إِنَّ هَٰذَا الْقُرْآنَ
يَهْدِي لِلَّتِي هِيَ أَقْوَمُ

నిశ్చయంగా ఈ ఖుర్ఆన్
అన్నిటికంటే సవ్యమైన మార్గాన్ని
చూపిస్తుంది.

(బనీ ఇస్రాయీల్ : 9)

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

إِنَّهُ لَقُرْآنٌ كَرِيمٌ فِي كِتَابٍ مَكْنُونٍ

Ahsanul Bayān (Telugu)

## అంతిమ దైవగ్రంథం

# ఖుర్‌ఆన్

తేట తెలుగు అనువాదం, తేనెలొలికే వ్యాఖ్యానం

## (అహ్‌సనుల్ బయాన్)


మూలానువాదం

**మౌలానా ముహమ్మద్ జునాగఢీ (రహ్మలై)**

వ్యాఖ్యానం

**హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్**

తెలుగు రూపం

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



لجنة التعريف بالإسلام

ISLAM PRESENTATION COMMITTEE

جمعية النجاة الخيرية

(శాంతిమార్గం పబ్లికేషన్స్ ట్రస్ట్, హైదరాబాద్ వారి సౌజన్యంతో)

# Antima Daiva Grandhām - Quran

## (Ahsanul Bayān) (Telugu)

*Urdu Translation* : Maulana Muhammad Junagadi (R.A)

*Commentary* : Hafiz Salahuddin Yousuf

*Telugu Translation* : Muhammad Azeez-ur- Rahman

*Edited by* : Dr. Sayeed Ahmed Umari Madani
Manzoor Ahmed Umari
Ata-ur-Rahman Umari
S.M. Rasool Sharfi

© *All Rights Reserved with Publishers*

*First Edition* :

*Copies* :

*Hadya* :

*Layout & Designing* : Al-Baseer Graphics, Hyd., 9441055065

*Published by:* : **Islam Presentation Committee**
KUWAIT.

وَلَقَدْ يَسَّرْنَا الْقُرْاٰنَ لِلذِّكْرِ فَهَلْ مِنْ مُّدَّكِرٍ ۝

"నిశ్చయంగా మేము ఖుర్‌ఆన్‌ను, అర్థం చేసుకోవటానికి, జ్ఞాపకం ఉంచుకోవటానికి సులభతరం చేశాము. మరి (దీని ద్వారా) హితబోధను గ్రహించేవారెవరైనా ఉన్నారా?"

*(ఖుర్‌ఆన్ 54 : 17)*

# విన్నపం

*ఈ గ్రంథంపై మీ సలహాలు, సూచనలను ఈ క్రింద తెలుపబడిన చిరునామాకు లేదా ఈ-మెయిల్‌కు పంపించ మనవి. మీ అమూల్యమైన సలహాలను మలి ముద్రణలో పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.*

***హాఫిజ్ ఎస్.ఎమ్. రసూల్ షర్ఫీ***

*16-2-867/10, అక్బర్‌బాగ్, సయీదాబాద్, హైదరాబాద్- 59.*

*సెల్ :* ***9676144697***

*E-mail: shantimargam@gmail.com*

## *శ్రేయోభిలాషులకు మనవి*

ఈ గ్రంథాన్ని కనీసం 500 కాపీలు లేదా 1000, 1500, 2000 ఇలా ఎన్ని కాపీలైనా ముద్రించి దైవమార్గంలో ఉచితంగా పంచి పెట్టాలని కోరుతున్న శ్రేయోభిలాషులు వివరాల కోసం ***"శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్టు"*** వారిని సంప్రదించగలరు.

*సెల్ :* ***9676144697***

*E-mail: shantimargam@gmail.com*

# ఒక్క చూపులో...

### ముందు మాట

(పేజి నెం.: vii) గ్రంథ అనువాదకుల మనోగతమిది. అనువాదానికి సంబంధించి స్వీయ అనుభవాలను ఆయన ఇందులో పేర్కొన్నారు. ఈ ఖుర్‌ఆన్ అనువాద కార్యం మొదలయిన కాలం, అది తుదిరూపంలోకి రావటానికి పట్టిన సమయం, గ్రంథ అనువాదంలో అనుసరించబడిన ప్రమాణాలు మొదలగు విషయాలు **'ముందుమాట'**లో ప్రస్తావనకు వచ్చాయి.

### గ్రంథ పరిచయం

(పేజి నెం.: X) మార్కెట్లో ఇప్పటికే ఎన్నో ఖుర్‌ఆన్ అనువాదాలు లభ్యమవుతుండగా మరో తెలుగు అనువాదాన్ని వెలువరించవలసిన అవసరం ఎందుకు వచ్చింది? దివ్య ఖుర్‌ఆన్ గ్రంథానికి అనేక అనువాదాలు ఉన్నప్పుడు పాఠకులు వాటన్నింటి ద్వారా ప్రయోజనం పొందగలిగే అత్యుత్తమ మార్గం ఏమిటి? మరి వాటిలో "అంతిమ దైవగ్రంథం – ఖుర్‌ఆన్"కు గల ప్రత్యేకత, ప్రాధాన్యతలేమిటి? మొదలగు విషయాలు **'గ్రంథ పరిచయం'**లో ప్రస్తావనకు వచ్చాయి.

### సంక్షిప్తాల వివరణ

(పేజి నెం.: xviii) ఇస్లామీయ సాహిత్య పఠనంలో తరచూ ఎదురయ్యే '(స)' '(అస)' లాంటి పొడి అక్షరాల వివరణలు ఈ శీర్షిక క్రింద పొందుపరచబడ్డాయి. ఇటువంటి **సంక్షిప్తాలు, పొడి అక్షరాలు** పఠన ప్రవాహంలో ఆధునిక పాఠకులకు కొద్దిగా ఇబ్బందిని కలిగించవచ్చు. కాని ఇస్లామీయ సాహిత్య పాఠకులపై అవి చూపే మంచి ప్రభావం మాటల్లో వర్ణించలేనిది. ఎందుకంటే నిజానికి అవి పొడి అక్షరాలు కావు. అవసరం కొద్దీ సంక్షిప్తీకరించిన కొన్ని అపురూపమైన ప్రార్థనా వచనాలు. పాఠకులు పెద్ద మనసుతో వాటిని విస్తరించుకొని చదువుకుంటే, దానివల్ల ఉద్దేశితులకే కాకుండా చదువరులకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఇటువంటి ప్రార్థనా వచనాలు లేని సాంప్రదాయ ఇస్లామీయ సాహిత్యాన్ని అసలు ఊహించటమే కష్టం.

### పారా సమాచారం

(పేజి నెం.: xix) మొత్తం ఖుర్‌ఆన్ గ్రంథాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. సూరాలుగా 2. పారాలుగా. ఈ రెండు రకాల్లో సూరా వర్గీకరణే మనకు అత్యంత ముఖ్యం. ఖుర్‌ఆన్‌లో మొత్తం 114 సూరాలున్నాయి. ఒక సూరాను ఆధారంగా చేసుకొని అందులోని ఒక వాక్యాన్ని వెతుక్కోవటం చాలా సులువు. సూరా వర్గీకరణ భావానుసారం జరిగినది. కాని పారా వర్గీకరణ దీనికి పూర్తిగా భిన్నం. ఇది పదానుసారం జరిగిన వర్గీకరణ. అరబీ మూల పఠన నిమిత్తం ఏర్పరచుకోబడినది. కనుకనే ఒక పారాను ఆధారంగా చేసుకొని అందులోని ఆయతులను వెతకటం సాధ్యం కాదు. దివ్య ఖుర్‌ఆన్ అనువాదంతో దీనికి అస్సలు సంబంధం లేదు. పైగా రెండు రకాల వర్గీకరణలు కలిపి ఇవ్వటం మూలంగా అది విషయ సందిగ్ధతకు దారితీస్తుంది. ఒక వాక్యాన్ని పారా ప్రకారం వెతుక్కోవాలో లేక సూరా ప్రకారం వెతుక్కోవాలో ఆధునిక పాఠకులకు అర్థం కాదు. కనుక ఈ గ్రంథం లోపల మేము పారాలను పేర్కొనలేదు. దానికి బదులు ప్రారంభంలోనే **పారా సమాచారం** పూర్తిగా ఇచ్చేశాము. పారా ప్రకారం పఠించేవారికి ఈ వివరణ సరిపోతుందని మేము ఆశిస్తున్నాము.

**సూరా సూచిక**

(పేజి నెం.: XX) ఖుర్‌ఆన్‌లో మొత్తం 114 సూరాలు ఉన్నాయని ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఈ సూరాల్లో కొన్ని చిన్నవి, మరికొన్ని కాస్త పెద్దవి, ఇంకొన్ని చాలా సుదీర్ఘమైనవి. ఖుర్‌ఆన్ సంకలనంలో మొదట అతి పెద్ద సూరాలు ప్రస్తావించబడ్డాయి. ఆ తరువాత పోయే కొద్దీ చిన్న చిన్న సూరాలు చదువరులకు తారసపడతాయి. మొత్తానికి ఆ సూరాలు ఈ గ్రంథంలోని ఏయే పేజీల్లో ప్రారంభమవుతున్నాయో తెలుసుకోవటానికి **సూరా సూచిక** చాలా చక్కగా ఉపయోగపడుతుంది.

**అసలు గ్రంథం**

(పేజి నెం.: 1-1854) మూల గ్రంథం ఇక్కణ్ణుంచే మొదలవుతుంది. 1 వ సూరా నుంచి 114వ సూరా వరకు మధ్యలో ఉన్నది అసలు గ్రంథం. మిగతావన్నీ అనుబంధాలు, వాటి సంపూరకాలే. ప్రతి సూరాకు ముందు పాఠకుల సౌకర్యార్థం క్లుప్తంగా ఆయా సూరాల పరిచయాలు ఇవ్వబడ్డాయి. కొన్ని సూరాల ప్రారంభంలో చారిత్రక సందర్భాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవటానికి ఉపయోగపడే పట్టికలూ పొందుపరచబడ్డాయి. దీనికోసం పాఠకులు మా పబ్లికేషన్ తరఫు నుంచే ప్రచురించబడిన **"ఖుర్‌ఆన్ కథామాలిక"** పుస్తకం సహాయం తీసుకోవలసి ఉంటుంది.

**కొత్త పదాలు**

(పేజి నెం.: 1855-1864) పుస్తకాల్లో కొన్ని విషయాలు చాలా సంక్లిష్టంగా ఉంటాయి. ఎంత విపులీకరించినప్పటికీ కొద్దో గొప్పో అస్పష్టత వాటిలో ఉండిపోతుంది. అనువాద గ్రంథాల్లోనయితే ఇది మరీ సహజం. అలాంటి సందర్భాలను, పదాలను ఏర్చి, వాటిని ప్రత్యేక జాబితాగా కూర్చి వివరించటం ఒక్కటే దానికి పరిష్కార మార్గం. అలాంటి చిరు ప్రయత్న ఫలితం ఈ **"కొత్తపదాలు - అర్థాలు"**.

**సమాచార దర్శిని**

(పేజి నెం.: 1865-1902) కావలసిన విషయం ఖుర్‌ఆన్‌లో వెతుక్కోవటానికి ఈ సమాచార దర్శిని ఉపయోగపడుతుంది. సమాచార గ్రంథాల్లో తలమానికమైనది 'విషయ దర్శిని' లేక 'సమాచార దర్శిని'. అయితే ఖుర్‌ఆన్ మాత్రం కేవలం సమాచార ప్రధాన గ్రంథం కాదు. అలా అని అందులోని సమాచార ప్రాముఖ్యతనూ ఉపేక్షించలేము. ఆ మార్గంలో వేయబడిన తొలి అడుగులే **"సమాచార దర్శిని"**.

**ప్రవక్తల పేర్లు**

(పేజి నెం.: 1903) అనాది నుంచి ఈ లోకంలో ఇస్లాం ధర్మ సముద్ధరణ కోసం ప్రతి కాలంలోనూ, ప్రతి యుగంలోనూ ఎంతోమంది ప్రవక్తలు ఉద్భవించారు. వారందరి పేర్లూ ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడలేదు. కేవలం కొన్ని పేర్లు మాత్రమే మనకు తెలుపబడ్డాయి. తెలుగు పాఠకుల సౌకర్యార్థం వాటిలోని బైబిల్ ఉచ్చారణ గల పేర్లను వేరు చేసి రూపొందించినదే ఈ **'ప్రవక్తల పేర్లు'**.

**సజ్దా సందర్భాలు**

(పేజి నెం.: 1904) ఖుర్‌ఆన్ పారాయణం చేసేటప్పుడు మధ్యలో సజ్దాకు (సాష్టాంగ ప్రణామానికి) సంబంధించిన సందర్భాలు వస్తాయి. అక్కడ ఆగి సజ్దా చేయటం ఉత్తమం. దైవప్రవక్త ముహమ్మద్ (స) ఖుర్‌ఆన్ పారాయణంలో కొన్నిచోట్ల సజ్దా చేసినట్లు హదీసుల్లో ఆధారాలున్నాయి. పాఠకుల ఆచరణకు వీలుగా అటువంటి సందర్భాలన్నిటిని ఒక జాబితాగా రూపొందించటం జరిగింది.

*అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్‌ పేరుతో*

# ముందు మాట

**– ముహమ్మద్‌ అజీజుర్రహ్మాన్‌**
(గ్రంథ అనువాదకులు)

ప్రశంసలు పొగడ్తలన్నీ సకల లోకాల పరిపోషకుడైన అల్లాహ్‌కే శోభిస్తాయి. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వ సల్లం) పై, ఆయన కుటుంబీకులపై, ఆయన ప్రియసహచరులపై అల్లాహ్‌ దయానుగ్రహాలు వర్షించుగాక!

తెలుగులో మీ ముందున్న ఈ "తఫ్సీర్‌ అహ్సనుల్‌ బయాన్‌" గ్రంథానికి 'ముందుమాట' వ్రాయటానికి చేయి వణుకుతోంది. మనోమస్తిష్కాలు భయంతో కంపిస్తున్నాయి. కారణం: అనువాద బాధ్యత నేను వహించటమే. ఈ అనువాదంపై పాఠకుల అభిప్రాయాలు, పండితుల విమర్శలు, సాహితీపరుల సమీక్షలు వచ్చిన మీదటే నా మాటగా ఏదన్నా వ్రాస్తే బావుంటుందనుకున్నాను. కాని ప్రకాశకుల ప్రోద్బలంపై కొన్ని పంక్తులు వ్రాయక తప్పటం లేదు.

## 2003 ఏప్రిల్‌ నాటి మాట -

హైదరాబాదులోని "అల్‌ హఖ్‌ తెలుగు పబ్లికేషన్స్‌" కార్యాలయంలో ఉన్న నాకు, ఖతర్‌ నుండి నా ఆప్తులు ఫోన్‌ చేసి, "మీరు అహ్సనుల్‌ బయాన్‌ను తెలుగులో తర్జుమా చేస్తే బావుంటుంది. రెండు మూడేండ్లలో మీరీ పనిని పూర్తి చేయగలుగుతారు" అని ప్రతిపాదించారు. "బహుశా ఆ మహాకార్యానికి నేను తగిన వాణ్ణి కానేమో!" అన్నాను. "ఇది నా ఒక్కని ప్రతిపాదన మాత్రమే కాదు. దోహాలో మీ రచనలను, తెలుగు అనువాదాలను చదివిన అనేక మంది కోరిక కూడా యిదే" అంటూ ఆయన ఫోన్‌ పెట్టేశారు. ఆ తర్వాత ఆయనగారి సుదీర్ఘమైన ఉత్తరం వచ్చింది. స్థూలంగా వారిచ్చిన సూచనల ప్రకారం –

- అనువాదం వ్యావహారికంగా ఉండాలి.
- భాష సులభగ్రాహ్యంగా ఉండాలి.
- తెలుగు నుడికారపు ఒంపుసొంపులు ఎక్కడా దెబ్బతినకుండా, అడ్డంకులు లేకుండా అనువాదం హాయిగా – సెలయేరులా – ప్రవహించాలి.
- అనువాదంలో మితిమీరిన స్వేచ్ఛ పనికిరాదు. అరబీ మూలానికి దగ్గరగా ఉండాలి.
- ఏ సూక్తికి ఆ సూక్తిని విడదీసి అనువదించాలి – కలిపివేయకూడదు.
- మూలానువాదంలో 'అల్లాహ్‌' అనే పదాన్ని యధాతథంగా ఉంచాలి.
- సాధ్యమైనంత వరకు ఏ పేజీలో రావలసిన వ్యాఖ్యానం (పాదసూచికలు) ఆ పేజీలోనే అయిపోవాలి. "మిగతా భాగం ఫలానా పేజీలో చూడండి" అంటూ చదువరులను విసుగెత్తించకూడదు.

పై సూచనలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని, అల్లాహ్‌పై భారంవేసి ఈ పవిత్ర కార్యానికి (2003 లో) పూనుకున్నాను. కాని అంతలోనే ఇస్లాం ప్రెజెంటేషన్‌ కమిటీ (IPC, Kuwait) వారి నుంచి ఆహ్వానం – గల్ఫ్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న

తెలుగు వారి కోసం తాము ప్రచురించబోయే ఆధ్యాత్మిక మాసపత్రిక (నెలవంక)కు సంపాదకత్వ బాధ్యత చేపట్ట వలసిందిగా IPC, Kuwait వారు కోరారు. అప్పటికే IPC తో నాకున్న ఎనిమిదేళ్ల ధార్మిక అనుబంధం దృష్ట్యా ఈ బాధ్యతను కూడా శిరసావహించక తప్పలేదు. 2003 నవంబరులో IPC లో అడుగుపెట్టాను. అయితే అల్‌హమ్దు లిల్లాహ్ IPC వారు కూడా ఖుర్‌ఆన్ అనువాద కార్యానికి ఆదరువుగా నిలిచారు. శ్రేయోభిలాషులు ఆశించినట్లే దైవసహాయంతో మూడేళ్లలో ఈ బాధ్యతను నెరవేర్చగలిగాను.

ఖుర్‌ఆన్ వ్యాఖ్యానాలలో "తఫ్సీర్ అహ్సనుల్ బయాన్"కు గల ప్రత్యేకత గురించి ఈ సందర్భంగా చెప్పాలి. ఉర్దూలో ఈ వ్యాఖ్యానానికి పూనుకున్న ఘనత "దారుస్సలామ్" పబ్లిషర్స్‌కి దక్కుతుంది. భారత ఉపఖండంలోని ఉర్దూ సోదరుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రామాణిక హదీసుల ఆధారంగా ఖుర్‌ఆన్ భావాన్ని విడమరచి చెప్పే ఉద్దేశ్యంతో 15 సంవత్సరాల క్రితం 'దారుస్సలామ్' సంస్థ ఈ బృహత్పథకాన్ని చేపట్టింది. ఈ సంస్థ మేనేజర్ మౌలానా అబ్దుల్ మాలిక్ ముజాహిద్ గారి ప్రేరణపై హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్ క్రీ.శ. 1993లో ఉర్దూలో తఫ్సీర్‌కు పూనుకున్నారు. అంతకుముందు మౌలానా ముహమ్మద్ జునాగఢీ (రహ్మ.లై) గారు చేసిన ఉర్దూ అనువాదాన్నే ఇందులో యధాతథంగా తీసుకోవటం జరిగింది. ప్రఖ్యాత విద్వాంసులు మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి (రహ్మ.లై) గారు ఉర్దూ తఫ్సీర్‌ని పునఃపరిశీలించి మెరుగులు దిద్దారు. సాధ్యమైనంత వరకు బలహీన ఉల్లేఖనాలను విడనాడి, ప్రమాణబద్ధమైన ఉల్లేఖనాలనే ఇందులో తీసుకోవటం జరిగింది. వ్యాఖ్యానం కోసం తఫ్సీర్ ఇబ్నె కసీర్, తఫ్సీర్ ఫత్‌హుల్ ఖదీర్, తఫ్సీర్ ఇబ్నెజరీర్ తబ్రీ, ఐసరుత్తఫాసీర్ వంటి ప్రామాణిక తఫ్సీర్లను ఆధారంగా తీసుకున్నానని హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్ గారన్నారు. విషయాన్ని అనవసరంగా సాగదీయకుండా, పాక్షిక సాపేక్షిక విషయాలపై తర్జనభర్జనకు తావు కల్పించకుండా ముందుకు సాగిపోవటం 'అహ్సనుల్ బయాన్' ప్రత్యేకత. చెప్పదలచిన విషయాన్ని తిరకాసులు లేకుండా సూటిగా చెప్పి, హదీసుల ఆధారంగా ఖుర్‌ఆన్ భావాన్ని పాఠకులకు విశదీకరించటం అహ్సనుల్ బయాన్ విశిష్టత. అందుకే ఉర్దూ పాఠకలోకంలో ఈ తఫ్సీర్‌కు అపూర్వ ప్రజాదరణ లభించింది. ఇప్పటికే ఎన్నో ఎడిషన్లు ముద్రితమైనాయి. మదీనాలోని షాహ్ ఫహద్ ఖుర్‌ఆన్ ముద్రణా సంస్థవారు కూడా ఈ ఉర్దూ వ్యాఖ్యానాన్నే ప్రామాణిక వ్యాఖ్యానంగా ఎన్నుకుని భారీఎత్తున ముద్రించి ప్రపంచం నలుదిశలా సరఫరా చేస్తున్నారు. దైవచిత్తమైతే మీ ముందున్న ఈ తెలుగు అనువాదం కూడా ఏదో ఒకనాడు ఈ భాగ్యానికి నోచుకోగలదన్న ఆశ ఉంది.

'అహ్సనుల్ బయాన్' అనువాదం సందర్భంగా ఎదుర్కొన్న అనుభవాలు, ఆస్వాదించిన అనుభూతులు మరుపురానివి, మరువరానివీను. దివ్యఖుర్‌ఆన్ అనువాదమంటే సామాన్య విషయం కాదు, అది చాలా సున్నితమైన ప్రక్రియ, అంతకన్నా అది బరువైన బాధ్యత. దీనికోసం ధర్మావగాహనతోపాటు పరిణతి అవసరం. షరీయతుపరమైన పరిమితులకు కట్టుబడి, చాలా జాగ్రత్తగా చేయవలసిన పని ఇది. అలా అని బాధ్యతల నుండి పలాయనం చిత్తగించనూ లేము. ఎవరికి వారు " ఇది నా వల్ల కానిపని " అని తప్పించుకుంటే కావలసిన ఎన్నో కార్యాలు కాలేవు. అందుకే ఈ బాధ్యతను మీద వేసుకోవటానికి సాహసించాను. ఒక పాఠకునిగా ఖుర్‌ఆన్ అధ్యయనం చేయటంలోనూ – ఒక అనువాదకునిగా బాధ్యత నెరవేర్చటంలోనూ ఉన్న వ్యత్యాసం ఏమిటో ఈ సందర్భంగా తెలిసి వచ్చింది. అక్షర రూపం ఇవ్వబోయే పంక్తులను అనువాదకుడు సయితం అనేక కోణాల నుంచి పరికించవలసి ఉంటుంది. దానికోసం ఇతర అనువాదాలను, వ్యాఖ్యానాలను కూడా చదవవలసి ఉంటుంది. ఆ విధంగా – వ్యక్తిగతంగా – నాకు కలిగిన లాభం వెలకట్టలేనిది. అనువాదంలో ప్రకాశకులు పెట్టిన నిబంధనలకు శాయశక్తులా కట్టుబడటం జరిగింది.

2005 డిశంబరు కల్లా 'అహ్సనుల్ బయాన్' తెలుగు అనువాదం పూర్తయింది. మరోవైపు టైప్‌సెట్టింగ్ పనికూడా హైదరాబాదులోనే ప్రారంభమయింది. ఇంకోవైపు నుంచి ప్రకాశకుల కోరికపై హాఫిజ్ ఎస్.ఎమ్. రసూల్‌గారు విద్వాంసుల, షరీయతువేత్తల పర్యవేక్షణలో అనువాదాన్ని పునఃపరిశీలించే పనిని మొదలెట్టారు. అయినప్పటికీ మరో రెండేళ్లు నిరీక్షించక తప్పలేదు. 2006 మార్చిలో ప్రూఫ్ రీడింగ్ నిమిత్తం నేను నాలుగు మాసాలు సెలవుపెట్టి హైదరాబాదుకు వచ్చేనాటికి నాకంటి చూపు బాగా తగ్గిపోయింది. ఆపరేషన్ అనివార్యమని భావించాను. కాని ఒక్కో అధ్యాయం రీడింగ్ చేసిన కొద్దీ నా కంటిచూపు మెరుగుపడసాగింది. పూర్తి గ్రంథాన్ని మూడుసార్లు రీడింగ్ చేశాను – అల్‌హమ్దు లిల్లాహ్!

ఈ అనువాదాన్ని ఆద్యంతం పరిశీలించి దోషాలను సవరించిన మౌలానా మంజూర్ అహ్మద్ ఉమ్రీ (ఖతర్) గార్కి, డా.సయీద్ అహ్మద్ మదనీ (పెడన) గార్కి, మౌలానా అతావుర్రహ్మాన్ ఖురైషీ ఉమ్రీ (ఖతర్) గార్కి, హాఫిజ్ ఎస్.ఎమ్. రసూల్ (హైదరాబాదు) గార్కి, ఈ ప్రక్రియలో ఎన్నో విలువైన సూచనలిచ్చిన జామియా దారుస్సలామ్, ఉమ్రాబాద్ షేఖుత్తఫ్సీర్ మౌలానా అబ్దుల్ కబీర్ ఉమ్రీ గార్కి నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకుంటూ, కారుణ్యప్రభువైన అల్లాహ్ వీరందరికీ ఉత్తమ పుణ్యఫలాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. ఎంతో ఓపికతో, మరెంతో దీక్షతో టైప్ సెట్టింగ్, డిజైనింగ్ బాధ్యతను నెరవేర్చిన హుసైన్‌భాయి గార్కి, లక్ష్మీ నారాయణ గార్కి, ముద్రణా విభాగానికి సంబంధించిన బాధ్యతలను పర్యవేక్షించిన అబ్దుల్ వకీల్ గార్కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఈ మహా కార్యానికి ప్రేరణనిచ్చి, చివరి దశవరకూ అండగా నిలిచిన మిత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞుణ్ణి. అల్లాహ్ వారికి అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదించు గాక! మరెన్నో బృహత్పథకాలను ఆవిష్కరించే అవకాశాన్ని, సౌభాగ్యాన్ని వారికి కల్పించుగాక!! (ఆమీన్)

సాధ్యమైనంత వరకు ముద్రా రాక్షసాలు జొరబడకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అనువాదంలో కూడా జాగ్రత్త వహించాను. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మానవమాత్రులమైన మన దౌర్బల్యాల మూలంగా తప్పులు దొర్లకుండా ఉండవు. మీ ఈ అనువాదకుడు కూడా ఈ సహజ దౌర్బల్యానికి అతీతుడు కాదు. మొదటి ముద్రణలో దృష్టికి వచ్చిన లోపాలను పాఠకులు ఎత్తిచూపితే మలి ముద్రణలో ఇన్‌షా అల్లాహ్ వాటిని సరిదిద్దుకుంటాము. ఈ సత్కార్యంలో మరుపు వల్ల జరిగిన పొరపాట్లను, తప్పులను మన్నించి, ఈ కృషిని దయతో స్వీకరించాలని కృపాశీలుడైన అల్లాహ్‌ను వినమ్రంగా వేడుకుంటున్నాను –

**– ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

(ఛీఫ్ ఎడిటర్, నెలవంక మాసపత్రిక, కువైట్)

# గ్రంథ పరిచయం

**– హాఫిజ్ ఎస్.ఎమ్.రసూల్ షర్ఫీ**

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. వస్సలాతు వస్సలాము అలా రసూలిహిల్ కరీమ్. అమ్మాబాద్:

**"ఖుర్ఆన్‌లోని దైవసందేశం ఏమిటో తెలుసుకోవాలి"**

*– ఓ శుభాత్మ అన్వేషణ.*

**"ఖుర్ఆన్ సందేశం జనులందరికీ అర్థం కావాలి"**

*– ఓ ధర్మసేవకుని తపన.*

**"అచ్చమైన భాషలో ఖుర్ఆన్ అనువాదం ఏదయినా ఉంటే చెబుతారా?!"**

*– ఓ చదువరుని విజ్ఞాపన.*

**"భాష కంటే భావం ముఖ్యం. ఖుర్ఆన్ అనువాదంలో మూలానికి ఎట్టి పరిస్థితుల్లోనూ విఘాతం కలుగరాదు సుమా!"**

*– ఓ శ్రేయోభిలాషి ఆవేదన.*

**"కేవలం అనువాదం అయితే ఏం సరిపోతుంది? ఖుర్ఆన్‌ను పూర్తిగా అర్థం చేసుకుని ఆచరించటానికి వివరణ తప్పనిసరి!"**

*– ఓ ఆచరణాశీలి ఆలోచన.*

u u u

ఖుర్ఆన్ అనువాద జగత్తులో ఎక్కడ విన్నా ఇవే మాటలు! అవసరాలు ఇన్ని అయినప్పుడు అనువాదాలు అనేకం కావటం సహజమే మరి?! తెలుగుభాషలో దివ్యఖుర్ఆన్‌కు అనేక అనువాదాలు వెలువడటానికీ అదే కారణం. అయితే అనువాదాలన్నీ ఆయా గ్రంథకర్తలు కేవలం ప్రజల ఆశలను, కోరికలను నెరవేర్చటానికి చేసినవని తీర్మానించరాదు. అనువాదాలు ఎన్నయినప్పటికీ అందరి ఆశయమూ ఒక్కటే. అదే దైవప్రసన్నత! దివ్యసందేశాన్ని దైవదాసులందరికీ పరిచయం చేయాలన్న తపన! తద్వారా దైవానికి అభిమాన పాత్రులవ్వాలన్న ఆత్రుత!! ఇంకా అంతిమ దైవగ్రంథం పట్ల తమకు గల అమితమైన భక్తీతత్పరత!!!

ఖుర్ఆన్ గ్రంథానికి గల సాహితీ కోణాలు అనంతం! వాటిని కొలవాలను కోవటం అవివేకం!! ఎల్లలు లేని విజ్ఞానవనం ఒక్క అంతిమ దైవగ్రంథానికే సొంతం. పూటకో విద్యాకుసుమం అందులో వికసిస్తూ ఉంటుంది. రోజుకో కొత్త విజ్ఞానఫలం చదువరులను ఊరిస్తూ ఉంటుంది. దివ్యఖుర్ఆన్ జ్ఞానం అనంత సాగరం వంటిది. దాని లోతుల్లోకి పోయేకొలది విలువైన ముత్యాలు దొరుకుతూనే ఉంటాయి. ఏ అనువాదకుడైనా, ఆ ముత్యాలన్నీ తన హారంలోనే ఇమిడిపోవాలని కోరుకుంటే అది అతని అమాయకత్వమే అవుతుంది.

అందువల్ల, ఇకపై తెలుగులో వచ్చిన ఖుర్ఆన్ అనువాదాల్లోకెల్లా ఏది మంచిది? అని అడగటం మానేసి

దేనిద్వారా ఏ రకమైన ప్రయోజనం ఎంతవరకు కలుగుతుందని మాట్లాడుకోవటం సబబు. ఖుర్‌ఆన్ గురించి లోతైన, విశాలమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలనుకునేవారు అన్ని అనువాద గ్రంథాలనూ క్షుణ్ణంగా అధ్యయనం చేసి తమ విజ్ఞాన దాహార్తిని తీర్చుకోవచ్చు. పోతే దైవగ్రంథాన్ని అర్థం చేసుకోవటానికి ఒక్క అనువాదంతోనే సరిపెట్టుకోవాలని కోరుకుంటున్న వారికి మాత్రం మేము ఈ గ్రంథాన్ని చాలా గట్టిగా సిఫారసు చేస్తున్నాము. అందుకు కారణాలేమిటో పాఠకులు ఇప్పటికే చదివి ఉంటారు. మరిన్ని కారణాలు ఈ 'గ్రంథ పరిచయం'లో తెలుసుకోగలరు.

ఈ గ్రంథ రూపకల్పనకు అంకురార్పణం తెలుగు ప్రజలకు ఒక మంచి ఖుర్‌ఆన్ అనువాదాన్ని అందజేయాలని కొందరు శ్రేయోభిలాషుల్లో జనించిన ఆకాంక్ష. తేనెలూరే తెలుగుభాషలో సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా, వ్యాఖ్యాన సహితంగా ఒక ఖుర్‌ఆన్ అనువాద గ్రంథాన్ని వెలువరించాలన్నది ఎంతో కాలం నుంచి వారి కోరిక. ఆ అనువాదం, వ్యాఖ్యానం దైవప్రవక్త (స) గారి హదీసుల వెలుగులో, దైవప్రవక్త సహచరుల (సహాబాల), వారి శిష్యుల (తాబియీన్ల) వ్యాఖ్యాన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలనీ, ముద్రణా ప్రమాణాలను కూడా దైవగ్రంథ ఔన్నత్యానికి తగిన విధంగా పాటించాలనీ ఆ శ్రేయోభిలాషులు ఆశించారు. వారంతా ఒక బృందంగా ఏర్పడి ఈ బృహత్కార్యాన్ని చేపట్టారు. అయితే నేరుగా తెలుగుభాషలోనే అటువంటి ప్రామాణికమైన గ్రంథాన్ని వెలువరించగల పరిస్థితులు మన తెలుగునాట లేవు. నిర్ణీత ప్రమాణాలతో కూడిన ఖుర్‌ఆన్ అనువాద గ్రంథాన్ని నేరుగా తెలుగులో రచించగల శక్తి, నైపుణ్యాలు కొరవడటమే దానికి కారణం. ఈ విషయాన్ని మనం సవినయంగా ఒప్పుకోవాలి.

మొత్తానికి దివ్యఖుర్‌ఆన్ అనువాదం కోసం అరబీకి – తెలుగుకు మధ్య మరో మాధ్యమ భాష మీద ఆధారపడక తప్పని పరిస్థితి! అయితే ఇస్లామీయ తెలుగు అనువాద రంగానికి బాగా పరిచయమున్న భాష ఉర్దూ. కనుక మూలగ్రంథం ఆ భాషలోనిదయితే సముచితంగా ఉంటుందని నిర్ణయించటం జరిగింది. మరి ఉర్దూలో నిర్ణీత ప్రమాణాలతో కూడిన గ్రంథం కోసం ఆరా తీసినప్పుడు అందరి దృష్టి **"అహ్‌సనుల్ బయాన్"** మీద పడింది. ఈ గ్రంథం అప్పటికే తన క్లుప్తత, భాషా మధురిమత, వ్యాఖ్యాన ప్రామాణికత మొదలగు ప్రత్యేకతలతో ఉర్దూ ప్రజానీకాన్ని బాగా అలరించి ఉంది. అంతకన్నా ముఖ్య విషయం – అరేబియా దేశంలోని మదీనా నగరంలో ఖుర్‌ఆన్ ప్రింటింగ్ కాంప్లెక్స్ ద్వారా ప్రచురించబడి ప్రపంచస్థాయి ఖ్యాతిని గడించిన గ్రంథం అది. అందుకని తెలుగు అనువాదం కోసం ఆ గ్రంథాన్నే ఎంపిక చేయటం జరిగింది. ఎట్టకేలకు ఆ సజ్జనుల సదాశయాలపై దేవుని ఆమోద ముద్ర పడి, అతి స్వల్ప కాలంలోనే ఈ కార్యం కోసం ఒక యంత్రాంగం ఏర్పాట యింది. గురువులు శ్రీ అజీజుర్రహ్మాన్‌గారు అహ్‌సనుల్ బయాన్‌ను తెలుగులోకి అనువదించే పని ప్రారంభించారు.

**అనువాదకుల వారి గురించి.....**

అజీజుర్రహ్మాన్‌గారు తెలుగువారికి సుపరిచితులైన అనువాదకులు. అనువాద రంగంలో సుదీర్ఘ అనుభవం గల వ్యక్తి. దాదాపు పాతికేళ్ల అనుభవం ఆయనది. 70కి పైచిలుకు అనువాద రచనలు ఆయన కలం నుంచి జాలువారి తెలుగు పాఠకలోకాన్ని అలరిస్తున్నాయి. ఇక వ్యాసాలయితే లెక్కలేనన్ని! తెలుగు భాషమీద అసాధారణ పట్టు ఆయన సొంతం. అనువాదపు నుడికారంలో కొత్త ఒరవడులను సృష్టించిన అక్షరశిల్పిగా తెలుగు ఇస్లామీయ సాహిత్యలోకం ఆయన్ని జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. ఆయన అనువాదాన్ని, ఆయన శైలిని అభిమానించేవారిలో

నేనూ ఒకణ్ణి. కేవలం అభిమానించటమే కాదు, ఆయన శైలిని అనుకరించటానికి కూడా నేను ఇష్టపడతాను. అపురూపమైన ఆయన శైలీసంపదను మనసులోనూ, మాటల్లోనూ పదిలపరచుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంటాను. ఎంతోదూరం అక్కర్లేదు. మచ్చుకు నేను రాసిన ఈ నాలుగు వాక్యాల్లోనే ఆయన శైలీపోలికలు ఎన్నో కనపడతాయి!

మొత్తానికి ప్రకాశకులవారు ఆశించినదానికంటే కూడా చాలా అద్భుతంగా అనువాదం చేశారు శ్రీ అజీజుర్రహ్మాన్‌గారు. అనువాదంలో ఆయనగారి మాటల ముత్యాలు పాఠకుల్ని రంజింపజేస్తాయి. అద్భుతమైన ఆయన శైలి చదువరుల్ని పరవశింపజేస్తుంది. చదివేకొద్దీ ఇంకా చదవాలనిపిస్తుంది. ప్రతి వాక్యం పాఠకునిలో ఓ సరికొత్త ఉత్సుకతను రేపుతుంది. ఆచరణ వైపు బలంగా ప్రేరేపిస్తూ ఉంటుంది. అనువాదం చదువుతున్నంత సేపూ పాఠకులు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు. ఈ గ్రంథం ప్రూఫ్ రీడింగ్ చేస్తున్నప్పుడు నేనూ, నా మిత్రబృందం పొందిన ఆధ్యాత్మిక ఆనందానుభూతి అంతా ఇంతా కాదు.

మొత్తం గ్రంథం ఈ విధంగా తుదిరూపంలో మీ చేతుల్లోకి రావటానికి పట్టిన సమయాన్ని మూడు దశలుగా విభజిస్తే, అన్వాన్ సూరా అనువాదంతో మొదటిదశ పూర్తవుతుంది. ఆ తర్వాత రెండో దశ పునః పరిశీలనది. మూడోదశ సెట్టింగు, ప్రింటింగు మొదలగువాటిది.

అనువాదాన్ని పునఃపరిశీలించే బాధ్యతను ప్రకాశకులవారు నా భుజస్కంధా లపై మోపారు. నేనా అల్పజ్ఞానిని! దివ్యఖుర్‌ఆన్ అనువాద పరిశీలన అంటే మాటలా?! నా దృష్టిలో ఖుర్‌ఆన్ అనువాదాన్ని పునఃపరిశీలించటం అంటే దాదాపు మరో కొత్త అనువాదం రాయటంతో సమానం. అందుకని ఆ బాధ్యతను నా మీద వేసుకోవటానికి మొదట్లో వెనుకాడాను. మదిలో మెదిలే భావాలకు, ఏదో నాకు వచ్చినంతమటుకు కాగితం మీద అక్షరరూపం ఇవ్వటానికి ప్రయత్నిస్తూ ఉంటాను తప్ప, అంతకు మించి నేను రాటుదేలిన రచయితనూ కాను, చేయితిరిగిన అనువాదకుణ్ణీ కాను. అలాంటప్పుడు దైవగ్రంథ అనువాద పునఃపరిశీలనకు నేనెలా సరిపోతానా? అని ఆలోచిస్తూ ఉండి పోయాను. కాని మరోవైపు ప్రకాశకుల వారి ప్రోద్బలం చాలా ఎక్కువగా ఉండటంతో ఒప్పుకోక తప్పలేదు. “లేదు, రసూల్‌గారూ! మీరు ఈ పని చేయగలరు. దైవసహాయం మీకు తోడుంటుంది” అన్న ప్రకాశకుల ప్రోత్సాహక పలుకులు నాకు మరింత బలాన్ని చేకూర్చాయి.

తర్వాత నాకు తెలిసింది, ఈ పనిలో ఉమ్రాబాద్ ధార్మిక యూనివర్శిటీ అధ్యాపకులు, ఇంకా మంజూర్ అహ్మద్ ఉమ్రిగారు, అతావుర్రహ్మాన్ ఖురైషీ ఉమ్రి గారు, డా.సయీద్ అహ్మద్ ఉమ్రి, మదనీగార్లు కూడా నాకు తోడుంటారని. అప్పటి వరకు స్వీయ అయోగ్యతా భావంతో కుంగిపోతున్న నేను కాస్త ఊరట చెందాను. అనువాద పరిశీలనా భారం మొత్తం నేనొక్కణ్ణే మోయటం లేదని తెలిసి శాంతపడ్డాను. మరోవైపు దైవగ్రంథానికి సేవచేసే సౌభాగ్యం లభిస్తున్నందుకు చాలా సంతోషం కూడా కలిగింది. నా శక్తియుక్తులన్నిటినీ కూడగట్టుకొని, అల్లాహ్ మీద భారం మోపి అనువాద పరిశీలనా కార్యం మొదలుపెట్టాను. కొన్ని ప్రమాణాలను అనుసరించి ఈ పని జరగా లని ప్రకాశకుల వారు నిర్ణయించారు. వాటిలో ముఖ్యమైనవాటిని ఈ క్రింద ప్రస్తావిస్తున్నాను:

u అనువాద ముసాయిదా మొత్తం క్షుణ్ణంగా, ఒక్కో పదం పరిశీలించాలి.

u అనువాదం మూలానికి వీలైనంత దగ్గరగా ఉండాలి. శైలీప్రవాహంలో అనువాదం మూలం నుంచి దూరం కాకూడదు.

u ఎట్టిపరిస్థితుల్లోనూ ఖుర్‌ఆన్ మూలానికిగాని, భావానికిగాని విఘాతం కలగ కూడదు.

- పదానువాదం వద్దు. మరీ స్వేచ్ఛానువాదమూ పనికిరాదు.
- భాష అత్యంత సులభంగానూ, సుబోధకంగానూ ఉండాలి. ఎక్కడైనా కఠినపదాలు దొర్లితే వాటిస్థానంలో మూలానికి సమానార్థకమైన, సులభంగా అర్థమయ్యే ఇతర పదాలు వాడాలి.
- అనువాదంలో కల్పనలు ఉండకూడదు. భావాన్ని మరోవైపు మళ్లించటానికి ప్రయత్నాలు జరగకూడదు. ఒకవేళ అనువాదకులు ఏదైనా విషయాన్ని వివరించ దలిస్తే దాన్ని ప్రత్యేకంగా కుండలీకరించి మరీ రాయాలి.
- ఒక మామూలు విద్యావంతుడు సైతం అర్థం చేసుకోగలిగే రీతిలో అనువాదం సాగాలి.

## పునఃపరిశీలన పనితీరు

చాలాకాలం నుంచి ఖుర్ఆన్, హదీసుల అనువాద రంగంలో ఉండటం వల్ల మొదటి నుంచీ ఖుర్ఆన్ వాక్యాల అనువాదానికి, వివరణకు సంబంధించి నాకంటూ సొంత పరిజ్ఞానం కొంత ఉంది. అయితే పునఃపరిశీలన పనికోసం నేను ఆ పరిజ్ఞానంపైనే ఆధారపడలేదు. దైవగ్రంథ అనువాద పరిశీలనకు ఆ పరిజ్ఞానం సరిపోదని భావించాను. అందుకని ప్రకాశకులవారి సహాయంతో ప్రముఖ ఖుర్ఆన్ అనువాద, వ్యాఖ్యాన గ్రంథాలను సమకూర్చుకుని చదవనారంభించాను. అలాగే ముఖ్యమైన అరబీ, తెలుగు డిక్షనరీలు, సామెతల, జాతీయాల పుస్తకాలు అధ్యయనం చేయసాగాను.

అనువాదాన్ని పరిశీలించిన తీరు పాఠకుల ముందు ఉంచటం సముచిత మని భావిస్తున్నాను. నేను ఈ గ్రంథాన్ని పరిశీలించిన తీరు ఇది: ముందుగా నేను ఖుర్ఆన్‌లో ప్రారంభం నుంచి ఒక్కో ఆయత్ చదువుతాను. దాని అర్థాన్ని బాగా ఆకళింపు చేసుకుంటాను. దానికి సంబంధించి ప్రముఖ వ్యాఖ్యాన (తఫ్సీర్), అనువాద గ్రంథాలన్నిటినీ ఒకసారి కూలంకషంగా అధ్యయనం చేస్తాను. కఠిన పదాలేవయినా ఎదురైతే అరబిక్ డిక్షనరీలను సంప్రతిస్తాను. ఆయత్‌ను అర్థం చేసుకోవటం పూర్తయిన తర్వాత, అప్పుడు దానికి రాసిన తెలుగు అనువాదాన్ని, దాని వ్యాఖ్యానాన్ని పరిశీలిస్తాను. ఈ విధంగా పరిశీలించినప్పుడు అనువాదంలోని ప్రామాణికతను చాలా సులభంగా బేరీజు వేయవచ్చు. దానికనుగుణంగా అనువాదంలో అవసరమైన మేరకు మార్పులు, చేర్పులు చేయటానికి వీలుంటుంది. మూలంలో ఎక్కడైనా ఒక పదానికి అనువాదంగా తెలుగులో కఠినమైన పదం వాడబడితే దాన్ని తొలగించి ఆ స్థానంలో సమానార్థకమే అయిన మరో సులభమైన పదాన్ని పొందుపరుస్తాను. ప్రకాశకులవారి ప్రమాణం ఏమంటే, మూలభాషలో ఖుర్ఆన్ ఎంత సులభంగా ఉన్నదో అనువాదంలోనూ అంతే సులభంగా ఉండాలి. నా పరిశీలన ఆ కోణంలోనూ సాగింది. అనువాద పరిశీలనకై నేను ఆధారపడ్డ ముఖ్య ఖుర్ఆన్ అనువాద, వ్యాఖ్యాన సంబంధ గ్రంథాలు ఇవి:

## అరబీ

1) తఫ్సీర్ ఇబ్నెకసీర్ – హాఫిజ్ ఇమాదుద్దీన్ ఇబ్నె కసీర్ దిమష్ఖీ
(2) జలాలైన్ – అల్లామా జలాలుద్దీన్ సుయూతీ మరియు మహల్లీ
(3) సఫ్వతుత్తఫాసీర్ – షేఖ్ ముహమ్మద్ అలీ అస్సాబూనీ
(4) తైసీరుల్ కరీమిర్రహ్మాన్ ఫీ తఫ్సీరి కలామిల్ మన్నాన్ – అల్లామా అబ్దుర్రహ్మాన్ బిన్ నాసిర్ అస్సఅదీ
(5) జుబ్దతుత్తఫ్సీర్ – డా. ముహమ్మద్ సులైమాన్ అబ్దుల్లాహ్ అల్ అష్కర్

(6) తఫ్సీర్ ఇబ్నె జరీర్ తబ్రీ
(7) అల్ ఇత్ఖాన్ ఫీ ఉలూమిల్ ఖుర్ఆన్ – అల్లామా జలాలుద్దీన్ సుయూతీ (ఇది వ్యాఖ్యాన సూత్రాలకు సంబంధించిన పుస్తకం)

## ఉర్దూ

(1) అహ్సనుల్ బయాన్ – (ప్రస్తుత అనువాద మూలగ్రంథం)
(2) తైసీరుర్రహ్మాని లిబయానిల్ ఖుర్ఆన్ – డా. ముహమ్మద్ లుఖ్మాన్ సలఫీ
(3) తఫ్సీరె ఖుర్ఆన్ – మౌలానా అబ్దుల్ మాజిద్ దర్యాబాదీ
(4) ఖుర్ఆనె కరీమ్ – మహ్మూదుల్ హసన్ గంగోహీ (ముజమ్మా ద్వారా ప్రచురించబడినది)

## తెలుగు

(1) దివ్యఖుర్ఆన్ – షేక్ హమీదుల్లా షరీఫ్ (**TIP Trust**)
(2) ఖుర్ఆన్ భావామృతం – అబుల్ ఇర్ఫాన్ (**IRC**)
(3) ఖురానె మజీద్ – మౌల్వీ ముహమ్మద్ అబ్దుల్ గఫూర్, కంభం

## ఇంగ్లీషు

(1) ద నోబుల్ ఖుర్ఆన్ – డా. ముహమ్మద్ తఖీయుద్దీన్ అల్ హిలాలీ,
– డా. ముహమ్మద్ ముహ్సిన్ ఖాన్

ఒక్కో ఆయతుకు సంబంధించి ఈ గ్రంథాలన్నీ అధ్యయనం చేసిన తర్వాతనే నేను ముందుకు కదిలేవాణ్ణి. అప్పటికీ, మూలానికీ – అనువాదానికి మధ్య సమన్వయం లోపిస్తున్నట్లు నాకు అనిపిస్తే అటువంటి సందర్భాలన్నిటినీ నోట్ చేసుకొని వారానికోసారి మౌలానా షేఖ్ అబ్దుల్ కబీర్ ఉమ్రీగారిని సంప్రతిస్తూ ఉండేవాణ్ణి. ఆయన వార్ధక్య దశలో ఉండి కూడా ఎంతో ఓపికతో నా సందేహాలు విని చాలా చక్కగా వాటికి సమాధానాలిచ్చేవారు.

మౌలానా అబ్దుల్ కబీర్ ఉమ్రీగారు తమిళనాడు రాష్ట్రం ఉమ్రాబాదులోని 'దారుస్సలామ్' అరబీ యూనివర్శిటీలో ఖుర్ఆన్ బోధన పండితులు. 80 యేండ్లకు పైబడిన వృద్ధులు. ఖుర్ఆన్ బోధనలో ఆయన సిద్ధహస్తులు. దాదాపు 60 యేండ్లుగా ఆ యూనివర్శిటీలో ఖుర్ఆన్ బోధన పనిలోనే నిమగ్నులై ఉన్నారు. అది దైవగ్రంథ మహిమో ఏమో గాని అంత వయోభారం ఉన్నప్పటికీ దివ్యఖుర్ఆన్ను బోధించటంలో ఆయన చాలా చురుకుగా ఉంటారు. పండు ముసలితనంలోనూ ఆయన మాట అత్యంత స్పష్టంగా, సూటిగా వెలువడుతుంది. ఖుర్ఆన్ విద్య మీద ఆయనతో సంభాషణ జరిపితే వ్యాఖ్యాన (తఫ్సీర్) గ్రంథాలను ఔపోశనం పట్టినట్లుంటుంది. ఖుర్ఆన్ గురించి అంత అద్భుతంగా మాట్లాడతారాయన! ఖుర్ఆన్లోని ఏదో ఒక సందర్భాన్ని ప్రస్తావించి సందేహం వెలిబుచ్చేలోగానే ఆయన్నుంచి సంతృప్తికరమైన సమాధానం వచ్చేస్తుంది. ఆయన శిష్యరికం పొందటం నా జీవితంలో ఎన్నటికీ మరువలేని ఘట్టం.

నేను పరిశీలన పని మొదలుపెట్టినప్పటికే అనువాదం మొత్తం కంప్యూటర్లో టైపు చేయబడింది. కనుక స్క్రిప్టు మీద నేను చేసిన సవరణలన్నిటినీ కంప్యూటర్లోనే సరిదిద్దటం జరిగింది. తర్వాత వాటి ప్రింట్లు తీసి

మంజూర్ అహ్మద్ ఉమ్రీ గారికి, అతావుర్రహ్మాన్ ఉమ్రీ గారికి ఒక్కొక్క సెట్టు చొప్పున మేము పంపించాము. వారు వాటిని ఎంత క్షుణ్ణంగా పరిశీలించారన్న సంగతి వారు పంపించిన సవరణ పత్రాలు చూస్తే తెలుస్తుంది. దివ్యఖుర్ఆన్ అనువాద పని ఒకరు గాకుండా ఒక టీం కలిసి చేస్తే అది ఎంతో ప్రభావవంతంగా, ప్రయోజనదాయకంగా ఉంటుంది. దాని ప్రకారమే మేమందరం కలిసి పని చేశాము. ప్రతి విషయాన్ని చర్చించి ఒక అంతిమ నిర్ణయానికి వచ్చాము. మంజూర్ అహ్మద్ ఉమరి, అతావుర్రహ్మాన్ ఉమరి గార్ల విలువైన సలహాలు, సూచనల ప్రకారం అనువాదాన్ని సరిదిద్దాము. ఆ తర్వాత మరో సెట్టు ప్రింటు తీయించి డా. సయీద్ అహ్మద్ మదనీ గారికి పంపించాము.

మదనీగారు అరబీలో, ఇస్లామీయ సాహిత్యంలో గొప్ప పండితులవటమే గాక ఎంతోకాలంగా సలఫ్ విధానానికి అనుగుణంగా, మూలానికి దగ్గరగా ఉండే విధంగా తెలుగులో ఒక ఖుర్ఆన్ అనువాదం తీసుకురావాలని తపన కలిగి వున్న వ్యక్తి. ఆయన తోడ్పాటు ఈ అనువాద కార్యానికి ఎంతగానో ఉపయుక్తమయింది. తన అనుభవాలు, ఆలోచనలన్నిటిని జోడించి ఆయన ఈ అనువాదాన్ని మరోమారు క్షుణ్ణంగా పరిశీలించి ఇచ్చారు. తమ విలువైన సలహాలతో మాకు సహాయం చేశారు. వాటన్నిటిని మేము అనువాదంలో సరిదిద్దుకున్నాము. మాటిమాటికీ కంప్యూటర్ మీద ఈ సరిదిద్దటం అనేది చాలా కష్టంతో కూడుకున్న పని. అదీ మూడు వేల పేజీలతో కూడిన ఒక ఉద్గ్రంథాన్ని మళ్ళీ మళ్ళీ రీసెట్టింగ్ చేయటమంటే మాటలు కాదు. అది ఎంతటి క్లిష్టమైన ఘట్టమో డి.టి.పి చేసేవాళ్ళెవరికైనా అర్థమవుతుంది. కాని అంత కష్టమైన పనిని కూడా సయ్యిద్ హుస్సేన్‌గారు, అబ్దుల్ వకీల్‌గారు, లక్ష్మీనారాయణ గార్ల మిత్రబృందం ఏమాత్రం విసుగు అనుకోకుండా, దైవప్రసన్నత కోసమని పని పూర్తిగావించారు. వారి ఓపికను, దక్షతను మాటల్లో వర్ణించలేము. అల్లాహ్ వారికి ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచి ప్రతిఫలాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

## ఈ గ్రంథంలో క్రొత్తగా చేర్చబడినవి

ఈ అనువాద గ్రంథాన్ని అహ్సనుల్ బయాన్ ఉర్దూ మూలగ్రంథంతో పోలిస్తే ఇందులో కొన్ని చేరికలు (ఎడిషన్స్) కనిపిస్తాయి. అవి:

**(1) సూరా పరిచయాలు.**

**(2) సందర్భ వివరణలు ఖుర్ఆన్ కథా మాలిక నుంచి.**

**(3) కొత్తపదాలు-వాటి అర్థాలు.**

**(4) సమాచార దర్శిని.**

**(5) ఖుర్ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన ప్రవక్తల పేర్లు, సజ్దాల సందర్భాలు.**

పాఠకులు వీటి గురించి కాస్త తెలుసుకుంటే గ్రంథపఠనం చాలా సాఫీగా సాగుతుంది.

**(1) సూరా పరిచయాలు:-** సామాన్యజనం ఖుర్ఆన్ గ్రంథాన్ని అర్థం చేసుకోవటానికి ముందుకు రాకపోవటానికి గల అనేక కారణాల్లో ఒక కారణం ఖుర్ఆన్‌లోని అధ్యాయాలకు సంబంధించి సరైన పరిచయం, నేపథ్యం వారికి అందకపోవటం. దివ్యఖుర్ఆన్‌లో ప్రారంభంలోని సూరాలు చాలా పెద్దవి. వాటికి మన అనువాదం, వ్యాఖ్యానం

కలిపినప్పుడు ఒక్కో సూరా ఓ వటవృక్షంలా తయారవు తుంది. దైవగ్రంథాన్ని మొదటిసారి పఠిస్తున్నవారికి ఒక్కసారిగా అన్ని విషయాలు జీర్ణం కావు. అందుకని సూరాలోకి ప్రవేశించే ముందు ఆ సూరా గురించి క్లుప్తంగా వివరిస్తే వారి పఠనం సాఫీగా ముందుకు సాగుతుంది. చదివే ప్రతిదీ వారికి చాలా తొందరగా అర్థమవుతుంది. ఒక్క దివ్యఖుర్‌ఆన్ అనే కాదు, ఏ విషయమైనా అంతే! నేపథ్యం, పరిచయం కలిగి ఉండే విషయాలు తొందరగా అర్థమవుతాయి. ఖుర్‌ఆన్‌తో బాగా పరిచయం ఉన్నవారి సంగతి పక్కనబెడితే, మామూలు పాఠకులందరూ ఈ గ్రంథంలో ప్రతిసూరాకు ముందు పరిచయం చదివిన తర్వాత, అందులోని విషయాలను స్థూలంగా అర్థం చేసుకున్న మీదటే సూరాలోకి ప్రవేశించాలని మనవి. అలాచేస్తే వారు దివ్యఖుర్‌ఆన్‌ను వీలైనంత ఎక్కువగా అర్థం చేసుకోగలరు.

**(2) సందర్భ వివరణలు ఖుర్‌ఆన్ కథా మాలిక నుంచి:–** ద్వితీయ ముద్రణలో చేర్చబడిన అంశం ఉంది. ఖుర్‌ఆన్ పఠనంలో మనకు కొన్ని సందరా&భలు ఎదురవుతుంటాయి. ఖుర్‌ఆన్ బోధనా శైలి అక్కడ విషయాన్ని చాలా క్లుప్తంగా ప్రస్తావించి ముందుకు సాగిపోతుంది. సందర్భానికి అవసరమైన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తుంది. ఇలాంటి సందరా&భలు కలిగి వున్న సూరాల ప్రారంభంలో ఒక సమాచార పట్టిక ఇవ్వబడింది. మా పబ్లికేషన్ తరఫు నుంచే వెలువడిన మరో పుస్తకం "ఖుర్‌ఆన్ కథామాలిక" ఆధారంగా ఇది రూపొందించబడింది. దివ్య ఖుర్‌ఆన్‌లోని చారిత్రక గాథలను మరింత లోతుగా, కాలానుగుణంగా అధ్యయనం చేయదలచుకునేవారు ఈ పట్టికల్లోని రిఫరెన్సుల సహాయంతో "ఖుర్‌ఆన్ కథామాలిక" ను అధ్యయనం చేసే వారికి విషయం మరింత సుబోధకం కాగలదు.

**3) కొత్తపదాలు – వాటి అర్థాలు:–** తెలుగు అహ్‌సనుల్ బయాన్‌కు మేము జోడించిన రెండో ముఖ్య అంశం ఇది. ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకోవటం చాలా సులభం. ఇది మా మాట కాదు. స్వతహాగా ఖుర్‌ఆనే తనను తాను సులభ మైనదిగా పరిచయం చేసుకున్నది (ఖమర్ సూరా, 17వ వాక్యం). అందుకని అనువాదంలో గాని, వ్యాఖ్యానంలో గాని పాఠకులకు కఠిన సందర్భాలు ఎదురు కాకూడదని భావించి తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. క్రియాత్మకంగా, ప్రచురణకు ముందే ఈ గ్రంథాన్ని కొందరు సామాన్య పాఠకుల చేత పఠనం చేయించి, వారికి కఠినంగా అనిపించిన సందర్భాలను గుర్తించి, వాటిని సులభంగా మార్చటానికి కృషి చేశాం. అరబీ పారిభాషిక పదాలను అక్కడికక్కడే వివరించటానికి ప్రయత్నించాం. ఒకవేళ అక్కడ వివరించటం వీలుకాని పక్షంలో, అటువంటి పదాలన్నిటిని ఏర్చికూర్చి గ్రంథం చివర్లో "కొత్తపదాలు – వాటి అర్థాలు" అనే పేరుతో ఒక సమగ్రమైన జాబితాను రూపొందించాం. పాఠకులకు ఎక్కువ సౌలభ్యం ఉండాలన్న ఉద్దేశంతో– ఏ సూరా కఠిన పదాలను ఆ సూరా పేరుతోనే వేర్వేరుగా ప్రస్తావించాం.

**(3) సమాచార దర్శిని:–** చివరగా చెప్పుకోవలసింది సమాచార దర్శిని గురించి. దీన్ని మేము ఇంగ్లీషులోని "ద నోబుల్ ఖుర్‌ఆన్" నుంచి సంగ్రహించి, సవరించి రాశాము. ఖుర్‌ఆన్‌లో ఏదయినా అంశానికి సంబంధించి సమాచారం కావాలనుకుంటే ఈ సమాచార దర్శినిలో అకారాదులను అనుసరించి ఆ అంశాన్ని చేరుకోవాలి. అక్కడున్న సూరా మరియు ఆయతు సంఖ్యలను గుర్తించి వాటిద్వారా ఈ ఖుర్‌ఆన్‌లో వీలైనంత ఎక్కువ సమాచారాన్ని గ్రహించవచ్చు.

సమాచార దర్శిని గురించి పాఠకులు ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మనసుకు తోచే ప్రతి అంశం ఇందులో దొరకాలంటే కష్టం. సమాచార దర్శినిని అంత సమగ్రంగానూ రూపొందించవచ్చు. కాని అలాచేస్తే అది సైతం ఒక ఉద్గ్రంథంగా తయారవుతుంది. అయితే ఒక పద్ధతిని అనుసరిస్తూ పాఠకులు దీని ద్వారా ఎక్కువ

ప్రయోజనం పొందవచ్చు. కావలసిన అంశం ఏదైనా 'సమాచార దర్శిని'లో దొరకనప్పుడు దానితో దగ్గరి సంబంధం ఉన్న పదం తీసుకుని వెతకండి. మూసా ప్రవక్త గురించి వెతికినప్పుడు ఫిరౌన్ పదం గురించి కూడా వెతకాలి. అలాగే ఈసా (యేసు) గురించి వెతికినప్పుడు మర్యమ్ గురించి వెతకటం కూడా మర్చిపోకూడదు. అలా చేస్తే కావలసినంత సమాచారం ఇందులో తప్పక లభిస్తుంది.

**4) ప్రవక్తల పేర్లు, సజ్దాల సందర్భాలు:–** ప్రపంచం పుట్టింది మొదలుకొని– అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వరకు, మానవుల మార్గదర్శనం కోసం ఈ ప్రపంచంలో ఎందరో ప్రవక్తలు ప్రభవించారు. కాని ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ వారందరి పేర్లను ప్రస్తావించలేదు. కొందరి పేర్లను మాత్రమే ప్రస్తావించాడు. పాఠకుల సౌలభ్యం కోసం వాటిలో కొన్ని ముఖ్యమైన పేర్లను ఏర్చికూర్చి గ్రంథం చివర్లో ఒక జాబితాను రూపొందించాం. పైగా ఆ పేర్ల అరబీ ఉచ్చారణతోపాటు మన నాట వాడుకలో ఉన్న తెలుగు బైబిల్ గ్రంథంలో ఆ పేర్లు ఉచ్చరించబడుతున్న తీరు, ఇంకా వాటి ఇంగ్లీషు స్పెల్లింగులు కూడా ఇచ్చాము.

ఇందులోనే రెండో అంశం సజ్దాల సందర్భాలు. ఖుర్ఆన్ పారాయణం చేసేటప్పుడు మధ్యలో కొన్నిచోట్ల సజ్దాకు (సాష్టాంగ ప్రణామానికి) సంబంధించిన సందర్భాలు వస్తాయి. అక్కడ ఆగి సజ్దా చేయటం ఉత్తమం. అయితే ఖుర్ఆన్‌లో సజ్దాకు సంబంధించిన ప్రస్తావనలు లెక్కలేనన్ని చోట్ల రావచ్చు. అన్ని చోట్లా సజ్దా చేయనక్కర్లేదు. అసలు అది పద్ధతి కూడా కాదు. దైవప్రవక్త ముహమ్మద్ (స) ఖుర్ఆన్ పారాయణంలో కొన్నిచోట్ల సజ్దా చేసినట్లు హదీసుల్లో ఆధారాలున్నాయి. ఆ సందర్భాల్లో మాత్రమే సజ్దా చేయాలి. అలా చేయటం సున్నత్ (సంప్రదాయం). పాఠకుల ఆచరణకు వీలుగా ఉంటుందని తలపోసి అటువంటి సందర్భాలన్నిటిని ఒక జాబితాగా తయారు చేసి ఇస్తున్నాం. అల్లాహ్ ఈ కృషిని ఆమోదిస్తాడని ఆశిస్తున్నాం.

గ్రంథం మొత్తం నేను కనీసం ఏడెనిమిది సార్లు పరిశీలనాత్మకంగా ప్రూఫ్ రీడింగ్ చేశాను. నా మిత్రుల సహకారం కూడా తీసుకున్నాను. మొత్తానికి ఈ గ్రంథాన్ని అనువాద దోషాల నుంచే కాకుండా, ముద్రారాక్షసాల నుంచి కూడా కాపాడటానికి శక్తికొలది జాగ్రత్తలు తీసుకున్నాం. అయినప్పటికీ మానవ సహజమైన దౌర్బల్యం చేత తప్పులు జరిగి ఉండవచ్చు. అలాంటివి ఏవయినా మీ దృష్టికి వస్తే మమ్మల్ని మన్నించి ఊరుకోకుండా గ్రంథం మూడవ పేజీలో ఇవ్వబడ్డ చిరునామాకు గాని, ఈ–మెయిల్‌కు గాని రాసి పంపండి. ఇన్షాఅల్లాహ్ మలిముద్రణలో వాటిని సరిదిద్దుకుంటాం.

ఈ పుణ్యకార్యంలో పాలుపంచుకున్న వారందరికీ అల్లాహ్ ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ఉత్తమ ప్రతిఫలాన్ని అనుగ్రహించాలని ప్రార్థిస్తూ.......

**– ఎస్.ఎమ్.రసూల్ షర్ఫీ**

సేవకుడు, శాంతిమార్గం పబ్లికేషన్స్.

# సంక్షిప్తాల వివరణ

**పాఠకులకు విజ్ఞప్తి:**

ఇస్లామీయ ధార్మిక పుస్తకాల్లో తరచుగా వచ్చే ప్రార్థనా వచనాలను వాక్య అంతరాయం దృష్ట్యా క్రింది విధంగా సంక్షిప్తంగానో లేక పొడి అక్షరాలుగానో పేర్కొనటం జరుగుతుంది. అయితే అవి రాతపరమైన సంక్షిప్తాలే గాని ఉచ్చారణపరమైన సంక్షిప్తాలు కావు. కనుక పాఠకులు మాత్రం ఆ సంక్షిప్త పదాలను విస్తరించుకునే చదువుకోవలసి ఉంటుంది. ఉదాహరణకు "ముహమ్మద్ (స)" అనే మాటను చదివేటప్పుడు "ముహమ్మద్ స" అని కాకుండా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం అని చదవాలి.

**(స) లేక (సఅసం)** = సల్లల్లాహు అలైహి వ సల్లం : (అల్లాహ్ ఆయన మీద శాంతి మరియు కరుణాకటాక్షాలు కురిపించుగాక!)
దైవప్రవక్త ముహమ్మద్ (స) పేరు ప్రస్తావనకు వచ్చినప్పుడు ఈ ప్రార్థనా పలుకులు పఠించాలి.

**(అలైహి)** = అలైహిస్సలామ్ : (అల్లాహ్ ఆయన మీద శాంతి కురిపించుగాక!)
ప్రవక్తల పేర్ల తరువాత ఈ విధంగా పలకాలి.

**(ర) లేక (రజి)** = రజియల్లాహు అన్హు : (అల్లాహ్ ఆయన పట్ల ప్రసన్నుడగుగాక!)

**(రజి.అన్హా)** = రజియల్లాహు అన్హా : (అల్లాహ్ ఆమె పట్ల ప్రసన్నుడగుగాక!)
దైవప్రవక్త ముహమ్మద్ (స) సహచరుల పేర్ల తరువాత ఈ విధంగా పలకటం ఆనవాయితీ.

**(రహ్మ.లై)** = రహ్మతుల్లాహి అలైహి: (ఆయన మీద అల్లాహ్ శాంతి కలుగుగాక!)
దైవప్రవక్త సహచరుల శిష్యుల (తాబియీన్ల) పేర్ల తరువాత, ప్రముఖ ఇస్లామీయ ధార్మికవేత్తలు, పండితుల పేర్ల తరువాత ఈ విధంగా పలకటం ఆనవాయితీ.

# పారా సమాచారం

| పారా నెం. | పారా పేరు | మొదలు పేజీ | ఈ ఆయత్ నుంచి మొదలు | | | ఈ ఆయత్ వరకు | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | సూరా పేరు | సూరా నెం | ఆయత్ నెం | సూరా పేరు | సూరా నెం | ఆయత్ నెం |
| 1 | అలిఫ్ లామ్ మీమ్ | 04 | అల్ ఫాతిహా | 01 | 01 | అల్ బఖర | 02 | 141 |
| 2 | సయఖూలు | 64 | అల్ బఖర | 02 | 142 | అల్ బఖర | 02 | 252 |
| 3 | తిల్కర్రుసులు | 117 | అల్ బఖర | 02 | 253 | అలి ఇమ్రాన్ | 03 | 91 |
| 4 | లన్‌తనాలూ | 174 | ఆలి ఇమ్రాన్ | 03 | 92 | అన్ నిసా | 04 | 23 |
| 5 | వల్ ముహ్సనాత్ | 231 | అన్ నిసా | 04 | 24 | అన్ నిసా | 04 | 147 |
| 6 | లా యుహిబ్బుల్లాహు | 285 | అన్ నిసా | 04 | 148 | అల్ మాయిద | 05 | 82 |
| 7 | వ ఇజా సమిఊ | 339 | అల్ మాయిద | 05 | 83 | అల్ అన్‌ఆమ్ | 06 | 110 |
| 8 | వలవ్ అన్ననా | 397 | అల్ అన్‌ఆమ్ | 06 | 111 | అల్ ఆరాఫ్ | 07 | 87 |
| 9 | ఖాలల్ మలఉ | 454 | అల్ ఆరాఫ్ | 07 | 88 | అల్ అన్‌ఫాల్ | 08 | 40 |
| 10 | వాలమూ | 510 | అల్ అన్‌ఫాల్ | 08 | 41 | అత్ తౌబా | 09 | 93 |
| 11 | యాతజిరూన్ | 564 | అత్ తౌబా | 09 | 94 | హూద్ | 11 | 5 |
| 12 | వమా మిన్ దాబ్బతిన్ | 618 | హూద్ | 11 | 6 | యూసుఫ్ | 12 | 52 |
| 13 | వమా ఉబర్రిఉ | 674 | యూసుఫ్ | 12 | 53 | అల్ హిజ్ర్ | 15 | 1 |
| 14 | రుబమా | 730 | అల్ హిజ్ర్ | 15 | 2 | అన్ నహ్ల్ | 16 | 128 |
| 15 | సుబ్‌హానల్లజీ | 786 | బనీ ఇస్రాయీల్ | 17 | 1 | అల్ కహఫ్ | 18 | 74 |
| 16 | ఖాల అలమ్ | 843 | అల్ కహఫ్ | 18 | 75 | తాహా | 20 | 135 |
| 17 | ఇఖ్తరబ | 905 | అల్ అంబియా | 21 | 1 | అల్ హజ్ | 22 | 78 |
| 18 | ఖద్ అఫ్లహ | 962 | అల్ మూ'మినూన్ | 23 | 1 | అల్ ఫుర్ఖాన్ | 25 | 20 |
| 19 | వఖాలల్లజీన | 1020 | అల్ ఫుర్ఖాన్ | 25 | 21 | అన్ నమ్ల్ | 27 | 59 |
| 20 | అమ్మన్ ఖలఖ్ | 1083 | అన్ నమ్ల్ | 27 | 60 | అల్ అన్‌కబూత్ | 29 | 44 |
| 21 | ఉత్లు మా ఊహియ | 1140 | అల్ అన్‌కబూత్ | 29 | 45 | అల్ అహ్‌జాబ్ | 33 | 30 |
| 22 | వమయ్ యఖ్‌నుత్ | 1213 | అల్ అహ్‌జాబ్ | 33 | 31 | యాసీన్ | 36 | 21 |
| 23 | వమా లియ | 1264 | యాసీన్ | 36 | 22 | అజ్ జుమర్ | 39 | 31 |
| 24 | ఫమన్ అజ్‌లమ్ | 1333 | అజ్ జుమర్ | 39 | 32 | హా మీమ్ అస్ సజ్‌దహ్ | 41 | 46 |
| 25 | ఇలైహి యురద్దు | 1390 | హామీమ్ అస్ సజ్‌దహ్ | 41 | 47 | అల్ జాసియహ్ | 45 | 37 |
| 26 | హామీమ్ | 1455 | అల్ అహ్‌ఖాఫ్ | 46 | 1 | అజ్ జారియాత్ | 51 | 30 |
| 27 | ఖాల ఫమా ఖత్‌బుకుమ్ | 1522 | అజ్ జారియాత్ | 51 | 31 | అల్ హదీద్ | 57 | 29 |
| 28 | ఖద్ సమిఅల్లాహు | 1599 | అల్ ముజాదలహ్ | 58 | 1 | అల్ తహ్‌రీమ్ | 66 | 12 |
| 29 | తబారకల్లజీ | 1667 | అల్ ముల్క్ | 67 | 1 | అల్ ముర్సలాత్ | 77 | 50 |
| 30 | అమ్మ | 1751 | అన్ నబా | 78 | 1 | అన్ నాస్ | 114 | 6 |

# సూరా సూచిక



| సూరా నెం. | సూరా పేరు | ఆయతుల సంఖ్య | పేజి నెం. |
|---|---|---|---|
| 1. | అల్ ఫాతిహా | 7 | 01 |
| 2. | అల్ బఖర | 286 | 09 |
| 3. | ఆలి ఇమ్రాన్ | 200 | 138 |
| 4. | అన్ నిసా | 176 | 214 |
| 5. | అల్ మాయిద | 120 | 297 |
| 6. | అల్ అన్ఆమ్ | 165 | 356 |
| 7. | అల్ ఆరాఫ్ | 206 | 422 |
| 8. | అల్ అన్ఫాల్ | 75 | 496 |
| 9. | అత్ తౌబా | 129 | 524 |
| 10. | యూనుస్ | 109 | 580 |
| 11. | హూద్ | 123 | 616 |
| 12. | యూసుఫ్ | 111 | 656 |
| 13. | అర్ రాద్ | 43 | 693 |
| 14. | ఇబ్రాహీమ్ | 52 | 712 |
| 15. | అల్ హిజ్ర్ | 99 | 729 |
| 16. | అన్ నహ్ల్ | 128 | 746 |
| 17. | బనీ ఇస్రాయీల్ | 111 | 784 |
| 18. | అల్ కహఫ్ | 110 | 818 |
| 19. | మర్యమ్ | 98 | 853 |
| 20. | తాహా | 135 | 874 |
| 21. | అల్ అంబియా | 112 | 904 |
| 22. | అల్ హజ్ | 78 | 932 |
| 23. | అల్ మూ'మినూన్ | 118 | 961 |

| | | | |
|---|---|---|---|
| 24. | అన్ నూర్ | 64 | 985 |
| 25. | అల్ ఫుర్ఖాన్ | 77 | 1014 |
| 26. | అష్ షుఅరా | 227 | 1035 |
| 27. | అన్ నమ్ల్ | 93 | 1068 |
| 28. | అల్ ఖసస్ | 88 | 1093 |
| 29. | అల్ అన్కబూత్ | 69 | 1124 |
| 30. | అర్ రూమ్ | 60 | 1149 |
| 31. | లుఖ్మాన్ | 34 | 1168 |
| 32. | అస్ సజ్దహ్ | 30 | 1181 |
| 33. | అల్ అహ్జాబ్ | 73 | 1190 |
| 34. | సబా | 54 | 1222 |
| 35. | ఫాతిర్ | 45 | 1242 |
| 36. | యాసీన్ | 83 | 1259 |
| 37. | అస్ సాఫ్ఫాత్ | 182 | 1278 |
| 38. | సాద్ | 88 | 1303 |
| 39. | అజ్ జుమర్ | 75 | 1322 |
| 40. | అల్ మూ'మిన్ | 85 | 1347 |
| 41. | హా మీమ్ అస్ సజ్దహ్ | 54 | 1375 |
| 42. | అష్ షూరా | 53 | 1394 |
| 43. | అజ్ జుఖ్రుఫ్ | 89 | 1412 |
| 44. | అద్ దుఖాన్ | 59 | 1432 |
| 45. | అల్ జాసియహ్ | 37 | 1443 |
| 46. | అల్ అహ్ఖాఫ్ | 35 | 1454 |
| 47. | ముహమ్మద్ | 38 | 1468 |
| 48. | అల్ ఫత్హ్ | 29 | 1482 |
| 49. | అల్ హుజురాత్ | 18 | 1497 |

| | | | |
|---|---|---|---|
| 50. | ఖాఫ్ | 45 | 1506 |
| 51. | అజ్ జారియాత్ | 60 | 1517 |
| 52. | అత్ తూర్ | 49 | 1528 |
| 53. | అన్ నజ్మ్ | 62 | 1538 |
| 54. | అల్ ఖమర్ | 55 | 1549 |
| 55. | అర్ రహ్మాన్ | 78 | 1560 |
| 56. | అల్ వాఖిఅహ్ | 96 | 1573 |
| 57. | అల్ హదీద్ | 29 | 1585 |
| 58. | అల్ ముజాదలహ్ | 22 | 1598 |
| 59. | అల్ హష్ర్ | 24 | 1609 |
| 60. | అల్ ముమ్‌తహినహ్ | 13 | 1619 |
| 61. | అస్ సఫ్ | 14 | 1628 |
| 62. | అల్ జుముఅహ్ | 11 | 1634 |
| 63. | అల్ మునాఫిఖూన్ | 11 | 1639 |
| 64. | అత్ తగాబున్ | 18 | 1644 |
| 65. | అత్ తలాఖ్ | 12 | 1651 |
| 66. | అత్ తహ్‌రీమ్ | 12 | 1659 |
| 67. | అల్ ముల్క్ | 30 | 1666 |
| 68. | అల్ ఖలమ్ | 52 | 1674 |
| 69. | అల్ హాఖ్ఖహ్ | 52 | 1684 |
| 70. | అల్ మఆరిజ్ | 44 | 1692 |
| 71. | నూహ్ | 28 | 1699 |
| 72. | అల్ జిన్న్ | 28 | 1706 |
| 73. | అల్ ముజ్జమ్మిల్ | 20 | 1714 |
| 74. | అల్ ముద్దస్సిర్ | 56 | 1721 |
| 75. | అల్ ఖియామహ్ | 40 | 1729 |

| | | | |
|---|---|---|---|
| 76. | అద్ దుహా | 31 | 1735 |
| 77. | అల్ ముర్సలాత్ | 50 | 1743 |
| 78. | అన్ నబా | 40 | 1751 |
| 79. | అన్ నాజిఆత్ | 46 | 1758 |
| 80. | అబస | 42 | 1764 |
| 81. | అత్ తక్వీర్ | 29 | 1770 |
| 82. | అల్ ఇన్ఫితార్ | 19 | 1774 |
| 83. | అల్ ముతఫ్ఫిఫీన్ | 36 | 1777 |
| 84. | అల్ ఇన్షిఖాఖ్ | 25 | 1782 |
| 85. | అల్ బురూజ్ | 22 | 1786 |
| 86. | అత్ తారిఖ్ | 17 | 1790 |
| 87. | అల్ ఆలా | 19 | 1793 |
| 88. | అల్ గాషియహ్ | 26 | 1796 |
| 89. | అల్ ఫజ్ర్ | 30 | 1799 |
| 90. | అల్ బలద్ | 20 | 1804 |
| 91. | అష్ షమ్స్ | 15 | 1807 |
| 92. | అల్ లైల్ | 21 | 1810 |
| 93. | అజ్ జుహా | 11 | 1813 |
| 94. | అష్ షరహ్ | 8 | 1816 |
| 95. | అత్ తీన్ | 8 | 1818 |
| 96. | అల్ అలఖ్ | 19 | 1820 |
| 97. | అల్ ఖద్ర్ | 5 | 1823 |
| 98. | అల్ బయ్యినహ్ | 8 | 1825 |
| 99. | అజ్ జిల్జాల్ | 8 | 1828 |
| 100. | అల్ ఆదియాత్ | 11 | 1830 |
| 101. | అల్ ఖారిఅహ్ | 11 | 1832 |

| | | | |
|---|---|---|---|
| 102. | అత్ తకాసుర్ | 8 | 1834 |
| 103. | అల్ అస్ర్ | 3 | 1835 |
| 104. | అల్ హుమజహ్ | 9 | 1837 |
| 105. | అల్ ఫీల్ | 5 | 1838 |
| 106. | ఖురైష్ | 4 | 1840 |
| 107. | అల్ మాఊన్ | 7 | 1841 |
| 108. | అల్ కౌసర్ | 3 | 1843 |
| 109. | అల్ కాఫిరూన్ | 6 | 1845 |
| 110. | అన్ నస్ర్ | 3 | 1846 |
| 111. | అల్ లహబ్ | 5 | 1847 |
| 112. | అల్ ఇఖ్లాస్ | 4 | 1849 |
| 113. | అల్ ఫలఖ్ | 5 | 1850 |
| 114. | అన్ నాస్ | 6 | 1852 |

# అనుబంధం-2

# సమాచార దర్శిని

**ఉదా: 95 : 1 (95 సూరా నెంబరు; 1 ఆయత్ నెంబరు)**


## అ

**అంజూరం (తీన్ పండు):** 95:1

**అక్రమ లైంగిక సంబంధాలు పాపం, వాటి నిరూప ణకై సాక్ష్యాధారాలు అవసరం:**
4:15-18; 24:2,19

**అగ్ని :** ఈ పదం ఖుర్ఆన్‌లో 200 కంటే ఎక్కువసార్లు ప్రస్తావనకు వచ్చింది.

**అద్న్ (శాశ్వత) స్వర్గం :**

శాశ్వత స్వర్గంలో స్వర్గవాసులకు పరిశుద్ధమైన నివాసాలు ఉంటాయి 9:72;

తమ పూర్వీకులలో, భార్యలలో, సంతానంలో సజ్జనులైన వారితోపాటు వారు స్వర్గప్రవేశం చేస్తారు 13:23;

ఇది భయభక్తులు కలవారి పరలోక నివాసం 16:31; 98:8;

స్వర్గవాసులకు బంగారు కంకణాలు, సన్నని జలతారు పట్టు వస్త్రాలు, ఎత్తైన ఆసనాలు ఉంటాయి 18:31;

ఈ స్వర్గం గురించి కరుణామయుడు తన దాసులకు వాగ్దానం చేశాడు 19:61;

పరిశుద్ధతను పాటించే వ్యక్తికి లభించే ప్రతిఫలం ఇది 20:76;

స్వర్గవాసులకు సువర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరణ 35:33;

స్వర్గవాసుల కొరకు స్వర్గద్వారాలు తెరువబడి ఉంటాయి 38:50;

విశ్వాసులకు స్వర్గం లభించాలని దైవ దూతలు సయితం ప్రార్థిస్తూ ఉంటారు 40:8;

స్వర్గం లభించటం గొప్ప సాఫల్యం 61:12;

**అనాథలు :**
2:83,177,215,220; 18:82; 59:7; 4:2,3,6,8, 10,36,127; 8:41; 76:8; 90:15;

ఉత్తమమైన రీతిలో తప్ప అనాథల ఆస్తి దరిదాపులకు కూడా పోకండి 6:152; 17:34;

అనాథలను గౌరవంగా చూడాలి 89:17;

పరలోక శిక్షను, బహుమానాన్ని తిరస్కరించేవాడు అనాథలను కసరికొడ్తాడు 107:2

అనాథల సంరక్షకులు 4:6

**అన్యాయానికి గురైనవాడు :**

అన్యాయం చేస్తే అగ్నిలో పడటం ఖాయం 4:30

అన్యాయం జరిగితే తప్ప, మనిషి చెడు పలకటాన్ని అల్లాహ్ ఇష్టపడదు 4:148

**అనుమానం:**
అతిగా అనుమానించరాదు, కొన్ని అనుమానాలు పాపాలు కావచ్చు 49:12

**అనుమానపు రోగం** (కపటుల, అవిశ్వాసుల గుండెల్లో) **:**
2:10; 5:52; 8:49; 9:125; 22:53; 24:50; 33:12,32,60; 47:20,29; 74:31

**అబ్‌రార్ (సజ్జనులు) :**
3:193,198; 76:5; 82:13; 83:18-22;

**అబస (మొహం చిట్లించాడు) :**
సూరా 80; 74:22

**అబద్ధాలకోరులు :**
అబద్ధాలు చెప్పే షైతానులు వంచకులైన దుర్మార్గుల దగ్గర దిగుతారు 26:221-223

**అబూ లహబ్ (దైవప్రవక్తను బాధించిన వ్యక్తి):** 111:1-5;

**అమరగతులు (షుహదా) :**
చనిపోలేదు 2:154; 3:169
తమ ప్రభువు వద్ద జీవికను పొందుతారు 3:170,171
సుఖంగా, సంతోషంగా ఉంటారు 3:169-171
మన్నింపు, కారుణ్యం పొందుతారు 3:157,158
మంచి ఆహారం పొందుతారు 22:58,59

**అమానతులు (అల్లాహ్ అప్పగించిన బాధ్యతలు):**
వీటిని ఆకాశాల ముందు, భూమి ముందు పెట్టగా వాటిని తీసుకోవటానికి అవి నిరాకరించాయి. కాని మానవుడు ఆ బాధ్యతల్ని తన నెత్తిన వేసుకున్నాడు. 33:72,73

**అమానతులు (ఇతరులు ఉంచమని ఇచ్చిన దబ్బు, ఆస్తి, నగలు, వస్తువులు వగైరా) :** 2:283;
అమానతులను యోగ్యులైన వారికే అప్పగించాలి 4:58;
అమానతుల విషయంలో ద్రోహానికి పాల్పడరాదు 8:27;
సాఫల్యం పొందే విశ్వాసులు అమానతులకు కట్టుబడి ఉంటారు 23:8; 70:32

**అయికా (అడవి) నివాసులు :**
అయికా జాతీయులకు అల్లాహ్ ప్రతీకారం చేశాడు 15:78; 38:13; 50:14 (మద్‌యన్ కూడా చూడండి)
అయికా ప్రజలు దైవప్రవక్తలను తిరస్కరించారు 26:176- 191

**అయ్యూబ్ (యోబు) ప్రవక్త :**
4:163; 6:84; 21:83,84; 38:41-44

**అరఫాత్ స్థలం :**
హజ్ యాత్రలో 'అరఫాత్' నుండి బయలుదేరి 'మష్‌అరె హరామ్' వద్ద ఆగి అల్లాహ్‌ను స్మరించండి 2:198

**అల్‌యసా (ఎలీషా) ప్రవక్త :** 6:86; 38:48

**అలఖ్ (పేరుకుపోయిన రక్తపు ముద్ద):** మనిషి పుట్టుక జరిగింది దీంతోనే. చూడండి 96వ సూరా;

**అలవాట్లు :**
ఇండ్లల్లోకి ప్రవేశించటం గురించి 24:27-29
ఇండ్లల్లో ఉన్నప్పుడు 24:58-61
ప్రవక్త కోసం దరూద్ సలామ్‌లు పఠించటం 33:56
అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు, విశ్వాసులైన స్త్రీ పురుషులకు బాధ కలిగించరాదు 33:57,58
ఒక సమాచారాన్ని నమ్మే ముందు బాగా విచారించుకోవాలి 49:6
ఇతరులను ఎగతాళి చేయరాదు 49:11
సభామర్యాదలు 58:11

**అల్లాహ్ :**
అల్లాహ్ అన్న పదం ఖుర్‌ఆన్‌లో 3000 కంటే ఎక్కువ సార్లు వచ్చింది

**అల్లాహ్ అభీష్టం (అల్లాహ్ తలచుకున్నది) :**
అల్లాహ్ తలచుకుంటే సమస్త భూవాసులూ విశ్వసించి ఉండే వారు 10:99,100;
అల్లాహ్ తాను కోరిన వారికి సహాయపడతాడు 30:5;
అల్లాహ్ మనిషిని తాను తలచుకున్న ఆకారంలో క్రమబద్ధంగా మలిచాడు 82:8
మానవులు తలచుకున్నా అల్లాహ్ తలచనిదే ప్రయోజనం లేదు 81:29

**అల్లాహ్ నిదర్శనాలు (ఆయాత్, అంటే అల్లాహ్ ఉన్నాడు, ఆయన ఉనికి మొదలగువాటికి సాక్ష్యాలు) :**
ఈ పదం దివ్య ఖుర్‌ఆన్‌లో 300 కంటే ఎక్కువసార్లు వచ్చింది.

**అల్లాహ్ మీద యుద్ధం :**
అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో పోరాడేవారికీ, భూమిలో కల్లోలాన్ని సృష్టిస్తూ తిరిగేవారికి శిక్ష ఏమిటంటే.... 5:33,34

**అల్లాహ్ స్మరణ :**
సిరిసంపదలు, సంతానం అల్లాహ్ స్మరణ నుంచి మరల్చరాదు 63:9
అల్లాహ్ స్మరణతో హృదయాలు నెమ్మదిస్తాయి 13:28

**అల్లాహ్ సమ్ముఖం (అల్లాహ్‌కు దగ్గరవటం, ఆయన అనుగ్రహం పొందటం) :** 2:115,272; 6:52; 13:22; 18:28; 28:88; 30:38,39; 55:27; 76:9; 92:20

**అవిశ్వాసులు (అల్లజీన కఫరూ) :**

ఈ పదం మొత్తం దివ్యఖుర్‌ఆన్‌లో 200 కంటే ఎక్కువసార్లు ప్రస్తావనకు వచ్చింది.

అవిశ్వాసులు జీవచ్ఛవాలు: 6:36

అవిశ్వాసులకు తమ పనులు మంచివిగా అగుపిస్తాయి : 6:108

అశుద్ధులు (విశ్వాసాల పరంగా అశుద్ధులైనవారు) :9:28

**అసత్యం, మిథ్య (అల్లాహ్ గురించి, ఆయన ప్రవక్తల గురించి అబద్ధాలు, మిథ్యా భావాలు, ఊహలు మొ॥వి):**

సత్యాన్ని అసత్యంతో కలగాపులగం చేయకండి 2:42; 3:71; 8:8;

అసత్యం నురుగులాగా ఎగిరిపోతుంది, సత్యం మాత్రం మానవులకు లాభం కలిగించే వస్తువు లాగా భూమ్మీద నిలిచి ఉంటుంది 13:17;

సత్యం వచ్చేసింది, అసత్యం నశించింది 17:81; 42:24;

అల్లాహ్ అసత్యాన్ని సత్యంతో దెబ్బతీస్తాడు, అది దాని తలను పగలగొడుతుంది 21:18;

అల్లాహ్‌యే సత్యం. అల్లాహ్‌ను వదలి అవిశ్వాసులు వేడుకునే వన్నీ అసత్యం 22:62; 31:30;

అసత్యాన్ని విశ్వసించి, అల్లాహ్‌ను తిరస్కరించేవారే అసలు నష్టానికి గురయ్యేవారు 29:52,67;

సత్యం వచ్చేసింది, ఇక అసత్యం ఏమి చేసినా నెగ్గజాలదు 34:49;

ప్రపంచ జాతులు అసత్యం అనే ఆయుధంతో సత్యాన్ని ఓడించటానికి ప్రయత్నించాయి 40:5; 47:3

ఈ గ్రంథం మీదకు అసత్యం ముందు నుండీ రాజాలదు, వెనుక నుండీ రాజాలదు 41:42;

**అస్ర్ (కాలం) :** కాలం సాక్షిగా మానవుడు నష్టంలో పడివున్నాడు. సూరా103

**అహ్‌ఖాఫ్ (ఇసుక గుట్టలు) :**46;

హూద్ ప్రవక్త ఇసుక గుట్టల మధ్య నివసించే తన జాతి వారిని హెచ్చరించారు 46:21

**అహ్మద్ (ముహమ్మద్ ప్రవక్త రాక గురించి ఏసు ప్రవక్త గారి శుభవార్త ఇంజీలు గ్రంథంలో):** 61:6;

## ఆ

**ఆకాశం పైకప్పు :**

ఆకాశాన్ని అల్లాహ్ ఒక సురక్షితమైన కప్పుగా చేశాడు 21:32

**ఆకాశాలు :**

ఆకాశాల్లోని అగోచర వస్తువులన్నీ అల్లాహ్‌వే: 16:77

ఆకాశాలు ఆటవిడుపుగా పుట్టించబడలేదు: 21:16

భూమ్యాకాశాలు కలిసి ఉండేవి : 21:30

ఆకాశాల్లో ఏదీ దాగిలేదు : 27:75

స్తంభాల్లేకుండానే సృష్టించబడ్డాయి : 31:10

అల్లాహ్ కుడిచేతిలో అవి చుట్టబడతాయి : 39:67

రెండురోజుల్లో సప్తాకాశాల సృష్టి : 41:12

సమీప ఆకాశాన్ని దీపాలతో ముస్తాబు చేయటం : 41:12

ఆకాశాల్లో ఉన్నదంతా అల్లాహ్‌కే చెందుతుంది 45:27; 53:31

ఒకదాని మీద ఒకటి సప్తాకాశాలు : 67:3

**ఆడ ఒంటె :**

సమూద్ జాతివారికి ఒక స్పష్టమైన నిదర్శనం 7:73; 17:59; 26:155-158

**ఆత్మ (రూహ్) :** 15:29

ఆత్మకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు 17:85

ఆత్మ ద్వారా అల్లాహ్ విశ్వాసులకు బలం ప్రసాదిస్తాడు 58:22

**ఆద్ ప్రజలు :**

7:65-74; 9:70; 11:59; 14:9; 22:42;

25:38; 26:123; 29:38; 38:12; 40:31; 41:13,15; 46:21; 50:13; 51:41; 53:50; 54:18; 69:4-6; 89:6;

**ఆదమ్ (మొట్టమొదటి మానవుడు):**

2:31,33,34,35,37; 3:33,59; 5:27; 7:11,19, 26,27,31,35,172; 17:61,70; 18:50; 19:58; 20:116,117,120,121; 36:60;

**ఆపదలు, పరీక్షలు:**

పూర్వం విశ్వాసులకు సంభవించినన్ని ఆపదలు ఇంకా మీకు సంభవించనే లేదు 2:214-218;

మీ సిరిసంపదలు, సంతానం మీకొక పరీక్ష 64:15

**ఆయతుల్ కుర్సీ :** 2:255

**ఆరాధ్యుడు (ఇలాహ్) ఒకే ఒక్కడు :**

2:163; 6:19; 16:22,51; 23:91; 37:4; 38:65

**ఆరాఫ్ వాసులు (స్వర్గం-నరకానికి మధ్య ఓ ఎత్తైన ప్రదేశవాసులు) :** సూరా 7; 7:46-48;

**ఆలా (మహోన్నతుడు) :**

సూరా 87; 87:1; 92:20;

**ఆశపడకండి :**

ఇతరులకు అల్లాహ్ ఎక్కువగా ప్రసాదించి ఉంటే దానికి ఆశపడకండి 4:32

**ఆస్తి:**

ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి 2:188;

మీరు ధనప్రాణాలకు సంబంధించిన పరీక్షను తప్పకుండా ఎదుర్కొంటారు 3:186;

సంపదను అవివేకులకు అప్పగించకండి 4:5,7,29;

విశ్వాసుల సంపదలో యాచకులకూ, అగత్యంకలవారికీ హక్కు ఉంటుంది 51:19; 70:25

**ఆస్తి వారసత్వం :**

ఆస్తికలవారు మరణశాసనం రాయటం 2:180,240; 5:106-108

ఆస్తిలో పురుషులకు భాగం ఉంది, అలాగే స్త్రీలకు కూడా భాగం ఉంది 4:7-9,11,12,19,33,176;

**ఆహారం, ఉపాధి:**

అల్లాహ్ ప్రసాదించిన ఆహారంలో కొన్నింటిని ధర్మసమ్మతం గానూ, మరికొన్నింటిని నిషిద్ధం గానూ చేసుకోవటం మహాప రాధం10:59;

అల్లాహ్ కొందరికి ఎక్కువగానూ, మరికొందరికి తక్కువగానూ జీవనోపాధి ప్రసాదిస్తాడు 13:26; 34:36,39; 42:12;

ఆహారం కొరకు రకరకాల ఫలాలను సృష్టించినవాడు అల్లాహ్‌యే14:32; 79:33

అవిశ్వాసులు తమకు ఆహారం ఇవ్వలేనటువంటి వాటిని పూజిస్తున్నారు 16:73;

అల్లాహ్ తన దాసుల నుండి ఉపాధిని కోరడు 51:57;

అల్లాహ్ తాను ప్రసాదించే ఆహారాన్ని ఆపితే, ఇంకెవరు ఆహార మివ్వగలరు? 67:21;

## ఇ

**ఇంజీలు:**

3:3,48,65; 5:46,47,66,68,110; 7:157; 9:111; 48:29; 57:27

**ఇద్దత్ కాలం:**

(విడాకుల తర్వాతగాని, భర్త మరణించినప్పుడు గాని స్త్రీలు పాటించవలసిన ప్రత్యేక శోకకాలం) 2:228,231,232, 234,235; 33:49; 65:1-7

**ఇద్రీస్ (హనోకు) ప్రవక్త:**

19:56,57; 21:85; 96:4

**ఇబ్రాహీమ్ (అబ్రహాము) ప్రవక్త** :

సూ14; 2:124-127,130,132,133,135,136,148, 258,260; 3:33,65,67,68,84,95,97; 4:54,125, 163; 6:74,75,83,161; 9:70,114; 11:69, 74-76; 12:6,38; 14:35; 15:51; 16:120,123; 19:41,46,58; 21:51,60,62,69; 22:26,43,78;

26:69; 29:16,31; 33:7; 37:83,104,109; 38:45; 42:13; 43:26; 51:24; 53:37; 57:26; 60:4; 87:19;

**ఇబ్లీసు (షైతాన్) :**

2:34; 7:11-18; 15:31-44; 17:61-65; 18:50; 20:116-120; 34:20,21; 38:71-8 సైతాన్ పదం కూడా చూడండి.

**ఇమ్రాన్ భార్య (మర్యమ్ తల్లి):** 3:35;

**ఇమ్రాన్ కూతురు (మర్యమ్)** :66:12

**ఇరమ్ :**

అల్లాహ్ చేత శిక్షించబడిన ఒకానొక జాతి 89:7

**ఇలియాస్ (ఏలియా) ప్రవక్త :**6:85; 37:123-132

**ఇల్లియ్యూన్ (సజ్జనుల కర్మల పత్రాలు భద్రపరచబడే స్థానం) :** 83:18-21;

**ఇస్‌హాఖ్ (ఇస్సాకు) ప్రవక్త :**

2:133; 4:163; 6:84; 19:49; 21:72; 29:27; 37:112,113

**ఇస్తవా (అల్లాహ్ సప్తాకాశాలపై ఆసీనుడవటం):** 2:29; 7:54; 10:3;
13:2; 20:5; 32:4; 41:11; 57:4

**ఇస్మాయీల్ (ఇష్మాయేలు) ప్రవక్త :**
2:125-129,133; 4:163; 6:86; 19:54,55; 21:85; 38:48

**ఇస్రాయీల్ సంతానం (యూదుజాతి వారు) :**
2:40-86

అనుగ్రహించబడినవారు 2:47-53,60,122; 45:16,17

అల్లాహ్ పట్ల అవిధేయత : 2:54-59,61, 63-74; 5:71; 7:138-141

ముస్లింలతో సంబంధాలు : 2:75-79

అహంకారం : 2:80, 88,91

ఒప్పందాలు :2:80,83-86,93,100; 5:12,13,70

పరలోకానికి బదులుగా ప్రపంచాన్ని కొనుక్కున్నవారు :2:86

జీవితంపై అందరికంటే ఎక్కువ ఆశ కలిగి వుండేవారు :2:96

రాజును నియమించమని కోరటం : 2:246-251

హద్దులు మీరారు, ముఠాలుగా చీలిపోయారు, కోతులు: 7:161-171

రెండుసార్లు వాగ్దానం చేయబడింది:17:4-8

శత్రువు నుంచి రక్షించబడ్డారు :20:80-82

గ్రంథాలు, నాయకులు పంపించబడ్డారు: 32:23-25; 40:53,54

వారిలోని విద్యావంతులకు ఖుర్‌ఆన్ సత్య గ్రంథమన్న సంగతి తెలుసు 26:197

**ఇస్లాం (అల్లాహ్ ఆజ్ఞలకు శిరసావహించటం, స్వయం సమర్పణ):**

3:19,85; 5:3; 6:125; 39:22; 61:7

అందరికంటే ముందు ఇస్లాంకు విధేయత చూపేవారు. 6:14,163; 39:12

మొట్టమొదటగా ఇస్లాం స్వీకరించినవారు 9:100

ఇస్లాం కోసం హృదయకవాటాలు తెరవటం 39:22

ఇస్లాం ఒక వరం. 49:17

**ఇహ్‌సాన్ (ఉపకారం, ఒక పనిని ఉత్తమ పద్ధతిలో చేయటం):** 16:90

**ఇహలోక జీవితం :**

ఇహలోక జీవితాన్ని పరలోక జీవితానికి బదులుగా అవిశ్వాసులు కొనుక్కున్నారు. 2:86

మోసంతో కూడిన ఆనందం 3:185

పరలోకం కోసం, అమ్మివేయటం 4:74

ఆట, వినోదం మాత్రమే 6:32; 29:64; 47:36; 57:20

మోసగిస్తుంది 6:130

ఇహలోక జీవితపు ఆనందం, పరలోకపు ఆనందం ముందు చాలా స్వల్పం 9:38; 13:26; 28:60

వర్షం లాంటిది 10:24

ఐహిక జీవితంలో శుభవార్తలు 10:64

ప్రాపంచిక జీవితాన్ని కోరుకునేవారికి పరలోకంలో అగ్ని తప్ప ఏమీ ఉండదు 11:15,16; 17:18; 42:20

ఇహలోక జీవితాన్ని ప్రేమించి, పరలోకాన్ని నిర్లక్ష్యం చేస్తే 75:20,21; 76:27

మీరు ఇహలోకాన్ని ప్రేమిస్తారు 87:16

**ఇహ్రామ్ దీక్ష :** 2:197; 5:2,95

ఇహ్రాం స్థితిలో వేట: 5:94-96

## ఈ

**ఈగ (అల్లాహ్‌కు సాటికల్పించేవారికి, విగ్రహారాధకులకు ఈగ ద్వారా ఒక ఉదాహరణ)** 22:73

**ఈసా ప్రవక్త, మర్యమ్ కుమారుడు (ఏసు):**

పుట్టుకకు సంబంధించి శుభవార్త 3:45-47; 19:22,23

ఇస్రాయీల్ జాతివారి ప్రవక్త :3:49-51

హవారీలు : 3:52,53; 5:111-115

హవారీలు అల్లాహ్ సేవకులుగా :3:52; 61:14

ఈసా ప్రవక్త పైకి ఎత్తుకోబడ్డారు: 3:55-58; 4:157

ఈసా పుట్టుక ఆదం పుట్టుక లాంటిదే :3:59

శిలువ వేయబడలేదు :4:157

వహీ :4:163

కేవలం ఒక ప్రవక్త మాత్రమే, అంతకుమించి ఏమీకారు: 4:171; 5:75; 43:63,64

"ఏసు దేవుడు లేక అల్లాహ్‌యే ఏసు" అని అన్నవారు అవిశ్వాసులు :5:17,72; 9:30

మన ప్రవక్త ముహమ్మద్ (స) ఏతెంచారు 5:19

ఇంజీల్ గ్రంథం తీసుకువచ్చారు :5:46

హవారీలు అన్నారు : మేము ముస్లిములం 5:111

భోజన బల్ల : 5:114

దైవేతరుల్ని ఆరాధించమని ఈసా చెప్పలేదు: 5:116-118

సత్య ప్రవక్త :6:85

ఒక సూచనగా వచ్చారు: 23:50; 43:61

ఒక దాసుడు మాత్రమే, ఇస్రాయీల్ జాతివారి కోసం ఆయన ఒక ఉపమానం లాంటి వారు :43:59

రాబోవు ప్రవక్త గురించి శుభవార్త ఇచ్చారు, అతని పేరు అహ్మద్ అయి ఉంటుందని చెప్పారు :61:6

## ఉ

**ఉజ్జా (ఇస్లాంకు పూర్వం అరబ్బులు ఆరాధించిన ఒక విగ్రహం):** 53:19

**ఉజైర్ (ఎజ్రా, యూదులు అల్లాహ్ కుమారునిగా తలపోసిన ఒక ప్రవక్త పేరు):** 9:30

**ఉదాహరణలు, ఉపమానాలు:**

మంటరాజేసిన వాని ఉపమానం (కపటుల కోసం) 2:17,18

ఆకాశం నుంచి కుండపోతగా వర్షం... (సత్యం విషయంలో ఊగిసలాడేవారి ఉపమానం) 2:19,20

కాదేదీ ఉపమానానికి అనర్హం అని నిరూపించిన దోమ ఉదాహరణ 2:26

కేకవేసినా వినలేని పశువులు (అల్లాహ్ చూపిన మార్గాన్ని తిరస్కరించేవారి ఉపమానం) 2:171

తలక్రిందులైన పట్టణం.... (మరణించిన తర్వాత అల్లాహ్ మళ్ళీ జీవం పోస్తాడన్న దానికి నిదర్శనం) 2:259

వెన్నులోని గింజలు (అల్లాహ్ మార్గంలో చేసే ఖర్చు పోలిక) 2:261

నునుపుగా ఉండే బండరాయి (పరుల మెప్పు కోసం చేసే ఖర్చు ఉపమానం) 2:264

తోట (అల్లాహ్ సంతోషం కోసం చేసే ఖర్చు ఉదాహరణ) 2:265,266

త్రాడును (అల్లాహ్ అవతరింపజేసిన ధర్మంను) గట్టిగా పట్టుకోండి 3:103

మంచుగాలి (ఐహిక జీవితంలో చేసే ధన వ్యయం పోలిక) 3:117

నాలుక వెళ్లబెట్టే కుక్క (ధర్మజ్ఞానాన్ని పొంది కూడా దాన్ని పాటించకుండా విముఖుడైన వాని ఉదాహరణ) 7:176

డొల్లలోయ అంచుపై....... (ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలు చేయటానికి కట్టబడిన మస్జిదు ఉదాహరణ) 9:109,110

వర్షం కురిసి బాగా పండినపంట నాశనమయి పోవటం (ప్రాపంచిక జీవితపు పోలిక) 10:24

అంధులు, చెవిటివారు (దేవుని గురించి లేనివి కల్పించి చెప్పే వారి పోలిక) 11:24

పెనుగాలి ఎగురవేసే బూడిద (అల్లాహ్ మీద విశ్వాసం లేకుండా చేసిన మంచి పనుల ఉపమానం) 14:18

మేలుజాతి చెట్టు (పరిశుద్ధ వాక్కుకు ఉపమానం) 14:24,25

చెడుజాతి చెట్టు (అపరిశుద్ధ వాక్కుకు ఉదాహరణ) 14:26

బానిస మరియు స్వేచ్ఛాజీవి 16:75

తన యజమానికి భారమైన మూగ చెవిటి బానిస 16:76

వడికిన నూలును ముక్కలు ముక్కలుగా చేసుకున్నట్లు.... 16:92

శాంతిమయమూ, సంతృప్తికరమూ అయిన జనపదం (అల్లాహ్ ప్రసాదించిన మేళ్ళకు కృతజ్ఞతలు తెలుపుకోనివారి ఉపమానం) 16:112,113

ఇద్దరు మనుషులు-ఖర్జూరపు తోట 18:32-44

ఇహలోక జీవితం ఆకాశం నుంచి కురిసే వర్షం లాంటిది 18:45

ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసిన వాని ఉపమానం ఆకాశం నుంచి కిందపడి, పక్షులు తన్నుకు పోయినవాని చందంగా ఉంటుంది 22:31

మిథ్యా దేవుళ్ల అశక్తతను వివరించే ఈగ ఉదాహరణ 22:73

అల్లాహ్ ఆకాశాలకూ, భూమికీ జ్యోతి: 24:35,36

ఎండమావులు (అవిశ్వాసానికి పాల్పడిన వారి కర్మల ఉపమానం) 24:39

సముద్ర గర్భంలోని గాఢాంధకారం (అవిశ్వాసుల కర్మలకు మరొక పోలిక) 24:40

సాలీడు (అల్లాహ్‌ను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసు కున్నవారి ఉపమానం) 29:41

భాగస్వాములు (దైవత్వంలో అల్లాహ్‌కు భాగస్వాములు లేరని చెప్పే ఉదాహరణ) 30:28

పట్టణ ప్రజలు (ప్రవక్తలను తిరస్కరించిన వారు) 36:13-32

అనేక భాగస్వాములకు చెందిన బానిస (అనేక దేవుళ్ల దాసుడు) 39:29

పొలంలో నాటబడిన విత్తనం (ప్రవక్త-స- వెంట ఉండినవారి ఉపమానం) 48:29

వర్షం తర్వాత మొక్కలు మొలకెత్తటం (ఇహలోక జీవితపు మరొక పోలిక) 57:20

పర్వతం తనంతట తానుగా కుంగి, బద్దలైపోవటం (ఖుర్‌ఆన్ మహత్యాన్ని వివరించే పోలిక) 59:21

దైవగ్రంథ బాధ్యతను నెరవేర్చనివారు పుస్తకాల బరువు మోసే గాడిదల్లాంటివారు 62:5

నీరు భూమిలోకి ఇంకిపోతే....?(దాసులు దైవం మీద ఎంతగా ఆధారపడి ఉన్నారో తెలిపే ఉపమానం) 7:30

తోటలవారు (మక్కా అవిశ్వాసుల కొరకు ఇవ్వబడిన ఒక ఉపమానం) 68:17-33

**ఉపవాసాలు (రమజాను ఉపవాసాలు, అదనంగా పుణ్యఫలం ఆశించిగాని, ఇంకా పాపపరిహారంగా గాని పాటించే ఉపవాసాలు మొ॥వి):**

2:178,183,184,185,187,196; 4:92; 5:89,95; 19:26; 33:35

ఉపవాసంలో ఉదయం ధవళ రేఖలు కనిపించే దాకా తినండి, త్రాగండి. 2:187

**ఉపాధి :**

ధర్మసమ్మతమైన సముపార్జన, అక్రమ సంపాదన (హలాల్, హరామ్): 2:168,172,173; 5:1,3-5,88; 6:118, 119,121,145,146; 16:114; 118; 23:51

గతంలో తిన్నదానికి పాపంలేదు, ఇక ముందు హరామ్ వస్తువులకు దూరంగా ఉండాలి :5:93

హద్దుమీరి పోకండి :5:87

అల్లాహ్ సమ్మతం చేసినవాటిని అధర్మంగా చేసుకోకండి : 5:87; 7:32; 16:116

**ఉమ్మత్ (సమాజం, జాతి) :**
2:143,144; 10:47,49; 11:118; 16:36,120

**ఉమ్రహ్ యాత్ర:** 2:128,158,196;

**ఉహుద్ యుద్ధం:** 3:121-128,140-180

## ఎ

**ఎడారి అరబ్బులు (కొత్తగా ఇస్లాంలోకి చేరిన గ్రామీణ అరబ్బులు):**
9:90,97-99,101,120; 48:11,16; 49:14

## ఏ

**ఏడు :**
అల్లాహ్ ఏడాకాశాలను సృష్టించాడు
2:29; 23:17; 65:12; 67:3; 71:15
భూమినీ ఏడు ఆకాశాల మాదిరిగానే సృష్టించాడు 65:12

**ఏతికాఫ్ (ప్రాపంచిక వ్యవహారాలకు దూరంగా అల్లాహ్ ప్రార్థనలో నిమగ్నమవటం):** 2:187

**ఏనుగుల వారు (మక్కా మీద దాడి చేసిన ఏనుగుల సైన్యం) :**105

## ఒ

**ఒంటె :** 6:144; 7:40; 77:33; 88:17

**ఒకే ఒక్క దేవుడు :** 2:163; 6:19; 16:22,51; 23:91; 37:4; 38:65

## ఓ

**ఓడ ప్రయాణం దేవుని నిదర్శనం:**
మానవసేవ కోసమే దానిసృష్టి, తద్వారా మానవులు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. దైవానుగ్రహాన్ని కోరుకోవాలి
2:164; 14:32; 16:14; 17:66; 22:65; 31:31; 35:12; 42:32,33; 43:12; 45:12; 55:24

## క

**కంచర గాడిదలు:** 16:8

**కంజ్ (జకాతు ఇవ్వబడని ధనం, బంగారం, వెండి తదితరాలు) :** 9:34,35

**కందకాల వాళ్లు (విశ్వాసులను కందకాలలో కాల్చిన వాళ్ళు):** 85:4-10

**కపటులు :**
మేము అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసిస్తున్నాం అంటారు. కాని వాస్తవానికి వారు దేన్నీ విశ్వసించరు 2:8
తమను తాము మోసం చేసుకుంటున్నారు: 2:9
వాళ్ల హృదయాల్లో రోగం ఉన్నది : 2:10; 8:49; 22:53; 33:12; 47:29
కల్లోలాన్ని రేకెత్తిస్తారు :2:11, 12
మూర్ఖులు, అవివేకులు :2:13-15
సన్మార్గానికి బదులుగా భ్రష్టత్వాన్ని కొనుక్కున్నవారు :2:16
చెవిటివారు, మూగవారు, గుడ్డివారు: 2:17,18
మరణానికి, చీకట్లకు భయపడతారు :2:19
తియ్యతియ్యని మాటలు మాట్లాడతారు : 2:204-206
యుద్ధంలో పిరికితనం చూపుతారు: 3:167
వారి హృదయాల్లో ఉన్నది అల్లాహ్‌కు బాగా తెలుసు : 3:167; 4:63
దైవవాణిని నిరాకరించి తీర్పుల కోసం దైవేతరుల (తాగూత్) వద్దకు వెళ్తారు. ఆపదలు ఎదురైనప్పుడు మాత్రం పరుగెత్తు కొస్తారు. 4:60-62
కష్టాలు కడగండ్లలో, సుఖాలు సంతోషాలలో 4:72,73
అల్లాహ్ వారిని వెనక్కి తరుముతాడు :4:88
వారిని స్నేహితులుగా చేసుకోరాదు :4:89; 58:14-19
ఒకవేళ ఇస్లాంను తృణీకరించి వెళితే, వారు ఎక్కడ కనబడితే అక్కడే వారిని వధించండి. 4:89
మీకు విజయం వరిస్తుందో లేక అవిశ్వాసులు ఆధిపత్యం సాధిస్తారోనని ఎదురుచూస్తూ ఉంటారు. 4:141
అల్లాహ్‌ను మోసగించటానికి ప్రయత్నిస్తారు 4:142
సోమరితనంతో, ప్రజలకు చూపించటం కోసమే నమాజు చేస్తారు 4:142

పూర్తిగా ఇటూ ఉండరు, పూర్తిగా అటూ ఉండరు :4:143

నరకంలో అట్టడుగు స్థానంలో ఉంటారు, వారికి సహాయకుడెవడూ ఉండడు :4:145

తమ బండారం ఎక్కడ బయటపడుతుందేమోనని భయపడుతుంటారు : 9:64, 65

వారికోసం దుఆ చేయరాదు: 9:84

కపట స్త్రీపురుషులు ఒకే కోవకు చెందినవారు: 9:67

నష్టానికి, దేవుని శాపానికి గురయ్యేవారు: 9:67-69

పల్లెటూరి కపటులు : 9:101

కనిపించిన చోట వారిని నిలువరించాలి, వధించాలి :33:61

అల్లాహ్ వారిని శిక్షిస్తాడు :33:73

అబద్ధాలకోరులు, వెన్నుచూపేవారు, వారి హృదయాలు ఒకటిగా లేవు: 59:11-14

అబద్ధాలకోరులు, దేవునిమీద ప్రమాణాలను తమ అబద్ధాలకు అడ్డంగా పెట్టుకుంటారు. వారిపట్ల కడు జాగ్రత్తగా ఉండండి: 63:1-4

అర్థం చేసుకోరు:63:7,8

వారికి వ్యతిరేకంగా గట్టిగా పోరాటం సలపండి. 66:9

**కర్మలు :**

అవిశ్వాసుల కర్మలు వారికి మనోహరంగా కనిపిస్తాయి: 47:14

మా కర్మలు మాకు, మీ కర్మలు మీకు 28:55; 42:15; 45:15

మంచి అయినా, చెడు అయినా అది దాని కర్తకే చెందుతుంది: 41:46

మనిషి కర్మల పత్రం అతని మెడలోనే ఉంటుంది :17:13

**కర్మలు అందమైనవిగా కనిపించేటట్టు...**
అవిశ్వాసులకు తమ కర్మలు అందంగా కనబడతాయి: 6:108

**కలం:** 68:1; 96:4

**కలవటం:**

అల్లాహ్‌ను కలుసుకోవటం 6:31

మహాదినాన జరిగే సమావేశం 19:37

పరలోకంలో కలవటం 30:16

**కవిత్వం:**

అల్లాహ్ తన ప్రవక్తకు కవిత్వం నేర్పించలేదు, అది ఆయనకు శోభించదు కూడా 36:69

**కవులు :** 26:224-227; 69:41

**కష్టం తర్వాత సుఖం:** 94:5,6

**కళ్లు, చెవులు, చర్మాలు :**
స్వయంగా పాపాత్ములకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతాయి 41:20-23

**కాకి (హత్య చేసిన ఆదము పుత్రునికి ఖననం చేయటం నేర్పటం):** 5:31

**కాఫూర్ కలిపిన పాత్ర (స్వర్గవాసులకు ఇవ్వబడే పానీయం)** : 76:5

**కాబా గృహం :**

ఇబ్రాహీం నిర్మించారు : 2:125-127

కాబా ఆవరణలో రక్తపాతం, హింస తగదు 5:94-96

శాంతి నిలయం : 5:97

మక్కా ముష్రికులు కాబాచుట్టూ నగ్నంగా ప్రదక్షిణ చేసేవారు. ఖుర్ఆన్ దానిని ఖండించింది 7:28

కాబా దగ్గర ప్రార్థించినప్పుడు...ప్రదక్షిణ చేసినప్పుడు... 2:200; 7:29,31

**కాలం:** 45:24; 76:1; 103:1

**కాళ్లూ చేతులు సాక్ష్యం చెప్పటం:** 36:65

**కిరామన్ కాతిబీన్ (అనుక్షణం మనిషి కర్మలను నమోదు చేస్తుండే దైవదూతలు):** 82:11

**క్రీస్తు ప్రవక్త:** చూడండి ఈసా

**కుర్సీ (ఆయతుల్ కుర్సీ):** 2:255

**కూడబెట్టిన సంపద:** 9:35

**క్రైస్తవులు (నసారా):**

ఈ పదం ఖుర్‌ఆన్‌లో 600 కంటే ఎక్కువ సార్లు వచ్చింది.

**కొండచరియల (హిజ్ర్) వాసులు:** 15:80-85

**కొలతల్లో తూనికల్లో న్యాయం పాటించటం:** 11:85; 17:35 83:3; 1-5

**కోరికలకు దాసులవటం:** 47:14,16

మనో వాంఛలను దేవుడుగా చేసుకోవటం 25:43

**కోతులు :**

దైవాదేశాలను ఉల్లంఘించినవారు కోతులుగా మారిపోయారు 2:65; 5:60; 7:166

**కౌసర్ ( స్వర్గ సరస్సు, అన్నిరకాల మేళ్ళు):** 108:1

## ఖ

**ఖర్చు:**

అల్లాహ్ మార్గంలో ఖర్చు 2:195,215,254,262,265, 267,274; 3:92,134; 8:3; 9:99; 13:22; 14:31; 22:35; 32:16; 35:29; 36:47; 47:38; 57:7; 63:10; 64:16

అవసరాలు తీరిపోగా మిగిలినదే ఖర్చు చేయాలి 2:219

అల్లాహ్ మార్గంలో చేసే ఖర్చు ఉపమానం 2:261

పరుల మెప్పుకోసం చేసే ఖర్చు 2:264; 4:38

అల్లాహ్ మార్గంలో మీరు ఏం ఖర్చుపెట్టినా అది మీకు తిరిగి చెల్లించబడుతుంది 2:272; 8:60; 34:39

దుబారా ఖర్చు చేయరాదు 6:141; 17:26

దుబారా చేయకండి, పీనాసిగానూ వ్యవహరించకండి 25:67

అల్లాహ్ మార్గంలో ఖర్చుచేయకుండా చేతుల్ని ఆపుకునేవారు 9:67

**ఖర్జూర చెట్లు :**

13:4; 19:25; 20:71; 59:5

**ఖారూన్(దేవుని మేలు మరచిన అపర కుబేరుడు):**

28:76-82; 29:39; 40:24

**ఖిబ్లా (మక్కాలో కాబా గృహం వున్న దిశ) :**

2:142-145,149

**ఖిసాస్ (ప్రతీకార న్యాయం) :**

2:178,179,194; 5:45; 16:126; 17:33; 22:60; 42:40

**ఖుబా మస్జిదు (మదీనాలోని ఓ మస్జిదు పేరు):**

9:107,108

**ఖుర్‌ఆన్ :**

అవతరింపజేయబడిన గ్రంథం 13:31,36,37; 14:1; 56:77-80

అల్లాహ్ తప్ప వేరెవరూ ఇటువంటి గ్రంథాన్ని అవతరింపజేయలేరు 2:23; 10:38; 11:13; 17:88

వేరొకరి గ్రంథమై ఉంటే విపరీతమైన విరుద్ధాంశాలు వుండేవి 4:82

జ్యోతి 4:174; 42:52

దైవప్రవక్తపై అవతరించినది 6:19

అల్లాహ్‌యే దానికి సాక్షి 6:19

స్పష్టమైన ప్రమాణం 6:157

దీని వాక్యాల గురించి చెడు సంభాషణలు జరుపరాదు 6:68

జ్ఞాపిక, గుర్తుచేసేది

7:63; 12:104; 18:101; 20:3,99, 124; 25:29; 36:11,69; 43:44; 50:8; 65:10; 72:17

పారాయణం సమయంలో మౌనంగా ఉండి దానిని శ్రద్ధగా ఆలకించాలి 7:204

ఇది జిక్ర్ 7:205; 15:6,9

వివేకంతో నిండిన గ్రంథం 10:1; 31:2; 36:2

వహీ సందేశం 10:2,109; 42:52

తిరస్కారులు 11:17

అరబీ భాషలో అవతరించింది

12:2; 13:37; 16:103; 20:113; 26:195; 39:28; 41:3,44; 42:7; 43:3; 44:58; 46:12

అంచెలంచెలుగా అవతరణ 15:91; 17:106; 25:32; 76:23
ఆయతుల రద్దు 16:101;
పారాయణం చేయదలచినప్పుడు 16:98
మార్గదర్శకం 17:9
శుభవార్త, హెచ్చరిక 17:9,10
ఖుర్‌ఆన్ మరియు అవిశ్వాసులు 17:45-47
ప్రాతఃకాలపు ఖుర్‌ఆన్ పారాయణం 17:78
స్వస్థత, కారుణ్యం 17:82
పలువిధాలుగా హితబోధ, కాని ప్రజల నిరాకరణ 17:89; 18:54; 39:27
సులభమైనది 19:97; 44:58; 54:17,22,32,40
"నా జాతి వారు దీనిని పరిహాసంగా తీసుకున్నారు" 25:30
ఇతర మతధర్మాల ద్వారా ఖుర్‌ఆన్ గ్రంథానికి ధృవీకరణ 26:196
ఇస్రాయీల్ జాతి వారి విభేదాలకు పరిష్కారం చూపుతుంది 27:76
ఖుర్‌ఆన్ పారాయణం చేయాలి, నమాజు స్థాపించాలి 29:45
దేవుని తరఫున సత్యం 32:3; 35:31
శుభరాత్రిన అవతరణ 44:3
ఆ రాత్రే ప్రతి విషయానికి సంబంధించిన నిర్ణయం 44:4
ఖుర్‌ఆన్ ఆయతులపై లోతుగా ఆలోచించాలి 47:24
ఖుర్‌ఆన్ పరిరక్షణ బాధ్యత అల్లాహ్‌ది 15:9
ఖుర్‌ఆన్ ద్వారా హెచ్చరించటం 50:45
అల్లాహ్ చేసిన బోధనే ఖుర్‌ఆన్ 55:1
మహోన్నతమైన వాణి, సురక్షితమైనది 56:77,78
పరిశుద్ధులు మాత్రమే దీనిని ముట్టుకుంటారు 56:79
ఒకవేళ ఏదైనా పర్వతం మీద అవతరింపజేయబడితే.... 59:21
తిరస్కారులకు దుఃఖకారకం 69:50
పూర్తిగా నమ్మదగిన సత్యం 69:51
మెల్లగా ఆగి ఆగి పఠించాలి 73:4
ప్రతిష్ఠాత్మకమైన, మహోన్నతమైన, పరిశుద్ధమైన పత్రాలలో ఇది ఉంది 80:13-16
సకల లోకాలవారికి జ్ఞాపిక 81:27
అవిశ్వాసులు తిరస్కరిస్తారు 84:22
ఖుర్‌ఆన్ సురక్షిత ఫలకంపై వ్రాయబడి భద్రంగా ఉంది 85:22
సత్యాన్ని అసత్యం నుంచి వేరుపరచే, విశదపరిచే గ్రంథం 86:13
పరిశుద్ధమైన పత్రాలు 98:2;
ఖుర్‌ఆన్ గురించి అనుచితంగా మాట్లాడేవారి సాంగత్యంలో ఉండరాదు 6:68

**ఖురైష్ తెగ:**
ఖురైషు అవిశ్వాసులు 54:43-46,51
చలికి, ఎండ తీవ్రతకు అలవాటు పడిపోయిన ఖురైషులు 106:1-4

**ఖౌలా బిన్తె సాలబా ( ఓ గొప్పమహిళ, దైవ ప్రవక్త గారి శిష్యురాలు ):** 58:1

# గ

**గడ్డి** : 87:4,5

**గడువు:**
ప్రతి జాతికి గడువు నిర్ణయించబడి ఉంది. అది పూర్తయినప్పుడు వెనకా ముందూ అవటం జరగదు 7:34; 10:49; 15:4,5; 16:61; 20:129

**గత్యంతరం లేని అవసరం:** 2:173; 6:145

**గ్రంథం (కితాబ్) :** ఈ పదం ఖుర్‌ఆన్‌లో 300 కంటే ఎక్కువసార్లు వచ్చింది.

**గాడిదలు :** 2:259; 16:8; 31:19; 62:5; 74:50

**గాలులు, పవనాలు :** 77:1-3
శుభవార్తల రాయబారులు 7:57; 30:46
మేఘాలను మోసుకెళ్తాయి, వర్షం కురిపిస్తాయి 15:22; 30:48
వడగాల్పులు పంటను పసుపు పచ్చగా మారుస్తాయి 30:51

**గీటురాయి (ధర్మాధర్మాల మధ్య విచక్షణి):**
2:53,185; 3:4; 8:29,41; 21:48; 25:1

**గుర్రాలు :**16:8

**గుహవారు (బహుదైవారాధకుల దగ్గరి నుండి పారిపోయి గుహలో అల్లాహ్ శరణు పొందిన వారు):** 18:9-22,25,26;

**గూఢచర్యం:** 49:12

**గొప్పవార్తలు :** 78:1-5

**గొప్ప సాఫల్యం :** 9:72; 44:57

## చ

**చంద్రకళలు (కాలం తెలుసుకోవటానికి కనపడే నెలవంకలు):** 2:189

**చంద్రుడు** :7:54; 10:5; 16:12; 22:18; 25:61; 36:39,40; 71:16; 91:2
చంద్రుడు చీలిపోయాడు 54:1

**చంపటం :**
ఒక మనిషిని చంపితే మొత్తం మానవాళిని చంపినట్లే.... ఒక మనిషి ప్రాణం కాపాడితే మొత్తం మానవాళిని కాపాడి నట్లే: 5:32
ఎవర్నీ అన్యాయంగా చంపకండి :17:33

**చట్టం :**
నిర్ణయించబడినది 5:48
అల్లాహ్ తరఫు నుంచి వచ్చిన చట్టాలు 2:219; 98:3

**చాడీలు :**49:12; 104:1

**చెడు** :
4:123; 10:27-30; 19:83; 59:15
చెడును ప్రజల్లో బహిరంగపరచరాదు 4:148;
చెడు మన వల్ల జరుగుతుంది, మంచి దేవుని తరఫు నుంచి వస్తుంది 4:79; 42:48
చెడుని మన్నించటం 4:149
చెడుకు ప్రతిఫలం 6:160; 42:40
కుటిల పన్నాగాలు పన్నటం 16:45-47
చెడుకు పరిణామం 30:10
నేలపైనా, నీటిలోనూ చెడు (కల్లోలం) కు కారణం మనిషి దురాగతాలే 30:41
చెడుని మంచి ద్వారా తొలగించాలి 13:22; 23:96; 41:34
చెడుని మంచిగా మార్చటం 7:95
చెడు కోరికల వెనుక పరుగెత్తరాదు 47:14,16
తమ చెడు కర్మలు తమకు అందమైనవిగా కనిపిస్తాయి 47:14
చెడుకు ప్రతిఫలం ఇవ్వటంలో అల్లాహ్ ఆలస్యం చేస్తాడు: 3:178; 10:11; 12:110; 14:42, 44; 29:53-55; 86:15-17

**చేజేతులా కలిగే ఆపదలు :** 42:30

## జ

**జంజబీల్ (సొంటి):** 76:17

**జంటలుగా సృష్టి** :
13:3; 30:8; 36:36; 42:11; 43:12; 51:9,49; 53:45

**జంతువు (దాబ్బతుల్ అర్జ్, ప్రళయానికి ముందు వచ్చే సూచన):** 27:82

**జకరియ్యా (జెకరియా) ప్రవక్త:**
3:37-41; 6:85; 9:2-11; 21:89,90

**జకాత్ (ధనవంతుల సొమ్ములో పేదల హక్కు):**
2:3,43,83,110,177,277; 9:5,11,18,71; 24:37, 56; 33:33; 58:13; 73:20;
జకాత్ ఇవ్వండి 4:77,162;
యూదులపై కూడా జకాత్ ఉండింది 5:12,55;

పంట కోసేటప్పుడు దాని హక్కును చెల్లించండి 6:141;

జకాత్ ఇచ్చేవారికి అల్లాహ్ కారుణ్యం లభిస్తుంది 7:156;

జకాత్ పాటించమని యేసు ప్రవక్తకు అల్లాహ్ ఆజ్ఞ 19:31,55;

ఇతర ప్రవక్తలకు కూడా జకాత్ ఆజ్ఞ 21:73;

విశ్వాసులకు భూమిపై అధికారం లభిస్తే నమాజు స్థాపిస్తారు, జకాత్ ఇస్తారు 22:41,78;

జకాత్ ఇవ్వటం పరలోకంలో సాఫల్యం పొందే విశ్వాసుల లక్షణం 23:4; 27:3; 31:4;

వడ్డీ వల్ల ధనం వృద్ధి కాదు, అల్లాహ్ ప్రసన్నత కోసం ఇచ్చే జకాతు వల్ల వృద్ధి అవుతుంది 30:39;

జకాత్ ఇవ్వని, పరలోకాన్ని తిరస్కరించే బహుదైవారాధకులు వినాశం పాలవుతారు 41:7;

పూర్వం గ్రంథ ప్రజలకు జకాత్ ఇవ్వమని ఆదేశించటం జరిగింది 98:5

జకాత్ పద్దులు 2:273; 9:60

**జఖ్ఖూమ్ (నరకవాసులకు ఆహారంగా ఉండే) వృక్షం:** 17:60; 37:62-66; 44:43-46; 56:52

**జబూర్ (దావూదు-దావీదు- ప్రవక్తకు ఇవ్వబడిన గ్రంథం):** 4:163; 21:105

**జమరాత్ (మనాసికె హజ్‌లో, అంటే హజ్‌విధుల్లో జమరాత్ వద్ద కంకర్రాళ్ళు విసరటం కూడా ఒకటి):** 2:200

**జ్ఞానం (అగోచరమైన జ్ఞానం) :**

అల్లాహ్‌కు తెలియకుండా చెట్టు నుంచి ఆకు కూడా రాలదు 6:59

అజ్ఞానం మూలంగా తమ బిడ్డల్నే చంపుకున్న వారు చాలా నష్టానికి గురయ్యారు : 6:140

ఐదు విషయాలకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది : 31:34

నమ్మకమైన జ్ఞానం :102:5-7

**జాలూత్ (దేవిడ్-గోలియత్):** 2:249-251

**జిక్ర్ (ఖుర్ఆన్):** 8:2; 15:6,9

**జిబ్రయీల్ (గాబ్రియేల్, అల్లాహ్ దూత):**

2:97,98; 26:193; 66:4; 81:19-21

రూహ్ (జిబ్రయీల్‌కు గల మరోపేరు): 26:193; 67:12; 70:4; 78:38; 97:4

రూహుల్ ఖుదుస్ : 2:87,253; 5:110; 16:102

**జిన్ను (మనిషి లాగే బుద్ధిజ్ఞానాలు కలిగిన కంటికి కనిపించని ఒక జీవి):**

6:100,112; 15:27; 34:41; 38:37; 46:18,29; 55:15,33,39; 72:1-15

**జిహాద్(అల్లాహ్ మార్గంలో సలిపే కృషి):**

2:216; 9:24; 22:78; 25:52 (పోరాటం కూడా చూడండి)

**జిహార్ (ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలంలో అరబ్బుల్లో ఉండిన ఒక దురాచారం) :**

33:4; 58:2-4

**జుమా నమాజు :** 62:9-11

**జుల్‌కిఫ్ల్ ప్రవక్త :** 21:85; 38; 48

**జుల్‌ఖర్‌నైన్ (తూర్పు, పడమర ప్రాంతాలను జయించిన ఒకానొక రాజు):** 18:83-98

**జూదం :** 2:219; 5:90

**జూదీ పర్వతం :** 11:44

**జెరూసలెం మస్జిదు:** 17:7

**జైతూన్ (ఆలివ్):**

6:141; 16:11; 23:20; 24:35; 95:1

**జైద్ బిన్ హారిసా : (దైవప్రవక్త బానిస, ఖుర్ఆన్‌లో పేరు ప్రస్తావించబడిన ఏకైక సహాబీ)** 33:37,38

**జ్యోతి (నూర్):**
స్పష్టంగా మార్గం చూపే జ్యోతి ప్రభువు తరఫు నుంచి వచ్చేసింది. 4:174
జ్యోతి మరియు అంధకారం 6:1
అల్లాహ్ ఆకాశాలకూ, భూమికీ జ్యోతి 24:35
జ్యోతి (వెలుగు) విశ్వాసుల వెంట, వారి ముందు నడుస్తూ ఉంటుంది 57:12-15; 66:8
విశ్వాసులు సరైన మార్గంలో నడవడం కోసం ప్రసాదించబడింది 57:2

## త

**తబూక్ యుద్ధం :**
9:40-59,89-99,117,118,120-122

**తయమ్ముమ్ (నీరు లేనప్పుడు మట్టితో వుజూ చేయటం):** 4:43; 5:6

**తల్‌హున్ (అరటిపండ్ల చెట్లు) :** స్వర్గంలో 56 : 29

**తలక్రిందులైన నగరాలు :** 69:9

**తలచుకోవటం (ఇష్టపడటం, కోరటం):**
ఎవరి తలంపు అయినా అల్లాహ్ తలంపుకు లోబడే ఉంటుంది. 6:107; 10:99; 74:56; 76:31; 81:28,29
ఇష్టముంటే విశ్వసించనీయండి లేదంటే అవిశ్వాసానికి పాల్పడనీయండి 18:29
ప్రభువు వైపు వెళ్ళే మార్గాన్ని కోరుకోవటం: 76:29
రుజుమార్గంలో నడవటం : 81:28

**తల్లిదండ్రులు, వారిపట్ల దయాభావం:**
2:83,215; 4:36; 16:90; 17:23; 29:8; 31:14; 46:15- 17;

**తవాఫ్ (కాబా చుట్టూ ప్రదక్షిణ):**2:200; 7:29,31

**తస్నీమ్ (స్వర్గంలోని ఎత్తయిన స్థానం నుండి పుట్టే ఒక సరోవరం):** 83 :27,28

**తాకట్టు :**
తాకట్టు పెట్టటం 2:283
ప్రతి మనిషి తాను చేసుకున్న పనులకు తాకట్టుగానే ఉన్నాడు 52:21; 74:38

**తాగూత్ (అల్లాహ్ గాకుండా మనుషులచేత పూజించబడే ఇతరాలు):**
2:256-257; 4:51-60,76; 5:60; 16:36; 17:39 (మిథ్యా దేవుళ్లు కూడా చూడండి)

**తాలూత్ (దేవిడ్-గోలియత్ కథలో రాజు):**
2:247-249

**తాళం చెవులు :**
భూమ్యాకాశాల తాళం చెవులు: 39:63; 42:12
అగోచర విషయాల తాళం చెవులు :6:59

**త్యాగం (ఖుర్బానీ) :**
2:196,200; 22:34-37

**త్రాసు ఎవరిది బరువుగా ఉంటుందో:** వారు విజయం సాధిస్తారు 7:8,9

**తుబ్బా ప్రజలు :** 44:37; 50:14

**తువా (మూసా ప్రవక్తకు ప్రవక్త పదవి లభించిన) లోయ:** 20:12; 79:16

**తూనికలలో మోసం :**83:1-6 (యుద్ధ సొత్తు కూడా చూడండి)

**తూర్ పర్వతం :** 28:29,46

**తెర (ఖుర్‌ఆన్ పఠనానికి-అవిశ్వాసులకు మధ్య అడ్డు):**17:45,46

**తేనెటీగ :**16:68,69

## ద

**దత్తపుత్రుడు :** 33:4,5

**దయతో చెప్పే పలుకులు :**
దానం తర్వాత దెప్పిపొడిచే కంటే గొప్పవి : 2:263

**దహ్ర్ (ఒక యుగం):**
దహ్ర్ సూరా76;
సమయం :76:1; 103:1

**దాబ్బతున్ లేక దవాబ్బ్:**
(నేలపై నడిచే లేక పాకే జంతువులు)
2:164; 6:38; 8:22,55; 11:6,56; 16:49,61; 22:18; 24:45; 27:82; 29:60; 31:10; 34:14; 35:28, 45; 42:29; 45:4

**దానధర్మాలు (సదఖా):** 2:196,263,264,270,271, 273; 4:114;
కపటులు తమకు దానధర్మాల సొమ్ము లభిస్తే సంతోషిస్తారు, లేదంటే అలుగుతారు 9:58,75,76-79,103,104;
స్త్రీపురుషులలో దానధర్మాలు చేసే వారికి ఎన్నోరెట్ల పుణ్య ఫలం 57:18;
దైవప్రవక్తతో ఏకాంతంలో మాట్లాడదలిస్తే ముందు ఏదైనా కొంచెం దానం చేయవలసి ఉండేది (తర్వాత ఈ ఆజ్ఞ రద్దయింది) 58:12,13
జకాత్ పద్దులు : 2:273; 9:60;

**దానిమ్మ పండ్లు :** 6:141

**దావూద్ (దావీదు) ప్రవక్త :**
4:163; 6:84; 21:78-80; 5:78; 34:10,13; 38:17-30; 17:55
జాలూత్ (గోలియత్) తో యుద్ధం : 2:251

**దీపం:** 25:61; 67:5; 71:16; 78:13

**దుబారా ఖర్చు:**
చేయరాదు 6:141; 7:31; 17:26

**దుఃఖం తర్వాత నిశ్చింతస్థితి :**3:154

**దుర్మార్గులు :** 11:18-22,101-104,116,117; 39:47 (అవిశ్వాసులు కూడా చూడండి)

**దైవదూత (మలక్) / దైవదూతలు (మలాయిక) :**
ఈ పదాలు ఖుర్ఆన్‌లో 100 కంటే ఎక్కువ సార్లు ప్రస్తావనకు వచ్చాయి.

**దొంగ, దొంగతనానికి శిక్ష :** 5:38,39

**దోమ:** ఒక ఉదాహరణ 2:26

**ద్రోహం, ఆత్మద్రోహం :**
2:187; 4:107; 5:13; 8:27,58,71; 12:52; 22:38; 66:10

**దౌర్జన్యానికి తగిన ప్రతీకారం:**
42:39-43

## ధ

**ధర్మం:**
ధర్మం విషయంలో బలాత్కారం లేదు 2:256
ధర్మం అసలు ఇస్లామే 3:19
దైవధర్మం 3:83, 84
ఇస్లామేతర ధర్మం 3:85
ధర్మం విషయంలో హద్దులు మీరకండి 4:171; 5:77
ధర్మం పరిపూర్ణం చేయబడింది 5:3
ధర్మాన్ని ఆటగా, వినోదంగా తీసుకోరాదు సుమా! 6:70
ధర్మాన్ని ముక్కచెక్కలు చేసి వర్గాలుగా విడిపోయినవారు 6:159; 30:32
ఇంకా చూడండి 42:13,14; 43:65; 45:17
ప్రతి మతధర్మం తనే సత్యమార్గంలో ఉన్నాననుకుంటోంది 23:53; 30:32
ధర్మంలో ఏ ఇబ్బందీ లేదు 22:78
మనిషి ధార్మిక స్వభావం మీదనే సృష్టించబడ్డాడు 30:30
దైవప్రవక్తలందరి ధర్మం ఒక్కటే 42:13-15
తాతముత్తాతల ధర్మం?! 43:22-24

**ధర్మభ్రష్టులు :**
(ఒకసారి ధర్మాన్ని అవలంబించి, ఆ తర్వాత మళ్లీ అధర్మం వైపునకు వెళ్ళినవారు). 47:25;

**ధర్మాన్ని ముక్కలు ముక్కలుగా చేసుకోవటం మహా పాపం:** 23:53; 30:32; 42:13,14; 43:65; 45:17

# న

**నజ్వా:** (చూడండి రహస్య సమాలోచనలు)

**నజస్ (అశుద్ధత):** 9:28

**నమ్మకద్రోహం:** 8:58; 22:38

**నమాజు స్థాపన :**
2:3,43,83,110,177,277; 4:77,102,103; 5:12,55; 6:72; 7:170; 8:3; 9:5,11,18,71; 10:87; 11:114; 13:22; 14:31,37; 17:78; 20:14; 22:41,78; 24:56; 27:3; 29:45; 30:31; 31:4,17; 33:33; 35:18,29; 42:38; 58:13; 73:20; 98:5

**నమాజులు, విధిగా ఐదుపూటలు:**
సహనంతోనూ, నమాజుతోనూ సహాయం అర్థించటం 2:45, 153; 20:132; 50:39

నమాజులో కాబావైపు తిరిగి నిలబడాలి 2:142-145, 149, 150

నమాజుల పరిరక్షణ 2:238

ప్రయాణంలోనూ, యుద్ధ సమయంలో కూడా నమాజు 2:239; 4:101,102

తాగి వున్నప్పుడు నమాజు దరిదాపులకు కూడా వెళ్ళరాదు 4:43

లైంగిక అశుద్ధావస్థ స్థితిలో నమాజు చేయరాదు 4:43

నమాజుకై పరిశుద్ధులు కావటం అవసరం 4:43; 5:6

నమాజు పూర్తయిన తర్వాత 4:103

నమాజు వేళలు 11:114; 17:78,79; 20:130; 30:17,18; 50:39,40; 52:48,49; 73:1-6,20,

మనిషి అల్లాహ్ ముందు మాత్రమే మోకరిల్లాలి 13:15

**నరకం :**
ఈ పదం దివ్యఖుర్ఆన్‌లో 200 కంటే ఎక్కువ సార్లు ప్రస్తావనకు వచ్చింది.

**నష్టం:**
స్పష్టమైన దివాళా 39:15

**నస్ర్ (నూహ్ కాలం నాటి ఒక విగ్రహం):** 71:23

**నక్షత్రం :** 53:1,49; 86:1-4

**నక్షత్రాలు :**
7:54; 15:16; 16:12,16; 22:18; 25:61; 37:6-10; 56:75; 77:8; 81:2; 82:2

**న్యాయం (అద్ల్) :**
2:282; 4:58,135; 7:29; 16:90; 57:25; 4:65,105

**నిందలు మోపేవాడు:** 68:11,12; 104:1

**నిద్ర, విశ్రాంతినిచ్చేది:** 78:9

**నిర్ణయం :**
ప్రతి వ్యవహారానికి సంబంధించి నిర్ణయం జరిగి ఉంటుంది: 13:38

మేము ఏ పట్టణాన్ని వినాశానికి గురిచేసినా దానికి సంబంధించిన నిర్ణయం ముందుగానే జరిగి ఉంటుంది : 15:4

ప్రతి విషయానికి సంబంధించిన నిర్ణయం అల్లాహ్ తరఫు నుంచే జరుగుతుంది. 44:5

ఆయన ఏదయినా పని చేయాలని నిర్ణయించుకున్నప్పుడు 'అయిపో' అని అంటే చాలు అది అయిపోతుంది. 2:117; 36:82; 40:68

**నిరాశ :**
అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందరాదు 39:53; 21:87, 88; 68:48-50

**నీడ:**
నీడ అల్లాహ్ ముందు మోకరిల్లుతుంది 13:15; 16:48

నీడ విస్తరణ 25:45

**నీరు:**
ప్రతి జీవి దాంతోనే సృష్టించబడింది 21:30; 24:45; 25:54

రెండు సముద్రాలు 18:60; 25:53; 35:12; 55:19,20
అల్లాహ్ సింహాసనం నీటిపైన 11:7
వర్షం 23:18

**నూహ్ ప్రవక్త :**

3:33; 4:163; 6:84; 7:59- 69; 9:70;
10:71; 11:25,32,36,42,45,46,48,89; 17:3; 21:76; 23:23; 25:37; 26:105; 29:14; 37:75; 51:46; 54:9; 69:11; 71:1-28
తుఫాను 29:14
దుర్జనుడైన ఆయన కుమారుడు రక్షించబడలేదు 11:45-47
దుర్జనురాలైన ఆయన భార్య కూడా రక్షించబడలేదు:
14:9; 17:3,17; 19:58; 21:76; 22:42; 26:105,106,116; 33:7; 37:75,79; 38:12; 42:13; 40:5,31; 42:13; 50:12; 53:52; 57:26; 67:10; 71:1, 21,26

**నెలల సంఖ్య:** 9:36,37

## ప

**పంచేంద్రియ ప్రదాత (వినటం, చూడటం, ఆలోచించటం మొదలగు శక్తులను ప్రసాదించినవాడు):** 23:78

**పట్టణం:**
అల్లాహ్ ఏ పట్టణాన్నయినా ఒక నిర్ధారిత గడువు ప్రకారమే తుదముట్టించాడు. 15:4

**పరదా పాటింపు:** 24:31; 33:59

**పరలోకం :**

పరలోకంలో గృహాన్ని కలిగివుండటం ఎంతో ఉత్తమం :6:32; 7:169
పరలోక పరిణామం : 6:135
దుర్మార్గులు సఫలురు కాలేరు :6:135
పరలోక గృహం : 12:109; 16:30; 28:83; 29:64
పరలోకాన్ని విశ్వసించనివారు :17:10
పరలోక సత్కారం :42:20
పరలోకంలో మంచి పరిణామం వెండి బంగారాల కంటే ఎంతో ఉత్తమం 43:33-35
పరలోక పరిణామం దైవభక్తిపరులదే : 43:35
పరలోక శిక్ష :68:33
పరలోక ప్రతిఫలం ఉత్తమమైనది, శాశ్వతమైనదీను :87:17
ఇహం కన్నా పరలోకం గొప్పది :93:4

**పర్వతాలు :**

15:19; 16:15; 20:105-107; 21:31; 22:18; 31:10; 42:32,33; 59:21; 73:14; 77:10,27; 81:3; 101:5

**పరిశుద్ధత పొందటం:**

శారీరకంగా 4:43; 5:6;
మానసికంగా 87:14; 91:9
9:28 పాద సూచిక కూడా చూడండి

**పరిహారం (ఫిద్‌యా) :**

ఉపవాస పరిహారం : 2:196
ఖైదీలను విడిచిపెట్టటానికి పరిహారం :8:67
అవిశ్వాసులు సమర్పించుకునే పరిహారం
3:91; 5:36,37; 10:54; 13:18
పరిహారం తీసుకోబడదు 57:15

**పరీక్ష :**

అల్లాహ్ నుంచి ఎదురయే పరీక్ష 3:154; 34:21

**ప్రతిఫలం:**

ప్రతిఫలదినం 1:4; 37:20; 51:12; 56:56; 82:17, 18; 96:7
ప్రతిఫలదిన తిరస్కారులు 107:1-7
చెడుకు ప్రతిక్రియ అదే రకమైన చెడు 42:40

**ప్రతిఫలం, బహుమానం:**

మంచిపనులకు ప్రతిఫలం వాటికి సమానంగా, ఇంకా అంత కంటే ఎక్కువే లభిస్తుంది 24:38; 29:7; 39:35

మంచి చేసిన వారికి దేవుని అత్యుత్తమ ప్రతిఫలం 53:31
మంచికి మంచే ప్రతిఫలం 55:60

**ప్రపంచం, ఇహలోకం:**
ప్రాపంచిక జీవితం ఒక ఆట, కొద్దిపాటి వినోదం తప్ప మరేమీ కాదు. 6:32; 29:64; 47:36; 57:20
ప్రాపంచిక జీవితం చేసే మోసం 6:130
ప్రపంచ జీవితపు ఆనందం పరలోకం ముందు ఎంతో స్వల్పం 9:38; 13:26; 28:60,61
ప్రపంచాన్ని కోరుకొని దాన్ని పొందినవారికి పరలోకంలో ఏమీ మిగలదు 11:15,16; 17:18; 42:20
ఈ సంపదా, ఈ సంతానమూ కేవలం ఐహిక జీవితపు అలంకారమే 18:46
ప్రపంచాన్ని ప్రేమించి పరలోకాన్ని వదలిపెట్టినవాడు 75:20,21; 76:27

**ప్రపంచాన్ని ఎక్కువగా అనుభవించాలన్న ఆశ :**
102:1-4

**ప్రమాణం, ప్రతిజ్ఞ (బైత్) :**
2:224-227; 3:77; 5:89; 6:109; 16:38,91, 92,94; 24:22,53; 66:2; 68:10,39; 77:3
ఇస్లాం కోసం ప్రమాణం చేయటం 16:91
ప్రవక్తకు ప్రమాణం చేయటం అల్లాహ్‌కు ప్రమాణం చేయటంతో సమానం 48:10
విశ్వాసుల ప్రతిజ్ఞ 48:18; 60:12

**ప్రయాణం, పర్యటన :**
గుణపాఠం నేర్చుకునే ఉద్దేశంతో భువిలో పర్యటించటం 6:11; 10:22; 12:109; 22:46; 27:69; 29:20; 30:9,42; 34:18; 35:44; 40:21,82; 47:10

**ప్రవక్తలు :**
2:253; 4:164,165; 40:78; 57:27;
3:33,34,146; 4:163; 5:20; 6:84-90; 23:23-50; 57:26
ప్రవక్తలందరి వాగ్దానం 3:81; 33:7-8
ప్రవక్త నమ్మకద్రోహానికి పాల్పడడు 3:161
ప్రవక్తలందరికి శత్రువు 6:112; 25:31
ప్రవక్తల తర్వాత ప్రవక్తలు 2:87
ప్రవక్తల పరంపర 5:19; 23:44
కొందరు ప్రవక్తలు చంపబడ్డారు 3:183
బెదిరించబడ్డారు 14:13
పరిహసించబడ్డారు 6:10; 13:32; 15:11; 21:41;
తిరస్కరించబడ్డారు 3 : 184; 6:34; 25:37; 34:45; 51:52
కొందరు ప్రవక్తల్ని విశ్వసించి, ఇతరుల్ని తిరస్కరించటం ధర్మం కాదు 4:150-152
ప్రవక్తల సమావేశం 5:109
శుభవార్తాహరులుగా, హెచ్చరిక చేసేవారుగా పంపబడ్డారు 6:48; 14:4-8
ప్రతి సమాజం నుంచి సాక్షిగా 16:89
ప్రతి సమాజానికి ఒక ప్రవక్త 10:47; 16:36
అల్లాహ్ ఆయతులను పారాయణం చేయటం 7:35,36
దైవదూత ప్రవక్త కాగలడా? 17:95; 25:7;
ప్రవక్తలూ మానవమాత్రులే 14:10-12; 17:94; 21:8; 25:7,8,20
వారి భార్యలు, వారి సంతానం 13:38

**పశువులు :**
3:14; 4:119; 5:1; 6:136,138,139,142; 7:179; 10: 24; 16:5-8,10,66,80; 20:54; 22-28,30,34; 23:21; 25:44,49; 26:133; 32:27; 35:28; 36:71-73; 39:6; 40:79; 42:79; 42:11; 43:12,13; 47:12; 79:33; 80:32;

**పశ్చాత్తాపం:**
అజ్ఞానం వల్ల తప్పు జరిగిపోయి వెంటనే తౌబా చేసుకుంటే ఆ తౌబా స్వీకరించబడుతుంది 4:17; 6:54
నిరంతరం పాపాలు చేస్తూనే పశ్చాత్తాపం చేసుకోవటం వల్ల లాభం లేదు 4:18

అల్లాహ్ పశ్చాత్తాపం స్వీకరిస్తాడు, పాపాలను క్షమిస్తాడు 4:25

## ప్రళయం :

ప్రళయం గురించిన జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది: 7:187; 33:63; 41:47; 68:26;

అకస్మాత్తుగా వారిపై విరుచుకుపడుతుంది 6:31; 7:187; 12:107; 43:66

మీపై ప్రళయం రావటం తథ్యం: 6:40; 12:107; 20:15; 34:3

ప్రళయం దగ్గరపడింది :54:1-5

రెప్పపాటులో లేక అంతకంటే తక్కువ వ్యవధిలోనే జరిగిపోతుంది :6:77

ప్రళయం నాటి భూకంపం :22:1

ప్రళయం సంభవించిననాడు: 30:12,14

తప్పకుండా సంభవిస్తుంది, అందులో సందేహం లేదు:

40:59; 45:32; 51:5,6

## పక్షులు :

2:260; 3:49; 5:110; 6:38; 12:36,41; 16:79; 21:79; 22:31; 24:41; 27:16,17,20; 34:10; 38:19; 56:21; 67:19; 105:3

## ప్రాణం:

కారణం లేకుండా ఒక మనిషి ప్రాణం తీసినవాడు మొత్తం మానవాళిని హత్య చేసినట్టు. అలాగే ఒక మనిషి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవజాతిని కాపాడినట్లే 5:32

## ప్రార్థన (దుఆ):

1:1-7; 3:8,26,27,147,191-194; 4:103; 17:80; 23:118

మరీ బిగ్గరగా కాకుండా మరీ మౌనంగానూ కాకుండా ప్రార్థన చేయాలి 17:110

అవిశ్వాసుల కొరకు ప్రార్థన 9:113,114

అవిశ్వాసుల ప్రార్థనకు ఉదాహరణ 13:14

అల్లాహ్ ప్రార్థనలను ఆలకిస్తాడు 42:26

## పాపం :

7:100; 74:43-6

అక్రమ లైంగిక సంబంధం పాపం 4:15,16; 24:2,19

పెద్ద పాపాలకు దూరంగా ఉంటే చిన్నచిన్న పాపాలు మన్నించబడతాయి 4:31

పాపాలు మనుషులకు తెలియకపోయినా అల్లాహ్‌కు తెలుస్తాయి 4:108

పాపం చేసినవాడే దాని భారం మోస్తాడు 4:111

పాపం చేసి ఇతరుల మీద ఆ నిందమోపితే... 4:112

తనకు సహవర్తుల్ని కల్పించే (షిర్క్ చేసే) పాపాన్ని అల్లాహ్ ఎన్నటికీ క్షమించడు అది గాకుండా తాను కోరినవారి ఇతర పాపాలను ఆయన క్షమిస్తాడు 4:116

పాపానికి ప్రతిఫలం అనుభవించక తప్పదు 6:120

పాపాత్ములు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు సుమా! 10:17

పాపాలన్నిటినీ అల్లాహ్ క్షమిస్తాడు 39:53

ఘోరపాపాలు 42:37

## పాపాత్ముల కాళ్లు, చేతులు, చర్మం:

స్వయానికి వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతాయి 41:20-23

## పానీయాలు :

మత్తుపానీయాలు : 2:219; 5:90;

స్వచ్ఛమైన పానీయం 37:45; 76:21;

స్వచ్ఛమైన, సీలువేయబడిన మద్యం : 83:25;

తెల్లనిది, కమ్మనిది: 37:46

## పిల్లలు :

పిల్లవాడికి పాలుపట్టే గడువు 2:233; 42:49,50

అజ్ఞానం వల్ల, మూర్ఖత్వం వల్ల సంతానాన్ని హత్యచేసినవారు, నష్టానికి గురిఅయ్యారు. 6:140

**పిసినారులు / పిసినారితనం:** 57:24;

## పిసినారితనం పనికిరాదు :

17:29; 47:38; 48:38

**పునరుత్థానదినం (మరణం తర్వాత మళ్లీ లేపబడే దినం) :** 7:89; 20:100,101,124
సంభవించితీరే రోజు 78:39
పూర్తి ప్రతిఫలం పొందేరోజు 3:185
కర్మల పత్రాలు తెరువబడతాయి 81:11
ప్రతిమనిషి తను సంపాదించి తెచ్చినది తెలుసుకుంటాడు 81:14
ప్రతి మనిషి ముందుకు అతను చేసిన మంచీ చెడులు తీసుకు రాబడతాయి 3:30
తను ముందుకు పంపుకున్నదీ, వెనుక విడిచి పెట్టినది తెలుసుకుంటాడు మనిషి 82:5
ఆ రోజు అన్యాయం జరుగుతుందనే భయం ఉండదు 20:112
సమానమైన న్యాయం జరుగుతుంది 21:47
కర్మలప్రతిఫలం లభించేరోజు 23:102,103
అణువంత మంచి లేక, చెడు చేసివున్నా మనిషి దాన్ని చూసుకుంటాడు 100:7,8
కుడిచేతిలో కర్మలపత్రం 69:19; 84:7-9
ఎడమ చేతిలో కర్మల పత్రం 69:25
వీపువెనుక నుంచి ఇవ్వబడటం 84:10-15
అవిశ్వాసులకు గడ్డుదినం 25:26; 54:8; 74:9
భారమైన దినం 76:27
ఆ రోజు అవిశ్వాసులు పెద్ద పాపభారం మోస్తారు 20:110, 101
సాకులు చెప్పటానికి వీలుండదు 77:36
దుర్మార్గులు వ్రేళ్లు కొరుక్కుంటారు 25:27
దుర్మార్గుల్ని, వారి సహచరులను, వారు పూజించిన విగ్రహాలను సమీకరించటం జరుగుతుంది 37:22
దిగ్భ్రమ, తీవ్రమైన నిరాశా నిస్పృహలు వారిని అలుము కుంటాయి 30:12
సజీవంగా మట్టిలో పాతిపెట్టబడిన అమ్మాయిని ప్రశ్నించటం జరుగుతుంది 81:8,9
మహా భీతావహ స్థితి ఉంటుంది 21:103
చాటింపు వేసేవాడు భయంకరమైన విషయం వైపునకు రమ్మని చాటింపు వేస్తాడు 50:41; 54:6-8
ఒకే ఒక అరుపు 36:29,49,53; 38:15; 50:42
జజ్‌రా (అరుపు) 37:19; 79:13
సమీపంలో రానున్న ఆపద 78:40
ఆకాశాలు భయంకరంగా ఊపివేయబడతాయి 52:9; 56:4
ఆకాశాలు బ్రద్దలైపోతాయి 84:1,2
ఆకాశం చీల్చివేయబడుతుంది 77:9; 82:1
మేఘం ఆకాశాన్ని చీలుస్తుంది 25:25
ఆకాశాలు చుట్టివేయబడి దేవుని కుడిచేతిలో ఉంటాయి 21:104; 39:67
ఆకాశాలలో, భూమిలో ఉన్నవారందరూ చచ్చిపడిపోతారు 39:68
ఆకాశం తెరువబడి, ద్వారాల మాదిరిగా అయిపోతుంది 78 :19
ఆకాశం నూనె గసిలాగా మారిపోతుంది 70:8
నక్షత్రాలు పడిపోతాయి 81:2; 82:2
నక్షత్రాలు కాంతిని కోల్పోతాయి 77:8
సూర్యుడు కాంతిహీనుడై పోతాడు 81:1
సముద్రాల్లో మంటలు చెలరేగుతాయి 81:6
సముద్రాలు చీల్చబడతాయి 82:3
ప్రళయం నాటి భూకంపం 22:1; 99:1
పర్వతాలు కదిలిపోతాయి 18:47; 27:88; 52:10; 77:9; 78:20; 81:3;
తుత్తునియలైపోతాయి 20:105; 56:5;
పర్వతాలు ఏకిన దూదిలా అయిపోతాయి 70:9; 101:5
భూమి, పర్వతాలు భయంకరంగా కుదిపేయబడతాయి 73:14; 79:6
భూమి దంచివేయబడుతుంది 89:21
భూమి మరో భూమి లాగా, ఆకాశాలు మరో ఆకాశాల్లాగా మార్చివేయబడతాయి 14:48;

భూమి విస్తరింపజేయబడుతుంది 84:3-5

భూమి బోసిపోతుంది 18:47; 20:106

భూమి తన గర్భంలో ఉన్నదంతా బయటికి విసరివేస్తుంది 84:4; 99:2

సమాధులు తలక్రిందులవుతాయి 82:4

సమాధుల నుంచి మనుషుల్ని బతికించి లేపటం జరుగుతుంది 21:97; 70:43

మనుషులు బతికించబడి ఒక బహిరంగ ప్రదేశంలోకి చేరుకుంటారు 79:14

అడవి జంతువులు సమీకరించబడతాయి 81:5

గ్రుడ్డివారుగా లేపబడతారు 20:124, 125

శంఖం పూరించబడుతుంది

6:73; 18:99; 20:102; 23:101; 27:87; 36:51; 39:68; 50:20; 69:13; 74:8; 78:18; 79:7;

సాఖ్ఖహ్ (చెవులను చెవిటిగా చేసే శబ్దం) 80:33

శరీరాల్లోకి ఆత్మల చేరిక 81:7

పదిరోజుల కంటే ఎక్కువ ప్రపంచంలో ఉండలేదన్నట్లు అనిపిస్తుంది 20:103

ఒకరోజు కంటే ఎక్కువ ప్రపంచంలో ఉండనేలేదన్నట్లు అనిపిస్తుంది 20:104

ఒక్కపూట కూడా ఉండలేదని కూడా అనిపిస్తుంది 24:112-114

సమీకరించే దినం 64:9

తీర్పు దినం 37:21

నిర్ణాయక దినం 77:38; 78:17

తీర్పు లేక నిర్ణాయక దినం 77:13,14

దుఃఖదినం 19:39

పునరుత్థాన ధిక్కారులు 77:15-50

మానవులు చెల్లాచెదరైన దీపపు పురుగుల మాదిరిగా అయిపోతారు 101:4

మానవులు విభిన్న వర్గాలుగా దైవం వైపునకు మరలుతారు 99:6

ప్రజలు మైకంలో ఉంటారు 22:2

సూడి ఒంటెలను కూడా ఎవరూ పట్టించుకోరు 81:4

పాలుపట్టే తల్లి పిల్లవాడ్ని మరిచిపోతుంది 22:2

ప్రతి గర్భిణికి గర్భం పడిపోతుంది 22:2

బంధువులు ఒకర్నొకరు చూసుకుంటారు

కాని మనిషి తనవాళ్లను చూడగానే పారిపోతాడు 70:11; 81:34-37

మిత్రుడు మిత్రుణ్ణి అడిగిచూడడు 70:10

ఆప్తమిత్రుడు గానీ, సిఫారసుదారు గానీ ఉండడు 40:18

ఎవరూ ఎవరికీ ఎలాంటి సహాయం చేయలేరు 82:19

ఎటువంటి శక్తి ఉండదు, సహాయకుడూ ఉండడు 87:10

విశ్వాసులకు అభయం! 43:68

విశ్వాసులు నీడల్లో, సెలయేరుల మధ్య పండ్లు ఫలాలు ఆరగిస్తూ ఉంటారు 77:41-43

స్వర్గవాసులు, వారి భార్యలు 36:55-58

దైవదూతలు దిగిరావటం 25:25

స్వర్గం దగ్గరికి తీసుకురాబడుతుంది 81:13

నరకం దగ్గరికి తీసుకురాబడుతుంది 89:23

నరకం మండించబడుతుంది 81:11,12

ప్రతీకారం తీర్చుకోకుండా క్షమిస్తే... 5:45

**పేదరికం, పేదవారు :**
2:88,177,215,273; 4:8,36; 8:41; 9:60; 17:26; 24:22,32; 30:38; 47:38; 51:19; 59:7,8; 69:34; 74:44; 76:8; 89:18; 90:16; 93:8; 107:3

**పేదరికం, కష్టాలు...:** 7:94-96

**పేర్లు (అస్మా) :**

అందమైన పేర్లన్నీ అల్లాహ్‌కే 7:180

అత్యుత్తమ పేర్లన్నీ ఆయనకే 17:110; 20:8; 59:24

**పొరుగువారి హక్కులు:** 4:36

**పోరాటం :** 81; 22:78; 25:52; 29:69; 47:3; 60:1; 61:11

అవిశ్వాసులపై అల్లాహ్ తరపున పోరాడటం 2:190-193, 244; 4:84,95; 8:72,74,75; 9:12-16,20,24, 36,123; 47:4; 61:11

దైవమార్గంలో పోరాడమని ఆజ్ఞ :2:216

పవిత్ర మాసాల్లో యుద్ధం : 2:217; 9:5;

బనీ ఇస్రాయీల్ వారు దైవమార్గంలో జరిపిన పోరాటం: 2:246-251

అల్లాహ్ మార్గంలో పోరాటం, అణగారిన ప్రజల కోసం పోరాటం : 4:74-76;

ఫిత్నా (షిర్క్, ఉపద్రవం) సమసిపోయేంత వరకూ పోరాడాలి: 8:39

ఇరవైమంది రెండొందల మందిని మట్టికరిపించగలరు :8:65

అల్లాహ్‌ను విశ్వసించనివారిపై పోరాటం 9:49

దౌర్జన్యపరులపై పోరాటానికి పీడితులకు అనుమతి: 22:39-41

కపటులు పోరాటం పేరుకే బెంబేలెత్తిపోతారు 47:20

యుద్ధ విధి నుండి మినహాయింపబడిన వారు 48:17

## ఫ

**ఫతహ్ (విజయం) :** 48వ సూరా

**ఫలములు :** 6:41; 16:11

స్వర్గంలో చాలా ఉంటాయి : 43:73

అన్ని రకాల ఫలాలు ఉంటాయి: 47:15

స్వర్గవాసులు కోరుకున్నవన్నీ ఉంటాయి: 77:42

**ఫిరౌన్ చక్రవర్తి :** 28:6; 40:24

ఫిరౌన్ ప్రజలు 2:49; 3:11; 7:141; 44:17-33

ముంపుకు గురయ్యారు 2:50

మూసాతో ఫిరౌన్ 7:103-137; 10:75-92 (మూసా ప్రవక్త కూడా చూడండి)

సముద్రం నుంచి ఫిరౌన్ మృతదేహం ఒడ్డుకు 10:90-92

ఫిరౌన్ హద్దుమీరినవాడు, పాపాత్ముడు, అవిధేయి 20:24; 69:9; 73:16; 85:17-20; 89:10-14

ఫిరౌన్ భార్య సదాచార సంపన్నురాలు, అల్లాహ్ మీద విశ్వాసం కల స్త్రీ 28:8, 9

ఫిరౌను తాను దేవుణ్ణని ప్రకటించుకున్న దుష్టుడు 28:38; 79:24

వాడు, వాడి అనుచరులు నాశనం చేయబడ్డారు 29:39

ఫిరౌన్ కుటుంబంలోని ఒక విశ్వాసి 40:28-44

మహాగోపుర నిర్మాణం 40:36,37

**ఫిర్‌దౌసు స్వర్గం :**18:160; 23:11

**ఫుజ్జార్ (దుర్జనులు) :** 82:14-16; 83:7

**ఫై (యుద్ధంలో విజేతలకు స్వాధీనమయ్యే) ధనం:** 59:6-8

## బ

**బంధువుల హక్కులు :**

2:83,177,215; 4:7-9,36; 8:41; 16:90; 17:26; 24:22; 29:8; 30:38; 42:23

**బఅల్ విగ్రహం :** 37:125

**బక్కా (మక్కా) :** 3:96

**బఖర (ఆవు) :** 2 వ సూరా

**బద్ర్ యుద్ధం :** 3:13

బద్ర్ యుద్ధం నేర్పే పాఠాలు: 8:5-19,42-48

**బనూనజీర్ (ఒక యూదతెగ):**59:2,9,13

**బర్జఖ్ (అడ్డు) :**

23:100; 25:53; 55:20;

ఇంకా చూడండి :18:94-97; 34:54; 36:9

**బాట:** 1:6; 42:52,53; 90:10

మార్గాన్ని సులభం చేయటం 87:8

(మార్గం కూడా చూడండి)

**బాటసారి :**
2:177,215; 8:41; 17:26; 29:29; 30:38; 59:7

**బానిసలు** :
2:177,178; 4:25,36,92; 5:89; 24:33; 58:3; 90:13 (యుద్ధఖైదీలు కూడా చూడండి)

**బుద్న్ (ఒంటెలు, ఆవులు, ఎద్దులు వంటి ఖుర్బానీ జంతువులు) :**22:36

**బురుజులు (పెద్ద పెద్ద నక్షత్రాలు):**
85; 85:1; 15:16; 25:61;

**బైతుల్ మామూర్ (నిత్యం ఆరాధనతో కళకళలాడే గృహం):** 52:4;

## భ

**భయభక్తుల దుస్తులు మంచిదుస్తులు:** 7:26

**భాగస్వాములు:**
దైవత్వంలో అల్లాహ్‌కు భాగస్వాములు లేరు 4:116; 10:34, 35,66; 16:86; 28:62-64,71-75; 30:40; 42:21

**భారం :**
పరలోకంలో ఒకరి భారం ఇంకొకరు మోయరు: 35:18; 39:7; 53:38;
అవిశ్వాసులు ఇతరుల భారం కూడా మోస్తారు 16:25; 29:13
వారు మోసే ఈ బరువు ఎంతో చెడ్డది 6:31, 164
అల్లాహ్ ఎవరిపైనా వారి శక్తికి మించి భారం వేయడు: 2:286; 7:42; 23:62

**భార్యలు :**
భార్యలు సేద్యపు భూములు 2:223
మీకు దుస్తుల్లాంటివారు 2:187
మీ జాతికే చెందినవారు 16:72

**భాషలు:**
విభిన్నం, మనుషుల రంగులు కూడా 30:22

**భూకంపం (జిల్‌జాల్ సూరా) :**
సూరా 99

**భూమ్యాకాశాల్లో ఉన్న ప్రతిదీ, ఇంకా వాటి నీడలు అల్లాహ్ ముందే మోకరిల్లుతాయి :** 13:15

**భూమి :**
ఈ పదం మొత్తం దివ్యఖుర్‌ఆన్‌లో 200 కంటే ఎక్కువసార్లు ప్రస్తావనకు వచ్చింది.

## మ

**మంచిపనుల్లో పరస్పరం పోటీ :** 5:48

**మంచి:**
మీరు ఒకదాన్ని మంచిదనుకుంటారు కాని అది.... మరొకదాన్ని చెడు అనుకుంటారు కాని అది...2:216
మంచి ప్రతిఫలం : 4:85; 28:54
రెట్టింపు ప్రతిఫలం : 4:40; 28:54
పదిరెట్ల పుణ్యఫలం : 6:160
మంచి పెంచబడుతుంది: 42:23
మంచి చేసేవాళ్ళకు మంచి ప్రతిఫలం, పరలోకంలో ఇల్లు 16:30
ఇహలోకంలో మంచి చేసేవాళ్లకు మంచి 39:10
మంచి చేసేవాళ్ళను అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలంతో సత్కరిస్తాడు 53:31
మంచికి ప్రతిఫలం మంచే 55:60
అల్లాహ్ నీకు మంచి చేసినట్లు నువ్వు కూడా ఇతరులకు మంచి చెయ్యి 28:77

**మంచి మరియు చెడులు:**
మంచి అల్లాహ్ తరుపు నుంచి, చెడు మీ తరపు నుంచి 4:79
మంచి చేసినా చెడు చేసినా అది మీ స్వయానికే చెందుతుంది17:7; 41: 46
చెడును మంచి ద్వారా నిర్మూలించాలి 23:96; 28:54; 41:34
మంచిచెడులు ఎన్నటికీ సమానం కాజాలవు: 41:34
ప్రతి వ్యక్తి తను చేసుకున్నదంతా తన కళ్ల ముందు చూసుకుంటాడు : 3 : 30

**మక్కా (బక్కా) :** 3:96; 90:1,2;
సురక్షిత నగరం 95:3

**మతగ్రంథం :**
గ్రంథప్రజలు (యూదులు, క్రైస్తవులు)
2:109; 3:64,65,69,70,71,72,75,98,99,110, 113,199; 4:47,153-161; 5:59,60,68; 98:1
గ్రంథంలోని ఆదేశాలను ప్రజల నుంచి దాచి ఉంచటం పాపం 5:61-63
గ్రంథప్రజల్లో కొందరు రుజువర్తనులు కూడా ఉన్నారు 5:66
గ్రంథప్రజలు సత్యాన్ని గుర్తిస్తారు కాని విశ్వసించరు 6:20

**మత్తుపానీయాలు :** 5:90; 2:219

**మద్‌యన్ (ఒక ప్రాంతం పేరు, ఈ ప్రాంతం వారికి ప్రవక్తగా అల్లాహ్ షుఐబును పంపించాడు):**
7:85-93; 11:84-95; 20:40;22:44; 28:22,23; 29:36,37 (అయ్‌కావారు కూడా చూడండి)

**మద్యం (స్వర్గంలో) :**
స్వచ్ఛమైన పానీయం 37:45; 76:21
తెల్లనిది కమ్మనిది 37:46
మద్యం కాలువలు 47:15
స్వచ్ఛంగా, సీలువేయబడినది 83:25

**మదీనా (యస్‌రిబ్):**
9:120; 33:13,60; 63:8

**మదీనా నగర ముట్టడి :** 33:9-27

**మన్న్ - సల్వా (మూసాజాతి ప్రజలకు అల్లాహ్ ప్రసాదించిన ఆహారం)** 2:57

**మనాత్ (ఇస్లాంకు పూర్వం అరబ్బులు పూజించిన ఒక విగ్రహం పేరు):** 53:20

**మనాసిక్ హజ్ (హజ్ విధులు):** 2:128,200; 22:30

**మనిషి** :
భూమిమీద ఒక తరం తర్వాత మరొక తరం 2:30; 6:165;
ఖలీఫాగా సృష్టించబడ్డాడు 35:39
మనిషి విధులు 2:83,84,88,177; 4:1-36; 8:41; 16:90; 17:23-39; 24:22; 29:8,9; 30:38; 33:33; 42:23; 64:14; 70:22-35
అల్లాహ్ చేత పరీక్షించబడటం 2:155; 3:186; 47:31; 57:25
మనిషి ఆశపడే వస్తువులు 3:14
ఇలా సృష్టించబడ్డాడు: 4:1; 6:2; 15:26,28,33; 16:4; 21:30; 22:5; 23:12-14; 25:54; 30:20; 32:7-9; 35:11; 36:77,78; 37:11; 39:6; 40:67; 49:13; 55:14; 56:57-59; 75:37-40; 76:1,2; 77:20-23; 80:18,19; 86:5-8; 96:2;
సృష్టించిన తర్వాత అతని జీవన వ్యవధి కూడా నిర్ణయించబడింది 6:2; 15:26
మనిషికీ-అతని భార్యకూ మధ్య సమాధానం కుదర్చటం 4:35
అల్లాహ్‌ను కలవటాన్ని విశ్వసించని వారు నష్టపోతారు 6:31
మరల్చు 6:60,72,164; 10:45,46
స్వయానికి వ్యతిరేకంగానే కుతంత్రాలు 6:123
ఒకరి బరువు ఇంకొకడు మోయడు 6:164
కృతఘ్నుడు 7:10; 11:9; 30:34; 32:9; 80:17; 100:6
షైతాన్ గురించి హెచ్చరించబడ్డాడు 7:27;
మనిషిభార్య, అతని సంతానం 7:189,190
నష్టం, కీడు కలిగినప్పుడు 10:12; 11:9,10; 16:53-55; 17:67; 29:10; 30:33; 31:32; 39:8,49; 41:49-51; 42:48; 70:19-21; 89:16
ప్రభువు వైపునకు మరలటం 10:23; 84:6; 96:8
తనకు తానుగా అన్యాయం చేసుకుంటాడు మనిషి 10:44
పొంగిపోతాడు, విర్రవీగుతాడు 11:10
కీడును అర్థిస్తాడు 17:11
తొందరపడతాడు 17:11
కర్మల పత్రం మనిషి మెడకు వేలాడదీయబడింది 17:13

దుర్మార్గంలో నడిచినవాడు, తన స్వయానికే నష్టం కలిగించు కుంటాడు.... సన్మార్గంలో నడిచేవాడు తన స్వయానికే ప్రయోజనం చేకూర్చుకుంటాడు 17:15

రవంత అన్యాయం జరగదు 17:71

మరణం, పునరుజ్జీవనం 23:15,16

తమ మతాన్ని ముక్కలు, ముక్కలుగా చేసుకున్నారు, ప్రతి మతం తన విశ్వాసం మీదనే మురిసిపోతోంది 23:53

నాలుక, చేతులు, కాళ్లు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతాయి 24:24

తనకు వ్యతిరేకంగా తన సాక్ష్యం 75:14

మనోవాంఛను దేవుడుగా చేసుకోవటం 25:43

వంశము, అత్తవారి వంశము 25:54

భూమ్యాకాశాల్లో ఉన్నదంతా అల్లాహ్ మనిషి కోసమే పుట్టించాడు 31:20

ఎవరైతే తమ స్వయాన్ని అల్లాహ్‌కు సమర్పించుకుంటారో..... 31:22

అల్లాహ్ ఒక మనిషిలో రెండు హృదయాలను తయారు చేయలేదు 33:4

అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి 39:64- 66

చేజేతులా సంపాదించుకున్న దాని ఫలితంగా మనిషికి ఆపదలు 42:30,48;

అతని పనుల్ని దైవదూతలు రికార్డు చేస్తుంటారు 50:17, 18,23; 85:11

అతన్ని రక్షించే దూతలు 13:11; 86:4;

పరలోకంలో మనుషులు మూడు తరగతులుగా విభజించబడతారు 56:7-56

అల్లాహ్‌కు అతి సమీపంలో ఉండే మనుషులు 56:10,11

కుడిపక్షం వారు 56:27-40

ఎడమ పక్షం వారు 56:41-56

రూపాలను మార్చి సృష్టించటం 56:60-62

అందంగా రూపొందించబడ్డాడు 64:3

సిరిసంపదలు, సంతానం ఒక పరీక్ష 64:15

సృష్టి, పంచేంద్రియాలు 67:23,24; 74:12-15; 90:8-10

సహనం లేనివాడు 70:19-21

నిత్యం నమాజు చేస్తూ ఉండాలి 70:22-35

అత్యాశపరుడు 74:15

స్వయానికి వ్యతిరేకంగా సాక్ష్యం 75:14,15

అహంకారం 75:31-40; 90:5-7

ఐహిక జీవితాన్ని ప్రేమిస్తాడు 76:27

మనిషిని సృష్టించటం కష్టతరమా? లేక ఆకాశాలను సృష్టించటమా? 79:28

ప్రభువు విషయంలో నిర్లక్ష్యం 82:6-12

దేవుడు ఎలాంటి లోపం లేకుండా పొందికగా రూపొందించాడు 82:7

మనిషి ఒక స్థితి నుండి మరొక స్థితికి తరలిపోతూ ఉంటాడు 84:19

సంపద పట్ల ప్రేమ 89:20

నిత్యకష్టాల్లో పుట్టించబడ్డాడు 90:4

ప్రయత్నాలు విభిన్నంగా ఉంటాయి 92:4

సన్మార్గంలో, కఠిన మార్గంలో నడవటం సులభం చేయబడింది 92:7,10

అతనిది అద్భుతమైన ఆకృతి 95:4

నీచాతినీచంగా మారిపోతాడు 96:5

అన్ని హద్దులనూ ఉల్లంఘించాడు 96:6,7

**మన్నింపుల వైఖరి :**

2:109; 4:48,110,116; 7:199; 39:53; 42:5, 40-43; 45:14; 53:32; 57:21

విశ్వాసుల విధి : 42:37; 45:14

గ్రంథప్రజల పట్ల విశ్వాసుల వైఖరి : 2:109

అల్లాహ్ తాను ఇష్టపడినవారిని మన్నిస్తాడు 4:48

ఆరాధనలో తనకు భాగస్వాములను అంటగట్టేవారిని అల్లాహ్ సుతరామూ క్షమించదు: 4:48,116

ఎవరైతే అల్లాహ్‌ను క్షమించమని ప్రార్థిస్తారో వారిని అల్లాహ్ క్షమిస్తాడు 4:110

ముష్రిక్కులను క్షమించమని అల్లాహ్‌ను వేడుకోరాదు :9:113
అల్లాహ్ గనక తలచుకుంటే పాపాలన్నిటిని క్షమించగలడు 39:53
భువి మీద ఉన్నవారి మన్నింపు కోసం దైవదూతలు ప్రార్థిస్తారు: 42:5
కోపాన్ని దిగమింగి మన్నింపుల వైఖరిని అవలంబించటం: 42:37
మన్నింపులతో పాటు సంస్కరణా వైఖరిని అవలంబించటం: 42:40
అల్లాహ్ మీద నమ్మకం లేని అవిశ్వాసులను విశ్వాసులు క్షమించి వదలిపెట్టాలి 45:14
పెద్దపెద్ద పాపాలకు, నీతి బాహ్యతకు దూరంగా ఉండేవారికి క్షమాభిక్ష :53:32
ప్రభువు క్షమాభిక్షకై పరస్పరం పోటీపడటం 57:21

**మర్‌యమ్ (ఈసా ప్రవక్త తల్లి):**
పుట్టుక 3:35-7
ఈసా ప్రవక్త పుడుతారనే శుభవార్త ఇవ్వబడింది 3:42-51; 19:16-21;
ప్రసవ సమయం 19:23-26
పసిబిడ్డను తన జాతి ప్రజల వద్దకు తీసుకెళ్లటం 19:27-33
ఆమె మీద తీవ్రమైన అపనింద మోపబడింది 4:156
శీలవతి : 21:91; 66:12

**మరణం :**
ఈ పదం ఖుర్‌ఆన్‌లో 200 కంటే ఎక్కువ సార్లు ప్రస్తావనకు వచ్చింది.

**మరణానంతర జీవనం :**
7:53; 14:21; 16:38-40; 17:49-52; 19:66-72; 22:5; 23:15,16; 46:33-34; 50:3, 20-29,41-44; 75:1-15; 79:10-12; 86:5-8

**మష్‌అరిల్ హరామ్ (హజ్‌యాత్రకు సంబంధించిన ఓ ప్రదేశం పేరు):** ఈ ప్రదేశంలో అల్లాహ్‌ను స్మరించాలి 2:198

**మస్జిదులు :** 2:187; 9:17-19
మస్జిదులను సంరక్షించటం 9:17,18

**మస్జిదె అఖ్సా (జెరూసలంలోని పుణ్యక్షేత్రం):** 17:1

**మస్జిదె హరామ్ (మక్కాలోని పుణ్యక్షేత్రం):**
2:144,149,150,191,196,217; 5:2; 9:19,28; 17:1; 48:25,27

**మహర్ (వివాహ సమయంలో వరుడు వధువుకు ఇచ్చే సొమ్ము)** :
2:229,236,237; 4:4,19-21,24,25; 5:5; 33:50; 60:10,11;

**మానవాళి** :
మానవాళి గురించి సాక్ష్యం 2:143
మొత్తం ఒకే జాతి 2:213; 10:19
ఒకే దంపతుల సంతానం 4:1; 39:6; 49:13
తిరుగుబాటు వల్ల స్వయానికే నష్టం 10:23
లెక్కల గడియ సమీపించినప్పటికీ ఏమరు పాటులో ఉన్నారు 21:1-3
సహజ స్వభావంతో పుట్టించబడ్డారు 30:30
అందరిలోకీ గౌరవపాత్రులు 49:13
జాతులుగా, తెగలుగా ఉంటారు 49:13

**మార్గం (అల్లాహ్ మార్గం):**
5:77; 16:94; 42:52,53; 43:43; 90:11,12;
(బాట కూడా చూడండి)

**మారూత్(మరియు హారూత్ ఇద్దరు దైవదూతలు)**: 2:102

**మా'వా స్వర్గం :** 53:15

**మితిమీరటం :**
అన్నపానీయాల్లో మితిమీరటం నిషిద్ధం 5:87
ధర్మం విషయంలో హద్దుమీరటం పాపం 4:171; 5:77-81

**మిథ్యా దేవుళ్లు :**
అల్లాహ్‌గాక ఇతర చిల్లరదేవుళ్ళు, ప్రజలు నిలబెట్టిన దైవత్వపు భాగస్వాములు
7:194-198; 16:20,21,72,86; 21:22,24; 34:22,27; 41:47,48; 46:5,6; 53:19-24; 71:23,24 (తాగూత్ కూడా చూడండి).
అల్లాహ్‌ను వదలిపెట్టి అవిశ్వాసులు పూజిస్తున్న మిథ్యా దేవుళ్లను తూలనాడరాదు 6:108

**ముత్యాలు (భద్రపరచబడినవి):**
సముద్రాల్లో ముత్యాలు, పగడాలు : 55:22;
దాచిపెట్టబడిన ముత్యాల్లా ఉండే స్వర్గ బాలురు, స్వర్గ కన్యలు: 52:24; 56:23

**ముస్లింలు:**
ముస్లింలలో తొలివారు 6:14,163; 9:100; 39:12
ముస్లింలుగా పేరుపెట్టబడ్డారు 22:78;
ముస్లింలయినవారికి క్షమాభిక్ష, గొప్ప ప్రతిఫలం 33:35,36

**ముహ్‌సినీన్ (సత్కార్యాలు చేసేవారు):**
2:117,195; 4:125,128; 10:126; 16:128
అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు 3:134,148; 5:93
అల్లాహ్ వీరి ప్రతిఫలాన్ని నాశనం చేయడు 5:85; 9:120; 11:115; 18:30
మేము ప్రతిఫలం ప్రసాదిస్తాము 12:22; 37:80,105, 110; 39:34; 77:44
అటువంటివారికి శుభవార్త 22:37; 46:12
అల్లాహ్ కారుణ్యం వీరికి చేరువలో ఉంటుంది 7:56
అల్లాహ్ వీరితోనే ఉంటాడు 29:69
వీరు బాధ్యతగలవారు, ఇంకా తల్లిదండ్రుల పట్ల మంచిగా మెలుగుతారు 2:83
అల్లాహ్ హక్కులను నెరవేర్చటంలో సహన శీలురు 16:90
(మంచి-చెడు పదాలు కూడా చూడండి)

**ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం**
అయన్ను పరిహసించటం ఘోరపాపం 2:104; 4:46; 25:41, 42; 34:78
ప్రవక్తను గౌరవించాలి 2:104; 4:46; 49:1-5
ఆయన్ని విశ్వసించాలని వాగ్దానం తీసుకోబడింది 3:81
విశ్వాసుల సాక్షి 2:143
కేవలం ప్రవక్త మాత్రమే 3:144
మృదువుగా వ్యవహరిస్తారు 3:159
ఆయన పని 3:164; 7:157; 36:6; 52:29; 74:1-7
విశ్వాసుల పాలిట గొప్ప అనుగ్రహమూర్తి 3:164
సత్యం ఇచ్చి పంపబడ్డారు 4:170
కావలివానిగా చేయబడలేదు 6:107
నిరక్షరాసి 7:157; 62:2;
మానవాళికంతటికి అల్లాహ్ తరఫు నుంచి ప్రవక్తగా పంపబడ్డారు 7:158; 48:9,29
కేవలం హెచ్చరించేవారు మాత్రమే 7: 184,188; 11:2; 15:89; 53:56
పిచ్చివాడు కాదు 7:184; 68:2; 81:22
ఆయన్ని ఆక్షేపించటం పాపం 9:58
ప్రవక్తను బాధపెట్టేవారికి వ్యథాభరితమైన శిక్ష 9:61
విశ్వాసుల కొరకు కారుణ్యం 9:61
అవతరించిన దాన్నే అనుసరించమని ఆయనకు ఆజ్ఞ 10:15, 16; 11:12-14; 46:9
ఆయన పలుకులు 11:2-4; 12:108; 34:46-50
అల్లాహ్ ఆయనసాక్షి 13:43; 29:52; 46:8
సాక్షిగా, శుభవార్తాహరునిగా, హెచ్చరిక చేసేవారుగా పంపబడ్డారు 11:2; 15:89; 26:194; 33:45; 34:28; 48:8
ఆయన మనసు నొప్పించరాదు 15:97; 16:127; 18:6
సాక్షిగా ఉండటానికి పంపబడ్డారు 16:89; 22:78; 73:15;
వివేకంతో, చక్కని హితబోధతో ఉత్తమోత్తమ విధానంలో వాదిస్తూ ధర్మమార్గం వైపు ఆహ్వానిస్తారు 16:125
మఖామమ్ మహ్మూద (కీర్తించబడిన స్థానం) గలవారు 17:79

ఆయనకు వహీ అందుతుంది 18:110

ఆయన సర్వలోకాల పాలిట కారుణ్యంగా పంపబడ్డారు 21:107

ఆయన ఏ ప్రతిఫలాన్నీ కోరరు 25:57; 38:86; 42:23

ఆయనకు ఇలా ఆజ్ఞాపించబడింది 27:91-93; 30:30; 66:9

ఆయనపై అల్లాహ్ కారుణ్యం, కనికరం 28:46,47

విశ్వాసులకు దగ్గరివారు 33:6

మానవులంతా అనుసరించదగ్గ గొప్ప ఆదర్శవంతుడు 33:21

దైవప్రవక్తల్లో చివరివారు 33:40

ఆయనపై 'సలాతు' పంపండి 33:56

ఆయన మొత్తం మానవాళి కోసం పంపబడిన వారు 34:28

ఆయనకు ప్రతిఫలం ఇవ్వటం అల్లాహ్ బాధ్యత 34:47

మానవమాత్రుడు 41:6

కాపలాదారుగా పంపబడలేదు 42:48

కొత్త ప్రవక్త ఏమీ కాదు 46:9

ఆయన గురించి ఇస్రాయీల్ జాతికి చెందిన వ్యక్తి సాక్ష్యం 46:10

ఆయనతో 'బైత్' (ప్రమాణం) అల్లాహ్‌తో బైత్ (ప్రమాణం) చేయటంతో సమానం. 48:10,18

జిబ్రయీల్‌ను చూశారు 53:4-18; 81:22-25

ఆయన్ను వ్యతిరేకించకండి 58:20-22

ఆయన గురించి యేసు ప్రవక్త భవిష్య వాణి ఇచ్చారు 61:6

సత్యధర్మానికి ఇతర ధర్మాలన్నిటిపై విజయం చేకూర్చటానికి ఏతెంచినవారు 61:9

అంధకారం నుంచి వెలుగు వైపునకు తీసుకువస్తారు 65:11

అవిశ్వాసులకు, కపటులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారు 66:9

మహోన్నతమైన నైతికత కలిగినవారు 68:4

కవిగాని, జోతిష్యుడుగాని కారు 69:41,42

అల్లాహ్‌ను అమితంగా కీర్తించినవారు 43:1-8,20; 74:3

ఒక అంధవ్యక్తితో 80:1-12

సజ్దా చెయ్యి, సాన్నిధ్యాన్ని పొందు అని ఆయనకు అల్లాహ్ ఆజ్ఞ ఇవ్వటం 96: 19

ఆయన పరిశుద్ధమైన సహీఫాలను చదివి వినిపిస్తారు 98:2

ఆయన కుటుంబానికి సంబంధించిన వాక్యాలు 24:11-17; 33:28-34,50-53,55,59; 66:1,3-6; 108:3 (ప్రవక్తలు కూడా చూడండి).

## ముహాజిర్లు (వలసపోయినవారు):

4:100; 9:100,107,117; 22:58,59; 24:22; 33:6; 49:8,9

స్త్రీల వలస (హిజ్రత్) 60:10-12

## మూసా ప్రవక్త :

ఆయన ప్రజలు 2:51-61; 5:20-29; 7:138-141, 159-162; 14:5-8; 61:5

ఫిరౌను 2:49,50; 7:103-137; 10:75-92; 11:96-99; 17:101-103; 20:17-53,56-79; 23:45-49; 25:35,36; 26:10-69; 28:4-21, 31-42; 40:23-46; 43:46-56; 51:38-40; 73:16; 79:15-26

అల్లాహ్ నుంచి మార్గదర్శకత్వం 6:84

పర్వతం మరియు ప్రభువు తేజస్సు 7:142-145

ఆయన గైర్హాజరులో ప్రజలు ఆవుదూడను పూజించటం 7:148-156; 20:86-98

ఆయనకు ఇవ్వబడిన గ్రంథం విషయంలో ప్రజల విభేదాలు 11:110

ఆయనకు గ్రంథం ఇవ్వబడింది 17:2

అల్లాహ్ తరఫు నుంచి తొమ్మిది స్పష్టమైన నిదర్శనాలు ఇవ్వబడ్డాయి 7:133; 17:101

రెండు నదుల సంగమం వైపు ఆయన పయనం 18:60-82

అల్లాహ్ ఆయన్ను పిలిచి ప్రవక్తను చేయటం 19:51-53; 20:9-56; 28:29-35

ఆయన బాల్యం, తల్లి, అక్క 20:38-40; 28:7-13

మాంత్రికుల ఇస్లాం స్వీకరణ 20:70-73; 26:46-52

మద్‌యన్ పట్టణంలో 20:40; 28:22-28
గీటురాయి (ఫుర్‌కాన్) ఇవ్వబడింది 21:48
అగ్ని కనిపించటం 27:7-12; 28:2-35
నగరంలో ఆయన మీద ఆపద 28:15-21
స్పష్టమైన సూచనతో రావటం 29:39
సన్మార్గంపై నడిపించబడ్డారు 37:114-122
మూసా గ్రంథం 53:36; 87:19

**మేరాజ్ (గగన యాత్ర):** 17:1; 53:12

## య

**యగూస్ (నూహ్ ప్రవక్త కాలంలో ప్రజలు పూజించిన ఒక పుణ్యాత్ముని విగ్రహం):** 71:23

**యవూఖ్ (నూహ్ ప్రవక్త కాలంలో ప్రజలు పూజించిన ఒక పుణ్యాత్ముని విగ్రహం):** 71:23

**యస్‌రిబ్ (మదీనా) ప్రజలు :** 33:13

**యహ్‌యా (యోహాను) ప్రవక్త :**
యహ్‌యా గురించి శుభవార్త :3:39; 21:90
యహ్‌యా సత్యవంతులు : 6:85
తెలివైనవారు, సానుభూతి కలవారు, బాధ్యత గలవారు :19:12-15

**యాఖూబ్ (యాకోబు) ప్రవక్త :**2:132,133; 4:163; 6:84; 12:18; 19:49; 21:72; 29:27
ఆయనకు పన్నెండు మంది కుమారులు (అస్‌బాత్) 2:140; 3:84; 4:163

**యుద్ధఖైదీలు :** 8:67-71 (చూడండి బానిసలు)

**యుద్ధసంపద :** 8:41,69; 48:15,19,20; 4:94;
ఫై (యుద్ధం జరగకుండానే లభించిన యుద్ధ సొత్తు) 59: 6-8
యుద్ధసొమ్మును అక్రమంగా తీసుకోవటం పాపం 3:162
యుద్ధసొత్తు పంపిణీ : 8 : 41

**యుద్ధంలో పట్టుబడినవారు :**
4:25; 8:67,70,71; 9:60; 33:26,27; 76:8

**యూదులు :**
మరియు క్రైస్తవులు :2:140; 4:153-161,171; 5:18
అసత్యం వింటారు : 5:41,42
తమ బొంకుడు తమ పాలిట శాపం అయింది 5:64
విశ్వాసుల (ముస్లింల) పట్ల శత్రుత్వం కలిగి వుంటారు :5:82
ఇస్లాంను అవలంబించినవారు :26:197; 28:53; 29:47

**యూనుస్ (యోనా) ప్రవక్త :**
4:163; 6:86; 10:98; 21:87; 37:139-148;
జున్నూన్ (చేపవారు): 21:87; 68:48-50

**యూసుఫ్ (యోసేపు) ప్రవక్త :** 6:84; 12:4-101

## ర

**రక్తశుల్కం (దియత్, ప్రాణానికి బదులుగా చెల్లించవలసిన నష్టపరిహారం) :** 2:178,179; 4:92; 17:33

**రబ్బీలు, సన్యాసులు :** 9:31,34

**రమజాన్ మాసం:** 2:185

**రమీ (హజ్ యాత్రలో షైతానుపై కంకర్రాళ్లు రువ్వటం):** 2:200

**రస్స్ వాసులు :** 25:38; 50:12

**రహ్‌బానియత్ (సన్యాసత్వం):**
రహ్‌బానియత్‌ను అల్లాహ్ విధించలేదు 57:27

**రహదారులు :** 43:10

**రహస్య సమాలోచనలు (నజ్‌వా):**
మాటలు 4:114; (11:18 పాదసూచిక కూడా చూడండి)
ముగ్గురు వ్యక్తులు కలిసి బృందంగా ఏర్పడి సమాలోచనలు జరపటం 58:7
ఏకాంత సంప్రదింపులు 58:12,13

**రాత్రి:**
ఒక సూచన 79:29; 92:1; 93:2;
విశ్రాంతి కొరకు సృష్టించబడింది 10:67
ఒక తెర లాంటిది 13:3; 78:10
మనిషి సేవకోసం సృష్టించబడింది 14:32
ఘనమైన (ఖద్ర్) రాత్రి 44:3,4; 97:1-5

**రికార్డు, చిట్టా:**
వ్రాతపూర్వకమైన చిట్టా 83:7-9,18-21
ప్రతి జాతిని తన కర్మల చిట్టా వైపు పిలవటం జరుగుతుంది 45:28,29
ప్రతి మనిషికి సంబంధించిన కర్మలు నమోదు చేయబడిన పత్రాలు 81:10
చిట్టాయే నిజం చెబుతుంది 23:63
కుడిచేతిలో 69:19; 84:7-9
ఎడమ చేతిలో 69:25
వీపు వెనుక 84:10-15
కర్మలు నమోదుచేసే దూతలు 50:17,18,23; 85:11

**రిబా :** (చూడండి వడ్డీ)

**రుజుమార్గం :**
ప్రభూ! మాకు రుజుమార్గం చూపించు అని వేడుకోలు 1:6;
రుజుమార్గ మూలసూత్రాలు 6:151-153

**రుణం :**
అల్లాహ్‌కు మంచి రుణం ఇవ్వటం 2:245; 73:20
ఎన్నోరెట్లు వృద్ధిచెందటం 57:11,18
రెట్టింపు అవుతుంది 64:17

**రుణ వ్యవహారాలు :** 2:280,282; 4:11,12

**రూహ్** (జిబ్రయీల్ దూత) **:**
26:193; 67:12; 70:4; 78:38; 97:4
రూహుల్ ఖుదుస్ 2:87,253; 5:110; 16:102

**రూహ్ (ఆత్మ) :** 15:29; 17:85; 58:22

**రేగి చెట్లు (సిద్రహ్):**
సబా జాతి మీద దైవశిక్ష అవతరించిన తర్వాత వారి పూర్వపు రెండుతోటల స్థానంలో చేదుపండ్ల చెట్లు, ఝూవుక వృక్షాలు, రేగుచెట్లు మొలిచాయి 34:16;
సప్తాకాశాలపైన గల రేగు చెట్టు 'సిద్రతుల్ ముంతహా' 53:14-16;
స్వర్గంలో ముళ్లులేని రేగిచెట్లు 56:28

**రోజులు :**
ఈ పదం ఖుర్‌ఆన్‌లో 500 కంటే ఎక్కువ సార్లు ప్రస్తావనకు వచ్చింది.

**రోమనులు :** 30:2-5

## ల

**లంచం :** 2:188

**లవాతత్ (స్వలింగ సంపర్కం) :**
పురుషుడు పురుషునితో, స్త్రీ మరో స్త్రీతో సంపర్కించుకోవటం మహాపాపం 7:80-82; 11:77-83; 15:61-77; 29:28, 29

**లాత్ (అరబ్బులు పూజించిన ఒక దేవతా విగ్రహం):** 53:19

**లుఖ్మాన్ (ఒక మహావివేకి):** 31:12-14

**లూత్ (లోతు) ప్రవక్త :**
6:86; 7:80; 11:70,77,81,89; 15:59,61; 21:71,74; 22:43; 26:160,161,167; 27:54-56; 29:26,28,32,33; 37:133; 38:13; 50:13; 54:33,34; 66:10
అవిధేయురాలైన ఆయన భార్య : 11:81; 15:60; 66:10

**లోహము (హదీద్) :** 57

## వ

**వడ్డీ (రిబా):**
2:275,276,278-280; 3:130; 4:161; 30:39

**వద్ద్ (నూహ్ ప్రవక్త కాలంలో ప్రజలు పూజించిన ఒక పుణ్యాత్ముని విగ్రహం):** 71:23

**వర్షం :**

అల్లాహ్ కానుక 56:68-70

లూత్ జాతీయులపై రాళ్ల వర్షం 27:58

**వహీ (దైవవాణి):**

6:93; 10:2,109; 12:102; 17:86; 40:15; 42:3,7,51,52; 53:4,10

అల్లాహ్ అవతరింపజేసే వహీ విషయంలో నీకు సందేహ ముంటే... 2:23,24

అల్లాహ్ వహీని రద్దుచేసినా లేక మరిపింపజేసినా.....2:106

సరైన మార్గదర్శకత్వం 3:73

వహీ ప్రభువు వద్ద నుంచి వస్తుంది కనుక సందేహించేవారిలో చేరకండి 6:114

అర్థం చేసుకునేవారికే ఇది 6:98

మార్గదర్శకం, కారుణ్యం 7:203; 16:64; 31:3

వహీ అవతరణ రూహుల్ ఖుదుస్ ద్వారా జరిగింది 16:102; 26:192,193

విశదీకరించబడింది 6:98; 41:2-4

గ్రంథ అవతరణ అల్లాహ్ తరఫు నుంచే జరిగింది 46:2

**వ్యక్తి :**

ఏ వ్యక్తిపైనా అల్లాహ్ అతని శక్తికి మించి భారం మోపడు 2:286; 7:42;

శక్తికి మించిన కష్టానికి గురిచెయ్యడు 23:62

రేపు ఏం సంపాదిస్తాడో, ఏ స్థలంలో మరలించబడనున్నాడో వ్యక్తికి తెలియదు 31:34

తను చేసిన మంచీచెడులు తనకు ఎదురవుతాయి 3:30

ప్రతివాడు ఆత్మరక్షణ కోసం వాదిస్తూ వస్తాడు 16:111

ప్రతి ఒక్కడు తను చేసుకున్న దానికి తాకట్టుగా ఉన్నాడు 74:38

ప్రబోధించే అంతరాత్మ సాక్షి 75:2

**వాణిజ్యం, సొమ్ము :** 4:29

**వాదన :**

అపరాధుల తరఫున వాదించరాదు. 4:107

మీరు ఈ అపరాధుల తరఫున ఇహలోక జీవితంలోనయితే వాదించారు. కాని ప్రళయం రోజున వారి తరఫున అల్లాహ్‌తో ఎవరు వాదిస్తారు? 4:109

**వాదించిన మహిళ :**58:1,2

**వార్తలను ధృవీకరించుకోవాలి :** 4:83

**వ్రాత పూర్వక వ్యవహారాలు :** 2:282

**విజయం :**

అల్లాహ్ తరఫు నుంచి వస్తుంది 48:1

అల్లాహ్ సహాయం ద్వారా లభిస్తుంది 61:13

**విడాకులు(తలాక్‌కు సంబంధించిన ఆయతులు):**

2:228-232,236,237,241; 65:1-7; 4:35 (జిహార్ కూడా చూడండి)

**విత్తనాన్ని మొలకెత్తింపజేసేవాడు:** 56:63-67; 6:95;

**విధవలు (భర్త చనిపోయిన స్త్రీలు):** 2:234,235, 240;

**విధివ్రాత (ఖదర్) :** 5:5; 64:11

**విధులను తప్పకుండా నెరవేర్చాలి:** 5:1

**విధేయత :**

3:132; 4:59,64,66,80,81; 5:95; 18:46; 24:51, 52,54; 47:33; 64:12

**వివాహం :** 2:232,234

అవిశ్వాసుల్ని, బానిసల్ని వివాహమాడటం 2:221

ఎంతమంది స్త్రీలను పెళ్ళిచేసుకోవచ్చు? 4:3

విడాకులైనప్పుడు స్త్రీ దగ్గరి నుంచి మహర్ సొమ్మును తిరిగి తీసుకోరాదు 4:20,21

వీరిని వివాహం చేసుకోరాదు 4:22-24

వివాహం చేసుకునే స్తోమత లేకపోతే 4:25

భార్యాభర్తల మధ్య సంబంధాలు సరిగా లేకపోతే ఇద్దరు మధ్య వర్తుల్ని నియమించాలి 4:35

భర్త నిరాదరణ భయం ఉన్నప్పుడు సర్దుబాటు చేసుకోవటం 4:128

ఒక భార్య వైపునకు పూర్తిగా మొగ్గి, మరొకామెను డోలాయ మాన స్థితిలో ఉంచటం 4:129

వ్యభిచారుల వివాహం 24:3

పేదవారి వివాహం జరిపించాలి 24:32

పెండ్లిచేసుకునే స్తోమత లేనివారి సంగతి 24:33

ప్రవక్తకు ధర్మసమ్మతం చేయబడిన స్త్రీలు 33:50-52

వివాహం జరిగి శోభనానికి ముందే విడాకులు అయిపోతే 'ఇద్దత్' లేదు 33:49

**విశాలమైన రహదారులు :**21:31

**విశ్వాసం :**

2:108; 3:167,177,193; 5:5; 9:23; 16:106; 30:56; 40:10; 42:52; 49:7,11,14; 52:21; 58:22; 59:9,10

విశ్వాసాన్ని తిరస్కరించినవారు 3:116

విశ్వాసంలో వృద్ధి 3:173

విశ్వాసంలో నిలకడతనం 44:7; 45:4,20; 51:20

విశ్వాసాన్ని అవలంబించే సద్బుద్ధిని ప్రసాదించబడటం 49:17

**విశ్వాసులు (మోమినూన్) :**

ఈ పదం ఖుర్ఆన్‌లో 200 కంటే ఎక్కువ సార్లు ప్రస్తావనకు వచ్చింది.

**వీలునామా :** 2:180,240; 4:7,12; 36:50;

**వుజూ (పరిశుభ్రత కోసం నిర్ణీత పద్ధతిలో ముఖం, కాళ్లు చేతులు కడుక్కోవటం) :**4:43; 5:6;

**వృక్షాలు :** 22:18

**వేచి చూడండి:**

మేమూ వేచి చూస్తాం: 7:71; 9:52; 10:102; 11:122; 20:135; 44:59; 52:31

## శ

**శంఖం పూరింపు, ప్రళయం నాడు:**

6:73; 18:99; 20:102; 23:101; 27:87; 36:51; 39:68; 50:20; 69:13; 74:8; 78:18; 79:7

సాఖ్ఖహ్ (చెవులను చెవిటిగా చేసే భయంకరమైన ధ్వని) 80:33

**శాంతి నగరం (మక్కా):** 95:3

**శాంతి వైపునకు మొగ్గండి:** 8:61

**శాశ్వత జీవితాన్నిచ్చే వృక్షం:** 20:120

**శిక్ష :**

శిక్షను వాయిదా వేయటం 3:178

చేతులు లేక కాళ్లు నరకటం 5:33

దౌర్జన్యం మేరకే ప్రతీకారం 16:126

ఇహపరలోకాల శిక్ష 24:19; 68:33

**శిక్ష, యాతన :**

3:188; 6:15,16; 10:50-53; 11:10; 13:34; 16:88; 46:20; 70:1,2

**శుక్రవారం ఆరాధన :** 62:9-11

## ష

**షుఐబ్ ప్రవక్త:**

7:85-93; 11:85-95; 29:36,37

## స

**సంఘటన (గొప్ప సంఘటన, ప్రళయం):** 56:1; 69:15

**సంతానం :** 4:9; 42:49,50

ఇష్టమైన వారికి ఇష్టమైన వారిని అనుగ్రహిస్తాడు అల్లాహ్ 42:49

**సంధి :**

ఎవరైనా క్షమించి, సంధికి ప్రయత్నిస్తే .....42:40

భార్యాభర్తల మధ్య సంధికుదర్చటం 4:35

విశ్వాసుల మధ్య రాజీకుదర్చటం 49:9,10

**సంపద :**

సంపదను కూడబెట్టినవాడు 104:2-4

అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టటం (చూడండి ఖర్చు)

**సంపద, సంతానం:**

ఇహలోకపు అలంకారం మాత్రమే 18:46

**సకీనహ్ (అల్లాహ్ తరపు నుండి ప్రశాంతత) :**

2:248; 9:26,40; 48:4,18,26

**సజ్జనులు :**

సజ్జనుల సాంగత్యం 4:69

సజ్జనులే భూమికి వారసులవ్వాలి 21:105

సజ్జనులు స్వర్గంలో ఉంటారు 51:15-19; 76:5-12

**సత్యవాగ్దానం :** 46:16,17

**సత్కార్యాలు :**

బహిరంగంగానూ, చాటుగానూ మేలు చేస్తూ పోవాలి : 4:149

పోటీపడి మరీ సత్కార్యాలు చేయండి :5:48

**సత్యం :**

5:48; 23:70,71,90; 25:33; 69:51; 56:95;

సత్యాన్ని అసత్యంతో కలగాపులగం చేయకండి, సత్యాన్ని దాచకండి 2:42

సత్యం వచ్చింది, అసత్యం తుడిచిపెట్టుకుపోయింది 17:81

సత్యవాగ్దానం 46:16,17

**సదఖా (దానధర్మాలు):**

2:196,263,264,270,271,273; 4:114; 9:60,75, 76,79,103,104; 57:18; 58:12,13

ఇతరులకు చూపించి చేసే దానధర్మాలకంటే ఎవరికీ తెలియకుండా చేసే దానధర్మాలే ఉత్తమం 2:271

**సదాచరణ :**

2:177,207,208,212; 3:16,17,92,133-135, 191-195; 4:36,125; 5:93; 7:42,43; 16:97

సదాచరణ మార్గం కఠినమైనది 90:11-18

**సబ్బత్ నియమం (యూదులకు శనివారం వేట నిషిద్ధం అనే నియమం):**

సబ్బత్ నియమాన్ని ఉల్లంఘించినవారు 2:65; 4:154; 7:163-166

దానితో విభేదించినవారిపైనే అది విధించబడింది 16:124

**సబయె మసానీ (మాటిమాటికీ పఠించబడే ఏడు ఆయతులు, అంటే ఫాతిహా సూరా) :** 15:87

**సబా రాణి :** 27:2-44; 34:15-21

**సమతూకం :**

త్రాసుపళ్లాలు బరువుగా ఉన్నవారు సాఫల్యం పొందుతారు, తేలికగా ఉన్నవారు నష్టానికి గురవుతారు 7:8,9; 101:6-9

తూనికల్లో న్యాయం పాటించాలి 17:35;

ప్రళయం నాడు ఖచ్చితంగా తూచే తరాజు నెలకొల్పబడుతుంది 21:47;

అల్లాహ్ త్రాసును నెలకొల్పాడు కనుక మీరు సమతూకాన్ని భంగపరచకండి 55:7-9;

ప్రవక్తలతోపాటు అల్లాహ్ త్రాసుని కూడా అవతరింపజేశాడు 57:25;

**సముద్రాలు :** 42:32,33; 45:12

సాగర సంగమం 18:60; 25:53; 35:12; 55:19,20

సముద్రాలు చీల్చబడినప్పుడు 82:3

**సమూద్ (ఒక ప్రాచీన జాతి):**

7:73-79; 11:61-68; 17:59; 25:38; 26:141-159; 27:45-53; 29:38; 41:17;

51:43-45; 54:23-31; 69:4-8; 85:17-20; 89:9-14; 91:11-15

**సరైన మార్గదర్శకం అల్లాహ్ మార్గదర్శకమే** 3:73

**సల్‌సబీల్ (స్వర్గంలోని ఒక ఊట):** 76:18

**సలాము (శాంతిప్రార్థన) :**

మీకు ఎవరైనా సలాము చేస్తే మీరు వారికి అంతకంటే ఉత్తమ మైన పద్ధతిలో ప్రతి సలాము చేయండి 4:86;

స్వర్గంలో స్వర్గవాసులు శాంతికలుగుగాక అని ప్రార్థిస్తారు 10:10;

"మీకు శాంతి కలుగుగాక" అని స్వర్గవాసులకు స్వాగతం పలుకబడుతుంది 14:23;

అల్లాహ్‌ను కలిసే రోజున వారికి శాంతి వచనాలతో స్వాగతం లభిస్తుంది 33:44; 25:75;

ఇండ్లల్లోకి ప్రవేశించేటప్పుడు ఇంట్లోవారికి సలాం చేసి ప్రవేశించాలి 24:61

**స్వర్గం :**

జన్నతుల్ మా'వా (స్వర్గ నివాస స్థలం) 53:15

ఫిర్‌దౌసు స్వర్గం 18:107; 23:11

క్రింద సెలయేరులు ప్రవహించే ఉద్యాన వనాలు 3:15, 198; 4:5; 5:119; 7:43; 9:72; 18:31; 22:23; 39:20; 57:127; 64:9; 98:8

శాశ్వత ఉద్యానవనాలు (అద్న్‌స్వర్గం) 9:72; 13:23; 18:31; 19:61; 20:76;

ఎల్లకాలం ఉండే స్వర్గవనాలు (అద్న్ స్వర్గం) 16:31; 35:33; 98:8

భోగభాగ్యాల ఉద్యానవనాలు 37:43; 56:12,89

శాశ్వత భోగాల స్వర్గవనం 9:21

ఉద్యానవనాలూ, ద్రాక్షతోటలూ 78:32

రెండు తోటల పండ్లు ఫలాలు 55:54,62

పండ్లుఫలాలు, కోరినవి, కోరినన్ని: 36:57; 36:42; 43:73; 44:55; 47:15; 55:52,68; 56:20,29, 32; 77:42

స్వర్గంలో పండ్లు చేతికందినంత దగ్గర్లో ఉంటాయి. 55:54; 69:23;

పండ్లు, మాంసం 52:22;

పక్షిమాంసం 56:21

అరటిపండ్ల చెట్లు 56:28,29;

ప్రవహించే సెలయేరులు 88:12

సల్‌సబీల్ సెలయేరు 76:18

కర్పూర జలం 76:5

తస్‌నీమ్ (స్వర్గంలో ఒక ఎత్తయిన స్థానం నుంచి పుట్టే సెలయేరు) 83:27,28;

కౌసర్ సరస్సు 108:1;

మద్యం, పాలు, స్వచ్ఛమైన తేనెల సెలయేళ్లు 47:15

తెల్లగా కమ్మగా ఉండే, స్వచ్ఛమైన సీలు వేయబడిన మద్యం 37:45,46; 56:18; 76:21; 83:25

సొంటి కలగలసిన పానీయపాత్ర 76:17; 78:34

పానీయం, నీరు 76:5

బంగారు పళ్లాలు, కప్పులు 43:71

వెండిపాత్రలు, గాజుగ్లాసులు 76 :15,16

సన్నని, దళసరి ఆకుపచ్చ పట్టు వస్త్రాలు 18:31; 22:23; 35:33; 44:53; 76:12,21;

బంగారం, ముత్యాలతో చేసిన ముంజేతి కడియాలు 18:31; 22:23; 35:33; 76:21

పట్టువస్త్రపు అంచుగల తివాచీలు 55:54

ఆకుపచ్చని తివాచీలు, విలువైన పరుపులు

వరుసగా పేర్చబడి ఉంటాయి 55:76; 88:15

బంగారు జలతారుతో అల్లిన ఆసనాలు 56:15; 88:13

పరచబడిన విలువైన తివాచీలు 88 :16

ఒకదానిపై ఒకటి ఉండే విశాలమైన గదులతో కూడిన అంద మైన భవనాలు 9:72; 39:20

శాశ్వతంగా, కలకాలం ఉంటారు 3:198; 4:57; 5:119; 9:22,77; 11:108; 43:71; 57:12; 98:8

శాశ్వత నిలయం 3:15; 35:35
ఆసనాలపై ఎదురెదురుగా కూర్చొని ఉంటారు 15:47; 37:44; 44:53; 56:16
మృత్యువు ఎన్నడూ దరిచేరదు 44:56
అక్కణ్ణుంచి వెళ్ళిపొమ్మని చెప్పబడదు 15:48
వారి హృదయాల నుంచి ద్వేషాన్ని, కాపట్యాన్ని తీసివేయటం జరుగుతుంది 7:43; 15:47;
దుఃఖాలు దూరం చేయబడతాయి 35:34
శ్రమ, కష్టం అనేది ఉండదు 15:48; 35:35
బాధ, నొప్పి, మత్తు అనేవి ఏవీ ఉండవు 37:47; 56:19
వ్యర్థమాటలు, పాపపు పలుకులు ఉండవు 19:62; 56:25
కీడు కలిగించే మాటలుగానీ, అసత్యాలుగానీ ఉండవు 78:35; 88:11
పాపం అంటదు 37:47; 52:23;
ఎండవేడి బాధించదు, చలితీవ్రత బాధించదు 76:13
అందరికీ తెలిసిన ఆహారం 37:41;
శాంతి, భద్రతలు 15:46; 44:51,55; 50:34
శాంతి నిలయం 6:127
శుభాభినందనలు 7:46; 10:10; 13:24; 14:23; 16:32; 19:62; 36:58; 39:73; 56:26;
మంచి పనులు చేసినవారు ప్రవేశిస్తారు 4:124; 42:22; 44:51;
ప్రభువు విధులను నిర్వర్తించినవారు బృందంగా తీసుకురాబడతారు 39:73
సత్కార్యాల మూలంగా స్వర్గవారసత్వం 43:72
అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడౌతాడు, వారు అల్లాహ్ పట్ల ప్రసన్నులౌతారు 5:119
“నా స్వర్గం” 89:30
గొప్ప సాఫల్యం 9:72
గొప్ప విజయం 57:12; 64:9
మహా విజయం 9:72; 44:57
విశ్వాసుల ఆనందం కోసం ఉద్యానవనాలు 32:19
ఆ రోజు స్వర్గవాసులు ఆనందదాయక విషయాల్లో ఓలలాడుతుంటారు 36:35
ఉద్యానవనాలు, సెలయేరుల మధ్య ఉంటారు 15:45; 19:63; 44:52; 52:17; 54:54; 55:46
అల్లాహ్ సింహాసనం చుట్టూ దూతలు ఉంటారు 39:75
మహత్తర చక్రవర్తి సమీపంలో ఉంటారు 54:55
స్వర్గంలో కోరినదల్లా లభిస్తుంది 50:35
హూర్‌లు, విశాలమైన కళ్ళతో భద్రపరచబడిన గుడ్లలాంటి సుకన్యలు 37:48,49; 44:54; 52:20; 55:58,70; 56:22,23
పవిత్రమైన భార్యలు 3:15
స్వర్గవాసులు చల్లని నీడలలో, మెత్తని పీఠాలపై భార్యలతో పాటు ఉంటారు 36:55
సమవయస్సుగల సుకన్యలు 78:33
సేవ కోసం చెదిరిన ముత్యాల్లాంటి నిత్య బాలురు 52:24; 56:17; 76:19

**సహనం :** 3:186,200; 10:109; 11:115; 16:126,127; 20:130; 40:55,77; 42:43; 46:35; 70:5; 73:10
సహనం మరియు నమాజ్ ద్వారా సహాయం కోరాలి 2:45, 153; 20:132; 50:39

**సహన మూర్తులు :**
పూర్తి ప్రతిఫలం పొందుతారు 39:10
అల్లాహ్ వారికి తోడుగా ఉంటాడు 8:46;
సహనం వహించండి 11:115
విధుల నిర్వహణలోనూ సహనభావం ఉండాలి 16:90
కోపం వచ్చినప్పుడు సహనం పాటించాలి 41:34; 3:134

**స్నానం (గుస్ల్) :** 4:43; 5:6

**సాబియీలు (మతాన్ని అనుసరించనివారు) :** 5:69; 22:17

**సామిరీ (మూసా ప్రవక్త జాతివారిని ఆవుదూడ పూజకు గురిచేసినవాడు):** 20:85,95-97

**సాలిహ్ ప్రవక్త:**
7:73-79; 11:61-68; 26:141-159; 27:45-53; 91:13

**సాక్ష్యం చెప్పే, చెప్పబడేరోజు :** 85:3

**సాక్ష్యాలు, వాగ్దానాలు :**
ప్రవక్తల నుంచి వాగ్దానాలు 3:81
మానవజాతికి సాక్షులుగా ప్రవక్తలు 2:143; 22:78
పరస్పర వ్యవహారాలకు సాక్షుల్ని నియమించుకోవాలి 2:282
ఇద్దరు స్త్రీల సాక్ష్యం ఒక పురుషుని సాక్ష్యానికి సమానం 2:282
అక్రమ సంబంధాల నిరూపణకై సాక్ష్యాధారాలు 4:16; 24:2
న్యాయానికి సాక్షులుగా ఉండండి 5:8
పరలోకంలో కాళ్లూచేతులు సాక్ష్యం పలుకుతాయి 36:65
మనిషి స్వయానికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పటం 75:14

**సింహం:** 74:51

**సింహాసనం :** 7:54,58; 9:129; 10:3; 13:2; 20:5; 23:86,116; 32:4; 40:15; 57:4; 85:15
నీటిపైన దేవుని సింహాసనం 11:7
ఎనిమిది మంది దూతలు మోస్తూ ఉంటారు 39:75; 40:7; 69:17

**సిజ్జీన్(భూమండలంలో అత్యంత అథమ స్థానం):**
కర్మలు ఉండే స్థానం 83:7-9

**సిద్రతుల్ మున్తహా :**
సప్తాకాశాలపైన రేగుచెట్టు 53:14

**సిఫారసు, సిఫారసు చేసేవాడు :**
6:51,70,93,94; 10:3; 19:87; 20:106,109; 30:13; 34:23; 39:44; 40:18; 43:86; 53:26; 74:48

**సినాయ్ పర్వతం :** 19:52; 23:20; 95:2

**సిరాత్ (నరకంపై ఉండే ఒక వంతెన):** 19:71

**సృష్టి :**
ప్రారంభం, సృష్టి పునర్నిర్మాణం :10:4; 21:104; 27:64; 29:19,20
సరికొత్తగా సృష్టించటం: 17:49,98; 35:16
సత్యం పునాదిగా సృష్టించటం : 15:85; 16:3; 29:44; 39:5; 44:39; 45:22; 46:3
విశ్వాన్ని కాలక్షేపం కోసం సృష్టించలేదు: 21:16,17; 24:115
ప్రతి జీవం సృష్టించబడినది ఈ పదార్థం నుంచే: 21:30; 24:45; 25:54
మానవ సృష్టి :4:1; 6:2; 15:26,28,33; 16:4; 21:30; 22:5; 23:12-14; 25:54; 32:7-9; 35:11; 36:77,78; 37:11; 39:6; 40:67; 49:13; 55:14; 56:57-59; 75:37-40; 76:1,2; 77:20-23; 80:18,19; 86:5-8; 96:2
తొలిదశ సృష్టి : 56:62
సృష్టి మొత్తం ఆరు రోజుల్లో : 7:54; 11:7; 32:4; 50:38; 57:4
ప్రతి వస్తువు జతలుగా సృష్టించబడింది: 13:3; 30:8; 36:36; 42:11; 43:12; 51:9,49; 53:45
సృష్టి ప్రక్రియలో వైవిధ్యం : 35:27,28
'అయిపో' అన్న దేవుని మాట చాలు ఒక వస్తువు అయిపోవటానికి 2:117; 16:40; 36:82; 40:68
రెప్పపాటులోనే :54:50
రేయింబవళ్లు, సూర్యచంద్రులు :39:5
భూమ్యాకాశాల సృష్టి మానవ సృష్టికన్నా క్లిష్టతరమైనది: 40:57; 79:27

సృష్టి ఉద్దేశం :51:56

**స్వర్గ కన్యలు (హూర్) :** 44:54; 52:20

**స్త్రీలు:** 2:222,223; 4:15,19-22,34,127

స్త్రీలపై నిందలుమోపిన వారికి ...శిక్ష 24:4,5,11-17, 23-26

స్త్రీలు పరదా పాటించాలి 24:31; 33:59

విశ్వసించి వలసవచ్చే స్త్రీలు 60:10-12

వాదప్రతివాదాలలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెలిబుచ్చ లేని వారు 43:17,18

**సులైమాన్ (సొలోమోను) ప్రవక్త :** 2:102; 4:163; 6:84; 21:78-82; 27:15-44; 34:12-14; 38:30-40

చీమల మాటలు అర్థం చేసుకోగలిగేవారు 27:18,19

హుద్‌హుద్ పక్షి 27:22-26

సబారాణిని ఏకదైవారాధన వైపుకు ఆహ్వానించారు 27:22-44; 34:15

**సువా (నూహ్ ప్రవక్త కాలంలో ప్రజలు పూజించిన ఒక విగ్రహం పేరు):** 71:23

**సూరహ్ (ఖుర్ఆన్‌లోని ఒక అధ్యాయం) :** 10:38; 11:13; 47:20;

సూరా అవతరణ విశ్వాసాన్ని పెంపొందింపజేస్తుంది: 9:124-127

**సూర్యుడు :**
7:54; 10:5; 14:32; 16:12; 22:18; 25:61; 36:38,40; 71:16; 81:1; 91:1

**సైతాన్ (సాతాన్):**
2:36,168,208,268,275; 3:36,155,175; 4:38, 60,76,83,119,120; 5:80,91; 6:43,68,142; 7:20,22,27,175,200,201; 8:48; 16:63,98; 20:120; 24:21; 25:29; 27:24; 41:36; 58:10,19; 82:25

విరోధ విద్వేషాలను సృష్టిస్తాడు 5:91

చెడు ఆలోచనలు కలిగిస్తాడు 7:200,201

మోసగిస్తాడు 8:48

ద్రోహం చేస్తాడు 14:22

విశ్వాసుల మీద అతనికి ఎలాంటి అధికారం లేదు 16:99, 100

చెడును కల్పిస్తాడు 22:52,53

ఒక శత్రువు 12:5; 35:6; 36:60

(ఇబ్లీస్ కూడా చూడండి)

**సైలల్ అరిమ్ (మారిబ్ ఆయకట్టును త్రెంచిన వరదనీరు):** 34 : 16

**సౌర్ గుహ :**9:40,

# హ

**హజ్ యాత్ర :**

2:158,196-203; 3:97; 5:2; 22:30

**హజ్ విధులు (మనాసిక్ హజ్):** 2:128,200; 22:30

**హత్య-పరిహారం :** 2:178,179

**హదీ (ఖుర్బానీ ఇవ్వబడే పశువు):** 2:196,200

**హద్దులు:**

అల్లాహ్ నిర్ణయించినవి 2:173,187,190,230; 9:112; 58:4; 65:1; 78:22

ఇవి అల్లాహ్ హద్దులు 2:187,229,230; 4:13; 58:4; 65:1

అల్లాహ్ హద్దులను అతిక్రమించకండి 2:190,229

ఎవరైనా ఉల్లంఘిస్తే 2:229; 4:14; 78:22

అత్యవసర పరిస్థితిలో గత్యంతరం లేని కారణంగా హద్దులను అతిక్రమిస్తే 2:173; 6:145

మీ ధర్మం విషయంలో, హద్దులను అతిక్రమించకండి 4:171; 5:77

హద్దులను అతిక్రమించిన కారణంగా కోతులుగా మారి పోయారు 7:166

హద్దులను కాపాడేవారూ....9:112

**హామాన్ (ఫిరౌను అనుంగు అనుచరుడు):** 28:6, 38; 29:39; 40:24,36,37

**హారూత్ (మారూత్, ఇద్దరు దైవదూతలు) :** 2 :102

**హారూన్ (అహ్రోను) ప్రవక్త** :
2 : 248; 4:163; 6:84; 7:122,142; 10:75; 19:28,53; 20:30,70,90,92; 21:48; 23:45; 25:35; 26:13,48; 28:34; 37:114,120.

**హిజ్ర్ (రాతిప్రదేశ) ప్రజలు:** 15:80-85

**హునైన్ యుద్ధం :** 9:25

**హూద్ ప్రవక్త:**
7:65-72; 11:50-60; 26:123-140; 46:21-26

**హృదయాలు :**
అవిశ్వాసుల హృదయాలు కఠినమైపోయాయి 2:74; 22:53; 39:22; 57:16

మూతపడ్డాయి: 7:100,101; 40:35; 47:16; 63:3

మూసుకున్నాయి : 17:46; 41:5

తాళాలు పడిపోయాయి : 47:24

ముక్కలయ్యాయి : 59:14

భయభ్రాంతులకు గురయ్యాయి :22:35

రోగగ్రస్తమయ్యాయి: 2:10; 5:52; 8:49; 9:125; 22:53; 24:50; 33:12,32,60; 47:20,29; 74:31

## ఖుర్‌ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన ప్రవక్తల పేర్లు కొన్ని

దివ్య ఖుర్‌ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన కొందరు ప్రవక్తల పేర్లు ఇవి. వాటన్నిటిని ఒకే చోట ప్రస్తావిస్తే పాఠకులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని భావించి ఈ జాబితాను రూపొందించాం. అంతేకాదు, ప్రక్కన వాటి ఆంగ్ల ఉచ్చారణతో పాటు తెలుగు బైబిలు ఉచ్చారణ కూడా ఇవ్వటం జరిగింది. గమనించండి.

***"అలైహిస్సలామ్"*** *అంటే ఆయనపై అల్లాహ్ శాంతి కలుగుగాక అని అర్థం.*

| వ.సం | అరబీ | ఇంగ్లీషు | | తెలుగు బైబిలు |
|---|---|---|---|---|
| 1 | అల్- యసా (అలైహిస్సలామ్) | ఏలిషా | Elisha | ఎలీషా |
| 2 | అయ్యూబ్ (అలైహిస్సలామ్) | జాబ్ | Job | యోబు |
| 3 | దావూద్ (అలైహిస్సలామ్) | డేవిడ్ | David | దావీదు |
| 4 | హారూన్ (అలైహిస్సలామ్) | ఆరాన్ | Aaron | అహ్రోను |
| 5 | ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) | అబ్రహాం | Abraham | అబ్రాహాము |
| 6 | ఇద్రీస్ (అలైహిస్సలామ్) | ఎనోక్ | Enoch | హనోకు |
| 7 | ఇల్‌యాస్ (అలైహిస్సలామ్) | ఎలియాస్ | Elias | ఏలియా |
| 8 | ఈసా (అలైహిస్సలామ్) | జీసస్ | Jesus | యేసు |
| 9 | ఇస్‌హాఖ్ (అలైహిస్సలామ్) | ఇసాక్ | Isaac | ఇస్సాకు |
| 10 | ఇస్మాయీల్ (అలైహిస్సలామ్) | ఇష్మాయేల్ | Ishmael | ఇష్మాయేలు |
| 11 | లూత్ (అలైహిస్సలామ్) | లాట్ | Lot | లోతు |
| 12 | మూసా (అలైహిస్సలామ్) | మోసెస్ | Moses | మోషే |
| 13 | నూహ్ (అలైహిస్సలామ్) | నోఆహ్ | Noah | నోవహు |
| 14 | సులైమాన్ (అలైహిస్సలామ్) | సొలమన్ | Solomon | సొలోమోను |
| 15 | ఉజైర్ (అలైహిస్సలామ్) | ఎజ్రా | Ezra | ఎజ్రా |
| 16 | యాఖూబ్ (అలైహిస్సలామ్) | జాకొబ్ | Jacob | యాకోబు |
| 17 | యహ్యా (అలైహిస్సలామ్) | జాన్ | John | యోహాను |
| 18 | యూనుస్ (అలైహిస్సలామ్) | జొనాహ్ | Jonah | యోనా |
| 19 | యూసుఫ్ (అలైహిస్సలామ్) | జోసెఫ్ | Joseph | యోసేపు |
| 20 | జకరియా (అలైహిస్సలామ్) | జకరియా | Zachariya | జెకరియా |

*("The Noble Quran" గ్రంథం ఆధారంగా)*

# ఖుర్‌ఆన్ పారాయణ క్రమంలో సజ్దా చేయవలసిన సందర్భాలు

దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు ఈ క్రింది సందర్భాల్లో సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేయటం సంప్రదాయం.

| క్ర.సం. | సూరా పేరు | సూరా నెం. | ఆయతు నెం. |
|---|---|---|---|
| 1 | అల్ ఆరాఫ్ | 7 | 206 |
| 2 | అర్ రాద్ | 13 | 15 |
| 3 | అన్ నహ్ల్ | 16 | 50 |
| 4 | బనీ ఇస్రాయీల్ | 17 | 100 |
| 5 | మర్‌యమ్ | 19 | 58 |
| 6 | అల్ హజ్ | 22 | 18 |
| 7★ | అల్ హజ్ | 22 | 77★ |
| 8 | అల్ ఫుర్‌ఖాన్ | 25 | 60 |
| 9 | అన్ నమ్ల్ | 27 | 26 |
| 10 | అస్ సజ్దా | 32 | 15 |
| 11 | సాద్ | 38 | 24 |
| 12 | హా మీమ్ సజ్దా | 41 | 38 |
| 13 | అన్ నజ్మ్ | 53 | 62 |
| 14 | అల్ ఇన్‌షిఖాఖ్ | 84 | 21 |
| 15 | అల్ అలఖ్ | 96 | 19 |

★ దివ్య ఖుర్‌ఆన్‌లో మొత్తం పద్నాలుగు సందర్భాల్లో సజ్దా (అనగా సజ్దయె తిలావత్) చేయాలన్న విషయమై ముస్లిం పండితులు, ధర్మవేత్తలందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది. ఇమామ్ షాఫయీ గారు అదనంగా ఈ సందర్భంలో కూడా సజ్దా చేయాలని అభిప్రాయపడ్డారు.

సజ్దయె తిలావత్‌లో ఈ క్రింది దుఆ పఠించాలి:

**"సజద వజ్‌హియ లిల్లజీ ఖలఖహూ వ సవ్వరహూ, వ షఖ్ఖ సమ్‌అహూ, వ బసరహూ తబారకల్లాహు అహ్‌సనుల్ ఖాలిఖీన్."**

నా ముఖం తనను సృష్టించిన, తనను తీర్చిదిద్దిన, తన చెవులనూ, కళ్లనూ తెరిచినవాని ముందు మోకరిల్లింది. అత్యుత్తమ సృష్టికర్త అయిన అల్లాహ్ శుభకరుడు. *(సహీహ్ ముస్లిం; 4:201)*

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

1వ సూరా

# అల్ ఫాతిహా

## ప్రారంభం

అవతరణ
మక్కాలో

ఆయతులు
7

### పరిచయం

*ఈ సూరాలో తౌహీద్ (అంటే ఏకదైవారాధన) ప్రధానంగా కనబడుతుంది. దేవుని పట్ల విశ్వాసం, దైవారాధన, దేవుణ్ణి సహాయం కోసం వేడుకోవడం, దేవుణ్ణి ప్రార్థించడం గురించి ఇందులో ముఖ్యంగా నొక్కి చెప్పడం జరిగింది. ఈ సూరాలో ఏడు ఆయతులున్నాయి. అల్లాహ్ మాత్రమే ఆరాధనలకు, స్తోత్రాలకు, అభ్యర్థనలకు యోగ్యుడనీ, అల్లాహ్ మాత్రమే పరిపూర్ణుడనీ, ఇహలోకానికి, పరలోకానికి అల్లాహ్ మాత్రమే ప్రభువనీ, ఆయనే సృష్టికర్త అనీ ఈ ఏడు ఆయతులలో నిర్దిష్టంగా చెప్పడం జరిగింది.*

*ఈ సూరాకు 'అల్ ఫాతిహా' (ప్రారంభం) అని పేరు పెట్టడం జరిగింది. ఎందుకంటే, ఇది దివ్య ఖుర్ఆన్‌కు ప్రారంభ అధ్యాయం. ఈ సూరా దివ్య ఖుర్ఆన్‌కు తల్లివంటిదనీ, దివ్యఖుర్ఆన్ సారం ఇందులో ఉందని కూడా చెప్పడం జరిగింది. ముస్లిములు చేసే నమాజుల్లో తప్పనిసరిగా చదువవలసిన సూరా ఇది. రోజూ చేసే అయిదు పూటల నమాజు కాని, లేక స్వచ్ఛందంగా చేసే ఐచ్ఛికమైన నమాజుల్లో కాని ప్రతి నమాజులో ఈ సూరాను పఠించటం తప్పనిసరి. ప్రారంభ సూరా చదువకపోతే ముస్లిములు చేసే ఏ నమాజూ స్వీకరించబడదని ముస్లిం ధర్మవేత్తలు ఖచ్చితంగా చెప్పారు.*

*ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం, ఈ ప్రారంభ సూరా (అల్ ఫాతిహా), పూర్తి ఖుర్ఆన్‌కు సారాంశం వంటిది. ఎందుకంటే ఇస్లాంకు సంబంధించిన ప్రధానమైన భావనలను, నియమాలను అన్నింటినీ ఈ సూరా క్లుప్తంగా తెలియజేస్తుంది. మౌలికమైన ఇస్లామీయ భావనలు, ప్రధానమైన ఇస్లామీయ విశ్వాసాలు, అంటే, దేవుని ఏకత్వం (దేవుడు ఒక్కడే అని విశ్వసించడం, దేవునికి భాగస్వాములు ఎవరూ లేరని విశ్వసించడం, దేవునికి సాటి ఎవరూ లేరని విశ్వసించడం), దేవుని గుణగణాలను గురించి ఈ సూరా సరళంగా, సూటిగా, సంక్షిప్తంగా మనిషికి తెలియజేస్తుంది. ముస్లిములు అల్లాహ్‌ను, అంటే ఒకే ఒక్క ఆరాధ్యుడిని తప్ప మరెవ్వరినీ అర్థించరాదనీ, ఎవరి ముందూ చేతులు చాపరాదనీ, మనిషి సాటి మనిషికి దాస్యం చేయరాదనీ, కేవలం దేవునికి మాత్రమే తన ఆరాధనను అంకితం చేసుకొని, ఆయన ముందు మాత్రమే తలవంచాలని బోధిస్తుంది. దేవునికి మానవ గుణగణాలు ఆపాదించడాన్ని ఖండిస్తుంది. అల్లాహ్‌కు ఎవరూ సమానులు కారు. అల్లాహ్ వంటివారు మరెవ్వరూ లేరు. మనిషి ఆయన్ను విశ్వసించాలి. విశ్వాసంతో ఆయన్నే ఆరాధించాలి.*

*ఈ సూరా రెండు సమాన భాగాలుగా ఉన్నట్లు కనబడుతుంది. మొదటి భాగంలో అల్లాహ్, ఆయన గుణగణాల గురించి వుంది. రెండవ భాగంలో మనిషి గురించి, మనిషికి దేవునితో ఉన్న అవసరం గురించి ఉంది.*

అల్ ఫాతిహా సూరా దివ్య ఖుర్‌ఆన్‌లోని మొట్ట మొదటి సూరా. హదీసుల ద్వారా కూడా దీని మహత్తు తెలుపబడింది. ఫాతిహా అంటే ఆరంభించటం, మొదలుపెట్టడం అని అర్థం. అందుకే దీనిని **"ఫాతిహతుల్ కితాబ్"**– అంటే పుస్తకారంభం అని పిలువటం జరిగింది. ఈ సూరాకు మరిన్ని పేర్లు కూడా ఉన్నట్లు హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. ఉదాహరణకు: (1) ఉమ్ముల్ ఖుర్‌ఆన్, (2) అస్సబ్‌వుల్ మసానీ, (3) అల్ ఖుర్‌ఆనుల్ అజీమ్, (4) అష్షిఫా (5) అర్రుఖ్‌యతు (ఊదటం), ఇంకా అనేక పేర్లు ఈ సూరాకు ఉన్నాయి.

ఈ సూరాకు గల ఇంకొక పేరు **'అస్సలాత్'**. హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : **"ఖసమ్‌తు స్సలాత బైనీ వ బైన అబ్దీ"** (సహీహ్ ముస్లిం : కితాబుస్సలాత్) – అంటే "నేను సలాత్ (నమాజు)ను నాకు – నా దాసునికి మధ్య విభజించాను" అని భావం. అంటే ఫాతిహా సూరా నన్నమాట! ఈ సూరాలోని సగభాగంలో దైవ స్తోత్రం చేయబడింది. ఆయన దయాదాక్షిణ్యాలు, పోషణ, న్యాయశీలం, విశ్వ సామ్రాజ్యాధికారం అభివర్ణించబడ్డాయి. మిగిలిన సగభాగంలో దైవసన్నిధిలో దాసుడు చేసుకునే విన్నపాలు, అభ్యర్థనలు వివరించబడ్డాయి.

ఈ హదీసులో ఫాతిహా సూరాను 'నమాజు' గా అభివర్ణించటం జరిగింది. దీన్నిబట్టి నమాజులో ఈ సూరాను పఠించటం చాలా అవసరమని స్పష్టమవుతోంది. మహనీయ ముహమ్మద్ (స) వారి ప్రవచనాల ద్వారా ఈ విషయం పదే పదే స్పష్టపరచటం జరిగింది: ఉదాహరణకు :– **"లా సలాత లిమన్ ల్లమ్ యఖ్‌రత్ బి ఫాతిహతిల్ కితాబ్"** (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం). అర్థం : ఫాతిహా సూరా పఠించని వ్యక్తి నమాజు నెరవేరదు. ఈ హదీసులోని అరబీ మూలంలో వచ్చిన 'మన్' అనే పదం సర్వసాధారణమైనది. నమాజు చేసే ప్రతి వ్యక్తికీ ఇది వర్తిస్తుంది. వ్యక్తిగత స్థాయిలో నమాజు చేసినా, సామూహికంగా నమాజు చేసినా, నమాజు చేయించే ఇమాము అయినా, ఇమామును అనుసరించే వారయినా – అందరూ ఈ సూరాను చదవవలసిందే. నెమ్మదిగా చేసే (సిర్రీ) నమాజులోనయినా, బిగ్గరగా చేసే (జహ్రీ) నమాజులోనయినా, విధిగా చేయవలసిన (ఫర్జ్) నమాజులోనయినా, స్వచ్ఛందంగా చేసుకునే (నఫిల్) నమాజుల్లోనయినా – నమాజు చేసే ప్రతి ఒక్కరూ ఈ సూరాను చదవటం తప్పనిసరి. క్రింద పేర్కొనబడిన హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది:

ఒకసారి ఫజ్ర్ (ఉదయం) నమాజులో మహాప్రవక్త (సఅసం)తో పాటు ఆయన సహచరులు (రజి) కూడా ఖుర్‌ఆన్ పారాయణం చేయసాగారు. తత్కారణంగా నమాజులో ఖుర్‌ఆన్ పఠించడానికి ఆయన (స) ఇబ్బందిని ఎదుర్కోవలసి వచ్చింది. నమాజును ముగించిన తరువాత ఆయన (స) తన సహచరులనుద్దేశ్యించి, "ఏమిటీ? మీరు కూడా (వెనకాల) ఖుర్‌ఆన్ పఠించారా?" అని అడిగారు. దానికి సహచరులు 'అవున'ని చెప్పారు. అప్పుడు ఆయన (స) ఇలా ఉపదేశించారు: "మీరిలా చేయకండి – నాతోపాటు పఠించకండి – అయితే ఫాతిహా సూరాను మాత్రం తప్పక పఠించాలి. ఎందుకంటే దాన్ని పఠించనిదే నమాజు నెరవేరదు" (అబూదావూద్, తిర్మిజీ, నసాయి). అలాగే మరో హదీసు – హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: **"మన్ సల్లా సలాతన్ లమ్ యఖ్‌రత్ ఫీహా బి ఉమ్మిల్ ఖుర్‌ఆని ఫహియ ఖిదాజున్"** సలాసన్ **ఘైరు తమామ్.** (ఎవరయితే ఫాతిహా సూరా పఠించకుండా నమాజు చేశాడో అతని నమాజు లోప భూయిష్టమైనదవుతుంది – అది పరిపూర్ణమైన నమాజు కాబోదు). దైవప్రవక్త (స) మూడుసార్లు ఈ మాటన్నారు. "మేము ఇమాము వెనుక కూడా నమాజు చేస్తాము కదా! మరప్పుడేం చేయాలి?" అని కొంతమంది హజ్రత్ అబూ హురైరా (రజి)ను ప్రశ్నించగా, "ఇమాము వెనుక ఉన్నప్పుడు (అంటే సామూహిక నమాజు చేస్తున్నప్పుడు) మీరు మనసులోనే – లోలోపలే – ఫాతిహా సూరా పఠించండి" అని ఆయన (రజి) సమాధానమిచ్చారు. (సహీహ్ ముస్లిం)

పై రెండు హదీసుల ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే, దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడినట్లు, "దివ్య ఖుర్‌ఆన్ మీ ముందు పఠించబడుతూ ఉన్నప్పుడు దాన్ని శ్రద్ధగా వినండి, మౌనంగా ఉండండి." (అల్ ఆరాఫ్ – 204). అలాగే హదీసులో చెప్పబడినట్లు – "సామూహిక నమాజుకు సారథ్యం వహించే వ్యక్తి (ఇమాము), గ్రంథ పారాయణం చేస్తున్నప్పుడు

మౌనంగా ఉండండి.” దీని భావం ఏమిటంటే, బిగ్గరగా చేయించే నమాజులలో వెనుక నిలబడివున్న నమాజీలు (ముక్తదీలు) ఫాతిహా సూరా తరువాత మిగిలిన పారాయణమంతటినీ మౌనంగా వినాలి. ఇమాముతోపాటే ఖుర్ఆన్ పారాయణం చేయకూడదు. లేదంటే ఇమాము, తన వెనుకనున్న అనుయాయులు కూడా సహీహ్ హదీసుల కనుగుణంగా ఫాతిహా సూరాను పఠించడానికి వీలుగా ఫాతిహా సూరా ఆయతులను బాగా ఆగి ఆగి పారాయణం చేయాలి. లేదా ఫాతిహా సూరాను ముగించిన తరువాత తన అనుయాయుల (ముఖ్తదీల) సౌకర్యార్థం ఇమాము చాలినంత వ్యవధిని ఇవ్వాలి. అలా చేస్తే ముఖ్తదీలు ఫాతిహా సూరా వాక్యాలను లోలోపలే చదువుకుంటారు. ఇలా చేయటం ఖుర్ఆన్ హదీసుల దృష్ట్యా ఆక్షేపణీయం కూడా కాదు. పైగా ఖుర్ఆన్, హదీసు-రెండింటి ఆదేశాలను పాటించినట్లవుతుంది. దీనికి భిన్నంగా ఫాతిహా సూరా పఠనాన్ని వారించటం వల్ల అనవసరంగా కొన్ని లేనిపోని సంశయాలకు తావిచ్చినట్లవుతుంది. ఉదా:- దివ్య ఖుర్ఆన్ మరియు ప్రామాణిక హదీసులు పరస్పరం సమన్వయం చెందటం లేదనీ, వాటి మధ్య వైరుధ్యం ఉందనీ, ఆ రెంటిలో ఏదో ఒకటి మాత్రమే ఆచరణయోగ్యమైనదనీ, ఏక కాలంలో రెండింటినీ అనుసరించటం దుస్సాధ్యమనీ (దైవం మన్నించుగాక!) కుంటి సాకులు వెతికే వారిని వెన్నుతట్టి ప్రోత్సహించినట్లవుతుంది. మరిన్ని వివరాలకై అల్ ఆరాఫ్ సూరా 204వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను కూడా చూడండి. (ఈ విషయానికి సంబంధించిన పూర్తి వివరాలు కావాలంటే మౌలానా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి గారి 'తహ్‌కీకుల్ కలామ్' పుస్తకం, ఇంకా మౌలానా ఇర్షాదుల్ హఖ్ అసరీ గారి పుస్తకాలు చదవండి). ఇక్కడ మరో విషయం కూడా గమనార్హం. ముక్తదీ గనక ఇమామ్ చేసే ఖుర్ఆన్ పారాయణం వింటున్నట్లయితే ఫాతిహా సూరా పఠించరాదనీ, ఒకవేళ వినని సందర్భంలో మాత్రం తప్పకుండా ఫాతిహా సూరా పఠించాల్సిందేనని 'సలఫ్'లో అత్యధికమంది తెలిపినట్లు ఇమామ్ ఇబ్నె తైమియా అభిప్రాయపడ్డారు. (మజ్‌మూయె ఫతావా ఇబ్నె తైమియా 23/265).

ఇది మక్కీ సూరా. అంటే ఈ సూరా మక్కాలో అవతరించిందన్నమాట! మక్కా లేక మదీనాలో అవతరించిందంటే భావం: మహాప్రవక్త (స) హిజ్రత్ చేయక మునుపు (మదీనాకు వలసపోక పూర్వం) అవతరించిన సూరాలన్నీ మక్కీ సూరాలనబడతాయి. మరి ఆ సూరాలన్నీ పవిత్ర మక్కా నగరంలోనే అవతరించి ఉండనవసరం లేదు. సమయం సందర్భాలను బట్టి మక్కా చుట్టుప్రక్కల ప్రాంతాలలో అవతరించి ఉన్నప్పటికీ అవి మక్కీ సూరాలుగానే పరిగణించబడతాయి. అలాగే హిజ్రత్ (దైవదౌత్యం అందిన 13 ఏండ్ల తరువాత జరిగిన మదీనా ప్రయాణం) అనంతరం అవతరించిన సూరాలు - అవి మదీనాలో అవతరించినా లేక మదీనా పొలిమేరల్లో అవతరించినా లేక మదీనా నగరానికి బహుదూరాన అవతరించినా - అవన్నీ మదనీ సూరాలుగానే వ్యవహరించబడతాయి. ఆఖరికి అవి మక్కాలో లేక మక్కా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అవతరించి ఉన్నాసరే!

**“బిస్మిల్లాహ్”** విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఇది ప్రతి సూరాకు మొదట్లో వచ్చే ప్రత్యేకమైన వచనమా? లేక ప్రతి సూరాలో అంతర్భాగమా? లేక ఫాతిహా సూరాలోని ఒక ఆయతా? లేక ఏ సూరాలోనూ అంతర్భాగం కాని అదనపు వచనమా? అంటే కేవలం ఒక సూరాను మరొక సూరా నుంచి విడదీయడానికి సూచనగా ప్రయోగించబడిన వాక్యమా?- అన్న విషయంపై మీమాంస ఉంది. దీన్ని ఫాతిహా సూరా సమేతంగా అన్ని సూరాలలో అంతర్భాగంగా మక్కా మరియు కూఫా పఠితలు (ఖుర్రా) ఖరారు చేశారు. కాగా; ఇది ఒక ఆయతుగా ఏ సూరాలోనూ అంతర్భాగం కాదని మదీనా, బస్రా, సిరియా పారాయణకర్తలు అన్నారు. కాకపోతే నమల్ సూరాలోని 30వ వచనంలో వచ్చిన 'బిస్మిల్లాహ్'ను మాత్రం అందరూ ఏకాభిప్రాయంతో ఆయతుగా శిరసావహించారు. అలాగే బిగ్గరగా చేసే నమాజులలో 'బిస్మిల్లాహ్'ను బిగ్గరగా చదివే అంశంపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. బిగ్గరగా చదవాలని కొందరు భావిస్తుండగా, నెమ్మదిగా పఠించాలని మరికొంతమంది తలపోస్తున్నారు (ఫత్‌హుల్ ఖదీర్). అధిక సంఖ్యాక విద్వాంసులు మాత్రం నెమ్మదిగా పఠించాలన్న విషయానికే ప్రాధాన్యతనిచ్చారు. అంతమాత్రం చేత బిగ్గరగా పఠించటం విపరీతం కాదు-బిగ్గరగా పఠించటం కూడా ధర్మసమ్మతమే.

**'బిస్మిల్లాహ్'** అంటే 'అల్లాహ్ పేరుతో' అని మాత్రమే అర్థం వస్తుంది. కనుక దానికి ముందు **అఖ్‌రవు** (నేను చదువుతున్నాను), **అబ్‌దవు** (నేను ప్రారంభిస్తున్నాను), **అత్‌లూ** (నేను పారాయణం చేస్తున్నాను) – లాంటిది ఏదో ఒక పదం ఉన్నట్లు భావించవలసి ఉంటుంది. అంటే అల్లాహ్ పేరుతో మొదలెడుతున్నాను, అల్లాహ్ పేరుతో అధ్యయనానికి ఉపక్రమిస్తున్నాను అని భావం. ప్రతి పనికి ముందు **"బిస్మిల్లాహ్"**ను పలకమని గట్టిగా తాకీదు చేయబడింది. భోజనం చేసేటప్పుడు, జంతువును జిబహ్ చేసేటప్పుడు, వుజూ చేయ సంకల్పించినప్పుడు ఆఖరికి సంభోగానికి ముందు కూడా 'బిస్మిల్లాహ్' పఠించాలని ఆదేశించబడింది. ఖుర్ఆన్ పారాయణం మొదలెడుతున్నప్పుడు **బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్**ను పఠించటం అనివార్యమైనప్పటికీ, దానికి ముందు **అవూజుబిల్లాహి మినష్షయితానిర్రజీమ్**ను పలకటం కూడా ఎంతో అవసరమే. ఎందుకంటే **"ఫయిజా ఖర'తల్ ఖుర్ఆన ఫస్తయిజ్ బిల్లాహి మినష్షయితానిర్రజీమ్** (మీరు ఖుర్ఆన్ పఠనానికి ఉపక్రమించినప్పుడు శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుంచి అల్లాహ్ శరణు వేడండి – అన్ నహ్ల్ : 98) అన్న ఆదేశం విస్మరించరానిది.

## అల్ ఫాతిహా సూరా

## سُوۡرَةُ الفَاتِحَة

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ |
| **1** అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో | بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ ١ |
| **2** ప్రశంసలు, పొగడ్తలన్నీ అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయి.[1] ఆయన సమస్త లోకాలకు పోషకుడు,[2] | ٱلۡحَمۡدُ لِلَّهِ رَبِّ ٱلۡعَٰلَمِينَ ٢ |

1. **అల్ హమ్దు :** ఇందులో 'అల్' అనే పదం ప్రత్యేకతను, సమీకృతాన్ని సూచిస్తోంది. సమస్త స్తోత్రములు అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయనీ, అవి ఆయనకే ప్రత్యేకమనీ భావం. ఎందుకంటే ప్రశంసలకు అసలు అర్హుడు అల్లాహ్‌యే. ఎవరిలోనయినా ఏదైనా ప్రత్యేకత, సద్గుణం, నేర్పు ఉంటే అది కూడా అల్లాహ్ సృజించినదే. అందుచేత స్తోత్రానికి అర్హుడు కూడా ఆయనే. **అల్లాహ్:** ఇది అల్లాహ్ నామం. వేరొకరి కోసం ఈ నామాన్ని ఉపయోగించటం సమ్మతం కాదు. **అల్ హమ్దు లిల్లాహ్ :** ఇది కృతజ్ఞతాపూర్వకమయిన పలుకు. హదీసుల ద్వారా ఈ వచనం అత్యంత మహత్పూర్వకమైనదని వెల్లడవుతోంది. **లా యిలాహ ఇల్లల్లాహ్** శ్రేష్ఠమయిన ధ్యానమైతే, **అల్ హమ్దు లిల్లాహ్** శ్రేష్ఠమయిన వేడుకోలు అని ఒక హదీసులో ఉంది (సుననె తిర్మిజీ). **"అల్ హమ్దు లిల్లాహి తమ్‌లవుల్ మీజాన్"** – 'అల్ హమ్దు లిల్లాహ్ త్రాసును నింపేస్తుంది' అని మరొక హదీసులో అనబడింది (సహీహ్ ముస్లిం). అందుకే దాసుడు తినే, త్రాగే ప్రతిసారీ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవటాన్ని అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడని వేరొక హదీసులో చెప్పబడింది (సహీహ్ ముస్లిం).
2. **రబ్బ్ :** అల్లాహ్ ఉత్తమ నామాలలో ఇదొకటి. రబ్బ్ అంటే ప్రతి వస్తువును సృష్టించటంతోపాటు దాని అవసరాలు, అక్కరలను తీర్చి, దానికి పరిపూర్తి నొసగేవాడు అని అర్థం. ఈ పదాన్ని ఈ భావంలో వేరొకరికై ఉపయోగించటం సమ్మతం కాదు. ఒకవేళ ఇతరులను ఈ పేరుతో సంబోధించదలిస్తే దానికి ముందుగాని వెనుకగాని మరో పదం వాడాలి. ఉదా : అబ్దుర్రబ్బ్ (ప్రభువు యొక్క దాసుడు). అంతేగాని కేవలం 'రబ్' అని ఇతరులెవరినీ పిలువకూడదు. **ఆలమీన్** అనే పదం ఆలమ్ అనే పదానికి బహువచనం. ఆ మాటకొస్తే సమస్త సృష్టిరాసుల సముదాయాన్ని ఆలమ్‌గా వ్యవహరిస్తారు. అందుకే సాధారణంగా ఈ పదాన్ని బహువచనంలోకి తీసుకోరు. అయితే దేవుని పరిపూర్ణ

| | |
|---|---|
| 3 అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు.[3] | الرَّحْمٰنِ الرَّحِيْمِ ﴿3﴾ |
| 4 ప్రతిఫల దినానికి (అంటే ప్రళయ దినానికి) యజమాని.[4] | مٰلِكِ يَوْمِ الدِّيْنِ ﴿4﴾ |
| 5 మేము నిన్నే ఆరాధిస్తున్నాము, సహాయం కోసం నిన్ను మాత్రమే అర్థిస్తున్నాము.[5] | اِيَّاكَ نَعْبُدُ وَ اِيَّاكَ نَسْتَعِيْنُ ﴿5﴾ |

పోషకత్వాన్ని, సమగ్ర ప్రభుతను వెల్లడించే ఉద్దేశ్యంతో **ఆలమీన్** అనే బహువచనాన్ని తీసుకు రావటం విశేషం. సృష్టిరాసుల్లోని వేర్వేరు రకాలను, కోవలను గురించి ఇక్కడ తెలియజెప్పటం ముఖ్యోద్దేశ్యం అన్నమాట! ఉదాహరణకు: జిన్నుల జగతి, మానవ జగతి, దైవదూతల లోకం, పశుపక్ష్యాదుల ప్రపంచం ఇత్యాదివి. ఈ సృష్టితాలన్నింటి అవసరాలు వేరు. తీరుతెన్నులు వేరు. అయితే **రబ్బిల్ ఆలమీన్** (సమస్త లోకాలను పోషించేవాడు) మాత్రం వాటి స్వరూప స్వభావాలను, అవసరాలను, స్థితిగతులను దృష్టియందుంచుకుని వాటికి కావలసినవన్నీ సమకూరుస్తున్నాడు.

3. **రహ్మాన్ :** రహ్మాన్, రహీమ్ – ఇవి రెండూ అధిక అర్థాన్నిచ్చే పదాలే. ఈ రెండింటిలోనూ అధికమైన, అనంతమైన, అపారమైన అనే భావం తొణికిసలాడుతోంది. అంటే అల్లాహ్ అపారంగా కనికరించేవాడు. ఆయనలోని ఈ గుణం ఇతర గుణగణాల మాదిరిగా శాశ్వతమైనది, స్థిరమైనది. కొంతమంది పండితులు ఈ సందర్భంగా ఏమంటారంటే; **రహీమ్** కన్నా **రహ్మాన్** అనే మాటలో విస్తృత భావం ఉంది. అందుకే **రహ్మాన ద్దునియా వల్ ఆఖిరతి** అని అనబడుతుంది. అంటే ఇహపర లోకాల్లోనూ కరుణించేవాడని అర్థం. ప్రపంచంలో ఆయన దయాదాక్షిణ్యాలు సర్వ సాధారణం. విశ్వాసులు–అవిశ్వాసులన్న విచక్షణ లేకుండా అందరూ ఈ ప్రపంచంలో ఆయన దయాదాక్షిణ్యాలకు నోచుకుంటున్నారు. కాని పరలోకంలో ఆయన కేవలం రహీమ్‌గా మాత్రమే ఉంటాడు. అంటే అక్కడ ఆయన దయానుగ్రహాలు కేవలం విశ్వాసులకు మాత్రమే పరిమితం అయి ఉంటాయి. "నేను ఆ కారుణ్యాన్ని నాకు భయపడేవారి కొరకూ, జకాత్ ఇచ్చేవారి కొరకూ, మా ఆయతులను విశ్వసించే వారి కొరకు తప్పకుండా వ్రాస్తాను" (అల్ ఆరాఫ్ – 156). అల్లాహుమ్మజ్ అల్నా మిన్‌హుమ్. (అల్లాహ్! మమ్మల్ని కూడా ఆ భాగ్యవంతులలో చేర్చు).

4. మనిషి ప్రపంచంలోనూ తాను చేసిన కర్మలకు ప్రతిఫలం కొంతవరకు అనుభవించినప్పటికీ పరలోకంలోనే అసలు సిసలు ఫలితం బయటపడుతుంది. సంపూర్ణమైన ప్రతిఫలం అక్కడే ఉనికిలోనికి వస్తుంది. ప్రతి వ్యక్తికీ అతను చేసిన మంచి లేక చెడు పనులనుబట్టి అల్లాహ్ అతనికి బహుమానం ఇవ్వటమో, శిక్ష విధించటమో జరిగి తీరుతుంది. ఇదే విధంగా ప్రపంచంలో కూడా తాత్కాలికంగా అనేకమందికి కొన్ని అధికారాలుంటాయి. కాని పరలోకంలో మాత్రం అధికారాలన్నీ అల్లాహ్ హస్తగతం అవుతాయి. తీర్పుదినాన ఆయన తిరుగులేని సార్వభౌమాధికారిగా ఉంటాడు. "ఈ రోజు విశ్వసామ్రాజ్యాధికారం ఎవరిదో చెప్పండి?" అంటూ ఆనాడాయన ప్రశ్నిస్తాడు. "తిరుగులేని వాడు, ఒక్కడైన అల్లాహ్‌దే" అంటూ ఆయనే సమాధానం కూడా ఇస్తాడు (అల్ మోమిన్–16). "ఆనాడు ఏ మనిషీ ఎవరికొరకైనా ఏదన్నా చెయ్యగలగటమన్నది అసంభవం, ఆ రోజు అధికారమంతా అల్లాహ్ చేతుల్లోనే ఉంటుంది." (ఇన్ ఫితార్ – 19) – అదీ తీర్పుదినమంటే!

5. **ఇబాదత్** అంటే ఒకరి ప్రసన్నతను చూరగొనేందుకు అత్యంత అణకువను, అశక్తతను, వినయ వినమ్రతలను అభివ్యక్తం చేయటం అని భావం. ఇబ్నె కసీర్ మాటల్లోనే చెప్పాలంటే, "షరీయత్‌లో సంపూర్ణమైన ప్రేమ, అభిమానం, భయము, భక్తీ – వీటన్నింటి సమ్మేళనమే ఇబాదత్." అంటే ఎవరిపట్లనయితే ప్రేమాభిమానాలు కలిగి ఉంటామో, ఆయన శక్తియుక్తుల ముందు తమ నిస్సహాయస్థితినీ, దైన్యస్థితినీ వ్యక్తపరచాలి. ఆ శక్తిమంతుడు తమను నిలదీసి అడుగుతాడన్న భీతి కూడా ఆ దాస్యంలో తొణికిసలాడుతూ ఉండాలి. విషయాన్ని సాదాసీదాగా చెప్పవలసి ఉంటే **"నాబుదుక, వ నస్తయీనుక"** (మేము నిన్ను ఆరాధిస్తాము, సహాయం కొరకు నిన్ను అర్థిస్తాము) అని అనబడేది. కాని అల్లాహ్ యిక్కడ **"ఇయ్యాక నాబుదు వ ఇయ్యాక నస్తయీన్"** అని నొక్కి వక్కాణించి ఈ వాక్యానికి ప్రత్యేకతను,

వైశిష్ట్యాన్ని కల్పించాడు– అంటే దీని అర్థం: “(ఓ అల్లాహ్!) మేము నిన్నే ఆరాధిస్తున్నాము, సహాయం కోసం నిన్ను మాత్రమే అర్థిస్తున్నాము” అని.

దీని ప్రకారం అల్లాహ్‌నుగాక వేరొకరిని పూజించటంగానీ, సహాయం కొరకు వేరితరులను మొరపెట్టుకోవటంగానీ ధర్మసమ్మతం కాదు. ఈ పదాల ద్వారా షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాముల్ని నిర్ణయించటం) నిర్ద్వంద్వంగా ఖండించబడింది. కాని హృదయాలలో షిర్క్ రోగం తిష్ఠవేసి ఉన్నవారు ఈ మూలాంశాన్ని విస్మరించి, అపోహలో పడిపోయి, భ్రమలకు లోనై పిడివాదానికి దిగుతారు. మనం జబ్బుపడినప్పుడు డాక్టరు సహాయం పొందటం లేదా? ఇల్లాలి సేవల్ని పొందటం లేదా? ఇరుగు పొరుగువారి తోడ్పాటును, డ్రైవరు సాయాన్ని పొందటం లేదా? అని దబాయిస్తారు. ఈ విధంగా వాళ్లు, అల్లాహ్ గాక వేరితరుల సహాయాన్ని అర్థించటం కూడా సమ్మతమేనని మీరు ఒప్పుకునేలా చేయటానికి ప్రయత్నిస్తారు. నిజానికి కారకాలకు లోబడి ఒండొకరి సహాయాన్ని కోరటం, సహాయపడటం షిర్క్ కానేకాదు. ఇదైతే దేవుడు సమ్మతించి ఆమోదించిన వ్యవస్థ. ఆ వ్యవస్థలోని పనులన్నీ బాహ్య కారకాలకనుగుణంగానే జరుగుతాయి. కడకు దైవప్రవక్తలు సయితం మనుషుల సహాయసహకారాలను పొందుతూ ఉంటారు. దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) తన జాతి జనులనుద్దేశ్యించి, “అల్లాహ్ (ధర్మం) కొరకు నాకు సహాయపడేవారు మీలో ఎవరున్నారు?” అని అడిగారు (అస్ సఫ్–14). అల్లాహ్ స్వయంగా విశ్వాసులనుద్దేశ్యించి, “సత్కార్యం, దైవభక్తికి సంబంధించిన విషయాలలో ఒకరికొకరు సహకరించుకోండి” అని సెలవిచ్చాడు. (అల్ మాయిద : 2)

మరి ఇటువంటి సహాయసహకారాలు నిషేధించబడటంగానీ, షిర్క్‌గా అభివర్ణించబడటంగానీ జరగలేదు. పైగా ఇలాంటి పనులు జరగాలని ప్రోత్సహించటమైంది. ఇలాంటి సత్కార్యాలు ప్రశంసనీయంగా పేర్కొనబడ్డాయి. వాస్తవమైన షిర్క్‌తో దీనికి ఎటువంటి సంబంధమూ లేదు. బాహ్యపరమైన కారకాల రీత్యా సహాయం చేయటం ఏమాత్రం చేతకాని వానిని, సహాయం చేయజాలని వానిని ‘సహాయం చెయ్యి’ అని అర్థించటమే అసలు షిర్క్. ఉదాహరణకు: చనిపోయిన ఒకానొక వ్యక్తిని సహాయం కోసం మొరపెట్టుకోవటం, కష్టాల నుండి అతడు గట్టెక్కిస్తాడనీ, అక్కరలు తీరుస్తాడని తలపోయటం, లాభనష్టాలు అతని అధీనంలో ఉన్నాయని ఊహించటం, దగ్గరున్నవారు పిలిచినా, దూరమున్నవారు మొరపెట్టుకున్నా, ప్రతి ఒక్కరి మొరలను ఆలకించే ‘శక్తి’ అతనిలో ఉందని నమ్మటం – ఇదంతా దైవానికి వేరొకరిని సహవర్తులుగా నిలబెట్టడంగా, భాగస్వామ్యం కల్పించటంగా, దేవుని లక్షణాలను వేరొకరికి ఆపాదించటంగా పరిగణించబడుతుంది. ఇదే షిర్క్! దురదృష్టవశాత్తూ ముస్లిం దేశాలలో సయితం ఇటువంటి షిర్క్ వర్థిల్లుతోంది. మహనీయుల (ఔలియాల) పట్ల ప్రేమ కలిగి ఉండటం అవసరం మరి! అంటూ ముస్లిం ఈ ప్రేమాభిమానంలో అతిశయిల్లి రాగానపడి షిర్కుకు ఒడిగడుతున్నారు. ఇటువంటి పోకడలబారి నుంచి అల్లాహ్ మనల్ని కాపాడుగాక!

తౌహీద్ (ఏకదైవోపాసన) మూడు రకాలు. ఈ సందర్భంగా ఏకదైవోపాసనకు సంబంధించిన ఈ మూడు రకాలను, క్లుప్తంగానయినాసరే వివరించటం సమంజసం అనిపిస్తోంది. అవేమంటే – (1) తౌహీదె రుబూబియత్ (2) తౌహీదె ఉలూహియత్ (3) తౌహీదె అస్మా వ సిఫాత్.

**1.తౌహీదె రుబూబియత్** అంటే భావం : ఈ మొత్తం విశ్వానికి సృష్టికర్త, యజమాని, పోషకుడు, కనిపెట్టుకుని ఉన్నవాడు, వ్యూహ రచయిత కేవలం అల్లాహ్ మాత్రమే. నాస్తికులు మినహా మిగిలిన వారంతా ఈ తౌహీద్‌ను అంగీకరిస్తారు. ఆఖరికి బహుదైవోపాసకులు సయితం ఈ దృక్పథాన్ని ఒప్పుకున్నారు. ఒప్పుకుంటున్నారు. మక్కాకు చెందిన బహుదైవారాధకుల (ముష్రిక్కుల) ఒప్పుకోలును గురించి ఖుర్‌ఆన్ ఇలా అభివర్ణించింది:
“ఓ ప్రవక్తా! వారిని అడగండి: ఆకాశం నుంచీ, భూమి నుంచీ మీకు ఉపాధినొసగేవాడు ఎవడు? (మీ లోని) వినేశక్తీ, చూసే శక్తీ ఎవరి అధీనంలో ఉన్నాయి? నిర్జీవమైన దాన్నుంచి జీవాన్ని, జీవమున్న దాన్నుంచి జీవములేని దాన్ని తీసేవాడెవడు? అసలీ విశ్వవ్యవస్థను నడుపుతున్న వాడెవడు? **‘అల్లాహ్’** అని వారు ఠకీమని అంటారు.”
*(యూనుస్ – 31)*

| | |
|---|---|
| **6** మాకు రుజుమార్గం (సన్మార్గం) చూపించు.[6] | اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ﴿٦﴾ |
| **7** నీవు అనుగ్రహించిన వారి మార్గం,[7] నీ ఆగ్రహానికి గురికాని వారి, అపమార్గానికి లోనుకాని వారి మార్గం[8] (చూపు). | صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ﴿٧﴾ |

మరొకచోట ఇలా అనబడింది :

"భూమ్యాకాశాలను సృష్టించిన వాడెవడు? అని వారిని అడిగితే, 'అల్లాహ్' అని వాళ్లు చెబుతారు."

*(అజ్జుమర్ : 38)*

వేరొకచోట సెలవీయబడింది :

"ఈ భూమి, భూమిలో ఉన్నదంతా ఎవరిదో మీకు తెలిస్తే చెప్పండి?" అని వారిని అడుగు. **'అల్లాహ్‌దే'** అని వారు చెబుతారు. మరలాంటప్పుడు మీరు ఎందుకు గ్రహించటం లేదు? అని వారితో అను. ఇంకా సప్తాకాశాలకూ, మహోన్నతమైన సింహాసనానికి అధిపతి ఎవరని కూడా వారిని ప్రశ్నించు. 'అల్లాహ్' అని వారు తడబడకుండా సమాధానమిస్తారు. మరి అటువంటప్పుడు మీరు ఆయనకు ఎందుకు భయపడటం లేదు? అని వారిని నిలదియ్యి."

*(అల్ మూ'మినూన్ : 84 - 89)*

**2. తౌహీదె ఉలూహియత్ :** అంటే భావం అన్ని రకాల ఆరాధన (ఇబాదత్) లకు, దాస్యాలకు, వేడుకోళ్ళకు అర్హుడు అల్లాహ్ మాత్రమే. ఎవరైనా ఒక ప్రత్యేక వ్యక్తి మెప్పు కోసం లేక అతని అప్రసన్నతకు గురవుతామేమోనన్న భయం కొద్దీ చేసే ప్రతి పనీ ఆరాధన (ఇబాదత్) గానే భావించబడుతుంది. అందుచేతనే నమాజ్, రోజా, హజ్, జకాత్ వంటి క్రియలు మాత్రమే ఆరాధనలు కావు - ఒకానొక ప్రత్యేక అస్తిత్వం ఎదుట అభ్యర్థించుకోవటం, అతని పేర మొక్కుకోవటం, మొక్కుబడులు తీర్చుకోవటం, అతని ఎదుట బుద్ధిగా చేతులు కట్టుకుని నిలబడటం, అతని చుట్టూ ప్రదక్షిణ చేయటం, అతని సమక్షంలో భయభక్తులను ప్రదర్శించటం, అతను తమకేదైనా అనుగ్రహిస్తాడేమోనని ఆశగా నిరీక్షించటం - ఇత్యాదివన్నీ ఆరాధన (ఇబాదత్)గానే పరిగణించబడతాయి. మరి ఇటువంటి పనులన్నీ ఒక్కడైన అల్లాహ్ కోసమే చేయాలి. ఇదే తౌహీదె ఉలూహియత్ (అయితే బాహ్య కారకాల కనుగుణంగా బ్రతికి ఉన్న మనుషుల వద్దకు వెళ్ళి, వారినుండి ఏదైనా ఆశించటం, వారి యెడల వినయ వినమ్రతలను కలిగి ఉండటం మాత్రం 'తౌహీద్'కు విరుద్ధం కాదు).

సమాధి పూజ వ్యాధికి లోనయిన సామాన్యులు, ప్రముఖులు ఈ 'తౌహీదె ఉలూహియత్'లో షిర్క్‌కు ఒడిగడుతుంటారు. ఇటువంటి ఆరాధనలను వారు సమాధులలో ఖననం చేయబడినవారి నుద్దేశించి చేస్తుంటారు. ఇది ముమ్మాటికీ షిర్కే!

**3. తౌహీదె అస్మా వ సిఫాత్ :** అంటే భావం ఖుర్ఆన్ హదీసులలో అల్లాహ్ గురించి చెప్పబడిన గుణగణాలను, లక్షణాలను ఏమాత్రం వక్రీకరించకుండా, వాటిలో ఎలాంటి మార్పులు చేర్పులు చేయకుండా - యధాతథంగా అంగీకరించటం. అంటే ఆ గుణగణాలు వేరొకరిలో కూడా ఉన్నాయన్న భావనకు సుతరామూ తావీయకూడదు.

ఉదాహరణకు : అగోచర జ్ఞానం అల్లాహ్ గుణం, లేదా దూరాన ఉన్నవారు మొరపెట్టుకున్నా, చేరువలో ఉన్నవారు ఫిర్యాదు చేసినా - అందరిగోడునూ ఆయన వింటాడు అనేది ఇంకొక గుణం. విశ్వమండలంలో ఏదైనాసరే చేయగల అధికారం ఆయనకు ఉంది అనేది ఇంకొకటి. ఇలాంటివే అనేకానేక గుణగణాలు ఆయన సొంతం. మరి అటువంటి గుణగణాలలో ప్రవక్తనో, వలీనో, సజ్జనులనో చేర్చరాదు. ఒకవేళ వారిని కూడా సహవర్తులుగా చేర్చి, ఆ మహనీయులకు కూడా అటువంటి గుణాలే ఉన్నాయని భావిస్తే అది ముమ్మాటికీ 'షిర్కే' అవుతుంది.

6. **హిదాయత్ :** అంటే మార్గదర్శకత్వం వహించటం, తిన్నని త్రోవలో నడపటం, గమ్యస్థానానికి చేర్చటం అని భావం. ఇదే అరబీలో సద్బుద్ధి, సత్ప్రేరణ, నిదర్శనంగా కూడా అభివర్ణించబడింది. అంటే మాకు రుజుమార్గం వైపుకు

దర్శకత్వం వహించు! ఆ మార్గంపై నడిచే సద్బుద్ధినొసగు!! ఆ మార్గంపై మాకు సహన స్థైర్యాలను ప్రసాదించు!!! తద్వారానే మేము నీ ప్రసన్నతను చూరగొనగలము అన్నది దీని మతలబు. మరి ఈ రుజుమార్గం కేవలం మనిషి బుద్ధిజ్ఞానాల వల్ల, అతని తెలివి తేటలవల్ల ప్రాప్తించదు. దానికి దైవకటాక్షం ఎంతో అవసరం. ఆ రుజుమార్గమే ఇస్లాం. ఆ మార్గాన్నే అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లోకానికి విడమరచి చెప్పారు. ఆ మార్గాన్ని పొందటమెలాగో ఖుర్ఆన్ హదీసులు పూసగుచ్చినట్లుగా మనకు వివరిస్తున్నాయి.

7. **అల్లాహ్ అనుగ్రహపాత్రులు :** ఈ కోవకు చెందిన వారెవరో ఖుర్ఆన్ ఖుద్దుగా వివరించింది. అన్ నిసా సూరాలో పేర్కొనబడినట్లు – "ఎవరయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారో వారు (ప్రళయదినాన) దైవకటాక్షం పొందిన వారితో ఉంటారు. అంటే దైవప్రవక్తలు, సత్యసంధులు, అమరగతులు, సద్వర్తనులు. అటువంటి వారి సహచర్యం ఎంతో మంచిది కదా!" (అన్ నిసా : 69).

దైవానుగ్రహానికి పాత్రులైన వారి ఈ మార్గం దైవవిధేయత మరియు ప్రవక్త విధేయతల మార్గమే తప్ప వేరొక మార్గం కాదన్న సంగతి కూడా ఈ ఆయతులో స్పష్టంగా చెప్పబడింది.

8. **ఆగ్రహానికి గురైనవారు, అపమార్గానికి లోనైనవారు:** ఆగ్రహానికి గురైనవారంటే యూదులు, అపమార్గానికి లోనైన వారంటే క్రైస్తవులని భావం. ఈ విషయంలో ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య ఎలాంటి అభిప్రాయభేదం లేదని ఇబ్నె అబీ హాతిమ్ అంటున్నారు (ఫత్‌హుల్ ఖదీర్). అందుకే రుజుమార్గాన నడవాలని కోరుకునేవారు యూదులు, క్రైస్తవుల మార్గవిహీనతకు దూరంగా మసలుకోవటం ఎంతో అవసరం. యూదుల మార్గభ్రష్టతకు తార్కాణం ఏమిటంటే, వాళ్లు తెలిసి కూడా – ఉద్దేశ్యపూర్వకంగా – సన్మార్గాన నడిచేవారు కారు. దైవవాక్కులలో ప్రక్షిప్తాలు చేసేవారు. ప్రతి దానికీ వంకలు పెట్టేవారు. ఉజైర్‌ను వారు దేవుని కుమారునిగా నిలబెట్టారు. ఏదేని విషయాన్ని ధర్మం (హలాల్) గానో, అధర్మం (హరాం) గానో ఖరారు చేసే అధికారాన్ని వారు తమ ఆచార్యులకు, మతాధికార్లకు కట్టబెట్టారు. ఇక క్రైస్తవులు చేసిన ఘోరమైన తప్పిదం ఏమిటంటే, వాళ్ళు దైవప్రవక్త హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు) ప్రేమలో అతిశయిల్లారు. ఆయన్ని దేవుని కుమారునిగా ఖరారు చేశారు. 'త్రిత్వం' (మూడు దైవాల భావన) ను సృష్టించి గందరగోళ స్థితికి కారకులయ్యారు. అత్యంత శోచనీయమైన విషయమేమిటంటే, ముహమ్మద్ (స) అనుచర సమాజంలో సయితం ఇటువంటి అయోమయావస్థ నెలకొంటున్నది. ప్రవక్త పట్ల ప్రేమాతిశయంతో కొందరు మహానుభావులు తమదైన శైలిలో తొక్కే కొత్త పుంతలు మార్గభ్రష్టతకు దారితీసేలా పరిణమిస్తున్నాయి. ఈ కారణంగానే వారు ఇహలోకంలోనే పరాభవానికి గురవుతున్నారు. అల్లాహ్ వారిని ఈ మార్గభ్రష్టతల లోయల్లో నుంచి బయట పడవేయుగాక!

ఫాతిహా సూరా చివర్లో **'ఆమీన్'** పలకటం అత్యంత మహత్పూర్వకమని మహనీయ ముహమ్మద్ (సఅసం) పదే పదే తాకీదు చేయటం గమనార్హం. అందుకే (నమాజులో) ఇమామ్, ముఖ్తదీలు ప్రతి ఒక్కరూ 'ఆమీన్' పలకాలి. బిగ్గరగా చేసే నమాజులలో దైవప్రవక్త (సఅసం) హెచ్చుస్వరంతో 'ఆమీన్' పలికేవారు. ప్రియ సహచరులు కూడా బిగ్గరగా ఆమీన్ పలికేసరికి మస్జిద్ ఆమీన్‌తో ప్రతిధ్వనించేది. (ఇబ్నె మాజ, ఇబ్నె కసీర్). ఆమీన్ బిగ్గరగా పలకటం సున్నత్ (దైవప్రవక్త సంప్రదాయం). ఇది ప్రవక్త ప్రియసహచరుల ఆచరణ కూడా. ఆమీన్‌కు పలు అర్థాలు ఇవ్వబడ్డాయి. 'ఆమీన్' అంటే తథాస్తు అనీ, 'ఓ అల్లాహ్! మా ప్రార్థనను స్వీకరించు' అనీ, 'మా ఆశను అడియాశ చేయకు' అనీ భావం.

2వ సూరా

# అల్ బఖర

## ఆవు

అవతరణ మదీనాలో

ఆయతులు 286

### పరిచయం

*ఈ సూరా ప్రధానంగా తౌహీద్, అంటే ఏకదైవారాధనను విశదీకరించిన సూరా. దివ్యఖుర్ఆన్ మనిషికి మార్గదర్శక గ్రంథమనీ, అందువల్ల దివ్యఖుర్ఆన్‌లోని బోధనలను మనిషి అనుసరించాలని ప్రబోధించే సూరా ఇది.*

*'అల్ బఖర' (ఆవు) అన్న పేరు కలిగిన ఈ సూరాను స్థూలంగా రెండు విభాగాలుగా విభజించవచ్చు. మొదటి విభాగంలో ఇస్రాయీల్ సంతతికి సంబంధించిన వివరాలున్నాయి. ఇస్రాయీల్ సంతతి మూసా ప్రవక్త (అ)తో వ్యవహరించిన తీరు, ఇతర ప్రవక్తలతో వారి వ్యవహారశైలి ఇందులో ప్రస్తావనకు వచ్చాయి. చిట్టచివరి దైవగ్రంథంగా అవతరించిన దివ్య ఖుర్ఆన్‌ను విశ్వసించాలని ఇందులో వారికి ప్రత్యేకంగా అప్పీలు చేయడం జరిగింది. రెండవ విభాగంలో మదీనాలో ఒక కొత్త ఇస్లామీయ వ్యవస్థను స్థాపించడానికి అవసరమైన న్యాయపరమైన, చట్టపరమైన అంశాలు ఉన్నాయి. ఈ సూరాలోని 67, 68 ఆయతులలో ప్రస్తావనకు వచ్చే ఆవు కథ కారణంగా ఈ సూరాకు "అల్ బఖర" అన్న పేరు పెట్టబడింది.*

*ప్రజల్లోని మూడు విభిన్న వర్గాల గురించిన వివరణతో ఈ సూరా ప్రారంభమవుతుంది. ఆ మూడు వర్గాలు వరుసగా – 1. అల్లాహ్‌కు భయపడేవారు, 2. దైవాన్ని, ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించేవారు, 3. దైవం పట్ల కపట విశ్వాసం ప్రదర్శించేవారు. ఈ మూడు వర్గాలకు చెందిన ప్రజల ప్రస్తావన తర్వాత మానవులు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలనీ, ఆయనకు సహవర్తులుగా, ఆయనకు సమానులుగా ఎవరినీ నిలబెట్టరాదని నొక్కి చెప్పడం జరిగింది. దివ్యఖుర్ఆన్‌లోని ఆయతులు అల్లాహ్ తరపు నుంచి అవతరించినవన్న విషయంలో ఎవరికైనా సందేహం ఉంటే, ఖుర్ఆన్‌లో మాదిరి ఒక్క సూరా అయినాసరే రచించి తీసుకురమ్మన్న సవాలు కూడా ఇందులో ఉంది.*

*మానవ సృష్టికి సంబంధించిన కథను ఈ సూరా ప్రస్తావించింది. ఆదమ్ (అలైహిస్సలామ్)ను సృష్టించడం గురించి తెలిపింది. ఆదమ్ (అస)ను సృష్టించిన దేవుడు దైవదూతలను ఆదమ్ (అస) ముందు గౌరవసూచకంగా సాష్టాంగపడమని ఆదేశించాడు. దైవదూతలందరూ దేవుని ఆదేశాన్ని పాటించారు. కాని ఇబ్లీస్ పాటించలేదు. ఇబ్లీస్ ఒక షైతాన్. ఇబ్లీస్ దైవాదేశాన్ని తిరస్కరించి తలబిరుసుగా వ్యవహరించాడు. ఈ విధంగా మనిషికి–షైతానులకు మధ్య ఘర్షణ ప్రారంభమయ్యింది.*

*ఈ సూరా మదీనా కాలానికి సంబంధించిన సూరా. అందువల్ల ఇందులో ఇస్రాయీల్ సంతతి (యూద జాతి)కి సంబంధించిన ప్రస్తావనలు వివరంగా ఉన్నాయి. అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌ను అవతరింపచేశాడని ఈ సూరా నొక్కి చెప్పింది. చిట్టచివరి దైవగ్రంథంగా, గత కాలాల్లోని దివ్య వచనాలను, అంటే మూసా (అలైహిస్సలామ్)పై అవతరించిన తౌరాత్ గ్రంథాన్ని, ఈసా (అలైహి)పై అవతరించిన ఇంజీల్ గ్రంథాన్ని ధృవీకరించే గ్రంథంగా దీనిని అవతరింపచేసినట్లు తెలియజేసింది.*

*దివ్యఖుర్ఆన్‌లో ఉన్న సందేశం కూడా తౌరాత్, ఇంజీల్ గ్రంథాలలో ఉన్న సందేశం వంటిదే. దివ్యఖుర్ఆన్‌లోని సందేశాన్ని ఇస్రాయీల్ సంతతి ప్రజలు సమగ్రంగా పరిశీలించి ఉన్నట్లయితే, తమ గ్రంథాలలో ఉన్న సందేశాన్ని ఇది ధృవీకరిస్తుందన్న వాస్తవాన్ని వారు గ్రహించి ఉండేవారు. కాని వారు దీనిని తిరస్కరించారు. మంత్రతంత్రాలలో, నానావిధ ఆచారాల్లో మునిగి పోయారు. ఇది చాలా చెడ్డ విషయం.*

*యూదులు కానట్లయితే ఎవరూ స్వర్గంలోకి ప్రవేశించలేరని యూదులు వాదించడాన్ని, క్రైస్తవులు కానివారు స్వర్గంలోకి ప్రవేశించలేరని క్రైస్తవులు అనడాన్ని ఈ సూరా ప్రస్తావించింది. ఇలా అనడానికి వారి వద్ద ఎలాంటి ఆధారమూ, ఎలాంటి*

నిరూపణ లేదనీ, నిజమైన విశ్వాసిగా దేవునికి తనను తాను సమర్పించుకున్న వ్యక్తి, సదాచరణలకు కట్టుబడిన వ్యక్తి ఎవరైనాగాని స్వర్గంలోకి ప్రవేశించగలడని ఈ సూరా వివరించింది. తౌరాత్, ఇంజీల్‌లలోని దైవసందేశాన్ని మార్పులు చేర్పులకు గురిచేసి, అమాయకులను దారి తప్పించిన పండితుల గురించిన ప్రస్తావన కూడా ఈ సూరాలో ఉంది.

క్రైస్తవ వాదనలను కూడా ఈ సూరా తిప్పికొట్టింది. అల్లాహ్ ఒక కుమారుడిని దత్తత చేసుకున్నాడన్న వాదనను ఖండిస్తూ అల్లాహ్ ఔన్నత్యాన్ని చాటిచెప్పింది.

ఆ కాలంలో మదీనాలో కొత్తగా ఏర్పడిన ఇస్లామీయ రాజ్యానికి అత్యవసరమైన ఇస్లామీయ చట్టపరమైన ఆదేశాలు ఈ సూరాలో ఉన్నాయి. ఇవి నేటికి కూడా ముస్లిమ్ సముదాయానికి ఎంతో ముఖ్యమైనవి. ప్రజల సామూహిక జీవనానికి సంబంధించిన ముఖ్యమైన వ్యవహారాల గురించిన ఆదేశాలు, వివరణలు ఈ సూరాలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ సూరా కుటుంబ వ్యవహారాలను విశదీకరించింది. కుటుంబాన్ని ఒక సత్సమాజానికి పునాది రాయిగా పరిగణించింది. ఈ సూరాలో వ్యాపార వ్యవహారాలను ప్రోత్సహించడం జరిగింది. అయితే ఇతరుల నుంచి వడ్డీ తీసుకోవడం, లేదా ఇతరులకు వడ్డీకి రుణం ఇవ్వడంతోపాటు వడ్డీకి సంబంధించిన సమస్త రూపాలను నిషేధించడం జరిగింది. వడ్డీని తక్షణం మానుకోవాలని హెచ్చరించడం జరిగింది.

కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన అనేక అంశాలు ఈ సూరాలో ఉన్నాయి. భార్యకు ఆర్థికంగాను, మానసికంగాను భర్త తోడుగా ఉండాలని పేర్కొంది. భార్యాభర్తల మధ్య లైంగిక సంబంధాన్ని గురించిన బోధనలు ఉన్నాయి. భార్య రుతుకాలంలో ఉన్నప్పుడు భర్త ఆమెకు లైంగికంగా దూరంగా ఉండాలనీ, విడాకులకు సంబంధించి – విడాకుల తర్వాత భార్యాభర్తలు మంచితనంతో, పరస్పర గౌరవాదరాలను పాటిస్తూ విడిపోవాలని, విడాకులు పొందిన స్త్రీ మూడు రుతుస్రావాల కాలంపాటు పునర్వివాహం చేసుకోకుండా ఆగాలని బోధించడం జరిగింది. వితంతువైన స్త్రీ భర్త మరణం తర్వాత నాలుగు మాసాల పది రోజుల పాటు వేచి ఉండాలని బోధించడం జరిగింది.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 6 – 7 | 225, 232, 240, 243, 257, | 'ఇస్లామీయ యుగం' 'తలబిరుసు తిరస్కారం' 'అబూ జహల్ మొండి తనం' 'అల్లాహ్‌మార్గంలో ప్రస్థానం' | ఎవరండీ ఆ దౌర్భాగ్యులు?! నిజ దేవుడైన అల్లాహ్ సందేశం దివ్యఖుర్ఆన్ వాక్యాల రూపంలో మాటిమాటికీ తమ కళ్ల ముందుకు వస్తున్నప్పటికీ, సత్యధర్మం గురించి అసలు తమకు ఏమీ తెలీనట్టు నటించిన ఆ అభాగ్య జనులు అసలెవరండీ? ముహమ్మద్(స) వారి శాంతియుత ఉద్యమానికి ఎదురు తిరిగి 'మొట్టమొదటి తిరస్కారులు'గా దైవగ్రంథంలో ప్రస్తావనకు వచ్చిన ఆ పరలోక దురదృష్టవంతులెవరూ?! |
| 8 – 20 | 268, 271, 287, 321 337, 348 | 'ఉహుద్‌పోరాటం' 'కందకయుద్ధం' 'భగ్గుమన్న ప్రాంతీయ విభేదాలు' 'కపటుల మస్జిద్' | కపటుల చరిత్ర, వారి పూర్వాపరాలు, మదీనా నగరంలో ముహమ్మద్ (స)కు, ముస్లింలకు వ్యతిరేకంగా వారు ఆడిన కపట నాటకాలు – తదితర విషయాలు. |

| | | | |
|---|---|---|---|
| 29 - 39 | 1 - 7 | 'సృష్టికథ' 'మానవ సృష్టి' 'ఇబ్లీస్ ప్రతీకారం' | సప్తాకాశాలను, సమస్త సృష్టిరాశులను అల్లాహ్ ఉనికిలోనికి తెచ్చిన తీరు, భూమి మీద కాలు మోపిన మొట్టమొదటి మానవుడెవరు? మనిషి అంటే షైతాన్‌కు ఎందుకంత అసూయ, కోపం? |
| 40 - 44 | 57 | 'దైవప్రవక్త యాఖూబ్' | ఇస్రాయీల్ సంతతి మూలపురుషుడు దైవప్రవక్త యాఖూబ్ (అ). ఆయనపై అల్లాహ్ అనుగ్రహాలు వర్షించాయి. ఆయన సంతతిలో ఎంతోమంది ప్రవక్తలు జన్మించారు. ఇస్రాయీల్ జాతివారి గతం ఎంత వైభవోపేతమో?! |
| 49 | 83 | 'దైవప్రవక్త మూసా, ఇస్రాయీల్ జాతి వారి విమోచన కర్త' | ఫిర్ఔన్ రాజ్య బానిసత్వంలో మగ్గుతున్న ఇస్రాయీల్ జాతి వారికి మూసా (అ) అల్లాహ్ సహాయంతో విముక్తిని కలిగించారు కదా?! అదెప్పుడు జరిగింది? ఎలా జరిగింది? |
| 50 | 97 | 'సముద్రం చీలటం' | ఇస్రాయీల్ జాతివారిని దైవప్రవక్త మూసా అద్భుత రీతిలో సముద్రం దాటించి ఆవలి ఒడ్డుకు తీసుకుని వెళ్లారు. అరుదైన ఆ సన్నివేశం పాఠకుల కళ్లకు కట్టినట్లు..... |
| 51 | 99-105 | 'ఆధ్యాత్మిక ప్రక్షాళన' 'బంగారు ఆవుదూడ' 'అల్లాహ్ అనుగ్రహాలు' | ఇస్రాయీల్ జాతి వారు అల్లాహ్ మేలు మరచి ఆవుదూడను పూజించిన పరిస్థితులేవి? అనంతరం వారి పరిణామం ఏమయింది? అల్లాహ్ వారిని తిరిగి అనుగ్రహించాడా? |
| 65 - 66 | 133 | 'సబ్బత్ నియమ అతిక్రమణ' | పూర్వకాలంలోని యూదులు కొందరు శనివారంరోజు చేపలు పట్టి అల్లాహ్ ఆదేశాలను బేఖాతరు చేసిన తీరు. చివరికి వారు దైవాగ్రహానికి గురి కావటం. |
| 67 - 73 | 111 | 'దైవమార్గంలో వదలివేయబడిన ఆవుదూడ' | ఇస్రాయీల్ జాతివారు ఆవుదూడను ఎందుకు బలి ఇవ్వవలసి వచ్చింది? ఆ ఆవు వారికి ఎక్కడ లభించింది? వారి యక్ష ప్రశ్నల లోగుట్టు ఏమిటి? |
| 87 | 189 - 193 | 'నవజాత శిశువు మాట్లాడటం' 'జిబ్రయీల్ దూత రాక' 'విందులో మహత్యం' | అల్లాహ్ యేసు ప్రవక్తకు ఇచ్చిన స్పష్టమైన నిదర్శనాలేవి? జిబ్రయీల్ దూత ద్వారా యేసు ప్రవక్తకు ఏ విధంగా సహాయం అందింది? అల్లాహ్ అనుజ్ఞతో ఆయన ఎటువంటి అద్భుతాలు చూపించగలిగారు? |
| 87 | 179 | 'యహ్యా జననం' 'అవిశ్వాసుల చేతుల్లో హత్యకు గురికావటం' | అలనాటి యూదులు దైవప్రవక్తలను హింసించి, వేధించి చివరకు వారిని హత్య చేసిన ఉదంతం మచ్చుకు ఒకటి. |
| 102 | 136 - 146 | 'దైవప్రవక్త సులైమాన్' | ఆయన గురించిన తేటమైన నిజాలు. యూదజాతి ప్రజలు కల్పించిన కల్లబొల్లి విషయాలు. ఆయన ఇంద్రజాలికులు కానేకారు. నికార్సయిన దైవప్రవక్త, అద్భుత రాజ్యాధికారి. |
| 108 | 100-104, 111 | 'బంగారు ఆవుదూడ' 'సాకులు చెప్పే జనం' | మూసా ప్రవక్త పట్ల ఇస్రాయీల్ జాతి వారి అనుచిత వైఖరి, మూర్ఖ ప్రవర్తన. |
| 114 (పాద సూచికతో) | 243, 292-307 | 'వలస' 'ఇస్లాం విజయారంభం' 'హుదైబియా ఒప్పందం' | మక్కా అవిశ్వాసులు అంతిమ దైవప్రవక్త (స) వారిని కాబా గృహ సందర్శనం నుంచి ఎందుకు అడ్డుకున్నారు? |

| | | | |
|---|---|---|---|
| | | | సత్యధర్మాన్ని అణగద్రొక్కటానికి అందివచ్చిన ఏ అవకాశాన్నీ జారవిడువని మక్కా అవిశ్వాసులు తమ లక్ష్యంలో విజయం సాధించగలిగారా? |
| 116 | 159, 200 | 'ఉజైర్ – వందేళ్ళు నిదురపోయిన మనిషి' 'దైవ కుమారుడు?! ' | యూదులు ఉజైర్ ప్రవక్తను అల్లాహ్ కుమారునిగా ఊహించు కున్నారు. క్రైస్తవులేమో యేసు ప్రవక్తను దైవ కుమారునిగా ఎంచారు. మరి వారిని పుట్టించిన అల్లాహ్‌ను మరిచారు! |
| 124-134 | 30 – 80 | 'ఇబ్రాహీం ప్రవక్త' నుంచి ఆయన మునిమనవడు 'యూసుఫ్ ప్రవక్త' వరకు. | దైవప్రవక్త ఇబ్రాహీం (అ) జీవితంలో ఎదుర్కొన్న కఠిన పరీక్షలు, క్లిష్ట సమస్యలు. నిరుపమానమైన ఆయన సహన స్థయిర్యాలు. ఆయనపై అల్లాహ్ కరుణ. ఆయన సంతా నంలో ప్రవక్తల పరంపర. |
| 137 (పాద సూచికతో సహా) | 280 – 284 | 'పొరబాటుగా జరిగిన ప్రతీకారం' 'కుట్ర' 'ద్రోహుల బహిష్కరణ' | ఇస్లాంకు వ్యతిరేకంగా అలనాటి యూదులు పన్నిన కుట్రలు. దైవప్రవక్త (స) పై వారి హత్యాయత్నం. నేరస్తులకు తగిన ప్రతీకారం. |
| 191 (పాద సూచికతో సహా) | 250, 271, 292, 308, 319 | 'బద్ర్ యుద్ధం' 'ఉహుద్ పోరాటం' | విశ్వాసులపై దైవ తిరస్కారుల దౌర్జన్యకాండ. విశ్వాసులు ఆయుధాలు ఎందుకు చేపట్టవలసి వచ్చింది? ప్రపంచ ప్రజలకు ఆదర్శప్రాయమైన దుష్టశిక్షణ. |
| 214 (పాద సూచికతో సహా) | 225 – 230 | 'ఇస్లామీయ యుగం' 'అణచివేతలు' | ఇస్లాం ప్రారంభకాలంలో ముస్లిములు ఎటువంటి కష్టాల నెదుర్కొన్నారు? తమపై దౌర్జన్యాలు జరిగినప్పటికీ వారు కదలని కొండల్లా స్థిరంగా ఎలా నిలబడగలిగారు? |
| 217 | 250 | 'బద్ర్ యుద్ధం' 'పవిత్ర మాసాల్లో అతిక్రమణలు' | నిత్యం నేరాలు చేసే దైవధిక్కారులు ముస్లిముల వల్ల పొరపాటుగా జరిగిన ఒక దాడి గురించి కాకిగోల చేయటం |
| 247-251 | 118 -129 | 'మహారాజుగా మారిన పశువుల కాపరి' 'దావూద్ – జాలూత్' | అర్హతగల ఒక నిరుపేద వ్యక్తిని అల్లాహ్ ఇస్రాయీల్ జాతి వారికి నాయకునిగా నియమించాడు. ఆ వ్యక్తి ఎవరు? అల్లాహ్‌పై విశ్వాసం గల ఆయన అనుచరులు అతి కొద్ది మంది జాలూత్ మహాసైన్యాన్ని ఎలా జయించారు? |
| 258 | 35 | 'అగ్నిగుండం' | దేవుడు ఎవరనే విషయంపై దైవప్రవక్త ఇబ్రాహీంకు – నిరంకుశ రాజు నమ్రూద్‌కు మధ్య ఆసక్తికర సంవాదం. |
| 259 | 159 | 'ఉజైర్ – వందేళ్ళు నిదురపోయిన మనిషి' | మరణానంతర జీవితం గురించి అల్లాహ్ చూపించిన సజీవ నిదర్శనం |
| 260 | 31 | 'పక్షుల మహత్యం' | మరణానంతరం మనిషి ఎలా బ్రతుకుతాడో కళ్లారా చూడా లన్న ఇబ్రాహీం (అ) కుతూహలాన్ని మన్నించి అల్లాహ్ ఆయనకు ఆ దృశ్యాన్ని చూపించిన సంఘటన. |
| | | | |

## سُورَةُ البَقَرَة

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

الٓمّٓ ⑴

ذٰلِكَ الْكِتٰبُ لَا رَيْبَ ۛ فِيْهِ ۛ هُدًى لِّلْمُتَّقِيْنَ ⑵

الَّذِيْنَ يُؤْمِنُوْنَ بِالْغَيْبِ وَ يُقِيْمُوْنَ الصَّلٰوةَ وَ مِمَّا رَزَقْنٰهُمْ يُنْفِقُوْنَ ⑶

## అల్ బఖర[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** అలిఫ్ లామ్ మీమ్[2].

**2** ఈ గ్రంథం (అల్లాహ్‌గ్రంథం అన్న విషయం) లో ఎంతమాత్రం సందేహం లేదు.[3] భయభక్తులు కలవారికి ఇది సన్మార్గం చూపుతుంది.[4]

**3** వారు గోప్యమైన విషయాలను విశ్వసిస్తారు,[5] నమాజును నెలకొల్పుతారు.[6] ఇంకా మేము ప్రసాదించిన దానిలో (సంపదలో) నుంచి ఖర్చుపెడతారు.[7]

1. **'బఖర'** అంటే ఆవు అని అర్థం. ఈ సూరాలో ఆవు సంఘటన వచ్చింది. అందుకే ఈ సూరా బఖరా సూరా (ఆవు సంఘటన గల సూరా)గా వ్యవహరించబడింది. ఏ ఇంట్లోనయితే ఈ సూరా పఠించబడుతుందో ఆ ఇంటి నుంచి షైతాన్ పలాయనం చిత్తగిస్తాడని హదీసులో చెప్పబడింది. దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు : మీ ఇండ్లను శ్మశానాలుగా మార్చుకోకండి. ఏ ఇంట్లోనయితే బఖరా సూరా పఠించబడుతుందో ఆ ఇంట్లోకి షైతాన్ ప్రవేశించలేదు (సహీహ్ ముస్లిం). ఇది మహాప్రవక్త (స) మదీనాకు వచ్చిన తరువాత అవతరించిన తొలి సూరాలలోనిది. అయితే ఇందులోని కొన్ని వచనాలు ప్రవక్త (స)గారి అంతిమ హజ్ యాత్ర సందర్భంగా అవతరించాయి. కొంతమంది పండితుల ప్రకారం ఈ సూరాలో వెయ్యి సమాచారాలు, వెయ్యి ఆజ్ఞలు, వెయ్యి నిషిద్ధాంశాలున్నాయి (ఇబ్నె కసీర్).
2. **అలిఫ్ లామ్ మీమ్ :** ఇవి **'ముఖత్తఆత్'**గా వ్యవహరించబడ్డాయి. అంటే వేర్వేరుగా పఠించబడే అక్షరాలని భావం. వీటి అర్థానికి సంబంధించి ప్రమాణబద్ధమైన ఉల్లేఖనాలేవీ లేవు. వాస్తవం అల్లాహ్‌కే ఎరుక. అయితే దీనిపై మహనీయ ముహమ్మద్ (సఅసం) వారి ప్రవచనం ఉంది. ఆయన (స) ఇలా అన్నారు : "అలిఫ్- లామ్ - మీమ్ - ఒకే ఒక అక్షరమని నేననను. పైగా 'అలిఫ్' ఒక అక్షరం, 'లామ్' ఒక అక్షరం, 'మీమ్' ఒక అక్షరం. ఒక్కో అక్షరంపై ఒక్కో పుణ్యం ఉంది. ఒక్కో పుణ్యఫలం పదింతలు." (సుననె తిర్మిజీ : కితాబు ఫజాయిలిల్ ఖుర్ఆన్)
3. ఇది దైవగ్రంథం అన్న విషయంలో ఎలాంటి సంశయానికీ, సందిగ్ధానికి తావులేదు. దివ్య ఖుర్ఆన్‌లోనే మరోచోట సెలవీయబడినట్లు; "ఈ గ్రంథం సకల లోకాల ప్రభువు తరఫునుండి అవతరింపజెయ్యబడిందన్న విషయంలో సందేహానికి ఆస్కారం లేదు" (అస్ సజ్దహ్-2). కొందరు పండితులు "సందేహానికి ఆస్కారం లేదు" (లా రైబ ఫీహి) అంటే "అందులో సందేహానికి లోనుకాకండి" (లా తర్తాబూ ఫీహి) అన్న భావమని చెప్పారు. అంతేకాదు, ఈ గ్రంథంలో పేర్కొనబడిన సంఘటనలు సత్యమైనవనటంలో, ఇందులో వివరించబడిన ఆదేశాలు ఉపదేశాలు మానవతకు మోక్షప్రదాయని అనటంలో, దేవుని ఏకత్వానికి, దైవదౌత్యానికి, పరలోకానికి సంబంధించి ఇందులో విశదీకరించబడిన విశ్వాసాలు సత్యబద్ధమైనవి అనటంలో కించిత్ అనుమానానికి కూడా తావు లేదు.
4. **మార్గదర్శక గ్రంథం :** ఆ మాటకొస్తే ఈ గ్రంథం సమస్త మానవాళికి దారిచూపే గ్రంథమే. అయితే సన్మార్గం కోసం పరితపించేవారు, దైవభీతితో జీవించే ధన్యజీవులు మాత్రమే ఈ శుభాల సరోవరాన్ని తనివితీరా ఆస్వాదించగలుగుతారు. మరణానంతర జీవితంలో దేవుని దర్బారులో నిలబడి జవాబు చెప్పుకోవలసి ఉందన్న భావన లేనివారికి, సన్మార్గాన్ని పొందాలన్న ధ్యాస మనసులో లేనివారికి, కనీసం అపమార్గానికి దూరంగా ఉండాలన్న చింతన కూడా లేనివారికి మార్గదర్శకత్వం ఎక్కడి నుంచి లభిస్తుంది? ఎలా లభిస్తుంది? ఎందుకు లభిస్తుంది?
5. **గోప్యమైన విషయాలు ( الْغَيْب ):** అంటే భావం మనిషి దృష్టికి, ఊహకు, పంచేంద్రియాలకు అందనివి. ఉదాహరణకు:

**4** మేము నీ వైపుకు (అంటే ప్రవక్త వైపుకు) అవతరింపజేసిన దానినీ, నీకు పూర్వం అవతరింపజేసిన వాటినీ వారు విశ్వసిస్తారు.[8] పరలోకం పట్ల కూడా వారు దృఢనమ్మకం కలిగిఉంటారు.

وَالَّذِيْنَ يُؤْمِنُوْنَ بِمَآ اُنْزِلَ اِلَيْكَ وَمَآ اُنْزِلَ مِنْ قَبْلِكَ ۚ وَبِالْاٰخِرَةِ هُمْ يُوْقِنُوْنَ ؕ﴿4﴾

**5** ఇలాంటి వారే తమ ప్రభువు తరఫు నుంచి వచ్చిన సన్మార్గాన ఉన్నారు. సాఫల్యాన్ని పొందేవారు వీరే.[9]

اُولٰٓئِكَ عَلٰى هُدًى مِّنْ رَّبِّهِمْ ۗ وَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ﴿5﴾

అల్లాహ్ అస్తిత్వం, అల్లాహ్ సంకేతం, స్వర్గం, నరకం, దైవదూతల ఉనికి, సమాధి యాతన, ప్రళయదినాన మానవులను శరీరాల సమేతంగా సమీకరించటం – ఇత్యాది విషయాలు. ఇవి అగోచరమైనవి. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే దైవం మరియు దైవప్రవక్త (స) తెలియజేసిన బుద్ధికందని విషయాలను సత్యమని నమ్మటం విశ్వాసం (ఈమాన్)లో అంతర్భాగం. వీటి నిరాకరణ శుద్ధ అపమార్గం.

6. **నమాజును నెలకొల్పటం** అంటే నాగా లేకుండా, సమయపాలన చేస్తూ మరీ నమాజు చేయటమనీ, దైవప్రవక్త (స) చూపిన విధానాన్ని అనుసరించి నమాజు చేయటమనీ భావం. చిత్తశుద్ధి లోపించిన నమాజు, దైవప్రవక్త (స) సంప్రదాయానికి విరుద్ధంగా చేసే నమాజు నమాజే కాదు. కపటులు కూడా నమాజు చేస్తారు. కాని అది దైవ సన్నిధిలో స్వీకారయోగ్యమవుతుందా? (వివరాలకోసం అన్‌కబూత్ సూరా 45వ ఆయతు పాద సూచికను చూడండి).

7. **ఇన్‌ఫాఖ్** (ఖర్చుపెట్టడం) అనే పదం సర్వసాధారణమైనది. విధిగా ఇవ్వవలసిన దానాలు (సదఖాతె వాజిబా), స్వచ్ఛందంగా ఇచ్చే దానాలు (సదఖాతె నాఫిలా) – రెండూ ఇందులో చేరి ఉన్నాయి. విశ్వాసులైనవారు తమ శక్తి స్తోమతలనుబట్టి ఈ రెండు రకాల దానాలను కూడా మనస్ఫూర్తిగా ఇస్తారు. ఈ విషయంలో వారు ఎలాంటి లోటునూ, పిసినారితనాన్నీ కనబరచరు. తల్లిదండ్రులు, భార్యాపిల్లలపై సరైన విధంగా డబ్బు ఖర్చుపెట్టటం కూడా ఇందులో చేరి ఉంది. ఈ ఖర్చు కూడా పుణ్యప్రదమైనదే.

8. వెనుకటి గ్రంథాలను విశ్వసించటమంటే అర్థం, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) కు పూర్వం దైవప్రవక్తల – (అలైహిముస్సలాం)పై అవతరించిన గ్రంథాలను, సహీఫా (చిన్న ప్రతు) లను సత్యమని నమ్మటం. అయితే ఇప్పుడవి సిసలైన రూపంలో లేవు. ప్రక్షిప్తాలకు, మార్పులకు లోనైనాయి. కనుక ఇప్పుడవి ఆచరణయోగ్యం కావు. ఇప్పుడు కేవలం దివ్య ఖుర్ఆన్ మరియు దానికి తాత్పర్యంగా వున్న ప్రవక్త (స) ప్రవచనాలను మాత్రమే ఆచరించాలి. దైవదౌత్య పరంపర మహాప్రవక్త ముహమ్మద్ (స)తో పరిసమాప్తమైందన్న విషయం కూడా దీనిద్వారా తేటతెల్లం అయింది. ఒకవేళ మహాప్రవక్త (సఅసం) అనంతరం కూడా దైవసందేశం (వహీ) అవతరించవలసి వుంటే, దాన్ని కూడా తప్పక విశ్వసించాలన్న సంగతి ప్రస్తావించబడి ఉండేది. కాని అలాంటి ప్రస్తావన ఏదీ అంతిమ దైవగ్రంథంలో లేదు.

9. **సఫలీకృతులు :** ఇందులో విశ్వసించినవారి సత్పరిణామం సూచించబడింది. ఎందుకంటే వారు విశ్వసించిన మీదట గోళ్లు గిల్లుకుంటూ, దిక్కులు చూస్తూ కూర్చోలేదు. నిత్యం సదాచరణ చేస్తూ, దైవానికి భయపడుతూ జీవించారు. విశ్వాస సంస్కరణ పట్ల సదా శ్రద్ధ వహించారు. పరలోకంలో దైవప్రసన్నతను బడయటం, ఆయన కారుణ్యానికి, మన్నింపుకు నోచుకోవటమే సిసలయిన సాఫల్యం అని మరువరాదు. శాశ్వతమైన పరలోక సాఫల్యంతోపాటు ప్రాపంచిక జీవితంలో కూడా భాగ్యాలు, సుఖశాంతులు ప్రాప్తిస్తే, సుబ్‌హానల్లాహ్! ఇక కావలసిందేమిటి?! అయితే శాశ్విత జీవితానికి నిలయమైన పరలోక సాఫల్యమే అసలు సాఫల్యం.

దీని తరువాత అల్లాహ్ రెండో వర్గం వారి గురించి ప్రస్తావించాడు. వారు కేవలం అవిశ్వాసులు (కాఫిర్లు) మాత్రమేకాదు, అవిశ్వాసంలో, వైరవైఖరిలో వారు ఆఖరి అంచుల దాకా పోయారు. ఆ స్థితికి చేరుకున్న వారి నుంచి ఇక మంచిని, ఇస్లాం స్వీకరణను ఆశిస్తే అది అత్యాశే అవుతుంది.

**6** అవిశ్వాసులను నీవు భయపెట్టినా, భయపెట్టకపోయినా ఒకటే. ఇక వారు విశ్వసించరు.[10]

إِنَّ الَّذِينَ كَفَرُوا سَوَاءٌ عَلَيْهِمْ ءَأَنذَرْتَهُمْ أَمْ لَمْ تُنذِرْهُمْ لَا يُؤْمِنُونَ ⑥

**7** అల్లాహ్ వారి హృదయాలపై, వారి చెవులపై ముద్రవేశాడు. వారి కళ్ళపై పొర వుంది. ఇంకా వారికి మహా (ఘోరమైన) శిక్ష వుంది.[11]

خَتَمَ اللَّهُ عَلَىٰ قُلُوبِهِمْ وَعَلَىٰ سَمْعِهِمْ ۖ وَعَلَىٰ أَبْصَارِهِمْ غِشَاوَةٌ ۖ وَلَهُمْ عَذَابٌ عَظِيمٌ ⑦

**8** మేము అల్లాహ్ పట్ల, అంతిమదినం పట్ల విశ్వాసం కలిగి ఉన్నామని కొందరంటున్నారు. కాని యదార్థానికి వారు విశ్వసించినవారు కారు.[12]

وَمِنَ النَّاسِ مَن يَقُولُ آمَنَّا بِاللَّهِ وَبِالْيَوْمِ الْآخِرِ وَمَا هُم بِمُؤْمِنِينَ ⑧

10. అందరూ ముస్లింలు కావాలన్నది దైవప్రవక్త (సఅసం) ఆకాంక్ష! ఆ మేరకే ఆయన (స) తన వంతు కృషి సలిపారు. అయితే విశ్వాసం వారి అదృష్టంలో లేదని అల్లాహ్ తెలియపరచాడు. ధిక్కార వైఖరిపై మొండికేయటం మూలంగా వారి హృదయాలపై సీలు పడిపోయింది. (అబూజహల్, అబూలహబ్ తదితరులంతా ఈ కోవలోకి వస్తారు). అయితే అల్లాహ్ అనుగ్రహంతోనే ఆయన (సఅసం) గారి సందేశ ప్రధానమైన కృషి ఫలితంగా అసంఖ్యాక జనం ఇస్లాం స్వీకరించారు. కడకు అరేబియా ద్వీపమంతా ఇస్లాం పరిధిలోకి వచ్చేసింది.

11. ధిక్కార వైఖరిపై వారు పాతుకుపోవడానికి కారణం ఏమిటో ఈ వచనంలో తెలుపబడింది. నిరంతరం కుఫ్రుకు (దైవ తిరస్కారానికి), మహాపరాధాలకు పాల్పడుతూ ఉండటం మూలంగా వారి హృదయాలు తుప్పు పట్టిపోయాయి. సత్యాన్ని సత్యంగా ఒప్పుకునే గుణం వారిలో లేకుండాపోయింది. వారి చెవులు సత్యవాక్కును వినడానికి సన్నద్ధం కాలేదు. విశ్వవ్యవస్థలో నలువైపులా విస్తరించివున్న దైవనిదర్శనాలను తిలకించటంలో వారి నేత్రాలు విఫలమైనాయి. మరలాంటప్పుడు వారు దైవాన్ని ఎలా విశ్వసిస్తారు? దేవుడిచ్చిన శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటూ, జీవన పరమార్థాన్ని తెలుసుకోవాలన్న ఆరాటంలో ఉండే ధన్యజీవులకు మాత్రమే ఈమాన్ (విశ్వాస) భాగ్యం ప్రాప్తిస్తుంది. లేనిపక్షంలో జనులకు క్రింద పేర్కొనబడే హదీసు వర్తిస్తుంది–

"విశ్వాసి పాపం చేసినప్పుడు అతని హృదయంపై ఒక నల్లని మచ్చ ఏర్పడుతుంది. తరువాత పశ్చాత్తాపం చెంది పాపకార్యాలకు దూరంగా మసలుకుంటే అతని హృదయంపై ఉన్న మచ్చ తొలగిపోయి, మునుపటిలా అతని హృదయం నిర్మలంగా, నిష్కళంకంగా తయారవుతుంది. ఒకవేళ అతగాడు పశ్చాత్తాపం చెందే బదులు నిరంతరం పాపిష్టి పనులకు పాల్పడసాగితే నల్లని మచ్చ క్రమంగా విస్తరిస్తూ హృదయాన్నంతటినీ ఆవరిస్తుంది." హృదయాలకు తుప్పు పట్టటమంటే ఇదే!

ఈ తుప్పును గురించే (దివ్య ఖుర్ఆన్లో) అల్లాహ్ ఈ విధంగా అభివర్ణించాడని మహనీయ ముహమ్మద్ (స) చెప్పారు – "వారి దుష్కార్యాల మూలంగా వారి హృదయాలకు తుప్పు పట్టింది." (అల్ ముతప్ఫిఫీన్-14). (తిర్మిజీలో ముతఫ్ఫిఫీన్ సూరాకు వ్యాఖ్యానంగా ఈ హదీసు వచ్చింది). ఈ స్థితిని దివ్యఖుర్ఆన్ **"ముద్ర వేయబడటం"** (ఖత్మ్)గా వర్ణించింది. నిరాఘాటంగా వారు సాగిస్తూపోయిన దుష్కార్యాల మూలంగా అనివార్యంగా సంభవించిన పరిణామం అది! దీన్నే మరికొన్ని చోట్ల క్రింది వాక్యాలతో ప్రస్తావించటం జరిగింది –

"వారి అవిశ్వాస వైఖరి కారణంగా అల్లాహ్ వారి హృదయాలపై ముద్రవేశాడు." *(అన్ నిసా – 155)*

12. ఇక్కడి నుంచి మూడో వర్గం – కపట వర్గం – ప్రస్తావన మొదలవుతుంది. వారి హృదయాలు విశ్వాస భాగ్యానికి నోచుకోలేదు. అయితే వారు విశ్వాసులను మోసగించే ఉద్దేశంతో వారి ముందు విశ్వాస ప్రకటన చేసేవారు. వాళ్ళు అల్లాహ్ను గానీ, విశ్వాసులను గానీ మోసగించలేరు. ఎందుకంటే అల్లాహ్ సర్వాన్నీ ఎరిగినవాడు. ముస్లింలకు సయితం ఆయన తన సంకేతం (వహీ) ద్వారా కపటుల కుయుక్తులను గురించి ఎప్పటికప్పుడు తెలియజెప్పేవాడు.

**9** వారు అల్లాహ్‌ను, విశ్వాసులనూ మోసపుచ్చుతున్నారు. అయితే వాస్తవానికి వారు స్వయంగా – తమను తామే మోస పుచ్చుకుంటున్నారు. కాని ఈ విషయాన్ని వారు గ్రహించటం లేదు.

يُخٰدِعُوْنَ اللّٰهَ وَالَّذِيْنَ اٰمَنُوْا ۚ وَمَا
يَخْدَعُوْنَ اِلَّاۤ اَنْفُسَهُمْ وَمَا يَشْعُرُوْنَ ۝٩

**10** వారి హృదయాలలో రోగం ఉంది. ఆ రోగాన్ని అల్లాహ్ మరింతగా పెంచాడు.[13] ఇంకా, వారు చెప్పే అబద్ధం మూలంగా వారి కొరకు వ్యధాభరితమయిన శిక్ష ఉంది.

فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ ۙ فَزَادَهُمُ اللّٰهُ مَرَضًا ۚ
وَلَهُمْ عَذَابٌ اَلِيْمٌ ۢ ۙ بِمَا كَانُوْا يَكْذِبُوْنَ ۝١٠

**11** "భూమిలో కల్లోలాన్ని రేకెత్తించకండి" అని వారితో అన్నప్పు డల్లా, "మేము దిద్దుబాటుకు ప్రయత్నించేవారం మాత్రమే" అని వారు సమాధానమిస్తారు.

وَاِذَا قِيْلَ لَهُمْ لَا تُفْسِدُوْا فِي الْاَرْضِ ۙ
قَالُوْۤا اِنَّمَا نَحْنُ مُصْلِحُوْنَ ۝١١

**12** జాగ్రత్త! నిజానికి కల్లోల జనకులు వీరే.[14] కాని వారికి ఆ విషయం తెలియటం లేదు.

اَلَاۤ اِنَّهُمْ هُمُ الْمُفْسِدُوْنَ وَلٰكِنْ
لَّا يَشْعُرُوْنَ ۝١٢

**13** "ఇతరులు (అంటే ప్రవక్త ప్రియ సహచరులు) విశ్వసించినట్లే మీరూ విశ్వసించండి" అని వారితో చెప్పినప్పుడు, "మూర్ఖ జనులు విశ్వసించినట్లుగా మేము విశ్వసించాలా?"[15] అని వారు (ఎదురు) ప్రశ్న వేస్తారు. తస్మాత్! ముమ్మాటికీ వీరే మూర్ఖులు. కాని ఆ సంగతి వీరికి తెలియటం లేదు.[16]

وَاِذَا قِيْلَ لَهُمْ اٰمِنُوْا كَمَاۤ اٰمَنَ النَّاسُ قَالُوْۤا
اَنُؤْمِنُ كَمَاۤ اٰمَنَ السُّفَهَآءُ ۗ اَلَاۤ اِنَّهُمْ هُمُ
السُّفَهَآءُ وَلٰكِنْ لَّا يَعْلَمُوْنَ ۝١٣

ఆ విధంగా ఆ వంచకుల ఎత్తుగడలన్నీ ఖుద్దుగా వారికే నష్టం చేకూర్చాయి. వారు తమ పరలోక జీవితాన్ని ఎలాగూ పాడు చేసుకున్నారు. అయితే ఇహలోకంలో సయితం వారికి మిగిలింది పరాభవమే!

13. రోగం అంటే అర్థం ధిక్కార రోగం! కాపట్య రోగం! దాన్ని నయం చేసే ఉపాయం గనక ఆలోచించకపోతే, అది రోజురోజుకూ పెరుగుతూ పోతుంది. అలాగే అబద్ధాలు చెప్పటం, డాంబికాలు పలకటం కూడా కాపట్య లక్షణాలే. అందుకే అసత్యాలకు, కల్లబొల్లి మాటలకు కడు దూరంగా ఉండాలి.

14. **'కల్లోలం'** (ఫసాద్) అనేది **'సంస్కరణ'** (సలాహ్)కు వ్యతిరేక పదం. అవిశ్వాస వైఖరి ద్వారా, వంచనా పూరితమయిన చేష్టల ద్వారా లోకంలో అరాచకం, అశాంతి, అలజడులు చెలరేగుతాయి. దైవవిధేయతా విధానాల ద్వారా సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. తరతరాలుగా, యుగయుగాలుగా కపటులు చేసిందల్లా ఒక్కటే – కల్లోలాన్ని వ్యాపింపజేయటం, చెడులను ప్రాచుర్యంలోనికి తీసుకురావటం, దేవుని హద్దులను అతిక్రమించటం! ఇంత చేసి కూడా కపటులు తమను గొప్ప సంస్కర్తలుగా, శ్రేయోభిలాషులుగా చెప్పుకుంటారు.

15. అల్లాహ్‌ను విశ్వసించి, అల్లాహ్ మార్గంలో ధనప్రాణాలను అర్పించడానికి ఎన్నడూ వెనుకాడని ప్రవక్త ప్రియ సహచరులను ఈ కపటులు "మూర్ఖుల" క్రింద జమకట్టారు. ప్రవక్త ప్రియసహచరుల విశ్వాసాన్ని శంకించేవారు నేటికీ ఉన్నారు. అల్లాహ్ ఆనాటి కపటులను, నేటి కపటులను కూడా నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాడు. మహదాశయం కోసం ప్రాపంచిక స్వలాభాలను పణంగా పెట్టడం 'మూర్ఖత్వం' కానేకాదు. పైగా అదెంతో వివేకవంతమైన పని. మహాభాగ్యం. ఈ భాగ్యం కోసమే ప్రవక్త ప్రియ సహచరులు మొక్కవోని సాహసాన్ని ప్రదర్శించారు. అందువల్లనే వారు నికార్సయిన విశ్వాసులుగానే కాకుండా 'ఈమాన్' అనే దానికి ఒక ప్రమాణాన్ని, గీటురాయిని నెలకొల్పారు.

14 విశ్వాసులను కలుసుకున్నప్పుడు వారు,"మేమూ విశ్వసించిన వారమే" అని అంటారు. కాని తమ షైతానుల (అంటే తమ పెద్దల లేక సర్దారుల) వద్దకు పోయినప్పుడు,[17] "మేము మీతోనే ఉన్నామండీ. కాకపోతే వాళ్ళతో పరిహాసమాడుతున్నామంతే" అని పలుకుతారు.

وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوا آمَنَّا وَإِذَا خَلَوْا إِلَىٰ شَيَاطِينِهِمْ قَالُوا إِنَّا مَعَكُمْ إِنَّمَا نَحْنُ مُسْتَهْزِئُونَ ⑭

15 అల్లాహ్ కూడా వారితో పరిహాసమాడుతున్నాడు.[18] వారి తలబిరుసుతనాన్ని మరింత అధికం చేస్తున్నాడు. ఫలితంగా వారు అంధులై గమ్యరహితంగా తిరుగుతూ పోతున్నారు.

اللَّهُ يَسْتَهْزِئُ بِهِمْ وَيَمُدُّهُمْ فِي طُغْيَانِهِمْ يَعْمَهُونَ ⑮

16 అపమార్గాన్ని సన్మార్గానికి బదులుగా కొనితెచ్చుకున్నవారు వీరే.[19] అందుచేత వారి ఈ వర్తకం వారికి లాభదాయకమూ కాలేదు, వారు సన్మార్గానికి నోచుకోనూ లేదు.

أُولَٰئِكَ الَّذِينَ اشْتَرَوُا الضَّلَالَةَ بِالْهُدَىٰ فَمَا رَبِحَت تِّجَارَتُهُمْ وَمَا كَانُوا مُهْتَدِينَ ⑯

---

కాబట్టి ఇక ప్రవక్త ప్రియసహచరుల మాదిరిగా విశ్వసించినవారి "విశ్వాసమే" ఎన్నదగినదవుతుంది. "మీరు విశ్వసించినట్లే వారు కూడా విశ్వసిస్తే అప్పుడు వారు సన్మార్గాన ఉన్నట్లు లెక్క." (అల్ బఖర : 137)

16. తొందరగా లభించే లాభం కోసం ఆలస్యంగా ప్రాప్తించే లాభాన్ని ఉపేక్షించటం, శాశ్వతమైన పరలోక జీవితంపై క్షణభంగురమైన ప్రాపంచిక జీవితానికి ప్రాధాన్యత నివ్వటం, అల్లాహ్‌కు బదులు జనసామాన్యానికి భయపడటం శుద్ధ అవివేకం! ప్రథమ శ్రేణి మూర్ఖత్వం! కపటులు పప్పులో కాలేసింది ఇక్కడే. తిరుగులేని ఒక యదార్థాన్ని వారు తెలుసుకోలేకపోయారు.

17. అరబీలో **'షైతానులు'** (شَيَاطِين) అని అనబడింది. ఇక్కడ షైతానులు అంటే ఖురైషు సర్దారులు, యూదులు అని భావం. వారి ప్రోద్బలంపైనే ఈ కపటులు ఇస్లాం మరియు ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలు పన్నేవారు. లేక షైతానులు అంటే స్వయానా కపటుల సర్దారులు అయినా కావచ్చు.

18. అల్లాహ్ కూడా వారితో పరిహాసమాడుతున్నాడు : అంటే భావం వారు ముస్లింలతో ఏ విధంగా దాగుడుమూత లాడుతున్నారో అల్లాహ్ కూడా వారితో అదేవిధంగా ప్రవర్తిస్తూ వారిని అవమానానికి, పరాజయానికి లోనుచేస్తున్నాడు. దీన్నే పరిహాసంగా చెప్పబడింది. ఇది మాట తీరు. నిజానికి అది పరిహాసం కాదు, వారి పరిహాసానికి శాస్తి. దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడినట్లు, "చెడుకు ప్రతిఫలం అటువంటి చెడే" (షూరా – 40). అలాగే **"యుఖాదివూనల్లాహ వహువ ఖాదివుహుమ్"** (వారు అల్లాహ్‌ను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. నిజానికి అల్లాహ్‌యే వారిని మోసపుచ్చుతున్నాడు) **"వ మకరూ వ మకరల్లాహు"** – వారు అల్లాహ్‌పై కుట్రపన్నారు. అల్లాహ్ వారిపై కుట్రపన్నాడు– వంటి ఆయతులను కూడా ఉదాహరించవచ్చు. ఇంకొక అర్థం ఏమిటంటే ప్రళయదినాన అల్లాహ్ కూడా వారిని ఆట పట్టిస్తాడు. అల్ హదీద్ సూరాలోని 13వ సూక్తిలో **"యౌమ యఖూలుల్ మునాఫిఖూన..."** అనే ఆయతు క్రింద ఇది కూలంకషంగా వివరించబడింది.

19. ఇక్కడ వర్తకం అంటే భావం సన్మార్గాన్ని వదలిపెట్టి నష్టాన్ని చవిచూసే మార్గవిహీనతను అవలంబించటం. కపటులు కాపట్య ముసుగును వేసుకుని పొద్దస్తమానం నష్టకరమైన వ్యాపారం చేశారు. ఈ నష్టం పరలోకానికి సంబంధించిన నష్టం. ప్రపంచంలోనే ఈ నష్టం వీరికి తెలియాలని ఎక్కడా లేదు. పైగా వారు వేసే వంచనాశిల్ప ఎత్తుగడల ఫలితంగా – తాత్కాలికంగా – ఒనగూడే ప్రయోజనాలను చూసుకుని వారు మురిసిపోయేవారు. దీని ఆధారంగా తెలివి తమ సొత్తని తలపోసేవారు, ముస్లింలు తెలివి తక్కువవారనీ, తమతో వారు సరితూగలేరనీ కాకి లెక్కలు వేసుకునేవారు.

**17** వారి ఉపమానం నిప్పు రాజేసిన వ్యక్తి లాంటిది. నిప్పు రాజేసినంతనే పరిసరాల్లోని వస్తువులన్నీ వెలుగులోనికి వచ్చాయి. అంతలోనే అల్లాహ్ వారి వెలుగును హరించి, వారిని కారు చీకట్లలో, ఏమీ కానరాని స్థితిలో వదిలేశాడు.[20]

مَثَلُهُمْ كَمَثَلِ الَّذِي اسْتَوْقَدَ نَارًا فَلَمَّا أَضَاءَتْ مَا حَوْلَهُ ذَهَبَ اللَّهُ بِنُورِهِمْ وَتَرَكَهُمْ فِي ظُلُمَاتٍ لَا يُبْصِرُونَ ﴿17﴾

**18** వారు చెవిటివారు, మూగవారు, గ్రుడ్డివారు. ఇక వారు (సరైన దారికి) మరలి రారు.

صُمٌّ بُكْمٌ عُمْيٌ فَهُمْ لَا يَرْجِعُونَ ﴿18﴾

**19** లేదా (వారి ఉపమానం) ఆకాశం నుంచి కురిసే భారీ వర్షం మాదిరిగా ఉంది – అందులోనూ చిమ్మచీకట్లు, ఉరుములు, మెరుపులు! ఉరుముల గర్జన విని, మృత్యు భయంతో వారు తమ వ్రేళ్ళను తమ చెవులలో దూర్చుకుంటారు. అల్లాహ్ ఈ అవిశ్వాసులను అన్ని వైపుల నుంచీ ముట్టడిస్తాడు.

أَوْ كَصَيِّبٍ مِنَ السَّمَاءِ فِيهِ ظُلُمَاتٌ وَرَعْدٌ وَبَرْقٌ يَجْعَلُونَ أَصَابِعَهُمْ فِي آذَانِهِمْ مِنَ الصَّوَاعِقِ حَذَرَ الْمَوْتِ وَاللَّهُ مُحِيطٌ بِالْكَافِرِينَ ﴿19﴾

**20** మెరుపులు వారి దృష్టిని ఎగరవేసుకు పోతాయా! అన్నట్టుంది వారి పరిస్థితి. అవి (మెరుపు తీగలు) వెలుగును విరజిమ్మినపుడల్లా వారు అందులో కొంతదూరం నడుస్తారు. తర్వాత వారిపై చీకటి ఆవరించగానే నిలబడిపోతారు.[21] అల్లాహ్యే గనక తలచుకుంటే వారి వినేశక్తినీ, కంటిచూపునూ పోగొట్టేవాడే,[22] నిశ్చయంగా అల్లాహ్ అన్నింటిపై అధికారం గలవాడు.

يَكَادُ الْبَرْقُ يَخْطَفُ أَبْصَارَهُمْ كُلَّمَا أَضَاءَ لَهُمْ مَشَوْا فِيهِ وَإِذَا أَظْلَمَ عَلَيْهِمْ قَامُوا وَلَوْ شَاءَ اللَّهُ لَذَهَبَ بِسَمْعِهِمْ وَأَبْصَارِهِمْ إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿20﴾

20. అబ్దుల్లా బిన్ మస్వూద్, తదితర సహాబీలు (దైవప్రవక్త సహచరులు) దీని భావార్థాన్ని ఇలా వివరించారు: దైవప్రవక్త (సఅసం) మదీనా నగరానికి వచ్చినపుడు కొంతమంది ముస్లిములయ్యారు. కాని కొద్ది రోజుల్లోనే వారు కపట నాటకాలు మొదలెట్టారు. వారి ఉదాహరణ ఎటువంటిదంటే; ఒక వ్యక్తి చీకట్లో ఉన్నాడు. అతడు నిప్పు రాజేశాడు. దాంతో పరిసరాలు వెలుగుమయమయ్యాయి. ప్రయోజనకరమయిన వస్తువులు ఎక్కడున్నాయో, హానికరమయినవి ఎక్కడున్నాయో అతను చూసుకున్నాడు. కాని అంతలోనే అకస్మాత్తుగా వెలుగు పోయింది. మునుపటిలాగే అతను తిరిగి చీకటిలో చిక్కుకుపోయాడు. కపటుల పరిస్థితి కూడా ఇంతే. మొదట వారు షిర్క్ (బహుదైవారాధన) అనే తమస్సులో ఉన్నారు. తరువాత ఇస్లాం స్వీకరించి వెలుగులోకి వచ్చారు. ధర్మాధర్మాలను, ఉచితానుచితాలను తెలుసుకున్నారు. కాని ఉన్నట్టుండి వారు అవిశ్వాసం వైపునకు, కాపట్యం వైపునకు తిరిగిపోయారు. అందుచేత వారి వెలుగంతా కనుమరుగైపోయింది (ఫత్హుల్ ఖదీర్).

21. వీళ్లు కపటులలోని వేరొక వర్గం వారు. వారిపై ఒక్కోసారి సత్యం ప్రస్ఫుటమవుతుంది. మరి అంతలోనే వారు సంశయంలో, సందిగ్ధంలో పడిపోతూ ఉంటారు. వారి మనోగతం చీకటిలో ధారాపాతంగా కురిసే వర్షం లాంటిది. ఉరుములు, మెరుపులకు వారి హృదయాలు కంపిస్తూ ఉంటాయి. భయం కొద్దీ వారు తమ వ్రేళ్లను చెవుల్లో దూర్చుకుంటారు. అయితే వారి ఈ ఉపాయం వారిని అల్లాహ్ పట్టునుంచి కాపాడదు. ఎందుకంటే వారు అల్లాహ్ దిగ్బంధం నుంచి తప్పుకోలేరు. సత్య కిరణాలు వారిపై పడినప్పుడల్లా వారు సత్యం వైపునకు మొగ్గుచూపుతారు. కాని ఇస్లాం మరియు ముస్లిములపై కష్టకాలం వచ్చిపడగానే కలవరం చెందుతారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్). ఈ విధంగా కపటుల వర్గం సదా డోలాయమాన స్థితిలో ఉండి సత్యానికి (ఇస్లాంకు) దూరమైపోతుంది.

22. ఇదొక హెచ్చరిక. అల్లాహ్ గనక తలచుకుంటే తాను ప్రసాదించిన శక్తిసామర్థ్యాలను నిర్వీర్యం గావించగలడు. జప్తు

**21** ప్రజలారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ పుట్టించిన మీ ప్రభువునే ఆరాధించండి–తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు.

يَٰٓأَيُّهَا ٱلنَّاسُ ٱعۡبُدُواْ رَبَّكُمُ ٱلَّذِي خَلَقَكُمۡ وَٱلَّذِينَ مِن قَبۡلِكُمۡ لَعَلَّكُمۡ تَتَّقُونَ ﴿٢١﴾

**22** ఆయనే మీ కోసం భూమిని పాన్పుగానూ, ఆకాశాన్ని కప్పుగానూ చేశాడు, ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, తద్వారా పండ్లు ఫలాలను పండించి మీకు ఉపాధినొసగాడు. ఇది తెలిసి కూడా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి.[23]

ٱلَّذِي جَعَلَ لَكُمُ ٱلۡأَرۡضَ فِرَٰشٗا وَٱلسَّمَآءَ بِنَآءٗ وَأَنزَلَ مِنَ ٱلسَّمَآءِ مَآءٗ فَأَخۡرَجَ بِهِۦ مِنَ ٱلثَّمَرَٰتِ رِزۡقٗا لَّكُمۡۖ فَلَا تَجۡعَلُواْ لِلَّهِ أَندَادٗا وَأَنتُمۡ تَعۡلَمُونَ ﴿٢٢﴾

**23** మేము మా దాసునిపై అవతరింపజేసిన దాని విషయంలో ఒకవేళ మీకేదన్నా అనుమానముంటే, అటువంటిదే ఒక్క సూరానైనా (రచించి) తీసుకురండి. మీరు సత్యవంతులే అయితే (ఈ పని కోసం) అల్లాహ్‌ను తప్ప మీ సహాయకులందరినీ పిలుచుకోండి.[24]

وَإِن كُنتُمۡ فِي رَيۡبٖ مِّمَّا نَزَّلۡنَا عَلَىٰ عَبۡدِنَا فَأۡتُواْ بِسُورَةٖ مِّن مِّثۡلِهِۦ وَٱدۡعُواْ شُهَدَآءَكُم مِّن دُونِ ٱللَّهِ إِن كُنتُمۡ صَٰدِقِينَ ﴿٢٣﴾

**24** ఒకవేళ మీరు గనక ఈ పని చెయ్యకపోతే–ఎన్నటికీ అది మీ వల్ల కాని పనే–[25] (దీన్ని సత్యమని ఒప్పుకుని) మానవులు, రాళ్ళు ఇంధనం కాగల ఆ అగ్ని నుండి (మిమ్మల్ని మీరు) కాపాడుకోండి.[26] అది సత్య తిరస్కారుల కోసం తయారు చేయబడింది.[27]

فَإِن لَّمۡ تَفۡعَلُواْ وَلَن تَفۡعَلُواْ فَٱتَّقُواْ ٱلنَّارَ ٱلَّتِي وَقُودُهَا ٱلنَّاسُ وَٱلۡحِجَارَةُۖ أُعِدَّتۡ لِلۡكَٰفِرِينَ ﴿٢٤﴾

---

చేసుకోగలదు. అందుకే మానవులు ఎట్టి పరిస్థితిలోనూ దైవ విధేయత పట్ల విముఖత చూపటంగానీ, ఆయన శిక్ష పట్ల నిర్భయంగా, నిశ్చింతగా ఉండటంగానీ చేయరాదు.

23. సన్మార్గం, అపమార్గం రీత్యా మనుషుల్లోని మూడు వర్గాలను ప్రస్తావించిన తరువాత దేవుని ఏకత్వం వైపునకు, దైవారాధన వైపునకు సమస్త మానవాళికి పిలుపు ఇవ్వటం జరిగింది. మిమ్మల్నీ, సమస్త విశ్వాన్ని సృష్టించినవాడు అల్లాహ్ అయినప్పుడు, మీ అవసరాలను, జీవన సామగ్రిని సమకూర్చేవాడు కూడా ఆయనే అయినప్పుడు, ఆయన్ని వదలిపెట్టి ఇతరులను ఎందుకు ఆరాధిస్తారు? ఇతరులను ఆయనకు సహవర్తులుగా ఎందుకు కల్పిస్తారు? దైవాగ్రహం నుంచి మీరు సురక్షితంగా ఉండాలంటే మీరు చేయవలసిందల్లా ఒక్కటే–ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధించండి, అన్నీ తెలిసి కూడా షిర్క్ (బహుదైవోపాసనా) చేష్టలకు ఒడిగట్టకండి. ఇందులోనే మీ శ్రేయం ఇమిడి ఉంది.

24. తౌహీద్ (దేవుని ఏకత్వం) తరువాత రిసాలత్ (దైవదౌత్యం) గురించి చెప్పబడింది. మేము మా దాసుని (అంటే మహాప్రవక్త ముహమ్మద్)పై అవతరింపజేసే గ్రంథం మా తరఫునే అవతరింపజేయబడిందన్న విషయంలో ఏమాత్రం సందేహమున్నా మీరు మీ సమూహాన్నంతటినీ సహాయం కోసం పిలుచుకుని దీన్ని పోలిన ఒక్క సూరానైనా తయారుచేయండి అని అల్లాహ్ సవాలు విసిరాడు. ఒకవేళ మీరు ఇలా చేయలేకపోతే, నిజంగా ఈ వాక్కు మానవమాత్రుని వాక్కు కాదని గ్రహించాలి, ఇది దైవవాక్కేనని తెలుసుకున్న మీదట మీరు అల్లాహ్‌ను, ముహమ్మద్ దౌత్యాన్నీ బేషరతుగా విశ్వసించి నరకాగ్ని నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలి. ఆ నరకాగ్ని సత్య తిరస్కారుల కోసం సిద్ధం చేయబడిందని అల్లాహ్ ఈ ఆయతులో విశదపరచాడు.

25. దివ్య ఖుర్‌ఆన్ సత్యబద్ధతకు ఇది స్పష్టమయిన నిదర్శనం. అరబ్బు, అరబ్బేతర అవిశ్వాసులందరికీ సవాలు చేయబడింది. కాని వారు నేటికీ ఆ సవాలును స్వీకరించలేకపోయారు. ప్రళయదినం వరకూ స్వీకరించలేరు కూడా.

**25** విశ్వసించి, సత్కార్యాలు చేసే వారికి[28] క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ)వనాల శుభవార్తలను అందజెయ్యి. తినడానికి అక్కడి పండ్లు వారికి ఇవ్వబడినప్పుడల్లా, "ఇలాంటి పండ్లే ఇంతకు మునుపు మాకు ఇవ్వబడినవి"[29] అని వారంటారు. నిజానికి పరస్పరం పోలి వుండే ఫలాలు వారికి ప్రసాదించ బడతాయి. వారి కొరకు పరిశుద్ధులైన[30] భార్యలుంటారు. వారు ఈ స్వర్గవనాలలో కలకాలం ఉంటారు.[31]

وَبَشِّرِ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ اَنَّ لَهُمْ
جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ ۗ كُلَّمَا رُزِقُوْا
مِنْهَا مِنْ ثَمَرَةٍ رِّزْقًا ۙ قَالُوْا هٰذَا الَّذِيْ
رُزِقْنَا مِنْ قَبْلُ ۙ وَاُتُوْا بِهٖ مُتَشَابِهًا ۗ وَلَهُمْ
فِيْهَآ اَزْوَاجٌ مُّطَهَّرَةٌ ۙ وَّهُمْ فِيْهَا خٰلِدُوْنَ ﴿٢٥﴾

26. ఇబ్నె అబ్బాస్ (రజి) దృష్టిలో 'రాళ్ళు' అంటే భావం గంధకపు రాళ్ళు కావచ్చు. మరి కొంతమంది దృష్టిలో రాళ్ళు అంటే రాతితో చేయబడిన విగ్రహాలు! ప్రజలు ప్రపంచంలో ఏ రాతి విగ్రహాలనైతే పూజించారో అవే రేపు నరకాగ్నికి ఇంధనం కాబోతున్నాయి. దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడినట్లు, "నిస్సందేహంగా మీరూ, అల్లాహ్‌ను కాదని మీరు పూజించే చిల్లరదైవాలు నరకానికి ఇంధనం అవుతారు" (అంబియా – 98). మరిన్ని వివరాల కోసం అంబియా సూరాలోని 98 – 101 ఆయతులను, జుఖ్రుఫ్ సూరాలోని 58వ ఆయతుకు వివరణను చూడండి.

27. ఈ ఆయతు ద్వారా అవగతమయ్యే ఒక ముఖ్య విషయమేమిటంటే నరకం అసలు సత్యతిరస్కారుల కోసం, బహుదైవోపాసకుల కోసం నిర్మించబడింది. రెండో విషయం ఏమిటంటే స్వర్గనరకాలు ప్రస్తుతం ఉనికిలోనే ఉన్నాయి. ఇది ఉమ్మత్‌కు చెందిన సలఫ్‌ల దృఢ విశ్వాసం. కొంతమంది కుహనా అభ్యుదయ పండితులు, హదీసు తిరస్కారులు వ్యాఖ్యానించినట్లుగా స్వర్గనరకాలు ఉపమానం నిమిత్తం చెప్పబడినవి కావు.

28. విశ్వాసం (ఈమాన్)తో పాటు సదాచరణ (అమలె సాలెహ్)ను దివ్యఖుర్ఆన్ అన్నిచోట్లా కలిపి ప్రస్తావించటంలోని మర్మం ఏమిటంటే ఈ రెంటికీ మధ్య విడదీయరాని సంబంధం ఉంది. సదాచరణ లేకుండా విశ్వాసం ఫలవంతం, ప్రయోజనకరం కాజాలదు. అలాగే విశ్వాసంలేని సదాచరణలకు దైవసన్నిధిలో ఎలాంటి విలువా లేదు. మరి సదాచరణలంటే దైవప్రవక్త (స) సంప్రదాయానికనుగుణంగా నెరవేర్చినవి, కేవలం దేవుని ప్రసన్నతను చూరగొనే సదుద్దేశంతో చేసినవే. దైవప్రవక్త సంప్రదాయానికి విరుద్ధంగా మంచిపని చేసినా అది స్వీకారయోగ్యం అవదు. గొప్పల కోసం, పరువు ప్రతిష్ఠల కోసం చేసిన సత్కార్యాలు కూడా వారి మొహాన తిప్పికొట్టబడతాయి.

29. **ముతషాబిహన్ ( مُتَشَابِهًا ) :** అంటే భావం స్వర్గంలోని పండ్లు ఫలాలన్నీ పరస్పరం ఒకే పోలిక కలిగి ఉంటాయి. లేదా అవి ప్రపంచంలోని పండ్లను పోలి ఉంటాయి. అయితే ఈ పోలిక కేవలం ఆకారానికి, పేర్లకు మాత్రమే పరిమితం అయి ఉంటుంది. వాస్తవానికి రుచి, సువాసనలో ప్రాపంచిక పండ్లకు – స్వర్గంలోని పండ్లకు ఏమాత్రం పొంతన ఉండదు. స్వర్గంలోని అనుగ్రహాలకు సంబంధించి హదీసులో ఇలా అనబడింది : "వాటిని ఏ కన్నూ కానలేదు. ఏ చెవి కూడా వాటి గురించి వినలేదు (చూడటం, వినటం అటుంచి) ఏ మానవ హృదయంలోనూ ఆ ఊహ కూడా రాలేదు" (సహీహ్ బుఖారీ – సూరె సజ్దా వ్యాఖ్యానం).

30. అంటే రుతుస్రావం, పురిటిరక్త స్రావం వంటి అశుద్ధావస్థ వారికి ఉండదు.

31. **'ఖులూద్'** (خُلُود) అంటే శాశ్వతం, ఎల్లకాలం అని అర్థం. స్వర్గవాసులు కలకాలం – శాశ్వతంగా – స్వర్గంలో ఉంటారు. హాయిగా సంతోషంగా ఉంటారు. కాగా, నరకవాసులు నరకంలో కలకాలం ఉంటారు. యాతనలో మ్రగ్గుతూ ఉంటారు. హదీసులో ఉంది – ప్రజలు స్వర్గం లేక నరకంలో ప్రవేశించిన మీదట దైవదూత ప్రకటన గావిస్తాడు : "ఓ నరకవాసులారా! ఇక మృత్యువు అన్నదే లేదు. ఓ స్వర్గవాసులారా! ఇంక మరణం అనేది లేదు. ఇప్పుడు ఎవరే స్థితిలో ఉన్నారో ఆ స్థితిలోనే కలకాలం ఉంటారు" (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం).

**26** నిశ్చయంగా అల్లాహ్ దేనినీ ఉపమానంగా చెప్పటానికి సిగ్గు పడడు– (కడకు) దోమ అయినాసరే, దానికన్నా అల్పమైన వస్తువు అయినాసరే![32] విశ్వసించినవారు మాత్రం దీన్ని తమ ప్రభువు తరఫు నుంచి వచ్చిన సత్యమని భావిస్తారు. కాని అవిశ్వాసులు, "ఈ ఉపమానం ద్వారా ఇంతకీ అల్లాహ్ ఏం చెప్పదలచుకుం టున్నాడు?" అని అంటారు. ఈ విధంగా ఆయన దీని ద్వారానే ఎంతో మందిని అపమార్గం పట్టిస్తాడు, మరెంతో మందిని సన్మార్గంపైకి తీసుకువస్తాడు.[33] అయితే దీని ద్వారా ఆయన అపమార్గానికి లోను చేసేది అవిధేయులను మాత్రమే.

إِنَّ اللَّهَ لَا يَسْتَحْيِ أَنْ يَضْرِبَ مَثَلًا مَا بَعُوضَةً فَمَا فَوْقَهَا ۚ فَأَمَّا الَّذِينَ آمَنُوا فَيَعْلَمُونَ أَنَّهُ الْحَقُّ مِنْ رَبِّهِمْ ۖ وَأَمَّا الَّذِينَ كَفَرُوا فَيَقُولُونَ مَاذَا أَرَادَ اللَّهُ بِهَٰذَا مَثَلًا ۘ يُضِلُّ بِهِ كَثِيرًا وَيَهْدِي بِهِ كَثِيرًا ۚ وَمَا يُضِلُّ بِهِ إِلَّا الْفَاسِقِينَ ﴿26﴾

**27** వీరు ఎలాంటివారంటే అల్లాహ్‌తో చేసిన దృఢమైన ప్రమాణాన్ని[34] భంగపరుస్తారు. అల్లాహ్ కలిపి ఉంచమని చెప్పిన వాటిని త్రెంచివేస్తారు. భువిలో చెడుగును వ్యాపింపజేస్తారు. వీరే అసలు నష్టాన్ని పొందేవారు.[35]

الَّذِينَ يَنْقُضُونَ عَهْدَ اللَّهِ مِنْ بَعْدِ مِيثَاقِهِ وَيَقْطَعُونَ مَا أَمَرَ اللَّهُ بِهِ أَنْ يُوصَلَ وَيُفْسِدُونَ فِي الْأَرْضِ ۚ أُولَٰئِكَ هُمُ الْخَاسِرُونَ ﴿27﴾

32. దివ్య ఖుర్‌ఆన్ ఒక అద్భుత గ్రంథమని అల్లాహ్ తిరుగులేని నిదర్శనాలతో నిరూపించిన తరువాత కుఫ్ఫారులు (దైవ తిరస్కారులు) ఆత్మరక్షణలో పడిపోయి, వేరొక తరహాలో అభ్యంతరం లేవనెత్తారు – ఒకవేళ ఇది నిజంగా దైవవాక్కే అయినట్లయితే, అంత గొప్పవాడు అవతరింపజేసిన వాణిలో ఇంతటి అల్పమయిన వస్తువులు దృష్టాంతాలుగా ఎందుకు ఇవ్వబడతాయి? అన్నది వారి ఆక్షేపణ. దీనికి అల్లాహ్, ఒకానొక గొప్ప పరమార్థాన్ని దృష్టిలో పెట్టుకుని విషయాన్ని ఇలాంటి ఉదాహరణల ద్వారా వివరించటం ఏ మాత్రం అనుచితం కాదని బదులిచ్చాడు. అందుకే ఇలాంటి విషయాలు చెప్పడానికి సిగ్గు, బిడియం, లజ్జ వంటి వాటికి తావివ్వనవసరం లేదు. మూలంలో **'ఫౌఖహా'** ( فَوْقَهَا ) అనే పదం ఉపయోగించబడింది. **ఫౌఖహా** అంటే దోమకు పైన ఉండేవి, అంటే దాని రెక్కలు అని భావం. ఈ భావం తీసుకుంటే, 'దోమకన్నా అత్యల్ప వస్తువు అయినా సరే' అని అర్థం వస్తుంది. అలాగే "ఫౌఖహా"కు దాని కంటే అధికమైన అనే అర్థం కూడా వస్తుంది. అటువంటప్పుడు "దోమ అయినా దానికంటే పెద్ద వస్తువు మరేదయినా" అని అర్థం చేసుకోవాలి. ఫౌఖహా అనే పదం ద్వారా, ఈ రెండు అర్థాలూ రావటానికి ఆస్కారముంది.

33. అల్లాహ్ ఇచ్చే ఉదాహరణలతో విశ్వాసులలోని స్వీకృతగుణం (ఈమాన్) మరింత పెరిగితే, అవిశ్వాసుల్లోని తిరస్కార వైఖరి మరింత తీవ్రతరమవుతుంది. ఇదంతా అల్లాహ్ సంవిధానానికి, ఆయన అభీష్టానికి అనుగుణంగానే జరుగుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని "ఎవరయినా ఏదైనా ఒక వైపుకు తిరిగితే దాని వైపునకే మేమతన్ని మరలిస్తాము" అన్న దైవసూక్తి (అన్ నిసా – 115) ఈ సందర్భంగా గమనార్హం. హదీసులో ఉంది: "ప్రతి వ్యక్తీ దేనికోసం పుట్టించబడ్డాడో అది అతనికి సులభతరం చేయబడింది." (సహీహ్ బుఖారీ)

దైవ విధేయతా పరిధి నుండి బయటికి వెళ్ళిపోయిన పనిని 'ఫిస్ఖ్' అంటారు. ఒక్కోసారి విశ్వాసి సయితం అటువంటి హద్దులను మీరిపోయి పాపానికి ఒడిగడతాడు. అయితే ఈ ఆయతులో ప్రస్తావించబడిన పాపం సాధారణ పాపం కాదు, మహాపాతకం. అవిశ్వాసి మాత్రమే అటువంటి పాతకానికి (ఫిస్ఖ్‌కు) పాల్పడతాడు. వచ్చే ఆయతులో అవిశ్వాసుల లక్షణాలు సూచించబడ్డాయి.

34. ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు **"అహ్ద్"** (عهد) అనే పదానికి అనేక భావార్థాలను వివరించారు. 1. తాను ఆదేశించిన

كَيْفَ تَكْفُرُونَ بِاللّٰهِ وَكُنْتُمْ اَمْوَاتًا
فَاَحْيَاكُمْ ۚ ثُمَّ يُمِيْتُكُمْ ثُمَّ يُحْيِيْكُمْ
ثُمَّ اِلَيْهِ تُرْجَعُوْنَ ﴿28﴾

**28** మీరు అల్లాహ్ యెడల తిరస్కార వైఖరికి ఎలా ఒడిగట్ట గలరు? చూడబోతే నిర్జీవులుగా ఉన్న మీకు ఆయనే ప్రాణం పోశాడు. మరి మీ ప్రాణం తీసేవాడూ, తిరిగి మిమ్మల్ని బ్రతికించే వాడు కూడా ఆయనే.[36] ఆ తరువాత మీరు ఆయన వైపుకే మరలించబడతారు.

هُوَ الَّذِيْ خَلَقَ لَكُمْ مَّا فِي الْاَرْضِ جَمِيْعًا ۚ ثُمَّ
اسْتَوٰٓى اِلَى السَّمَآءِ فَسَوّٰىهُنَّ سَبْعَ سَمٰوٰتٍ ۭ
وَهُوَ بِكُلِّ شَيْءٍ عَلِيْمٌ ﴿29﴾

**29** ఆయనే మీ కోసం భూమిలో ఉన్న సమస్త వస్తువులనూ సృష్టించాడు.[37] తరువాత ఆకాశం వైపుకు ధ్యానాన్ని మరల్చి,[38] తగు రీతిలో సప్తాకాశాలను నిర్మించాడు.[39] ఆయన అన్నీ తెలిసినవాడు.

---

వాటిని చేయాలని, నిషేధించిన వాటి జోలికి పోరాదని దైవప్రవక్తల (అలైహిముస్సలాం) ద్వారా అల్లాహ్ తన సృష్టితాలకు చేసిన తాకీదు. 2. అంతిమ దైవప్రవక్త (స) ప్రభవించిన తరువాత మీరు ఆయన్ని ప్రవక్తగా ధృవీకరించాలనీ, ఆయన్ని విశ్వసించాలని గ్రంథవహుల (యూదుల) చేత తౌరాత్‌లో తీసుకున్న ప్రమాణం 3. ఆదం వెన్నెముక నుంచి వెలికి తీసిన తరువాత సమస్త ఆదం సంతతి నుండి అల్లాహ్ తీసుకున్న ప్రమాణం (అహ్‌దె అలస్త్). దివ్య ఖుర్‌ఆన్‌లో కూడా ఈ విషయం ప్రస్తావించబడింది : స్వయంగా వారిని వారికే సాక్షులుగా పెట్టి, "నేను మీ ప్రభువును కానా?" అని అల్లాహ్ అడిగాడు. దానికి వారు, "ఎందుకు కావు? నిస్సందేహంగా నీవే మా ప్రభువు. దీనికి మేము సాక్షులుగా ఉన్నాము" అని అన్నారు (అల్ ఆరాఫ్ – 172). వాగ్దాన భంగం అంటే అర్థం, చేసిన బాసను నిర్లక్ష్యం చేయటం (ఇబ్నె కసీర్).

35. ఏనాటికైనా నష్టపోయేది దైవాజ్ఞల్ని ఉల్లంఘించి, భువిలో విచ్చలవిడిగా వ్యవహరించేవారే. దైవానికిగానీ, దైవప్రవక్తలకుగానీ, దైవమార్గం వైపుకు పిలిచే వారికి (దాయీలకు) గానీ వాటిల్లే నష్టం ఏమీ ఉండదు.

36. ఈ ఆయతులో రెండు మరణాల, రెండు జీవితాల ప్రస్తావన ఉంది. మొదటి మరణం అంటే ఉనికి లేనిదని అర్థం. మొదటి జీవితం అంటే తల్లి కడుపునుంచి వచ్చి మరణం సంభవించేదాకా బ్రతికి ఉండటం అన్నమాట. తరువాత మృత్యువు వస్తుంది. తరువాత పరలోక జీవితం మొదలవుతుంది. ఈ జీవితాన్నే అవిశ్వాసులు, ప్రళయదిన తిరస్కారులు త్రోసిపుచ్చుతున్నారు. సమాధి జీవితం కూడా (దానికి తగినవిధంగా) ప్రాపంచిక జీవితంగానే పరిగణించబడుతుందన్న కొంతమంది అభిప్రాయాన్ని అల్లామా షౌకానీ ఇక్కడ ప్రస్తావించారు(ఫత్‌హుల్ ఖదీర్). యదార్థానికి సమాధి జీవితం (బర్జఖ్ అవస్థ) కూడా పరలోక జీవితపు తొలి మజిలీయే. అందుచేత ఈ అవస్థను పరలోక జీవితంలో భాగంగా పరిగణించటమే సబబు.

37. భువిలోని వస్తువులన్నీ ప్రాణుల కొరకు ధర్మ సమ్మతమైనవేనని దీని ఆధారంగా పేర్కొనడమైనది. ఏదైనా వస్తువు నిషిద్ధం అని మూలం (ఖుర్‌ఆన్, హదీసుల) ద్వారా నిరూపితమైతే తప్ప దాన్ని హరామ్‌గా భావించరాదు – అది హలాల్‌గానే భావించబడుతుంది (ఫత్‌హుల్ ఖదీర్).

38. సలఫ్ (ఇస్లాంలో తొలి మూడు తరాలకు చెందిన నికార్సయిన ముస్లిం) పండితులు కొందరు "ఆకాశం వైపుకు అధిరోహించాడు" అని తర్జుమా చేశారు (సహీహ్ బుఖారీ). అల్లాహ్ ఆకాశాల పైకి ఎక్కడం, అర్ష్ అనే సింహాసనాన్ని అధిష్ఠించటం, భూమండలానికి చేరువలోనున్న ఆకాశం పైకి దిగి రావటం – ఇవన్నీ అల్లాహ్ గుణగణాలుగానే చెప్పబడ్డాయి. వక్రభాష్యాలు చెప్పకుండా, ఖుర్‌ఆన్ హదీసుల్లో పేర్కొనబడిన విధంగా ఈ విషయాలన్నింటినీ విశ్వసించటం అనివార్యం. ఖుర్‌ఆన్ హదీసులు కూడా ఈ మేరకు నొక్కి వక్కాణిస్తున్నాయి.

39. దీనిద్వారా బోధపడుతున్న మొదటి విషయం – ఆకాశం అనేది ఒక అర్థం చేసుకోగలిగే వస్తువు. దాని ఉనికి ఉంది. అది వాస్తవికమైనది. కేవలం ఎత్తునే ఆకాశంగా ఈ వాక్యంలో పరిగణించటం జరగలేదు. (అరబీలో 'సమా' లేక

وَاِذۡ قَالَ رَبُّكَ لِلۡمَلٰٓـئِكَةِ اِنِّىۡ جَاعِلٌ فِى الۡاَرۡضِ خَلِيۡفَةً ‌ؕ قَالُوۡٓا اَتَجۡعَلُ فِيۡهَا مَنۡ يُّفۡسِدُ فِيۡهَا وَيَسۡفِكُ الدِّمَآءَ ۚ وَنَحۡنُ نُسَبِّحُ بِحَمۡدِكَ وَنُقَدِّسُ لَكَ ‌ؕ قَالَ اِنِّىۡٓ اَعۡلَمُ مَا لَا تَعۡلَمُوۡنَ ﴿30﴾

**30** "నేను భువిలో ప్రతినిధిని[40] చేయబోతున్నాను" అని నీ ప్రభువు తన దూతలతో[41] అన్నప్పుడు, "భూమిలో కల్లోలాన్ని రేకెత్తించి, రక్తం ప్రవహింపజేసేవాణ్ణి ఎందుకు సృష్టిస్తావు (ప్రభూ)? నిన్ను స్తుతించటానికి, ప్రశంసించటానికి, నీ పవిత్రతను కొనియాడటానికి మేమున్నాము కదా!" అని వారన్నారు. దానికి అల్లాహ్, "నాకు తెలిసినవన్నీ మీకు తెలియవు"[42] అని అన్నాడు.

وَعَلَّمَ اٰدَمَ الۡاَسۡمَآءَ كُلَّهَا ثُمَّ عَرَضَهُمۡ عَلَى الۡمَلٰٓـئِكَةِ فَقَالَ اَنۡۢبِـُٔوۡنِىۡ بِاَسۡمَآءِ هٰٓؤُلَآءِ اِنۡ كُنۡتُمۡ صٰدِقِيۡنَ ﴿31﴾

**31** (తరువాత) అల్లాహ్ ఆదంకు అన్ని (వస్తువుల) పేర్లనూ నేర్పి, వాటిని దూతల ముందుంచాడు. "ఒకవేళ మీరు చెప్పేదే నిజమయితే, కాస్త వీటి పేర్లు చెప్పండి?" అన్నాడు.

---

'సుమువ్వున్' అంటే ఎత్తు, పైన ఉండేది అనే అర్థాలు వస్తాయి. దీన్ని చూసుకొని కొందరు ఇక్కడ 'సమా' అంటే ఆకాశం కాదు, కేవలం ఎత్తు, అల్లాహ్ ఎత్తుకు అధిరోహించాడు అని భాష్యం చెప్పారు. కాని ఆ తర్వాతి "సవ్వాహున్న"– ఆయన వాటిని తగురీతిలో నిర్మించాడు– అన్న వాక్యం వారి ఈ అభిప్రాయాన్ని ఖండిస్తున్నది). రెండో ముఖ్య విషయం ఏమిటంటే, ఈ ఆకాశాల సంఖ్య ఏడు. హదీసు ప్రకారం రెండు ఆకాశాల మధ్యగల అంతరం 500 ఏండ్ల ప్రయాణానికి సమానం. ఇక భూమి గురించి ఖుర్ఆన్‌లోనే ఇలా వుంది : "భూమి కూడా ఆకాశాల వంటిదే" (తలాఖ్ – 12). దీన్నిబట్టి భూముల సంఖ్య కూడా ఏడేనని విదితమవుతోంది. మహాప్రవక్త (స) వారి ఈ ప్రవచనం ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది: "ఎవరయితే అన్యాయంగా ఒకరికి చెందిన జానెడు భూమిని కబళిస్తాడో అతనికి అల్లాహ్ ప్రళయదినాన సప్తభూముల గుదిబండను తొడిగిస్తాడు" (సహీహ్ బుఖారీ). ఆకాశం కంటే ముందు భూమండలం సృష్టించబడిందన్న సంగతి కూడా ఈ ఆయతు ద్వారా తెలుస్తోంది. అయితే 'అన్నాజియాత్' సూరాలో ఆకాశం గురించి చెప్పబడిన తరువాత ఇలా అనబడింది: "దాని తరువాత ఆయన భూమిని పరచాడు." భూమిని మొదటే సృష్టించినప్పటికీ, దాన్ని చదునుచేసే, సానుకూలంగా తీర్చిదిద్దే ప్రక్రియ, ఆకాశాల నిర్మాణం తరువాత జరిగిందన్నది దీని భావం కావచ్చు (ఫత్‌హుల్ ఖదీర్). మరిన్ని వివరాల కోసం 'హామీమ్ అస్సజ్దా' సూరాలోని తాత్పర్యం చూడండి.

40. అరబీలో **'ఖలీఫా'** ( خَلِيۡفَةً ) అనే పదం వచ్చింది. అంటే ఒకదాని తర్వాత ఒకటి వచ్చేటటువంటి జాతి అని భావం. అంతేగాని మానవుడు ఈ ప్రపంచంలో దేవుని ఖలీఫా, ఆయన ప్రతినిధి అని చెప్పటం సముచితం కాదు.

41. అరబీలో దైవదూతల కోసం **'మలాయిక'** ( مَلٰٓـئِكَة ) అనే పద ప్రయోగం జరిగింది. దైవదూతలు కాంతితో సృష్టించబడిన దేవుని సృష్టిరాశులు. ఆకాశం వారి నివాస స్థలం. దైవాజ్ఞలను పాలించటంలో, దైవస్తోత్రం చేయటంలో, దేవుని పవిత్రతను కొనియాడటంలో సదా నిమగ్నులై ఉంటారు. దేవుని ఏ ఆజ్ఞను కూడా వారు జవదాటరు.

42. మానవ సృష్టిపై దైవదూతలు ఆ విధంగా ప్రతిస్పందించడానికి కారణం అసూయ లేక ఓర్వలేనితనం ఎంతమాత్రం కాదు. మానవ సృష్టి పరమార్థాన్ని తెలుసుకునే ఉద్దేశంతో మాత్రమే వారలా అన్నారు – ఓ ప్రభూ! ఉపద్రవాన్ని రేపి, రక్తపాతం సృష్టించే దుష్టజనులు కూడా వారిలో ఉండబోతున్నప్పుడు, మరి ఈ సృష్టిని మొదలుపెట్టడంలోని ఔచిత్యం ఏమిటి? నిన్ను ఆరాధించటమే ఒకవేళ ఈ పుట్టుక పరమార్థమై ఉంటే అందుకు మేమున్నాము కదా! కొత్త సృష్టితాల ద్వారా తలెత్తే ప్రమాదాలు కూడా మా తరఫున ఉండవాయె. మరటువంటప్పుడు లేనిపోని ఈ చిక్కులెందుకు? అన్నది దైవదూతల అభిప్రాయం. దానికి అల్లాహ్ ఇలా అన్నాడు: అందలి పరమార్థం నాకు తెలుసు. మనుజ జాతిలో సంక్షోభాన్ని సృష్టించి, భూమండలాన్ని అస్తవ్యస్తం చేసే వారుంటారన్నది నిజమే అయినప్పటికీ

قَالُوا سُبْحَانَكَ لَا عِلْمَ لَنَا إِلَّا مَا عَلَّمْتَنَا ۖ
إِنَّكَ أَنتَ الْعَلِيمُ الْحَكِيمُ ﴿٣٢﴾

**32** వారంతా ఇలా అన్నారు : "(ఓ అల్లాహ్!) నీవు అత్యంత పవిత్రుడవు. నీవు మాకు తెలియజేసినది తప్ప ఇంకేమీ మాకు తెలియదు. నిశ్చయంగా అన్నీ తెలిసినవాడవు, వివేకవంతుడవూ నీవే!"

قَالَ يَا آدَمُ أَنبِئْهُم بِأَسْمَائِهِمْ ۖ فَلَمَّا أَنبَأَهُم
بِأَسْمَائِهِمْ قَالَ أَلَمْ أَقُل لَّكُمْ إِنِّي أَعْلَمُ غَيْبَ
السَّمَاوَاتِ وَالْأَرْضِ وَأَعْلَمُ مَا تُبْدُونَ وَمَا
كُنتُمْ تَكْتُمُونَ ﴿٣٣﴾

**33** అప్పుడు అల్లాహ్, "ఓ ఆదం! వీటి పేర్లేమిటో నువ్వు తెలుపు" అన్నాడు. ఆయన వాటి పేర్లన్నీ చెప్పేయగానే అల్లాహ్ ఇలా ప్రకటించాడు: "భూమ్యాకాశాలలో గోప్యంగా వున్నవన్నీ నాకు తెలుసనీ, మీరు బహిర్గతం చేసేవీ, దాచి పెట్టేవీ[43] అన్నీ నాకు తెలుసని (ముందే) నేను మీకు చెప్పలేదా?"

وَإِذْ قُلْنَا لِلْمَلَائِكَةِ اسْجُدُوا لِآدَمَ فَسَجَدُوا إِلَّا
إِبْلِيسَ أَبَىٰ وَاسْتَكْبَرَ وَكَانَ مِنَ الْكَافِرِينَ ﴿٣٤﴾

**34** "మీరందరూ ఆదం ముందు సాష్టాంగపడండి"[44] అని మేము దూతలను ఆజ్ఞాపించినపుడు ఇబ్లీసు తప్ప అందరూ సాష్టాంగపడ్డారు. వాడు మాత్రం[45] తిరస్కరించాడు. అహంకారి అయి, అవిధేయులలో చేరిపోయాడు.

నేను ఎందుకు ఈ సృష్టిని మొదలెడుతున్నానో మీకు తెలియదు. ఎందుకంటే వీరిలో ప్రవక్తలు, షహీదులు (అమరులు), సజ్జనులు, సాత్వికులు, మహనీయులు కూడా ఉంటారు (ఇబ్నె కసీర్).

ఆదం సంతతిలో కల్లోలాన్ని రేకెత్తించే వారుంటారన్న సంగతి దైవదూతలకు ఎలా తెలుసు? అన్నది ఇక్కడ ఉత్పన్నమయ్యే ప్రశ్న. బహుశా మానవ సృష్టికి పూర్వం వున్న సృష్టితాల నైజాన్ని గమనించి వారు ఆ విధంగా ఊహించి ఉంటారేమో! వారీవిధంగా ప్రవర్తిస్తారని అల్లాహ్‌యే ఈ సంగతిని దూతలకు ముందుగా చెప్పి ఉంటాడని మరికొంతమంది అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

43. **పేర్లు** (أَسْمَاءَ) : పేర్లు అంటే వస్తువుల, వ్యక్తుల పేర్లని భావం. వాటి స్వభావం, వాటి లాభనష్టాల జ్ఞానం కూడా తెలిసి ఉండటం. అల్లాహ్ తన జ్ఞానం ద్వారా, దివ్యావిష్కృతి ద్వారా ఆదంకు ఇదంతా నేర్పాడు. వాటి పేర్లేమిటో కాస్త చెప్పు అని అనగానే ఆదం (అలైహిస్సలామ్) అన్నీ టకటకా చెప్పేశారు. మరి ఆ పేర్లు దూతలకు తెలియవు. ఈ విధంగా అల్లాహ్ ఆదంను సృష్టించటంలోని యుక్తినీ, పరమార్థాన్నీ దూతలకు స్పష్టపరచటంతోపాటు, ప్రపంచ వ్యవస్థను నడపటానికి మనుజ జాతి విద్యా విషయకంగా ముందంజ వేయటం ఎంతో అవసరమన్న సత్యాన్ని కూడా చెప్పకనే చెప్పేశాడు. ఈ పరమార్థాన్ని తెలుసుకున్నంతనే దైవదూతలు తమ పరిమిత జ్ఞాన పరిధిని ఒప్పుకున్నారు. దైవదూతల ఈ ఒప్పుకోలు ద్వారా 'అగోచరాల జ్ఞాని కేవలం అల్లాహ్‌యే' అన్న యదార్థం కూడా ముందుకు వచ్చేసింది. అల్లాహ్, తాను కటాక్షించి, తన కార్యం కోసం ఎన్నుకున్న ప్రత్యేక దాసులకు కూడా అల్లాహ్ ప్రసాదించినంత జ్ఞానమే ఉంటుందన్న సత్యం కూడా దీనిద్వారా సుబోధకం అవుతోంది.

44. విజ్ఞానపరంగా శ్రేష్ఠత నొసగబడిన ఆదంకు లభించిన ఇంకొక గౌరవ పురస్కారం ఇది. ఇక్కడ 'సజ్దా' అనే పదం ఉపయోగించబడింది. సజ్దా అంటే తలవంచటం, వినమ్రులవటం అనే అర్థాలు వస్తాయి. 'నేలకు నుదురును ఆనించటం' దీనికి పరాకాష్ఠ (ఖుర్తుబి). ఇలాంటి సజ్దా ఇస్లామీయ షరీయతులో ఒక్క అల్లాహ్‌కు తప్ప మరొకరికి చేయటం ధర్మసమ్మతం కాదు. మహాప్రవక్త (సఅసం) వారి విఖ్యాత ప్రవచనం ఒకటి ఇలా వుంది : సాష్టాంగపడటం అనేది మరొకరెవరికయినా ధర్మం అయివుంటే తన భర్తకు సాష్టాంగపడమని నేను స్త్రీకి ఆజ్ఞాపించి వుండేవాణ్ణి" (సుననె తిర్మిజీ). మొత్తానికి దైవాదేశాన్ని పురస్కరించుకుని దైవదూతలు హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)కు సజ్దా

وَقُلْنَا يَـٰٓـَٔادَمُ ٱسْكُنْ أَنتَ وَزَوْجُكَ ٱلْجَنَّةَ وَكُلَا مِنْهَا رَغَدًا حَيْثُ شِئْتُمَا وَلَا تَقْرَبَا هَـٰذِهِ ٱلشَّجَرَةَ فَتَكُونَا مِنَ ٱلظَّـٰلِمِينَ ﴿٣٥﴾

**35** (తరువాత) మేము, "ఓ ఆదం! నువ్వూ, నీ భార్య – ఇద్దరూ– స్వర్గంలో ఉండండి,[46] మీరు ఇష్టపడిన చోటు నుంచి స్వేచ్ఛగా తినండి, త్రాగండి. కాని ఈ వృక్షం దరిదాపులకు కూడా పోవద్దు.[47] లేదంటే దుర్మార్గులలో చేరిపోతారు" అని చెప్పాము.

فَأَزَلَّهُمَا ٱلشَّيْطَـٰنُ عَنْهَا فَأَخْرَجَهُمَا مِمَّا كَانَا فِيهِ ۖ وَقُلْنَا ٱهْبِطُوا۟ بَعْضُكُمْ لِبَعْضٍ عَدُوٌّ ۖ وَلَكُمْ فِى ٱلْأَرْضِ مُسْتَقَرٌّ وَمَتَـٰعٌ إِلَىٰ حِينٍ ﴿٣٦﴾

**36** కాని షైతాన్ వారిని పెడత్రోవ పట్టించి, అక్కడి నుంచి బయటికి తీసివేయించాడు.[48] మేము వారిని ఇలా ఆదేశించాము: "దిగిపోండి. మీరు ఒండొకరికి శత్రువులు.[49] ఒక నిర్ణీత కాలం వరకు భూమిపైనే ఉండి మీరు లబ్ది పొందవలసి ఉంది."

فَتَلَقَّىٰٓ ءَادَمُ مِن رَّبِّهِۦ كَلِمَـٰتٍ فَتَابَ عَلَيْهِ ۚ إِنَّهُۥ هُوَ ٱلتَّوَّابُ ٱلرَّحِيمُ ﴿٣٧﴾

**37** అప్పుడు ఆదం (అలైహిస్సలాం) తన ప్రభువు నుంచి కొన్ని మాటలు నేర్చుకుని (పశ్చాత్తాపం[50] చెందారు.) అల్లాహ్ ఆయన పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. నిశ్చయంగా ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడు కూడాను.

---

చేశారు. ఆ విధంగా దైవదూతలపై ఆదం (అలైహి)గారి ఆధిక్యత, పెద్దరికం చాటి చెప్పబడింది. ఎందుకంటే ఈ సజ్దా గౌరవాన్ని, ఔన్నత్యాన్ని వ్యక్తపరచేదే గానీ ఆరాధన మరియు దాస్యంతో కూడుకున్నది కాదు. అల్లాహ్ ఆదంను సృష్టిశ్రేష్ఠునిగా నిరూపించదలచాడు. నిరూపించాడు. కాని ఇప్పుడు మానవుల్లో ఎవరినయినా గొప్పవాడని నిరూపించే ఉద్దేశంతో కూడా సజ్దా చేయకూడదు.

45. ఆదం (అలైహిస్సలాం) ముందు తలవంచడానికి నిరాకరించి ఇబ్లీస్ దేవుని చేత ధూత్కరించబడ్డాడు. దివ్య ఖుర్ఆన్ వివరించినట్లుగా ఇబ్లీస్ జిన్నుల కోవకు చెందినవాడు (కహఫ్ : 50). కాని అల్లాహ్ అతన్ని ఆదరించి దూతల సరసన నిలబెట్టేవాడు. అందుకే అల్లాహ్ ఆదేశానుసారం దూతలతో ఇబ్లీస్ కూడా ఆదం ముందు మోకరిల్లవలసిన పరిస్థితి ఏర్పడింది. అయితే అతనికి అహం అడ్డువచ్చింది. అతనిలోని అసూయాద్వేషాలు బుసలు కొట్టగా సాష్టాంగ పడటానికి నిరాకరించాడు. కాబట్టి అసూయ, అహంకారం కూడా పాపమే. దీనికి ప్రప్రథమంగా ఒడిగట్టినవాడు ఇబ్లీస్.

46. స్వర్గంలో నివసించమని చెప్పటం ఆదం (అలైహిస్సలాం)కు లభించిన మూడవ గౌరవ పురస్కారం.

47. ఆ నిషిద్ధ వృక్షం ఏది? దీనికి సంబంధించిన వివరాలు ఖుర్ఆన్ హదీసులలో ఎక్కడా లేవు. అది గోధుమ మొక్క అని ప్రాచుర్యంలోనికి వచ్చింది. కాని అది నిరాధారమైనది. ఆ చెట్టు పేరు తెలుసుకోవలసిన అవసరం మనకు లేదు. దానివల్ల మనకు చేకూరే ప్రయోజనం కూడా ఏదీ లేదు.

48. షైతాన్ స్వర్గంలోకి జొరబడి, ఆదం దంపతులకు ఎదురుపడి వారిని అపమార్గం పట్టించాడు. లేదా దుష్ప్రేరణ ద్వారా దైవాజ్ఞను ఉల్లంఘించేలా చేశాడు. దీని గురించి స్పష్టమయిన వివరణ ఏదీ లేదు. అయితే సజ్దా చేయమని దేవుడు ఆజ్ఞాపించినపుడు దైవాజ్ఞకు ప్రతిగా తాను ఆదం కంటే గొప్పవాణ్ణని ఎలా ఆత్మవంచన చేసుకుని సజ్దా చేయడానికి నిరాకరించాడో, అలాగే "చెట్టు దరిదాపులకు పోవద్దు" అన్న దేవుని తాకీదుకు వక్రభాష్యం చెప్పి, ఆదం (అలైహిస్సలాం)ను బోల్తా కొట్టించటంలో వాడు కృతకృత్యుడు కాగలిగాడన్నది మాత్రం నిజం. దీని వివరాలు అల్ ఆరాఫ్ సూరాలో కూడా వస్తాయి. ఈ విధంగా దైవాదేశానికి ప్రతిగా అంచనాలపై ఆధారపడి, మనోభిరామం ప్రకారం మసలుకుని అసలుకే మోసం కొనితెచ్చుకున్న 'ఘనత' కూడా ప్రప్రథమంగా ఈ షైతాన్‌కే దక్కింది – అల్లాహ్ వీడి బారినుంచి కాపాడుగాక!

**38** మేము వారితో అన్నాము: "మీరంతా ఇక్కడి నుంచి దిగిపోండి. నా ఉపదేశం ఎప్పుడు మీ వద్దకు వచ్చినా, దాన్ని అనుసరించే వారికి ఎలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు."

قُلْنَا اهْبِطُوا مِنْهَا جَمِيعًا ۚ فَإِمَّا يَأْتِيَنَّكُم مِّنِّي
هُدًى فَمَن تَبِعَ هُدَايَ فَلَا خَوْفٌ عَلَيْهِمْ
وَلَا هُمْ يَحْزَنُونَ ﴿38﴾

**39** ఎవరయితే దానిని నిరాకరించి, మా ఆయతులను అసత్యాలని త్రోసిపుచ్చుతారో వారే నరకాగ్నిలోకి పోయేవారు.[51] వారందులో కలకాలం పడి ఉంటారు.

وَالَّذِينَ كَفَرُوا وَكَذَّبُوا بِآيَاتِنَا أُولَٰئِكَ أَصْحَابُ
النَّارِ ۖ هُمْ فِيهَا خَالِدُونَ ﴿39﴾

**40** ఓ ఇస్రాయీలు[52] వంశస్థులారా! నేను మీకు అనుగ్రహించిన భాగ్యాన్ని గురించి కాస్త జ్ఞాపకం చేసుకోండి. మీరు నాతో చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోండి, నేను మీతో చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తాను. మీరు నాకు మాత్రమే భయపడండి.

يَا بَنِي إِسْرَائِيلَ اذْكُرُوا نِعْمَتِيَ الَّتِي أَنْعَمْتُ
عَلَيْكُمْ وَأَوْفُوا بِعَهْدِي أُوفِ بِعَهْدِكُمْ
وَإِيَّايَ فَارْهَبُونِ ﴿40﴾

49. ఒండొకరికి శత్రువులు అంటే ఒకరు ఆదం – మరొకరు షైతాన్ అని భావం. లేదా ఆదం సంతతిలోని వారు ఒకరింకొకరికి విరోధులు అన్నది మరో భావం కావచ్చు.

50. ఆదం (అలైహిస్సలాం) తనవల్ల జరిగిన తప్పిదంపై పశ్చాత్తాపంతో కుమిలిపోతూ, క్షమాభిక్షకై ప్రార్థించసాగారు. ఆ క్లిష్ట పరిస్థితిలో సయితం అల్లాహ్ ఆయన్ని ఆదుకుని, మార్గదర్శకత్వం వహించాడు. మన్నింపు వాక్యాలను నేర్పాడు. ఈ వాక్యాలు అల్ ఆరాఫ్ సూరాలోని 23వ ఆయత్‌లో వివరించబడ్డాయి (రబ్బనా జలమ్‌నా అన్‌ఫుసనా వ ఇల్లమ్ తగ్‌ఫిర్‌లనా వ తర్‌హమ్నా.......). కొంతమంది ప్రబుద్ధులు ఇక్కడ ఒక కల్పిత ఉల్లేఖనాన్ని ఊతంగా తీసుకుని ఇలా వ్యాఖ్యానించారు: దైవ సింహాసనంపై **లా యిలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్** అని లిఖించి ఉండటం ఆదం చూశారట! దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆధారంగా ఆయన వేడుకోగా, అల్లాహ్ క్షమాభిక్ష పెట్టాడట! ఈ ఉల్లేఖనం నిరాధారమైనది. ఖుర్ఆన్ ప్రబోధనకు కూడా ఇది విరుద్ధమైనది. అదీగాక అసలిది అల్లాహ్ చూపిన వేడుకోలు పద్ధతికి వ్యతిరేకమైనది. దైవప్రవక్తలు ఎప్పుడు ప్రార్థించినా నేరుగా అల్లాహ్‌నే వేడుకున్నారు. ఏ ప్రవక్త కూడా ఒకానొక సజ్జనుని ఆసరాతో దుఆ చేసినట్టు ఎక్కడా లేదు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సయితం ఎప్పుడు దుఆ చేసినా మధ్యలో ఎవరి ఆధారాన్ని, ఆసరాను తీసుకోకుండా నేరుగా అల్లాహ్‌ను వేడుకున్నారు – ఇదే సరైనది.

51. దుఆ (ప్రార్థన)ను స్వీకరించినప్పటికీ అల్లాహ్ వారిని తిరిగి స్వర్గంలో వసింపజేసే బదులు – ప్రపంచంలోనే ఉంటూ స్వర్గలోకాన్ని పొందేందుకు సాధన చేయమని ప్రబోధించాడు. ఆదం (అలైహిస్సలాం) ద్వారా సమస్త మానవాళికి స్వర్గ మార్గం తెలియజేయబడుతోంది – ప్రవక్తల ద్వారా నా ఉపదేశం మీకు అందుతూ ఉంటుంది. దాన్ని స్వీకరించినవారు స్వర్గ ప్రవేశానికి అర్హులవుతారు. లేదా నా శిక్షకు పాత్రులవుతారు. "వారికి ఎలాంటి భయం ఉండదు" అనేది పరలోకానికి సంబంధించినది. "దుఃఖం ఉండదు" అనే మాట ప్రాపంచిక జీవితంతో ముడిపడినది. అంటే పరలోకం గురించి భయమూ ఉండదు, ప్రపంచంలో జరిగిపోయిన దాని గురించి దుఃఖమూ ఉండదు. వేరొకచోట చెప్పబడినట్లు – "నా మార్గదర్శకత్వాన్ని అనుసరించినవాడు (ప్రపంచంలో) పెడత్రోవ పట్టడు, (పరలోకంలో) దౌర్భాగ్య స్థితికీ లోనవ్వడు" (తాహా – 123) (ఇబ్నె కసీర్). "ఎలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండవు" అన్న శుభవార్త ప్రతి నిజమైన విశ్వాసికీ వర్తిస్తుంది. అది కేవలం కొందరు వలీలకు మాత్రమే పరిమితం అన్న భావన సరైనది కాదు. ఈ విషయాన్ని కొంతమంది చిలువలు పలువలు చేసి, వక్రభాష్యం చెప్పి జన సామాన్యాన్ని అయోమయంలో పడవేసే ప్రయత్నం చేశారు. వాస్తవానికి విశ్వాసులందరూ, భయభక్తులతో జీవించే వారందరూ

**41** మీ వద్దనున్న గ్రంథాలకు ధృవీకరణగా నేను అవతరింప జేసిన ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్‌ను) విశ్వసించండి. దీని పట్ల[53] అందరికంటే ముందు మీరే తిరస్కారులు కాకండి. ఇంకా నా ఆయతులను కొద్దిపాటి ధరకు అమ్ముకోకండి.[54] నాకు మాత్రమే భయపడండి.

وَاٰمِنُوْا بِمَآ اَنْزَلْتُ مُصَدِّقًا لِّمَا مَعَكُمْ وَلَا تَكُوْنُوْٓا اَوَّلَ كَافِرٍۢ بِهٖ ۖ وَلَا تَشْتَرُوْا بِاٰيٰتِيْ ثَمَنًا قَلِيْلًا ۡ وَّاِيَّايَ فَاتَّقُوْنِ ﴿41﴾

**42** సత్యాన్ని అసత్యంతో కలిపి కలగాపులగం చేయకండి. తెలిసి కూడా సత్యాన్ని కప్పిపుచ్చకండి.

وَلَا تَلْبِسُوا الْحَقَّ بِالْبَاطِلِ وَتَكْتُمُوا الْحَقَّ وَاَنْتُمْ تَعْلَمُوْنَ ﴿42﴾

అల్లాహ్‌కు ప్రీతిపాత్రులే. "ఔలియా అల్లాహ్" అనే వారు ప్రత్యేక సృష్టి ఏమీ కారు. కాకపోతే 'ఔలియా అల్లాహ్' అనబడేవారి అంతస్థులు వేరుగా ఉంటాయి.

52. అసలు ఇస్రాయీల్ అంటే అర్థం అబ్దుల్లాహ్ (అల్లాహ్ దాసుడు) అని. ఇది దైవప్రవక్త యాఖూబ్ (అలైహిస్సలాం) గారి బిరుదు. యూదులను ఇస్రాయీల్ వంశస్థులుగా పిలువటం జరిగింది. అంటే యాఖూబ్ (అలైహి) సంతతి అన్నమాట! యాఖూబ్ (అలైహిస్సలాం)కు 12 మంది కుమారులవటం చేత, 12 తెగలు ఉనికిలోనికి వచ్చాయి. వారిలో చాలామంది దైవప్రవక్తలుగా నియుక్తులయ్యారు. ఇస్రాయీల్ సంతతి నుండే యూదుల వర్గం వచ్చింది. అరేబియాలో తమ గత వైభవం మూలంగానూ, జ్ఞానంతో, మత ధర్మంతో వారికి గల అనుబంధం కారణంగానూ ప్రపంచంలో వారికొక ప్రత్యేక స్థానం ప్రాప్తమయింది. అందుకే వారికి గతంలోని దైవానుగ్రహాలను జ్ఞాపకం చేయించి మరీ అల్లాహ్ కోర్తున్నాడు-అంతిమ దైవప్రవక్త (స) ప్రభవనం మరియు ఆయన్ని విశ్వసించే విషయమై మీరు నాకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి అని! మీరు గనక మీ మాటను నిలబెట్టుకుంటే నా వాగ్దానాన్ని నేను నెరవేరుస్తాను-అంటే మీ ఘోరకృత్యాల, పాపాల మూలంగా- శిక్షగా- మీపై పడివున్న బరువులను దించివేస్తాను, తిరిగి మిమ్మల్ని ఉత్థానస్థితికి చేరుస్తాను. మీరు నాకు భయపడుతూ మసలుకోండి. లేదంటే నేను మిమ్మల్ని నిరంతరం అవమానాలపాలు చేస్తాను. మీరు, మీ పూర్వీకులు తరతరాలుగా మగ్గుతున్న దుర్భరస్థితి మీ నుండి దూరం కాదు.

53. ఈ వాక్యం దివ్యఖుర్ఆన్‌ను లేదా మహనీయ ముహమ్మద్ (స)ను సూచిస్తోంది. రెండూ సరైనవే. రెండూ అనివార్య మైనవే. దివ్య ఖుర్ఆన్ పట్ల తిరస్కారవైఖరిని అవలంబించినవాడు దైవప్రవక్త (సఅసం) పట్ల కూడా ధిక్కార వైఖరినే అవలంబించిన వాడవుతాడు. దైవప్రవక్త (స) పట్ల గడసరిగా వ్యవహరించినవాడు, దైవగ్రంథమయిన ఖుర్ఆన్ పట్ల కూడా పెడసరిగా ప్రవర్తించినట్లే లెక్క (ఇబ్నె కసీర్). "అందరికంటే ముందు మీరే తిరస్కారులవకండి" అని అనటంలోని ఉద్దేశమేమిటంటే, మీ దగ్గరున్న జ్ఞానం ఎవరి దగ్గరా లేదు, అందుచేత మీ మీద బాధ్యత అందరికన్నా అధికంగా ఉంది. రెండో విషయం ఏమిటంటే, మదీనాలో యూదులకు అందరికంటే ముందు విశ్వసించమని పిలుపు ఇవ్వబడింది. అందుకే వారికి హెచ్చరికగా చెప్పబడింది – అందరికంటే ముందు మీరే తిరస్కారులుగా పేరు మోయకండి అని! ఒకవేళ మీరు గనక ఆ పని చేస్తే యావత్తు యూదుల ధిక్కార బాధ్యత మీపైనే పడుతుంది సుమా! అని ఈ ఆయతు భావం.

54. **'కొద్దిపాటి ధరకు అమ్ముకోకండి'** అంటే భావం గిట్టుబాటు ధరకు అమ్ముకోమని కాదు. ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం దైవాదేశాలతో చెలగాటమాడరాదన్నదే దీని అసలు ఉద్దేశం. దైవాదేశాలు ఎంత అమూల్యమైనవంటే ప్రపంచంలోని ధనసంపత్తులన్నింటినీ ధారబోసినా వాటి ముందు అవి దేనికీ పనికిరావు. ఇస్రాయీల్ వంశస్థులను దృష్టిలో పెట్టుకుని ఈ తాకీదు చేయబడినప్పటికీ, ప్రళయదినం వరకూ అందరికీ ఇది వర్తిస్తుంది. స్వప్రయోజనాల కోసం సత్యాసత్యాలను కలగాపులగం చేసే వారికీ, స్వార్థం కోసం, ప్రాపంచిక అందలాల కోసం ఉద్దేశపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చేవారికీ ఇది తీవ్రమైన హెచ్చరిక అన్నమాట! (ఫత్‌హుల్ ఖదీర్).

وَأَقِيمُوا الصَّلَوٰةَ وَآتُوا الزَّكَوٰةَ وَارْكَعُوا مَعَ الرَّاكِعِينَ ﴿43﴾

**43** (ఇస్రాయీలు సంతతి వారలారా!) మీరు నమాజులను నెలకొల్పండి, జకాతును ఇవ్వండి, (నా సన్నిధిలో) రుకూ చేసే వారితోపాటు మీరూ రుకూ చేయండి.

أَتَأْمُرُونَ النَّاسَ بِالْبِرِّ وَتَنْسَوْنَ أَنْفُسَكُمْ وَأَنْتُمْ تَتْلُونَ الْكِتَابَ ۚ أَفَلَا تَعْقِلُونَ ﴿44﴾

**44** ప్రజలకైతే మీరు మంచిని గురించి ఆదేశిస్తారు, కాని మీ స్వయాన్ని మరచిపోతారే?! చూడబోతే మీరు గ్రంథపారాయణం చేస్తారాయె. మరి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా మీకు లేదా?

وَاسْتَعِينُوا بِالصَّبْرِ وَالصَّلَوٰةِ ۚ وَإِنَّهَا لَكَبِيرَةٌ إِلَّا عَلَى الْخَاشِعِينَ ﴿45﴾

**45** మీరు ఓర్పు ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి.[55] నిశ్చయంగా ఇది కష్టమయిన పనే. కాని (అల్లాహ్‌కు) భయపడేవారికి[56] (ఇది సులువైన పని).

الَّذِينَ يَظُنُّونَ أَنَّهُمْ مُلَاقُوا رَبِّهِمْ وَأَنَّهُمْ إِلَيْهِ رَاجِعُونَ ﴿46﴾

**46** (ఎందుకంటే) ఎట్టకేలకు తాము తమ ప్రభువును కలుసుకోవాల్సి ఉందనీ, ఆయన వైపునకే మరలిపోవలసి ఉందనీ వారు నమ్ముతారు.

يَا بَنِي إِسْرَائِيلَ اذْكُرُوا نِعْمَتِيَ الَّتِي أَنْعَمْتُ عَلَيْكُمْ وَأَنِّي فَضَّلْتُكُمْ عَلَى الْعَالَمِينَ ﴿47﴾

**47** ఓ ఇస్రాయీలు (యాఖూబు) సంతతి వారలారా! నేను మీపై కురిపించిన అనుగ్రహాన్నీ, (నాటి) సమస్త లోకవాసులపై[57] మీకు ఇచ్చిన ప్రాధాన్యతను గురించి (కాస్త) నెమరు వేసుకోండి.

55. సహనం, నమాజు – ఇవి రెండూ సదాచార సంపన్నుల ముఖ్య ఆయుధాలు. నమాజు ద్వారానే ఒక విశ్వాసికీ – అల్లాహ్‌కు మధ్య సంబంధం ఏర్పడుతుంది. తద్వారా అతనికి దైవసహాయం, తోడ్పాటు లభిస్తుంది. పోతే, సహనం, నిగ్రహం ద్వారా మనిషి నడవడిక పరిపక్వమవుతుంది. ధర్మమార్గంలో స్థయిర్యం, నిలకడ ఒనగూడుతాయి. "దైవప్రవక్త (స)కు ఎప్పుడు, ఏ క్లిష్టసమస్య ఎదురైనా, ఆయన (స) వెంటనే నమాజు వైపు శ్రద్ధ చూపేవారు" అని హదీసులో ఉంది (ముస్నదె అహ్మద్, ఫత్‌హుల్ ఖదీర్ ఆధారం). (ఈ విషయమై మరిన్ని వివరాల కోసం అన్‌కబూత్ సూరా 45వ వచనానికి వివరణ చూడండి).

56. క్రమం తప్పకుండా నమాజు చేయటం అనేది సాధారణ వ్యక్తులకు కష్టతరమైన పనే. అయితే దైవ విధేయులకు, అల్లాహ్ భీతిగల వారికి ఇది ఏమాత్రం కష్టం కాదు. పైగా ఈ నమాజు ద్వారా వారు హాయినొందుతారు. వారి మనసులు కుదుటపడుతాయి. ఎవరు వారు? అంటే తీర్పుదినంపై గట్టి నమ్మకం కలవారు. తీర్పుదినంపై దృఢ విశ్వాసం ఉంటే చాలు, ఏ మంచి పనైనా సులభతరమైపోతుంది. కాగా; పరలోక చింతన లేని మనిషి పనికిమాలిన వాడుగా తయారవుతాడు. అంతేకాదు – చెడుల చెట్టుగా, పాపాల పుట్టగా కూడా మారిపోతాడు.

57. మరోసారి ఇస్రాయీల్ వంశస్థులకు చేయబడిన మహోపకారాలు గుర్తు చేయబడుతున్నాయి. ప్రళయదినం నాటి పరిస్థితిని వివరించి జాగరూకపరచటం జరిగింది. ఆనాడు ఎవరూ మరొకరిని ఆదుకోలేరు. సిఫార్సులు చేయలేరు. చేసినా అవి అంగీకరించబడవు. నష్టపరిహారం లేక జరిమానా చెల్లించి బయటపడే మార్గం కూడా ఉండదు. సాయం చేయడానికి ముందుకు వచ్చేవాడు కూడా ఎవడూ ఉండడు.

సమస్త లోకవాసులపై ఇస్రాయీలు సంతతికి శ్రేష్ఠతనొసగబడిందన్న విషయం మామూలు విషయం కాదు. అంటే ముహమ్మద్ (స) అనుచర సమాజానికి పూర్వం ప్రపంచజాతుల్లో గొప్పవారన్న బిరుదు బనీ ఇస్రాయీల్‌కి ఉండేది. కాని వారు దేవుని అవిధేయతకు ఒడిగట్టి ఆ విశిష్ఠతను కోల్పోయారు. ఇప్పుడా బిరుదు ముహమ్మద్ (స) అనుచర

وَاتَّقُوْا يَوْمًا لَّا تَجْزِيْ نَفْسٌ عَنْ نَّفْسٍ شَيْـًٔا وَّلَا يُقْبَلُ مِنْهَا شَفَاعَةٌ وَّلَا يُؤْخَذُ مِنْهَا عَدْلٌ وَّلَا هُمْ يُنْصَرُوْنَ ﴿48﴾

**48** ఎవరూ ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేని, ఎవరి సిఫారసూ స్వీకరించబడని, ఎవరి వద్ద కూడా పరిహారం తీసుకోబడని, ఎలాంటి సాయం అందజేయబడని ఆ దినానికి భయపడండి.

وَاِذْ نَجَّيْنٰكُمْ مِّنْ اٰلِ فِرْعَوْنَ يَسُوْمُوْنَكُمْ سُوْٓءَ الْعَذَابِ يُذَبِّحُوْنَ اَبْنَآءَكُمْ وَيَسْتَحْيُوْنَ نِسَآءَكُمْ ۭ وَفِيْ ذٰلِكُمْ بَلَاۗءٌ مِّنْ رَّبِّكُمْ عَظِيْمٌ ﴿49﴾

**49** (ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేసుకోండి) ఫిరౌను మనుషుల[58] బారి నుండి మేము మీకు విముక్తి నొసగాము. వారు మిమ్మల్ని దారుణంగా వేధించేవారు. మీ కొడుకులను చంపివేసి, కూతుళ్ళను మాత్రం విడిచి పెట్టేవాళ్ళు. ఈ విముక్తి నొసగటంలో మీ ప్రభువు తరఫునుండి మీకు గొప్ప పరీక్ష ఉండినది.

وَاِذْ فَرَقْنَا بِكُمُ الْبَحْرَ فَاَنْجَيْنٰكُمْ وَاَغْرَقْنَآ اٰلَ فِرْعَوْنَ وَاَنْتُمْ تَنْظُرُوْنَ ﴿50﴾

**50** అప్పుడు మేము మీ కోసం సముద్రాన్ని చీల్చి,[59] మిమ్మల్ని సురక్షితంగా (ఆవలి ఒడ్డుకు) చేరవేశాము. అదే సమయంలో మీరు చూస్తుండగానే ఫిరౌనీయులను అందులో ముంచివేశాము.

---

సమాజానికి లభించింది. అంటే "ఖైరె ఉమ్మత్" (శ్రేష్ఠ సమాజం) అన్నమాట! ఈ ఆయతు ద్వారా చేయబడే ఒక పరోక్ష హెచ్చరిక ఏమిటంటే దేవుని తరఫున వొసగబడే గౌరవపురస్కారాలు ఏదో ఒక జాతికో, వర్గానికో ప్రత్యేకం కావు. విశ్వాసం మరియు సదాచరణ ఆధారంగా ఇవి ప్రాప్తిస్తాయి. అవిశ్వాస వైఖరికి ఒడిగట్టి, దుర్వర్తనులుగా మారినపక్షంలో దైవకానుకలు జప్తు చేసుకోబడతాయి. ఉమ్మతె ముహమ్మదియా (ముహమ్మద్-స- అనుచర సమాజం) సయితం ఈనాడు తమ దుష్కర్మల మూలంగా, ముష్రిక్కు పోకడల కారణంగా 'శ్రేష్ఠ సమాజానికి' బదులు 'హీన సమాజం'గా తయారవుతోంది. అల్లాహ్ సన్మార్గం చూపుగాక!

తాము అల్లాహ్కు ఎంతో ప్రీతిపాత్రులం అన్న ఊహ కూడా యూదులను నిలువునా ముంచేసింది. పరలోకంలో అల్లాహ్ పట్టునుంచి తాము సురక్షితంగా ఉండగలమని వారనుకున్నారు. కాని ఆ రోజు దైవధిక్కారులకు ఎవరూ ఎటువంటి ఆశ్రయంగానీ, తోడ్పాటుగానీ ఇవ్వజాలరని అల్లాహ్ ముందే స్పష్టపరచాడు. కాని నేటి ముస్లిం సమాజం సయితం ఈ భ్రమకు లోనయింది. తామెన్ని దుష్కార్యాలకు ఒడిగట్టినా 'సిఫారసు' ద్వారా గట్టెక్కవచ్చని కొంతమంది తలపోస్తున్నారు. మహాప్రవక్త (సఅసం) తప్పకుండా తన అనుయాయుల కోసం అల్లాహ్కు సిఫారసు చేస్తారు. అల్లాహ్ కూడా ఆయన (స) సిఫారసును అంగీకరిస్తాడు (సహీహ్ హదీసుల ద్వారా కూడా ఈ సంగతి నిరూపితమే). అయితే ధర్మంలో కొంగ్రొత్త విషయాలను సృష్టించిన (బిద్అత్లకు పాల్పడిన) వారు సిఫారసు భాగ్యానికి నోచుకోకుండా పోతారని కూడా హదీసులలో వచ్చింది. అంతే కాదు – చాలామంది పాపాత్ములు నరకంలో శిక్ష అనుభవించిన తరువాత – ఆయన (స) చేసిన సిఫారసుపై నరకాగ్నినుంచి బయటికి తీయబడతారు. అయితే ఏదో ఒకనాడు తమకు సిఫారసు భాగ్యం వరించకపోతుందా అన్న ఆశతో – నిశ్చింతగా ఉంటూ – మహాపాతకాలు చేస్తూ పోవాలనుకునేవారు కొన్నాళ్ళపాటైనా సరే నరక యాతనను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నారా?! ఆ యాతన వారికి భరించశక్యమేనా?

58. ఫిరౌను మనుషులంటే భావం కేవలం ఫిరౌను చక్రవర్తి కుటుంబీకులు మాత్రమే కాదు, ఫిరౌను అనుయాయులంతా ఇందులోకి వచ్చేస్తారు. "మేము ఫిరౌనీయులందరినీ ముంచివేశాము" అన్న వాక్యం కేవలం ఫిరౌను ఇంటివారికే పరిమితం కాదు. అతని సైనికదళం, అతని దృక్పథాన్ని సమర్థించిన జనమంతా అందులో చేరి ఉన్నారు. మొత్తానికి ఖుర్ఆన్లో **"ఆల్"** (آل) అన్న పదం అనుచరులు అనే అర్థంలో వాడబడింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అల్ అహ్జాబ్ సూరాలోని 33వ ఆయతు పాద సూచికను చూడండి.

**51** (జ్ఞాపకం చేసుకోండి) మేము మూసా (అలైహిస్సలాం)కు నలభై రాత్రుల వాగ్దానం చేసి (అతన్ని పిలిచి) నప్పుడు, అతను వెళ్ళిన తరువాత మీరు ఆవు దూడను పూజించటం మొదలెట్టారు. ఆ విధంగా మీరు దుర్మార్గానికి పాల్పడ్డారు.[60]

وَإِذْ وٰعَدْنَا مُوسَىٰٓ أَرْبَعِينَ لَيْلَةً ثُمَّ اتَّخَذْتُمُ
الْعِجْلَ مِنْۢ بَعْدِهٖ وَأَنْتُمْ ظٰلِمُونَ ﴿٥١﴾

**52** అయినప్పటికీ మేము మిమ్మల్ని మన్నించి వదలిపెట్టాము – అలాగయినా కృతజ్ఞులవుతారేమోనని!

ثُمَّ عَفَوْنَا عَنْكُمْ مِّنْۢ بَعْدِ ذٰلِكَ لَعَلَّكُمْ
تَشْكُرُونَ ﴿٥٢﴾

**53** ఇంకా మేము మూసాకు, మీ మార్గదర్శకత్వం నిమిత్తం గ్రంథాన్నీ, గీటురాయినీ ప్రసాదించాము.[61]

وَإِذْ اٰتَيْنَا مُوسَى الْكِتٰبَ وَالْفُرْقَانَ لَعَلَّكُمْ
تَهْتَدُونَ ﴿٥٣﴾

**54** (గుర్తు చేయి) మూసా తన జాతి ప్రజలతో ఇలా అన్నాడు: "ఓ నా జాతివారలారా! ఆవుదూడను ఆరాధ్య దైవంగా చేసుకుని మీరు మీ స్వయానికి అన్యాయం చేసుకున్నారు. కనుక ఇప్పుడు మీరు పశ్చాత్తాప భావంతో మీ సృష్టికర్త వైపుకు మరలండి. (ఈ ఘోర కృత్యానికి పాల్పడిన) మీలోని వారిని చంపండి. మీ సృష్టికర్త

وَإِذْ قَالَ مُوسٰى لِقَوْمِهٖ يٰقَوْمِ إِنَّكُمْ ظَلَمْتُمْ
أَنْفُسَكُمْ بِاتِّخَاذِكُمُ الْعِجْلَ فَتُوبُوٓا إِلٰى بَارِئِكُمْ
فَاقْتُلُوٓا أَنْفُسَكُمْ ذٰلِكُمْ خَيْرٌ لَّكُمْ عِنْدَ بَارِئِكُمْ ط

59. సముద్రాన్ని చీల్చడం, అందులో మార్గం ఏర్పరచటం – ఇది దేవుని మహిమల్లోనిది. మరిన్ని వివరాలు షుఅరా సూరాలో వచ్చాయి. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్‌గానీ, మహిమల్ని తిరస్కరించే ఇతర ప్రబుద్ధులుగానీ తలపోసినట్లు ఇది సముద్రపు ఆటుపోట్ల ప్రభావం ఎంతమాత్రం కాదు.

60. ఫిరౌను ప్రజల దాస్యం నుండి విముక్తినొందిన తరువాత ఇస్రాయీల్ సంతతివారు సినాయ్ ద్వీపకల్పానికి చేరుకున్నారు. 'ఆవుదూడను పూజించే' సంఘటన జరిగింది ఆ రోజుల్లోనే. మూసా (అలైహిస్సలాం)కు తౌరాత్ గ్రంథం ప్రసాదించేందుకు అల్లాహ్ 40 రాత్రుల కోసం ఆయన్ని తూర్ పర్వతంపైకి పిలుచుకున్నాడు. మూసా (అలైహిస్సలాం) ప్రజల మధ్య నుంచి వెళ్ళగానే ఇస్రాయీలీయులు సామిరీ అనే వ్యక్తి మాయమాటల్లో పడిపోయి దూడను పూజించటం మొదలెట్టారు. మానవుడు ఎంత బరితెగించిన భౌతికవాది?! దేవుని గొప్ప గొప్ప నిదర్శనాలను తన కళ్ళారా చూసినప్పటికీ, ప్రవక్తలు (మూసా, హారూన్) తన ముందు ఉన్నప్పటికీ ఆవు దూడను తన "ఆరాధ్య దైవం"గా చేసుకున్నాడు. ఇది అతనిలోని విపరీతమైన ధార్మిక నిర్లక్ష్య భావానికి తార్కాణం. నేటి నవతరం కూడా ఈ విషయంలో ఎవరికీ ఏమాత్రం తీసిపోదు. నేటి ఆధునిక ముస్లింలు సయితం బహుదైవోపాసనతో కూడుకున్న మూఢనమ్మకాలలో, దురాచారాలలో దారుణంగా చిక్కుకుని ఉన్నారు. అయితే ముస్లిములనేవారు షిర్కులో ఎలా చిక్కుకుంటారు? అని వాళ్ళు తమ్ము తామే సముదాయించుకుంటున్నారు. చూడబోతే మరి వాళ్ళు చేసేది షిర్కే. రాతి విగ్రహాలను పూజించేవారు మాత్రమే ముష్రిక్కులని ఈ ముష్రిక్కు ముస్లింలు తలపోస్తున్నారు. కాని రాతి బొమ్మలను పూజించే బహుదైవారాధకులు ఏమేం చేస్తారో ఈ సోకాల్డ్ ముస్లింలు కూడా సమాధుల వద్దకు పోయి అదే చేస్తున్నారు. అల్లాహ్ మనల్ని ఈ షిర్క్ జాడ్యం నుంచి కాపాడుగాక!

61. ఇది కూడా ఇస్రాయీల్ వంశస్థులు ఎర్ర సముద్రం దాటిన తరువాత జరిగిన సంఘటనే (ఇబ్నె కసీర్). బహుశా తౌరాత్ గ్రంథాన్నే గీటురాయి (ఫుర్ఖాన్)గా పేర్కొని ఉండవచ్చు. ఎందుకంటే ప్రతి ఆకాశగ్రంథం సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను వేరు పరచేదై ఉంటుంది. లేక అద్భుతాలనే 'గీటురాయి'గా చెప్పబడి ఉండవచ్చు. అద్భుతాలు, మహిమలు కూడా ధర్మాన్ని – అధర్మాన్నీ పరికించటంలో కీలకపాత్ర వహిస్తాయి.

فَتَابَ عَلَيْكُمْ ۚ إِنَّهُ هُوَ التَّوَّابُ الرَّحِيمُ ﴿54﴾

వద్ద ఇదే మీ కొరకు మేలైనది." మరి ఆయన మీ పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరించే వాడు, కనికరించేవాడు.[62]

وَإِذْ قُلْتُمْ يَٰمُوسَىٰ لَن نُّؤْمِنَ لَكَ حَتَّىٰ نَرَى ٱللَّهَ
جَهْرَةً فَأَخَذَتْكُمُ ٱلصَّٰعِقَةُ وَأَنتُمْ تَنظُرُونَ ﴿55﴾

**55** మీరు మూసాతో అన్న మాటలను గుర్తుకు తెచ్చుకోండి : "ఓ మూసా! మేము అల్లాహ్‌ను కళ్ళారా చూడనంతవరకూ నిన్ను విశ్వసించము." (మీ ఈ పెడసరి ధోరణికి శిక్షగా) మీరు చూస్తుం డగానే[63] (మీపై) పిడుగు పడింది.

ثُمَّ بَعَثْنَٰكُم مِّنۢ بَعْدِ مَوْتِكُمْ لَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿56﴾

**56.** అయితే (ఈసారయినా) మీరు కృతజ్ఞులవుతారేమోనన్న ఉద్దేశంతో చనిపోయిన మిమ్మల్ని తిరిగి బ్రతికించాము.

وَظَلَّلْنَا عَلَيْكُمُ ٱلْغَمَامَ وَأَنزَلْنَا عَلَيْكُمُ ٱلْمَنَّ
وَٱلسَّلْوَىٰ ۖ كُلُوا۟ مِن طَيِّبَٰتِ مَا رَزَقْنَٰكُمْ ۖ وَمَا
ظَلَمُونَا وَلَٰكِن كَانُوٓا۟ أَنفُسَهُمْ يَظْلِمُونَ ﴿57﴾

**57.** మేము మీపై మేఘాల ఛాయను కల్పించాము. మీపై మన్న్, సల్వాలను (ఆహారంగా) దించాము. "మేము మీకు ప్రసాదించిన పరిశుద్ధమైన వస్తువులను తినండి"[64] (అని చెప్పాము. కాని, వారు ఆ అనుగ్రహాలు అనుభవించి కృతజ్ఞులయ్యే బదులు కృతఘ్నత చూపటం మొదలుపెట్టారు). వారు మాకెలాంటి అన్యాయం చేయలేదు, కాకపోతే వారు తమకు తామే అన్యాయం చేసుకుంటూ పోయారు.

62. వారు చేసిన షిర్క్ చేష్టను గురించి మూసా (అలైహిస్సలాం) తీవ్రంగా మందలించిన తరువాత వారిలో పశ్చాత్తాప భావన జాగృతమయింది. ఒండొకరిని హతమార్చుకోవటమే దానికి పశ్చాత్తాపమని తీర్మానించటం జరిగింది. "ఒండొకరిని హతమార్చుకోండి" అన్నది అరబీ మూలంలో వున్న పదం. దీనికి రెండు వ్యాఖ్యానాలు చెప్పబడ్డాయి. వాటిలో ఒకటి: ఆవుదూడను పూజించిన వాళ్ళందరినీ రెండు వరుసల్లో నిలబెట్టి ఒకరినొకరు చంపుకోమని ఆదేశిం చటం జరిగింది. రెండోది: షిర్క్‌కు ఒడిగట్టిన వారందరినీ ఒక ప్రక్కన నిలబెట్టి, ఈ ఘోరకృత్యానికి దూరంగా– సురక్షితంగా – ఉన్నవారిని పిలిచి వారిచేత వాళ్ళను చంపించటం జరిగింది. ఆ విధంగా హతులైనవారి సంఖ్య డెబ్భయి వేల వరకూ ఉంటుందని చెప్పబడింది (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

63. మూసా (అలైహిస్సలాం) 70 మందిని తౌరాత్ గ్రంథం గ్రహించే ఉద్దేశంతో తూర్ పర్వతంపై తీసుకెళ్ళారు. మూసా (అలైహిస్సలాం) తిరిగివస్తుండగా; 'మేము అల్లాహ్‌ను ప్రత్యక్షంగా (నీతో సంభాషిస్తుండగా) చూడనంతవరకూ మేము నీ మాటల్ని నమ్మబోము' అని వారు తెగేసి చెప్పేశారు. వారి ఈ దౌష్ట్యానికి శిక్షగా వారి కళ్ళముందరే భయంకరమైన పిడుగుపడింది. ఆ దెబ్బకు వారు నేలకొరిగారు. ఈ హఠాత్పరిణామానికి మూసా (అలైహిస్సలాం) కలవరం చెందారు. వాళ్ళను తిరిగి బ్రతికించమని దైవాన్ని దీనాతిదీనంగా వేడుకున్నారు. దాంతో అల్లాహ్ వారికి తిరిగి ప్రాణం పోశాడు. 'చూస్తుండగానే పిడుగుపడింది' అంటే భావం మొదట్లో పిడుగుపడిన వారిని ప్రక్కనున్న వారు చూస్తూనే ఉన్నారు. ఆఖరికి వారంతా మృత్యువు ఒడిలోకి జారుకున్నారు.

64. చాలామంది వ్యాఖ్యాతల దృష్టిలో ఇది ఈజిప్టుకు – సిరియాకు మధ్యన గల 'తీహ్' మైదానంలో జరిగిన సంఘటన. దైవాదేశానుసారం వారు 'అమాలిఖా' పురములో ప్రవేశించడానికి నిరాకరించినప్పుడు, శిక్షగా ఇస్రాయీల్ వంశస్థులు తీహ్ మైదానంలో నలభై సంవత్సరాలపాటు పడిఉండాల్సి వచ్చింది. అయితే మరి కొంతమంది దీంతో ఏకీభవించలేదు.

وَإِذْ قُلْنَا ادْخُلُوا هَٰذِهِ الْقَرْيَةَ فَكُلُوا مِنْهَا حَيْثُ
شِئْتُمْ رَغَدًا وَادْخُلُوا الْبَابَ سُجَّدًا وَقُولُوا
حِطَّةٌ نَغْفِرْ لَكُمْ خَطَايَاكُمْ ۚ وَسَنَزِيدُ الْمُحْسِنِينَ ﴿58﴾

**58** (ఇంకా ఆ విషయాన్ని కూడా నెమరు వేసుకోండి). "ఈ పురములో ప్రవేశించండి.[65] అక్కడ మీకు ఇష్టమైన చోట, కోరు కున్న విధంగా తృప్తిగా తినండి. కాని నగర ముఖద్వారం గుండా పోతున్నప్పుడు 'సజ్దా' చేస్తూ మరీ పోవాలి.[66] పోతున్నప్పుడు 'హిత్తతున్'[67] అని నోటితో పలుకుతూ ముందుకు సాగాలి. అప్పుడు మేము మీ తప్పులను మన్నిస్తాము, సదాచార సంపన్ను లకు మరింతగా అనుగ్రహిస్తాము" అని మేము మీతో అన్నాము.

فَبَدَّلَ الَّذِينَ ظَلَمُوا قَوْلًا غَيْرَ الَّذِي قِيلَ لَهُمْ
فَأَنْزَلْنَا عَلَى الَّذِينَ ظَلَمُوا رِجْزًا مِنَ السَّمَاءِ
بِمَا كَانُوا يَفْسُقُونَ ﴿59﴾

**59** కాని దుర్మార్గులు వారితో అనబడిన ఈ మాటను మార్చి వేశారు.[68] అందుచేత మేము కూడా ఆ దుర్మార్గులపై వారి (దుర్మార్గం), ధిక్కార వైఖరికి శాస్తిగా ఆకాశం నుంచి శిక్షను అవతరింపజేశాము.[69]

---

(వీరి ప్రకారం) సీనా ఎడారిలోకి చేరిన పిదప వారికి అన్నిటికన్నా ముందు అన్నపానీయాల సమస్య ఎదురయింది. అప్పుడు వారికోసం ఈ 'మన్న్' 'సల్వా'ల ఏర్పాటు చేయబడింది. 'మన్న్' అంటే మొక్కలపై, రాళ్ళపై కురిసి పేరుకుపోయే మంచు లేదా తియ్యటి గుళికలు, ఇది కూడా సహజసిద్ధమైనదే. తేనెలా తియ్యగా ఉంటుంది. ఎండిన తరువాత జిగట పదార్థంగా తయారవుతుంది. మరి కొంతమంది అభిప్రాయంలో ఇది తేనె లేక తీపి నీరు లాంటిది. హదీసులో వుంది: "పుట్టగొడుగు కూడా ఇస్రాయీల్ సంతతిపై, మూసా అలైహిస్సలాంపై అవతరించిన మన్న్ లాంటిదే. దాని నీరు కళ్ళ జబ్బును నయం చేస్తుంది" (సహీహ్ ముస్లిం). దీని మతలబు ఏమిటంటే; ఏ విధంగానయితే ఇస్రాయీల్ వంశస్థులకు వేళాపాళా లేకుండా ఎప్పుడంటే అప్పుడు అన్నం సమకూర్చబడేదో, అదేవిధంగా పుట్టగొడుగు కూడా ఎవరూ విత్తనం నాటకుండానే, సేద్యం చేయకుండానే పండుతుంది (అహ్సనుత్తఫాసీర్). "సల్వా" : పూరేడు పిట్ట లేదా పిచ్చుక తరహాలో ఉండే పక్షి. దాన్ని జిబహ్ చేసి తినేవారు (ఫత్హుల్ ఖదీర్).

65. అధిక సంఖ్యాక వ్యాఖ్యాతలు ఈ పురమును 'బైతుల్ మఖ్దిస్' నెలకొని వున్న స్థలంగా భావిస్తున్నారు.

66. ఇక్కడ 'సజ్దా'ను కొందరు ఒక అర్థంలో, మరికొందరు ఇంకొక అర్థంలో తీసుకున్నారు. వంగి లేక తలవంచుకుని నగరంలో ప్రవేశించాలని మొదటి వర్గం భావించగా, కృతజ్ఞతాపూర్వకంగా సాష్టాంగపడి మరీ లోపలికి వెళ్ళాలని రెండవ వర్గం అర్థం తీసుకుంది. మొత్తమ్మీద దీని భావార్థం ఒక్కటే-దేవుడు ఈ సదవకాశం కల్పించినందుకు వినయ వినమ్రతలు ఉట్టిపడుతూ వుండగా, ధన్యవాదాలను అర్పించుకుంటూ లోపలికి ప్రవేశించాలి.

67. 'హిత్తతున్' అంటే "మా పాపాలను మన్నించుము" అని అర్థం.

68. దీనికి సంబంధించిన వివరణ హదీసులో ఉంది. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలో కూడా ఈ హదీసు పొందుపరచబడి ఉంది. దీని ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా తెలియజేశారు : "సజ్దా చేస్తూ ప్రవేశించండి అని వారికి ఆజ్ఞాపించబడింది. కాని వారు తమ పిరుదులు నేలకు రాసుకునేలా దేక్కుంటూ వెళ్ళారు. 'హిత్తతున్' అనడానికి బదులు 'హబ్బతున్ ఫీ షారతిన్'-అంటే 'వెన్నులో గోధుమ గింజ' అని పలికారు (కితాబుత్తఫ్సీర్). దీని ద్వారా వారిలోని తలబిరుసుతనం ఏ స్థాయికి చేరిందో, దైవాదేశాలతో పరిహాసమాడటంలో వారెంత ముందుకు వెళ్ళిపోయారో అర్థమవుతోంది. వాస్తవమేమంటే ఏ జాతి అయినా నైతికంగా దివాలాతీసి, అధోగతి వైపుకు సాగిపోతున్నప్పుడు దైవాదేశాల పట్ల అది వ్యవహరించే తీరు ఇలాగే ఉంటుంది.

وَإِذِ اسْتَسْقَىٰ مُوسَىٰ لِقَوْمِهِ فَقُلْنَا اضْرِب بِّعَصَاكَ
الْحَجَرَ ۖ فَانفَجَرَتْ مِنْهُ اثْنَتَا عَشْرَةَ عَيْنًا ۖ قَدْ
عَلِمَ كُلُّ أُنَاسٍ مَّشْرَبَهُمْ ۖ كُلُوا وَاشْرَبُوا مِن
رِّزْقِ اللَّهِ وَلَا تَعْثَوْا فِي الْأَرْضِ مُفْسِدِينَ ﴿٦٠﴾

**60** మూసా (అలైహిస్సలాం) తన జాతి ప్రజల కోసం నీటిని అడిగినప్పుడు, "నీ చేతి కర్రతో ఆ (కొండ) రాతిపై కొట్టు" అని మేమన్నాము. (అలా కొట్టగా) దాన్నుండి పన్నెండు ఊటలు పెల్లుబికాయి.[70] వారిలోని ప్రతి తెగవారూ తమ తమ నీటి స్థలాన్ని తెలుసుకున్నారు. (అప్పుడు మేము వారికి ఈ విధంగా ఆదేశించాము:) "అల్లాహ్ (మీకు ప్రసాదించిన) ఉపాధిని తినండి, త్రాగండి. భువిలో అలజడిని రేపుతూ తిరగకండి."

وَإِذْ قُلْتُمْ يَا مُوسَىٰ لَن نَّصْبِرَ عَلَىٰ طَعَامٍ وَاحِدٍ
فَادْعُ لَنَا رَبَّكَ يُخْرِجْ لَنَا مِمَّا تُنبِتُ الْأَرْضُ مِن
بَقْلِهَا وَقِثَّائِهَا وَفُومِهَا وَعَدَسِهَا وَبَصَلِهَا ۖ قَالَ
أَتَسْتَبْدِلُونَ الَّذِي هُوَ أَدْنَىٰ بِالَّذِي هُوَ خَيْرٌ ۚ اهْبِطُوا
مِصْرًا فَإِنَّ لَكُم مَّا سَأَلْتُمْ ۗ وَضُرِبَتْ عَلَيْهِمُ الذِّلَّةُ

**61** (జ్ఞాపకం చేసుకోండి,) "ఓ మూసా! ఒకే రకమైన తిండిని మేము అస్సలు సహించము. అందుకే భూమిలో పండే ఆకు కూరలు, దోసకాయలు, గోధుమలు, పప్పుదినుసులు, ఉల్లి పాయలు ప్రసాదించవలసినదిగా నీ ప్రభువును ప్రార్థించు" అని మీరు డిమాండు చేసినప్పుడు అతనిలా అన్నాడు: "మీరు శ్రేష్ఠమైన వస్తువుకు బదులుగా అధమమైన దానిని కోరుకుంటున్నా రెందుకు? (సరే!) ఏదయినా పట్టణానికి వెళ్ళండి. అక్కడ మీరు కోరుకున్నవన్నీ మీకు లభిస్తాయి."[71] దాంతో వారిపై పరాభవం,

69. ఏమిటీ ఆ ఆకాశ శిక్ష? దైవాగ్రహమనీ, దట్టమైన పొగమంచు అనీ, ప్లేగు వ్యాధి అనీ కొందరు అభిప్రాయపడ్డారు. ప్లేగువ్యాధి అన్న దానికి హదీసు ద్వారా కూడా సమర్థన లభిస్తోంది. "ఈ ప్లేగు వ్యాధి కూడా ఆ యాతన మరియు శిక్షలో భాగమే. మీకు పూర్వం గతించిన కొన్ని వర్గాలపై అది విరుచుకుపడింది. మీరున్నచోట గనక ఈ వ్యాధి ప్రబలిపోతే మీరక్కణ్ణుంచి వేరొక ప్రాంతానికి బయలుదేరకండి. అలాగే వేరొక ప్రాంతంలో ఎక్కడయినా ప్లేగు వ్యాధి వచ్చిందని తెలిస్తే అక్కడికీ వెళ్ళకండి" అని మహనీయ ముహమ్మద్ (స) ఉపదేశించారు (సహీహ్ ముస్లిం).

70. ఈ సంఘటన తీహ్ లోయలో జరిగిందని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడగా, కాదు – సినాయ్ ఎడారిలో సంభవించిందని మరికొందరు అభిప్రాయపడ్డారు. మొత్తానికి అక్కడ మంచినీటి ఎద్దడి ఏర్పడగా, చేతికర్రతో కొండరాతిపై కొట్టమని దేవుడు మూసా (అలైహిస్సలాం)ను ఆజ్ఞాపించాడు. ఆ విధంగా ఆ రాతి నుంచి పన్నెండు ఊటలు పుట్టుకువచ్చాయి. ఇస్రాయీల్ సంతతిలో పన్నెండు తెగలుండేవి. ఒక్కో తెగ ఒక్కో ఊటను తన కోసం ప్రత్యేకించుకుని దాహం తీర్చుకునేది. ఇది కూడా దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) ద్వారా అల్లాహ్ ప్రస్ఫుటం చేసిన ఒక అద్భుతమే.

71. ఇది కూడా 'తీహ్' ప్రాంతంలో జరిగిన ఘటనే. **'మిస్ర్'** (مِصرٌ) అంటే ఇక్కడ అర్థం ఈజిప్టు పట్టణం అని కాదు. ఏదైనా ఒక పట్టణ ప్రాంతం అని మాత్రమే దీని భావం – అంటే ఇక్కడి నుంచి ఏదో ఒక పట్నానికి తరలిపొండి, అక్కడ కష్టపడండి, వ్యవసాయం చేయండి. మీకు మనసైన కాయగూరలు, పప్పుదినుసులు పండించుకొని తినండి అని ప్రవక్త మూసా (అలైహిస్సలాం) సలహాయిచ్చారు. వాళ్ల డిమాండు ఒక విధంగా దైవప్రసాదం పట్ల కృతఘ్నతకు, దురహంకారానికి తార్కాణం. అందుకే మూసా (అలైహిస్సలాం) "మీరు కోరుకున్నవన్నీ అక్కడ మీకు దొరుకుతాయి" అని నిష్ఠూరంగా అన్నారు.

وَالْمَسْكَنَةُ وَبَآءُو بِغَضَبٍ مِّنَ اللّٰهِ ذٰلِكَ بِاَنَّهُمْ
كَانُوْا يَكْفُرُوْنَ بِاٰيٰتِ اللّٰهِ وَيَقْتُلُوْنَ النَّبِيّٖنَ بِغَيْرِ
الْحَقِّ ذٰلِكَ بِمَا عَصَوْا وَّكَانُوْا يَعْتَدُوْنَ ﴿61﴾

దారిద్ర్యం రుద్దబడింది. వారు దైవాగ్రహానికి గురై తరలి పోయారు.[72] వారి ఈ దురవస్థకు కారణమేమిటంటే వారు అల్లాహ్ ఆయతుల పట్ల తిరస్కార వైఖరిని అవలంబించేవారు, అన్యాయంగా ప్రవక్తలను చంపేవారు.[73] ఇది వారి అవిధేయతకు, బరితెగించిన పోకడకు పర్యవసానం మాత్రమే![74]

اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَالَّذِيْنَ هَادُوْا وَالنَّصٰرٰى
وَالصّٰبِـِٕيْنَ مَنْ اٰمَنَ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ وَعَمِلَ
صَالِحًا فَلَهُمْ اَجْرُهُمْ عِنْدَ رَبِّهِمْ وَلَا خَوْفٌ
عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ﴿62﴾

**62** విశ్వసించినవారైనా, యూదులైనా,[75] నసారాలయినా,[76] సాబియనులయినా[77] – ఎవరయినాసరే – అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించి సదాచరణ చేస్తే వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉం(టుం)ది. వారికెలాంటి భయం గానీ, దుఃఖం గానీ ఉండదు.[78]

72. ఇంతకు మునుపు వారికి లభించిన పురస్కారాలు, మహోపకారాలెక్కడ? ఇప్పుడు వారిని చుట్టుముట్టిన అవమానం, దుర్భర దారిద్ర్యం ఎక్కడ? అసలు విషయం ఏమిటంటే వాళ్ళు దైవానుగ్రహాల పట్ల కృతజ్ఞులై ఉండకుండా ఘోర తప్పిదం చేశారు. ఫలితంగా వారిపై దేవుని దెబ్బపడింది. ఆగ్రహం కూడా అనుగ్రహం మాదిరిగా అల్లాహ్ గుణం. అల్లాహ్ గుణాల విషయంలో స్వంత భాష్యాలు చెప్పకూడదు. కనుక అల్లాహ్ ఆగ్రహాన్ని 'శిక్షించాలనే ఆయన తలంపు' అనో లేక 'శిక్ష' అనో వ్యాఖ్యానించటం సమంజసం కాదు. అల్లాహ్ వారిపై ఆగ్రహోదగ్రుడయ్యాడు (ఆయన ఔన్నత్యానికి తగినవిధంగా).

73. ఇస్రాయీల్ సంతతికి దాపురించిన దురవస్థకు కారణం ఇందులో వివరించబడింది. దైవవాక్కులను ధిక్కరించటం, దైవమార్గం వైపుకు ప్రజలను పిలిచే దైవ సందేశహరులను చంపివేయటం, వారిని అధములుగా జమకట్టటం, అవమానపరచటం సాధారణ నేరం కాదు, మహాపరాధం. ఈ అపరాధం కారణంగానే వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది. యూదులు ఈ అపరాధానికి ఒడిగట్టి శాపగ్రస్తులయ్యారు. అవమానాలపాలయ్యారు. ఇది దైవ సంప్రదాయం. ఈనాటికీ మానవ జాతులకు ఈ సూత్రం వర్తిస్తుంది. దైవాదేశాలతో చెలగాటమాడేవారు, దైవానుగ్రహాలను ఖాతరు చెయ్యనివారు, దైవధర్మ ప్రచారకులను అధములుగా భావించేవారు ఎంతటి వారైనాసరే, ఏ ప్రాంతంలో ఉండేవారైనా సరే గౌరవోన్నతుల్ని ఎలా పొందగలుగుతారు?

74. పరాభవానికీ, దీనావస్థకు, దారిద్ర్యానికి గల రెండో కారణమిది. చేయరాదని చెప్పిన పనులన్నీ చేసి వారు తలబిరుసుతనం చూపారు. ఇక చేయమని చెప్పిన పనులను దైవసూచనానుసారం సజావుగా చేసేబదులు, తమకు నచ్చిన రీతిలో చేసి పెడసరి ధోరణిని ప్రదర్శించారు. ఆదేశపాలన అంటే ఏమిటీ? 'వద్దు' అన్నదాన్ని చేయకుండా ఉండటం. 'చేయండి' అన్నదాన్ని చేయటం – అదీ ఏ విధంగా చేయమంటే ఆ విధంగానే చేయాలి. అందులో తమ తరఫున ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకూడదు. మార్పులు చేర్పులు కూడా చేయకూడదు. ఒకవేళ అలాచేస్తే ఇది దైవాభిమతానికి విరుద్ధం అవుతుంది. పొగరుబోతులు, గర్విష్ఠులు మాత్రమే ఇలాంటి చేష్టలకు ఒడిగడతారు; **"అసౌ"** ( **عَصَوْا** ) అంటే వారు అవిధేయతకు పాల్పడ్డారు, ఏ విషయాలనుంచయితే వారిని వారించటం జరిగిందో వాటికి ఒడిగట్టారు అని అర్థం. **"యాతదూన్"** ( **يَعْتَدُوْنَ** ) అంటే ఆజ్ఞాపించబడిన పనుల్లోనే హద్దులను అతిక్రమించేవారని అర్థం.

75. యహూద్ అనే పదం **'హవాదా'** లేక **'తహవ్వదున్'** అనే ధాతువు నుండి వచ్చింది. హవాదా అంటే ప్రేమ; తహవ్వదున్ అంటే పశ్చాత్తాపం; మొత్తానికి యహూద్ (యూదులు) అంటే పరస్పరం ప్రేమభావం కలిగి ఉండేవారు లేక పశ్చాత్తాపం చెందినవారు అని అసలు అర్థం. అయితే మూసా (అలైహిస్సలాం)ను నమ్మి నడుచుకునే వారిని 'యహూద్'గా వ్యవహరిస్తారు.

**63** తూరు పర్వతాన్ని మీపైకి ఎత్తి[79] మేము మీ చేత చేయించిన ప్రమాణాన్ని కాస్త జ్ఞాపకం చేసుకోండి. అప్పుడు, "మేము మీకు ప్రసాదించిన దానిని (గ్రంథాన్ని) గట్టిగా పట్టుకోండి. అందులో వున్న వాటిని బాగా జ్ఞాపకం చేసుకోండి, దీని ద్వారానే మిమ్మల్ని మీరు కాపాడుకునే అవకాశం ఉంది" (అని ఉపదేశించాము.)

وَإِذْ أَخَذْنَا مِيثَاقَكُمْ وَرَفَعْنَا فَوْقَكُمُ الطُّورَ خُذُوا مَا آتَيْنَاكُم بِقُوَّةٍ وَاذْكُرُوا مَا فِيهِ لَعَلَّكُمْ تَتَّقُونَ (63)

76. **నసారా :** నస్రాన్ అనే పదానికి బహువచనం. ఇది నుస్రత్ నుండి వచ్చింది. నుస్రత్ అంటే సహాయం అని అర్థం. ఒండొకరికి సహాయ సహకారాలందజేసుకునే వారన్న భావంలో వీరికి ఈ పేరు వచ్చింది. వీరిని 'అన్సార్లు' గా కూడా వ్యవహరించటం జరిగింది. వీళ్ల దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం – ఏసు ప్రవక్త) నుద్దేశించి "అల్లాహ్‌కు సహాయకులుగా మేమున్నాము (నహ్ను అన్సారుల్లాహి)" అని అన్నారు. (ఆలి ఇమ్రాన్ – 52, సఫ్ – 14). మొత్తమ్మీద ఈసా (ఏసు ప్రవక్త) అనుయాయులు నసారాగా పిలువబడతారు.

77. **సాబియీన్ :** సాబియీ అనే పదానికిది బహువచనం. తెలుగులో దీన్ని సాబియనులుగా వ్యవహరించటం జరిగింది. నిస్సందేహంగా ఈ వర్గంవారు ఒకప్పుడు సత్యధర్మాన్ని అవలంబించి ఉంటారు (అందువల్లనే బహుశా దివ్య ఖుర్‌ఆన్‌లో వీరిపేరు యూదుల, నసారాలతోపాటు ప్రస్తావించబడింది). కాని తరువాత వీళ్ల దైవదూతలను, నక్షత్రాలను ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు. ఆ తరువాత అసలు ఏ మతాన్నీ అవలంబించలేదు. అందుకే ఒక మతమంటూ లేనివారిని సాబియనులుగా పిలువటం జరిగింది.

78. కొంతమంది ఆధునిక వ్యాఖ్యాతలు ఈ ఆయతును అర్థం చేసుకోవటంలో పొరబడ్డారు. "మతాలన్నీ ఒక్కటే" అన్న భావనకు వారు ఊతం ఇచ్చే కృషిచేశారు. అంటే ముహమ్మద్ (స) గారి దైవదౌత్యాన్ని విశ్వసించటం తప్పనిసరి కాదనీ, మనిషి తానేమతాన్ని అవలంబించి మంచి పనులు చేసినా చాలు, అతను మోక్షం పొందుతాడని భాష్యం చెప్పారు. ఈ ఫిలాసఫీ చాలా ప్రమాదకరమైనది.

ఈ ఆయతుకు సరైన భావార్థం ఏమిటంటే; అల్లాహ్ ఇంతకు ముందు వచ్చిన ఆయతులలో యూదుల దుష్కార్యాల, దురాగతాల కారణంగా వారిని శిక్షార్హులుగా ఖరారు చేశాడు. మరి అటువంటప్పుడు యూదులలో నికార్సయిన వారిపట్ల దైవగ్రంథాన్నీ, దైవప్రవక్తను ఖచ్చితంగా అనుసరించి, జీవించిన వారి పట్ల అల్లాహ్ చేసే వ్యవహారం ఏమిటీ? అన్న సందేహం ఈ సందర్భంగా కలగటం సహజం. ఈ సందేహానికి అల్లాహ్ స్పష్టంగా సమాధానమిచ్చాడు– ఒక్క యూదులే కాదు, నసారా, సాబియనులైనాసరే – తమ తమ కాలాల్లో రుజువర్తనులై ఉండి, అల్లాహ్ మరియు అంతిమ దినంపై విశ్వాసం కలిగి ఉన్నట్లయితే, సదాచరణచేసి ఉన్నట్లయితే వారు తప్పకుండా పరలోకంలో సాఫల్యం పొందుతారు.

అదేవిధంగా ముస్లింలు ప్రస్తుతం ముహమ్మద్ (స) అందజేసిన దైవసందేశాన్ని నిష్కల్మషంగా విశ్వసించి, అల్లాహ్ మరియు అంతిమ దినంపై దృఢ నమ్మకం కలిగి ఉంటూ, మంచిపనులు చేసినట్లయితే వారు కూడా శాశ్వితమైన పరలోక భాగ్యాలకు అర్హులుగా ఖరారు చేయబడతారు. పరలోక శ్రేయోసాఫల్యాల విషయంలో ఎవరిపట్ల కూడా ఎలాంటి వివక్ష కనబరచబడదు. అక్కడ నిష్పక్షపాతంగా నిర్ణయం గైకొనబడుతుంది – ముస్లిములైనా, అంతిమ దైవప్రవక్త (స)కు ముందు గతించిన యూదులు, నసారా, సాబియనులైనాసరే! కొన్ని ముర్సల్ ఉల్లేఖనాలు కూడా ఈ విషయాన్నే సమర్థిస్తున్నాయి. ఉదాహరణకు ముజాహిద్ గారు, సల్మాన్ ఫార్సీ (రజి) కథనాన్ని ఇలా ఉటంకించారు. అందులో ఆయన ఇలా చెప్పారు – నా పూర్వాశ్రమంలో ధర్మావలంబీకులుగా జీవితం గడిపిన నా సహవాసుల గురించి దైవప్రవక్త (సఅసం)ను అడిగాను. వాళ్లు ధర్మనిష్ఠాపరులు, దైవారాధన చేసేవారు. (అంటే మహాప్రవక్త దైవదౌత్యానికి పూర్వం వాళ్ళు తమ ధర్మంపై చిత్తశుద్ధి కలిగి ఉండేవారు). ఆ సందర్భంగానే ఈ ఆయతు అవతరించింది–ఇన్నల్లజీన ఆమనూ వల్లజీన హాదూ...(ఇబ్నె కసీర్). దివ్య ఖుర్‌ఆన్‌లోని ఇతర ఆయతుల ద్వారా

**64** కాని దీని తరువాత మీరు విముఖులైపోయారు. అయి నప్పటికీ దైవానుగ్రహం, దైవకారుణ్యం మీపై ఉండింది. లేకపోతే మీరు (తీవ్రంగా) నష్టపోయేవారే.

ثُمَّ تَوَلَّيْتُم مِّنۢ بَعْدِ ذَٰلِكَ ۖ فَلَوْلَا فَضْلُ اللَّهِ عَلَيْكُمْ وَرَحْمَتُهُۥ لَكُنتُم مِّنَ الْخَاسِرِينَ (64)

**65** శనివారం[80] విషయంలో ఆజ్ఞోల్లంఘనకు పాల్పడిన మీ వారి గురించి కూడా మీకు బాగా తెలుసు. "అత్యంత అసహ్యకరమైన, ఛీత్కరించబడిన కోతులుగా మారిపోండి" అని మేము వాళ్ళను శపించాము.

وَلَقَدْ عَلِمْتُمُ الَّذِينَ اعْتَدَوْا مِنكُمْ فِي السَّبْتِ فَقُلْنَا لَهُمْ كُونُوا قِرَدَةً خَاسِئِينَ (65)

**66** దీనిని మేము ఆ కాలం వారికీ, భావితరాల వారికీ గుణపాఠ సూచనగానూ, భయభక్తులు కలవారికి హితబోధగానూ చేశాము.

فَجَعَلْنَاهَا نَكَالًا لِّمَا بَيْنَ يَدَيْهَا وَمَا خَلْفَهَا وَمَوْعِظَةً لِّلْمُتَّقِينَ (66)

**67** మూసా తన జాతివారితో, "అల్లాహ్ మిమ్మల్ని ఒక ఆవును 'జిబహ్' చేయవలసిందిగా ఆజ్ఞాపిస్తున్నాడు"[81] అని అన్నప్పుడు, "ఏమిటీ, మాతో వేళాకోళం చేస్తున్నావా?" అని వారు ప్రశ్నిం

وَإِذْ قَالَ مُوسَىٰ لِقَوْمِهِۦٓ إِنَّ اللَّهَ يَأْمُرُكُمْ أَن تَذْبَحُوا بَقَرَةً ۖ قَالُوٓا أَتَتَّخِذُنَا هُزُوًا ۖ قَالَ

కూడా దీనికి సమర్థన లభిస్తోంది. ఉదాహరణకు :1. "దైవసన్నిధిలో ఆమోదించబడిన ధర్మం ఇస్లాం మాత్రమే" (ఆలి ఇమ్రాన్-19). 2. "ఇస్లాం తప్ప వేరే ఇంకొక ధర్మాన్ని అన్వేషించినవాడు ఎట్టి పరిస్థితిలోనూ సమ్మతిని పొందలేడు" (ఆలి ఇమ్రాన్-85).

హదీసులలో కూడా ఈ విషయమై మహనీయ ముహమ్మద్ (సఅసం) స్పష్టమయిన సూచనలిచ్చారు. అంటే తన దైవదౌత్యాన్ని విశ్వసించనంతవరకూ ఎవరూ మోక్షం పొందలేరు అని చెప్పారు. ఉదాహరణకు : ఆయన ఇలా అన్నారు : "ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను – నా అనుచర సమాజంలో ఏ వ్యక్తయినాసరే – అతను యూదుడైనా, నస్రానీ అయినా సరే – నేను చెప్పింది విన్నమీదట నన్ను విశ్వసించకపోతే అతను నరకంలోకి పోతాడు" (సహీహ్ ముస్లిం).

మొత్తానికి తేలిందేమంటే దివ్య ఖుర్ఆన్‌లోని ఇతర ఆయతులను ఉపేక్షించినందు వల్ల "అన్ని మతాలూ ఒక్కటే" అని వాదించేవారికి దీని ద్వారా సందు దొరికింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి ప్రబోధనలను విస్మరించి ఖుర్ఆన్‌కు వ్యాఖ్యానం ఇవ్వదలచిన వారు కూడా ఇలాగే పిల్లిమొగ్గలు వేస్తుంటారు. అందుకే – ప్రామాణిక హదీసులను విస్మరించి ఖుర్ఆన్‌పై యోచన చేసే ప్రయత్నం అధర్మమైనది. సహీహ్ హదీసులతో నిమిత్తం లేకుండా ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవాలనుకోవటం సరికాదు.

79. ఈ తౌరాత్‌లోని ఆజ్ఞలను పాలించటం మా వల్లకాదు అని యూదులు దురుద్దేశ్యంతో అన్నప్పుడు అల్లాహ్ తూర్ పర్వతాన్ని ఒక కప్పు మాదిరిగా వారి పైకి ఎత్తాడు. ఈ పరిణామానికి వారు భయకంపితులై, ఆజ్ఞల్ని శిరసావహిస్తామని ప్రమాణం చేశారు.

80. శనివారం (సబ్త్) నాడు చేపలు పట్టడంతోసహా ఏ రకమైన ప్రాపంచిక వ్యవహారమూ జరపరాదని యూదులకు తాకీదు చేయబడింది. కాని వాళ్ళు ఏదో ఒక వంకపెట్టి ఈ ఆజ్ఞను ఉల్లంఘించేవారు. శనివారంనాడే (వారికొక పరీక్షగా) చేపలు నీటి ఉపరితలంపైకి వచ్చేవి. వాళ్లు చేపల కోసం తీరంలో గుంటలు త్రవ్విపెట్టేవారు. గుంటల్లో పడిన చేపలను ఆదివారం పట్టుకునేవారు.

81. ఇస్రాయీల్ వంశస్థుల్లో సంతానం లేని ఒక ధనికుడుండేవాడు. అతనికి ఒక భ్రాతృజుడు (సోదర కుమారుడు) తప్ప వారసులెవరూ లేరు. ఒకరోజు రాత్రి ఆ భ్రాతృజుడు తన పినతండ్రిని దారుణంగా చంపి, శవాన్ని వేరొకరి

أَعُوذُ بِاللَّهِ أَنْ أَكُونَ مِنَ الْجَاهِلِينَ (67)

చారు. దానికి అతను, "నేనలాంటి మూర్ఖుల్లో ఒకణ్ణి కాకుండా ఉండేందుకు అల్లాహ్ శరణు వేడుతున్నాను" అని జవాబిచ్చాడు.

قَالُوا ادْعُ لَنَا رَبَّكَ يُبَيِّن لَّنَا مَا هِيَ ۚ قَالَ إِنَّهُ
يَقُولُ إِنَّهَا بَقَرَةٌ لَّا فَارِضٌ وَلَا بِكْرٌ عَوَانٌ
بَيْنَ ذَٰلِكَ ۖ فَافْعَلُوا مَا تُؤْمَرُونَ (68)

**68** అప్పుడు వారు, "అయితే అది ఎటువంటిది అయిఉండాలో మాకు వివరించవలసిందిగా నీ ప్రభువును అర్థించు" అని అన్నారు. దానికి అతను, "అది మరీ ముసలిదై ఉండకూడదు, మరీ లేగదూడగా కూడా ఉండరాదు. పైగా అది మధ్యవయస్సులో వున్న ఆవు అయి ఉండాలని ఆయన ఆజ్ఞాపిస్తున్నాడు. (సరేనా!) ఇక ఆజ్ఞాపించబడిన విధంగా చెయ్యండి" అని చెప్పాడు.

قَالُوا ادْعُ لَنَا رَبَّكَ يُبَيِّن لَّنَا مَا لَوْنُهَا ۚ قَالَ إِنَّهُ
يَقُولُ إِنَّهَا بَقَرَةٌ صَفْرَاءُ فَاقِعٌ لَّوْنُهَا تَسُرُّ
النَّاظِرِينَ (69)

**69** "అది ఏ రంగుదై ఉండాలో మాకు వివరించమని నీ ప్రభువును ప్రార్థించు" అని మళ్ళీ అడిగారు. "అది పసుపు వర్ణం గలదై, నిగనిగలాడుతూ, చూసేవారికి ఆకర్షణీయంగా కనిపించేలా ఉండాలన్నది అల్లాహ్ ఆజ్ఞ" అని మూసా సమాధానమిచ్చాడు.

قَالُوا ادْعُ لَنَا رَبَّكَ يُبَيِّن لَّنَا مَا هِيَ إِنَّ
الْبَقَرَ تَشَابَهَ عَلَيْنَا وَإِنَّا إِن شَاءَ اللَّهُ
لَمُهْتَدُونَ (70)

**70** అప్పుడు వారు, "అది ఎలాంటిదై ఉండాలో మాకు (ఇంకా బాగా) వివరించమని నీ ప్రభువును ప్రార్థించు. మాకు ఆవు సంగతి ఇంకా ప్రస్ఫుటం కాలేదు. అల్లాహ్ గనక తలిస్తే మేము మార్గదర్శకత్వం పొందుతాము" అని అన్నారు.

قَالَ إِنَّهُ يَقُولُ إِنَّهَا بَقَرَةٌ لَّا ذَلُولٌ تُثِيرُ الْأَرْضَ
وَلَا تَسْقِي الْحَرْثَ مُسَلَّمَةٌ لَّا شِيَةَ فِيهَا ۚ قَالُوا
الْآنَ جِئْتَ بِالْحَقِّ ۚ فَذَبَحُوهَا وَمَا كَادُوا
يَفْعَلُونَ (71)

**71** దానికి అతను, "ఆ ఆవు పనిచేసేదీ, దుక్కి దున్నేదీ, సేద్యపు పనిలో ఉపయోగపడేదీ అయి ఉండకూడదు. ఇంకా అది ఆరోగ్యవంతమైనదై, ఎటువంటి మచ్చలూ లేకుండా ఉండాలి అన్నది అల్లాహ్ ఆజ్ఞ" అని చెప్పాడు. దానికి వారు "నువ్వు ఇప్పుడు సరిగ్గా చెప్పావు. (మాకిప్పుడు అర్థం అయింది)" అన్నారు. అసలు వారు ఆదేశపాలనకు ఏమాత్రం సుముఖంగా లేరు. ఎట్టకేలకు (మాట విని) ఆవును జిబహ్ చేశారు.[82]

గుమ్మం వద్ద పడవేశాడు. తెల్లవారిన తరువాత వారు ఒండొకరిని నిందితులుగా నిలబెట్టసాగారు. కడకు వ్యవహారం మూసా (అలైహిస్సలాం) కాడికి వచ్చింది. అప్పుడాయన ఆవును బలి ఇవ్వమని ఆదేశించారు. ఆవు మాంసం ముక్క ఒకటి ఆ మృతదేహంపై కొట్టగా హతుడు లేచి కూర్చున్నాడు. తనను చంపిన హంతకుడెవరో చెప్పి చచ్చిపోయాడు (ఫత్హుల్ ఖదీర్).

82. ఆవును బలి ఇవ్వమని మాత్రమే వారికి చెప్పటం జరిగింది. ఏ ఆవునయినాసరే వారు జిబహ్ చేసేసి ఉంటే దైవాదేశ పాలన జరిగిపోయేది. కాని ఇస్రాయీల్ వంశస్థుల పెంకితనాన్నే చూడండి – వాళ్లు చెయ్యమన్నది చేసే బదులు నానా రకాలుగా ప్రశ్నించి లేనిపోని ఇబ్బందులకు అవకాశం కల్పించారు. అల్లాహ్ కూడా వారికోసం

**72** (జ్ఞాపకం చేసుకోండి.) మీరు ఒక వ్యక్తిని హత్య చేసి, ఆ విషయంలో పరస్పరం విభేదించుకోసాగారు. కాని మీ గుట్టును అల్లాహ్ రట్టు చేయాలనే నిర్ణయించుకున్నాడు.[83]

وَاِذْ قَتَلْتُمْ نَفْسًا فَادّٰرَءْتُمْ فِيْهَا ۗ وَاللّٰهُ مُخْرِجٌ مَّا كُنْتُمْ تَكْتُمُوْنَ ﴿72﴾

**73** కనుక, "ఈ ఆవు (మాంసపు) ముక్క నొకదాన్ని హతుని దేహానికేసి కొట్టండి (అతడు లేచి నిలబడతాడు)" అని మేము అన్నాము. ఈ విధంగా అల్లాహ్ మృతులను బ్రతికించి[84] తన నిదర్శనాలను చూపుతున్నాడు – మీరు ఇకనయినా బుద్ధిగా మసలుకోవాలని!

فَقُلْنَا اضْرِبُوْهُ بِبَعْضِهَا ۗ كَذٰلِكَ يُحْيِ اللّٰهُ الْمَوْتٰى ۙ وَيُرِيْكُمْ اٰيٰتِهٖ لَعَلَّكُمْ تَعْقِلُوْنَ ﴿73﴾

**74** కాని ఆ తరువాత మీ హృదయాలు కఠినమైపోయాయి. రాళ్ళ మాదిరిగా, కాదు – వాటికంటే కూడా కఠినం అయిపోయాయి.[85] కొన్ని రాళ్ళల్లోనుంచైతే సెలయేళ్ళు ప్రవహిస్తాయి. మరి కొన్ని రాళ్ళు పగలగా వాటినుంచి నీరు చిమ్ముతుంది. మరికొన్ని

ثُمَّ قَسَتْ قُلُوْبُكُمْ مِّنْۢ بَعْدِ ذٰلِكَ فَهِيَ كَالْحِجَارَةِ اَوْ اَشَدُّ قَسْوَةً ۗ وَاِنَّ مِنَ الْحِجَارَةِ لَمَا يَتَفَجَّرُ مِنْهُ الْاَنْهٰرُ ۗ وَاِنَّ مِنْهَا لَمَا يَشَّقَّقُ

---

వ్యవహారాన్ని మరింత జటిలం చేసేశాడు. అందుకే ధర్మావలంబన విషయంలో సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాల్లోకి తలదూర్చి చిక్కుల్ని కొనితెచ్చుకోరాదనీ, సరళమార్గాన్ని అనుసరించటమే శ్రేయస్కరమని చెప్పబడింది.

83. ఈ హత్యోదంతం మూలంగానే ఆవును బలి ఇవ్వమని ఇస్రాయీల్ సంతతిని ఆజ్ఞాపించడమయింది. ఈ విధంగా అల్లాహ్ హత్యా రహస్యాన్ని బట్టబయలు చేశాడు. నిజానికి ఈ హత్య రాత్రి చీకటిలో గుట్టుచప్పుడు కాకుండా చేశారు. భావం ఏమిటంటే సత్కార్యమయినా, దుష్కార్యమయినా – మీరు దాన్ని ఎంత గప్‌చిప్‌గా, పకడ్బందీగా చేసినా అది అల్లాహ్‌కు తెలియకుండా ఉండదు. దాన్ని ప్రజల ముందుకు తెచ్చే శక్తి అల్లాహ్‌కు ఉంది. అందుకే ఏకాంతంలో వున్నా, నలుగురిలో వున్నా – నిత్యం మంచి పనులు మాత్రమే చేస్తూ ఉండండి. ఎప్పుడయినా అవి బహిర్గతం అయి, ప్రజల సమక్షంలోకి వచ్చేసినా నలుగురిలో నవ్వులపాలు కావలసిన పరిస్థితి ఏర్పడదు. పైగా అలాంటి పరిస్థితే గనక ఒకవేళ ఎదురయితే మీ గౌరవప్రతిష్ఠలు మరింతగా ఇనుమడిస్తాయి. చెడుపనిని ఎంత గుట్టుగా చేసినా సరే – ఏదో ఒక సందర్భంలో అది రట్టయ్యే ప్రమాదం ఉంది. దాని మూలంగా చివరికి మిగిలేది పరాభవమే సుమా!

84. చచ్చిపోయిన వ్యక్తిని తిరిగి బ్రతికించటం ద్వారా అల్లాహ్, ప్రళయదినాన మనుషులందరినీ తిరిగి లేపుతానన్న తన మాటను సూచనాప్రాయంగా తెలియజేస్తున్నాడు. ప్రళయదినాన దేవుడు చనిపోయిన వారిని మళ్ళీ బ్రతికిస్తాడన్న విషయంపై తిరస్కారులు సదా ఆశ్చర్యాన్నే వెలిబుచ్చారు. అందుకే అల్లాహ్ ఖుర్ఆన్‌లో పలుచోట్ల, పలు విధాలా ఈ విషయాన్ని వారి ముందుకు తీసుకువచ్చాడు. ఈ ఒక్క బఖరా సూరాలోనే అల్లాహ్ దీనికి సంబంధించిన ఐదు ఉపమానాలు ఇచ్చాడు : 1. ఈ సూరాలోని 56వ ఆయతు. 2. మీరు చదువుతున్న ఈ ఆయతు. 3. 243వ ఆయతు. 4. 259వ ఆయతు. 5. ఆ తరువాత వచ్చే ఆయతులో (260) ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి నాలుగు పక్షుల సంఘటన.

85. అంటే ఈ అద్భుతాలను చూచిన తరువాత – కళ్ళ ముందరే చచ్చిపోయిన వ్యక్తి తిరిగి బ్రతికిన తాజా సంఘటనను తిలకించిన మీదట – కూడా మీ హృదయాలలో నిజ దేవుని వైపు మరలాలన్న ఆలోచన (ఇనాబత్ ఇలల్లాహ్) గాని, పశ్చాత్తాపభావం గాని, క్షమాపణలు కోరుకునే గుణంగాని పెంపొందలేదు. పైపెచ్చు మీ గుండెలు రాతి గుండెలయిపోయాయి. అంతకంటే కూడా కఠినం అయిపోయాయి. హృదయాలు కఠినంగా మారితే అది మానవ సమాజాల

فَيَخْرُجُ مِنْهُ الْمَاءُ ۚ وَإِنَّ مِنْهَا لَمَا يَهْبِطُ مِنْ
خَشْيَةِ اللَّهِ ۗ وَمَا اللَّهُ بِغَافِلٍ عَمَّا تَعْمَلُونَ ﴿74﴾

అల్లాహ్ భయంతో (కంపించి) క్రిందపడి పోతాయి.[86] మీ కార్య కలాపాల పట్ల అల్లాహ్ పరధ్యానంలో ఉన్నాడని అనుకోకండి.

أَفَتَطْمَعُونَ أَنْ يُؤْمِنُوا لَكُمْ وَقَدْ كَانَ فَرِيقٌ
مِنْهُمْ يَسْمَعُونَ كَلَامَ اللَّهِ ثُمَّ يُحَرِّفُونَهُ مِنْ بَعْدِ
مَا عَقَلُوهُ وَهُمْ يَعْلَمُونَ ﴿75﴾

**75** (ముస్లిములారా!) వారు మీ మాటను నమ్ముతారనే (ఇప్పటికీ) మీరు ఆశపడుతున్నారా? వాస్తవానికి వారిలో, అల్లాహ్ వాక్కును విని, అర్థం చేసుకుని కూడా ఉద్దేశపూర్వకంగా దాన్ని మార్చి వేసేవారు ఉన్నారు.[87]

وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوا آمَنَّا وَإِذَا خَلَا
بَعْضُهُمْ إِلَىٰ بَعْضٍ قَالُوا أَتُحَدِّثُونَهُمْ بِمَا فَتَحَ
اللَّهُ عَلَيْكُمْ لِيُحَاجُّوكُمْ بِهِ عِنْدَ رَبِّكُمْ ۚ
أَفَلَا تَعْقِلُونَ ﴿76﴾

**76** వారు విశ్వాసులను కలుసుకున్నప్పుడు తమ విశ్వాసాన్ని వెల్లడిస్తారు.[88] తమ వర్గానికి చెందినవారిని ఏకాంతంలో కలుసుకున్నప్పుడు, “అల్లాహ్ మీకు తెలియజేసిన విషయాలను మీరు వీరికి ఎందుకు చేరవేస్తున్నారు? తద్వారా మీ ప్రభువు సమక్షంలో వారు మీపై వాదనకు బలం పొందగలరనే సంగతిని విస్మరించారా ఏమి?” అని అంటారు.

వినాశానికి ఆనవాలని గ్రహించాలి. హృదయాలు కఠినంగా మారాయంటే వాటిలో సత్యాన్ని అంగీకరించే, మంచిని స్వాగతించే గుణం నశించిందని భావం. ఈ దశకు చేరిన వారిని తీర్చిదిద్దే ప్రయత్నం ఎంతగా చేసినా ఆశించిన ఫలితం రాదు. అందుకే విశ్వసించిన వారిని ప్రత్యేకంగా తాకీదు చేయటం జరిగింది – “పూర్వం గ్రంథం ఇవ్వబడిన ప్రజల మాదిరిగా విశ్వాసులు మారిపోకూడదు సుమా! ఒక సుదీర్ఘకాలం వారిపై గడచిపోయాక వారి హృదయాలు కఠినమైపోయాయి.” (అల్ హదీద్ : 16)

86. రాళ్ళు, శిలలు ఎంత కఠినంగా, కరకుగా ఉన్నప్పటికీ వాటి ద్వారా ఒనగూడే ప్రయోజనాలు, అవి సయితం లోనయ్యే స్థితిగతులు వివరించబడ్డాయి. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే రాళ్ళకు సయితం ఒక రకమైన గ్రాహ్యశక్తి, స్పందన ఉన్నాయి. ఉదాహరణకు బనీ ఇస్రాయీల్ సూరాలోని 44వ ఆయతులో చెప్పబడినట్లు – “ఆయన పరిశుద్ధతను సప్తాకాశాలూ, భూమీ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడనటువంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు.” మరిన్ని వివరాల కోసం బనీ ఇస్రాయీల్ సూరా 44వ ఆయతుకు గల పాదసూచికను చూడండి.

87. **‘యూదులు విశ్వసిస్తారని మీరు ఆశపడుతున్నారా?’** అని ముస్లిములను ఉద్దేశించి ప్రశ్నించబడింది. వారి పూర్వీకుల్లో ఒక వర్గం ఉండేది. అది ఉద్దేశపూర్వకంగా దైవవాక్కులో ప్రక్షిప్తం చేసి, విషయాన్ని వక్రీకరించేది. కాబట్టి ఇలాంటివారు విశ్వసిస్తారన్న ఆశ ఏమాత్రం లేదు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ప్రాపంచిక స్వప్రయోజనాల నాశించేవారు, అసూయాద్వేషాలతో రగిలిపోయేవారు, తమ వర్గంవారి పట్ల దురభిమానంతోనో, ఎదుటివర్గం పట్ల అసూయాద్వేషాల తోనో దైవవాక్కును తారుమారు చేయడానికి కూడా వెనుకాడరు. వారు మార్గవిహీనత ఊబిలో దారుణంగా కూరుకు పోయారు. అందులోనుంచి ఇక వారిని వెలికి తీయటం కష్టం. ఉమ్మతె ముహమ్మదియా (ముహమ్మద్ ప్రవక్త అనుచర సమాజం)లోని కొందరు పండితులు, మత గురువులు కూడా ఖుర్ఆన్ హదీసుల్లో ప్రక్షిప్తాలకు పూనుకున్నారు. ఈ మహాపరాధానికి అల్లాహ్ మనల్ని దూరంగా ఉంచుగాక (నిసా సూరా 77వ ఆయతుకు వివరణను చూడండి).

88. ఇది యూదుల్లోని కొంతమంది ఆడే కపట నాటకం అన్నమాట! వారు ముస్లిములతో కలిసి సంభాషిస్తున్నప్పుడు

**77** వారు దాచేదీ, బహిర్గతం చేసేదీ – అంతా అల్లాహ్‌కు తెలుసన్న సంగతి వారికి తెలియదా?![89]

اَوَلَا يَعْلَمُوْنَ اَنَّ اللّٰهَ يَعْلَمُ مَا يُسِرُّوْنَ وَمَا يُعْلِنُوْنَ ﴿77﴾

**78** వారిలో చదువురాని వారు కొందరున్నారు – వారికి గ్రంథ జ్ఞానం లేదు. వారు కేవలం ఆశల్ని నమ్ముకొని ఉన్నారు. లేనిపోని అంచనాలు వేసి, ఊహల్లో విహరిస్తూ ఉంటారు.[90]

وَمِنْهُمْ اُمِّيُّوْنَ لَا يَعْلَمُوْنَ الْكِتٰبَ اِلَّآ اَمَانِيَّ وَاِنْ هُمْ اِلَّا يَظُنُّوْنَ ﴿78﴾

**79** తమ స్వహస్తాలతో లిఖించిన గ్రంథాన్ని దైవగ్రంథమని చెప్పి, ప్రాపంచిక తుచ్ఛ ప్రయోజనాన్ని పొందజూసే వారికి 'వినాశం' కలదు. వారి ఈ స్వహస్త లిఖిత రచన కూడా వారి వినాశానికి దారితీస్తుంది. వారి ఈ సంపాదన కూడా వారి నాశనానికి కారణ భూతం అవుతుంది.[91]

فَوَيْلٌ لِّلَّذِيْنَ يَكْتُبُوْنَ الْكِتٰبَ بِاَيْدِيْهِمْ ۗ ثُمَّ يَقُوْلُوْنَ هٰذَا مِنْ عِنْدِ اللّٰهِ لِيَشْتَرُوْا بِهٖ ثَمَنًا قَلِيْلًا ۗ فَوَيْلٌ لَّهُمْ مِّمَّا كَتَبَتْ اَيْدِيْهِمْ وَوَيْلٌ لَّهُمْ مِّمَّا يَكْسِبُوْنَ ﴿79﴾

**80** పైగా, "మేము నరకాగ్నిలో కొన్ని రోజులు మాత్రమే ఉంటాము" అని వారంటున్నారు. వారిని అడుగు: మీరు ఆ మేరకు అల్లాహ్ నుండి పొందిన వాగ్దానం[92] ఏదన్నా మీ వద్ద

وَقَالُوْا لَنْ تَمَسَّنَا النَّارُ اِلَّآ اَيَّامًا مَّعْدُوْدَةً ۗ قُلْ اَتَّخَذْتُمْ عِنْدَ اللّٰهِ عَهْدًا فَلَنْ يُّخْلِفَ اللّٰهُ

తమను తాము విశ్వాసులుగా పరిచయం చేసుకుంటారు. కాని వాళ్ళ మనుషులను (యూదులను) కలుసుకున్నప్పుడు, తాము తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి పరస్పరం తాకీదు చేసుకుంటారు. అవసరానికి మించిన విషయాలు ముస్లిములకు చెప్పకూడదనీ, ఒకవేళ చెప్పేస్తే అరేబియా ప్రవక్త (సఅసం) దౌత్యాన్ని సమర్థించినట్లవుతుందని, దైవసమక్షంలో ఇది తమకు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉందని చెప్పుకుని పెదవి విరిచేవారు.

89. మీరు చెప్పినా చెప్పకపోయినా అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు. మీరు ఏదన్నా విషయం దాచినాసరే ఆయన ముస్లిములకు దాన్ని గురించి తెలియపరుస్తాడని అల్లాహ్ ఇందులో స్పష్టపరిచాడు.

90. ఇప్పటివరకూ తెలిసినవారి, చదువుకున్న వారి గురించి చెప్పుకోవటం జరిగింది. ఇకపోతే చదువురానివారు. వారికి గ్రంథ (తౌరాత్) జ్ఞానం లేదు. కేవలం ఆశలు, మూఢ నమ్మకాలు మాత్రమే ఉన్నాయి. అందుకే వారు ఊహల్లో తేలియాడుతూ ఉంటారు. వారి ఈ స్థితికి వారి పండితులే కారకులు. ఉదాహరణకు: మేము అల్లాహ్‌కు ప్రీతిపాత్రులం. కాబట్టి మమ్మల్ని నరకాగ్ని జ్వాలలు ముట్టుకోవు. ఒకవేళ నరకానికిపోయినా కొన్ని రోజులే. మా మత గురువులు మమ్మల్ని కాపాడతారు – ఇలాంటి మాటలతో తమను తాము సముదాయించుకుంటూ ఉంటారు. అజ్ఞానం ఆవరించిన నేటి ముస్లిములను సయితం వారి పండితులు, గురువులు అందమైన మాటలతో అరచేతిలో స్వర్గం చూపించి మోసపుచ్చుతున్న సంగతి మనకు తెలియనిది కాదు.

91. ఇది యూద విద్వాంసుల్లో లోపించిన పాపభీతికి, నిర్లక్ష్య వైఖరికి ప్రబల తార్కాణం. వారు తమ స్వహస్తాలతో లేని విషయాలను జొప్పించి, వాటిని దైవప్రోక్తంగా అభివర్ణిస్తారు. ఈ ఆయతు ఆధారంగా కొంతమంది విద్వాంసులు, దివ్యఖుర్‌ఆన్‌ను అమ్మటం అధర్మమని చెప్పారు. కాని ఈ విధమయిన అన్వయింపు సరైనది కాదు. ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం దైవవాక్కుల్లో ప్రక్షిప్తాలు చేసేవారికి, మతం పేరిట ప్రజలను మోసగించే వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. **వినాశం (వైల్) :** హదీసు ప్రకారం వైల్ అనే పదానికి 'నరకంలోని ఒకానొక లోయ' అనే అర్థం కూడా ఉంది. ఆ లోయ ఎంత లోతైనదంటే – ఒక నరకవాసి అందులో పడటానికి నలభై యేళ్లు పడుతుంది (అహ్మద్, తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ – ఫత్‌హుల్ ఖదీర్ ఆధారంగా).

92. ప్రపంచ ఆయుషు మొత్తం ఏడు వేల సంవత్సరాలనీ, ప్రతి వెయ్యి సంవత్సరాలకు ఒక రోజు చొప్పున కేవలం

ఉందా? ఒకవేళ ఉంటే అల్లాహ్ ముమ్మాటికీ తన వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరించడు. (అసలు అలా జరగనే లేదు) అసలు మీరు మీకు తెలియని విషయాలను అల్లాహ్‌కు ఆపాది స్తున్నారు.[93]

عَهْدَهٗٓ اَمْ تَقُوْلُوْنَ عَلَى اللّٰهِ مَا لَا تَعْلَمُوْنَ ﴿80﴾

**81** నిస్సందేహంగా – ఎవడు పాపకార్యాలకు ఒడిగట్టాడో, అతని పాపాలు అతన్ని చుట్టుముట్టాయో అలాంటివారే నరకవాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

بَلٰى مَنْ كَسَبَ سَيِّئَةً وَّاَحَاطَتْ بِهٖ خَطِيْٓـَٔتُهٗ فَاُولٰٓئِكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ﴿81﴾

**82** మరెవరు విశ్వసించి, మంచి పనులు చేస్తారో వారు స్వర్గ వాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.[94]

وَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ اُولٰٓئِكَ اَصْحٰبُ الْجَنَّةِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ﴿82﴾

**83** మేము ఇస్రాయీల్ వంశస్థుల నుండి వాగ్దానం తీసు కున్నాము (దాన్ని గుర్తుకు తెచ్చుకోండి) : “అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా మెలగాలి. అలాగే బంధువులను, అనాథలను, అగత్యపరులను (ఆదరించాలి). ప్రజలతో మర్యాదగా మాట్లాడాలి. నమాజును నెలకొల్పుతూ ఉండాలి, జకాత్ ఇస్తూ ఉండాలి.” అయితే మీలో కొద్దిమంది తప్ప అందరూ మాట తప్పారు, ముఖం తిప్పు కున్నారు.

وَاِذْ اَخَذْنَا مِيْثَاقَ بَنِيْٓ اِسْرَآءِيْلَ لَا تَعْبُدُوْنَ اِلَّا اللّٰهَ ۗ وَبِالْوَالِدَيْنِ اِحْسَانًا وَّذِي الْقُرْبٰى وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ وَقُوْلُوْا لِلنَّاسِ حُسْنًا وَّاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ ۭ ثُمَّ تَوَلَّيْتُمْ اِلَّا قَلِيْلًا مِّنْكُمْ وَاَنْتُمْ مُّعْرِضُوْنَ ﴿83﴾

ఏడు రోజులు మాత్రమే తాము నరకాగ్నిని చవిచూస్తామని యూదులు అనేవారు. తాము నలభై రోజులపాటు ఆవుదూడను పూజించటం వల్ల నలభై రోజుల కొరకు మాత్రమే నరకంలో పడవేయబడతామని మరికొందరు అభిప్రాయపడేవారు. “ఏమిటీ? ఆ మేరకు మీరు అల్లాహ్ నుండి ఏదన్నా హామీ పత్రం పొందారా?” అని అల్లాహ్ ప్రశ్నిస్తున్నాడు. అల్లాహ్ అటువంటి హామీ ఏదీ వారికి ఇవ్వనప్పుడు, వారెందుకిలాంటి ప్రగల్భాలు పలుకుతున్నారు?

93. ‘మేము ఒకవేళ నరకానికి పోయినా స్వల్ప వ్యవధి కోసం మాత్రమే పోతామ’న్న మీ వాదనకు ఆధారం ఏదీ లేదు. ఇది మీ కల్పన మాత్రమే. పైపెచ్చు మీరు ఈ విషయమై అల్లాహ్‌కు అబద్ధాలు అంటగడుతున్నారు. మీకు సయితం దీనికి సంబంధించిన జ్ఞానం ఏదీ లేదాయె! రానున్న వాక్యాలలో అల్లాహ్ తన శిక్షాబహుమానాల సూత్రాన్ని విశదీకరించాడు. తీర్పుదినాన అల్లాహ్ సజ్జనులకు, దుర్జనులకు వారి వారి కర్మలను బట్టి ప్రతిఫలం ఇస్తాడు.

94. యూదుల బుకాయింపులను ఖండిస్తూ అల్లాహ్ స్వర్గనరకాల ప్రవేశానికి ఏఏ విషయాలు కారణభూతమవుతాయో తెలియజేశాడు. ఎవరి కర్మల పత్రంలో పాపాలే పాపాలున్నాయో, ఇంకా షిర్క్ (బహుదైవారాధన) మరియు కుఫ్ర్ (దైవతిరస్కారం)తో కూడుకున్న పనులు లిఖించబడి ఉన్నాయో వారి నివాసస్థలం నరకం అవుతుంది. వారందులో కలకాలం మగ్గవలసిందే. విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు స్వర్గవాసులవుతారు. ఇక విశ్వాసుల్లో పాపం చేసిన వారు కూడా ఉంటారు– వారి వ్యవహారం దైవాధీనమై ఉంటుంది. ఆయన గనక తలిస్తే తన కృపతో వారిని మన్నించి, కొంతకాలం పాటు నరకంలో ఉంచి, స్వర్గానికి తరలించగలడు. లేదా దైవప్రవక్త (స) సిఫారసుపై, వారిని మన్నించి స్వర్గంలో దాఖలు చేయగలడు. సహీహ్ హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది.

وَاِذۡ اَخَذۡنَا مِيۡثَاقَكُمۡ لَا تَسۡفِكُوۡنَ دِمَآءَكُمۡ
وَلَا تُخۡرِجُوۡنَ اَنۡفُسَكُمۡ مِّنۡ دِيَارِكُمۡ ثُمَّ
اَقۡرَرۡتُمۡ وَاَنۡتُمۡ تَشۡهَدُوۡنَ ﴿84﴾

**84** పరస్పరం రక్తం చిందించరాదనీ (చంపుకోరాదని), తోటి వారిని వారి నివాసస్థలాల నుంచి బహిష్కరించరాదనీ మీనుండి వాగ్దానం తీసుకున్నప్పుడు, దానికి మీరు అంగీకరించారు. ఆ విషయానికి స్వయంగా మీరే సాక్షులు.[95]

ثُمَّ اَنۡتُمۡ هٰٓؤُلَآءِ تَقۡتُلُوۡنَ اَنۡفُسَكُمۡ وَتُخۡرِجُوۡنَ
فَرِيۡقًا مِّنۡكُمۡ مِّنۡ دِيَارِهِمۡ تَظٰهَرُوۡنَ عَلَيۡهِمۡ بِالۡاِثۡمِ
وَالۡعُدۡوَانِ ؕ وَاِنۡ يَّاۡتُوۡكُمۡ اُسٰرٰى تُفٰدُوۡهُمۡ وَهُوَ
مُحَرَّمٌ عَلَيۡكُمۡ اِخۡرَاجُهُمۡ ؕ اَفَتُؤۡمِنُوۡنَ بِبَعۡضِ
الۡكِتٰبِ وَتَكۡفُرُوۡنَ بِبَعۡضٍ ۚ فَمَا جَزَآءُ مَنۡ يَّفۡعَلُ
ذٰلِكَ مِنۡكُمۡ اِلَّا خِزۡىٌ فِى الۡحَيٰوةِ الدُّنۡيَا ۚ وَيَوۡمَ
الۡقِيٰمَةِ يُرَدُّوۡنَ اِلٰٓى اَشَدِّ الۡعَذَابِ ؕ وَمَا اللّٰهُ
بِغَافِلٍ عَمَّا تَعۡمَلُوۡنَ ﴿85﴾

**85** కాని మీరు పరస్పరం చంపుకున్నారు. మీలోని ఒక వర్గం వారిని ఇండ్ల నుంచి బహిష్కరించటం కూడా చేశారు. పాపానికి, దౌర్జన్యానికి పాల్పడుతూ మీరు వారికి వ్యతిరేకంగా–ఇతరులను సమర్థించారు. మరి వారు బందీలుగా పట్టుబడి మీ వద్దకు వచ్చినప్పుడు మీరు వారికోసం నష్టపరిహారం ఇచ్చిన మాట వాస్తవమే. కాని మీరు వారిని వెళ్ళగొట్టడమే అధర్మం (అప్పుడు మీరు దాన్ని అస్సలు లెక్కచేయలేదు). ఏమిటీ? మీరు కొన్ని ఆజ్ఞలను విశ్వసించి, మరికొన్నింటిని తిరస్కరిస్తున్నారా?[96] మీలో ఇలా చేసేవారికి ప్రపంచ జీవితంలో అవమానం తప్ప ఇంకేం ప్రతిఫలం ఉంటుంది? ఇక ప్రళయ దినాన వారు మరింత కఠినమైన శిక్ష వైపు మరలించబడతారు. అల్లాహ్‌కు మీ చేష్టలు తెలియకుండా లేవు.

95. ఇస్రాయీల్ సంతతి నుండి తీసుకున్న వాగ్దానాన్ని గురించి అల్లాహ్ వివరించాడు. కాని ఈ వాగ్దానాన్ని కూడా వారు భంగపరిచారు. ఈ వాగ్దానంలోని మొట్టమొదటి అంశం ఏకదైవారాధన. ప్రవక్తలందరి సందేశం కూడా ఇదే. ఈ అంశాన్నే వారు తమ సందేశ కార్యక్రమానికి మూలంగా తీసుకున్నారు (అంబియా సూరా 25వ ఆయతు ద్వారా, ఇతర ఆయతుల ద్వారా ఇది స్పష్టమవుతోంది). ఏకదైవారాధన తరువాత తల్లిదండ్రుల యెడల మంచిగా మెలగాలని ఆదేశించబడింది. దైవారాధన ప్రస్తావన వచ్చిన వెంటనే తల్లిదండ్రులతో ఉత్తమ వ్యవహారాన్ని గురించి పేర్కొనటం విశేషం. అల్లాహ్‌ను ఆరాధించటం ఎంత అవసరమో, తల్లిదండ్రుల యెడల సత్ప్రవర్తనను కలిగి ఉండటం కూడా అంతే అవసరం. అందులో ఎలాంటి లోటూ కనబరచకూడదు.

ఖుర్ఆన్‌లో అల్లాహ్ చాలా చోట్ల తన ఆరాధన గురించి చెప్పిన తర్వాత వెంటనే రెండో స్థానంలో తల్లిదండ్రుల పట్ల విధేయత కనబరచాలనీ, వారిపట్ల అత్యుత్తమంగా మెలగాలని ఆదేశించాడు. దీనిద్వారా తల్లిదండ్రులకు విధేయత చూపటం ఎంత అవసరమో బోధపడుతోంది. తల్లిదండ్రుల తరువాత ఆత్మీయుల, అనాథల, అగత్యపరుల వంతు వస్తుంది. వారితో కూడా మృదువుగా వ్యవహరించాలి. ఈ విషయాలకు ఇస్లాంలో ఎంతో ప్రాముఖ్యం ఉంది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా వీటిని గురించి పలు విధాలుగా నొక్కి వక్కాణించారు. ఈ వాగ్దానంలో నమాజును నెలకొల్పటం గురించి, జకాత్ (విధిగా చెల్లించవలసిన దానాల) గురించి కూడా వచ్చింది. ఈ రెండు అంశాలు వెనుకటి షరీయతులలో (జీవన ధర్మాలలో) కూడా ఉండేవి. దీన్నిబట్టి వీటి ప్రాముఖ్యం ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. ఇస్లాంలో కూడా ఈ రెండు ఆరాధనలు ఎంతో ముఖ్యమైనవి. ఈ రెంటిలో ఏ ఒక్క దానిని త్రోసిపుచ్చినా లేక దానిపట్ల వైముఖ్యం కనబరచినా అది ధిక్కార (కుఫ్ర్) వైఖరిగా భావించబడుతుంది. అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) తన ఖిలాఫత్ కాలంలో 'జకాత్' చెల్లించడానికి నిరాకరించిన వారితో ధర్మయుద్ధం (జిహాద్) చేస్తానని ప్రకటించటం ఈ సందర్భంగా గమనార్హం.

96. మహాప్రవక్త (సఅసం) మదీనాకు రాకముందు అన్సార్ వర్గంలో (ఇస్లాంకు పూర్వం వీరు అవిశ్వాసులుగా ఉండేవారు)

أُولَٰئِكَ الَّذِينَ اشْتَرَوُا الْحَيَاةَ الدُّنْيَا بِالْآخِرَةِ ۖ فَلَا يُخَفَّفُ عَنْهُمُ الْعَذَابُ وَلَا هُمْ يُنصَرُونَ ﴿٨٦﴾

**86** పరలోకానికి బదులుగా ప్రాపంచిక జీవితాన్ని కొనుక్కున్న వారు వీరే. వీరికి విధించబడే శిక్షల్లో తగ్గింపూ ఉండదు, వారికి సహాయపడటమూ జరగదు.[97]

وَلَقَدْ آتَيْنَا مُوسَى الْكِتَابَ وَقَفَّيْنَا مِن بَعْدِهِ بِالرُّسُلِ ۖ وَآتَيْنَا عِيسَى ابْنَ مَرْيَمَ الْبَيِّنَاتِ وَأَيَّدْنَاهُ بِرُوحِ الْقُدُسِ ۗ أَفَكُلَّمَا جَاءَكُمْ رَسُولٌ بِمَا لَا تَهْوَىٰ أَنفُسُكُمُ اسْتَكْبَرْتُمْ فَفَرِيقًا كَذَّبْتُمْ وَفَرِيقًا تَقْتُلُونَ ﴿٨٧﴾

**87** మేము మూసాకు గ్రంథం వొసగాము. అతని తరువాత కూడా ప్రవక్తలను పంపించాము. ఇంకా మేము మర్యమ్ కుమారుడైన ఈసాకు స్పష్టమైన నిదర్శనాలు ఇచ్చాము. రూహుల్ ఖుదుస్ ద్వారా అతనికి సహాయం చేశాము.[98] అయితే ఏ ప్రవక్త అయినా మీ మనసులకు నచ్చని విషయాలు మీ వద్దకు తెచ్చి నప్పుడల్లా మీరు అహంకారం ప్రదర్శించారు. వారిలో కొందరిని ధిక్కరించారు, మరి కొందరిని హతమార్చటం కూడా చేశారు.[99]

రెండు తెగలుండేవి. 1. ఔస్ 2. ఖజ్రజ్. ఇవి రెండూ అనునిత్యం పరస్పరం కత్తులు దూసుకునేవి. అలాగే మదీనాకు చెందిన యూదులలో మూడు తెగలుండేవి. 1. బనూ ఖైనుఖా, 2. బనూ నజీర్, 3. బనూ ఖురైజ. ఈ మూడు తెగలు కూడా పరస్పరం కయ్యానికి కాలుదువ్వేవి. బనూ ఖురైజ ఔస్ తెగకు మద్దతునివ్వగా, బనూ ఖైనుఖా మరియు బనూ నజీర్ ఖజ్రజ్ తెగకు అండగా నిలిచేవి. యుద్ధ సమయాలలో వారు తమ తమ కూటములకు సహాయ సహకారాలందించేవారు. ఫలితంగా వారు తమ మతానికే చెందిన వారిని చంపటం, ఇండ్ల నుంచి వెళ్ళగొట్టటం లాంటి పనులు చేసేవారు. మరి చూడబోతే తౌరాత్ గ్రంథం ప్రకారం ఇలా చేయటం నిషిద్ధం. విచిత్రం ఏమిటంటే తమ మతానికి చెందిన యూద తెగలు యుద్ధఖైదీలుగా పట్టుబడితే, నష్టపరిహారం చెల్లించి మరీ వారిని విడుదల చేయించేవారు. అదేమంటే తౌరాత్‌లో ఈ విధంగా ఆదేశించబడింది అని అనేవారు. యూదుల ఈ పరస్పర విరుద్ధమైన వైఖరిని దృష్టిలో పెట్టుకుని, వారు షరీయత్‌ను మైనపు ముద్దలా చేసుకున్నారనీ, గ్రంథంలోని కొన్ని విషయాలను విశ్వసిస్తూ మరికొన్ని విషయాలను ప్రక్కన పెడుతున్నారని చెప్పబడింది. దైవాదేశాలను నిర్లక్ష్యం చేసి సోదర సంహారానికి పాల్పడటం, ఇండ్ల నుంచి వెళ్ళగొట్టటం, వారికి వ్యతిరేకంగా ఇంకొకరికి సాయపడటం – వారి షరీయతులోనే అధర్మంగా ఖరారు చేయబడింది. కాని వారు ఈ మూడు నిషిద్ధాజ్ఞల్ని ఉల్లంఘించి, ఆ తర్వాత నష్టపరిహారం చెల్లించి ఖైదీలను విడిపించమనే ఆజ్ఞను పాటించసాగారు. ఆ మూడు విషయాలకే గనక వారు కట్టుబడి ఉండే పక్షంలో అసలు నష్టపరిహారం చెల్లించవలసిన అగత్యమే ఏర్పడేది కాదు కదా!

97. షరీయతులోని కొన్ని ఆదేశాలను శిరసావహించి, మరికొన్ని ఆదేశాలకు తిలోదకాలిచ్చినందుకు జరిగే శాస్తి ఏమిటో ఇందులో చెప్పబడింది. ఈ నేరానికి గాను ప్రాపంచిక జీవితంలో గౌరవోన్నతులకు బదులు ఘోర పరాభవం, అవమానం లభిస్తాయి. పరలోకంలో వ్యధాభరితమైన శిక్ష ఎలాగూ ఉంటుంది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే సంపూర్ణ విధేయతే దైవానికి స్వీకారయోగ్యమవుతుంది. అడపాదడపా కొన్ని విషయాలను ఒప్పుకుని, వాటికనుగుణంగా మసలుకునేవారి పట్ల అల్లాహ్‌కు ఎలాంటి ఆసక్తి లేదు. ఈ ఆయతు ముస్లిములను సయితం ఆలోచింపజేస్తోంది– ఈనాడు ప్రపంచం నలుమూలలా ముస్లింలు ఎదుర్కొంటున్న అవమానాలకు కారణం, ధర్మాదేశాలలో కొన్నింటిని అవలంబించి, మరి కొన్నింటిని వదలివేయటమైతే కాదుకదా?! – ఇది తీవ్రంగా ఆలోచించవలసిన విషయం.

98. **"వ ఖఫ్ఫయ్‌నా మింబాదిహీ బిర్రుసులి"** అనే వాక్యానికి భావం ఏమిటంటే మూసా (అలైహి) తరువాత నిరంతరం దైవప్రవక్తలు ప్రభవిస్తూ ఉన్నారు. కడకు బనీ ఇస్రాయీల్‌లో ఈ దైవదౌత్య పరంపర ఈసా (ఏసు ప్రవక్త)తో ముగిసింది.

**'బయ్యినాత్'** (الْبَيِّنَاتِ) అంటే దేవుని తరఫున ఇవ్వబడిన సూచనలు, మహిమలు అని అర్థం. అవి ఈసా

وَقَالُوا قُلُوبُنَا غُلْفٌ ۚ بَل لَّعَنَهُمُ اللَّهُ بِكُفْرِهِمْ فَقَلِيلًا مَّا يُؤْمِنُونَ ﴿٨٨﴾

**88** "మా హృదయాలు గలేబుల్లో చుట్టబడి ఉన్నాయ"ని[100] వారంటున్నారు. కాదు, వారి తిరస్కారవైఖరి మూలంగా అల్లాహ్ వారిని ధూత్కరించాడు. కనుక వారు విశ్వసించేది బహు స్వల్పం.[101]

وَلَمَّا جَاءَهُمْ كِتَابٌ مِّنْ عِندِ اللَّهِ مُصَدِّقٌ لِّمَا مَعَهُمْ وَكَانُوا مِن قَبْلُ يَسْتَفْتِحُونَ عَلَى الَّذِينَ كَفَرُوا فَلَمَّا جَاءَهُم مَّا عَرَفُوا كَفَرُوا بِهِ ۚ فَلَعْنَةُ اللَّهِ عَلَى الْكَافِرِينَ ﴿٨٩﴾

**89** వారి వద్ద (ముందు నుంచే) ఉన్న దైవగ్రంథాన్ని ధృవీకరించే గ్రంథం అల్లాహ్ వద్ద నుంచి వచ్చినప్పుడు, తెలిసి కూడా వారు దానిని తిరస్కరించసాగారు – మరి చూడబోతే దీని రాకకు మునుపు తమకు అవిశ్వాసులపై విజయం చేకూరాలని[102] వారు స్వయంగా అభిలషించేవారు. ఇటువంటి తిరస్కారులపై అల్లాహ్ శాపం పడుగాక!

(అలైహిస్సలాం)కు ఇవ్వబడ్డాయి. ఉదాహరణకు : ఆయన మృతులను బ్రతికించటం, కుష్ఠురోగులను నయం చేయటం, అంధులకు చూపునొసగటం మొదలైనవి. ఈ విషయాలు ఆలి ఇమ్రాన్ సూరాలోని 49వ వచనంలో ప్రస్తావనకు వచ్చాయి.

**'రూహుల్ ఖుదుస్'** అనేది జిబ్రయీల్ దూత యొక్క బిరుదు. రూహ్ అంటే ఆత్మ; ఖుదుస్ అంటే పరిశుద్ధుడు – అల్లాహ్ అన్నమాట! ఈ విధంగా రూహుల్ ఖుదుస్ అనే పదానికి 'పరిశుద్ధుని ఆత్మ' అనే అర్థం వస్తుంది. జిబ్రయీల్ దూతను పరిశుద్ధుని ఆత్మ అని ఎందుకు అనటం జరిగిందంటే ఆయన 'అమ్రె తక్వీనీ' ద్వారా ఉనికిలోకి వచ్చారు. (అంటే అల్లాహ్ యొక్క ప్రత్యేక శక్తి సామర్థ్యాల ద్వారా జిబ్రయీల్ దూత ఉనికిలోకి వచ్చారు). జిబ్రయీల్ దూత గౌరవోన్నతులను ఇనుమడింపజేసే ఉద్దేశంతో ఆయన్ని పరిశుద్ధుని ఆత్మ అన్నారు. అలాగే స్వయంగా ఈసా ప్రవక్తను కూడా 'రూహ్' అని అనటం జరిగింది. మొత్తానికి రూహుల్ ఖుదుస్ అంటే, పరిశుద్ధుడైన అల్లాహ్ ఆజ్ఞ ద్వారా ఉనికిలోకి వచ్చిన జిబ్రయీల్ దూత అన్నమాట. ఇబ్నె జరీర్ కూడా ఈ విషయాన్నే సమర్థించారు. అదీగాక అల్ మాయిద సూరాలో రూహుల్ ఖుదుస్, ఇంజీలు గ్రంథం రెండూ వేర్వేరుగా ప్రస్తావించబడ్డాయి. దీని ద్వారా తెలిసేదేమిటంటే కొంతమంది అనుకుంటున్నట్లు, రూహుల్ ఖుదుస్ అంటే ఇంజీలు గ్రంథం కాదు. వేరొకచోట జిబ్రయీల్‌ను 'రూహుల్ అమీన్'గా పిలువటం జరిగింది. ఒకసారి దైవప్రవక్త (సఅసం) తన ప్రియ సహచరులైన హస్సాన్ (రజి) కోసం దైవాన్ని ప్రార్థిస్తూ, "ఓ అల్లాహ్! రూహుల్ ఖుదుస్ ద్వారా ఆయనకు తోడ్పాటునందించు" అని అన్నారు. "జిబ్రయీల్ మీకు అండగా ఉన్నారు" అని వేరొక హదీసులో ఉంది. కనుక రూహుల్ ఖుదుస్ (పరిశుద్ధుని ఆత్మ) అంటే జిబ్రయీల్ అనే భావించాలి (ఫత్‌హుల్ బయాన్, ఇబ్నె కసీర్–అష్రఫుల్ హవాషీ ఆధారంగా).

99. అంటే వీరు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం)ను, హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ధిక్కరించారు. హజ్రత్ జకరియా, యహ్యాలను హతమార్చారు.

100. అంటే దీని అర్థం, "ఓ ముహమ్మద్! నీ మాటల ప్రభావం మాపై ఏమీ పడదులే" అని. వేరొకచోట కూడా ఇలాంటి మాటలే అనబడ్డాయి. ఉదాహరణకు : "నీవు దేని వైపుకు మమ్మల్ని పిలుస్తున్నావో ఆ పిలుపు నుండి మా హృదయాలు సురక్షితంగా ఉన్నాయి." (హామీమ్ అస్సజ్దహ్–5)

101. హృదయాలపై సత్యవాక్కు ప్రభావం పడకుండా ఉండటం అన్నది గర్వపడే విషయం ఎంతమాత్రం కాదు. పైగా ఇది దౌర్భాగ్యానికి, శాపగ్రస్త స్థితికి సంకేతం. వీళ్లలో ఉన్న విశ్వాసం (ఈమాన్) కూడా చాలా తక్కువ. లేక వీళ్ళలో విశ్వసించేవారు చాలా కొద్దిమంది మాత్రమే.

102. మూలంలో **"యస్తఫ్తిహూన"** (يَسْتَفْتِحُونَ) అనే పదం వచ్చింది. దీనికి రెండు అర్థాలున్నాయి. ఒకటి : ఆధిక్యతను

بِئْسَمَا اشْتَرَوْا بِهٖۤ اَنْفُسَهُمْ اَنْ يَّكْفُرُوْا بِمَاۤ اَنْزَلَ اللّٰهُ بَغْيًا اَنْ يُّنَزِّلَ اللّٰهُ مِنْ فَضْلِهٖ عَلٰى مَنْ يَّشَآءُ مِنْ عِبَادِهٖ ۚ فَبَآءُوْ بِغَضَبٍ عَلٰى غَضَبٍ ؕ وَلِلْكٰفِرِيْنَ عَذَابٌ مُّهِيْنٌ ﴿٩٠﴾

**90** ఏ వస్తువుకు బదులుగా వారు తమను అమ్ముకున్నారో అది అత్యంత నీచమైనది– అది వారి తిరస్కారం. అల్లాహ్ తాను ఇష్ట పడే తన దాసుణ్ణి ప్రత్యేకంగా అనుగ్రహించాడన్న అసూయతో[103] వారు అల్లాహ్ తరఫున అవతరించిన విషయాలను తిరస్కరించి ఆగ్రహంపై ఆగ్రహానికి[104] పాత్రులయ్యారు. ఇంకా ఈ తిరస్కారుల కొరకు ఘోర అవమానంతో కూడిన శిక్ష ఉంది.

وَاِذَا قِيْلَ لَهُمْ اٰمِنُوْا بِمَاۤ اَنْزَلَ اللّٰهُ قَالُوْا نُؤْمِنُ بِمَاۤ اُنْزِلَ عَلَيْنَا وَيَكْفُرُوْنَ بِمَا وَرَآءَهٗ ۗ وَهُوَ الْحَقُّ مُصَدِّقًا لِّمَا مَعَهُمْ ؕ قُلْ فَلِمَ تَقْتُلُوْنَ اَنْۢبِيَآءَ اللّٰهِ مِنْ قَبْلُ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ﴿٩١﴾

**91** "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించండి" అని వారితో అన్నప్పుడు, "మాపై అవతరింపజేయబడిన దానిని మేము విశ్వసిస్తున్నాం"[105] అని సమాధానమిస్తారు. దాని తర్వాత వచ్చిన దాన్ని, అది సత్యమైనప్పటికీ, తమవద్ద ఉన్న గ్రంథాన్ని అది ధృవీకరిస్తున్నప్పటికీ వారు తిరస్కరిస్తారు. (సరే! అలాగైతే) వారిని ఈ విధంగా అడుగు: "(మునుపటి గ్రంథాలపై) మీకు నమ్మకముంటే, మరి పూర్వం వచ్చిన దైవప్రవక్తలను ఎందుకు హత్య చేశారు?"[106]

ప్రసాదించమనీ, సహాయం చేయమని ప్రార్థించటం. అంటే ఈ యూదులు ముష్రిక్కు (బహుదైవారాధకు)ల చేతిలో ఓటమిని చవి చూసినప్పుడు, "ఓ అల్లాహ్! అంతిమ ప్రవక్తను త్వరగా పంపు. మేము అతనితో కలిసి ఈ ముష్రిక్కులపై ఆధిక్యతను సంపాదిస్తాము" అని దేవుణ్ణి ప్రార్థించేవారు. అంటే మొదటి అర్థం ప్రకారం 'యస్తఫ్తిహూన' అనే పదం "యస్తన్సిరూన" (సహాయం కోరటం) అనే అర్థంలో వాడబడిందన్నమాట! ఇక ఈ పదానికి గల రెండో అర్థం సమాచారాన్ని అందించటం. దాని ప్రకారం ఈ ఆయతుకు 'త్వరలోనే అంతిమ ప్రవక్త రానున్నాడని యూదులు ముష్రిక్కులకు తెలియజేసేవార'ని అర్థం వస్తుంది (ఫత్హుల్ ఖదీర్). తీరా ఆ అంతిమ ప్రవక్త ప్రభవించాక, యూదులు తెలిసి కూడా, అసూయ కొద్దీ ఆయన్ని విశ్వసించేందుకు నిరాకరించారు.

103. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) వారు తౌరాత్, బైబిలు గ్రంథాల్లో సూచించబడిన అంతిమ దైవప్రవక్తయేనన్న సంగతి వారికి తెలుసు. గ్రంథవహులు ఆయన్ని ఓ ముక్తిప్రదాతగా భావించి, ఆయన (స) రాకకోసం ఎదురుచూసిన సంగతి కూడా వాస్తవమే. కాని 'ఆ ప్రవక్త'ను దేవుడు తమ సంతతి నుండి ఎన్నుకోలేదన్న అసూయతో వారు మహనీయ ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని త్రోసిపుచ్చారు. అంటే జాతి వివక్ష, అసూయ, సంకుచిత స్వభావం సత్య స్వీకారంలో ప్రధాన అడ్డంకిగా నిలిచాయి.

104. **'ఆగ్రహంపై ఆగ్రహం'** అంటే భావం తీవ్రమయిన కోపావేశం. ఎందుకంటే వారు మాటిమాటికీ కోపం తెప్పించే పనులే చేస్తూ పోయారు. వెనుకటి పుటల్లో ఆ వివరాలు వచ్చాయి. కాని ఇప్పుడు వారు అసూయ వల్ల దివ్య ఖుర్ఆన్ను, మహనీయ ముహమ్మద్ (స)ను తృణీకరించారు.

105. అంటే మాకు తౌరాత్పై విశ్వాసం ఉంది. కాబట్టి మేము ఖుర్ఆన్ను విశ్వసించవలసిన అవసరం లేదు అన్నది యూదుల ఉద్దేశం.

106. అంటే–తౌరాత్పై విశ్వాసముందన్న మీ మాటల్లో నిజాయితీ లేదు. ఒకవేళ ఉంటే మీరు మీ కాలం నాటి ప్రవక్తలను వధించేవారు కారు. కాబట్టి మీరు మీ వాదనలో సత్యవంతులు కారు. కేవలం ఓర్వలేనితనం కారణంగా మీరు ఖుర్ఆన్ను విశ్వసించటం లేదు.

وَلَقَدْ جَآءَكُمْ مُّوسٰى بِالْبَيِّنٰتِ ثُمَّ اتَّخَذْتُمُ الْعِجْلَ مِنْۢ بَعْدِهٖ وَاَنْتُمْ ظٰلِمُوْنَ ﴿92﴾

**92** మీ వద్దకు మూసా ఈ సూచనలనే తీసుకువచ్చాడు. అయినా సరే అతను వెళ్ళిన తరువాత మీరు ఆవుదూడను పూజించారు. (అసలు విషయం ఏమిటంటే) మీరు దుర్మార్గులు.[107]

وَاِذْ اَخَذْنَا مِيْثَاقَكُمْ وَرَفَعْنَا فَوْقَكُمُ الطُّوْرَ ؕ خُذُوْا مَآ اٰتَيْنٰكُمْ بِقُوَّةٍ وَّاسْمَعُوْا ؕ قَالُوْا سَمِعْنَا وَعَصَيْنَا ۗ وَاُشْرِبُوْا فِىْ قُلُوْبِهِمُ الْعِجْلَ بِكُفْرِهِمْ ؕ قُلْ بِئْسَمَا يَاْمُرُكُمْ بِهٖٓ اِيْمَانُكُمْ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ﴿93﴾

**93** మేము తూరు పర్వతాన్ని మీపైకి ఎత్తి, మీనుండి వాగ్దానం తీసుకున్న సందర్భాన్ని మననం చేసుకోండి – (ఆ సందర్భంగా మేము), "మీకు ప్రసాదించిన దానిని గట్టిగా పట్టుకోండి. మరియు వినండి" అని అనగానే, వారు "మేము విన్నాము. కాని శిరసావహించము" అని బదులిచ్చారు.[108] అసలు వారి హృదయాలలో ఆవుదూడ పట్ల ప్రేమాభిమానాలు నూరి పోయబడ్డాయి.[109] వారి అవిశ్వాసం కారణంగా (వారికీ దుర్గతి పట్టింది).[110] వారితో అనండి : "మీరు విశ్వాసులే అయితే మీ ఈ విశ్వాసం మీకు చెడు ఆజ్ఞ ఇస్తోంది."

قُلْ اِنْ كَانَتْ لَكُمُ الدَّارُ الْاٰخِرَةُ عِنْدَ اللّٰهِ خَالِصَةً مِّنْ دُوْنِ النَّاسِ فَتَمَنَّوُا الْمَوْتَ اِنْ كُنْتُمْ صٰدِقِيْنَ ﴿94﴾

**94** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఒకవేళ అల్లాహ్ వద్ద పరలోక నివాసం ఇతర మానవులెవరికీ కాకుండా కేవలం మీ కొరకే ప్రత్యేకమై ఉంటే, రండి! మీ వాదన సత్యమైందనడానికి రుజువుగా మరణాన్ని కోరండి."

وَلَنْ يَّتَمَنَّوْهُ اَبَدًاۢ بِمَا قَدَّمَتْ اَيْدِيْهِمْ ؕ وَاللّٰهُ عَلِيْمٌۢ بِالظّٰلِمِيْنَ ﴿95﴾

**95** కాని వారు తమ చేజేతులా చేసుకున్న దురాగతాల దృష్ట్యా ఎన్నటికీ మరణాన్ని కోరరు.[111] అల్లాహ్ దుర్మార్గుల గురించి బాగా ఎరిగినవాడు.

107. వారి తిరస్కార వైఖరికి, వైర భావానికి ఇది కూడా ఒక నిదర్శనమే. ప్రవక్త మూసా స్పష్టమయిన దైవాదేశాలను, నిదర్శనాలను తీసుకువచ్చి దైవప్రవక్తనయిన తనను అనుసరించమని కోరారు. ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే పూజించమని పిలుపు ఇచ్చారు. కాని మీరు మాత్రం మూసా (అలైహిస్సలాం)ను ఎంతగానో వేధించారు. ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించారు. కడకు ఆయన కొన్నాళ్ళపాటు తూర్ పర్వతంపైకి పోగానే, ఆయన వెనకే దూడను ఆరాధ్య దైవంగా చేసుకున్నారు. మీ వైఖరి కడు శోచనీయం.

108. వారిలోని పెడసరి ధోరణికి, దురహంకారానికి ఇదొక తార్కాణం అన్నమాట! చెప్పినట్టు వింటామని అంటూనే మనసులో మరొక తలంపు కలిగి ఉండటం, ద్వంద్వార్థాలతో కూడిన వాక్యాలు పలకటం – ఇదంతా సూచించేదేమిటీ? ముమ్మాటికీ ఇది వారిలోని ఆత్మ వంచనకు అద్దం పడుతున్నది.

109. అసలే ప్రేమ గుడ్డిది అంటారు. మనిషిలో ఏదైనా ఒక వస్తువు పట్ల అమితమయిన ప్రేమ ఏర్పడిందంటే దానికోసం అతను ఏమైనా చేస్తాడు. బనీ ఇస్రాయీల్‌కు ఆవుదూడ పట్ల ప్రేమ నూరిపోయబడింది. ఆ ప్రేమ వారి నరనరాల్లో చెడు రక్తంలా ప్రవహిస్తోంది. కాబట్టి వారు ఏకదైవారాధన వైపుకు చిత్తశుద్ధితో మరలి రావటం అన్నది కష్టం.

110. అంటే దుర్బుద్ధి, ఆవుదూడ పట్ల గల ప్రేమ మూలంగా మీ హృదయాలలో 'కుఫ్ర్' (అవిశ్వాసం) గూడుకట్టుకుంది. అది ఇట్టే తొలగిపోయేది కాదు అని భావం.

111. ఇబ్నె అబ్బాస్ (రజి) గారు దీన్ని 'దావతె ముబాహలా'గా పేర్కొన్నారు. అంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

وَلَتَجِدَنَّهُمْ اَحْرَصَ النَّاسِ عَلٰى حَيٰوةٍ ۚ وَمِنَ الَّذِيْنَ اَشْرَكُوْا ۚ يَوَدُّ اَحَدُهُمْ لَوْ يُعَمَّرُ اَلْفَ سَنَةٍ ۚ وَمَا هُوَ بِمُزَحْزِحِهٖ مِنَ الْعَذَابِ اَنْ يُّعَمَّرَ ۗ وَاللّٰهُ بَصِيْرٌۢ بِمَا يَعْمَلُوْنَ ﴿٩٦﴾

**96** (ఓ ప్రవక్తా!) జీవితం పట్ల అందరి కన్నా ఎక్కువ వ్యామోహం వీరికే ఉందన్న విషయాన్ని నువ్వు గ్రహిస్తావు. (జీవితం పట్ల వ్యామోహంలో) వీరు ముష్రిక్కులను కూడా మించిపోయారు.[112] వీరిలోని ప్రతి ఒక్కడూ వెయ్యి సంవత్సరాల వయస్సును కోరు కుంటాడు. అయితే ఈ దీర్ఘాయుషు కూడా వారిని శిక్ష బారి నుంచి ఏ మాత్రం తప్పించలేదు. అల్లాహ్ వారి కార్యకలాపా లన్నింటినీ చూస్తూనే ఉన్నాడు.

قُلْ مَنْ كَانَ عَدُوًّا لِّجِبْرِيْلَ فَاِنَّهٗ نَزَّلَهٗ عَلٰى قَلْبِكَ بِاِذْنِ اللّٰهِ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ وَهُدًى وَّبُشْرٰى لِلْمُؤْمِنِيْنَ ﴿٩٧﴾

**97** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "జిబ్రీల్‌కు శత్రువు అయిన ప్రతివాడూ (అల్లాహ్‌తో శత్రుత్వాన్ని కొనితెచ్చుకున్నాడన్న) యదా ర్థాన్ని గ్రహించాలి. ఎందుకంటే అల్లాహ్ సూచనపైనే ఆయన నీ హృదయంపై ఈ సందేశాన్ని అవతరింపజేశాడు. ఇది (ఈ ఖుర్ఆన్) తనకు పూర్వం వచ్చిన గ్రంథాలను ధృవీకరిస్తుంది. విశ్వసించేవారికి మార్గదర్శకత్వం వహిస్తూ, వారికి శుభవార్త ఇస్తుంది.[113]

దైవదౌత్యాన్ని తృణీకరించటంలోనూ, దైవసన్నిధిలో మీరు అందరికన్నా ఎక్కువ ప్రేమపాత్రులు అన్న ప్రకటనలోనూ మీరు సత్యవంతులే అయితే ముస్లింలు, యూదులు – ఇరువర్గాల వారూ కలసి అల్లాహ్‌ను ఈ విధంగా అభ్యర్థించాలి: "ఓ అల్లాహ్! ఇరువురిలో ఎవరు అబద్ధం చెబుతున్నారో వారిని మృత్యువాతకు గురిచెయ్యి." జుమా సూరాలో కూడా వారికి ఈ విధంగా సవాలు విసరబడింది. ఆలి ఇమ్రాన్ సూరాలో వచ్చిన ప్రస్తావన ప్రకారం నజరాన్‌కు చెందిన క్రైస్తవులకు కూడా ఈ రకమయిన సవాలు చేయబడింది. యూదులు కూడా క్రైస్తవుల వలెనే తమ వాదనలో అసత్యవంతులవటం చేత ఈ సవాలును స్వీకరించలేదు. అందుకే అల్లాహ్ వీళ్లను ఉద్దేశించి, "ఎట్టి పరిస్థితిలోనూ వారు మరణాన్ని కోరరు (అంటే 'ముబాహలా'కు సిద్ధమవరు)" అని అన్నాడు. ఈ వ్యాఖ్యానానికే హాఫిజ్ ఇబ్నె కసీర్ కూడా ప్రాధాన్యతనిచ్చారు.

112. మరణం సంగతి అటుంచి, అసలు ప్రాపంచిక జీవితం పట్ల వారికెంత మక్కువ ఉందంటే, ఈ విషయంలో ప్రపంచ జనులెవరూ వారితో పోటీపడలేరు. ఆఖరికి ముష్రిక్కులు కూడా. అయితే దీర్ఘాయుషు వారిని అల్లాహ్ శిక్షనుంచి కాపాడజాలదు. ఎక్కువ కాలం బ్రతికి ఉన్నంత మాత్రాన వారి పాపాల పుట్ట తరుగుతుందని ఆశిస్తే పొరబాటే. తాము అల్లాహ్‌కు ఎంతో ఇష్టమైనవారం అనీ, స్వర్గం తమ స్వంతమనీ, మిగిలిన వారంతా నరకవాసులన్న వాదనలో యూదులు సత్యసంధులు కారని, పైగా వారు కేవలం కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని తేలిపోయింది. ఆ విషయం నిజమై ఉంటే, లేదా కనీసం తమ వాదనలో తాము అతిశయిల్లటం లేదన్న నమ్మకం స్వయంగా వారికి ఉంటే "మరణాన్ని కోరటానికి" వారు వెనుకంజవేసేవారు కాదు. నోటితో వారు ఎన్ని గొప్పలు చెప్పినప్పటికీ, వాగ్ధాటితో తమ చుట్టూ ఎంత సుందరమైన వలయాన్ని అల్లుకున్నప్పటికీ మనస్సాక్షి మాత్రం వారిని నిరంతరం హెచ్చరిస్తూనే ఉంటుంది. అల్లాహ్ సన్నిధిలో నిలబడిన రోజున అవిధేయులకు పట్టే దుర్గతే తమకూ పడుతుంది అన్న యదార్థం కూడా వారికి తెలియనిది కాదు.

113. హదీసు ప్రకారం : కొంతమంది యూద పండితులు మహాప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, "మీరు గనక ఈ సందేహా లకు సరైన సమాధానం ఇస్తే మేము విశ్వసిస్తాము. ఎందుకంటే దైవప్రవక్త అయినవాడు మాత్రమే వీటికి సమాధానం ఇవ్వగలుగుతాడు" అని ప్రతిపాదించారు. మహాప్రవక్త (స) వారి సందేహాలన్నింటికీ సమాధానం ఇచ్చిన మీదట,

مَنْ كَانَ عَدُوًّا لِّلّٰهِ وَمَلٰٓئِكَتِهٖ وَرُسُلِهٖ
وَجِبْرِيْلَ وَمِيْكٰىلَ فَاِنَّ اللّٰهَ عَدُوٌّ لِّلْكٰفِرِيْنَ (98)

**98** ఎవరు అల్లాహ్‌కు, ఆయన దూతలకు, ఆయన ప్రవక్తలకు, జిబ్రీల్ మరియు మీకాయీల్‌కు శత్రువులుగా ఉంటారో, అటువంటి అవిశ్వాసులకు అల్లాహ్ శత్రువుగా ఉంటాడు.[114]

وَلَقَدْ اَنْزَلْنَآ اِلَيْكَ اٰيٰتٍۢ بَيِّنٰتٍ ۚ وَمَا يَكْفُرُ بِهَآ
اِلَّا الْفٰسِقُوْنَ (99)

**99** (ఓ ప్రవక్తా!) స్పష్టమైన సూచనలను మేము నీపై అవతరింపజేశాము. అవిధేయులు తప్ప వేరెవరూ వాటిని త్రోసిపుచ్చరు.

اَوَكُلَّمَا عٰهَدُوْا عَهْدًا نَّبَذَهٗ فَرِيْقٌ مِّنْهُمْ ۭ بَلْ
اَكْثَرُهُمْ لَا يُؤْمِنُوْنَ (100)

**100** వారెప్పుడు ఏ వాగ్దానం చేసినా, వారిలోని ఏదో ఒక వర్గం దాన్ని భంగపరుస్తుంది. పైగా వారిలో అనేకులు విశ్వాసులు కారు.

وَلَمَّا جَآءَهُمْ رَسُوْلٌ مِّنْ عِنْدِ اللّٰهِ مُصَدِّقٌ
لِّمَا مَعَهُمْ نَبَذَ فَرِيْقٌ مِّنَ الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ ۙ
كِتٰبَ اللّٰهِ وَرَآءَ ظُهُوْرِهِمْ كَاَنَّهُمْ لَا يَعْلَمُوْنَ (101)

**101** వారి వద్దకు, వారి గ్రంథాన్ని నిజమని ధృవీకరించే ప్రవక్త అల్లాహ్ తరఫు నుంచి ఎప్పుడు వచ్చినా ఆ గ్రంథ వహులలోని ఒక వర్గంవారు, దైవ గ్రంథాన్ని, అసలు దాని గురించి ఏమీ తెలియనివారుగా వెనుక పడవేశారు.[115]

---

"మీపై దైవవాణిని తీసుకువచ్చేది ఎవరు?" అని ప్రశ్నించారు. "జిబ్రీల్" అని ఆయన (స) బదులిచ్చారు. అప్పుడు యూదులు, "జిబ్రీల్ అయితే అతడు మా శత్రువు. అతడు వైమనస్యాన్ని, మారణకాండను, విపత్తును తీసుకుని వస్తూ ఉంటాడు" అని వంకపెట్టి మహాప్రవక్త (స) దైవదౌత్యాన్ని శిరసావహించటానికి నిరాకరించారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

114. "మీకాయీల్ దూత మా నేస్తం" అని యూదులనేవారు. కాగా; "వాళ్ళందరూ నా ప్రియ దాసులే. వారికీ లేక వారిలో ఏ ఒక్కరికైనా శత్రువుగా ఉన్నవాడు, అల్లాహ్‌కు శత్రువు" అని స్వయంగా అల్లాహ్ అంటున్నాడు. "నా స్నేహితులలో ఎవరిపట్లనయినా వైరం వహించినవాడు వాస్తవానికి నాపై యుద్ధప్రకటన చేశాడు" అని హదీసులో ఉంది (సహీహ్ బుఖారీ). అంటే అల్లాహ్ స్నేహితుల్లోని ఏ ఒక్కరితోనయినా శత్రుత్వం వహిస్తే సమస్త స్నేహితులతో (ఔలియాలతో) శత్రుత్వం వహించినట్లే. అంతేకాదు, అల్లాహ్‌తో శత్రుత్వం కొనితెచ్చుకున్నట్లే. కాబట్టి "ఔలియా అల్లాహ్"ను అభిమానించటం, ఆదరించటం ఎంతో అవసరం. వారిపట్ల ద్వేషం, వైరభావం కలిగి ఉండటం అపరాధం. పైగా అది అల్లాహ్‌కు వ్యతిరేకంగా యుద్ధ ప్రకటన చేయటం వంటిదే. ఇంతకీ ఆ 'ఔలియా అల్లాహ్' ఎవరు? యూనుస్ సూరాలోని 62, 63 ఆయతులను అధ్యయనం చేయండి.

అయితే ఔలియా అల్లాహ్ (అల్లాహ్ స్నేహితుల) పట్ల ఆదరాభిమానాలు కలిగి ఉండటమంటే భావం వారు చనిపోయిన తరువాత వారి సమాధుల వద్దకు పోయి మొక్కటం, సమాధులపై పెద్ద పెద్ద గుంబదులు, గోపురాలు నిర్మించటం ఎంతమాత్రం కాదు. వారి పేరున ఏడాదికోసారి 'ఉరుసు'లనే మేళాలు, తిరునాళ్ళు ఏర్పాటు చేయటం, వారి పేరు మీద మొక్కుబడులు చేసుకోవటం, సమాధులకు స్నానాదులు చేయించి, సరికొత్త పరదాలను కప్పటం ధర్మసమ్మతం కాదు. అలాగే ఆ మృతులను అక్కరలు తీర్చేవారుగా, కష్టాల నుంచి గట్టెక్కించే వారుగా, లాభనష్టాలు చేకూర్చగల శక్తి ఉన్నవారుగా నమ్మి, వారి ముందు వేడుకోవటం, సామూహికంగా సమాధుల ముందు నిలబడి ధ్యానించటం, వాటి ముందు మోకరిల్లటం – ఎంతమాత్రం సమ్మతం కాదు. దురదృష్టవశాత్తు "ఔలియా అల్లాహ్ పట్ల అభిమానం" అనే పేరుపై ఈ వ్యాపారం మహా జోరుగా సాగుతోంది. చూడబోతే అది ఒకప్పటి లాత్, మనాత్ దేవతల పూజను పునరుద్ధరించే ప్రయత్నంగా కానవస్తుంది. నిజానికి ఇది 'ప్రేమ' కాదు. ఇదొక రకమయిన "పూజ". ఇది షిర్క్. ఘోర అపచారం. ఈ సమాధి పూజ నుండి అల్లాహ్ మనల్ని కాపాడుగాక!

115. అల్లాహ్ తన అంతిమ సందేశహరుణ్ణి (సఅసం) ఉద్దేశించి ఏమంటున్నాడంటే; మేము మీకు ఎన్నో స్పష్టమయిన

102 వారు సులైమాను రాజ్యంలోని షైతానులు అవలంబించిన విషయాల వెనుకపడ్డారు. అసలు సులైమాను ఎన్నడూ అవిశ్వాసానికి ఒడిగట్టలేదు, ఈ అవిశ్వాస పోకడ అసలు షైతానులదే. వారు ప్రజలకు చేతబడిని నేర్పేవారు.[116] వారు బాబిలోనియాలో హారూత్, మారూత్ అనే ఇద్దరు దైవదూతలపై అవతరింపజేయబడిన విద్య వెంటపడ్డారు.[117] "మేము ఒక పరీక్ష వంటివారం.[118]

وَاتَّبَعُوا مَا تَتْلُوا الشَّيٰطِيْنُ عَلٰى مُلْكِ سُلَيْمٰنَ ۚ
وَمَا كَفَرَ سُلَيْمٰنُ وَلٰكِنَّ الشَّيٰطِيْنَ كَفَرُوْا يُعَلِّمُوْنَ
النَّاسَ السِّحْرَ ۗ وَمَآ اُنْزِلَ عَلَى الْمَلَكَيْنِ بِبَابِلَ
هَارُوْتَ وَمَارُوْتَ ۗ وَمَا يُعَلِّمٰنِ مِنْ اَحَدٍ

సూచనలను, వాక్యాలను ఇచ్చి పంపాము. వాటిని చూసిన తరువాత యూదులు సయితం విశ్వసించాల్సిందే. అదీగాక వారి గ్రంథమైన తౌరాత్‌లోనూ మీ గుణగణాలు తెలుపబడ్డాయి. మిమ్మల్ని వారు విశ్వసించాలన్న ప్రమాణ ప్రస్తావన కూడా ఉంది.

కాని వారు ఎప్పుడు వాగ్దాన పాలన చేశారనీ ఈ వాగ్దానాన్ని కూడా పాలించటానికి!? వాగ్దాన భంగం చేయటం వారిలోని ఒక వర్గానికి హాబీ అయిపోయింది. ఆఖరికి దైవగ్రంథాన్ని కూడా వారు మరుగున పడవేశారు. దాని గురించి తమకేమీ తెలీనట్లే వ్యవహరించారు.

116. అంటే యూదులు దైవగ్రంథాన్ని, చేసిన బాసను నిర్లక్ష్యం చేసిందిగాక, షైతాను అడుగుజాడల్లో నడుస్తూ, చేతబడి వంటి క్షుద్రవిద్యల వెంటబడ్డారు. అంతేకాదు, సులైమాను (అలైహిస్సలాం) అసలు దైవప్రవక్తే కారనీ (దైవం మన్నించుగాక!), ఆయనొక మాంత్రికుడనీ, మంత్రతంత్రాల శక్తితో రాజ్యమేలాడనీ అపవాదు మోపారు. ఈ అపవాదును అల్లాహ్ ఖండించాడు : సులైమాను (అలైహిస్సలాం) చేతబడి చేసేవారు కాదు. ఎందుకంటే చేతబడి అనేది ఒక అవిశ్వాస పోకడ. అలాంటి అవిశ్వాసంతో కూడుకున్న చేష్టకు ఆయన ఎందుకు పాల్పడతారు?

సులైమాను (అలైహిస్సలాం) కాలంలో క్షుద్రవిద్యలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయని చెబుతారు. దీని నివారణోపాయంలో భాగంగా సులైమాను (అలైహిస్సలాం) క్షుద్ర సాహిత్యాన్ని సేకరించి వాటిని తన సింహాసనం క్రింద పాతిపెట్టేశారు. సులైమాన్ (అలైహిస్సలాం) మరణించిన తరువాత ఈ షైతానులు, మాంత్రికులు కలసి ఆ సాహిత్యాన్ని వెలికితీశారు. సులైమాన్ శక్తియుక్తుల, అధికారం వైభవాల వెనుక ఉన్న అసలు రహస్యం ఈ చేతబడేనని ప్రజలకు నమ్మబలికారు. దీని ఆధారంగా ఈ దుర్మార్గులు సులైమాను (అలైహిస్సలాం)ను అవిశ్వాసి (కాఫిర్)గా ఖరారు చేశారు. అయితే అల్లాహ్ దీనిని ఖండించటమేగాక దీనిని ఒక నీలాపనిందగా అభివర్ణించాడు, సులైమానును ఒక నికార్సయిన విశ్వాసిగా పేర్కొన్నాడు (ఇబ్నె కసీర్).

117. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు **'వమా ఉన్జిల'** (**وَمَآ اُنْزِلَ**) అనే పదంలోని **'మా'** (**مَا**) అనే పదాన్ని నకారాత్మక భావంలో తీసుకుని, హారూత్, మారూత్‌లపై అసలేమీ అవతరించలేదని అభిప్రాయపడ్డారు. అయితే ఖుర్‌ఆన్‌లో వచ్చిన తర్వాతి ప్రస్తావన ఈ అభిప్రాయాన్ని సమర్థించేదిగా లేదు. అందుకే ఇబ్నె జరీర్ మొదలగు వ్యాఖ్యానకర్తలు ఈ వాదనను త్రోసిపుచ్చారు (ఇబ్నె కసీర్). అలాగే హారూత్ మారూత్‌ల గురించి ఎన్నో ఇస్రాయీలీ ఉల్లేఖనాలు ఉన్నాయి. అయితే దైవప్రవక్త (స) స్వయంగా చెప్పినట్లు ప్రమాణబద్ధమైన ఉల్లేఖనం ఈ నేపథ్యంలో ఏ ఒక్కటీ లేదు. వివరాల్లోకి పోకుండా, ఎంతో క్లుప్తంగా ఈ సంఘటనను అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించాడు. కాబట్టి మనం ఈ విషయాన్ని అంతవరకు మాత్రమే విశ్వసించాలి (తఫ్సీర్ ఇబ్నె కసీర్). ఇద్దరు దూతలకు అల్లాహ్ చేతబడి విద్యను ఇచ్చి బాబిలోనియాకు పంపాడని ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యం ద్వారా తెలియవస్తోంది. (1) దీని ఉద్దేశం ఏమై ఉంటుంది? (వాస్తవం దైవానికే ఎరుక) అంటే దైవప్రవక్తల ద్వారా వ్యక్తమయ్యే మహిమలు వేరు, ఈ చేతబడి వేరు. అల్లాహ్ తరఫున మాకు ఒసగబడిన చేతబడి ఇదిగో ఇలా ఉంటుంది, (ఈ కాలంలో చేతబడి సర్వత్రా ప్రబలిపోయిన కారణంగా దైవప్రవక్తలు కూడా మాంత్రికులే అయి ఉంటారేమో! అని కొంతమంది అనుమానించటం మొదలెట్టారు). ప్రజలు ఈ అపోహకు గురి కారాదన్న ఉద్దేశంతో – ఒక పరీక్షగా – దైవదూతలను అవతరింపజేయటం జరిగింది.

(2) రెండో ఉద్దేశం: బనీ ఇస్రాయీల్ నైతికంగా ఎంతగా దివాలా తీసిందో, చేతబడి వంటి క్షుద్రవిద్యను నేర్చుకోవటానికి

حَتّٰى يَقُوْلَآ اِنَّمَا نَحْنُ فِتْنَةٌ فَلَا تَكْفُرْ ؕ
فَيَتَعَلَّمُوْنَ مِنْهُمَا مَا يُفَرِّقُوْنَ بِهٖ بَيْنَ الْمَرْءِ
وَزَوْجِهٖ ؕ وَمَا هُمْ بِضَآرِّيْنَ بِهٖ مِنْ اَحَدٍ اِلَّا
بِاِذْنِ اللّٰهِ ؕ وَيَتَعَلَّمُوْنَ مَا يَضُرُّهُمْ وَلَا
يَنْفَعُهُمْ ؕ وَلَقَدْ عَلِمُوْا لَمَنِ اشْتَرٰىهُ مَا لَهٗ
فِى الْاٰخِرَةِ مِنْ خَلَاقٍ ؕ وَلَبِئْسَ مَا شَرَوْا بِهٖٓ
اَنْفُسَهُمْ ؕ لَوْ كَانُوْا يَعْلَمُوْنَ (102)

నువ్వు మాత్రం అవిశ్వాసానికి పాల్పడకు" అని (స్పష్టంగా) చెప్పనంతవరకూ వారు (ఇద్దరూ) ఎవరికీ ఆ విద్యను నేర్పేవారు కూడా కాదు. అయినప్పటికీ జనులు వారి దగ్గర భార్యాభర్తలను విడగొట్టే విద్యను నేర్చుకునేవారు. ఎంత చేసినా వారు అల్లాహ్ అనుమతి లేకుండా ఆ చేతబడి ద్వారా ఎవరికీ ఎలాంటి కీడు కలిగించలేరు సుమా![119] తమకు నష్టం తప్ప ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని దానిని వారు నేర్చుకుంటున్నారు. ఆ విద్యను కొనుక్కున్నవారికి పరలోకంలో (అక్కడి సుఖసౌఖ్యాలలో) ఎలాంటి భాగం లేదన్న సంగతి వారికి సయితం తెలుసు. ఎంత నీచమైన వస్తువుకు బదులుగా వారు తమను తాము అమ్ముకుంటున్నారో వారికి తెలిస్తే ఎంత బావుండు!

وَلَوْ اَنَّهُمْ اٰمَنُوْا وَاتَّقَوْا لَمَثُوْبَةٌ مِّنْ عِنْدِ اللّٰهِ
خَيْرٌ ؕ لَوْ كَانُوْا يَعْلَمُوْنَ (103)

**103** వారే గనక విశ్వసించి, అల్లాహ్ పట్ల భీతిపరులుగా వ్యవహరించి ఉంటే అల్లాహ్ తరఫున వారికి అత్యుత్తమ పుణ్యఫలం లభించి ఉండేది. ఆ సంగతిని వారు తెలుసుకోగలిగితే ఎంత బావుండేది!

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَقُوْلُوْا رَاعِنَا وَقُوْلُوا
انْظُرْنَا وَاسْمَعُوْا ؕ وَلِلْكٰفِرِيْنَ عَذَابٌ اَلِيْمٌ (104)

**104** ఓ విశ్వాసులారా! (దైవప్రవక్త–సల్లల్లాహు అలైహి వ సల్లంను) 'రాయినా' అని అనకండి, 'ఉన్‌జుర్నా'[120] అని అనండి. శ్రద్ధగా వింటూ ఉండండి. అవిశ్వాసుల కొరకు బాధాకరమైన శిక్ష ఉంది.

వారు ఎలా దైవదూతల వెంటపడ్డారో తెలియజేయటం కూడా దీని ఉద్దేశం అయ్యుండవచ్చు. చేతబడి అవిశ్వాసంతో కూడుకున్న పని అనీ, తాము ప్రజలకు ఒక పరీక్షగా మాత్రమే ప్రభవింపజెయ్యబడ్డామని దూతలు స్పష్టం చేసిన పిదప కూడా వారు ఈ క్షుద్రవిద్య కోసం ఎగబడ్డారు. తద్వారా ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురాల్లో కలతలు రేపి, అనుమానాల బీజాలు నాటి, వాళ్ళ సంసారాల్లో నిప్పులు పోయాలనీ, కాపురాలను కూల్చాలనీ వారు తహతహలాడేవారు. అంటే; అది వారి అధోగతికి, కుల్లుమోతు తనానికీ ఒక ప్రబల నిదర్శనం, కొంపలు కూల్చే వారి కార్యక్రమంలో ఒక ముఖ్యాంశం అన్నమాట! అల్లాహ్ మనల్ని దాన్నుంచి రక్షించుగాక!

118. ఇది మిథ్యను ఖండించే ఉద్దేశంతో, ఒక గురువు వద్ద మిథ్యావాదాన్ని నేర్చుకోవటం వంటిది. మిథ్యావాదాన్ని ఖండిస్తాననీ, ధర్మరక్షణ కోసం ఆ విద్యను ఉపయోగిస్తానని శిష్యుడు ఇచ్చిన హామీపై గురువు అతనికి ఆ విద్యను నేర్పుతాడు. అంటే గురువు తన శిష్యుణ్ణి నమ్మాడు. కాని విద్య నేర్చుకున్న తరువాత శిష్యుడు సయితం మిథ్యావాదిగా మారిపోయి, మిథ్యను ప్రాచుర్యంలోనికి తెస్తే ఆ దోషం గురువుది కాదుకదా! "మేము అల్లాహ్ తరఫున దాసుల పాలిట ఓ పరీక్ష వంటి వాళ్ళం" అన్న ఆ ఇద్దరు దైవదూతల మాటల్లోని ఆంతర్యం ఇదే.

119. దైవ ప్రణాళికకు ప్రమేయం లేనంతవరకూ ఈ చేతబడి కూడా ఎవరికీ ఎటువంటి హాని కలిగించజాలదు. చేతబడిని నేర్చుకోవటాన్ని, దానిని ఆచరణలో పెట్టడాన్నీ ఇస్లాం అధర్మంగా ఖరారు చేసింది. ఏ మేలును ఆశిస్తున్నా, ఏ కీడును పారద్రోలాలనుకున్నా అల్లాహ్ వైపుకు మరలాలి. ఎందుకంటే ఆయనే అందరి సృష్టికర్త. జగతిలో ఏ పని జరిగినా ఆయన ఆమోదించిన ప్రణాళికకు అనుగుణంగానే జరుగుతుంది.

120. **'రాయినా'** ( رَاعِنَا ) అంటే మమ్మల్ని కాస్త దృష్టిలో పెట్టుకోండి అని అసలు అర్థం. విషయం అర్థం కానప్పుడు

مَا يَوَدُّ الَّذِيْنَ كَفَرُوْا مِنْ اَهْلِ الْكِتٰبِ وَلَا الْمُشْرِكِيْنَ اَنْ يُّنَزَّلَ عَلَيْكُمْ مِّنْ خَيْرٍ مِّنْ رَّبِّكُمْ ؕ وَاللّٰهُ يَخْتَصُّ بِرَحْمَتِهٖ مَنْ يَّشَآءُ ؕ وَاللّٰهُ ذُو الْفَضْلِ الْعَظِيْمِ ﴿١٠٥﴾

**105** మీపై మీ ప్రభువు తరఫు నుంచి ఏదైనా మేలుతో కూడుకున్న విషయం అవతరించటం గ్రంథవహుల్లోని తిరస్కారులకుగానీ, ముష్రిక్కు (బహుదైవారాధకు)లకు గానీ ఏమాత్రం ఇష్టం లేదు. (వారెంతగా అసూయ చెందినా ఫరవాలేదు) అల్లాహ్ తన ప్రత్యేక కారుణ్యం నుంచి తాను కోరిన వారికి అనుగ్రహిస్తాడు, అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.

مَا نَنْسَخْ مِنْ اٰيَةٍ اَوْ نُنْسِهَا نَاْتِ بِخَيْرٍ مِّنْهَآ اَوْ مِثْلِهَا ؕ اَلَمْ تَعْلَمْ اَنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَىْءٍ قَدِيْرٌ ﴿١٠٦﴾

**106** (ఓ ప్రవక్తా!) ఏదేని ఒక వాక్యాన్ని మేము రద్దుపరచినా[121] లేక మరపింపజేసినా (దాని స్థానంలో) దానికన్నా ఉత్తమమైన దానినీ లేదా కనీసం దానికి సమానమైన దానిని తీసుకువస్తాము. అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడన్న సంగతి నీకు తెలియదా?

ప్రేక్షకులు ఈ విధంగా చెప్పి వక్తను సావధానపరచేవారు. ఇలా చెప్పటం తప్పు కూడా కాదు. కాని యూదులు తమలోని ఈర్ష్య వల్ల ఈ పదాన్ని వక్రీకరించి ప్రయోగించేవారు. దాంతో అసలు అర్థం కాస్తా మారిపోయి చెడు అర్థం వచ్చేది. ఆ విధంగా వారు తమ మనసులోని అక్కసును, ఆవేశాన్ని చల్లార్చుకునేవారు. ఉదాహరణకు : 'రాయినా' (ఓ మా కాపరివాడా!) లేక 'రాయినన్' (చిలిపి మనిషీ!) మొదలైన పద ప్రయోగాలు చేసేవారు. ఈ ద్వంద్వ స్వభావం వారికి కొత్తేమీ కాదు. సలాం చేయవలసి వచ్చినప్పుడు కూడా వాళ్ళు "అస్సలాము అలైకుమ్" బదులు "అస్సాము అలైకుమ్" (మీకు చావు వచ్చుగాక!) అని పలికేవారు. అందుకే అల్లాహ్ వారిని 'రాయినా' బదులు **'ఉన్‌జుర్నా'** (انْظُرْنَا) అని పలకమని ఉపదేశించాడు. ఉన్‌జుర్‌నా అంటే మా వైపు చూడు, మమ్మల్ని కూడా దృష్టిలో పెట్టుకో అని అర్థం. ఇందులో పెడర్థాలు రావు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే వ్యంగ్యానికి, పరిహాసానికి ఆస్కారం కల్పించే పదాలను ఉపయోగించటం, ఎదుటివారిని అగౌరవపరచే ధోరణిని అవలంబించటం సమంజసం కాదు. అలాగే మాటల్లోనూ, చేతల్లోనూ అవిశ్వాసుల పద్ధతులను అనుసరించకుండా జాగ్రత్త పడటం మంచిది. తద్వారా ముస్లింలు, "ఎవరు అన్యుల పద్ధతులను పోలిన పద్ధతులనే అవలంబిస్తాడో అతడు వారిలోని వాడుగానే పరిగణించబడతాడు" అన్న మహాప్రవక్త (స) హెచ్చరికను ఖచ్చితంగా ఖాతరు చేసిన వారవుతారు. ఈ ప్రవచనం అబూ దావూద్ గ్రంథంలో ఉంది.

121. అరబీలో **'నస్ఖ్'** (نسخ) అనే పదం వచ్చింది. నిఘంటువు ప్రకారం నస్ఖ్ అంటే నకలు చేయటం అని అర్థం. కాని షరీయతు పరిభాషలో ఏదేని ఒక ఆదేశాన్ని మార్చి దాని స్థానంలో కొత్త ఆదేశాన్ని తీసుకురావటాన్ని 'నస్ఖ్' అంటారు. ఈ మార్పు అల్లాహ్ తరఫున జరిగింది. అల్లాహ్ తాను కోరిన సమయంలో తాను కోరిన ఆదేశాన్ని రద్దుపరచి, నూతన ఆదేశాన్ని ప్రవేశపెట్టగలడు. ఒకప్పుడు ఆదం (అలైహిస్సలాం) కాలంలో అన్నాచెల్లెళ్ళ మధ్య వివాహబంధం ధర్మసమ్మతంగా ఉండేది. అప్పట్లో అది అధర్మం కాదు. కాని కొంతకాలం తర్వాత ఇది హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేయబడింది. అలాగే దివ్య ఖుర్ఆన్‌లో కూడా అల్లాహ్ కొన్ని ఆదేశాలను అవతరింపజేసిన తరువాత వాటిని రద్దు చేశాడు. వాటి స్థానంలో సరికొత్త ఆదేశాలను అవతరింపజేశాడు. అటువంటి ఆయతులు ఎన్ని ఉంటాయి? అన్న విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. వాటి సంఖ్య కేవలం 'అయిదు' అని షాహ్ వలీయుల్లాహ్ గారు 'అల్ ఫౌజుల్ కబీర్'లో వివరించారు. ఈ రద్దు కూడా మూడు విధాలుగా ఉంటుంది. **ఒకటి :** ఒక ఆయతును రద్దుపరచి దాని స్థానంలో మరొక ఆయతును అవతరింపజేయటం. **రెండు :** రెండో తరహా ఎటువంటిదంటే, మొదటిసారిగా వచ్చిన ఆజ్ఞల వాక్యం ఖుర్ఆన్‌లో ఉంటుంది. దాని పారాయణం కూడా జరుగుతుంది, దాంతో పాటు తదుపరి అవతరించిన వాక్యం కూడా ఖుర్ఆన్‌లో పొందుపరచబడి ఉంటుంది – అంటే కొత్తగా వచ్చిన ఆయతుతో పాటు రద్దు పరచబడిన ఆయతు కూడా యథాతథంగా ఉంచబడుతుందన్నమాట! దీన్నే **"నస్ఖ్ మఅత్తిలావత్"**

**107** భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌దేననీ, అల్లాహ్ తప్ప మరొకరెవరూ మీ రక్షకులూ, సహాయకులూ కారన్న విషయం నీకు తెలియదా?

اَلَمْ تَعْلَمْ اَنَّ اللّٰهَ لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۭ وَمَا لَكُمْ مِّنْ دُوْنِ اللّٰهِ مِنْ وَّلِيٍّ وَّلَا نَصِيْرٍ ﴿107﴾

**108** లోగడ మూసా (అలైహిస్సలాం)కు వేయబడినటువంటి ప్రశ్నలే మీరు మీ ప్రవక్త (ముహమ్మద్–స)కు వేయదలుస్తున్నారా?[122] (అయితే వినండి) విశ్వాసాన్ని అవిశ్వాస వైఖరి ద్వారా మార్చేవాడు రుజుమార్గం నుంచి తప్పిపోతాడు.

اَمْ تُرِيْدُوْنَ اَنْ تَسْــَٔـلُوْا رَسُوْلَكُمْ كَمَا سُىِٕلَ مُوْسٰى مِنْ قَبْلُ ۭ وَمَنْ يَّتَبَدَّلِ الْكُفْرَ بِالْاِيْمَانِ فَقَدْ ضَلَّ سَوَاۗءَ السَّبِيْلِ ﴿108﴾

అని అంటారు. **మూడు :** ఇక మూడో తరహా రద్దు ఎలాంటిదంటే, ఆయతుల పారాయణం రద్దుచేయబడుతుంది. ఆ వాక్యాలు ఖుర్‌ఆన్‌లో పఠించబడవు. అంటే మహనీయ ముహమ్మద్ (సఅసం) దివ్య ఖుర్‌ఆన్‌లో ఆ ఆయత్‌ను పొందుపరచలేదు. కాని దాని ఆదేశాన్ని మాత్రం ఆయన యధాతథంగా ఉంచారు. ఉదాహరణకు: "వివాహితుడైన పురుషుడు, వివాహితురాలైన స్త్రీ–ఒకవేళ వ్యభిచారం చేస్తే వారికి శిలాశిక్ష విధించాలి" (ముఅత్తా ఇమామ్ మాలిక్–కితాబుల్ హుదూద్). ఈ వాక్యాలు కూడా ఒకప్పుడు ఖుర్‌ఆన్‌లో అంతర్భాగంగా ఉండేవి. వాటి పఠనం కూడా జరిగేది. కాని ఆ తరువాత ఈ ఆయతుల పఠనం రద్దయింది. అయితే వాటి ఆదేశం మాత్రం అలాగే ఉంచబడింది.

**"మా నన్‌సఖ్ మిన్ ఆయతిన్......."** అన్న పై ఆయతులో అల్లాహ్ మొదటి రెండు రకాల రద్దుల గురించి చెబుతున్నాడు. ఎలాగంటే, **"మా నన్‌సఖ్ మిన్ ఆయతిన్"** (మేము ఏదేని వాక్యాన్ని రద్దుపరచినా) అన్న వాక్యం రెండవ రకమైన రద్దును సూచిస్తున్నది (అనగా మేము వాటిని రద్దుచేసినా కూడా వాటిని మీచేత మరిపింపజేయము. అవి ఖుర్‌ఆన్‌లో యధాతథంగా ఉంటాయి). ఇకపోతే **"అవ్ నున్‌సిహా"** (లేక మేము మరిపింపజేసినా) అన్న వాక్యం మొదటిరకపు రద్దును సూచిస్తున్నది (అనగా ఒక ఆయతు పారాయణం, దాని ఆదేశం రెండింటినీ మరిపింప జేస్తాడు అల్లాహ్).

"మేము మరిపింపజేస్తాము" అంటే భావం ఆ ఆదేశంతో పాటు, తత్సంబంధిత ఆయతును కూడా మేము లేపుకుంటాము. అంటే మీరు మరచిపోయేలా చేసి, కొత్త ఆదేశాన్ని అవతరింపజేస్తాము. లేక మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మనోఫలకంపై నుంచే మేము దాన్ని చెరిపేస్తాము.

యూదులు తౌరాత్ గ్రంథాన్ని మార్పులకు వీలులేని గ్రంథంగా ఖరారు చేసేవారు. ఖుర్‌ఆన్‌లో కూడా కొన్ని ఆదేశాలు రద్దు కావటంపై వారు ఆక్షేపణను తెలియజేశారు. కాని అల్లాహ్ వారి ఆక్షేపణను ఖండిస్తూ, భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌దేననీ, తాను సముచితం అనుకున్న దానిని ఆయన సమ్మతించి ఆమోదిస్తాడనీ స్పష్టం చేశాడు. నిజమే. ఏ ఆజ్ఞ ఎప్పుడు, ఎక్కడ సరిగ్గా వర్తిస్తుందో, దేనిలో మానవాళి శ్రేయోసాఫల్యాలు ఇమిడి ఉన్నాయో ఆయనకు బాగా తెలుసు. అందుకే ఆయన తాను తలచిన ఆదేశాన్ని రద్దుపరచగలడు, తాను తలచిన దానిని ప్రవేశపెట్టగలడు. అది ఆయన తిరుగులేని అధికారానికి, గుణగణాలకు దర్పణం అన్నమాట! కొంతమంది ప్రాచీన మార్గభ్రష్టులు (ఉదాహరణకు అబూ ముస్లిం అస్‌ఫహానీ మూతజిలి వంటివారు), నేటి సోకాల్డ్ అభ్యుదయవాదులు కూడా యూదుల మాదిరిగానే, ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ తరఫున జరిగిన ఈ 'రద్దు'ను నమ్మ నిరాకరించారు. నిజానికి పైన వివరించబడిన విషయమే సరైనది. సలఫె సాలిహీన్ (ఇస్లాంలో తొలి మూడు తరాలకు చెందిన నికార్సయిన ముస్లింల) విశ్వాసం కూడా అదే. అంటే ఖుర్‌ఆన్‌లో నస్ఖ్ (రద్దు) జరిగిందని!

122. ఈ ఆయతులో ముస్లిములకు (మహాప్రవక్త ప్రియ సహచరులకు) హెచ్చరిక ఉంది. యూదుల వలెనే మీరు ప్రవక్తకు తిక్క ప్రశ్నలు వేసి, పెడసరి మాటలు పలికి విశ్వాసంలో కల్తీకి తావీయకండి. ఎందుకంటే ఇలాంటి పనికిమాలిన ప్రశ్నల్లో నుంచి 'అవిశ్వాస వాసన' వస్తోంది.

وَدَّ كَثِيرٌ مِّنْ أَهْلِ الْكِتَابِ لَوْ يَرُدُّونَكُم مِّن
بَعْدِ إِيمَانِكُمْ كُفَّارًا حَسَدًا مِّنْ عِندِ أَنفُسِهِم
مِّن بَعْدِ مَا تَبَيَّنَ لَهُمُ الْحَقُّ فَاعْفُوا وَاصْفَحُوا
حَتَّىٰ يَأْتِيَ اللَّهُ بِأَمْرِهِ إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ
قَدِيرٌ ﴿١٠٩﴾

**109** ఈ గ్రంథవహుల్లోని అనేకులు, సత్యమేదో స్పష్టంగా తెలిసి పోయినప్పటికీ – కేవలం తమ మనసులలో ఉన్న అసూయ మూలంగా మిమ్మల్ని కూడా విశ్వాస మార్గం నుంచి అవిశ్వాసం వైపు మళ్ళించాలని చూస్తున్నారు. కాబట్టి అల్లాహ్ తన ఆదేశాన్ని తీసుకువచ్చే వరకూ మీరు కూడా మన్నింపుల వైఖరిని అవలం బిస్తూ ఉండండి, వారిని పట్టించుకోకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు.

وَأَقِيمُوا الصَّلَاةَ وَآتُوا الزَّكَاةَ وَمَا تُقَدِّمُوا لِأَنفُسِكُم
مِّنْ خَيْرٍ تَجِدُوهُ عِندَ اللَّهِ إِنَّ اللَّهَ بِمَا تَعْمَلُونَ
بَصِيرٌ ﴿١١٠﴾

**110** మీరు మాత్రం నమాజును నెలకొల్పుతూ, జకాత్‌ను ఇస్తూ ఉండండి, మీరు మీ కోసం ఏ మంచి పనులను ముందుగా పంపుకున్నా అల్లాహ్ వద్ద వాటిని పొందుతారు. నిస్సందేహంగా అల్లాహ్ మీ కార్యకలాపాలన్నింటినీ గమనిస్తూనే ఉన్నాడు.[123]

وَقَالُوا لَن يَدْخُلَ الْجَنَّةَ إِلَّا مَن كَانَ هُودًا
أَوْ نَصَارَىٰ تِلْكَ أَمَانِيُّهُمْ قُلْ هَاتُوا بُرْهَانَكُمْ
إِن كُنتُمْ صَادِقِينَ ﴿١١١﴾

**111** “యూదులు, క్రైస్తవులు తప్ప వేరెవరూ స్వర్గంలో ప్రవేశించ లేర”ని వారంటున్నారు. ఇవి వారి ఆశలు, ఆకాంక్షలు మాత్రమే. “మీరు మీ వాదనలో సత్యవంతులే అయితే ఆ మేరకు ఏదన్నా నిదర్శనం సమర్పించండి” అని వారిని అడుగు.[124]

بَلَىٰ مَنْ أَسْلَمَ وَجْهَهُ لِلَّهِ وَهُوَ مُحْسِنٌ فَلَهُ أَجْرُهُ
عِندَ رَبِّهِ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿١١٢﴾

**112** ఔను మరి! ఎవడైతే ఆచరణలో అత్యుత్తమ రీతిని అవలం బించి తనను తాను అల్లాహ్ సన్నిధిలో సమర్పించుకుంటాడో,[125] అతనికి తన ప్రభువు వద్ద ప్రతిఫలం ఉంది. అలాంటి వారికి ఎలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండవు.

123. యూదుల హృదయాలలో తిష్ఠవేసి వున్న అసూయాద్వేషాల మూలంగా వాళ్ళు ఇస్లాంను, అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించేందుకు నిరాకరించారు. తాము దారి తప్పినది గాక, ముస్లింలను సయితం పెడత్రోవ పట్టించజూశారు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిముల కర్తవ్యం ఏమిటో తెలుపటం జరిగింది. ఇలాంటి పరీక్షా సమయంలో వారు అల్లాహ్ వైపుకే మరలాలి. నమాజును స్థాపించాలి, దానధర్మాలు చేస్తూ ఉండాలి. సహనం, సంయమనాన్ని పాటించాలి. దుర్మార్గుల దుశ్చేష్టలను పట్టించుకోకుండా, వారి పట్ల మన్నింపుల వైఖరినే అవలంబించాలి. తద్వారా దైవసహాయం మీకు అందుతుంది.

124. ఇక్కడ గ్రంథవహుల గర్వాతిశయం, ఆత్మ ఆధిక్యతా భావం మరోసారి ప్రస్తావించబడింది. ఇవి కేవలం వారి భ్రమలు మాత్రమేననీ, వాటి వెనుక ఎలాంటి ఆధారమూ లేదని అల్లాహ్ స్పష్టం చేశాడు.

125. **“అస్లమ వజ్‌హహు లిల్లాహి”** – అంటే కేవలం అల్లాహ్ ప్రసన్నతను చూరగొనే లక్ష్యంతో పనిచేసేవారు అని భావం. “వహువ ముహ్సినున్” – అంటే చిత్తశుద్ధితో, అంతిమ దైవప్రవక్త (సఅసం) సంప్రదాయానికనుగుణంగా ఆచరించేవాడు అని మతలబు. సదాచరణ దైవసమక్షంలో స్వీకారయోగ్యమవడానికి ఈ రెండు సూత్రాలను దృష్టిలో పెట్టుకోవటం అవసరం. ఈ రెండు సూత్రాల ప్రాతిపదికపై చేసిన మంచిపనుల ఆధారంగానే పరలోక సాఫల్యం, మోక్షం ప్రాప్తిస్తాయి. అంతేగాని ఉత్త ఆశలు, ఆకాంక్షల వల్ల ఒరిగేదేమీ ఉండదు.

**113** క్రైస్తవులు సత్యంపై లేరని యూదులు అంటున్నారు.[126] యూదులు సత్యంపై లేరని క్రైస్తవులంటున్నారు. మరి చూడబోతే వారంతా గ్రంథాన్ని చదువుతున్నారు. జ్ఞానం లేనివాళ్ళు కూడా ఇలాంటి మాటే అంటున్నారు.[127] కనుక అల్లాహ్ ప్రళయ దినాన వీళ్ళ భేదాభిప్రాయం గురించి వీళ్ళ మధ్య తీర్పు చేస్తాడు.

وَقَالَتِ الْيَهُوْدُ لَيْسَتِ النَّصٰرٰى عَلٰى شَيْءٍ ۖ وَّقَالَتِ النَّصٰرٰى لَيْسَتِ الْيَهُوْدُ عَلٰى شَيْءٍ ۙ وَّهُمْ يَتْلُوْنَ الْكِتٰبَ ؕ كَذٰلِكَ قَالَ الَّذِيْنَ لَا يَعْلَمُوْنَ مِثْلَ قَوْلِهِمْ ۚ فَاللّٰهُ يَحْكُمُ بَيْنَهُمْ يَوْمَ الْقِيٰمَةِ فِيْمَا كَانُوْا فِيْهِ يَخْتَلِفُوْنَ ﴿113﴾

**114** అల్లాహ్ మస్జిదులలో, ఆయన నామస్మరణను అడ్డుకుని,[128] వాటిని పాడుచేయడానికి ప్రయత్నించే[129] వానికంటే పరమ దుర్మార్గుడు ఎవడుంటాడు? అటువంటివారు వాటిలో ప్రవేశించినా భయపడుతూనే ప్రవేశించాలి సుమా![130] వారికి ప్రపంచంలోనూ పరాభవం తప్పదు, పరలోకంలో కూడా మహా ఘోర శిక్ష తప్పదు.

وَمَنْ اَظْلَمُ مِمَّنْ مَّنَعَ مَسٰجِدَ اللّٰهِ اَنْ يُّذْكَرَ فِيْهَا اسْمُهٗ وَسَعٰى فِيْ خَرَابِهَا ؕ اُولٰٓئِكَ مَا كَانَ لَهُمْ اَنْ يَّدْخُلُوْهَا اِلَّا خَآئِفِيْنَ ؕ لَهُمْ فِي الدُّنْيَا خِزْيٌ وَّلَهُمْ فِي الْاٰخِرَةِ عَذَابٌ عَظِيْمٌ ﴿114﴾

---

126. యూదులు తౌరాతు గ్రంథం చదువుతారు. అందులో మూసా (అలైహిస్సలాం)గారు, ఈసా (అలైహిస్సలాం) రాకను గురించి ధృవీకరించి ఉన్నారు. కాని యూదులు మాత్రం ఈ విషయం తెలిసి కూడా ప్రవక్తగా ఈసా (అలైహిస్సలాం)ను తిరస్కరించేవారు.

    ఇక క్రైస్తవుల వద్ద ఇంజీలు గ్రంథం ఉంది. అందులో మూసా (అలైహిస్సలాం) మరియు తౌరాతు గ్రంథాల ధృవీకరణ ఉంది. అయినప్పటికీ క్రైస్తవులు యూదుల వద్ద ఏమీ లేదని చెబుతున్నారు. ఈ పరస్పర వాగ్యుద్ధానికి కారణమేమిటంటే, ఇరువర్గాల వారు ఒండొకరి యెడల సదభిప్రాయం కలిగిలేరు. పైగా ఒకరింకొకరి పట్ల వైరభావం కలిగి ఉన్నారు. ఒకరంటే ఇంకొకరికి అసూయ కూడా ఉంది. దానికి తోడు వారు ఊహాలోకాల్లో విహరిస్తున్నారు.

127. గ్రంథవహులకు (యూదులు, క్రైస్తవులకు) ప్రతిగా అరేబియా ముష్రిక్కులు నిరక్షరాస్యులు (ఉమ్మీలు). విద్యాగంథం సోకనివారు. అందుకనే వారిని జ్ఞానం లేనివాళ్ళుగా వ్యవహరించటం జరిగింది. అయినాసరే వారు – ముష్రిక్కులై ఉండి కూడా – గ్రంథవహుల మాదిరిగానే బీరాలు పోయేవారు. తామే సత్యమార్గంపై ఉన్నామని తలపోసేవారు. అంతటితో ఆగక మహాప్రవక్త ముహమ్మద్ (స) వారిని 'సాబియీ' (మతధర్మం లేనివాడు) గా పిలిచేవారు.

128. ఇంతకీ మస్జిదులలో దైవనామస్మరణ జరగకుండా అడ్డగించిన వారెవరు? దీనిపై ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు రెండు రకాల అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఒక అభిప్రాయం ప్రకారం క్రైస్తవులు రోము చక్రవర్తితో కుమ్మక్కై బైతుల్ మఖ్దిస్‌లో యూదులను ఆరాధన చేయకుండా ఆపారు. తత్సంబంధమైన కుట్రలో వారు పాలుపంచుకున్నారు. ఇబ్నె జరీర్ తబ్రీ కూడా ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. అయితే హాఫిజ్ ఇబ్నె కసీర్ ఈ అభిప్రాయంతో విభేదించి, మక్కాకు చెందిన బహుదైవారాధకులు ఈ కృత్యానికి పాల్పడ్డారని అన్నారు. వారు రెండు విధాలుగా ఈ పనిచేశారు. ఒకటి : అంతిమ దైవప్రవక్త (సఅసం)ను, ఆయన సహచరుల (రజి)ను మక్కా నగరం వదలివెళ్ళేలా పరిస్థితుల్ని సృష్టించారు. ఈ విధంగా ముస్లింలను కాబా గృహంలో ఆరాధన చేయకుండా ఆపారు. రెండు : హుదైబియా ఒప్పందం సందర్భంగా కూడా వారు ఇటువంటి పాత్రనే పోషించారు. మా పితామహులను, కొడుకులను సంహరించిన వారిని మేము మక్కా లోపల అడుగుపెట్టనిచ్చేది లేదని తెగేసి చెప్పారు. మరి చూడబోతే కాబా గృహ సందర్శన కోసం వచ్చే వారిని అడ్డుకోవటం మంచి సంప్రదాయం కానేకాదు.

129. ఆరాధనా గృహాన్ని నేలమట్టం చేయటం, కట్టడానికి నష్టం చేకూర్చటం మాత్రమే విచ్ఛిన్నకరమైన పనికాదు, ఆరాధన నుండి, దైవనామ స్మరణ నుండి ఆపటం, షరీయత్ ఆదేశాలను పాటించకుండా నిరోధించటం, మస్జిదుల్లో తిష్ఠవేసిన ముష్రిక్కు పోకడలను సమూలంగా తుడిచిపెట్టడానికి నడుం బిగించినవారిని అడ్డగించటం – ఇత్యాదివన్నీ విచ్ఛిన్న కరమయిన పనులుగా, విధ్వంసకర చేష్టలుగానే పరిగణించబడతాయి.

وَلِلّٰهِ الْمَشْرِقُ وَالْمَغْرِبُ ۚ فَأَيْنَمَا تُوَلُّوْا فَثَمَّ وَجْهُ اللّٰهِ ۗ إِنَّ اللّٰهَ وَاسِعٌ عَلِيْمٌ ﴿١١٥﴾

**115** తూర్పుపడమరలకు అధిపతి అల్లాహ్‌యే. మీరు మీ ముఖాన్ని ఏ వైపుకు త్రిప్పినా, అటు అల్లాహ్ సమ్ముఖం లభిస్తుంది.[131] నిస్సందేహంగా అల్లాహ్ విస్తృతి కలవాడు, సర్వమూ తెలిసినవాడు.

وَقَالُوا اتَّخَذَ اللّٰهُ وَلَدًا ۙ سُبْحٰنَهٗ ۗ بَلْ لَّهٗ مَا فِي السَّمٰوٰتِ وَالْأَرْضِ ۗ كُلٌّ لَّهٗ قٰنِتُوْنَ ﴿١١٦﴾

**116** అల్లాహ్‌కు సంతానం కలదని వీళ్ళు అంటున్నారు. (ఇలాంటి మాటలకు) ఆయన అతీతుడు, పవిత్రుడు. పైగా భూమ్యాకాశాలలో వున్న సమస్తమూ ఆయనదే. అవన్నీ ఆయన (ఆజ్ఞల)కు తల ఒగ్గి ఉన్నాయి.

بَدِيْعُ السَّمٰوٰتِ وَالْأَرْضِ ۗ وَإِذَا قَضٰى أَمْرًا فَإِنَّمَا يَقُوْلُ لَهٗ كُنْ فَيَكُوْنُ ﴿١١٧﴾

**117** భూమ్యాకాశాలను ప్రప్రథమంగా సృష్టించినవాడు ఆయనే. ఆయన ఏ పనినైనా చేయ సంకల్పించుకున్నప్పుడు దాన్ని 'అయిపో' అని అంటే చాలు, అది అయిపోతుంది.[132]

130. ఇది ముస్లిములకు శుభవార్త అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అతి త్వరలో ముస్లిములకు విజయం వరిస్తుందనీ, ముష్రిక్కులు కాబా గృహ ప్రాంగణంలో అడుగుపెట్టేటప్పుడు భయాందోళనకు గురవుతారని, ఎందుకంటే ఒకప్పుడు ముస్లింలపై తాము పాల్పడిన అఘాయిత్యాలకు ముస్లిములు ప్రతీకారం తీర్చుకుంటారేమోనన్న అనుమానం వారికి కలుగుతుందని దీని భావం. అనుకున్నట్లే శీఘ్రగతిన ముస్లింలకు ఈ ఆధిక్యత లభించింది.

మరి కొంతమంది దీనిపై వ్యాఖ్యానిస్తూ ఈ అర్థం తీసుకున్నారు: అల్లాహ్ తన కృపతో మీకు గనక విజయం ప్రసాదిస్తే మీరు ఈ ముష్రిక్కులను మక్కా నగరంలో ఉండటానికి కొన్ని షరతులు విధించాలి. వారిపై 'జిజ్‌యా'ను విధించాలి. హిజ్రీ 8వ సంవత్సరంలో మక్కా విజయం చేకూరిన తరువాత మహాప్రవక్త (సఅసం), వచ్చే ఏడాది నుంచి ఏ ముష్రిక్కుకూ హజ్ చేసేందుకు, నగ్నంగా కాబా ప్రదక్షిణ చేసేందుకు అనుమతి ఉండబోదనీ, ప్రతి ఒక్కరూ తాము చేసుకున్న సంధి షరతులకు కట్టుబడి మరీ ఇక్కడ ఉండవలసి ఉంటుందనీ ప్రకటన గావించారు.

131. మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ (ప్రస్థానం) చేసిన తరువాత ముస్లిములు బైతుల్ మఖ్దిస్ వైపుకు అభిముఖమై నమాజ్ చేస్తున్నప్పుడు వారికి దుఃఖం కలిగేది. ఆ సందర్భంగానే ఈ ఆయతు అవతరించింది. మరి కొందరి అభిప్రాయం ప్రకారం : బైతుల్ మఖ్దిస్ వైపు నుంచి మళ్ళీ కాబా దిశ వైపుకు తిరగాలని ఆజ్ఞాపించబడినప్పుడు యూదులు రకరకాల అభ్యంతరాలను లేవనెత్తారు. వాటికి సమాధానంగా ఈ వచనం అవతరించింది. మరికొంతమంది ఇలా అభిప్రాయపడ్డారు : ఈ ఆయతు అవతరించటానికి అసలు కారణమేమంటే, ప్రయాణంలో ఉన్నప్పుడు వాహనంపై కూర్చుని నఫిల్ నమాజులు చేసుకునేందుకు అనుమతి ఉంది. అప్పుడు వాహనం ఏ దిశలో పోతున్నా నమాజ్‌ను చేయవచ్చునని విశదీకరించబడింది. ఒక్కోసారి అనేక కారణాలు కలిసి ఒక ఆయతు అవతరణకు ఆస్కారం కల్పిస్తాయి. అట్టి పరిస్థితిలో ఇలాంటి ఆయతుల అవతరణా నేపథ్యాన్ని విడమరచి చెప్పే ఉల్లేఖనాలు అనేకం మన ముందుకు వస్తాయి. ఒక ఉల్లేఖనంలో ఒక కారణం చెప్పబడితే, మరో ఉల్లేఖనంలో మరో కారణం వివరించబడుతుంది. ఈ ఆయతు కూడా ఆ కోవకు చెందినదే (అహ్సనుత్తఫాసీర్ నుంచి సంగ్రహం).

132. భూమ్యాకాశాల్లో ఉన్న సకల చరాచరాలకు దేవుడు అల్లాహ్‌యే. నిఖిల జగతిలో ఉన్నవన్నీ ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తున్నాయి. అంతేకాదు, ఎలాంటి నమూనా కూడా లేకుండా భూమ్యాకాశాలను పుట్టించినవాడు, సమపాళ్ళలో వాటిని తీర్చిదిద్దినవాడూ ఆయనే. తాను చేయదలచుకున్న ప్రతి పనికోసం ఆయన 'అయిపో' అంటే చాలు, అది అయిపోతుంది. అంతటి అద్భుతం చేసే మహోన్నతునికి సంతానం అవసరం ఏముంది?

**118** జ్ఞానం లేనివాళ్లు, "అల్లాహ్ స్వయంగా మాతో ఎందుకు మాట్లాడడు? లేక మా వద్దకు ఏదైనా సూచన ఎందుకు రాదు?"[133] అని అంటారు. వారి పూర్వీకులు కూడా ఇలాంటి పలుకులే పలికారు. వారందరి హృదయాలు ఒకే విధమైనవి.[134] వాస్తవానికి నమ్మేవారి కోసం మేము మా సూచనలను స్పష్టం చేసే ఉంచాము.

وَقَالَ الَّذِينَ لَا يَعْلَمُونَ لَوْلَا يُكَلِّمُنَا اللَّهُ
أَوْ تَأْتِينَا آيَةٌ ۗ كَذَٰلِكَ قَالَ الَّذِينَ مِن قَبْلِهِم
مِّثْلَ قَوْلِهِمْ ۘ تَشَابَهَتْ قُلُوبُهُمْ ۗ قَدْ بَيَّنَّا الْآيَاتِ
لِقَوْمٍ يُوقِنُونَ ﴿١١٨﴾

**119** (ఓ ప్రవక్తా!) మేము నిన్ను సత్యంతో పాటు శుభవార్తనిచ్చే వానిగా, హెచ్చరించేవానిగా చేసిపంపాము. నరకవాసుల గురించి నిన్ను (నిలదీసి) అడగటం జరగదు.

إِنَّا أَرْسَلْنَاكَ بِالْحَقِّ بَشِيرًا وَنَذِيرًا ۖ وَلَا تُسْأَلُ
عَنْ أَصْحَابِ الْجَحِيمِ ﴿١١٩﴾

**120** (ఓ ముహమ్మద్!) నువ్వు వారి విధానాన్ని అనుసరించ నంతవరకూ[135] యూదులు, క్రైస్తవులు నిన్ను ఇష్టపడరు. అల్లాహ్ చూపిన మార్గమే సరైన మార్గం[136] అని నువ్వు వారికి చెప్పేయి. ఒకవేళ నువ్వు నీ వద్దకు జ్ఞానం వచ్చిన మీదట కూడా వారి కోరికలను అనుసరిస్తే, అల్లాహ్ (పట్టు) నుండి నిన్ను రక్షించే వాడు, సహాయకుడూ ఎవడూ ఉండడు.[137]

وَلَن تَرْضَىٰ عَنكَ الْيَهُودُ وَلَا النَّصَارَىٰ حَتَّىٰ تَتَّبِعَ
مِلَّتَهُمْ ۗ قُلْ إِنَّ هُدَى اللَّهِ هُوَ الْهُدَىٰ ۗ وَلَئِنِ
اتَّبَعْتَ أَهْوَاءَهُم بَعْدَ الَّذِي جَاءَكَ مِنَ
الْعِلْمِ ۙ مَا لَكَ مِنَ اللَّهِ مِن وَلِيٍّ وَلَا نَصِيرٍ ﴿١٢٠﴾

133. వీరు అరేబియాకు చెందిన ముష్రిక్కులు. వీరు కూడా యూదులలాగే డిమాండు చేయసాగారు – అల్లాహ్ నేరుగా మాతో ఎందుకు సంభాషించడు? ఏదైనా స్పష్టమయిన నిదర్శనం మా వద్దకు పంపిస్తే, మేము దాన్ని చూసి విశ్వసించేవాళ్ళం కదా! అనేవారు. (దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు బనీ ఇస్రాయీల్ సూరా 90వ ఆయతు నుంచి 93వ ఆయతు వరకు ఉన్నాయి).

134. అంటే తిరస్కారం, శత్రుత్వం, తలబిరుసుతనంలో అరబ్బు బహుదైవారాధకుల హృదయాలు తమ పూర్వీకుల హృదయాలలాగే కరకుగా మారిపోయినై. తూర్ సూరాలోని 52 – 53 ఆయతుల్లో చెప్పబడినట్లు, వీరికి పూర్వం ఏ ప్రవక్త వచ్చినా అతన్ని జనులు మాంత్రికుడనో, ఉన్మాది అనో అన్నారు. ఏమిటీ, వీరు ఒండొకరికి ఈ మేరకు తాకీదు చేసిపోతున్నారా? కాదు కాదు... అసలు వీళ్ళంతా తలబిరుసులు. అంటే వీళ్ళందరిలోనూ ఇంచుమించుగా ఒకేవిధమైన అహంకార భావం ఉంది. అందుకే సత్య సందేశ ప్రదాతల ముందు వీళ్ళు కొంగ్రొత్త డిమాండ్లు చేస్తూ ఉంటారు. లేదనుకుంటే ప్రవక్తలను ఉన్మాదులుగా అభివర్ణిస్తూ ఉంటారు.

135. అంటే యూదత్వాన్ని లేక క్రైస్తవాన్ని అవలంబించటం అని భావం.

136. అది ఇప్పుడు ఇస్లాం రూపంలో ఉంది. మహాప్రవక్త (సఅసం) పిలుపు ఇచ్చేది దాని వైపునకే – ప్రక్షిప్తాలకు లోనైన యూద, క్రైస్తవ మతాల వైపుకు కాదు.

137. ఇందులో హెచ్చరిక ఉంది. జ్ఞానం లభించిన మీదట కూడా (ఓ ముహమ్మద్!) ఒకవేళ నీవు గనక వారిని సంతోషపరచటానికి, వారిలోని మార్గవిహీనుల పద్ధతులను గనక అవలంబించినట్లయితే నీకు సహాయపడే వాడెవడూ ఉండడు. ఇందులో ముహమ్మద్ (స) ద్వారా ఆయన అనుచర సమాజాన్ని హెచ్చరించటం జరుగుతున్నది. అదేమంటే వారు కూడా ధర్మంలో సరికొత్త పోకడలు పోయేవారిని, మార్గభ్రష్టులను సంతోషపెట్టే ఉద్దేశంతో ధర్మావలంబనలో ఎలాంటి మెతక వైఖరికి, వక్రభాష్యాలకు తావు కల్పించరాదు.

121 మేము ఎవరికి గ్రంథం వొసగామో వారు[138] దానిని పారాయణం చేయవలసిన రీతిలో పారాయణం చేస్తారు.[139] (అంతేకాదు,) వారు ఈ గ్రంథాన్ని విశ్వసిస్తారు. ఇక, దీనిపట్ల తిరస్కార వైఖరిని అవలంబించినవారే నష్టపోయేది.[140]

الَّذِينَ آتَيْنَاهُمُ الْكِتَابَ يَتْلُونَهُ حَقَّ تِلَاوَتِهِ أُولَٰئِكَ يُؤْمِنُونَ بِهِ ۗ وَمَن يَكْفُرْ بِهِ فَأُولَٰئِكَ هُمُ الْخَاسِرُونَ ﴿١٢١﴾

122 ఓ (యాఖూబు) ఇస్రాయీలు సంతతివారలారా! నేను మీపై కురిపించిన వరాలను జ్ఞప్తికి తెచ్చుకోండి. నేను మీకు సమస్త లోకాలపై (అలనాటి అన్ని జాతులపై, సమాజాలపై) శ్రేష్ఠతను వొసగాను.

يَا بَنِي إِسْرَائِيلَ اذْكُرُوا نِعْمَتِيَ الَّتِي أَنْعَمْتُ عَلَيْكُمْ وَأَنِّي فَضَّلْتُكُمْ عَلَى الْعَالَمِينَ ﴿١٢٢﴾

123 ఎవరూ ఎవరికీ ఏ విధంగానూ తోడ్పడలేని, ఎవరి నుంచీ పరిహారం కూడా స్వీకరించబడని, ఏ సిఫారసూ ఎవరికీ ప్రయోజనకరం కాజాలని, ఎవరికీ సహాయం కూడా చేయజాలని ఆ దినానికి భయపడండి.

وَاتَّقُوا يَوْمًا لَّا تَجْزِي نَفْسٌ عَن نَّفْسٍ شَيْئًا وَلَا يُقْبَلُ مِنْهَا عَدْلٌ وَلَا تَنفَعُهَا شَفَاعَةٌ وَلَا هُمْ يُنصَرُونَ ﴿١٢٣﴾

124 (జ్ఞాపకం చేసుకోండి) ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను అతని ప్రభువు అనేక విషయాలలో పరీక్షించగా,[141] అతను అన్నింటిలోనూ (నికార్సుగా) నెగ్గుకు వచ్చాడు. అప్పుడు అల్లాహ్ అతన్ని ఉద్దేశించి, "నేను నిన్ను ప్రజలకు నాయకునిగా చేస్తాను"

وَإِذِ ابْتَلَىٰ إِبْرَاهِيمَ رَبُّهُ بِكَلِمَاتٍ فَأَتَمَّهُنَّ ۖ قَالَ إِنِّي جَاعِلُكَ لِلنَّاسِ إِمَامًا ۖ قَالَ وَمِن ذُرِّيَّتِي ۖ قَالَ

138. గ్రంథవహుల్లోని అవినీతిపరుల దుశ్చేష్టలను, దుర్నీతిని వివరించిన తరువాత సద్వర్తనుల ప్రస్తావన వచ్చింది. ఈ వాక్యంలో ఆ సజ్జనుల గుణగణాలు తెలుపబడటంతోపాటు, వారు విశ్వసించినవారన్న శుభవార్త కూడా యివ్వబడింది. అటువంటి వారిలో అబ్దుల్లాహ్ బిన్ సలాం (రజి) మరియు ఆయన లాంటి ఇతర సహచరులు కూడా ఉన్నారు. వారు ఒకప్పుడు యూదులుగా ఉండేవారు. కాని ఇస్లాం సత్యామృతాన్ని ఆస్వాదించే భాగ్యం వారికి లభించింది.

139. **"పఠించవలసిన విధంగా పఠిస్తారు"** అన్న వాక్యానికి పలు అర్థాలు వివరించబడ్డాయి. (1). బాగా చదువుతారు. శ్రద్ధతో, ఏకాగ్రతతో పారాయణం చేస్తారు. పఠన సందర్భంగా స్వర్గ ప్రస్తావన వస్తే స్వర్గంలో ప్రవేశం కల్పించమని ప్రభువును వేడుకుంటారు. నరక ప్రస్తావన వస్తే దాని బారినుంచి రక్షించమని ప్రార్థిస్తారు. (2). అందులో ధర్మసమ్మతంగా ఖరారు చేయబడిన అంశాలను ధర్మసమ్మతాలుగా విశ్వసిస్తారు. అధర్మం అని స్పష్టం చేయబడిన వాటిని అధర్మంగానే భావిస్తారు. అంతేగాని (యూదుల మాదిరిగా) ప్రక్షిప్తాలకు పాల్పడటంగానీ, తప్పుడు అన్వయింపులు చేయటంగానీ చేయరు. (3). అందులో పొందుపరచబడివున్న విషయాలను గురించి అందరికీ వివరిస్తారు, వాటిని దాచి ఉంచరు. (4). అందులో చేయమని ఆజ్ఞాపించబడిన వాటిని (ముహ్కమాత్‌ను) చేస్తారు, అస్పష్టంగా ఉన్న (ముతషాబిహాత్) విషయాలను విశ్వసిస్తారు, అర్థంకాని విషయాలను గురించి విద్వాంసులను అడిగి తెలుసుకుంటారు. (5). అందలి ఒక్కో విషయాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తారు (ఫత్‌హుల్ ఖదీర్).

పఠించవలసిన రీతిలో పఠిస్తారన్న వాక్యంలో ఇన్ని పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. వీటన్నింటి పట్ల శ్రద్ధాసక్తులు కలిగి ఉన్న వారికే దేవుని మార్గదర్శకత్వం ప్రాప్తిస్తుంది.

140. గ్రంథవహుల్లో దైవప్రవక్త (సఅసం) సందేశాన్ని విశ్వసించనివారు నరకానికి పోతారు (సహీహ్ ముస్లిం).

141. ఇక్కడ **'కలిమాతిన్' (بِكَلِمَاتٍ)** అంటే భావం షరీయత్ ఆదేశాలు, హజ్ క్రియలు, త్యాగం, దైవమార్గంలో వలసపోవటం,

لَا يَنَالُ عَهْدِي الظّٰلِمِيْنَ ﴿124﴾

అన్నాడు. దానికి అతను, "నా సంతానాన్ని కూడానా!" అని అడిగాడు.[142] అప్పుడు అల్లాహ్, "దుర్మార్గులకు నా వాగ్దానం వర్తించదు" అని సమాధానం ఇచ్చాడు.

وَإِذْ جَعَلْنَا الْبَيْتَ مَثَابَةً لِّلنَّاسِ وَأَمْنًا ؕ وَاتَّخِذُوْا مِنْ مَّقَامِ إِبْرٰهٖمَ مُصَلًّى ؕ وَعَهِدْنَآ إِلٰٓى إِبْرٰهٖمَ وَإِسْمٰعِيْلَ أَنْ طَهِّرَا بَيْتِيَ لِلطَّآئِفِيْنَ وَالْعٰكِفِيْنَ وَالرُّكَّعِ السُّجُوْدِ ﴿125﴾

**125** (జ్ఞాపకం చేసుకోండి) మేము ఈ గృహాన్ని (కాబా గృహాన్ని) మానవులందరి పుణ్యక్షేత్రంగానూ, శాంతి నిలయంగానూ చేశాము.[143] మీరు ఇబ్రాహీము నిలబడిన ప్రదేశాన్ని[144] నమాజు స్థలంగా చేసుకోండి. "నా గృహాన్ని (సందర్శించి) ప్రదక్షిణ చేసేవారి కోసం, అక్కడ ఏతెకాఫ్ పాటించేవారి కోసం, రుకూ సజ్దాలు చేసేవారి కోసం మీరు దానిని పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంచాలి" అని ఇబ్రాహీము, ఇస్మాయీలు నుంచి మేము వాగ్దానం తీసుకున్నాము.

---

నమ్రూద్ తరఫున ఎదురైన అగ్ని పరీక్ష – అన్నీ ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు పెట్టబడిన కఠిన పరీక్షలే. ఈ పరీక్షలన్నింటినీ ఆయన సహన స్థైర్యాలతో ఎదుర్కోవటమే గాకుండా, వాటిలో పూర్తిగా నెగ్గారు కూడా. దీనికి ప్రతిఫలంగా ఆయన మానవాళికి నేతగా సన్మానించబడ్డారు. అందుకే ఒక్క ముస్లింలేగాక, యూదులు, క్రైస్తవులు, అరబ్బు ముష్రిక్కులు – అందరూ ఆయన్ని అభిమానిస్తారు, ఆదరిస్తారు. ఆయన్ని తమ పితామహునిగా పరిగణిస్తారు.

142. ఇబ్రాహీం (అలైహి)గారి ఈ కోర్కెను కూడా అల్లాహ్ నెరవేర్చాడు. దివ్య ఖుర్ఆన్‌లోనూ ఆ విషయం ప్రస్తావనకు వచ్చింది: "మేము అతని వంశంలో ప్రవక్త పదవినీ, గ్రంథాన్నీ ఉంచాము"(అన్‌కబూత్–27). ఇబ్రాహీం (అలైహిస్సలాం) తరువాత వచ్చిన ప్రవక్తలు అందరూ ఆయన వంశీయులే. దైవగ్రంథాలు కూడా ఆయన వంశీయులపైనే అవతరింపజేయబడ్డాయి (ఇబ్నె కసీర్). దాంతోపాటు "నా వాగ్దానం దుర్మార్గులకు వర్తించదు" అని అనబడటం గమనార్హం. ఇబ్రాహీం (అలైహిస్సలాం) వ్యక్తిత్వం ఎంతో విశిష్టమైనది, దైవసన్నిధిలో సయితం ఆయనకు గొప్ప అంతస్థులు ప్రాప్తించాయి – అయినప్పటికీ ఇబ్రాహీం సంతతిలోని అసమర్థులను, అవిశ్వాసులను, ముష్రిక్కులను అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు. వారికి రేపు పట్టే దుర్గతిని, దురవస్థను దూరం చేసేవాడు కూడా ఎవడూ ఉండడు. అల్లాహ్ ఇక్కడ కులగోత్రాలను, కుహనా ప్రతిష్ఠలను కూకటి వ్రేళ్ళతో పెకలించేశాడు. విశ్వాసం (ఈమాన్) మరియు సత్కార్యాలు (అమలుస్సాలిహ్) లేకుండా ఎవరూ దేవుని మెప్పును పొందలేరు. ప్రవక్తల పుత్ర రత్నాలయినా, చక్రవర్తుల మానసపుత్రులయినా, పీర్ సాహెబ్బుల ఆశీస్సులు పొందినవారైనా – ఎవరయినాసరే విశ్వసించి, మంచి పనులు చేయటం అనివార్యం. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరి ఆచరణ అయితే అతన్ని వెనుక వదిలేసిందో అతని వంశం అతన్ని ముందుకు తీసుకెళ్ళదు" (సహీహ్ ముస్లిం).

143. కాబా గృహ నిర్మాతలలో ప్రప్రథముడైన ఇబ్రాహీం (అలైహిస్సలాం) ద్వారా అల్లాహ్ కాబా గృహానికి సంబంధించిన రెండు విషయాలను ఇందులో ప్రస్ఫుటం చేశాడు. ఒకటి: 'మానవులందరి పుణ్యక్షేత్రం' అన్నది. దీనికి – మాటిమాటికీ మరలి రావలసిన స్థలం అన్న అర్థం కూడా వస్తుంది. ఒకసారి ఈ కాబా గృహాన్ని సందర్శించిన వ్యక్తి మరోసారి, ఇంకోసారి కూడా అక్కడికి రావాలని ఉవ్విళ్ళూరుతుంటాడు. ఎన్నిసార్లు సందర్శించినా ఆకర్షణ తగ్గదు. రెండు: అదొక శాంతి నిలయం. అక్కడ శత్రుభయం కూడా ఉండదు. అజ్ఞాన కాలంలో సయితం ప్రజలు ఆ పుణ్యక్షేత్రం పరిధిలో శత్రువును సంహరించేవారు కాదు. ఆ పవిత్ర గృహానికి గల ప్రత్యేకతను, గౌరవాన్నీ, ఆనవాయితీని ఇస్లాం అనుయాయులు ఇప్పటి వరకూ కాపాడుకుంటూ వస్తున్నారు. పైగా ఈ విషయమై ఇస్లాం తన అనుయాయులకు మరింత గట్టిగా తాకీదు చేసింది.

144. అరబీలో **'మఖామె ఇబ్రాహీమ్'** అని అనబడింది. మఖామె ఇబ్రాహీం అనేది ఒక రాయి. ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్)

**126** "నా ప్రభూ! నీవు ఈ ప్రదేశాన్ని శాంతి నగరంగా చెయ్యి. ఈ నగరవాసులలో అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసించే వారికి పండ్లు ఫలాలను ఆహారంగా ప్రసాదించు"[145] అని ఇబ్రాహీం అర్థించినప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలికాడు: "విశ్వసించనివారికి కూడా నేను కొంత ప్రయోజనం చేకూర్చు తాను. కాని చివరకు వారిని అగ్నిశిక్ష వైపుకు ఈడుస్తాను. అది అత్యంత చెడ్డ నివాస స్థలం."

وَاِذْ قَالَ اِبْرٰهٖمُ رَبِّ اجْعَلْ هٰذَا بَلَدًا اٰمِنًا
وَّارْزُقْ اَهْلَهٗ مِنَ الثَّمَرٰتِ مَنْ اٰمَنَ مِنْهُمْ
بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ ؕ قَالَ وَمَنْ كَفَرَ فَاُمَتِّعُهٗ
قَلِيْلًا ثُمَّ اَضْطَرُّهٗۤ اِلٰى عَذَابِ النَّارِ ؕ
وَبِئْسَ الْمَصِيْرُ ﴿126﴾

**127** ఇబ్రాహీం (అలైహిస్సలాం), ఇస్మాయీల్ (అలైహిస్సలాం)– ఇద్దరూ (కాబా) గృహ పునాదులను, గోడలను లేపుతూ ఇలా ప్రార్థించేవారు: "మా ప్రభూ! మా సేవను స్వీకరించు. నీవు మాత్రమే సర్వం వినేవాడవు, సర్వం తెలిసినవాడవు."

وَاِذْ يَرْفَعُ اِبْرٰهٖمُ الْقَوَاعِدَ مِنَ الْبَيْتِ وَاِسْمٰعِيْلُ ؕ
رَبَّنَا تَقَبَّلْ مِنَّا ؕ اِنَّكَ اَنْتَ السَّمِيْعُ الْعَلِيْمُ ﴿127﴾

**128** "మా ప్రభూ! మమ్మల్ని నీ విధేయులు (ముస్లింలు)గా చేసుకో. మా సంతతి నుండి కూడా నీ విధేయతకు కట్టుబడి ఉండే ఒక సమూహాన్ని ప్రభవింపజెయ్యి. మాకు మా ఆరాధనా రీతులను నేర్పు. మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా నీవు మాత్రమే పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడవు, అపారంగా కరుణించేవాడవు."

رَبَّنَا وَاجْعَلْنَا مُسْلِمَيْنِ لَكَ وَمِنْ ذُرِّيَّتِنَآ اُمَّةً
مُّسْلِمَةً لَّكَ ۪ وَاَرِنَا مَنَاسِكَنَا وَتُبْ عَلَيْنَا ۚ
اِنَّكَ اَنْتَ التَّوَّابُ الرَّحِيْمُ ﴿128﴾

**129** "మా ప్రభూ! నీ వాక్యాలను వారికి చదివి వినిపించే, గ్రంథజ్ఞానాన్ని నేర్పించే, విజ్ఞతా వివేచనలను[146] విడమరచి చెప్పే, వారిని పరిశుద్ధపరచే[147] ఒక ప్రవక్తను[148] స్వయంగా వారి జాతి నుండే వారిలో ప్రభవింపజెయ్యి. నిస్సందేహంగా నీవు సర్వాధికుడవు, వివేకవంతుడవు."

رَبَّنَا وَابْعَثْ فِيْهِمْ رَسُوْلًا مِّنْهُمْ يَتْلُوْا عَلَيْهِمْ
اٰيٰتِكَ وَيُعَلِّمُهُمُ الْكِتٰبَ وَالْحِكْمَةَ وَيُزَكِّيْهِمْ ؕ
اِنَّكَ اَنْتَ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿129﴾ ع

ఆ రాతిమీదే నిలబడి కాబా గృహాన్ని నిర్మించారు. ఆ రాయిపై ఆయన పాదచిహ్నాలు కూడా ఉన్నాయి. ఇప్పుడా రాయి ఒక అద్దాల కేసులో సురక్షితంగా ఉంచబడింది. హజ్, ఉమ్రాలకు వెళ్ళిన ప్రతి ఒక్కరూ కాబా ప్రదక్షిణ సందర్భంగా దాన్ని చూడవచ్చు. కాబా ప్రదక్షిణ పూర్తయ్యాక ఆ స్థలంలో రెండు రకాతుల నమాజు చేయటం సంప్రదాయం (సున్నత్).

145. ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ ప్రార్థనను అల్లాహ్ ఆమోదించాడు. ఆ నగరం (మక్కా) నేడు శాంతి నగరంగా విరాజిల్లుతోంది. అక్కడ వర్షాలు అంతగా కురవకపోయినప్పటికీ, అది వ్యవసాయానికి అనువైన ప్రదేశం కానప్పటికీ ప్రపంచం నలుమూలల నుంచీ ఆహార ధాన్యాలు, పండ్లు ఫలాలు పుష్కలంగా సమకూరుతున్నాయి. పరిస్థితుల ఈ స్వరూపాన్ని చూసి అందరూ నివ్వెరపోతున్నారు.

146. గ్రంథం అంటే దివ్య ఖుర్ఆన్ అనీ, విజ్ఞత అంటే హదీసు అనీ భావం. దైవ వాక్యాల పారాయణం గురించి చెప్పిన తరువాత గ్రంథజ్ఞానం గురించి, వివేకాన్ని గురించి చెప్పటం విశేషం! స్వతహాగా దివ్య ఖుర్ఆన్ పారాయణం కూడా ఎంతో పుణ్యప్రదమైనదనే విషయాన్ని ఇది సూచిస్తున్నది. ఒకవేళ అందలి దివ్య వచనాల భావార్థం కూడా

**130** శుద్ధ అవివేకి మాత్రమే ఇబ్రాహీం ధర్మం (విధానం) పట్ల విరక్తి చెందుతాడు. మేము అతన్ని ప్రపంచంలోనూ ఎన్ను కున్నాము, పరలోకంలో కూడా అతడు సజ్జనుల సరసన[149] ఉంటాడు.

وَمَنْ يَّرْغَبُ عَنْ مِّلَّةِ اِبْرٰهٖمَ اِلَّا مَنْ سَفِهَ
نَفْسَهٗ ؕ وَلَقَدِ اصْطَفَيْنٰهُ فِي الدُّنْيَا ۚ وَاِنَّهٗ فِي
الْاٰخِرَةِ لَمِنَ الصّٰلِحِيْنَ ﴿130﴾

**131** "(ఆత్మ) సమర్పణ చేసుకో" అని అతని ప్రభువు అతన్ని ఆదేశించినప్పుడల్లా, "సకల లోకాల ప్రభువు సమక్షంలో నన్ను నేను సమర్పించుకున్నాను"[150] అని అతను సమాధానం ఇచ్చాడు.

اِذْ قَالَ لَهٗ رَبُّهٗۤ اَسْلِمْ ۙ قَالَ اَسْلَمْتُ
لِرَبِّ الْعٰلَمِيْنَ ﴿131﴾

**132** ఈ ఉపదేశమే ఇబ్రాహీం మరియు యాఖూబ్ తమ సంతానానికి చేశారు. (వారిలా అన్నారు:) "నా బిడ్డలారా! అల్లాహ్ మీ కోసం ఈ (విధేయతా) ధర్మాన్నే ఇష్టపడ్డాడు. కనుక మీరు ముస్లింలుగా తప్ప మరణించకూడదు సుమా!"[151]

وَوَصّٰى بِهَاۤ اِبْرٰهٖمُ بَنِيْهِ وَيَعْقُوْبُ ؕ يٰبَنِيَّ اِنَّ
اللّٰهَ اصْطَفٰى لَكُمُ الدِّيْنَ فَلَا تَمُوْتُنَّ اِلَّا وَاَنْتُمْ
مُّسْلِمُوْنَ ﴿132﴾

తెలిస్తే ఇక చెప్పవలసిన పనేలేదు. కాని దైవ వచనాల అర్థం తెలీకపోయినప్పటికీ, చిత్తశుద్ధితో పారాయణం చేసినందుకు పుణ్యం ఎటూపోదు. అందుకే తమకు అర్థం తెలియదు కదా! అంటూ అసలు పారాయణానికే ఉపక్రమించ కుండా ఉండటం సమంజసం కాదు. పైగా వీలైనంత వరకు ఖుర్ఆన్ వచనాలను అర్థం చేసుకుంటూ పారాయణం చేయటానికి కృషిచేయాలి.

147. **'పరిశుద్ధపరచటం'** (تزكية) అంటే తన జాతి ప్రజలను మూఢాచారాల నుంచి, బహుదైవారాధన నుంచి కాపాడటం, నైతికపు రుగ్మతలను నిర్మూలించటం అని భావం. దైవప్రవక్త (సఅసం)కు అప్పగించబడిన నాలుగు విధ్యుక్త ధర్మాలలో ఇది చివరిది.

148. ఇది ఇబ్రాహీం (అలైహిస్సలాం), ఇస్మాయీల్ (అలైహిస్సలాం)ల చివరి ప్రార్థన. దీనికి కూడా అల్లాహ్ ఆమోదముద్ర వేశాడు. ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతతి నుండి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రభవింపజేశాడు. అందుకే ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : నేను నా తండ్రి ఇబ్రాహీం – అలైహిస్సలాం – ప్రార్థనా ఫలాన్ని. ఈసా (అలైహిస్సలాం) ఇచ్చిన శుభవార్తను. నా తల్లిగారి కలల పంటను" (ఫత్హుర్రబ్బానీ – సంపుటి : 20, పేజీ – 181, 189).

149. ఈ ఆయతులో అల్లాహ్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఔన్నత్యాన్ని అందరికీ అవగతం చేస్తున్నాడు. ఇహపరాలలో తాను ఆయనకు ఇచ్చిన గౌరవోన్నతుల్ని గురించి చెప్పటమేగాక, ఆయన విధానం పట్ల వైముఖ్యం ప్రదర్శించటం అజ్ఞానానికి, అవివేకానికి తార్కాణమని తెలియజేస్తున్నాడు.

**గమనిక :** సాధారణంగా **రగిబ** (رَغِبَ) అంటే ఇష్టపడటం, అభిమానించటం అనే అర్థాలు వస్తాయి. కాని 'రగిబ'తో పాటు **అన్** (عَنْ) వస్తే మాత్రం అయిష్టత, నిర్లక్ష్యం అనే అర్థాలు వస్తాయి.

150. మరి ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు అంతటి ఔన్నత్యం ఎందుకు లభించింది? అన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నం కావచ్చు. అసలు విషయం ఏమిటంటే దైవాజ్ఞాపాలనలో ఆయన నిరుపమానమైన విధేయతను చూపారు. ఎన్ని విధాలుగా పరీక్షించినా నెగ్గుకు వచ్చారు.

151. దైవ ప్రవక్తలైన ఇబ్రాహీం, యాఖూబ్‌లు ఇరువురూ తమ సంతానానికి **"అద్దీన్"** (الدِّيْنَ) గురించి వసీయతు చేశారు. ఆ 'అద్దీన్' అనేది ఇస్లాం మాత్రమేగాని యూదమతం కాదు. పై వాక్యాల ద్వారా ఈ విషయమే బోధపడుతున్నది.

**133** ఏమిటీ, యాఖూబ్ మరణ ఘడియల్లో ఉన్నప్పుడు మీరక్కడ ఉన్నారా?[152] ఆ సమయంలో ఆయన తన సంతానాన్నుద్దేశించి, "నా తదనంతరం మీరు దేనిని ఆరాధిస్తారు?" అని అడిగాడు. దానికి వారంతా, "మీ ఆరాధ్య దైవాన్ని, మీ పితామహులగు ఇబ్రాహీం, ఇస్మాయీలు, ఇస్హాఖ్‌ల ఆరాధ్యదైవం అయిన ఏకైక ఆరాధ్యుణ్ణి మాత్రమే ఆరాధిస్తాము, ఆయనకే విధేయులమై ఉంటాము" అని జవాబు ఇచ్చారు.

أَمْ كُنتُمْ شُهَدَاءَ إِذْ حَضَرَ يَعْقُوبَ الْمَوْتُ
إِذْ قَالَ لِبَنِيهِ مَا تَعْبُدُونَ مِن بَعْدِي قَالُوا
نَعْبُدُ إِلَٰهَكَ وَإِلَٰهَ آبَائِكَ إِبْرَاهِيمَ وَإِسْمَاعِيلَ
وَإِسْحَاقَ إِلَٰهًا وَاحِدًا وَنَحْنُ لَهُ مُسْلِمُونَ ﴿١٣٣﴾

**134** అది గతించిన ఒక సమూహం. వారు చేసుకున్నది వారికి చెందుతుంది. మీరు చేసేది మీకు చెందుతుంది. వారి కర్మల గురించి మీరు ప్రశ్నించబడరు.[153]

تِلْكَ أُمَّةٌ قَدْ خَلَتْ لَهَا مَا كَسَبَتْ وَلَكُم مَّا
كَسَبْتُمْ وَلَا تُسْأَلُونَ عَمَّا كَانُوا يَعْمَلُونَ ﴿١٣٤﴾

**135** మీరు యూదులుగానో, క్రైస్తవులుగానో మారిపోతే సన్మార్గం పొందగలరని వారు అంటారు. (ఓ ముహమ్మద్!) మీరు వారికి స్పష్టంగా చెప్పండి: "కాదు, ఇబ్రాహీము ధర్మాన్ని అనుసరించే వారే సన్మార్గంపై ఉన్నారు. ఇబ్రాహీం స్వచ్ఛమైన ఏకదైవారాధకుడు, అతను బహుదైవోపాసకుడు కాదు."[154]

وَقَالُوا كُونُوا هُودًا أَوْ نَصَارَىٰ تَهْتَدُوا قُلْ بَلْ
مِلَّةَ إِبْرَاهِيمَ حَنِيفًا وَمَا كَانَ مِنَ الْمُشْرِكِينَ ﴿١٣٥﴾

---

దివ్య ఖుర్‌ఆన్‌లోని ఇతర చోట్ల కూడా పదే పదే ఈ విషయం పునరావృతం అవుతూ ఉంది. ఉదాహరణకు: "ఇన్నద్దీన ఇన్దల్లాహిల్ ఇస్లాం" (అల్లాహ్ వద్ద ఆమోదయోగ్యమైన ధర్మం ఇస్లాం మాత్రమే) (ఆలి ఇమ్రాన్ : 19).

152. ఇక్కడ యూదులను నిలదీసి అడగటం జరిగింది. మీ పెద్దలగు ఇబ్రాహీం, యాఖూబులు తమ సంతానానికి యూదత్వంపై స్థిరంగా ఉండమని తాకీదు చేసినట్లు మీరు చెబుతున్నారు కదా! ఆ సమయంలో మీరు అక్కడ ఉన్నారా? దానికి వారు 'అవును'ని అంటే అది అన్నిటికన్నా పెద్ద అబద్ధంగా, అపనిందగా భావించబడుతుంది. ఒకవేళ వారు 'లేదు' అని అన్నారనుకోండి, అట్టి పరిస్థితిలో వారు చెబుతున్నది నిజం కాదని అనుకోవాలి. ఎందుకంటే ఆ మహనీయులు తాకీదు చేసింది యూదత్వం గురించో, క్రైస్తవం గురించో, బహు దైవత్వం గురించో కాదు – వారు తాకీదు చేసింది ఇస్లాం గురించి మాత్రమే. ఆ మాటకువస్తే ప్రవక్తలందరి ధర్మం కూడా ఇస్లామే. వారు అందజేసిన షరీయతులో, ఆచరణా విధానంలో పాక్షికంగా తేడాపాడాలున్నప్పటికీ మౌలికంగా వారు ఆచరించి చూపిన జీవన ధర్మం మాత్రం ఒక్కటే – అదే ఇస్లాం! అదే దైవవిధేయతా విధానం!! ఈ విషయాన్నే మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు : "ప్రవక్తల సమూహం సవతి సంతానం వంటిది, వారి తల్లులు వేరు, కాని వారి ధర్మం మాత్రం ఒక్కటే" (సహీహ్ బుఖారీ, కితాబుల్ అంబియా – బాబు వజ్‌కుర్ ఫిల్ కితాబి మర్యమ. . . . ).

153. ఇది కూడా యూదులకే వర్తిస్తుంది. మీ పూర్వీకుల్లోని ప్రవక్తల, మహనీయుల ఘనకార్యాలను చెప్పుకుని మురిసిపోవటం వల్ల ప్రయోజనం ఏమీలేదు. వారు చేసుకున్న పుణ్యకార్యాల పుణ్యఫలం వారికే లభిస్తుంది – మీకు మాత్రం లభించదు. మీకు మాత్రం మీరు సంపాదించుకున్నదే లభిస్తుంది. దీన్నిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే తాతముత్తాతల సత్కర్మలను తలచుకుని, వాటి ఆశ్రయం పొందజూడటం సరైనది కాదు. విశ్వాసం, సత్కార్యాలు – ఇవి రెండూ చాలా ముఖ్యం. వెనుకటి పుణ్యపురుషుల మూలధనం కూడా ఈ రెండు వస్తువులే. ప్రళయదినం వరకూ రాబోయే తరాల మోక్షం కూడా ఈ రెండింటితోనే ముడిపడి ఉంది.

154. యూదులు యూదత్వాన్ని స్వీకరించమనీ, క్రైస్తవులు క్రైస్తవాన్ని పుచ్చుకోమనీ ముస్లింలకు పిలుపు ఇస్తున్నారు.

| | |
|---|---|
| **136** (ముస్లిములారా!) మీరు ఇలా ప్రకటించండి :"మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మాపై అవతరింపజేయబడిన దానినీ, ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్ మరియు వారి సంతతిపై అవతరింపజేయబడిన దానినీ, మూసా, ఈసా ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున వొసగబడిన దానిని కూడా మేము విశ్వసించాము. మేము వారిలో ఎవరి మధ్య కూడా ఎలాంటి విచక్షణ (వివక్ష)ను పాటించము. మేము ఆయనకే విధేయులము."[155] | قُوْلُوْٓا اٰمَنَّا بِاللّٰهِ وَمَآ اُنْزِلَ اِلَيْنَا وَمَآ اُنْزِلَ اِلٰٓى اِبْرٰهٖمَ وَاِسْمٰعِيْلَ وَاِسْحٰقَ وَيَعْقُوْبَ وَالْاَسْبَاطِ وَمَآ اُوْتِيَ مُوْسٰى وَعِيْسٰى وَمَآ اُوْتِيَ النَّبِيُّوْنَ مِنْ رَّبِّهِمْ ۚ لَا نُفَرِّقُ بَيْنَ اَحَدٍ مِّنْهُمْ ۖ وَنَحْنُ لَهٗ مُسْلِمُوْنَ ﴿١٣٦﴾ |
| **137** ఒకవేళ వారు మీరు విశ్వసించినట్లే విశ్వసిస్తే, సన్మార్గం పొందగలరు. విముఖత గనక చూపితే వారు వైరభావానికి లోనైఉన్నారన్నది సుస్పష్టం. వారి బారి నుండి (రక్షించటానికి) నీకు అల్లాహ్ చాలు.[156] ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు. | فَاِنْ اٰمَنُوْا بِمِثْلِ مَآ اٰمَنْتُمْ بِهٖ فَقَدِ اهْتَدَوْا ۚ وَاِنْ تَوَلَّوْا فَاِنَّمَا هُمْ فِيْ شِقَاقٍ ۚ فَسَيَكْفِيْكَهُمُ اللّٰهُ ۚ وَهُوَ السَّمِيْعُ الْعَلِيْمُ ﴿١٣٧﴾ |

సన్మార్గం తమ తమ మతాలలోనే ఉందని వారంటున్నారు. అయితే సన్మార్గం ఇబ్రాహీం విధానాన్ని అనుసరించిన వారికే లభిస్తుందనీ, ఇబ్రాహీం ఏమాత్రం కల్తీలేని ఏక దైవారాధకుడనీ గ్రంథవహులకు స్పష్టం చేయబడింది. ఇబ్రాహీం బహుదైవోపాసకుడు కాడు. కాని యూదత్వంలో, క్రైస్తవంలో షిర్క్ (బహు దైవారాధన) సమ్మిళితం అయి ఉంది.

**హెచ్చరిక :** ఇప్పుడు ముస్లిములలో సయితం షిర్క్ ధోరణులు పొడసూపుతున్నాయి. ఇస్లాం ప్రబోధనలన్నీ ఖుర్‌ఆన్ హదీసులలో సురక్షితంగా ఉన్నప్పటికీ, దేవుని ఏకత్వపు భావన వాటిలో అత్యంత స్పష్టంగా విశదీకరించబడినప్పటికీ, యూదత్వం, క్రైస్తవం ఇంకా బహుదైవత్వ మతాలకంటే ఇస్లాం ఎంతో విలక్షణమైన జీవన ధర్మం అని ఖుర్‌ఆన్ హదీసులు చెబుతున్నప్పటికీ ముస్లింలలోని ఓ పెద్ద వర్గంవారి విశ్వాసాలలో, ఆచరణలలో పెచ్చరిల్లిన ముదనష్టపు ముష్రిక్కు భావాలు ప్రపంచం దృష్టిలో ఇస్లాంకుగల వైశిష్ట్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఎందుకంటే అన్య మతాలవారు అందరూ నేరుగా ఖుర్‌ఆన్ హదీసులను తరచి చూసి 'ఇస్లాం అంటే ఇది' అన్న నిర్ణయానికి రాలేరు. వారు మాత్రం ఒక్క చూపులో ముస్లింల ఆచరణలను చూసి 'ఓహో! ఇస్లాం ధర్మం బోధించేది ఇదేనేమో!' అనుకుంటారు. రానున్న ఆయతులో 'ఈమాన్' (విశ్వాస) ప్రామాణికత వివరించబడింది.

155. ఈమాన్ అంటే – ప్రవక్తలందరిపై అల్లాహ్ తరఫున అవతరింపజేయబడిన దానినీ, లేక వారికి వొసగబడిన దానినీ విశ్వసించాలి. ఏ ఒక్క దైవప్రవక్తనుగానీ, దైవగ్రంథాన్ని గానీ తిరస్కరించకూడదు. ఏదో ఒక గ్రంథాన్నీ, ఎవరో ఒక ప్రవక్తను విశ్వసించటం, మిగిలిన గ్రంథాలను లేక ప్రవక్తలను విశ్వసించ నిరాకరించటం అంటే ప్రవక్తల మధ్య భేదాన్ని పాటించటమే. ఈ భేదభావాన్ని ఇస్లాం సమ్మతించదు. కాకపోతే ఇప్పుడు ఆచరించవలసింది ఖుర్‌ఆన్ ప్రకారమే. వెనుకటి గ్రంథాలలో వున్న విషయాలను అవలంబించకూడదు. ఎందుకంటే ఇప్పుడవి అసలు సిసలు స్థితిలో లేవు. అవి మార్పులు చేర్పులకు లోనయ్యాయి. దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన తరువాత వాటిలోని ఆదేశాలు, ఉపదేశాలన్నీ వాటంతట అవే రద్దయిపోతాయి.

156. ప్రవక్త ప్రియ సహచరులు (రజి) కూడా ఇందులో పేర్కొనబడిన విధంగానే విశ్వసించారు. అందుచేతనే ప్రియసహచరుల ఉదాహరణను ఇస్తూ, (ప్రవక్త సహచరులారా!) ఒకవేళ వారు కూడా మీరు విశ్వసించినట్లే విశ్వసిస్తే ముమ్మాటికీ వారు సన్మార్గాన ఉంటారు. మంకుతనంతో ముఖం త్రిప్పుకుంటే, మీరు ఏమాత్రం ఆందోళన చెందవలసిన పనిలేదు. వారి కుట్రలు, కుయుక్తులు మిమ్మల్ని ఏమీ చేయలేవు. ఎందుకంటే అల్లాహ్ మీకు అండగా ఉన్నాడు. అదే

صِبْغَةَ اللّٰهِ ۚ وَمَنْ اَحْسَنُ مِنَ اللّٰهِ صِبْغَةً ۫
وَّنَحْنُ لَهٗ عٰبِدُوْنَ ﴿138﴾

**138** అల్లాహ్ రంగును స్వీకరించండి. అల్లాహ్ రంగుకన్నా మంచి రంగు ఎవరిది కాగలదు?[157] మేము మాత్రం ఆయన్నే ఆరాధిస్తాము.

قُلْ اَتُحَآجُّوْنَنَا فِى اللّٰهِ وَهُوَ رَبُّنَا وَرَبُّكُمْ ۚ وَلَنَآ
اَعْمَالُنَا وَلَكُمْ اَعْمَالُكُمْ ۚ وَنَحْنُ لَهٗ
مُخْلِصُوْنَ ۙ ﴿139﴾

**139** వారితో చెప్పు : "ఏమిటీ, మాకూ ప్రభువు, మీకూ ప్రభువు అయిన అల్లాహ్ విషయంలో మీరు మాతో వాదులాడుతారా? మా ఆచరణలు మాకు, మీ ఆచరణలు మీకు. మేము ఆయనకే అంకితం అయ్యాము.[158]

اَمْ تَقُوْلُوْنَ اِنَّ اِبْرٰهٖمَ وَاِسْمٰعِيْلَ وَاِسْحٰقَ
وَيَعْقُوْبَ وَالْاَسْبَاطَ كَانُوْا هُوْدًا اَوْ نَصٰرٰى ؕ
قُلْ ءَاَنْتُمْ اَعْلَمُ اَمِ اللّٰهُ ؕ وَمَنْ اَظْلَمُ مِمَّنْ
كَتَمَ شَهَادَةً عِنْدَهٗ مِنَ اللّٰهِ ؕ وَمَا اللّٰهُ بِغَافِلٍ
عَمَّا تَعْمَلُوْنَ ﴿140﴾

**140** "ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్హాఖు, యాకూబు మరియు వారి సంతానం యూదులుగానో, క్రైస్తవులుగానో ఉన్నారని మీరు అంటున్నారా? ఏమిటీ, మీకు ఎక్కువ తెలుసా లేక అల్లాహ్‌కు ఎక్కువ తెలుసా?"[159] అని వారిని అడుగు. అల్లాహ్ అప్పగించిన సాక్ష్యాన్ని దాచిపెట్టే వానికన్నా ఎక్కువ అన్యాయస్థుడు ఎవడు కాగలడు? మీ చేష్టల పట్ల అల్లాహ్ అజాగ్రత్తగా లేడు.[160]

---

జరిగింది కూడా. కొన్నేండ్లలోనే ఈ వాగ్దానం నెరవేరింది. బనూ ఖైనుఖా, బనూ నజీర్ (మదీనా) నగరం నుంచి బహిష్కరించబడ్డారు. బనూ ఖురైజ వధించబడ్డారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతి నొందినప్పుడు ఒక పలక ఆయన ఒడిలో ఉండటం కనిపించిందనీ, దానిపై ఈ ఆయతులోని **"ఫ సయక్ఫీకహుముల్లాహ్"** అని రాసివున్న చోటే ఆయనగారి రక్తపు బిందువులు కారిపడినట్లు చారిత్రక ఉల్లేఖనాల ఆధారంగా తెలుస్తున్నది. ఆ ఖుర్ఆన్ ప్రతి (ముస్హఫ్) నేటికీ టర్కి దేశంలో ఉన్నదని చెబుతారు.

157. క్రైస్తవులు పసుపు పచ్చని రంగుగల నీరును ప్రత్యేకించుకున్నారు. దాన్ని వారు క్రైస్తవ పిల్లలకు ఇస్తారు. క్రైస్తవం (బాప్తిస్మం) పుచ్చుకోదలచిన వారందరికీ అది ఇవ్వబడుతుంది. దీన్నే వారు 'బాప్తిస్మం' పుచ్చుకోవటం అని అంటారు. ఈ ఆచారం వారి దృష్టిలో చాలా ముఖ్యమైనది. బాప్తిస్మం పుచ్చుకోనివారిని వారు పరిశుద్ధులుగా భావించరు. అల్లాహ్ వారి ఈ పోకడను ఖండిస్తూ, అసలు రంగు అల్లాహ్‌దేనని, అల్లాహ్ రంగును మించినది వేరొకటి లేదని చెప్పాడు. అల్లాహ్ రంగు అంటే భావం సహజ ధర్మం. సహజ ధర్మం ఇస్లాం మాత్రమే. ప్రవక్తలందరూ తమ తమ కాలాల్లో, తమ జాతి ప్రజలను ఈ ధర్మం వైపునకే పిలిచారు – అంటే దేవుని ఏకత్వం వైపుకు మానవాళిని ఆహ్వానించారు.

158. ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధించేవారం మేము. ఆయన కోసమే మేము మా దాస్యాన్ని ప్రత్యేకించుకున్నాము. ఆయన చేయమన్న వాటిని చేస్తున్నాము. చేయరాదన్న వాటి జోలికి పోకుండా ఉంటున్నాము. మీరు అందుకోసం మాతో తగవులాటకు దిగుతున్నారా? వాస్తవానికి ఆయన మాకూ ప్రభువే, మీకూ ప్రభువే. మేము మా ప్రభువు విషయంలో ఏం చేస్తున్నామో మీరూ అదే చేయాలి. మీరు గనక అలా చేయకపోతే దాని పర్యవసానం మీరే అనుభవిస్తారు. దానికి మేం బాధ్యులం కాము. మేము మాత్రం మా ప్రభువు కొరకే చిత్తశుద్ధితో ఆచరణ చేస్తాము.

159. దైవప్రవక్తలు, వారి పుత్రులు యూదులుగానో, క్రైస్తవులుగానో ఉన్నారని మీరు చెబుతున్నారు – అల్లాహ్ ఈ విషయాన్ని త్రోసిపుచ్చాడు. ఇప్పుడు మీరే చెప్పండి? మీకు ఎక్కువ తెలుసా? లేక అల్లాహ్‌కా?

160. దైవప్రవక్తలు యూదులుగానీ, క్రైస్తవులుగానీ కారన్న సంగతి స్వయంగా మీకూ తెలుసు. అలాగే మీ గ్రంథాలలో

**141** అది గతించిన ఓ సమాజం. వారు చేసుకున్నది వారికి చెందుతుంది. మీరు చేసుకున్నది మీకు లభిస్తుంది. వారి కర్మల గురించి మీరు ప్రశ్నించబడరు.[161]

تِلْكَ أُمَّةٌ قَدْ خَلَتْ ۖ لَهَا مَا كَسَبَتْ
وَلَكُم مَّا كَسَبْتُمْ ۖ وَلَا تُسْأَلُونَ عَمَّا كَانُوا
يَعْمَلُونَ ﴿١٤١﴾

**142** “వీరు ఏ ఖిబ్లా వైపుకు అభిముఖులయ్యేవారో దాన్నుంచి మరలటానికి కారణం ఏమిటి?” అని మూర్ఖజనులు అంటారు. (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: తూర్పు పడమరలు (అన్నీ) అల్లాహ్‌వే. తాను తలచిన వారికి ఆయన రుజుమార్గం చూపుతాడు.[162]

سَيَقُولُ السُّفَهَاءُ مِنَ النَّاسِ مَا وَلَّاهُمْ عَن
قِبْلَتِهِمُ الَّتِي كَانُوا عَلَيْهَا ۚ قُل لِّلَّهِ الْمَشْرِقُ وَ
الْمَغْرِبُ ۚ يَهْدِي مَن يَشَاءُ إِلَىٰ صِرَاطٍ مُّسْتَقِيمٍ ﴿١٤٢﴾

**143** అదేవిధంగా మేము మిమ్మల్ని ఒక “న్యాయశీల సమాజం” (ఉమ్మతె వసత్)[163]గా చేశాము – మీరు ప్రజలపై సాక్షులుగా, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మీపై సాక్షిగా ఉండటం కోసం (మేమిలా చేశాము.) ప్రవక్తకు విధేయత చూపటంలో

وَكَذَٰلِكَ جَعَلْنَاكُمْ أُمَّةً وَسَطًا لِّتَكُونُوا شُهَدَاءَ عَلَى
النَّاسِ وَيَكُونَ الرَّسُولُ عَلَيْكُمْ شَهِيدًا ۗ وَمَا جَعَلْنَا
الْقِبْلَةَ الَّتِي كُنتَ عَلَيْهَا إِلَّا لِنَعْلَمَ مَن يَتَّبِعُ

అంతిమ దైవప్రవక్త (స) రాకకు సంబంధించిన సూచనలు కూడా ఉన్నాయి. కాని మీరు ఈ సాక్ష్యాలను కప్పిపుచ్చి మహాపరాధానికి ఒడిగడుతున్నారు. ఆ సంగతి అల్లాహ్‌కు తెలీదని మాత్రం అనుకోకండి.

161. ఈ ఆయతులో మరోసారి మనిషి చేయవలసిన ‘ఆచరణ’ గురించి నొక్కి చెప్పబడింది. స్వయంగా ఏమీ చేయకుండా పూర్వీకుల్లోని పుణ్య పురుషుల ‘ఆసరా’ ద్వారా గట్టెక్కవచ్చని అనుకుంటే ఒరిగేది ఏమీ ఉండదని జాగరూకపరచటం జరిగింది. ఎందుకంటే దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు : ఎవరినయితే అతని ఆచరణ వెనుక వదలిపెట్టిందో, అతన్ని అతని వంశం ముందుకు తీసుకొనిపోజాలదు (సహీహ్ ముస్లిం). మీ పూర్వీకులు ఏదన్నా పుణ్యం చేసుకుని ఉంటే అది వారికి ఉపయోగపడుతుంది. వారి కర్మల గురించి మిమ్మల్ని నిలదీయటం జరగదు. అలాగే వారి పుణ్యకార్యాలు మీ ఖాతాలో జమ చెయ్యబడవు. దివ్య ఖుర్‌ఆన్‌లో చెప్పబడినట్లు “బరువు మోసేవాడెవ్వడూ మరొకరి బరువును మోయడు” (ఫాతిర్ – 18). “మానవుడు దేని కోసం పరిశ్రమిస్తాడో అది తప్ప మరొకటేదీ అతనికి ప్రాప్తించదు” (అన్ నజ్మ్ – 39).

162. మహాప్రవక్త (సఅసం) మక్కా నుండి మదీనాకు వలసపోయిన తరువాత సుమారు 16, 17 మాసాల వరకూ ‘బైతుల్ మఖ్దిస్’ వైపుకు తిరిగి నమాజు చేసేవారు. అయితే ఇబ్రాహీం గారి ఖిబ్లా అయిన కాబాగృహం వైపుకు తిరిగి నమాజు చేయాలన్న కోరిక ఆయన (స) మనసులో ఉండేది. అందుకోసం ఆయన (స) పలుసార్లు ప్రార్థించారు. కొన్నిసార్లు ఆకాశం వైపు కూడా ఆశగా చూశారు. ఎట్టకేలకు అల్లాహ్ ఖిబ్లా మార్పుకు సంబంధించిన ఆదేశాన్ని ఇచ్చాడు. దీనిపై యూదులు, కపటులు పెద్ద రాద్ధాంతమే చేశారు. వాస్తవానికి నమాజు అనేది ఒక ఆరాధన. ఆరాధన చేసే వానికి ఆరాధ్య దైవం నుంచి ఏ సూచన అందిందో దాని ప్రకారమే ఆరాధించవలసి ఉంటుంది. కాబట్టి అల్లాహ్ ఏ దిక్కుకు తిరగమంటే ఆ వైపుకు తిరగటం దాసుల విధి. అదీగాక వారు ఆరాధించే దైవం సకల లోకాల ప్రభువు. తూర్పు పడమరలన్నీ ఆయనవే. కాబట్టి ఏ వైపుకు తిరుగుతున్నామన్నది ముఖ్యం కాదు, ఆజ్ఞాపాలనలో ఎంతటి చిత్తశుద్ధి ఉంది? అన్నదే ప్రధానం. ఏ దిక్కుకు తిరిగి ప్రార్థన చేసినా అది ప్రార్థనే. కాకపోతే ఆ దిక్కుకు తిరిగి ప్రార్థన చేసుకోవచ్చు అని అల్లాహ్ తరఫున సెలవీయబడి ఉండాలంతే. ఖిబ్లా మార్పుకు సంబంధించిన ఈ ఆదేశం అస్ర్ నమాజ్ వేళ అవతరించింది. అస్ర్ నమాజు కాబా గృహం వైపు తిరిగి చేయబడింది.

163. అరబీలో **‘వసత్’ (وَسَطً)** అని ఉంది. ‘వసత్’ అంటే మధ్యస్థం అని అసలు అర్థం. కాని మెరుగైన, ఉత్తమమైన అన్న అర్థంలో కూడా ఈ పదం ప్రయోగించబడుతుంది. ఇక్కడ ఈ భావంలోనే ఇది ప్రయోగించబడింది. అంటే మీకు అత్యుత్తమమైన ‘ఖిబ్లా’ను ప్రసాదించినట్లే, మిమ్మల్ని అందరికన్నా మెరుగైన సమాజంగా కూడా చేయటం

الرَّسُولَ مِمَّنْ يَّنْقَلِبُ عَلٰى عَقِبَيْهِ ۭ وَاِنْ كَانَتْ لَكَبِيْرَةً اِلَّا عَلَى الَّذِيْنَ ھَدَى اللّٰهُ ۭ وَمَا كَانَ اللّٰهُ لِيُضِيْعَ اِيْمَانَكُمْ ۭ اِنَّ اللّٰهَ بِالنَّاسِ لَرَءُوْفٌ رَّحِيْمٌ (143)

ఎవరు నిజాయితీపరులో, మరెవరు వెనుతిరిగి పోయేవారో[164] తెలుసుకునే (పరీక్షించే) నిమిత్తమే మేము, పూర్వం నీవు అభిముఖుడవై ఉండిన దిశను మీ 'ఖిబ్లా'గా నిర్ధారించాము. ఇదెంతో కష్టమైన విషయమే అయినప్పటికీ అల్లాహ్ సన్మార్గం చూపిన వారికి (ఏ మాత్రం కష్టతరం కాదు). అల్లాహ్ మీ విశ్వాసాన్ని వృథా కానివ్వడు.[165] నిశ్చయంగా అల్లాహ్ (తన దాసులైన) మానవుల యెడల అమితమైన వాత్సల్యం కలవాడు! పరమ కృపాశీలుడు.

జరిగింది. ఇలా చేయటంలోని ముఖ్యోద్దేశం మీరు మానవాళి కొరకు సాక్షులుగా ఉండాలన్నదే. మరో చోట సెలవీయబడినట్లు – "దైవప్రవక్త మీపై సాక్షిగా ఉండటానికీ, మీరు ప్రజల విషయంలో సాక్షులుగా ఉండటానికి (మేము ఇలా చేశాము)" అల్ హజ్ – 78).

కొన్ని హదీసులలో ఈ విషయం ఇలా విశదీకరించబడింది : ప్రళయదినాన అల్లాహ్ తన ప్రవక్తలనుద్దేశించి, మీరు మానవాళికి నా సందేశం అందజేశారా? లేదా? అని ప్రశ్నిస్తాడు. అందజేశామని వారు జవాబిస్తారు. ఈ మేరకు ఎవరన్నా సాక్షులుగా ఉన్నారా? అని తిరిగి ప్రశ్నించబడుతుంది. 'ఉన్నారు. ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు ఈ విషయానికి సాక్షులు' అని వారంటారు. అప్పుడు మానవాళి కొరకు సాక్ష్యం ఇచ్చే గౌరవం ముహమ్మద్ (స) అనుచర సమాజానికి దక్కుతుంది. అందుకే ఉమ్మతె వసత్‌ను 'న్యాయశీల సమాజం'గా కూడా అనువదించటం జరిగింది (తఫ్సీర్ ఇబ్నె కసీర్). 'మధ్యస్థ సమాజం' అని కూడా అనువాదాలు జరిగాయి. అంటే రెండు అతివాదాలకు అతీతమైనది, మధ్యేమార్గంతో కూడుకున్నది అన్న భావంలో ఈ తర్జుమా అయింది. రెండు అనువాదాలు కూడా సరైనవే.

164. **'ఖిబ్లా' (قِبْلَة)** మార్పు ఉద్దేశం ఇందులో వివరించబడింది. నిజమైన విశ్వాసులు ఎల్లప్పుడూ దైవప్రవక్త (సఅసం) నుంచి అందే సూచన కోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఒక్క సైగ చేస్తే చాలు, కర్తవ్య నిర్వహణకై నడుం బిగిస్తారు. అందుకే ఒకవైపు నుంచి మరో వైపుకు మరలటం వారికి ఏమాత్రం కష్టతరం అనిపించలేదు. ఒకచోట కొందరు నమాజులో నిమగ్నులై ఉండగా– అకస్మాత్తుగా – ఖిబ్లా మార్పుకు సంబంధించిన ఆదేశం వచ్చింది. అందరూ రుకూ (వంగిన) స్థితిలో ఉన్నారు. ఆజ్ఞాపించబడిన తక్షణమే వారు తమ దిశను మరల్చుకున్నారు. ఆ ప్రార్థనా స్థలం ఇప్పుడు 'మస్జిదె ఖిబ్లతైన్' (రెండు ఖిబ్లాల మసీదు)గా పిలువబడుతుంది. అంటే ఒకే నమాజులో రెండు దిశల వైపుకు అభిముఖం అయిన మస్జిదు అన్నమాట! మస్జిదె ఖుబాలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. ఆయతులో అల్లాహ్, **'లినాలమ' (لِنَعْلَمَ)** (మేము తెలుసుకోవటం కోసం) అని అన్నాడు. చూడబోతే ఏ దాసులు ఎటువంటివారో ఆయనకు బాగా తెలుసు. మరి అల్లాహ్ 'లినాలమ' అని ఎందుకు అన్నట్లు?! అన్న సందేహం ఈ సందర్భంగా జనించవచ్చు. దీని భావం ఏమిటంటే, నమ్మకంగలవారిని – సందేహాలకు లోనై ఉన్నవారిని అల్లాహ్ వేరుపరచ దలిచాడు, ఇరువర్గాల వారిని స్పష్టపరచదలిచాడు – ఇది దానికి భావం! (ఫత్‌హుల్ ఖదీర్).

165. ఖిబ్లా మార్పు జరిగిన సందర్భంగా కొంతమంది ప్రవక్త సహచరులకు కూడా తమ సత్కర్మలకు సంబంధించి కించిత్ అనుమానం కలిగింది. ఇప్పటి వరకూ మనం బైతుల్ మఖ్దిస్ వైపుకు తిరిగి చేసిన నమాజులు ఏం కావాలి? వాటి పుణ్యం దక్కుతుందా? లేదా? ఇప్పటి దాకా చేసిన నమాజులన్నీ వృథా అయిపోయినట్లేనా?! అలాగయితే బైతుల్ మఖ్దిస్ వైపుకు తిరిగి నమాజు చేసే కాలంలో చనిపోయిన సహచరుల సంగతేమిటి?! – వారి ఈ సందేహాన్ని అల్లాహ్ నివృత్తి చేశాడు. వారు చేసిన నమాజులు ఏమాత్రం నిరర్థకం కావనీ, వాటి పుణ్యఫలం వారికి లభిస్తుందనీ స్పష్టం చేశాడు. ఈ ఆయతులో నమాజును ఈమాన్ (విశ్వాసం)తో పోల్చి నమాజులేని విశ్వాసానికి అర్థమేలేదని

قَدْ نَرٰى تَقَلُّبَ وَجْهِكَ فِي السَّمَآءِ ۚ فَلَنُوَلِّيَنَّكَ قِبْلَةً تَرْضٰىهَا ۪ فَوَلِّ وَجْهَكَ شَطْرَ الْمَسْجِدِ الْحَرَامِ ؕ وَحَيْثُ مَا كُنْتُمْ فَوَلُّوْا وُجُوْهَكُمْ شَطْرَهٗ ؕ وَاِنَّ الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ لَيَعْلَمُوْنَ اَنَّهُ الْحَقُّ مِنْ رَّبِّهِمْ ؕ وَمَا اللّٰهُ بِغَافِلٍ عَمَّا يَعْمَلُوْنَ ﴿١٤٤﴾

**144** (ఓ ప్రవక్తా!) నువ్వు నీ ముఖాన్ని మాటిమాటికీ ఆకాశం వైపుకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. కాబట్టి ఇప్పుడు మేము, నువ్వు ఇష్టపడే ఆ దిశ వైపుకే నిన్ను త్రిప్పుతున్నాము. కనుక నువ్వు నీ ముఖాన్ని మస్జిదె హరామ్ వైపుకు త్రిప్పుకో. మీరెక్కడున్నాసరే ఇక మీదట మీ ముఖాలను దాని వైపుకే త్రిప్పాలి. (ఖిబ్లా మార్పుకు సంబంధించిన) ఈ విషయం, తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమేనని గ్రంథం ఇవ్వబడిన వారికి బాగా తెలుసు.[166] అల్లాహ్ వారి కార్యకలాపాల పట్ల అజాగ్రత్తగా లేదు.

وَلَئِنْ اَتَيْتَ الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ بِكُلِّ اٰيَةٍ مَّا تَبِعُوْا قِبْلَتَكَ ۚ وَمَا اَنْتَ بِتَابِعٍ قِبْلَتَهُمْ ۚ وَمَا بَعْضُهُمْ بِتَابِعٍ قِبْلَةَ بَعْضٍ ؕ وَلَئِنِ اتَّبَعْتَ اَهْوَآءَهُمْ مِّنْ بَعْدِ مَا جَآءَكَ مِنَ الْعِلْمِ ۙ اِنَّكَ اِذًا لَّمِنَ الظّٰلِمِيْنَ ﴿١٤٥﴾

**145** ఒకవేళ నీవు గ్రంథవహులకు నిదర్శనాలన్నీ చూపినా, వారు నీ 'ఖిబ్లా'ను అనుసరించరు.[167] వారి 'ఖిబ్లా'ను అంగీకరించటం అన్నది నీవల్ల కూడా కానిపని.[168] వారిలో కూడా కొందరు మరికొందరి 'ఖిబ్లా'ను అనుసరించరు.[169] ఒకవేళ నువ్వు– జ్ఞానం వచ్చేసిన తరువాత కూడా – వారి కోరికలను అనుసరించినట్లయితే నువ్వు కూడా దుర్మార్గులలో చేరిపోతావు సుమా![170]

అవగతం చేయటం జరిగింది. సమాజాను సజావుగా నెలకొల్పినప్పుడు, దైవాజ్ఞలను సక్రమంగా పాటించినపుడే ఈమాన్‌కు సార్థకత చేకూరుతుంది (ఫత్‌హుల్ ఖదీర్).

166. కాబాగృహం అంతిమ దైవప్రవక్త (స)కు 'ఖిబ్లా'గా ఉంటుందన్న సంగతి గ్రంథవహుల వద్ద ఉన్న వివిధ 'సహీఫా'లలో స్పష్టంగా సూచించబడింది. అందుచేత ఆ విషయం సత్యబద్ధం అని కూడా వారికి తెలుసు. అయినప్పటికీ వారి జాత్యహంకారం, ఓర్వలేనితనం సత్య స్వీకారంలో వారికి అడ్డంకిగా నిలిచాయి.

167. యూదుల వ్యతిరేకతకు అసలు కారణం అసూయ, అక్కసు గనక ఎన్ని నిదర్శనాలు సమర్పించినా వారి మనసులు మారవు. పరివర్తన రావాలంటే మనసులు నిర్మలంగా ఉండాలి. సంకుచిత భావాలు, అసూయా ద్వేషాలు సదా సత్యమార్గంలో అవరోధాలుగానే నిలుస్తాయి.

168. దైవప్రవక్త (సఅసం) దైవవాణిననుసరించి ఆచరించే వారవటం చేత యూదుల కోర్కెలను అనుసరించలేదు. యూదులు కోరారు కదా! అని వారి 'ఖిబ్లా' వైపుకు మరలలేదు.

169. యూదులు, క్రైస్తవులు కూడా బైతుల్ మఖ్దిస్‌నే తమ 'ఖిబ్లా'గా చేసుకున్నప్పటికీ అందులో యూదులు "సఖ్‌రయె బైతుల్ ముఖ్దిస్"ను ఖిబ్లాగా భావిస్తుండగా, క్రైస్తవులు బైతుల్ మఖ్దిస్ తూర్పు దిక్కును తమ ఖిబ్లాగా చేసుకున్నారు. గ్రంథవహులనబడే ఈ రెండు వర్గాల మధ్యనే 'ఖిబ్లా' వ్యవహారంలో ఏకాభిప్రాయం లేనప్పుడు, ముస్లింలు ఈ విషయంలో తమను అనుసరిస్తారని వారు ఎలా ఆశించగలరు?

170. అలాంటి అన్యాయానికి పాల్పడితే దాని పర్యవసానం తీవ్రంగా ఉంటుందని అల్లాహ్ హెచ్చరిస్తున్నాడు. ఈ వాక్యాన్ని ముస్లిం సమాజానికి అన్వయించుకున్నట్లయితే, ఖుర్‌ఆన్ హదీసుల పరిజ్ఞానాన్ని ఆర్జించిన పిదప కూడా మార్గవిహీనుల అడుగుజాడల్లో నడవటం అన్యాయమవుతుందన్న భావం స్ఫురిస్తుంది.

**146** మేము ఎవరికి గ్రంథం వొసగామో వారు తమ కన్న కొడుకులను గుర్తుపట్టినట్లే అతన్ని (అనగా ముహమ్మద్‌-సఅసం-ను) గుర్తుపడతారు. వారిలోని ఒక సమూహం సత్యాన్ని గుర్తించి కూడా దాన్ని కప్పిపుచ్చుతుంది.[171]

الَّذِينَ آتَيْنَاهُمُ الْكِتَابَ يَعْرِفُونَهُ كَمَا يَعْرِفُونَ
أَبْنَاءَهُمْ ۖ وَإِنَّ فَرِيقًا مِّنْهُمْ لَيَكْتُمُونَ الْحَقَّ وَهُمْ
يَعْلَمُونَ ﴿١٤٦﴾

**147** అయితే ఇది నీ ప్రభువు తరఫు నుంచి వచ్చిన (స్పష్ట మయిన) సత్యం. (జాగ్రత్త!) నీవు మాత్రం సంశయాల్లో ఊగిసలాడేవారి సరసన చేరకు.[172]

الْحَقُّ مِن رَّبِّكَ ۖ فَلَا تَكُونَنَّ مِنَ الْمُمْتَرِينَ ﴿١٤٧﴾

**148** ప్రతి ఒక్కడూ ఏదో ఒక దిక్కుకు తిరుగుతున్నాడు.[173] కాబట్టి మీరు సత్కార్యాలలో మించిపోయేందుకు ప్రయత్నించండి. మీరు ఎక్కడ ఉన్నాసరే అల్లాహ్‌ మిమ్మల్ని సమీకరిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్‌ ప్రతి వస్తువుపై అధికారం కలవాడు.

وَلِكُلٍّ وِجْهَةٌ هُوَ مُوَلِّيهَا ۖ فَاسْتَبِقُوا الْخَيْرَاتِ ۚ
أَيْنَ مَا تَكُونُوا يَأْتِ بِكُمُ اللَّهُ جَمِيعًا ۚ إِنَّ اللَّهَ
عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿١٤٨﴾

**149** నీవు ఎక్కడి నుంచి బయలుదేరినా (నమాజు కోసం) నీ ముఖాన్ని మస్జిదె హరాం వైపునకు త్రిప్పు. ఇదే నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలియకుండా లేదు.

وَمِنْ حَيْثُ خَرَجْتَ فَوَلِّ وَجْهَكَ شَطْرَ الْمَسْجِدِ
الْحَرَامِ ۖ وَإِنَّهُ لَلْحَقُّ مِن رَّبِّكَ ۗ وَمَا اللَّهُ بِغَافِلٍ
عَمَّا تَعْمَلُونَ ﴿١٤٩﴾

171. ఇక్కడ గ్రంథవహుల్లోని కొందరు బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చినందుకు అపరాధులుగా ఖరారు చేయబడ్డారు. ఎందుకంటే యూదుల్లో కొంతమంది అబ్దుల్లా బిన్ సలాం (రజి) లాంటివారు కూడా ఉండేవారు. కాని ఆయన (రజి) మాత్రం తన అంతరాత్మ ప్రబోధాన్ని అణచిపెట్టడం సహించలేక ఇస్లాం స్వీకరించారు.

172. దేవుని తరఫున దైవప్రవక్తపై ఏ ఆదేశం అవతరించినా అది సత్యబద్ధం అయి ఉంటుంది. అందులో సందేహానికీ, అనుమానానికి ఆస్కారం ఉండకూడదు.

173. అంటే అన్ని మతాలవారు తమదంటూ ఒక దిక్కును నిర్ధారించుకున్నారు. ఈ వాక్యానికిగల మరొక అర్థం ఏమిటంటే, ప్రతి మతమూ తనదైన ఒక పంథాను, మార్గాన్ని నిర్ధారించి పెట్టుకుంది. దివ్య ఖుర్‌ఆన్‌లోనే వేరొకచోట సెలవీయబడినట్లు, "మీలో ప్రతి ఒక్కరి కోసం మేము ఒక నిబంధనావళినీ, మార్గాన్నీ నిర్ధారించాము. అల్లాహ్‌యే గనక తలిస్తే మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు. అయితే మీకు వొసగబడిన దానిలో మిమ్మల్ని పరీక్షించాలన్నది ఆయన అభిలాష" (అల్ మాయిదహ్ : 48). అంటే అల్లాహ్‌ సన్మార్గాన్నీ, అపమార్గాన్ని కూడా స్పష్టపరచిన తరువాత, ఆ రెంటిలో ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకునే ఏ స్వేచ్ఛనైతే మనిషికి ఇచ్చాడో, దాని ఆధారంగా జనులు వివిధ పద్ధతులను, జీవన విధానాలను ఏర్పరచుకున్నారు. ఆ విధానాలు భిన్నంగా ఉంటాయి. ఒకటి మరొకదానితో ఏమాత్రం సమరసం చెందదు. అల్లాహ్‌యే గనక తలచుకుంటే అందరి మెడలు వంచి అందరినీ ఒకే మార్గంపై - రుజుమార్గంపై - తీసుకురాగలిగేవాడే. ఒకవేళ ఆయన గనక అలా చేసి ఉన్నట్లయితే మనిషికి ఇవ్వబడిన 'స్వేచ్ఛ' మరియు 'ఎంపిక' అధికారానికి అర్థమే ఉండేదికాదు. వాస్తవానికి అల్లాహ్‌ - ఇచ్చిన ఈ స్వేచ్ఛయే మనిషి పాలిట పరీక్ష! కనుక ఓ ముస్లిములారా! మీరు ఈ పరీక్షలో నెగ్గుకురావాలి. దానికోసం మీరు సదాచరణ వైపుకు సమాయత్తం కావాలి. సమాయత్తం కావటంతోనే సరిపోదు, ఒండొకరిని మించిపోవాలి. ఇదే దైవమార్గం. ఇదే ప్రవక్త చూపిన మార్గం. మీరు ఈ మార్గంపైనే ముందుకు సాగండి.

**150** ఏ స్థలం నుంచి నీవు వెడలినా నీ ముఖాన్ని మజ్జిదె హరాం వైపునకు త్రిప్పు.[174] మీరు ఎక్కడ ఉన్నాసరే, మీ ముఖాలను దాని వైపునకే త్రిప్పండి – జనులు మీతో వాదులాటకు దిగకుండా ఉండటానికి[175] (ఇలాగే చేయండి). వారిలోని దుర్మార్గులకు (వారు ఎలాగూ రాద్ధాంతం చేసేవారే. అంతమాత్రాన మీరు వారికి) భయపడకండి.[176] నాకు మాత్రమే భయపడండి[177]– నేను నా అనుగ్రహాన్ని మీపై సంపూర్తి గావించటానికి, మీరు సన్మార్గగాములు అవటానికి.

وَمِنْ حَيْثُ خَرَجْتَ فَوَلِّ وَجْهَكَ شَطْرَ الْمَسْجِدِ
الْحَرَامِ ۚ وَحَيْثُ مَا كُنتُمْ فَوَلُّوا وُجُوهَكُمْ شَطْرَهُ
لِئَلَّا يَكُونَ لِلنَّاسِ عَلَيْكُمْ حُجَّةٌ إِلَّا الَّذِينَ
ظَلَمُوا مِنْهُمْ فَلَا تَخْشَوْهُمْ وَاخْشَوْنِي وَلِأُتِمَّ
نِعْمَتِي عَلَيْكُمْ وَلَعَلَّكُمْ تَهْتَدُونَ ﴿١٥٠﴾

**151** అదేవిధంగా[178] మేము మీ వద్దకు స్వయంగా మీలో నుండే ఒక ప్రవక్తను (నియుక్తం చేసి) పంపాము. అతడు మీకు మా వాక్యాలను చదివి వినిపిస్తున్నాడు, మిమ్మల్ని పరిశుద్ధుల్ని చేస్తు న్నాడు, మీకు గ్రంథజ్ఞానాన్నీ, వివేకవంతమైన విషయాలను బోధిస్తున్నాడు, ఇంకా మీకు తెలియని విషయాలను నేర్పు తున్నాడు.

كَمَا أَرْسَلْنَا فِيكُمْ رَسُولًا مِّنكُمْ يَتْلُو عَلَيْكُمْ
آيَاتِنَا وَيُزَكِّيكُمْ وَيُعَلِّمُكُمُ الْكِتَابَ وَالْحِكْمَةَ
وَيُعَلِّمُكُم مَّا لَمْ تَكُونُوا تَعْلَمُونَ ﴿١٥١﴾

174. **'ఖిబ్లా'** వైపుకు ముఖం త్రిప్పుకోండి అన్న ఆజ్ఞ ఒకటి, రెండు కాదు – మూడుసార్లు చెప్పబడింది. దీన్నిబట్టి ఈ విషయానికి ఎంత ప్రాముఖ్యం ఉందో అర్థమవుతోంది. అసలు విషయం ఏమిటంటే ముస్లింలకు ఇది తొలి 'నస్ఖ్' అనుభవం. అంటే కొనసాగుతున్న ఒక ఆనవాయితీ మారటం ముస్లింలకు ఇదే మొదటిసారి! ఈ ఆనవాయితీ మార్పు వల్ల కలిగే మానసిక తటపటాయింపును దూరం చేసే ఉద్దేశంతో ఇలా చెప్పబడి ఉండవచ్చు. లేక అనేక అనివార్య పరిస్థితుల దృష్ట్యా కూడా పదే పదే ఆ విషయం పునరావృతం అయి ఉండవచ్చు. కాబా గృహం తమ ఖిబ్లాగా ఉంటే బాగుంటుందన్న కోరిక ముహమ్మద్ (స) ఆంతర్యంలో జనించింది. ఇదొక కారణం. దానికి ఒకసారి **"ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామ్"** అని చెప్పబడింది. ఏ సైద్ధాంతిక సమాజానికయినా తమ జీవన విధానానికి, ఆరాధనా రీతులకు ఒక కేంద్రస్థానం ఎంతైనా అవసరం. ఇది మరొక కారణం. అందుకని ఇక్కడ మరోసారి **"ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామ్"** అని అనబడింది. ఖిబ్లా మార్పుపై వ్యతిరేకుల, ప్రతికూలుర, విమర్శకుల నోళ్లు మూయించటం కూడా అవసరమే. ఇది ఇంకో కారణం. అందుకని ఇక్కడ కూడా మరోమారు ఆ వాక్యం పునరావృతమయింది (ఫత్‌హుల్ ఖదీర్).

175. అంటే – "ముస్లిముల ఖిబ్లా కాబా గృహం అయి ఉన్నప్పటికీ వీళ్లు బైతుల్ మఖ్దిస్ వైపుకు తిరిగి నమాజ్ చేస్తున్నారేమిటీ?" అన్న ప్రశ్నను గ్రంథవహులు లేవనెత్తి, గొడవ చేయకుండా ఉండేందుకుగాను ముందుగానే ఈ విధంగా ఆదేశించడ మయింది అని భావం.

176. ఇక్కడ **'అల్లజీన జలమూ'** (الَّذِينَ ظَلَمُوا) అంటే వైరభావం కలవారని అర్థం. అంతిమ దైవప్రవక్త (స) వారి 'ఖిబ్లా' కాబా గృహమేనని తెలిసి కూడా గ్రంథం కలవారిలోని విరోధులు బుద్ధిపూర్వకంగా ఏదో ఒకటి అంటారు. బైతుల్ మఖ్దిస్ దిశ నుండి మరలిపోయి ఈ ప్రవక్త ఎట్టకేలకు తమ తాతముత్తాతల ధర్మం వైపుకే మొగ్గిపోయాడని అక్కసును వెళ్ళగ్రక్కుతారు. మరికొంతమంది విద్వాంసుల దృష్టిలో ఇక్కడ 'అల్లజీన జలమూ' అంటే ముష్రిక్కులు అని భావం.

177. దుర్మార్గులకు భయపడకండి. అంటే ముష్రిక్కులు అనే మాటలను పట్టించుకోకండి. "ముహమ్మద్ (సఅసం) ఆఖరికి మా 'ఖిబ్లా' వైపుకు అభిముఖం అయిపోయాడు. కొన్నాళ్ళుపోతే మా పూర్వీకుల ధర్మాన్ని కూడా అవలంబిస్తాడు" – అని ముష్రిక్కులు చంకలు గుద్దుకుని మరీ చెప్పుకున్నారు. దానిపై అల్లాహ్ ముస్లింలను ఉద్దేశించి, "మీరు నాకు

**152** అందుకే మీరు నన్ను స్మరించండి, నేను మిమ్మల్ని జ్ఞాపక ముంచుకుంటాను. నాకు కృతజ్ఞులై ఉండండి. కృతఘ్నుతకు పాల్పడకండి.[179]

فَاذْكُرُوْنِيْٓ اَذْكُرْكُمْ وَاشْكُرُوْا لِيْ وَلَا تَكْفُرُوْنِ ﴿152﴾

**153** ఓ విశ్వాసులారా! సహనం మరియు నమాజు ద్వారా సహాయం అర్థించండి. అల్లాహ్ సహనం పాటించేవారికి తోడుగా ఉంటాడు.[180]

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اسْتَعِيْنُوْا بِالصَّبْرِ وَالصَّلٰوةِ ۭ اِنَّ اللّٰهَ مَعَ الصّٰبِرِيْنَ ﴿153﴾

**154** అల్లాహ్ మార్గంలో చంపబడినవారిని మృతులు[181] అని అనకండి. వారు బ్రతికే ఉన్నారు. కాని ఆ విషయం మీకు అర్థం కాదు.

وَلَا تَقُوْلُوْا لِمَنْ يُّقْتَلُ فِيْ سَبِيْلِ اللّٰهِ اَمْوَاتٌ ۭ بَلْ اَحْيَاۗءٌ وَّلٰكِنْ لَّا تَشْعُرُوْنَ ﴿154﴾

---

మాత్రమే భయపడండి, నేనిచ్చిన సూచనలను నిర్భయంగా అమలు చేయండి" అని ఓదార్చాడు. ఖిబ్లా మార్పును అనుగ్రహాల పరిపూర్తిగా, సన్మార్గ భాగ్యానికి ప్రతీకగా అభివర్ణించాడు. దైవాదేశాలను శిరసావహించే మనిషి సదా గౌరవ పురస్కారాలకు అర్హుడవుతాడనీ, సన్మార్గ భాగ్యం కూడా అతన్ని వరిస్తుందని స్పష్టం చేశాడు.

178. అరబీ మూలంలో **'కమా'** (**كَمَا**) అనే పదం వచ్చింది. అంటే 'అదే విధంగా' అని అర్థం. ఈ పదానికి వెనుకటి వాక్యంతో సంబంధం ఉంది. ఈ ఆయతుకు భావం ఏమిటంటే, ఇంతకు ముందు మీలో నుంచే ఒక ప్రవక్త ప్రభవింపజేయబడ్డాడు. ఆ ప్రవక్త మీకు దివ్య వచనాలను వినిపిస్తున్నాడు. మిమ్మల్ని పరిశుద్ధపరుస్తున్నాడు. మీకు గ్రంథాన్ని, వివేకాన్ని బోధిస్తున్నాడు. మీకు తెలియని విషయాలను నేర్పుతున్నాడు. ఇది మీ కొరకు ఒక మహాభాగ్యం. ఓ గొప్ప వరం. మీకు ఆ వరం ఎలా లభించిందో అదేవిధంగా ఈ పరిపూర్ణ అనుగ్రహం, సన్మార్గ సద్బుద్ధి మీకు ప్రాప్తించాయి.

179. కాబట్టి మీరు ఈ అనుగ్రహ భాగ్యాలకు ప్రతిగా నన్ను ధ్యానించండి, నా నామస్మరణ చేయండి, నా పవిత్రతను కొనియాడండి, నన్నే స్తుతించండి. ఈ వరాలను సద్వినియోగం చేసుకుంటూ కృతజ్ఞులై మెలగండి. కృతజ్ఞతా భావం పెరిగినకొద్దీ మీ అనుగ్రహాలు మీ పాలిట శుభకరంగా పరిణమిస్తాయి. మీ జీవితాలలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. అందుకే మీరు నేను చేసిన మేలును మరువకండి. 'కృతఘ్నతా వైఖరి'కి ఒడిగట్టిన వారిని అల్లాహ్ ఈసడించుకుంటాడు. **"లయిన్ షకర్తుమ్ లఅజీదన్నకుమ్. వ లయిన్ కఫర్తుమ్ ఇన్న అజాబీ లషదీద్"** (ఇబ్రాహీం – 7) అన్న ఖుర్ఆన్ వాక్యం ఇక్కడ గమనార్హం.

180. మనిషి తన జీవితంలో రెండు ముఖ్య స్థితులను ఎదుర్కొంటాడు. ఒకటి : సుఖసౌఖ్యాల స్థితి. రెండు : కష్టాలు, కడగండ్ల స్థితి. సుఖసౌఖ్యాలు ప్రాప్తించినపుడు అతడు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. కష్టాలెదురైనప్పుడు సహనంతో, ఓపికతో దైవసహాయాన్ని అర్థించాలి. హదీసులో ఇలా అనబడింది : "విశ్వాసి వ్యవహారం కడు విచిత్రమైనది. కలిమి కలిగినప్పుడు అతడు అల్లాహ్‌కు కృతజ్ఞుడవుతాడు. బాధ కలిగినప్పుడు ఓర్పు వహిస్తాడు. రెండు పరిస్థితులూ అతనికి మేలు చేకూర్చుతాయి" (సహీహ్ ముస్లిం).

ఓర్పు కూడా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి : నిషిద్ధ విషయాలను, పాపాలను విడనాడటం, వాటికి దూరంగా ఉండటానికి తన్ను తాను నిగ్రహించుకోవటం. భోగలాలసను, మనసైన వాటిని త్యాగం చేయటం, క్షణభంగురమైన ప్రయోజనాలను వదులుకోవటం వల్ల మనసుకు కలిగే అసంతృప్తిని ఓర్చుకోవటం. రెండు : దైవాదేశాలను పాటించటంలో ఎదురయ్యే కష్టాలను, బాధలను ఓర్పుతో, నేర్పుతో భరించటం. మరికొంతమంది ఇలా అభివర్ణించారు: అల్లాహ్‌కు ఇష్టమయిన వాటిని ఆచరణలో పెట్టాలి. మనసుకు, శరీరానికి ఎంత బాధ కలిగినాసరే అల్లాహ్‌కు ఇష్టంలేని విషయాలకు దూరంగా మసలుకోవాలి. కోర్కెలు, అభిరుచులు ఎంతగా ఉబలాటం చేసినా దైవసమ్మతం కాని వాటిని త్యజించాలి–ఇదే ఓర్పు! (ఇబ్నె కసీర్).

155 మేము ఏదో ఒకవిధంగా మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తూ ఉంటాము–భయంతో, ఆకలిదప్పులతో, ధన ప్రాణాల నష్టంతో, పండ్ల కొరతతో (పరీక్షిస్తాము)! ఈ సహనమూర్తులకు శుభవార్త ఇవ్వండి.

وَلَنَبْلُوَنَّكُمْ بِشَيْءٍ مِّنَ الْخَوْفِ وَالْجُوعِ وَنَقْصٍ مِّنَ الْأَمْوَالِ وَالْأَنفُسِ وَالثَّمَرَاتِ ۗ وَبَشِّرِ الصَّابِرِينَ ﴿١٥٥﴾

156 వారికెప్పుడు ఏ ఆపద వచ్చిపడినా, "మేము ఖుద్దుగా అల్లాహ్‌కు చెందిన వారము,[182] మేము మరలిపోవలసింది కూడా ఆయన వద్దకే కదా!"అని అంటారు.

الَّذِينَ إِذَا أَصَابَتْهُم مُّصِيبَةٌ قَالُوا إِنَّا لِلَّهِ وَإِنَّا إِلَيْهِ رَاجِعُونَ ﴿١٥٦﴾

157 వారిపై వారి ప్రభువు దయానుగ్రహాలు, కారుణ్యం ఉన్నాయి. సన్మార్గాన్ని పొందినవారు కూడా వీరే.

أُولَٰئِكَ عَلَيْهِمْ صَلَوَاتٌ مِّن رَّبِّهِمْ وَرَحْمَةٌ ۖ وَأُولَٰئِكَ هُمُ الْمُهْتَدُونَ ﴿١٥٧﴾

158 నిస్సందేహంగా సఫా మర్వాలు అల్లాహ్ చిహ్నాల[183] లోనివి. కనుక కాబా గృహాన్ని (సందర్శించి) హజ్ ఉమ్రాలు చేసేవారు వాటి మధ్య ప్రదక్షిణ చేస్తే అందులో ఏ మాత్రం తప్పులేదు.[184] స్వచ్ఛందంగా ఎవరైనా ఏదైనా సత్కార్యం చేస్తే అల్లాహ్ ఆదరించే వాడు, తెలుసుకునేవాడు.

إِنَّ الصَّفَا وَالْمَرْوَةَ مِن شَعَائِرِ اللَّهِ ۖ فَمَنْ حَجَّ الْبَيْتَ أَوِ اعْتَمَرَ فَلَا جُنَاحَ عَلَيْهِ أَن يَطَّوَّفَ بِهِمَا ۚ وَمَن تَطَوَّعَ خَيْرًا فَإِنَّ اللَّهَ شَاكِرٌ عَلِيمٌ ﴿١٥٨﴾

181. అల్లాహ్ మార్గంలో అమరగతి నొందినవారిని మృతులని అనకూడదు. ఎందుకంటే వారి గౌరవార్థం ఇలాంటి మాటలు అనరాదన్నమాట! ఈ సమాధి జీవితాన్ని "బర్జఖ్ జీవితం" అంటారు. దీన్ని మనం అర్థం చేసుకోలేము. ఈ జీవితం వివిధ స్థాయిల్లో ప్రవక్తలకు, విశ్వాసులకు చివరికి అవిశ్వాసులకు కూడా ఇవ్వబడుతుంది. అమరగతుని ఆత్మ – కొన్ని ఉల్లేఖనాల ప్రకారం విశ్వాసి ఆత్మ కూడా – ఒక పక్షి ఉదరంలో ఉండి స్వర్గంలో తాను కోరినచోట విహరిస్తూ ఉంటుంది (ఇబ్నె కసీర్ – ఇంకా ఆలి ఇమ్రాన్ సూరా 169వ వచనంలో చూడండి).

182. ఈ ఆయతులో సహనం వహించేవారికి శుభవార్తలు అందజేయబడ్డాయి. నష్టం వాటిల్లినపుడు 'ఇన్నా లిల్లాహి వ యిన్నా ఇలైహి రాజివూన్'తో పాటు, **"అల్లాహుమ్మఅ్ జుర్‌నీ ఫీ ముసీబతీ వ అఖ్‌లిఫ్ లీ ఖైరమ్ మ్మిన్‌హా"** పఠించటం ఎంతో మహత్పూర్వకమైనదని, దీన్ని తప్పక చదవాలని చెప్పబడింది (సహీహ్ ముస్లిం – కితాబుల్ జనాయిజ్). (పాఠకులు ప్రార్థనల పుస్తకాల్లోంచి ఈ దుఆను నేర్చుకోగలరు.)

183. ఆయతులో **'షఆయిర్' (شَعَآئِر)** అనే పదం వచ్చింది. 'షయీరతున్' దాని ఏకవచనం. షఆయిర్ అంటే చిహ్నాలు, గుర్తులు అని అర్థం. ఇక్కడ షఆయిర్ అంటే అల్లాహ్ నిర్ణయించిన హజ్ క్రియలు అని భావం. ఉదా : మౌఖఫ్ (అరఫాత్ మైదానం, అక్కడ ఆగటం), సఫా మర్వాల మధ్య సయీ చేయటం (పరుగెత్తటం), హదీ (ఖుర్బానీ పశువు), మన్‌హర్ (ఖుర్బానీ ఇచ్చే స్థలం) మొదలగునవి.

184. సఫా – మర్వాల మధ్య పరుగెత్తటం దోషం కాదు సరికదా అది హజ్ సందర్భంగా పాటించే క్రియల్లో ఒక అంశం. మరయితే దివ్య ఖుర్‌ఆన్ పదజాలాన్ని బట్టి (అంటే – వాటి మధ్య 'సయీ' చేస్తే అది తప్పు కాదు అని చెప్పటాన్ని బట్టి) బహుశా ఈ క్రియను పాటించవలసిన అవసరం లేదేమో! అన్న సంశయం కొందరికి కలగటం సహజం. ఎవరికో కాదు, స్వయంగా ప్రవక్త ప్రియసహచరులకే ఈ సందేహం కలిగింది. ఈ విషయం ఆయిషా (ర.అన్హా) దృష్టికి వచ్చినప్పుడు ఆమె గారు ఇలా అభిప్రాయపడ్డారు : "ఒకవేళ మీరనుకునేదే నిజమైతే, 'వారు వాటిమధ్య ప్రదక్షిణ చేయకపోయినా తప్పులేదు' అని అల్లాహ్ సెలవిచ్చి ఉండేవాడు." ఆ తరువాత ఆమెగారు ఈ ఆయతు పూర్వరంగాన్ని విశదీకరించారు – దాని ప్రకారం ఇస్లాం స్వీకరణకు పూర్వం అన్సారులు మనాత్ విగ్రహం పేరున

**159** మేము అవతరింపజేసిన నిదర్శనాలను మరియు సన్మార్గాన్ని ప్రజల కొరకు గ్రంథంలో విశదపరచిన తరువాత కూడా వాటిని దాచిపెట్టే వారిని అల్లాహ్ శపిస్తాడు. ఇంకా, వేరే శపించే వారు కూడా వారిని శపిస్తారు.[185]

إِنَّ الَّذِينَ يَكْتُمُونَ مَا أَنزَلْنَا مِنَ الْبَيِّنَاتِ
وَالْهُدَىٰ مِن بَعْدِ مَا بَيَّنَّاهُ لِلنَّاسِ فِي الْكِتَابِ ۙ
أُولَٰئِكَ يَلْعَنُهُمُ اللَّهُ وَيَلْعَنُهُمُ اللَّاعِنُونَ ﴿١٥٩﴾

**160** అయితే పశ్చాత్తాపం చెంది, తమ ప్రవర్తనను సంస్కరించుకుని, సత్యాన్ని బహిర్గతం చేసిన వారి పశ్చాత్తాపాన్ని నేను స్వీకరిస్తాను (వారి తప్పును మన్నిస్తాను). నేను పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాణ్ణి, అపారంగా కనికరించేవాణ్ణి.

إِلَّا الَّذِينَ تَابُوا وَأَصْلَحُوا وَبَيَّنُوا فَأُولَٰئِكَ
أَتُوبُ عَلَيْهِمْ ۚ وَأَنَا التَّوَّابُ الرَّحِيمُ ﴿١٦٠﴾

**161** నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడి, అవిశ్వాస స్థితిలోనే మరణించిన వారిపై అల్లాహ్ మరియు ఆయన దూతల, ఇంకా జనులందరి శాపం పడుతుంది.[186]

إِنَّ الَّذِينَ كَفَرُوا وَمَاتُوا وَهُمْ كُفَّارٌ أُولَٰئِكَ
عَلَيْهِمْ لَعْنَةُ اللَّهِ وَالْمَلَائِكَةِ وَالنَّاسِ أَجْمَعِينَ ﴿١٦١﴾

---

కీర్తనలు ఆలాపించేవారు. దానికోసం వారు 'ముషల్లల్' కొండపైన పూజలు కూడా చేసేవారు. అటువంటి పనులు చేసిన తాము, సఫా–మర్వా కొండల మధ్య పరుగులు తీయటం కూడా తప్పేనేమో! అని అనుమానించసాగారు. ఇస్లాం స్వీకరించిన మీదట వారు దైవప్రవక్త (సఅసం)ను ఈ విషయమై ప్రశ్నించగా ఈ ఆయతు అవతరించింది. సఫా–మర్వాల మధ్య 'సయీ' చేయటం తప్పు కాదు అని అందులో స్పష్టపరచటం జరిగింది (సహీహ్ బుఖారీ, కితాబుల్ హజ్).

మరికొంతమంది ఈ ఆయతు నేపథ్యాన్ని గురించి ఇలా వివరిస్తున్నారు : అజ్ఞానకాలంలో ముష్రిక్కులు సఫా–మర్వా పర్వతాలపై రెండు విగ్రహాలను ప్రతిష్ఠించారు. సఫా పర్వతంపై 'అసాఫ్' అనే పేరుగల విగ్రహం, మర్వా పర్వతంపై 'నాయిలా' అనే విగ్రహం ఉండేవి. 'సయీ' సందర్భంగా వాళ్ళు ఆ విగ్రహాలను ముద్దాడేవారు. లేదా చేత్తో తాకేవారు. కాని ఇస్లాం స్వీకరించిన తరువాత వారి అంతర్యాల్లో, 'సయీ' చేయటం బహుశా తప్పేమోనన్న శంక కలిగింది. వారి మనస్సుల్లో ఉన్న ఈ జంకును దూరం చేయడానికి అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి, 'సయీ' చేయటం చాలా అవసరమని బోధించాడు. ఈ 'సయీ' సఫా నుండి మొదలై మర్వా వద్ద ముగుస్తుంది (ఐసరుత్తఫాసీర్).

185. అల్లాహ్ తన గ్రంథంలో అవతరింపజేసిన విషయాలను బుద్ధిపూర్వకంగా దాచి ఉంచటం ఘోర పాపం. ఈ పాపానికి పాల్పడిన వారిని అల్లాహ్యే గాక శపించేవారు కూడా శపిస్తారు. హదీసులో ఇలా ఉంది: "తనకు తెలిసిన విషయం గురించి ఎవరయినా అతన్ని ప్రశ్నించగా, అతను దాన్ని దాచిపెడితే, ప్రళయదినాన అతని నోట్లో అగ్ని కళ్ళెం వేయబడుతుంది" (అబూ దావూద్ – కితాబుల్ ఇల్మ్).

186. దీనిద్వారా స్పష్టమయ్యేదేమిటంటే, చనిపోయిన వ్యక్తి ఖచ్చితంగా అవిశ్వాస స్థితిలో మరణించాడన్న దృఢ నమ్మకం ఉన్నప్పుడు అతన్ని శపించటం సమ్మతమే. కాని ఒక విశ్వాసిని – అతనెంత పాపాత్ముడు, దుర్మార్గుడైనాసరే– శపించటం ధర్మ సమ్మతం కాదు. ఎందుకంటే అతడు మరణ ఘడియలు ఆసన్నమైనపుడు నిజంగా పశ్చాత్తాపం చెందాడేమో! లేక అల్లాహ్ అతని ఇతరత్రా పుణ్యకార్యాల ఆధారంగా అతని కర్మల పత్రంపై "మన్నింపుల పెన్ను"ను ప్రయోగించాడేమో!! ఎవరికి తెలుసు? దాన్ని గురించి మానవ మాత్రులమైన మనం తెలుసుకోవటం అసాధ్యం. అయితే నిరంతరం శాపకారణమైన పనులు చేస్తూ, లతుకోరు చేష్టలకు పాల్పడుతూ కూడా పశ్చాత్తాప పడకుండా, క్షమాభిక్షకై వేడుకోకుండా ఉంటే అటువంటి దౌర్భాగ్యులను గురించి వారు శాపగ్రస్త పనులు చేస్తున్నారని మాత్రం చెప్పవచ్చు.

**162** అందులోనే వారు ఎల్లకాలం ఉంటారు. వారి శిక్షను తగ్గించటం గానీ, వారికి కొంత విడుపు ఇవ్వటంగానీ జరగదు.

خٰلِدِيْنَ فِيْهَا ۚ لَا يُخَفَّفُ عَنْهُمُ الْعَذَابُ وَلَا هُمْ يُنْظَرُوْنَ ﴿162﴾

**163** మీ అందరి ఆరాధ్య దైవం ఒకే ఆరాధ్య దైవం. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేదు.[187] ఆయన అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు.

وَاِلٰهُكُمْ اِلٰهٌ وَّاحِدٌ ۚ لَآ اِلٰهَ اِلَّا هُوَ الرَّحْمٰنُ الرَّحِيْمُ ﴿163﴾

**164** భూమ్యాకాశాల సృష్టిలో, రేయింబవళ్ళ (నిరంతర) మార్పిడిలో, ప్రజలకు లాభం చేకూర్చే వస్తువులను మోసు కుంటూ సముద్రాలలో నడిచే ఓడలలో, ఆకాశం నుంచి అల్లాహ్ వర్షపు నీటిని కురిపించి మృతభూమిని బ్రతికించటంలో,[188] ఇంకా అందులో అన్ని రకాల ప్రాణులను వ్యాపింపజేయటంలో, వీచే పవనాల దిశలు మార్చటంలో, భూమ్యాకాశాల మధ్య (దేవుని) నియమ నిబంధనలకు కట్టుబడి మసలుకుంటున్న మేఘాలలో బుద్ధిమంతులకు (దేవుని శక్తి సామర్థ్యాలకు సంబంధించిన) ఎన్నో సూచనలున్నాయి.

اِنَّ فِیْ خَلْقِ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَاخْتِلَافِ الَّيْلِ وَالنَّهَارِ وَالْفُلْكِ الَّتِیْ تَجْرِیْ فِی الْبَحْرِ بِمَا يَنْفَعُ النَّاسَ وَمَآ اَنْزَلَ اللّٰهُ مِنَ السَّمَآءِ مِنْ مَّآءٍ فَاَحْيَا بِهِ الْاَرْضَ بَعْدَ مَوْتِهَا وَبَثَّ فِيْهَا مِنْ كُلِّ دَآبَّةٍ ۪ وَّتَصْرِيْفِ الرِّيٰحِ وَالسَّحَابِ الْمُسَخَّرِ بَيْنَ السَّمَآءِ وَالْاَرْضِ لَاٰيٰتٍ لِّقَوْمٍ يَّعْقِلُوْنَ ﴿164﴾

187. ఈ ఆయతులో ఇంకొకసారి దేవుని ఏకత్వ సందేశం ఇవ్వబడింది. ఈ ఏక దైవారాధనా పిలుపు మక్కాలోని ముష్రిక్కు (బహుదైవారాధకు)లకు మింగుడు పడేది కాదు. "ఏమిటీ, ఈయన ఇన్ని ఆరాధ్య దైవాల స్థానంలో ఒకే దైవాన్ని ప్రతిపాదిస్తున్నాడా? ఇది కడు ఆశ్చర్యకరమైన విషయం కదూ!" అని వారు అనేవారు (సాద్-5). అందుకే తరువాతి ఆయతులో దేవుని ఏకత్వపు నిదర్శనాలు తెలుపబడ్డాయి.

188. ఈ ఆయతు ఎంతో సమగ్రమైనది. విశ్వ వ్యవస్థ నిర్మాణానికి, దాని నిర్వహణకు, ప్రణాళికకు సంబంధించిన ఏడు ముఖ్యాంశాలు ఇందులో ఒకేచోట చేర్చబడ్డాయి. మరే ఆయతులోనూ ఇన్ని ప్రధానాంశాలు రాలేదు. 1. భూమ్యాకాశాల నిర్మాణం. వాటి వైశాల్యం, ఔన్నత్యం గురించి వర్ణించటం ఎవరితరమూ కాదు. 2. రేయింబవళ్లు ఒకదాన్ని తరుముకుంటూ ఇంకొకటి రావటం, పగటి వెలుగు, రాత్రి చీకటి మానవుల కార్యక్రమాలను, విశ్రాంతి సమయాన్ని నిర్ధారించుకోవటంలో ఎంతగానో దోహదపడుతున్నాయి. పగలు సుదీర్ఘంగా ఉన్నప్పుడు రాత్రి కుదించబడటం, రేయి పెరిగినప్పుడు పగలు తరగటం - ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పరచబడింది. 3. సముద్రాలలో పయనించే ఓడలు. వాటి ద్వారా టన్నుల కొద్దీ వర్తక సామగ్రి ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి తరలించబడుతుంది. 4. భూమి సస్యశ్యామలంగా, పైరుపచ్చగా ఉండటానికి ఆకాశం నుంచి వర్షాలు కురవటం ఎంతో అవసరం. అల్లాహ్‌యే గనక ఆ కారుణ్య జల్లును కురిపించకపోతే నేల బీటలు వారుతుంది. అన్నపానీయాలు లేకుండా పోతాయి. అనావృష్టి వల్ల కరువు కాటకాలు సంభవిస్తాయి. పశుగ్రాసం లేకుండా పోతుంది. దేవుని ఈ ఆగ్రహోదగ్ర స్థితికి మానవుడు తట్టుకోలేడు. కాబట్టి ఇంగిత జ్ఞానమున్నవారు ఆకాశం నుంచి కురిసే ఈ వర్షంపై ఆలోచించాలి. 5. ధరణిలో నలువైపులా వ్యాపించి ఉన్న ప్రాణుల్లో సయితం సూచనలున్నాయి. పశువుల పుట్టుక, ఎగుమతి దిగుమతుల్లో వాటి ఉపయోగం, వ్యవసాయం కోసం అవి ఉపయోగపడుతున్న తీరు, యుద్ధాలు ప్రయాణాల కోసం కూడా వాటిని వాడుకోవటం, పాల ఉత్పత్తి, మాంసాహార సేకరణ - ఇన్ని విధాలుగా పశువులు మనుజ జాతికి ఉపయోగపడుతున్నాయి. 6. ఇక గాలులనే చూడండి - చల్లని గాలులు, వేడి గాలులు, రుతుపవనాలు, ఫలప్రదం కాని పవనాలు, అతి శీతల వాయువులు - నలు దిక్కుల నుంచీ వీస్తూ మానవ మనుగడకు దోహదపడు

وَمِنَ النَّاسِ مَنْ يَّتَّخِذُ مِنْ دُوْنِ اللّٰهِ اَنْدَادًا يُّحِبُّوْنَهُمْ كَحُبِّ اللّٰهِ ؕ وَالَّذِيْنَ اٰمَنُوْٓا اَشَدُّ حُبًّا لِّلّٰهِ ؕ وَلَوْ يَرَى الَّذِيْنَ ظَلَمُوْٓا اِذْ يَرَوْنَ الْعَذَابَ ۙ اَنَّ الْقُوَّةَ لِلّٰهِ جَمِيْعًا ۙ وَّاَنَّ اللّٰهَ شَدِيْدُ الْعَذَابِ ﴿165﴾

**165** కాని అల్లాహ్‌ను కాదని ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టి, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమించేవారు కూడా ప్రజలలో కొందరు ఉన్నారు.[189] అయితే విశ్వసించినవారు అల్లాహ్‌ను అంతకంటే ప్రగాఢంగా(అధికంగా) ప్రేమిస్తారు.[190] సర్వశక్తులూ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయనీ, అల్లాహ్ చాలా కఠినంగా శిక్షించేవాడన్న యదార్థాన్ని ముష్రిక్కులు, అల్లాహ్ విధించే శిక్షలను చూసిన తరువాత తెలుసుకునే బదులు, ఇప్పుడే తెలుసుకుంటే ఎంత బాగుంటుంది! (తెలుసుకుంటే వారు ఈ షిర్క్ పాపానికి ఒడిగట్టరు).

తున్నాయి. 7. ఇక కురిసే మేఘాలు – వాటిని అల్లాహ్ తాను కోరిన ప్రదేశాలలో కురిపిస్తాడు. ఇదంతా ఒక్కడైన ఆ దేవుని అద్భుత శక్తికి ప్రతీక కాదా? ఇవన్నీ ఆయన నిదర్శనాలు కావా?? ఈ సృష్టి ప్రక్రియలోగానీ, ఈ వ్యూహరచనలోగానీ, ఈ కార్యనిర్వహణలోగానీ వేరొకరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? లేరు. ముమ్మాటికీ లేరు. మరలాంటప్పుడు ఆ దైవాన్ని వదిలిపెట్టి ఇతరులను తమ అక్కరలు తీర్చేవారుగా భావించటం ఎంతవరకు సమంజసం? ఇది వివేకవంతమైన పనేనా? – ఆలోచించండి!

189. అల్లాహ్ తన దైవత్వానికి సంబంధించిన ఇన్ని స్పష్టమయిన నిదర్శనాలను ఇచ్చినప్పటికీ, అల్లాహ్‌ను కాదని ఇతరులను పూజించేవారు, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా చిల్లరదేముళ్ళను ప్రేమించేవారు లోకంలో ఉన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రభవించిన కాలంలోనే కాదు, ఈ కాలంలోనూ షిర్క్ (బహు దైవారాధన)కు సంబంధించిన అటువంటి ప్రదర్శనలు లెక్కకు మించి కనిపిస్తాయి. ఇస్లాం పేరు చెప్పుకునే ప్రబుద్ధులలో సయితం ఈ రుగ్మత ప్రబలి ఉంది. వీళ్లు దైవేతరులను, పీర్లను, ఫకీర్లను, బాబాలను ఆరాధ్య దైవాలుగా కొలవటమే గాకుండా అల్లాహ్‌కన్నా అధికంగా వారిని అభిమానిస్తున్నారు. దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి నొక్కి వక్కాణించినపుడు ఆనాటి ముష్రిక్కులు ఎంతగా రెచ్చిపోయేవారో, వీళ్లూ అంతగానే రెచ్చిపోతుంటారు. పరిస్థితుల ఆ స్వరూపాన్ని అల్లాహ్ ఈ ఆయతులో ఈ విధంగా చిత్రీకరించాడు: "అల్లాహ్ ఒక్కని గురించి ప్రస్తావించినప్పుడు పరలోకాన్ని నమ్మనివారి గుండెలు అక్కసుతో ఉడికిపోతాయి. మరి అల్లాహ్ తప్ప ఇతరుల గురించి చెప్పినప్పుడు మాత్రం అవి ఆనందంతో విప్పారుతాయి." (అజ్జుమర్ – 45).

190. కాని విశ్వాసులు (మోమిన్లు) మాత్రం ఇందుకు భిన్నంగా, ఒక్క అల్లాహ్‌నే ఆరాధిస్తారు. వారు అల్లాహ్ యెడల అమితమైన ప్రేమను కలిగి ఉంటారు. ముష్రిక్కులది మాత్రం ద్వంద్వ స్వభావం. ఆపదల్లో ఉన్నప్పుడు వారు తమ ఇష్ట దేవతలను మరచిపోయి, ఒక్కడైన అల్లాహ్‌నే మొరపెట్టుకుంటారు. సముద్రపు తుఫానులలో చిక్కుకున్నప్పుడు వారికి తమ కుల దైవాలు గుర్తుకు రావు. గండం గట్టెక్కడానికి సర్వలోక ప్రభువు ఆసరా తప్ప మరో ఆశ్రయం వారికి ఉండదు. ఆ దృశ్యాలనే ఖుర్ఆన్ ఎంతో చక్కగా చిత్రీకరించింది: 1. "వారు పడవలోకి ఎక్కినపుడు తమ ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకుంటారు" (అన్‌కబూత్ – 65). 2. "(సముద్రంలో) వారి మీదకు ఒక కెరటం నీడల మాదిరిగా క్రమ్ముకుని వచ్చినపుడు వారు తమ ధర్మాన్ని పూర్తిగా అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని ఆయన్ని మొరపెట్టుకుంటారు" (లుఖ్మాన్ – 32). 3. "అకస్మాత్తుగా ఎదురుగాలి ఉధృతమై అన్ని దిశల నుండి అలల తాకిడి తగలగా ప్రయాణీకులు తాము తుఫానులో చిక్కుకుపోయామని తెలుసుకుంటారు. ఆ సమయంలో అందరూ తమ ధర్మాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకుంటారు" (యూనుస్ – 22).

**166** ఆ సమయంలో, వీళ్ళచేత అనుసరించబడిన నాయకులు తమ అనుచరులతో తమకు ఏ మాత్రం సంబంధం లేనట్లుగా ప్రవర్తిస్తారు. ఇంకా వారు శిక్షను కళ్ళారా చూసుకుంటారు. వారి మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలన్నీ తెగిపోతాయి.

إِذْ تَبَرَّأَ الَّذِينَ اتُّبِعُوا مِنَ الَّذِينَ اتَّبَعُوا وَرَأَوُا
الْعَذَابَ وَتَقَطَّعَتْ بِهِمُ الْأَسْبَابُ ﴿166﴾

**167** అప్పుడు (కనువిప్పు కలిగిన) అనుచరులు ఇలా అంటారు: "మేమే గనక మరోసారి ప్రాపంచిక జీవితం వైపుకు మరలించ బడటమంటూ జరిగితే వీరు (ఈ అయ్యవార్లు) మా పట్ల ఇక్కడ విసుగును ప్రదర్శించినట్లే మేమూ వీరిపట్ల విసుగును ప్రదర్శించే వారం."[191] ఈ విధంగా వారు సిగ్గుతో కుంచించుకుపోయే విధంగా అల్లాహ్ వారి కర్మలను వారికి చూపిస్తాడు. అయినాసరే వారు నరకం నుంచి బయట పడటమన్నది అసంభవం.

وَقَالَ الَّذِينَ اتَّبَعُوا لَوْ أَنَّ لَنَا كَرَّةً فَنَتَبَرَّأَ
مِنْهُمْ كَمَا تَبَرَّءُوا مِنَّا ۗ كَذَٰلِكَ يُرِيهِمُ اللَّهُ
أَعْمَالَهُمْ حَسَرَاتٍ عَلَيْهِمْ ۖ وَمَا هُمْ بِخَارِجِينَ
مِنَ النَّارِ ﴿167﴾

**168** ప్రజలారా! భూమిలోని ధర్మసమ్మతమైన, పవిత్రమైన వస్తువులన్నింటినీ తినండి. కాని షైతాన్ అడుగుజాడలలో మాత్రం నడవకండి.[192] వాడు మీకు బహిరంగ శత్రువు.

يَا أَيُّهَا النَّاسُ كُلُوا مِمَّا فِي الْأَرْضِ حَلَالًا طَيِّبًا
وَلَا تَتَّبِعُوا خُطُوَاتِ الشَّيْطَانِ ۚ إِنَّهُ لَكُمْ عَدُوٌّ
مُبِينٌ ﴿168﴾

**169** వాడు మిమ్మల్ని కేవలం చెడు వైపుకు, నీతి బాహ్యత వైపుకు పురికొల్పుతాడు. ఏ విషయాల జ్ఞానం మీకు లేదో వాటిని అల్లాహ్ పేరుతో చెప్పమని మీకు ఆజ్ఞాపిస్తాడు.

إِنَّمَا يَأْمُرُكُمْ بِالسُّوءِ وَالْفَحْشَاءِ وَأَنْ
تَقُولُوا عَلَى اللَّهِ مَا لَا تَعْلَمُونَ ﴿169﴾

**170** "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, "మా తాతలు తండ్రులు అవలం బిస్తూ ఉండగా చూచిన పద్ధతినే మేము పాటిస్తాము" అని వారు సమాధానమిస్తారు. వారి పూర్వీకులు ఒట్టి అవివేకులు, మార్గ విహీనులైనప్పటికీ (వీళ్లు వారినే అనుసరిస్తారన్నమాట!)[193]

وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنْزَلَ اللَّهُ قَالُوا بَلْ
نَتَّبِعُ مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءَنَا ۗ أَوَلَوْ كَانَ
آبَاؤُهُمْ لَا يَعْقِلُونَ شَيْئًا وَلَا يَهْتَدُونَ ﴿170﴾

191. పరలోకంలో – దైవసమక్షంలో – తాము ఆరాధించిన పీర్లు, బాబాల నిస్సహాయ స్థితిని చూసి ముష్రిక్కులు సిగ్గుతో కుంచించుకుపోతారు. కాని వారి ఈ పశ్చాత్తాపం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. ప్రపంచంలోనే వారికి ఆ జ్ఞానోదయం అయివుంటే అది వారికి లాభదాయకం అయి ఉండేది.

192. అంటే షైతాన్ అడుగుజాడల్లో నడిచి అల్లాహ్ ధర్మసమ్మతం (హలాల్) గావించిన వస్తువులను అనవసరంగా నిషిద్ధం (హరాం) చేసుకోకండి. బహుదైవోపాసకులనే చూడండి, వారు తమ దేవీదేవతల పేర వదలిన జంతువులను తినటాన్ని హరామ్ చేసుకున్నారు. దీని వివరాలు అల్ అన్ఆమ్ సూరాలో వస్తాయి. అల్లాహ్ ఇలా సెలవిచ్చినట్లు మహాప్రవక్త (సఅసం) తెలిపారు : "నేను నా దాసులను ఏకదైవారాధకులు (హనీఫ్) గానే పుట్టించాను. కాని షైతానులు వాళ్ళను వారి ధర్మం నుండి పెడత్రోవ పట్టించారు. వారి కోసం నేను సమ్మతించిన విషయాలను వారిపై నిషిద్ధంగా చేశారు" (సహీహ్ ముస్లిం).

193. అంతెందుకూ, ఈ కాలపు బిద్అతీలనే (ధర్మంలో లేనిపోని కొత్త విషయాలను సృష్టించేవారినే) చూడండి – మీరు

وَمَثَلُ الَّذِينَ كَفَرُوا كَمَثَلِ الَّذِي يَنْعِقُ بِمَا لَا يَسْمَعُ إِلَّا دُعَاءً وَنِدَاءً ۚ صُمٌّ بُكْمٌ عُمْيٌ فَهُمْ لَا يَعْقِلُونَ ﴿١٧١﴾

**171** సత్య తిరస్కారుల ఉపమానం పశువుల కాపరి యొక్క కేకను, అరుపును మాత్రమే వినే పశువుల వంటిది (ఆలోచన అన్నమాటే ఉండదు). వారు చెవిటివారు, మూగవారు, గ్రుడ్డి వారు. వారు అర్థం చేసుకోరు.[194]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُلُوا مِنْ طَيِّبَاتِ مَا رَزَقْنَاكُمْ وَاشْكُرُوا لِلَّهِ إِنْ كُنْتُمْ إِيَّاهُ تَعْبُدُونَ ﴿١٧٢﴾

**172** ఓ విశ్వసించిన వారలారా! మీరు కేవలం అల్లాహ్‌ను ఆరాధించేవారే అయితే మేము మీకు ప్రసాదించిన పవిత్రమైన వస్తువులను తినండి, త్రాగండి, అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపండి.[195]

إِنَّمَا حَرَّمَ عَلَيْكُمُ الْمَيْتَةَ وَالدَّمَ وَلَحْمَ الْخِنْزِيرِ وَمَا أُهِلَّ بِهِ لِغَيْرِ اللَّهِ ۖ فَمَنِ اضْطُرَّ غَيْرَ بَاغٍ وَلَا عَادٍ فَلَا إِثْمَ عَلَيْهِ ۚ إِنَّ اللَّهَ غَفُورٌ رَحِيمٌ ﴿١٧٣﴾

**173** అల్లాహ్ మీ కొరకు నిషేధించినవి ఇవే: చచ్చిన జంతువులు, (ప్రవహించిన) రక్తం, పందిమాంసం, ఇంకా అల్లాహ్ తప్ప ఇతరుల పేరు ఉచ్చరించబడినది.[196] ఎవరయినా ఉద్దేశపూర్వకంగా కాకుండా, హద్దులను అతిక్రమించకుండా– గత్యంతరం లేని స్థితిలో – తింటే పాపం కాదు. నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, జాలి చూపేవాడు.

చేసే ఈ పనులకు దీన్ (ధర్మం)లో ఎలాంటి ఆధారం లేదు కదా! అని అంటే, మా తాతముత్తాతల కాలం నుంచి ఇది ఆనవాయితీగా వస్తోంది, ఇప్పుడు మేము చెయ్యకూడదంటే ఎలా? అని జవాబు ఇస్తారు. వాస్తవానికి వారి తాతముత్తాతలు కూడా ధర్మావగాహన లేనివారే. వారు సయితం సన్మార్గానికి నోచుకోలేదు. కాబట్టి షరీయత్ నిదర్శనాలు ముందుకు వచ్చేసిన తరువాత తాతముత్తాతల ఆచారాలను పట్టుకు వ్రేలాడటం తప్పు. అలాగే దైవోపదేశం, దైవప్రవక్త (స) మార్గం స్పష్టమైపోయాక తమ ఇమాములు, విద్వాంసులు క్రోడీకరించి ఇచ్చిన అంశాలనే ప్రమాణబద్ధంగా తీసుకోవటం సమంజసం కాదు. అల్లాహ్ ముస్లిం సోదరులను ఈ ఊబి నుంచి వెలికి తీయుగాక!

194. తమ పూర్వీకుల అంధానుసరణలో బుద్ధివివేకాలను స్థంభింపజేసుకున్న సత్య తిరస్కారులను పశువుల మందతో పోల్చటం జరిగింది. పశువుల కాపరి కేకవేసి పిలిచినపుడు అతని పిలుపును మాత్రం అవి వింటాయి. కాని అతను ఎందుకు కేకేశాడో ఆలోచించవు. ఈ అనుయాయుల పరిస్థితీ ఇంతే. వారు సత్యవాణిని వినలేని బధిరులు. సత్యం పలకలేని మూగజీవులు. సత్యాన్ని చూడలేని అంధులు. సత్య సందేశం, దేవుని ఏకత్వపు సందేశం, దైవప్రవక్త (స) విధానం గురించి ఏమాత్రం మెదడుకు మేత పెట్టని బద్ధకస్థులు. ఈ ఆయతులో **దుఆ, నిదా** అనే రెండు పదాలు ఉపయోగించబడ్డాయి. దగ్గర్లో ఉన్న వాటిని పిలువటానికి దుఆ, దూరంలో ఉన్నవాటిని పిలువటానికి నిదా అనే పదాలు ఉపయోగిస్తారు. వాటినే మేము అరుపు, కేక అని తర్జుమా చేశాం.

195. పవిత్రమైన వస్తువులన్నింటినీ భుజించాలనీ, అల్లాహ్‌కు కృతజ్ఞులై మెలగాలనీ ఇందులో విశ్వాసులకు తాకీదు చేయబడింది. 1. అల్లాహ్ ధర్మసమ్మతం గావించిన వస్తువులే పవిత్రం, పరిశుద్ధమనీ, నిషిద్ధ వస్తువులన్నీ అపవిత్రం మరియు అశుద్ధమైనవనీ దీనిద్వారా అవగతం అవుతోంది. నిషిద్ధ వస్తువులు శరీరానికి ఎంత శక్తినీ, మనసుకు ఎంత తృప్తిని ఇచ్చినప్పటికీ (పాశ్చాత్యులకు పంది మాంసం ఎంతో ఇష్టమైనట్లుగా) అవి అపవిత్రమైనవే. 2. దాంతో పాటు బహు దైవారాధకులు తమ దేవీదేవతల పేరు మీద అచ్చువేసి వదలిపెట్టిన జంతువులను, వస్తువులను తమ కోసం హరామ్ చేసుకుంటారు (అల్ అన్ఆమ్ సూరాలో వివరాలు ఉన్నాయి). వారి ఈ చేష్ట అధర్మం. వారు తమ కోసం ఒక వస్తువును నిషేధించుకున్నంత మాత్రాన శాస్త్రబద్ధంగా అది నిషిద్ధ వస్తువు కాబోదు. కాబట్టి మీరు

إِنَّ الَّذِينَ يَكْتُمُونَ مَا أَنْزَلَ اللَّهُ مِنَ الْكِتٰبِ
وَيَشْتَرُونَ بِهِ ثَمَنًا قَلِيلًا أُولٰٓئِكَ مَا يَأْكُلُونَ
فِي بُطُونِهِمْ إِلَّا النَّارَ وَلَا يُكَلِّمُهُمُ اللَّهُ يَوْمَ
الْقِيٰمَةِ وَلَا يُزَكِّيهِمْ وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿174﴾

**174** అల్లాహ్ తన గ్రంథంలో అవతరింపజేసిన విషయాలను దాచేవారు, వాటిని కొద్దిపాటి ధరకు అమ్ముకునేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు. ప్రళయ దినాన అల్లాహ్ వారితో అస్సలు మాట్లాడడు. వారిని పరిశుద్ధపరచడు. పైపెచ్చు వారికి బాధాకరమైన శిక్ష కలదు.

ఈ ముష్రిక్కుల మాదిరిగా హలాల్ వస్తువులను హరామ్ చేసుకోకండి. (హరామ్ చేయబడిన వస్తువులు ఏవేవో తరువాతి వచనంలో వివరించబడ్డాయి). 3. మీరు నిజంగా ఒకే దైవాన్ని ఆరాధించేవారైతే వీలయినంత అధికంగా ఆయనకు కృతజ్ఞతలు చెల్లించండి.

196. ఈ ఆయతులో నాల్గు నిషిద్ధ (హరామ్) వస్తువుల ప్రస్తావన వచ్చింది. అయితే అరబీ మూలంలో **'ఇన్నమా'** (إِنَّمَا) అనే పద ప్రయోగం జరగటం వల్ల ఈ నాలుగు వస్తువులు మాత్రమే నిషిద్ధం కాబోలు! అన్న సంశయం కలుగుతుంది. కాని వీటితోపాటు మరికొన్ని వస్తువులు కూడా హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేయబడ్డాయి. కాబట్టి ఈ 'ఇన్నమా' అనే పదప్రయోగం ఒకానొక ప్రత్యేక నేపథ్యంలో జరిగిందని గ్రహించాలి. అంటే ముష్రిక్కులు ధర్మసమ్మతమైన వాటిని సయితం తమ కొరకు అధర్మం చేసుకోవటాన్ని ఎత్తిచూపిస్తూ ఇలా అనబడింది: 'నిషిద్ధ వస్తువులు అవి కావు, నిజానికి నిషిద్ధ వస్తువులు ఇవి' అని అల్లాహ్ చెప్పదలిచాడు. దీన్నే "హస్రె ఇజాఫీ" అని అంటారు. అంటే ఇవిగాక మరికొన్ని నిషిద్ధ వస్తువులు కూడా ఉన్నాయన్నమాట!

జంతువుల ధర్మసమ్మతికి, నిషిద్ధానికి సంబంధించిన రెండు సూత్రాలు హదీసులో తెలియపరచబడ్డాయి. ఈ ఆయతుకు సరైన వివరణగా అవి మన దృష్టిలో మెదలుతూ ఉండాలి. క్రూర మృగాలలో గోళ్ళతో, కోరలతో వేటాడేవి, పక్షి జాతికి చెందినవాటిలో కాళ్ళతో తన్నుకుపోయేవి నిషిద్ధాలు. హదీసులో నిషిద్ధంగా నిరూపితమైన వేరితర జంతువులు కూడా హరామే. ఉదాహరణకు : గాడిద, కుక్క లాంటివి కూడా నిషిద్ధమే. దీన్నిబట్టి రూఢీ అయ్యే మరో ముఖ్యవిషయం ఏమిటంటే ఖుర్ఆన్ మాదిరిగా హదీసు కూడా దీన్ (ధర్మం)కు మూలాధారమే. ఖుర్ఆన్‌తో పాటు హదీసును కూడా నమ్మి నడుచుకున్నప్పుడు మాత్రమే ధర్మం పరిపూర్ణం అవుతుంది. హదీసును ఉపేక్షించి కేవలం ఖుర్ఆన్‌ను అనుసరిస్తామని ఎవరయినా అంటే అది సరైనది కాదు.

ఇక చచ్చిన జంతువు అంటే అర్థం జిబహ్ చేయకుండానే సహజ మరణం పొందిన లేక ప్రమాదం జరిగి చచ్చిపోయిన హలాల్ జంతువు అన్నమాట! (దీనికి సంబంధించిన వివరాలు అల్ మాయిద సూరాలో వస్తాయి) లేదా షరీయత్ సూచించిన పద్ధతికి విరుద్ధంగా జిబహ్ చేయబడిన జంతువు. అంటే గొంతు పిసకటం ద్వారానో, కర్రతో బాదటం ద్వారానో, రాయి విసరటం ద్వారానో ప్రాణం తీయబడినది అని భావం. అయితే హదీసులో రెండు మృత జంతువులు హలాల్ (ధర్మసమ్మతం) అని స్పష్టంగా చెప్పబడింది. 1. చేప. 2. మిడుత. ఈ 'మృత' ఆదేశం నుంచి ఈ రెండు జంతువులకూ మినహాయింపు ఉంది. 'రక్తం' అంటే జంతువును జిబహ్ చేసే సమయంలో ప్రవహించే రక్తం అన్నమాట! జిబహ్ తరువాత కూడా మాంసానికి రక్తం ఒకవేళ అంటుకుని ఉన్నా ఫరవాలేదు. హదీసు ప్రకారం రక్తంతో కూడుకున్న కాలేయం, గుల్మం కూడా ధర్మ సమ్మతమే.

పంది మాంసం నిషిద్ధం. అది అత్యంత నీచమైన, పరమ జుగుప్సాకరమైన జంతువు. అల్లాహ్ దీనిని హరామ్‌గా ఖరారు చేశాడు. అలాగే దైవేతరుని పేరు ఉచ్చరించబడిన జంతువు లేక వస్తువు కూడా నిషిద్ధమే. అంటే అల్లాహ్ పేరుమీద గాక వేరొకరి పేరు మీద జిబహ్ చేయబడిన జంతువు. ఉదాహరణకు : అరబ్బు ముష్రిక్కులు అల్లాహ్ పేరు మీద గాకుండా లాత్, ఉజ్జా తదితర దేవతల పేరున జంతువులను కోసేవారు. జోరాష్ట్రియన్లు అగ్ని పేరున కోసేవారు.

ధర్మజ్ఞానం లేని ముస్లింలు చనిపోయిన తమ పూర్వీకుల పట్ల గల అభిమానాన్ని, భక్తినీ చాటుకోవటానికి, వారి ప్రసన్నతను చూరగొనడానికి, వారి ద్వారా తమ అక్కరలు తీర్చుకోవటానికి సమాధుల వద్ద, దర్గాల వద్ద, ఆస్థానాల

**175** అపమార్గాన్ని సన్మార్గానికి బదులుగా, శిక్షను క్షమాభిక్షకు బదులుగా కొనుక్కున్నవారు వీరే. వారు నరకాగ్నిని ఎలా భరిస్తారో?!

أُولَٰئِكَ الَّذِينَ اشْتَرَوُا الضَّلَالَةَ بِالْهُدَىٰ وَالْعَذَابَ بِالْمَغْفِرَةِ ۚ فَمَا أَصْبَرَهُمْ عَلَى النَّارِ ﴿١٧٥﴾

**176** ఇలా ఎందుకు జరిగిందంటే, అల్లాహ్ సత్యంతో కూడు కున్న గ్రంథాన్ని అవతరింపజేయగా, ఈ గ్రంథంతో విభేదించే వారు, తమ పెడసరి ధోరణిలో బహుదూరం వెళ్ళిపోయారు.

ذَٰلِكَ بِأَنَّ اللَّهَ نَزَّلَ الْكِتَابَ بِالْحَقِّ ۗ وَإِنَّ الَّذِينَ اخْتَلَفُوا فِي الْكِتَابِ لَفِي شِقَاقٍ بَعِيدٍ ﴿١٧٦﴾

**177** మీరు మీ ముఖాలను తూర్పు దిక్కుకో, పడమర దిక్కుకో తిప్పటమే సదాచరణ కాదు. సదాచరణ అంటే[197] వాస్తవానికి అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ, దైవదూతలనూ, దైవగ్రంథాన్నీ, దైవ ప్రవక్తలనూ విశ్వసించటం. ధనప్రీతి ఉన్నప్పటికీ సమీప బంధువు లకు, అనాథలకు, అగత్యపరులకు, బాటసారులకు, యాచించే

لَيْسَ الْبِرَّ أَن تُوَلُّوا وُجُوهَكُمْ قِبَلَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ وَلَٰكِنَّ الْبِرَّ مَنْ آمَنَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ وَالْمَلَائِكَةِ وَالْكِتَابِ وَالنَّبِيِّينَ وَآتَى الْمَالَ عَلَىٰ حُبِّهِ ذَوِي الْقُرْبَىٰ وَالْيَتَامَىٰ وَالْمَسَاكِينَ وَابْنَ السَّبِيلِ

వద్ద జిబహ్ చేసే జంతువులు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఈ సందర్భంగా జంతువులను జిబహ్ చేస్తున్నప్పుడు అల్లాహ్ పేరు చెప్పినప్పటికీ అవి ధర్మసమ్మతం కాజాలవు. ఎందుకంటే ఈ తతంగం వెనుక వారి ఉద్దేశం దైవప్రసన్నతను పొందటం ఎంతమాత్రం కాదు. సమాధిలో వున్న వ్యక్తిని మెప్పించటానికి, దైవేతరుని సంతోషాన్ని బడయటానికి మాత్రమే వారు ఈ తతంగాన్ని జరిపించారు. కాబట్టి ఇది షిర్క్. అదేవిధంగా జంతువులు మాత్రమే గాకుండా దైవేతరుల పేరిట వారు సమర్పించే ఇతరత్రా వస్తువులు, నజరానాలు, నైవేద్యాలు – అన్నీ అధర్మంగానే పరిగణించబడతాయి. ఉదాహరణకు: దర్గాల, సమాధుల వద్దకు ఆహార వస్తువులు, వస్త్రాలు తీసుకువెళ్ళి కానుకగా సమర్పించుకోవటం, దర్గా చుట్టూ తిష్ఠవేసిన వారికి తినిపించటం, మిఠాయిలు పంచిపెట్టడం, హుండీలో నగదు వేయటం, ఉరుసుల సందర్భంగా పాలు, పండ్లు ఫలహారాలు పంపించటం – ఇవన్నీ హరామ్ కోవలోకే వస్తాయి. ఎందుకంటే ఇవన్నీ దైవేతరుని పేర చేసుకున్న మొక్కుబడులు. మొక్కుబడులు కూడా నమాజ్, రోజాల మాదిరిగా ఆరాధనలే. కాగా; ఆరాధన అన్నది ఒక్క అల్లాహ్‌కే ప్రత్యేకం కావాలి. అది ఇతరుల పేర జరిగితే షిర్క్ (బహుదైవారాధన) అవుతుంది. అందుకే హదీసులో అనబడింది – "దైవేతరుని పేర జంతువును బలి ఇచ్చినవాడు శాపగ్రస్తుడు" అని! (సహీహ్ అల్ జామె).

"తఫ్సీరె అజీజీ"లో నీషాపూరీ వ్యాఖ్యానం ఆధారంగా ఇలా అనబడింది : "ఏ ముస్లిం అయినాసరే దైవేతరుని సామీప్యం పొందే సంకల్పంతో జంతువును జిబహ్ చేస్తే అతడు ధర్మభ్రష్టుడు అయిపోతాడు, అతను చేసిన జిబహ్ ఒక ధర్మభ్రష్టుడు ఇచ్చిన జంతు బలి అవుతుంది అన్న విషయంలో పండితుల మధ్య ఏకాభిప్రాయం ఉంది" (అల్ అన్ఆమ్ సూరా 145వ ఆయతు, అన్ నహ్ల్ సూరా 115వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను కూడా చూడండి).

197. అసలు ఈ ఆయతు 'ఖిబ్లా' నేపథ్యంలోనే అవతరించింది. ఒకవైపు నుంచి (బైతుల్ మఖ్దిస్ పడమటి భాగాన్ని శ్రేష్ఠమైనదిగా భావించే) యూదులు, మరోవైపు నుంచి (బైతుల్ మఖ్దిస్ తూర్పు ప్రాంతానికి ప్రాముఖ్యం ఇచ్చే) క్రైస్తవులు ముస్లింల 'ఖిబ్లా' మార్పుపై రాద్ధాంతం చేస్తూ ఉండగా కొందరు ముస్లింల మనసు నొచ్చుకునేది. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి, తూర్పు వైపుకో, పడమర వైపుకో ముఖాన్ని త్రిప్పటం స్వతహాగా సత్కార్యం ఏమీ కాదని, ఒక కేంద్రస్థానం కోసమే (సామూహిక లక్ష్యం కోసం) ఈ 'ఖిబ్లా' అనేది నిర్ధారితం అవుతుందనీ చెప్పదలిచాడు. ఇంకా అల్లాహ్ క్రింది విషయాలను కూడా ఈ సందర్భంగా స్పష్టపరిచాడు :

నిజానికి సత్కార్యం అంటే ధర్మం యొక్క మౌలికాంశాలపై దృఢవిశ్వాసం కలిగి ఉండాలి. దైవం సూచించిన మంచిపనులను సజావుగా నిర్వర్తించాలి. నీతీ నడవడికలను కలిగి ఉండాలి. అల్లాహ్‌ను విశ్వసించటమంటే ఖుర్ఆన్

وَ السَّآئِلِيْنَ وَفِي الرِّقَابِ ۚ وَاَقَامَ الصَّلٰوةَ وَ
اٰتَى الزَّكٰوةَ ۚ وَالْمُوْفُوْنَ بِعَهْدِهِمْ اِذَا عٰهَدُوْا ۚ
وَالصّٰبِرِيْنَ فِي الْبَاْسَآءِ وَالضَّرَّآءِ وَحِيْنَ الْبَاْسِ ۗ
اُولٰٓئِكَ الَّذِيْنَ صَدَقُوْا ۗ وَاُولٰٓئِكَ هُمُ الْمُتَّقُوْنَ ﴿177﴾

వారికి (ధనాన్ని) ఇవ్వటం, బానిసలకు విముక్తి నొసగటం, నమాజును నెలకొల్పటం, జకాతును చెల్లిస్తూ ఉండటం, ఇచ్చిన మాటను నిలుపుకోవటం, లేమిలో కష్టకాలంలో, యుద్ధ సమయాలలో సహన స్థయిర్యాలను కనబరచటం– ఇవన్నీ కలిగి వున్నవారే వాస్తవానికి సత్యమూర్తులు. భయభక్తులు కలవారు కూడా వీరే.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُتِبَ عَلَيْكُمُ الْقِصَاصُ فِي
الْقَتْلٰى ۗ اَلْحُرُّ بِالْحُرِّ وَالْعَبْدُ بِالْعَبْدِ وَالْاُنْثٰى
بِالْاُنْثٰى ۗ فَمَنْ عُفِيَ لَهٗ مِنْ اَخِيْهِ شَيْءٌ فَاتِّبَاعٌ ۢ
بِالْمَعْرُوْفِ وَاَدَآءٌ اِلَيْهِ بِاِحْسَانٍ ۗ ذٰلِكَ تَخْفِيْفٌ

**178** ఓ విశ్వాసులారా! హతుల విషయంలో ప్రతీకార న్యాయం (ఖిసాస్) మీ కొరకు విధిగా నిర్ణయించబడింది. స్వతంత్రునికి బదులుగా స్వతంత్రుణ్ణి, బానిసకు బదులుగా బానిసను, స్త్రీకి బదులుగా స్త్రీని (మాత్రమే) హతమార్చాలి.[198] ఒకవేళ హతుని సోదరుడు హంతకుణ్ణి కనికరించదలిస్తే అతను రక్తశుల్కాన్ని

హదీసులలో సూచించబడినట్లుగా ఆయన అస్థిత్వాన్నీ, ఆయన గుణగణాలను, ఆయన అధికారాలను వక్రభాష్యాలు చెప్పకుండా, ఉపమానాలు ఇవ్వకుండా విశ్వసించాలి. ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టకూడదు. ఆయన ఆజ్ఞలన్నింటినీ శిరసావహించాలి. అంతిమ దినాన్ని విశ్వసించటమంటే అర్థం శిక్షాబహుమానాల దినాన్ని, స్వర్గనరకాలను నమ్మటం. అలాగే దైవగ్రంథాన్ని విశ్వసించటమంటే అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలన్నింటినీ నమ్మాలన్న భావం అందులో అంతర్లీనమై ఉంది. దైవదూతల ఉనికిని సత్యమని ధృవీకరించాలి. దైవప్రవక్తలందరి రాకను నిజమని నమ్మాలి. ఈ విశ్వాసాలతో పాటు (అంటే దేవుని హక్కులతోపాటు) సత్కార్యాలు (దాసుల హక్కులు) కూడా నెరవేర్చాలి. సిరిసంపదల పట్ల ఎంత వ్యామోహం ఉన్నప్పటికీ ఆప్తులకు, అవసరం ఉన్నవారికీ ఎంతో కొంత ఇవ్వాలి. కష్టకాలంలో, ఆర్థిక ఇబ్బందుల్లో కలవరపడకుండా ఆత్మ నిబ్బరంతో పరిస్థితులకు ఎదురీదటం నేర్చుకోవాలి. ఇది చెప్పుకున్నంత సులభం కాదు. చాలా కఠినమయిన విషయం. అయితే కలిమిలో ఉబ్బితబ్బిబ్బవకుండా, లేమిలో కృంగిపోకుండా మసలుకునే సజ్జనులను అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడు. **అల్ బఅ్సా** (اَلْبَاْسَآءِ) అంటే ఆర్థిక లేమి, తీవ్రమైన పేదరికం; **అజ్జర్రా** (اَلضَّرَّآءِ) అంటే నష్టం లేక రోగం; **అల్ బఅ్స** (اَلْبَاْسِ) అంటే యుద్ధం, యుద్ధ తీవ్రత.

198. అజ్ఞాన యుగంలో ఒక నిర్ణీత చట్టం, న్యాయవ్యవస్థ ఉండేవి కావు. అందుచేత బలం, అధికారం ఉన్న తెగలు, వర్గాలు బలహీన వర్గాలపై, నిమ్న తెగలపై దౌర్జన్యం చేసేవి. అడ్డం వచ్చిన వారిని తెగనరికేవి. ఎవరయినా ఏదైనా వర్గానికి చెందిన ఒక వ్యక్తిని చంపితే ప్రతీకారంగా హంతకుణ్ణి చంపేబదులు హంతకుని తెగకు చెందిన అనేకమందిని పొట్టన పెట్టుకునేవారు. ఒక్కోసారి పూర్తి తెగనే మట్టుబెట్టేవారు. ఒక్కోసారి స్త్రీకి బదులుగా పురుషునిపై, బానిసకు బదులుగా యజమానిపై, స్వతంత్రునిపై ప్రతీకారం తీర్చుకునేవారు. అల్లాహ్ ఈ తేడాను, విచక్షణను రూపుమాపుతూ ప్రతీకార న్యాయానికి సంబంధించిన కొన్ని నియమాలను నిర్ధారించాడు. హత్యకు పాల్పడిన వాణ్ణి 'ఖిసాస్' (బదులు)గా హతమార్చాలని ఆదేశించాడు. ఒకవేళ హంతకుడు బానిస అయితే ఆ బానిసనే హతమార్చాలి. హంతకుడు స్వతంత్రుడైతే ప్రతీకారంగా ఆ స్వతంత్రుణ్ణే వధించాలి. స్త్రీకి బదులుగా ఆ స్త్రీనే వధించాలి. హత్యానేరానికి పాల్పడినవాడు పురుషుడైనపుడు స్త్రీని ప్రతీకారంగా చంపటంగానీ, హత్య చేసింది స్త్రీ అయినపుడు ప్రతీకారంగా పురుషుణ్ణి వధించటంగానీ న్యాయం, ధర్మం కాదు. 'ఖిసాస్'లో హంతకుణ్ణి మాత్రమే వధించటం జరుగుతుంది. ఆ హంతకుడు స్త్రీగానీ, పురుషుడుగానీ – ఎవరయినా సరే! మరిన్ని వివరాల కోసం అల్ మాయిద సూరా 45వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి.

న్యాయసమ్మతంగా అడగాలి. హంతకుడు కూడా రక్తధనాన్ని ఉత్తమ రీతిలో అతనికి చెల్లించాలి.[199] ఇది మీ ప్రభువు తరఫున ఇవ్వబడిన వెసులుబాటు, కారుణ్యం.[200] ఆ తరువాత కూడా ఎవరయినా హద్దులు అతిక్రమిస్తే అతనికి వ్యధాభరితమైన శిక్ష ఉంటుంది.[201]

مِّنْ رَّبِّكُمْ وَرَحْمَةٌ ۗ فَمَنِ اعْتَدٰى بَعْدَ ذٰلِكَ فَلَهٗ عَذَابٌ اَلِيْمٌ ﴿178﴾

**179** ఓ బుద్ధిమంతులారా! ఈ ప్రతీకార న్యాయంలోనే మీ జీవనం ఉంది–ఇలా ఉంటేనే మీరు (అమానుషాల నుండి) ఆగి ఉంటారు.[202]

وَلَكُمْ فِي الْقِصَاصِ حَيٰوةٌ يّٰٓاُولِي الْاَلْبَابِ لَعَلَّكُمْ تَتَّقُوْنَ ﴿179﴾

**180** మీలో ఎవరికయినా మరణ ఘడియలు సమీపించి, వారి వద్ద ఆస్తిపాస్తులున్నట్లయితే, వారు తమ తల్లిదండ్రుల, సమీప బంధువుల పేర ఉత్తమరీతిలో వీలునామా వ్రాసిపోవటం విధిగా చేయబడింది.[203] భయభక్తులు కలవారికి ఈ విధ్యుక్త ధర్మం మరింతగా వర్తిస్తుంది.

كُتِبَ عَلَيْكُمْ اِذَا حَضَرَ اَحَدَكُمُ الْمَوْتُ اِنْ تَرَكَ خَيْرًا ۖۚ اِلْوَصِيَّةُ لِلْوَالِدَيْنِ وَالْاَقْرَبِيْنَ بِالْمَعْرُوْفِ ۚ حَقًّا عَلَى الْمُتَّقِيْنَ ﴿180﴾

199. క్షమాభిక్ష రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి : రక్తశుల్కం (లేక నష్ట పరిహారం) తీసుకోకుండా పెట్టే క్షమాభిక్ష. రెండు: ప్రతీకారం తీర్చుకునే బదులు రక్తశుల్కం తీసుకుని వదలివేయటం. రెండో పద్ధతి ననుసరించినప్పుడు రక్తశుల్కం తీసుకోవాలని నిర్ణయించుకున్న (హతుని తరఫు) వ్యక్తి ఉత్తమ రీతిలో మెలగాలి. మరోవైపు హంతకుడు హతుని వారసులకు ఉత్తమరీతిలోనే నష్టపరిహారం చెల్లించాలి. హతుని వారసులు తనకు క్షమాభిక్ష పెట్టి ఉపకారం చేశారు గనక. “ఉపకారానికి బదులు ఉపకారమే కాగలదు” (అర్రహ్మాన్ - 60). కాబట్టి హంతకుడు కూడా ఉపకార భావంతోనే వ్యవహరించాలి.

200. **‘ఖిసాస్’** (ప్రతీకారం), **‘దియత్’** (రక్తశుల్కం), **‘మాఫీ’** (క్షమాభిక్ష) రూపంలో అల్లాహ్ మీకు కల్పించిన సౌకర్యం మామూలు సౌకర్యంకాదు. ఆయనే గనక ఈ విధంగా మీపై దయదలచి ఉండకపోతే మీ మధ్యగల కక్షలు కార్పణ్యాలు ముదిరి నరమేధం నిరంతరాయంగా కొనసాగేది. లోగడ తౌరాత్ గ్రంథాన్ని అనుసరించేవారికి ఖిసాస్ లేదా క్షమాపణ – రెండింటిలో ఏదో ఒకటి ఉండేది. రక్తశుల్కం ఉండేది కాదు. ఇంజీల్ అనుయాయులకు కేవలం క్షమాభిక్ష గురించి చెప్పబడింది. ఇంజీల్లో ఖిసాస్ గురించిగానీ, దియత్ గురించిగానీ ఏమీ అనబడలేదు (ఇబ్నె కసీర్).

201. రక్తశుల్కం (దియత్) తీసుకున్న తర్వాత కూడా ప్రతీకారంతో హత్యకు పాల్పడితే అది తలబిరుసుతనంగా, హద్దుల అతిక్రమణగా పరిగణించబడుతుంది. దానికి ఇహంలోనూ, పరలోకంలోనూ కఠిన శిక్షను అనుభవించవలసి ఉంటుంది. ఎందుకంటే ప్రతీకార చర్యకు పాల్పడి ఇప్పుడు అతను స్వయంగా నేరస్థుడైపోయాడు. నేరస్థుడికి శిక్ష తప్పదు కదా!

202. ‘ఖిసాస్’ (బదులు లేక ప్రతీకారం)గా తాను కూడా చంపబడతానన్న భయం హంతకునికి ఉన్నప్పుడే అతడు హత్యా నేరానికి పాల్పడేందుకు జంకుతాడు. మనుషుల్లో నెలకొనే ఈ ‘ఖిసాస్’ భీతి మూలంగా సమాజంలో రక్తపాతం, హత్యాకాండ వంటివి బహు అరుదుగా జరుగుతాయి. సమాజంలో శాంతి సౌమనస్యాలు నెలకొంటాయి. సవూదీ అరేబియా దేశంలో ఇప్పటికీ ఈ పరిస్థితిని వీక్షించవచ్చు. ఇది కేవలం ఇస్లామీయ శిక్షా విధానం చలువ మాత్రమే. ఇతర ముస్లిం దేశాలు కూడా ఈ శిక్షాస్మృతిని ప్రవేశపెట్టినట్లయితే ప్రజా బాహుళ్యానికి మేలు చేకూర్చినట్లవుతుంది.

203. వసీయతుకు సంబంధించిన ఈ ఆజ్ఞ వారసత్వ పంపకాల ఆయతు అవతరించక ముందు వచ్చింది. అయితే ఇప్పుడీ ఆజ్ఞ రద్దు పరచబడింది. మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: “అల్లాహ్ ప్రతి హక్కుదారునికీ అతని హక్కును ఇచ్చేశాడు (అంటే వారసుల ఆస్తి భాగాలు నిర్ధారించబడ్డాయి). కాబట్టి ఇకమీదట ఏ వారసుని పేరిట

181 వీలునామా (వసీయతు గురించి) విన్న తరువాత కూడా ఏ వ్యక్తయినా దాన్ని మార్చివేస్తే ఆ పాపమంతా ఆ మార్చిన వానిపైనే పడుతుంది. వాస్తవానికి అల్లాహ్ వినేవాడు, తెలిసినవాడూను.

فَمَنۢ بَدَّلَهُۥ بَعْدَمَا سَمِعَهُۥ فَإِنَّمَآ إِثْمُهُۥ عَلَى ٱلَّذِينَ يُبَدِّلُونَهُۥٓ ۚ إِنَّ ٱللَّهَ سَمِيعٌ عَلِيمٌ ﴿١٨١﴾

182 వీలునామా చేసేవాడు పొరబాటున పక్షపాత వైఖరిని అవలంబించాడనో లేక పాపంతో కూడుకున్న శాసనం చేశాడనో భయపడినవారు[204] సంబంధీకులందరినీ పిలిచి, వారందరి మధ్య రాజీ కుదిరిస్తే అందులో దోషం లేదు. అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు కూడా.

فَمَنْ خَافَ مِن مُّوصٍ جَنَفًا أَوْ إِثْمًا فَأَصْلَحَ بَيْنَهُمْ فَلَآ إِثْمَ عَلَيْهِ ۚ إِنَّ ٱللَّهَ غَفُورٌ رَّحِيمٌ ﴿١٨٢﴾

183 ఓ విశ్వసించినవారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించబడింది – మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది.[205]

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ كُتِبَ عَلَيْكُمُ ٱلصِّيَامُ كَمَا كُتِبَ عَلَى ٱلَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ ﴿١٨٣﴾

184 అదీ లెక్కించదగిన కొన్ని రోజులు మాత్రమే. అయితే మీలో వ్యాధిగ్రస్తులుగానో, ప్రయాణీకులుగానో ఉన్నవారు ఆ ఉపవాసాల లెక్క ఇతర దినాలలో పూర్తి చేసుకోవాలి.[206] స్థోమత ఉన్న

أَيَّامًا مَّعْدُودَٰتٍ ۚ فَمَن كَانَ مِنكُم مَّرِيضًا أَوْ عَلَىٰ سَفَرٍ فَعِدَّةٌ مِّنْ أَيَّامٍ أُخَرَ ۚ وَعَلَى ٱلَّذِينَ

కూడా వసీయతు చేయటం (వీలునామా రాయటం) ధర్మసమ్మతం కాదు" (సుననె తిర్మిజీ, ఇబ్నె మాజ – కితాబుల్ వసాయ). అయితే వారసత్వ హక్కు లభించనటువంటి బంధువుల పేర వీలు వ్రాయవచ్చు. లేదా దైవమార్గంలో ఖర్చుపెట్టే ఉద్దేశంతో కూడా వీలు వ్రాయవచ్చు. కాని ఈ వీలు గరిష్ఠ పరిమితి ఆస్తిలో మూడో వంతు మాత్రమే. అంతకుమించి వీలు వ్రాసేందుకు అనుమతి లేదు (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఫరాయిజ్).

204. మూలంలో **'జనఫన్'** (جَنَفًا) మరియు **'ఇస్మన్'** (إِثْمًا) అనే రెండు పదాలు ఉపయోగించబడ్డాయి. 'జనఫన్' (మొగ్గిపోవటం) – అంటే పొరపాటువల్లనో, మరుపువల్లనో బంధువుల్లో ఏ ఒక్కరి వైపుకైనా మొగ్గిపోవటం. ఇక 'ఇస్మన్' అంటే ఉద్దేశపూర్వకంగా ఒకరివైపు మొగ్గిపోవటం (ఐసరుత్తఫాసీర్). లేక ఇస్మన్ అంటే పాపంతో కూడుకున్న వీలునామా రాయటం. ఇటువంటి వీలునామాను తప్పకుండా మార్చాలి. దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలుపరచకూడదు. దీనిద్వారా తెలిసేదేమిటంటే వీలునామా రాయటంలో న్యాయాన్ని పాటించటం చాలా అవసరం. అలాగాకుండా ప్రపంచాన్ని వదలి వెళ్ళినప్పుడు కూడా ఆత్మీయులకు అన్యాయం చేసివెళితే పరలోక సాఫల్యం రీత్యా అది అతని కొరకు అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

205. **సియామ్, సౌమ్ :** సౌమ్ అంటే ఉపవాసం అని అర్థం – అంటే షరీయత్ పరిభాషలో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలకు, భార్యతో సంభోగానికి దూరంగా ఉండటం అని అర్థం. ఈ దీక్ష కేవలం దైవప్రసన్నత కొరకే పాటించాలి. ఇది ఆత్మశుద్ధికి అత్యంత ముఖ్యమైన ఆరాధన గనక మీకు పూర్వం గతించిన సమాజాలపై కూడా ఈ ఆరాధన విధిగా నిర్ణయించబడింది. భయభక్తులను అలవరచుకోవటం, నిగ్రహం సంయమనాలను పుణికిపుచ్చుకోవటం దీని అసలు ఉద్దేశం. మానవుని నీతి నడవడికలను సంస్కరించటంలో, అతని జీవన రథాన్ని ధర్మపథంలో నడిపించటంలో ఈ రోజా ఎంతగానో దోహదకారి అవుతుంది.

206. ఇది వ్యాధిగ్రస్తులకు, ప్రయాణీకులకు ఇవ్వబడిన రాయితీని సూచిస్తోంది. ప్రయాణీకులు లేక వ్యాధిగ్రస్తులు రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించలేని పక్షంలో, తరువాత వారు ఆ దినాలను పూర్తి చేసుకోవాలి.

يُطِيقُونَهُ فِدْيَةٌ طَعَامُ مِسْكِينٍ ۖ فَمَن تَطَوَّعَ خَيْرًا فَهُوَ خَيْرٌ لَّهُ ۚ وَأَن تَصُومُوا خَيْرٌ لَّكُمْ إِن كُنتُمْ تَعْلَمُونَ ﴿184﴾

వారు[207] (ఉపవాసం పాటించకపోయినందుకు) పరిహారంగా ఒక నిరుపేదకు అన్నం పెట్టాలి. కాని ఎవరైనా స్వచ్ఛందంగా ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే, అది వారికే మేలు.[208] మీరు గ్రహించ గలిగితే ఉపవాసం ఉండటమే మీ కొరకు శ్రేయస్కరం.

شَهْرُ رَمَضَانَ الَّذِي أُنزِلَ فِيهِ الْقُرْآنُ هُدًى لِّلنَّاسِ وَبَيِّنَاتٍ مِّنَ الْهُدَىٰ وَالْفُرْقَانِ ۚ

**185** రమజాను నెల – ఖుర్ఆన్ అవతరింపజేయబడిన నెల.[209] అది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతోపాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి.

---

207. అరబీలో **'యుతీఖూనహు' (يُطِيقُونَهُ)** అనే పదం ఉంది. దానికి 'శక్తిని కలిగి ఉండటం' అని అర్థం; అయితే ఆ పదాన్నే 'అతి కష్టంమీద ఉపవాసం ఉండగలగటం' అని కూడా తర్జుమా చేయటం జరిగింది. ఇది ఇబ్నె అబ్బాస్ (రజి) గారి తర్జుమా. ఇమామ్ బుఖారి కూడా ఈ తర్జుమాను ఇష్టపడ్డారు. అంటే విపరీతమైన వృద్ధాప్యం లేక నయమయ్యే సూచనలు లేని రోగం వల్ల అతి కష్టమ్మీద ఉపవాసం ఉండగలిగేవారు, ఇక తమ వల్ల బాధను ఓర్చుకోవటం సాధ్యం కాదనుకున్నప్పుడు, పరిహారంగా ఒక నిరుపేదకు అన్నం పెట్టాలి. అయితే ఈ పదానికి మెజారిటీ ఉలమాలు "స్థోమత ఉన్నవారు" అని తర్జుమా చేశారు. దీని భావం ఏమిటంటే ఇస్లాం ఆవిర్భవించిన తొలి రోజుల్లో జనులకు ఉపవాసం ఉండటం అలవాటులేని కారణంగా ఆరోగ్యవంతులకు, ఉపవాసం పాటించే శక్తిగలవారికి కూడా 'రాయితీ' ఇవ్వబడింది. ఒకవేళ మీరు ఉపవాసం ఉండదలచుకోని పక్షంలో మీ తరపున ఒక పేదవానికి అన్నం పెట్టండి అని అనబడింది. ఆ తరువాత "ఫమన్ షహిద మిన్‌కుముష్షహ్ర ఫల్ యసుమ్‌హు" (మీలో ఈ నెలను చూసినవారు ఉపవాసం పాటించాలి) అనే ఆయతు ద్వారా ఈ రాయితీ కూడా ఎత్తివేయబడింది– అంటే శక్తి కలిగి ఉన్నవారు ప్రతి ఒక్కరూ కూడా ఇకపై ఉపవాసం ఉండాల్సిందే. కాకపోతే విపరీతమైన ముసలి తనంతో బాధపడేవారు, దీర్ఘకాలిక రోగాలతో కాలం వెళ్ళదీస్తున్నవారు మాత్రం తమ తరఫున ఫిదియా (పరిహారం) ఇచ్చుకోవచ్చు. గర్భవతులకు, బాలింతలకు ఉపవాసం కష్టంగా పరిణమిస్తే అలాంటప్పుడు వారు "మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులై ఉంటే...."అన్న ఆయతు భావంలోకి వస్తారు. వారు ఆ స్థితిలో ఉపవాసం ఉండకపోయినా ఫర్వాలేదు. అయితే తరువాత వారు విడిచిపెట్టిన ఆ ఉపవాసాల సంఖ్యను పూర్తిచేయవలసి ఉంటుంది (తొహ్ఫతుల్ అహ్వజీ–తిర్మిజీ వివరణ గ్రంథం).

208. ఏ వ్యక్తి అయినా స్వచ్ఛందంగా ఒక నిరుపేదకు బదులు ఇద్దరేసి, ముగ్గురేసి నిరుపేదలకు అన్నం తినిపిస్తే అది అతనికే శ్రేయస్కరం అవుతుంది.

209. రమజాన్ నెలలో ఖుర్ఆన్ అవతరింపజేయబడిందంటే దాని అర్థం పూర్తిగా ఈ గ్రంథం ఈ ఒక్క మాసంలోనే అవతరించిందని కాదు. అసలు ఇది రమజాన్ నెలలోని ఘనమయిన రేయి (లైలతుల్ ఖద్ర్)లో భూమండలానికి సమీపంలోనున్న ఆకాశంపై అవతరింపజేయబడింది. అక్కడ అది 'బైతుల్ ఇజ్జత్'లో భద్రపరచబడింది. అక్కడి నుంచి క్రమక్రమంగా, కొద్దికొద్దిగా, పరిస్థితులకనుగుణంగా అవతరించి 23 సంవత్సరాల వ్యవధిలో పూర్తయింది (ఇబ్నె కసీర్). అందుచేత ఖుర్ఆన్ రమజాన్ నెలలోనో, లైలతుల్ ఖద్ర్‌లోనో, లైలతున్ ముబారకాలోనో అవతరించిందని అంటే ఇది కూడా సరైనదే. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ 'లౌహె మహ్ఫూజ్' నుంచి సమీప ఆకాశంలోకి అవతరింప జేయబడినది రమజాన్ నెలలోనే. లైలతుల్ ఖద్ర్ అన్నా, లైలతున్ ముబారక అని అన్నా రెండూ ఒక్కటే. అది రమజాన్ నెలలో వచ్చే శ్రేష్ఠమయిన రేయి మాత్రమే.

మరికొంతమంది విద్వాంసులు ఈ విధంగా వ్యాఖ్యానించారు: "ఖుర్ఆన్ అవతరణ రమజాన్ నెలలోనే మొదలయింది. హిరా కొండపై అవతరించిన మొట్టమొదటి 'వహీ' (దైవవాణి) రమజాన్ నెలలోనే. కాబట్టి దివ్య ఖుర్ఆన్‌కు – రమజాన్ నెలకు అవినాభావ సంబంధం ఉంది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుభప్రదమైన ఈ మాసంలోనే జిబ్రీల్ (అలైహిస్సలాం)కు ఖుర్ఆన్ అప్పజెప్పేవారు. ఆయన (సఅసం) మరణించిన ఏడాది

فَمَنْ شَهِدَ مِنْكُمُ الشَّهْرَ فَلْيَصُمْهُ ؕ وَمَنْ كَانَ مَرِيْضًا اَوْ عَلٰى سَفَرٍ فَعِدَّةٌ مِّنْ اَيَّامٍ اُخَرَ ؕ يُرِيْدُ اللّٰهُ بِكُمُ الْيُسْرَ وَلَا يُرِيْدُ بِكُمُ الْعُسْرَ ؗ وَلِتُكْمِلُوا الْعِدَّةَ وَلِتُكَبِّرُوا اللّٰهَ عَلٰى مَا هَدٰىكُمْ وَلَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿185﴾

కనుక మీలో ఎవరు ఈ నెలను చూస్తారో వారు ఉపవాసా లుండాలి. అయితే రోగగ్రస్తుని గానో, ప్రయాణీకుని గానో ఉన్న వారు ఇతర దినాలలో ఈ లెక్కను పూర్తిచేయాలి. అల్లాహ్ మీకు సౌలభ్యాన్ని సమకూర్చదలుస్తున్నాడేగాని మిమ్మల్ని కష్టపెట్టదల చటం లేదు. మీరు (ఉపవాసాల) నిర్ణీత సంఖ్యను పూర్తిచేసుకోవా లన్నదీ, తాను అనుగ్రహించిన సన్మార్గ భాగ్యానికి ప్రతిగా ఆయన గొప్పతనాన్ని కీర్తించి, తగురీతిలో మీరు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నది అల్లాహ్ అభిలాష!

وَاِذَا سَاَلَكَ عِبَادِيْ عَنِّيْ فَاِنِّيْ قَرِيْبٌ ؕ اُجِيْبُ دَعْوَةَ الدَّاعِ اِذَا دَعَانِ ۙ فَلْيَسْتَجِيْبُوْا لِيْ وَلْيُؤْمِنُوْا بِيْ لَعَلَّهُمْ يَرْشُدُوْنَ ﴿186﴾

**186** (ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని (నువ్వు వారికి చెప్పు).[210] కాబట్టి వారు కూడా నా ఆదేశాన్ని శిరసావహించాలి, నన్ను విశ్వసించాలి (ఈ విషయం నీవు వారికి తెలియజేయి). తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందగల్గుతారు.

---

వచ్చిన రమజాన్‌లో రెండుసార్లు జిబ్రీల్‌కు ఖుర్ఆన్ అప్పజెప్పారు. రమజాన్ నెలలోని మూడు రాత్రులలో ఆయన (స) తన సహచరులను సామూహికంగా ఖియాముల్లయిల్ (రాత్రి నమాజు) చేయించారు. దాన్నే ప్రస్తుతం తరావీహ్‌గా వ్యవహరించడం జరుగుతోంది (సహీహ్ సుననె తిర్మిజీ, సహీహ్ సుననె ఇబ్నెమాజ – అల్‌బానీ). ఈ తరావీహ్ నమాజు 8 రకాతులుగా ఉండేది. విత్ర్‌తో కలుపుకుని 11 రకాతులు అయ్యేది. జాబిర్ (రజి), ఆయిషా (రజి.అన్హా) ఉల్లేఖనాల్లో తత్సంబంధిత వివరాలు ఉన్నాయి (బుఖారీ, కితాబుత్తహజ్జుద్). మహాప్రవక్త (సఅసం) 20 రకాతులు తరావీహ్ నమాజు చేసినట్లు ఏ సహీహ్ హదీసు ద్వారా కూడా నిరూపితం కాలేదు. అయితే కొంతమంది సహాబా (దైవప్రవక్త సహచరులు) పదకొండు రకాతులకన్నా ఎక్కువ చేసినట్లు ఆధారాలున్నాయి. కనుక కేవలం నఫిల్ సంకల్పంతో ఇరవై రకాతులు లేక వాటికంటే ఎక్కువ లేక తక్కువ రకాతులు చేయవచ్చు.

210. ఒకవైపు రమజాన్ నెలకు సంబంధించిన ఆదేశాలు, ఉపదేశాలు కొనసాగుతుండగానే మధ్యలో దుఆ (ప్రార్థన, వేడుకోలు) ప్రస్తావన రావటం గమనార్హం. దీన్నిబట్టి రమజాన్ మాసంలో 'దుఆ'కు గల ప్రాధాన్యం ఎటువంటిదో బోధపడుతోంది. కనుక వీలైనంత అధికంగా అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండాలి. ముఖ్యంగా ఉపవాసి ఉపవాస విరమణకు ముందు చేసే దుఆ ఎంతో విశిష్ఠమైనదనీ, అది దుఆ స్వీకరించబడే సమయమని చెప్పబడింది (ముస్నదె అహ్మద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ – ఇబ్నె కసీర్ ఆధారంగా).

అయితే దుఆ స్వీకార యోగ్యానికి కూడా కొన్ని షరతులున్నాయన్న సంగతిని మరువరాదు. ఖుర్ఆన్ హదీసులలో అవి సూచించబడ్డాయి. వాటిలో రెండు షరతులు ఇక్కడ పేర్కొనబడ్డాయి. అవేమంటే : 1. నిజభావంలో అల్లాహ్‌ను విశ్వసించాలి. ఆ విశ్వాసం కల్తీలేనిదై ఉండాలి. అందులో సంశయానికి, ఊగిసలాటకు కించిత్తు ఆస్కారం కూడా ఉండకూడదు. 2. అల్లాహ్‌కు విధేయులై ఉండాలి. ఏ దశలోనూ, ఏ పనిలోనూ అవిధేయతా భావం, ధిక్కరణా ధోరణి తొంగిచూడకూడదు. వినయ వినమ్రతలు అణువణువునా తొణికిసలాడుతూ ఉండాలి. అలాగే హదీసులలో కూడా కొన్ని ముఖ్యాంశాలు పేర్కొనబడ్డాయి. వాటి ప్రకారం మనిషి అధర్మ సంపాదనతో కడుపు నింపుకోకుండా ఉండాలి. అతని వేడుకోలులో భీతి, అణకువ, అశక్తతలతో పాటు ఆశాభావం అభివ్యక్తమవుతూ ఉండాలి.

أُحِلَّ لَكُمْ لَيْلَةَ الصِّيَامِ الرَّفَثُ إِلَىٰ نِسَائِكُمْ ۚ
هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ ۗ عَلِمَ اللَّهُ
أَنَّكُمْ كُنتُمْ تَخْتَانُونَ أَنفُسَكُمْ فَتَابَ عَلَيْكُمْ
وَعَفَا عَنكُمْ ۖ فَالْآنَ بَاشِرُوهُنَّ وَابْتَغُوا مَا كَتَبَ
اللَّهُ لَكُمْ ۚ وَكُلُوا وَاشْرَبُوا حَتَّىٰ يَتَبَيَّنَ لَكُمُ
الْخَيْطُ الْأَبْيَضُ مِنَ الْخَيْطِ الْأَسْوَدِ مِنَ الْفَجْرِ ۖ
ثُمَّ أَتِمُّوا الصِّيَامَ إِلَى اللَّيْلِ ۚ وَلَا تُبَاشِرُوهُنَّ
وَأَنتُمْ عَاكِفُونَ فِي الْمَسَاجِدِ ۗ تِلْكَ حُدُودُ اللَّهِ
فَلَا تَقْرَبُوهَا ۗ كَذَٰلِكَ يُبَيِّنُ اللَّهُ آيَاتِهِ لِلنَّاسِ
لَعَلَّهُمْ يَتَّقُونَ ﴿١٨٧﴾

**187** ఉపవాస కాలంలోని రాత్రులలో మీరు మీ భార్యలను కలుసుకోవటం మీ కొరకు ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు. మీరు రహస్యంగా ఆత్మద్రోహానికి పాల్పడుతున్నారనే సంగతి అల్లాహ్‌కు తెలుసు. అయినప్పటికీ ఆయన క్షమాగుణంతో మీ వైపుకు మరలి, మీ తప్పును మన్నించాడు. ఇకనుంచి మీరు మీ భార్యలతో (ఉపవాసపు రాత్రులందు) రమించడానికీ, అల్లాహ్ మీ కొరకు రాసిపెట్టిన దాన్ని అన్వేషించటానికీ మీకు అనుమతి ఉంది. తొలిజాములోని తెలుపు నడిరేయి నల్లని చారలో నుండి ప్రస్ఫుటం అయ్యే వరకూ తినండి, త్రాగండి.[211] ఆ తరువాత (వీటన్నింటినీ పరిత్యజించి) రాత్రి చీకటి పడేవరకూ ఉపవాసం ఉండండి.[212] ఇంకా – మీరు మస్జిదులలో 'ఏతెకాఫ్' పాటించేకాలంలో మాత్రం మీ భార్యలతో సమాగమం జరపకండి.[213] ఇవి అల్లాహ్ (నిర్ధారించిన) హద్దులు. మీరు వాటి దరిదాపులకు కూడా పోకండి. ప్రజలు అప్రమత్తంగా ఉండగలందులకుగాను అల్లాహ్ తన ఆయతులను ఇలా విడమరచి చెబుతున్నాడు.

211. ఇస్లాం ఆవిర్భవించిన తొలికాలంలో ఉన్న ఆజ్ఞ ప్రకారం సాయంత్రం ఉపవాస విరమణ తరువాత ఇషా నమాజు వరకు లేదా రాత్రి నిద్రించేవరకు మాత్రమే తినటానికీ, త్రాగటానికీ, భార్యతో సంభోగించటానికీ అనుమతి ఉండేది. నిద్రపట్టిన తరువాత ఇక ఈ మూడింటిలో ఏ ఒక్కటీ చేయకూడదు. ఈ ఆంక్ష ఒకింత కఠినమైనదే. దీన్ని ఖచ్చితంగా ఆచరణలో పెట్టటం కష్టతరం. అందువల్ల కొంతకాలం తరువాత అల్లాహ్ ఈ రెండు ఆంక్షలను కూడా ఎత్తివేసి, తెల్లవారుజాము వరకూ అన్నపానీయాలు తీసుకోవచ్చునీ, రతిక్రీడలో పాల్గొనవచ్చునీ తెలియపరిచాడు. **రఫస్** అంటే భార్యతో సంభోగించటం; **ఖైతుల్ అబ్‌యజ్** (తెల్ల దారం) అంటే ఉషోదయమనీ, **ఖైతుల్ అస్‌వద్** (నల్ల దారం) అంటే రాత్రి అనీ భావం (ఇబ్నె కసీర్).

**గమనార్హ విషయం :** దీనిద్వారా అవగతమయ్యే మరో అంశం ఏమిటంటే; సంభోగంవల్ల ఏర్పడిన అశుద్ధావస్థలో ఉపవాస సంకల్పం చేసుకోవటంలో తప్పు లేదు. ఎందుకంటే సహ్‌రీ వేళ వరకూ దేవుడు రతిక్రీడకు అనుమతించాడు. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం ఉల్లేఖనాల ద్వారా కూడా ఈ అభిప్రాయానికి సమర్థన లభిస్తోంది (ఇబ్నె కసీర్).

212. అంటే సూర్యాస్తమయం కాగానే ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయాలి. ఇఫ్తార్‌లో అనవసర జాప్యం చేయకూడదు. ఉపవాస విరమణలో వేగిరపడమని, ఇదెంతో శ్రేయోదాయకమని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది. **'విసాల్'** చేయకండి. విసాల్ అంటే ఒక రోజు ఉపవాసం ఉండి, ఉపవాస విరమణ చేయకుండానే మరునాడు ఉపవాసం ఉండటం. మహాప్రవక్త (స) దీనిని చాలా గట్టిగా వారించారు (హదీసు గ్రంథాల్లో దీని వివరాలు ఉన్నాయి).

213. మస్జిదులో 'ఏతెకాఫ్' పాటిస్తున్నప్పుడు భార్యతో సంభోగించటం, ఆమెను ముద్దుపెట్టుకోవటం వంటివి సమ్మతం కావు. అయితే ఆమెతో కలసి మాట్లాడవచ్చు. ముఖ్య విషయాలను చర్చించవచ్చు. 'ఆకిఫూన ఫిల్ మసాజిద్'

188 ఒకరి సొమ్మును ఇంకొకరు అన్యాయంగా స్వాహా చేయ కండి. బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంతభాగం కాజేయటం కోసం అధికారులకు ముడుపులు చెల్లించకండి. అది (న్యాయం కాదన్న సంగతి) మీకూ తెలిసి నదే.[214]

وَلَا تَأْكُلُوٓا أَمْوَالَكُمْ بَيْنَكُمْ بِالْبَاطِلِ وَتُدْلُوا
بِهَآ إِلَى الْحُكَّامِ لِتَأْكُلُوا فَرِيقًا مِّنْ أَمْوَالِ
النَّاسِ بِالْإِثْمِ وَأَنْتُمْ تَعْلَمُونَ ﴿188﴾

189 (ఓ ప్రవక్తా!) ప్రజలు నిన్ను నెలవంకలను గురించి ప్రశ్నిస్తు న్నారు కదూ! ఇది ప్రజల (ఆరాధనల) వేళలను, హజ్ కాలాన్ని నిర్ధారించటానికి (జరిగిన ఏర్పాటు) అని నువ్వు వారికి సమా ధానం ఇవ్వు. (ఇహ్రామ్ స్థితిలో) మీరు మీ ఇళ్ళల్లోకి వెనుక వైపు నుంచి రావటం సత్కార్యం కాదు. అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి వున్నవాడిదే అసలు సత్కార్యం. మీరు మీ ఇండ్లల్లోకి వాకిళ్ళ నుండే ప్రవేశించండి.[215] సాఫల్యం పొందగలందులకుగాను అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.

يَسْـَٔلُونَكَ عَنِ الْأَهِلَّةِ ۖ قُلْ هِيَ مَوَاقِيتُ لِلنَّاسِ
وَالْحَجِّ ۗ وَلَيْسَ الْبِرُّ بِأَنْ تَأْتُوا الْبُيُوتَ مِنْ
ظُهُورِهَا وَلَٰكِنَّ الْبِرَّ مَنِ اتَّقَىٰ ۗ وَأْتُوا الْبُيُوتَ مِنْ
أَبْوَابِهَا ۚ وَاتَّقُوا اللَّهَ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿189﴾

(మస్జిదుల్లో ఏతెకాఫ్ చేస్తున్నప్పుడు) అని అనడాన్ని బట్టి ఏతెకాఫ్ దీక్ష మస్జిద్‌లోనే చేయటం అవసరమని రూఢీ అవుతోంది. కాబట్టి స్త్రీలు తమ నివాస గృహాలలో 'ఏతెకాఫ్' పాటించటం సరైంది కాదు. మహాప్రవక్త (సఅసం) వారి సతీమణులు కూడా 'ఏతెకాఫ్' కోసం మస్జిద్‌నే ఎన్నుకున్నారు. అయితే మస్జిద్‌లో స్త్రీల కోసం ప్రతిదీ వేరుగా ఏర్పాటు చేయటం అవసరం. ఆడవారు, మగవారు కలసిపోకూడదన్నదే దీని ఉద్దేశం. మస్జిద్‌లో ఆ మేరకు సదుపాయాలు సమకూరనంతవరకూ, స్త్రీలకు సురక్షితమైన స్థానం కల్పించనంతవరకూ వారిని మస్జిద్‌లో ఏతెకాఫ్ కోసం కూర్చోవటానికి సుతరామూ అనుమతి ఇవ్వకూడదు. స్త్రీలు కూడా ఈ విషయంలో మొండి పట్టు పట్టరాదు. ఎందుకంటే ఇదొక స్వచ్ఛంద (నఫిల్) ఆరాధన. విధిగా నిర్వర్తించవలసిన (ఫర్జ్) ఆరాధన ఏమీ కాదు. కాబట్టి గట్టి భద్రత, వసతి సౌకర్యం సమకూరనంతవరకూ ఈ స్వచ్ఛంద ఆరాధనను స్త్రీలు పరిత్యజించటమే మంచిది. "పరమార్థాల ప్రాప్తికై ప్రాకులాడేకన్నా, పొంచివున్న ప్రమాదాల నుంచి తప్పించుకోవటం ప్రథమ కర్తవ్యం" అన్నది ఫికహ్ సూత్రం.

214. ఒక వ్యక్తి ఏదేని సొమ్ముకు, ఆస్తికి హక్కుదారుడైనప్పటికీ ఒక్కోసారి తన హక్కును నిరూపించుకోవటానికి కావలసిన ఆధారాలు, సాక్ష్యాలు అతని వద్ద ఉండవు. ఎదుటివాని ఈ బలహీనతను సొమ్ము చేసుకునే ఉద్దేశంతో ఎవరయినా న్యాయ స్థానాన్నిగానీ, సంబంధిత అధికారులనుగానీ ఆశ్రయించి, లంచాలు ఇచ్చి తన పక్షాన తీర్పువచ్చేలా చేసుకుంటే అది ముమ్మాటికీ అక్రమమే అవుతుంది. ఒకరి సొమ్మును అన్యాయంగా కబళించటం అంటే ఇదే. ఇది దుర్మార్గం, దురాగతం! న్యాయస్థానం పై పై ఆధారాలను, సాక్ష్యాలను చూసి తీర్పు వినిపిస్తుంది. అంతమాత్రాన (అంటే న్యాయస్థానం తీర్పు ఇచ్చినంత మాత్రాన) ఒక హరామ్ వస్తువు హలాల్ అయిపోదు. ఒక అన్యాయం న్యాయంగా మారిపోదు. కాబట్టి ఇలాంటి అన్యాయానికి పాల్పడినవాడు దేవుని దృష్టిలో నేరస్థుడుగానే పరిగణించ బడతాడు (ఇబ్నె కసీర్).

215. అజ్ఞాన కాలంలో అన్సార్లు హజ్ లేక ఉమ్రహ్ కొరకు ఇహ్రామ్ దీక్షబూనిన తరువాత కూడా ఏదైనా అవసరం ఏర్పడి తమ ఇండ్లకు రాదలచినప్పుడు ముందువైపు నుంచి వచ్చే బదులు వెనుకవైపు నుంచి గోడదూకి మరీ వచ్చేవారు. పైగా ఇలా రావటం సత్కార్యం అని వారు భావించేవారు. ఇది ముమ్మాటికీ సత్కార్యం కాదనీ, దేవుని హద్దులను ఖాతరు చెయ్యటమే సిసలయిన సత్కార్యం అని అల్లాహ్ వారికి స్పష్టపరిచాడు (ఐసరుత్తఫాసీర్).

**190** మీతో పోరాడే వారితో మీరు కూడా దైవమార్గంలో పోరాడండి. కాని మితిమీరకండి.[216] మితిమీరి పోయేవారిని అల్లాహ్ ఇష్టపడడు.

وَ قَاتِلُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ الَّذِيْنَ يُقَاتِلُوْنَكُمْ وَلَا تَعْتَدُوْا ؕ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْمُعْتَدِيْنَ ﴿190﴾

**191** వారు ఎక్కడ ఎదురైనా మీరు వారితో తలపడండి, మిమ్మల్ని ఎక్కడి నుంచి వారు తరిమికొట్టారో, అక్కడి నుంచి మీరు కూడా వారిని తరిమికొట్టండి. ఫిత్నా (కుఫ్ర్, షిర్క్, పీడన) అనేది చంపటం కన్నా తీవ్రమైనది.[217] 'మస్జిదె హరామ్' వద్ద వారు మీతో యుద్ధం చేయనంతవరకూ మీరూ వారితో పోరాడకండి. వారు గనక మిమ్మల్ని హతమార్చడానికి ప్రయత్నిస్తే మీరు కూడా దీటైన జవాబు ఇవ్వండి.[218] అవిశ్వాసులకు సరైన సమాధానం ఇదే.

وَاقْتُلُوْهُمْ حَيْثُ ثَقِفْتُمُوْهُمْ وَ اَخْرِجُوْهُمْ مِّنْ حَيْثُ اَخْرَجُوْكُمْ وَ الْفِتْنَةُ اَشَدُّ مِنَ الْقَتْلِ ۚ وَلَا تُقٰتِلُوْهُمْ عِنْدَ الْمَسْجِدِ الْحَرَامِ حَتّٰى يُقٰتِلُوْكُمْ فِيْهِ ۚ فَاِنْ قٰتَلُوْكُمْ فَاقْتُلُوْهُمْ ؕ كَذٰلِكَ جَزَآءُ الْكٰفِرِيْنَ ﴿191﴾

216. ఈ ఆయతులో మొట్టమొదటిసారిగా శత్రువులతో పోరాడేందుకు అనుమతించబడింది. అదీ ఎప్పుడు? ముస్లింలను తుదముట్టించే సంకల్పంతో వారు దండెత్తి వస్తున్నారని తెలిసినప్పుడు. అయితే అట్టి పరిస్థితుల్లో కూడా ఎంత వరకు పోరాడాలో అంతవరకే పోరాడాలనీ, మితిమీరకూడదనీ తాకీదు చేయబడింది. దీని భావం ఏమిటంటే యుద్ధంలో పాల్గొనకుండా ఉండేవారినీ, స్త్రీలను, పిల్లలను, వృద్ధులను చంపకూడదు. యుద్ధంలో పాల్గొన్న వారిని సైతం చిత్రవధ చేయరాదు. పండ్లు ఫలాలను ఇచ్చే వృక్షాలను నరకరాదు. ఏ పాపం ఎరుగని పశువులను అనవసరంగా వధించటం కూడా హద్దు మీరటంగానే పరిగణించబడుతుంది. ఇలాంటి ఆగడాలకు దూరంగా ఉండాలని నొక్కి వక్కాణించబడింది (ఇబ్నె కసీర్).

217. మక్కాలో ఉండగా ముస్లింలు బలహీనులుగా, చెల్లాచెదురుగా ఉండేవారు. అందువల్ల అవిశ్వాసులతో తలపడేందుకు వారికి అనుమతి ఇవ్వబడలేదు. కాని హిజ్రత్ అనంతరం ముస్లింలు ఒక శక్తిగా, సంఘటిత సమాజంగా ఆవిర్భవించారు. శత్రువుకు అర్థమయ్యే భాషలో సమాధానం చెప్పగల శక్తియుక్తులు వారికి ఒనగూడాయనుకున్న తరువాత జిహాద్‌కు అనుమతి ఇవ్వబడింది. ముస్లింలపై దండెత్తి వచ్చిన వారిని మాత్రమే మొదట్లో ఆయన (స) ప్రతిఘటించేవారు. ఆ తరువాత రణనీతి మార్చబడింది. అవసరం అనుకున్నప్పుడు అవిశ్వాసుల ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయి యుద్ధం చేసేవారు. హద్దులను అతిక్రమించకూడదని ఖుర్ఆన్ తాకీదు చేసింది. అందుకే ద్రోహబుద్ధికి పాల్పడరాదనీ, వాగ్దానాన్ని భంగం చేయరాదని, చిత్రవధ చేయరాదనీ, స్త్రీలను పిల్లలను చంపరాదనీ, చర్చీలలో ప్రార్థనలో నిమగ్నులైె ఉన్న మతాచార్యులకు కీడు తలపెట్టరాదని మహాప్రవక్త (సఅసం) తన సహచరులకు తాకీదు చేశారు. అలాగే చెట్లను నరికివేయటం, పంటలను కాల్చివేయటం, పశువులను అకారణంగా చంపివేయటం వంటి వాటిని కూడా వారించారు (ఇబ్నె కసీర్, సహీహ్ ముస్లిం – కితాబుల్ జిహాద్).

మక్కాకు చెందిన అవిశ్వాసులు ఒకప్పుడు మిమ్మల్ని వేధించారు. బహిష్కరించారు. నగరం వదలిపోయే పరిస్థితిని సృష్టించారు. కాబట్టి ఇప్పుడు వారు ఎక్కడ ముఖాముఖీ అయినా వారితో తలపడండి; వారిని కూడా అక్కడి నుంచి వెళ్ళగొట్టండి అని చెప్పబడింది. 'మక్కా విజయం' తరువాత ముస్లింలు కానివారికి ఒక నిర్ణీత గడువు ఇవ్వబడింది. ఒప్పందం ప్రకారం గడువు ముగిసిన తరువాత వారిని మక్కా నగరం నుంచి బహిష్కరించటం జరిగింది. పీడన, ఉపద్రవం (ఫిత్నా) అంటే కుఫ్ర్ మరియు షిర్క్ అని అర్థం. ఇది మారణకాండ కన్నా చాలా చెడ్డది, తీవ్రమైనది. కాబట్టి ఈ 'ఫిత్నా'ను రూపుమాపడానికి అవసరమైతే జిహాద్ చేయడానికి కూడా వెనుకాడకూడదు.

218. నిజానికి పవిత్ర మక్కా క్షేత్ర పరిధిలో మారణకాండకు పాల్పడరాదు. కాని అవిశ్వాసులు గనక ఒకవేళ ఈ నిషేధాజ్ఞను ఖాతరు చెయ్యకుండా కత్తి దూసినట్లయితే అట్టి పరిస్థితుల్లో వారికి దీటుగా జవాబు ఇవ్వటం సమంజసమే.

**192** ఒకవేళ వారు గనక (తమ దమన నీతిని) మానుకుంటే నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు.

فَإِنِ انْتَهَوْا فَإِنَّ اللَّهَ غَفُورٌ رَّحِيمٌ (192)

**193** పీడన (ఫిత్నా) సమసిపోనంతవరకూ, దైవధర్మానిది పైచేయి కానంతవరకూ వారితో పోరాడుతూనే ఉండండి. ఒకవేళ వారు యుద్ధాన్ని విరమిస్తే (మీరూ విరమించండి). మెడలు వంచ వలసింది దౌర్జన్యపరులవే.

وَقَاتِلُوهُمْ حَتَّىٰ لَا تَكُونَ فِتْنَةٌ وَيَكُونَ الدِّينُ لِلَّهِ ۖ فَإِنِ انْتَهَوْا فَلَا عُدْوَانَ إِلَّا عَلَى الظَّالِمِينَ (193)

**194** నిషిద్ధమాసం నిషిద్ధమాసానికి బదులుగా ఉన్నది. నిషేధాజ్ఞలు సరిసమానంగా వర్తిస్తాయి.[219] మీపై ఎవరయినా దౌర్జన్యానికి ఒడిగడితే మీరు కూడా వారిపై ఆ మేరకు ప్రతీకారం తీర్చుకోండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ భక్తిగలవారికి తోడుగా ఉన్నాడన్న విషయాన్ని తెలుసుకోండి.

الشَّهْرُ الْحَرَامُ بِالشَّهْرِ الْحَرَامِ وَالْحُرُمَاتُ قِصَاصٌ ۚ فَمَنِ اعْتَدَىٰ عَلَيْكُمْ فَاعْتَدُوا عَلَيْهِ بِمِثْلِ مَا اعْتَدَىٰ عَلَيْكُمْ ۚ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوا أَنَّ اللَّهَ مَعَ الْمُتَّقِينَ (194)

**195** అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి. చేజేతులా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి.[220] ఉత్తమంగా మసలుకోండి. నిస్సందేహంగా అల్లాహ్ ఉత్తమంగా వ్యవహరించేవారిని ప్రేమిస్తాడు.

وَأَنْفِقُوا فِي سَبِيلِ اللَّهِ وَلَا تُلْقُوا بِأَيْدِيكُمْ إِلَى التَّهْلُكَةِ ۛ وَأَحْسِنُوا ۛ إِنَّ اللَّهَ يُحِبُّ الْمُحْسِنِينَ (195)

219. హిజ్రీ 6వ సంవత్సరంలో మహాప్రవక్త (సఅసం) 1400 మంది సహచరులను వెంటబెట్టుకుని **'ఉమ్రహ్'** చేసే నిమిత్తం మక్కాకు బయలుదేరారు. అయితే మక్కా నగరంలో ప్రవేశించేందుకు అవిశ్వాసులు అనుమతించలేదు. వచ్చే ఏడాది కేవలం మూడు రోజుల పాటు నగరంలోకి వచ్చి ఉమ్రహ్ చేసుకోవచ్చని అంగీకారం కుదిరింది. అది జీకఅద నెల. అది నిషిద్ధ మాసాలలోని ఒక మాసం. మరుసటి సంవత్సరం ముస్లింలు అదే మాసంలో ఉమ్రహ్ సంకల్పంతో బయలుదేరినప్పుడు అల్లాహ్ ఈ ఆదేశాలను అవతరింపజేశాడు. దీని భావం ఏమిటంటే ఈసారి కూడా మక్కా అవిశ్వాసులు ఈ నెలకు గల పవిత్రతను కాలరాచి (క్రితంసారి వలే) మిమ్మల్ని మక్కా నగరంలో అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకుంటే, మీరు మాత్రం ఊరుకోవద్దు. శక్తియుక్తులన్నింటినీ ఒడ్డి వారితో పోరాడండి. ప్రత్యర్థి వర్గంవారు నియమాలను ఉల్లంఘించినప్పుడు మీరు చేతులు నలుపుకుంటూ కూర్చోనవసరం లేదు. దెబ్బకు దెబ్బ కొట్టి వారికి గుణపాఠం నేర్పండి (ఇబ్నె కసీర్).

220. చేజేతులా వినాశం పాలు చేసుకోకండి అన్న ఈ వచనానికి పలువురు పలు వ్యాఖ్యానాలు చెప్పారు. దైవమార్గంలో పిసినారులుగా వ్యవహరించటం వినాశానికి హేతువని కొందరు, జిహాద్‌ను విడనాడటమే వినాశానికి మూలకారణం అని మరికొందరు, నిరంతరం పాపాలు చేస్తూ పోవటమే వినాశానికి అసలు ప్రాతిపదిక అని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. జిహాద్‌ను పరిత్యజించి పిరికివారుగా జీవించగోరినా, దైవమార్గంలో ఖర్చుపెట్టకుండా తమ చేతిని కట్టిపడేసుకున్నా – దాని పరిణామం ఒక్కటే. మీ శత్రువు బలపడతాడు. అతని దృష్టిలో మీకు పూచిక పుల్లంత విలువ కూడా లేకుండాపోతుంది. ఫలితంగా అతడు మిమ్మల్ని అణచివేసే వ్యూహాన్ని రచిస్తాడు. అలాగే మనిషి చేసిన తప్పును తలచుకుని సిగ్గుతో కుంచించుకు పోయే బదులు నిరంతరం పాపాలు చేస్తూ పోయాడనుకోండి, అది పరలోకం దృష్ట్యా అతని పాలిట వినాశకరంగా పరిణమిస్తుంది.

وَأَتِمُّوا الْحَجَّ وَالْعُمْرَةَ لِلَّهِ ۚ فَإِنْ أُحْصِرْتُمْ فَمَا
اسْتَيْسَرَ مِنَ الْهَدْيِ ۖ وَلَا تَحْلِقُوا رُءُوسَكُمْ حَتَّىٰ
يَبْلُغَ الْهَدْيُ مَحِلَّهُ ۚ فَمَن كَانَ مِنكُم مَّرِيضًا أَوْ
بِهِ أَذًى مِّن رَّأْسِهِ فَفِدْيَةٌ مِّن صِيَامٍ أَوْ صَدَقَةٍ
أَوْ نُسُكٍ ۚ فَإِذَا أَمِنتُمْ فَمَن تَمَتَّعَ بِالْعُمْرَةِ
إِلَى الْحَجِّ فَمَا اسْتَيْسَرَ مِنَ الْهَدْيِ ۚ فَمَن لَّمْ
يَجِدْ فَصِيَامُ ثَلَاثَةِ أَيَّامٍ فِي الْحَجِّ وَسَبْعَةٍ إِذَا

**196** హజ్, ఉమ్రాలను అల్లాహ్ కొరకు పూర్తిచేయండి.[221] ఒకవేళ మీరు నిలువరించబడితే, మీరు ఇవ్వగలిగిన ఖుర్బానీని ఇచ్చివేయండి.[222] మీరు ఇచ్చే ఖుర్బానీ, ఖుర్బానీ స్థలానికి చేరనంతవరకూ శిరోముండనం చేయించుకోకండి.[223] అయితే మీలో వ్యాధిగ్రస్తులుగా ఉన్నవారు, లేదా తలలో బాధ ఉన్నవారు (శిరోముండనం చేయించుకుంటే ఫరవాలేదు. కాని వారు) దీనికి పరిహారంగా ఉపవాసం ఉండటమో, దానధర్మాలు చేయటమో, ఖుర్బానీ ఇవ్వటమో చేయాలి.[224] మరి ఆ తర్వాత (చిక్కుల నుంచి, నిలువరింపు నుంచి) ప్రశాంతతను పొంది ఉన్న స్థితిలో మీలో ఎవరయినా ఉమ్రహ్ మొదలుకుని హజ్ వరకు సంకల్పం బూని ప్రయోజనం (తమత్తు) పొందినట్లయితే, వారు తమ వద్దనున్న ఖుర్బానీని ఇచ్చివేయాలి. ఖుర్బానీ ఇవ్వలేనివారు హజ్ దినాలలో మూడు రోజులు ఉపవాసం పాటించాలి. హజ్ నుండి తిరిగి వచ్చిన తరువాత ఏడు రోజులు ఉపవాసముండాలి.[225]

221. అంటే, హజ్ లేక ఉమ్రహ్ కొరకు ఒకసారి దీక్షబూనిన తరువాత దానిని పూర్తిచేయటం అనివార్యం – అది నఫిల్ హజ్, నఫిల్ ఉమ్రహ్ అయినాసరే! (ఐసరుత్తఫాసీర్).

222. ఒకవేళ మార్గమధ్యంలో శత్రువులు మిమ్మల్ని అడ్డుకోవటమో లేక మీరు తీవ్రంగా రోగగ్రస్తులవటమో జరిగితే అక్కడే ఒక పశువును – మేకనుగానీ, ఆవునుగానీ, ఒంటెలో ఏడవ భాగంగానీ– జిబహ్‌చేసి, శిరోముండనం చేయించుకుని దీక్ష నుండి బయటపడవచ్చు. హుదైబియా ఒప్పందం సందర్భంగా మహాప్రవక్త (సఅసం) మరియు ఆయన ప్రియ సహచరులు (రజి) ఈ విధానాన్నే అవలంబించారు. హుదైబియా స్థలం మక్కా పొలిమేరలకు ఆవల ఉంది (ఫత్‌హుల్ ఖదీర్). అసంపూర్ణంగా ఉండిపోయిన ఆ హజ్ లేక ఉమ్రా యాత్రను మరు సంవత్సరం పూర్తి చేసుకోవాలి. దైవప్రవక్త (స) కూడా హి.శ. 6వ యేట చేయలేకపోయిన ఉమ్రాను హి.శ. 7వ యేట ఖజా (పూర్తి) చేశారు.

223. అంటే హజ్ క్రియలన్నీ పూర్తయ్యేవరకు శిరోముండనం చేయించుకోరాదని దీని భావం. అత్యవసర పరిస్థితులు ఏర్పడి ఉంటే అది వేరే విషయం. సాధారణ పరిస్థితులున్నప్పుడు, శాంతి భద్రతలు నెలకొని ఉన్నప్పుడు మాత్రం క్రమబద్ధంగా హజ్ క్రియలన్నింటినీ నెరవేర్చిన తరువాతే శిరోముండనం చేయించుకోవాలి (అంటే ఇహ్రామ్ దీక్షను విరమించాలి).

224. శిరోముండనం చేయించుకోవటం తప్ప వేరే మార్గాంతరం లేని పరిస్థితి ఎవరికయినా ఆసన్నమైతే అప్పుడు వారు తల క్షవరం చేయించుకోవచ్చు. కాని వారు ఈ చర్యకు పరిహారం చెల్లించాలి. హదీసు ప్రకారం ఇలాంటి వ్యక్తి ఆరుగురు నిరుపేదలకు అన్నం తినిపించాలి. లేదా ఒక మేకను జిబహ్ చేయాలి. లేదా మూడు రోజులపాటు ఉపవాసముండాలి. మొదటి రెండు ఫిదియాలు ఇవ్వవలసిన చోటు విషయంలో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. పేదవారికి అన్నం పెట్టడమయినా, మేకను జిబహ్ చేయటమైనా మక్కా ప్రాంతంలోనే జరగాలని కొందరంటున్నారు. ఉపవాసాల మాదిరిగా ఈ పరిహారం కూడా ఎక్కడయినా చెల్లించవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఇమామ్ షౌకానీ రెండో అభిప్రాయాన్నే సమర్థించారు (ఫత్‌హుల్ ఖదీర్).

رَجَعْتُمْ ۗ تِلْكَ عَشَرَةٌ كَامِلَةٌ ۗ ذٰلِكَ لِمَنْ لَّمْ يَكُنْ
أَهْلُهٗ حَاضِرِي الْمَسْجِدِ الْحَرَامِ ۚ وَاتَّقُوا اللّٰهَ
وَاعْلَمُوْٓا أَنَّ اللّٰهَ شَدِيْدُ الْعِقَابِ ﴿196﴾

ఈ విధంగా మొత్తం పది ఉపవాసాలవుతాయి. మస్జిదె హరామ్‌కు సమీపంలో ఉండని వారికి మాత్రమే ఈ ఆదేశం వర్తిస్తుంది.[226] (ప్రజలారా!) అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడన్న సంగతిని తెలుసుకోండి.

اَلْحَجُّ أَشْهُرٌ مَّعْلُوْمٰتٌ ۚ فَمَنْ فَرَضَ فِيْهِنَّ
الْحَجَّ فَلَا رَفَثَ وَلَا فُسُوْقَ وَلَا جِدَالَ فِي الْحَجِّ ۗ

**197** హజ్ మాసాలు నిర్ధారితమై ఉన్నాయి.[227] కనుక ఈ నిర్ణీత మాసాలలో హజ్‌ను తన కొరకు విధించుకున్న వ్యక్తి – హజ్ దినాలలో – కామ క్రీడలకు, పాపకార్యాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలి.[228] మీరు ఏ సత్కార్యం చేసినా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు. (హజ్ యాత్రకు బయలుదేరినప్పుడు)

225. హజ్‌లో మూడు రకాలున్నాయి : 1. హజ్జె ఇఫ్రాద్ 2. హజ్జె ఖిరాన్ 3. హజ్జె తమత్తు.

**హజ్జె ఇఫ్రాద్ :** కేవలం హజ్ సంకల్పంతో ఇహ్రామ్ కట్టుకోవటం.

**హజ్జె ఖిరాన్ :** హజ్ మరియు ఉమ్రహ్ రెండింటినీ కలిపి సంకల్పం చేసుకుని ఇహ్రామ్ కట్టుకుంటే అది 'హజ్జె ఖిరాన్' అనబడుతుంది. ఈ మొదటి రెండు పరిస్థితుల్లోనూ హజ్ క్రియలన్నీ నెరవేరేవరకూ ఇహ్రామ్‌ను విప్పటం సమ్మతం కాదు.

**హజ్జె తమత్తు :** ఈ పద్ధతి ప్రకారం కూడా హజ్ మరియు ఉమ్రహ్‌ల సంకల్పంతో ఇహ్రామ్ దీక్ష బూనబడుతుంది. అయితే మొదట కేవలం 'ఉమ్రహ్' కోసం ఇహ్రామ్ వస్త్రం కట్టుకుంటారు. ఉమ్రహ్ చేయగానే ఇహ్రామ్ విప్పబడుతుంది. తిరిగి జిల్ హజ్ నెల 8వ తేదీన మక్కాలోనే 'హజ్' కోసం మళ్ళీ ఇహ్రామ్ కట్టుకోవటం జరుగుతుంది. 'తమత్తు' అంటే సౌలభ్యం పొందటం అని అర్థం. అంటే ఉమ్రహ్ చేయగానే ఇహ్రామ్ దీక్ష నుంచి బయటపడి జిల్‌హజ్ 8వ తేదీ వరకు స్వేచ్ఛగా ఉండే అవకాశాన్ని వినియోగించుకోవటమన్నమాట! హజ్జె ఖిరాన్ మరియు హజ్జె తమత్తు – రెండింటిలోనూ ఒక పశువును ఖుర్బానీ చేయవలసి ఉంటుంది. ఈ ఆయతులో హజ్జె తమత్తు ప్రస్తావన వచ్చింది. ఈ హజ్ చేసిన వ్యక్తి తన స్థోమతనుబట్టి 10వ తేదీన ఒక పశువును ఖుర్బానీగా సమర్పించుకోవాలనీ, పశువును ఖుర్బానీగా ఇవ్వలేనివాడు హజ్ దినాలలో మూడు రోజులు ఉపవాసం పాటించి, ఇంటికి వాపసు అయిన తరువాత ఏడు రోజులు ఉపవాసాలుండాలని చెప్పబడింది. హజ్ దినాలలో ఉపవాసం ఉండవలసిన తేదీలు ఏవేవి? అంటే 9వ తేదీకి ముందు లేదా తష్రీఖ్ దినాలు (ఫత్‌హుల్ ఖదీర్).

226. **'హజ్జె తమత్తు'** మూలంగా పశువును ఖుర్బానీ ఇవ్వటం లేక ఉపవాసముండటం అనే నియమం దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికే వర్తిస్తుంది. హరమ్ క్షేత్రంలో ఉండేవారికి – షరీయత్ ప్రకారం ప్రయాణీకులు అనబడనివారికి– ఈ నియమం వర్తించదు (ఇబ్నె కసీర్ – 'ఇబ్నె జరీర్' ఆధారంగా).

227. ఆ మాసాలు ఇవి :1. షవ్వాల్ 2. జుల్‌ఖఅద 3. జుల్ హిజ్జ్‌లోని మొదటి పది దినాలు. 'ఉమ్రహ్' అయితే ఏడాదిలో ఎప్పుడైనా చేయవచ్చు. కాని హజ్ మాత్రం కేవలం నిర్ధారిత దినాలలో మాత్రమే అవుతుంది. కనుక హజ్ కొరకు బూనే దీక్ష ఆ నిర్ణీత మాసాలలో తప్ప వేరితర మాసాలలో సమ్మతం కాదు (ఇబ్నె కసీర్).

**గమనార్హ విషయం :** హజ్జె ఖిరాన్ లేక హజ్జె ఇఫ్రాద్‌కు సంబంధించిన దీక్ష (ఇహ్రామ్)ను మక్కా వాసులు మక్కాలోనే బూనుతారు. అయితే హజ్జె తమత్తు సంకల్పం చేసుకున్నప్పుడు మక్కా స్థానికులు 'ఉమ్రహ్' కోసం నగర పొలిమేరలు దాటిపోయి, ఇహ్రామ్ కట్టుకుని రావలసి ఉంటుంది (ఫత్‌హుల్ బారీ, కితాబుల్ హజ్). అలాగే బయటి నుంచి వచ్చినవారు 'హజ్జె తమత్తు'లో జిల్‌హజ్ 8వ తేదీన మక్కాలోనే ఇహ్రామ్ కట్టుకోవచ్చు. అయితే కొంతమంది

ప్రయాణ సామగ్రి(ఖర్చు)ని వెంటతీసుకెళ్ళండి. అయితే అన్నింటి కంటే అత్యుత్తమ సామగ్రి దైవభీతి (అని బాగా గుర్తుంచు కోండి).[229] కనుక ఓ బుద్ధిమంతులారా! నాకు భయపడుతూ ఉండండి.

وَمَا تَفْعَلُوا مِنْ خَيْرٍ يَعْلَمْهُ اللَّهُ ۗ وَتَزَوَّدُوا فَإِنَّ خَيْرَ الزَّادِ التَّقْوَىٰ ۚ وَاتَّقُونِ يَا أُولِي الْأَلْبَابِ ﴿١٩٧﴾

**198** (హజ్ యాత్ర సందర్భంగా) మీరు గనక మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషిస్తే అందులో తప్పేమీ లేదు.[230] మీరు అరఫాత్ నుండి తిరిగి వస్తున్నప్పుడు 'మష్అరె హరామ్' వద్ద దైవనామాన్ని స్మరించండి – ఆయన సూచించిన విధంగానే ఆయన నామస్మరణ చేయండి. ఇంతకు మునుపైతే మీరు దారి తప్పి ఉన్నారు.[231]

لَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ أَنْ تَبْتَغُوا فَضْلًا مِنْ رَبِّكُمْ ۚ فَإِذَا أَفَضْتُمْ مِنْ عَرَفَاتٍ فَاذْكُرُوا اللَّهَ عِنْدَ الْمَشْعَرِ الْحَرَامِ ۖ وَاذْكُرُوهُ كَمَا هَدَاكُمْ وَإِنْ كُنْتُمْ مِنْ قَبْلِهِ لَمِنَ الضَّالِّينَ ﴿١٩٨﴾

---

విద్వాంసుల ప్రకారం స్థానిక ముస్లింలు ఉమ్రహ్ కోసం మక్కా పొలిమేరలు దాటి బయటికి పోనవసరం లేదు. కనుక వారు ఏ రకపు హజ్ చేయదలచినా, ఉమ్రహ్ చేయదలచినా తమ తమ పేటల నుంచే ఇహ్రామ్ కట్టుకోవచ్చు.

**హెచ్చరిక :** హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ ఇలా అంటున్నారు – దైవప్రవక్త (స) వారి వాక్కర్మల చేత రెండే రెండు ఉమ్రహ్‌లు నిరూపితం అయినాయి. ఒకటి : హజ్జె తమత్తుతో కలుపుకుని చేసే ఉమ్రహ్. రెండు : హజ్ మాసాలు గాక, ఇతర దినాలలో కేవలం ఉమ్రహ్ సంకల్పం చేసుకుని చేసే ప్రయాణం. హరమ్ క్షేత్రం దాటి బయటికి వెళ్ళి అక్కడి నుంచి ఉమ్రహ్ కోసం ఇహ్రామ్ దీక్షబూని రావటం అనేది శాస్త్రబద్ధం కాదు. (ఎవరయినా ఆయిషా (ర.అన్హా) లాంటి పరిస్థితిని ఎదుర్కొంటే అది వేరేవిషయం) (జాదుల్ మఆద్ – సంపుటి – 2).

**గమనిక :** హరమ్ పరిధులకు (నిషిద్ధ ప్రాంతానికి) వెలుపల గల ప్రదేశాన్ని "హిల్ల్" అనీ, 'మీఖాత్'కు వెలుపల నుంచి వచ్చే యాత్రికులను 'ఆఫాఖీ' అని పిలుస్తారు.

228. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని హదీసులో ఇలా వుంది : "ఎవరయితే నిర్మలమైన మనసుతో, కామవాంఛతో కూడుకున్న మాటలకు, పాపకార్యాలకు దూరంగా ఉంటూ హజ్ చేశాడో అతడు తన పాపాలన్నీ ప్రక్షాళనమై ఆ రోజే తన తల్లి కడుపు నుంచి పుట్టిన వానిలా పవిత్రుడు అయిపోతాడు."

229. ఇక్కడ **'దైవభీతి'** (తఖ్వా) అంటే భావం యాచించకుండా ఉండటం. కొంతమంది తగినంత ప్రయాణ సామగ్రిని సమకూర్చుకోకుండానే హజ్ యాత్రకు బయలుదేరతారు. అదేమంటే మాకు అల్లాహ్‌పై పూర్తి భరోసా ఉందని అంటారు. ఈ రకమయిన భరోసాను అల్లాహ్ స్వయంగా ఖండించాడు. ప్రయాణ సామగ్రిని, ప్రయాణ ఖర్చులను సరిగ్గా అంచనా వేసి సకల సన్నాహాలతో బయలుదేరాలి – ఇదే తఖ్వా !

230. ఇక్కడ **'ప్రభువు అనుగ్రహం'** అంటే భావం వర్తకం. అంటే హజ్ యాత్ర సందర్భంగా వ్యాపారం చేయటం దోషంతో కూడుకున్న పనికాదు.

231. జిల్ హజ్ 9వ తేదీన సూర్యుడు నడి నెత్తి నుంచి వాలినప్పటి నుండి సూర్యాస్తమయం వరకు అరఫాత్ మైదానంలో ఆగటం హజ్‌కు సంబంధించిన క్రియలన్నింటిలోకీ అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే "అరఫాత్‌లో ఆగటమే అసలు హజ్" అని హదీసులో అనబడింది. ఇక్కడ మగ్రిబ్ నమాజ్ చేయకూడదు. సూర్యాస్తమయం కాగానే ఇక్కడి నుంచి 'ముజ్దలిఫా'కు బయలుదేరాలి. ముజ్దలిఫాలో మగ్రిబ్‌కి సంబంధించిన మూడు రకాతుల నమాజ్‌తో పాటు, ఇషాకు సంబంధించిన రెండు రకాతుల (ఖసర్) నమాజు చేయాలి. ఒక్క అజాన్, రెండు ఇఖామత్‌లతో ఈ రెండు పూటల నమాజులూ కలుపుకోబడతాయి. ముజ్దలిఫానే 'మష్అరె హరామ్'గా కూడా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఇది హరమ్ పరిధిలో ఉంది. ఇక్కడ దైవధ్యానం చేయమని నొక్కి వక్కాణించబడింది. ఆ రాత్రి ఇక్కడే విడిది

ثُمَّ أَفِيضُوا مِنْ حَيْثُ أَفَاضَ النَّاسُ وَاسْتَغْفِرُوا
اللَّهَ ۚ إِنَّ اللَّهَ غَفُورٌ رَحِيمٌ ﴿١٩٩﴾

**199** తరువాత మీరు ప్రజలందరూ మరలే చోటు నుంచే మరలండి.[232] క్షమాపణకై అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడూను.

فَإِذَا قَضَيْتُمْ مَنَاسِكَكُمْ فَاذْكُرُوا اللَّهَ كَذِكْرِكُمْ
آبَاءَكُمْ أَوْ أَشَدَّ ذِكْرًا ۗ فَمِنَ النَّاسِ مَنْ يَقُولُ
رَبَّنَا آتِنَا فِي الدُّنْيَا وَمَا لَهُ فِي الْآخِرَةِ
مِنْ خَلَاقٍ ﴿٢٠٠﴾

**200** హజ్ క్రియలన్నింటినీ నిర్వర్తించిన తరువాత అల్లాహ్‌ను ధ్యానించండి. మీ తాతముత్తాతలను జ్ఞాపకం చేసుకున్నట్లే, ఇంకా అంతకంటే అధికంగానే అల్లాహ్‌ను జ్ఞాపకం చేయండి.[233] "ఓ ప్రభూ! మాకు ప్రపంచంలోనే ప్రసాదించు" అని ప్రార్థించేవారు కూడా ప్రజల్లో కొందరున్నారు. అటువంటి వారికి పరలోకంలో ఏ భాగమూ లభించదు.

وَمِنْهُمْ مَنْ يَقُولُ رَبَّنَا آتِنَا فِي الدُّنْيَا
حَسَنَةً وَفِي الْآخِرَةِ حَسَنَةً وَقِنَا عَذَابَ
النَّارِ ﴿٢٠١﴾

**201** ప్రజల్లోనే మరికొందరు, "ప్రభూ! మాకు ప్రపంచంలోనూ మేలును ప్రసాదించు,[234] పరలోకంలో కూడా మేలును ప్రసాదించు. ఇంకా మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి కాపాడు" అని ప్రార్థించేవారు కూడా ఉన్నారు.

చేయాలి. ఉషోదయపు తొలివేళలో చీకటి ఉండగానే ఫజ్ర్ నమాజు చేసి సూర్యోదయం దాకా దైవనామ స్మరణ చేయాలి. సూర్యోదయం తర్వాత అక్కడినుంచి 'మినా' ప్రదేశానికి బయలుదేరాలి.

232. పైన ప్రస్తావించబడినట్లుగా అరఫాత్ మైదానానికి వెళ్ళటం, అక్కడ విడిదిచేసి, అక్కడినుంచి తిరిగి రావటం చాలా అవసరం. అయితే అరఫాత్ మైదానం హరమ్ పరిధికి బయట ఉండటం వల్ల మక్కాలోని ఖురైషులు 'అరఫాత్'కు వెళ్ళేవారు కాదు– 'ముజ్దలిఫా' నుంచే వెనుతిరిగేవారు. అందుచేత ప్రజలంతా తిరిగివచ్చే చోటు నుంచి – అంటే అరఫాత్ మైదానం నుంచి – తిరిగి రావలసిందిగా ఆదేశించబడింది.

233. పూర్వం అరబ్బులు హజ్ విధులను నిర్వర్తించిన మీదట తీరిగ్గా 'మినా' ప్రదేశంలో సమ్మేళనం జరిపి, తమ తాత ముత్తాతల ఘనకార్యాలను తలచుకుని ఆనందించేవారు. అయితే ముస్లింలకు ఏమని ఆజ్ఞాపించబడిందో చూడండి: మీరు జిల్ హజ్జ్ నెల 10వ తేదీన కంకర రాళ్లు రువ్వటం, ఖుర్బానీ ఇవ్వటం, శిరోముండనం చేయించుకోవటం, కాబా ప్రదక్షిణ, సయీలను ముగించుకోవటం – ఇత్యాది విధులన్నింటినీ పూర్తిచేసిన పిదప 'మినా'లో విడిది చేయాల్సిన మూడు రోజులలో వీలయినంత ఎక్కువగా అల్లాహ్ నామాన్ని స్మరించండి. పూర్వం మీరు మీ పూర్వీకుల వైభవాన్ని తలచుకుని మురిసిపోయినట్లే దేవుని ఘనత్వాన్ని తలచుకుని కృతజ్ఞతాపూర్వకంగా ఆయన పవిత్రతను కొనియాడండి అని ఉపదేశించబడింది.

234. సదాచరణలను చేసే సద్బుద్ధి నొసగమని వేడుకోవటం విశ్వాసుల ముఖ్య లక్షణం. వారు ఇహలోకంలో జీవిస్తున్నప్పటికీ ఇహలోక మేళ్లతో పాటు పరలోక శుభాలను, మేళ్లను కూడా ప్రసాదించమని ప్రార్థిస్తారు. సత్కార్యాలను చేసే సద్బుద్ధిని నొసగమని వేడుకుంటారు. అంటే ప్రాపంచిక జీవితంలో నీవు ప్రసాదించే సిరిసంపదలు, అనుగ్రహాలు పరలోక జీవితానికి కూడా పనికి వచ్చేలా చెయ్యి అని దీని భావం. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా అత్యధికంగా ఈ దుఆ చేసేవారు. చాలామంది కాబా గృహ ప్రదక్షిణ సందర్భంగా – ఒక్కో ప్రదక్షిణపై – ఒక్కో దుఆను, స్వీయకల్పిత దుఆను పఠిస్తూ ఉంటారు. వాటికి బదులు ప్రదక్షిణ సమయంలో రుక్నె యమానీ – హజ్రె అస్వద్‌ల మధ్య **'రబ్బనా ఆతినా ఫిద్దున్‌యా హసనతన్ వఫిల్ ఆఖిరతి హసనతన్ వఖినా అజాబన్నార్'** అనే ఈ దుఆ చేయటం మస్నూన్ (సంప్రదాయం).

**202** ఇలాంటి వారికి వారి కర్మలను బట్టి వాటా లభిస్తుంది. అల్లాహ్ వేగంగా లెక్క తీసుకునేవాడు.

أُولَٰئِكَ لَهُمْ نَصِيبٌ مِّمَّا كَسَبُوا ۚ وَاللَّهُ سَرِيعُ الْحِسَابِ ﴿٢٠٢﴾

**203** గణించదగిన ఆ దినాలలో (తష్రీఖ్ దినాలలో) అల్లాహ్‌ను స్మరించండి.[235] రెండు దినాలలోనే ఇక్కడి నుంచి తిరిగి వెళ్ళేందుకు ఎవరైనా తొందరపాటు కనబరచినా తప్పులేదు. వెనుక ఉండిపోయిన వారు కూడా నిందార్హులు కారు.[236] ఇది భయభక్తులు గల వారికై ఉద్దేశించినది. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరంతా ఆయన వైపుకే సమీకరించబడతారన్న యదార్థాన్ని బాగా తెలుసుకోండి.

وَاذْكُرُوا اللَّهَ فِي أَيَّامٍ مَّعْدُودَاتٍ ۚ فَمَن تَعَجَّلَ فِي يَوْمَيْنِ فَلَا إِثْمَ عَلَيْهِ وَمَن تَأَخَّرَ فَلَا إِثْمَ عَلَيْهِ ۚ لِمَنِ اتَّقَىٰ ۗ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوا أَنَّكُمْ إِلَيْهِ تُحْشَرُونَ ﴿٢٠٣﴾

**204** (ఓ ప్రవక్తా!) ప్రజలలో కొందరు పలికే ప్రాపంచిక ఉద్దేశాలతో కూడుకున్న మాటలు నిన్ను అలరించవచ్చు. వాడు తన ఆంతర్యంలోనున్న అసలు విషయానికి అల్లాహ్‌ను సాక్షిగా పెడుతున్నాడు. మరి చూడబోతే వాడు పెద్ద తగవులమారి.[237]

وَمِنَ النَّاسِ مَن يُعْجِبُكَ قَوْلُهُ فِي الْحَيَاةِ الدُّنْيَا وَيُشْهِدُ اللَّهَ عَلَىٰ مَا فِي قَلْبِهِ وَهُوَ أَلَدُّ الْخِصَامِ ﴿٢٠٤﴾

**205** వాడు (నీ వద్ద నుండి) తిరిగి వెళ్ళిన తరువాత ధరణిలో కల్లోలాన్ని రేకెత్తించడంలో, పంటలను నాశనం చేయడంలో, సంతతిని పాడు చేయటంలో నిమగ్నుడైపోతాడు. కాగా; అల్లాహ్ ఇలాంటి చెడుగును సుతరామూ ఇష్టపడడు.

وَإِذَا تَوَلَّىٰ سَعَىٰ فِي الْأَرْضِ لِيُفْسِدَ فِيهَا وَيُهْلِكَ الْحَرْثَ وَالنَّسْلَ ۗ وَاللَّهُ لَا يُحِبُّ الْفَسَادَ ﴿٢٠٥﴾

**206** "అల్లాహ్‌కు భయపడు" అని వాడితో అన్నప్పుడు, వాడి గర్వం, దురభిమానం వాడ్ని పాపం వైపుకే పురికొల్పుతుంది.[238] ఇలాంటి వారికి నరకమే గతి. అది అతి చెడ్డ నివాస స్థలం.

وَإِذَا قِيلَ لَهُ اتَّقِ اللَّهَ أَخَذَتْهُ الْعِزَّةُ بِالْإِثْمِ ۚ فَحَسْبُهُ جَهَنَّمُ ۚ وَلَبِئْسَ الْمِهَادُ ﴿٢٠٦﴾

235. 'తష్రీఖ్ దినాలు' అంటే జిల్ హజ్ 11, 12, 13 తేదీలు. ఈ దినాలలో దైవనామాన్ని స్మరించటం – అంటే బిగ్గరగా 'తక్బీర్' పలకటం సంప్రదాయం. కేవలం ఫర్జ్ నమాజుల తర్వాతే కాదు, ఎల్లవేళలా ఈ తక్బీర్లు పఠిస్తూ ఉండాలి. ఒక బలహీనమైన (జయీఫ్) హదీసు మూలంగా తక్బీరె తష్‌రీఖ్ ఫర్జ్ నమాజుల తర్వాత పఠించే ఆచారం ప్రచారం నొందింది. తక్బీర్ ఇది : **అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా యిలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, వ లిల్లాహిల్‌హమ్ద్** (అల్లాహ్‌యే గొప్పవాడు. అల్లాహ్‌యే గొప్పవాడు, అల్లాహ్‌యే గొప్పవాడు. అల్లాహ్ తప్ప వేరొక దైవం లేనేలేడు. అల్లాహ్‌యే గొప్పవాడు, అల్లాహ్‌యే గొప్పవాడు. స్తోత్రం అల్లాహ్‌కే శోభాయమానం). కంకరరాళ్లు రువ్వేటప్పుడు (రమీ చేసే సమయంలో) ఒక్కో రాయి రువ్వుతూ ఈ తక్బీర్ పలకటం సంప్రదాయం (నైలుల్ ఔతార్, కితాబుల్ ఈదైన్).

236. 'మినా'లో మూడు రోజులు ఉండి **'రమీ'** చేయటం (రాళ్ళు రువ్వటం) ఉత్తమం. ఒకవేళ ఎవరయినా రెండు రోజుల్లోనే 'రమీ' చేసి మినా నుండి వాపసు అవదలిస్తే అందులో తప్పు లేదు.

237. కొన్ని బలహీన ఉల్లేఖనాల ప్రకారం ఈ ఆయతు ఆనాటి కపటి అయిన అఖ్‌నస్ బిన్ షరీఖ్ సఖఫీని దృష్టిలో పెట్టుకుని అవతరించింది. కాని ప్రమాణబద్ధమైన విషయం ఏమిటంటే కపటులు, గర్విష్టులందరినీ దృష్టిలో పెట్టుకుని అల్లాహ్ ఈ మందలింపు చేశాడు.

وَمِنَ النَّاسِ مَن يَشْرِي نَفْسَهُ ابْتِغَاءَ مَرْضَاتِ اللَّهِ ۗ وَاللَّهُ رَءُوفٌ بِالْعِبَادِ ﴿٢٠٧﴾

**207** ప్రజల్లోని మరి కొంతమంది ఎలాంటివారంటే, దైవ ప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో వారు తమ ప్రాణాలను సయితం పణంగా పెడుతున్నారు.[239] అటువంటి (త్యాగధనులైన) తన దాసుల పట్ల అల్లాహ్ అమితమైన వాత్సల్యం కలిగి ఉంటాడు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا ادْخُلُوا فِي السِّلْمِ كَافَّةً وَلَا تَتَّبِعُوا خُطُوَاتِ الشَّيْطَانِ ۚ إِنَّهُ لَكُمْ عَدُوٌّ مُّبِينٌ ﴿٢٠٨﴾

**208** ఓ విశ్వాసులారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగు జాడలలో నడవకండి.[240] వాడు మీకు బద్ధవిరోధి.

فَإِن زَلَلْتُم مِّن بَعْدِ مَا جَاءَتْكُمُ الْبَيِّنَاتُ فَاعْلَمُوا أَنَّ اللَّهَ عَزِيزٌ حَكِيمٌ ﴿٢٠٩﴾

**209** మీ వద్దకు స్పష్టమయిన నిదర్శనాలు వచ్చిన తరువాత కూడా మీరు ఒకవేళ తప్పటడుగు వేస్తే అల్లాహ్ సర్వశక్తి మంతుడు, వివేక సంపన్నుడన్న సంగతిని బాగా గుర్తుంచుకోండి.

238. అహంకారం, గర్వం, దురభిమానం వారిని పాపం వైపుకే పురికొల్పుతాయి. ఆంతర్యాల్లో అహంకారం తిష్ఠవేసినప్పుడు దైవభీతి, పాపభీతి వాటిల్లో చోటును సంపాదించలేవు మరి!

239. ఈ ఆయతు సుహైబ్ రూమీ (రజి)ని దృష్టిలో పెట్టుకుని అవతరింపజేయబడింది అని అనబడుతోంది. ఆయన మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేయదలచినప్పుడు అవిశ్వాసులు అడ్డగించి, నువ్వు ఈ ధనాన్నంతా ఇక్కడే సంపాదించావు. అందుచేత దీన్ని మేము నీ వెంటబెట్టుకుని వెళ్ళడానికి అంగీకరించము అని పేచీ పెట్టారు. అప్పుడు సుహైబ్ (రజి) తన ధనాన్నంతటినీ వారికి వదలిపెట్టేసి, దైవధర్మాన్ని తన వెంటబెట్టుకుని మహాప్రవక్త (స) వద్దకు వచ్చేశారు. ఈ వృత్తాంతమంతా విన్న తరువాత దైవప్రవక్త (స), "సుహైబ్ లాభసాటి వ్యాపారం చేశాడు" అని కొనియాడారు. ఈ మాటను ఆయన (స) రెండుసార్లు పలికారు (ఫత్హుల్ ఖదీర్). అయితే ఈ ఆయతు సర్వసాధారణమైనది. విశ్వాసులకు, దైవభక్తిపరులకు, ఇహలోకానికి బదులుగా పరలోకానికి ప్రాముఖ్యం ఇచ్చే త్యాగమూర్తులందరికీ ఇది వర్తిస్తుంది.

240. ఇది విశ్వసించిన వారినుద్దేశించి చేయబడిన హితోపదేశం. మీరు ఇస్లాంలోకి రాదలిస్తే పూర్తిగా వచ్చేయండి. పాక్షికంగా వద్దు. మీకు నచ్చిన విషయాలను, ప్రయోజనకరమైన అంశాలను అమలుపరచి, మీ ఆశలు ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఉన్నాయనుకున్న వాటిని వదలివేస్తామంటే కుదరదు. అలాగే పూర్వాశ్రమంలో మీరు వదలి వచ్చిన కాల్పనిక సిద్ధాంతాలను, ఆచార దురాచారాలను ఇస్లాంలో జొప్పించే ప్రయత్నం చేయకండి. ఇస్లాంను – సంపూర్ణంగా– అవలంబించండి. సంపూర్తిగా మీరు ఈ ధర్మాన్ని అవలంబించిననాడు మీరంతట మీరే దురాచారాలకు, మిథ్యా వాదాలకు దూరం అయిపోతారు.

ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించడానికి నిరాకరించినవాడు – వేరే మాటల్లో ధర్మాన్ని పాక్షికంగా మాత్రమే అనుసరించగోరే వాడు – దాన్ని ఆరాధనల వరకే, మస్జిద్ నాలుగు గోడల వరకే పరిమితం చేయాలనుకుంటున్నాడన్నమాట! రాజకీయాల నుంచి, చట్టసభల నుంచి దాన్ని వేరుపరచాలనుకుంటున్నాడు. అలాగే ప్రజలు తమ ప్రాంతీయ అలవాట్లను, ఆచారాలను, సంస్కృతిని ఇష్టపడతారు. వాటిని వదులుకోవడానికి సుముఖంగా ఉండరు. ముఖ్యంగా వివాహాది విషయాలలో దుబారా ఖర్చు చేయటం, ముస్లిమేతర ఆచారాలను అవలంబించటం వంటివి జరుగుతూ ఉంటాయి. అందుకే షైతాన్ అడుగు జాడలను అనుసరించకండి అని బోధించబడింది. ఎందుకంటే షైతాన్ మిమ్మల్ని ఆకట్టుకోవడానికి, ఇస్లాంకు విరుద్ధంగా ఉండే విషయాలనే అందమైన ఫిలాసఫీ ద్వారా మీకు నచ్చినట్లుగా సమర్పిస్తాడు. చెడులపై అందమైన గిలాపులను చుట్టి మీ ముందుంచుతాడు. బిద్అత్‌లను కూడా సత్కార్యాలుగా నమ్మబలుకుతాడు. అందుకే ఇస్లాంలోకి ప్రవేశించిన మీదట మనసు మెచ్చే విషయాలను దైవేచ్ఛకు, దైవప్రవక్త (స) వారి సంప్రదాయానికి అప్పగించాలి. దైవప్రసన్నతతో సమరసం చెందని విషయాలను నిస్సంకోచంగా విడనాడాలి.

هَلْ يَنظُرُونَ إِلَّآ أَن يَأْتِيَهُمُ ٱللَّهُ فِى ظُلَلٍ مِّنَ ٱلْغَمَامِ وَٱلْمَلَٰٓئِكَةُ وَقُضِىَ ٱلْأَمْرُ ۚ وَإِلَى ٱللَّهِ تُرْجَعُ ٱلْأُمُورُ ﴿٢١٠﴾

**210** ఏమిటీ, అల్లాహ్ మరియు దూతలు స్వయంగా మేఘాల నీడలలో వచ్చి తమ కార్యాన్ని పరిపూర్తిగావిస్తారని వారు ఎదురుచూస్తున్నారా?[241] కార్యాలన్నీ (నిర్ణయం కొరకు) అల్లాహ్ వైపుకే మరలించబడతాయి.

سَلْ بَنِىٓ إِسْرَٰٓءِيلَ كَمْ ءَاتَيْنَٰهُم مِّنْ ءَايَةٍۭ بَيِّنَةٍ ۗ وَمَن يُبَدِّلْ نِعْمَةَ ٱللَّهِ مِنۢ بَعْدِ مَا جَآءَتْهُ فَإِنَّ ٱللَّهَ شَدِيدُ ٱلْعِقَابِ ﴿٢١١﴾

**211** మేము ఇస్రాయీల్ వంశస్థులకు ఎన్ని స్పష్టమైన నిదర్శనాలను ప్రసాదించామో వారినే అడగండి.[242] దైవ ప్రసాదితాలు తమ వద్దకు చేరిన తరువాత వాటిని తారుమారు చేసేవారు,[243] అల్లాహ్ కఠినమైన శిక్షలు విధించగలవాడన్న విషయాన్ని విస్మరించరాదు.

زُيِّنَ لِلَّذِينَ كَفَرُوا۟ ٱلْحَيَوٰةُ ٱلدُّنْيَا وَيَسْخَرُونَ مِنَ ٱلَّذِينَ ءَامَنُوا۟ ۘ وَٱلَّذِينَ ٱتَّقَوْا۟ فَوْقَهُمْ يَوْمَ ٱلْقِيَٰمَةِ ۗ وَٱللَّهُ يَرْزُقُ مَن يَشَآءُ بِغَيْرِ حِسَابٍ ﴿٢١٢﴾

**212** అవిశ్వాసుల కొరకు ప్రాపంచిక జీవితం ఎంతో సుందరంగా, ఆకర్షణీయంగా మలచబడింది. వారు విశ్వసించిన వారిని అవహేళన చేస్తున్నారు.[244] వాస్తవానికి అల్లాహ్ పట్ల భయభక్తులు గలవారు ప్రళయ దినాన వారికన్నా ఎంతో ఉన్నత స్థితిలో ఉంటారు. అల్లాహ్ తాను తలచిన వారికి లెక్కలేనంతగా ఉపాధిని అనుగ్రహిస్తాడు.[245]

241. కొన్ని ఖుర్ఆన్ వ్యాఖ్యానాలలో ఉన్నట్లు ఇది ప్రళయదినం దృశ్యం కావచ్చు (తఫ్సీర్ ఇబ్నె కసీర్). లేక అల్లాహ్ తన దూతలతో, మేఘాల నీడలలో ప్రత్యక్షమై, తమ సంశయాలన్నింటినీ దూరం చేస్తే అప్పుడు తాము విశ్వసిస్తామన్నది వారి ఉద్దేశం కావచ్చు. అయితే ఇటువంటి ఇస్లాం స్వీకరణకు దైవసన్నిధిలో ఎలాంటి విలువా లేదు. అందుకే ఇస్లాం స్వీకరణలో తాత్సారం చేయకండి. వీలైనంత తొందరగా ఈ సత్యామృతాన్ని ఆస్వాదించి మీ పరలోక జీవితాన్ని తీర్చిదిద్దుకోండి.

242. ఉదాహరణకు మూసా (అలైహిస్సలాం) దగ్గరున్న చేతికర్రనే తీసుకోండి. దాని ద్వారా మేము మంత్రగాళ్ళ కనికట్టును కకావికలం చేశాము. సముద్రంలో నుంచి మార్గం ఏర్పరచాము. బండరాయి నుంచి 12 నీటి ఊటలను ఉత్పత్తి చేశాము. అలాగే మేఘాల ద్వారా ఛాయను కల్పించటం, మన్న్ సల్వాలను ఆహార పదార్థాలుగా అవతరింపజేయటం– ఇవన్నీ దైవశక్తికి, దైవప్రవక్త (స) సత్యతకు ప్రబల తార్కాణాలే. కాని ఇంత చేసినా ఇస్రాయీల్ సంతతివారు దైవాదేశాల పట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించారు.

243. దైవానుగ్రహాన్ని తారుమారు చేయటమంటే భావం; వాళ్లు ఈమాన్‌కు (విశ్వాసానికి) బదులుగా తిరస్కార వైఖరికి ఒడిగట్టారు. దైవసందేశం పట్ల విముఖత చూపారు.

244. ఆనాటి ముస్లిముల్లో అత్యధికులు పేదవారు, అభాగ్య జీవులే. వారి దగ్గర విలాస వస్తువులుగానీ, ఆస్తీ అంతస్థులుగానీ ఉండేవి కావు. అందుచేత మక్కాకు చెందిన ఖురైషులు అడుగడుగునా ముస్లింలను అవమానపరచేవారు, ఎగతాళి చేసేవారు. తరతరాలుగా యుగయుగాలుగా జరుగుతున్నది కూడా ఇదే. సమాజంలోని శ్రీమంతులు సదా సత్య బలమున్న పేదవర్గాన్ని చిన్న చూపు చూస్తూనే వచ్చారు. కాని ఎట్టకేలకు సత్యబలం ఉన్న వర్గం మాత్రమే కాలం పెట్టే పరీక్షలో నెగ్గింది.

245. విశ్వాస వర్గం యొక్క పేదరికాన్ని, నిరాడంబరత్వాన్ని చూసి అవిశ్వాసులు చేసిన ఎగతాళికి సమాధానం ఇవ్వబడింది. మీరు ప్రాపంచికంగా ఏ అభాగ్య జీవులను పరిహసిస్తున్నారో వారే ప్రళయదినాన తమ తఖ్వా (దైవభీతి, పాపభీతి) దృష్ట్యా ఉన్నత స్థానాల్లో ఉంటారు. 'లెక్కలేనంతగా ఉపాధిని ప్రసాదిస్తాడు' అన్న మాటలో పరలోక అనుగ్రహంతో

كَانَ النَّاسُ اُمَّةً وَّاحِدَةً فَبَعَثَ اللّٰهُ النَّبِيّٖنَ
مُبَشِّرِيْنَ وَمُنْذِرِيْنَ وَاَنْزَلَ مَعَهُمُ الْكِتٰبَ
بِالْحَقِّ لِيَحْكُمَ بَيْنَ النَّاسِ فِيْمَا اخْتَلَفُوْا فِيْهِ
وَمَا اخْتَلَفَ فِيْهِ اِلَّا الَّذِيْنَ اُوْتُوْهُ مِنْۢ بَعْدِ
مَا جَآءَتْهُمُ الْبَيِّنٰتُ بَغْيًاۢ بَيْنَهُمْ فَهَدَى اللّٰهُ
الَّذِيْنَ اٰمَنُوْا لِمَا اخْتَلَفُوْا فِيْهِ مِنَ الْحَقِّ بِاِذْنِهٖ
وَاللّٰهُ يَهْدِيْ مَنْ يَّشَآءُ اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ (213)

**213** మానవులంతా ఒకే సమాజంగా ఉండేవారు.[246] అల్లాహ్ ప్రవక్తలను శుభవార్తనిచ్చే వారుగా, భయపెట్టే వారుగా చేసి పంపాడు. ప్రజల మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలపై తీర్పు చేయటానికిగాను వారివెంట (అనగా ప్రవక్తల వెంట) సత్య బద్ధమైన గ్రంథాలను పంపాడు. మరి వాళ్ళే (అనగా ప్రజలే) – స్పష్టమైన ఆదేశాలు వొసగబడిన తరువాత కూడా – పరస్పర వైర భావం, అసూయ మూలంగా అందులో విభేదించుకున్నారు.[247] అందుచేత అల్లాహ్ విశ్వాసులకు ఈ భేదాభిప్రాయం నుండి కూడా తన ఆజ్ఞానుసారం సత్యం వైపుకు దర్శకత్వం వహించాడు.[248] అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు.

పాటు ఇహలోక ప్రసాదం కూడా ఇమిడి ఉంది. అన్నట్లుగానే – కొన్నేండ్లలోనే – అల్లాహ్ ఈ పేదప్రజల కోసం విజయ ద్వారాలు తెరిచాడు. దాంతో వారికి ప్రాపంచిక ఐశ్వర్యం కూడా ప్రాప్తించింది.

246. అంటే అందరూ తౌహీద్ (దేవుని ఏకత్వం) పై ఉండేవారు. హజ్రత్ ఆదం నుండి హజ్రత్ నూహ్ వరకు – పది తరాల వరకూ దైవప్రవక్తలు ఏకదైవారాధననే ప్రబోధించారు. ప్రజలు కూడా ఈ 'దేవుని ఏకత్వం'పై గట్టిగా నిలబడ్డారు. ఆ తరువాత క్రమేణా షైతాన్ వారిలో దుష్ప్రేరణలను నూరిపోశాడు. పర్యవసానంగా వారి మధ్య భేదాభిప్రాయం పొడసూపింది. షిర్క్ మరియు గోచర వస్తువుల పూజ సర్వసాధారణం అయిపోయింది. అందువల్ల మార్గభ్రష్టతకు లోనైన మానవతను తిరిగి రుజుమార్గంలోకి తీసుకురావటానికి అల్లాహ్ తన ప్రవక్తలకు గ్రంథాలిచ్చి పంపాడు. మౌలిక విశ్వాసంపై ప్రజల మధ్య ఏర్పడిన అభిప్రాయభేదాలను విచారించి సత్యమేదో – అసత్యమేదో స్పష్టం చేయటం దీని అసలు ఉద్దేశం (ఇబ్నె కసీర్).

247. సత్యం పట్ల వైముఖ్యధోరణి, విసుగు పుట్టినచోటల్లా అభిప్రాయభేదం తప్పకుండా వస్తుంది. ఈ విముఖతకు అసలు కారణం అసూయ, విరోధం, మనసులోని అక్కసు. ముస్లిం సమాజంలోనూ ఈ విముఖత పొడసూపకుండా ఉన్నంతకాలం, ఈ సమాజం తన మౌలిక విశ్వాసంపై కదలని కొండలా నిలబడింది. కాని తఖ్లీద్ (ఇమాముల అంధానుసరణ) మరియు బిద్అత్ (ధర్మంలో సరికొత్త విషయాలకు అంకురార్పణ)ల మూలంగా సత్యమార్గం నుండి మనిషి తప్పటడుగు వేయటం ప్రారంభించాడు. విభేదాలు నానాటికీ పెరగనారంభించాయి. కడకు "ఉమ్మత్ ఐక్యత" అనేది అసాధ్యంగా పరిణమించింది. అల్లాహ్ ముస్లింలకు మార్గం చూపుగాక!

248. ఉదాహరణకు జుమా రోజు విషయంలో గ్రంథవహులు విభేదించారు. యూదులు శనివారాన్ని, క్రైస్తవులు ఆదివారాన్ని తమ పవిత్ర దినాలుగా చేసుకున్నారు. అంచేత అల్లాహ్ ముస్లిములకు జుమా రోజును (అంటే శుక్రవారాన్ని) అవలంబించవలసిందిగా సూచించాడు. యూదులు ఈసా (అలైహిస్సలాం) విషయంలో విభేదించారు. వారు ఆయన్ని ధిక్కరించటమేగాక, ఆయన తల్లి అయిన మర్యమ్‌పై అపనిందవేశారు. ఇదిలా వుండగా క్రైస్తవులు ఈసా (ఏసు ప్రవక్త)ను అల్లాహ్ కుమారునిగా, సాక్షాత్తూ దేవునిగా చేసుకున్నారు. కాగా; అల్లాహ్ ఆయన విషయంలో సరైన దృక్పథాన్ని అవలంబించే సద్బుద్ధిని ముస్లిములకు వొసగాడు. అంటే ఈసా (ఏసు)– దైవప్రవక్త మరియు దేవునికి విధేయత చూపే దాసుడు అని ముస్లిములు విశ్వసిస్తారు. ఇబ్రాహీం (అలైహిస్సలాం) విషయంలో కూడా వాళ్లు విభేదించారు. ఆయన యూదుడు అని ఒకరంటే, 'కాదు – క్రైస్తవుడు' అని ఇంకొకరన్నారు. అయితే ఆయన "చిత్తశుద్ధి గల దైవవిధేయుడు (ముస్లిం)" అని అల్లాహ్ ముస్లిములకు ఎరుకపరిచాడు. ఈ విధంగా అనేక విషయాలలో అల్లాహ్ ముస్లింలకు తన కృపతో సరైన మార్గం చూపాడు.

**214** ఏమిటీ, మీరు స్వర్గంలో ఇట్టే ప్రవేశించగలమని అనుకుంటున్నారా? వాస్తవానికి మీకు పూర్వం గతించిన వారికి ఎదురైనటువంటి పరిస్థితులు మీకింకా ఎదురు కానేలేదు.[249] వారిపై కష్టాలు, రోగాలు వచ్చిపడ్డాయి. వారు ఎంతగా కుదిపి వేయబడ్డారంటే, (ఆ ధాటికి తాళలేక) “ఇంతకీ దైవసహాయం ఎప్పుడొస్తుంది?” అని ప్రవక్తలు, వారి సహచరులు ప్రశ్నించ సాగారు. “వినండి! దైవ సహాయం సమీపంలోనే ఉంది”[250] (అని వారిని ఓదార్చటం జరిగింది).

أَمْ حَسِبْتُمْ أَنْ تَدْخُلُوا الْجَنَّةَ وَلَمَّا يَأْتِكُمْ مَثَلُ
الَّذِينَ خَلَوْا مِنْ قَبْلِكُمْ ۖ مَسَّتْهُمُ الْبَأْسَاءُ وَ
الضَّرَّاءُ وَزُلْزِلُوا حَتَّىٰ يَقُولَ الرَّسُولُ وَالَّذِينَ آمَنُوا
مَعَهُ مَتَىٰ نَصْرُ اللَّهِ ۗ أَلَا إِنَّ نَصْرَ اللَّهِ قَرِيبٌ ﴿٢١٤﴾

**215** తాము ఏం ఖర్చు చెయ్యాలి? అని వారు నిన్ను ప్రశ్నిస్తున్నారు. మీరేం ఖర్చు చేసినా అది మీ తల్లిదండ్రుల కొరకూ, బంధువుల కొరకూ, అనాథల కొరకూ, నిరుపేదలు, బాటసారుల కొరకూ ఖర్చు చేయాలి.[251] మీరు ఏ మేలు చేసినా అల్లాహ్‌కు దాని గురించి తెలుసు అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

يَسْأَلُونَكَ مَاذَا يُنْفِقُونَ ۖ قُلْ مَا أَنْفَقْتُمْ مِنْ
خَيْرٍ فَلِلْوَالِدَيْنِ وَالْأَقْرَبِينَ وَالْيَتَامَىٰ وَالْمَسَاكِينِ
وَابْنِ السَّبِيلِ ۗ وَمَا تَفْعَلُوا مِنْ خَيْرٍ فَإِنَّ اللَّهَ
بِهِ عَلِيمٌ ﴿٢١٥﴾

249. మదీనాకు వలస వెళ్ళిన తరువాత కపటుల, యూదుల, ముష్రిక్కుల తరఫు నుంచి ముస్లింలకు ఎన్నో వేధింపులు, బాధలు ఎదురయ్యాయి. కొంతమంది ముస్లింలు ఈ విషయమై దైవప్రవక్త (స)కు ఫిర్యాదు కూడా చేశారు. దానిపై ముస్లింలను ఓదారుస్తూ ఈ ఆయతు అవతరించింది. మహాప్రవక్త (సఅసం) సయితం వారిని ఈ విధంగా ఓదార్చారు: మీకు పూర్వం గతించిన వారిని నిలువునా రంపంతో కోశారు. ఇనుప దువ్వెనలతో వారి శరీరం నుంచి మాంసం తీయబడింది. అయితే ఈ చిత్రవధ, ఈ అమానుషకాండ వారిని వారి ధర్మం నుంచి మరలించలేకపోయింది.” ఆ తరువాత ఆయన (స) ఇలా అన్నారు : దైవసాక్షి! అల్లాహ్ ఈ వ్యవహారాన్ని సంపూర్ణం గావిస్తాడు (అంటే ఇస్లాంకు ప్రాబల్యాన్ని వొసగుతాడు). కడకు ఒక ప్రయాణీకుడు ఒంటరిగా ‘సన్‌ఆ’ నుండి ‘హజర్‌మోత్’ వరకు నిశ్చింతగా ప్రయాణం చేయగలుగుతాడు. అతడు అల్లాహ్‌కు తప్ప వేరొకరికి భయపడవలసిన అవసరం ఉండదు. ఆ కాలం వస్తుంది (సహీహ్ బుఖారీ). ఈ ఉపదేశం ద్వారా మహాప్రవక్త (సఅసం) ముస్లింలలో ఆత్మ విశ్వాసాన్ని, స్థయిర్యాన్ని పెంపొందించదలిచారు.

250. రానున్న ప్రతిదీ దాపులోనే ఉంటుంది. విశ్వాసులకు దేవుని తోడ్పాటు లభించటం అన్నది నిశ్చయం. కనుక అది చాలా సమీపంలోనే ఉంది అని అర్థం.

251. కొంతమంది ప్రవక్త సహచరులు అడిగిన దానికి సమాధానంగా, ధనం ఏ ఏ పద్దుల్లో ఖర్చుపెట్టాలో తెలియజేయబడింది. పైన పేర్కొనబడిన వారు మీ ధన సహాయానికి, సహకారానికి ఎక్కువ హక్కుదారులు. దీన్నిబట్టి బోధపడేదేమంటే ఖర్చుపెట్టడానికి సంబంధించిన ఈ ఆజ్ఞ ‘సదఖాతె నాఫిలా’ కు వర్తిస్తుంది. అంటే స్వచ్ఛందంగా చేయవలసిన ఖర్చు అన్నమాట! ఇది జకాత్‌కు వర్తించదు. ఎందుకంటే జకాత్ అనేది విధిగా ఇవ్వవలసిన దానం. అది తల్లిదండ్రుల కోసం ఖర్చు చేయకూడదు. మైమూన్ బిన్ మిహ్రాన్ ఈ ఆయతును పారాయణం చేస్తూ ఇలా వ్యాఖ్యానించారు : “ధనం ఖర్చుచేసే ఈ పద్దుల్లో సంగీత వాయిద్యాల ప్రస్తావనగానీ, గోడలకు వ్రేలాడదీసే చిత్రపటాల, ఖరీదైన తెరల ప్రస్తావన గానీ లేదు.” అంటే ఇలాంటి విలాసవంతమైన పద్దులపై డబ్బు ఖర్చుపెట్టడం దుబారా ఖర్చు క్రిందికి వస్తుంది. కాని విచారకరమైన విషయం ఏమిటంటే ఇలాంటి దుబారా ఖర్చులు, భోగలాలస వస్తువులు మన జీవితంలో అనివార్య అంశాలైపోయాయి. వాటికోసం విచ్చలవిడిగా డబ్బు తగలెడుతున్నప్పుడు మన మనసుల్లో అయిష్టత అనేది ఏర్పడటం లేదు.

كُتِبَ عَلَيْكُمُ الْقِتَالُ وَهُوَ كُرْهٌ لَّكُمْ ۚ وَعَسَىٰ أَن
تَكْرَهُوا شَيْئًا وَهُوَ خَيْرٌ لَّكُمْ ۖ وَعَسَىٰ أَن تُحِبُّوا
شَيْئًا وَهُوَ شَرٌّ لَّكُمْ ۗ وَاللَّهُ يَعْلَمُ وَأَنتُمْ
لَا تَعْلَمُونَ (216)

**216** యుద్ధం చేయటం మీకు కష్టంగా అనిపించినప్పటికీ, అది మీపై విధిగా నిర్ణయించబడింది. మీరు దేన్ని ఇష్టపడటం లేదో అదే మీ పాలిట బహుశా శుభకరం కావచ్చు. అలాగే మీరు మీ కోసం ఎంతగానో కోరుకునే విషయాలే మీ పాలిట హానికరంగా రూపొందవచ్చు. నిజ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. మీకు ఆ విషయం తెలియదు.[252]

يَسْأَلُونَكَ عَنِ الشَّهْرِ الْحَرَامِ قِتَالٍ فِيهِ ۖ قُلْ
قِتَالٌ فِيهِ كَبِيرٌ ۖ وَصَدٌّ عَن سَبِيلِ اللَّهِ
وَكُفْرٌ بِهِ وَالْمَسْجِدِ الْحَرَامِ وَإِخْرَاجُ أَهْلِهِ
مِنْهُ أَكْبَرُ عِندَ اللَّهِ ۚ وَالْفِتْنَةُ أَكْبَرُ مِنَ
الْقَتْلِ ۗ وَلَا يَزَالُونَ يُقَاتِلُونَكُمْ حَتَّىٰ يَرُدُّوكُمْ
عَن دِينِكُمْ إِنِ اسْتَطَاعُوا ۚ وَمَن يَرْتَدِدْ

**217** నిషిద్ధ మాసాలలో యుద్ధం చెయ్యటం గురించి ప్రజలు నిన్ను అడుగుతున్నారు. నువ్వు వారికి చెప్పు : ఈ మాసాలలో యుద్ధం చేయటం మహాపరాధం. అయితే అల్లాహ్ మార్గంలో అవరోధాలు కల్పించటం, అల్లాహ్‌ను తిరస్కరించటం, మస్జిదె హరామ్‌ను సందర్శించే జనులను అడ్డుకోవటం, అక్కడ నివసించే వారిని అక్కడి నుంచి వెళ్ళగొట్టడం అల్లాహ్ దృష్టిలో అంతకన్నా ఘోరమైన అపరాధం. ఈ ఉపద్రవం (ఫిత్నా) హత్య కన్నా పెద్దది.[253] వారు మీతో యుద్ధం చేస్తూనే ఉంటారు. చివరికి వారికి

252. జిహాద్‌కు సంబంధించిన ఒకానొక ఆజ్ఞను ఇస్తూ, అల్లాహ్ మీకు ఏ ఆదేశాన్ని ఇచ్చినా మీరు దాన్ని శిరసావహించ వలసిందేనని బోధపరచబడింది. ఏదేని ఒక ఆదేశం మీకు బరువుగా, కష్టంగా అనిపించవచ్చు. కాని దాని పరిణామం ఎలా ఉంటుందో అల్లాహ్‌కు తెలుసు. మీకు తెలియదు.మీరు మీకోసం బాధాకరం అనుకున్నదే మీ పాలిట శుభకరం కూడా కావచ్చు. యుద్ధం ద్వారా మీకు ఆధిక్యత, గౌరవోన్నతులతోపాటు సిరిసంపదలు లభించవచ్చు. అశాంతి అలజడుల స్థానే శాంతీ సుస్థిరతలు నెలకొనవచ్చు. అలాగే మీరు కోరుకునే వస్తువు (యుద్ధం చేసే బదులు ఇండ్లలో కూర్చుని ఉండాలన్న తలంపు) భవిష్యత్తులో మిమ్మల్ని పరాభవానికి గురిచేయవచ్చు. శత్రువు మీపై దాడి చేసి, మీ జీవితాలను మరింత దుర్భరం చేయవచ్చు. కనుక మీరు దైవాదేశాల పట్ల విముఖత చూపే బదులు, ఆజ్ఞ అవగానే 'చిత్తం' అంటూ సకారాత్మకంగా స్పందించండి.

253. రజబ్, జుల్ ఖఅద, జుల్‌హిజ్జ్, ముహర్రం – ఈ నాలుగు మాసాలు అజ్ఞాన కాలంలో కూడా నిషిద్ధ మాసాలుగా పరిగణించబడేవి. ఈ మాసాలలో యుద్ధం, జగడం అవాంఛనీయంగా భావించబడేది. ఇస్లాం కూడా వీటి పవిత్రతను యథాతథంగా కొనసాగించింది. మహాప్రవక్త (స) కాలంలో రజబ్ మాసంలో ఒక ముస్లిం సైనిక దళం చేతిలో ఒక అవిశ్వాసి హతమార్చబడ్డాడు. కొంతమంది ఖైదీలుగా పట్టుబడ్డారు. ఎందుకంటే రజబ్ నెల ప్రారంభమైన సంగతి ముస్లింలకు తెలియలేదు. ఈ సంఘటనను ఆసరాగా తీసుకుని అవిశ్వాసులు ముస్లింలపై ఎద్దేవా చేశారు. నిషిద్ధ (పవిత్ర) మాసాల్లో కూడా వీరు రక్తపాతం సృష్టిస్తున్నారని విమర్శించారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. నిస్సందేహంగా నిషిద్ధ మాసాలలో రక్తపాతం సృష్టించటం పాపకార్యమేగాని, నిషిద్ధ మాసాలను ఉదాహరించేవారు కూడా తమ అంతరంగంలోకి తొంగిచూసుకోవాలని చురక అంటించబడింది. ఎందుకంటే వాళ్లు సయితం నిషిద్ధ మాసాలలో చేయరాని పనులన్నీ చేశారు. అల్లాహ్ మార్గంలో అడ్డంకులు సృష్టించటం, దైవగృహ సందర్శనం నిమిత్తం వెళ్ళే వారిని నిలువరించటం, మక్కాలోని ముస్లింలను మూటాముల్లె సర్దుకుని వెళ్ళిపోయే పరిస్థితుల్ని సృష్టించటం – ఇవన్నీ మామూలు అపరాధాలు కావు. క్షమార్హం కాని నేరాలు! హత్యా నేరంకన్నా తీవ్రమైన చేష్టలు!! అందువల్ల ముస్లింల చేత – పొరపాటున – నిషిద్ధ మాసంలో జరిగిన ఒక్కగానొక్క హత్యోదంతంపై కాకిగోల

مِنْكُمْ عَنْ دِيْنِهٖ فَيَمُتْ وَهُوَ كَافِرٌ فَاُولٰٓئِكَ
حَبِطَتْ اَعْمَالُهُمْ فِى الدُّنْيَا وَالْاٰخِرَةِ ۚ وَاُولٰٓئِكَ
اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ (217)

వీలు కలిగితే మిమ్మల్ని మీ ధర్మం నుంచి మరలించనయినా మరలించేస్తారు.[254] మరి మీలో గనక ఎవరయినా తమ ధర్మం నుంచి తిరిగిపోయి, అవిశ్వాస స్థితిలో మరణిస్తే వారి ఇహపర లోకాల్లోని కర్మలు సర్వనాశనమైపోతాయి. అలాంటి వారే నరకవాసులు. వారందులో కలకాలం పడి ఉంటారు.[255]

اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَالَّذِيْنَ هَاجَرُوْا وَجٰهَدُوْا فِىْ
سَبِيْلِ اللّٰهِ ۙ اُولٰٓئِكَ يَرْجُوْنَ رَحْمَتَ اللّٰهِ ؕ وَاللّٰهُ
غَفُوْرٌ رَّحِيْمٌ (218)

**218** అయితే విశ్వసించినవారు, హిజ్రత్ చేసిన (వలసపోయిన) వారు, దైవ మార్గంలో పోరాడేవారు మాత్రమే దైవ కారుణ్యానికి అభ్యర్థులు. అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, అపారంగా కరుణించేవాడు.

يَسْـَٔلُوْنَكَ عَنِ الْخَمْرِ وَالْمَيْسِرِ ؕ قُلْ فِيْهِمَآ اِثْمٌ
كَبِيْرٌ وَّمَنَافِعُ لِلنَّاسِ ؗ وَاِثْمُهُمَآ اَكْبَرُ مِنْ
نَّفْعِهِمَا ؕ وَيَسْـَٔلُوْنَكَ مَاذَا يُنْفِقُوْنَ ۬ قُلِ

**219** ప్రజలు నిన్ను మద్యపానం గురించి, జూదం గురించి ప్రశ్నిస్తున్నారు. నువ్వు వారికి చెప్పు: "రెండింటిలోనూ చాలా పెద్ద పాపం ఉంది.[256] ప్రజలకు దీనివల్ల కొన్ని ప్రాపంచిక లాభాలు కూడా చేకూరుతాయి. కాని వీటి ద్వారా చేకూరే లాభం కన్నా పాపం చాలా ఎక్కువ."[257] ఏం ఖర్చు పెట్టాలి? అని వారు నిన్ను

---

చేయటం విడ్డూరమే. దానికి బదులు వారు ఆత్మావలోకనం చేసుకుని, తమ కర్మల చిట్టాను ఓసారి తిరిగేసుకుని పశ్చాత్తాపం చెందటం మంచిది.

254. వాళ్ళు ఒక వైపు తమ దురాగతాలను కొనసాగిస్తూ, కుట్రలు కుయుక్తులతో మిమ్మల్ని ధర్మభ్రష్టుల్ని చేసేందుకు యత్నిస్తున్నప్పుడు మీరు మాత్రం – నిషిద్ధమాసం అని చెప్పి – ఎందుకు ఆగాలి?

255. ఎవరయినా ఇస్లాం ధర్మం వైపు నుంచి తిరిగి పోయి – అంటే ధర్మభ్రష్టులైపోయి – ఆ తరువాత పశ్చాత్తాపం చెందకపోతే ప్రపంచంలో అతనికి మరణ శిక్ష విధించబడాలి. హదీసులో ఇలా ఉంది : "మన్ బద్దల దీనహు ఫఖ్తులూహు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్. మరిన్ని వివరాలకు అల్ బఖర సూరా 256వ ఆయతు, దాని వివరణ చదవండి). ఈ ఆయతులో అతనికి విధించబడే పరలోక శిక్ష ప్రస్తావనకు వచ్చింది. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే విశ్వాసస్థితిలో చేసిన సత్కార్యాలు కూడా అవిశ్వాసం మరియు ధర్మభ్రష్టత (ఇర్తిదాద్) మూలంగా వృథా అయిపోతాయి. ఏ విధంగానయితే విశ్వసించినవారి విశ్వాసం మూలంగా వారి గతకాలపు పాపాలు తుడిచిపెట్టుకుపోతాయో అదేవిధంగా ధిక్కార వైఖరి, వైముఖ్య ధోరణి మూలంగా వారి మంచి పనులన్నీ బూడిదలో పోసిన పన్నీరులా అయిపోతాయి. అయితే అవిశ్వాస స్థితిలో ప్రాణం పోయినప్పుడే ఈ కర్మలు పాడవుతాయి. ఒకవేళ చావుకు ముందే మనిషి తన తప్పును గ్రహించి క్షమాభిక్ష వేడుకుంటే, అల్లాహ్ అతని తప్పును మన్నిస్తాడు. అట్టి స్థితిలో అతని సత్కర్మలు వృథా కావు.

256. **'పెద్ద పాపం'** (**اِثْمٌ كَبِيْرٌ**) అనేది ధార్మికత రీత్యా అన్నమాట. ఈ రెండు వస్తువులూ (మద్యపానం, జూదం) మనిషిని నైతికంగా అధోగతికి చేరుస్తాయి.

257. లాభాలు ప్రాపంచికమైనవి. ఉదాహరణకు : మద్యపానం వల్ల తాత్కాలికంగా మనిషి శరీరావయవాలు చురుకుగా పనిచేస్తే చేయవచ్చు. కొంతమందికి మెదడు కూడా బాగా పనిచేయవచ్చు. వారి లైంగిక శక్తి కూడా పెరగవచ్చు! అలాగే వాటి క్రయవిక్రయాలు, క్లబ్బుల ఏర్పాటు లాభసాటి వ్యాపారం కావచ్చు. జూదంలో కూడా ఒక్కోసారి మనిషి గెలిచినపుడు లాభపడతాడు. కాని అతనికి చేకూరే ఈ క్షణభంగురపు లాభాలు నైతికంగా, ధార్మికంగా

الْعَفْوَ ۗ كَذٰلِكَ يُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ لَعَلَّكُمْ تَتَفَكَّرُوْنَ ﴿219﴾

అడుగుతారు. 'మీ ఖర్చులు పోగా మిగిలినది' [258] అని నువ్వు వారికి చెప్పు. మీరు యోచన చేసేటందుకు గాను అల్లాహ్ ఈ విధంగా తన ఆదేశాలను స్పష్టంగా వివరిస్తున్నాడు.

فِي الدُّنْيَا وَالْاٰخِرَةِ ۗ وَيَسْـَٔلُوْنَكَ عَنِ الْيَتٰمٰى ۗ قُلْ اِصْلَاحٌ لَّهُمْ خَيْرٌ ۗ وَاِنْ تُخَالِطُوْهُمْ فَاِخْوَانُكُمْ ۗ وَاللّٰهُ يَعْلَمُ الْمُفْسِدَ مِنَ الْمُصْلِحِ ۗ وَلَوْ شَآءَ اللّٰهُ لَاَعْنَتَكُمْ ۗ اِنَّ اللّٰهَ عَزِيْزٌ حَكِيْمٌ ﴿220﴾

**220** ఇహలోక జీవితంలో, పరలోకంలో కూడా. ఇంకా వీరు అనాథలను గురించి కూడా నిన్ను ప్రశ్నిస్తున్నారు కదూ![259] వారికి బోధపరచు: వారి బాగోగులను అభిలషించటం ఉత్తమం. (బాగు పరచే ఉద్దేశంతో) ఒకవేళ మీరు వారి సొమ్మును మీ సొమ్ములో కలుపుకుంటే వారూ మీ సహోదరులే. చెడగొట్టేవారెవరో, బాగు పరచేవారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు. అల్లాహ్‌యే గనక తలిస్తే మిమ్మల్ని కష్టాల్లో పడవేసేవాడే.[260] నిశ్చయంగా అల్లాహ్ శక్తి మంతుడు, వివేకవంతుడు.

అతను పోగొట్టుకునే దాని ముందు ఎందుకూ సరిపోవు. అందుకే "వీటి పాపం వీటి లాభాలకన్నా ఎంతో అధికం" అని అనబడింది. ఈ విధంగా ఈ ఆయతులో మద్యపానం, జూదం హరామ్ (నిషిద్ధం)గానైతే ఖరారు కాలేదు. కాని ఇందులో రానున్న కాలంలో నిషేధించబడటానికి 'భూమిక' తయారు చేయబడింది.

ఈ ఆయతు ద్వారా మన ముందుకు వచ్చే ఒక ముఖ్య సూత్రం ఏమిటంటే, ఒక వస్తువు ఎంత హానికరమైనదైనప్పటికీ అందులో కూడా ఎంతో కొంత మేలు లేక ప్రయోజనం ఉండవచ్చు. ఉదాహరణకు: రేడియో, టీ.వీ వంటి సాధనాల ఆవిష్కరణ. కొంతమంది వాటి లాభాలను లెక్కించి తమ ఆత్మలను మోసపుచ్చుకుంటారు. కాని లాభనష్టాలను బేరీజువేసి దేని శాతం ఎంత? అన్నది చూడాలి. ముఖ్యంగా ధార్మికత, నైతికత రీత్యా చేకూరే లాభనష్టాలను ఖచ్చితంగా అంచనా వేయాలి. ధార్మికత రీత్యా ఎక్కువ నష్టాలు వాటిల్లుతున్నప్పుడు కొద్దిపాటి ప్రాపంచిక ప్రయోజనాల కోసం వాటిని ధర్మసమ్మతంగా పరిగణించరాదు. ఇక టీ.వీ. ద్వారా మనిషి ధార్మికతకు కలిగే నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పేదేముందీ?!

258. చెప్పే తీరునిబట్టి ఇది నైతికోపదేశంగా తోస్తుంది. లేక అది ఇస్లాం తొలి రోజుల్లో ఇవ్వబడిన ఆజ్ఞ అయి ఉండవచ్చు. జకాత్ విధిగా నిర్ణయించబడిన తరువాత ఈ ఉపదేశంపై అమలుపరచటం తప్పనిసరి కాదు. కాకపోతే ఇది మంచి పని వైపుకు ప్రోత్సహించే విషయంగా ఎప్పుడూ చెలామణీ అవుతుంది. లేదా "మీరు సులువుగా చేయగలిగినంత చేయండి. మీ మనసుకు కష్టం అనిపించకుండా ఉన్నంతగా" అన్నది దీని భావం కావచ్చు (ఫత్‌హుల్ ఖదీర్). ఇస్లాం దైవమార్గంలో ఖర్చుకు సంబంధించి ఎంతగానో ప్రోత్సహించింది. అయితే మనిషి తనపై ఆధారపడి వున్న వారి పోషణ పట్ల తొలుత శ్రద్ధవహించాలన్నది ఇస్లాం ఆదేశం. మరో విషయం ఏమిటంటే; రేపటి రోజున తన పిల్లలు, కుటుంబీకులు వేరొకరి ముందు చేయి చాచి అర్థించవలసిన దుస్థితి ఏర్పడకుండా అతను జాగ్రత్తపడాలి.

259. అనాథల ఆస్తిని అన్యాయంగా కబళించేవారిని గురించి హెచ్చరిక రాగానే ప్రవక్త సహచరులు భీతితో వణికిపోయారు. తమ వద్దనున్న అనాథల వస్తువులన్నింటినీ తమ సంపదల్లో నుంచి వేరుపరచారు. ఆఖరికి తిను పదార్థాలు కూడా ఏమైనా మిగిలిపోతే వాటిని కూడా వేరుగా ఉంచేవారు. ఆ విధంగా అవి కుళ్ళిపోయేవి. అనాథల సొమ్మును అన్యాయంగా తినేవారి జాబితాలో తమ పేరు కూడా ఎక్కడ నమోదు పరచబడుతుందోనన్న భయం వారిని అనుక్షణం పీడిస్తూ ఉండేది. దానిపై ఈ వచనం అవతరించింది (ఇబ్నె కసీర్).

260. అంటే మీరు బాగు చేసే ఉద్దేశంతో అనాథల సొమ్మును మీ సొమ్ములో కలుపుకోగోరినా ఆయన అందుకు సమ్మతించే వాడు కాదు. కాని ఆయన అందుకు సమ్మతించి మీకు సౌకర్యం కలుగజేశాడు. కాబట్టి మీరు దేవుని యెడల కృతజ్ఞతా భావంతో మెలగండి. అనాథలను ఆదరించండి.

**221** దైవానికి భాగస్వామ్యం కల్పించే స్త్రీలు విశ్వసించి ముస్లింలు కానంతవరకూ మీరు వారిని వివాహమాడకండి.[261] దైవానికి భాగస్వామ్యం కల్పించే స్వతంత్ర స్త్రీ మీకు ఎంతగా నచ్చినప్పటికీ ఆమెకన్నా అల్లాహ్‌ను విశ్వసించే ఒక బానిస స్త్రీ ఎంతో ఉత్తమురాలు. (అలాగే) షిర్కుకు ఒడిగట్టే పురుషులు విశ్వసించనంతవరకూ మీ స్త్రీలను వారి వివాహ బంధంలోకి ఇవ్వకండి. ఎందుకంటే షిర్కుకు పాల్పడే పురుషుడు మీకు నచ్చినప్పటికీ అతనికంటే విశ్వసించిన ఒక బానిస పురుషుడు ఎన్నో రెట్లు నయం. వీరు (మిమ్మల్ని) నరకం వైపుకు పిలుస్తున్నారు. కాని అల్లాహ్ తన అనుజ్ఞతో స్వర్గం వైపునకూ, క్షమాభిక్ష వైపునకూ పిలుస్తున్నాడు. ప్రజలు గుణపాఠం నేర్చుకునేందుకుగాను ఆయన తన ఆయతులను విడమరచి మరీ చెబుతున్నాడు.

وَلَا تَنْكِحُوا الْمُشْرِكٰتِ حَتّٰى يُؤْمِنَّ ؕ وَلَاَمَةٌ مُّؤْمِنَةٌ
خَيْرٌ مِّنْ مُّشْرِكَةٍ وَّلَوْ اَعْجَبَتْكُمْ ۚ وَلَا تُنْكِحُوا
الْمُشْرِكِيْنَ حَتّٰى يُؤْمِنُوْا ؕ وَلَعَبْدٌ مُّؤْمِنٌ خَيْرٌ مِّنْ
مُّشْرِكٍ وَّلَوْ اَعْجَبَكُمْ ؕ اُولٰٓئِكَ يَدْعُوْنَ اِلَى النَّارِ ۖۚ
وَاللّٰهُ يَدْعُوْٓا اِلَى الْجَنَّةِ وَالْمَغْفِرَةِ بِاِذْنِهٖ ۚ
وَيُبَيِّنُ اٰيٰتِهٖ لِلنَّاسِ لَعَلَّهُمْ يَتَذَكَّرُوْنَ ﴿221﴾

**222** వారు నిన్ను బహిష్టు గురించి ప్రశ్నిస్తున్నారు. నువ్వు వారికి చెప్పు: అదొక అశుద్ధ స్థితి. కనుక అశుద్ధావస్థలో వారికి ఎడంగా ఉండండి.[262] వారు పరిశుద్ధులయ్యేవరకు వారివద్దకు పోకండి.

وَيَسْـَٔلُوْنَكَ عَنِ الْمَحِيْضِ ؕ قُلْ هُوَ اَذًى ۙ فَاعْتَزِلُوا
النِّسَآءَ فِي الْمَحِيْضِ ۙ وَلَا تَقْرَبُوْهُنَّ حَتّٰى يَطْهُرْنَ ۚ

261. ముష్రిక్కు స్త్రీలంటే విగ్రహారాధన చేసే స్త్రీలని భావం. గ్రంథవహులైన స్త్రీలను (యూదులు, క్రైస్తవులు) నికాహ్ చేసుకునేందుకు ఖుర్‌ఆన్ అనుమతించింది. అయితే ఒక ముస్లిం స్త్రీని మాత్రం గ్రంథవహులగు పురుషులకు ఇచ్చి వివాహం జరిపించరాదు. ఉమర్ (రజి) గారైతే గ్రంథవహులైన స్త్రీలను కూడా మనువాడటాన్ని ఇష్టపడేవారు కాదు. కొన్ని పరమార్థాల దృష్ట్యా ఆయన ఇలా భావించేవారు (ఇబ్నె కసీర్). విశ్వాసులైన పురుషులను, విశ్వాసురాలైన స్త్రీలను మాత్రమే వివాహమాడాలని ముస్లింలకు తాకీదు చేయబడింది. ధార్మికతను విస్మరించి, కేవలం అందచందాల ఆధారంగా నికాహ్ చేసుకోవటం అంటే పరలోక జీవితాన్ని నాశనం చేసుకోవటమేనని చెప్పటం జరిగింది. హదీసులో కూడా ఈ విషయం ఉంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రబోధించారు: "నాలుగు ప్రాతిపదికలపై స్త్రీని వివాహమాడటం జరుగుతుంది. 1. ఐశ్వర్యం 2. అందం 3. వంశం 4. ధార్మికత. మీరు ధార్మికురాలైన స్త్రీని ఎన్నుకోండి" (సహీహ్ బుఖారీ, కితాబున్నికాహ్, సహీహ్ ముస్లిం – కితాబుర్రజాఅ) అదేవిధంగా మహాప్రవక్త (సఅసం) సద్వర్తనురాలైన స్త్రీని ప్రపంచంలో కెల్లా అత్యుత్తమమైన, శ్రేష్ఠమయిన సామగ్రిగా పేర్కొన్నారు – ఖైరు మతాయిద్దున్యా అల్ మర్అతుస్సాలిహా–(సహీహ్ ముస్లిం).

262. రజస్వల తరువాత ప్రతి స్త్రీకి నెలవారీ దినాలలో అయ్యే రక్తస్రావాన్ని బహిష్టు స్థితి (హైజ్) అని అంటారు. ఒక్కోసారి వ్యాధి మూలంగా ఈ పీరియడ్‌లో మార్పు రావచ్చు. సుదీర్ఘకాలం పాటు రక్తస్రావం జరగవచ్చు. ఈ స్థితిని 'ఇస్తెహాజా'గా వ్యవహరిస్తారు. ఇస్తిహాజా ఆదేశాలు బహిష్టు స్థితి ఆదేశాల కంటే భిన్నంగా ఉంటాయి. బహిష్టుస్థితిలో ఉన్నప్పుడు స్త్రీలు నమాజు చేయనవసరం లేదు. ఉపవాసాలు పాటించకూడదు. అయితే నాగా అయిన ఉపవాసాలను తరువాతి దినాలలో పూర్తిచేసుకోవాలి. 'బహిష్టు స్థితిలో ఉన్న స్త్రీల వద్దకు పోకూడదు' అంటే భావం ఈ అశుద్ధావస్థలో భార్యాభర్తలు రతిలో పాల్గొనరాదు అని మాత్రమే. ఈ స్థితిలో భర్త భార్యను ముద్దుపెట్టుకున్నా, ఆలింగనం చేసుకున్నా, తాకినా తప్పులేదు. అలాగే స్త్రీలు ఈ అశుద్ధస్థితిలో ఇంటిపనులు చేసుకోవచ్చు. వంట చేసుకోవచ్చు.

వారు పరిశుద్ధత నొందిన మీదట,[263] అల్లాహ్ అనుమతించిన స్థానం నుంచి మీరు వారితో సమాగమం జరుపవచ్చు.[264] అల్లాహ్ పశ్చాత్తాపపడేవారిని, పారిశుద్ధ్యాన్ని అవలంబించేవారిని ఇష్ట పడతాడు.

فَإِذَا تَطَهَّرْنَ فَأْتُوهُنَّ مِنْ حَيْثُ أَمَرَكُمُ اللَّهُ ۚ إِنَّ اللَّهَ يُحِبُّ التَّوَّابِينَ وَيُحِبُّ الْمُتَطَهِّرِينَ ﴿٢٢٢﴾

**223** మీ స్త్రీలు మీ పంటపొలాలు. కాబట్టి మీ పొలాల్లోకి మీరు కోరిన విధంగా రండి.[265] మీ స్వయం కోసం (సత్కర్మలను) ముందుకు పంపండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు ఆయన్ని కలుసుకోవలసి ఉందన్న విషయాన్ని గ్రహించండి. (ఓ ప్రవక్తా!) విశ్వాసులకు శుభవార్తను వినిపించు.

نِسَاؤُكُمْ حَرْثٌ لَكُمْ فَأْتُوا حَرْثَكُمْ أَنَّىٰ شِئْتُمْ ۖ وَقَدِّمُوا لِأَنْفُسِكُمْ ۚ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوا أَنَّكُمْ مُلَاقُوهُ ۗ وَبَشِّرِ الْمُؤْمِنِينَ ﴿٢٢٣﴾

---

కాని యూదులు ఈ స్థితిలో స్త్రీలను పూర్తిగా వెలివేస్తారు. ఆ స్థితిలో ఆమెతో కలసి మెలసి ఉండటం, కలసి భుజించటం కూడా సమ్మతం కాదని అంటారు. ప్రవక్త ప్రియసహచరులు (రజి) ఈ విషయమై దైవప్రవక్త (స)ను సంప్రతించగా ఈ ఆదేశం అవతరించింది. ఇందులో కేవలం సంభోగించడాన్ని మాత్రమే వారించటం జరిగింది (ఇబ్నె కసీర్ తదితర వ్యాఖ్యానాలు).

263. **"వారు పరిశుద్ధత నొందిన మీదట...."** దీనికి రెండు అర్థాలు చెప్పబడ్డాయి. మొదటి అర్థం: 'రక్తస్రావం ఆగిన మీదట.' అంటే రుతుస్రావం నిలిచిపోయిన పక్షంలో స్నానం చేయకపోయినాసరే స్త్రీ పరిశుద్ధురాలైనట్లే లెక్క. ఇట్టి స్థితిలో భర్త ఆమెతో రమించటం సమ్మతమే. ఇబ్నె హజమ్ సహా మరి కొంతమంది ఇమాములు ఈ విధానానికి సుముఖంగా ఉన్నారు. అల్లామా అల్‌బానీ కూడా దీన్ని సమర్థించారు *(ఆదాబుజ్జిఫాఫ్‌-పేజీ:47)*.

రెండవ అర్థం : రక్తస్రావం ఆగిన మీదట స్నానం చేసి మరీ పరిశుద్ధత నొందటం. ఈ రెండవ అర్థం ప్రకారం బహిష్టు స్థితిని అధిగమించిన స్త్రీ స్నానం చేయనంతవరకూ, భర్తతో సంభోగంలో పాల్గొనటం సమ్మతం కాదు. ఇమామ్ షౌకానీ ఈ పద్ధతికి ప్రాధాన్యత నిచ్చారు (ఫత్‌హుల్ ఖదీర్). మా దృష్టిలో రెండు పద్ధతులూ ఆచరణ యోగ్యమైనవే అయినప్పటికీ రెండవ పద్ధతి మాత్రం ప్రాధాన్యత నివ్వదగినది.

264. **"అనుమతించిన స్థానం నుంచి"** అంటే మర్మస్థానం (యోని లేక మానం) అని భావం. ఎందుకంటే బహిష్టు స్థితిలో కూడా ఆ స్థానాన్ని ఉపయోగించటమే నిషిద్ధంగా ఖరారు చేయబడింది. పరిశుద్ధత నొందిన తరువాత అనుమతించ బడటం అంటే అర్థం ఆ (మర్మ) స్థానం తప్ప మరో భాగం కాదు. ఈ ఆదేశంలో దాగివున్న మరో మర్మం ఏమిటంటే స్త్రీ మల విసర్జనా మార్గం (దుబుర్) ద్వారా రతిక్రీడ జరపటం హరామ్ (నిషిద్ధం). హదీసులలో కూడా మరింత విపులంగా ఈ విషయం వచ్చింది.

265. స్త్రీని ఉదరం ఆధారంగా పడుకోబెట్టి వెనుకవైపు నుంచి సంభోగిస్తే పుట్టేపిల్లవాడికి మెల్లచూపు వస్తుందని యూదులు భావించేవారు. ఈ భావనకు ప్రతిక్రియగా ఈ ఆదేశం అవతరించింది. ముందు నుంచి సంభోగించినా, వెనుకవైపు నుంచి రమించినా, ఏ భంగిమలో రతిక్రీడ సాగించినా సరే సమ్మతమే. కాని ఎట్టి పరిస్థితిలోనూ స్త్రీ యోనిని మాత్రమే ఉపయోగించాలి. 'మీరు కోరిన విధంగా రావచ్చు' అన్న వాక్యంలో స్త్రీ మలవిసర్జనా స్థానం కూడా వస్తుంది కదా! కాబట్టి అది కూడా సమ్మతమే' అని కొందరు నిరూపించే యత్నం చేశారు. కాని ఇది తప్పు. దివ్య ఖుర్‌ఆన్ స్త్రీలను పంటపొలాలుగా అభివర్ణించటం గమనార్హ విషయం. పొలం అనేది స్త్రీ మానానికి మాత్రమే వర్తిస్తుంది. లైంగిక ప్రక్రియకు, మానవ సంతానోత్పత్తికి ఏకైక మార్గం యోని (మానం) మాత్రమేగాని మల విసర్జనా స్థానం కాదు. అదీగాక అంగప్రవేశం యోనిద్వారా కాకుండా మరోవిధంగా జరపటం అంటే అది అసహజమైన ప్రక్రియ అవుతుంది. స్త్రీ మలవిసర్జనా స్థానాన్ని వాడుకునేవాడు శాపగ్రస్తుడుగా, ధూత్కరించబడినవాడుగా ఖరారు చేయబడ్డాడు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

**224** సత్కార్యాన్నీ, భయభక్తులనూ, మానవుల మధ్య సంస్కరణను విడిచిపెట్టే పరిస్థితి ఏర్పడేలా[266] – మీరు అల్లాహ్‌ను మీ 'ప్రమాణా' లకు లక్ష్యంగా పెట్టకండి. అల్లాహ్‌ సర్వం వినేవాడు, సర్వం తెలిసినవాడు.

وَلَا تَجْعَلُوا اللّٰهَ عُرْضَةً لِّاَيْمَانِكُمْ اَنْ تَبَرُّوْا وَتَتَّقُوْا وَتُصْلِحُوْا بَيْنَ النَّاسِ ؕ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ﴿224﴾

**225** అనాలోచిత ప్రమాణాలను గురించి అల్లాహ్‌ మిమ్మల్ని నిలదీయడు.[267] హృదయపూర్వకంగా మీరు చేసే ప్రమాణాలను గురించి మాత్రం ఆయన తప్పకుండా నిలదీసి అడుగుతాడు. అల్లాహ్‌ క్షమాశీలి, సహనశీలి కూడా.

لَا يُؤَاخِذُكُمُ اللّٰهُ بِاللَّغْوِ فِيْٓ اَيْمَانِكُمْ وَلٰكِنْ يُّؤَاخِذُكُمْ بِمَا كَسَبَتْ قُلُوْبُكُمْ ؕ وَاللّٰهُ غَفُوْرٌ حَلِيْمٌ ﴿225﴾

**226** ఎవరయితే తమ భార్యలతో సంబంధం పెట్టుకోబోమని ఒట్టేసుకుంటారో వారి కొరకు నాలుగు మాసాల గడువు ఉంది.[268] మరి వారు గనక (ఈలోగా) మరలివస్తే అల్లాహ్‌ కూడా క్షమించేవాడు, జాలి చూపేవాడు.

لِلَّذِيْنَ يُؤْلُوْنَ مِنْ نِّسَآئِهِمْ تَرَبُّصُ اَرْبَعَةِ اَشْهُرٍ ۚ فَاِنْ فَآءُوْ فَاِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿226﴾

**227** ఒకవేళ వారు విడాకులు ఇవ్వాలనే నిశ్చయించుకుంటే,[269] నిస్సందేహంగా అల్లాహ్‌ అన్నీ వినేవాడు, అంతా తెలిసినవాడు.

وَاِنْ عَزَمُوا الطَّلَاقَ فَاِنَّ اللّٰهَ سَمِيْعٌ عَلِيْمٌ ﴿227﴾

266. ఫలానా వ్యక్తి పట్ల ఇక నుంచి మంచిగా మెలగను, ఫలానా వ్యక్తుల మధ్య తగాదాను పరిష్కరించను, ఫలానా వారికి ఉపదేశం చేయను – అంటూ కోపావేశంలో ప్రమాణం చేసి మరీ చెప్పటం సర్వసాధారణం. కాని ఎప్పుడయినా ఇలాంటి ప్రమాణాలు గనక చేస్తే వాటిని భంగపరచండి, ప్రమాణ భంగానికిగాను పరిహారాన్ని చెల్లించండి అని హదీసులో చెప్పబడింది (ప్రమాణ భంగానికి చెల్లించవలసిన పరిహారం గురించి అల్ మాయిద సూరా 89వ ఆయతును చూడండి).

267. అనాలోచిత ప్రమాణాలు అంటే సంకల్ప రహితంగా చేసే ప్రమాణాలు అని అర్థం. మాటల సందర్భంగా ప్రతి చిన్న విషయంపై 'దైవం తోడు' అన్న పదాన్ని ఊతపదంగా చేసుకోవటం. అయితే ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రమాణం చేయటం మహాపాపం.

268. దీన్ని **'ఈలా'**గా వ్యవహరిస్తారు. ఈలా అంటే ఒట్టేసుకోవటం అని అర్థం. ఏ భర్త అయినా తన భార్యతో ఒక నెలరోజులపాటో, లేక రెండు నెలలో సంబంధం పెట్టుకోనని ఒట్టేసుకుంటే దీనిని 'ఈలా' అని అంటారు. ఈ విధంగా ఒట్టేసుకొని అనుకున్న గడువు పూర్తయిన తర్వాత ఆమెతో లైంగిక సంబంధం ఏర్పరచుకుంటే ఏమీ లేదు. ఒకవేళ ఇలా ఒట్టేసుకున్న మీదట గడువు పూర్తికాకమునుపే అతను భార్య వద్దకుపోతే ఈ ప్రమాణ భంగానికి గాను పరిహారం (కఫ్ఫారా) చెల్లించవలసి ఉంటుంది. ఒకవేళ నాలుగు మాసాలకన్నా ఎక్కువ కాలం వరకు లేక అసలు కాల నిర్ణయం ఏమీ లేకుండా భార్యవద్దకు పోనని ప్రమాణం చేసినట్లయితే నాలుగు మాసాల వ్యవధి ముగియగానే అతను భార్యతో సంబంధం ఏర్పరచుకోవాలి. లేకుంటే ఆమెకు విడాకులు ఇవ్వాలి. (ఎందుకంటే ఆమెను నాలుగు మాసాలకన్నా ఎక్కువ కాలం డోలాయమాన స్థితిలో ఉంచేందుకు అనుమతి లేదు). మొదటి పరిస్థితి ప్రకారం అతను ప్రమాణ భంగానికి పరిహారం ఇవ్వాలి. ఒకవేళ అతడు రెండింటిలో ఏ ఒక్కదానిని కూడా అవలంబించకుండా– అనిశ్చిత స్థితిని కొనసాగిస్తే – ఏదో ఒక నిర్ణయానికి రావలసిందిగా న్యాయస్థానం అతన్ని నిలదీస్తుంది. అంటే ఆమెతో కాపురం చేయటమో లేక విడాకులు ఇవ్వటమో చేయమంటుంది. స్త్రీకి అన్యాయం జరగరాదన్నదే దీని ఉద్దేశం (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

وَالْمُطَلَّقٰتُ يَتَرَبَّصْنَ بِاَنْفُسِهِنَّ ثَلٰثَةَ قُرُوْٓءٍ ؕ
وَلَا يَحِلُّ لَهُنَّ اَنْ يَّكْتُمْنَ مَا خَلَقَ اللّٰهُ فِيْٓ
اَرْحَامِهِنَّ اِنْ كُنَّ يُؤْمِنَّ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ ؕ
وَبُعُوْلَتُهُنَّ اَحَقُّ بِرَدِّهِنَّ فِيْ ذٰلِكَ اِنْ اَرَادُوْٓا
اِصْلَاحًا ؕ وَلَهُنَّ مِثْلُ الَّذِيْ عَلَيْهِنَّ بِالْمَعْرُوْفِ
وَلِلرِّجَالِ عَلَيْهِنَّ دَرَجَةٌ ؕ وَاللّٰهُ عَزِيْزٌ حَكِيْمٌ ﴿228﴾

**228** విడాకులు పొందిన స్త్రీలు తమను తాము మూడు రుతువుల దాకా ఆపి ఉంచుకోవాలి.[270] వారు అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ విశ్వసించేవారే అయితే అల్లాహ్ వారి గర్భాలలో సృష్టించిన దానిని దాచి ఉంచటం వారికి ధర్మ సమ్మతంకాదు.[271] ఒకవేళ ఈ గడువు లోపల వారిని తిరిగి రప్పించుకోవాలన్న సదుద్దేశం భర్తలకు ఉంటే ధర్మం ప్రకారం అలా రప్పించుకునే హక్కు వారికి ఉంది.[272] భర్తలకు స్త్రీలపై హక్కులున్నట్లే స్త్రీలకు కూడా వారిపై హక్కులున్నాయి – కాని ఉత్తమ రీతిలో! కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒకింత ప్రాధాన్యత ఉంది.[273] అల్లాహ్ సర్వాధికుడు, వివేచనాపరుడు.

269. ఈ వాక్యంలోని పదజాలాన్ని బట్టి విదితమయ్యేదేమిటంటే, నాలుగు మాసాల గడువు ముగియటంతోనే వాటంతట అవే విడాకులు అయిపోవు (కాని కొంతమంది విద్వాంసులు మాత్రం వేర్పాటు అయిపోతుందని అంటారు). నిజానికి భర్త విడాకులు ఇస్తేనే అది విడాకు అనబడుతుంది. ఆ మేరకు న్యాయస్థానం కూడా అతనిపై ఒత్తిడి తీసుకువస్తుంది. అత్యధికమంది విద్వాంసులు కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు (ఇబ్నె కసీర్).

270. విడాకులు పొందిన స్త్రీ గర్భవతి అయితే ఆమె గడువు (ఇద్దత్) ప్రసవం వరకూ ఉంటుంది. ఒకవేళ కాపురానికి ముందే (అంటే దాంపత్య సంబంధం ఏర్పడకముందే) ఆమెకు విడాకులు ఇవ్వబడినట్లయితే, అలాంటి స్త్రీకి అసలు ఇద్దత్ అనేదే ఉండదు. ఇక విడాకులు పొందిన స్త్రీ ముట్లుడిగిన స్త్రీ అయిన పక్షంలో ఆమె ఇద్దత్ మూడు నెలలు ఉంటుంది – ఇకపోతే ఈ ఆయత్‌లో పేర్కొనబడిన స్త్రీ పైన ప్రస్తావనకు వచ్చిన మూడు రకాల స్త్రీలలో ఏ కోవకూ చెందకుండా కేవలం భర్తతో దాంపత్య జీవితం గడుపుతూ విడాకులు పొందిన స్త్రీ అన్నమాట. ఇటువంటి స్త్రీల ఇద్దత్ (గడువు) మూడు రుతువులు. అంటే మూడుసార్లు బహిష్టు అవటం లేదా మూడుసార్లు రుతుస్రావం నుండి పరిశుద్ధత నొందటం. ఈ మూడు రుతువులు ముగిసిన తరువాత వారు పునర్వివాహం చేసుకోగలరు. సలఫ్ విద్వాంసులు 'రుతువు' (ఖురు) అనే పదానికి ఇక్కడ ప్రస్తావించబడిన రెండు అర్థాలూ సరైనవేనని అభిప్రాయపడ్డారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

271. **'దాచి ఉంచటం'** అనే మాటలో బహిష్టు మరియు గర్భధారణ – రెండూ ఇమిడి ఉన్నాయి. బహిష్టును దాచటమనే విషయాన్నే మనం ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. స్త్రీకి తనకు విడాకులిచ్చిన భర్తతోనే కాపురం చేయాలని ఉంటుంది. అందుకని ఆమె తనకు మూడుసార్లు బహిష్టు వచ్చినా పైకి మాత్రం తనకు ఒకసారో లేక రెండుసార్లో మాత్రమే బహిష్టు వచ్చిందని అబద్ధం చెబుతుంది. (మూడు రుతువులు గడవలేదంటే తను ఆ భర్తకే భార్యగా ఉండగలదన్న ఉద్దేశంతో అలా చెబుతుందన్న మాట!) ఒక్కోసారి భర్తకు తన విడాకుల్ని ఉపసంహరించుకోవాలని ఉంటుంది. అదే సమయంలో ఆమెకు, తిరిగి భర్త వద్దకు వెళ్ళటం ఇష్టం ఉండదు. అందుకని ఆమె తనకు మూడు రుతువులు గడవకపోయినా, గడిచిపోయాయని అబద్ధం చెప్పి భర్తకు దాంపత్య జీవితాన్ని పునరుద్ధరించుకునే హక్కు లేకుండా చేస్తుంది. ఇది బహిష్టును దాచటమయింది. అలాగే గర్భధారణ సంగతి కూడా. తను గర్భాన్ని దాల్చిన విషయం దాచిపెట్టకూడదు. స్పష్టంగా ప్రకటించాలి. ఎందుకంటే దాపరికం వల్ల ప్రమాదాలు పొడసూపుతాయి. ఆమె కడుపులో ఉన్న బిడ్డ ఒకరి వీర్యకణం వల్ల ఉత్పన్నమవగా, ఆ శిశువును వేరొక వ్యక్తికి అంటగట్టడం మహాపాతకం.

272. భార్యను వేధించే దురుద్దేశం ఏదీ లేకుండా, బుద్ధిగా కాపురం చేసుకోవాలని మనసులో ఉంటే ఇద్దత్ (గడువు) లోపల ఆమెను రప్పించుకునే హక్కు భర్తకు ఉంది. స్త్రీ తరపు సంరక్షకుడు ఈ రాజీ ప్రయత్నంలో అవరోధాలు సృష్టించకూడదు.

**229** ఈ విడాకులు రెండుసార్లే.[274] ఆ తరువాత సక్రమంగా
(ఆమెను) ఆపుకోవాలి.[275] లేదంటే ఉత్తమ రీతిలో వదలి
పెట్టాలి.[276] మీరు వారికి ఇంతకు ముందు ఇచ్చి ఉన్న వాటిలో
నుంచి దేన్నయినా తిరిగి తీసుకోవటం ధర్మసమ్మతం కాదు. ఆం
ఒకవేళ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమన్న
భయం వారిరువురికీ ఉంటే అది వేరే విషయం. అందువల్ల
దంపతులిద్దరూ అల్లాహ్ ఏర్పరచిన హద్దులకు కట్టుబడి ఉండ
లేరన్న భయం మీకు కలిగి, అదే సమయంలో స్త్రీ తన భర్తకు

اَلطَّلَاقُ مَرَّتٰنِ ۪ فَاِمْسَاكٌۢ بِمَعْرُوْفٍ اَوْ تَسْرِيْحٌۢ
بِاِحْسَانٍ ؕ وَلَا يَحِلُّ لَكُمْ اَنْ تَاْخُذُوْا مِمَّآ
اٰتَيْتُمُوْهُنَّ شَيْـًٔا اِلَّآ اَنْ يَّخَافَآ اَلَّا يُقِيْمَا
حُدُوْدَ اللّٰهِ ؕ فَاِنْ خِفْتُمْ اَلَّا يُقِيْمَا حُدُوْدَ
اللّٰهِ ۙ فَلَا جُنَاحَ عَلَيْهِمَا فِيْمَا افْتَدَتْ بِهٖ ؕ

273. అంటే భార్యాభర్తలిరువురి హక్కులూ పరస్పరం పోలి ఉన్నాయి. వాటిని నెరవేర్చవలసిన బాధ్యత – ధర్మం ప్రకారం– ఇరువురిపైనా ఉంది. కాకపోతే భర్తకు కాస్తంత ఆధిక్యత ఉంది. ఉదాహరణకు : సహజ శక్తి సామర్థ్యాలలో, జిహాద్ అనుమతి విషయంలో, వారసత్వంలో రెండు వాటాలు లభించటంలో, ఇంటి వ్యవహారాలు నిర్వహించటంలో, విడాకులు ఇవ్వటం మరియు తిరిగి రప్పించుకోవటం మొదలైన విషయాల్లో పురుషునికి ఒకింత ఆధిక్యత ఉంది.

274. భర్తకు తన నిర్ణయం నుంచి మరలివచ్చేందుకు అవకాశం ఉన్న విడాకులు ఇవి. ఇవి రెండు మాత్రమే. మొదటిసారి విడాకుల తరువాత, రెండవసారి విడాకుల తరువాత కూడా గడువు లోపల భార్యను తిరిగి రప్పించుకోవడానికి అవకాశం ఉంటుంది. మూడవసారి విడాకులు ఇచ్చిన తరువాత ఇక ఈ అవకాశం మిగిలి ఉండదు. అజ్ఞానకాలంలో విడాకులు ఇవ్వడానికి, తిరిగి రప్పించుకోవడానికి ఒక గడువు అంటూ ఉండేది కాదు. తత్కారణంగా స్త్రీలు ఎన్నో బాధలు భరించవలసి వచ్చేది. భర్త పదే పదే ఆమెకు విడాకులివ్వటం, మళ్లీ కాపురానికి పిలిపించుకోవటం పరిపాటి అయిపోయింది. అంటే ఆమెతో ఉత్తమరీతిలో సంసారం చేసేవాడూ కాదు, మంచితనంతో విడిచిపెట్టేవాడూ కాదు. స్త్రీలు నిత్యం అనిశ్చిత స్థితికి లోనై ఉండేవారు. ఈ అన్యాయాన్ని అల్లాహ్ ఆపాడు. అలా అని భర్తలకు కూడా అన్యాయం చేయలేదు. వారికి కూడా ఒకటి లేక రెండుసార్లు ఆలోచించుకునే, స్వీయసంస్కరణ చేసుకునే అవకాశం ఇచ్చాడు. అలా గాకుండా ఒక్క విడియాకుతోనే వ్యవహారం తెగత్రెంపులయ్యేటట్లు చేసివుంటే, దాని ద్వారా లెక్కలేనన్ని సామాజిక సమస్యలు ఉత్పన్నం అయ్యేవి. అదీగాక అల్లాహ్ **'తల్ఖతాని'** (రెండు విడాకులు) అని అనలేదు. పైగా **'అత్తలాఖు మర్రతాని'** (విడాకులు రెండుసార్లు) అని స్పష్టంగా చెప్పాడు. దీనిద్వారా బోధపడే ముఖ్య విషయం ఏమిటంటే ఒకే సమయంలో రెండు లేక మూడు విడాకులు ఇచ్చేయటం, తక్షణం వాటిని అమలుపరచటం దైవసూక్తికీ, దేవుని యుక్తికీ విరుద్ధం. దేవుడు ఈ 'రెండుసార్లు' ద్వారా వాంఛించేదేమిటీ? అన్నది ముఖ్య విషయం.

భర్త ఒకసారి విడాకులు ఇచ్చిన తరువాత, లేక రెండుసార్లు విడాకులు ఇచ్చిన మీదట అతనికి ఆలోచించుకునే అవకాశం కల్పించాలి. ఆవేశం వల్లనో, అపార్థం వల్లనో అతడు తొందరపడి విడాకులు ఇచ్చి ఉండవచ్చు. తీరా విడాకులు ఇచ్చిన తరువాత అతనికి తన తప్పు తెలిసి రావచ్చు. ఒకేచోట, ఒకే సమయంలో ఆగ్రహావేశంలో మూడుసార్లు 'తలాక్' అంటూ విడాకుల ప్రయోగం చేసినప్పుడు దాన్ని 'ఒకే తలాక్'గా, అది కూడా తిరిగి మరలేందుకు అనువుండే తలాక్‌గా పరిగణించినప్పుడే తప్పును సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది. లేకుంటే కాపురాలు తొందరగా కూలిపోతాయి. ఈ సందేహం పూర్తిగా తీరకపోతే సత్యాన్ని నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా చెప్పే విద్వాంసులను సంప్రతించండి. "మజ్‌మూఅ మఖాలాతె ఇల్‌మియా బాబత్ – ఏక్ మజ్లిస్‌కి తీన్ తలాఖ్" మరియు "ఇఖ్‌తిలాఫె ఉమ్మత్ ఔర్ సిరాతె ముస్తఖీమ్" పుస్తకాలు చదవండి. ఎందుకంటే విషయం అర్థం కానపుడు విద్వాంసులను సంప్రతించి మార్గదర్శకత్వం పొందాలి. షరీయతు వాంఛించేది కూడా ఇదే!

275. అంటే రాజీపడిన తర్వాత మంచి పద్ధతిలో కాపురం చేయాలి.

276. వదలి పెట్టడం అంటే మూడవసారి (తుదిసారి) విడాకులు ఇవ్వటం అని భావం.

تِلْكَ حُدُودُ اللَّهِ فَلَا تَعْتَدُوهَا ۚ وَمَن يَتَعَدَّ
حُدُودَ اللَّهِ فَأُولَٰئِكَ هُمُ الظَّالِمُونَ ﴿229﴾

కొంత నష్టపరిహారం ఇచ్చి వేర్పడదలిస్తే – అట్టి పరిస్థితిలో ఇరువురిపై ఎలాంటి దోషంలేదు.[277] ఇవి అల్లాహ్ నిర్ధారించిన హద్దులు. (జాగ్రత్త!) వాటిని దాటకూడదు. ఎవరు అల్లాహ్ నిర్ధారించిన హద్దులను మీరిపోతారో వారే దుర్మార్గులు.

فَإِن طَلَّقَهَا فَلَا تَحِلُّ لَهُ مِن بَعْدُ حَتَّىٰ تَنكِحَ
زَوْجًا غَيْرَهُ ۗ فَإِن طَلَّقَهَا فَلَا جُنَاحَ عَلَيْهِمَا أَن
يَتَرَاجَعَا إِن ظَنَّا أَن يُقِيمَا حُدُودَ اللَّهِ ۗ وَتِلْكَ
حُدُودُ اللَّهِ يُبَيِّنُهَا لِقَوْمٍ يَعْلَمُونَ ﴿230﴾

**230** మరి ఆమెకు (మూడవసారి) గనక విడాకులిస్తే, ఆ స్త్రీ ఇతనిని తప్ప వేరొక వ్యక్తిని వివాహం చేసుకోనంతవరకూ ఇతని కోసం ఆమె ధర్మసమ్మతం కాజాలదు. ఆ తరువాత అతను (రెండవ భర్త) కూడా ఆమెకు విడాకులిస్తే, మళ్ళీ వీరిద్దరూ అల్లాహ్ (విధించిన) హద్దులకు కట్టుబడి ఉండగలమన్న నమ్మకం ఉండి వివాహ బంధంలోకి రాదలిస్తే అందులో తప్పులేదు.[278] ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. తెలుసుకోగలవారికి ఆయన వీటిని స్పష్టపరుస్తున్నాడు.

277. ఈ వాక్యం **'ఖులా'**ను గురించి సూచిస్తోంది. అంటే ఒకవేళ భార్య తన భర్త నుంచి వేర్పడదలిస్తే భార్యకు 'మహర్'గా ఇచ్చిన సొమ్మును భర్త తిరిగి తీసుకోగలడు. ఒకవేళ వేర్పాటుకు భర్త అంగీకరించకపోతే, అతను స్వయంగా ఆమెకు విడాకులిచ్చేలా న్యాయస్థానం అతనిపై ఒత్తిడి తెస్తుంది. అప్పటికీ అతను ఒప్పుకోకపోతే న్యాయస్థానం ఆ నికాహ్‌ను రద్దుపరుస్తుంది. ఈ విధంగా 'ఖులా' తలాక్ ద్వారా మరియు 'నికాహ్ రద్దు' ద్వారా కూడా అయిపోతుంది. రెండు పరిస్థితుల్లోనూ ఇద్దత్ (గడువు) ఒక రుతువుగా నిర్ధారించబడింది (అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, హాకిమ్ – ఫత్‌హుల్ ఖదీర్ ఆధారంగా). స్త్రీకి ఇస్లాం ఈ హక్కును ఇచ్చినప్పటికీ తగు కారణం లేకుండా భర్త నుండి వేర్పడే డిమాండు చీటికీ మాటికీ చేయరాదని కూడా చాలా గట్టిగా తాకీదు చేసింది. ఒకవేళ ఏ స్త్రీ అయినా తగు కారణం లేకుండా విడాకుల కోసం ఒత్తిడి తీసుకువస్తే ఆమె స్వర్గలోక సువాసనను కూడా ఆస్వాదించజాలదని మహాప్రవక్త (సఅసం) హెచ్చరించారు (ఇబ్నె కసీర్).

278. **'మూడవసారి తలాఖ్'** ఇచ్చిన తరువాత జరిగేదేమిటో ఈ వాక్యంలో వివరించబడింది. మూడవసారి విడాకులు ఇచ్చిన పిదప భర్త ఇక రాజీపడలేడు. ఆమెను తిరిగి వివాహం కూడా చేసుకోలేడు. అయితే ఆ స్త్రీ వేరొక చోట వివాహం చేసుకున్న తరువాత, ఆ భర్త ఆమెకు తన ఇష్టపూర్వకంగా విడాకులిస్తే లేదా అతను మరణిస్తే అప్పుడు ఆమె తన మొదటి భర్తతో వివాహం చేసుకోవటం ధర్మ సమ్మతమవుతుంది. అయితే దీని కోసం మనదేశంలో కొంతమంది 'హలాలా' పద్ధతిని అనుసరించి ఈ హక్కును దుర్వినియోగపరుస్తున్నారు. ఇది కడు హేయమైన చేష్ట. దైవాదేశాలతో చెలగాటం అంటే ఇదే. 'హలాలా' చేసేవారిని, చేయించేవారిని కూడా మహాప్రవక్త (సఅసం) ధూత్కరించారు.

**'హలాలా'** అంటే ఆవేశంలో భార్యకు విడాకులిచ్చేసిన వ్యక్తి, తరువాత తన తప్పును తెలుసుకుని బాధపడతాడు. ఇక ఆమెను ఎలాగూ తన వివాహబంధంలోకి రప్పించుకోలేడు. కాబట్టి ఆమెను వేరొక వ్యక్తితో నికాహ్ జరిపిస్తాడు. ఆ నవ దంపతులు సమాగమం జరిపిన తరువాత విడాకుల తతంగాన్ని పూర్తి చేస్తారు. ఆ తరువాత ఇద్దత్ (గడువు) పూర్తయ్యాక మొదటి భర్త ఆమెను మళ్ళీ నికాహ్ చేసుకుంటాడు. దీన్నే 'హలాలా'గా వ్యవహరిస్తారు. ఇది తప్పుడు విధానం. ఈ విధంగా జరిపించబడే నికాహ్ అసలు నికాహ్‌యే కాదు. అదొక ప్రహసనం. దురుద్దేశంతో కూడుకున్న చేష్ట. దైవాజ్ఞలతో చెలగాటం! పరిహాసం!! ఇంకా సూటిగా చెప్పాలంటే అది వ్యభిచారం. ఎందుకంటే దుష్ట సంకల్పంతో 'హలాలా' చేయించినందున ఆ స్త్రీ తన మొదటి భర్త కోసం హలాల్ (ధర్మ సమ్మతం) కాజాలదు.

**231** మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చినప్పుడు, వారి గడువు (ఇద్దత్) ముగియనుండగా వారిని సహృదయంతో మీ వద్ద ఆపి ఉంచుకోండి. లేదంటే ఉత్తమ రీతిలో సాగనంపండి.[279] వారిపై దౌర్జన్యానికి ఒడిగట్టే ఉద్దేశంతో వారిని ఆపి ఉంచుకొని వేధించ కండి. ఈ వైఖరిని అనుసరించినవాడు నిజానికి తనకు తానే అన్యాయం చేసుకున్నాడు. దైవాదేశాలతో పరిహాసమాడకండి.[280] అల్లాహ్ మీకు చేసిన ఉపకారాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి. మీపై గ్రంథాన్ని, హిక్మత్‌ను (ప్రవక్త సంప్రదాయాన్ని, ధర్మశాస్త్రాన్ని) అవతరింపజేసి, మీకు చేసిన ఉపదేశాన్ని కూడా (అవలోకనం చేసుకోండి). అల్లాహ్ యెడల భయభక్తులు కలిగి ఉండండి. అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు అన్న విషయాన్ని మీరు తెలుసుకోండి.

وَإِذَا طَلَّقْتُمُ النِّسَاءَ فَبَلَغْنَ أَجَلَهُنَّ فَأَمْسِكُوهُنَّ بِمَعْرُوفٍ أَوْ سَرِّحُوهُنَّ بِمَعْرُوفٍ ۚ وَلَا تُمْسِكُوهُنَّ ضِرَارًا لِّتَعْتَدُوا ۚ وَمَن يَفْعَلْ ذَٰلِكَ فَقَدْ ظَلَمَ نَفْسَهُ ۚ وَلَا تَتَّخِذُوا آيَاتِ اللَّهِ هُزُوًا ۚ وَاذْكُرُوا نِعْمَتَ اللَّهِ عَلَيْكُمْ وَمَا أَنزَلَ عَلَيْكُم مِّنَ الْكِتَابِ وَالْحِكْمَةِ يَعِظُكُم بِهِ ۚ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوا أَنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿٢٣١﴾

**232** మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చిన తరువాత, వారు తమ గడువు (ఇద్దత్)ను ముగించి, తమ (మాజీ) భర్తలను ధర్మబద్ధంగా పరస్పరం ఇష్టపడి వివాహమాడదలిస్తే మీరు వారికి అడ్డు తగల కండి.[281] మీలో ఎవరయితే అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ విశ్వ సిస్తున్నారో వారికి ఈ ఉపదేశం చేయబడుతోంది. ఇందులోనే మీ పరిశుద్ధత, పరిశుభ్రత ఇమిడి ఉన్నాయి. అంతా అల్లాహ్‌కు తెలుసు, మీకు తెలియదు.

وَإِذَا طَلَّقْتُمُ النِّسَاءَ فَبَلَغْنَ أَجَلَهُنَّ فَلَا تَعْضُلُوهُنَّ أَن يَنكِحْنَ أَزْوَاجَهُنَّ إِذَا تَرَاضَوْا بَيْنَهُم بِالْمَعْرُوفِ ۗ ذَٰلِكَ يُوعَظُ بِهِ مَن كَانَ مِنكُمْ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۗ ذَٰلِكُمْ أَزْكَىٰ لَكُمْ وَأَطْهَرُ ۗ وَاللَّهُ يَعْلَمُ وَأَنتُمْ لَا تَعْلَمُونَ ﴿٢٣٢﴾

---

279. రెండుసార్లు విడాకులు ఇచ్చేవరకు రాజీపడటానికి వీలుంటుందని "అత్తలాఖు మర్రతాని" – ఆయతులో అనబడింది. అయితే ఈ రాజీ ఇద్దత్ (గడువు) ముగిసేలోగా జరగాలనీ, గడువు దాటిందంటే ఆ సౌలభ్యం వీగిపోతుందని ఈ ఆయతులో చెప్పబడుతోంది.

280. కొంతమంది వేళాకోళానికి కూడా విడాకులిచ్చే వారుండవచ్చు. అలాగే ఉబుసుపోక వివాహం చేసుకునే వారుంటారు. అదేమంటే పరిహాసానికి అలా చేశామని అంటారు. అల్లాహ్ దీనిని దైవాజ్ఞలతో పరిహాసంగా అభివర్ణించాడు. అంటే ఇలాంటి వెకిలి చేష్టలను నిరోధించాలి అన్నది దీని అసలు ఉద్దేశం. అందుకే మహాప్రవక్త (సఅసం) ఏమని సెలవిచ్చారంటే ఎవరయినా వేళాకోళానికి కూడా ఇలాంటి పనులు చేస్తే అది వాస్తవంగానే భావించబడుతుంది. వేళాకోళానికి ఇచ్చిన తలాఖ్, ఉబుసుపోక చేసుకున్న పెళ్ళి, (బానిసకు) స్వేచ్ఛనొసగటం వంటివి అన్నీ ఈ కోవలోకి వస్తాయి (ఇబ్నె కసీర్).

281. విడాకులు పొందిన స్త్రీకి సంబంధించి మూడో ఆజ్ఞ ఇందులో ఇవ్వబడింది. అదేమంటే గడువు పూర్తయిన తరువాత (అంటే మొదటిసారి లేక రెండవసారి విడాకుల అనంతరం) ఆ దంపతులు పరస్పరం ఒక అంగీకారానికి వచ్చి, మళ్ళీ వివాహబంధంలో ఇమడగోరితే పెద్దవాళ్లు అడ్డు తగలకూడదు. దైవప్రవక్త (సఅసం) కాలంలో సరిగ్గా ఇలాంటిదే ఒక సంఘటన జరిగింది. అప్పుడు స్త్రీ సోదరుడు ఆమెకు అడ్డు తగిలాడు. దానిపై ఈ ఆయతు అవతరించింది (సహీహ్ బుఖారీ, కితాబున్నికాహ్).

దీనిద్వారా స్పష్టమయ్యే ఇంకొక విషయం ఏమిటంటే స్త్రీ తన స్వీయ నిర్ణయంతో నికాహ్ చేసుకోజాలదు. పైగా ఆమె నికాహ్ కోసం ఆమె సంరక్షకుని అనుమతి, అంగీకారం అవసరం. స్త్రీల సంరక్షకులు తమకు గల అజమాయిషీ

233 పాల గడువును పూర్తి చేయాలని (తండ్రులు) కోరినపక్షంలో తల్లులు తమ పిల్లలకు పూర్తిగా రెండు సంవత్సరాలపాటు పాలు పట్టాలి.[282] బిడ్డల తండ్రులపై పోషణాభారం ఉంటుంది. కనుక వారు వారికి ఉత్తమ రీతిలో అన్నవస్త్రాలను సమకూర్చాలి.[283]

وَالْوَالِدٰتُ يُرْضِعْنَ اَوْلَادَهُنَّ حَوْلَيْنِ كَامِلَيْنِ
لِمَنْ اَرَادَ اَنْ يُّتِمَّ الرَّضَاعَةَ ؕ وَعَلَى الْمَوْلُوْدِ لَهٗ
رِزْقُهُنَّ وَكِسْوَتُهُنَّ بِالْمَعْرُوْفِ ؕ لَا تُكَلَّفُ نَفْسٌ

హక్కును దుర్వినియోగపరచకూడదు అని అల్లాహ్ తాకీదు చేశాడంటే, వారికి ఆ హక్కు ఉండబట్టే కదా తాకీదు చేశాడు! కాబట్టి ఈ ఆయతు అవతరణా నేపథ్యంలో సహీహ్ బుఖారీలో పొందుపరచబడిన సంరక్షకుని వ్యవహారం సుస్పష్టం. ఇందులో ఎలాంటి అస్పష్టతకు, సంకోచానికి ఆస్కారం లేదు. ఇంకా యితర హదీసుల ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. ఉదాహరణకు : "స్త్రీ సంరక్షకుని అనుమతి లేనిదే నికాహ్ అవదు" అనే ఉల్లేఖనం ఒకటుంది. మరో ఉల్లేఖనంలో "ఏ స్త్రీ అయితే తన సంరక్షకుని అనుమతి పొందకుండా నికాహ్ చేసుకుందో, ఆమె నికాహ్ అధర్మం, ఆమె నికాహ్ అధర్మం, ఆమె నికాహ్ అధర్మం" అని ఉంది (అల్‌బానీ గారు ఈ హదీసును కూడా ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు). ఇతర హదీసువేత్తల మాదిరిగా అల్లామా అన్వర్ షా కశ్మీరీ కూడా ఈ హదీసులను ప్రామాణికమైన, అహ్సన్ కోవకు చెందిన హదీసులుగా గ్రహించారు (ఫైజుల్‌బారీ – సంపుటి : 4, కితాబున్నికాహ్).

ఈ ఆయతు ద్వారా స్పష్టంగా మన ముందుకు వచ్చే మరో ముఖ్యాంశం ఏమిటంటే స్త్రీల సంరక్షకులు కూడా మొండిగా మసలుకోకూడదు. వారు ఈ సందర్భంగా స్త్రీల మనోభావాలను అర్థం చేసుకోవాలి. ఒకవేళ స్త్రీ సంరక్షకుడు గనక స్త్రీ యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా – బలవంతంగా – ఎవరికో ఒకరికి కట్టబెడితే, అట్టి పరిస్థితిలో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించి నికాహ్‌ను రద్దు చేయించేందుకు షరీయత్ ఆమెకు అనుమతినిస్తోంది. అందుకే నికాహ్ సందర్భంగా ఇరువురి అంగీకారం చాలా అవసరం. ఏ ఒక్కరూ తన ఇష్టానుసారం వ్యవహరించకూడదు. ఒకవేళ స్త్రీ గనక తన సంరక్షకుని మాటను ధిక్కరించి వివాహం చేసుకుంటే అట్టి వివాహం సరైంది అనిపించుకోదు. అదేవిధంగా సంరక్షకుడు మూర్ఖునిగా ప్రవర్తిస్తూ, స్త్రీ బాగోగులకు బదులు తన స్వప్రయోజనాలకే ప్రాధాన్యత నిస్తున్నట్లయితే న్యాయస్థానం అటువంటి సంరక్షకుని అజమాయిషీ హక్కును జప్తు చేసుకుంటుంది. ఆ తర్వాత ఆ సంరక్షకుని తదనంతరం ఆమెకు బాధ్యత వహించే వ్యక్తి పర్యవేక్షణలోగాని లేక స్వయంగా తన పర్యవేక్షణలోగాని ఆమె నికాహ్ జరిపిస్తుంది. "సంరక్షకులు పరస్పరం తగవుపడితే రాజ్యాధికారి సంరక్షణా బాధ్యతలు స్వీకరిస్తాడు" (ఇర్వావుల్ గలీల్).

282. ఈ ఆయతులో **'పాల గడువు'**, **'పాల వరుస'**కు సంబంధించిన ముఖ్య విషయాలు ప్రస్తావించబడ్డాయి. దీనిద్వారా బోధపడుతున్న మొట్టమొదటి విషయం ఏమిటంటే పాల గడువును పూర్తి చేయదలిచేవారు పూర్తిగా రెండు సంవత్సరాలు పిల్లవాడికి పాలుపట్టాలి. పై ఆయతులోని పదాల ద్వారా అంతకంటే తక్కువ గడువు వరకు పాలు త్రాపించుకునేందుకు కూడా వెసులుబాటు ఉన్నట్లు బోధపడుతున్నది. రెండో విషయం : పాలగడువు గరిష్ఠంగా రెండు సంవత్సరాలన్న సంగతి దీనిద్వారా రూఢీ అవుతోంది. సుననె తిర్మిజీలో ఉమ్మె సలమా (ర.అన్హా) గారి 'మర్ఫూ' ఉల్లేఖనం ఇలా వుంది : చనువుల నుండి వెలువడి కడుపులోని ప్రేగులను వ్యాకోచింపజేసే పాలు మాత్రమే పాల వరుస సంబంధాన్ని (నిషిద్ధతను) నిరూపిస్తాయి. పాల గడువు లోపల త్రాపే పాలు మాత్రమే అటువంటి గుణం కలిగి ఉంటాయి (సుననె తిర్మిజీ, కితాబుర్రజాఅ). ఏ చంటి పిల్లవాడైనా ఆ వయస్సులో, ఆ విధంగా ఏ స్త్రీ పాలైనా సరే త్రాగి ఉంటే, తద్వారా పాల వరుస సంబంధం ఏర్పడినట్లవుతుంది. ఆ సంబంధం ఉందని తెలిసిన మీదట (అంటే ఒకే స్త్రీ చనుబాలు త్రాగిన ఒక అబ్బాయి, ఒక అమ్మాయి – ఒకే తల్లిబిడ్డలు కాకపోయినప్పటికీ – అన్నాచెల్లెలు అయిపోతారు). వారిద్దరి మధ్య వైవాహిక సంబంధం నిషిద్ధం. "వంశపారంపర్యం రీత్యా ఏ ఏ సంబంధాలు వివాహానికి నిషిద్ధమో అవే పాలవరుస మూలంగా కూడా నిషిద్ధం అవుతాయి" (సహీహ్ బుఖారీ, కితాబుష్షహాదాత్).

283. **'మౌలూద్ లహూ'** అంటే తండ్రి అని అర్థం. విడాకుల అనంతరం పాలు త్రాగే పసి పిల్లల ఆలనాపాలనా సమస్య, విడాకులు పొందిన మహిళల పోషణా వ్యవహారం ముస్లిం సమాజంలో మరింత జటిలంగా తయారవుతోంది. దీనికి

ఎవరిపైనా శక్తికి మించిన భారం వేయబడదు. బిడ్డ మూలంగా తల్లిని వేధించటంగానీ, సంతానం కారణంగా తండ్రిని ముప్పు తిప్పలు పెట్టడంగానీ చేయరాదు.[284] వారసులపై కూడా ఇటువంటి బాధ్యతే ఉంటుంది.[285] ఒకవేళ ఉభయులూ (తల్లిదండ్రులు) తమ ఇష్టపూర్వకంగా, పరస్పర సంప్రతింపులతో పాలు విడిపించదలిస్తే వారు నిందార్హులు కారు. ఒకవేళ మీ సంతానానికి పాలు పట్టాలన్నదే మీ అభిలాష అయితే అందు లోనూ దోషంలేదు. అయితే మీరు ఆమెకు సముచితమైన రీతిలో ఇవ్వవలసిన దాన్ని ఇవ్వండి.[286] అల్లాహ్‌కు భయపడుతూ మసలుకోండి. అల్లాహ్ మీ కార్యకలాపాలన్నింటినీ గమనిస్తున్నా డన్న విషయాన్ని తెలుసుకోండి.

إِلَّا وُسْعَهَا ۚ لَا تُضَارَّ وَالِدَةٌۢ بِوَلَدِهَا وَلَا
مَوْلُودٌ لَّهُۥ بِوَلَدِهِۦ ۚ وَعَلَى ٱلْوَارِثِ مِثْلُ ذَٰلِكَ ۗ
فَإِنْ أَرَادَا فِصَالًا عَن تَرَاضٍ مِّنْهُمَا وَتَشَاوُرٍ فَلَا
جُنَاحَ عَلَيْهِمَا ۗ وَإِنْ أَرَدتُّمْ أَن تَسْتَرْضِعُوٓا۟
أَوْلَٰدَكُمْ فَلَا جُنَاحَ عَلَيْكُمْ إِذَا سَلَّمْتُم مَّآ ءَاتَيْتُم
بِٱلْمَعْرُوفِ ۗ وَٱتَّقُوا۟ ٱللَّهَ وَٱعْلَمُوٓا۟ أَنَّ ٱللَّهَ بِمَا
تَعْمَلُونَ بَصِيرٌ ﴿233﴾

**234** మీలో ఎవరయినా మరణించి, వారు భార్యలను వదలిపోతే అటువంటి స్త్రీలు నాలుగు మాసాల పది రోజుల వరకూ తమను తాము గడువు (ఇద్దత్)లో ఆపుకోవాలి.[287] గడువు ముగిసిన

وَٱلَّذِينَ يُتَوَفَّوْنَ مِنكُمْ وَيَذَرُونَ أَزْوَٰجًا
يَتَرَبَّصْنَ بِأَنفُسِهِنَّ أَرْبَعَةَ أَشْهُرٍ وَعَشْرًا ۖ

కారణం ఇస్లామీయ షరీయతు పట్ల గల అవగాహనా లోపమే. దైవాదేశం ప్రకారం – ఈ ఆయతులో సూచించిన విధంగా – పాలగడువు ముగిసేవరకూ భర్త తన స్థోమతను బట్టి స్త్రీకి అన్నవస్త్రాలను, వసతి సౌకర్యాన్ని కల్పిస్తే ఏ చిక్కూ ఉండదు. బాధ్యతా నిర్వహణలో నిర్లక్ష్యం, పలాయనవాదం పొడసూపిన చోటల్లా సమస్యలు ఉత్పన్నం అవుతాయి.

284. తల్లిని వేధించటం అంటే అర్థం ఇది : ఒక్కోసారి విడాకుల అనంతరం తల్లి తన పసిబిడ్డను తన దగ్గరే ఉంచుకోగోర్తుంది. కాని ఆమె మమతానురాగాలను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా భర్త తరఫువారు బలవంతంగా ఆ పసివాణ్ణి ఆమె నుంచి లాక్కుంటారు. లేదా ఖర్చుల కోసం చిల్లిగవ్వ కూడా ఆమెకు ఇవ్వకుండా పిల్లవాణ్ణి పోషిస్తే పోషించు లేకపోతే లేదు, నీ యిష్టం అని భర్త అంటాడు. ఇది న్యాయం కాదుకదా! అలాగే తండ్రిని ముప్పుతిప్పలు పెట్టడం అంటే భావం: విడాకులు పొందిన స్త్రీ మరియు ఆమె తరఫు బంధువులు ఏకమై అతనిపై కక్షసాధింపు ప్రయత్నంలో భాగంగా పసిపిల్లలకు పాలుపట్టేది లేదని తెగేసి చెప్పటం లేదా ఒకవేళ పాలుపట్టినా ఖర్చుల క్రింద భారీమొత్తం అతన్నుంచి రాబట్టేందుకు ప్రయత్నించటం, లేదా నీ పిల్లవాణ్ణి నువ్వు తీసుకుపో అంటూ చీటికీ మాటికీ చెప్పటం.

285. ఒకవేళ భరణం చెల్లిస్తూ ఉండే తండ్రి గనక అకస్మాత్తుగా మరణిస్తే ఆ పిల్లవాడి పాలుపట్టే ఖర్చుల్ని అతని వారసులు భరించాలి. పాలుపట్టే తల్లిపైగానీ, పసిపిల్లవాడి పోషణపై గానీ ఎలాంటి చెడు ప్రభావం పడకుండా వారు శుభ్రంగా చూసుకోవాలి.

286. కన్నతల్లి కాకుండా వేరొక స్త్రీ చేత పసిపిల్లవాడికి పాలు పట్టించడానికి అనుమతి ఉంది. అయితే ఇందుకయ్యే ఖర్చుల్ని న్యాయసమ్మతంగా చెల్లించటం అవసరం.

287. భర్తతో కాపురం చేసిన స్త్రీ అయినా లేక కాపురానికి ముందే భర్త చనిపోయి ఉన్నా, యువతి అయినా ముసలి స్త్రీ అయినా, ఎవరికైనా ఈ గడువు వర్తిస్తుంది. ఒక్క గర్భవతి అయిన మహిళకు మాత్రమే దీన్నుంచి మినహాయింపు ఉంది. ఎందుకంటే భర్త చనిపోయిన స్త్రీలు గర్భవతులై ఉంటే వారి ఇద్దత్ (గడువు) ప్రసవం వరకు ఉంటుంది. తలాఖ్ సూరాలో ఇలా అనబడింది : "గర్భిణీ స్త్రీల ఇద్దత్ వారి కాన్పు అయ్యేవరకు ఉంటుంది." ఇద్దత్ కాలంలో

فَإِذَا بَلَغْنَ أَجَلَهُنَّ فَلَا جُنَاحَ عَلَيْكُمْ فِيمَا
فَعَلْنَ فِي أَنفُسِهِنَّ بِالْمَعْرُوفِ ۗ وَاللَّهُ بِمَا
تَعْمَلُونَ خَبِيرٌ ﴿234﴾

తరువాత వారు సంస్కారవంతమైన పద్ధతిలో తమ కొరకు మంచిదనుకున్న కార్యమేదయినా చేసుకుంటే అందులో మీపై దోషం ఏమీలేదు.[288] మీరు ఏమేం చేస్తున్నారో అల్లాహ్‌కు అంతా తెలుసు.

وَلَا جُنَاحَ عَلَيْكُمْ فِيمَا عَرَّضْتُم بِهِ مِنْ
خِطْبَةِ النِّسَاءِ أَوْ أَكْنَنتُمْ فِي أَنفُسِكُمْ ۚ عَلِمَ
اللَّهُ أَنَّكُمْ سَتَذْكُرُونَهُنَّ وَلَٰكِن لَّا تُوَاعِدُوهُنَّ
سِرًّا إِلَّا أَن تَقُولُوا قَوْلًا مَّعْرُوفًا ۚ وَلَا تَعْزِمُوا

**235** ఆ స్త్రీలను (వితంతువులను) నికాహ్ చేసుకోవాలన్న మీ సంకల్పాన్ని సూచనా ప్రాయంగా వారికి తెలియజేసినా లేక మీ ఉద్దేశాన్ని మీ గుండెల్లోనే దాచుకున్నా అందులో తప్పేమీలేదు. మీరు తప్పకుండా వారి గురించి ప్రస్తావిస్తారన్న సంగతి అల్లాహ్‌కు తెలుసు. అయితే మీరు వారికి లోపాయికారిగా వాగ్దానాలు చేయకండి.[289] ధర్మయుక్తంగా ఏదన్నా చెబితే అది

ఆ స్త్రీలు సింగారించుకోవటం, (ఆఖరికి సుర్మా లేక కళ్ళకు కాటుక పెట్టుకోవటం వంటివి కూడా) చేయకూడదు. భర్త నివసించే ఇల్లు దాటి వేరొక చోటికి పోకూడదు. అయితే రాజీ పడటానికి వీలుండే విడాకులు (తలాఖె రజ్‌యీ) పొందిన స్త్రీ అలంకరించుకుంటే తప్పులేదు. రాజీ పడటానికి వీలులేని విడాకులు (తలాఖె బాయిన్) పొందినవారు ఇద్దత్ కాలంలో అలంకరించుకోవచ్చా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు 'వచ్చు' అనంటే మరికొందరు 'కూడదు' అని అంటున్నారు (ఇబ్నె కసీర్).

288. అంటే ఇద్దత్ (గడువు) ముగిసిన పిదప వారు అలంకరించుకోవచ్చు. దానిపై ఎవరూ రాద్ధాంతం చేయనక్కరలేదు. అలాగే వితంతువు తన సంరక్షకులను, పెద్దలను సంప్రతించి పునర్వివాహం చేసుకోదలిస్తే వారు సంతోషంగా అంగీకారం తెలుపాలి. అంగీకారమే కాదు, దగ్గరుండి ఆ ఏర్పాట్లన్నీ చేసి ఆశీర్వదించి మరీ పంపాలి. వితంతు వివాహాన్ని అపచారంగానో, నామోషీగానో భావించకూడదు. ఆ సత్కార్యంలో అవరోధాలు కల్పించకూడదు. అన్య మతాలలో ఈ భావన ఉంది. ఆ ప్రభావానికి ముస్లింలు లోను కానవసరం లేదు.

289. అంటే వితంతువు లేక మూడుసార్లు విడాకులు పొందిన స్త్రీ విషయమై ఒక ముఖ్య సూచన ఇందులో ఇవ్వబడింది. అదేమంటే, గడువు (ఇద్దత్) కాలంలో మీరు ఒకవేళ ఆమెతో నికాహ్ గురించి సూచనాప్రాయంగా చెప్పదలిస్తే అందులో తప్పులేదు. (ఉదాహరణకు: నేను పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాననో, నేను ఒక ఉత్తమ ఇల్లాలి కోసం అన్వేషిస్తున్నానో అని అనటంలో దోషం లేదు) కాని ఆ మేరకు రహస్య మంతనాలు సాగించటం, ఆమె చేత ఒట్టు వేయించుకోవటం వంటివి చేయకూడదు. అలాగే గడువు ముగియక ముందే వివాహం నిశ్చయించుకోవటం కూడా సరైనదికాదు. ఇక మొదటిసారి లేక రెండవసారి విడాకులు పొందిన స్త్రీల వద్ద ఇలాంటి ప్రస్తావన చూచాయగా తీసుకురావటం కూడా ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే ఆ గడువు పూర్తయ్యే వరకూ ఆమెపై భర్తకు హక్కు ఉంటుంది. బహుశా ఆమె భర్త రాజీ పడాలనుకుంటాడేమో!

**గమనిక :** కొంతమంది తెలీక ఇద్దత్ కాలంలోనే నికాహ్ చేసుకుంటారు. వీరికి సంబంధించిన ఆదేశం ఏమిటంటే, ఒకవేళ ఆ నవ దంపతులు సమాగమం జరపకుండా ఉంటే వెంటనే వారిని విడదీయాలి. ఒకవేళ సమాగమం జరిగిపోయి ఉంటే అప్పుడూ వేర్పాటు తప్పదు. కాని తిరిగి వారిద్దరూ (గడువు అనంతరం) నికాహ్ చేసుకోగలరా లేదా? అన్న విషయమై ఏకాభిప్రాయం లేదు. ఇక వారు ఎన్నటికీ పరస్పరం నికాహ్ ద్వారా కలుసుకోలేరు అని కొందరు విద్వాంసులు నిర్ద్వంద్వంగా చెప్పారు. అయితే వారి మధ్య వివాహ బంధానికి అవకాశం మిగిలి ఉంటుందని చాలామంది ఉలమాలు భావిస్తున్నారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

عُقْدَةَ النِّكَاحِ حَتّٰى يَبْلُغَ الْكِتٰبُ اَجَلَهٗ ؕ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ يَعْلَمُ مَا فِىْٓ اَنْفُسِكُمْ فَاحْذَرُوْهُ ۚ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ غَفُوْرٌ حَلِيْمٌ ﴿235﴾

వేరే విషయం![290] కాని ఇద్దత్ (గడువు) కాలం ముగియనిదే నికాహ్ ఒప్పందాన్ని నిశ్చయం చేయకండి. మీ అంతర్యాల్లో దాగి వున్న విషయాలను సయితం అల్లాహ్ తెలుసుకుంటాడని మరువ కండి. కనుక ఆయన పట్ల అప్రమత్తంగా ఉండండి. అల్లాహ్ క్షమించేవాడు, సహనశీలి అని కూడా తెలుసుకోండి.

لَا جُنَاحَ عَلَيْكُمْ اِنْ طَلَّقْتُمُ النِّسَآءَ مَا لَمْ تَمَسُّوْهُنَّ اَوْ تَفْرِضُوْا لَهُنَّ فَرِيْضَةً ۖۚ وَّمَتِّعُوْهُنَّ ۚ عَلَى الْمُوْسِعِ قَدَرُهٗ وَعَلَى الْمُقْتِرِ قَدَرُهٗ ۚ مَتَاعًا ۢ بِالْمَعْرُوْفِ ۚ حَقًّا عَلَى الْمُحْسِنِيْنَ ﴿236﴾

**236** ఒకవేళ మీరు స్త్రీలను తాకకుండా, వారి మహర్‌ను నిర్ధారించకుండానే వారికి విడాకులిస్తే అది కూడా మీకు పాపం కాదు. అయితే వారికి ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చండి. స్థితిమంతుడు తన స్థితికి తగినట్లుగా, పేదవాడు తన స్థోమతకు తగినట్లుగా ధర్మం ప్రకారం ప్రయోజనం చేకూర్చాలి. ఉత్తమంగా వ్యవహరించేవారికి ఇది విధిగా నిర్ణయించబడింది.[291]

وَاِنْ طَلَّقْتُمُوْهُنَّ مِنْ قَبْلِ اَنْ تَمَسُّوْهُنَّ وَقَدْ فَرَضْتُمْ لَهُنَّ فَرِيْضَةً فَنِصْفُ مَا فَرَضْتُمْ

**237** మీరు స్త్రీలను ముట్టుకోక ముందే విడాకులిచ్చేస్తే, అప్పటికే వారి 'మహర్' సొమ్ము కూడా నిర్ణయించబడి ఉంటే, నిర్ణీత మహర్‌లో సగం సొమ్ము వారికి ఇవ్వండి. ఒకవేళ వారు (స్త్రీలు)

290. అంటే సూచనప్రాయంగా, చూచాయగా ఉద్దేశాన్ని వ్యక్తపరచటమన్నమాట. ఉదాహరణకు : నీ విషయంలో నేను శ్రద్ధాసక్తులు కలిగి ఉన్నాను అని అనటం లేదా ఆమె వివాహం విషయంలో ఒక నిర్ణయానికి వచ్చేముందు నాకు తప్పకుండా తెలియజేయండి అని ఆమె సంరక్షకునితో చెప్పటం మొదలగునవి (ఇబ్నె కసీర్).

291. నికాహ్ సందర్భంగా 'మహర్' నిర్ధారణ కాకుండా ఉండి, శోభనానికి ముందే విడాకులు ఇచ్చేసిన స్త్రీ గురించి ఇందులో చెప్పబడింది. అటువంటి స్త్రీకి ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చి సాగనంపమని తాకీదు చేయబడింది. ఈ 'ప్రయోజనాన్ని' ఆయా వ్యక్తులు తమ స్థాయికి తగ్గట్టు చేకూర్చాలి. మొత్తానికి మంచివారిపై ఇది తప్పనిసరిగా చేయబడింది. ఈ ప్రయోజన (ముత్‌అ) నిర్ధారణ కూడా జరిగింది. ఒక సేవకురాలిని కానుకగా ఇవ్వాలని కొందరంటే, 500 దిర్హములు నగదు చెల్లించాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఒకటి లేక అంతకన్నా ఎక్కువ జతల బట్టలు సమకూర్చాలని ఇంకా కొందరు వ్యాఖ్యానించారు. అయితే ఈ నిర్ధారణ షరీయతు పరంగా జరిగినది కాదు. ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిపై, వారి ఔదార్యంపై ఇది ఆధారపడి ఉంటుంది.

మరి ఈ ప్రయోజనం (ముత్‌అ) అన్ని రకాల విడాకులకు వర్తిస్తుందా? లేక ఈ ఆయతులో, యిక్కడ పేర్కొనబడిన, ఈ రకపు విడాకులకు మాత్రమే వర్తిస్తుందా? అన్న విషయమై కూడా ద్వంద్వాభిప్రాయాలున్నాయి. అన్ని రకాల విడాకులు పొందిన మహిళకు ఇది వర్తిస్తుందని దివ్య ఖుర్‌ఆన్‌లోని మరికొన్ని ఆయతులు సూచిస్తున్నాయి. ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చి సగౌరవంగా పంపాలన్న ఈ ఆదేశంలో దాగివున్న పరమార్థం గురించి, దాని లాభాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భేదాభిప్రాయాలు వచ్చి, మాటా మాటా పెరిగి, గుండెకు గాయమై వ్యవహారం విడాకుల వరకూ వచ్చినప్పుడు ఉదారంగా మసలుకోవటం, వీలైనంతవరకు స్త్రీకి లబ్ధి చేకూర్చటం చాలా అవసరం. తద్వారా భవిష్యత్తులో ప్రతీకార భావం పెల్లుబకకుండా ఉంటుంది. కాని వాస్తవంగా జరుగుతున్నదేమిటీ? మన సమాజంలో విడాకులు పొందిన స్త్రీని చిన్నచూపు చూడటమే గాకుండా, అత్యంత అవమానకరమైన ధోరణిలో ఆమెను సాగనంపటం పరిపాటి అయిపోయింది. ఈ చర్య వల్ల ఆ రెండు కుటుంబాల మధ్య గల సత్సంబంధాలు శాశ్వతంగా చెడిపోతాయి.

ఆ సొమ్మును కూడా మన్నించి వదలిపెడితే[292] లేక వివాహ బంధం తన చేతిలో ఉన్న వ్యక్తి (పురుషుడు తాను పెళ్ళి సందర్భంగా యిచ్చిన మహర్ సొమ్మును) క్షమించివేస్తే[293] అది వేరే విషయం. మీ మన్నింపుల వైఖరి దైవభక్తికి చాలా సన్నిహిత మైనది. ఒండొకరి పట్ల ఔదార్యం చూపటాన్ని విస్మరించకండి. నిస్సందేహంగా అల్లాహ్ మీ కర్మలను గమనిస్తూనే ఉన్నాడు.

إِلَّآ أَن يَعْفُونَ أَوْ يَعْفُوَا۟ ٱلَّذِى بِيَدِهِۦ عُقْدَةُ ٱلنِّكَاحِ ۚ وَأَن تَعْفُوٓا۟ أَقْرَبُ لِلتَّقْوَىٰ ۚ وَلَا تَنسَوُا۟ ٱلْفَضْلَ بَيْنَكُمْ ۚ إِنَّ ٱللَّهَ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ (237)

**238** నమాజులను కాపాడుకోండి, ముఖ్యంగా మధ్యలో వున్న నమాజును.[294] అల్లాహ్ సమక్షంలో వినమ్రులై నిలబడండి.

حَـٰفِظُوا۟ عَلَى ٱلصَّلَوَٰتِ وَٱلصَّلَوٰةِ ٱلْوُسْطَىٰ وَقُومُوا۟ لِلَّهِ قَـٰنِتِينَ (238)

292. మహర్ సొమ్ము ముందుగానే ఖరారై ఉండి, భర్త ఆమెను ముట్టుకోక ముందే, ఖల్వతె సహీహాకు (వాస్తవమైన ఏకాంతానికి) ముందే విడాకులు ఇచ్చిన పక్షంలో నిర్ధారిత మహర్‌లో సగభాగం ఆమెకు విధిగా చెల్లించాలి. ఒకవేళ విడాకులు పొందిన స్త్రీ అతన్ని క్షమిస్తే, అప్పుడు అతనిపై ఆ చెల్లింపు బాధ్యత ఉండదు.

293. వివాహబంధం తన చేతిలో ఉన్న వ్యక్తి అంటే భర్త అని అర్థం. (ఆ ముడిని విప్పాలా? లేక అలాగే ఉంచాలా? అనే కీలక నిర్ణయం గైకొనే వ్యక్తి యిక్కడ భర్తే). సగం మహర్ భర్త మాఫీ చేయటం ఏమిటీ? అన్న సందేహం యిక్కడ కలగవచ్చు. అంటే ఒకవేళ అతడు నికాహ్ సందర్భంగానే మహర్ సొమ్మును వధువుకు యిచ్చేసివుంటే, దాన్ని ఆమె నుండి వాపసు తీసుకోకుండా వదలిపెట్టడం అన్నమాట! ఈ సందర్భంగా సదమరవర్తనను, ఉపకార భావాన్ని మరువరాదని ఇస్లాం ఉపదేశిస్తోంది. మహర్ విషయంలో కనబరచే ఔదార్యం మున్ముందు మీ పాలిట శుభసూచకం అవుతుందని దీని భావం.

"వివాహ బంధం తన చేతిలో ఉన్న వ్యక్తి" అంటే స్త్రీ యొక్క సంరక్షకుడు అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. కాని యిది సరైంది కాదు. ఎందుకంటే వివాహబంధాన్ని కొనసాగించే లేక రద్దుపరచే అధికారం సంరక్షకునికి ఉండదు. మరో విషయం ఏమిటంటే మహర్ స్త్రీ హక్కు. దాన్ని మాఫీ చేసే అధికారం స్త్రీకి మాత్రమే ఉందిగాని ఆమె సంరక్షకునికి లేదు. కాబట్టి ఇంతకుముందు ఇచ్చిన వివరణే సరైంది (ఫత్‌హుల్ ఖదీర్).

గమనిక : విడాకులు పొందిన స్త్రీలు నాలుగు రకాలు :

1. మహర్ ముందుగా ఖరారై ఉండి, వివాహం తరువాత భర్త సమాగమం కూడా చేసి వుంటే అట్టి విడాకులు పొందిన మహిళకు పూర్తి మహర్ హక్కు ప్రాప్తిస్తుంది. 229వ ఆయతులో దీని వివరాలు ఉన్నాయి.
2. మహర్ సొమ్ము కూడా నిర్ధారితం కాకుండా, వివాహానంతరం సమాగమం కూడా జరగకుండా ఉన్న స్త్రీకి కేవలం కొంత లబ్ది మాత్రం చేకూర్చబడుతుంది.
3. మహర్ హక్కు ముందుగానే నిర్ణయించబడింది. కాని కార్యం జరగలేదు. అటువంటి మహిళకు సగం మహర్ సొమ్ము చెల్లించాలి. వీరిరువురికి సంబంధించిన వివరాలు 237వ ఆయతులో వచ్చాయి.
4. వివాహం తరువాత సంభోగం మాత్రం జరిగింది. కాని ఆమె మహర్ ఎంతో నిర్ణయించబడలేదు. అట్టి పరిస్థితిలో ఆ మహిళకు "మహరె మిస్ల్" ఇవ్వబడుతుంది. మహరె మిస్ల్ అంటే ఆ మహిళ పుట్టింటి తరఫు వారి స్థాయినిబట్టి, లేక ఆ వంశంలో సాధారణంగా తీసుకునే మహర్‌ను బట్టి ఆమె మహర్ నిర్ధారించబడు తుంది. అదీ సాధ్యం కాకపోతే ఆ మహిళ యోగ్యతను అంచనావేసి ఆమెకు ఎంత మహర్ ఇవ్వవచ్చునో నిర్ణయిస్తారు. (నైలుల్ ఔతార్, ఔనుల్ మాబూద్)

294. మధ్య నమాజు అంటే 'అస్ర్ నమాజ్' అని భావం. కందక పోరాటం నాడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ నమాజును **"సలాతుల్ వుస్తా"** (మధ్య నమాజు)గా ఖరారు చేశారు (సహీహ్ బుఖారీ, కితాబుల్ జిహాద్).

**239** పరిస్థితులు భయానకంగా ఉన్నప్పుడు నడుస్తూనో లేక వాహనంపై పోతూనో (నమాజు చేయండి). శాంతిభద్రతలు నెలకొన్న తరువాత అల్లాహ్ మీకు బోధించిన విధంగా ఆయన్ని ధ్యానించండి. దాని గురించి అంతకుముందు మీకు తెలీదు.[295]

فَإِنْ خِفْتُمْ فَرِجَالًا أَوْ رُكْبَانًا ۖ فَإِذَآ أَمِنتُمْ
فَاذْكُرُوا اللَّهَ كَمَا عَلَّمَكُم مَّا لَمْ تَكُونُوا
تَعْلَمُونَ (239)

**240** మీలో ఎవరయినా చనిపోయి, వారు తమ భార్యలను వదలిపోతే, వారు ఒక ఏడాది కాలంపాటు ప్రయోజనం పొందేలా,[296] వారిని ఎవరూ ఇండ్ల నుంచి గెంటివేయకుండా ఉండేలా వీలునామా వ్రాయాలి. ఒకవేళ వారు తమంతట తాముగా వెళ్ళిపోయి, తమ విషయంలో ధర్మసమ్మతంగా ఏమి చేసినా దానికి మీరు నిందార్హులు కారు. అల్లాహ్ సర్వాధికుడు, వివేచనాపరుడు.

وَالَّذِينَ يُتَوَفَّوْنَ مِنكُمْ وَيَذَرُونَ أَزْوَاجًا
وَصِيَّةً لِّأَزْوَاجِهِم مَّتَاعًا إِلَى الْحَوْلِ غَيْرَ
إِخْرَاجٍ ۚ فَإِنْ خَرَجْنَ فَلَا جُنَاحَ عَلَيْكُمْ فِي
مَا فَعَلْنَ فِيٓ أَنفُسِهِنَّ مِن مَّعْرُوفٍ ۗ وَاللَّهُ
عَزِيزٌ حَكِيمٌ (240)

**241** విడాకులు పొందిన మహిళలకు సముచిత మేలు చేయటం భావ్యం. ఇది దైవభీతిపరులపై విధిగా చేయబడింది.[297]

وَلِلْمُطَلَّقَاتِ مَتَاعٌۢ بِالْمَعْرُوفِ ۖ حَقًّا عَلَى
الْمُتَّقِينَ (241)

**242** మీరు అర్థం చేసుకుని బుద్ధిగా మసలుకునేందుకుగాను అల్లాహ్ ఈ విధంగా తన ఆయతులను (ఆజ్ఞలను) మీకు విశద పరుస్తున్నాడు.

كَذَٰلِكَ يُبَيِّنُ اللَّهُ لَكُمْ آيَاتِهِ لَعَلَّكُمْ
تَعْقِلُونَ (242)

---

295. శత్రువు మెరుపుదాడి చేయొచ్చన్న భయం ఉన్నప్పుడు ఏ విధంగా నమాజు చేసుకున్నా ఫరవాలేదు. అంటే నడుస్తూ నడుస్తూ, వాహనంపై కూర్చొని నమాజు చేయవచ్చు. అయితే భయంకర పరిస్థితులు తొలగిపోయి, శాంతి భద్రతలు నెలకొన్న మీదట, మీకు నేర్పిన విధంగానే నమాజు చేయవలసి ఉంటుంది.

296. ఈ ఆయతు రద్దు పరచబడింది. అమలులో ఉన్న ఆయతు ఇంతకు ముందే ప్రస్తావనకు వచ్చింది. దాని ప్రకారం ఇద్దత్ (గడువు) కాలం 4 మాసాల 10 రోజులు అని స్పష్టం చేయబడింది. అదీగాక వారసత్వ ఆదేశాలకు సంబంధించిన ఆయతులో వితంతువు భాగం కూడా నిర్ధారించబడింది. కాబట్టి ఇకమీదట భర్త తన భార్య పేరిట ఏ రకమయిన వీలునామా కూడా రాయనవసరం లేదు.

297. ఇది సర్వసాధారణమైన ఆజ్ఞ. ఇందులో విడాకులు పొందిన మహిళలందరూ వచ్చేస్తారు. వేర్పాటు సందర్భంగా మహిళలతో సహృదయతతో మెలగాలనీ, వీలైనంత ఎక్కువగా వారికి లబ్ది చేకూర్చి సగౌరవంగా పంపించాలని ఇందులో తాకీదు చేయబడింది. ఇందులో అసంఖ్యాకమైన సామాజిక పరమార్థాలు దాగి ఉన్నాయి. ముస్లింలు ఈ ఉపదేశాన్ని సరిగ్గా అమలుపరిస్తే ఎంత బాగుండు! దురదృష్టవశాత్తు వారు ఈ బోధను విస్మరించారు. ఇదిలా ఉండగా కొంతమంది "ముజ్తహిదీన్" (దైనందిన జీవన వ్యవహారాలపై షరీయతు సూత్రాలను అన్వయింపజేసేవారు) ఈ 'లబ్ది' (ముత్అ)కి వక్రభాష్యం చెబుతున్నారు. 'ముత్అ' అంటే విడాకులు పొందిన స్త్రీకి జీవితాంతం చెల్లించవలసిన మనోవర్తి లేక ఆస్తిలో ఇవ్వవలసిన హక్కు అని వారిలో కొందరు విశదీకరించారు. ఇవి రెండూ నిరాధారమైనవే. తన జీవిత భాగస్వామిగా పనికిరాదని భావించి, ఆమెతో తెగత్రెంపులు చేసుకున్న పురుషుడు ఆమెకు జీవితాంతం ఎలా మనోవర్తి ఇచ్చుకుంటాడు? అలాగే తాను కాదనుకున్న, లేక తనను కాదన్న మగవాడి నుంచి అభిమానవతి అయిన ఏ ఆడది మాత్రం ఎలా అతని దగ్గర జీవితాంతం ముష్టెత్తుకుంటుంది?

الم تر الى الذين خرجوا من ديارهم وهم
الوف حذر الموت فقال لهم الله موتوا
ثم احياهم ان الله لذو فضل على الناس
ولكن اكثر الناس لا يشكرون (243)

**243** వేల సంఖ్యలో ఉండి కూడా మరణ భీతితో ఇల్లూ వాకిలీ వదలిపోవడానికి సిద్ధమైన వారిని నీవు చూడలేదా? అల్లాహ్ వారితో "చావండి" అని అన్నాడు. మరి వారిని తిరిగి బ్రతికించాడు.[298] నిస్సందేహంగా అల్లాహ్ జనుల పట్ల దయగలవాడు. కాని వారిలో అత్యధికులు కృతజ్ఞత చూపరు.

وقاتلوا في سبيل الله واعلموا ان الله
سميع عليم (244)

**244** అల్లాహ్ మార్గంలో పోరాడండి. అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడన్న విషయాన్ని మీరు తెలుసుకోండి.

من ذا الذي يقرض الله قرضا حسنا
فيضعفه له اضعافا كثيرة والله يقبض
ويبصط واليه ترجعون (245)

**245** అల్లాహ్‌కు మంచి రుణం[299] ఇచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా? దాన్ని ఆయన ఎన్నోరెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. (ఉపాధిని) తగ్గించేవాడు, పెంచేవాడు అల్లాహ్‌యే. కడకు మీరంతా మరలి పోవలసింది ఆయన వైపుకే.

الم تر الى الملا من بني اسراءيل من بعد
موسى اذ قالوا لنبي لهم ابعث لنا ملكا
نقاتل في سبيل الله قال هل عسيتم

**246** మూసా తరువాత ఇస్రాయీలు సంతతి పెద్దల (రెండు నాల్కల ధోరణి)ని గురించి నువ్వు ఆలోచించావా?[300] "మేము దైవమార్గంలో పోరాడేందుకుగాను మాకోసం ఎవరినయినా రాజుగా నియమించండి"[301] అని వారు తమ ప్రవక్తను కోరారు.

298. ఈ సంఘటన గతించిన ఒకానొక సమాజానిది. దీనికి సంబంధించిన వివరాలు ఏ ప్రామాణిక హదీసులో కూడా పొందుపరచబడిలేవు. కొన్ని కథనాల ప్రకారం ఇది ఇస్రాయీల్ సంతతి కాలంలో జరిగిన ఉదంతం అనీ, హిజ్ఖీల్ అనే ప్రవక్త చేసిన ప్రార్థనను విని అల్లాహ్ ఆ జాతి ప్రజలను తిరిగి బ్రతికించాడనీ అనబడుతోంది. యుద్ధంలో చనిపోతామన్న భయంతోనో లేక ప్లేగువ్యాధి వాతనపడి చచ్చిపోతామన్న భీతితోనో వారు తమ ఇండ్లనుంచి మూటాముల్లె సర్దుకున్నారు. ఆ సమయంలో అల్లాహ్ వారందరినీ మృత్యువాతన పడేసి చావుబ్రతుకులు వారి చేతుల్లో లేవనీ, దైవచిత్తమయితేనే వారు బ్రతికి బట్ట కట్టగలరనీ గుర్తు చేయదలిచాడు. వారు ఏ దేశమేగినా, ఏ గడప వద్ద బ్రతుకు గడపగోరినా కడకు వారు అల్లాహ్ ఆశ్రయంలోకి రావలసిందేనని కూడా బోధించదలిచాడు. అలాగే అల్లాహ్ చనిపోయిన వారిని తిరిగి బ్రతికించే శక్తి కలిగి ఉన్నాడు. దానికి సజీవ సాక్ష్యం ఈ ఉదంతమే. తదుపరి వాక్యంలో దైవమార్గంలో పోరాడమని ముస్లింలకు ఉపదేశించటం జరిగింది. దైవమార్గంలో యుద్ధమనేసరికి నీళ్లు నమలకండి అని ఇంతకుముందు పేర్కొనబడిన సంఘటన ద్వారా జ్ఞాపకం చెయ్యబడింది. జీవన్మరణాల నిర్ణయం నేలపై కాదు, నింగిపైనే చేయబడింది. యుద్ధ మైదానం నుంచి వెన్నుచూపి పారిపోయినంత మాత్రాన మీరు మృత్యువు నుంచి తప్పించుకోలేరు.

299. **"మంచి రుణం"** అంటే భావం దైవమార్గంలో ఖర్చుపెట్టడం. అంటే ప్రాణత్యాగం చేసినట్లే ధనత్యాగం చేయటం. దైవధర్మ ఉన్నతి కోసం కష్టపడి చెమటోడ్చి సంపాదించిన సొమ్మును మనస్ఫూర్తిగా అర్పించటం. దీనికోసం ఊగిసలాడకూడదు. పిసినారితనం కనబరచకూడదు. ఈ రోజు దైవమార్గంలో అర్పిస్తే రేపటి రోజున మా గతేంకాను?! అని సందేహపడకూడదు. ఎందుకంటే ఉపాధిలో సమృద్ధి నొసగటంగానీ, తగ్గించటంగానీ అల్లాహ్ చేతుల్లో ఉంది. ఆయన మిమ్మల్ని రెండు విధాలుగానూ పరీక్షిస్తాడు. ఒక్కోసారి మీ ఉపాధిని తగ్గించి, ఒక్కోసారి పుష్కలంగా ప్రసాదించి పరీక్షిస్తాడు. దైవమార్గంలో ఖర్చుపెట్టడం వల్ల సంపద తరగదు. దాన్ని ఎన్నో రెట్లు పెంచి మరీ మీకు వాపసు చేస్తాడాయన. ఈ సమృద్ధి రకరకాలుగా ఉంటుంది. భౌతిక వృద్ధితోపాటు ఆధ్యాత్మిక వికాసం మీకు ప్రాప్తిస్తుంది.

اِنْ كُتِبَ عَلَيْكُمُ الْقِتَالُ اَلَّا تُقَاتِلُوْا ؕ قَالُوْا وَمَا لَنَآ اَلَّا نُقَاتِلَ فِىْ سَبِيْلِ اللّٰهِ وَقَدْ اُخْرِجْنَا مِنْ دِيَارِنَا وَاَبْنَآئِنَا ؕ فَلَمَّا كُتِبَ عَلَيْهِمُ الْقِتَالُ تَوَلَّوْا اِلَّا قَلِيْلًا مِّنْهُمْ ؕ وَاللّٰهُ عَلِيْمٌۢ بِالظّٰلِمِيْنَ (246)

దానికి ఆ ప్రవక్త, "తీరా యుద్ధం విధించబడ్డాక మీరు వెనుకంజ వేస్తారేమో!" అని అన్నాడు. దానికి వారు, "మేము ఇప్పటికే ఇళ్లనుంచి తరిమివేయబడ్డాము. మా పిల్లలకు దూరం చేయ బడ్డాము. అలాంటప్పుడు మేము దైవమార్గంలో పోరాడకుండా ఉండటం అనేది ఎలా సాధ్యం?" అని (కడు గంభీరంగా) పలికారు. తీరా యుద్ధం విధిగా చేయబడినప్పుడు, వారిలో కొద్ది మంది మినహా మిగిలిన వారంతా వెన్నుచూపారు. అల్లాహ్ దుర్మార్గులను బాగా ఎరుగు.

وَقَالَ لَهُمْ نَبِيُّهُمْ اِنَّ اللّٰهَ قَدْ بَعَثَ لَكُمْ طَالُوْتَ مَلِكًا ؕ قَالُوْٓا اَنّٰى يَكُوْنُ لَهُ الْمُلْكُ عَلَيْنَا وَنَحْنُ اَحَقُّ بِالْمُلْكِ مِنْهُ وَلَمْ يُؤْتَ

**247** "అల్లాహ్ తాలూత్‌ను మీ రాజుగా నియమించాడ"ని వారి ప్రవక్త వారికి తెలియజేసినప్పుడు, "అతని అధికారం మాపై ఎలా నడుస్తుంది? రాజ్యాధికారానికి అతనికన్నా ఎక్కువ హక్కు దారులము మేమాయె! కనీసం అతనికి సిరిసంపదల్లో కూడా

ప్రాపంచిక జంఝాటాల నుంచి, రోగాల బారినుంచి అల్లాహ్ మిమ్మల్ని కాపాడి, మీ మనసులు కుదుటపడేలా చేయవచ్చు. ఇక పరలోకంలో మీకు లభించే పుణ్యఫలమైతే మిమ్మల్ని ఆశ్చర్యపరిచే విధంగా ఉంటుంది.

300. అరబీలో **'మలవున్'** అనే పదం ఉంది. ఏదేని జాతిలోని ప్రముఖులను, యోగ్యులను 'మలవున్'గా వ్యవహరిస్తారు. వీరు సలహాదారులుగా, నాయకులుగా ఉంటారు. నిఘంటువులో 'మలఅ' అనే పదానికి నిండటం అనే అర్థం ఉంది. వారిని చూడగానే ఒకవిధమైన భయం కళ్ళల్లో నిండిపోతుంది (ఐసరుత్తఫాసీర్). ఇక్కడ ప్రస్తావించబడిన దైవప్రవక్త పేరు షమ్‌వేల్ అని అనబడుతోంది. ఇబ్నె కసీర్ సహా అనేకమంది వ్యాఖ్యాతలు వివరించిన దాని ప్రకారం దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) మరణం తరువాత ఇస్రాయీల్ వంశస్థులు కొంత కాలం వరకు సన్మార్గంపైనే ఉన్నారు. కాని ఆ తరువాత వారిలో విముఖత పొడసూప నారంభించింది. ధర్మంలో లేనిపోని విషయాలు ప్రవేశపెట్టి దాని రూపురేఖలను మార్చివేయసాగారు. ఆఖరికి వారి వ్యవహారం విగ్రహారాధన వరకూ వచ్చింది. దైవ ప్రవక్తలు వారిని అన్నివిధాలా బోధపరచారు. అయినా వాళ్లు షిర్కును, పాపకార్యాలను విడనాడలేదు. పర్యవసానంగా అల్లాహ్ వారిపై శత్రు బెడదను మోపాడు. శత్రువులు వీరి ప్రాంతాలను వశపరచుకోవటమేగాక, భారీ సంఖ్యలో వీళ్ల మనుషులను ఖైదీలుగా పట్టుకున్నారు. వారిలో దైవప్రవక్తల పరంపర కూడా ఆగిపోయింది. ఎట్టకేలకు కొంతమంది సజ్జనుల ప్రార్థన ఫలితంగా షమ్‌వేల్ అనే ప్రవక్త ప్రభవింపజేయబడ్డారు. ఆయన వారి మధ్య మంచిని పెంపొందించే, చెడులను అరికట్టే ప్రయత్నాన్ని నిరాఘాటంగా కొనసాగించాడు. దైవమార్గం వైపుకు ప్రజలను పిలువసాగాడు. తమకొక నాయకత్వాన్ని ఇస్తే అతని నేతృత్వంలో శత్రువులతో పోరాడి, కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సంపాదించు కుంటామని వారు ప్రవక్తముందు సరికొత్త ప్రతిపాదనను తీసుకువచ్చారు. కాని ఆ ప్రవక్తకు తన జాతి ప్రజల చంచల స్వభావం గురించి బాగా తెలుసు. తీరా యుద్ధ ఘడియలు ఆసన్నమైనపుడు వెన్నుచూపి పారిపోతారేమో కదా! అని ఆయన చెప్పనే చెప్పాడు. కడకు ఆయన అనుమానమే నిజమయింది.

301. తమ కోసం ఒక రాజును నియమించమని ప్రజలు కోరటాన్నిబట్టి, దాని ప్రకారం దైవప్రవక్త దైవాన్ని ప్రార్థించటాన్నిబట్టి 'రాజరికం' అనేది స్వాభావికంగా చెడ్డది, అధర్మమైనది ఏమీ కాదని తెలుస్తోంది. ఒకవేళ రాజరికం అధర్మమైనదయితే అల్లాహ్ వారి కోరికను త్రోసిపుచ్చేవాడే. కాని అల్లాహ్ వారి కోరికను మన్నించాడు. 'తాలూత్'ను వారికి రాజుగా నియుక్తుణ్ణి చేశాడు. దీనిద్వారా బోధపడేదేమిటంటే రాజు గనక నిరంకుశుడు, దౌర్జన్యపరుడు కాకుండా, పైగా దైవాజ్ఞలను పాలిస్తూ ప్రజల మధ్య న్యాయాన్ని, ధర్మాన్ని పరిరక్షిస్తున్నవాడయితే అతని రాజరికం కేవలం ధర్మసమ్మతమే

سَعَةً مِّنَ الْمَالِ ۚ قَالَ إِنَّ اللَّهَ اصْطَفَاهُ عَلَيْكُمْ وَزَادَهُ بَسْطَةً فِي الْعِلْمِ وَالْجِسْمِ ۖ وَاللَّهُ يُؤْتِي مُلْكَهُ مَن يَشَاءُ ۚ وَاللَّهُ وَاسِعٌ عَلِيمٌ ﴿247﴾

విస్తృతి వొసగబడలేదు" అని (సాకులు) చెప్పసాగారు. ప్రవక్త వారికి ఇలా నచ్చజెప్పాడు: "(చూడండి!) అల్లాహ్ అతన్నే మీపై (నాయకునిగా) ఎన్నుకున్నాడు. జ్ఞానపరంగా, శారీరకంగా కూడా అతనికి ఆధిక్యతను ప్రసాదించాడు.[302] అల్లాహ్ తాను కోరిన వారికి రాజ్యాధికారం ఇస్తాడు. అల్లాహ్ విశాల సంపన్నుడు, జ్ఞాన సంపన్నుడు కూడా!"

وَقَالَ لَهُمْ نَبِيُّهُمْ إِنَّ آيَةَ مُلْكِهِ أَن يَأْتِيَكُمُ التَّابُوتُ فِيهِ سَكِينَةٌ مِّن رَّبِّكُمْ وَبَقِيَّةٌ مِّمَّا تَرَكَ آلُ مُوسَىٰ وَآلُ هَارُونَ تَحْمِلُهُ الْمَلَائِكَةُ ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً لَّكُمْ إِن كُنتُم مُّؤْمِنِينَ ﴿248﴾

**248** వారి ప్రవక్త వారికి మళ్ళీ ఈ విధంగా నచ్చజెప్పాడు: అతని రాజరికానికి సంబంధించిన బహిరంగ నిదర్శనం ఏమిటంటే (అతని ఏలుబడిలో) మీ వద్దకు ఆ (శుభసూచకాల) పెట్టె తిరిగి వస్తుంది.[303] అందులో మీ ప్రభువు తరఫున మీకు గుండె నిబ్బరం ఉంది. మూసా, హారూన్ కుటుంబీకులు వదలి వెళ్ళిన అవశేషాలు కూడా అందులో ఉన్నాయి. దాన్ని దూతలు మోసుకువస్తారు. మీరే గనక విశ్వసించిన వారైతే ఇందులో మీ కొరకు స్పష్టమయిన సూచన ఉంది.

కాదు, వాంఛనీయం కూడా. మరిన్ని వివరాలకై అల్ మాయిదా సూరా 20వ ఆయతు వివరణను అధ్యయనం చేయండి.

302. ఇస్రాయీల్ వంశీయులు తాలూత్‌ను రాజుగా అంగీకరించకపోవడానికి అసలు కారణం ఆయన ఇస్రాయీల్ సంతతిలోని రాజవంశానికి చెందినవాడు కాకపోవటమే. ఆయన సాధారణ సిపాయి మాత్రమే. అందుకే ఆయనంటే వారికి అభ్యంతరం. 'ఇది నా ఎంపిక కాదు, అల్లాహ్ ఈయన్ని ఎన్నుకున్నాడు' అని ప్రవక్త వారికి నచ్చజెప్పాడు. అదీగాక రాజరికం కోసం, నాయకత్వం కోసం సిరిసంపదలకన్నా, కులగోత్రాలకన్నా బుద్ధికుశలత, ప్రజ్ఞాపాటవాలు, ధైర్యసాహసాలు, వజ్రసంకల్పం చాలా అవసరం. ఈ సుగుణాలు మీకన్నా తాలూత్‌లోనే మెండుగా ఉన్నాయనీ, అందుకే అల్లాహ్ మీపై ఆయనకు ప్రాధాన్యతను ఇచ్చాడని దైవప్రవక్త వారందరికీ ఉపదేశించాడు. అదలా ఉంచితే అల్లాహ్ విశాల సంపన్నుడు, అన్నీ తెలిసినవాడు. ఆయన తాను కోరినవారికి లెక్కలేనంతగా అనుగ్రహిస్తాడు. గౌరవం ఆయన చేతుల్లో ఉంది. ఆ గౌరవాన్ని ఆయన ఎవరికంటే వారికి ఇవ్వడు. యోగ్యులైనవారికే ఇస్తాడు. అర్హత ఎవరిలో ఉందో, ఎవరిలో లేదో ఆయనకు తెలుసు – ఈ విధంగా దైవప్రవక్త తన జాతి వారికి విశదీకరించి, ఇదంతా దైవనిర్ణయానుసారం జరిగిందని చెప్పారు. (అప్పటికయినా ఆ జనం నమ్మారా? అంటే వారంత సులభంగా నమ్మే రకం కాదు మరి. "నువ్వు చెప్పేదే నిజమైతే ఏదయినా నిదర్శనం చూపించు" అని మరో డిమాండు చేశారు. రాబోయే ఆయతులో ఆ నిదర్శనం గురించి వివరించబడింది.)

303. మూలంలో పెట్టెను **'తాబూత్'** అని అనబడింది. ఈ తాబూత్ 'తౌబ్' నుండి వచ్చింది. అంటే మరలటం అని దీని అర్థం. ఇస్రాయీల్ సంతతివారు శుభశ్రేయాలను ఆశించి ఆ పెట్టె వైపుకు మరలేవారు (ఫత్‌హుల్ ఖదీర్). ఆ పెట్టెలో దైవప్రవక్తలయిన మూసా, హారూన్ (అలైహిముస్సలాం)ల వస్తుసామగ్రి ఉండేది. ఆఖరికి ఆ పెట్టెను కూడా వారి శత్రువులు దోచుకుని వెళ్ళారు. అల్లాహ్ ఆ పెట్టెను ఒక 'సూచన'గా దైవదూతల ద్వారా తాలూత్ గడపవద్దకు చేర్చాడు. దాన్ని చూడగానే ఇస్రాయీల్ వంశీయులు ఆనందంతో పరవశించిపోయారు. అల్లాహ్ తాలూత్‌ను చక్రవర్తిగా ఇష్టపడ్డాడనటానికి దీన్ని ఒక తార్కాణంగా భావించారు. అంతేకాదు, ఆ పెట్టెను అల్లాహ్ ఇస్రాయీల్ వంశీయుల వైభవానికి, స్థిరత్వానికి ప్రతీకగా ఖరారు చేశాడు. ఏ జాతికయినా ఒక నిలకడ, ప్రశాంతత, తృప్తి, గుండె నిబ్బరం

فَلَمَّا فَصَلَ طَالُوتُ بِالْجُنُودِ قَالَ إِنَّ اللَّهَ
مُبْتَلِيكُم بِنَهَرٍ فَمَن شَرِبَ مِنْهُ فَلَيْسَ
مِنِّي وَمَن لَّمْ يَطْعَمْهُ فَإِنَّهُ مِنِّي إِلَّا مَنِ
اغْتَرَفَ غُرْفَةً بِيَدِهِ ۚ فَشَرِبُوا مِنْهُ إِلَّا قَلِيلًا
مِّنْهُمْ ۚ فَلَمَّا جَاوَزَهُ هُوَ وَالَّذِينَ آمَنُوا مَعَهُ
قَالُوا لَا طَاقَةَ لَنَا الْيَوْمَ بِجَالُوتَ وَجُنُودِهِ ۚ
قَالَ الَّذِينَ يَظُنُّونَ أَنَّهُم مُّلَاقُو اللَّهِ كَم مِّن
فِئَةٍ قَلِيلَةٍ غَلَبَتْ فِئَةً كَثِيرَةً بِإِذْنِ اللَّهِ ۗ
وَاللَّهُ مَعَ الصَّابِرِينَ ﴿٢٤٩﴾

**249** తాలూత్ సైన్యాన్ని తీసుకుని బయలుదేరినప్పుడు ఇలా ప్రకటించాడు : "చూడండి! అల్లాహ్ మిమ్మల్ని ఒక కాలువ[304] ద్వారా పరీక్షించబోతున్నాడు. అందులోని నీళ్ళను త్రాగినవాడు నా వాడు కాడు. త్రాగనివాడు మాత్రమే నా వాడు. చేత్తో గుక్కెడు నీరు తీసుకుని త్రాగితే ఫరవాలేదు." కాని కొద్దిమంది తప్ప మిగిలిన వారంతా ఆ నీళ్ళను (కడుపునిండా) త్రాగేశారు.[305] తాలూత్ విశ్వాసులైన తన సైన్యంతో కాలువ దాటి ముందుకు పోతున్నప్పుడు, "జాలూత్‌తో, అతని సైన్యంతో తలపడే శక్తి ఈ రోజు మాలో లేదు"[306] అని వారన్నారు. కాని అల్లాహ్‌ను కలుసుకోవలసి ఉందనే విషయంపై దృఢవిశ్వాసం గల కొంతమంది ఇలా అన్నారు : "ఒక చిన్న వర్గం, ఒక పెద్ద వర్గాన్ని, దైవాజ్ఞతో జయించటం ఎన్నోసార్లు జరిగింది." అల్లాహ్ సహనం చూపే వారికి అండగా నిలుస్తాడు.

అనేది లభిస్తే అది దేవుని తరఫున ఆ జాతికి వొసగబడిన చాలా పెద్ద కానుక అని భావించాలి. 'గుండె నిబ్బరం' అనేది మామూలు వస్తువు కాదు. దేవుడు ప్రత్యేకంగా అనుగ్రహించదలచిన దాసులకు మాత్రమే అది ఒనగూడుతుంది. భీకర యుద్ధాలలో రక్తపుటేరులు ప్రవహిస్తున్నప్పుడు, శవాల గుట్టలు పేరుకుపోతున్నప్పుడు గుండెనిబ్బరం లేనివారు పరిస్థితిని చూసి బెంబేలెత్తిపోతారు. అయితే దైవానుగ్రహంతో గుండెనిబ్బరం పొందిన విశ్వాసులు మాత్రం కదన రంగంలో ఏమాత్రం తొణక్కుండా, పర్వతంలా నిలబడతారు. ప్రత్యర్థివర్గం వీరి స్థయిర్యాన్ని చూసి కలవరపడుతుంది. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ప్రవక్తలు వదలివెళ్ళిన చిహ్నాలు, అవశేషాలు – దైవాజ్ఞతో – ప్రయోజనం చేకూర్చుతాయి. కాని అవి ప్రవక్త అవశేషాలే అన్నదానికి గట్టి ఆధారాలు ఉండాలి. లేని సంబంధాన్ని ఆపాదించినంత మాత్రాన శుభాలు సంక్రమించవు. ఈ మధ్య చాలాచోట్ల 'పవిత్ర కేశాలు', 'అవశేషాలు' అనే పేర్లతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వాటి వెనుక ఏ చారిత్రక ఆధారమూ ఉండదు. అలాగే మరికొంతమంది మహాప్రవక్త (సఅసం) పేరుతో ఆయన పవిత్ర పాదుకల ఆకారాన్ని తయారుచేసి ఇంటిముంగిట వ్రేలాడదీస్తే తమ అక్కరలు తీర్తాయనీ, కష్టాలు తొలగిపోతాయనీ నమ్ముతారు. అలాగే సమాధుల వద్ద సజ్జనుల పేర మొక్కుకోవటం, మొక్కుబడి చెల్లించిన వస్తువులను తినటం అత్యంత పవిత్రంగా, శుభదాయకంగా భావించటం కూడా జరుగుతోంది. నిజానికి ఇది దైవేతరుల పేరిట మొక్కుబడి. ఇది కూడా షిర్క్ (బహుదైవారాధన) పరిధిలోకి వస్తుంది. కనుక ఇటువంటి వస్తువులు తినటం హరామ్ (నిషిద్ధం). సమాధులను కడిగి ఆ నీళ్ళను త్రాగటం, శరీరానికి పూసుకోవటం శుభప్రదం అని భావించేవారున్నారు. వాస్తవానికి ఈ సమాధుల స్నానం కూడా 'కాబాగృహ స్నానాని'కి అనుకరణే. దీనికి ఎలాంటి ఆధారంలేదు. షిర్క్‌తో రంగరించబడిన ఆ కాలుష్య జలం పవిత్రం ఎలా అయిపోతుంది? మొత్తానికి ఈ పోకడలన్నీ నిరాధారమైనవి, నిర్హేతుకమైనవి. షరీయత్‌తో వీటికి ఎలాంటి సంబంధం లేదు.

304. ఈ కాలువ జోర్డాన్‌కు – పాలస్తీనాకు మధ్యలో ఉంది (ఇబ్నె కసీర్).

305. నేతకు విధేయులై ఉండటం ఎట్టి పరిస్థితిలోనూ అనివార్యం. అందునా యుద్ధం లాంటి కీలక సమయంలో ఈ విధేయత నూటికి నూరు శాతం కనబరచాలి. యుద్ధంలో విజయం వరించాలంటే సైనికులు అత్యంత సాహసంతో పోరాడాలి. ఆకలి దప్పికలను, ఇతరత్రా కష్టాలను అత్యంత నిగ్రహంతో సహించాలి. ఈ రెండు విషయాల్లో వారికి శిక్షణ, తర్ఫీదు ఇచ్చే ఉద్దేశంతో తాలూత్ కాలువ ఒడ్డున ఒక పరీక్ష పెట్టాడు. వారిలో నికార్సయిన సహచరులు

وَلَمَّا بَرَزُوْا لِجَالُوْتَ وَجُنُوْدِهٖ قَالُوْا رَبَّنَآ اَفْرِغْ عَلَيْنَا صَبْرًا وَّثَبِّتْ اَقْدَامَنَا وَانْصُرْنَا عَلَى الْقَوْمِ الْكٰفِرِيْنَ ﴿250﴾

250 జాలూత్‌తో, అతని సైన్యంతో ముఖాముఖీ అయినప్పుడు వారు ఇలా ప్రార్థించారు: "ప్రభూ! మాకు సహన స్థయిర్యాలు ప్రసాదించు. మా కాళ్లకు నిలకడను ఇవ్వు. అవిశ్వాస జనులపై (జరిగే పోరాటంలో) మాకు తోడ్పడు."[307]

فَهَزَمُوْهُمْ بِاِذْنِ اللّٰهِ ۙ وَقَتَلَ دَاوٗدُ جَالُوْتَ وَاٰتٰهُ اللّٰهُ الْمُلْكَ وَالْحِكْمَةَ وَعَلَّمَهٗ مِمَّا يَشَآءُ ؕ وَلَوْلَا دَفْعُ اللّٰهِ النَّاسَ بَعْضَهُمْ بِبَعْضٍ ۙ لَّفَسَدَتِ الْاَرْضُ وَلٰكِنَّ اللّٰهَ ذُوْ فَضْلٍ عَلَى الْعٰلَمِيْنَ ﴿251﴾

251 కడకు అల్లాహ్ అనుజ్ఞతో వారు (జాలూత్ సైన్యాన్ని) ఓడించారు. దావూద్ జాలూత్‌ను సంహరించాడు.[308] మరి అల్లాహ్ దావూద్‌కు రాజ్యాధికారాన్నీ, వివేచననూ ఒసగాడు.[309] ఇంకా, తాను కోరినంత జ్ఞానాన్ని కూడా ఆయనకు ప్రసాదించాడు. అల్లాహ్ గనక కొందరిని మరికొందరి ద్వారా ఈ విధంగా తొలగించకపోతే భువిలో కల్లోలం రేకెత్తి ఉండేది. కాని అల్లాహ్ లోకవాసులపై ఎంతో దయానుగ్రహం కలవాడు.[310]

ఎందరున్నారో ఆయన తెలుసుకోదలిచాడు. కాని వారిలో అధికులు 'జారి'పోయారు. నీరు త్రాగిన వారి సంఖ్యపై వ్యాఖ్యాతల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. నీరు త్రాగకుండా ఉన్నవారు మాత్రం 313 మంది అని తెలియజేయబడింది. బద్ర్ సంగ్రామంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వెంట వచ్చిన సహాబీల సంఖ్యకు ఇది సమానం. వాస్తవం అల్లాహ్‌కే ఎరుక.

306. శత్రుసైన్యం భారీ సంఖ్యలో ఉండటం చూసి తొలుత ముస్లిం సేనలు భయాందోళన చెందాయి. ఈ రోజు శత్రువును ఎదుర్కొనే సత్తువ తమలో లేదని చెప్పటానికి ముఖ్య కారణం ఇదే. కాని వారిలోని విజ్ఞులు, జ్ఞానులు, స్థితప్రజ్ఞులు మాత్రం తొణకలేదు. జయాపజయాలు కేవలం సంఖ్యాబలంపై, ఆయుధ సంపత్తిపై ఆధారపడిలేవనీ, వాస్తవానికి అవి దైవప్రణాళిక, దైవాజ్ఞకు లోబడి ఉంటాయని వారికి తెలుసు. అల్లాహ్ తమకు ఆదరువుగా నిలవాలని అభిలషించేవారు మొక్కవోని సాహసాన్ని, స్థయిర్యాన్నీ చూపాలి.

307. **జాలూత్ :** అమాలిఖా జాతివారైన శత్రుసేనలకు అధిపతి. తాలూత్ మరియు అతని సహచరులు అతన్ని ఎదుర్కోవలసిన తరుణం ఆసన్నమయింది. జాలూత్ సైన్యం యుద్ధపిపాస కలది. పోరాటాలే ఊపిరిగా జీవించే జాతి అది. ఆ సైన్యానికున్న పేరు ప్రతిష్ఠల దృష్ట్యా విశ్వాస సేనలు కొంచెం భయపడ్డాయి. కాని తీరా యుద్ధం మొదలయ్యే ముందు, అవిశ్వాస సేనలకు ప్రతిగా తమకు సహన స్థయిర్యాలను వొసగమనీ, విజయాన్ని చేకూర్చమని వారు దైవాన్ని దీనాతిదీనంగా అర్థించారు. తమ వద్ద ఎన్ని యుద్ధ మెళకువలు ఉన్నా, సాధనసంపత్తులున్నా ఇలాంటి కీలక తరుణంలో విశ్వాసులు దైవ సహాయం కోసం ప్రత్యేకంగా మొరపెట్టుకోవటం అవసరం. బద్ర్ రణరంగంలో కూడా మహాప్రవక్త (సఅసం) ఈ విధంగానే అల్లాహ్‌ను వేడుకున్నారు. అల్లాహ్ ఆయన (స) వేడుకోలుకు ఆమోదముద్ర వేశాడు. గుప్పెడు మంది ముస్లిం సేనలకు అవిశ్వాసుల భారీ సైన్యంపై అపురూపమైన విజయాన్ని వొసగాడు.

308. అప్పటికి దావూద్ దైవప్రవక్తగాగానీ, చక్రవర్తిగాగానీ నియుక్తులు కాలేదు. తాలూత్ సైన్యంలో ఒక సాధారణ సిపాయిగానే ఆయన పోరాడారు. అయితే అల్లాహ్ ఆయన చేతుల మీదుగా జాలూత్ కథను కంచికి చేర్చాడు. అంతేకాదు, ఒక చిన్న సైనిక వర్గం ద్వారా భూమిలో చెలరేగిపోతున్న ఒక పెద్ద సైనిక వర్గాన్ని చిత్తుగా ఓడించాడు.

309. ఆ తరువాత అల్లాహ్ రాజ్యాధికారంతో పాటు, ప్రవక్త పదవి (నబువ్వత్) బాధ్యతను కూడా ఆయనకు ప్రసాదించాడు. ఇక్కడ 'హిక్మత్' అనే పదం ప్రయోగించబడింది. హిక్మత్ అంటే నబువ్వత్ అని కొందరు, లోహపు వస్తువుల తయారీలో నైపుణ్యం అని మరికొందరు అభిప్రాయపడ్డారు. హిక్మత్ అంటే ఆ యుద్ధ సమయంలో కొన్ని విషయాల్లో

**252** ఇవి అల్లాహ్ ఆయతులు. వీటిని మేము సత్యబద్ధంగా నీకు వినిపిస్తున్నాము. (ఓ ముహమ్మద్!) నిస్సందేహంగా నువ్వు దైవసందేశహరులలోని[311] వాడవు.

تِلْكَ آيَاتُ اللَّهِ نَتْلُوهَا عَلَيْكَ بِالْحَقِّ ۚ وَإِنَّكَ لَمِنَ الْمُرْسَلِينَ ﴿٢٥٢﴾

**253** వీరు దైవప్రవక్తలు. వీరిలో కొందరికి మరికొందరిపై మేము ప్రాధాన్యతను వొసగాము.[312] వీరిలో కొందరితో అల్లాహ్ సంభాషించాడు. కొందరి తరగతులను ఉన్నతం చేశాడు. ఇంకా మేము మర్యమ్ కుమారుడగు ఈసాకు స్పష్టమైన సూచనలు ప్రసాదించాము. పరిశుద్ధాత్మ ద్వారా అతనికి తోడ్పాటునందించాము.[313] ఒకవేళ అల్లాహ్యే గనక తలిస్తే వీరి తరువాత

تِلْكَ الرُّسُلُ فَضَّلْنَا بَعْضَهُمْ عَلَىٰ بَعْضٍ ۘ مِّنْهُم مَّن كَلَّمَ اللَّهُ ۖ وَرَفَعَ بَعْضَهُمْ دَرَجَاتٍ ۚ وَآتَيْنَا عِيسَى ابْنَ مَرْيَمَ الْبَيِّنَاتِ وَأَيَّدْنَاهُ بِرُوحِ الْقُدُسِ ۗ وَلَوْ شَاءَ اللَّهُ مَا اقْتَتَلَ الَّذِينَ مِن بَعْدِهِم مِّن بَعْدِ مَا جَاءَتْهُمُ

ఆయన కనబరచిన అవగాహనా ప్రతిభ అనీ, అల్లాహ్ అభీష్టం మరియు అల్లాహ్ సంకల్పంతో అవి ఆయన అనుకున్నట్టుగానే జరిగిపోయాయని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.

310. ఈ వాక్యంలో దేవుని విధానం ఎటువంటిదో వివరించబడింది. దీని ప్రకారం ఆయన మానవుల్లోని ఒక వర్గం ద్వారా మరో వర్గపు దౌర్జన్యాన్ని, దాని దురాక్రమణను తుదముట్టిస్తూ ఉంటాడు. లేదా ఒక వర్గం ద్వారా మరో వర్గాన్ని అధికార స్థానాల నుంచి తొలగిస్తాడు. అలా జరగకపోతే – ఏదో ఒక వర్గం మాత్రమే కుర్చీలను అంటిపెట్టుకుని ఉంటే – ఆ వర్గం తన అధికార బలంతో భూమిలో చెలరేగిపోతుంది. దోపిడీ దౌర్జన్యాలు మితిమీరిపోతాయి. అందుకే ఈ దైవశాసనాన్ని లోకవాసుల పాలిట దేవుని మహదానుగ్రహంగా తలపోయాలి. దీనిగురించి అల్లాహ్ హజ్ సూరాలోని 38వ ఆయతులోనూ, 40వ ఆయతులోనూ విశదీకరించాడు.

311. ఈ గత కాలపు సంఘటనలు మీపై అవతరింపజేయబడే గ్రంథం ద్వారా లోకానికి తెలిసివస్తున్నాయి. కనుక ఓ ముహమ్మద్ (స), మీకు అందజేయబడే దైవసందేశం సత్యానికి ప్రతీక! ఎందుకంటే మీరు ఈ విషయాలను ఏదేని గ్రంథంలో చదవటమో, ఎవరి ద్వారానయినా వినటమో జరగలేదు. దీనిద్వారా విదితమయ్యేదేమిటంటే ఇవి ముమ్మాటికీ దైవం తరఫున మీపై అవతరింపజెయ్యబడే అగోచర విషయాలు. దివ్య ఖుర్ఆన్లో పెక్కుచోట్ల గతకాలపు ఘటనలను మహాప్రవక్త (సఅసం) వారి దైవదౌత్యానికి ప్రబల నిదర్శనాలుగా సమర్పించటం జరిగింది.

312. ఈ విషయాన్ని అల్లాహ్ ఇతరచోట్ల కూడా ప్రస్తావించాడు. ఉదాహరణకు : "మేము కొంతమంది ప్రవక్తలకు మరి కొంతమందిపై ప్రాధాన్యతను వొసగాము" (బనీ ఇస్రాయీల్ – 55). ఈ వాస్తవంలో సందేహానికి ఆస్కారమే లేదు. అయితే మహాప్రవక్త (సఅసం) వారు తన సహచరులనుద్దేశించి, "మీరు ప్రవక్తల మధ్య నాకు ప్రత్యేకతను ఇవ్వకండి" అని అన్నారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఫజాయెల్). ఈ ప్రబోధనం ఒకరికి మరొకరిపై ఇవ్వబడిన శ్రేష్ఠతను త్రోసిపుచ్చటం లేదు. కాకపోతే దైవప్రవక్తల ఆదరాభిమానాలలో, మర్యాదలో ఎలాంటి లోటు రానివ్వకూడదన్న తాకీదు ఇందులో ఇమిడి ఉంది. దేవుడు కొందరికి మరికొందరిపై ప్రాధాన్యతను ప్రసాదించాడంటే ఏ కారణంగా ప్రసాదించాడో మీకు తెలియదు. కాబట్టి మీరు నా ప్రాముఖ్యతను గురించి చెప్పినప్పుడు ఇతర ప్రవక్తలకు గల ఘనత, మర్యాదకు ఏమాత్రం విఘాతం కలగకూడదు. నిజానికి ఎవరి ప్రత్యేకత వారిది. మరి ప్రవక్తలందరిపై అంతిమ దైవప్రవక్త (స)కు శ్రేష్ఠత నొసగబడిన విషయం కూడా తిరుగులేని సత్యమే. అహ్లె సున్నత్ వారందరూ ఈ విషయాన్ని ఏకాభిప్రాయంతో విశ్వసిస్తారు. ఈ విషయానికి ఖుర్ఆన్ హదీసుల ద్వారా కూడా రుజువులున్నాయి. (వివరాల కోసం ఫత్హుల్ ఖదీర్లో అల్లామా షౌకానీ వ్యాఖ్యానం చూడండి).

313. ఈసా (అలైహిస్సలాం) కు ఇవ్వబడిన మహిమల గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. ఉదాహరణకు: ఆయన మృతులను సజీవులుగా చేయటం. ఆలి ఇమ్రాన్ సూరాలో ఈ వివరాలు వస్తాయి. పరిశుద్ధాత్మ అంటే జిబ్రీల్ అని భావం.

الْبَيِّنٰتُ وَلٰكِنِ اخْتَلَفُوْا فَمِنْهُمْ مَّنْ اٰمَنَ وَمِنْهُمْ مَّنْ كَفَرَ ؕ وَلَوْ شَآءَ اللّٰهُ مَا اقْتَتَلُوْا ۫ وَلٰكِنَّ اللّٰهَ يَفْعَلُ مَا يُرِيْدُ ﴿253﴾

స్పష్టమయిన నిదర్శనాలు చూసిన ప్రజలు పరస్పరం తగవులాడుకునేవారు కాదు. కాని వారు విభేదాల్లో పడిపోయారు. వారిలో కొందరు విశ్వసించగా, మరి కొందరు అవిశ్వాసులుగా ఉండిపోయారు. అల్లాహ్ గనక కోరితే వీరు పరస్పరం కలహించుకునేవారు కారు.[314] కాని అల్లాహ్ మాత్రం తాను తలచిందే చేస్తాడు.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْۤا اَنْفِقُوْا مِمَّا رَزَقْنٰكُمْ مِّنْ قَبْلِ اَنْ يَّاْتِىَ يَوْمٌ لَّا بَيْعٌ فِيْهِ وَلَا خُلَّةٌ وَّلَا شَفَاعَةٌ ؕ وَالْكٰفِرُوْنَ هُمُ الظّٰلِمُوْنَ ﴿254﴾

**254** ఓ విశ్వాసులారా! వ్యాపార లావాదేవీలుగానీ, స్నేహ బంధాలు గానీ, సిఫార్సులుగానీ[315] ఉండని ఆ రోజు రాకముందే మేము మీకు ప్రసాదించిన దానిలో నుంచి ఖర్చుచేయండి. వాస్తవానికి తిరస్కారులే దుర్మార్గులు.

314. ఈ అంశాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ఉదాహరించాడు. దేవుడు అవతరింపజేసిన ధర్మంలో విభేదాలు, వైమనస్యాలు పొడసూపాలన్నది దేవుని అభిమతం అని దీని భావం ఎంతమాత్రం కాదు. నిజానికి వైమనస్యాన్ని ఆయన సుతరామూ ఇష్టపడడు. తాను సమ్మతించి ఆమోదించిన జీవనధర్మాన్ని మానవులంతా అవలంబించి వారు నరకాగ్నికి ఆహుతి కాకుండా ఉండాలన్నదే ఆయన అభీష్టం. అందుకే ఆయన తన గ్రంథాలను అవతరింపజేశాడు. తన సందేశహరులను పంపించాడు. ఈ సందేశ పరంపరను ముహమ్మద్ (సఅసం)పై పరిసమాప్తం చేశాడు. అయితే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) తదనంతరం కూడా ఖలీఫాల ద్వారా, సజ్జనులైన విద్వాంసుల ద్వారా మంచిని పెంపొందించే, చెడులను నిర్మూలించే సందేశప్రధాన కార్యక్రమం కొనసాగింపబడింది. ఈ సందేశ కార్యాన్ని తరం తరం... నిరంతరం చేస్తూ ఉండాలని గట్టిగా తాకీదు చేయటం కూడా జరిగింది. ఎందుకు? ఎందుకంటే దైవం సమ్మతించిన జీవన ధర్మాన్ని ప్రజలందరూ అవలంబించి దైవప్రసన్నతను చూరగొనాలని! అయితే ఆయన ఈ జగతిలో సన్మార్గంతోపాటు అపమార్గాన్ని కూడా ఉంచి, ఆ రెండు మార్గాల పర్యవసానాన్ని కూడా విడమరచి చెప్పి మనిషికి ఆ రెంటిలో ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించాడు. అంటే ఆయన మనిషిని పరీక్షించదలిచాడు. ఆయనే గనక తలచుకుంటే తన దాసులైన మానవులందరూ తన సన్నిధిలో మోకరిల్లేలా చేసుకునేవాడే. ఒకవేళ ఆయన అలా చేసివుంటే, మనిషి సంకల్పానికీ, అతని స్వేచ్ఛాధికారానికి విలువ, అర్థం లేకుండా పోయేవి. ఇప్పుడు అల్లాహ్ చూసేది ఒక్కటే – తనకివ్వబడిన స్వేచ్ఛాధికారాన్ని ఎంతమంది సద్వినియోగం చేస్తారు? మరెంతమంది దుర్వినియోగపరచుకుని దైవధిక్కారులుగా మిగిలిపోతారు? ఇదే అసలు పరీక్ష. దేవుని ప్రణాళికకు, యుక్తికి లోబడి ఈ పరీక్ష పెట్టబడుతోంది.

315. ఈ ఆయతు ద్వారా సిఫార్సు వాస్తవికత ముందుకు వచ్చింది. ఒకప్పుడు యూదులు, క్రైస్తవులు, తిరస్కారులు, ముష్రిక్కులు దీనిపై చాలా ధీమా వ్యక్తం చేశారు. వారు తమ తమ మత పెద్దలను – అంటే ప్రవక్తలను, వలీలను, సజ్జనులను, పీర్లను, ముర్షిదులను ప్రస్తావిస్తూ వారికి దైవసమక్షంలో గొప్ప పలుకుబడి ఉందనీ, వారు ఆ పలుకుబడిని ఉపయోగించి తమ అనుయాయుల కోసం కోరిందల్లా మంజూరు చేయించుకుంటారని ప్రగాఢంగా విశ్వసిస్తారు. దాన్నే వారు షిఫాఅత్‌గా వ్యవహరించేవారు. నేటి అజ్ఞానులు చెబుతున్న మాటలనే ఆనాడు సత్యతిరస్కారులూ చెప్పేవారు. తమ మత పెద్దలు అల్లాహ్ దర్బారులో హఠం చేసి మరీ తమ డిమాండ్లు సాధిస్తారన్నది వారి ఉద్దేశం. కాని దైవసమక్షంలో ఇలాంటి సిఫార్సులకు ఎలాంటి అవకాశమూ లేదని ఈ వాక్యంలో నిర్ద్వంద్వంగా చెప్పేయబడింది. ఆ తరువాత ఆయతుల్ కుర్సీ ద్వారా, ఇతర వాక్యాల ద్వారా కూడా ఎటువంటి సిఫార్సులను అల్లాహ్ సమ్మతిస్తాడో విశదీకరించటం జరిగింది. అయితే ఆ సిఫార్సు కూడా అందరూ చేయలేరు. అల్లాహ్ అనుమతించినవారు మాత్రమే

**255** అల్లాహ్ (మాత్రమే నిజానికి ఆరాధ్య దైవం). ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేనేలేడు. ఆయన సజీవుడు; అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునుకుగానీ, నిద్రగానీ పట్టదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగలవాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనుక ఉన్నదానిని కూడా ఆయన ఎరుగు. ఆయన కోరినది తప్ప ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్యపరిధిలోకి రాదు.[316] ఆయన కుర్సీ వైశాల్యం[317] భూమ్యాకాశాలను చుట్టుముట్టి ఉంది. వాటిని రక్షించటానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు.

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۚ اَلْحَيُّ الْقَيُّوْمُ ۚ لَا تَاْخُذُهٗ سِنَةٌ وَّلَا نَوْمٌ ؕ لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ؕ مَنْ ذَا الَّذِيْ يَشْفَعُ عِنْدَهٗٓ اِلَّا بِاِذْنِهٖ ؕ يَعْلَمُ مَا بَيْنَ اَيْدِيْهِمْ وَمَا خَلْفَهُمْ ۚ وَلَا يُحِيْطُوْنَ بِشَيْءٍ مِّنْ عِلْمِهٖٓ اِلَّا بِمَا شَآءَ ۚ وَسِعَ كُرْسِيُّهُ السَّمٰوٰتِ وَالْاَرْضَ ۚ وَلَا يَـُٔوْدُهٗ حِفْظُهُمَا ۚ وَهُوَ الْعَلِيُّ الْعَظِيْمُ ﴿255﴾

**256** ధర్మం విషయంలో బలవంతం ఏమీ లేదు. సన్మార్గం అపమార్గం నుంచి ప్రస్ఫుటమయ్యింది.[318] కనుక ఎవరయితే అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్యులను (తాగూత్‌ను) తిరస్కరించి అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తారో వారు దృఢమైన కడియాన్ని పట్టుకున్నారు. అది ఎన్నటికీ తెగదు. అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం తెలిసినవాడు.

لَآ اِكْرَاهَ فِي الدِّيْنِ ۚ قَدْ تَّبَيَّنَ الرُّشْدُ مِنَ الْغَيِّ ۚ فَمَنْ يَّكْفُرْ بِالطَّاغُوْتِ وَيُؤْمِنْۢ بِاللّٰهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقٰى ۚ لَا انْفِصَامَ لَهَا ؕ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ﴿256﴾

సిఫార్సు చేయగల్గుతారు. అల్లాహ్ అనుమతించిన వారి కోసం మాత్రమే సిఫార్సు చేయగలరు. మరి అల్లాహ్ అనుమతించేది ఎవరికోసం అంటే సమాధానం ఒక్కటే – ఏక దైవారాధకుల కోసం! ఈ సిఫార్సును దైవదూతలు, దైవప్రవక్తలు కూడా చేస్తారు. అమరగతులకు, సజ్జనులకు కూడా ఈ అవకాశం ఇవ్వబడుతుంది. అయితే వీరిలో ఎవరూ అల్లాహ్‌పై ఎలాంటి ఒత్తిడీ తీసుకురాలేరు. పైగా వీరంతా ఆ సమయంలో అల్లాహ్ భయంతో గజగజా వణికిపోతూ ఉంటారు. వారి ముఖ కవళికలు మారిపోతుంటాయి. "అల్లాహ్ ఇష్టపడినవారి కోసమే వారు సిఫార్సు చేయగలుగుతారు. దైవభీతితో వారు కంపిస్తూ ఉంటారు" (అంబియా – 28).

316. ఇది **ఆయతుల్ కుర్సీ.** దీని శ్రేష్ఠత, మహిమ గురించి ప్రామాణిక హదీసులలో వచ్చింది. ఉదాహరణకు: ఈ ఆయతు దివ్య ఖుర్ఆన్‌లోని ఘనమైన ఆయతు. దీన్ని పారాయణం చేయటం వల్ల రాత్రిపూట షైతాన్ కీడు నుంచి రక్షణ లభిస్తుంది. ప్రతి ఫర్జ్ నమాజ్ అనంతరం ఈ ఆయతుల్ కుర్సీని పఠించటం పుణ్యప్రదం (తఫ్సీర్ ఇబ్నె కసీర్). ఇది అల్లాహ్ యొక్క శాసించే గుణాన్ని, ఆయన వైభవాన్ని, శక్తియుక్తులను అభివర్ణించే ఆయతు.

317. **'కుర్సీ'** అంటే అడుగు పెట్టే స్థలమని కొందరూ, జ్ఞానం అని కొందరు, దైవశక్తి అని మరికొందరు, రాజ్యాధికారం అని ఇంకొందరు, 'అర్ష్' అని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే దేవుని గుణగణాల విషయంలో ఖుర్ఆన్ హదీసులు ఏమిచెప్పినా దానిపై స్వంత అభిప్రాయాలు, వర్ణనలు జొప్పించే బదులు యథాతథంగా వాటిని విశ్వసించటం సరైన విధానం. హదీసువేత్తల, సలఫ్‌ల విధానం కూడా ఇదే. కాబట్టి దీన్ని 'కుర్సీ'గానే నమ్మాలి. అర్ష్ వేరు, కుర్సీ వేరు. అది ఎలా ఉంటుంది? దానిపై ఆయన ఎలా ఆసీనుడవుతాడు?? అనే విషయం వర్ణనాతీతం. ఎందుకంటే ఆ విషయ పరిజ్ఞానం మనకు లేదు.

اَللّٰهُ وَلِيُّ الَّذِيْنَ اٰمَنُوْا يُخْرِجُهُمْ مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوْرِ ؕ وَالَّذِيْنَ كَفَرُوْٓا اَوْلِيٰٓـئُهُمُ الطَّاغُوْتُ يُخْرِجُوْنَهُمْ مِّنَ النُّوْرِ اِلَى الظُّلُمٰتِ ؕ اُولٰٓـئِكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ (257)

**257** విశ్వసించినవారి సంరక్షకునిగా స్వయంగా అల్లాహ్ ఉంటాడు. ఆయన వారిని చీకట్ల నుంచి వెలుగు వైపుకు తీసుకుపోతాడు. కాగా; అవిశ్వాసుల నేస్తాలు షైతానులే (తాగూతే). వాళ్లు వారిని వెలుగు నుంచి చీకట్ల వైపుకు లాక్కు పోతారు. వారు నరకవాసులు, కలకాలం అందులోనే పడి ఉంటారు.

318. ఈ ఆయతు ఏ నేపథ్యంలో అవతరించిందనేది గమనించదగింది. అన్సార్ వర్గానికి చెందిన కొంతమంది యువకులు యూదులుగానో, క్రైస్తవులుగానో మారిపోయారు. తరువాత కొంత కాలానికి వీళ్ల ఇస్లాం స్వీకరించి, యూదులుగానో, క్రైస్తవులుగానో ఉన్న తమ నవతరాన్ని కూడా ఇస్లాం పుచ్చుకోమని బలవంతం చేయసాగారు. అప్పుడు ఈ దైవవాక్కు అవతరించింది. అవతరణా పూర్వరంగం దృష్ట్యా కొంతమంది విద్వాంసులు ఈ ఆయతును కేవలం గ్రంథవహులను దృష్టిలో పెట్టుకుని వచ్చిందని అన్నారు. అంటే ముస్లిం రాజ్యంలో నివసించే గ్రంథవహులు గనక 'జిజ్యా'ను చెల్లిస్తూ ఉన్న పక్షంలో, ఇస్లాం స్వీకరించండి అని వారిపై ఒత్తిడి తీసుకురావటం జరగదు.

అయితే ఈ ఆయతు 'ఆదేశం' దృష్ట్యా సర్వసాధారణమైనది. అంటే ఏ ఒక్కరిపై కూడా ఇస్లాం స్వీకరించండి అన్న ఒత్తిడి తీసుకురాబడదు. ఎందుకంటే అల్లాహ్ సన్మార్గాన్నీ – అపమార్గాన్ని కూడా స్పష్టంగా మన ముందుంచాడు. అయితే మిథ్యావాదం మరియు షిర్క్ దౌర్జన్యాన్ని, పీడనను అరికట్టడానికి జిహాద్ ఉంది. బలాత్కారంతో దానికి ఎటువంటి సంబంధం లేదు. అల్లాహ్ ధర్మాన్ని ఆచరించటంలో, దాని ప్రచార మార్గంలో అవరోధాలు సృష్టిస్తూ ఉంటే, అట్టి అవరోధాలను తొలగించుకోవటానికి – అనివార్య స్థితిలో – కదనరంగం వైపుకు కదలటమే జిహాద్! ప్రతి వ్యక్తి తన ఇష్టపూర్వకంగా, ఉంటే తన తిరస్కార వైఖరిపైనే నిలకడగా ఉండటానికి లేకపోతే మనస్ఫూర్తిగా ఇస్లాంలోకి ప్రవేశించటానికి మార్గాన్ని సుగమం చెయ్యటమే జిహాద్ (ధర్మయుద్ధం) అసలు లక్ష్యం. ఈ మార్గంలో అవరోధంగా నిలిచే శక్తుల్ని తాత్కాలికంగా మన్నించి వదలివేసినా తరువాత అవి ఊరుకోవు. ఉండుండి అడ్డంకుల్ని సృష్టించటం, వేధించటం వంటి చేష్టలకు పాల్పడుతూనే ఉంటాయి. అందుకే అల్లాహ్ జిహాద్‌ను శాశ్వతమైన చర్యగా ఉంచాడు. ప్రళయదినం వరకూ అది ఉంటుంది. "జిహాద్ ప్రళయదినం వరకూ ఉంటుంది" అని హదీసులో ఉంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఖుద్దుగా అవిశ్వాసులతో, బహుదైవోపాస కులతో పోరాడారు. ఆయన (స) ఇలా అన్నారు :

"లా యిలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త) అనే విషయాన్ని ఒప్పుకునే దాకా జనులతో నేను పోరాడుతూనే ఉండాలని నాకు ఆదేశించబడింది" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్).

అలాగే ధర్మభ్రష్టతకు పాల్పడిన వారికి విధించబడే శిక్షకు కూడా ఈ ఆయతు విరుద్ధం కాదు. ధర్మభ్రష్టుడైన వ్యక్తికి మరణ శిక్ష ఉందంటే అది బలవంతంతో ముడిపడిన విషయం కాదు. పైగా అది ఇస్లామీయ వ్యవస్థ సైద్ధాంతిక స్వరూపాన్ని కాపాడే చర్యలో భాగం. ఒక ముస్లిం రాజ్యంలో ఒక అవిశ్వాసికి తన అవిశ్వాసంపై నిలకడగా ఉండేందుకు అనుమతి ఇవ్వవచ్చుగాని ఒకసారి ఇస్లాంలోకి వచ్చిన మీదట, మళ్లీ దాన్నుంచి తిరిగిపోవటానికి, ఇస్లాంపై తిరుగుబాటు చేయటానికి అనుమతి ఇవ్వబడదు. కాబట్టి ఇస్లాంలోకి రాదలచినవాడు బాగా ఆలోచించి, అన్నీ బేరీజు వేసుకుని మరీ రావాలి. ఈ విషయంలో దృఢంగా, ఖచ్చితంగా వ్యవహరించటం చాలా అవసరం. ఎందుకంటే ఈ వ్యవహారంలో గనక మెతక వైఖరి అవలంబిస్తే సైద్ధాంతిక చట్రమే కుప్పకూలిపోతుంది. దాంతో దాని అనుయాయుల్లో సైద్ధాంతిక వ్యాఘాతం, గంద్రగోళస్థితి ఏర్పడతాయి. ఈ అయోమయావస్థ ఇస్లామీయ సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు! తత్కారణంగా దేశంలో శాంతిభద్రతలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఏ విధంగానయితే మనిషికి జీవించే హక్కు ఉందని చెప్పి రాజ్యంలో హత్యాకాండను, దొంగతనాన్ని, వ్యభిచారాన్ని, దోపిడీని అనుమతించటం జరగదో అదేవిధంగా

**258** అల్లాహ్ తనకు రాజ్యాధికారం ఇచ్చాడని (గర్వం కొద్దీ) ఇబ్రాహీంతో అతని ప్రభువు (ఎవరన్న) విషయంపై గొడవపడిన వానిని నీవు చూడలేదా? "జీవన్మరణాలను ఇచ్చేవాడు నా ప్రభువు" అని ఇబ్రాహీం అన్నప్పుడు, "నేనూ బ్రతికిస్తాను, చంపుతాను" అని అతనన్నాడు. అప్పుడు ఇబ్రాహీం (అలైహిస్సలాం), "సరే! అల్లాహ్ సూర్యుణ్ణి తూర్పు వైపు నుంచి ఉదయింపజేస్తున్నాడు కదా! మరి నువ్వు దాన్ని కాస్త పడమటి వైపు నుంచి ఉదయింపజెయ్యి" అని కోరినప్పుడు ఆ దైవతిరస్కారి బిత్తర పోయాడు. యదార్థమేమిటంటే అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు.

أَلَمْ تَرَ إِلَى الَّذِي حَاجَّ إِبْرٰهِمَ فِي رَبِّهِ أَنْ
آتٰهُ اللّٰهُ الْمُلْكَ إِذْ قَالَ إِبْرٰهِمُ رَبِّيَ الَّذِي
يُحْيِي وَيُمِيتُ قَالَ أَنَا أُحْيِي وَأُمِيتُ قَالَ
إِبْرٰهِمُ فَإِنَّ اللّٰهَ يَأْتِي بِالشَّمْسِ مِنَ الْمَشْرِقِ
فَأْتِ بِهَا مِنَ الْمَغْرِبِ فَبُهِتَ الَّذِي كَفَرَ
وَاللّٰهُ لَا يَهْدِي الْقَوْمَ الظّٰلِمِينَ ﴿258﴾

**259** లేదా ఇండ్ల కప్పులు కూలి తలక్రిందులుగా పడివున్న పట్టణం మీదుగా పోయినవాడు; (అతనిని నీవు చూడలేదా?) "దీని చావు తరువాత అల్లాహ్ తిరిగి దీనికి ఎలా ప్రాణం పోస్తాడు?"[319] అని ఆ వ్యక్తి ఆశ్చర్యపోయినప్పుడు అల్లాహ్ అతన్ని చంపి నూరేళ్ళవరకు మరణస్థితిలో ఉంచాడు. తరువాత అతన్ని లేపి, "ఈ స్థితిలో నువ్వు ఎంతకాలం ఉన్నావు?" అని అడిగాడు. "మహా అయితే ఒక రోజు లేక ఒక రోజులో కొంత

أَوْ كَالَّذِي مَرَّ عَلٰى قَرْيَةٍ وَهِيَ خَاوِيَةٌ عَلٰى
عُرُوشِهَا قَالَ أَنّٰى يُحْيِي هٰذِهِ اللّٰهُ بَعْدَ
مَوْتِهَا فَأَمَاتَهُ اللّٰهُ مِائَةَ عَامٍ ثُمَّ بَعَثَهُ
قَالَ كَمْ لَبِثْتَ قَالَ لَبِثْتُ يَوْمًا أَوْ بَعْضَ
يَوْمٍ قَالَ بَلْ لَبِثْتَ مِائَةَ عَامٍ فَانْظُرْ إِلٰى

భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట ఒక ఇస్లామీయ వ్యవస్థలో సైద్ధాంతిక తిరుగుబాటు (ఇర్తిదాద్)కు కూడా అనుమతించటం జరగదు. ఇది **'లా ఇక్రాహ'** పరిధిలోకి రాదు. ఒక రాజ్యంలో నరమేధాన్ని సృష్టించి, ప్రజా జీవితాల్లో అరాచకాన్ని రేపే వారికి మరణ దండన విధించటం ఎలా న్యాయమో, ఒక సైద్ధాంతిక సమాజంలో ధర్మభ్రష్టతకు పాల్పడి ప్రజల ధర్మపథాన్నే ప్రశ్నార్థకంగా నిలబెట్టిన వ్యక్తిని తుదముట్టించటం కూడా అలాగే న్యాయం. రాజ్యాన్ని అరాచకం అవ్యవస్థల నుండి కాపాడటం మొదటిదాని లక్ష్యమైతే, రాజ్యంలోని సైద్ధాంతిక స్వభావ స్వరూపాలకు విఘాతం కలగకుండా జాగ్రత్తపడటం రెండోదాని లక్ష్యం. ఈ రెండు ఉద్దేశాలూ ఒక రాజ్యం కోసం అనివార్యమే.

319. మూలంలో **'అవ్కల్లజీ'** (أَوْ كَالَّذِي) అనే పదం వచ్చింది. అవ్కల్లజీ అంటే "లేక అతను" అని అర్థం. ఈ పదం రాబోయే సంఘటనను ఇంతకు ముందు పేర్కొనబడిన సంఘటనతో అనుసంధానం చేస్తున్నది. (ఇంతకు ముందు చెప్పబడిన సంఘటన మాదిరిగానే) నీవు నేలమట్టం అయిన నగరం గుండా వెళ్ళిన వ్యక్తి సంఘటన గురించి ఆలోచించలేదా? అని దాని భావం. నేలమట్టం అయివున్న ఆ నగరం గుండా వెళ్ళిన వ్యక్తి ఎవరు? దీనిపై విభిన్న కథనాలు ఉన్నాయి. ఉజైర్ పేరు ఈ సందర్భంగా బాగా ప్రసిద్ధిచెందింది. కొంతమంది ప్రవక్త సహచరులు, వారి శిష్యులు కూడా దీనిని సమర్థించారు. యదార్థం అల్లాహ్‌కే తెలుసు. దీనికి ముందు వచ్చిన వాక్యంలో (ఇబ్రాహీం-నమ్రూద్‌ల సంఘటనలో) "దేవుడున్నాడు. ఆయన ఉనికి సత్యం" అని చెప్పటం జరిగింది. మరి ఈ వాక్యంలో దేవుని అద్భుతాలు, శక్తులు వివరించబడ్డాయి. నూరేళ్ళ తరువాత అల్లాహ్ ఆ వ్యక్తిని, అతని గాడిదను తిరిగి బ్రతికించాడు. నూరేళ్లు గడచినా భోజనపదార్థాలు కుళ్ళిపోకుండా కాపాడాడు. ప్రపంచంలో మన ముందు ఒక దృష్టాంతంగా ఈ పనిచేసిన అల్లాహ్‌యే ప్రళయదినాన సమస్త మానవులను తిరిగి లేపుతాడు. నూరేళ్ల తరువాత పునరుజ్జీవనం చేసినవాడు వేనవేల సంవత్సరాల తరువాత మాత్రం పునరుద్ధరించలేడా?

طَعَامِكَ وَشَرَابِكَ لَمْ يَتَسَنَّهْ ۚ وَانظُرْ إِلَىٰ
حِمَارِكَ وَلِنَجْعَلَكَ آيَةً لِّلنَّاسِ ۖ وَانظُرْ إِلَى
الْعِظَامِ كَيْفَ نُنشِزُهَا ثُمَّ نَكْسُوهَا لَحْمًا ۚ
فَلَمَّا تَبَيَّنَ لَهُ قَالَ أَعْلَمُ أَنَّ اللَّهَ عَلَىٰ
كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿٢٥٩﴾

భాగం"[320] అని అతను బదులిచ్చాడు. "లేదు. నువ్వు నూరేళ్ళు ఈ స్థితిలో పడిఉన్నావు. కాస్త నీ అన్నపానీయాల వైపు చూడు. అవి ఏ మాత్రం చెడిపోలేదు. మరి నీ గాడిదను కూడా చూసుకో. మేము నిన్ను ప్రజల కోసం ఒక నిదర్శనంగా చేయదలిచాము. మేము (గాడిద) ఎముకలను ఏ విధంగా లేపి, వాటిపై మాంసం నింపుతామో చూడు! ఇదంతా ప్రస్ఫుటమయి పోయాక, "అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడని నాకు తెలుసు"[321] అని అన్నాడతను.

وَإِذْ قَالَ إِبْرَاهِيمُ رَبِّ أَرِنِي كَيْفَ تُحْيِي الْمَوْتَىٰ ۖ
قَالَ أَوَلَمْ تُؤْمِن ۖ قَالَ بَلَىٰ وَلَٰكِن لِّيَطْمَئِنَّ
قَلْبِي ۖ قَالَ فَخُذْ أَرْبَعَةً مِّنَ الطَّيْرِ فَصُرْهُنَّ
إِلَيْكَ ثُمَّ اجْعَلْ عَلَىٰ كُلِّ جَبَلٍ مِّنْهُنَّ جُزْءًا
ثُمَّ ادْعُهُنَّ يَأْتِينَكَ سَعْيًا ۚ وَاعْلَمْ أَنَّ اللَّهَ
عَزِيزٌ حَكِيمٌ ﴿٢٦٠﴾

**260** (మరొక సంఘటన.) "ఓ ప్రభూ! నీవు మృతులను ఎలా బ్రతికిస్తావో కాస్త నాకు చూపవా?" అని ఇబ్రాహీం విన్నవించు కున్నప్పుడు, "నీకు నమ్మకం లేదా?" అని దేవుని తరఫున సెలవీయబడింది. "ఎందుకు లేదు?! (నాకు పూర్తి నమ్మకం ఉంది. కాకపోతే) ఆత్మ తృప్తికై ఇలా అడిగాను" అని అతనన్నాడు. అప్పుడు అల్లాహ్, "నాలుగు పక్షులను తీసుకో. వాటిని మచ్చిక చేసుకో. (వాటిని కోసి ముక్కలు ముక్కలుగా చెయ్యి). తరువాత ఒక్కో పర్వతంపై దాని ఒక్కో (మాంసపు) ముక్కను ఉంచు. ఆపైన వాటిని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి.[322] అల్లాహ్ సర్వశక్తిమంతుడు, వివేకవంతుడన్న సంగతిని బాగా తెలుసుకో" అని అన్నాడు.

---

320. ఆ వ్యక్తి మరణించినపుడు కాస్త పొద్దెక్కిందనీ, లేపి నిలబెట్టబడినపుడు ఇంకా పొద్దుగూకలేదని చెప్పబడుతుంది. దాన్నిబట్టి అతనేమని ఊహించాడంటే ఒకవేళ తాను నిన్న యిక్కడికి వచ్చి ఉంటే ఒక రోజు గడచి ఉంటుంది. లేక ఈ రోజే ఇది జరిగి ఉంటే బహుశా కొన్ని గంటల క్రితం జరిగి ఉంటుంది. మరి చూడబోతే ఈ సంఘటన జరిగి నూరేళ్ళు నిండాయి.

321. అంటే నాకు ముందు నుంచీ నమ్మకముంది. కాకపోతే ఈ అనుభవం ద్వారా నా నమ్మకం మరింత బలపడింది. నా జ్ఞానం కూడా పెరిగింది అన్నది ఆ వ్యక్తి మాటల ఉద్దేశం.

322. మృతులను బ్రతికించటానికి సంబంధించిన ఇంకొక సంఘటన ఇది. ఏకదైవోపాసనలో ఎంతో నికార్సయిన దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) కోరికపై, ఆయన ఆత్మ తృప్తి కోసం ఈ దృశ్యం చూపబడింది. ఇంతకీ ఆ నాలుగు పక్షులు ఏవేవి? ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అనేకపేర్లు ప్రస్తావించారు. ఆ పేర్ల నిర్ధారణ వల్ల కలిగే ప్రయోజనం ఏమీ లేదు. అందుకే అల్లాహ్ కూడా వాటి పేర్లను తెలుపలేదు. అయితే అవి వేర్వేరు జాతులకు చెందిన పక్షులు. దైవాదేశానుసారం ఇబ్రాహీం (అలైహిస్సలాం) నాలుగు పక్షులను సేకరించి, వాటిని మచ్చిక చేసుకున్నారు. మచ్చిక చేసుకోవడానికి కారణం, తరువాత ఆ పక్షులను సరిగ్గా గుర్తుపట్టాలన్నదే. వాటిని కోసిన పిదప వాటి భాగాలను నాలుగు కొండలపై ఉంచారాయన. వాటిని పిలువగానే అవి పరుగెత్తుకుంటూ ఆయన వద్దకు వచ్చాయి. **'ఫసుర్‌హున్న**

مَثَلُ الَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمْ فِي سَبِيلِ
اللَّهِ كَمَثَلِ حَبَّةٍ أَنبَتَتْ سَبْعَ سَنَابِلَ فِي
كُلِّ سُنبُلَةٍ مِّائَةُ حَبَّةٍ ۗ وَاللَّهُ يُضَاعِفُ
لِمَن يَشَاءُ ۗ وَاللَّهُ وَاسِعٌ عَلِيمٌ (261)

**261** అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చుచేసేవారి ఉపమానం ఇలా ఉంటుంది: ఒక విత్తనాన్ని నాటగా, అది మొలకెత్తి అందులో నుంచి ఏడు వెన్నులు పుట్టుకువస్తాయి. ప్రతి వెన్నులోనూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరినవారికి సమృద్ధి వొసగుతాడు.[323] అల్లాహ్ పుష్కలంగా ప్రసాదించేవాడు, ప్రతిదీ తెలిసినవాడు.

**ఇలైక'**కు ఒక అనువాదం **"అమిల్‌హున్న"** అని చేయటం జరిగింది. 'అమిల్‌హున్న' అంటే, 'వాటిని మచ్చికచేసుకో' అని అర్థం. ఆ విధంగా మచ్చిక చేసుకోవటం మూలంగా అవి తిరిగి బ్రతికిన తర్వాత సులభంగా వాటిని గుర్తుపట్టవచ్చు, అప్పుడు ఈ పక్షులు నీవు మచ్చిక చేసుకున్నవేనని నీకు బాగా నమ్మకం కలుగుతుంది, ఇక వాటి గురించి నీకు ఎలాంటి అనుమానాలూ ఉండవు అని దాని భావం. ఈ భావం గనక తీసుకుంటే 'ఫసుర్‌హున్న' తర్వాత **'సుమ్మ ఖత్తిహున్న'** (అనంతరం వాటిని ముక్కలు ముక్కలుగా కోయి) అనే మాట మార్జితము (మహ్‌జూఫ్)గా ఉన్నట్లు భావించవలసి ఉంటుంది.

అయితే 'ఫసుర్‌హున్న' అనే పదానికి 'ఖత్తిహున్న' (ముక్కలు ముక్కలుగా కోయి) అనే మరో అర్థం కూడా చెప్పబడింది. ఈ అర్థాన్ని తీసుకుంటే ఇక ఏ సమస్యా ఉండదు. 'ఫసుర్‌హున్న' తర్వాత ఏ పదమూ మార్జితం (మహ్‌జూఫ్)గా ఉన్నట్లు భావించనవసరం లేదు. విషయం దానంతట అదే సుబోధకం అవుతుంది. మొత్తానికి ఈ పదాల భావం ఏమిటంటే ఆ పక్షులను ముక్కలు ముక్కలుగా కోసి, వాటన్నిటిని కలిపి, వేర్వేరు కొండలపై వాటి ముక్కలు ఉంచి, ఆ తర్వాత వాటిని పిలిస్తే అవి బ్రతికి మళ్ళీ నీ వద్దకు వచ్చేస్తాయి. అలాగే జరిగింది కూడా!

కాని దైవప్రవక్త సహచరుల, వారి శిష్యుల (అంటే తాబియీన్ల) వ్యాఖ్యానానికి, సలఫ్‌ల విధానానికి ఏమాత్రం విలువ ఇవ్వని సాంప్రదాయ, ఆధునిక సోకాల్డ్ వ్యాఖ్యాతలు కొందరు 'ఫసుర్‌హున్న' అనే పదాన్ని కేవలం 'మచ్చిక చేసుకో' అని మాత్రమే అనువదించారు. పక్షులు ముక్కలు చేయబడటం, ఆ ముక్కలను వేర్వేరు కొండలపై ఉంచగా, అవి అల్లాహ్ మహిమతో కలిసి మళ్ళీ యధాతథంగా పక్షులుగా మారటం – ఈ విషయాలను వారు అంగీకరించలేదు. వారి ఈ అభిమతం సరైనది కాదు. వారి అభిప్రాయం మూలంగా ఈ సంఘటనకు గల మహిమౌన్నత్యాలు తగ్గిపోతున్నాయి. వారు చెప్పిన అర్థం ప్రకారమైతే అసలు ఈ సంఘటనను ఇక్కడ పొందుపరచవలసిన అవసరం ఏముంటుంది చెప్పండి?! మృతులను బ్రతికించి చూపమని ఇబ్రాహీమ్ ప్రవక్త అడిగిన ప్రశ్న యధాతథంగా మిగిలిపోదూ?! నిజానికి ఒక ప్రాణి మరణించి దాని దేహం అణువణువూ విడిపోయినప్పటికీ అల్లాహ్ ఆ ప్రాణిని తిరిగి బ్రతికించగలడని తెలియజెప్పటమే ఈ సంఘటన అసలు ఉద్దేశం.

ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ సంఘటనను ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "మేము శంక విషయంలో ఇబ్రాహీం కన్నా ఎక్కువ హక్కుదారులము" (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్). ఇబ్రాహీం శంకించారు అని దీని భావం ఎంతమాత్రం కాదు. పైగా ఆయన శంకించారనే దాన్ని ఇది త్రోసిపుచ్చుతోంది. మృతులను తిరిగి బ్రతికించే విషయాన్ని ఇబ్రాహీం శంకించలేదు. ఒకవేళ ఆయనే గనక శంకించి ఉంటే, అలాంటి శంకను వెలిబుచ్చడానికి ఆయనకన్నా మేమే ఎక్కువ హక్కుదారులము అని దీని భావం (మరిన్ని వివరాలకై ఫత్‌హుల్ ఖదీర్‌లో షౌకానీ – రహ్మ.లై – వ్యాఖ్యను చూడండి).

323. దైవమార్గంలో ఖర్చుచేయటం వల్ల లభించే పుణ్యాన్ని వివరించటానికి ఈ ఉపమానం ఇవ్వబడింది. ఇక్కడ 'దైవమార్గంలో ఖర్చు'కు జిహాద్ కోసం పెట్టే ఖర్చు అని అర్థం తీసుకున్నట్లయితే జిహాద్ కోసం చేసే ఖర్చుకు ఆయతులో చెప్పబడినంత పుణ్యం లభిస్తుంది అన్న అర్థం వస్తుంది. ఒకవేళ ఈ 'దైవమార్గంలో ఖర్చు'ను అన్ని రకాల సత్కార్యాల కోసం

**262** ఎవరయితే దైవమార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేసిన తరువాత తమ దాతృత్వాన్ని మాటిమాటికీ చాటుతూ ఉండకుండా, (గ్రహీతల మనస్సును) నొప్పించకుండా[324] జాగ్రత్త పడతారో, వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంటుంది. వారికెలాంటి భీతిగానీ, దుఃఖంగానీ ఉండదు.

الَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمْ فِي سَبِيلِ اللَّهِ ثُمَّ لَا يُتْبِعُونَ مَا أَنفَقُوا مَنًّا وَلَا أَذًى ۙ لَّهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٢٦٢﴾

**263** దానం చేసిన తరువాత మనసు నొప్పించటం[325] కంటే మంచి మాట పలకటం, క్షమించటం ఎంతో మేలు. అల్లాహ్ అక్కరలేనివాడు, సహనశీలుడు.

قَوْلٌ مَّعْرُوفٌ وَمَغْفِرَةٌ خَيْرٌ مِّن صَدَقَةٍ يَتْبَعُهَا أَذًى ۗ وَاللَّهُ غَنِيٌّ حَلِيمٌ ﴿٢٦٣﴾

---

చేయబడే ఖర్చుగా తలపోసినట్లయితే, అప్పుడు ఆయతులో చెప్పబడిన పుణ్యం షరీఅత్‌పరమైన విధుల కోసం చేసే ఖర్చు (నఫఖాత్)కు, అలాగే దైవమార్గంలో స్వచ్ఛందంగా చేసే ఖర్చు (సదఖాతె నాఫిలా)కు లభిస్తుందన్న అర్థం వస్తుంది. (మరి ఒక సత్కార్యానికి పది రెట్ల పుణ్యం లభిస్తుందన్న మాటకు అర్థం ఏమిటి? అన్న సందేహం ఈ సందర్భంగా కలగవచ్చు. దానికి సమాధానం ఏమిటంటే ఖర్చుతో నిమిత్తం లేని) ఇతర సత్కార్యాలు **'అల్ హసనతు బి అషరి అమ్‌సాలిహా'** – ఒక సత్కార్యానికి పదిరెట్ల పుణ్యం లభిస్తుంది – అన్న ఆదేశం క్రిందికి వస్తాయి. (ఫత్‌హుల్ ఖదీర్). అంటే విధులపై, స్వచ్ఛంద సత్కార్యాలపై చేసే ఖర్చుకు లభించే పుణ్యం (ఖర్చుతో నిమిత్తం లేని) ఇతర సత్కార్యాలకు లభించే పుణ్యం కన్నా ఎక్కువగా ఉంటుందన్న మాట! అదలా ఉంచితే దైవమార్గంలో ఖర్చుకు గల ప్రాముఖ్యత, మహత్తు కూడా సుస్పష్టమే. యుద్ధసామగ్రి, సైనికుల అవసరాలు సమకూరనంత వరకూ సైనిక కార్యకలాపాలు కూడా చురుకుగా సాగవు. మరి డబ్బు లేకుండా యుద్ధసామగ్రి లభించదు.

324. మరి దైవమార్గంలో ఖర్చుపెట్టిన ప్రతి ఒక్కరికీ ఈ మహత్పూర్వక స్థాయి ప్రాప్తించదు. ఆ పెట్టే ఖర్చులో చిత్తశుద్ధి ఉండాలి. గ్రహీత మనసును గాయపరచకుండా ఉండాలి. ఎవరికయినా ఉపకారం చేసి ఏదో ఒక సందర్భంలో దెప్పిపొడిచినట్లయితే పేదవాని మనసు చివుక్కుమంటుంది. ఈ చేష్ట కూడా ఒక నేరమే. మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: "ప్రళయదినాన అల్లాహ్ ముగ్గురు వ్యక్తులతో మాట్లాడడు. వారిలో ఒకడు ఉపకారాన్ని ఎంచేవాడు" (ముస్లిం : కితాబుల్ ఈమాన్).

325. యాచకులను కసిరికొట్టరాదు, విదిలించకూడదు అని దీని భావం. దీనికి బదులు వారితో మృదువుగా మాట్లాడాలి. యాచకులు అడిగిందల్లా మీరు ఇవ్వనవసరం లేదు. ఇవ్వలేరు కూడా. ఈసారికి మన్నించు అనో, దేవుడు నీపైనా, నాపైనా దయజూపుగాక అనో చెప్పి మంచిపద్ధతిలో పంపివేయాలి. ఇదే మృదు భాషణం లేక మంచిమాట (ఖౌలుమ్ మారూఫున్). మరి "క్షమించటం" (మగ్‌ఫిరతున్) అంటే ఏమిటి? అన్న సందేహం కలగవచ్చు. యాచకులలోనూ రకరకాల వారుంటారు. నిజంగా అవసరం ఏర్పడి ఒకరి ముందు చేయిచాపి అర్థించినవారి ఆత్మ గౌరవాన్ని సదా దృష్టిలో పెట్టుకోవాలి. 'వాడేమిటీ ఇలా ముష్టెత్తుకుంటున్నాడు?' లాంటి మాటల్ని పలకటంగానీ, నలుగురి ముందూ అతన్ని నవ్వులపాలు చేయటంగానీ చేయకూడదు. ఏ సందర్భంలోనయినా కోపంలో యాచకుని నోట అమర్యాదకరమైన మాట వెలువడినా వీలైనంత వరకు మన్నించి వదలిపెట్టాలి. ఇది కూడా 'మగ్‌ఫిరతున్' క్రిందికే వస్తుంది. దానం చేసిన తరువాత యాచకుణ్ణి నలుగురిలో నిలబెట్టి నానా మాటలనేకంటే అతనిపట్ల మృదువైఖరిని అవలంబించటం, అతని యాచనను తెరమరుగు గావించటం, ఉపేక్షించటం ఎంతో మేలు. అందుకే హదీసులో అనబడింది: "అల్ కలిమతుత్తయ్యిబతు సదఖతున్" (సద్వచనం కూడా దానమే) (సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్). మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇంకా ఈ విధంగా ఉపదేశించారు : "మీరు ఏ సత్కార్యాన్నీ (మారూఫ్‌నూ) అల్పంగా భావించకండి – ఆఖరికి మీ సహోదరుణ్ణి నవ్వుతూ పలకరించడాన్ని కూడా!" (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

**264** ఓ విశ్వాసులారా! తన ధనాన్ని పరుల మెప్పుకోసం ఖర్చుచేస్తూ, అల్లాహ్‌ను గానీ, అంతిమదినాన్ని గానీ విశ్వసించని వ్యక్తి మాదిరిగా మీరు మీ ఉపకారాన్ని చాటుకుని, (గ్రహీతల) మనస్సులను నొప్పించి మీ దానధర్మాలను వృధా చేసుకోకండి. అతని ఉపమానం కొద్దిగా మట్టి పేరుకుని ఉన్న నున్నని రాతి బండ వంటిది. దానిపై భారీవర్షం కురిసి, ఆ మట్టి కాస్తా కొట్టుకు పోయి, కటికరాయి మాత్రమే మిగులుతుంది.[326] ఈ ప్రదర్శనా కారులకు తాము చేసుకున్న దానిలో నుంచి ఏమీ ప్రాప్తించదు. అల్లాహ్ సత్యతిరస్కారులకు సన్మార్గం చూపదు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تُبْطِلُوا صَدَقَاتِكُمْ
بِالْمَنِّ وَالْأَذَىٰ كَالَّذِي يُنْفِقُ مَالَهُ رِئَاءَ
النَّاسِ وَلَا يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۖ فَمَثَلُهُ كَمَثَلِ
صَفْوَانٍ عَلَيْهِ تُرَابٌ فَأَصَابَهُ وَابِلٌ فَتَرَكَهُ
صَلْدًا ۖ لَا يَقْدِرُونَ عَلَىٰ شَيْءٍ مِمَّا كَسَبُوا ۗ
وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الْكَافِرِينَ ﴿264﴾

**265** ఇక దైవప్రసన్నతను చూరగొనే తపనతో, దృఢనమ్మకంతో తమ సంపదను ఖర్చుపెట్టేవారి ఉపమానం మెరక ప్రాంతంలో ఉన్న తోట వంటిది.[327] భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. ఒకవేళ దానిపై పెద్ద వర్షం పడకుండా, కేవలం వానజల్లు కురిసినా సరిపోతుంది. అల్లాహ్ మీ పనులన్నింటినీ చూస్తూనే ఉన్నాడు.

وَمَثَلُ الَّذِينَ يُنْفِقُونَ أَمْوَالَهُمُ ابْتِغَاءَ
مَرْضَاتِ اللَّهِ وَتَثْبِيتًا مِنْ أَنْفُسِهِمْ كَمَثَلِ
جَنَّةٍ بِرَبْوَةٍ أَصَابَهَا وَابِلٌ فَآتَتْ أُكُلَهَا
ضِعْفَيْنِ فَإِنْ لَمْ يُصِبْهَا وَابِلٌ فَطَلٌّ ۗ
وَاللَّهُ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ﴿265﴾

326. ఇందులో రెండు ముఖ్య విషయాలు నొక్కి చెప్పబడ్డాయి. ఒకటి: దానధర్మాలు చేసి ఉపకారాన్ని చాటటం, దానం పుచ్చుకున్నవారి మనస్సును నొప్పించటం. ఇలాంటి దెప్పిపొడుపులు కపటులు మాత్రమే చేస్తారు. నలుగురిలో పేరు ప్రతిష్ఠల్ని పొందగోరి దానం చేసినవారు మాత్రమే ఈ విధంగా నోరు జారతారు. విశ్వాసులనబడేవారికి ఇవి ఎంతమాత్రం శోభించవు. రెండు: ఈ రకమయిన దానం నున్నని బండరాయి వంటిది. ఏ కాస్త మట్టి దానిపై పేరుకుని ఉన్నా విత్తనం నాటడానికి పనికిరాదు. ఒకవేళ విత్తనం వేసినా దానిపై కురిసే వర్షానికి మొత్తం కొట్టుకుపోతుంది. దీని భావం ఏమిటంటే వర్షం ఏ విధంగా ఆ రాతి ప్రదేశానికి ప్రయోజనం చేకూర్చలేకపోయిందో అదేవిధంగా ప్రదర్శనాబుద్ధి గలవాడికి కూడా అతని దానం ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు.

327. ఇది దైవప్రసన్నతను చూరగొనే లక్ష్యంతో తమ ధనాన్ని వ్యయపరచేవారి దృష్టాంతం. వారు ఖర్చుపెట్టిన ధనం ఎత్తయిన ప్రదేశంలో వున్న తోట లాంటిది. బాగా వర్షం కురిస్తే ఆ తోట నుంచి రెట్టింపు దిగుబడి లభిస్తుంది. ఒకవేళ సన్నని జల్లు లాంటిది పడినా దానికి సరిపోతుంది. వారి దానధర్మాలు కూడా అంతే. అవి చిన్నవైనా, పెద్దవైనా దైవకృపతో ఎన్నో రెట్లు పెంచబడి, వారికి వాపసు చేయబడతాయి. అరబీ మూలంలో "జన్నతున్" అనే పదం వచ్చింది. మొక్కలు, చెట్లు బాగా దట్టంగా పెరగటం మూలంగా కనిపించకుండా ఉండే నేలను 'జన్నతున్' అని అంటారు. లేక నలువైపుల నుంచి దట్టమైన కంచె ఉండటం మూలంగా కనిపించకుండా ఉండే తోటను 'జన్నతున్' అంటారు. 'జన్నతున్' అనేది అసలు 'జిన్' అనే ధాతువు నుండి వచ్చింది. జిన్ అనేది కంటికి కానరాని ప్రాణి. మాతృగర్భంలో వున్న శిశువును కూడా 'జనీన్' అని అంటారు – అది కూడా కనిపించదు గనక! అలాగే ఉన్మాదాన్ని, మానసిక సంతులనం లోపించటాన్ని 'జునూన్'గా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఆ స్థితిలో తెలివిపై ఒక విధమైన పొర కమ్ముకుంటుంది. ఇక జన్నత్‌ను (స్వర్గాన్ని) 'జన్నత్' అని అనటానికి అసలు కారణం అది కళ్లకు కనిపించకుండా దాచి ఉంచబడటమే. **'రబ్‌వతున్'** అంటే ఎత్తుగా ఉండే నేల; **'వాబిలున్'** అంటే భారీ వర్షం.

**266** మీలో ఎవరికయినా ఖర్జూరం, ద్రాక్ష పండ్ల తోట ఉండి, అందులో పిల్ల కాలువలు ప్రవహిస్తూ, అందులో అతనికి అన్ని రకాల ఫలాలు కూడా లభిస్తూ ఉండి, అతను ముసలివాడై పోగా, మరోవైపు అతని పిల్లలు బలహీనులుగా ఉండగా– అకస్మాత్తుగా ఆ తోటపై నిప్పులు చెరిగే వడగాలి వచ్చి ఆ తోట కాలిపోవటాన్ని మీలో ఎవరయినాసరే ఇష్టపడతారా? [328] మీరు ఆలోచించే టందుకుగాను అల్లాహ్ ఈ విధంగా తన ఆయతులను మీకు స్పష్ట పరుస్తున్నాడు.

أَيَوَدُّ أَحَدُكُمْ أَنْ تَكُونَ لَهُ جَنَّةٌ مِنْ نَخِيلٍ وَأَعْنَابٍ تَجْرِي مِنْ تَحْتِهَا الْأَنْهَارُ لَهُ فِيهَا مِنْ كُلِّ الثَّمَرَاتِ وَأَصَابَهُ الْكِبَرُ وَلَهُ ذُرِّيَّةٌ ضُعَفَاءُ فَأَصَابَهَا إِعْصَارٌ فِيهِ نَارٌ فَاحْتَرَقَتْ ۗ كَذَٰلِكَ يُبَيِّنُ اللَّهُ لَكُمُ الْآيَاتِ لَعَلَّكُمْ تَتَفَكَّرُونَ ﴿٢٦٦﴾

**267** ఓ విశ్వసించినవారలారా! ధర్మ సమ్మతమైన మీ సంపా దనలో నుంచి, మేము మీ కోసం నేల నుంచి ఉత్పత్తిచేసిన వస్తువు లలో నుంచి ఖర్చు చేయండి.[329] వాటిలోని చెడు (నాసిరకం) వస్తువులను ఖర్చుపెట్టే సంకల్పం చేసుకోకండి–మీరు స్వయంగా వాటిని తీసుకోరు. ఒకవేళ కళ్లు మూసుకొని ఉంటే అది వేరే విషయం.[330] అల్లాహ్ అక్కరలేనివాడు, సర్వస్తోత్రములకు అర్హుడని తెలుసుకోండి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَنْفِقُوا مِنْ طَيِّبَاتِ مَا كَسَبْتُمْ وَمِمَّا أَخْرَجْنَا لَكُمْ مِنَ الْأَرْضِ ۖ وَلَا تَيَمَّمُوا الْخَبِيثَ مِنْهُ تُنْفِقُونَ وَلَسْتُمْ بِآخِذِيهِ إِلَّا أَنْ تُغْمِضُوا فِيهِ ۚ وَاعْلَمُوا أَنَّ اللَّهَ غَنِيٌّ حَمِيدٌ ﴿٢٦٧﴾

328. ఈ **'ప్రదర్శనాబుద్ధి'** నుంచి కాపాడే ఉద్దేశంతో ఇక్కడ ఇంకొక ఉదాహరణ ఇవ్వబడింది. తోట ద్వారా వచ్చే ఆదాయంతో బ్రతుకు బండిని లాగే ఒక ముసలివాడున్నాడు. అతనికి చంటిపిల్లలేగాని యుక్త వయస్సుకు చేరిన కొడుకులు లేరు. మరోవైపు ఆ ముదుసలి కూడా ఇప్పుడు కష్టపడి డబ్బు సంపాయించలేడు. ఆ తోటే అతని జీవనాధారం. ఆ సమయంలో ఉన్నట్టుండి ఆ తోటపై ఒక పెనుగాలి వీచింది. దాంతో ఉన్నది కాస్తా ఊడ్చుకుపోయింది. మరి ఆ తోటను పూర్వ స్థితికి తెచ్చే సత్తువ కూడా ఆ ముసలి రైతులో లేదు. నలుగురిలో పేరుప్రతిష్ఠల్ని పొందాలన్న తలంపుతో సత్కార్యాలు చేసిన దుష్టసంకల్పుల పరిస్థితి కూడా ప్రళయదినాన ఇలాగే ఉంటుంది. కాపట్యం మూలంగా వారి సత్కర్మలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయి. మరోవంక వారు కష్టాల కడలిని దాటడానికి ఒక్కో సత్కార్యం కోసం అర్రులు చాస్తూ ఉంటారు. మరిన్ని సత్కార్యాలను సంపాదించుకువద్దామంటే, ఆ అవకాశం కూడా ఇవ్వబడ దాయె! మరి మీ పరిస్థితి కూడా ఇలాగే రూపుదాల్చాలని మీరు కోరుకుంటున్నారా? అని యిక్కడ అల్లాహ్ ప్రశ్నిస్తున్నాడు.

జీవితాంతం దైవమార్గంలో అంకితభావంతో సాధనచేసి, త్యాగాలు చేసి వయసు మీదపడిన తరువాత షైతాన్ ఎత్తులకు చిత్తయిపోయి దైవ అవిధేయతకు పాల్పడిన వారికి కూడా ఈ ఉపమానం వర్తిస్తుందని ఇబ్నె అబ్బాస్ మరియు ఉమర్ (రజి)లు చెప్పారు (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్, ఫత్హుల్ ఖదీర్ లిష్షౌకానీ, తఫ్సీర్ ఇబ్నె జరీర్ తబ్రీ).

329. దానధర్మాలు స్వీకారయోగ్యం కావాలంటే – క్రితం ఆయతులో చెప్పబడినట్లు – అవి మన్నన్ (ఉపకారాన్ని చాటుకోవటం), అజన్ (గ్రహీత మనసు నొప్పించటం) మరియు ప్రదర్శనాబుద్ధి (రియా) వంటి మాలిన్యాల నుంచి పరిశుభ్రంగా ఉండటంతోపాటు సంపాదన ధర్మసమ్మతం అయి ఉండాలి. మనిషి వ్యాపారం చేసినా, వ్యవసాయం చేసినా, ఉద్యోగం చేసినా, మరేపని ద్వారా ధనాన్ని ఆర్జించినా – అది దైవం సమ్మతించిన పద్ధతిలో – ఆర్జించాలి. అటువంటి సంపాదన 'పరిశుద్ధమైన' సంపాదన అనబడుతుంది. "చెడు (ఖబీస్) వస్తువులను అల్లాహ్ మార్గంలో

**268** షైతాన్ మీకు దారిద్ర్యం గురించి భయపెడతాడు. నీతిమాలిన పనులకై పురికొల్పుతాడు.[331] కాగా; అల్లాహ్ మిమ్మల్ని క్షమిస్తాననీ, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ గొప్ప ఉదార స్వభావుడు, అన్నీ తెలిసినవాడు.

اَلشَّيْطٰنُ يَعِدُكُمُ الْفَقْرَ وَيَاْمُرُكُمْ بِالْفَحْشَآءِ ۚ وَاللّٰهُ يَعِدُكُمْ مَّغْفِرَةً مِّنْهُ وَفَضْلًا ؕ وَاللّٰهُ وَاسِعٌ عَلِيْمٌ ۖۚ (268)

**269** ఆయన తాను కోరిన వారికి విజ్ఞతా వివేచనలను ప్రసాదిస్తాడు. ఎవరికి విజ్ఞతా వివేచనలు వొసగబడ్డాయో అతనికి ఎన్నో మేళ్లు వొసగబడినట్లే.[332] హితబోధను బుద్ధిమంతులు తప్ప మరొకరు గ్రహించరు.

يُّؤْتِى الْحِكْمَةَ مَنْ يَّشَآءُ ۚ وَمَنْ يُّؤْتَ الْحِكْمَةَ فَقَدْ اُوْتِىَ خَيْرًا كَثِيْرًا ؕ وَمَا يَذَّكَّرُ اِلَّآ اُولُوا الْاَلْبَابِ (269)

ఇవ్వాలన్న తలంపు రానివ్వకండి" అంటే భావం అధర్మంగా, అన్యాయంగా, అక్రమంగా ఆర్జించిన దానిని ఇవ్వరాదు అని! అలాంటి దానాన్ని అల్లాహ్ స్వీకరించడు. "అల్లాహ్ పరిశుద్ధుడు. పరిశుద్ధ (హలాల్) వస్తువులను మాత్రమే ఆయన ఆమోదిస్తాడు" అని హదీసులో ఉంది. 'ఖబీస్'కు మరో అర్థం పనికిరాని, నాసిరకం వస్తువులు. వాటిని కూడా అల్లాహ్ మార్గంలో ఇవ్వరాదు. మదీనాలోని అన్సార్లు కొందరు దైవమార్గంలో వ్యవసాయోత్పత్తులను ఇవ్వవలసి వచ్చినప్పుడు నాసిరకం ఖర్జూరపండ్లను మస్జిదులో ఇచ్చి వెళ్ళేవారు. ఇది అల్లాహ్‌కు నచ్చలేదు. ఈ నేపథ్యంలోనే "మీరు అమితంగా ప్రేమించే వస్తువులను ఖర్చుపెట్టనంతవరకూ మీరు సత్కార్యస్థాయికి చేరుకోలేరు" అన్న దివ్య వచనం అవతరించింది (ఫత్‌హుల్ ఖదీర్ – తిర్మిజీ, ఇబ్నె మాజాల ఆధారంగా).

330. నాసిరకం వస్తువులను మీరు సయితం మనస్ఫూర్తిగా పుచ్చుకోరు. అటువంటప్పుడు దైవమార్గంలో అలాంటి వస్తువులను ఇవ్వటం భావ్యం కాదు కదా! అని దీని భావం.

331. మీరు దైవమార్గంలో ధనాన్ని వ్యయపరచాలని అనుకున్నప్పుడు మిమ్మల్ని షైతాన్ పరిపరి విధాలుగా ప్రక్కదారి పట్టించజూస్తాడు. ఇలా ఖర్చుచేస్తే మీరు దివాలా తీస్తారనీ, ముష్టెత్తుకోవలసిన పరిస్థితి దాపురిస్తుందనీ భయపెడతాడు. మరి అదే దుష్కార్యాలలో ఖర్చుపెట్టబోతున్నప్పుడు ఎలాంటి సంకోచం దరి చేరనివ్వడు. పైగా అలాంటి దుష్కార్యాలకు ఎంతో అందమైన పేర్లుపెట్టి, రంగురంగుల డిజైనులను అతికించి, మనోహరమైన తీరులో మీ ముందుకు తీసుకువస్తాడు. వాటికోసం మీరు ఎంత డబ్బు అయినా విచ్చలవిడిగా తగలెట్టేలా మిమ్మల్ని సమాయత్తపరుస్తాడు. మీరు గమనించారోలేదో ఒక సంక్షేమ కార్యక్రమం కోసం, ఒక మస్జిద్, మదర్సా పనికోసం మీరు ఎప్పుడయినా ఒక ధనవంతుని వద్దకు వెళితే తానిచ్చే వంద రూపాయల కోసం పదిసార్లు తిప్పుతాడు. పదేసి ప్రశ్నలతో మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేసేస్తాడు. కాని ఆ స్థితిమంతుడే దుష్కార్యాల కోసం డబ్బు ఖర్చుపెడుతున్నప్పుడు ఇలాంటి ఆరాలు ఏమీ తీయడు. ఆదాయపు పన్ను అధికారులను సంతోషపెట్టేందుకు, అక్రమ రీతిలో లైసెన్సులు పొందేందుకు ఎన్ని అడ్డదారులైనా తొక్కుతాడు. ఆ సమయంలో ఎలాంటి సంకోచం, తడబాటు అతనిలో ఉండదు.

332. అరబీలో **'అల్ హిక్మత్' (الحكمة)** అనబడింది. దీన్ని పలువురు పలు భావాల్లో తీసుకున్నారు. హిక్మత్ అంటే విషయావగాహన, విద్య అని కొందరు, సరైన అభిప్రాయాన్నే కలిగి ఉండటమని కొందరు, ఖుర్‌ఆన్‌లోని రద్దుపరచబడిన ఆయతులు, వాటికి బదులు అమలులో ఉన్న ఆయతులకు సంబంధించిన జ్ఞానం, అవగాహన, నిర్ణయం గైకొనగల శక్తి అని మరికొందరు, కేవలం ఖుర్‌ఆన్ హదీసుల జ్ఞానం అని ఇంకొందరు భావించారు. నిజానికి ఈ భావాలన్నీ 'హిక్మత్' విస్తృత పరిధిలోకి వచ్చేస్తాయి. సహీహైన్ (బుఖారీ, ముస్లింల) లోని హదీసు ఇక్కడ గమనార్హం: "ఇద్దరు వ్యక్తుల పట్ల ఈర్ష్య (రష్క్) చెందటం ధర్మసమ్మతమే. ఒకడు : సిరిసంపదలు వొసగబడగా సత్యమార్గంలో ఖర్చుచేసేవాడు. మరొకడు : అల్లాహ్ హిక్మత్‌ను ప్రసాదించగా దాని ఆధారంగా ప్రజల మధ్య తీర్పులు ఇచ్చేవాడు. ప్రజలకు హిక్మత్‌ను బోధపరచేవాడు" (సహీహ్ బుఖారీ : కితాబుల్ ఇల్మ్ ; ముస్లిం – కితాబు సలాతిల్ ముసాఫిరీన్).

**270** మీరు (దైవమార్గంలో) ఎంత ఖర్చు చేసినా, ఏ మొక్కుబడి చేసుకున్నా[333] అల్లాహ్‌కు దాని గురించి పూర్తిగా తెలుసు. దుర్మార్గులకు సహాయం చేసే వారెవరూ లేరు.

وَمَآ اَنۡفَقۡتُمۡ مِّنۡ نَّفَقَةٍ اَوۡ نَذَرۡتُمۡ مِّنۡ
نَّذۡرٍ فَاِنَّ اللّٰهَ يَعۡلَمُهٗ ؕ وَمَا لِلظّٰلِمِيۡنَ
مِنۡ اَنۡصَارٍ ﴿270﴾

**271** ఒకవేళ మీరు బహిరంగంగా దాన ధర్మాలు చేసినా మంచిదే గాని, గోప్యంగా నిరుపేదలకు ఇస్తే అది మీ కొరకు ఉత్తమం.[334] (దీనివల్ల) అల్లాహ్ మీ పాపాలను తుడిచిపెడతాడు. అల్లాహ్‌కు మీరు చేసేదంతా తెలుసు.

اِنۡ تُبۡدُوا الصَّدَقٰتِ فَنِعِمَّا هِىَ ۚ وَاِنۡ تُخۡفُوۡهَا
وَتُؤۡتُوۡهَا الۡفُقَرَآءَ فَهُوَ خَيۡرٌ لَّكُمۡ ؕ وَيُكَفِّرُ
عَنۡكُمۡ مِّنۡ سَيِّاٰتِكُمۡ ؕ وَاللّٰهُ بِمَا تَعۡمَلُوۡنَ خَبِيۡرٌ ﴿271﴾

**272** (ఓ ప్రవక్తా!) వారిని సన్మార్గంపై తెచ్చి నిలబెట్టే బాధ్యత నీపై లేదు. వాస్తవానికి సన్మార్గ భాగ్యాన్ని అల్లాహ్ తాను కోరిన వారికి అనుగ్రహిస్తాడు. మీరు దైవ మార్గంలో ఏ మంచి వస్తువును వ్యయపరచినా, దాని లాభాన్ని స్వయంగా మీరే పొందుతారు. కాకపోతే మీరు కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే ఖర్చు చేయాలి. మీరు ఎంత ఖర్చుచేసినా దాని పూర్తి ప్రతిఫలం మీకు ఇవ్వబడుతుంది.[335] మీకు ఎంతమాత్రం అన్యాయం జరగదు.

لَيۡسَ عَلَيۡكَ هُدٰٮهُمۡ وَلٰكِنَّ اللّٰهَ يَهۡدِىۡ مَنۡ
يَّشَآءُ ؕ وَمَا تُنۡفِقُوۡا مِنۡ خَيۡرٍ فَلِاَنۡفُسِكُمۡ ؕ
وَمَا تُنۡفِقُوۡنَ اِلَّا ابۡتِغَآءَ وَجۡهِ اللّٰهِ ؕ وَمَا تُنۡفِقُوۡا
مِنۡ خَيۡرٍ يُّوَفَّ اِلَيۡكُمۡ وَاَنۡتُمۡ لَا تُظۡلَمُوۡنَ ﴿272﴾

---

333. **నజ్ర్ :** మొక్కుబడి. నేను అనుకున్న ఫలానా పని గనక అయిపోతే లేక నేను ఎదుర్కొంటున్న ఫలానా కఠిన పరీక్ష నుండి నాకు ముక్తి లభిస్తే దైవమార్గంలో ఇంతమొత్తం దానం చేస్తాను అని ఎవరైనా మనసులో అనుకుంటే అది 'నజ్ర్' అవుతుంది. దాన్నే తెలుగులో మొక్కుకోవటం అని అంటారు. ఈ మొక్కు ధర్మసమ్మతం గనక దాన్ని చెల్లించటం తప్పనిసరి. ఒకవేళ అధర్మమైన, దైవధిక్కారంతో కూడుకున్న మొక్కుబడి చేసుకుంటే దాన్ని తీర్చటం తప్పనిసరికాదు. మొక్కుబడి కూడా నమాజ్, ఉపవాసాల మాదిరిగా ఆరాధనే. కాబట్టి అల్లాహ్ మినహా ఇంకొకరి ఎవరి పేరున మొక్కుకున్నా అది "ఆరాధనలో షిర్క్‌కు తావు కల్పించటం"తో సమానమే. నేడు మన ముస్లిం సోదరులు దర్గాల దగ్గర, సమాధుల వద్ద తీర్చే మొక్కుబడులు కూడా ఈ షిర్క్ కోవకే చెందుతాయి. దైవం మనల్ని షిర్కు నుంచి కాపాడుగాక!

334. సాధారణ పరిస్థితుల్లో రహస్యంగా దానధర్మాలు చేయటమే ఉత్తమం అని ఈ ఆయతు ద్వారా విదితమవుతోంది. ఒకవేళ ఏ సందర్భంలోనయినా బహిరంగంగా – అందరికీ తెలిసేలా – దానం చేస్తే దానివల్ల ఇతరులకు కూడా ప్రేరణ లభిస్తుందనుకుంటే అప్పుడు బహిరంగంగా కూడా దానం చేయవచ్చు. ప్రదర్శనాబుద్ధిని మనసులో రానివ్వకుండా ఇతరులను మంచివైపుకు పురికొల్పే సదుద్దేశంతో ఎవరయినా ఇలాంటి సత్కార్యాల్లో తొలి అడుగువేస్తే, అటువంటి వారికి లభించే ప్రత్యేకమైన పుణ్యం గురించి హదీసుల్లో స్పష్టంగా చెప్పబడింది. అయితే ఇవి ప్రత్యేక పరిస్థితులు. ఇక సాధారణ సమయాల్లో మాత్రం సాధ్యమైనంతవరకు గోప్యంగా – ఎవరికీ తెలియకుండా – దానధర్మాలు చేయటం ఎక్కువ పుణ్యప్రదం. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఒకసారి ఇలా ప్రవచించారు : ప్రళయదినాన ఎవరెవరికయితే దైవ సింహాసనం క్రింద నీడ లభిస్తుందో వారిలో ఒక భాగ్యవంతుడు గోప్యంగా దానధర్మాలు చేసినవాడు. అతను దానధర్మాలు చేసే తీరు ఎంత గుట్టుగా ఉండేదంటే కుడిచేత్తో ఏం దానం చేశాడో ఎడమచేతికి కూడా తెలిసేది కాదు." ఈ శ్రేష్ఠత స్వచ్ఛంద (నఫిల్) దానధర్మాలకే వర్తిస్తుందనీ, 'జకాత్' లాంటి విధిగా ఇవ్వవలసిన దానాలను బహిరంగంగా ఇవ్వటమే మేలని కొందరు విద్వాంసులు అభిప్రాయపడ్డారు. అయితే ఖుర్ఆన్‌లో చేయబడిన ప్రబోధన స్వచ్ఛంద దానాలకు, తప్పనిసరి దానాలకు కూడా వర్తిస్తుంది (ఇబ్నె కసీర్). హదీసులోని విషయం కూడా ఈ భావంలోనే ఉంది.

**273** దైవమార్గంలో నిమగ్నులైన కారణంగా , (బ్రతుకు తెరువు కోసం) భూమిలో సంచరించే వీలులేని నిరుపేదలు[336] వాస్తవానికి మీ ధన సహాయానికి అర్హులు. వారి నిజస్థితిని గురించి తెలియనివారు, (ఆత్మాభిమానం వల్ల) వారెవరినీ అడగకపోవటం చూసి, వారిని అవసరాలు లేనివారుగా తలపోస్తారు. మీరు వారి వాలకాన్ని చూసి వాస్తవస్థితిని ఊహించవచ్చు. తమకు సహాయం చెయ్యమంటూ వారు ప్రజల వెంటపడరు.[337] (అటువంటి త్యాగధనుల సహాయార్థం) మీరు ఎంత సొమ్ము వెచ్చించినా, నిశ్చయంగా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు.

للفقراء الذين أحصروا في سبيل الله
لا يستطيعون ضربا في الأرض يحسبهم
الجاهل أغنياء من التعفف تعرفهم
بسيماهم لا يسألون الناس إلحافا وما
تنفقوا من خير فإن الله به عليم ﴿٢٧٣﴾

**274** ఎవరయితే తమ సిరిసంపదలను రేయింబవళ్లు రహస్యంగానూ, బహిరంగంగానూ ఖర్చుచేస్తారో వారి కొరకు వారి ప్రభువు వద్ద (గొప్ప) పుణ్యఫలం ఉంది. వారికెలాంటి భయం గానీ, దుఃఖంగానీ ఉండదు.

الذين ينفقون أموالهم بالليل والنهار سرا
وعلانية فلهم أجرهم عند ربهم
ولا خوف عليهم ولا هم يحزنون ﴿٢٧٤﴾

335. వివిధ వ్యాఖ్యానాల ద్వారా బోధపడేదేమంటే; ముస్లిలు అవిశ్వాసులైన తమ బంధువులకు ఆర్థిక సహాయం చేయటం సమంజసం కాదని భావించేవారు. పైగా వారు ముస్లింలుగా మారిపోవాలని కోరుకునేవారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. ఎవరికయినాసరే సన్మార్గాన నడిచే సద్బుద్ధి అల్లాహ్ తరఫున లభిస్తుంది. సన్మార్గం గురించి బోధపరచటం వరకే మీ బాధ్యత. ఇకపోతే, మీరు దైవమార్గంలో చిత్తశుద్ధితో ఏమి ఖర్చుచేసినా దాని పూర్తి పుణ్యఫలం మీకు లభిస్తుంది. దీన్నిబట్టి అవగతమయ్యే ఒక విషయం ఏమిటంటే ముస్లిమేతరులైన బంధువులను ఆదుకోవటం, బంధుత్వ ప్రాతిపదికపై వారితో మంచిగా మెలగటం పుణ్యప్రదం. అయితే 'జకాత్' అనబడే తప్పనిసరి దానాలకు మాత్రం ముస్లింలే హక్కుదారులు. ముస్లిమేతరులకు జకాత్ సొమ్ము ఇవ్వరాదు.

336. దైవమార్గంలో ఇల్లూ వాకిలీ వదలి మక్కా నుండి మదీనాకు వలసవచ్చిన ముహాజిర్లు వీరు. ధార్మిక విద్యను ఆర్జించే విద్యార్థులు, విద్వాంసులు, దైవకార్యం కోసం తమ జీవితాలను అంకితం చేసినవారు కూడా ఈ కోవలోకి వస్తారు.

337. ఇది విశ్వాసుల ఒక ముఖ్య లక్షణం. పేదరికంలో మ్రగ్గుతూ ఉన్నప్పటికీ వారు నోరు తెరచి ఇతరులను ఏమీ అడుగరు. సాధ్యమైనంతవరకూ ఉన్న దాంతోనే తృప్తి పడాలనీ, తమ బాధలను నలుగురికీ చెప్పుకోరాదని అనుకుంటారు. అరబీలో రెండు పదాలు వచ్చాయి. ఒకటి **తఅఫ్ఫుఫ్**(**التعفف**), రెండోది **ఇల్‌హాఫ్** (**إلحافا**). తఅఫ్ఫుఫ్ అంటే 'ఆత్మాభిమానం' అని అర్థం. ఇల్‌హాఫ్ అంటే 'సహాయం చెయ్యండి అని మరీ జిడ్డుగా అడగటం' అని అర్థం వస్తుంది. అసలు ఎవరినీ ఏమీ అడగకుండా ఉండటం 'ఇల్‌హాఫ్' అని మరికొందరు భావించారు. ఎందుకంటే వీరికి 'ఆత్మగౌరవం' చాలా ముఖ్యమని ఇంతకుముందే చెప్పబడింది (ఫత్‌హుల్ ఖదీర్). ఒకవేళ ఎవరినయినా ఏదయినా అడిగినా బ్రతిమాలుతూ వెంటపడరు అని మరి కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అవసరం లేకపోయినా యాచించటాన్ని హాబీగా చేసుకోరు (నేటి ప్రొఫెషనల్ ఫకీర్ల మాదిరిగా) అని ఇంకా కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు.

ఇంటింటికీ పోయి ఓ ముద్ద అన్నం పెట్టమనో, రెండు ఖర్జూరపండ్లు ధర్మం చెయ్యమనో ముష్టెత్తుకునేవారు వాస్తవానికి నిరుపేదలు కారనీ, అవసరం ఉండి కూడా ఆత్మాభిమానం వల్ల ఇతరుల ముందు చేయి చాపకుండా గుట్టుగా, గుంభనంగా బ్రతికేవారే సిసలయిన నిరుపేదలని మహనీయ ముహమ్మద్ (సఅసం) వివరించారు. ఈ మాట అన్న తర్వాత ఆయన (స) "లా యస్‌అలూనన్నాస ఇల్‌హాఫా" (తమకు సహాయం చేయమంటూ వారు

**275** వడ్డీ సొమ్ము తినేవారు[338] షైతాను పట్టటంవల్ల ఉన్మాది అయినవాని లాగానే నిలబడతారు.[339] వారికీ దుర్గతి పట్టడానికి కారణం "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా!" అని వారు

اَلَّذِيْنَ يَاْكُلُوْنَ الرِّبٰوا لَا يَقُوْمُوْنَ اِلَّا كَمَا يَقُوْمُ الَّذِيْ يَتَخَبَّطُهُ الشَّيْطٰنُ مِنَ الْمَسِّ ؕ ذٰلِكَ

ప్రజల వెంట పడరు) అన్న ఆయతును పఠించారు (సహీహ్ బుఖారీ : అత్తఫ్సీర్ వ జకాత్). కాబట్టి తమ ధనాన్ని 'సదకా' గా ఇవ్వదలచిన వారు ప్రొఫెషనల్ ఫకీర్లకు ఇచ్చేబదులు ధర్మజ్ఞాన సముపార్జనలో ఉండి ఉపాధిని సమకూర్చుకోలేని వారినీ, దైవమార్గంలో ప్రస్థానం చేసేవారినీ, తమ దారిద్ర్య స్థితిని చాటుకోకుండా గౌరవంగా బ్రతుకుబండిని లాగుతూ ఉండేవారిని అన్వేషించి, ఉత్తమ రీతిలో ఆదుకోవాలి. ఎందుకంటే వారు అభిమానం వల్ల ఇతరుల ముందు తమ గోడును వినిపించుకోరు.

అదే సమయంలో – తమ అవసరాలకు తగిన ఉపాధి ఉండి కూడా పరుల ముందు చేయి చాపటం తమను తాము అవమానపరచుకోవటమే. అలా చేసిన వారి ముఖాలపై ప్రళయదినాన గాయాలు కనిపిస్తాయని హదీసులో ఉంది (సునన్ గ్రంథకర్తలైన నలుగురూ ఈ హదీసును వెలికి తీశారు – తిర్మిజీలోని కితాబుజ్జకాత్‌లో ఈ హదీసు ఉంది). నిత్యం జనుల ముందు యాచిస్తూ తిరిగేవాని మొహంపై ప్రళయదినాన మాంసం ఉండదని బుఖారీ, ముస్లింలలోని హదీసులో ఉంది (మిష్కాత్, కితాబుజ్జకాత్ ఆధారంగా).

338. ఆయతులో **'రిబా'** అని ఉంది. రిబా అంటే అధికం, ఎక్కువ అనే అర్థాలు వస్తాయి. దాన్నే మనం వడ్డీగా వ్యవహరిస్తాం. రిబా (వడ్డీ)లో రెండు రకాలున్నాయి: **1. రిబల్ ఫజ్ల్. 2. రిబన్నసీఅహ్.** ఆరు వస్తువుల లావాదేవీల్లో హెచ్చుతగ్గుల మూలంగా, నగదు రుణ వ్యవహారం మూలంగా జరిగే వడ్డీని **'రిబల్ ఫజ్ల్'** అని అంటారు. (ఆ ఆరు వస్తువుల వివరాలు హదీసుల్లో వచ్చాయి. ఉదాహరణకు:– గోధుమలకు బదులుగా గోధుమలతోనే లావాదేవీలు జరపవలసి ఉంటే ఆ రెండూ సరిసమానంగా ఉండాలి. దాంతోపాటు అది నగదు వ్యవహారమై కూడా ఉండాలి. అంటే ఆ రెండు వస్తువులు అక్కడే చేతులు మారాలి. అలాగాకుండా ఆ రెండు వస్తువులు సరిసమానంగా లేకున్నా, అలాగే అప్పటికప్పుడు వస్తుమార్పిడి జరగకుండా ఒక వస్తువు నగదుగా ఉండి మరో వస్తువు రుణంగానో లేక రెండూ రుణంగానో ఉంటే ఆ వ్యవహారం వడ్డీ వ్యవహారం క్రిందికి వస్తుంది). ఇక రెండోది **రిబన్నసీఅహ్.** ఎవరికయినా కొంత నగదు అరువుగా ఇచ్చి పుచ్చుకునేటప్పుడు ఎక్కువ పుచ్చుకుంటానని షరతు పెట్టటం 'రిబన్నసీఅహ్' అవుతుంది. ఇది కూడా వడ్డీయే. ఉదాహరణకు 6 నెలల గడువు కొరకు ఎవరికయినా 100 రూపాయలు రుణంగా ఇచ్చి వాపసు చేసే సమయంలో రూ. 125 ఇవ్వాలని షరతు పెట్టడం. అంటే 6 నెలల గడువు కోసం 25 రూపాయలు అదనంగా పుచ్చుకోవటమన్నమాట. దైవప్రవక్త ప్రియ సహచరులైన అలీగారు ఇలా అన్నారు : "కుల్లు ఖర్‌జిన్ జర్ర మన్‌ఫఅతన్ ఫహువ రిబన్" – అప్పు ఇవ్వటం ద్వారా వచ్చిన ప్రయోజనమేదైనా వడ్డీయే (ఫైజుల్ ఖదీర్). ఇలాంటి అప్పు వ్యక్తిగత అవసరాల కోసం ఇచ్చిపుచ్చుకున్నా, వాణిజ్యం కొరకు ఇచ్చిపుచ్చుకున్నా– రెండు పరిస్థితుల్లో కూడా ఇది వడ్డీయే. ఈ వడ్డీ హరామ్ (నిషిద్ధం)గా పరిగణించబడుతుంది. అజ్ఞాన కాలంలోనూ ఈ రెండు రకాల రుణాల లావాదేవీలు జరిగేవి. ఈ రెంటినీ ఇస్లాం నిషిద్ధంగా ఖరారు చేసింది.

వర్తకం కోసం బ్యాంకు ద్వారా తీసుకునే రుణాలు 'వడ్డీ' లావాదేవీల పరిధిలోకి రావని కొంతమంది భావిస్తున్నారు. ఒక వ్యక్తి బ్యాంకు నుంచి రుణం తీసుకుని, వాణిజ్యం ద్వారా పెద్దమొత్తంలో లాభాలు గడిస్తున్నప్పుడు కొద్దిపాటి సొమ్మును బ్యాంకుకు అదనంగా చెల్లించటంలో దోషం ఏముంది? అని వారు ప్రశ్నిస్తారు. ఇలాంటి వడ్డీని ధర్మసమ్మతంగా ఖరారు చేయాలని కోరే ఈ మహానుభావులకు చెడుగు కానరాకపోవచ్చు గాని దేవుని దృష్టిలో మాత్రం ఇందులో అనేక చెడుగులు ఉన్నాయి. ఉదాహరణకు : రుణం తీసుకుని వ్యాపారం చేసే వ్యక్తికి ఖచ్చితంగా లాభం వస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదు. లాభాల సంగతి అటుంచి, పెట్టిన అసలు పెట్టుబడి అన్నా తిరిగి వస్తుందన్న దృఢనమ్మకం ఏమీ ఉండదు. ఒక్కోసారి వ్యాపారంలో పెట్టే మూలధనమంతా మునిగిపోతుంది. కాని మరోవంక

بِأَنَّهُمْ قَالُوٓا۟ إِنَّمَا ٱلْبَيْعُ مِثْلُ ٱلرِّبَوٰا۟ ۗ وَأَحَلَّ ٱللَّهُ ٱلْبَيْعَ وَحَرَّمَ ٱلرِّبَوٰا۟ ۚ فَمَن جَآءَهُۥ مَوْعِظَةٌ مِّن رَّبِّهِۦ فَٱنتَهَىٰ فَلَهُۥ مَا سَلَفَ وَأَمْرُهُۥٓ إِلَى ٱللَّهِ ۖ وَمَنْ عَادَ فَأُو۟لَٰٓئِكَ أَصْحَٰبُ ٱلنَّارِ ۖ هُمْ فِيهَا خَٰلِدُونَ ﴿275﴾

అనటమే.[340] వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేసి, వడ్డీని నిషేధించాడు. కనుక ఎవరు తన ప్రభువు వద్దనుంచి వచ్చిన హితబోధను విని వడ్డీని మానుకున్నాడో, అతడు గతంలో పుచ్చుకున్నదేదో పుచ్చుకున్నాడు.[341] అతని వ్యవహారం దైవాధీనం.[342] ఇకమీదట కూడా దీనికి పాల్పడినవారే నరకవాసులు. వారు కలకాలం అందులో పడి ఉంటారు.

يَمْحَقُ ٱللَّهُ ٱلرِّبَوٰا۟ وَيُرْبِى ٱلصَّدَقَٰتِ ۗ وَٱللَّهُ لَا يُحِبُّ كُلَّ كَفَّارٍ أَثِيمٍ ﴿276﴾

**276** అల్లాహ్ వడ్డీని హరింపజేస్తాడు, దానధర్మాలను పెంచుతాడు.[343] మేలును మరిచేవారిని, పాపిష్టులను అల్లాహ్ సుతరామూ ప్రేమించడు.

రుణదాత (బ్యాంకు లేక షావుకారు) మాత్రం తాను యిచ్చిన అసలుతోపాటు వడ్డీని కూడా అణాపైసలతో సహా రాబట్టుకుంటాడు. అంటే వడ్డీ వ్యాపారికి లాభనష్టాల రిస్కు ఉండదు. కాని అప్పు తీసుకుని దివాలా తీసిన వ్యక్తిపై ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ కించిత్ జాలి కూడా కనబరచకుండా అతని తోలు వలచి మరీ వసూలు చేసుకుంటుంది. ఇటువంటి అన్యాయాన్ని, దోపిడీని షరీయతు ధర్మసమ్మతంగా ఎలా ఖరారు చేస్తుంది? అద్వైతే సమాజంలోని నిరాధార జీవులను ఆదుకోమని చెబుతుందాయె! పేదల నుండి, అవసరమున్న వారి నుండి ఎలాంటి ప్రయోజనాలను ఆశించకుండా – నిస్వార్థంగా – సహాయం చెయ్యమని చెప్పే శాసనాంగం దోపిడీని సహించలేదు కదా!?

నిస్వార్థ సేవాభావంతో సమాజంలోని అగత్యపరులకు, అభాగ్యజీవులకు చేయూతనిచ్చినప్పుడు ప్రజల మధ్య గల అంతరాలు సమసిపోతాయి. సమాజంలో సోదరభావాలు, సానుభూతి, సహకారభావాలు, ప్రేమానురాగాలు చిగురిస్తాయి. దీనికి పూర్తిగా విరుద్ధమైనది వడ్డీ. ఈ వడ్డీ వ్యవస్థ మూలంగా స్వార్థ ప్రియత్వం పెంపొందుతుంది. కరకుదనం, హృదయ కాఠిన్యత ప్రబలుతాయి. ఒక పెట్టుబడి దారుడు, ఒక వడ్డీ వ్యాపారి ఎంతసేపటికీ రూపాయి ద్వారా రూపాయి సంపాదించుకోవాలనే ఆలోచిస్తారు తప్ప దీనివల్ల పేదల బ్రతుకులు ఎలా పరిణమిస్తాయో! అని ఆలోచించరు. సమాజంలో తిష్ఠవేసి ఉన్న ఆర్థిక మాంద్యంతోనూ, నైతిక అధోగతితోనూ వారికి పనిలేదు. ఇటువంటి వైపరీత్యాన్ని, నిర్దాక్షిణ్య ధోరణిని ఇస్లామీయ షరీయతు ఎట్లా హర్షిస్తుంది? వడ్డీ వ్యవస్థ వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలు ఇంకా చాలా ఉన్నాయి. వివరాల్లోకిపోయే అవకాశం యిక్కడ లేదు. చెప్పవచ్చేదేమిటంటే వడ్డీ ముమ్మాటికీ హరామ్ (నిషిద్ధం). అది వ్యక్తిగత అవసరాల కోసం తీసుకున్నా, వర్తకం కోసం తీసుకున్నా – మరే ఉద్దేశంతో తీసుకున్నా అది ధర్మసమ్మతం అయ్యే ప్రసక్తే లేదు.

339. అంటే వడ్డీ సొమ్ము తినేవాడికి ఈ దుస్థితి సమాధి నుంచి లేపబడేటప్పుడో, హష్ర్ మైదానంలో లేపబడేటప్పుడో ఏర్పడుతుంది.

340. వ్యాపారాన్ని వడ్డీతో పోల్చటం దారుణం. ఎందుకంటే వ్యాపారంలో వస్తు మారకం జరుగుతుంది. వ్యాపారంలో లాభనష్టాల రిస్కు ఉంటుంది. కాని వడ్డీ వ్యవహారం అటువంటిది కాదు. అదలావుంచితే వ్యాపారాన్ని అల్లాహ్ హలాల్ (ధర్మసమ్మతం)గా ఖరారుచేసి, వడ్డీని హరామ్ (నిషిద్ధం)గా ప్రకటించాడు. అలాంటప్పుడు ఇవి రెండూ సమానం ఎలా అవుతాయి?

341. ఇస్లాం స్వీకరించిన తరువాత లేక పశ్చాత్తాపం చెందిన తరువాత, గతంలో పుచ్చుకున్న వడ్డీపై ప్రశ్నించబడదు అని భావం.

342. అంటే పశ్చాత్తాపం చెందిన పిదప అతడు నీతికి నిలబడతాడో లేక ఆంతర్యంలో జనించే చెడుగు వైపుకు జారిపోతాడో పరీక్షించటం జరుగుతుంది. నిజంగానే అతనిలో పరివర్తన వస్తే సరి. లేకుంటే దైవాగ్రహానికి గురవుతాడు.

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ وَأَقَامُوا
الصَّلَاةَ وَآتَوُا الزَّكَاةَ لَهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ
وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٢٧٧﴾

**277** విశ్వసించి (సున్నత్ ప్రకారం) సత్కార్యాలు చేసేవారికి, నమాజులను నెలకొల్పేవారికి, జకాత్‌ను చెల్లించేవారికి తమ ప్రభువు వద్ద పుణ్యఫలం ఉంది. వారికెలాంటి భయంగానీ, చీకూ చింతగానీ ఉండవు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَذَرُوا مَا بَقِيَ
مِنَ الرِّبَا إِن كُنتُم مُّؤْمِنِينَ ﴿٢٧٨﴾

**278** ఓ విశ్వసించినవారలారా! అల్లాహ్‌కు భయపడండి. మీరు నికార్సయిన విశ్వాసులే అయినట్లయితే మిగిలి వున్న వడ్డీని విడిచి పెట్టండి.

فَإِن لَّمْ تَفْعَلُوا فَأْذَنُوا بِحَرْبٍ مِّنَ اللَّهِ وَرَسُولِهِ
وَإِن تُبْتُمْ فَلَكُمْ رُءُوسُ أَمْوَالِكُمْ لَا تَظْلِمُونَ
وَلَا تُظْلَمُونَ ﴿٢٧٩﴾

**279** ఒకవేళ మీరు గనక అలా చేయనట్లయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తతో యుద్ధానికి సిద్ధంకండి.[344] ఒకవేళ మీరు పశ్చాత్తాపం చెందితే మీ అసలు సొమ్ము మీకే ఉంటుంది. మీరూ ఒకరికి అన్యాయం చేయకూడదు. మీకు కూడా అన్యాయం జరుగకూడదు.[345]

وَإِن كَانَ ذُو عُسْرَةٍ فَنَظِرَةٌ إِلَىٰ مَيْسَرَةٍ وَأَن
تَصَدَّقُوا خَيْرٌ لَّكُمْ إِن كُنتُمْ تَعْلَمُونَ ﴿٢٨٠﴾

**280** ఒకవేళ రుణగ్రస్తుడు యిబ్బందుల్లో ఉంటే అతని పరిస్థితి మెరుగుపడేవరకూ అతనికి గడువు ఇవ్వాలి. లేదా మన్నించి దానంగా వదలి పెట్టండి. మీరే గనక తెలుసుకోగలిగితే ఇది మీ కొరకు శ్రేయోదాయకం.[346]

343. వడ్డీ వంటి ముదనష్టపు సొమ్ము వల్ల కలిగే అనర్థాలతోపాటు, దాన ధర్మాలవంటి సత్కార్యాల ద్వారా ప్రాప్తించే శుభాలు ఇందులో వివరించబడ్డాయి. వడ్డీ పైకి పెరుగుతున్నట్లు కనిపించినా దాని పరిణామం భయంకరంగా ఉంటుంది. ఇప్పుడు ఈ వాస్తవాన్ని పాశ్చాత్య ఆర్థిక నిపుణులు సయితం అంగీకరిస్తున్నారు.

344. ఇది అత్యంత తీవ్రమయిన హెచ్చరిక. మరే యితర పాపకార్యంపై కూడా ఇలాంటి ఉత్తర్వు జారీచేయబడలేదు. అందుకే ఈ ఆయతు నేపథ్యంలో అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఇలా అన్నారు : "ఇస్లామీయ రాజ్యంలో వడ్డీని వదలనివాడు ఉంటే సమకాలీన ఖలీఫా అతన్ని పిలిపించి, అతనిచేత ప్రాయశ్చిత్తం (తౌబా) చేయించాలి. అతడు బుద్ధిగా వింటే సరి, లేకుంటే అతని శిరస్సును ఛేదించాలి" (ఇబ్నె కసీర్).

345. మీరు గనక అసలు సొమ్ముకన్నా అధికంగా వసూలుచేస్తే మీ తరఫున ఇతరులకు అన్యాయం జరిగినట్లు లెక్క. ఒకవేళ మీకు అసలు సొమ్ము కూడా ముట్టకపోతే మీకు అన్యాయం జరిగినట్లు లెక్క.

346. అజ్ఞానకాలంలో షావుకారు వద్ద తీసుకున్న అప్పును నిర్ణీత సమయానికి చెల్లించకపోతే, వడ్డీపై వడ్డీ వేసేవాడు. ఆ చక్రవడ్డీ దిన దిన ప్రవర్ధమానమై అనతికాలంలోనే గోరంత అప్పు కొండంత అయి కూర్చునేది. రుణగ్రస్తుడు దాన్ని చెల్లించలేక షావుకారుకు దాసోహం అనేవాడు. అతని ఈ బలహీనతను సొమ్ము చేసుకుంటూ షావుకారు అతన్ని బానిసగా మార్చుకోవటమో, వెట్టిచాకిరీ చేయించుకోవటమో చేసేవాడు. (నిన్నమొన్నటి దాకా మన నాట కూడా పరిస్థితి ఇంచుమించు అదేననుకోండి – అనువాదకుడు). అందుకే అల్లాహ్ ఏమని ఆదేశించాడంటే, రుణగ్రస్తుని నుంచి వడ్డీ గుంజటం అటుంచి, రుణగ్రస్తుడు ఆర్థిక యిబ్బందుల్లో ఉంటే అతని స్థితి మెరుగుపడే వరకూ రుణదాత అతనికి గడువు ఇవ్వాలి. ఒకవేళ అతని రుణాన్ని పూర్తిగా మాఫీచేస్తే మరీ మంచిది. ఇలా ఔదార్యంతో మెలగటం అత్యంత మహత్పూర్వక విషయమని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది. ఈ రెండు వ్యవస్థ (పెట్టుబడిదారీ

**281** మీరు అంతా అల్లాహ్ వైపుకు మరలింపబడే రోజుకు భయపడండి. ఆ తర్వాత ప్రతి ఒక్కరికీ తాను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం వొసగబడుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.[347]

وَاتَّقُوْا يَوْمًا تُرْجَعُوْنَ فِيْهِ اِلَى اللّٰهِ ثُمَّ تُوَفّٰى
كُلُّ نَفْسٍ مَّا كَسَبَتْ وَهُمْ لَا يُظْلَمُوْنَ (281)

**282** ఓ విశ్వాసులారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత గడువు కొరకు అప్పు వ్యవహారం చేసుకుంటున్నప్పుడు దాన్ని (స్పష్టంగా) వ్రాసుకోండి.[348] వ్రాసేవాడు ఈ వ్యవహారాన్ని మీ మధ్య న్యాయబద్ధంగా వ్రాయాలి. అల్లాహ్ ఎవడికైతే వ్రాయటం నేర్పాడో, అతను వ్రాయటానికి నిరాకరించకూడదు. అతడు వ్రాయాలి. రుణం పుచ్చుకున్న వ్యక్తి విషయాన్ని విడమరచి వ్రాయించాలి.[349] ఈ విషయంలో అతను తన ప్రభువైన అల్లాహ్‌కు భయపడాలి. పుచ్చుకున్న దాన్ని తగ్గించి వ్రాయించకూడదు. ఒకవేళ రుణ

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِذَا تَدَايَنْتُمْ بِدَيْنٍ اِلٰٓى
اَجَلٍ مُّسَمًّى فَاكْتُبُوْهُ ۭ وَلْيَكْتُبْ بَّيْنَكُمْ
كَاتِبٌۢ بِالْعَدْلِ ۠ وَلَا يَاْبَ كَاتِبٌ اَنْ يَّكْتُبَ
كَمَا عَلَّمَهُ اللّٰهُ فَلْيَكْتُبْ ۚ وَلْيُمْلِلِ الَّذِيْ
عَلَيْهِ الْحَقُّ وَلْيَتَّقِ اللّٰهَ رَبَّهٗ وَلَا يَبْخَسْ مِنْهُ
شَيْـًٔا ۭ فَاِنْ كَانَ الَّذِيْ عَلَيْهِ الْحَقُّ سَفِيْهًا اَوْ

వ్యవస్థ – ఇస్లామీయ వ్యవస్థ)ల్లో ఎంత పెద్ద వ్యత్యాసం ఉందో చూడండి! ఒక వ్యవస్థ ఆసాంతం అన్యాయం, దౌర్జన్యం, నిర్దాక్షిణ్యవైఖరి, స్వార్థ పరత్వంపై ఆధారపడి ఉండగా మరో వ్యవస్థ సానుభూతి, సహకారభావం, చేయూతపై నెలకొని ఉన్నది. ముస్లింలు ఖుద్దుగా ఈ శుభప్రదమైన, కారుణ్యప్రదమైన వ్యవస్థను అవలంబించకపోతే ఆ దోషం ఇస్లాందీ కాదు, దాన్ని ప్రవేశపెట్టిన దైవానిదీ కాదు. ముస్లింలు తమ కారుణ్య వ్యవస్థ యొక్క ప్రాముఖ్యాన్ని, ఆవశ్యకతను గుర్తించి, తమ జీవనరథాన్ని దానికనుగుణంగా పోనిస్తే ఎంత బావుండు!

347. ఇది మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అవతరించిన ఆఖరి దివ్య ఖుర్‌ఆన్ వచనమని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. ఈ వాక్యం అవతరించిన కొన్నాళ్ళకే ఆయన (సఅసం) ఇహలోక జీవితాన్ని వీడిపోయారు – సల్లల్లాహు అలైహి వ సల్లం! (ఇబ్నె కసీర్).

348. వడ్డీ నిషేధించబడిన సమాజంలో, దానధర్మాల గురించి నొక్కి వక్కాణించబడిన వ్యవస్థలో ప్రజలకు అప్పు అవసరం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే యిక్కడ వడ్డీ హరామ్‌గా ఖరారుచేయబడింది. పోతే ప్రతివ్యక్తీ దానధర్మాలు చేసే స్థోమత కలిగి ఉండదు. అలాగే ప్రతి వ్యక్తీ దానధర్మాలు పుచ్చుకోవడానికి కూడా ముందుకు రాడు. ఇటువంటి పరిస్థితిలో మనిషి తన అవసరాలను తీర్చుకోవడానికి అప్పు చేయటం అనివార్యం అవుతుంది. ఈ అప్పు వ్యవహారంలోనే గనక అజాగ్రత్త, అశ్రద్ధ వహిస్తే అది ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. అందుకే 'ఆయతుద్దయిన్' అనబడే ఈ ఆయతులో – దివ్య ఖుర్‌ఆన్‌లోని అత్యంత సుదీర్ఘమయిన ఈ ఆయతులో – అల్లాహ్ అప్పు వ్యవహారానికి సంబంధించిన ముఖ్యమైన సూచనలన్నింటినీ స్పష్టంగా పొందుపరచాడు. మనిషి దైనందిన జీవితానికి ఎంతో అవసరమైన అప్పు అతని పాలిట తప్పుగా పరిణమించరాదనీ, అతన్ని పప్పులో కాలెయ్యకుండా ఉంచాలని ఈ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయబడ్డాయి. అందుకే కాలపరిమితిని ముందుగానే నిర్ధారించుకోమని ఆదేశించబడింది. అలాగే లావాదేవీలు లిఖితపూర్వకంగా ఉండాలని కూడా తాకీదు చేయబడింది. ఆ వ్యవహారానికి సంబంధించి సాక్షులను కూడా ఉంచుకోమని నిర్దేశించబడింది.

349. రుణగ్రహీత అల్లాహ్‌కు భయపడుతూ, ఉన్నదున్నట్టుగా దస్తావేజు వ్రాయించాలి. ఎంత సొమ్ము అప్పుగా పుచ్చుకుంటే అంతే వ్రాయాలి. తగ్గించి వ్రాయకూడదు. ఒకవేళ రుణగ్రస్తుడు అమాయకుడో, విషయావగాహన లేనివాడో, మతి స్థిమితం లేనివాడో అయి ఉంటే అతని తరఫున అతని సంరక్షకుడు న్యాయసమ్మతంగా ఆ లాంఛనాలను పూర్తిచేయాలి. రుణదాతకు నష్టం వాటిల్లకుండా ఉండగలందులకు ఈ జాగ్రత్తలు తీసుకోవటం అవసరం.

ضَعِيْفًا اَوْ لَا يَسْتَطِيْعُ اَنْ يُّمِلَّ هُوَ فَلْيُمْلِلْ
وَلِيُّهٗ بِالْعَدْلِ ؕ وَاسْتَشْهِدُوْا شَهِيْدَيْنِ مِنْ
رِّجَالِكُمْ ۚ فَاِنْ لَّمْ يَكُوْنَا رَجُلَيْنِ فَرَجُلٌ وَّامْرَاَتٰنِ
مِمَّنْ تَرْضَوْنَ مِنَ الشُّهَدَآءِ اَنْ تَضِلَّ اِحْدٰىهُمَا
فَتُذَكِّرَ اِحْدٰىهُمَا الْاُخْرٰى ؕ وَلَا يَاْبَ الشُّهَدَآءُ
اِذَا مَا دُعُوْا ؕ وَلَا تَسْـَٔمُوْٓا اَنْ تَكْتُبُوْهُ صَغِيْرًا اَوْ
كَبِيْرًا اِلٰٓى اَجَلِهٖ ؕ ذٰلِكُمْ اَقْسَطُ عِنْدَ اللّٰهِ وَاَقْوَمُ
لِلشَّهَادَةِ وَاَدْنٰٓى اَلَّا تَرْتَابُوْٓا اِلَّآ اَنْ تَكُوْنَ تِجَارَةً
حَاضِرَةً تُدِيْرُوْنَهَا بَيْنَكُمْ فَلَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ
اَلَّا تَكْتُبُوْهَا ؕ وَاَشْهِدُوْٓا اِذَا تَبَايَعْتُمْ ۪ وَلَا يُضَآرَّ
كَاتِبٌ وَّلَا شَهِيْدٌ ؕ وَاِنْ تَفْعَلُوْا فَاِنَّهٗ فُسُوْقٌۢ

గ్రహీత అమాయకుడో, బలహీనుడో, లేక చెప్పి వ్రాయించ లేనివాడో అయి ఉంటే అతని సంరక్షకుడు న్యాయంగా వ్రాయించాలి. మీలో ఇద్దరు పురుషులను ఈ వ్యవహారానికి సాక్షులుగా పెట్టుకోండి. ఇద్దరు పురుషులు లభ్యం కానిపక్షంలో మీరిష్టపడే సాక్షులలో ఒక పురుషుణ్ణి, ఇద్దరు స్త్రీలను సాక్షులుగా పెట్టుకోండి.[350] ఎందుకంటే వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ మరచిపోయిన ఆమెకు జ్ఞాపకం చేయవచ్చు.[351] సాక్ష్యం కోసం పిలువబడినప్పుడు సాక్షులు రావటానికి నిరాకరించకూడదు. నిర్ణీతకాలం కొరకు తీసుకునే అప్పు, చిన్నదైనా పెద్దదైనా దాన్ని వ్రాసుకోవటంలో మాత్రం అశ్రద్ధ చేయరాదు. అల్లాహ్ దృష్టిలో ఈ పద్ధతి ఎంతో న్యాయవంతమైనది. ఇది సాక్ష్యాన్ని స్థిరంగా ఉంచుతుంది. సందేహాలకు, (అపార్థాలకు) లోనుకాకుండా ఉండేందుకు కూడా ఇది బాగా దోహదపడుతుంది.[352] ఒకవేళ మీ మధ్య జరిగే వ్యవహారం అప్పటికప్పుడు తేలిపోయే వ్యాపార లావాదేవీలదైతే అట్టి పరిస్థితిలో దాన్ని వ్రాసుకోకపోయినా ఫరవాలేదు. కాని క్రయ విక్రయాల సందర్భంగా కూడా సాక్షులను ఉంచుకోండి.[353] దస్తావేజు వ్రాసేవారిని గానీ, సాక్షులను

350. అంటే మీకు నమ్మకస్థులైనవారు, నిజాయితీపరులు అని భావం. దివ్య ఖుర్ఆన్‌లోని మూలం ద్వారా తెలిసే మరో విషయం ఏమిటంటే ఇద్దరు మహిళా సాక్షులు ఒక పురుష సాక్షికి సమానం. అలాగే పురుషుడు లేకుండా కేవలం ఒక స్త్రీ సాక్ష్యం యిచ్చినా అది స్వీకారయోగ్యం కాదు. స్త్రీ తప్ప మరొకరికి తెలియని వ్యవహారం అయితే అప్పుడు ఆమె సాక్ష్యం స్వీకారయోగ్యమవుతుంది. దావా చేసిన వ్యక్తి ప్రమాణం చేసినపక్షంలో, ఒక్క మగవాడు సాక్ష్యం యిచ్చినా సరిపోతుంది కదా! మరి అలాగే ఏదేని వివాదంపై దావేదారుని ప్రమాణంతో పాటు ఇద్దరు స్త్రీలు ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా తీర్పు ఇవ్వటం సరైనదేనా కాదా? అన్న విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. హనఫీ ధర్మవేత్తల దృష్టిలో ఇది ధర్మసమ్మతం కాదు. కాని హదీసువేత్తలు దీనికి సుముఖంగానే ఉన్నారు. ఎందుకంటే ఒక సాక్షితోపాటు, ఒక ప్రమాణం కూడా ఉంటే దాని ఆధారంగా నిర్ణయం గైకొనవచ్చని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. మరలాంటప్పుడు ఇద్దరు మహిళా సాక్షులు ఒక పురుష సాక్షికి సమానమైనట్లయితే, ఇద్దరు మహిళల సాక్ష్యం మరియు ఒక ప్రమాణం ఆధారంగా తీర్పు యివ్వటం కూడా ధర్మ సమ్మతమే (ఫత్‌హుల్ ఖదీర్).

351. ఒక పురుష సాక్షికి బదులుగా ఇద్దరు మహిళా సాక్షులను ఉంచటంలోని మర్మం యిక్కడ చెప్పబడింది. సాధారణంగా స్త్రీ జ్ఞాపకశక్తిలోనూ, సమయస్ఫూర్తిలోనూ పురుషునికన్నా కొంచెం వెనుకంజవేస్తుంది (సహీహ్ ముస్లింలోని హదీసు ద్వారా కూడా ఈ సంగతి విదితమవుతోంది). కొంతమంది భావిస్తున్నట్లుగా ఇది స్త్రీజాతిని కించపరచే ఉద్దేశంతో చెప్పబడిన మాట ఎంతమాత్రం కాదు. పురుషాధిక్యతను చాటటం అంతకన్నా కాదు. వాస్తవాల, సంఘటనల ఆధారంగా ఇది ఎవరూ కాదనలేని సత్యం.

352. వ్యవహారం లిఖితపూర్వకంగా ఉంటే న్యాయం, ధర్మాల పాలన సజావుగా సాగుతుంది. సాక్ష్యాలు దృఢంగా ఉంటాయి. ఒకవేళ సాక్షులు చనిపోయినా లేక అందుబాటులో లేకున్నా వ్రాతపూర్వకపత్రం ఒక్కటే సమస్యలన్నింటికీ పరిష్కారంగా నిలుస్తుంది. విషయం లిఖించబడి ఉండటం వల్ల సందేహాలకు, అనుమానాలకు ఆస్కారం ఉండదు.

بِكُمْ ؕ وَاتَّقُوا اللّٰهَ ؕ وَيُعَلِّمُكُمُ اللّٰهُ ؕ وَاللّٰهُ
بِكُلِّ شَيْءٍ عَلِيْمٌ ﴿282﴾

గానీ ఇరకాటంలో పెట్టరాదు[354] (అని తెలుసుకోండి). ఒకవేళ మీరు గనక అలాచేస్తే అది నియమోల్లంఘన క్రిందికి వస్తుంది. అల్లాహ్‌కు భయపడండి.[355] అల్లాహ్ మీకు (పద్ధతిని) నేర్పుతున్నాడు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు.

وَاِنْ كُنْتُمْ عَلٰى سَفَرٍ وَّلَمْ تَجِدُوْا كَاتِبًا فَرِهٰنٌ
مَّقْبُوْضَةٌ ؕ فَاِنْ اَمِنَ بَعْضُكُمْ بَعْضًا فَلْيُؤَدِّ
الَّذِى اؤْتُمِنَ اَمَانَتَهٗ وَلْيَتَّقِ اللّٰهَ رَبَّهٗ ؕ
وَلَا تَكْتُمُوا الشَّهَادَةَ ؕ وَمَنْ يَّكْتُمْهَا فَاِنَّهٗۤ
اٰثِمٌ قَلْبُهٗ ؕ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ عَلِيْمٌ ﴿283﴾

**283** ఒకవేళ మీరు ప్రయాణంలో ఉండి, వ్రాసేవాడు దొరక్కపోతే వస్తువును తాకట్టుగా పెట్టండి.[356] ఒకరికి మరొకరి పట్ల నమ్మకం ఏర్పడినట్లయితే, తనను నమ్మి ఇచ్చిన అమానతును అతను వాపసు చేయాలి. ఇంకా అతను తన ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతూ మసలుకోవాలి.[357] మీరు సాక్ష్యాన్ని దాచకండి. సాక్ష్యాన్ని దాచేవాని హృదయం పాపభూయిష్టమైనది.[358] మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

353. క్రయవిక్రయాల సందర్భంగా కూడా సాక్షులుంటే మంచిది. ముఖ్యంగా భారీఎత్తున సరుకును అప్పుగా యిస్తున్నప్పుడు, లేదా పెద్ద తరహా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నప్పుడు ఈ సాక్ష్యాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. సాక్ష్యాలు లేకపోతే ఏదో ఒక పక్షంవారు మాటతప్పే, విముఖత చూపే ప్రమాదం ఉంటుంది. కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వర్తకాన్ని ఇండ్ల కొనుగోలుగా, దుకాణాల, షాపుల అమ్మకంగా, పశువుల క్రయవిక్రయాలుగా తలపోశారు (ఐసరుత్తఫాసీర్).

354. ఇరకాటంలో పెట్టరాదంటే భావం – దస్తావేజులు వ్రాసేవారిని, సాక్షులుగా ఉండే వారిని మరీ దూరప్రాంతాలకు పిలిచి వ్యవహారం చేయటం, వారి సాధకబాధకాలను పట్టించుకోకపోవటం, అబద్ధపు విషయాలకు సాక్షిగా ఉండమని వారిపై ఒత్తిడి తీసుకురావటం, విషయాన్ని వక్రీకరించి వ్రాయమనటం, వారు ఒప్పుకోకపోతే బెదిరించటం – ఇవన్నీ ఇరకాటంలోపెట్టే, నష్టం చేకూర్చే పద్ధతులే.

355. అంటే మీకు ఏ ఏ విషయాల అమలుపై తాకీదు చేయటం జరిగిందో వాటిని ఖచ్చితంగా అమలుపరచండి. ఏ విషయాలను విడనాడమని ఆజ్ఞాపించబడిందో వాటిని విడనాడండి. ఈ విషయంలో ఎల్లప్పుడూ అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.

356. ఒకవేళ ప్రయాణావస్థలో అప్పు తీసుకోవలసివస్తే, అక్కడ పత్రం వ్రాసేవారుగానీ, వ్రాత పత్రంగానీ లభ్యం కాకపోతే అప్పుడు అప్పు తీసుకునేవాడు అప్పు ఇచ్చే వ్యక్తి దగ్గర తన వస్తువును కుదువపెట్టాలి. మహాప్రవక్త (సఅసం) సయితం ఒకసారి తన యుద్ధ కవచాన్ని ఒక యూదుని వద్ద తాకట్టుపెట్టారు (బుఖారి – ముస్లిం). తాకట్టు పెట్టబడిన వస్తువు ప్రయోజనం చేకూర్చేదై ఉంటే అట్టి ప్రయోజనం వస్తువు యజమానికే దక్కాలి. తాకట్టు పెట్టుకొన్నవానికి మాత్రం కాదు. కాకపోతే తాకట్టు పెట్టుకున్న వస్తువు మెయింటెనెన్స్ కోసం ఏమన్నా ఖర్చు అయితే ఆ ఖర్చుల్ని వస్తువు యజమానిపై వడ్డించవచ్చు. మిగిలిన ఆదాయాన్ని మాత్రం వస్తువు యజమానికే ఇవ్వవలసి ఉంటుంది.

357. ఒకవేళ ఒండొకరి పట్ల నమ్మకం ఉన్నట్లయితే వస్తువును తాకట్టుగా పెట్టుకోకుండా కూడా లావాదేవీల వ్యవహారం జరపవచ్చు. ఇక్కడ అమానతు అంటే 'అప్పు' అని అర్థం. దైవానికి భయపడుతూ తీసుకున్న అప్పును ఉత్తమరీతిలో తిరిగి ఇవ్వాలి.

358. సాక్ష్యాన్ని దాచిపెట్టడం మహాపరాధం. అందుకే దీనిపై తీవ్రమయిన హెచ్చరిక చేయబడింది. హదీసులలో కూడా దీనిపై తీవ్ర హెచ్చరిక చేయబడింది. అలాగే సాక్ష్యంపై నిలబడటం, సత్యసాక్ష్యం ఇవ్వటం ఎంతో పుణ్యప్రదమైన

**284** ఆకాశాలలో, భూమిలో ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్‌దే. మీ మనసులలో ఉన్న దాన్ని మీరు వెల్లడించినా లేక దాచిపెట్టినా అల్లాహ్ మీ నుండి దాని లెక్క తీసుకుంటాడు.[359] ఆ తరువాత ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు, తాను కోరిన వారిని శిక్షిస్తాడు. అల్లాహ్‌కు అన్నింటిపై అధికారం ఉంది.

لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۭ وَاِنْ تُبْدُوْا
مَا فِيْٓ اَنْفُسِكُمْ اَوْ تُخْفُوْهُ يُحَاسِبْكُمْ بِهِ اللّٰهُ ۭ
فَيَغْفِرُ لِمَنْ يَّشَاۗءُ وَيُعَذِّبُ مَنْ يَّشَاۗءُ ۭ وَاللّٰهُ
عَلٰي كُلِّ شَيْءٍ قَدِيْرٌ ﴿284﴾

**285** తన ప్రభువు తరఫున అవతరింపజేయబడిన దానిని ప్రవక్త విశ్వసించాడు. దాన్ని విశ్వాసులు కూడా (సత్యమని నమ్మారు). వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను,

اٰمَنَ الرَّسُوْلُ بِمَآ اُنْزِلَ اِلَيْهِ مِنْ رَّبِّهٖ
وَالْمُؤْمِنُوْنَ ۭ كُلٌّ اٰمَنَ بِاللّٰهِ وَمَلٰۗىِٕكَتِهٖ

విషయం అని కూడా చెప్పబడింది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు : "సాక్ష్యం కోసం పిలువబడకముందే, స్వయంగా సాక్ష్యం ఇవ్వడానికి ముందుకు వచ్చిన సాక్షి అత్యుత్తముడు" (సహీహ్ ముస్లిం – కితాబుల్ అఖ్‌జియ). వేరొక ఉల్లేఖనంలో అత్యంత నీచమైన సాక్ష్యం ఏదో కూడా తెలియజేయబడింది. "అత్యంత నీచులైన సాక్షులెవరో నేను మీకు తెలుపనా? సాక్ష్యం ఇవ్వండి అని పిలువక ముందే వారు సాక్ష్యం ఇచ్చేందుకు ఎగబడి వస్తారు." (సహీహ్ బుఖారీ – కితాబుర్రిఖాఖ్). అంటే తప్పుడు సాక్ష్యాలు, అబద్ధపు సాక్ష్యాలు యిచ్చే వారన్నమాట! ఈ పనిచేసి వారు పాపాన్ని మూట కట్టుకుంటారు. ఈ సందర్భంగా 'హృదయం' అంటూ ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనార్హం. హృదయం మానవ శరీరావయవాలన్నింటికీ సారథి లాంటిది. అదెలాంటి మాంసపు ముద్దంటే అది గనక సజావుగా ఉంటే శరీరమంతా ఆరోగ్యవంతంగా ఉంటుంది. అది గనక చెడిపోతే శరీరమంతా చెడిపోతుంది (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్).

359. ఈ ఆయతు అవతరించినప్పుడు మహాప్రవక్త ప్రియ సహచరులు (రజి) తీవ్రంగా ఆందోళన చెందారని హదీసుల ద్వారా తెలుస్తోంది. వారు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! మాకు ఆదేశించబడినట్లుగా నమాజ్, రోజా, జకాత్, జిహాద్ తదితర ఆచరణలను సాధ్యమైనంతవరకు మేము పాటిస్తూనే ఉన్నాము. ఎందుకంటే ఇవి మా శక్తికి మించినవి కావు. కాని మనసులో జనించే ఆలోచనలు, ప్రేరణలపై మాకెలాంటి అదుపు ఉండదు. అవి మనిషి తాహతుకు లోబడనివి. మరైతే అల్లాహ్ వీటి గురించి కూడా లెక్క తీసుకుంటానని ప్రకటించాడు" అని విన్నవించుకున్నారు. "ప్రస్తుతానికి ఏ ఆజ్ఞ వచ్చినా మీరు 'మేము విన్నాము, శిరసావహించాము' అనే అనండి" అని మహాప్రవక్త (స) తన సహచరులకు సముదాయించారు. సహచరులు మారు మాట్లాడలేదు. వారి ఈ విధేయతా భావాన్ని చూచి అల్లాహ్ ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు : "అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం వేయడు." ఈ ఆయతు ద్వారా పై ఆయతు ఆదేశాన్ని రద్దుపరచాడు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్). క్రింది హదీసు కూడా దీన్ని సమర్థిస్తోంది: మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "నా అనుచర సమాజం వారి ఆంతర్యాల్లో జనించే విషయాలను అల్లాహ్ మన్నించాడు. అయితే ఆంతర్యంలో జనించిన చెడ్డ విషయాలను ఆచరిస్తే లేక నోటితో వ్యక్తపరిస్తే మాత్రం ఆయన తప్పకుండా ప్రశ్నిస్తాడు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇత్ఖ్). దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే మనసులో ఉత్పన్నమయ్యే భావాలు, భావనలపై లెక్క తీసుకోబడదు. కాని వాటిపై దృఢ సంకల్పం చేసుకుంటే లేక ఆచరణలో పెడితే మాత్రం నిలదీసి అడగటం జరుగుతుంది. దీనికి ప్రతిగా ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ ఏమంటారంటే; ఈ ఆయతు రద్దు కాలేదు. అల్లాహ్ నిలదీసి లెక్క తీసుకున్న వారందరికీ శిక్ష పడి తీరుతుందని కూడా అనుకోరాదు. ఎందుకంటే అల్లాహ్ లెక్క తీసుకోవడానికైతే అందరి నుంచీ తీసుకుంటాడు. కాని లెక్క తీసుకున్న తరువాత చాలామంది ఆయన క్షమాగుణం ద్వారా ముక్తి పొందుతారు. మరికొందరికైతే; వారి ఒక్కొక్క పాపాన్ని గుర్తుచేసి, ఆ పాపం చేసినట్లు వారిచేత ఒప్పించి, కడకు వారికి క్షమాభిక్ష పెడతాడు (ఈ హదీసు సహీహ్ బుఖారీ, ముస్లింలలో ఉంది – ఇబ్నె కసీర్ ఆధారంగా).

وَكُتُبِهِ وَرُسُلِهِ لَا نُفَرِّقُ بَيْنَ أَحَدٍ مِّن
رُّسُلِهِ وَقَالُوا سَمِعْنَا وَأَطَعْنَا غُفْرَانَكَ
رَبَّنَا وَإِلَيْكَ الْمَصِيرُ ﴿٢٨٥﴾

ఆయన ప్రవక్తలనూ విశ్వసించారు. "మేము ఆయన (పంపిన) ప్రవక్తల మధ్య ఎలాంటి విచక్షణను, భేదభావాన్నీ పాటించము"[360] (అని వారు చెబుతారు). "మేము విన్నాము. విధేయులం అయ్యాము. మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము. కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే" అని అంటారు.

لَا يُكَلِّفُ اللَّهُ نَفْسًا إِلَّا وُسْعَهَا لَهَا مَا كَسَبَتْ
وَعَلَيْهَا مَا اكْتَسَبَتْ رَبَّنَا لَا تُؤَاخِذْنَا إِن نَّسِينَا
أَوْ أَخْطَأْنَا رَبَّنَا وَلَا تَحْمِلْ عَلَيْنَا إِصْرًا كَمَا
حَمَلْتَهُ عَلَى الَّذِينَ مِن قَبْلِنَا رَبَّنَا وَلَا تُحَمِّلْنَا
مَا لَا طَاقَةَ لَنَا بِهِ وَاعْفُ عَنَّا وَاغْفِرْ لَنَا
وَارْحَمْنَا أَنتَ مَوْلَانَا فَانصُرْنَا عَلَى الْقَوْمِ
الْكَافِرِينَ ﴿٢٨٦﴾

**286** అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం వేయడు. అది ఏ పుణ్యాన్ని సంపాదించినా దానికే లభిస్తుంది. మరి అది ఏ పాపాన్ని మూటగట్టుకున్నా దాని ఫలితాన్ని అది చవి చూస్తుంది. (ఇలా ప్రార్థిస్తూ ఉండండి): "ఓ మా ప్రభూ! మేము మరచిపోయినా, లేక మేము పొరబడినా మమ్మల్ని నిలదీయకు. మా ప్రభూ! మాకు పూర్వం గతించిన వారిపై వేసినటువంటి భారాన్ని మాపై వేయకు. మా ప్రభూ! మేము మోయలేనటువంటి బరువును మాపై మోపకు. మమ్మల్ని మన్నించి వదలిపెట్టు. మాకు క్షమాభిక్ష పెట్టు. మాపై దయజూపు. నీవే మా సంరక్షకుడవు. అందుచేత అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయపడు."

360. ఈ వాక్యంలో మరోసారి 'విశ్వాసాల' ప్రస్తావనను తీసుకువచ్చి విశ్వాసులకు 'విశ్వాస' ప్రాముఖ్యతను జ్ఞాపకం చేయటం జరిగింది. తరువాతి వాక్యంలో అల్లాహ్ తన దాసులకు చేసిన మహోపకారాన్ని గుర్తుచేశాడు. అదేమంటే ఆయన వారిపై శక్తికి మించిన బరువు బాధ్యతలను మోపలేదు. ఈ రెండు ఆయతులు అత్యంత మహత్పూర్వకమైనవని హదీసుల ద్వారా తెలుస్తోంది. దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరయినా బఖరా సూరాలోని చివరి రెండు ఆయతులను రాత్రిపూట పారాయణం చేస్తే అవి అతని కోసం చాలు" (సహీహ్ బుఖారీ - ఇబ్నె కసీర్). అంటే వీటి మూలంగా అల్లాహ్ అతన్ని తన రక్షణలోకి తీసుకుంటాడు. రాత్రిపూట చేసే దైవధ్యానానికి ఈ రెండు ఆయతులు సరితూగుతాయని మరి కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

వేరొక హదీసు ప్రకారం మహాప్రవక్త (సఅసం)కు మేరాజ్ యాత్ర సందర్భంగా ప్రసాదించబడిన మూడు వరాలలో బఖరా సూరాలోని ఈ చివరి రెండు ఆయతులు కూడా ఉన్నాయి (సహీహ్ ముస్లిం - సిద్రతుల్ మున్తహా ప్రస్తావన గల అధ్యాయం). దైవపీఠానికి (అర్ష్‌కు) క్రిందనున్న ఖజానా నుంచి అంతిమ దైవప్రవక్త (స)కు ఈ రెండు ఆయతులు అనుగ్రహించబడ్డాయని మరికొన్ని ఉల్లేఖనాలు తెలుపుతున్నాయి. ఈ ఆయతులు ఆయనకు తప్ప మరొకరెవరికీ అనుగ్రహించబడలేదు (అహ్మద్, నసాయి, తబ్రానీ, బైహఖీ, హాకిమ్, దారిమీ). ఈ సూరా ముగింపుపై ముఆజ్ (రజి) 'ఆమీన్' అనేవారు (ఇబ్నె కసీర్).

3వ సూరా

# ఆలి ఇమ్రాన్

## ఇమ్రాన్ కుటుంబం

అవతరణ మదీనాలో

ఆయతులు 200

### పరిచయం

*దివ్య ఖుర్ఆన్‌లో ఇది మూడవ సూరా. అయితే దివ్య ఖుర్ఆన్ అవతరణా క్రమంలో మూడవ సూరాగా భావించరాదు. ఇది మదనీ సూరా, అంటే మదీనాలో అవతరించింది. ఈ సూరాలో తౌహీద్ (ఏక దైవారాధన), దివ్య ఖుర్ఆన్ అవతరణల ధృవీకరణ, ప్రవక్తల పరంపర, కొన్ని ఇస్లామీయ చట్టపరమైన ఆదేశాలు ప్రధానంగా ఉన్నాయి. అత్యంత ధర్మపరాయణత్వం కలిగిన ఇమ్రాన్ కుటుంబం – ప్రవక్త మూసా (అస), ప్రవక్త ఈసా (అస)లకు పూర్వీకుడైన ఇమ్రాన్ కుటుంబం పేరు ఈ సూరాకు పెట్టడం జరిగింది.*

*ఈ సూరా తౌహీద్ (ఏక దైవారాధన)ను నొక్కి చెబుతూ ప్రారంభం అవుతుంది. దివ్య ఖుర్ఆన్ దేవుని తరఫున అవతరిస్తున్న దైవవాణి అని నొక్కి చెబుతూ, ఇంతకు ముందు అవతరించిన దివ్య గ్రంథాలు – తౌరాత్, ఇంజీల్‌లను ధృవీకరిస్తుంది. మునుపటి దివ్య గ్రంథాలు – తౌరాత్, ఇంజీల్‌ల మాదిరిగా కాకుండా దివ్య ఖుర్ఆన్ ఒక సంపూర్ణమైన దివ్యవాణి అని ఈ సూరా తెలుపుతుంది. దివ్య ఖుర్ఆన్‌లోని రెండవ సూరా ముఖ్యంగా యూదుల గురించి, ప్రవక్త మూసా (అస) గురించి ప్రస్తావించింది. కాగా, ఈ సూరా ముఖ్యంగా క్రైస్తవుల గురించి, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గురించి ప్రస్తావించింది.*

*ఈ సూరాను రెండు ముఖ్యమైన భాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగంలో గ్రంథ ప్రజల (యూదుల, క్రైస్తవుల) గురించి, ముఖ్యంగా క్రైస్తవుల గురించి ప్రస్తావన ఉంది. వారిని ప్రత్యేకంగా ఉద్దేశించి చెప్పడం జరిగింది. కొత్తగా అవతరిస్తున్న ఈ దైవవచనాలను స్వీకరించాలనీ, అల్లాహ్‌కు భాగస్వాములుగా ఎవరినీ చేర్చరాదని చెప్పడం జరిగింది. రెండవ భాగంలో ఇస్లామీయ ధర్మ సూత్రాలు, దైవాదేశాల ప్రస్తావన ఉంది.*

*యావత్తు మానవాళిని సృష్టించింది ఆయనే. మనిషికి మాతృగర్భంలో ఆయన రూపురేఖలు ఇస్తాడు. ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయమేమంటే, మాతృగర్భంలో జీవితం ఎలాంటిదో మనకు తెలియనట్లే, పుట్టుక వెనుక ఉన్న రహస్యాలు మనకు తెలియనట్లే, ఈసా ప్రవక్త (అస) పుట్టుక కూడా మనిషి మేధకు అందని విషయం.*

*ఇస్రాయీల్ సంతతి గురించి ప్రస్తావిస్తూ, వారిని అల్లాహ్ చిహ్నాలను విశ్వసించడానికి నిరాకరించే వారిగా వర్ణించడం జరిగింది. గత కాలానికి చెందిన అనేకమంది ప్రవక్తలను హతమార్చిన జాతిగా, ఎంతో మంది సదాచార సంపన్నులను చంపిన వారిగా పేర్కొంది. యూదులను, క్రైస్తవులను ఉద్దేశించి, వారికి దివ్య గ్రంథాలను ప్రసాదించడం జరిగిందనీ, కాని వారు ఆ గ్రంథాలకు కట్టుబడలేదని విమర్శించడం జరిగింది. వారి గ్రంథాలలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గురించిన ప్రస్తావన ఉందనీ, కాబట్టి గ్రంథప్రజలు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను విశ్వసించాలని చెప్పడం జరిగింది.*

*మెస్సయ్య అల్లాహ్ కాదనీ, అల్లాహ్ కుమారుడు కూడా కాదనీ, కేవలం మామూలు మనిషి మాత్రమేననీ, ఒక ప్రవక్త మాత్రమేనని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా అనేక చారిత్రక సంఘటనలను ప్రస్తావించడం జరిగింది.*

*ఈ సూరాలో ఆదమ్, ఈసా (అస)ల సృష్టి గురించి గుర్తు చేయడం జరిగింది. ఈసా ప్రవక్త సృష్టిని ఆదమ్ (అస) సృష్టితో పోల్చటం జరిగింది. ఆదమ్ (అస)ను దేవుడు తల్లి తండ్రి – ఇద్దరూ లేకుండా సృష్టించాడు. ఈసా (అస)ను కేవలం తండ్రి లేకుండా పుట్టించాడు. ఈసా ప్రవక్త అల్లాహ్ సృష్టించిన మానవమాత్రుడు తప్ప అంతకు మించి ఏమీ కాదని ఈ ఆయతులు స్పష్టం చేస్తున్నాయి. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవ్వరూ లేరని ఈ సందర్భంగా స్పష్టం చేయడం జరిగింది.*

మానవాళి కోసం ఉనికిలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజంగా ముస్లిములను ఈ సూరాలో అభివర్ణించడం జరిగింది. మంచి వైపునకు పిలిచే, చెడు నుంచి నిరోధించే సమాజంగా ఏర్పడాలని ముస్లిములను ప్రోత్సహించింది. ఈ సూరాలో ముస్లిముల నైతిక స్థయిర్యాన్ని పెంపొందించే వాక్యాలు ఉన్నాయి. అవిశ్వాసులు ఎన్నటికీ ముస్లిములకు నష్టం కలిగించలేరనీ, పరాభవం, అవమానం, దైన్యం, దైవాగ్రహం, పతనాలు వారికి తప్పవని తెలియజేసింది. ముస్లిములు కష్టకాలంలో సహనం వహిస్తే, అల్లాహ్‌ను నమ్ముకుంటే అవిశ్వాసుల కుట్రలు భగ్నమవుతాయని భరోసా ఇచ్చింది. "దేవుడు ఒక్కడే", "సహనం సాఫల్యానికి సాధనం" అనే రెండు ముఖ్య విషయాలను నొక్కి చెబుతూ ఈ సూరా ముగుస్తుంది.

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 10 | 280, 285 | 'పొరబాటుగా జరిగిన ప్రతీకారం' 'శత్రు మూకలు' | ఇస్లాం ప్రారంభకాలంలో ముహమ్మద్ (స)తో యూదుల సంబంధాలు ఎలా ఉండేవి? కొన్ని యూద తెగలను మదీనా నగరం నుంచి ఎందుకు బహిష్కరించవలసి వచ్చింది?- తదితర విషయాలు. |
| 11 | 97, 51<br>28, 22<br>18 | 'సముద్రం చీలటం' 'హెచ్చరించే దూతలు' 'అల్లాహ్ పథకం' 'నిష్ఫలం' 'జలప్రళయం' | ఫిర్‌ఔనీయులకు ఏ గతి పట్టింది? వారికి పూర్వం గతించిన వారంటే ఎవరు? వారిలో ఎవరెవరిపై ఏ ఏ రకాల శిక్షలు అవతరించాయి? |
| 13,123 | 250 | 'బద్ర్ యుద్ధం' | బద్ర్ యుద్ధానికి దారితీసిన పరిస్థితులేవి? ఈ యుద్ధంలో విజయం ఎవరిని వరించింది? యుద్ధానంతరం దైవప్రవక్త (స) మక్కా ఖైదీల పట్ల ఎలా వ్యవహరించారు? |
| 21 | 179 | 'యహ్‌యా జననం' | దైవప్రవక్తల పట్ల యూదజాతి వ్యవహారం ఎలా ఉండింది? దైవప్రవక్తల హత్యల్లో వారి పరోక్ష పాత్ర. |
| 33 | 4, 14<br>30, 184 | 'మానవ సృష్టి' 'ప్రవక్త నూహ్' 'దైవప్రవక్త ఇబ్రాహీమ్' 'మర్యమ్' | ఆదమ్, నూహ్, ఇబ్రాహీమ్, ఇమ్రాన్ మొదలగువారి జీవిత చరిత్రలు. సమస్త లోకవాసులపై అల్లాహ్ వారికి ఎటువంటి ప్రాధాన్యతను ప్రసాదించాడో బోధపడుతుంది. |
| 35 | 351 | 'ముబాహలా' | 'ముబాహలా' అంటే ఏమిటి?నికార్సయినవిశ్వాసుల చేతుల్లో అది ఎంతటి శక్తివంతమైన ఆయుధమో తెలుస్తుంది. |
| 67-68 | 30 | 'దైవప్రవక్త ఇబ్రాహీమ్' | ఇబ్రాహీమ్ ప్రవక్త జీవిత చరిత్ర ఏకదైవారాధనకు పెట్టింది పేరు. ఆయన పేరు వింటేనే 'తౌహీద్' (ఏక దైవారాధన) గుర్తుకు వస్తుంది. |
| 121-122 | 271 | 'ఉహుద్ యుద్ధం' | ఉహుద్ యుద్ధానికి దారితీసిన పరిస్థితులు. అందులో జయాపజయాలు. |
| 144 | 271<br>276 | 'ఉహుద్ యుద్ధం' 'వదంతి' | ఒక వదంతి యుద్ధరంగంలో ముస్లింల ఆత్మవిశ్వాసాన్ని నీరుగార్చింది. ఏమిటి ఆ వదంతి? అది ముస్లింలకు ఎంత నష్టం కలుగజేసింది? ముస్లింలు ఆ వదంతి నుంచి ఎలా తేరుకోగలిగారు? |

## ఆలి ఇమ్రాన్[1] సూరా

## سُوْرَةُ اٰلِ عِمْرٰنَ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** అలిఫ్ లామ్ మీమ్.

الٓمّٓ ﴿1﴾

**2** అల్లాహ్ – ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. ఆయన సజీవుడు, సర్వసృష్టికి మూలాధారం.[2]

اللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ الْحَيُّ الْقَيُّوْمُ ﴿2﴾

**3** (ఓ ప్రవక్తా!) ఆయన నీపై సత్యంతోపాటు ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు.[3] దానికి పూర్వం వచ్చిన గ్రంథాలను అది ధృవపరుస్తుంది. ఆయనే తౌరాతు, ఇన్జీలు గ్రంథాలను అవతరింపజేశాడు,[4]

نَزَّلَ عَلَيْكَ الْكِتٰبَ بِالْحَقِّ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ وَاَنْزَلَ التَّوْرٰىةَ وَالْاِنْجِيْلَ ﴿3﴾

1. ఈ సూరా మదీనాలో అవతరించింది. ఇందలి వివిధ ఆయతులు వివిధ సందర్భాలలో– హిజ్రత్ అనంతరం – అవతరించాయి. మొదటి 83 ఆయతులు హిజ్రీ 9వ ఏట దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చిన నజరాన్ క్రైస్తవబృందం గురించి అవతరింపజేయబడినవే. క్రైస్తవ మతాచార్యులు దైవప్రవక్త (స) వద్దకు వచ్చి క్రైస్తవ మత విశ్వాసాల గురించి – ఇస్లాం గురించి వాదించారు. వారి సిద్ధాంతాలను ఖండిస్తూ 'ముబాహలా' కొరకు కూడా వారిని పిలువటం జరిగింది. వాటి వివరాలు ముస్ముందు వస్తాయి. ఈ నేపథ్యంలోనే ఈ సూరాలోని ఈ ఆయతులను అధ్యయనం చేయాలి.

2. **అల్ హయ్యు** ( اَلْحَيُّ ), **అల్ ఖయ్యూము** ( اَلْقَيُّوْمُ ) : ఇవి రెండూ అల్లాహ్ ముఖ్య గుణాలు. 'హయ్యున్' అంటే సజీవుడు. నిత్యుడు, ఆది మధ్యాంత రహితుడు. పూర్వం కూడా ఉన్నాడు. నేడూ ఉన్నాడు, ఏనాటికైనా ఉంటాడు. ఆయనకు మరణం అన్నది ఉండదు. 'ఖయ్యూం' అంటే సమస్త సృష్టికి మూలాధారం, సమస్తాన్నీ ప్రతిష్ఠించినవాడు, సర్వాన్నీ కాపాడేవాడు, పర్యవేక్షకుడు అని భావం. విశ్వం మొత్తం ఆయనపైనే ఆధారపడి ఉంది. కాని ఆయన మాత్రం ఎవరిపైనా ఆధారపడిలేడు. విశ్వమంతటికీ ఆయన అవసరం ఉంది. కాని ఆయనకు మాత్రం ఎవరి అవసరమూ లేదు. క్రైస్తవులు ఏసు ప్రవక్త (ఈసా)ను దైవంగా లేక దేవుని కుమారుడుగా లేక ముగ్గురిలో ఒకనిగా నమ్మేవారు. కనుక వారికి ఈ ఆయతు ద్వారా జవాబు ఇవ్వబడింది – ఏసు ప్రవక్త కూడా దేవుని సృష్టి అయినపుడు, ఆయన సయితం తల్లి కడుపు నుంచి పుట్టినప్పుడు, ఆయన పుట్టుక కూడా సృష్టి ఉనికిలోకి వచ్చిన చాలా కాలం తరువాత జరిగినపుడు ఆయన దేవుడు లేక దేవుని కుమారుడు ఎలా అవుతారు? మీ విశ్వాసమే గనక ఒకవేళ నిజమైనదైతే ఆయన ఒక మానవ సృష్టిగా ముందుకువచ్చే బదులు దైవత్వపు లక్షణాలతో సృష్టి ఉనికికి ముందుగానే ప్రభవించి ఉండాల్సింది. ఆయనకు మరణం కూడా సంభవించవలసింది కాదు. కాని ఒకానొక నిర్ణీత సమయంలో ఆయన మరణించవలసినవారే. క్రైస్తవులైతే ఆయన మృత్యువాతన పడ్డారనే అంటారు.

దివ్య ఖుర్ఆన్‌లోని మూడు ఆయతులలో అల్లాహ్ మహోన్నత నామం (ఇస్మె ఆజమ్) పేర్కొనబడిందనీ, దాని ఆధారంగా చేసే వేడుకోలు త్రోసిపుచ్చబడదనీ హదీసుల్లో చెప్పబడింది : వాటిలో మొదటిది ఆలి ఇమ్రాన్ సూరాలోని ఈ (రెండవ) ఆయతు. రెండవది : ఆయతుల్ కుర్సీలోనిది (అల్లాహు లా యిలాహ ఇల్లా హువల్ హయ్యుల్ ఖయ్యూమ్). మూడవది : తాహా సూరా లోనిది (వ అనతిల్ వుజూహు లిల్ హయ్యిల్ ఖయ్యూమ్) (ఇబ్నె కసీర్ – తఫ్సీర్ ఆయతుల్ కుర్సీ).

3. అంటే ఈ గ్రంథం అల్లాహ్ తరపు నుండి అవతరింపజేయబడిందనేది సత్యం. ఇందులో సందేహానికి ఆస్కారం లేదు. ఇక్కడ గ్రంథం అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం.

مِنْ قَبْلُ هُدًى لِّلنَّاسِ وَأَنْزَلَ الْفُرْقَانَ ۗ إِنَّ الَّذِينَ كَفَرُوا بِآيَاتِ اللَّهِ لَهُمْ عَذَابٌ شَدِيدٌ ۗ وَاللَّهُ عَزِيزٌ ذُو انْتِقَامٍ ④

4 ఇంతకు మునుపు ప్రజల కొరకు మార్గదర్శకత్వంగా. ఇంకా గీటురాయి (ఖుర్ఆన్)ని కూడా ఆయనే అవతరింపజేశాడు.[5] అల్లాహ్ ఆయతులను తిరస్కరించిన వారికి కఠినశిక్ష పడటం ఖాయం. అల్లాహ్ సర్వాధిక్యుడు. ప్రతీకారం చేసేవాడూను.

إِنَّ اللَّهَ لَا يَخْفَىٰ عَلَيْهِ شَيْءٌ فِي الْأَرْضِ وَلَا فِي السَّمَاءِ ⑤

5 నిశ్చయంగా – భూమ్యాకాశాలలోని ఏ వస్తువూ అల్లాహ్‌కు గోప్యంగా లేదు.

هُوَ الَّذِي يُصَوِّرُكُمْ فِي الْأَرْحَامِ كَيْفَ يَشَاءُ ۚ لَا إِلَٰهَ إِلَّا هُوَ الْعَزِيزُ الْحَكِيمُ ⑥

6 ఆయనే తాను కోరిన విధంగా మాతృ గర్భాల్లో మీ రూపురేఖలను మలుస్తాడు.[6] ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన శక్తి సంపన్నుడు, వివేక సంపన్నుడు కూడాను.

هُوَ الَّذِي أَنْزَلَ عَلَيْكَ الْكِتَابَ مِنْهُ آيَاتٌ مُحْكَمَاتٌ هُنَّ أُمُّ الْكِتَابِ وَأُخَرُ مُتَشَابِهَاتٌ ۖ

7 నీపై గ్రంథాన్ని అవతరింపజేసినవాడు ఆయనే. అందులో సుస్పష్టమైన (ముహ్కమాత్) వచనాలున్నాయి. అవి గ్రంథానికి మూలం. మరికొన్ని బహువిధ భావంతో కూడిన (ముతషాబిహాత్) వచనాలున్నాయి.[7] హృదయాలలో వక్రత ఉన్న వారు

4. ఇంతకు మునుపు దైవప్రవక్తల (అలైహిముస్సలాం)పై అవతరించిన గ్రంథాలు సత్యమైనవని ఈ గ్రంథం ధృవీకరిస్తుంది. ఆ గ్రంథాలలో వివరించబడిన అంశాలన్నింటినీ అంగీకరిస్తుంది. వాటిలో పేర్కొనబడివున్న భవిష్యత్తుకు సంబంధించిన ప్రకటనలను ఒప్పుకుంటుంది. పూర్వపు గ్రంథాలను అవతరింపజేసినవాడే ఈ ఖుర్ఆన్ గ్రంథాన్ని కూడా అవతరింపజేశాడనటానికి ఇదొక ప్రబల తార్కాణం. ఒకవేళ సర్వలోక ప్రభువు తరఫునగాక వేరొకరి ప్రమేయంతో, మానవుల కృషితో ఇది రూపొందించబడి ఉంటే అది పూర్వపు గ్రంథాలను సత్యమని ధృవీకరించేది కాదు, వాటికి విరుద్ధంగా ఉండేది. అన్ని విషయాలలోనూ వాటితో విభేదించేది.

5. అంటే తౌరాత్, ఇన్జీలు గ్రంథాలు కూడా తమ తమ కాలాల్లో మానవాళికి సన్మార్గం చూపేవన్నది నిర్వివాదాంశం. ఎందుకంటే ఆ గ్రంథాలను అవతరింపజేయటంలోని అసలు ఉద్దేశం మార్గం చూపటమే. ఆ తర్వాత "ఈ గీటురాయిని కూడా ఆయనే అవతరింపజేశాడు" అన్న పలుకును బట్టి విదితమయ్యేదేమిటంటే అంతిమ దైవగ్రంథమైన ఖుర్ఆన్ వొసగబడిన తరువాత ఇక ఇన్జీలు, తౌరాత్‌ల అవసరం లేదు. నేడు సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను వేరుపరచగలిగే గ్రంథం ఖుర్ఆన్ ఒక్కటే. కనుక ఖుర్ఆన్ గ్రంథాన్ని సత్యమని నమ్మేవరకూ ఎవరూ ముస్లింలు, విశ్వాసులు కాజాలరు.

6. అంటే అందంగానూ – అంద వికారంగానూ, మగవానిగానూ – ఆడదానిగానూ, భాగ్యవంతునిగానూ – దౌర్భాగ్యునిగానూ, సర్వాంగ సుందరంగానూ – అంగవికలునిగానూ తనకిష్టం వచ్చిన విధంగా మలుస్తాడు. మాతృగర్భాలలో ఇన్ని విధాలుగా రూపకల్పన చేసే అధికారం దైవానికి మాత్రమే ఉంది. అటువంటప్పుడు ఈసా అలైహిస్సలాం (ఏసు ప్రవక్త) దైవం ఎలా అవుతారు? వాస్తవానికి ఆయన సయితం మాతృగర్భంలో సృష్టి ప్రక్రియ వివిధ దశలను అధిగమించినవారేనాయె!

7. **ముహ్కమాత్ (مُحْكَمَاتٌ)** : అంటే స్పష్టమైనవి. ఇందులో చేయవలసినవి – చేయకూడనివి, ఆదేశాలు – ఆజ్ఞలు, అనుజ్ఞలు, గాథలు–వృత్తాంతాలు అన్నీ ఉన్నాయి. అవి ఎంతో కూలంకషంగా ఉంటాయి. వాటి అర్థం స్థిరంగా ఉంటుంది. వాటిని అర్థం చేసుకోవటంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. దీనికి ప్రతిగా ముతషాబిహాత్ అనబడే ఆయతులు ఉన్నాయి. ఉదాహరణకు : అల్లాహ్ అస్తిత్వం, స్వర్గనరకాలు, దైవదూతలు మొదలగునవి. వాటి వాస్తవికతను ఆకళింపు చేసుకోవటంలో మానవ బుద్ధిజ్ఞానాలు విఫలమవుతూ ఉంటాయి. వాటినుంచి నానార్థాలు తీయడానికీ

فَأَمَّا الَّذِينَ فِي قُلُوبِهِمْ زَيْغٌ فَيَتَّبِعُونَ مَا تَشَابَهَ مِنْهُ ابْتِغَاءَ الْفِتْنَةِ وَابْتِغَاءَ تَأْوِيلِهِ ۗ وَمَا يَعْلَمُ تَأْوِيلَهُ إِلَّا اللَّهُ ۗ وَالرَّاسِخُونَ فِي الْعِلْمِ يَقُولُونَ آمَنَّا بِهِ كُلٌّ مِنْ عِنْدِ رَبِّنَا ۗ وَمَا يَذَّكَّرُ إِلَّا أُولُو الْأَلْبَابِ ⑦

అందులోని బహువిధ భావ వచనాల (ముతషాబిహాత్) వెంట పడి (ప్రజలను) భ్రష్టుపట్టించటానికి ప్రయత్నిస్తారు. తమ ఉద్దేశాలకనుగుణంగా తాత్పర్యాలు తీస్తారు. నిజానికి వాటి వాస్తవికత అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ తెలీదు.[8] అయితే జ్ఞానంలో పరిపక్వత పొందినవారు మాత్రం, "మేము వీటిని విశ్వసించాము. ఇవన్నీ మా ప్రభువు తరఫు నుంచి వచ్చినవే" అని అంటారు. వాస్తవానికి బుద్ధి జ్ఞానాలు కలవారు మాత్రమే హిత బోధను గ్రహిస్తారు.

رَبَّنَا لَا تُزِغْ قُلُوبَنَا بَعْدَ إِذْ هَدَيْتَنَا وَهَبْ لَنَا مِنْ لَدُنْكَ رَحْمَةً ۚ إِنَّكَ أَنْتَ الْوَهَّابُ ⑧

**8** (వారు ఇలా వేడుకుంటూ ఉంటారు:) "మా ప్రభూ! సన్మార్గ భాగ్యం ప్రసాదించిన తరువాత మా హృదయాలలో వక్రతను రానీయకు. నీ వద్ద నుంచి మాకు కారుణ్యాన్ని ప్రసాదించు. నిశ్చయంగా నీవే గొప్ప దాతవు."

లేక వాటిలోని అస్పష్టతను ఆధారంగా చేసుకుని ప్రజలను పెడదారి పట్టించడానికి ఆస్కారం ఉంటుంది. హృదయాలలో 'వక్రత' ఉన్నవారు ఇలాంటి క్లిష్టమయిన ఆయతుల నుంచి కూపీలు లాగి, వాటి ద్వారా 'ఉపద్రవం' సృష్టిస్తూ ఉంటారు.

క్రైస్తవులు చేసింది కూడా అదే. దివ్య ఖుర్ఆన్ ఈసా (ఏసు ప్రవక్త)ను దైవదాసుడు మరియు దైవప్రవక్త అని స్పష్టం చేసింది. ఇది ఎంతో స్పష్టమైన, నిర్దిష్టమైన విషయం. కాని క్రైస్తవులు ఈ సుస్పష్టమైన విషయాన్ని వదిలేసి దైవప్రవక్త ఏసును దివ్య ఖుర్ఆన్ రూహుల్లాహ్ (దేవుని ఆత్మ), కలిమతుల్లాహ్ (దైవవాక్కు) అని అభివర్ణించిన పదాలను ఆశ్రయించి, వాటి ఆసరాతో తప్పుడు విశ్వాసాల వైపుకు ఆధారాలు వెలికితీసే ప్రయత్నం చేస్తారు. ఈనాటి మన సమాజంలోని బిద్అతీల (ధర్మంలో కొత్త పుంతలు తొక్కుతున్న వారి) పరిస్థితి కూడా యింతే. ఖుర్ఆన్ ప్రబోధించిన స్పష్టమైన విశ్వాసాలకు విరుద్ధంగా బిద్అతీలు కల్పించిన బూటకపు సూత్రాలన్నీ ఈ 'ముతషాబిహాత్'ల ఆధారంగా కల్పించినవే. ఒక్కోసారి 'ముహ్కమాత్' లను సయితం ఈ ప్రబుద్ధులు తమ గారడీతో 'ముతషాబిహాత్'లుగా మార్చే ప్రయత్నం చేస్తుంటారు. దీనికి భిన్నంగా సత్యబద్ధమైన విశ్వాసంగల ముస్లింలు 'ముహ్కమాత్' వచనాలను తు.చ. తప్పకుండా పాటిస్తారు. 'ముతషాబిహాత్'ల దగ్గరకు వచ్చేసరికి వారు తమ విజ్ఞతను ప్రదర్శిస్తూ వాటిపట్ల తమకు ప్రగాఢమైన విశ్వాసం ఉందని చెప్పి సంశయాలకు తెర దించేస్తారు. వీలయినంతవరకు స్పష్టమైన వచనాల ఆధారంగా అస్పష్టమైన వచనాలను కూడా అవగాహన చేసుకునేందుకు యత్నిస్తూ ఉంటారు. ఎందుకంటే ఈ 'ముహ్కమాత్'నే ఖుర్ఆన్ 'అసలు గ్రంథం'గా ఖరారు చేసింది. మనిషి వీటిని చిత్తశుద్ధితో అర్థం చేసుకునే ప్రయత్నం చేసినపుడు ఉపద్రవాల నుంచి సురక్షితంగా ఉంటాడు. తప్పుడు విశ్వాసాలకు లోనుకాకుండా ఉంటాడు. అల్లాహ్ మనల్ని అటువంటి సద్బుద్ధి కలవారిగా చేయుగాక!

8. మూలంలో **"తావీల్"** అనే పదం వచ్చింది. "ఏదైనా విషయానికి సంబంధించిన అసలు వాస్తవికత" అని తావీల్‌కు ఒక అర్థం ఉంది. ఈ అర్థం గనక తీసుకుంటే మూలంలో తప్పనిసరిగా 'ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప) వరకు వాక్యం పూర్తయినట్లు భావించాలి. అయితే తావీల్‌కు 'ఏదయినా విషయానికి సంబంధించిన వ్యాఖ్యానం, తాత్పర్యం, వివరణ' అనే మరో అర్థం కూడా ఉంది. ఈ అర్థం తీసుకుంటే 'ఇల్లల్లాహ్' దగ్గర కాకుండా 'వర్రాసిఖూన ఫిల్ ఇల్మి' (జ్ఞానంలో పరిపక్వత పొందినవారు) అనే చోట కూడా వాక్యాన్ని పూర్తి చేయవచ్చు. ఎందుకంటే పరిపక్వ జ్ఞానులు కూడా సరైన వ్యాఖ్యానం, వివరణ చేసే సామర్థ్యాన్ని, జ్ఞానాన్ని కలిగి ఉంటారు. దివ్య ఖుర్ఆన్‌లో 'తావీల్'కు సంబంధించిన ఈ రెండు అర్థాలూ ఉపయోగించబడినట్లు దాఖలాలున్నాయి (ఇబ్నె కసీర్ వ్యాఖ్యాన సారాంశం).

**9** "మా ప్రభూ! నిశ్చయంగా నీవు జనులందరినీ ఒక రోజు సమీకరిస్తావు. ఆ రోజు రావటంలో సందేహానికి ఎలాంటి ఆస్కారం లేదు, అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరించడు."

رَبَّنَآ اِنَّكَ جَامِعُ النَّاسِ لِيَوْمٍ لَّا رَيْبَ فِيْهِ ؕ اِنَّ اللّٰهَ لَا يُخْلِفُ الْمِيْعَادَ ﴿9﴾

**10** అవిశ్వాసులను[9] వారి సిరిసంపదలు గానీ, వారి సంతానం గానీ అల్లాహ్ (శిక్ష) నుంచి విడిపించటంలో ఏమాత్రం ఉపయోగపడవు. నరకానికి ఇంధనం అయ్యేవారు వీరే.

اِنَّ الَّذِيْنَ كَفَرُوْا لَنْ تُغْنِىَ عَنْهُمْ اَمْوَالُهُمْ وَلَآ اَوْلَادُهُمْ مِّنَ اللّٰهِ شَيْـًٔا ؕ وَاُولٰٓئِكَ هُمْ وَقُوْدُ النَّارِ ﴿10﴾

**11** ఫిరౌను జనులకు, వారికి పూర్వం గతించిన వారికి పట్టిన గతే వీరికీ పడుతుంది. (ఎందుకంటే) వారు మా వచనాలను ధిక్కరించారు. మరి అల్లాహ్ కూడా వారిని వారి పాపాలకుగాను పట్టుకున్నాడు. అల్లాహ్ తీవ్రంగా దండించేవాడు సుమా!

كَدَاْبِ اٰلِ فِرْعَوْنَ ۙ وَالَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ؕ كَذَّبُوْا بِاٰيٰتِنَا ۚ فَاَخَذَهُمُ اللّٰهُ بِذُنُوْبِهِمْ ؕ وَاللّٰهُ شَدِيْدُ الْعِقَابِ ﴿11﴾

**12** (ఓ ప్రవక్తా!) అవిశ్వాసులతో చెప్పు: "త్వరలోనే మీరు ఓటమి పాలవుతారు. నరకం వైపుకు సమీకరించబడతారు. అది అత్యంత చెడ్డ నివాస స్థలం."

قُلْ لِّلَّذِيْنَ كَفَرُوْا سَتُغْلَبُوْنَ وَتُحْشَرُوْنَ اِلٰى جَهَنَّمَ ؕ وَبِئْسَ الْمِهَادُ ﴿12﴾

**13** ముఖాముఖీ అయిన ఆ రెండు వర్గాలలో మీ కోసం నిశ్చయంగా గుణపాఠ సూచన ఉంది. వాటిలో ఒక వర్గం దైవ మార్గంలో పోరాడుతూ ఉండగా, రెండోది అవిశ్వాసుల వర్గం. వారు తమకన్నా రెండింతలుండటాన్ని వారు స్వయంగా తమ కళ్ళతో తిలకించారు.[10] అల్లాహ్ తాను తలచిన వారికి తన సహాయంతో బలం చేకూర్చుతాడు. కళ్ళున్న వారికోసం ఇందులో గొప్ప గుణపాఠం ఉంది.

قَدْ كَانَ لَكُمْ اٰيَةٌ فِىْ فِئَتَيْنِ الْتَقَتَا ؕ فِئَةٌ تُقَاتِلُ فِىْ سَبِيْلِ اللّٰهِ وَاُخْرٰى كَافِرَةٌ يَّرَوْنَهُمْ مِّثْلَيْهِمْ رَاْىَ الْعَيْنِ ؕ وَاللّٰهُ يُؤَيِّدُ بِنَصْرِهٖ مَنْ يَّشَآءُ ؕ اِنَّ فِىْ ذٰلِكَ لَعِبْرَةً لِّاُولِى الْاَبْصَارِ ﴿13﴾

9. ఇక్కడ అవిశ్వాసులు అంటే యూదులని భావం. ఈ భవిష్యవాణి అతి త్వరలోనే నెరవేరింది. యూదులకు చెందిన బనూ ఖైనుఖా, బనూ నజీర్ తెగలు దేశం నుంచి బహిష్కరించబడ్డాయి. బనూ ఖురైజ తెగవారు వధించబడ్డారు. ఖైబర్ జయించబడింది. ఆ తరువాత యూదులపై 'జిజ్‌యా' విధించబడింది (ఫత్‌హుల్ ఖదీర్).

10. అంటే ప్రతి వర్గం తమ ప్రత్యర్థి వర్గాన్ని తమకన్నా రెండింతలుగా చూడసాగింది. అవిశ్వాసుల సంఖ్య దాదాపు వెయ్యి. అంటే ముస్లింలకన్నా మూడు రెట్లు ఎక్కువగా ఉన్నారన్నమాట. అయితే వారి కంటికి ముస్లింలు రెండువేల మందిగా కానవచ్చారు. ముస్లింలంటే అవిశ్వాసుల గుండెల్లో దడ పుట్టించటమే దీని అసలు ఉద్దేశ్యం. మరోవైపు ముస్లిం సైనికుల సంఖ్య మూడు వందల పైచిలుకు (313) మాత్రమే. వారి కంటికి అవిశ్వాసులు 600 లేక 700 మందిగా కనిపించారు. నిజానికి అవిశ్వాసుల సంఖ్య రణరంగంలో సుమారు వెయ్యి. ముస్లింల ఆత్మ విశ్వాసాన్ని, స్థయిర్యాన్ని ఇనుమడింపజేయడానికి దేవుడిలా చేశాడు. దేవుని వ్యూహమే గనక యిక్కడ పనిచేసి ఉండకపోతే, తమకన్నా మూడింతలు అధికంగా ఉన్న అవిశ్వాసులను చూసి ముస్లింలు భయపడేవారేమో! మూడింతలకు బదులు రెండింతలుగా కనబడేసరికి వారి ఆత్మ విశ్వాసం సడలలేదు. అయితే ఈ రెట్టింపుగా కానవచ్చే స్థితి కదన రంగంలో

زُيِّنَ لِلنَّاسِ حُبُّ الشَّهَوٰتِ مِنَ النِّسَآءِ وَالْبَنِيْنَ وَالْقَنَاطِيْرِ الْمُقَنْطَرَةِ مِنَ الذَّهَبِ وَالْفِضَّةِ وَالْخَيْلِ الْمُسَوَّمَةِ وَالْاَنْعَامِ وَالْحَرْثِ ؕ ذٰلِكَ مَتَاعُ الْحَيٰوةِ الدُّنْيَا ۚ وَاللّٰهُ عِنْدَهٗ حُسْنُ الْمَاٰبِ ﴿۱۴﴾

**14** స్త్రీలు, కుమారులూ, పోగుచేయబడిన వెండి బంగారు రాసులూ, అచ్చువేయబడిన (మేలిజాతి) గుర్రాలు, పశువులూ, పంటపొలాలు వంటి వ్యామోహాలపై ప్రేమ, జనులకు మనోజ్ఞంగా చేయబడింది.[11] ఇది ప్రాపంచిక జీవన సామగ్రి. మరలిపోవలసిన అత్యుత్తమ నివాసమైతే అల్లాహ్ వద్దనే ఉంది.

కాలు మోపక ముందు మాత్రమే. ఇరు పక్షాల సేనలు పరస్పరం తలపడిన మీదట ప్రతి వర్గంవారికి ప్రత్యర్థి వర్గం తక్కువగా కనిపించేటట్టు చేయటం జరిగింది. ఏ ఒక్క వర్గం కూడా యుద్ధం పట్ల విముఖత చూపరాదన్నదే దీని లక్ష్యం (ఇబ్నె కసీర్). అన్‌ఫాల్ సూరాలోని 44వ ఆయతులో ఈ విషయం మరింత స్పష్టంగా వివరించబడింది.

మహాప్రవక్త (స) మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ చేసిన రెండు సంవత్సరాలకే బద్ర్ యుద్ధమైదానంలో ఎదురయిన సంఘటన ఇది. అనేక విధాలుగా ఇది కీలకమైన పోరాటం. 1. అది సత్యాసత్యాలకు మధ్య జరిగిన ప్రప్రథమ పోరాటం! 2. ఈ పోరాటం ఎలాంటి పథకం, వ్యూహరచన లేకుండానే జరిగింది. సిరియా నుంచి వర్తక సామగ్రిని తీసుకుని మక్కాకు వెళుతున్న అబూ సుఫ్యాన్ కోసం ముస్లింలు బయలుదేరారు. ఈ వర్తమానాన్ని తెలుసుకున్న అబూ సుఫ్యాన్ తన వర్తక బిడారు దిశను మార్చి ఎలాగో తప్పించుకున్నాడు. కాని మక్కా అవిశ్వాసులు తమ శౌర్యాన్ని ప్రదర్శించే ఉద్దేశ్యంతో ముస్లింలపై దండెత్తి వచ్చారు. బద్ర్ మైదానంలో ఇరువర్గాలూ మార్కొన్నాయి. 3. ఈ యుద్ధ సందర్భంగా దేవుని ప్రత్యేకసహాయం ముస్లింలకు లభించింది. 4. చరిత్ర దిశను మలచిన ఈ యుద్ధంలో అవిశ్వాసులకు ఘోర పరాజయం ఎదురయింది. పర్యవసానంగా వారిలోని ఆత్మవిశ్వాసం నీరుగారి పోయింది.

11. **షహవాత్ :** అంటే సహజంగా మనిషి ఇష్టపడే, అతని మనసును దోచుకునే వస్తువులు అని భావం. అందుకే ఆ వస్తువులను కోరుకోవటం, వాటి పట్ల మోజు చూపటం తప్పు కాదు. కాకపోతే ఈ విషయంలో మనిషి మితిమీరి పోకూడదు. షరీయతు విధించిన హద్దులను అతిక్రమించకూడదు. వాటిని మనిషి కొరకు ఆకర్షవంతంగా, మనోజ్ఞ మైనవిగా చేయటం అన్నది కూడా దేవుని తరఫున ఓ పరీక్షే. "మేము మనుషులను పరీక్షించే నిమిత్తం భూమిపై ఉన్న వాటిని మనోజ్ఞమైనవిగా చేశాము" (అల్ కహఫ్ – 7).

అన్నిటికన్నా ముందు స్త్రీ ప్రస్తావన వచ్చింది. ఎందుకంటే యుక్తవయస్సుకు చేరిన ప్రతి మనిషికీ స్త్రీ అత్యంత అవసరం. అతనికి అత్యంత యిష్టమైనది కూడా స్త్రీయే. "స్త్రీ మరియు సువాసన నాకు అత్యంత ప్రీతికరమైనవి" అని మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు స్వయంగా వక్కాణించారు (ముస్నదె అహ్మద్). అలాగే "ప్రపంచంలో అత్యంత శ్రేష్ఠమయిన సామగ్రి ఏదన్నా ఉందంటే అది మంచి నడవడికగల స్త్రీ మాత్రమే" అని కూడా ఆయన (స) ప్రవచించారు. అందుకే ఆమె యెడల గల ప్రేమ షరీయతు విధించిన పరిమితుల్లో ఉంటే ఆమె మనిషి కొరకు అత్యుత్తమ సహధర్మచారిణిగా ఉండగలదు. అలాగే పరలోక సాఫల్యానికి దోహదపడే విలువైన సంపదగా కూడా పరిణమించగలదు. లేకపోతే ఈ మగువే మగవానిపాలిట ఓ ఉపద్రవంగా కూడా తయారవగలదు. అందుకేనేమో మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా సెలవిచ్చారు: నా తదనంతరం పొడసూపే ఉపద్రవాలలో పురుషుల పాలిట అత్యంత నష్టదాయకమైన ఉపద్రవం స్త్రీలదే" (సహీహ్ బుఖారీ : కితాబున్నికాహ్).

అలాగే మగపిల్లల పట్ల ప్రేమ: ముస్లింల శక్తిని, బలాన్ని పెంచటం, సంతతిని అధికం చేసుకోవటం, విస్తృతపరచు కోవటం దీని లక్ష్యమయితే ఈ ప్రేమ మెచ్చుకోదగినదే. లేకపోతే అది నిందార్హం. ఈ సందర్భంగా అంతిమ దైవప్రవక్త(స) వారి ఈ ప్రవచనాన్ని గమనించండి : ఆయన (స) ఇలా అన్నారు – "అమితంగా ప్రేమించే, అధిక సంతానాన్ని కనే స్త్రీని మనువాడండి. ఎందుకంటే నేను ప్రళయదినాన ఇతర సమాజాలకు ప్రతిగా నా అనుచర సమాజం (ఉమ్మత్) యొక్క అధిక సంఖ్యపై గర్వపడతాను."

ఈ ఆయతు ద్వారా సన్యాసత్వం, వైరాగ్యం, మనుజ జాతి జననాలను నియంత్రించే కుటుంబ నియంత్రణా పథకాల

**15** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: వీటికన్నా మేలైనదేదో నేను మీకు తెలుపనా? దైవభక్తి కలవారికి వారి ప్రభువు వద్ద స్వర్గ వనాలున్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తుంటాయి. వాటిలో వారు ఎల్లకాలం ఉంటారు.[12] పవిత్రులైన భార్యలు వారి కోసం ఉంటారు.[13] (వీటన్నింటితో పాటు) అల్లాహ్ ప్రసన్నత వారికి ప్రాప్తిస్తుంది. అల్లాహ్ దాసులను కనిపెట్టుకొని ఉన్నాడు.

قُلْ أَؤُنَبِّئُكُم بِخَيْرٍ مِّن ذَٰلِكُمْ ۚ لِلَّذِينَ اتَّقَوْا
عِندَ رَبِّهِمْ جَنَّاتٌ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ
خَالِدِينَ فِيهَا وَأَزْوَاجٌ مُّطَهَّرَةٌ وَرِضْوَانٌ مِّنَ
اللَّهِ ۗ وَاللَّهُ بَصِيرٌ بِالْعِبَادِ (15)

**16** వారు ఇలా వేడుకుంటారు: "మా ప్రభూ! మేము విశ్వసించాము. కనుక మా పాపాలను క్షమించు. ఇంకా మమ్మల్ని అగ్ని శిక్ష నుంచి కాపాడు."

الَّذِينَ يَقُولُونَ رَبَّنَا إِنَّنَا آمَنَّا فَاغْفِرْ لَنَا
ذُنُوبَنَا وَقِنَا عَذَابَ النَّارِ (16)

**17** వారు ఓర్పు వహిస్తారు, సదా సత్యమే పలుకుతారు. విధేయత చూపుతారు. దైవమార్గంలో ఖర్చుచేస్తారు. రాత్రి చివరి భాగంలో క్షమాభిక్షకై వేడుకుంటారు.

الصَّابِرِينَ وَالصَّادِقِينَ وَالْقَانِتِينَ وَالْمُنفِقِينَ
وَالْمُسْتَغْفِرِينَ بِالْأَسْحَارِ (17)

**18** అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేదని స్వయంగా అల్లాహ్, ఆయన దూతలు, జ్ఞానసంపన్నులూ సాక్ష్యమిస్తున్నారు.[14] ఆయన సమత్వం, సమతూకంతో ఈ విశ్వాన్ని నిలిపి ఉంచాడు. సర్వాధిక్యుడు, వివేచనాశీలి అయిన ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధనకు అర్హులు కారు.

شَهِدَ اللَّهُ أَنَّهُ لَا إِلَٰهَ إِلَّا هُوَ وَالْمَلَائِكَةُ
وَأُولُو الْعِلْمِ قَائِمًا بِالْقِسْطِ ۚ لَا إِلَٰهَ إِلَّا هُوَ
الْعَزِيزُ الْحَكِيمُ (18)

---

వంటివి ఖండించబడ్డాయి. ఇకపోతే సిరిసంపదల ద్వారా మనిషి తన ఆర్థిక స్థితిని మెరుగుపరచుకుంటాడు. బంధుత్వ హక్కులు నెరవేరుస్తాడు. సంక్షేమ కార్యక్రమాలకై, దానధర్మాలకై డబ్బును వెచ్చిస్తాడు. ఒకరి ముందు చేయిచాచి అర్థించే దీన స్థితి నుంచి తన్ను తాను కాపాడుకుంటాడు. ఈ లక్ష్యాల కోసం అతడు దైవ ప్రసాదితాలను ఉపయోగిస్తే మంచిదే. అలా కాని పక్షంలో అవి అతని వినాశానికి కారణభూతమవుతాయి. గుర్రాలు దైవమార్గంలో పోరాటానికి ఉపయోగపడతాయి. పశువులు సేద్యానికి, తదితర ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి. భూమిని పంటలు పండించటానికి ఉపయోగించుకుంటాం. మరి ఈ లక్ష్యాల కోసం గాక కేవలం డబ్బు సంపాదించటం కోసం, పేరు ప్రతిష్ఠల కోసం, బడాయి కోసం గుర్రాలను, పశువులను పోషిస్తే అది ముమ్మాటికీ గర్హనీయమే. మనిషి ఈ పశుపోషణలో, గుర్రాల మోజులో దైవనామస్మరణ పట్ల నిర్లక్ష్యం వహించి, విలాసవంతమైన జీవితానికి అలవాటుపడితే లాభదాయకమైన ఈ వస్తువులే అతని పాలిట హానికరంగా పరిణమిస్తాయి. **'ఖనాతీర్'**: ఇది **'ఖిన్‌తార్'**కు బహువచనం. అంటే నిధులు; వెండి బంగారాలు, సిరిసంపదల అధిక విస్తృతి అని ఇక్కడ దాని భావం. **'అల్ ముసవ్వమహ్'** అంటే మేతకోసం మేతశాలలోకి వదలిపెట్టబడిన గుర్రాలు లేక యుద్ధం కోసం సిద్ధపరచబడినవి లేక గుర్తుకోసం ఏదయినా సంఖ్య లేక చిహ్నం వేయబడిన గుర్రాలు అని భావం (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).

12. మీరు ప్రపంచంలోని ఈ వస్తువుల పట్ల మోజు పెంచుకుని సర్వస్వం ఇదేనని భ్రమపడకండి. నిజానికి దైవం వద్ద మీకోసం సిద్ధంచేసి ఉంచబడినది ఇంతకన్నా మేలైనది. అది కేవలం దైవభక్తిపరాయణులకు మాత్రమే లభిస్తుంది. కాబట్టి మీరు భయభక్తుల విధానాన్ని (తఖ్వాను) అవలంబించండి అని విశ్వాసులకు బోధపరచటం జరిగింది. మీలోనే గనక దైవాదేశాలను పాలించే గుణం పెంపొందితే, ఇహపరాల శుభాలన్నీ మీ ముందు వచ్చిపడినట్లేనని చెప్పబడింది.

19 నిస్సందేహంగా ఇస్లాం మాత్రమే అల్లాహ్ వద్ద సమ్మతమైన ధర్మం.[15] గ్రంథంకల ప్రజలు తమ వద్దకు జ్ఞానం వచ్చేసిన పిదపనే తమలోని పరస్పర అసూయాద్వేషాల కారణంగా విభేదించుకున్నారు.[16] అల్లాహ్ వచనాల పట్ల ఎవరు తిరస్కార వైఖరిని అవలంబించినాసరే, అల్లాహ్ చాలా తొందరగానే వారి లెక్క తేలుస్తాడు.[17]

إِنَّ الدِّينَ عِندَ اللَّهِ الْإِسْلَامُ ۗ وَمَا اخْتَلَفَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ إِلَّا مِن بَعْدِ مَا جَاءَهُمُ الْعِلْمُ بَغْيًا بَيْنَهُمْ ۗ وَمَن يَكْفُرْ بِآيَاتِ اللَّهِ فَإِنَّ اللَّهَ سَرِيعُ الْحِسَابِ ⑲

13. పవిత్ర స్త్రీలంటే ప్రాపంచిక అపరిశుభ్రతలు, బహిష్టుస్థితి, పురిటిస్థితి వంటివి ఉండని స్త్రీలు, సౌశీల్యవతులు అని అర్థం. రాబోయే రెండు వాక్యాల్లోనూ దైవభక్తిపరాయణుల సుగుణాలు వివరించబడ్డాయి.

14. ఇక్కడ **షహాదత్** (సాక్ష్యమివ్వటం) అంటే విడమరచి చెప్పటం, సావధానపరచటం అని భావం. అంటే అల్లాహ్ ఏదైతే సృష్టించాడో, మరేదైతే బోధపరచాడో వాటిద్వారా తన 'ఏకత్వం' వైపుకు మనందరికీ మార్గదర్శకత్వం వహించాడు (ఫత్‌హుల్ ఖదీర్). దైవదూతలు, జ్ఞానులు కూడా ఈ 'దేవుని ఏకత్వాన్ని' (తౌహీద్) గురించి సాక్ష్యమిస్తున్నారు. అల్లాహ్ తన దూతలతోపాటు తమ పేరును కూడా ప్రస్తావించటం జ్ఞానుల, విద్వాంసుల అదృష్టం అనాలి. దీనిద్వారా జ్ఞానానికి గల ప్రాధాన్యత, మహత్తు ఎటువంటిదో తెలుస్తోంది. జ్ఞానం అంటే దైవగ్రంథ జ్ఞానం, సున్నత్ జ్ఞానం అని భావం (ఫత్‌హుల్ ఖదీర్).

15. ఇస్లాం ధర్మం కొత్త ధర్మమేమీ కాదు. ప్రవక్తలందరూ, తమ తమ కాలాల్లో, తమ తమ జాతులకు బోధపరచిన ధర్మమే ఇది. కాకపోతే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా ఇది మానవాళికి సంపూర్ణంగా అందజేయబడింది. మహాప్రవక్త (సఅసం) తెలిపినట్లుగానే మనం ఈ ధర్మాన్ని పూర్తిగా నమ్మి నడుచుకోవాలి. తౌహీద్ (దేవుని ఏకత్వం), రిసాలత్ (దైవదౌత్యం), ఆఖిరత్ (పరలోకం)పై దృఢ విశ్వాసం కలిగి ఉండాలి. అల్లాహ్ ఒక్కడే అనీ కేవలం నమ్మినంతమాత్రాన లేక కొన్ని మంచి పనులు చేసుకున్నంత మాత్రాన మన జీవితంలో సంపూర్ణ ఇస్లాం రాదు. దానివల్ల పరలోక సాఫల్యం కూడా సిద్ధించదు. ఇస్లాం అన్నా, ఈమాన్ అన్నా, జీవన ధర్మం అన్నా పూర్తిభావం ఏమిటంటే - అల్లాహ్ ఒక్కడేనని నమ్మాలి. కేవలం ఆయన్నే ఆరాధించాలి, ముహమ్మద్ (సఅసం) సమేతంగా దైవప్రవక్తలందరినీ విశ్వసించాలి. మహాప్రవక్త ముహమ్మద్ (స)తో దైవదౌత్యం పరిసమాప్తమయిందన్న విషయాన్ని మనసారా అంగీకరించాలి. ఈ విశ్వాసాలతో పాటు ఖుర్‌ఆన్ హదీసుల ప్రకారం సదాచరణలను శ్రద్ధగా అవలంబించాలి. ఇదే ఇస్లాం ధర్మం. ఈ ధర్మం తప్ప మరొక ధర్మం ఏదీ దైవ సమక్షంలో స్వీకారయోగ్యం కాదు. ఈ మార్గాన్ని తప్ప మరో మార్గాన్ని అవలంబించినవాడు పరలోకంలో విఫలుడవుతాడు, నష్టపోతాడు. **"వమైంయ్యబ్‌తగి గైరల్ ఇస్లామి దీనన్ ఫలైఁ యుఖ్‌బల మిన్‌హు. వ హువ ఫిల్ ఆఖిరతి మినల్ ఖాసిరీన్"** (ఎవరైనా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయినవారిలో చేరిపోతాడు - ఆలి ఇమ్రాన్ : 85).

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి దైవదౌత్యం సమస్త మానవులకు వర్తిస్తుంది. "(ఓ ప్రవక్తా!) వారితో అనండి : ప్రజలారా! నేను మీ అందరికోసం పంపబడిన దైవ సందేశహరుణ్ణి" (ఆరాఫ్ - 158). "సమస్త లోకవాసులకు హెచ్చరించేవానిగా ఉండేందుకు ఈ గీటురాయి (దివ్య ఖుర్‌ఆన్)ని తన దాసునిపై అవతరింపజేసినవాడు ఎంతో శుభప్రదమైనవాడు" (అల్ ఫుర్ఖాన్ - 1).

హదీసులో మహనీయ ముహమ్మదు (సఅసం) వారు ఇలా ప్రవచించారు : "ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆయన మీద ప్రమాణం చేసి చెబుతున్నాను - నన్ను విశ్వసించకుండా చనిపోయిన ఏ యూదుడైనా, క్రైస్తవుడయినాసరే అతను నరకవాసియే" (సహీహ్ ముస్లిం). ఆయన (స) ఇంకా ఇలా చెప్పారు: "నేను తెల్లవారికోసం, నల్లవారికోసం- అందరికోసం ప్రవక్తగా పంపబడ్డాను." అందుకే ఆయన (స) తన సమకాలీన రాజులకు, చక్రవర్తులకు, సర్దారులకు ఉత్తరాలు వ్రాస్తూ ఇస్లాంను స్వీకరించమని కోరారు (సహీహైన్ : ఇబ్నె కసీర్ ఆధారంగా).

20 ఒకవేళ అప్పటికీ వారు నీతో గొడవపడితే, "నేనూ, నా అనుచరులు దైవ విధేయతకు తలఒగ్గాము" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పేయి. "మరి మీరు కూడా దైవాజ్ఞకు తలఒగ్గు తున్నారా?" అని గ్రంథవహులను, నిరక్షరాస్యులను[18] అడుగు. ఒకవేళ వారేగనక ఒప్పుకున్నట్లయితే సన్మార్గ భాగ్యం పొందినట్లే. ఒకవేళ వారు విముఖతను ప్రదర్శిస్తే, సందేశాన్ని అందజేయటం వరకే నీ బాధ్యత. అల్లాహ్ తన దాసులను చూస్తూనే ఉన్నాడు.

فَإِنْ حَآجُّوكَ فَقُلْ أَسْلَمْتُ وَجْهِيَ لِلَّهِ وَمَنِ
اتَّبَعَنِ ۗ وَقُل لِّلَّذِينَ أُوتُوا الْكِتَابَ وَالْأُمِّيِّينَ
أَأَسْلَمْتُمْ ۚ فَإِنْ أَسْلَمُوا فَقَدِ اهْتَدَوا ۖ وَّإِن تَوَلَّوْا
فَإِنَّمَا عَلَيْكَ الْبَلَاغُ ۗ وَاللَّهُ بَصِيرٌ بِالْعِبَادِ ﴿20﴾

21 ఎవరయితే అల్లాహ్ ఆయతులను తిరస్కరిస్తూ, అన్యాయంగా ప్రవక్తలను చంపుతూ, ప్రజల్లో న్యాయం గురించి ఆజ్ఞాపించేవారిని కూడా తుదముట్టిస్తున్నారో[19] వారికి (ఓ ప్రవక్తా!) వ్యథాభరితమైన శిక్ష ఉందన్న శుభవార్తను వినిపించు.

إِنَّ الَّذِينَ يَكْفُرُونَ بِآيَاتِ اللَّهِ وَيَقْتُلُونَ
النَّبِيِّينَ بِغَيْرِ حَقٍّ وَيَقْتُلُونَ الَّذِينَ يَأْمُرُونَ
بِالْقِسْطِ مِنَ النَّاسِ فَبَشِّرْهُم بِعَذَابٍ أَلِيمٍ ﴿21﴾

22 వారి కర్మలు ఇహపరాలలో వృథా అయిపోయాయి. వారిని ఆదుకునేవారెవరూ లేరు.

أُولَٰئِكَ الَّذِينَ حَبِطَتْ أَعْمَالُهُمْ فِي الدُّنْيَا
وَالْآخِرَةِ وَمَا لَهُم مِّن نَّاصِرِينَ ﴿22﴾

16. **"వారి పరస్పర విభేదం"** అంటే ఒకే ధర్మాన్ని అనుసరించేవారు పరస్పరం చేసుకున్న విభేదాలని భావం. ఉదా : యూదుల్లోని పరస్పర విభేదాలు, వాటి మూలంగా ఏర్పడిన వర్గాలు. అలాగే క్రైస్తవుల్లోని పరస్పర విభేదాలు, వాటిమూలంగా వారిలో ఏర్పడిన వర్గాలు. అదేవిధంగా యూదులకు – క్రైస్తవులకు మధ్యగల విభేదాలకు కూడా ఈ ఆయతు వర్తిస్తుంది. ఈ విభేదాల మూలంగానే యూదులు క్రైస్తవులను, క్రైస్తవులు యూదులను "మీరు అసలు ఏ ధర్మంపైనా లేరు" అని పరస్పరం తూలనాడుకునేవారు. అలాగే ముహమ్మద్ (స) దైవదౌత్యానికి, ఈసా (అలైహి) దైవదౌత్యానికి సంబంధించిన విభేదాలు కూడా ఇందులోకి వచ్చేస్తాయి. మరి చూడబోతే వారి ఈ విభేదాలకు, ఘర్షణలకు ఏదైనా బలమైన ఆధారం ఉందా అంటే అలాంటిదేదీ లేదు. కేవలం అసూయ, వైరభావం వల్ల ఈ తగాదాలొచ్చేవి. అంటే వారు సత్యాన్ని తెలుసుకుని కూడా ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం, కుహనా ప్రతిష్ఠల కోసం తమ పెడసరి ధోరణిపై పాతుకుపోయి ఉండేవారు. కడు శోచనీయమైన విషయం ఏమిటంటే నేటి ముస్లిం విద్వాంసులలోని ఒక పెద్ద వర్గం ఇటువంటి స్వార్థపూరిత లక్ష్యాల కోసమే తమ మంకుతనంపై మొండిగా నిలబడి ఉంది. అల్లాహ్ మనందరికీ సద్బుద్ధిని ప్రసాదించుగాక!

17. అల్లాహ్ వచనాల పట్ల తిరస్కారవైఖరి అంటే భావం, ఇస్లాం దైవసమ్మతమైన ధర్మం అని చాటిచెప్పే వచనాలను త్రోసిపుచ్చటం అన్నమాట! ఇలా త్రోసిపుచ్చేవారి సంగతి అల్లాహ్ చూసుకుంటాడు.

18. ఇక్కడ నిరక్షరాస్యులంటే అరేబియాకు చెందిన బహుదైవారాధకులన్నమాట. గ్రంథవహులైన యూదులు, క్రైస్తవులతో పోల్చుకుంటే వారు దాదాపు అక్షర జ్ఞానం లేనివారే.

19. ఇది వారి తలబిరుసుతనానికి, ఉన్మాదానికి పరాకాష్ఠ అన్నమాట! వారు దైవప్రవక్తలనే గాకుండా న్యాయం గురించి మాట్లాడేవారిని కూడా వదలిపెట్టలేదు. మంచిని గురించి ప్రబోధించి, చెడు నుంచి ఆపే బాధ్యతను నిర్వర్తించే సత్యసందేశకర్తలను, చిత్తశుద్ధులైన విశ్వాసులను సైతం హత్య చేశారు. ఈ సందర్భంగా గమనించవలసిన ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే; అల్లాహ్ తన ప్రవక్తలతోపాటు సత్యధర్మ ఉన్నతికై పాటుపడే, మంచిని ప్రబోధించే, చెడుల నుంచి వారించే సజ్జనుల గురించి ప్రస్తావించి వారి స్థానం ఎంత ఉన్నతమైందో తెలియజేశాడు.

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ أُوتُوا نَصِيبًا مِّنَ الْكِتَٰبِ يُدْعَوْنَ إِلَىٰ كِتَٰبِ اللَّهِ لِيَحْكُمَ بَيْنَهُمْ ثُمَّ يَتَوَلَّىٰ فَرِيقٌ مِّنْهُمْ وَهُم مُّعْرِضُونَ ﴿٢٣﴾

**23** గ్రంథంలోని ఒక భాగం ఇవ్వబడగా, తమ పరస్పర వ్యవహారాల తీర్పుకోసం దైవగ్రంథం వైపునకు రండి అని పిలిచినప్పటికీ వారిలోని ఒక వర్గం ముఖం తిప్పుకుని[20] పోవటాన్ని నీవు చూడలేదా?

ذَٰلِكَ بِأَنَّهُمْ قَالُوا لَن تَمَسَّنَا النَّارُ إِلَّا أَيَّامًا مَّعْدُودَٰتٍ ۖ وَغَرَّهُمْ فِي دِينِهِم مَّا كَانُوا يَفْتَرُونَ ﴿٢٤﴾

**24** వారి (ఈ వైముఖ్య) ధోరణికి కారణం; "నరకాగ్ని మమ్మల్ని లెక్కించదగిన కొన్ని రోజులు మాత్రమే కాల్చుతుంది" అని వారు చెప్పటమే. వారి ఈ మనోకల్పిత విషయాలే ధర్మం విషయంలో వారిని మోసంలో పడవేశాయి.[21]

فَكَيْفَ إِذَا جَمَعْنَٰهُمْ لِيَوْمٍ لَّا رَيْبَ فِيهِ وَوُفِّيَتْ كُلُّ نَفْسٍ مَّا كَسَبَتْ وَهُمْ لَا يُظْلَمُونَ ﴿٢٥﴾

**25** మరి మేము వారిని సమావేశపరచిన రోజున వారి గతేం కాను? అది రావటంలో ఎలాంటి సందేహానికి తావులేదు. అప్పుడు ప్రతి ప్రాణికీ అది సంపాదించుకున్న దాని పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.[22]

قُلِ اللَّهُمَّ مَٰلِكَ الْمُلْكِ تُؤْتِي الْمُلْكَ مَن تَشَاءُ وَتَنزِعُ الْمُلْكَ مِمَّن تَشَاءُ وَتُعِزُّ مَن تَشَاءُ وَتُذِلُّ مَن تَشَاءُ ۖ بِيَدِكَ الْخَيْرُ ۖ إِنَّكَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿٢٦﴾

**26** (ఓ ముహమ్మద్!) ఈ విధంగా పలుకు: "ఓ అల్లాహ్! విశ్వ రాజ్యాధిపతీ! నీవు కోరినవారికి రాజ్యాధికారం ఇస్తావు. నీవు కోరినవారి నుండి రాజ్యాన్ని లాక్కుంటావు. నీవు కోరిన వారికి గౌరవమొసగుతావు. నీవు కోరిన వారిని పరాభవానికి గురి చేస్తావు. సమస్త మేళ్లూ నీ చేతిలోనే ఉన్నాయి.[23] నిశ్చయంగా నీవు ప్రతి వస్తువుపైన అధికారం కలవాడవు.

20. గ్రంథం వొసగబడిన వారంటే యిక్కడ యూదులని భావం. మదీనాలో నివసించే యూదుల్లోని ఓ పెద్ద వర్గం ఇస్లాంను ఒప్పుకోలేదు సరికదా, ముస్లింలకు, అంతిమ దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా కుట్రలు పన్నటంలో నిమగ్నమైంది. వారి ఈ కుయుక్తుల, విచ్ఛిన్నకర కార్యకలాపాల కారణంగా వారిలోని రెండు తెగలను నగరం నుంచి బహిష్కరించటంతోపాటు, ఒక తెగను తుదముట్టించవలసి వచ్చింది.

21. ఇది యూదుల మితిమీరిన నిర్లక్ష్యధోరణికి ప్రబల తార్కాణం. వారు దైవగ్రంథాన్ని నిర్లక్ష్యం చేసిందిగాక, అసలు నరకాగ్ని తమను తాకనే తాకదని, ఒకవేళ తాకినా కొన్నాళ్లు మాత్రమేనని ధీమాను వ్యక్తం చేసేవారు. వారి ఈ స్వీయకల్పిత విషయాలే రుజుమార్గం పట్ల వారిని మోసానికి గురిచేశాయి.

22. ప్రళయదినాన వారి ప్రగల్భాలు, మూఢనమ్మకాలు ఏమాత్రం పనికిరావు. తిరుగులేని న్యాయాధీశుడు, తీర్పుదినపు యజమాని అయిన అల్లాహ్ ప్రతి ఒక్కరికీ వారు చేసుకున్న కర్మల్ని బట్టి పూర్తి ప్రతిఫలం ఇస్తాడు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.

23. ఈ ఆయతులో అల్లాహ్ యొక్క అపారమైన శక్తిసామర్థ్యాలు వివరించబడ్డాయి. ఆయన తానిష్టపడిన వారికి ఇష్టమొచ్చినంతగా అనుగ్రహిస్తాడు. రాజును పేదగా మార్చినా, పేదవాణ్ణి రాజుగా పట్టాభిషేకం చేసినా – అది ఆయనకే చెల్లుతుంది. ఆగ్రహానుగ్రహాలు ఆయనకే శోభిస్తాయి. అధికారాలన్నింటికి యజమాని ఆయనే. **"అల్ ఖైరు బియదిక"** అని అనే బదులు **"బియదికల్ ఖైర్"** అని సమాచార పదాన్ని ముందుగా పేర్కొనటం ప్రత్యేకార్థాన్ని

27 నువ్వే రాత్రిని పగటిలోనికి ప్రవేశింపజేస్తావు, పగటిని రాత్రి లోనికి తీసుకెళతావు.[24] నువ్వే నిర్జీవమైన వాటి నుంచి జీవమున్న వాటిని తీస్తున్నావు, మరి నువ్వే జీవమున్న వాటి నుంచి నిర్జీవ మైన వాటిని వెలికితీస్తున్నావు.[25] ఇంకా నీవు కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ఇస్తావు."

تُوْلِجُ الَّيْلَ فِي النَّهَارِ وَتُوْلِجُ النَّهَارَ فِي الَّيْلِ وَتُخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَتُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَتَرْزُقُ مَنْ تَشَاءُ بِغَيْرِ حِسَابٍ ﴿٢٧﴾

28 విశ్వాసులు తమ తోటి విశ్వాసులను వదలి అవిశ్వాసులను స్నేహితులుగా చేసుకోరాదు.[26] అలా చేసేవాడు ఏ విషయం లోనూ అల్లాహ్‌తో సంబంధం లేనివాడు. అయితే ఏ విధంగా

لَا يَتَّخِذِ الْمُؤْمِنُوْنَ الْكٰفِرِيْنَ اَوْلِيَآءَ مِنْ دُوْنِ الْمُؤْمِنِيْنَ ۚ وَمَنْ يَّفْعَلْ ذٰلِكَ فَلَيْسَ مِنَ اللّٰهِ

సూచిస్తోంది. అంటే మేళ్ళన్నీ నీ చేతిలోనే ఉన్నాయి, నీవు తప్ప మరొకరెవరూ మేలును ప్రసాదించలేరు అని దాని భావం. 'కీడు'ను సృష్టించినవాడు కూడా ఆయనే అయినప్పటికీ యిక్కడ దాని ప్రస్తావన లేదు. కేవలం మేలు మాత్రమే ప్రస్తావనకు వచ్చింది. ఎందుకంటే మేలు అన్నది కేవలం దైవకృప మాత్రమే. ఇక కీడు అంటారా! అది మనిషి చేసిన దుష్కర్మలకుగాను లభించే ప్రతిఫలం. మరో విషయం ఏమిటంటే, మానవునికి కలిగే కీడు కూడా విధివ్రాతలో రాయబడి ఉన్నదే! మరి అంతిమంగా విధివ్రాత మొత్తం మేలుతో కూడుకున్నదిగానే భావించబడుతుంది. ఈ విధంగా అల్లాహ్ పనులన్నీ కూడా మేళ్ళే అవుతాయి. బహుశా అందుకేనేమో ఈ ఆయతులో కేవలం మేళ్లను మాత్రమే ప్రస్తావించటం జరిగింది (ఫత్‌హుల్ ఖదీర్).

24. రాత్రిని పగటిలోనికి, పగలును రాత్రిలోనికీ ప్రవేశింపజెయ్యటం అంటే భావం రుతువుల మార్పులు. రాత్రి సుదీర్ఘంగా ఉన్నప్పుడు పగలు చిన్నదిగా ఉంటుంది. రాత్రి చిన్నదిగా ఉన్నప్పుడు పగలు పొడవుగా ఉంటుంది. అంటే కొన్ని సమయాలలో పగలులోని ఒక భాగం రాత్రిలోనికీ, మరికొన్ని సమయాలలో రాత్రిలోని ఒక భాగం పగటిలోనికీ వస్తుంది. పర్యవసానంగా రేయింబవళ్లు తరుగుతూ పెరుగుతూ ఉంటాయి. ఈ తేడాలు ఆసియా లాంటి ఉష్ణోగ్రత హెచ్చుగా ఉన్న దేశాలలో కన్నా ఐరోపా వంటి శీతల దేశాలలో అధికంగా కనిపిస్తాయి.

25. ఉదాహరణకు: ముందు సజీవమైన మనిషి నుంచి (నిర్జీవమైన) రేతస్సు వెలువడుతుంది. తర్వాత ఆ నిర్జీవమైన దాని (రేతస్సు) నుంచే మళ్లీ మనిషి పుట్టుక జరుగుతుంది. అదేవిధంగా జీవం లేని 'గుడ్డు' నుంచి, ముందు కోడిపిల్ల వస్తుంది. తర్వాత సజీవమైన ఆ కోడి నుంచే (జీవంలేని) గుడ్డు బయటికి వస్తుంది. అలాగే అవిశ్వాసి ఇంట విశ్వాసి పుట్టటం, విశ్వాసి కడుపున అవిశ్వాసి పుట్టటం కూడా దీని భావం కావచ్చు.

కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ముఆజ్ (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, తనపై రుణభారం ఉందని విన్నవించుకోగా ఈ ఆయతులను పఠిస్తూ ఉండమని, ఆయతును పఠించిన పిదప ఈ దుఆను కూడా చేయమని ఆయన (సఅసం) సూచించారు. ఆ దుఆ ఇది : **రహ్మానద్దున్‌యా వల్ ఆఖిరతి ! వ రహీమహుమా తూతీ మన్‌తషావు మిన్‌హుమా వ తమ్‌నవు మన్‌తషావు, ఇర్‌హమ్నీ రహ్మతన్ తుగ్‌నీనీ బిహా అన్ రహ్మతి మన్‌సివాక. అల్లాహుమ్మ ! అగ్‌నినీ మినల్ ఫఖ్రి వఖ్‌జి అన్నిద్దైన్** – 'మీపై ఉహుద్ పర్వతమంత రుణభారం ఉన్నాసరే మీరు దాన్ని తీర్చివేసే ఏర్పాటును అల్లాహ్ ఈ దుఆ ద్వారా చేస్తాడ'ని వేరొక ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది (మజ్‌మవుజ్ జవాయిద్).

పైన పేర్కొనబడిన దుఆకు అర్థం : ఓ ఇహపరలోకాల కరుణామయుడా! ఓ ఇహపర లోకాల కృపాశీలుడా! నీవు కోరినవారికి నీవు ఇహపరాల్లోనూ ప్రసాదిస్తావు. నీవు తలచుకున్నవారికి ప్రసాదించకుండా ఉంటావు. (ప్రభూ!) నీ కరుణ పట్ల తప్ప ఇతరులందరి కరుణ పట్లా నిరపేక్షాపరుణ్ణి అయ్యేలా నీవు నన్ను కరుణించు. నన్ను పేదరికం నుంచి స్థితిమంతుణ్ణి చెయ్యి. నా రుణభారాన్ని తొలగించు.

26. ఆయతులో **'ఔలియా' (اَوْلِيَآءَ)** అని అనబడింది. ఇది వలీ అనే పదానికి బహువచనం. మనస్ఫూర్తిగా ప్రేమించే,

فِي شَيْءٍ إِلَّا أَنْ تَتَّقُوا مِنْهُمْ تُقَاةً ۗ
وَيُحَذِّرُكُمُ اللَّهُ نَفْسَهُ ۗ وَإِلَى اللَّهِ الْمَصِيرُ ﴿28﴾

నయినా వారి కీడు నుంచి రక్షణ పొందే ఉద్దేశ్యంతో మీరు మైత్రికోసం ప్రయత్నిస్తే అది వేరే విషయం.[27] అల్లాహ్ తనకు మాత్రమే భయపడవలసిందిగా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు. కడకు (మీరు) మరలిపోవలసింది అల్లాహ్ వద్దకే.

قُلْ إِنْ تُخْفُوا مَا فِي صُدُورِكُمْ أَوْ تُبْدُوهُ يَعْلَمْهُ
اللَّهُ ۗ وَيَعْلَمُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ ۗ
وَاللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿29﴾

**29** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "మీరు మీ గుండెల్లోని మాటలను దాచినా లేక వ్యక్తపరచినా – వాటన్నింటినీ అల్లాహ్ తెలుసు కుంటాడు. భూమ్యాకాశాలలో ఉన్నవన్నీ ఆయనకు తెలుసు. అల్లాహ్ సర్వాన్నీ చేయగల సమర్థుడు."

يَوْمَ تَجِدُ كُلُّ نَفْسٍ مَا عَمِلَتْ مِنْ خَيْرٍ
مُحْضَرًا وَمَا عَمِلَتْ مِنْ سُوءٍ تَوَدُّ لَوْ
أَنَّ بَيْنَهَا وَبَيْنَهُ أَمَدًا بَعِيدًا ۗ وَيُحَذِّرُكُمُ
اللَّهُ نَفْسَهُ ۗ وَاللَّهُ رَءُوفٌ بِالْعِبَادِ ﴿30﴾

**30** ఆ రోజు ప్రతి వ్యక్తీ తాను చేసుకున్న పుణ్యాన్నీ, తాను చేసిన పాపాన్నీ తన ముందు చూసుకుంటాడు. తనకూ – తన పాపానికీ మధ్య ఎంతో దూరం ఉంటే బావుండేదే! అని కాంక్షిస్తాడు. అల్లాహ్ తన గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు. అల్లాహ్ తన దాసుల పట్ల అమితమైన వాత్సల్యం గలవాడు.

قُلْ إِنْ كُنْتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ
وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ ۗ وَاللَّهُ غَفُورٌ رَحِيمٌ ﴿31﴾

**31** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి.[28] (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు.[29] ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించే వాడు."

సన్నిహిత సంబంధం కలిగి ఉండే వ్యక్తిని 'వలీ' అని అంటారు. అల్లాహ్ కూడా తనను విశ్వాసుల వలీగా ప్రకటించు కున్నాడు (అల్ బఖర – 257). భావం ఏమిటంటే విశ్వాసులు పరస్పరం ప్రగాఢ స్నేహితులు. అటువంటప్పుడు వారు తమ విశ్వాస సోదరులను కాదని అవిశ్వాసులకు ఆ స్థానం ఇవ్వటం ఎంతమాత్రం భావ్యం కాదు. ఎందుకంటే అవిశ్వాసులు అటు అల్లాహ్‌కూ, ఇటు ముస్లింలకు కూడా విరోధులే. మరి అటువంటప్పుడు వారితో స్నేహానికి ఆస్కారం ఎక్కడుంది? అందుకే అల్లాహ్ ఈ అంశాన్ని ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల ఎంతో స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పేశాడు. విశ్వాసులు అవిశ్వాసులను ఆంతరంగికులుగా చేసుకుని నష్టపోరాదన్నదే దీని ముఖ్యోద్దేశం. కాకపోతే అనివార్య పరిస్థితుల్లో వారితో సంధి చేసుకోవటం, మైత్రీ సంబంధాలను ఏర్పరచుకోవటం, వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం, లావాదేవీలు జరపటం సమంజసమే. అలాగే ముస్లింల పట్ల వైరవైఖరిని అనుసరించకుండా ఉండే అవిశ్వాసుల యెడల ఉదారంగా వ్యవహరించి, మేలు చేయటం ధర్మసమ్మతమే. 'ముమ్తహినా' సూరాలో దీనికి సంబంధించిన వివరాలు రానున్నాయి. ఎందుకంటే ఒకరి యెడల ఉపకారభావంతో మెలగటం, వారితో వ్యవహారాలు జరపటం వేరు, వారిని ఆంతరంగికులుగా చేసుకోవటం వేరు.

27. అవిశ్వాసుల ఏలుబడిలో ఉన్న ముస్లిములకు సంబంధించిన ఆదేశం యిది. మైత్రి భావనను వ్యక్తపరచటం వినా మార్గాంతరం లేనపుడు వారు ఇలా చేయటం విపరీతం అనిపించుకోదు.

28. అల్లాహ్ పట్ల తమకు, తమ పట్ల అల్లాహ్‌కు ఎనలేని ప్రేమ ఉందని ఒక వైపు యూదులూ, మరోవైపు క్రైస్తవులు కూడా చెప్పుకునేవారు. ముఖ్యంగా క్రైస్తవులు ఈసా మరియు మర్యమ్‌ల ప్రేమలో, భక్తిలో ఎంతగా అతిశయిల్లి

**32** ఇంకా వారికి చెప్పు : "మీరు అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయులై ఉండండి." ఒకవేళ వారు విముఖత చూపితే అల్లాహ్ తిరస్కారులను ఏ మాత్రం ఇష్టపడడు.[30]

قُلْ اَطِيْعُوا اللّٰهَ وَالرَّسُوْلَ ۚ فَاِنْ تَوَلَّوْا فَاِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْكٰفِرِيْنَ ﴿32﴾

**33** నిశ్చయంగా అల్లాహ్ ఆదమ్‌నూ, నూహ్‌నూ, ఇబ్రాహీం పరివారాన్నీ, ఇమ్రాన్ సంతతినీ సమస్త లోకవాసులపై (వారికి ప్రాధాన్యత ఇచ్చి తన సందేశం కోసం) ఎన్నుకున్నాడు.[31]

اِنَّ اللّٰهَ اصْطَفٰۤى اٰدَمَ وَنُوْحًا وَّاٰلَ اِبْرٰهِيْمَ وَاٰلَ عِمْرٰنَ عَلَى الْعٰلَمِيْنَ ﴿33﴾

పోయారంటే వారిని దైవత్వపు స్థానంలో ప్రతిష్ఠింపజేశారు. ఈ విధంగా చేస్తే తాము దైవప్రసన్నతను బడయగలమని, ఆయన సామీప్యం పొందగలమని వారు తలపోసేవారు. కాని వారు డాంబికాలు పలికినంతమాత్రాన లేక స్వయంకల్పిత ఆచారాలను అనుసరించినంత మాత్రాన అల్లాహ్ ప్రేమ లభించదనీ, నిజంగానే వారు దైవప్రేమను కోరుకునేవారైతే అంతిమ దైవప్రవక్త (సఅసం)ను విశ్వసించి, ఆయన చూపిన విధానాన్ని అనుసరించాలని స్పష్టంగా ప్రకటన గావించబడింది. ఈ ఆయతు ద్వారా అల్లాహ్ తనపట్ల ప్రేమకు, ప్రసన్నతకు సంబంధించిన ఒక 'గీటురాయి'ని నిర్ధారించాడు. ఆ 'గీటురాయి'పై మేలిమి అని తేలినవారు సాఫల్యం పొందినట్లే లెక్క. లేకుంటే అతని ప్రేమ బూటకమైందని అర్థం. అలాంటి వ్యక్తి లక్ష్యసాధనలో విఫలుడైనట్లే. దైవప్రవక్త స్వయంగా ఇలా ప్రవచించి ఉన్నారు: "మాతో సంబంధం లేని – అంటే మేము చూపిన పద్ధతికి భిన్నమైన– రీతిలో ఎవరయినా ఏదన్నా ఆచరిస్తే అది త్రోసిపుచ్చదగినది" (బుఖారి, ముస్లిం).

29. అంటే దైవప్రవక్త (స) విధానాన్ని అనుసరించటం వల్ల మీ పాపాలు క్షమించబడటం ఒక్కటే కాదు, మీరు దైవానికి ప్రియతములుగా కూడా ఖరారు చేయబడతారు. ఒక మనిషి దైవ దర్బారులో ప్రియతమునిగా నిలబడటం అంటే సామాన్య విషయం కాదు – అది ఎంతో ఉన్నతమైన స్థానం సుమా!

30. ఈ ఆయతులో మరోసారి దైవ విధేయతతోపాటు, దైవప్రవక్త (స) విధేయత గురించి నొక్కి చెప్పబడింది. కనుక ఇక మోక్షం, సాఫల్యం అనేవి ఎక్కడయినా ఉన్నాయంటే కేవలం ముహమ్మద్ (సఅసం) వారి సున్నత్ అనుసరణలోనే నన్నమాట. ఆయన(స) విధానం పట్ల వైముఖ్యం కనబరచటం అంటే తిరస్కారవైఖరికి పాల్పడటమే. కాగా; తిరస్కారులను అల్లాహ్ ఎంతమాత్రం ప్రేమించడు. వారు దైవప్రేమకు సంబంధించిన ఎన్ని సాక్ష్యాలు సమర్పించినా, ఎన్ని కోతలు కోసినా నిరర్థకమే అవుతాయి. **'హుజ్జియ్యతె హదీస్'** (హదీసులు ప్రామాణికమైన ఆధారాలు) అన్న విషయాన్ని త్రోసిపుచ్చేవారికి, దైవప్రవక్త విధేయత పట్ల వైముఖ్యం కనబరచే వారిరువురికీ ఈ ఆయతులో తీవ్రమైన హెచ్చరిక ఉంది. ఎందుకంటే ఈ రెండు వర్గాలవారూ తమదైన రీతిలో అవలంబిస్తున్న ధోరణినే ఇక్కడ కుఫ్ర్ (ధర్మతిరస్కారం)గా పరిగణించటం జరిగింది. అల్లాహ్ మనల్ని ఈ ఉపద్రవం నుంచి కాపాడుగాక!

31. దైవప్రవక్తల (అలైహిముస్సలాం) కుటుంబాలలో ఇద్దరు ఇమ్రాన్‌లున్నారు. వారిలో ఒకరు ప్రవక్త మూసా, హారూన్‌ల తండ్రి. రెండవవారు మర్యమ్ తండ్రి. ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన ఇమ్రాన్ రెండవవారు. ఖుర్ఆన్ వ్యాఖ్యాతల్లో అత్యధికమంది ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తారు. ఈ వంశానికి మర్యమ్ మరియు ఆమె కుమారుడైన ఈసా మూలంగా గొప్పస్థానం లభించింది. మర్యమ్ తల్లిపేరు 'హన్నా బిన్తె ఫాఖూద్' అని వ్యాఖ్యాతలు పేర్కొన్నారు (ఖుర్తుబీ, ఇబ్నె కసీర్). ఈ ఆయతులో అల్లాహ్ ఇమ్రాన్ సంతతితోపాటు మరో మూడు కుటుంబాలను గురించి కూడా ప్రస్తావించాడు. ఆయా కాలాల్లో ఆయన వారికి గౌరవోన్నతుల్ని వొసగాడు. వారిలో ఒకరు: ఆదం (అలైహిస్సలాం). ఈయన్ని దేవుడు తన స్వహస్తాలతో చేశాడు. ఆయనలో ప్రాణం పోశాడు. దైవదూతలు ఆయన ఎదుట మోకరిల్లేంత శ్రేష్ఠస్థానం వొసగాడు. వివిధ వస్తువుల పేర్లు చెప్పే జ్ఞానమొసగాడు. ఆయనకు స్వర్గంలో నివాసం కల్పించాడు. ఆ తరువాత ఆయన్ని భూమండలంపైకి పంపాడు. అలా పంపటంలో అసంఖ్యాకమైన పరమార్థాలు దాగి ఉన్నాయి. రెండవ వారు: నూహ్. ఈయన తన జాతి ప్రజల కోసం ప్రవక్తగా చేసి పంపబడ్డారు. నిజదైవాన్ని వదలి విగ్రహారాధన

ذُرِّيَّةً بَعْضُهَا مِنْ بَعْضٍ ۗ وَاللَّهُ سَمِيعٌ
عَلِيمٌ (34)

34 వారిలో కొందరు మరికొందరి సంతానం.[32] అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

إِذْ قَالَتِ امْرَأَتُ عِمْرَانَ رَبِّ إِنِّي نَذَرْتُ
لَكَ مَا فِي بَطْنِي مُحَرَّرًا فَتَقَبَّلْ مِنِّي ۖ
إِنَّكَ أَنْتَ السَّمِيعُ الْعَلِيمُ (35)

35 (ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేయి,) ఇమ్రాను భార్య ఇలా వేడుకున్నది: "ఓ నా ప్రభూ! నా గర్భంలో ఉన్న దానిని నీ సేవ కోసం అంకితం చేయాలని[33] మొక్కుకున్నాను. నీవు నా తరఫున దీనిని స్వీకరించు. నిస్సందేహంగా నీవు సర్వం వినేవాడవు, సర్వం తెలిసినవాడవు."

فَلَمَّا وَضَعَتْهَا قَالَتْ رَبِّ إِنِّي وَضَعْتُهَا أُنْثَىٰ ۗ
وَاللَّهُ أَعْلَمُ بِمَا وَضَعَتْ ۗ وَلَيْسَ الذَّكَرُ
كَالْأُنْثَىٰ ۖ وَإِنِّي سَمَّيْتُهَا مَرْيَمَ وَإِنِّي أُعِيذُهَا بِكَ
وَذُرِّيَّتَهَا مِنَ الشَّيْطَانِ الرَّجِيمِ (36)

36 తరువాత ఆమె ప్రసవించినప్పుడు, "ప్రభూ! నాకు ఆడపిల్ల కలిగినదే!" అని విన్నవించుకుంది. ఆమె కన్న సంతానం ఏదో అల్లాహ్‌కు బాగా తెలుసు. మగ పిల్లవాడు ఆడపిల్ల వంటివాడు కాడు.[34] "నేను ఈ పాపకు మర్యమ్ అని పేరు పెట్టాను.[35] నేను ఈమెనూ, ఈమె సంతానాన్ని శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుంచి రక్షణ పొందటానికి నీకు అప్పగిస్తున్నాను"[36] అని అన్నది.

మొదలెట్టిన తన జాతి జనులనుద్దేశించి ఆయన ధర్మబోధ చేశారు. అల్లాహ్ ఈయనకు దీర్ఘాయుషు ప్రసాదించాడు. ఈయన తన జాతి వారిపై తొమ్మిదిన్నర శతాబ్దాల పాటు పరిశ్రమించారు. కాని గుప్పెడు మంది తప్ప ఎవరూ ఆయన మాట వినలేదు. ఎట్టకేలకు ఆయన బాధాతప్త హృదయంతో చేసిన శాపనార్థాల మూలంగా – విశ్వసించిన వారు మినహా – జాతి జనులంతా ఉప్పెనలో ముంచివేయబడ్డారు. ఇక ఇబ్రాహీం సంతతి : అల్లాహ్ ఈయన సంతతిలో ఎంతోమందిని ప్రవక్తలుగా నియుక్తుల్ని చేశాడు. వారిలో కొందరికి రాజ్యాధికారాన్ని కూడా ఇచ్చాడు. కడకు కట్టకడపటి ప్రవక్త అయిన ముహమ్మద్ (సఅసం) కూడా ఈ పరంపరలోనివారే. ఈయన (స) ఇబ్రాహీం కుమారుడగు ఇస్మాయీల్ (అలైహిస్సలాం) వంశపరంపరలో పుట్టారు.

32. లేక దీని రెండవ అర్థం ధర్మం విషయంలో ఒకరికొకరు సహాయకులు అని.

33. **'ముహర్రరన్'** (నీ పేరు మీద వదలిపెడుతున్నాను) అనేది మూల పదం. అంటే నీ ఆరాధనాలయ సేవకోసం అంకితం చేస్తున్నాను అని దాని భావం.

34. ఈ మాటలో కొంచెం నిరాశ ఉంది, తనను మన్నించి తను సమర్పించుకుంటున్న దానిని స్వీకరించమనే విన్నపమూ ఉంది. 'నేను అనుకున్న దానికి భిన్నంగా ఆడపిల్ల పుట్టిందే!' అన్న బాధ మరియు 'నీ ప్రసన్నత కోసం ఒక సేవకుణ్ణి సమర్పించుకోవాలనుకున్నాను, ఈ సేవ మగవాడైతేనే బాగా చేస్తాడు, ఇప్పుడు నేను నీకు ఏం సమర్పించగలనో నీకు తెలుసు, దయచేసి దాన్నే స్వీకరించు' అన్న విన్నపమూ ఆమె మాటలో తొణకిసలాడుతున్నది (ఫత్‌హుల్ ఖదీర్).

35. హాఫిజ్ ఇబ్నె కసీర్ ఈ ఆయతు ఆధారంగా, మహాప్రవక్త (స) వారి ఇతర హదీసుల ఆధారంగా చెప్పేదేమిటంటే; శిశువు జన్మించిన నాడే నామకరణం చేయాలి. ఏడవ రోజున పేరు పెట్టాలన్న హదీసును ఆయన బలహీనమైనది (జయీఫ్)గా ఖరారు చేశారు. అయితే హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ దీనికి సంబంధించిన హదీసులన్నింటినీ శోధించిన తరువాత, మొదటి రోజుగానీ, మూడవ రోజుగానీ, ఏడవ రోజునగానీ నామకరణం చేయవచ్చన్న అభిప్రాయానికి వచ్చారు. ఈ విషయంలో వీటన్నింటికీ వెసులుబాటు ఉంది (తొహ్‌ఫతుల్ మౌదూద్).

36. ఆమె మొరను అల్లాహ్ ఆలకించాడు. ఒక సహీహ్ హదీసులో ఇలా ఉంది: ఏ శిశువైనాసరే జన్మించినపుడు షైతాన్

37 అంతే! ఆమె ప్రభువు ఆ పసిపాపను ఉత్తమరీతిలో స్వీకరించి, అత్యుత్తమ రీతిలో ఆమెను పోషించాడు. ఆమె బాగోగులు చూసే బాధ్యతను జకరియ్యాకు అప్పగించాడు.[37] జకరియ్యా ఆమె కుటీరానికి వెళ్ళినప్పుడల్లా, ఆమె వద్ద ఆహార పదార్థాలు కనిపించేవి.[38] "మర్యమ్! ఇవి నీ వద్దకు ఎక్కడి నుంచి వచ్చాయి?" అని ఆయన అడిగితే, "అల్లాహ్ వద్ద నుంచి" అని ఆమె చెప్పేది. నిశ్చయంగా అల్లాహ్ తాను కోరిన వారికి లెక్క లేనంతగా ఉపాధిని ప్రసాదిస్తాడు.

فَتَقَبَّلَهَا رَبُّهَا بِقَبُولٍ حَسَنٍ وَأَنۢبَتَهَا نَبَاتًا حَسَنًا وَكَفَّلَهَا زَكَرِيَّا ۖ كُلَّمَا دَخَلَ عَلَيْهَا زَكَرِيَّا الْمِحْرَابَ وَجَدَ عِندَهَا رِزْقًا ۖ قَالَ يَا مَرْيَمُ أَنَّىٰ لَكِ هَٰذَا ۖ قَالَتْ هُوَ مِنْ عِندِ اللَّهِ ۖ إِنَّ اللَّهَ يَرْزُقُ مَن يَشَاءُ بِغَيْرِ حِسَابٍ ﴿٣٧﴾

38 అక్కడే జకరియ్యా (అలైహిస్సలాం) తన ప్రభువును వేడుకున్నాడు. "ఓ నా ప్రభూ! నీ వద్ద నుండి నాకు మంచి సంతానాన్ని ప్రసాదించు. నిస్సందేహంగా నీవు మొరను ఆలకించేవాడవు" అని అన్నాడు.

هُنَالِكَ دَعَا زَكَرِيَّا رَبَّهُ ۖ قَالَ رَبِّ هَبْ لِي مِن لَّدُنكَ ذُرِّيَّةً طَيِّبَةً ۖ إِنَّكَ سَمِيعُ الدُّعَاءِ ﴿٣٨﴾

దాన్ని తాకుతాడు. దాంతో శిశువు ఏడుస్తుంది. అయితే అల్లాహ్ మర్యమ్‌ను, మర్యమ్ కుమారుడగు ఈసా (అలైహిస్సలాం)ను ఈ షైతాన్ తాకిడి నుండి సురక్షితంగా ఉంచాడు (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్; ముస్లిం – కితాబుల్ ఫజాయెల్).

37. జకరియ్యా (అలైహిస్సలాం) మర్యమ్‌కి పినతండ్రి కూడా. అదీగాక ఆయన ఆనాటి దైవప్రవక్త కూడా. అందువల్ల ఆమె కోసం ఆయనకన్నా మంచి సంరక్షకులు ఇంకెవరు కాగలుగుతారు? మర్యమ్ భౌతిక అవసరాలను తీర్చటంలోనూ, ఆమెకు విద్యాబుద్ధులు నేర్పటంలోనూ, ఆమెను సంస్కారవతిగా తీర్చిదిద్దటంలోనూ జకరియ్యా మాత్రమే తగిన వ్యక్తి.

38. మూలంలో **మిహ్రాబ్, రిజ్ఖ్** అనే రెండు పదాలు వచ్చాయి. మిహ్రాబ్ అంటే కుటీరం అని అర్థం. రిజ్ఖ్ (ఆహారపదార్థాలు) అంటే పండ్లు ఫలాలు అన్నమాట. ఆ సీజన్‌లో లేని పండ్లు ఆమె వద్దకు వచ్చేవి. ఎండాకాలంలో రావలసిన ఫలాలు శీతాకాలంలోనూ, శీతాకాలంలో రావలసిన పండ్లు ఎండాకాలంలోనూ సమర్పించబడటం విచిత్రం, విశేషం కదూ! జకరియ్యాగానీ, లేక ఆయన ద్వారా నియమించబడిన మరో సేవకుడుగానీ వాటిని తెచ్చేవారు కాదు. అందుకే ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి? అంటూ జకరియ్యా ఆశ్చర్యంతో ప్రశ్నించారు. 'అల్లాహ్ వద్ద నుంచి' అని మర్యమ్ జవాబిచ్చింది. ఇది మర్యమ్‌గారి విషయంలో జరిగిన మహిమ అనాలి. ప్రకృతికి విరుద్ధంగా సంభవించే దానిని 'మహిమ' లేక 'అద్భుతం' అని అంటారు. ఈ మహిమలు, అద్భుతాలు ఒక దైవప్రవక్త చేతుల మీదుగా జరిగితే దాన్ని "మూజిజా" అంటారు. అదే ఒక వలీ చేత ఇలాంటివి జరిగితే దానిని "కరామత్" అని అంటారు. ఇవి రెండూ సత్యబద్ధమైనవే. కాకపోతే అవి దైవాజ్ఞపై, దైవప్రణాళికకు కట్టుబడి సంభవిస్తాయి. మహిమలను, లేక అద్భుతాలను ఎప్పుడంటే అప్పుడు చూపించే అధికారం, శక్తి ప్రవక్తలకు, వలీలకు ఉండదు. ఈ మహనీయులకు దైవసన్నిధిలో విశిష్టస్థానం ఉందన్న దానికి ఇవి తార్కాణమే. అయితే వారు విశ్వవ్యవస్థలో తాము తలచిందల్లా చేయగలిగే అధికారం కూడా కలిగి ఉన్నారని భావిస్తే అది పొరబాటు. 'బిద్‌అతీలు' ఇక్కడే పొరబడ్డారు. ఔలియాలకు (దేవుని ప్రియతమ దాసులకు) గల కొన్ని మహిమల్ని ఉదాహరిస్తూ ఈ ప్రబుద్ధులు జనసామాన్యాన్ని షిర్కుకు (అల్లాహ్‌తో పాటు వలీలను సమానంగా భావించే పాపానికి), అంధ విశ్వాసాలకు లోను చేస్తుంటారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు మోజిజాత్ (ప్రవక్తల మహిమలు) పేర్కొనబడిన చోట వస్తాయి.

**39** కుటీరంలో నిలబడి నమాజు చేస్తుండగా దైవదూతలు తనను పిలిచి, "అల్లాహ్ నీకు యహ్యా గురించిన శుభవార్త ఇస్తున్నాడు.[39] అతడు దైవవాక్కును ధృవపరుస్తాడు. నాయకు డౌతాడు. ఇంద్రియ నిగ్రహం కలవాడు, దైవప్రవక్త, సద్వర్తనుల కోవకు చెందినవాడై ఉంటాడు" అని చెప్పారు.[40]

فَنَادَتْهُ الْمَلٰٓئِكَةُ وَهُوَ قَآئِمٌ يُّصَلِّيْ فِي الْمِحْرَابِ ۙ اَنَّ اللّٰهَ يُبَشِّرُكَ بِيَحْيٰى مُصَدِّقًۢا بِكَلِمَةٍ مِّنَ اللّٰهِ وَسَيِّدًا وَّحَصُوْرًا وَّنَبِيًّا مِّنَ الصّٰلِحِيْنَ ﴿39﴾

**40** దానికి జకరియ్యా ఇలా విన్నవించుకున్నాడు : "ప్రభూ! నేనేమో పండు ముసలివాణ్ణి. నా భార్య ఏమో గొడ్రాలు. అలాంట ప్పుడు నాకు కొడుకు ఎలా పుడతాడు?" దానికి, "అలాగే జరుగు తుంది. అల్లాహ్ తాను కోరినది చేస్తాడు" అని (దైవదూత) సమాధానం ఇచ్చాడు.

قَالَ رَبِّ اَنّٰى يَكُوْنُ لِيْ غُلٰمٌ وَّقَدْ بَلَغَنِيَ الْكِبَرُ وَامْرَاَتِيْ عَاقِرٌ ؕ قَالَ كَذٰلِكَ اللّٰهُ يَفْعَلُ مَا يَشَآءُ ﴿40﴾

**41** "నా ప్రభూ! దీనికి సంబంధించిన నిదర్శనం ఏదన్నా నా కొరకు నిర్ణయించు" అని అతను మనవి చేసుకోగా, "నీ కొరకు నిదర్శనం ఏమిటంటే, మూడు రోజుల వరకూ నువ్వు సైగలు చేయటం తప్ప జనులతో మాట్లాడలేవు. నువ్వు నీ ప్రభువును అత్యధికంగా స్మరిస్తూ ఉండు. ఉదయం, సాయంత్రం ఆయన పవిత్రతను[41] కొనియాడుతూ ఉండు" అని చెప్పాడు.

قَالَ رَبِّ اجْعَلْ لِّيْٓ اٰيَةً ؕ قَالَ اٰيَتُكَ اَلَّا تُكَلِّمَ النَّاسَ ثَلٰثَةَ اَيَّامٍ اِلَّا رَمْزًا ؕ وَاذْكُرْ رَّبَّكَ كَثِيْرًا وَّسَبِّحْ بِالْعَشِيِّ وَالْاِبْكَارِ ﴿41﴾

39. సీజన్‌లో రావలసిన పండ్లు అన్‌సీజన్‌లో కనబడేసరికి జకరియ్యాలో కూడా ఆశలు చిగురించాయి. ఒకవైపు తాను ముసలివాడై ఉండి, మరోవైపు తన భార్య గొడ్రాలు అయినప్పటికీ ఆయనలో దైవకారుణ్యం పట్ల ఆశ అంతరించలేదు. మర్యమ్‌కు అద్భుతమైన రీతిలో పండ్లు ఫలాలను ప్రసాదించినట్లుగానే దేవుడు తనకూ ఒక మంచి బిడ్డనిస్తే ఎంత బావుండు! అన్న కోరిక పుట్టింది. అందుకే దైవసన్నిధిలో ఆయన చేతులు అప్రయత్నంగా పైకి లేచాయి. ఆయన అధరాల నుంచి వేడుకోలు వచనాలు వెలువడ్డాయి. దేవుడు వాటిని దయతో ఆమోదించాడు.

40. దైవ వాక్కును ధృవపరచటమంటే భావం దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం – ఏసు)ను ధృవీకరించటం అన్నమాట! అంటే యహ్యా, ఈసా కంటే పెద్దవారని దీనిద్వారా తెలుస్తున్నది. వారిరువురూ ఒండొకరి దైవదౌత్యాన్ని (నబువ్వత్‌ను) సమర్థించుకున్నారు. మరిన్ని వివరాలకోసం మర్యమ్ సూరా వ్యాఖ్యానం చదవండి. 'సయ్యిదన్' అంటే సర్దారు, నాయకుడు అని అర్థం. **'హసూరన్'** (ఇంద్రియ నిగ్రహం కలవాడు) అంటే చెడుల దరిదాపులకు కూడా పోనివాడని అర్థం. 'హసూరన్' అనే పదాన్ని 'మహ్‌సూర్' అన్న అర్థంలో తీసుకుంటే కామోద్రేకాల నుంచి పూర్తిగా ఆపబడినవాడన్న అర్థం కూడా వస్తుంది. దీని ఆధారంగా కొంతమంది వ్యాఖ్యాతలు 'నపుంసకుడు' అని భావించారు. కాని ఈ భావన సరైంది కాదు. పైగా ఇదొక లోపం. ఇక్కడ ఈ గుణాన్ని లోపంగా కాకుండా గొప్పదనంగా అభివర్ణించటం జరిగిందన్న సంగతిని మరువరాదు.

41. వృద్ధాప్యంలో అద్భుతమైన రీతిలో సంతాన శుభవార్త వినిపించబడేసరికి ఆయనలో ఉత్సుకత పెరిగింది. ఆ మేరకు ఏదన్నా ఆనవాలు ఇవ్వమని కోరారాయన. మూడు రోజుల పాటు నీ నోట మాటరాదు. అదే ఆనవాలు. అయితే ఈలోగా నీవు లోలోపలే దైవనామాన్ని వీలైనంత ఎక్కువగా స్మరించాలి. ఉదయం సాయంత్రం దేవుని పవిత్రతను

وَاِذْ قَالَتِ الْمَلٰٓئِكَةُ يٰمَرْيَمُ اِنَّ اللّٰهَ اصْطَفٰكِ وَطَهَّرَكِ وَاصْطَفٰكِ عَلٰى نِسَآءِ الْعٰلَمِيْنَ ﴿42﴾

42 (ఆ సందర్భాన్ని కూడా జ్ఞాపకం చేయి. మర్యమ్‌ను ఉద్దేశించి) దైవదూతలు ఇలా అన్నారు: "ఓ మర్యమ్! అల్లాహ్ (తన సేవ కొరకు) నిన్ను ఎన్నుకున్నాడు. నిన్ను పరిశుద్ధురాలిగా చేశాడు. ప్రపంచంలోని మహిళలందరిపై నీకు ప్రాధాన్యతను ఇస్తూ నీ ఎంపిక చేశాడు.[42]

يٰمَرْيَمُ اقْنُتِىْ لِرَبِّكِ وَاسْجُدِىْ وَارْكَعِىْ مَعَ الرّٰكِعِيْنَ ﴿43﴾

43 "(కనుక) ఓ మర్యమ్! నువ్వు నీ ప్రభువుకు విధేయత చూపు. ఆయనకు సజ్దా చెయ్యి (ఆయన సాన్నిధ్యంలో మోకరిల్లు). 'రుకూ' చేసే వారితో పాటు నువ్వూ రుకూ చెయ్యి (వినమ్రతతో ఆయన ముందు తలవంచు)."

ذٰلِكَ مِنْ اَنْۢبَآءِ الْغَيْبِ نُوْحِيْهِ اِلَيْكَ ؕ وَمَا كُنْتَ لَدَيْهِمْ اِذْ يُلْقُوْنَ اَقْلَامَهُمْ اَيُّهُمْ يَكْفُلُ مَرْيَمَ ۪ وَمَا كُنْتَ لَدَيْهِمْ اِذْ يَخْتَصِمُوْنَ ﴿44﴾

44 ఇవి అగోచర విషయాలలోనివి. (ఓ ప్రవక్తా!) వాటిని నీకు వహీ ద్వారా తెలియజేస్తున్నాము. మర్యమ్‌కు పోషకులుగా ఎవరుండాలి? అన్న విషయమై వారు తమ కలములు విసరినప్పుడు నీవు అక్కడ లేవు. (ఈ వ్యవహారంపై) వారు గొడవ పడినప్పుడు కూడా నీవు అక్కడ లేవు.[43]

కొనియాడుతూ ఉండాలి. ఈ విధంగా నీవు నీకు వొసగబడే అనుగ్రహానికి కృతజ్ఞతలు తెలుపుకున్నట్లవుతుంది అని ఆయనకు సూచించబడింది. ఇందులో గొప్ప గుణపాఠం ఉంది. దేవుడు మీరు కోరుకున్న విధంగా మీకు ప్రసాదించినపుడు అదే రీతిలో దైవానికి కృతజ్ఞతలు కూడా తెలుపుకోవాలి. కృతజ్ఞతలు ఎంత ఎక్కువగా తెలుపుకుంటే అంతే అధికంగా దైవానుగ్రహాలు ప్రాప్తిస్తాయి. అంతేకాదు, అవి మన పాలిట శుభకరంగా కూడా పరిణమిస్తాయి.

42. మర్యమ్‌ను దేవుడు అత్యుత్తమ మహిళగా ఖరారు చేశాడు. అంటే ఆమె తన కాలంలో గల మహిళల్లోకెల్లా గొప్ప మహిళ అని భావం. ఎందుకంటే మర్యమ్‌తోపాటు ఖదీజా (ర.అన్హా)కు కూడా ఈ గౌరవపురస్కారం లభించినట్లు హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. ఖదీజా నుద్దేశించి **'ఖైరు నిసాయిహా'** – మహిళలందరిలోకీ ఉత్తమురాలు – అని హదీసులో ఉంది. మరికొన్ని హదీసుల్లో నలుగురు మహిళలను సంపూర్ణులుగా పేర్కొనటం జరిగింది. వారు : మర్యమ్, ఆసియా (ఫిరౌన్ భార్య), ఖదీజా, ఆయిషా (రజి). 'సరీద్' వంటకానికి ఇతర వంటకాలన్నింటిపై ఎలా ప్రాధాన్యత ఉందో అలాగే ఆయిషా (ర.అన్హా)కు మహిళలందరిపై శ్రేష్ఠత ఉంది అని హదీసులో చెప్పబడింది (ఇబ్నె కసీర్). తిర్మిజీలోని ఉల్లేఖనంలో ముహమ్మద్(స) పుత్రిక అయిన ఫాతిమా(ర.అన్హా)కు కూడా అత్యుత్తమశ్రేణి మహిళల సరసన స్థానం ఇవ్వబడింది (ఇబ్నె కసీర్). ఈ ఉల్లేఖనాలన్నింటినీ కూర్చగా విదితమయ్యేదేమిటంటే యిక్కడ ప్రస్తావించబడిన మహిళామణులందరికీ అల్లాహ్ స్త్రీ జాతిపై ప్రాధాన్యతను యిచ్చాడు. లేక వీరు తమ తమ కాలాలకు చెందిన మహిళల్లో గొప్పవారుగా ఉన్నారు. వాస్తవం దైవానికే ఎరుక.

43. బిద్అతీలు మహాప్రవక్త (సఅసం) పట్ల ప్రేమాతిశయంతో చెప్పే మాయమాటలకు ఈ వాక్యం చెంపపెట్టు వంటిది. మహాప్రవక్త (స)కు అగోచర జ్ఞానం ఉందనీ, ఆయన (స) అన్నిచోట్లా అన్ని సమయాల్లో ఉంటారని బిద్అతీలు అంటుంటారు. ఒకవేళ వారన్నట్లు మహాప్రవక్త (స) నిజంగా అగోచరజ్ఞాని అయివుంటే ఆయన్ని (స) ఉద్దేశించి దేవుడు ఇలా అని ఉండేవాడు కాదు. ("ఇవి అగోచర విషయాలలోనివి. వాటిని మేము నీకు తెలియజేస్తున్నాము") అలాగే 'నీవు ఆ సమయంలో అక్కడ లేవు' అని అనటాన్నిబట్టి ప్రవక్త (స)గారు అన్నిచోట్లా హాజరై ఉంటారన్నది కూడా నిజం కాదని తేలిపోయింది.

కలములు విసరవలసిన అవసరం ఎందుకు ఏర్పడిందంటే, అనేకమంది మర్యమ్‌కు సంరక్షకులుగా ఉంటామని

45 దైవదూతలు, "ఓ మర్యమ్! అల్లాహ్ నీకు తన వాక్కుకు[44] సంబంధించిన శుభవార్తను వినిపిస్తున్నాడు. అతని పేరు మసీహ్ ఈసా బిన్ మర్యమ్.[45] అతడు ఇహపరాలలో గౌరవనీయుడవుతాడు. అతను (అల్లాహ్) సామీప్యం పొందిన వారిలో ఒకడు."

إِذْ قَالَتِ الْمَلَٰٓئِكَةُ يَٰمَرْيَمُ إِنَّ اللَّهَ يُبَشِّرُكِ بِكَلِمَةٍ مِّنْهُ اسْمُهُ الْمَسِيحُ عِيسَى ابْنُ مَرْيَمَ وَجِيهًا فِي الدُّنْيَا وَالْآخِرَةِ وَمِنَ الْمُقَرَّبِينَ ﴿٤٥﴾

ముందుకు వచ్చారు. ఈ విషయం తేల్చటానికి నిర్వాహకులు చీటీలు వేసి పేరు నిర్ధారించే పద్ధతిలో కలములు విసిరారన్నమాట. ఈ వివరాలన్నీ మహాప్రవక్త (స) పై అవతరించటం కూడా ఒకవిధంగా ఆయన (స) దైవదౌత్యాన్ని సత్యమని నిర్ధారించే ఒక ప్రమాణమే. ఎందుకంటే దైవవాణి (వహీ) ప్రవక్త మీదే అవతరిస్తుంది, ఇతరుల మీద అవతరించదు. ముహమ్మద్ (స) వారి ప్రవక్తా పదవిపై అనుమానానికి గురై ఉన్న యూదులు, క్రైస్తవులకు ఇది దీటైన జవాబు.

44. **'దైవవాక్కు'** (కలిమతుల్లాహ్) అని ఈసా (అలైహిస్సలాం) నుద్దేశించి అల్లాహ్ అనటంలోని ప్రధాన ఉద్దేశం ఆయన పుట్టుక ప్రత్యేక తరహాలో జరిగింది. సాధారణ మానవ సూత్రానికి భిన్నంగా – తండ్రి లేకుండానే – దైవాజ్ఞతో ఆయన పుట్టించబడ్డారు. 'అయిపో' అన్న దేవుని వాక్కుపై ఆయన సృష్టి జరిగింది. అందుచేత ఈసా 'కలిమతుల్లాహ్' (దైవాజ్ఞ లేక దైవవాక్కు) గా పిలువబడ్డారు.

45. **'ఈసా బిన్ మర్యమ్'** అంటే మర్యమ్ కుమారుడైన ఈసా అని అర్థం; **మసీహ్ :** ఇది 'మస్‌హున్' నుంచి వచ్చిన పదం. అరబీలో 'మసహల్ అర్జ' అంటారు. అంటే అతను భువిలో సంచరించాడని దానికి అర్థం. దాని ప్రకారం 'మసీహ్' అనే పదానికి అత్యధికంగా సంచరించేవాడని అర్థం వస్తుంది. 'మసీహ్' అనే పదానికి చేత్తో స్పర్శించేవాడని కూడా ఒక అర్థం వస్తుంది. ఈసా ప్రవక్త దైవాదేశంతో రోగగ్రస్తులను చేత్తో స్పర్శించి నయం చేసేవారవటం చేత ఆయనకు ఆ పేరు వచ్చింది. మసీహ్ అనే పదం 'ఫయీల్' అనే పదానికి సంతులన పదం. అరబీలో 'ఫయీల్'కు సంతులనంగా వచ్చే పదాలకు కర్త మరియు కర్మణి–రెండు రకాల అర్థాలూ వస్తాయి. దాని ప్రకారం 'మసీహ్'కు పైన చెప్పబడిన రెండు అర్థాలు కర్తాభావాన్ని సూచిస్తున్నాయి.

ఇది ఇలా ఉండగా ప్రళయానికి ముందు పుడతాడని చెప్పుకునే ఉపద్రవాగ్రేసరుణ్ణి (దజ్జాల్‌ను) కూడా 'మసీహ్' అనే పిలుస్తారు. మరి ఈ 'మసీహ్' కర్తాపదమా లేక కర్మణి పదమా? అన్న సందేహం ఈ సందర్భంగా కలుగుతుంది. దానికి సమాధానం ఏమిటంటే అది కర్తాపదమూ కావచ్చు, కర్మణి పదమూ కావచ్చు. ఎందుకంటే 'మస్‌హున్'కు చెరిపివేయటం అనే ఇంకో అర్థం కూడా ఉంది. దజ్జాల్‌కు ఒక కన్ను మాత్రమే ఉండి, మరో కన్ను చెరిపేసినట్టుగా ఉంటుంది. అందుకని అతణ్ణి 'మసీహ్' (చెరిపివేయబడినవాడు) అని పిలుస్తారు. ఈ విధంగా చూస్తే 'మసీహ్' అన్న పదం కర్మణి పదం అవుతుంది. అయితే దజ్జాల్ కూడా ప్రపంచంలో విపరీతంగా సంచారం చేస్తాడనీ, మక్కా మదీనాలు తప్ప ప్రతి చోటుకీ చేరుకుంటాడని హదీసుల్లో చెప్పబడింది (బుఖారీ, ముస్లిం). అందుకని అతన్ని 'మసీహ్' అని పిలుస్తారని మరికొంతమంది చెబుతారు. సాధారణంగా ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు తమ గ్రంథాల్లో ఇదే మాట రాశారు. దీని ప్రకారం 'మసీహ్' అన్నది కర్తాపదం అవుతుంది.

ఇంకొంతమంది శాస్త్రవేత్తలు ఏమంటారంటే యూదుల, క్రైస్తవుల పరిభాషలో దేవుని చేత నియమించబడిన గొప్ప ప్రవక్తను 'మసీహ్' అని పిలుస్తారు. అంటే వారి పరిభాషలో మసీహ్ అనేది ఒక దృఢచిత్తుడైన ప్రవక్తకు పర్యాయపదం అన్నమాట! ఒక గొప్ప విప్లవానికి కారకుడయ్యే ప్రవక్త ప్రభవించనున్నాడని యూదులకు శుభవార్త ఇవ్వబడింది. దాన్ని వారు తప్పుగా అర్థం చేసుకొని ఆ మసీహ్ (విప్లవానికి కారకుడయ్యే ప్రవక్త ) కోసం ఇప్పటికీ నిరీక్షిస్తున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రళయానికి ముందు రాబోయే ఉపద్రవాగ్రేసరుడు (దజ్జాల్), యూదులు ఎదురుచూస్తున్న 'మసీహ్' తనేనని ప్రకటించుకుంటాడు. అందుకే అతన్ని మసీహ్ దజ్జాల్ అని పిలువటం జరుగు

46 "అతడు ఉయ్యాలలో ఉన్నప్పుడూ, పెద్దవాడైనప్పుడూను[46] ప్రజలతో మాట్లాడతాడు. ఇంకా అతడు సద్వర్తనులలోని వాడై ఉంటాడు" అని అన్నప్పుడు;

وَيُكَلِّمُ النَّاسَ فِي الْمَهْدِ وَكَهْلًا وَّمِنَ الصّٰلِحِيْنَ ﴿٤٦﴾

47 ఆమె, "నా ప్రభూ! నాకు పిల్లవాడు ఎలా పుడ్తాడు? నన్ను ఏ మనిషీ తాకలేదే!" అని అన్నది. "అలాగే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరినది పుట్టిస్తాడు. ఆయన ఏదైనా పనిని చేయ సంకల్పించుకుని 'అయిపో' అని అంటే చాలు, అది 'అయి పోతుంది'[47] అని (దైవదూత ద్వారా) సమాధానం లభించింది.

قَالَتْ رَبِّ اَنّٰى يَكُوْنُ لِيْ وَلَدٌ وَّلَمْ يَمْسَسْنِيْ بَشَرٌ ۭ قَالَ كَذٰلِكِ اللّٰهُ يَخْلُقُ مَا يَشَاۗءُ ۭ اِذَا قَضٰٓى اَمْرًا فَاِنَّمَا يَقُوْلُ لَهٗ كُنْ فَيَكُوْنُ ﴿٤٧﴾

48 అల్లాహ్ అతనికి అక్షర జ్ఞానాన్ని,[48] వివేకాన్ని, తౌరాతు, ఇన్జీలు గ్రంథాల జ్ఞానాన్నీ నేర్పుతాడు (అని కూడా దైవదూతలు తెలిపారు).

وَيُعَلِّمُهُ الْكِتٰبَ وَالْحِكْمَةَ وَالتَّوْرٰىةَ وَالْاِنْجِيْلَ ﴿٤٨﴾

తుందని వ్యాఖ్యాతలు వివరిస్తారు. నిజానికి అతను చెప్పే ప్రతిమాట, చేసే ప్రతి పని దగా, మోసాలతో కూడుకొని ఉంటుంది. ప్రపంచ చరిత్రలో ఎవరూ కనివిని ఎరుగనటువంటి, మహా దగాకోరుతనానికి అతను పాల్పడతాడు. అందుకే అతన్ని 'దజ్జాల్' అన్నారు మరి! దజ్జాల్ అంటే ఉపద్రవాగ్రేసరుడు, మహా మోసగాడు అని అర్థం.

ఇకపోతే 'ఈసా' అనే పదం: కొంతమంది దీన్ని అరబ్బేతర పదంగా ఖరారు చేయగా, మరికొందరు ఇది అరబీ పదమేననీ, దీనికి నాయకత్వం వహించేవాడు అని అర్థమని చెప్పారు (ఖుర్తుబీ, ఫత్హుల్ ఖదీర్).

46. ఈసా (ఏసు ప్రవక్త) ఉయ్యాలలో ఉండగానే సంభాషించిన విషయం మర్యమ్ సూరాలో ఉంది. ఇదిగాక సహీహ్ హదీసులో ఇద్దరు బాలుర ప్రస్తావన వచ్చింది. వారిలో ఒకరు జురైజ్, మరొకరు ఇస్రాయీల్ వంశస్థురాలైన ఒక స్త్రీకి చెందిన పిల్లవాడు (సహీహ్ బుఖారీ– కితాబుల్ అంబియా, అధ్యాయం : వజ్కుర్ ఫిల్ కితాబి మర్యమ్). ఈ ఉల్లేఖనంలో ప్రస్తావనకు వచ్చిన ముగ్గురు బాలురు ఇస్రాయీల్ సంతతికి చెందినవాళ్ళు. ఇదిగాకుండా సహీహ్ ముస్లింలో 'కందకాలవాళ్ళ' గాథలో కూడా పాలు త్రాగే పసివాడు మాట్లాడినట్లు ఉంది. యూసుఫ్ ప్రవక్త గురించి సాక్ష్యాధారాలతో తీర్పు చేసినది పసిపిల్లవాడు అని ప్రచారంలో ఉన్నమాట వాస్తవం కాదు. అసలు ఆ వ్యక్తి గడ్డం గలవాడు (జూ లిహ్యహ్). దీనిద్వారా అతను పెద్ద మనిషి అని తెలుస్తున్నది (అజ్జయిఫా గ్రంథం, 881వ పేజీ).

ఈ వాక్యంలో **'కహ్లున్'** అనే పదం వచ్చింది. కహ్లున్ అంటే నడి వయస్సు అని అర్థం. పెద్దవాడైన తర్వాత నడివయస్సులో సంభాషిస్తాడన్న మాటకు అర్థం ఏమిటి? అంటే ఆయన పెద్దవాడై, దైవసందేశాన్ని అందుకుని సంస్కరణా కార్యక్రమానికి ఉపక్రమించినపుడు జనులనుద్దేశించి సంభాషిస్తాడని దీని భావం అని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఈసా (అలైహిస్సలాం) ప్రళయం సమీపించినపుడు దివి నుంచి భువికి దిగివచ్చి చేసే ఇస్లాం ప్రచారమే 'ఈ సంభాషణ' అని ఇంకొంతమంది వ్యాఖ్యాతలు విశదీకరించారు. ప్రళయ సమీప కాలంలో ఈసా ప్రవక్త ఆకాశం నుంచి దిగివస్తారని మన అహ్లెసున్నత్ వారి విశ్వాసం. ప్రామాణికమైన ముతవాతిర్ హదీసుల ద్వారా ఈ విషయం నిరూపితమై ఉంది (తఫ్సీర్ ఇబ్నె కసీర్, ఖుర్తుబీ).

47. పిల్లవాడు పుడతాడన్న వార్త నిన్ను ఆశ్చర్యంలో ముంచెత్తి ఉండవచ్చు. కాని దేవుని శక్తి సామర్థ్యాల ముందు ఇదేమీ కష్టకార్యం కాదు. భౌతిక ప్రాకృతిక విధానానికి విరుద్ధంగా కూడా ఆయన ఏదైనా చేయగలుగుతాడు. 'అయిపో' అన్న ఒక్కమాటతో తాను తలచిందల్లా చేస్తాడు.

48. ఇక్కడ అరబీలో **'కితాబ్'** అని వచ్చింది. కితాబ్ అనే పదం యిక్కడ 'వ్రాత' అన్న అర్థంలో తీసుకోబడింది. లేదా

وَرَسُوۡلًا اِلٰى بَنِىۡۤ اِسۡرَآءِيۡلَ ۙ اَنِّىۡ قَدۡ
جِئۡتُكُمۡ بِاٰيَةٍ مِّنۡ رَّبِّكُمۡ ۙۚ اَنِّىۡۤ اَخۡلُقُ لَـكُمۡ
مِّنَ الطِّيۡنِ كَهَیۡـــَٔةِ الطَّيۡرِ فَاَنۡفُخُ فِيۡهِ فَيَكُوۡنُ
طَيۡرًاۢ بِاِذۡنِ اللّٰهِ‌ ۚ وَاُبۡرِئُ الۡاَكۡمَهَ وَالۡاَبۡرَصَ
وَاُحۡىِ الۡمَوۡتٰى بِاِذۡنِ اللّٰهِ‌ ۚ وَاُنَبِّئُكُمۡ بِمَا تَاۡكُلُوۡنَ
وَمَا تَدَّخِرُوۡنَ ۙ فِىۡ بُيُوۡتِكُمۡ‌ ؕ اِنَّ فِىۡ ذٰلِكَ لَاٰيَةً
لَّـكُمۡ اِنۡ كُنۡتُمۡ مُّؤۡمِنِيۡنَ ۚ (49)

**49** ఇంకా అతను ఇస్రాయీలు వంశీయుల వైపుకు ప్రవక్తగా పంపబడతాడు. (వారినుద్దేశించి ఆయన ఇలా అంటాడు:) "నేను మీ వద్దకు మీ ప్రభువు దగ్గరి నుంచి సూచనను తీసుకువచ్చాను. నేను మీ కోసం పక్షి ఆకారం ఉన్న ఒక మట్టి బొమ్మను తయారు చేసి[49] అందులో ఊదుతాను. అల్లాహ్ ఆజ్ఞతో అది పక్షి అవుతుంది. ఇంకా అల్లాహ్ ఆజ్ఞతో నేను పుట్టుగ్రుడ్డిని, కుష్ఠు రోగిని బాగుచేస్తాను. మృతులను బ్రతికిస్తాను.[50] మీరు తినే వాటినీ, మీరు మీ ఇండ్లలో నిలువచేసి ఉంచిన వాటిని గురించి (కూడా) చెబుతాను. మీరే గనక విశ్వసించేవారైతే ఇందులో మీ కొరకు గొప్ప సూచన ఉంది."

తౌరాత్, ఇన్జీలు గ్రంథాలతోపాటు మరేదైనా గ్రంథ జ్ఞానం దేవుడు ఆయనకు వొసగాడని దాని భావం కావచ్చు (ఖుర్తుబీ). లేక తౌరాత్, ఇంజీల్ పదాలు మూలంలో వచ్చిన అల్ కితాబ్, అల్ హిక్మత్ అనే పదాలకు తాత్పర్యం కావచ్చు.

49. **'అఖ్లుఖు లకుమ్'** (నేను మీ కొరకు సృష్టిస్తాను) – ఇందులో అఖ్లుఖు అన్న పదం సృష్టిస్తాను అన్న భావంలో చెప్పబడలేదు. ఎందుకంటే సృష్టించేవాడు కేవలం అల్లాహ్ మాత్రమే. అందులో సందేహానికి ఆస్కారమే లేదు. ఇక్కడ ఈ పదం 'ఉసవ్విరు', అంటే బాహ్యరూపాన్ని మలుస్తాను. 'ఉఖద్దిరు' (తయారు చేస్తాను) అన్న భావంలో మాత్రమే ఉపయోగించబడింది (ఖుర్తుబీ).

50. **'అల్లాహ్ ఆజ్ఞతో'** (బి ఇజ్నిల్లాహి) అన్న పదం రెండేసిసార్లు చెప్పబడటం గమనార్హం. దీన్నిబట్టి బోధపడేదేమంటే దైవత్వపు గుణాలలో, అధికారాలలో తనను భాగస్వామిగా ఎవరూ ఊహించుకోరాదనీ, తాను కేవలం ఒక దాసుడు మరియు ప్రవక్త మాత్రమేనని ఈసా (అలైహిస్సలాం) చెప్పదలిచారు. తన ద్వారా జరుగుతున్నదంతా ఒక మహిమాన్వితం (మోజిజా) మాత్రమే. అదీ అల్లాహ్ ఆజ్ఞతోనే జరుగుతోంది. అందులో నా గొప్పతనం ఏమీలేదు అని కూడా ప్రవక్త ఈసా స్పష్టపరచదలిచారు. ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు : అల్లాహ్ ప్రతి ప్రవక్తకూ అతని కాలపు స్థితిగతులనుబట్టి కొన్ని మహిమలు ప్రసాదించాడు. ఆ ప్రవక్తను ప్రజలు సత్యవంతుడుగా, ఔన్నత్యం గలవాడుగా నమ్మాలన్నదే దాని అసలు ఉద్దేశం. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) కాలంలో ప్రజల్లో చేతబడి ప్రభావం విపరీతంగా ఉండేది. మంత్రవిద్యలు, కనికట్లు పెచ్చరిల్లాయి. కాని అల్లాహ్ ఆయనకు అత్యంత శక్తిమంతమైన మహిమను ప్రసాదించేసరికి దానిముందు మాంత్రికుల మంత్రతంత్రాలన్నీ పటాపంచలైనాయి. దాంతో మూసా (అలైహిస్సలాం) సత్యవంతుడైన ప్రవక్త అని తేటతెల్లం అయిపోయింది. మంత్రగాళ్లు సయితం ఈ విషయాన్ని ఒప్పుకుని మూసాను విశ్వసించారు.

అదేవిధంగా ఈసా (అలైహిస్సలాం) కాలంలో వైద్యం, వ్యాధి నివారణ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అందుకే మృతుణ్ణి బ్రతికించే, పుట్టుగ్రుడ్డికి చూపును ప్రసాదించే, కుష్ఠురోగిని నయం చేసే మహిమలు దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం)కు వొసగబడ్డాయి. ఆ కాలపు వైద్యనిపుణుడెవరూ ఈ అద్భుతాలు చేయలేక పోయేవాడు.

అలాగే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాలంలో సాహితీ విలువలకు, తేనెలొలికే తేటమైన కవిత్వానికి అమితమైన ప్రాముఖ్యం ఉండేది. అందుచేత ఆయన (సఅసం)కు దివ్య ఖుర్ఆన్ వంటి మనోహర శైలితో కూడుకున్న, అత్యుత్తమ సాహితీ ప్రమాణాలను కలిగివున్న ఉద్గ్రంథం ప్రసాదించబడింది. అటువంటి గ్రంథాన్ని ప్రపంచంలోని గొప్ప సాహితీవేత్తలు, మహాకవులెవరూ ఇప్పటివరకూ రచించలేకపోయారు. మరెప్పటికీ ఇలాంటి కృతిని సమర్పించ లేరన్నది సత్యం (ఇబ్నె కసీర్).

**50** "ఇంకా నేను నాకు పూర్వం అవతరించిన తౌరాతు (గ్రంథము)ను ధృవపరుస్తున్నాను. మీ కొరకు నిషేధించబడిన[51] కొన్ని వస్తువులను ధర్మసమ్మతం గావించటానికి కూడా నేను వచ్చాను. ఇంకా నేను మీ వద్దకు మీ ప్రభువు సూచనను తీసుకు వచ్చాను. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి."

وَمُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيَّ مِنَ التَّوْرٰىةِ
وَلِاُحِلَّ لَكُمْ بَعْضَ الَّذِيْ حُرِّمَ عَلَيْكُمْ وَجِئْتُكُمْ
بِاٰيَةٍ مِّنْ رَّبِّكُمْ ۣ فَاتَّقُوا اللّٰهَ وَاَطِيْعُوْنِ ﴿50﴾

**51** "నిశ్చయంగా అల్లాహ్ నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. కనుక మీరంతా ఆయన్నే ఆరాధించండి. ఇదే రుజుమార్గం."[52]

اِنَّ اللّٰهَ رَبِّيْ وَرَبُّكُمْ فَاعْبُدُوْهُ ۭ هٰذَا صِرَاطٌ
مُّسْتَقِيْمٌ ﴿51﴾

**52** అయితే వారిలోని తిరస్కార వైఖరిని పసిగట్టిన[53] తరువాత ఈసా, "అల్లాహ్ మార్గంలో నాకు తోడ్పడేవారెవరు?"[54] అని ప్రశ్నించగా, హవారీలు,[55] "అల్లాహ్ మార్గంలో మేము (మీకు) తోడ్పడతాము. మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మేము విధేయులమయ్యాము. ఈ విషయానికి మీరు సాక్షులుగా ఉండండి" అని జవాబిచ్చారు.

فَلَمَّآ اَحَسَّ عِيْسٰى مِنْهُمُ الْكُفْرَ قَالَ مَنْ
اَنْصَارِيْٓ اِلَى اللّٰهِ ۭ قَالَ الْحَوَارِيُّوْنَ نَحْنُ اَنْصَارُ
اللّٰهِ ۚ اٰمَنَّا بِاللّٰهِ ۚ وَاشْهَدْ بِاَنَّا مُسْلِمُوْنَ ﴿52﴾

51. ఆ వస్తువులు ఎందుకు నిషేధించబడ్డాయన్నది ప్రశ్న. బహుశా దేవుడు వారిని శిక్షించే ఉద్దేశంతో కొన్ని వస్తువులను వారికై హరామ్ (నిషిద్ధం)గా ఖరారుచేసి ఉండవచ్చు. లేదా ధర్మశాస్త్రాన్ని దైనందిన జీవితానికి అన్వయింపజేయటంలో వారి విద్వాంసుల వల్ల జరిగిన పొరబాటు మూలంగా ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చు. అలాంటి పొరబాటును బహుశా ఈసా (అలైహిస్సలాం) సరిదిద్ది వాటిని తిరిగి ధర్మసమ్మతంగా ఖరారు చేసి ఉండవచ్చు (ఇబ్నె కసీర్).

52. అంటే దైవసన్నిధిలో ఆరాధన చేయటంలో, ఆయన ఎదుట నిస్సహాయస్థితిని వ్యక్త పరుస్తూ నిలబడటంలో నేనూ, మీరు – సమానులమే. కనుక రుజుమార్గం ఒక్కటే. అదేమిటంటే అందరూ కలసి ఒకే దైవాన్ని ఆరాధించటం! ఆయన దైవత్వంలో వేరొకరిని సహవర్తులుగా నిలబెట్టకుండా ఉండటం!!

53. అంటే ఇస్రాయీలీయులు పన్నే కుట్రలు, కపట చేష్టలు దాదాపు కుఫ్ర్ (అవిశ్వాసం)తో కూడుకున్నవిగా, దైవప్రవక్త ఈసా సందేశాన్ని తృణీకరించేవిగా ఉండేవి. ఇక వీళ్లు ఎంతమాత్రం తన సహాయకులు కాజాలరని ఈసాకు అర్థమైపోయింది.

54. తరతరాలుగా, యుగయుగాలుగా చరిత్ర చాటిచెప్పేదేమంటే ఎంతోమంది దైవప్రవక్తలు తమ జాతి వారి ఆగడాలను భరించలేక తొలుత జాతికి చెందిన వివేకవంతులను సంప్రతించి వారి సహాయ సహకారాలను కోరారు. అంతిమ దైవప్రవక్త (సఅసం) కూడా ప్రారంభంలో ఇదే పని చేశారు. మక్కా ఖురైషులు ఆయన (స) సందేశ కార్యక్రమంలో ప్రధాన అడ్డంకిగా నిలిచారు. అందుచేత ఆయన (స) హజ్ సందర్భంగా దూర ప్రదేశాల నుంచి వివిధ తెగల వారిని కలుసుకుని దైవధర్మ ప్రచారంలో తనకు సహాయకులుగా నిలువమని కోరేవారు. దీనికి అన్సారులు అనుకూలంగా స్పందించారు. హిజ్రత్‌కు ముందు, హిజ్రత్ తరువాత కూడా అన్సార్ వర్గీయులు మహాప్రవక్త (స)కు అండగా నిలిచారు.

ఈసా (అలైహిస్సలాం) కూడా ఇదేవిధంగా ప్రజల సహకారాన్ని కోరారు. ఈ రకమయిన అభ్యర్థన 'షిర్క్'గా పరిగణించ బడదు. అసలు దైవప్రవక్తలు వచ్చేదే 'షిర్క్'ను రూపుమాపడానికి కదా! మరి అటువంటప్పుడు వారు స్వయంగా షిర్క్‌కి ఎలా పాల్పడతారు? కాని సమాధుల వద్దకు వెళ్ళి మొక్కుబడులు తీర్చుకునే వారు తాము ఒడిగట్టే చేష్టను

**53** (వారు ఇంకా ఇలా అన్నారు:) "ప్రభూ! నీవు అవతరింపజేసిన దాన్ని మేము విశ్వసించాము. మేము నీ ప్రవక్తను అనుసరించాము. కనుక సాక్షుల జాబితాలో మా పేర్లు కూడా వ్రాసుకో."

رَبَّنَآ اٰمَنَّا بِمَآ اَنْزَلْتَ وَاتَّبَعْنَا الرَّسُوْلَ فَاكْتُبْنَا مَعَ الشّٰهِدِيْنَ ﴿53﴾

**54** అవిశ్వాసులు రహస్యంగా ఎత్తులు వేయసాగారు. అల్లాహ్ కూడా వారి ఎత్తులకు పై ఎత్తులు వేశాడు. ఎత్తులు వేసే వారిలో అల్లాహ్ సాటిలేని మేటి.[56]

وَمَكَرُوْا وَمَكَرَ اللّٰهُ ۭ وَاللّٰهُ خَيْرُ الْمٰكِرِيْنَ ﴿54﴾

**55** అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు : ఓ ఈసా! నేను నిన్ను పూర్తిగా తీసుకుంటాను.[57] నిన్ను నా వైపుకు లేపుకుంటాను.

اِذْ قَالَ اللّٰهُ يٰعِيْسٰٓى اِنِّىْ مُتَوَفِّيْكَ وَرَافِعُكَ اِلَيَّ

సమర్థించుకోవటానికి ఈసా (అలైహి)గారి ఈ పలుకులను (దైవమార్గంలో నాకు తోడ్పడేవారెవరు? అన్న పలుకులను) ఉదాహరించటం వారి అవివేకానికి, హ్రస్వదృష్టికి తార్కాణం. అల్లాహ్ వారికి సన్మార్గాన్నీ, సద్బుద్ధినీ వొసగుగాక!

55. **'హవారియ్యూన్'** అనేది హవారీ అనే పదానికి బహువచనం. 'హవారీలు' అంటే సహాయకులు, తోడ్పాటునిచ్చేవారు అని అర్థం. మహనీయ ముహమ్మద్ (సఅసం)వారు ఇలా ప్రవచించారు : "ప్రతి ప్రవక్తకూ ఎవరో ఒకరు ప్రత్యేక సహాయకులుగా ఉంటారు. నా సహాయకుడు జుబైర్ (రజి)" (సహీహ్ బుఖారీ: కితాబుల్ జిహాద్).

56. ఈసా (అలైహిస్సలాం) కాలంలో సిరియా ప్రాంతం రోమనుల ఏలుబడిలో ఉండేది. వారి తరఫున ఆ ప్రాంతానికి అధికారిగా నియమితుడై ఉన్న వ్యక్తి అవిశ్వాసి. ఈసా (ఏసు ప్రవక్త)కు వ్యతిరేకంగా యూదులు ఆ అధికారి చెవుల్లో ఏవేవో నూరిపోసారు. అతడు తండ్రి లేనివాడనీ, కల్లోల కారకుడనీ చాడీలు చెప్పారు. వారి ఫిర్యాదులపై రాజ్యపాలకుడు ఈసా (అలైహిస్సలాం)కు శిలువ వేయమని ఆదేశించాడు. కాని అల్లాహ్ ఈసా (ఏసు ప్రవక్త)ను సురక్షితంగా ఆకాశంపైకి ఎత్తుకున్నాడు. ఆయన బదులు ఆయన్ని పోలివున్న మరో వ్యక్తికి – ఆయనేనని భ్రమపడి – శిలువ వేశారు. తాము ఈసాకు మరణదండన విధించామని వారంతా సంబరపడుతున్నారు. అరబీలో 'మక్ర్' అనే పదం వచ్చింది. మక్ర్ అంటే రహస్యంగా పన్నే కుటిలపన్నాగం, రహస్య ఎత్తుగడ అని అర్థం. ఈ రెండవ భావంలోనే యిక్కడ అల్లాహ్‌ను ఎత్తుగడల్లో సాటిలేని మేటి (ఖైరుల్ మాకిరీన్) అని చెప్పటం జరిగింది. ఈ ఎత్తుగడ చెడు ఉద్దేశంతో వేస్తే అది కుట్ర, ద్రోహం అనబడుతుంది. అదే సదుద్దేశంతోనో, ఆత్మరక్షణ కోసమో వేస్తే అప్పుడది మంచి వ్యూహం, మేలైన ఎత్తుగడగా పరిగణించబడుతుంది.

57. ఆయతులో **'ముతవఫ్ఫీ'** అని అనబడింది. దీని మూలపదం 'తవఫ్ఫియున్.' అసలు వీటన్నింటి ధాతువు 'వఫియ్యున్.' దీనికి సంపూర్తిగా తీసుకోవటం అనే అర్థం వస్తుంది. మనిషి మరణించినపుడు 'వఫాత్' అనే పదం వాడబడుతుంది. కారణం అతని భౌతిక శక్తి యుక్తులన్నీ ఆ క్షణంలో జప్తు చేసుకోబడతాయి. ఈ విధంగా చూస్తే మరణం అనేది వఫాత్ యొక్క వివిధ స్థితుల్లో ఒక స్థితి మాత్రమే. వఫాత్ అంటే మరణమే అని అనుకోనవసరం లేదు. మనిషి నిద్రలోకి జారుకున్నప్పుడు కూడా అతనికి తనపై ఏమాత్రం అదుపు, అజమాయిషీ ఉండదు. మనిషి శక్తులు– తాత్కాలికంగా – అతన్నుంచి తీసుకోబడతాయి. అందుకే దివ్య ఖుర్ఆన్ నిద్రను కూడా వఫాత్‌గా అభివర్ణించింది. దీనిద్వారా బోధపడేదేమిటంటే **వఫియ్యున్, తవఫ్ఫియున్, వఫాత్** అనే పదాలకు అసలు అర్థం సంపూర్తిగా తీసుకోవటమనేగాని వాటి అర్థం మరణం కాదు. 'ఇన్నీ ముతవఫ్ఫీక' అనే పదం యిక్కడ ఈ అసలు అర్థంలోనే ప్రయోగించబడింది. అంటే – 'ఓ ఈసా! నేను నిన్ను యూదుల కుట్ర నుంచి కాపాడి, నిన్ను పూర్తిగా నా వైపుకు – ఆకాశాలపైకి – ఎత్తుకుంటాను' అని దేవుడు చెప్పదలిచాడు. జరిగింది కూడా అదేను. మరణం అనే పదం వఫాత్‌కు ప్రత్యామ్నాయంగా విరివిగా వాడబడుతుండటం చేత కొందరు ఇక్కడ 'ముతవఫ్ఫీక'కు 'నేను నిన్ను మరణింపజేస్తాను' అనే తర్జుమా చేశారు. అయితే అక్కడే వారు మరో సంగతి కూడా స్పష్టం చేశారన్నది గమనార్హం. అదేమిటంటే, ఈ

وَمُطَهِّرُكَ مِنَ الَّذِينَ كَفَرُوا وَجَاعِلُ الَّذِينَ
اتَّبَعُوكَ فَوْقَ الَّذِينَ كَفَرُوا إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ ۚ ثُمَّ
إِلَيَّ مَرْجِعُكُمْ فَأَحْكُمُ بَيْنَكُمْ فِيمَا كُنتُمْ فِيهِ
تَخْتَلِفُونَ ﴿55﴾

అవిశ్వాసుల బారి నుంచి నిన్ను పరిశుద్ధునిగా చేస్తాను.[58] నిన్ను అనుసరించిన వారిని ప్రళయదినం వరకూ[59] అవిశ్వాసులపై పైచేయిగా ఉంచుతాను. ఆ తర్వాత మీరంతా మరలి రావలసింది నా వద్దకే. అప్పుడు నేనే మీ మధ్య ఉన్న పరస్పర విభేదాలపై తీర్పు చేస్తాను.

فَأَمَّا الَّذِينَ كَفَرُوا فَأُعَذِّبُهُمْ عَذَابًا شَدِيدًا
فِي الدُّنْيَا وَالْآخِرَةِ وَمَا لَهُم مِّن نَّاصِرِينَ ﴿56﴾

**56** మరి అవిశ్వాసులకైతే నేను ఇహలోకంలోనూ, పరలోకంలోనూ కఠిన శిక్ష విధిస్తాను. వారిని ఆదుకునే వారెవరూ ఉండరు.

وَأَمَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ فَيُوَفِّيهِمْ
أُجُورَهُمْ ۗ وَاللَّهُ لَا يُحِبُّ الظَّالِمِينَ ﴿57﴾

**57** అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసినవారికి వారి పూర్తి పుణ్యఫలాన్ని అల్లాహ్ ఇస్తాడు. అల్లాహ్ దుర్మార్గులను ఎంత మాత్రం ఇష్టపడడు.

ذَٰلِكَ نَتْلُوهُ عَلَيْكَ مِنَ الْآيَاتِ وَالذِّكْرِ الْحَكِيمِ ﴿58﴾

**58** (ఓ ముహమ్మద్!) మేము నీకు (దివ్య ఖుర్ఆన్) ఆయతులను, వివేకంతో కూడిన హితబోధను చదివి వినిపిస్తున్నాము.

إِنَّ مَثَلَ عِيسَىٰ عِندَ اللَّهِ كَمَثَلِ آدَمَ ۖ خَلَقَهُ
مِن تُرَابٍ ثُمَّ قَالَ لَهُ كُن فَيَكُونُ ﴿59﴾

**59** అల్లాహ్ దృష్టిలో ఈసా ఉపమానం ఆదం ఉపమానాన్ని పోలినదే. (ఆయన) అతన్ని మట్టితో చేసి 'అయిపో' అని ఆజ్ఞాపించగానే అతను (మనిషిగా) అయిపోయాడు.

الْحَقُّ مِن رَّبِّكَ فَلَا تَكُن مِّنَ الْمُمْتَرِينَ ﴿60﴾

**60** నీ ప్రభువు తరఫు నుంచి (వచ్చిన) సత్యం ఇదే. జాగ్రత్త! శంకించే వారిలో చేరిపోకు.

---

ఆయతులో పదాల వాడకం – ముందుది వెనక్కి, వెనుకది ముందుకి – జరిగింది. అంటే భావం రీత్యా 'రాఫివుక' (నేను నిన్ను నా వైపు ఎత్తుకుంటాను) అన్న పదం ముందు ఉంది. 'ముతవఫ్ఫీక' (నిన్ను మరణింపజేస్తాను) అన్న పదం తర్వాత ఉంది. ఈ విధంగా చేయటం వల్ల భావం ఏమవుతుందంటే – ఓ ఈసా! నేను నిన్ను ఆకాశంపైకి ఎత్తుకుంటాను. ఆ తర్వాత మళ్లీ ప్రపంచంలోకి దింపినప్పుడు నీకు మరణం ఇస్తాను. ఇప్పుడు యూదుల చేతుల్లో నీకు మరణం రాదు. నీవు సహజమైన మరణమే మరణిస్తావు (ఫత్హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).

58. అంటే యూదులు నీకు వ్యతిరేకంగా చేసే దుష్ప్రచారం నుంచి, నీపై వేసే నీలాపనిందల కాలుష్య వాతావరణం నుంచి నిన్ను కాపాడుతాను అని దీని భావం. అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (సఅసం) ద్వారా ఈ వాగ్దానాన్ని నెరవేర్చాడు. ఈసా ప్రవక్త నిర్దోషత్వాన్ని, నిర్మలత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు.

59. ఈ 'పైచేయి' ఎవరికి వర్తిస్తుంది? క్రైస్తవులకా, ముస్లింలకా? అన్న సందేహం యిక్కడ కలగవచ్చు. క్రైస్తవుల విశ్వాసాలు పెడత్రోవపట్టిన కారణంగా పరలోక సాఫల్యం వారికి లభించకపోయినప్పటికీ ప్రపంచంలో మాత్రం వారు యూదులపై ఎల్లప్పుడూ ఆధిక్యతను ప్రదర్శిస్తూ ఉండవచ్చు. ఇది ఒకటి. ఇక రెండవ భావంలో ఈ పైచేయి ముహమ్మద్ (స) అనుయాయులది కావచ్చు. ఎందుకంటే వారు ఈసా ప్రవక్తతో సహా మిగతా ప్రవక్తలందరినీ విశ్వసిస్తారు. వారు చూపిన సరైన, ఏమాత్రం ప్రక్షిప్త నిక్షిప్తాలకు లోనుగాని స్వచ్ఛమైన ధర్మాన్ని అనుసరిస్తారు. ఆ విధంగా ఈసా ప్రవక్తకు నిజమైన అనుయాయులు ముస్లింలే అవుతారు.

**61** కనుక నీ వద్దకు ఈ జ్ఞానం వచ్చిన తరువాత కూడా నీతో ఎవరయినా ఈ విషయంలో వాదనకు దిగితే వారితో స్పష్టంగా ఇలా చెప్పేయి: "రండి! మీరూ మేము కలసి మన కుమారులను, మన స్త్రీలను పిలుద్దాం. స్వయంగా మనం కూడా వద్దాం. ఆ తర్వాత – 'అబద్ధాలు చెప్పేవారిపై అల్లాహ్ శాపం పడుగాక' అని దీనాతిదీనంగా ప్రార్థిద్దాము."[60]

فَمَنْ حَاجَّكَ فِيهِ مِنْ بَعْدِ مَا جَاءَكَ مِنَ الْعِلْمِ
فَقُلْ تَعَالَوْا نَدْعُ أَبْنَاءَنَا وَأَبْنَاءَكُمْ وَنِسَاءَنَا
وَنِسَاءَكُمْ وَأَنْفُسَنَا وَأَنْفُسَكُمْ ثُمَّ نَبْتَهِلْ
فَنَجْعَلْ لَعْنَتَ اللَّهِ عَلَى الْكَاذِبِينَ (61)

**62** నిశ్చయంగా ఇదే సత్యబద్ధమైన వృత్తాంతం. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. నిస్సందేహంగా అల్లాహ్‌యే సర్వాధిక్యుడు, వివేకవంతుడు.

إِنَّ هَٰذَا لَهُوَ الْقَصَصُ الْحَقُّ ۚ وَمَا مِنْ إِلَٰهٍ
إِلَّا اللَّهُ ۚ وَإِنَّ اللَّهَ لَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ (62)

**63** (ఈ సవాలు విసిరిన) తరువాత కూడా వారు (సత్యాన్ని) ఒప్పుకోక తిరిగిపోయినట్లయితే, అసలు సంక్షోభాన్ని రేకెత్తించే వారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు.

فَإِنْ تَوَلَّوْا فَإِنَّ اللَّهَ عَلِيمٌ بِالْمُفْسِدِينَ (63)

**64** (ఓ ప్రవక్తా!) వారికి స్పష్టంగా చెప్పు: "ఓ గ్రంథవహులారా! మాలోనూ, మీ లోనూ సమానంగా ఉన్న ఒక విషయం వైపుకు రండి. అదేమంటే మనం అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ ఆరాధించ కూడదు, ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ కల్పించరాదు.[61]

قُلْ يَا أَهْلَ الْكِتَابِ تَعَالَوْا إِلَىٰ كَلِمَةٍ سَوَاءٍ بَيْنَنَا
وَبَيْنَكُمْ أَلَّا نَعْبُدَ إِلَّا اللَّهَ وَلَا نُشْرِكَ بِهِ شَيْئًا

60. ఈ ఆయతు (61వ ఆయతు) **'ఆయతె ముబాహలా'**గా పిలువబడుతుంది. అంటే రెండు వర్గాల వారు కూడా తాము చెప్పేదే సత్యమని వాదిస్తున్నప్పుడు అసత్యం పలికేవారిపై దేవుని శాపం పడుగాక! అని ఒండొకరిని శపించటం అన్నమాట. సత్యాసత్యాల విషయమై భేదాభిప్రాయం ఏర్పడి, వ్యవహారం ఎటూ తేలని స్థితి ఏర్పడినప్పుడు ఈ 'ముబాహలా' జరుగుతుంది.

దీని పూర్వరంగం ఏమిటీ? అని ప్రశ్నించుకుంటే హిజ్రీ 9వ సంవత్సరంలో నజ్‌రాన్ ప్రాంతం నుంచి ఒక క్రైస్తవ బృందం మహాప్రవక్త (స) వద్దకు వచ్చింది. దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) విషయంలో అతిశయంతో కూడిన తమ విశ్వాసాల గురించి ఆ బృందం వాదించసాగింది. ఎట్టకేలకు ఈ ఆయతు అవతరించింది. దీని ఆధారంగా మహాప్రవక్త (స) క్రైస్తవబృందాన్ని 'ముబాహలా' కొరకు ఆహ్వానించారు. ఇందుకోసం ఆయన (స) అలీ (రజి), ఫాతిమా (రజి), హసన్ మరియు హుసైన్‌లను కూడా పిలుచుకున్నారు. మీరు కూడా మీ ఆలుబిడ్డలను పిలుచుకోండి. మనం ఉభయులం కలసి మనలోని అసత్యవాదులపై దేవుని శాపం పడమని శపిద్దాం అని సవాలు విసిరారు. ఈ సవాలుపై క్రైస్తవులు పరస్పరం సంప్రతించుకున్న మీదట 'ముబాహలా'ను ఎదుర్కొనలేకపోయారు. తమరు మా నుండి ఏం కోరుకున్నా తీర్చడానికి సిద్ధమేగానీ, 'ముబాహలా' మాత్రం వద్దన్నారు. అప్పుడు మహాప్రవక్త(స) వారిపై 'జిజ్‌యా'ను విధించారు. ఆ సొమ్మును వసూలు చేసే నిమిత్తం ఆయన (స) 'అమీనె ఉమ్మత్' (ఉమ్మత్ యొక్క నిజాయితీపరుడు)గా తనచేత కితాబు అందుకున్న అబూ ఉబైద బిన్ జర్రాహ్ (రజి)ను వారి వెంట పంపించారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్ ఆధారంగా). దీని తరువాతి ఆయతులో గ్రంథవహులైన యూదులు, క్రైస్తవులకు ఏకదైవారాధన వైపుకు పిలుపు ఇవ్వబడింది.

61. అంటే ఏ విగ్రహాన్నిగానీ, శిలువనుగానీ, అగ్నినిగానీ, మరే యితర వస్తువునుగానీ అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకూడదు. ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. ప్రవక్తలంతా యిచ్చిన సందేశం కూడా ఇదే.

అల్లాహ్‌ను వదలి మనలో ఎవరూ ఇంకొకరిని ప్రభువులుగా చేసుకోరాదు."[62] ఈ ప్రతిపాదన పట్ల గనక వారు విముఖత చూపితే, "మేము మాత్రం ముస్లిం (విధేయు)లము అన్న విషయానికి మీరు సాక్షులుగా ఉండండి"[63] అని వారికి చెప్పేయండి.

وَلَا يَتَّخِذَ بَعْضُنَا بَعْضًا أَرْبَابًا مِّن دُونِ اللَّهِ ۚ فَإِن تَوَلَّوْا فَقُولُوا اشْهَدُوا بِأَنَّا مُسْلِمُونَ ﴿٦٤﴾

65 ఓ గ్రంథవహులారా! మీరు ఇబ్రాహీం విషయంలో ఎందుకు గొడవపడుతున్నారు. తౌరాతు, ఇన్జీలు గ్రంథాలైతే ఆయన తరువాతనే అవతరించాయి కదా! అయినా మీరు అర్థం చేసుకోరే?![64]

يَا أَهْلَ الْكِتَابِ لِمَ تُحَاجُّونَ فِي إِبْرَاهِيمَ وَمَا أُنزِلَتِ التَّوْرَاةُ وَالْإِنجِيلُ إِلَّا مِن بَعْدِهِ ۚ أَفَلَا تَعْقِلُونَ ﴿٦٥﴾

62. గ్రంథవహుల మనోమస్తిష్కాలను కుదిపివేసే వాక్యం ఇది. మీరు హజ్రత్ ఈసాను, హజ్రత్ ఉజైర్‌ను ప్రభువు(రబ్)గా నమ్ముతున్నారు. కాని మీ నమ్మకం గుడ్డి నమ్మకం. వారు ప్రభువులు కారు. మీలాంటి మనుషులే. అదీగాక మీరు ధర్మాన్ని (హలాల్‌ను) అధర్మం (హరామ్)గా, అధర్మాన్ని ధర్మంగా ఖరారుచేసే నిర్ణయాధికారం మీ మతాధికారులకు, ఆచార్యులకు అప్పగించారు. ఇది కూడా ఒకవిధంగా వారిని ప్రభువులుగా చేసుకోవటమే. తౌబా సూరాలోని 31వ వచనం దీనికి తార్కాణం. ఈ ధోరణి కూడా సరైంది కాదు. ఎందుకంటే హలాల్ – హరామ్‌ల నిర్ణయాధికారం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంది (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

63. సహీహ్ బుఖారీలో ఉంది : దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆదేశానుసారం మహాప్రవక్త (సఅసం) రోము చక్రవర్తియగు హెర్క్లియస్‌కు ఒక లేఖ రాశారు. ఆ లేఖలో ఆయన (స) ఈ ఆయతు ఆధారంగా ఇస్లాంను స్వీకరించమని కోరారు. ఒకవేళ నీవు ఇస్లాంను స్వీకరిస్తే నీకు రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది, లేకపోతే నీ పాలిత ప్రజల పాపభారమంతా నీ మీదపడుతుందని హెచ్చరించారు. హదీసు వాక్యాలు ఇలా ఉన్నాయి: "ఇస్లాం ముందు నిన్ను నువ్వు సమర్పించుకో. శాంతిగా ఉంటావు. ఇస్లాం స్వీకరించు, అల్లాహ్ నీకు రెట్టింపు పుణ్యఫలం వొసగుతాడు. ఒకవేళ నువ్వు గనక ఇస్లాం స్వీకారం పట్ల విముఖత చూపావంటే నీ పరిపాలనలో ఉన్న జనుల పాపం కూడా నీ మీదే పడుతుంది. (ఎందుకంటే నీ పాలితులు ఇస్లాం స్వీకరించక పోవటానికి నువ్వే కారకుడయ్యావు కాబట్టి!)" (సహీహ్ బుఖారీ : కితాబు బద్‌యిల్ వహీ).

ఈ ఆయతులో మూడు ముఖ్యాంశాలు గమనార్హమైనవి – 1. కేవలం ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. 2. ఆయనకు భాగస్వాములుగా వేరితరులను నిలబెట్టరాదు – అంటే షిర్క్‌కు ఒడిగట్టరాదు. 3. ప్రపంచంలో ఏ వ్యక్తికీ, ఏ శక్తికీ షరీయత్‌కు రూపకల్పన చేసే అధికారం కట్టబెట్టరాదు. ఎవరికయినా ఈ అధికారాన్ని గనక కట్టబెడితే, వారిని దైవాలుగా, ప్రభువులుగా శిరసావహించినట్లే లెక్క.

**కలిమతున్ సవావున్** (సమానంగా ఉన్న విషయం) అంటే ఈ మూడు అంశాలే. ఈ మూడు అంశాల ఆధారంగానైనా ముస్లింలతో ఏకం కమ్మని గ్రంథవహులను పిలువటం జరిగింది. అదేవిధంగా విడిపోయిన మన ముస్లిం సమాజాన్ని ఏకం చేయటానికి కూడా మూడు అంశాలతో కూడిన ఈ 'కలిమతున్ సవావున్'నే ప్రాతిపదికగా చేసుకోవటం ఎంతైనా అవసరం.

64. ఇబ్రాహీం తమవాడంటే తమవాడని అటు యూదులు, ఇటు క్రైస్తవులు కూడా వాదులాడటంలోని ప్రధాన ఉద్దేశం ఏమిటంటే ఆయన వారి ధర్మాన్ని మాత్రమే అనుసరించాడని వారు చెప్పదలిచారు. మరి చూడబోతే యూదులు విశ్వసించే తౌరాతు గ్రంథంగానీ, క్రైస్తవులు నమ్మే బైబిలు గ్రంథంగానీ ఇబ్రాహీం (అలైహిస్సలాం) పరమపదించిన ఎన్నో సంవత్సరాల తరువాత అవతరించాయి. మరి అలాంటప్పుడు ఇబ్రాహీం యూదుడో లేక క్రైస్తవుడో ఎలా అవుతారు? ఇబ్రాహీంకి – మూసాకి మధ్య వెయ్యి సంవత్సరాల అంతరం ఉండగా, ఇబ్రాహీంకి – ఈసాకి మధ్య రెండు వేల సంవత్సరాల అంతరం ఉంది (ఖుర్తుబీ).

هٰٓاَنْتُمْ هٰٓؤُلَآءِ حَاجَجْتُمْ فِيْمَا لَكُمْ بِهٖ عِلْمٌ
فَلِمَ تُحَآجُّوْنَ فِيْمَا لَيْسَ لَكُمْ بِهٖ عِلْمٌ ؕ وَاللّٰهُ
يَعْلَمُ وَاَنْتُمْ لَا تَعْلَمُوْنَ ﴿66﴾

**66** చూడండి, మీకు తెలిసిన విషయం గురించి మీరెలాగూ వాదించారు. కాని మీకు తెలియని విషయాల గురించి ఎందుకు వాదిస్తున్నారు?[65] (యదార్థం) అల్లాహ్‌కు తెలుసుగాని మీకు తెలియదు.

مَا كَانَ اِبْرٰهِيْمُ يَهُوْدِيًّا وَّلَا نَصْرَانِيًّا وَّلٰكِنْ
كَانَ حَنِيْفًا مُّسْلِمًا ؕ وَمَا كَانَ مِنَ الْمُشْرِكِيْنَ ﴿67﴾

**67** ఇబ్రాహీం యూదుడూ కాదు, క్రైస్తవుడూ కాదు. ఆయన ఒకే దేవునివైపు అభిముఖుడైన ముస్లిం.[66] ఆయన ముష్రిక్కులలోని వాడు ఎంతమాత్రం కాదు.

اِنَّ اَوْلَى النَّاسِ بِاِبْرٰهِيْمَ لَلَّذِيْنَ اتَّبَعُوْهُ
وَهٰذَا النَّبِىُّ وَالَّذِيْنَ اٰمَنُوْا ؕ وَاللّٰهُ وَلِىُّ
الْمُؤْمِنِيْنَ ﴿68﴾

**68** అందరికన్నా ఎక్కువగా ఇబ్రాహీంకు దగ్గరివారమని చెప్పుకునే హక్కు ఎవరికయినా ఉందీ అంటే, అది ఆయన్ని అను సరించినవారికీ, ఈ ప్రవక్తకూ, విశ్వాసులకూ మాత్రమే ఉంది.[67] అల్లాహ్ విశ్వాసులకు మాత్రమే నేస్తం.

وَدَّتْ طَّآئِفَةٌ مِّنْ اَهْلِ الْكِتٰبِ لَوْ يُضِلُّوْنَكُمْ ؕ
وَمَا يُضِلُّوْنَ اِلَّآ اَنْفُسَهُمْ وَمَا يَشْعُرُوْنَ ﴿69﴾

**69** గ్రంథవహులలోని ఒక వర్గం మిమ్మల్ని పెడత్రోవ పట్టించాలని చూస్తోంది. నిజానికి వారు తమను తామే పెడత్రోవలో పడ వేసుకుంటున్నారు. కాని ఆ విషయాన్ని వారు గ్రహించటం లేదు.[68]

65. మీకు తెలిసిన విషయాల్లోనే–అంటే మీ ధర్మం, మీరు అనుసరించే గ్రంథజ్ఞానం విషయంలోనే – మీరు అర్థం పర్థం లేకుండా వాదించుకుంటున్నారు. అలాంటప్పుడు అసలు మీకు ఏమీ తెలియని విషయాల్లో వాదులాడుకుంటే అది యింకా ఎంత అర్థరహితంగా, నిర్హేతుకంగా ఉంటుందో ఊహించవచ్చు. వాస్తవానికి మీరు ఏ ఇబ్రాహీం గురించి దెబ్బలాడుకుంటున్నారో ఆయన ఏకదైవారాధనలో నిగ్గుతేలిన వాడు. మిథ్యావాదులకు కొరకరాని కొయ్యగా తయారయిన అసాధారణ వ్యక్తిత్వం ఆయనది. "నువ్వు విధేయుడవు అయిపో" అని దైవాజ్ఞ కాగానే, 'నేను సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కు విధేయుణ్ణి అయిపోయాను' అని స్పందించిన వినయశీలి ఆయన.

66. అరబీలో **"హనీఫన్, ముస్లిమన్"** అని వచ్చింది. అంటే బహుదైవోపాసనా భావాల పట్ల విసుగును, విరక్తిని వ్యక్తపరుస్తూ, కేవలం ఒకే ఒక్కడైన అల్లాహ్ దాస్యానికి అంకితమైనవాడు అని అర్థం.

67. ఇబ్రాహీం అనుసరించిన ధర్మానికీ, ఆయన అనుసరించిన షరీయతుకు చేరువగా ఎవరయినా ఉన్నారూ అంటే వారు మహనీయ ముహమ్మదు (సఅసం), ఆయన అనుచరులైన ముస్లిములు మాత్రమే. అందుకే దివ్య ఖుర్ఆన్‌లో సయితం ఇబ్రాహీం విధానాన్ని అనుసరించమని మహాప్రవక్త (సఅసం)కు ఆదేశించటం జరిగింది (అన్ నహ్ల్ – 123). హదీసులో ఉంది – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ప్రతి ప్రవక్తకూ ప్రవక్తలలో కొంతమంది స్నేహితులు ఉంటారు. కాగా, వారిలో నా పితామహుడు, నా ప్రభువుకు స్నేహితుడైన టువంటి ఆయనే (ఇబ్రాహీం గారే) నా స్నేహితులు." ఈ మాట అన్న తర్వాత ఆయన ఈ ఆయత్ పఠించారు. (సుననె తిర్మిజీ – ఇబ్నె కసీర్ ఆధారంగా).

68. ముస్లిముల పట్ల యూదుల్లో గల అసూయకు, వైరభావానికి ఇది ప్రతిరూపం. ఈ వైరభావం మూలంగానే వారు ముస్లిములను అపమార్గానికి లోను చెయ్యజూసేవారు. నిజానికి ఈ విధంగా వారు తమల్ని తామే పెడత్రోవలో పడవేసుకుంటున్నారనీ, స్వయంగా వారికి కూడా ఆ విషయం తెలియటం లేదని అల్లాహ్ హెచ్చరిస్తున్నాడు.

**70** "ఓ గ్రంథవహులారా! మీరు స్వయంగా అల్లాహ్ ఆయతు
లకు సాక్షిగా ఉండి కూడా వాటిని ఎందుకు తిరస్కరిస్తున్నారు?"[69]

يَاَهْلَ الْكِتٰبِ لِمَ تَكْفُرُوْنَ بِاٰيٰتِ اللّٰهِ وَاَنْتُمْ تَشْهَدُوْنَ ﴿70﴾

**71** "గ్రంథం కల ఓ ప్రజలారా! తెలిసి కూడా మీరు సత్యానికి
అసత్యపు రంగు పులిమి దానిని ఎందుకు అనుమానాస్పదం
చేస్తారు? (ఉద్దేశపూర్వకంగా) సత్యాన్ని ఎందుకు కప్పిపుచ్చు
తున్నారు??"[70]

يَاَهْلَ الْكِتٰبِ لِمَ تَلْبِسُوْنَ الْحَقَّ بِالْبَاطِلِ وَتَكْتُمُوْنَ الْحَقَّ وَاَنْتُمْ تَعْلَمُوْنَ ﴿71﴾

**72** గ్రంథవహులలోని ఒక వర్గం ఇలా అన్నది : "విశ్వసించిన
వారిపై అవతరించిన దానిని ఉదయం విశ్వసించి, సాయంత్రం
తిరస్కరించండి. బహుశా ఇలాగయినా వారు మరలి
పోతారేమో!"[71]

وَقَالَتْ طَّآئِفَةٌ مِّنْ اَهْلِ الْكِتٰبِ اٰمِنُوْا بِالَّذِيْٓ اُنْزِلَ عَلَى الَّذِيْنَ اٰمَنُوْا وَجْهَ النَّهَارِ وَاكْفُرُوْٓا اٰخِرَهٗ لَعَلَّهُمْ يَرْجِعُوْنَ ﴿72﴾

**73** "మీరు మీ ధర్మాన్ని అనుసరించేవారిని తప్ప వేరెవరినీ
నమ్మవద్దు"[72] (అని అంటారు). (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు :
"నిశ్చయంగా అల్లాహ్ చూపే మార్గమే సన్మార్గం."[73]

وَلَا تُؤْمِنُوْٓا اِلَّا لِمَنْ تَبِعَ دِيْنَكُمْ ؕ قُلْ اِنَّ الْهُدٰى هُدَى اللّٰهِ ۙ اَنْ يُّؤْتٰٓى اَحَدٌ مِّثْلَ مَآ اُوْتِيْتُمْ

69. అంటే ముహమ్మద్ (సఅసం) సత్య సందేశహరుడనీ, ఆయన (స) చెబుతున్నదంతా వాస్తవమనీ తెలిసి కూడా మీరు ఆయన్ని తిరస్కరిస్తున్నారు.

70. యూదుల్లో తిష్ఠవేసిన రెండు పెద్ద నేరాలు యిక్కడ వేలెత్తి చూపబడ్డాయి. 1. ధర్మాధర్మాలను, సత్యాసత్యాలను కలగాపులగం చేసి ప్రజలకు సత్యమేదో స్పష్టంగా బోధపడకుండా చేయటం. 2. నిజాన్ని దాచటం. అంటే తౌరాతు గ్రంథంలో ముహమ్మద్ (స) ప్రవక్త గురించి సూచించబడిన ఆనవాళ్లను జనులకు తెలియకుండా దాచిపెట్టడం. కనీసం ఈ విధంగానయినా ముహమ్మద్ (స) సత్యప్రవక్త అన్న విషయం బహిర్గతం కాకుండా ఉండాలన్నది వారి అసలు ఉద్దేశం. ఈ రెండు అపరాధాలకు దూరంగా ఉండమని వారికి ఈ ఆయతులో తాకీదు చేయడం జరిగింది. ఎందుకంటే ఈ రెండు నేరాలకు వారు బుద్ధిపూర్వకంగా పాల్పడేవారు. ఈ పనికి ఒడిగట్టి వారు తమ దౌర్భాగ్యాన్ని మరింతగా పెంచుకున్నారు. బఖరా సూరాలో కూడా, "తెలిసీ సత్యాన్ని అసత్యంతో కలిపివేయకండి, సత్యాన్ని దాచకండి" అని వారిని మందలించటం జరిగింది (ఆయతు నెం.42). ఇక్కడ గ్రంథవహులు అనే పదం యూదులతో పాటు, క్రైస్తవులకు కూడా వర్తిస్తుందని కొంతమంది వ్యాఖ్యాతలు భావిస్తున్నారు. అంటే ఈ నేరాలకు దూరంగా ఉండమని ఆ ఇరువర్గాల వారికీ ప్రబోధించటం జరుగుతున్నదని వారి అభిప్రాయం. మరికొంతమంది వ్యాఖ్యాతల దృష్టిలో మదీనాలో నివసించిన యూద తెగలు బనూ ఖురైజ, బనూ నజీర్, బనూ ఖైనుఖాలకు మాత్రమే ఈ ఆయతు వర్తిస్తుంది. ఈ చివరి అభిప్రాయమే సరైనది. ఎందుకంటే ముస్లింల పట్ల నేరుగా వైర వైఖరిని ప్రదర్శించటంలో ఎల్లప్పుడూ అందరికంటే ముందుండేది ఈ మూడు తెగలే.

71. యూదుల కుటిల పన్నాగాల్లో మరొక పన్నాగం ఇది. దీనిద్వారా వారు ముస్లింలను సన్మార్గం నుంచి తప్పించటానికి ప్రయత్నించేవారు. ప్రొద్దున పూట ముస్లింలుగా మారి సాయంత్రం పూట ఇస్లాంను విడనాడుతూ ఉంటే ముస్లింల శిబిరాల్లో కలవరం రేకెత్తుతుంది. ఇస్లాం ధర్మంలో ఏవో లోపాలుండటం వల్లే జనులు ఇలా తిరిగి పోతున్నారేమో! అన్న అనుమానపు బీజాలు వారిలో నాటుకుంటాయి అని కొంతమంది యూదులు ఈ కుటిల పన్నాగాన్ని పన్నారు.

72. యూదులు తమలో తాము చెప్పుకున్న మాటలివి – పైకి మాత్రం మీరు ముస్లింలుగా నటించండి. కాని లోపలినుంచి మాత్రం మీరు యూదులుగానే ఉండండి. మీరు మీ ధర్మంపైనే ఉండాలి. ఇతరుల మాటలకు ప్రభావితం కారాదు.

أَوْ يُحَآجُّوكُمْ عِندَ رَبِّكُمْ ۗ قُلْ إِنَّ الْفَضْلَ بِيَدِ اللَّهِ يُؤْتِيهِ مَن يَشَآءُ ۗ وَاللَّهُ وَاسِعٌ عَلِيمٌ ﴿73﴾

((గ్రంథవహులు తమ వారికి ఇంకా ఈ విధంగా కూడా నూరి పోస్తారు:) "మీకు ఇవ్వబడినదే[74] వేరెవరికయినా ఇవ్వబడి ఉండ వచ్చునీ, లేక వారు మీ ప్రభువు సమక్షంలో మీకు వ్యతిరేకంగా వాదిస్తారని (మీరు ఎంతమాత్రం అనుకోకండి)." ఓ ప్రవక్తా! వారితో అను: "అనుగ్రహాలన్నీ అల్లాహ్ చేతిలో ఉన్నాయి. ఆయన తాను కోరిన వారికి వాటిని ఇస్తాడు. అల్లాహ్ గొప్ప విస్తృతి కలవాడు, అన్నీ తెలిసినవాడు."

يَخْتَصُّ بِرَحْمَتِهِ مَن يَشَآءُ ۗ وَاللَّهُ ذُو الْفَضْلِ الْعَظِيمِ ﴿74﴾

**74** "ఆయన తాను కోరిన వారిని తన కారుణ్యం కొరకు ప్రత్యేకించుకుంటాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు."[75]

73. యూదుల సంభాషణల గురించి చెబుతూ మధ్యలో హఠాత్తుగా **'ఖుల్ ఇన్న హుదల్లాహి హువల్ హుదా'** (ప్రవక్తా! చెప్పెయ్యి. నిశ్చయంగా అల్లాహ్ చూపే మార్గమే సన్మార్గం) అన్న వాక్యం తీసుకురావటం పాఠకులకు విచిత్రంగానూ, పైగా అది అసందర్భమైన వాక్యంగానూ అనిపించవచ్చు. వీటినే 'జుమ్లే మూతరిజా' (అసందర్భ వాక్యాలు) అని అంటారు. విషయ ప్రవాహం మధ్యలో, ఇటువంటి వాక్యాలను వివిధ ఉద్దేశాలతో వాడటం జరుగుతుంది. ఇక్కడ యూదుల కుంటిసాకులను, కుటిల పన్నాగాలను స్పష్టీకరించే ఉద్దేశంతో ఇలా చెప్పబడింది. అంటే దైవమార్గంలో వారెన్ని మాయోపాయాలు చేసినా, ఎన్ని అవరోధాలను కల్పించినా దానివల్ల వాటిల్లే నష్టం ఏమీ ఉండదు, అల్లాహ్ తాను కోరినవారికి మార్గదర్శకత్వం వహించి తీర్తాడు అని దీని భావం.

74. ఇది కూడా యూదులు చెప్పుకున్న మాటే. అంటే – మీ వర్గంలో దైవదౌత్య (రిసాలత్) పరంపర ఉన్నట్లే, ఇతరులకు కూడా దైవదౌత్యం లభించవచ్చు కదా! యూదుల మాదిరిగానే ఇతరులు కూడా సత్యంపై ఉండవచ్చు కదా! లాంటి మాటలు వారు మీకు చెబుతారేమో! కాని మీరు మాత్రం వారి మాటల్ని నమ్మకండి అని యూద నాయకులు తమ వారికి నూరిపోశారన్నమాట!

75. ఈ ఆయతుకు రెండు అర్థాలున్నాయి. ఒకటి: పొద్దెక్కుతున్న సమయంలో మీరు ఇస్లాం స్వీకరించి పొద్దు గూకుతుండగా ఆ మతం నుంచి మరలిపొండి. మీరు ఇలా చేయటం వల్ల మొదటినుంచీ ఇస్లాంపై స్థిరంగా ఉన్న ముస్లింలు కూడా అయోమయంలో పడిపోయి తమ ధర్మం నుంచి తిరిగిపోయే అవకాశం ఉంది అని యూద పండితులు తమ అనుచర వర్గానికి నేర్పేవారు. వారు తమ శిష్యులకు యింకా ఏమని చెప్పేవారంటే; మీరు నామకా ముస్లింలుగా ఉండాలి. నిజంగా ముస్లింలు అయిపోకూడదు సుమా! వాస్తవానికి మీరు మనస్ఫూర్తిగా యూదులుగానే ఉండాలి. ధర్మం, దైవసందేశం, షరీయతు, దేవుని ప్రత్యేక కృప మాకు వొసగబడినట్లే అన్యులకూ వొసగబడి ఉండవచ్చుకదా! మాలాగే అన్యులు కూడా సత్యమార్గంపై ఉండవచ్చుకదా! వారు రేపటి రోజున దైవసమక్షంలో మాకు వ్యతిరేకంగా వాదించి మమ్మల్ని దోషులుగా నిలదీస్తారేమో కదా! అని ఆలోచించి ఆ ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోతారేమో! జాగ్రత్త! అలాంటి తెలివితక్కువ పని చేయకండి... ఈ భావంలో తీసుకుంటే మధ్యలో వచ్చిన 'జుమ్లే మూతరిజా' (అసందర్భ వాక్యం) మినహా "ప్రభువు సమక్షంలో నివేదించుకుంటారు!" అనే వాక్యం వరకు అవి యూదులు చెప్పుకున్న మాటలుగానే పరిగణించబడతాయి.

**రెండు :** ఇక రెండవ భావంలో తీసుకుంటే అల్లాహ్ యూదులకు ఈ విధంగా ప్రబోధించినట్లవుతుంది : ఓ యూదులారా! మీరు సత్యాన్ని అణచివేసే ఉద్దేశంతో ఈ కుట్రలు పన్నుతున్నారు. ఎందుకంటే మీకు ఇవ్వబడినటువంటి విద్య, అనుగ్రహం, వహీ, షరీఅతు, ధర్మం వేరితరులకు కూడా ఇవ్వబడిందే! అన్న అసూయాగ్నిలో మీరు దహించుకు పోతున్నారు. ఈ సత్యమే గనక భూమండలంలో వ్రేళ్లూనుకుంటే ఇప్పటివరకూ ప్రపంచంలో మీకు గల ఆధిపత్యం

وَمِنْ اَهْلِ الْكِتٰبِ مَنْ اِنْ تَاْمَنْهُ بِقِنْطَارٍ يُّؤَدِّهٖٓ اِلَيْكَ ۚ وَمِنْهُمْ مَّنْ اِنْ تَاْمَنْهُ بِدِيْنَارٍ لَّا يُؤَدِّهٖٓ اِلَيْكَ اِلَّا مَا دُمْتَ عَلَيْهِ قَآئِمًا ۗ ذٰلِكَ بِاَنَّهُمْ قَالُوْا لَيْسَ عَلَيْنَا فِي الْاُمِّيّٖنَ سَبِيْلٌ ۚ وَيَقُوْلُوْنَ عَلَى اللّٰهِ الْكَذِبَ وَهُمْ يَعْلَمُوْنَ ﴿75﴾

**75** గ్రంథవహులలో కొందరు ఎలాంటివారంటే, నీవు వారి వద్ద ఒక పెద్ద ధనరాశిని అమానతుగా పెట్టినాసరే, వారు దాన్ని నీకు తిరిగి ఇచ్చేస్తారు. వారిలో మరి కొందరు కూడా ఉన్నారు. వారెలాంటి వారంటే నువ్వు వారికి ఒక్క దీనారును అప్పగించినా వారు తిరిగి ఇవ్వరు – నువ్వు వారి నెత్తిమీద నిల్చుంటే తప్ప! ఎందుకంటే "నిరక్షర కుక్షుల (యూదేతరుల) హక్కు విషయంలో మమ్మల్ని నిలదీయటం జరగదు" అని వారు చెప్పి ఉన్నారు. వీరు తెలిసి కూడా అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదిస్తున్నారు.[76]

بَلٰى مَنْ اَوْفٰى بِعَهْدِهٖ وَاتَّقٰى فَاِنَّ اللّٰهَ يُحِبُّ الْمُتَّقِيْنَ ﴿76﴾

**76** ఎందుకు నిలదీయటం జరగదు? (వారిని నిలదీయటం ఖాయం). అయితే ఇచ్చిన మాటను నిలుపుకుని, భయభక్తుల వైఖరిని అవలంబిస్తే, అల్లాహ్ భయభక్తులుగలవారిని ప్రేమి స్తాడు.[77]

ఎక్కడ చేజారిపోతుందోనన్న ఆందోళన మీలో ఉంది. అంతేకాదు, ఇప్పటివరకూ సత్యాన్ని దాచిపెట్టడానికి మీరు చేస్తున్న రహస్య యత్నాలు ఎక్కడ బట్టబయలవుతాయోనన్న భయం కూడా మీ ఆంతర్యాల్లో ఉంది. ధర్మం, షరీయతు కేవలం దైవకటాక్షమనీ, ఇవి ఎవరి వారసత్వమూ కావనీ, దేవుడు తాను కోరిన వారిని కటాక్షించి వారికి సన్మార్గభాగ్యం ప్రసాదిస్తాడన్న విషయాన్ని మీరు తెలుసుకుంటే ఎంత బావుండేది!

76. **'ఉమ్మియ్యీన్'** (నిరక్షర కుక్షులు) అంటే చదువురానివారు, అజ్ఞానులు అని అర్థం. అంటే అరేబియాలోని ముష్రిక్కుల నుద్దేశించి యూదులు ఈ పదం వాడారు. యూదులు అప్పగింతల్లో ద్రోహానికి పాల్పడేవారు. తాము ఒకవేళ తిన్నా ముష్రిక్కుల సొమ్ము తింటున్నాము గనక అది తమ కొరకు ధర్మసమ్మతమేనన్నది వారి ఉవాచ. వారు చెప్పే ఈ మాట అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టడమే. ఎవరి సొమ్మునయినా అన్యాయంగా స్వాహా చేయవచ్చని అల్లాహ్ ఎలా అంటాడు? కొన్ని ఖుర్‌ఆన్ వ్యాఖ్యానాలలో గల ఉల్లేఖనాల ప్రకారం మహాప్రవక్త (స) కూడా యూదుల ఈ మాటల్ని విని ఈ విధంగా వక్కాణించారు : "దైవవిరోధులు అబద్ధం చెప్పారు. అజ్ఞాన కాలం నాటి ఇలాంటి అహంభావాలన్నీ నా పాదాల క్రింద ఉన్నాయి – అప్పగింతలు (అమానతులు) తప్ప. అవి ఎట్టి పరిస్థితిలోనూ చెల్లించబడతాయి. ఆ అమానతులు మంచివారివైనాసరే, దుర్మార్గులవి అయినా సరే (వారికి ముట్టజెప్పబడతాయి)" (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

ఈ రకమయిన మాటల్ని నేటి ముస్లింలు కూడా కొందరు అంటూ ఉండటం కడు శోచనీయం. ముష్రిక్కుల సొమ్ముల్ని కబళించే ఉద్దేశంతో వారు 'దారుల్ హర్బ్' (ముస్లింలు యుద్ధం చేస్తున్న దేశం)లో వడ్డీ తీసుకోవచ్చనీ, 'హరబీ' దేశస్థుల సొమ్మును కబళించటం తప్పు కాదని అంటారు. ఇది సరికాదు. పైన పేర్కొనబడిన దైవప్రవక్త ప్రవచనం ఈ అభిప్రాయాన్ని ఖండిస్తున్నది.

77. ఇచ్చిన మాటను నిలుపుకోవటం అంటే; మహాప్రవక్త (సఅసం)ను విశ్వసించవలసిందిగా గ్రంథవహుల నుంచి లేదా ప్రవక్తల ద్వారా వారి అనుయాయుల నుంచి తీసుకున్న వాగ్దానాన్ని నెరవేర్చటం. భయభక్తుల వైఖరిని అవలంబించట మంటే దేవుడు నిషేధించిన విషయాల జోలికి పోకుండా ఉండటం, దైవప్రవక్త (స) ఆచరించమని చెప్పినవాటిని ఆచరించటం. ఇలాంటి సజ్జనులు దేవుని పట్టులోకి రారు. పైగా వారు దైవప్రీతికి పాత్రులవుతారు.

**77** ఎవరయితే అల్లాహ్ వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను కొద్ది పాటి మూల్యానికి అమ్ముకుంటారో అలాంటి వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. అల్లాహ్ వారిని ప్రళయదినాన పలకరించటం గానీ, వారి వంక చూడటంగానీ చేయడు. వారిని పరిశుద్ధ పరచడు. పైగా వారి కోసం బాధాకరమైన శిక్ష ఉంటుంది.[78]

إِنَّ الَّذِينَ يَشْتَرُونَ بِعَهْدِ اللَّهِ وَأَيْمَانِهِمْ ثَمَنًا
قَلِيلًا أُولَٰئِكَ لَا خَلَاقَ لَهُمْ فِي الْآخِرَةِ وَلَا
يُكَلِّمُهُمُ اللَّهُ وَلَا يَنظُرُ إِلَيْهِمْ يَوْمَ الْقِيَامَةِ
وَلَا يُزَكِّيهِمْ وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿٧٧﴾

**78** వారిలోని మరికొందరు గ్రంథాన్ని పఠిస్తూ తమ నాలుకలను త్రిప్పుతారు – అది గ్రంథంలోని భాగమే అని మీరు భావించాలన్న ఉద్దేశ్యంతో వారలా చేస్తారు. కాని వాస్తవానికి అది గ్రంథంలో అంతర్భాగం కానేకాదు. "అది అల్లాహ్ తరఫు నుంచి వచ్చినది" అని వారు అంటారు. యదార్థానికి అది అల్లాహ్ తరఫునుండి వచ్చినది కాదు. వారు ఉద్దేశ్యపూర్వకంగా అల్లాహ్‌కు అసత్యాన్ని అంటగడుతున్నారు.[79]

وَإِنَّ مِنْهُمْ لَفَرِيقًا يَلْوُونَ أَلْسِنَتَهُم بِالْكِتَابِ
لِتَحْسَبُوهُ مِنَ الْكِتَابِ وَمَا هُوَ مِنَ الْكِتَابِ
وَيَقُولُونَ هُوَ مِنْ عِندِ اللَّهِ وَمَا هُوَ مِنْ عِندِ اللَّهِ
وَيَقُولُونَ عَلَى اللَّهِ الْكَذِبَ وَهُمْ يَعْلَمُونَ ﴿٧٨﴾

78. ఇందులో రెండు రకాల దుర్జనుల ప్రస్తావన ఉంది. ఒకరు : దైవంతో చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను ఆంతర్యంలో అణచిపెట్టేసి, స్వల్పమైన స్వప్రయోజనాల కోసం మహాప్రవక్త (స)ను విశ్వసించేందుకు నిరాకరించినవారు. రెండోవారు : అబద్ధపు ప్రమాణాలు చేసి తమ సరుకును అమ్మేవారు; ఇతరుల సొమ్మును స్వాహా చేసేవారు. హదీసులలో కూడా ఇలాంటి వాళ్ల ప్రస్తావన ఉంది. ఉదాహరణకు మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు : "ఎవరయితే ఇతరుల సొమ్మును కబళించే ఉద్దేశంతో అబద్ధపు ప్రమాణం చేస్తాడో అతడు ఆగ్రహోదగ్రుడైవున్న స్థితిలో అల్లాహ్‌ను కలుసుకుంటాడు (సహీహ్ బుఖారీ – కితాబుల్ మసాఖాత్; సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్). ఆయన (సఅసం) ఇంకా ఈ విధంగా ప్రవచించారు : "ముగ్గురు వ్యక్తులతో అల్లాహ్ మాట్లాడడు, వారి వంక కన్నెత్తి కూడా చూడడు. వారిని పరిశుద్ధుల్ని చేయడు. పైగా వారికొరకు వ్యథాభరితమయిన శిక్ష సిద్ధంగా ఉంటుంది – వారిలో ఒకడు అబద్ధపు ప్రమాణాలు చేసి తన సరకును అమ్మేవాడు" (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్). ఇంకా అనేక హదీసులలో ఈ విషయాలు ప్రస్తావనకు వచ్చాయి (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

79. యూదుల్లోని పండిత వర్గం ఇది. వారు దైవగ్రంథమైన తౌరాతులో మార్పులు చేర్పులు చేయటమేగాక మరో రెండు అపరాధాలకు కూడా ఒడిగట్టారు. ఒకటేమంటే వారు గ్రంథాన్ని పఠిస్తున్నప్పుడు నాలుకను త్రిప్పి ఉచ్చారణలో మార్పు వచ్చేలా చేసేవారు. ఆ విధంగా ఒక విషయం ద్వంద్వార్థాలకు తావు ఇచ్చేలా చేయటంలో కృతకృత్యులు కాగలిగేవారు. రెండవదేమంటే, తాము స్వయంగా కల్పించిన విషయాలను జనులు దైవప్రోక్తంగా భావించేలా అభినయించేవారు.

దురదృష్టవశాత్తూ ముస్లిం సమాజంలో కూడా ఇలాంటి ప్రబుద్ధులు పుట్టుకువచ్చారు. "మీరు మీ పూర్వీకుల అడుగుజాడల్లో నడుస్తారు" అన్న మహనీయ ముహమ్మద్ (స) వారి భవిష్యవాణిని సాకారం చేస్తూ వారు ప్రాపంచిక స్వప్రయోజనాలు, తమ వర్గ (జమాఅత్) దురభిమానం, తమ ఫిఖహ్ పట్ల మితిమీరిన అభిమానం కారణంగా దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆదేశాల మతలబులు తీయటంలో వాస్తవాలకు బహుదూరంగా వెళ్ళిపోతున్నారు. వీరు దివ్య ఖుర్‌ఆన్ ఆయతులనైతే పఠిస్తారు. కాని తాత్పర్యం చెప్పేటప్పుడు మాత్రం తమ అభిమతం వైపుకు మొగ్గిపోతారు. తమ మౌల్వీ సాహెబు దివ్య ఖుర్‌ఆన్ వెలుగులో విషయాన్ని విశదీకరించారని సామాన్య ప్రజలు తలపోస్తుంటారు. కాని నిజానికి వారు విడమరచి చెప్పినదంతా ఖుర్‌ఆన్ స్ఫూర్తికి విరుద్ధంగానూ, తమ మనోకల్పిత ఆలోచనకు అనుగుణంగానూ ఉంటుంది. అల్లాహ్ మనల్ని వాటినుంచి రక్షించుగాక!

**79** అల్లాహ్‌ ఏ మనిషికయినా గ్రంథాన్నీ, వివేకాన్నీ, ప్రవక్త పదవిని (నబువ్వత్‌ను) ప్రసాదించిన మీదట కూడా 'మీరు అల్లాహ్‌ను వదలిపెట్టి నాకు దాసులుకండి' అని అతడు ప్రజలతో అనటం ఎంతమాత్రం తగదు. దానికి బదులు, 'మీరంతా ప్రభువు వారైపోండి'[80] అని అతడనాలి. ఎందుకంటే మీరు గ్రంథాన్ని నేర్పేవారవటం చేతనూ, గ్రంథాన్ని చదివేవారవటం చేతనూ[81] (మీరు మీ ప్రభువు వారవటమే ధర్మం).

مَا كَانَ لِبَشَرٍ اَنْ يُّؤْتِيَهُ اللّٰهُ الْكِتٰبَ وَالْحُكْمَ
وَالنُّبُوَّةَ ثُمَّ يَقُوْلَ لِلنَّاسِ كُوْنُوْا عِبَادًا لِّيْ مِنْ
دُوْنِ اللّٰهِ وَلٰكِنْ كُوْنُوْا رَبّٰنِيّٖنَ بِمَا كُنْتُمْ تُعَلِّمُوْنَ
الْكِتٰبَ وَبِمَا كُنْتُمْ تَدْرُسُوْنَ ﴿٧٩﴾

**80** దూతలను, ప్రవక్తలను ప్రభువులుగా చేసుకోమని అతడు మీకు ఎన్నటికీ ఆదేశించ(లే)డు. ఏమిటీ, మీరు ముస్లిములయిన మీదట కూడా అతడు మిమ్మల్ని అవిశ్వాసానికి పాల్పడమని ఆజ్ఞాపిస్తాడా?[82] (ఇది అసంభవం).

وَلَا يَاْمُرَكُمْ اَنْ تَتَّخِذُوا الْمَلٰٓئِكَةَ وَالنَّبِيّٖنَ اَرْبَابًا
اَيَاْمُرُكُمْ بِالْكُفْرِ بَعْدَ اِذْ اَنْتُمْ مُّسْلِمُوْنَ ﴿٨٠﴾

**81** అల్లాహ్‌ (తన) ప్రవక్తల నుండి వాగ్దానం తీసుకున్నప్పుడు, "నేను మీకు గ్రంథాన్ని, వివేకాన్ని ఒసగిన తరువాత, మీ వద్ద ఉన్న దాన్ని సత్యమని ధృవీకరించే ప్రవక్త మీ వద్దకు వస్తే మీరు

وَاِذْ اَخَذَ اللّٰهُ مِيْثَاقَ النَّبِيّٖنَ لَمَآ اٰتَيْتُكُمْ
مِّنْ كِتٰبٍ وَّحِكْمَةٍ ثُمَّ جَآءَكُمْ رَسُوْلٌ

---

80. ఈ వాక్యం క్రైస్తవులను ఉద్దేశించి చెప్పబడింది. ఎందుకంటే వారు ఏసు ప్రవక్త (ఈసా అలైహిస్సలాం)ను దైవంగా చేసుకున్నారు. మరి ఈసా ఒక మానవమాత్రుడే. కాకపోతే ఆయనకు దైవగ్రంథం, వివేకంతో పాటు ప్రవక్త పదవి వొసగబడింది. అటువంటి ప్రవక్త ఎవరూ, నిజదైవాన్ని వదలిపెట్టి తన భక్తులుగా మారిపొమ్మని ఎన్నటికీ అనడు. 'మీరు మీ ప్రభువు వారలు అవండి' అని మాత్రమే అతను పిలుపు యిస్తాడు. 'రబ్బానీ' అంటే ప్రభువు మనిషి అని అర్థం. రబ్‌ (ప్రభువు) మరియు 'ఇ'(వాడు) అనే రెండు పదాల సంయోగంతో 'రబ్బానీ' ఏర్పడింది (ఫత్‌హుల్‌ ఖదీర్‌).

81. అంటే గ్రంథజ్ఞానాన్ని గురించి ప్రజలకు బోధించే వారవటంచేత వారు చాలా త్వరగా ప్రభువును తెలుసుకోవాల్సింది. ప్రభువుతో ప్రత్యేక సంబంధం పెట్టుకోవాల్సింది. అలాగే గ్రంథం గురించి తెలిసివున్నవారు జనులకు దివ్య ఖుర్‌ఆన్‌ ప్రబోధనలను వినిపించే శిక్షణ ఇవ్వటం అవసరం. తమను పూజించమని ప్రజలకు చెప్పే అధికారం దైవప్రవక్తలకే లేనపుడు మరొకరికి మాత్రం ఆ హక్కు, అధికారం ఎందుకు ప్రాప్తిస్తాయి? (తఫ్సీర్‌ ఇబ్నె కసీర్‌).

82. అంటే ప్రవక్తలనుగానీ, దైవదూతలనుగానీ, మరెవరినయినాగానీ దైవంగానో, దైవగుణాలు పుణికి పుచ్చుకున్నవారనో నమ్మబలకటం కుఫ్ర్‌ (అవిశ్వాసం)తో కూడుకున్న పని. అటువంటప్పుడు మీరు ముస్లింలు అయిపోయిన మీదట ఒక ప్రవక్త అంతటివాడు ఇలాంటి అవిశ్వాస పోకడకు ఎలా పాల్పడతాడు? ఎందుకంటే సాటిలేని ప్రభువైన అల్లాహ్‌ వైపుకు ప్రజలను ఆహ్వానించటమే ప్రవక్త పనాయె!

మరి కొంతమంది ఖుర్‌ఆన్‌ వ్యాఖ్యాతలు ఈ వచనం నేపథ్యం గురించి ఇలా అన్నారు: మహాప్రవక్త (స)కు పాదాభివందనం (సజ్దా) చేసేందుకు అనుమతించమని కొంతమంది ముస్లింలు అనుమతి కోరగా ఈ ఆయతు అవతరించింది (ఫత్‌హుల్‌ ఖదీర్‌). మరికొంతమంది అభిప్రాయం ప్రకారం; యూదులు, క్రైస్తవులు ఉభయులూ కలసి మహనీయ ముహమ్మద్‌ (స) వద్దకు ఒక ప్రతిపాదన తీసుకువచ్చారు. "క్రైస్తవులు ఏసుప్రవక్తను ఆరాధిస్తున్నట్లుగా మేము కూడా తమరిని ఆరాధించాలా?" అన్నది ఆ ప్రతిపాదన. దానికి మహాప్రవక్త(స) ఇలా అన్నారు: "మనం అల్లాహ్‌ను వదలి వేరొకరిని పూజించటమా?! ఇలాంటి మాటల నుంచి నేను అల్లాహ్‌ శరణు వేడుతున్నాను. అల్లాహ్‌ నన్ను పంపించింది

مُصَدِّقٌ لِّمَا مَعَكُمْ لَتُؤْمِنُنَّ بِهٖ وَلَتَنْصُرُنَّهٗ ؕ
قَالَ ءَاَقْرَرْتُمْ وَاَخَذْتُمْ عَلٰى ذٰلِكُمْ اِصْرِیْ ؕ
قَالُوْٓا اَقْرَرْنَا ؕ قَالَ فَاشْهَدُوْا وَاَنَا مَعَكُمْ
مِّنَ الشّٰهِدِيْنَ ﴿81﴾

తప్పకుండా అతన్ని విశ్వసించాలి, అతనికి సహాయపడాలి"[83] అని చెప్పాడు. తరువాత ఆయన, "ఈ విషయాన్ని మీరు ఒప్పుకుంటున్నారా? నేను మీపై మోపిన బాధ్యతను స్వీకరిస్తున్నారా?" అని ప్రశ్నించగా, "మేము ఒప్పుకుంటున్నాము" అని అందరూ అన్నారు. "మరయితే దీనికి మీరు సాక్షులుగా ఉండండి. మీతోపాటు నేనూ సాక్షిగా ఉంటాను" అని అల్లాహ్ అన్నాడు.

فَمَنْ تَوَلّٰى بَعْدَ ذٰلِكَ فَاُولٰٓئِكَ هُمُ الْفٰسِقُوْنَ ﴿82﴾

**82** దీని తరువాత కూడా ఎవరు వెనుతిరిగిపోతారో వారే పరమ అవిధేయులు.[84]

ఇలాంటి సందేశం ఇవ్వటానికి కాదు." ఈ నేపథ్యంలో ఈ ఆయతు అవతరించింది (ఇబ్నె కసీర్ – సీరత్ ఇబ్నె హిషామ్ ఆధారంగా).

83. ఇది ప్రవక్తల నుండి అల్లాహ్ తీసుకున్న ప్రమాణం. 1. దీని ప్రకారం ఏ దైవప్రవక్త అయినా జీవించి ఉండగా మరో ప్రవక్త కూడా ప్రభవింపజేయబడితే మునుపటి ప్రవక్త ఈ ప్రవక్తను విశ్వసించటం, ఇతనికి తోడ్పాటునందించటం తప్పనిసరి. తన జీవితకాలంలో ప్రభవించిన ప్రవక్తను విశ్వసించటం ఒక ప్రవక్తకే తప్పనిసరి అయినప్పుడు అతని అనుయాయులు కూడా ఆ ప్రవక్తను విశ్వసించటం ఇంకెంత అనివార్యమో ఆలోచించండి! 2. మరికొంతమంది విద్వాంసులు దీనికి వ్యాఖ్యానంగా ఇలా అన్నారు: ఈ ఆయతులో **'రసూలుమ్ ముసద్దిఖున్'** అని సాధారణ నామం ప్రయోగించబడినప్పటికీ అది **'అర్రసూల్'** అనే ఒక ప్రత్యేకార్థంలో ఉపయోగించబడింది. అంతిమ దైవప్రవక్త (స) ధృవీకరణ గురించి ఇది సూచిస్తోంది. మునుపటి ప్రవక్తల హయాంలో గనక అంతిమ దైవప్రవక్త (స) ప్రభవిస్తే వారంతా అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించి తమ సందేశ బాధ్యతలను విరమించుకోవాలి. అయితే మొదటి అభిప్రాయంలో ఈ రెండవ అభిప్రాయం కూడా అంతర్లీనమై ఉంది. కనుక ఖుర్‌ఆన్ ఆయతులోని పదజాలం రీత్యా మొదటి భావమే ఎంతో సమంజసమైనది. ఎందుకంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అందజేసిన జ్యోతిర్మయమైన సందేశం తరువాత మరో జ్యోతిని వెలిగించవలసిన అవసరం లేదు. హదీసులో ఇలా వుంది: ఒకసారి ఉమర్ (రజి) తౌరాతు గ్రంథంలోని పుటలను చదువుతుండటం చూచి మహాప్రవక్త (స) వారి ముఖారవిందం ఆగ్రహంతో కంది పోయింది. ఆ సందర్భంగా ఆయన (సఅసం) ఇలా అన్నారు : "ఎవరి చేతిలో ముహమ్మద్ ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను – ఒకవేళ మూసా (అలైహిస్సలాం) గారే బ్రతికి వచ్చినా, మీరు నన్ను వదలి ఆయన వెంట వెళ్ళితే, మీరు అపమార్గం పాలవుతారు" (ముస్నదె అహ్మద్ – ఇబ్నె కసీర్ ఆధారంగా).

మొత్తమ్మీద అవగతమయ్యేదేమిటంటే ప్రళయదినం వరకూ మరే ప్రవక్తా రాబోడు. కాబట్టి ముహమ్మద్ (స) ప్రవక్తను విశ్వసించటం తప్పనిసరి. ఆయన్ని (స) అనుసరించినపుడే సాఫల్యం సిద్ధిస్తుంది. అంతేగాని ఏ ఇమామునో, ఏ పీరునో, ఏ గురువునో గుడ్డిగా అనుసరించటం వల్ల, వారి చేతుల మీద 'బైత్' (ప్రమాణం) చేయటం వల్ల కాదు. మరి ముహమ్మద్ (స) తర్వాత ప్రవక్తల అధికారమే చెల్లనప్పుడు, జనసామాన్యాన్ని తమ విధేయులుగా మార్చుకునే హక్కు ఇతరులకు ఎక్కడి నుంచి వస్తుంది?; **'ఇస్‌రున్'** (اِصْرٌ) అంటే ప్రమాణం, బాధ్యత అని అర్థం.

84. ఈ వాక్యంలో యూదులు, క్రైస్తవులు తదితరులకు హెచ్చరిక ఉంది. ముహమ్మదు ప్రవక్త (స) వచ్చిన తరువాత కూడా ఆయన్ని కాదని తమ తమ ధర్మాలపై పాతుకు పోవటం అంటే ప్రవక్తల ద్వారా వారి అనుయాయుల నుంచి దేవుడు తీసుకున్న ప్రమాణానికి విరుద్ధంగా ప్రవర్తించటమే. కాగా; ఏ జాతి వారైనాసరే తమ ప్రవక్త చేసిన ప్రమాణాన్ని ధిక్కరిస్తే అది కుఫ్ర్ (ధర్మ తిరస్కారం) అవుతుంది. కాబట్టి మహా ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల తిరస్కార వైఖరి కూడా 'కుఫ్ర్'గానే భావించబడుతుంది.

أَفَغَيْرَ دِيْنِ اللّٰهِ يَبْغُوْنَ وَلَهٗٓ أَسْلَمَ مَنْ فِي السَّمٰوٰتِ وَالْأَرْضِ طَوْعًا وَّكَرْهًا وَّإِلَيْهِ يُرْجَعُوْنَ (83)

**83** ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న వారంతా – తమకు ఇష్టమున్నా లేకపోయినా[85] అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉండగా, వీరు అల్లాహ్ ధర్మాన్ని కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తున్నారా? ఎట్టకేలకు వారంతా ఆయన వైపునకే మరలించబడతారు.

قُلْ اٰمَنَّا بِاللّٰهِ وَمَآ أُنْزِلَ عَلَيْنَا وَمَآ أُنْزِلَ عَلٰٓى إِبْرٰهِيْمَ وَإِسْمٰعِيْلَ وَإِسْحٰقَ وَيَعْقُوْبَ وَالْأَسْبَاطِ وَمَآ أُوْتِيَ مُوْسٰى وَعِيْسٰى وَالنَّبِيُّوْنَ مِنْ رَّبِّهِمْ لَا نُفَرِّقُ بَيْنَ أَحَدٍ مِّنْهُمْ ز وَنَحْنُ لَهٗ مُسْلِمُوْنَ (84)

**84** (ఓ ప్రవక్తా!) వారితో అను: "మేము అల్లాహ్‌ను, మాపై అవతరింపజెయ్యబడిన దానినీ విశ్వసించాము. ఇంకా ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబుపై, ఆయన సంతానంపై అవతరింపజెయ్యబడిన దానినీ, మూసా, ఈసా ఇంకా ఇతర ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున వొసగబడిన వాటిని మేము విశ్వసించాము.[86] మేము వారి మధ్య ఎలాంటి భేదభావాన్ని కనబరచము. మేము ఆయనకే విధేయులము."

وَمَنْ يَّبْتَغِ غَيْرَ الْإِسْلَامِ دِيْنًا فَلَنْ يُّقْبَلَ مِنْهُ ج وَهُوَ فِي الْاٰخِرَةِ مِنَ الْخٰسِرِيْنَ (85)

**85** ఎవరయినా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయినవారిలో చేరిపోతాడు.

كَيْفَ يَهْدِي اللّٰهُ قَوْمًا كَفَرُوْا بَعْدَ إِيْمَانِهِمْ وَشَهِدُوْٓا أَنَّ الرَّسُوْلَ حَقٌّ وَّجَآءَهُمُ الْبَيِّنٰتُ ط وَاللّٰهُ لَا يَهْدِي الْقَوْمَ الظّٰلِمِيْنَ (86)

**86** (తొలుత) విశ్వసించి, ఈయన ప్రవక్త అనే విషయం సత్యమేనని సాక్ష్యం (కూడా) యిచ్చి, తీరా తమ వద్దకు స్పష్టమైన సూచనలు వచ్చేసిన మీదట అవిశ్వాసులైపోయిన వారికి అల్లాహ్ సన్మార్గం ఎలా చూపుతాడు? అల్లాహ్ ఇటువంటి దుర్మార్గులకు దారి చూపడు.

---

'ఫిస్‌ఖ్' (فِسْق) అనే పదం ఇక్కడ కుఫ్ర్ (తిరస్కారం) అనే అర్థంలో వాడబడింది. అసలు 'ఫిస్ఖ్' అంటే పాపం, అవిధేయత; కాగా, ముహమ్మద్ (స) గారి దైవదౌత్యాన్ని త్రోసి పుచ్చటం కేవలం పాపం మాత్రమే కాదు, అది కుఫ్ర్ (అంటే ధర్మ తిరస్కారం, దైవ తిరస్కారం).

85. భూమ్యాకాశాలలో వున్న ఏ వస్తువైనాసరే, తన కిష్టమున్నా లేకున్నా అది దాని పరిమితులను దాటిపోవటంగానీ, తన కార్య పరిధిని కాకుండా మరో పనిని చేయటంగానీ చేయజాలదు. మరి అటువంటప్పుడు మీరు ఆ శక్తిమంతుని సమక్షంలో తలవంచటానికి ఎందుకు తటపటాయిస్తున్నారు? తదుపరి వాక్యంలో ప్రతి ప్రవక్తను, అల్లాహ్ తరఫు నుంచి అవతరించిన ప్రతి గ్రంథాన్ని ఎలాంటి భేదభావం లేకుండా నమ్మటం తప్పనిసరి అని చెప్పి, వాటిని విశ్వసించవలసిన తీరుతెన్నులను విశదీకరించిన మీదట, ఇస్లాం తప్ప మార్గాంతరం లేదనీ, ఇతరత్రా మార్గాలను అనుసరించిన వారి నొసట నష్టం, పరాభవం మాత్రమే లిఖించబడి ఉంటుందని స్పష్టపరచటం జరిగింది.

86. అంటే, ఆయా కాలాల్లో వచ్చిన ప్రవక్తలందరూ సత్యవంతులనీ, వారు అందజేసిన సందేశం దైవసందేశమని, వారిపై అవతరించిన గ్రంథాలు, సహీఫాలు అల్లాహ్ తరఫు నుంచి అవతరించినవేనని మనస్ఫూర్తిగా నమ్మటం అన్నమాట. అయితే దివ్య ఖుర్‌ఆన్ అంతిమ దైవగ్రంథం కావటం వల్ల, దాని రాకతో వెనుకటి గ్రంథాలలోని ఆదేశాలన్నీ రద్దయిపోతాయి. ఇప్పుడు కేవలం దివ్య ఖుర్‌ఆన్ మాత్రమే ఆచరణ యోగ్యం.

اُولٰٓئِكَ جَزَآؤُهُمۡ اَنَّ عَلَيۡهِمۡ لَعۡنَةَ اللّٰهِ وَالۡمَلٰٓئِكَةِ وَالنَّاسِ اَجۡمَعِيۡنَ ﴿87﴾

**87** వారి పాపఫలంగా వారిపై అల్లాహ్ శాపం, దూతల, సమస్త జనుల శాపం పడుతుంది.

خٰلِدِيۡنَ فِيۡهَا ۚ لَا يُخَفَّفُ عَنۡهُمُ الۡعَذَابُ وَلَا هُمۡ يُنۡظَرُوۡنَ ﴿88﴾

**88** ఈ (శాపగ్రస్త) స్థితిలో వారు కలకాలం ఉంటారు. వారి శిక్షను తగ్గించటంగానీ, వారికి గడువు ఇవ్వటంగానీ జరగదు.

اِلَّا الَّذِيۡنَ تَابُوۡا مِنۡۢ بَعۡدِ ذٰلِكَ وَاَصۡلَحُوۡا فَاِنَّ اللّٰهَ غَفُوۡرٌ رَّحِيۡمٌ ﴿89﴾

**89** అయితే ఆ తరువాత ఎవరు పశ్చాత్తాపం చెంది, తమ నడవడికను సరిదిద్దుకుంటారో (వారు రక్షించబడతారు). నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు.[87]

اِنَّ الَّذِيۡنَ كَفَرُوۡا بَعۡدَ اِيۡمَانِهِمۡ ثُمَّ ازۡدَادُوۡا كُفۡرًا لَّنۡ تُقۡبَلَ تَوۡبَتُهُمۡ ۚ وَاُولٰٓئِكَ هُمُ الضَّآلُّوۡنَ ﴿90﴾

**90** ఎవరు విశ్వసించిన మీదట అవిశ్వాస వైఖరికి[88] ఒడిగడ తారో, ఆ తరువాత అవిశ్వాసంలో మరింత పెచ్చరిల్లుతారో వారి పశ్చాత్తాపం సుతరామూ స్వీకరించబడదు. అపమార్గం పాలైన వారంటే వీరే.[89]

87. ఈ వాక్యానికి పూర్వరంగం ఏమిటంటే మదీనాకు చెందిన అన్సారులలో ఒక వ్యక్తి ధర్మభ్రష్టుడై, ముష్రిక్కులతో చేరిపోయాడు. కాని త్వరలోనే అతనికి జ్ఞానోదయం అయి, పశ్చాత్తాపంతో కుంచించుకుపోయాడు. తాను గనక తిరిగి రుజువర్తనుడు కాదలిస్తే తన పశ్చాత్తాపం స్వీకారయోగ్యమవుతుందా?! అసలు తనకు తౌబా చేసుకునే అవకాశం ఉందా? (హల్ లీ మిన్ తౌబతిన్?) అని మరొకరి ద్వారా మహాప్రవక్త (స)ను అడిగించాడు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. ఈ ఆయతుల ద్వారా బోధపడే ఒక ముఖ్య విషయం ఏమిటంటే ధర్మం నుంచి మరలిపోవటం (ఇర్తిదాద్) అన్నది చాలా పెద్ద పాపమే. ఎందుకంటే ఒకసారి ఒక విషయాన్ని సత్యమని కనుగొన్న పిమ్మట దాన్ని విడనాడటమంటే అది మనిషిలోని దురహంకారానికి, వైరభావానికి, ఆంతర్యంలోని అక్కసుకు ప్రబల తార్కాణం. ఈ వైఖరికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాల్సిందే. అయితే చేసిన తప్పుపై సిగ్గుతో కుమిలిపోయి, చిత్తశుద్ధితో రుజుమార్గం వైపుకు గనక మరలివస్తే, అలాంటి వారి విషయంలో అల్లాహ్ క్షమాశీలి అని మరువరాదు.

88. ఈ ఆయతులో వారికి విధించబడే శిక్ష వివరించబడింది. ధర్మం నుంచి మరలిపోయిన మీదట పశ్చాత్తాపం చెందకుండా జీవితాంతం అవిశ్వాసులుగానే ఉండి, అవిశ్వాసులుగానే మరణించిన వారికి ఈ శిక్ష తప్పదు.

89. జీవితాంతం తలబిరుసులుగా వ్యవహరించి గుండెలోని ప్రాణం గొంతుదాటి బయటికి వస్తున్నప్పుడు చెందే పశ్చాత్తాపం గురించి యిక్కడ చెప్పటం జరిగింది. నిజానికి దేవుడు తన పశ్చాత్తాప స్వీకార ద్వారాన్ని ఎప్పుడూ తెరిచే ఉంచుతాడు. ఇంతకు ముందు వచ్చిన ఆయతులో పశ్చాత్తాపం స్వీకరించబడుతుందని చెప్పబడిన విషయం ఇందుకు ప్రబల నిదర్శనం. అదీగాక దివ్య ఖుర్ఆన్లో అల్లాహ్ పదే పదే పశ్చాత్తాప (తౌబా) ప్రాముఖ్యాన్ని, దాని స్వీకృతిని గురించి విశదపరచాడు. ఉదాహరణకు : 1. "ఆయనే తన దాసుల నుండి పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు" (షూరా–25). 2. "అల్లాహ్‌యే తన దాసుల పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడని వారికి తెలియదా?" (తౌబా– 104). హదీసులలో కూడా ఈ అంశం సవివరంగా వచ్చింది. కనుక పై ఆయతులో వచ్చిన పశ్చాత్తాపం మరణ ఘడియల్లో చెందే పశ్చాత్తాపం అన్నమాట! ఇటువంటి పశ్చాత్తాపం ఆమోదయోగ్యం కాజాలదు. దివ్య ఖుర్ఆన్లోనే వేరొకచోట చెప్పబడినట్లు – "దుష్కార్యాలకు ఒడిగడుతూ ఉండే వారిలో ఎవరికయినా మరణ ఘడియ దాపురించినపుడు, అతను 'నేను పశ్చాత్తాపం చెందుతున్నాను' అని అంటాడు. కాని అతని పశ్చాత్తాపం ఆమోదించబడదు" (అన్ నిసా – 18). హదీసులో ఇలా ఉంది : "అల్లాహ్ తన దాసునికి మరణ వెక్కిళ్లు రాకుండా ఉన్నంత వరకూ అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు" (ముస్నదె అహ్మద్, తిర్మిజీ – ఫైజుల్ ఖదీర్, అల్ జామివుస్సగీర్ వివరణ ఆధారంగా).

إِنَّ الَّذِينَ كَفَرُوا وَمَاتُوا وَهُمْ كُفَّارٌ فَلَن يُقْبَلَ مِنْ أَحَدِهِم مِّلْءُ الْأَرْضِ ذَهَبًا وَلَوِ افْتَدَىٰ بِهِ ۗ أُولَٰئِكَ لَهُمْ عَذَابٌ أَلِيمٌ وَمَا لَهُم مِّن نَّاصِرِينَ ﴿٩١﴾

**91** మరెవరు అవిశ్వాసానికి ఒడిగట్టి, అవిశ్వాసులుగానే మరణించారో వారిలో ఎవరయినాసరే భూమి నిండా బంగారం సమర్పించినా, తమ పాపానికి పరిహారంగా ఇచ్చినాసరే అది స్వీకారయోగ్యం అవదు. వ్యధాభరితమైన శిక్షకు పాత్రులయ్యే వారంటే వీరే. వీరిని ఆదుకునే వాడెవడూ ఉండడు.[90]

90. హదీసులో ఇలా ఉంది : ప్రళయదినాన అల్లాహ్ ఒక నరకవాసిని అడుగుతాడు, 'ఒకవేళ నీ దగ్గర భూమండలం నిండా సంపద, సామగ్రి ఉంటే, ఈ నరకశిక్ష నుంచి విముక్తి పొందటానికి నీవు దాన్ని పరిహారంగా ఇవ్వగలవా?' అని. దానికి అతను 'ఇస్తాన'ంటాడు. అప్పుడు అల్లాహ్ అతనికి ఇలా చెబుతాడు : ప్రపంచంలో నేను నీకు ఇంతకన్నా చాలా సులభమైన పని చెప్పాను, నాకు భాగస్వాములుగా మరెవరినీ నిలబెట్టవద్దని. కాని నువ్వు మాత్రం ఆ పని (షిర్క్ చేయటం) మానుకోలేదు (ముస్నదె అహ్మద్ – ఇబ్నె కసీర్). దీని ద్వారా తెలిసేదేమంటే అవిశ్వాసి కొరకు శాశ్వితమయిన నరక శిక్ష ఉంటుంది. అతడు ఇహలోకంలో ఏవైనా మంచిపనులు చేసి వున్నప్పటికీ అతనిలోని తిరస్కార వైఖరి మూలంగా అవి వృధా అయిపోతాయి. హదీసులో చెప్పబడినట్లు; అబ్దుల్లా బిన్ జద్ఆన్ చాలా మంచివాడు, అతిథి మర్యాద చేసేవాడు, పేదలను పోషించేవాడు, బానిసలకు విముక్తి వొసగుతూ ఉండేవాడు, మరి అతని ఈ సత్కర్మలు అతనికి లాభదాయకం అవుతాయా? అని ఎవరో అడగ్గా, "కావు. ఎందుకంటే అతను జీవితంలో ఒక్క రోజు కూడా తన పాపాల మన్నింపుకై తన ప్రభువును వేడుకోలేదు" అని మహాప్రవక్త (సఅసం) చెప్పారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

(నేడు మనం చూస్తూ ఉంటాం – లోక కళ్యాణం, మానవ సంక్షేమం పేరిట చాలామంది చాలా మంచి పనులు చేస్తుంటారు. ఉదాహరణకు:- ఆసుపత్రుల నిర్మాణం, వాటి పర్యవేక్షణ, విద్యాలయాల స్థాపన, ఆపదల్లో వున్న వారిని ఆదుకోవటం, సానుభూతి, సాంత్వనను వెలిబుచ్చటం మొదలగునవి. ఇలాంటి పనులు చేస్తే సరిపోతుందని వాళ్ళంటారు. ఈమాన్ అన్నా, ఇస్లాం అన్నా వారికెలాంటి ఆసక్తి ఉండదు. సాధారణంగా ప్రజలు వారి సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రభావితులవుతారు. వారి సేవలను కొనియాడతారు. బాగానే ఉంది. మానవసేవ చేయటం గొప్ప విషయమే- అందులో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే ఈ పనులు చేయాలని దేవుడు స్వయంగా ఆజ్ఞాపించాడు.

ఈ సత్కార్యాలు దైవసమక్షంలో ఫలించాలంటే, వీటిని నెరవేర్చిన వ్యక్తి పరలోక మోక్షం పొందాలంటే తొలుత అతను "విశ్వసించాలని" హదీసులు చెబుతున్నాయి. అంటే దైవదౌత్యం సత్యమని, పరలోకం తథ్యమని అతను దృఢంగా నమ్మాలి. దేవుని ఏకత్వం (తౌహీద్) పట్ల దృఢవిశ్వాసం కలిగి ఉండాలి. ఇస్లాంలోని ఆరాధనలను తన జీవితంలో అవలంబించాలి. ఆ తరువాత పైన పేర్కొనబడిన సంక్షేమ కార్యక్రమాలలో హృదయపూర్వకంగా పాల్గొనాలి. అప్పుడు ఈ సత్కార్యాలన్నీ దైవాదేశానికనుగుణంగా నెరవేర్చినట్లుగా పరిగణించబడతాయి. పరలోకంలో వీటికి పుణ్యఫలం ఇన్షా అల్లాహ్ (దైవం తలిస్తే) తప్పకుండా లభిస్తుంది. దీనికి బదులుగా అతడు దైవాన్ని విశ్వసించకుండా, ఈ మంచిపనులు దైవాదేశాల్లోనివి అని తలపోయకుండా చేసినట్లయితే – ఇహలోకంలో అతనికి పేరుప్రతిష్ఠలు ప్రాప్తించవచ్చునేమో గాని పరలోకంలో మాత్రం లభించే పుణ్యఫలం ఏమీ ఉండదు. కాబట్టి ప్రతి ఒక్కరూ మొదట అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించి, తమ సకల సదాచరణల ప్రధాన ఉద్దేశ్యం దైవం మరియు దైవప్రవక్తల మెప్పు పొందటమేనని భావించి తదనుగుణంగా మసలుకోవాలి – అనువాదకుడు).

రెండో విషయం ఏమిటంటే అక్కడ ఏ వ్యక్తీ భూమండలమంత బంగారాన్ని పరిహారంగా యిచ్చినా నరకశిక్ష నుంచి బయటపడలేడు. అసలు అక్కడ ఎవరివద్దా ఏమీ ఉండదు. ఒకవేళ ఉన్నా భూమి అంతటి నిధిని సమర్పించుకున్నా శిక్ష నుంచి ముక్తి లభించదు. ఎందుకంటే పరిహారం తీసుకుని వదలిపెట్టే స్థలం కాదది. వేరొకచోట సెలవీయబడినట్లు, "అతని నుంచి ఏదైనా ప్రతిఫలం తీసుకోవటం జరగదు, ఏ సిఫారసూ అతనికి ప్రయోజనకరం కాజాలదు" (అల్ బఖర–123)."ఆ రోజు క్రయ విక్రయాలు జరగటంగానీ, మిత్రుల సాయం పొందటంగానీ జరగదు" (ఇబ్రాహీం–31).

لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ ؕ وَمَا تُنْفِقُوْا مِنْ شَیْءٍ فَاِنَّ اللّٰهَ بِهٖ عَلِیْمٌ ﴿92﴾

**92** మీకు ప్రియాతిప్రియమైన వస్తువుల నుండి మీరు (దైవ మార్గంలో) ఖర్చు పెట్టనంతవరకూ మీరు పుణ్య స్థాయికి చేరుకోలేరు.[91] మీరు ఖర్చుపెట్టేదంతా అల్లాహ్‌కు తెలుసు.[92]

كُلُّ الطَّعَامِ كَانَ حِلًّا لِّبَنِیْۤ اِسْرَآءِیْلَ اِلَّا مَا حَرَّمَ اِسْرَآءِیْلُ عَلٰی نَفْسِهٖ مِنْ قَبْلِ اَنْ تُنَزَّلَ التَّوْرٰىةُ ؕ قُلْ فَاْتُوْا بِالتَّوْرٰىةِ فَاتْلُوْهَاۤ اِنْ كُنْتُمْ صٰدِقِیْنَ ﴿93﴾

**93** తౌరాతు గ్రంథం అవతరించక పూర్వం, ఇస్రాయీల్ (యాఖూబు) తన కోసం నిషేధించుకున్న వస్తువులు తప్ప ఇతర ఆహార పదార్థాలన్నీ ఇస్రాయీల్ వంశస్థుల కొరకు ధర్మ సమ్మతం గానే ఉండేవి. 'మీరు సత్యవంతులే అయితే తౌరాతును తీసుకుని రండి, దాన్ని చదివి వినిపించండి'[93] అని (ఓ ముహమ్మద్!) వారికి చెప్పు.

فَمَنِ افْتَرٰی عَلَی اللّٰهِ الْكَذِبَ مِنْۢ بَعْدِ ذٰلِكَ فَاُولٰٓىِٕكَ هُمُ الظّٰلِمُوْنَ ﴿94﴾

**94** దీని తరువాత కూడా ఎవరయినా అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదిస్తే వారే దుర్మార్గులవుతారు.

91. అరబీలో **'అల్ బిర్ర్'** ( **اَلْبِرَّ** ) అని వచ్చింది. అల్ బిర్ర్ (సత్కార్యం, పుణ్యం) అంటే యిక్కడ సదాచరణ లేక స్వర్గం అని అర్థం (ఫత్‌హుల్ ఖదీర్). ఈ ఆయతు అవతరించినపుడు మదీనాలో స్థితిమంతుడైన అబూ తల్హా అన్సారీ (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "ఓ దైవప్రవక్తా! 'బైరుహా' తోట నాకు అన్నిటికంటే ప్రియమైనది. కాబట్టి నేను దాన్ని దైవప్రీతి నిమిత్తం దానం చేయదలిచాను" అని విన్నవించుకున్నారు. దానికి ఆయన (స), "అదెంతో లాభదాయకమైన తోట కదా! దాన్ని నువ్వు నీ బంధువులకు పంచిపెడితే బావుంటుందేమో!" అని సలహా ఇచ్చారు. అందుచేత ఆయన ఆ తోటను తన బంధువులకు, బాబాయి, పెత్తండ్రి కుమారులకు పంచిపెట్టారు (ముస్నదె అహ్మద్). ఇదేవిధంగా మరెంతో మంది సహాబీలు తాము అమితంగా ప్రేమించే వస్తువులను దైవమార్గంలో ఖర్చుచేశారు. **'మిమ్మా తుహిబ్బూన్'** అని ఆయతులో అనబడింది. మీరు ప్రేమించే వస్తువులన్నింటినీ దానం చేయమని దీని భావం కాదు. 'మీరు ప్రేమించే వస్తువుల్లో నుంచి' అని దీనికి అర్థం వస్తుంది. కాబట్టి దానధర్మాలు చేసే సమయంలో మంచి వస్తువులను దానంగా ఇవ్వాలి. అత్యుత్తమమైన, పరిపూర్ణమైన స్థాయిని పొందటానికి ఇదే పద్ధతిని అవలంబించాలి. అయితే సాధారణమైన లేక తమ అవసరానికి మించిన వస్తువులను లేక తాము ఉపయోగించిన పాత వస్తువులను దానం చేయకూడదనీ, వాటికి పుణ్యం లభించదని దాని భావం ఎంతమాత్రం కాదు. ఇలాంటి వస్తువులను కూడా దానం చేయవచ్చు. వీటికి కూడా పుణ్యం లభిస్తుంది. కాని పరిపూర్ణమైన, అత్యుత్తమమైన స్థానం మాత్రం అమితంగా ప్రేమించే వస్తువులను దానం చేసినప్పుడే దక్కుతుంది.

92. మీరు ఇచ్చే వస్తువు నాసిరకమో, నాణ్యమైనదో అల్లాహ్‌కు బాగా తెలుసు. మనస్ఫూర్తిగా దానం చేశారో, అన్య మనస్కంగా చేశారో కూడా ఆయనకు తెలుసు. దాని ప్రకారమే ఆయన మీకు పుణ్యఫలం ప్రసాదిస్తాడు.

93. ఈ ఆయతు, దీని తరువాతి రెండు ఆయతులు యూదుల ఆక్షేపణలకు సమాధానంగా అవతరించాయి. ఇంతకీ ఆ ఆక్షేపణలేమిటీ? అంటే కొంతమంది యూదులు మహాప్రవక్త(స)నుద్దేశించి ఇలా అన్నారు: "మీరు ఒకవైపు ఇబ్రాహీము అనుయాయులం అని చెప్పుకుంటూనే మరోవైపు ఒంటె మాంసం తింటున్నారాయె. మరి చూడబోతే ఇబ్రాహీము ధర్మంలో ఒంటె మాంసం, ఒంటె పాలు నిషేధించబడ్డాయి." దీనికి జవాబుగా అల్లాహ్ ఏమన్నాడంటే; యూదుల ఆరోపణ నిరాధారమైనది. ఇబ్రాహీము (అలైహిస్సలాం) ధర్మంలో ఈ రెండు వస్తువులు నిషిద్ధం (హరామ్)గా లేవు. కాకపోతే ఇస్రాయీలు (యాఖూబు) తనంతట తానుగా కొన్ని వస్తువులను తన కోసం నిషేధించుకున్నారు. ఆ వస్తువులే ఈ ఒంటె మాంసం, ఒంటె పాలు. (మొక్కుబడి మూలంగానో, అనారోగ్యం కారణంగానో ఆయన ఈ నిర్ణయానికి వచ్చారు). యాఖూబుగారి ఈ నిర్ణయం కూడా తౌరాతు గ్రంథం అవతరించక పూర్వం జరిగింది. మరి

95 వారికి చెప్పు: "అల్లాహ్ సత్యం పలికాడు. కనుక మీరంతా ఏకాగ్ర చిత్తంకల ఇబ్రాహీము ధర్మాన్నే అనుసరించండి. ఆయన బహుదైవోపాసకులలోని వాడు కాదు."

قُلْ صَدَقَ اللّٰهُ ۗ فَاتَّبِعُوْا مِلَّةَ اِبْرٰهِيْمَ حَنِيْفًا ؕ وَمَا كَانَ مِنَ الْمُشْرِكِيْنَ ﴿95﴾

96 నిశ్చయంగా మానవుల కొరకు ప్రప్రథమంగా ఖరారు చేయబడిన (దైవ) గృహం బక్కాలో (మక్కాలో) ఉన్నదే.[94] అది శుభప్రదమైనది, సమస్త లోకవాసులకు మార్గదర్శకం కూడాను.

اِنَّ اَوَّلَ بَيْتٍ وُّضِعَ لِلنَّاسِ لَلَّذِىْ بِبَكَّةَ مُبٰرَكًا وَّهُدًى لِّلْعٰلَمِيْنَ ﴿96﴾

97 అందులో స్పష్టమయిన సూచనలున్నాయి. మఖామె ఇబ్రాహీం (ఇబ్రాహీం నిలబడిన స్థలం) ఉన్నది. అందులోకి ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు.[95] అక్కడికి వెళ్ళే స్థోమత గలవారికి, ఆ గృహ (యాత్ర) హజ్ చేయటాన్ని అల్లాహ్ విధిగా[96] చేశాడు. మరెవరయినా (ఈ ఆజ్ఞను శిరసావహించటానికి) నిరాకరిస్తే అల్లాహ్‌కు సమస్త లోకవాసుల అవసరం ఎంతమాత్రం లేదు.[97]

فِيْهِ اٰيٰتٌۢ بَيِّنٰتٌ مَّقَامُ اِبْرٰهِيْمَ ۚ وَمَنْ دَخَلَهٗ كَانَ اٰمِنًا ؕ وَلِلّٰهِ عَلَى النَّاسِ حِجُّ الْبَيْتِ مَنِ اسْتَطَاعَ اِلَيْهِ سَبِيْلًا ؕ وَمَنْ كَفَرَ فَاِنَّ اللّٰهَ غَنِىٌّ عَنِ الْعٰلَمِيْنَ ﴿97﴾

తౌరాతు గ్రంథమేమో ఇబ్రాహీము, యాఖూబుల చాలాకాలం తరువాత వచ్చింది. మరలాంటప్పుడు మీరు ఇలాంటి అభ్యంతరాలను ఎలా లేవనెత్తుతున్నారు? అదీగాక మీరు (యూదులు) పాల్పడే కొన్ని దుర్మార్గాల, దురాగతాల మూలంగానే తౌరాతులో కొన్ని వస్తువులు నిషేధించబడ్డాయి (అల్ అన్ఆమ్ సూరా:146, నిసా సూరా: 160). మీకు అనుమానముంటే తౌరాతు గ్రంథం తెచ్చి చదవండి – ఇబ్రాహీం కాలంలో ఈ వస్తువులు నిషిద్ధంగా ఖరారు కాలేదన్న వాస్తవం మీకే తెలుస్తుంది. మీపైన సయితం కొన్ని ఆహారపదార్థాలు నిషేధించబడ్డాయి. దానికి్కారణం మీ తలబిరుసుతనమే. అంటే దానికి శిక్షగా అవి మీకు నిషేధించబడ్డాయన్నమాట! (ఐసరుత్తఫాసీర్).

94. యూదుల రెండో ఆక్షేపణకు జవాబిది. 'బైతుల్ మఖ్దిస్' అన్నిటికన్నా మొదటి ఆరాధనా కేంద్రం అయి ఉండగా ముహమ్మద్ (స) తన ముఖాన్ని 'కాబా గృహం' వైపుకు ఎందుకు త్రిప్పుకున్నారు?' అని వారు ప్రశ్నించేవారు. దీనికి సమాధానంగా, మీరు చెప్పే ఈ మాట కూడా నిజమయింది కాదనీ, దైవారాధన కోసం నిర్మించబడిన మొట్టమొదటి దైవగృహం మక్కా నగరంలోనున్న కాబా గృహమేనని చెప్పబడింది.

95. ఈ ప్రదేశంలో హత్యాకాండ సాగించటం, రక్తపాతం సృష్టించటం, జంతువులను వేటాడటం, ఆఖరికి చెట్లను నరకటం కూడా నిషిద్ధమే (సహీహైన్).

96. **"వెళ్ళే స్థోమత ఉంటే...."** అంటే ప్రయాణ ఖర్చులు, వస్తుసామగ్రిని సమకూర్చుకోగలిగితే అని అర్థం. దీంతోపాటు హజ్ యాత్రకై పరిస్థితులు సానుకూలంగా ఉండాలి. వెళ్ళే రూటులో శాంతియుత పరిస్థితులు నెలకొని ఉండాలి. ధనమాన ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం పొంచి ఉండకూడదు. అలాగే యాత్రీకుడు అంతదూరం ప్రయాణం చేయగలిగేందుకు ఆరోగ్యవంతంగా ఉండాలి. స్త్రీలు యాత్రకు బయలుదేరితే వారివెంట మహ్రమ్ బంధువులు ఉండాలి (ఫత్‌హుల్ ఖదీర్). స్థోమత ఉన్న ప్రతి ఒక్కరూ హజ్ చేయటం విధి అని ఈ ఆయతు సూచిస్తోంది. కాగా; జీవితంలో కేవలం ఒకసారి హజ్ చేయటం మాత్రమే విధి (ఫర్జ్) అని హదీసుల ద్వారా తేటతెల్లం అవుతోంది (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

97. శక్తీస్థోమతలు ఉండి కూడా హజ్ చేయడానికి నిరాకరిస్తే అది కుఫ్ర్ (తిరస్కారవైఖరి) అవుతుందని ఖుర్ఆన్ ప్రకటించింది. హదీసులలో కూడా ఇలాంటివారు తీవ్రంగా హెచ్చరించబడ్డారు. కనుక హజ్ చేయటం విధి అన్న విషయంలో ఇక ఎలాంటి సందేహమూ మిగిలుండదు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

قُلْ يَٰٓأَهْلَ ٱلْكِتَٰبِ لِمَ تَكْفُرُونَ بِـَٔايَٰتِ ٱللَّهِ
وَٱللَّهُ شَهِيدٌ عَلَىٰ مَا تَعْمَلُونَ ﴿٩٨﴾

**98** "ఓ గ్రంథవహులారా! మీరు అల్లాహ్ ఆయతుల(వాక్యాల)ను ఎందుకు తిరస్కరిస్తున్నారు? మీరు చేసే కర్మలకు అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

قُلْ يَٰٓأَهْلَ ٱلْكِتَٰبِ لِمَ تَصُدُّونَ عَن سَبِيلِ
ٱللَّهِ مَنْ ءَامَنَ تَبْغُونَهَا عِوَجًا وَأَنتُمْ شُهَدَآءُ ۗ
وَمَا ٱللَّهُ بِغَٰفِلٍ عَمَّا تَعْمَلُونَ ﴿٩٩﴾

**99** "గ్రంథవహులారా! అల్లాహ్ మార్గం నుంచి మీరు విశ్వసించినవారిని ఎందుకు అడ్డుకుంటున్నారు? (ఇదే సన్మార్గం అన్న దానికి) మీరు సాక్షులై[98] ఉండి కూడా అందులో లోపాలు వెతికే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? అల్లాహ్ మీ చేష్టల పట్ల పరధ్యానానికి లోనైలేదు" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓا۟ إِن تُطِيعُوا۟ فَرِيقًا مِّنَ ٱلَّذِينَ
أُوتُوا۟ ٱلْكِتَٰبَ يَرُدُّوكُم بَعْدَ إِيمَٰنِكُمْ كَٰفِرِينَ ﴿١٠٠﴾

**100** విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు గ్రంథవహులలోని ఏదయినా వర్గంవారి మాటను విన్నారంటే, వారు మిమ్మల్ని మీ విశ్వాసస్థితి నుంచి అవిశ్వాసులుగా మార్చుతారు.[99]

وَكَيْفَ تَكْفُرُونَ وَأَنتُمْ تُتْلَىٰ عَلَيْكُمْ ءَايَٰتُ
ٱللَّهِ وَفِيكُمْ رَسُولُهُۥ ۗ وَمَن يَعْتَصِم بِٱللَّهِ
فَقَدْ هُدِىَ إِلَىٰ صِرَٰطٍ مُّسْتَقِيمٍ ﴿١٠١﴾

**101** మీకు అల్లాహ్ ఆయతులు (వాక్యాలు) చదివి వినిపిస్తుండగా, ఆయన ప్రవక్త మీ మధ్యనుండగా మీరు అవిశ్వాసానికి ఎలా పాల్పడగలరు? ఎవరు అల్లాహ్ (ధర్మము)ను గట్టిగా పట్టుకున్నాడో[100] నిస్సందేహంగా అతడు రుజుమార్గం వైపు దర్శకత్వం వహించబడినట్లే.

98. అంటే ఇస్లాం దైవధర్మం అనీ, రుజుమార్గం అనీ మీకు తెలుసు. ఈ ధర్మాన్ని మానవులకు అందజేస్తున్న సందేశహరుడు సత్యసంధుడని కూడా మీకు తెలుసు. మీ ప్రవక్తలపై అవతరించిన, మీరు నిత్యం పారాయణం చేస్తూ ఉన్న మీ గ్రంథాలలో కూడా ఈ సంగతి నమోదై ఉంది. అయినా మీరు వక్ర మనస్కులై దారిలో పెడదారి తీస్తారే?!

99. యూదుల కుటిల పన్నాగాలను, మోసపూరిత చేష్టలను, ముస్లిములను పెడత్రోవ పట్టించటానికి వారు చేసే నీచమయిన పనులను ఖండించిన తరువాత ముస్లిములను కూడా అప్రమత్తం చేయటం జరిగింది. మీరు కూడా వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి సుమా! అనుదినం మీకు దైవవాక్యాలు చదివి వినిపిస్తున్నప్పటికీ, దైవ సందేశహరుడు సయితం మీమధ్య ఉన్నప్పటికీ మీరు యూదుల ఎత్తులకు చిత్తయి పోవచ్చు సుమా! జాగ్రత్త!!

దీనికి పూర్వరంగం ఇది : అన్సార్ వర్గానికి చెందిన రెండు తెగలు ఔస్, ఖజ్రజ్‌లు ఒక సమావేశంలో కూర్చొని పరస్పరం చర్చించుకుంటున్నారు. అప్పుడే షాస్ బిన్ ఖైస్ అనే యూదుడు అటువైపు నుంచే సాగిపోయాడు. ఔస్ – ఖజ్రజ్ తెగల మధ్యగల సఖ్యతను, ప్రేమానురాగాల్ని చూసి ఓర్చుకోలేకపోయాడు. ఎందుకంటే ఈ రెండు తెగల మధ్య ఒకప్పుడు బద్ధ వైరం ఉండేది. ఇస్లాం పుణ్యమా అని ఆ రెండు తెగలు పాలుతేనియల్లా కలసిపోయాయి. అయితే హిజ్రత్‌కు కొద్దికాలం క్రితమే ఆ రెండు తెగల మధ్య జరిగిన బుఆస్ యుద్ధాన్ని గుర్తుచేసి, అజ్ఞానకాలపు ప్రతీకార భావాలను రగుల్గొలిపే బాధ్యతను యూదులు ఒక యువకుడికి అప్పగించారు. ఒకరింకొకరిని రెచ్చగొడుతూ పాడిన పద్యాలను కూడా చదివి వినిపించమని వారతనికి తాకీదు చేశారు. ఆ వ్యక్తి అక్షరాలా చెప్పినట్లే చేశాడు. దాంతో అక్కడి వాతావరణం వేడెక్కిపోయింది. ఇరు తెగల మధ్య పాత కక్షలు బుసకొట్టాయి. ఒండొకరిని దూషించుకున్నారు. కడకు కత్తులు దూసుకోవడానికి కూడా సిద్ధమయ్యారు. ఇంకాస్త ఉంటే యుద్ధం మొదలయ్యేదే. అంతలోనే దైవప్రవక్త (సఅసం) వచ్చి, వారికి నచ్చజెప్పటంతో వాళ్లు శాంతించారు. అప్పుడు ఈ ఆయతు, దీని తర్వాత రాబోయే ఆయతులు అవతరించాయి (తఫ్సీర్ ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

**102** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు ఎంతగా భయపడాలో అంతగా భయపడండి.[101] ముస్లింలుగా తప్ప మరణించకండి.

**103** అల్లాహ్ త్రాడును అందరూ కలసి గట్టిగా పట్టుకోండి.[102] చీలిపోకండి.[103] అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి – అప్పుడు మీరు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను సృజించాడు. దాంతో ఆయన అనుగ్రహం వల్ల మీరు ఒకరికొకరు అన్నదమ్ములుగా మారారు. మీరు అగ్నిగుండం ఆఖరి అంచులకు చేరుకోగా, ఆయన మిమ్మల్ని దాన్నుంచి కాపాడాడు. మీరు సన్మార్గం పొందాలని ఈ విధంగా అల్లాహ్ మీకు తన సూచనలను విశదపరుస్తున్నాడు.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اتَّقُوا اللّٰهَ حَقَّ تُقٰتِهٖ
وَلَا تَمُوْتُنَّ اِلَّا وَاَنْتُمْ مُّسْلِمُوْنَ ﴿102﴾
وَاعْتَصِمُوْا بِحَبْلِ اللّٰهِ جَمِيْعًا وَّلَا تَفَرَّقُوْا ۪
وَاذْكُرُوْا نِعْمَتَ اللّٰهِ عَلَيْكُمْ اِذْ كُنْتُمْ
اَعْدَآءً فَاَلَّفَ بَيْنَ قُلُوْبِكُمْ فَاَصْبَحْتُمْ
بِنِعْمَتِهٖۤ اِخْوَانًا ۚ وَكُنْتُمْ عَلٰى شَفَا حُفْرَةٍ
مِّنَ النَّارِ فَاَنْقَذَكُمْ مِّنْهَا ؕ كَذٰلِكَ يُبَيِّنُ
اللّٰهُ لَكُمْ اٰيٰتِهٖ لَعَلَّكُمْ تَهْتَدُوْنَ ﴿103﴾

100. అల్లాహ్‌ను గట్టిగా పట్టుకోవటం (ఏతిసామ్ బిల్లాహ్) అంటే అల్లాహ్ ఆమోదించిన ధర్మాన్నే గట్టిగా పట్టుకోవటం, దాని అనుసరణలో ఎలాంటి అశ్రద్ధను కనబరచకుండా ఉండటం అని భావం.

101. **'ఎంతగా భయపడాలో అంతగా భయపడండి'** అంటే ఇస్లాం ఆదేశాలను, విధులను పూర్తిగా పాటించటం, వారించబడిన వాటికి దూరంగా మసలుకోవటం అని భావం. ఈ ఆయతు అవతరించినప్పుడు దైవప్రవక్త సహచరులు ఇందులోని ఆజ్ఞను, అంటే 'ఎంతగా భయపడాలో అంతగా భయపడండి' అనే ఆదేశాన్ని చూసి ఆందోళన చెందారని, అప్పుడు అల్లాహ్ మళ్ళీ **'ఫత్తఖుల్లాహ మస్తతాతుమ్'** (మీరు మీ శక్తికొలదీ అల్లాహ్‌కు భయపడండి) అనే ఆయతును అవతరింపజేశాడని కొందరు వ్యాఖ్యాతలు చెబుతారు (అంటే ఈ విధంగా రెండవ ఆయతు మొదటి ఆయతును రద్దుపరచిందన్నది వారి అభిప్రాయం). అయితే రెండవ ఆయతును **నాసిఖ్** (రద్దుపరచేది) గా భావించేకంటే **ముబయ్యిన్** (మొదటిదానికి వివరణ)గా భావించటం సరైనది. ఎందుకంటే రెండు ఆయతుల మధ్య సమరసానికి వీలులేని చోట మాత్రమే మొదటి ఆయతు రద్దయినట్లుగా భావించాలి. కాని ఇక్కడ పరిస్థితి వేరు. ఇక్కడ రెండు ఆయతులు పరస్పరం సమరసం చెందటానికి వీలుంది. ఇప్పుడు ఈ ఆయతుకు **'ఫత్తఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహీ మస్తతాతుమ్'** (మీరు మీ శక్తికొలదీ అల్లాహ్‌కు భయపడవలసిన విధంగా భయపడండి) అనే అర్థం వస్తుంది (ఫత్‌హుల్ ఖదీర్).

102. భయపడమని బోధించిన తరువాత అందరూ కలసి దేవుని త్రాటిని గట్టిగా పట్టుకోమని చెప్పటం గమనార్హం. అంటే మానవ సాఫల్యం ఈ రెండు సూత్రాలపైనే ఆధారపడి ఉంది. మానవుల ఐక్యత కూడా ఈ రెండు అంశాల ఆధారంగానే సాధ్యమవుతుంది, సాధ్యమైన తర్వాత అది స్థిరంగానూ ఉంటుంది.

103. **'వలా తఫర్రఖూ'** (وَلَا تَفَرَّقُوْا) అంటే చీలిక తీసుకురాకండి, విభేదించుకోకండి అని అర్థం. పై వచనంలో పేర్కొనబడిన రెండు సూత్రాలను గనక మీరు విస్మరించినట్లయితే మీ మధ్య అనైక్యత, చీలిక వస్తుంది. మీరు చెల్లాచెదురైపోతారు. ముస్లిం సమాజంలో పొడసూపిన ముఠాల వెనుక గల చరిత్రను పరిశోధిస్తే ఈ సంగతి విదితమవుతుంది. ఖుర్ఆన్ హదీసులను అవగాహన చేసుకోవటంలో, భావార్థాల విషయంలో స్వల్పమైన వ్యత్యాసాలు సర్వత్రా ఉండేవే. అవగాహనలో గల ఈ వైవిధ్యం ముఠాలకు, వర్గాలకు దారి తీయదు. ప్రవక్త ప్రియ సహచరులలో, వారి శిష్యులైన తాబియీన్‌లలో సయితం ఈ పాటి వ్యత్యాసాలు ఉండేవి. కాని అవి ముస్లిం సమాజంలో ముఠాలకు దారి తెరవలేదు. ఎందుకంటే అవలంబనా విధానంలో స్వల్పమైన తేడా పాడాలున్నప్పటికీ వారి భక్తీ విశ్వాసాలకు కేంద్రబిందువు ఖుర్ఆన్ హదీసులే. అయితే రానురానూ 'వ్యక్తి ప్రాముఖ్యం' పెరిగిపోయింది. వ్యక్తి పట్ల గల అభిమానం అతిశయిల్లి 'రాగాన' పడింది. ఆ రాగానికి అభిమానుల 'తానం' కూడా తోడయింది. ఫలితంగా మతావలంబనలో ఆయా వ్యక్తులు ప్రాధాన్యత

وَلْتَكُن مِّنكُمْ أُمَّةٌ يَدْعُونَ إِلَى الْخَيْرِ
وَيَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنكَرِ ۚ
وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ (104)

**104** మేలు వైపుకు పిలిచే, మంచిని చెయ్యమని ఆజ్ఞాపించే, చెడుల నుంచి వారించే ఒక వర్గం మీలో ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యాన్ని పొందుతారు.

وَلَا تَكُونُوا كَالَّذِينَ تَفَرَّقُوا وَاخْتَلَفُوا مِن بَعْدِ مَا
جَاءَهُمُ الْبَيِّنَاتُ ۚ وَأُولَٰئِكَ لَهُمْ عَذَابٌ عَظِيمٌ (105)

**105** తమ వద్దకు స్పష్టమయిన నిదర్శనాలు వచ్చేసిన తరువాత కూడా వర్గాలుగా విడిపోయి, విభేదించుకున్న వారి మాదిరిగా మీరు తయారవకండి.[104] మహాశిక్ష ఉన్నది ఇటువంటివారి కోసమే.

يَوْمَ تَبْيَضُّ وُجُوهٌ وَتَسْوَدُّ وُجُوهٌ ۚ فَأَمَّا الَّذِينَ
اسْوَدَّتْ وُجُوهُهُمْ أَكَفَرْتُم بَعْدَ إِيمَانِكُمْ
فَذُوقُوا الْعَذَابَ بِمَا كُنتُمْ تَكْفُرُونَ (106)

**106** ఆనాడు కొన్ని ముఖాలు వెలిగిపోతూ ఉంటాయి. మరికొన్ని ముఖాలు నల్లబడి ఉంటాయి.[105] నలుపు ఆవరించి ఉన్న మొహాలు కలిగిన వారినుద్దేశించి, "మీరు విశ్వసించిన మీదట తిరస్కార వైఖరికి ఒడిగట్టారా? సరే, మీరు తిరస్కరించిన దాని ఫలితంగా శిక్షను చవిచూడండి" (అని అనబడుతుంది).

وَأَمَّا الَّذِينَ ابْيَضَّتْ وُجُوهُهُمْ فَفِي رَحْمَةِ
اللَّهِ ۖ هُمْ فِيهَا خَالِدُونَ (107)

**107** తెల్లగా ప్రకాశిస్తున్న మొహాలవారు దైవకారుణ్యంలో ఉంటారు. అందులో వారు కలకాలం ఉంటారు.

---

యిచ్చిన 'అభిమతం' ఎనలేని ప్రాచుర్యం పొందింది. వారి పేర్లతో మతాలు, వర్గాలు పుట్టుకువచ్చాయి. ఆ వ్యక్తులు నొక్కి వక్కాణించిన దృక్పథం, వారి విచారధార ఉంది చూశారూ, అది ప్రథమ స్థానాన్ని ఆక్రమించుకోగా వారి అభిమానులు దైవం మరియు దైవప్రవక్త ప్రవచనాలను ద్వితీయ స్థానానికి దిగజార్చారు. దాంతో ముస్లిం సమాజంలో చీలికల పర్వం మొదలయింది. ఈ చీలికలు దిన దిన ప్రవర్థమానమైనాయి.

104. స్పష్టమయిన నిదర్శనాలు వచ్చిన తరువాత కూడా విభేదాలు సృష్టించిన వారు యూదులు, క్రైస్తవులు. వారి ఈ విభేదాలకు కారణం సత్యమేదో తెలియక కాదు. అన్నీ తెలిసి కూడా వాళ్లు తమ ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం, మనోవాంఛల కోసం డొంకతిరుగుడు ధోరణితో చీలికల పర్వాన్ని మొదలెట్టారు. ఉద్దేశ్యపూర్వకంగా నిర్హేతుక వైఖరిపై పాతుకుపోయారు. దివ్య ఖుర్ఆన్ విభిన్న విధాలుగా వారి ఈ వక్రబుద్ధిని ఎండగట్టింది. పెడసరి ధోరణిని మానుకోమని పలువిధాలుగా నచ్చజెప్పింది. కాని అత్యంత విచారకరమయిన విషయం ఏమిటంటే ఈ (ముస్లిం) సమాజంలోని మత నాయకులు కూడా ఇలాంటి కపట వైఖరినే ప్రదర్శిస్తూ ఉమ్మత్ సంగఠితత్వానికి తూట్లు పొడుస్తున్నారు. సత్యమేదో, దానికి సంబంధించిన స్పష్టమైన నిదర్శనాలేవో వారికి తెలీక కాదు, తెలుసు. కాని వాళ్లు తమ కాల్పనిక మతాలను అంటిపెట్టుకుని, తమ తెలివితేటలన్నింటినీ – గత సమాజాలలోని సంకుచిత స్వభావులవలే – ఖుర్ఆన్ హదీసులకు వక్రభాష్యం చెప్పటానికి, ఎటు తిప్పీ వాటినుంచి తాము అనుసరిస్తున్న, తమ మత గురువులు చెప్పిన భావాన్ని రాబట్టే అసహ్యకరమైన పనికోసం వెచ్చిస్తున్నారు.

105. ఇబ్నె అబ్బాస్ (రజి) ఈ ఆయతుకు తాత్పర్యం చెబుతూ (దైవప్రవక్త సంప్రదాయాన్ని ఖచ్చితంగా అనుసరించే) 'అహ్లె సున్నత్ వల్ జమాఅత్' వారి ముఖాలు ప్రకాశిస్తూ ఉంటాయనీ, దీనికి భిన్నంగా ధర్మంలో కొంగ్రొత్త పోకడలు పోయేవారి (అహ్లె బిద్అత్) ముఖాలు వాడిపోయి, నలుపుగా ఉంటాయని చెప్పారు (ఇబ్నె కసీర్, ఫత్హుల్ ఖదీర్). దీనిద్వారా బోధపడేదేమిటంటే, అహ్లె సున్నత్ వల్ జమాఅత్‌వారు అనుసరిస్తున్నదే అసలు ఇస్లాం ధర్మం. ఇకపోతే బిద్అతీలు (కొత్తపుంతలు తొక్కేవారు) పరలోక సాఫల్యానికి మూలమైనటువంటి ఈ ఇస్లాం అనుగ్రహానికి చాలా దూరంలో ఉన్నారు.

**108** (ఓ ప్రవక్తా!) ఇవి అల్లాహ్ వచనాలు. వాటిని మేము నీకు ఉన్నదున్నట్లుగా చదివి వినిపిస్తున్నాము. లోకవాసులకు అన్యాయం చేయాలన్న తలంపు అల్లాహ్‌కు ఎంతమాత్రం లేదు.

تِلْكَ اٰيٰتُ اللّٰهِ نَتْلُوْهَا عَلَيْكَ بِالْحَقِّ ؕ وَمَا اللّٰهُ يُرِيْدُ ظُلْمًا لِّلْعٰلَمِيْنَ ﴿١٠٨﴾

**109** ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్తమూ అల్లాహ్‌కే చెందుతుంది. సకల వ్యవహారాలూ అల్లాహ్ వైపుకే మళ్ళించ బడతాయి.

وَلِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ؕ وَاِلَى اللّٰهِ تُرْجَعُ الْاُمُوْرُ ﴿١٠٩﴾

**110** మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరు. మీరు మంచి విషయాలకై ఆజ్ఞాపిస్తారు, చెడు నుంచి ఆపుతారు, ఇంకా మీరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు.[106] గ్రంథవహులు కూడా విశ్వసించి ఉంటే, అది వారి కోసం శ్రేయస్కరం అయ్యేది. వారిలో కొందరు విశ్వాసులు కూడా ఉన్నారు.[107] కాని అత్యధికులు అవిధేయులే.

كُنْتُمْ خَيْرَ اُمَّةٍ اُخْرِجَتْ لِلنَّاسِ تَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَتَنْهَوْنَ عَنِ الْمُنْكَرِ وَتُؤْمِنُوْنَ بِاللّٰهِ ؕ وَلَوْ اٰمَنَ اَهْلُ الْكِتٰبِ لَكَانَ خَيْرًا لَّهُمْ ؕ مِنْهُمُ الْمُؤْمِنُوْنَ وَاَكْثَرُهُمُ الْفٰسِقُوْنَ ﴿١١٠﴾

**111** వారు మీకు ఏమాత్రం హాని కలిగించలేరు – మహా అయితే కొంచెం బాధించటం తప్ప.[108] ఒకవేళ మీతో తలపడవలసిన పరిస్థితే ఏర్పడినట్లయితే వారు మీకు వెన్ను చూపి పారిపోతారు. ఆ తరువాత వారికెలాంటి సహాయమూ లభించదు.

لَنْ يَّضُرُّوْكُمْ اِلَّاۤ اَذًى ؕ وَاِنْ يُّقَاتِلُوْكُمْ يُوَلُّوْكُمُ الْاَدْبَارَ ۟ ثُمَّ لَا يُنْصَرُوْنَ ﴿١١١﴾

106. ఈ ఆయతులో ముస్లిలు **శ్రేష్ఠ సమాజం** (ఖైరె ఉమ్మత్) గా పిలువబడ్డారు. దానికి ప్రధాన కారణం కూడా తెలుప బడింది– అదేమంటే వారు మంచిని ఆజ్ఞాపిస్తారు, చెడు నుంచి వారిస్తారు. అల్లాహ్ యెడల విశ్వాసం కలిగి ఉంటారు. అంటే ముస్లిం సమాజంలో ఈ మూడు సద్గుణాలు ఉన్నప్పుడే అది శ్రేష్ఠసమాజం అనిపించుకుంటుంది. లేకపోతే అది తన వైశిష్ట్యాన్ని కోల్పోతుంది. ఆ తరువాత గ్రంథవహుల ధోరణి ఖండించబడింది. అది కూడా ముస్లిములకు మేల్కొలుపు లాంటిది. అంటే మంచిని పెంపొందించే, చెడుల నుండి వారించే పనిని విస్మరించిన ఏ జాతికైనాసరే గ్రంథవహులకు పట్టిన గతే పడుతుంది. ఎందుకంటే వాళ్ళు, "చెడుల నుంచి ఒండొకరిని ఆపే పనిని మానేశారు" (అల్ మాయిద – 79). ఇంతకీ మంచిని పెంపొందించే పని **'ఫర్జె ఐన్'** (వైయక్తిక విధి) క్రిందికి వస్తుందా? 'ఫర్జె కిఫాయ' (సామూహిక విధి) క్రిందికి వస్తుందా? **'ఫర్జె కిఫాయ'** క్రిందికి వస్తుందని చాలామంది పండితులు అభిప్రాయపడ్డారు. అంటే పండితులు, విద్వాంసులు, మేధావులు ఈ కర్తవ్యాన్ని నెరవేరుస్తూ ఉండాలి. ఎందుకంటే మంచిపనులు – చెడుపనులకు సంబంధించిన సరైన షరీఅతు జ్ఞానం వారికే ఉంటుంది. వారు గనక సమాజంలో ఈ సందేశ ప్రదాన బాధ్యతను నిర్వర్తిస్తే సామాన్య ప్రజానీకంపై నుంచి ఆ బరువు తొలగిపోతుంది. ఏ విధంగా సాధారణ సమయంలో జిహాద్ (దైవమార్గంలో పోరాటం) కూడా ఫర్జె కిఫాయగానే ఉంటుందో ఆ విధంగా అన్నమాట. అంటే సమాజంలో ఒక వర్గం దాన్ని నిర్వర్తిస్తే మిగతా వారందరి తరఫున అది సరిపోతుంది.

107. ఉదాహరణకు అబ్దుల్లాహ్ బిన్ సలామ్ లాంటివారు. ఆయన మొదట్లో యూదుడే. కాని తరువాత ఇస్లాం స్వీకరించారు. ఇలాంటి విశ్వాసపాత్రుల సంఖ్య చాలా తక్కువ.

108. **బాధపెట్టడం (అజన్)** అంటే ఇక్కడ అర్థం అపనిందలు మోపటం, అబద్ధాలు కల్పించటం. వీటి ద్వారా ముస్లింలను ఎంత బాధపెట్టినప్పటికీ ముఖాముఖీ అయినప్పుడు మాత్రం వారు మిమ్మల్ని ప్రతిఘటించలేరు. పైగా తోకముడిచి

**112** సర్వత్రా వారిపై పరాభవపు దెబ్బ పడుతుంది – వారికి అల్లాహ్ శరణు లేదా ప్రజల నుండి అభయహస్తం లభిస్తే తప్ప![109] వారు దైవాగ్రహానికి పాత్రులైపోయారు. వారికి దీనావస్థ అంట గట్టబడింది. వారి ఈ స్థితికి కారణమేమిటంటే వారు అల్లాహ్ ఆయతులను తిరస్కరించేవారు, అన్యాయంగా ప్రవక్తలను చంపి వేసేవారు. వారి అవిధేయతకు, అతిక్రమణలకు[110] శాస్తి ఇది!

ضُرِبَتْ عَلَيْهِمُ الذِّلَّةُ اَيْنَ مَا ثُقِفُوْٓا اِلَّا بِحَبْلٍ مِّنَ اللّٰهِ وَحَبْلٍ مِّنَ النَّاسِ وَ بَآءُوْ بِغَضَبٍ مِّنَ اللّٰهِ وَضُرِبَتْ عَلَيْهِمُ الْمَسْكَنَةُ ؕ ذٰلِكَ بِاَنَّهُمْ كَانُوْا يَكْفُرُوْنَ بِاٰيٰتِ اللّٰهِ وَ يَقْتُلُوْنَ الْاَنْۢبِيَآءَ بِغَيْرِ حَقٍّ ؕ ذٰلِكَ بِمَا عَصَوْا وَّكَانُوْا يَعْتَدُوْنَ ﴿112﴾

**113** వారంతా ఒకలాంటివారు కారు. ఈ గ్రంథవహులలోని ఒక వర్గం వారు (సత్యంపై) నిలకడగా ఉన్నారు. వారు రాత్రి సమయాల్లో కూడా దైవవాక్యాలను పారాయణం చేస్తారు, సాష్టాంగపడతారు.

لَيْسُوْا سَوَآءً ؕ مِنْ اَهْلِ الْكِتٰبِ اُمَّةٌ قَآئِمَةٌ يَّتْلُوْنَ اٰيٰتِ اللّٰهِ اٰنَآءَ الَّيْلِ وَهُمْ يَسْجُدُوْنَ ﴿113﴾

**114** అల్లాహ్‌ను, అంతిమదినాన్ని కూడా వారు విశ్వసిస్తారు. మంచిని ఆజ్ఞాపిస్తారు, చెడు నుండి ఆపుతారు. సత్కార్యాల కోసం పరస్పరం పోటీపడతారు. వీరు సజ్జనుల కోవకు చెందినవారు.

يُؤْمِنُوْنَ بِاللّٰهِ وَ الْيَوْمِ الْاٰخِرِ وَ يَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَ يَنْهَوْنَ عَنِ الْمُنْكَرِ وَيُسَارِعُوْنَ فِى الْخَيْرٰتِ ؕ وَاُولٰٓئِكَ مِنَ الصّٰلِحِيْنَ ﴿114﴾

తిరోన్ముఖులవుతారు. ఎట్టకేలకు జరిగింది కూడా అదే. మదీనా నగరం నుంచి యూదులు గెంటివేయబడ్డారు. ఆపైన ఖైబరు కూడా కైవసమయింది. అక్కడి నుంచి కూడా యూదులు తరిమివేయబడ్డారు. అనంతరం సిరియా ప్రాంతంలోని క్రైస్తవులు ముస్లింల చేతిలో పరాజయాన్ని చవిచూశారు. దీనికి ప్రతీకారంగా అన్నట్లు శిలువ యుద్ధాలలో క్రైస్తవులు ముస్లింలపై అప్రతిహతంగా దాడులు చేశారు. 'బైతుల్ ముఖద్దస్'ను ముస్లింల నుంచి స్వాధీనం కూడా చేసుకున్నారు. అయితే 90 సంవత్సరాల తరువాత సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబీ దానిని క్రైస్తవుల చేతుల్లో నుంచి విడిపించారు. అయితే ఈనాడు ముస్లింల విశ్వాస మాంద్యం వల్లనైతేనేమీ, జియోనిస్టుల కుయుక్తుల వల్లనైతేనేమీ "బైతుల్ మఖ్దిస్" మరోసారి ముస్లింల నుంచి చేజారిపోయింది. కాని పరిస్థితుల ఈ స్వరూపం మారకపోదు. ముఖ్యంగా ఈసా (అలైహిస్సలాం) రాకతో క్రైస్తవం అంతమై ఇస్లాం ఆధిక్యత నొందుతుంది. సహీహ్ హదీసులు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి (ఇబ్నె కసీర్).

109. దైవాగ్రహానికి గురైన కారణంగా యూదులపై అవమానం, దైన్యావస్థ నెట్టివేయబడ్డాయి. తాత్కాలికంగా ఈ దుస్థితి నుంచి వారు బయటపడే మార్గాలు రెండు. ఒకటి : వారు దేవుని శరణు పొందాలి. అంటే వారు ఇస్లాం స్వీకరించాలి. లేదా ఇస్లామీయ రాజ్యంలో 'జిజ్‌యా'ను చెల్లించి 'జిమ్మీ'లు (బాధ్యత తీసుకోబడినవారు) గా ఉండాలి. రెండు : ప్రజల తరఫున అభయం వారికి లభించాలి. ఈ వాక్యానికి రెండు అర్థాలున్నాయి. (1). ఇస్లామీయ రాజ్యానికి బదులు సాధారణ ముస్లింలు వారికి ఆశ్రయమిచ్చి ఉండాలి. ప్రతి ముస్లింకూ ఈ రకమయిన ఆశ్రయం ఇచ్చే హక్కు ఉంది. ఒక సామాన్య ముస్లిం అయినాసరే ఎవరికయినా అభయమిస్తే అతని ఆశ్రయాన్ని కాదనే అధికారం ముస్లిం పరిపాలకులకు లేదని తాకీదు చేయబడింది. లేదా (2). ఏదైనా పెద్ద ముస్లిమేతర శక్తి లేక రాజ్యం ప్రోద్బలం వారికి లభించాలి. ఎందుకంటే వాక్యంలో 'అన్నాస్' అనే పదం వచ్చింది. ఇది విస్తృతమైన అర్థంకల పదం. ఇందులోకి ముస్లింలు, ముస్లిమేతరులు కూడా వచ్చేస్తారు.

110. అంటే – ఎంత బోధపరచినా తమ పెడసరి ధోరణిని, అహంకారాన్ని మానుకోకుండా హద్దు మీరి ప్రవర్తించినందులకు వారిపై పడిన దేవుని దెబ్బ అది.

**115** వారు ఏ మంచి పనిచేసినా దానికి విలువ ఇవ్వకపోవటం అనేది జరగదు. భయభక్తులు గలవారి గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు.[111]

وَمَا يَفْعَلُوْا مِنْ خَيْرٍ فَلَنْ يُّكْفَرُوْهُ ؕ
وَاللّٰهُ عَلِيْمٌۢ بِالْمُتَّقِيْنَ (115)

**116** ఇకపోతే అవిశ్వాసులు; వారి సంపదగానీ, సంతానం గానీ దైవ సమక్షంలో వారికి ఏ మాత్రం పనికిరావు. వారు నరకాగ్ని వాసులు. కలకాలం అందులోనే పడి ఉంటారు.

اِنَّ الَّذِيْنَ كَفَرُوْا لَنْ تُغْنِيَ عَنْهُمْ اَمْوَالُهُمْ
وَلَاۤ اَوْلَادُهُمْ مِّنَ اللّٰهِ شَيْـًٔا ؕ وَاُولٰٓئِكَ اَصْحٰبُ
النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ (116)

**117** ఈ అవిశ్వాసులు ఇహలోక జీవితంలో చేస్తున్న ఖర్చు తీవ్రమయిన చలిగాలులు తగిలి సర్వనాశనమైన[112] దుర్మార్గుల పొలాన్ని పోలినది. అల్లాహ్ వారికెలాంటి అన్యాయమూ చేయ లేదు. వాస్తవానికి వారే తమ మీద తాము అన్యాయం చేసుకునే వారు.

مَثَلُ مَا يُنْفِقُوْنَ فِيْ هٰذِهِ الْحَيٰوةِ الدُّنْيَا
كَمَثَلِ رِيْحٍ فِيْهَا صِرٌّ اَصَابَتْ حَرْثَ قَوْمٍ
ظَلَمُوْۤا اَنْفُسَهُمْ فَاَهْلَكَتْهُ ؕ وَمَا ظَلَمَهُمُ
اللّٰهُ وَلٰكِنْ اَنْفُسَهُمْ يَظْلِمُوْنَ (117)

**118** ఓ విశ్వాసులారా! మీరు మీ వారిని తప్ప వేరితరులను మీ ఆంతరంగికులుగా చేసుకోకండి.[113] ఇతరులు మీకు నష్టం కలిగించటానికి తమకు దొరికే ఏ అవకాశాన్నీ విడిచిపెట్టరు.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَتَّخِذُوْا بِطَانَةً مِّنْ
دُوْنِكُمْ لَا يَاْلُوْنَكُمْ خَبَالًا ؕ وَدُّوْا مَا عَنِتُّمْ ۚ

111. అంటే వెనుకటి ఆయతులలో ఖండించిన విధంగా గ్రంథవహులంతా అటువంటివారు కారు. వారిలోనూ మంచి వారున్నారు. ఉదాహరణకు అబ్దుల్లా బిన్ సలామ్, అసద్ బిన్ ఉబైద్, సాలబ బిన్ సఅ్‌యహ్, ఉసైద్ బిన్ సఅ్‌యహ్ మొదలగువారు. అల్లాహ్ వారికి ఇస్లాం భాగ్యాన్ని అనుగ్రహించాడు. నికార్సయిన విశ్వాసుల్లో ఉండే భయభక్తులు, సాత్వికత వారిలో కూడా ఉన్నాయి. అల్లాహ్ వారితోనూ, వారు అల్లాహ్‌తోనూ ప్రసన్నులవుగాక!; **ఖాయిమతున్** (సత్యంపై నిలకడగా ఉంటారు) అంటే షరీఅతుకు, దైవప్రవక్త(స)కు విధేయత చూపుతారని భావం. **'యస్‌జుదూన్'** అంటే వారు రాత్రిపూట దైవారాధనలో గడుపుతూ, తహజ్జుద్ నమాజులు చేస్తారు. నమాజుల్లో ఖుర్‌ఆన్ పారాయణం చేస్తారు. ఇలాంటి సద్వర్తనుల ప్రస్తావన ముమ్ముందు కూడా రానున్నది.

112. ప్రళయదినాన అవిశ్వాసుల సంతానంగానీ, వారి ఆస్తిపాస్తులుగానీ వారికేవిధంగానూ తోడ్పడలేవు. అంతేకాదు, లోక కళ్యాణం పేరిట వారు చేసే మంచి పనులు, వారు చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు కూడా–ఈమాన్ లేనందు వల్ల–నిరర్థకం అయిపోతాయి. వారి ఖర్చు తీవ్రమైన చలిగాలి తగిలిన పంటపొలం లాంటిది. దుర్మార్గులు ఆ పొలాన్ని చూసుకుని తెగ మురిసిపోయేవారు. ఆ పొలం ద్వారా వచ్చే ఫలసాయంపై ఎన్నో ఆశలు కూడా పెట్టుకున్నారు. కాని అకస్మాత్తుగా వారి ఆశలన్నీ మట్టిలో కలసిపోయాయి. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే మనుషులు సంక్షేమ కార్యక్రమాల కోసం ఎంతడబ్బు ఖర్చుపెట్టినా, లోకంలో వారి పేరు ప్రతిష్ఠలు ఎంతగా మార్మోగి పోయినాసరే వారి మనోభూమిలో ఈమాన్ (విశ్వాసం) అనే విత్తనం నాటుకోనంతవరకూ పరలోక జీవితంలో వారికెలాంటి పండ్లూ ఫలాలు లభించవు. అక్కడ వారికి శాశ్వతమైన నరకమే స్వాగతం పలుకుతుంది.

113. ఈ విషయం ఇంతకుముందు కూడా వచ్చింది. దీని అవసరం దృష్ట్యా మరోసారి ప్రస్తావించబడింది. అరబీలో **'బితానతన్' (بِطَانَةً)** అనే పదం వచ్చింది. ఆంతరంగికుణ్ణి, రహస్యాలు సయితం తెలిసిన మిత్రుణ్ణి 'బితానతన్' అంటారు. ముస్లిములకు సంబంధించి అవిశ్వాసులు, ముష్రిక్కులు వెలిబుచ్చే అభిప్రాయాలను, ఆంతర్యాల్లో దాచి వుంచుకునే విషయాలను అల్లాహ్ సూచించాడు. ఈ ఆయతును, ఇటువంటి ఇతర ఆయతులను దృష్టిలో పెట్టుకుని, ఇస్లామీయ రాజ్యంలో ముస్లిమేతరులను కీలక శాఖల్లో నియమించరాదని, కీలకమయిన పదవులు కూడా యివ్వరాదనీ

قَدْ بَدَتِ الْبَغْضَاءُ مِنْ أَفْوَاهِهِمْ ۖ وَمَا تُخْفِي صُدُورُهُمْ أَكْبَرُ ۚ قَدْ بَيَّنَّا لَكُمُ الْآيَاتِ ۖ إِنْ كُنْتُمْ تَعْقِلُونَ ﴿118﴾

మీరు కష్టాల్లో పడాలన్నదే వారి కోరిక.[114] వారిలోని అక్కసు స్వయంగా వారి నోట వెల్లడయింది. ఇక వారు తమ ఆంతర్యాల్లో దాచి ఉంచినది మరింత తీవ్రమైనది. మేము మీ కొరకు సూచనలను స్పష్టం చేశాము. మీరు బుద్ధిమంతులే అయితే (వీటిపై యోచన చేయండి).

هَا أَنْتُمْ أُولَاءِ تُحِبُّونَهُمْ وَلَا يُحِبُّونَكُمْ وَتُؤْمِنُونَ بِالْكِتَابِ كُلِّهِ ۚ وَإِذَا لَقُوكُمْ قَالُوا آمَنَّا ۚ وَإِذَا خَلَوْا عَضُّوا عَلَيْكُمُ الْأَنَامِلَ مِنَ الْغَيْظِ ۚ قُلْ مُوتُوا بِغَيْظِكُمْ ۗ إِنَّ اللَّهَ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ﴿119﴾

**119** మీరైతే వారిని ప్రేమిస్తున్నారు.[115] కాని వారు మాత్రం మిమ్మల్ని ప్రేమించటం లేదు. మీరు గ్రంథాన్నంతటినీ విశ్వసిస్తున్నారు (కాని వారు విశ్వసించటం లేదు. మరలాంటప్పుడు వారు మీకు స్నేహితులెలా అవుతారు?). వారు మిమ్మల్ని కలసినప్పుడు తాము విశ్వసించామని చెబుతారు, కాని మీ దగ్గరి నుంచి తప్పుకున్నప్పుడు మీపై కోపంకొద్దీ తమ వ్రేళ్లను కసిగా కొరుక్కుంటారు.[116] “మీరు మీ కోపావేశంలోనే చావండి. నిశ్చయంగా అల్లాహ్ గుండెల్లోని గుట్టును గురించి బాగా తెలిసినవాడు” అని వారికి చెప్పండి.

పండితులు, విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఒక ఉల్లేఖనం ప్రకారం అబూ మూసా అష్అరీ (రజి) గారు ఒక ‘జిమ్మీ’ (ముస్లిమేతరు)ని తన వ్యక్తిగత కార్యదర్శిగా పెట్టుకున్నారు. ఈ సంగతి తెలుసుకున్న ఉమర్ (రజి) ఆయన్ని తీవ్రంగా మందలించడమేగాక ఇలా అన్నారు: “అల్లాహ్ దూరం చేసిన వారిని మీరు దగ్గరకు చేర్చకండి. అల్లాహ్ వారిని అవమానపరచగా మీరు వారికి గౌరవమొసగకండి. అల్లాహ్ వారిని నమ్మక ద్రోహులుగా ఖరారు చేయగా మీరు వారిని ఆంతరంగికులుగా చేసుకోకండి.” ఉమర్ (రజి) గారి ఈ వ్యాఖ్యకు మూలాధారం దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వచనమే.

ఇమామ్ ఖుర్తుబీ ఇలా అంటున్నారు : “ఈ కాలంలో గ్రంథవహులను సెక్రటరీలుగా, వ్యక్తిగత సలహాదారులుగా నియమించుకోవటం మూలంగా పరిస్థితులు మారిపోయాయి. మూర్ఖులు, అవివేకులు నాయకులుగా, అమీర్లుగా అవతరించారు” (తఫ్సీరె ఖుర్తుబీ). దురదృష్టవశాత్తూ నేటి ముస్లిం రాజ్యాలలో సయితం దివ్య ఖుర్ఆన్‌లోని ఈ అతి ముఖ్యమయిన సూచనను అంతగా పట్టించుకోవటం లేదు. పైగా ముస్లిం రాజ్యాలలో ముస్లిమేతరులు అత్యంత కీలకమయిన హోదాలను అలంకరించారు. దాని పర్యవసానం కూడా జగద్విదితమే. ముస్లిం రాజ్యాలు గనక తమ దేశీయాంగ, విదేశాంగ వ్యవహారాలలో, విధానాలలో ఈ ‘ఆదేశాన్ని’ తగు రీతిలో పాటిస్తే ఇప్పుడు జరుగుతున్న భారీ నష్టాన్ని నివారించటం అసంభవం ఏమీ కాదు.

114. మిమ్మల్ని దెబ్బ తీయడానికి వారు సదా పొంచి వుంటారు. మీకు నష్టం చేకూర్చే ఏ చిన్న అవకాశం దొరికినా వారు దాన్ని పోగొట్టుకోరు. మీరు బాధపడుతుంటే చూచి ఆనందించాలన్నదే వారి కోరిక. **‘లాయఅ్లూన’** (لَا يَأْلُونَكُمْ) అంటే తక్కువ చేయకుండా ఉండరు, అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోకుండా వదలిపెట్టరు అని భావం; **ఖబాలన్** (خَبَالًا) అంటే నష్టం, నాశనం; **‘మా అనిత్తుమ్’** (مَا عَنِتُّمْ) అంటే దేనిమూలంగానైతే మీరు కష్టానికి, బాధలకు గురౌతారో; ఇక్కడ ‘అనతున్’ అన్న పదం ‘ముషఖ్ఖతున్’ అనే అర్థంలో వాడబడింది. ముషఖ్ఖతున్ అంటే బాధ, కష్టం.

115. మీరు ఈ నయవంచకుల నమాజులను చూచి, వారి తియ్యని మాటలను విని మోసపోతున్నారు. వారిని మీ మిత్రులుగా తలపోసి, దగ్గరకు చేరుస్తున్నారు. కాని వారు నిజంగా మీ మిత్రులు కారు. వారి అణువణువునా మీరంటే విరోధభావం వెలసి ఉంది.

**120** మీకేదైనా మేలు కలిగితే వారు బాధపడతారు. అదే మీకేదైనా హాని జరిగితే మాత్రం ఆనందిస్తారు.[117] మీరే గనక సహనంతో, భయభక్తులతో వ్యవహరించినట్లయితే వారి కుట్ర మీకెలాంటి నష్టమూ చేకూర్చదు.[118] ఎందుకంటే వారి కార్యకలాపాలన్నింటినీ అల్లాహ్ ముట్టడించి ఉన్నాడు.

إِن تَمْسَسْكُمْ حَسَنَةٌ تَسُؤْهُمْ وَإِن تُصِبْكُمْ سَيِّئَةٌ يَفْرَحُوا بِهَا ۖ وَإِن تَصْبِرُوا وَتَتَّقُوا لَا يَضُرُّكُمْ كَيْدُهُمْ شَيْئًا ۗ إِنَّ اللَّهَ بِمَا يَعْمَلُونَ مُحِيطٌ ﴿١٢٠﴾

**121** (ఓ ప్రవక్తా! ఆ సమయాన్ని కూడా జ్ఞప్తికి తెచ్చుకో,) అప్పుడు నీవు తెలతెల వారుతుండగా నీ ఇంటి నుండి బయలుదేరి రణ రంగంలో విశ్వాసులు మోహరించవలసిన స్థలాలను నిర్ధారించ సాగావు.[119] అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

وَإِذْ غَدَوْتَ مِنْ أَهْلِكَ تُبَوِّئُ الْمُؤْمِنِينَ مَقَاعِدَ لِلْقِتَالِ ۗ وَاللَّهُ سَمِيعٌ عَلِيمٌ ﴿١٢١﴾

116. ఇది వారి ఆంతర్యంలో అణగివున్న క్రోధాగ్నిని సూచిస్తోంది. దీని తరువాత వచ్చే ఆయతు కూడా వారిలోని అసహనాన్ని, ఆగ్రహావేశాన్ని వెల్లడిస్తోంది.

117. విశ్వసించిన వారి యెడల కపటులలోని తీవ్ర విరోధభావాన్ని, ఓర్వలేనితనాన్ని ఈ వాక్యం వెల్లడిస్తోంది. ముస్లిములకు కలిమి ప్రాప్తించినా, దేవుని తోడ్పాటుతో వారికెక్కడయినా విజయం వరించినా, వారి సంఖ్యలో వృద్ధి జరిగినా ఈ కపటులు ఓర్చుకోలేరు. లోలోపలే ఉడుక్కుంటారు. అసూయాగ్నిలో దహించుకుపోతూ ఉంటారు. మరి అదే ముస్లింలు కరువు కాటకాలకు లోనవటమో, దైవప్రణాళికననుసరించి ఏ యుద్ధంలోనయినా ఓటమి పొందటమో జరిగితే మహా సంబరపడిపోతారు. వికటాట్టహాసం చేస్తారు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే మనసుల్లో ఇంతటి కుళ్ళును దాచిపెట్టు కున్నవారు మీ శ్రేయోభిలాషులెలా అవుతారు? వారిని మీరు మీ ఆంతరంగికులుగా ఎలా నియమించుకుంటారు? అందుకే అల్లాహ్ యూదులతో, క్రైస్తవులతో సయితం స్నేహం చేయరాదని తాకీదు చేశాడు. ఎందుకంటే వారు కూడా ముస్లింల పట్ల వైరభావం కలిగి ఉన్నారు. ముస్లింలకు విజయం వరిస్తే అసహనంతో చిందులేస్తారు, అపజయం ఎదురైతే మాత్రం ఆనందంతో ఎగిరి గంతేస్తారు.

118. వారి మాయోపాయాల నుంచి బయటపడే మార్గమిది. అంటే కపటుల, ఇస్లాం విరోధుల కుట్రల నుంచి బయట పడటానికి ఉత్తమరీతిలో సహనం వహించాలి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండాలి. ఈనాడు ముస్లిములలో ఈ రెండు గుణాలే లోపించాయి. ఈ కారణంగానే వారు అన్యుల ఆగడాలకు బలి అవుతున్నారు. అన్యులు సాధించిన భౌతిక ప్రగతి మూలంగా, వైజ్ఞానికంగా సాంకేతికంగా వారు సంపాదించిన పురోగతి మూలంగా వారికి ప్రపంచాధిక్యత ప్రాప్తించిందని చాలామంది భావిస్తున్నారు. కాని ముస్లిముల అధోగతికి అంతకన్నా బలమైన మరో కారణముంది – అదేమంటే వారు ధర్మమార్గంలో సహనస్థయిర్యాలను కోల్పోతున్నారు. తమను సృష్టించిన దైవానికి భయపడవలసిన రీతిలో భయపడటం లేదు. నిజానికి ఈ రెండు విషయాల్లోనే వారి విజయ రహస్యం దాగి ఉంది. అల్లాహ్ సహాయం కూడా ఈ రెండూ ఉన్నప్పుడే లభిస్తుంది.

119. మెజారిటీ ఉలమా (విద్వాంసుల) ప్రకారం ఇది ఉహుద్ యుద్ధ రంగానికి సంబంధించిన సంఘటన. ఈ సంఘటన హిజ్రీ 3వ సంవత్సరం, షవ్వాల్ నెలలో సంభవించింది. క్లుప్తంగా దీని పూర్వరంగం ఇది : ఏడాది క్రితమే (హిజ్రీ 2లో) బద్ర్ యుద్ధమైదానంలో అవిశ్వాసులకు ఘోర పరాజయం ఎదురయింది. వారి వెంటవచ్చిన వారిలో 70 మంది అంతమయ్యారు. మరో డెబ్భయిమంది యుద్ధఖైదీలుగా పట్టుబడ్డారు. ఈ పరాభవం వారిని తలెత్తుకోకుండా చేసింది. అందువల్ల వారంతా కలసి ముస్లిములకు వ్యతిరేకంగా ఓ పెద్ద యుద్ధానికి వ్యూహరచన చేయసాగారు. వారి మహిళలు సయితం సమర సన్నాహాల్లో మునిగిపోయారు. 3 వేలమంది సైనికులతో వారు ఉహుద్ కొండ దగ్గర మోహరించి ఉన్నారని తెలిసినంతనే మహాప్రవక్త (స) తన సహచరులను సంప్రతించారు. మదీనాలోనే ఉండి శత్రువును నిలువరించాలా? లేక మదీనా పొలిమేరలు దాటి వచ్చి శత్రువును ఎదుర్కోవాలా? అన్న విషయంపై

**122** మీలోని రెండు సమూహాల వారి ఆత్మవిశ్వాసం సన్నగిల్లి నప్పుడు[120] అల్లాహ్ వారికి అండగా ఉన్నాడు.[121] విశ్వాసులైన వారు సదా అల్లాహ్‌నే నమ్ముకోవాలి.

إِذْ هَمَّت طَّآئِفَتَانِ مِنكُمْ أَن تَفْشَلَا وَٱللَّهُ وَلِيُّهُمَا ۗ وَعَلَى ٱللَّهِ فَلْيَتَوَكَّلِ ٱلْمُؤْمِنُونَ ﴿122﴾

**123** బద్ర్ (యుద్ధం)లో మీరు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ఆదుకున్నాడు.[122] కాబట్టి అల్లాహ్‌కు మాత్రమే భయపడండి. తద్వారా మీకు కృతజ్ఞతలు తెలుపుకునే సద్బుద్ధి ప్రాప్తిస్తుంది.

وَلَقَدْ نَصَرَكُمُ ٱللَّهُ بِبَدْرٍ وَأَنتُمْ أَذِلَّةٌ ۖ فَٱتَّقُوا۟ ٱللَّهَ لَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿123﴾

**124** (ఈ కృతజ్ఞతల మూలంగానే మీకు సహాయ సహకారాలు అందవచ్చు. (ఓ ప్రవక్తా!) నీవు విశ్వాసులను ఓదార్చిన ఆ ఘడియలను కాస్త జ్ఞాపకం చేసుకో!) "ఏమిటీ, ఆకాశం నుంచి మూడు వేల మంది దూతలను దింపి మీ ప్రభువు మీకు తోడ్పడటం మీకు చాలదా?" అని అప్పుడు నువ్వు వారితో అన్నావు.

إِذْ تَقُولُ لِلْمُؤْمِنِينَ أَلَن يَكْفِيَكُمْ أَن يُمِدَّكُمْ رَبُّكُم بِثَلَـٰثَةِ ءَالَـٰفٍ مِّنَ ٱلْمَلَـٰٓئِكَةِ مُنزَلِينَ ﴿124﴾

**125** "అవును. మీరే గనక సహనం వహించి, భయభక్తులతో మెలగుతూ ఉండి, వారు (దైవ విరోధులు) ఇదే ఆవేశంతో మీపైకి దండెత్తివస్తే, మీ ప్రభువు ఐదువేల మంది[123] ప్రత్యేక చిహ్నాలుగల[124] దూతలతో మీకు సాయమందిస్తాడు."

بَلَىٰٓ ۚ إِن تَصْبِرُوا۟ وَتَتَّقُوا۟ وَيَأْتُوكُم مِّن فَوْرِهِمْ هَـٰذَا يُمْدِدْكُمْ رَبُّكُم بِخَمْسَةِ ءَالَـٰفٍ مِّنَ ٱلْمَلَـٰٓئِكَةِ مُسَوِّمِينَ ﴿125﴾

---

సహచరుల సలహా కోరారు. నగరంలోనే ఉండి శత్రువును ఎదుర్కొందామని కొంతమంది సహాబీలు సలహా యిచ్చారు. కపటాగ్రేసరుడైన అబ్దుల్లా బిన్ ఉబై కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించాడు. అయితే బద్ర్ యుద్ధంలో పాల్గొనే అవకాశం లభించని కొంతమంది ఔత్సాహిక సహచరులు మదీనా పొలిమేరలు దాటిపోయి, బహిరంగ ప్రదేశంలో తలపడటానికే ప్రాధాన్యత యిచ్చారు. ఆయన (సఅసం) తన కుటీరం లోపలికి వెళ్ళి సాయుధులై వచ్చారు. బహుశా తాము దైవప్రవక్త (సఅసం) మనోగతానికి విరుద్ధంగా సలహాయిచ్చి, ఆయన్ని ఇబ్బందుల్లో పెట్టామేమోనన్న సంశయంతో రెండో వర్గం వారు కించిత్ సిగ్గుపడ్డారు. "దైవప్రవక్తా! నగరంలోనే ఉండి శత్రువును ఎదిరించాలన్నది మీ కోరిక అయితే అలాగే కానివ్వండి. ఇక్కడుండే శత్రువును ఎదుర్కొందాం" అని వారు చెప్పారు కూడా. దానికాయన (స), "యుద్ధవస్త్రాలను తొడిగిన తర్వాత వాటిని విడువటం ఒక దైవప్రవక్తకు ఏమాత్రం శోభించదు" అని చెప్పారు. కడకు వెయ్యిమంది ముస్లింలు యుద్ధానికి బయలుదేరారు. తీరా రణరంగానికి చేరుకుంటూ ఉండగా కపటుల సర్దారు అయిన అబ్దుల్లా బిన్ ఉబై దైవప్రవక్త తన సలహాను పాటించలేదన్న సాకుతో మూడువందల మందిని వెంటబెట్టుకుని ఇంటి ముఖం పట్టాడు. అతని ఈ ఆకస్మిక నిర్ణయంతో చాలామంది ముస్లిం యోధుల ఆత్మవిశ్వాసం నీరుగారిపోయింది. దాని ప్రభావం ఆ యుద్ధంపై కూడా పడింది (ఇబ్నె కసీర్).

120. అవి ఔస్, ఖజ్రజ్‌కు చెందిన రెండు తెగలు (బనూ హారిస, బనూ సలమ).

121. ఆ సమయంలో అల్లాహ్ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ధైర్యాన్ని కూడగట్టి, వారికి సహాయమందించాడు.

122. సంఖ్యాపరంగానూ, ఆయుధ సామగ్రి రీత్యాను మీరు అత్యంత బలహీనులుగా ఉన్నప్పుడు ఆయన మీకు అపూర్వంగా తోడ్పడ్డాడు. ఆ సందర్భంగా ముస్లింల సంఖ్య 313 మాత్రమే. కేవలం రెండు గుర్రాలు, 70 ఒంటెలున్నాయి. మిగిలిన వారంతా కాలినడకన వచ్చారు (ఇబ్నె కసీర్).

وَمَا جَعَلَهُ اللّٰهُ اِلَّا بُشْرٰى لَكُمْ وَلِتَطْمَىِٕنَّ قُلُوْبُكُمْ بِهٖ ؕ وَمَا النَّصْرُ اِلَّا مِنْ عِنْدِ اللّٰهِ الْعَزِيْزِ الْحَكِيْمِ ﴿126﴾

**126** అల్లాహ్ మీ కొరకు దీనిని శుభవార్తగానూ, ఇంకా మీ మనోనిబ్బరం కోసం జరిగే ఏర్పాటుగానూ చేశాడు. యదార్థానికి అసలు సహాయం మాత్రం అల్లాహ్ తరఫు నుంచి లభించేదే. ఆయన సర్వాధిక్యుడు, వివేచనాపరుడు.

لِيَقْطَعَ طَرَفًا مِّنَ الَّذِيْنَ كَفَرُوْۤا اَوْ يَكْبِتَهُمْ فَيَنْقَلِبُوْا خَآىِٕبِيْنَ ﴿127﴾

**127** అవిశ్వాసులలోని ఒక వర్గం కథ ముగించడానికి లేదా వారిని పరాభవం పాలుచేయడానికి, (వారంతా) ఓటమిపాలై వెనుతిరిగిపోవటానికిగాను[125] (అల్లాహ్ మీకు ఈ సహాయ మందించాడు).

لَيْسَ لَكَ مِنَ الْاَمْرِ شَیْءٌ اَوْ يَتُوْبَ عَلَيْهِمْ اَوْ يُعَذِّبَهُمْ فَاِنَّهُمْ ظٰلِمُوْنَ ﴿128﴾

**128** (ఓ ప్రవక్తా! ఈ వ్యవహారంలో) నీకెలాంటి నిర్ణయాధికారం లేదు.[126] అల్లాహ్ (గనక తలిస్తే) వారి పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు లేదా వారిని శిక్షిస్తాడు.[127] ప్రస్తుతానికి వారు అక్రమానికి పాల్పడినవారే!

---

123. బద్ర్ మైదానం వైపుకు ముస్లింలు బయలుదేరింది యుద్ధం కోసం కాదు. కురైష్‌కు చెందిన వర్తక బిడారును తనిఖీ చేయటమే వారి ఉద్దేశం. కాని తీరా అక్కడికి చేరుకునేసరికి మక్కా ముష్రిక్కుల ఒక పెద్ద సైన్యం సకల యుద్ధసన్నాహాలతో, సమరనాదం చేస్తూ వస్తోందని సమాచారం అందింది. ఈ వార్త విన్నంతనే ముస్లింలలో కలవరం మొదలయింది. వారిలో ఆందోళనతోపాటు శత్రువులకు గట్టిగా బుద్ధి చెప్పాలనే భావోద్వేగాలూ పొంగుకొచ్చాయి. ఆ తరువాత అందరూ కలిసి దైవసన్నిధిలో కడు దీనంగా వేడుకోవటం జరిగింది. అల్లాహ్ వారి మొరలను ఆలకించాడు. ముందుగా వెయ్యిమందిని, ఆ తర్వాత మూడు వేలమంది దూతలను సాయంగా పంపిస్తానని అల్లాహ్ శుభవార్త అందజేశాడు. మీరు సహనాన్ని పాటిస్తూ, అల్లాహ్‌కు భయపడుతూ ఉన్న పక్షంలో శత్రు సైన్యం మీపై ఇప్పుడున్న ఆగ్రహావేశాలతోనే దాడి చేసినట్లయితే ఐదువేల దూతలను పంపి అయినా మీకు సహాయం చేస్తానని వాగ్దానం చేశాడు. (కాని ముష్రిక్కుల ఉత్సాహం కాస్తా కదన రంగానికి రాగానే నీరుగారిపోయింది. రణరంగానికి చేరుకోకముందే వారి శ్రేణుల్లో భేదాభిప్రాయం పొడసూపింది. కొంతమంది మక్కాకు తిరిగివెళ్ళిపోయారు. వచ్చిన వారిలో కూడా కొన్ని తెగల నాయకులు యుద్ధానికి సుముఖంగా లేరు). ఎట్టకేలకు మూడు వేలమంది దూతల సాయంతోనే ముస్లింలకు విజయం లభించింది. అయిదువేల మంది దూతలు రావలసిన అవసరం కూడా లేకపోయింది. అయితే అయిదువేల మందీ వచ్చారని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

124. అంటే వారు దైవదూతలని గుర్తుపట్టడానికి కొన్ని ప్రత్యేక ఆనవాళ్లు ఉంటాయి.

125. సర్వశక్తుడు, సర్వాధికుడైన దైవసహాయ ఫలితమిది. అన్‌ఫాల్ సూరాలో దైవదూతల సంఖ్య వెయ్యి అని తెలుపబడింది. "మీరు మీ ప్రభువు సహాయం కోసం అర్థించినపుడు, ఆయన మీ అభ్యర్థనను ఆలకిస్తూ వెయ్యిమంది దూతల ద్వారా మీకు తోడ్పడతానని, వారు వరుసగా మీ వద్దకు వస్తారని అన్నాడు" (అన్‌ఫాల్ – 9). ఈ వాక్యం ద్వారా బోధపడేదేమి టంటే దైవదూతలు నిజానికి వచ్చింది వెయ్యిమందే. అయితే అవసరాన్ని బట్టి మూడువేల మందిగానీ, అయిదువేల మందిగానీ పంపబడతారని వాగ్దానం చేయబడింది. కాని ఆ అవసరం ఏర్పడలేదు. కాబట్టి మూడు వేలమంది లేక అయిదు వేల మంది దైవదూతలు రాలేదనీ, ముస్లింల ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేయటమే దీని ఉద్దేశ్యమనీ, అసలు సహాయమైతే అల్లాహ్‌దేనని కొంతమంది వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించారు. అల్లాహ్‌కు దూతల అవసరంగానీ, వేరొకరి అవసరంగానీ లేదు. ఆయన సర్వశక్తుడు, సర్వజ్ఞుడు. అందుచేత ఆయన బద్ర్ రంగంలో ముస్లింలకు

**129** భూమ్యాకాశాలలో వున్నదంతా అల్లాహ్‌దే. ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు, తాను కోరిన వారిని శిక్షిస్తాడు. అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడు కూడాను.

وَلِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۭ يَغْفِرُ لِمَنْ يَّشَاۗءُ وَيُعَذِّبُ مَنْ يَّشَاۗءُ ۭ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿١٢٩﴾

**130** ఓ విశ్వసించిన వారలారా! ద్విగుణీకృతం, బహుగుణీకృతం చేసి వడ్డీని తినకండి.[128] మీరు సాఫల్యం పొందటానికి గాను అల్లాహ్‌కు భయపడండి.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَاْكُلُوا الرِّبٰٓوا اَضْعَافًا مُّضٰعَفَةً ۠ وَاتَّقُوا اللّٰهَ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ ﴿١٣٠﴾

**131** అవిశ్వాసుల కొరకు సిద్ధం చేయబడిన నరకాగ్నికి భయ పడండి.

وَاتَّقُوا النَّارَ الَّتِيْٓ اُعِدَّتْ لِلْكٰفِرِيْنَ ﴿١٣١﴾

**132** అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపండి – తద్వారా మీరు కనికరించబడే అవకాశం ఉంది.

وَاَطِيْعُوا اللّٰهَ وَالرَّسُوْلَ لَعَلَّكُمْ تُرْحَمُوْنَ ﴿١٣٢﴾

---

అండగా నిలిచాడు. ఫలితంగా ముస్లిములకు చరిత్రాత్మక విజయం వరించింది. అవిశ్వాసుల, మిథ్యావాదుల శక్తి సన్నగిల్లింది. సత్యతిరస్కారుల అహం అణిగింది (ఐసరుత్తఫాసీర్).

126. అంటే ఈ అవిశ్వాసులకు సన్మార్గం చూపటమైనా, లేక వారి విషయంలో మరేదైనా నిర్ణయం గైకొనటమయినా – అదంతా అల్లాహ్ చేతుల్లో ఉంది. హదీసుల ప్రకారం ఉహుద్ రణరంగంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి దంతాలు రాలి పోయాయి. ముఖారవిందానికి కూడా గాయమైంది. అప్పుడాయన (స), "ప్రవక్తను గాయపరచిన జాతి ఎలా బాగుపడుతుంది?" అని పలికారు. అంటే ఇక వారు సన్మార్గం పొందే అవకాశాలు మృగ్యమైపోయాయన్న భావం ఆయన (స) మాటల్లో వ్యక్తమయింది. అప్పుడు ఈ ఆయతు అవతరించింది.

మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆయన (స) కొంతమంది అవిశ్వాసులను శపించటానికి 'ఖునూతె నాజిలా' కూడా (నమాజులో) చేసేవారు. దానిపై ఈ ఆయతు అవతరించగా ఆయన (స) ఖునూతె నాజిలాలో వారిని శపించటం మానేశారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్). మహాప్రవక్త (సఅసం)కు సర్వాధికారాలు కలవని వాదించేవారికి ఈ ఆయతు కనువిప్పు కావాలి. తాను తలచిన వారినల్లా సన్మార్గాన పెట్టే అధికారం ఆయన (స)కు లేదు. దైవప్రవక్తలు దైవసందేశాన్ని మానవాళికి అందజేసి, వారిని నరకాగ్ని బారినుంచి కాపాడటానికి నిరంతరం పరితపిస్తూ ఉంటారన్నది అక్షర సత్యమైనప్పటికీ, ఆ సన్మార్గ భాగ్యాన్ని ప్రసాదించేవాడు మాత్రం అల్లాహ్‌యేనని మరువరాదు.

127. దైవప్రవక్త ఎవరినయితే శపించారో వారంతా కడకు ఇస్లాం స్వీకరించారు. దేవుడు వారికి సద్బుద్ధినిచ్చాడు. కాబట్టి సర్వాధికారి, అగోచర విషయాల జ్ఞాని కేవలం అల్లాహ్‌యేనని అవగతమవుతోంది.

128. ఉహుద్ పోరాటంలో ముస్లిములకు ఎదురయిన అపజయానికి అసలు కారణం దైవప్రవక్త పట్ల అవిధేయత, ధన వ్యామోహం. అందుకే వారిని ధన వ్యామోహంలో అతి భయంకర రూపమైన 'వడ్డీసొమ్ము' విషయమై హెచ్చరించటం జరిగింది. మనిషిలో ధనవ్యామోహాన్ని, పేరాశను పెంచి అతన్ని పరమలోభిగా, కఠినాత్మునిగా మార్చే మహమ్మారి 'వడ్డీ.' ఎన్నోరెట్లు పెరుగుతూ పోయే వడ్డీని తినకండి అని అనటాన్నిబట్టి తక్కువ వడ్డీ అయితే తీసుకోవచ్చా? అన్న సందేహాన్ని ఎవరయినా వెలిబుచ్చవచ్చు. కాని దీనిభావం ఇది ఎంతమాత్రం కాదు. తక్కువైనా ఎక్కువైనా వడ్డీ వడ్డీయే. అది నిషిద్ధం (హరామ్) అన్నది నిర్వివాదాంశం. అజ్ఞాన కాలంలో నిర్ణీత గడువుపై ఋణగ్రస్తుడు ఋణాన్ని చెల్లించకపోతే, అతనికి మరికొంత గడువు యిచ్చి, పెంచిన గడువును బట్టి మరింత ఎక్కువ వడ్డీ వడ్డించబడేది. (మననాట దీన్ని చక్రవడ్డీగా వ్యవహరిస్తారు). ఈ వడ్డీ సొమ్ము ఇంతై అంతై – దిన దిన ప్రవర్థమానమై – ఋణగ్రస్తుని పాలిట పర్వతంలా తయారవుతుంది. ఒక సామాన్య మనిషి జీవితాంతం ఆ ఊబిలో నుంచి బయటపడలేడు.

**133** మీ ప్రభువు యొక్క క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పరుగెత్తండి.[129] ఆ స్వర్గం వెడల్పు భూమ్యాకాశాలంత ఉంటుంది. అది భయభక్తులు గలవారి కోసం తయారు చేయబడింది.

وَسَارِعُوٓا إِلَىٰ مَغْفِرَةٍ مِّن رَّبِّكُمْ وَجَنَّةٍ عَرْضُهَا السَّمٰوٰتُ وَالْأَرْضُ ۙ أُعِدَّتْ لِلْمُتَّقِينَ ﴿١٣٣﴾

**134** వారు కలిమిలోనూ, లేమిలోనూ (దైవమార్గంలో) ఖర్చు చేస్తారు.[130] కోపాన్ని దిగమ్రింగుతారు,[131] ప్రజల పట్ల మన్నింపుల వైఖరిని అవలంబిస్తారు. అల్లాహ్ ఇలాంటి సదాచార సంపన్ను లనే ప్రేమిస్తాడు.

الَّذِينَ يُنفِقُونَ فِي السَّرَّآءِ وَالضَّرَّآءِ وَالْكٰظِمِينَ الْغَيْظَ وَالْعَافِينَ عَنِ النَّاسِ ۗ وَاللّٰهُ يُحِبُّ الْمُحْسِنِينَ ﴿١٣٤﴾

**135** తమ ద్వారా ఏదైనా నీతిబాహ్యమైన పని జరిగిపోతే లేదా తమ ఆత్మలకు వారు ఏదైనా అన్యాయం చేసుకుంటే వెంటనే అల్లాహ్‌ను తలచుకుని, తమ పాపాల క్షమాపణకై వేడుకుం టారు.[132] – నిజానికి అల్లాహ్ తప్ప పాపాలను క్షమించే వాడెవడు న్నాడు? – వారు తమ వల్ల జరిగింది తప్పు అని తెలిసినపుడు దానిపై హటం చెయ్యరు.

وَالَّذِينَ إِذَا فَعَلُوا فٰحِشَةً أَوْ ظَلَمُوٓا أَنفُسَهُمْ ذَكَرُوا اللّٰهَ فَاسْتَغْفَرُوا لِذُنُوبِهِمْ ۗ وَمَن يَغْفِرُ الذُّنُوبَ إِلَّا اللّٰهُ ۗ وَلَمْ يُصِرُّوا عَلَىٰ مَا فَعَلُوا وَهُمْ يَعْلَمُونَ ﴿١٣٥﴾

**136** తమ ప్రభువు తరఫు నుంచి క్షమాభిక్ష, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలు ప్రతిఫలంగా లభించేది ఇటువంటి వారికే. వాటిలో వారు ఎల్లకాలం ఉంటారు. ఈ సత్కార్యాలు చేసేవారికి లభించే పుణ్యఫలం ఎంత చక్కనిది!

أُولٰٓئِكَ جَزَآؤُهُم مَّغْفِرَةٌ مِّن رَّبِّهِمْ وَجَنّٰتٌ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهٰرُ خٰلِدِينَ فِيهَا ۚ وَنِعْمَ أَجْرُ الْعٰمِلِينَ ﴿١٣٦﴾

---

అందుకే అల్లాహ్ వారికి హితోపదేశం చేశాడు – 'అల్లాహ్‌కు భయపడండి, అవిశ్వాసుల కొరకు సిద్ధం చేయబడిన నరకాగ్నికి భయపడండి' అని! మీరే గనక వడ్డీ సొమ్మును తినటం మానకపోతే, ఈ జాడ్యం మిమ్మల్ని క్రమక్రమంగా అవిశ్వాస స్థితికి చేర్చి, ఆ తరువాత నరకాగ్నికి ఆహుతి చేస్తుంది అన్న హెచ్చరిక కూడా ఈ ఉపదేశంలో అంతర్లీనమై ఉంది. ఎందుకంటే వడ్డీ తినటం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు వ్యతిరేకంగా యుద్ధం చేయటమే.

129. సిరిసంపదల వైపుకు, ప్రాపంచిక ప్రయోజనాల వైపుకు పరుగులు తీసి పరలోక జీవితాన్ని పాడుచేసుకునే బదులు దైవానికి, దైవప్రవక్తకు విధేయులై దేవుని క్షమాభిక్షను, స్వర్గలోకాన్ని పొందే ప్రయత్నం చేయండి, ఆ స్వర్గాన్ని అల్లాహ్ తనకు భయపడుతూ జీవితం గడిపేవారి కోసం తయారుచేశాడని అర్థం. ఆ దైవభీతిపరుల కొన్ని సద్గుణాలు తరువాతి వచనాల్లో విశదీకరించబడ్డాయి.

130. అంటే వారు తమ వద్ద డబ్బు ఉన్నప్పుడే కాదు, ఆర్థిక యిబ్బందులు ఉన్నప్పుడు కూడా దైవమార్గంలో ఖర్చుపెట్టడానికి వెనుకాడరు. ఎల్లవేళలా వారు పుణ్యార్జన కోసం సిద్ధంగా ఉంటారు.

131. బాగా కోపం వచ్చినపుడు వారు ఆవేశంలో ఊగిపోకుండా, దాన్ని లోలోపలే అణచుకుంటారు. ఆగ్రహంలోనూ నిగ్రహాన్ని ప్రదర్శిస్తారు. కసి తీర్చుకోగల అవకాశం ఉండి కూడా తమను తాము కట్టిపడేసుకుంటారు. పైగా తమకు కోపం తెప్పించిన వారిని మన్నించి పొమ్మంటారు.

132. అంటే మానవ సహజమైన దౌర్బల్యం వల్ల వారి ద్వారా ఏదైనా నీతిమాలిన పని జరిగినా, అలసత్వం వల్ల ఏదైనా అన్యాయానికి ఒడిగట్టినా వెంటనే తేరుకుని అల్లాహ్‌ను స్మరిస్తారు. 'అల్లాహ్! క్షమించు' అని ప్రార్థిస్తారు. జరిగిన తప్పుకు సిగ్గుతో కుమిలిపోతారు.

قَدْ خَلَتْ مِنْ قَبْلِكُمْ سُنَنٌ فَسِيرُوا فِي الْأَرْضِ
فَانْظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُكَذِّبِينَ ﴿١٣٧﴾

**137** మీకు పూర్వం కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. కనుక (దివ్య సందేశాన్ని) ధిక్కరించిన వారికి పట్టిన గతేమిటో భూమిలో సంచరించి చూడండి.[133]

هٰذَا بَيَانٌ لِّلنَّاسِ وَهُدًى وَّمَوْعِظَةٌ
لِّلْمُتَّقِينَ ﴿١٣٨﴾

**138** సామాన్య ప్రజానీకం కోసం ఇది (ఈ ఖుర్ఆన్) ఒక బోధన. భయభక్తులు కలవారి కోసమైతే ఇది మార్గదర్శకం మరియు హితోపదేశం.

وَلَا تَهِنُوا وَلَا تَحْزَنُوا وَأَنْتُمُ الْأَعْلَوْنَ
إِنْ كُنْتُمْ مُّؤْمِنِينَ ﴿١٣٩﴾

**139** క్రుంగిపోకండి, దుఃఖించకండి.[134] విశ్వాసులుగా ఉంటే కడకు మీరే ఆధిక్యత పొందుతారు.

إِنْ يَّمْسَسْكُمْ قَرْحٌ فَقَدْ مَسَّ الْقَوْمَ قَرْحٌ
مِّثْلُهُ ۚ وَتِلْكَ الْأَيَّامُ نُدَاوِلُهَا بَيْنَ النَّاسِ ۚ
وَلِيَعْلَمَ اللّٰهُ الَّذِينَ اٰمَنُوا وَيَتَّخِذَ مِنْكُمْ
شُهَدَآءَ ۗ وَاللّٰهُ لَا يُحِبُّ الظّٰلِمِينَ ﴿١٤٠﴾

**140** మీరు దెబ్బతిన్నారనుకుంటే మీ ప్రత్యర్థులు కూడా అలాగే దెబ్బతిన్నారు. మేము ఈ కాలచక్రాన్ని జనుల మధ్య త్రిప్పుతూ ఉంటాము.[135] (ఉహుద్ యుద్ధంలో మీకు ఎదురైన అపజయానికి అసలు కారణం ఏమిటంటే) మీలో (నికార్సయిన) విశ్వాసులు ఎవరో అల్లాహ్ చూపించదలిచాడు. మీలో కొందరికి 'షహాదత్' (వీర మరణ) స్థాయిని కూడా ఆయన ప్రసాదించదలిచాడు. అల్లాహ్ దుర్మార్గులను సుతరామూ ఇష్టపడడు.

133. ఉహుద్ యుద్ధంలో ముస్లిం సైనికులు 700 మంది వరకూ ఉన్నారు. వారిలో విలువిద్యలో ప్రావీణ్యం గలవారు 50 మంది దాకా ఉన్నారు. మహాప్రవక్త (స) వారందరినీ ఒక దళంగా విడదీసి అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) నేతృత్వంలో ఒక పర్వత గుట్టపై మోహరించారు. విజయం లభించినా, అపజయం ఎదురైనా ఆ స్థలం నుంచి మాత్రం కదలవద్దని వారికి గట్టిగా తాకీదు కూడా చేశారు. ఆ వైపునుంచి ఏ అశ్వదళం వచ్చినా బాణాన్ని సంధించి, దాన్ని వెనక్కి నెట్టాలని కూడా సూచించారు. అయితే ముస్లింలు ఆరంభంలో విజయం సాధించి, విజయప్రాప్తిని పోగుచేసుకోవటం వారి కంటపడింది. దాంతో పర్వతగుట్టపై మోహరించి ఉన్న జట్టులో ఒకింత ఉత్సాహం ఉరకలు వేసింది. తామూ విజయప్రాప్తి కోసం ఎందుకు పోకూడదు?! అన్న ఆత్రం ఎక్కువయింది. ఈ విషయంపై వారిలో భేదాభిప్రాయం కూడా పొడసూపింది. వారు దైవప్రవక్త (స) గారి హితోపదేశానికి నానార్థాలు తీయసాగారు. యుద్ధం జరుగుతున్నంత సేపూ ఎక్కడికీ వెళ్ళకుండా యిక్కడే ఉండమని దైవప్రవక్త మనకు చెప్పారు. ఇప్పుడెలాగూ యుద్ధం ముగిసింది. శత్రుసేనలు పలాయనం చిత్తగిస్తున్నాయి. అటువంటప్పుడు మనం యిక్కడ దిక్కులు చూస్తూ ఎందుకు నిలబడాలి? అని కొందరు చెప్పారు. అంతే, పదిమంది సహాబీలు మినహా మిగిలిన వారంతా నిర్దేశిత స్థలాన్ని వదలివెళ్ళి, విజయప్రాప్తి కోసం ఎగబడ్డారు. ఈ అవకాశం దొరికిందే తడవుగా అవిశ్వాసులు ఆ పర్వత గుట్ట మీదుగానే వచ్చి మెరుపుదాడి చేసి ముస్లింలను నలువైపుల నుంచీ ముట్టడించారు. ముస్లింలలో తీవ్రమైన గందరగోళం నెలకొంది. అనూహ్యమైన ఈ పరిణామం నుంచి వారు తేరుకోలేకపోయారు. దీంతో సహజంగానే వారికి ఎంతో నష్టం వాటిల్లింది. ఈ ఆయతు ద్వారా అల్లాహ్ వారిని ఓదార్చదలిచాడు – ఇలాంటి ఘటన మీకే పరిమితం కాదు. గతకాలంలోనూ ఇలాంటి వైపరీత్యాలు జరిగాయి. ఎట్టకేలకు దైవాన్ని, దైవప్రవక్తను తిరస్కరించిన వారే నష్టపోతారు.

134. క్రితంసారి యుద్ధంలో మీకు నష్టం వాటిల్లిన సంగతి నిజమే. అంతమాత్రాన మీరు కృంగిపోవలసిన, దుఃఖించవలసిన పనిలేదు. మీలోనే గనక విశ్వాసశక్తి ఉన్నట్లయితే అంతిమ విజయం మీకే లభిస్తుంది. అంటే మీ విజయ రహస్యం

141 ఈ పరీక్ష ద్వారా అల్లాహ్ సిసలైన విశ్వాసులను వేరు చేసి అవిశ్వాసులను తుదముట్టించదలిచాడు.[136]

وَلِيُمَحِّصَ اللَّهُ الَّذِينَ آمَنُوا وَيَمْحَقَ الْكَافِرِينَ ﴿١٤١﴾

142 ఏమిటీ, మీరు స్వర్గంలో (ఇట్టే) ప్రవేశించగలమని అనుకుంటున్నారా?[137] వాస్తవానికి మీలో (తన మార్గంలో) పోరాడేవారెవరో, ఓర్పు వహించేవారెవరో[138] ఇప్పటివరకూ అల్లాహ్ పరీక్షించనే లేదు.

أَمْ حَسِبْتُمْ أَن تَدْخُلُوا الْجَنَّةَ وَلَمَّا يَعْلَمِ اللَّهُ الَّذِينَ جَاهَدُوا مِنكُمْ وَيَعْلَمَ الصَّابِرِينَ ﴿١٤٢﴾

విశ్వాసం (ఈమాన్) లోనే దాగి ఉందని అల్లాహ్ ఈ వాక్యంలో స్పష్టపరిచాడు. ఈ సంఘటన తరువాత జరిగిన యుద్ధాలన్నింటిలోనూ ముస్లింలు తమ ఆధిక్యతను నిరూపించుకోవటం గమనార్హం.

135. ఇవి మరో విధమైన సాంత్వన వచనాలు. ఉహుద్ యుద్ధంలో మీ పక్షంవారికి ఎక్కువ గాయాలైనాయని బాధపడకండి. మీ శత్రువర్గానికి కూడా బద్ర్ యుద్ధంలో, ఉహుద్ యుద్ధ ప్రారంభంలో ఇలాంటి గాయాలే తగిలాయి. జయాపజయాలు దైవాధీనం. ఈ కాలచక్రపు ఎగుళ్ళు దిగుళ్ళను దేవుడు మీ మధ్య తీసుకువస్తుంటాడు. కాబట్టి మీరు అవమాన భారంతో కృంగిపోకుండా విశ్వాసాన్ని, ధైర్యాన్ని కూడగట్టుకోండి అని దీనిభావం.

136. ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు తమ స్వయంకృతం మూలంగా తాత్కాలికంగా ఓటమి ఎదురైనప్పటికీ, భవిష్యత్తులో అది వారికొరకు ఎన్నో రకాలుగా ప్రయోజనకరం అయింది. వాటిని అల్లాహ్ ఈ వాక్యాల్లో వివరిస్తున్నాడు. ఒకటి : ఈ యుద్ధం ద్వారా అల్లాహ్ విశ్వాసులను బహిరంగపరచదలిచాడు. కష్టకాలంలో కదలని కొండలా స్థిరత్వాన్ని ప్రదర్శించేవారెవరో అల్లాహ్ చూడదలిచాడు. అలాంటి సహనమూర్తులంతా నికార్సయిన విశ్వాసులన్నమాట! రెండు: దేవుడు తన ప్రియదాసుల్లో కొందరిని అమరవీరు(షహీద్)ల శ్రేణిలో నిలబెట్టదలిచాడు. మూడు: విశ్వాసులను వారి తప్పుల నుంచి పరిశుద్ధుల్ని చేయదలిచాడు. అరబీలో **'యుమహ్హిసు'** (يُمَحِّصُ) అనే పదం వాడబడింది. దాని మూలపదం తమ్‌హీస్; ఈ పదానికి ఎన్నుకోవటం అని ఒక అర్థం ఉంది. దాంతోపాటే **'తత్‌హీర్', 'తఖ్‌లీస్'** అనే మరో రెండు అర్థాలు కూడా ఉన్నాయి. అయితే ఆ రెండింటి భావం దాదాపు ఒక్కటే – పరిశుద్ధపరచటమని (ఫత్‌హుల్ ఖదీర్); మన ఉర్దూ అనువాదకులైన ముహమ్మద్ జునాగఢీగారు – (అల్లాహ్ ఆయనపై శాంతి కురిపించుగాక!) ఇక్కడ 'తమ్‌హీస్' అన్న పదానికి మొదటి అర్థాన్ని, అనగా ఎన్నుకోవటం అనే అర్థాన్నే తీసుకున్నారు. ఈ వాక్యంలో దాగివున్న మరో పరమార్థం ఏమిటంటే అల్లాహ్ అవిశ్వాసులను అంతమొందించగోరాడు. తాత్కాలికంగా తమకు లభించిన విజయంతో వారు ఉబ్బిపోయి, తలబిరుసుతనం ప్రదర్శిస్తారు. ఆ తలబిరుసుతనమే వారి పతనానికి, వినాశానికి నాందీవాచకమవుతుంది.

137. అంటే దైవమార్గంలో పోరాడకుండానే, కఠిన పరీక్షలు ఎదుర్కోకుండానే స్వర్గ ప్రవేశం లభిస్తుందని భావిస్తున్నారా? ఎంతమాత్రం కాదు. కఠిన పరీక్షల్లో నెగ్గుకు వచ్చినవారికే స్వర్గం లభిస్తుంది. వేరొక చోట ఇలా సెలవీయబడింది : "ఏమిటీ, మీరు స్వర్గంలో ప్రవేశిస్తామని ఊహిస్తున్నారా? మీకు పూర్వం గతించిన వారికి ఎదురైన పరిస్థితులు మీకింకా ఎదురు కానేలేదు. వారిపై కష్టాలు, బాధలు విరుచుకుపడ్డాయి. తద్వారా వారు బాగా కుదిపివేయబడ్డారు" (అల్ బఖర:214). మరోచోట ఈ విధంగా అనబడింది: "మేము విశ్వసించాము అని అనగానే విడిచిపెట్టబడతామనీ, పరీక్షించబడమని ప్రజలు అనుకుంటున్నారా?" (అన్‌కబూత్-2).

138. ఈ విషయం ఇంతకుముందు బఖరా సూరాలో కూడా వచ్చింది. సందర్భోచితంగా యిక్కడ కూడా ప్రస్తావనకు వచ్చింది. స్వర్గప్రవేశం కోసం మీలోని మేలిమి బంగారాన్ని వేరుచేయాలి. దానికోసం మీరు పరీక్షించబడటం అవసరం. మీలో కల్తీ సరకు ఏదో, మేలిమి సరకు ఏదో కదనరంగంలో కష్టాలెదురైనప్పుడుగాని తెలిసిరాదు.

**143** యుద్ధానికి ముందైతే మీరు (వీర) మరణాన్ని ఎంతగానో కోరుకునేవారు.[139] ఇప్పుడు దాన్ని మీరు మీ కళ్లారా తిలకించారు.[140]

وَلَقَدْ كُنْتُمْ تَمَنَّوْنَ الْمَوْتَ مِنْ قَبْلِ أَنْ تَلْقَوْهُ فَقَدْ رَأَيْتُمُوهُ وَأَنْتُمْ تَنْظُرُونَ ﴿١٤٣﴾

**144** ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక ప్రవక్త మాత్రమే.[141] ఈయనకు పూర్వం కూడా (చాలామంది) ప్రవక్తలు గతించారు. ఒకవేళ ఈయన చనిపోతే లేక చంపబడితే మీరు– ఇస్లాం నుంచి – వెనుతిరిగిపోతారా? వెనుతిరిగిపోయేవాడు అల్లాహ్‌కు ఏ మాత్రం హాని కలిగించలేడు.[142] కృతజ్ఞతలు తెలిపే వారికి అల్లాహ్ త్వరలోనే మంచి ప్రతిఫలం వొసగుతాడు.[143]

وَمَا مُحَمَّدٌ إِلَّا رَسُولٌ قَدْ خَلَتْ مِنْ قَبْلِهِ الرُّسُلُ أَفَإِنْ مَاتَ أَوْ قُتِلَ انْقَلَبْتُمْ عَلَىٰ أَعْقَابِكُمْ وَمَنْ يَنْقَلِبْ عَلَىٰ عَقِبَيْهِ فَلَنْ يَضُرَّ اللَّهَ شَيْئًا وَسَيَجْزِي اللَّهُ الشَّاكِرِينَ ﴿١٤٤﴾

139. బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయిన సహాబీలు కనే కలలను ఈ వాక్యం సూచిస్తున్నది. తమకూ అవకాశం దొరికినట్లయితే తాము కూడా శత్రువుల పంక్తుల్లోకి చొచ్చుకుపోయి, దైవవిరోధులను అంతమొందించి తమ ప్రతాపాన్ని చాటి చెబుతామని వారు చెప్పేవారు. అటువంటి ఔత్సాహిక సహచరుల కోరికపైనే మదీనా నగరం దాటి – శత్రువును ప్రతిఘటించడానికి – బయటికి రావలసి వచ్చింది. కాని తీరా శత్రువులు చేసిన మెరుపుదాడితో ఓటమి పాలైనాక ఈ ఔత్సాహిక యోధుల్లోని ఆవేశం కాస్తా చల్లారిపోయింది. వారిలో కొందరైతే పలాయనం చిత్తగించారు. కొద్దిమంది మాత్రమే స్థిరంగా నిలబడ్డారు. వివరాలు ముస్ముందు రాబోతున్నాయి – (ఫత్‌హుల్ ఖదీర్). అందుకే హదీసులో సెలవీయబడింది : "మీరు శత్రువుతో ముఖాముఖీ అవ్వాలని కోరుకోకండి. సదా యోగక్షేమాల కోసమే దైవాన్ని ప్రార్థించండి. ఒకవేళ శత్రువును ప్రతిఘటించక తప్పని పరిస్థితే గనక ఏర్పడితే అప్పుడు మొక్కవోని సాహసాన్ని, స్థయిర్యాన్ని కనబరచండి. ఖడ్గాల నీడలోనే స్వర్గం ఉందన్న విషయాన్ని విస్మరించకండి" (సహీహైన్ – ఇబ్నె కసీర్ ఆధారంగా).

140. అంటే ఖడ్గాల ఝుళిపింపుల్లోని మెరుపును, ఈటెల్లోని వేడిని వాడినీ, బాణాలు సృష్టించిన హోరును, యుద్ధ కాముకుల పోరాట పటిమను – వీటన్నింటిలోనూ తొణికిసలాడే మృత్యువును– మీరు మీ చర్మచక్షువులతో తదేకంగా వీక్షించారుగా!; **'రఐతుమ్'** ( رَأَيْتُمْ ) మరియు **'తన్‌జురూన్'** (تَنْظُرُوْنَ) రెండూ ఒకే అర్థం కలిగిన పదాలు. చూడటం అని వాటికి అర్థం. మాటలో చేవ తీసుకురావటం కోసం ఈ పర్యాయపదాలను ఉపయోగించటం జరిగింది.

141. ముహమ్మద్ (స) ఒక దైవప్రవక్తయే. అంటే దైవదౌత్యం మూలంగా ఆయనకు ఈ లోకంలో విశిష్టత ప్రాప్తించింది. అంతమాత్రాన ఆయన మానవ సహజమైన విషయాలకు అతీతులు కారు. దైవిక గుణాలు కలిగివున్న వ్యక్తి కూడా కారు. కనుక ఆయన మరణం కూడా ఏనాటికైనా అసంభవమైన విషయమేమీ కాదు.

142. ఉహుద్ పోరాటంలో ముస్లింలకు ఎదురైన ఓటమికి మరో ముఖ్య కారణం; మహాప్రవక్త (స) అంతమొందించబడ్డారన్న వదంతిని అవిశ్వాసులు వ్యాపింపజేయటమే. ఈ వదంతి ముస్లింలలో వ్యాపించటంతో, వారి ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. తమ మధ్య దైవప్రవక్తే(స) లేనపుడు తాము యింకెవరి కోసం పోరాడాలి?! అన్న నిరాశతో వారు వెనుకంజ వేశారు. వారి ఈ ధోరణిని విమర్శిస్తూ ఈ ఆయతు అవతరించింది. అందులో ఏమనబడిందంటే; అవిశ్వాసుల చేతిలో ప్రవక్త హతమార్చబడటం లేదా ప్రవక్తకు మరణం సంభవించటం – ఇదేమీ కొత్త విషయం కాదు. వెనుకటి ప్రవక్తలు కూడా గతించారు. వారిలో కూడా కొందరు తమ జాతుల వారి చేత వధించబడ్డారు. ఒకవేళ మీ మధ్యన ఉన్న ప్రవక్తకు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురవుతే, మీరు ఇస్లాం ధర్మం నుంచి మరలిపోతారా? గుర్తుంచుకోండి, ఈ విధంగా వెన్ను చూపినవాడు అల్లాహ్‌కు ఎలాంటి నష్టమూ కలిగించలేడు. అతడు తన స్వయానికే నష్టం

وَمَا كَانَ لِنَفْسٍ اَنْ تَمُوْتَ اِلَّا بِاِذْنِ اللّٰهِ
كِتٰبًا مُّؤَجَّلًا ؕ وَمَنْ يُّرِدْ ثَوَابَ الدُّنْيَا نُؤْتِهٖ
مِنْهَا ۚ وَمَنْ يُّرِدْ ثَوَابَ الْاٰخِرَةِ نُؤْتِهٖ مِنْهَا ؕ
وَسَنَجْزِى الشّٰكِرِيْنَ ﴿145﴾

**145** దైవాజ్ఞ కానంతవరకూ ఏ ప్రాణీ చావదు. నిర్ధారిత సమయం రాయబడి ఉంది. ప్రాపంచిక ఫలితాన్ని కోరుకున్న వారికి మేము ఎంతో కొంత ఇచ్చేస్తాము. పరలోక ప్రతిఫలాన్ని కోరుకున్న వారికి మేము దాన్ని కూడా అనుగ్రహిస్తాము.[144] కృతజ్ఞులై ఉండేవారికి మేము త్వరలోనే మంచి ప్రతిఫలాన్ని వొసగుతాము.

وَكَاَيِّنْ مِّنْ نَّبِىٍّ قٰتَلَ ۙ مَعَهٗ رِبِّيُّوْنَ كَثِيْرٌ ۚ
فَمَا وَهَنُوْا لِمَاۤ اَصَابَهُمْ فِىْ سَبِيْلِ اللّٰهِ وَمَا
ضَعُفُوْا وَمَا اسْتَكَانُوْا ؕ وَاللّٰهُ يُحِبُّ الصّٰبِرِيْنَ ﴿146﴾

**146** ఎంతోమంది ప్రవక్తలకు ఆదరువుగా నిలిచి, ఎందరో అల్లాహ్ భక్తులు దైవమార్గంలో పోరాడారు. వారికి కూడా అల్లాహ్ మార్గంలో కష్టాలెదురయ్యాయి. కాని వారెన్నడూ ధైర్యం కోల్పో లేదు, అశక్తతకు లోనుకాలేదు, లొంగిపోనూ లేదు. అల్లాహ్ ఇష్టపడేది (ఇలాంటి) సహనమూర్తులనే.[145]

وَمَا كَانَ قَوْلَهُمْ اِلَّاۤ اَنْ قَالُوْا رَبَّنَا اغْفِرْ لَنَا
ذُنُوْبَنَا وَاِسْرَافَنَا فِىْۤ اَمْرِنَا وَثَبِّتْ اَقْدَامَنَا
وَانْصُرْنَا عَلَى الْقَوْمِ الْكٰفِرِيْنَ ﴿147﴾

**147** వారిది ఒక్కటే పలుకు : "మా ప్రభూ! మా పాపాలను క్షమించు. మా పనుల్లో మా వల్ల జరిగిన 'అతి'ని మన్నించు. మా పాదాలకు నిలకడను ప్రసాదించు. అవిశ్వాస జనులకు వ్యతిరేకంగా మాకు తోడ్పాటునందించు."

---

చేకూర్చుకుంటాడు. హి. శ. 11వ యేట దైవప్రవక్త (సఅసం) వాస్తవంగా మరణించినప్పుడు సర్వత్రా విషాదఛాయలు ఆవరించాయి. ఉమర్ (రజి) భావోద్రేకాలకు లోనయ్యారు. ఆవేశపూరితులై దైవప్రవక్త (సఅసం) వారి మరణవార్తను ఖండించసాగారు. ఆ సమయంలో అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఎంతో విజ్ఞతతో, సమయస్ఫూర్తితో దైవప్రవక్త (స) వారి వేదిక ప్రక్కన నిలబడి ఈ ఆయతును పారాయణం చేశారు. అంతే! ఉమర్ (రజి) గారి ఆవేశం ఒక్కసారిగా చల్లారి పోయింది. అబూబక్ర్ (రజి)గారు ఖుర్‌ఆన్ వాక్యం పఠిస్తుంటే అప్పుడప్పుడే అది అవతరిస్తోందా! అనిపించింది. అదీగాక, ఉమర్ (రజి) ఎంత ఉద్రేకులైనప్పటికీ, ఖుర్‌ఆన్ పఠించినప్పుడల్లా ఆయన దానికి 'చిత్తం' అనేవారు.

143. ఇక్కడ కృతజ్ఞతలు తెలపటం అంటే భావం దైవమార్గంలో నిలకడ చూపటం, దేవుడు చేసిన అపారమైన మేళ్లకు బదులుగా దైవాదేశాలను పాలించటం అన్నమాట! కృతజ్ఞతా పూర్వకంగా వ్యవహరించేవారిని అల్లాహ్ మరింతగా అనుగ్రహిస్తాడు.

144. ధైర్యం వీడి, పిరికితనం చూపినవారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఈ విధంగా ఉపదేశించటం జరిగింది. మరణ సమయం ముందుగానే నిర్ణయించబడి ఉండగా, పిరికిపందలై పారిపోవలసిన అవసరమేముంది? అలా పారిపోవటం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటీ? మీరిలా పలాయనం చిత్తగించి, కొద్దోగొప్పో ప్రాపంచిక లాభాలను జుర్రుకున్నప్పటికీ, శాశ్వితమైన పరలోకంలో మీకు లభించే పుణ్యఫలం ఏమీ ఉండదు. దీనికి భిన్నంగా పరలోక సాఫల్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని జీవించేవారికి పరలోకంలో పుణ్యఫలం ఎలాగూ లభిస్తుంది. అయితే అలాంటివారికి ప్రపంచంలో కూడా అల్లాహ్ – అడ్వాన్సుగా – అనుగ్రహిస్తాడు. వారిలో ఉత్తేజాన్ని, ధైర్యాన్ని నూరిపోయడానికి వెనుకటి ప్రవక్తల, వారి ప్రియసహచరుల అసాధారణ త్యాగాలను, సహన స్థయిర్యాలను కూడా ఉదాహరించటం జరిగింది.

145. అంటే యుద్ధ సందర్భాలలో ఎదురయ్యే కష్టాలకు వెరవకుండా, బాధపడకుండా, భయభ్రాంతులకు లోను కాకుండా, శత్రువుకు ఎదురొడ్డి నిలబడే వారిని యిక్కడ సహనశీలురు అని అనటం జరిగింది.

فَاٰتٰىهُمُ اللّٰهُ ثَوَابَ الدُّنْيَا وَحُسْنَ ثَوَابِ الْاٰخِرَةِ ۗ وَاللّٰهُ يُحِبُّ الْمُحْسِنِيْنَ ﴿148﴾

**148** అల్లాహ్ వారికి ప్రాపంచిక ఫలాన్నీ ఇచ్చాడు, పరలోకపు ఉత్తమ పుణ్య ఫలాన్ని కూడా ప్రసాదించాడు. సత్కార్యాలను ఉత్తమరీతిలో నిర్వర్తించేవారిని అల్లాహ్ ఎంతగానో ప్రేమిస్తాడు.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِنْ تُطِيْعُوا الَّذِيْنَ كَفَرُوْا يَرُدُّوْكُمْ عَلٰٓى اَعْقَابِكُمْ فَتَنْقَلِبُوْا خٰسِرِيْنَ ﴿149﴾

**149** ఓ విశ్వాసులారా! మీరు గనక అవిశ్వాసుల మాట విన్నారంటే, వారు మిమ్మల్ని మీ కాలి మడమలపైనే తిరోన్ముఖుల్ని చేస్తారు (ధర్మభ్రష్టుల్ని చేస్తారు). అప్పుడు నష్టపోయేది మీరే.

بَلِ اللّٰهُ مَوْلٰىكُمْ ۚ وَهُوَ خَيْرُ النّٰصِرِيْنَ ﴿150﴾

**150** వాస్తవానికి అల్లాహ్‌యే మీ రక్షకుడు, ఆయనే అత్యుత్తమ సహాయకుడూను.[146]

سَنُلْقِيْ فِيْ قُلُوْبِ الَّذِيْنَ كَفَرُوا الرُّعْبَ بِمَآ اَشْرَكُوْا بِاللّٰهِ مَا لَمْ يُنَزِّلْ بِهٖ سُلْطٰنًا ۚ وَمَاْوٰىهُمُ النَّارُ ۗ وَبِئْسَ مَثْوَى الظّٰلِمِيْنَ ﴿151﴾

**151** త్వరలోనే మేము అవిశ్వాసుల హృదయాలలో భయాన్ని కలిగిస్తాము. ఎందుకంటే అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయనప్పటికీ – నిరాధారంగా – వారు ఇతరత్రా వాటిని అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పిస్తున్నారు. కనుక నరకాగ్నియే వారి నివాస స్థలం.[147] అది దుర్మార్గుల చెడ్డ నివాసం.

وَلَقَدْ صَدَقَكُمُ اللّٰهُ وَعْدَهٗٓ اِذْ تَحُسُّوْنَهُمْ بِاِذْنِهٖ ۚ حَتّٰٓى اِذَا فَشِلْتُمْ وَتَنَازَعْتُمْ فِى الْاَمْرِ وَعَصَيْتُمْ

**152** అల్లాహ్ మీకు చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపాడు. అప్పుడు మీరు ఆయన అనుజ్ఞతో వారిని వధించసాగారు.[148] అయితే ఆఖరికి మీరు పిరికితనం చూపారు. కార్యనిర్వహణలో

146. ఈ విషయం ఇంతకు ముందు కూడా వచ్చింది. అయినా మళ్లీ పునరావృతమయింది. ఎందుకంటే ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు కలిగిన స్వల్ప పరాజయాన్ని అదనుగా తీసుకొని అవిశ్వాసులు, కపటులు ముస్లింలకు ఉచిత సలహాలు ఉదారంగా యివ్వసాగారు. "ఎందుకొచ్చిన తంటాగానీ, మీరు మీ తాతముత్తాతల ధర్మం వైపుకు మరలిపొండి" అని పురికొల్పసాగారు. ఇలాంటి పరిస్థితిలో ముస్లింలు గనక వారి తప్పుడు సలహాలపై అమలుచేస్తూ, నిజంగానే మరలిపోతే జీవితాలు దుర్భరమైపోతాయని, ఇహపరాలలో వినాశాన్ని చవిచూడవలసి వస్తుందని హెచ్చరించటం జరిగింది. యదార్థానికి సాఫల్యం సిద్ధించేది దైవమార్గంలోనేనని, దైవం మాత్రమే అత్యుత్తమ సహాయకుడనీ ముసల్మానులకు బోధపరచటం జరిగింది.

147. ముస్లింల పరాజయాన్ని చూసిన అవిశ్వాసులు కొందరు, ముస్లింలను నామరూపాల్లేకుండా చేయటానికి ఇంతకన్నా మంచి అవకాశం దొరకదని భావించారు. అయితే అల్లాహ్ ఈ కీలక సమయంలో ముస్లింలంటే సత్య తిరస్కారుల గుండెల్లో దడ పుట్టించాడు. అందుచేత వారు తమ ఆంతర్యాల్లో జనించిన దుష్ట ఆలోచనకు కార్యరూపం యివ్వలేక పోయారు (ఫత్‌హుల్ ఖదీర్). 'సహీహైన్'లోని హదీసు ప్రకారం మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు : "నాకు పూర్వం ఏ ప్రవక్తకూ యివ్వబడని అయిదు వస్తువులు నాకు యివ్వబడ్డాయి. వాటిలో ఒకటేమంటే, శత్రువు ఒక నెలకాలం ప్రయాణించినంత దూరంలో ఉండగానే అతనిలో నా తాలూకు భయాన్ని కలుగజేసి నాకు సహాయం చేయటం జరిగింది."

ఈ హదీసు ద్వారా బోధపడేదేమంటే శత్రువులకు ఎల్లప్పుడూ ఆయన (స) అంటే ఒకలాంటి భయము, భీతి ఉండేవి. ఆయనతో పాటు ఆయన అనుచరులంటే కూడా శత్రువులు జడుసుకునేవారు. దానికి కారణం వారి షిర్కే. షిర్కుకు ఒడిగట్టేవారు ఎల్లప్పుడూ భయకంపితులై ఉంటారు. మీరు గమనించారో, లేదో! ముస్లింలలోని ఒక పెద్ద

مِنْۢ بَعْدِ مَآ اَرٰىكُمْ مَّا تُحِبُّوْنَ ؕ مِنْكُمْ مَّنْ
يُّرِيْدُ الدُّنْيَا وَمِنْكُمْ مَّنْ يُّرِيْدُ الْاٰخِرَةَ ۚ ثُمَّ
صَرَفَكُمْ عَنْهُمْ لِيَبْتَلِيَكُمْ ۚ وَلَقَدْ عَفَا عَنْكُمْ ؕ
وَاللّٰهُ ذُوْ فَضْلٍ عَلَى الْمُؤْمِنِيْنَ ﴿١٥٢﴾

విభేదించుకున్నారు.[149] మీరు ఇష్టపడే వస్తువును ఆయన మీకు చూపేసరికి, మీరు అవిధేయతకు[150] ఒడిగట్టారు. మీలో కొందరు ప్రపంచం కోసం ప్రాకులాడగా,[151] మరికొందరు పరలోకాన్ని కోరుకున్నారు.[152] అందువల్ల అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించే నిమిత్తం, మిమ్మల్ని వారి నుంచి వెనక్కి మళ్లించాడు.[153] అయినా ఆయన మిమ్మల్ని క్షమించాడు. యదార్థానికి అల్లాహ్ విశ్వాసుల పట్ల గొప్ప అనుగ్రహం గలవాడు..[154]

వర్గంవారి విశ్వాసాలు బలహీనమై, వారిలో షిర్క్ భావాలు పొడసూపినప్పటి నుంచి వారు సయితం పిరికివారుగా తయారయ్యారు. శత్రువులు వారికి భయపడాల్సింది పోయి, వారే శత్రువులకు భయపడుతున్నారు.

148. ఇంతకీ అల్లాహ్ నిజం చేసి చూపిన ఆ వాగ్దానం ఏది? అన్న ప్రశ్న ఈ సందర్భంగా జనించవచ్చు. ఇది, అల్లాహ్ తాను మూడువేల లేక ఐదువేల దూతల్ని దింపుతానని చేసిన వాగ్దానమేనని కొంతమంది వ్యాఖ్యాతలు తలపోశారు. కాని ఇలా తలపోయటానికి వీలులేదు. ఎందుకంటే దూతలను దింపుతానన్న అల్లాహ్ వాగ్దానం బద్ర్ యుద్ధానికి మాత్రమే పరిమితం. కాగా; ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన వాగ్దానం ముస్లింల విజయానికి, దైవ సహాయానికి సంబంధించిన సర్వసామాన్యమైన వాగ్దానం. ఈ వాగ్దానాన్ని అల్లాహ్ తరఫున అంతిమ దైవప్రవక్త (స), ముస్లిములకు వినిపించి ఉన్నారు. మక్కాలో ఉండగానే ఈ మేరకు కొన్ని ఆయతులు అవతరించాయి. దీని ప్రకారం యుద్ధారంభంలో ముస్లిములు ఆధిక్యతను ప్రదర్శించారు కూడా. 'అప్పుడు మీరు అల్లాహ్ అనుజ్ఞతో వారిని వధించసాగారు' అన్న వాక్యం ఈ విషయాన్నే సూచిస్తోంది.

149. ఇక్కడ **'విభేదించుకోవటం'** అంటే అర్థం, ఉహుద్ యుద్ధ సందర్భంగా పర్వతంపై నియమించబడిన 50 మంది విలుకాండ్ర మధ్య ఏర్పడిన భేదాభిప్రాయం. తొలుత ముస్లిములకు లభించిన విజయాన్ని చూసి, విజయధనాన్ని ప్రోగుచేసుకోవాలన్న ఆరాటంతో వారు అక్కడి నుంచి తరలివెళ్ళిన సందర్భం ఇది. దీన్ని అదనుగా తీసుకొని అవిశ్వాసులు ఆ పర్వత మార్గం ద్వారానే వచ్చి ముస్లింలపై విరుచుకుపడ్డారు.

150. అంటే ఈ స్థలం నుంచి ఎట్టి పరిస్థితిలోనూ కదలవద్దన్న దైవప్రవక్త (స) సూచనను ఖాతరు చెయ్యకుండా యుద్ధప్రాప్తి కోసం ఎగబడ్డారు.

151. అంటే తమ కర్తవ్య పాలనను విస్మరించి ప్రాపంచిక ప్రయోజనాలపై దృష్టిని నిలిపారు. నిజానికి వారు ఆ స్థలంలో స్థిరంగా నిలబడి ఉంటే సంపూర్ణ విజయం లభించేది. కాని 'మాలె గనీమత్' (విజయధనం)పై వారికి కలిగిన మక్కువ మూలంగా ఎదురుదెబ్బ తగిలింది.

152. పరలోకాన్ని కోరుకున్నవారంటే, తాము మోహరించబడివున్న స్థలాన్ని వదలి ముందుకు పోవటానికి సుతరామూ ఒప్పుకోనివారు అని భావం. దైవప్రవక్త (స) చేసిన సూచనను ఖచ్చితంగా పాటిస్తూ, తదుపరి ఆజ్ఞ అయ్యేవరకూ అక్కడే నిఘావేసి ఉంచాలని వారు పట్టుబట్టారు.

153. అంటే మొదట్లో మీకు లభించిన విజయాన్ని తరువాత అపజయంగా మార్చి అవిశ్వాసుల ముందు మీరు నిలదొక్కుకోకుండా చేశాడు. ఆ విధంగా మిమ్మల్ని పరీక్షించాడు.

154. మహాప్రవక్త ప్రియసహచరుల (రజి) ఔన్నత్యాన్ని, విశిష్టతను ఇది సూచిస్తోంది. మానవ సహజమైన దౌర్బల్యాల వల్ల కొన్ని సందర్భాలలో వారి అడుగులు తడబడినప్పటికీ అల్లాహ్ వారికి ఈ విశిష్టతను అనుగ్రహించాడు. వారిని కటాక్షించాడు. ఎందుకంటే వారు అంతిమ దైవప్రవక్త (స)కు చేదోడు వాదోడుగా నిలిచిన మానవ నవనీతం! సత్యబలమున్న వర్గం!! శ్రేష్ఠసమాజం (ఖైరె ఉమ్మత్)లో ప్రథమశ్రేణికి చెందిన సద్వర్తనుల వర్గం!!! అటువంటి మహనీయులపై భవిష్యత్తులో ఎవరూ వేలెత్తకుండా ఉండటానికి అల్లాహ్ అప్పటికప్పుడే వారి పొరబాటును ఎత్తిచూపి,

إِذْ تُصْعِدُونَ وَلَا تَلْوُونَ عَلَىٰٓ أَحَدٍ وَٱلرَّسُولُ
يَدْعُوكُمْ فِىٓ أُخْرَىٰكُمْ فَأَثَٰبَكُمْ غَمًّۢا بِغَمٍّ
لِّكَيْلَا تَحْزَنُوا۟ عَلَىٰ مَا فَاتَكُمْ وَلَا مَآ أَصَٰبَكُمْ ۗ
وَٱللَّهُ خَبِيرٌۢ بِمَا تَعْمَلُونَ ﴿١٥٣﴾

**153** ఆ సమయంలో మీరు పరారవసాగారు.[155] ఇంకొకరిని పట్టించుకునే ధ్యాసే మీకు లేకపోయింది. ఆ క్షణంలో వెనుక నుంచి ప్రవక్త మిమ్మల్ని కేక వేస్తూనే వున్నాడు.[156] కనుక మీకు దక్కకుండా పోయిన దాని గురించి, వాటిల్లిన నష్టాన్ని గురించి మీరు బాధపడకుండా ఉండటానికి అల్లాహ్ మీకు దుఃఖం వెంబడి దుఃఖం[157] కలుగజేశాడు.[158] మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుసు.

ثُمَّ أَنزَلَ عَلَيْكُم مِّنۢ بَعْدِ ٱلْغَمِّ أَمَنَةً نُّعَاسًا
يَغْشَىٰ طَآئِفَةً مِّنكُمْ ۖ وَطَآئِفَةٌ قَدْ أَهَمَّتْهُمْ

**154** మరి ఈ దుఃఖం తరువాత ఆయన శాంతియుత స్థితిని మీపై అవతరింపజేశాడు. దాంతో మీలోని ఒక వర్గం వారిపై కునుకు ఆవహించసాగింది.[159] అయితే మరోవర్గం వారు తమ

మన్నించి, ఇకమీదట ఇలాంటి పొరబాట్లు చెయ్యరాదని ఉపదేశించాడు. అల్లాహ్ స్వయంగా ఖుర్ఆన్‌లో వారిపట్ల సర్వసాధారణమైన మన్నింపుల ప్రకటన చేయగా, ఇకవారి చర్యను తూలనాడే అవకాశం ఇతరులకు ఎక్కడ ఉంది? సహీహ్ బుఖారీలో పొందుపరచబడిన ఒక సంఘటన ప్రకారం, ఒకసారి హజ్ యాత్ర సందర్భంగా ఒకానొక వ్యక్తి ఉస్మాన్ (రజి)పై కొన్ని అభ్యంతరాలు లేవనెత్తాడు. బద్ర్ యుద్ధంలోనూ, బైతె రిజ్వాన్ (రిజ్వాన్ ప్రతిజ్ఞ) సందర్భంగానూ ఆయన ఎందుకు హాజరు కాలేదు? అన్నది వాటిలో ఒకటి. ఉహుద్ యుద్ధంలో ఆయన వెన్నుచూపి పారిపోయారని కూడా అతడు ఆక్షేపించాడు. దానికి ఇబ్నె ఉమర్ (రజి) ఎంతో సముచితమైన రీతిలో సమాధానమిచ్చారు. ఆ సమాధానం ఇది: "బద్ర్ యుద్ధ సందర్భంగా ఆయన సతీమణి (అంటే దైవప్రవక్త కుమార్తె) వ్యాధిగ్రస్తులై ఉన్నారు. బైతె రిజ్వాన్ సందర్భంగా ఆయన దైవప్రవక్త (స) తరపున ప్రత్యేక దూతగా మక్కా వెళ్ళి ఉన్నారు. ఇక ఉహుద్ యుద్ధంలో పలాయనమంటారా! దాన్ని అల్లాహ్ మన్నించాడు" (సహీహ్ బుఖారీ : ఉహుద్ యుద్ధ ప్రస్తావన).

155. అవిశ్వాసులు చేసిన మెరుపుదాడి ధాటికి ముస్లింలు తట్టుకోలేకపోయారు. ఒక్కసారిగా గంద్రగోళం ఏర్పడింది. కలకలం రేగింది. ముస్లింలలో చాలామంది కదనరంగం నుండి పరుగెత్తసాగారు. **'తుస్‌యిదూన'** (تُصْعِدُونَ) – ఇది 'ఇస్‌ఆద్' నుంచి ఏర్పడిన పదం. వెనక్కి చూడకుండా పరుగెత్తటం, గుట్టపైకి పరుగెత్తటమని దాని అర్థం (తబ్రీ).

156. దైవప్రవక్త (సఅసం) కొద్దిమంది సహచరులతో యుద్ధ మైదానంలోనే ఉండిపోయారు. పారిపోతున్న వారినుద్దేశ్యించి "దైవదాసులారా! నా వైపుకు తిరిగి రండి. దైవదాసులారా! నా వైపుకు తిరిగి రండి" అని కేకలేశారు. కాని ఆ గంద్రగోళంలో ఆయన (స) మాటను ఎవరూ వినిపించుకోలేదు.

157. **'ఫఅసాబకుమ్'** (فَأَثَٰبَكُمْ) అంటే మీ బాధ్యతా నిర్లక్ష్యం మూలంగా దేవుడు మీకు దుఃఖం తరువాత దుఃఖం కలుగజేశాడు. ఇబ్నె జరీర్, ఇబ్నె కసీర్ తదితర వ్యాఖ్యాతలు తీసుకున్న అర్థం ప్రకారం యిక్కడ మొదటి దుఃఖానికి భావం విజయం మరియు విజయప్రాప్తి దక్కకుండా పోవటం. రెండవ దుఃఖానికి భావం ముస్లింలకు అపారమైన ప్రాణనష్టం జరగటం. దైవప్రవక్త (సఅసం) వారి ఆదేశాన్ని పాటించకపోవటం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. అదీగాక, దైవప్రవక్త(స) యుద్ధంలో అమరగతి నొందారన్న వదంతి కూడా వారి దుఃఖాన్ని మరింతగా పెంచింది.

158. ఈ విధంగా అల్లాహ్ వారికి దుఃఖం వెంబడి దుఃఖం కలుగజేయటంలో ఒక పరమార్థం కూడా దాగి ఉంది. అదేమంటే కష్టాలకు ఓర్చుకునే, ప్రతికూల పవనాలకు ఎదురీదే సామర్థ్యం, స్థయిర్యం వారిలో పెరగాలి. ఈ గుణం వారిలో పెంపొందిననాడు జరిగిన నష్టంపై కృంగిపోయి, చేతులెత్తేసే దయనీయ స్థితి రాకుండా ఉంటుంది.

159. ఇంతకు ముందు ప్రస్తావించబడిన దీనావస్థ తరువాత అల్లాహ్ ముస్లింలపై దయ చూపాడు. యుద్ధరంగంలో మిగిలి

أَنفُسُهُمْ يَظُنُّونَ بِاللَّهِ غَيْرَ الْحَقِّ ظَنَّ الْجَاهِلِيَّةِ ۖ
يَقُولُونَ هَل لَّنَا مِنَ الْأَمْرِ مِن شَيْءٍ ۗ قُلْ
إِنَّ الْأَمْرَ كُلَّهُ لِلَّهِ ۗ يُخْفُونَ فِي أَنفُسِهِم
مَّا لَا يُبْدُونَ لَكَ ۖ يَقُولُونَ لَوْ كَانَ لَنَا مِنَ
الْأَمْرِ شَيْءٌ مَّا قُتِلْنَا هَاهُنَا ۗ قُل لَّوْ كُنتُمْ
فِي بُيُوتِكُمْ لَبَرَزَ الَّذِينَ كُتِبَ عَلَيْهِمُ الْقَتْلُ
إِلَىٰ مَضَاجِعِهِمْ ۖ وَلِيَبْتَلِيَ اللَّهُ مَا فِي صُدُورِكُمْ

ప్రాణరక్షణ[160] గురించి తీవ్ర విచారంలో పడిపోయారు. వారు అల్లాహ్ యెడల మరీ అజ్ఞానంతో కూడిన, సత్యదూరమైన సందేహాలను, అనుమానాలను వ్యక్తపరచసాగారు.[161] "ఇంతకీ మాకంటూ ఏదన్నా అధికారం ఉందా?"[162] అని వారనేవారు. "దీనికి సంబంధించిన నిర్ణయాధికారం అంతా అల్లాహ్‌దే"[163] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. వారు తమ ఆంతర్యాల్లో అణచి పెట్టుకున్న విషయాలను నీ ముందు వెలిబుచ్చటం లేదు.[164] "మాకంటూ అధికారమేదైనా ఉండి ఉంటే మేమిలా హత మార్చబడి ఉండేవాళ్ళం కాము"[165] అని వారంటున్నారు. (అంటే తమ మనుషులు చంపబడేవారు కాదు అని వారి అభిప్రాయం). "ఒకవేళ మీరు మీ ఇండ్లల్లోనే ఉన్నప్పటికీ, వధించబడటం అన్నది మీకు రాసిపెట్టి ఉంటే మీ అంతట మీరే వధ్యస్థలాలకు వచ్చి తీర్తారు"[166] అని వారికి చెప్పు. మీ మనసుల్లో దాగి ఉన్న

---

పోయిన ముస్లింలపై ఆయన ఒక రకమయిన ప్రశాంత స్థితిని కల్పించాడు. దాంతో వారు కునుకు తీశారు. ఈ కునుకు అల్లాహ్ తరఫు నుంచి అవతరించిన సహాయానికి, ప్రశాంతతకు నిదర్శనం. దాని గురించి అబూ తల్హా (రజి) ఇలా అంటున్నారు: "ఉహుద్ మైదానంలో కునుకు పట్టిన వారిలో నేనూ ఉన్నాను. నా చేతిలో వున్న ఖడ్గం ఎన్నోసార్లు చేజారి కిందపడింది. నేను దాన్ని పట్టుకునేవాణ్ణి. అది మళ్లీ పడిపోయేది. మళ్లీ పట్టుకుంటే మళ్లీ జారిపడేది" (సహీహ్ బుఖారీ); **'తాయిఫతున్'** అనే పదం – ఏకవచనం, బహువచనం – రెండింటి కోసం ఉపయోగించబడుతుంది (ఫత్‌హుల్ ఖదీర్).

160. వీరు ఎవరో కాదు, మదీనాలోని కపటులు (మునాఫిక్‌లు). వారికెంతసేపటికీ తమ ప్రాణాల గురించిన దిగులు తప్ప మరో ఆలోచన ఉండేది కాదు.

161. అంటే దైవప్రవక్త (సఅసం) వారి సందేశంలో ఏదో లోపం ఉందనీ, ఆయన (స) అందజేసే జీవన విధానం (దీన్) భవిష్యత్తు ప్రమాదంలో పడిందనీ, ఆయన (స)కు దైవసహాయం అందటం లేదనీ – ఇలా రకరకాలుగా అనుమానించ సాగారు.

162. ఇప్పుడింతకీ అల్లాహ్ తరఫున మాకేదన్నా సహాయం అందుతుందా? లేదా? పోనీ అదీ కాదంటే కనీసం మా మాట అయినా చెల్లుతుందా? లేదా? అన్నది వారి ఉద్దేశం.

163. అంటే, ఈ వ్యవహారం మీ అధీనంలో లేదు. సహాయమైనా, విజయమైనా దైవాజ్ఞతోనే లభిస్తుంది. ఏది చేయాలి? ఏది చేయకూడదనే దాన్ని ఆయనే నిర్ణయిస్తాడు, మీరు కాదు అని భావం.

164. అంటే, వారు తమ మనసుల్లో 'కాపట్యం' (నిఫాఖ్) అనే కుల్లును దాచిపెట్టుకున్నారు. పైకి మాత్రం 'మార్గదర్శకత్వం' కోసం ఎదురుచూస్తున్నామని అంటారు. కాని అంతరంగంలోని ఉద్దేశం వేరే ఉంది.

165. ఈ మాటలు వారు పరస్పరం చెప్పుకుంటారు లేదా లోలోపలే చెప్పుకుంటారు.

166. ఇలాంటి కాకిలెక్కల వల్ల ప్రయోజనం ఏమిటీ? మరణం ఏదో ఒకరోజు రావటం తథ్యం. దాన్నుంచి ఎవరూ తప్పించుకోలేరు. దాన్ని వాయిదా వెయ్యనూ లేరు. అది కూడా దేవుడు రాసిపెట్టినచోటే ఆ మృత్యువు మిమ్మల్ని కబళిస్తుంది. ఒకవేళ ఏదో ఒకచోట మీ మరణం లిఖించబడి ఉండి, మీరు మీ ఇండ్లల్లో కూర్చుని ఉన్నా – అది మిమ్మల్ని ఏదో ఒక వంకతో అక్కడికి లాక్కుపోతుంది.

వాటిని పరికించేందుకు, మీ హృదయాలలో వున్న దానిని శుద్ధి చేసేందుకు[167] (అల్లాహ్ ఈ పరిస్థితులను ఉత్పన్నం చేశాడు). అల్లాహ్ గుండెల్లోని గుట్టును బాగా ఎరిగినవాడు.[168]

وَلِيُمَحِّصَ مَا فِي قُلُوبِكُمْ ۗ وَاللَّهُ عَلِيمٌ
بِذَاتِ الصُّدُورِ ﴿١٥٤﴾

**155** ఇరు సమూహాలు ముఖాముఖీ అయిన రోజున మీలో కొందరు వెన్నుచూపారు. వారు చేసిన కొన్ని తప్పుల వల్ల షైతాన్ వారిని తడబాటుకు లోనుచేశాడు.[169] అయినా అల్లాహ్ వారిని మన్నించాడు.[170] అల్లాహ్ క్షమించేవాడు, సహనశీలుడూను.

إِنَّ الَّذِينَ تَوَلَّوْا مِنكُمْ يَوْمَ الْتَقَى الْجَمْعَانِ
إِنَّمَا اسْتَزَلَّهُمُ الشَّيْطَانُ بِبَعْضِ مَا كَسَبُوا ۖ
وَلَقَدْ عَفَا اللَّهُ عَنْهُمْ ۗ إِنَّ اللَّهَ غَفُورٌ حَلِيمٌ ﴿١٥٥﴾

**156** ఓ విశ్వసించిన వారలారా! మీరు ఆ అవిశ్వాసుల్లాగా ప్రవర్తించకండి. వారు, తమ సోదరులు ప్రయాణంలోనో, యుద్ధంలోనో ఉన్నప్పుడు, "ఒకవేళ వారు మా వద్దనే ఉండిఉంటే చనిపోయేవారూ కాదు, చంపబడేవారూ కాదు"[171] అని అంటారు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَكُونُوا كَالَّذِينَ كَفَرُوا
وَقَالُوا لِإِخْوَانِهِمْ إِذَا ضَرَبُوا فِي الْأَرْضِ أَوْ كَانُوا

167. సంభవించిన పరిణామాలను తలచుకుని మీరు ఆందోళన చెందకండి. ఈ పరిణామాల ద్వారా కాపట్యరోగం ఉన్నవారెవరో మీనుండి ఏరిపారవేసే అవకాశం కలిగింది. ఈ పరీక్షలో మీరు పోతపోయబడ్డారు. తప్పాతాలు అంతా ఎగిరిపోగా దైవానికి కావలసిన మేలైన సరకు – అంటే సత్యబలం ఉన్న వర్గం – నిలబడింది. ఆ తరువాత ఆయన పైశాచిక ప్రేరణల నుంచి మీ హృదయాలను పరిశుద్ధం చేశాడు.

168. మీలో నికార్సయిన ముస్లింలు ఎవరో, కాపట్య ముసుగును వేసుకున్న వారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు. ధర్మయుద్ధంలో దాగివున్న అసంఖ్యాక పరమార్థాలలో ఒకటేమంటే దాని ద్వారా చిత్తశుద్ధిగల విశ్వాసులెవరో – వంచనాశిల్ప నిష్ణాతులెవరో స్పష్టంగా తేలిపోతుంది. ఆ తరువాత సభ్యసమాజ సభ్యులు వారిని గుర్తెరిగి వారి యెడల అప్రమత్తంగా ఉండగలుగుతారు.

169. అంటే ఉహుద్ యుద్ధ సందర్భంగా ముస్లింల వల్ల జరిగిన పొరబాట్లకు కారణం వారిలోని కొన్ని బలహీనతలే. అందువల్ల షైతాన్ వారిని బోల్తా కొట్టించటంలో ఆ రోజు కూడా సఫలీకృతుడయ్యాడు. తొలికాలపు సజ్జనులు (సలఫ్‌లు) కొంతమంది వక్కాణించినట్లు, "సత్కార్యానికి బదులుగా మరిన్ని సత్కార్యాలు చేసే సద్బుద్ధి మనిషికి ప్రసాదించబడుతుంది. చెడుకు ప్రతిఫలంగా మరిన్ని చెడులకు ద్వారం తెరచుకుంటుంది."

170. అల్లాహ్ ప్రవక్త (స) గారి ప్రియసహచరుల పొరబాట్లను ఎత్తిచూపి, వాటి పరిణామాలను, అందలి పరమార్థాలను వివరిస్తూనే తన మన్నింపుల ప్రకటన కూడా చేయటం విశేషం! దీనిద్వారా మనకు బోధపడే ముఖ్య విషయం ఏమిటంటే ప్రవక్త (స) గారి ప్రియసహచరులు అల్లాహ్‌కు కూడా ప్రీతిపాత్రులు. ఆ సత్య విశ్వాసులను స్వయంగా అల్లాహ్ మన్నించి, వారిపట్ల ప్రసన్నుడవగా, ఇక ఆ మహనీయులను విమర్శించే, వారి చర్యలను గర్హించే హక్కు మనబోటి సామాన్య ముస్లింలకు ఏమాత్రం లేదు. ఇది ముస్లిములందరికీ ఒక హెచ్చరిక లాంటిది.

171. ఇలాంటి మిథ్యా విశ్వాసాల నుండి ముస్లిములను జాగరూకపరచటం దీని అసలు ఉద్దేశం. 'అయితే గీతే' లాంటి ఊహాగానాలు మనిషి విశ్వాసాన్ని (ఈమాన్‌ను) బలహీన పరుస్తాయి. వాస్తవానికి ఆనాటి అవిశ్వాసులలో, కపటులలో ఇలాంటి భావాలు తిష్ఠవేసి ఉండేవి. ఇవి పిరికితనానికి ప్రతీకలు. జీవన్మరణాలు దైవాధీనమై ఉన్నాయనీ, మరణానికి ఒక సమయం నిర్ధారించబడి ఉందని మనిషి తలపోసినపుడు అతనికి సంకల్పబలం సిద్ధిస్తుంది. అతనిలో ఆత్మ విశ్వాసం పెంపొందుతుంది. దైవమార్గంలో పోరాట పటిమను ప్రదర్శించే స్ఫూర్తి లభిస్తుంది.

غُزًّى لَّوْ كَانُوا عِنْدَنَا مَا مَاتُوا وَمَا قُتِلُوا ۚ لِيَجْعَلَ اللَّهُ ذَٰلِكَ حَسْرَةً فِي قُلُوبِهِمْ ۗ وَاللَّهُ يُحْيِي وَيُمِيتُ ۗ وَاللَّهُ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ﴿١٥٦﴾

ఈ విధమైన తమ ఆలోచనలను అల్లాహ్ తమ హృదయశోకానికి కారణాలుగా చేయాలనే[172] వారిలాంటి మాటలు మాట్లాడు తుంటారు. వాస్తవానికి ప్రాణభిక్ష పెట్టేవాడు, ప్రాణం తీసేవాడు అల్లాహ్ మాత్రమే. మీరు చేసే పనులన్నిటినీ అల్లాహ్ కనిపెడు తూనే ఉన్నాడు.

وَلَئِنْ قُتِلْتُمْ فِي سَبِيلِ اللَّهِ أَوْ مُتُّمْ لَمَغْفِرَةٌ مِّنَ اللَّهِ وَرَحْمَةٌ خَيْرٌ مِّمَّا يَجْمَعُونَ ﴿١٥٧﴾

**157** మీరు దైవమార్గంలో చంపబడినా లేక చనిపోయినా, (మీకు లభించే) దేవుని క్షమాభిక్ష మరియు కారుణ్యం వారు కూడబెడు తున్న దానికన్నా ఎంతో మేలైనవి.[173]

وَلَئِنْ مُّتُّمْ أَوْ قُتِلْتُمْ لَإِلَى اللَّهِ تُحْشَرُونَ ﴿١٥٨﴾

**158** మీరు చనిపోయినా లేక చంపబడినా (చివరకు) మీరు సమీకరించబడేది అల్లాహ్ వద్దకే (అని మరువకండి).

فَبِمَا رَحْمَةٍ مِّنَ اللَّهِ لِنتَ لَهُمْ ۖ وَلَوْ كُنتَ فَظًّا غَلِيظَ الْقَلْبِ لَانفَضُّوا مِنْ حَوْلِكَ ۖ فَاعْفُ عَنْهُمْ وَاسْتَغْفِرْ لَهُمْ وَشَاوِرْهُمْ فِي الْأَمْرِ ۖ فَإِذَا عَزَمْتَ فَتَوَكَّلْ عَلَى اللَّهِ ۚ إِنَّ

**159** (ఓ ప్రవక్తా!) అల్లాహ్ దయవల్లనే నీవు వారి యెడల మృదు మనస్కుడవయ్యావు. ఒకవేళ నువ్వే గనక కర్కశుడవు, కఠిన మనస్కుడవు అయివుంటే వారంతా నీ దగ్గరి నుంచి వెళ్ళిపోయేవారు.[174] కనుక నువ్వు వారిపట్ల మన్నింపుల వైఖరిని అవలంబించు, వారి క్షమాపణ కోసం (దైవాన్ని) వేడుకో. కార్య నిర్వహణలో వారిని సంప్రదిస్తూ ఉండు.[175] ఏదైనా పని

172. విశ్వాసంలోని ఈ చెడుగు హృదయావేదనకే కారణభూతం అవుతుంది. "ఒకవేళ వారు ఇల్లు విడిచిపోకుండా ఉంటే లేక కదన రంగానికి కదం తొక్కకుండా – ఇంట్లోనే ఉండిపోతే – ఈ దుర్గతి పట్టేది కాదు" లాంటి మాటలు అర్థం పర్థం లేనివి. పటిష్టమైన కంచుకోటలలో కూర్చుని ఉన్నా, కాంక్రీటు బంకర్లలో తలదాచుకున్నా మృత్యువు వదలిపెట్టదు. రావలసిన సమయానికి అది వచ్చితీరుతుంది. "మీరెక్కడున్నా, పటిష్టమయిన కోటలలో ఉన్నాసరే మృత్యువు మిమ్మల్ని పట్టుకొని తీరుతుంది" (అన్ నిసా–78). కాబట్టి దృఢ విశ్వాసంగల ముస్లిములు మాత్రమే ఇలాంటి హృదయావేదన నుంచి బయటపడగలుగుతారు.

173. మృత్యువైతే ఎట్టి పరిస్థితిలోనూ రాక తప్పదు. అయితే మరణించిన పిదప మనిషి దేవుని క్షమాభిక్షకు, దైవకారుణ్యానికి అర్హుడయ్యాడంటే అతడు ఇహలోకంలో జీవితాంతం కష్టపడి కూడబెట్టిన సిరిసంపదలన్నింటికన్నా శ్రేష్ఠమైన దాన్ని పొందినట్లే. అందుకే దైవమార్గంలో పోరాడేందుకు ఎన్నడూ వెరవకూడదు. సంతోషంగా, ఆనందంగా దానికోసం ముందుకు రావాలి. చిత్తశుద్ధితో అతనాపని చేస్తే నిశ్చయంగా దైవకారుణ్యం, దేవుని క్షమ అతన్ని ఆవరిస్తాయి.

174. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) స్వతహాగా ప్రేమమయులు. అల్లాహ్ తన ప్రవక్తలోని ఈ గుణాన్ని గురించి చెబుతూ, నీలోని ఈ మృదుత్వానికీ, దయార్ద్రతలకు అసలు కారణం దైవకృపే. దైవధర్మ ప్రచారానికి ఈ మృదుత్వం ఎంతో అవసరం. నీలోనే గనక ఈ సద్గుణం ఉండి ఉండకపోతే, దీనికి బదులుగా నీవు కఠిన స్వభావుడవు, దురుసు వైఖరి కలవాడవు అయివుంటే జనులు నీకు దగ్గరయ్యే బదులు, దూరం వెళ్ళిపొయ్యేవారు. అందుకే నీవు నీ సహచరుల పట్ల నిత్యం మన్నింపుల వైఖరినే అవలంబిస్తూ ఉండాలని ఉపదేశిస్తున్నాడు.

175. అంటే, తోటి ముస్లింల హృదయాలను జయించే పనుల్లో ఒకటి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఉండటం. ఈ ఆయతు ద్వారా సలహా సంప్రతింపుల ఆవశ్యకత ఏమిటో అర్థమవుతుంది. కొంతమంది విద్వాంసులు ఈ సలహా

గురించి తుది నిర్ణయానికి వచ్చినప్పుడు, అల్లాహ్‌పై భారం మోపు.[176] నిశ్చయంగా అల్లాహ్ తనను నమ్ముకున్న వారిని ప్రేమిస్తాడు.

اللّٰهَ يُحِبُّ الْمُتَوَكِّلِيْنَ ﴿١٥٩﴾

**160** అల్లాహ్‌యే గనక మీకు తోడ్పాటునందిస్తే ఇక మిమ్మల్ని ఎవరూ జయించలేరు. ఒకవేళ ఆయనే గనక మిమ్మల్ని విడిచి పెట్టేస్తే, తరువాత మీకు సహాయపడ గలవాడెవడు? కాబట్టి విశ్వసించినవారు సదా అల్లాహ్‌నే నమ్ముకోవాలి.

اِنْ يَّنْصُرْكُمُ اللّٰهُ فَلَا غَالِبَ لَكُمْ ۚ وَاِنْ يَّخْذُلْكُمْ فَمَنْ ذَا الَّذِيْ يَنْصُرُكُمْ مِّنْۢ بَعْدِهٖ ۗ وَعَلَى اللّٰهِ فَلْيَتَوَكَّلِ الْمُؤْمِنُوْنَ ﴿١٦٠﴾

**161** ఒక ప్రవక్త ద్రోహానికి పాల్పడటమనేది జరగని పని.[177] ద్రోహానికి పాల్పడే ప్రతి ఒక్కడూ తను ద్రోహానికి పాల్పడిన దానిని తీసుకుని ప్రళయదినాన హాజరవుతాడు. తరువాత ప్రతి ఒక్కరికీ వారు చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం ఇవ్వబడు తుంది. వారికెలాంటి అన్యాయం జరగదు.

وَمَا كَانَ لِنَبِيٍّ اَنْ يَّغُلَّ ۗ وَمَنْ يَّغْلُلْ يَاْتِ بِمَا غَلَّ يَوْمَ الْقِيٰمَةِ ۚ ثُمَّ تُوَفّٰى كُلُّ نَفْسٍ مَّا كَسَبَتْ وَهُمْ لَا يُظْلَمُوْنَ ﴿١٦١﴾

సంప్రతింపులను 'వాజిబ్' (అవశ్యం) గా తలపోయగా, మరికొంతమంది 'ముస్తహబ్' (అభిలషణీయం)గా భావించారు (ఇబ్నె కసీర్). ఈ నేపథ్యంలో ఇమామ్ షౌకానీ ఇలా వ్యాఖ్యానించారు : "పరిపాలకులు తమకు తెలియని విషయాలపై లేక తమకు అనుమానం ఉన్న అంశాలపై చర్య తీసుకునే ముందు విద్వాంసులను సంప్రతించటం అవసరం. సైనిక వ్యవహారాల్లో సైనికాధికారుల్ని సంప్రతించాలి. ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచిస్తున్నప్పుడు నిపుణులను, మేధావులను సంప్రతించాలి. వివిధ ప్రాంతాల వారి అవసరాలను, ప్రాధాన్యతలను అవలోకనం చేసే సమయంలో తన క్రిందివారిని, గవర్నర్లను సంప్రతించాలి."

'ధర్మవేత్తలను, విద్వాంసులను సంప్రతించకుండా నిర్ణయాలు తీసుకునే పరిపాలకుణ్ణి గద్దె దింపటం వాజిబ్ (తప్పనిసరి) అన్న విషయంలో ఎలాంటి భేదాభిప్రాయం లేదు' అని ఇబ్నె తైమియా అన్నారు. అయితే ఈ ధర్మవేత్తలను సంప్రతించటమనేది, షరీఅత్‌లో వివరించబడని లేక రాజ్యంలో ఏర్పాట్లకు సంబంధించిన విషయాల వరకు మాత్రమే పరిమితం. పోతే ఏ విషయంలో షరీఅత్ ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయో వాటిలో ఇక వేరొకరి సలహాలు తీసుకోవలసిన అవసరం ఉండదు (ఫత్‌హుల్ ఖదీర్).

176. అంటే, సలహా తీసుకున్న తరువాత నీవు ఏది సముచితమనుకుంటే దాన్ని చెయ్యి. కాని అల్లాహ్‌పై ఆధారపడి మరీ చెయ్యి. దీని ద్వారా బోధపడేదేమిటంటే, సలహా మండలిని సంప్రతించిన మీదట కూడా అంతిమ నిర్ణయం రాజ్యాధికారిదే అవుతుంది. సలహా మండలి చెప్పిన ప్రతిదానినీ పరిపాలకుడు పాటించనవసరం లేదు. గమనార్హమైన మరో విషయం ఏమిటంటే సలహాదారులు ఎన్ని మంచి సలహాలిచ్చేవారైనప్పటికీ పరిపాలకుడు అల్లాహ్‌పై ఆధారపడక తప్పదు. వచ్చే ఆయతులో కూడా అల్లాహ్‌పై భారం మోపమని మళ్లీ తాకీదు చేయబడింది.

177. ఉహుద్ యుద్ధ సందర్భంగా తమ స్థానాలను వదలిపెట్టి విజయప్రాప్తి వైపుకు పరుగులు తీసినవారి మనసుల్లో వచ్చిన ఆలోచన ఏమిటంటే తాము గనక సకాలంలో అక్కడికి చేరుకోకపోతే, ఇతరులు వాటిని స్వాహా చేస్తారు. దానిపై ఈ హెచ్చరిక వచ్చింది. విజయ ధనంలో నుంచి మీ వాటా మీకు దక్కదని అసలు మీరెలా అనుకున్నారు? ఏమిటీ, మీకు మీ నాయకుడు అయిన ముహమ్మద్ (సఅసం)పై భరోసా లేకుండా పోయిందా? గుర్తుంచుకోండి! ఒక ప్రవక్త ద్వారా ఎన్నటికీ, ఎలాంటి అవినీతీ జరగదు. ఇది ముమ్మాటికీ అసంభవం. ఎందుకంటే అవినీతి అనేది ప్రవక్త నైజానికే వ్యతిరేకం. ఒకవేళ ప్రవక్తే అవినీతిపరుడైతే మరి అతని దైవదౌత్యం ఎలా నమ్మశక్యం అవుతుంది? అవినీతి లేక ద్రోహం (ఖియానత్) మహాపరాధం. హదీసులలో అది నిర్ద్వంద్వంగా ఖండించబడింది.

**162** ఏమిటీ, దైవ ప్రసన్నతకు అనుగుణంగా నడుచుకున్న వాడు, దైవాగ్రహానికి పాత్రుడై అతిచెడ్డ నివాసమైన నరకానికి పోయేవానితో సమానుడవుతాడా?

أَفَمَنِ اتَّبَعَ رِضْوَانَ اللَّهِ كَمَنۢ بَآءَ بِسَخَطٍ مِّنَ اللَّهِ وَمَأْوَىٰهُ جَهَنَّمُ ۚ وَبِئْسَ الْمَصِيرُ ﴿١٦٢﴾

**163** అల్లాహ్ వద్ద వారి స్థానాలు వేర్వేరుగా ఉన్నాయి సుమా! వారు చేసేదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.

هُمْ دَرَجَٰتٌ عِندَ اللَّهِ ۗ وَاللَّهُ بَصِيرٌۢ بِمَا يَعْمَلُونَ ﴿١٦٣﴾

**164** అల్లాహ్ విశ్వాసులకు చేసిన మహోపకారం ఏమిటంటే, ఆయన వారిలో నుండే ఒక ప్రవక్తను ఎన్నుకుని వారి వద్దకు పంపాడు.[178] అతడు వారికి ఆయన వాక్యాలను చదివి వినిపిస్తాడు. వారిని పరిశుద్ధుల్ని చేస్తాడు. వారికి గ్రంథ జ్ఞానాన్నీ, వివేకాన్నీ బోధిస్తాడు.[179] నిశ్చయంగా అంతకు ముందైతే[180] వాళ్ళు స్పష్టమైన అపమార్గానికి లోనై ఉండేవారు.

لَقَدْ مَنَّ اللَّهُ عَلَى الْمُؤْمِنِينَ إِذْ بَعَثَ فِيهِمْ رَسُولًا مِّنْ أَنفُسِهِمْ يَتْلُوا عَلَيْهِمْ ءَايَٰتِهِۦ وَيُزَكِّيهِمْ وَيُعَلِّمُهُمُ الْكِتَٰبَ وَالْحِكْمَةَ وَإِن كَانُوا مِن قَبْلُ لَفِى ضَلَٰلٍ مُّبِينٍ ﴿١٦٤﴾

178. దైవప్రవక్త ఒక మానవమాత్రుడు కావటం, ఆ ప్రజా సమూహంలో నుంచే వారిని సంస్కరించే ప్రవక్తను దేవుడు ఎంపిక చేయటం నిశ్చయంగా దైవకృపే అనీ, ఇది మానవాళికి దేవుడు చేసిన మహోపకారం అనీ వివరించటం జరిగింది. (1). ఎందుకంటే అతడు ఆ జాతి జనులు మాట్లాడే భాషలోనే దైవసందేశాన్ని అందజేస్తాడు. వారి యాసలోనే వారిని పలకరిస్తాడు. అందువల్ల ప్రతివ్యక్తీ అతని మాటను తొందరగా అర్థం చేసుకుంటాడు. (2). అతడు మానవమాత్రుడై ఉండటం మూలంగా మనుజ జాతి అతనికి తొందరగా దగ్గరవుతుంది. (3). ఒక మనిషి మరో మనిషిని అనుసరించగలడు గాని, మనిషనేవాడు దైవదూతలను అనుసరించలేడు. దైవదూత కూడా మానవుల మనోభావాలను, వారి అవసరాలను సరిగ్గా అర్థం చేసుకోలేడు. అందుకే ప్రవక్తలను దైవదూతల నుంచి ఎన్నుకుని ఉంటే వారు దైవధర్మ ప్రచారానికి సంబంధించిన బాధ్యతలను సజావుగా నిర్వర్తించలేకపోయేవారు. అందుకే తన ప్రవక్తలందరినీ అల్లాహ్ మానవజాతి నుంచే ఎన్నుకున్నాడు. వారు మాట్లాడే భాషలోనే దైవసందేశాన్ని అవతరింప జేశాడు. దానికి నిదర్శనాలివి :

1. "(ఓ ప్రవక్తా!) మీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలంతా మానవులే. వారికి మేము 'వహీ'ని అందజేసేవారం." (అంబియా - 7)
2. "(ఓ ప్రవక్తా!) మీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలంతా అన్నం తినేవారే. బజార్లలో సంచరించేవారే." (అల్ ఫుర్ఖాన్ - 20)

స్వయానా దైవప్రవక్త (సఅసం) చేత ఇలా చెప్పించటం జరిగింది :

3. "(ఓ ప్రవక్తా!) వారితో అనండి: నేనూ మీలాంటి ఒక మానవుణ్ణే. అయితే నాపై 'వహీ' అవతరిస్తుంది." (హామీమ్ సజ్దా - 6)

ఈనాడు చాలామంది ముహమ్మద్ ప్రవక్త (స) మానవమాత్రులేనన్న విషయాన్ని గ్రహించకుండా, అంధ విశ్వాసాలకు లోనవుతున్నారు.

179. ఈ ఆయతులో దైవప్రవక్త (స) వారి మూడు ముఖ్య బాధ్యతలు సూచించబడ్డాయి. 1. దివ్య వచనాల పారాయణం. 2. హృదయశుద్ధి. 3. గ్రంథజ్ఞానాన్ని, వివేకాన్నీ నేర్పటం.

గ్రంథాన్ని నేర్పించటంలో 'పఠనం' (తిలావత్) కూడా వచ్చేస్తుంది. పఠనంతోపాటే విషయాన్ని విడమరచి చెప్పే పనిని కూడా చేయవచ్చు. పారాయణం చెయ్యకుండా పాఠం చెప్పటం సాధ్యమయ్యే విషయం కాదు. అయినప్పటికీ

أَوَلَمَّآ أَصَابَتْكُم مُّصِيبَةٌ قَدْ أَصَبْتُم مِّثْلَيْهَا
قُلْتُمْ أَنَّىٰ هَـٰذَا ۖ قُلْ هُوَ مِنْ عِندِ أَنفُسِكُمْ ۗ
إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿١٦٥﴾

**165** (ఏమిటీ?) మీపై ఆపదరాగానే – దీనికన్నా రెండింతలుగా మీరు వారిపై విరుచుకుపడి ఉండి కూడా – ఇదెక్కడి నుంచి వచ్చిపడిందని అంటారా?[181] "ఇది చేజేతులా మీరు కొనితెచ్చు కున్నదే"[182]అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతి దానినీ చేయగల సమర్థుడు.

وَمَآ أَصَابَكُمْ يَوْمَ الْتَقَى الْجَمْعَانِ فَبِإِذْنِ اللَّهِ
وَلِيَعْلَمَ الْمُؤْمِنِينَ ﴿١٦٦﴾

**166** ఇరువర్గాల వారు ఢీకొన్న ఆ రోజున మీకు కలిగిన బాధ అల్లాహ్ ఆజ్ఞ మేరకేనని తెలుసుకోండి. మీలో (సిసలైన) విశ్వాసు లెవరో అల్లాహ్ (బహిరంగంగా) తెలుసుకోదలిచాడు.

وَلِيَعْلَمَ الَّذِينَ نَافَقُوا ۚ وَقِيلَ لَهُمْ تَعَالَوْا
قَاتِلُوا فِي سَبِيلِ اللَّهِ أَوِ ادْفَعُوا ۖ قَالُوا لَوْ نَعْلَمُ
قِتَالًا لَّاتَّبَعْنَاكُمْ ۗ هُمْ لِلْكُفْرِ يَوْمَئِذٍ أَقْرَبُ

**167** దగాకోరులెవరో[183] కూడా ఆయన తెలుసుకోవాలను కున్నాడు. "రండి, అల్లాహ్‌మార్గంలో పోరాడండి లేదా అవిశ్వాసు లను ఎదుర్కోండి" అని వారితో (కపటులతో) అన్నప్పుడు, "యుద్ధం జరగబోతుందని మాకు తెలిసి ఉంటే తప్పకుండా

పారాయణాన్ని వేరుగా ప్రస్తావించటం గమనించదగిన విషయం. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే గ్రంథ పారాయణం ఒక పుణ్యప్రదమైన విషయం. పారాయణం చేసేవానికి, దాన్ని వినేవానికి అది అర్థమైనా, అర్థంకాకపోయినా పఠించినందుకు పుణ్యం ఎలాగూ ప్రాప్తిస్తుంది. దివ్య ఖుర్‌ఆన్ వాక్యాలపై యోచన చేయటం, దాని భావాన్ని తెలుసుకోవ టానికి కృషి చెయ్యటం ముమ్మాటికీ అవసరమే. అయితే ఈ లక్ష్యం నెరవేరనంతవరకూ ఖుర్‌ఆన్‌ను పఠించకుండా చేతులు ముడుచుకుని కూర్చోవటం కూడా సమ్మతం కాదు.

హృదయశుద్ధి (తజ్‌కియ) అంటే విశ్వాసాలను, ఆచరణలను, నడవడికను సంస్కరించటం, చక్కదిద్దటమని భావం. ఉదాహరణకు – మహనీయ ముహమ్మద్(స) తన జాతి ప్రజలను షిర్క్ భావాల నుంచి తౌహీద్ భావాల వైపుకు మళ్ళించారు. నైతికంగా ఎంతో దిగజారిపోయిన వారిలో దైవభీతి, పరలోక భీతి ఆధారంగా ఉత్తమ నైతికపు విలువలను నూరిపోశారు. 'హిక్మత్' అంటే చాలా మంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల దృష్టిలో హదీసు అని భావం.

180. అంటే మహనీయ ముహమ్మద్ (స) దైవప్రవక్తగా ఎన్నుకోబడక మునుపు అరబ్బులు మార్గవిహీనత, మార్గభ్రష్టతల ఆఖరి అంచులకు చేరిపోయారన్నది నిర్వివాదాంశం; సాధారణంగా అరబీలో **'ఇన్'** ( إِنْ ) అనే పదానికి 'ఒకవేళ' అని అర్థం వస్తుంది. అయితే ఈ ఆయతులో వచ్చిన **ఇన్** ( إِنْ ) అటువంటిది కాదు. దీనిని 'ముఖఫ్ఫఫహ్ మినల్ ముసఖ్ఖలహ్' అంటారు. అంటే ఈ 'ఇన్', సదరు ఆయతులో, 'ఇన్న' (నిశ్చయంగా, నిస్సందేహంగా) అనే అర్థంలో ఉపయోగించబడిందన్నమాట!

181. అంటే ఉహుద్ యుద్ధంలో మీ పక్షానికి చెందిన 70 మంది అమరగతి నొందితే, బద్ర్ యుద్ధంలో మీరు కూడా 70 మంది అవిశ్వాసులను వధించి ఉన్నారు. మరో 70 మందిని బందీలుగా పట్టుకున్నారు.

182. అంటే – దైవప్రవక్త (సఅసం) మీకు గట్టిగా తాకీదు చేసినప్పటికీ మీరు ఆయన (స) మాటల్ని లెక్కచేయకుండా నిర్ణీత స్థలాన్ని వదలి మీరు ఘోర తప్పిదం చేశారు. మీరు చేసిన ఆ తప్పు వల్లనే అవిశ్వాసులు ఆ వైపు నుంచే ఆకస్మిక దాడి చేసి మీకు నష్టం కలిగించారు.

183. ఉహుద్ యుద్ధరంగంలో మీకు చేకూరిన నష్టం దైవప్రణాళిక ప్రకారమే చేకూరింది (భవిష్యత్తులో మీరు దైవప్రవక్త (స) ఆదేశాన్ని శాయశక్తులా పాలించేలా చేయడానికి ఇలా చేయటం జరిగింది). దైవవిశ్వాసులను – వంచకుల నుండి స్పష్టంగా వేరు పరచాలన్న పరమార్థం కూడా ఇందులో దాగి ఉంది.

మీవెంట వచ్చే వాళ్ళమే"[184] అని వారు బదులిచ్చారు. ఆనాడు వాళ్లు విశ్వాసం కన్నా అవిశ్వాసానికి బహు చేరువలో ఉన్నారు.[185] తమ మనసుల్లో లేని దాన్ని నోటితో పలుకుతున్నారు.[186] వారు దాచి ఉంచే దానిని అల్లాహ్ బాగా ఎరుగు.

مِنْهُمْ لِلْإِيمَانِ ۚ يَقُولُونَ بِأَفْوَاهِهِمْ مَا لَيْسَ فِي قُلُوبِهِمْ ۗ وَاللَّهُ أَعْلَمُ بِمَا يَكْتُمُونَ ﴿١٦٧﴾

**168** వారు తమ ఇండ్లల్లోనే కూర్చున్నదిగాక, తమ సోదరుల గురించి మాట్లాడుకుంటూ, వారు కూడా తమ మాట విని ఉన్నట్లయితే ఈ విధంగా చంపబడి ఉండేవారు కాదు అని అంటారు. "మీరు సత్యవంతులే అయితే మీ ప్రాణాలను మృత్యు వాతన పడకుండా కాపాడుకోండి"[187] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

الَّذِينَ قَالُوا لِإِخْوَانِهِمْ وَقَعَدُوا لَوْ أَطَاعُونَا مَا قُتِلُوا ۗ قُلْ فَادْرَءُوا عَنْ أَنْفُسِكُمُ الْمَوْتَ إِنْ كُنْتُمْ صَادِقِينَ ﴿١٦٨﴾

**169** అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని సుతరామూ మృతులుగా తలపోయకండి. వారు సజీవులు. వారికి తమ ప్రభువు వద్ద ఆహారం[188] ఇవ్వబడుతుంది.

وَلَا تَحْسَبَنَّ الَّذِينَ قُتِلُوا فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتًا ۚ بَلْ أَحْيَاءٌ عِنْدَ رَبِّهِمْ يُرْزَقُونَ ﴿١٦٩﴾

184. ఈ మాటల ద్వారా వారు ఏం చెప్పదలచుకున్నారంటే, మీరు నిజంగానే యుద్ధానికి వెళుతున్నట్లయితే మేమూ మీతోపాటు వచ్చి ఉండేవాళ్ళం. కాని మీరు వెళుతున్నది యుద్ధం చేయటానికి కాదు, కష్టాలు కొనితెచ్చుకోవటానికే! ఏరికోరి మీరు కష్టాలను, కడగండ్లను కొనితెచ్చుకుంటూ ఉండగా మేమెందుకు సహాయం చేయాలి? కపటాగ్రేసరుడైన అబ్దుల్లా బిన్ ఉబై మరియు అతని అనుంగు అనుచరులు పలికిన పలుకులివి. తాము చెప్పేదాన్ని పట్టించుకోనందుకు నిరసనగా వారు 'షౌత్' అనే స్థలం వద్దకు చేరుకున్నాక మదీనాకు తిరుగు ముఖం పట్టారు. ఆ సమయంలో అబ్దుల్లా బిన్ హిజామ్ అన్సారీ (రజి) వాళ్లకు నచ్చజెప్పి యుద్ధంలో పాల్గొనేలా ఒప్పించేందుకు తీవ్ర ప్రయత్నం చేయసాగారు (ఇతర వివరాలు వెనుకటి అంశాల్లో పేర్కొనబడ్డాయి).

185. ఆ సమయంలో వారి నోట వెలువడ్డ మాటలు వారిలోని కాపట్యానికి (నిఫాఖ్‌కు), అవిశ్వాసానికి (కుఫ్రుకు) ప్రతిబింబంగా ఉన్నాయి.

186. వారు పైకి చెప్పిన మాటలు ఇంతకుముందు వివరించబడ్డాయి. ఇప్పుడు ఈ ఆయతులో వారి అంతరంగం గురించి చెప్పబడుతోంది. తాము వెళ్ళకపోవటం వల్ల ముస్లిం సైన్యంలో ఆత్మవిశ్వాసం క్షీణిస్తుందనీ, ఇది పరోక్షంగా శత్రువులకు లాభం చేకూరుస్తుందనీ వారు మనసులో అనుకునేవారు. అంటే ఏదో ఒకవిధంగా ఇస్లాంకు, ముస్లింలకు, దైవప్రవక్త (స) ఉద్యమానికి విఘాతం కలగాలన్నది వారి మనసులో ఉన్న కోరిక.

187. తమ సలహాను పాటించి ఇళ్ళల్లోనే కూర్చుని ఉంటే యుద్ధంలో అమరగతులైన తమ సోదరులకు ఈ దుర్గతి పట్టేది కాదన్నది కపటుల ఉవాచ. దీనికి సమాధానంగా, ఒకవేళ మీ మాటల్లో ఏమాత్రం నిజాయితీ ఉన్నా మీరు మీ మరణాన్ని వాయిదా వేసి చూపించండి అని అల్లాహ్ సవాలు విసిరాడు. దీని భావం ఏమిటంటే విధిరాత నుంచి ఎవరూ తప్పించుకోలేరు. మృత్యువు ఎప్పుడు రావాలో, ఎక్కడ రావాలో రాసిపెట్టి ఉంటుంది. దాని ప్రకారం అది వచ్చితీర్తుంది. దైవమార్గంలో పోరాటపటిమను ప్రదర్శించవలసిన కీలక సమయంలో వెన్నుచూపి పారిపోయినంత మాత్రాన లేక యుద్ధ రంగానికి వెళ్ళకుండా గోళ్లు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చున్నంత మాత్రాన మృత్యువు కబళించకుండా ఉండదు.

188. అమరగతులు సజీవులుగా ఉంటారన్నది వాస్తవమా? లేక కేవలం వారి గౌరవం దృష్ట్యా అలా అనబడిందా? అంటే ముమ్మాటికీ వాస్తవమే. కాని ప్రపంచవాసులు ఆ విషయాన్ని అర్థం చేసుకోలేరు. (దివ్య ఖుర్‌ఆన్ ఈ విషయాన్ని

فَرِحِينَ بِمَآ ءَاتَىٰهُمُ ٱللَّهُ مِن فَضْلِهِۦ وَيَسْتَبْشِرُونَ بِٱلَّذِينَ لَمْ يَلْحَقُوا۟ بِهِم مِّنْ خَلْفِهِمْ أَلَّا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿170﴾

**170** అల్లాహ్ తన అనుగ్రహం నుంచి ప్రసాదించిన దాంతో వారు చాలా సంతోషంగా ఉన్నారు. ఇంకా తమతో వచ్చిచేరని, తమ వెనుక (ప్రపంచంలోనే) ఉండిపోయినవారి[189] (విశ్వాసుల) గురించి పరస్పరం శుభవార్త వినిపించుకుంటున్నారు. భయ పడవలసిన, దుఃఖించవలసిన అవసరం లేనందులకు (వారు ఆనందంగా ఉన్నారు).

يَسْتَبْشِرُونَ بِنِعْمَةٍ مِّنَ ٱللَّهِ وَفَضْلٍ وَأَنَّ ٱللَّهَ لَا يُضِيعُ أَجْرَ ٱلْمُؤْمِنِينَ ﴿171﴾

**171** అల్లాహ్ వరాల పట్ల, (ఆయన) అనుగ్రహం పట్ల వారు ఎంతగానో సంతోషిస్తున్నారు. అల్లాహ్ విశ్వాసుల పుణ్యఫలాన్ని వృధా కానివ్వడన్న విషయం కూడా వారినెంతగానో సంతృప్త పరచింది.[190]

స్పష్టంగా ప్రకటించింది. అల్ బఖరా సూరాలోని 154వ ఆయతును చూడండి). మరి ఆ జీవితాన్ని స్థూలంగా ఎలా అర్థం చేసుకోవాలి అన్నది ప్రశ్న. సమాధులలోకి వారి ఆత్మలు తిరిగి పంపబడతాయనీ, దైవానుగ్రహాలను ఆస్వాదిస్తూ వారు అందులో హాయిగా ఉంటారని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. స్వర్గంలో పండ్లు ఫలాల సువాసనను పీల్చుతూ వారు సుఖంగా, సంతృప్తంగా ఉంటారని మరి కొందరు వ్యాఖ్యానించారు. అయితే హదీసు ద్వారా మూడో విషయం కూడా తెలియవస్తోంది. ఇదే నిజమయింది. అదేమిటంటే వారి ఆత్మలు పచ్చని పక్షుల ఉదరాల్లోకి ప్రవేశపెట్ట బడతాయి. అవి స్వర్గంలో తింటూ త్రాగుతూ, అందలి అనుగ్రహాలను తనివితీరా ఆస్వాదిస్తూ ఉంటాయి (ఫత్‌హుల్ ఖదీర్ – సహీహ్ ముస్లిం : కితాబుల్ ఇమారహ్ ప్రకరణం ఆధారంగా).

189. అంటే ఇప్పటివరకూ (చనిపోకుండా) ప్రపంచంలోనే ఉన్న విశ్వాసులు, లేక జిహాద్‌లో పాల్గొన్నవారు వీరమరణం పొంది తమలాగా వారు కూడా అనుగ్రహభరితమైన ఇలాంటి జీవితానికి నోచుకుంటే ఇంకా బావుంటుందేమో! అని అనుకుంటూ ఉంటారు. ఉహుద్ యుద్ధంలో అమరగతినొందినవారు అల్లాహ్‌నుద్దేశ్యించి, "ప్రపంచంలో మా వెనుక ఉండిపోయిన మా సోదరులకు సుఖసంతోషాలతో నిండిన మా జీవన పరిస్థితులను గురించి తెలియజేసేవారెవరయినా ఉన్నారా?! ఈ వార్త గనక వారికి అందితే వారెన్నడూ ధర్మయుద్ధం (జిహాద్) పట్ల విముఖత చూపకుండా ఉంటారు" అని విన్నవించుకోగా, "మీ అభిప్రాయాన్ని నేను వారికి తెలియజేస్తాను" అని అల్లాహ్ హామీ యిచ్చాడు. ఈ నేపథ్యంలోనే అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు (ముస్నదె అహ్మద్, సుననె అబూ దావూద్). ఇదేగాక ఇంకా అనేక హదీసుల ద్వారా కూడా షహాదత్ (అమరగతి) గొప్పదనం విదితమవుతోంది. ఉదాహరణకు ఒక హదీసులో ఇలా అనబడింది: "మరణించి దేవుని సన్నిధిలో ఆదరణ పొందిన ఏ ప్రాణీ తిరిగి ఇహలోకంలోకి రావటానికి ఇష్టపడదు. అయితే అమరగతుడు మాత్రం మళ్లీ ఇహలోకంలోకి వచ్చి మరోసారి దైవమార్గంలో వీరమరణం పొందాలని అభిలషిస్తాడు. అమరగతి నొందేవారికి లభించే ఉన్నత శ్రేణిని తిలకించిన కారణంగా అతనిలో ఈ ఆశ, అభిలాష పెరుగుతుంది" (ముస్నదె అహ్మద్, సహీహ్ ముస్లిం).

దైవప్రవక్త (సఅసం) తనతో ఈ విధంగా అన్నారని జాబిర్ (రజి) చెప్పారు: "నీకు తెలుసా! అల్లాహ్ నీ తండ్రిని బ్రతికించి, 'నానుండి ఏమన్నా కోరుకో' అని అడిగాడు. దానికి నీ తండ్రి, 'నాకు ఒకే ఒక్క కోరిక ఉంది – అదేమి టంటే మళ్లీ నన్ను ప్రపంచంలోకి పంపిస్తే నేను మళ్లీ నీ మార్గంలో పోరాడి అమరగతి నొందాలన్నది నా కోరిక' అని బదులిచ్చాడు. 'ఇది అసంభవం. ఎందుకంటే ఒకసారి నా దగ్గరకు వచ్చిన తరువాత ప్రపంచంలో తిరిగివెళ్ళే అవకాశం ఎవరికీ ఇవ్వబడదని నేను ముందే నిర్ణయం చేసేశాను' అని అల్లాహ్ అన్నాడు.

190. ఇక్కడ అమరగతుల సంతోషాన్ని మరోమారు ప్రస్తావించి వారికి సంతోషం తప్పకుండా లభించి తీరుతుందని నొక్కి చెప్పబడుతున్నది. అలాగే మరో విషయం ఏమిటంటే వారి ఈ సుఖసంతోషాలకు కారణం భయం, దుఃఖంతో

**172** ఎవరయితే తీవ్రంగా గాయపడిన తరువాత కూడా అల్లాహ్ మరియు అల్లాహ్‌ప్రవక్త ఆజ్ఞలను శిరసావహించారో, వారిలో ఎవరయితే సదాచరణ చేసి, భయభక్తులతో మసలుకున్నారో వారి కొరకు గొప్ప పుణ్యఫలముంది.[191]

الَّذِينَ اسْتَجَابُوا لِلَّهِ وَالرَّسُولِ مِن بَعْدِ مَا أَصَابَهُمُ الْقَرْحُ ۚ لِلَّذِينَ أَحْسَنُوا مِنْهُمْ وَاتَّقَوْا أَجْرٌ عَظِيمٌ ﴿١٧٢﴾

**173** "అవిశ్వాస జనులు మీకు వ్యతిరేకంగా భారీ సైన్యాన్ని మోహరించి ఉన్నారు. మీరు వారికి భయపడండి" అని ప్రజలు వారితో అన్నప్పుడు, ఆ మాట వారి విశ్వాసాన్ని మరింతగా పెంచింది. దానికి జవాబుగా, "మాకు అల్లాహ్ చాలు. ఆయన చాలా మంచి కార్యసాధకుడు"[192] అని వారన్నారు.

الَّذِينَ قَالَ لَهُمُ النَّاسُ إِنَّ النَّاسَ قَدْ جَمَعُوا لَكُمْ فَاخْشَوْهُمْ فَزَادَهُمْ إِيمَانًا وَقَالُوا حَسْبُنَا اللَّهُ وَنِعْمَ الْوَكِيلُ ﴿١٧٣﴾

కూడుకున్న పరిస్థితులు దూరమవటం ఒక్కటే కాదు. అల్లాహ్ ప్రసాదించిన అనంతమైన వరాలను, అనుగ్రహాలను చూచిన తరువాత వారి హృదయాంతరాళాలు ఆనందంతో పరవశిస్తాయి. మరి కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం వారికి కలిగిన మొదటి సంతోషానికి కారణం ప్రపంచంలో తమ వెనుక ఉండిపోయిన తమ సహోదరులు. రెండవ సంతోషానికి కారణం అల్లాహ్ వొసగిన అనంత అనుగ్రహాలు (ఫత్‌హుల్ ఖదీర్).

191. ఉహుద్ యుద్ధం నుండి మక్కాకు తిరిగివస్తున్నప్పుడు మార్గమధ్యంలో ముష్రిక్కులకు ఒక ఆలోచన తట్టింది. తాము మదీనాపై దండెత్తే సువర్ణావకాశాన్ని జారవిడుచుకున్నామనీ, ముస్లింలు అన్ని విధాలుగానూ ధైర్యసాహసాలను కోల్పోయి, పలాయనం చిత్తగిస్తున్న తరుణంలో తాము గనక మదీనా నగరంపై దాడి జరిపి ఉంటే ఇస్లాం వృక్షం కూకటివ్రేళ్ళతో పెకలించబడేది కదా! అని కురైషులు బేరీజు వేసుకున్నారు. సరిగ్గా అదే సమయంలో అటు మదీనాలో మహాప్రవక్త (సఅసం), శత్రువులు ఏ క్షణంలోనయినా మరోసారి మదీనాపైకి దండెత్తి వస్తారని అనుమానించారు. అందుకే తన సహచరులతో సంప్రతింపులు మొదలెట్టారు. అప్పటికే యుద్ధంలో అపారమైన ధన ప్రాణ నష్టం సంభవించి బాధాతప్త హృదయంతో ఉన్న ప్రవక్త ప్రియసహచరులు తమ నాయకుని ఆదేశంపై ఆత్మరక్షణకు సిద్ధమైపోయారు. మదీనాకు 8 మైళ్ళ దూరాన ఉన్న "హమ్రావుల్ అసద్" వద్ద మోహరించారు. ఈ సమాచారం అటు ముష్రిక్కులకు చేరిపోయింది. దాంతో మదీనాపై దాడిచేయటానికి ఇది సరైన సమయం కాదని తలపోసి మక్కా ముష్రిక్కులు తోక ముడిచారు. ఆ తరువాత దైవప్రవక్త (స) తన సహచరులతో కలసి మదీనాకు వాపసు అయ్యారు.

ఈ ఆయతులో ప్రవక్త సహచరుల్లోని ఈ విధేయతా భావం కొనియాడబడింది. మరికొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం ఈ ఆయతు అబూ సుఫ్యాన్ హెచ్చరిక నేపథ్యంలో అవతరించింది. వచ్చే ఏడాది 'బద్రె సుఘ్రా'లో మీకు – మాకు మధ్య పోరు జరుగుతుందని అబూ సుఫ్యాన్ హెచ్చరించాడు. (ఆయన అప్పటికింకా ముస్లిం కాలేదు). అతని సవాలును స్వీకరిస్తూ ముస్లింలు దైవానికి, దైవప్రవక్తకు పూర్తి విధేయతను కనబరుస్తామని ముందుకు వచ్చారు. శక్తి వంచన లేకుండా పోరాడతామని మాటిచ్చారు (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్‌లలోని వ్యాఖ్యాన సారాంశం). అయితే ఈ చివరి అభిప్రాయం రాబోయే ఆయతు భావంతో సమరసం చెందటం లేదు.

192. 'హమ్రావుల్ అసద్' సందర్భంగా (కొంతమంది ఇది 'బద్రె సుగ్రా'లో జరిగిన సంఘటన అని చెబుతారు) అవిశ్వాసుల నాయకుడైన అబూ సుఫ్యాన్ కొంతమందికి ధనం ఇచ్చి, వారిచేత ముస్లింలలో వదంతుల్ని వ్యాపింపజేశాడు. మక్కాకు చెందిన ముష్రిక్కులు సర్వ విధాలా యుద్ధానికి సన్నద్ధులై వస్తున్నారన్నది ఆ వదంతుల సారాంశం. దీనివల్ల ముస్లింల శిబిరాలలో కలవరం పుట్టాలనీ, వారు ధైర్యసాహసాలను వీడి పరస్పరం విభేదించుకోవాలని అవిశ్వాసులు ఆశించారు. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం షైతాన్ తన మూకల చేత ఈ పుకార్లు పుట్టించాడు. అయితే ముస్లింలు ఈ రకమయిన వదంతులకు ఏమాత్రం తొణకలేదు సరికదా, ద్విగుణీకృత విశ్వాసంతో, సమధికోత్సాహంతో ప్రతికూల పవనాలకు ఎదురీదడానికి నిశ్చయించుకున్నారు. ముస్లింలలోని ఆ భావాన్నే ఇక్కడ విశ్వాసంలో పెరుగుదలగా సూచించటం

| | |
|---|---|
| **174** (తత్ఫలితంగా) వారు అల్లాహ్ ప్రసాదించిన వరాలతో, అనుగ్రహంతో తిరిగి వచ్చారు.[193] వారికెలాంటి కీడూ కలగలేదు. వారు అల్లాహ్ ప్రసన్నతను అనుసరించారు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు. | فَانْقَلَبُوْا بِنِعْمَةٍ مِّنَ اللّٰهِ وَفَضْلٍ لَّمْ يَمْسَسْهُمْ سُوْٓءٌ ۙ وَّاتَّبَعُوْا رِضْوَانَ اللّٰهِ ۗ وَاللّٰهُ ذُوْ فَضْلٍ عَظِيْمٍ (174) |
| **175** నిజానికి (ఈ వార్త అందజేసిన) వాడు షైతాను. వాడు తన మిత్రుల గురించి మీకు భయపెట్టాడు.[194] కనుక మీరు అవిశ్వాసులకు భయపడకండి, మీరు విశ్వాసులే అయితే నాకు భయపడండి.[195] | اِنَّمَا ذٰلِكُمُ الشَّيْطٰنُ يُخَوِّفُ اَوْلِيَآءَهٗ ۠ فَلَا تَخَافُوْهُمْ وَخَافُوْنِ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ (175) |
| **176** (ఓ ప్రవక్తా!) అవిశ్వాసంలో ముందుకు దూసుకుపోతున్న వారిని చూసి నువ్వు దిగులు చెందకు. వారు అల్లాహ్‌కు ఏమాత్రం కీడు కలిగించలేరు. వారికి పరలోకంలో ఎలాంటి భాగమూ ఇవ్వరాదన్నది అల్లాహ్ ఉద్దేశం.[196] వారి కొరకు ఘోర శిక్ష కలదు. | وَلَا يَحْزُنْكَ الَّذِيْنَ يُسَارِعُوْنَ فِي الْكُفْرِ ۚ اِنَّهُمْ لَنْ يَّضُرُّوا اللّٰهَ شَيْـًٔا ۗ يُرِيْدُ اللّٰهُ اَلَّا يَجْعَلَ لَهُمْ حَظًّا فِي الْاٰخِرَةِ ۚ وَلَهُمْ عَذَابٌ عَظِيْمٌ (176) |

జరిగింది. ఎందుకంటే విశ్వాసం (ఈమాన్) ఎంత గట్టిగా ఉంటే సంకల్పం కూడా అంతే దృఢంగా ఉంటుంది. మనిషిలో పోరాటభావం, స్ఫూర్తి కూడా అప్పుడే పుట్టుకువస్తాయి. ఈ ఆయతు ద్వారా తేటతెల్లమయ్యే ఇంకొక విషయమేమిటంటే ఈమాన్ (విశ్వాసం) అనేది పెరగకుండా, తరగకుండా ఖనిజం లాగా పడి ఉండే వస్తువు కాదు. అందులో హెచ్చు తగ్గులు అవుతూ ఉంటాయి. హదీసు వేత్తల అభిప్రాయం కూడా ఇదే. కష్టకాలంలో విశ్వాసులన బడేవారు తమ ప్రయత్నాలు తాము చేస్తూనే సర్వలోక ప్రభువు, కార్య సాధకుడు అయిన అల్లాహ్‌పై పూర్తి భరోసా చేస్తారు. అందుకే **"హస్బునల్లాహు వ నిఅ్‌మల్ వకీల్"** (మాకు అల్లాహ్ చాలు. ఆయన అత్యుత్తమ కార్యసాధకుడు) అనే వచనాన్ని అత్యధికంగా పఠిస్తూ ఉండటం మహత్పూర్వక విషయం అని హదీసులు చెబుతున్నాయి. సహీహ్ బుఖారీ తదితర గ్రంథాలలోని ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను అగ్నిలో పడవేసినప్పుడు ఆయన నోట ఈ వచనమే వెలువడింది (ఫత్‌హుల్ ఖదీర్).

193. ఇక్కడ వరం (నీ'మతున్) అంటే శాంతి అనీ, అనుగ్రహం (ఫజ్ల్) అంటే లాభం అనీ అర్థం. బద్రె సుగ్రాలో వర్తకం ద్వారా ముస్లింలకు ఇది ప్రాప్తించింది. బద్రె సుగ్రా వద్ద మహాప్రవక్త (స) ఒక వర్తక బిడారు వద్ద సరకు కొని విక్రయించారు. తద్వారా వచ్చిన లాభాన్ని ఆయన (స) సహచరులందరికీ పంచిపెట్టారు (ఇబ్నె కసీర్).

194. మీ శత్రువులు ఎంతో బలవంతులని వాడు మీకు నూరిపోశాడు. ఈ మాటలకు మీరు నీరుగారి పోతారని వాడనుకున్నాడు.

195. వారు మీమధ్య వదంతుల్ని వ్యాపింపజేస్తున్నప్పుడు మీరేమాత్రం ఖేదపడకుండా మీరు నాపైనే ఆధారపడండి. నా వైపుకే మరలండి. మీకు నా సహాయం చాలు. నేను మీకు అండగా ఉండి, మీ కార్యం సాధించిపెడతాను. వేరొకచోట తాకీదు చేసినట్లు, "ఏమిటీ, అల్లాహ్ తన దాసునికి సరిపోడా?" (అజ్జుమర్-36). మరోచోట ఇలా అనబడింది : "నేనూ, నా ప్రవక్తలు మాత్రమే ఆధిపత్యం వహిస్తారు అని అల్లాహ్ రాసిపెట్టేశాడు" (ముజాదలహ్-21).

196. ప్రజలంతా ఇస్లాం స్వీకరించాలన్నది మహాప్రవక్త (సఅసం) కోరిక! అందుకే వారి ధిక్కార వైఖరి ఆయన్ని మనస్తాపానికి లోనుచేసేది. అందుచేత, 'నీవు దిగులు చెందకు. వీళ్లు అల్లాహ్‌కు ఎలాంటి కీడూ కలిగించలేరు. పైపెచ్చు వీళ్లు తమ పరలోక జీవితాన్నే పాడు చేసుకుంటున్నారు' అని అల్లాహ్ ఆయన్ని (స) ఓదార్చాడు. దైవప్రవక్తలు మానవుల శ్రేయోభిలాషులై ఉంటారన్న దానికి ఇది మచ్చుతునక.

**177** విశ్వాసానికి బదులుగా అవిశ్వాసాన్ని కొనేవారు ఎట్టిపరిస్థితి లోనూ అల్లాహ్‌కు అపకారం చేయలేరు. పైగా వ్యధాభరితమైన శిక్ష వారికోసం సిద్ధం చేయబడి ఉంది.

إِنَّ الَّذِينَ اشْتَرَوُا الْكُفْرَ بِالْإِيمَانِ لَنْ يَضُرُّوا
اللَّهَ شَيْئًا ۚ وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿177﴾

**178** మేము ఇస్తున్న అవకాశాన్ని అవిశ్వాసులు తమ పాలిట మేలైనదని భావించరాదు సుమా! వారు తమ పాపాల పుట్టను పెంచుకోవటానికే ఈ అవకాశం ఇస్తున్నాం.[197] అవమానభరిత మైన శిక్ష వారి కోసమే ఉంది.

وَلَا يَحْسَبَنَّ الَّذِينَ كَفَرُوا أَنَّمَا نُمْلِي لَهُمْ خَيْرٌ
لِأَنْفُسِهِمْ ۚ إِنَّمَا نُمْلِي لَهُمْ لِيَزْدَادُوا إِثْمًا ۚ
وَلَهُمْ عَذَابٌ مُهِينٌ ﴿178﴾

**179** అపవిత్రులను పవిత్రుల నుంచి వేరుపరచే వరకూ[198] అల్లాహ్ విశ్వాసులను ఇప్పుడున్న స్థితిలోనే వదలిపెట్టడు. అలా అని అల్లాహ్ మీకు అగోచర విషయాలనూ తెలుపడు.[199] పైగా అల్లాహ్ తన ప్రవక్తలలో తాను కోరిన వారిని (ఇందుకోసం) ఎన్నుకుంటాడు.[200] అందుచేత మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త లను విశ్వసించండి. మీరే గనక విశ్వసించి, దైవభీతిపరులుగా మసలుకున్నట్లయితే మీకు గొప్ప పుణ్యఫలం లభిస్తుంది.

مَا كَانَ اللَّهُ لِيَذَرَ الْمُؤْمِنِينَ عَلَىٰ مَا أَنْتُمْ
عَلَيْهِ حَتَّىٰ يَمِيزَ الْخَبِيثَ مِنَ الطَّيِّبِ ۗ
وَمَا كَانَ اللَّهُ لِيُطْلِعَكُمْ عَلَى الْغَيْبِ وَلَٰكِنَّ
اللَّهَ يَجْتَبِي مِنْ رُسُلِهِ مَنْ يَشَاءُ ۖ فَآمِنُوا
بِاللَّهِ وَرُسُلِهِ ۚ وَإِنْ تُؤْمِنُوا وَتَتَّقُوا فَلَكُمْ
أَجْرٌ عَظِيمٌ ﴿179﴾

197. ఈ ఆయతులో అల్లాహ్ వివిధ జాతులకు వ్యవధినిచ్చే తన విధానాన్ని విశదీకరించాడు. ఆయన తన ప్రణాళికనను సరించి సత్య తిరస్కారులకు, ముష్రిక్కులకు గడువు ఇస్తూపోతాడు. తాత్కాలికంగా వారికి సిరిసంపదల్నీ, సంతానాదుల్నీ, అధికారాలను కూడా ఇస్తాడు. దేవుడు వారికి అపారంగా అనుగ్రహిస్తున్నాడని ప్రజలు తలపోస్తారు. అయితే ఈ మహాభాగ్యాలను అనుభవించేవారు వీటిని దైవానుగ్రహాలుగా భావించి దైవవిధేయతా మార్గాన్ని అవలంబిస్తే సరి. లేకుంటే ఈ 'దైవకృపే' వారి పాలిట 'దేవుని గడువు'గా పరిణమిస్తుంది. పర్యవసానంగా వారి పాపం పండుతూ పోతుంది. తిరస్కార వైఖరిలో, తలబిరుసుతనంలో వారు మరింత వేగంగా ముందుకు దూసుకుపోతారు. భువిలో చెలరేగిపోతారు. కడకు దేవుడు వారిపై తన కొరడాను ఝుళిపిస్తాడు. శాశ్వతమైన నరకాన్ని వారి నివాస స్థానంగా ఖరారు చేస్తాడు. ఈ అంశాన్ని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల ప్రస్తావించాడు. ఉదాహరణకు మోమినూన్ సూరాలో చూడండి: "మేము వారి సిరిసంతానాదులలో వృద్ధి వొసగుతూ ఉంటే, వారికి మేళ్లు చేయటంలో మేమే తొందరపడుతున్నామని వారనుకుంటున్నారా? లేదు. వారు అసలు విషయాన్ని అర్థం చేసుకోవటంలేదు" (55, 56).

198. అందుకే అల్లాహ్ తప్పకుండా పరీక్ష పెడతాడు. తద్వారా తన మిత్రులను బహిరంగ పరుస్తాడు. శత్రువులను అవమానానికి గురిచేస్తాడు. విశ్వాసులను, ఓరిమిగల వారిని ఒక వైపుకు – కాపట్యం, వైరభావం గల వారిని మరో వైపుకు స్పష్టంగా విడదీయడానికే అల్లాహ్ వారిని కష్టాలకు లోను చేస్తాడు, ఉహుద్ యుద్ధంలో చేసినట్లుగా.

199. మీకు అగోచరాల జ్ఞానం ఎలాగూ లేదు. నిజమైన, నమ్మదగ్గ సహచరులెవరో, విశ్వాస ఘాతకులెవరో స్పష్టంగా తేలిపోవాలంటే మీకు ఇలాంటి కఠిన పరీక్షలు ఎదురవటం చాలా అవసరం. ఇలాంటి సందర్భాలలోనే వ్యక్తుల నిజస్వరూపం బయటపడుతుంది.

200. అగోచర విషయాలను తెలియజేయటం దైవవిధానం కాదు. అయితే తాను కోరిన ప్రవక్తలలో కొందరికి కొన్ని విషయాలను ఆయన తెలియజేస్తాడు. తద్వారా ప్రవక్త తన జాతి ప్రజలలో దగాకోరులెవరో, వారి కార్యకలాపాలేమిటో, వారు పన్నుతున్న కుతంత్రాల వల్ల ధర్మపథంలో ఎలాంటి అవరోధాలు ఎదురవుతున్నాయో తెలుసుకుంటాడు. అంటే కొన్ని ప్రత్యేక సందర్భాలలో, ఎవరో ఒకరిద్దరు ప్రవక్తలకు సంకేతప్రాయంగా ఈ సంగతి తెలియజేయబడుతుంది.

وَلَا يَحْسَبَنَّ الَّذِينَ يَبْخَلُونَ بِمَا آتَاهُمُ
اللَّهُ مِن فَضْلِهِ هُوَ خَيْرًا لَّهُم ۖ بَلْ هُوَ
شَرٌّ لَّهُمْ ۖ سَيُطَوَّقُونَ مَا بَخِلُوا بِهِ يَوْمَ
الْقِيَامَةِ ۗ وَلِلَّهِ مِيرَاثُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۗ
وَاللَّهُ بِمَا تَعْمَلُونَ خَبِيرٌ ﴿١٨٠﴾

**180** అల్లాహ్ తన కృపతో ప్రసాదించిన దానిలో పిసినారులుగా ప్రవర్తించేవారు, ఆ పిసినారితనం తమ పాలిట మేలైనదని భావించరాదు. వాస్తవానికి అది వారి పాలిట హానికరం. పిసినారి తనంతో వారు కూడబెట్టుకున్న వస్తువే ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది.[201] భూమ్యాకాశాల వారసత్వం అల్లాహ్‌కే చెందుతుంది. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

لَّقَدْ سَمِعَ اللَّهُ قَوْلَ الَّذِينَ قَالُوا إِنَّ اللَّهَ
فَقِيرٌ وَنَحْنُ أَغْنِيَاءُ ۘ سَنَكْتُبُ مَا قَالُوا
وَقَتْلَهُمُ الْأَنبِيَاءَ بِغَيْرِ حَقٍّ وَنَقُولُ ذُوقُوا
عَذَابَ الْحَرِيقِ ﴿١٨١﴾

**181** "అల్లాహ్ పేదవాడు, మేము ధనికులం"[202] అని అన్నవారి మాటను అల్లాహ్ విన్నాడు. వారి ఈ మాటను మేము వ్రాసు కుంటాము. వారు ప్రవక్తలను అన్యాయంగా హతమార్చటాన్ని కూడా మేము నమోదు చేసుకుంటాము.[203] "దహించే అగ్ని శిక్షను చవిచూడండి."

అంతేగాని ఇది సర్వసాధారణ విషయం ఎంతమాత్రం కాదు. అల్లాహ్ తలచనంతవరకూ ప్రవక్తలు సయితం కపటుల లోపలి విషయాలను, వారి మదిలో మెదలుతున్న కుయుక్తులను పసిగట్టలేరు (తౌబా సూరాలోని 101వ ఆయతులో అల్లాహ్ తన ప్రవక్తనుద్దేశ్యించి ఈ సంగతి చెప్పాడు – "ఓ ప్రవక్తా! పల్లెటూరి వాళ్ళల్లోనూ, మదీనా వాసుల్లోనూ పుట్టుకువచ్చిన కపటులను మీరు ఎరుగరు. మేము వారిని ఎరుగుదుము" అని జాగరూకపరచాడు). దీని మరో భావం ఇది కూడా కావచ్చు : అగోచర జ్ఞానాన్ని మేము కేవలం ప్రవక్తలకు మాత్రమే ప్రసాదిస్తాము. ఎందుకంటే వారి బాధ్యతల రీత్యా ఈ జ్ఞానాన్ని వారికి ప్రసాదించటం అవసరం. ఈ వహీ (దైవవాణి) మరియు అగోచర వ్యవహారాల ఆధారంగానే వారు జనులను దైవమార్గం వైపుకు పిలుస్తారు. వీటి ఆధారంగానే వారు తమను దైవప్రవక్తలుగా నిరూపించుకుంటారు. ఈ విషయమే ఖుర్ఆన్‌లో మరోచోట ఈ విధంగా పేర్కొనబడింది – "రహస్య జ్ఞాని ఆయన మాత్రమే. ఆయన తన రహస్యాలను తానెన్నుకున్న ప్రవక్తకు తప్ప ఎవరికీ తెలుపడు" (జిన్ – 26, 27). దీనిద్వారా బోధపడేదేమిటంటే ప్రవక్తలకు వారి నబువ్వత్ బాధ్యతలకు సంబంధించిన అగోచర విషయాలు మాత్రమే తెలుపబడతాయి, అంతేగాని, 'మా కాన – మా యకూను', అంటే జరిగినవన్నీ – భవిష్యత్తులో జరగబోయే విషయాలన్నీ వారికి తెలుపబడవు. కొంతమంది మిథ్యావాదులు ఈ రకమైన అగోచర జ్ఞానం ప్రవక్తలందరికీ ఉంటుందని చెబుతారు. మరికొందరైతే 'అయిమ్మయె మాసూమీన్' (పరిశుద్ధులైన ఇమాములు)కు కూడా అగోచర జ్ఞానం ఉంటుందని నమ్మించటానికి ప్రయత్నిస్తారు (అది శుద్ధ అవివేకం).

201. అల్లాహ్ ప్రసాదించిన సిరిసంపదల్లోంచి అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడానికి వెనుకాడే పరమపీనాసి గురించి ఇలా చెప్పబడింది. వాడు విధిగా చెల్లించవలసిన జకాత్‌నుకూడా యివ్వడు. ప్రళయదినాన అలాంటి లోభి ధనాన్ని అత్యంత భయంకరమైన విషపూరిత సర్పంగా మార్చి అతని మెడలో హారంగా వేయబడుతుందని సహీహ్ బుఖారీ హదీసులో వచ్చింది. ఆ సర్పం అతని దవడలను పట్టుకుని 'నేను నీ సంపదను, నీవు కూడబెట్టిన ఖజానాను' అని అంటూ ఉంటుంది (సహీహ్ బుఖారీ : కితాబుత్తఫ్సీర్).

202. అల్లాహ్ విశ్వాసులైన తన దాసులలో, తన మార్గంలో ధనాన్ని ఖర్చుచేసే స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో "అల్లాహ్‌కు మంచి రుణం యిచ్చేవారెవరు?" అని ప్రేరేపించాడు (అల్ బఖర – 245). దానిపై స్పందిస్తూ యూదులు, "ఓ ముహమ్మద్ (స)! ఏమిటీ, నీ ప్రభువు దాసులమైన మా నుంచి అప్పు అడిగేంత పేదవాడై పోయాడా?" అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు (ఇబ్నె కసీర్).

ذَٰلِكَ بِمَا قَدَّمَتْ أَيْدِيكُمْ وَأَنَّ اللَّهَ لَيْسَ
بِظَلَّامٍ لِّلْعَبِيدِ ﴿١٨٢﴾

**182** "ఇది మీరు ఇంతకుమునుపు చేసుకున్న కర్మలకు ప్రతిఫలం. అల్లాహ్ తన దాసులకు అన్యాయం చేసేవాడు కాదు" అని (తీర్పుదినాన) మేము వారికి చెబుతాము.

الَّذِينَ قَالُوا إِنَّ اللَّهَ عَهِدَ إِلَيْنَا أَلَّا نُؤْمِنَ
لِرَسُولٍ حَتَّىٰ يَأْتِيَنَا بِقُرْبَانٍ تَأْكُلُهُ النَّارُ ۗ قُلْ
قَدْ جَاءَكُمْ رُسُلٌ مِّن قَبْلِي بِالْبَيِّنَاتِ وَبِالَّذِي
قُلْتُمْ فَلِمَ قَتَلْتُمُوهُمْ إِن كُنتُمْ صَادِقِينَ ﴿١٨٣﴾

**183** "అగ్ని తినివేసేటటువంటి ఖుర్బానీని మా వద్దకు తేనంత వరకూ ఏ ప్రవక్తనూ విశ్వసించరాదని అల్లాహ్ మాకు ఆజ్ఞాపించాడు" అని చెప్పిన జనం వారు. ఓ ప్రవక్తా! వారితో ఇలా అను: "నాకు పూర్వం మీ వద్దకు వచ్చిన ప్రవక్తలు ఇతర అనేక మహిమలతోపాటు, మీరు కోరుతున్న ఈ మహిమను కూడా తీసుకువచ్చారు. మరి మీరు సత్యవంతులే అయితే వారిని ఎందుకు చంపారు?"[204]

فَإِن كَذَّبُوكَ فَقَدْ كُذِّبَ رُسُلٌ مِّن قَبْلِكَ
جَاءُوا بِالْبَيِّنَاتِ وَالزُّبُرِ وَالْكِتَابِ الْمُنِيرِ ﴿١٨٤﴾

**184** (ఇంతగా బోధపరచినప్పటికీ) వారు నిన్ను ధిక్కరిస్తే, నీకు పూర్వం కూడా స్పష్టమయిన నిదర్శనాలను, సహీఫాలను, జ్యోతిర్మయమైన గ్రంథాన్ని తీసుకువచ్చిన ప్రవక్తలు కూడా ఇటువంటి ధిక్కారానికి గురయ్యారు.[205]

203. అంటే వారు ఒక వైపు ఇలాంటి అధిక ప్రసంగాలతో అల్లాహ్ పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించటమేగాక, మరోవైపు (వారి పూర్వీకులు) దైవప్రవక్తలను అకారణంగా వధించి మహాపరాధానికి ఒడిగట్టారు. వారి అత్యాచారాలన్నీ దైవసమక్షంలో నమోదు చేయబడ్డాయి. వాటికి ప్రతిఫలంగా వారు నరకాగ్నికి ఆహుతి చేయబడతారు.

204. యూదుల మరో ధిక్కరణ ఇక్కడ ఖండించబడింది. ఆకాశం నుండి అగ్ని వచ్చి ఖుర్బానీ వస్తువును, దానధర్మాలను తినివేసే మహిమను చూపేదాకా మీరు ఏ ప్రవక్తనూ నమ్మవద్దు అని దేవుడు తమకు తాకీదు చేసి ఉన్నాడని యూదులనేవారు. ఈ మాటల ద్వారా వారు చెప్పదలచిందేమిటీ అంటే, "ఓ ముహమ్మద్ (సఅసం)! మీరు ఇప్పటి వరకూ అటువంటి మహిమను మాకు చూపనే లేదు. కాబట్టి దైవాదేశం ప్రకారం మీ దైవదౌత్యాన్ని స్వీకరించవలసిన బాధ్యత మాపై లేదు."

మరి వాస్తవానికి అంతకు మునుపు వచ్చిన ప్రవక్తలు ఇలాంటి మహిమల్ని చూపినా – ఆకాశం నుంచి అగ్ని వచ్చి బలి దానాన్ని తినేసినా – వారు ప్రవక్తలను విశ్వసించలేదు. ఆకాశం నుంచి అగ్ని వచ్చి బలిదానాన్ని తినేస్తే దైవసమక్షంలో తమ సత్కార్యాలు ఆమోదించబడినట్లు లెక్క. ఇటువంటి మహిమను చూపిన ప్రవక్త సత్యవంతుడని కూడా వారు విశ్వసించాలి. కాని యూదులు అలాంటి మహిమల్ని చూపిన ప్రవక్తల్ని నమ్మలేదు సరికదా, వారిని ధిక్కరించారు. మీరు కోరిన మహిమల్ని మీకు చూపిన ప్రవక్తల్ని మరి మీరు ఎందుకు ధిక్కరించారు? మీ మాటల్లో ఏమాత్రం నిజాయితీ ఉన్నా మీరు ఆ ప్రవక్తల్ని ఆదరించాల్సింది! అన్యాయంగా వారిని హతమార్చవలసింది కాదు అని అల్లాహ్ సెలవిచ్చాడు.

205. ఈ వాక్యంలో మహాప్రవక్త (సఅసం)ను ఓదార్చటం జరిగింది. వారు (యూదులు) మిమ్మల్ని ధిక్కరించినందుకు బాధపడకండి. వారు వేసే చొప్పదంటు ప్రశ్నలు, నిర్హేతుకమయిన వాదనలు మిమ్మల్ని మనస్తాపానికి గురిచెయ్యరాదు. ఇలాంటి దుర్వ్యవహారం మీ పట్లనేకాదు, మీకు పూర్వం గతించిన అనేకమంది ప్రవక్తల పట్ల కూడా ఇలాగే జరిగింది అని ఉపదేశించబడింది.

كُلُّ نَفْسٍ ذَآئِقَةُ الْمَوْتِ ۗ وَإِنَّمَا تُوَفَّوْنَ أُجُورَكُمْ يَوْمَ الْقِيٰمَةِ ۖ فَمَنْ زُحْزِحَ عَنِ النَّارِ وَأُدْخِلَ الْجَنَّةَ فَقَدْ فَازَ ۗ وَمَا الْحَيٰوةُ الدُّنْيَآ إِلَّا مَتَاعُ الْغُرُورِ ﴿185﴾

**185** ప్రతి ప్రాణీ మృత్యువు రుచి చూడవలసిందే. ప్రళయదినాన మీరు అందరూ మీ కర్మల పూర్తి ఫలితాన్ని పొందుతారు. అప్పుడు ఎవదు నరకాగ్ని నుంచి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశం కల్పించ బడతాడో అతడు నిశ్చయంగా సఫలీకృతుడయ్యాడు. ప్రాపంచిక జీవితమైతే ఒక మాయావస్తువు తప్ప మరేమీ కాదు.[206]

لَتُبْلَوُنَّ فِيٓ أَمْوٰلِكُمْ وَأَنْفُسِكُمْ ۗ وَلَتَسْمَعُنَّ مِنَ الَّذِينَ أُوتُوا الْكِتٰبَ مِنْ قَبْلِكُمْ وَمِنَ الَّذِينَ أَشْرَكُوٓا أَذًى كَثِيرًا ۚ وَإِنْ تَصْبِرُوا وَتَتَّقُوا فَإِنَّ ذٰلِكَ مِنْ عَزْمِ الْأُمُورِ ﴿186﴾

**186** నిశ్చయంగా మీ ధనప్రాణాల ద్వారా మీరు పరీక్షించ బడతారు.[207] అంతేకాదు, మీకు పూర్వం గ్రంథం వొసగబడిన వారి తరఫునుండీ, ముష్రిక్కుల తరఫునుండీ మీరు బాధాకరమైన మాటలెన్నో వినవలసి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో మీరు గనక సహనం పాటిస్తూ, భయభక్తులతో మసలుకుంటే ఇదెంతో సాహసోపేతమైన పనే![208]

206. ఒకటేమంటే; మరణం ఏదో ఒకనాడు తథ్యం అన్నది తిరుగులేని సత్యం. రెండో విషయం ఏమిటంటే; ప్రపంచంలో ఎవరు మంచి చేసినా చెడు చేసినా దాని పూర్తి ప్రతిఫలం వారికి ఇవ్వబడుతుంది. మూడవదేమంటే; ఈ ప్రపంచ జీవితంలో తమ ప్రభువు అభీష్టానికనుగుణంగా మసలుకుని, దానికి బహుమానంగా నరకాగ్ని బారినుంచి రక్షించబడి స్వర్గసుఖాలను పొందినవాడు సిసలైన విజేత. నాల్గోది : ఈ ప్రపంచం ఓ మాయాజాలం. ఈ మాయలో చిక్కుకుపోకుండా అత్యంత లాఘవంగా తనను కాపాడుకున్నవాడు ధన్యుడు. ఇక్కడి మాయోపాయాలలో, మోసపూరిత వలయంలో దారుణంగా చిక్కుకున్నవాడు విఫలుడయ్యాడు.

207. విశ్వాసులు తమ విశ్వాసానికి తగ్గట్టుగా పరీక్షించబడతారని చెప్పబడింది. అల్ బఖర సూరాలోని 155వ వచనంలో కూడా ఇది వివరించబడింది. ఈ ఆయతు వ్యాఖ్యానంలో ఒక సంఘటన కూడా ప్రస్తావించబడింది. దాని ప్రకారం వంచకుల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబై అప్పటికింకా ముస్లింనని ప్రకటించలేదు. అప్పటికి బద్ర్ యుద్ధం కూడా యింకా జరగలేదు. సాద్ బిన్ ఉబాద (రజి)ను పరామర్శించే ఉద్దేశ్యంతో దైవప్రవక్త (సఅసం) హారిస్ బిన్ ఖజ్రజ్ తెగవారి వైపుకు బయలుదేరారు. దారిలో కొంతమంది కూర్చుని ఉన్నారు. వారిలో ముష్రిక్కులు, యూదులు, అబ్దుల్లా బిన్ ఉబై కూడా ఉన్నారు. ఆయన (స) వాహనం ద్వారా ఎగిరిన ధూళికి అతడు చిరాకుపడ్డాడు. దైవప్రవక్త (స) అక్కడే నిలబడి ఆ సమూహానికి ఇస్లాం సందేశం ఇవ్వసాగారు. దీనిపై అబ్దుల్లా బిన్ ఉబై తీవ్రంగా స్పందించటమేకాక, అసభ్యకరమైన మాటలన్నాడు. అదే సమయంలో అక్కడున్న కొంతమంది ముస్లింలు ఆయన్ని (స) ప్రశంసించసాగారు. రెండు వర్గాల మధ్య మాటా మాటా పెరిగింది. ఒండొకరిపై కత్తులు దూసుకోవటానికి సిద్ధమవుతుండగా ఆయన (స) అందరినీ శాంతపర్చారు. అక్కడి నుంచి సాద్ (రజి) వద్దకు వెళ్ళి జరిగిన దాన్ని గురించి చెప్పారు. దానికి సాద్ (రజి) బాధపడటమే గాక అబ్దుల్లాహ్ బిన్ ఉబైలోని అసహనానికి, వైరభావానికి అసలు కారణమేమిటో చెప్పారు. ఆయన (రజి) కథనం ప్రకారం, మహాప్రవక్త (సఅసం) మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేయక ముందు, మదీనా పౌరులు అబ్దుల్లా బిన్ ఉబైకి కిరీటం తొడిగించి, అతన్ని తమ నాయకునిగా ఎన్నుకోవాలనుకున్నారు. కాని దైవప్రవక్త (స) రావటంతో అతను కన్న అందమైన కల చెదిరిపోయింది. ఆ విషయాన్ని తలచుకుని అతడు రుసరుసలాడేవాడు. అదే దైవప్రవక్త (స) పట్ల అతనిలో గల అక్కసుకు, ఈర్ష్యకు అసలు కారణం. కాబట్టి (ఓ ప్రవక్తా!) తమరు అతని అసహనాన్ని అంతగా పట్టించుకోకండి అని సాద్ బిన్ ఉబాదా (రజి) అభిప్రాయపడ్డారు (సహీహ్ బుఖారీ : కితాబుత్తఫ్సీర్ సారాంశం).

208. ముస్లింల మనసు నొప్పించే వారిలో గ్రంథవహులు ముఖ్యులు. గ్రంథవహులంటే యూదులు, క్రైస్తవులన్నమాట! అరబ్బు బహుదైవారాధకులూ అంతే. దాంతోపాటు మదీనాకు వచ్చిన తరువాత కపటులు కూడా తమ కపట

**187** (జ్ఞాపకం చెయ్యి,) అల్లాహ్ గ్రంథవహుల నుంచి, "మీరు గ్రంథజ్ఞానాన్ని ప్రజలకు తప్పకుండా వివరించాలి. దానిని దాచకూడదు" అని వాగ్దానం తీసుకున్నాడు. అయినప్పటికీ వారు ఈ వాగ్దానాన్ని తమ వీపు వెనుక పడవేయటమేగాక అతి తక్కువ మూల్యానికి దాన్ని అమ్మివేశారు. వారు చేసిన ఈ వర్తకం బహు చెడ్డది.[209]

وَاِذْ اَخَذَ اللّٰهُ مِيْثَاقَ الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ
لَتُبَيِّنُنَّهٗ لِلنَّاسِ وَلَا تَكْتُمُوْنَهٗ ۡ فَنَبَذُوْهُ
وَرَآءَ ظُهُوْرِهِمْ وَاشْتَرَوْا بِهٖ ثَمَنًا قَلِيْلًا ؕ
فَبِئْسَ مَا يَشْتَرُوْنَ ﴿187﴾

**188** తాము చేసిన పనులపై సంబరపడేవారు, తాము చేయని పనికి కూడా తమకు జేజేలు లభించాలని తహతహలాడేవారు శిక్ష నుంచి బయటపడ్తారని నువ్వు అనుకోకు. వారి కొరకైతే వ్యధాభరితమైన శిక్ష ఉంది.[210]

لَا تَحْسَبَنَّ الَّذِيْنَ يَفْرَحُوْنَ بِمَاۤ اَتَوْا وَّيُحِبُّوْنَ
اَنْ يُّحْمَدُوْا بِمَا لَمْ يَفْعَلُوْا فَلَا تَحْسَبَنَّهُمْ بِمَفَازَةٍ
مِّنَ الْعَذَابِ ۚ وَلَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿188﴾

**189** భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌దే. అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం గలవాడు.

وَلِلّٰهِ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ وَاللّٰهُ عَلٰى
كُلِّ شَىْءٍ قَدِيْرٌ ﴿189﴾

---

చేష్టలతో తీవ్ర మనస్తాపానికి గురి చేశారు. ముఖ్యంగా కపటాగ్రేసరుడైన అబ్దుల్లా బిన్ ఉబై మహాప్రవక్త (స) వారిని అడుగడుగునా కించపరచేవిధంగా మాట్లాడేవాడు. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు మహాప్రవక్త (స) రాకతో అతని పదవి చేజారిపోయింది. ప్రతీకారేచ్ఛతో లోలోపలే రగిలిపోతూ ఉండేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లింలు రెచ్చిపోయి, వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా తయారుచేసే బదులు నిగ్రహంతో, సమయ స్ఫూర్తితో వ్యవహరించాలనీ, ఎదుటి వారిపట్ల వీలయినంత వరకు మన్నింపుల వైఖరిని అవలంబించాలని తాకీదు చేయబడింది. ఈ పరిణామం ద్వారా బోధపడే ఒక ముఖ్య విషయం ఏమిటంటే సన్మార్గం వైపుకు ప్రజలను పిలిచేవారికి కష్టాలు రావటం, మనసు నొప్పించే సంఘటనలు ఎదురవటం ఎంతో సహజం, అనివార్యం కూడా. దీనికి విరుగుడు ఒక్కటే – ఓర్పుతో వ్యవహరిస్తూ దైవసహాయాన్ని అర్థించటం (ఇబ్నె కసీర్).

209. ఇది గ్రంథవహులకు చేయబడిన హెచ్చరిక. గ్రంథం (తౌరాత్, ఇంజీల్)లో ఉన్న విషయాలను, అంతిమ దైవప్రవక్త గురించి ఇవ్వబడిన సూచనలను ఎలాంటి దాపరికం లేకుండా ప్రజలకు వివరించాలని దేవుడు వారినుంచి ప్రమాణం తీసుకున్నాడు. కాని స్వల్పమైన ప్రాపంచిక ప్రయోజనాల కోసం వారు దైవానికిచ్చిన మాటను వీపు వెనుక పడవేశారు. ఈ ఆయతు ద్వారా విదితమయ్యే మరో ముఖ్యాంశం ఏమిటంటే పండితులు, మేధావులనబడేవారు తమ వద్ద గల ప్రయోజనకరమయిన విద్యా విషయాలను దాచకుండా లోకానికి చాటిచెప్పాలి. తద్వారా ప్రజల అంధవిశ్వాసాలు సంస్కరించబడి, వారు రుజుమార్గాన పయనించే అవకాశముంది. స్వార్థప్రయోజనాల కోసం, పదవుల కోసం విద్యను, శాస్త్రాలను కప్పిపుచ్చటం మహాపరాధం. ప్రళయదినాన అటువంటి వారికి అగ్ని కళ్ళెం వేయబడుతుంది (హదీసు).

210. తాము చేసిన ఘనకార్యాల గురించి మాత్రమే గాకుండా చేయని వాటి గురించి ప్రజలు తమను పొగడాలనీ ఉవ్విళ్ళూరే వారు ఈ వాక్యంలో గట్టిగా మందలించబడ్డారు. దైవప్రవక్త కాలంలో కొంతమందిలో ఈ 'ప్రదర్శనా జాడ్యం' ఉండటం వల్ల వారిని సంస్కరించే ఉద్దేశ్యంతో ఈ వాక్యం అవతరించింది. ఇలాంటి వారు నేడు లోకంలో మరీ ఎక్కువై పోయారు. ప్రజాసేవ కోసం వారికి పదవి కావాలి. పదవి లేనిదే, పత్రికల్లో తమ పేరు పడనిదే వారు ప్రజా సేవ చేయరు. సన్మానాలు చేసి పూలదండలు వేయనిదే వారు సంక్షేమ కార్యాల కోసం చందాలు ఇవ్వరు. ఈ ఆయతు ద్వారా బోధపడే మరో విషయం ఏమిటంటే యూదులు దైవగ్రంథంలో హెచ్చుతగ్గులు చేసేవారు. తమ ఉద్దేశాలకనుగుణంగా మార్చుకునేవారు. ఇంతచేసి కూడా వారు తమ కృత్యాలపై సిగ్గుపడే బదులు సంబరపడేవారు. నేటి మిథ్యావాదులు కూడా అంతే. వారు ప్రజలకు అపమార్గం పట్టించే ప్రకటనలు చేస్తూ, దైవ వచనాలకు వక్రభాష్యం

190 నిశ్చయంగా భూమ్యాకాశాల సృష్టిలో, రేయింబవళ్ల రాకపోకలలో విజ్ఞులకు ఎన్నో సూచనలున్నాయి.[211]

191 వారు నిల్చుని, కూర్చుని, తమ పడకలపై ఒత్తిగిలి అల్లాహ్‌ను స్మరిస్తూ ఉంటారు. భూమ్యాకాశాల సృష్టి గురించి యోచన చేస్తూ ఉంటారు. వారిలా అంటారు : "మా ప్రభూ! నువ్వు ఈ సృష్టిని నిరర్థకంగా చేయలేదు. నువ్వు పవిత్రుడవు. మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుంచి కాపాడు."[212]

إِنَّ فِي خَلْقِ السَّمَٰوَٰتِ وَالْأَرْضِ وَاخْتِلَٰفِ الَّيْلِ وَالنَّهَارِ لَءَايَٰتٍ لِّأُولِي الْأَلْبَٰبِ ﴿١٩٠﴾
الَّذِينَ يَذْكُرُونَ اللَّهَ قِيَٰمًا وَقُعُودًا وَعَلَىٰ جُنُوبِهِمْ وَيَتَفَكَّرُونَ فِي خَلْقِ السَّمَٰوَٰتِ وَالْأَرْضِ رَبَّنَا مَا خَلَقْتَ هَٰذَا بَٰطِلًا سُبْحَٰنَكَ فَقِنَا عَذَابَ النَّارِ ﴿١٩١﴾

చెప్పి ప్రజలను అయోమయంలో పడవేస్తూ ఉంటారు. పైగా తాము చేసింది చాలా గొప్పపని అనుకుని ఊరట చెందుతూ ఉంటారు. తమ వర్గం మాత్రమే సత్యవర్గమనీ సగర్వంగా చాటిచెబుతూ ఉంటారు – తస్మాత్ జాగ్రత్త!

211. అంటే భూమ్యాకాశాల నిర్మాణంపై, నిఖిల జగతిలోని నిత్యనూతన నిదర్శనాలపై చింతన చేసేవారికి సృష్టికర్త గురించి, ఆయన గుణగణాల గురించి క్షుణ్ణంగా బోధపడుతుంది. సువిశాలమైన ఈ విశ్వమండలం ఎలాంటి ఆటంకమూ, లోపమూ లేకుండా ఎంతో సజావుగా సాగిపోవటం వారిని అబ్బురపరుస్తుంది. దీనివెనుక ఓ ప్రణాళికా రచయిత ఉన్నాడనీ, ఆయన అనుజ్ఞ ప్రకారమే ఇదంతా జరుగుతోందని, ఆ మహాశక్తివంతుడు అల్లాహ్‌యేనని వారికి అవగతమవు తుంది. ఈ విధంగా యోచించటం బుద్ధివివేకాలున్నవారికే సాధ్యమవుతుంది. జ్ఞానోదయం అయిన తరువాత వారు కాలక్షేపం చేస్తూ కూర్చోరు. వారు కూర్చుని ఉన్నా, నిలబడి ఉన్నా, పడకపై మేను వాల్చినా ఆ సర్వోన్నత ప్రభువు నామాన్ని స్మరిస్తూ ఉంటారు. ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. ఆయనకు తమ శ్రద్ధాభక్తుల నివాళి ఘటిస్తూ ఉంటారు.

హదీసులో వచ్చింది. మహాప్రవక్త (సఅసం) వారు **'ఇన్న ఫీ ఖల్‌ఖిస్సమావాతి'** అనే ఆయతు మొదలుకుని ఈ సూరా ఆఖరివరకూ రాత్రి తహజ్జుద్ నమాజ్ కొరకు లేచినపుడు పఠించేవారు. ఆ తరువాత వుజూ చేసేవారు (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్, సహీహ్ ముస్లిం; కితాబు సలాతిల్ ముసాఫిరీన్....)

212. ఈ పది ఆయతుల్లోని మొదటి ఆయతులో అల్లాహ్ తన శక్తియుక్తులను, అనితర సాధ్యమైన తన ప్రజ్ఞను విశదపరచి బుద్ధివివేకాలు గలవారు మాత్రమే ఈ నిదర్శనాలను గ్రహిస్తారని అన్నాడు. ఇన్ని నిదర్శనాలు కళ్ళ ముందర ఉన్నప్పటికీ వాటిని గురించి పట్టించుకోనివారికి, ఇంకా దేవుని ఉనికికి సంబంధించిన జ్ఞానోదయం కాలేదని అనుకోవాలి. కాని విచిత్రం ఏమిటంటే లోకంలో తమ నిజ ప్రభువు గురించి తీవ్రమయిన సంశయానికి, సందిగ్ధానికి లోనై సవాలక్ష ప్రశ్నలు వేసేవారే ఈనాడు మహాజ్ఞానులుగా, మేధా సంపన్నులుగా చెలామణీ అవుతున్నారు. **ఫ యిన్నా లిల్లాహి వ యిన్నా ఇలైహి రాజివూన్!;** తరువాతి వచనంలో దైవనామ స్మరణ చేసేవారి, దైవ నిదర్శనాలపై యోచన చేసేవారి ప్రస్తావన వచ్చింది. హదీసులో కూడా దీని గురించి వివరించబడింది. మహనీయ ముహమ్మదు (స) వారు ఇలా ఉపదేశించారు: "నిలబడి నమాజు చేయండి, ఒకవేళ నిలబడి నమాజు చేయలేకపోతే కూర్చొని నమాజు చేయండి. కూర్చుని కూడా నమాజు చేయలేకపోతే పరుండి – ఒక ప్రక్కకు ఒత్తిగిలి – నమాజు చేయండి" (సహీహ్ బుఖారీ ; కితాబుస్సలాత్).

ఇలాంటి సజ్జనులు ఎల్లవేళలా అల్లాహ్‌ను స్మరిస్తూ ఉంటారు. భూమ్యాకాశాల సృష్టి ప్రక్రియలోని పరమార్థంపై యోచన చేస్తారు. తద్వారా వారికి సృష్టికర్త ప్రజ్ఞా పాటవాలు, ఔన్నత్యం, అధికారం, కారుణ్యం – ఇత్యాది విషయాలు తెలిసివస్తాయి. ఈ విశ్వవ్యవస్థ ఉత్తుత్తిగానే ఉనికిలోకి రాలేదనీ, దాసుల పరీక్షార్థమే ఇదంతా జరిగిందన్న సంగతి వారికి సుబోధకం అవుతుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు స్వర్గసుఖాలకు అర్హులవుతారనీ, ఉత్తీర్ణులు కానివారికి నరకమే గతి అని కూడా వారికి బోధపడుతుంది. అందుకే వారు తమను నరకాగ్ని నుంచి కాపాడమని దీనంగా వేడుకుంటారు. ఆ తరువాతి మూడు ఆయతులలో కూడా మన్నింపుకై, పరాభవ స్థితి రాకుండా ఉండేందుకై ప్రభువును ప్రార్థించటం జరిగింది.

**192** "ఓ మా పోషకుడా! నువ్వెవరినైతే నరకాగ్నిలో పడవేస్తావో, వాణ్ణి నువ్వు పరాభవానికి, అవమానానికి గురి చేసినట్లే. యదార్థానికి దుర్మార్గులకు తోడ్పడేవారెవరూ ఉండరు."

رَبَّنَآ إِنَّكَ مَن تُدْخِلِ النَّارَ فَقَدْ أَخْزَيْتَهُ ۖ
وَمَا لِلظَّٰلِمِينَ مِنْ أَنصَارٍ ﴿192﴾

**193** "మా ప్రభూ! పిలిచేవాడొకడు విశ్వాసం (ఈమాన్) వైపుకు పిలవటం, 'ప్రజలారా! మీ ప్రభువును విశ్వసించండి' అని పిలుపునివ్వటం మేము విన్నాము. అంతే! మేము విశ్వసించాము. కనుక ఓ ప్రభూ! మా పాపాలను క్షమించు. మా చెడుగులను మా నుంచి దూరం చెయ్యి. సజ్జనులతోపాటు మాకు మరణం వొసగు."

رَّبَّنَآ إِنَّنَا سَمِعْنَا مُنَادِيًا يُنَادِي لِلْإِيمَٰنِ أَنْ
ءَامِنُوا بِرَبِّكُمْ فَـَٔامَنَّا ۚ رَبَّنَا فَٱغْفِرْ لَنَا ذُنُوبَنَا
وَكَفِّرْ عَنَّا سَيِّـَٔاتِنَا وَتَوَفَّنَا مَعَ الْأَبْرَارِ ﴿193﴾

**194** "మా ప్రభూ! నీ ప్రవక్తల ద్వారా నీవు మాకు చేసిన వాగ్దానం ప్రకారం మమ్మల్ని అనుగ్రహించు. ప్రళయదినాన మమ్మల్ని అవమానపరచకు. ఎట్టి పరిస్థితిలోనూ నీవు వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరించేవాడవు కావు."

رَبَّنَا وَءَاتِنَا مَا وَعَدتَّنَا عَلَىٰ رُسُلِكَ وَلَا تُخْزِنَا
يَوْمَ الْقِيَٰمَةِ ۗ إِنَّكَ لَا تُخْلِفُ الْمِيعَادَ ﴿194﴾

**195** వారి ప్రభువు వారి మొరను ఆలకించి ఆమోదించాడు[213]: "మీలో పని చేసేవారి పనిని – వారు పురుషులైనా సరే, స్త్రీలయినాసరే – నేను వృథా చేయను.[214] మీరు పరస్పరం ఒకే కోవకు చెందినవారు.[215] కాబట్టి తమ స్వస్థలం వదలి వలస వెళ్ళినవారు (హిజ్రత్ చేసినవారు), తమ ఇళ్ళనుంచి వెళ్లగొట్ట బడినవారు, నా మార్గంలో వేధింపులకు గురైనవారు, నా మార్గంలో పోరాడి చంపబడినవారు – అటువంటి వారి

فَٱسْتَجَابَ لَهُمْ رَبُّهُمْ أَنِّي لَآ أُضِيعُ عَمَلَ
عَٰمِلٍ مِّنكُم مِّن ذَكَرٍ أَوْ أُنثَىٰ ۖ بَعْضُكُم مِّنۢ
بَعْضٍ ۖ فَٱلَّذِينَ هَاجَرُوا وَأُخْرِجُوا مِن دِيَٰرِهِمْ
وَأُوذُوا فِي سَبِيلِي وَقَٰتَلُوا وَقُتِلُوا لَأُكَفِّرَنَّ
عَنْهُمْ سَيِّـَٔاتِهِمْ وَلَأُدْخِلَنَّهُمْ جَنَّٰتٍ تَجْرِي مِن

213. అరబీలో **'ఫస్తజాబ'** ( فَاسْتَجَابَ ) అని ఉంది. అంటే వారి వేడుకోలును ఆమోదించాడు అని ఇక్కడ దాని భావం (ఫత్హుల్ ఖదీర్).

214. **'పురుషులైనా, స్త్రీలైనా'** అని నొక్కి చెప్పటంలోని ముఖ్య ఉద్దేశం ఏమిటంటే పుణ్యఫలం ప్రాప్తించే విషయంలో ఎలాంటి విచక్షణకు, హెచ్చుతగ్గులకు ఆస్కారం లేదు. కొన్ని కొన్ని విషయాలలో ఇస్లాం స్త్రీ పురుషుల కార్యపరిధులను వేరుపరచటం వల్ల బహుశా పుణ్యఫలంలో కూడా తేడా ఉంటుందేమోనన్న సందేహం ఎవరికయినా కలగవచ్చు. ఉదాహరణకు : కుటుంబ యాజమాన్యం, సంపాదనా బాధ్యత, ధర్మయుద్ధంలో పాల్గొనటం, వారసత్వంలో సగం వాటా స్త్రీలకు ఇవ్వటం – ఇత్యాది విషయాలను బట్టి సత్కార్యాల పుణ్యఫలంలో కూడా హెచ్చుతగ్గులుంటాయేమోనని అనుమానం రావచ్చు. కాని హెచ్చుతగ్గులేమీ ఉండవు. ఒక మంచి పనిచేసినందుకు పురుషులకు లభించే పుణ్యఫలమే స్త్రీలకూ లభిస్తుంది.

215. ఈ వాక్యం వెనుకటి వాక్యంతో ముడిపడినది. విధేయతలోనూ, పుణ్య ఫలప్రాప్తి విషయంలోనూ స్త్రీ పురుషులంతా ఒకే తరహాకు చెందినవారు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఒకసారి ఉమ్మె సలమా (ర.అన్హా) దైవప్రవక్త నుద్దేశించి, 'ఓ దైవప్రవక్తా (సఅసం)! హిజ్రత్ సందర్భంగా స్త్రీల ప్రస్తావన రాలేదేమీ?' అని ప్రశ్నించగా ఈ ఆయతు అవతరించింది (తఫ్సీరె తబ్రీ, ఇబ్నె కసీర్, ఫత్హుల్ ఖదీర్).

تَحْتِهَا الْأَنْهٰرُ ۚ ثَوَابًا مِّنْ عِنْدِ اللّٰهِ ۗ وَاللّٰهُ عِنْدَهٗ حُسْنُ الثَّوَابِ ﴿١٩٥﴾

చెడుగులను వారి నుంచి దూరం చేస్తాను. క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలో వారిని ప్రవేశింపజేస్తాను. ఇదీ అల్లాహ్ తరఫున వారికి లభించే పుణ్యఫలం. అల్లాహ్ వద్దనే అత్యుత్తమమయిన పుణ్యఫలం ఉంది" అని సెలవిచ్చాడు.

لَا يَغُرَّنَّكَ تَقَلُّبُ الَّذِيْنَ كَفَرُوْا فِي الْبِلَادِ ﴿١٩٦﴾

**196** (ఓ ప్రవక్తా!) నగరాలలో దైవ తిరస్కారుల స్వేచ్ఛా సంచారం నిన్ను మోసపుచ్చకూడదు.[216]

مَتَاعٌ قَلِيْلٌ ۗ ثُمَّ مَاْوٰىهُمْ جَهَنَّمُ ۗ وَبِئْسَ الْمِهَادُ ﴿١٩٧﴾

**197** ఇది చాలా స్వల్ప ప్రయోజనం మాత్రమే.[217] ఆ తరువాత నరకమే వారి నివాస స్థలం అవుతుంది. అదెంతో అధ్వాన్నమైన స్థలం.

لٰكِنِ الَّذِيْنَ اتَّقَوْا رَبَّهُمْ لَهُمْ جَنّٰتٌ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْأَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَا نُزُلًا مِّنْ عِنْدِ اللّٰهِ ۗ وَمَا عِنْدَ اللّٰهِ خَيْرٌ لِّلْأَبْرَارِ ﴿١٩٨﴾

**198** కాని తమ ప్రభువుకు భయపడుతూ మసలుకునేవారి కోసం క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలున్నాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. ఇదీ అల్లాహ్ వద్ద నుంచి వారికి లభించే ఆతిథ్యం. సద్వర్తనుల కోసం అల్లాహ్ వద్ద ఉన్నది అన్నింటికంటే శ్రేష్ఠమైనది.[218]

216. ఈ మాట దైవప్రవక్త (స) నుద్దేశించి చెప్పబడినప్పటికీ ఇది సమస్త ముస్లిం సమాజానికి వర్తిస్తుంది. పట్టాణాలలో సంచరించటం అంటే వర్తకం కోసమో, ఇతరత్రా వ్యవహారాల కోసమో ఒక నగరం నుంచి ఇంకో నగరానికి, ఒక దేశం నుంచి వేరొక దేశానికి రాకపోకలు సాగించటం అని భావం. ఈ సంచారం వాణిజ్య అభివృద్ధికి, ప్రాపంచిక వ్యవహారాల పురోగతికి ప్రబల తార్కాణం. అయితే ఇవన్నీ తాత్కాలికమైనవనీ, కొద్దిపాటి లాభం మాత్రమేననీ, ఈ హడావిడిని, సందడిని చూసి విశ్వాసులు ఆందోళన చెందవలసిన పని లేదనీ అల్లాహ్ ధైర్యం చెబుతున్నాడు. విశ్వాసి అయినవాడు సదా అంతిమ పరిణామంపై దృష్టి నిలపాలి. విశ్వాసం గనక లోపిస్తే శాశ్వితమైన నరకాగ్నిని చవిచూడవలసి ఉంటుంది. ప్రాపంచిక సిరిసంపదలలో మునిగి తేలుతున్న అవిశ్వాసులు ఈ నరకాగ్నికి పాత్రులవుతారు. ఈ అంశం దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల వివరించబడింది. ఉదాహరణకు : (1). "అవిశ్వాసులైనవారే అల్లాహ్ ఆయతుల విషయంలో జగడాలకు దిగుతారు. కాబట్టి పట్టణాలలో వారు తిరుగాడటం నిన్ను మోసంలో పడవేయరాదు" (అల్ మోమిన్ - 4). (2.) "ఓ ప్రవక్తా! ఇలా ప్రకటించు: అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టేవారు ఎన్నటికీ సాఫల్యాన్ని పొందలేరు. వారు కొన్ని రోజులపాటు ఇహలోక జీవితంలో సుఖాలను అనుభవిస్తారేమో. కాని తరువాత వారెలాగూ మా వైపునకు మరలి రావలసిందే" (యూనుస్-70). (3). "మేము వారికి కొంతకాలం ప్రపంచంలో సుఖాలను అనుభవించే అవకాశాన్ని ఇస్తున్నాము, తరువాత వారిని అశక్తులుగా చేసి ఒక కఠోర శిక్ష వైపునకు లాగుకొనిపోతాము" (లుఖ్మాన్ - 24).

217. అంటే ఈ ప్రాపంచిక సుఖసౌఖ్యాలు, భోగవిలాసాలు పైకి ఎంత ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి అవి బహుస్వల్పమైనవి. ఎందుకంటే చివరకు అవన్నీ అంతమయ్యేవే. అవి అంతం కాక పూర్వమే వాటిని అనుభవించే వారు కూడా అంతమవుతారు. ఈ ప్రాపంచిక లాభాలను, భోగవిలాసాలను జుర్రుకునే ప్రయత్నంలో వారు అల్లాహ్‌ను విస్మరిస్తున్నారు. అన్ని రకాల నైతిక నియమాలను, కట్టుబాట్లను, దేవుడు విధించిన హద్దులను అతిక్రమించే వీరు చివరకు సాధించేదేమిటీ?

218. పైన పేర్కొనబడిన వారికి భిన్నంగా అల్లాహ్ పట్ల భయభక్తులతో జీవితం గడుపుతూ, సదాచరణ చేస్తూ ఉండేవారున్నారు. వారి వద్ద ఆస్తీ అంతస్థులు లేకపోవచ్చు. పలుకుబడి లేకపోవచ్చు. అయినాసరే దైవసన్నిధిలో వారు ఆదరించబడతారు.

وَإِنَّ مِنْ أَهْلِ الْكِتٰبِ لَمَنْ يُّؤْمِنُ بِاللّٰهِ وَمَآ أُنْزِلَ إِلَيْكُمْ وَمَآ أُنْزِلَ إِلَيْهِمْ خٰشِعِيْنَ لِلّٰهِ لَا يَشْتَرُوْنَ بِاٰيٰتِ اللّٰهِ ثَمَنًا قَلِيْلًا أُولٰٓئِكَ لَهُمْ أَجْرُهُمْ عِنْدَ رَبِّهِمْ إِنَّ اللّٰهَ سَرِيْعُ الْحِسَابِ ﴿١٩٩﴾

**199** గ్రంథవహులలో కొందరున్నారు – వారు అల్లాహ్‌ను, మీపై అవతరించిన దానినీ, వారి వైపునకు అవతరించిన దాన్ని కూడా విశ్వసిస్తారు. అల్లాహ్‌కు భయపడుతూ ఉంటారు.[219] అల్లాహ్ ఆయతులను కొద్దిపాటి మూల్యానికి అమ్ముకోరు. అలాంటివారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంది. నిశ్చయంగా అల్లాహ్ వేగంగా లెక్క తీసుకుంటాడు.

يٰٓأَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اصْبِرُوْا وَصَابِرُوْا وَرَابِطُوْا وَاتَّقُوا اللّٰهَ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ ﴿٢٠٠﴾

**200** ఓ విశ్వసించిన వారలారా! మీరు సహనస్థయిర్యాలను ప్రదర్శించండి.[220] పరస్పరం సహనం గురించి బోధించుకుంటూ, (అల్లాహ్ మార్గంలో పోరుకు) సమాయత్తమై ఉండండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు.

---

వారు దేవుని ఆతిథ్యం పొందుతారు. ప్రపంచంలో అవిశ్వాసులకు, ముష్రిక్కులకు లభించిన భాగ్యాలకన్నా విలువైన, శ్రేష్ఠమైన భాగ్యాలు ఈ సజ్జనులకు సర్వలోకప్రభువైన అల్లాహ్ దగ్గర లభిస్తాయి.

219. మహాప్రవక్త (సఅసం) దైవదౌత్యాన్ని సత్యమని ధృవీకరించి, విశ్వాస భాగ్యం పొందిన గ్రంథవహుల్లోని సజ్జనుల ప్రస్తావన ఇక్కడ వచ్చింది. వారిలోని విశ్వాసాన్ని, ఇతర సద్గుణాలను కొనియాడుతూ అల్లాహ్ గ్రంథవహుల్లో వారి వైశిష్ట్యాన్ని స్పష్టపరిచాడు. అంటే గ్రంథవహుల్లోని అత్యధికులు ఇస్లాం మరియు ఇస్లాం ప్రవక్త (స)కు విరుద్ధంగా కుట్రలు పన్నుతుండగా, వారి వర్గానికే చెందిన కొద్దిమంది సజ్జనులు సత్యామృతాన్ని ఆస్వాదించి దేవుని దృష్టిలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారయ్యారు. ఎందుకంటే వీరు నిత్యం అల్లాహ్‌కు భయపడుతూ జీవించేవారు. జానెడు పొట్ట నింపుకోవటం కోసం దైవవాక్యాలను అమ్ముకునే రకం కాదు వీరు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం దైవవచనాలను పణంగా పెట్టేవారు, వాటికి వక్రభాష్యం చెప్పేవారు – లోకం దృష్టిలో ఎంతగొప్ప విద్వాంసులుగా, గురువులుగా చెలామణీ అయినప్పటికీ – దేవుని దృష్టిలో వారు విశ్వాసానికి, భక్తీ తత్పరతకు దూరమైపోయారు. హాఫిజ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: "గ్రంథవహుల్లో అల్లాహ్ చేత కొనియాడబడిన ఈ విశ్వాసులు యూదవర్గంలో పట్టుమని పదిమంది కూడా లేరు. అయితే క్రైస్తవుల్లో చాలామంది ఇస్లాం స్వీకరించారు" (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

220. ఇక్కడ సహన స్థయిర్యాలను ప్రదర్శించటమంటే అర్థం మనోవాంఛలను అదుపులో ఉంచుకోవటం, విషయలోలత్వానికి దూరంగా ఉండటం, దైవాజ్ఞాపాలనకై మనసును సమాయత్తం చేయటం అన్నమాట! యుద్ధ సందర్భాలలో శత్రువుకు భయపడకుండా మొక్కవోని సాహసాన్ని **'ముసాబరత్' (مُصَابَرَة)** అంటారు. ఇది సహనంలో అత్యంత కఠినతరమైన పరిస్థితి. అందుకే దీనిని వేరుగా ప్రస్తావించటం జరిగింది. యుద్ధరంగంలో చక్కని సమన్వయంతో, పటిష్టమైన రణనీతితో అప్రమత్తంగా ఉండాలని తాకీదు చేయబడింది. **'రాబితూ' (رَابِطُوْا)** అంటే యుద్ధమైదానంలో మోహరించిన స్థలాల్లో అత్యంత అప్రమత్తతతో దైవమార్గంలో పోరాటం కోసం సమాయత్తమై ఉండటం. అందుకే "దైవమార్గం (యుద్ధం)లో ఒక్కరోజు చేసిన మోహరింపు ప్రపంచం మరియు అందులో వున్న సర్వస్వం కన్నా శ్రేష్ఠమైనది" అని హదీసులో అనబడింది (సహీహ్ బుఖారీ – బాబు ఫజ్లి రిబాత్). "మనసుకు భారంగా ఉండే పరిస్థితుల్లో పూర్తిగా వుజూ చేసి, చాలా దూరం వరకు మస్జిదులకు నడచిరావటం, ఒక నమాజు చేసి మరో నమాజు కొరకు మస్జిదులలో నిరీక్షించటం కూడా 'మోహరింపు' (రిబాత్) గానే పరిగణించబడింది" (సహీహ్ ముస్లిం – కితాబుత్తహార).

4వ సూరా

# అన్ నిసా

## (స్త్రీలు)

అవతరణ మదీనాలో

ఆయతులు 176

### పరిచయం

*ఈ సూరాలోని ఆయతులు ముఖ్యంగా ఇస్లామీయ చట్టాలకు, మహిళల హక్కులకు, ఇతర సాంఘిక సమస్యలకు సంబంధించినవి. ఈ సూరాలో అనేక నైతిక సూత్రాలు కూడా ప్రస్తావించబడ్డాయి. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి, ఉత్తమమైన మానవ సంబంధాలకు ఇవి ఎంతయినా అవసరం. ఈ సూరా ముఖ్యంగా స్త్రీల సమస్యలను ప్రస్తావించింది. స్త్రీల హక్కులు, వివాహానికి సంబంధించి వారి హక్కులు, కుటుంబంలో, వారసత్వపు ఆస్తిలో వారి హక్కులను ప్రస్తావించింది. అందువల్లనే ఈ సూరాకు* ***"అన్ నిసా"*** *(స్త్రీలు) అని పేరు పెట్టబడింది. ఈ సూరా ప్రారంభ వచనం అల్లాహ్ పట్ల భయభక్తులను ప్రస్తావించింది. ఈ ప్రస్తావన ద్వారా ఈ సూరాకు సంబంధించిన అసలు విషయాలకు కావలసిన నేపథ్యాన్ని ఇవ్వడం జరిగింది. అంటే ఇస్లామీయ చట్టాలకు సంబంధించిన సమాచారాన్ని అల్లాహ్ పట్ల భయం కలిగి ఉండాలన్న హెచ్చరికతో అందించడం జరిగింది. అల్లాహ్ పట్ల భయభక్తులు లేనిదే చట్టాన్ని పాటించడం అన్నది జరగదు. ప్రజలు దానికి కట్టుబడడం జరగదు. ధార్మిక విశ్వాసానికి – సాంఘిక వ్యవహారాలకు మధ్య అవినాభావ సంబంధం ఉందన్న విషయాన్ని ఈ విధంగా స్పష్టం చేసింది. ప్రారంభ వచనంలో మానవాళి యావత్తు ఒకే తండ్రి ఆదం (అస) సంతానమని తెలియజేసింది. ఈ సూరాను రెండు విభాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగం ఇస్లామీయ శాసనాలకు సంబంధించినది. రెండవ విభాగం ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించినది. ఈ రెండు విభాగాల్లోనూ మనిషి నడవడి గురించిన ఆదేశాలున్నాయి.*

*ఈ సూరా గ్రంథ ప్రజలను ఉద్దేశించి కొన్ని ముఖ్యమైన విషయాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ధార్మిక విశ్వాసానికి సంబంధించి దేవునికి భాగస్వాములను, సహవర్తులను నిలబెట్టడం గురించి, అల్లాహ్‌కు సంబంధించి అబద్ధాలు కల్పించడం గురించి ప్రస్తావిస్తూ, ఈ చేష్టలు ఘోరమైన నేరాలనీ, క్షమించరాని పాపాలని హెచ్చరించింది. ఇందులో చెప్పబడిన మరొక ముఖ్యమైన విషయం – యూదులు దైవ వచనాలను వాటి సందర్భం నుంచి తొలగించి, వాటికి ఇష్టం వచ్చిన తాత్పర్యం చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, మూసా ప్రవక్త (అస) పట్ల యూదుల వ్యవహారశైలినీ, ఆయనకు వారు పెట్టిన ఇబ్బందులనూ వివరించడం జరిగింది. యూదులు మూసా ప్రవక్త (అస)ను తమకు దేవుడిని ప్రత్యక్షంగా చూపించమని అడిగారు. వారు ఆవుదూడను పూజించేవారు. నిషిద్ధమైన వడ్డీ తినేవారు. వాగ్దాన భంగానికి పాల్పడేవారు. అల్లాహ్ చిహ్నాలను విశ్వసించడానికి నిరాకరించేవారు. ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించేవారు. కొందరు ప్రవక్తలను హతమార్చారు. మర్యంకు సంబంధించి భయంకరమైన అపవాదు సృష్టించారు. మర్యం కుమారుడు ఈసా ప్రవక్త (అస)ను తాము హతమార్చామని భావించారు. ఈ సూరా ప్రకారం తౌరాతు గ్రంథంలో రాబోయే ప్రవక్త గురించిన వర్ణన పూర్తిగా ముహమ్మద్ (స)కు అన్వయించేదిగా, స్పష్టంగా ఉంది. కాని యూదులు దానిని వక్రీకరించి తాత్పర్యం చెప్పుకున్నారు.*

*ఈ సూరా దేవుడు ఒక్కడే అని గట్టిగా నొక్కి చెప్పింది. ఈసా ప్రవక్త (అస), దేవుని ప్రవక్త మాత్రమే అనీ, ఆయన మర్యం కుమారుడనీ, ఆయనను హత్య చేయడం కాని, ఆయనను శిలువ వేయడం కాని జరగలేదనీ, అల్లాహ్ ఆయన్ను తన వైపునకు పిలుచుకున్నాడని తెలిపింది. విశ్వాసులు ఒకే ఒక్క దేవుడైన, అల్లాహ్‌ను, ఆయన దూతలను, గత కాలంలో అవతరించిన గ్రంథాలను, దైవప్రవక్తలను, తీర్పుదినాన్ని విశ్వసించాలని ప్రబోధించింది.*

*ఈ సూరా కపట విశ్వాసుల గురించి కూడా ప్రస్తావించింది. కపట విశ్వాసులు పైకి మాత్రం తాము ఇస్లాంను విశ్వసించామని అంటారు. కాని ఆచరణలో వారు ప్రవక్త ముహమ్మద్(స) ఆదేశాలను ఏమాత్రం పాటించరు. పైగా అవిశ్వాసులు, బహుదైవారాధకులయిన ఎడారి అరబ్బు తెగలకు తమ సహాయ సహకారాలు కొనసాగిస్తూ వచ్చారు. ముస్లిములను నిరాశా నిస్పృహలకు గురిచేసే పుకార్లు వ్యాపించేలా చేసేవారు. ఇలాంటి వారికి పరలోకంలో బాధాకరమైన కఠినమైన శిక్ష తప్పదని హెచ్చరించింది.*

# సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 47 | 133 | 'సబ్బత్ నియమ అతిక్రమణ' | శనివారం వాళ్లు ఎవరు? వారిపై అల్లాహ్ ఆగ్రహం ఎందుకు విరుచుకుపడింది? అల్లాహ్ వారిని ఏ విధంగా శిక్షించాడు? |
| 51 | 285 | 'కందక యుద్ధం' | కేవలం మక్కా బహుదైవారాధకులను మెప్పించటం కోసం, వారి నుంచి తాత్కాలిక సహాయసహకారాలు పొందటం కోసం ఏకదైవారాధన కంటే బహుదైవారాధనే గొప్పదని చెప్పిన ఆ ధర్మవిహీనులు ఎవరు? |
| 54 | 30,55<br>51, 60<br>83, 127<br>136 | 'ఇబ్రాహీమ్ ప్రవక్త' 'ఇస్‌హాఖ్ ప్రవక్త' 'యాఖూబ్ ప్రవక్త' 'యూసుఫ్ ప్రవక్త' 'మూసా ప్రవక్త' 'మధుర స్వరం కలిగిన పాలకుడు' 'ప్రవక్త సులైమాన్' | ఇబ్రాహీమ్ ప్రవక్త సంతానంలో చాలామంది ప్రవక్తలు పుట్టారు. వారిలో యూసుఫ్, దావూద్, సులైమాన్ వంటి ప్రవక్తలకు రాజ్యాధికారం కూడా అనుగ్రహించబడింది. చివరకు ఈసా, ముహమ్మద్(స)లు కూడా ఇబ్రాహీమ్ ప్రవక్త వంశీయులే. అయితే ఆయన వంశంలోని ఒక ఉపవంశ మైన యూదులు అంతిమ దైవప్రవక్త తమ వంశధారలో పుట్టనందుకు ముహమ్మద్ (స)పై అసూయతో ఉన్నారు. |
| 88 | 272 | 'పిరికి పంద' | కపటుల నమ్మకద్రోహం వల్ల యుద్ధానికి బయలుదేరిన ముస్లిం సేనల్లో కలకలం రేగింది. భేదాభిప్రాయాలు తలెత్తే ప్రమాదమూ ఏర్పడింది. మరి ఆ తర్వాత ఏం జరిగింది? |
| 153 | 97-100 | 'సముద్రం చీలటం' 'ఆధ్యాత్మిక ప్రక్షాళన' 'బంగారు ఆవుదూడ' | అల్లాహ్ ఇస్రాయీల్ జాతివారికి చేసిన ఉపకారాలేమిటి? మేలును మరిచిన ఇస్రాయీల్ ప్రజలు ఆవుదూడ పూజ ఎలా మొదలెట్టారు? ఆ తర్వాత జరిగిన పరిణామాలేవి? |
| 154 | 133 | 'సబ్బత్ నియమ అతిక్రమణ' | అసలు సబ్బత్ (శనివారం) నియమం ఏమిటి? అది ఎందుకు విధించబడింది? ఆ కాలం ప్రజలు ఆ నియమాన్ని ఎలా ఉల్లంఘించారు? అందుకు వారికి జరిగిన శాస్తి ఏమిటి? |
| 155 | 179 | 'యహ్యా జననం' | అలనాటి యూదులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎంతో మంది ప్రవక్తల దారుణహత్యలకు కారకులయ్యారు. మచ్చుకు ఒక సంఘటన. |
| 156-159 | 184-198 | 'మర్యమ్' 'ప్రవక్త ఈసా జననం' 'నేడు మనకు తెలిసిన క్రైస్తవ విశ్వాసాలు' | యూదులు మర్యమ్ తల్లిపై ఘోర అపనింద మోపారు. ఏమిటి ఆ అపనింద? ఈసా ప్రవక్తకు వారు పెట్టిన కష్టాలేమిటి? ఈసా ప్రవక్త జీవిత వాస్తవ విశేషాలేవి? యేసు ప్రవక్త శిలువ వేయబడ్డారా? లేక ఆకాశాలకు ఎత్తుకోబడ్డారా? |

## అన్ నిసా[1] సూరా

## سُورَةُ النِّسَاءِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** మానవులారా! మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించి,[2] దాన్నుంచే దాని జతను కూడా సృష్టించి, ఆ ఇద్దరి ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను వ్యాపింపజేసిన మీ ప్రభువుకు భయపడండి. ఎవరిపేరుతో మీరు పరస్పరం మీకు కావలసిన వాటిని అడుగుతారో ఆ అల్లాహ్‌కు భయపడండి. బంధుత్వ సంబంధాల తెగత్రెంపులకు దూరంగా ఉండండి.[3] నిశ్చయంగా అల్లాహ్ మీపై నిఘావేసి ఉన్నాడు.

يَا أَيُّهَا النَّاسُ اتَّقُوا رَبَّكُمُ الَّذِي خَلَقَكُم مِّن
نَّفْسٍ وَاحِدَةٍ وَخَلَقَ مِنْهَا زَوْجَهَا وَبَثَّ مِنْهُمَا
رِجَالًا كَثِيرًا وَنِسَاءً ۚ وَاتَّقُوا اللَّهَ الَّذِي تَسَاءَلُونَ
بِهِ وَالْأَرْحَامَ ۚ إِنَّ اللَّهَ كَانَ عَلَيْكُمْ رَقِيبًا ①

**2** తండ్రి లేని బిడ్డలకు వారి ఆస్తిని వారికివ్వండి. పరిశుద్ధమైన, ధర్మసమ్మతమైన వస్తువులకు బదులు అపవిత్రమైన, అధర్మమైన వస్తువులను తీసుకోకండి. మీ సొమ్ములతోపాటు వారి సొమ్మును కూడా కలగాపులగం చేసి స్వాహా చేయకండి. ముమ్మాటికీ ఇది మహా పాతకమే.[4]

وَآتُوا الْيَتَامَىٰ أَمْوَالَهُمْ ۖ وَلَا تَتَبَدَّلُوا الْخَبِيثَ
بِالطَّيِّبِ ۖ وَلَا تَأْكُلُوا أَمْوَالَهُمْ إِلَىٰ أَمْوَالِكُمْ ۚ
إِنَّهُ كَانَ حُوبًا كَبِيرًا ②

---

1. **నిసా :** నిసా అంటే స్త్రీలని అర్థం. ఈ సూరాలో చాలా వరకు స్త్రీలకు సంబంధించిన విషయాల, హక్కుల ప్రస్తావన ఉండటం వల్ల దీనికి ఈ పేరు వచ్చింది.

2. "ఒకే ప్రాణి" అంటే మానవుల మూల పురుషుడైన ఆదం (అలైహిస్సలాం) అని భావం. **"ఖలఖ మిన్‌హా జౌజహా"** (దాన్నుంచి దాని జతను సృష్టించటం) అనే వాక్యంలో 'మిన్‌హా' (దాన్నుంచి) అంటే ఆదం నుంచి ఆయన భార్య అయిన హవ్వాను సృష్టించటం అని అర్థం. హవ్వా ఆదం నుంచి ఎలా సృష్టించబడిందన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం హవ్వా, పురుషుని నుంచి (అంటే ఆదం నుంచి) సృజించబడింది. అనగా ఆయన ఎడమవైపు ప్రక్కటెముక నుంచి సృష్టించబడిందని భావం. ఒక హదీసులో ఇలా అనబడింది : "స్త్రీ ప్రక్కటెముక నుంచి సృష్టించబడింది. ప్రక్కటెముకలో అత్యంత వంకర భాగం దాని పైభాగం. ఒకవేళ నువ్వు గనక దాన్ని తిన్నగా చేయబోతే అది విరిగిపోతుంది. నువ్వు గనక ఆమె ద్వారా ప్రయోజనం పొందదలిస్తే ఆ వంకర స్థితిలోనే ప్రయోజనం పొందగలవు" (సహీహ్ బుఖారీ – కితాబు బద్‌యిల్ ఖల్ఖ్ ; సహీహ్ ముస్లిం – కితాబుర్రజాయి). ఈ హదీసు వెలుగులో పండితులు ఇబ్నె అబ్బాస్ (రజి) ద్వారా నుడవబడిన అభిప్రాయాన్ని సమర్థించారు. దివ్య ఖుర్ఆన్‌లోని **ఖలఖ మిన్‌హా** అనే పదం కూడా హవ్వా సృష్టి ఆదం నుండే జరిగిందన్న వాదానికి బలం చేకూరుస్తున్నది.

3. అరబీలో **'వల్ అర్‌హామ్'** (وَالْأَرْحَامَ) అని అనబడింది. వాక్యంలో ఈ పదానికి–దీనికి ముందు వచ్చిన 'అల్లాహ్' అన్న పదానికి మధ్య అత్ఫ్ (సంబంధం) ఉంది. కనుక ఈ వాక్యానికి 'అల్లాహ్‌కు భయపడండి, బంధుత్వాలను త్రెంచటానికి కూడా భయపడండి' అని భావం వస్తుంది. **అర్‌హామ్** అనేది **'రహిమున్'**కు బహువచనం. అంటే మాతృగర్భంతో ముడిపడి వున్న రక్త సంబంధాలు, బంధుత్వాలన్నమాట! **మహ్రమ్** (వివాహం నిషిద్ధం చేయబడిన) బంధువులు, **గైర్ మహ్రమ్** (వివాహం నిషిద్ధం కాని) బంధువులు – ఇరువురూ కూడా 'అర్‌హామ్' గానే పరిగణించబడతారు. బంధుత్వాలను త్రెంచటం ఘోరపాపం. దీన్ని 'ఖతే రహ్మీ' (బంధు విచ్ఛిత్తి) అని అంటారు. బంధువులతో సత్సంబంధాలను ఎట్టి

3 (మీ సంరక్షణలో ఉన్న) తండ్రిలేని ఆడపిల్లలను వివాహమాడి న్యాయం చేయలేమన్న భయం మీకుంటే, మీకు నచ్చిన వేరితర స్త్రీలలో ఇద్దరినిగానీ, ముగ్గురినిగానీ, నలుగురినిగానీ వివాహ మాడండి. అయితే వారి మధ్య న్యాయబద్ధంగా వ్యవహరించ లేమన్న భయం మీకున్నప్పుడు ఒక్కామెతోనే సరిపెట్టుకోండి. లేదా మీ యాజమాన్యంలోకి వచ్చిన బానిస స్త్రీలతో గడపండి.[5] మీరు ఒక వైపుకు మొగ్గిపోకుండా[6] (అంటే అన్యాయానికి పాల్పడ కుండా) ఉండటానికి ఇది అత్యుత్తమ మార్గం.

وَإِنْ خِفْتُمْ أَلَّا تُقْسِطُوا فِي الْيَتَامَىٰ فَانكِحُوا مَا طَابَ لَكُم مِّنَ النِّسَاءِ مَثْنَىٰ وَثُلَاثَ وَرُبَاعَ ۖ فَإِنْ خِفْتُمْ أَلَّا تَعْدِلُوا فَوَاحِدَةً أَوْ مَا مَلَكَتْ أَيْمَانُكُمْ ۚ ذَٰلِكَ أَدْنَىٰ أَلَّا تَعُولُوا ③

పరిస్థితుల్లోనయినా కొనసాగించాలనీ, వారి హక్కులను నెరవేర్చాలని హదీసుల్లో గట్టిగా తాకీదు చేయబడింది. ఇదెంతో గొప్ప పుణ్యకార్యమని కూడా చెప్పబడింది. దీన్ని 'సిలా రహ్మీ' (బంధుత్వ సత్సంబంధం) అంటారు.

4. తండ్రిలేని బిడ్డలు యుక్త వయస్సుకు చేరుకోగానే లేక వారికి లోకజ్ఞానం రాగానే వారి ఆస్తిపాస్తులను వారికి అప్పజెప్పండి. **'ఖబీస్'** అంటే పనికిరాని వస్తువులనీ, **'తయ్యిబ్'** అంటే నాణ్యమైన వస్తువులని భావం. వారి ఆస్తిపాస్తుల్లో నుంచి మంచి మంచి భాగాలను, నాణ్యమైన వస్తువులను తీసేసుకుని, పనికిరాని వస్తువులను మొక్కుబడిగా వారికి ఇచ్చి చేతులు దులుపుకునే నైచ్యానికి పాల్పడకండి. ఇలాంటి పనికిమాలిన వస్తువులను అశుద్ధమైన వస్తువులు (ఖబీస్)గా, నాణ్యమైన వస్తువులను పవిత్రమైన వస్తువులు (తయ్యిబ్)గా అభివర్ణించి చెప్పదలచుకున్నదేమిటంటే, మీరు ఏ వస్తువులను మేలైనవిగా తలపోసి కబళించారో అవే మీ పాలిట అపవిత్రంగా, అధర్మమైనవిగా, అశుభ మైనవిగా పరిణమిస్తాయి. ఎందుకంటే మీ ఉద్దేశ్యం మారిపోయింది. మీ సంకల్పంలో చెడుగు చోటు చేసుకుంది. కాబట్టి చెడు ఉద్దేశ్యంతో ఒకరి సొమ్మును తమ సొమ్ములో కలిపి తినటం నిషేధం. ఒకవేళ శ్రేయోభిలాషతో, ఎదుటివారి సొమ్మును అభివృద్ధిపరచే ఉద్దేశంతో తమ సొమ్ములో కలుపుకుంటే అట్టి సొమ్ములో నుంచి తినటం ధర్మసమ్మతమే.

5. ఈ నేపథ్యంలో ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం గమనార్హం. అనాథ బాలిక స్థితిమంతురాలు, అందగత్తె అయి వుండి ఒకరి సంరక్షణలో ఉన్నప్పుడు, ఆ వ్యక్తి ఆమె ఐశ్వర్యానికి, అందానికి ప్రభావితుడై ఆమెను నికాహ్ చేసుకోవడానికైతే చేసుకుంటాడుగాని, తన ఇతర భార్యలకిచ్చినట్లుగా ఈమెకు మహర్ హక్కును ఇవ్వడు. అల్లాహ్ ఈ అన్యాయాన్ని అరికట్టదలిచాడు. మీ పోషణలో ఉన్న అనాథ బాలికల విషయంలో న్యాయం చేయలేమన్న అనుమానం మీకున్నప్పుడు అసలు వారిని వివాహమే చేసుకోవద్దు. ఇతర స్త్రీలను వివాహమాడే మార్గం మీకోసం ఎలాగూ తెరచుకుని ఉంది (సహీహ్ బుఖారీ: కితాబుత్తఫ్సీర్). ఒక్కామెనే కాదు, ఇద్దరేసి, ముగ్గురేసి, నలుగురేసి స్త్రీలను కూడా వివాహమాడవచ్చు. కాకపోతే వారి మధ్య న్యాయంగా మసలుకునే స్థోమత ఉండాలి. లేకపోతే ఒక్కామెతోనే కాపురం చేయాలి. లేదంటారా, మీ యాజమాన్యంలోకి ధర్మసమ్మతంగా వచ్చిన బానిస స్త్రీతో గడపండి. ఈ ఆయతు ద్వారా విదితమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే ఒక ముస్లిం (నిజంగా తనకు అవసరమనుకుంటే) ఏక కాలంలో నలుగురు స్త్రీలను తన దాంపత్య జీవితంలోకి తీసుకురాగలడు. అంతకుమించి చేసుకోలేడు. సహీహ్ హదీసులలో ఈ విషయానికి సంబంధించిన మరిన్ని తఫ్సీళ్లు వచ్చాయి. దైవప్రవక్త (సఅసం) ఏకకాలంలో నలుగురుకన్నా ఎక్కువ మంది సతీమణులను కలిగి ఉన్నారంటే అది దైవప్రవక్త (స)కు ప్రత్యేకం. దీని ఆధారంగా ముస్లిం సమాజానికి చెందిన ఏ వ్యక్తి అయినా నలుగురు స్త్రీలకు మించి వివాహమాడలేదు (ఇబ్నె కసీర్).

6. మొత్తమ్మీద ఒకామెను వివాహమాడటంతోనే సరిపెట్టుకోవచ్చు. ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలున్నప్పుడు వారి మధ్య సమభావంతో మెలగటం మీకు కష్టం కావచ్చు. సాధారణంగా జరిగేదేమిటంటే భర్త మానసికంగా ఏ భార్య వైపుకు మొగ్గిఉంటాడో, ఆమె జీవనావసరాల పట్లనే ఎక్కువ శ్రద్ధ వహిస్తాడు. ఆ విధంగా అతడు సమత్వం, సమతూకం

وَاٰتُوا النِّسَآءَ صَدُقٰتِهِنَّ نِحۡلَةً ؕ فَاِنۡ طِبۡنَ لَكُمۡ
عَنۡ شَیۡءٍ مِّنۡهُ نَفۡسًا فَكُلُوۡهُ هَنِیۡٓـًٔا مَّرِیۡٓـًٔا ﴿۴﴾

4 స్త్రీలకు వారి మహర్ సొమ్మును మనస్ఫూర్తిగా ఇవ్వండి. ఒకవేళ వారు గనక తమంతట తాముగా – ఇష్టపూర్వకంగా – మహర్‌లో కొంత మొత్తాన్ని వదలిపెట్టినట్లయితే సంతోషంగా (నిస్సంకోచంగా) దాన్ని అనుభవించండి.

وَلَا تُؤۡتُوا السُّفَهَآءَ اَمۡوَالَكُمُ الَّتِیۡ جَعَلَ اللّٰهُ لَكُمۡ
قِیٰمًا وَّارۡزُقُوۡهُمۡ فِیۡهَا وَاكۡسُوۡهُمۡ وَقُوۡلُوۡا لَهُمۡ
قَوۡلًا مَّعۡرُوۡفًا ﴿۵﴾

5 అల్లాహ్ మీ జరుగుబాటుకు ఆధారంగా చేసిన మీ ధనాన్ని అవివేకుల పరం చేయకండి. కాకపోతే ఆ సంపదలో నుంచి వారికి అన్నవస్త్రాలు మొదలగునవి సమకూర్చండి. వారితో మంచితనంతో, మృదువుగా మాట్లాడండి.

وَابۡتَلُوا الۡيَتٰمٰى حَتّٰۤى اِذَا بَلَغُوا النِّكَاحَ ۚ فَاِنۡ
اٰنَسۡتُمۡ مِّنۡهُمۡ رُشۡدًا فَادۡفَعُوۡۤا اِلَیۡهِمۡ اَمۡوَالَهُمۡ ۚ
وَلَا تَاۡكُلُوۡهَاۤ اِسۡرَافًا وَّبِدَارًا اَنۡ یَّكۡبَرُوۡا ؕ وَمَنۡ كَانَ
غَنِیًّا فَلۡیَسۡتَعۡفِفۡ ۚ وَمَنۡ كَانَ فَقِیۡرًا فَلۡیَاۡكُلۡ
بِالۡمَعۡرُوۡفِ ؕ فَاِذَا دَفَعۡتُمۡ اِلَیۡهِمۡ اَمۡوَالَهُمۡ
فَاَشۡهِدُوۡا عَلَیۡهِمۡ ؕ وَكَفٰى بِاللّٰهِ حَسِیۡبًا ﴿۶﴾

6 తండ్రిలేని బిడ్డలు పెళ్ళీడుకు వచ్చేవరకూ వారిని తీర్చి దిద్దుతూ, పరీక్షిస్తూ ఉండండి. ఒకవేళ వారిలో తెలివితేటలు, కార్యదక్షత కానవస్తే వారి ఆస్తిని వారికి అప్పగించండి. వారు పెద్దవారవుతున్నారన్న భయంతో వారి ఆస్తిపాస్తులను ఆదరాబాదరాగా దుబారా ఖర్చుచేయకండి. తండ్రిలేని బిడ్డల పోషకుడు ధనవంతుడైన పక్షంలో వారి సొమ్మును ముట్టుకోకూడదు. ఒకవేళ అతడు పేదవాడైతే ధర్మబద్ధంగా – అవసరమైనంత మేరకు – అనుభవించవచ్చు. మరి వారి ఆస్తిని వారికి అప్పగించేటప్పుడు దానికి సాక్షుల్ని పెట్టుకోండి. లెక్క తీసుకోవటానికి అల్లాహ్ చాలు.[7]

నుంచి తొలగిపోతాడు. ఇది దైవ సమక్షంలో నేరంగా పరిగణించబడుతుంది. దివ్య ఖుర్ఆన్ ఈ విషయాన్నే మరో చోట అత్యంత చతురతతో విపులీకరించింది: "భార్యల మధ్య పూర్తి న్యాయం పాటించటం అన్నది మీ వల్ల కానిపని. మీరెంతగా కోరుకున్నా ఈ విషయంలో సఫలీకృతులు కాలేరు. కనుక (మీరు కనీసం ఇలా అయినా చేయండి). ఇతర భార్యలను డోలాయమాన స్థితిలో పడవేసేలా మీరు ఒక భార్య వైపుకే పూర్తిగా మొగ్గిపోకండి." (నిసా–129).
దీని ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే, ఏక కాలంలో ఒకరికంటే ఎక్కువ స్త్రీలను వివాహమాడటం, వారి మధ్య సమానత్వాన్ని పాటించకపోవటం అసమంజసం, ఇంకా ప్రమాదకరం కూడా.

7. అనాథల ఆస్తికి సంబంధించిన ముఖ్యమైన మార్గదర్శక నియమాలు సూచించబడిన తరువాత 'లెక్క తీసుకోవటానికి అల్లాహ్ చాలు' అని అనటం గమనార్హం. అంటే తండ్రిలేని బిడ్డల ఆస్తిని మీరు ఏవిధంగా కాపాడారు, వారి ఆస్తిని వారికి అప్పగించే సమయంలో న్యాయంగా వ్యవహరించారా లేదా? అందులో ఏమైనా హెచ్చుతగ్గులుగానీ, కలగాపులగంగానీ చేశారా? ఈ వ్యవహారంలో మీ నిజాయితీ ఏ పాటిది? – తదితర విషయాలు జనానికి తెలిసినా తెలియకపోయినా అల్లాహ్‌కు మాత్రం తెలీకుండా లేవు. మీరు ఆయన సన్నిధిలో హాజరైనప్పుడు ఆయన మీ లెక్క తేలుస్తాడు. అందుకే ఇది ఎంతో బాధ్యతతో కూడుకున్న పని అని హదీసులో చెప్పబడింది. ఒకసారి దైవప్రవక్త (స) అబూజర్ (రజి) నుద్దేశించి, "ఓ అబూజర్! నా దృష్టికి నువ్వు బలహీనుడివిగా కనబడుతున్నావు. కనుక నా కోసం ఇష్టపడేదే నీ కోసం కూడా నేను యిష్టపడుతున్నాను. నీవు ఇద్దరు వ్యక్తులపై కూడా 'అమీరు' (నాయకుని)గా గానీ, తండ్రిలేని బిడ్డలకు సంరక్షకునిగా గానీ అవకు" అని ఉపదేశించారు (సహీహ్ ముస్లిం–కితాబుల్ ఇమార).

**7** తల్లిదండ్రులు, సమీప బంధువులు వదలివెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అలాగే తల్లిదండ్రులు, సమీప బంధువులు వదలివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది. ఆ ఆస్తి తక్కువైనాసరే, ఎక్కువైనాసరే (అందులో) వాటా మాత్రం నిర్ధారితమై ఉంది.[8]

لِلرِّجَالِ نَصِيبٌ مِّمَّا تَرَكَ الْوَالِدَانِ وَالْأَقْرَبُونَ وَلِلنِّسَاءِ نَصِيبٌ مِّمَّا تَرَكَ الْوَالِدَانِ وَالْأَقْرَبُونَ مِمَّا قَلَّ مِنْهُ أَوْ كَثُرَ ۚ نَصِيبًا مَّفْرُوضًا ⑦

**8** ఆస్తిని పంచుకునే సమయంలో బంధువులు, తండ్రిలేని బిడ్డలు, నిరుపేదలు వస్తే అందులో నుంచి వారికీ కొంత ఇవ్వండి. (ఆ సందర్భాన) వారితో మృదువుగా మాట్లాడండి.[9]

وَإِذَا حَضَرَ الْقِسْمَةَ أُولُو الْقُرْبَىٰ وَالْيَتَامَىٰ وَالْمَسَاكِينُ فَارْزُقُوهُم مِّنْهُ وَقُولُوا لَهُمْ قَوْلًا مَّعْرُوفًا ⑧

**9** ఒకవేళ తాము తమ వెనుక చిన్న చిన్న పసికందులను విడిచి పోతే, వారికెక్కడ అన్యాయం జరుగుతుందోనని ఆందోళన చెందేవారు (ఈ సందర్భంగా) భయపడాలి. వారు అల్లాహ్‌కు భయపడుతూ, సముచితమైన రీతిలో మాట్లాడాలి.[10]

وَلْيَخْشَ الَّذِينَ لَوْ تَرَكُوا مِنْ خَلْفِهِمْ ذُرِّيَّةً ضِعَافًا خَافُوا عَلَيْهِمْ فَلْيَتَّقُوا اللَّهَ وَلْيَقُولُوا قَوْلًا سَدِيدًا ⑨

8. ఇస్లాంకు పూర్వం జరిగే అన్యాయాలలో ఒకటి స్త్రీలకు, చిన్న పిల్లలకు వారసత్వంలో వాటా యివ్వకుండా ఉండటం. యుద్ధాలలో పాల్గొనేందుకు అర్హులైన పెద్ద పిల్లలు మాత్రమే ఆస్తి మొత్తానికి వారసులయ్యేవారు. తమ తల్లిదండ్రులు, సమీప బంధువులు వదలి వెళ్ళిన ఆస్తిలో పురుషుల మాదిరిగానే స్త్రీలకు, ఆడపిల్లలు – మగపిల్లలందరికీ కూడా వాటా నిర్ధారితమై ఉందని అల్లాహ్ ఈ ఆయతులో విపులీకరించాడు. కాకపోతే ఆడపిల్లకు లభించే వాటా మగ పిల్లవాడికి లభించే వాటాలో సగభాగం అయి ఉంటుంది. అది వేరే విషయం (మూడు ఆయతుల తర్వాత ఆ వివరాలు కూడా వస్తాయి). దీన్ని స్త్రీజాతికి జరిగిన అన్యాయంగా భావించి గగ్గోలు చెందవలసిన అవసరం లేదు. ఇస్లాంలోని ఈ వారసత్వ నియమం న్యాయం, ధర్మంతో కూడుకుని ఉంది. ఎందుకంటే స్త్రీలపై ఇస్లాం సంపాదనా భారం మోపలేదు. పురుషుణ్ణి ఆమె పోషకునిగా, సంరక్షకునిగా నియమించింది. అదీగాక వివాహ సమయంలో స్త్రీకి మహర్ రూపంలో సొమ్ము ముడుతుంది. దాన్ని చెల్లించే బాధ్యత కట్టుకున్న మొగుడిపై మోపబడింది. ఈ రకంగా పురుషునిపై – స్త్రీకన్నా – ఎన్నో రెట్లు ఆర్థికపరమైన బరువు, బాధ్యతలున్నాయి. ఇలాంటి పరిస్థితిలో స్త్రీకి సగభాగం బదులు మగవానితో సమానంగా పూర్తి భాగం ఇస్తే అది ఒక రకంగా పురుషునిపై 'జులుం' అవుతుంది. కాని అల్లాహ్ ఎవరికీ అన్యాయం (జులుం) చేయదలచలేదు. ఎందుకంటే ఆయన న్యాయశీలుడు, వివేకవంతుడు.

9. కొంతమంది విద్వాంసులు ఈ హితోపదేశాన్ని (అనగా ఆస్తి పంపకం సందర్భంగా ఆత్మీయులకు, అనాథలకు, అగత్యపరులకు ఎంతో కొంత యిచ్చి సాగనంపాలన్న ఉపదేశాన్ని) వారసత్వ శాసనం నుండి రద్దయినట్లుగా ఖరారు చేశారు. కాని ప్రామాణికమైన విషయం ఏమిటంటే, వాస్తవానికి ఇది రద్దు కాలేదు. పైగా యిది నైతికంగా ఎంతో ముఖ్యమైన సూచన. ఆస్తిలో వాటాకు హక్కుదారులు కాని సమీప బంధువుల్లో చాలామంది బీదవారుంటారు. వారికి వాటా ఎలాగూ ఇవ్వబడదు. కాబట్టి వారికి పొసగమేలు చేసి పంపితే ప్రేమానురాగాలు పెంపొందుతాయి. బంధుత్వాలు మరింత పటిష్టం అవుతాయి. ఇందులో ఎన్నో పరమార్థాలు దాగి ఉన్నాయి. ఇక్కడ గమనించవలసిన మరో విషయం ఏమిటంటే ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడుతున్న వారసత్వ భాగాన్ని చూసి ఖారూన్‌లాగా మిడిసిపడకుండా, ఫిర్ఔన్ మాదిరిగా అహంకారం ప్రదర్శించకుండా ఎంతో నిగ్రహం పాటించాలి. భావాలు, భావోద్రేకాలను అదుపులో పెట్టుకోవలసిన తరుణం అది. షరీయతు రీత్యా వారసత్వంలో వాటాకు నోచుకోని మీ ఆత్మీయులు కొందరు ఆ సమయంలో అక్కడ ఉంటారు. వారి మనోమయ భావాలను పసిగట్టి, వారిని మర్యాదగా పలకరించాలి, ప్రేమతో వారి మనసుల్ని జయించాలి. అంతేగాని ధనమదాంధులై వారిని ఈసడించుకోరాదు.

إِنَّ الَّذِينَ يَأْكُلُونَ أَمْوَالَ الْيَتَامَىٰ ظُلْمًا إِنَّمَا
يَأْكُلُونَ فِي بُطُونِهِمْ نَارًا ۖ وَسَيَصْلَوْنَ سَعِيرًا ﴿10﴾

**10** తండ్రిలేని బిడ్డల సొమ్మును అన్యాయంగా తినేవారు తమ పొట్టల్ని అగ్నితో నింపుకుంటున్నారు. త్వరలోనే వారు మండే అగ్నిలోకి ప్రవేశిస్తారు.

يُوصِيكُمُ اللَّهُ فِي أَوْلَادِكُمْ ۖ لِلذَّكَرِ مِثْلُ حَظِّ
الْأُنثَيَيْنِ ۚ فَإِن كُنَّ نِسَاءً فَوْقَ اثْنَتَيْنِ فَلَهُنَّ
ثُلُثَا مَا تَرَكَ ۖ وَإِن كَانَتْ وَاحِدَةً فَلَهَا النِّصْفُ ۚ
وَلِأَبَوَيْهِ لِكُلِّ وَاحِدٍ مِّنْهُمَا السُّدُسُ مِمَّا تَرَكَ

**11** అల్లాహ్ మీ సంతానం విషయంలో మీకు ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నాడు : ఒక అబ్బాయి వాటా ఇద్దరు అమ్మాయిల వాటాకు సమానం.[11] ఒకవేళ (మృతునికి) ఇద్దరుకన్నా ఎక్కువ మంది కుమార్తెలు మాత్రమే ఉంటే వారికి వారసత్వ ఆస్తిలో మూడింట రెండొంతుల భాగం లభిస్తుంది.[12] ఒకవేళ ఒకే

10. కొంతమంది విద్వాంసుల దృష్టిలో వీలు వ్రాయబడినవారిని (అనగా 'ఔసియా'ను) ఉద్దేశ్యించి ఈ ఉపదేశం చేయబడింది. తమ పోషణలో వున్న తండ్రిలేని బిడ్డలను తమ కన్నపిల్లల వలే చూసుకోవాలనీ, తాము చనిపోతున్నప్పుడు తమ పసిపిల్లల పట్ల తమకు ఎంత చింత ఉంటుందో అంతే చింత ఆ 'బలహీన వర్గం' పట్ల ఉండాలని తాకీదు చేయ బడింది. మరి కొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం సాధారణ ప్రజలనుద్దేశించి ఈ విధంగా బోధించబడింది. తండ్రిలేని పసివాళ్ల పట్ల, ఇతర చిన్న పిల్లల పట్ల వాత్సల్యంతో మెలగాలనీ, వారు మీ పోషణలో ఉన్నాసరే లేకపోయినా సరే వారిపై జాలి చూపాలని తాకీదు చేయటం జరిగింది.

ఇంకా కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం మరణ ఘడియలు సమీపించిన వారి దగ్గర కూర్చున్న వారినుద్దేశించి ఈ విధంగా హితోపదేశం చేయబడింది : ఇహలోకాన్ని వీడిపోతున్న వారినుద్దేశించి వారి బాధ్యతలను వారు గుర్తుచేయాలి. ఒకవైపు దేవుని హక్కులతో పాటు మరోవైపు దాసుల హక్కులను గురించి వారికి నొక్కి చెప్పాలి. మరణించే వ్యక్తి తన వీలునామాలో ఆ రెండింటిని దృష్టిలో పెట్టుకొని విల్లు చెప్పేటట్లు చూడాలి. ఒకవేళ మరణ ఘడియలు సమీపించిన వ్యక్తి బాగా ఉన్నవాడైతే, అతని ఆస్తిలో నుంచి మూడో వంతును సమీప బంధువుల్లో దారిద్ర్యం అనుభవిస్తున్న వారిపేర వీలు వ్రాయమని సలహాయివ్వాలి. లేదంటే ఏదేని ధార్మిక సంస్థకు రాసి యివ్వమని చెప్పాలి. ఆ విధంగా అది అతని పరలోక సాఫల్యానికి దోహదపడుతుంది. ఒకవేళ మరణించేవాడు స్థితిమంతుడు కానిపక్షంలో మూడోవంతు ఆస్తికి వీలు వ్రాయకుండా అతన్ని ఆపాలి. ఎందుకంటే అతడు పోయిన తరువాత అతని ఆలుబిడ్డలు ఇతరుల ముందు చేయిచాపి అర్థించవలసిన అగత్యం ఏర్పడకూడదు. అలాగే ఎవరయినా తమ వారసులకు ఆస్తి దక్కకుండా చేసే ఆలోచనలో ఉంటే వారిని అలా చేయకుండా అడ్డుకోవాలి. తమ తదనంతరం తమ పిల్లలే గనక ముష్టెత్తుకోవలసిన దుస్థితి ఏర్పడితే తమకెంత బాధకలుగుతుందో ఊహించుకుని, ఇతరులకు కూడా అలాంటి దురవస్థ దాపురించకుండా ఉండేలా శ్రేయోభిలాషతో మెలగాలి.

ఈ వివరణ ద్వారా పైన పేర్కొనబడిన విభిన్న వ్యక్తులందరికీ ఈ ఆయతు వర్తిస్తుంది (తఫ్సీరె ఖుర్తుబీ, ఫత్‌హుల్ ఖదీర్).

11. ఇలా నిర్ధారించబడటంలోగల పరమార్థాలను ఇంతకుముందే వివరించటం జరిగింది. (8వ పాదసూచిక చూడండి). వారసుల్లో ఆడపిల్లలు – మగ పిల్లలు గనక ఉంటే ఈ నియమం ప్రకారం పంపకం జరుగుతుంది. ఆడపిల్లలుగానీ, మగపిల్లలుగానీ– వారు చిన్నవారైనా పెద్దవారైనా– వారి వాటాలు వారికి లభించి తీరాల్సిందే. ఆఖరికి మాతృగర్భంలో పెరుగుతున్న శిశువు (జనీన్) కు సయితం మృతుడు వదలిన ఆస్తిలో భాగం లభిస్తుంది. అయితే అవిశ్వాసులైన సంతానానికి వారసత్వ హక్కు సంక్రమించదు.

12. అంటే మృతునికి మగ పిల్లలు ఎవరూ లేకుండా ఇద్దరు కంటే ఎక్కువమంది కుమార్తెలుంటే అతని మొత్తం ఆస్తిలోని రెండొంతుల భాగం వారికి ఇవ్వబడుతుంది. ఒకవేళ కేవలం ఇద్దరు కూతుళ్ళు ఉన్నాసరే వారికి ఈ రెండొంతుల

إِن كَانَ لَهُۥ وَلَدٌ ۚ فَإِن لَّمْ يَكُن لَّهُۥ وَلَدٌ وَوَرِثَهُۥٓ
أَبَوَاهُ فَلِأُمِّهِ ٱلثُّلُثُ ۚ فَإِن كَانَ لَهُۥٓ إِخْوَةٌ فَلِأُمِّهِ
ٱلسُّدُسُ مِنۢ بَعْدِ وَصِيَّةٍ يُوصِى بِهَآ أَوْ دَيْنٍ ۗ
ءَابَآؤُكُمْ وَأَبْنَآؤُكُمْ لَا تَدْرُونَ أَيُّهُمْ أَقْرَبُ لَكُمْ

కూతురుంటే ఆమెకు సగభాగం దక్కుతుంది. చనిపోయిన వ్యక్తికి గనక సంతానముంటే,[13] అతని తల్లిదండ్రులలో ఒక్కొక్కరికి అతను వదలివెళ్ళిన ఆస్తిలో ఆరింట ఒక భాగం లభిస్తుంది. ఒకవేళ మృతుడు సంతానం లేనివాడై ఉండి, అతని తల్లిదండ్రులే అతని ఆస్తికి వారసులైనపుడు, అతని తల్లికి మూడింట ఒక భాగం ఇవ్వాలి.[14] ఒకవేళ మృతునికి గనక అనేక మంది అన్నదమ్ములుంటే, అప్పుడు తల్లికి ఆరింట ఒక భాగం మాత్రమే దక్కుతుంది.[15] చనిపోయిన వ్యక్తి వ్రాసిన వీలునామాను అమలు

భాగం పంచి ఇవ్వటం జరుగుతుంది. ఉదాహరణకు హదీసులో పేర్కొనబడినట్లు ఉహుద్ యుద్ధసందర్భంగా సాద్ బిన్ రబీ (రజి) అమరగతులయ్యారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. కాని సాద్ గారి ఆస్తినంతటినీ ఆయన సోదరుడు స్వాధీనం చేసుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) జోక్యం చేసుకుని ఆ అమ్మాయిల పినతండ్రి నుంచి మూడింట రెండొంతుల ఆస్తిని వారికి ఇప్పించారు (తిర్మిజీ, అబూ దావూద్, ఇబ్నె మాజ – కితాబుల్ ఫరాయెజ్). అదీగాక మృతునికి వారసులుగా అతని ఇద్దరు సోదరీమణులు మాత్రమే ఉంటే, అట్టి పరిస్థితిలో మృతుడు వదలిపోయిన ఆస్తిలో మూడింట రెండొంతుల భాగం వారికి ఇవ్వబడుతుంది. ఈ విషయం ఈ సూరా చివర్లో రానున్నది. మృతుని ఇద్దరు సోదరీమణులు ఆస్తిలో మూడింట రెండొంతుల భాగానికి హక్కుదారులు అవుతుండగా, మృతుని ఇద్దరు కూతుళ్ళు తమ పిత్రార్జితంలో మూడింట రెండొంతుల భాగాన్ని పొందటంలో సంశయానికి లేశమయినా ఆస్కారం ఉండకూడదు. అక్కడ కూడా సోదరీమణులు ఇద్దరికంటే ఎక్కువమంది ఉన్నప్పుడు, వారిని ఇద్దరికంటే ఎక్కువమంది కుమార్తెల స్థానంలో ఉంచి వ్యవహరించటం జరిగింది (ఫత్హుల్ ఖదీర్). మొత్తానికి అవగతమయ్యేదేమిటంటే ఆడ పిల్లలు ఇద్దరైనా, ఇద్దరికంటే ఎక్కువ మందైనా – రెండు పరిస్థితుల్లోనూ వారసత్వ సొమ్ముగా వారికి మూడింట రెండు భాగాలు లభిస్తాయి. మిగిలిన ఆస్తి మృతుని 'అసబ' బంధువుల్లో పంచబడుతుంది.

13. తల్లిదండ్రులకు లభించే వాటాలకు సంబంధించి మూడు పరిస్థితులు వివరించబడ్డాయి. ఇది మొదటి పరిస్థితి. దీని ప్రకారం మృతుడు సంతానం కలవాడైతే అతని తల్లిదండ్రుల్లో ప్రతి ఒక్కరికి ఆరింట ఒక వంతు (1/6) ఆస్తి లభిస్తుంది (ఇవి రెండూ కలిపితే మూడింట ఒక వంతు – 1/3 – అవుతుంది). మిగతా మూడింట రెండు వంతులు (2/3) సంతానానికి పంచబడతాయి. ఒకవేళ మృతుని సంతానంలో కేవలం కూతురు మాత్రమే ఉంటే, కేవలం సగం ఆస్తి (అంటే మొత్తం ఆస్తిని ఆరు భాగాలుగా విభజిస్తే అందులో మూడు భాగాలు) ఆమెకు పోతుంది. మిగిలిన మూడు భాగాలలో ఒక భాగం (అంటే మొత్తం ఆస్తిలో ఆరవ భాగం) మృతుని తల్లికి ఇవ్వబడుతుంది. ఒక భాగం తండ్రికి వొసగబడుతుంది. మిగిలిపోయిన ఆరవభాగం అసబా బంధువు అయిన కారణంగా మృతుని తండ్రి తీసుకుంటాడు. ఈ విధంగా మృతుని తండ్రికి, తండ్రి అయినందుకు ఒక భాగం, 'అసబా' బంధువు అయినందుకు మరో భాగం – మొత్తం రెండు భాగాలు దక్కుతాయి.

14. ఇది రెండో పరిస్థితి – మృతునికి సంతానం లేనప్పుడు... (**'ఇజ్మా'** ప్రకారం మనవడు, మనవరాలు కూడా సంతానంలో చేరి ఉన్నారన్నది గమనార్హం). ఈ పరిస్థితిలో తల్లికి మూడోవంతు లభిస్తుంది. మిగిలిన రెండు వంతులు అసబా హక్కుగా తండ్రికి లభిస్తాయి. ఒకవేళ తల్లిదండ్రులతోపాటు చనిపోయిన పురుషుని భార్య లేక చనిపోయిన స్త్రీ యొక్క భర్త కూడా బ్రతికి ఉంటే భార్య లేక భర్త వాటాను ముందుగానే వేరుచేసి (దీనికి సంబంధించిన వివరాలు రానున్నాయి), మిగిలి ఉన్న ఆస్తిలో నుంచి తల్లికి మూడోవంతు ఇవ్వాలి. ఆపైన మిగిలి ఉన్నదంతా తండ్రిది.

15. ఇక మూడో పరిస్థితి : తల్లిదండ్రులతోపాటు మృతుని సోదర సోదరీమణులు కూడా బ్రతికి ఉన్నారు. ఆ సోదరులు ఒకే తల్లిదండ్రుల సంతానమైనా లేక తండ్రి ఒక్కడే అయివుండి తల్లులు వేర్వేరయినా లేదా తల్లి ఒక్కతే అయివుండి

نَفۡعًا ؕ فَرِيۡضَةً مِّنَ اللّٰهِ ؕ اِنَّ اللّٰهَ كَانَ
عَلِيۡمًا حَكِيۡمًا ﴿۱۱﴾

పరచి, అతను చేసి వున్న అప్పులను తీర్చిన మీదటే ఈ (ఆస్తి) వాటాలు లభిస్తాయి. మీ తండ్రులలో లేక కుమారులలో – మీకు ప్రయోజనం చేకూర్చటంలో ఎవరు ఎక్కువ సన్నిహితులో మీకు తెలియదు.[16] ఇవి అల్లాహ్ తరఫున నిర్ణయించబడిన వాటాలు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞాని, పరిపూర్ణ వివేకం గలవాడు.

وَلَكُمۡ نِصۡفُ مَا تَرَكَ اَزۡوَاجُكُمۡ اِنۡ لَّمۡ يَكُنۡ
لَّهُنَّ وَلَدٌ ۚ فَاِنۡ كَانَ لَهُنَّ وَلَدٌ فَلَكُمُ
الرُّبُعُ مِمَّا تَرَكۡنَ مِنۡۢ بَعۡدِ وَصِيَّةٍ يُّوۡصِيۡنَ
بِهَاۤ اَوۡ دَيۡنٍ ؕ وَلَهُنَّ الرُّبُعُ مِمَّا تَرَكۡتُمۡ
اِنۡ لَّمۡ يَكُنۡ لَّكُمۡ وَلَدٌ ۚ فَاِنۡ كَانَ لَكُمۡ وَلَدٌ
فَلَهُنَّ الثُّمُنُ مِمَّا تَرَكۡتُمۡ مِّنۡۢ بَعۡدِ وَصِيَّةٍ
تُوۡصُوۡنَ بِهَاۤ اَوۡ دَيۡنٍ ؕ وَاِنۡ كَانَ رَجُلٌ يُّوۡرَثُ

**12** మీ భార్యలకు సంతానం లేనిపక్షంలో వారు వదలివెళ్ళిన ఆస్తిలో సగభాగం మీది. ఒకవేళ వారికి సంతానముంటే వారు విడిచిపెట్టిన ఆస్తిలో నాల్గోభాగం మీకు చెందుతుంది.[17] వారు వ్రాసిపోయిన వీలునామాను అమలుపరచిన మీదట, లేదా వారు చేసిన అప్పుల్ని తీర్చిన మీదటే ఈ పంపకం జరగాలి. మీకు పిల్లలు లేని పక్షంలో మీరు వదలిపోయే ఆస్తిలో మీ భార్యలకు నాల్గో భాగం లభిస్తుంది. ఒకవేళ మీకు పిల్లలుంటే అప్పుడు మీరు వదలివెళ్ళే ఆస్తిలో మీ భార్యలకు ఎనిమిదో వంతు[18] మాత్రమే లభిస్తుంది. మీరు వ్రాసి వెళ్ళిన వీలునామాను అమలు పరచి, లేదా మీరు చేసివెళ్ళిన అప్పుల్ని తీర్చిన తరువాతే మిగిలిన ఆస్తిలో పంపకాలు జరుగుతాయి. చనిపోయిన పురుషుడు లేక

తండ్రులు వేర్వేరయినా – ఈ అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు మృతుని తండ్రి బ్రతికి ఉండగా ఆస్తికి హక్కుదారులు కాకపోయినప్పటికీ, తల్లికి లభించవలసిన ఆస్తి వాటాలో తగ్గుదలకు మాత్రం వారు కారకులవుతారు. అంటే వారు ఒకరికన్నా ఎక్కువమంది ఉన్నప్పుడు తల్లికి దక్కవలసిన మూడో వంతు భాగాన్ని ఆరోవంతు భాగంగా మార్చేస్తారన్న మాట! మిగిలిన సొమ్మంతా (ఆరింట ఐదోవంతు) తండ్రికి చెందుతుంది. మరో వారసుడెవరూ లేనప్పుడే ఈ విధంగా వర్తిస్తుంది. హాఫిజ్ ఇబ్నె కసీర్ ఇలా వ్రాస్తున్నారు : మెజారిటీ ఉలమా దృష్టిలో ఇద్దరికన్నా ఎక్కువ మంది సోదరులకు వర్తించే ఆదేశమే ఇద్దరు సోదరులకు కూడా వర్తిస్తుంది. అంటే ఒక సోదరుడు లేక సోదరి ఉన్న పక్షంలో ఆస్తిలో మూడోవంతు తల్లికి చెందుతుంది. అది ఆరోవంతుగా మార్పు చెందదన్నమాట! (ఇబ్నె కసీర్).

16. కాబట్టి మీరు మీకు సముచితం అనిపించిన రీతిలో ఆస్తిని పంచకండి. దైవాజ్ఞ ప్రకారం ఎవరికి ఎంతభాగం ఖరారై ఉందో అంత భాగం వారికి ఇచ్చేయండి.

17. మృతుని సంతానం బ్రతికి లేనిపక్షంలో అతని లేక ఆమె కొడుకు పిల్లలు – అంటే మనవళ్ళు – సంతానంగానే పరిగణించబడతారు సుమా! ఈ విషయంలో ముస్లిం సమాజంలోని ధర్మవేత్తలందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది (ఫత్హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్). అలాగే చనిపోయిన భర్తకు చెందిన సంతానం – ఆ సంతానం ఇప్పుడు అతనికి వారసురాలైన భార్యకు పుట్టినదైనాసరే లేక (అంతకు ముందు చనిపోయిన లేక విడాకులు పొందిన) మరో భార్యకు పుట్టినదైనాసరే. అలాగే చనిపోయిన స్త్రీకి చెందిన సంతానం. ఆ సంతానం ఇప్పుడు ఆమెకు వారసుడైన భర్త ద్వారా కలిగినదైనాసరే లేక మాజీ భర్త ద్వారా కలిగినదైనా సరే.

18. ఒకే భార్య అయినాసరే 4వ భాగం లేక 8వ భాగం హక్కుగా లభిస్తుంది. ఒకవేళ ఒకరికంటే ఎక్కువమంది భార్యలున్నప్పటికీ అదే 4వ భాగం లేక 8వ భాగం వారందరి మధ్య సమంగా పంచటం జరుగుతుంది. అంతేగాని ఒక్కొక్కరికి

كَلَٰلَةً أَوِ امْرَأَةٌ وَلَهُۥٓ أَخٌ أَوْ أُخْتٌ فَلِكُلِّ وَٰحِدٍ
مِّنْهُمَا السُّدُسُ ۚ فَإِن كَانُوٓا۟ أَكْثَرَ مِن ذَٰلِكَ فَهُمْ
شُرَكَآءُ فِى الثُّلُثِ ۚ مِنۢ بَعْدِ وَصِيَّةٍ يُوصَىٰ بِهَآ
أَوْ دَيْنٍ غَيْرَ مُضَآرٍّ ۚ وَصِيَّةً مِّنَ اللَّهِ ۗ
وَاللَّهُ عَلِيمٌ حَلِيمٌ ﴿١٢﴾

స్త్రీ 'కలాలా' అయి ఉండి[19] (అంటే వారికి తండ్రిగాని, కొడుకు గాని లేకుండా ఉండి) వారికి ఒక సోదరుడు లేక ఒక సోదరి ఉన్నట్లయితే[20] వారిలో ఒక్కొక్కరికి ఆరింట ఒక భాగం చొప్పున లభిస్తుంది. కాని వారు ఒకరికన్నా ఎక్కువ మంది ఉన్నట్లయితే అప్పుడు మొత్తం ఆస్తిలోని మూడో భాగాన్ని వారంతా సమానంగా పంచుకోవాలి.[21] అయితే మృతుడు వ్రాసిన వీలునామాను అమలుపరచి, లేదా అతని అప్పులన్నీ తీర్చిన మీదటే ఈ పంపకం జరగాలి.[22] ఇది ఇతరులకు నష్టకరంగా పరిణమించకూడదు.[23] ఇది అల్లాహ్ తరఫున జరిగిన నిర్ధారణ. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, సహనశీలుడు.

నాల్గవ లేక ఎనిమిదవ భాగం చొప్పున ఇవ్వటం జరగదు. ఈ విషయంలో కూడా ధర్మవేత్తలందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది (ఫత్‌హుల్ ఖదీర్).

19. తండ్రిగానీ, కొడుకుగానీ లేని పురుషుడు లేదా స్త్రీ మృతదేహాన్ని ఇక్కడ **'కలాలా'** గా అభివర్ణించటం జరిగింది. ఇది **'ఇక్‌లీల్'** నుండి వచ్చింది. ఏదేని వస్తువు తల భాగం అన్నివైపుల నుంచీ చుట్టుముట్టబడి ఉంటే దాన్ని 'ఇక్‌లీల్'గా వ్యవహరిస్తారు. ఇక్కడ తండ్రిగానీ, కొడుకుగానీ లేని మృతుణ్ణి 'కలాలా' అని చెప్పబడటంలోని ఆంతర్యం ఏమిటంటే నియమబద్ధంగానైతే అతనికి వారసులెవరూ లేరుగానీ పరిసరాల్లోని ఆత్మీయులు, దగ్గరి బంధువులు ఆస్తికోసం వచ్చి చేర్తారు (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్). మరికొంతమంది ఈ పదం **'కల్లల'** నుంచి వచ్చిందని చెబుతారు. కల్లల అంటే అలసిపోవటమని శాబ్దిక అర్థం. అతని వరకు చేరుకొని వంశధార అలసిపోయిందనీ, ఆ తర్వాత ముందుకు నడవలేకపోయిందని భావం.

20. అంటే ఒకే తల్లికి పుట్టిన అన్నాచెల్లెళ్లు. కాని వారి తండ్రులు వేర్వేరు. దీనికి భిన్నంగా సొంత సోదరీమణుల, అల్లాతీ సోదరుల (తండ్రి ఒక్కడే అయి ఉండి తల్లులు వేర్వేరు అయిన సోదరుల) ఆస్తి వాటా ఈ విధంగా ఉండదు. దీనికి సంబంధించిన తఫ్సీళ్లు కూడా ఈ సూరా చివర్లో రానున్నాయి. ఈ విషయంలో కూడా పండితులందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది (ఫత్‌హుల్ ఖదీర్).

21. ఒకరికన్నా ఎక్కువమంది ఉన్నప్పుడు వారంతా మూడింట ఒక వంతు ఆస్తిలో భాగస్వాములౌతారు. ఈ సందర్భంగా ఆడ – మగ వ్యత్యాసం కూడా చూపబడదు. స్త్రీలకూ, పురుషులకూ సమానమైన భాగాలు ఇవ్వబడతాయి.

**గమనార్హం :** తల్లి తరఫు సోదరులు కొన్ని విషయాలలో ఇతర వారసులకన్నా భిన్నమైనవారు. 1. వీరు కేవలం తమ తల్లి మూలంగా వారసులవుతారు. 2. వీరికి ఇవ్వబడే వారసత్వ భాగంలో ఆడ – మగ తేడా లేకుండా సమానంగా ఇవ్వబడుతుంది. 3.మృతునికి తండ్రిగానీ, కొడుకుగానీ లేనప్పుడే వీరు వారసులుగా పరిగణించబడతారు. 4. ఈ కోవకు చెందిన స్త్రీ పురుషులు ఎంతమంది వున్నాసరే మూడింట ఒక వంతుకు మించి వారికి ఇవ్వబడదు. పైన చెప్పబడినట్లు వారికి చనిపోయిన తమ తల్లి తరఫు సోదరుని నుంచి లభించే ఆస్తిలో తమ స్త్రీ పురుషుల వాటాలు సరిసమానంగా ఉంటాయి. పురుషునికి స్త్రీ కంటే ఒక వంతు ఎక్కువ లభించే విధానం ఇక్కడ వర్తించదు. ఉమర్ (రజి) తన పరిపాలనా కాలంలో ఇలాగే తీర్పు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్ జుహ్‌రీ (రహ్మ.లై) వ్యాఖ్య గమనించదగినది. "ఉమర్ (రజి) ఈ విధంగా నిర్ణయం గైకొన్నారంటే నిశ్చయంగా ఆ మేరకు ఆయన వద్ద దైవప్రవక్త (స) వారి హదీసు ఉండి ఉంటుంది" (ఇబ్నె కసీర్).

22. వారసత్వ ఆదేశాలను వివరించిన ప్రతిసారీ, ఆఖరిలో "మరణ శాసనాన్ని (విల్లును) అమలు పరచిన తరువాత,

**13** ఇవి అల్లాహ్ నిర్ధారించిన హద్దులు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సఅసం)కు విధేయత చూపేవారికి అల్లాహ్, క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలో ప్రవేశం కల్పిస్తాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. గొప్ప విజయం అంటే ఇదే.

تِلْكَ حُدُودُ اللَّهِ ۚ وَمَن يُطِعِ اللَّهَ وَرَسُولَهُ
يُدْخِلْهُ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ
خَالِدِينَ فِيهَا ۚ وَذَٰلِكَ الْفَوْزُ الْعَظِيمُ (13)

**14** ఎవడు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సఅసం) యెడల అవిధేయుడై, ఆయన నిర్ధారించిన హద్దులను మీరిపోతాడో వాడ్ని ఆయన నరకాగ్నిలో పడవేస్తాడు. వాడందులో ఎల్లకాలం పడి ఉంటాడు. అవమానకరమైన శిక్ష అలాంటి వారికోసమే ఉంది.

وَمَن يَعْصِ اللَّهَ وَرَسُولَهُ وَيَتَعَدَّ حُدُودَهُ يُدْخِلْهُ
نَارًا خَالِدًا فِيهَا وَلَهُ عَذَابٌ مُّهِينٌ (14)

**15** మీ స్త్రీలలో ఎవరయినా అక్రమ సంబంధం పెట్టుకుంటే వారికి వ్యతిరేకంగా మీలోని నలుగురు వ్యక్తులను సాక్షులుగా తీసుకురండి. వారు గనక సాక్ష్యం ఇస్తే ఆ స్త్రీలను మరణకాలం వచ్చే వరకుగానీ,[24] లేదా అల్లాహ్ వారికోసం ఏదైనా మార్గాంతరం సూచించేవరకు గానీ[25] – గృహాల్లో నిర్బంధించి ఉంచండి.

وَاللَّاتِي يَأْتِينَ الْفَاحِشَةَ مِن نِّسَائِكُمْ
فَاسْتَشْهِدُوا عَلَيْهِنَّ أَرْبَعَةً مِّنكُمْ ۖ فَإِن شَهِدُوا
فَأَمْسِكُوهُنَّ فِي الْبُيُوتِ حَتَّىٰ يَتَوَفَّاهُنَّ الْمَوْتُ
أَوْ يَجْعَلَ اللَّهُ لَهُنَّ سَبِيلًا (15)

---

అప్పులు తీర్చిన తరువాత ఆస్తి పంచుకోవాలి" అని నొక్కి చెప్పటం, ఒకటికి మూడుసార్లు గుర్తుచేయటం గమనించదగ్గ విషయం. దీన్నిబట్టి ఈ రెండు విషయాలను అమలుపరచటం ఎంత అవసరమో విదితమవుతోంది. అన్నింటికంటే ముందు మృతుని అప్పులను తీర్చటం జరుగుతుంది. ఆ తర్వాత అతని వసియ్యతు (వీలునామా)ను అమలుపరచటం జరుగుతుంది. దీనిపై కూడా ఏకాభిప్రాయం ఉంది. అయితే ఖుర్ఆన్‌లో వసీయతు (వీలునామా లేక మరణశాసనం) ప్రస్తావన ముందుగా చేయబడటం ఆలోచించదగినది. ప్రాముఖ్యం రీత్యా అప్పుల ప్రస్తావన ముందుగా రావలసింది. కాని దేవుడు 'వసీయతు'ను తొలుత ప్రస్తావించి, అప్పుల్ని తీర్చే బాధ్యతను తరువాత నొక్కి చెప్పాడు. ఎందుకంటే మృతుని అంత్యక్రియలు అయిపోగానే అప్పులవాళ్లు ఎలాగూ వచ్చి కూర్చుంటారు. వారసుల వద్ద నుంచి అణాపైసలతో సహా దులుపుకుని పోతారు. కాని సాధారణంగా మృతుని వారసులు 'మరణ శాసనం' పట్ల అశ్రద్ధ వహించటం, మరుపుకు లోనవటం జరుగుతూ ఉంటుంది. అందుకే అల్లాహ్ మాటిమాటికీ వీలునామాను ప్రస్తావనకు తీసుకువచ్చి, వారసులు దాన్ని విస్మరించకుండా ఉండాలని తాకీదు చేస్తున్నాడు (రూహుల్ మఆనీ).

**గమనిక :** భార్యకు మహర్ హక్కు చెల్లించి ఉండకపోతే అది కూడా 'దైన్' (అప్పు) క్రిందికే వస్తుంది. దాన్ని ఆస్తి పంపిణీకి ముందు చెల్లించటం అవశ్యం. ఈ మహర్ సొమ్ము తీసుకోవటంతోపాటు భార్యగా కూడా ఆమె ఆస్తిలో హక్కుదారు అవుతుంది.

23. వీలునామా ద్వారా ఎవరికయినా ఆస్తి హక్కు దక్కకుండా చేయటం లేదా ఒకరికివ్వవలసిన దానికన్నా ఎక్కువ ఇప్పించటం, లేక తగ్గించటం లేదా వారసులకు నష్టం చేకూర్చే ఉద్దేశ్యంతో 'నేను ఫలానా ఫలానా వారికి ఇంత బాకీపడి ఉన్నాన'ని ఊరకే చెప్పటం – ఇవన్నీ వారసులకు నష్టం కలిగించే చేష్టలు. అంటే వసీయతు (వీలునామా) ద్వారా, అప్పు ద్వారా – రెండు విధాలుగానూ వారసులకు నష్టం కలిగించటానికి ప్రయత్నం జరగవచ్చు. ఇటువంటి చేష్టలు మహాపరాధాలుగా భావించబడతాయి. అంతేకాదు, ఈ రకమయిన మరణ శాసనం (వసియ్యతు) కూడా మిథ్యగా, అధర్మంగా ఖరారు చేయబడుతుంది.

**16** మీలో ఏ ఇద్దరయినా ఈ (పాడు) పని[26] చేస్తే వారిద్దరినీ బాధించండి.[27] ఒకవేళ వారు పశ్చాత్తాపపడి, తమ ప్రవర్తనను సరిదిద్దుకుంటే వారిని ఉపేక్షించండి. నిస్సందేహంగా అల్లాహ్ పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడు కూడా.

وَالَّذَانِ يَأْتِيَانِهَا مِنكُمْ فَآذُوهُمَا ۖ فَإِن تَابَا وَأَصْلَحَا فَأَعْرِضُوا عَنْهُمَا ۗ إِنَّ اللَّهَ كَانَ تَوَّابًا رَّحِيمًا ﴿١٦﴾

**17** అవివేకం వల్ల ఏదైనా చెడు కార్యానికి పాల్పడి, వెనువెంటనే తప్పు తెలుసుకుని పశ్చాత్తాపం చెందేవారి పశ్చాత్తాపాన్ని స్వీకరించే బాధ్యత మాత్రమే అల్లాహ్‌పై ఉంది. అటువంటి వారి పశ్చాత్తాపాన్ని అల్లాహ్ స్వీకరిస్తాడు. అల్లాహ్ మహాజ్ఞాని, గొప్ప వివేకవంతుడు.

إِنَّمَا التَّوْبَةُ عَلَى اللَّهِ لِلَّذِينَ يَعْمَلُونَ السُّوءَ بِجَهَالَةٍ ثُمَّ يَتُوبُونَ مِن قَرِيبٍ فَأُولَٰئِكَ يَتُوبُ اللَّهُ عَلَيْهِمْ ۗ وَكَانَ اللَّهُ عَلِيمًا حَكِيمًا ﴿١٧﴾

---

24. ఇస్లాం ప్రారంభంలో వ్యభిచారానికి పాల్పడే స్త్రీలకు విధించబడిన శిక్ష ఇది. అప్పటికింకా వ్యభిచార నేరానికి శిక్ష నిర్ధారించబడలేదు. కాబట్టి ఈ శిక్ష తాత్కాలికంగా అమలుపరచబడింది. ఈ ఆయతులో ఇంకో విషయం కూడా గమనార్హం. అరబీ భాషలో మూడు నుంచి పది వరకు వస్తువుల సంఖ్య గురించి చెప్పటానికి నియమం ఏమిటంటే, వస్తువులు పుంలింగమైతే వాటిని సూచించే సంఖ్య స్త్రీలింగపదమై ఉండాలి. ఒకవేళ వస్తువులు స్త్రీలింగమైతే వాటిని సూచించే సంఖ్య పుంలింగం వాడబడాలి. ఇక్కడ ఆయతులో **"అర్‌బఅహ్"** అని వచ్చింది. అర్‌బఅహ్ అంటే నాలుగు లేక నలుగురు అని అర్థం. ఇది (అర్‌బఅహ్) స్త్రీలింగ పదం. కాబట్టి దీని తర్వాత ఎలాగయినా **పుంలింగ** పదమే రావాలి. ఆ పదం **'రిజాల్'** అవుతుంది. రిజాల్ అనగా పురుషులు అని అర్థం. అంటే నలుగురు పురుషులన్నమాట!
మొత్తానికి తెలిసేదేమిటంటే, ఎవరయినా వ్యభిచారానికి పాల్పడ్డారని ఆరోపించదలచినప్పుడు దానికి నలుగురు పురుషుల సాక్ష్యం తప్పనిసరి. అంటే ఇస్లాం ధర్మం వ్యభిచార నేరానికి ఎంత కఠినమైన శిక్ష విధించిందో, ఆ నేరాన్ని రుజువు చేయటం కోసం కూడా అంతే కఠినమైన షరతును విధించింది. అదీ ఒకటీ రెండూ కాదు, నాలుగు సాక్ష్యాలు కావాలి. కళ్ళారా చూసినట్లు నలుగురు సాక్షులు ముందుకు రానంతవరకూ షరీయతుపరంగా శిక్ష విధించటానికి ఆస్కారం ఉండదు.
25. ఇక్కడ మార్గాంతరం అంటే భావం తరువాతి కాలంలో అల్లాహ్ నిర్ధారించిన శిక్ష. అంటే వివాహితులైన పురుషులు, స్త్రీలు ఇలాంటి అక్రమ సంబంధాలకు ఒడిగడితే రాళ్లు రువ్వే శిక్ష విధించబడుతుంది. పెళ్ళికాని వారు గనక వ్యభిచారం చేస్తే నూరు కొరడా దెబ్బలు కొట్టబడతాయి. దీని గురించి వివరాలు నూర్ సూరాలో, ప్రామాణికమైన హదీసుల్లోనూ ఉన్నాయి.
26. ఏమిటీ ఈ **"(పాడు)పని"** అన్నది ఇక్కడ సహజంగా జనించే ప్రశ్న. బహుశా యిది స్వలింగ సంపర్కం (హోమో సెక్సువాలిటీ) కావచ్చునని కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు. మరి కొంతమంది దీన్ని అవివాహితులైన స్త్రీ పురుషుల శారీరక సంబంధం అన్న భావంలో తీసుకున్నారు. ఇంతకు ముందు వచ్చిన ఆయతును వీరు ముహ్‌సనాత్ (వివాహితుల)కు ప్రత్యేకమైనదిగా భావించారు. స్త్రీ పురుషులు – వారు వివాహితులైనాసరే, అవివాహితులు అయినా సరే – వారు పెట్టుకునే అక్రమ సంబంధమే ఈ 'పాడుపని' అని ఇంకొంతమంది వివరించారు. అయితే ఇబ్నె జరీర్ తబ్రీ మాత్రం అవివాహితులైన స్త్రీ పురుషుల అక్రమ సంబంధం అన్న దానికే ప్రాధాన్యత ఇచ్చారు. మొదటి ఆయతులో తెలుపబడిన శిక్ష (గృహ నిర్బంధం చేసి ఉంచాలన్నది) దైవప్రవక్త (స) వారు సూచించిన 'శిలాశిక్ష' తరువాత రద్దు పరచబడిందనీ, అలాగే ఈ ఆయతులో తెలుపబడిన శిక్ష నూర్ సూరాలో స్పష్టపరచబడిన నూరు కొరడా దెబ్బల శిక్ష ఆధారంగా రద్దుపరచటం జరిగిందనీ ఆయన చెప్పారు (తఫ్సీరె తబ్రీ).
27. **'బాధించటం'** అంటే అర్థం తీవ్రంగా మందలించటం, చీవాట్లు పెట్టడం లేదా చేత్తో కొట్టడం. అయితే ఇంతకు ముందు వివరించబడినట్లు, ఈ శిక్ష రద్దుపరచబడింది.

وَلَيْسَتِ التَّوْبَةُ لِلَّذِينَ يَعْمَلُونَ السَّيِّئَاتِ ۚ
حَتَّىٰ إِذَا حَضَرَ أَحَدَهُمُ الْمَوْتُ قَالَ إِنِّي تُبْتُ
الْآنَ وَلَا الَّذِينَ يَمُوتُونَ وَهُمْ كُفَّارٌ ۚ أُولَٰئِكَ
أَعْتَدْنَا لَهُمْ عَذَابًا أَلِيمًا ﴿١٨﴾

**18** నిరంతరం పాపకార్యాలకు పాల్పడుతూ, తీరా మరణ ఘడియలు సమీపించాక, "ఇప్పుడు నేను పశ్చాత్తాప పడుతున్నాను"[28] అని అనే వారి పశ్చాత్తాపం ఆమోదించబడదు. అలాగే అవిశ్వాస స్థితిలో ప్రాణం విడిచే వారి పశ్చాత్తాపం కూడా స్వీకరించబడదు. ఇలాంటి వారి కోసమే మేము వ్యధా భరితమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాము.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا يَحِلُّ لَكُمْ أَنْ تَرِثُوا
النِّسَاءَ كَرْهًا ۖ وَلَا تَعْضُلُوهُنَّ لِتَذْهَبُوا
بِبَعْضِ مَا آتَيْتُمُوهُنَّ إِلَّا أَنْ يَأْتِينَ بِفَاحِشَةٍ
مُبَيِّنَةٍ ۚ وَعَاشِرُوهُنَّ بِالْمَعْرُوفِ ۚ فَإِنْ
كَرِهْتُمُوهُنَّ فَعَسَىٰ أَنْ تَكْرَهُوا شَيْئًا وَيَجْعَلَ
اللَّهُ فِيهِ خَيْرًا كَثِيرًا ﴿١٩﴾

**19** విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు బలవంతంగా స్త్రీలకు వారసులై కూర్చోవటం[29] మీకు ధర్మసమ్మతం కానేరదు. మీరు వారికి ఇచ్చిన దానిలో (మహర్) నుంచి కొంత సొమ్ము కాజేసే ఉద్దేశ్యంతో[30] వారిని ఆపి ఉంచుకోకండి. ఒకవేళ వారు గనక బాహాటంగా ఏదైనా నీతిమాలిన పనికి పాల్పడితే అది వేరే విషయం.[31] వారితో ఉత్తమరీతిలో కాపురం చేయండి. ఒకవేళ వారు మీకు నచ్చకపోతే బహుశా ఏదో ఒక్క విషయం మూలంగా మీకు నచ్చకపోవచ్చు. కాని మీకు నచ్చని ఆ విషయంలోనే అల్లాహ్ అపారమైన శుభాన్ని పొందుపరచాడేమో![32] (మీకేం తెలుసు?)

28. గుండెల్లోని ప్రాణం గొంతుదాటి పోతున్నప్పుడు లెంపలేసుకుంటే లాభం ఏమీలేదని, అటువంటి పశ్చాత్తాపం దైవ సన్నిధిలో స్వీకారయోగ్యం కాదని దీనిద్వారా స్పష్టమవుతున్నది. హదీసు ద్వారా కూడా ఈ విషయం విపులీకరించ బడింది. ఆలి ఇమ్రాన్ సూరా 90వ వచనంలో కూడా ఈ విషయమే సూటిగా చెప్పబడింది.

29. ఇస్లాంకు పూర్వం స్త్రీ జాతిపై జరుగుతూ ఉన్న మరో దౌర్జన్యం యిక్కడ పేర్కొనబడింది. ఎవరయినా ఒక వ్యక్తి మరణిస్తే వారసులు అతని ఆస్తిపై విరుచుకుపడినట్లే, వారు అతని భార్యను కూడా చుట్టుముట్టేవారు. ఆమె యిష్టా యిష్టాలతో ఏమాత్రం నిమిత్తం లేకుండా ఆమెను తమ దాంపత్యంలోకి తీసేసుకోవాలని ఉబలాటపడేవారు. లేదా అన్నకో, తమ్ముడికో, అన్న కుమారునికో ఆమెను కట్టబెట్టేవారు. ఆఖరికి సవతి తల్లిని మనువాడటానికి కూడా వెనుకాడేవారు కాదు. అదీ కుదరనప్పుడు ఆమె తన యిష్టంతో మరో వ్యక్తిని పెళ్ళిచేసుకునే స్వేచ్ఛ కూడా ఆమెకు ఉండేది కాదు. ఆమె జీవితం మోడువారిన బ్రతుకు అయిపోయేది. ఈ రకమయిన అన్యాయాన్ని ఇస్లాం అరికట్టింది.

30. ఆనాడు అతివలపై జరిగే మరో జులుం ఏమిటంటే భర్తకు గనక భార్య నచ్చకపోతే ఆమెకు విడాకులిచ్చి వదిలిపెట్టే బదులు, ఆమెను విపరీతంగా వేధించి, డోలాయమాన స్థితిలో పెట్టేవాడు. ఆమె ఈ వేధింపులను భరించలేక భర్త తనకు మహర్ రూపంలో, కానుకల రూపంలో యిచ్చిన ఆస్తిపాస్తులన్నింటినీ ఏకపక్షంగా వదులుకుని, అతన్నుంచి 'సెలవు' తీసుకోవాలన్నది అతని దురుద్దేశం అయి ఉండేది. పైకి స్పష్టంగా కనిపించని ఈ 'అమానుషాన్ని' కూడా ఇస్లాం నిర్ద్వంద్వంగా ఖండించింది.

31. బాహాటంగా నీతిమాలిన పనికి పాల్పడటం అంటే ఎవరితోనయినా అక్రమ సంబంధం పెట్టుకోవటం లేదా దుర్భాష లాడటం లేదా ధిక్కారవైఖరికి పాల్పడటం అని అర్థం. ఇట్టి పరిస్థితిలో ఆమె తన భర్త తనకిచ్చిన మహర్ సొమ్మును, తన పేర రాసిన ఆస్తిపాస్తులను భర్తకు వాపసుచేసి 'ఖులా' ద్వారా అతన్నుంచి వేర్పడేలా భార్య పట్ల వ్యవహరించ టానికిగాను భర్తకు అనుమతి ఇవ్వబడింది. భార్య స్వయంగా 'ఖులా' ద్వారా భర్త నుంచి విడిపోదలచినప్పుడు, ఆమెకు ఇచ్చిన మహర్ సొమ్మును తిరిగి తీసుకునే హక్కు భర్తకు ఉంటుంది (సూరె బఖర 229వ ఆయతు చూడవచ్చు).

**20** మీరు ఒక భార్య స్థానంలో మరో భార్యను చేసుకోదలిస్తే, వారిలో ఎవరికయినా మీరు పెద్ద ధనరాశిని ఇచ్చివున్నా సరే, దానిలోనుంచి ఏ కొంచెం కూడా తిరిగి తీసుకోకండి.[33] ఏమిటీ, అది అన్యాయం, స్పష్టమైన పాపం అయినప్పటికీ మీరు దాన్ని తీసుకుంటారా?

وَإِنْ أَرَدْتُّمُ اسْتِبْدَالَ زَوْجٍ مَّكَانَ زَوْجٍ
وَآتَيْتُمْ إِحْدَاهُنَّ قِنطَارًا فَلَا تَأْخُذُوا مِنْهُ
شَيْئًا ۚ أَتَأْخُذُونَهُ بُهْتَانًا وَإِثْمًا مُّبِينًا ﴿٢٠﴾

**21** మీరు పరస్పరం కలుసుకున్న తరువాత,[34] ఆ స్త్రీలు మీ నుండి గట్టి వాగ్దానం తీసుకున్న తరువాత[35] కూడా ఆ ధనాన్ని మీరెలా (తిరిగి) తీసుకోగలుగుతారు?

وَكَيْفَ تَأْخُذُونَهُ وَقَدْ أَفْضَىٰ بَعْضُكُمْ إِلَىٰ بَعْضٍ
وَأَخَذْنَ مِنكُم مِّيثَاقًا غَلِيظًا ﴿٢١﴾

**22** మీ తండ్రులు వివాహమాడిన స్త్రీలను మీరు ఎట్టి పరిస్థితి లోనూ పెళ్ళి చేసుకోకండి.[36] పూర్వం జరిగిందేదో జరిగి పోయింది. అదొక సిగ్గుమాలిన పని, ద్వేషానికి మూలం, ఒక చెడు నడత.

وَلَا تَنكِحُوا مَا نَكَحَ آبَاؤُكُم مِّنَ النِّسَاءِ إِلَّا
مَا قَدْ سَلَفَ ۚ إِنَّهُ كَانَ فَاحِشَةً وَمَقْتًا ۖ
وَسَاءَ سَبِيلًا ﴿٢٢﴾

32. భార్యతో కాపురం చేయవలసిన పద్ధతిని ఈ ఆయతు వివరించింది. ఈ విషయాన్ని దైవప్రవక్త (స) మరింత స్పష్టంగా విడమరచి చెప్పారు. ఈ ఆయతుకు భావార్థంగా ఒక హదీసు ఇలా ఉంది: "విశ్వాసి (అయిన భర్త) విశ్వాసురాలైన స్త్రీ (భార్య) పట్ల ఏహ్యభావం కలిగి ఉండకూడదు. ఒకవేళ ఆమె అలవాట్లలోని ఏదేని ఒక విషయం తనకు యిష్టకరంగా లేకపోతే, ఇతర అలవాట్లు ఎన్నో మంచివి కూడా ఆమెలో ఉండవచ్చు" (సహీహ్ ముస్లిం – కితాబుర్రిజాయి). దీని భావం ఏమిటంటే చెడునడత, ద్రోహం, అవిధేయత లాంటి దుర్గుణాలేవీ లేకుండా ఇతరత్రా చిన్న చిన్న లోపాలు భార్యలో ఉంటే వాటి గురించి రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదు. లోపాలు లేనివారు లోకంలో ఎవరూ లేరు. ప్రతి చిన్న లోపాన్ని సాకుగా తీసుకుని చీటికీ మాటికీ చిందులేస్తూ విడాకుల ప్రస్తావన తీసుకువస్తూ ఉంటే కళకళలాడవలసిన కాపురాలు కాస్తా కుప్పకూలిపోతాయి. కాబట్టి చిన్నచిన్న లోపాల విషయంలో భర్త ఓర్పుతో, నేర్పుతో వ్యవహరించాలి. ఎందుకంటే ఏ భార్యను తాను పద్దాక సాధిస్తున్నాడో ఆమె ద్వారానే అతనికి అల్లాహ్ ఎన్నో వరాలు ప్రసాదించవచ్చు. ఆమె ద్వారా దేవుడు అతనికి ఉత్తమ సంతానం ప్రసాదించవచ్చు! ఆమె ద్వారా అతని ఇల్లూ వాకిలిలో సిరులు పొంగిపొరలవచ్చు!

కాని విచారకరమైన విషయం ఏమిటంటే ముస్లిం సోదరులు ఈ ఖుర్ఆన్ హదీసు ఉపదేశాలను పెడచెవినపెట్టి, అతి సాధారణ విషయాల ఆధారంగా తమ భార్యలకు విడాకులిచ్చేస్తూ ఉంటారు. ఈ విధంగా వారు ఇస్లాం తమకు యిచ్చిన విడాకుల అస్త్రాన్ని అత్యంత దారుణమైన రీతిలో ప్రయోగిస్తున్నారు. అనివార్యమైన పరిస్థితుల్లో వాడటానికి మాత్రమే ఆ హక్కు యివ్వటం జరిగింది కాని ఈ రకంగా కొంపల్ని కూల్చటానికి కాదు! ఆడవారికి అన్యాయం చేయడానికి, కన్నపిల్లల జీవితాలను సర్వనాశనం చేయడానికి ఈ హక్కు యివ్వబడలేదు. గత్యంతరంలేని పరిస్థితుల్లో భార్యాభర్తలు విడిపోవడానికి కల్పించబడిన ఈ వెసులుబాటును దుర్వినియోగపరచటం వల్ల ఇస్లాంకు చెడ్డ పేరు వస్తోంది. ఈ విధంగా ఇస్లాంకు చెందిన ఒక గొప్ప సుగుణాన్ని చెడుగా, దుర్మార్గంగా చిత్రీకరించటం జరుగుతోంది.

33. తమంతట తాముగా భార్యకు విడాకులిచ్చినప్పుడు మహర్ హక్కును తిరిగి తీసుకోరాదని చాలా గట్టిగా తాకీదు చేయబడింది. ఆయతులో **'ఖిన్తారున్'** అనే పదం వచ్చింది. ఖిన్తారున్ అంటే చాలా పెద్ద మొత్తంలో ధనం అని అర్థం. అనగా నికాహ్ సందర్భంగా మీరామెకు ఎంత పెద్దమొత్తంలో మహర్ సొమ్ము యిచ్చివున్నాసరే అందులో నుంచి ఏ కొంచెం కూడా డిమాండు చేయటంగానీ, లాక్కోవటంగానీ తగదు. ఒకవేళ మీరలా చేస్తే అది జులుం అవుతుంది. బహిరంగ పాపం అనిపించుకుంటుంది.

34. పరస్పరం కలుసుకోవటమంటే సమాగమం జరపటం, దాంపత్య సుఖం పొందటం అని అర్థం.

حُرِّمَتْ عَلَيْكُمْ أُمَّهٰتُكُمْ وَبَنٰتُكُمْ وَأَخَوٰتُكُمْ
وَعَمّٰتُكُمْ وَخٰلٰتُكُمْ وَبَنٰتُ الْأَخِ وَبَنٰتُ الْأُخْتِ
وَأُمَّهٰتُكُمُ الّٰتِيْٓ أَرْضَعْنَكُمْ وَأَخَوٰتُكُمْ مِّنَ
الرَّضَاعَةِ وَأُمَّهٰتُ نِسَآئِكُمْ وَرَبَآئِبُكُمُ الّٰتِيْ فِيْ
حُجُوْرِكُمْ مِّنْ نِّسَآئِكُمُ الّٰتِيْ دَخَلْتُمْ بِهِنَّ ۡ
فَإِنْ لَّمْ تَكُوْنُوْا دَخَلْتُمْ بِهِنَّ فَلَا جُنَاحَ عَلَيْكُمْ
وَحَلَآئِلُ أَبْنَآئِكُمُ الَّذِيْنَ مِنْ أَصْلَابِكُمْ وَأَنْ
تَجْمَعُوْا بَيْنَ الْأُخْتَيْنِ إِلَّا مَا قَدْ سَلَفَ ۭ
إِنَّ اللّٰهَ كَانَ غَفُوْرًا رَّحِيْمًا (23)

**23** మీ కొరకు నిషేధించబడినవారు[37]– మీ తల్లులు, మీ కుమార్తెలు, మీ అక్కా చెల్లెళ్ళు, మీ మేనత్తలు, మీ తల్లి సోదరీ మణులు (మీ పిన్నమ్మ పెద్దమ్మలు), మీ అన్నదమ్ముల కుమార్తెలు, అక్కాచెల్లెళ్ళ కూతుళ్ళు (మేనకోడళ్ళు), మీకు పాలిచ్చిన తల్లులు, పాల వరుస ద్వారా మీకు అక్కాచెల్లెళ్ళు అయినవారు, మీ భార్యల తల్లులు (అత్తలు), మీరు దాంపత్య సుఖాన్ని అనుభవించిన మీ భార్యల (ఆమె మాజీ భర్త ద్వారా పుట్టిన) మీ సంరక్షణలోనున్న కూతుళ్ళు – ఒకవేళ మీరు వారితో సమాగమం జరపకుండా ఉంటే (కేవలం పెళ్ళిమాత్రం చేసుకుని వారికి విడాకులు యిచ్చేసివున్న పక్షంలో వారి కూతుళ్లను వివాహమాడటం) మీ కొరకు పాపం కాదు. అలాగే మీ వెన్ను నుండి (స్ఖలించబడిన వీర్యంతో) పుట్టిన మీ కొడుకుల భార్యలు (కోడళ్ళు) మీ కోసం నిషేధించబడ్డారు. (ఏకకాలంలో) ఇద్దరు అక్కా చెల్లెళ్ళను కలిపి భార్యలుగా చేసుకోవటం కూడా మీ కొరకు నిషిద్ధమే, లోగడ జరిగిందేదో జరిగిపోయింది. నిస్సందేహంగా అల్లాహ్ క్షమాశీలి, కృపాకరుడు కూడాను.

35. గట్టి వాగ్దానం తీసుకోవటమంటే నికాహ్ సందర్భంగా పురుషుని (వరుని) నుంచి తీసుకునే వాగ్దానం. ఇల్లాలిని సుఖపెడతాననీ, ఒకవేళ వదిలినా ఉత్తమరీతిలోనే వదలుతానని అతడు యిచ్చే 'మాట.'

36. అజ్ఞానకాలంలో సవతి కొడుకులు వితంతువు అయిపోయిన తమ తండ్రుల భార్యలను (సవతి తల్లులను) పెళ్ళిచేసుకునేవారు. నీతిబాహ్యమైన ఈ చేష్టకు పాల్పడరాదని యిక్కడ గట్టిగా చెప్పబడింది. తండ్రి ఒకసారి పెళ్ళి చేసుకుని, ఆమెను ఒక్కసారి కూడా కలుసుకోకుండా విడాకులిచ్చేసిన స్త్రీని కూడా సవతి కొడుకు వివాహమాడరాదు. ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ద్వారా కూడా ఈ సంగతి రుజువవుతోంది. ముస్లిం విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే (తఫ్సీరె తబ్రీ).

37. వివాహం కొరకు నిషేధించబడిన స్త్రీల వివరాలు యిక్కడ పేర్కొనబడ్డాయి. వారిలో ఏడు రకాల నిషిద్ధ స్త్రీలు వంశ పారంపర్యంగా వస్తారు. ఏడుగురు పాలవరుస ద్వారా వస్తారు. నలుగురు అత్తవారింటి తరఫున వస్తారు. అదీగాక దైవప్రవక్త (స) వారి ప్రవచనం ప్రకారం భార్య యొక్క మేనత్తను, పినతల్లిని, ఆమె సోదరుల పుత్రికను, ఆమె అక్కా చెల్లెళ్ళ పుత్రికను కూడా – ఏకకాలంలో – నికాహ్ చేసుకోరాదు. వంశపారంపర్యం రీత్యా నిషేధించబడిన స్త్రీలలో తల్లులు, కుమార్తెలు, అక్కాచెల్లెళ్ళు, మేనత్తలు, పిన్నమ్మలు, సోదరుల పుత్రికలు, మేనకోడళ్ళు చేరి ఉన్నారు. అలాగే ఒకేతల్లి పాలు త్రాగటం వల్ల ఏర్పడిన పాలవరుస సంబంధాల మూలంగా సరిగ్గా ఈ ఏడు రకాల స్త్రీలు వివాహానికి నిషేధించబడతారు. ఇక అత్తవారి తరఫున నిషేధించబడిన స్త్రీలలో అత్తగారు, నికాహ్ చేసుకున్న (తరువాత శుభకార్యం జరిగిపోయిన) భార్యలకు ఆమె మునుపటి భర్తల ద్వారా పుట్టిన కుమార్తెలు, కోడళ్లు ఉన్నారు. ఇద్దరు సొంత అక్కాచెల్లెళ్ళను ఏకకాలంలో భార్యలుగా కలిగి ఉండటం కూడా హరామే (నిషిద్ధమే).

(I). **ముహర్రమాతె నసబియ్య** (వంశపరంగా హరామ్ గావించబడిన స్త్రీలు) :

**1. తల్లులు (ఉమ్మహాత్):** తల్లులలో తల్లుల మాతలు (అమ్మమ్మలు), వారి నాయనమ్మలు, తండ్రుల మాతలు (నాయనమ్మలు, మున్నాయనమ్మలు, వారి పూర్వీకులు) కూడా చేరి ఉన్నారు.

**2. కుమార్తెలు (బనాత్) :** వీరిలో కన్న కూతుళ్ళతో పాటు వారి పుత్రికలు (మనవరాళ్ళు, మనవరాళ్ళ కుమార్తెలు, ఆపైవారు కూడా వస్తారు). అక్రమ సంబంధం ద్వారా పుట్టిన ఆడపిల్ల షరీయత్‌పరంగా కూతురుగానే పరిగణించబడుతుందా? లేదా? అన్న విషయమై అభిప్రాయభేదం ఉంది. ముగ్గురు ఇమాములు (అనగా అబూ హనీఫా, మాలిక్, అహ్మద్ బిన్ హంబల్ -రహ్మలై-లు) ఆమెను కూతురుగానే భావించి, ఆమెతో నికాహ్ చేసుకోవటాన్ని నిషిద్ధంగా ప్రకటించారు. ఇమామ్ షాఫయి మాత్రం ఆమెను ధర్మబద్ధమయిన కుమార్తెగా పరిగణించలేదు. ఎందుకంటే **'యూసీకుముల్లాహు ఫీ ఔలాదికుమ్'** (అల్లాహ్ మీ సంతానం విషయంలో మీకు ఆజ్ఞాపిస్తున్నాడు) అనే ఆయతు ఈమెకు వర్తించదు. కనుక అక్రమ సంబంధం మూలంగా పుట్టిన బిడ్డలు ఆస్తికి వారసులు కాలేరన్న విషయమై పండితుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. అదేవిధంగా ఆమె ఈ ఆయతు భావపరిధిలోకి కూడా రాజాలదని ఇమామ్ షాఫయీ అభిప్రాయం. యదార్థం అల్లాహ్‌కే తెలుసు (ఇబ్నె కసీర్).

**3. అక్కాచెల్లెళ్ళు (అఖవాత్) :** వారు తోబుట్టువులైనా, సవతి అక్కాచెల్లెళ్ళయినా - వారంతా అక్కాచెల్లెళ్ళుగానే పరిగణించబడతారు. సవతి అక్కాచెల్లెళ్లు రెండు విధాలుగా ఉండవచ్చు.

★ **అఖ్‌యాఫీ అక్కాచెల్లెళ్లు :** తల్లి ఒక్కటే అయి ఉండి తండ్రులు మాత్రం వేర్వేరుగా ఉన్నవారు.

★ **అల్లాతీ అక్కా చెల్లెళ్లు :** తండ్రి ఒక్కడే అయి ఉండి తల్లులు మాత్రం వేర్వేరుగా ఉన్నవారు.

**4. మేనత్తలు (అమ్మాత్) :** ఈ కోవలో తండ్రి సోదరీమణులు, తాతల అక్కాచెల్లెళ్ళు కూడా చేరి ఉన్నారు.

**5. పెద్దమ్మ, పిన్నమ్మలు (ఖాలాత్) :** ఇందులో తల్లి అక్కాచెల్లెళ్ళు, అమ్మమ్మగారి సోదరీమణులు, నాయనమ్మగారి సోదరీమణులంతా చేరి ఉన్నారు.

**6. సోదర కుమార్తెలు :** మూడు రకాల అన్నదమ్ముల కుమార్తెలు ఈ పరిధిలోకి వస్తారు. స్వంత అన్నదమ్ములు, సవతి అన్నదమ్ములు, తల్లి తరఫున వచ్చి చేరిన అన్నదమ్ములు - ఈ మూడు రకాల సోదరుల కుమార్తెలు వివాహానికి నిషేధించబడ్డారు.

**7. మేనకోడళ్ళు :** ఇందులో కూడా మూడు రకాల మేనకోడళ్ళు చేరి ఉన్నారు.

(II) **ముహర్రమాతె రజాయియ్య** (పాల వరుస మూలంగా నిషేధించబడిన స్త్రీలు) :

1. రెండేళ్ల లోపు వయస్సులో మీరు పాలు త్రాగిన స్త్రీ.

2. మీ కన్న తల్లి వద్ద లేక మీకు చనుబాలు యిచ్చిన మరే స్త్రీ వద్దయినా పాలు త్రాగి ఉన్న స్త్రీ ఎవరయినా సరే; ఆమె మీకు పాలవరుస సోదరి అవుతుంది. ఆమె మీతో కలసి ఆ పాలు త్రాగినా, మీకు ముందు త్రాగి ఉన్నా, మీ తరువాత త్రాగివున్నా, ఆమె మీ సోదరిగానే పరిగణించబడుతుంది. వంశపరంగా నిషిద్ధమయ్యే బంధుత్వాలన్నీ పాల వరుస ద్వారా కూడా హరామ్ (నిషిద్ధం) అవుతాయి. ఎందుకంటే పాలవరుస తల్లి యొక్క కన్నబిడ్డలు మరియు పాలవరుస బిడ్డలంతా కూడా ఆమె వద్ద పాలు త్రాగిన పిల్లవాడికి అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు అవుతారు. అలాగే ఆమె భర్త అతనికి 'పాలవరుస తండ్రి' అవుతాడు. ఆ పురుషుని అక్కాచెల్లెళ్ళు అతనికి 'పాల వరుస మేనత్తలు' అవుతారు. ఇంకా పాలవరుస తల్లి యొక్క అక్కాచెల్లెళ్ళు ఈ పిల్లవాడికి 'పాలవరుస పిన్నమ్మ పెద్దమ్మలు' అవుతారు. ఆమె భర్త (అనగా పాలవరుస తండ్రి యొక్క) సోదరులు ఇతనికి 'పాలవరుస బాబాయి, పెదనాన్నలు' అవుతారన్న మాట. ఇక్కడ ఒక విషయం గమనార్హం. పాలతల్లి ఇంటివారితో ఈ సంబంధాలు ఆమెవద్ద పాలుత్రాగిన పిల్లవాడి వరకే పరిమితమై ఉంటాయి. ఆఖరికి ఆ అబ్బాయి సొంత అన్నదమ్ములకు కూడా ఆ ఇంటితో ఎటువంటి నిషిద్ధ బంధుత్వం ఉండదని గమనించాలి.

(III) **ముహర్రమాత్ బిల్ ముసాహర** - భార్యల తల్లులు (అంటే - అత్తలు), భార్యల తల్లులతోపాటు వారి అమ్మమ్మలు,

నాయనమ్మలు కూడా ఈ కోవలోకి వస్తారు. ఒకవేళ ఏ స్త్రీనయినా వివాహం చేసుకుని, సంభోగించకుండానే ఆమెకు విడాకులిచ్చినప్పటికీ ఆమె తల్లితో వివాహం నిషిద్ధమవుతుంది. ఒకవేళ ఏ స్త్రీనయినా వివాహం చేసుకుని, సంభోగించకుండానే విడాకులిచ్చిన పిదప ఆమె కూతురిని మాత్రం నికాహ్ చేసుకోవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

**మీ సంరక్షణలో పెరిగే మీ భార్యల కుమార్తె(రబీబా)లు :** అంటే వివాహ బంధంలోకి వచ్చిన భార్యలకు అంతకుముందే వారి మాజీ భర్తల ద్వారా కూతుళ్ళు పుట్టి ఉంటే, అట్టి కూతుళ్ళు నికాహ్‌కు హరాం అవుతారు. ఒకవేళ ఆ భార్యలతో అతడు సంభోగం జరపకుండానే విడాకులు యిచ్చి ఉంటే, అప్పుడు ఆ అమ్మాయిలు అతని కోసం హరాం (నిషిద్ధం) అవరు.

ఇక్కడ అరబీలో **'ఫీ హుజూరికుమ్'** (మీ సంరక్షణలో పెరుగుతున్న) అని అనబడింది. ఇది నియమం కాదు. అంటే మీ భార్యల కుమార్తెలు మీ సంరక్షణలో గాకుండా, ఇతర చోట్ల ఉంటే వారిని వివాహం చేసుకోవచ్చని ఈ ఆయతు ఉద్దేశ్యం ఎంతమాత్రం కాదు. సాధారణంగా పిల్లలు తమ తల్లితోపాటు ఆమె భర్త సంరక్షణలోనే ఉంటారు కనుక అలా చెప్పబడింది. అంచేత భార్యకు మాజీ భర్త ద్వారా కలిగిన పుత్రిక తన సంరక్షణలో పెరిగినా మరెక్కడ పెరిగినా– భార్యతో సంభోగం జరిగిన పక్షంలో – ఆ అమ్మాయి తన కొరకు శాశ్వతంగా నిషిద్ధం అయిపోతుంది.

**మీ వెన్ను నుండి పుట్టిన మీ కుమారుల భార్యలు :** అరబీలో **'హలాయిలు'** అని ఉంది. ఇది **'హలీలా'** అనే పదానికి బహువచనం. అసలు ఇది 'హల్ల – యహిల్లు' నుంచి వచ్చింది. 'హల్ల – యహిల్లు' అంటే దిగటమని అర్థం. భర్త ఎక్కడ నివాసముంటే భార్య కూడా అక్కడే నివాసముంటుంది. భర్త ఎక్కడ దిగితే భార్య కూడా అక్కడే దిగుతుంది. కనుకనే భార్యను అరబీలో 'హలీలా' అన్నారు. మొత్తానికి **'హలాయిలు అబ్‌నాయికుమ్'** అంటే మీ కుమారుల భార్యలన్నమాట! కన్న కొడుకులతోపాటు, కొడుకుల సంతానం, కూతుళ్ళ సంతానం (మనవళ్ళ) యొక్క భార్యలు కూడా ఈ కోవలోకి వస్తారు. అదేవిధంగా పాల వరుస కుమారుల భార్యలు కూడా నిషిద్ధంగా పరిగణించబడతారు. మరి దత్తత తీసుకున్న పుత్రుల విషయంలో ఈ నిషేధాజ్ఞ వర్తించదు. దత్తపుత్రుల భార్యలు గనక వితంతువులవటమో, విడాకులు పొందటమో జరిగితే వారిని మీరు పునర్వివాహం చేసుకోవటం ధర్మసమ్మతమే. అందుకే ఆయతులో 'హలాయిలు అబ్‌నాయికుమ్' అని చెప్పిన తర్వాత **'మిన్ అస్‌లాబికుమ్'** (మీ వెన్ను నుంచి పుట్టిన) అన్న నియమం ఉంచబడింది.

**ఏకకాలంలో అక్కా చెల్లెళ్ళిద్దరినీ కలిపి భార్యలుగా చేసుకోవటం :** ఇది కూడా ధర్మసమ్మతం కాదు. ఆ అక్కాచెల్లెళ్ళు రక్త సంబంధీకులైనాసరే, పాల వరుస సంబంధం రీత్యా అక్కాచెల్లెళ్ళు అనబడినాసరే–వారిద్దరినీ ఏకకాలంలో భార్యలుగా పొందకూడదు. అయితే వారిరువురిలో ఒకరు చనిపోవటమో, లేక విడాకులు యివ్వటమో జరిగితే ఇద్దత్ (గడువు) పూర్తయిన తర్వాత ఆమె రెండో సోదరిని దాంపత్య జీవితంలోనికి తెచ్చుకోవటం ధర్మసమ్మతమే. అలాగే నలుగురు భార్యలున్న వ్యక్తి వారిలో ఒకామెకు విడాకులిచ్చి మరొకామెను అప్పటికప్పుడే పెండ్లాడలేడు. విడాకులివ్వబడిన స్త్రీకి గడువు (ఇద్దత్) పూర్తి కావాలి.

**గమనిక :** వ్యభిచారం మూలంగా బంధుత్వ నిషిద్ధత (హుర్‌మత్) ఏర్పడుతుందా లేదా? – ఈ విషయంలో పండితుల మధ్య భేదాభిప్రాయం ఉంది. అత్యధికమంది పండితులు ఏమన్నారంటే, ఒక వ్యక్తి ఏ స్త్రీతోనయినా అక్రమ సంబంధం పెట్టుకుంటే, దాని ఆధారంగా ఆ స్త్రీ అతనితో వివాహానికి నిషిద్ధం కాజాలదు. అదే విధంగా తన భార్య యొక్క తల్లి (అత్త)తో లేక (మరో భర్త ద్వారా కలిగిన) ఆమె కూతురుతో అక్రమ సంబంధం పెట్టుకున్న కారణంగా అతని భార్య అతని కొరకు హరామ్ కాజాలదు. (ఆధారాల కోసం ఫత్‌హుల్ ఖదీర్ వ్యాఖ్యానం చూడండి). అయితే హనఫీల ప్రకారం, మరికొంతమంది పండితుల ప్రకారం వ్యభిచారం వల్ల కూడా సంబంధిత స్త్రీలతో బంధుత్వ నిషిద్ధత (హుర్‌మత్) ఏర్పడుతుంది. ఈ విషయంలో మొదటగా పేర్కొనబడిన మెజారిటీ ఉలమాల అభిప్రాయాన్ని కొన్ని హదీసులు కూడా సమర్థిస్తున్నాయి.

وَّالْمُحْصَنٰتُ مِنَ النِّسَآءِ اِلَّا مَا مَلَكَتْ
اَيْمَانُكُمْ ۚ كِتٰبَ اللّٰهِ عَلَيْكُمْ ۚ وَاُحِلَّ لَكُمْ مَّا
وَرَآءَ ذٰلِكُمْ اَنْ تَبْتَغُوْا بِاَمْوَالِكُمْ مُّحْصِنِيْنَ
غَيْرَ مُسٰفِحِيْنَ ۗ فَمَا اسْتَمْتَعْتُمْ بِهٖ مِنْهُنَّ

**24** భర్తగల స్త్రీలు కూడా మీ కొరకు నిషేధించబడ్డారు. అయితే మీ యాజమాన్యంలోనికి వచ్చిన బానిస స్త్రీలు[38] మాత్రం (నిషేధించబడలేదు). అల్లాహ్ ఈ ఆదేశాలను మీపై విధించాడు. ఈ స్త్రీలు మినహా మిగతా స్త్రీలను మీరు మహర్ రూపంలో ధనం చెల్లించి వివాహమాడటం మీ కొరకు ధర్మసమ్మతం (హలాల్) చేయబడింది. అయితే చెడుల నుండి దూరంగా ఉండే ఉద్దేశ్యంతోనే ఈ పని చెయ్యాలి తప్ప కామక్రీడల కోసం కాదు.[39]

38. మూలంలో **'ముహ్సనాత్'** (**اَلْمُحْصَنٰتُ**) అని ఉంది. ఇది **'ఇహ్సాన్'** (**اِحْصَان**) అనే పదం నుంచి వచ్చింది. దివ్య ఖుర్ఆన్ **'ఇహ్సాన్'** అనే పదాన్ని నాలుగు అర్థాలలో ఉపయోగించింది : 1. వివాహం 2. స్వేచ్ఛ 3. సౌశీల్యం 4. ఇస్లాం. ఈ రకంగా 'ముహ్సనాత్' అనే పదానికి నాలుగు అర్థాలు వస్తాయి. 1. వివాహిత స్త్రీలు 2. స్వతంత్ర స్త్రీలు 3. సౌశీల్యవతులైన స్త్రీలు 4. ముస్లిం స్త్రీలు. ఇక్కడ మాత్రం మొదటి అర్థమే వర్తిస్తుంది. దీని పూర్వరంగంలో ఏమనబడిందంటే కొన్ని యుద్ధాల తరువాత అవిశ్వాసుల స్త్రీలు కూడా – యుద్ధప్రాప్తిగా – ముస్లింల యాజమాన్యంలోకి ఖైదీలుగా వచ్చినప్పుడు వారితో సమాగమం జరపడానికి ముస్లింలు ఊగిసలాడారు. ఎందుకంటే వారు వివాహిత స్త్రీలు. ఈ విషయమై వారు దైవప్రవక్త (సఅసం) ముందు సందేహం వెలిబుచ్చగా ఈ ఆయతు అవతరించింది (ఇబ్నె కసీర్). దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే, యుద్ధసొత్తుగా లభించే అవిశ్వాసుల స్త్రీలు వివాహితులైనప్పటికీ వారు తమ యాజమాన్యంలోకి వచ్చినప్పుడు వారితో సమాగమం జరపటం ధర్మసమ్మతమే. అయితే వారికి కనీసం ఒక రుతుస్రావం జరిగిన మీదటే వారివద్దకు వెళ్ళాలి. ఒకవేళ వారు గర్భవతులై ఉంటే ప్రసవం అయ్యేవరకూ ఆగాలి.

**బానిస స్త్రీల సమస్య :** దివ్య ఖుర్ఆన్ అవతరణాకాలంలో సాధారణంగా సమాజమంతటా బానిసలు, బానిసరాళ్ళ వ్యవస్థ ఉండేది. అయితే ఖుర్ఆన్ ఒక్కసారిగా దీనిని నిషేధించలేదు. అంచెలవారీగా అరికట్టే ఉపాయాలను మన ముందుంచింది. బానిసలకు వీలయినన్ని సౌలభ్యాలను సమకూర్చి, వారికి జరిగే అన్యాయాన్ని నిరోధించాలన్నదే దీని ముఖ్యోద్దేశం. 1. ఆనాడు కొన్ని తెగల వారి (పురుషుల, స్త్రీల) క్రయవిక్రయాలు జరిగేవి. కొనబడిన స్త్రీ పురుషులే బానిసలుగా పిలువబడేవారు. యజమాని సర్వవిధాలా వారి ద్వారా లబ్ధి పొందేవాడు. 2. యుద్ధానంతరం ఖైదీలుగా పట్టుబడిన అవిశ్వాసుల స్త్రీలు ముస్లింల సొత్తుగా పంచబడేవారు. ఆ స్త్రీలు బానిసరాళ్ళుగా వారి ఇంటికి వచ్చేవారు. ఆ కాలంలో యుద్ధఖైదీల కోసం అంతర్జాతీయ చట్టాలేమీ లేవు. ఖైదీలుగా పట్టుబడిన స్త్రీలను ఒక్కో పురుషుని యాజమాన్యంలో యివ్వటం ఆనాటి ఆ సమస్యకు సర్వోత్తమ పరిష్కారంగా ఉండేది. ఎందుకంటే ఆ స్త్రీలను సమాజంలో అలాగే వదిలేస్తే వారి బ్రతుకు బజారున పడుతుంది. సమాజంలో సౌశీల్యం స్థానే చెడులు ప్రబలిపోయే ప్రమాదముంటుంది (మరిన్ని వివరాల కోసం మౌలానా సయీద్ అహ్మద్ అక్బరాబాదీ రచించిన "ఇస్లాంలో బానిసత్వం వాస్తవికత" (ఉర్దూ) గ్రంథాన్ని అధ్యయనం చేయగలరు). మొత్తమ్మీద భర్త గల స్త్రీలు – వారు ముస్లిములైనా, ముస్లిమేతరులైనా – పరాయి పురుషుల కొరకు నిషేధించబడ్డారు. అయితే విజయసొత్తుగా ముస్లింల యాజమాన్యంలోకి వచ్చిన స్త్రీలు మాత్రం వారికోసం నిషిద్ధం కారు. ఒక బహిష్టు అనంతరం వారు ఆ స్త్రీలతో శారీరక సంబంధం ఏర్పరచుకోవచ్చు.

39. అంటే ఖుర్ఆన్ హదీసులలో సూచించబడిన నిషిద్ధ స్త్రీలను తప్ప, మిగతా స్త్రీలను నికాహ్ చేసుకోవటం ధర్మమే. అయితే ఈ సందర్భంగా నాలుగు షరతులున్నాయి: 1. ఉభయుల తరఫునా సమ్మతి పొందాలి. 2. వరుడు వధువుకు మహర్ సొమ్ము చెల్లించటానికి ఒప్పుకోవాలి. 3. వారిద్దరినీ శాశ్వత ప్రాతిపదికపై వివాహబంధంలో ఇమడ్చటం ప్రధాన లక్ష్యం అయి ఉండాలి – (వ్యభిచారంలో మాదిరిగానో లేక 'షియాలు' చేసుకునే ముత్ఆ పెళ్ళిలో మాదిరిగానో) కేవలం కామతాపాన్ని చల్లార్చుకోవటం ఉద్దేశ్యం అయి ఉండరాదు. షియాల్లో కామవాంఛలు తీర్చుకోవటం

అందుకే మీరు ఏ స్త్రీలతో సౌఖ్యాన్ని పొందారో వారికి నిర్ధారిత మహర్ సొమ్మును ఇచ్చివేయండి.[40] మహర్ సొమ్ము నిర్ధారించ బడిన తరువాత మీరు పరస్పరం – ఇష్టపూర్వకంగా – ఆ విషయమై ఒక అవగాహనకు వస్తే అందులో దోషం ఏమీ లేదు.[41] నిశ్చయంగా అల్లాహ్ సర్వం తెలిసినవాడు, వివేక వంతుడు.

فَاٰتُوْهُنَّ اُجُوْرَهُنَّ فَرِيْضَةً ؕ وَلَا جُنَاحَ عَلَيْكُمْ
فِيْمَا تَرٰضَيْتُمْ بِهٖ مِنْۢ بَعْدِ الْفَرِيْضَةِ ؕ اِنَّ
اللّٰهَ كَانَ عَلِيْمًا حَكِيْمًا ﴿24﴾

**25** మీలో ఎవరికయినా స్వతంత్రులగు ముస్లిం స్త్రీలను వివాహమాడే స్థోమత లేకపోతే, మీ యాజమాన్యంలో ఉన్న విశ్వాసులైన బానిస స్త్రీలను నికాహ్ చేసుకోవాలి. మీ విశ్వాస స్థితి గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు. మీరంతా పరస్పరం ఒక్కటే కదా! కాబట్టి వారి యజమానుల అనుమతితో వారిని వివాహమాడండి.[42] నియమానుసారం వారి మహర్‌ను వారికి ఇవ్వండి. అయితే వారు సౌశీల్యవతులై ఉండాలి. బాహాటంగా

وَمَنْ لَّمْ يَسْتَطِعْ مِنْكُمْ طَوْلًا اَنْ يَّنْكِحَ الْمُحْصَنٰتِ
الْمُؤْمِنٰتِ فَمِنْ مَّا مَلَكَتْ اَيْمَانُكُمْ مِّنْ فَتَيٰتِكُمُ
الْمُؤْمِنٰتِ ؕ وَاللّٰهُ اَعْلَمُ بِاِيْمَانِكُمْ ؕ بَعْضُكُمْ مِّنْۢ
بَعْضٍ ۚ فَانْكِحُوْهُنَّ بِاِذْنِ اَهْلِهِنَّ وَاٰتُوْهُنَّ

కోసం కొన్ని గంటల కొరకు, కొన్ని రోజుల కొరకు అని పెళ్ళిచేసుకునే ఆచారం ఉంది. ఇది పచ్చి వ్యభిచారం. 4. ఈ నికాహ్ ప్రక్రియ చాటుమాటుగా కాకుండా బహిరంగంగా – నలుగురికీ తెలిసేలా – జరగాలి. సాక్షుల సమక్షంలో జరగాలి. ఈ నాలుగు షరతులు నెరవేర్చబడితే అది నికాహ్ ఒప్పందం అనబడుతుంది. ఈ ఆయతు షియాలు చేసుకునే ముత్ఆ వివాహాన్ని ఖండించటంతోపాటు నేడు మన నాట జరుగుతున్న **'హలాలా'** విధానాన్ని కూడా ఖండిస్తోంది. (హలాలా గురించి వివరాలు అల్ బఖర సూరా 278వ పాదసూచికలో చదువుకోగలరు). ఎందుకంటే ముత్ఆ వివాహంలో మాదిరిగానే హలాలా విధానంలో కూడా స్త్రీని శాశ్విత ప్రాతిపదికపై వివాహ బంధంలోకి తెచ్చుకోవాలనే ఉద్దేశం ఉండదు. కేవలం ఒక రాత్రి గడిపే ఉద్దేశంతో ముందే నిశ్చయించుకుని ఈ పెళ్ళిచేస్తారు.

40. ధర్మబద్ధంగా మీరు వివాహమాడిన స్త్రీల ద్వారా 'సుఖం' పొందినప్పుడు వారికిస్తామని మాటిచ్చిన మహర్ హక్కును వారికి ఇవ్వండి.

41. వివాహ సందర్భంగా ఒకసారి మహర్ సొమ్ము నిర్ధారించబడినప్పటికీ దంపతుల మధ్య సదవగాహన ఉన్నప్పుడు వారుభయులూ పరస్పరం చర్చించుకుని దానిపై పునరాలోచన చేసుకోవచ్చు. భార్యగనక తలిస్తే ఆ సొమ్మును కొంత తగ్గించటమో, పూర్తిగా వదులుకోవటమో చేయవచ్చు. అలాగే భర్త తను నిర్ధారించిన మహర్‌కన్నా ఎక్కువ ఇవ్వదలచినా ఇవ్వవచ్చు. ఇందులో ఎలాంటి దోషం లేదు.

**గమనార్హం :** 'సుఖం పొందటం' (ఇస్తిమ్‌తా) అనే పదాన్ని షియా వర్గం వారు వక్రీకరించి దీనిద్వారా **'ముత్ఆ పెళ్ళి'**ని రుజువు చేయటానికి విఫల ప్రయత్నాలు చేస్తుంటారు. నిజానికి ఇక్కడ 'సుఖం పొందటం' అంటే వివాహానంతరం పురుషుడు స్త్రీతో జరిపే సంభోగం. ఆమె నుంచి పొందే సుఖం అని అర్థం. ఈ ఆయతు 'ముత్ఆ పెళ్ళి'ని ధర్మసమ్మతం చేసిందని చెప్పటానికి వీల్లేదు. ఎందుకంటే ఈ ఆచారం ఇస్లాంకు పూర్వం నుంచే నడుస్తూ వచ్చింది. దానిమూలంగా ఇస్లాం తొల్దొలి రోజుల్లో కూడా అది అమల్లో ఉండింది. కాని ఆ తర్వాత దైవప్రవక్త (స), ఇక ప్రళయం వరకూ ఈ తాత్కాలిక వివాహ పద్ధతి నిషేధించబడిందని అత్యంత స్పష్టమైన మాటల్లో చెప్పేశారు.

42. దీన్నిబట్టి బోధపడేదేమంటే బానిస స్త్రీల యజమానియే వారి సంరక్షకుడు కూడా. అతని అనుమతి పొందకుండా ఏ బానిస స్త్రీని కూడా ఎవరూ వివాహమాడజాలరు. అలాగే బానిస పురుషుడు కూడా తన యజమాని అనుమతి పొందకుండా ఎవరినీ నికాహ్ చేసుకోలేదు.

أجورهن بالمعروف محصنت غير مسفحت
ولا متخذت أخدان ۚ فإذا أحصن فإن أتين
بفاحشة فعليهن نصف ما على المحصنت
من العذاب ۚ ذلك لمن خشي العنت منكم ۚ
وأن تصبروا خير لكم ۗ والله غفور رحيم (25)

అశ్లీల కార్యాలకు పాల్పడనివారై ఉండాలి. చాటుమాటు ప్రేమ కలాపాలు సాగించేవారు కాకుండా ఉండాలి. మరి ఆ బానిస స్త్రీలు వివాహబంధంలో కట్టుబడిన తరువాత కూడా సిగ్గుమాలిన పనికి గనక ఒడిగడితే స్వతంత్రులగు స్త్రీలకు విధించే శిక్షలో సగం శిక్ష వీరికి విధించబడుతుంది.[43] తమ వల్ల పాపకార్యం జరిగి పోతుందేమో, ఓర్చుకోలేమేమో అన్న భయం ఉన్నవారికి ఇలా బానిస స్త్రీలను వివాహమాడే వెసులుబాటు ఇవ్వబడింది. ఒకవేళ మీరు ఆత్మనిగ్రహాన్ని అలవరచుకుంటే అది మీకే శ్రేయస్కరం. అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించే వాడూను.[44]

يريد الله ليبين لكم ويهديكم سنن
الذين من قبلكم ويتوب عليكم ۗ
والله عليم حكيم (26)

**26** అల్లాహ్ మీకు (ధర్మాధర్మాలను) విడమరచి చెప్పాలనీ, మీ పూర్వీకుల్లోని (సజ్జనుల) మార్గంపై మిమ్మల్ని నడిపించాలనీ, మీ పశ్చాత్తాపాన్ని ఆమోదించాలని అభిలషిస్తున్నాడు. అల్లాహ్ సర్వం తెలిసినవాడు, వివేక సంపన్నుడు.

والله يريد أن يتوب عليكم ۖ ويريد الذين
يتبعون الشهوت أن تميلوا ميلا عظيما (27)

**27** అల్లాహ్ మీ పశ్చాత్తాపాన్ని అంగీకరించాలని కోరుతున్నాడు. కాని, తమ మనోవాంఛలను అనుసరిస్తున్నవారు మాత్రం మీరు (దైవమార్గం నుంచి) పెడదారి తీసి చాలా దూరం వెళ్ళిపోవాలని[45] కోరుకుంటున్నారు.

يريد الله أن يخفف عنكم ۚ وخلق الإنسان
ضعيفا (28)

**28** మీపైన ఉన్న బరువును తగ్గించాలన్నది అల్లాహ్ అభిలాష. ఎందుకంటే మానవుడు బలహీనుడుగా పుట్టించబడ్డాడు.[46]

43. అంటే బానిస స్త్రీ గనక అక్రమ సంబంధం పెట్టుకుందని నిరూపితమయితే శిక్షగా ఆమెకు నూరు కొరడా దెబ్బల బదులు అందులో సగం, యాభై కొరడా దెబ్బలే కొట్టబడతాయి. అంటే వీరికి శిలాశిక్ష లేదన్నమాట! ఎందుకంటే శిలాశిక్ష సగం విధించటం సాధ్యపడదు. అవివాహిత బానిస స్త్రీకు మందలింపు శిక్ష విధించబడుతుంది. మరిన్ని వివరాల కోసం తఫ్సీర్ ఇబ్నె కసీర్‌ని చూడండి.

44. అంటే, తమ యౌవన శక్తిని, కామవాంఛను అదుపులో ఉంచుకోలేమనుకున్న (పేద) వారికి ఈ విధంగా బానిస స్త్రీలను మనువాడే రాయితీ కల్పించబడింది. ఎందుకంటే వారికి ఈ సౌలభ్యం కూడా లేకపోతే వారు పెడదారి తీసే ప్రమాదం ఉంది. అలాంటి ప్రమాదం ఏదీ లేదన్న దృఢ నమ్మకం తమకు ఉంటే, తమ మనోవాంఛలపై తమకు పూర్తిగా అదుపు ఉంటుందని అనుకుంటే స్వతంత్ర స్త్రీతో వివాహ సంబంధం నిశ్చయమయ్యే దాకా ఓపిక పట్టడమే మంచిది.

45. **'అన్ తమీలూ'** (أن تميلوا) : అంటే రుజుమార్గాన్ని వీడి మిథ్యా భావాల వైపు మొగ్గిపోవాలనీ, మార్గభ్రష్టులై పోవాలని కాంక్షిస్తున్నారని భావం.

46. ఈ బలహీనత మూలంగా మనిషి పాపాలకు ఒడిగట్టే ప్రమాదం ఎక్కువగా పొంచి ఉంటుంది. అందుకే అల్లాహ్ అతని కొరకు వీలైనన్ని సౌలభ్యాలను సమకూర్చాడు. స్థోమత లేనివారికి బానిస స్త్రీలను వివాహమాడే రాయితీ

**29** ఓ విశ్వసించిన వారలారా! ఒండొకరి సొమ్మును అధర్మంగా తినకండి.[47] అయితే పరస్పర అంగీకారంతో జరిగే క్రయ విక్రయాల ద్వారా లభించే దానిని[48] (తినవచ్చు). మిమ్మల్ని మీరు చంపుకోకండి.[49] నిస్సందేహంగా అల్లాహ్ మీపై అమితమైన దయగలవాడు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ لَا تَأْكُلُوٓا۟ أَمْوَٰلَكُم بَيْنَكُم بِٱلْبَٰطِلِ إِلَّآ أَن تَكُونَ تِجَٰرَةً عَن تَرَاضٍ مِّنكُمْ ۚ وَلَا تَقْتُلُوٓا۟ أَنفُسَكُمْ ۚ إِنَّ ٱللَّهَ كَانَ بِكُمْ رَحِيمًا ﴿29﴾

**30** తలబిరుసుతనంతో, దౌర్జన్యంతో దీనికి (ఈ అవిధేయతకు) పాల్పడేవాడ్ని[50] మేము నరకాగ్నిలో పడవేస్తాము. ఇలా చేయటం అల్లాహ్‌కు చాలా తేలిక.

وَمَن يَفْعَلْ ذَٰلِكَ عُدْوَٰنًا وَظُلْمًا فَسَوْفَ نُصْلِيهِ نَارًا ۚ وَكَانَ ذَٰلِكَ عَلَى ٱللَّهِ يَسِيرًا ﴿30﴾

**31** మీకు వారించబడే మహాపరాధాలకు[51] గనక మీరు దూరంగా ఉన్నట్లయితే, మీ చిన్న చిన్న పాపాలను మేము మీ (లెక్క) నుండి తీసేస్తాము. ఇంకా మిమ్మల్ని గౌరవప్రద స్థానాల్లో ప్రవేశింప జేస్తాము.

إِن تَجْتَنِبُوا۟ كَبَآئِرَ مَا تُنْهَوْنَ عَنْهُ نُكَفِّرْ عَنكُمْ سَيِّـَٔاتِكُمْ وَنُدْخِلْكُم مُّدْخَلًا كَرِيمًا ﴿31﴾

---

కల్పించబడటం కూడా వాటిలో ఒక సౌలభ్యమే. మరికొంతమంది ఈ 'బలహీనత'ను స్త్రీల విషయంలో బలహీనతగా భావించారు. పురుషుల్లోని ఈ బలహీనత కారణంగానే ఆడవారు వారిని ఇట్టే వల్లో వేసుకుంటూ ఉంటారు.

47. అధర్మంగా తినటమంటే దగా, మోసం, వంచన, నమ్మక ద్రోహం, కల్తీవంటి దుశ్చేష్టలకు పాల్పడటం. ఇవిగాక షరీయతు వారించిన ఏ అక్రమ పద్ధతిని వర్తకంలో అవలంబించినా అది అధర్మం క్రిందికే వస్తుంది. ఉదాహరణకు: జూదం, వడ్డీ తీసుకోవటం, కొలతల్లో తూనికల్లో తగ్గించి ఇవ్వటం ఇత్యాదివి. అలాగే నిషేధించబడిన వస్తువుల క్రయవిక్రయాలు జరపటం కూడా అధర్మం క్రిందికే వస్తుంది. ఉదాహరణకు : షరీఅత్ అనుమతించే అవసరం ఏదీ లేకుండా ఫోటోగ్రఫి, రేడియో, టీ.వీ, వి.సి.ఆర్., వీడియో ఫిల్ములు, అశ్లీలాన్ని ప్రేరేపించే కేసెట్లు మొదలగునవి– వీటిని నిర్మించటం, అమ్మటం, మరమ్మత్తు చేయటం అన్నీ అధర్మం.

48. ఈ లావాదేవీలు, క్రయవిక్రయాలు కూడా ధర్మ సమ్మతమైన వస్తువులతో జరగాలన్నది షరతు. ఇరువర్గాల మధ్య అంగీకారంతో జరిగినప్పటికీ ఆ లావాదేవీలు అధర్మ వస్తువులకు సంబంధించినవైతే – ఆ మొత్తం వర్తకమే అధర్మం అయిపోతుంది. అదీగాక 'పరస్పర అంగీకారం' అన్న విషయంలో ఇరుపక్షాల వారికీ ఆ సమావేశం పూర్తి కానంతవరకూ ఒప్పందాన్ని రద్దుపరచే అధికారం కూడా ఉంటుంది. దీన్నే **'ఖియారె మజ్లిస్'** అని అంటారు. అంటే ఇద్దరు కలసి లావాదేవీలపై ఏదన్నా ఒప్పందం చేసుకున్నప్పుడు ఆ యిద్దరూ అక్కడి నుంచి విడిపోయిన మీదటే సరుకు అమ్మకం కొనుగోలు అమలులోకి వస్తుంది. హదీసులో కూడా ఈ విషయం స్పష్టపరచబడింది: "వాణిజ్య ఒప్పందం చేసుకునే ఇద్దరు వ్యక్తులకు అక్కడి నుంచి నిష్క్రమించే వరకూ (దానికి సంబంధించిన) పూర్తి అధికారం ఉంటుంది" (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం : కితాబుల్ బుయూ).

49. ఆత్మహత్య కూడా యిందులోకి వస్తుంది. ఎందుకంటే అది కూడా మహాపరాధమే. ఘోరమయిన పాపాలకు, అపచారాలకు ఒడిగట్టడం కూడా తమను తాము చంపుకోవటంతో సమానమే. సాటి ముస్లింను అకారణంగా హతమార్చటం కూడా తమను తాము చంపుకోవటం వంటిదే. ఎందుకంటే ముస్లింలంతా ఒకే దేహం వంటివారు.

50. అంటే తెలిసి కూడా నిషిద్ధ పనులకు పాల్పడటం. దైవభీతి ఉన్నవాడెవడూ ఇలా చేయడు. అహంకారంతో విర్రవీగేవాడు తనకేదీ ఎదురులేదని తలపోసే పరమ దుర్మార్గుడు మాత్రమే ఇలాంటి వాటికి పాల్పడతాడు.

51. **"కబాయిర్"** (మహాపరాధాల) నిర్వచనంపై భిన్నాభిప్రాయాలున్నాయి. శిక్షలు నిర్ధారించబడి ఉన్న పాపాలే మహాపరాధా లని కొందరన్నారు. ఖుర్ఆన్ హదీసులు తీవ్రంగా హెచ్చరించి, ధూత్కరించిన చెడు కార్యాలే మహాపరాధాలని

32 అల్లాహ్ మీలో కొందరికి మరికొందరిపై దేని మూలంగా విశిష్ఠతను ప్రసాదించాడో దానికోసం ఆశపడకండి. పురుషులు సంపాదించిన దానినిబట్టి వారి భాగం వారికుంటుంది. అలాగే స్త్రీలు సంపాదించిన దానినిబట్టి వారి భాగం వారికుంటుంది. కాకపోతే మీరు అల్లాహ్ నుండి ఆయన అనుగ్రహాన్ని అర్థిస్తూ ఉండండి.[52] నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు.

وَلَا تَتَمَنَّوْا مَا فَضَّلَ اللّٰهُ بِهٖ بَعْضَكُمْ عَلٰى بَعْضٍ ؕ لِلرِّجَالِ نَصِيْبٌ مِّمَّا اكْتَسَبُوْا ؕ وَلِلنِّسَآءِ نَصِيْبٌ مِّمَّا اكْتَسَبْنَ ؕ وَسْـَٔلُوا اللّٰهَ مِنْ فَضْلِهٖ ؕ اِنَّ اللّٰهَ كَانَ بِكُلِّ شَىْءٍ عَلِيْمًا ﴿32﴾

మరికొందరు నిర్వచించారు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) నిషిద్ధమని చెప్పి ఏ ఏ పనుల నుంచి మానవాళిని వారించారో వాటికి పాల్పడినట్లయితే అది మహాపాపం క్రిందికి వస్తుందని ఇంకా కొందరు వ్యాఖ్యానించారు. వాస్తవమేమిటంటే మనిషి చేసే పాపంలో, పై వాటిలో ఏ ఒక్క అంశం ఉన్నా అది మహాపరాధంగానే పరిగణించబడుతుంది. హదీసులలో పలు మహా పాపాలు ప్రస్తావనకు వచ్చాయి. వాటిని కొంతమంది విద్వాంసులు గ్రంథరూపంలో సంకలనం కూడా చేశారు. ఉదాహరణకు ఇమామ్ జహబీగారి 'అల్ కబాయిర్' గ్రంథం, హైతమిగారి 'అజ్జవాజిరు అన్ ఇఖ్‌తిరాఫిల్ కబాయిర్' గ్రంథం మొదలగునవి. ఇక్కడొక సూత్రప్రాయమైన విషయం చెప్పబడింది. అదేమంటే షిర్క్, తల్లిదండ్రుల అవిధేయత, అబద్ధం వంటి పెద్ద పెద్ద పాపాల నుండి దూరంగా ఉండే ముస్లిం వల్ల జరిగే చిన్న చిన్న పొరబాట్లను మేము మన్నిస్తాము అని అల్లాహ్ అంటున్నాడు. అన్ నజ్మ్ సూరాలో కూడా ఈ విషయం వివరించబడింది. అయితే చిన్న చిన్న తప్పుల మన్నింపు కోసం, మహాపరాధాలతో పాటు, నీతిమాలిన పనులకు దూరంగా ఉండటం కూడా అవసరమని అక్కడ చెప్పబడింది. ఇక్కడ గమనార్హమైన మరో విషయం ఏమిటంటే చిన్న చిన్న తప్పులపై మనిషి సిగ్గుపడకుండా, పశ్చాత్తాపభావంతో కుమిలిపోకుండా నిశ్చింతగా ఉంటే క్రమంగా అవి పెద్ద పాపాలుగా పరిణమిస్తాయి. అలాగే పెద్ద పాపాలకు దూరంగా ఉండటంతోపాటు మనిషి ఇస్లాం విధులను నిర్వర్తించటం, సత్కార్యాలు చేయటం కూడా అవసరమే. మహాప్రవక్త (స) గారి ప్రియసహచరులు (రజి) ఇస్లామీయ షరీయతు యొక్క ఈ నైజాన్ని బాగా ఆకళింపు చేసుకున్నారు. అందుకే వారు అల్లాహ్ తమను క్షమిస్తానని వాగ్దానం చేసినప్పటికీ చేతులు ముడుచుకుని కూర్చోలేదు. పైగా దేవుని క్షమను, కరుణను సాకారం చేసుకోవటం కోసం అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవటంలో నిమగ్నులయ్యారు. కాని మనమూ ఉన్నాం. మన కర్మల జోలెలో సదాచరణలైతే లేవుగాని, మన హృదయాలు మాత్రం ఆశలు, ఆకాంక్షలతో నిండి ఉన్నాయి!

52. దీని పూర్వరంగం ఇది : "పురుషులు ధర్మయుద్ధంలో పాల్గొంటారు. అమరగతి నొందుతారు. కాగా; స్త్రీలైన మేము ఈ ఘనకార్యానికి నోచుకోకుండా పోతున్నాము. వారసత్వంలో మాకు లభించే భాగం కూడా సగమే" అని ఉమ్మె సలమా (ర.అన్హా) దైవప్రవక్త (స)కు విన్నవించుకోగా ఈ దైవవచనం అవతరించింది (ముస్నదె అహ్మద్ : సంపుటి - 6, పేజీ-322). ఈ దైవాదేశంలోని ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే పురుషులకు అల్లాహ్ ప్రసాదించిన శారీరక శక్తి సామర్థ్యాల వెనుక పరమార్థం ఉంది. పురుషుల కార్యక్షేత్రం స్త్రీల కార్యపరిధికన్నా భిన్నమయింది. పురుషులు దైవమార్గంలో యుద్ధం చేస్తారు. స్త్రీల స్వభావానికి సరిపడని ఎన్నో బయటి పనులను వారు చేస్తారు. ఇది ప్రకృతి ధర్మం. అల్లాహ్ వారికి ప్రసాదించిన అనుగ్రహం. కాబట్టి మహిళలు తమలో లేని ప్రత్యేకతలు పురుషుల్లో ఉండటం చూచి, వాటిని కాంక్షించటం, పురుషులు చేసే పనులు తామూ చేస్తామని కోరుకోవటం సబబు కాదు. అయితే దైవవిధేయతలో, సత్కార్యాలలో, దానధర్మాలలో వారు శక్తివంచన లేకుండా కృషిచేయాలి. ఈ రంగంలో వారు కృషిచేస్తే - పురుషుల మాదిరిగా - వారు సంపాదించుకున్నదానికి పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. దీంతోపాటు దైవానుగ్రహం కోసం సదా ప్రార్థిస్తూ ఉండాలి. ఇక పురుషులకు - స్త్రీలకు కార్యపరిధి రీత్యా ఉన్నటువంటి వ్యత్యాసాలు సహజమైనవి. ఇది తిరుగులేని ప్రకృతి ధర్మం. ఆశలు పెంచుకున్నంత మాత్రాన అవి ప్రాప్తించేవి కావు. కాకపోతే దైవకటాక్షంతో వారు తమకు లభించే కష్టఫలాన్ని ఎంతగానో పెంచుకోవచ్చు.

وَلِكُلٍّ جَعَلْنَا مَوَالِيَ مِمَّا تَرَكَ الْوَالِدٰنِ وَالْاَقْرَبُوْنَ ۭ وَالَّذِيْنَ عَقَدَتْ اَيْمَانُكُمْ فَاٰتُوْهُمْ نَصِيْبَهُمْ ۭ اِنَّ اللّٰهَ كَانَ عَلٰي كُلِّ شَيْءٍ شَهِيْدًا ۝33

**33** తల్లిదండ్రులు, సమీప బంధువులు వదలివెళ్ళిన ఆస్తికి మేము వారి వారసులను నిర్ధారించిపెట్టాము.[53] మీరు ఎవరితో నయినా ఏదయినా ఒప్పందం చేసుకుని ఉంటే, తదనుగుణంగా వారి భాగాన్ని వారికి ఇవ్వండి.[54] యదార్థానికి అల్లాహ్ అన్నిం టిపై సాక్షిగా ఉన్నాడు.

53. అరబీలో **'మవాలీ'** ( مَوَالِي ) అనే పదం ఉపయోగించబడింది. ఇది 'మౌలా'కు బహువచనం. మౌలా అనే పదానికి పలు అర్థాలున్నాయి. స్నేహితుడు, స్వేచ్ఛనొసగబడిన బానిస, తండ్రి సోదరుని కుమారుడు, పొరుగువాడు అనే అర్థాలు వస్తాయి. కాని యిక్కడ మాత్రం 'వారసులు' అనే భావంలో ఈ పదం ప్రయోగించబడింది. దీని అర్థం ఏమిటంటే ఏ పురుషుడైనా, మరే స్త్రీ అయినా తమ వెనుక ఆస్తిని విడిచి మరణిస్తే, ఆ ఆస్తికి తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు వారసులవుతారు.

54. ఈ వాక్యం అమలులో ఉందా? లేక రద్దయిందా? అన్న విషయంలో ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయా లున్నాయి. ఇబ్నె జరీర్ తబ్రీ తదితరులు ఇది రద్దు కాలేదని (అంటే ఇది 'ముహ్కమ్' ఆయతు అని) అభిప్రాయపడు తున్నారు. వారిలా అంటున్నారు : **'ఐమాన్'** ( اَيْمَان ) అంటే ప్రమాణం చేయటం లేక ఒడంబడిక చేసుకోవటం అని అర్థం. ఇస్లాంకు పూర్వం ఇరువురు వ్యక్తుల లేక ఇరు తెగల మధ్య పరస్పర సహాయ సహకారాలకు సంబంధించి ఇలాంటి ఒప్పందాలు జరిగేవి. ఇస్లాం అనంతరం కూడా ఈ పద్ధతి కొనసాగింది. దానికి సంబంధించిన భాగమే యిక్కడ ప్రస్తావించబడింది. 'నసీబహుమ్' (వారి భాగం) – అంటే ఆ ప్రమాణానికి లేక ఒప్పందానికి అనుగుణంగా ఇవ్వవలసిన సహాయసహకారాల వాటాయే.

అయితే ఇబ్నె కసీర్ సహా మరి కొంతమంది వ్యాఖ్యాతల దృష్టిలో ఈ ఆదేశం రద్దయ్యింది. ఎందుకంటే వీరి దృష్టిలో ఇక్కడ ఒప్పందం (ఐమాన్) అంటే భావం హిజ్రత్ అనంతరం ముహాజిర్ల – అన్సార్ల మధ్య సౌభ్రాతృత్వం ప్రాతిపదికపై జరిగిన ఒప్పందం. దీని ప్రకారం ఒక అన్సార్ వ్యక్తి ఆస్తికి, అతని బంధువు కాకుండా, ముహాజిర్ వ్యక్తి వారసుడయ్యే వాడు. అయితే ఈ ఒప్పందం తాత్కాలికమైనది. అందువల్ల "దైవాదేశం ప్రకారం బంధువులు ఒండొకరి పాలిట ఎక్కువ హక్కుదారులు" (అన్ఫాల్ – 75) అన్న ఆదేశాన్ని అవతరింపజేసి దీనిని రద్దుపరచాడు అల్లాహ్. అయితే ఇప్పుడు **'ఫ ఆతూహుమ్ నసీబహుమ్'** (వారికి వారి భాగం ఇవ్వండి) అనే మాటకు భావం ఏమిటంటే, మైత్రి, ప్రేమ, వాత్సల్యం, సహకార భావం ఆధారంగా ఎవరికయినా ఏదన్నా కొంతభాగం యివ్వదలిస్తే అది యిప్పటికీ ఇవ్వవచ్చు. అలాగే వసీయతు చేయటం లేక వీలునామా రాయటం కూడా ఇందులోకి వస్తుంది. కనుక ఇక నుంచి ఒప్పందం మూలంగా ఒకరు ఇంకొకరికి వారసులవటం (మవాలాతె అఖ్ద్) గానీ, ప్రమాణం మూలంగా ఒండొకరికి వారసులవటం (మవాలాతె హల్ఫ్) గానీ, సౌభ్రాతృత్వ ప్రాతిపదికపై వారసులవటం (మవాలాతె ఉఖువ్వత్) గానీ జరిగే ప్రసక్తే ఉండదు.

మరి కొంతమంది విద్వాంసులు ఈ వాక్యాన్ని క్రింది విధంగా వ్యాఖ్యానించారు : ఇద్దరు వ్యక్తుల్లో ఏ ఒక్కడైనా వారసులు లేనివాడై ఉంటాడు. వారిలో ఒక వ్యక్తి రెండో వ్యక్తితో "నేను నీకు 'మౌలా' అయిపోయాను. నేనేదైనా అపరాధానికి పాల్పడితే నువ్వు నాకు సాయం చేయాలి. నేను చంపబడితే నా 'రక్తపరిహారం' నువ్వు తీసుకో" అని అంటాడు. వారసులు లేని వ్యక్తి చనిపోయినప్పుడు రెండో వ్యక్తి అతని ఆస్తిని తీసేసుకుంటాడు. నిజంగా అతని వారసుడెవడూ లేనపుడే ఇది సాధ్యమవుతుంది. ఇంకా కొంతమంది పండితుల ప్రకారం ఇక్కడ ఒప్పందాన్ని చేసుకున్న వారంటే ఆలుమగలని అర్థం. ఎందుకంటే ఆయతులో **'వల్లజీన అఖదత్ ఐమానుకుమ్'** అనే వాక్యం, అంతకు ముందు వచ్చిన **'వల్ అఖ్రబూన'** అన్న పదంతో సంబంధం (అత్ఫ్) కలిగి ఉంది. దీని ప్రకారం ఆయతుకు భావం ఏమవుతుందంటే – తల్లిదండ్రులు, బంధువులు, మీ మధ్య పరస్పర ఒప్పందం ఏర్పడినవారు (ఆలుమగలు) – వీరు

**34** పురుషులు స్త్రీలపై అధికారులు. ఎందుకంటే అల్లాహ్ ఒకరికి ఇంకొకరిపై విశిష్ఠతను వొసగాడు. అదీగాక పురుషులు తమ సంపదను (వారిపై) ఖర్చుపెట్టారు.[55] కనుక గుణవంతులైన స్త్రీలు విధేయులై ఉంటారు. తమ భర్తలు లేని సమయంలో అల్లాహ్ రక్షణలో ఉంటూ (తమ శీలాన్నీ, భర్త సంపదను) కాపాడుతారు. ఏ స్త్రీలు అవిధేయతకు పాల్పడతారని మీకు భయం ఉంటుందో వారికి నచ్చజెప్పండి. (అవసరమైతే) పడక దగ్గర వారిని వేరుగా ఉంచండి. వారిని కొట్టండి. ఆ తరువాత వారు గనక మీకు విధేయులైతే వారిని అనవసరంగా వేధించే ఉద్దేశ్యంతో సాకులు వెతక్కండి.[56] నిశ్చయంగా అల్లాహ్ సర్వోన్నతుడు, గొప్పవాడు.

اَلرِّجَالُ قَوّٰمُوْنَ عَلَى النِّسَآءِ بِمَا فَضَّلَ اللّٰهُ
بَعْضَهُمْ عَلٰى بَعْضٍ وَّبِمَآ اَنْفَقُوْا مِنْ اَمْوَالِهِمْ ؕ
فَالصّٰلِحٰتُ قٰنِتٰتٌ حٰفِظٰتٌ لِّلْغَيْبِ بِمَا حَفِظَ
اللّٰهُ ؕ وَالّٰتِيْ تَخَافُوْنَ نُشُوْزَهُنَّ فَعِظُوْهُنَّ
وَاهْجُرُوْهُنَّ فِي الْمَضَاجِعِ وَاضْرِبُوْهُنَّ ۚ
فَاِنْ اَطَعْنَكُمْ فَلَا تَبْغُوْا عَلَيْهِنَّ سَبِيْلًا ؕ
اِنَّ اللّٰهَ كَانَ عَلِيًّا كَبِيْرًا ﴿34﴾

**35** ఒకవేళ ఆలుమగల మధ్య విముఖత విరోధంగా మారే భయం మీకుంటే భర్త తరఫు నుంచి ఒక మధ్యవర్తినీ, భార్య వైపు నుంచి ఒక మధ్యవర్తినీ నియమించుకోండి.[57] వారిద్దరూ గనక సర్దుబాటుకు ప్రయత్నం చేయదలిస్తే అల్లాహ్ ఆ దంపతుల మధ్య రాజీ కుదుర్చుతాడు. నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, సర్వం ఎరిగినవాడు.

وَاِنْ خِفْتُمْ شِقَاقَ بَيْنِهِمَا فَابْعَثُوْا حَكَمًا
مِّنْ اَهْلِهٖ وَحَكَمًا مِّنْ اَهْلِهَا ۚ اِنْ يُّرِيْدَآ
اِصْلَاحًا يُّوَفِّقِ اللّٰهُ بَيْنَهُمَا ؕ اِنَّ اللّٰهَ كَانَ
عَلِيْمًا خَبِيْرًا ﴿35﴾

వదలివెళ్ళిన ఆస్తికి అల్లాహ్ హక్కుదారులను, వారసులను నిర్ణయించి పెట్టాడు. కనుక ఆ హక్కుదారులకు వారి హక్కులు ఇచ్చేయండి – ఈ అర్థం గనక తీసుకుంటే గత (11, 12వ) ఆయతుల్లోని ఆస్తి పంపకాల గురించి ఇక్కడ మళ్లీ క్లుప్తంగా ప్రస్తావించి ఆ హక్కులను తప్పకుండా చెల్లించాలని గట్టిగా తాకీదు చేసినట్లవుతుంది.

55. ఈ వాక్యంలో పురుషుల అధికారానికి, ఆధిక్యతకి రెండు కారణాలు తెలుపబడ్డాయి. ఒకటి: ప్రకృతిపరమైనది. శారీరక మానసిక శక్తి సామర్థ్యాలలో, పుట్టుకరీత్యానే పురుషుడు స్త్రీకంటే విలక్షణమైనవాడు. రెండు : సంపాదించి పోషించే బాధ్యతను షరీయతు పురుషునిపై మోపింది. స్త్రీ కోమలాంగి. ఆమెలోని కోమలత్వం, శారీరక బలహీనత దృష్ట్యా, సహజసిద్ధంగా ఆమెలో పొందుపరచబడివున్న వ్రీడాభావం దృష్ట్యా ఇస్లాం ఆమె కార్యపరిధిని వేరుగా ఉంచింది. కుటుంబ పోషణా భారం నుంచి ఆమెను దూరంగా ఉంచింది. పురుషులపై స్త్రీ అధికారానికి విరుద్ధమైన ఈ ఖుర్ఆన్ ఆదేశానికి తాత్పర్యంగా ఉన్న సహీహ్ బుఖారీలోని హదీసును గమనించండి. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "తమ వ్యవహారాలను స్త్రీకి అప్పజెప్పే జాతి ఎన్నటికీ సాఫల్యం పొందజాలదు" (సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ).

56. అవిధేయతకు ఒడిగట్టే స్త్రీలను దారికి తేవటానికి మొట్టమొదట వారికి నచ్చజెప్పాలి. తరువాత రెండవ మాత్రగా తాత్కాలికంగా వారి పడకలకు దూరంగా ఉండాలి. ఉత్తమురాలైన స్త్రీకి యిది సయితం ఓ పెద్ద నోటీసు లాంటిదే. అప్పటికీ ఆమె ప్రవర్తనలో పరివర్తన రాకపోతే తేలిగ్గా కొట్టేందుకు అనుమతించబడింది. అయితే మూర్ఖుల్లా, కిరాతకుల్లా భార్యలను కొట్టరాదు. ఈ రకమయిన దౌర్జన్యం చేసే, వేధించే అనుమతిని అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్త (స) ఎవరికీ యివ్వలేదు. ఒకవేళ వారిలో ఆశించిన మార్పు కనిపిస్తే మీ ధోరణిని కూడా మార్చుకోండి. లేనిపోని సాకులు వెతికి వారిని వేధించే, పీడించే ప్రయత్నం చేయకండి. చీటికీ మాటికీ విడాకుల ప్రస్తావన తీసుకురాకండి.

**36** అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా వ్యవహరించండి. బంధువుల పట్ల, తండ్రిలేని బిడ్డల పట్ల, నిరుపేదల పట్ల, ఆత్మీయులైన పొరుగువారి పట్ల, బంధువులు కాని పొరుగువారి పట్ల,[58] ప్రక్కనున్న మిత్రుల పట్ల,[59] బాటసారుల పట్ల, మీ అధీనంలో ఉన్న బానిసల పట్ల[60] ఔదార్యంతో మెలగండి. నిశ్చయంగా అల్లాహ్ అహంకారంతో విర్రవీగేవారిని, బడాయి కొట్టే వారిని ఎంతమాత్రం ఇష్టపడడు.[61]

وَاعْبُدُوا اللّٰهَ وَلَا تُشْرِكُوْا بِهٖ شَيْـًٔا وَّبِالْوَالِدَيْنِ
اِحْسَانًا وَّبِذِى الْقُرْبٰى وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ
وَالْجَارِ ذِى الْقُرْبٰى وَالْجَارِ الْجُنُبِ وَالصَّاحِبِ
بِالْجَنْۢبِ وَابْنِ السَّبِيْلِ ۙ وَمَا مَلَكَتْ اَيْمَانُكُمْ ؕ
اِنَّ اللّٰهَ لَا يُحِبُّ مَنْ كَانَ مُخْتَالًا فَخُوْرَا ۙ﴿36﴾

**37** వారు పిసినారులుగా ప్రవర్తించటమే గాక, ఇతరులకు కూడా పిసినారితనాన్ని నేర్పుతారు. అల్లాహ్ తన అనుగ్రహం నుండి తమకు ప్రసాదించిన దాన్ని దాచిపెడతారు. ఇటువంటి తిరస్కారుల కొరకు మేము అవమానకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాము.

اِلَّذِيْنَ يَبْخَلُوْنَ وَيَاْمُرُوْنَ النَّاسَ بِالْبُخْلِ
وَيَكْتُمُوْنَ مَآ اٰتٰىهُمُ اللّٰهُ مِنْ فَضْلِهٖ ؕ
وَاَعْتَدْنَا لِلْكٰفِرِيْنَ عَذَابًا مُّهِيْنًا ۚ﴿37﴾

విడాకుల అస్త్రం అనివార్య పరిస్థితిలో మాత్రమే ప్రయోగించబడుతుంది. కాని కొంతమంది పురుషులు ఈ హక్కును దుర్వినియోగపరుస్తూ, ప్రతి చిన్న విషయంపై ఆవేశపడి విడాకులిచ్చేస్తూ ఉంటారు. ఆ విధంగా వారు తమ దాంపత్య జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటూ ఉంటారు. తాము తమ జీవితాన్ని దుర్భరం చేసుకున్నదిగాక తమ పిల్లల బ్రతుకులను కూడా నరకప్రాయం చేస్తూ ఉంటారు. ఇది ముమ్మాటికీ గర్హనీయం.

57. ఇంటి నాలుగు గోడల మధ్య అవలంబించవలసిన ఈ మూడు పద్ధతులూ సత్ఫలితాలనివ్వకపోతే నాల్గవ దశలో ఇరు పక్షాల మధ్యవర్తులను పిలుచుకోవాలి. ఆ మధ్యవర్తులు న్యాయశీలురు, విజ్ఞులై ఉండాలి. వారు ఈ చిక్కు సమస్యకు సమాధానం వెతకాలని చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే దేవుడు తప్పక తోడ్పడతాడు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఇక ఆ దంపతుల మధ్య 'వేర్పాటు' తప్ప గత్యంతరం లేదు. (వివరాల కోసం తఫ్సీరె తబ్రీ, ఫత్‌హుల్ ఖదీర్, తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లను చూడండి).

58. **'అల్ జారిల్ జునుబ్'** (బంధువులు కాని పొరుగువారు) అనే పదం ఆత్మీయులైన పొరుగువారు అన్న పదానికి వ్యతిరేకంగా ఉపయోగించబడింది. ఇరుగుపొరుగు వారిలో కూడా రెండు రకాల వారుంటారు. ఒకరు: బంధువులు. రెండవవారు: పొరుగునే ఉన్నప్పటికీ బంధువులు కానివారు. అయినాసరే వారు మన పొరుగు వారైనందువల్ల వారిపట్ల సహకార భావంతో మసలుకోవాలి. పొరుగువారి యెడల సద్భావంతో మెలిగే విషయమై హదీసులలో కూడా పదే పదే తాకీదు చేయబడింది.

59. ప్రక్కనున్న మిత్రులు అంటే ప్రయాణంలో తోడుగా ఉన్నవారు, వర్తక భాగస్వామి, సహోద్యోగి, జీవిత భాగస్వామి మొదలగువారు. తమ నుండి ఏదన్నా ప్రయోజనాన్ని ఆశించి తమకు దగ్గరైన వ్యక్తి కూడా ఈ కోవలోకి వస్తాడు. అంతేకాదు, చదువు సంధ్యల కోసం దగ్గరైనవాడు, ఏదైనా పని నేర్చుకునేందుకు వచ్చినవాడు, వాణిజ్య వ్యవహారాల నిమిత్తం మీ వద్దకు వచ్చి కూర్చునేవాడు కూడా ఈ పరిధిలోకి వస్తాడు (ఫత్‌హుల్ ఖదీర్).

60. తమ ఇంట్లో పనిచేసే నౌకర్లు, పాలేర్లు, దుకాణాల్లో, కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు కూడా ఈ పరిధిలోకి వస్తారు. బానిసల పట్ల ఉపకారభావంతో మెలగాలని హదీసులలో గట్టిగా చెప్పబడింది.

61. గర్వం, అహంకారం, మిడిసిపాటు అల్లాహ్‌కు ఏమాత్రం గిట్టవు. పైగా ఒక హదీసులో ఎంత గట్టిగా వక్కాణించబడిందో చూడండి: "మనసులో ఆవగింజంత అయినా అహంకారం ఉంటే అటువంటి వ్యక్తి స్వర్గంలో ప్రవేశించడు"

وَالَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمْ رِئَاءَ النَّاسِ وَلَا
يُؤْمِنُونَ بِاللَّهِ وَلَا بِالْيَوْمِ الْآخِرِ ۗ وَمَن يَكُنِ
الشَّيْطَانُ لَهُ قَرِينًا فَسَاءَ قَرِينًا ﴿38﴾

**38** వారు ప్రజలకు చూపటానికి తమ సొమ్మును ఖర్చుపెడతారు. అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించరు. వాస్తవమేమిటంటే షైతాను ఎవరికి స్నేహితుడయ్యాడో[62] (వారిని ఇలాగే నాశనం చేస్తాడు), వాడు బహుచెడ్డ స్నేహితుడు.

وَمَاذَا عَلَيْهِمْ لَوْ آمَنُوا بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ وَأَنفَقُوا
مِمَّا رَزَقَهُمُ اللَّهُ ۚ وَكَانَ اللَّهُ بِهِمْ عَلِيمًا ﴿39﴾

**39** వారే గనక అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించి, అల్లాహ్ తమకు ప్రసాదించిన దానిలో నుంచి ఖర్చుపెడితే ఏం పోయేది? వారి స్థితిగతులు అల్లాహ్‌కు బాగా తెలుసు.

إِنَّ اللَّهَ لَا يَظْلِمُ مِثْقَالَ ذَرَّةٍ ۖ وَإِن تَكُ حَسَنَةً
يُضَاعِفْهَا وَيُؤْتِ مِن لَّدُنْهُ أَجْرًا عَظِيمًا ﴿40﴾

**40** అల్లాహ్ ఎవరికీ రవ్వంత అన్యాయం చేయడనేది నిశ్చయం. సత్కార్యం ఉంటే ఆయన దాన్ని రెట్టింపు చేస్తాడు. అంతేకాదు, తన వద్దనున్న దానిలో నుంచి గొప్ప ప్రతిఫలాన్ని వొసగుతాడు.

فَكَيْفَ إِذَا جِئْنَا مِن كُلِّ أُمَّةٍ بِشَهِيدٍ
وَجِئْنَا بِكَ عَلَىٰ هَٰؤُلَاءِ شَهِيدًا ﴿41﴾

**41** (ఓ ముహమ్మద్–స!) మేము ప్రతి సమాజం నుంచి ఒక సాక్షిని తెచ్చి, వారిపై నిన్ను సాక్షిగా పెట్టినప్పుడు[63] పరిస్థితి ఎలా ఉంటుంది?

(సహీహ్ ముస్లిం : కితాబుల్ ఈమాన్). ఇక్కడ అహంకారం ప్రత్యేకంగా ఖండించబడింది. మనసులో అహంకారం లేనివాడే అల్లాహ్‌ను ఆరాధిస్తూ, అల్లాహ్ సూచించిన వ్యక్తులందరినీ ఆదరిస్తాడు. గర్విష్టి అయిన వ్యక్తి దేవుని హక్కునూ సరిగా నెరవేర్చలేడు, దాసుల హక్కులను కూడా నెరవేర్చడు.

62. అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టకుండా పరమ లోభిగా మారటం, ఒకవేళ ఖర్చుపెట్టినా ప్రదర్శనా బుద్ధితో ఖర్చుపెట్టడం, లోకుల మెప్పును పొందగోరటం – ఈ రెండు విషయాలను దేవుడు ఎంతమాత్రం ఇష్టపడడు. దైవ తిరస్కారులు మాత్రమే ఇలాంటి బడాయిని చాటుకుంటారనీ, అల్లాహ్ మరియు అంతిమదినంపై విశ్వాసం లేనివారు, షైతానుకు మిత్రులుగా మారినవారు మాత్రమే ఈ కపట నాటకాలాడతారని చెప్పటాన్నిబట్టి ఈ పోకడను అల్లాహ్ ఎంతగా గర్హిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.

63. ప్రతి సమాజం నుంచి ఒక ప్రవక్త దైవసన్నిధిలోకి వచ్చి ఈ విధంగా సాక్ష్యం పలుకుతాడు: "ఓ అల్లాహ్! మేమైతే నీ సందేశాన్ని వీరికి హెచ్చుతగ్గులు లేకుండా అందజేశాము. వీళ్లు ఈ సందేశాన్ని పెడచెవిన పెడితే అందులో మా తప్పేముందీ?" దీనిపై అంతిమ దైవప్రవక్త (సఅసం) ముందుకు వచ్చి, "ఓ అల్లాహ్! వీళ్లు సత్యం పలుకుతున్నారు" అని అంటారు. ఆయన (స) అలా అనటానికి ఆయనపై అవతరించిన దివ్యఖుర్ఆనే మూలాధారం. ఈ గ్రంథంలో వెనుకటి ప్రవక్తల ప్రస్తావన వచ్చింది. తమ తమ జాతులను ఉద్దేశ్యించి వారు ఇచ్చిన పిలుపు కూడా పేర్కొన బడింది. సర్వలోక ప్రభువు ఎదుట సంభవించబోయే ఆ దృశ్యాన్ని ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఒకసారి అంతిమ దైవప్రవక్త(స) ఖుర్ఆన్‌ను పారాయణం చేసి వినిపించమని అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి)ను కోరారు. ఆయన ఖుర్ఆన్ పారాయణం చేయసాగారు. ఈ ఆయతు వద్దకు రాగానే, "చాలు, ఇక ఆపండి" అని అన్నారు దైవప్రవక్త (స). ఆ సమయంలో ఆయన (స) కళ్లగుండా అశ్రుధారలు ప్రవహించసాగాయని అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) వివరించారు (సహీహ్ బుఖారీ : ఫజాయిలుల్ ఖుర్ఆన్).

ఈ అంశాన్ని ఆధారంగా తీసుకుని కొంతమంది ప్రజల ఆలోచనలు పెడత్రోవ పట్టాయి. వారేమంటారంటే, దేన్నయినా ప్రత్యక్షంగా తిలకించిన వ్యక్తి మాత్రమే, దానికి సంబంధించి సాక్ష్యం యివ్వగలుగుతాడు. అంతిమ దైవప్రవక్త

يَوْمَئِذٍ يَوَدُّ الَّذِينَ كَفَرُوا وَعَصَوُا الرَّسُولَ لَوْ تُسَوّٰى بِهِمُ الْأَرْضُ ۖ وَلَا يَكْتُمُونَ اللّٰهَ حَدِيثًا ﴿٤٢﴾

**42** ఆ రోజు అవిశ్వాసులూ, ప్రవక్త పట్ల అవిధేయతకు పాల్పడినవారూ తాము నేలమట్టం చేయబడితే బావుండునే! అని కోరుకుంటారు. వారు దైవసమక్షంలో ఏ ఒక్క విషయాన్నీ దాచలేరు.

يٰٓاَيُّهَا الَّذِينَ اٰمَنُوا لَا تَقْرَبُوا الصَّلٰوةَ وَاَنْتُمْ سُكٰرٰى حَتّٰى تَعْلَمُوْا مَا تَقُولُونَ وَلَا جُنُبًا اِلَّا عَابِرِىْ سَبِيلٍ حَتّٰى تَغْتَسِلُوا ۗ وَاِنْ كُنْتُمْ

**43** విశ్వసించిన ప్రజలారా! మీరు (తాగిన) మత్తులో ఉన్నప్పుడు నమాజు దరిదాపులకు కూడా పోకండి.[64] మీరు పలికేదేమిటో మీకు అర్థం కాగలిగినప్పుడే (నమాజు చెయ్యాలి). లైంగిక అశుద్ధావస్థలో కూడా – స్నానం చేయనంతవరకూ[65] – నమాజు చేయరాదు. (మస్జిదు) దారిగుండా సాగిపోయేటి పరిస్థితి అయితే అది వేరే విషయం![66] ఒకవేళ మీరు వ్యాధిగ్రస్తులైతే, లేక

(సఅసం) సాక్షులందరిపై 'సాక్షి'గా నిలబెట్టబడ్డారంటే ఆయన (స) సర్వత్రా ఆయా జాతుల స్థితిగతులను ప్రత్యక్షంగా తిలకించి ఉండాలి – ఈ రకంగా ముహమ్మద్ ప్రవక్త (సఅసం) "అన్ని చోట్లా ఉంటారు. అన్నింటినీ చూస్తూ ఉంటారు" అనే ఓ భ్రష్టకరమైన వినూత్న తత్వాన్ని బిద్అతీలు ప్రతిపాదించారు. ఇది సరైంది కాదు. ఒకవిధంగా ఇది ఆయన (స)కు అల్లాహ్ గుణగణాలలో భాగస్వామ్యం కల్పించటం వంటిదే. ఎందుకంటే జ్ఞానపరంగా అన్నిచోట్లా ఉండి, అందరినీ చూడటం అనేది అల్లాహ్ గుణం. కనుక 'షహీద్' అనే పదాన్ని ఆధారంగా చేసుకొని బిద్అతీలు చేస్తున్న వాదన ఏమాత్రం పసలేనిది. నమ్మకమైన జ్ఞానం ఆధారంగా కూడా సాక్ష్యం ఇవ్వవచ్చు. అంతిమ దైవప్రవక్త (స) అందరిపై సాక్షిగా చేయబడ్డారంటే లేక సాక్ష్యం యిస్తారంటే అర్థం దివ్య ఖుర్ఆన్‌లో తెలుపబడిన యదార్థాల ఆధారంగా సాక్ష్యం యిస్తారు. ఖుర్ఆన్‌లో ప్రకటించబడిన సంఘటనల కన్నా సత్యబద్ధమైనవి ఇంకేముంటాయి చెప్పండి?! ఈ యదార్థ జ్ఞానం ప్రాతిపదికపైనే ముహమ్మద్ (స) గారి అనుచర సమాజాన్ని సయితం దివ్య ఖుర్ఆన్ **'షుహదావు అలన్నాస్'** (సమస్త మానవాళిపై సాక్షులు)గా ఖరారు చేసింది. ఒకవేళ సాక్ష్యం యివ్వడానికి 'ప్రత్యక్షంగా తిలకించటం' అనివార్యమై ఉంటే ముహమ్మద్ అనుచర సమాజాన్ని భూమండలంలోని సమస్త మానవులపై సాక్షిగా ఉంచటం ఎలా సాధ్యమయ్యేది? మరి ఆ లెక్కన ముహమ్మద్ (స) అనుయాయుల్లోని ప్రతి ఒక్కణ్ణీ "అన్నిచోట్లా ఉంటాడు, అన్నీ చూస్తుంటాడు" అని అంటారా? ఇదంతా అర్థం లేని వాదన. అంధ విశ్వాసం. ఆధారంలేనిది. ఏమైనప్పటికీ దైవప్రవక్త (స) విషయంలో ఇటువంటి విశ్వాసాన్ని కలిగివుండటం పచ్చి షిర్క్ అవుతుంది. (అల్లాహ్ మనల్ని రక్షించుగాక!)

64. మద్యపానం నిషేధించబడక ముందు జారీ చేయబడిన ఉత్తర్వు ఇది. అసలేం జరిగిందంటే ఒక విందు భోజనంలో తప్పతాగిన తరువాత నమాజు కోసం నిలబడినప్పుడు సారామత్తులో మునిగి ఉన్న ఇమాము ఖుర్ఆన్ వచనాలను తప్పుగా పఠించారు (వివరాల కోసం తిర్మిజీ గ్రంథంలో అన్ నిసా సూరా వ్యాఖ్యానం చూడండి). అప్పుడు ఈ ఆజ్ఞ అవతరించింది. ఇకనుంచి తాగిన మైకంలో నమాజు చెయ్యరాదని స్పష్టంగా చెప్పబడింది. అంటే అప్పట్లో కేవలం నమాజు వేళల్లో మాత్రమే మద్యపానానికి దూరంగా ఉండమని ఆదేశించబడిందన్నమాట! ఆ తర్వాత కొంత కాలానికి మద్యపానం పూర్తిగా నిషేధించబడింది.

65. అపరిశుద్ధ స్థితిలో కూడా నమాజు చెయ్యకూడదు. ఎందుకంటే నమాజు కోసం మనిషి పరిశుద్ధంగా ఉండటం అవసరం.

66. అంటే ప్రయాణంలో ఉన్నప్పుడు నీరు లభించకపోతే అశుద్ధావస్థలోనే నమాజు చెయ్యండి అని దీని భావం ఎంతమాత్రం

مَرْضَىٰ أَوْ عَلَىٰ سَفَرٍ أَوْ جَاءَ أَحَدٌ مِّنكُم مِّنَ
الْغَائِطِ أَوْ لَامَسْتُمُ النِّسَاءَ فَلَمْ تَجِدُوا مَاءً
فَتَيَمَّمُوا صَعِيدًا طَيِّبًا فَامْسَحُوا بِوُجُوهِكُمْ
وَأَيْدِيكُمْ ۗ إِنَّ اللَّهَ كَانَ عَفُوًّا غَفُورًا (43)

ప్రయాణంలో ఉంటే లేక మీలో ఎవరయినా మలమూత్ర విసర్జన చేసివస్తే లేక మీరు స్త్రీలతో సమాగమం జరిపి ఉంటే – అట్టి స్థితిలో మీకు నీరు లభ్యం కానిపక్షంలో పరిశుభ్రమైన మట్టి(ని ఉపయోగించే) సంకల్పం చేసుకోండి. (దాంతో) మీ ముఖాలను, చేతులను తుడుచుకోండి.[67] నిశ్చయంగా అల్లాహ్ మన్నించే వాడు, క్షమాభిక్ష పెట్టేవాడు.

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ أُوتُوا نَصِيبًا مِّنَ الْكِتَابِ
يَشْتَرُونَ الضَّلَالَةَ وَيُرِيدُونَ أَن تَضِلُّوا السَّبِيلَ (44)

**44** గ్రంథంలో కొంతభాగం యివ్వబడిన వారిని మీరు చూడ లేదా? వారు మార్గభ్రష్టతను కొనితెచ్చుకుంటారు. మీరు కూడా మార్గం తప్పాలన్నది వారి ఉద్దేశం.

وَاللَّهُ أَعْلَمُ بِأَعْدَائِكُمْ ۚ وَكَفَىٰ بِاللَّهِ وَلِيًّا
وَكَفَىٰ بِاللَّهِ نَصِيرًا (45)

**45** మీ శత్రువుల గురించి అల్లాహ్ బాగా ఎరిగినవాడు. మీకు మిత్రుడిగా అల్లాహ్ చాలు. మీకు సహాయకుడిగా (కూడా) అల్లాహ్ చాలు.

مِّنَ الَّذِينَ هَادُوا يُحَرِّفُونَ الْكَلِمَ عَن
مَّوَاضِعِهِ وَيَقُولُونَ سَمِعْنَا وَعَصَيْنَا وَاسْمَعْ

**46** కొంతమంది యూదులు పదాలను వాటి నిజస్థానం నుంచి తారుమారు చేస్తారు. "మేము విన్నాము, అవిధేయులం అయ్యాము" అని వారంటారు. అంతేకాదు – "విను. నీకేమీ

కాదు. అత్యధికమంది విద్వాంసుల దృష్టిలో దీని భావం ఏమిటంటే – అపరిశుద్ధావస్థలో మీరు మస్జిదులో కూర్చోరాదు. కాని మస్జిద్ గుండా సాగిపోకతప్పని పరిస్థితి ఎదురయితే అది వేరే విషయం! అలా వెళ్ళవచ్చు. ఆనాడు మదీనాలో కొంతమంది ప్రవక్త ప్రియసహచరులు (రజి) తమ ఇళ్లకు రాకపోకలు సాగించాలంటే మస్జిదె నబవీ గుండానే వెళ్ళవలసి వచ్చేది. వారి సౌకర్యార్థమే ఈ రాయితీ యివ్వబడింది (తఫ్సీర్ ఇబ్నె కసీర్); పోతే ప్రయాణీకుని గురించి ముందు రాబోతున్నది.

67. 1. వుజూ కోసం నీరు ఉపయోగించటం వల్ల హాని కలుగుతుందనే లేక వ్యాధి ముదురుతుందనే భయం ఉన్న రోగగ్రస్తులు. 2. ప్రయాణీకులు : సుదీర్ఘ ప్రయాణంలో ఉన్నవారైనా, చిన్నపాటి ప్రయాణంలో ఉన్నవారైనా వారు ప్రయాణీకులుగానే భావించబడతారు. వారికి గనక నీరు లభ్యం కాకపోతే 'తయమ్ముమ్' చేసుకునేందుకు అనుమతి ఉంది. నీరు లభ్యం కానపుడు స్థానిక వ్యక్తికి కూడా ఈ మేరకు అనుమతి ఉందనుకోండి. కాని వ్యాధిగ్రస్తునికి, ప్రయాణీకునికి సాధారణంగా 'తయమ్ముమ్' అవసరం ఎక్కువగా ఏర్పడుతుంది. అందుకని ప్రత్యేకంగా ఈ అనుమతి ఇవ్వబడింది. 3. కాలకృత్యాలు తీర్చుకుని వచ్చినవారు. 4. భార్యతో రతిలో పాల్గొన్నవారు. వారు కూడా నీరు లభ్యం కానిపక్షంలో తయమ్ముమ్ చేసి నమాజు చేయవచ్చు. తయమ్ముమ్ చేసే పద్ధతి ఇది: ఒకేసారి రెండు చేతుల్నీ పరిశుభ్రమైన మట్టిపై కొట్టి మణికట్టు వరకూ రెండు చేతుల్ని తుడుచుకోవాలి (మోచేతుల వరకూ అక్కరలేదు). తరువాత రెండు చేతుల్నీ ముఖానికి తుడుచుకోవాలి. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఈ తయమ్ముమ్ గురించి విశదీకరిస్తూ, "రెండు అరచేతులను, ముఖాన్నీ తుడుచుకోవడానికి ఒక్కసారి మట్టిపై కొడితే సరిపోతుంది" అన్నారు (ముస్నదె అహ్మద్). **'సయీదన్ తయ్యిబన్'** (صَعِيدًا طَيِّبًا) అంటే పరిశుభ్రమైన మట్టి అని అర్థం. కొంతమంది తలపోస్తున్నట్లు భూమిలో నుంచి లభించే ప్రతిదీ ఇందులోకి రాదు. హదీసు ద్వారా ఈ విషయం మరింత స్పష్టంగా బోధించబడింది– "మనకు నీరు లభ్యం కానప్పుడు భూమిలోని మట్టి మన పరిశుద్ధతకు సాధనంగా చేయబడింది" (సహీహ్ ముస్లిం – కితాబుల్ మసాజిద్).

వినపడకూడదు.[68] రాయినా" అని పలుకుతారు. అలా అనే టప్పుడు వారు తమ నాలుకను మెలి తిప్పుతారు. (ఇస్లాం) ధర్మాన్ని ఎగతాళి చేయాలన్నది అసలు వారి ఉద్దేశం. ఇలా అనే బదులు వారు, "మేము విన్నాము. విధేయులమయ్యాము" అనీ, "వినండి. మా వంక చూడండి" అని పలికి ఉంటే అది వారి కొరకు ఎంతో శ్రేయస్కరంగా, సమంజసంగా ఉండేది. కాని అల్లాహ్ వారి అవిశ్వాసం మూలంగా వారిని శపించాడు. ఇక వారిలో విశ్వసించేది బహుకొద్దిమంది మాత్రమే.[69]

غَيْرَ مُسْمَعٍ وَّرَاعِنَا لَيًّا بِاَلْسِنَتِهِمْ وَطَعْنًا فِى
الدِّيْنِ ط وَلَوْ اَنَّهُمْ قَالُوْا سَمِعْنَا وَاَطَعْنَا
وَاسْمَعْ وَانْظُرْنَا لَكَانَ خَيْرًا لَّهُمْ وَاَقْوَمَ لا
وَلٰكِنْ لَّعَنَهُمُ اللّٰهُ بِكُفْرِهِمْ فَلَا يُؤْمِنُوْنَ اِلَّا
قَلِيْلًا (46)

**47** ఓ గ్రంథవహులారా! మేము అవతరింపజేసిన దానిని విశ్వసించండి. అది మీ వద్ద ఉన్నదానిని ధృవీకరిస్తుంది. మేము ముఖాలను వికృతం చేసి, వీపు వైపుకు తిప్పకముందే[70] లేక శనివారం వాళ్లను శపించినట్లుగా మేము వారినీ శపించక ముందే[71] దీనిని (ఈ గ్రంథాన్ని) విశ్వసించండి. అల్లాహ్ తలచుకున్న పని ఇక అయిపోయినట్లే.[72]

يٰۤاَيُّهَا الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ اٰمِنُوْا بِمَا نَزَّلْنَا
مُصَدِّقًا لِّمَا مَعَكُمْ مِّنْ قَبْلِ اَنْ نَّطْمِسَ وُجُوْهًا
فَنَرُدَّهَا عَلٰۤى اَدْبَارِهَاۤ اَوْ نَلْعَنَهُمْ كَمَا لَعَنَّاۤ
اَصْحٰبَ السَّبْتِ ط وَكَانَ اَمْرُ اللّٰهِ مَفْعُوْلًا (47)

**48** తనకు భాగస్వామిగా మరొకరిని కల్పించటాన్ని (షిర్కును) అల్లాహ్ సుతరామూ క్షమించడు. ఇది తప్ప ఆయన తాను కోరిన వారి ఇతర పాపాలను క్షమిస్తాడు. అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పించిన వాడు ఘోర పాపంతో కూడిన కల్పన చేశాడు.[74]

اِنَّ اللّٰهَ لَا يَغْفِرُ اَنْ يُّشْرَكَ بِهٖ وَيَغْفِرُ مَا دُوْنَ
ذٰلِكَ لِمَنْ يَّشَآءُ ج وَمَنْ يُّشْرِكْ بِاللّٰهِ فَقَدِ
افْتَرٰۤى اِثْمًا عَظِيْمًا (48)

68. యూదుల కుటిల పన్నాగాలలో, దుర్మార్గాలలో ఒకటి ఇది : "మేము విన్నాము" అని అనటంతో పాటే "అవిధేయతకు పాల్పడతాము" అని అనేవారు. అంటే దైవప్రవక్త (స) చెప్పేది తాము ఎట్టిపరిస్థితిలోనూ ఆచరించేది లేదు అన్నది వారి ఉద్దేశం. ఇలా మనసులోనే అనుకునేవారు లేక తమ సహచరుల ముందు ఆ మాట అనేవారు. కొన్నిసార్లయితే బాహాటంగా – మొహం మీదే – చెప్పేసేవారు. అలాగే సమావేశాల్లో కూర్చుని **"గైర ముస్మయిన్"** (నీ మాట ఎవరూ వినకూడదు) అని కోరుకునేవారు. అంటే ఇది ఒకవిధంగా శాపనార్థం. నీమాట ప్రజాబాహుళ్యంలో స్వీకార యోగ్యం కాకూడదు గాక! అని వారు శపిస్తున్నారు; 'రాయినా' అనే పదానికి వివరణ కోసం అల్ బఖర సూరాలోని 104వ ఆయతు పాదసూచిక చూడగలరు.

69. యూదులలో విశ్వసించే వారి సంఖ్య బహు తక్కువ అన్న విషయం ఇంతకు ముందు కూడా వచ్చింది. వారిలో విశ్వసించిన వారు పట్టుమని పదిమంది కూడా లేరు. లేదా వారు కేవలం కొన్ని విషయాలనే విశ్వసిస్తారన్నది కూడా ఒక భావం కావచ్చు. కాగా; అన్ని విషయాలను విశ్వసించినప్పుడే ఆ 'విశ్వాసం' ప్రయోజనకారి అవుతుంది.

70. అంటే అల్లాహ్ గనక తలిస్తే మీ పాపాలకుగాను ఈ శిక్షను విధించగలడు.

71. ఈ గాథ 'అల్ ఆరాఫ్' సూరాలో రానున్నది. ఇంతకుముందు కూడా చూచాయగా ప్రస్తావించబడింది. అంటే మీరు గనక దారికి రాకపోతే, వారి లాగే మీరూ శాపగ్రస్తులు కావచ్చు.

72. ఒకసారి ఆయన ఏదైనా విషయాన్ని ఆజ్ఞాపిస్తే ఇక దాన్ని ఆపేవారుగాని, వ్యతిరేకించేవారుగాని ఉండరు.

73. అంటే ఏ విశ్వాసి అయినా యితరత్రా తప్పులపై పశ్చాత్తాపం చెందకుండానే చనిపోయినప్పటికీ ఆయన తాను

**49** తాము పవిత్రులమని ఆత్మస్తుతి చేసుకునే వారిని నువ్వు
చూడలేదా? యదార్థానికి అల్లాహ్ తాను కోరిన వారిని పవిత్రు
లుగా చేస్తాడు. ఎవరికీ ఒక చిన్న పీచు అంత అన్యాయం కూడా
జరగదు.[75]

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يُزَكُّونَ أَنفُسَهُمْ ۚ بَلِ اللَّهُ
يُزَكِّي مَن يَشَاءُ وَلَا يُظْلَمُونَ فَتِيلًا ﴿٤٩﴾

**50** వారు అల్లాహ్‌కు ఎలాంటి అసత్యాలను ఆపాదిస్తున్నారో
చూడు![76] స్పష్టమైన పాపం కావటానికి ఈ ఒక్క చేష్ట చాలు.[77]

انظُرْ كَيْفَ يَفْتَرُونَ عَلَى اللَّهِ الْكَذِبَ ۖ
وَكَفَىٰ بِهِ إِثْمًا مُّبِينًا ﴿٥٠﴾

**51** గ్రంథంలో కొంతభాగం ఇవ్వబడిన వారిని నీవు చూడ
లేదా? వారు విగ్రహాల (జిబ్త్)పై, మిథ్యాదైవాల (తాగూత్)పై
విశ్వాసం కలిగి ఉన్నారు. అవిశ్వాసుల గురించి అభిప్రాయ
పడుతూ, "విశ్వాసుల కంటే వీరే చాలా వరకు సన్మార్గాన
ఉన్నారు"[78] అని అంటారు.

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ أُوتُوا نَصِيبًا مِّنَ الْكِتَابِ
يُؤْمِنُونَ بِالْجِبْتِ وَالطَّاغُوتِ وَيَقُولُونَ لِلَّذِينَ
كَفَرُوا هَٰؤُلَاءِ أَهْدَىٰ مِنَ الَّذِينَ آمَنُوا
سَبِيلًا ﴿٥١﴾

---

కోరిన తన దాసులను క్షమించగలడు. చాలా మందికి శిక్షవేసిన తరువాత క్షమిస్తాడు. ఇంకా చాలా మందిని మహనీయ ముహమ్మద్ (స) వారి సిఫారసుపై మన్నిస్తాడు. అయితే షిర్కుకు పాల్పడిన వారిని మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. ఎందుకంటే ముష్రిక్కుల కోసం స్వర్గం హరామ్ (నిషిద్ధం) గావించబడింది.

74. **"ముమ్మాటికీ షిర్కు చాలా పెద్ద దుర్మార్గం"** అని వేరొకచోట సెలవీయబడింది (సూరె లుఖ్మాన్). హదీసులో ఈ షిర్కు పాపాలన్నింటిలోకీ పెద్దదిగా పేర్కొనబడింది: **అక్‌బరుల్ కబాయిరి అష్షిర్‌కు బిల్లాహి.....** (ఘోర పాపాలన్నిటిలోకెల్లా అతి ఘోర పాపం అల్లాహ్ దైవత్వంలో వేరొకరికి భాగస్వామ్యం కల్పించటం.)

75. తాము అల్లాహ్ కుమారులమనీ, తమను అల్లాహ్ అమితంగా ప్రేమిస్తున్నాడనీ యూదులు తమ గురించి గొప్పలు చెప్పుకునేవారు. అయితే అల్లాహ్‌కు మాత్రమే ఆత్మశుద్ధి చేసే అధికారముందనీ, ఎవరు నిజంగా పరిశుద్ధులయ్యారో కూడా ఆయనకే తెలుసని అల్లాహ్ ఈ వాక్యంలో విశదీకరించాడు; ఆయతులో **'ఫతీల్'** (فَتِيل) అనే పదం వచ్చింది. ఖర్జూరపు విత్తనంపై ఉండే గాటులోని పీచును 'ఫతీల్' అంటారు. వారికి అంత చిన్న అన్యాయం కూడా జరగదని దాని భావం.

76. అంటే తమ పవిత్రత గురించి వారు గొప్పలు చెప్పుకొని అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టారు.

77. వారు అబద్ధాగ్రేసరులనీ, ఉన్నవీ లేనివీ కల్పించేవారని అనడానికి ఆత్మశుద్ధికి సంబంధించి వారు కల్పించిన ఈ ఒక్క అబద్ధం చాలు. దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతు ద్వారా, దీని పూర్వరంగానికి సంబంధించిన ఉల్లేఖనాల ద్వారా అవగతమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే ఆత్మస్తుతి చేసుకోవటం, భజనపరుల చేత, వందిమాగధుల చేత తమ పొగడ్తలు చేయించటం ధర్మసమ్మతం కాదు. ముఖ్యంగా ఆత్మశుద్ధి, పవిత్రతల గురించి గొప్పలు చెప్పుకోవటం ఎంతమాత్రం సమ్మతం కాదు. ఈ మాటనే దివ్య ఖుర్ఆన్ వేరొకచోట ఈ విధంగా చెప్పింది : "మీరు మీ పరిశుద్ధత గురించి గొప్పలు చెప్పుకోకండి. మీలో నిజంగా దైవభీతిగలవాడెవడో అల్లాహ్‌కు బాగా తెలుసు" (అన్ నజ్మ్ – 32).

హదీసులో ఇలా వుంది – మిఖ్దాద్ (రజి) ఇలా వివరించారు : "పొగడ్తల్లో ముంచెత్తేవారి ముఖంపై మన్ను వేయమని దైవప్రవక్త (సఅసం) మాకు ఆదేశించారు" (సహీహ్ ముస్లిం : కితాబుజ్జుహ్ద్).

మరో హదీసులో ఇలా ఉంది–ఒక వ్యక్తి మరోవ్యక్తిని అదేపనిగా ప్రశంసిస్తూ ఉండటం విని దైవప్రవక్త (స), "నీ పరిస్థితి కడు శోచనీయం! నువ్వు నీ స్నేహితుని మెడ నరికేశావు" అని అన్నారు. ఆ తరువాత ఆయన (స) ఇలా

أُولَٰٓئِكَ الَّذِينَ لَعَنَهُمُ اللّٰهُ ۖ وَمَنْ يَّلْعَنِ
اللّٰهُ فَلَنْ تَجِدَ لَهٗ نَصِيرًا ﴿52﴾

**52** అల్లాహ్ శపించింది కూడా వీరినే. అల్లాహ్ శాపానికి గురైన వారిని ఆదుకునే వాడెవణ్ణీ నీవు చూడవు.

اَمْ لَهُمْ نَصِيبٌ مِّنَ الْمُلْكِ فَاِذًا
لَّا يُؤْتُونَ النَّاسَ نَقِيرًا ﴿53﴾

**53** రాజ్యాధికారంలో వారికేదన్నా భాగముందా? ఒకవేళ ఉంటే వారు జనులకు రవంత కూడా ఇవ్వరు.[79]

اَمْ يَحْسُدُونَ النَّاسَ عَلٰى مَآ اٰتٰهُمُ اللّٰهُ
مِنْ فَضْلِهٖ ۚ فَقَدْ اٰتَيْنَآ اٰلَ اِبْرٰهِيمَ الْكِتٰبَ
وَالْحِكْمَةَ وَاٰتَيْنٰهُمْ مُّلْكًا عَظِيمًا ﴿54﴾

**54** లేక అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రజలకు ప్రసాదించిన దానిపై వారు అసూయ పడుతున్నారా?[80] మేమైతే ఇబ్రాహీము సంతతికి గ్రంథాన్ని, వివేకాన్నీ ప్రసాదించాము. గొప్ప సామ్రాజ్యాన్ని కూడా వొసగాము.

فَمِنْهُمْ مَّنْ اٰمَنَ بِهٖ وَمِنْهُمْ مَّنْ صَدَّ عَنْهُ ۖ
وَكَفٰى بِجَهَنَّمَ سَعِيرًا ﴿55﴾

**55** తరువాత వారిలో కొందరు ఈ గ్రంథాన్ని విశ్వసించగా, కొందరు (విశ్వసించకుండా) ఆగిపోయారు.[81] (వారిని) దహించటానికి నరకం చాలు.

ఉపదేశించారు : "మీలో ఎవరైనా మరొకరిని అంతగా పొగడాలనే అనుకుంటే, 'నేను ఈయన గురించి ఇలా అనుకుంటున్నాను' అని మాత్రం అనాలి. అల్లాహ్ అందరినీ కనిపెట్టుకుని ఉండగా మీరు ఒకరి హృదయశుద్ధి గురించి కితాబు ఇవ్వకండి" (సహీహ్ బుఖారీ : కితాబుష్షహాదాత్ వల్ అదబ్, ముస్లిం : కితాబుజ్జుహ్ద్).

78. ఈ వాక్యంలో యూదులు పాల్పడే మరో చేష్టపై ఆశ్చర్యం వెలిబుచ్చబడింది. అదేమంటే వారు గ్రంథవహులై ఉండి కూడా **'జిబ్త్'** (విగ్రహాలు, జ్యోతిష్యులు, మాంత్రికులు మొదలగువాటి)ని, తాగూత్ (బూటకపు దైవాల)ను నమ్ముతున్నారు. మక్కాలోని అవిశ్వాసులను ముస్లిములకన్నా మంచివారుగా, సన్మార్గగాములుగా తలపోస్తున్నారు. 'జిబ్త్' అనే పదానికి పైన పేర్కొనబడిన అర్థాలన్నీ చెప్పబడ్డాయి. హదీసులో 'జిబ్త్' గురించి ఇలా అనబడింది : "పక్షులను ఎగురవేసి, గీతలు గీసి శకునాలు చూడటం జిబ్త్ క్రిందికి వస్తుంది" (సుననె అబూ దావూద్ : కితాబుత్తిబ్). అంటే ఇవన్నీ షైతాను పనులు. యూదులలో కూడా దాదాపు ఈ పనులన్నీ ఉండేవి. తాగూత్ అంటే షైతాన్ అని కూడా ఒక అర్థం. మరోమాటలో చెప్పాలంటే బూటకపు దైవాలను పూజించటమంటే షైతాను అడుగుజాడల్లో నడవటమే. కనుక షైతాన్ కూడా 'తాగూత్' పరిధిలోకి వస్తాడు.

79. అంటే రాజ్యాధికారంలో వారికెలాంటి భాగస్వామ్యం లేదని చెప్పటానికి ఈ విధంగా అనబడింది. ఒకవేళ అలాంటి భాగస్వామ్యం అనేది వారికుంటే యూదులు తమ పిసినారితనం మూలంగా జనులకు ఏమీ యివ్వరు. ముఖ్యంగా మహాప్రవక్త (స)కు వారు ఖర్జూరపు గింజపై ఉండే గాటులోని పీచు అంతటి ప్రయోజనం కూడా చేకూర్చరు. ఖర్జూరపు గింజపై ఉండే పగులు లేక గాటును **'నఖీర్' (نَقِيْر)** అంటారు (ఇబ్నె కసీర్).

80. అంతేకాదు దేవుడు ఇస్రాయీల్ సంతతిని గాకుండా మరో సంతతి నుంచి తన చివరి ప్రవక్త (సఅసం)ను ఎన్నుకున్నందుకు వారు అసూయ చెందుతున్నారు. వాస్తవమేమంటే నబువ్వత్ (ప్రవక్త పదవి) అల్లాహ్ ప్రసాదించే గొప్పవరం. దాన్ని ఆయన తాను కోరిన వారికి అనుగ్రహిస్తాడు.

81. అంటే దైవప్రవక్త ఇబ్రాహీం వంశానికి చెందిన ఇస్రాయీలీయులకు మేము రాజ్యాధికారంతో పాటు, ప్రవక్త పదవీ బాధ్యతల (నబువ్వత్)ను కూడా ప్రసాదించాము. కాని ఏం లాభం? యూదులంతా ఆ ప్రవక్తలను విశ్వసించలేదు. కొందరు విశ్వసిస్తే మరికొందరు విముఖత చూపారు. కనుక (ఓ ముహమ్మద్!) వీరు నీ సందేశాన్ని ఈనాడు నిరాకరిస్తున్నారంటే అది ఆశ్చర్యకరం ఏమీ కాదు. వీళ్ల గత చరిత్ర అంతా ప్రవక్తల పట్ల ధిక్కార వైఖరితో నిండి ఉంది. ఆఖరికి తమ వంశంలోనే ప్రభవించిన ప్రవక్తలపై సయితం వీళ్లు తిరగబడ్డారు. కొందరు విద్వాంసులు **'ఆమన బిహీ'**లోని **'హీ'** సర్వనామం ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను సూచిస్తోన్నదని చెప్పారు. దాని

إِنَّ الَّذِينَ كَفَرُوا بِآيَاتِنَا سَوْفَ نُصْلِيهِمْ نَارًا ۖ
كُلَّمَا نَضِجَتْ جُلُودُهُم بَدَّلْنَاهُمْ جُلُودًا غَيْرَهَا
لِيَذُوقُوا الْعَذَابَ ۗ إِنَّ اللَّهَ كَانَ عَزِيزًا حَكِيمًا ﴿56﴾

**56** మా ఆయతులను త్రోసిపుచ్చిన వారిని మేము అగ్నిలో పడవేస్తాము.[82] వారి చర్మాలు బాగా ఉడికిపోయినప్పుడల్లా, వాటికి బదులుగా, వారు శిక్ష యొక్క రుచి చూసేందుకు[83] వేరే చర్మాలను సృష్టిస్తాము. నిశ్చయంగా అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేకవంతుడు.

وَالَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ سَنُدْخِلُهُمْ
جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ
فِيهَا أَبَدًا ۖ لَّهُمْ فِيهَا أَزْوَاجٌ مُّطَهَّرَةٌ ۖ
وَنُدْخِلُهُمْ ظِلًّا ظَلِيلًا ﴿57﴾

**57** మరెవరు విశ్వసించి సత్కార్యాలు చేస్తారో[84] వారిని మేము, క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలోకి తీసుకుపోతాము. వాటిలో వారు కలకాలం ఉంటారు. వారి కోసం అక్కడ పవిత్రులైన భార్యలుంటారు. ఇంకా మేము వారిని దట్టమైన నీడల్లోకి (మరియు పూరిపూర్ణ సౌఖ్యంలోకి) తీసుకుపోతాము.[85]

ప్రకారమైతే యూదుల్లో కొందరు ముహమ్మద్ (సఅసం)ను విశ్వసించారు, మరికొందరు ఆయన్ని తిరస్కరించారు అన్న భావం వస్తుంది. – ఏమనుకున్నప్పటికీ ఇలాంటి ధిక్కారుల పర్యవసానం నరకాగ్ని తప్ప మరేమీ కాదు సుమా!

82. అంటే నరకాగ్నిలోకి నెట్టివేయబడేది ఒక్క గ్రంథవహులలోని అవిశ్వాసులు మాత్రమే కాదు. సమస్త అవిశ్వాసుల నివాస స్థలం నరకమే అవుతుంది.

83. నరక యాతన తీవ్రత, దాని శాశ్విత శిక్ష యిక్కడ ప్రస్తావించబడింది. చర్మాలు కాలటం, వాటి స్థానంలో కొత్త చర్మాలు రావటం అనుదినం కొన్ని వందలసార్లు జరుగుతూ ఉంటుందని ప్రవక్త ప్రత్యక్షసహచరుల కథనాల ద్వారా తెలుస్తోంది. ముస్నదె అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం నరకవాసులు నరకంలో ఎంత స్థూలకాయులు అయిపోతారంటే, వారి చెవుల నుండి – మెడ వెనుక భాగానికి మధ్య గల అంతరం ఏడువందల సంవత్సరాలంత సుదీర్ఘం అయి ఉంటుంది. వారి చర్మపు మందం 70 జానెళ్ళు ఉంటుంది. వారి దవడ ఉహుద్ పర్వతమంత ఉంటుంది.

84. అవిశ్వాసులకు ప్రతిగా విశ్వాసులకు లభించే శాశ్విత సుఖాల ప్రస్తావన ఈ వాక్యంలో చేయబడింది. అయితే విశ్వసించటంతోపాటు సత్కార్యాలు చేసిన వారికి మాత్రమే ఈ అనుగ్రహాలు లభిస్తాయి. దివ్య ఖుర్ఆన్‌లో 'విశ్వాస' (ఈమాన్) ప్రస్తావన వచ్చినప్పుడల్లా సత్కార్యాల (అమలుస్సాలెహ్)ను కూడా ప్రస్తావించి – ఈ రెండింటికీ మధ్య విడదీయరాని సంబంధం ఉందని అల్లాహ్ స్పష్టం చేశాడు. సదాచరణ లేని విశ్వాసం సువాసనలేని కాగితపు పువ్వులాంటిది, పండ్లుఫలాలు ఇవ్వని వృక్షం లాంటిది! ప్రవక్త ప్రియసహచరులు (రజి), ఉత్తమ తరాలకు చెందిన ముస్లింలు ఈ విషయాన్ని బాగా జీర్ణించుకున్నారు. అందుచేత వారి జీవితాలు విశ్వాస పువ్వులతో, సత్కార్యాల ఫలాలతో నిండివుండేవి. ఆ కాలంలో క్రియాశూన్యత లేక దుష్క్రియతో పాటు విశ్వాసం (ఈమాన్) అనేది అనూహ్యమైన విషయంగా ఉండేది.

కాని ఈనాడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విశ్వాసం (ఈమాన్) అనేది ఈనాడు ప్రసంగాలకు, హితబోధలకే పరిమితం అయింది. సత్కార్యాలు చేశామని గొప్పలు చెప్పుకునే వారిలో విశ్వాసం లోపించి ఉంటుంది. కొంతమంది, తాము ఫలానా ఫలానా మంచిపనులు, సంక్షేమ కార్యాలు చేశామని అంటారు. ఉదాహరణకు: నిజాయితీ తత్పరత, అభాగ్యులకు చేయూత, సానుభూతి మొదలగునవి. కాని వారు విశ్వాస భాగ్యానికి నోచుకోరు. అట్టి పరిస్థితిలో వారి ఈ ప్రజోపయోగ పనులు ప్రపంచంలో వారి పేరు ప్రతిష్ఠల్ని ఇనుమడిస్తాయేమోగాని, అల్లాహ్ సమక్షంలో వాటికి ఎలాంటి విలువా, ఆదరణా ఉండదు. ఎందుకంటే ఈ సత్కార్యాలు ఈమాన్ (విశ్వాసం) ఆధారంగా ఉనికిలోకి

**58** “ఎవరి అమానతులను వారికి అప్పగించండి.[86] ప్రజల మధ్య తీర్పులు చేసేటప్పుడు న్యాయంగా తీర్పు చేయండి”[87] అని అల్లాహ్ మిమ్మల్ని గట్టిగా ఆదేశిస్తున్నాడు. నిశ్చయంగా అల్లాహ్ మీకు చేసే ఉపదేశం ఎంతో చక్కనిది.[88] నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ వింటున్నాడు, చూస్తున్నాడు.

إِنَّ اللَّهَ يَأْمُرُكُمْ أَنْ تُؤَدُّوا الْأَمَانَاتِ إِلَىٰ أَهْلِهَا وَإِذَا حَكَمْتُمْ بَيْنَ النَّاسِ أَنْ تَحْكُمُوا بِالْعَدْلِ ۚ إِنَّ اللَّهَ نِعِمَّا يَعِظُكُمْ بِهِ ۗ إِنَّ اللَّهَ كَانَ سَمِيعًا بَصِيرًا ﴿58﴾

**59** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపండి. మరియు మీలోని అధికారులకు కూడా.[89] ఆపైన ఏ విషయంలోనైనా మీ

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ وَأُولِي الْأَمْرِ مِنْكُمْ ۖ فَإِنْ تَنَازَعْتُمْ فِي شَيْءٍ

వచ్చినవి కావు. ప్రాపంచిక కీర్తి ప్రతిష్ఠల వరకే వారి సంక్షేమ కార్యక్రమాలు పరిమితం అయ్యాయి. శ్రేయోభిలాషులుగా, సంస్కర్తలుగా లోకం వారిని కొనియాడింది. అంతటితోనే వారి ప్రతిఫలం పరిసమాప్తం అయింది.

85. దట్టమైన, స్వచ్ఛమైన, కాలుష్య రహితమైన చల్లని నీడలు, వాటినే అనువాదంలో ‘సంపూర్ణ సౌఖ్యం’గా అభివర్ణించటం జరిగింది. హదీసులో ఇలా ఉంది: “స్వర్గంలో ఒక వృక్షం ఉంది. దాని నీడ ఎంతగా విస్తరిల్లి ఉంటుందంటే ఒక రౌతు నూరేళ్లు పయనించినా ఆ దూరాన్ని దాటలేడు. ఆ వృక్షం పేరు ‘షజ్రతుల్ ఖుల్ద్’ (ముస్నదె అహ్మద్‌– సంపుటి: 2, బుఖారీలో కితాబు బదయిల్ ఖల్ఖ్).

86. అత్యధికమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం ఈ ఆయతు ఉస్మాన్ బిన్ తల్హా (రజి)ను దృష్టిలో పెట్టుకుని అవతరించింది. కాబా గృహ తాళం చెవులు ఆయన వద్ద ఉండేవి. వంశపారంపర్యంగా ఆయన కుటుంబీకులే ఈ బాధ్యతను నిర్వహిస్తూ వస్తున్నారు. మక్కా విజయం సందర్భంగా మహనీయ ముహమ్మద్ (సఅసం) కాబా గృహంలోకి ప్రవేశించారు. తవాఫ్ మొదలగు కార్యాలను ఆచరించిన తర్వాత హుదైబియా ఒడంబడిక సందర్భంగా ఇస్లాం స్వీకరించిన ఉస్మాన్ బిన్ తల్హా (రజి)ను పిలిచి కాబా తాళం చెవులను అప్పగించారు. “ఇదిగో, ఇవి నీ తాళం చెవులు. ఈ రోజు వాగ్దానాలను నెరవేర్చేరోజు, సద్వ్యవహారం చేసే రోజు” అని కూడా మహాప్రవక్త (సఅసం) సెలవిచ్చారు (ఇబ్నె కసీర్). ఈ ఆయతు ఒకానొక ప్రత్యేక సంఘటన నేపథ్యంలో అవతరించినప్పటికీ, ఇందలి ఆదేశం మాత్రం సర్వసాధారణమైనది. పాలితులకు, పాలకులకు – అందరికీ యిది వర్తిస్తుంది. యోగ్యులైన వారికి అమానతులను అప్పగించాలని ఈ వాక్యంలో ఆజ్ఞాపించబడింది. ఇక్కడ అమానతులు రెండు రకాలు. ఒకటి: ఒకరు ఇంకొకరి వద్ద భద్రపరచమని పెట్టిన సొమ్ములు. వాటిలో ఏమాత్రం ద్రోహానికి పాల్పడకుండా యధాతథంగా భద్రపరచాలి. వచ్చి అడిగినప్పుడు ఎవరి సొమ్ములను వారికి అప్పగించాలి. రెండు: రెండవ రకపు అమానతు పదవులకు సంబంధించినది. ఈ పదవుల్ని యోగ్యత వున్న వారికి, న్యాయశీలురికి మాత్రమే కట్టబెట్టాలి. కేవలం రాజకీయ, జాతి, వంశ ప్రాతిపదికపై పదవుల్ని పంచటం, రిజర్వేషన్ల ఆధారంగా కోటా నింపటం ఈ ఆయతుకు విరుద్ధం.

87. న్యాయబద్ధంగా తీర్పులు ఇవ్వాలనీ, ముఖ్యంగా పరిపాలకులైన వారు న్యాయాన్ని విడనాడరాదని ఈ ఆయతులో తాకీదు చేయబడింది. ఒక హదీసులో ఇలా అనబడింది: “పరిపాలకుడు అన్యాయానికి ఒడిగట్టకుండా ఉన్నంతవరకూ అతనికి అల్లాహ్ అండగా ఉంటాడు. అతడు అన్యాయానికి పాల్పడటం మొదలెట్టినప్పుడు అల్లాహ్ అతన్ని అతని మానాన వదలిపెట్టేస్తాడు” (సుననె ఇబ్నె మాజ, కితాబుల్ అహ్‌కామ్).

88. అంటే ఎవరి అమానతులను వారికి అప్పగించాలనీ, ప్రజల మధ్య తీర్పులు యిచ్చే సమయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అల్లాహ్ చేసిన ఉపదేశం అన్నమాట!

89. **ఉలుల్ అమ్ర్** (أُولُوالامَر) : అంటే మీలోని అధికారిక జనులు. కొంతమంది దృష్టిలో ఇక్కడ ఉలుల్ అమ్ర్ అంటే రాజ్యాధికారులు, ప్రభుత్వాధికారులు. మరి కొంతమంది దృష్టిలో ధర్మవేత్తలు, ఇస్లామీయ విద్వాంసులు. – రెండూ సరైనవే. నిజానికి అసలు విధేయత అనేది అల్లాహ్‌కే కనబరచాలి. ఎందుకంటే ఖుర్‌ఆన్‌లో ఇలా అనబడింది:

فَرُدُّوْهُ اِلَى اللّٰهِ وَ الرَّسُوْلِ اِنْ كُنْتُمْ تُؤْمِنُوْنَ بِاللّٰهِ وَ الْيَوْمِ الْاٰخِرِ ؕ ذٰلِكَ خَيْرٌ وَّ اَحْسَنُ تَاْوِيْلًا ﴿59﴾

మధ్య వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్ మరియు ప్రవక్త వైపుకు మరల్చండి – మీకు నిజంగా అల్లాహ్‌పై, అంతిమ దినంపై నమ్మకం ఉన్నట్లయితే (మీరిలా చేయటం అవశ్యం)! ఇదే మేలైన పద్ధతి. పరిణామం రీత్యా కూడా ఇదే అన్నింటికంటే ఉత్తమమైనది.[90]

1."బాగా వినండి. సృష్టించటం, ఆజ్ఞాపించటం అనేది ఆయనకే చెందుతుంది (అల్ ఆరాఫ్ – 54). 2. 'ఆజ్ఞ అల్లాహ్‌కే సొంతం' (యూసుఫ్ : 40). అయితే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్ అభీష్టానికి స్వచ్ఛమైన ప్రతిరూపం. ఆయన ఇష్టాయిష్టాలకు ప్రతినిధి. కనుక అల్లాహ్ తనతోపాటు తన ప్రవక్తను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించి ఆయన ఆజ్ఞను తప్పనిసరిగా అనుసరించాలని ఖరారు చేశాడు. ప్రవక్త విధేయత వాస్తవానికి అల్లాహ్ విధేయతేనని చెప్పాడు. "ఎవరు ప్రవక్తకు విధేయులయ్యారో వారు అల్లాహ్‌కు విధేయులయ్యారు" (అన్ నిసా – 80). దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే ఖుర్ఆన్ ఏ విధంగా ఇస్లాం ధర్మానికి మూలాధారమో, హదీసు కూడా అదేవిధంగా మూలాధారం. అలాగే అమీర్లకు, అధికారులకు విధేయులై ఉండటం కూడా అవసరమే. ఎందుకంటే వారు దైవం మరియు దైవప్రవక్త (స) ఆజ్ఞలను మన మధ్య ప్రవేశపెడతారు లేదా ఉమ్మత్ యొక్క సామూహిక ప్రయోజనాలను కాపాడుతూ, తత్సంబంధిత వ్యవహారాలను అజమాయిషీ చేస్తూ ఉంటారు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే అమీర్లకు, అధికారులకు విధేయులై ఉండటం అవసరమే అయినప్పటికీ ఈ విధేయత బేషరతుగా జరగదు. అది షరతులతో కూడుకున్నది. తొలుత అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయత చూపాలి. తమ అధికారులు షరీయతుకు కట్టుబడి, 'మంచి' విషయాలు ఆజ్ఞాపించినపుడు వారికి విధేయత చూపాలి. చెడుల విషయంలో అమీర్ల అడుగులకు మడుగులొత్తవలసిన అవసరం లేదు. అందుకనే **'అతీవుల్లాహ'** తర్వాత **'అతీవుర్రసూల'** అని అయితే అనబడింది. కాని **'అతీవూ ఉలిల్ అమ్ర్'** అని చెప్పలేదు. ఎందుకంటే అల్లాహ్ విధేయత, ప్రవక్త విధేయత – ప్రత్యేక విధులు. కాని అధికారుల విధేయత ప్రత్యేక విధి కాదు. అది అల్లాహ్ మరియు ప్రవక్త విధేయతకు లోబడినది. హదీసులో కూడా ఇలా అనబడింది: "సృష్టి విధేయత వల్ల సృష్టికర్త పట్ల అవిధేయత జరిగితే అటువంటి విధేయత తగదు. (అల్ బానీ – మిష్కాత్). "మంచిపనుల్లోనే విధేయత చూపాలి" (బుఖారీ – కితాబుల్ అహ్‌కామ్). నాయకుడు అవిధేయతకు ఒడిగట్టనంతవరకూ అతని మాట వినాలి. అతనికి విధేయత కనబరచాలి. ఒకవేళ పండితుల (ఉలమా)ను, విద్వాంసుల (ఫుకహా)ను 'ఉలుల్ అమ్ర్'గా భావించినట్లయితే వారి విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. వారు దైవాదేశాలను, ప్రవక్త ఉపదేశాలను జనులకు వివరిస్తూ ఉంటారు. ప్రజలకు ధర్మం వైపు మార్గదర్శకత్వం వహిస్తూ ఉంటారు. కనుక వారికి విధేయత కనబరచాలి. దీనిద్వారా బోధపడేదేమంటే పండితులు, విద్వాంసులు కూడా ధార్మిక వ్యవహారాలలో – ప్రభుత్వాధికారుల లాంటివారే. అయితే ఇస్లామీయ విద్వాంసులు కూడా దైవం మరియు దైవప్రవక్త ఆజ్ఞల్ని ప్రజలకు వివరించినంత కాలమే ప్రజలు వారి మాట వినాలి. వారు గనక గాడి తప్పుతున్నట్లు అనిపిస్తే జనసామాన్యం వారికి విధేయత చూపనవసరం లేదు. పైగా వైముఖ్య దశలో ఉన్నప్పుడు తెలిసి కూడా వారి అడుగుజాడల్లో నడవటం పాపం అవుతుంది.

90. వివాదాస్పదమైన విషయాన్ని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వైపుకు మరల్చటమంటే నేటి ధార్మిక పరిభాషలో అర్థం ఖుర్ఆన్ హదీసుల వైపుకు మరలటం అన్నమాట! అభిప్రాయభేదాలను, వివాదాలను పరిష్కరించటానికి ఇది అత్యుత్తమమైన మార్గదర్శక సూత్రం! ఈ సూత్రం ద్వారా అర్థమయ్యేదేమంటే మరో మూడోవ్యక్తిని అనుసరించవలసిన అగత్యంలేదు. ఒకానొక నిర్ణీత పండితుణ్ణి అనుసరించటం (తఖ్‌లీదె ముఅయ్యన్ లేక తఖ్‌లీదె షఖ్‌సీ) తప్పనిసరి అని చెప్పేవారు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తతోపాటు మూడో వ్యక్తి అనుసరణను తప్పనిసరి (వాజిబ్)గా ఖరారు చేశారు. దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతుకు పూర్తిగా విరుద్ధమైన ఈ మూడో వ్యక్తి అనుసరణ ముస్లింలకు ఐక్య సమాజం (**ఉమ్మతె ముత్తహిదా**) కాకుండా అనైక్య సమాజం (ఉమ్మతె మున్‌తషిరహ్)గా, ఇంకా చెప్పాలంటే ముస్లిం సమాజ ఐక్యతను దాదాపు దుస్సాధ్యంగా మార్చివేసింది.

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يَزْعُمُونَ أَنَّهُمْ آمَنُوا
بِمَا أُنْزِلَ إِلَيْكَ وَمَا أُنْزِلَ مِنْ قَبْلِكَ
يُرِيدُونَ أَنْ يَتَحَاكَمُوا إِلَى الطَّاغُوتِ
وَقَدْ أُمِرُوا أَنْ يَكْفُرُوا بِهِ ۖ وَيُرِيدُ
الشَّيْطَانُ أَنْ يُضِلَّهُمْ ضَلَالًا بَعِيدًا ﴿٦٠﴾

**60** (ఓ ప్రవక్తా!) నీపై అవతరించినదాన్నీ, నీకు పూర్వం వారిపై అవతరించిన దాన్నీ విశ్వసించాము అని అంటూనే తమ వ్యవహారాలను తీర్పు కోసం దైవేతరుల (తాగూత్) వద్దకు తీసుకుపోగోరే వారిని నీవు చూడలేదా? మరి నిజానికి షైతాన్‌ను (తాగూత్‌ను) తిరస్కరించమని వారికి (స్పష్టంగా) ఆదేశించటం జరిగింది. షైతానైతే వారిని మార్గం తప్పించి చాలా దూరంలో పడవేయాలని కోరుతున్నాడు.

وَإِذَا قِيلَ لَهُمْ تَعَالَوْا إِلَىٰ مَا أَنْزَلَ اللَّهُ
وَإِلَى الرَّسُولِ رَأَيْتَ الْمُنَافِقِينَ يَصُدُّونَ
عَنْكَ صُدُودًا ﴿٦١﴾

**61** "అల్లాహ్ అవతరింపజేసిన దాని వైపుకు, ప్రవక్త (సఅసం) వైపుకు రండి" అని వారితో అన్నప్పుడల్లా, ఈ కపటులు నీ నుండి అయిష్టంగా ముఖం త్రిప్పుకుని పోవటాన్ని నీవు గమనిస్తావు.[91]

فَكَيْفَ إِذَا أَصَابَتْهُمْ مُصِيبَةٌ بِمَا قَدَّمَتْ
أَيْدِيهِمْ ثُمَّ جَاءُوكَ يَحْلِفُونَ ۖ بِاللَّهِ إِنْ
أَرَدْنَا إِلَّا إِحْسَانًا وَتَوْفِيقًا ﴿٦٢﴾

**62** మరి ఇదేమిటి? వారు తమ చేజేతులా చేసుకున్న దాని పర్యవసానంగా వారిపై ఏదన్నా ఆపద వచ్చిపడితే, అప్పుడు వారు నీ వద్దకు వచ్చి, అల్లాహ్‌పై ప్రమాణం చేస్తూ, "మేము మేలును, సయోధ్యను కాంక్షించి మాత్రమే ఇలా చేశాము"[92] అని అంటారు.

أُولَٰئِكَ الَّذِينَ يَعْلَمُ اللَّهُ مَا فِي قُلُوبِهِمْ
فَأَعْرِضْ عَنْهُمْ وَعِظْهُمْ وَقُلْ لَهُمْ فِي
أَنْفُسِهِمْ قَوْلًا بَلِيغًا ﴿٦٣﴾

**63** వారి హృదయాలలో ఉన్నదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. కనుక (ఓ ప్రవక్తా!) వారిని పట్టించుకోకు. కాకపోతే వారికి బోధపరుస్తూ ఉండు. వారి మనోక్షేత్రంలో నాటుకునేలా మాట చెబుతూ ఉండు.[93]

91. కేసులను న్యాయస్థానానికి తీసుకెళ్ళే బదులు యూద నాయకుల వద్దకు, ఖురైషు సర్దారుల వద్దకు వెళ్ళి తీర్పుకోరే వారినుద్దేశించి ఈ ఆయతులు అవతరించాయి. అయితే ఈ ఆదేశం సర్వసామాన్యమైనది. దైవగ్రంథాన్ని, దైవప్రవక్త సంప్రదాయాన్ని కాదని తమ సమస్యలను అన్యులవద్దకు తీసుకుపోయే వారందరికీ యిది వర్తిస్తుంది. "విశ్వాసుల మధ్య తీర్పు చెప్పటానికి, వారిని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వైపునకు పిలిచినప్పుడు, 'మేము విన్నాము, శిరసావహించాము' అని వారంటారు." అలాంటి వారినుద్దేశ్యించి అల్లాహ్ ఏమన్నాడో తెలుసా? "సాఫల్యాన్ని పొందినవారంటే వారే" (నూర్ – 51).

92. తమ తప్పుడు నిర్ణయాల మూలంగా దైవాగ్రహానికి గురై, కష్టాలు కడగండ్లలో చిక్కుకు పోయినప్పుడు లబోదిబోమంటూ దైవప్రవక్త (సఅసం) వద్దకు పరుగెత్తుకుని వచ్చేవారు. "అబ్బే, వాళ్ళేదో మాకు న్యాయం చేస్తారని భావించి మేము అక్కడికి వెళ్ళలేదు. అసలు మీకన్నా న్యాయం చేసేవాళ్ళు ఎవరున్నారు? కాకపోతే వాళ్ళను కూడా కలుపుకు పోవాలికదా! సదవగాహన కోసమే వారిని సంప్రతించాము. అంతకుమించి మాకు మరో ఉద్దేశం లేదు" అంటూ కాళ్ళ బేరానికి వస్తారు.

93. ఈ వాక్యంలో అల్లాహ్ ఏమంటున్నాడంటే : పైకి వాళ్లు అబద్ధాలు చెబుతున్నప్పటికీ వారి అంతరంగం గురించి మాకు బాగా తెలుసు. తదనుగుణంగానే మేము వారికి ప్రతిఫలం ఇస్తాము. ఓ ముహమ్మద్ (స)! దాన్ని గురించి నీవు చింతించకు. వారు నీ ముందు వ్యక్తపరిచే కల్లబొల్లి మాటలను తీవ్రంగా తీసుకోకు. వారిని ఉపేక్షించు. అయితే

وَمَآ اَرْسَلْنَا مِنْ رَّسُوْلٍ اِلَّا لِيُطَاعَ بِاِذْنِ
اللّٰهِ ؕ وَلَوْ اَنَّهُمْ اِذْ ظَّلَمُوْٓا اَنْفُسَهُمْ جَآءُوْكَ
فَاسْتَغْفَرُوا اللّٰهَ وَاسْتَغْفَرَ لَهُمُ الرَّسُوْلُ
لَوَجَدُوا اللّٰهَ تَوَّابًا رَّحِيْمًا ﴿64﴾

**64** మేము ఏ ప్రవక్తను పంపినా దైవాజ్ఞతో (ప్రజలు) అతనిని అనుసరించాలనే పంపాము. వారే గనక తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నప్పుడు, నీ వద్దకు వచ్చి క్షమాపణకై దైవాన్ని వేడుకుని ఉంటే, ప్రవక్త కూడా వారి మన్నింపుకై విన్నవించుకుని ఉంటే[94] అప్పుడు వారు అల్లాహ్‌ను క్షమించేవాడుగా, కరుణించే వాడుగా పొంది ఉండేవారు.

فَلَا وَرَبِّكَ لَا يُؤْمِنُوْنَ حَتّٰى يُحَكِّمُوْكَ فِيْمَا شَجَرَ
بَيْنَهُمْ ثُمَّ لَا يَجِدُوْا فِيْٓ اَنْفُسِهِمْ حَرَجًا مِّمَّا
قَضَيْتَ وَيُسَلِّمُوْا تَسْلِيْمًا ﴿65﴾

**65** కనుక (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు తోడు! వారు తమ పరస్పర వివాదాలన్నింటిలో నిన్ను తీర్పరిగా చేసుకోనంతవరకూ, తర్వాత నీవు వారి మధ్య చెప్పిన తీర్పుపట్ల వారు తమ మనసులలో ఎలాంటి సంకోచానికి, అసంతృప్తికి ఆస్కారం యివ్వకుండా మనస్ఫూర్తిగా శిరసావహించనంతవరకూ – వారు విశ్వాసులు కాజాలరు.[95]

---

వారికి బోధపరచే ప్రయత్నాలను మాత్రం మానుకోకు. మనసుల్ని ఆకట్టుకునే ప్రవచనాల ద్వారా వారిని సంస్కరించే నీ కార్యక్రమాన్ని కొనసాగించు.

దీని ద్వారా అవగతమయ్యేదేమిటంటే శత్రువుల కుట్రలు కుతంత్రాలను మన్నింపుల వైఖరి ద్వారా, హితోపదేశాల ద్వారా, హృదయాలను ఆకట్టుకునే సందేశం ద్వారా వమ్ము చేసేందుకు ప్రయత్నించాలి.

94. క్షమాపణకై దైవసన్నిధిలో వేడుకుంటే సరిపోతుంది. దానికోసం ప్రవక్త దగ్గరికి రానక్కర్లేదు. కాని యిక్కడ అలా అనబడలేదు. పైగా, "ఓ ప్రవక్తా! వారు నీ వద్దకు వచ్చి, క్షమాపణకై దైవాన్ని వేడుకుని ఉంటే, నువ్వు కూడా వారి క్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థించేవాడివి" అని అనబడింది. ఎందుకంటే వాళ్లు తమ తగాదాల విషయంలో అన్యుల వద్దకు వెళ్ళి ప్రవక్తను అగౌరవపరిచారు. అందుచేత వారి అహం అణగడానికి వారు ప్రవక్త వద్దకు రావలసి ఉంది అన్నది దీని భావం.

(ఆయతులోని పదజాలాన్ని బట్టి, సంబోధనా తీరునిబట్టి ఈ అంశం ఆయన (సఅసం) జీవితంతో ముడిపడినది. కాని కొంతమంది ఈ విషయంలో అతిశయిల్లారు. ప్రవక్త (స) జీవితకాలంలో లాగానే ఈనాడు కూడా ఆయన (స) సమాధి వద్దకెళ్ళి క్షమాపణ కోరాలని వారంటారు. అల్లాహ్ ఇలాంటి అపమార్గం నుంచి రక్షించుగాక! – అనువాదకుడు.)

95. సాధారణంగా ఈ ఆయతు అవతరణ వెనుక ఒక యూద వ్యక్తికి – ఒక ముస్లింకీ మధ్య జరిగిన తగాదాను ఉదాహరించటం జరుగుతుంది. అదేమిటంటే, దైవప్రవక్త (సఅసం) దర్బారులో తీర్పు జరిగిన తరువాత కూడా ఆ ముస్లిం ఉమర్ (రజి) వద్దకు వెళ్ళి తీర్పు కోరాడు. దైవప్రవక్త (స) తీర్పు యిచ్చారని తెలుసుకున్న ఉమర్ (రజి) ఆగ్రహోదగ్రులై ఆ ముస్లిం శిరస్సును ఛేదించారు. కాని ఈ సంఘటన నిజం కాదు. దీని ఆధారాలు సరిగ్గా లేవు. ఇబ్నె కసీర్ కూడా ఈ విషయాన్ని విశదీకరించారు. దీని పూర్వరంగానికి సంబంధించిన అసలు సంఘటన ఏమిటంటే, దైవప్రవక్త (స) మేనత్త కుమారుడగు జుబైర్ (రజి)కి – మరో మనిషికి మధ్య పొలాలకు నీళ్లు వదిలేచోట గొడవ జరిగింది. ఆ వ్యవహారం దైవప్రవక్త (స) దాకా వచ్చింది. విచారణ జరిపిన తరువాత ఆయన (స) ఇచ్చిన తీర్పు యాదృచ్ఛికంగా జుబైర్ (రజి)కు అనుకూలంగా వచ్చింది. దైవప్రవక్త (స) తీర్పు యివ్వటంలో బంధుప్రీతిని కనబరచారని రెండో వ్యక్తి అభిప్రాయపడ్డాడు. దానిపై ఈ ఆయతు అవతరించింది. (సహీహ్ బుఖారీ – నిసా సూరా వ్యాఖ్యానం). దైవప్రవక్త (స) యిచ్చిన తీర్పును విభేదించటం సంగతటుంచి, దానిపై కనీసం మనసులో లేశమయినా అసంతృప్తి

**66** ఒకవేళ మేము "మిమ్మల్ని మీరు చంపుకోండి" లేదా "మీ ఇళ్ల నుంచి వెళ్ళిపోండి" అనే ఆదేశాన్ని వారిపై విధించి ఉంటే, వారిలో బహుకొద్దిమంది మాత్రమే దాన్ని పాటించేవారు. అలా కాకుండా వారు తమకు ఉపదేశించబడుతున్న విధంగా చేసి వుంటే నిశ్చయంగా అది వారి కొరకు శ్రేయస్కరం అయ్యేది, ఎక్కువ స్థయిర్యాన్నీ ఒనగూర్చేది.[96]

وَلَوْ اَنَّا كَتَبْنَا عَلَيْهِمْ اَنِ اقْتُلُوْٓا اَنْفُسَكُمْ
اَوِ اخْرُجُوْا مِنْ دِيَارِكُمْ مَّا فَعَلُوْهُ اِلَّا قَلِيْلٌ
مِّنْهُمْ ۭ وَلَوْ اَنَّهُمْ فَعَلُوْا مَا يُوْعَظُوْنَ بِهٖ لَكَانَ
خَيْرًا لَّهُمْ وَاَشَدَّ تَثْبِيْتًا ﴿66﴾

**67** అదేగనక జరిగి ఉంటే మేము మా వద్ద నుండి వారికి గొప్ప పుణ్యఫలం ప్రసాదించి ఉండేవాళ్ళం.

وَّاِذًا لَّاٰتَيْنٰهُمْ مِّنْ لَّدُنَّآ اَجْرًا عَظِيْمًا ﴿67﴾

**68** ఇంకా వారికి రుజుమార్గం చూపించి ఉండేవాళ్ళం.

وَّلَهَدَيْنٰهُمْ صِرَاطًا مُّسْتَقِيْمًا ﴿68﴾

**69** ఎవరయితే అల్లాహ్‌కు, ప్రవక్త (సఅసం)కు విధేయత కనబరుస్తారో వారే అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్య సంధులతోనూ, షహీదులతోనూ, సద్వర్తనులతోనూ ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు.[97]

وَمَنْ يُّطِعِ اللّٰهَ وَالرَّسُوْلَ فَاُولٰۗىِٕكَ مَعَ الَّذِيْنَ
اَنْعَمَ اللّٰهُ عَلَيْهِمْ مِّنَ النَّبِيّٖنَ وَالصِّدِّيْقِيْنَ
وَالشُّهَدَاۗءِ وَالصّٰلِحِيْنَ ۚ وَحَسُنَ اُولٰۗىِٕكَ رَفِيْقًا ﴿69﴾

రాజుకున్నా అది విశ్వాసానికి వ్యతిరేకంగా పరిణమిస్తుందని హెచ్చరించటం జరిగింది. ఈ ఆయతు హదీసు ధిక్కారులకు ఎలాగూ హెచ్చరికే. అయితే దైవప్రవక్త (స) వారి ప్రవచనాలు (సహీహ్ హదీసులు) తేటతెల్లంగా తమ ముందు ఉండగా వాటిపై ఇమాము పలుకులకు ప్రాధాన్యతనిచ్చే వారు కూడా ఆత్మపరిశీలన చేసుకోవలసిన సందర్భమిది. కడు శోచనీయమైన విషయం ఏమిటంటే వారు తమ భాష్యాలను చెల్లుబాటు చేసుకునే ప్రయత్నంలో ఆయా హదీసులను బహిరంగంగా నిరాకరిస్తారు లేదా వాటికి వక్రభాష్యాలు చెప్పిగానీ, విశ్వసనీయులైన ఉల్లేఖకులను బలహీనులుగా ఖరారు చేసిగానీ ఆయా హదీసులను త్రోసిపుచ్చటానికి హేయమైన ప్రయత్నాలు చేస్తుంటారు.

96. అవిధేయులైన వారికి ఈ ఆయతులో చురకలు వేయబడ్డాయి. తేలికపాటి ఆజ్ఞలను శిరసావహించటానికే సందిగ్ధంలో పడుతున్న వీరు కఠినమైన ఆదేశాలను ఇంకెక్కడ పాలిస్తారు? కాని అల్లాహ్ ప్రేమమయుడు, దయాశీలుడు. ఆయన ఆదేశాలు కూడా సరళమైనవి, ఆచరణ యోగ్యమైనవే. కనుక కనీసం తమకు బోధించబడుతున్న ఆదేశాలను గనక ప్రజలు వినయంగా పాటించినట్లయితే అవే ధర్మం మీద సహన స్థయిర్యాలకు సోపానమవుతాయి. ఎందుకంటే విధేయత మూలంగా విశ్వాసం పెరుగుతుంది. అవిధేయత మూలంగా తరుగుతుంది. సత్కార్యాలు చేస్తూపోతే సన్మార్గం సులభమవుతూ పోతుంది. చెడులకు పాల్పడుతూ పోతే దుర్మార్గం సులభతరమవుతుంది.

97. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స)కు విధేయత కనబరచిన వారికి లభించే పుణ్యఫలం ఎటువంటిదో యిక్కడ చెప్పటం జరిగింది. "మనిషి ఎవరిని అభిమానిస్తాడో వారి సాంగత్యమే అతనికి లభిస్తుంది" అన్న హదీసు ఈ సందర్భంగా గమనార్హం (సహీహ్ బుఖారీ: కితాబుల్ అదబ్, ముస్లిం : కితాబుల్ బిర్రి వస్సిలతి వల్ ఆదాబ్). అనస్ (రజి) ఇలా అంటున్నారు: "దైవప్రవక్త (స)నోట వెలువడిన ఈ ప్రవచనం విన్నప్పుడు సహాబాకు కలిగినంత ఆనందం మరెన్నడూ కలగలేదు" ఎందుకంటే వారు స్వర్గంలో కూడా తమ ప్రియప్రవక్త (స) సాంగత్యాన్ని కోరుకునేవారు.

ఈ ఆయతు పూర్వరంగానికి సంబంధించిన ఉల్లేఖనాల్లో ఇలా చెప్పబడింది: కొంతమంది సహచరులు వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! దేవుడు తమరికి స్వర్గంలో ఉన్నత స్థానాలను ప్రసాదిస్తాడు. మాకు అంతకన్నా అధమ స్థానమే లభిస్తుంది. అందువల్ల మేము అక్కడ మీ సాంగత్యానికి, సహచర్యానికి దూరమైపోతాము. ప్రపంచంలో మాకు

70 ఇదీ అల్లాహ్ తరఫు నుంచి లభించే అనుగ్రహం. తెలుసు కోవటానికి అల్లాహ్‌యే చాలు.

ذٰلِكَ الْفَضْلُ مِنَ اللّٰهِ ؕ وَكَفٰى بِاللّٰهِ عَلِيْمًا ﴿٧٠﴾

71 విశ్వాసులారా! మీరు మీ ఆత్మరక్షణా సామగ్రిని సమకూర్చు కోండి.[98] ఆపైన వేర్వేరు దళాలుగా ఏర్పడి బయలుదేరండి లేదా అందరూ కలసికట్టుగా కదలండి.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا خُذُوْا حِذْرَكُمْ فَانْفِرُوْا ثُبَاتٍ اَوِ انْفِرُوْا جَمِيْعًا ﴿٧١﴾

72 మీలో కొందరు వెనుకాడేవారు కూడా ఉన్నారు.[99] ఒకవేళ మీకు ఏదన్నా నష్టం వాటిల్లితే, "అల్లాహ్ నన్ను అనుగ్రహిం చాడు. ఆ సమయంలో నేను వారివెంట లేను" అని అంటారు.

وَاِنَّ مِنْكُمْ لَمَنْ لَّيُبَطِّئَنَّ ۚ فَاِنْ اَصَابَتْكُمْ مُّصِيْبَةٌ قَالَ قَدْ اَنْعَمَ اللّٰهُ عَلَيَّ اِذْ لَمْ اَكُنْ مَّعَهُمْ شَهِيْدًا ﴿٧٢﴾

73 ఒకవేళ దైవానుగ్రహం ఏదన్నా మీకు లభిస్తే,[100] మీ మధ్య– అతని మధ్య స్నేహబంధమే లేనట్లుగా మాట్లాడుతూ[101] – "అరెరే! నేనూ వారి వెంట ఉండి ఉంటే ఘనవిజయాన్ని పొంది ఉండే వాడినే!"[102] అని చెబుతారు.

وَلَئِنْ اَصَابَكُمْ فَضْلٌ مِّنَ اللّٰهِ لَيَقُوْلَنَّ كَاَنْ لَّمْ تَكُنْۢ بَيْنَكُمْ وَبَيْنَهٗ مَوَدَّةٌ يّٰلَيْتَنِيْ كُنْتُ مَعَهُمْ فَاَفُوْزَ فَوْزًا عَظِيْمًا ﴿٧٣﴾

ప్రాప్తించిన మీ సహచర్య భాగ్యం పరలోకంలో ప్రాప్తించదు కదా!" అని సందేహపడ్డారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి వారి మనసులు కుదుట పడేలా చేశాడు (ఇబ్నె కసీర్).

మరి కొంతమంది సహచరులైతే స్వర్గంలో దైవప్రవక్త (స) సహచర్యం కోసం ప్రత్యేకంగా విన్నపాలు చేసుకున్నారు. అలాంటి వారినుద్దేశ్యించి, నఫిల్ (స్వచ్ఛంద) నమాజులు అత్యధికంగా చేయమని ఆయన (స) తాకీదు చేశారు. "మీరు (వీలైనన్ని) ఎక్కువ సజ్దాల ద్వారా నాకు తోడ్పడండి" అని ఆయన (స) సెలవిచ్చారు (సహీహ్ ముస్లిం: కితాబుస్సలాత్). ఇంకొక హదీసులో ఇలా అనబడింది – "సత్యసంధుడు, నిజాయితీ పరుడైన వర్తకుడు ప్రవక్తల, సిద్దీఖుల (సత్యసంధుల), షహీదుల(అమరవీరుల)లతో పాటు ఉంటాడు" (తిర్మిజీ : కితాబుల్ బుయూ).

విశ్వాసంలోనూ, విధేయతలోనూ పరిపూర్ణ స్థాయికి చేరుకున్న వారిని 'సిద్దీఖులు' గా వ్యవహరిస్తారు. ప్రవక్త పదవి (నబువ్వత్) తరువాతి స్థానం యిదే. మహనీయ ముహమ్మద్ (స) వారి అనుచర సమాజంలో ఈ అంతస్థు పొందిన వారిలో అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) అగ్రగాములు. అందుకే ప్రవక్తేతర వ్యక్తులలో మహాప్రవక్త (స) తరువాతి స్థానం ఆయనదే అన్న విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఇక దేవుని హక్కులతో పాటు, దాసుల హక్కులను కూడా పూర్తిగా నెరవేరుస్తూ, అందులో ఎలాంటి లోటూ రానివ్వకుండా జాగ్రత్తపడేవారిని సజ్జనులు (సాలిహీన్) అని అంటారు.

98. **'హిజ్‌రకుమ్'** (حِذْرَكُمْ) అంటే ఆత్మ రక్షణోపాయాన్ని అవలంబించటం. యుద్ధసామగ్రిని – ఆయుధాలను, ఒనరులను, వాహనాలను సమకూర్చుకోవటం అని భావం.

99. వెనుకాడే వారెవరంటే కపటులన్నమాట. వారు ఏదో ఒక విధంగా యుద్ధం బెడద నుంచి తప్పుకోవాలన్న ఉద్దేశ్యంతో ఆలస్యం చేస్తారు. అందుకోసం కుంటిసాకులు చెబుతారు.

100. ఇక్కడ దైవానుగ్రహం అంటే అర్థం యుద్ధంలో గెలుపు, ఆధిక్యత, యుద్ధప్రాప్తి.

101. అంటే వారు మీ ధార్మిక సోదరులే కాదన్నట్లు, మీకు అపరిచితులైనట్లే మాట్లాడతారు.

102. అంటే యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)లో వాటా పొంది ఉండేవాళ్ళం; సంపదను పొందటమే ప్రపంచాన్ని కోరుకునేవారి ప్రధాన ఆశయమై ఉంటుంది.

**74** కాబట్టి ఇహలోక జీవితాన్ని పరలోకానికి బదులుగా అమ్మి వేసినవారు[103] దైవమార్గంలో పోరాడాలి. దైవమార్గంలో పోరాడుతూ చంపబడినవానికి లేదా విజయం పొందినవానికి మేము గొప్ప పుణ్యఫలాన్ని వొసగుతాము.

فَلْيُقَاتِلْ فِي سَبِيلِ اللَّهِ الَّذِينَ يَشْرُونَ الْحَيَاةَ
الدُّنْيَا بِالْآخِرَةِ ۚ وَمَن يُقَاتِلْ فِي سَبِيلِ اللَّهِ
فَيُقْتَلْ أَوْ يَغْلِبْ فَسَوْفَ نُؤْتِيهِ أَجْرًا عَظِيمًا ﴿٧٤﴾

**75** "మా ప్రభూ! దుర్మార్గుల ఈ పురము నుండి మాకు విముక్తి నొసగు.[104] మా కొరకు నీ వద్దనుంచి ఒక రక్షకుణ్ణి నియమించు, మాకు (అండగా) నీ వద్ద నుంచి ఒక సహాయకుణ్ణి పంపించు" అని వేడుకుంటున్న బలహీన పురుషుల, స్త్రీల, పసివాళ్ళ విమోచనకై మీరు దైవ మార్గంలో ఎందుకు పోరాడటం లేదు?!

وَمَا لَكُمْ لَا تُقَاتِلُونَ فِي سَبِيلِ اللَّهِ وَالْمُسْتَضْعَفِينَ
مِنَ الرِّجَالِ وَالنِّسَاءِ وَالْوِلْدَانِ الَّذِينَ يَقُولُونَ
رَبَّنَا أَخْرِجْنَا مِنْ هَٰذِهِ الْقَرْيَةِ الظَّالِمِ أَهْلُهَا
وَاجْعَل لَّنَا مِن لَّدُنكَ وَلِيًّا وَاجْعَل لَّنَا
مِن لَّدُنكَ نَصِيرًا ﴿٧٥﴾

103. అరబీలో **షరా, యష్రీ** (యష్రూన) అనే పదానికి అమ్మటం, కొనటం – రెండు అర్థాలూ వస్తాయి. పైన మూలంలో ఉర్దూ అనువాదకులు మొదటి అర్థాన్ని తీసుకున్నారు. ఈ అర్థం తీసుకున్నట్లయితే వాక్య నిర్మాణం ఇలా ఉంటుంది: మూలంలో 'పోరాడాలి' (ఫల్ యుఖాతిల్) అన్నది క్రియాపదం. దీనికర్త 'అమ్మివేసినవారు' (అల్లజీన యష్రూనల్ హయాత) అవుతుంది. ఈ విధంగా భావించినట్లయితే – పైన చెప్పినట్లు – భావం ఇలా వస్తుంది : పరలోకం కోసం ఇహలోక జీవితాన్ని అమ్మివేసినవారు (లేక మరోమాటలో చెప్పుకోవాలంటే) ఇహలోక జీవితాన్ని త్యాగం చేసిన వీరులు దైవమార్గంలో పోరాడాలి.

పై దానికి భిన్నంగా మనం రెండవ అర్థం తీసుకున్నట్లయితే – అనగా మూలంలోని 'యష్రూన' అన్న పదాన్ని అమ్మివేసినవారు అని గాకుండా 'కొన్నవారు' అని అర్థం చేసుకున్నట్లయితే అప్పుడు, 'అల్లజీన యష్రూనల్ హయాత' (కొనుక్కున్నవారు) అన్న పదం వాక్యంలో కర్మగా మారుతుంది. అప్పుడు ఆయతుకు, 'పరలోకానికి బదులు ఇహలోకాన్ని కొనుక్కున్నవారితో పోరాడాలి' అనే అర్థం వస్తుందన్నమాట! అయితే పోరాడేదెవరు? లేక 'పోరాడాలి' అన్న పదానికి వాక్యంలో కర్త ఏది? అన్న ప్రశ్న ఈ సందర్భంగా జనిస్తుంది. దానికి సమాధానం ఏమిటంటే – మూలంలో **'ఫల్ యుఖాతిల్'** (పోరాడాలి) అన్న తర్వాత 'అల్ మోమినున్నాఫిరు' (దైవమార్గంలో పోరాటం నిమిత్తం బయలుదేరిన విశ్వాసి) అనే పదం మార్జితము (మహ్జూఫ్) గా ఉన్నట్లు భావించవలసి ఉంటుంది.

మొత్తానికి దీని సారాంశం ఏమిటంటే, ఆయతులో 'యష్రూన' అన్న పదానికి 'కొనుక్కున్న' అని అర్థం చెప్పినట్లయితే, 'ఎవరయితే తమ ధర్మాన్ని, నీతినిజాయితీలకు బదులుగా ఇహలోకపు తుచ్ఛ ప్రయోజనాలను కొనుక్కుంటారో వారికి వ్యతిరేకంగా విశ్వాసులు దైవమార్గంలో పోరాడాలి' అన్న భావం వస్తుంది (ఇబ్నె కసీర్ ఈ భావమే తీసుకున్నారు).

104. దుర్మార్గులు నివసించే పురము అంటే – సందర్భాన్ని బట్టి – మక్కా నగరం అని అర్థం. హిజ్రత్ అనంతరం మక్కాలో ఉండిపోయిన నిరాధారజీవులు, బలహీనులు, స్త్రీలు, పిల్లలు అవిశ్వాసుల ఆగడాలకు తాళలేక దుర్భర స్థితిలో జీవించే వారు. దుర్మార్గుల, దుష్టుల బారినుండి తమను కాపాడమని దీనాతిదీనంగా దైవాన్ని వేడుకునేవారు. అప్పుడు దైవకారుణ్యం కదలివచ్చింది. దుష్టుల బారినుంచి ఈ నిరాధార జీవుల్ని రక్షించటానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడటం లేదు? అంటూ దేవుడు ముస్లింల పౌరుషాన్ని జాగృతం చేశాడు. ఈ ఆయతు ఆధారంగా ఇస్లామీయ విద్వాంసులు ఏమన్నారంటే, సాటి ముస్లింలు ఏ ప్రాంతంలో వేధింపులకు గురవుతున్నా, ఎక్కడ వారు అవిశ్వాసుల, మిథ్యావాదుల చెరలో బాధించబడుతూవున్నా సరే వారిని కాపాడే ఉద్దేశ్యంతో ముస్లింలు ధర్మయుద్ధం చెయ్యాలి. ఇది రెండవ రకం జిహాద్. మొదటి రకం జిహాద్ దైవధర్మ ఉన్నతికోసం జరుగుతుంది.

**76** విశ్వసించినవారు దైవమార్గంలో పోరాడతారు. అవిశ్వాస వైఖరిని అవలంబించినవారు దైవేతరుల మార్గంలో పోరాడ తారు.[105] కనుక (ఓ విశ్వాసులారా!) మీరు షైతాను స్నేహితులతో యుద్ధం చేయండి. షైతాను జిత్తులు అత్యంత బలహీనమైనవి.[106]

**77** "మీ చేతులను ఆపుకోండి, నమాజులను నెలకొల్పుతూ ఉండండి, జకాతును చెల్లిస్తూ ఉండండి" అని ఆదేశించబడిన వారిని నీవు చూడలేదా? తీరా వారికి యుద్ధం చెయ్యమని ఆజ్ఞాపించబడితే, వారిలోని ఒక వర్గంవారు అల్లాహ్‌కు భయపడ వలసిన రీతిలో– పైగా అంతకంటే ఎక్కువగానే– జనులకు భయ పడసాగారు. "ప్రభూ! నీవు మాపై యుద్ధాన్ని ఎందుకు విధిం చావు?[107] మరి కొంతకాలంపాటు మమ్మల్ని ఎందుకు బ్రతక నివ్వలేదు?"[108] అని అనసాగారు. వారితో ఇలా చెప్పు:ప్రాపంచిక ప్రయోజనాలు బహు స్వల్పమైనవి. (అల్లాహ్‌కు) భయపడేవారికి పరలోకమే మేలైనది. మీకు (అక్కడ) ఒక చిన్న పీచు అంత అన్యాయం కూడా జరగదు.

اَلَّذِيْنَ اٰمَنُوْا يُقَاتِلُوْنَ فِيْ سَبِيْلِ اللّٰهِ ۚ وَالَّذِيْنَ
كَفَرُوْا يُقَاتِلُوْنَ فِيْ سَبِيْلِ الطَّاغُوْتِ فَقَاتِلُوْٓا
اَوْلِيَآءَ الشَّيْطٰنِ ۚ اِنَّ كَيْدَ الشَّيْطٰنِ كَانَ
ضَعِيْفًا ﴿76﴾ ع

اَلَمْ تَرَ اِلَى الَّذِيْنَ قِيْلَ لَهُمْ كُفُّوْٓا اَيْدِيَكُمْ
وَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ ۚ فَلَمَّا كُتِبَ عَلَيْهِمُ
الْقِتَالُ اِذَا فَرِيْقٌ مِّنْهُمْ يَخْشَوْنَ النَّاسَ
كَخَشْيَةِ اللّٰهِ اَوْ اَشَدَّ خَشْيَةً ۚ وَقَالُوْا رَبَّنَا لِمَ
كَتَبْتَ عَلَيْنَا الْقِتَالَ ۚ لَوْلَآ اَخَّرْتَنَآ اِلٰٓى اَجَلٍ
قَرِيْبٍ ؕ قُلْ مَتَاعُ الدُّنْيَا قَلِيْلٌ ۚ وَالْاٰخِرَةُ
خَيْرٌ لِّمَنِ اتَّقٰى ۗ وَلَا تُظْلَمُوْنَ فَتِيْلًا ﴿77﴾

105. యుద్ధం చెయ్యవలసిన పరిస్థితి ఒక విశ్వాసికీ, అవిశ్వాసికి కూడా ఎదురవుతుంది. అయితే ఆ ఇరువురి యుద్ధ లక్ష్యాలలో భూమ్యాకాశాలంత వ్యత్యాసం ఉంటుంది. విశ్వాసి అల్లాహ్ కోసం పోరాడతాడు. కేవలం యుద్ధప్రాప్తి, రాజ్యాధికారం అతని లక్ష్యం అయి ఉండదు. కాని అవిశ్వాసి మాత్రం కేవలం ప్రాపంచిక ఉద్దేశ్యాలను, స్వప్రయోజనా లను దృష్టిలో పెట్టుకుని కదనరంగానికి కదలి వస్తాడు.

106. ముస్లింల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ ప్రస్తావన తేబడింది – దైవేతర (తాగూత్) ఉద్దేశ్యాలతో వేయబడే ఎత్తుగడలు, కుట్రలు ఎంతో బలహీనంగా ఉంటాయి. కాబట్టి వారి భౌతిక ఒనరులను, మంది మార్బలాన్ని చూసి మీరు కలవరం చెందకండి. మీ విశ్వాస శక్తి ముందు, దైవమార్గంలో పోరాడాలన్న మీ సంకల్ప బలం ముందు షైతాన్ భౌతిక ఒనరులు ఎందుకూ పనికిరావు. వాడి జిత్తులు ఇట్టే విఫలమైపోతాయి.

107. మక్కా నగరంలో ఉన్నప్పుడు ముస్లింలు సంఖ్యాపరంగా, ఆర్థికంగా బలహీనులు. శత్రువులను ఎదిరించే సామర్థ్యం వారివద్ద లేదు. అందుకే యుద్ధం చేయాలని వారనుకుంటూ ఉన్నప్పటికీ వారిని యుద్ధం నుంచి ఆపటం జరిగింది. రెండు విషయాల గురించి వారికి తాకీదు చేయబడింది. ఒకటి : తిరస్కారుల దౌర్జన్యాలను సహన స్థయిర్యాలతో ఓర్చుకోవాలి. మన్నింపుల వైఖరితో మసలుకోవాలి. రెండు : అల్లాహ్‌తో పటిష్టమైన సంబంధాన్ని, సంప్రతింపులను కలిగివుండటం కోసం నమాజ్, జకాత్ మరియు ఇతర ఆరాధనలను గట్టిగా ఆచరిస్తూ ఉండాలి. అయితే మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేసి మదీనాలో ముస్లింలు ఒక 'శక్తి'గా ఉద్భవించిన తరువాత శత్రువును ఎదిరించి పోరాడేందుకు వారికి అనుమతి యివ్వబడింది. తీరా యుద్ధం కొరకు అనుమతి యివ్వబడిన తరువాత ముస్లింలలోని కొందరు బలహీనతను, అధైర్యాన్ని కనబరచారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి, ఒకప్పుడు మీరు మక్కా నగరంలో ఉన్నప్పుడు శత్రువుతో యుద్ధం చేస్తామని గొప్పలు చెప్పుకునేవారు. తీరా మీ కోరిక మేరకు యుద్ధం విధించబడితే, ఇప్పుడు ఎందుకు భయపడుతున్నారు? అని ప్రశ్నిస్తున్నాడు.

ఈ ఆయతు మొదట్లో "మీ చేతులను ఆపుకోండి" (అంటే యుద్ధం చేయకండి) అని ఆజ్ఞాపించబడింది. కొంతమంది

أَيْنَ مَا تَكُونُوا يُدْرِككُّمُ الْمَوْتُ وَلَوْ كُنتُمْ
فِي بُرُوجٍ مُّشَيَّدَةٍ ۗ وَإِن تُصِبْهُمْ حَسَنَةٌ يَقُولُوا
هَٰذِهِ مِنْ عِندِ اللَّهِ ۖ وَإِن تُصِبْهُمْ سَيِّئَةٌ
يَقُولُوا هَٰذِهِ مِنْ عِندِكَ ۚ قُلْ كُلٌّ مِّنْ عِندِ
اللَّهِ ۖ فَمَالِ هَٰؤُلَاءِ الْقَوْمِ لَا يَكَادُونَ يَفْقَهُونَ
حَدِيثًا ﴿٧٨﴾

**78** మీరెక్కడ ఉన్నాసరే, మృత్యువు మిమ్మల్ని కబళిస్తుంది. ఆఖరికి మీరు పటిష్టమైన కోటలలో ఉన్నాసరే[109] (అది మిమ్మల్ని వదలదు). వారికేదైనా మంచి జరిగితే, "ఇది అల్లాహ్ తరఫున లభించింది" అని అంటారు. అదే వారికేదైనా కీడు కలిగితే, "ఇదంతా నీ మూలంగానే జరిగింది"[110] అని నిందిస్తారు. "ఇవన్నీ వాస్తవానికి అల్లాహ్ తరఫుననే సంభవించాయి" అని (ఓ ప్రవక్తా!) వారికి తెలియజేయి. అసలు వీరికేమైపోయిందీ? ఏ విషయాన్ని కూడా వీరు బొత్తిగా అర్థం చేసుకోరే?![111]

ఈ వాక్యానికి వక్రభాష్యం చెబుతూ, నమాజు స్థితిలో– రుకూ నుంచి లేచి నిలబడే సమయంలో – 'రఫే యదైన్' చేయరాదు అని అభిప్రాయపడ్డారు. ఇది సంకుచిత దృష్టితో చెయ్యబడిన తప్పుడు అన్వయింపు తప్ప మరేమీ కాదు. ఇలా అభిప్రాయపడి వారు దివ్య ఖుర్ఆన్‌లోని ఆయతును, దాని అర్థాన్ని మార్చే దుస్సాహసానికి ఒడిగట్టారు. ఈ రకమయిన తుచ్ఛమైన ప్రయత్నం ఒక ముస్లిం విద్వాంసునికి ఎంతమాత్రం శోభించదని వారు తెలుసుకోవాలి. దైవం మన్నించుగాక!

108. "మరి కొన్నాళ్ళపాటు యుద్ధాన్ని ఎందుకు ఆపి ఉంచలేదు?" అన్న భావంలో కూడా దీన్ని తర్జుమా చేయవచ్చు. **'అజలిన్ ఖరీబ్'** (أجل قريب) అంటే మృత్యువు లేదా జిహాద్ విధి అయ్యే గడువు అని భావం (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

109. ప్రాపంచిక జీవితం పట్ల మక్కువ పెంచుకుని, మరణం నుండి పారిపోవాలనుకునే బలహీన ముస్లింలను ఉద్దేశ్యించి ఈ ఉపదేశం చేయబడింది. ఈ ప్రాపంచిక జీవితం నశించిపోయేది. ఇందలి సుఖాలు కూడా తాత్కాలికమైనవే. మరికొంత గడువు ప్రసాదించమని మీరు విన్నవించుకుంటున్నారు. కాని పరలోకంలో మీకు లభించే సుఖభోగాలు వీటికన్నా ఎన్నో రెట్లు మేలైనవనీ, శాశ్వితమైనవనీ మరువకండి. దైవం మరియు దైవప్రవక్తకు విధేయులై ఉన్న వారికి ఈ శాశ్విత సుఖాలు వరిస్తాయి. మరో ముఖ్య విషయం ఏమిటంటే; మీరు దైవమార్గంలో పోరాడినా, పోరాడకపోయినా మృత్యువు మాత్రం రావలసిన ఘడియలో వచ్చి తీరుతుంది. ఎట్టి పరిస్థితిలోనూ మీరు దాన్నుంచి తప్పించుకోలేరు. మీరు కంచుకోటలలో శరణుపొందినా, ఉక్కు బంకర్లలో తలదాచుకున్నా అది మిమ్మల్ని వదలదుగాక వదలదు. మరలాంటప్పుడు మీరు మృత్యువుకు భయపడి దైవమార్గంలో పోరాడకుండా వంకలుపెట్టి ప్రయోజనం ఏమిటీ?

**గమనార్హ విషయం :** కొంతమంది ముస్లింలు స్వతహాగా యుద్ధమంటే భయంవల్ల అలా అన్నారేగాని, నిజంగా వారు అవిశ్వాసులు కారు. అందువల్ల అల్లాహ్ వారిలోని ఈ దౌర్బల్యాన్ని క్షమించాడు. అంతేకాదు, అత్యంత బలమైన నిదర్శనాల ద్వారా వారి మనోబలాన్ని పెంచాడు.

110. ఇక్కడి నుంచి మళ్లీ కపటుల ప్రస్తావన మొదలయింది. గత సమాజాలలోని తిరస్కారులు పలికిన కృతఘ్నతాపూర్వకమైన మాటలే వీరు కూడా పలికారు. ఉదాహరణకు : లాభం చేకూరితే (కలిమి, ఆహారోత్పత్తులు, సిరిసంపదలు, సంతానోత్పత్తి మొదలగునవి పుష్కలంగా లభిస్తే) అది దైవకృపవల్ల చేకూరిందనీ, నష్టం వాటిల్లితే (కరువు కాటకాలు, లేమి, ప్రకృతి వైపరీత్యాలు లాంటివి వస్తే), ఓ ముహమ్మద్! అది నీ మూలంగానే వాటిల్లిందని చెప్పసాగారు. అంటే నీ ధర్మాన్ని అవలంబించటం వల్లనే మాకీ ఆపదలు వచ్చాయి అని నిందించేవారు. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) పట్ల కూడా గతంలో ఇలాగే జరిగింది. అందుకే అల్లాహ్ ఫిర్ఔన్ జాతి ప్రజలనుద్దేశ్యించి ఇలా సెలవిచ్చాడు : మరి వారికేదైనా మేలు కలిగితే "ఇది మాకు కలగవలసినదే (ఇది మా హక్కు)" అని అంటారు. అదే వారికేదైనా కీడు కలిగితే, "మూసా అతని అనుయాయుల అపశకునం వల్ల ఈ దుర్గతి పట్టింది" అని నిందిస్తారు (అల్ ఆరాఫ్ – 131).

111. మేలు జరిగినా, కీడు జరిగినా – అంతా దైవం తరఫుననే జరుగుతుందన్న విషయం వీరికి అర్థం కాదేమిటీ? అసలు

مَآ اَصَابَكَ مِنْ حَسَنَةٍ فَمِنَ اللّٰهِ ۫ وَمَآ اَصَابَكَ
مِنْ سَيِّئَةٍ فَمِنْ نَّفْسِكَ ؕ وَاَرْسَلْنٰكَ لِلنَّاسِ
رَسُوْلًا ؕ وَكَفٰى بِاللّٰهِ شَهِيْدًا ﴿79﴾

79 నీకు ఏ మంచి జరిగినా అది అల్లాహ్ తరఫు నుంచే జరుగుతుంది.[112] నీకు ఏదైనా చెడు జరిగితే అది నీ స్వయంకృతమే.[113] (ఓ ముహమ్మద్!) మేము నిన్ను సమస్త జనులకు సందేశం అందజేసేవానిగా చేసి పంపాము. దీనికి సాక్షిగా అల్లాహ్ చాలు.

مَنْ يُّطِعِ الرَّسُوْلَ فَقَدْ اَطَاعَ اللّٰهَ ۚ وَمَنْ تَوَلّٰى
فَمَآ اَرْسَلْنٰكَ عَلَيْهِمْ حَفِيْظًا ؕ ﴿80﴾

80 ఈ ప్రవక్త (సఅసం)కు విధేయత చూపినవాడు అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. మరెవరైతే విముఖత చూపుతారో వారిపై మేము నిన్ను కావలివానిగా చేసి పంపలేదు.

وَيَقُوْلُوْنَ طَاعَةٌ ۫ فَاِذَا بَرَزُوْا مِنْ عِنْدِكَ
بَيَّتَ طَآئِفَةٌ مِّنْهُمْ غَيْرَ الَّذِيْ تَقُوْلُ ؕ
وَاللّٰهُ يَكْتُبُ مَا يُبَيِّتُوْنَ ۚ فَاَعْرِضْ عَنْهُمْ
وَتَوَكَّلْ عَلَى اللّٰهِ ؕ وَكَفٰى بِاللّٰهِ وَكِيْلًا ﴿81﴾

81 తాము విధేయత చూపుతున్నట్లు వారు నీ ముందర ప్రకటిస్తారు. కాని నీ దగ్గర నుంచి వెళ్ళిపోయిన తరువాత, వారిలోని ఒక వర్గం వారు రాత్రివేళల్లో సమావేశమై తాము చెప్పినదానికి వ్యతిరేకంగా మంతనాలు జరుపుతారు.[114] రాత్రిపూట వారు జరిపే రహస్య మంతనాలను అల్లాహ్ నమోదు చేసుకుంటున్నాడు. కనుక (ఓ ముహమ్మద్!) వారిని పట్టించుకోకు. అల్లాహ్ పైనే ఆధారపడి ఉండు. కార్యసాధనకై అల్లాహ్‌యే చాలు.

---

విషయం ఏమిటంటే తమ అవగాహనా లోపం వల్ల, అజ్ఞాన వైఖరి కారణంగా, దురాగతాల మూలంగా, వారి హృదయ కవాటాలు మూసుకుపోయాయి. మంచీ – చెడుల విచక్షణా జ్ఞానం వారిలో క్షీణించింది.

112. నీకు ఏ మంచి జరిగినా అది దైవకృప మాత్రమేనని తెలుసుకో. నీ సత్కార్యాలకు ప్రతిఫలంగా మాత్రం కాదు. ఎందుకంటే నీకు సత్కార్యాలు చేసే సద్బుద్ధి కలిగినా, ఆ సద్బుద్ధి కూడా దైవప్రసాదితమేనని మరువబోకు. అదీగాక దైవానుగ్రహాలు, వరాలు ఎంత విస్తారంగా ఉన్నాయంటే వాటిముందు మనిషి చేసే ఆరాధనలు, ఉపాసనలు ఏమాత్రం లెక్కలోకి రావు. అందుకే ఒకసారి మహనీయ ముహమ్మద్ (సఅసం) ఏమన్నారంటే, ఏ వ్యక్తి స్వర్గంలో ప్రవేశించినా దైవకారుణ్యం వల్లనే ప్రవేశిస్తాడు (అతని సత్కార్యాల వల్ల కాదు). ఇది విన్న ఆయన (స) ప్రియశిష్యులు, "ఓ దైవప్రవక్తా! తమరు కూడా దైవకారుణ్యం లేకుండా స్వర్గంలో ప్రవేశించలేరా?" అని ప్రశ్నించగా, "అవును. అల్లాహ్ నన్ను తన కారుణ్యఛాయలోకి తీసుకోనంతవరకూ నేను సయితం స్వర్గంలోకి వెళ్ళలేను" అని ఆయన (స) విశదీకరించారు (సహీహ్ బుఖారీ : కితాబుర్రిఖాఖ్).

113. మనిషికి వాటిల్లే కీడు కూడా దైవాజ్ఞతోనే సంభవించినప్పటికీ, దాని వెనుక మనిషి స్వయంకృతం ఏదో ఒకటి ఉంటుంది. అందుకే "అది నీ స్వయంకృతమే", అనగా 'నీ పాపాలకు, తప్పులకు ఫలితమే' అని చెప్పబడింది. ఈ మాటే దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట ఈ విధంగా అనబడింది : "మీపైకి ఏ ఆపద వచ్చినా, అది మీ కర్మల ఫలితమై ఉంటుంది. పోతే, ఎన్నో పొరపాట్లను ఆయన ఇట్టే మన్నించేస్తుంటాడు" (అష్ షూరా – 30).

114. అంటే ; ఈ కపటులు నీ ముందు వెల్లడించిన విషయానికి వ్యతిరేకంగా రాత్రివేళల్లో సమావేశమై కుట్రలు పన్నుతారు. వారు మీ శ్రేయోభిలాషులు కానేకారు. అందుచేత వారిని లెక్కచేయకు. వారి మాటలు, వారు పన్నే కుయుక్తులు నీకు ఏమాత్రం హాని కలిగించలేవు. నువ్వు అల్లాహ్‌నే నమ్ముకో. ఎందుకంటే నీ కార్యక్రమములను నెరవేర్చేవాడు, అవిశ్వాసుల కుతంత్రాలను తిప్పికొట్టేవాడు అల్లాహ్ మాత్రమే.

**82** ఏమిటీ, వారు ఖుర్‌ఆన్ గురించి యోచన చేయరా? ఒకవేళ ఇది గనక అల్లాహ్ తరఫు నుంచి గాక ఇంకొకరి తరఫు నుంచి వచ్చి ఉంటే అందులో వారికి ఎంతో వైరుధ్యం కనపడేది.[115]

أَفَلَا يَتَدَبَّرُونَ الْقُرْآنَ ۚ وَلَوْ كَانَ مِنْ عِنْدِ
غَيْرِ اللَّهِ لَوَجَدُوا فِيهِ اخْتِلَافًا كَثِيرًا ﴿82﴾

**83** శాంతికి సంబంధించిన వార్తగానీ, భయాందోళనల్ని కలిగించే సమాచారంగానీ ఏదైనా వారికి అందినప్పుడు దాన్ని వారు చాటింపు వేసేస్తారు. దానికి బదులు వారు ఆ విషయాన్ని ప్రవక్తకు, విషయం లోతుల్లోకి వెళ్ళే తమలోని విజ్ఞులకు చేరవేసి ఉంటే వారు అందలి నిజానిజాలను, ఉచితానుచితాలను పరికించి ఒక నిర్ణయానికి రావటానికి ఆస్కారముండేది.[116] దైవానుగ్రహం, ఆయన కారుణ్యమే గనక మీపై లేకుండినట్లయితే మీలో కొందరు తప్ప – అందరూ షైతాను అనుయాయులుగా మారిపోయేవారు.

وَإِذَا جَاءَهُمْ أَمْرٌ مِنَ الْأَمْنِ أَوِ الْخَوْفِ أَذَاعُوا
بِهِ ۖ وَلَوْ رَدُّوهُ إِلَى الرَّسُولِ وَإِلَىٰ أُولِي الْأَمْرِ
مِنْهُمْ لَعَلِمَهُ الَّذِينَ يَسْتَنْبِطُونَهُ مِنْهُمْ ۗ
وَلَوْلَا فَضْلُ اللَّهِ عَلَيْكُمْ وَرَحْمَتُهُ لَاتَّبَعْتُمُ
الشَّيْطَانَ إِلَّا قَلِيلًا ﴿83﴾

115. దివ్య ఖుర్‌ఆన్ ద్వారా సన్మార్గం పొందేందుకు అందలి వాక్యాలపై యోచన చేయటం అవసరమని ఇందులో గుర్తు చేయబడింది. యోచన, చింతన చేయటం వల్ల విషయం ప్రస్ఫుటం అవుతుంది. ఈ గ్రంథం దైవగ్రంథమనీ, సత్యబద్ధమైన గ్రంథమనీ చెప్పటానికి ఒక ప్రమాణం పేర్కొనబడింది. అదేమంటే ఒకవేళ యిదే గనక (అవిశ్వాసులు తలపోస్తున్నట్లుగా) మానవ కల్పిత ప్రవచనమై ఉంటే అందలి అంశాలలోనూ, అది ఉదాహరించిన వివిధ వృత్తాంతాలలోనూ వైరుధ్యం ఉండేది. ఎందుకంటే ఇదో సంక్షిప్త పుస్తకం కానేకాదు. సమగ్రమైన, సవివరమైన గ్రంథం. ఇందలి ప్రతి భాగం, ప్రతి కాండం విశిష్టంగా, అపురూపంగా ఉంది. మానవ విరచితమైన పెద్ద పెద్ద గ్రంథాల్లో అంతటి గాంభీర్యం, తేటదనం ఉండవు. అదీగాక ఈ గ్రంథంలో గత సమాజాల గాథలు, సంఘటనలు కూడా క్లుప్తంగా వివరించబడ్డాయి. అగోచర విషయాల జ్ఞాని అయిన అల్లాహ్ తప్ప వేరొకరెవరూ వాటిని చెప్పలేరు. ఇంకొక విషయం ఏమిటంటే, వెనుకటి జాతుల వృత్తాంతాలలో ఎక్కడా తేడాగానీ, వ్యాఘాతంగానీ మచ్చుకైనా లేదు. మానవుడు పూర్వపు సంఘటనలను చెప్పదలచినా ఇంత పూసగుచ్చినట్లుగా చెప్పలేడు. అతని వివరణలో ఎంతో వైరుధ్యం కనబడుతుంది. కాని దివ్యఖుర్‌ఆన్‌లో ఇలాంటి లోపాలు, వ్యత్యాసాలు ఎక్కడా లేకపోవటం ఒక్కటి చాలు– అది దైవప్రోక్తమనీ, ప్రక్షిప్తాలకు లోనుకాని పవిత్ర గ్రంథమనీ, అల్లాహ్ తన దూత ద్వారా తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు పంపిన సందేశం అని చెప్పడానికి!

116. కొంతమంది ఆవేశపరులు, తొందరపడే ముస్లిములనుద్దేశ్యించి చెప్పబడిన విషయం ఇది. శాంతివార్త అంటే ముస్లింల విజయానికి సంబంధించిన కబురు. (ఈ వార్త విన్నప్పుడు శాంతిసుస్థిరతల పవనాలు వీస్తాయి. దీనిమూలంగా ఒక్కోసారి మితిమీరిన ఆత్మ విశ్వాసం ప్రబలి నష్టం చేకూరవచ్చు). భయాందోళనల సమాచారం అంటే ముస్లింల ఓటమికి, వారి హత్యాకాండకు సంబంధించిన కబురు అని అర్థం (దీనిమూలంగా ముస్లిం సమాజంలో సర్వత్రా నిరాశానిస్పృహలు ఆవరించి, వారిలోని ఆత్మ విశ్వాసం సన్నగిల్లే ప్రమాదముంది). కాబట్టి ఇలాంటి సమాచారమేదైనా తమకు అందినప్పుడు దాన్ని ప్రజాబాహుళ్యంలో వ్యాపింపజేసే బదులు దైవప్రవక్త (సఅసం)కు వినిపించాలి. లేదా మీలోని విజ్ఞులకు, మేధావులకు ఈ సమాచారాన్ని చేరవేయాలి. వారు ఆ సమాచారంలోని నిజానిజాలను, ఉచితానుచితాలను విచారించి, దాన్ని ప్రజలకు తెలియజేయటం లాభకరమో నష్టకరమో బేరీజు వేస్తారు. సాధారణ పరిస్థితుల్లోనే ఈ విషయానికి ఎంతో ప్రాముఖ్యమున్నప్పుడు అసాధారణ, అత్యవసర పరిస్థితుల్లో ఇంకెంత ప్రాముఖ్యం

فَقَاتِلْ فِي سَبِيلِ اللَّهِ ۚ لَا تُكَلَّفُ إِلَّا نَفْسَكَ
وَحَرِّضِ الْمُؤْمِنِينَ ۖ عَسَى اللَّهُ أَنْ يَكُفَّ بَأْسَ
الَّذِينَ كَفَرُوا ۚ وَاللَّهُ أَشَدُّ بَأْسًا وَأَشَدُّ تَنْكِيلًا ﴿84﴾

**84** కనుక నీవు అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యి. నీవు నీ స్వయానికి మాత్రమే బాధ్యుడవు. అయితే విశ్వసించిన వారిని (యుద్ధం చేయమని) ప్రేరేపిస్తూ ఉండు. త్వరలో అల్లాహ్ అవిశ్వాసుల యుద్ధాన్ని ఆపినా ఆపి వేయవచ్చు! అల్లాహ్ అందరికంటే గొప్ప శక్తిగలవాడు, శిక్షించటంలో కూడా చాలా కఠినుడు.

مَنْ يَشْفَعْ شَفَاعَةً حَسَنَةً يَكُنْ لَهُ نَصِيبٌ مِنْهَا ۖ
وَمَنْ يَشْفَعْ شَفَاعَةً سَيِّئَةً يَكُنْ لَهُ كِفْلٌ مِنْهَا ۗ
وَكَانَ اللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ مُقِيتًا ﴿85﴾

**85** ఎవరయినా ఒక మంచి పని కోసం సిఫారసు చేస్తే, అతనికి అందులో కొంత భాగం లభిస్తుంది. మరెవరయినా ఒక చెడు పని కోసం సిఫారసు చేస్తే, ఆ పాపంలో అతనికీ వాటా ఉంటుంది. అల్లాహ్ అన్నింటిపై అదుపు అజమాయిషీ కలవాడు.

وَإِذَا حُيِّيتُمْ بِتَحِيَّةٍ فَحَيُّوا بِأَحْسَنَ مِنْهَا أَوْ رُدُّوهَا ۗ
إِنَّ اللَّهَ كَانَ عَلَىٰ كُلِّ شَيْءٍ حَسِيبًا ﴿86﴾

**86** ఎవరయినా మీకు 'సలాం' చేసినప్పుడు మీరు అంతకంటే ఉత్తమరీతిలో జవాబు ఇవ్వండి లేదా కనీసం అదే విధంగానైనా చెప్పండి.[117] నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదానికీ లెక్క తీసుకుంటాడు.

اللَّهُ لَا إِلَٰهَ إِلَّا هُوَ ۚ لَيَجْمَعَنَّكُمْ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ
لَا رَيْبَ فِيهِ ۗ وَمَنْ أَصْدَقُ مِنَ اللَّهِ حَدِيثًا ﴿87﴾

**87** అల్లాహ్ – ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ఆయన మిమ్మల్నందరినీ ప్రళయదినాన సమీకరిస్తాడు. ఆ రోజు (రావటం)లో సందేహానికి తావేలేదు. అల్లాహ్ మాటకన్నా సత్యమైన మాట మరెవరిది కాగలదు?

---

ఉంటుందో ఊహించుకోవచ్చు, **ఇస్తింబాత్ (اِستنباط)** : ఇది 'నబతున్' నుంచి వచ్చిన పదం. బావి తవ్వుతున్నప్పుడు మొట్టమొదటగా ఊరే నీటిని 'నబతున్' అంటారు. అలాగే 'ఇస్తింబాత్' అనే పదం, ఏదయినా విషయాన్ని శోధించటం, దాని లోతుల్లోకి వెళ్ళటం అనే అర్థంలో ఉపయోగించబడుతుంది. (ఫత్‌హుల్ ఖదీర్).

117. అరబీలో **'తహియ్యతున్'** అని ఉంది. అంటే దీర్ఘాయుష్షు ప్రసాదించమని ప్రార్థించటం, దీవించటం అని భావం. అయితే యిక్కడ ఈ పదం 'సలాం చేయటం' అన్న భావంలో ఉపయోగించబడింది (ఫత్‌హుల్ ఖదీర్). అత్యుత్తమ రీతిలో జవాబు ఇవ్వాలనే మాటకు హదీసు ప్రకారం వివరణ ఏమిటంటే, 'అస్సలాము అలైకుమ్' అని ఎవరయినా అంటే బదులు పలికేటప్పుడు 'వ అలైకుముస్సలాం వ రహ్మతుల్లాహ్' అని అనాలి. 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్' అని ఎవరయినా సలాం చేస్తే, 'వ అలైకుముస్సలాము వ రహ్మతుల్లాహి వ బరకాతుహ్' అని ప్రతి సలామ్ చేయాలి. కాని ఎవరయినా, 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహ్' అంటూ సలాం చేశారనుకోండి, అప్పుడు అదనపు పదాలేమీ చేర్చకుండానే ప్రతిసలాం చేయాలి (ఇబ్నె కసీర్).

మరో హదీసులో ఇలా ఉంది : కేవలం 'అస్సలాము అలైకుమ్' అని అంటే పది పుణ్యాలు లభిస్తాయి. దాంతోపాటు 'వ రహ్మతుల్లాహ్' అని కూడా అంటే ఇరవై పుణ్యాలు ప్రాప్తిస్తాయి. 'వ బరకాతుహ్' అనే పదాన్ని కూడా పలికితే ముప్ఫయి పుణ్యాలు ప్రసాదించబడతాయి (ముస్నదె అహ్మద్ – సంపుటి : 4, పేజీ – 439, 440). ఈ మర్యాదలు ముస్లింల కొరకేనని మరువరాదు. అంటే ఒక ముస్లింకు మరో ముస్లిం ఎదురుపడినప్పుడు సలాం చేయాలి. జిమ్మీలైన

فَمَا لَكُمْ فِي الْمُنٰفِقِيْنَ فِئَتَيْنِ وَاللّٰهُ اَرْكَسَهُمْ
بِمَا كَسَبُوْا ؕ اَتُرِيْدُوْنَ اَنْ تَهْدُوْا مَنْ اَضَلَّ
اللّٰهُ ؕ وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَلَنْ تَجِدَ لَهٗ سَبِيْلًا ﴿88﴾

**88** మీకేమైపోయిందీ? కపటుల విషయంలో మీరు రెండు వర్గాలుగా అయిపోతున్నారు?[118] వాస్తవానికి వారి స్వయం కృతాల మూలంగా అల్లాహ్ వారిని వెనక్కి మరలించాడు.[119] ఏమిటీ, అల్లాహ్ సన్మార్గం నుంచి తప్పించిన వారిని మీరు సన్మార్గానికి తీసుకురాదలుస్తున్నారా? అల్లాహ్ అపమార్గం పట్టించినవారి కోసం నీవు ఎన్నటికీ ఏ మార్గం కనుగొనలేవు సుమా![120]

وَدُّوْا لَوْ تَكْفُرُوْنَ كَمَا كَفَرُوْا فَتَكُوْنُوْنَ سَوَآءً فَلَا
تَتَّخِذُوْا مِنْهُمْ اَوْلِيَآءَ حَتّٰى يُهَاجِرُوْا فِيْ سَبِيْلِ
اللّٰهِ ؕ فَاِنْ تَوَلَّوْا فَخُذُوْهُمْ وَاقْتُلُوْهُمْ حَيْثُ
وَجَدْتُّمُوْهُمْ ۪ وَلَا تَتَّخِذُوْا مِنْهُمْ وَلِيًّا
وَّلَا نَصِيْرًا ﴿89﴾

**89** తాము అవిశ్వాసులుగా ఉన్నట్లే మీరు కూడా అవిశ్వాస వైఖరిని అవలంబించి, ఆపైన అందరూ ఒకేలాగా అయిపోవా లన్నది వారి ఆకాంక్ష! కనుక వారు దైవ మార్గంలో తమ స్వస్థలాన్ని వదలి బయలుదేరనంతవరకూ, వారిలో ఎవరినీ మీ స్నేహితులుగా చేసుకోకండి.[121] ఒకవేళ వారు విముఖులైపోతే వారిని పట్టుకోండి.[122] ఎక్కడ దొరికితే అక్కడ వారిని చంపండి.[123] జాగ్రత్త! వారిలో ఎవరినీ మీ మిత్రునిగా, సహాయకునిగా భావించ కండి.

(ఇస్లామీయ రాజ్యం బాధ్యత వహించిన) యూదులకు, క్రైస్తవులకు సలాం విషయంలో ముందంజ వేయరాదు. ఒకవేళ సలాంకు బదులు పలికినా "వ అలైకుమ్" అని మాత్రం పలకాలి (సహీహ్ బుఖారీ : కితాబుల్ ఇస్తీజాన్; ముస్లిం : కితాబుస్సలాం).

118. అంటే కపటుల వ్యవహారంలో అసలు మీ మధ్య ద్వంద్వాభిప్రాయానికి తావు కలగకుండా ఉండాల్సింది. ఇక్కడ కపటులంటే ఉహుద్ యుద్ధ సందర్భంగా మదీనా నుంచి కొంతదూరం వచ్చి, తమ మాటకు విలువ యివ్వలేదన్న సాకుతో మార్గమధ్యం నుంచే వెనక్కి తిరిగినవారని భావం (బుఖారి, ముస్లిం). ఆ కపటుల విషయంలో ముస్లింల మధ్య రెండు వర్గాలు ఏర్పడ్డాయి. వారిలో ఒక వర్గం వారు కపటులతో సయితం యుద్ధం చెయ్యాలని కోరగా, రెండవ వర్గం వారు, పరిస్థితుల స్వరూపం దృష్ట్యా అలా చేయటం సముచితం కాదని అభిప్రాయపడ్డారు.

119. **'కసబూ'** (كَسَبُوْا) అంటే వారు చేజేతులా మూటకట్టుకున్న పాపం అని అర్థం. అంటే దైవప్రవక్త (స) యెడల వాళ్ళ వైరవైఖరి మరియు ధర్మయుద్ధం పట్ల వైముఖ్యధోరణి అని భావం; **'అర్కసహుమ్'** (اَرْكَسَهُمْ) అనగా వెనక్కి మరలించటం. అంటే ఏ తిరస్కారం, మార్గవిహీనతల్లో నుంచి వారు వచ్చారో మళ్ళీ అందులోకే వారిని నెట్టివేశాడు. లేక వారి తిరస్కారం, మార్గవిహీనత మూలంగా వారిని వినాశం పాలుచేశాడని కూడా దాని భావం కావచ్చు.

120. నిరంతర ధిక్కార వైఖరి, వైర స్వభావం మూలంగా అల్లాహ్ ఎవరి హృదయాలకైతే సీలు వేస్తాడో, వారికి ఇక ఎవరూ సన్మార్గం చూపలేరు.

121. ఎవరయినా దైవమార్గంలో ఇల్లూ వాకిలి వదలి బయలుదేరితే (హిజ్రత్ చేస్తే) ఇక వారి చిత్తశుద్ధిని శంకించనవసరం లేదు. వారు నికార్సయిన ముస్లిములని భావించాలి. అటువంటి వారితో స్నేహం చేయవచ్చు, సత్సంబంధాలు పెట్టుకోవచ్చు.

122. మీకు వారిపై ఆధిక్యత లభించినప్పుడు, ఆ పని చెయ్యవచ్చు.

123. వారు మక్కా పుణ్యక్షేత్రం పరిధిలో దొరికినా, పరిధికి ఆవల దొరికినా వారిని దండించవలసిందే.

اِلَّا الَّذِيْنَ يَصِلُوْنَ اِلٰى قَوْمٍۭ بَيْنَكُمْ وَ بَيْنَهُمْ
مِّيْثَاقٌ اَوْ جَآءُوْكُمْ حَصِرَتْ صُدُوْرُهُمْ اَنْ
يُّقَاتِلُوْكُمْ اَوْ يُقَاتِلُوْا قَوْمَهُمْ ؕ وَلَوْ شَآءَ اللّٰهُ
لَسَلَّطَهُمْ عَلَيْكُمْ فَلَقٰتَلُوْكُمْ ۚ فَاِنِ اعْتَزَلُوْكُمْ فَلَمْ
يُقَاتِلُوْكُمْ وَ اَلْقَوْا اِلَيْكُمُ السَّلَمَ ۙ فَمَا جَعَلَ
اللّٰهُ لَكُمْ عَلَيْهِمْ سَبِيْلًا ﴿90﴾

**90** అయితే మీతో ఒప్పందం చేసుకున్న వారితో కలసిపోయిన వారికీ, లేదా ఇటు మీతోనూ, అటు తమ వర్గం వారితోనూ యుద్ధం చేయటానికి మనసొప్పక[124] మీ దగ్గరకు వచ్చే వారికి మాత్రం ఈ ఆజ్ఞ నుండి మినహాయింపు ఉంది. అల్లాహ్‌యే గనక తలిస్తే మీపై వారికి ప్రాబల్యాన్ని ఒసగేవాడే. అదేగనక జరిగితే వారు మీతో యుద్ధం చేసేవారే.[125] కాబట్టి వారు మీ దారినుంచి తప్పుకుని, మీతో యుద్ధం చేయకుండా, సంధి కోసం ప్రయత్నిస్తే[126] (అప్పుడు వారిపై దాడి జరపటానికి) అల్లాహ్ మీకు మార్గం తెరచి ఉంచలేదు.

سَتَجِدُوْنَ اٰخَرِيْنَ يُرِيْدُوْنَ اَنْ يَّاْمَنُوْكُمْ وَ
يَاْمَنُوْا قَوْمَهُمْ ؕ كُلَّمَا رُدُّوْٓا اِلَى الْفِتْنَةِ اُرْكِسُوْا

**91** వారిలో మరి కొంతమందిని కూడా మీరు చూస్తారు. వారు (పైకి) మీ నుంచి, తమ వర్గం వారి నుంచి శాంతిగా ఉండాలని కోరుకుంటారు.[127] (కాని) ఎప్పుడైనా ఉపద్రవం వైపు మరలించ

124. రెండు రకాల జనులతో యుద్ధం చెయ్యనవసరం లేదని ఇందులో తెలుపబడింది. ఒకరు: మీరు ఏ వర్గంతో నిర్యుద్ధసంధి చేసుకున్నారో వారితో సత్సంబంధాలు కలిగి ఉన్నవారు. మరొకరు : తటస్థంగా ఉండదలచేవారు. అంటే తమ వర్గం వారితో కలసి మీపై దాడి జరపటానికిగానీ, మీతో కలసి తమ వర్గం వారిపై దాడిచేయటానికిగానీ ఆసక్తి కనబరచని వారు.

125. ఇది దైవకృప మాత్రమే. దేవుడు వారిని యుద్ధానికి దూరంగా ఉంచి మీ మార్గాన్ని మరింత సులభతరం చేశాడు. ఒకవేళ వారే గనక తమ వర్గం వారికి అనుకూలంగా రంగప్రవేశం చేసి మీతో యుద్ధానికి తలపడి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టతరంగా ఉండేది. కాని అలా జరగలేదు. కనుక వాళ్లు నిజంగా యుద్ధానికి దూరంగా ఉంటున్నట్లయితే మీరు కూడా వారికి వ్యతిరేకంగా సైనిక చర్యకు ఉపక్రమించకండి.

126. అంటే మీరు వారి జోలికి పోకుండా ఉండాలి. దారి నుంచి తప్పుకోవటమన్నా, సంధి సందేశం పంపటమన్నా, యుద్ధం చేయకుండా ఉండటమన్నా – మూడింటి భావం ఒక్కటే! విషయాన్ని మరింత విపులంగా చెప్పే ఉద్దేశ్యంతో యిక్కడ ఈ మూడు పదాలు ప్రయోగించబడ్డాయి. ముస్లింలు వారిపై కయ్యానికి కాలు దువ్వరాదు అన్న ఉద్దేశ్యంతోనే పరి పరి విధాలుగా నొక్కి వక్కాణించటం జరిగింది. పైగా ఇలాంటి పరిస్థితి ఏర్పడటం అనేది కేవలం దైవకృప మాత్రమే. కాబట్టి అటువంటి తటస్థ వైఖరిని అవలంబించేవారితో ఉత్తమ రీతిలోనే మసలుకోవాలి. అనవసరంగా వారిని కవ్వించటమో, వారిపట్ల నిర్దయగా వ్యవహరించటమో జరిగితే అది వారిలో ప్రతీకార భావాలను పెంపొందించ వచ్చు. అదేగనక జరిగితే ముస్లింల పాలిట అది నష్టకరంగా పరిణమించవచ్చు. కాబట్టి వాళ్లు ప్రస్తుత వైఖరికి కట్టుబడి ఉన్నంతకాలం వారితో యుద్ధ ప్రస్తావన తేకండి. ఉదాహరణకు బనీ హాషిమ్ తెగతో సంబంధం కలిగి వున్న సమూహానికి కూడా ఇది వర్తిస్తుంది. వాళ్లు బద్ర్ యుద్ధ సమయంలో యుద్ధరంగానికైతే వచ్చారు. కాని బనీ హాషిమ్‌తో కలసి ముస్లింలతో పోరాడటం పట్ల వారికి ఏమాత్రం ఆసక్తిలేదు. ఉదాహరణకు దైవప్రవక్త బాబాయిగారైన అబ్బాస్ (రజి) తదితరులు. వారు అప్పటికింకా ముస్లింలు కాకపోవటం మూలంగా బాహాటంగా అవిశ్వాసుల శిబిరంలో చేరవలసి వచ్చింది. అందుకే మహాప్రవక్త (సఅసం) అబ్బాస్ (రజి)ను తుదముట్టించకుండా కేవలం యుద్ధఖైదీగానే ఉంచారు; **'సిల్‌మున్'** అన్న పదం ఇక్కడ **'ముసాలమత్'** (సంధి) అనే అర్థంలో వాడబడింది.

127. ఈ మూడో వర్గం కపటుల వర్గం. ముస్లింల నుంచి సురక్షితంగా ఉండేందుకు వాళ్లు ముస్లింల వద్దకు వచ్చినప్పుడు

فِيهَا ۚ فَإِنْ لَّمْ يَعْتَزِلُوكُمْ وَيُلْقُوٓا إِلَيْكُمُ السَّلَمَ وَيَكُفُّوٓا أَيْدِيَهُمْ فَخُذُوهُمْ وَاقْتُلُوهُمْ حَيْثُ ثَقِفْتُمُوهُمْ ۚ وَأُولَٰٓئِكُمْ جَعَلْنَا لَكُمْ عَلَيْهِمْ سُلْطَٰنًا مُّبِينًا ﴿91﴾

బడితే మాత్రం[128] పిల్లిమొగ్గలు వేస్తారు. వారు గనక మీకు దూరంగా ఉండకపోతే, మీకు స్నేహ హస్తం అందించకపోతే, (యుద్ధం నుంచి) తమ చేతులను ఆపి ఉంచకపోతే[129] వారిని పట్టుకోండి, ఎక్కడ దొరికితే అక్కడే వారిని హతమార్చండి. మేము మీకు స్పష్టమయిన అధికారాన్ని ప్రసాదించినది వీరి పైనే.[130]

وَمَا كَانَ لِمُؤْمِنٍ أَنْ يَّقْتُلَ مُؤْمِنًا إِلَّا خَطَـًٔا ۚ وَمَنْ قَتَلَ مُؤْمِنًا خَطَـًٔا فَتَحْرِيرُ رَقَبَةٍ مُّؤْمِنَةٍ وَّدِيَةٌ مُّسَلَّمَةٌ إِلَىٰٓ أَهْلِهِۦٓ إِلَّآ

**92** ఒక విశ్వాసి మరో విశ్వాసిని చంపటం ఎంతమాత్రం తగదు.[131] పొరపాటున జరిగితే[132] అది వేరే విషయం. ఎవరయినా పొరపాటున ఒక ముస్లింను చంపితే దానికి పరిహారంగా ఒక ముస్లిం బానిసను బానిసత్వం నుంచి విడిపించాలి. ఇంకా హతుని కుటుంబీకులకు రక్త పరిహారం చెల్లించాలి.[133] ఒకవేళ

తాము ఇస్లాం స్వీకరించామని చెబుతారు. కాని తమ వర్గం వారివద్దకు పోయినప్పుడు బహుదైవారాధనకు ఒడిగడతారు. ఇస్లాంను విమర్శిస్తారు. ఈ రకంగా వీళ్లు ఇరువర్గాల వారిని మోసగించి తమ పబ్బం గడుపుకోజూస్తారు.

128. ఇక్కడ **'ఫిత్నా'** (ఉపద్రవం) అంటే అర్థం షిర్క్ (బహుదైవారాధన) అనీ కావచ్చు (ఈ అర్థం తీసుకుంటే **'ఉర్‌కిసూ ఫీహా'** అన్న పదానికి 'వారు ఆ షిర్క్‌లోకే మరలించబడతారు' అనే భావం వస్తుంది). లేక ఫిత్నా అంటే యుద్ధం కూడా కావచ్చు. అనగా ముస్లింలతో పోరాడటానికి పిలువబడినప్పుడు లేక మరలింపబడినప్పుడు వారు చాలా సులభంగా దానికి సన్నద్ధులౌతారు.

129. మూలంలో **'యుల్‌ఖూ'** (స్నేహ హస్తం అందించటం), **'యకుఫ్ఫూ'** (చేతుల్ని ఆపి ఉంచటం) అనే రెండు పదాలు వచ్చాయి. ఈ రెండు పదాలకు, అంతకుముందు వచ్చిన **'లమ్ యాతజిలూ'** (దూరంగా ఉండకపోతే) అన్న పదంతో అత్ఫ్ (సంబంధం) ఉంది. కనుక యుల్‌ఖూ, యకుఫ్ఫూ అనే పదాలకు ముందు కూడా 'లమ్' చేరటం సహజం. 'లమ్'-కు లేదు, లేకపోతే అనే అర్థాలు వస్తాయి. ఈ విధంగా లమ్ యాతజిలూ, లమ్ యుల్‌ఖూ, లమ్ యకుఫ్ఫూ- అన్న పదాలకు వరుసగా - దూరంగా ఉండకపోతే...., స్నేహహస్తం అందించకపోతే ....., ఆపి ఉంచకపోతే.... అనే అర్థాలు వస్తాయి.

130. వాళ్ల హృదయాలలో పేరుకుపోయిన కాపట్య రోగం వల్ల, మీకు వ్యతిరేకంగా వాళ్ల అణువణువునా పెనవేసుకున్న విరోధ భావం వల్ల వారిపై కఠినచర్య తీసుకోవటానికి మేము మీకు అధికారాన్ని ప్రసాదించాము. వారి హృదయాలలో ఈ కపట రోగం ఉండబట్టే కదా, వారు ఇంతలోనే మళ్లీ ఫిత్నాలోకి (షిర్క్‌లోకి లేక మీకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలోకి) దిగారు.

131. 'తగదు', 'శోభాయమానం కాదు' - అని అన్నప్పటికీ అసలు దాని ఉద్దేశ్యం చేయరాదు అనే. అది నిషిద్ధతను సూచిస్తోంది. అంటే ఒక విశ్వాసి మరో విశ్వాసిని చంపటం నిషిద్ధం అన్నమాట. దివ్య ఖుర్‌ఆన్‌లోనే మరోచోట సెలవీయబడినట్లు; "దైవప్రవక్తకు బాధ కలిగించటం మీకు తగదు" (అల్ అహ్‌జాబ్ - 53). అంటే దైవప్రవక్తను బాధించటం హరామ్ (నిషిద్ధం) అన్నమాట.

132. పొరబాటు అనేక విధాలుగా జరుగుతుంది. చంపే ఉద్దేశ్యం లేకపోయినప్పటికీ అనుకోకుండా హత్య జరిగిపోవటం అని ఇక్కడ భావం.

133. పొరబాటున హత్యా నేరానికి పాల్పడినందుకు చెల్లించవలసిన జరిమానా గురించి యిక్కడ వివరించటం జరిగింది. ఇందులో రెండు విషయాలున్నాయి : 1. పాపపరిహారంగా అల్లాహ్ నుంచి క్షమాభిక్ష పొందటం కోసం ఒక ముస్లిం బానిస మెడను విడిపించాలి. మెడను విడిపించటం అంటే బానిస బంధనాల నుండి అతనికి విముక్తిని వొసగటం

اَنْ يَّصَّدَّقُوْا ؕ فَاِنْ كَانَ مِنْ قَوْمٍ عَدُوٍّ
لَّكُمْ وَهُوَ مُؤْمِنٌ فَتَحْرِيْرُ رَقَبَةٍ مُّؤْمِنَةٍ ؕ
وَاِنْ كَانَ مِنْ قَوْمٍۢ بَيْنَكُمْ وَبَيْنَهُمْ مِّيْثَاقٌ
فَدِيَةٌ مُّسَلَّمَةٌ اِلٰۤى اَهْلِهٖ وَتَحْرِيْرُ رَقَبَةٍ
مُّؤْمِنَةٍ ۚ فَمَنْ لَّمْ يَجِدْ فَصِيَامُ شَهْرَيْنِ
مُتَتَابِعَيْنِ ۫ تَوْبَةً مِّنَ اللّٰهِ ؕ وَكَانَ اللّٰهُ
عَلِيْمًا حَكِيْمًا ﴿92﴾

వారు క్షమాభిక్షపెడితే అది వేరే విషయం.[134] కాని చంపబడిన వ్యక్తి, శత్రు వర్గానికి చెందినవాడై, అతను ముస్లిం కూడా అయి వుంటే అట్టి పరిస్థితిలో ఒక్క ముస్లిం బానిసకు విముక్తి నొసగాలి.[135] ఒకవేళ హతుడు మీతో ఒడంబడిక చేసుకున్న జాతికి చెందినవాడైనపుడు రక్త పరిహారాన్ని అతని కుటుంబీకు లకు చెల్లించి తీరాలి. (దాంతో పాటు) ఒక ముస్లిం బానిసను కూడా స్వతంత్రుడ్ని చేయాలి.[136] బానిసకు విముక్తి నొసగే స్థోమత లేనివారు ఎడతెగకుండా రెండు మాసాలు ఉపవాసం ఉండాలి.[137] అల్లాహ్ నుంచి క్షమాభిక్ష పొందటానికి (ఈ పద్ధతి సూచించబడింది). అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేచనా పరుడూను.

అని అర్థం. 2. మానవ హక్కు కాలరాయబడినందుకు పరిహారం. ఇది 'దియత్' (రక్తశుల్కం) అనబడుతుంది. హత్యచేసినందుకు పరిహారంగా హతుని వారసులకు చెల్లించవలసిన దాన్ని 'దియత్' అంటారు. హదీసుల ప్రకారం ఈ 'దియత్' పరిమాణం నూరు ఒంటెలు లేక వాటి విలువకు సమానమైన బంగారు, వెండి, కరెన్సీ రూపంలో ఉంటుంది.

**గమనార్హ విషయం :** ఉద్దేశ్యపూర్వకంగా హత్యానేరానికి పాల్పడినట్లయితే 'ఖిసాస్' (మరణదండన) లేక **'దియతె ముగల్లజా'** (కఠినమైన రక్తశుల్కం) ఉంటుంది. 'దియతె ముగల్లజా' పరిమాణం నూరు ఒంటెలు. అయితే వయసును బట్టి, నాణ్యతను బట్టి అవి మూడు కోవలకో లేక మూడు ప్రమాణాలకో చెందినవై ఉంటాయి. అయితే పొరబాటువల్ల జరిగిన హత్యానేరానికి కేవలం దియత్ (రక్తశుల్కం) చెల్లించవలసి ఉంటుంది. దీనికి 'ఖిసాస్' ఉండదు. ఈ 'దియత్' కూడా నూరు ఒంటెలేగాని నాణ్యత విషయంలో కఠినమైన ఆంక్షలు లేవు. అదీగాక ఈ రకమైన దియత్ విలువ సుననె అబూ దావూద్‌లోని హదీసులో 800 దీనార్లు లేక 8వేల దిర్హమ్‌లుగా చెప్పబడింది. తిర్మిజీ ఉల్లేఖనంలో 12 వేల దిర్హమ్‌లుగా పేర్కొనబడింది. అలాగే ఉమర్ (రజి) తన ఖిలాఫత్ కాలంలో ఈ రక్తశుల్కం విలువలో హెచ్చుతగ్గులు చేశారు. వివిధ వృత్తులనుబట్టి, ఆయా వ్యక్తుల స్థితిగతులనుబట్టి వివిధ రకాలుగా రక్తశుల్కాన్ని నిర్ధారించారు (ఇర్వావుల్ గలీల్ : సంపుటి–8). దీని భావం ఏమిటంటే అసలు దియత్ నూరు ఒంటెలే. దాన్ని ఆధారంగా చేసుకుని ఆయా కాలాల పరిస్థితులను బట్టి ఈ దియత్ సొమ్మును నిర్ధారించటం జరుగుతుంది. (మరిన్ని వివరాల కోసం సంబంధిత హదీసు వ్యాఖ్యానాలను, ఫికహ్ గ్రంథాలను చూడగలరు).

134. ఈ వాక్యంలో క్షమించి వదలిపెట్టడం అనేది 'క్షమాభిక్ష'గా, దానధర్మంగా అభివర్ణించబడింది. అంటే ఈ మన్నింపుల వైఖరిని ప్రోత్సహించాలన్నది దీని ఉద్దేశ్యం.

135. హతుడు శత్రువర్గానికి చెందిన ముస్లిం అయినప్పుడు రక్తశుల్కం (దియత్) చెల్లించవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఆ రక్తశుల్కానికి వారసులు శత్రువర్గానికి చెందిన అవిశ్వాసులవుతారు. వారు ముస్లిం రక్త శుల్కానికి హక్కుదారులు కాజాలరు. మరి కొంతమంది దీనికి చెప్పిన కారణం ఏమంటే ఈ రకమయిన ముస్లింలు ఇస్లాం స్వీకరించిన మీదట అత్యంత కీలకమైన హిజ్రత్ (వలస) చేయలేదు. మరి చూడబోతే ఆనాడు హిజ్రత్‌కు సంబంధించి చాలా గట్టిగా తాకీదు చేయబడింది. వారిలోని ఈ వెలితి మూలంగా వారి హత్య అంత తీవ్రమైన విషయంగా పరిగణించబడలేదు (ఫత్‌హుల్ ఖదీర్).

136. ఇది మూడవ పరిస్థితి. మొదటి పరిస్థితిలో మాదిరిగానే ఇందులోనూ అదే పరిహారం, అదే రక్తశుల్కం (దియత్) చెల్లించవలసి ఉంటుంది. హతుడు 'జిమ్మీ' అయినపుడు ముస్లింకు చెల్లించే రక్తశుల్కంలో సగం సొమ్ము చెల్లించవలసి ఉంటుందని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే అవిశ్వాసికి ఇవ్వబడే 'దియత్' ముస్లింకు

**93** ఇక ఉద్దేశ్యపూర్వకంగా ఒక విశ్వాసిని చంపేవానికి ప్రతిఫలం నరకమే. అందులో వాడు కలకాలం పడి ఉంటాడు. వాడిపై దైవాగ్రహం,[138] ఆయన శాపం పడుతుంది. ఇంకా ఆయన అతని కోసం పెద్ద శిక్షను సిద్ధం చేసి ఉంచాడు.[139]

وَمَنْ يَّقْتُلْ مُؤْمِنًا مُّتَعَمِّدًا فَجَزَآؤُهٗ جَهَنَّمُ
خٰلِدًا فِيْهَا وَغَضِبَ اللّٰهُ عَلَيْهِ وَلَعَنَهٗ
وَاَعَدَّ لَهٗ عَذَابًا عَظِيْمًا ﴿93﴾

**94** ఓ విశ్వాసులారా! మీరు దైవమార్గంలో వెళ్తున్నప్పుడు నిజానిజాలను తెలుసుకొని వ్యవహరించండి. ఎవరయినా మీకు సలాం చేస్తే దానికి సమాధానంగా 'నీవు విశ్వాసివి కావు' అని అనకండి.[140] మీరు ప్రాపంచిక జీవన సామగ్రిని అన్వేషించ

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِذَا ضَرَبْتُمْ فِيْ سَبِيْلِ
اللّٰهِ فَتَبَيَّنُوْا وَلَا تَقُوْلُوْا لِمَنْ اَلْقٰٓى اِلَيْكُمُ السَّلٰمَ
لَسْتَ مُؤْمِنًا ۚ تَبْتَغُوْنَ عَرَضَ الْحَيٰوةِ الدُّنْيَا ۫

ఇవ్వబడే 'దియత్'లో సగభాగం అయి ఉంటుందని హదీసులో ఉంది. కాని ఈ మూడో పరిస్థితిలో కూడా ముస్లిం హతుని గురించే చెప్పబడిందన్నది నిజమని తోస్తోంది.

137. అంటే ఒక మెడను విడిపించే స్థోమత లేనప్పుడు మొదటి మరియు మూడవ పరిస్థితుల్లో 'దియత్' (రక్తశుల్కం) చెల్లించటంతో పాటు నిరాఘాటంగా (నాగా లేకుండా) రెండు మాసాల పాటు ఉపవాసం పాటించటం అనివార్యం. అదే అతని ప్రాయశ్చిత్తానికి మార్గం. ఒకవేళ మధ్యలో నాగావస్తే మళ్ళీ మొదటి నుంచి ఉపవాసం మొదలెట్టి రెండు నెలల పాటు పూర్తి చెయ్యవలసి ఉంటుంది. అయితే షరీయతుపరమైన కారణం వల్ల నాగావస్తే అట్టి పరిస్థితిలో మళ్లీ మొదటినుంచి ఉపవాసం ఉండనవసరం లేదు. ఉదాహరణకు : రుతుస్రావం, పురిటి రక్తస్రావం లేక తీవ్రమైన అస్వస్థత, – అంటే ఉపవాసం ఉండలేనంత వ్యాధిగ్రస్త స్థితి ఏర్పడటం. ఇక ప్రయాణావస్థలో కూడా ఈ ఉపవాసాల నాగా చేయవచ్చా లేదా? అన్న విషయమై ద్వంద్వాభిప్రాయాలున్నాయి (ఇబ్నె కసీర్).

138. బుద్ధిపూర్వకంగా ముస్లింను చంపిన వాడినుద్దేశ్యించి ఇలా అనబడింది. హత్య మూడు విధాలుగా ఉంటుంది. 1. పొరబాటున జరిగిన హత్య (ఇంతకుముందే దీని గురించి చెప్పుకోవటం జరిగింది). 2. ఉద్దేశ్యపూర్వకంగానే చేసినట్టుండే హత్య. ఈ రకపు హత్య గురించి కూడా హదీసులో వివరాలున్నాయి. 3. ఉద్దేశ్యపూర్వకంగా కావాలని ఒకరిని చంపటం – అంటే సాధారణంగా హత్య చేయటానికి ఉపయోగించే ఆయుధాలను ఉపయోగించటం. ఉదా: కత్తి, ఖడ్గం ఇత్యాదివి. ఈ ఆయతులో సాటి విశ్వాసిని చంపటం చాలా తీవ్రంగా తీసుకోబడింది. దాని శిక్ష నరకమని స్పష్టంగా చెప్పటం గమనార్హం. అందులో కలకాలం ఉండాల్సి ఉంటుందని, దానికి తోడు ఈ దారుణ అఘాయిత్యానికి పాల్పడిన వానిపై దేవుని ఆగ్రహంతోపాటు, శాపం కూడా పడుతుందని, అతని కొరకు వ్యధాభరితమైన యాతన సమకూర్చబడుతుందని చెప్పటాన్నిబట్టి ఇదెంత ఘోరమైన నేరమో విదితమవుతోంది. ఇంత కఠినమైన శిక్షలు ఏకకాలంలో మరే అపరాధి గురించీ వివరించబడలేదు. హదీసులలో కూడా ఈ అపరాధి కఠిన పదజాలంతో నిందించబడ్డాడు.

139. సాటి విశ్వాసిని చంపినవాని పశ్చాత్తాపం స్వీకరించబడుతుందా? లేదా? పై ఆయతులో చేయబడిన తీవ్రమైన హెచ్చరికల దృష్ట్యా పశ్చాత్తాపం స్వీకరించబడదని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. కాని ఖుర్ఆన్ హదీసుల మూలాన్ని బట్టి చిత్తశుద్ధితో చెందే ఏ పశ్చాత్తాపం అయినాసరే స్వీకారయోగ్యమవుతుందని తెలుస్తోంది. ఉదాహరణకు: "(ఈ పాపాల తరువాత) ఎవరు పశ్చాత్తాపం చెంది, విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చివేస్తాడు" (అల్ ఫుర్ఖాన్–70). తౌబాకు సంబంధించిన ఇలాంటి వాక్యాలు ఖుర్ఆన్‌లో యింకా ఉన్నాయి. పెద్ద పాపమయినా, చిన్న పాపమయినాసరే మనిషి నిష్కల్మషమైన హృదయంతో పశ్చాత్తాపపడి, సిగ్గుతో కుంచించుకుపోయినప్పుడు అల్లాహ్ తప్పకుండా క్షమిస్తాడు. మరి యిక్కడ శాశ్వితమైన నరకయాతనే గతి అని అనబడిందంటే పశ్చాత్తాపం చెందకుండా మరణించిన వారికి ఈ దుర్గతి పడుతుందని భావించాలి. అలాగే పశ్చాత్తాపం చెందకుండా మరణించినవారు కలకాలం నరకంలో పడి ఉండటమంటే సుదీర్ఘకాలం పాటు నరకంలో

فَعِندَ اللّٰهِ مَغَانِمُ كَثِيرَةٌ ۚ كَذٰلِكَ كُنتُم
مِّن قَبْلُ فَمَنَّ اللّٰهُ عَلَيْكُمْ فَتَبَيَّنُوا ۚ إِنَّ
اللّٰهَ كَانَ بِمَا تَعْمَلُونَ خَبِيرًا ﴿94﴾

టంలో పడి ఉన్నారేమో! అయితే అల్లాహ్ వద్ద విజయధనం పుష్కలంగా ఉంది.[141] లోగడ మీరు కూడా ఇలాగే ఉండేవారు. కాని తరువాత అల్లాహ్ మిమ్మల్ని కటాక్షించాడు. కనుక మీరు విషయాన్ని పరికించి మరీ మసలుకోండి. నిస్సందేహంగా అల్లాహ్‌కు మీరు చేసేదంతా తెలుసు.

لَا يَسْتَوِي الْقٰعِدُونَ مِنَ الْمُؤْمِنِينَ غَيْرُ
أُولِي الضَّرَرِ وَالْمُجٰهِدُونَ فِي سَبِيلِ اللّٰهِ
بِأَمْوٰلِهِمْ وَأَنفُسِهِمْ ۚ فَضَّلَ اللّٰهُ الْمُجٰهِدِينَ
بِأَمْوٰلِهِمْ وَأَنفُسِهِمْ عَلَى الْقٰعِدِينَ دَرَجَةً ۚ
وَكُلًّا وَعَدَ اللّٰهُ الْحُسْنٰى ۚ وَفَضَّلَ اللّٰهُ الْمُجٰهِدِينَ
عَلَى الْقٰعِدِينَ أَجْرًا عَظِيمًا ﴿95﴾

**95** ఏ కారణమూ లేకుండా (ఇంటి పట్టున) కూర్చుండిపోయే విశ్వాసులు, దైవమార్గంలో తమ ధన ప్రాణాలతో పోరాడే విశ్వాసులూ సమానులు కాలేరు.[142] తమ ధనప్రాణాలతో పోరాడేవారికి అల్లాహ్ ఇంట్లో కూర్చుని ఉండేవారిపై అంతస్థుల రీత్యా ఎంతో ఉన్నతిని ప్రసాదించాడు. ఆ మాటకొస్తే అల్లాహ్ ప్రతి ఒక్కరికీ ఉత్తమ ప్రతిఫలం ఇస్తానని వాగ్దానం చేసి ఉన్నాడు.[143] అయితే ఆయన కూర్చుని ఉండే వారిపై ముజాహిద్ (యోధు)లకు గొప్ప ప్రతిఫలం ద్వారా శ్రేష్ఠతను ప్రసాదించాడు.

ఉంటారని భావం. ఎందుకంటే శాశ్వితంగా నరకంలో పడి ఉండేవారు అవిశ్వాసులు మరియు ముష్రిక్కులే. గమనార్హమైన ఇంకొక విషయమేమిటంటే హత్యానేరం 'దాసుల హక్కుల'తో ముడిపడినది. పశ్చాత్తాపం ద్వారా కూడా ఈ నేరం క్షమార్హం కాదు. కాని అల్లాహ్ తన ప్రత్యేక కటాక్షంతో హతుని ద్వారా క్షమాభిక్ష పెట్టించి, హతునికి పుణ్యఫలం ప్రసాదించటంతోపాటు, హంతకుణ్ణి మన్నించే ఏర్పాటు కూడా చేయగలడు (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).

140. హదీసుల ప్రకారం కొంతమంది ప్రవక్త సహచరులు ఒక ప్రాంతం గుండా సాగిపోతుండగా ఒక గొఱ్ఱెల కాపరి తారసపడ్డాడు. ముస్లింలను చూడగానే అతడు వారికి 'సలాం' చేశాడు. బహుశా ప్రాణభయంతో అతను తమకు సలాం చేస్తున్నాడని కొందరు సహాబీలు తలపోశారు. నిజానిజాలు తెలుసుకోకుండా వారతన్ని హతమార్చారు. అక్కడున్న మేకలను (విజయధనంగా) గ్రహించి వాటిని దైవప్రవక్త (స) సమక్షంలో సమర్పించారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది (సహీహ్ బుఖారీ, తిర్మిజీ – నిసా సూరా వ్యాఖ్యానం). కొన్ని ఉల్లేఖనాలలో మహాప్రవక్త (స) కూడా తన సహచరులను మందలించారని ఉంది. లోగడ మక్కాలో ఉన్నప్పుడు, మీరు కూడా ఈ గొర్రెల కాపరి మాదిరిగానే మీ విశ్వాసాన్ని దాచుకొని బ్రతకవలసి వచ్చేది. (దాన్ని మర్చిపోయారా మీరు?) అని అన్నారని ఉంది (సహీహ్ బుఖారీ : కితాబుద్దియాత్). అతన్ని హత్య చేయటం మీకు ధర్మసమ్మతం కాదన్నది ఆయన ప్రవచనంలోని ఉద్దేశం.

141. అంటే, ఈ గొఱ్ఱెల కాపరిని చంపినందువల్ల మీకు ఒక చిన్న గొఱ్ఱెల మంద ప్రాప్తించిందేమో! కాని అల్లాహ్ వద్ద ఉన్న విజయ ధనాలు దీనికన్నా ఎన్నో రెట్లు పెద్దవి. ఉత్తమమైనవి. దైవం మరియు దైవప్రవక్త (స)కు విధేయత చూపినందుకు అవి మీకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ప్రాప్తిస్తాయి.

142. దైవమార్గంలో పోరాడేవారు – ఇండ్లల్లో కూర్చొని ఉండేవారు సమానులు కాజాలరు అన్న సూక్తి అవతరించినపుడు అంధులైన అబ్దుల్లా బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) మొదలగువారు, "మేము వికలాంగులం. అందుచేత మేము యుద్ధంలో పాల్గొనలేము కదా!" అని అన్నారు. అంటే ఇంట్లో కూర్చుని ఉండటం మూలంగా యోధులకు లభించే పుణ్యం మాకు లభించదే! అన్నది వారి బాధ. తాము ఇంట్లో కూర్చుండిపోతున్నది అంగవైకల్యం మూలంగానే గానీ సోమరితనం వల్ల కాదు. మరలాంటప్పుడు తమకు పుణ్యం లభించకపోవటం సబబేనా?! అన్నది వారి అంతరంగం. అప్పుడు అల్లాహ్ "ఏ కారణమూ లేకుండా" అనే పదాన్ని చేర్చి అటువంటి షరీయతుపరమైన కారణం వల్ల ఇంటిపట్టున

دَرَجٰتٍ مِّنۡهُ وَمَغۡفِرَةً وَّرَحۡمَةً ؕ
وَكَانَ اللّٰهُ غَفُوۡرًا رَّحِيۡمًا ﴿96﴾

**96** ఆయన తరఫున వారి కొరకు ఉన్నత స్థానాలూ ఉన్నాయి. మన్నింపు మరియు కారుణ్యం కూడా ఉంది. అల్లాహ్ క్షమించే వాడు, కరుణించేవాడు కూడాను.

اِنَّ الَّذِيۡنَ تَوَفّٰٮهُمُ الۡمَلٰۤـئِكَةُ ظَالِمِىۡۤ اَنۡفُسِهِمۡ
قَالُوۡا فِيۡمَ كُنۡتُمۡ ؕ قَالُوۡا كُنَّا مُسۡتَضۡعَفِيۡنَ فِى
الۡاَرۡضِ ؕ قَالُوۡۤا اَلَمۡ تَكُنۡ اَرۡضُ اللّٰهِ وَاسِعَةً
فَتُهَاجِرُوۡا فِيۡهَا ؕ فَاُولٰۤـئِكَ مَاۡوٰٮهُمۡ جَهَنَّمُ ؕ
وَسَآءَتۡ مَصِيۡرًا ﴿97﴾

**97** ఎవరయితే తమకు తాము అన్యాయం చేసుకుంటూ ఉన్నారో, వారి ప్రాణాలను తీసేటప్పుడు దైవదూతలు, "మీరే స్థితిలో ఉండేవారు?"[144] అని వారిని అడుగుతారు. దానికి వారు, "మేము మా ప్రదేశంలో బలహీనులముగా, (నిస్సహాయులంగా) ఉండేవారము"[145] అని బదులిస్తారు. "ఏమిటీ? మీరు (ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి) వలసపోవటానికి దేవుని భూమి విశాలంగా లేదా?" అని దైవ దూతలు వారిని అడుగు తారు. వీరి నివాస స్థలమే నరకం. అది అత్యంత చెడ్డ గమ్య స్థానం.

ఉండిపోయిన వారికి మినహాయింపు యిచ్చాడు. అంటే ఇలాంటివారు దైవమార్గంలో పోరాడకపోయినప్పటికీ యోధులకు లభించే పుణ్యంతో సమానంగా వారికి కూడా పుణ్యం లభిస్తుంది. ఎందుకంటే, తగు కారణం వారిని ఆపి ఉంచింది (సహీహ్ బుఖారీ : కితాబుల్ జిహాద్).

143. తమ ధన ప్రాణాలను పణంగా పెట్టి దైవమార్గంలో పోరాడేవారికి లభించే శ్రేష్ఠత జిహాద్‌లో పాల్గొనలేకపోయేవారికి లభించనప్పటికీ అల్లాహ్ విశ్వాసుల్లోని ఈ ఇరు వర్గాల వారికీ మేలు చేస్తానని వాగ్దానం చేశాడు. దీని ఆధారంగా ఇస్లామీయ విద్వాంసులేమంటారంటే సాధారణ పరిస్థితులలో జిహాద్ (ధర్మయుద్ధం) 'ఫర్జెఐన్' (వైయక్తిక విధి) కాదు. 'ఫర్జె కిఫాయ' (సామూహిక విధి) మాత్రమే. అంటే కొందరు యుద్ధంలో పాల్గొన్నా సరిపోతుంది. అవసరమైనంత మంది యుద్ధంలో పాలు పంచుకున్నా ఆ ప్రాంతానికి చెందిన ఇతరుల తరఫున కూడా ఈ కర్తవ్యం నెరవేరి నట్లుగానే భావించబడుతుంది.

144. మక్కా మరియు దాని పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిములనుద్దేశ్యించి ఈ ఆయతు అవతరించింది. వారు ఇస్లాం స్వీకరించి ముస్లిములయ్యారు గాని తమ ఇల్లూవాకిలిని, బంధుమిత్రులను వదలి హిజ్రత్ (ప్రస్థానం) చేయకుండా ఉండిపోయారు. ముస్లింలంతా ఒక శక్తిగా ఆవిర్భవించడానికి వారంతా ఒకచోటికి వలసపోవాలని ఆదేశించబడి నప్పటికీ కొంతమంది ముస్లిములు ఇందుకు సాహసించలేకపోయారు. అందుకే హిజ్రత్ చేయాలన్న దైవాదేశాన్ని కాదన్న వారిని ఆత్మలకు అన్యాయం చేసుకున్నవారుగా అభివర్ణించటం జరిగింది. అంతేకాదు, వారి నివాస స్థలం నరకమని కూడా ప్రకటించబడింది. దీనిద్వారా విదితమయ్యే ఓ ముఖ్యాంశం ఏమిటంటే కొన్ని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఇస్లాంలోని కొన్ని ఆదేశాల పాటింపు , విశ్వాసం – అవిశ్వాసాల సమస్యగా పరిణమిస్తుంది. ఆ సందర్భంలో హిజ్రత్ చేయమన్న ఆజ్ఞను పాలిస్తే అది విశ్వాసంగానూ, కాదంటే ధిక్కారం (కుఫ్ర్)గానూ ఖరారు చేయబడింది. ఈ ఆయతు ద్వారా బోధపడే ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే ఇస్లామీయ ఆదేశాలను, ఉపదేశాలను దైనందిన జీవితంలో పాటించటం దుస్సాధ్యం అయిపోయిన చెడు వ్యవస్థ నుంచి సత్యప్రధానమైన వ్యవస్థ వైపుకు వలసపోవటం విధి.

145. ఇక్కడ ప్రదేశం లేక భూమి (అర్జ్) అంటే అర్థం మక్కా మరియు దాని పరిసర ప్రాంతాలు. అప్పట్లో అది అవిశ్వాసుల ప్రాబల్యం గల ప్రదేశం. ఇస్లాం ఆదేశాల కనుగుణంగా జీవించటం అక్కడ గగనమైపోయేది. అందుచేత దైవాదేశాలను పాలించటానికి అనువుగా ఉన్న ప్రదేశం (మదీనా) వైపుకు సాగిపొమ్మని ఆజ్ఞాపించబడింది.

**98** అయితే నిజంగానే ఏ సాధన సంపత్తి లేని, దారి తెలియని[146] నిస్సహాయులైన పురుషుల, స్త్రీల, పసివాళ్ళ (సంగతి వేరు).

**99** అల్లాహ్ వారిని మన్నించవచ్చు! అల్లాహ్ మన్నించేవాడు, క్షమాభిక్ష పెట్టేవాడు.

**100** అల్లాహ్ మార్గంలో తన స్వస్థలాన్ని వదలి వలసపోయిన వాడు భూమండలంలో ఎన్నో ఆశ్రయాలను, విస్తృతిని పొందు తాడు.[147] అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సఅసం) వైపుకు వలస వెళ్ళటానికి తన గృహం నుంచి బయలుదేరి దారిలో మృత్యువాతన పడిన వానికి పుణ్యఫలం ప్రసాదించే బాధ్యత అల్లాహ్‌ది.[148] అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు.

إِلَّا الْمُسْتَضْعَفِينَ مِنَ الرِّجَالِ وَالنِّسَاءِ
وَالْوِلْدَانِ لَا يَسْتَطِيعُونَ حِيلَةً
وَلَا يَهْتَدُونَ سَبِيلًا ﴿98﴾
فَأُولَٰئِكَ عَسَى اللَّهُ أَنْ يَعْفُوَ عَنْهُمْ ۚ
وَكَانَ اللَّهُ عَفُوًّا غَفُورًا ﴿99﴾
وَمَنْ يُهَاجِرْ فِي سَبِيلِ اللَّهِ يَجِدْ فِي الْأَرْضِ
مُرَاغَمًا كَثِيرًا وَسَعَةً ۚ وَمَنْ يَخْرُجْ مِنْ
بَيْتِهِ مُهَاجِرًا إِلَى اللَّهِ وَرَسُولِهِ ثُمَّ يُدْرِكْهُ
الْمَوْتُ فَقَدْ وَقَعَ أَجْرُهُ عَلَى اللَّهِ ۗ وَكَانَ اللَّهُ
غَفُورًا رَحِيمًا ﴿100﴾

146. ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వలసపోవటానికి స్థోమత లేని, దారి తెలియని నిస్సహాయ ముస్లిం స్త్రీ పురుషులకు, పసిపిల్లలకు ఈ ఆజ్ఞ నుంచి మినహాయింపు ఇవ్వబడింది. చిన్న పిల్లలకు షరీయతు ఆదేశాలు వర్తించక పోయినప్పటికీ హిజ్రత్ ప్రాముఖ్యాన్ని తెలియజెప్పటానికి వారి ప్రస్తావన సయితం యిక్కడ తేబడింది. లేక ఇక్కడ పసివాళ్ళంటే భావం మరీ చిన్న పిల్లలని కాదు. ప్రాజ్ఞ వయస్సుకు త్వరలో చేరుకునేవారని కావచ్చు.

147. దైవమార్గంలో వలసపోవటాన్ని, బహుదైవత్వ భావాలకు అల్లంత దూరంగా ఉండటాన్ని ఈ ఆయతు పురికొల్పుతోంది. **'మురాగమన్'** (مُرٰغَمًا) అంటే స్థలం, ఉండే చోటు లేక ఆశ్రయం అని అర్థం. **'సఅతన్'** ( سَعَةً ) అంటే ఉపాధి, స్థలాల లేక రాజ్యాల విస్తృతి, పుష్కలత అన్న అర్థాలు వస్తాయి.

148. సంకల్పాన్ని బట్టి పుణ్యఫలం లభిస్తుందన్న హామీ యిందులో ఇవ్వబడింది. మరణం సంభవించటం వల్ల ఒక వ్యక్తి తన లక్ష్యాన్ని సాధించలేకపోయినప్పటికీ తన సంకల్పశుద్ధి మూలంగా పూర్తి పుణ్యాన్ని మూటగట్టుకుంటాడు. గత కాలంలో వందమందిని చంపి పశ్చాత్తాపం చెందటానికి సజ్జనుల ప్రదేశం వైపుకు సాగిపోయిన ఒక వ్యక్తి ఉదాహరణ హదీసు ద్వారా మనకు తెలుస్తోంది. మార్గమధ్యంలోనే మృత్యువు అతన్ని కబళించింది. అల్లాహ్ అతని వైపుకు కారుణ్యంతో మరలాడు. తను బయలుదేరిన స్థలం కన్నా పుణ్యాత్ముల జనవాసానికి అతను దగ్గరగా ఉండేలా ఏర్పాటు చేశాడు. తత్ఫలితంగా కారుణ్య దూతలు అతన్ని తమ వెంట ఎత్తుకువెళ్ళారు (సహీహ్ బుఖారీ : కితాబుల్ అంబియా; ముస్లిం : కితాబుత్తౌబా).

అలాగే ఎవరయినా దైవమార్గంలో వలసపోయే సంకల్పంతో ఇంటి నుంచి బయలుదేరగా, దారిలోనే మరణం సంభవిస్తే – అతని సంకల్పశుద్ధి కారణంగా అతనికి హిజ్రత్ పుణ్యాన్ని ప్రసాదించే బాధ్యత అల్లాహ్‌పై ఉంటుంది. అల్లాహ్ అతనికి రవ్వంత అన్యాయం కూడా చేయడు. హదీసులో ఇలా ఉంది: **"ఇన్నమల్ ఆమాలు బిన్నియ్యాత్"** (ఆచరణలు సంకల్పాలపై ఆధారపడి ఉంటాయి). "మనిషి చేసుకున్న సంకల్పాన్నిబట్టే అతనికేదైనా సిద్ధిస్తుంది." "ఎవరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం హిజ్రత్ చేశారో, వారి హిజ్రత్ అందునిమిత్తమే ఉంటుంది. మరెవరయితే ప్రాపంచిక ప్రయోజనాన్ని పొందడానికి లేక స్త్రీని వివాహమాడటానికి వలసపోయాడో అతని వలస అతని ఆ ఉద్దేశ్యాలకే వర్తిస్తుంది" (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం). ఈ ఆజ్ఞ సర్వసాధారణమైనది. ధర్మానికి

| | |
|---|---|
| **101** మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు, అవిశ్వాసులు మిమ్మల్ని వేధిస్తారనే భయం గనక మీకుంటే, మీరు నమాజులను కుదించుకోవటంలో తప్పులేదు.[149] నిశ్చయంగా అవిశ్వాసులు మీ బహిరంగ శత్రువులే. | وَإِذَا ضَرَبْتُمْ فِي الْأَرْضِ فَلَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ أَنْ تَقْصُرُوا مِنَ الصَّلٰوةِ ۖ إِنْ خِفْتُمْ أَنْ يَفْتِنَكُمُ الَّذِينَ كَفَرُوا ۚ إِنَّ الْكٰفِرِينَ كَانُوا لَكُمْ عَدُوًّا مُّبِينًا ﴿١٠١﴾ |

సంబంధించిన అన్ని అంశాలకు ఇది వర్తిస్తుంది. అంటే ఒక పనిని చేస్తున్నప్పుడు దైవ ప్రసన్నతను చూరగొనాలన్నది మనిషి సంకల్పమై ఉంటే అది దైవసమక్షంలో స్వీకారయోగ్యమవుతుంది. లేకపోతే త్రోసిపుచ్చబడుతుంది.

149. ప్రయాణావస్థలో నమాజును కుదించుకోవడానికి అనుమతి ఇవ్వబడింది. **"ఒకవేళ మీకు భయముంటే..."** అనే మాట సాధారణ పరిస్థితుల దృష్ట్యా అనబడింది. ఎందుకంటే ఆనాడు అరేబియా అంతా అశాంతి అలజడులతో అట్టుడికిపోయేది. ఇస్లాం మరియు ముస్లింలకు సర్వత్రా శత్రువులు పొంచి ఉండేవారు. అడుగడుగునా ప్రమాదాలు జరిగేవి. ఏ ప్రయాణమూ ప్రశాంతంగా చేసుకోవటానికి వీలుండేది కాదు. అందుచేత ప్రయాణంలో ఉన్నప్పుడు నమాజును 'ఖసర్' చేసుకునే సౌలభ్యం ఇవ్వబడింది. అయితే "ఒకవేళ మీకు భయముంటే" – అన్న వాక్యాన్ని చూసి ప్రయాణంలో శత్రుభయముంటేనే 'ఖస్ర్' చేయటానికి అనుమతి ఉంటుందని తలపోయరాదు. ఇది ఆనాటి పరిస్థితుల దృష్ట్యా చెప్పినమాట అని ఇంతకుముందే వివరించాం. దివ్య ఖుర్ఆన్‌లో వేరితర చోట్ల కూడా ఇటువంటి షరతులతో కూడిన వాక్యాలు ఉన్నాయి. నిజానికి అవి షరతులు కావు. సాధారణ పరిస్థితుల దృష్ట్యా చెప్పబడినవి మాత్రమే. ఉదాహరణకు :

"విశ్వాసులారా! ఇబ్బడిముబ్బడిగా పెరిగే ఈ వడ్డీని తినటం మానండి" (ఆలి ఇమ్రాన్: 130) అంటే వడ్డీ ఇబ్బడి ముబ్బడిగా పెరగకపోతే తినవచ్చని దాని అర్థం ఎంతమాత్రం కాదు. వడ్డీ సొమ్ము అతి స్వల్ప పరిమాణంలోనైనా సరే తీసుకోవటం, తినటం, దానికి సంబంధించి కాగితాలు రాయటం – అన్నీ నిషిద్ధమే. అలాగే ఇంకొక ఆయతు చూడండి :

"మీ బానిస స్త్రీలు శీలవతులుగా ఉండగోరినప్పుడు వారిని వేశ్యావృత్తికై బలవంత పెట్టకండి" (నూర్ : 33).

ఆ స్త్రీలు వేశ్యావృత్తికి దూరంగా ఉండాలని కోరుకునేవారు కాబట్టి అల్లాహ్ అలా వివరించాడు. అంతేగాని ఒకవేళ వారు దానికి ఒప్పుకుంటే వారిచేత వేశ్యావృత్తి నడపటం ధర్మ సమ్మతం అవుతుందని దాని భావం కాదు. అటువంటిదే ఈ ఆయతు కూడా : "మీ సంరక్షణలో పెరిగిన మీ భార్యల కుమార్తెల్ని (వివాహమాడటం నిషిద్ధం)" (నిసా : 23).

ఎవరైనా ఈ వాక్యాన్ని చూసి తమ సంరక్షణలో పెరగని కుమార్తెల్ని వివాహం చేసుకోవచ్చని అనుకుంటే పొరబడినట్లే. ఇలాంటి ఆయతులు ఇంకా అనేకం ఉన్నాయి.

కొంతమంది ప్రవక్త ప్రియసహచరులకు కూడా సందేహం కలిగింది – ఇప్పుడు పరిస్థితులు సద్దుమణిగాయి, శాంతి నెలకొన్నది. కాబట్టి ఇప్పుడు మనం ప్రయాణావస్థలో నమాజును తగ్గించవలసిన అవసరం లేదేమో! అని వారను కున్నారు. అప్పుడు మహాప్రవక్త (స) వారి సందేహాన్ని దూరం చేస్తూ, "ఇది అల్లాహ్ తరఫున మీకు సదఖా (దానం) లాంటిది. ఈ సదఖాను మీరు గ్రహించండి" అని అన్నారు (ముస్నదె అహ్మద్ – సంపుటి : 1 – సహీహ్ ముస్లిం : కితాబుల్ ముసాఫిరీన్).

**గమనిక :** నమాజు ఖస్ర్ చేసే అనుమతి ఎంత దూరపు ప్రయాణంలో లభిస్తుంది? ఎన్ని రోజుల వరకు ఖస్ర్ చేసుకోవచ్చు అనే విషయాలలో చాలా భిన్నాభిప్రాయాలున్నాయి. ఇమామ్ షౌకానీ గారు 3 ఫర్‌సఖ్‌లు (9 కోసుల దూరం) అన్న ఉల్లేఖనానికి ప్రాధాన్యత యిచ్చారు (నైలుల్ ఔతార్ – సంపుటి : 3–పేజీ : 220). అలాగే చాలామంది పరిశోధకులు ఏమంటారంటే ప్రయాణావస్థలో ఏదైనా ఒకచోట మూడు లేక నాలుగు రోజులకన్నా ఎక్కువ కాలం ఆగిపోయే సంకల్పం లేనపుడే ఈ 'ఖస్ర్' వర్తిస్తుంది. ఎక్కువ కాలం ఆగిపోయే ఉద్దేశం ఉన్నప్పుడు నమాజును ఖస్ర్ చేయటానికి అనుమతి లేదు (వివరాల కోసం మిర్‌ఆతుల్ మఫాతీహ్ గ్రంథం చూడండి).

وَاِذَا كُنْتَ فِيْهِمْ فَاَقَمْتَ لَهُمُ الصَّلٰوةَ فَلْتَقُمْ
طَآئِفَةٌ مِّنْهُمْ مَّعَكَ وَلْيَاْخُذُوْٓا اَسْلِحَتَهُمْ
فَاِذَا سَجَدُوْا فَلْيَكُوْنُوْا مِنْ وَّرَآئِكُمْ وَلْتَاْتِ
طَآئِفَةٌ اُخْرٰى لَمْ يُصَلُّوْا فَلْيُصَلُّوْا مَعَكَ
وَلْيَاْخُذُوْا حِذْرَهُمْ وَاَسْلِحَتَهُمْ ۚ وَدَّ الَّذِيْنَ
كَفَرُوْا لَوْ تَغْفُلُوْنَ عَنْ اَسْلِحَتِكُمْ وَاَمْتِعَتِكُمْ
فَيَمِيْلُوْنَ عَلَيْكُمْ مَّيْلَةً وَّاحِدَةً ۗ وَلَا جُنَاحَ
عَلَيْكُمْ اِنْ كَانَ بِكُمْ اَذًى مِّنْ مَّطَرٍ اَوْ كُنْتُمْ
مَّرْضٰٓى اَنْ تَضَعُوْٓا اَسْلِحَتَكُمْ ۚ وَخُذُوْا حِذْرَكُمْ ؕ
اِنَّ اللّٰهَ اَعَدَّ لِلْكٰفِرِيْنَ عَذَابًا مُّهِيْنًا ﴿١٠٢﴾

**102** (ఓ ప్రవక్తా!) నీవు వారి మధ్య ఉన్నప్పుడు, వారి కోసం నమాజును మొదలుపెట్టినప్పుడు, వారిలోని ఒక సమూహం తమ ఆయుధాలను తీసుకొని నీ వెంట నిలబడాలి. మరి వారు సజ్దా చేయగానే మీ వెనక్కి వెళ్ళిపోవాలి. అప్పటి వరకూ నమాజ్‌లో పాల్గొనని రెండవ సమూహం వచ్చి నీతోపాటు నమాజు చేయాలి. వారు కూడా తమ రక్షణ సామగ్రిని, తమ ఆయుధాలను చేబూని ఉండాలి. మీరు మీ ఆయుధాల పట్ల, సామగ్రిపట్ల ఏమరుపాటుకు లోనైతే, ఒక్కసారిగా మీపై విరుచుకుపడాలని అవిశ్వాసులు కోరుకుంటారు.[150] అయితే వర్షం మూలంగా లేక అస్వస్థత మూలంగా ఇబ్బందిగా ఉండి మీరు మీ ఆయుధాలను విడిచినట్లయితే అది దోషం కాదు. అయినా ఆత్మరక్షణ సామగ్రిని వెంట తీసుకొని ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ తిరస్కారుల కోసం అవమానకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాడు.

فَاِذَا قَضَيْتُمُ الصَّلٰوةَ فَاذْكُرُوا اللّٰهَ قِيٰمًا وَّقُعُوْدًا
وَّعَلٰى جُنُوْبِكُمْ ۚ فَاِذَا اطْمَاْنَنْتُمْ فَاَقِيْمُوا

**103** మరి మీరు నమాజును నెరవేర్చిన తరువాత నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండండి.[151] అయితే పరిస్థితులు కుదుటపడిన తరువాత మాత్రం నమాజును నెల

150. ఈ ఆయతులో **'సలాతుల్ ఖౌఫ్'**కు సంబంధించిన ఆజ్ఞ ఉంది. 'సలాతుల్ ఖౌఫ్' అంటే భీతావహస్థితిలో చేసే నమాజ్ అని అర్థం. ముస్లిం సేనలు – శత్రుసేనలు ముఖాముఖి అయివుండి ముస్లింలు ఒక్క క్షణం పాటు పరధ్యానానికి లోనైనా ప్రమాదం జరిగే క్లిష్ట పరిస్థితులు ఏర్పడి ఉన్నప్పుడు నమాజుకు వేళ అయితే 'సలాతుల్ ఖౌఫ్' చేయాలనే ఆజ్ఞ ఉంది. ఈ నమాజు ఎలా చేయాలో హదీసులలో మరింత క్షుణ్ణంగా తెలుపబడింది. సైన్యం రెండు బృందాలుగా విడిపోయి, ఒక బృందం శత్రువుల బారినుంచి రక్షణకై పహారా కాస్తుండగా రెండవ బృందం మహాప్రవక్త (సఅసం)తో కలసి సామూహిక నమాజు చేసింది. ఈ బృందంవారు నమాజును ముగించుకొని రెండవ బృందం వారి స్థానాలలోకి వెళ్ళి పహారా కాయసాగారు. అప్పుడు నమాజులో పాల్గొనని రెండవ బృందం వచ్చి నమాజు చేసింది. ఆయన (స) ఒక్కో జట్టుకు ఒక్కో 'రకాతు' చొప్పున సామూహిక నమాజు చేయించినట్లు మరికొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. అంటే దైవప్రవక్త (సఅసం) రెండు రకాతుల నమాజు చేయగా, ఆయన్ని అనుసరించే సహచరులు మాత్రం ఒక రకాతు నమాజు మాత్రమే చేయగలిగారు. ఇంకొన్ని ఆధారాల ద్వారా తెలిసేదేమంటే ఆయన (స) ఒక్కో జట్టుకు రెండేసి రకాతుల చొప్పున నమాజు చేయించారు. ఆ విధంగా దైవప్రవక్త (స) నాలుగు రకాతుల నమాజు చేయించగా, సహచరులు మాత్రం రెండేసి రకాతుల చొప్పున చేశారు. మరికొన్ని ఉల్లేఖనాలలో ఇలా వుంది: ఆయన (సఅసం) ఒక రకాతు నమాజు చేయించిన మీదట ఖాయిదాలో కూర్చుని ఉండగా సైనికులు నిలబడి తమ తరఫున రెండవ రకాతును పూర్తిచేశారు. ఆ తరువాత వెళ్ళి శత్రువును ప్రతిఘటించేందుకు నిలబడిపోయారు. అప్పుడు రెండో జట్టు సభ్యులు వచ్చి ప్రవక్త (స) వెనుక నమాజు చేశారు. ఆయన (స) వారికి కూడా ఒకే రకాతు నమాజు చేయించి 'ఖాయిదా'లో కూర్చున్నారు. తన వెనుకనున్న సిపాయిలు లేచి నిలబడి రెండవ రకాతు పూర్తి చేసే వరకూ ఆయన (స) అలాగే కూర్చుని ఉండి ఆఖరిలో సలాం చేశారు. ఈ విధంగా ఆయన (స) రెండు రకాతుల నమాజు చేశారు.

الصَّلٰوةَ ۚ اِنَّ الصَّلٰوةَ كَانَتْ عَلَى الْمُؤْمِنِيْنَ
كِتٰبًا مَّوْقُوْتًا (103)

కొల్పండి.[152] నిస్సందేహంగా నమాజును నిర్ధారిత వేళల్లో చేయటం విశ్వాసులకు విధిగా చేయబడింది.[153]

وَلَا تَهِنُوْا فِي ابْتِغَآءِ الْقَوْمِ ۭ اِنْ تَكُوْنُوْا تَاْلَمُوْنَ
فَاِنَّهُمْ يَاْلَمُوْنَ كَمَا تَاْلَمُوْنَ ۚ وَتَرْجُوْنَ مِنَ اللّٰهِ
مَا لَا يَرْجُوْنَ ۭ وَكَانَ اللّٰهُ عَلِيْمًا حَكِيْمًا (104)

**104** వారిని వెంబడించటంలో ఏ మాత్రం బలహీనతను ప్రదర్శించకండి.[154] ఒకవేళ మీరు అవిశ్రాంతంగా ఉన్నారను కుంటే మీ మాదిరిగానే వారు కూడా అవిశ్రాంతంగా ఉన్నారు. పైగా అల్లాహ్ నుంచి వారు ఆశించని వాటిని మీరు ఆశిస్తు న్నారు.[155] అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేచనాపరుడు.

اِنَّآ اَنْزَلْنَآ اِلَيْكَ الْكِتٰبَ بِالْحَقِّ لِتَحْكُمَ بَيْنَ
النَّاسِ بِمَآ اَرٰىكَ اللّٰهُ ۭ وَلَا تَكُنْ لِّلْخَآىِٕنِيْنَ
خَصِيْمًا (105)

**105** (ఓ ప్రవక్తా!) అల్లాహ్ నీకు చూపిన విధంగా నీవు ప్రజల మధ్య తీర్పు చెయ్యటానికిగాను[156] మేము నీ వైపుకు ఈ గ్రంథాన్ని సత్యంతోపాటు పంపాము. కనుక ద్రోహానికి పాల్పడే వారి తరఫున వాదిగా నిలబడకు.[157]

---

ఆయన సహచరులు కూడా రెండేసి రకాతుల చొప్పున నమాజును నెరవేర్చారు (వివరాలకై హదీసు గ్రంథాలను చూడండి).

151. అంటే భయస్థితిలో చేయబడే నమాజు ఒక విధంగా కుదించబడిన నమాజే. కాబట్టి ఈ లోటును భర్తీ చేయటానికి నిలుచొని, కూర్చొని ఇంకా పడుకొని ఉన్నప్పుడు సయితం అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండాలని ఇక్కడ ప్రబోధించటం జరిగింది.

152. అంటే యుద్ధమేఘాలు తొలగిపోయి, భయోత్పాత వాతావరణం మారిపోయి శాంతియుత పరిస్థితులు నెలకొన్నప్పుడు నమాజును దాని అసలు పద్ధతిలోనే చేయాలని దీని భావం.

153. నమాజులను నిర్ధారిత వేళల్లో చేయటం అవశ్యమని ఇందులో గట్టిగా తాకీదు చేయబడింది. అందువల్ల షరీఅత్‌పరమైన కారణమేదీ లేకుండా రెండు వేళల నమాజులను ఒకే సమయంలో కలిపి చేయటం సమ్మతం కాదని దీని ద్వారా స్పష్టమవుతోంది. ఎందుకంటే ఈ విధానంలో ఏదో ఒక నమాజు వేళకాని వేళలో చేయబడుతుంది. అది ఈ ఆయత్ స్ఫూర్తికి విరుద్ధం.

154. అంటే మీ శత్రువును తరిమి కొట్టడంలో ఎలాంటి బలహీనతనూ, అలసత్వాన్నీ కనబరచకండి. పైగా వారికి వ్యతిరేకంగా మీ శక్తియుక్తులన్నింటినీ ధారబోసి మరీ పోరాడండి. వారికోసం అవసరమైన చోటల్లా పొంచి కూర్చోండి.

155. అంటే మీరు అవిశ్రాంతంగా పోరాడినట్లే, మీ శత్రువులు కూడా అవిశ్రాంత పోరాటం చేశారు. మీకు గాయాలైనట్లే వారికీ గాయాలైనాయి. మీకు కలిగిన బాధలకు గాను అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలం ప్రసాదిస్తాడన్న ఆశ మీకుంది. కాని మీ శత్రువులకు ఆ ఆశ కూడా లేదుకదా! కాబట్టి పరలోక సాఫల్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని మీరు పడినంత శ్రమ, మీరు చూపినంత పోరాటపటిమ అవిశ్వాసులకు ఎలాగూ సాధ్యపడదు. కాబట్టి మీరు భీతిల్లకుండా, క్రుంగిపోకుండా, పూర్తి శక్తినీ, ఉత్సాహాన్ని కూడగట్టుకుని మీ శత్రువుకు గట్టిగా బుద్ధిచెప్పండి అని ఈ వాక్యానికి భావం.

156. ఈ ఆయతుల (ఆయతు నెం. 104 నుండి 113 వరకు) అవతరణ వెనుక ఒక సంఘటన ఉంది. అన్సార్ వర్గానికి చెందిన బనీ జఫర్ తెగలో తోమా లేక బషీర్ బిన్ ఉబైరిఖ్ అనే ఒక వ్యక్తి ఉండేవాడు. అతను మరో అన్సార్ వ్యక్తికి చెందిన యుద్ధకవచాన్ని (ఇనుప జాకెట్‌ను) దొంగిలించాడు. ఆ విషయం కొంతమందికి తెలిసింది. దానిపై గుసగుసలు మొదలయ్యాయి. దాంతో ఆ వ్యక్తి ఆందోళనచెంది, తన దొంగతనాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంలో ఆ కవచాన్ని ఒక యూదుని ప్రాంగణంలో పారేశాడు. అంతేకాదు, బనీ జఫర్‌కు చెందిన కొంతమందిని వెంటబెట్టుకుని దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చాడు. దొంగతనానికి ఒడిగట్టింది ఫలానా యూదుడేనని వారంతా వివరించారు. అయితే యూదుడు

**106** క్షమాభిక్షకై అల్లాహ్‌ను వేడుకో.[158] నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు.

وَّاسْتَغْفِرِ اللّٰهَ ۭ اِنَّ اللّٰهَ كَانَ غَفُوْرًا رَّحِيْمًا (106)

**107** ఆత్మ ద్రోహం చేసుకునే వారి పక్షాన నిలిచి వాదించకు. దగాకోరును, పాపిష్టివాడిని అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు.

وَلَا تُجَادِلْ عَنِ الَّذِيْنَ يَخْتَانُوْنَ اَنْفُسَھُمْ ۭ
اِنَّ اللّٰهَ لَا يُحِبُّ مَنْ كَانَ خَوَّانًا اَثِيْمًا (107)

**108** వారు ప్రజల నుంచి దాక్కోగలరు. కాని అల్లాహ్ నుంచి దాక్కోలేరు. వారు రాత్రివేళల్లో అల్లాహ్ ఇష్టపడని విషయాలపై రహస్య మంతనాలు సాగిస్తున్నప్పుడు ఆయన వారితో పాటు ఉంటాడు. వారి కర్మలన్నింటినీ ఆయన చుట్టుముట్టి ఉన్నాడు.

يَّسْتَخْفُوْنَ مِنَ النَّاسِ وَلَا يَسْتَخْفُوْنَ مِنَ اللّٰهِ
وَھُوَ مَعَھُمْ اِذْ يُبَيِّتُوْنَ مَا لَا يَرْضٰى مِنَ الْقَوْلِ ۭ
وَكَانَ اللّٰهُ بِمَا يَعْمَلُوْنَ مُحِيْطًا (108)

---

కూడా దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి, తానేపాపం ఎరుగననీ, వాళ్ళే దొంగతనం చేసి తన ఇంట్లో ఆ కవచాన్ని పారవేశారని సంజాయిషీ యిచ్చుకున్నాడు. బనీ జఫర్ బృందం వారు తెలివి మీరినవారు. వారు తమ వాక్చాతుర్యంతో యూదవ్యక్తినే దోషిగా నిలబెట్టారు. దైవప్రవక్త(స) కూడా వారి వాక్పటిమకు ప్రభావితులై అన్సార్ వ్యక్తిని నిర్దోషిగా ఖరారుచేసి యూదుణ్ణి నేరస్థునిగా ప్రకటించాలనుకున్నారు. అంతలోనే ఈ ఆయతులు అవతరించాయి.

దీని ద్వారా స్పష్టమయ్యే విషయం ఏమిటంటే దైవప్రవక్త సయితం మానవ సహజమైన బలహీనతవల్ల విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోవచ్చు. అదీగాక ఆయన (స)కు అగోచర జ్ఞానం ఉండదని కూడా దీనిద్వారా బోధపడుతున్నది. అగోచరాల జ్ఞానమే గనక ఆయన (స)కు ఉండి ఉంటే తక్షణం ఆయనకు నిజస్వరూపం అర్థమయ్యేది. కాని అలా జరగలేదు. అయితే అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా తప్పు జరగకుండా, అన్యాయం జరగకుండా సత్వరమే వారిని కాపాడుతాడు. ప్రవక్తల ద్వారా న్యాయాన్యాయాల, ధర్మాధర్మాల విషయంలో ఎప్పుడైనా కుడిఎడమయ్యే పరిస్థితి ఎదురవుతే వెంటనే అల్లాహ్ విషయాన్ని విశదపరచటమో, హెచ్చరించటమో చేస్తాడు. ఎందుకంటే ప్రవక్తా పదవిపై ఉన్నవారి చేత ప్రజలకు లేశమైనా అన్యాయం జరగరాదు. ఆ బాధ్యత స్వయంగా దేవుడు తీసుకున్నాడు. ఒక్క ప్రవక్తల విషయంలో తప్ప వేరొకరి విషయంలో ఇలా జరగదు.

157. ఇక్కడ ద్రోహానికి పాల్పడినవారు అంటే ఆ బనీ ఉబైరిఖ్ వారే. తాము ఖుద్దుగా దొంగతనం చేసిందిగాక, తమ వాగ్ధాటితో, దబాయింపులతో యూదవ్యక్తిని నిందితునిగా నిలబెట్టే యత్నం చేశారు. ఈ ఆయతు తరువాత వచ్చే వాక్యాలలో కూడా వీరి మరియు వీరిని సమర్థించినవారి దుర్నీతి గురించి దేవుడు తన ప్రవక్త (స)కు తెలియపరచాడు. వర్గ, ప్రాంతీయ దురభిమానంతో తీర్పులు యిచ్చే పెద్దలకు ఇది గుణపాఠం కావాలి. "తప్పయినా, ఒప్పయినా నా వాడు" అనే ధోరణిని మానుకోమని ఇస్లాం అంటోంది.

158. "ఓ ముహమ్మద్ (సఅసం) – విషయం లోతుల్లోకి వెళ్ళకుండానే నువ్వు ద్రోహులకు అండగా నిలబడబోయావు. అందుకుగాను క్షమాభిక్ష వేడుకో" అని అల్లాహ్ మందలించటం గమనార్హం. దీన్నిబట్టి బోధపడేదేమంటే ఇరువురు వ్యక్తులు తమ తగాదా గురించి నివేదించుకున్నప్పుడు వారిలో ఎవరు సత్యంపై ఉన్నారో తెలుసుకోకుండా గుడ్డిగా ఒక పక్షాన నిలిచి వాదించటం సమ్మతం కాదు. అదీగాక ఏదైనా ఒక పక్షంవాడు మోసంతో, ధనబలంతో, వాగ్ధాటితో న్యాయస్థానం లేక రాజ్యాధికారి చేత తనకనుకూలంగా తీర్పు చేయించుకుంటే అటువంటి తీర్పుకు దైవసమక్షంలో ఎలాంటి విలువా, ప్రాముఖ్యం లేదు. మహాప్రవక్త (స) ఈ విషయాన్నే ఒక హదీసులో ఇలా స్పష్టం చేశారు : "జాగ్రత్త! నేనూ మానవమాత్రుణ్ణే. మీ వాదనను విన్న తరువాత దాని వెలుగులో నిర్ణయం గైకొంటూ ఉంటాను. ఎవరయినా తెలివైనవాడు, నేర్పరి, మాటకారి అయివుండి తన వాదనలో ఆధిపత్యం వహిస్తే నేను అతని మాటలకు ప్రభావితుణ్ణి అయి, అతడు అన్యాయవాది అయినప్పటికీ నేనతని పక్షాన నిర్ణయం గైకొంటానేమో! అవతలి పక్షానికి చెందవలసిన హక్కుని ఇవతలి వ్యక్తికి ఇచ్చేస్తానేమో! జాగ్రత్త! ఆ హక్కు 'అగ్ని ముక్క' అని అతను తెలుసుకోవాలి.

هَاَنْتُمْ هٰۤؤُلَآءِ جٰدَلْتُمْ عَنْهُمْ فِى الْحَيٰوةِ الدُّنْيَا فَمَنْ يُّجَادِلُ اللّٰهَ عَنْهُمْ يَوْمَ الْقِيٰمَةِ اَمْ مَّنْ يَّكُوْنُ عَلَيْهِمْ وَكِيْلًا ﴿١٠٩﴾

**109** ప్రాపంచిక జీవితంలోనైతే మీరు వారి తరఫున వాదించారుగాని, ప్రళయ దినాన వారికి మద్దతుగా అల్లాహ్‌తో ఎవరు వాదిస్తారు? వారి తరఫున వకాల్తా ఎవరు పుచ్చుకుంటారు?[159]

وَمَنْ يَّعْمَلْ سُوْٓءًا اَوْ يَظْلِمْ نَفْسَهٗ ثُمَّ يَسْتَغْفِرِ اللّٰهَ يَجِدِ اللّٰهَ غَفُوْرًا رَّحِيْمًا ﴿١١٠﴾

**110** ఎవరయినా దుష్కార్యానికి పాల్పడి లేదా తనకు తాను అన్యాయం చేసుకుని, ఆ తరువాత క్షమాపణకై అల్లాహ్‌ను అర్థిస్తే, అతడు అల్లాహ్‌ను క్షమాశీలిగా, కృపాశీలిగా పొందుతాడు.

وَمَنْ يَّكْسِبْ اِثْمًا فَاِنَّمَا يَكْسِبُهٗ عَلٰى نَفْسِهٖ ؕ وَكَانَ اللّٰهُ عَلِيْمًا حَكِيْمًا ﴿١١١﴾

**111** కాని ఎవడయినా పాపాన్ని సంపాదించుకుంటే అతను సంపాదించుకున్నది అతనిపైనే పడుతుంది.[160] అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు, వివేచనాపరుడు.

وَمَنْ يَّكْسِبْ خَطِيْٓـئَةً اَوْ اِثْمًا ثُمَّ يَرْمِ بِهٖ بَرِيْٓــًٔـا فَقَدِ احْتَمَلَ بُهْتَانًا وَّاِثْمًا مُّبِيْنًا ﴿١١٢﴾

**112** ఇంకా ఎవరయినా ఏదైనా తప్పు చేసి, లేదా పాపానికి పాల్పడి, ఆ నిందను ఏ పాపం ఎరుగని అమాయకుని పైకి నెట్టివేస్తే, అలాంటివాడు చాలా పెద్ద అపనిందను, స్పష్టమైన పాపాన్ని ఎత్తుకున్నవాడవుతాడు.[161]

وَلَوْلَا فَضْلُ اللّٰهِ عَلَيْكَ وَرَحْمَتُهٗ لَهَمَّتْ طَّآئِفَةٌ مِّنْهُمْ اَنْ يُّضِلُّوْكَ ؕ وَمَا يُضِلُّوْنَ اِلَّآ اَنْفُسَهُمْ وَمَا يَضُرُّوْنَكَ مِنْ شَىْءٍ ؕ وَاَنْزَلَ اللّٰهُ عَلَيْكَ الْكِتٰبَ وَالْحِكْمَةَ وَعَلَّمَكَ مَا لَمْ تَكُنْ تَعْلَمُ ؕ وَكَانَ فَضْلُ اللّٰهِ عَلَيْكَ عَظِيْمًا ﴿١١٣﴾

**113** (ఓ ముహమ్మద్!) దైవానుగ్రహం, ఆయన కారుణ్యం నీపై లేకుండా ఉంటే వారిలోని ఒక సమూహం నిన్ను తప్పు దారి పట్టించాలనే అనుకుంది.[162] కాని నిజానికి వారు తమను తామే అపమార్గానికి లోనుచేసుకుంటున్నారు. వారు నీకెలాంటి హానీ కలిగించలేరు. అల్లాహ్ నీపై గ్రంథాన్ని, వివేకాన్నీ అవతరింపజేశాడు. నీకు తెలియని విషయాలను నీకు నేర్పాడు.[163] నీపై అల్లాహ్ యొక్క గొప్ప అనుగ్రహం ఉంది.

దాన్ని పుచ్చుకుంటాడో లేక వదిలేస్తాడో అది అతని యిష్టం" (సహీహ్ బుఖారీ : కితాబుష్షహాద... సహీహ్ ముస్లిం : కితాబుల్ అఖ్‌జియ).

159. అంటే ఈ అపరాధానికి పాల్పడినందుకు (పరలోకంలో) అతన్ని నిలదీయటం జరిగితే అల్లాహ్ పట్టు నుంచి అతన్ని రక్షించే వాడెవడుంటాడు?

160. ఈ విషయాన్నే అల్లాహ్ వేరొకచోట ఇలా సెలవిచ్చాడు : "బరువును మోసేవాడెవడూ ఇంకొకరి బరువును మోయడు" (బనీ ఇస్రాయీల్ – 15). అంటే ఎవడూ ఇంకొకరి కర్మలకు బాధ్యత వహించరు అని భావం. ప్రతి ప్రాణికీ అది సంపాదించి తెచ్చినదానికి అనుగుణంగానే ప్రతిఫలం లభిస్తుంది.

161. ఈ ఆయతులోని హెచ్చరిక అందరికీ, అన్ని కాలాల వారికీ వర్తిస్తుంది. మదీనాలో బనూ ఉబైరిఖ్ తెగవారు ఏ విధంగా తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవటానికి, ఒక నిర్దోషిపై అపనింద వేశారో అలాగే లోకంలో ఎక్కడయినా ఇలాంటి సంఘటనలు జరగవచ్చు. దాని పర్యవసానం తీవ్రంగా ఉండబోతుందని దేవుడు హెచ్చరిస్తున్నాడు.

114 వారు జరిపే అత్యధిక రహస్య మంతనాలలో ఏ మేలూ ఉండదు.[164] అయితే దానధర్మాల గురించి లేక మంచి పనుల గురించి లేక ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచటం గురించి ఆజ్ఞాపించేవాని రహస్య మంతనాల్లో మేలుంటుంది.[165] ఎవరయినా కేవలం దైవప్రసన్నత కోసం ఈ పనులు చేస్తే[166] నిశ్చయంగా మేమతనికి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము.[167]

لَاخَيْرَ فِيْ كَثِيْرٍ مِّنْ نَّجْوٰىهُمْ اِلَّا مَنْ اَمَرَ بِصَدَقَةٍ اَوْ مَعْرُوْفٍ اَوْ اِصْلَاحٍ بَيْنَ النَّاسِ ؕ وَمَنْ يَّفْعَلْ ذٰلِكَ ابْتِغَآءَ مَرْضَاتِ اللّٰهِ فَسَوْفَ نُؤْتِيْهِ اَجْرًا عَظِيْمًا ﴿114﴾

162. ఇంతకుముందు కూడా చెప్పుకున్నట్లు దైవప్రవక్తలు (అలైహిముస్సలాం) దేవుని ప్రత్యేక పర్యవేక్షణలో ఉంటారు. ఇది వారిపై దేవుని కటాక్షానికి, ఆయన ప్రత్యేక అనుగ్రహానికి నిదర్శనం.

ఇక దైవప్రవక్త(స)ను పెడత్రోవ పట్టించజూసిన సమూహం అంటే ఆయన సన్నిధిలో బనూ ఉబైరిఖ్ తెగవారికి అనుకూలంగా వాదించినవారని భావం. వారి ఈ వాదన మూలంగా దైవప్రవక్త (స), అసలు దొంగనే నిర్దోషిగా ఖరారు చేసే ప్రమాదం జరగబోయింది.

163. ఇక్కడ దేవుని మరో గొప్ప అనుగ్రహం, ఉపకారం గురించి జ్ఞాపకం చెయ్యటం జరిగింది. అదే గ్రంథం మరియు వివేకం. ఇంకా ఇతర ముఖ్య విషయాలకు సంబంధించిన జ్ఞానం. గ్రంథమంటే దివ్య ఖుర్ఆన్ అనీ, వివేకం అంటే సున్నత్ అనీ అర్థం. ఈ రెండింటి ద్వారా మహనీయ ముహమ్మద్ (సఅసం)కు అప్పటి వరకూ తెలియని ఎన్నో పరమార్థాలు, జీవన రహస్యాలు తెలిశాయి. దివ్య ఖుర్ఆన్‌లో యితర చోట్ల అల్లాహ్ తన ఈ అనుగ్రహాన్ని గురించి జ్ఞాపకం చేశాడు. ఉదాహరణకు: 1. "(ఓ ప్రవక్తా!) గ్రంథం అంటే ఏమిటో, విశ్వాసం (ఈమాన్) అంటే ఏమిటో నీకు అసలు ఏమీ తెలియని పరిస్థితిలో మేము మా ఆజ్ఞ ద్వారా (ఖుర్ఆన్‌ను యిచ్చి) ఒక ఆత్మను (దూతను) నీ వద్దకు పంపాము" (అష్ షూరా: 52). 2. "(ఓ ప్రవక్తా!) నీపై గ్రంథం అవతరింపజేయబడుతుందని అసలు నీవు ఊహించనైనా లేదు. కాని ఇది కేవలం నీ ప్రభువు కృపవల్లనే (నీపై అవతరించింది)" (అల్ ఖసస్ – 86). ఈ ఆయతుల ద్వారా విదితమయ్యేదేమిటంటే అల్లాహ్ తన ప్రవక్తపై ప్రత్యేకంగా దయదలిచాడు. ఆయనకు మహోపకారం చేశాడు. కనుకనే ఆయనకు గ్రంథాన్నీ, వివేకాన్నీ వొసగాడు. ఇవిగాక ఆయన (స)కు తెలియని మరెన్నో నిగూఢమైన విషయాలను కూడా నేర్పాడు. ఆయన (స) అగోచర విషయాల జ్ఞాని కారు అన్న దానికి ఈ వాక్యం కూడా ఒక తార్కాణమే. ఎందుకంటే ఖుద్దుగా అగోచర విషయాలు తెలిసిన వారికి వేరొకరి నుంచి జ్ఞానాన్ని పొందవలసిన ఆవశ్యకత ఉండదు కదా! వహీ ద్వారాగానీ, మరో మార్గానగానీ సమాచారం అందుకునే వ్యక్తి 'అగోచర జ్ఞాని' (ఆలిముల్ గైబ్) అనబడడు.

164. అరబీలో **'నజ్వా'** అనే పదం వచ్చింది. ఇక్కడ నజ్వా అంటే ముస్లింలకు వ్యతిరేకంగా కపటులు పరస్పరం జరిపే రహస్య సమాలోచనలనీ, గుసగుసలనీ అర్థం. పరస్పరం ఒండొకరికి వ్యతిరేకంగా జరిపే గోప్యమైన సమావేశాలకు కూడా ఈ పదం వర్తిస్తుంది.

165. అంటే దానధర్మాలను ప్రోత్సహించటానికీ, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడానికీ, ప్రజల మధ్య ఏర్పడిన అపార్థాలను దూరంచేసి వారిని కలపటానికి పరస్పరం సంప్రతింపులు జరపటం అభిలషణీయమే. ఇలాంటి సదుద్దేశ్యాలతో ప్రజలతో సమావేశమవటం పుణ్యప్రదమని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది; **మారూఫ్ (مَعْرُوْفٍ)** : ప్రతి మంచి పనీ 'మారూఫ్' క్రిందికే వస్తుంది.

166. ఏ పనిచేసినా దైవాన్ని మెప్పించే ఉద్దేశ్యంతో చేస్తేనే అది పుణ్యప్రదం అవుతుంది. లేకుంటే ఎంత గొప్ప పని అయినా అది వృథా అయిపోతుంది. ఒక్కోసారి అది అతని పాలిట హానికరంగా కూడా పరిణమించవచ్చు. అల్లాహ్ మనల్ని ప్రదర్శనా బుద్ధి నుంచి, కపట విశ్వాసం నుంచి రక్షించుగాక!

167. ఈ ఆయతులో ప్రస్తావించిన మంచిపనుల మహత్యం గురించి హదీసులలో కూడా నొక్కి వక్కాణించటం జరిగింది.

**115** కాని ఎవరయినా సన్మార్గం ప్రస్ఫుటమైన మీదట కూడా ప్రవక్త (సఅసం)కు వ్యతిరేకంగా పోతే, విశ్వాసులందరి మార్గాన్ని వీడి, ఇతర మార్గాన్ని అనుసరిస్తే, మేమతన్ని అతను మరల దలచుకున్న వైపుకే మరల్చుతాము. కడకు అతన్ని నరకంలో పడవేస్తాము.[168] అది అత్యంత చెడ్డ గమ్యస్థానం.

وَمَنْ يُّشَاقِقِ الرَّسُوْلَ مِنْۢ بَعْدِ مَا تَبَيَّنَ
لَهُ الْهُدٰى وَيَتَّبِعْ غَيْرَ سَبِيْلِ الْمُؤْمِنِيْنَ نُوَلِّهٖ
مَا تَوَلّٰى وَنُصْلِهٖ جَهَنَّمَ ؕ وَسَآءَتْ مَصِيْرًا ﴿115﴾

**116** తనకు భాగస్వామ్యం (షిర్క్) కల్పించటాన్ని అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. షిర్క్ మినహా తాను కోరిన వారి ఇతర పాపాలను క్షమిస్తాడు. అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టినవాడు మార్గభ్రష్టతలో చాలా దూరం వెళ్ళి పోయాడు.

اِنَّ اللّٰهَ لَا يَغْفِرُ اَنْ يُّشْرَكَ بِهٖ وَيَغْفِرُ
مَا دُوْنَ ذٰلِكَ لِمَنْ يَّشَآءُ ؕ وَمَنْ يُّشْرِكْ
بِاللّٰهِ فَقَدْ ضَلَّ ضَلٰلًاۢ بَعِيْدًا ﴿116﴾

ధర్మసమ్మతంగా ఆర్జించిన సంపాదన నుంచి ఒక్క ఖర్జూర పండును దానం చేసినా అది ఉహుద్ పర్వతమంతగా పెరుగుతుందని చెప్పబడింది (సహీహ్ ముస్లిం: కితాబుజ్జకాత్). ఒకమంచి మాటను ఉపదేశించటం కూడా గొప్ప సత్కార్యమే. అలాగే బంధుమిత్రుల మధ్య ఏర్పడిన అంతరాల అగాధాలను పూడ్చటం, ఎడమొహం – పెడమొహంగా ఉంటున్న వారిమధ్య సఖ్యతను పెంపొందించటం గొప్ప సదాచరణగా పరిగణించబడుతుంది. ఈ రకమయిన సయోధ్య కోసం పాటుపడటం నఫిల్ నమాజులు చేయటంకన్నా, నఫిల్ ఉపవాసాలు పాటించటంకన్నా, స్వచ్ఛందమైన దాన ధర్మాలు చేయటంకన్నా శ్రేష్ఠతరమని ఒక హదీసు చెబుతోంది (అబూ దావూద్ : కితాబుల్ అదబ్, తిర్మిజీ : కితాబుల్ బిర్ర్, ముస్నదె అహ్మద్ – 6/444, 445). ఆఖరికి సయోధ్య కుదిర్చే వాడికి అబద్ధం పలకటానికి కూడా అనుమతించబడింది – ఒండొకరిని దగ్గర చేర్చడానికి కించిత్ లౌక్యం ప్రదర్శించవలసి వచ్చినా అతను తాత్సారం చేయకూడదు.

“జనుల మధ్య సయోధ్య కోసం మంచి మాటను వ్యాపింపజేసేవాడు లేక మంచిమాట పలికేవాడు అబద్ధాలకోరు కాజాలడు” (బుఖారీ: కితాబుస్సులహ్ ; ముస్లిం మరియు తిర్మిజీ: కితాబుల్ బిర్ర్, అబూదావూద్: కితాబుల్ అదబ్).

168. సన్మార్గమేదో స్పష్టంగా బోధపడిన తరువాత కూడా దైవప్రవక్త (సఅసం)ను వ్యతిరేకించి, విశ్వాసుల మార్గాన్ని కాదని, వేరొక మార్గాన్ని అవలంబించినవాడు ఇస్లాం ధర్మం నుంచి తొలగిపోయినట్లే. అటువంటి వ్యక్తికి నరకమే గతి అని హెచ్చరించబడింది. ఇక్కడ ‘విశ్వాసులు’ అంటే ప్రవక్త ప్రియసహచరులు (రజి) అని భావం. వారు ఇస్లాం ధర్మానికి ప్రథమశ్రేణి అనుయాయులు. ఇస్లాం ప్రబోధనలకు ప్రతిబింబం లాంటివారు. ఖుర్ఆన్ అవతరించే తొలికాలంలో మహాప్రవక్త ప్రియ సహచరులు మినహా విశ్వాసుల మరోవర్గం ఏదీ లేదు. అందుచేత దైవప్రవక్త (స) యెడల వ్యతిరేక ధోరణి, ప్రవక్త సహచరుల మార్గం గాకుండా ఇతరత్రా మార్గాలను అనుసరించటం – వాస్తవానికి ఈ రెండూ ఒకటే. కనుక ప్రవక్త సహచరుల మార్గాన్ని, వారి విధానాన్ని వదలిపెట్టటం కూడా తిరస్కారం, అపమార్గం క్రిందికే వస్తుంది.

కొంతమంది విద్వాంసులు “విశ్వాసుల మార్గం” అనే పదాన్ని ఉమ్మత్ ఏకాభిప్రాయం చెందిన మార్గం (ఇజ్మాయె ఉమ్మత్) అన్న అర్థంలో తీసుకున్నారు. కాబట్టి సమస్త ఉమ్మత్ (ముస్లిం సమాజం) ఏకీభవించిన విధానం పట్ల వైముఖ్య ధోరణి కనబరచటం కూడా తిరస్కార వైఖరికీ, అపమార్గానికీ ఆనవాలే. అయితే ఇక్కడొక విషయం గమనార్హం– అసలు ‘ఇజ్మా’ అంటే ఏదేని విషయంలో ముస్లిం సమాజానికి చెందిన పండితుల, విద్వాంసుల (ఫుకహాల) ఏకాభిప్రాయం లేక ఏదేని విషయంలో ప్రవక్త సహచరుల ఏకాభిప్రాయం – ఇజ్మాలో ఈ రెండు అంశాలూ చేరి ఉన్నాయి. కనుక ఈ రెండింటి తిరస్కారం లేక వీటిలో ఏ ఒక్కదాని తిరస్కారం సైతం కుఫ్ర్‌గానే భావింపబడుతుంది. అయితే ప్రవక్త సహచరుల ఏకాభిప్రాయం చాలా విషయాల్లో కనిపిస్తుంది (ఇజ్మాలోని ఈ అంశానికి సంబంధించిన

117 వారు అల్లాహ్‌ను వదలి స్త్రీలను మొరపెట్టుకుంటు న్నారు.[169] వాస్తవానికి వారసలు పొగరుబోతు షైతానును మొరపెట్టుకుంటున్నారు.[170]

إِن يَدْعُونَ مِن دُونِهِۦٓ إِلَّآ إِنَٰثًا وَإِن يَدْعُونَ إِلَّا شَيْطَٰنًا مَّرِيدًا ﴿117﴾

118 అల్లాహ్ వాణ్ణి శపించాడు. షైతాను ఇలా అన్నాడు: "నీ దాసుల నుండి నేను నిర్ణీత భాగాన్ని పొంది తీర్తాను."[171]

لَّعَنَهُ ٱللَّهُ ۘ وَقَالَ لَأَتَّخِذَنَّ مِنْ عِبَادِكَ نَصِيبًا مَّفْرُوضًا ﴿118﴾

119 "వారిని దారి నుంచి తప్పిస్తూ ఉంటాను. వారికి ఉత్తుత్తి ఆశలు చూపిస్తూ ఉంటాను.[172] పశువుల చెవులు చీల్చమని వారికి పురమాయిస్తాను.[173] అల్లాహ్ సృష్టిని మార్చమని వారిని ఆదేశిస్తాను."[174] వినండి! అల్లాహ్‌ను వదలి షైతానును తన స్నేహితునిగా చేసుకున్నవాడు స్పష్టంగా నష్టపోయినట్లే.

وَلَأُضِلَّنَّهُمْ وَلَأُمَنِّيَنَّهُمْ وَلَءَامُرَنَّهُمْ فَلَيُبَتِّكُنَّ ءَاذَانَ ٱلْأَنْعَٰمِ وَلَءَامُرَنَّهُمْ فَلَيُغَيِّرُنَّ خَلْقَ ٱللَّهِ ۚ وَمَن يَتَّخِذِ ٱلشَّيْطَٰنَ وَلِيًّا مِّن دُونِ ٱللَّهِ فَقَدْ خَسِرَ خُسْرَانًا مُّبِينًا ﴿119﴾

ఉదాహరణలెన్నో మనకు లభిస్తాయి). కాని ప్రవక్త సహచరుల 'ఇజ్మా' తర్వాత ముస్లిం సమాజ పండితుల, విద్వాంసుల ఏకాభిప్రాయం (ఇజ్మా) కూడా ఎన్నో విషయాల్లో ఉందని వాదించటం జరిగింది. కాని నిజానికి ముస్లిం సమాజ పండితుల, విద్వాంసులందరి ఏకాభిప్రాయం ఉన్న ఇటువంటి ఇజ్మా విషయాలు చాలా అరుదుగానే ఉన్నాయి. మొత్తానికి ప్రవక్త సహచరుల ఏకాభిప్రాయాన్ని (ఇజ్మాయె సహాబాను) తిరస్కరించటం 'కుఫ్ర్' అయినట్లే, ఇటువంటి ముస్లిం సమాజ ఏకాభిప్రాయాన్ని (ఇజ్మాను) తిరస్కరించటం కూడా కుఫ్ర్ క్రిందికే వస్తుంది. ఎందుకంటే సహీహ్ హదీసులో ఇలా అనబడింది– "అల్లాహ్ నా అనుచర సమాజాన్ని అపమార్గంపై ఏకం కానివ్వడు. కాగా; 'జమాఅత్' (సమూహం లేదా సామూహిక వ్యవస్థ)పై అల్లాహ్ హస్తం ఉంటుంది" (సహీహ్ తిర్మిజీ : లిల్ అల్‌బానీ : 2, హదీసు నెంబరు – 1759).

169. **"ఇనాసున్" (స్త్రీలు)** : స్త్రీలు అంటే స్త్రీ దేవతలన్నమాట. ఉదాహరణకు :లాత్, ఉజ్జా, మనాత్, నాయిలా మొదలగు దేవతలు. లేక 'దైవదూతలు' అన్న భావం కూడా కావచ్చు. ఎందుకంటే అరబ్బు ముష్రిక్కులు దూతలను అల్లాహ్ కుమార్తెలుగా భావించి వాటిని పూజించేవారు.

170. విగ్రహారాధన, దైవదూతల పూజ, ఇతర వ్యక్తుల, శక్తుల పూజ వాస్తవానికి షైతాను పూజే. ఎందుకంటే షైతానే మనిషిని దైవసన్నిధి నుంచి లాక్కుపోయి వీధివీధినా, వాడవాడనా, గడప గడపనా, ఇతరుల ఆస్థానాల ముందు తల వంచేలా చేస్తాడు. తరువాతి ఆయతులో ఈ విషయమే చెప్పబడింది.

171. నిర్ణీతభాగం అంటే ముష్రిక్కులు తమ దేవీదేవతల పేర, సమాధులలో ఉన్న తమ పెద్దల, పూర్వీకుల పేర సమర్పించుకునే మొక్కుబడులు, నైవేద్యాలూ కావచ్చు. లేక షైతాన్ అపమార్గం పట్టించి తన వెంట నరకానికి తీసుకువెళ్ళే నరకవాసుల సమూహం కూడా కావచ్చు.

172. షైతాన్ జోక్యం వల్ల, వాడి ప్రేరేపణల వల్ల మనిషిలో రకరకాల ఆశలు జనిస్తాయి. ధర్మ విరుద్ధమైన కోర్కెలెన్నో పుట్టుకు వస్తాయి. వాటిని నెరవేర్చుకోవాలన్న ఆరాటంలో అతను సన్మార్గం నుంచి తప్పిపోయి, మార్గ విహీనత చివరి అంచుల వరకూ వెళ్ళిపోతాడు.

173. చెవులు చీల్చడం అంటే పుణ్యం కొరకు వదలిపెట్టదలచిన పశువుల చెవులు కోయటం అని అర్థం. ఆనాడు ముష్రిక్కులు తమ దేవీదేవతల పేర ఈ విధంగా పశువులను వదలిపెడతామని మొక్కుకుని, దానికి ఆనవాలుగా వాటి చెవులను చీల్చేవారు. బహీరా, సాయిబా పశువులను వారు ఇలాగే చేసేవారు.

174. **"అల్లాహ్ సృష్టిలో మార్పులు చేయటం"** అనే మాటకు రకరకాల వివరణలు చెప్పబడ్డాయి. వాటిలో ఒకటి గత

يَعِدُهُمْ وَيُمَنِّيهِمْ ۖ وَمَا يَعِدُهُمُ الشَّيْطَانُ
إِلَّا غُرُورًا ﴿120﴾

**120** వాడు వారికి వట్టి వాగ్దానాలు చేస్తూ ఉంటాడు. ఆశలు కలిగిస్తూ ఉంటాడు. కాని షైతాను వారితో చేసే వాగ్దానాలన్నీ మోసపూరితమైనవే.

أُولَٰئِكَ مَأْوَاهُمْ جَهَنَّمُ وَلَا يَجِدُونَ عَنْهَا
مَحِيصًا ﴿121﴾

**121** ఇటువంటి వారు చేరుకోవలసిన స్థలం నరకం. ఇక వారికి దాన్నుంచి తప్పించుకునే మార్గం ఏదీ ఉండదు.

وَالَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ سَنُدْخِلُهُمْ
جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ
فِيهَا أَبَدًا ۖ وَعْدَ اللَّهِ حَقًّا ۚ وَمَنْ
أَصْدَقُ مِنَ اللَّهِ قِيلًا ﴿122﴾

**122** కాగా; ఎవరు విశ్వసించి సత్కార్యాలు చేస్తారో వారిని మేము క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలోకి తీసుకు పోతాము. అందులో వారు కలకాలం, శాశ్వతంగా ఉంటారు. ఈ అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. అల్లాహ్ కంటే సత్యమైన మాట పలికేదెవరు?[175]

لَّيْسَ بِأَمَانِيِّكُمْ وَلَا أَمَانِيِّ أَهْلِ الْكِتَابِ ۗ
مَن يَعْمَلْ سُوءًا يُجْزَ بِهِ وَلَا يَجِدْ لَهُ مِن
دُونِ اللَّهِ وَلِيًّا وَلَا نَصِيرًا ﴿123﴾

**123** నిజస్థితి (సాఫల్యం) మీ ఆకాంక్షల కనుగుణంగా గానీ, గ్రంథవహుల ఆశలు, అభిలాషలపై ఆధారపడిగానీ లేదు. చెడుకు పాల్పడినవాడు ఎవడైనా దాని ఫలితాన్ని అనుభవిస్తాడు. దైవసమక్షంలో తనను సమర్థించే, తనను ఆదుకునే వారెవరినీ అతడు పొందలేడు.

అంశంలో వివరించబడినది. అంటే పశువుల చెవులు కోయటం, చీల్చటం, లేక చెవులకు రంధ్రాలు వేయటం. ఇవే గాకుండా అల్లాహ్ సృష్టిలో మార్పు మరెన్నో రకాలుగా జరగవచ్చు. ఉదాహరణకు అల్లాహ్ సృష్టించిన అద్భుత వస్తువుల అసలు ఆశయాన్ని మార్చి వాటిని ఆరాధ్య దైవాలుగా కొలవటం. ఉదాహరణకు: అల్లాహ్ సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, పర్వతాలను, అగ్నినీ వివిధ లక్ష్యాల కోసం సృష్టించాడు. కాని ముష్రిక్కులు వాటి సృష్టి పరమార్థాన్ని నిర్లక్ష్యం చేసి, వాటిని తమ ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు. 'మార్పు' అంటే ప్రకృతి ధర్మాన్ని మార్చటం అన్నదీ ఒక అర్థం కావచ్చు. లేదా ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా చేసుకోవటం అన్నదీ ఒక అర్థం కావచ్చు. అలాగే పురుషులకూ, స్త్రీలకూ కుటుంబ నియంత్రణా ఆపరేషన్లు చేయించి పిల్లల్ని కనే సామర్థ్యం లేకుండా చేయటం కూడా ఈ మార్పులో ఒక భాగం కావచ్చు. మేకప్ పేరుతో ఆడవారు మగవారిలా, మగవారు ఆడవారిలా తయారవటం, పచ్చబొట్లు వేయించుకోవటం వంటివి కూడా ఈ మార్పులో అంతర్భాగమై ఉండవచ్చు. ఇవన్నీ షైతాను పోకడలే. వీటికి దూరంగా ఉండటం ఎంతో అవసరం. అయితే పశువుల నుండి అధిక ఉత్పత్తినీ, ప్రయోజనాన్నీ ఆశించి ఈ రకమయిన చర్యలు తీసుకుంటే అది సమ్మతమే. ఉదా : (పోతు) పశువులకు బుడ్డ కొట్టించటం. అలాంటి పశువులను ఖుర్బానీ సందర్భంగా మహాప్రవక్త (సఅసం) జిబహ్ చేసినట్లు ఆధారాలున్నాయి. ఒకవేళ అలాంటి పశువులు ధర్మసమ్మతం కానిపక్షంలో దైవప్రవక్త (సఅసం) వాటిని ఖుర్బానీ కొరకు ఉపయోగించేవారు కాదు.

175. షైతాన్ వాగ్దానాలు మోసపూరితమైనవై ఉంటాయి. కాని మానవుడు కూడా విచిత్రమైనవాడు. వాడు సత్యవంతులు చెప్పే మాటలను చాలా తక్కువగా నమ్ముతాడు. కాని ఆడి తప్పేవారి మాటలను గుడ్డిగా నమ్మేస్తాడు. లోకంలో మీకు ఎటు చూసినా షైతాను మార్గంలో నడిచేవారు అత్యధికమంది కానవస్తారు. కాని అల్లాహ్ వచనాలను ఆచరించేవారు బహు కొద్దిమంది మాత్రమే కనబడతారు. "నాకు కృతజ్ఞులై మెలిగే దాసులు కొద్దిమందే ఉంటార"ని దేవుడు స్వయంగా సెలవిస్తున్నాడు (సబా – 13).

**124** సత్కార్యాలు చేసేవారు – వారు పురుషులైనా, స్త్రీలైనా– విశ్వసించి ఉంటే, ఇలాంటివారు తప్పకుండా స్వర్గంలో ప్రవేశి స్తారు. వారికి ఖర్జూరపు విత్తనంపై ఉండే గాటుకు సమానంగా కూడా అన్యాయం జరగదు.[176]

وَمَنْ يَّعْمَلْ مِنَ الصّٰلِحٰتِ مِنْ ذَكَرٍ اَوْ اُنْثٰى وَهُوَ مُؤْمِنٌ فَاُولٰٓئِكَ يَدْخُلُوْنَ الْجَنَّةَ وَلَا يُظْلَمُوْنَ نَقِيْرًا ﴿124﴾

**125** ఒక వ్యక్తి అల్లాహ్ ముందు తలవంచి, సదాచార సంపన్నుడై ఉండి, ఏకాగ్రచిత్తుడైన ఇబ్రాహీము ధర్మాన్ని అనుసరిస్తే – ధర్మం రీత్యా అతని కంటే ఉత్తముడు మరెవడు కాగలడు? ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం)ను అల్లాహ్ తన మిత్రునిగా చేసుకున్నాడు.[177]

وَمَنْ اَحْسَنُ دِيْنًا مِّمَّنْ اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ وَّاتَّبَعَ مِلَّةَ اِبْرٰهِيْمَ حَنِيْفًا ؕ وَاتَّخَذَ اللّٰهُ اِبْرٰهِيْمَ خَلِيْلًا ﴿125﴾

**126** ఆకాశాలలో, భూమిలో ఉన్న సమస్తమూ అల్లాహ్‌దే. అల్లాహ్ అన్నింటినీ పరివేష్టించి ఉన్నాడు.

وَلِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ؕ وَكَانَ اللّٰهُ بِكُلِّ شَيْءٍ مُّحِيْطًا ﴿126﴾

**127** (ఓ ప్రవక్తా!) వారు నిన్ను స్త్రీల విషయమై ధర్మాదేశం ఏమిటని అడుగుతున్నారు.[178] వారికి చెప్పు: "అల్లాహ్ స్వయంగా వారి విషయంలో మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు. ఇంకా తండ్రిలేని

وَيَسْتَفْتُوْنَكَ فِي النِّسَآءِ ؕ قُلِ اللّٰهُ يُفْتِيْكُمْ فِيْهِنَّ ۙ وَمَا يُتْلٰى عَلَيْكُمْ فِي الْكِتٰبِ فِيْ

176. పరలోకంలో తాము మోక్షం పొందటం ఖాయం అని గ్రంథవహులు సంబరపడేవారు. వారి భ్రమలను పటాపంచలు చేస్తూ అల్లాహ్, కేవలం ఆశలు, అభిలాషలపై పరలోక సాఫల్యం ఆధారపడిలేదనీ, దానికోసం విశ్వాసం (ఈమాన్) మరియు సదాచరణ (అమలుస్సాలిహ్) అవశ్యమని స్పష్టం చేశాడు. దీనికి భిన్నంగా కర్మల పత్రంలో దుష్కార్యాలు నమోదై ఉంటే శిక్షను చవిచూడవలసి ఉంటుందని, ఆ శిక్ష నుంచి తప్పించే సహాయకుడెవడూ అక్కడ ఉండబోడని కూడా అల్లాహ్ విపులీకరించాడు. ఈ ఆయతులో అల్లాహ్ గ్రంథవహులతో పాటు, విశ్వాసులను కూడా బోధపరిచాడు. యూదుల, క్రైస్తవుల మాదిరిగా వారు కేవలం ఆశలు, ఆకాంక్షలలోనే ఉండిపోరాదని, సదాచరణ పట్ల శ్రద్ధవహించాలన్నది దీని అసలు ఉద్దేశ్యం. కాని విచారకరమైన విషయమేమిటంటే ఇన్ని హెచ్చరికలు చేయబడినా ముస్లింలు నిశ్చింతగా అందమైన కలలుగంటూ, సదాచరణకు దూరమై కాలక్షేపం చేస్తూ ఉండిపోతున్నారు.

177. ఇక్కడ సాఫల్యానికి ఒక ప్రమాణం, ఒక ఆదర్శం చూపబడింది. అదేమిటంటే ఇహపరలోకాలలో విజయం, మోక్షం పొందగోరినవాడు తన్ను తాను బేషరతుగా అల్లాహ్‌కు సమర్పించుకోవాలి. సదాచరణ చేయాలి. తమ పితామహుడైన ఇబ్రాహీము (అలైహిస్సలాం) ధర్మాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ఎందుకంటే ఇబ్రాహీము (అలైహిస్సలాం)ను దేవుడు తన నేస్తంగా చేసుకున్నాడు. ఎవరి హృదయంలో అల్లాహ్ పట్ల నిజమైన ప్రేమాభిమానాలు గూడుకట్టుకుంటాయో, వేరెవరికీ అందులో చోటు లేకుండా ఉంటుందో అతడు, నేస్తం లేక స్నేహితుడు (ఖలీల్) అనబడతాడు. 'ఖలీల్' అనేది కర్త్రాపదం. కర్త్రాపదంలో 'చేసేవాడు' అనే అర్థం వస్తుంది. ఈ విధంగా ఖలీల్ అనే మాటకు అభిమానించేవాడు అని అర్థం. అయితే కొంతమంది దీన్ని కర్మణి పదంగా భావించారు. (కర్మణి పదంలో 'చేయబడ్డవాడు' అనే అర్థం వస్తుంది). ఈ విధంగా 'ఖలీల్' అన్న పదానికి అభిమానించబడినవాడు అన్న భావం వస్తుంది. రెండు అర్థాలూ సరైనవే. ఎందుకంటే ఇబ్రాహీమ్ అల్లాహ్‌ను అభిమానించారు, అల్లాహ్ చేత అభిమానించబడ్డారు కూడా (ఫత్‌హుల్ ఖదీర్). అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రకటించారు : "ఇబ్రాహీమును స్నేహితునిగా చేసుకున్నట్లే అల్లాహ్ నన్ను కూడా స్నేహితునిగా చేసుకున్నాడు" (సహీహ్ ముస్లిం : కితాబుల్ మసాజిద్).

178. స్త్రీల హక్కుల గురించి ఆనాడు జనులు వెలిబుచ్చే సందేహాలకు ఈ ఆయతులో సమాధానాలివ్వబడ్డాయి.

يَتٰمَى النِّسَآءِ الّٰتِىْ لَا تُؤْتُوْنَهُنَّ مَا كُتِبَ
لَهُنَّ وَ تَرْغَبُوْنَ اَنْ تَنْكِحُوْهُنَّ
وَالْمُسْتَضْعَفِيْنَ مِنَ الْوِلْدَانِ ۙ وَاَنْ تَقُوْمُوْا
لِلْيَتٰمٰى بِالْقِسْطِ ؕ وَمَا تَفْعَلُوْا مِنْ خَيْرٍ
فَاِنَّ اللّٰهَ كَانَ بِهٖ عَلِيْمًا ﴿127﴾

ఆడ పిల్లలకు మీరు, వారి కొరకు నిర్ధారించబడిన హక్కును వారికివ్వకుండా,[179] వారిని వివాహమాడాలనే మీ కోరిక గురించీ,[180] బలహీనులైన పిల్లల గురించీ[181] మీకు వినిపించ బడుతున్న ఖుర్‌ఆన్ ఆయతులు కూడా (మిమ్మల్ని ఆదేశి స్తున్నాయి). ఇంకా తండ్రిలేని బిడ్డల విషయంలో న్యాయంగా వ్యవహరించమని[182] కూడా ఆయన మీకు ఆజ్ఞాపిస్తున్నాడు. మీరు ఏ మంచిపని చేసినా దాని గురించి అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు.

179. పైన అరబీ వాక్యంలోని **'మా యుత్‌లా అలైకుమ్'** (మీకు చదివి వినిపించబడే ఆయతులు) అన్న పదం **"అల్లాహు యుఫ్‌తీకుమ్"** (అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు) అన్న వాక్యంతో అత్‌ఫ్ సంబంధాన్ని కలిగివుంది. దాని ప్రకారం అర్థం ఇలా వస్తుంది: అల్లాహ్ దీని గురించి వివరిస్తున్నాడు, అలాగే అనాథ బాలికలకు సంబంధించి గ్రంథంలో ఇంతకు మునుపే అవతరించిన వాక్యాలు కూడా ఈ విషయాన్ని విపులీకరిస్తున్నాయి. నిసా సూరాలోని 3వ ఆయతులో ఈ తప్పీళ్లు ఉన్నాయి. అందంగా ఉన్న అనాథ ఆడపిల్లలను మీరు పెండ్లాడటానికైతే ఎగబడతారుగాని వారి మహర్ హక్కును చెల్లించరు. ఇది అన్యాయం అని అక్కడ చెప్పబడింది.

180. అరబీలో **'రగిబ'** (رَغِبَ) అంటే ఆసక్తి చూపటం. వాస్తవంలో ఈ పదం రెండు అర్థాల కోసం ఉపయోగించబడుతుంది. 1. రగిబ ఫీ (ఆసక్తిని కల్గి ఉండటం) 2. రగిబ అన్ (ఆసక్తి లేకపోవటం). దీని ప్రకారం పై ఆయతును రెండు విధాలుగా తర్జుమా చేయవచ్చు. పై ఆయతులో కేవలం **తర్‌గబూన** అని మాత్రమే ఉంది. ('తర్‌గబూన' – అనేది 'రగిబ'కు వర్తమాన క్రియారూపం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి). 'తర్‌గబూన' తర్వాత **'ఫీ'** ( فِى ) అయినా ఉండవచ్చు. **'అన్'** (عَنْ) అయినా ఉండవచ్చు. ఉర్దూ అనువాదకులు దానితర్వాత 'ఫీ' ఉన్నట్లుగా భావించి తర్జుమా చేశారు (వారిని వివాహమాడాలనే 'మీ కోరిక' గురించి అని). ఇక రెండో అర్థం తీసుకుంటే, అనగా 'తర్‌గబూన' తర్వాత అన్ ఉన్నట్లు భావించినట్లయితే 'వారిని వివాహమాడాలనే కోరిక మీకు లేనప్పుడు' అని అనువదించవలసి వస్తుంది. 'రగిబ అన్' అనే పదానికి ఆసక్తి లేకపోవటం, నిర్లక్ష్యం చేయటం అనే అర్థాలున్నా యనటానికి ఇంకో ఉదాహరణ కూడా ఖుర్‌ఆన్‌లో ఉంది. "వమన్ **యర్‌గబు అన్** మిల్లతి ఇబ్రాహీమ ఇల్లా మన్ సఫిహ నఫ్‌సహ్" (శుద్ధ అవివేకి మాత్రమే ఇబ్రాహీమ్ ధర్మాన్ని నిర్లక్ష్యంచేస్తాడు – అల్ బఖర సూరా:130వ ఆయతు).

రెండవ అనువాదం దృష్ట్యా భావం ఇలా వస్తుంది : తండ్రిలేని ఆడపిల్ల అందంగా లేనప్పుడు ఆమె ఆలనాపాలనా చూస్తున్నవారు ఆమెను పెండ్లాడటం పట్ల ఆసక్తి చూపరు. లేదా ఆమెతోపాటు ఆస్తికి వారసులైన ఇతరులు కూడా ఆమెను నికాహ్ చేసుకోవటానికి ముందుకు రారు. వేరొకచోట ఆమెకు యిచ్చి పెండ్లిచేయటం పట్ల కూడా శ్రద్ధ కనబరచరు – ఆమెకు చెందవలసిన వారసత్వ హక్కులో వేరొకరు భాగస్వాములు కాకూడదన్న దురుద్దేశ్యంతో. మొదటి అనువాదాన్ని తీసుకున్నా, రెండవ అనువాదాన్ని తీసుకున్నా – అంతిమంగా భావం మాత్రం ఒక్కటే. పైన పేర్కొనబడిన రెండు పద్ధతులూ అన్యాయపూరితమైనవే. ఖుర్‌ఆన్ ఈ రెండు రకాల అన్యాయాలనూ ఖండిస్తోంది.

181. అనాథ బాలికల వ్యవహారంలోనూ (నిసా సూరాలోని 3వ ఆయతు చూడండి), బలహీనులు, నిస్సహాయులైన బాలల విషయంలోనూ (నిసా సూరా 11వ ఆయతు) మీకు చదివి వినిపించబడే వాక్యాలలో కూడా మీకు దేవుని మార్గదర్శక సూత్రాలు లభిస్తాయి. నిసా సూరా 11వ ఆయతులో కొడుకులతోపాటు, కూతుళ్లకు కూడా ఆస్తిలో భాగం యివ్వాలన్న ఆజ్ఞ ఇవ్వబడింది. కారణం ఏమిటంటే, అజ్ఞానకాలంలో (ఇస్లాంకు పూర్వం) సంతానంలో పెద్దవారిని మాత్రమే వారసులుగా పరిగణించి, చిన్నవారికి, బలహీనులకు, ఆడవారికి అన్యాయం చేసేవారు. అయితే ఇస్లామీయ షరీయతు వీళ్లందరినీ ఆస్తికి వారసులుగా – హక్కుదారులుగా – ఖరారు చేసింది.

وَإِنِ امْرَأَةٌ خَافَتْ مِنْ بَعْلِهَا نُشُوزًا أَوْ إِعْرَاضًا
فَلَا جُنَاحَ عَلَيْهِمَا أَنْ يُصْلِحَا بَيْنَهُمَا صُلْحًا ۚ
وَالصُّلْحُ خَيْرٌ ۗ وَأُحْضِرَتِ الْأَنْفُسُ الشُّحَّ ۚ وَإِنْ
تُحْسِنُوا وَتَتَّقُوا فَإِنَّ اللَّهَ كَانَ بِمَا تَعْمَلُونَ
خَبِيرًا ﴿128﴾

**128** భర్త తనను ఈసడించుకుంటాడనో లేక తనను పట్టించుకోడనో స్త్రీకి భయమున్నప్పుడు వారిద్దరూ పరస్పరం సర్దుబాటు చేసుకుంటే అందులో వారిరువురిపై ఏమాత్రం దోషం లేదు.[183] సర్దుబాటు అన్నింటికన్నా మేలైనది. 'పేరాశ' అనేది ప్రతి ప్రాణిలోనూ పొందుపరచబడి ఉంది.[184] ఒకవేళ మీరు ఔదార్యాన్ని చూపి, భయభక్తుల వైఖరిని అవలంబించినట్లయితే మీ వ్యవహార శైలి అల్లాహ్‌కు తెలుస్తుంది.

وَلَنْ تَسْتَطِيعُوا أَنْ تَعْدِلُوا بَيْنَ النِّسَاءِ وَلَوْ حَرَصْتُمْ
فَلَا تَمِيلُوا كُلَّ الْمَيْلِ فَتَذَرُوهَا كَالْمُعَلَّقَةِ ۚ وَإِنْ
تُصْلِحُوا وَتَتَّقُوا فَإِنَّ اللَّهَ كَانَ غَفُورًا رَحِيمًا ﴿129﴾

**129** మీరు ఎంతగా ఆశించినప్పటికీ, శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ మీ భార్యలందరి మధ్య మీరు అన్నివిధాలా న్యాయం చెయ్యటమన్నది మీ వల్ల కాని పని. కాబట్టి మీరు పూర్తిగా ఒకామె వైపుకు మొగ్గిపోయి, రెండో ఆవిడను అనిశ్చిత స్థితిలో పడవెయ్యకండి.[185] ఒకవేళ మీరు మీ ధోరణిని సరిదిద్దుకుని, భయభక్తుల (తఖ్వా)తో మసలుకుంటే నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు.

182. అనాథుల పట్ల న్యాయసమ్మతంగా వ్యవహరించండి అన్న దైవగ్రంథంలోని ఉపదేశం కూడా మీకు పదే పదే చదివి వినిపించబడుతోంది. తండ్రిలేని ఆడపిల్ల అందగత్తె అయినా, కాకపోయినాసరే ఆమె యెడల మీ వ్యవహారం ఒకే విధంగా ఉండాలి. రెండు పరిస్థితుల్లోనూ మీరు ఆమెకు న్యాయం చేయాలి.

183. ఏ కారణంగానయినా భర్త తన భార్యకు దూరంగా ఉండటమో లేక ఆమెను నిర్లక్ష్యం చేయటమో చేస్తే లేదా ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలున్నప్పుడు అందచందాల రీత్యా వెనుకంజవేసిన భార్య పట్ల ఉదాసీనంగా ఉండటం లాంటిది చేస్తే – అట్టి పరిస్థితిలో భార్య తన భర్తతో ఏదైనా ఒక 'అవగాహన'కు వస్తే (ఉదాహరణకు మహర్ సొమ్మును వదలుకోవటం లేక మనోవర్తిని వదలుకోవటం లేదా తన 'వంతు'ను త్యాగం చేయటం వంటివి చేస్తే) అందులో తప్పులేదు. ఎందుకంటే పరస్పర సదవగాహన లేక సర్దుబాటు వైఖరి సర్వవిధాలా శ్రేయస్కరం. విశ్వాసుల మాతయగు సౌదా (ర.అన్హా) కూడా ముసలితనంలో తన 'వంతు'ను తన సవతి అయిన ఆయిషా (ర.అన్హా)కోసం త్యాగం చేశారు. ఈ నిర్ణయాన్ని దైవప్రవక్త (సఅసం) కూడా ఆమోదించారు (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం: కితాబున్నికాహ్).

184. అరబీలో **'షుహ్హ్'** (**شُحّ**) అంటే పేరాశ, పిసినారితనం, స్వార్థప్రియత్వం అనే అర్థాలు వస్తాయి. సాధారణంగా ప్రతి ఒక్కరికీ సొంత లాభం అత్యంత ప్రీతికరం అయి ఉంటుంది. దానికోసం ప్రతి ప్రాణీ పిసినారిగానూ, పేరాశతోనూ వ్యవహరిస్తుంది.

185. మనిషి ఎంత న్యాయశీలుడైనప్పటికీ ప్రేమానురాగాల రీత్యా భార్యలందరి మధ్య సమభావం చూపటం అన్నది సాధ్యం కాని పని. అన్నవస్త్రాలు సమకూర్చటంలో, ఇతరత్రా భౌతిక అవసరాలు తీర్చటంలో అతడు హెచ్చుతగ్గులు లేకుండా మసలుకున్నప్పటికీ, మానసికంగా మాత్రం సమభావాన్ని పాటించలేడు. ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలున్నప్పుడు అతని మనసు ఒకామె వైపు ఎక్కువగా మొగ్గిపోవచ్చు. ఎందుకంటే ప్రేమ అన్నది మనసుతో ముడిపడినది. దానిపై అదుపు సాధ్యం కాదు. స్వయంగా అంతిమ దైవప్రవక్త (సఅసం)నే చూడండి – తన సతీమణుల్లో ఆయన (స) ఆయిషా (ర.అన్హా)ను అధికంగా ప్రేమించేవారు. భార్యల మధ్య న్యాయం చేయాలన్న కోరిక ఉన్నప్పటికీ

**130** ఒకవేళ వారిరువురూ విడిపోవటం జరిగితే, అప్పుడు అల్లాహ్ తన విస్తృతమైన అనుగ్రహంతో వారిరువురికీ– ఒకరి అవసరం ఇంకొకరికి లేకుండా – తోడ్పడతాడు.[186] అల్లాహ్ అపారమైన విస్తృతి కలవాడు, వివేక సంపన్నుడు.

وَإِن يَتَفَرَّقَا يُغْنِ اللَّهُ كُلًّا مِّن سَعَتِهِ ۚ
وَكَانَ اللَّهُ وَاسِعًا حَكِيمًا ﴿١٣٠﴾

**131** ఆకాశాలలో, భూమిలో వున్న సమస్తమూ అల్లాహ్‌దే. అల్లాహ్‌కు భయపడుతూ మెలగవలసిందిగా మేము మీకు పూర్వం గ్రంథం వొసగబడినవారికీ, మీకూ ఆజ్ఞాపించాము. ఒకవేళ మీరు తిరస్కరిస్తే, ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దేననీ, అల్లాహ్ అక్కరలు లేనివాడనీ, స్తోత్రనీయుడనీ మరువకండి.

وَلِلَّهِ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ ۗ وَلَقَدْ
وَصَّيْنَا الَّذِينَ أُوتُوا الْكِتَابَ مِن قَبْلِكُمْ وَإِيَّاكُمْ
أَنِ اتَّقُوا اللَّهَ ۚ وَإِن تَكْفُرُوا فَإِنَّ لِلَّهِ مَا فِي
السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ ۚ وَكَانَ اللَّهُ غَنِيًّا
حَمِيدًا ﴿١٣١﴾

న్యాయం చేయటం అసాధ్యం అని అనబడటంలోని మర్మం ఏమిటంటే తిండితిప్పల విషయంలో మీరు సమానంగా వ్యవహరించినా ఒకామె వైపుకు మొగ్గిపోతున్న మనసును మాత్రం నియంత్రించలేరు. అయితే ఈ మానసిక దౌర్బల్యంపై దేవుడు నిలదీయడు. మహాప్రవక్త (సఅసం) ఈ విషయంలో మన ముందు ఓ ఉత్తమ ఆదర్శాన్ని నెలకొల్పారు. కాని చాలామంది ఇక్కడే దెబ్బతింటూ ఉంటారు. తమ ఈ మానసిక ప్రేమ మూలంగా ఒక భార్య వైపుకు పూర్తిగా మొగ్గిపోయి ఇతర భార్యల హక్కుల్ని ఉపేక్షిస్తూ ఉంటారు. తమకు 'ప్రియాతి ప్రియమైన భార్య'ను సుఖపెట్టడానికి అష్టకష్టాలూ పడతారు. కాని ఇతర భార్యల కనీస అవసరాలు కూడా తీర్చరు. వారి కష్టసుఖాలను కనీసం అడిగి తెలుసుకోరు. పైగా వాళ్ళను డోలాయమాన స్థితిలో వదలివేస్తారు. అంటే; వాళ్లతో అటు సవ్యంగా కాపురమూ చేయరు, ఇటు వాళ్ళను విడాకులైనా ఇవ్వరు. ఎటూకాని పరిస్థితిలో ఉంచి, వారి జీవితాలతో ఆడుకుంటారు. ఇది అన్యాయం, దుర్మార్గం. ఇస్లాం దీన్ని అరికట్టగోర్తుంది. భార్యల మధ్య పక్షపాత వైఖరిని అవలంబించే వ్యక్తినుద్దేశ్యించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వక్కాణించారు : "ఎవరికైతే ఇద్దరు భార్యలుండగా అతడు ఒకామె వైపుకు మొగ్గిపోతాడో (అంటే మరొకామెను ఉపేక్షిస్తాడో) అతడు ప్రళయదినాన శరీరంలోని ఒక పార్శ్వం పడిపోయిన స్థితిలో వస్తాడు" (తిర్మిజీ : కితాబున్నికాహ్).

186. ఇది ఆఖరి స్థితి. ఎంత ప్రయత్నించినా ఆలుమగల మధ్య రాజీ సాధ్యం కానపుడు విడాకుల (తలాఖ్) ద్వారా వేర్పడిపోవటమే మంచిది. విడిపోయిన తరువాత ఆ మగవాడి అభిరుచికి తగ్గ భార్య దొరుకుతుందేమో! అలాగే ఆ స్త్రీకి ఆమె స్వభావంతో సమన్వయం చెందగల భర్త దొరుకుతాడేమో! ఇస్లాంలో 'తలాఖ్' అత్యంత అయిష్టకరమైన ఘట్టంగా అభివర్ణించబడింది. ఒక హదీసులో ఇలా ఉంది: "తలాఖ్ ధర్మ సమ్మతమే. కాని ధర్మసమ్మతమైన వాటిలో అల్లాహ్‌కు ఎంతో అయిష్టకరమైనది తలాఖ్" (అబూ దావూద్, మిష్కాత్). అయినాసరే విడాకులకు అల్లాహ్ అనుమతించాడు. ఎందుకంటే ఒక్కోసారి పరిస్థితులు ఎంత సంక్లిష్టంగా రూపుదాలుస్తాయంటే విడిపోవటం వినా గత్యంతరం ఉండదు. విడాకులే వారి పాలిట మేలు అనిపిస్తాయి. కాబట్టి 'సర్దుకుపోవటం ఇక అసంభవం' అనుకున్నప్పుడే విడాకులను ఆశ్రయించాలని ఖుర్ఆన్ హదీసులు చెబుతున్నాయి.

పైన పేర్కొనబడిన హదీసు, ఆధారాల రీత్యా, బలహీనమైనదయినప్పటికీ భార్యాభర్తల మధ్య సర్దుబాటు అసాధ్యంగా పరిణమించినప్పుడే ఈ హక్కును వినియోగించాలని ఖుర్ఆన్ మరియు సున్నతుల ద్వారా స్పష్టం అవుతోంది.

**గమనిక :** పైన పేర్కొనబడిన అబూ దావూద్‌లోని హదీసును షేఖ్ అల్‌బానీగారు బలహీనమైనదిగా ఖరారు చేశారు (ఇర్వావుల్ గలీల్, 2040వ హదీసు). అయితే షరీఅత్‌పరమైన కారణమేదీ లేకుండా విడాకులు ఇవ్వటం అవాంఛనీయం అన్న విషయంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు.

وَلِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۗ
وَكَفٰى بِاللّٰهِ وَكِيْلًا ﴿132﴾

**132** ఆకాశాలలో, భూమిలో ఉన్న వస్తువులన్నీ అల్లాహ్ అధీనం లోనే ఉన్నాయి. కార్యనిర్వాహకారిగా అల్లాహ్ చాలు.

اِنْ يَّشَاْ يُذْهِبْكُمْ اَيُّهَا النَّاسُ وَيَاْتِ بِاٰخَرِيْنَ ۗ
وَكَانَ اللّٰهُ عَلٰى ذٰلِكَ قَدِيْرًا ﴿133﴾

**133** అల్లాహ్‌యే గనక తలిస్తే ఓ ప్రజలారా! మిమ్మల్ని తొలగించి, మీ స్థానంలో ఇతరుల్ని తేగలడు.[187] ఈ పని చేయగల పూర్తి శక్తి అల్లాహ్‌కు ఉంది.

مَنْ كَانَ يُرِيْدُ ثَوَابَ الدُّنْيَا فَعِنْدَ اللّٰهِ ثَوَابُ
الدُّنْيَا وَالْاٰخِرَةِ ۗ وَكَانَ اللّٰهُ سَمِيْعًا بَصِيْرًا ﴿134﴾

**134** ఎవరయితే ప్రాపంచిక ప్రతిఫలాన్ని కోరుకుంటున్నాడో (అతడు), అల్లాహ్ వద్ద ప్రాపంచిక ప్రతిఫలంతో పాటు పరలోక ప్రతిఫలం కూడా ఉంది (అని తెలుసుకోవాలి).[188] అల్లాహ్ అంతా వినేవాడు, అన్నింటినీ చూసేవాడు సుమా!

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُوْنُوْا قَوّٰمِيْنَ بِالْقِسْطِ
شُهَدَآءَ لِلّٰهِ وَلَوْ عَلٰٓى اَنْفُسِكُمْ اَوِ الْوَالِدَيْنِ
وَالْاَقْرَبِيْنَ ۚ اِنْ يَّكُنْ غَنِيًّا اَوْ فَقِيْرًا فَاللّٰهُ
اَوْلٰى بِهِمَا ۗ فَلَا تَتَّبِعُوا الْهَوٰٓى اَنْ تَعْدِلُوْا ۚ
وَاِنْ تَلْوٗٓا اَوْ تُعْرِضُوْا فَاِنَّ اللّٰهَ كَانَ بِمَا
تَعْمَلُوْنَ خَبِيْرًا ﴿135﴾

**135** ఓ విశ్వసించిన వారలారా! మీరు న్యాయం విషయంలో గట్టిగా నిలబడండి. అల్లాహ్ ప్రసన్నత నిమిత్తం (సత్యం మాత్రమే పలికే) సాక్షులుగా ఉండండి – అది మీ స్వయానికీ, మీ తల్లి దండ్రులకు, మీ బంధువులకు వ్యతిరేకంగా పరిణమించినా సరే![189] అతను ధనికుడయినా, పేదవాడైనా సరే. వారి పట్ల అల్లాహ్ (మీకన్నా) ఎక్కువ శ్రేయోభిలాషి.[190] కాబట్టి మీరు మీ మనోవాంఛకు లొంగిపోయి న్యాయాన్ని వీడకండి.[191] ఒకవేళ మీరు మీ సాక్ష్యాన్ని వక్రీకరించినా, సాక్ష్యం చెప్పటానికి విముఖత చూపినా[192] మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుసు సుమా!

187. ఇది దేవుని ప్రచండ శక్తికి నిదర్శనం. విముఖత చూపిన వారి అవసరం ఆయనకు లేదు. ఈ విషయాన్నే దేవుడు వేరొకచోట ఈ విధంగా సెలవిచ్చాడు : "మీరు గనక వెన్నుచూపితే మీ స్థానంలో ఆయన వేరితరులను తెస్తాడు. వారు మీలాంటి వారై ఉండరు" (ముహమ్మద్ – 38).

188. ఎవరయినా కేవలం యుద్ధప్రాప్తి (మాలె గనీమత్) కోసం ధర్మయుద్ధం చేస్తే అంతకన్నా అవివేకం మరొకటి ఏముంటుంది? అలాగే అల్లాహ్ ఇహపరాల సాఫల్యాలు రెండింటినీ ప్రసాదించటానికి సిద్ధంగా ఉండగా ఒకే ఒక్క లాభాన్ని కోరుకుని దానికోసం ఎగబడటం ఎంతవరకు సమంజసం? మనిషి రెండింటినీ ఎందుకు కాంక్షించకూడదు?

189. నిత్యం న్యాయానికి, ధర్మానికి కట్టుబడి ఉండాలనీ, సాక్ష్యమిస్తే సత్యబద్ధంగానే య్వివాలనీ ఈ వచనంలో విశ్వాసులకు అల్లాహ్ గట్టిగా తాకీదు చేస్తున్నాడు. తాము చెప్పే సాక్ష్యం తమకు, తమ తల్లిదండ్రులకు, తమ ఆత్మీయులకు నష్టకరంగా పరిణమించినప్పటికీ వెనుకాడరాదని కూడా ప్రబోధించటం జరిగింది. ఎందుకంటే సత్యం అన్నిటికన్నా ముఖ్యం. అందరినీ శాసించగలిగేది సత్యం మాత్రమే.

190. అంటే నిందితుడు శ్రీమంతుడైనందున న్యాయం, సాక్ష్యం విషయంలో అతని పట్ల సడలింపుల ధోరణిని అవలంబించటంగానీ, లేక అతడు పేదవాడైనందువల్ల అతని మీద జాలిపడటంగానీ చేయకూడదు. వాళ్ల విషయంలో దేవుడు మీకన్నా ఎక్కువ ప్రేమమయుడు.

191. అంటే మీ మనోవాంఛ, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, వర్గ దురభిమానం, రాగద్వేషాలు మిమ్మల్ని న్యాయం, ధర్మాల

**136** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను, ఆయన తన ప్రవక్త (స)పై అవతరింపజేసిన గ్రంథాన్నీ, అంతకు మునుపు ఆయన అవతరింపజేసిన గ్రంథాలన్నిటినీ విశ్వసించండి.[193] ఎవడు అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమ దినాన్ని తిరస్కరించాడో వాడు మార్గం తప్పి చాలాదూరం వెళ్ళిపోయాడు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓا۟ ءَامِنُوا۟ بِٱللَّهِ وَرَسُولِهِۦ وَٱلْكِتَٰبِ ٱلَّذِى نَزَّلَ عَلَىٰ رَسُولِهِۦ وَٱلْكِتَٰبِ ٱلَّذِىٓ أَنزَلَ مِن قَبْلُ ۚ وَمَن يَكْفُرْ بِٱللَّهِ وَمَلَٰٓئِكَتِهِۦ وَكُتُبِهِۦ وَرُسُلِهِۦ وَٱلْيَوْمِ ٱلْءَاخِرِ فَقَدْ ضَلَّ ضَلَٰلًۢا بَعِيدًا ﴿١٣٦﴾

విషయంలో గుడ్డివారిగా చేయరాదు సుమా! ఈ విషయాన్నే అల్లాహ్ వేరొక చోట ఇలా సెలవిచ్చాడు : "ఒకరిపట్ల గల విరోధం కారణంగా మీరు న్యాయాన్ని వదలకండి" (అల్ మాయిద - 8).

192. అరబీలో **'తల్‌వూ'** ( تَلْوُوْا ) అనబడింది. ఇది **'లై'** నుండి ఏర్పడిన పదం. **లై** అంటే విషయాన్ని వక్రీకరించటం, తారుమారు చేయటం, ఉద్దేశ్యపూర్వకంగా అబద్ధం చెప్పటం అని అర్థం. అంటే తప్పుడు సాక్ష్యం యివ్వటం, సాక్ష్యానికి పెడర్థాలు తీయటం అని భావం. విముఖత చూపటమంటే సత్యాన్ని కప్పిపుచ్చటం లేక సాక్ష్యం చెప్పకుండా ఉండటం అన్నమాట! – ఈ రెండు విషయాలకు కూడా దూరంగా ఉండాలని తాకీదు చేయబడింది. దీని సారాంశం ఇది : 1. ఎట్టి పరిస్థితిలోనూ న్యాయం చేయాలి. న్యాయం విషయంలో వైముఖ్య ధోరణి పనికిరాదు. తాము చెప్పటం వల్ల ఒకరు తమ గురించి ఏమనుకుంటారోనని ఆలోచించకూడదు. ఆశ్రిత పక్షపాతానికి ఏమాత్రం తావీయకూడదు. పైగా ఈ ధర్మకాంటాను నెలకొల్పటంలో పరస్పరం అందరూ సహాయ సహకారాలందించుకోవాలి. 2. న్యాయం చెప్పేటప్పుడు, సాక్ష్యం యిచ్చేటప్పుడు కేవలం దైవప్రీతి మీ దృష్టిలో ఉండాలి. అప్పుడే మీరు విషయానికి వక్రభాష్యం చెప్పటం, లేనిపోని మతలబులు తీయటం, సాక్ష్యాన్ని దాచటం వంటివాటికి దూరంగా ఉంటారు. ఇంకా మీరు సమత్వం సమతూకాలను స్థాపించగలుగుతారు. 3. మీరు యిచ్చే తీర్పు స్వయంగా మీకు, మీ తల్లిదండ్రులకు, మీ ఆప్తులకు నష్టకరంగా రూపొందినాసరే మీరు న్యాయం నుంచి వైదొలగకూడదు. సర్వకాల సర్వావస్థల్లో మీరు న్యాయంపై నిలకడగా ఉండాలి. 4. కలవారి కీర్తి ప్రతిష్ఠల్ని చూసి మెతకవైఖరిని అవలంబించటమో, లేనివారి దైన్యస్థితికి జాలిపడి మృదువుగా వ్యవహరించటమో చేయకండి. వారిద్దరి పాలిట ఏది శ్రేయస్కరమో దైవానికే బాగా తెలుసు. 5. తీర్పు సమయంలో మనోవాంఛలకు దాసులైపోయి ఒక వైపుకు మొగ్గిపోవటం, వర్గ దురభిమానం చేత అన్యాయస్థునికి అండగా నిలవటం వంటివి సుతరామూ సహించరానివి. కాబట్టి ఈ సంకుచిత, పక్షపాత పద్ధతులన్నింటినీ అధిగమించి నిష్పక్షపాతంగా న్యాయం చేయండి.

ఈ సమత్వం, సమతూకం నెలకొల్పబడే సమాజంలో శాంతీ సుస్థిరతలు వెల్లివిరుస్తాయి. ఆ సమాజంపై దేవుడు తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. కటాక్షిస్తాడు. ఈ విషయాన్ని మహాప్రవక్త ప్రియసహచరులు (రజి) బాగా అర్థం చేసుకున్నారు. దానికొక ఉపమానం ఇది : ఖైబర్‌లోని యూదుల అధీనంలో ఉన్న పొలాల, తోటల ఉత్పత్తులను అంచనా వేసే నిమిత్తం మహాప్రవక్త (సఅసం) తన సహచరులైన అబ్దుల్లా బిన్ రవాహ (రజి)ను పంపించారు. తీరా అక్కడికి చేరుకున్నాక యూదులు ఆయనకు లంచం ఇవ్వబోయారు. ఆయన వారిపట్ల పట్టువిడుపుల ధోరణిని అవలంబించాలన్నదే ఆ లంచం ఉద్దేశ్యం. దానికాయన ఏమన్నారో చూడండి: "దైవం తోడు! ప్రపంచంలో నాకు అందరికన్నా ప్రియతముడైన వ్యక్తి తరఫున నేను ప్రతినిధిగా వచ్చాను. నా దృష్టిలో అత్యంత అయిష్టకరమైన వారు మీరు. అయితే మా నాయకుని ప్రేమగానీ, మీ పట్ల నాకున్న అయిష్టతగానీ నన్ను అన్యాయం కొరకు పురికొల్పలేవు." ఆయన గారి మాటలు విని, "ఈ సమతూకం (న్యాయశీలం) మూలంగానే భూమ్యాకాశాల వ్యవస్థ సురక్షితంగా నిలబడి ఉంది" అని యూదులు అభిప్రాయపడ్డారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

193. విశ్వసించినవారినే విశ్వసించమని తాకీదు చేయటం–చర్విత చర్వణం వంటిదికాదు. వాస్తవానికి ఈ ఆయతు పరిపూర్ణంగా విశ్వసించాలనీ, ఆ తర్వాత దానిపై నిలకడగా ఉండాలనీ ప్రజలను ఆదేశిస్తోంది. ఫాతిహా సూరాలోని **"ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమ్"** అనే వేడుకోలు వచనాన్ని మాటిమాటికీ ఉచ్చరించటం వెనుక ఉన్న ఆంతర్యం కూడా యిదే.

**137** ఎవరు విశ్వసించి మళ్ళీ తిరస్కారులయ్యారో, మళ్లీ విశ్వసించి మళ్లీ తిరస్కార వైఖరికి ఒడిగట్టారో, ఆపైన తమ తిరస్కార వైఖరిలో పెచ్చురిల్లిపోయారో అలాంటి వారిని అల్లాహ్ ససేమిరా క్షమించడు. అటువంటి వారికి సన్మార్గం కూడా చూపడు.[194]

إِنَّ الَّذِينَ آمَنُوا ثُمَّ كَفَرُوا ثُمَّ آمَنُوا ثُمَّ كَفَرُوا ثُمَّ ازْدَادُوا كُفْرًا لَّمْ يَكُنِ اللَّهُ لِيَغْفِرَ لَهُمْ وَلَا لِيَهْدِيَهُمْ سَبِيلًا ﴿١٣٧﴾

**138** కపటులకు వ్యధాభరితమైన శిక్ష ఖాయం అన్న శుభవార్తను వారికి అందజెయ్యి.

بَشِّرِ الْمُنَافِقِينَ بِأَنَّ لَهُمْ عَذَابًا أَلِيمًا ﴿١٣٨﴾

**139** వారు ఎలాంటివారంటే, విశ్వాసులను వదలి అవిశ్వాసులను తమ మిత్రులుగా చేసుకుంటున్నారు.[195] ఏమిటీ? వారు గౌరవ ప్రతిష్ఠల కోసం వారి వద్దకు వెళుతున్నారా? యదార్థానికి గౌరవమంతా అల్లాహ్ అధీనంలో ఉంది[196] (అని వారు తెలుసుకోవాలి).

الَّذِينَ يَتَّخِذُونَ الْكَافِرِينَ أَوْلِيَاءَ مِن دُونِ الْمُؤْمِنِينَ ۚ أَيَبْتَغُونَ عِندَهُمُ الْعِزَّةَ فَإِنَّ الْعِزَّةَ لِلَّهِ جَمِيعًا ﴿١٣٩﴾

**140** అల్లాహ్ తన గ్రంథంలో ఇదివరకే మీ వద్దకు ఈ ఆజ్ఞను అవతరింపజేశాడు: ఎవరైనా అల్లాహ్ వాక్యాలను తిరస్కరిస్తూ, పరిహాసమాడుతున్నట్లు మీరు విన్నట్లయితే, – వారు ఆ మాటలు విడిచి పెట్టి వేరే మాటలు మాట్లాడటం మొదలు పెట్టనంత వరకూ – ఆ సమూహంలో వారితో కలసి కూర్చోకండి.

وَقَدْ نَزَّلَ عَلَيْكُمْ فِي الْكِتَابِ أَنْ إِذَا سَمِعْتُمْ آيَاتِ اللَّهِ يُكْفَرُ بِهَا وَيُسْتَهْزَأُ بِهَا فَلَا تَقْعُدُوا مَعَهُمْ حَتَّىٰ يَخُوضُوا فِي حَدِيثٍ غَيْرِهِ ۚ إِنَّكُمْ

194. యూదులను దృష్టిలో పెట్టుకుని ఈ హెచ్చరిక చేయబడిందని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. యూదులు దైవప్రవక్త మూసానైతే విశ్వసించారు. కాని ఉజైర్‌ను తిరస్కరించారు. ఉజైర్‌ను విశ్వసించినపుడు ఈసాను తిరస్కరించారు. ఆ తరువాత తిరస్కార మార్గంలో పురోగమిస్తూపోయారు. ఆఖరికి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను కూడా తిరస్కరించారు.

ఈ వాక్యం కపటుల్ని ఉద్దేశ్యించి అవతరించిందని మరికొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. ముస్లింలకు కీడు కలిగించాలన్నది వారి ఉద్దేశం అయి ఉండటం వల్ల వారు మాటిమాటికీ ముసల్మానులై మళ్లీ తమ కాపట్యరోగం మూలంగా అపమార్గం వైపుకు వెళ్ళిపోయేవారు. తత్ఫలితంగా ఆఖరికి వారు సన్మార్గం వైపుకు వచ్చే అవకాశాలు మృగ్యమై పోయాయి.

195. ఇది కపటుల ద్విపాత్రాభినయం! ఇంతకుముందు అల్ బఖరా సూరాలో కూడా వారి ఈ ద్వంద్వ ప్రవృత్తి ప్రస్తావనకు వచ్చింది. అవిశ్వాసులను కలుసుకున్నప్పుడు వారు "నిజానికి మేము మీ స్నేహితులమే. ముస్లింలతో స్నేహితులుగా నటిస్తున్నామంతే" అని అనేవారు.

196. అంటే అవిశ్వాసులతో కలివిడిగా ఉన్నంతమాత్రాన మీకు గౌరవప్రతిష్ఠలు లభిస్తాయనుకుంటే అది ఒట్టి భ్రమ మాత్రమే. గౌరవం అనేది అల్లాహ్ అధీనంలో ఉంది. దాన్ని ఆయన విశ్వసించిన వారికి వొసగుతాడు. "గౌరవాన్ని అభిలషించే ప్రతివాడూ, అల్లాహ్ మాత్రమే గౌరవానికి పూర్తిగా అర్హుడని తెలుసుకోవాలి" (ఫాతిర్ – 10).

"వాస్తవానికి గౌరవం అనేది అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు, విశ్వాసులకు మాత్రమే వర్తిస్తుంది. కాని కపటులకు ఈ విషయం తెలియదు" (అల్ మునాఫిఖూన్ –8). అంటే వీరు కపట చేష్టల ద్వారా, అవిశ్వాసులతో స్నేహం చేయటం ద్వారా గౌరవం పొందాలనుకుంటున్నారు. నిజానికి ఈ పద్ధతి పరాభవానికి గురిచేస్తుంది, గౌరవానికి కాదు.

إِذًا مِّثْلُهُمْ ۗ إِنَّ اللَّهَ جَامِعُ الْمُنَافِقِينَ وَالْكَافِرِينَ فِي جَهَنَّمَ جَمِيعًا ﴿١٤٠﴾

(అన్యథా) మీరు కూడా ఆ సమయంలో వారిలాంటి వారుగానే పరిగణించబడతారు.[197] అల్లాహ్ నిశ్చయంగా కపటులను, అవిశ్వాసులందరినీ నరకంలో పోగుచేయనున్నాడు.

الَّذِينَ يَتَرَبَّصُونَ بِكُمْ فَإِن كَانَ لَكُمْ فَتْحٌ مِّنَ اللَّهِ قَالُوا أَلَمْ نَكُن مَّعَكُمْ وَإِن كَانَ لِلْكَافِرِينَ نَصِيبٌ قَالُوا أَلَمْ نَسْتَحْوِذْ عَلَيْكُمْ وَنَمْنَعْكُم مِّنَ الْمُؤْمِنِينَ ۚ فَاللَّهُ يَحْكُمُ بَيْنَكُمْ يَوْمَ الْقِيَامَةِ ۗ وَلَن يَجْعَلَ اللَّهُ لِلْكَافِرِينَ عَلَى الْمُؤْمِنِينَ سَبِيلًا ﴿١٤١﴾

**141** ఈ కపటులు మీకు ఏ గతి పడుతుందోనని ఆసక్తితో ఎదురుచూస్తూ ఉంటారు. ఒకవేళ అల్లాహ్ తరఫు నుంచి మీకు విజయం చేకూరితే, "మేము మీతో లేమా?!" అని అంటారు. ఒకవేళ అవిశ్వాసులకు కాస్తంత ఆధిక్యత లభిస్తే, "మీకు వ్యతిరేకంగా పోరాడే శక్తి మాకు లేదా? (అయినాసరే) మేము ముస్లింల బారి నుంచి మిమ్మల్ని రక్షించలేదా?"[198] అని (కపటులు) వారితో అంటారు. కాబట్టి ప్రళయదినాన అల్లాహ్ స్వయంగా మీ మధ్య తీర్పు చేస్తాడు.[199] అల్లాహ్ ఎన్నటికీ అవిశ్వాసులకు, విశ్వాసులపై (విజయ) మార్గం సుగమం చేయడు.[200]

197. అంటే, వారించినప్పటికీ దైవవాక్యాలను ఎగతాళి చేసేవారి సమూహంలో గనక మీరు కూర్చుంటే, వారి పెడసరి ధోరణిని మీరు ఖండించకపోతే ఆ పాపంలో మీరు కూడా వారితో సమానులే అవుతారు. ఉదాహరణకు ఒక హదీసులో ఇలా ఉంది : "మీలో అల్లాహ్ మరియు అంతిమ దినంపై విశ్వాసం ఉన్న వ్యక్తి, మద్యం సేవించబడే విందులో పాల్గొనకూడదు" (ముస్నదె అహ్మద్ : సంపుటి – 1, పేజీలు – 20, సంపుటి:2, పేజి: 339). దీనిద్వారా తెలిసేదేమిటంటే దైవం మరియు దైవప్రవక్త (స) ఆదేశాలను మాటల ద్వారాగాని, చేతల ద్వారాగాని ఎగతాళి చేసే సమావేశాలలో, కార్యక్రమాలలో హాజరవటం అధర్మం. నేటి నాయకుల, పాశ్చాత్య నాగరికతా ప్రభావితుల సమావేశాలలో జరిగేది కూడా యిదే. వివాహాది వేడుకలు మొదలుకుని పుట్టిన రోజు పండుగల వరకూ నేడు అన్నిచోట్లా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఆదేశాలను పరిహసించటం జరుగుతున్నది. ఇస్లాం ఆదేశాలను నిర్లక్ష్యం చేయటం కూడా వాటిని పరిహసించటం క్రిందికే వస్తుంది. ఇటువంటి వేడుకల్లో పాల్గొనటం మహాపాపం. మనసుల్లో విశ్వాసం ఉండాలేగాని, "మీరు కూడా వారిలాంటివారే" అన్న ఆయతు విశ్వాసుల హృదయాలను వణికిస్తోంది!

198. అంటే; "మేము గనక తలిస్తే మిమ్మల్ని ఓడించే వాళ్ళమే. మా స్నేహితులు కదా! అన్న ఉద్దేశ్యంతో ఊరుకున్నాం. ముస్లింల పక్షాన నిలువకుండా మేము పరోక్షంగా మీకు సహాయపడ్డాం. వారి బారి నుంచి మిమ్మల్ని రక్షించాం. మేము అవలంబించిన ఈ ద్వంద్వ నీతి మూలంగానే మీకు ఆధిక్యత లభించింది. పైకి మేము ముస్లింల మనుషులుగా కనబడినా ముస్లింలకు నష్టం కలిగించటానికి లభించిన ఏ అవకాశాన్నీ మేము వదలుకోలేదు. ఎట్టకేలకు మీరు ముస్లింలపై ఆధిపత్యం సంపాదించారు. కాబట్టి మేము మీ మనుషులమేనని నమ్మండి" – కపటులు అవిశ్వాసులతో చెప్పిన మాటల సారాంశమిది!

199. ప్రపంచంలో మీరు మోసంతో, వంచనతో తాత్కాలిక ప్రయోజనాల్ని పొందినప్పటికీ పరలోకంలో మీ ఎత్తుగడలేమీ పనికిరావు. అల్లాహ్ మీ ఆంతర్యాల్లో ఉన్న భావాలు, భావనలన్నింటినీ ఎరిగినవాడు. వాటన్నింటినీ ఆయన బట్టబయలు చేసి, ఆపైన తీర్పు చెబుతాడు. అప్పుడు తెలిసివస్తుంది – కపటనీతి ఎంత ఘోర పరాభవానికి కారణభూతమవుతుందో! దాని మూలంగా శాశ్వత నరకశిక్ష అనుభవించవలసి వస్తుంది (అల్లాహ్ శరణు!)

200. అంటే ఎట్టి పరిస్థితిలోనూ దేవుడు అవిశ్వాసులకు ఆధిక్యతను వొసగడు. ఈ వాక్యానికి ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు విభిన్న భావార్థాలు చెప్పారు: 1. ఇస్లాం అనుయాయులకు లభించే ఈ ఆధిక్యత తీర్పు దినానికి సంబంధించినది. 2. వాదన రీత్యాగానీ, ఆధారాలు నిదర్శనాల దృష్ట్యాగానీ అవిశ్వాసులు ముస్లింలపై ఎన్నటికీ ఆధిక్యతను పొందలేరు. 3.ఎప్పుడన్నా

إِنَّ الْمُنٰفِقِيْنَ يُخٰدِعُوْنَ اللّٰهَ وَهُوَ خَادِعُهُمْ ۚ
وَإِذَا قَامُوْٓا إِلَى الصَّلٰوةِ قَامُوْا كُسَالٰى ۙ يُرَآءُوْنَ
النَّاسَ وَلَا يَذْكُرُوْنَ اللّٰهَ إِلَّا قَلِيْلًا ﴿١٤٢﴾

**142** నిశ్చయంగా కపటులు అల్లాహ్‌ను మోసం చేయ జూస్తున్నారు. అయితే అల్లాహ్ వారి మోసానికి శిక్ష విధించ నున్నాడు.[201] వారు నమాజు కోసం నిలబడినప్పుడు ఎంతో బద్ధకంతో,[202] కేవలం జనులకు చూపే ఉద్దేశంతో నిలబడ తారు.[203] ఏదో నామ మాత్రంగా దైవాన్ని స్మరిస్తారు.[204]

مُّذَبْذَبِيْنَ بَيْنَ ذٰلِكَ ۖ لَآ إِلٰى هٰٓؤُلَآءِ وَلَآ إِلٰى
هٰٓؤُلَآءِ ۚ وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَلَنْ تَجِدَ لَهٗ
سَبِيْلًا ﴿١٤٣﴾

**143** వారు ఎటూ కాకుండా మధ్యలోనే ఊగిసలాడుతున్నారు. పూర్తిగా అటూ ఉండరు, సరిగ్గా ఇటూ ఉండరు.[205] అల్లాహ్ ఎవరినయితే అపమార్గం పాల్జేస్తాడో వాని కోసం నీవు ఏ మార్గాన్నీ కనుగొనలేవు.

---

అవిశ్వాసులకు ఆధిక్యత లభించినా, ముస్లింల వైభవం, వారి సంస్కృతీ నాగరికతలు సమసిపోయేంత ఆధిక్యత మాత్రం ఎప్పుడూ లభించదు. ఒక సహీహ్ హదీసు ద్వారా కూడా ఈ తాత్పర్యానికి సమర్థన లభిస్తోంది. 4.ముస్లింలు తమ ధర్మావలంబనలో స్థిరంగా ఉన్నంతవరకూ, వారు అధర్మాన్ని అసహ్యించుకుంటూ, చెడులను అరికడుతూ ఉన్నంత వరకూ అవిశ్వాసులు వారిని లొంగదీసుకోలేరు. ఇమామ్ ఇబ్నుల్ అరబీ ఇలా అంటున్నారు: "అన్నింటికన్నా ఉత్తమమైన అర్థం ఇదే." ఎందుకంటే అల్లాహ్ ఈ విధంగా సెలవిస్తున్నాడు: "మీపై ఏ విపత్తు వచ్చిపడినా అది మీరు సంపాదించుకున్న దాని ఫలం అయి ఉంటుంది" (అష్ షూరా-30). అంటే ముస్లింలు ఎప్పుడు, ఎక్కడ ఓటమిని చవిచూసినా అది వారి పొరబాటు వల్లనేనని తెలుసుకోవాలి (ఫత్‌హుల్ ఖదీర్). దీనిద్వారా తెలిసేదేమిటంటే, ముస్లింల పరాజయం, పరాధీనత వారు చేసుకున్న తప్పుల ఫలితమే.

201. దీనికి సంబంధించిన సంక్షిప్త వివరణ అల్ బఖరా సూరా ప్రారంభంలోనే వచ్చింది.

202. ఇస్లాం మూల స్థంభాలలో ఎంతో ముఖ్యమైనది నమాజు. అందులో కూడా కపటులు తమ బద్ధకాన్ని, సోమరితనాన్ని ప్రదర్శించేవారు. ఎందుకంటే వారి అంతరంగాలలో విశ్వాసంగానీ, దైవభీతిగానీ, చిత్తశుద్ధిగానీ ఉండేవి కావు. అందుకే ఇషా, ఫజ్ర్ నమాజులు వారికెంతో భారం అనిపించేవి. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ప్రవచించినట్లు, "కపటులపై ఇషా, ఫజ్ర్ వేళల నమాజులు మరీ భారంగా ఉంటాయి" (సహీహ్ బుఖారీ: మవాఖీతుస్సలాత్ – సహీహ్ ముస్లిం, కితాబుల్ మసాజిద్).

203. నమాజు చేసినా వారు (కపటులు) జనులకు చూపే ఉద్దేశ్యంతో, ముస్లింలను మోసపుచ్చే సంకల్పంతో చేస్తారే తప్ప మనసారా చేయరు.

204. అల్లాహ్‌ను ఏదో నామమాత్రానికి స్మరిస్తారు. లేక నమాజు చేసినా క్లుప్తంగా చేస్తారు. నమాజులో చిత్తశుద్ధి, దైవభక్తి, అణకువ, వినమ్రత లోపించినపుడు మనిషి నిదానంగానూ, ఏకాగ్ర చిత్తంతోనూ నమాజు చేయలేడు. అల్ బఖరా సూరాలోని 45వ వచనంలో చెప్పబడినట్లు, నిశ్చయంగా నమాజు కష్టమైన పనే. కాని అల్లాహ్‌కు భయపడే దాసులకు అది ఎంతమాత్రం కష్టతరం కాదు. హదీసులలో అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: "ఇదీ కపటి నమాజు, ఇదీ కపటి నమాజు, ఇదీ కపటి నమాజు. అతడు కూర్చొని సూర్యుని కోసం నిరీక్షిస్తాడు. సూర్యుడు షైతాన్ యొక్క రెండు కొమ్ముల మధ్య ఉన్నప్పుడు (అంటే సూర్యాస్తమయ సమయం ఆసన్నమైనపుడు) లేచి టకటకా నాలుగు సజ్దాలు చేసేస్తాడు" (సహీహ్ ముస్లిం : కితాబుల్ మసాజిద్; ముఅత్తా : కితాబుల్ ఖుర్ఆన్).

205. అవిశ్వాసుల వద్దకు వెళ్ళినపుడు వారి సహవాసులుగా చెప్పుకుంటారు. ముస్లింల వద్దకు వచ్చినప్పుడు వారి శ్రేయోభిలాషులుగా నటిస్తారు. పై నుంచిగానీ, లోపలి నుంచిగానీ వారు పూర్తిగా అవిశ్వాసుల వైపునా లేరు, పూర్తిగా ముస్లింల వైపునా లేరు. పైకి ముస్లింల మనుషులుగా కానవస్తున్నప్పటికీ లోపలి నుంచి అవిశ్వాసుల మంచిని

**144** ఓ విశ్వసించిన వారలారా! విశ్వాసులను వదలి అవిశ్వాసులను మిత్రులుగా చేసుకోకండి. ఏమిటీ, మీకు వ్యతిరేకంగా మీరే అల్లాహ్‌కు స్పష్టమైన ఆధారం సమకూర్చదలుస్తున్నారా?[206]

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَتَّخِذُوا الْكٰفِرِيْنَ اَوْلِيَآءَ مِنْ دُوْنِ الْمُؤْمِنِيْنَ ؕ اَتُرِيْدُوْنَ اَنْ تَجْعَلُوْا لِلّٰهِ عَلَيْكُمْ سُلْطٰنًا مُّبِيْنًا ﴿144﴾

**145** కపటులు నిశ్చయంగా నరకంలోని అధమాతి అధమ శ్రేణిలోకిపోతారు.[207] వారికి సహాయపడే వారిని నీవు ఎన్నటికీ చూడలేవు.

اِنَّ الْمُنٰفِقِيْنَ فِى الدَّرْكِ الْاَسْفَلِ مِنَ النَّارِ ۚ وَلَنْ تَجِدَ لَهُمْ نَصِيْرًا ﴿145﴾

కాంక్షిస్తున్నారు. మరి కొంతమంది కపటులు విశ్వాసానికి – అవిశ్వాసానికీ మధ్య ఊగిసలాడుతున్నారు. అందుకే కపటి గురించి మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా వ్యాఖ్యానించారు : "కపటి ఉపమానం (గొఱ్ఱెపోతుతో జతకట్టడానికి) రెండు గొఱ్ఱె మందల మధ్య తారట్లాడే గొఱ్ఱెలాంటిది. ఒక్కోసారి అది ఒక మంద వైపుకు పోతే, మరోసారి మరోమంద వైపుకు వెళుతుంది" (సహీహ్ ముస్లిం : కితాబుల్ మునాఫిఖీన్).

206. అంటే అవిశ్వాసులతో స్నేహసంబంధాలు పెట్టుకోరాదని అల్లాహ్ తాకీదు చేస్తున్నాడు. ఇది తెలిసిన తరువాత కూడా ఎవరయినా ఇక మీదట వారిని దోస్తులుగా చేసుకుంటే, మీరు స్వయంగా మీకు వ్యతిరేకంగా సాక్ష్యాన్ని సమకూర్చు కుంటున్నారని భావం.

207. మనసులో ఒకటి, మాటలో ఒకటి! పైన మృదుత్వం, లోపలంతా కుళ్లు!! – ఇదే కాపట్యం. ఈ కాపట్య రోగం ఉన్నవారిని కపటులుగా వ్యవహరించటం జరిగింది. ప్రజలను మోసగించి, తమ పబ్బం గడుపుకునే ఉద్దేశ్యంతో కపటులు ఈ ద్వంద్వ నీతిని పాటిస్తారు. మహాప్రవక్త (సఅసం) కాలంలో ఇలాంటి ఒక వర్గం ఉండేది. వారు తమను ముస్లింలుగా పైకి చెప్పుకున్నప్పటికీ, నిజానికి వారు ముస్లిములు కారు. వారి ఆంతర్యాల్లో కాపట్యం, తిరస్కారం తిష్ఠవేసి ఉండేవి. వారి లోగుట్టును గురించి అల్లాహ్ వహీ (దైవవాణి) ద్వారా తన ప్రవక్త (స)కు పూర్తిగా తెలియజేశాడు. అయితే దైవప్రవక్త (స) ఆనాటి పరిస్థితుల దృష్ట్యా వారి లోగుట్టును బట్టబయలు చేయలేదు. కాకపోతే కాపట్య రోగ లక్షణాలను ఆయన (స) సంకేతప్రాయంగా తెలియజేశారు. తద్వారా ముస్లింలు కపటులను పసిగట్టేవారు. ఆయన (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరిలో నాలుగు దుష్ట లక్షణాలు పొడసూపుతాయో అతడు పరిపూర్ణ నయవంచకుడు (కపటి) అయి ఉంటాడు: మరెవరిలో ఈ నాల్గింటిలో ఒక దుర్గుణం ఉంటుందో దాన్ని విడనాడ నంతవరకూ అతనిలో కాపట్యంలోని ఒక భాగం ఉంటుంది. అవేమంటే; 1. అతని వద్ద అమానతు (అప్పగింత)ను భద్రపరిస్తే దాన్ని కాజేస్తాడు. 2. మాట్లాడితే అబద్ధం చెబుతాడు. 3. ఆడి తప్పుతాడు. 4. జగడానికి దిగినపుడు సత్యాన్ని ధర్మాన్ని పరిత్యజించి అసత్యానికీ అడ్డగోలుకు ఒడిగడతాడు" (సహీహ్ బుఖారీ : ఈమాన్ – బాబు అలామతిల్ మునాఫిఖ్; ముస్లిం: ఈమాన్ – బాబు బయాని ఖసాయిలిల్ మునాఫిఖ్). ఇవిగాక యింకా ఇతర దుర్గుణాలు కూడా రానున్న ఆయతులలో వివరించబడ్డాయి.

ఒకవేళ నేటి ముస్లింలలో ఈ స్వభావం కనిపిస్తే వారు తమలోని ఈ అవగుణాలను బట్టి కపటులను పోలినవారుగా పరిగణించబడతారని పండితులు వ్యాఖ్యానించారు. మరికొంతమంది విద్వాంసులు విశ్వాసం లోపించిన కపటులు – ఆచరణ శూన్యమైన కపటులు అని వర్గీకరించారు. దైవప్రవక్త (స) కాలంలోని కపటులలో విశ్వాసం (ఈమాన్) లోపించి ఉండేది. కాని నేటి క్రియాశూన్యమైన ముస్లింలలో విశ్వాసమైతే ఉందిగానీ ఆచరణ లోపించింది. ఈమాన్ లోపించిన వారికి విధించబడే శిక్ష కాఫిర్లు, ముష్రిక్కుల మాదిరిగా శాశ్వత నరక శిక్ష అయి ఉంటుంది. అయితే ఆచరణ లోపించిన వారికి అల్లాహ్ విధించే శిక్ష ఆయన అభీష్టాన్ని బట్టి ఉంటుంది.

దీనికి ఇంకొక భావం అనువాదంలో చెప్పబడిన విషయమే. అంటే అల్లాహ్ వారి కపటవైఖరికి తగిన శిక్ష విధిస్తాడు. వారు ఇహలోకంలో సన్మార్గానికి దూరం అవటమే గాకుండా, పరలోకంలో నరకంలోని అట్టడుగు స్థానాన ఉంటారు. మరి కొంతమంది విద్వాంసులు ఏమని చెప్పారంటే తీర్పుదినాన వారికి తొలుత వెలుగు ప్రసాదించబడుతుంది.

إِلَّا الَّذِينَ تَابُوا وَأَصْلَحُوا وَاعْتَصَمُوا بِاللَّهِ
وَأَخْلَصُوا دِينَهُمْ لِلَّهِ فَأُولَٰئِكَ مَعَ الْمُؤْمِنِينَ ۖ
وَسَوْفَ يُؤْتِ اللَّهُ الْمُؤْمِنِينَ أَجْرًا عَظِيمًا ﴿١٤٦﴾

**146** అయితే పశ్చాత్తాపం చెంది, తమ ప్రవర్తనను చక్కదిద్దుకుని, అల్లాహ్‌ను గట్టిగా నమ్మి, తమ ధర్మాన్ని అల్లాహ్ కొరకే ప్రత్యేకించుకున్నట్లయితే అప్పుడు వీరు విశ్వాసులతోపాటు ఉంటారు.[208] త్వరలోనే అల్లాహ్ విశ్వాసులకు గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

مَا يَفْعَلُ اللَّهُ بِعَذَابِكُمْ إِنْ شَكَرْتُمْ وَآمَنْتُمْ ۚ
وَكَانَ اللَّهُ شَاكِرًا عَلِيمًا ﴿١٤٧﴾

**147** మీరు కృతజ్ఞులుగా మసలుకుంటూ, విశ్వాసులుగా ఉన్నప్పుడు[209] అల్లాహ్ మిమ్మల్ని శిక్షించి ఏం చేస్తాడు? అల్లాహ్ విలువనిచ్చేవాడూ, అన్నీ తెలిసినవాడు.[210]

لَا يُحِبُّ اللَّهُ الْجَهْرَ بِالسُّوءِ مِنَ الْقَوْلِ
إِلَّا مَنْ ظُلِمَ ۚ وَكَانَ اللَّهُ سَمِيعًا عَلِيمًا ﴿١٤٨﴾

**148** అన్యాయానికి గురైనవాడు తప్ప, ఏ మనిషి అయినా చెడు మాటలు బిగ్గరగా పలకటాన్ని అల్లాహ్ ఇష్టపడడు.[211] అల్లాహ్ అంతా వినేవాడూ, అన్నీ తెలిసినవాడు.

---

వారు ఆ వెలుగులో ముస్లింలతో కలసి నడుస్తారు. ఆ తరువాత వారిపై అంధకారం ఆవరిస్తుంది. అల్ హదీద్ సూరాలోని 13వ వాక్యంలో ఈ విషయం వివరించబడింది. – (ఈ అంశం అనువాదకుల తరఫు నుంచి).

నరకంలోని అట్టడుగు ప్రదేశం **'హావియ'** అనబడుతుంది. అల్లాహ్ దాన్నుంచి మనల్ని రక్షించుగాక! కాపట్య గుణాలు మనలో జొరబడకుండా ఉండుగాక!!

208. అంటే ; కపటుల్లోని వారెవరయినాసరే చిత్తశుద్ధితో ఈ నాలుగు సద్గుణాలను పుణికి పుచ్చుకుంటే అల్లాహ్ వారిని నరకాగ్ని బారినుంచి రక్షించి, సజ్జనులతో పాటు స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు.

209. కృతజ్ఞులుగా మెలగటమంటే భావం దైవాజ్ఞల్ని అనుసరించి చెడులకు దూరంగా ఉండటం, సత్కార్యాలను మనస్ఫూర్తిగా చేయటం అన్నమాట! ఇది దైవానుగ్రహాలకు క్రియాత్మకంగా చూపే కృతజ్ఞతాభావం. ఈమాన్ (విశ్వాసం) అంటే దేవుని ఏకత్వాన్ని, ఆయన పోషకత్వాన్ని, అంతిమ దైవప్రవక్త (స) వారి ప్రభవనాన్ని, ఆయన సందేశాన్ని మనసారా నమ్మి తదనుగుణంగా నడవటం.

210. అంటే దైవానుగ్రహాల పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండేవారిని దేవుడు తప్పక ఆదరిస్తాడు. మనస్ఫూర్తిగా విశ్వసించిన వారెవరో దైవానికి ఎరుకే. వారి విశ్వాస స్థాయిని, ఆచరణా తీరునుబట్టి ఆయన వారికి అంతస్థులను ప్రసాదిస్తాడు.

211. ఒకరిలో ఏదైనా చెడుగు ఉంటే దాన్ని చర్చనీయాంశంగా చేయరాదనీ, ఏకాంతంలో అతన్ని నచ్చజెప్పాలని షరీయతు తాకీదు చేస్తోంది. ఒకవేళ ధర్మానికి నష్టం వాటిల్లుతున్న పక్షంలో దాన్ని బహిర్గతం చేయవచ్చు. అలాగే పబ్లిగ్గా చెడుకు పాల్పడటం కూడా ఎంతమాత్రం వాంఛనీయం కాదు. ఆ మాటకొస్తే చెడును గుట్టుగా చేసినా, బహిరంగంగా చేసినా–అది అధర్మమే, నిషిద్ధమే! మరి ఆ చెడును బాహాటంగా చేస్తే అది మరింత దారుణం అనిపించుకుంటుంది. దివ్య ఖుర్ఆన్ పైన పేర్కొనబడిన ఈ రెండు రకాల చెడులనూ బయట పెట్టటాన్ని ఖండిస్తోంది. అలాగే ఒక వ్యక్తిని అతను చేయని తప్పుకి లేక చేసిన తప్పుకైనా అతన్ని ఎడాపెడా దులిపేయటం కూడా ఇందులోకి వచ్చేస్తుంది. అంటే దీన్ని కూడా ఖుర్ఆన్ ఖండిస్తున్నది.

అయితే దుర్మార్గుని మూలంగా అన్యాయానికి గురయ్యే వ్యక్తికి మాత్రం తూలనాడే అనుమతి యివ్వబడింది. తనకు జరిగిన అన్యాయాన్ని నలుగురి ముందూ వివరించటానికి కూడా అనుమతి ఉంది. దీనివల్ల జరిగే ఒక మేలు ఏమిటంటే ఆ చెడ్డవాడు ఇకమీదట చెడుకు దూరంగా ఉండవచ్చు లేదా బాధిత వ్యక్తికి జరిగిన నష్టాన్ని చెల్లించవచ్చు. రెండో మేలు ఏమిటంటే; ఈ సంఘటన జనులకు గుణపాఠం కాగలదు. హదీసులో ఇలా ఉంది: ఒకవ్యక్తి దైవప్రవక్త

إِن تُبْدُوا خَيْرًا أَوْ تُخْفُوهُ أَوْ تَعْفُوا عَن سُوٓءٍ
فَإِنَّ اللَّهَ كَانَ عَفُوًّا قَدِيرًا (149)

**149** మీరు ఏదన్నా మంచి పనిని బహిర్గతంగా చేసినా, గుట్టుగా చేసినా లేక ఏదైనా చెడుగును మన్నించి వదలి పెట్టినా[212] అల్లాహ్ అమితంగా మన్నించేవాడు, సర్వశక్తుడూ (అని తెలుసుకోండి.)

إِنَّ الَّذِينَ يَكْفُرُونَ بِاللَّهِ وَرُسُلِهِ وَيُرِيدُونَ
أَن يُفَرِّقُوا بَيْنَ اللَّهِ وَرُسُلِهِ وَيَقُولُونَ نُؤْمِنُ
بِبَعْضٍ وَنَكْفُرُ بِبَعْضٍ وَيُرِيدُونَ أَن يَتَّخِذُوا
بَيْنَ ذَٰلِكَ سَبِيلًا (150)

**150** ఎవరయితే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను తిరస్కరిస్తారో, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తల మధ్య భేదభావం పాటించ దలుస్తున్నారో, ఇంకా "మేము కొంతమంది ప్రవక్తలను విశ్వ సిస్తాం, మరి కొంతమందిని విశ్వసించం" అని చెబుతూ, రెంటికీ మధ్య ఓ (సరికొత్త) మార్గాన్ని తీయదలుస్తున్నారో–

أُولَٰٓئِكَ هُمُ الْكَافِرُونَ حَقًّا ۚ وَأَعْتَدْنَا لِلْكَافِرِينَ
عَذَابًا مُّهِينًا (151)

**151** వీళ్ళే అసలైన అవిశ్వాసులు.[213] ఇలాంటి అవిశ్వాసుల కొరకు మేము అవమానకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాము.

وَالَّذِينَ آمَنُوا بِاللَّهِ وَرُسُلِهِ وَلَمْ يُفَرِّقُوا بَيْنَ
أَحَدٍ مِّنْهُمْ أُولَٰٓئِكَ سَوْفَ يُؤْتِيهِمْ أُجُورَهُمْ ۗ
وَكَانَ اللَّهُ غَفُورًا رَّحِيمًا (152)

**152** (దీనికి భిన్నంగా) ఎవరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలం దరినీ విశ్వసించి, వారిలో ఎవరి మధ్యా తేడా చూపకుండా ఉంటారో వారికి అల్లాహ్ వారి పూర్తి పుణ్యఫలాన్ని ప్రసా దిస్తాడు.[214] అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు.

---

(సఅసం) సన్నిధిలోకి వచ్చి, తన పొరుగువాడు తనను అదేపనిగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశాడు. "నీ ఇంట్లోని సామానును తీసి వీధిలో పెట్టు" అని ఆయన (స) అతనికి సలహా యిచ్చారు. ఆ వ్యక్తి అదే పనిచేశాడు. దారిగుండా నడచిపోయే వారంతా 'ఏమిటీ సంగతి?' అని విచారించసాగారు. ఆ వ్యక్తి తన పొరుగువాని వేధింపులను ఏకరువు పెట్టేవాడు. దాంతో దారిన వెళ్ళేవారంతా ఆ పొరుగువాడ్ని శపించేవారు. ఈ పరిస్థితి పొరుగువాడికి ఎంతో ఇబ్బందికరంగా తయారయింది. ఎట్టకేలకు అతడు క్షమాపణ కోరుకోవటమే గాక, ఇకమీదట ఎన్నడూ వేధించనని నిర్ణయించుకున్నాడు. బయటవున్న సామానును ఇంట్లోకి తరలించమని కూడా అతడు ప్రాధేయపడ్డాడు" (సుననె అబూ దావూద్ : కితాబుల్ అదబ్).

212. ఎవరయినా తోటి వ్యక్తిపై దౌర్జన్యానికి పాల్పడితే, తనకు జరిగిన అన్యాయం మేరకే ప్రతీకారం తీర్చుకోవటానికి ఇస్లామీయ షరీయతు అనుమతినిచ్చింది. "పరస్పరం దుర్భాషకు, తిట్లకు దిగిన ఇరువురిలో ముందుగా తిట్ల పురాణం మొదలెట్టిన వానిపై ఆ పాపం పడుతుంది. అయితే బాధితుడైన ఎదుటి వ్యక్తి (కేవలం తిట్టుకు జవాబు మాత్రమే చెప్పి) హద్దు మీరకుండా ఉన్నప్పుడే ఇలా జరుగుతుంది (సహీహ్ ముస్లిం: కితాబుల్ బిర్ర్). ప్రతీకారం తీర్చుకునే అనుమతి యివ్వబడినప్పటికీ, దుర్మార్గుణ్ణి మన్నించి వదలిపెట్టడం ఉత్తమం అని సెలవీయబడింది. ఎందుకంటే అల్లాహ్ సర్వశక్తుడు, శిక్షించే అధికారం కలవాడైనప్పటికీ, ఆయన సయితం అన్యాయానికి ఒడిగట్టిన దాసులను అమితంగా మన్నిస్తున్నాడు. అందుకే ఖుర్‌ఆన్‌లో వేరొకచోట ఇలా చెప్పబడింది: "చెడుకు ప్రతిక్రియ అదే రకమయిన చెడు. కాని ఎవరయినా క్షమించి, సంస్కరణకు ప్రయత్నిస్తే దానికి ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది" (అష్ షూరా– 40). ఒక హదీసులో ఇలా ఉంది : "క్షమించటం వల్ల అల్లాహ్ గౌరవాన్ని మరింత అధికం చేస్తాడు" (సహీహ్ ముస్లిం : కితాబుల్ బిర్ర్ వస్సిలా – బాబు ఇస్తిహ్‌బాబిల్ అఫ్వి వత్తవాజువ్).

213. గ్రంథవహులు కొంతమంది ప్రవక్తల్ని విశ్వసించి, మరి కొంతమందిని తిరస్కరించేవారు. ఈ విషయం ఇంతకుముందు కూడా ప్రస్తావనకు వచ్చింది. ఉదాహరణకు : యూదులు ఈసా (అలైహిస్సలాం)ను, ముహమ్మదు (సఅసం)ను

يَسْـَٔلُكَ اَهْلُ الْكِتٰبِ اَنْ تُنَزِّلَ عَلَيْهِمْ كِتٰبًا
مِّنَ السَّمَآءِ فَقَدْ سَاَلُوْا مُوْسٰٓى اَكْبَرَ مِنْ ذٰلِكَ
فَقَالُوْٓا اَرِنَا اللّٰهَ جَهْرَةً فَاَخَذَتْهُمُ الصّٰعِقَةُ
بِظُلْمِهِمْ ۚ ثُمَّ اتَّخَذُوا الْعِجْلَ مِنْۢ بَعْدِ مَا
جَآءَتْهُمُ الْبَيِّنٰتُ فَعَفَوْنَا عَنْ ذٰلِكَ ۚ وَاٰتَيْنَا
مُوْسٰى سُلْطٰنًا مُّبِيْنًا ﴿153﴾

**153** (ఓ ప్రవక్తా!) నీవు ఆకాశం నుంచి ఏదైనా గ్రంథాన్ని తమపై అవతరింపజెయ్యవలసిందిగా ఈ గ్రంథవహులు నిన్ను అడుగుతున్నారు.[215] వారు దీనికన్నా పెద్ద కోరికే మూసాను కోరి ఉన్నారు. "మాకు అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూపించు" అని వారు కోరారు. వారి ఈ దుర్మార్గ వైఖరి మూలంగా వారిపై పిడుగు విరుచుకుపడింది. ఆపైన వారి వద్దకు ఎన్నో స్పష్టమైన నిదర్శనాలు వచ్చిన తరువాత కూడా వారు ఆవు దూడను తమ ఆరాధ్య దైవంగా చేసుకున్నారు. అప్పటికీ మేము దాన్ని మన్నించాము. ఇంకా, మేము మూసాకు స్పష్టమైన ప్రాబల్యాన్ని (బహిరంగ నిదర్శనాన్ని) వొసగాము.

وَرَفَعْنَا فَوْقَهُمُ الطُّوْرَ بِمِيْثَاقِهِمْ وَقُلْنَا لَهُمُ
ادْخُلُوا الْبَابَ سُجَّدًا وَّقُلْنَا لَهُمْ لَا تَعْدُوْا
فِى السَّبْتِ وَاَخَذْنَا مِنْهُمْ مِّيْثَاقًا غَلِيْظًا ﴿154﴾

**154** వారి నుంచి ప్రమాణం తీసుకోవటానికి మేము వారిపైకి తూరు పర్వతాన్ని ఎత్తాము. సజ్దా చేస్తూ (నగర) ద్వారంలోనికి ప్రవేశించమని వారిని ఆజ్ఞాపించాము. శనివారం నాడు హద్దు మీరి ప్రవర్తించవద్దని కూడా వారికి ఉపదేశించాము. ఈ విధంగా మేము వారినుంచి చాలా గట్టి వాగ్దానం తీసుకున్నాము.

فَبِمَا نَقْضِهِمْ مِّيْثَاقَهُمْ وَكُفْرِهِمْ بِاٰيٰتِ اللّٰهِ
وَقَتْلِهِمُ الْاَنْۢبِيَآءَ بِغَيْرِ حَقٍّ وَّقَوْلِهِمْ قُلُوْبُنَا
غُلْفٌ ؕ بَلْ طَبَعَ اللّٰهُ عَلَيْهَا بِكُفْرِهِمْ فَلَا
يُؤْمِنُوْنَ اِلَّا قَلِيْلًا ﴿155﴾

**155** వారు ప్రమాణ భంగం చేయటం వల్లనూ, దైవాజ్ఞల పట్ల తిరస్కార వైఖరికి ఒడిగట్టడం వల్లనూ, ప్రవక్తలను అన్యాయంగా హతమార్చటం వల్లనూ,[216] "మా హృదయాలపై గలేబులున్నాయి" అని చెప్పటం వల్లనూ (వారికీ శాస్తి జరిగింది). వాస్తవానికి వారి తిరస్కారం కారణంగా అల్లాహ్ వారి హృదయాలకు సీలువేశాడు. అందువల్ల వారు చాలా తక్కువగా మాత్రమే విశ్వసిస్తారు.

నిరాకరించగా, క్రైస్తవులు ముహమ్మదు (స)ను నిరాకరించారు. కాగా; ప్రవక్తల మధ్య భేదభావం కనబరచేవారంతా అవిశ్వాసుల కోవకు చెందినవారేనని అల్లాహ్ స్పష్టం చేశాడు.

214. విశ్వాసుల విధానం ఏమిటో యిక్కడ తేటతెల్లం చేయటం జరిగింది. వారు ప్రవక్తలందరినీ విశ్వసిస్తారు. ఉదాహరణకు: ముస్లిలు అంతిమ దైవప్రవక్త (స)తో సహా, అంతకుముందు ప్రభవింపజేయబడిన దైవప్రవక్తలందరినీ విశ్వసిస్తారు. ఈ ఆయతులో 'మతాలన్నీ ఒక్కటే' (వహ్‌దతె అద్‌యాన్) అన్న భావన ఖండించబడింది. ముహమ్మద్ (స) ప్రవక్త దైవదౌత్యాన్ని విశ్వసించనివారి మత భావాలన్నీ త్రోసిపుచ్చబడ్డాయి. కేవలం దైవంపై విశ్వాసం కలిగి ఉంటే సరిపోదనీ, దైవంతో పాటు అంతిమ దైవప్రవక్త (స)పై విశ్వాసం కలిగి ఉంటేనే సాఫల్యం సిద్ధిస్తుందనీ, ఈ దృక్పథంపై నమ్మకం లేనివారు మోక్షం పొందజాలరని ఖుర్‌ఆన్ స్పష్టం చేసింది. (మరిన్ని వివరాల కోసం అల్ బఖర సూరాలోని 62వ ఆయతు వివరణను చూడండి).

215. అంటే, దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) ఏ విధంగా తూర్ పర్వతం పైకి వెళ్ళి పలకలపై వ్రాయబడి ఉన్న తౌరాతు గ్రంథాన్ని తెచ్చాడో అదేవిధంగా (ఓ ముహమ్మద్!) మీరు కూడా ఆకాశం మీదికి వెళ్ళి లిఖిత ఖుర్‌ఆన్‌ను తీసుకురండి అని వారు కోరారు. వారి ఈ కోరిక వెనుక ఈర్ష్య, ద్వేషం, విరోధం తప్ప మరేమీ లేవు.

**156** వారు తిరస్కారానికి పాల్పడటం వల్ల, మర్యమ్‌పై చాలా ఘోరమైన అపనిందను మోపటం వల్ల,[217]

**157** ఇంకా – "మర్యమ్ పుత్రుడగు దైవప్రవక్త ఈసాను మేము హతమార్చాము" అని అనటం వల్ల – (వారు శిక్షను చవిచూశారు). నిజానికి వారు ఆయన్ని చంపనూలేదు,[218] శిలువ పైకి ఎక్కించనూ లేదు. నిజం ఏమిటంటే, వారి కొరకు ఆయన్ని పోలిన వ్యక్తి రూపొందించబడ్డాడు.[219] ఈసా విషయంలో విభేదించినవారు ఆయన వ్యవహారంలో సందేహానికి లోనయ్యారు. అంచనాలను అనుసరించటం తప్ప[220] వారికి ఈ విషయమై ఖచ్చితంగా ఏమీ తెలియదు. అసలు వారు ఆయన్ని చంపలేదు,

وَّ بِكُفْرِهِمْ وَ قَوْلِهِمْ عَلٰى مَرْيَمَ بُهْتَانًا عَظِيْمًا ﴿156﴾

وَّ قَوْلِهِمْ اِنَّا قَتَلْنَا الْمَسِيْحَ عِيْسَى ابْنَ مَرْيَمَ رَسُوْلَ اللّٰهِ ۚ وَمَا قَتَلُوْهُ وَمَا صَلَبُوْهُ وَلٰكِنْ شُبِّهَ لَهُمْ ؕ وَاِنَّ الَّذِيْنَ اخْتَلَفُوْا فِيْهِ لَفِيْ شَكٍّ مِّنْهُ ؕ مَا لَهُمْ بِهٖ مِنْ عِلْمٍ اِلَّا اتِّبَاعَ الظَّنِّ ۚ وَمَا قَتَلُوْهُ يَقِيْنًا ﴿157﴾

216. అంటే వారి వాగ్దాన భంగం వల్లనూ, దైవ వాక్యాలను వారు త్రోసిపుచ్చటం వల్లనూ, దైవప్రవక్తలను అన్యాయంగా హతమార్చిన కారణంగానూ దేవుడు వారిని శపించాడు లేదా వారిని శిక్షించాడు.

217. అపనింద అంటే యూసుఫ్ నజ్జార్‌తో మర్యమ్‌కు అక్రమ సంబంధం ఉందన్న అపనింద! నేటికీ కొంతమంది సోకాల్డ్ పరిశోధకులు ఈ పెద్ద అపనిందను "నిరూపిత యదార్థం" అని నమ్మబలుకుతుంటారు. ఈ విధంగా యూసుఫ్ నజ్జార్ ఈసా తండ్రి అనీ (దైవం మన్నించుగాక!) చెప్పి దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) యొక్క మహిమాన్విత పుట్టుకను త్రోసిపుచ్చుతున్నారు.

218. దీనిద్వారా విదితమయ్యేదేమంటే తమ పథకం ప్రకారం దైవప్రవక్త ఈసా (ఏసు)ను చంపటంలోగానీ, శిలువపైకి ఎక్కించటంలోగానీ యూదులు కృతకృత్యులు కాలేకపోయారు. ఆలి ఇమ్రాన్ సూరాలోని 55వ ఆయతుకు ఇవ్వబడిన సారాంశంలో ఈ విషయం క్లుప్తంగా వివరించబడింది.

219. దీని భావం ఏమిటంటే, తనను చంపాలన్న యూదుల కుట్రను గురించి తెలుసుకున్న ఈసా (దైవప్రవక్త ఏసు) తన అనుచరులైన హవారీలను సమావేశపరచారు. ఆ హవారీల సంఖ్య 12 లేక 17 మాత్రమే. "మీలో ఎవరయినా నా స్థానంలో ఉరికంబం ఎక్కడానికి సిద్ధంగా ఉన్నారా? ఈ త్యాగానికి సిద్ధమయ్యే వారికి దేవుడు నా రూపురేఖలను ప్రసాదిస్తాడు" అని ఈసా (దైవప్రవక్త ఏసు) అడిగారు. వారిలో ఒక యువకుడు ఈ పనికి సిద్ధం అయ్యాడు. అప్పుడు ఈసా (దైవప్రవక్త ఏసు) అక్కడినుంచి ఆకాశం మీదికి ఎత్తుకోబడ్డారు. తరువాత యూదులు వచ్చి, ఏసు ఆకారంలో ఉన్న యువకుణ్ణి తీసుకువెళ్ళి శిలువపైకి ఎక్కించారు. తాము ఈసా (ఏసు)ను శిలువ పైకి ఎక్కించామని యూదులు తలపోశారు. కాని వాస్తవానికి ఈసా అక్కడ లేరు. ఆయన సజీవ స్థితిలోనే ఆకాశం పైకి ఎత్తుకోబడ్డారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

220. దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) రూపురేఖలను పోలివున్న వ్యక్తిని చంపిన తరువాత, తాము ఈసాను తుదముట్టించామని వారిలోని ఒక వర్గం గట్టిగా నమ్మసాగింది. కాని మరోవర్గం మాత్రం సందేహంలో పడింది. శిలువపైకి ఎక్కించబడిన వ్యక్తి ఈసా (ఏసు) కాదనీ, అతను మరో వ్యక్తి అనీ వారి అనుమానం. ఈసా శిలువపైకి ఎక్కించబడ్డారన్న విషయాన్ని ఈ వర్గం త్రోసిపుచ్చసాగింది. ఈసా ఆకాశం వైపుకు సాగిపోవటం కూడా వారు చూశారని కొంతమంది చెబుతారు. ఇక్కడ విభేదం అంటే స్వయంగా క్రైస్తవ వర్గాల్లో ఉన్న విభేదాలని మరికొంతమంది తలపోశారు. ఎందుకంటే క్రైస్తవుల్లోని నస్తూరియా వర్గం, ఈసా (ఏసు) శారీరకంగానయితే శిలువపైకెక్కారుగాని, దైవికంగా కాదు అని అంటుంది. అయితే ఈ హత్య శారీరకంగానూ, దైవికంగానూ కూడా పరిపూర్తి అయిందని మల్కానియా వర్గం నమ్ముతోంది (ఫత్‌హుల్ ఖదీర్). మొత్తం మీద వారు అనుమానానికి, సంశయానికి లోనై ఉన్నారు.

158 పైగా అల్లాహ్ ఆయన్ని తన వైపునకు ఎత్తుకున్నాడు.[221] అల్లాహ్ సర్వాధిక్యుడు, మహావివేకి.[222]

بَلْ رَّفَعَهُ اللّٰهُ اِلَيْهِ ؕ وَكَانَ اللّٰهُ عَزِيْزًا حَكِيْمًا ﴿158﴾

159 గ్రంథవహులలో ఏ ఒక్కడూ ఈసాను, అతని (అంటే తన లేక ఆయన)మరణానికి మునుపు విశ్వసించకుండా మిగలడు.[223] ప్రళయ దినాన ఆయన వారిపై సాక్షిగా ఉంటాడు.[224]

وَاِنْ مِّنْ اَهْلِ الْكِتٰبِ اِلَّا لَيُؤْمِنَنَّ بِهٖ قَبْلَ مَوْتِهٖ ۚ وَيَوْمَ الْقِيٰمَةِ يَكُوْنُ عَلَيْهِمْ شَهِيْدًا ﴿159﴾

221. అల్లాహ్ ఈసా అలైహిస్సలాం (ఏసు)ను సజీవంగా ఆకాశానికి ఎత్తుకున్నాడనటానికి ఈ ఆయతు ప్రబల నిదర్శనం. ముతవాతిర్ (అనగా తరతరాలుగా ఎంతోమంది చేత ఉల్లేఖించబడుతూ వస్తోన్న) ప్రామాణికమైనటువంటి హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. వివిధ హదీసు గ్రంథాలతో పాటు, సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం గ్రంథాల్లోనూ ఈ సంఘటన నమోదై ఉంది. ఈ హదీసులలో ఆకాశంపైకి ఎత్తుకోబడటంతోపాటు ప్రళయదినానికి సమీపంలో ఆయన భువిపైకి దిగి రావటానికి సంబంధించిన అనేక విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ ఉల్లేఖనాలన్నింటినీ పేర్కొని చివర్లో ఇలా వ్యాఖ్యానించారు: “ఈ హదీసులన్నీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలం నుంచి నేటి వరకు ప్రతి యుగంలోనూ ఎంతోమంది చేత ఉల్లేఖించబడుతూ వస్తున్నాయి (అంటే ఇవి ‘ముతవాతిర్’ హదీసులు). ఈ హదీసులను ఉల్లేఖించినవారిలో అబూహురైర (రజి), అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి), ఉస్మాన్ బిన్ అబుల్ ఆస్, అబూ ఉమామ, నువ్వాస్ బిన్ సమ్ఆన్, అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్, ముజమ్మి బిన్ జారియ, అబూ సురైహా, హుజైఫా బిన్ ఉసైద్ (రజి) ప్రభృతులున్నారు. ఈ హదీసులలో ఆయన (ఈసా) ఎలా దిగుతారో, ఏ స్థలంలో దిగుతారో కూడా సూచించబడింది. ఆయన (అలైహిస్సలాం) దెమాస్కస్‌లోని మనారా షర్ఖియా వద్ద, ఫజ్ర్ నమాజుకై ఇఖామత్ చెప్పే సమయంలో దిగుతారని తెలుపబడింది. ఆయన పందిని చంపుతారు. శిలువను విరగ్గొడతారు. జిజ్‌యాను మాఫీ చేస్తారు. ఆయన హయాంలో ప్రజలంతా ముస్లింలవుతారు. ఉపద్రవాగ్రేసరుడైన దజ్జాల్ కూడా ఆయన ద్వారా సంహరించబడతాడు. ఆయన కాలంలో యాజూజ్ మాజూజ్‌ల ఉపద్రవం కూడా పుట్టుకువస్తుంది. కడకు ఆయన శాపం మూలంగానే వారిరువురి కథ కంచికి చేరుతుంది.”

222. అల్లాహ్ గొప్ప శక్తిమంతుడు. ఆయన సంకల్పాన్ని, ప్రణాళికను ఎవరూ దాటలేరు. ఆయన శరణుజొచ్చిన వారికి ఎవరూ ఎలాంటి కీడు తలపెట్టలేరు. పైగా ఆయన వివేకసంపన్నుడు. ఆయన నిర్ణయాలన్నీ యుక్తితో, పరమార్థంతో కూడుకుని ఉంటాయి.

223. **‘ఖబ్‌ల మౌతిహీ’** (తన మరణానికి ముందు) అన్నమాటలో ‘హీ’ (తన) అనే సర్వనామం గ్రంథవహులను (క్రైస్తవులను) సూచిస్తున్నదని కొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు. అంటే చనిపోయేటప్పుడు ప్రతి క్రైస్తవుడూ ఈసా (ఏసు)ను విశ్వసిస్తాడు. కాని మరణ సమయంలో విశ్వసించటం నిష్ప్రయోజనకరం అవుతుంది. అయితే ‘సలఫ్’ మరియు చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఇక్కడ ‘హీ’ అనే సర్వనామం దైవప్రవక్త ఈసా (ఏసు)ను సూచిస్తున్నది. అంటే ఆయన మరోసారి ఈ భువిపైకి దిగివచ్చి, దజ్జాల్ అనే కల్లోల జనకుణ్ణి సంహరించి, సర్వత్రా ఇస్లాంను వ్యాపింపజేసిన తర్వాత (ఇక మిగిలిపోయిన) యూదులు, క్రైస్తవులందరినీ హతమారుస్తారు. భూమండలంపై ముస్లింలు తప్ప ఎవరూ మిగలరు. ఈ విధంగా ప్రపంచంలోవున్న గ్రంథవహులందరూ ఈసా (అలైహిస్సలాం-ఏసు) మరణించకముందే విశ్వసించి తనువు చాలిస్తారు. వారి విశ్వాసం ఏ తరహాకు చెందినదైనా, ఏ స్థాయికి చెందినదైనా – వారు విశ్వసించటమనేది మాత్రం తథ్యం. సహీహ్ హదీసుల ద్వారా కూడా ఈ విషయం నిజమని నిర్ధారణ అవుతోంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా సెలవిచ్చారు: “ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! మర్యమ్ కుమారుడు అధికారిగా, న్యాయశీలునిగా మీ మధ్యకు ఏతెంచే సమయం తప్పక వస్తుంది. ఆయన శిలువను విరగ్గొడతారు. పందిని వధిస్తారు. జిజ్‌యా పన్నును ఎత్తివేస్తారు. ధనం ఎంత ఎక్కువగా

**160** యూదుల దుర్మార్గం వల్ల వారికి ధర్మసమ్మతంగా ఉన్న అనేక పరిశుద్ధ వస్తువులను మేము వారికోసం నిషేధించాము. వారు ఎంతో మందిని దైవమార్గం నుంచి అడ్డుకోవటం వల్లనూ,[225]

فَبِظُلْمٍ مِّنَ الَّذِينَ هَادُوا حَرَّمْنَا عَلَيْهِمْ طَيِّبَاتٍ أُحِلَّتْ لَهُمْ وَبِصَدِّهِمْ عَن سَبِيلِ اللَّهِ كَثِيرًا ﴿١٦٠﴾

**161** నిషేధించబడిన వడ్డీని పుచ్చుకోవటం వల్లనూ, జనుల సొమ్మును అన్యాయంగా స్వాహా చేయటం వల్లనూ (వారికీ దుర్గతి పట్టింది). వారిలో అవిశ్వాసులుగా ఉన్నవారి కోసం మేము బాధాకరమయిన శిక్షను సిద్ధం చేసి ఉంచాము.

وَأَخْذِهِمُ الرِّبَا وَقَدْ نُهُوا عَنْهُ وَأَكْلِهِمْ أَمْوَالَ النَّاسِ بِالْبَاطِلِ ۚ وَأَعْتَدْنَا لِلْكَافِرِينَ مِنْهُمْ عَذَابًا أَلِيمًا ﴿١٦١﴾

**162** అయితే వారిలో పరిపూర్ణమైన, పరిపక్వతనొందిన జ్ఞానం గలవారూ,[226] విశ్వసించినవారూ, నీపై అవతరింపజెయ్య బడినదానినీ, నీకు పూర్వం అవతరింపజెయ్యబడిన దానినీ విశ్వసించేవారూ, నమాజులను నెలకొల్పేవారూ,[227] జకాతును

لَّٰكِنِ الرَّاسِخُونَ فِي الْعِلْمِ مِنْهُمْ وَالْمُؤْمِنُونَ يُؤْمِنُونَ بِمَا أُنزِلَ إِلَيْكَ وَمَا أُنزِلَ مِن قَبْلِكَ ۚ وَالْمُقِيمِينَ الصَّلَاةَ ۚ وَالْمُؤْتُونَ الزَّكَاةَ

అయిపోతుందంటే దాన్ని పుచ్చుకునేవారెవరూ ఉండరు (అంటే దానధర్మాలను స్వీకరించేవారు ఉండరని భావం). ఒక్క సజ్దా (సాష్టాంగ ప్రణామం) ప్రపంచం మరియు అందులో ఉన్న సామగ్రికన్నా శ్రేష్ఠమైనదిగా అయిపోతుంది." ఈ హదీసు వినిపించిన తరువాత అబూ హురైరా (రజి) ఇలా అన్నారు – "మీరు కావాలనుకుంటే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వచనాన్ని చదువుకోండి : **"వ ఇన్ మిన్ అహ్‌లిల్ కితాబి ఇల్లా లయూమినన్న బిహీ ఖబ్ల మౌతిహీ"** (సహీహ్ బుఖారీ : కితాబుల్ అంబియా). దీనికి సంబంధించిన హదీసులు ఎంత అధిక సంఖ్యలో ఉన్నాయంటే ఇవన్నీ కలిసి 'తవాతుర్' స్థాయికి చేరుకున్నాయి. (దైవప్రవక్త (స) కాలం నుంచి ప్రతి యుగంలోనూ ఎంతోమంది ఉల్లేఖకులు ఒక విషయం వివరించటాన్ని తవాతుర్ అంటారు. ఇటువంటి హదీసులను ముతవాతిర్ హదీసులుగా వ్యవహరిస్తారు). ఈ ముతవాతిర్ ఉల్లేఖనాల ఆధారంగానే అహ్లె సున్నత్‌వారంతా ఈసా (ఏసు) ఆకాశంలో సజీవంగా ఉన్నారనీ, ప్రళయ కాలానికి ముందు ఆయన భూమండలంపైకి దిగివస్తారని, దజ్జాల్‌తోసహా మిథ్యా ధర్మాలన్నిటిని రూపుమాపి ఇస్లాంను సర్వత్రా ప్రాబల్యం వహించేలా చేస్తారనీ, యాజూజ్ మాజూజ్‌లనే వారు కూడా ఆయన హయాంలోనే బయటికి వస్తారనీ, ఆయన (ఏసు) ప్రార్థనా ఫలితంగానే ఈ ఉపద్రవం కూడా అంతమవుతుందని గట్టిగా విశ్వసిస్తారు. హదీసుల ద్వారా అవగతమయ్యేది కూడా ఇదే.

224. ఈ సాక్ష్యం తన మొదటి జీవితానికి, అప్పటి స్థితిగతులకు సంబంధించినదై ఉంటుంది. అల్ మాయిద సూరాలోని ఆఖరి భాగంలో చెప్పబడినట్లు '(అల్లాహ్!) నేను వారి మధ్య ఉన్నంతకాలమే నేను వారిని కనిపెట్టుకుని ఉన్నాను.'

225. అంటే నిరంతరం వారు ఒడిగడుతూ పోయిన పాపాల, అపరాధాల మూలంగా – శిక్షగా – ఎన్నో హలాల్ (ధర్మ సమ్మతమైన) వస్తువులను హరామ్ (నిషిద్ధం) గావించాము. అల్ అన్ఆమ్ సూరాలోని 146వ ఆయతులో ఈ వివరాలు వస్తాయి.

226. అంటే ఇస్లాం స్వీకరించిన అబ్దుల్లా బిన్ సలాం (రజి) తదితర గ్రంథవహులన్నమాట!

227. పూర్వం గ్రంథవహులుగా ఉండి తరువాత అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించిన వారు లేదా హిజ్రత్ చేసినవారు మరియు అన్సారులని భావం. అంటే షరీయతు గురించి క్షుణ్ణంగా తెలిసినవారు, సంపూర్ణ విశ్వాసం గలవారు అటువంటి పాపకార్యాలకు దూరంగా ఉంటారు. దైవానికి అయిష్టకరమైన పనులు చేయరు.

చెల్లించేవారూ,[228] అల్లాహ్ మరియు అంతిమ దినాన్ని విశ్వసించేవారూ[229] – వీరందరికీ మేము గొప్ప పుణ్య ఫలాన్ని ప్రసాదిస్తాము.

وَالْمُؤْمِنُونَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۚ أُولَٰئِكَ
سَنُؤْتِيهِمْ أَجْرًا عَظِيمًا ﴿162﴾

**163** (ఓ ముహమ్మద్!) మేము నూహ్ వైపుకు, అతని తరువాత వచ్చిన ప్రవక్తల వైపుకు వహీ పంపినట్లే (వాణిని అవతరింప జేసినట్లే) నీ వైపుకూ వహీ పంపాము. ఇంకా మేము ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్హాఖు, యాకూబు మరియు అతని సంతతి వారికి, ఈసా, అయ్యూబు, యూనుసు, హారూను, సులైమానుల వైపుకు కూడా వహీ పంపాము.[230] ఇంకా మేము దావూదుకు జబూరు (గ్రంథం) వొసగాము.

إِنَّا أَوْحَيْنَا إِلَيْكَ كَمَا أَوْحَيْنَا إِلَىٰ نُوحٍ
وَالنَّبِيِّينَ مِن بَعْدِهِ ۚ وَأَوْحَيْنَا إِلَىٰ إِبْرَاهِيمَ
وَإِسْمَاعِيلَ وَإِسْحَاقَ وَيَعْقُوبَ وَالْأَسْبَاطِ
وَعِيسَىٰ وَأَيُّوبَ وَيُونُسَ وَهَارُونَ وَسُلَيْمَانَ ۚ
وَآتَيْنَا دَاوُودَ زَبُورًا ﴿163﴾

**164** నీకు పూర్వం గతించిన ఎంతో మంది ప్రవక్తల వృత్తాంతాలను మేము నీకు తెలియజేశాము.[231] మరెంతో మంది ప్రవక్తల గాథలను తెలుపలేదు.[232] మూసా (అలైహిస్సలాం) తోనైతే అల్లాహ్ నేరుగా మాట్లాడాడు.[233]

وَرُسُلًا قَدْ قَصَصْنَاهُمْ عَلَيْكَ مِن قَبْلُ وَرُسُلًا
لَّمْ نَقْصُصْهُمْ عَلَيْكَ ۚ وَكَلَّمَ اللَّهُ مُوسَىٰ تَكْلِيمًا ﴿164﴾

228. ఇక్కడ జకాత్ అంటే అర్థం ధనపరమైన జకాతూ కావచ్చు, ఆత్మశుద్ధి (జకాతె నఫ్స్) కూడా కావచ్చు. జకాతె నఫ్స్ అంటే తమ నైతికతను, నడవడికను పాపాల నుంచి పరిశుద్ధం చేసుకోవటం.

229. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదని విశ్వసించటంతో పాటు, మరణానంతరం తిరిగి లేపబడతామనీ, అక్కడ ఆచరణలను బట్టి బహుమానం మరియు శిక్ష లభిస్తాయన్న విషయం సత్యం అని నమ్ముతారు.

230. ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) తరువాత దేవుడు ఏ మనిషిపైనా తన సందేశాన్ని అవతరింపజెయ్యటంగానీ, ప్రవక్తగా నియుక్తం చేయటంగానీ చేయలేదని కొంతమంది వాదించసాగారు. ఈ విధంగా వారు ముహమ్మద్ (స) వారి దైవదౌత్యాన్ని (రిసాలత్‌ను) కూడా తిరస్కరించారు. వారికి జవాబుగా ఈ ఆయతు అవతరించింది (ఇబ్నె కసీర్). ఇందులో వారి వాదనను ఖండించటంతోపాటు ముహమ్మద్ (స) వారి దైవదౌత్యాన్ని కూడా నిరూపించటం జరిగింది.

231. దివ్య ఖుర్ఆన్‌లో 24 లేక 25 మంది ప్రవక్తల పేర్లు, వారి జీవిత సంఘటనలు ప్రస్తావనకు వచ్చాయి. వారి పేర్లు ఇవి : 1. ఆదం 2. ఇద్రీస్ 3. నూహ్ 4. హూద్ 5. సాలిహ్ 6. ఇబ్రాహీం 7. లూత్ 8. ఇస్మాయీల్ 9. ఇస్హాఖ్ 10. యాకూబ్ 11. యూసుఫ్ 12. అయ్యూబ్ 13. షుఐబ్ 14. మూసా 15. హారూన్ 16. యూనుస్ 17. దావూద్ 18. సులైమాన్ 19. ఇల్‌యాస్ 20. అల్ ఎసా 21. జకరియ్యా 22. యహ్యా 23. ఈసా 24. జుల్ కిఫ్ల్ (చాలామంది విద్వాంసుల ప్రకారం) 25. ముహమ్మద్ (సలవాతుల్లాహి వ సలాముహూ అలైహి వ అలైహిమ్ అజ్మయీన్ – ఆయనపై, ఇతర ప్రవక్తలందరిపై అల్లాహ్ యొక్క శాంతీ కారుణ్యాలు కురియుగాక!)

232. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావనకు రాని ప్రవక్తల, సందేశహరుల సంఖ్య ఎంత? – ఇది అల్లాహ్‌కే తెలుసు. సుప్రసిద్ధమైన ఒక హదీసులో లక్షా ఇరవై నాలుగువేల మంది అనీ, వేరొక హదీసులో ఎనిమిది వేల మంది అని ఉంది. అయితే ఈ రెండు ఉల్లేఖనాలూ చాలా బలహీనమైనవి. ఖుర్ఆన్ హదీసుల ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే వివిధ కాలాల్లో, వివిధ ప్రదేశాల్లో పరిస్థితుల స్వరూపానికనుగుణంగా ఎంతోమంది శుభవార్తాహరులు, హెచ్చరించేవారు (దైవప్రవక్తలు) వచ్చారు. చివరికి ఈ ప్రవక్తల పరంపర ముహమ్మద్ (సఅసం) వారి రాకతో పరిసమాప్తమయింది. ఆయన (స)కు పూర్వం వచ్చిన ప్రవక్తల సంఖ్య అసలు ఎంత? అన్నది కేవలం అల్లాహ్‌కే తెలుసు – వేరెవరికీ తెలియదు. ఇకపోతే

**165** మేము వారిని శుభవార్తలు వినిపించే, హెచ్చరించే ప్రవక్తలుగా చేసి పంపాము[234] – ప్రవక్తలు వచ్చిన తరువాత అల్లాహ్‌కు వ్యతిరేకంగా వాదించటానికి ప్రజల వద్ద ఏ ఆధారమూ మిగలకూడదని (మేమిలా చేశాము).[235] అల్లాహ్‌యే సర్వాధిక్యుడు, మహావివేకి.

رُسُلًا مُّبَشِّرِينَ وَمُنذِرِينَ لِئَلَّا يَكُونَ لِلنَّاسِ
عَلَى اللَّهِ حُجَّةٌ بَعْدَ الرُّسُلِ ۚ وَكَانَ اللَّهُ
عَزِيزًا حَكِيمًا ﴿165﴾

**166** (ఓ ప్రవక్తా!) నీపై అవతరింపజేసిన దానిని గురించి, దాన్ని తన జ్ఞానంతో అవతరింపజేశానని అల్లాహ్ స్వయంగా సాక్ష్య మిస్తున్నాడు. దూతలు సయితం దాని గురించి సాక్ష్యమిస్తు న్నారు. అసలు సాక్షిగా అల్లాహ్‌యే చాలు.

لَّٰكِنِ اللَّهُ يَشْهَدُ بِمَا أَنزَلَ إِلَيْكَ ۖ أَنزَلَهُ
بِعِلْمِهِ ۖ وَالْمَلَائِكَةُ يَشْهَدُونَ ۚ وَكَفَىٰ
بِاللَّهِ شَهِيدًا ﴿166﴾

**167** ఎవరయితే అవిశ్వాసానికి ఒడిగట్టి, అల్లాహ్ మార్గంలోకి రాకుండా ఇతరులను కూడా అడ్డుకున్నారో వారు నిస్సందే హంగా అపమార్గంలో చాలా దూరం వెళ్ళిపోయారు.

إِنَّ الَّذِينَ كَفَرُوا وَصَدُّوا عَن سَبِيلِ اللَّهِ
قَدْ ضَلُّوا ضَلَالًا بَعِيدًا ﴿167﴾

**168** అవిశ్వాసులై, అన్యాయానికి పాల్పడిన వారిని అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ క్షమించటంగానీ, ఏదైనా మార్గం చూపటంగానీ చేయడు[236]–

إِنَّ الَّذِينَ كَفَرُوا وَظَلَمُوا لَمْ يَكُنِ اللَّهُ
لِيَغْفِرَ لَهُمْ وَلَا لِيَهْدِيَهُمْ طَرِيقًا ﴿168﴾

---

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తదనంతరం తమను ప్రవక్తలుగా ప్రకటించుకున్నవారు, ప్రకటించుకోబోయే వారంతా – కల్లోల జనకులు, ఉపద్రవాగ్రేసరులు, అబద్ధాలకోరులు. అటువంటి మార్గభ్రష్టుల మాటల్ని నమ్మి వారిని అనుసరించేవారు కూడా ఇస్లాం పరిధి నుంచి వైదొలగిపోతారు. ఇలాంటివారు మరొక వినూత్న సమాజంగా రూపొందుతారేగాని, ముహమ్మదీయులుగా మాత్రం భావింపబడరు. అలాగే మిర్జా ఖాదియానీని 'మసీహె మౌవూద్' (ప్రళయానికి ముందు రానున్నారని చెప్పబడిన మసీహ్) అని తలపోసే మిర్జాయీలు కూడా ఆ కోవకు చెందినవారే.

233. ఇది మూసా (అలైహిస్సలాం) విశిష్ఠత అన్నమాట! దైవంతో నేరుగా సంభాషించిన ఘనత ఇతర ప్రవక్తలందరిలో ఈయనకు దక్కింది. సహీహ్ ఇబ్నె హిబ్బాన్‌కు చెందిన ఒక ఉల్లేఖనం దృష్ట్యా దైవంతో నేరుగా సంభాషించిన ఘనత ఆదం మరియు ముహమ్మద్ (సఅసం)కు కూడా వర్తిస్తుందని ఇమామ్ ఇబ్నె కసీర్ భావించారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

234. శుభవార్త అంటే విశ్వసించిన వారికి అనుగ్రహభరితమైన స్వర్గవనాల శుభవార్త ఇవ్వటం. హెచ్చరిక అంటే దైవధిక్కారానికి పాల్పడిన వారికోసం వ్యథాభరితమైన నరకాగ్ని సిద్ధంగా ఉందని భయపెట్టడం.

235. 'అసలు మాకు నీ సందేశం ఏమీ అందలేదు' అని తీర్పుదినాన ప్రజలు అల్లాహ్ ముందు సాకులు చూపెట్టే అవకాశం ఏదీ మిగలకుండా ఉండటానికిగాను ఆయన శుభవార్తలు అందజేసే, భయపెట్టే ప్రవక్తలను అన్ని కాలాల్లోనూ, అన్ని జాతుల్లోనూ, అన్ని ప్రాంతాలలోనూ పంపించాడు. ఖుర్‌ఆన్‌లో వేరొకచోట చెప్పబడినట్లు "ఒకవేళ మేము వీళ్ళను (ప్రవక్తను పంపక) మునుపే తుదముట్టించి ఉంటే, 'ప్రభూ! నీవు మా వద్దకు ప్రవక్తను ఎందుకు పంపలేదు? ఈ అవమానకర స్థితి ఏర్పడకముందే మేము నీ సూచనలను అవలంబించి ఉండేవారం కదా?' అని అంటారు" (తాహా – 134).

236. ఎందుకంటే నిరంతరం తిరస్కారానికి ఒడిగడుతూ ఉండటం వల్ల, అన్యాయానికి పాల్పడుతూ ఉండటం వల్ల వీళ్ల

إِلَّا طَرِيقَ جَهَنَّمَ خَٰلِدِينَ فِيهَآ أَبَدًا ۚ وَكَانَ ذَٰلِكَ عَلَى ٱللَّهِ يَسِيرًا ﴿١٦٩﴾

169 వారికి నరకమార్గం చూపటం తప్పు! వారందులో ఎల్లకాలం పడి ఉంటారు. ఇలా చేయటం అల్లాహ్‌కు బహు సులువు.

يَٰٓأَيُّهَا ٱلنَّاسُ قَدْ جَآءَكُمُ ٱلرَّسُولُ بِٱلْحَقِّ مِن رَّبِّكُمْ فَـَٔامِنُوا۟ خَيْرًا لَّكُمْ ۚ وَإِن تَكْفُرُوا۟ فَإِنَّ لِلَّهِ مَا فِى ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ ۚ وَكَانَ ٱللَّهُ عَلِيمًا حَكِيمًا ﴿١٧٠﴾

170 ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి ప్రవక్త సత్యం తీసుకువచ్చాడు. కాబట్టి మీరు విశ్వసించండి. అది మీకే మేలు. ఒకవేళ మీరు గనక తిరస్కరిస్తే ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే (అని తెలుసుకోండి).[237] అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేకవంతుడూను.

يَٰٓأَهْلَ ٱلْكِتَٰبِ لَا تَغْلُوا۟ فِى دِينِكُمْ وَلَا تَقُولُوا۟ عَلَى ٱللَّهِ إِلَّا ٱلْحَقَّ ۚ إِنَّمَا ٱلْمَسِيحُ عِيسَى ٱبْنُ

171 ఓ గ్రంథవహులారా! మీరు మీ ధర్మం విషయంలో అతిశయిల్లకండి.[238] సత్యం తప్ప మరోమాట అల్లాహ్‌కు ఆపాదించకండి. మర్యమ్ కుమారుడైన ఈసా మసీహ్ కేవలం దైవప్రవక్త మరియు (అయిపో అన్న) దైవవాక్కు (ద్వారా పుట్టించ

హృదయాలపై నలుపు ఆవరించింది. ఇక వారు పశ్చాత్తాపం చెంది, సన్మార్గం వైపుకు వస్తారన్న ఆశలు ఏమీ మిగలలేదు.

237. అంటే, మీ తిరస్కార వైఖరి వల్ల అల్లాహ్‌కు వాటిల్లే నష్టం ఏమీ లేదు. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) తన జాతి ప్రజలనుద్దేశించి ఇలా అన్నారు : "ఒకవేళ మీరూ, భూమండలంపై నివసించేవారంతా కలసి అవిశ్వాస మార్గాన్ని ఎన్నుకున్నా (అల్లాహ్‌కు కలిగే నష్టం ఏమీలేదు) అల్లాహ్ ఏ అక్కరా లేనివాడు, స్తుతించబడినవాడు" (ఇబ్రాహీం – 8) – హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడని ఉంది – "ఓ నా దాసులారా! మీలోని తొలి – తుది మానవులు, జిన్నులంతా కలసి మీలో అందరికన్నా గొప్ప సదాచార సంపన్నుని హృదయం వలే అయిపోయినప్పటికీ దానివల్ల నా రాజ్యాధికారంలో ఎలాంటి పెరుగుదల ఉండదు. ఒకవేళ మీలోని తొలి–తుది మానవులు, జిన్నాతులంతా కలసి మీలోని పరమ అవిధేయుని హృదయం వలె అయిపోయినప్పటికీ నా రాజ్యాధికారంలో ఏపాటి తరుగుదలారాదు. ఓ నా దాసులారా! ఒకవేళ మీరంతా కలసి ఒక మైదానంలో గుమిగూడి నన్ను అభ్యర్థించుకున్నా, మీ అభ్యర్థనల కనుగుణంగా నేను ఒక్కొక్కనికి ఇస్తూ పోయినా నా ఖజానాలో – ఒక సూదిని సముద్రంలో ముంచి బయటికి తీయటం వల్ల సముద్రంలో వచ్చే లోటు ఎంత ఉంటుందో అంతకు మించిన లోటు (నా ఖజానాలో) ఏర్పడదు" (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

238. అరబీలో **'లా తగ్‌లూ'** ( لَا تَغْلُوا ) అని ఉంది. అంటే అతిశయిల్లకండి అని అర్థం. తగ్‌లూ అన్న పదం అసలు 'గులువ్వున్' నుంచి వచ్చింది. గులువ్వున్ అనే పదానికి అతిశయిల్లటం, ఏదేని విషయంలో హద్దు మీరటం అనే అర్థాలున్నాయి. క్రైస్తవులు ఈసా విషయంలోనూ, ఆయన తల్లిగారైన మర్యమ్ విషయంలోనూ అతిశయిల్లారు. వారిని 'దైవదౌత్య' స్థానం నుండి లేపి 'దైవత్వపు' స్థానంలో ప్రతిష్ఠించారు. దేవుణ్ణి పూజించినట్లుగానే వారిద్దరినీ పూజించ సాగారు. అంతేకాదు, దైవప్రవక్త ఏసును భక్తితో ఆరాధించి, అనుసరించే మతాధికారులను సయితం క్రైస్తవులు దైవాంశ సంభూతులుగా తలపోయసాగారు. ధర్మాధర్మాలను నిర్ణయించే (ఏది హలాల్, మరేది హరామ్ అనే దానిని ఖరారుచేసే) అధికారం ఆ మతాధికారులకు కట్టబెట్టి మరో 'అతి'కి శ్రీకారం చుట్టారు. ఉదాహరణకు : తౌబా సూరాలో చెప్పబడినట్లు – "వారు అల్లాహ్‌ను వదలి తమ పండితులను, సన్యాసులను ప్రభువులుగా చేసుకున్నారు." (31వ ఆయతు). హదీసు ప్రకారం ప్రభువుగా చేసుకోవటమంటే భావం–వారు హలాల్ అని చెప్పిన దాన్ని హలాల్‌గానూ, హరామ్ అని చెప్పిన దాన్ని హరామ్‌గానూ నమ్మారు. మరి వాస్తవానికి ఈ అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. అయితే గ్రంథవహులు ఈ హక్కును కూడా తమ మతాధిపతులకు కట్టబెట్టారు. అంతిమ దైవప్రవక్త (సఅసం) ఈ అతివాదాన్ని ఉదాహరిస్తూ తన విషయంలో అలాంటి 'అతి'కి పోరాదని తన అనుచర సమాజానికి హెచ్చరించారు.

బడినవారు) మాత్రమే. దాన్ని ఆయన మర్యమ్ వైపు ప్రయోగించాడు. ఇంకా ఆయన (ఈసా), దేవుని దగ్గరి నుంచి వచ్చిన ఆత్మ మాత్రమే.[239] కాబట్టి మీరు అల్లాహ్‌నూ, ఆయన పంపిన ప్రవక్తలందరినీ విశ్వసించండి. దేవుడు 'ముగ్గురు' అని అనకండి.[240] ఈ (త్రిత్వం) వాదనను మానండి. ఇందులోనే మీకు మేలుంది. ఆరాధ్యుడగు అల్లాహ్ ఒక్కడు మాత్రమే. ఆయనకు కుమారుడున్నాడనే విషయానికి ఆయన అతీతుడు, పరిశుద్ధుడు. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నదంతా ఆయనకు చెందినదే. కార్య నిర్వాహకారిగా అల్లాహ్ ఒక్కడే చాలు.

مَرْيَمَ رَسُوْلُ اللّٰهِ وَكَلِمَتُهٗ ۚ اَلْقٰهَاۤ اِلٰى مَرْيَمَ
وَرُوْحٌ مِّنْهُ ۫ فَاٰمِنُوْا بِاللّٰهِ وَرُسُلِهٖ ۚ وَلَا
تَقُوْلُوْا ثَلٰثَةٌ ؕ اِنْتَهُوْا خَيْرًا لَّكُمْ ؕ اِنَّمَا اللّٰهُ اِلٰهٌ
وَّاحِدٌ ؕ سُبْحٰنَهٗۤ اَنْ يَّكُوْنَ لَهٗ وَلَدٌ ۘ لَهٗ مَا فِى
السَّمٰوٰتِ وَمَا فِى الْاَرْضِ ؕ وَكَفٰى بِاللّٰهِ وَكِيْلًا ﴿171﴾

**172** మసీహ్ (అలైహిస్సలాం) గానీ, అల్లాహ్ సామీప్యం పొందిన దూతలు[241] గానీ తాము అల్లాహ్ దాసులు కావటాన్ని అగౌరవంగా, అవమానకరంగా ఎంత మాత్రం భావించరు. అల్లాహ్ దాస్యం చేయటాన్ని అవమానకరంగా, అగౌరవంగా భావించి, గర్వాతిశయంతో విర్రవీగే వారినందరినీ అల్లాహ్ తన వద్దకు ప్రోగుచేస్తాడు.

لَنْ يَّسْتَنْكِفَ الْمَسِيْحُ اَنْ يَّكُوْنَ عَبْدًا لِّلّٰهِ
وَلَا الْمَلٰۤئِكَةُ الْمُقَرَّبُوْنَ ؕ وَمَنْ يَّسْتَنْكِفْ عَنْ
عِبَادَتِهٖ وَيَسْتَكْبِرْ فَسَيَحْشُرُهُمْ اِلَيْهِ جَمِيْعًا ﴿172﴾

ఆయన (స) ఇలా అన్నారు: "క్రైస్తవులు మర్యమ్ పుత్రుడగు ఈసా (అలైహిస్సలాం) విషయంలో అతివాదానికి పాల్పడినట్లుగా మీరు నా విషయంలో అతిశయిల్లకండి. నేను దేవుని దాసుడను మాత్రమే. కాబట్టి మీరు నన్ను ఆయన దాసుడనీ, ప్రవక్త అని మాత్రమే అనండి" (సహీహ్ బుఖారీ : కితాబుల్ అంబియా; ముస్నదె అహ్మద్–సంపుటి:1– పేజీ : 23, 153).

కాని విచారకరమైన విషయం ఏమిటంటే, దైవప్రవక్త (స) ఇంతగా హెచ్చరించినప్పటికీ ముస్లిం సమాజం ఈ 'అతి'కి దూరంగా ఉండలేకపోయింది. క్రైస్తవుల మాదిరిగానే ముస్లింలు కూడా తమ ప్రవక్త ముహమ్మద్ (స)ను, ఆఖరికి సజ్జనులను కూడా దైవిక గుణాలు కలవారిగా తలపోయసాగారు. నిజానికిది క్రైస్తవుల పోకడ. అంతేకాదు, ముస్లింలు తమ పండితులను, ధర్మవేత్తల (ఫుకహా)లను ధర్మబోధకులుగా గౌరవించే బదులు ఏకంగా వారిని షరీయత్ నిర్మాతలుగానే తలపోయటం మొదలెట్టారు. మహాప్రవక్త (సఅసం) చేసిన హెచ్చరిక నిజమయింది. ఆయన (సఅసం) ఇలా ప్రవచించారు : "ఏ విధంగానయితే ఒక చెప్పు, జోడీ చెప్పులాగే ఉంటుందో, అదే విధంగా మీరు తప్పకుండా మీ వెనుకటి సమాజాల వారిని అనుసరిస్తారు."

239. **'కలిమతుల్లాహ్'** (దేవుని వాక్కు) అంటే భావం – 'అయిపో' అన్న దైవాదేశంతో ఈసా (అలైహిస్సలాం) తండ్రి లేకుండానే పుట్టారు. ఈ వాక్కు దైవదూత జిబ్రయీల్ ద్వారా మర్యమ్ వరకు చేరింది. దేవుని ఆత్మ (రూహుల్లాహ్) అంటే భావం దైవాజ్ఞమేరకు జిబ్రయీల్ మర్యమ్‌పై ఊదటం. ఈ విధంగా దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం – ఏసు) దైవదూత ద్వారా మర్‌యమ్ వైపు వదలబడిన దైవవాక్కు అయ్యారు. అలాగే దేవుడు జిబ్రయీల్ ద్వారా మర్‌యమ్ వద్దకు పంపిన ఆత్మ కూడా అయ్యారాయన (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

240. క్రైస్తవుల్లో అనేక వర్గాలున్నాయి. వారిలో కొందరు ఈసా (ఏసు)ను దైవంగా, మరికొందరు దేవుని భాగస్వామిగా, ఇంకొందరు దేవుని కుమారునిగా నమ్ముతారు. యేసును దైవంగా విశ్వసించేవారే మళ్ళీ 'దేవుళ్ళు ముగ్గురు' అనీ, అందులో ఈసా ముగ్గురిలో ఒకరు (సాలిసు సలాసహ్) అని తలపోస్తారు. కాగా; 'దేవుళ్ల ముగ్గురు' అని అనటం మానెయ్యండి – వాస్తవానికి దేవుడు ఒక్కడే అని అల్లాహ్ ఈ వాక్యంలో స్పష్టం చేశాడు.

241. ఈసా ప్రవక్తను చేసినట్టు వారు కొంతమంది దైవదూతలను కూడా దైవత్వంలో భాగస్వాములుగా నిలబెట్టారు. కాని

**173** మరి ఎవరు విశ్వసించి, సత్కార్యాలు ఆచరించారో, వారికి వారి పూర్తి పుణ్య ఫలాన్ని వొసగటమేగాక, తన అనుగ్రహంతో మరింతగా ప్రసాదిస్తాడు.[242] కాగా; (అల్లాహ్ దాస్యాన్ని) చిన్న తనంగా తలపోసి తలబిరుసులుగా ప్రవర్తించిన[243] వారికి ఆయన బాధాకరమైన శిక్షను విధిస్తాడు.[244] అల్లాహ్ తప్ప తమను ఆదుకునే రక్షకుణ్ణిగానీ, సహాయకుణ్ణిగానీ వారు పొందలేరు.

فَأَمَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ
فَيُوَفِّيهِمْ أُجُورَهُمْ وَيَزِيدُهُم مِّن فَضْلِهِ ۖ
وَأَمَّا الَّذِينَ اسْتَنكَفُوا وَاسْتَكْبَرُوا فَيُعَذِّبُهُمْ
عَذَابًا أَلِيمًا ۙ وَلَا يَجِدُونَ لَهُم مِّن دُونِ
اللَّهِ وَلِيًّا وَلَا نَصِيرًا ﴿173﴾

**174** ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి స్పష్టమైన నిదర్శనం (బుర్హాన్) వచ్చేసింది.[245] ఇంకా, మేము మీ వద్దకు స్పష్టమైన జ్యోతిని పంపాము.[246]

يَا أَيُّهَا النَّاسُ قَدْ جَاءَكُم بُرْهَانٌ مِّن
رَّبِّكُمْ وَأَنزَلْنَا إِلَيْكُمْ نُورًا مُّبِينًا ﴿174﴾

**175** కాబట్టి, ఎవరు అల్లాహ్‌ను విశ్వసించి, ఆయనతో తమ సంబంధాన్ని పటిష్ఠం చేసుకుంటారో వారిని ఆయన తన కారుణ్యంలోకి, అనుగ్రహంలోకి తీసేసుకుంటాడు. వారికి తన వైపుకు తెచ్చే రుజుమార్గం చూపుతాడు.

فَأَمَّا الَّذِينَ آمَنُوا بِاللَّهِ وَاعْتَصَمُوا بِهِ فَسَيُدْخِلُهُمْ
فِي رَحْمَةٍ مِّنْهُ وَفَضْلٍ ۙ وَيَهْدِيهِمْ إِلَيْهِ
صِرَاطًا مُّسْتَقِيمًا ﴿175﴾

**176** (ఓ ప్రవక్తా!) వీరు నిన్ను ('కలాలా' గురించి) ధర్మాదేశం అడుగుతున్నారు. అల్లాహ్ (స్వయంగా) 'కలాలా' గురించి మీకు ఆదేశం ఇస్తున్నాడని నువ్వు వారికి చెప్పు. ఏ వ్యక్తయినా సంతానం లేకుండా చనిపోతే, అతనికి ఒక సోదరి మాత్రమే ఉంటే, అతను వదలి వెళ్ళిన ఆస్తిలో సగభాగం[247] ఆమెకు

يَسْتَفْتُونَكَ قُلِ اللَّهُ يُفْتِيكُمْ فِي الْكَلَالَةِ ۚ إِنِ
امْرُؤٌ هَلَكَ لَيْسَ لَهُ وَلَدٌ وَلَهُ أُخْتٌ فَلَهَا
نِصْفُ مَا تَرَكَ ۚ وَهُوَ يَرِثُهَا إِن لَّمْ يَكُن

---

వారంతా కేవలం దైవదాసులేనని అల్లాహ్ ఈ ఆయతులో తేటతెల్లం చేశాడు. తాము దేవుని దాసులమని చెప్పుకోవటానికి వారెన్నడూ సిగ్గుపడరు. మరలాంటప్పుడు మీరు వారిని దైవాలుగా, దైవత్వంలో భాగస్వాములుగా, దైవాంశ సంభూతులుగా ఎలా ఖరారు చేసుకుంటున్నారు?

242. ఈ **'మరింత అనుగ్రహం'** ఏమిటీ? బహుశా ఇది, విశ్వాసులకు దేవుడు సిఫారసు చేసేందుకు ప్రసాదించే అనుమతి అయి ఉండవచ్చు అని కొంతమంది విద్వాంసులు వివరించారు. ఈ అనుమతిని పొంది వారు దైవం కోరిన వారి కోసం సిఫారసు చేస్తారు.

243. అంటే అల్లాహ్ ఆరాధన చేయకుండా, ఆయనకు విధేయత చూపకుండా, తిరస్కార భావాన్ని, పొగరుమోతుతనాన్ని ప్రదర్శించటం.

244. ఈ విషయాన్నే అల్లాహ్ వేరొక ఆయతులో ఈ విధంగా సెలవిచ్చాడు : "నిశ్చయంగా ఎవరయితే నా ఆరాధన పట్ల విముఖత చూపి గర్విష్ఠులయ్యారో, వారు పరాభవం పాలై నరకంలో ప్రవేశిస్తారు" (అల్ మోమిన్ – 60).

245. అరబీలో **'బుర్హాన్' (بُرْهَانٌ)** అని ఉంది. బుర్హాన్ అంటే స్పష్టమైన ఆధారం, నిదర్శనం అని అర్థం. ఈ ఆధారం గనక ఒకసారి వచ్చిన తరువాత ఇక సందేహాలకు, అనుమానాలకు ఏమాత్రం ఆస్కారం ఉండకూడదు. అందుకే తదుపరి వాక్యంలో దీన్ని జ్యోతిగా అభివర్ణించటం జరిగింది.

246. జ్యోతి అంటే ఖుర్ఆన్ అన్నమాట! అది కుఫ్ర్, షిర్క్‌ల అంధకారంలో రుజుమార్గంపై పయనించటానికి వెలుగునిస్తుంది. మనిషి కుడి ఎడమల అపమార్గాలకు లోనుకాకుండా కాపాడుతుంది. అది సూచించే బాటను అనుసరించినవారు దైవకటాక్షానికి అర్హత పొందుతారు.

لَهَا وَلَدٌ ۚ فَإِن كَانَتَا اثْنَتَيْنِ فَلَهُمَا الثُّلُثَانِ مِمَّا تَرَكَ ۚ وَإِن كَانُوا إِخْوَةً رِّجَالًا وَنِسَاءً فَلِلذَّكَرِ مِثْلُ حَظِّ الْأُنثَيَيْنِ ۗ يُبَيِّنُ اللَّهُ لَكُمْ أَن تَضِلُّوا ۗ وَاللَّهُ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿176﴾

లభిస్తుంది. ఒకవేళ సోదరి–సంతానం లేకుండా మరణిస్తే ఆమె సోదరుడు ఆమె ఆస్తికి వారసుడౌతాడు.[248] ఒకవేళ (మరణించిన వ్యక్తికి) ఇద్దరు సోదరీమణులుంటే, అతని మొత్తం ఆస్తిలో మూడింట రెండొంతుల భాగం వారిద్దరికీ దక్కుతుంది.[249] ఒకవేళ సోదరీసోదరులు అనేకమంది వారసులుగా ఉన్నప్పుడు, ఒక పురుషుని భాగం ఇద్దరు స్త్రీలకు ఇచ్చే భాగాలకు సమానంగా ఉంటుంది.[250] మీరు పెడదారి పట్టకుండా ఉండేందుకుగాను అల్లాహ్ మీకు స్పష్టంగా విడమరచి చెబుతున్నాడు. అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు.

247. **'కలాలా'** గురించి ఇంతకు ముందు కూడా వచ్చింది. తండ్రిగానీ, కొడుకుగానీ లేని స్థితిలో మరణించిన వానిని 'కలాలా'గా వ్యవహరిస్తారు. ఇతని వారసత్వం గురించి మరోసారి సూరా చివర్లో ప్రస్తావించబడుతోంది. కేవలం కొడుకు మాత్రం లేకుండా మరణించిన వ్యక్తి 'కలాలా' అనబడతాడని కొందరు తలపోస్తున్నారు. అంటే తండ్రి ఉంటాడని భావం. ఇది సరైన తలంపు కాదు. కలాలా గురించి మొదట ఇచ్చిన నిర్వచనమే సరైనది. ఎందుకంటే మృతుని తండ్రి బ్రతికి ఉండగా, సోదరి ఎట్టి పరిస్థితిలోనూ ఆస్తికి వారసురాలు కాజాలదు. ఆమెకు తండ్రి అవరోధం (హాజిబ్)గా నిలుస్తాడు. కాని పై వాక్యంలో ఖుర్ఆన్ ఏమంటుందంటే; 'కలాలా' ఆస్తి సగభాగం సహోదరికి లభిస్తుంది. కాబట్టి కొడుకుతో పాటు తండ్రి కూడా లేని స్థితిలో మరణించిన వ్యక్తి మాత్రమే 'కలాలా' అనబడతాడని తేలిపోయింది.

**గమనిక :** ఇక్కడ కొడుకు అన్న భావంలో అతని మనవడు కూడా వస్తాడు. అలాగే సోదరి అనేసరికి తోబుట్టువుతో పాటు, తన తండ్రికి (మరో భార్య ద్వారా కలిగిన పుత్రిక, అంటే తన) సవతి తల్లి ద్వారా జన్మించిన సోదరి కూడా వారసురాలిగా నిలుస్తుంది (ఐసరుత్తఫాసీర్). సహీహ్ హదీసుల ద్వారా రూఢీ అయ్యే ఇంకొక విషయం ఏమిటంటే, 'కలాలా' అయిన మృతుని సోదరితోపాటు, కూతురు కూడా ఉంటే కూతురికి సగభాగం, సోదరికి సగభాగం లభిస్తుంది. కూతురితో పాటు మనవరాలు (కుమారుని కూతురు) కూడా ఉంటే కూతురికి ఆస్తిలో సగభాగం, మనవరాలికి ఆరవభాగం ఇవ్వబడుతుంది. మిగిలిన మూడింట ఒక భాగం సోదరికి ఇవ్వబడుతుంది (ఫత్హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్). దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే మృతునికి సంతానమున్న పక్షంలో, మృతుని సోదరీమణికి ('జవిల్ ఫురూజ్' రూపంలో) వారసత్వ సొమ్ము ఏమీ లభించదు. ఒకవేళ మృతునికి మగ సంతానముంటే, సోదరీమణికి అసలేవిధంగానూ ఏమీ లభించదు. మృతునికి ఆడ సంతానమున్నప్పుడు సోదరీమణి 'అస్బా' అవుతుంది. ఆడ సంతానం ధర్మప్రకారంగా తీసుకోగా 'మిగిలినది' సోదరీమణి పుచ్చుకుంటుంది. ఆ 'మిగిలినది' ఎంత అంటే ఒక్క కూతురే ఉన్నప్పుడు సగభాగం, ఒకరికన్నా ఎక్కువమంది ఉన్నప్పుడు మూడింట ఒక భాగం అన్నమాట.

248. అలాగే తండ్రి కూడా బ్రతికి ఉండని పరిస్థితి ఇది. ఎందుకంటే సోదరుని కంటే తండ్రి సమీప వారసునిగా భావింపబడతాడు. మృతురాలి తండ్రి బ్రతికి ఉండగా సోదరుడు హక్కుదారుడు అయ్యే ప్రసక్తే ఉండదు. ఒకవేళ ఆ కలాలా మృతురాలి భర్తగానీ, ఆమె తల్లి తరఫు సోదరుడుగానీ ఉంటే వారి భాగాలు వారికిచ్చి మిగిలిన ఆస్తిని ఆమె సోదరునికి ఇవ్వటం జరుగుతుంది (ఇబ్నె కసీర్).

249. ఇద్దరు అక్కాచెల్లెళ్ళకన్నా ఎక్కువ మంది ఉన్నప్పుడు కూడా ఇదే ఆజ్ఞ వర్తిస్తుంది. దీనిభావం ఏమిటంటే 'కలాలా' వ్యక్తికి ఇద్దరు లేక ఇద్దరికన్నా ఎక్కువమంది అక్కాచెల్లెళ్ళు ఉన్నప్పుడు వారికి మృతుని మొత్తం ఆస్తిలో మూడింట రెండొంతుల భాగం లభిస్తుంది.

250. ఒకవేళ 'కలాలా' మృతునికి వారసులుగా నిలబడిన వారిలో ఆడవారు, మగవారు కూడా ఉంటే ఇద్దరు ఆడవారికి లభించే భాగానికి సమానంగా ఒక మగవాడికి ఇవ్వటం జరుగుతుంది.

5వ సూరా

# అల్ మాయిదా

## ఆహారపదార్థాలు నిండివున్న పళ్లెం

అవతరణ మదీనాలో

ఆయతులు 120

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా మూడు విషయాలను నొక్కి చెబుతుంది. అవి : ఏక దైవారాధన, ఇస్లామీయ చట్టాలు, గ్రంథప్రజలు (అంటే తౌరాత్, ఇంజీల్ గ్రంథాలు పంపబడిన ప్రజలు–యూదులు, క్రైస్తవులు). ముఖ్యంగా ఈ సూరా క్రైస్తవులను ఉద్దేశించింది. ఈ సూరా పేరు, ఇందులోని 112వ ఆయతు వల్ల వచ్చింది. ఆ ఆయతులో ఈసా ప్రవక్త (అస) శిష్యులు ఆయన్ను ఆకాశం నుంచి ఆహారపదార్థాలు నిండిన పళ్లాన్ని దించమని కోరతారు. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది.*

*ఈ సూరాలో అనేక చోట్ల గ్రంథ ప్రజల ప్రస్తావన వచ్చింది. కొత్త సందేశహరుడిని (ప్రవక్త ముహమ్మద్ (స)ను) విశ్వసించాలని అల్లాహ్ వారికి పిలుపునిచ్చాడు. ప్రవక్త ముహమ్మద్ (స)కు, ఆయన తీసుకువచ్చిన దైవసందేశానికి మద్దతుగా ఉండాలని అన్నాడు. యూదులు, క్రైస్తవులు దేవుని సంతానం అని చెప్పడాన్ని, దేవుని ప్రీతిపాత్రులని వాదించడాన్ని ఈ సూరా సవాలు చేస్తూ, వారు కూడా సాధారణ మానవులే అని స్పష్టం చేసింది.*

*ఈ సూరా చివర్లో తీర్పుదినం దృశ్యాన్ని చిత్రీకరించడం జరిగింది. ఆనాడు ప్రజలు తమ ప్రభువు ఎదుట హాజరవుతారు. ఆనాడు ఈసా ప్రవక్త (అస)ను ఆరాధించిన వారి అసత్యం బట్టబయలవుతుంది. ఆనాడు అల్లాహ్ ఈసా ప్రవక్త (అస)ను, "నన్ను కాదని నిన్ను, నీ తల్లిని ఆరాధించాలని నీవు ప్రజలకు బోధించావా?" అని ప్రశ్నిస్తాడు. ఈసా ప్రవక్త (అస) బదులిస్తూ తాను అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని బోధించినట్లు తెలుపుతారు.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 27 | 7-11 | 'ఆదంకుమారులు ఖాబిల్, హాబిల్' 'భూమిపై మొదటి హత్య' | 'భూమిపై మొట్టమొదటి హత్య ఎందుకు జరిగింది? దాని పరిణామాలేమిటి? మృతులను మట్టిలో పూడ్చిపెట్టే సంప్రదాయం అల్లాహ్ స్వయంగా సూచించినదే! ఆదికాలం నుంచీ అది అమలవుతూ వస్తోంది. |
| 46 | 189, 191 192 | 'నవజాత శిశువు మాట్లాడటం' 'జిబ్రయీల్ దూత రాక' 'విందులో మహత్యం' | మర్యమ్ కుమారుడు యేసు ప్రవక్తకు సంబంధించిన పరిపూర్ణ వాస్తవ సమాచారం – మొత్తం ఒకే చోట! |
| 70 | 179 | 'యహ్యా జననం' 'అవిశ్వాసుల చేతుల్లో హత్యకు గురికావటం' | దైవప్రవక్తల పట్ల యూదజాతి వారి అనుచిత వైఖరికి ఈ సంఘటన ఒక మచ్చుతునక. ఇది వారి చరిత్రపై ఒక మాయని మచ్చ కూడా. |
| 112-115 | 192 | "విందులో మహత్యం' | ఈసాప్రవక్త సహచరుల ఆత్మతృప్తి కోసం అల్లాహ్ అనుజ్ఞతో దైవప్రవక్త ఈసా(అ) చేతుల మీదుగా ఉనికిలోకి వచ్చిన ఒక అత్యద్భుత సంఘటన. |

## అల్ మాయిదా సూరా

## سُورَةُ المَائِدَة

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** ఓ విశ్వాసులారా! ప్రమాణాలను, ఒప్పందాలను నెరవేర్చండి.[1] మీకు చదివి వినిపించబడేవి తప్ప[2] మిగిలిన చతుష్పాద పశువులన్నీ మీ కోసం ధర్మసమ్మతం (హలాల్) గావించబడ్డాయి.[3] అయితే మీరు 'ఇహ్రామ్' స్థితిలో ఉన్నప్పుడు వేటను ధర్మసమ్మతంగా పరిగణించకండి. నిశ్చయంగా అల్లాహ్ తాను కోరినది ఆజ్ఞాపిస్తాడు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَوْفُوا بِالْعُقُودِ ۚ أُحِلَّتْ لَكُم بَهِيمَةُ الْأَنْعَامِ إِلَّا مَا يُتْلَىٰ عَلَيْكُمْ غَيْرَ مُحِلِّي الصَّيْدِ وَأَنتُمْ حُرُمٌ ۗ إِنَّ اللَّهَ يَحْكُمُ مَا يُرِيدُ ①

**2** విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ చిహ్నాలనుగానీ,[4] ఏ నిషిద్ధ మాసాన్నిగానీ[5] అగౌరవపరచకండి. ఖుర్బానీ నిమిత్తం కాబా గృహానికి గొనిపోబడుతున్న జంతువుల, మెడలో పట్టాలు కట్టబడి

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تُحِلُّوا شَعَائِرَ اللَّهِ وَلَا الشَّهْرَ الْحَرَامَ وَلَا الْهَدْيَ وَلَا الْقَلَائِدَ وَلَا

---

1. అరబీలో **'ఉఖూద్'** (عُقُود) అనే పదం వచ్చింది. ఇది 'అఖ్ద్' అనే పదానికి బహువచనం. 'అఖ్ద్' అంటే ముడివేయటమని అర్థం. ఈ పదాన్ని ఏదేని వస్తువుకు ముడివేయటం కోసమూ ఉపయోగిస్తారు, అలాగే గట్టి ఒప్పందం చేసుకోవటం అనే భావంలో కూడా ఈ పదాన్ని ఉపయోగిస్తారు. ఇక్కడ 'అఖ్ద్' అంటే అల్లాహ్ మానవులకు జారీ చేసిన ఆజ్ఞలు అని భావం. మనుషులు పరస్పరం చేసుకునే వ్యవహారాలకు, రకరకాల ఒప్పందాలకు కూడా ఈ పదం వర్తిస్తుంది. వ్యవహారం అల్లాహ్‌తో జరిగినదైనా, సాటి మనుషులతో జరిగినదైనా – రెంటికీ కట్టుబడి ఉండటం ఎంతో అవసరం.
2. ఈ వివరాలు మూడవ ఆయతులో రానున్నాయి.
3. అరబీలో **'బహీమతుల్ అన్‌ఆమ్'** (بَهِيمَةُ الْأَنْعَام) అని ఉంది. **'బహీమ'** అంటే చతుష్పాదం, నాలుగు కాళ్లపై నిలబడే జంతువు అని అర్థం. ఇది 'బహ్‌మున్' లేక 'ఇబ్‌హామ్' అనే మూలపదం నుంచి ఏర్పడింది. ఇబ్‌హామ్ అంటే అస్పష్టత. జంతువుల పలుకు, సంభాషణ అస్పష్టంగా, అర్థం కాకుండా ఉంటుంది కనుక వాటిని 'బహీమ' అని అనటం జరిగిందని కొంతమంది చెబుతారు. ఇకపోతే **అన్‌ఆమ్;** ఒంటె, ఆవు, మేక, పొట్టేలును 'అన్‌ఆమ్' అంటారు. దీని మూలపదానికి 'మెత్తదనం' అన్న అర్థం ఉంది. పైన పేర్కొనబడిన పశువుల నడకలో కూడా కాస్త మెత్తదనం ఉండటం చేత వాటిని 'అన్‌ఆమ్' అని పిలిచారు. మొత్తానికి ఈ చతుష్పాద పశువులు (బహీమతుల్ అన్‌ఆమ్) ఆడ మగ కలిపి మొత్తం ఎనిమిది రకాలున్నాయి. వీటి వివరాలు అల్ అన్‌ఆమ్ సూరా 143వ ఆయతులో వస్తాయి. ఇవిగాక లేడి, జింక మొదలగు వేటాడబడే జంతువులు కూడా ధర్మసమ్మతమే. అయితే హజ్ మరియు ఉమ్రాల కోసం 'ఇహ్రామ్' దీక్షబూని ఉన్నప్పుడు ఈ జంతువులనుగానీ, పక్షులనుగానీ వేటాడటం ధర్మసమ్మతం కాదు. సున్నతులో తెలుపబడిన సూత్రాల ప్రకారం ఏ జంతువులు కోరపళ్లతో చీల్చి తినవో (అంటే జూ నాబ్ కావో), మరే పక్షులు పంజాతో దాడి చేయవో (అంటే జూ మిఖ్‌లబ్ కావో) అవన్నీ ధర్మసమ్మతమే. అల్ బఖరా సూరా 173వ ఆయతుకు ఇవ్వబడిన వ్యాఖ్యానంలో ఈ వివరాలు వచ్చాయి. **'జూ నాబ్'** అంటే కోరపళ్ళతో జంతువులను పట్టుకొని చీల్చి తినే జంతువులు. ఉదా : పులి, చిరుతపులి, కుక్క, తోడేలు మొదలగునవి. **'జూ మిఖ్‌లబ్'** అంటే పంజాతో వేటాడే పక్షులు. ఉదా : డేగ, రాబందు, గ్రద్ద మొదలగునవి.
4. అరబీలో **'షఆయిర్'** (شَعَائِر) అని ఉంది. ఇది 'షయీరతున్'కు బహువచనం. **'షఆయిర్'** అంటే చిహ్నాలు, సూచనలు

آمِّينَ الْبَيْتَ الْحَرَامَ يَبْتَغُونَ فَضْلًا مِّن رَّبِّهِمْ
وَرِضْوَانًا ۚ وَإِذَا حَلَلْتُمْ فَاصْطَادُوا ۚ وَلَا يَجْرِمَنَّكُمْ
شَنَآنُ قَوْمٍ أَن صَدُّوكُمْ عَنِ الْمَسْجِدِ الْحَرَامِ أَن
تَعْتَدُوا ۘ وَتَعَاوَنُوا عَلَى الْبِرِّ وَالتَّقْوَىٰ ۖ وَلَا تَعَاوَنُوا

ఉన్న జంతువుల జోలికిపోకండి.[6] అలాగే తమ ప్రభువు అనుగ్రహాన్ని, ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో పవిత్ర గృహం (కాబా) వైపుకు వెళుతున్న వారికి అడ్డు తగలకండి.[7] అయితే మీరు ఇహ్రామ్ దీక్షను విరమించిన మీదట వేటాడవచ్చు.[8] మస్జిదె హరామ్‌కు పోకుండా (ఒకప్పుడు) మిమ్మల్ని నిలువరించిన వారి పట్ల ద్వేషం మిమ్మల్ని హద్దుమీరినవారుగా మార్చివేయరాదు.[9]

అని అర్థం. దేవుడు ఏ ఏ వస్తువులను భక్తికి, పవిత్రతకు సూచనలుగా చేశాడో వాటిని దేవుని చిహ్నాలుగా పరిగణిస్తారు. కొంతమంది విద్వాంసులు ఈ పదాన్ని సర్వసాధారణ భావంలో తీసుకోగా, మరి కొంతమంది హజ్ ఉమ్రాలకే పరిమితం చేశారు. అంటే హజ్, ఉమ్రా యాత్రల్లో చేయవలసిన పనులన్నమాట! అలాగే హజ్ ఉమ్రాల సంకల్పంతో దైవగృహం వైపుకు సాగిపోయే వారిని అడ్డుకోవటం కూడా దేవుని చిహ్నాలను అగౌరవపరచటం క్రిందికే వస్తుంది.

5. అరబీలో **'అష్షహ్రల్ హరామ్'** (నిషిద్ధ మాసం) అని ఏకవచనం ప్రయోగించబడింది. అయితే భావం రీత్యా నిషిద్ధ మాసాలన్నీ అందులోకి వచ్చేస్తాయి. నిషిద్ధ మాసాలు లేక గౌరవప్రదమైన మాసాలు అంటే రజబ్, జుల్‌ఖఅద, జిల్‌హజ్జ్, ముహర్రమ్. ఈ నాల్గు మాసాలకు అల్లాహ్ కల్పించిన గౌరవప్రతిపత్తిని కాపాడాలి. ఈ మాసాల్లో యుద్ధాలు చేయటం, రక్తపాతం సృష్టించటం తగదు. ఆయతులో ఏకవచన ప్రయోగాన్ని దృష్టిలో పెట్టుకొని కొంతమంది విద్వాంసులు ఇక్కడ 'నిషిద్ధ మాసం' అంటే జిల్‌హజ్జ్ మాసం ఒక్కటే అని అభిప్రాయపడ్డారు. తౌబా సూరాలోని 'ముష్రిక్కులు ఎక్కడ కనిపిస్తే అక్కడ వారిని వధించండి' అన్న ఆయతు అవతరణతో, అసలు ఈ ఆయతులోని మాసాల నిషిద్ధతే రద్దయిపోయిందని మరికొంతమంది భావించారు. కాని ఈ విధంగా భావించనవసరం లేదు. పై రెండు ఆదేశాలకూ వాటి వాటి ఆచరణ పరిధులున్నాయి. వాటి మధ్య ఎలాంటి వైరుధ్యం లేదు.

6. హజ్ యాత్రికుడు హరమ్‌లో 'ఖుర్బానీ' ఇవ్వడానికి తన వెంట తోలుకుని వెళ్ళే పశువును 'హదీ'గా వ్యవహరిస్తారు. **'ఖలాయిద'** అనే పదం ఖలాదతున్ నుండి వచ్చింది. అంటే మెడలో కట్టబడిన పట్టాలు అని అర్థం. గుర్తుకోసం మెడలో బూట్లుగాని లేక పట్టాలుగాని కట్టబడి ఉండి, హజ్ లేక ఉమ్రా యాత్ర సందర్భంగా ఖుర్బానీ చేయబడే పశువులని ఇక్కడ దాని భావం. మొత్తానికి ఖలాయిద్ అంటే హరమ్‌కు గొనిపోబడే పశువులు మాత్రమే. అరబీ మూలంలో ఖలాయిద్‌కు ముందు వచ్చిన 'హదీ' అన్న పదానికి కూడా అర్థం అదే. అయితే వాటి ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ రెండేసి పదాలను ఉపయోగించటం జరిగింది. మొత్తానికి చెప్పదలచుకున్నదేమిటంటే, అటువంటి పశువులను ఎవరి నుండీ లాక్కోవటంగానీ, హరమ్‌కు వెళ్ళకుండా అడ్డుకోవటంగానీ చేయరాదు.

7. అంటే హజ్ ఉమ్రాల ఉద్దేశ్యంతోగానీ, ఉపాధి అన్వేషణలోగానీ పవిత్ర క్షేత్రానికి వెళ్ళే వారిని అడ్డుకోకండి. వారిని వేధించకండి. ఈ ఆజ్ఞ విశ్వాసులు – ముష్రిక్కులు కలసి హజ్ చేసే కాలానికి సంబంధించినదనీ, తర్వాత తౌబా సూరాలోని 28వ ఆయతు (ముష్రిక్కులు అపరిశుద్ధులు. కనుక ఈ ఏడాది తరువాత వారు కాబా గృహం దరిదాపులకు కూడా పోకూడదు) అన్న ఆయతు అవతరించిన తర్వాత పై ఆయతులో ముష్రిక్కుల మటుకు భావం రద్దయిపోయిందని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. అయితే ఈ ఆయతు రద్దుకాలేదనీ, పైగా ఇదొక ముహ్కమ్ (అనగా అమల్లో ఉన్న) ఆయతు అనీ, ఇందులోని ఆజ్ఞ ముస్లింలకు సంబంధించినది మాత్రమేనని మరికొంతమంది పండితులు చెప్పారు (ఫత్‌హుల్ ఖదీర్).

8. 'ఇహ్రామ్' అంటే హజ్ ఉమ్రాల కోసం బూనే దీక్ష. ఈ దీక్షబూనినవారు రెండు తెల్లటి దుప్పట్లు ధరిస్తారు. సాధారణ సమయాలలో ఒక ముస్లింకు 'హలాల్' (ధర్మసమ్మతం)గా ఉండే కొన్ని పనులు 'ఇహ్రామ్' స్థితిలో 'హరామ్' (నిషిద్ధం) అయిపోతాయి. వాటిల్లో వేటాడటం కూడా ఒకటి.

9. ముష్రిక్కులు హిజ్రీ 6వ యేట ముస్లింలను కాబాగృహం సందర్శించకుండా అడ్డుకున్న సంగతి వాస్తవమే అయినప్పటికీ,

عَلَى الْإِثْمِ وَالْعُدْوَانِ ۚ وَاتَّقُوا اللَّهَ ۖ إِنَّ اللَّهَ
شَدِيدُ الْعِقَابِ ②

సత్కార్యాలలో, అల్లాహ్ భీతితో కూడిన విషయాలలో ఒండొకరికి తోడ్పడుతూ ఉండండి. పాపకార్యాలలో, దౌర్జన్యపు పనుల్లో ఎవరితోనూ సహకరించకండి.[10] అల్లాహ్‌కు భయ పడుతూ ఉండండి. నిస్సందేహంగా అల్లాహ్ చాలా కఠినంగా శిక్షించేవాడు.

حُرِّمَتْ عَلَيْكُمُ الْمَيْتَةُ وَالدَّمُ وَلَحْمُ الْخِنْزِيرِ
وَمَا أُهِلَّ لِغَيْرِ اللَّهِ بِهِ وَالْمُنْخَنِقَةُ وَالْمَوْقُوذَةُ
وَالْمُتَرَدِّيَةُ وَالنَّطِيحَةُ وَمَا أَكَلَ السَّبُعُ إِلَّا
مَا ذَكَّيْتُمْ وَمَا ذُبِحَ عَلَى النُّصُبِ وَأَنْ
تَسْتَقْسِمُوا بِالْأَزْلَامِ ۚ ذَٰلِكُمْ فِسْقٌ ۗ الْيَوْمَ يَئِسَ

**3** మీ కొరకు నిషేధించబడిన వస్తువులు ఇవి : మృత పశువు, రక్తం, పంది మాంసం, అల్లాహ్ పేరుగాక వేరితరుల పేరు ఉచ్చరించబడినది,[11] గొంతు పిసకబడటం వల్ల చచ్చిన పశువు,[12] దెబ్బ తగిలి చనిపోయిన పశువు,[13] ఎత్తయిన స్థలం నుంచి క్రిందపడి చనిపోయినది[14] లేక కొమ్ము తగలటం వల్ల చచ్చిపోయినది,[15] క్రూరమృగాలు చీల్చి తినటం వల్ల చని పోయిన పశువు[16] (ఇవి మీ కొరకు హరామ్ గావించబడ్డాయి). కాని మీరు ఒకవేళ 'జిబహ్' చేస్తే అది మీ కొరకు నిషిద్ధం కాదు.[17] అలాగే ఆస్థానాల వద్ద బలి ఇచ్చినవి కూడా నిషిద్ధమే.[18]

---

మీరు ఆ సంగతిని జ్ఞాపకం ఉంచుకుని వారిపై ప్రతీకారానికి దిగకండి. ప్రతీకారం తీర్చుకునే స్థితిలో ఉన్నప్పటికీ శత్రువును క్షమించి వదలిపెట్టడం అత్యుత్తమమని ఈ ఆయతులో బోధించబడింది.

10. అత్యంత ముఖ్యమైన నీతి సూత్రం ముస్లిములకు ఇవ్వబడింది. దాన్ని ప్రతి ముస్లిం అడుగడుగునా, క్షణక్షణాన గుర్తుంచుకుని, తదనుగుణంగా మసలుకోవాలి. మంచిపనులలో పరస్పరం చేదోడు వాదోడుగా ఉండటం, చెడు చేష్టలకు, పాపిష్టి పనులకు పచ్చజెండా చూపకుండా ఉండటంలోనే సమాజ శ్రేయస్సు, పురోగతి, మానవ మనుగడ ఇమిడి ఉన్నాయి. నేటి ముస్లింలంతా ఈ సూత్రాన్ని తమ మధ్య అమలుపరిస్తే ఎంత బావుండు!

11. ఈ సూరా మొదటి ఆయతులో సూచించబడిన నిషిద్ధ జంతువుల పేర్లు ఇక్కడ ప్రస్తావించబడ్డాయి. బఖరా సూరాలోని 173వ ఆయతులో ఈ ప్రస్తావన పాక్షికంగా వచ్చింది.

12. ఎవరన్నా గొంతు పిసికి చంపినా, లేక ఆ జంతువు ఎక్కడయినా ఇరుకు ప్రదేశంలో ఇరుక్కుపోయి ఊపిరాడక చచ్చి పోయినా దాన్ని తినకూడదు.

13. ఎవరయినా రాయి విసరటం వల్లగానీ, లాఠీతో, కర్రతో కొట్టడం వల్లగానీ చనిపోయిన జంతువు. కాని అది చావకముందే దాన్ని జిబహ్ చేసినట్లయితే తినవచ్చు. అజ్ఞానకాలంలో దెబ్బతగిలి చచ్చిన జంతువులను తినేవారు. ఇస్లామీయ షరీయత్ దాన్ని నిషేధించింది.

**తుపాకీతో వేట :** తుపాకీతో వేటాడబడిన జంతువు ధర్మసమ్మతమా కాదా అన్న విషయంలో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఇమామ్ షౌకానీ ఒక హదీసు ఆధారంగా తుపాకీతో వేటాడబడిన జంతువును ధర్మసమ్మతం (హలాల్)గా ఖరారు చేశారు (ఫత్‌హుల్ ఖదీర్). అంటే 'బిస్మిల్లాహ్' పఠించి తుపాకీ గుండు పేల్చగా, దాంతో జంతువు (జిబహ్ చేయకముందే) చనిపోతే దాన్ని తినటం ఈ అభిప్రాయం ప్రకారం ధర్మసమ్మతమే అవుతుంది.

14. ఆ జంతువు తనంతట తానుగా క్రిందపడినదైనాసరే, ఎవరన్నా క్రిందికి త్రోసి పడగొట్టినాసరే – రెండు పరిస్థితుల్లోనూ– అది నిషిద్ధమే.

الَّذِيْنَ كَفَرُوْا مِنْ دِيْنِكُمْ فَلَا تَخْشَوْهُمْ وَاخْشَوْنِ ؕ
اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَاَتْمَمْتُ عَلَيْكُمْ
نِعْمَتِيْ وَرَضِيْتُ لَكُمُ الْاِسْلَامَ دِيْنًا ؕ فَمَنِ اضْطُرَّ

అదే విధంగా బాణాల ప్రయోగం ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకోవటం కూడా నిషిద్ధమే.[19] ఇవన్నీ అత్యంత నీచమైన పాప కార్యాలు. ఈ రోజు అవిశ్వాసులు మీ ధర్మం గురించి ఇక ఆశను వదులుకున్నారు. జాగ్రత్త! మీరు భయపడవలసింది వారికి కాదు, మీరు నాకు భయపడండి. ఈ రోజు మీ కొరకు

15. **'నతీహతున్'** అంటే, ఏదయినా వస్తువు ఢీ కొనటం వల్ల చనిపోయిన జంతువు అన్నమాట! జిబహ్ చేయకముందే గనక అది చచ్చిపోతే, దాన్ని తినకూడదు.

16. అంటే – పులి, చిరుతపులి, సింహం, తోడేలు – ఇత్యాది క్రూర మృగాలు తమ గోళ్ళతో చీల్చటంవల్లగానీ, తినటం వల్లగానీ చచ్చిపోయిన జంతువులు. అజ్ఞాన కాలంలో జనులు ఇలాంటి వాటిని కూడా తినేవారు. ఇస్లాం దీన్ని కూడా నిషేధించింది.

17. అత్యధికమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల దృష్టిలో 'జంతువు బ్రతికి ఉంటే దాన్ని జిబహ్ చేసి తినవచ్చునే ఈ 'మినహాయింపు' పైన పేర్కొనబడిన జంతువులన్నింటికీ వర్తిస్తుంది. అనగా గొంతు పిసకబడినది (మున్ఖనిఖహ్), దెబ్బతగిలినది (మౌఖూజహ్), పైనుంచి క్రిందికి జారిపడినది (ముతరద్దియహ్), ఢీకొన్నది (నతీహా) క్రూరమృగాలు దాడిచేసినది – అన్ని జంతువులకూ ఈ మినహాయింపు వర్తిస్తుంది. అంటే ఒకవేళ అటువంటి జంతువేదయినా బ్రతికున్న స్థితిలో కనిపిస్తే దాన్ని షరీయతు సూచించే పద్ధతిలో జిబహ్ చేసి తినవచ్చు. జిబహ్ చేసే క్షణం వరకూ అది ప్రాణంతోనే ఉంది అని భావించటానికి ఆనవాలు ఏమిటంటే, గొంతు కోసినప్పుడు అది తడతడా కాళ్ళతో కొట్టుకోవాలి. కత్తితో జిబహ్ చేస్తున్నప్పుడు ఈ కదలిక గనక లేకపోతే అప్పటికే అది ప్రాణం విడిచిందని అనుకోవాలి.

**జిబహ్ చేసే పద్ధతి :** 'బిస్మిల్లాహ్' పఠించి పదునైన పరికరంతో గొంతు నాళాలు వేగంగా తెగిపోయేలా కోయాలి. 'జిబహ్'తో పాటు 'నహర్' పద్ధతి కూడా ధర్మ సమ్మతమే. ఈ పద్ధతి ప్రకారం జంతువు నిలబడి ఉండగా దాని గొంతు తెగేలా కత్తితో వేటు వేయబడుతుంది. దానిమూలంగా గొంతునాళాలు తెగి రక్తమంతా బయటికి వెళ్ళిపోతుంది. సాధారణంగా ఒంటెను ఈ విధంగానే జిబహ్ చేస్తారు.

18. ముష్రిక్కులు తాము ప్రతిష్ఠించిన విగ్రహాలకు సమీపంలో రాయితోనో, మరేదైనా వస్తువుతోనో బలిపీఠం ఒకటి నిర్మిస్తారు. దాన్నే **'నుసుబ్'** అంటారు. దేవీదేవతల పేరు మీద మొక్కుకున్న జంతువులను వారు ఇక్కడికి తెచ్చి, బలిపీఠంపై బలి యిస్తారు. దైవేతరుల పేర జంతుబలి ఇచ్చే పద్ధతుల్లో ఇదొకటి. దీనిద్వారా విదితమయ్యేదేమిటంటే ఆస్థానాల వద్ద, సమాధుల, దర్గాల వద్ద అక్కరలు తీర్తాయన్న సంకల్పంతోనో, సమాధుల్లో ఉన్న మృతుల్ని ప్రసన్నుల్ని చేసే ఉద్దేశ్యంతోనో (కోడి, మేకలాంటి) పశువులను కోయటం, పలావులు వండి తినిపించటం ముమ్మాటికీ నిషిద్ధం (హరామ్). ఈ పనులన్నీ "దైవేతరుల పేర ఆస్థానాల వద్ద ఇచ్చే జంతుబలి" క్రిందికే వస్తాయి.

19. అరబీలో **'తస్తఖ్సిమూ బిల్ అజ్లామ్'** అని వచ్చింది. దీనికి రెండు అర్థాలున్నాయి. ఒకటి: బాణాల ద్వారా పంపకం చేయటం. రెండు : బాణాల ప్రయోగం ద్వారా జాతకాన్ని తెలుసుకోవటం. మొదటి అర్థంలో తీసుకుంటే – జూదంలో జిబహ్ చేయబడిన జంతువుల్ని పంపిణీ చేసేందుకు ఈ బాణ ప్రయోగం చేసేవారు. ఈ పద్ధతి ప్రకారం అవి కొందరికి దొరికేవి, కొందరికి దొరికేవి కావు. రెండవ అర్థంలో తీసుకుంటే – ఏదైనా పనిని ప్రారంభించటానికి వారు బాణప్రయోగం ద్వారా శకునం చూసేవారు. దీనికోసం వారు మూడు రకాల బాణాలను తయారుచేశారు. వాటిలో ఒకదానిపై 'ఇఫ్అల్' (చెయ్యి) అనీ, రెండవదానిపై 'లా తఫ్అల్' (చెయ్యవద్దు) అనీ ఉండేది. మూడవ దానిపై ఏమీ రాయబడి ఉండేది కాదు. మొదటిబాణం తగిలితే పని మొదలెట్టేవారు. రెండవది తగిలితే పని మానేసేవారు. మూడవ బాణం గనక తగిలితే మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేవారు. ఇది కూడా జోస్యం వంటి పనే. ఒకరకంగా ఇది కూడా అల్లాహ్‌ను గాకుండా ఇతరుల్ని సహాయం కోసం అర్థించటం (ఇస్తిమ్దాద్ బిగైరిల్లాహ్) క్రిందికే

فِى مَخْمَصَةٍ غَيْرَ مُتَجَانِفٍ لِّإِثْمٍ ۙ فَإِنَّ اللّٰهَ غَفُورٌ رَّحِيمٌ ③

మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తిచేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను. ఎవడయినా తీవ్రమయిన ఆకలి బాధతో అల్లాడిపోతూ – గత్యంతరంలేని పరిస్థితిలో పాపానికి పాల్పడే ఉద్దేశం లేకుండా ఉండి (పై వాటిలో దేన్నయినా తిన్నట్లయితే) నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడూను.[20]

يَسْـَٔلُونَكَ مَاذَآ أُحِلَّ لَهُمْ ۖ قُلْ أُحِلَّ لَكُمُ الطَّيِّبٰتُ ۙ وَمَا عَلَّمْتُم مِّنَ الْجَوَارِحِ مُكَلِّبِينَ تُعَلِّمُونَهُنَّ مِمَّا عَلَّمَكُمُ اللّٰهُ ۖ فَكُلُوا مِمَّآ أَمْسَكْنَ عَلَيْكُمْ وَاذْكُرُوا اسْمَ اللّٰهِ عَلَيْهِ ۖ وَاتَّقُوا اللّٰهَ ۚ إِنَّ اللّٰهَ سَرِيعُ الْحِسَابِ ④

**4** (ఓ ప్రవక్తా!) తమ కొరకు 'హలాల్' (అనగా ధర్మసమ్మతం) చేయబడిన వస్తువులేవి? అని ప్రజలు నిన్ను అడుగుతున్నారు. వారికి ఇలా చెప్పు: "పరిశుద్ధమైన వస్తువులన్నీ మీ కోసం హలాల్ చేయబడ్డాయి.[21] అలాగే మీరు శిక్షణ ఇచ్చిన వేట జంతువులు[22] మీ కోసం ఏదైనా వేటాడితే (ఆ వేట మాంసాన్ని మీరు తినండి). కాని, మీరు వాటిని అల్లాహ్ మీకు బోధించిన పద్ధతిలో తర్ఫీదు చేసి ఉండాలి సుమా! దానిపై అల్లాహ్ నామాన్ని స్మరించండి.[23] అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిస్సందేహంగా అల్లాహ్ తొందరగా లెక్క తీసుకునేవాడు."

---

వస్తుంది. అందుచేత ఇస్లామీయ షరీయతులో ఇది కూడా నిషిద్ధంగా ఖరారు చేయబడింది; **'ఇస్తిఖ్‌సామ్'** అంటే అదృష్టం తెలుసుకోవటం అని అర్థం. అజ్ఞానకాలంలో అరబ్బులు బాణాల ద్వారా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేవారు.

20. తీవ్రమయిన ఆకలి బాధకు తట్టుకోలేక ప్రాణం పోయే క్లిష్టపరిస్థితి ఏర్పడినప్పుడు పైన నిషేధించబడిన జంతువులను సయితం మనిషి తినడానికి అనుమతి ఇవ్వబడింది. అయితే దైవాదేశాలను ధిక్కరించే ఉద్దేశంగానీ, మితిమీరి ప్రవర్తించే దుష్ట సంకల్పంగానీ లేకుండా – కేవలం ప్రాణాన్ని కాపాడుకునే సత్సంకల్పంతో మాత్రమే తినాలి.

21. అంటే హలాల్ (ధర్మసమ్మతం)గా ఖరారు చేయబడిన వస్తువులన్నీ పరిశుభ్రమైనవి, పవిత్రమైనవిగానే భావించబడతాయి. హరామ్ (అధర్మం)గా నిర్ధారించబడిన వస్తువులు పైకి ఎంత పరిశుభ్రంగా కానవచ్చినా ధార్మికంగా అవి అశుద్ధమైనవే, నీచమైనవే.

22. అరబీలో **'జవారిహ్'** (الْجَوَارِح) అని ఉంది. ఇది జారిహ్ అనే పదానికి బహువచనం. ఇక్కడ ఈ పదం సంపాదించిపెట్టేవి (కాసిబ్) అనే అర్థంలో ఉంది. అంటే వేట జంతువులు. ఉదాహరణకు : వేటకుక్క, వేట పక్షి, చిరుతపులి మొదలగునవి. అయితే ఈ వేట జంతువులను వేటకోసం వదలక ముందు, వేట గురించి తర్ఫీదు ఇవ్వాలి. అంటే జంతువును వేటాడటానికి వదలగానే అవి వేటకోసం పరుగెత్తాలి. ఆగమన్నప్పుడు ఆగాలి, వెనక్కి తిరిగి రమ్మన్నప్పుడు వెనక్కి తిరిగి రావాలి.

23. ఈ విధంగా తర్ఫీదు ఇవ్వబడిన వేట జంతువుల ద్వారా వేటాడబడిన జంతువులు రెండు షరతులపై హలాల్ (ధర్మసమ్మతం) అవుతాయి – 1. వేటకోసం వదిలేటప్పుడు 'బిస్మిల్లాహ్' పఠించబడి ఉండాలి. 2. వేటాడిన జంతువును అది తన యజమాని కోసం ఉంచాలి. అంటే దాన్ని అది తినకుండా ఉండాలి. ఒకవేళ ఆ విధంగా వేటాడబడిన జంతువు చచ్చిపోయినా దాన్ని తినవచ్చు. ఎందుకంటే తర్ఫీదు పొందిన వేట జంతువును వదిలేటప్పుడు యజమాని 'బిస్మిల్లాహ్' పఠించాడు గనక! అయితే తర్ఫీదు పొందిన వేట జంతువుతోపాటు మరో జంతువు కూడా ఆ వేటలో పాల్గొంటే, అట్టి పరిస్థితిలో వేటాడబడిన జంతువును తినకూడదు (సహీహ్ బుఖారీ : కితాబుజ్జబాయిహ్ వస్సైద్; ముస్లిం – కితాబుస్సైద్).

**5** ఈ రోజు పరిశుద్ధమైన వస్తువులన్నీ మీ కోసం హలాల్ చేయ బడ్డాయి. గ్రంథవహులు జిబహ్ చేసినది మీ కొరకు ధర్మ సమ్మతం.[24] మీరు జిబహ్ చేసినది వారి కొరకు ధర్మసమ్మతం. సౌశీల్యవతులగు ముస్లిం స్త్రీలు, మీకు పూర్వం గ్రంథం వొసగ బడినవారి సౌశీల్యవతులగు స్త్రీలు కూడా మీ కొరకు హలాల్ అవుతారు.[25] అయితే మీరు వారికి చెల్లించవలసిన మహర్ సొమ్మును చెల్లించి, వారిని వివాహబంధంలోకి తెచ్చుకోవాలి. అంతేగాని, బహిరంగంగా వ్యభిచారం చేయటం కోసం, చాటు మాటు ప్రేమకలాపాలు జరపటం కోసం వారు మీకు హలాల్ కారు. విశ్వాసాన్ని తిరస్కరించినవారి కర్మలు వృథా అయి పోతాయి. పరలోకంలో వారు నష్టపోయిన వారిలో చేర్తారు.

الْيَوْمَ أُحِلَّ لَكُمُ الطَّيِّبَاتُ ۖ وَطَعَامُ الَّذِينَ
أُوتُوا الْكِتَابَ حِلٌّ لَّكُمْ وَطَعَامُكُمْ حِلٌّ لَّهُمْ ۖ
وَالْمُحْصَنَاتُ مِنَ الْمُؤْمِنَاتِ وَالْمُحْصَنَاتُ مِنَ
الَّذِينَ أُوتُوا الْكِتَابَ مِن قَبْلِكُمْ إِذَا آتَيْتُمُوهُنَّ
أُجُورَهُنَّ مُحْصِنِينَ غَيْرَ مُسَافِحِينَ وَلَا مُتَّخِذِي
أَخْدَانٍ ۗ وَمَن يَكْفُرْ بِالْإِيمَانِ فَقَدْ حَبِطَ عَمَلُهُ
وَهُوَ فِي الْآخِرَةِ مِنَ الْخَاسِرِينَ ﴿٥﴾

**6** ఓ విశ్వసించినవారలారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు మీ మొహాలను, మోచేతుల సమేతంగా మీ చేతులను కడుక్కోండి.[26] మీ తలలను మసహ్ చేయండి,[27] చీలమండల

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا قُمْتُمْ إِلَى الصَّلَاةِ فَاغْسِلُوا
وُجُوهَكُمْ وَأَيْدِيَكُمْ إِلَى الْمَرَافِقِ وَامْسَحُوا

24. అయితే జంతువు రక్తం ప్రవహించే తీరులో వారు జిబహ్ చేసినప్పుడే అది హలాల్ అవుతుంది. ప్రస్తుతం యూరపు దేశాలలో గ్రంథవహులు (యూదులు, క్రైస్తవులు) జంతువుల 'జిబహ్' కొరకు ఉపయోగించే యంత్రపరికరాల ద్వారా రక్తం ప్రవహించదని అంటున్నారు. అలాంటి యంత్రాల ద్వారా కోసిన జంతువులు ముస్లింల కోసం ధర్మసమ్మతం కావు అని గమనించాలి.

25. గ్రంథవహుల (యూదుల, క్రైస్తవుల) స్త్రీలను వివాహమాడటానికి పెట్టబడిన ఒక ముఖ్యమైన షరతు; వారు సౌశీల్యవతులై ఉండాలి. కాని నేటి పాశ్చాత్య సంస్కృతికి ప్రభావితులైన గ్రంథవహుల స్త్రీలు ఏ మేరకు శీలవతులై ఉంటారో ఊహించవచ్చు. రెండో విషయం: ఎవరైనా విశ్వసించిన తరువాత, అవిశ్వాస మార్గాన్ని కూడా అవలంబిస్తే వారి కర్మలన్నీ బూడిదలో పోసిన పన్నీరులా వృథా అయిపోతాయి. ఈ వాక్యం ద్వారా ముస్లింలకు చెయ్యబడే ఒక హెచ్చరిక ఏమిటంటే, ఏ స్త్రీని వివాహమాడటం వల్ల మీ విశ్వాసం (ఈమాన్) ప్రమాదంలో పడే అవకాశముందో అలాంటి మగువ వలలో పడకుండా ఉండటంలోనే మీకు మేలుంది. ఈ మధ్య కాలంలో గ్రంథవహుల స్త్రీలను వివాహం చేసుకున్న అనేకమంది ముస్లింల విశ్వాసం ఎలా డోలాయమాన స్థితిలో ఉందో విడమరచి చెప్పనవసరం లేదు. లోకజ్ఞానం ఉన్న వారందరికీ ఈ సంగతి తెలుసు. 'ఈమాన్' (విశ్వాసం)ను కాపాడుకోవటం ప్రతి ముస్లిం విద్యుక్త ధర్మం. ధర్మసమ్మతమయిన ఒక పనికోసం విద్యుక్త ధర్మాన్ని (ఫర్జ్‌ను) ప్రమాదంలో పడవెయ్యవలసినంతటి రిస్క్ తీసుకోరాదు. పైన ప్రస్తావించబడిన రెండు షరతులు ఖచ్చితంగా నెరవేరగలవన్న గ్యారంటీ ఉన్నప్పుడే (1. ఆ స్త్రీ సౌశీల్యవతి అయి ఉండాలి. 2. ఆమెను మనువాడటం మూలంగా మన 'ఈమాన్'కు ఎలాంటి విఘాతం కలగబోదన్న దృఢ నమ్మకం, భరోసా ఉన్నప్పుడే) ఈ సాహసానికి పూనుకోవాలి. అదీగాక, గమనించవలసిన మరో విషయమేమిటంటే ఈ గ్రంథవహుల స్త్రీలకు తమ ధర్మం గురించిన పరిజ్ఞానం బొత్తిగా లేదాయె! పైగా వారు ధర్మం మీద తిరుగుబాటు చేస్తున్నారు. ఇక దైవభీతి అంటారా, అది అసలే లేదు. మరలాంటప్పుడు వారు నిజంగానే గ్రంథవహులనబడతారా?! ఏమో దేవుడే ఎరుగు!

26. కనీసం ఒకసారిగాని, రెండేసి మూడేసిసార్లు గాని అరచేతులు కడిగి, పుక్కిలించి, ముక్కులోకి నీరు పోనిచ్చి శుభ్రం

بِرُءُوسِكُمْ وَأَرْجُلَكُمْ إِلَى الْكَعْبَيْنِ ۚ وَإِن كُنتُمْ
جُنُبًا فَاطَّهَّرُوا ۚ وَإِن كُنتُم مَّرْضَىٰ أَوْ عَلَىٰ سَفَرٍ
أَوْ جَاءَ أَحَدٌ مِّنكُم مِّنَ الْغَائِطِ أَوْ لَامَسْتُمُ
النِّسَاءَ فَلَمْ تَجِدُوا مَاءً فَتَيَمَّمُوا صَعِيدًا طَيِّبًا
فَامْسَحُوا بِوُجُوهِكُمْ وَأَيْدِيكُم مِّنْهُ ۚ مَا يُرِيدُ
اللَّهُ لِيَجْعَلَ عَلَيْكُم مِّنْ حَرَجٍ وَلَٰكِن يُرِيدُ

వరకు మీ కాళ్ళను కడుక్కోండి.[28] ఒకవేళ మీరు లైంగిక అశుద్ధావస్థకు లోనవుతే స్నానం చేసి పరిశుద్ధులు అవ్వండి.[29] ఒకవేళ మీరు వ్యాధిగ్రస్తులైతే లేక ప్రయాణావస్థలో ఉంటే లేక మీలో ఎవరయినా కాలకృత్యాలు తీర్చుకుని వస్తే లేక మీరు స్త్రీలతో సమాగమం జరిపి ఉంటే – అట్టి పరిస్థితిలో – నీరు లభ్యం కాకపోతే పరిశుభ్రమైన మట్టితో 'తయమ్ముమ్' చేసుకోండి. దాన్ని మీ మొహాలపై, చేతులపై తుడుచుకోండి.[30] అల్లాహ్ మిమ్మల్ని

చేసిన మీదట మొహం కడగాలి. మొహం కడిగిన తరువాతే రెండు చేతుల్నీ మోచేతుల సమేతంగా కడగాలి. ఈ క్రియలన్నీ 'వుజూ'లో అంతర్భాగాలు. హదీసుల ద్వారా సయితం ఈ సంగతి రుజువవుతోంది.

27. మసహ్ చేసేటప్పుడు రెండు (తడి) అరచేతులతో పూర్తి తలను తుడుచుకోవాలి. తల ముందు భాగం నుంచి మొదలెట్టి తల వెనుక భాగం వరకూ తుడవాలి. ఆ తరువాత రెండు అరచేతులనూ తల ముందు భాగం వైపుకు తీసుకురావాలి. తరువాత చెవుల మసహ్ కూడా చేయాలి. ఒకవేళ తలకు తలపాగా చుట్టుకుని ఉంటే మేజోళ్లపై మసహ్ చేసినట్లు దానిపైనే మసహ్ చేయవచ్చని హదీసుల ద్వారా తెలుస్తోంది (సహీహ్ ముస్లిం – కితాబుత్తహారత్). ఈ విధంగా ఒక్కసారి మసహ్ చేస్తే సరిపోతుంది.

28. వుజూ సందర్భంగా చీలమండల సమేతంగా రెండు కాళ్ళూ కడగాలి. అయితే వుజూ చేసి ఉన్న స్థితిలో మేజోళ్లు ధరిస్తే, హదీసు ప్రకారం మలిసారి వుజూ చేసేటప్పుడు ఆ మేజోళ్లపై మసహ్ చేసినా సరిపోతుంది.

**సూచన:** 1. మనిషి మొదటి నుంచే వుజూతో ఉన్నట్లయితే నమాజుకు ఉపక్రమించినపుడు మళ్లీ వుజూ చేయనక్కరలేదు. అయితే ప్రతి నమాజు కోసం సరికొత్తగా వుజూ చేయటం మొత్తమ్మీద మంచిదే. 2. వుజూకు ముందు సంకల్పం చేసుకోవటం విధి. 3. వుజూకు ముందు 'బిస్మిల్లాహ్' పఠించటం కూడా అవసరమే. 4. మొహంపై గుబురుగా గడ్డం ఉన్నప్పుడు వ్రేళ్లతో 'ఖిలాల్' చేయాలి. 5. నిర్ణీత శరీరావయవాలను క్రమబద్ధమైన రీతిలోనే కడగాలి. 6. ఒక అవయవం కడిగిన తరువాత – మరో అవయవం వెంటనే కడగాలి– అంతరం ఉండకూడదు. 7. వుజూలోని నిర్ణీత శరీరావయవాలు పూర్తిగా కడగాలి. అవి మధ్యలో ఎక్కడా పొడిగా ఉండకుండా జాగ్రత్త వహించాలి. లేకపోతే వుజూ పూర్తికాదు. 8. ఏ శరీరావయవం కూడా మూడుసార్లకన్నా ఎక్కువగా కడగకూడదు. ఒకవేళ ఎక్కువ సార్లు కడిగితే అది సంప్రదాయ (సున్నత్‌కు) విరుద్ధం అవుతుంది (తఫ్సీర్ ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

29. ఇది **'జనాబత్'** అనే అశుద్ధావస్థ. వీర్య స్ఖలనం వల్లగానీ, భార్యతో సంభోగించటం వల్లగానీ మనిషి ఈ అపరిశుద్ధ (జనాబత్) స్థితికి లోనవుతాడు. హైజ్ (బహిష్టు స్థితి), నిఫాస్ (పురిటి రక్తస్రావం) కూడా ఈ అపరిశుద్ధ పరిధిలోకి వస్తాయి. రక్తస్రావం పూర్తిగా ఆగిపోయిన మీదట పరిశుద్ధత పొందటానికి తలంటి స్నానం చేయటం అవసరం. ఒకవేళ నీరు లభించకపోతే పరిశుద్ధతా సంకల్పంతో 'తయమ్ముమ్' చేసుకోవాలి. దీనికి సంబంధించిన వివరాలు హదీసులో ఉన్నాయి (ఫత్‌హుల్ ఖదీర్, ఐసరుత్తఫాసీర్).

30. ఈ ఆయతులో అశుద్ధావస్థను తొలగించే నిమిత్తం సూచించబడిన పద్ధతి నిసా సూరాలోని 43వ వచనంలో కూడా ఇంతకుముందు వివరించబడింది. సహీహ్ బుఖారీలో ఈ ఆయతు పూర్వరంగం వివరించబడింది. దీని ప్రకారం ఒకానొక ప్రయాణంలో 'బైదా' అనే స్థలంలో ఆయిషా (ర.అన్హా) కంఠహారం పోగొట్టుకున్నారు. ఈ కారణంగా పయనబృందం అంతా అక్కడే ఆగిపోవలసి వచ్చింది. ఫజ్ర్ నమాజ్ చేద్దామంటే అక్కడ నీరు లేదు. పరిసరాల్లో వెతికితే ఎక్కడా నీరు లభ్యం కాలేదు. ఆ సందర్భంగా ఈ ఆయతు అవతరించింది. ఇందులో 'తయమ్ముమ్' సౌలభ్యం ముస్లింలకు కల్పించబడింది. ఈ ఆయతును విన్నప్పుడు ఉసైద్ బిన్ హుజైర్ (రజి), 'ఓ అబూ బక్ర్ కుటుంబీకులారా! మీ మూలంగా అల్లాహ్ జనులకు ఎన్నో శుభాలను ప్రసాదించాడు. ఇది మీ ద్వారా లభించిన మొదటి శుభం కాదు'

لِيُطَهِّرَكُمْ وَلِيُتِمَّ نِعْمَتَهُ عَلَيْكُمْ لَعَلَّكُمْ تَشْكُرُونَ ⑥

ఎలాంటి ఇబ్బందికీ గురి చేయదలచుకోడు.[31] మీరు కృతజ్ఞులయ్యేందుకు[32] మిమ్మల్ని పరిశుద్ధులుగా చేసి, మీపై తన అనుగ్రహాన్ని సంపూర్ణం గావించాలన్నదే ఆయన అభిలాష!

وَاذْكُرُوا نِعْمَةَ اللَّهِ عَلَيْكُمْ وَمِيثَاقَهُ الَّذِي وَاثَقَكُمْ بِهِ إِذْ قُلْتُمْ سَمِعْنَا وَأَطَعْنَا وَاتَّقُوا اللَّهَ إِنَّ اللَّهَ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ⑦

**7** మీపై ఉన్న అల్లాహ్ అనుగ్రహాన్ని, ఆయన మీనుండి తీసుకున్న ప్రమాణాన్ని జ్ఞాపకం ఉంచుకోండి. అప్పుడు మీరు, "మేము విన్నాము, శిరసావహించాము" అని చెప్పి ఉన్నారు. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మనసుల్లోని విషయాలు సయితం ఎరిగినవాడు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُونُوا قَوَّامِينَ لِلَّهِ شُهَدَاءَ بِالْقِسْطِ وَلَا يَجْرِمَنَّكُمْ شَنَآنُ قَوْمٍ عَلَىٰ أَلَّا تَعْدِلُوا اعْدِلُوا هُوَ أَقْرَبُ لِلتَّقْوَىٰ وَاتَّقُوا اللَّهَ إِنَّ اللَّهَ خَبِيرٌ بِمَا تَعْمَلُونَ ⑧

**8** ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ కొరకు సత్యంపై నిలకడగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి.[33] ఏదైనా ఒక వర్గంతో ఉన్న విరోధం మిమ్మల్ని న్యాయవిరుద్ధతకు పాల్పడనీయకూడదు. న్యాయం చెయ్యండి. ఇది దైవభీతికి అత్యంత చేరువైనది. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుస్తూనే ఉంటాయి.

وَعَدَ اللَّهُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ لَهُمْ مَغْفِرَةٌ وَأَجْرٌ عَظِيمٌ ⑨

**9** విశ్వసించి, మంచిపనులు చేసిన వారికి గొప్ప మన్నింపుతో పాటు, గొప్ప ప్రతి ఫలం కూడా ఉందని అల్లాహ్ వాగ్దానం చేశాడు.

وَالَّذِينَ كَفَرُوا وَكَذَّبُوا بِآيَاتِنَا أُولَٰئِكَ أَصْحَابُ الْجَحِيمِ ⑩

**10** మరెవరు అవిశ్వాసానికి ఒడిగట్టి, మా ఆదేశాలను ధిక్కరించారో వారే నరకవాసులు.

---

అని అభిప్రాయపడ్డారు (అంటే మీ కుటుంబం ఉమ్మత్ కొరకు శుభప్రదమైనది అని భావం). (సహీహ్ బుఖారీ, అల్ మాయిద సూరా).

31. అందుకే మీకు 'తయమ్ముమ్' సౌకర్యం కల్పించబడింది.

32. అందుకే వుజూచేసిన ప్రతిసారీ దుఆ చేయమని హదీసులు మనల్ని ఉపదేశిస్తున్నాయి. దుఆల పుస్తకాల నుండి ఈ దుఆను కంఠస్తం చేసుకోవాలి.

33. న్యాయానికి సంబంధించి ఇంతకుముందు నిసా సూరాలోని 135వ ఆయతులో కూడా తాకీదు చేయబడింది. అలాగే దాని తర్వాతి వాక్యం గురించి ఈ సూరా ఆరంభంలోనూ నొక్కి వక్కాణించబడింది. దైవప్రవక్త (సఅసం) వారి దృష్టిలో న్యాయానికి ఎంత ప్రాధాన్యత ఉండేదోనన్నదానికి నోమాన్ బిన్ బషీర్ (రజి)గారు తెలిపిన ఈ సంఘటన ఓ మచ్చుతునక. ఆయన ఇలా వివరించారు: "మా నాన్నగారు నాకు ఒక కానుకను యిచ్చారు. అది చూసి మా అమ్మగారు, ఈ కానుకకు దైవప్రవక్త (స) సాక్షిగా ఉండనంతవరకూ తాను దాన్ని ఒప్పుకోనని అంది. అప్పుడు మా నాన్న దైవప్రవక్త(స) వద్దకు వెళ్ళి విషయాన్ని వివరించారు. 'నువ్వు నీ పిల్లలందరికీ ఈ కానుకను యిచ్చావా?' అని దైవప్రవక్త (స) దర్యాప్తు చేశారు. 'లేద'ని మా నాన్నగారు బదులిచ్చారు. 'మరయితే అల్లాహ్‌కు భయపడు. సంతానం మధ్య న్యాయాన్ని పాటించు. నేను అన్యాయానికి సాక్షిగా ఉండను' అని చెప్పారు (సహీహ్ బుఖారీ, ముస్లిం–కితాబుల్ హిబ).

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱذْكُرُوا۟ نِعْمَتَ ٱللَّهِ عَلَيْكُمْ
إِذْ هَمَّ قَوْمٌ أَن يَبْسُطُوٓا۟ إِلَيْكُمْ أَيْدِيَهُمْ فَكَفَّ
أَيْدِيَهُمْ عَنكُمْ ۖ وَٱتَّقُوا۟ ٱللَّهَ ۚ وَعَلَى ٱللَّهِ
فَلْيَتَوَكَّلِ ٱلْمُؤْمِنُونَ ﴿١١﴾

**11** విశ్వాసులారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారాన్ని కాస్త జ్ఞప్తికి తెచ్చుకోండి – అప్పుడు ఒక జాతివారు మీపై చేయి చేసుకో వాలని అనుకున్నారు. అయితే అల్లాహ్ వారి చేతులు మీపై లేవకుండా ఆపాడు.[34] అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. విశ్వాసులు నమ్ముకోవలసింది కూడా అల్లాహ్‌నే.

وَلَقَدْ أَخَذَ ٱللَّهُ مِيثَٰقَ بَنِىٓ إِسْرَٰٓءِيلَ ۖ
وَبَعَثْنَا مِنْهُمُ ٱثْنَىْ عَشَرَ نَقِيبًا ۖ وَقَالَ
ٱللَّهُ إِنِّى مَعَكُمْ ۖ لَئِنْ أَقَمْتُمُ ٱلصَّلَوٰةَ وَءَاتَيْتُمُ

**12** అల్లాహ్ ఇస్రాయీల్ సంతతి నుండి గట్టి వాగ్దానాన్ని తీసుకున్నాడు.[35] వారిలో నుంచే పన్నెండు మంది నాయకులను మేము నియమించాము.[36] ఇంకా అల్లాహ్ వారితో ఇలా అన్నాడు: "నిశ్చయంగా నేను మీకు తోడుగా ఉన్నాను. మీరు గనక నమాజును నెలకొల్పుతూ ఉంటే, జకాత్ ఇస్తూ ఉంటే,

34. ఈ ఆయతు నేపథ్యంపై ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు పలు సంఘటనలను పేర్కొన్నారు. ఉదాహరణకు : ఒక పల్లెటూరి బైతు జరిపిన దాడి. దైవప్రవక్త (స) ఒకానొక ప్రయాణం నుండి తిరిగివస్తూ దారిలో ఒక వృక్షం క్రింద విశ్రమించారు. ఖడ్గం వృక్షానికి వ్రేలాడుతూ ఉంది. ఆ వ్యక్తి ఖడ్గం తీసుకుని ఆయన (స)పై విరుచుకుపడ్డాడు. 'ఓ ముహమ్మద్ (స)! ఇప్పుడు నా బారినుండి నిన్ను రక్షించగల వారెవరో చెప్పుకో!' అన్నాడు. "అల్లాహ్" అని ఆయన (స) ప్రశాంతంగా బదులిచ్చారు. ఆ సమాధానం విన్నంతనే అతని చేతిలోని ఖడ్గం జారి క్రిందపడింది. మరి కొంతమంది కథనం ప్రకారం కాబ్ బిన్ అష్రఫ్ బృందం మహాప్రవక్త (స)కు, ఆయన సహచరులకు కీడు తలపెట్టింది. మోసంతో హాని కలిగించాలని కుట్రపన్నింది. కాని అల్లాహ్ ఈ దుష్ట పన్నాగం నుంచి తన ప్రవక్తను కాపాడాడు.

వేరొక కథనం ప్రకారం ఒక ముస్లిం చేతిలో పొరపాటున ఇద్దరు ఆమిర్ తెగకు చెందిన మనుషులు హతమార్చబడ్డారు. యూద తెగ అయిన బనూ నజీర్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం రక్త పరిహారం (దియత్) చెల్లించే విషయంలో వారినుంచి తీసుకోవలసిన సహాయ సహకారాల గురించి మాట్లాడటానికి మహాప్రవక్త (స) తన సహచరులతో కలసి అక్కడికి వెళ్ళారు. యూదులతో సంప్రతింపులు జరిపే ఉద్దేశ్యంతో ఆయన (స) ఒక గోడకు ఆనుకుని కూర్చున్నారు. ఆ గోడ పైనుంచి తిరుగలి రాయిని ఆయన (స)పై పడేయాలని యూదులు కుట్రపన్నారు. అయితే అల్లాహ్ 'వహీ' ద్వారా ఈ సంగతిని తన ప్రవక్తకు తెలియజేశాడు. ఈ సంఘటనలన్నింటి తర్వాత అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి ఉండవచ్చు. ఎందుకంటే ఒక్కో ఆయతు అవతరణ వెనుక ఒకటికన్నా ఎక్కువ కారణాలు, పరిస్థితులు ఉండవచ్చు (తఫ్సీర్ ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

35. అల్లాహ్, ఇంతకు ముందు ఆయతుల్లో ముహమ్మద్ ప్రవక్త (స) ద్వారా తాను విశ్వాసుల నుంచి తీసుకున్న ఒప్పందాన్ని, ప్రమాణాన్ని నెరవేర్చమని వారికి గట్టిగా తాకీదు చేశాడు. సత్యాన్ని స్థాపించమనీ, న్యాయానికి కట్టుబడి సాక్ష్యం చెప్పమని ఆదేశించాడు. తర్వాత తాను వారిపై కురిపించిన భౌతిక, ఆధ్యాత్మిక వరాలను గుర్తు చేశాడు. ముఖ్యంగా తాను వారిని సత్యధర్మంపై, రుజుమార్గంపై నడిచే సద్బుద్ధిని ప్రసాదించిన సంగతి – వీటన్నింటినీ ప్రస్తావించిన తర్వాత అల్లాహ్ ఇస్రాయీల్ వంశంవారి నుంచి తీసుకున్న వాగ్దానాన్ని, ప్రమాణాన్ని గురించి పేర్కొంటున్నాడు. ఆ ప్రమాణాన్ని వారు నెరవేర్చలేకపోయారు. అల్లాహ్ ఈ ఉదాహరణ ద్వారా ముస్లింలను పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు. బనీ ఇస్రాయీల్‌లోని అధిక సంఖ్యాకుల మాదిరిగా ఒప్పందాన్ని ఉల్లంఘించి, విర్రవీగకండి అని ముందుగానే అప్రమత్తం చేస్తున్నాడు.

36. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) 'జబాబిరహ్' (ఆజానుబాహుల)తో యుద్ధానికి సన్నద్ధమైనపుడు తన జాతి ప్రజలకు చెందిన 12 తెగలపై 12 మంది కావలివాళ్ళను (నఖీబ్‌లను) నియమించారు. ఆయా తెగలను యుద్ధం కోసం

الزَّكٰوةَ وَ اٰمَنْتُمْ بِرُسُلِيْ وَعَزَّرْتُمُوْهُمْ
وَاَقْرَضْتُمُ اللّٰهَ قَرْضًا حَسَنًا لَّاُكَفِّرَنَّ عَنْكُمْ
سَيِّاٰتِكُمْ وَلَاُدْخِلَنَّكُمْ جَنّٰتٍ تَجْرِيْ مِنْ
تَحْتِهَا الْاَنْهٰرُ ۚ فَمَنْ كَفَرَ بَعْدَ ذٰلِكَ مِنْكُمْ
فَقَدْ ضَلَّ سَوَآءَ السَّبِيْلِ ⑫

నా ప్రవక్తలను విశ్వసిస్తూ, వారిని గౌరవించి వారికి సహాయ పడితే, అల్లాహ్‌కు ఉత్తమ రుణాన్ని ఇస్తూ ఉంటే నేను మీ చెడుగులను మీ నుంచి దూరం చేస్తాను. క్రింద సెలయేళ్లు ప్రవహించే స్వర్గవనాలలోకి మిమ్మల్ని తీసుకుపోతాను. ఈ ప్రమాణం తరువాత కూడా మీలో ఎవడైనా తిరస్కార వైఖరికి పాల్పడితే అతడు రుజుమార్గం (సవావుస్సబీల్) నుంచి తప్పిపోయాడు."

فَبِمَا نَقْضِهِمْ مِّيْثَاقَهُمْ لَعَنّٰهُمْ وَجَعَلْنَا قُلُوْبَهُمْ
قٰسِيَةً ۚ يُحَرِّفُوْنَ الْكَلِمَ عَنْ مَّوَاضِعِهٖ ۙ وَنَسُوْا
حَظًّا مِّمَّا ذُكِّرُوْا بِهٖ ۚ وَلَا تَزَالُ تَطَّلِعُ عَلٰى

**13** ఆ తరువాత వారు తమ వాగ్దానాన్ని భంగపరచిన కారణంగా మేము వారిని శపించాము. వారి హృదయాలను కఠినం చేశాము. (తత్కారణంగా) వారు పదాలను వాటి (అసలు) స్థానం నుంచి తారుమారు చేస్తున్నారు.[37] అంతేకాదు, తమకు బోధించబడిన ఉపదేశంలో చాలా భాగం వారు మరచి పోయారు.[38] (ఓ ప్రవక్తా!) వారు పాల్పడే ఏదో ఒక ద్రోహానికి సంబంధించిన సమాచారం నీకు అందుతూనే ఉంటుంది.[39]

---

సమాయత్తపరచటం, వాటికి మార్గదర్శకత్వం వహించటం, వారి వ్యవహారాలను చక్కదిద్దటం ఈ నఖీబ్‌ల (నాయకుల) బాధ్యతగా నిర్ణయించారు.

37. ఇన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన మీదట కూడా ఇస్రాయీల్ సంతతి వారు ఆడిన మాట తప్పారు. అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని భంగపరిచారు. ఫలితంగా వారు దేవుని శాపానికి గురయ్యారు. ఈ శాపం మూలంగానే వారి హృదయాలు పాషాణ హృదయాలై పోయాయి. అందువల్లనే సత్యామృతాన్ని అవి ఆస్వాదించలేకపోయాయి. దైవప్రవక్తల దయ, జాలి, కరుణ లాంటి ప్రవచనాలకు ఆ కరకు గుండెలు కరగలేదు. పైగా వారు దైవ వచనాలలో ప్రక్షిప్తాలకు, మార్పులు చేర్పులకు పాల్పడటం మొదలెట్టారు. వాస్తవిక విషయాలకు వక్రభాష్యం చెప్పసాగారు. అసలు విషయం ఏమిటంటే వారి మనసుల్లో వక్రత వచ్చేసింది. వారి నిర్భయం, నిర్లక్ష్యవైఖరి నానాటికీ పెరిగిపోయింది. ఫలితంగా వారు అల్లాహ్ వాక్యాలలో సయితం ఇష్టం వచ్చినట్లు మార్పులూ చేర్పులూ మొదలెట్టారు.

యూదుల ఈ వైఖరి ముస్లింలకు కనువిప్పు కావాల్సింది. కాని దురదృష్టవశాత్తూ ముస్లింలు సయితం కఠిన మనస్కులుగా తయారవుతున్నారు. దైవ వచనాలకు వక్రభాష్యం చెప్పే దుర్గుణం వారిలోనూ చోటు చేసుకుంటోంది. అజ్ఞానుల సంగతటుంచండి, జ్ఞానులు, బుద్ధిజీవులు సయితం దైవానికి ఏ మాత్రం భయపడకుండా దైవవచనాలతో చెలగాటమాడుతున్నారు. ఖుర్ఆన్ సాక్షిగా వారి ముందు దైవోపదేశం చేసినా వారి కరకు గుండెలు కరగటం లేదు. తాము పాల్పడిన అత్యాచారాలపై వారు పశ్చాత్తాపభావంతో సిగ్గు పడటం లేదు. తాము సృష్టించే బిద్అత్‌ల కోసం, ధర్మానికి తాము చెప్పదలచే సరికొత్త వ్యాఖ్యానాల కోసం వారు దివ్య వచనాలకు తప్పుడు అర్థాలు తీయడానికి కూడా వెనుకాడటం లేదు (దైవం మన్నించుగాక!).

38. ఇది మూడవ దుష్పరిణామం. దైవాదేశాలను అమలుపరచే విషయంలో వారు కనబరచిన అలసత్వం, నిర్లక్ష్యం మూలంగా వారు ధార్మికంగా అధోగతి పాలయ్యారు. వారి మదిలో సకారాత్మక ఆలోచనలు కొరవడ్డాయి. వారి భావాలలో స్థిరత్వం, నిలకడ లోపించాయి. మొత్తమ్మీద వారు సన్మార్గానికే దూరమైపోయారు.

39. అంటే మోసం, దగా, అప్పగింతల్లో ద్రోహం, కుట్రలు కుతంత్రాలు – వారి నడవడికలో అంతర్భాగాలై పోయాయి. వాటికి సంబంధించిన సంఘటనలు అనుదినం మీ ముందుకు వస్తుంటాయి.

خَآئِنَةٍ مِّنْهُمْ إِلَّا قَلِيلًا مِّنْهُمْ فَاعْفُ عَنْهُمْ وَاصْفَحْ ۚ إِنَّ اللَّهَ يُحِبُّ الْمُحْسِنِينَ ⑬

అయితే వారిలో కొద్దిమంది మాత్రం అలాంటివారు కారు.[40] అయినా సరే నువ్వు వారిని మన్నిస్తూ, ఉపేక్షిస్తూ ఉండు.[41] నిస్సందేహంగా అల్లాహ్ ఉత్తమంగా వ్యవహరించేవారిని అమితంగా ప్రేమిస్తాడు.

وَمِنَ الَّذِينَ قَالُوا إِنَّا نَصَارَىٰ أَخَذْنَا مِيثَاقَهُمْ فَنَسُوا حَظًّا مِّمَّا ذُكِّرُوا بِهِ فَأَغْرَيْنَا بَيْنَهُمُ الْعَدَاوَةَ وَالْبَغْضَاءَ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ ۚ وَسَوْفَ يُنَبِّئُهُمُ اللَّهُ بِمَا كَانُوا يَصْنَعُونَ ⑭

**14** తమను తాము 'నసారా'[42] (క్రైస్తవులు)గా చెప్పుకునేవారి నుండి కూడా మేము వాగ్దానం తీసుకున్నాము. అయితే వారు కూడా తమకు చేయబడిన ఉపదేశంలోని ఎక్కువ భాగాన్ని విస్మరించారు. ఈ కారణంగా మేము వారి మధ్య విరోధాన్ని, విద్వేషాలను తగిలించాము. అవి ప్రళయ దినం వరకూ ఉంటాయి.[43] వారు చేస్తూ ఉండిన పనులన్నింటినీ అల్లాహ్ త్వరలోనే వారికి తెలియజేస్తాడు.

40. ఆ కొద్దిమంది గ్రంథవహులలోని వారే. వారు అల్లాహ్‌ను విశ్వసించి ముస్లింలయ్యారు. వారి సంఖ్య పదికి లోపే ఉంది.

41. పోరాడేందుకు అనుమతి లేని కాలంలో ఈ మన్నింపుల వైఖరి గురించి తాకీదు చేయబడింది. ఆ తరువాత కొంతకాలానికి దీని స్థానంలో "అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించని వారితో యుద్ధం చేయండి" అన్న తౌబా సూరా, 29వ వాక్యం అవతరించింది. అయితే కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం "మన్నింపుల వైఖరిని అవలంబించండి" అన్న ఆజ్ఞ రద్దు కాలేదు. పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ దైవోపదేశాన్ని సయితం అవలంబించవచ్చు. యుద్ధం ద్వారా లభించే ప్రయోజనాలే ఒక్కోసారి ఈ మన్నింపుల ద్వారా కూడా ప్రాప్తిస్తాయి.

42. అరబీలో **'నసారా' (نصٰرٰی)** అని ఉంది. అంటే క్రైస్తవులని దాని అర్థం. అసలు నసారా అనే పదం 'నుస్రత్' నుంచి వచ్చింది. నుస్రత్ అంటే సహాయం అని అర్థం. "దైవధర్మం విషయంలో మీలో నాకు సహాయపడే వారెవరు?" అన్న ఈసా (అలైహిస్సలాం) ప్రశ్నకు సమాధానంగా చిత్తశుద్ధిగల కొంతమంది అనుచరులు, "నహ్ను అన్సారుల్లాహ్" (మేము అల్లాహ్‌కు సహాయకులం) అంటూ ముందుకు వచ్చారు. ఈ నస్రానీలు (క్రైస్తవులు) కూడా యూదుల మాదిరిగా గ్రంథవహులే. వీళ్లనుంచి కూడా అల్లాహ్ ప్రమాణం తీసుకున్నాడు. కాని తరువాత వారు కూడా ఈ ఒప్పందాన్ని ఖాతరు చెయ్యలేదు. తత్ఫలితంగా వీళ్ళ హృదయాలు కూడా ప్రభావరహితం అయిపోయాయి. వీళ్ల నడవడిక భావితరాలకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకం కాకుండా పోయింది.

43. అల్లాహ్‌కు ఇచ్చిన మాట పట్ల వీరు చూపిన విముఖత మూలంగానూ, ఆచరణ లోపించిన ప్రవర్తన కారణంగానూ అల్లాహ్ వారి మధ్య సదవగాహన, సఖ్యత లేకుండా చేశాడు. ఇది ప్రళయం వరకూ ఉంటుంది. నేడు క్రైస్తవంలో అనేక వర్గాలున్నాయి. ఒకరి పొడ ఇంకొకరికి గిట్టదు. వారు పరస్పరం వైరభావం కలిగి ఉంటారు. ఒక వర్గం వారు ఇంకొక వర్గం వారి ప్రార్థనాలయంలో ప్రార్థన చేయరు.

శోచనీయమైన విషయం ఏమిటంటే ముస్లిం సమాజం కూడా ఇలాంటి వైమనస్యానికి లోనై ఉంది. వారిలోనూ అనేక అభిమతాలు గలవారున్నారు. ఒకరి అభిమతం ఇంకొకరికి పడదు. వారి మధ్య తీవ్రమయిన భేదాభిప్రాయాలున్నాయి. ఒకరింకొకరిని విరోధులుగా చూసుకుంటారు. ఇదంతా చూస్తుంటే పూర్వం క్రైస్తవులకు పడిన శిక్ష ముస్లింలపై కూడా పడిందేమోననిపిస్తోంది. (అల్లాహ్ మనపై దయజూపుగాక!)

يٰۤاَهۡلَ الۡكِتٰبِ قَدۡ جَآءَكُمۡ رَسُوۡلُنَا يُبَيِّنُ لَـكُمۡ
كَثِيۡرًا مِّمَّا كُنۡتُمۡ تُخۡفُوۡنَ مِنَ الۡكِتٰبِ وَيَعۡفُوۡا
عَنۡ كَثِيۡرٍ ؕ قَدۡ جَآءَكُمۡ مِّنَ اللّٰهِ نُوۡرٌ وَّكِتٰبٌ
مُّبِيۡنٌ ﴿15﴾

**15** ఓ గ్రంథవహులారా! మీ వద్దకు మా ప్రవక్త (సఅసం) వచ్చేశాడు. మీరు కప్పిపుచ్చుతూ ఉండిన[44] గ్రంథంలోని ఎన్నో విషయాలను అతను మీ ముందు విపులీకరిస్తున్నాడు. మరెన్నో విషయాలను ఉపేక్షిస్తున్నాడు. అల్లాహ్ తరఫు నుంచి మీ వద్దకు జ్యోతి వచ్చేసింది. అంటే, స్పష్టమైన గ్రంథం వచ్చేసింది.[45]

يَّهۡدِىۡ بِهِ اللّٰهُ مَنِ اتَّبَعَ رِضۡوَانَهٗ سُبُلَ
السَّلٰمِ وَيُخۡرِجُهُمۡ مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوۡرِ
بِاِذۡنِهٖ وَيَهۡدِيۡهِمۡ اِلٰى صِرَاطٍ مُّسۡتَقِيۡمٍ ﴿16﴾

**16** దాని ద్వారా అల్లాహ్ తన ప్రసన్నతను అనుసరించేవారికి శాంతి మార్గాలను చూపుతాడు. తన అనుమతి మేరకు వారిని చీకట్లలో నుంచి వెలికితీసి, కాంతి వైపుకు తీసుకువస్తాడు. రుజుమార్గం వైపుకు వారికి దర్శకత్వం వహిస్తాడు.

44. అంటే తౌరాతు, ఇంజీలు (బైబిలు) గ్రంథాలలో వారు తమ మనోవాంఛలకనుగుణంగా చేసిన ప్రక్షిప్తాలను, తారుమారు చేసిన ఆజ్ఞలను వారు కప్పిపుచ్చేందుకు ప్రయత్నించేవారు. అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలాంటి కీలకమయిన విషయాలను స్పష్టంగా విడమరచి చెప్పారు. ఉదాహరణకు : శిలా శిక్ష విషయంలో వారు ఆడిన దాగుడుమూతలు ఇందుకు ఒక నిదర్శనం. హదీసులలో ఇది వివరంగా వచ్చింది.

45. జ్యోతి (నూర్) అన్నా, స్పష్టమైన గ్రంథం (కితాబుమ్ ముబీన్) అన్నా యిక్కడ ఖుర్ఆన్ అని భావం. ఈ గ్రంథం ద్వారా అల్లాహ్ మానవులకు సన్మార్గం వైపుకు దర్శకత్వం వహిస్తున్నాడు. అరబీలో **"నూరున్ వ కితాబుమ్ ముబీన్"** (జ్యోతి 'మరియు' స్పష్టమైన గ్రంథం) అని వచ్చింది. ఇక్కడ 'మరియు' అన్న పదం 'జ్యోతి', 'స్పష్టమైన గ్రంథం' – రెండూ వేర్వేరు వస్తువులని సూచించటానికి రాలేదు. నిజానికి ఇక్కడ 'మరియు' అన్న పదం జ్యోతి అంటే ఏమిటో వివరించటం కోసం ఉపయోగించబడింది. అది స్పష్టమైన గ్రంథమని విశదీకరిస్తోంది. దీనినే అరబీలో 'అత్ఫె తఫ్సీరి' అంటారు. ఈ వివరణకు నిదర్శనం కూడా లేకపోలేదు. అదేమిటంటే దీని తర్వాతి వాక్యంలో "యహ్దీ బిహిల్లాహ్" (అల్లాహ్ దీనిద్వారా మార్గం చూపుతాడు) అని చెప్పబడింది. ఒకవేళ జ్యోతి, స్పష్టమైన గ్రంథం – రెండూ వేర్వేరు వస్తువులు అయి ఉన్నట్లయితే తర్వాతి వాక్యంలో 'యహ్దీ బిహిమల్లాహు' (అల్లాహ్ ఆ రెండిటి ద్వారా – లేక – వాటి ద్వారా సన్మార్గం చూపుతాడు) అని చెప్పాల్సింది. కాని ఆ తర్వాతి వాక్యంలో అలా లేదు. దీనిద్వారా బోధపడేదేమిటంటే ఈ వాక్యంలోని జ్యోతి, స్పష్టమైన గ్రంథం – రెండూ వేర్వేరు వస్తువులు కావు. రెండూ ఒక్కటే. అదే ఖుర్ఆన్. దీనికి విరుద్ధంగా ఇక్కడ నూర్ (జ్యోతి) అంటే మహాప్రవక్త (స) అనీ, గ్రంథమంటే ఖుర్ఆన్ అనీ కొందరు చేసిన వ్యాఖ్యానం సరైంది కాదు. ముఖ్యంగా బిద్అతీలు ఈ విధంగా వాదిస్తారు. మహాప్రవక్త (స) విషయంలో వారు "నూరుమ్మిన్ నూరిల్లాహి (అల్లాహ్ జ్యోతిలో అంతర్భాగం)" అనే దృక్పథానికి రూపకల్పన చేశారు. మహాప్రవక్త (స) మానవమాత్రులన్న విషయాన్ని నిరాకరించారు. తమ స్వకల్పిత విశ్వాసానికి అనుకూలంగా వారు, "అల్లాహ్ అన్నిటికన్నా ముందు దైవప్రవక్త కాంతిని సృజించి, ఆ కాంతి ద్వారా సమస్త జగతినీ సృష్టించాడు" అన్న హదీసును ఆసరాగా తీసుకుంటారు. మరి చూడబోతే, ప్రామాణిక హదీసు సంకలనాలలో ఎక్కడా ఈ హదీసు కనిపించదు. కాగా; ఇది తిర్మిజీ మరియు అబూ దావూద్ గ్రంథాల్లోని "అల్లాహ్ ప్రప్రథమంగా కలమును సృష్టించాడు" అన్న మహాప్రవక్త (సఅసం) ప్రవచనానికి విరుద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో విఖ్యాత హదీసువేత్త అల్బానీ ఇలా రాశారు: 'అల్లాహ్ ప్రప్రథమంగా కలమును సృష్టించాడు' అన్న ఈ హదీసు ప్రామాణికమైనది. ఇందులో ఎలాంటి సందేహానికీ తావులేదు. అంతేకాదు, జనుల్లో ప్రాచుర్యం పొందివున్న 'ఓ జాబిర్! అల్లాహ్ మొట్టమొదటగా నీ ప్రవక్త జ్యోతిని సృష్టించాడు' అన్న హదీసు 'మిథ్య' అని చెప్పటానికి కూడా పై హదీసు ఒక ప్రబల తార్కాణం (తాలీఖాతుల్ మిష్కాత్, మొదటి సంపుటి 34వ పేజీ).

**17** "అల్లాహ్ (అంటే) మర్యమ్ పుత్రుడైన మసీహ్‌యే" అని అన్నవారు నిస్సందేహంగా అవిశ్వాసానికి పాల్పడ్డారు. (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఒకవేళ అల్లాహ్ మర్యమ్ పుత్రుడైన మసీహ్‌ని, అతని తల్లిని, భూమండలంలోని సమస్త జనులనూ నాశనం చేయదలిస్తే, ఆయన్ని అడ్డుకోగల శక్తి, అధికారం ఎవరికున్నాయి? భూమ్యాకాశాలలోనూ, వాటి మధ్యలోనూ ఉన్నవాటి సమస్త సార్వభౌమత్వానికి అధిపతి అల్లాహ్‌యే. ఆయన తాను కోరిన దాన్ని సృష్టిస్తాడు. అల్లాహ్ ప్రతిదీ చేయగల అధికారం కలవాడు."[46]

لَقَدْ كَفَرَ الَّذِينَ قَالُوا إِنَّ اللَّهَ هُوَ الْمَسِيحُ
ابْنُ مَرْيَمَ ۚ قُلْ فَمَن يَمْلِكُ مِنَ اللَّهِ شَيْئًا
إِنْ أَرَادَ أَن يُهْلِكَ الْمَسِيحَ ابْنَ مَرْيَمَ وَأُمَّهُ
وَمَن فِي الْأَرْضِ جَمِيعًا ۗ وَلِلَّهِ مُلْكُ السَّمَاوَاتِ
وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا ۚ يَخْلُقُ مَا يَشَاءُ ۚ
وَاللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿١٧﴾

**18** "మేము అల్లాహ్ పుత్రులం, ఆయనకు ప్రియమైన వారం"[47] అని యూదులు, క్రైస్తవులు (నస్రానీలు) అంటారు. (ఓ ప్రవక్తా!) వారిని ఇలా అడుగు : "మరయితే మీ పాపాలకుగాను ఆయన మిమ్మల్ని ఎందుకు శిక్షిస్తున్నాడు?[48] కాదు, మీరు కూడా ఆయన సృష్టించిన మానవ వర్గానికి చెందినవారే. ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు, తాను కోరిన వారిని శిక్షిస్తాడు.[49] భూమ్యాకాశాలలోనూ, వాటి మధ్యనూ ఉన్నవాటన్నింటిపై అధికారం అల్లాహ్‌దే. ఆయన వైపుకే మరలిపోవలసి ఉంది."

وَقَالَتِ الْيَهُودُ وَالنَّصَارَىٰ نَحْنُ أَبْنَاءُ اللَّهِ
وَأَحِبَّاؤُهُ ۚ قُلْ فَلِمَ يُعَذِّبُكُم بِذُنُوبِكُم ۖ
بَلْ أَنتُم بَشَرٌ مِّمَّنْ خَلَقَ ۚ يَغْفِرُ لِمَن
يَشَاءُ وَيُعَذِّبُ مَن يَشَاءُ ۚ وَلِلَّهِ مُلْكُ السَّمَاوَاتِ
وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا ۖ وَإِلَيْهِ الْمَصِيرُ ﴿١٨﴾

46. ఈ ఆయతులో అల్లాహ్ తన సంపూర్ణ ఆధిపత్యాన్ని, అసాధారణమైన తన అధికారాన్ని గురించి ప్రస్తావించాడు. క్రైస్తవుల త్రిత్వ విశ్వాసాన్ని, మెస్సయ్య దేవుడు అన్నవారి మూఢ నమ్మకాన్ని ఖండించటం దీని అసలు ఉద్దేశ్యం. పూర్వం క్రైస్తవుల్లో ఒక వర్గం 'యాకూబియ్యా' మాత్రమే ఏసుక్రీస్తును దైవంగా భావించేది. కాని ప్రస్తుతం క్రైస్తవుల్లో దాదాపు అన్ని వర్గాలూ, ఏదో ఒక విధంగా ఏసుక్రీస్తును దైవంగా భావించి కొలుస్తున్నాయి. ప్రస్తుతం క్రైస్తవ ప్రపంచంలో "మూడు దైవాల భావన" వేళ్లూనుకుంది. అయితే ఏ ప్రవక్తనయినా దైవంగాగానీ, దైవాంశసంభూతుడుగా గానీ ఖరారుచేసి, ఆ విధంగా కొలవటం పచ్చి కుఫ్ర్ (దైవ తిరస్కారం) అనీ ఈ సందర్భంగా ఖుర్ఆన్ తేటతెల్లం చేస్తోంది. క్రైస్తవులు దైవప్రవక్త ఏసు (మసీహ్)ను దైవంగా ఖరారు చేసి ఈ రకమయిన అవిశ్వాసానికి ఒడిగట్టారు. అలాగే మరే వర్గంవారైనా ఏ ప్రవక్తనయినాసరే ప్రవక్తా పదవినుంచి, మానవత్వ స్థాయి నుంచి తొలగించి అమాంతం దైవత్వపు పీఠంపై కూర్చోబెడితే వారు కూడా అవిశ్వాసుల సరసనే నిలబడతారు. **ఫ నవూజు బిల్లాహి మిన్ హాజిహిల్ అఖీదతిల్ ఫాసిదతి.**

47. యూదులు ఉజైర్‌ను దేవుని కుమారునిగా ఖరారు చేయగా, క్రైస్తవులు ఈసా (ఏసు)ను దేవుని కుమారుడని అన్నారు. తాము కూడా దేవుని మానస పుత్రులమని చెప్పుకున్నారు. వారు దేవుని కుమారులని చెప్పలేదనీ, దేవుని కుమారుల అనుయాయులం (అత్‌బావు అబ్‌నాయిల్లాహి) అని చెప్పుకున్నారని మరికొంతమంది వ్యాఖ్యానించారు. రెండింటి మధ్య తేడా పెద్దగా లేదు. ఆ రెంటిలో ఏమాట చెప్పినా దేవుని పట్ల వారికి గల విశ్వాసం ఎటువంటిదో బహిర్గతమవుతూనే ఉంది.

48. యూదుల, క్రైస్తవుల మాటల్లో ఏమాత్రం పసలేదన్నదానికి ఇది నిదర్శనం. ఒకవేళ మీరు నిజంగానే అల్లాహ్‌కు ప్రీతిపాత్రులై ఉంటే మీ పరిస్థితి ఇలా ఉండేది కాదు. మీరు దైవానికి ప్రియమైన వారై ఉంటే మీరు తలచిందల్లా

يٰۤاَهۡلَ الۡكِتٰبِ قَدۡ جَآءَكُمۡ رَسُوۡلُنَا يُبَيِّنُ لَكُمۡ
عَلٰى فَتۡرَةٍ مِّنَ الرُّسُلِ اَنۡ تَقُوۡلُوۡا مَا جَآءَنَا
مِنۡۢ بَشِيۡرٍ وَّلَا نَذِيۡرٍ فَقَدۡ جَآءَكُمۡ بَشِيۡرٌ
وَّنَذِيۡرٌ ؕ وَاللّٰهُ عَلٰى كُلِّ شَىۡءٍ قَدِيۡرٌ (19)

**19** గ్రంథవహులారా! ప్రవక్తల ఆగమన క్రమంలో విరామం తర్వాత మా ప్రవక్త మీ వద్దకు వచ్చేశాడు. అతను మీకు స్పష్టంగా విడమరచి చెబుతున్నాడు. మా వద్దకు శుభవార్త అందించేవాడు, భయపెట్టేవాడు ఎవరూ రాలేదన్న మాట మీరు అనకుండా ఉండేందుకుగాను (ఈ ఏర్పాటు జరిగింది). అందుకే ఇప్పుడు నిజంగా శుభవార్త వినిపించేవాడు, భయపెట్టేవాడు మీ వద్దకు వచ్చేశాడు.[50] అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు.

وَاِذۡ قَالَ مُوۡسٰى لِقَوۡمِهٖ يٰقَوۡمِ اذۡكُرُوۡا نِعۡمَةَ
اللّٰهِ عَلَيۡكُمۡ اِذۡ جَعَلَ فِيۡكُمۡ اَنۡۢبِيَآءَ وَجَعَلَكُمۡ مُّلُوۡكًا ۖ
وَّاٰتٰٮكُمۡ مَّا لَمۡ يُؤۡتِ اَحَدًا مِّنَ الۡعٰلَمِيۡنَ (20)

**20** మూసా తన జాతి వారినుద్దేశించి చెప్పిన విషయాన్ని జ్ఞాపకం చేసుకోండి : "ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారాన్ని కాస్త మననం చేసుకోండి – ఆయన మీలో ప్రవక్తల్ని నియమించాడు. మిమ్మల్ని రాజులుగా చేశాడు.[51] లోకవాసులలో ఎవరికీ ప్రసాదించని దానిని మీకు ప్రసాదించాడు."[52]

---

చేయటానికి మీకు స్వేచ్ఛ ఉండేది. మీ తప్పులను గురించి దేవుడు మిమ్మల్ని నిలదీసేవాడు కాదు. కాని వాస్తవ పరిస్థితులు అలా లేవు. మీ పాపాలకు ప్రతిగా అల్లాహ్ మిమ్మల్ని కఠినాతి కఠినంగా శిక్షిస్తున్నాడు. అంటే మీరు ఆయనకు ప్రీతిపాత్రులు కారనేగా అర్థం. అల్లాహ్ వట్టి వాదనల ఆధారంగా తీర్పు చేయడు. విశ్వాసం (ఈమాన్), ఆచరణ (అమల్), భక్తి (తఖ్వా) ఆధారంగా ఆయన మనుషుల వ్యవహారాలపై నిర్ణయం గైకొంటాడు. ఇహపర సాఫల్యాలు రెండూ వీటిపైనే ఆధారపడి ఉంటాయి.

49. ఈ క్షమించటమయినా, శిక్షించటమయినా దేవుని సంవిధానం ప్రకారమే జరుగుతుంది. అదేమిటంటే విశ్వాసులు క్షమాపణకు అర్హత పొందగా, అవిశ్వాసులు శిక్షకు పాత్రులవుతారు. కనుక ఓ గ్రంథవహులారా! మీరు కూడా అందరిలాంటి మానవులే. మరలాంటప్పుడు ఇతర మనుషులకు భిన్నంగా మీపట్ల ప్రత్యేక వ్యవహారం ఎలా జరుగుతుంది?

50. ఈసా (అలైహిస్సలాం)కీ – అంతిమ దైవప్రవక్త ముహమ్మదు (సఅసం) వారికీ మధ్య దాదాపు 570 లేక 600 సంవత్సరాల వ్యవధి ఉంది. ఇది 'సంధికాలం' (ఫత్రా)గా పరిగణించబడుతుంది. ఈ సంధికాలం తరువాత మేము మా అంతిమ సందేశహరుణ్ణి మీ వద్దకు పంపించాము. లేకపోతే, 'మా వద్దకు శుభవార్తాహరుడు గానీ, హెచ్చరిక చేసేవాడు గానీ రాలేదే!' అని మీరు మాట మార్చే అవకాశం ఉంది. కనుక నేను మీకు సాకులు చెప్పే అవకాశం ఇవ్వదలచుకోలేదు అని అల్లాహ్ గ్రంథవహుల్ని ఉద్దేశించి చెబుతున్నాడు.

51. దైవప్రవక్తల్లో చాలామంది బనీ ఇస్రాయీల్ నుంచే నియుక్తులయ్యారు. ఈ పరంపర ఈసా (అలైహిస్సలాం) వరకూ సాగింది. అంతిమ దైవప్రవక్త (సఅసం) మాత్రం ఇస్మాయీల్ సంతతికి చెందినవారు. అలాగే ఇస్రాయీల్ సంతతికి చెందినవారు ఎంతోమంది భూమండలంలో రాజ్యాలను ఏలారు. కొంతమంది ప్రవక్తలకు సయితం రాజ్యాధికారం లభించింది. దావూద్ (అలైహిస్సలాం)గారి రాజ్యాధికారం ఇందుకు ఒక ఉదాహరణ. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే ప్రవక్త పదవిలాగే రాజరికం కూడా దేవుని మహదనుగ్రహమే. కాబట్టి రాజకీయాన్ని, అధికారాన్ని చెడు అంశంగా భావించటం సమంజసం కాదు. రాజ్యాధికారమే గనక స్వతహాగా చెడ్డ వస్తువు అయిఉంటే దేవుడు ప్రవక్తల్ని రాజులుగా చేసేవాడే కాదు. పరిపాలన చేయటం మంచిది కాదనుకుంటే అల్లాహ్ దీన్ని తన అనుగ్రహంగా పేర్కొనేవాడే కాదు. రాజరికంగానీ, రాజకీయాలు గానీ స్వతహాగా చెడ్డవి కావు. వాటిని ఏలేవారిలో ఉన్న చెడుగు మూలంగా వాటికి చెడ్డ

**21** “నా జాతివారలారా! అల్లాహ్ మీకు రాసిపెట్టిన[53] ఈ పవిత్ర ప్రదేశంలో ప్రవేశించండి.[54] వెన్నుచూపి మరలిపోకండి.[55] వెన్నుచూపి మరలిపోయారంటే మీరే నష్టపోతారు.”

يٰقَوْمِ ادْخُلُوا الْاَرْضَ الْمُقَدَّسَةَ الَّتِيْ كَتَبَ اللّٰهُ
لَكُمْ وَلَا تَرْتَدُّوْا عَلٰٓى اَدْبَارِكُمْ فَتَنْقَلِبُوْا خٰسِرِيْنَ ﴿21﴾

**22** దానికి వారు ఇలా బదులిచ్చారు : “మూసా! అక్కడ మహా బలవంతులు ఉన్నారు. వారక్కణ్ణుంచి వెళ్ళిపోనంత వరకూ మేము అందులో ప్రవేశించేది లేదు. ఒకవేళ వారు వెళ్ళిపోతే మాత్రం, మేము తప్పకుండా అందులోకి ప్రవేశిస్తాము.”[56]

قَالُوْا يٰمُوْسٰٓى اِنَّ فِيْهَا قَوْمًا جَبَّارِيْنَ ۖ وَاِنَّا لَنْ
نَّدْخُلَهَا حَتّٰى يَخْرُجُوْا مِنْهَا ۚ فَاِنْ يَّخْرُجُوْا
مِنْهَا فَاِنَّا دٰخِلُوْنَ ﴿22﴾

పేరు వచ్చింది. ఈ చెడ్డ పేరును అంటగట్టడంలో పాశ్చాత్య ప్రజాస్వామిక ధ్వజవాహకులు కూడా ప్రముఖ భూమికను పోషించారు. వారు స్వయంగా ప్రపంచ రాజకీయాలు నడుపుతూనే ప్రాచ్యుల మదిలో రాజకీయాల పట్ల ఏవగింపును, జుగుప్సను నాటే ప్రయత్నం చేశారు. మొత్తమ్మీద రాజరికంగానీ, ఏకసత్తాక పరిపాలనగానీ – పరిపాలకుడు గనక దైవభీతిపరుడు, న్యాయశీలుడైన పక్షంలో – ప్రజాస్వామిక వ్యవస్థకన్నా మంచి ఫలితాలను ఇవ్వగలదు.

52. ఇస్రాయీల్ సంతతికి వొసగిన అసంఖ్యాకమైన వరాలను దేవుడు యిక్కడ జ్ఞాపకం చేయిస్తున్నాడు. ఉదాహరణకు : మన్, సల్వా అనే ఆహారపదార్థాల అవతరణ, మేఘాల ఛాయ, ఫిర్ఔన్ బారినుంచి రక్షించటానికి వారికోసం సముద్రంలో మార్గం ఏర్పరచటం మొదలగునవి. ఈ రకంగా ఈ జాతి ఆధిక్యత, దైవానుగ్రహాల దృష్ట్యా తన కాలంలో ఇతర జాతులకన్నా ఎంతో ముందంజలో ఉండేది. అయితే అంతిమ దైవప్రవక్త (సఅసం) ప్రభవించిన తరువాత ఈ శ్రేష్ఠత ముహమ్మద్ (స) గారి అనుచర సమాజానికి లభించింది. “మానవుల కోసం ఉనికిలోకి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరు” అని దేవుడు వారికి కితాబు ఇచ్చాడు (ఆలి ఇమ్రాన్-110). అయితే ఈ శ్రేష్ఠత ఒక షరతుతో ముడిపడి ఉంది. ఈ షరతు కూడా ఈ ఆయతులోనే తెలియజేయబడింది – “మీరు ప్రజలకు మంచిని గురించి ఆజ్ఞాపిస్తారు. చెడు నుండి ఆపుతారు. దైవాన్ని విశ్వసిస్తారు.” కారుణ్యప్రభువు అయిన అల్లాహ్ ముస్లింలకు ఈ ‘పని’ చేసే సద్బుద్ధిని వొసగి, వారు నిజంగానే శ్రేష్ఠ సమాజంగా విరాజిల్లే అవకాశం ప్రసాదించుగాక!

53. ఇస్రాయీల్ సంతతికి మూలపురుషుడైన యాఖూబ్ (అలైహిస్సలాం) బైతుల్ మఖ్దిస్‌లో ఉండేవారు. అయితే యూసుఫ్ (అలైహిస్సలాం) ఈజిప్టులో నాయకత్వం వహిస్తున్నప్పుడు ఇస్రాయీల్ సంతతివారు ఈజిప్టుకు తరలిపోయారు. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) వారిని ఫిర్ఔన్ బెడద నుంచి కాపాడేందుకు రాత్రికి రాత్రే అక్కడినుంచి తరలించే దాకా వారు అక్కడే నివాసముండేవారు. ఆ రోజుల్లో బైతుల్ మఖ్దిస్‌పై అమాలిఖా జాతి అధికారం ఉండేది. అదొక వీరజాతి. వారిలో శౌర్యం, పరాక్రమం మెండుగా ఉండేవి. మళ్లీ బైతుల్ మఖ్దిస్ ప్రదేశంలోకి వెళ్ళి స్థిరపడాలని దైవప్రవక్త మూసా నిశ్చయించుకున్నారు. దానికోసం అమాలిఖా జాతితో పోరాడటం తప్ప మార్గాంతరం లేదు. కాస్త ధైర్యం చేసి ఆ పవిత్ర క్షేత్రంలోకి ప్రవేశిస్తే దేవుని తోడ్పాటుతో అది తమ వశం అవుతుందని మూసా (అలైహిస్సలాం) శుభవార్త అందించారు. అయినాసరే అమాలిఖాతో పోరాడటానికి ఇస్రాయీల్ సంతతివారు సాహసించలేదు (ఇబ్నె కసీర్).

54. అంటే తన మార్గంలో పోరాడిన పక్షంలో అల్లాహ్ ప్రసాదిస్తానని వాగ్దానం చేసిన విజయం, సహాయాలన్నమాట.

55. ‘వెన్నుచూపి మరలకండి’ అంటే పోరాటం పట్ల విముఖత చూపరాదని భావం.

56. అమాలిఖా జాతి శౌర్య పరాక్రమాలకు ఇస్రాయీల్ సంతతివారు జడుసుకున్నారు. ఈ కారణంగా తొలి దశలోనే వారు చేతులెత్తేశారు. ఆ సమయంలో వారు దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) మాటను లక్ష్య పెట్టకపోవటమే గాక, దేవుని వాగ్దానంపై కూడా వారికి నమ్మకం లేకుండా పోయింది.

**23** అప్పుడు, అల్లాహ్‌కు భయపడే వారిలో ఆయన అనుగ్రహం పొందిన ఇద్దరు ఇలా అన్నారు : "మీరు వారిని ఎదుర్కోవటానికి (కనీసం) ద్వారం లోపలికైనా ప్రవేశించండి. మీరు లోపలికి ప్రవేశిస్తే చాలు, మీరే ఆధిక్యత పొందుతారు. మీరు విశ్వాసులే అయితే అల్లాహ్‌నే నమ్మండి."[57]

قَالَ رَجُلَانِ مِنَ الَّذِينَ يَخَافُونَ أَنْعَمَ اللَّهُ
عَلَيْهِمَا ادْخُلُوا عَلَيْهِمُ الْبَابَ فَإِذَا دَخَلْتُمُوهُ
فَإِنَّكُمْ غَالِبُونَ ۚ وَعَلَى اللَّهِ فَتَوَكَّلُوا إِن
كُنتُم مُّؤْمِنِينَ (23)

**24** (కాని ఈ మాటల్ని వారు లక్ష్య పెట్టలేదు). "ఓ మూసా! వారు అక్కడ ఉన్నంత వరకూ మేము సుతరామూ అక్కడికి వెళ్ళబోము. నువ్వూ, నీ ప్రభువూ పోయి ఉభయులూ వారితో పోరాడండి. మేమిక్కడే కూర్చుని ఉంటాము"[58] అని వారు చెప్పారు.

قَالُوا يَا مُوسَىٰ إِنَّا لَن نَّدْخُلَهَا أَبَدًا مَّا دَامُوا
فِيهَا فَاذْهَبْ أَنتَ وَرَبُّكَ فَقَاتِلَا إِنَّا هَاهُنَا
قَاعِدُونَ (24)

**25** అప్పుడు మూసా ఇలా విన్నవించుకున్నాడు: "ప్రభూ! నాకు నా స్వయంపైనా, నా సోదరునిపైన మాత్రమే అధికారం ఉంది. కాబట్టి నువ్వు మమ్మల్ని – ఈ అవిధేయులను వేరు చెయ్యి."[59]

قَالَ رَبِّ إِنِّي لَا أَمْلِكُ إِلَّا نَفْسِي وَأَخِي فَافْرُقْ
بَيْنَنَا وَبَيْنَ الْقَوْمِ الْفَاسِقِينَ (25)

**26** అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు: "ఇక ఈ భూమి వారి కోసం నలభై సంవత్సరాల దాకా నిషేధించబడింది. వారు ఎక్కడా నిలువ నీడ లేకుండా నేలపై తచ్చాడుతూ తిరుగు తుంటారు.[60] కనుక నువ్వు ఈ అవిధేయ జనుల విషయంలో దుఃఖించకు."[61]

قَالَ فَإِنَّهَا مُحَرَّمَةٌ عَلَيْهِمْ أَرْبَعِينَ سَنَةً ۛ
يَتِيهُونَ فِي الْأَرْضِ ۚ فَلَا تَأْسَ عَلَى الْقَوْمِ
الْفَاسِقِينَ (26)

---

57. మూసా (అలైహిస్సలాం) జాతి ప్రజలలో ఆ యిద్దరు మాత్రమే నిజభావంలో విశ్వసనీయులుగా, నిజాయితీపరులుగా నిరూపించుకున్నారు. వారికి దైవసహాయం పట్ల సంపూర్ణ విశ్వాసం ఉంది. 'కాస్తంత ధైర్యంతో అడుగు ముందుకు వేయండి, ఆ తర్వాత దైవసహాయం ఎలా లభిస్తుందో మీరే చూద్దురుగాని' అంటూ వారు తమ తోటివారికి నచ్చజెప్పడానికి శాయశక్తులా ప్రయత్నించారు.

58. కాని ఎంత నచ్చజెప్పినా ఇస్రాయీల్ సంతతివారికి కనువిప్పు కాలేదు. వారు కీలక సమయంలో పిరికిపందలుగా ప్రవర్తించారు. అమర్యాదను, మొండితనాన్నీ ప్రదర్శించారు. 'నువ్వూ, నీ ప్రభువు – ఇద్దరూ కలసి పోరాడండి' అంటూ తమ నిర్లక్ష్యధోరణిని, సోమరితనాన్ని వ్యక్తం చేశారు. దీనికి భిన్నంగా బద్ర్ యుద్ధాన్నే తీసుకోండి! పోరాడేవారు చాలా కొద్దిమందే అయినప్పటికీ, తగు ఆయుధ సామగ్రి లేకపోయినప్పటికీ సహాబీలు ఎలాంటి సాకులూ చెప్పకుండా దైవప్రవక్త (స) ఆదేశాన్ని శిరసావహిస్తూ యుద్ధరంగానికి తరలివచ్చారు. ఆ సందర్భంగా వారు ఇలా అన్నారు: "దైవప్రవక్తా! మూసా జాతివారు మూసాకు పెడసరిగా సమాధానం ఇచ్చినట్లుగా మేము ఇవ్వము" (సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ, కితాబుత్తఫ్సీర్).

59. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) గారి ఈ వినతిలో తన జాతివారి విషయంలో ఒకింత నిస్సహాయ స్థితి, ఒకింత తెగత్రెంపుల ఆలోచన – రెండూ తొణికిసలాడుతున్నాయి.

60. అది **'తీహ్'** మైదానంగా పేరుమోసింది. అవిధేయత, జిహాద్ పట్ల విముఖత మూలంగా ఈ జాతివారు నలభై

وَاتْلُ عَلَيْهِمْ نَبَاَ ابْنَيْ اٰدَمَ بِالْحَقِّ ۘ اِذْ قَرَّبَا
قُرْبَانًا فَتُقُبِّلَ مِنْ اَحَدِهِمَا وَلَمْ يُتَقَبَّلْ
مِنَ الْاٰخَرِ ؕ قَالَ لَاَقْتُلَنَّكَ ؕ قَالَ اِنَّمَا
يَتَقَبَّلُ اللّٰهُ مِنَ الْمُتَّقِيْنَ ﴿27﴾

**27** (ఓ ముహమ్మద్-స!) ఆదం యొక్క ఇద్దరు కుమారుల వృత్తాంతాన్ని కూడా వారికి యధాతథంగా వినిపించు.[62] వారిరువురూ దైవానికి నజరానా సమర్పించగా, వారిలో ఒకరి నజరానా స్వీకరించబడింది. మరొకరిది స్వీకరించబడలేదు.[63] అప్పుడు రెండవతను, "నేను నిన్ను చంపేస్తాను" అన్నాడు. దానికి సమాధానంగా మొదటివాడు, "అల్లాహ్ భీతిపరుల నజరానాను మాత్రమే స్వీకరిస్తాడు -

ఏండ్లదాకా అక్కడే తచ్చాడుతూ ఉండవలసి వచ్చింది. ఆ స్థితిలో కూడా వారిపై మన్, సల్వా ఆహార పదార్థాలు అవతరించాయి. దానిపై కూడా వారు సంతృప్తి చెందకుండా, "ఒకే రకమయిన ఆహారం తినీ తినీ మాకు మొహం మొత్తింది. మా కోసం కూరగాయలు, ఆహారధాన్యాలు, పప్పుదినుసులు పండించమని నీ ప్రభువును ప్రార్థించు" అని మూసాపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ మైదానంలో వుండగానే వారిపై మేఘాల ద్వారా నీడ కల్పించబడింది. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన కర్రతో కొండరాయిపై కొట్టగా 12 తెగల కోసం 12 ఊటలు చిమ్ముకు వచ్చాయి. ఈ విధంగా రకరకాల అనుగ్రహాలు వారికి లభించాయి. నలభై యేండ్ల తర్వాత వారు బైతుల్ మఖ్దిస్‌లో ప్రవేశించేలా పరిస్థితులు మలచబడ్డాయి.

61. ప్రవక్తలు తమ జాతి ప్రజల మేలును కోరుకునే వారై ఉంటారు. తాము అందజేసే సందేశాన్ని స్వీకరించి వారు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ సాఫల్యం పొందాలని ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. దానికోసం ప్రవక్తలు అహర్నిశలూ ప్రయత్నిస్తారు. ఎంత బోధపరచినా జాతి ప్రజలు సన్మార్గం వైపుకు రాకపోతే సహజంగానే వారు మనస్తాపానికి లోనవుతారు. అంతిమ దైవప్రవక్త (సఅసం) సయితం ఇలాంటి పరిస్థితికి లోనవుతూ ఉండేవారు. దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల అల్లాహ్ ఈ విషయాన్ని ప్రస్తావించాడు. ఈ ఆయతు చివరిలో అల్లాహ్ తన ప్రవక్త అయిన మూసా (అలైహిస్సలాం)ను ఓదార్చాడు - మూసా! ప్రవక్తా ధర్మాన్ని నిర్వర్తించటం వరకే నీ పని. నువ్వు ఈ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించావు. వారి జీవితాలను తీర్చిదిద్దుతూ, వారిని విజయ ద్వారం వరకూ తెచ్చి నిలబెట్టావు. ఒకవేళ వారిప్పుడు విముఖులై, చపలచిత్తులై మూర్ఖంగా ప్రవర్తిస్తే అది నీ తప్పు కాదు. నువ్వు నీ కర్తవ్యాన్ని నెరవేర్చావు. ఇక ఇప్పుడు నీవు వారి పర్యవసానం గురించి చింతించవలసిన పనిలేదు. ఇలాంటి సందర్భాలలో మనిషికి దుఃఖం ముంచుకు రావటం సహజం. కాని నిన్ను ఈ విషయమై నిలదీయటం జరగదు. దేవుని దృష్టిలో నీ బాధ్యత నెరవేరింది అని అల్లాహ్ చెప్పదలిచాడు.

62. ఆదం ఇద్దరు కుమారులలో ఒకరి పేరు హాబిల్, మరొకరి పేరు ఖాబిల్.

63. ఈ నజరానా లేక ఖుర్బానీ ఎందుకు సమర్పించబడింది? అన్నది ప్రశ్న. దీని గురించి ప్రామాణికమైన ఉల్లేఖనం ఏదీ లేదు. అయితే దీని గురించి ఒక సంఘటన సుప్రసిద్ధమయింది. ఆది మానవులైన ఆదం - హవ్వాల (అలైహిస్సలాం) కలయిక వల్ల ఒకే కాన్పులో హవ్వాకు అబ్బాయి - అమ్మాయి పుట్టేవారు. రెండో కాన్పులో కూడా ఒక అబ్బాయితో పాటు ఒక అమ్మాయి జన్మించేది. ఒక కాన్పులో పుట్టిన పిల్లల పెళ్ళి మరో కాన్పులో పుట్టిన పిల్లలతో జరిపించబడేది. అయితే హాబీలుతో కలసి పుట్టిన ఆడపిల్ల అందవికారంగా ఉండేది. కాగా; ఖాబీలుతో కలసి జన్మించిన అమ్మాయి మాత్రం అందగత్తె. ఆనాటి నియమాల ప్రకారం హాబీలు వివాహం ఖాబీలు చెల్లెలితోనూ, ఖాబీలు వివాహం హాబీలు చెల్లెలితోనూ జరగాలి. కాని ఖాబీలు అందవికారంగా ఉన్న హాబీలు చెల్లెలికి బదులు అందగత్తె అయిన తన తోబుట్టువునే వివాహమాడదలచాడు. పితామహుడైన ఆదం (అలైహిస్సలాం) అతన్ని ఎంతగానో నచ్చజెప్పారు కాని అతడు వినిపించుకోలేదు. ఎట్టకేలకు హజ్రత్ ఆదం ఆ సమస్యకు పరిష్కార మార్గం సూచిస్తూ, దైవసమక్షంలో ఖుర్బానీ ఇవ్వమని ఆదేశించారు. ఎవరి ఖుర్బానీ స్వీకరించబడుతుందో వారికి ఖాబీలు చెల్లెలినిచ్చి వివాహం జరిపించబడు

لَئِنۢ بَسَطتَ إِلَيَّ يَدَكَ لِتَقۡتُلَنِي مَآ أَنَا۠
بِبَاسِطٖ يَدِيَ إِلَيۡكَ لِأَقۡتُلَكَۖ إِنِّيٓ أَخَافُ
ٱللَّهَ رَبَّ ٱلۡعَٰلَمِينَ ﴿٢٨﴾

**28** “నువ్వు నన్ను చంపటానికి చెయ్యి ఎత్తినా, నేను మాత్రం నిన్ను చంపే ఉద్దేశంతో చెయ్యి ఎత్తను. నేను సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతున్నాను.

إِنِّيٓ أُرِيدُ أَن تَبُوٓأَ بِإِثۡمِي وَإِثۡمِكَ فَتَكُونَ مِنۡ
أَصۡحَٰبِ ٱلنَّارِۚ وَذَٰلِكَ جَزَٰٓؤُاْ ٱلظَّٰلِمِينَ ﴿٢٩﴾

**29** “నువ్వు నీ పాపంతో పాటు, నా పాపం కూడా నీ నెత్తిన పెట్టుకుని[64] నరక వాసుల్లో చేరిపోవాలని కోరుకుంటాను (గాని నేను మాత్రం ఆ పాపానికి ఒడిగట్టలేను). దుర్మార్గులకు ప్రతిఫలం ఇదే” అని అన్నాడు.

فَطَوَّعَتۡ لَهُۥ نَفۡسُهُۥ قَتۡلَ أَخِيهِ فَقَتَلَهُۥ
فَأَصۡبَحَ مِنَ ٱلۡخَٰسِرِينَ ﴿٣٠﴾

**30** తర్వాత అతని మనసు తన సోదరుని హత్యకే పురికొల్పింది. అతణ్ణి హత్యచేసి అతడు నష్టపోయిన వారిలో చేరిపోయాడు.[65]

فَبَعَثَ ٱللَّهُ غُرَابٗا يَبۡحَثُ فِي ٱلۡأَرۡضِ لِيُرِيَهُۥ
كَيۡفَ يُوَٰرِي سَوۡءَةَ أَخِيهِۚ قَالَ يَٰوَيۡلَتَىٰٓ أَعَجَزۡتُ
أَنۡ أَكُونَ مِثۡلَ هَٰذَا ٱلۡغُرَابِ فَأُوَٰرِيَ سَوۡءَةَ
أَخِيۖ فَأَصۡبَحَ مِنَ ٱلنَّٰدِمِينَ ﴿٣١﴾

**31** ఆ తరువాత సోదరుని శవాన్ని ఎలా దాచాలో అతనికి చూపించటానికి అల్లాహ్ ఒక కాకిని పంపాడు. అది నేలను త్రవ్వసాగింది. అతను (ఆ దృశ్యాన్ని చూసి,) “అయ్యో! నా సోదరుని శవాన్ని దాచే విషయంలో నేను ఈ కాకిపాటి వాణ్ణి కూడా కాలేకపోయానే” అంటూ సిగ్గుతో కుమిలిపోయాడు.

---

తుందని ముందుగానే చెప్పారు. ఆఖరికి హాబీలు ఖుర్బానీ స్వీకరించబడింది. అంటే ఆకాశం నుంచి అగ్నివచ్చి ఆ ఖుర్బానీని హరించింది. ఆ విధంగా అగ్ని వచ్చి ఖుర్బానీని హరించటం ఖుర్బానీ స్వీకృతికి నిదర్శనంగా భావించబడేది. కొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం హాబీలు ఒక మంచి పొట్టేలును ఖుర్బానీ చేయగా ఖాబీలు మాత్రం గోధుమ వెన్నును నజరానాగా సమర్పించాడు. అప్పుడు హాబీలు ఖుర్బానీ స్వీకారయోగ్యం అవటంతో అతనిపై ఖాబీలు అసూయ చెందాడు.

64. **‘నా పాపం’** అంటే అర్థం ఒకవేళ నేను నిన్ను హతమార్చదలిస్తే నాపై పడే పాపం అన్న మాట! ‘హంతకునితో పాటు హతుడు కూడా నరకంలోకి పోతాడు’ అని హదీసులో ఉంది. ‘హంతకుడు నరకానికి పోవటం ఎలాగూ సహజమే. కాని హతుడు నరకానికి పోవటమేమిటీ?’ అని ప్రవక్త సహచరులు (రజి) అడగ్గా, “హతుడు కూడా తన ప్రత్యర్థిని చంపే ఉద్దేశ్యంతోనే ఉంటాడు!” అని మహాప్రవక్త (సఅసం) చెప్పారు (సహీహ్ బుఖారీ, ముస్లిం –కితాబుల్ ఫితన్).

65. అందుకే హదీసులో అనబడింది : “అన్యాయంగా ఏ హత్యచేయబడినా (హంతకునితో పాటు) ఆ పాపభారం ఆదం యొక్క ఆ మొదటి పుత్రునిపై కూడా వేయబడుతుంది. ఎందుకంటే హత్యా నేరానికి ప్రప్రథమంగా పాల్పడింది ఇతనే గనక!” (సహీహ్ బుఖారీ: కితాబుల్ అంబియా – అధ్యాయం : 1; ముస్లిం : కితాబుల్ ఖసామ).

ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు : “హాబీలును అన్యాయంగా చంపిన నేరానికి ఖాబీలుకు ఈ ప్రపంచంలోనే తక్షణం శిక్ష విధించబడినట్లు పైకి కనిపిస్తోంది.” హదీసు ఏమంటుందో గమనించండి – మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : “దౌర్జన్యం, బంధుత్వ సంబంధాల తెగత్రెంపులు – ఈ రెండు అపరాధాలు ఎంత ఘోరమైనవంటే వీటికి పాల్పడినవారికి అల్లాహ్ ఇహలోకంలోనే తక్షణం శిక్ష విధిస్తాడు. అయితే పరలోక శిక్ష వేరుగా ఉంటుంది. అక్కడ కూడా వారు ఈ శిక్షను అనుభవించక తప్పదు” (అబూ దావూద్ : కితాబుల్ అదబ్ ; ఇబ్నె మాజ: కితాబుజ్జుహ్ద్). కాగా; ఖాబీలు చేసిన నేరంలో ఈ రెండు అపరాధాలు ఇమిడి ఉన్నాయి (ఇబ్నె కసీర్).

مِنْ اَجْلِ ذٰلِكَ ۛۚ كَتَبْنَا عَلٰى بَنِيْٓ اِسْرَآءِيْلَ
اَنَّهٗ مَنْ قَتَلَ نَفْسًۢا بِغَيْرِ نَفْسٍ اَوْ فَسَادٍ
فِي الْاَرْضِ فَكَاَنَّمَا قَتَلَ النَّاسَ جَمِيْعًا ۭ
وَمَنْ اَحْيَاهَا فَكَاَنَّمَآ اَحْيَا النَّاسَ جَمِيْعًا ۭ
وَلَقَدْ جَاۗءَتْهُمْ رُسُلُنَا بِالْبَيِّنٰتِ ۡ ثُمَّ اِنَّ كَثِيْرًا
مِّنْهُمْ بَعْدَ ذٰلِكَ فِي الْاَرْضِ لَمُسْرِفُوْنَ ﴿32﴾

**32** ఈ కారణంగానే మేము ఇస్రాయీలు సంతతిపై ఈ ఫర్మానా విధించాము: "ఎవరయినా ఒకరి హత్యకు ప్రతీ కారంగా కాకుండా, భూమిలో కల్లోలాన్ని రేకెత్తించినందుకు కాకుండా, అకారణంగా ఎవరినయినా చంపినట్లయితే అతడు సమస్త మానవులను చంపినవాడవుతాడు. అలాగే ఎవరయినా ఒకరి ప్రాణాన్ని రక్షిస్తే అతడు సమస్త మానవుల ప్రాణాలను రక్షించిన వాడవుతాడు."[66] వారి వద్దకు మా ప్రవక్తలెందరో స్పష్టమయిన నిదర్శనాలను తీసుకువచ్చారు. కాని ఆ తరువాత కూడా వారిలో చాలా మంది అవనిలో దుర్మార్గం, దౌర్జన్యాలకు పాల్పడేవారు ఉన్నారు.[67]

اِنَّمَا جَزٰۗؤُا الَّذِيْنَ يُحَارِبُوْنَ اللّٰهَ وَرَسُوْلَهٗ
وَيَسْعَوْنَ فِي الْاَرْضِ فَسَادًا اَنْ يُّقَتَّلُوْٓا اَوْ
يُصَلَّبُوْٓا اَوْ تُقَطَّعَ اَيْدِيْهِمْ وَاَرْجُلُهُمْ مِّنْ
خِلَافٍ اَوْ يُنْفَوْا مِنَ الْاَرْضِ ۭ ذٰلِكَ لَهُمْ خِزْيٌ
فِي الدُّنْيَا وَلَهُمْ فِي الْاٰخِرَةِ عَذَابٌ عَظِيْمٌ ﴿33﴾

**33** ఎవరు అల్లాహ్‌తోనూ, ఆయన ప్రవక్తతోనూ పోరాడుతారో, భూమిలో కల్లోలాన్ని రేకెత్తిస్తూ తిరుగుతుంటారో వారు వధించ బడాలి. లేదా ఉరి కంబం ఎక్కించబడాలి. లేదా ఎదురుగా వారి కాళ్లు చేతులు ఖండించబడాలి. లేదా వారిని దేశం నుంచి బహిష్కరించాలి.[68] ఇది ఇహలోకంలో వారికి కలగవలసిన పరాభవం. పరలోకంలో వారికి విధించబడే శిక్ష (ఇంతకన్నా) ఘోరంగా ఉంటుంది.

66. దారుణమైన ఈ హత్య తరువాత అల్లాహ్ మనిషి ప్రాణం విలువను తెలియజేసే నిమిత్తం ఇస్రాయీల్ సంతతికి ఈ ఫర్మానాను జారీ చేశాడు. మానవ రక్తానికి దేవుని దృష్టిలో ఎంత విలువ ఉందో, హత్యానేరం ఎంత ఘోరమైనదో దీన్నిబట్టి ఊహించవచ్చు. ఈ సూత్రం ఒక్క బనీ ఇస్రాయీల్‌కు మాత్రమే వర్తించదు, ఇస్లాం బోధనల ప్రకారం ఈ సూత్రం నాటికీ, నేటికీ, మరెన్నటికీ వర్తిస్తుంది. సులైమాన్ బిన్ రబీ ఇలా అంటున్నారు: "బనీ ఇస్రాయీల్‌ని ఉద్దేశించిన ఈ ఆయతు మనక్కూడా వర్తిస్తుందా?" అని నేను హసన్ బస్రీని అడగ్గా, దానికాయన, "అవును, సహవర్తులెవరూ లేని దేవుని సాక్షిగా చెబుతున్నా – బనీ ఇస్రాయీల్ వారి రక్తం అల్లాహ్ దృష్టిలో మన రక్తంకన్నా ఎక్కువ గౌరవప్రదమైంది కాదు" అని సమాధానమిచ్చారు (ఇబ్నె కసీర్).

67. ఈ ఆయతు యూదులకు మందలింపు లాంటిది. వారివద్దకు దైవప్రవక్తలు స్పష్టమయిన సూచనలను, ఆధారాలను తీసుకువచ్చేవారు. కాని సర్వదా వారు హద్దుమీరి ప్రవర్తించారు. దేవుడు ఈ ఆయతు ద్వారా తన అంతిమ ప్రవక్త (సఅసం)ను ఓదారుస్తున్నాడు – ఓ ప్రవక్తా! నిన్ను తుదముట్టించటానికి, నీ కార్యక్రమానికి విఘాతం కలిగించటానికి వీళ్లు పన్నే కుట్రలు, కుయుక్తులు కొత్తవేమీ కావు. వీళ్ల చరిత్ర అంతా కుట్రలు, కుతంత్రాలతోనే నిండి ఉంది. మొత్తానికి నువ్వు సహన స్థయిర్యాలను ప్రదర్శిస్తూ, దైవసహాయంపై ఆధారపడు. వీళ్ల ఎత్తులకు పై ఎత్తులు వేయటంలో అల్లాహ్ సాటిలేని మేటి అని ఆయన ధైర్యం చెబుతున్నాడు.

68. ఈ ఆయతు అవతరణకు దారితీసిన సంఘటన గమనించదగినది. అకల్, ఉరైనా తెగలకు చెందిన కొంతమంది ఇస్లాం స్వీకరించి మదీనా నగరానికి వచ్చారు. కాని మదీనా వాతావరణం వారికి పడలేదు. వారు అస్వస్థతకు గురయ్యారు. దైవప్రవక్త (సఅసం) ఆ బృందాన్ని మదీనాకు కొంతదూరంలో సదఖా ఒంటెలు మేసే ప్రదేశానికి పంపుతూ, కొంతకాలం అక్కడే ఉండి ఒంటె పాలు, ఒంటె మూత్రం తాగమన్నారు. దానివల్ల దేవుడు స్వస్థతను

34 కాని వారిలో ఎవరయినా మీ అదుపులోకి రాకముందే[69] పశ్చాత్తాపపడితే, అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, అపారంగా కరుణించేవాడని తెలుసుకోండి.

إِلَّا ٱلَّذِينَ تَابُوا۟ مِن قَبْلِ أَن تَقْدِرُوا۟ عَلَيْهِمْ ۖ فَٱعْلَمُوٓا۟ أَنَّ ٱللَّهَ غَفُورٌ رَّحِيمٌ ﴿٣٤﴾

35 విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. ఆయన సామీప్యాన్ని పొందే సాధనం వెతకండి.[70] ఆయన మార్గంలో(యుద్ధ ప్రాతిపదికన) కృషి సలపండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱتَّقُوا۟ ٱللَّهَ وَٱبْتَغُوٓا۟ إِلَيْهِ ٱلْوَسِيلَةَ وَجَٰهِدُوا۟ فِى سَبِيلِهِۦ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿٣٥﴾

చేకూరుస్తాదని సలహా యిచ్చారు. ఆ విధంగానే వారు పాటించి, కొద్దికాలంలోనే ఆరోగ్యవంతులయ్యారు. స్వస్థత చేకూరటంతోనే వారి బుద్ధి కూడా గడ్డి కరిచింది. ఒంటెల కాపరిని, పర్యవేక్షకుణ్ణి దారుణంగా చంపేసి, ఒంటెల్ని తోలుకుపోసాగారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న దైవప్రవక్త (స) కొంతమందిని పంపారు. వారు ఆ నేరస్థుల్ని పట్టుకుని వచ్చి దైవప్రవక్త (స) సమక్షంలో హాజరుపరిచారు. దైవప్రవక్త (స) వారి కాళ్ళు చేతుల్ని వ్యతిరేక దిశలో నరకమని ఆదేశించారు. వారి కళ్లల్లో సలసలా కాలే ఇనుపచువ్వల వాత పెట్టించారు (ఎందుకంటే వీళ్ళు ఈ విధంగానే పశువుల కాపరి పట్ల ప్రవర్తించారు). తరువాత వాళ్లను మండుటెండల్లో పడవేశారు. కడకు వారు అక్కడే మలమలా మాడి చచ్చిపోయారు. సహీహ్ బుఖారీలోని హదీసులో– వారు దొంగతనానికి పాల్పడటమే గాకుండా హత్య కూడా చేశారు, విశ్వసించిన తరువాత అవిశ్వాసానికి కూడా పాల్పడ్డారు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) పట్ల తిరుగుబాటు కూడా చేశారు అని ఉంది (సహీహ్ బుఖారీ : కితాబుద్దియాత్ ... సహీహ్ ముస్లిం : కితాబుల్ ఖసామ).

దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆజ్ఞ సర్వసాధారణమయింది. ఇది విశ్వాసులకు, అవిశ్వాసులకు – ఇద్దరికీ వర్తిస్తుంది. ఈ ఆయతు 'ఆయతె ముహారబ' అనబడుతుంది. ముహారబా అంటే ఇస్లామీయ రాజ్యపరిధిలో లేదా దాని సరిహద్దు ప్రాంతాల్లో ప్రయాణం చేసే వారిపై పకడ్బందీగా, మాటువేసి సాయుధులై దాడి చేయటం, హత్యాకాండకు పాల్పడటం, దోపిడీ చేయటం, కిడ్నాపులకు పాల్పడటం, మానభంగాలు చేయటం మొదలగునవి. ఆయతులో 4 శిక్షలు ప్రస్తావించబడ్డాయి. పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని సమకాలీన నాయకుడు (లేదా ఖలీఫా) ఆ నాల్గింటిలో తనకు సముచితమనిపించిన శిక్షను విధించగలడు.

మరి కొంతమంది ఇలా అభిప్రాయపడ్డారు : ఒకవేళ తిరుగుబాటుదారులు హత్యలు మరియు దోపిడీలు చేస్తే, ఉగ్రవాదానికి పాల్పడితే వారికి మరణ శిక్ష విధించటం మరియు ఉరితీయటం జరుగుతాయి. ఒకవేళ ఎవరయినా కేవలం హత్యచేసి సొమ్మును లూటీ చేయకుండా ఉంటే అతనికి మరణదండన విధించబడుతుంది. ఎవరయినా హత్యచేయటంతోపాటు, సొమ్మును కూడా దోచుకుంటే, అతని ఒక కుడి చెయ్యితోపాటు ఎడమ కాలు తియ్యబడుతుంది. లేదా ఎడమ చెయ్యితోపాటు కుడి కాలు తీసెయ్యబడుతుంది. ఎవరయినా హత్యా నేరానికిగానీ, దోపిడీకిగానీ పాల్పడకుండా కేవలం అలజడిని సృష్టిస్తే అతన్ని దేశం నుంచి బహిష్కరించటం జరుగుతుంది.

అయితే వీటన్నింటిలో, శిక్ష విధించే విషయంలో నాయకునిదే అంతిమ నిర్ణయం అన్న మొదటి అభిప్రాయమే సరైనదని ఇమామ్ షౌకానీ అంటున్నారు (ఫతహుల్ ఖదీర్).

69. అంటే వారు పట్టుబడకముందే పశ్చాత్తాపం చెంది, ఇస్లామీయ రాజ్యవ్యవస్థకు లోబడి ఉంటామని ప్రకటిస్తే, అలాంటి వారిని క్షమించి వదలిపెట్టాలి. ఇంతకు ముందు ప్రస్తావించిన శిక్షలు వారికి విధించకూడదు. మరి వారు హత్యచేసి లేదా దోపిడీకి పాల్పడి లేదా మానభంగాలు చేసి, ప్రజలపై చేయిచేసుకున్నా క్షమించాల్సిందేనా? లేక వారికి ప్రతీకారం చేయవచ్చా? అన్న విషయంలో భేదాభిప్రాయం ఉంది. కొంతమంది పండితుల ప్రకారం ఈ పెద్ద నేరాలు క్షమార్హం

| | |
|---|---|
| **36** తిరస్కార వైఖరిని అవలంబించిన వారివద్ద భూమిలో ఉన్న సంపద మొత్తం, ఇంకా అంతే సంపద దానితోపాటు ఉండి, ఆ మొత్తం సంపదను వారు ప్రళయ దినపు శిక్షనుంచి తప్పించు కోవటానికి పరిహారంగా ఇవ్వదలచినా – అది వారి నుండి స్వీకరింపజాలదు. వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.[71] | إِنَّ الَّذِينَ كَفَرُوا لَوْ أَنَّ لَهُم مَّا فِي الْأَرْضِ جَمِيعًا وَمِثْلَهُ مَعَهُ لِيَفْتَدُوا بِهِ مِنْ عَذَابِ يَوْمِ الْقِيَامَةِ مَا تُقُبِّلَ مِنْهُمْ ۖ وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿٣٦﴾ |
| **37** వారు నరకాగ్ని నుంచి బయటపడాలని పరితపిస్తారు. కాని వారు దాన్నుంచి బయటికి రాలేరు. వారి కోసం శాశ్వితమైన శిక్ష ఉంటుంది.[72] | يُرِيدُونَ أَن يَخْرُجُوا مِنَ النَّارِ وَمَا هُم بِخَارِجِينَ مِنْهَا ۖ وَلَهُمْ عَذَابٌ مُّقِيمٌ ﴿٣٧﴾ |

కావు. వారినుంచి పరిహారం తీసుకోవలసిందే. అయితే ఇమామ్ షౌకానీ, ఇమామ్ ఇబ్నె కసీర్ లాంటి విద్వాంసులు వారిని పూర్తిగా క్షమించవలసిందేనని అంటున్నారు. ఆయతు బాహ్యార్థం ద్వారా కూడా ఈ విషయమే బోధపడుతున్నది. కాని పట్టుబడిన తరువాత పశ్చాత్తాపం చెందితే మాత్రం వారి అపరాధాలు క్షమించబడవు, వారు శిక్షార్హులే (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).

70. ఆయతులో **'అల్ వసీలా' (الْوَسِيلَةَ)** అనే పదం ఉంది. వసీలా అంటే ఏదేని ఆశయాన్ని సాధించటానికి, సామీప్యం, సాన్నిధ్యం పొందటానికి అవలంబించబడే మార్గం లేక సాధనం అని అర్థం. "అల్లాహ్ సామీప్యాన్ని పొందే సాధనం వెతకండి" అంటే ఆయనకు దగ్గర చేర్చే సత్కార్యాలను చేయమని అర్థం. ఇమామ్ షౌకానీ ఇలా అంటున్నారు : "సామీప్యం అన్న భావంలో వున్న 'వసీలా' భయభక్తులను, సదాచరణలను సూచిస్తున్నది. వాటి ద్వారా దాసులు తమ ప్రభువు సామీప్యాన్ని పొందుతారు." అదేవిధంగా నిషిద్ధ పనులకు, వ్యర్థ కార్యకలాపాలకు దూరంగా మసలుకోవటం ద్వారా కూడా దైవసామీప్యం ప్రాప్తిస్తుంది. కాని అజ్ఞానులు కొందరు ఈ నిజమయిన వసీలాను వదిలేసి సమాధులలో ఖననమై ఉన్నవారిని 'వసీలా'గా భావించారు. షరీయతులో ఇలాంటి భావనలకు, తలంపులకు ఎలాంటి ఆధారం లేదు. అయితే తీర్పుదినాన అల్లాహ్ అంతిమ దైవప్రవక్త (సఅసం) గారికి ప్రసాదిస్తానని వాగ్దానం చేసిన 'మఖామె మహ్‌మూద్' కూడా వసీలాయేనని హదీసు ద్వారా తెలుస్తోంది. అందుకే 'అజాన్' పిలుపు తరువాత నా కోసం ఈ 'వసీలా దుఆ'ను చేసేవారు నా సిఫారసుకు అర్హులవుతారని మహనీయ ముహమ్మద్ (సఅసం) తెలియజేశారు (సహీహ్ బుఖారీ : కితాబుల్ అజాన్; సహీహ్ ముస్లిం: కితాబుస్సలాత్). అజాన్ పిలుపు యిచ్చిన ప్రతిసారీ పఠించబడే ఆ 'వసీలా దుఆ' ఇది : **"అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్దావ తిత్తామ్మతి వస్సలాతిల్ ఖాయిమతి ఆతి ముహమ్మదనిల్ వసీలత వల్ ఫజీలత వబ్అస్‌హు మఖామమ్ మహ్‌మూదనిల్లజీ వ అత్తహు"** (బుఖారీ, ముస్లిం– అధ్యాయం పైన పేర్కొనబడినదే).

71. హదీసులో ఇలా అనబడింది : ఒక నరకవాసిని నరకంలో నుంచి తీసి అతన్ని దైవసమక్షంలో హాజరుపరచటం జరుగుతుంది. "నీ నివాస స్థలం ఎలా ఉంది?" అని అల్లాహ్ అతన్ని అడుగుతాడు. "అత్యంత దుర్భరంగా ఉంది" అని అతను బదులిస్తాడు. "భూమి నిండిపోయేంత బంగారం పరిహారంగా యిచ్చి ఈ దుర్భర నివాసస్థలం నుంచి బయటపడటం నీకిష్టమేనా?" అని అల్లాహ్ మళ్లీ ప్రశ్నిస్తాడు. "ఇష్టమే" అని అతనంటాడు. అప్పుడు అల్లాహ్ ఇలా సమాధానమిస్తాడు – "నేను ప్రపంచంలో దీనికన్నా చాలా స్వల్పమైన దానిని నీనుండి కోరాను. కాని నువ్వు దాన్ని లక్ష్యపెట్టలేదు." మళ్లీ అతను నరకంలో పడవేయబడతాడు. (సహీహ్ ముస్లిం–సిఫతుల్ ఖియామ; సహీహ్ బుఖారీ– కితాబుర్రిఖాఖ్, కితాబుల్ అంబియా).

72. ఈ ఆయతు అవిశ్వాసులకు వర్తిస్తుంది. ఎందుకంటే విశ్వాసులు ఏదో ఒకనాడు – శిక్ష అనుభవించిన తరువాత – నరకంలో నుంచి తీయబడతారని హదీసులు చెబుతున్నాయి.

**38** దొంగతనం చేసినది – పురుషుడైనా, స్త్రీ అయినా – ఉభయుల చేతులూ నరకండి.[73] అది వారు చేసిన దానికి ప్రతిఫలం. అల్లాహ్ తరఫున విధించబడిన శిక్ష. అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేచనాశీలి కూడా.

وَالسَّارِقُ وَالسَّارِقَةُ فَاقْطَعُوْٓا اَيْدِيَهُمَا
جَزَآءًۢ بِمَا كَسَبَا نَكَالًا مِّنَ اللّٰهِ ؕ وَاللّٰهُ
عَزِيْزٌ حَكِيْمٌ ﴿38﴾

**39** పాపం చేసిన తరువాత పశ్చాత్తాపం చెంది, తన నడవడికను సరిదిద్దుకున్నవాని వైపుకు అల్లాహ్ కారుణ్యంతో మరలుతాడు.[74] నిస్సందేహంగా అల్లాహ్ క్షమాభిక్షపెట్టేవాడు, కరుణించేవాడూను.

فَمَنْ تَابَ مِنْۢ بَعْدِ ظُلْمِهٖ وَاَصْلَحَ فَاِنَّ اللّٰهَ
يَتُوْبُ عَلَيْهِ ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿39﴾

**40** ఆకాశాల మరియు భూమి యొక్క రాజ్యాధికారం అల్లాహ్‌దే నన్న సంగతి నీకు తెలియదా? ఆయన తాను తలచిన వారిని శిక్షిస్తాడు, తాను తలచినవారిని క్షమిస్తాడు. అల్లాహ్ అన్నింటిపై తిరుగులేని అధికారం కలవాడు.

اَلَمْ تَعْلَمْ اَنَّ اللّٰهَ لَهٗ مُلْكُ السَّمٰوٰتِ
وَالْاَرْضِ ؕ يُعَذِّبُ مَنْ يَّشَآءُ وَيَغْفِرُ لِمَنْ
يَّشَآءُ ؕ وَاللّٰهُ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ﴿40﴾

**41** ఓ ప్రవక్తా! అవిశ్వాసంలో ముందుకు దూసుకుపోయే వారిని చూసి నువ్వు దుఃఖించకు. తాము ముస్లిములమేనని వారు నోటితో పలికినాసరే – వాస్తవానికి వారి హృదయాలు విశ్వాస పూరితం కావు[75] (వాటిలో కాపట్యం ఉంది). కాగా; యూదుల్లోని కొందరు తప్పుడు మాటలను ఆసక్తితో చెవియొగ్గి వింటారు.

يٰٓاَيُّهَا الرَّسُوْلُ لَا يَحْزُنْكَ الَّذِيْنَ يُسَارِعُوْنَ
فِى الْكُفْرِ مِنَ الَّذِيْنَ قَالُوْٓا اٰمَنَّا بِاَفْوَاهِهِمْ
وَلَمْ تُؤْمِنْ قُلُوْبُهُمْ ۛ وَمِنَ الَّذِيْنَ هَادُوْا ۛ

73. బాహ్యార్థగ్రాహులైన కొందరు ధర్మవేత్తలు దొంగతనం చిన్నదైనా పెద్దదైనా, అలాగే భద్రపరచబడిన వస్తువులను దొంగిలించినా లేక అభద్రంగా ఉన్న వస్తువులను దొంగిలించినా – దేనికయినా శిక్ష తప్పదని అభిప్రాయపడ్డారు. అయితే ఇతర ధర్మవేత్తలు దొంగతనం యొక్క పరిస్థితినీ, పరిమాణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. ఇక ఎంత సొమ్మును దొంగిలిస్తే ఈ శిక్ష విధించాలి? అన్న విషయంలో కూడా భేదాభిప్రాయం ఉంది. పావు దీనారుగానీ, మూడు దిర్హముల విలువకు సమానమైనదాన్ని గానీ దొంగిలిస్తే దొంగవాని చేతిని నరకవచ్చునీ, అంతకన్నా తక్కువ సొమ్మును దొంగిలించినపుడు హస్తఖండన శిక్ష విధించరాదనీ హదీసువేత్తలు అంటున్నారు. అదీగాక కొంతమంది అభిప్రాయపడినట్లు చేతుల్ని మొదలు నుంచిగానీ, మోచేతుల వద్ద నుంచిగానీ కాకుండా మణికట్టు వద్దనుంచి మాత్రమే ఖండించాలి. (వివరాల కోసం హదీసు, ఫికహ్ గ్రంథాలనూ, ఖుర్‌ఆన్ వ్యాఖ్యానాలను అధ్యయనం చేయగలరు).

74. ఇక్కడ పశ్చాత్తాపం (తౌబా) అంటే భావం దైవసన్నిధిలో అంగీకరించబడే పశ్చాత్తాపం అన్నమాట! అంతేగాని దొంగతనమో, మరో అత్యాచారమో చేసి తాను పశ్చాత్తాపం చెందానని ప్రభుత్వానికి చెబితే సరిపోదు. శిక్షలు పశ్చాత్తాపం ద్వారా మాఫీ చేయబడవు.

75. అవిశ్వాసులు, ముష్రిక్కులు విశ్వసించి సన్మార్గం వైపుకు రాకపోవటం చూసి మహాప్రవక్త (సఅసం) తీవ్ర మనస్తాపానికి గురయ్యేవారు. ఈ పరిస్థితిని గమనించిన అల్లాహ్, కృంగిపోవలసిన అవసరం లేదనీ, ఇలాంటి మొండివారు విశ్వసించకపోయినంత మాత్రాన నీకు కలిగే నష్టం ఏమీలేదనీ, నీవు నా దృష్టిలో ఏమాత్రం నిందార్హుడవు కావు అని తన సందేశహరుణ్ణి ఓదారుస్తున్నాడు.

سَمّٰعُوْنَ لِلْكَذِبِ سَمّٰعُوْنَ لِقَوْمٍ اٰخَرِيْنَ ۙ
لَمْ يَاْتُوْكَ ؕ يُحَرِّفُوْنَ الْكَلِمَ مِنْۢ بَعْدِ
مَوَاضِعِهٖ ۚ يَقُوْلُوْنَ اِنْ اُوْتِيْتُمْ هٰذَا فَخُذُوْهُ
وَاِنْ لَّمْ تُؤْتَوْهُ فَاحْذَرُوْا ؕ وَمَنْ يُّرِدِ اللّٰهُ
فِتْنَتَهٗ فَلَنْ تَمْلِكَ لَهٗ مِنَ اللّٰهِ شَيْـًٔا ؕ اُولٰٓئِكَ
الَّذِيْنَ لَمْ يُرِدِ اللّٰهُ اَنْ يُّطَهِّرَ قُلُوْبَهُمْ ؕ لَهُمْ
فِى الدُّنْيَا خِزْىٌ ۖۚ وَّلَهُمْ فِى الْاٰخِرَةِ عَذَابٌ
عَظِيْمٌ (41)

ఇంకా ఇంతవరకూ నీ వద్దకు రాని వారి కోసం గూఢచారులుగా వ్యవహరిస్తున్నారు. వారు పదాల అసలు సందర్భాన్ని విడిచి పెట్టి, వాటిని తారుమారు చేస్తారు. "మీకు ఈ ఆదేశమే గనక ఇవ్వబడితే దాన్ని స్వీకరించండి. ఈ ఆదేశం గనక లభించక పోతే దూరంగా ఉండండి" అని (ప్రజలకు) చెబుతారు.[76] అల్లాహ్ ఎవరినయినా వినాశాని (ఫిత్నా)కి లోను చేయదలిస్తే అల్లాహ్‌కు ప్రతిగా నీకు వారిపై ఏ అధికారం ఉండదు. అల్లాహ్ పరిశుద్ధ పరచదలచుకోలేనిది ఇటువంటి వారి హృదయాలనే. వారికి ఇహలోకంలోనూ పరాభవం ఉంటుంది, పరలోకంలో కూడా వారికి ఘోర శిక్ష తప్పదు.

76. 41వ ఆయతు నుంచి 44వ ఆయతు వరకు – ఈ నాల్గు ఆయతుల అవతరణ వెనుక రెండు సంఘటనలు వివరించబడ్డాయి. 1. వివాహితులైన ఇద్దరు యూదులు వ్యభిచారానికి పాల్పడిన సంఘటన. యూదులు ఎలాగూ తమ గ్రంథమైన తౌరాతులో మార్పులు చేర్పులు చేసేశారు. అంతేకాదు, తమ గ్రంథంలోని ఎన్నో ఆజ్ఞలను వారు పాటించేవారు కాదు. అలాంటి ఆజ్ఞలలో ఒకటి శిలాశిక్ష. వివాహితులై ఉండి అక్రమ సంబంధానికి ఒడిగట్టిన వారిపై రాళ్లు రువ్వాలని వారి గ్రంథంలో ఉంది. కాని వారు ఆ శిక్షనుంచి తప్పించుకోవటానికి, ఆ వాక్యాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేసేవారు. వ్యభిచారం చేసిన ఇద్దరు స్త్రీ పురుషులను దైవప్రవక్త (స) సమక్షంలో హాజరు పరచేముందు యూదులు పరస్పరం సంప్రతించుకున్నారు – "మనం ముహమ్మద్ (స) వద్దకు వెళదాం. అయితే మనం సృష్టించుకున్న కొత్తచట్టం ప్రకారం కొరడా దెబ్బలు కొట్టే, ముఖానికి మసిపూసే శిక్ష విధిస్తే ఒప్పుకుందాం. ఒకవేళ రాళ్లు రువ్వమని తీర్పు యిస్తే మాత్రం నిరాకరిద్దాం" అని పథకం వేసుకున్నారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇలా అంటున్నారు – యూదులు దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చారు. శిలా శిక్ష గురించి తౌరాతు ఏమంటోంది? అని దైవప్రవక్త (స) వారిని అడిగారు. వ్యభిచారం చేసిన వారికి కొరడా దెబ్బలు కొట్టాలనీ, బహిరంగంగా అవమానపరచాలనీ మా గ్రంథంలో ఉంది అని వారు చెప్పారు. అప్పుడు వెంటనే హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (రజి) జోక్యం చేసుకుని, "మీరు చెప్పేది అబద్ధం. తౌరాతు గ్రంథంలో రాళ్లు రువ్వమని ఆదేశించబడింది. వెళ్ళి తౌరాతు తీసుకురండి" అని అన్నారు. వారు తౌరాతు తెచ్చి చదవసాగారు. రాళ్లు రువ్వే వాక్యం దగ్గరకు రాగానే దానిపై చేయిపెట్టి, దానికి ముందు వెనక ఉన్న వాక్యాలను చదవసాగారు. "ముందు అక్కడి నుంచి చెయ్యి తియ్యండి" అని అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) పురమాయించారు. చెయ్యి ఎత్తారు. అక్కడ రాళ్లు రువ్వే ఆదేశం లిఖించబడి ఉంది. ఎట్టకేలకు వారు మహాప్రవక్త (సఅసం) చెప్పేది నిజం అని ఒప్పుకోవాల్సి వచ్చింది. తౌరాతు గ్రంథంలోని ఈ ఆజ్ఞననుసరించి వ్యభిచారం చేసిన ఆ యూద జంటకు శిలా శిక్ష విధించటం జరిగింది. (వివరాలకై సహీహైన్ ఇతర – హదీసు గ్రంథాలను – చూడగలరు).

2. రెండవ సంఘటన : యూదుల్లోని ఒక తెగ వారు తమను ఇతర యూద తెగలకన్నా ఉత్తములుగా, కులీనులుగా భావించేవారు. అందుచేత తమ తెగకు చెందిన వ్యక్తిని ఎవరయినా చంపితే రక్తపరిహారంగా నూరు వసఖ్‌లు చెల్లించాలనీ, ఇతర తెగలకు చెందిన వ్యక్తిని హత్యచేస్తే 50 వసఖ్‌లు యిస్తే సరిపోతుందని వారు నిర్ధారించారు. మహాప్రవక్త (సఅసం) మదీనాకు వచ్చిన తరువాత రక్తపరిహారంగా సగభాగం పుచ్చుకుంటున్న యూద తెగలలో చైతన్యం వచ్చింది. తాము ఇక మీదట నూరు వసఖ్‌ల రక్తపరిహారం చెల్లించబోమని వారంతా తెగేసి చెప్పారు. యూద తెగల మధ్య ఈ వ్యవహారంపై రగడ మొదలయింది. పరస్పరం వారు కత్తులు దూసుకోవడానికి సిద్ధమయ్యారు. అంతలోనే వారిలోని కొందరు విజ్ఞులు వారిని దైవప్రవక్త (సఅసం) వద్దకు తీసుకువచ్చారు. ఆ సందర్భంగానే ఈ ఆయతులు అవతరించాయి.

**42** వీరు చెవియొగ్గి అబద్ధాలు వినేవారు,[77] నిషిద్ధమైన సొమ్ము (హరాం) చాలా ఎక్కువగా తినేవారు. ఒకవేళ వారు (తమ గొడవలను) నీ వద్దకు తీసుకువస్తే, నీకిష్టముంటే వారి మధ్య తీర్పు చెప్పు, లేదంటే విముఖతను తెలుపు. ఒకవేళ నువ్వు వారినుంచి ముఖం త్రిప్పుకున్నా వారు నీకెలాంటి హానీ కలిగించలేరు. ఒకవేళ నువ్వు (వారి వ్యవహారాలపై), తీర్పు చెబితే వారిమధ్య న్యాయసమ్మతంగా తీర్పు చెప్పు. నిస్సందేహంగా అల్లాహ్ న్యాయశీలురను ప్రేమిస్తాడు.

سَمّٰعُوْنَ لِلْكَذِبِ اَكّٰلُوْنَ لِلسُّحْتِ ؕ فَاِنْ
جَآءُوْكَ فَاحْكُمْ بَيْنَهُمْ اَوْ اَعْرِضْ عَنْهُمْ ۚ
وَاِنْ تُعْرِضْ عَنْهُمْ فَلَنْ يَّضُرُّوْكَ شَيْـًٔا ؕ
وَاِنْ حَكَمْتَ فَاحْكُمْ بَيْنَهُمْ بِالْقِسْطِ ؕ
اِنَّ اللّٰهَ يُحِبُّ الْمُقْسِطِيْنَ ﴿42﴾

**43** దైవాదేశాలు పొందుపరచబడి వున్న తౌరాతు గ్రంథం తమ వద్ద ఉన్నప్పటికీ వారు నిన్ను ఎట్లా న్యాయనిర్ణేతగా చేసుకుంటున్నారు? (ఇది ఆశ్చర్యకరం కదూ?!) ఆ తరువాత మళ్ళీ తిరిగి పోతున్నారు. యదార్థమేమిటంటే వారసలు విశ్వాసులే కారు.

وَكَيْفَ يُحَكِّمُوْنَكَ وَعِنْدَهُمُ التَّوْرٰىةُ فِيْهَا
حُكْمُ اللّٰهِ ثُمَّ يَتَوَلَّوْنَ مِنْۢ بَعْدِ ذٰلِكَ ؕ
وَمَاۤ اُولٰٓـئِكَ بِالْمُؤْمِنِيْنَ ﴿43﴾

**44** మేము తౌరాతు గ్రంథాన్ని అవతరింపజేశాము. అందులో మార్గదర్శకత్వము, జ్యోతీ ఉండేవి. ఈ తౌరాతు ఆధారంగానే ముస్లిములైన ప్రవక్తలు,[78] రబ్బానీలు, ధర్మవేత్తలు యూదుల[79]

اِنَّاۤ اَنْزَلْنَا التَّوْرٰىةَ فِيْهَا هُدًى وَّنُوْرٌ ۚ
يَحْكُمُ بِهَا النَّبِيُّوْنَ الَّذِيْنَ اَسْلَمُوْا لِلَّذِيْنَ

వీటిలోని ఒక ఆయతులో ఖిసాస్ (రక్త పరిహారం) గురించి ఆదేశించబడింది. ఖిసాస్ అందరికీ సమానంగా వర్తిస్తుందని కూడా స్పష్టం చేయబడింది. (ఈ ఉల్లేఖనం ముస్నదె అహ్మద్‌లో ఉంది. దీని ప్రామాణికతను షేఖ్ అహ్మద్ షాకిర్ ధృవీకరించారు. ముస్నదె అహ్మద్ – సంపుటి :1, హదీసు నెంబరు: 2212). ఒకే సమయంలో ఈ రెండు సంఘటనలు జరిగి ఈ ఆయతుల అవతరణకు దోహదపడి ఉండవచ్చని ఇమామ్ ఇబ్నె కసీర్ భావిస్తున్నారు (ఇబ్నె కసీర్).

77. అరబీలో **'సమ్మావూన్'** (سَمّٰعُوْنَ) అని ఉంది. సమ్మావూన్ అంటే అదేపనిగా వినేవారు అన్నమాట! దీనికి రెండు అర్థాలు కావచ్చు: గూఢచార కార్యకలాపాలు నిర్వహించటానికి ప్రతి చిన్న విషయంలోనూ తలదూర్చటం, నక్కి నక్కి వినటం లేదా ఇతరుల మాటల్ని వినటానికి, స్వీకరించటానికి చెవులు రిక్కించి మరీ వినటం. కొంతమంది వ్యాఖ్యాతలు మొదటి అర్థాన్ని తీసుకోగా, మరి కొందరు రెండవ అర్థాన్ని తీసుకున్నారు.

78. అరబీలో **అస్లమూ** (اَسْلَمُوْا) అని అనబడింది. ఇది దైవప్రవక్తల ప్రధాన సుగుణం. వారు ఎల్లప్పుడూ దైవవిధేయులుగా– ముస్లిములుగా – ఉంటారు. అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (సఅసం) ఇస్తున్న సందేశం కూడా కొత్త సందేశం కాదు. అది కూడా మునుపటి ప్రవక్తలు అందజేసిన దైవవిధేయతా (ఇస్లాం) సందేశమే. అంటే దైవప్రవక్తలందరి మౌలిక సందేశం ఒక్కటే – "అంటే ఒక్కడైన దేవుణ్ణి ఆరాధించాలి, ఆరాధనలో, దాస్యంలో ఆయనకు భాగస్వాములుగా ఇతరులను కల్పించకూడదు." ఏ దైవప్రవక్త అయినా మౌలికంగా అన్నిటికన్నా ముందు చెప్పింది ఇదే. అదే ఏకదైవారాధనా సందేశం! "(ఓ ప్రవక్తా!) మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా 'నేను తప్ప మరో ఆరాధ్యదైవం లేదు. కనుక మీరు నా దాస్యమే చేయండి' అనే విషయాన్ని తెలియజేశాము". ఇదే దివ్య ఖుర్ఆన్‌లో 'అద్దీన్'గా కూడా వ్యవహరించబడింది. "(షర్అ లకుమ్ మినద్దీని .....) ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు" (షూరా సూరాలోని 13వ వచనం).

79. అంటే యూదుల మధ్య తలెత్తే వివాదాలపై తీర్పులు అని భావం.

هَادُوْا وَالرَّبّٰنِيُّوْنَ وَالْاَحْبَارُ بِمَا اسْتُحْفِظُوْا
مِنْ كِتٰبِ اللّٰهِ وَكَانُوْا عَلَيْهِ شُهَدَآءَ ۚ
فَلَا تَخْشَوُا النَّاسَ وَاخْشَوْنِ وَلَا تَشْتَرُوْا
بِاٰيٰتِيْ ثَمَنًا قَلِيْلًا ؕ وَمَنْ لَّمْ يَحْكُمْ بِمَآ
اَنْزَلَ اللّٰهُ فَاُولٰٓئِكَ هُمُ الْكٰفِرُوْنَ ﴿44﴾

సమస్యలను పరిష్కరించేవారు. ఎందుకంటే దేవుని ఈ గ్రంథాన్ని రక్షించవలసిందిగా వారికి ఆజ్ఞాపించటం జరిగింది.[80] దీనికి వారు సాక్షులుగా ఉండేవారు.[81] కాబట్టి మీరు మనుషులకు భయపడకండి. నాకు మాత్రమే భయపడండి. నా వాక్యాలను కొద్దిపాటి వెలకు అమ్ముకోకండి.[82] ఎవరు అల్లాహ్ అవతరింపజేసిన వహీ ప్రకారం తీర్పు చెయ్యరో వారే (కరడుగట్టిన) అవిశ్వాసులు.[83]

وَكَتَبْنَا عَلَيْهِمْ فِيْهَآ اَنَّ النَّفْسَ بِالنَّفْسِ ۙ وَالْعَيْنَ
بِالْعَيْنِ وَالْاَنْفَ بِالْاَنْفِ وَالْاُذُنَ بِالْاُذُنِ
وَالسِّنَّ بِالسِّنِّ ۙ وَالْجُرُوْحَ قِصَاصٌ ؕ فَمَنْ
تَصَدَّقَ بِهٖ فَهُوَ كَفَّارَةٌ لَّهٗ ؕ وَمَنْ لَّمْ يَحْكُمْ
بِمَآ اَنْزَلَ اللّٰهُ فَاُولٰٓئِكَ هُمُ الظّٰلِمُوْنَ ﴿45﴾

**45** మేము తౌరాతు గ్రంథంలో యూదుల కోసం ఒక శాసనాన్ని లిఖించాము: (దీని ప్రకారం) ప్రాణానికి బదులు ప్రాణం, కన్నుకు బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పంటికి బదులు పన్ను. అలాగే కొన్ని ప్రత్యేక గాయాల కోసం కూడా (సరిసమానంగా) ప్రతీకారం ఉంది.[84] కాని ఎవరయినా క్షమాభిక్ష పెడితే అది అతని పాలిట పరిహారం (కప్ఫారా) అవుతుంది. అల్లాహ్ అవతరింపజేసిన దానికనుగుణంగా తీర్పు ఇవ్వనివారే దుర్మార్గులు.[85]

80. తరువాతి కాలంలో యూదపండితులు ప్రక్షిప్తాలకు పాల్పడినట్లుగా ప్రథమ శ్రేణి విద్వాంసులు, తొలికాలపు సజ్జనులు తౌరాతు గ్రంథంలో ఎలాంటి ప్రక్షిప్తాలకూ పూనుకోలేదు. వారు దైవాజ్ఞకు కట్టుబడి మసలుకుంటూ, తౌరాతు గ్రంథాన్ని కాపాడేవారు.

81. అంటే ఈ గ్రంథం ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ఉండేది. ఎందుకంటే ఇది దేవుని తరఫున పంపబడిన గ్రంథం.

82. అంటే ప్రజల ఒత్తిడికి లోనై, వారికి భయపడి తౌరాతు గ్రంథంలోని సిసలైన, నికార్సయిన ఆదేశాలను కనుమరుగు చేసే ప్రయత్నం చేయకండి. స్వల్ప లాభాల కోసం, స్వార్థంతో దైవసూక్తులను మార్చివేయకండి.

83. దైవాజ్ఞలు, దైవ శాసనాలు మునుపటి నుంచే మీవద్ద ఉండగా అసలు మీరు మిథ్యా భావాలకు ఎలా లొంగిపోయారు? అవిశ్వాసుల పట్ల ఎలా రాజీపడిపోయారు?

84. తౌరాతు గ్రంథంలో ప్రాణానికి బదులు ప్రాణం, గాయానికి బదులు గాయం అని నిర్ధారించబడి ఉండగా యూదుల్లోని ఒక తెగవారు (బనూ నజీర్) మరో తెగవారి (బనూ ఖురైజ) పట్ల తద్భిన్నంగా వ్యవహరించటం, రక్త పరిహారం విషయంలో న్యాయాన్ని వీడటం వారి దివాలాకోరుతనానికి ప్రబల నిదర్శనం.

85. అంటే యూదుల్లోని ఏ తెగవారైతే ఈ రకమయిన తీర్పుచేశారో అది దైవాజ్ఞకు విరుద్ధమైంది. ఈ విధంగా వారు దైవవాక్యాలతో చెలగాటమాడి అన్యాయానికి ఒడిగట్టారు. కాబట్టి దైవాదేశాలను యథాతథంగా అవలంబించటం వినా మనిషికి మార్గాంతరం లేదు. వాటికనుగుణంగానే అతను నిర్ణయాలు గైకొనాలి. జీవితంలోని అన్ని వ్యవహారాల లోనూ అతను వాటి నుంచి మార్గదర్శకత్వం పొందాలి. ఒకవేళ అతను అలా చేయకపోతే దైవదర్బారులో అన్యాయ పరుడుగా ఖరారవుతాడు. పాపాత్ముడుగా పరిగణించబడతాడు. అవిశ్వాసిగా భావించబడతాడు. ఇలాంటి వారికోసం అల్లాహ్ ఈ మూడు పదాలను ఉపయోగించి తన ఆగ్రహాన్ని, అసమ్మతిని వ్యక్తపరిచాడు. ఇంత స్పష్టంగా తెలిపిన మీదట కూడా మనిషి తన మనోవాంఛలను అనుసరిస్తే, స్వకల్పిత చట్టాలను అవలంబిస్తే అతనికన్నా దురదృష్టవంతుడు ఇంకెవడుంటాడు?

**46** ఆ ప్రవక్తల తరువాత మేము మర్యమ్ కుమారుడగు ఈసాను పంపాము. అతను తనకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని సత్యమని ధృవీకరించేవాడు. మేమతనికి ఇంజీలు గ్రంథాన్ని వొసగాము.[86] అందులో మార్గదర్శకత్వమూ, జ్యోతీ ఉండేవి. అది తనకు ముందున్న తౌరాతు గ్రంథాన్ని ధృవీకరించేది. అంతేకాదు, అది దైవభీతి కలవారికి ఆసాంతం మార్గదర్శిని మరియు హితబోధిని కూడా.[87]

وَقَفَّيْنَا عَلَىٰٓ اٰثَارِهِمْ بِعِيْسَى ابْنِ مَرْيَمَ
مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ مِنَ التَّوْرٰىةِ ۪
وَاٰتَيْنٰهُ الْاِنْجِيْلَ فِيْهِ هُدًى وَّنُوْرٌ ۙ
وَّمُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ مِنَ التَّوْرٰىةِ
وَهُدًى وَّمَوْعِظَةً لِّلْمُتَّقِيْنَ ۟ (46)

**47** ఇంజీలు గ్రంథం గలవారు కూడా, అల్లాహ్ ఇంజీలులో అవతరింపజేసిన దానికనుగుణంగానే తీర్పు చెయ్యాలి.[88] అల్లాహ్ అవతరింపజేసిన దాని ప్రకారం తీర్పుచెయ్యని వారే పాపాత్ములు.

وَلْيَحْكُمْ اَهْلُ الْاِنْجِيْلِ بِمَآ اَنْزَلَ اللّٰهُ فِيْهِ ۭ
وَمَنْ لَّمْ يَحْكُمْ بِمَآ اَنْزَلَ اللّٰهُ فَاُولٰۗىِٕكَ هُمُ
الْفٰسِقُوْنَ (47)

**గమనార్హ విషయం :** ఈ ఆయతుల సందర్భంగా ఇస్లామీయ సైద్ధాంతిక పండితులు (ఉలమాయె ఉసూలియ్యీన్) ఇలా రాశారు : వెనుకటి షరీయతులోని ఆదేశాన్ని గనక దేవుడు యథాతథంగా (రద్దు చేయకుండా) ఉంచినట్లయితే, దాన్ని అమలుపరచవలసిన బాధ్యత మనపై కూడా ఉంటుంది. ఈ ఆయతులోని ఆజ్ఞ రద్దు కాలేదు. కాబట్టి ఇది కూడా ఇస్లామీయ షరీయతులో అంతర్భాగమే. హదీసుల ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది (ఈ అంశంపై మరిన్ని వివరాల్లోకి పోదలచుకున్నవారు ఫత్హుల్ బారీ, నైలుల్ ఔతార్ గ్రంథాలను చూడగలరు).

86. అంటే దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) గారికి, ఆయనకు మునుపు వచ్చిన ప్రవక్తలకు మధ్య ఎక్కువ అంతరం లేదు. తనకు ముందు పంపబడిన తౌరాతు గ్రంథాన్ని ఈసా (ఏసు) ప్రవక్త ధృవీకరించారు, దాన్ని ఆయన అసత్యమని కొట్టిపారేయలేదు. దీనిద్వారా ఆయన సత్యవంతుడైన ప్రవక్త అనీ, మూసాను పంపిన దేవుడే ఆయన్ని కూడా పంపాడని రుజువవుతున్నది. అయినప్పటికీ యూదులు హజ్రత్ ఈసాను ధిక్కరించటమేగాక, ఆయన్ని అవమానపర్చారు. ధర్మభ్రష్టుడని కూడా గోలచేశారు.

87. అంటే ఒకప్పుడు తౌరాతు గ్రంథం ఏ విధంగా ప్రజలకు మార్గదర్శకత్వంగా ఉండేదో అదేవిధంగా ఇప్పుడు ఇంజీలు మానవాళికి మార్గదర్శిగా, హితోపదేశంగా ఉంటుంది అని భావం. మరి అలాగే దివ్య ఖుర్ఆన్ అవతరించిన తరువాత తౌరాతు, ఇంజీలుతోపాటు ఇతర ఆకాశ గ్రంథాల ఆదేశాలన్నీ రద్దయి పోయాయి. ఇప్పుడు సన్మార్గానికి, ముక్తికి ఏకైక సాధనం దివ్య ఖుర్ఆన్ మాత్రమే. ఈ గ్రంథంతో అల్లాహ్ తన ఆకాశ గ్రంథాల అవతరణను పరిసమాప్తం చేశాడు. ప్రళయదినం వరకూ జన్మించబోయే మానవులందరికీ ఈ గ్రంథమే మార్గదర్శకం మరియు మోక్షప్రదాయిని అన్న ప్రకటన కూడా ఈ మాటల్లో ఇమిడి ఉంది. దీనిపట్ల చికాకు చెందినవాడు, నుదురు చిట్లించినవాడు ఎల్లప్పుడూ అసంతృప్తికి లోనై ఉంటాడు. దీంతో సంబంధాన్ని త్రెంచుకున్నవాడు వైఫల్యాలను చవిచూస్తూ ఉంటాడు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే "అన్ని మతాలు ఒక్కటే" అన్న తత్వం సరైంది కాదు. సత్యం ఎప్పుడూ ఒక్కటే, అనేకం కాదు. సత్యం మినహా మిగతావన్నీ మిథ్యే. తౌరాతు తన కాలంలో సత్యగ్రంథంగా ఉండేది. ఆ తరువాత ఇంజీలు గ్రంథం తన కాలంలో సత్య గ్రంథంగా, జ్యోతిగా అలరారింది. ఇంజీలు అవతరించిన మీదట తౌరాతు ప్రకారం ఆచరించటం అధర్మం. అలాగే ఖుర్ఆన్ అవతరించిన తరువాత ఇంజీలు గ్రంథం రద్దయింది. కాబట్టి ఇప్పుడు ఇంజీలు ప్రకారం ఆచరించటం అధర్మం. ఇప్పుడు దివ్య ఖుర్ఆన్ ఒక్కటే ప్రపంచంలో దేవుని అంతిమ గ్రంథం. యావత్తు ప్రపంచానికీ, సమస్త మానవాళికీ మార్గదర్శక గ్రంథం! ఆచరణ యోగ్యమైన గ్రంథం!! కాబట్టి ఈ అంతిమ దైవగ్రంథాన్ని విశ్వసించనంతరకూ, అంతిమ దైవప్రవక్తగా ముహమ్మద్ (స) ను అంగీకరించనంతవరకూ మోక్షం లభించదు. మరింత వివరణ కోసం బఖరా సూరాలోని 62వ ఆయతుకు వ్యాఖ్యానం కూడా చూడండి.

48 ఇంకా (ఓ ప్రవక్తా!) మేము నీ వైపుకు ఈ గ్రంథాన్ని సత్య సమేతంగా అవతరింపజేశాము. అది తనకన్నా ముందు వచ్చిన గ్రంథాలను సత్యమని ధృవీకరిస్తుంది, వాటిని పరిరక్షిస్తుంది.[89] కాబట్టి నువ్వు వారి పరస్పర వ్యవహారాలపై అల్లాహ్ అవతరింప జేసిన ఈ గ్రంథానికనుగుణంగానే తీర్పు చెయ్యి.[90] నీ వద్దకు వచ్చిన ఈ సత్యాన్ని వీడి, వారి మనోవాంఛలను అనుస రించకు.[91] మీలో ప్రతి ఒక్కరి కోసం మేము ఒక విధానాన్ని, మార్గాన్నీ నిర్ధారించాము.[92] అల్లాహ్ యే గనక తలిస్తే మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు. అయితే మీకు

وَاَنْزَلْنَآ اِلَيْكَ الْكِتٰبَ بِالْحَقِّ مُصَدِّقًا لِّمَا بَيْنَ
يَدَيْهِ مِنَ الْكِتٰبِ وَمُهَيْمِنًا عَلَيْهِ فَاحْكُمْ
بَيْنَهُمْ بِمَآ اَنْزَلَ اللّٰهُ وَلَا تَتَّبِعْ اَهْوَآءَهُمْ
عَمَّا جَآءَكَ مِنَ الْحَقِّ ؕ لِكُلٍّ جَعَلْنَا مِنْكُمْ
شِرْعَةً وَّمِنْهَاجًا ؕ وَلَوْ شَآءَ اللّٰهُ لَجَعَلَكُمْ اُمَّةً

88. ఇంజీలు గ్రంథానికి సంబంధించిన ఈ ఆజ్ఞ దైవప్రవక్త ఈసా (ఏసు) అలైహిస్సలాం దైవదౌత్యం కొనసాగినంత కాలం వరకూ ఉండింది. అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రభవనంతో ఈసా (అలైహిస్సలాం) దైవదౌత్యకాలం కూడా సమాప్తమయింది. ఇంజీలు గ్రంథానుసరణ కూడా రద్దయింది. ఆనాటి నుంచీ ముహమ్మద్ (సఅసం) ప్రవక్తను విశ్వసించి, దివ్యఖుర్ఆన్ గ్రంథాన్ని అనుసరించే వారే విశ్వాసులు (మోమిన్లు)గా వ్యవహరించ బడతారు.

89. ప్రతి ఆకాశ గ్రంథం తనకన్నా ముందు అవతరించిన గ్రంథాన్ని సత్యమని ధృవీకరిస్తుంది. దివ్య ఖుర్ఆన్ సయితం తనకన్నా ముందు అవతరించిన ఆకాశ గ్రంథాలను ధృవపరచింది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే ఆ గ్రంథాలు నిజంగా దైవగ్రంథాలే. అయితే దివ్య ఖుర్ఆన్ పూర్వపు గ్రంథాలను కేవలం ధృవీకరించటంతోనే ఆగక వాటిని పరిరక్షించేది (ముహైమిన్)గా, వాటికి సాక్షిగా, అమానతుదారుగా, అధికారిగా ఖరారు చేయబడింది. అంటే పూర్వపు గ్రంథాలు ప్రక్షిప్తాలకు, మార్పులు చేర్పులకు లోనవటం వల్ల ఇప్పుడు ఖుర్ఆన్ చేసే తీర్పు తుది తీర్పుగా ఉంటుంది. ఖుర్ఆన్ దేన్ని ప్రామాణికంగా ఖరారు చేస్తుందో అదే ప్రామాణికమైంది. ఖుర్ఆన్ దేన్ని మిథ్యగా ఖరారు చేస్తుందో అదే మిథ్య.

90. ఇంతకు ముందు 42వ ఆయతులో ముహమ్మద్ (సఅసం) నుద్దేశ్యించి, 'నీవు వారి వ్యవహారాలను నీకిష్టముంటే పరిష్కరించు, లేకుంటే లేదు' అని అనబడింది. అయితే ఇప్పుడు దాని స్థానంలో సరికొత్తగా ఆదేశించబడింది – 'వారి పరస్పర వ్యవహారాలను ఈ (ఖుర్ఆన్) గ్రంథానికనుగుణంగానే పరిష్కరించు' అని!

91. వాస్తవానికి ఇది 'ఉమ్మత్'కు చేయబడుతున్న ఉపదేశం. సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను వేరుపరచే మార్గదర్శక గ్రంథం మీమధ్య ఉండగా, మీరు మీ మనోవాంఛల కనుగుణంగా మీ వ్యవహారాలను పరిష్కరించుకోవటం, స్వకల్పిత శాసనాలకు, అభిప్రాయాలకు తలొగ్గి తదనుగుణంగా తీర్పులు చెప్పటం అపమార్గమని చెప్పబడింది. ఒక ప్రవక్తకే ఇలాంటి నిర్ణయం గైకొనే అనుమతి లేనపుడు సామాన్య మానవులకు ఎలా ఉంటుంది?

92. అంటే వెనుకటి షరీఅతులు (ధర్మశాస్త్రాలు) అని భావం. వాటి మధ్య కొన్ని పాక్షిక విషయాలలో అభిప్రాయ భేదాలుండేవి. ఒక షరీయతులో హరామ్ (అధర్మం)గా ఉండే కొన్ని విషయాలు, మరొక షరీయతులో హలాల్ (ధర్మసమ్మతం)గా ఉండేవి. ఒక విషయం ఒక షరీయతులో దృఢం (Rigid)గా ఉండగా, అదే విషయం మరో షరీయతులో అదృఢం (Flexible)గా ఉండేది. అయితే మౌలికంగా అందరి ధర్మం మాత్రం ఒక్కటే – అదే దేవుని ఏకత్వంతో కూడుకున్న ధర్మం. ఈ రకంగా దైవప్రవక్తలందరి సందేశం ఒక్కటే! ఈ విషయమే ఒక హదీసులో ఇలా వివరించబడింది – "దైవప్రవక్తల సమూహానికి చెందిన మేము అల్లాతీ (సవతి) సోదరులం. మా అందరి ధర్మం ఒక్కటే" అని మహాప్రవక్త (సఅసం) వారు సెలవిచ్చారు (సహీహ్ బుఖారీ). అల్లాతీ సోదరులంటే ఒకే తండ్రికి పుట్టిన బిడ్డలు. కాని వారి తల్లులు మాత్రం వేరు. దీనర్థం ఏమిటంటే వారందరూ తెచ్చిన ధర్మం మాత్రం ఒక్కటే

وَّاحِدَةً وَّلٰكِنْ لِّيَبْلُوَكُمْ فِيْ مَآ اٰتٰىكُمْ فَاسْتَبِقُوا الْخَيْرٰتِ ؕ اِلَى اللّٰهِ مَرْجِعُكُمْ جَمِيْعًا فَيُنَبِّئُكُمْ بِمَا كُنْتُمْ فِيْهِ تَخْتَلِفُوْنَ ﴿48﴾

వొసగబడిన దానిలో మిమ్మల్ని పరీక్షించాలన్నది ఆయన అభిలాష.[93] కాబట్టి మీరు సత్కార్యాలు చేయటంలో త్వరపడండి. మీరంతా మరలిపోవలసింది అల్లాహ్ వైపుకే. ఆ తరువాత ఆయన, మీరు పరస్పరం విభేదించుకునే విషయాల గురించి మీకు (తన తీర్పు) తెలియజేస్తాడు.

وَاَنِ احْكُمْ بَيْنَهُمْ بِمَآ اَنْزَلَ اللّٰهُ وَلَا تَتَّبِعْ اَهْوَآءَهُمْ وَاحْذَرْهُمْ اَنْ يَّفْتِنُوْكَ عَنْۢ بَعْضِ مَآ اَنْزَلَ اللّٰهُ اِلَيْكَ ؕ فَاِنْ تَوَلَّوْا فَاعْلَمْ اَنَّمَا يُرِيْدُ اللّٰهُ اَنْ يُّصِيْبَهُمْ بِبَعْضِ ذُنُوْبِهِمْ ؕ وَاِنَّ كَثِيْرًا مِّنَ النَّاسِ لَفٰسِقُوْنَ ﴿49﴾

**49** (ఓ ప్రవక్తా!) అల్లాహ్ అవతరింపజేసిన దానికనుగుణంగానే నీవు వారి మధ్య తీర్పు చేయి. వాళ్ళ కోరికలను ఎంత మాత్రం అనుసరించకు. అల్లాహ్ నీ వైపుకు అవతరింపజేసిన ఏదేని ఆజ్ఞ విషయంలో వారు నిన్ను ప్రక్కదారి పట్టించకుండా నీవు చాలా అప్రమత్తంగా ఉండు. ఒకవేళ వారు విముఖత చూపితే, వారు ఒడిగట్టిన కొన్ని పాపాలకుగాను వారికి శిక్ష విధించాలన్నదే అల్లాహ్ సంకల్పం అని తెలుసుకో. ప్రజల్లో చాలా మంది అవిధేయులే ఉంటారు.

اَفَحُكْمَ الْجَاهِلِيَّةِ يَبْغُوْنَ ؕ وَمَنْ اَحْسَنُ مِنَ اللّٰهِ حُكْمًا لِّقَوْمٍ يُّوْقِنُوْنَ ﴿50﴾

**50** ఏమిటీ, వారు మళ్ళీ అజ్ఞాన (కాల)పు తీర్పు కోరుతున్నారా?[94] నమ్మకం గల వారి కోసం అల్లాహ్ కన్నా ఉత్తమ తీర్పు ఇవ్వగల వాడెవడుంటాడు?[95]

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَتَّخِذُوا الْيَهُوْدَ وَالنَّصٰرٰۤى اَوْلِيَآءَ ؔۘ بَعْضُهُمْ اَوْلِيَآءُ بَعْضٍ ؕ

**51** ఓ విశ్వసించినవారలారా! యూదులను, నసారాను (అంటే క్రైస్తవులను) స్నేహితులుగా చేసుకోకండి.[96] వారు ఒండొకరికి స్నేహితులు.[97] మీలో ఎవరయినాసరే వారితో చెలిమిచేస్తే అతడు

గాని, వారికి ఇవ్వబడిన షరీయతులు మాత్రం వేర్వేరు. అయితే ముహమ్మద్ (సఅసం) వారు ప్రవేశపెట్టిన షరీయతు తరువాత మునుపటి షరీయతులన్నీ రద్దయినాయి. ఇప్పుడు దీన్ (ధర్మం)తో పాటు షరీయతు కూడా ఒక్కటే.

93. అంటే దివ్య ఖుర్ఆన్ అవతరించిన తరువాత మానవ సాఫల్యం దీనితోనే ముడిపడి ఉన్నప్పటికీ, మోక్షమార్గాన్ని అవలంబించే విషయంలో దేవుడు మనుషులపై ఎలాంటి నిర్బంధం, బలవంతం పెట్టలేదు. ఆయనే గనక తలిస్తే బలవంతంగా అందరూ తనముందు తలవంచేలా చేసుకునేవాడే. కాని ఆయన గనక అలాచేస్తే 'మిమ్మల్ని పరీక్షించాలి' అన్న ఉద్దేశం నెరవేరదు. సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండి కూడా, ఎవరు సన్మార్గాన్ని ఎన్నుకుంటారో పరీక్షించాలనే ఆయన ఈ స్వేచ్ఛను వొసగాడు.

94. ఇప్పుడు ఖుర్ఆన్ మరియు ఇస్లాంలు మినహా మిగిలినదంతా అజ్ఞానమే కదా! అయినాసరే వీళ్లు జ్యోతినీ, సన్మార్గాన్ని (ఇస్లాంను) కాదని అజ్ఞానాంధకారం వైపుకే పోవాలనుకుంటున్నారా? అజ్ఞాన కాలం నాటి వ్యవస్థ ఎంత దారుణమైనదో చెప్పి, దానిపట్ల ఏవగింపును కలిగించటానికి ఈ విధంగా చెప్పబడింది. "అల్లాహ్ నీపై అవతరింపజేసిన దానికనుగుణంగా నువ్వు యిచ్చే తీర్పులపై వీరు విముఖత చూపుతున్నారు, వీపు తిప్పుకుంటున్నారు. అజ్ఞానకాలం నాటి పద్ధతులను అన్వేషిస్తున్నారు" (ఫత్హుల్ ఖదీర్).

95. హదీసులో ఇలా ఉంది : "ఇస్లాంలోకి వచ్చి అజ్ఞాన కాలపు పద్ధతులను అన్వేషించేవారినీ, అన్యాయంగా ఒకరిని

وَمَنْ يَّتَوَلَّهُمْ مِّنْكُمْ فَاِنَّهٗ مِنْهُمْ ؕ اِنَّ اللّٰهَ لَا يَهْدِى الْقَوْمَ الظّٰلِمِيْنَ ﴿51﴾

కూడా వారిలో ఒకడుగానే భావించబడతాడు. నిశ్చయంగా దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.[98]

فَتَرَى الَّذِيْنَ فِىْ قُلُوْبِهِمْ مَّرَضٌ يُّسَارِعُوْنَ فِيْهِمْ يَقُوْلُوْنَ نَخْشٰٓى اَنْ تُصِيْبَنَا دَآٮِٕرَةٌ ؕ فَعَسَى اللّٰهُ اَنْ يَّاْتِىَ بِالْفَتْحِ اَوْ اَمْرٍ مِّنْ عِنْدِهٖ فَيُصْبِحُوْا عَلٰى مَاۤ اَسَرُّوْا فِىْۤ اَنْفُسِهِمْ نٰدِمِيْنَ ؕ ﴿52﴾

**52** మరి హృదయాలలో (కాపట్య) రోగం[99] ఉన్నవారు పదేపదే వారి వైపుకు పరుగెత్తటం నీవు చూస్తావు. అంతేకాదు, "మాపై ఏ ఆపద వచ్చిపడుతుందోనని మేము భయపడుతున్నాము"[100] అని వారంటారు. అయితే త్వరలోనే అల్లాహ్ విజయాన్ని చేకూర్చవచ్చు[101] లేక తనవద్ద నుంచి దేన్నయినా అనుగ్రహించ వచ్చు.[102] అప్పుడు వారు తమ ఆంతర్యాల్లో దాచిపెట్టిన విషయాలపై పశ్చాత్తాపపడతారు.

చంపాలనుకునే వారిని అల్లాహ్ అందరికన్నా ఎక్కువగా అసహ్యించుకుంటాడు" అని మహాప్రవక్త (స) ప్రవచించారు (సహీహ్ బుఖారీ: కితాబుద్దియాత్).

96. యూదులను, క్రైస్తవులను స్నేహితులుగా చేసుకోవటంగానీ, కీలక వ్యవహారాలలో వారిని ఆంతరంగికులుగా చేసుకోవటంగానీ తగదు. ఎందుకంటే వారు ఇస్లాంకు, ముస్లిములకు శత్రువులు. వారితో స్నేహం చేయటం ఎంత తీవ్రమయిన విషయం అంటే ఎవరయినా ముస్లింలలో ఆ పనికి ఒడిగడితే అతను కూడా వారికి చెందినవాడుగానే జమకట్టబడతాడు (మరిన్ని వివరాల కోసం ఆలి ఇమ్రాన్ సూరాలోని 28వ ఆయతు, 118వ ఆయతుకు వివరణ చూడండి).

97. దివ్య ఖుర్ఆన్ నిర్ద్వంద్వంగా, సూటిగా చెప్పిన ఈ యదార్థాన్ని నేడు ఎవరయినా ప్రపంచంలో గమనించవచ్చు. యూదులు – క్రైస్తవులు సైద్ధాంతికంగా, విశ్వాసపరంగా పరస్పరం ఎంతగానో విభేదించుకున్నప్పటికీ, ఒండొకరిని చూసి అసూయ చెందినప్పటికీ ఇస్లాం మరియు ముస్లిముల దగ్గరకొచ్చేసరికి వారంతా ఏకమైపోతారు. ముస్లిములకు వ్యతిరేకంగా ఒకరింకొకరికి సహకరించుకుంటారు.

98. ఈ ఆయతుల పూర్వరంగం గురించి ఇలా చెప్పబడుతుంది: హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి), కపటుల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబై – ఇరువురూ అజ్ఞానకాలం నుంచే యూదులకు మిత్రులుగా, సహాయకులుగా ఉంటూ వచ్చేవారు. బద్ర్ యుద్ధంలో ముస్లింలకు విజయం వరించటంతో అబ్దుల్లా బిన్ ఉబై కూడా ఇస్లాంను స్వీకరిస్తున్నట్టు ప్రకటించాడు. ఆ తర్వాత కొంతకాలానికే యూదుల్లోని బనూ ఖైనుఖా తెగవారు అరాచకానికి, అలజడులకు పూనుకుని చిక్కుల్లో పడ్డారు. అప్పుడు హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) తన యూద మిత్రులతో స్నేహసంబంధాన్ని త్రెంచుకోగా, అబ్దుల్లా బిన్ ఉబై మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తూ, యూదుల్ని రక్షించడానికి శాయశక్తులా కృషి చేశాడు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయతు అవతరించింది.

99. రోగం అంటే కాపట్యం, వంచన (మునాఫఖత్) అని అర్థం. అంటే ఆంతర్యంలో కాపట్యం తిష్ఠవేసినవారు కొందరు, యూదులతో చెలిమి కోసం అర్రులు చాస్తున్నారన్నమాట!

100. అంటే ముస్లిములే గనక యుద్ధంలో పరాజయం పొందితే తమకు కూడా నష్టం వాటిల్లుతుందేమో! అందుకే ముందు నుంచీ యూదులతో స్నేహసంబంధాలు పెట్టుకుని ఉంటే కష్టకాలంలో వారు తమను ఆదుకుంటారని కపటులు ఎత్తు వేశారు.

101. అంటే యుద్ధంలో ముస్లింలు విజయ పతాకం ఎగురవేస్తే.......

102. అంటే ముస్లిములకు విజయం వరించి, యూదులు క్రైస్తవులు జిజ్యా చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడితే కపటులు

**53** విశ్వాసులు (వారి ఈ పరిస్థితిని చూసి), "మేము మీతోనే ఉన్నామని అదేపనిగా అల్లాహ్ పేర కఠోర ప్రమాణాలు చేసి చెప్పింది వీళ్ళేనా?!" అని అంటారు. వీళ్ళ సత్కార్యాలన్నీ వృథా అయ్యాయి. ఆ విధంగా వీరు (ఘోరంగా) నష్టపోయారు.

وَيَقُوْلُ الَّذِيْنَ اٰمَنُوْٓا اَهٰٓؤُلَآءِ الَّذِيْنَ اَقْسَمُوْا بِاللّٰهِ جَهْدَ اَيْمَانِهِمْ ۙ اِنَّهُمْ لَمَعَكُمْ ؕ حَبِطَتْ اَعْمَالُهُمْ فَاَصْبَحُوْا خٰسِرِيْنَ ﴿53﴾

**54** ఓ విశ్వాసులారా! మీలో ఎవరయినాసరే తమ ధర్మం నుంచి తిరిగిపోతే (పోవచ్చు),[103] అల్లాహ్ త్వరలోనే మరో జాతి వారిని తీసుకువస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు, వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు.[104] వారు విశ్వాసుల పట్ల మృదు స్వభావులుగానూ, అవిశ్వాసుల పట్ల కఠినులుగానూ ఉంటారు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు. నిందించేవారి నిందలను వారు ఏమాత్రం పట్టించుకోరు.[105] ఇది అల్లాహ్ అనుగ్రహం. ఆయన తాను కోరిన వారికి దీన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ విస్తృతి కలవాడు, జ్ఞాన సంపన్నుడు.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا مَنْ يَّرْتَدَّ مِنْكُمْ عَنْ دِيْنِهٖ فَسَوْفَ يَاْتِى اللّٰهُ بِقَوْمٍ يُّحِبُّهُمْ وَيُحِبُّوْنَهٗٓ ۙ اَذِلَّةٍ عَلَى الْمُؤْمِنِيْنَ اَعِزَّةٍ عَلَى الْكٰفِرِيْنَ ؗ يُجَاهِدُوْنَ فِىْ سَبِيْلِ اللّٰهِ وَلَا يَخَافُوْنَ لَوْمَةَ لَآئِمٍ ؕ ذٰلِكَ فَضْلُ اللّٰهِ يُؤْتِيْهِ مَنْ يَّشَآءُ ؕ وَاللّٰهُ وَاسِعٌ عَلِيْمٌ ﴿54﴾

తమ హ్రస్వదృష్టిపై సిగ్గుపడి మళ్లీ ముస్లిములకు దగ్గరవటానికి ప్రయత్నిస్తారు. భవిష్యత్తులో సంభవించబోయే పరిణామాలను ఈ ఆయతు సూచిస్తోంది. యూదుల్లోని బనూ ఖురైజ వారు హతమార్చబడ్డారు. వారి పిల్లలు బందీ అయ్యారు. బనూ నజీర్ తెగ నగరం నుంచి బహిష్కరించబడింది.

103. అల్లాహ్ చెప్పింది అక్షరాలా నిజం అయింది. దైవప్రవక్త (సఅసం) చనిపోయిన మరునాటి నుంచే ఇస్లాం ధర్మం నుంచి మరలిపోయేవారు – ధర్మభ్రష్టులు – తల ఎత్తారు. ఈ ధర్మభ్రష్ట ఉపద్రవాన్ని అణచివేసే ఘనత హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) గార్కి, ఆయన సహచరులకు దక్కింది.

104. ధర్మభ్రష్టత (ఇర్తెదాద్)కు పాల్పడినవారికి వ్యతిరేకంగా అల్లాహ్ నిలబెట్టే జాతిలో నాలుగు సుగుణాలుంటాయి: 1. వారిని అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు, వారు అల్లాహ్‌ను ప్రేమించేవారై ఉంటారు. 2. వారు సాటి ముస్లిం సోదరుల యెడల దయార్ద్ర హృదయులుగా ఉంటారు, అవిశ్వాసుల పట్ల మాత్రం కఠినంగా వ్యవహరించే వారై ఉంటారు. 3. వారు దైవమార్గంలో మొక్కవోని వీరులుగా నిలిచి పోరాడుతారు. 4. తాము అవలంబించే ధర్మమార్గంలో ఎవరెంతగా తూలనాడినా, ఎవరెన్ని నీలాపనిందలు మోపినా ఏమాత్రం తొణక్కుండా, జంకులేకుండా ముందుకు సాగిపోతారు. మహాప్రవక్త (స) గారి ప్రియసహచరులలో ఈ సుగుణాలు పుష్కలంగా ఉండేవి. అందుకే అల్లాహ్ వారికి ఇహపరాల భాగ్యాలను ప్రసాదించాడు. వారు ప్రపంచంలోనే దేవుని ప్రియతమ దాసులుగా శ్లాఘించబడ్డారు.

105. **"నిందించే వారి నిందలను ఏమాత్రం లక్ష్యపెట్టరు"** అన్న విశ్వాసుల ఆఖరి సద్గుణం చాలా ముఖ్యమైనది. దైవవిధేయత మరియు దైవప్రవక్త విధేయతా మార్గంలో ఎన్ని అడ్డంకులు కల్పించబడినా, ఎన్ని నిందలు నిష్ఠూరాలు ఎదురైనా వారు పట్టించుకోకుండా, లక్ష్యం వైపుకు దూసుకుపోతుంటారు. సమాజంలో చెడుగులు, ఉపద్రవాలు సర్వసామాన్యమై పోయినపుడు వాటిని ధైర్యంగా ఎదిరించి, ప్రతికూల పవనాలకు ఎదురీదాలంటే ఈ సుగుణం మనిషిలో ఉండటం ఎంతో అవసరం. సమాజంలోని ఎంతోమంది ఈ చెడుల నుండి, నీతిబాహ్యత నుండి, సామాజిక రుగ్మతల నుండి తమను రక్షించుకోవాలని తపన పడుతుంటారు. కాని వారు లోకానికి జడుసుకుని ముందుకు రారు. ఈ మార్గంలో ఎదురయ్యే కష్టాలను సహించటానికి, మీదపడే అభాండాలను మోయడానికి, దుర్విమర్శలను, అపనిందలను భరించ

اِنَّمَا وَلِيُّكُمُ اللّٰهُ وَرَسُوْلُهٗ وَالَّذِيْنَ اٰمَنُوا الَّذِيْنَ يُقِيْمُوْنَ الصَّلٰوةَ وَيُؤْتُوْنَ الزَّكٰوةَ وَهُمْ رٰكِعُوْنَ ﴿55﴾

**55** (ముస్లిములారా!) వాస్తవానికి మీ స్నేహితులు అల్లాహ్, ఆయన ప్రవక్త, ఇంకా నమాజును నెలకొల్పే, జకాతును చెల్లించే, రుకూ చేసే (ఆరాధనలో అణకువను కలిగి ఉండే) విశ్వాసులు మాత్రమే.[106]

وَمَنْ يَّتَوَلَّ اللّٰهَ وَرَسُوْلَهٗ وَالَّذِيْنَ اٰمَنُوْا فَاِنَّ حِزْبَ اللّٰهِ هُمُ الْغٰلِبُوْنَ ﴿56﴾

**56** అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, విశ్వాసులను మిత్రులుగా చేసుకున్నవారు, అల్లాహ్ పక్షంవారే[107] విజయం పొందుతారన్న విషయాన్ని తెలుసుకోవాలి.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَتَّخِذُوا الَّذِيْنَ اتَّخَذُوْا دِيْنَكُمْ هُزُوًا وَّلَعِبًا مِّنَ الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ مِنْ قَبْلِكُمْ وَالْكُفَّارَ اَوْلِيَآءَ ۚ وَاتَّقُوا اللّٰهَ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ﴿57﴾

**57** ఓ విశ్వాసులారా! మీకు పూర్వం గ్రంథం వొసగబడిన వారిలో మీ ధర్మాన్ని నవ్వులాటగా, వినోదంగా చేసుకున్న వారినిగానీ, అవిశ్వాసులనుగానీ[108] మీ స్నేహితులుగా చేసుకోకండి. మీరే గనక నిజమయిన విశ్వాసులైతే అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.

టానికి సాహసించరు. ఫలితంగా వారు చెడులను మనసారా అసహ్యించుకున్నప్పటికీ, ఆ చెడుల రొంపి నుంచి బయటకు రాలేకపోతారు. అందుకే ఈ నాల్గు సద్గుణాలు పుణికిపుచ్చుకున్నవారు ధన్యజీవులనీ, దైవానుగ్రహానికి పాత్రులైనవారనీ అల్లాహ్ సెలవిచ్చాడు.

106. యూదులతో, క్రైస్తవులతో స్నేహం చేయరాదని అంటే, మరి స్నేహం చేయాల్సింది ఎవరితోనన్న ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానం ఈ ఆయతులో ఉంది. విశ్వాసులకు అందరికన్నా ఎక్కువగా నమ్మదగ్గవారు దైవం మరియు దైవప్రవక్తయే. ఆ తరువాత వారిద్దరినీ విశ్వసించే సాటి ముస్లిములు. వారు నమాజును నెలకొల్పేవారై ఉంటారు. దేవుడు తమకు ప్రసాదించిన దానిలోనుంచి జకాతును (అనగా విధిగా చెల్లించవలసిన దానాన్ని) ఇస్తారు. ఎల్లప్పుడూ వినయశీలురుగా ఉంటారు.

107. ఆయతులో **'హిజ్బుల్లాహ్'** (అల్లాహ్ పక్షం, అల్లాహ్ కూటమి) అని అనబడింది. దైవాన్ని, దైవప్రవక్తను నమ్ముకుని, సాటిసోదరులతో కలసిమెలసి ఉండేవారే 'హిజ్బుల్లాహ్' అనబడతారు. వారు అవిశ్వాసులు, ముష్రిక్కులతో – వారు తమ బంధుమిత్రులైనాసరే – సన్నిహితంగా మెలగరు. వారిని తమ ఆంతరంగికులుగా చేసుకోరు. ముజాదలా సూరాలోని ఆఖరి ఆయతులో కూడా ఈ విషయమే చెప్పబడింది – "అల్లాహ్‌నూ, పరలోకాన్నీ విశ్వసించేవారు అల్లాహ్ మరియు, ఆయన ప్రవక్తను శత్రువులుగా వ్యవహరించేవారిని అభిమానిస్తున్నట్టు నీవు చూడవు – వారు తమ తండ్రులైనాసరే, తమ కుమారులైనాసరే, తమ అన్నదమ్ములైనాసరే, తమ బంధువులైనా సరే. (ఎందుకంటే) వారి హృదయాలలో విశ్వాసం (ఈమాన్) గట్టిగా నాటుకుంది. వారికి అల్లాహ్ ప్రత్యేకంగా సహాయం చేస్తాడు. క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాల్లో అల్లాహ్ వారికి ప్రవేశం కల్పిస్తాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారిపట్ల ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల ప్రసన్నులయ్యారు. వారు అల్లాహ్ పక్షానికి చెందినవారు. అల్లాహ్ పక్షమే ఎన్నటికైనా విజయం సాధిస్తుందని తెలుసుకోండి" (అల్ ముజాదలహ్ చివరి ఆయతు).

108. గ్రంథం వొసగబడిన వారంటే యూదులు, క్రైస్తవులని భావం. అవిశ్వాసులంటే బహుదైవోపాసకులన్నమాట! దైవధర్మాన్ని ఆషామాషీగా, వేళాకోళంగా భావించేవారు – పైకి వారు ఎంత మంచివారుగా కనిపించినప్పటికీ – దైవవిరోధులేననీ, అందువల్ల విశ్వసించినవారు వాళ్లతో దోస్తీ చేయటం భావ్యం కాదని మరోసారి ఈ ఆయతు నొక్కి చెబుతోంది.

**58** మీరు నమాజు కోసం పిలిచినప్పుడు వారు దాన్ని నవ్వు లాటగా, తమాషాగా చేసుకుంటారు.[109] ఎందుకంటే వారు బొత్తిగా బుద్ధిలేనివారు.

وَإِذَا نَادَيْتُمْ إِلَى الصَّلَوٰةِ اتَّخَذُوهَا هُزُوًا وَلَعِبًا ۚ ذَٰلِكَ بِأَنَّهُمْ قَوْمٌ لَّا يَعْقِلُونَ ﴿٥٨﴾

**59** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఓ గ్రంథవహులారా!(అంటే ఓ యూదులారా, క్రైస్తవులారా!) మేము అల్లాహ్‌ను, మావైపుకు అవతరింపజేయబడిన దానినీ, దానికి పూర్వం అవతరింప జేయబడిన దానిని విశ్వసిస్తున్నామన్న కారణంతో, ఇంకా మీలో అత్యధికులు అపమార్గాన ఉన్న కారణంతోనే కదా మీరు మాతో వైరవైఖరిని అవలంబిస్తున్నది?"

قُلْ يَٰٓأَهْلَ الْكِتَٰبِ هَلْ تَنقِمُونَ مِنَّآ إِلَّآ أَنْ ءَامَنَّا بِاللَّهِ وَمَآ أُنزِلَ إِلَيْنَا وَمَآ أُنزِلَ مِن قَبْلُ وَأَنَّ أَكْثَرَكُمْ فَٰسِقُونَ ﴿٥٩﴾

**60** వారికి చెప్పు : "అల్లాహ్ వద్ద దీనికన్నా చెడు ప్రతిఫలం పొందేవారు ఎవరో నేను మీకు తెలుపనా? అల్లాహ్ శాపానికి గురైనవారు, ఆయన ఆగ్రహానికి పాత్రులైనవారు – వారిలో కొందరిని ఆయన కోతులుగా, పందులుగా చేశాడు – ఇంకా

قُلْ هَلْ أُنَبِّئُكُم بِشَرٍّ مِّن ذَٰلِكَ مَثُوبَةً عِندَ اللَّهِ ۚ مَن لَّعَنَهُ اللَّهُ وَغَضِبَ عَلَيْهِ وَجَعَلَ مِنْهُمُ الْقِرَدَةَ وَالْخَنَازِيرَ وَعَبَدَ الطَّٰغُوتَ ۚ

109. హదీసులో ఇలా అనబడింది : "అజాన్ పిలుపు వినగానే షైతాన్ అపానవాయువు వెలువరుచుకుంటూ పారిపోతాడు. అజాన్ పిలుపు పూర్తయిన తరువాత మళ్లీ తిరిగివస్తాడు. తక్బీర్ (అల్లాహు అక్బర్) పలుకుతున్నప్పుడు మళ్లీ వెన్నుచూపి పారిపోతాడు. ఆ తరువాత మళ్లీ తిరిగివచ్చి నమాజీలలో దుష్ప్రేరణల్ని రేకెత్తిస్తాడు........" (సహీహ్ బుఖారీ – కితాబుల్ అజాన్; సహీహ్ ముస్లిం – కితాబుస్సలాత్). షైతాను మాదిరిగానే షైతాను అనుంగు అనుచరులకు కూడా అజాన్ పిలుపు కర్ణకఠోరంగా ఉంటుంది. అందుకే వారు దాన్ని ఎగతాళి చేయడానికి ప్రయత్నిస్తారు.

ఈ ఆయతు ద్వారా తెలిసే మరో ముఖ్యాంశం ఏమిటంటే దివ్య ఖుర్ఆన్ మాదిరిగానే ప్రవక్త (సఅసం) వారి హదీసు కూడా ఇస్లాం ధర్మానికి మూలం. ఎందుకంటే ఖుర్ఆన్ నమాజు కోసం యివ్వబడే 'పిలుపు' గురించి మాత్రమే ప్రస్తావించిందిగానీ ఆ 'పిలుపు' ఏమిటీ? అదెలా ఉంటుంది? లాంటి విషయాలను ఎక్కడా విడమరచి చెప్పలేదు. ఈ విషయం హదీసు ద్వారా మాత్రమే విదితం అయింది. హదీసు, 'దీన్' (ధర్మ) ప్రామాణికతకు నిదర్శనం అనడానికి ఇదొక ప్రబల తార్కాణం. అంటే దీనిభావం ఏమిటంటే ఖుర్ఆన్ మూలంగా నిరూపణ అయ్యే ఆదేశాలను, విద్యుక్త ధర్మాలను పాటించటం ఏ విధంగా అవశ్యమో, పాటించకుండా తిరస్కరించటం ఏ విధంగా కుఫ్ర్ క్రిందికి వస్తుందో అదేవిధంగా ప్రామాణిక హదీసు ద్వారా రూఢీ అయిన విషయాన్ని పాటించటం కూడా విధియే. దాన్ని తప్పకుండా పాటించాలి. దాన్ని తిరస్కరించిన పక్షంలో అది కుఫ్ర్ అవుతుంది. అయితే ఆ హదీసు ప్రామాణికమైనదయి ఉండాలి. నిజంగా దైవప్రవక్త (స) చెప్పినట్టు లేక ఆయన ద్వారా అంగీకారం పొందినట్టు తగిన సాక్ష్యాధారాలు కావాలి. హదీసును అందజేసిన ఉల్లేఖకుల పరంపర మధ్యలో ఎక్కడా 'లింకు' తెగి ఉండకూడదు. ఆ విధంగా ప్రామాణిక మైనదిగా రుజువయిన హదీసు – అది ఎంతోమంది ఉల్లేఖకుల చేత ఉల్లేఖించబడిన (ముతవాతిర్) హదీసు అయినా, ఒకే ఒక ఉల్లేఖకుడు అందించినది (ఖబ్రె వాహిద్) అయినా, ఇంకా ఆ హదీసు దైవప్రవక్త ప్రవచనమయినా, ఆయన ఆచరించిన పని అయినా లేక ఆయన అంగీకారం పొందిన విషయమయినా – ప్రామాణికంగా అందిన హదీసు ఏదయినా అనుసరణీయమే! ఆ హదీసును అందజేసినవారు ఒక్కరే అన్న కారణంగానో లేక అది ఇమాముల ఇజ్తెహాద్‌తో సమన్వయం చెందేదిగా లేదనో లేదా ఫలానా ఉల్లేఖకుని ధర్మావగాహన ఎన్నదగ్గది కాదన్న సాకుతోనో లేదా హేతువు ప్రాతిపదికపైనో లేదా ఇటువంటివే అనేక కారణాల ఆధారంగానో – హదీసును త్రోసిపుచ్చటం, రద్దు పరచటం సరైంది కాదు. ఇవన్నీ హదీసుల పట్ల వైముఖ్య ధోరణిలోని వివిధ రూపాలుగానే పరిగణించబడతాయి.

أُولَٰئِكَ شَرٌّ مَكَانًا وَأَضَلُّ عَنْ سَوَاءِ
السَّبِيلِ (60)

మిథ్యా దైవాలను పూజించినవారు. అత్యంత అధమశ్రేణికి చెందినవారు వీరే. రుజుమార్గం నుంచి బహుదూరం వెళ్ళిపోయినవారు కూడా వీరే.[110]

وَإِذَا جَاءُوكُمْ قَالُوا آمَنَّا وَقَدْ دَخَلُوا
بِالْكُفْرِ وَهُمْ قَدْ خَرَجُوا بِهِ ۚ وَاللَّهُ أَعْلَمُ
بِمَا كَانُوا يَكْتُمُونَ (61)

**61** వారు మీ వద్దకు వచ్చినప్పుడు, "మేము విశ్వసించాము" అని అంటారు. నిజానికి వారు అవిశ్వాసంతోనే వచ్చారు. మరి ఆ అవిశ్వాసంతోనే తిరిగి వెళ్ళిపోయారు. వారు దాచిపెట్టే దాన్ని అల్లాహ్ బాగా ఎరుగు.[111]

وَتَرَىٰ كَثِيرًا مِنْهُمْ يُسَارِعُونَ فِي الْإِثْمِ
وَالْعُدْوَانِ وَأَكْلِهِمُ السُّحْتَ ۚ لَبِئْسَ مَا كَانُوا
يَعْمَلُونَ (62)

**62** వారిలో చాలామందిని నీవు చూస్తావు, వారు పాపకార్యాల వైపుకు, దౌర్జన్యం వైపుకు, అధర్మమయిన సొమ్మును స్వాహా చేయటం వైపుకు ఎగబడుతూ ఉంటారు. వారు చేసే ఈ చేష్టలన్నీ పరమ చెడ్డవి.

لَوْلَا يَنْهَاهُمُ الرَّبَّانِيُّونَ وَالْأَحْبَارُ عَنْ قَوْلِهِمُ
الْإِثْمَ وَأَكْلِهِمُ السُّحْتَ ۚ لَبِئْسَ مَا كَانُوا
يَصْنَعُونَ (63)

**63** వారు ఇలాంటి పాపిష్టిమాటలు చెప్పకుండా, అధర్మమైన సొమ్మును తినకుండా వారి మతాచార్యులు, పండితులు వారిని ఎందుకు ఆపరు? వారు చేస్తున్నది చాలా చెడ్డ పని.[112]

110. అంటే (ఓ గ్రంథవహులారా!) మీరు మా పట్ల కినుక వహించటానికి కారణం ఏమిటి? మేము చేసిన పాపం ఏమిటి? మేము దైవాన్ని, దైవప్రవక్తను, ఖుర్ఆన్‌ను, ఖుర్ఆన్‌కు ముందు వచ్చిన ఆకాశ గ్రంథాలను నమ్మటమే పాపమా? ఇవి పాపకార్యాలు కావే?! వాస్తవానికి ఈ భావాలు కలిగి ఉన్నవారు పాపాత్ములు కానేకారు. దేవుని దృష్టిలో సిసలయిన పాపాత్ములు ఎవరో చెబుతాము వినండి! తమ అవిధేయతా కార్యకలాపాల మూలంగా దేవుని శాపానికి గురయినవారు, దేవుని ఆగ్రహానికి కారకులయినవారు దేవుని దృష్టిలో పరమ దుర్మార్గులు. వారు అసహ్యించుకోదగినవారు. వారిలో కొందరిని దేవుడు కోతులుగా, పందులుగా మార్చేశాడు. ఎందుకంటే వారు 'తాగూత్'ను ఆరాధించారు. ఈ విషయాలు మీకు కనువిప్పు కావాలి. మీరేమిటో, మీ కార్యకలాపాలేమిటో ఓసారి మీ అంతరంగంలోకి తొంగిచూసుకోండి. మీ ప్రవర్తన ఎలా ఉందో అద్దంలో ఓసారి చూసుకోండి. మీరు దేవుని హద్దులను మీరిపోవటం లేదా ఏమి?

111. ఇది కపటుల ప్రస్తావన. వారు దైవప్రవక్త (స) వద్దకు వచ్చినప్పుడు గుండెల్లో కాపట్యపు కుల్లును పెట్టుకుని వస్తారు. కాపట్యాన్నే మోసుకుపోతారు. వారి మనసులు నిర్మలమైనవి కావు. మీ సహచర్య సత్ప్రభావం వారిపై పడదు. మీరు చేసే ఉపదేశాలు వారి మనోక్షేత్రంలో నాటుకోవు. ఎందుకంటే వారి భూమి సారవంతమైనది, మెత్తది కాదు. అది బంజరు భూమి! చవుడు నేల! దాన్ని బాగుపరచుకోవాలన్న ధ్యాస కూడా వారికి లేదు. ఉపదేశం పొందే ఉద్దేశంతో వాళ్లు మీవద్దకు రావటం లేదు. తమ్ము తాము వంచించుకోవటంతోపాటు, ఎదుటివారిని కూడా మోసగించే దురుద్దేశంతోనే వస్తున్నారు. అటువంటప్పుడు సత్యోపదేశం కోసం వారి హృదయ కవాటాలు ఎలా తెరచుకుంటాయి?

112. ధర్మ పండితులకు, మతగురువులకు ఈ ఆయతు ఒక మందలింపు లాంటిది – మీ పరిసరాల్లోని చాలామంది దేవుని హద్దులను అతిక్రమిస్తూ, అవినీతికి పాల్పడుతూ, అక్రమ సంపాదనను ఆర్జిస్తూ ఉంటే మీరు నిర్లిప్తంగా ఎలా ఉంటున్నారు? మీ ఈ అనాసక్తత, నిర్లిప్తత క్షంతవ్యం కాని అలసత్వం కాదా? దీన్నిబట్టి సమాజంలోని మేధావులు, సంస్కర్తలు మంచిని పెంపొందించటంలో, చెడులను అరికట్టడంలో నిర్వర్తించవలసిన పాత్ర ఏమిటో అర్థమవుతోంది. హదీసులలో కూడా ఈ విషయం నొక్కి వక్కాణించబడింది.

وَقَالَتِ الْيَهُودُ يَدُ اللَّهِ مَغْلُولَةٌ ۚ غُلَّتْ أَيْدِيهِمْ
وَلُعِنُوا بِمَا قَالُوا ۘ بَلْ يَدَاهُ مَبْسُوطَتَانِ يُنفِقُ
كَيْفَ يَشَاءُ ۚ وَلَيَزِيدَنَّ كَثِيرًا مِّنْهُم مَّا
أُنزِلَ إِلَيْكَ مِن رَّبِّكَ طُغْيَانًا وَكُفْرًا ۚ وَأَلْقَيْنَا
بَيْنَهُمُ الْعَدَاوَةَ وَالْبَغْضَاءَ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ ۚ كُلَّمَا
أَوْقَدُوا نَارًا لِّلْحَرْبِ أَطْفَأَهَا اللَّهُ ۚ وَيَسْعَوْنَ
فِي الْأَرْضِ فَسَادًا ۚ وَاللَّهُ لَا يُحِبُّ الْمُفْسِدِينَ (64)

**64** “అల్లాహ్ చేతులు కట్టివేయబడి ఉన్నాయి”[113] అని యూదులు అన్నారు. నిజానికి వారి చేతులే కట్టివేయబడ్డాయి. వారు అన్న ఈ మాట మూలంగా వారిని శపించటం జరిగింది. నిజానికి అల్లాహ్ చేతులు రెండూ విశాలంగా ఉన్నాయి. తాను తలచుకున్న విధంగా ఆయన ఖర్చుపెడుతున్నాడు. నీపైన నీ ప్రభువు తరఫు నుంచి అవతరించిన సందేశం వారిలోని చాలా మందిలో తలబిరుసుతనాన్ని, తిరస్కారభావాన్నే వృద్ధి చేస్తుంది. ఇంకా, మేము వారి మధ్య ప్రళయదినం వరకూ విరోధం, విద్వేషం ఉండేలా చేశాము. వారు యుద్ధాగ్నిని రాజేసినప్పుడల్లా, అల్లాహ్ దాన్ని ఆర్పివేస్తాడు.[114] వారు భూమిలో కల్లోలాన్ని రేకెత్తిస్తూ తిరుగుతుంటారు.[115] కాగా; అల్లాహ్ కల్లోల జనకులను ఎంతమాత్రం ప్రేమించడు.

113. ఆలి ఇమ్రాన్ సూరా 181వ ఆయతులో చెప్పబడిన మాటలాంటిదే ఇది కూడా. అల్లాహ్ తన దాసులను తన మార్గంలో ఖర్చుపెట్టేందుకు ప్రోత్సహిస్తూ, అది అల్లాహ్‌కు ఇచ్చే ఉత్తమ రుణం అని అభివర్ణించినపుడు “అల్లాహ్ దరిద్రుడు” అని యూదులు వ్యాఖ్యానించారు. మరి చూడబోతే మనుషుల దగ్గర ఉన్నదంతా అల్లాహ్ ప్రసాదించినదే. అల్లాహ్ ప్రసాదించిన దానిలో నుంచి కొంతభాగం అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడం రుణం క్రిందికి రానేరాదు. అయినాసరే అల్లాహ్ దాన్ని ‘రుణం’గా అభివర్ణించి, దాని ప్రతిఫలం కూడా తన దాసునికి తిరిగి ఇస్తానని ప్రకటించాడు. ఇది దేవుని మహోన్నత కరుణాకటాక్షాలకు నిదర్శనం. ఎందుకంటే తన సొమ్మును తన దాసునికి ఇచ్చిందికాక, అతను ఖర్చుపెట్టేదానికి రుణం అని పేరుపెట్టి, మళ్లీ దాన్ని తిరిగి ఇస్తాననటం – అదీ అనేక రెట్లు పెంచి ఇస్తాననటం– దైవానికే చెల్లింది. ‘చేతులు కట్టివేయబడి ఉన్నాయి’ అంటే అర్థం నిజంగానే చేతులు బంధించబడ్డాయి అన్నది యూదుల ఉద్దేశం కాదు. ఖర్చుపెట్టకుండా, ఇవ్వకుండా చేతుల్ని కట్టిపడేసుకున్నాడు అని వారు చెప్పదలిచారు (ఇబ్నె కసీర్). నిజానికి చేతుల్ని కట్టిపడేసుకున్నది దేవుడు కాదు, యూదులే. వారు పిసినారితనంలో అగ్రగణ్యులు. అల్లాహ్ చేతులు ఎల్లప్పుడూ వదలుగానే ఉంటాయి. ఆయన యథేచ్ఛగా ఖర్చు పెడతాడు. తాను కోరినవారికి అపారంగా వొసగుతాడు. ఆయన అనుగ్రహానికి అవధుల్లేవు. భూమ్యాకాశాల ఖజానాలన్నీ ఆయన అధీనంలో ఉన్నాయి. తన సృష్టితాల అవసరాలు, అక్కరలన్నింటినీ ఆయనే తీరుస్తాడు. పగలయినా, రేయయినా, ఇంట్లో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా – సర్వకాల సర్వావస్థల్లో – మనకు అవసరమయ్యే వస్తు సామగ్రినంతటినీ సమకూర్చేవాడు ఆయనే. “మీరు ఏది అడిగినా ఆయన మీకు ప్రసాదించాడు. మీరు గనక అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే లెక్కించలేరు. నిజంగా మానవుడు అవివేకి, కృతఘ్నుడు” (ఇబ్రాహీమ్–34).

హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు : “అల్లాహ్ కుడిచెయ్యి నిండి ఉంది. రేయింబవళ్లు ఆయన ఖర్చుపెడుతూ ఉన్నా అందులో తరుగుదల ఉండదు. భూమ్యాకాశాలను నిర్మించినప్పటి నుంచీ ఆయన ఖర్చుపెడుతూనే ఉన్నాడు. కాని ఆయన చేతి ఖజానాలో ఎలాంటి లోటూ ఏర్పడలేదు........” (బుఖారీ – ముస్లిం).

114. అంటే వారు ఎప్పుడు మీపై కయ్యానికి కాలుదువ్వినా అల్లాహ్ దాన్ని వమ్ముచేస్తున్నాడు. వారి కుట్రను వారిపైనే రుద్దుతున్నాడు.

115. రాజ్యంలో అరాచకాన్ని, అవ్యవస్థను సృష్టించటం అనేది వారి మరో దురలవాటు. దేవుడు కల్లోల జనకులను ఇష్టపడడన్న సంగతి వారికి తెలియక కాదు, తెలుసు. కాని వారి గుణం మారదు.

**65** ఒకవేళ ఈ గ్రంథవహులే గనక విశ్వసించి, భయభక్తులతో కూడుకున్న (తఖ్వా) విధానాన్ని[116] అవలంబించినట్లయితే, మేము వారి పాపాలన్నింటినీ వారి నుంచి దూరంచేసి, సుఖ సౌఖ్యాలతో కూడుకున్న స్వర్గవనాలలో వారికి తప్పకుండా ప్రవేశం కల్పించేవారము.

وَلَوْ أَنَّ أَهْلَ الْكِتٰبِ اٰمَنُوْا وَاتَّقَوْا لَكَفَّرْنَا عَنْهُمْ سَيِّاٰتِهِمْ وَلَاَدْخَلْنٰهُمْ جَنّٰتِ النَّعِيْمِ ﴿65﴾

**66** వారు గనక తౌరాతుకూ, ఇంజీలుకూ, తమ ప్రభువు తరపున తమ వద్దకు పంపబడిన దానికి కట్టుబడి ఉంటే[117] వారు తమపై నుంచీ, క్రింది నుంచీ పుష్కలంగా ఉపాధిని పొందుతూ, హాయిగా తినేవారు.[118] వారిలో ఒక వర్గం మాత్రం మధ్యేమార్గం అవలంబిస్తుంది. కాని వారిలోని అత్యధికులు చేసే పనులు చాలా చెడ్డవి.[119]

وَلَوْ أَنَّهُمْ أَقَامُوا التَّوْرٰىةَ وَالْاِنْجِيْلَ وَمَآ أُنْزِلَ اِلَيْهِمْ مِّنْ رَّبِّهِمْ لَاَكَلُوْا مِنْ فَوْقِهِمْ وَمِنْ تَحْتِ اَرْجُلِهِمْ ؕ مِنْهُمْ اُمَّةٌ مُّقْتَصِدَةٌ ؕ وَكَثِيْرٌ مِّنْهُمْ سَآءَ مَا يَعْمَلُوْنَ ﴿66﴾

**67** ఓ ప్రవక్తా! నీ ప్రభువు తరపు నుంచి నీపై అవతరింప జేయబడిన దానిని (ప్రజలకు) అందజెయ్యి. ఒకవేళ నువ్వు గనక ఈ పని చెయ్యకపోతే, దైవప్రవక్తగా నీవు నీ ధర్మాన్ని నిర్వర్తించని వాడవవుతావు.[120] అల్లాహ్ నిన్ను ప్రజల (కీడు) నుంచి కాపాడుతాడు.[121] నిశ్చయంగా అల్లాహ్ తిరస్కారులకు సన్మార్గం చూపడు.

يٰۤاَيُّهَا الرَّسُوْلُ بَلِّغْ مَآ اُنْزِلَ اِلَيْكَ مِنْ رَّبِّكَ ؕ وَاِنْ لَّمْ تَفْعَلْ فَمَا بَلَّغْتَ رِسَالَتَهٗ ؕ وَاللّٰهُ يَعْصِمُكَ مِنَ النَّاسِ ؕ اِنَّ اللّٰهَ لَا يَهْدِى الْقَوْمَ الْكٰفِرِيْنَ ﴿67﴾

116. అంటే అల్లాహ్ కోరుకునే విధంగా వారు పరిపూర్ణ విశ్వాసులుగా నిరూపించుకుని, అంతిమ దైవప్రవక్త (సఅసం) దైవదౌత్యాన్ని వారు అంగీకరించి, పాపకార్యాలకు దూరంగా మసలుకుని ఉంటే – అంటే ముఖ్యంగా షిర్కు అనే మహాపరాధానికి ఒడిగట్టకుండా ఉన్నట్లయితే – అల్లాహ్ వారిని మన్నించి, స్వర్గ ప్రవేశానికి అర్హులుగా ఖరారుచేసేవాడు.

117. తౌరాతు, ఇంజీలు గ్రంథాలను అనుసరించటమంటే అర్థం ఆ గ్రంథాలలో ఇవ్వబడిన ఆదేశాలను, ఉపదేశాలను పాటించటం, వాటిలో అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించాలన్న అంశం కూడా ఉంది. **'వమా ఉంజిల'** (وَمَآ أُنْزِلَ) అంటే ఆకాశ గ్రంథాలన్నింటినీ విశ్వసించటమన్నమాట. వాటిలో దివ్య ఖుర్ఆన్ కూడా ఒకటి. మొత్తానికి వారు ఇస్లాం స్వీకరించాలన్నమాట!

118. పైనుంచి, క్రింది నుంచి ఉపాధిని పొందటమనే పదం అతిశయోక్తిగా ప్రయోగించబడింది. అంటే ఆకాశం నుంచి వర్షం కురవటం, భూముల్లో నుంచి పంటలు పుష్కలంగా పండటం అన్న భావంలో ఇలా అనబడింది. దివ్య ఖుర్ఆన్ లోనే మరోచోట ఈ విషయం మరో విధంగా చెప్పబడింది–"పురముల్లోని ప్రజలు విశ్వసించి, దైవభక్తి పరాయణులుగా మసలుకుని ఉన్నట్లయితే మేము వారికోసం భూమ్యాకాశాల శుభాల ద్వారాలను తెరచివేసేవారం"(అల్ ఆరాఫ్–96).

119. వారిలోని మెజారిటీ జనులు విశ్వాస మార్గాన్ని అవలంబించలేదు. వారు తమ తిరస్కార వైఖరిపై పాతుకుపోయారు. మహాప్రవక్త (సఅసం) దైవదౌత్యంపై వారు ఏమాత్రం సత్యబద్ధమైన వైఖరిని అవలంబించలేదు. తమ ఈ మంకుతనం, పెడసరి ధోరణినే ఇక్కడ చెడ్డ పనులుగా పేర్కొనటం జరిగింది. ఇక మధ్యేమార్గాన్ని అవలంబించే వర్గం అంటే అబ్దుల్లా బిన్ సలాం (రజి) తదితరులు అన్నమాట. అయితే వారి సంఖ్య 8, 9కి మించి లేదు. పూర్వం వారు యూదులుగా ఉండేవారు. తరువాత ఇస్లాం స్వీకరించారు.

**68** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: “ఓ గ్రంథవహులారా! మీరు తౌరాతునూ, ఇంజీలునూ, మీ ప్రభువు తరఫున మీ వద్దకు పంపబడిన దానినీ (మీ జీవితాలలో) నెలకొల్పనంతవరకూ మీరు ఏ ధర్మంపైనా లేనట్లే.” నీ ప్రభువు తరఫున నీపై అవతరింపజేయబడినది వారిలోని అనేకుల తలబిరుసుతనాన్ని, తిరస్కార వైఖరిని మరింత అధికం చేస్తుంది.[122] కనుక నీవు ఈ తిరస్కారులపై దిగులు చెందకు.

قُلْ يَٰٓأَهْلَ ٱلْكِتَٰبِ لَسْتُمْ عَلَىٰ شَىْءٍ حَتَّىٰ تُقِيمُوا۟
ٱلتَّوْرَىٰةَ وَٱلْإِنجِيلَ وَمَآ أُنزِلَ إِلَيْكُم مِّن رَّبِّكُمْ ۗ
وَلَيَزِيدَنَّ كَثِيرًا مِّنْهُم مَّآ أُنزِلَ إِلَيْكَ مِن
رَّبِّكَ طُغْيَٰنًا وَكُفْرًا ۖ فَلَا تَأْسَ عَلَى
ٱلْقَوْمِ ٱلْكَٰفِرِينَ ﴿٦٨﴾

120. అంటే (ఓ ప్రవక్తా!) మీపై అవతరింపజెయ్యబడే విషయాలన్నింటినీ నిర్భయంగా, హెచ్చుతగ్గులు లేకుండా మీరు జనులకు అందజెయ్యండి అని దేవుడు ఉపదేశిస్తున్నాడు. ఆయన (సఅసం) అలాగే చేశారు. అందుకే హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా అంటున్నారు: “దైవప్రవక్త (సఅసం) కొన్ని విషయాలను తెలుపకుండా దాచిపెట్టారు అని అనుమానించినవాడు అబద్ధం పలికాడు” (సహీహ్ బుఖారీ : 4855). అలాగే, “మీ దగ్గర ఖుర్ఆన్ గాకుండా ‘వహీ’ ద్వారా అందిన మరేదన్నా విషయం ఉందా?” అని హజ్రత్ అలీ (రజి)ని అడిగినప్పుడు ఆయన “లేద”ని ప్రమాణం చేసి మరీ చెప్పారు. ఆయన (రజి) ఇలా అన్నారు : “కాకపోతే నా దగ్గర ఖుర్ఆన్ అవగాహన ఉంది. ఈ అవగాహనా శక్తిని అల్లాహ్ తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు” (సహీహ్ బుఖారీ : 3 – 69). అంతిమ హజ్ యాత్ర సందర్భంగా దైవప్రవక్త (స) తన లక్షమంది లేదా లక్షా 40 వేలమంది సహచరుల సమూహాన్ని ఉద్దేశ్యించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు: “మీ అభిప్రాయం ఏమిటీ? నేను నా కర్తవ్యాన్ని నిర్వర్తించానా లేదా?” దీనికి సహచరులు, “తమరు దైవసందేశాన్ని అందజేశారనీ, కర్తవ్యాన్ని నిర్వర్తించారనీ, శ్రేయోభిలాషిగా మెలిగారనీ మేము సాక్ష్యమిస్తున్నాము” అని ముక్త కంఠంతో బదులిచ్చారు. ఆయన (స) ఆకాశం వైపు వ్రేలితో సంజ్ఞ చేస్తూ, “ఓ అల్లాహ్! దీనికి నువ్వే సాక్షివి” అని మూడుసార్లు పలికారు. (సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్ – బాబు హజ్జతిన్నబీ సల్లల్లాహు అలైహి వ సల్లం).

121. అల్లాహ్ తన అద్భుత శక్తి ద్వారానూ, ప్రాపంచిక కారకాల ద్వారానూ తన సందేశహరుణ్ణి ఎల్లప్పుడూ దుష్టశక్తుల బారినుంచి కాపాడుతూ ఉండేవాడు. ప్రాపంచికంగా చూస్తే – ఆయన (స) పినతండ్రి అయిన అబూ తాలిబ్ హృదయంలో ఆయన (స) పట్ల అమితమైన అవ్యాజానురాగాలను పొందుపరచాడు. అబూ తాలిబ్ ఒక వైపు సత్యతిరస్కారిగా ఉంటూనే, మరోవైపు దైవప్రవక్త (స)కు అండగా నిలబడ్డారు. ఇది కూడా బహుశా దైవలీల అయి ఉండవచ్చు. బహుశా ఆయన గనక ఇస్లాం స్వీకరించి ఉంటే ఖురైష్ సర్దారులు ఆయన్ని కూడా వెలివేసేవారేమో! అబూ తాలిబ్ చనిపోయిన తరువాత కొంతమంది ఖురైషు నాయకుల ద్వారా, మదీనా అన్సార్ల ద్వారా అల్లాహ్ ఆయన (స)కు తోడ్పాటునందజేశాడు. ఎట్టకేలకు ఈ 67వ ఆయతు అవతరించింది. ఆ రోజు నుంచీ ఆయన (స) తనకు రక్షణగా, పహరాగా ఎవరూ ఉండనవసరం లేదని చెప్పేశారు. ఆ తరువాత కూడా ఎన్నో సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ దేవుడు తన ప్రవక్తను దుర్మార్గుల నుంచి కాపాడాడు. యూదులు తమ కుట్రలు, కుతంత్రాల ద్వారా ఆయన (స)కు అపకారం తలపెట్టబోయినప్పుడల్లా దేవుడు ‘వహీ’ ద్వారా కుట్రలను బయటపెట్టాడు. హోరాహోరీ పోరాటాలలో సయితం అవిశ్వాసుల దాడి నుంచి ఆయన్ని రక్షించాడు.

122. ఇది దైవ సంప్రదాయం. సన్మార్గం ప్రాప్తించటమైనా, అపమార్గం లభించటమైనా – అది మనిషి చేసే కొన్ని పనులపై కూడా ఆధారపడి ఉంటుంది. కొన్ని మంచి పనుల మూలంగా మనిషి విశ్వాసంలో, సద్వర్తనలో, సద్బుద్ధిలో, శ్రేయోదాయకమైన పరిజ్ఞానంలో వృద్ధి జరుగుతుంది. అలాగే మరికొన్ని దుష్కార్యాల మూలంగా అవిశ్వాసంలో, తలబిరుసుతనంలో వృద్ధి కనిపిస్తుంది. ఈ అంశాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఎన్నోచోట్ల ప్రస్తావించాడు. ఉదాహరణకు: 1. “ఈ ఖుర్ఆన్ విశ్వాసులకు మార్గదర్శకం మరియు స్వస్థత చేకూర్చేది. కాని విశ్వసించని వారి చెవులకు చెవుడు

**69** ముస్లిములైనా, యూదులైనా, సాబియీలైనా, నసారా (క్రైస్తవులు) అయినా–ఎవరయినా సరే–వారు గనక అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించి, సదాచరణ చేసినట్లయితే వారి కెలాంటి భయంగానీ, చింతగానీ ఉండబోదు.[123]

إِنَّ الَّذِينَ آمَنُوا وَالَّذِينَ هَادُوا وَالصَّابِئُونَ
وَالنَّصَارَىٰ مَنْ آمَنَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ وَعَمِلَ
صَالِحًا فَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٦٩﴾

**70** మేము ఇస్రాయీలు సంతతి వారి నుండి గట్టి వాగ్దానం తీసుకున్నాము. వారి వద్దకు ప్రవక్తలను పంపాము. కాని వారి మనోభీష్టానికి విరుద్ధమైన ఆదేశాలను ప్రవక్తలు వారి వద్దకు తీసుకువచ్చినప్పుడల్లా వారు ప్రవక్తలలో కొందరిని ధిక్కరించారు, మరికొందరిని హత్య చేస్తూ ఉన్నారు.

لَقَدْ أَخَذْنَا مِيثَاقَ بَنِي إِسْرَائِيلَ وَأَرْسَلْنَا
إِلَيْهِمْ رُسُلًا ۖ كُلَّمَا جَاءَهُمْ رَسُولٌ بِمَا
لَا تَهْوَىٰ أَنْفُسُهُمْ فَرِيقًا كَذَّبُوا وَفَرِيقًا
يَقْتُلُونَ ﴿٧٠﴾

**71** తమకు ఏ ఉపద్రవమూ సంభవించదని వారు తలపోశారు. ఈ కారణంగా వారు గుడ్డివారుగా, చెవిటివారుగా ప్రవర్తించారు. అయితే ఆ తరువాత అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. కాని ఆ తరువాత కూడా వారిలో చాలామంది అంధులు, బధిరులు అయిపోయారు.[124] అల్లాహ్ వారి చేష్టలన్నింటినీ చూస్తూనే ఉన్నాడు.

وَحَسِبُوا أَلَّا تَكُونَ فِتْنَةٌ فَعَمُوا وَصَمُّوا
ثُمَّ تَابَ اللَّهُ عَلَيْهِمْ ثُمَّ عَمُوا وَصَمُّوا
كَثِيرٌ مِنْهُمْ ۚ وَاللَّهُ بَصِيرٌ بِمَا يَعْمَلُونَ ﴿٧١﴾

**72** "అల్లాహ్ (అంటే) మర్యమ్ కుమారుడగు మసీహ్‌యే"[125] అని చెప్పినవారు నిస్సందేహంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. యదార్థానికి మసీహ్ ఖుద్దుగా వారితో ఇలా పలికాడు : "ఓ ఇస్రాయీలు వంశస్థులారా! నాకూ, మీకూ ప్రభువైన అల్లాహ్‌ను

لَقَدْ كَفَرَ الَّذِينَ قَالُوا إِنَّ اللَّهَ هُوَ الْمَسِيحُ
ابْنُ مَرْيَمَ ۖ وَقَالَ الْمَسِيحُ يَا بَنِي إِسْرَائِيلَ
اعْبُدُوا اللَّهَ رَبِّي وَرَبَّكُمْ ۖ إِنَّهُ مَنْ يُشْرِكْ بِاللَّهِ

ఉంది. వారి కళ్ళకు ఇది గంత" (హామీమ్ అస్సజ్దహ్ – 44). 2. "విశ్వాసులకు స్వస్థతను, కారుణ్యాన్ని చేకూర్చే విషయాలను మేము ఈ ఖుర్‌ఆనులో అవతరింపజేస్తున్నాము. అయితే పాపాత్ములకు వాటి ద్వారా నష్టం తప్ప మరొకటి వృద్ధి అవదు" (బనీ ఇస్రాయీల్ – 82).

123. ఈ విషయం అల్ బఖరా సూరాలోని 62వ ఆయతులో కూడా వచ్చింది. గమనించగలరు.

124. తమకెలాంటి శిక్ష పడదని వారనుకున్నారు. కాని దైవ సంప్రదాయం ప్రకారం వారిపై ఒక ఆపద వచ్చిపడింది. అదేమిటంటే, సత్యాన్ని పరికించే విషయంలో వారు మరింత అంధులైపోయారు. సత్య సందేశం వారి కర్ణపుటాలకు తాకలేదు. అప్పుడు వారు అల్లాహ్ వైపుకు మరలి, పశ్చాత్తాపం చెందగా అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. వారికి ఒక అవకాశం ఇచ్చాడు. కాని ఆ అవకాశాన్ని కూడా వారిలోని చాలామంది సద్వినియోగం చేసుకోలేదు. ఫలితంగా మళ్ళీ వారిపై దైవశిక్ష విరుచుకుపడింది.

125. ఇంతకు ముందు 17వ ఆయతులో కూడా ఈ విషయం చెప్పబడింది. గ్రంథవహుల మార్గవిహీనత ప్రస్తావనకు రావటం వల్ల మరోసారి ఈ విషయం పునరావృతమయింది. ఏసును దేవుడుగా తలపోస్తున్న క్రైస్తవ వర్గంవారి అతివాదం ఇక్కడ ఖండించబడింది.

فَقَدْ حَرَّمَ اللّٰهُ عَلَيْهِ الْجَنَّةَ وَمَاْوٰىهُ النَّارُ ۭ وَمَا لِلظّٰلِمِيْنَ مِنْ اَنْصَارٍ ﴿72﴾

మాత్రమే పూజించండి."[126] ఎవడు అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను కల్పించాడో అలాంటి వానికోసం అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడని తెలుసుకోండి. అతని నివాసం నరకాగ్ని. దుర్మార్గులకు సహాయపడే వాడెవడూ ఉండడు.[127]

لَقَدْ كَفَرَ الَّذِيْنَ قَالُوْٓا اِنَّ اللّٰهَ ثَالِثُ ثَلٰثَةٍ ۘ وَمَا مِنْ اِلٰهٍ اِلَّآ اِلٰهٌ وَّاحِدٌ ۭ وَاِنْ لَّمْ يَنْتَهُوْا عَمَّا يَقُوْلُوْنَ لَيَمَسَّنَّ الَّذِيْنَ كَفَرُوْا مِنْهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿73﴾

**73** "అల్లాహ్ ముగ్గురిలో మూడవవాడు" అని అన్నవారు కూడా ముమ్మాటికీ తిరస్కారానికి (కుఫ్రుకు) పాల్పడినట్లే.[128] వాస్తవానికి ఒక్కడైన అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేడు. ఒకవేళ వారు గనక తమ ఈ మాటలను మానుకోకపోతే, వారిలో తిరస్కారవైఖరిపై ఉండే వారికి బాధాకరమైన శిక్ష తప్పకుండా అంటుకుంటుంది.

اَفَلَا يَتُوْبُوْنَ اِلَى اللّٰهِ وَ يَسْتَغْفِرُوْنَهٗ ۭ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿74﴾

**74** వారు అల్లాహ్ వైపునకు మరలరా? క్షమాపణ కోసం ఆయన్ని వేడుకోరా? అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు కూడా.

126. మర్యమ్ కుమారుడగు మసీహ్ (ఏసు) పాలు తాగుతున్న పసితనంలోనే మాట్లాడటం మొదలుపెట్టి, అన్నిటికన్నా ముందు తాను 'దేవుని దాసుణ్ణి' అని ప్రకటించాడు (సాధారణంగా రెండేళ్లకన్నా తక్కువ వయసులో ఉన్న పసిపిల్లలు మాట్లాడలేరు). ఆయన (ఏసు) ఇలా అన్నారు : "నేను అల్లాహ్ దాసుడను, ఆయన ప్రవక్తను. ఆయన నాకు గ్రంథాన్ని కూడా వొసగాడు" (మర్యమ్ – 30). అంటే తాను దేవుని దాసుణ్ణి అని ఆయన నొక్కి వక్కాణించారు. పెద్దవారయిన తర్వాత కూడా ఆయన తన జాతి వారికి ఈ సందేశమే యిచ్చారు. ఆయన (ఏసు) ఇలా అన్నారు: "నిశ్చయంగా అల్లాహ్ నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. కాబట్టి మీరంతా ఆయన దాస్యమే చేయండి. ఇదే రుజుమార్గం" (ఆలి ఇమ్రాన్ : 51). తల్లి ఒడిలో ఉన్నప్పుడు ఆయన చెప్పింది కూడా యిదే (చూడండి : మర్యమ్ సూరా 36వ వచనం). ప్రళయదినానికి ముందు ఆయన దివి నుంచి భువికి దిగివచ్చినప్పుడు కూడా ప్రపంచ మానవాళిని దేవుని ఏకత్వం మరియు దైవారాధన వైపుకే పిలుస్తారుగాని తనను పూజించమని చెప్పరు. ఈ విషయం సహీహ్ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. ముస్లిం విద్వాంసులందరి మధ్యా ఈ విషయంపై ఏకాభిప్రాయం ఉంది.

127. దైవప్రవక్త ఏసు(ఈసా అలైహిస్సలాం) పాలు త్రాగే వయసులోనే తాను దేవుని దాసుణ్ణి, దేవుని ప్రవక్తను అని చెప్పటమేగాక, పెద్దయిన తర్వాత కూడా ఇదే ప్రకటన చేశారు. దాంతో పాటు షిర్క్ (బహుదైవారాధన)ను ఖండించారు. షిర్క్ యొక్క భయంకరమైన పర్యవసానాన్ని కూడా స్పష్టపరిచారు. షిర్క్ మూలంగా నరకంలోకి నెట్టివేయబడినవాణ్ణి బయటికి తీసేవాడెవడూ ఉండడని హెచ్చరించారు.

128. క్రైస్తవుల్లోని ఇంకొక వర్గంవారి గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. వారు "త్రిత్వం" పై విశ్వాసం కలిగి ఉండేవారు. దీనికోసం వారు యిచ్చిన నిర్వచనంపై స్వయంగా వారిలోనే విభేదాలున్నాయి. మొత్తానికి వీరు అల్లాహ్‌తోపాటు మరో యిద్దరికి – అంటే ఈసా (అలైహిస్సలాం)ను, ఆయన తల్లి మర్యమ్ (అలైహస్సలాం)ను కూడా దైవాలుగా కొలిచారు. కాని ఈ మేరకు ఈసా (అలైహిస్సలాం) ఎన్నడూ చెప్పలేదు. ఆ విషయమే ఖుర్ఆన్ ఈ విధంగా వివరించింది. తీర్పుదినాన సర్వలోక ప్రభువగు అల్లాహ్ హజ్రత్ ఈసా (ఏసు) నుద్దేశించి ఇలా అడుగుతాడు: "మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! అల్లాహ్‌ను వదలి నన్నూ, నా తల్లిని దైవాలుగా చేసుకోండి అని నువ్వు జనులతో

**75** మర్యమ్ కుమారుడైన మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. ఆయనకు మునుపు కూడా ఎంతోమంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి సద్వర్తనురాలు.[129] ఆ తల్లీ కొడుకులిరువురూ అన్నం తినేవారే.[130] చూడు, మేము వారి ముందు ఏ విధంగా నిదర్శనాలను విశదీకరిస్తున్నామో! అయినా వారు ఎలా తిరిగి పోతున్నారో చూడు!

مَا الْمَسِيحُ ابْنُ مَرْيَمَ إِلَّا رَسُولٌ قَدْ خَلَتْ
مِنْ قَبْلِهِ الرُّسُلُ ۖ وَأُمُّهُ صِدِّيقَةٌ ۖ
كَانَا يَأْكُلَانِ الطَّعَامَ ۗ انْظُرْ كَيْفَ نُبَيِّنُ
لَهُمُ الْآيَاتِ ثُمَّ انْظُرْ أَنَّىٰ يُؤْفَكُونَ ﴿٧٥﴾

**76** వారితో ఇలా చెప్పు : ఏమిటీ, మీరు అల్లాహ్‌ను కాదని మీకు నష్టంగానీ, లాభంగానీ చేకూర్చే అధికారం లేని వారిని ఆరాధిస్తున్నారా? అల్లాహ్ మాత్రమే అన్నీ వినేవాడు, సర్వమూ తెలిసినవాడు.[131]

قُلْ أَتَعْبُدُونَ مِنْ دُونِ اللَّهِ مَا لَا يَمْلِكُ
لَكُمْ ضَرًّا وَلَا نَفْعًا ۚ وَاللَّهُ هُوَ السَّمِيعُ
الْعَلِيمُ ﴿٧٦﴾

**77** ఇలా చెప్పేయి : "ఓ గ్రంథవహులారా! మీరు మీ ధర్మంలో అన్యాయంగా హద్దులు మీరకండి.[132] పూర్వం తాము మార్గం నుంచి తప్పడమేగాక, ఎంతో మందిని మార్గం నుంచి తప్పించి రుజుమార్గ భ్రష్టులైనవారి మనోవాంఛలను అనుసరించకండి."[133]

قُلْ يَا أَهْلَ الْكِتَابِ لَا تَغْلُوا فِي دِينِكُمْ
غَيْرَ الْحَقِّ وَلَا تَتَّبِعُوا أَهْوَاءَ قَوْمٍ قَدْ
ضَلُّوا مِنْ قَبْلُ وَأَضَلُّوا كَثِيرًا وَضَلُّوا
عَنْ سَوَاءِ السَّبِيلِ ﴿٧٧﴾

---

చెప్పావా?" (అల్ మాయిద – 116). ప్రశ్నించే ఈ తీరునుబట్టి బోధపడేదేమిటంటే ఏసును, ఆయన తల్లిని కూడా క్రైస్తవులు దైవాలుగా తలపోశారు. వారి దృష్టిలో అల్లాహ్ మూడవవాడు. ఏసును దేవుడుగా నమ్మినవారు అవిశ్వాసానికి పాల్పడినట్లే, ముగ్గురిలో మూడవవాడు అల్లాహ్ అనే 'త్రిత్వం' భావనను కలిగి ఉన్నవారు కూడా అవిశ్వాసానికి ఒడిగట్టారు.

129. అరబీలో మర్యమ్ నుద్దేశించి **'సిద్దీఖతున్' (صِدِّيقَةٌ)** అని అనటం జరిగింది. సిద్దీఖతున్ అంటే విశ్వాసురాలు, భక్తురాలు అన్న అర్థాలు వస్తాయి. ఆమెగారు సయితం ఈసాను దైవప్రవక్తగా విశ్వసించటమే గాక, ఆయన ఇచ్చే సందేశాన్ని సత్యమని ధృవీకరించారు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ఆమెగారు దైవప్రవక్తల కోవకు చెందినవారు కారు. కొంతమంది హజ్రత్ మర్యమ్‌తోపాటు ఇస్హాఖ్ (అలైహిస్సలాం) తల్లి అయిన హజ్రత్ సారాను, హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తల్లిని కూడా దైవప్రవక్తలుగా తలపోశారు. వారి ఈ తలంపు సరైంది కాదు. వారు తమ తలంపుకు ఆధారాలు కూడా పేర్కొన్నారు. హజ్రత్ మర్యమ్‌తోనూ, హజ్రత్ సారాతోనూ దైవదూతలు మాట్లాడారనీ, హజ్రత్ మూసా తల్లిగారి వద్దకు దేవుడు స్వయంగా వహీ పంపాడని, అందువల్ల ఈ ముగ్గురినీ దైవప్రవక్తలుగా భావించవచ్చన్నది వీరి వాదన. అయితే అత్యధిక మంది విద్వాంసుల దృష్టిలో ఈ వాదన అత్యంత బలహీనమైనది. పైగా ఇది, "మేము పంపిన ప్రవక్తలంతా పురుషులే" (యూసుఫ్ – 109) అన్న దైవవాక్కుకు విరుద్ధంగా ఉంది. అందువల్ల ఈ వాదన పరిగణనలోకి తీసుకోదగ్గది కాదు.

130. ప్రవక్త ఏసుగానీ, మర్యమ్‌గానీ దేవుళ్లు కారనడానికి, వారు మానవులు మాత్రమేనని చెప్పటానికి ఇది ప్రబల తార్కాణం. ఎందుకంటే అన్నపానీయాలు మానవ అవసరాలు. దేవుడైన వాడు ఇలాంటి అక్కరలకు అతీతుడై ఉంటాడు.

131. బహు దైవారాధకుల అవివేకాన్ని, అమాయకత్వాన్ని యిక్కడ ఎత్తి చూపటం జరిగింది. ఎందుకంటే వారు తమకు ఏమాత్రం లాభనష్టాలు చేకూర్చలేని వస్తువులను, వ్యక్తులను ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు. లాభనష్టాల సంగతి

**78** ఇస్రాయీలు సంతతిలోని అవిశ్వాసులు దావూదు నోట, మర్యమ్ పుత్రుడైన ఈసా నోట శపించబడ్డారు.[134] ఎందుకంటే వారు అవిధేయతకు పాల్పడేవారు. హద్దుమీరి ప్రవర్తించేవారు.[135]

لُعِنَ الَّذِينَ كَفَرُوا مِن بَنِي إِسْرَائِيلَ عَلَىٰ لِسَانِ دَاوُودَ وَعِيسَى ابْنِ مَرْيَمَ ۚ ذَٰلِكَ بِمَا عَصَوا وَّكَانُوا يَعْتَدُونَ ﴿٧٨﴾

**79** వారు, తాము చేసే చెడు పనుల నుండి ఒండొకరిని నిరోధించేవారు కారు.[136] వారు చేస్తూ ఉండినది బహుచెడ్డది.

كَانُوا لَا يَتَنَاهَوْنَ عَن مُّنكَرٍ فَعَلُوهُ ۚ لَبِئْسَ مَا كَانُوا يَفْعَلُونَ ﴿٧٩﴾

అలా ఉంచండి, కనీసం తమను మొరపెట్టుకునే వారి మొరలను ఆలకించే, వారి మనోరథాన్ని తెలుసుకునే శక్తి కూడా వాటికి (వారికి) లేదు. ఈ శక్తి ఒక్క అల్లాహ్‌కే స్వంతం. అందుకే కష్టాల నుంచి గట్టెక్కించేవాడు, అక్కరలను తీర్చేవాడు అల్లాహ్ మాత్రమే.

132. అంటే సత్యాన్ని నమ్మి నడుచుకునే విషయంలో హద్దుమీరి ప్రవర్తించరాదని భావం. దేన్ని ఏ మేరకు ఆచరించమని అనబడిందో ఆ మేరకే ఆచరించాలి. ధర్మంలో ఏ వస్తువుకు ఏ స్థాయి ఉందో దాన్ని ఆ స్థానంలోనే ఉంచాలి. భక్తి విశ్వాసాలలో అవధులు మీరి దైవదౌత్యాన్ని, దైవప్రవక్తను దైవత్వపు స్థానంలో ప్రతిష్ఠించటం ఎంతమాత్రం తగదు. కాని గ్రంథవహులైన మీరు (క్రైస్తవులు) దైవప్రవక్త ఈసా (ఏసు – అలైహిస్సలాం)ను ఏకంగా దైవత్వపు స్థానంలో కూర్చోబెట్టి ధర్మంలో అతిశయిల్లారు. హద్దుమీరి ప్రవర్తించారు. ఈ 'అతివాదం' అన్ని కాలాలూ, అన్ని యుగాల్లోనూ షిర్కుకు, అపమార్గానికి ద్వారం తెరిచింది. సాధారణంగా మనిషి తాను నమ్మేవారిని గాఢంగా ప్రేమిస్తాడు. ఈ ప్రేమ ఒక్కోసారి శృతి మించి రాగాన పడుతుంది. తమ మధ్యన ఉన్న ఇమామును, నాయకుణ్ణి, గురువును కూడా పైగంబరుల మాదిరిగా పరమ పునీతులుగా తలపోస్తాడు. అందుకే వారిని విమర్శకు అతీతులుగా భావిస్తాడు. దురదృష్టవశాత్తూ ఈ 'అతివాదం' ముస్లిం సమాజంలోనూ జొరబడింది. వారు కొంతమంది ఇమాముల పట్ల గల అభిమానంలో అతిశయిల్లి వారి అభిప్రాయాలను, తీర్పులను, ఇజ్తెహాద్‌ను శిరోధార్యంగా తీసుకోవటమేగాక వాటికి దైవప్రవక్త (సఅసం) ప్రవచనాలకన్నా ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఆపాదించారు. మితిమీరి ప్రవర్తించటంలో ఇది కూడా ఒక భాగమే.

133. అంటే ధర్మావలంబన విషయంలో మీరు మీ పూర్వీకుల అడుగుజాడల్లో నడవకండి. ఒక దైవప్రవక్తను సరాసరి దేవునిగా చేసేసి, తాము దారి తప్పింది గాక, ఇతరులను సయితం పెడత్రోవ పట్టించే వారు మీకు మార్గదర్శకులెలా అవుతారు?

134. అంటే జబూర్ గ్రంథం హజ్రత్ దావూదు (అలైహిస్సలాం)పై, బైబిలు గ్రంథం హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) పై అవతరింపజెయ్యబడినపుడు ఈ విధంగా శపించటం జరిగింది. ఇప్పుడు అంతిమ దైవప్రవక్త (స)పై అవతరింప జెయ్యబడిన దివ్య ఖుర్‌ఆన్‌లో కూడా అవిశ్వాసులు ఇదేవిధంగా శపించబడ్డారు. శాపం అంటే దైవ కారుణ్యానికి, శ్రేయోసాఫల్యాలకు దూరంగా ఉంచటం అని భావం.

135. ఈ శాపానికి కారణాలు రెండు. ఒకటి : అల్లాహ్ విధించిన వాటిని నెరవేర్చకుండా ఉండటం. హరామ్ (నిషిద్ధ) విషయాల వెనుకపడటం. రెండు: ధర్మం విషయంలో అతిశయిల్లటం. లేనిపోని వాటిని ధర్మంలో జొప్పించి, దాని రూపురేఖలను మార్చి వేయటం.

136. అంతేకాదు, వారికి సమాజంలో ప్రబలుతున్న చెడుల పట్ల ఏ మాత్రం బాధ ఉండేది కాదు. ఎందుకంటే వారు స్వయంగా చెడుల ఊబిలో కూరుకుని ఉండేవారు. చెడుల నుంచి ఆపే పనిచేయకపోవటం వారి పాలిట శాపంగా పరిణమించిందని పండితులు వ్యాఖ్యానించారు. చెడు తమ కళ్ల ముందరే జరుగుతున్నా, దాన్ని అడ్డుకోకుండా చూసీ చూడనట్లుగా ప్రవర్తించటం చాలా పెద్దనేరం. ఇది దైవాగ్రహానికి కారణభూతమవుతుంది. హదీసులో కూడా ఈ అపరాధానికి ఒడిగట్టిన వారిని గట్టిగా హెచ్చరించటం జరిగింది. ఒక హదీసులో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: ఇస్రాయీల్ సంతతివారిలో ప్రవేశించిన ప్రప్రథమ చెడుగు ఏమిటంటే ఒకవ్యక్తి చెడుకు పాల్పడుతుండగా మరో వ్యక్తి చూసి, "దైవానికి భయపడు. ఈ చెడు పనిని మానెయ్యి" అని చెబుతాడు. కాని ఆ

**80** వారిలో చాలామందిని నీవు చూస్తావు, వారు అవిశ్వాసులతో స్నేహసంబంధాలు పెట్టుకుంటారు. వారు తమ స్వయం కోసం ఏదయితే ముందుకు పంపుకున్నారో అది చాలా చెడ్డది. అందుకే అల్లాహ్ వారిపట్ల అప్రసన్నుడయ్యాడు. వారు కలకాలం శిక్షలో పడి ఉంటారు.[137]

تَرَىٰ كَثِيرًا مِّنْهُمْ يَتَوَلَّوْنَ الَّذِينَ كَفَرُوا ۚ لَبِئْسَ
مَا قَدَّمَتْ لَهُمْ أَنفُسُهُمْ أَن سَخِطَ اللَّهُ
عَلَيْهِمْ وَفِي الْعَذَابِ هُمْ خَالِدُونَ ﴿٨٠﴾

**81** వారికి అల్లాహ్ పట్ల, ప్రవక్త పట్ల, ప్రవక్తపై అవతరింప జేయబడిన దానిపట్ల విశ్వాసమే గనక ఉంటే వారు అవిశ్వాసులను స్నేహితులుగా చేసుకునేవారే కాదు. కాని వారిలో చాలా మంది దైవవిధేయతకు దూరమై పోయారు.[138]

وَلَوْ كَانُوا يُؤْمِنُونَ بِاللَّهِ وَالنَّبِيِّ وَمَا أُنزِلَ
إِلَيْهِ مَا اتَّخَذُوهُمْ أَوْلِيَاءَ وَلَٰكِنَّ كَثِيرًا
مِّنْهُمْ فَاسِقُونَ ﴿٨١﴾

**82** విశ్వాసుల పట్ల శత్రుత్వంలో అందరికన్నా ఎక్కువగా కరడు గట్టినవారు యూదులు మరియు ముష్రిక్కులని నీవు తెలుసుకుంటావు.[139] ఇక విశ్వాసులతో స్నేహం విషయానికి వస్తే "మేము సహాయకులం (నసారా లేక క్రైస్తవులం)" అని చెప్పుకునే వారిని నీవు ఎక్కువ సన్నిహితులుగా చూస్తావు. ఎందుకంటే వారిలో పండితులు, భవబంధాలకు దూరంగా ఉండే మతాచార్యులు ఉన్నారు.[140] ఇంకో విషయం ఏమిటంటే వారు అహంకారం చూపరు.

لَتَجِدَنَّ أَشَدَّ النَّاسِ عَدَاوَةً لِّلَّذِينَ
آمَنُوا الْيَهُودَ وَالَّذِينَ أَشْرَكُوا ۖ وَلَتَجِدَنَّ
أَقْرَبَهُم مَّوَدَّةً لِّلَّذِينَ آمَنُوا الَّذِينَ قَالُوا
إِنَّا نَصَارَىٰ ۚ ذَٰلِكَ بِأَنَّ مِنْهُمْ قِسِّيسِينَ
وَرُهْبَانًا وَأَنَّهُمْ لَا يَسْتَكْبِرُونَ ﴿٨٢﴾

మరునాడే చెడుకు పాల్పడిన ఆ వ్యక్తితో కలసి కూర్చోవటానికి, అతనితో కలసి తినడానికి, త్రాగడానికి ఏమాత్రం సిగ్గుపడడు. మరి వాస్తవానికి అతను దాన్ని అసహ్యించుకోవాల్సింది, అతనికి దూరంగా ఉండాల్సింది. ఈమాన్ (విశ్వాసం) కోరేది కూడా ఇదే. వారి ఈ ద్వంద్వ స్వభావం మూలంగా అల్లాహ్ వారి మధ్య వైమనస్యాన్ని సృష్టించాడు. కడకు వారు దైవాగ్రహానికి పాత్రులయ్యారు." తరువాత ఆయన (స) ఇలా అన్నారు : "దైవసాక్షి! మీరు తప్పకుండా ప్రజలకు మంచిని గురించి ఆదేశించండి. చెడుల నుంచి వారించండి. దుర్మార్గుని చేయి పట్టుకోండి (లేకపోతే మీకూ అదే గతి పడుతుంది)" (అబూ దావూద్ : కితాబుల్ మలాహిమ్-4336). ఈ విద్యుక్త ధర్మాన్ని గనక పరిత్యజిస్తే దైవ శిక్షకు గురికావలసి వస్తుందని, ఆ తరువాత దైవాన్ని వేడుకున్నా వేడుకోళ్లు స్వీకారయోగ్యం కాజాలవని వేరొక ఉల్లేఖనంలో చెప్పబడింది (ముస్నదె అహ్మద్ – సంపుటి : 5; పేజీ – 388).

137. ఇది అవిశ్వాసులతో చేసిన స్వార్థపూరిత చెలిమికి లభించిన పర్యవసానం. వారి ఈ వైఖరికి దేవుడు ఆగ్రహించాడు. ఈ ఆగ్రహం వారి నరక శిక్షకు ప్రధాన కారణమయింది.

138. దీని భావమేమిటంటే మనోక్షేత్రంలో విశ్వాస (ఈమాన్) విత్తనం నాటుకున్నవారు అవిశ్వాసులతో ఎన్నడూ చెలిమి చెయ్యరు.

139. ఎందుకంటే యూదులలో అసూయాద్వేషాలు అధికం. వారు నిత్యం సత్యం పట్ల వైముఖ్య ధోరణిని ప్రదర్శిస్తారు. అహంకారంతో మత ప్రబోధకులను, విద్వాంసులను అగౌరవపరుస్తారు. అందుకే దైవప్రవక్తల్ని సయితం ధిక్కరించే, హతమార్చే ప్రవృత్తి వారిలో ప్రబలింది. ఆఖరికి వారు అంతిమ దైవప్రవక్త (సఅసం)ను సయితం హత్య చేసేందుకు అనేకసార్లు కుట్రపన్నారు. ఆయన (స)పై చేతబడి చేశారు. రకరకాలుగా ఆయన (స) లక్ష్యానికి అవరోధం కల్పించే నీచ ప్రయత్నాలు చేశారు. ఈ విషయంలో ముష్రిక్కులు కూడా దాదాపు ఇదేవిధంగా వ్యవహరించారు.

**83** ప్రవక్తపై అవతరించిన దానిని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళ నుంచి కన్నీరు ప్రవహించటం నీవు గమనిస్తావు. వారిలా అంటారు: “మా ప్రభూ! మేము విశ్వసించాము. కాబట్టి మా పేర్లను కూడా ధృవీకరించేవారితో పాటు వ్రాసుకో.

وَإِذَا سَمِعُوا مَا أُنزِلَ إِلَى الرَّسُولِ تَرَىٰ
أَعْيُنَهُمْ تَفِيضُ مِنَ الدَّمْعِ مِمَّا عَرَفُوا مِنَ الْحَقِّ ۖ
يَقُولُونَ رَبَّنَا آمَنَّا فَاكْتُبْنَا مَعَ الشَّاهِدِينَ (83)

**84** “మేము అల్లాహ్‌ను, మా వద్దకు వచ్చిన సత్యాన్ని విశ్వసించ కుండా ఉండటానికి ఇక మా వద్ద మిగిలిన సాకు ఏముంది? మా ప్రభువు మమ్మల్ని సజ్జనుల సహచర్యంలో చేరుస్తాడన్న ఆశ మాకుంది.”[141]

وَمَا لَنَا لَا نُؤْمِنُ بِاللَّهِ وَمَا جَاءَنَا مِنَ الْحَقِّ
وَنَطْمَعُ أَن يُدْخِلَنَا رَبُّنَا مَعَ الْقَوْمِ الصَّالِحِينَ (84)

**85** వారు ఈ విధంగా పలికినందుకుగాను అల్లాహ్ వారికి క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలను ప్రసాదిస్తాడు. వారందులో కలకాలం ఉంటారు. సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలమే లభిస్తుంది.

فَأَثَابَهُمُ اللَّهُ بِمَا قَالُوا جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا
الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا ۚ وَذَٰلِكَ جَزَاءُ الْمُحْسِنِينَ (85)

**86** ఇకపోతే తిరస్కార వైఖరికి పాల్పడి, మా ఆయతులను ధిక్కరించేవారు – వారే నరకవాసులు.

وَالَّذِينَ كَفَرُوا وَكَذَّبُوا بِآيَاتِنَا أُولَٰئِكَ أَصْحَابُ
الْجَحِيمِ (86)

140. అరబీలో **‘రుహ్బాన్’ (رُهْبَان)** అనబడింది. రుహ్బాన్ అంటే ఆరాధనాపరులు. ఏకాంత కుహరాల్లో దైవధ్యానం చేసుకునే వారని భావం. **‘ఖిస్సీసీన్’ (قِسِّيسِين)** అంటే పండితులు, ప్రబోధకులు అని అర్థం. క్రైస్తవుల్లోని ఈ మతాచార్యులలో ధర్మజ్ఞానంతో పాటు వినయ వినమ్రతలు తొణకిసలాడుతాయి. ఎవరయినా మీ కుడి చెంపపై కొడితే వారికి ఎడమ చెంపను అప్పజెప్పండి అని వారి గ్రంథాలలో లిఖించబడి ఉంది. అంటే జగడాలకు, తగవులకు దూరంగా ఉండమని భావం. ఈ కారణంగా క్రైస్తవులు ముస్లింల పాలిట యూదులకన్నా చాలా దగ్గరివారు. అయితే ఇస్లాం పట్ల శత్రుత్వం విషయంలో క్రైస్తవులు ఇతరులకన్నా కొంచెం మెతకవైఖరిని అవలంబించినప్పటికీ, ‘వైరభావం’ అనేది క్రైస్తవుల్లో కూడా ఉంది. శిలువ యుద్ధాలతో మొదలైన ఈ వైరవైఖరిని ఇప్పటిదాకా ఏదో ఒక విధంగా వారు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ మధ్యకాలంలోనయితే ఇస్లాంకు వ్యతిరేకంగా యూదులు – క్రైస్తవులు ఏకమై సంఘటితంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. అందుకే దివ్య ఖుర్ఆన్ ఉభయులతోనూ స్నేహబంధం కుదుర్చుకోరాదని తాకీదు చేసింది.

141. అబిసీనియా (ఇథియోపియా) దేశంలో నివసించే క్రైస్తవుల నేపథ్యంలో ఈ ఆయతులు అవతరించాయి. అబిసీనియాలో అస్హమా నజాషీ అనే చక్రవర్తి ఉండేవాడు. అది క్రైస్తవ రాజ్యం. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఆ రోజుల్లో హజ్రత్ అమ్ర్ బిన్ ఉమయ్య జమ్రీ (రజి) ద్వారా నజాషీ చక్రవర్తికి ఒక లేఖను పంపించారు. ఆయన ఆ లేఖను నజాషీకి చదివి వినిపించారు. ఆ ఉత్తరంలోని సంగతిని గ్రహించిన నజాషీ, అప్పటికే మక్కా నుంచి తమ దేశానికి వలస వచ్చిన ముస్లిములను, జాఫర్ బిన్ అబీ తాలిబ్ (రజి)ను తన దర్బారుకు పిలిపించాడు. క్రైస్తవ మతాచార్యులను, పండితులను కూడా సమావేశపరిచాడు. ఖుర్ఆన్‌ను పారాయణం చేసి వినిపించమని హజ్రత్ జాఫర్ (రజి)ను పురమాయించాడు. నజాషీ చక్రవర్తి ఆజ్ఞానుసారం హజ్రత్ జాఫర్ (రజి) మర్యమ్ సూరాను చదివి వినిపించారు. ఈ సూరాలో ప్రవక్త ఏసు గొప్పదనాన్ని గురించి చెబుతూనే, ఆయన ఒక దైవప్రవక్త అనీ, దేవుని

| | |
|---|---|
| **87** విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ మీ కోసం ధర్మసమ్మతం (హలాల్) చేసిన పవిత్రమైన వస్తువులను మీ అంతట మీరుగా నిషేధించుకోకండి.[142] మితిమీరి పోకండి. నిశ్చయంగా అల్లాహ్ మితిమీరి పోయేవారిని ఇష్టపడడు. | يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تُحَرِّمُوْا طَيِّبٰتِ مَآ اَحَلَّ اللّٰهُ لَكُمْ وَلَا تَعْتَدُوْا ؕ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْمُعْتَدِيْنَ ﴿87﴾ |
| **88** అల్లాహ్ మీకు ప్రసాదించిన వాటిలో నుంచి ధర్మసమ్మతమైన, పరిశుద్ధమైన పదార్థాలను భుజించండి. మీరు విశ్వసించే అల్లాహ్‌కు భయపడండి. | وَكُلُوْا مِمَّا رَزَقَكُمُ اللّٰهُ حَلٰلًا طَيِّبًا ۪ وَّاتَّقُوا اللّٰهَ الَّذِيْٓ اَنْتُمْ بِهٖ مُؤْمِنُوْنَ ﴿88﴾ |

దాసుడనీ స్పష్టంగా చెప్పబడింది. ఈ సత్యాన్ని తెలుసుకుని వారంతా అమితంగా ప్రభావితులయ్యారు. వారి కళ్లు చెమ్మగిల్లాయి. వారంతా ఈ సత్యాన్ని విశ్వసించారు. మరికొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం స్వయంగా నజాషీ చక్రవర్తియే కొంతమంది క్రైస్తవ పండితులను ముహమ్మద్ (సల్లం) వద్దకు పంపాడు. వారి ముందు ముహమ్మద్ (సల్లం) ఖుర్ఆన్ చదివి వినిపించగానే వారు అప్రయత్నంగా కంట తడిపెట్టారు. ఇస్లాంను స్వీకరించారు. (ఫత్‌హుల్ ఖదీర్).

దివ్య ఖుర్ఆన్ ఆయతులను విన్నప్పుడు వారు ప్రభావితులైన తీరు ఇందులో అభివర్ణించబడింది. దివ్య ఖుర్ఆన్‌లో మరికొన్ని చోట్ల కూడా ఇటువంటి క్రైస్తవుల ప్రస్తావన వచ్చింది. ఉదాహరణకు: ఆలి ఇమ్రాన్ సూరాలో ఇలా అనబడింది : "గ్రంథవహులలో కూడా కొందరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు. నీ వైపుకు పంపబడిన ఈ గ్రంథాన్ని విశ్వసిస్తారు. స్వయంగా వారి వైపుకు ఇదివరకు పంపబడిన గ్రంథాన్ని కూడా విశ్వసిస్తారు. అల్లాహ్ సమక్షంలో వినమ్రులై ఉంటారు" (199).

హదీసు ద్వారా తెలిసే ఇంకొక విషయమేమిటంటే నజాషీ చక్రవర్తి చనిపోయాడన్న కబురు దైవప్రవక్త (సఅసం) కు అందినపుడు, ఆయన తన సహచరులను పిలిచి, "అబిసీనియాలో మీ సోదరుడు చనిపోయాడు. అతని అంత్యక్రియల నమాజు (జనాజా నమాజు) చేయండి" అని ఆజ్ఞాపించారు. తరువాత ఆయన ఎడారి మైదానంలో నజాషీ చక్రవర్తి నమాజె జనాజా (గాయిబానా) చేయించారు (సహీహ్ బుఖారీ : కితాబుల్ జనాయిజ్; సహీహ్ ముస్లిం : కితాబుల్ జనాయిజ్). ముహమ్మద్ (స) దైవదౌత్యంపై విశ్వాస ప్రకటన చేసిన గ్రంథవహులకు రెట్టింపు పుణ్యఫలం లభిస్తుందని వేరొక హదీసు ద్వారా తెలుస్తోంది (బుఖారీ – కితాబుల్ ఇల్మ్, కితాబున్నికాహ్.)

142. హదీసులో వచ్చింది : ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సన్నిధిలోకి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు – "దైవప్రవక్తా! నేను మాంసం తిన్నప్పుడల్లా నా మనోవాంఛలు నాపై ప్రాబల్యం వహిస్తున్నాయి. కాబట్టి నేను నా కోసం మాంసాన్ని నిషేధించుకున్నాను" అని అన్నాడు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది (సహీహ్ తిర్మిజీ : లిల్ అల్‌బానీ – సంపుటి 3 : పేజీ – 46). మరికొంతమంది సహాబీలు వైరాగ్యానికి, దైవభక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడానికి కొన్ని హలాల్ విషయాలకు దూరంగా ఉండసాగారు. ఉదాహరణకు : పెళ్లి చేసుకోవటం, రాత్రిపూట నిద్రించటం, పగటిపూట అన్నం తినటం వంటివి మానుకున్నారు. ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలియగా, అలా చేయవద్దని ఆయన వారించారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) అనే సహాబి తన భార్యకు దూరంగా ఉండసాగారు. ఆయన భార్య చేసిన ఫిర్యాదును పురస్కరించుకుని దైవప్రవక్త (స) ఆయన్ని కూడా మందలించారు (హదీసు గ్రంథాల ఆధారంగా). మొత్తానికి ఈ ఆయతు ద్వారానూ, హదీసుల ద్వారానూ బోధపడేదేమిటంటే దేవుడు ధర్మసమ్మతంగా ఖరారు చేసిన ఏ వస్తువునయినా మనుషులు తమంతట తాముగా నిషేధించుకోవటం లేక వాటికి దూరంగా ఉండటం భావ్యం కాదు. ఈ ధర్మాధర్మాలు అన్నపానీయాలకు సంబంధించినవైనా, వస్త్రధారణకు సంబంధించినవైనా, లైంగిక వాంఛలకు సంబంధించినవైనా – వాటిని అవలంబించటంలోనే అందం ఉంది. మానవ సభ్యతా సంస్కృతులకు, మనుగడకు ఇవి ప్రాణం వంటివి.

لَا يُؤَاخِذُكُمُ اللّٰهُ بِاللَّغْوِ فِيْٓ اَيْمَانِكُمْ وَلٰكِنْ
يُّؤَاخِذُكُمْ بِمَا عَقَّدْتُّمُ الْاَيْمَانَ ۚ فَكَفَّارَتُهٗٓ
اِطْعَامُ عَشَرَةِ مَسٰكِيْنَ مِنْ اَوْسَطِ مَا تُطْعِمُوْنَ
اَهْلِيْكُمْ اَوْ كِسْوَتُهُمْ اَوْ تَحْرِيْرُ رَقَبَةٍ ۗ فَمَنْ لَّمْ
يَجِدْ فَصِيَامُ ثَلٰثَةِ اَيَّامٍ ۗ ذٰلِكَ كَفَّارَةُ اَيْمَانِكُمْ

**89** మీరు చేసే అర్థంలేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని నిలదీయడు. అయితే మీరు పటిష్టపరచిన ప్రమాణాలను గురించి ఆయన మిమ్మల్ని తప్పకుండా నిలదీస్తాడు.[143] (అటువంటి ప్రమాణభంగానికి మీరు చెల్లించవలసిన) పరిహారం ఏమిటంటే, మీరు మీ ఇంటి వారికి పెట్టే[144] మధ్యరకపు అన్నం పది మంది పేదలకు తినిపించాలి లేదా వారికి బట్టలుపెట్టాలి[145] లేదా ఒక బానిసకో, బానిసరాలికో స్వేచ్ఛనొసగాలి.[146] ఇవేవీ

**గమనిక:** ఒక్క స్త్రీ విషయంలో తప్ప, మిగతా విషయాల్లో ఎవరయినా ఒక వస్తువును తన కోసం హరాం చేసుకున్నంత మాత్రాన అది హరామ్ అయిపోదు. ఈ సందర్భంగా కొంతమంది పండితుల అభిప్రాయమేమంటే, అతడు హరామ్ అని చెప్పినందుకుగాను పరిహారం చెల్లించవలసి ఉంటుంది. కొంతమంది విద్వాంసులు పరిహారం చెల్లించనవసరం లేదని అంటున్నారు. ఇలాంటి వారిలో ఇమామ్ షౌకానీ కూడా ఉన్నారు. కాని ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా వ్యాఖ్యానించారు: "ఈ ఆయతు తర్వాత అల్లాహ్ ప్రమాణానికి పరిహారం నిర్ధారించాడు. దీన్నిబట్టి ధర్మమైన దానిని అధర్మంగా చేసుకోవటం అంటే అది ప్రతినబూనటంతో సమానమే. అది పరిహారాన్ని కోరుతుంది"– అయితే ఈ వ్యాఖ్య ప్రామాణిక హదీసుల ముందు నిలదొక్కుకోజాలదు. కనుక షౌకానీ గారి అభిప్రాయమే సరైనదని తెలుస్తోంది.

143. ప్రమాణాన్ని అరబీలో **హల్ఫ్** లేక **యమీన్** అని పిలుస్తారు. ఈ ప్రమాణం మూడు రకాలుగా ఉంటుంది. 1. లఘ్వున్ 2. గమూస్ 3. ముఅఖ్ఖదతున్.

**1. లఘ్వున్ :** అంటే మనిషి అర్థంపర్థం లేకుండా చీటికీ మాటికీ ఒట్టేసి మరీ చెప్పటం. దీన్ని తన ఊతపదంగా చేసుకోవటం. ఇటువంటి ప్రమాణాల గురించి పట్టింపు ఉండదు.

**2. గమూస్ :** అంటే మనిషి ఎదుటివారిని మోసగించటానికి ఉద్దేశ్యపూర్వకంగా చేసే అబద్ధపు ప్రమాణం. ఇది మహాపరాధం. ఘోరాతిఘోర పాపం. ఇటువంటి ప్రమాణానికి పరిహారం ఉండదు.

**3. ముఅఖ్ఖదతున్ :** అంటే మనిషి తన మాటను దృఢం చేయడానికి ఉద్దేశ్యపూర్వకంగా ప్రమాణం చేయటం. ఇటువంటి బాసను గనక అతను తప్పితే పై ఆయతులో పేర్కొనబడిన పరిహారం (కఫ్ఫారా) చెల్లించవలసి ఉంటుంది.

144. ఈ అన్నం ఏ పరిమాణంలో ఉండాలి అన్న విషయమై ప్రామాణిక ఉల్లేఖనం ఏదీ లేదు. అయితే ఇమామ్ షాఫయిగారు ఒక్కో పేదవానికి ఒక 'ముద్' ఆహారం పెట్టాలని అభిప్రాయపడ్డారు. దీనికోసం ఆయన, రమజాన్ మాసంలో ఉపవాసస్థితిలో భార్యతో సంభోగించిన పాపానికి పరిహారంగా పేదలకు అన్నం పెట్టమని చెబుతున్న హదీసును ఆధారంగా తీసుకుని ఈ నిర్ధారణకు వచ్చారు. ఎందుకంటే సదరు వ్యక్తికి దైవప్రవక్త (స) 15 'సా'ల ఖర్జూరాలు ఇచ్చి, వాటిని 60 మంది పేదవారికి పంచిపెట్టమన్నారు. ఒక 'సా' 4 'ముద్'లకు సమానం. దీని ప్రకారం ప్రమాణ భంగానికి పరిహారం క్రింద పదిమంది నిరుపేదలకు ఒక్కొక్కరికి ఒక్కో ముద్ చొప్పున ఆహారం సమకూరిస్తే సరిపోతుంది (పది 'ముద్'లు కలిపితే మొత్తం దాదాపు ఆరు కిలోలు అవుతాయి) (ఇబ్నె కసీర్).

145. బట్టలు పెట్టే విషయంలోనూ భిన్నాభిప్రాయం ఉంది. సాధారణంగా ఒక మనిషి నమాజ్ చేసుకునేందుకు వీలుగా సరిపోయే ఒక జత బట్టలన్న అర్థం వస్తుంది. మరి కొంతమంది ఇంతకు ముందు అంశంలో పేర్కొనబడిన ఆహార పరిమాణాన్ని, అలాగే ఇందులోని వస్త్ర నిర్ణయాన్ని ప్రాంతీయ ప్రజల పరిస్థితులను బట్టి నిర్ణయించాలని అభిప్రాయ పడ్డారు. అంటే వీటిని కాలాన్నిబట్టి, ప్రాంతాన్నిబట్టి, ప్రజల స్థితిగతులను బట్టి నిర్ణయించవచ్చున్నమాట. వివరాలకు ఈ ఆయతుకు వ్యాఖ్యానంగా ఇబ్నె కసీర్ వెల్లడించిన అభిప్రాయాన్ని అధ్యయనం చెయ్యవచ్చు.

146. పొరబాటున జరిగిన హత్యకు చెల్లించవలసిన 'దియత్'ను పోలుస్తూ ఇక్కడ కూడా ముస్లిం బానిసను లేక బానిసరాలిని

إِذَا حَلَفْتُمْ ۚ وَاحْفَظُوا أَيْمَانَكُمْ ۚ كَذَٰلِكَ
يُبَيِّنُ اللَّهُ لَكُمْ آيَاتِهِ لَعَلَّكُمْ تَشْكُرُونَ (89)

చేయలేనివారు మూడు రోజులపాటు ఉపవాసం పాటించాలి[147]– మీరు ప్రమాణాలు చేసినప్పుడు (వాటిని భంగపరచినందుకు గాను ఇచ్చే) ప్రమాణాల పరిహారం ఇది. అందుకే మీరు ప్రమాణాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండండి. ఈ విధంగా మీరు కృతజ్ఞతాపూర్వకంగా మసలుకునేందుకుగాను అల్లాహ్ మీకోసం తన ఆదేశాలను తేటతెల్లం చేస్తున్నాడు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِنَّمَا الْخَمْرُ وَالْمَيْسِرُ
وَالْأَنصَابُ وَالْأَزْلَامُ رِجْسٌ مِّنْ عَمَلِ
الشَّيْطَانِ فَاجْتَنِبُوهُ لَعَلَّكُمْ تُفْلِحُونَ (90)

**90** ఓ విశ్వసించిన వారలారా! సారాయి, జూదం, బలిపీఠాలు, జోస్యం కోసం వాడే బాణాలు– ఇవన్నీ పరమ జుగుప్సాకరమైన విషయాలు, షైతాన్ చేష్టలు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి. మీరలా చేస్తే సాఫల్యం పొందవచ్చు.[148]

إِنَّمَا يُرِيدُ الشَّيْطَانُ أَن يُوقِعَ بَيْنَكُمُ الْعَدَاوَةَ
وَالْبَغْضَاءَ فِي الْخَمْرِ وَالْمَيْسِرِ وَيَصُدَّكُمْ عَن ذِكْرِ
اللَّهِ وَعَنِ الصَّلَاةِ ۖ فَهَلْ أَنتُم مُّنتَهُونَ (91)

**91** సారాయి, జూదాల ద్వారా మీ మధ్య విరోధాన్ని, ద్వేషాన్ని సృజించాలనీ, అల్లాహ్ స్మరణ నుంచీ, నమాజు నుంచీ మిమ్మల్ని దూరంగా ఉంచాలని[149] షైతాను కోరుకుంటున్నాడు. కనుక ఇకనయినా వాటిని మానుకోండి.

మాత్రమే విడుదల చేయాలని కొంతమంది పండితులు భావిస్తున్నారు. అయితే ఈ ఆయతులో అలాంటి ఆంక్షలేవీ లేవనీ, స్వేచ్ఛొసగబడే బానిస ముస్లిం అయినా, అవిశ్వాసి అయినా ఫరవాలేదని ఇమామ్ షౌకానీ అంటున్నారు.

147. పైన పేర్కొనబడిన మూడింటిలో ఏ ఒక్కటీ నెరవేర్చగలిగే శక్తిలేని వారు మూడు రోజుల పాటు ఉపవాసం పాటిస్తే సరిపోతుంది. ఈ ఉపవాసాలు నిరంతరం (మధ్యలో నాగాలేకుండా) పాటించాలని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడుతుండగా, వీలునుబట్టి పాటించినా సరిపోతుందని మరి కొంతమంది అంటున్నారు.

148. సారాయి గురించి ఇవ్వబడిన మూడవ ఆదేశం యిది. మొదటి రెండు ఆదేశాలలో స్పష్టంగా దీన్ని గురించి వారించటం జరగలేదు. కాని ఇక్కడ దీనిని, దీంతోపాటు జూదం, బహుదైవోపాసనా స్థలాలు, పాచికలద్వారా జోస్యం తెలుసుకోవటం– వీటన్నిటినీ పరమ జుగుప్సాకరమైనవి (రిజ్స్)గా పేర్కొని అత్యంత స్పష్టమైన మాటల్లో వాటన్నిటినీ నిషేధించటం జరిగింది. అంతేకాదు, వీటివల్ల కలిగే దుష్పరిణామాన్ని గురించి కూడా యిక్కడ హెచ్చరించటం గమనార్హం. ఆఖరికి మీరు వీటిని ఇకనయినా మానుకుంటారా? లేదా? అని చెప్పి విశ్వాసులకు పరీక్ష పెట్టడం జరిగింది. నికార్సయిన విశ్వాసులంతా ఈ ఆయతు అవతరించగానే దేవుని అభిమతాన్ని పసిగట్టి మద్యసేవనాన్ని పరిత్యజించారు. "ఓ ప్రభూ! మేము వీటిని మానుకున్నాము" అని క్రియాత్మకంగా సమాధానమిచ్చారు (ముస్నదె అహ్మద్–సంపుటి : 2, పేజీ – 351). కాని నేటి ఆధునిక "మేధావులు" కొందరు దీనిపై తలతిక్క ప్రశ్నలు వేస్తున్నారు. సారాయిని హరామ్‌గా ప్రకటించిన ఆయతు ఖుర్‌ఆన్‌లో ఎక్కడా లేదే?! అని అంటున్నారు.

సారాయిని ఒక పైశాచిక చేష్టగా అభివర్ణించి, దానికి దూరంగా ఉండమని చెప్పటం హరామ్ కాకపోతే ఏమిటి? ఆధునిక సోకాల్డ్ పండితులు దాన్ని నిషేధాజ్ఞల జాబితాలో చేర్చకపోతే అది వారి ఖర్మ. దాని ద్వారా వారు చెప్పదలచిందేమిటీ? ఒక నీచమయిన పని, షైతాన్ చేష్ట కూడా ధర్మసమ్మతం కాగలదని వారు రుజువు చెయ్యదలుస్తున్నారా? సాఫల్యానికి దోహదపడే వస్తువులు – పతనానికి కారణభూతమయ్యే వస్తువులు రెండునూ ధర్మసమ్మతమైనవేనని వారు చెప్పదలుస్తున్నారా? ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.

149. సారాయి, జూదం వల్ల పొడసూపే మరిన్ని చెడుగులు యిక్కడ పేర్కొనబడ్డాయి. ఆ చెడుగులు సామాజికమైనవీ,

وَاَطِيْعُوا اللّٰهَ وَاَطِيْعُوا الرَّسُوْلَ وَاحْذَرُوْا ۚ فَاِنْ تَوَلَّيْتُمْ فَاعْلَمُوْۤا اَنَّمَا عَلٰى رَسُوْلِنَا الْبَلٰغُ الْمُبِيْنُ ﴿٩٢﴾

**92** అల్లాహ్‌కు విధేయత చూపండి. ఆయన ప్రవక్తకు విధేయత చూపండి. (చెడుల పట్ల) కడు జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ మీరు గనక విముఖత చూపితే, మా ప్రవక్తపై ఉన్న బాధ్యతల్లా స్పష్టంగా విషయాన్ని అందజేయటం వరకేనని తెలుసుకోండి.

لَيْسَ عَلَى الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ جُنَاحٌ فِيْمَا طَعِمُوْۤا اِذَا مَا اتَّقَوْا وَّاٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ ثُمَّ اتَّقَوْا وَّاٰمَنُوْا ثُمَّ اتَّقَوْا وَّاَحْسَنُوْا ؕ وَاللّٰهُ يُحِبُّ الْمُحْسِنِيْنَ ﴿٩٣﴾

**93** విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు (ఇంతకు మునుపు) తిన్నదానికి, తాగినదానికి వారిపై ఎటువంటి పాపం ఉండదు. కాకపోతే వారు ఇక మీదట భయభక్తులతో మెలగాలి, విశ్వసించి మంచిపనులు చెయ్యాలి. మళ్లీ భయభక్తుల వైఖరిని అవలంబించాలి, విశ్వసించాలి. మళ్ళీ అల్లాహ్‌కు భయపడుతూ సద్వర్తనులుగా మసలుకోవాలి. ఇటువంటి సద్వర్తనులనే అల్లాహ్ ప్రేమిస్తాడు.[150]

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَيَبْلُوَنَّكُمُ اللّٰهُ بِشَىْءٍ مِّنَ الصَّيْدِ تَنَالُهٗۤ اَيْدِيْكُمْ وَرِمَاحُكُمْ لِيَعْلَمَ اللّٰهُ مَنْ يَّخَافُهٗ بِالْغَيْبِ ۚ فَمَنِ اعْتَدٰى بَعْدَ ذٰلِكَ فَلَهٗ عَذَابٌ اَلِيْمٌ ﴿٩٤﴾

**94** విశ్వాసులారా! మీ చేతులకూ, మీ ఈటెలకూ అందుబాటులో ఉన్న[151] కొన్ని వేట జంతువుల ద్వారా అల్లాహ్ మిమ్మల్ని పరీక్షిస్తాడు,[152] తనను చూడకుండానే తనకు భయపడేవారెవరో తెలుసుకోవాలని. దీని తరువాత కూడా హద్దు మీరి ప్రవర్తించే వారికి వ్యథాభరితమైన శిక్ష ఉంటుంది.

---

ధార్మికమైనవీ కావచ్చు. అందుకే మద్యపానాన్ని "అపరాధాల అమ్మ"గా అభివర్ణించటం జరిగింది. అలాగే జూదం కూడా పరమ దరిద్రమైన వ్యసనం. ఈ వ్యసనానికి దాసోహమన్న వ్యక్తి ఎందుకూ పనికిరానివాడుగా మారిపోతాడు. గొప్ప గొప్ప జమీందారులు, శ్రీమంతులే దీని వాతన పడి బిచ్చగాళ్లుగా మారిపోయారు.

150. మద్యపానాన్ని నిషేధించిన తరువాత కొంతమంది ప్రవక్త సహచరులు (రజి) ఆలోచనలో పడిపోయారు. అంతకు ముందు చాలా మంది భక్తిపరులైన సహచరులు మద్యం సేవించేవారు. మరి చూడబోతే వారంతా విశ్వసించి మంచి పనులు చేసినవారే. వారిలో చాలామంది దైవమార్గంలో పోరాడి అమరగతి నొందారు. మరి వారి సంగతేమిటి? అన్నది వారి సందేహం. ఈ ఆయతు ద్వారా వారి సందేహ నివృత్తి చేయబడింది. వారంతా ఈమాన్ (విశ్వాసం) మరియు తఖ్వా (దైవభక్తి) ప్రాతిపదికపైనే మరణించారని, ఎందుకంటే అప్పటికింకా మద్యపాన నిషేధాజ్ఞలు రాలేదని దీని భావం.

151. దగ్గరలో ఉన్న వేట జంతువులను, చిన్నపాటి జంతువులను సాధారణంగా చేత్తోటే పట్టుకోవటం జరుగుతుంది. దూరంలో ఉన్న వేట జంతువుల కోసం ఈటెలు, బాణాలు ఉపయోగించబడేవి. అందువల్ల ఆనాటి స్థితిగతుల దృష్ట్యా ఈ విధంగా విషయం ప్రస్తావించబడింది. అయితే 'ఇహ్రామ్' స్థితిలో ఏ విధంగా వేటాడినా, ఏ ఆయుధాలతో పరికరాలతో వేటాడినా నిషిద్ధమే అవుతుంది.

152. వేట అరబ్బుల ఉపాధి అన్వేషణలో అంతర్భాగం. అందుకే దేవుడు ఇహ్రామ్ స్థితిలో వేటాడటాన్ని నిషేధించి వారికి పరీక్ష పెట్టాడు. ముఖ్యంగా దైవప్రవక్త సహచరులు హుదైబియా వద్ద బస చేసినప్పుడు ఎన్నో వేట జంతువులు వారికి దాపులో కనిపించేవి. అయితే ఆ రోజుల్లోనే ఈ నాలుగు ఆయతులు అవతరించాయి. వీటిలో సంబంధిత ఆజ్ఞలు ఇవ్వబడ్డాయి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَقْتُلُوا الصَّيْدَ وَأَنتُمْ حُرُمٌ ۚ
وَمَن قَتَلَهُ مِنكُم مُّتَعَمِّدًا فَجَزَاءٌ مِّثْلُ مَا قَتَلَ
مِنَ النَّعَمِ يَحْكُمُ بِهِ ذَوَا عَدْلٍ مِّنكُمْ هَدْيًا بَالِغَ
الْكَعْبَةِ أَوْ كَفَّارَةٌ طَعَامُ مَسَاكِينَ أَوْ عَدْلُ ذَٰلِكَ
صِيَامًا لِّيَذُوقَ وَبَالَ أَمْرِهِ ۗ عَفَا اللَّهُ عَمَّا سَلَفَ ۚ
وَمَنْ عَادَ فَيَنتَقِمُ اللَّهُ مِنْهُ ۗ وَاللَّهُ عَزِيزٌ
ذُو انتِقَامٍ (95)

**95** ఓ విశ్వాసులారా! మీరు ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు[153] వేట జంతువులను చంపకండి. మీలో ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా[154] దానిని చంపినట్లయితే అతడు తాను చంపిన జంతువుకు సమానమైన జంతువును పరిహారంగా చెల్లించటం అవశ్యం.[155] దానిని మీలోని ఇరువురు న్యాయశీలురు నిర్ణయించాలి.[156] పరిహారంగా యివ్వబడే జంతువును ఖుర్బానీ నిమిత్తం కాబా వద్దకు చేర్చాలి.[157] లేదా ఆ పాపానికి పరిహారంగా కొంతమంది పేదలకు అన్నం పెట్టాలి. లేదా దానికి సమానంగా ఉపవాసం పాటించాలి.[158] తాను పాల్పడిన చేష్టకు ఫలితాన్ని చవిచూసేందుకు (ఈ విధంగా నిర్ధారించబడింది). గతంలో జరిగిన దాన్ని అల్లాహ్ మన్నించాడు. ఇకమీదట కూడా ఎవరయినా అలా చేస్తే అల్లాహ్ ప్రతీకారం చేస్తాడు. అల్లాహ్ సర్వాధిక్యుడు, ప్రతీకారం చేసే వాడూను.

153. వేటాడే జంతువులంటే కేవలం తినటానికి పనికివచ్చే జంతువులు మాత్రమేనని ఇమామ్ షాఫయి అభిప్రాయపడ్డారు. అవి తప్ప ఇతరత్రా భూచర జంతువులను ఇహ్రామ్ స్థితిలో చంపినా ఫరవాలేదని చెప్పారు. కాని అత్యధికమంది పండితుల దృష్టిలో ఈ విచక్షణకు తావులేదు. తినడానికి ఉపయోగపడే జంతువులైనా – ఇతరత్రా జంతువులైనా వేటినీ చంపకూడదు. కాని హదీసులలో పేర్కొనబడిన 5 రకాల జంతువులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనయినా చంపవచ్చు. అవేమంటే ; 1. కాకి 2. డేగ 3. తేలు 4. ఎలుక 5. పిచ్చికుక్క (సహీహ్ ముస్లిం – కితాబుల్ హజ్). 'మరి పాము సంగతేమిటీ?' అని హజ్రత్ నాఫే గారిని అడగ్గా, 'దాన్ని చంపే విషయంలో భేదాభిప్రాయానికి తావేలేదు' అని ఆయన బదులిచ్చారు (ఇబ్నె కసీర్). ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ తదితర పండితులు తోడేలు, క్రూరమృగాలు, చిరుతపులి, పెద్దపులి, సింహం లాంటి జంతువులను కరిచే కుక్కల కోవలోకి తీసుకున్నారు. అందుచేత ఇహ్రామ్ స్థితిలో ఈ క్రూర జంతువులను చంపటం ధర్మసమ్మతమేనని భావించారు (ఇబ్నె కసీర్).

154. **"ఉద్దేశ్యపూర్వకంగా"** అన్న పదాన్నిబట్టి కొంతమంది విద్వాంసులేమంటారంటే, పొరపాటు వల్లగానీ, మరుపువల్లగానీ చంపిన జంతువుకుగాను పరిహారం (ఫిదియా) చెల్లించనవసరం లేదు. కాని మెజారిటీ ఉలమాలు మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ పరిహారం చెల్లించాల్సిందేనని అంటున్నారు. ఎందుకంటే ఈ ఆయతులో 'ఉద్దేశ్య పూర్వకంగా' అన్న పదం సాధారణ పరిస్థితుల దృష్ట్యా చెప్పబడిందే కాని అది నియమం కాదు. ఖుర్ఆన్‌లో ఇటువంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి.

155. సమానమైన జంతువు (లేక అలాంటి జంతువు) అంటే సృష్టిరీత్యా, పరిమాణం రీత్యా దాంతో సరితూగే జంతువు అన్నమాట! హనఫీ విద్వాంసులు తలపోస్తున్నట్లుగా వెల రీత్యా సమానమైన జంతువు కాదు. ఉదాహరణకు జింకను చంపినట్లయితే దానిలాంటి (దానికి సమానమైన) మేకను పరిహారంగా ఇవ్వాలి. దుప్పిని చంపినట్లయితే అందుకు ఒక ఆవును పరిహారంగా ఇచ్చుకోవాలి. అయితే ఒకవేళ చంపిన జంతువుకు సమానమైన జంతువు ఏదీ లభ్యం కాని పక్షంలో దాని ఖరీదు కూడా పరిహారంగా ఇవ్వవచ్చు. ఆ పరిహార మొత్తాన్ని మక్కాకు పంపించాలి.

156. ఒకవేళ చంపబడిన జంతువుకు సమానమైన, అదే కోవకు చెందిన జంతువు దొరక్కపోతే, అట్టి పరిస్థితిలో న్యాయసమ్మతంగా ఆ జంతువు వెలను నిర్ధారించి, ఆ మొత్తంతో ఆహారపదార్థాలను కొని మక్కా నగరంలోని పేదప్రజల మధ్య ఒక్కొక్కరికి ఒక్కో 'ముద్' చొప్పున పంపిణీ చేయటం జరుగుతుంది. హనఫీ పండితుల ప్రకారం ఒక్కో పేదవాడికి రెండేసి 'ముద్'ల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది.

**96** సముద్రపు జంతువులను వేటాడటం, దాని ఆహారం మీకొరకు ధర్మసమ్మతం గావించబడింది.[159] మీ ప్రయోజనం కోసం, ప్రయాణీకుల కోసం కూడా. అయితే మీరు ఇహ్రామ్ స్థితిలో ఉన్నంతవరకూ భూమిపై వేటాడటం నిషేధించబడింది. అల్లాహ్‌కు భయపడండి. ఆయన వద్దకే మీరంతా సమీకరించబడతారు.

أُحِلَّ لَكُمْ صَيْدُ الْبَحْرِ وَطَعَامُهُ مَتَاعًا لَّكُمْ
وَلِلسَّيَّارَةِ ۖ وَحُرِّمَ عَلَيْكُمْ صَيْدُ الْبَرِّ مَا دُمْتُمْ
حُرُمًا ۗ وَاتَّقُوا اللَّهَ الَّذِي إِلَيْهِ تُحْشَرُونَ ﴿٩٦﴾

**97** గౌరవప్రద గృహమైన 'కాబా'ను అల్లాహ్ మానవ మనుగడ సాధనంగా చేశాడు. ఇంకా నిషిద్ధ మాసాన్నీ, హదీ పశువును (హరమ్ క్షేత్రంలో ఖుర్బానీ ఇవ్వబడే జంతువులను), మెడలలో పట్టాలు[160] వేసిన జంతువులను కూడా. ఆకాశాలలో, భూమిలో ఉన్న సమస్త వస్తువుల గురించి అల్లాహ్‌కు తెలుసనీ, ఆయన ప్రతిదీ క్షుణ్ణంగా ఎరిగినవాడన్న సంగతి మీకు తెలియడానికిగాను ఆయన ఇలా చేశాడు.

جَعَلَ اللَّهُ الْكَعْبَةَ الْبَيْتَ الْحَرَامَ قِيَامًا لِّلنَّاسِ
وَالشَّهْرَ الْحَرَامَ وَالْهَدْيَ وَالْقَلَائِدَ ۚ ذَٰلِكَ
لِتَعْلَمُوا أَنَّ اللَّهَ يَعْلَمُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي
الْأَرْضِ وَأَنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿٩٧﴾

157. ఈ పరిహారం జంతువు రూపేణాగానీ, వెల రూపేణాగానీ కాబాకు చేరాలి. ఇక్కడ కాబా అంటే మొత్తం హరమ్ ప్రాంతం (ఫత్‌హుల్ ఖదీర్). అంటే ఆ పరిహారం మక్కా హరమ్ ప్రాంత పరిధిలో నివసించే నిరుపేదలకు పంచాలి.

158. పరిహారంగా పేదలకు అన్నం తినిపించటంగాని లేక అందుకు సమానంగా ఉపవాసాలు పాటించటంగాని – రెండిట్లో ఏదయినా చేయవచ్చు. చంపబడిన జంతువు మూల్యాన్నిబట్టి పేదలకు పెట్టబడే అన్నంలో హెచ్చుతగ్గులు ఉన్నట్లే ఉపవాసాలలో కూడా హెచ్చుతగ్గులు ఉంటాయి. ఉదాహరణకు : ఇహ్రామ్ దీక్షలో ఉన్న వ్యక్తి గనక ఒక జింకను చంపితే దానికి సమానమైన జంతువుగా మేకను పరిగణనలోకి తీసుకుని, జిబహ్ కొరకు దానిని కాబాకు తరలించాలి. ఒకవేళ మేక గనక లభ్యం కాకపోతే హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయం ప్రకారం ఆరుగురు అగత్యపరులకు అన్నం పెట్టాలి. లేదా మూడురోజుల పాటు ఉపవాసం ఉండాలి. ఒకవేళ 12 కొమ్ములు గల పెద్ద జింకనో, ఆ స్థాయికి చెందిన మరేదైనా జంతువునో చంపితే దానికి సమానంగా ఆవును పరిహారంగా ఇవ్వాల్సి ఉంటుంది. మరి ఆ సమయంలో ఆవు గనక లభ్యం కాకపోతే 20 మంది అభాగ్యులకు అన్నం పెట్టాలి. లేదా 20 రోజులపాటు ఉపవాసం పాటించాలి. చంపబడిన జంతువు దీనికన్నా పెద్ద తరహాకు చెందినదైతే అప్పుడు పరిహారంగా ఒంటెను సమర్పించుకోవాలి. మరి ఒంటె గనక లభ్యం కాకపోతే 30 మంది పేదలకు అన్నం పెట్టాలి లేదా 30 రోజులపాటు ఉపవాసం ఉండాలి (ఇబ్నె కసీర్).

159. **'సైద్'** (صَيْد) అంటే ఇక్కడ భావం సజీవంగా ఉన్న నీటి జంతువులు. **'తఆముహు'** (طَعَامُه) అంటే చనిపోవటం మూలంగా ఒడ్డుకు వచ్చిపడ్డ లేక నీటి ఉపరితలంపైకి తేలివచ్చిన చేపలు, తదితర జంతువులు. అవి సముద్రంలోనివైనా, నదులు, చెరువుల్లోనివైనా కావచ్చు. సముద్రంలోని జంతువులు ప్రాణం విడిచినా అవి హలాల్ (ధర్మసమ్మతం)గానే పరిగణించబడతాయని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. వివరాలకు తఫ్సీర్ ఇబ్నె కసీర్, నైలుల్ అవ్‌తార్ గ్రంథాలను చూడగలరు.

160. కాబా గృహాన్ని **'బైతుల్ హరామ్'** (నిషిద్ధ గృహం, పవిత్ర గృహం, గౌరవమర్యాదల గృహం) అని అనడానికి ప్రధాన కారణం దాని పరిధిలోకి వచ్చే ప్రాంతంలో వేటాడటం, చెట్లు నరకటం ఇత్యాదివి నిషేధించబడ్డాయి. ఆఖరికి కన్న తండ్రిని చంపిన దుర్మార్గుడు తారసపడినా ఆ పరిధిలో ప్రతీకారం తీర్చుకునేందుకు అనుమతించబడేది కాదు.

**98** తెలుసుకోండి! అల్లాహ్ శిక్షించటంలో కఠినుడు. దాంతో పాటు అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, కనికరించేవాడు కూడా.

اِعۡلَمُوۡۤا اَنَّ اللّٰهَ شَدِيۡدُ الۡعِقَابِ وَاَنَّ اللّٰهَ غَفُوۡرٌ رَّحِيۡمٌ ﴿۹۸﴾

**99** సందేశాన్ని అందజేయటం వరకే ప్రవక్త బాధ్యత. మీరు వెల్లడించేదీ, దాచి పెట్టేదీ – అంతా అల్లాహ్‌కు తెలుసు.

مَا عَلَى الرَّسُوۡلِ اِلَّا الۡبَلٰغُ‌ ؕ وَاللّٰهُ يَعۡلَمُ مَا تُبۡدُوۡنَ وَمَا تَكۡتُمُوۡنَ ﴿۹۹﴾

**100** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: అపవిత్రత యొక్క ఆధిక్యత నీకు ఎంత బాగా తోచినప్పటికీ అపవిత్రము – పవిత్రము ఎన్నటికీ సమానం కాలేవు.[161] కనుక ఓ వివేకవంతులారా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి, తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు.

قُلْ لَّا يَسۡتَوِى الۡخَبِيۡثُ وَالطَّيِّبُ وَلَوۡ اَعۡجَبَكَ كَثۡرَةُ الۡخَبِيۡثِ‌ ۚ فَاتَّقُوا اللّٰهَ يٰۤاُولِى الۡاَلۡبَابِ لَعَلَّكُمۡ تُفۡلِحُوۡنَ ﴿۱۰۰﴾

**101** ఓ విశ్వాసులారా! మీకు గనక విడమరచి చెబితే మీకు బాధ కలిగించేటటువంటి విషయాలను గురించి అడగకండి. అయితే ఖుర్ఆన్ అవతరించే సమయంలో మీరు వాటిని గురించి ప్రశ్నిస్తే అవి మీకు విడమరచి చెప్పబడతాయి.[162] ఇంత వరకు వేసిన ప్రశ్నలను అల్లాహ్ మన్నించాడు. అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, సహనశీలుడు కూడా.

يٰۤاَيُّهَا الَّذِيۡنَ اٰمَنُوۡا لَا تَسۡـَٔلُوۡا عَنۡ اَشۡيَآءَ اِنۡ تُبۡدَ لَـكُمۡ تَسُؤۡكُمۡ‌ ۚ وَاِنۡ تَسۡـَٔـلُوۡا عَنۡهَا حِيۡنَ يُنَزَّلُ الۡقُرۡاٰنُ تُبۡدَ لَـكُمۡ ؕ عَفَا اللّٰهُ عَنۡهَا‌ ؕ وَاللّٰهُ غَفُوۡرٌ حَلِيۡمٌ ﴿۱۰۱﴾

---

అంతేగాక ఈ ప్రాంతం జనుల నివాసానికి, మనుగడకు యోగ్యమైన ప్రాంతంగా ఖరారు చేయబడింది. దీని భావం ఏమిటంటే ఈ పవిత్ర గృహం మూలంగా మక్కావాసుల జీవనం సుఖప్రదమవటమే గాకుండా, ఆర్థికంగా అది వారికి బలం చేకూరుస్తుంది. అలాగే పవిత్ర నెలలలో కాబా గృహానికి తరలించబడే జంతువులు కూడా మనుగడ సాధనాలే. ఎందుకంటే వీటిద్వారా కూడా మక్కావారికి పైన పేర్కొనబడిన ప్రయోజనాలు చేకూరేవి.

161. అపవిత్రం అంటే అధర్మం లేదా అవిశ్వాసి లేదా అపరాధి లేదా పనికిరానిది కావచ్చు. అలాగే పవిత్రం అంటే ధర్మసమ్మతం లేదా విశ్వాసి లేదా విధేయుడు లేదా మేలైన వస్తువు అన్న అర్థం కావచ్చు. లేక ఈ అర్థాలన్నీ దీని పరిధిలోకి రావచ్చు. అంటే 'అశుద్ధత' ఉన్న వస్తువు ఏదయినా – అది అవిశ్వాసమైనా, పాపకార్యమైనా, అపసవ్యమైన పనులైనా, నీతిమాలిన మాటలైనా – అది ఎంత హెచ్చుగా ఉన్నప్పటికీ 'పరిశుద్ధత'తో పోటీపడజాలదు. ఇవి రెండూ ఎట్టి పరిస్థితిలోనూ సమానం కాలేవు. ఎందుకంటే అపరిశుభ్రత, అశుద్ధతల మూలంగా ఆ వస్తువులోని శుభం నశించిపోతుంది. కాగా; పరిశుద్ధతను సంతరించుకున్న వస్తువు పరిమాణంలో తక్కువగా ఉన్నప్పటికీ దానివల్ల శుభశ్రేయాలు ప్రాప్తిస్తూ ఉంటాయి.

162. ఈ ఆంక్ష ఖుర్ఆన్ అవతరించే కాలంలో ఉండేది. అధిక ప్రశ్నలు వేయవద్దని దైవప్రవక్త (సఅసం) స్వయంగా తన సహచరులకు చెప్పేవారు. ఒక హదీసు ప్రకారం ఆయన (స) ఇలా ప్రవచించారు : "ఎవరయినా, తాను వేసిన ప్రశ్న మూలంగా అప్పటివరకూ ధర్మసమ్మతం (హలాల్) గా ఉన్న వస్తువు నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేయబడితే అతను ముస్లింలలో అందరికన్నా పెద్ద నేరస్థుడవుతాడు" (సహీహ్ బుఖారీ : హదీసు నెంబరు – 7289; సహీహ్ ముస్లిం : కితాబుల్ ఫజాయెల్).

قَدْ سَأَلَهَا قَوْمٌ مِّن قَبْلِكُمْ ثُمَّ أَصْبَحُوا بِهَا
كَافِرِينَ ﴿١٠٢﴾

**102** మీ పూర్వీకుల్లో కూడా కొందరు ఇలాంటి విషయాలను అడిగారు. మరి ఆ విషయాలను తిరస్కరించింది కూడా వారే.[163]

مَا جَعَلَ اللَّهُ مِن بَحِيرَةٍ وَلَا سَائِبَةٍ وَلَا وَصِيلَةٍ
وَلَا حَامٍ ۙ وَلَٰكِنَّ الَّذِينَ كَفَرُوا يَفْتَرُونَ عَلَى
اللَّهِ الْكَذِبَ ۖ وَأَكْثَرُهُمْ لَا يَعْقِلُونَ ﴿١٠٣﴾

**103** అల్లాహ్ 'బహీరా'నుగానీ, 'సాయిబా' నుగానీ, 'వసీలా'ను గానీ, 'హామ్'నుగానీ ఏర్పరచలేదు.[164] అయినప్పటికీ అవిశ్వాసులు అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగడుతున్నారు. వారిలో చాలా మంది అవివేకులు.

وَإِذَا قِيلَ لَهُمْ تَعَالَوْا إِلَىٰ مَا أَنزَلَ اللَّهُ
وَإِلَى الرَّسُولِ قَالُوا حَسْبُنَا مَا وَجَدْنَا عَلَيْهِ
آبَاءَنَا ۚ أَوَلَوْ كَانَ آبَاؤُهُمْ لَا يَعْلَمُونَ
شَيْئًا وَلَا يَهْتَدُونَ ﴿١٠٤﴾

**104** "అల్లాహ్ అవతరింపజేసిన ఆదేశాల వైపుకు, ప్రవక్త వైపుకు రండి" అని వారితో అన్నప్పుడు, "మా తాత ముత్తాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూసిన విధానమే మాకు చాలు" అని వారంటారు. ఏమిటీ? వారి తాత ముత్తాతలకు ఏమీ తెలీకపోయినప్పటికీ, వారు సన్మార్గంలో నడవనప్పటికీ వీరు వాళ్లనే అనుసరిస్తారా?

---

163. మీ పూర్వీకులు ఒడిగట్టిన పాపానికి మీరు కూడా పాల్పడతారేమో జాగ్రత్త! ఉదాహరణకు: "దేవుడు మీపై హజ్ యాత్రను విధిగా నిర్ణయించాడు" అని దైవప్రవక్త (స) పలికారు. "ఏటేటా విధిగా హజ్ చేయాల్సిందేనా?" అని ఒక వ్యక్తి ఆయన్ని ప్రశ్నించాడు. దానికాయన (స) మౌనం వహించారు. కాని ఆ వ్యక్తి మూడుసార్లు అదేమాటను అడిగేసరికి, "ఒకవేళ నేను 'అవున'ని అంటే ఏటేటా అది 'విధి'గా ఖరారైపోతుంది. అదే గనక జరిగితే ఏటేటా హజ్ చేయటం మీకు సాధ్యం కాదు" అని బదులిచ్చారాయన (సహీహ్ ముస్లిం: కితాబుల్ హజ్ – హదీసు నెంబరు – 412; ముస్నదె అహ్మద్, సుననె అబూ దావూద్, నసాయి, ఇబ్నె మాజ). ఈ ఆయతు నేపథ్యంలో కొంతమంది వ్యాఖ్యాతలు ఇలా అభిప్రాయపడ్డారు : అల్లాహ్ తన గ్రంథంలో ఏ విషయాన్నయినా ప్రస్తావించకపోతే, ఆ విషయమై ఆయన మన్నింపుల వైఖరిని అవలంబించాడని తలపోయాలి. కాబట్టి ఆ విషయమై మీరు కూడా ఆయనలాగే మౌనంగా ఉండిపోండి (ఇబ్నె కసీర్). వేరొక హదీసులో మహాప్రవక్త (స) స్పష్టంగా ఇలా వక్కాణించారు : "మీకు తెలుపబడని విషయాల గురించి మీరు నన్ను ప్రశ్నించకండి. ఎందుకంటే మీకు పూర్వం గతించిన సమాజాలవారు పదే పదే ప్రశ్నల వర్షం కురిపించి, ప్రవక్తలతో విభేదించి వినాశానికి గురయ్యారు" (సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్).

164. అరబ్బులు పూర్వం తమ దేవతల పేర మొక్కుబడిగా సమర్పించుకునే వివిధ రకాల జంతువులివి. వీటి గురించి రకరకాల వ్యాఖ్యానాలు చేయబడ్డాయి. సహీహ్ బుఖారీలో హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యబ్ (రజి) కథనం ప్రకారం దీని వ్యాఖ్యానం ఇలా ఉంది :

**1. బహీరా :** పాలు పితకకుండా వదలివేయబడే పశువు. ఆ పాలు దేవతలకు ప్రత్యేకం అని అనేవారు. ఇలాంటి పశువుల పొదుగులను ఎవరూ ముట్టుకోరు.

**2. సాయిబా :** ఇవి దేవతల పేర వదలి వేయబడిన పశువులు. వాటిని వాహనంగా గానీ, బరువు మోయటానికిగాని ఉపయోగించేవారు కారు.

**3. వసీలా :** ఒకసారి ఆడ ఒంటెను ఈని, రెండవసారి కూడా ఆడ ఒంటెనే ఈనిన ఒంటెను దేవతల పేర వదలిపెట్టేసేవారు.

**4. హామ్ :** అనేక ఒంటె పిల్లల పుట్టుకకు మూలంగా నిలిచిన మగ ఒంటె. ఇటువంటి మగ ఒంటె చేత వ్యవసాయ

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُواْ عَلَيۡكُمۡ أَنفُسَكُمۡۖ لَا يَضُرُّكُم مَّن ضَلَّ إِذَا ٱهۡتَدَيۡتُمۡۚ إِلَى ٱللَّهِ مَرۡجِعُكُمۡ جَمِيعٗا فَيُنَبِّئُكُم بِمَا كُنتُمۡ تَعۡمَلُونَ ﴿١٠٥﴾

**105** ఓ విశ్వసించినవారలారా! మీరు మీ గురించి జాగ్రత్త పడండి. మీరు గనక సన్మార్గంలో నడుస్తున్నట్లయితే దారి తప్పిన వారు మీకు ఎలాంటి నష్టం కలిగించజాలరు.[165] మీరంతా అల్లాహ్ వద్దకే మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు చేసిన కర్మలన్నింటినీ మీకు తెలుపుతాడు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُواْ شَهَٰدَةُ بَيۡنِكُمۡ إِذَا حَضَرَ أَحَدَكُمُ ٱلۡمَوۡتُ حِينَ ٱلۡوَصِيَّةِ ٱثۡنَانِ ذَوَا عَدۡلٖ مِّنكُمۡ أَوۡ ءَاخَرَانِ مِنۡ غَيۡرِكُمۡ إِنۡ أَنتُمۡ ضَرَبۡتُمۡ

**106** ఓ విశ్వాసులారా! మీలో ఎవరికయినా మరణ సమయం దగ్గరపడి, అతడు విల్లు చెప్పదలచినప్పుడు మీలోని ఇద్దరు వ్యక్తులు సాక్షులుగా ఉండటం భావ్యం. ఆ ఇద్దరు వ్యక్తులూ ధర్మచింతన గలవారై ఉండాలి. (వారు మీ వారై ఉండాలి).[166] లేదా మీరు ప్రయాణావస్థలో ఉండి, మీకు మరణ విపత్తు

పనులు చేయించటం, వాహనంగా ఉపయోగించటం భావ్యం కాదని తలచి దాన్ని దేవతల పేర వదలిపెట్టేవారు. ఈ విధంగా దేవతల పేర పశువులను వదలిపెట్టిన ప్రప్రథమ వ్యక్తి అమ్ర్ బిన్ ఆమిర్ ఖుజాయి అని కూడా ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. "అతడు నరకంలో ప్రేగులు లాగటం నేను చూశాను" అని మహాప్రవక్త (సఅసం) తెలిపారు (సహీహ్ బుఖారీ : అల్ మాయిదా సూరా వ్యాఖ్యానం). అల్లాహ్ ఈ విధంగా పశువులను నిర్ణయించలేదనీ, మొక్కుబడులను ఆయన తన కోసమే ప్రత్యేకించాడని ఈ ఆయతులో విశదపరచబడింది. అయితే దేవతల పేర జంతువులను కేటాయించే పద్ధతులు ముష్రిక్కులు సృష్టించినవే. దేవతల, మిథ్యాదైవాల పేర జంతువులను అచ్చువేసి వదిలే ఆచారం నేటికీ ముష్రిక్కులలోనూ, కథాకథిత ముస్లిములలోనూ అమల్లో ఉంది. దైవం కాపాడుగాక!

165. ఈ ఆయతును అర్థం చేసుకోవటంలో కొంతమంది పొరబడ్డారు. తమ స్వీయ ఆచరణ పట్ల శ్రద్ధవహిస్తే సరిపోతుందనీ, మంచిని పెంచవలసిన, చెడులను నిర్మూలించవలసిన అవసరం లేదని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ అభిప్రాయం సరైంది కాదు. ఎందుకంటే సమాజంలో మంచిని పెంపొందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒక ముస్లిం గనక ఈ విద్యుక్త ధర్మాన్ని త్యజిస్తే అసలు అతను సన్మార్గం మీదే ఉన్నట్లు కాదు. ఎందుకంటే 'సన్మార్గం' అన్నమాటలో మంచిని గురించి ఆజ్ఞాపించే, చెడుల నుంచి ఆపే బాధ్యత కూడా ఉంది. మరోవైపు పై ఆయతులో అల్లాహ్ **'ఇజహ్ తదైతుమ్'** (మీరు సన్మార్గంలో నడుస్తున్నప్పుడు) అనే నియమం పెట్టాడు. దీనిద్వారా తెలిసేదేమిటంటే మంచిని పెంచే, చెడుని త్రుంచే గురుతర బాధ్యతను విస్మరించి, కేవలం స్వీయ సంస్కరణకు మాత్రమే పరిమితమయిపోతే దానివల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. అందుకే, ప్రజలు ఈ ఆయతును అర్థం చేసుకోవటంలో పొరబడ్డారని హజ్రత్ అబూబక్ర్ (రజి)కు తెలిసినప్పుడు, "ప్రజలారా! మీరు ఈ ఆయతును అన్వయింపజేయటంలో పొరబడ్డారు. దైవప్రవక్త (సఅసం) ప్రబోధిస్తుండగా నేను విన్నాను – 'చెడు జరుగుతుండగా ప్రజలు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తే, దాన్ని సంస్కరించే ప్రయత్నం చేయకపోతే అల్లాహ్ వారిని తన శిక్షకు గురిచేసే సమయం దగ్గర పడిందనుకోండి" (ముస్నదె అహ్మద్: సంపుటి-1 ; తిర్మిజీ – హదీసు – 2178. అబూ దావూద్ – 4338 వ హదీసు). ఇంతకీ ఈ ఆయతు యొక్క అసలు అర్థం ఏమిటంటే, మీరు ఎంతగా బోధపరచినప్పటికీ జనులు మంచి వైపుకు మరలకపోతే, మీకు వాటిల్లే నష్టం ఏమీ ఉండదు. మీరు మాత్రం సన్మార్గాన ఉండి, చెడుల జోలికి పోకుండా ఉంటే చాలు. అయితే సమాజం నైతికంగా మరీ దిగజారిపోయి మంచిని పెంపొందించటానికి పరిస్థితులు ఏమాత్రం అనువుగా లేనపుడు, ప్రాణ భయం ఉన్నప్పుడు ఈ బాధ్యతను – తాత్కాలికంగా – విడనాడవచ్చు.

166. "వారు మీ వారై ఉండాలి" – అంటే 'ముస్లిములై ఉండాలి' అని కొంతమంది తలపోయగా, 'వీలునామా వ్రాసే వాని తెగవారై ఉండాలి' అని మరి కొంతమంది భావించారు. "అన్యులిద్దరు" అన్న వాక్యంలో కూడా రెండు

فِي الْأَرْضِ فَأَصَابَتْكُمْ مُّصِيبَةُ الْمَوْتِ ۚ تَحْبِسُونَهُمَا مِن بَعْدِ الصَّلَاةِ فَيُقْسِمَانِ بِاللَّهِ إِنِ ارْتَبْتُمْ لَا نَشْتَرِي بِهِ ثَمَنًا وَلَوْ كَانَ ذَا قُرْبَىٰ ۙ وَلَا نَكْتُمُ شَهَادَةَ اللَّهِ إِنَّا إِذًا لَّمِنَ الْآثِمِينَ ﴿١٠٦﴾

దాపురిస్తే[167] అన్యులిద్దరిని కూడా సాక్షులుగా తీసుకోవచ్చు. ఒకవేళ మీకు అనుమానం కలిగితే నమాజు అనంతరం ఆ ఇద్దరినీ ఆపుకోండి. మరి వారిద్దరూ దేవునిపై ప్రమాణం చేసి ఇలా చెప్పాలి: "మేము స్వప్రయోజనం కోసం ప్రమాణాలను అమ్ముకునేవాళ్ళం కాము.[168] (మేము సాక్ష్యమిచ్చే వ్యక్తి) మా బంధువు అయినాసరే (మేము నిష్పక్షపాతంగానే వ్యవహ రిస్తాము). అల్లాహ్ యొక్క సాక్ష్యాన్ని మేము దాచి పెట్టము. ఒకవేళ మేమలా చేస్తే ఘోరమైన పాపానికి పాల్పడిన వారమవు తాము."

فَإِنْ عُثِرَ عَلَىٰ أَنَّهُمَا اسْتَحَقَّا إِثْمًا فَآخَرَانِ يَقُومَانِ مَقَامَهُمَا مِنَ الَّذِينَ اسْتَحَقَّ عَلَيْهِمُ الْأَوْلَيَانِ فَيُقْسِمَانِ بِاللَّهِ لَشَهَادَتُنَا أَحَقُّ مِن شَهَادَتِهِمَا وَمَا اعْتَدَيْنَا إِنَّا إِذًا لَّمِنَ الظَّالِمِينَ ﴿١٠٧﴾

**107** ఆ తరువాత ఆ ఇద్దరు సాక్షులు ఏదయినా పాపానికి పాల్పడ్డారని తెలిస్తే,[169] ఎవరికి వ్యతిరేకంగానయితే పాపం జరిగిందో వారిలో (మృతునికి) చాలా దగ్గరి వారైన ఇద్దరు వ్యక్తులు ముందుకు వచ్చి ఆ ఇద్దరి స్థానంలో నిలబడి,[170] "వారిద్దరి సాక్ష్యం కన్నా మా సాక్ష్యం ఎక్కువ సత్యబద్ధమైనది. ఈ విషయంలో మేము ఎలాంటి అతిక్రమణకూ పాల్పడటం లేదు. మేమే గనక అలా చేస్తే పరమ దుర్మార్గులమవుతాము" అని అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెప్పాలి.

ذَٰلِكَ أَدْنَىٰ أَن يَأْتُوا بِالشَّهَادَةِ عَلَىٰ وَجْهِهَا أَوْ يَخَافُوا أَن تُرَدَّ أَيْمَانٌ بَعْدَ أَيْمَانِهِمْ ۗ وَاتَّقُوا اللَّهَ وَاسْمَعُوا ۗ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الْفَاسِقِينَ ﴿١٠٨﴾

**108** ఈ పద్ధతివల్ల వారు యథాతథంగా సాక్ష్యమిస్తారనీ, తాము ప్రమాణాలు చేసిన తరువాత ప్రమాణాలు తమకు వ్యతిరేకంగా పరిణమిస్తాయన్న భయం[171] వారికి ఉంటుందని ఆశించబడు తోంది. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. వినండి! అల్లాహ్ అవిధేయ జనులకు సన్మార్గం చూపడు.

అర్థాలున్నాయి. 1. ముస్లిమేతరులూ (గ్రంథవహులు) కావచ్చు లేదా మరణశాసనం వ్రాసేవాని తెగకు చెందని వ్యక్తులు అని కూడా కావచ్చు.

167. మనిషి ప్రయాణావస్థలో తీవ్రంగా వ్యాధిగ్రస్తుడై, బ్రతికి బయటపడే ఆస్కారం లేనపుడు న్యాయవంతులైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టి వీలునామా వ్రాయదలిస్తే వ్రాయవచ్చు.

168. అంటే సాక్షులు మోసానికి పాల్పడినట్లుగానీ, వీలునామాను మార్చినట్లుగానీ మృతుని వారసులకు అనుమానం వస్తే వారు నమాజు చేసిన తరువాత జనుల సమక్షంలో నిలదీసి వారి నుంచి ప్రమాణం తీసుకోవాలి. మరోవైపు ప్రమాణం చేసేవారు కూడా, తాము ఈ వ్యవహారంలో ఎలాంటి ప్రతిఫలం తీసుకోవటంగానీ, లబ్ధిని పొందటంగానీ చేయలేదని చెప్పాలి.

169. అంటే వారు చేసిన ప్రమాణం బూటకమని స్పష్టమైపోతే.

170. అంటే మృతుని వారసులు, సమీప బంధువులైన ఇరువురు వ్యక్తులు ముందుకు వచ్చి, మొదటి సాక్షులిద్దరూ అన్యాయానికి

**109** ఏ రోజున అల్లాహ్ ప్రవక్తలందరినీ సమావేశపరచి, “మీకు ఏం సమాధానం లభించింది?” అని అడుగుతాడో ఆ రోజు, “మాకేమీ తెలియదు.[172] నిశ్చయంగా రహస్య విషయాల గురించి పరిపూర్ణ జ్ఞానం కలవాడవు నువ్వే” అని వారంటారు.

يَوْمَ يَجْمَعُ اللَّهُ الرُّسُلَ فَيَقُولُ مَاذَا أُجِبْتُمْ ۖ
قَالُوا لَا عِلْمَ لَنَا ۖ إِنَّكَ أَنتَ عَلَّامُ الْغُيُوبِ ﴿١٠٩﴾

**110** అప్పుడు అల్లాహ్ ఈ విధంగా అడుగుతాడు : “మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నేను నీకూ, నీ తల్లికి ప్రసాదించిన అనుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకో. అప్పుడు రూహుల్ ఖుదుస్[173] ద్వారా నేను నీకు సహాయం చేశాను. నీవు ఊయలలో ఉన్నప్పుడు,[174]

إِذْ قَالَ اللَّهُ يَا عِيسَى ابْنَ مَرْيَمَ اذْكُرْ نِعْمَتِي
عَلَيْكَ وَعَلَىٰ وَالِدَتِكَ إِذْ أَيَّدتُّكَ بِرُوحِ الْقُدُسِ
تُكَلِّمُ النَّاسَ فِي الْمَهْدِ وَكَهْلًا ۖ وَإِذْ عَلَّمْتُكَ

---

పాల్పడ్డారనీ, తమకు చెందవలసిన హక్కును కాజేశారని నొక్కిచెప్పాలి. ఈ వ్యవహారంలో తాము ఎలాంటి మోసానికి పాల్పడటం లేదనీ, ఎవరిపైనా నీలాపనిందలు మోపటం లేదని ప్రకటించాలి.

171. ఇలా ఒకటికి రెండుసార్లు నిలదీసి ప్రమాణాలు తీసుకునే పద్ధతివల్ల జనులు సాక్ష్యాల విషయంలో జాగ్రత్తపడే అవకాశం ఉంది. ఎందుకంటే వారు గనక అబద్ధపు ప్రమాణాలు చేస్తే ఏ క్షణంలోనయినా బండారం బయటపడవచ్చు. ఈ ఆయతు అవతరణ వెనుక బుదైల్ బిన్ అబూ మర్యమ్ సంఘటన ఒకటి ఉంది. ఆయన ఒకసారి వర్తకం నిమిత్తం సిరియా వెళ్ళారు. అక్కడ తీవ్రంగా జబ్బుపడి, మరణ సమయం ఆసన్నమయిందని భావించారు. ఆయన దగ్గర వర్తక సామగ్రితోపాటు ఒక వెండి పాత్ర కూడా ఉంది. అప్పుడాయన ఇద్దరు క్రైస్తవులను సాక్షులుగా తీసుకుని, తన తదనంతరం ఈ సామగ్రి తన వారసులకు అందజేయాలని చెప్పారు. ఆ తరువాత ఆయన చనిపోయారు. ఆ సాక్షులిరువురూ తిరిగి వచ్చాక వర్తక సామగ్రిని మాత్రం వారసులకు ముట్టజెప్పారు. కాని వెండిపాత్రను అమ్ముకుని చెరి సగం పంచుకున్నారు. ఆ సామగ్రిలో ఒక కవరు కనిపించింది. అందులో వస్తుసామగ్రి జాబితా కూడా ఉంది. దాని ప్రకారం ఒక వెండిపాత్ర లెక్కలోకి రావటం లేదు. దాని గురించి వారిని అడిగితే తమకేమీ తెలియదని అబద్ధపు ప్రమాణం చేశారు. అయితే ఆ పాత్రను వాళ్లు ఒక నగల వ్యాపారికి అమ్మినట్లు తెలిసింది. అప్పుడు మృతుని వారసులు ఆ ముస్లిమేతర సాక్షులకు వ్యతిరేకంగా ప్రమాణం చేసి ఆ పాత్ర పైకాన్ని రాబట్టుకున్నారు. ఈ ఉల్లేఖనం ప్రామాణికత రీత్యా బలహీనమైనది (తిర్మిజీ). అయితే మరొక ఆధారం ద్వారా హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) చేత కూడా ఈ సంఘటన సంక్షిప్తంగా ఉల్లేఖించబడింది. అల్లామా అల్‌బానీ దీనిని ప్రామాణికమైందిగా ఖరారు చేశారు (సహీహ్ తిర్మిజీ - సంపుటి - 3, నెంబర్ - 2449).

172. తమజాతి ప్రజలు తమ పట్ల చేసిన వ్యవహారం గురించి ప్రవక్తలకు తెలిసే ఉంటుంది. అయితే ప్రళయదినం నాటి భీతావహ పరిస్థితి వల్లనో లేక ప్రళయదిన అధినేత అయిన అల్లాహ్ సమక్షంలో మాట్లాడే ధైర్యం లేకనో వారు చెప్పటానికి నిరాకరిస్తారు. లేదా తాము చనిపోయిన తరువాత ఆయా జాతుల వారు అవలంబించిన పోకడలను గురించి తమకు ఏమీ తెలియదన్నది వారి ఉద్దేశమై ఉండవచ్చు. అదీగాక రహస్య విషయాల జ్ఞానమంతా అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఆ విషయాన్నే ప్రవక్తలు వెల్లడించారు.

దీన్నిబట్టి బోధపడేదేమిటంటే దైవప్రవక్తలకు అగోచర విషయాల జ్ఞానం ఉండదు. కేవలం అల్లాహ్ మాత్రమే అగోచర విషయాల జ్ఞాని. కాకపోతే దైవదౌత్య బాధ్యతల నిర్వహణకు సంబంధించిన కొన్ని విషయాలు ప్రవక్తలకు తెలియజేయబడతాయి. అవి కూడా వహీ ద్వారా తెలియపరచబడతాయి. ఒకరి ద్వారా ఒక విషయాన్ని తెలుసుకునేవారు అగోచర విషయాల జ్ఞాని కాజాలరు. ప్రత్యక్షంగా అన్ని విషయాల జ్ఞానం కలవాడు మాత్రమే అగోచర జ్ఞాని కాగలడు.

173. **‘రూహుల్ ఖుదుస్’** అంటే దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) అని భావం. ఇంతకుముందు అల్ బఖరా సూరాలోని 87వ ఆయతులో కూడా ఈ విషయం వచ్చింది.

174. హజ్రత్ మర్యమ్ (అలైహిస్సలాం) పసికందు అయిన ఈసాను ఎత్తుకుని తన జాతి ప్రజల వద్దకు వచ్చినప్పుడు,

الْكِتٰبَ وَالْحِكْمَةَ وَالتَّوْرٰىةَ وَالْاِنْجِيْلَ ۚ وَاِذْ
تَخْلُقُ مِنَ الطِّيْنِ كَهَيْـَٔةِ الطَّيْرِ بِاِذْنِىْ فَتَنْفُخُ
فِيْهَا فَتَكُوْنُ طَيْرًاۢ بِاِذْنِىْ وَتُبْرِئُ الْاَكْمَهَ
وَالْاَبْرَصَ بِاِذْنِىْ ۚ وَاِذْ تُخْرِجُ الْمَوْتٰى بِاِذْنِىْ ۚ
وَاِذْ كَفَفْتُ بَنِىْٓ اِسْرَآءِيْلَ عَنْكَ اِذْ جِئْتَهُمْ
بِالْبَيِّنٰتِ فَقَالَ الَّذِيْنَ كَفَرُوْا مِنْهُمْ اِنْ هٰذَآ
اِلَّا سِحْرٌ مُّبِيْنٌ ﴿110﴾

పెద్దవాడైన తరువాత కూడా ప్రజలతో మాట్లాడేవాడివి. అప్పుడు నేను నీకు గ్రంథాన్నీ, వివేకాన్నీ తౌరాతునూ, ఇంజీలునూ[175] నేర్పాను. అప్పుడు నీవు నా అనుమతితో, మట్టితో పక్షి ఆకారం లాంటి దాన్ని తయారుచేసి, అందులోకి ఊదగానే నా అనుమతితో అది (నిజంగానే) పక్షి అయిపోయేది. అలాగే నీవు నా అనుమతితో పుట్టుగుడ్డినీ, కుష్టు రోగినీ బాగుచేసేవాడివి. నా అనుమతితో మృతులను లేపి నిలబెట్టే వాడివి.[176] నీవు స్పష్టమైన నిదర్శనాలతో ఇస్రాయీలు వంశీయుల వద్దకు వచ్చినపుడు, 'ఇది స్పష్టమైన మాయాజాలం తప్ప మరేమీ కాదు' అని వారిలోని సత్య తిరస్కారులు చెప్పారు.[177] ఆ సమయంలో మేము వారిని నీ నుంచి ఆపాము.[178]

వారు ఆ పసివాణ్ణి చూసి ఆశ్చర్యపోయారు. ఆయన పుట్టుక గురించి ప్రజలు రకరకాల ప్రశ్నల వర్షం కురిపించసాగారు. తల్లడిల్లిన ఆ తల్లి ఆ పసివాని వంక చూడగా, పాలు త్రాగే వయసులోనే ఆ బాలుడు దైవాజ్ఞతో తన జాతి జనులతో మాట్లాడాడు. 'పెద్దవాడైన తరువాత కూడా సంభాషించాడు' అంటే ప్రవక్తగా నియుక్తుడైన పిమ్మట దైవసందేశాన్ని అందజేశాడని అర్థం.

175. ఆలి ఇమ్రాన్ సూరాలోని 48వ ఆయతు క్రింద ఈ వివరణ ఇవ్వబడింది.

176. ఈ మహిమల ప్రస్తావన కూడా ఆలి ఇమ్రాన్ సూరాలోని 49వ ఆయతులో వచ్చింది.

177. ప్రవక్త మాటలను ధిక్కరించేవారు సాధారణంగా అతను చూపే సూచనలను, మహిమలను జాలవిద్య అని చెప్పి తేలిగ్గా కొట్టిపారేస్తారు. జాలవిద్య తాంత్రిక విద్యలకు సంబంధించినది. దైవప్రవక్తలు ఇలాంటి మంత్రతంత్రాల జోలికి అసలు పోరు. పైగా ప్రవక్తల ద్వారా ప్రస్ఫుటమయ్యే మహిమలు సర్వాధికారి అయిన అల్లాహ్ శక్తికి ప్రబల తార్కాణంగా ఉంటాయి. ఎందుకంటే ఈ మహిమలు దైవాజ్ఞతోనే ఉనికిలోకి వస్తాయి. వాటి వెనుక దేవుని పరమార్థం ఉంటుంది. ఏ ప్రవక్త అయినా తాను కోరినప్పుడల్లా దైవాజ్ఞతో నిమిత్తం లేకుండా మహిమలను చూపలేదు. అందుకే హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు) గారి మహిమల ప్రస్తావన వచ్చినప్పుడు అల్లాహ్ నాలుగుసార్లు 'నా అనుమతితో' అని చెప్పాడు. ప్రవక్త ఈసా ఏ మహిమను చూపినా అది తన ఆజ్ఞమేరకే జరిగిందని అల్లాహ్ స్పష్టం చేశాడు. ఈ కారణంగానే వివిధ మహిమలు చూపమని మక్కాలోని ముష్రిక్కులు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను కోరినప్పుడు, ఆయన ఏమన్నారో చూడండి : "నా ప్రభువు పరమ పవిత్రుడు (ఆయనకు ఏదీ అసాధ్యం కాదు. ఆయన బలహీనతలన్నింటికీ అతీతుడు. అయితే మహిమలు చూపవలసిన అవసరం నిజంగానే ఉందా? ఉంటే ఎట్టి పరిస్థితుల్లో చూపాలి? ఈ సంగతి ఆయనకే తెలుసు. తదనుగుణంగానే ఆయన నిర్ణయం గైకొంటాడు) నేనైతే మానవమాత్రుణ్ణి, ప్రవక్తను మాత్రమే." అంటే నా అంతట నేను ఎలాంటి మహిమలు చూపలేను. (వివరాలకు బనీ ఇస్రాయీల్ సూరా 91 – 93 ఆయతులు చూడండి).

మొత్తమ్మీద చెప్పొచ్చేదేమంటే దైవప్రవక్తలు చూపే మహిమలకు మంత్రతంత్రాలతో, చేతబడితో ఎలాంటి సంబంధం లేదు. ఒకవేళ సంబంధమే గనక ఉండి ఉంటే మంత్రగాళ్లు ప్రవక్తల మహిమలకు విరుగుడును కూడా కనుగొనేవారు. ప్రపంచంలోని పేరుమోసిన మంత్రగాళ్ళంతా కలసి కూడా దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) మహిమలకు విరుగుడును ప్రదర్శించలేకపోయారు. పైగా దైవాజ్ఞతో ప్రదర్శించబడిన మహిమలను తాము ఎదుర్కోలేమని తెలియగానే వారు ముస్లింలుగా మారిపోయారు.

178. యూదులు హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు)ను చంపటానికి పన్నిన కుట్ర గురించి ఈ వాక్యంలో సూచించటం జరిగింది.

**111** "మీరు నన్నూ, నా ప్రవక్తనూ విశ్వసించండి" అని నేను హవారీలకు ఆజ్ఞాపించినప్పుడు,[179] "మేము విశ్వసించాము, మేము పూర్తిగా విధేయులమయ్యాము అన్నదానికి నువ్వు సాక్షిగా ఉండు" అని వారన్నారు.

وَإِذْ أَوْحَيْتُ إِلَى الْحَوَارِيِّنَ أَنْ آمِنُوا بِي وَبِرَسُولِي
قَالُوا آمَنَّا وَاشْهَدْ بِأَنَّنَا مُسْلِمُونَ ﴿١١١﴾

**112** "మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నీ ప్రభువు మా కోసం ఆహార పదార్థాలతో నిండిన ఒక పళ్లాన్ని ఆకాశం నుంచి దింపగలడా?"[180] అని హవారీలు అడిగిన సందర్భం జ్ఞాపకం చేసుకోదగినది. అప్పుడు ఈసా, "మీరే గనక విశ్వాసులైతే అల్లాహ్‌కు భయపడండి"[181] అన్నాడు.

إِذْ قَالَ الْحَوَارِيُّونَ يَا عِيسَى ابْنَ مَرْيَمَ هَلْ
يَسْتَطِيعُ رَبُّكَ أَنْ يُنَزِّلَ عَلَيْنَا مَائِدَةً مِنَ
السَّمَاءِ قَالَ اتَّقُوا اللَّهَ إِنْ كُنْتُمْ مُؤْمِنِينَ ﴿١١٢﴾

**113** దానికి వారిలా అన్నారు: "అందులోని ఆహారాన్ని తినాలని, తద్వారా మా మనసులు సంతృప్తి చెందాలనీ, నీవు మాకు చెప్పినదంతా సత్యమనే నమ్మకం మాలో మరింత పెరగాలనీ, మేము సాక్ష్యమిచ్చే వారం కాగలగాలనీ కోరుకుంటున్నాము."

قَالُوا نُرِيدُ أَنْ نَأْكُلَ مِنْهَا وَتَطْمَئِنَّ قُلُوبُنَا
وَنَعْلَمَ أَنْ قَدْ صَدَقْتَنَا وَنَكُونَ عَلَيْهَا مِنَ
الشَّاهِدِينَ ﴿١١٣﴾

**114** అప్పుడు మర్యమ్ కుమారుడగు ఈసా ఇలా వేడుకున్నాడు : "ఓ అల్లాహ్! మా ప్రభూ! ఆకాశం నుంచి మాపై ఆహారంతో నిండిన పళ్లాన్ని దించు. అది మా కొరకు, అనగా

قَالَ عِيسَى ابْنُ مَرْيَمَ اللَّهُمَّ رَبَّنَا أَنْزِلْ
عَلَيْنَا مَائِدَةً مِنَ السَّمَاءِ تَكُونُ لَنَا عِيدًا

అల్లాహ్ వారి బారినుంచి ఆయన్ని కాపాడుతూ, ఆయన్ని ఆకాశంపైకి లేపుకున్నాడు. వివరాలకు ఆలి ఇమ్రాన్ సూరాలోని 54వ ఆయతును చూడండి.

179. **"హవారీలు"** అంటే దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం)ను విశ్వసించి, ఆయనకు మద్దతుగా నిలిచిన అనుయాయులు. వారు మొత్తం 12 మంది అని చెప్పబడుతోంది. ఇక్కడ 'వహీ' అంటే దైవదూత ద్వారా పంపబడిన 'వహీ' కాదు. ఇక్కడ 'వహీ' అంటే భావం దేవుని తరఫున కొంతమంది మనసులలో కల్పించబడే సద్బుద్ధి. లేక దివ్య సంకేతం. ఇలాంటి సంకేతమే దైవప్రవక్త మూసా తల్లిగార్కి, దైవప్రవక్త ఈసా మాత హజ్రత్ మర్యమ్ గారికి కూడా ఇవ్వబడింది. ఈ సంకేతాన్నే దివ్య ఖుర్ఆన్ 'వహీ'గా పేర్కొన్నది.

ఇక్కడ సంకేతాన్ని 'వహీ'గా పేర్కొనటం చూసి కొంతమంది, మూసా ప్రవక్త తల్లి మరియు మర్యమ్ లిరువురూ స్త్రీ ప్రవక్తలయి ఉంటారనీ, వారి మీదకు కూడా వహీ అవతరిస్తూ ఉండవచ్చనీ తలపోశారు. కాని ఇది సరైనది కాదు.

180. అరబీలో **'మాయిద' (مَائِدَة)** అని అనబడింది. మాయిద అంటే ఆహారంతో కూడుకున్న పాత్ర, పళ్ళెం అని అర్థం. అందుకే వడ్డించిన విస్తరి అన్న భావంలో కూడా దీన్ని తీసుకుంటారు. ఈ సూరా కూడా ఈ పేరుతోనే ఉంది అన్నది గమనార్హ విషయం. దైవప్రవక్త ఇబ్రాహీం లోగడ ఏ విధంగానయితే మరణానంతర జీవితాన్ని కళ్ళారా చూడాలని అభిలషించారో అదేవిధంగా హవారీలు తమ ఆత్మ తృప్తికోసం ఇలాంటి ఒక పాత్రను ఆకాశం నుంచి దించమని కోరారు.

181. అంటే, మీరు ఇలాంటి విపరీతమైన కోర్కెలు కోరకండి. ఇలాంటి కోర్కెలు మీ పాలిట పరీక్షగా పరిణమించవచ్చు. మీ కోరిక మేరకు ఒకవేళ ఇలాంటి మహిమ మీకు చూపించబడిన తరువాత కూడా మీరు విశ్వాసంలో బలహీనులుగా

لِّأَوَّلِنَا وَآخِرِنَا وَآيَةً مِّنكَ ۖ وَارْزُقْنَا وَأَنتَ خَيْرُ الرَّازِقِينَ ﴿114﴾

మాలోని తొలివారు, తుది వారందరికీ సంతోషకరమైన విషయం (పండుగ) కావాలి.[182] ఇంకా నీ తరఫున అది ఒక సూచన కాగలగాలి. నీవు మాకు ఆహారం ప్రసాదించు. నీవు అందరికన్నా శ్రేష్ఠమైన ఆహార ప్రదాతవు."

قَالَ اللَّهُ إِنِّي مُنَزِّلُهَا عَلَيْكُمْ ۖ فَمَن يَكْفُرْ بَعْدُ مِنكُمْ فَإِنِّي أُعَذِّبُهُ عَذَابًا لَّا أُعَذِّبُهُ أَحَدًا مِّنَ الْعَالَمِينَ ﴿115﴾

**115** దానికి అల్లాహ్ ఇలా జవాబిచ్చాడు: "సరే, ఆ ఆహారాన్ని నేను మీపై అవతరింపజేస్తాను.[183] మరి ఆ తరువాత కూడా మీలో ఎవరయినా అవిశ్వాసానికి పాల్పడితే లోకంలో ఎవరికీ విధించనటువంటి శిక్షను వారికి విధిస్తాను."

---

మారితే, అది మీ శిక్షకు కారణంగా మారవచ్చు. అందుకే మీరు ఇలాంటి విపరీతమైన డిమాండ్లు చేసి దైవాగ్రహాన్ని కొనితెచ్చుకోకండి. దైవానికి భయపడండి అని హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) హవారీలకు నచ్చజెప్పారు.

182. ఇస్లామీయ షరీయతుల్లో పండుగ అంటే అర్థం జాతీయపండుగో, స్వాతంత్ర్య దినోత్సవమో కాదు. అవధులు మీరిన ఆనంద ప్రలాపనలతో, నీతీ నియమాలకు తిలోదకాలిచ్చి, షరీయతు ఆదేశాలను కాలరాచి తైతక్కలాడే ఉత్సవం అంతకన్నా కాదు. ఈ రోజుల్లో పర్వదినాన్ని ఈ అర్థంలోనే తీసుకోవటం పరిపాటి అయి పోయింది. కాని ఆకాశ ధర్మాలలో (షరీయతులలో) అసలు పండుగ అనేది ఒక సామూహిక ఉత్సవం అయి ఉంటుంది. ఆ రోజు ఆ సమాజంలోని సభ్యులంతా కలసి దేవుడు చేసిన మేళ్లకు గాను కృతజ్ఞతలు తెలుపుకుంటారు. ఆయన గొప్పదనాన్ని, ఔన్నత్యాన్ని చాటిచెప్పే తక్బీర్లు పలుకుతారు. దైవదాస్య భావం తొణికిసలాడే విధంగా స్తుతిగీతికను ఆలాపిస్తారు. దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) ఆ రోజును 'పండుగ రోజు'గా జరుపుకోవాలని అభిలషించటంలోని పరమార్థం కూడా అదే. కొంతమంది మహానుభావులు ఈ 'మాయిద పండుగ' (ఈదె మాయిద)ను ఆధారంగా చేసుకుని 'ఈదె మీలాద్' కూడా అటువంటి సంతోషదాయక ఘడియేనని భాష్యం చెప్పారు. కాని అసలు ఈ 'ఈదె మాయిద' 'షరీయతె ముహమ్మదీ'కి సంబంధించినదే కాదు. ఒకవేళ ఇస్లాం గనక దాన్ని కొనసాగించదలిస్తే ఆ మేరకు ప్రకటన చేయబడేది. అదలా ఉంచితే, ఆ రోజు పండుగ రోజు కాగలగాలి అన్న అభిలాషను మాత్రమే ప్రవక్త ఈసా వెల్లడించారు. ఒకవేళ పండుగ అన్నా కూడా దాన్ని, పై వాక్యాల్లో వివరించినట్టుగానే అర్థం చేసుకోవాలి. కాని 'ఈదె మీలాద్'లో ఇటువంటివేమీ లేవు. కనుక బిద్అతీలు జరుపుకునే 'ఈదె మీలాద్'కు ఇస్లామీయ షరీయతులో ఎలాంటి ఆధారం లేదనీ, అది ధర్మంలో కల్పించబడిన ఓ సరికొత్త పోకడ (బిద్అత్) అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇస్లాంలో రెండే రెండు పండుగలున్నాయి. 1. ఈదుల్ ఫిత్ర్ 2. ఈదుల్ అజ్హా. ఈ రెండు పండుగలు మినహా మరో పండుగ ఏదీ లేదు.

183. ఇంతకీ ఆ ఆహార పదార్థాల పాత్ర ఆకాశం నుంచి అవతరించిందా? లేదా? దీన్ని విడమరచి చెప్పే ప్రామాణికమైన, స్పష్టమైన దైవప్రవక్త (స) గారి హదీసు ఏదీ లేదు. కాకపోతే ఇమామ్ షౌకానీ, ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ సహా అధికసంఖ్యాక విద్వాంసులు "ఆ పాత్ర అవతరించింది" అనే అంటున్నారు. "దాన్ని మీపై అవతరింపజేస్తాను" అన్న ఖుర్ఆన్ వాక్యాన్ని వారు ఆధారంగా తీసుకున్నారు. అల్లాహ్ వాగ్దానం సత్యబద్ధం అన్న విషయంలో ఎలాంటి సందేహానికి తావు లేదుగాని, "అవతరింపజేసిన తరువాత కూడా ఎవరయినా విశ్వాసఘాతకులుగా ప్రవర్తిస్తే కఠినంగా శిక్షిస్తాను" అని ఆయన చెప్పటాన్ని బట్టి దేవుని వాగ్దానం షరతుతో కూడుకున్నదైపోయింది. దేవుడు ఈ షరతు విధించేసరికి 'ఆహారపాత్రను దించవలసిన అవసరం లేద'ని హవారీలు చెప్పారని మరికొంతమంది విద్వాంసులు పేర్కొన్నారు. ఇమామ్ ఇబ్నె కసీర్ కూడా ఈ వాదనను సమర్థించారు. ఆ పాత్ర అవతరించిందన్న విషయం క్రైస్తవులలో కూడా ప్రసిద్ధి చెందలేదు. క్రైస్తవ గ్రంథాలలో కూడా పొందుపరచబడిలేదు. నిజంగా అది అవతరించి ఉంటే ఆ విషయం ఖ్యాతి గడించటమేగాక, వారి గ్రంథాలలో కూడా గ్రంథస్థం అయి ఉండేదని ఆయన అభిప్రాయ పడ్డారు. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.

**116** (ఆ తరువాత) "మర్యమ్ పుత్రుడవైన ఓ ఈసా! అల్లాహ్‌ను వదలి నన్నూ, నా తల్లిని ఆరాధ్య దైవాలుగా చేసుకోండి అని గాని నీవు ప్రజలకు చెప్పావా?"[184] అని అల్లాహ్ (నిలదీసి) అడిగే సందర్భం కూడా స్మరించుకోదగినదే. అప్పుడు ఈసా ఇలా విన్నవించుకుంటారు: "(ఓ అల్లాహ్!) నిన్ను పరమ పవిత్రునిగా భావిస్తున్నాను. ఏ మాటను అనే హక్కు నాకు లేదో అలాంటి మాటను అనటం నాకేమాత్రం తగదు. ఒకవేళ నేను గనక అలాంటిదేదైనా అని ఉంటే అది నీకు తెలిసి ఉండేది. నా మనసులో ఏముందో కూడా నీకు తెలుసు. కాని నీలో ఏముందో నాకు తెలీదు.[185] నిశ్చయంగా నీవు సమస్త గుప్త విషయాలను ఎరిగినవాడవు.

وَإِذْ قَالَ اللَّهُ يَا عِيسَى ابْنَ مَرْيَمَ أَأَنتَ
قُلْتَ لِلنَّاسِ اتَّخِذُونِي وَأُمِّيَ إِلَٰهَيْنِ مِن
دُونِ اللَّهِ ۖ قَالَ سُبْحَانَكَ مَا يَكُونُ لِي أَنْ
أَقُولَ مَا لَيْسَ لِي بِحَقٍّ ۚ إِن كُنتُ قُلْتُهُ
فَقَدْ عَلِمْتَهُ ۚ تَعْلَمُ مَا فِي نَفْسِي وَلَا أَعْلَمُ
مَا فِي نَفْسِكَ ۚ إِنَّكَ أَنتَ عَلَّامُ الْغُيُوبِ ﴿١١٦﴾

**117** 'నా ప్రభువూ, మీ ప్రభువూ అయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి' అని నీవు చెప్పమని ఆజ్ఞాపించిన విషయం తప్ప మరో మాటను నేను వారికి చెప్పలేదు.[186] నేను వారిమధ్య ఉన్నంత కాలం వారిపై సాక్షిగా ఉన్నాను. నీవు నన్ను పైకి లేపుకున్న తరువాత నువ్వే వారిని కనిపెట్టుకుని ఉన్నావు.[187] వాస్తవానికి అన్ని విషయాలను కనిపెట్టుకుని ఉండేవాడవు నువ్వే.

مَا قُلْتُ لَهُمْ إِلَّا مَا أَمَرْتَنِي بِهِ أَنِ اعْبُدُوا اللَّهَ
رَبِّي وَرَبَّكُمْ ۚ وَكُنتُ عَلَيْهِمْ شَهِيدًا مَّا دُمْتُ
فِيهِمْ ۖ فَلَمَّا تَوَفَّيْتَنِي كُنتَ أَنتَ الرَّقِيبَ عَلَيْهِمْ ۚ
وَأَنتَ عَلَىٰ كُلِّ شَيْءٍ شَهِيدٌ ﴿١١٧﴾

184. ఈ ప్రశ్న తీర్పుదినాన వేయబడుతుంది. అల్లాహ్‌ను వదలి ఇతరత్రా వస్తువులను, మనుషులను ఆరాధ్య దైవాలుగా చేసుకున్న వారికి ఇది హెచ్చరిక లాంటిది. మీరు ఎవరిని ఆరాధ్యదైవాలుగా, అక్కరలు తీర్చేవారుగా తలపోశారో వారు కూడా దేవుని దర్బారులో నిలదీయబడతారు. రెండో విషయం ఏమంటే, క్రైస్తవులు ప్రవక్త ఏసుతోపాటు ఆయన తల్లి అయిన మర్యమ్‌ను కూడా దైవంగా చేసుకున్నారు. మూడో ముఖ్య విషయం: దైవేతర ఆరాధ్యదేవుళ్ళు (మిన్‌దూనిల్లాహ్) అంటే ముష్రిక్కులు పూజించే రాళ్ళు రప్పలు, చెట్టుపుట్టలు మాత్రమే కాదు, ప్రజలు ఏదో ఒక ఉద్దేశంతో, భక్తితో ఆరాధించే పుణ్యపురుషులు, సజ్జనులు, మహనీయులు కూడా 'దైవేతర ఆరాధ్య దేవుళ్ళ' కోవలోకి వస్తారు. ఉదాహరణకు : హజ్రత్ ఈసా (ఏసు), హజ్రత్ మర్యమ్ (అలైహిస్సలాం).

185. తన వద్ద అగోచర జ్ఞానం లేదని దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) ఎంత స్పష్టంగా, మరెంత నిర్ద్వంద్వంగా చెబుతున్నారో చూడండి!

186. హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) ఉయ్యాలలో ఉన్న పసితనంలోనూ, యుక్తవయస్సు వచ్చిన తరువాత కూడా ప్రజలను ఏకదైవారాధన వైపుకు పిలిచారన్నది గమనార్హ విషయం.

187. అరబీలో **'తవప్ఫైతనీ'** (**تَوَفَّيْتَنِي**) అని అనబడింది. ప్రపంచం నుండి నీవు నన్ను రప్పించుకున్న తరువాత అని దీని భావం. ఆలి ఇమ్రాన్ సూరాలోని 55వ ఆయతులో కూడా దీని ప్రస్తావన వచ్చింది. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే ప్రవక్తలకు ఏ విషయాలు తెలిసినా, అవి దైవప్రసాదితం అయి ఉంటాయి. అంతకుమించి వారివద్ద గుప్త విషయాల జ్ఞానం ఉండదు. ఒకరి మార్గదర్శకం లేకుండా ఆది నుంచి అంతం వరకూ సమస్త విషయాల జ్ఞానం కలవాడే 'రహస్య విషయాల జ్ఞాని' అనబడతాడు. ఈ రకమయిన జ్ఞానం అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ లేదు. అందుచేత అల్లాహ్ మాత్రమే అగోచర విషయాల జ్ఞాని. ఈ గుణం వేరొకరిలో లేదు.

إِنْ تُعَذِّبْهُمْ فَإِنَّهُمْ عِبَادُكَ ۚ وَإِنْ تَغْفِرْ لَهُمْ فَإِنَّكَ أَنْتَ الْعَزِيزُ الْحَكِيمُ ﴿118﴾

**118** "ఒకవేళ నీవు వారిని శిక్షించినట్లయితే వారు నీ దాసులు. నీవు గనక వారిని క్షమించినట్లయితే నిశ్చయంగా నీవు సర్వాధిక్యుడవు, వివేచనాపరుడవు."[188]

قَالَ اللَّهُ هَٰذَا يَوْمُ يَنْفَعُ الصَّادِقِينَ صِدْقُهُمْ ۚ لَهُمْ جَنَّاتٌ تَجْرِي مِنْ تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا أَبَدًا ۚ رَضِيَ اللَّهُ عَنْهُمْ وَرَضُوا عَنْهُ ۚ ذَٰلِكَ الْفَوْزُ الْعَظِيمُ ﴿119﴾

**119** అల్లాహ్ ఈ విధంగా సెలవిస్తాడు: "ఈ రోజు సత్యవంతులకు వారి సత్యం ప్రయోజనకరమవుతుంది.[189] క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలు వారికి ప్రాప్తిస్తాయి. అందులో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు. వాస్తవానికి గొప్ప సాఫల్యమంటే ఇదే.

لِلَّهِ مُلْكُ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا فِيهِنَّ ۚ وَهُوَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿120﴾

**120** ఆకాశాలు, భూమి, ఇంకా వాటిలో ఉన్న సమస్త వస్తువుల ఆధిపత్యం అల్లాహ్‌దే. ఆయన అన్నింటి పై అధికారం కలవాడు.

---

ఒక హదీసులో ఇలా ఉంది : ప్రళయదినాన హష్ర్ మైదానంలో, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అనుయాయులు కొంతమంది ఆయన (స) వైపుకు వస్తూ ఉంటారు. కాని దైవదూతలు వారిని పట్టుకుని వేరొకవైపు లాక్కుపోతుంటారు. "వారిని నా వద్దకు రానివ్వండి. వాళ్లు నా అనుయాయులు" అని ఆయన (స) చెప్పగా, "(ఓ ముహమ్మద్! వీళ్ల నిజ స్వరూపం) మీకు తెలీదు. మీ తదనంతరం వీళ్లు ధర్మంలో లేనిపోని కొత్త విషయాలను కల్పించారు" అని దైవదూతలంటారు.

ఈ సంగతి తెలియగానే తను కూడా, సదాచారి అయిన దైవదాసుడు ఈసా (అలైహిస్సలామ్) చెప్పినట్టు "నేను వారి మధ్య ఉన్నంతకాలం వారిపై సాక్షిగా ఉన్నాను. నీవు నన్ను పైకి లేపుకున్న తర్వాత నువ్వే వారిని కనిపెట్టుకొని ఉన్నావు" అని దేవునితో అంటానని ముహమ్మద్ (సఅసం) చెప్పారు. (సహీహ్ బుఖారీ : తఫ్సీర్ సూరతుల్ మాయిద; సహీహ్ ముస్లిం – బాబు ఫనాయిద్దున్యా వ బయానుల్ హష్ర్ యౌమల్ ఖియామ).

188. అల్లాహ్! వీళ్ల వ్యవహారం పూర్తిగా నీ అధీనంలో ఉంది. నీవు ఎలా వ్యవహరించినా అది నీ యిష్టం. నిన్ను నిలదీసి అడిగే వారెవరూ లేరు అన్నది హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) పలుకుల ఆంతర్యం.

"ఆయన తాను చేసే పనులకు ఎవరి ముందూ జవాబుదారు కాడు. కాని అందరూ (ఆయన ముందు) జవాబుదారులే" (అల్ అంబియా – 23). ఈ ఆయతులో దేవుని సమక్షంలో దాసుని అశక్తత, నిస్సహాయ స్థితి వ్యక్తపరచబడటంతో పాటు, దేవుని ఔన్నత్యం, శక్తి, తిరుగులేని అధికారం, సార్వభౌమత్వం కూడా వివరించబడ్డాయి. ఈ రెండు విషయాల ఆధారంగా మన్నింపు కూడా అర్థించబడింది. సుబ్‌హానల్లాహ్! ఎంత విచిత్రమైన, నిగూఢమైన వచనమిది!! అందుకే మహాప్రవక్త (సఅసం) ఒక రోజు రాత్రి నఫిల్ నమాజులో ఖుర్ఆన్ పారాయణం చేస్తూ ఈ ఆయతు దగ్గరకు రాగానే తన ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. ఆయన (స) మనోఫలకంపై దీని ప్రభావం ఎంతగా పడిందంటే అన్ని రకాతులలోనూ ఈ ఆయతునే పఠించసాగారు. ఈ పఠనం తెల్లవారేదాకా సాగింది (ముస్నదె అహ్మద్ – సంపుటి: 5, పేజీ – 149).

189. ఆ రోజు ఏక దైవారాధకులకు మాత్రమే వారి ఏక దైవారాధన లాభకరం అవుతుందని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఈ ఆయతుకు భావార్థం చెప్పారు. అంటే ఆ రోజు బహుదైవారాధకుల క్షమాపణలు స్వీకరించబడవన్నమాట.

6 వ సూరా

# అల్ అన్ఆమ్

## పశువులు

అవతరణ మక్కాలో

ఆయతులు 165

### పరిచయం

*ఈ సూరాలో పశువుల గురించి వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు "అన్ఆమ్" అనే పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా ముఖ్యంగా రెండు విషయాలను నొక్కి చెబుతుంది. అవి: ధార్మిక విశ్వాసం (ఈమాన్), ఇస్లామీయ మౌలిక సూత్రాలు.*

*ఈ మౌలిక సూత్రాలు ఇస్లామీయ విశ్వాసాలకు పునాదుల వంటివి. దేవుని విశ్వ సామ్రాజ్యాధిపత్యం, దైవవచనాల అవతరణ, మరణానంతరం మళ్ళీ బ్రతికించబడడం, తీర్పుదినాన శిక్షా బహుమానాలు మొదలైనవి ఇందులో ఉన్నాయి. ఈ సూరా అల్లాహ్‌కు ఉన్న శక్తిసామర్థ్యాలను, ఆయనకు మాత్రమే ప్రత్యేకమైన సృష్టించేశక్తిని విశదీకరిస్తూ, దేవుని విశ్వసామ్రాజ్యాధిపత్యానికి రుజువులు చూపించింది. అల్లాహ్ భూమ్యాకాశాల సృష్టికర్త అని ఈ సూరా స్పష్టం చేసింది. ఆయన మానవాళిని మట్టి నుంచి సృష్టించాడనీ, ఒకే ఒక్క ప్రాణి నుంచి మానవాళిని పుట్టించాడనీ, ఆయన అన్నీ తెలిసినవాడనీ, అన్నీ గ్రహించేవాడనీ, మనం రహస్యంగా ఉంచినవాటిని, బహిర్గతం చేసినవాటిని, మనం చేసే ప్రతి పనిని ఎరిగినవాడని, మనకు కనబడని అగోచర విషయాల తాళాలు ఆయన వద్దనే ఉన్నాయని (అంటే మన గ్రహణ శక్తి, ఇంద్రియ జ్ఞానానికి అతీతమైన విషయాలన్నీ తెలిసినవాడనీ), ఆయన మనలను రాత్రులలో మృతుల మాదిరిగా చేస్తాడనీ, విత్తనాన్ని, టెంకను చీల్చి మొలకెత్తేలా చేసేది ఆయనేనని, నిర్జీవ పదార్థం నుంచి జీవిని, జీవి నుంచి నిర్జీవ పదార్థాన్ని తీసేదీ ఆయనేననీ, రాత్రిని విశ్రాంతి సమయంగా చేసింది ఆయనేననీ, మానవాళి ప్రయోజనం కొరకు సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, నక్షత్రాలను సృష్టించింది ఆయనేననీ ఈ సూరా అల్లాహ్ గురించి విశదీకరిస్తుంది.*

*అల్లాహ్ ఒక్కడే అనీ, యూదులు క్రైస్తవులు ఆపాదించిన విషయాలకు ఆయన అతీతుడని ఈ సూరా స్పష్టం చేసింది. అల్లాహ్ విషయంలో అబద్ధాలు కల్పించవద్దని ఇరువర్గాలనూ హెచ్చరించడం జరిగింది. వాళ్ళు (గ్రంథం కల ప్రజలు) తమ సంతానాన్ని గుర్తించినంత తేలిగ్గా దివ్య ఖుర్ఆన్ అల్లాహ్ వచనం అన్న విషయాన్ని గుర్తిస్తున్నారనీ, కాని ఆత్మ వినాశనానికి పాల్పడిన వాళ్ళు ఈ నిజాన్ని నమ్మలేకపోతున్నారని ఈ సూరా వ్యాఖ్యానించింది. క్రైస్తవులకు సంబంధించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, విశ్వాన్ని సృష్టించిన అల్లాహ్‌కు అసలు భార్యే లేనప్పుడు కొడుకు ఎలా ఉంటాడని ప్రశ్నించింది. సృష్టి వెనుక ఉద్దేశ్యాలు, లక్ష్యాలను, భూమిపై మన ఉనికి ఉద్దేశ్య లక్ష్యాలను ఈ సూరా చివర్లో ప్రస్తావించింది. అల్లాహ్ దృష్టిలో మానవాళికి ప్రత్యేకమైన హోదా ఉందని ఈ సూరా తెలిపింది. భూమిపై మనిషి ఉత్తమమైన విధంగా వ్యవహరించాలని ఉద్బోధిస్తుంది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 6 | 97, 51<br>28, 22<br>18 | 'సముద్రం చీలటం' 'హెచ్చరించే దూతలు' 'అల్లాహ్ పథకం' 'నిష్ఫలం' 'జలప్రళయం' | ఎన్నో మానవ సముదాయాలను వారి తలబిరుసు వైఖరి కారణంగా అల్లాహ్ నాశనం చేశాడని ప్రపంచ చరిత్ర చెబుతోంది. ఉదాహరణకు కొన్ని సంఘటనలు. |
| 74-83 | 30 | 'దైవప్రవక్త ఇబ్రాహీమ్' | ఇబ్రాహీమ్ ప్రవక్త జీవితం ఏక దైవారాధనకు పెట్టింది పేరు. ఆయన పేరు వింటేనే మనకు 'తౌహీద్' (ఏక దైవారాధన) గుర్తుకు వస్తుంది. ఆ సమాచారం మొత్తం ఒకేచోట లభిస్తుంది. |

# అల్ అన్ఆమ్ సూరా

# سُورَةُ الْأَنْعَامِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَجَعَلَ الظُّلُمٰتِ وَالنُّوْرَ ثُمَّ الَّذِیْنَ كَفَرُوْا بِرَبِّهِمْ یَعْدِلُوْنَ ①

هُوَ الَّذِیْ خَلَقَكُمْ مِّنْ طِیْنٍ ثُمَّ قَضٰۤی اَجَلًا وَاَجَلٌ مُّسَمًّی عِنْدَهٗ ثُمَّ اَنْتُمْ تَمْتَرُوْنَ ②

وَهُوَ اللّٰهُ فِی السَّمٰوٰتِ وَفِی الْاَرْضِ یَعْلَمُ سِرَّكُمْ وَجَهْرَكُمْ وَیَعْلَمُ مَا تَكْسِبُوْنَ ③

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** ప్రశంసలు, పొగడ్తలన్నీ భూమ్యాకాశాలను పుట్టించిన అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయి. మరి ఆయనే చీకట్లనూ, వెలుగునూ తయారు చేశాడు.[1] అయినప్పటికీ అవిశ్వాసులు (ఇతరులను) తమ ప్రభువుకు సమానులుగా నిలబెడుతున్నారు.[2]

**2** ఆయనే మిమ్మల్ని మట్టితో చేశాడు.[3] ఆపైన ఒక గడువును నిర్ధారించాడు.[4] మరో నిర్ణీత గడువు మాత్రం అల్లాహ్ వద్దనే ఉంది.[5] అయినా మీరు సంశయానికి లోనై ఉన్నారు![6]

**3** ఆకాశాలలోనూ, భూమిలోనూ నిజదైవం ఆయనే. మీరు దాచిపెట్టేదీ, పైకి వ్యక్తపరచేదీ – అంతా ఆయనకు తెలుసు. మీరు చేసే పనులన్నీ ఆయనకు ఎరుకే.[7]

1. చీకట్లంటే రాత్రి చీకటి అనీ, వెలుగు అంటే పగటి వెలుతురు అనీ దీని భావం. అవిశ్వాసపు అంధకారం మరియు విశ్వాస జ్యోతి అని కూడా దీనికి మరో అర్థం కావచ్చు. వెలుగు అన్న పదానికి వ్యతిరేకంగా చీకట్లు అనే బహువచనం ఉపయోగించటం గమనార్హం. ఎందుకంటే మానవజీవితంలో కారుచీకట్లు కమ్ముకోవటానికి కారణాలెన్నో ఉంటాయి. కాని వెలుగు లేక జ్యోతి అనేది ఎన్ని విధాలుగా ఉన్నప్పటికీ మొత్తమ్మీద అది ఒకే సమగ్రపదంగా ఉంటుంది (ఫత్‌హుల్ ఖదీర్). విశ్వాసం లేక సన్మార్గం ఒక్కటే అయి ఉంటుంది గాని అనేకం కావు అన్న భావంలో కూడా యిక్కడ ఏకవచనం ప్రయోగించబడి ఉండవచ్చు.
2. అంటే నిజదైవానికి ఇతరులను భాగస్వాములుగా కల్పించి, బహుదైవారాధనకు పాల్పడుతున్నారన్నమాట!
3. అంటే మానవజాతికి మూలపురుషుడైన హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)ను దేవుడు మట్టితో చేశాడు. మరో అర్థం ఇది: మీరు తినే ఆహారపదార్థాలన్నీ మట్టి నుంచే ఉత్పత్తి అవుతాయి. ఈ ఆహారం ద్వారానే మీలో వీర్యకణాలు తయారవుతాయి. ఆ వీర్యాన్ని మీరు గర్భాశయంలోకి స్ఖలిస్తారు. ఆ వీర్యకణమే మాతృగర్భంలో మానవ నిర్మాణ ప్రక్రియకు నాంది పలుకుతుంది. ఈ విధంగా మీ సృష్టిలో మట్టి ముఖ్యపాత్రను పోషిస్తుంది.
4. అంటే మరణ సమయాన్ని వ్రాసిపెట్టాడు.
5. అంటే పరలోక దినమని అర్థం. అది ఎప్పుడు సంభవిస్తుందన్నది అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.
6. అంటే ప్రళయదినం నెలకొనే విషయంలో అవిశ్వాసులు, బహుదైవారాధకులు తీవ్రమైన సంశయానికి లోనయ్యారు. తాము మరణించి మట్టిలో కలసిపోయిన తరువాత తమను తిరిగి బ్రతికించటం ఎలా సాధ్యమవుతుంది? అన్నది వారి సందేహం. మిమ్మల్ని తొలిసారి ఎలా పుట్టించటం జరిగిందో మలిసారి కూడా అలాగే బ్రతికించటం జరుగుతుందని అల్లాహ్ సెలవిచ్చాడు (యాసీన్ సూరా).
7. అల్లాహ్ తన ఔన్నత్యానికి తగిన విధంగా 'అర్ష్' అనే పీఠంపై ఆసీనుడై ఉన్నప్పటికీ, ఆయన తన పరిజ్ఞానం రీత్యా అన్నిచోట్లా ఉంటాడు. ఏ విషయం కూడా ఆయన జ్ఞానపరిధిని దాటి లేదు. ఇదీ అహ్లె సున్నత్ వారి, అనగా సలఫ్‌ల విశ్వాసం. కాని పెడత్రోవ పట్టిన కొన్ని వర్గాలు ఈ ఆయతును అర్థం చేసుకోవటంలో పొరబడ్డాయి.

**4** వారి వద్దకు వారి ప్రభువు సూచనలలో నుంచి ఏ సూచన వచ్చినా దానిపట్ల వారు విముఖతే చూపుతున్నారు.

وَمَا تَأْتِيهِم مِّنْ آيَةٍ مِّنْ آيَاتِ رَبِّهِمْ إِلَّا كَانُوا
عَنْهَا مُعْرِضِينَ ﴿٤﴾

**5** తమ వద్దకు వచ్చిన ఈ సత్య గ్రంథాన్ని కూడా వారు అసత్యమని త్రోసిపుచ్చారు. కాబట్టి దేనిపట్ల వారు పరిహాసమాడేవారో దానికి సంబంధించిన వార్తలు వారికి త్వరలోనే అందుతాయి.[8]

فَقَدْ كَذَّبُوا بِالْحَقِّ لَمَّا جَاءَهُمْ ۖ فَسَوْفَ يَأْتِيهِمْ
أَنبَاءُ مَا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ﴿٥﴾

**6** ఏమిటీ, మేము వీళ్ళకు పూర్వం ఎన్ని సముదాయాలను నాశనం చేశామో వీరు చూడలేదా? ప్రపంచంలో మీకు ప్రసాదించని బలిమిని మేము ఆ సముదాయాల వారికి ప్రసాదించాము. వారి కోసం మేము ధారాపాతంగా వర్షాన్ని కురిపించాము. వారి కోసం క్రింది నుంచి కాలువల్ని ప్రవహింపజేశాము. కాని వారి పాపాల మూలంగా మేము వారిని తుదముట్టించాము.[9] వారి తరువాత ఇతర సముదాయాలను ప్రభవింపజేశాము.[10]

أَلَمْ يَرَوْا كَمْ أَهْلَكْنَا مِن قَبْلِهِم مِّن قَرْنٍ
مَّكَّنَّاهُمْ فِي الْأَرْضِ مَا لَمْ نُمَكِّن لَّكُمْ وَأَرْسَلْنَا
السَّمَاءَ عَلَيْهِم مِّدْرَارًا وَجَعَلْنَا الْأَنْهَارَ تَجْرِي
مِن تَحْتِهِمْ فَأَهْلَكْنَاهُم بِذُنُوبِهِمْ وَأَنشَأْنَا مِن
بَعْدِهِمْ قَرْنًا آخَرِينَ ﴿٦﴾

**7** (ఓ ప్రవక్తా!) ఒకవేళ కాగితంపై లిఖించబడివున్న సందేశాన్నే మేము నీపై అవతరింపజేసినా, మరి వీళ్లు తమ స్వహస్తాలతో దానిని తాకినా, "ఇది స్పష్టమైన మాయాజాలం తప్ప మరేమీ కాదు" అనే అంటారు[11] అవిశ్వాసులు.

وَلَوْ نَزَّلْنَا عَلَيْكَ كِتَابًا فِي قِرْطَاسٍ فَلَمَسُوهُ
بِأَيْدِيهِمْ لَقَالَ الَّذِينَ كَفَرُوا إِنْ هَٰذَا
إِلَّا سِحْرٌ مُّبِينٌ ﴿٧﴾

అల్లాహ్ అర్ష్ అనే ఆసనాన్ని అధిష్టించి లేడనీ, ఆయన అన్నిచోట్లా ఉంటాడని వారు వాదించటమే గాక, తమ వాదనకు ఆధారంగా ఈ ఆయతును ఉదాహరిస్తారు. ఈ విశ్వాసమూ సరైనది కాదు, ఈ ఉపమానం కూడా సరైనది కాదు. దీని సరైన భావం ఇది: భూమ్యాకాశాలలో ఏ శక్తిమంతుడు అల్లాహ్‌గా పిలువబడుతున్నాడో, భూమ్యాకాశాలలో ఎవరి రాజ్యాధికారం నడుస్తున్నదో, భూమ్యాకాశాలలో ఎవరు సిసలైన ఆరాధ్యుడుగా భావించబడుతున్నాడో ఆ అల్లాహ్ మీరు దాచిపెట్టినదాన్నీ, బహిర్గతం చేసేదాన్నీ – సర్వాన్నీ ఎరిగినవాడు (ఫత్‌హుల్ ఖదీర్). ఈ ఆయతుకు మరిన్ని వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి. తఫ్సీరె తబ్రీ, తఫ్సీరె ఇబ్నె కసీర్ లాంటి గ్రంథాలలో ఇవి వివరంగా పొందుపరచబడి ఉన్నాయి.

8. అంటే వారు చూపిన వైముఖ్యానికి, ధిక్కార వైఖరికి జరిగే శాస్తి ఏమిటో తొందరగానే వారికి తెలిసిపోతుంది. మేము ఈ సత్యగ్రంథాన్ని పరిహసించకుండా, ధిక్కరించకుండా ఉంటే బావుండేది కదా! అని వారు అప్పుడు లోలోపలే బాధపడతారు.

9. దుర్మార్గాల, దురాగతాల కారణంగా మీకన్నా బలిష్టమైన జాతులను, ఆర్థికంగా మీకన్నా మెరుగైన స్థితిలో ఉన్నవారిని మేము తుదముట్టించినపుడు మీరెంత? మీ జోరెంత? ఈ వాక్యం ద్వారా బోధపడే మరో ముఖ్య విషయం ఏమిటంటే ఏదేని ఒక జాతి సిరిసంపదలతో తులతూగుతూ, వైజ్ఞానికంగా బడాయిని చాటుకుంటున్నంత మాత్రాన అది సాఫల్య మార్గంలో పురోగమిస్తున్నదని భ్రమపడకండి. ఈ కలిమి లేములు, కష్ట సుఖాలు ప్రజలను పరీక్షించే నిమిత్తం అల్లాహ్ కల్పిస్తాడు. ఈ ప్రపంచం వాస్తవానికి ఒక పరీక్షా స్థలం. ఈ ప్రాపంచిక జీవితం ఒక పరీక్షా గడువు. ఈ గడువు ముగిసేసరికి లెక్కలు ముందుకు వచ్చేస్తాయి. ప్రాపంచిక వైభవాలుగానీ, భోగభాగ్యాలుగానీ దైవశిక్ష నుంచి కాపాడటానికి ఆనాడు ఏ విధంగానూ ఉపకరించవు.

**8** "ఈయన వద్దకు ఒక దైవదూత ఎందుకు అవతరింపజేయ బడలేదు?" అని వారు అంటున్నారు. మేమే గనక దూతను పంపి ఉంటే ఈ పాటికి వ్యవహారం ముగిసి ఉండేది. తర్వాత వీళ్ళకు కొద్దిపాటి గడువు కూడా ఇవ్వబడేది కాదు.[12]

وَقَالُوا لَوْلَا أُنزِلَ عَلَيْهِ مَلَكٌ ۖ وَلَوْ أَنزَلْنَا مَلَكًا لَّقُضِيَ الْأَمْرُ ثُمَّ لَا يُنظَرُونَ ﴿٨﴾

**9** ఒకవేళ మేము దూతను పంపినా, అతన్ని మనిషిగానే చేసి ఉండేవారము. అప్పుడు మేము గైకొన్న ఈ చర్యవల్ల వారు ప్రస్తుతం ఏ సందేహానికి లోనై ఉన్నారో మళ్లీ అదే సందేహానికి లోనయ్యేవారు.[13]

وَلَوْ جَعَلْنَاهُ مَلَكًا لَّجَعَلْنَاهُ رَجُلًا وَلَلَبَسْنَا عَلَيْهِم مَّا يَلْبِسُونَ ﴿٩﴾

**10** (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం కూడా చాలామంది ప్రవక్తలు పరిహసించబడ్డారు. మరి ఆ పరిహాసమాడేవారిని, వారు పరిహసిస్తూ వచ్చిన ఆపదే చుట్టుముట్టింది.

وَلَقَدِ اسْتُهْزِئَ بِرُسُلٍ مِّن قَبْلِكَ فَحَاقَ بِالَّذِينَ سَخِرُوا مِنْهُم مَّا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ﴿١٠﴾

10. వెనుకటి సమాజాల వారిని పరీక్షించినట్లే వీళ్లను కూడా పరీక్షించటం ఈ ప్రభవనం ముఖ్యోద్దేశం.

11. ఇది వారి వైరవైఖరికి, అహంకారానికి ప్రబల నిదర్శనం. స్పష్టమైన దైవగ్రంథం ముందుకు వచ్చిన మీదట కూడా వారు నిరాకరిస్తున్నారంటే, దాన్ని కనికట్టుగా భావిస్తున్నారంటే సత్యం పట్ల వారి శత్రుత్వం ఏ స్థాయికి చేరుకుందో ఊహించుకోవచ్చు! దివ్య ఖుర్ఆన్‌లోనే ఇతర చోట్ల కూడా ఇలాంటి ఉపమానాలు లభిస్తాయి:

ఉదాహరణకు: 1. ఒకవేళ మేము వారికొరకు ఏదైనా ఆకాశ ద్వారం తెరిచినా, వారు అందులోకి ఎక్కిపోతూ ఉన్నప్పుడు కూడా "మా కళ్లు మోసపోతున్నాయి. మాపై చేతబడి చేయబడింది" అనే అంటారు. (అల్ హిజ్ర్-14, 15).

2. ఒకవేళ ఆకాశం నుంచి తునకలు సైతం రాలిపడటం వారు చూసినా 'ఇవి దట్టమైన మేఘాలు మాత్రమే' అని వారంటారు. (అత్ తూర్ - 44).

అంటే ఏదో ఒక సాకు చెప్పి విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేస్తారేగాని, దైవప్రణాళికను ఒప్పుకునేందుకు సిద్ధమవరు. మరి చూడబోతే విశ్వవ్యవస్థలో ఏది సంభవించినా, అది పరమ ప్రభువు అభీష్టం ప్రకారమే సంభవిస్తుంది.

12. మానవతకు మార్గదర్శకత్వం వహించటానికి విశ్వప్రభువు ఎంతమంది ప్రవక్తలను ఎన్నుకున్నా, మానవ సముదాయాలలో నుంచే ఎన్నుకున్నాడు. ఒక్కో జాతిలో ఆ జాతికి చెందిన వ్యక్తినే ఎంపికచేసి, అతని వద్దకు దైవసందేశం (వహీ) పంపబడేది. దైవప్రవక్త మానవమాత్రుడై ఉండటం అవశ్యం. ఎందుకంటే మానవమాత్రుడై ఉన్నవాడే దైవసందేశాన్ని అందించే బాధ్యతను సజావుగా నిర్వర్తించగల్గుతాడు. ఉదాహరణకు : దైవదూతనే గనక ప్రవక్తగా నియుక్తుణ్ణి చేసి పంపితే అతను మానవుల భాషలో మాట్లాడలేడు. మానవుల అవసరాల గురించి, వారి భావాలు, భావోద్రేకాల గురించి అతనికి బొత్తిగా తెలీకపోవటం వల్ల అతని సందేశం మానవ భావనలతో సమరసం చెందదు. మరలాంటప్పుడు దైవదూత దైవదౌత్యపు బాధ్యతను ఎలా విజయవంతంగా నిర్వర్తించగలడు? అందుకే అల్లాహ్ మానవుల్లో నుంచే దైవప్రవక్తలను ఎన్నుకుని మానవతకు మహోపకారం చేశాడు. అందుకే కాబోలు ఆ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో 'ఉపకారం'గా పేర్కొన్నాడు : "అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు. స్వయంగా వారినుండే – వారి మధ్య – ఒక ప్రవక్తను పంపాడు" (ఆలి ఇమ్రాన్-164). అయితే మానవమాత్రులు దైవప్రవక్తలుగా రావటం సత్యతిరస్కారులను ఆశ్చర్యంలో పడేసింది. ప్రవక్తలనేవారు దైవదూతల్లో నుంచి రావాలిగాని మనుషుల్లో నుంచి నియుక్తమవటమేమిటి? అన్నది వారి ప్రశ్న. ప్రవక్త పదవీ బాధ్యతలు (నబువ్వత్) మానవుడికి శోభించవన్నది వారి ఉద్దేశ్యం. నేటి బిద్అతీలు (ధర్మంలో కొత్తపుంతలు తొక్కే ప్రబుద్ధులు) కూడా ఒక రకంగా ఇలాగే ఆలోచిస్తున్నారు.

**11** 'కాస్త భూమిలో సంచరించి, (సత్యాన్ని) ధిక్కరించేవారికి ఏ గతి పట్టిందో చూడండి' అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

قُلْ سِيرُوا فِي الْأَرْضِ ثُمَّ انظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُكَذِّبِينَ ﴿11﴾

**12** "ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నదంతా ఎవరిది?" అని వారిని అడుగు. వారికి చెప్పు: "సమస్తమూ అల్లాహ్‌దే." కనికరించటాన్ని అల్లాహ్ తన కోసం అవశ్యం చేసుకున్నాడు.[14] అల్లాహ్ ప్రళయదినాన మిమ్మల్నందరినీ సమీకరిస్తాడు. ఇందులో ఎలాంటి సందేహానికీ తావులేదు. కాని తమను తాము నష్టంలో పడవేసుకున్నవారు మాత్రం విశ్వసించరు.

قُل لِّمَن مَّا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ ۖ قُل لِّلَّهِ ۚ كَتَبَ عَلَىٰ نَفْسِهِ الرَّحْمَةَ ۚ لَيَجْمَعَنَّكُمْ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ لَا رَيْبَ فِيهِ ۚ الَّذِينَ خَسِرُوا أَنفُسَهُمْ فَهُمْ لَا يُؤْمِنُونَ ﴿12﴾

**13** రాత్రిపూట, పగటివేళ విశ్రమిస్తూ ఉండేదంతా అల్లాహ్‌దే. ఆయన సర్వం వినేవాడు, సర్వం తెలిసినవాడు.

وَلَهُ مَا سَكَنَ فِي اللَّيْلِ وَالنَّهَارِ ۚ وَهُوَ السَّمِيعُ الْعَلِيمُ ﴿13﴾

---

ఆనాడు అవిశ్వాసులు ప్రవక్తల పదవిని (నబువ్వత్‌ను, రిసాలత్‌ను) మాత్రమే త్రోసిపుచ్చేవారుగాని వారు మానవ మాత్రులన్న విషయాన్ని మాత్రం తృణీకరించేవారు కాదు. ఎందుకంటే వారి కుటుంబం గురించి, వంశపరంపర గురించీ వారికి ముందు నుంచే బాగా తెలుసు. కాకపోతే ఆ ప్రవక్తలు అందజేసే సందేశాన్ని మాత్రం వారు ధిక్కరించేవారు.

కాని నేటి బిద్అతీలు ప్రవక్తల దైవదౌత్యాన్ని మాత్రం నిరాకరించరుగాని ప్రవక్తలు మానవమాత్రులు అన్న విషయాన్ని త్రోసిపుచ్చుతారు. ఒక మానవమాత్రుడు ప్రవక్త పదవిని (నబువ్వత్‌ను), దైవదౌత్యాన్ని (రిసాలత్‌ను) పొందటం అసంభవమన్నది వారి తలంపు. మొత్తమ్మీద ఈ ఆయతు ద్వారా అల్లాహ్ తేటతెల్లం చేయదలచిన విషయం ఏమిటంటే అవిశ్వాసుల కోర్కెలకనుగుణంగా మేము మా దూతల్లో ఎవరినయినా ప్రవక్తగా చేసి పంపినట్లయితే లేదా ప్రవక్తను ధృవీకరించే నిమిత్తం వారివద్దకు మా దూతను పంపి ఉంటే అప్పటికీ వారు విశ్వసిస్తారన్న గ్యారంటీ ఏమీ లేదు. ఒకవేళ అదేగనక జరిగి ఉంటే వారి వినాశానికి అంతిమ ఘడియలు వచ్చి ఉండేవి.

13. ఒకవేళ మేము దైవదూతనే ప్రవక్తగా చేసి పంపాలని నిర్ణయించుకుని ఉంటే అతను సిసలయిన దైవదూత ఆకారంలో రాలేడు. సిసలైన రూపంలో గనక వస్తే మానవులు అతనికి దగ్గరయ్యే బదులు జడుసుకుని బహుదూరం పారిపోయే వారు. అందువల్ల ఆ దైవదూతను కూడా మానవాకారంలోనే పంపటం అనివార్యమయ్యేది. కాని అప్పుడైనా జరిగేదేమిటీ? ప్రజానాయకులు మళ్లీ మొదటికొస్తారు. ఇతను కూడా మనలాంటి మనిషిగానే ఉన్నాడు కదా! ఇతనికీ – మనకూ మధ్య తేడా ఏముందీ? అని పాయింటు తీస్తారు. అటువంటప్పుడు దైవదూతను పంపి కూడా ప్రయోజనమేమిటీ?

14. హదీసులో మహనీయ ముహమ్మద్ (సఅసం) చెప్పినట్లు, "అల్లాహ్ సృష్టితాలను పుట్టించినప్పుడు అర్ష్‌పై 'నిశ్చయంగా నా అనుగ్రహం నా ఆగ్రహంపై ఆధిపత్యం వహించి ఉంటుంది' అని లిఖించాడు" (సహీహ్ బుఖారీ : కితాబుత్తౌహీద్ వ బద్యిల్ ఖల్ఖ్ ; సహీహ్ ముస్లిం : కితాబుత్తౌబా). అయితే ఈ అనుగ్రహం, ఈ దయాదాక్షిణ్యం ప్రళయదినాన కేవలం విశ్వాసులకు మాత్రమే ప్రత్యేకమై ఉంటుంది. అవిశ్వాసుల పాలిట మాత్రం అల్లాహ్ ఆగ్రహోదగ్రుడై ఉంటాడు.

ఇహలోకంలో మాత్రం ఆయన కారుణ్యం సర్వసాధారణంగా అందరికీ వర్తిస్తుంది. ఆయన కారుణ్యాన్ని విశ్వాసులు–అవిశ్వాసులు, సజ్జనులు – దుర్జనులు, విధేయులు – అవిధేయులు అందరూ ఆస్వాదిస్తూ ఉంటారు. అవిధేయత కారణంగా అల్లాహ్ ఏ ఒక్కరి ఉపాధినీ నిలిపి ఉంచడు. అయితే దేవుని ఈ రకమైన కారుణ్యం ఇహలోకం వరకే. పరలోకంలో మాత్రం అలా జరగదు. ఎందుకంటే అది శిక్షా లేదా బహుమానాల స్థలం. అక్కడ అల్లాహ్ న్యాయగుణం పరిపూర్ణంగా ప్రస్ఫుటమవుతుంది. తత్ఫలితంగా విశ్వాసులు ఆయన కటాక్షానికి అర్హులవుతారు. కాగా; అవిశ్వాసులు

قُلْ اَغَيْرَ اللّٰهِ اَتَّخِذُ وَلِيًّا فَاطِرِ السَّمٰوٰتِ وَالْاَرْضِ
وَهُوَ يُطْعِمُ وَلَا يُطْعَمُ ؕ قُلْ اِنِّیْۤ اُمِرْتُ اَنْ
اَكُوْنَ اَوَّلَ مَنْ اَسْلَمَ وَلَا تَكُوْنَنَّ مِنَ
الْمُشْرِكِيْنَ ﴿14﴾

**14** “ఆకాశాలను, భూమినీ సృష్టించినవాడు, అందరికీ తినిపించేవాడూ, ఎవరి నుండి కూడా ఆహారం పుచ్చుకోనివాడూ అయిన అల్లాహ్‌ను వదలి నేను వేరొకరిని ఆరాధ్యునిగా[15] చేసుకోవాలా?” అని ఓ ప్రవక్తా! వారిని అడుగు. “అందరికంటే ముందు నేను ఇస్లాం స్వీకరించాలని నాకు ఆదేశించబడింది” అని నీవు వారికి తెలియజెయ్యి. “ఎట్టి పరిస్థితుల్లోనూ నీవు బహుదైవారాధకులలో చేరిపోకూడదు” (అని కూడా నాకు ఆదేశించబడిందని చెప్పు).

قُلْ اِنِّیْۤ اَخَافُ اِنْ عَصَيْتُ رَبِّیْ عَذَابَ
يَوْمٍ عَظِيْمٍ ﴿15﴾

**15** “నేనే గనక నా ప్రభువు ఆజ్ఞను శిరసావహించకపోతే ఒకానొక మహాదినాన నాకు శిక్ష పడుతుందని నేను భయపడుతున్నాను”[16] అని (కూడా) వారికి చెప్పు.

مَنْ يُّصْرَفْ عَنْهُ يَوْمَئِذٍ فَقَدْ رَحِمَهٗ ؕ
وَذٰلِكَ الْفَوْزُ الْمُبِيْنُ ﴿16﴾

**16** ఆ రోజు ఎవరిపై నుంచి ఆ శిక్ష తొలగించబడుతుందో ఆ వ్యక్తిని అల్లాహ్ అపారంగా కరుణించినట్లే. అదే స్పష్టమైన విజయం.[17]

وَاِنْ يَّمْسَسْكَ اللّٰهُ بِضُرٍّ فَلَا كَاشِفَ لَهٗۤ اِلَّا
هُوَ ؕ وَاِنْ يَّمْسَسْكَ بِخَيْرٍ فَهُوَ عَلٰى كُلِّ
شَیْءٍ قَدِيْرٌ ﴿17﴾

**17** ఒకవేళ అల్లాహ్ నిన్ను ఏదన్నా బాధకు గురిచేస్తే, ఆయన తప్ప మరెవరూ దాన్ని దూరం చేయలేరు. ఒకవేళ ఆయన నీకు ఏదన్నా మేలు చేస్తే, ఆయన అన్నింటిపై అధికారం కలవాడు.[18]

---

శాశ్వితమైన నరకానికి పాత్రులుగా నిలుస్తారు. అందుకే దివ్య ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది–“నా కారుణ్యం అన్ని వస్తువులనూ ఆవరించి ఉంది. అయితే భయభక్తులతో మెలగేవారికీ, జకాత్ ఇచ్చేవారికీ, మా ఆయతులను విశ్వసించేవారికి నేను ఆ కారుణ్యాన్ని వ్రాస్తాను” (అల్ ఆరాఫ్ – 156).

15. అరబీ మూలంలో **‘వలియ్యన్’ (وَلِيًّا)** అనే పదం ఉంది. దీనికి సహాయకుడు, సంరక్షకుడు అన్న అర్థాలు వస్తాయి. కాని ఆయతు సందర్భం దృష్ట్యా వలియ్యన్ అనే పదాన్ని ఆరాధ్యదైవం అన్న అర్థంలో తీసుకోవలసి ఉంటుంది.

16. అంటే – నేను ప్రవక్తనైనప్పటికీ నేనే గనక దేవుని మాట వినకుండా ఆయన్ని వదలి ఇంకొకరిని నా ఆరాధ్య దైవంగా చేసుకున్నట్లయితే నేను కూడా ఆయన పట్టు నుంచి తప్పించుకోలేను.

17. నష్టం నుంచి దూరంగా ఉంటూ లాభం పొందటమే సిసలైన సాఫల్యం. కాగా; నరకాగ్ని నుంచి ఎవరయినా తనను కాపాడుకుని స్వర్గవనాలలోకి ప్రవేశిస్తే అతని కొరకు అంతకుమించిన సాఫల్యం ఇంకేముంటుంది? ఆ విషయమే దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: “ఎవడు నరకాగ్ని నుంచి తప్పించబడి స్వర్గంలో ప్రవేశం కల్పించబడ్డాడో అతడు విజయం పొందాడు” (ఆలి ఇమ్రాన్ – 185).

18. అంటే లాభనష్టాలను చేకూర్చగల శక్తి అల్లాహ్‌కు మాత్రమే ఉంది. విశ్వమండలంలో తిరుగులేని అధికారం గలవాడు ఆయన మాత్రమే. ఆయన నిర్ణయాధికారాన్ని ఎవరూ అడ్డుకోలేరు. ఈ విషయమే ఒక హదీసులోని ప్రార్థనలో ఇలా వివరించబడింది : “ఓ అల్లాహ్! నీవు ఎవరికైనా ఇవ్వదలిస్తే ఎవరూ ఆపలేరు. నీవు ఎవరికయినా ఇవ్వకుండా ఆపుకుంటే అతనికి ఇప్పించేవారు కూడా ఎవరూ లేరు. ఏ స్థితిమంతునికీ అతని స్థోమత నీకు ప్రతిగా ఎలాంటి

وَهُوَ الْقَاهِرُ فَوْقَ عِبَادِهٖ ؕ وَهُوَ الْحَكِيْمُ الْخَبِيْرُ ⑱

**18** తన దాసులపై తిరుగులేని ఆధిపత్యం,[19] అధికారం గలవాడు ఆయనే. ఆయన అత్యంత వివేచనాపరుడు, అన్నీ తెలిసినవాడు.

قُلْ اَيُّ شَيْءٍ اَكْبَرُ شَهَادَةً ؕ قُلِ اللّٰهُ ۙ شَهِيْدٌۢ بَيْنِيْ وَبَيْنَكُمْ ۙ وَاُوْحِيَ اِلَيَّ هٰذَا الْقُرْاٰنُ لِاُنْذِرَكُمْ بِهٖ وَمَنْۢ بَلَغَ ؕ اَئِنَّكُمْ لَتَشْهَدُوْنَ اَنَّ مَعَ اللّٰهِ اٰلِهَةً اُخْرٰى ؕ قُلْ لَّاۤ اَشْهَدُ ۚ قُلْ اِنَّمَا هُوَ اِلٰهٌ وَّاحِدٌ وَّاِنَّنِيْ بَرِيْٓءٌ مِّمَّا تُشْرِكُوْنَ ⑲

**19** "అందరికన్నా గొప్ప సాక్ష్యం ఎవరిది?" అని వారిని అడుగు. "నాకూ– మీకూ మధ్య సాక్షిగా అల్లాహ్ ఉన్నాడు.[20] ఈ ఖుర్ఆను ద్వారా నేను మిమ్మల్నీ, ఇది ఎవరెవరి వరకు చేరుతుందో వారందరినీ హెచ్చరించటానికి గాను[21] ఈ ఖుర్ఆన్ నా వద్దకు వహీ ద్వారా పంపబడింది" అని (ఓ ప్రవక్తా!) వారికి తెలియపరచు. అల్లాహ్‌తోపాటు మరి కొంతమంది దేవుళ్లు కూడా ఉన్నారని మీరు నిజంగా సాక్ష్యం ఇవ్వగలరా? "నేను మాత్రం అలాంటి సాక్ష్యం (ఇవ్వనుగాక) ఇవ్వను" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. "ఆయనే ఒకే ఒక్కడైన ఆరాధ్య దేవుడు. మీరు దైవానికి కల్పించే షిర్క్ (భాగస్వామ్యం)తో నాకెలాంటి సంబంధం లేదు" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పెయ్యి.

اَلَّذِيْنَ اٰتَيْنٰهُمُ الْكِتٰبَ يَعْرِفُوْنَهٗ كَمَا يَعْرِفُوْنَ اَبْنَآءَهُمْ ۘ اَلَّذِيْنَ خَسِرُوْۤا اَنْفُسَهُمْ فَهُمْ لَا يُؤْمِنُوْنَ ⑳

**20** ఎవరికయితే మేము గ్రంథాన్ని వొసగి ఉన్నామో వారు తమ కన్న కొడుకులను గుర్తుపట్టినట్లే ప్రవక్తను గుర్తుపడతారు. అయితే తమను తాము నష్టంలో పడవేసుకున్నవారు మాత్రం విశ్వసించరు.[22]

ప్రయోజనాన్నీ చేకూర్చజాలదు" (సహీహ్ బుఖారీ : కితాబుల్ ఏతిసామ్; ముస్లిం – కితాబుస్సలాత్ వల్ మసాజిద్). ప్రతి నమాజు తరువాత మహాప్రవక్త (సఅసం) ఈ దుఆ చేసేవారు.

19. అంటే అందరి శిరస్సులు ఆయన ముందు వాలి ఉన్నాయి. మహామహులు, నిరంకుశ చక్రవర్తులు, నియంతలు సైతం ఆయన ఎదుట అశక్తులై ఉన్నారు. ఆయన అన్నింటిపైనా తిరుగులేని అధికారం గలవాడు. సమస్త జగతి ఆయన ఆజ్ఞలకు కట్టుబడి ఉంది. ఆయన చేసే ప్రతి పనీ వివేకంతో కూడుకున్నది. ప్రతి చిన్న విషయం ఆయనకు తెలుసు. తన దయానుగ్రహాలకు ఎవరు అర్హులో మరెవరు అనర్హులో ఆయనకు బాగా తెలుసు.

20. తాను సాటిలేని దైవం, గొప్ప పరిపోషకుడన్న విషయానికి స్వయంగా అల్లాహ్‌యే సాక్షి. ఆయన్ని మించిన సాక్షి ఇంకెవడూ లేడు.

21. ఈ ఆయతుకు వ్యాఖ్యానంగా హజ్రత్ రబీ బిన్ అనస్ (రజి) ఇలా అంటున్నారు : "ఎవరెవరి వద్దకు ఈ ఖుర్ఆన్ చేరుతుందో వారు నిజంగా మహాప్రవక్త (సఅసం) అనుయాయులే అయితే దైవప్రవక్త (స) ప్రజలను అల్లాహ్ వైపుకు పిలిచినట్లే వారు కూడా ప్రజలను అల్లాహ్ వైపుకు పిలవాలి. ఏ విధంగా దైవప్రవక్త (స) జనులను హెచ్చరించారో అదేవిధంగా వారు కూడా ప్రజలను హెచ్చరించాలి (ఇది వారి విద్యుక్త ధర్మం)" (ఇబ్నె కసీర్).

22. అరబీలో **'యారిఫూనహు'** (يَعْرِفُوْنَهٗ) అని ఉంది. అంటే వారు అతన్ని గుర్తుపడతారని భావం. ఈ గుర్తుపట్టడం అన్నది అంతిమ దైవప్రవక్త (స) నేపథ్యంలో చెప్పబడింది. గ్రంథవహులు తమ కన్నకొడుకులను గుర్తుపట్టినట్లే ఆయన్ని గుర్తుపడతారు. ఎందుకంటే వారి గ్రంథాలలో ఆయన (స) గుణగణాలు విశదీకరించబడ్డాయి. ఈ గుణగణాల

21 అల్లాహ్‌పై అబద్ధపు నిందలు మోపే వాడికంటే లేదా అల్లాహ్ ఆయతులను అసత్యాలని త్రోసిపుచ్చే వాడికంటే ఎక్కువ దుర్మార్గుడెవడుంటాడు?[23] ఇలాంటి దుర్మార్గులకు ఎన్నటికీ సాఫల్యం ప్రాప్తించదు.[24]

وَمَنْ اَظْلَمُ مِمَّنِ افْتَرٰی عَلَی اللّٰهِ كَذِبًا اَوْ كَذَّبَ بِاٰیٰتِهٖ ؕ اِنَّهٗ لَا یُفْلِحُ الظّٰلِمُوْنَ ﴿21﴾

22 మేము వారందరినీ సమీకరించే రోజున, "మీరు ఆరాధ్య దైవాలుగా చేసుకున్న మీ భాగస్వాములు ఏరి?" అని ముష్రిక్కులను మేము అడిగే సందర్భం కూడా జ్ఞాపకం చేసుకోదగినదే.

وَیَوْمَ نَحْشُرُهُمْ جَمِیْعًا ثُمَّ نَقُوْلُ لِلَّذِیْنَ اَشْرَكُوْۤا اَیْنَ شُرَكَآؤُكُمُ الَّذِیْنَ كُنْتُمْ تَزْعُمُوْنَ ﴿22﴾

23 అప్పుడు వారు, "మా ప్రభువైన అల్లాహ్ సాక్షి! మేము ముష్రిక్కులము కానేకాము"[25] అని పలకటం తప్ప వారి షిర్కుకు మరే ఫలితమూ ఉండదు.

ثُمَّ لَمْ تَكُنْ فِتْنَتُهُمْ اِلَّاۤ اَنْ قَالُوْا وَاللّٰهِ رَبِّنَا مَا كُنَّا مُشْرِكِیْنَ ﴿23﴾

---

దృష్ట్యా వారు ఈ అంతిమ దైవప్రవక్త రాకకోసం ఎదురు చూశారు కూడా. అందుచేత ఇప్పుడు వారు విశ్వసించక పోవటం అన్నది వారిని తీవ్రమయిన నష్టానికి లోను చేస్తుంది. ఎందుకంటే వారు గ్రంథజ్ఞానం ఉండి కూడా సత్యవాక్కును తృణీకరిస్తున్నారు.

23. అల్లాహ్ పేరుతో అబద్ధాలు చెప్పి తనను తాను ప్రవక్తగా ప్రకటించుకునేవాడు ఎంత పెద్ద దుర్మార్గుడో, దైవవాక్కులను, దైవప్రవక్తను ఉద్దేశపూర్వకంగా త్రోసిపుచ్చేవాడు కూడా అంతేపెద్ద దుర్మార్గుడు. తమను తాము ప్రవక్తలుగా బూటకపు ప్రకటనలు చేసుకోవటం ఘోర అపరాధం అన్న సంగతి దీనిద్వారా విదితమవుతున్నప్పటికీ ఎంతోమంది ఇలాంటి అబద్ధాగ్రేసరులు అన్ని కాలాలలోనూ పుట్టుకువచ్చారు. ఇలాంటి అబద్ధాల అయ్యలు 30 మంది వరకూ ఉంటారనీ, వారిలో ప్రతి ఒక్కడూ తనను ప్రవక్తగా ప్రకటించుకుంటాడని మహనీయ ముహమ్మద్ (స) భవిష్యవాణి చెప్పారు. గత శతాబ్దిలో ఖాదియాన్ అనే గ్రామంలో కూడా ఒక అబద్ధాగ్రేసరుడు తలెత్తి తన్ను ప్రవక్తగా ప్రకటించుకున్నాడు. అతని అనుయాయుల్లో కొంతమంది నేడు అతన్ని ఒక ప్రవక్తగా, 'మసీహ్ మౌవూద్'గా నమ్ముతున్నారు. కొద్దిమంది ఒక అసత్యవాదిని సత్యవంతుడుగా నమ్మటం అతని సత్యసంధతకు తార్కాణం కాజాలదు. సత్యం కోసం ఖుర్ఆన్ హదీసుల సుస్పష్టమైన నిదర్శనాలు కావాలి.

24. వీరిద్దరూ దుర్మార్గులే అయినపుడు ఇద్దరూ (1. దైవం పేరుతో అబద్ధాలు చెప్పేవాడు. 2. సత్యాన్ని త్రోసిపుచ్చేవాడు) సాఫల్య భాగ్యానికి ఎలా నోచుకుంటారు? సన్మార్గానికి బదులు పెడదారులు తీసే ప్రబుద్ధులకు ఈ పరిణామం కనువిప్పు కావాలి.

25. **'తాము ముష్రిక్కులము కాము'** అని సంజాయిషీ యిచ్చుకుని ఏదో ఒక విధంగా వారు ఈ గండం నుంచి గట్టెక్కాలని చూస్తారు. దీనికి భావార్థం చెబుతూ ఇమామ్ ఇబ్నె జరీర్ ఇలా వివరించారు : "మేము వాళ్ళను ప్రశ్నల కొలిమిలో పడవేసినప్పుడు, ఇహలోకంలో షిర్క్‌కు ఒడిగట్టినవాళ్లు దిక్కుతోచని స్థితికి లోనవుతారు. మేము ముష్రిక్కులము కానేకాము అని సంజాయిషీ ఇవ్వటం వినా వారికి మార్గాంతరం ఉండదు.

అక్కడ మనుషుల కాళ్లూ చేతులు సాక్ష్యం ఇస్తాయి కదా! వారి నోటికి తాళం వేయబడుతుంది కదా!! మరలాంటప్పుడు వారు సాకులు ఎలా చెబుతారు? అన్న సందేహం ఈ సందర్భంగా కలగవచ్చు. దీనికి హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారి సమాధానం ఇది : "ఏక దైవోపాసకులైన ముస్లింలు స్వర్గంలో ప్రవేశిస్తూ ఉండటం చూసి ముష్రిక్కులు ఉండబట్టలేక పరస్పరం సంప్రతించుకుంటారు. తాము అసలు షిర్క్ (బహుదైవారాధన) చేయనేలేదని నమ్మబలుకుతారు. అప్పుడు అల్లాహ్ వారి నోళ్ళకు తాళం వేస్తాడు. వారు చేసిన కర్మలను గురించి వారి కాళ్లూ చేతులు సాక్ష్యం ఇవ్వ మొదలెడతాయి. ఆ క్షణం నుంచి వారు అల్లాహ్ ముందు ఏ విషయాన్నీ దాచిపెట్టలేరు" (ఇబ్నె కసీర్).

**24** చూడు! వారు తమ గురించి తాము ఎలా అబద్ధం చెప్పు కుంటారో. వారు కల్పించుకుంటూ ఉండినవన్నీ వారినుండి మటుమాయమై పోతాయి.[26]

انْظُرْ كَيْفَ كَذَبُوا عَلَىٰ أَنْفُسِهِمْ وَضَلَّ عَنْهُمْ
مَا كَانُوا يَفْتَرُونَ ﴿٢٤﴾

**25** వారిలో కొంతమంది నీ వైపు చెవి యొగ్గి ఉంటారు.[27] మేము వారి హృదయాలపై తెర వేసి ఉంచాము. అందువల్ల వారు దానిని అర్థం చేసుకోలేరు. వారి చెవులలో చెవుడును ఉంచాము.[28] (ఈ కారణంగా) వారు నిదర్శనాలన్నింటినీ చూసి నప్పటికీ వాటిని విశ్వసించరు. ఆఖరికి వారు నీ వద్దకు వచ్చి నపుడు అనవసరంగా నీతో వాదనకు దిగుతారు. అవిశ్వాసులు "ఇవి పూర్వీకుల నుంచీ చెలామణీలో ఉన్న కట్టుకథలు తప్ప మరేమీ కావు" అని అంటారు.[29]

وَمِنْهُمْ مَنْ يَسْتَمِعُ إِلَيْكَ ۖ وَجَعَلْنَا عَلَىٰ قُلُوبِهِمْ
أَكِنَّةً أَنْ يَفْقَهُوهُ وَفِي آذَانِهِمْ وَقْرًا ۚ وَإِنْ يَرَوْا
كُلَّ آيَةٍ لَا يُؤْمِنُوا بِهَا ۚ حَتَّىٰ إِذَا جَاءُوكَ
يُجَادِلُونَكَ يَقُولُ الَّذِينَ كَفَرُوا إِنْ هَٰذَا
إِلَّا أَسَاطِيرُ الْأَوَّلِينَ ﴿٢٥﴾

**26** వాళ్లు దాన్నుంచి ఇతరులను ఆపటమే గాకుండా, స్వయంగా వాళ్లు కూడా దానికి దూరంగా ఉంటున్నారు.[30] వాస్తవానికి వారు తమను మాత్రమే నాశనం చేసుకుంటున్నారు. కాని వారికి ఆ స్పృహ లేదు.[31]

وَهُمْ يَنْهَوْنَ عَنْهُ وَيَنْأَوْنَ عَنْهُ ۖ وَإِنْ يُهْلِكُونَ
إِلَّا أَنْفُسَهُمْ وَمَا يَشْعُرُونَ ﴿٢٦﴾

26. వారు పలికిన ఈ పచ్చి అబద్ధం వారికేవిధంగానూ పనికిరాదు. మానవుడు ప్రపంచంలో ఇలాంటి కీలక ఘట్టాలలో అబద్ధం పలికి గండం నుంచి గట్టెక్కినట్టు తలపోస్తాడు. కాని పరలోకంలో అతని పప్పులుడకవు. అల్లాహ్‌ను వదలి వారు పూజించే మిథ్యా దేవుళ్లు కూడా ఆ సమయంలో వారి నుంచి మాయమైపోతారు. తాము ఎన్నో ఆశలుపెట్టుకున్న చిల్లరదేవుళ్లు కీలక సమయంలో, వారికి మొండి చేయి చూపిస్తారు. అంటే వారి బండారం కాస్తా బయటపడిపోతుంది. అయితే చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం ఉండదు కదా!

27. ఈ ముష్రిక్కులు దైవప్రవక్త (స) వద్దకు వచ్చి, చెవి యొగ్గి ఖుర్ఆన్‌ను వినడానికయితే వింటారుగాని ఆ వినటం వారికెలాంటి లాభాన్నీ కలిగించదు. ఎందుకంటే సన్మార్గం పొందాలన్నది వారి ఆశయం కాదు. మనిషి మంచిని ఆశించినపుడే అది అతనికి ప్రాప్తిస్తుంది.

28. వారిలో తిష్ఠవేసిన అవిశ్వాస జాడ్యం మూలంగా మేము వారి హృదయాలపై తెరవేసి ఉంచాము. ఇంకా వారి చెవులు మొద్దుబారేలా చేశాము. అందువల్ల వారి హృదయాలు సత్యాన్ని ఆస్వాదించలేవు. వారి చెవులకు సత్యవాణి సోకదు.

29. మార్గవిహీనత, మార్గభ్రష్టతల ఊబిలో వారెంతగా కూరుకుపోయారంటే, వారి కళ్లకు ఇప్పుడు ఎంత పెద్ద మహిమను చూపినా విశ్వాస భాగ్యానికి వారు నోచుకోలేరు. వారి వైరభావం, పిడివాదం పరాకాష్ఠకు చేరింది. అందుకే వారు దివ్య ఖుర్ఆన్‌ను నిరాధారమైన పాతకాలపు కథలని చెప్పి విషయాన్ని దాటవేస్తున్నారు.

30. సామాన్య ప్రజలు విశ్వసించకుండా ఉండాలన్న ఉద్దేశంతో వారిని దైవప్రవక్తకు, ఖుర్ఆన్‌కు దగ్గర కాకుండా అవరోధాలు సృష్టిస్తారు. వాళ్లు సయితం సత్యసందేశానికి దూరంగా ఉంటారు.

31. వాళ్లు ప్రజలను అడ్డుకోవటం వల్లగానీ, వారు సయితం సత్యసందేశానికి దూరంగా మసలుకోవటం వల్లగానీ మాకొచ్చిన నష్టం ఏమీలేదు. అలాగే మా ప్రవక్త (సఅసం)కు కూడా వారివల్ల ఎలాంటి నష్టం కలగదు. ఎటొచ్చీ ఇలాంటి విచ్ఛిన్నకర కార్యకలాపాల ద్వారా వాళ్ళే తమ వినాశానికి మార్గం సుగమం చేసుకుంటున్నారు.

**27** నరకం దగ్గర వారు నిలబెట్టబడినప్పుడు నీవు వారిని చూస్తే (ఎంత బావుండు!)[32] – "అయ్యో! మేము మళ్ళీ తిరిగి పంప బడితే బావుండునే! అదేగనక జరిగితే మేము మా ప్రభువు సూచనలను తిరస్కరించము. ఇంకా మేము విశ్వాసులలో చేరిపోతాము!" అని (ఆ సమయంలో) వారు పలుకుతారు.[33]

وَلَوْ تَرَىٰٓ إِذْ وُقِفُوا۟ عَلَى ٱلنَّارِ فَقَالُوا۟ يَـٰلَيْتَنَا نُرَدُّ وَلَا نُكَذِّبَ بِـَٔايَـٰتِ رَبِّنَا وَنَكُونَ مِنَ ٱلْمُؤْمِنِينَ ﴿٢٧﴾

**28** అసలు విషయం అది కాదు. వారు అంతకుముందు దేన్న యితే కప్పిపుచ్చేవారో అది వారి ముందు బహిర్గతం అయింది.[34] ఒకవేళ వారు తిరిగి పంపబడినప్పటికీ, తమకు వారించబడిన పనులన్నీ మళ్ళీ చేస్తారు. ముమ్మాటికీ వాళ్లు అబద్ధాలకోరులు.[35]

بَلْ بَدَا لَهُم مَّا كَانُوا۟ يُخْفُونَ مِن قَبْلُ ۖ وَلَوْ رُدُّوا۟ لَعَادُوا۟ لِمَا نُهُوا۟ عَنْهُ وَإِنَّهُمْ لَكَـٰذِبُونَ ﴿٢٨﴾

**29** "ఈ ప్రాపంచిక జీవితమే అసలు జీవితం. మళ్లీ మనం బ్రతికించబడటం అనేది కల్ల"[36] అని వారు చెబుతున్నారు.

وَقَالُوٓا۟ إِنْ هِىَ إِلَّا حَيَاتُنَا ٱلدُّنْيَا وَمَا نَحْنُ بِمَبْعُوثِينَ ﴿٢٩﴾

**30** వారు తమ ప్రభువు ఎదుట నిలబెట్టబడిన దృశ్యాన్ని నీవు చూస్తే (బావుండేది). "ఇది నిజం కాదా?!" అని అల్లాహ్ అడుగుతాడు. దానికి వారు "ఎందుకు నిజం కాదు? మా ప్రభువు సాక్షిగా (ఇది నిజమే)!" అని అంటారు. "మరయితే మీ తిరస్కా రానికి బదులుగా శిక్షను చవిచూడండి"[37] అని అల్లాహ్ సెలవిస్తాడు.

وَلَوْ تَرَىٰٓ إِذْ وُقِفُوا۟ عَلَىٰ رَبِّهِمْ ۚ قَالَ أَلَيْسَ هَـٰذَا بِٱلْحَقِّ ۚ قَالُوا۟ بَلَىٰ وَرَبِّنَا ۚ قَالَ فَذُوقُوا۟ ٱلْعَذَابَ بِمَا كُنتُمْ تَكْفُرُونَ ﴿٣٠﴾ ع

32. అంటే ఓ ప్రవక్తా! ఆ దృశ్యం ఎంతో భయానకంగా ఉంటుంది.

33. కాని వారికి మరో అవకాశం ఇవ్వబడదు. అవిశ్వాసుల ఈ ఆకాంక్ష దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల ప్రస్తావనకు వచ్చింది. ఉదాహరణకు :

1. "మా ప్రభూ! మమ్మల్ని ఈ నరకం నుంచి బయటకు తీయి. మళ్లీ మేము గనక నీ అవిధేయతకు పాల్పడితే ముమ్మాటికీ దుర్మార్గులమవుతాము" అనంటారు. దానికి అల్లాహ్, "ఇందులోనే అవమానకరమైన స్థితిలో పడి ఉండండి. నాతో మాట్లాడకండి" అని అంటాడు (మోమినూన్-107, 108).

2. "మా ప్రభూ! మేము కళ్ళారా చూశాము. బాగా విన్నాము. ఇక మమ్మల్ని మళ్లీ ప్రపంచంలోకి పంపించు. ఇక నుంచి మంచి పనులు చేస్తాము. ఇప్పుడు మాకు నమ్మకం కలిగింది" (అస్ సజ్దా - 12).

34. **'బహిర్గతం అవటం'** అనేది అనేక విధాలుగా జరగవచ్చు. 1. ప్రపంచంలోనూ, పరలోకంలోనూ వారు తమలో అణచిపెట్టుకొని ఉన్న సత్యతిరస్కారం, శత్రుత్వం బట్టబయలవుతుంది. అంటే వారు తిరస్కరిస్తూ ఉన్నదే వారి ముందుకు వచ్చేస్తుంది. 2. దివ్య ఖుర్ఆన్ సత్యమనీ, దైవప్రవక్త (స) చెప్పేది అంతా నిజమని వారి మనస్సాక్షి చెబుతూ ఉన్నప్పటికీ పరిస్థితుల ప్రభావానికి లోనై వారు దాన్ని అణచిపెట్టేవారు. అది కాస్తా ఆ రోజు బహిర్గతం అవుతుంది. లేదా కపటులు విశ్వాసుల ముందు ఆడే కపట నాటకాలు అక్కడ అందరిముందూ బయల్పడతాయి (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

35. తిరిగి ప్రపంచంలోకి రావాలని వారు కోరుకుంటున్నది విశ్వసించటానికి కాదు. కేవలం నరకాగ్ని యాతన నుండి

**31** అల్లాహ్‌ను కలుసుకోవలసి ఉందనే విషయాన్ని ధిక్కరించిన వారు నిశ్చయంగా నష్టానికి గురయ్యారు. ఆఖరికి ఆ నిర్ధారిత సమయం అకస్మాత్తుగా వచ్చిపడినప్పుడు, "అయ్యో! ఈ విషయాన్ని మేము ఎంత నిర్లక్ష్యం చేశాం!" అని బాధపడతారు. వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందంటే, వారు తమ బరువులను తమ వీపులపై మోస్తూ ఉంటారు. తెలుసుకోండి! వారు మోసే బరువు చాలా చెడ్డది.[38]

قَدْ خَسِرَ الَّذِينَ كَذَّبُوا بِلِقَاءِ اللَّهِ ۖ حَتَّىٰ إِذَا
جَاءَتْهُمُ السَّاعَةُ بَغْتَةً قَالُوا يَا حَسْرَتَنَا عَلَىٰ
مَا فَرَّطْنَا فِيهَا وَهُمْ يَحْمِلُونَ أَوْزَارَهُمْ عَلَىٰ
ظُهُورِهِمْ ۚ أَلَا سَاءَ مَا يَزِرُونَ ﴿31﴾

**32** ప్రాపంచిక జీవితం ఆట, తమాషా తప్ప మరేమీ కాదు. అయితే భయభక్తులు కలవారి కోసం పరలోక నిలయం ఎంతో మేలైనది. ఏమిటీ, మీరు బొత్తిగా బుద్ధిని ఉపయోగించరా?

وَمَا الْحَيَاةُ الدُّنْيَا إِلَّا لَعِبٌ وَلَهْوٌ ۖ وَلَلدَّارُ الْآخِرَةُ
خَيْرٌ لِّلَّذِينَ يَتَّقُونَ ۗ أَفَلَا تَعْقِلُونَ ﴿32﴾

**33** (ఓ ప్రవక్తా!) వాళ్లు అనే మాటలు నిన్ను దుఃఖానికి గురి చేస్తున్నాయన్న సంగతి మాకు బాగా తెలుసు. వారు ధిక్కరిస్తున్నది నిన్ను కాదు, నిజానికి ఈ దుర్మార్గులు అల్లాహ్ ఆయతులను తిరస్కరిస్తున్నారు.[39]

قَدْ نَعْلَمُ إِنَّهُ لَيَحْزُنُكَ الَّذِي يَقُولُونَ
فَإِنَّهُمْ لَا يُكَذِّبُونَكَ وَلَٰكِنَّ الظَّالِمِينَ بِآيَاتِ
اللَّهِ يَجْحَدُونَ ﴿33﴾

తప్పించుకోవటానికి వారు నాటకమాడుతున్నారు. వారి అభ్యర్థనను మన్నించి ఒకవేళ వారిని మరోసారి ప్రపంచంలోకి పంపినా, వారి కథ మళ్లీ మొదటికే వస్తుంది.

36. వారు మరణానంతర జీవితాన్ని పబ్లిగ్గా ధిక్కరిస్తున్నారు. ప్రతి అవిశ్వాసీ సాధారణంగా మరణానంతర జీవితాన్ని త్రోసిపుచ్చుతాడు. అతనిలోని కరడుగట్టిన తిరస్కార వైఖరికి, ఈ వాస్తవ ధిక్కరణే ప్రధాన కారణం. పరలోక భీతి గనక మనిషి మనసులో వేళ్లూనుకుంటే సత్యాన్ని ఆస్వాదించేందుకు అతడు తహతహలాడుతాడు.

37. పరలోక దృశ్యాన్ని తమ కళ్లతో చూసుకున్న నాడు వారి కళ్లు నిజంగా తెరుచుకుంటాయి. పరలోక జీవితం సత్యబద్ధమైనది అని అంగీకరిస్తారు. కాని అక్కడ ఒప్పుకుని ఏం లాభం? "ఇప్పుడు మీరు మీ తిరస్కార వైఖరికి బదులుగా శిక్షను అనుభవించండి" అని సర్వోన్నత ప్రభువు తేల్చి చెప్పేస్తాడు.

38. విశ్వప్రభువు అయిన అల్లాహ్ ముందర హాజరుపరచబడే విషయాన్ని తేలిగ్గా కొట్టిపారేసినవారు ఎంతటి భారీనష్టాన్ని చవిచూస్తారో, వారు ఎదుర్కొనే ఓటమి ఎంత ఘోరంగా ఉంటుందో, తమ తప్పిదంపై వాళ్ళెలా సిగ్గుతో కుంచించుకు పోతారో, వారి వీపులపై ఉండే వారి పాపాలభారం వారిని ఎంతగా కృంగదీస్తుందో ఈ ఆయతు మన కళ్లకు కట్టినట్లు చిత్రీకరించింది. పరలోక ఉనికిని విశ్వసించి, దానికి కావలసిన సామగ్రిని సమకూర్చుకోవటంలో తాము చేసిన తప్పు ఎంతటి పరాభవానికి దారితీసిందో కూడా వారికి తెలిసివస్తుంది (ఫత్‌హుల్ ఖదీర్).

39. అవిశ్వాసులు కల్పించే మాటలకు దైవప్రవక్త (సఅసం) మనసు చివుక్కుమనేది. నా జాతి ప్రజలు ఇలా అంటున్నారేమిటీ?! అని ఆయన బాధపడేవారు. ఆయన్ని ఓదార్చటానికి అల్లాహ్ ఇలా అంటున్నాడు : ఓ ప్రవక్తా! వాస్తవానికి వాళ్లు నిన్ను ధిక్కరించటం లేదు. నువ్వు సత్యవంతుడవనీ, నిజాయితీపరుడవని వాళ్లు ఒప్పుకుంటున్నారు. వాస్తవానికి వారు ధిక్కరిస్తున్నది అల్లాహ్ వాక్యాలను! ఈ విధంగా వాళ్లు మహా దుర్మార్గానికి ఒడిగడుతున్నారు.

తిర్మిజీ తదితర గ్రంథాల్లోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఒకసారి అబూజహల్ దైవప్రవక్త (సఅసం) నుద్దేశించి, 'ఓ ముహమ్మద్ (స)! మేము నిన్ను అసత్యవాది అని అనటం లేదు. కాకపోతే నువ్వు తెచ్చిన సందేశాన్ని మేము

34 నీకు పూర్వం కూడా చాలామంది ప్రవక్తలు ధిక్కరించబడ్డారు. అయితే వారు (ప్రజల) ధిక్కారవైఖరికి, తమకు పెట్టబడిన బాధలకు సహనం వహించారు. కడకు వారికి మా సహాయం అందింది.[40] అల్లాహ్ వాక్కులను మార్చేవాడు ఎవడూ లేడు.[41] కొంతమంది ప్రవక్తలకు సంబంధించిన కొన్ని విషయాలు ఇప్పటికే నీ వద్దకు చేరాయి.[42]

وَلَقَدْ كُذِّبَتْ رُسُلٌ مِّن قَبْلِكَ فَصَبَرُوا عَلَىٰ مَا كُذِّبُوا وَأُوذُوا حَتَّىٰ أَتَاهُمْ نَصْرُنَا ۚ وَلَا مُبَدِّلَ لِكَلِمَاتِ اللَّهِ ۚ وَلَقَدْ جَاءَكَ مِن نَّبَإِ الْمُرْسَلِينَ ﴿٣٤﴾

35 ఒకవేళ వారి వైముఖ్యం (ఓ ముహమ్మద్! (స) నీకు సహించ రానిదిగా ఉంటే (నీవే దానికి ఏదైనా ఉపాయం ఆలోచించు). నీకే గనక శక్తి ఉంటే భూమిలో ఏదైనా సొరంగం లేదా ఆకాశంలో ఏదైనా నిచ్చెనను వెతికి వారి కోసం ఏదైనా మహిమ తేగలిగితే తెచ్చుకో.[43] అల్లాహ్యే గనక తలచుకుంటే వారందరినీ సన్మార్గంపై సమీకరించి ఉండేవాడే. కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు అవివేకుల్లో చేరిపోకు.[44]

وَإِن كَانَ كَبُرَ عَلَيْكَ إِعْرَاضُهُمْ فَإِنِ اسْتَطَعْتَ أَن تَبْتَغِيَ نَفَقًا فِي الْأَرْضِ أَوْ سُلَّمًا فِي السَّمَاءِ فَتَأْتِيَهُم بِآيَةٍ ۚ وَلَوْ شَاءَ اللَّهُ لَجَمَعَهُمْ عَلَى الْهُدَىٰ ۚ فَلَا تَكُونَنَّ مِنَ الْجَاهِلِينَ ﴿٣٥﴾

---

త్రోసిపుచ్చుతున్నాం' అని అన్నాడు. అతను చెప్పిన ఈ మాటల నేపథ్యంలో ఈ ఆయతు అవతరించింది. తిర్మిజీలోని ఈ ఉల్లేఖనం ప్రామాణికత రీత్యా బలహీనమైనదే అయినప్పటికీ, ఇతర ప్రామాణిక ఉల్లేఖనాల ప్రకారం మక్కాలోని అవిశ్వాసులు దైవప్రవక్త (స)ను విశ్వసనీయమైన వ్యక్తిగా, నిజాయితీతత్పరత గలవానిగా నమ్మేవారు. అయినప్పటికీ వాళ్లు ఆయన (స) దైవదౌత్యాన్ని ఒప్పుకోలేదు. నేటికీ చాలా మంది మహానుభావులు మహాప్రవక్త (స) వారి గుణగణాలను, సత్ప్రవర్తనను, సత్యసంధతను గురించి తన్మయత్వంతో వర్ణిస్తారు. తేనెలొలికే పదజాలంతో ఉపన్యాసా లిస్తారు. కాని దైవప్రవక్త (స) అనుసరణ దగ్గరకొచ్చేసరికి నీళ్లు నములుతారు. ప్రవక్త (స) వారి పలుకులుండగా, ఫికహ్కు, ఇమాముల అభిప్రాయాలకు పెద్దపీట వేస్తారు. తాము పోషించే ఈ 'పాత్రకు' అర్థం ఏమిటో వాళ్లు స్వయంగా ఆలోచించాలి.

40. మహాప్రవక్త (సఅసం)ను ఓదార్చటానికి ఇవ్వబడే మరో ఉదాహరణ ఇది. ఇంతకు ముందు కూడా ప్రజలు తమ కాలం నాటి ప్రవక్తలను తిరస్కరించారు. కాబట్టి ఓ ముహమ్మద్ (స)! నీవు దిగులు చెందనవసరం లేదు. వాళ్ళ ఆగడాలను అత్యుత్తమ రీతిలో సహిస్తూ, సాహసంతో ముందుకు సాగిపో. గతంలో మేము మా ప్రవక్తలకు తోడ్పడినట్లే నీకూ తోడ్పడతాము. మేము వాగ్దాన భంగం చేసేవారం కాము. "నిశ్చయంగా మేము మా ప్రవక్తలకు, విశ్వాసు లకు సహాయపడతాము" అని వాగ్దానం చేసి ఉన్నాము (అల్ మోమిన్ – 51). "నేనూ, నా ప్రవక్తలు మాత్రమే ఆధిక్యం వహిస్తాము" అని అల్లాహ్ వ్రాసిపెట్టాడు (ముజాదలహ్ – 21). ఇలాంటి ఆయతులు ఇంకా ఉన్నాయి. ఉదా : సాప్ఫాత్ సూరా 171, 172 ఆయతులు.

41. అంటే అల్లాహ్ వాగ్దానం నెరవేరి తీరుతుంది. నీవు (ముహమ్మద్!) అవిశ్వాసులపై తప్పక ఆధిపత్యం వహిస్తావు అని అల్లాహ్ ఓదార్చాడు. ఆఖరికి జరిగింది కూడా అదే.

42. దీనిద్వారా స్పష్టమయ్యేదేమిటంటే మొదట్లో ఆయా జాతులవారు తమ ప్రవక్తలను ధిక్కరించినా, కష్టాలకు గురిచేసినా, వారి బ్రతుకును దుర్భరం చేసినా, ఆఖరికి దైవసహాయం రానేవచ్చింది. ప్రాపంచిక విజయంతోపాటు, పరలోక సాఫల్యం కూడా ప్రవక్తలను, వారి అనుయాయులనే వరించింది.

43. అవిశ్వాసుల, ముష్రిక్కుల ధిక్కార వైఖరికి మహాప్రవక్త (స) మనసు సహజంగానే నొచ్చుకునేది. అయితే ఇదంతా దేవుని ప్రణాళిక ప్రకారమే జరుగుతోందనీ, దైవాజ్ఞ కానంతవరకూ ప్రవక్త వాళ్లను ఇస్లాం మార్గంపైకి తీసుకురాలేరని

**36** వినేవారు మాత్రమే (సత్యాన్ని) స్వీకరిస్తారు.[45] ఇకపోతే మృతుల విషయం – అల్లాహ్ వారిని బ్రతికించి లేపుతాడు. తర్వాత వారంతా ఆయన వద్దకే మరలించబడతారు.

إِنَّمَا يَسْتَجِيبُ الَّذِينَ يَسْمَعُونَ ۘ وَالْمَوْتَىٰ يَبْعَثُهُمُ
اللَّهُ ثُمَّ إِلَيْهِ يُرْجَعُونَ ﴿36﴾

**37** ఈయన ప్రభువు తరఫు నుంచి ఈయనపై ఏదైనా మహిమ ఎందుకు అవతరింపజేయబడలేదు? అని వారు అడుగుతున్నారు. “అల్లాహ్ (ముమ్మాటికీ) మహిమను అవతరింపజేసే శక్తి కలిగి ఉన్నాడు”[46] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. అయితే వారిలో అధికులకు తెలియదు.[47]

وَقَالُوا لَوْلَا نُزِّلَ عَلَيْهِ آيَةٌ مِّن رَّبِّهِ ۚ قُلْ إِنَّ اللَّهَ
قَادِرٌ عَلَىٰ أَن يُنَزِّلَ آيَةً وَلَٰكِنَّ أَكْثَرَهُمْ
لَا يَعْلَمُونَ ﴿37﴾

**38** భూమిలో సంచరించే ఎన్ని రకాల జంతువులైనా, తమ రెండు రెక్కల సహాయంతో ఎగిరే పక్షులైనా – అన్నీ మీలాంటి సముదాయాలే.[48] మేము గ్రంథంలో నమోదు చేయకుండా దేన్నీ వదలిపెట్టలేదు.[49] ఆపైన అందరూ తమ ప్రభువు వైపుకు సమీకరించబడేవారే.[50]

وَمَا مِن دَابَّةٍ فِي الْأَرْضِ وَلَا طَائِرٍ يَطِيرُ بِجَنَاحَيْهِ
إِلَّا أُمَمٌ أَمْثَالُكُم ۚ مَّا فَرَّطْنَا فِي الْكِتَابِ مِن شَيْءٍ ۚ
ثُمَّ إِلَىٰ رَبِّهِمْ يُحْشَرُونَ ﴿38﴾

అల్లాహ్ ఈ ఆయతులో స్పష్టం చేశాడు. ఆఖరికి దైవప్రవక్త నేలను త్రవ్వి అందులో సొరంగం తయారు చేసి లేదా, ఆకాశానికి నిచ్చెన వేసి మహిమను తీసుకువచ్చినా వీళ్లు విశ్వసిస్తారన్న గ్యారంటీ ఏమీలేదు. ఇదంతా దేవుని వ్యూహం ప్రకారమే జరుగుతోంది. మానవమేధ ఇందలి మర్మాన్ని తెలుసుకోజాలదు. దేవుడు మనిషికి ఒకింత స్వేచ్ఛను ఇచ్చి అతన్ని పరీక్షిస్తున్నాడు. ఆయనే గనక కోరితే బలవంతంగా వారి మెడలు వంచి మరీ అందరినీ సన్మార్గంపైకి తెచ్చేవాడే. అదే గనక జరిగితే దేవుడు మనిషికి ఇచ్చిన స్వేచ్ఛకు, నిర్ణయాధికారానికి అర్థం ఉండేది కాదు. తనకు నచ్చిన దాన్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ కలిగి ఉండి కూడా మనిషి సన్మార్గాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించాలన్నదే దేవుని అభిమతం.

44. అంటే, ఓ ప్రవక్తా! నీవు వారి అవిశ్వాసంపై ఎక్కువ విచారపడకు. ఆ వ్యవహారాన్ని దైవానికే వదలిపెట్టు. అందులోని యుక్తినీ, పరమార్థాన్ని దేవుడే బాగా ఎరుగు.

45. ఈ అవిశ్వాసుల పరిస్థితి మృతుల వంటిది. వారు వినలేరు. కనలేరు. ఆలోచించి అర్థంచేసుకునే శక్తి వారికుండదు. తమకున్న తెలివితేటల్ని ఉపయోగించి, యోచన చేసే ప్రయత్నం వారు చేయటం లేదు. అందువల్ల వారు కూడా శవాలవంటి వారే.

46. అంటే వారు విశ్వసించటం తప్ప మరో మార్గం లేని సూచనను లేక మహిమను దేవుడు అవతరింపజేయటం అన్నది ఆయనకు ఏమాత్రం కష్టతరం కాదు. ఉదాహరణకు : దైవదూతను తెచ్చి వారి కళ్లముందు ప్రత్యక్షపరచటం, పర్వతాన్ని పైకి ఎత్తటం సంభవమే. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) కాలంలో ఇలాంటి మహిమలు సంభవించాయి కూడా. ఇలాంటి అద్భుతాల ద్వారా మనుషుల మనసులను ఆకట్టుకుని వారందరినీ ఒకే త్రాటిపై నడిపించగల శక్తి అల్లాహ్‌కు ఉంది. అయితే ఇలాంటి చమత్కారాలు జరిగిననాడు మనిషిని పరీక్షించటంలో అర్థమే ఉండదు. ఒకవేళ చమత్కారాలు చూపబడిన తరువాత కూడా వారు విశ్వసించడానికి నిరాకరిస్తే వారిపై దైవాగ్రహం విరుచుకు పడుతుంది. వెంటనే వారు ప్రపంచంలోనే కఠినంగా శిక్షించబడతారు. కాబట్టి మహిమలు, చమత్కారాలు చూపకుండా ఉండటంలోనే మానవాళి శ్రేయం ఇమిడి ఉందని దీనిద్వారా అవగతం అవుతోంది. ప్రతి పని వెనుకా దేవుని యుక్తి, పరమార్థం తప్పక ఉంటుంది.

47. అంటే వారు దైవాజ్ఞలలోని మర్మాన్నీ, యుక్తినీ పూర్తిగా బేరీజు వేయలేరు.

**39** ఎవరయితే మా ఆయతులను ధిక్కరిస్తున్నారో వారు చీకట్లలో తచ్చాడుతున్న చెవిటివారు, మూగవారు. అల్లాహ్ తాను కోరిన వారిని పెడదారి పట్టిస్తాడు. అలాగే ఆయన తాను కోరిన వారిని రుజుమార్గంపై నడిపిస్తాడు.[51]

وَالَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا صُمٌّ وَبُكْمٌ فِي الظُّلُمَاتِ ۗ مَن يَشَإِ اللَّهُ يُضْلِلْهُ ۖ وَمَن يَشَأْ يَجْعَلْهُ عَلَىٰ صِرَاطٍ مُّسْتَقِيمٍ ﴿٣٩﴾

**40** (ఓ ప్రవక్తా!) వాళ్ళను అడుగు : "చూడండి! అల్లాహ్ తరఫునుంచి మీపై ఏదయినా ఆపద వచ్చిపడితే లేక మీపైన ప్రళయమే వస్తే అప్పుడు మీరు అల్లాహ్‌ను తప్ప వేరొకరెవరి నయినా మొరపెట్టుకుంటారా? మీరు సత్యవంతులే అయితే (నిజం) చెప్పండి."

قُلْ أَرَأَيْتَكُمْ إِنْ أَتَاكُمْ عَذَابُ اللَّهِ أَوْ أَتَتْكُمُ السَّاعَةُ أَغَيْرَ اللَّهِ تَدْعُونَ إِن كُنتُمْ صَادِقِينَ ﴿٤٠﴾

48. అంటే మిమ్మల్ని పుట్టించిన విధంగానే దేవుడు పశుపక్షాదులను కూడా పుట్టించాడు. మీకు ఆహారాన్ని ప్రసాదించినట్లు వాటికి కూడా ప్రసాదిస్తున్నాడు. దేవుడు నిర్ధారించిన వ్యవస్థకు మీరు కట్టుబడి ఉన్నట్లే అవి కూడా కట్టుబడి ఉన్నాయి.

49. ఇక్కడ **'గ్రంథం'** అంటే లౌహె మహ్‌ఫూజ్ (సురక్షిత ఫలకం) అనీ అర్థం కావచ్చు లేక దివ్య ఖుర్ఆన్ అన్నదీ దాని అర్థం కావచ్చు. జీవన విధానానికి (దీన్‌కు) సంబంధించి ప్రతి విషయం సంక్షిప్తంగానో, సవివరంగానో అందులో నమోదై ఉంది. ఉదాహరణకు : "(ఓ ప్రవక్తా!) మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. అది ప్రతి విషయాన్నీ స్పష్టంగా వివరిస్తుంది" (అన్ నహ్ల్ – 89) అన్న వచనం గమనార్హం. అయితే ఈ ఆయతు నేపథ్యంలో మొదటి అర్థమే సందర్భానికి చేరువలో ఉంది.

50. అంటే ప్రస్తావించబడిన సమూహాలన్నీ ఒకచోట సమీకరించబడతాయి. చనిపోయిన మానవులను సజీవులుగా చేసి లెక్క తీసుకున్నట్లే పశుపక్షాదులు, తదితర జీవరాసులను కూడా బ్రతికించి వాటినుంచి కూడా లెక్క తీసుకోవటం జరుగుతుందని పండితులు అభిప్రాయపడుతున్నారు. ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచించినట్లు, "కొమ్ములుగల ఒక మేక కొమ్ములు లేని మేకను పొడిచి ఉంటే ప్రళయదినాన కొమ్ములుగల మేకకు కూడా ప్రతీకారం చేయటం జరుగుతుంది" (సహీహ్ ముస్లిం: హదీసు నెంబరు – 1997). ఇక్కడ "సమీకరణ" (హష్ర్) అనే పదాన్ని కొంతమంది విద్వాంసులు 'మరణం' అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే అందరూ మరణించవలసినవారే. ఇక్కడ 'సమీకరణ' అనే పదం అవిశ్వాసులకు, బహు దైవారాధకులకు మాత్రమే వర్తిస్తుందని మరి కొంతమంది వ్యాఖ్యా నించారు. వీరి దృష్టిలో మేకకు ప్రతీకారం చేయబడుతుంది అన్న హదీసు కేవలం ఉపమానంగా మాత్రమే పేర్కొన బడింది. ప్రళయదినం నాటి లెక్కల ప్రాధాన్యతను నొక్కిచెప్పటం అసలు దీని ఉద్దేశం. లేదా పశువులలో బాధించిన–బాధించబడిన వాటిని మాత్రమే తిరిగి లేపి బాధితునికి బాధించిన దానినుండి పరిహారం ఇప్పించి తర్వాత ఆ రెండింటి ఉనికి లేకుండా చేయటం జరుగుతుందన్న భావంలో ఇది వచ్చి ఉండవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్). మరికొన్ని హదీసుల ద్వారా కూడా ఈ వాదనకు సమర్థన లభిస్తోంది.

51. దైవ వాక్కులను త్రోసిపుచ్చేవారు సత్యాన్ని తమ చెవులతో వినరు. సత్యాన్ని తమ నోటితో పలకరు. కాబట్టి వారు చెవిటివారితో, మూగవారితో సమానం. అదీగాక వాళ్ళు అవిశ్వాసం అనే అంధకారంలో చిక్కుకుని ఉన్నారు. అందుచేత తమను చక్కదిద్దుకునే దారి ఏదీ వారికి కానరాదు. వారి పంచేంద్రియాలు చచ్చుబడిపోయాయి. అందువల్ల వారు బాగుపడే అవకాశాలను జారవిడుస్తున్నారు.

యదార్థానికి సమస్త అధికారాలు దేవుని హస్తగతమై ఉన్నాయి. ఆయన తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు. తాను కోరిన వారిని అపమార్గాన వదిలివేస్తాడు. అయితే ఆయన నిర్ణయం ఇట్టే అకారణంగా – అల్లాటప్పాగా –

بَلْ إِيَّاهُ تَدْعُونَ فَيَكْشِفُ مَا تَدْعُونَ إِلَيْهِ إِنْ شَآءَ وَتَنْسَوْنَ مَا تُشْرِكُونَ ﴿41﴾

**41** "లేదు. (ఆ క్షణంలో) మీరు కేవలం ఆయన్నే వేడుకుంటారు. దేనికోసం మీరు వేడుకున్నారో ఆ ఆపదను ఆయన మీ నుండి తొలగించదలచుకుంటే తొలగిస్తాడు. అలాంటి సమయాలలో మీరు మాత్రం (అల్లాహ్‌కు) సహవర్తులుగా నిలబెట్టిన వారందరినీ మరచిపోతారు."[52]

وَلَقَدْ أَرْسَلْنَآ إِلَىٰٓ أُمَمٍ مِّنْ قَبْلِكَ فَأَخَذْنٰهُمْ بِالْبَأْسَآءِ وَالضَّرَّآءِ لَعَلَّهُمْ يَتَضَرَّعُونَ ﴿42﴾

**42** నీకు పూర్వం ఎన్నో సమాజాల వద్దకు కూడా మేము ప్రవక్తలను పంపాము. ఆయా సమాజాలవారు అణకువను వ్యక్తపరచాలన్న ఉద్దేశంతో మేము వాళ్ళను దారిద్ర్యానికి, అనారోగ్య బాధలకు గురిచేసి పట్టుకున్నాము.

فَلَوْلَآ إِذْ جَآءَهُمْ بَأْسُنَا تَضَرَّعُوا وَلٰكِنْ قَسَتْ قُلُوبُهُمْ وَزَيَّنَ لَهُمُ الشَّيْطٰنُ مَا كَانُوا يَعْمَلُونَ ﴿43﴾

**43** మా తరఫున వారిపైకి శిక్ష వచ్చినప్పటికీ వారు అణకువను ఎందుకు ప్రదర్శించలేదు? పైగా వారి హృదయాలు కఠినమై పోయాయి. షైతాన్ వారి దృష్టిలో వారు చేసే పనులన్నీ మంచివే అని భ్రమపడేలా చేశాడు.[53]

జరగదు. ప్రతిదీ న్యాయబద్ధంగా జరుగుతుంది. మార్గవిహీనతపై పాతుకుపోయిన మూర్ఖులను మాత్రమే ఆయన వదలిపెడతాడు. మార్గవిహీనత అనే రొంపి నుండి బయటపడి రుజుమార్గంలో రాగోరిన వారికి ఆయన తప్పకుండా సహాయపడతాడు. (మరిన్ని వివరాల కోసం అల్ బఖరా సూరాలోని 26వ ఆయతుకు వివరణను చూడండి).

52. ఈ రకమయిన ప్రశ్నలు దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల వేయబడ్డాయి. (ఉదాహరణకు: అల్ బఖరా సూరాలోని 165వ ఆయతుకు వివరణ చూడండి.) దీన్నిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే మనిషి మనసులో తౌహీద్ (ఏక దైవోపాసన) అనేది నాటుకుని ఉంది. అయితే మనిషి పరిసరాలకు, సావాసానికి ప్రభావితుడవటం వల్లనో, కుటుంబ ఒత్తిడి వల్లనో అంతరాత్మ ప్రబోధాన్ని అణచివేసి బహుదైవోపాసనా భావాల వెల్లువలో కొట్టుకుపోతుంటాడు. చిల్లర దేవుళ్ల ముందు తలవంచటమే గాకుండా, వాటి పేరు మీద మొక్కుకుంటాడు. కాని భయంకరమైన ఆపదలు నలువైపుల నుండీ చుట్టుముట్టినప్పుడు అతనిలోని అంతరాత్మ ఒక్కసారిగా మేల్కొంటుంది. ఆ ఘడియలో అతను పూజించే చిట్టిపొట్టి దేముళ్ళందరినీ మరచిపోయి నిజదైవాన్ని పిలుస్తాడు. మానవ నైజం వాంఛించే ఈ 'ప్రకృతి ధర్మం' (తౌహీద్) పైనే అతడు సదా నిలకడగా ఉంటే ఎంత బావుండు!

క్రితం ఆయతు మొదట్లో **'అరఐతకుమ్'** (أَرَءَيْتَكُمْ) అనే పదం ఉపయోగించబడింది. ఇందులో **'కుమ్'** (كُمْ) అనేది సంబోధన నిమిత్తం వచ్చి చేరిన ప్రత్యయం. అసలు పదం 'అరఐత' మాత్రమే. 'నీవు చూశావా?' అని దాని శాబ్దిక అర్థం. అయితే ఇక్కడ ఇది **'అఖ్‌బిరూనీ'** (నాకు చెప్పు, తెలుపు) అన్న భావంలో ఉపయోగించబడింది.

53. జాతులు నైతికంగా అత్యంత హీనస్థితికి దిగజారిపోయి వాటి మనసులకు తుప్పు పట్టినప్పుడు దేవుని తరఫున వచ్చే హెచ్చరికలు కూడా వాటికి కనువిప్పు కలిగించలేవు. హృదయాలకు పట్టిన తుప్పు మూలంగా వారికి విషయం అర్థం కాదు. అందువల్ల వారు క్షమాభిక్ష కోరుతూ దైవసన్నిధిలో చేతులెత్తరు. దిద్దుబాటు వైపుకు వారు రానేరారు. వారి మనసులలో పశ్చాత్తాప భావం కలగదు. పైగా వారు తమ తప్పుడు పనులను సమర్థించుకోవటానికి అందమైన ఉపమానాలు ఇస్తారు. వాటి చుట్టూ సుందర వలయాన్ని అల్లటానికి ప్రయత్నిస్తారు. ఇలా చేసి తమ కర్తవ్యం నెరవేరినట్లు మనసులకు సర్దిచెప్పుకుంటూ ఉంటారు. షైతాన్ వారి పనులు వారికి ఎంతో మంచివిగా అనిపించేలా చేస్తారన్న మాటలోని అంతరార్థం ఇదే.

فَلَمَّا نَسُوا مَا ذُكِّرُوا بِهِ فَتَحْنَا عَلَيْهِمْ أَبْوَابَ كُلِّ
شَيْءٍ حَتَّىٰ إِذَا فَرِحُوا بِمَا أُوتُوا أَخَذْنَاهُمْ بَغْتَةً
فَإِذَا هُمْ مُبْلِسُونَ ﴿٤٤﴾

**44** తరువాత వారికి బోధించిన విషయాలను వారు విస్మరించినప్పుడు, మేము వారి కోసం అన్ని వస్తువుల ద్వారాలూ తెరిచాము. తమకు ప్రాప్తించిన వస్తువులపై వారు మిడిసిపడుతుండగా, అకస్మాత్తుగా మేము వారిని పట్టుకున్నాము. అప్పుడు, వారు పూర్తిగా నిరాశ చెందారు.

فَقُطِعَ دَابِرُ الْقَوْمِ الَّذِينَ ظَلَمُوا ۚ وَالْحَمْدُ لِلَّهِ
رَبِّ الْعَالَمِينَ ﴿٤٥﴾

**45** ఈ విధంగా, దుర్మార్గాలకు పాల్పడినవారి వేరు త్రెంపబడింది. సమస్త లోకాల ప్రభువైన అల్లాహ్‌కే కృతజ్ఞతలు.[54]

قُلْ أَرَأَيْتُمْ إِنْ أَخَذَ اللَّهُ سَمْعَكُمْ وَأَبْصَارَكُمْ
وَخَتَمَ عَلَىٰ قُلُوبِكُمْ مَنْ إِلَٰهٌ غَيْرُ اللَّهِ يَأْتِيكُمْ بِهِ ۗ
انْظُرْ كَيْفَ نُصَرِّفُ الْآيَاتِ ثُمَّ هُمْ يَصْدِفُونَ ﴿٤٦﴾

**46** (ఓ ప్రవక్తా!) వారిని అడుగు: "అల్లాహ్‌యే గనక మీ వినికిడిని, మీ చూపును పూర్తిగా తీసేసుకుని, మీ హృదయాలకు ముద్రవేస్తే, అల్లాహ్ తప్ప వాటిని మీకు తిరిగి ప్రసాదించగల మరో ఆరాధ్యుడు ఎవడున్నాడు చెప్పండి?!" మేమెన్ని విధాలుగా మా సూచనలను వారికి విశదీకరిస్తున్నామో చూడు! అయినా వారు ముఖం త్రిప్పుకుంటున్నారు.[55]

54. దైవప్రసాదితాలను అనుభవిస్తూ, దైవాన్నే విస్మరించిన జాతుల స్థితిగతులను అల్లాహ్ ఈ ఆయతులో అపురూపంగా వర్ణించాడు–అలాంటి తలబిరుసులను మేము తాత్కాలికంగా కటాక్షిస్తాము. వారికోసం భోగభాగ్యాల ద్వారాలు తెరుస్తాము. వారు ఆ విలాస వస్తువులలో మునిగిపోయి, తమకు ప్రాప్తించిన కలిమిపై మిడిసిపడుతున్న సమయంలో అకస్మాత్తుగా మేము వారిని పట్టుకుని, లెక్క అడుగుతాము. ఏ ఆస్తిపాస్తుల్ని చూసుకుని వారు మురిసిపోయేవారో వాటిని జప్తు చేసుకుంటాము అని అల్లాహ్ హెచ్చరిస్తున్నాడు. ఈ విషయమే ఒక హదీసులో మహనీయ ముహమ్మద్ (స) ద్వారా ఇలా వివరించబడింది: "అవిధేయులుగా ప్రవర్తిస్తున్నప్పటికీ అల్లాహ్ ఎవరినయినా వారి అభీష్టానికనుగుణంగా అనుగ్రహిస్తుంటే, దాన్ని 'ఇస్తిద్‌రాజ్'గా (అంటే ఆయన వదులు ఇస్తున్నట్లుగా) భావించండి." తరువాత ఆయన (సఅసం) దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతునే పఠించారు (ముస్నదె అహ్మద్ : సంపుటి – 4, పేజీ – 145).

దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతు ద్వారానూ, ప్రవక్త (స) వారి ఈ ప్రవచనం ద్వారానూ బోధపడేదేమంటే, ప్రాపంచిక జీవితంలో వ్యక్తులుగానీ, జాతులుగానీ ఇలా సిరిసంపదలతో తులతూగుతుంటే వారు దైవప్రసన్నతను చూరగొన్నవారని భావించనక్కరలేదు. చాలామంది ఈ విధంగా అనుకోవటమేగాక, అలాంటివారిని 'దేవుని సజ్జనదాసులు'గా కూడా వర్ణిస్తుంటారు. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్, "సజ్జనులైన మా దాసులే భూమికి వారసులవుతారు" అని చెప్పాడని డొంకతిరుగుడు ఫిలాసఫీ చెబుతారు. ఈ అభిప్రాయం తప్పు. అలా అనుకుంటే నేడు ప్రపంచంలో మార్గవిహీనతకు లోనై ఉన్న ఎన్నో జాతులు భౌతికంగా కీర్తి శిఖరాల అంబరాలను చుంబిస్తున్నాయి. నిజానికి ఇది వారికి సృష్టికర్త తరఫున ఇవ్వబడిన ఒక "అవకాశం మరియు పరీక్ష" మాత్రమేగానీ, దేవుని మెప్పుకు తార్కాణం కాదు. వాళ్ళ పాపాలు పండిన రోజు వాళ్ళ నిజస్వరూపం బయటపడుతుంది.

55. మనిషి శరీరావయవాల్లో ఎంతో కీలకమైనవి కళ్ళు, చెవులు, హృదయం. అల్లాహ్‌యే గనక తలచుకుంటే తాను ప్రసాదించిన ఈ వస్తువులను వారి నుంచి జప్తు చేసుకోగలడు. అంటే వారిని చెవిటివారుగా చేయగలడు. కంటిచూపును పోగొట్టగలడు. గ్రాహ్యశక్తిని నిర్వీర్యం చేయగలడు. సాధారణంగా అవిశ్వాసులు ఈ అవయవాలు కలిగి ఉండి కూడా వాటిని సత్యం కోసం ఉపయోగించలేకుండా ఉంటారు. ఆ దేవుడు స్వయంగా ఎవరినయినా రక్షించదలిస్తే తప్ప, ఆయన పట్టు నుంచి ఎవరూ ఎవరినీ విడిపించలేరు. ఈ విధంగా దేవుడు పెక్కు ఉపమానాల ద్వారా – కొన్ని సార్లు హెచ్చరికల ద్వారా, కొన్ని సార్లు శుభవార్తల ద్వారా – విషయాన్ని విడమరచి చెబుతూ ఉంటాడు.

قُلْ اَرَءَيْتَكُمْ اِنْ اَتٰىكُمْ عَذَابُ اللّٰهِ بَغْتَةً اَوْ جَهْرَةً هَلْ يُهْلَكُ اِلَّا الْقَوْمُ الظّٰلِمُوْنَ ﴿47﴾

47 "చూడండి! ఒకవేళ మీపై అకస్మాత్తుగా గానీ, బహిరంగంగా గానీ అల్లాహ్ యొక్క శిక్ష వచ్చిపడితే దుర్మార్గులు తప్ప ఎవరు నాశనం చేయబడతారు?"[56] అని వారిని అడుగు.

وَمَا نُرْسِلُ الْمُرْسَلِيْنَ اِلَّا مُبَشِّرِيْنَ وَمُنْذِرِيْنَ ۚ فَمَنْ اٰمَنَ وَاَصْلَحَ فَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ﴿48﴾

48 మేము ప్రవక్తలను పంపేది, వారు శుభవార్త అందజేయటానికి, హెచ్చరించటానికి మాత్రమే.[57] కాబట్టి ఎవరు విశ్వసించి, తమ ప్రవర్తనను సరిదిద్దుకుంటారో వారికెలాంటి భయం గానీ, దుఃఖంగానీ ఉండదు.[58]

وَالَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِنَا يَمَسُّهُمُ الْعَذَابُ بِمَا كَانُوْا يَفْسُقُوْنَ ﴿49﴾

49 అయితే మా ఆయతులను అబద్ధాలని కొట్టిపారేసేవారికి, వారి అవిధేయత కారణంగా శిక్ష అంటుకుంటుంది.[59]

قُلْ لَّآ اَقُوْلُ لَكُمْ عِنْدِيْ خَزَآئِنُ اللّٰهِ وَلَآ اَعْلَمُ الْغَيْبَ وَلَآ اَقُوْلُ لَكُمْ اِنِّيْ مَلَكٌ ۚ اِنْ اَتَّبِعُ اِلَّا مَا يُوْحٰٓى اِلَيَّ ؕ قُلْ هَلْ يَسْتَوِي الْاَعْمٰى وَالْبَصِيْرُ ؕ اَفَلَا تَتَفَكَّرُوْنَ ﴿50﴾

50 ఓ ప్రవక్తా! వారికి చెప్పేయి: "నా వద్ద అల్లాహ్ ఖజానాలున్నాయని నేను మీతో అనటం లేదు. నా వద్ద అగోచర జ్ఞానం కూడా లేదు. నేను దైవదూతనని కూడా మీతో అనటం లేదు. నాపై అవతరింపజేయబడే 'వహీ'ని మాత్రమే నేను అనుసరిస్తున్నాను."[60] (ఓ ప్రవక్తా!) వారిని అడుగు:"గ్రుడ్డివాడు, కళ్ళున్నవాడూ – ఇద్దరూ సమానులేనా?[61] మీరు ఈ మాత్రం ఆలోచించరా?"

---

56. అరబీలో **'బగ్తతన్'** (అకస్మాత్తుగా రావటం), **'జహ్రతన్'** (బహిరంగంగా రావటం) అనే రెండు పదాలు ఉపయోగించబడ్డాయి. అకస్మాత్తుగా ఆపద రావటమంటే రాత్రిపూట రావటమనీ, బహిరంగంగా రావటమంటే పగటిపూట రావటమనీ భావం. అందుకే సూరె యూనుస్‌లోని 50వ ఆయతులో 'బగ్తతన్', 'జహ్రతన్' అని గాకుండా 'బయాతన్ అవ్ నహారన్' అని చెప్పబడింది. అంటే రాత్రిపూట లేక పగటిపూట రావటమన్నమాట. అకస్మాత్తుగా వచ్చే ఆపద అంటే, ఎటువంటి ముందస్తు సూచనలు లేకుండా ఒక్కసారిగా విరుచుకుపడే ఆపద అనీ, దీనికి భిన్నంగా బహిరంగంగా వచ్చే ఆపద అంటే ముందస్తు సూచనలతో వచ్చే ఆపద అని కూడా భావం చెబుతారు. ఏమయినప్పటికీ ఈ ఆపదలు దుర్మార్గులపై, దైవాజ్ఞల్ని ధిక్కరించిన వారిపై, పాపాత్ములపై వచ్చిపడతాయి. వారిని సమూలంగా నాశనం చేసేస్తాయి.

57. దైవప్రవక్తలు దైవానికి విధేయత చూపి, మంచిపనులు చేసేవారికి అనుగ్రహభరితమైన స్వర్గం లభిస్తుందన్న శుభవార్తను వినిపిస్తారు. దైవాజ్ఞల్ని ధిక్కరించి, భూమిలో విర్రవీగే వారికి దేవుడు సిద్ధంచేసి ఉంచిన వ్యధాభరితమైన నరక శిక్ష గురించి భయపెడతారు.

58. అంటే పరలోకంలో ఎదురయ్యే స్థితిగతుల గురించి వారు అదే పనిగా భీతి చెందనవసరం లేదు. అలాగే వారు ప్రపంచంలో తమ వెనుక వదలి వచ్చిన వాటిని గురించిగాని, ప్రపంచంలో అనుభవించలేకపోయిన సౌఖ్యాల గురించి గాని బాధపడవలసిన పని ఉండదు. ఎందుకంటే ఉభయ లోకాలలోనూ వారి వ్యవహారాలను చక్కదిద్దేవాడు, వారి సంరక్షకుడు, ఆ రెంటికీ యజమాని అయిన అల్లాహ్‌యే.

59. వారి శిక్షకు ప్రధాన కారణం వారి ధిక్కారి వైఖరే. అల్లాహ్ ఆజ్ఞల ముందు తలవంచడానికి నిరాకరించటం వల్లనూ, ఆయన నిషేధించిన అధర్మ కార్యాలకు నిర్భయంగా ఒడిగట్టడం వల్లనూ వారు దేవుని కోపానికి గురయ్యారు.

وَأَنذِرْ بِهِ الَّذِينَ يَخَافُونَ أَن يُحْشَرُوا إِلَىٰ
رَبِّهِمْ لَيْسَ لَهُم مِّن دُونِهِ وَلِيٌّ وَلَا شَفِيعٌ
لَّعَلَّهُمْ يَتَّقُونَ ﴿٥١﴾

**51** స్వయంగా తమ ప్రభువు తప్ప, తమను ఆదుకునేవారుగానీ, తమకోసం సిఫారసు చేసేవారుగాని ఉండని స్థితిలో తమ ప్రభువు దగ్గరికి హాజరు కావలసి ఉంటుందని భయపడేవారికి (ఓ ప్రవక్తా!) ఇందుమూలంగా హెచ్చరించు, దీనిద్వారా వారు భయభక్తుల వైఖరిని అవలంబించవచ్చు.[62]

وَلَا تَطْرُدِ الَّذِينَ يَدْعُونَ رَبَّهُم بِالْغَدَاةِ
وَالْعَشِيِّ يُرِيدُونَ وَجْهَهُ ۖ مَا عَلَيْكَ مِنْ حِسَابِهِم
مِّن شَيْءٍ وَمَا مِنْ حِسَابِكَ عَلَيْهِم مِّن شَيْءٍ
فَتَطْرُدَهُمْ فَتَكُونَ مِنَ الظَّالِمِينَ ﴿٥٢﴾

**52** ఉదయం, సాయంత్రం తమ ప్రభువును ప్రార్థిస్తూ, కేవలం ఆయన ప్రసన్నతను పొందాలనుకునేవారిని నీ దగ్గరి నుండి తొలగి పొమ్మనకు. (నువ్వు వారిని తొలగి పొమ్మనటానికి) నీపై వారి లెక్క ఏ మాత్రం లేదు. అలాగే నీ లెక్క కూడా వారిపై ఎంతమాత్రం లేదు. అయినప్పటికీ ఒకవేళ నువ్వు వాళ్లను తొలగిపొమ్మన్నావంటే దౌర్జన్యపరులలో చేరిపోతావు.[63]

60. దేవుని అంతిమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో నిర్ద్వంద్వంగా ఇలా చెప్పటంలోని ఆంతర్యం ఏమిటో కాస్త ఆలోచించండి! ఆయన (స) చెప్పదలచిందేమిటంటే, సమస్త అధికారాలు దైవాధీనమై ఉన్నాయి. దేవుని అనుమతి, ఆజ్ఞ లేకుండా నేను మీకు ఏ విషయమూ చెప్పలేను. ఆయన ఆదేశం కానంతవరకూ మీముందు ఏ అద్భుతాన్నీ చేయలేను. భవిష్యత్తులో జరగబోయేదేమిటో మీకు ఎరుకపరచడానికి నావద్ద అగోచర విషయాల జ్ఞానం లేదు. మానవాతీత శక్తుల్ని మీముందు ప్రదర్శించడానికి నేను దైవదూత (ఫరిష్తా)ను కూడా కాను. నేను కేవలం నాపై అవతరించే 'వహీ' (అల్లాహ్ వాణి)ని ఖచ్చితంగా అనుసరించే ప్రవక్తను మాత్రమే. 'వహీ' అన్నప్పుడు ఖుర్ఆన్‌తోపాటు హదీసు కూడా అందులోకి వచ్చేస్తుంది. "నాకు ఖుర్ఆన్‌తో పాటు దానివంటిదే మరొకటి కూడా ఇవ్వబడింది" అని ఆయన (స) ఒక హదీసులో చెప్పారు. ఆ దానివంటిదే మరో అంశం 'హదీసు'. అంటే మహాప్రవక్త (స) వారి ప్రబోధనలు మరియు ఆయన విధానం.

61. ఏ విధంగా గుడ్డివాడూ – కళ్లున్నవాడు సమానులు కాలేరో అదేవిధంగా దారితప్పిన వాడు – రుజుమార్గం పొందినవాడు సమానులు కాలేరు. అలాగే విశ్వాసి – అవిశ్వాసి కూడా సమానులు కాలేరు.

62. మనసులో దైవభీతి, పరలోక భీతి ఉన్నవారే హెచ్చరికలను ఖాతరు చేస్తారు. మరణానంతర జీవితంపై అసలు విశ్వాసమే లేనివారికి భయబోధ చేసి ప్రయోజనం ఏమిటి? ఎంత నచ్చజెప్పినా వారు తమ అవిశ్వాసంపైనే పాతుకుపోయి ఉంటారు. తమ పూర్వీకులు, తమ పూజ్యదైవాలు పరలోకంలో తమ కోసం సిఫారసు చేస్తారని గుడ్డిగా నమ్మే గ్రంథవహులకు, బహుదైవారాధకులకు, అవిశ్వాసులకు కూడా ఈ ఆయతులో చురక అంటించబడింది. నరకాగ్నికి అర్హులుగా ఖరారు చేయబడిన ప్రబుద్ధుల్ని ఆదుకునేవాడుగానీ, వారి గురించి సిఫారసు చేసేవాడు గాని ఆనాడు ఎవడూ ఉండడు. అయితే విశ్వాసుల కోసం దేవుని సజ్జనదాసులు దేవుని అనుమతితో సిఫారసు చేయటం సంభవమే. అంటే అవిశ్వాసుల, బహుదైవారాధకుల కోసం సిఫారసు చేసేందుకు అనుమతి లభించదు. పాపాలు చేసిన విశ్వాసులు – వారు గనక ఏకదైవోపాసకులై ఉంటే – వారికోసం సిఫారసు ఆమోదయోగ్యమవుతుంది.

63. నిరాధార జీవులు, నిరుపేదలైన ముస్లింలు ఎంతో వినమ్రతతో, చిత్తశుద్ధితో రేయింబవళ్లు తమ ప్రభువును ప్రార్థిస్తున్నారు. అయితే వారు పొద్దస్తమానం దైవప్రవక్త (స) చుట్టూ గుమిగూడి ఉండటం మక్కాలోని ముష్రిక్కులకు సహించరానిదిగా ఉండేది. "ఓ ముహమ్మద్ (స)! నీ చుట్టూ గుమిగూడి ఉండే ఈ దరిద్రులను నువ్వు కాస్త దూరం జరిపితే మేము నీతో కలసి సంభాషించడానికి వీలుంటుంది" అని ఈ శ్రీమంతులు, సర్దారులు కోరేవారు. ఈ నేపథ్యంలో అల్లాహ్ తన ప్రవక్తను అప్రమత్తం చేస్తున్నాడు: ఓ ప్రవక్తా! ఈ 'గొప్పోళ్ళ' కోసం, నిన్ను అమితంగా అభిమానించే పేద

53 "మా అందరిలోకీ అల్లాహ్ అనుగ్రహించినది వీళ్లనేనా!" అని వారు పలికేందుకుగాను మేము వారిలో కొందరిని మరి కొందరి ద్వారా పరీక్షించాము.[64] కృతజ్ఞతా భావంతో మెలిగే వారిని అల్లాహ్ ఎరుగడా ఏమిటీ?![65]

وَكَذَٰلِكَ فَتَنَّا بَعْضَهُم بِبَعْضٍ لِّيَقُولُوٓا۟ أَهَٰٓؤُلَآءِ
مَنَّ ٱللَّهُ عَلَيْهِم مِّنۢ بَيْنِنَآ ۗ أَلَيْسَ ٱللَّهُ بِأَعْلَمَ
بِٱلشَّٰكِرِينَ ﴿53﴾

54 (ఓ ప్రవక్తా!) మా ఆయతులను విశ్వసించేవారు నీ వద్దకు వచ్చినప్పుడు, "మీపై సలామ్! (శాంతి కలుగుగాక!)[66] దయ చూపటాన్ని మీ ప్రభువు తన కోసం విధిగా లిఖించుకున్నాడు.[67] మీలో ఎవరయినా అజ్ఞానం వల్ల ఏదన్నా చెడు పని చేసి, తరువాత పశ్చాత్తాపం చెంది, దిద్దుబాటుకు ప్రయత్నిస్తే అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా దయజూపేవాడు"[68] అని చెప్పు.

وَإِذَا جَآءَكَ ٱلَّذِينَ يُؤْمِنُونَ بِـَٔايَٰتِنَا فَقُلْ سَلَٰمٌ
عَلَيْكُمْ ۖ كَتَبَ رَبُّكُمْ عَلَىٰ نَفْسِهِ ٱلرَّحْمَةَ ۖ أَنَّهُۥ مَنْ
عَمِلَ مِنكُمْ سُوٓءًۢا بِجَهَٰلَةٍ ثُمَّ تَابَ مِنۢ بَعْدِهِۦ
وَأَصْلَحَ فَأَنَّهُۥ غَفُورٌ رَّحِيمٌ ﴿54﴾

సహచరులను దూరం చేసుకోకు. ఒకవేళ నువ్వు గనక అలా చేశావంటే అది నీ హోదాకు ఏమాత్రం శోభించదు. పైగా అదొక అన్యాయంతో కూడిన చర్య. కనుక నువ్వు అన్యాయపరుల సరసన నిలబడకు అని అల్లాహ్ హెచ్చరించాడు.

సభ్య సమాజ సభ్యులకు ఈ వచనంలో గొప్ప హితోపదేశం ఉంది. సమాజంలో ఆస్తీ అంతస్థులు లేని వారిని చిన్నచూపు చూడటం, వారికి ఆమడదూరాన మసలుకోవటం, వారు ఒక దారిగుండా వస్తుంటే తాము మరో దారిగుండా వెళ్ళిపోవటం, వారితో తెగత్రెంపులు చేసుకోవటం వివేకం, విజ్ఞత కాదు. ఇలాంటి చేష్టలకు అజ్ఞానులు మాత్రమే పాల్పడతారు. విశ్వాసులు ఎన్నడూ ఇలా చేయరు. విశ్వాసులు పరస్పరం అన్నదమ్ములు. వారు పేదవారైనా, నిరాశ్రయులైనా ఒండొకరి పట్ల నిష్కల్మషమైన ప్రేమాభిమానాలు కలిగి ఉంటారు.

64. తొలికాలంలో నిరుపేదలు, బానిసలు, దళితులే ఎక్కువమంది ఇస్లాం స్వీకరించారు. ఈ విషయం సమాజంలోని శ్రీమంతులకు, అయ్యవార్లకు మింగుడు పడలేదు. తమ అధీనంలో ఉన్న ఇలాంటి పేద ముస్లింలను చూసి వారు వేళాకోళం చేసేవారు. పగలబడి నవ్వేవారు. వారిని వేధించి వికటాట్టహాసం చేసేవారు. "ఏమిటీ, దైవకటాక్షానికి అర్హులుగా కనిపించింది ఈ చిల్లర మనుషులేనా?" అని ఎగతాళి చేసేవారు. ఈమాన్ (విశ్వాసం) మరియు దీన్ (ఇస్లాం ధర్మం) నిజంగా దేవుని మహోపకారమై ఉంటే అది అందరికన్నా ముందు తమపై అవతరించాల్సింది అన్నది ఈ అయ్యవార్ల అభిమతం. దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట కూడా వారు ఈ విధంగా పలికినట్లు చెప్పబడింది: "నిజంగా ఇది మంచి విషయమే అయితే దీన్ని విశ్వసించే విషయంలో వీళ్లు మాకంటే ముందుకు పోగలిగేవారు కాదు" (అల్ అహ్ఖాఫ్- 11). అంటే ఈ బడుగు జనులకంటే ముందు తామే ముస్లింలయ్యేవారమన్నది వారి ఉద్దేశం.

65. అల్లాహ్ బాహ్యంలోని తళుకుబెళుకులను, ఆర్భాటం అట్టహాసాన్ని, ఠీవీ దర్పాన్ని చూడడు. మనిషిలోని కృతజ్ఞతా భావాన్ని, అణకువను మాత్రమే చూస్తాడు. గుండెల్లో గూడు కట్టుకుని ఉన్న భావాలను ఆయన బాగా ఎరిగినవాడు. ఎవరి మనసులో నిష్కల్మషమైన కృతజ్ఞతా భావం ఉందో, మరెవరు కపట నాటకమాడుతున్నారో ఆయనకు పూర్తిగా తెలుసు. అందుకే ఆయన కృతజ్ఞతాభావం నిండిన త్యాగధనులకు విశ్వాస భాగ్యాన్ని ప్రసాదించాడు. హదీసులో పేర్కొనబడినట్లు: "అల్లాహ్ మీ రంగును, రూపురేఖలను చూడడు. ఆయనైతే మీ మనసులను, మీ కర్మలను చూస్తాడు" (సహీహ్ ముస్లిం : కితాబుల్ బిర్ర్).

66. అంటే, వారికి 'సలామ్' చేసి లేదా వారి సలామ్‌కు ప్రతిసలామ్ చేసి వారియెడల మర్యాదగా వ్యవహరించు.

67. అంటే, దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో ఉండే దాసులను కరుణించాలని అల్లాహ్ నిశ్చయించుకున్నాడు అన్న

**55** ఈ విధంగా మేము, అపరాధులు ఎంచుకున్న మార్గం ఎలాంటిదో విదితమయ్యేందుకుగాను ఆయతులను విడమరచి చెబుతుంటాము.

وَكَذٰلِكَ نُفَصِّلُ الْاٰيٰتِ وَلِتَسْتَبِيْنَ سَبِيْلُ
الْمُجْرِمِيْنَ ﴿55﴾

**56** (ఓ ప్రవక్తా!) "అల్లాహ్‌ను వదలి మీరు పిలిచే ఇతరులకు దాస్యం చేయటం నాకు నిషేధించబడింది" అని వారికి చెప్పేయి. "నేను మీ కోర్కెలను అనుసరించను. ఒకవేళ నేనలా చేసి నట్లయితే మార్గ విహీనతకు లోనైపోతాను. సన్మార్గాన నడిచే వారిలో ఉండను"[69] అని (కూడా) వారికి చెప్పు.

قُلْ اِنِّيْ نُهِيْتُ اَنْ اَعْبُدَ الَّذِيْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِ
اللّٰهِ ؕ قُلْ لَّاۤ اَتَّبِعُ اَهْوَآءَكُمْ ۙ قَدْ ضَلَلْتُ اِذًا
وَّمَاۤ اَنَا مِنَ الْمُهْتَدِيْنَ ﴿56﴾

**57** ఇంకా ఇలా చెప్పు: "నా వద్ద నా ప్రభువు తరఫున ఒక ప్రమాణం ఉంది.[70] మీరేమో దాన్ని అసత్యమని త్రోసిపుచ్చు తున్నారు. దేనికోసం మీరు తొందర పెడుతున్నారో అది నా దగ్గరలేదు. నిర్ణయాధికారం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు.[71] ఆయన సత్యాన్ని తెలియపరుస్తాడు.[72] అందరికన్నా ఉత్తమమైన తీర్పరి ఆయనే."

قُلْ اِنِّيْ عَلٰى بَيِّنَةٍ مِّنْ رَّبِّيْ وَكَذَّبْتُمْ بِهٖ ؕ
مَا عِنْدِيْ مَا تَسْتَعْجِلُوْنَ بِهٖ ؕ اِنِ الْحُكْمُ اِلَّا
لِلّٰهِ ؕ يَقُصُّ الْحَقَّ وَهُوَ خَيْرُ الْفٰصِلِيْنَ ﴿57﴾

శుభవార్తను విశ్వాసులకు వినిపించు. హదీసులో సెలవీయబడినట్లు; అల్లాహ్ విశ్వమండలాన్ని సృష్టించిన తర్వాత అర్ష్ అనే తన ఆసనంపై ఇలా లిఖించాడు : "నా కారుణ్యం, నా ఆగ్రహాన్ని మించి ఉంటుంది" (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం).

68. ఈ వాక్యంలో కూడా విశ్వాసులకు శుభవార్త ఉంది. ఎందుకంటే అవివేకం వల్ల ఏదన్నా అపరాధానికి ఒడిగట్టినప్పుడు లేదా మానవ సహజమైన దౌర్బల్యం మూలంగా తమ వల్ల ఏదన్నా తప్పు జరిగిపోయినప్పుడు వెంటనే తప్పును తెలుసుకుని పశ్చాత్తాప భావంతో కుమిలిపోవటం, తప్పును సరిదిద్దుకోవటం విశ్వాసుల లక్షణం. అంతేగాని వారు తమ తప్పుడు పనిని సరైనదిగా సమర్థించుకోవడానికి పిడివాదం చేయటం, ఎదుటివారిని బుకాయించటం వంటివి చేయరు. తమ తప్పుల నుంచి పలాయనం చిత్తగించే ప్రయత్నం కూడా చేయరు.

69. అంటే – మీలాగానే నేను కూడా అల్లాహ్ దాస్యాన్ని కాదని, మీ అడుగులకు మడుగులొత్తుతూ, దైవేతరుల దాస్యాన్ని మొదలెడితే నేను కూడా మార్గభ్రష్టుణ్ణి అయిపోవటం ఖాయం. దీని భావమేమిటంటే దైవేతరుల దాస్యం అన్నిటికన్నా పెద్ద అపమార్గం. కాని దురదృష్టవశాత్తూ ఈ అపమార్గం సర్వసామాన్యమైపోయి ఉంది. ముస్లింలలో సయితం పెక్కుమంది ఈ అపమార్గానికి లోనై ఉన్నారు – అల్లాహ్ వారికి సన్మార్గం చూపుగాక!

70. ఇక్కడ 'ప్రమాణం' (బయ్యినతున్) అంటే భావం 'వహీ' ద్వారా దైవప్రవక్త (సఅసం)పై అవతరించిన షరీయతు – ఇస్లామీయ షరీయతు. అందులో ఏకదైవారాధన కీలకమైనది. "అల్లాహ్ మీ రూపురేఖలను చూడడు, మీ సిరిసంపదలను చూడడు. ఆయన కేవలం మీ హృదయాలను, మీ ఆచరణలను మాత్రమే చూస్తాడు." (సహీహ్ ముస్లిం, ముస్నదె అహ్మద్).

71. సమస్త విశ్వవ్యవస్థకు అల్లాహ్‌యే సార్వభౌమాధికారి. వ్యవహారాలన్నీ ఆయన చేతిలోనే ఉన్నాయి. శీఘ్రంగా దైవశిక్ష మీపై అవతరించాలనీ, దాన్నిబట్టే నేను సత్యవంతుడనో కానో ఖరారవుతుందని మీరు డిమాండు చేస్తున్నారు కదా! ఈ నిర్ణయాధికారం కూడా దైవాధీనమై ఉంది. ఆయనే గనక తలచుకుంటే మీ మనోరథాన్ని ఈడేరుస్తూ మీపై తొందరగానే శిక్షను అవతరింపజేసి మిమ్మల్ని అప్రమత్తుల్ని చేయగలడు. లేదా తన ప్రణాళికను అనుసరించి

قُلْ لَّوْ اَنَّ عِنْدِیْ مَا تَسْتَعْجِلُوْنَ بِهٖ لَقُضِیَ الْاَمْرُ بَیْنِیْ وَبَیْنَكُمْ ؕ وَاللّٰهُ اَعْلَمُ بِالظّٰلِمِیْنَ ﴿58﴾

**58** "మీరు తొందరపెట్టే ఆ వస్తువే గనక నా దగ్గర ఉండి ఉంటే మీకూ – నాకూ మధ్య ఈపాటికి వ్యవహారం తేలిపోయి ఉండేది.[73] దుర్మార్గుల గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

وَعِنْدَهٗ مَفَاتِحُ الْغَیْبِ لَا یَعْلَمُهَاۤ اِلَّا هُوَ ؕ وَیَعْلَمُ مَا فِی الْبَرِّ وَالْبَحْرِ ؕ وَمَا تَسْقُطُ مِنْ وَّرَقَةٍ اِلَّا یَعْلَمُهَا وَلَا حَبَّةٍ فِیْ ظُلُمٰتِ الْاَرْضِ وَلَا رَطْبٍ وَّلَا یَابِسٍ اِلَّا فِیْ كِتٰبٍ مُّبِیْنٍ ﴿59﴾

**59** అగోచరాల తాళం చెవులు, (ఖజానాలు) అల్లాహ్ వద్దనే ఉన్నాయి. అల్లాహ్‌కు తప్ప ఇతరులెవరికీ వాటి గురించి తెలీదు. భూమిలోనూ, సముద్రాలలోనూ ఉన్న వస్తువులన్నింటి గురించి ఆయనకు తెలుసు. రాలే ఆకు కూడా ఆయనకు తెలీకుండా ఉండదు. నేలలోని చీకటి పొరలలో పడే ఏ గింజ అయినా – పచ్చిది, ఎండినది ఏది పడినా – స్పష్టమైన గ్రంథంలో నమోదై ఉంది.[74]

మీకు గడువును కూడా ఇవ్వగలడు. ఇందులో నా నిర్ణయానికి ఎలాంటి ప్రమేయం లేదు అన్న విషయాన్ని దేవుడు తన ప్రవక్త (స) ద్వారా విశదపరచాడు.

72. మూలంలో **'యఖుస్సు'** (**يَقُصُّ**) అని ఉంది. ఇది 'ఖససున్' నుంచి వచ్చిన పదం. కనుక యఖుస్సు అంటే సత్య విషయాలు తెలుపుతాడు అని అర్థం. అయితే 'యఖుస్సు' అనేది 'ఖస్స అసరహూ' నుంచి కూడా కావచ్చు. ఖస్స అసరహూ అంటే అనుసరించటం, వెనుక నడవటం. దాని ప్రకారం పై ఆయతులో 'యఖుస్సుల్ హఖ్ఖ' అంటే అల్లాహ్ సత్యబద్ధంగా తీర్పులు చెబుతాడని భావం (ఫత్‌హుల్ ఖదీర్).

73. ప్రవక్త (స) గారి మాటల్లోని అంతరార్థం ఏమిటంటే; తాను కోరినంతనే దేవుడు శిక్షను అవతరింపజేస్తే లేక శిక్షించే అధికారం తనకు ఇచ్చేస్తే, మీరు హడావిడి చేస్తున్న ఆ శిక్ష ఎప్పుడో మీ కథను కంచికి చేర్చి ఉండేది. కాని ఈ వ్యవహారమంతా దేవుని చేతుల్లో ఉంది. అంతా ఆయన నిర్ధారించిన ప్రణాళిక ప్రకారం జరుగుతోంది. కాబట్టి నేను ఎప్పుడంటే అప్పుడు ఆ శిక్షను అవతరింపజేయమని దైవాన్ని అభ్యర్థించలేను. అలాంటి శిక్షను నా తరఫున విధించే అధికారం కూడా నాకు లేదు.

**గమనిక :** హదీసు ప్రకారం ఒకానొక సందర్భంలో దైవాజ్ఞపై పర్వతాల దూత మహా ప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "తమరు సెలవిస్తే ఇక్కడి జనులందరినీ రెండు పర్వతాల మధ్య నుజ్జు నుజ్జు చేసేస్తాన"ని అన్నాడు. దానికి దైవప్రవక్త (సఅసం), "వద్దొద్దు. వీళ్లు విశ్వసించకపోయినా వీళ్ళ తరువాతి తరం వారిలోనయినా దేవుడు తనను ఆరాధించేవారిని, తనకు సాటి కల్పించకుండా ఉండేవారిని పుట్టిస్తాడన్న ఆశ నాకుంది" అని అన్నారు (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం). స్థూలదృష్టితో చూస్తే ఈ హదీసు దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతుకు వ్యాఘాతంగా కనిపిస్తుంది. కాని ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయమేమిటంటే, ఈ ఆయతులో "శిక్ష అవతరింపజెయ్యమని కోరినంతనే శిక్ష అవతరించదు" అని చెప్పబడింది. అయితే హదీసులో– దైవప్రవక్త (స) శిక్షను కోరకపోయినప్పటికీ ఆ తెగవారి దురుసుతనానికి ఆగ్రహించి వారిపై శిక్షను అవతరింపజెయ్యాలని సంకల్పించాడు. కాని తన పట్ల ఎంతో అవమాన కరంగా ప్రవర్తించిన బనూ సఖీఫ్‌ను శిక్షించడానికి దైవప్రవక్త (స) సుముఖతను వ్యక్తం చేయలేదు. పైగా తాయఫ్ వాసులైన ఆ తెగవారి శ్రేయాన్ని అభిలషించారు. దైవప్రవక్తలు మానవుల శ్రేయోభిలాషులు, మహోపకారులు అయి ఉంటారన్న దానికి ఇదొక మచ్చుతునక.

74. **'కితాబున్ ముబీన్'** (స్పష్టమయిన గ్రంథం) అంటే 'లౌహె మహ్‌ఫూజ్' అని భావం. అగోచరాల జ్ఞాని అల్లాహ్ మాత్రమేననీ, సమస్త ఖజానాల, నిధుల తాళం చెవులు ఆయన అధీనంలోనే ఉన్నాయని ఈ వచనం ద్వారా

**60** ఆయనే రాత్రిపూట (ఒకింత) మీ ఆత్మలను స్వాధీనం చేసుకుంటాడు.[75] పగటిపూట మీరు చేసేదంతా ఆయనకు తెలుసు. మళ్లీ ఆయన నిర్ధారిత సమయాన్ని పూర్తిచేయడానికి[76] మిమ్మల్ని అందులో మేల్కొలుపుతున్నాడు.[77] ఆ తర్వాత మీరంతా ఆయన వైపుకే మరలిపోవలసి ఉన్నది.[78] ఆ తరువాత మీరు చేస్తూ ఉండిన కర్మలన్నింటినీ ఆయన మీకు తెలుపుతాడు.

وَهُوَ الَّذِي يَتَوَفَّاكُم بِاللَّيْلِ وَيَعْلَمُ مَا جَرَحْتُم
بِالنَّهَارِ ثُمَّ يَبْعَثُكُمْ فِيهِ لِيُقْضَىٰ أَجَلٌ مُّسَمًّى ۖ
ثُمَّ إِلَيْهِ مَرْجِعُكُمْ ثُمَّ يُنَبِّئُكُم بِمَا كُنتُمْ
تَعْمَلُونَ ﴿٦٠﴾

**61** ఆయన తన దాసులపై తిరుగులేని ఆధిపత్యం గలవాడు. ఆయన మీపై కావలివాళ్ళను పంపుతాడు. చివరకు మీలో ఎవరికయినా మరణ ఘడియ సమీపిస్తే, మేము పంపిన దూతలు అతని ఆత్మను స్వాధీనం చేసుకుంటారు. (ఈ విధి నిర్వహణలో) వారెలాంటి నిర్లక్ష్యం చేయరు.[79]

وَهُوَ الْقَاهِرُ فَوْقَ عِبَادِهِ ۖ وَيُرْسِلُ عَلَيْكُمْ حَفَظَةً
حَتَّىٰ إِذَا جَاءَ أَحَدَكُمُ الْمَوْتُ تَوَفَّتْهُ رُسُلُنَا وَهُمْ
لَا يُفَرِّطُونَ ﴿٦١﴾

**62** ఆపైన అందరూ తమ అసలు యజమాని అయిన అల్లాహ్ సన్నిధికి తీసుకురాబడతారు.[80] బాగా వినండి! నిర్ణయాధికారం అల్లాహ్‌దే. ఆయన బహువేగంగా లెక్క తీసుకుంటాడు.

ثُمَّ رُدُّوا إِلَى اللَّهِ مَوْلَاهُمُ الْحَقِّ ۚ أَلَا لَهُ
الْحُكْمُ وَهُوَ أَسْرَعُ الْحَاسِبِينَ ﴿٦٢﴾

అవగతమవుతున్నది. అందువల్ల సత్య తిరస్కారులపై, ముష్రిక్కులపై శిక్ష ఎప్పుడు అవతరిస్తుంది? అన్న విషయం కూడా ఆయనకు మాత్రమే తెలుసు. ఆయన సమయోచితంగా ఆ నిర్ణయం గైకొంటాడు. అగోచరాల (రహస్య విషయాల) తాళం చెవులు అయిదు రకాలుగా ఉంటాయని హదీసు ద్వారా కూడా మనకు తెలుస్తోంది: 1. ప్రళయం ఎప్పుడు వస్తుంది? 2. వర్షం ఎప్పుడు, ఎక్కడ కురుస్తుంది? 3. మాతృగర్భంలో పెరిగే శిశువు స్థితిగతులు 4. రేపు సంభవించబోయే సంఘటనలు ఏమిటి? 5. మృత్యువు ఎప్పుడు, ఎక్కడ వస్తుంది? ఈ అయిదు విషయాల జ్ఞానం అల్లాహ్‌కు తప్ప వేరితరులకు లేదు (సహీహ్ బుఖారీ : అల్ అన్ఆమ్ సూరా వ్యాఖ్యానం).

75. ఈ ఆయతులో 'నిద్ర'ను 'మృత్యువు' (వఫాత్)గా అభివర్ణించటం గమనార్హం. అందుకే నిద్రను 'వఫాతె అస్గర్' (చిన్న తరహా మరణం) గానూ, మృత్యువును 'వఫాతె అక్బర్' (పెద్ద తరహా మరణం) గానూ వ్యవహరిస్తారు. వఫాత్‌కు సంబంధించిన మరింత వివరణ కోసం ఆలి ఇమ్రాన్ సూరా 55వ వచనానికి ఇవ్వబడిన వ్యాఖ్యానాన్ని చూడండి.

76. అంటే దైనందిన కార్యకలాపాలు పూర్తిచేసుకోవటానికి మనిషిని చిన్నపాటి మరణావస్థ నుంచి మేల్కొలిపి 'జీవితాన్ని' ప్రసాదిస్తాడు. ఈ జీవన్మరణాలు మనిషిని 'మృత్యువు' కబళించే వరకూ అనుదినం వస్తూనే ఉంటాయి. మరణానంతర జీవితంపై సంశయంలో పడి ఉన్న ప్రబుద్ధులకు ఈ ఆయతు ఒక గుణపాఠం వంటిది.

77. అంటే పగటిపూట – తెల్లవారగానే – మీ ఆత్మలను మీకు తిరిగి అప్పగిస్తున్నాడు.

78. అంటే – ప్రళయదినం వచ్చినప్పుడు చచ్చిన వారంతా మళ్లీ బ్రతికి దేవుని సమక్షంలో హాజరుకావలసి ఉంది.

79. తమకు కేటాయించబడిన బాధ్యతను నిర్వర్తించటంలో దైవదూతలు ఏమాత్రం అలసత్వానికి, మరుపుకు లోనవరు. ప్రాణం తీసుకునే దూత తన విధిని ఖచ్చితంగా నిర్వహిస్తాడు. చనిపోయే వ్యక్తి గనక సజ్జనుడు అయివుంటే అతని ఆత్మను (ప్రాణాన్ని) "ఇల్లియ్యీన్"కు, దుష్టుడు అయివుంటే అతని ఆత్మను "సిజ్జీన్"కు పంపుతాడు.

80. అల్లాహ్ సన్నిధికి "తేబడేది" ఎవరు? అంటే ప్రాణం తీసుకుని దైవసన్నిధికి వెళ్ళే దైవదూతలు అని కొందరు అభిప్రాయపడ్డారు. మానవులంతా ఇందులోకి వస్తారని మరికొంతమంది విద్వాంసులు భావిస్తున్నారు. దీని భావమేమిటంటే పునరుత్థాన దినాన అందరూ ప్రళయదిన అధినేత అయిన అల్లాహ్ సమక్షంలో హాజరుపరచ

قُلْ مَنْ يُّنَجِّيْكُمْ مِّنْ ظُلُمٰتِ الْبَرِّ وَالْبَحْرِ تَدْعُوْنَهٗ تَضَرُّعًا وَّخُفْيَةً ۚ لَئِنْ اَنْجٰىنَا مِنْ هٰذِهٖ لَنَكُوْنَنَّ مِنَ الشّٰكِرِيْنَ ﴿63﴾

**63** (ఓ ప్రవక్తా!) వారిని అడుగు: "భూసముద్రాలపై అలుముకున్న చీకట్లలో నుండి మిమ్మల్ని రక్షించేవాడెవడు? 'ఆయన గనక మమ్మల్ని ఈ ఆపదనుంచి రక్షిస్తే మేము తప్పకుండా కృతజ్ఞులమై ఉంటామ'ని కడు దీనంగా, లోలోపలే మీరు ఎవరిని వేడుకుంటారు?"

قُلِ اللّٰهُ يُنَجِّيْكُمْ مِّنْهَا وَمِنْ كُلِّ كَرْبٍ ثُمَّ اَنْتُمْ تُشْرِكُوْنَ ﴿64﴾

**64** "ఈ విపత్తు నుండీ, అన్ని రకాల దుఃఖాల నుండీ మీకు విముక్తి నొసగేవాడు అల్లాహ్‌యే. అయినాసరే మీరు (మేలును మరిచిపోయి) షిర్కుకు ఒడిగడతారు!" అని చెప్పు.

قُلْ هُوَ الْقَادِرُ عَلٰٓى اَنْ يَّبْعَثَ عَلَيْكُمْ عَذَابًا مِّنْ فَوْقِكُمْ اَوْ مِنْ تَحْتِ اَرْجُلِكُمْ اَوْ يَلْبِسَكُمْ

**65** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "మీ పై నుండి గానీ,[81] మీ పాదాల క్రింది నుంచి గానీ[82] మీపైకి శిక్షను తెచ్చే, లేదా మిమ్మల్ని వర్గాలుగా విడగొట్టి ఒకరి తడాఖాను ఇంకొకరికి చూపించే[83]

---

బడతారు. అందరి వ్యవహారాన్ని ఆయన తేలుస్తాడు. ప్రాణం తీసుకునే దైవదూత గురించి ప్రస్తావించినప్పుడు బహువచనం ప్రయోగించబడింది. అంటే – ప్రాణం తీసుకునే దైవదూత ఒకరికన్నా ఎక్కువమంది ఉంటారని ఆయతును బట్టి బోధపడుతోంది. ఈ నేపథ్యంలో కొంతమంది వ్యాఖ్యాతలు ఏమంటారంటే, ప్రాణం తీసుకునే విషయం అల్లాహ్‌కు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులో ఇలా ఉంది – "జనుల మరణ సమయంలో అల్లాహ్ వారి ఆత్మలను కైవసం చేసుకుంటాడు" (జుమర్ – 42).

కాగా; ప్రాణం తీసుకునే దైవదూత వైపుకు కూడా ఇది సూచించబడింది. ఉదాహరణకు ఖుర్ఆన్‌లోనే వేరొకచోట ఇలా అనబడింది : వారికి ఇలా చెప్పు: "మీకోసం నిర్ధారించబడిన మృత్యుదూత మీ ఆత్మలను స్వాధీనం చేసుకుంటాడు. ఆ తరువాత మీరు మీ ప్రభువు వైపుకు మరలించబడతారు" (అస్ సజ్‌దహ్ – 11).

అనేకమంది దైవదూతలకు కూడా ఇది అన్వయించబడింది. నిసా సూరాలోని 97వ వచనం, అల్ అన్ఆమ్ సూరాలోని 93వ వచనం ఈ విషయాన్ని సమర్థిస్తున్నాయి. వాస్తవానికి సర్వాధికారాలు కలవాడు, సమస్త కార్యాల నిర్వహణకు మూలం అల్లాహ్‌యే. ఇక పెక్కుమంది దైవదూతల సంగతేమిటి? అని అంటారేమో! వారంతా మలకుల్ మౌత్ (మృత్యుదూత)కు సహాయకులు. వారు నరాల ద్వారా, బృహద్ధమని నాళాల ద్వారా ఆత్మలు స్వాధీనం చేసుకుంటారు. ఇకపోతే; మృత్యు దూత. అతడు ఆఖరిలో ప్రాణాలు తీసుకుని ఊర్ధ్వలోకాల వైపుకు సాగిపోతాడు (తఫ్సీర్ రూహుల్ మఆనీ: సంపుటి – 5, పేజీ – 125).

హాఫిజ్ ఇబ్నె కసీర్, ఇమామ్ షౌకానీ మరియు అధిక సంఖ్యాక విద్వాంసులు 'మృత్యుదూత' మాత్రం ఒక్కడే ఉంటాడనీ, సజ్దా సూరాలోని 11వ ఆయతు దీనికి ప్రబల తార్కాణమని అంటున్నారు. ముస్నదె అహ్మద్ (4వ సంపుటి, 287వ పుట) లోని హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) హదీసు ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది. ఇకపోతే 'మృత్యుదూతలు' అని బహువచన పదం ఉపయోగించటానికి కారణం – ఈ దూతలు అసలు మృత్యుదూతకు సహాయకులుగా ఉంటారన్నమాట! మరికొన్ని ఉల్లేఖనాల్లో మలకుల్ మౌత్ (మృత్యుదూత) పేరు 'ఇజ్రాయీల్' అని చెప్పబడింది (తఫ్సీర్ ఇబ్నె కసీర్ – అలిఫ్ లామ్ మీమ్ అస్సజ్దహ్). వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.

81. పైనుంచి శిక్ష రావటమంటే ఆకాశం నుంచి కురిసే అతివృష్టి, పెనుగాలులు, వడగళ్ళ వాన, రాళ్ల వర్షం మొదలగునవి. అలాగే నియంతలైన పరిపాలకులు, దుర్మార్గులైన అధికారుల ద్వారా జరిగే దౌర్జన్యం కూడా కావచ్చు.

شِيَعًا وَّيُذِيْقَ بَعْضَكُمْ بَأْسَ بَعْضٍ ۭ اُنْظُرْ كَيْفَ نُصَرِّفُ الْاٰيٰتِ لَعَلَّهُمْ يَفْقَهُوْنَ ﴿65﴾

శక్తి కూడా ఆయనే కలిగి ఉన్నాడు." వారు వాస్తవాన్ని గ్రహించ గలందులకు ఏ విధంగా మేము సూచనలను పలు రీతులుగా వివరిస్తున్నామో చూడు!

وَكَذَّبَ بِهٖ قَوْمُكَ وَهُوَ الْحَقُّ ۭ قُلْ لَّسْتُ عَلَيْكُمْ بِوَكِيْلٍ ﴿66﴾ۭ

**66** వాస్తవానికి అది సత్యమైనా, నీ జాతి దాన్ని అసత్యమని తిరస్కరిస్తోంది.[84] "మీపై నేను కాపరిగా నియమించబడలేదు"[85] అని (ప్రవక్తా!) వారికి చెప్పు.

لِكُلِّ نَبَاٍ مُّسْتَقَرٌّ ۡ وَّسَوْفَ تَعْلَمُوْنَ ﴿67﴾

**67** ప్రతి ఒక్క వార్తకు (అనగా అది జరగటానికి) ఒక సమయం నిర్ధారితమై ఉంది. త్వరలోనే మీకు తెలిసిపోతుంది.

وَاِذَا رَاَيْتَ الَّذِيْنَ يَخُوْضُوْنَ فِيْٓ اٰيٰتِنَا فَاَعْرِضْ عَنْهُمْ حَتّٰى يَخُوْضُوْا فِيْ حَدِيْثٍ غَيْرِهٖ ۭ وَاِمَّا يُنْسِيَنَّكَ الشَّيْطٰنُ فَلَا تَقْعُدْ بَعْدَ الذِّكْرٰى مَعَ الْقَوْمِ الظّٰلِمِيْنَ ﴿68﴾

**68** (ఓ ప్రవక్తా!) మా ఆయతులలో లోపాలు వెతికేవారిని నీవు చూసినప్పుడు, వారు (దీనిని వదలి) ఇతర విషయాలపై మాట్లాడనంత వరకూ వారి మధ్య ఉండకు. ఒకవేళ షైతాను నిన్ను మరుపుకు గురిచేస్తే, జ్ఞాపకం వచ్చిన మీదట ఆ దుర్మార్గుల మధ్యన కూర్చోకు.[86]

---

82. పాదాల క్రింద నుంచి శిక్ష రావటమంటే అర్థం వరదలు, ఉప్పెనలు వచ్చి ధనప్రాణ నష్టం సంభవించటం, భూకంపాలు రావటం, నేలలో కూరుకుపోవటం ఇత్యాదివి. అలాగే తమ చేతి క్రింద ఉండే దిగువ స్థాయి నౌకర్ల, బానిసల, పాలేర్ల చేత మనిషి సతాయించబడటం, వాళ్ల అవినీతి మూలంగా మనిషి ఆర్జించినదంతా పోగొట్టుకుని రోడ్డున పడటం కూడా ఇందులోకి రావచ్చు.

83. దేవుడు ఏ జాతినయినా హెచ్చరించదలచినప్పుడు ఆయన పంపే శిక్షలు (ఆపదలు) రకరకాలుగా ఉంటాయి. ఆ జాతి ప్రజల వ్యవహారాల్లో స్పష్టత లేకుండా పోతుంది. తత్ఫలితంగా ప్రజలు సంశయానికి, సందిగ్ధానికి లోనై వర్గాలుగా, తెగలుగా, ముఠాలుగా చీలిపోతారు. ఒక వర్గం ఇంకో వర్గాన్ని తూలనాడటం మొదలెడుతుంది. ఒకరింకొకరి ద్వారా వేధించబడుతుంటారు. హదీసులో ఇలా ఉంది: తాను మూడు విషయాల కోసం అల్లాహ్‌ను ప్రార్థించానని మహాప్రవక్త (సఅసం) చెప్పారు : 1. నా అనుచర సమాజం ముంపుకు గురై నాశనం చేయబడకూడదు. 2. సర్వత్రా కరువు కాటకాలు ఏర్పడి అంతమవకూడదు. 3. వారు పరస్పరం తగవులకు, కుమ్ములాటలకు లోను కాకూడదు. ఈ మూడు వేడుకోళ్ళలో అల్లాహ్ మొదటి రెండింటిని ఆమోదించాడు. మూడవ వేడుకోలు చేయటంపై దేవుడు తనను వారించాడని ఆయన (స) తెలిపారు (సహీహ్ ముస్లిం – 2216). అంటే ముహమ్మద్ (సఅసం) అనుచర సమాజంలో విభేదాలు ఉంటాయనీ, వారిలో చీలిక వస్తుందని, దానికి కారణం దేవుని అవిధేయులుగా మారి ఖుర్ఆన్ హదీసుల పట్ల ప్రజలు వైముఖ్య ధోరణి కనబరచటమే అవుతుందని అల్లాహ్‌కు తెలుసు. చెప్పొచ్చేదేమంటే జాతుల నీతినడవడికలలో పొడసూపే పరిణామాలుగానీ, వారిపైకి నిరంతరం వచ్చిపడే ఆపదలు గానీ దైవసంప్రదాయం ప్రకారం సంభవిస్తూ ఉంటాయి. ఈ ఆనవాయితీలో మార్పు రావటం సాధ్యపడదు. "నీవు అల్లాహ్ సంప్రదాయంలో మార్పును ఎంతమాత్రం కానలేవు. అల్లాహ్ సంప్రదాయం తన నిర్ణీత లక్ష్యం నుంచి తొలగిపోవటాన్ని కూడా నీవు చూడవు" (ఫాతిర్ – 43).

84. ఆ సత్యమైనది ఏది? అది ఖుర్ఆనూ కావచ్చు లేదా దేవుడు అవతరింపజేస్తానంటున్న శిక్ష కూడా కావచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

85. అంటే ఆరు నూరైనాసరే 'మిమ్మల్ని నా దారికి తెచ్చితీర్తాను' అని నేను అనటం లేదు. దైవసందేశాన్ని అందజేయటం

وَمَا عَلَى الَّذِيْنَ يَتَّقُوْنَ مِنْ حِسَابِهِمْ مِّنْ شَيْءٍ وَّلٰكِنْ ذِكْرٰى لَعَلَّهُمْ يَتَّقُوْنَ ﴿٦٩﴾

**69** వారి లెక్కల బాధ్యత ఏదీ దైవభీతిపరులపై లేదు.[87] అయితే వారికి హితబోధ చేయటం మాత్రం మానుకోరాదు. ఎందుకంటే బహుశా వారు కూడా దైవభీతిపరులు కావచ్చు.[88]

وَذَرِ الَّذِيْنَ اتَّخَذُوْا دِيْنَهُمْ لَعِبًا وَّلَهْوًا وَّغَرَّتْهُمُ الْحَيٰوةُ الدُّنْيَا وَذَكِّرْ بِهٖٓ اَنْ تُبْسَلَ نَفْسٌۢ بِمَا كَسَبَتْ ۖ لَيْسَ لَهَا مِنْ دُوْنِ اللّٰهِ وَلِيٌّ وَّلَا شَفِيْعٌ ۚ وَاِنْ تَعْدِلْ كُلَّ عَدْلٍ لَّا يُؤْخَذْ مِنْهَا ۗ اُولٰٓئِكَ الَّذِيْنَ اُبْسِلُوْا بِمَا كَسَبُوْا ۚ

**70** (ప్రవక్తా!) ఎవరు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసు కున్నారో, ఎవరినయితే ప్రాపంచిక జీవితం మోసపుచ్చిందో వారికి దూరంగా ఉండు. అయితే ఈ ఖుర్‌ఆను ద్వారా వారికి ఉపదేశం మాత్రం చేస్తూ ఉండు. ఏ వ్యక్తీ తన చేష్టల మూలంగా ఇరుక్కు పోయే[89] పరిస్థితి రాకుండా ఉండటానికి, అల్లాహ్ తప్ప వేరెవరూ సహాయం చేయని, సిఫారసు చేసేవాడెవడూ ఉండని దురవస్థ దాపురించకుండా ఉండటానికి, ప్రపంచ మంతటినీ పరిహారంగా ఇచ్చి బయటపడాలని తహతహలాడినా అది అతన్నుంచి

వరకే నా బాధ్యత. "ఇది మీ ప్రభువు తరపున వచ్చిన సత్యం. కాబట్టి ఇష్టమున్నవారు దీన్ని అవలంబించవచ్చు. ఇష్టం లేనివారు తిరస్కరించవచ్చు" (అల్ కహఫ్ – 29).

86. ఈ ఆజ్ఞ దైవప్రవక్త (సఅసం)కు ఇవ్వబడినప్పటికీ, ముస్లిం సమాజంలోని సభ్యులందరికీ ఇది వర్తిస్తుంది. దైవవాక్కులను, దైవప్రవక్త (స) ప్రవచనాలను పరిహసించే, అభ్యంతరాలు వెలిబుచ్చే సభలు, సమావేశాలు ఎక్కడ జరిగినా ముస్లింలు వాటిని బహిష్కరించాలి. అల్లాహ్ ఈ ఆజ్ఞను ఖుర్‌ఆన్‌లో ఇతర చోట్ల కూడా ఇచ్చాడు. అన్ నిసా సూరాలోని 140వ వచనంలో కూడా ఈ ప్రస్తావన వచ్చింది. ధర్మంలో కొత్త పుంతలు తొక్కుతున్న ప్రబుద్ధులు కొందరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) పలుకులకు వక్రభాష్యం చెప్పి, తమ "కొత్త పుంతలను" సమర్థించుకో జూస్తున్నారు. ఈ మహానుభావుల పెడసరి వ్యాఖ్యల్ని ఖండించి, సత్యాన్ని నిర్దిష్టంగా, సూటిగా చెప్పే సంకల్పంతో అలాంటి సమావేశాలకు హాజరు కావచ్చుగాని ఇతరత్రా ఉద్దేశాలతో హాజరైతే అది పాపాన్ని మూటకట్టుకోవటంతో సమానమే.

87. ఇక్కడ వారి లెక్కల బాధ్యత అంటే దేవుని ఆయతులను ఎగతాళి చేస్తూ, వాటిపై అభ్యంతరాలను లేవనెత్తే వారి లెక్క అని భావం. ఇలాంటి సమావేశాల నుంచి వాకౌట్ చేసిన వారిని ఎన్నడూ నిలదీసి అడగటం జరగదు. ఎగతాళి చేసిన వారు మాత్రమే దాని గురించి ప్రశ్నించబడతారు. ఆ పాపభారం కూడా ఎగతాళి చేసిన వారి మీదే పడుతుంది. సజ్జనులు మాత్రం సురక్షితంగా ఉంటారు.

88. సజ్జనులు అలాంటి కుత్సితుల సమావేశాల నుంచి నిష్క్రమించటంతోనే ఆగిపోకుండా మంచిని పెంపొందించే, చెడులను నిర్మూలించే ప్రయత్నాలను కూడా ముమ్మరం చేస్తారు. నిరంతరం వారు చేసే ఈ సకారాత్మక కృషి ఫలితంగా దుర్మార్గులు తమ చెడు నడతను మార్చుకున్నా మార్చుకోవచ్చు.

89. అరబీలో **'తుబ్‌సల'** (تُبْسَلَ) అని అనబడింది. దీనికి అసలు అర్థం 'ఆపబడటం' అని. అయితే ఇక్కడ ఈ పదానికి 1. అప్పగించబడటం, 2. అవమానించబడటం, 3. నిలదీయబడటం, 4. ప్రతిఫలం ఇవ్వబడటం అనే అర్థాలు చెప్పబడ్డాయి. ఇవన్నీ దాదాపు ఒకే భావాన్ని కలిగి ఉన్నాయని ఇమామ్ ఇబ్నె కసీర్ అంటున్నారు. అంటే ఒక మనిషి తాను ఆర్జించిన దాని ఫలితంగా వినాశానికి గురిచేయబడకుండా ఉండటానికి, లేదా పరాభవంపాలు కాకుండా ఉండటానికి, నిలదీయబడకుండా, చిక్కుబడకుండా ఉండటానికి గాను అతనికి ఖుర్‌ఆన్ ద్వారా ముందుగానే ఉపదేశించాలి. హెచ్చరించాలి. ఈ భావంలోనే (ఉర్దూ) అనువాదకులు "ఇరుక్కుపోయే పరిస్థితి రాకుండా ఉండటానికి" అని వ్రాశారు.

لَهُمْ شَرَابٌ مِّنْ حَمِيمٍ وَعَذَابٌ أَلِيمٌ بِمَا
كَانُوا يَكْفُرُونَ (70)

స్వీకరించబడని[90] (గడ్డు) స్థితి ఏర్పడకుండా ఉండటానికి గాను (నీవు వారికి బోధపరుస్తూ ఉండాలి సుమా!). తమ చేష్టల మూలంగా (అటువంటి పరిస్థితిలో) చిక్కుకునేవారు వీరే. తమ తిరస్కార వైఖరి కారణంగా వారికి సలసలా కాగే నీరు త్రాగేందుకు ఇవ్వబడుతుంది. ఇంకా వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

قُلْ أَنَدْعُوا مِنْ دُونِ اللَّهِ مَا لَا يَنْفَعُنَا
وَلَا يَضُرُّنَا وَنُرَدُّ عَلَىٰ أَعْقَابِنَا بَعْدَ إِذْ
هَدَانَا اللَّهُ كَالَّذِي اسْتَهْوَتْهُ الشَّيَاطِينُ
فِي الْأَرْضِ حَيْرَانَ لَهُ أَصْحَابٌ يَدْعُونَهُ
إِلَى الْهُدَى ائْتِنَا ۗ قُلْ إِنَّ هُدَى اللَّهِ هُوَ
الْهُدَىٰ ۖ وَأُمِرْنَا لِنُسْلِمَ لِرَبِّ الْعَالَمِينَ (71)

**71** (ఓ ప్రవక్తా!) వారిని అడుగు : ఏమిటీ, మేము అల్లాహ్‌ను వదలి మాకు లాభంగానీ, నష్టంగానీ చేకూర్చలేని వారిని మొర పెట్టుకోవాలా? అల్లాహ్ మాకు సన్మార్గం చూపిన తరువాత షైతానులు ఒక వ్యక్తిని అడవిలో మార్గవిహీనుణ్ణి చేయగా, అతని సహవాసులు కొందరు ఉండి, "మా వద్దకు రా!"[91] అని అతన్ని సన్మార్గం వైపుకు పిలుస్తున్నప్పటికీ, దిక్కులు చూస్తూ ఉండి పోయేవాని మాదిరిగా – మేము సన్మార్గం నుండి వెనుతిరిగి పోవాలా? వారితో ఇలా అను: "యదార్థానికి అల్లాహ్ చూపిన మార్గమే సన్మార్గం.[92] మేము సర్వలోక ప్రభువుకు పూర్తిగా విధేయులు కావాలని మాకు ఆజ్ఞాపించబడింది."

90. ఇహలోకంలో సాధారణంగా మనిషి ఎవరయినా తన మిత్రుని సహాయంతోనో, లేక ఒకరి సిఫారసుపైనో లేక నష్టపరిహారం చెల్లించటం వల్లనో గండం నుంచి గట్టెక్కుతాడు. కాని పరలోకంలో ఈ మూడు సాధనాలూ పనికిరావు. అక్కడ సత్య తిరస్కారులను ఆదుకునే సంరక్షకుడు ఎవడూ ఉండడు. దైవాగ్రహం నుంచి కాపాడే సిఫారసు కూడా అతనికి దొరకదు. నష్టపరిహారం చెల్లించడానికి ఎవరి దగ్గరా ఏమీ ఉండదు. ఒకవేళ ఉన్నా అది స్వీకారయోగ్య మవదు. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల పునరావృతం అయింది.

91. విశ్వసించిన తరువాత అవిశ్వాసులుగా మారిపోయినవారి, ఏకదైవోపాసకులుగా ఉండి మళ్లీ బహుదైవారాధకులుగా మారిపోయినవారి ఉపమానం ఎటువంటిదో ఈ ఆయతులో వివరించబడింది. అతని ఉపమానం సన్మార్గాన నడిచే తన సహవాసుల బృందంలో నుంచి తప్పిపోయిన వ్యక్తి లాంటిది. తప్పిపోయిన ఆ వ్యక్తి అడవిలో దారీ తెన్నూ కానరాకుండా ఉన్నాడు. "ఇదిగో! మేము సాగిపోతున్న ధర్మపథంలోకి రా!" అని అతని మిత్రబృందం కేకేసి పిలుస్తున్నా, అతను ఆ పిలుపును వినే స్థితిలో లేడు లేదా పైశాచిక శక్తులు, జిన్నాతులు పన్నిన పద్మవ్యూహంలో దారుణంగా చిక్కుకుపోయిన కారణంగా సన్మార్గం వైపుకు మరలిరాలేని నికృష్టస్థితి అతనిది.

92. దీని భావం ఏమిటంటే అవిశ్వాసానికి ఒడిగట్టినవారు, దైవానికి సహవర్తులుగా ఇతరులను నిలబెట్టి మార్గవిహీనతకు లోనైనవారు దారితప్పిన బాటసారి లాంటివారు. అల్లాహ్ వారికి సన్మార్గం చూపితే తప్ప వారు రుజుమార్గం వైపుకు మరలివచ్చే అవకాశం ఉండదు. అల్లాహ్ సద్బుద్ధిని ప్రసాదించినవారు తప్పక మరలివస్తారు. సద్బుద్ధినొసగటం, సన్మార్గానికి తిరిగి రప్పించటం నిస్సందేహంగా దేవుని పని. దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట సెలవీయబడినట్లు – "నీవు వారిని సన్మార్గానికి తేవాలని కోరుకున్నంత మాత్రాన సరిపోదు. అల్లాహ్ వారికి సన్మార్గం చూపడు. అలాంటి వారిని ఆదుకునేవారు కూడా ఎవరూ ఉండరు" (అన్ నహ్ల్ – 37). అయితే మనిషి సన్మార్గం పొందటమైనా, అప మార్గానికి లోనవటమైనా – అది దేవుడు నిర్ధారించిన నియమాల ప్రకారమే జరుగుతుంది. అకారణంగా ఆయన ఎవరినీ అపమార్గానికి లోను చేయడు. అలాగే అపమార్గంపై పాతుకుపోయి సన్మార్గం పట్ల బొత్తిగా శ్రద్ధచూపని

72 (ఇంకా ఇలా ఆదేశించబడింది:) "నమాజును నెలకొల్పండి, ఆయనకు భయపడండి,[93] ఆఖరికి మీరంతా ఆయన వద్దకే సమీకరించబడతారు."

وَاَنْ اَقِيْمُوا الصَّلٰوةَ وَاتَّقُوْهُ ؕ وَهُوَ الَّذِيْٓ اِلَيْهِ تُحْشَرُوْنَ ﴿72﴾

73 ఆయనే ఆకాశాలనూ, భూమినీ సత్యబద్ధంగా సృష్టించాడు.[94] ఏ రోజున ఆయన "అయిపో"[95] అని ఆజ్ఞాపిస్తాడో అప్పుడు అది అయిపోతుంది. ఆయన మాట సత్యమైనది, ప్రభావపూరితమైనది. శంఖం[96] ఊదబడే రోజున, అధికారమంతా ఆయనదే అవుతుంది. ఆయన నిగూఢమైన విషయాలను, బహిర్గతమై వున్న విషయాలనూ ఎరిగినవాడు. ఆయనే వివేక సంపన్నుడు, సర్వమూ తెలిసినవాడు.

وَهُوَ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ بِالْحَقِّ ؕ وَيَوْمَ يَقُوْلُ كُنْ فَيَكُوْنُ ؕ۬ قَوْلُهُ الْحَقُّ ؕ وَلَهُ الْمُلْكُ يَوْمَ يُنْفَخُ فِي الصُّوْرِ ؕ عٰلِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ ؕ وَهُوَ الْحَكِيْمُ الْخَبِيْرُ ﴿73﴾

వారికి కూడా ఆయన సద్బుద్ధిని వొసగడు. సత్యాన్ని ఆస్వాదించి, తమ దుష్ప్రవర్తనను మార్చుకోదలచిన వారికి అల్లాహ్ తప్పకుండా సహాయపడతాడు.

93. మనిషి దేవుని అస్తిత్వం ముందు బేషరతుగా తలవంచి, అతనికి విధేయునిగా ఉంటానని ఒప్పుకున్న తరువాత, అతనిపై విధించబడే అంశాలలో అత్యంత ముఖ్యమైనది 'నమాజ్.' దీన్నిబట్టి ఇస్లాంలో నమాజ్‌కు గల ప్రాముఖ్యం ఎటువంటిదో విదితమవుతున్నది. ఆ తరువాత 'తఖ్వా' (దైవభక్తి) ప్రస్తావన వచ్చింది. మనిషిలో దైవభక్తి, దైవభీతి, అణకువ, వినమ్రత లేనంతవరకూ అతడు నమాజ్ విధిని సక్రమంగా నెరవేర్చలేడు. "నిస్సందేహంగా నమాజు కష్టతరమైన పనే. కాని అల్లాహ్ పట్ల భక్తి, భయము గలవారికి అది ఎంతమాత్రం కష్టం కాదు" అన్న ఖుర్ఆన్ సూక్తి ఈ సందర్భంగా గమనించదగినది (అల్ బఖర – 45).

94. 'ప్రయోజనార్థం పుట్టించాడు' అన్న అర్థం కూడా వస్తుంది. అంటే ఆయన భూమ్యాకాశాలను నిరర్థకంగా, ఉత్తుత్తిగా నిర్మించలేదు. ఒక నిర్ణీత లక్ష్యంతో ఆయన ఈ విశ్వవ్యవస్థకు రూపకల్పన చేశాడు. సర్వాన్నీ సృష్టించినటువంటి ఆ ఏకైక దేవుణ్ణి మానవులు సదా స్మరించాలనీ, ఆయన యెడల కృతజ్ఞులై ఉండాలన్నదే ఆ లక్ష్యం.

95. మూలంలో **'యౌమ'** (يَوْمَ) అనే పదం వచ్చింది. అందులో అంత్యాక్షరమైన 'మీమ్' మీద నసబ్ లేక జబర్ (◌َ) ఉండటం గమనార్హం. అరబీ భాషలో సాధారణంగా కర్మణీ పదాల అంత్యాక్షరాలు మన్సూబ్‌గా (నసబ్ లేక జబర్‌ను కలిగి) ఉంటాయి. ఇక్కడ కూడా 'యౌమ' ఒక కర్మణి పదం. దీనికి ముందు 'ఉజ్కుర్' (గుర్తు చేసుకో) లేక 'ఇత్తఖు' (భయపడు) అనే పదాలు మార్జితంగా ఉన్నట్లు భావించవలసి ఉంటుంది. మొత్తానికి దాని భావం ఏమవుతుందంటే, ఆ రోజును అంటే ప్రళయదినాన్ని గుర్తు చేసుకోండి, దానికి భయపడండి. ఎందుకంటే ఆ రోజున అల్లాహ్ 'అయిపో' అని ఆజ్ఞాపించినంతనే ఆయన తలచినదల్లా అయిపోతుంది. లెక్కల తనిఖీ కూడా అత్యంత సులువుగా, తొందరగా జరిగిపోతుందన్న సంకేతం కూడా దీని ద్వారా మనకు అందుతోంది. అంటే విశ్వసించిన వారి లెక్కలు చాలా తొందరగా తెమలుతాయి. కాని ఇతరుల పాలిట మాత్రం అది సుదీర్ఘమైన దినంగా, వెయ్యేండ్లకు లేక యాభై వేల ఏండ్లకు సమానంగా ఉంటుంది.

96. అరబీలో **'సూర్'** (صُور) అని ఉంది. అది శంఖం కావచ్చు లేక కొమ్ములాంటిది, విజిల్ లాంటిది కూడా కావచ్చు. దాని గురించి హదీసులో ఈ విధంగా ఉంది : "దైవదూత ఇస్రాఫీల్ దాన్ని నోట్లో పెట్టుకుని, తలవంచుకుని దైవాజ్ఞ కోసం ఎదురు చూస్తున్నారు. దైవసంకేతం అందగానే ఆయన ఆ శంఖాన్ని ఊదుతారు" (ఇబ్నె కసీర్). "ఆ సూరు ఒక కొమ్ము అనీ, అందులోనే ఊదబడుతుంది" అనీ అబూ దావూద్, తిర్మిజీ (నెంబరు 4742, 3244)లలో ఉంది. కొంతమంది పండితుల ప్రకారం ఇది మూడుసార్లు ఊదబడుతుంది. మొదటిసారి ఊదినపుడు అందరూ స్పృహ

وَاِذْ قَالَ اِبْرٰهِيْمُ لِاَبِيْهِ اٰزَرَ اَتَتَّخِذُ اَصْنَامًا اٰلِهَةً ۚ اِنِّيْٓ اَرٰىكَ وَقَوْمَكَ فِيْ ضَلٰلٍ مُّبِيْنٍ ﴿٧٤﴾

74 ఇబ్రాహీము తన తండ్రి ఆజరుతో,[97] "ఏమిటీ, నీవు విగ్రహాలను ఆరాధ్య దైవాలుగా చేసుకుంటున్నావా? నువ్వూ, నీ జాతి వారూ నిస్సందేహంగా స్పష్టమైన అపమార్గానికి గురై ఉన్నారని నాకనిపిస్తోంది" అని పలికిన సందర్భం కూడా స్మరించు కోదగినదే.

وَكَذٰلِكَ نُرِيْٓ اِبْرٰهِيْمَ مَلَكُوْتَ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَلِيَكُوْنَ مِنَ الْمُوْقِنِيْنَ ﴿٧٥﴾

75 ఈ విధంగానే మేము ఇబ్రాహీముకు భూమ్యాకాశాలలోని సృష్టితాలను[98] చూపించాము. అతనికి దృఢ నమ్మకం కలగాలన్న ఉద్దేశంతోనే అలా చేశాము.

فَلَمَّا جَنَّ عَلَيْهِ الَّيْلُ رَاٰ كَوْكَبًا ۚ قَالَ هٰذَا رَبِّيْ ۚ فَلَمَّآ اَفَلَ قَالَ لَآ اُحِبُّ الْاٰفِلِيْنَ ﴿٧٦﴾

76 అతనిపై రాత్రి చీకటి అలుముకున్నప్పుడు, అతను ఒక నక్షత్రాన్ని చూసి, "ఇతనే నా ప్రభువు" అన్నాడు. కాని అది అస్తమించగానే, "అస్తమించే వాటిని నేను అభిమానించను"[99] అని చెప్పాడు.

فَلَمَّا رَاَ الْقَمَرَ بَازِغًا قَالَ هٰذَا رَبِّيْ ۚ فَلَمَّآ اَفَلَ قَالَ لَىِٕنْ لَّمْ يَهْدِنِيْ رَبِّيْ لَاَكُوْنَنَّ مِنَ الْقَوْمِ الضَّاۤلِّيْنَ ﴿٧٧﴾

77 మరి అతను ప్రకాశిస్తున్న చంద్రుణ్ణి చూసి, "ఇతను నా ప్రభువు" అన్నాడు. కాని అది కూడా అస్తమించటంతో "ఒకవేళ నా ప్రభువు గనక నాకు మార్గదర్శకత్వం వహించకపోతే నేను మార్గవిహీన జనుల్లో చేరిపోతాను" అని పలికాడు.

فَلَمَّا رَاَ الشَّمْسَ بَازِغَةً قَالَ هٰذَا رَبِّيْ هٰذَآ

78 ఆ తరువాత సూర్యుణ్ణి[100] ప్రకాశిస్తుండగా చూసి, "ఇతనే నా ప్రభువు. ఇతను అందరికన్నా పెద్దవాడు" అని పలికాడు. కాని

కోల్పోతారు. దీన్ని 'నఫ్ఖతుస్సఅఖ్' అంటారు. రెండవసారి : అందరూ అంతమైపోతారు. దీన్ని 'నఫ్ఖతుల్ ఫనా' అని పిలుస్తారు. మూడవసారి: మానవులంతా మళ్లీ బ్రతికించబడతారు. దీనిని 'నఫ్ఖతుల్ ఇన్షా' అంటారు. కొంతమంది విద్వాంసులైతే ఆఖరి రెండు మాత్రమే సరైనవని భావిస్తున్నారు.

97. దైవప్రవక్త ఇబ్రాహీము (అలైహిస్సలాం) తండ్రికి ఆజరు, తారిఖ్ అనే రెండు పేర్లున్నాయని చరిత్రకారులు అంటున్నారు. రెండవ పేరు బహుశా అతని బిరుదు అయి ఉండవచ్చు. ఆజరు ఆయన పినతండ్రి పేరని మరికొంతమంది భావిస్తున్నారు. కాని ఇది నిజం కాదు. ఎందుకంటే ఇబ్రాహీము తండ్రిని ఖుర్ఆను ఆజరుగా పిలిచింది. కనుక ఆజరు తండ్రి అన్నదే సరైనది.

98. ఆయతులో **'మలకూత్' (مَلَكُوْت)** అని ఉంది. అంటే సృష్టితాలని అర్థం. పైన అనువాదంలో ఈ అర్థమే తీసుకోబడింది. లేక ఇక్కడ దాని భావం 'రుబూబియత్' (అల్లాహ్ యొక్క పోషకత్వం) మరియు 'ఉలూహియత్' (ఆరాధనా హక్కు) కావచ్చు. అంటే మేము ఇబ్రాహీమ్‌కు ఈ విషయాలు చూపించాము, ఈ విషయాల జ్ఞానంలో అతనికి దృఢత్వాన్ని ప్రసాదించాము. లేక అర్ష్ (దైవ సింహాసనం) నుంచి భూమి క్రింది లోకాల వరకు ఇబ్రాహీమ్‌కు సర్వం చూపెట్టాము అన్న భావంలో కూడా ఈ పదం ఉపయోగించబడి ఉండవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

99. అంటే గతించే, మార్పు చెందే దైవం నాకక్కరలేదు అన్నది ఇబ్రాహీం (అలైహి) ఉద్దేశం.

100. ఉదయించే సూర్యుడు అన్నింటికన్నా పెద్దగా ఉండటం చూసి, బహుశా అదే తన దైవం కావచ్చునని ఆయన

اَكۡبَرُ ۚ فَلَمَّاۤ اَفَلَتۡ قَالَ يٰقَوۡمِ اِنِّىۡ بَرِىۡٓءٌ
مِّمَّا تُشۡرِكُوۡنَ ﴿78﴾

అది కూడా అస్తమించేసరికి అతనిలా అన్నాడు: "ఓ నా జాతి వారలారా! మీరు (దైవానికి) కల్పించే భాగస్వామ్యాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు.[101]

اِنِّىۡ وَجَّهۡتُ وَجۡهِىَ لِلَّذِىۡ فَطَرَ السَّمٰوٰتِ
وَالۡاَرۡضَ حَنِيۡفًا وَّمَاۤ اَنَا مِنَ الۡمُشۡرِكِيۡنَ ﴿79﴾

**79** నేను ఆకాశాలను, భూమిని సృష్టించినవాని వైపుకు ఏకాగ్రతతో నా ముఖాన్ని త్రిప్పుకుంటున్నాను.[102] నేను షిర్క్ చేసేవారిలోని వాణ్ణి కాను."

وَحَآجَّهٗ قَوۡمُهٗ ؕ قَالَ اَتُحَآجُّوۡٓنِّىۡ فِى اللّٰهِ وَقَدۡ
هَدٰٮنِ ؕ وَلَاۤ اَخَافُ مَا تُشۡرِكُوۡنَ بِهٖۤ اِلَّاۤ اَنۡ

**80** అతని జాతి వారు అతనితో పిడివాదానికి దిగినప్పుడు,[103] అతనిలా అన్నాడు: "ఏమిటీ, మీరు అల్లాహ్ విషయంలో నాతో వాదులాడుతున్నారా? వాస్తవానికి ఆయన నాకు సన్మార్గం

(అలైహిస్సలాం) అనుకున్నారు. సూర్యుణ్ణి పూజించేవారు కూడా ఇక్కడే పొరబడ్డారు. ఆకాశాలలో కనిపించే నక్షత్రాలు, గ్రహాలన్నింటిలోకీ సూర్యుడు పెద్దదిగా కనిపిస్తూ ఉండటం వల్లనూ, అది వెలుతురును, వేడిమిని ఇస్తూ ఉన్నందువల్లనూ, మానవ మనుగడ కోసం దాని ఆవశ్యకత ఎంతో ఎక్కువగా ఉండటం వల్లనూ వారు సూర్యుణ్ణే తమ దైవంగా తలపోసి, పూజించటం మొదలెట్టారు. అయితే దైవప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) సూర్యచంద్రులు అస్తమించటం గమనించి అస్తమించేవారికి దైవంగా పిలువబడే అర్హతలేదని ప్రకటించి, వాటి పూజారుల విశ్వాసాన్ని సున్నితంగా త్రోసిపుచ్చారు.

101. అంటే; మీరు నిజదైవాన్ని కాదని ఏ ఏ వస్తువులను భాగస్వామ్యంగా కల్పిస్తున్నారో, ఏ సూర్యచంద్రాదులను, మరే విగ్రహాలను, రాతిబొమ్మలను మీరు పూజిస్తున్నారో వాటితో నేను తెగత్రెంపులు చేసుకుంటున్నాను. వాటికెలాంటి విలువలేదని ప్రకటిస్తున్నాను. ఎందుకంటే ఆ వస్తువుల్లో మార్పు వస్తుంది. అవి కొంతసేపు ప్రత్యక్షమవుతాయి. మరికొంత సేపు కనుమరుగైపోతాయి. కాబట్టి అవి సృష్టికర్తలు కావు. అవి ఇంకొకనిచే సృష్టించబడినవి మాత్రమే. అవి సృష్టికర్త నిర్ణయించిన పరిమితులలో ఉంటూ తమ విధిని నిర్ణయిస్తున్నాయే తప్ప, ఒకరిని ఆజ్ఞాపించే, శాసించే శక్తిని కలిగిలేవు. అవి స్వయంగా ఒక సృష్టికర్త ముందు తలఒగ్గి ఉన్నప్పుడు వేరొకరికి లాభంగానీ, నష్టంగానీ చేకూర్చే అధికారం వాటికెక్కడుంటుందీ?

ఆ కాలంనాటి చక్రవర్తి – నమ్రూద్ – తాను కన్న కలకు జ్యోతిష్కులు చెప్పిన వ్యాఖ్యానం దృష్ట్యా తన రాజ్యంలో జన్మించే మగపిల్లలను ఎక్కడికక్కడే చంపేయమని ఆజ్ఞాపించాడు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కూడా ఆ కాలంలోనే జన్మించారు. ఆయన నమ్రూద్ చక్రవర్తి నియమించిన భటుల వాతన పడకుండా ఉండేందుకు, ఆయన తల్లిదండ్రులు ఆయన్ని ఒక గుహలో రహస్యంగా పెంచారు. ఆ గుహలో ఉన్నప్పుడే ఆయన సూర్యచంద్రులను చూసి, ఈ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారని ఒక కథ ప్రచారంలో ఉంది. కాని గుహలో ఉండగానే ఆయన ఇలా అన్నారనేది ప్రమాణబద్ధమైన విషయం కాదు. తన జాతి ప్రజలనుద్దేశించి మాట్లాడేటప్పుడు మాత్రమే ఆయన ఇలా అన్నారు. తన జాతివారు తన ఎదుట ఉండటం వల్లనే ఆయన, "దేవునికి మీరు కల్పించే భాగస్వామ్యాలతో నేను విసుగెత్తిపోయాను" అని అనాల్సి వచ్చింది. మిథ్యా దైవాల వాస్తవికతను బట్టబయలు చేయటం నిజానికి ఈ తర్జన భర్జన అసలు ఉద్దేశం.

102. **"ముఖం త్రిప్పుకుంటున్నాను"** అన్న మాటల్ని బట్టి మనిషి తాను దేన్ని కోరుకుంటున్నాడో, మరి దేనిని అసహ్యించుకుంటున్నాడో స్పష్టంగా విదితమవుతుంది. అంటే సర్వలోక ప్రభువు, భూమ్యాకాశాల నిర్మాత అయిన అల్లాహ్‌ను మాత్రమే తాను పూజించదలిచాననీ ఈ విషయంలో ఎవరితోనూ, ఏ విధంగానూ రాజీపడే ప్రసక్తిలేదని ఆయన చెప్పదలిచారు.

يَشَآءَ رَبِّي شَيۡـًٔاۗ وَسِعَ رَبِّي كُلَّ شَيۡءٍ عِلۡمًاۚ أَفَلَا تَتَذَكَّرُونَ ﴿80﴾

చూపించాడు. మీరు కల్పించే సహవర్తులకు నేను ఏమాత్రం భయపడను. అయితే నా ప్రభువు గనక తలిస్తే ఏమైనా జరగ వచ్చు. నా ప్రభువు జ్ఞానం అన్నింటినీ ఆవరించి ఉంది. అయినా మీరు గ్రహించరా?”

وَكَيۡفَ أَخَافُ مَآ أَشۡرَكۡتُمۡ وَلَا تَخَافُونَ أَنَّكُمۡ أَشۡرَكۡتُم بِٱللَّهِ مَا لَمۡ يُنَزِّلۡ بِهِۦ عَلَيۡكُمۡ سُلۡطَٰنٗاۚ فَأَيُّ ٱلۡفَرِيقَيۡنِ أَحَقُّ بِٱلۡأَمۡنِۖ إِن كُنتُمۡ تَعۡلَمُونَ ﴿81﴾

**81** “అల్లాహ్ మీ వద్దకు ఏ నిదర్శనాన్నీ అవతరింపజేయనప్పటికీ మీరు అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే విషయానికి భయపడటం లేదు. మరి అటువంటప్పుడు అల్లాహ్‌కు సహ వర్తులుగా మీరు నిలబెట్టే వాటికి నేనెలా భయపడతాను? కాబట్టి ఈ రెండు పక్షాలలో సురక్షిత స్థితికి అర్హులెవరో[104] మీకు తెలిస్తే కాస్త చెప్పండి.”

ٱلَّذِينَ ءَامَنُواْ وَلَمۡ يَلۡبِسُوٓاْ إِيمَٰنَهُم بِظُلۡمٍ أُوْلَٰٓئِكَ لَهُمُ ٱلۡأَمۡنُ وَهُم مُّهۡتَدُونَ ﴿82﴾

**82** విశ్వసించి, తమ విశ్వాసాన్ని దుర్మార్గం (షిర్కు)తో కలగా పులగం చేయకుండా ఉండేవారే సురక్షితంగా ఉన్నవారు. సన్మార్గంపై ఉన్నవారు కూడా వారే.[105]

وَتِلۡكَ حُجَّتُنَآ ءَاتَيۡنَٰهَآ إِبۡرَٰهِيمَ عَلَىٰ قَوۡمِهِۦۚ نَرۡفَعُ

**83** ఇబ్రాహీము (అలైహిస్సలాం) తన జాతి వారిని ఎదుర్కొన టానికిగాను మేము అతనికి ఇచ్చిన మా ‘నిదర్శనం’[106] ఇది!

103. దైవప్రవక్త ఇబ్రాహీము (అలైహిస్సలాం) ఇచ్చిన ఏకదైవారాధనా సందేశాన్ని విన్నప్పుడు, ఆయన జాతి ప్రజలకు దిమ్మ తిరిగినంత పనయింది. ఎందుకంటే ఆ సందేశం ఇంతకాలంగా వారు సేవిస్తూ వస్తున్న మిథ్యా దైవాలను నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది. అందుకే వాళ్లంతా కలసి వాదులాటకు దిగారు. దీన్నిబట్టి తెలిసే ఒక ముఖ్య విషయం ఏమిటంటే ముష్రిక్కులు సయితం తమ షిర్క్‌కు అనుకూలంగా కొన్ని అస్త్రాలను ముందు నుంచే సిద్ధం చేసుకుని ఉంటారు. నేటి ముష్రిక్కులను మనం చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. తమ బహుదైవోపాసనా సిద్ధాంతాలను సమర్థించుకోవటానికి, తమ అనుయాయులను ఊరడించటానికి వారు కొన్ని “ఆయుధాల”కు పదును పెట్టుకుంటారు. వాటిని వారు ‘నిదర్శనాలు’గా తలపోస్తారు. లేదా తమ మాయ మాటల ద్వారా ప్రజలను మోసగిస్తూ ఉంటారు.

104. రెండు పక్షాలలో ఒకటి: విశ్వాసుల పక్షం. రెండవది: అవిశ్వాసుల పక్షం. విశ్వాసి దగ్గర దేవుని ఏకత్వానికి (తౌహీద్‌కు) సంబంధించిన స్పష్టమయిన ప్రమాణాలెన్నో ఉన్నాయి. కాని అవిశ్వాసి దగ్గర, ముష్రిక్కు దగ్గర దేవుని తరఫున ఎలాంటి ఆధారమూ లేదు. మూఢనమ్మకాలు లేక వక్ర భాష్యాలు మాత్రమే వారి దగ్గర ఉన్నాయి. అందువల్ల శాంతికీ, సాఫల్యానికి అర్హులెవరో దీన్నిబట్టి ఊహించవచ్చు.

105. ఆయతులో **‘జుల్మ్’ (ظُلم)** అనే పదం వాడబడింది. ఇక్కడ ‘జుల్మ్’ అంటే షిర్క్ అని అర్థం. అసలు ‘జుల్మ్’ అన్న పదానికి లోటు, తప్పు, పాపం, దుర్మార్గం, అన్యాయం అనే అర్థాలు ఉన్నాయి. ఈ ఆయతు అవతరించినప్పుడు దైవప్రవక్త (స) గారి సహచరులు, ఇక్కడ ‘జుల్మ్’ అన్న పదం శాబ్దిక అర్థంలో ఉపయోగించబడలేదని తెలియక చాలా ఆందోళన పడిపోయారు. వారు మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చి, “మాలో అన్యాయానికి ఒడిగట్టకుండా ఎవరున్నారు? ప్రతి ఒక్కరి వల్లా ఎంతో కొంత అన్యాయం జరుగుతుంది. మరి మా ‘ఈమాన్’ కలుషితం అయిపోతుందా?” అని వారు సందేహపడ్డారు. అప్పుడాయన (సఅసం), “ఈ జుల్మ్ మీరు అనుకునే జుల్మ్ కాదు. ఇక్కడ జుల్మ్ అంటే భావం షిర్క్ (దైవత్వంలో కల్పించే భాగస్వామ్యం). నిశ్చయంగా ‘షిర్క్’ చాలా పెద్ద జుల్మ్

دَرَجٰتٍ مَّنْ نَّشَآءُ ۗ اِنَّ رَبَّكَ حَكِيْمٌ عَلِيْمٌ (83)

మేము తలచుకున్నవారి అంతస్తుల్ని పెంచుతాము. నిశ్చయంగా నీ ప్రభువు వివేకవంతుడు, గొప్ప పరిజ్ఞానం కలవాడు.

وَوَهَبْنَا لَهٗۤ اِسْحٰقَ وَيَعْقُوْبَ ؕ كُلًّا هَدَيْنَا ۚ وَنُوْحًا هَدَيْنَا مِنْ قَبْلُ وَمِنْ ذُرِّيَّتِهٖ دَاوٗدَ وَسُلَيْمٰنَ وَاَيُّوْبَ وَيُوْسُفَ وَمُوْسٰى وَهٰرُوْنَ ؕ وَكَذٰلِكَ نَجْزِى الْمُحْسِنِيْنَ (84)

**84** ఇంకా మేము అతనికి ఇస్‌హాఖును, యాఖూబ్‌ను[107] ప్రసాదించాము. వారిలో ప్రతి ఒక్కరికీ మేము సన్మార్గం చూపించాము. అంతకు మునుపు మేము నూహ్‌కు సన్మార్గం చూపించి ఉన్నాము. ఇంకా అతని సంతతి[108] వారిలోనుంచి దావూదు సులైమానులకు, అయ్యూబు యూసుఫులకు, మూసా హారూనులకు మేము సన్మార్గం చూపాము. సత్కార్యాలు చేసేవారికి మేము ఇలాగే ప్రతిఫలం ఇస్తూ ఉంటాము.

(అన్యాయం) అని హజ్రత్ లుఖ్మాన్ తన కుమారునికి ఉపదేశించారు కదా!" అని ఆయన (సఅసం) విశదీకరించారు (సహీహ్ బుఖారీ : తఫ్సీర్ సూరె అల్ అన్ఆమ్).

106. అంటే దేవుని ఏకత్వానికి (తౌహీద్‌కు) సంబంధించి అల్లాహ్ తన ప్రవక్త (ఇబ్రాహీము)కు ఇచ్చిన ఆధారం ఎంత బలవత్తరంగా ఉందంటే ఆ జాతి ప్రజలు దాని ముందు ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. కొంతమంది పండితులు, ఇక్కడ నిదర్శనం (లేక ఆధారం) అంటే ఇంతకు ముందు ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) తన జాతివారితో అన్న ఈ మాటేనని అభిప్రాయపడ్డారు : "అల్లాహ్ మీ వద్దకు ఏ నిదర్శనాన్నీ అవతరింపజేయనప్పటికీ వాటిని మీరు అల్లాహ్‌కు భాగస్వామ్యంగా కల్పించే విషయానికి భయపడటం లేదు. మరి అటువంటప్పుడు అల్లాహ్‌కు సహవర్తులుగా మీరు నిలబెట్టేవాటికి నేనెలా భయపడతాను? కాబట్టి ఈ రెండు పక్షాలలో సురక్షిత స్థితికి అర్హులెవరో నాకు చెప్పండి." తర్వాత ఇబ్రాహీమ్ ప్రవక్తగారి మాటను ధృవీకరిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "విశ్వసించి, తమ విశ్వాసాన్ని దుర్మార్గం (షిర్కు)తో కలగాపులగం చేయకుండా ఉండేవారే సురక్షితంగా ఉన్నవారు. సన్మార్గంపై ఉన్నవారు కూడా వారే." (అల్ అన్ఆమ్ సూరా 81, 82 ఆయతులు).

107. ఇబ్రాహీము దంపతులు వృద్ధులయ్యే వరకూ వారికి సంతానం కలుగలేదు. తమకింకా పిల్లలు పుట్టరేమో! అని వారనుకున్నారు. ఆ సమయంలో వారికి కొడుకుతో పాటు మనవడి శుభవార్త కూడా ఇవ్వబడింది. ఆ మనవడు యాఖూబు (అలైహిస్సలాం) అని అనబడింది. హూద్ సూరాలోని 72, 73 వచనాలలో ఈ శుభవార్త ఇవ్వబడింది. **'యాఖూబ్'** అన్న పదం 'అఖ్‌బ్' నుంచి వచ్చింది. తర్వాత, వెనుక అని దాని అర్థం. ఈ విధంగా యాఖూబ్ తర్వాత ఆయన సంతతి భవిష్యత్తులో శాఖోపశాఖలుగా విస్తరిస్తుందనీ, వర్ధిల్లుతుందన్న భావం ఆ పేరులోనే ఉంది.

108. **"అతని సంతతి"** (జుర్రియ్యతిహీ) అంటే ఎవరి సంతతి? నూహ్ సంతతి వారా? లేక ఇబ్రాహీము సంతతి వారా? వాక్యంలో నూహ్ (అలైహిస్సలాం) ప్రస్తావన దగ్గర్లో ఉండటం వల్ల ఇది నూహ్ సంతతికే వర్తిస్తుందని విద్వాంసులు వ్యాఖ్యానించారు. అంటే హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) సంతతికి చెందిన దావూదు, సులైమానులకు వర్తిస్తుందన్న మాట! మరి కొంతమంది పండితులేమంటున్నారంటే; విషయం హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) నేపథ్యంలో చర్చించబడు తోంది గనక "అతని సంతతి" అనే మాట ఇబ్రాహీముకే చెందుతుంది. మరి అదే నిజమైతే లూత్ (అలైహిస్సలాం) ప్రస్తావన ఈ జాబితాలోకి రాకుండా ఉండాల్సిందే! అన్న సంశయం ఈ సందర్భంగా కలగవచ్చు. ఎందుకంటే హజ్రత్ లూత్ (అలైహి) ఇబ్రాహీము సంతతిలోని వారు కాదు. ఈయన ఇబ్రాహీం సోదరుడైన హారాన్ బిన్ ఆజర్ కుమారుడు. అంటే ఇబ్రాహీముకు భ్రాతృజుడు అవుతారు. హజ్రత్ ఇబ్రాహీము (అలైహి) హజ్రత్ లూత్ (అలైహి) గార్కి తండ్రి కారు. బాబాయి మాత్రమే. విషయ ఆధిక్యత మూలంగా ఈయన్ని కూడా ఇబ్రాహీము సంతతిలో భాగంగా పేర్కొనటం జరిగింది. ఇలాంటిదే మరో ఉదాహరణ కూడా ఖుర్ఆన్‌లో లభిస్తుంది. అదేమిటంటే హజ్రత్

وَزَكَرِيَّا وَيَحْيَىٰ وَعِيسَىٰ وَإِلْيَاسَ ۖ كُلٌّ مِّنَ
الصَّالِحِينَ ﴿٨٥﴾

**85** ఇంకా జకరియ్యా, యహ్యా, ఈసా,[109] ఇల్యాస్‌లకు కూడా (మేము సన్మార్గం చూపించాము.) వారంతా సద్వర్తనుల కోవకు చెందినవారే.

وَإِسْمَاعِيلَ وَالْيَسَعَ وَيُونُسَ وَلُوطًا ۚ وَكُلًّا فَضَّلْنَا
عَلَى الْعَالَمِينَ ﴿٨٦﴾

**86** ఇంకా – ఇస్మాయీలుకు, యసఅకు, యూనుసు లూతులకు కూడా (మేము మార్గదర్శకత్వం వహించాము). వారిలో ప్రతి ఒక్కరికీ మేము లోకవాసులందరిపై శ్రేష్ఠతను అనుగ్రహించాము.

وَمِنْ آبَائِهِمْ وَذُرِّيَّاتِهِمْ وَإِخْوَانِهِمْ ۖ وَاجْتَبَيْنَاهُمْ
وَهَدَيْنَاهُمْ إِلَىٰ صِرَاطٍ مُّسْتَقِيمٍ ﴿٨٧﴾

**87** అంతేకాదు, వారి పితామహులలో (తాత ముత్తాతలలో), వారి సంతానంలో, వారి సహోదరులలో[110] కూడా కొందరిని (మేము కటాక్షించాము.) వారిని (మా సేవకోసం) ఎన్నుకున్నాము. వారిని రుజుమార్గం వైపుకు నడిపించాము.

ذَٰلِكَ هُدَى اللَّهِ يَهْدِي بِهِ مَن يَشَاءُ مِنْ
عِبَادِهِ ۚ وَلَوْ أَشْرَكُوا لَحَبِطَ عَنْهُم مَّا كَانُوا
يَعْمَلُونَ ﴿٨٨﴾

**88** ఇదీ అల్లాహ్ మార్గదర్శకత్వం. ఆయన తన దాసులలో తాను కోరిన వారిని ఈ మార్గంపై నడిపింపజేస్తాడు. ఒకవేళ వీరు సైతం, దైవత్వంలో భాగస్వామ్యానికి (షిర్కుకు) ఒడిగట్టి ఉంటే, వారు చేసుకున్న కర్మలన్నీ కూడా వృథా అయిపోయేవి.[111]

---

ఇస్మాయీలు (అలైహిస్సలాం) గారిని హజ్రత్ యాఖూబు (అలైహిస్సలాం) సంతతికి తాతగా పేర్కొనటం జరిగింది. కాగా; ఆయన యాఖూబు సంతతికి పినతండ్రి అవుతారు (అల్ బఖర సూరా 133వ ఆయతును చూడండి).

109. హజ్రత్ ఈసా – అలైహిస్సలాం – (కు తండ్రి లేకపోయినప్పటికీ ఆయన) ప్రస్తావన హజ్రత్ నూహ్ లేక హజ్రత్ ఇబ్రాహీము సంతతిలో రావటాన్ని బట్టి కొడుకుల సంతానం మాదిరిగా, కూతురి సంతానం కూడా తన సంతానంగానే పరిగణించబడుతుందని అవగతం అవుతోంది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన మనుమడైన హజ్రత్ హసన్ – రజి – ను (ఈయన ప్రవక్తగారి పుత్రికకు కలిగిన బిడ్డ అయినప్పటికీ) తన కుమారుడు అని అనటం గమనించదగిన విషయం. హజ్రత్ హసన్ (రజి) గురించి మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు : "ముమ్మాటికీ నా (ఈ) కుమారుడు నాయకుడే. బహుశా అల్లాహ్ ఇతని ద్వారా ముస్లిములకు చెందిన రెండు పెద్ద వర్గాల మధ్య సంధి కుదుర్చవచ్చు" (సహీహ్ బుఖారీ : కితాబుస్సులహ్). వివరాలకు "తఫ్సీర్ ఇబ్నె కసీర్" చూడండి.

110. **'ఆబా'** అంటే పూర్వీకులు అని అర్థం. అంటే వంశవృక్షం యొక్క వేళ్లు. అంటే తండ్రులు, తాతలు, ముత్తాతలు అన్నమాట. **'జుర్రియ్యాత్'** అంటే సంతతికి చెందినవారు. కొడుకులు, మనవళ్లు, మునిమనవళ్లు అన్నమాట! అల్లాహ్ వారి తాతముత్తాతలలో చాలామందిపై, అలాగే వారి సంతతిలో పెక్కుమందిపై, వారి అన్నదమ్ములలో కూడా అనేక మందిపై ప్రత్యేకంగా దయదలిచాడు. "వాళ్లను ఎన్నుకున్నాము" (ఇజ్‌తబైనా) అంటే వాళ్లను మాకు నచ్చిన దాసుల జాబితాలో చేర్చుకున్నాము అని భావం. అరబీలో 'జబైతుల్ మాఅ ఫిల్ హౌజి' అని అనటం కద్దు. అంటే 'నేను కొలనులో నీటిని సమీకరించాను' అని అర్థం. ఈ విధంగా 'ఇజ్‌తబైనా' అన్న దానికి నేను వారిని నా ప్రత్యేకదాసుల్లో కలుపుకున్నాను అన్న అర్థం కూడా వస్తుంది. అలాగే 'ఇజ్‌తబైనా' అన్న పదానికి 'ఇస్‌తిఫా' అన్న అర్థం కూడా రావచ్చు. ఇస్తిఫా అంటే ఎన్నుకోవటం. దీన్నుంచే 'ముస్తఫా' అనే పదం వచ్చింది. ముస్తఫా అంటే ఎన్నుకోబడినవాడని అర్థం (ఫత్‌హుల్ ఖదీర్).

111. పద్దెనిమిది మంది ప్రవక్తల పేర్లు ప్రస్తావించిన తరువాత అల్లాహ్ వారిని ఇలా హెచ్చరించటం గమనార్హ విషయం. ఈ ప్రవక్తలు జగతిలో ఇతరులందరికన్నా ఉత్తములే అయినప్పటికీ, ఒకవేళ వాళ్ళు సయితం 'షిర్క్' అనే దుర్మార్గానికి

**89** మేము గ్రంథాన్నీ, వివేకాన్నీ, ప్రవక్త పదవినీ ప్రసాదించినది వీరికే. ఒకవేళ వారు గనక దానిని తిరస్కరించే పక్షంలో,[112] దానిని తిరస్కరించకుండా ఉండే[113] చాలా మందిని మేము దానికోసం నియమించి ఉన్నాము.

أُولَٰئِكَ الَّذِينَ آتَيْنَاهُمُ الْكِتَابَ وَالْحُكْمَ وَالنُّبُوَّةَ ۚ فَإِن يَكْفُرْ بِهَا هَٰؤُلَاءِ فَقَدْ وَكَّلْنَا بِهَا قَوْمًا لَّيْسُوا بِهَا بِكَافِرِينَ ﴿٨٩﴾

**90** అల్లాహ్ సన్మార్గం చూపించినటువంటివారు వీరే. కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు కూడా వారి మార్గాన్నే అనుసరించు.[114] "దీనికిగాను నేను మీనుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు.[115] ఇది సమస్త లోకవాసుల కోసం హితోపదేశం"[116] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

أُولَٰئِكَ الَّذِينَ هَدَى اللَّهُ ۖ فَبِهُدَاهُمُ اقْتَدِهْ ۗ قُل لَّا أَسْأَلُكُمْ عَلَيْهِ أَجْرًا ۖ إِنْ هُوَ إِلَّا ذِكْرَىٰ لِلْعَالَمِينَ ﴿٩٠﴾

**91** "అల్లాహ్ ఏ మానవమాత్రునిపైనా ఎలాంటి విషయాన్నీ అవతరింపజేయలేదు" అని పలికినప్పుడు ఈ (అవిశ్వాస) జనులు అల్లాహ్‌ను అర్థం చేసుకోవలసిన విధంగా అర్థం చేసుకోలేదు.[117] వారిని అడుగు: "మరి మూసా తెచ్చిన ఆ గ్రంథాన్ని ఎవరు

وَمَا قَدَرُوا اللَّهَ حَقَّ قَدْرِهِ إِذْ قَالُوا مَا أَنزَلَ اللَّهُ عَلَىٰ بَشَرٍ مِّن شَيْءٍ ۗ قُلْ مَنْ أَنزَلَ الْكِتَابَ الَّذِي

గనక పాల్పడితే వాళ్ల సత్కార్యాలన్నీ నాశనమైపోయి ఉండేవి. వేరొక చోట తన అంతిమ దైవప్రవక్త (సఅసం)ను ఉద్దేశించి కూడా అల్లాహ్ ఈ మేరకు హెచ్చరించాడు : "(ఓ ప్రవక్తా!) ఒకవేళ నువ్వు కూడా షిర్కుకు పాల్పడ్డావంటే నీ కర్మలన్నీ వృథా అయిపోతాయి" (అజ్జుమర్ – 65). వాస్తవానికి ప్రవక్తల ద్వారా ఎన్నడూ షిర్కు జరగదు. వారు దేవుని పర్యవేక్షణలో ఉంటారు. అయితే షిర్క్ ఎంత ఘోరమైన పనో, దాని దుష్పరిణామాలు ఎంత భయంకరంగా ఉంటాయో అనుచర సమాజానికి ఎరుకపరచడానికి దేవుడు ఈ విధంగా సావధానపరుస్తున్నాడు.

112. తిరస్కరించేవారంటే అంతిమ దైవప్రవక్త (స) సందేశాన్ని త్రోసిపుచ్చే (మక్కా) అవిశ్వాసులు, ముష్రిక్కులు.

113. 'తిరస్కరించకుండా ఉండేవాళ్ళు' అంటే దైవమార్గంలో వలసపోయిన ముహాజిర్లు, అన్సారులు, ప్రళయదినం వరకూ పుట్టబోయే విశ్వాసులు అని భావం.

114. **'వారి మార్గాన్నే అనుసరించు'** అనంటే ఇంతకుముందు ఆయతులలో దేవుడు ప్రస్తావించిన ప్రవక్తలన్నమాట! వారంతా దేవుని ఏకత్వం (తౌహీద్) వైపుకే ప్రజలను పిలిచారు. కాబట్టి దేవుని ఏకత్వానికి సంబంధించినంతవరకు గతించిన ప్రవక్తల మార్గాన్ని అనుసరించవచ్చు. అలాగే గత ప్రవక్తలు అవలంబించిన షరీయతులో ఏదేని ఆజ్ఞ రద్దుకాకుండా ఉంటే దాన్ని కూడా అనుసరించవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్). ఎందుకంటే ధార్మిక మూలాంశాలు ఏ షరీయతులోనయినా ఒకేవిధంగా ఉంటాయి. కాకపోతే వాటి పాక్షిక, సాపేక్షిక విషయాలు, పోకడలు మాత్రం విభిన్నంగా ఉంటాయి. "ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు" అనే దివ్య వచనం ద్వారా కూడా ఈ సంగతి స్పష్టమవుతోంది (అష్ షూరా – 13).

115. అంటే నేను మిమ్మల్ని దైవమార్గం వైపుకు పిలిచి, మిమ్మల్ని నరకాగ్ని నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నందుకు మీనుంచి జీతం అడగటం లేదు. నేను చేసే ఈ పనికి మంచి ప్రతిఫలం పరలోకంలో అల్లాహ్ దగ్గర నాకు లభిస్తుంది.

116. సమస్త జనులు ఈ ఖుర్‌ఆన్ ద్వారా పాఠం నేర్చుకోవాలి. ఎందుకంటే ఈ ఉద్గ్రంథం మనిషిని అవిశ్వాసం మరియు బహుదైవోపాసన యొక్క అంధకారం నుంచి వెలికితీసి సన్మార్గమనే కాంతిని ప్రసాదిస్తుంది. కుడి ఎడమల అపవాదాల నుంచి, వంకరటింకర దారుల నుంచి రుజుమార్గం వైపుకు ఆహ్వానిస్తుంది. అయితే దీనిద్వారా ఉపదేశం పొందగోరే

జَآءَ بِهٖ مُوْسٰی نُوْرًا وَّ هُدًی لِّلنَّاسِ تَجْعَلُوْنَهٗ
قَرَاطِیْسَ تُبْدُوْنَهَا وَتُخْفُوْنَ كَثِیْرًا ۚ وَعُلِّمْتُمْ

అవతరింపజేసినట్టు? ఆ గ్రంథం ఒక జ్యోతి. మానవుల కొరకు మార్గదర్శకత్వం. మీరు దాన్ని వేర్వేరు కాగితాలుగా[118] విభజించి చూపుతున్నారు. ఎన్నో విషయాలను దాచేస్తున్నారు. మీకుగానీ, మీ పెద్దలకుగానీ తెలియని ఎన్నో విషయాలు (ఇందు

వారికి మాత్రమే అది తోడ్పడుతుంది. అంధులుగా, చెవిటివారుగా, మూగవారిగా వ్యవహరించగోరే వారికి ఎవరయినా ఏం చేయగలుగుతారు?

117. ఆయతులో **'ఖద్రిహీ'** (**قَدْرِهٖ**) అని వచ్చింది. 'ఖద్ర్' అంటే సరిగ్గా అంచనా వేయటం అని అర్థం. ఒక వస్తువు విలువను, వాస్తవికతను తెలుసుకోవలసిన రీతిలో తెలుసుకోవటం, దాన్ని గుర్తించటం అన్న భావంలో ఈ పదం ఉపయోగించబడుతుంది.

**'వారు అల్లాహ్‌ను అర్థం చేసుకోవలసిన విధంగా చేసుకోలేదు'** అంటే భావం మక్కాకు చెందిన ఈ అవిశ్వాసులు దైవవాణిని, దైవగ్రంథాన్ని తిరస్కరించి అల్లాహ్ విషయంలో తప్పుడు అంచనా వేశారు. ఎందుకంటే వారసలు అల్లాహ్ గురించి తెలుసుకోనేలేదు. అల్లాహ్‌కు సంబంధించిన జ్ఞానం ఏమాత్రం ఒంటపట్టలేదు. ఏమాత్రం వారికి ఈ 'జ్ఞానం' ఉన్నా ఈ సందేశాన్ని వారింత తేలిగ్గా కొట్టిపారేసేవారు కారు. ఈ అవగాహనాలేమి కారణంగానే వారు దైవప్రవక్త (స) ఆగమనం పట్ల కూడా సందిగ్ధానికి లోనయ్యారు. "ఒక మానవమాత్రునిపై దైవవాణి ఎలా అవతరిస్తుంది?" అన్న వారి సందేహమే వారి అజ్ఞానానికి మచ్చుతునక. దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట సెలవీయ బడింది : - "ఏమిటీ, మేము స్వయంగా వారిలో నుంచే ఒక మనిషిని ప్రభవింపజేసి, ప్రజలకు భయపెట్టు అని చెప్పటం, విశ్వసించినవారికి వారి ప్రభువు వద్ద ఉన్నత పదవి ఉందన్న శుభవార్తను వినిపించు అని చెప్పి పంపటం ప్రజలకు వింతగా ఉందా?" (యూనుస్ - 2). వేరొకచోట ఏమనబడిందో చూడండి: "ప్రజల వద్దకు సన్మార్గం వచ్చేశాక, ఏమిటీ, దేవుడు ఒక మానవమాత్రుణ్ణి ప్రవక్తగా చేసి పంపాడా?' అని చెప్పి వారు దాన్ని విశ్వసించేందుకు నిరాకరించారు" (బనీ ఇస్రాయీల్ - 94). దీనికి సంబంధించిన మరికొంత వివరణ ఇంతకు ముందు 8వ ఆయతుకు ఇవ్వబడిన పాదసూచికలో కూడా ఉంది. దేవుడు ఒక మానవమాత్రుణ్ణి ప్రవక్తగా నియమించి, అతని వద్దకు దైవగ్రంథం పంపటమేమిటీ? అన్నది అవిశ్వాసులకు కలిగిన పసలేని సందేహం. దానికి సమాధానంగా అల్లాహ్; ఒకవేళ అదే మీ నిరాకరణకు కారణమనుకుంటే, ఇంతకాలంగా మీరు నమ్ముతూ వస్తున్న తౌరాతు గ్రంథాన్ని మూసా - అలైహిస్సలాం-పై అవతరింపజేసినవాడెవడు? మరి మూసా మానవమాత్రుడు కాడా?? అని ఈ సందేహాల స్వాములను అడగమని అంటున్నాడు.

118. పైన చెప్పిన వివరణ ప్రకారం ఈ మాట యూదులనుద్దేశించి చెప్పబడినది : మీరు తౌరాతు గ్రంథాన్ని ఖండఖండాలుగా విభజించారు. దాన్ని వేర్వేరు కాగితాల్లో ఉంచారు. మీకు లాభసాటిగా ఉన్నాయనుకున్నవాటిని బహిర్గతం చేస్తున్నారు. మీకు వ్యతిరేకంగా ఉన్నాయనుకున్న కాగితాలను దాచేస్తున్నారు. శిలాశిక్ష గురించి అడిగినప్పుడుగానీ, అంతిమదైవప్రవక్త (స) గుణగణాల గురించి చెప్పవలసి వచ్చినప్పుడుగానీ మీరు సత్యాన్ని ఎందుకు కప్పిపుచ్చుతున్నారు?

ఈ ఆయతులోని **'తజ్అలూనహూ', 'తుబ్దూనహా'** అన్న పదాలను కొంతమంది పండితులు 'యజ్అలూనహూ', 'యుబ్దూనహా' అని కూడా పఠించారన్న విషయం గమనార్హం. మొదటి రెండు పదాలకు 'మీరు చేస్తున్నారు' అన్న అర్థం వస్తుండగా, తర్వాతి రెండు పదాలకు 'వారు చేస్తున్నారు' అనే అర్థం వస్తుంది. హాఫిజ్ ఇబ్నె కసీర్ మరియు ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ రెండవ రకపు పఠనానికే ప్రాధాన్యత నిచ్చారు. ఎందుకంటే ఈ ఆయతు యూదులనుద్దేశించి చెప్పబడుతోంది. అదీగాక ఇది మక్కాలో అవతరించిన ఆయతు. అటువంటప్పుడు మక్కా కాలపు వాక్యాలు యూదులను నేరుగా ఏవిధంగా సంబోధిస్తాయని వారు ప్రశ్న లేవనెత్తారు. కనుక ఈ వాక్యం యూదులను ప్రత్యక్షంగా కాకుండా, పరోక్షంగా మాత్రమే సంబోధిస్తోందని వారు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. మరికొంతమంది పండితులు ఈ ఆయతంతా ఫక్తు యూదులనుద్దేశించే అవతరించిందని నొక్కి వక్కాణించారు. ఎందుకంటే ఇందులో యూదులు

مَّا لَمْ تَعْلَمُوٓا أَنتُمْ وَلَآ ءَابَآؤُكُمْ ۖ قُلِ ٱللَّهُ ۖ
ثُمَّ ذَرْهُمْ فِى خَوْضِهِمْ يَلْعَبُونَ ﴿٩١﴾

మూలంగా) మీకు నేర్పబడ్డాయి."[119] దాన్ని అవతరింపజేసిన వాడు అల్లాహ్‌యే[120] అని చెప్పు. ఆ తర్వాత వాళ్లను వారి వ్యర్థ విషయాలలోనే ఆడుకోనివ్వు.

وَهَٰذَا كِتَٰبٌ أَنزَلْنَٰهُ مُبَارَكٌ مُّصَدِّقُ ٱلَّذِى بَيْنَ يَدَيْهِ
وَلِتُنذِرَ أُمَّ ٱلْقُرَىٰ وَمَنْ حَوْلَهَا ۚ وَٱلَّذِينَ يُؤْمِنُونَ
بِٱلْءَاخِرَةِ يُؤْمِنُونَ بِهِۦ ۖ وَهُمْ عَلَىٰ صَلَاتِهِمْ يُحَافِظُونَ ﴿٩٢﴾

**92** ఇది కూడా మేము అవతరింపజేసిన గ్రంథమే. ఎంతో శుభప్రదమైనది, తనకంటే ముందున్న గ్రంథాలను ధృవీకరించేది. నీవు మక్కా (ఉమ్ముల్ ఖురా) వారినీ, దాని పరిసరాల వారిని హెచ్చరించటానికిగాను (దీనిని అవతరింపజేశాము). పరలోకంపై దృఢ విశ్వాసం ఉన్నవారు దీనిని విశ్వసిస్తారు; వారు తమ నమాజులను జాగ్రత్తగా కాపాడుకునేవారై ఉంటారు.

وَمَنْ أَظْلَمُ مِمَّنِ ٱفْتَرَىٰ عَلَى ٱللَّهِ كَذِبًا أَوْ قَالَ أُوحِىَ
إِلَىَّ وَلَمْ يُوحَ إِلَيْهِ شَىْءٌ وَمَن قَالَ سَأُنزِلُ مِثْلَ
مَآ أَنزَلَ ٱللَّهُ ۗ وَلَوْ تَرَىٰٓ إِذِ ٱلظَّٰلِمُونَ فِى غَمَرَٰتِ
ٱلْمَوْتِ وَٱلْمَلَٰٓئِكَةُ بَاسِطُوٓا أَيْدِيهِمْ أَخْرِجُوٓا

**93** అల్లాహ్‌పై అబద్ధాన్ని కల్పించే వాడికంటే, లేదా తనపై ఎలాంటి వహీ అవతరించక పోయినప్పటికీ 'నాపై వహీ అవతరించింది' అని చెప్పే వానికంటే లేదా అల్లాహ్ అవతరింపజేసి నటువంటిదే 'నేను కూడా అవతరింపజేస్తాను' అని అనేవాడి కంటే పరమ దుర్మార్గుడు ఎవడుంటాడు? ఈ దుర్మార్గులు[121]

తమలోని మంకుతనం, అసూయ, శత్రుత్వం మూలంగా అంతిమ దైవప్రవక్త (స)ను నిరాకరించారనీ, వారి వైరవైఖరిని ఎండగట్టడం అసలు ఈ ఆయతు ప్రధాన ఉద్దేశమనీ వారు వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద ఈ ఆయతుకు సంబంధించి ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు మూడు రకాల అభిప్రాయాలు వెలిబుచ్చారు: 1. ఆయతు సాంతం యూదులనుద్దేశించి అవతరించిందని అనేవారు కొందరు. 2. ఆయతు అంతా బహుదైవారాధకులకు సంబంధించినదని భావించేవారు మరి కొందరు. 3. ఆయతులోని ప్రథమ భాగం బహుదైవారాధకులనుద్దేశించి, ద్వితీయభాగం యూదులనుద్దేశించి చర్చిస్తోందని వాదించేవారు ఇంకొందరు. వాస్తవం దైవానికే ఎరుక.

119. ఈ మాట యూదులను దృష్టిలో పెట్టుకుని చెప్పబడింది అని అనుకునే పక్షంలో తౌరాతు ద్వారా మీకెన్నో విషయాలు తెలుపబడ్డాయి అన్న అర్థం వస్తుంది. అన్యథా ఖుర్ఆన్ ద్వారా నేర్పబడ్డాయి అన్న అర్థం వస్తుంది.

120. అవతరింపజేసిన వాడెవడు (మన్ అన్‌జల?) అన్న దానికి ఇది సమాధానం.

121. అరబీలో **'జాలిమ్' (ظَالِم)** అని వచ్చింది. జాలిమ్ అంటే దుర్మార్గుడు అని అర్థం. దుర్మార్గానికి పాల్పడిన వారెవరయినా సరే ఈ ఆయతు భావపరిధిలోకి వస్తారు. అయితే దైవగ్రంథాన్ని త్రోసిపుచ్చేవాళ్ళు, తమను తాము దైవప్రవక్తలుగా ప్రకటించుకునే అబద్ధాలరాయుళ్ళు వీరిలో అందరికంటే ముందు పేర్కొనదగ్గవారు, పరమ దుర్మార్గులు. మృత్యువు ఒడిలో కొనఊపిరి ఘడియలు లెక్కపెట్టుకుంటున్నప్పుడు వారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటుంది. ప్రాణం తీయడానికి దైవదూతలు వారి ముందుకు చేతులు చాపుతూ ఉంటారు. "ఈ రోజు అవమానకరమైన శిక్ష విధించ బడుతుంది" అంటే ఈనాటితో ప్రపంచంలో మీకు నూకలు చెల్లాయి. ఈ రోజు మీ ప్రాణం తీయబడి, మీకు శిక్ష విధించటం మొదలవుతుందని భావం. ఆ శిక్ష మొదలయ్యే స్థలం సమాధి. సమాధి శిక్ష సత్యం అన్న దానికి ఇది ప్రబల తార్కాణం. సమాధి శిక్షే గనక లేనట్లయితే ప్రాణం తీసే దూతలు, "ఈ రోజు మీకు పరాభవంతో కూడిన శిక్ష విధించబడుతుంది" అని చెప్పటంలో అర్థమే లేదు. సమాధి అంటే 'బర్‌జఖ్ జీవితం' అన్నమాట. ఇహలోక జీవితం తర్వాత, పరలోక జీవితానికి ముందు మధ్యలో మరో జీవితం ఉంటుంది. దీన్నే 'బర్‌జఖ్ జీవితం' అంటారు. మరణించిన దగ్గర్నుంచి ప్రళయం వరకూ మనిషి ఇదే స్థితిలో ఉంటాడు. మనిషి ఖననం చేయబడినా, కాల్చివేయబడినా,

أَنفُسَكُمُ ۖ الْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ الْهُونِ بِمَا كُنتُمْ تَقُولُونَ عَلَى اللَّهِ غَيْرَ الْحَقِّ وَكُنتُمْ عَنْ آيَاتِهِ تَسْتَكْبِرُونَ ﴿٩٣﴾

మరణ యాతనలో ఉన్నప్పుడు, దైవదూతలు తమ చేతులు చాచి, “సరే! ఇక మీ ప్రాణాలు (బయటికి) తీయండి. మీరు అల్లాహ్‌కు అబద్ధాలను ఆపాదించినందుకూ,[122] అల్లాహ్ ఆయతుల పట్ల గర్వాతిశయంతో విర్రవీగినందుకుగాను ఈ రోజు మీకు పరాభవంతో కూడిన శిక్ష విధించబడుతుంది” అని చెబుతుండగా (ఆ దృశ్యాన్ని) నీవు చూడగలిగితే ఎంత బావుండు!

وَلَقَدْ جِئْتُمُونَا فُرَادَىٰ كَمَا خَلَقْنَاكُمْ أَوَّلَ مَرَّةٍ وَتَرَكْتُم مَّا خَوَّلْنَاكُمْ وَرَاءَ ظُهُورِكُمْ ۖ وَمَا نَرَىٰ مَعَكُمْ شُفَعَاءَكُمُ الَّذِينَ زَعَمْتُمْ أَنَّهُمْ فِيكُمْ شُرَكَاءُ ۚ لَقَد تَّقَطَّعَ بَيْنَكُمْ وَضَلَّ عَنكُم مَّا كُنتُمْ تَزْعُمُونَ ﴿٩٤﴾

**94** మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించినట్లుగానే, మీరు మా సన్నిధికి ఒంటరిగా[123] వచ్చారు. మేము మీకు ప్రసాదించిన దాన్నంతా మీ వెనుకే వదిలేసి వచ్చారు. మీ వ్యవహారాలలో మాకు భాగస్వాములని మీరు భావించిన మీ సిఫారసుదారులను కూడా ఇప్పుడు మేము మీవెంట చూడటం లేదు! నిజంగానే వారికీ – మీకూ మధ్య గల సంబంధాలన్నీ తెగిపోయాయి. మీరు నమ్ముతూ ఉన్నదంతా మీకు కనిపించకుండా పోయింది.

إِنَّ اللَّهَ فَالِقُ الْحَبِّ وَالنَّوَىٰ ۖ يُخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَمُخْرِجُ الْمَيِّتِ مِنَ الْحَيِّ ۚ ذَٰلِكُمُ اللَّهُ ۖ فَأَنَّىٰ تُؤْفَكُونَ ﴿٩٥﴾

**95** నిస్సందేహంగా విత్తనాన్ని, టెంకను చీల్చేవాడు అల్లాహ్‌యే.[124] ఆయన జీవమున్న దానిని జీవములేని దానిలో నుంచి తీస్తాడు.[125] జీవములేని దానిని జీవమున్న దానిలో నుంచి తీసేవాడూ ఆయనే.[126] ఆయనే అల్లాహ్. మరలాంటప్పుడు మీరు (సత్యం నుండి) ఎటు మరలిపోతున్నారు?

---

క్రూరమృగాల వాతనపడి మరణించినా, సముద్ర కెరటాలలో చిక్కుకొని చనిపోయినా – ప్రళయం వరకూ అతను బర్‌జఖ్ జీవితంలో ఉన్నట్లే లెక్క. బర్‌జఖ్ జీవితంలోనూ మనిషి శిక్షలను ఎదుర్కొంటాడన్న విషయం ముమ్మాటికీ సత్యం. అతను ఏ స్థితిలో ఉన్నాసరే అల్లాహ్ అతన్ని శిక్షించగలడు.

122. దైవగ్రంథాల అవతరణను త్రోసిపుచ్చటం, దైవప్రవక్తలను తిరస్కరించటం, తమ వద్దకు దైవవాణి వస్తుందని కల్లబొల్లి కబుర్లు చెప్పటం – ఇవన్నీ అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదించటం క్రిందికే వస్తాయి. గర్వంతో విర్రవీగేవారే దైవప్రవక్తలను, దైవగ్రంథాలను తిరస్కరిస్తారు. ఇలాంటి వారికి అవమానకరమైన శిక్షపడటం ఖాయం.

123. మూలంలో **‘ఫురాదా’** (**فُرَادَىٰ**) అనే పదం వచ్చింది. ఇది ‘ఫర్‌దున్’కు బహువచనం. ‘ఒక్కొక్కరే’ అని దాని భావం; అంటే, మీరు సమూహంగా, జట్టుగా కలసిరారు. ఒక్కొక్కరే – వేర్వేరుగా – మా ముందు హాజరవుతారు. మీ దగ్గర మీ సిరిసంపదలు ఉండవు. మీరు పూజించే బూటకపు దైవాలు కూడా ఉండరు. అల్లాహ్‌ను కాదని మీరు కల్పించుకున్న దేవుని పార్ట్‌నర్లు ఎవరూ మీకు తోడుగా రారు. అంటే ఏ సహాయకులను, మరే ఆస్తిపాస్తులను, పదవులను చూసుకుని మీరు మిడిసిపడేవారో వాటిలో ఏ ఒక్కటీ ఆనాడు మీకు ఆసరాగా నిలబడవు.

124. దేవుని అపురూపమైన సృష్టి, అనుపమమైన ఏర్పాట్ల గురించి యిక్కడ పేర్కొనటం జరిగింది. విత్తనాన్ని, టెంకను రైతు నేలలో నాటగానే, దాన్ని అసాధారణమైన రీతిలో చీల్చి, దాన్నుంచి మొక్కలను మొలకెత్తించి, వాటి ద్వారా రకరకాల వృక్షాలను సృజిస్తాడు. నేల ఒక్కటే. దానికి సరఫరా చేయబడే నీరు కూడా ఒక్కటే. కాని ఏ విత్తనం నాటితే ఆ మొక్కే మొలకెత్తుతుంది. ఏ టెంకను నాటితే ఆ వృక్షమే పుడుతుంది. ఆ విధంగా ఆ నేలద్వారా రకరకాల ఆహార ధాన్యాలు, పండ్లు ఫలాలు, కూరగాయలు సమకూరుతాయి. అల్లాహ్‌గాక మరొకరెవరయినా ఈ పనుల్ని

فَالِقُ الْإِصْبَاحِ ۚ وَجَعَلَ اللَّيْلَ سَكَنًا وَالشَّمْسَ وَالْقَمَرَ حُسْبَانًا ۚ ذَٰلِكَ تَقْدِيرُ الْعَزِيزِ الْعَلِيمِ ﴿٩٦﴾

**96** ఉదయాన్ని వెలికి తీసేవాడు ఆయనే.[127] ఇంకా ఆయన రాత్రిని విశ్రాంతి సమయంగా చేశాడు.[128] సూర్యచంద్రుల లెక్కను నిర్ధారించాడు.[129] ఇదంతా సర్వాధిక్యుడు, మహాజ్ఞాని (అయిన అల్లాహ్) చేసిన నిర్ధారణ.

وَهُوَ الَّذِي جَعَلَ لَكُمُ النُّجُومَ لِتَهْتَدُوا بِهَا فِي ظُلُمَاتِ الْبَرِّ وَالْبَحْرِ ۗ قَدْ فَصَّلْنَا الْآيَاتِ لِقَوْمٍ يَعْلَمُونَ ﴿٩٧﴾

**97** చీకట్లలోనూ, భూమిలోనూ, సముద్రంలోనూ మీరు మార్గం తెలుసుకునేందుకుగాను ఆయనే మీ కోసం నక్షత్రాలను[130] సృష్టించాడు. మేము జ్ఞానం కలవారి కోసం మా సూచనలను బాగా విడమరచి చెప్పాము.

وَهُوَ الَّذِي أَنْشَأَكُمْ مِنْ نَفْسٍ وَاحِدَةٍ فَمُسْتَقَرٌّ وَمُسْتَوْدَعٌ ۗ قَدْ فَصَّلْنَا الْآيَاتِ لِقَوْمٍ يَفْقَهُونَ ﴿٩٨﴾

**98** ఇంకా, మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించినవాడు ఆయనే. మరి ఒక స్థలం ఎక్కువ కాలం ఉండేదీ, ఇంకొక స్థలం తక్కువ కాలం[131] ఉండేదిగా నిర్ధారించబడింది. అర్థం చేసుకోగలిగే వారి కోసం మేము మా సూచనలను స్పష్టంగా వివరించాము.

---

చేసిపెడుతున్నారా?; **'హబ్బున్'** అంటే విత్తనం, గింజ; **'నవా'** – ఇది నవాతున్‌కు బహువచనం. టెంకాయ అని దాని అర్థం.

125. అంటే విత్తనం, టెంక లాంటి జీవం లేని వస్తువుల నుండి ఆయన మొక్కలను మొలకెత్తిస్తాడు. అవి శాఖోపశాఖలుగా విస్తరిస్తాయి. వాటిలో జీవముంటుంది. అవి పండ్లు ఫలాలనిస్తాయి. వాటి ద్వారా ఆహారధాన్యాలు, పప్పు దినుసులు ప్రాప్తిస్తాయి. మరికొన్ని తీగలు, వృక్షాలు సువాసనను వెదజల్లుతుంటాయి. వాటికి రంగు రంగుల పూలు పూస్తాయి. వాటిని చూసి, వాటి సువాసనను పీల్చి మనిషి మధురానుభూతికి లోనవుతాడు. అలాగే ఆయన వీర్యం నుంచి, గుడ్డు నుంచి మనుషులను, పక్షులను, పశువులను పుట్టిస్తాడు.

126. అంటే పశుపక్షాదుల నుంచి గుడ్డును తీస్తాడు. అది జీవములేని వస్తువుగా పరిగణించబడుతుంది. విశ్వాసి–అవిశ్వాసిని కూడా సజీవులు నిర్జీవులుగా అభివర్ణించటం జరిగింది. అంటే ఆయన విశ్వాసి ఇంట అవిశ్వాసినీ, అవిశ్వాసి ఇంట విశ్వాసినీ పుట్టిస్తాడు.

127. వెలుతురు – చీకట్ల, రేయింబవళ్ళ సృష్టికర్త కూడా ఆయనే. ఆయన రాత్రి చీకటి నుంచి ప్రభాత వెలుతురును వెలికి తీస్తాడు. దానిమూలంగా ప్రతి వస్తువూ జ్యోతిర్మయం అవుతుంది.

128. పగటి వెలుగులో మనిషి పరిశ్రమించి, చెమటోడ్చి అలసిపోతాడు. ఈ వ్యాపకాల నుంచి వేర్పడి అతను ప్రశాంతంగా నిద్రపోవటం అవసరం. అందుకే ఆయన రాత్రిపై చీకటి పొరలను దట్టంగా క్రమ్మి, దాన్ని విశ్రాంతి కోసం కేటాయించాడు.

129. సూర్యచంద్రుల కార్యపరిధి స్పష్టంగా నిర్ధారించబడింది. వాటి డ్యూటీ వేళలలో, పరిమితులలో ఎలాంటి మార్పూ పొడసూపదు. తమకు కేటాయించబడిన కక్ష్యలో అవి పరిభ్రమిస్తూ ఉంటాయి. ఈ కారణంగా చలికాలంలో పగలు చిన్నదిగా ఉండి రాత్రి సుదీర్ఘంగా ఉంటుంది. దీనికి భిన్నంగా వేసవి కాలంలో పగలు సుదీర్ఘంగా ఉంటుంది. రేయి చిన్నదిగా ఉంటుంది. మరిన్ని వివరాల కోసం యూనుస్ సూరాలోని 5వ ఆయతును, యాసీన్ సూరాలోని 40వ ఆయతును, అల్ ఆరాఫ్ సూరాలోని 54వ ఆయతును చూడండి.

130. నక్షత్రాల ఉనికికి సంబంధించి ఇక్కడ ఒక్క ప్రయోజనం మాత్రమే పేర్కొనబడింది. ఇది కాకుండా మరో రెండు ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఖుర్ఆన్‌లో వేరేచోట వాటి ప్రస్తావన వచ్చింది. 1. ఆకాశానికి అలంకరణ.

وَهُوَ الَّذِيٓ اَنۡزَلَ مِنَ السَّمَآءِ مَآءً ۚ فَاَخۡرَجۡنَا بِهٖ نَبَاتَ
كُلِّ شَيۡءٍ فَاَخۡرَجۡنَا مِنۡهُ خَضِرًا نُّخۡرِجُ مِنۡهُ حَبًّا
مُّتَرَاكِبًا ۚ وَمِنَ النَّخۡلِ مِنۡ طَلۡعِهَا قِنۡوَانٌ دَانِيَةٌ
وَّجَنّٰتٍ مِّنۡ اَعۡنَابٍ وَّالزَّيۡتُوۡنَ وَالرُّمَّانَ مُشۡتَبِهًا
وَّغَيۡرَ مُتَشَابِهٍ ؕ اُنۡظُرُوۡۤا اِلٰى ثَمَرِهٖۤ اِذَاۤ اَثۡمَرَ وَيَنۡعِهٖ ؕ
اِنَّ فِيۡ ذٰلِكُمۡ لَاٰيٰتٍ لِّقَوۡمٍ يُّؤۡمِنُوۡنَ ﴿٩٩﴾

**99** ఇంకా – ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించినవాడు ఆయనే. ఆ తరువాత దాని ద్వారా మేము అన్నిరకాల మొక్కల్ని వెలికి తీశాము.[132] ఆపైన మేము పచ్చని కొమ్మను సృజించాము.[133] దానిద్వారా మేము ఒకదానిపై ఒకటి పేరుకుని ఉన్న గింజలు గల పంటల్ని పండిస్తాము.[134] ఖర్జూర చెట్ల నుంచి, అంటే వాటి పొళి నుండి క్రిందికి వ్రేలాడే పండ్ల గెలలను,[135] ద్రాక్ష తోటలను, జైతూనును (ఆలివ్ పండ్లను),[136] దానిమ్మ కాయలను ఉత్పన్నం చేశాము. వాటిలో కొన్ని ఒక దానిని ఇంకొకటి పోలి ఉంటాయి. మరికొన్ని పోలి ఉండవు.[137] ప్రతి చెట్టుకు కాసినకాయ పెరిగి పెద్దదవుతున్నప్పుడు, అది పండుతున్నప్పుడు కాస్త నిశిత దృష్టితో చూడండి! నమ్మేవారి కోసం వీటిలో నిదర్శనాలున్నాయి.[138]

2. షైతానులను తరిమికొట్టటానికి ఉపయోగపడే సాధనాలు (రుజూమల్లిష్షయాతీన్). అంటే షైతానులు ఆకాశాలలోకి పోవటానికి ప్రయత్నించినప్పుడు అవి అగ్ని గోళాలుగా మారి వాటిపై పడతాయి. ఈ మూడు విషయాలు మినహా ఎవరయినా ఈ నక్షత్రాల గురించి ఇతరత్రా నమ్మకాలు కలిగి ఉంటే అతను పొరబడ్డాడనీ, అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదించినట్లేనని కొంతమంది సలఫ్‌లు వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే, మనదేశంలో జ్యోతిష్కులు నక్షత్రాల ఆధారంగా మనిషి భవిష్యత్తును గురించి, ప్రపంచంపై పడే వాటి ప్రభావం గురించి చెప్పేవన్నీ నిరాధారాలే, అవన్నీ షరీయతుకు విరుద్ధమైన విషయాలు. జోస్యం కూడా చేతబడిలో ఒక భాగమేనని ఒక హదీసులో చెప్పబడటం గమనార్హం : “ఎవరయితే నక్షత్రాల విద్యను ఆర్జించాడో అతను చేతబడి (జాలవిద్య) లోని ఒక భాగాన్ని నేర్చుకున్నాడు” (సహీహ్ అబూ దావూద్ నెంబరు : 3905; ఈ హదీసు ‘హసన్’ కోవకు చెందినదని అల్‌బానీ అభిప్రాయపడ్డారు).

131. చాలామంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు **‘ముస్తఖర్రున్’** (**مُستقرّ**) అంటే మాతృగర్భమనీ, **‘ముస్తవ్‌దవున్’** (مُستودَع) అంటే పురుషుని వెన్ను అనీ అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).

132. ఈ ఆయతులో విశ్వప్రభువు యొక్క సృష్టి ప్రక్రియలోని అపురూపమైన అందాలు, అద్భుతాలు చిత్రించబడ్డాయి. వర్షాన్నే చూడండి. అది కురవగానే అప్పటివరకూ నెర్రలు కొట్టి ఉన్న నేల ఒక్కసారిగా పులకిస్తుంది. రకరకాల మొక్కలు అందులో మొలకెత్తుతాయి. చూస్తూ ఉండగానే నలువైపులా పచ్చిక బయళ్లు పరచుకుని అది ముస్తాబవుతుంది.

133. నేలలో చల్లబడిన ఒక చిన్న విత్తనం లేక టెంక క్రమక్రమంగా ఓ మహావృక్షంలా రూపు దాల్చటం, అది శాఖోపశాఖలుగా విస్తరించి నలుగురికీ నీడనివ్వటం, పువ్వులు, కాయలు, పండ్లతో అది పరిసరాల వారికి ప్రయోజనదాయకంగా మారటం, వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడం – ఇదంతా ఆ పరిపాలకుని ప్రణాళికా రచనలో అంతర్భాగమే.

134. ఈ మొక్కల, మహావృక్షాల నుండి దేవుడు సృజించిన ధాన్యాలు, కాయలు, పండ్లు కూడా ఆయన అద్భుత సృష్టికి ప్రతిరూపమే. ఉదాహరణకు : గోధుమలు, వరిబుట్టలు, మొక్కజొన్న కండ్లు, గోధుమ, జొన్న వెన్నులు మొదలగు ధాన్యాలు యోచన చేసేవారికి ప్రబల నిదర్శనాలుగా ఉన్నాయి.

135. అరబీలో **‘ఖిన్‌వానున్’** (**قِنْوَانٌ**) అని వచ్చింది. ఇది ‘ఖిన్‌వున్’కు బహువచనం. గెల అని దీని అర్థం. ఖర్జూర వృక్షాల నుంచి మొదట పువ్వుల రూపంలో గెల బయటికి పొడుచుకు వస్తుంది. ఆ తరువాత దానికి చిన్న చిన్న పిందలు మొలుస్తాయి. ఎండాకాలంలో అవి పండి కోతకు వస్తాయి. వాటిలో కొన్ని గెలలు క్రిందికి వ్రేలాడుతూ చేతికి అందుతూ ఉంటాయి. మరికొన్ని గెలలు అందవు (ఫత్‌హుల్ ఖదీర్).

136. అంటే మేము వర్షం ద్వారా మొలకెత్తించిన వృక్షాలలో ద్రాక్ష తీగెలు, జైతూను, దానిమ్మ వృక్షాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ మేము మీ ప్రయోజనార్థమే పుట్టించాము. అయినా మీరు ఈ సృష్టిపై యోచన చెయ్యరేమిటి?!

وَجَعَلُوْا لِلّٰهِ شُرَكَآءَ الْجِنَّ وَخَلَقَهُمْ وَخَرَقُوْا لَهٗ بَنِيْنَ وَبَنٰتٍ بِغَيْرِ عِلْمٍ ؕ سُبْحٰنَهٗ وَتَعٰلٰى عَمَّا يَصِفُوْنَ ﴿١٠٠﴾

**100** ప్రజలు జిన్నాతులను అల్లాహ్‌కు భాగస్వాములుగా ఖరారు చేసుకున్నారు. మరి చూడబోతే వాళ్లను సృష్టించింది కూడా ఆయనే. అంతేకాదు, వీళ్లు ఎటువంటి జ్ఞానం లేకుండానే ఆయనకు కుమారులను, కుమార్తెలను కూడా కల్పించారు. వాస్తవానికి వీళ్లు చెప్పే ఈ మాటలకు ఆయన పవిత్రుడు, ఉన్నతుడు.

بَدِيْعُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ اَنّٰى يَكُوْنُ لَهٗ وَلَدٌ وَّلَمْ تَكُنْ لَّهٗ صَاحِبَةٌ ؕ وَخَلَقَ كُلَّ شَیْءٍ ۚ وَهُوَ بِكُلِّ شَیْءٍ عَلِيْمٌ ﴿١٠١﴾

**101** ఆకాశాలను, భూమినీ ఆవిష్కరించినవాడు ఆయనే. అల్లాహ్‌కు భార్యయే లేనపుడు ఆయనకు సంతానం ఎలా కలుగుతుంది? ఆయన ప్రతి వస్తువునూ సృష్టించాడు.[139] ఆయనకు ప్రతిదీ బాగా తెలుసు.

ذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمْ ۚ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ ۚ خَالِقُ كُلِّ شَیْءٍ فَاعْبُدُوْهُ ۚ وَهُوَ عَلٰى كُلِّ شَیْءٍ وَّكِيْلٌ ﴿١٠٢﴾

**102** ఆయనే అల్లాహ్. మీ ప్రభువు. ఆయన తప్ప మరొక రెవరూ ఆరాధ్యులు కారు. సమస్త వస్తువులను సృష్టించినవాడు ఆయనే. కాబట్టి మీరు ఆయన్నే ఆరాధించండి. అన్ని విషయాల కార్యసాధకుడు ఆయనే.

لَا تُدْرِكُهُ الْاَبْصَارُ ؗ وَهُوَ يُدْرِكُ الْاَبْصَارَ ۚ وَهُوَ اللَّطِيْفُ الْخَبِيْرُ ﴿١٠٣﴾

**103** ఎవరి చూపులు కూడా ఆయన్ని అందుకోజాలవు.[140] ఆయన మాత్రం అందరి చూపులను అందుకోగలడు. ఆయన సూక్ష్మదృష్టి కలవాడు. సర్వమూ తెలిసినవాడు.

137. అంటే గుణాల, స్వభావాల రీత్యా కొన్ని పండ్లు పరస్పరం పోలి ఉంటాయి. అయినా దేని ప్రత్యేకత దానిదే. వాటి రంగు వేరు, రూపు వేరు, రుచి వేరు. వాసన వేరు. కొన్ని వృక్షాల ఆకులు పరస్పరం పోలి ఉంటాయి. కాని వాటి పండ్లు మాత్రం భిన్నంగా ఉంటాయి.

138. ఇప్పటివరకూ పేర్కొనబడిన వస్తువులన్నింటిలోనూ సృష్టికర్త యొక్క అసాధారణమైన శక్తి, సామర్థ్యాలతోపాటు ఆయన వివేచనం, దాక్షిణ్యం, యుక్తి తొణికిసలాడుతున్నాయి.

139. అంటే – ఏ విధంగా ఈ వస్తువులన్నింటినీ సృష్టించటంలో దేవుడు ఒంటరివాడో, సాటిలేనివాడో అదేవిధంగా ఆరాధనల, అర్చనల విషయంలో కూడా ఆయన ఒంటరివాడు, సాటిలేనివాడు. కాబట్టి ఆరాధనల్లో ఆయనకు భాగస్వాములుగా ఇంకొకరెవరినీ చేర్చరాదు. కాని జనులు ఈ సాటిలేని అల్లాహ్‌ను వదిలి జిన్నాతులను భాగస్వాములుగా నిలబెట్టారు. వాస్తవానికి జిన్నాతులను పుట్టించినవాడు కూడా అల్లాహ్‌యే. బహుదైవారాధకులు సాధారణంగా విగ్రహాలను, రాళ్లు రప్పలను, సమాధులలో పూడ్చిపెట్టబడిన వ్యక్తులను పూజిస్తుంటారు. కాని ఈ వచనంలో, వారు జిన్నాతులను ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారని అనబడింది! ఇక్కడ జిన్నాతులంటే భావం షైతానులు. వాటి ప్రేరణపైనే జనులు షిర్క్‌కి పాల్పడతారు. ఆ విధంగా వారు షైతాన్‌కు దాసోహమన్నారు. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో పెక్కుచోట్ల ప్రస్తావించబడింది. ఉదాహరణకు: అన్ నిసా సూరాలోని 117వ వచనం, మర్యమ్ సూరాలోని 44వ వచనం, యాసీన్ సూరాలోని 60వ వచనం, సబా సూరాలోని 41వ వచనం.

140. **'చూపులు ఆయన్ని అందుకోజాలవు'** అన్నది ఇహలోక జీవితానికే వర్తిస్తుంది. అంటే ప్రస్తుతం మనిషి తనకుగల కంటిచూపుతో అల్లాహ్‌ను చూడలేడు. అయితే ప్రళయదినాన విశ్వాసులు అల్లాహ్‌ను చూస్తారనీ, స్వర్గంలో కూడా

قَدْ جَاءَكُمْ بَصَآئِرُ مِنْ رَّبِّكُمْ ۚ فَمَنْ اَبْصَرَ فَلِنَفْسِهٖ ۚ وَمَنْ عَمِيَ فَعَلَيْهَا ؕ وَمَآ اَنَا عَلَيْكُمْ بِحَفِيْظٍ ﴿104﴾

**104** “నిస్సందేహంగా మీ వద్దకు మీ ప్రభువు తరఫునుంచి సత్యాన్ని దర్శించే సూచనలు వచ్చేశాయి. కనుక దాన్ని చూసిన వాడు తనకు లాభం చేకూర్చుకుంటాడు. గ్రుడ్డిగా వ్యవహరిస్తే తనకే నష్టం.[141] నేను మాత్రం మీపై రక్షకుణ్ణి కాను”[142] (అని ఓ ప్రవక్తా! చెప్పు).

وَكَذٰلِكَ نُصَرِّفُ الْاٰيٰتِ وَلِيَقُوْلُوْا دَرَسْتَ وَلِنُبَيِّنَهٗ لِقَوْمٍ يَّعْلَمُوْنَ ﴿105﴾

**105** ఈ విధంగా మేము సూచనలను విభిన్న కోణాల నుంచి విశదీకరిస్తూ ఉంటాము– “నీవు ఎవరి వద్దనో పాఠాలు నేర్చు కున్నావు”[143] అని వారు చెప్పేటందుకు, దాన్ని విజ్ఞులకు బాగా స్పష్టపరచేటందుకుగాను (మేమిలా చేస్తాము).

اِتَّبِعْ مَآ اُوْحِيَ اِلَيْكَ مِنْ رَّبِّكَ ۚ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۚ وَاَعْرِضْ عَنِ الْمُشْرِكِيْنَ ﴿106﴾

**106** ఓ ప్రవక్తా! నీవు మాత్రం నీ ప్రభువు తరఫు నుంచి నీ వద్దకు వహీ ద్వారా పంపబడుతున్న విధానాన్ని అనుసరిస్తూ ఉండు. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ముష్రిక్కులను పట్టించుకోకు.

---

అల్లాహ్ దర్శన భాగ్యం వారికి ప్రాప్తిస్తుందనీ ప్రామాణికమైన మరియు ముతవాతిర్ హదీసుల ద్వారా మనకు రుజువు లభిస్తోంది. కాబట్టి ఎవరయినా ఈ ఆయతును ఆధారంగా చేసుకుని అల్లాహ్‌ను ఎవరూ – ప్రపంచంలోగానీ, పరలోకంలోగానీ – చూడలేరని అంటే అది సరైంది కాదు. ‘మూతజిలా’ అనే వర్గం ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. కాని నిజానికి మానవులు అల్లాహ్‌ను చూడలేకపోయేది ప్రపంచంలో మాత్రమే. ప్రపంచంలో మానవులెవరూ అల్లాహ్‌ను చూడలేరన్న విషయం అక్షరాలా సత్యం. అందుకే హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారు సయితం ఈ ఆయతును ఉదాహరిస్తూ ఇలా అన్నారు : “దైవప్రవక్త (సఅసం) – మేరాజ్ యాత్ర సందర్భంగా – అల్లాహ్‌ను దర్శించారని చెప్పినవాడు ఖచ్చితంగా అసత్యం పలికాడు” (సహీహ్ బుఖారీ : అల్ అన్ఆమ్ సూరా వ్యాఖ్యానం). ఎందుకంటే ఈ ఆయతు చెప్పేదాన్ని బట్టి ప్రవక్త సహా ఎవరూ దైవాన్ని దర్శించే శక్తి, తాహతు కలిగిలేరు. కాకపోతే పరలోక జీవితంలో ఈ దర్శన భాగ్యం సాధ్యమవుతుంది. దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట సెలవీయబడినట్లు: “ఆనాడు ఎన్నో ముఖాలు ప్రఫుల్లంగా, తాజాగా ఉంటాయి. అవి తమ ప్రభువు వంక చూస్తూ ఉంటాయి” అన్న వచనాన్ని బట్టి కూడా ఈ దర్శన భాగ్యం నిజం అని తేటతెల్లమవుతోంది.

141. అరబీలో **‘బసాయిర్’** ( بَصَآئِرُ ) అని వచ్చింది. ఇది ‘బసీరతున్’కు బహువచనం. మనోదృష్టిని, కాంతిని బసీరత్ అంటారు. ఖుర్ఆన్‌లో పలుచోట్ల, పదే పదే వివరించబడుతున్న ఆధారాలు, నిదర్శనాలు అని ఇక్కడ దాని భావం. ఈ నిదర్శనాలను దైవప్రవక్త(సఅసం) కూడా హదీసులలో వివరించారు. ఈ నిదర్శనాలను చూసి, సన్మార్గాన్ని పొందినవాడు తన స్వయానికి మేలు చేసుకున్న వాడవుతాడు. అక్కర లేదనుకున్నవాడు నిలువునా మునిగిపోతాడు. వేరొకచోట ఇలా సెలవీయబడింది : “ఎవరు సన్మార్గానికి వచ్చాడో అతను తన మంచి కోసమే సన్మార్గానికి వచ్చాడు. మరెవడు అపమార్గానికి గురయ్యాడో వాడు తన కీడుకోసమే అపమార్గానికి గురయ్యాడు” (బనీ ఇస్రాయీల్–15).

142. **‘నేను మీ రక్షకుణ్ణి కాను’** అని ప్రవక్త (స) చెప్పటంలోని ఉద్దేశం ఏమిటంటే; తాను సందేశహరుడు మాత్రమే. స్వర్గలోక శుభవార్తను వినిపించడం, నరక శిక్ష గురించి భయపెట్టడం, సన్మార్గం ఏదో వివరించటం వరకే తన బాధ్యత. సన్మార్గంపై నడిపించేది అల్లాహ్‌యే.

143. దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి, దానికి సంబంధించిన నిదర్శనాల గురించి ఉపమానాలతో సహా విభిన్న

**107** అల్లాహ్ గనక తలచుకుని ఉంటే వారు షిర్క్కు ఒడిగట్టే వారే కారు.[144] మేము నిన్ను వాళ్ళపై కావలివానిగా నియమించలేదు. నువ్వు వారి వ్యవహారాలకు బాధ్యుడవూ కావు.[145]

وَلَوْ شَآءَ اللّٰهُ مَآ اَشْرَكُوْا ؕ وَمَا جَعَلْنٰكَ عَلَيْهِمْ حَفِيْظًا ۚ وَمَآ اَنْتَ عَلَيْهِمْ بِوَكِيْلٍ ﴿107﴾

**108** వారు అల్లాహ్ను వదలి వేడుకునే వారిని మీరు దూషించకండి. ఎందుకంటే దీనికి బదులుగా వారు కూడా తమ అజ్ఞానం చేత మితిమీరిపోయి అల్లాహ్ను దూషిస్తారు.[146] ఈ విధంగానే మేము అన్ని సమాజాలవారికీ వారి పనులు అందమైనవిగా చేశాము. తర్వాత వారంతా తమ ప్రభువు వద్దకే మరలి వెళతారు. అప్పుడు ఆయన, వారు చేస్తూ ఉన్నదేమిటో వారికి ఎరుక పరుస్తాడు.

وَلَا تَسُبُّوا الَّذِيْنَ يَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ فَيَسُبُّوا اللّٰهَ عَدْوًاۢ بِغَيْرِ عِلْمٍ ؕ كَذٰلِكَ زَيَّنَّا لِكُلِّ اُمَّةٍ عَمَلَهُمْ ۠ ثُمَّ اِلٰى رَبِّهِمْ مَّرْجِعُهُمْ فَيُنَبِّئُهُمْ بِمَا كَانُوْا يَعْمَلُوْنَ ﴿108﴾

రీతులలో వివరించటం చూసి బహుదైవారాధకులు ఆశ్చర్యపోతారు. 'బహుశా ముహమ్మద్ (సఅసం) ఈ విషయాలను ఎవరి దగ్గరో నేర్చుకుని ఉంటాడు!' అని చెప్పుకుంటారు. ఖుర్ఆన్లోనే మరోచోట ఇలా వుంది : "అవిశ్వాసులు ఇలా అంటారు–'ఈ ఖుర్ఆన్ ఇతని ద్వారా చేయబడిన ఒక కల్పన. ఈ కల్పనలో ఇతరులు కూడా ఇతనికి సాయం చేశారు'. వీళ్లు ఈ విధంగా చెప్పి దుర్మార్గానికి, పెద్ద అపవాదానికి ఒడిగట్టారు. 'ఇవి పూర్వకాలం నాటి ప్రజలు అల్లిన కట్టుకథలు. వాటినే ఇతను వ్రాస్తున్నాడు' అని కూడా వాళ్ళన్నారు" (అల్ ఫుర్ఖాన్-4, 5). వాస్తవానికి వాళ్లు అనుకుంటున్నవేవీ నిజం కావు. విజ్ఞత, వివేచన గల వారికి విషయాన్ని పూసగుచ్చినట్లుగా వివరించి, వారిపట్ల గల కర్తవ్యాన్ని నిర్వర్తించటమే దీని అసలు ఉద్దేశం.

144. ఇంతకు ముందు ఈ విషయంపై వివరణ వచ్చింది. దేవుడు తలచుకోవటం వేరు, ఆయన ప్రసన్నత వేరు. దాసుడు షిర్క్కు ఒడిగట్టకుండా ఉన్నప్పుడు మాత్రమే ఆయన ప్రసన్నత లభిస్తుంది. ఇందులోనే అతని శ్రేయోసాఫల్యాలు ఇమిడి ఉన్నాయి. అయితే అల్లాహ్ మనిషికి ఒకింత స్వేచ్ఛనూ, ఎంపిక అధికారాన్ని కూడా ఇచ్చాడు. బలవంతంగా మనిషి మెడ వంచి, అతన్ని లొంగదీసుకోవాలన్నది ఆయన అభిమతం కానేకాదు. ఒకవేళ ఆయన అలా చేయదలచుకుంటే చిటికెలోనే ఆ పని అయిపోతుంది. ఇది బలాత్కారం క్రిందికి వస్తుంది. బలవంతంగా మనిషిని తన దారికి రప్పించుకున్న నాడు మనిషి పరీక్షించబడడు. అడ్డదారులు తొక్కే స్వేచ్ఛ, కాల్పనిక దేవుళ్ళను మొక్కే స్వాతంత్ర్యం ఉండి కూడా ఎవడు నిజదైవం వైపుకు వస్తాడో చూడాలన్నదే ఆయన అభిమతం (మరిన్ని వివరాల కోసం అల్ బఖర సూరాలోని 253వ ఆయతు, అల్ అన్ఆమ్ సూరాలోని 35వ ఆయతుకు వ్యాఖ్యానం చూడండి).

145. ఈ విషయం కూడా ఖుర్ఆన్లో ఎన్నోచోట్ల ప్రస్తావించబడింది. దైవప్రవక్త (స) వారి సందేశ ప్రధానమైన బాధ్యతను నిర్దిష్టంగా చెప్పటం దీని ముఖ్యోద్దేశం. దైవసందేశాన్ని మానవాళికి చేరవేసి, వారిని సన్మార్గం వైపుకు పిలువటం వరకే ప్రవక్తల పని. అంతకు మించిన అధికారం వారికి ఉండదు. ఒకవేళ అంతిమ దైవప్రవక్త (స)కే గనక ఈ మేరకు ఏవైనా ప్రత్యేక అధికారాలు ఉండి ఉంటే ఆయన నిత్యం తనకు వెన్నుదన్నుగా నిలిచిన తన పినతండ్రి అబూ తాలిబ్ను ముస్లింగా మార్చుకునేవారే. ఆయన ఇస్లాం స్వీకరించాలని దైవప్రవక్త (స) ఎంతగానో కాంక్షించారు. కాని అబూ తాలిబ్కు ఆ సద్బుద్ధి కలగలేదు.

146. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే, ఒక చర్య వల్ల ఆశించిన ప్రయోజనం కన్నా నష్టం అధికంగా వాటిల్లుతున్నప్పుడు ఆ చర్య గైకొనకుండా ఉండటమే మంచిది. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు మీరు మరొకరి తల్లిదండ్రులను దూషించి మీ తల్లిదండ్రులపై కూడా దూషణాస్త్రాలు వచ్చిపడటానికి కారకులు అవకండని ప్రబోధించారు (సహీహ్ ముస్లిం : కితాబుల్ ఈమాన్). చెడును రూపుమాపే క్రమంలో, దానికి దారితీసే మార్గాలను సయితం

وَاَقْسَمُوْا بِاللّٰهِ جَهْدَ اَيْمَانِهِمْ لَئِنْ جَآءَتْهُمْ اٰيَةٌ
لَّيُؤْمِنُنَّ بِهَا ؕ قُلْ اِنَّمَا الْاٰيٰتُ عِنْدَ اللّٰهِ
وَمَا يُشْعِرُكُمْ ۙ اَنَّهَآ اِذَا جَآءَتْ لَا يُؤْمِنُوْنَ (109)

**109** వీళ్లు అల్లాహ్‌పై అతి గట్టిగా ప్రమాణం చేస్తూ,[147] తమ వద్దకు ఏదైనా సూచన గనక వస్తే[148] తప్పకుండా విశ్వసిస్తామని అన్నారు. (ఓ ప్రవక్తా!) "సూచనలన్నీ అల్లాహ్ అధీనంలో ఉన్నాయి"[149] అని వారికి చెప్పు. నీకేం తెలుసు? ఒకవేళ ఆ సూచనలు వచ్చినప్పటికీ వీళ్లు మాత్రం విశ్వసించేవారు కారు.

وَنُقَلِّبُ اَفْـِٕدَتَهُمْ وَاَبْصَارَهُمْ كَمَا لَمْ يُؤْمِنُوْا بِهٖٓ اَوَّلَ
مَرَّةٍ وَّنَذَرُهُمْ فِيْ طُغْيَانِهِمْ يَعْمَهُوْنَ (110) ع

**110** తొలిసారి ఏ విధంగానయితే వీళ్లు దీనిని విశ్వసించలేదో[150] అదే విధంగా మేము కూడా వీళ్ల హృదయాలను, వీళ్ల చూపులను తిప్పివేస్తాము. వారిని వారి తలబిరుసుతనంలోనే, దారితప్పి తిరిగేలా వదలిపెడతాము.

وَلَوْ اَنَّنَا نَزَّلْنَآ اِلَيْهِمُ الْمَلٰٓئِكَةَ وَكَلَّمَهُمُ
الْمَوْتٰى وَحَشَرْنَا عَلَيْهِمْ كُلَّ شَيْءٍ قُبُلًا مَّا

**111** మేము వాళ్ళ దగ్గరికి దూతలను పంపించినా,[151] మృతులు వారితో మాట్లాడినా,[152] సమస్త వస్తువులను మేము వారి కళ్ళ ఎదుటే తెచ్చిపెట్టినా[153] వాళ్ళు విశ్వసించటమనేది కల్ల.

---

మూసివేయాలన్న ఆదేశానికి ఈ ఆయతు మూలం వంటిదని ఇమామ్ షౌకానీ అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

147. కేవలం ప్రమాణాలు చేయటమే కాదు, గట్టిగా ప్రమాణాలు చేస్తారు.

148. అంటే దేవుని తరఫునుంచి ఏదైనా అద్భుతాన్ని, మహిమను చూపిస్తే నిన్ను నమ్ముతాము అన్నది అవిశ్వాసుల ఉద్దేశం. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) గార్కి ఇవ్వబడిన కర్రలాంటిది, ప్రవక్త ఈసాకు ఇవ్వబడిన మహిమల్లాంటివి, సమూద్ జాతి వారి వద్దకు పంపబడిన ఒంటె లాంటిది ఏదైనా తమకు కూడా చూపిస్తే, తాము విశ్వసించటానికి పరిస్థితి అనుకూలిస్తుంది. తమ మనసు కుదుటపడుతుంది అని వారు చెప్పదలిచారు.

149. ఇస్లాంను అవలంబించకుండా ఉండటానికి, ఇస్లాం పట్ల శత్రుత్వంతో వారు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నారే తప్ప, నిజంగా విశ్వసించే ఉద్దేశ్యంతో కానేకాదు. ఎందుకంటే వారి మనసులు నిర్మలంగా లేవు. అదలా ఉంచితే అద్భుతాలు చేసి చూపటం, చమత్కారాలను ప్రదర్శించటం, సూచనలను అవతరింపజేయటం – ఇవన్నీ అల్లాహ్ అభీష్టంపై ఆధారపడి వున్నాయి. ఆయన గనక కోరితే వారి ఈ కోర్కెను తీర్చగలడు. 'సఫా' పర్వతాన్ని బంగారు పర్వతంగా గనక మారిస్తే తామంతా విశ్వసిస్తామని మక్కా అవిశ్వాసులు చెప్పినట్లు కొన్ని 'ముర్సల్' ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. అల్లాహ్ వీళ్ల కోర్కెను మన్నించి సఫా పర్వతాన్ని బంగారు పర్వతంగా మార్చటం ఆయనకు కష్టతరం కాదు. కాని ఆ తరువాత కూడా వీళ్లు విశ్వసించకపోతే, సమూలంగా తుడిచిపెట్టబడే శిక్ష వీరిపై అవతరిస్తుంది అని జిబ్రయీల్ (అలైహిస్సలాం) చెప్పటంతో అలా చేయవద్దని మహాప్రవక్త (స) అభ్యర్థించారు (ఇబ్నె కసీర్).

150. హృదయాలను, చూపులను త్రిప్పటమంటే అర్థం; అన్ని విషయాలు తెలిసిన మీదట కూడా వీళ్లు మొదటిసారి విశ్వసించేందుకు నిరాకరించటం వల్ల వారికి దరిద్రం చుట్టుముట్టింది. సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను, మంచీ చెడులను పరికించే వారి విచక్షణా జ్ఞానం క్షీణించింది. అందువల్ల ఇక మీదట కూడా వారు సత్యామృతాన్ని ఆస్వాదించే అవకాశాలు లేకుండా పోయాయి (ఇబ్నె కసీర్).

151. దేవుడు దైవదూతలను ఎందుకు దింపటం లేదు? అని వారు పదే పదే ప్రశ్నిస్తున్నారు కదూ! ఒకవేళ దైవదూతలనే ప్రత్యక్షపరచినా వారు విశ్వసిస్తారా?

152. మరణించిన వారు లేచి వచ్చి ముహమ్మద్ (స) దేవుని అంతిమ ప్రవక్త అని సాక్ష్యమిచ్చినా వీళ్లు నమ్మరు.

كَانُوا لِيُؤْمِنُوا إِلَّا أَن يَشَاءَ اللَّهُ وَلَٰكِنَّ
أَكْثَرَهُمْ يَجْهَلُونَ ﴿١١١﴾

ఒకవేళ అల్లాహ్ తలిస్తే అది వేరే విషయం. అయితే వీళ్ళలో చాలామంది అజ్ఞానపు మాటలు మాట్లాడేవారే.[154]

وَكَذَٰلِكَ جَعَلْنَا لِكُلِّ نَبِيٍّ عَدُوًّا شَيَاطِينَ الْإِنسِ
وَالْجِنِّ يُوحِي بَعْضُهُمْ إِلَىٰ بَعْضٍ زُخْرُفَ الْقَوْلِ
غُرُورًا ۚ وَلَوْ شَاءَ رَبُّكَ مَا فَعَلُوهُ ۖ فَذَرْهُمْ
وَمَا يَفْتَرُونَ ﴿١١٢﴾

**112** ఇదే విధంగా మేము ప్రతి ప్రవక్తకూ జిన్నులలోని షైతానులను, మనుషులలోని షైతానులను శత్రువులుగా చేశాము.[155] వారిలోని కొందరు మరి కొందరిని మోసపుచ్చటానికి ముచ్చట గొలిపే మాటలతో ప్రేరేపిస్తుంటారు.[156] నీ ప్రభువే గనక తలచుకుంటే వారెన్నటికీ అలా చేయలేరు.[157] కాబట్టి వాళ్ళను, వారి కల్పనలను వదలివెయ్యి.

وَلِتَصْغَىٰ إِلَيْهِ أَفْئِدَةُ الَّذِينَ لَا يُؤْمِنُونَ
بِالْآخِرَةِ وَلِيَرْضَوْهُ وَلِيَقْتَرِفُوا مَا هُم
مُّقْتَرِفُونَ ﴿١١٣﴾

**113** పరలోకాన్ని విశ్వసించని వారి మనసులు దానివైపుకు మొగ్గాలనీ, దానిని ఇష్టపడాలనీ, తాము ఒడిగట్టిన పాపాలకు వారు కూడా ఒడిగట్టాలని (వారీ మాయోపాయాలు చేస్తున్నారు).[158]

153. వాళ్లు మాటిమాటికీ కోరుతున్న సూచనలను, మహిమలను వారి కళ్ల ముందే ప్రోగుచేసినా వారు విశ్వసిస్తారన్న భరోసా ఏమీ లేదు. దీనికి మరో భావం ఇది: ఒకవేళ భూమండలంలోని వస్తువులన్నింటినీ వారి ఎదుట తీసుకువచ్చి ప్రవక్తల పరంపర సత్యబద్ధమైన విషయమని వాటిచేత సాక్ష్యం ఇప్పించినా వాళ్లు విశ్వసిస్తారన్న గ్యారంటీ ఏమీ లేదు. ఇదే భావాన్నిచ్చే ఇంకొక వచనం కూడా ఖుర్ఆన్‌లో ఉంది : "ఎవరి విషయంలో నీ ప్రభువు మాట నిజమని రుజువు అయిపోయిందో వారిముందు అన్ని రకాల నిదర్శనాలు వచ్చినా సరే – బాధాకరమైన శిక్షను చవిచూసే వరకూ వారు విశ్వసించరు" (యూనుస్ – 96, 97).

154. వారి ఈ మంకుతనమే వారికీ – సత్యస్వీకారానికి మధ్య అడ్డుగోడగా నిలిచివుంది. ఈ మంకుతనం, అజ్ఞానం వైదొలగినట్లయితే బహుశా వారికి సత్యాసత్యాలు, ఉచితానుచితాలు అర్థం కావచ్చు. సత్యం అవగతమైనప్పుడు దైవచిత్తమయితే సన్మార్గ భాగ్యం కూడా ప్రాప్తించవచ్చు.

155. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఓదార్చడానికి ఇవ్వబడిన ఉపమానాలలో ఇది కూడా ఒకటి. యదార్థమేమిటంటే (ఓ ముహమ్మద్!) ఇంతకుముందు వచ్చిన ప్రవక్తలందరూ జనుల చేత ధిక్కరించబడ్డారు. బాధించబడ్డారు. అయినప్పటికీ వారు ఏ విధంగా గుండె నిబ్బరంతో, ధైర్యంతో తమ పనిని సజావుగా చేసుకుపోయారో అదేవిధంగా నీవు కూడా ధర్మవిరోధులకు వ్యతిరేకంగా సహనస్థయిర్యాలను ప్రదర్శించు.

ఈ ఆయతు ద్వారా అవగతమయ్యే మరో విషయమేమిటంటే షైతాను అనుయాయులు మనుషుల్లోనే గాకుండా జిన్నుల్లో కూడా ఉంటారు. ఈ రెండు వర్గాలలోని గర్విష్ఠులు, తలబిరుసులు, పొగరుబోతులు షైతాను అడుగుజాడల్లో నడుస్తూ ధర్మ సంస్థాపనా మార్గంలో అడ్డంకులు సృష్టిస్తూ ఉంటారు.

156. మూలంలో **'యూహీ'** (يُوحِي) అన్న పదం ఉపయోగించబడింది. ఇది 'వహ్యున్' నుంచి వచ్చింది. రహస్యంగా చెప్పే మాటను 'వహ్యున్' అంటారు. అంటే ఈ దుర్మార్గులు మనుషులను, జిన్నులను పెడత్రోవ పట్టించే ఉద్దేశంతో ఒండొకరికి కొత్త కొత్త చిట్కాలు నేర్పుతుంటారు. కొంగ్రొత్త వ్యూహాలు రచిస్తూ ఉంటారు. మాయ మాటలతో ఏమార్చే ప్రయత్నాలు చేస్తుంటారు. మీరు గమనిస్తూనే ఉంటారు: షైతాను పోకడలను వ్యాపింపజేయటంలో జనులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తారు. సమాజంలో చెడు శీఘ్రగతిన పెచ్చరిల్లుతుంది.

157. షైతాను పోకడలను అడ్డుకుని, సమాజంలో చెడుగును పెంచి పోషించే కుత్సితులకు ముకుతాడు బిగించే శక్తి

**114** ఏమిటీ, నేను అల్లాహ్‌ను కాకుండా ఇంకొక న్యాయనిర్ణేతను వెతకాలా? యదార్థానికి ఆయన ఒక సంపూర్ణ గ్రంథాన్ని మీ వద్దకు పంపి ఉన్నాడు. అందలి విషయాలు స్పష్టంగా విపులీకరించబడ్డాయి. మేము ఎవరికి గ్రంథం వొసగామో వారికి, ఈ గ్రంథం నీ ప్రభువు తరఫు నుంచి సత్య సమేతంగా వచ్చిందన్న విషయం బాగా తెలుసు. కాబట్టి (ఓ ప్రవక్తా!) నువ్వు శంకించేవారిలో చేరిపోకు.[159]

أَفَغَيْرَ اللَّهِ أَبْتَغِي حَكَمًا وَهُوَ الَّذِي أَنْزَلَ إِلَيْكُمُ
الْكِتَابَ مُفَصَّلًا ۚ وَالَّذِينَ آتَيْنَاهُمُ الْكِتَابَ
يَعْلَمُونَ أَنَّهُ مُنَزَّلٌ مِنْ رَبِّكَ بِالْحَقِّ ۖ فَلَا
تَكُونَنَّ مِنَ الْمُمْتَرِينَ ﴿١١٤﴾

**115** సత్యం రీత్యా, న్యాయం రీత్యా నీ ప్రభువు వాక్కు సంపూర్ణమైనది.[160] ఆయన వాక్కులను మార్చగలవాడెవడూ లేడు.[161] ఆయన ప్రతిదీ వినేవాడు, ప్రతిదీ తెలిసినవాడు.[162]

وَتَمَّتْ كَلِمَتُ رَبِّكَ صِدْقًا وَعَدْلًا ۚ لَا مُبَدِّلَ
لِكَلِمَاتِهِ ۚ وَهُوَ السَّمِيعُ الْعَلِيمُ ﴿١١٥﴾

**116** (ఓ ప్రవక్తా!) భూమిపై నివసించే అధిక సంఖ్యాకులు చెప్పినట్లుగా నీవు మసలుకున్నావంటే వారు నిన్ను అల్లాహ్ మార్గం నుంచి అపమార్గం పట్టిస్తారు. వారు వట్టి ఊహలను అనుసరిస్తారు. కేవలం అంచనాలతో మాట్లాడతారు.[163]

وَإِنْ تُطِعْ أَكْثَرَ مَنْ فِي الْأَرْضِ يُضِلُّوكَ
عَنْ سَبِيلِ اللَّهِ ۚ إِنْ يَتَّبِعُونَ إِلَّا الظَّنَّ
وَإِنْ هُمْ إِلَّا يَخْرُصُونَ ﴿١١٦﴾

---

అల్లాహ్‌కు ఉంది. అయితే ఆయన అందరికీ ఒకింత 'విడుపు'ను ఇచ్చాడు. అందరిపట్లా సడలింపుల వైఖరిని అవలంబిస్తూ ఉన్నాడు. బలవంతంగా ఒకరి స్వేచ్ఛను హరించటం ఆయన విధానం కానేకాదు. ఈ "విడుపు"లోని ఔచిత్యం, పరమార్థం ఆయనకే బాగా తెలుసు.

158. సాధారణంగా పరలోక జీవితం పట్ల విశ్వాసం, నమ్మకంలేని వారే షైతాను దుష్ప్రేరణలకు ప్రభావితులై, వాడు పన్నిన వలలో దారుణంగా చిక్కుకుంటారు. ఈనాడు ఎవరిలోనయితే తీర్పుదినం పట్ల, అక్కడ సమర్పించబడే లెక్కల పట్ల విశ్వాసం క్షీణిస్తున్నదో వారు షైతాను మాయోపాయాలకు అతి సులువుగా గురవుతున్నారు. ఇదొక వాస్తవం.

159. ప్రవక్త (స) ను ఉద్దేశించి ఇలా చెబుతున్నప్పటికీ, నిజానికిది ఆయన అనుచర సమాజానికి చేయబడిన ఉపదేశం. తెలియజేయబడిన విషయాలను అమలు చేయకుండా పొద్దస్తమానం లేనిపోని విషయాల వెనుకబడి కూపీలు లాగుతూ విలువైన కాలాన్ని పాడుచేసుకునే సందేహాల స్వాములకు, అనుమానాల అయ్యలకు ఇది హెచ్చరిక లాంటిది.

160. సమాచారం, సంఘటనల విషయంలో అల్లాహ్ వాక్కు సత్యవంతమైనదిగానూ, ఆదేశాలు, నిర్దేశిక నియమాల విషయాల్లో ఆయన వాక్కు సమత్వంతో, సమతూకంతో కూడుకున్నదిగానూ ఉంటుంది. ఆయన ఏ ఆజ్ఞను, మరే చట్టాన్ని ప్రజా బాహుళ్యంలో ప్రవేశపెట్టినా న్యాయం ధర్మాలను పూర్తిగా దృష్టియందుంచుకుని మరీ ప్రవేశపెట్టాడు. మానవ శ్రేయస్సుకు దోహదపడే అంశాలనే ఆయన ఆదేశించాడు. లోకవాసుల యెడల హానికరంగా మారే విషయాలను వారించాడు. కాకపోతే మానవుడు తన అవివేకం వల్లనో, షైతాను వలలో చిక్కుకున్నందువల్లనో ఈ యదార్థాన్ని గుర్తించలేకపోతున్నాడు.

161. దైవాదేశాలను మార్చగల వాడెవడూ లేడు. ఎందుకంటే ఆయన్ని మించిన శక్తిశాలి జగతిలో ఎవడూ లేడు.

162. అంటే దాసుల మాటలను వినేవాడు, వాళ్ళ ఒక్కొక్క కదలికను కనిపెట్టుకుని ఉన్నవాడు, వాళ్ళ గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు ఆయన. దీని ప్రకారమే ఆయన వారికి ప్రతిఫలం ప్రసాదిస్తాడు.

**117** తన దారిలో నుంచి పెడదారి తీసే వారెవరో నీ ప్రభువుకు బాగా తెలుసు. తన మార్గంపై నడిచేవారెవరో కూడా ఆయనకు బాగా తెలుసు.

**118** కనుక అల్లాహ్ ఆదేశాలపై మీకు గనక విశ్వాసముంటే అల్లాహ్ పేరు స్మరించబడిన జంతువు మాంసాన్ని తినండి.[164]

**119** అల్లాహ్ పేరు ఉచ్చరించబడిన జంతువు మాంసాన్ని మీరు తినకపోవటానికి అసలు కారణం ఏమిటీ? అల్లాహ్ మీ కొరకు నిషేధించిన జంతువుల వివరాలను[165] ముందుగానే

إِنَّ رَبَّكَ هُوَ أَعْلَمُ مَن يَضِلُّ عَن سَبِيلِهِۦ
وَهُوَ أَعْلَمُ بِٱلْمُهْتَدِينَ ﴿117﴾

فَكُلُوا۟ مِمَّا ذُكِرَ ٱسْمُ ٱللَّهِ عَلَيْهِ إِن كُنتُم
بِـَٔايَٰتِهِۦ مُؤْمِنِينَ ﴿118﴾

وَمَا لَكُمْ أَلَّا تَأْكُلُوا۟ مِمَّا ذُكِرَ ٱسْمُ ٱللَّهِ عَلَيْهِ
وَقَدْ فَصَّلَ لَكُم مَّا حَرَّمَ عَلَيْكُمْ إِلَّا

163. ఖుర్ఆన్ చాటిచెప్పిన ఈ సత్యం అన్ని కాలాల్లోనూ, అన్ని యుగాల్లోనూ నిజమైనట్లు మనం కనుగొంటాం. వేరొకచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "(ఓ ప్రవక్తా!) నీవు ఎంతగా కోరినా వీరిలో చాలామంది విశ్వసించరు" (యూసుఫ్ – 103). దీన్నిబట్టి బోధపడేదేమిటంటే సత్యంపై, సన్మార్గంపై నడిచేవారు సర్వదా కొద్దిమందే ఉంటారు. కాబట్టి సత్యాసత్యాలను ఎన్నడూ అధిక – అల్ప సంఖ్యల ఆధారంగా చూడకూడదు. సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను పరికించటానికి నిత్యం దేవుడు ప్రసాదించిన ప్రమాణ నికషాన్ని, గీటురాయిని ఆశ్రయించాలి. ఏదేని ఒక దృక్పథాన్ని ఒక పెద్ద జన సమూహం అనుసరిస్తున్నందున అది ఖచ్చితంగా సత్యం అయి ఉంటుందనో, లేక ఒక సిద్ధాంతాన్ని అవలంబించేవారు కొద్దిమందే ఉన్నందున అది బహుశా సత్యంతో కూడుకున్నది కాదనో అనుకోవటం పొరబాటు. ఇంకా చెప్పాలంటే దివ్య ఖుర్ఆన్‌లోని వివరణా తీరునుబట్టి సత్యాన్ని ప్రేమించి, సన్మార్గాన నడుచుకునేవారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. అంతిమ దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "నా అనుచర సమాజం (ఉమ్మత్) 73 వర్గాలుగా చీలిపోతుంది. వాటిలో ఒక్కగానొక్క వర్గం మాత్రమే స్వర్గానికి పోతుంది. మిగిలినవన్నీ నరకానికి పోతాయి" స్వర్గంలో ప్రవేశించే ఆ వర్గం ఎలా ఉంటుందో చెబుతూ ఆయన (స) ఇలా అన్నారు : "ఆ వర్గం నన్నూ, నా ప్రియసహచరుల విధానాన్ని అవలంబిస్తుంది" (అబూదావూద్: కితాబుస్సున్నహ్– షర్హుస్సున్నహ్ అధ్యాయం. హదీసు నెంబరు–4596, తిర్మిజీ: కితాబుల్ ఈమాన్).

164. జంతువును వేటాడుతున్నప్పుడుగానీ, దానిని జిబహ్ చేస్తున్నప్పుడుగానీ అల్లాహ్ నామం గనక ఉచ్చరించటం జరిగి ఉంటే ఆ జంతువును నిస్సంకోచంగా తినండి. అయితే ఆ జంతువులు ధర్మసమ్మతంగా ఖరారు చేయబడినవై ఉండాలి. దీన్నిబట్టి విదితమయ్యేదేమంటే షరీయతుపరంగా ధర్మసమ్మతమైన అట్టి జంతువులను జిబహ్ చేసే సమయంలో ఉద్దేశపూర్వకంగా అల్లాహ్ పేరు (బిస్మిల్లాహ్) స్మరించకపోతే వాటిని తినటం సమ్మతం కాదు. అయితే జిబహ్ చేసే సమయంలో ముస్లిం వ్యక్తి అల్లాహ్ పేరు ఉచ్చరించాడా లేదా? అన్న సంశయం ఏర్పడితే అప్పుడేం చేయాలి? అలాంటి పరిస్థితి ఏర్పడితే అల్లాహ్ పేరు ఉచ్చరించి దానిని తినవచ్చు. హదీసు ప్రకారం హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దైవప్రవక్త (సఅసం)ను ఈ విధంగా అడిగారు: "జనులు మా వద్దకు మాంసాన్ని (కానుకగా) తీసుకువస్తుంటారు (వారు ఇప్పుడిప్పుడే ఇస్లాం స్వీకరించిన పల్లెటూరి వాళ్లు. ఇస్లాం గురించి, దాని బోధనల గురించి వారికి పూర్తిగా అవగాహన లేదు. కాబట్టి) వాళ్లు అల్లాహ్ నామాన్ని ఉచ్చరిస్తున్నారో లేదో మాకు తెలీదు." దానికాయన (స), "మీరు అల్లాహ్ పేరు ఉచ్చరించి తినండి" అని ప్రబోధించారు (సహీహ్ బుఖారీ – జబీహతుల్ ఆరాబి అధ్యాయం. హదీసు నెం.5507). అంటే సందిగ్ధానికి లోనైన సమయంలో ఈ 'రాయితీ' ఉంది. ఏ జంతువునైనా 'బిస్మిల్లాహ్' అని పలికి తినవచ్చన్నది దీని మతలబు ఎంతమాత్రం కాదు. ముస్లింల మండీలలో, ముస్లింల దుకాణాలలో అమ్మబడే మాంసం హలాల్ మాంసం అయి ఉంటుందన్న భావం దీనిద్వారా స్ఫురిస్తోంది. ఒకవేళ ఈ మాంసం పట్ల కూడా సందేహం కలిగితే, తినేటప్పుడు 'బిస్మిల్లాహ్' పలికి తినాలి.

مَا اضْطُرِرْتُمْ إِلَيْهِ ۗ وَإِنَّ كَثِيرًا لَّيُضِلُّونَ بِأَهْوَائِهِم بِغَيْرِ عِلْمٍ ۗ إِنَّ رَبَّكَ هُوَ أَعْلَمُ بِالْمُعْتَدِينَ ﴿١١٩﴾

స్పష్టపరిచాడు కదా! గత్యంతరం లేని పరిస్థితుల్లో అవి కూడా (ప్రాణరక్షణ కోసం నిషిద్ధ జంతువులు సయితం) మీకోసం ధర్మ సమ్మతం అవుతాయి. వాస్తవమేమిటంటే చాలా మంది ఏ ప్రమాణమూ లేకుండానే – తమ కోరికల ఆధారంగా – జనులను పెడత్రోవ పట్టిస్తూ ఉంటారు. నిశ్చయంగా నియమాలను ఉల్లంఘించే వారిని నీ ప్రభువు బాగా ఎరుగు.

وَذَرُوا ظَاهِرَ الْإِثْمِ وَبَاطِنَهُ ۚ إِنَّ الَّذِينَ يَكْسِبُونَ الْإِثْمَ سَيُجْزَوْنَ بِمَا كَانُوا يَقْتَرِفُونَ ﴿١٢٠﴾

**120** మీరు బహిరంగ పాపాలనూ, గోప్యమైన పాపాలను కూడా విడనాడండి. పాపాలకు ఒడిగట్టేవారికి అతి త్వరలోనే వారు చేసుకున్నదానికి శిక్ష పడి తీరుతుంది.

وَلَا تَأْكُلُوا مِمَّا لَمْ يُذْكَرِ اسْمُ اللَّهِ عَلَيْهِ وَإِنَّهُ لَفِسْقٌ ۗ وَإِنَّ الشَّيَاطِينَ لَيُوحُونَ إِلَىٰ أَوْلِيَائِهِمْ لِيُجَادِلُوكُمْ ۖ وَإِنْ أَطَعْتُمُوهُمْ إِنَّكُمْ لَمُشْرِكُونَ ﴿١٢١﴾

**121** అల్లాహ్ పేరు స్మరించబడని జంతువులను తినకండి. ఎందుకంటే ఇది ఆజ్ఞోల్లంఘన క్రిందికి వస్తుంది.[166] మీతో వాదులాడటానికి షైతానులు తమ మిత్రులను ఉసిగొల్పుతుంటారు.[167] ఒకవేళ మీరు గనక వారిని అనుసరించారంటే మీరు కూడా అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించినవారు (ముష్రిక్కులు) అయిపోతారు (జాగ్రత్త!).

165. వాటి వివరాలు ఈ సూరాలోనే రాబోతున్నాయి. ఇదిగాక ఇతర సూరాలలో, హదీసులలోనూ నిషిద్ధ జంతువుల వివరాలు వచ్చాయి. ఆ నిర్ణీత హరామ్ జంతువులు మినహా మిగిలినవన్నీ హలాల్ (ధర్మసమ్మతం)గా పరిగణించబడతాయి. ఇదిలావుండగా నిషిద్ధ (హరామ్) జంతువులు కూడా అత్యవసర పరిస్థితిలో – ప్రాణం కాపాడుకోవటానికి – ధర్మ సమ్మతమవుతాయి.

166. అంటే ధర్మసమ్మతమైన ఏ జంతువునైనా జిబహ్ చేస్తున్నప్పుడు లేదా వేటాడుతున్నప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా అల్లాహ్ పేరు పఠించకపోతే అది అధర్మంగా, దైవాజ్ఞను ధిక్కరించటంగా పరిగణించబడుతుంది. హ|జత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కూడా ఇదే విధంగా వివరించారు. ఆయన (రజి) ఇలా అన్నారు: "మరచిపోయినవాడు పాపాత్ముడుగా పరిగణించబడడు." ఇమామ్ బుఖారీ అభిమతం కూడా ఇదే. హనఫీ పండితుల దృక్పథం కూడా ఇదే. కాని ఇమామ్ షాఫయి అభిప్రాయం తద్భిన్నంగా ఉంది. రెండు పరిస్థితుల్లోనూ – అతడు అల్లాహ్ పేరును ఉచ్చరించటం మరచిపోయినా, లేక ఉద్దేశ్యపూర్వకంగా ఉచ్చరించకపోయినా – ముస్లిం చేత జిబహ్ చేయబడిన జంతువు ధర్మ సమ్మతమేనని ఇమామ్ షాఫయి అభిప్రాయపడ్డారు.

167. షైతాన్ తన అనుంగు అనుచరుల ద్వారా, స్నేహితుల ద్వారా వ్యాపింపజేసిన దుష్ప్రచారం ఇది: "ఈ ముస్లింలు దేవుడు స్వయంగా జిబహ్ చేసిన (అంటే మృత) జంతువులను హరామ్ (నిషిద్ధం)గా ప్రకటించి, తాము జిబహ్ చేసిన వాటిని హలాల్ (ధర్మసమ్మతం)గా ఖరారు చేస్తున్నారు. ఇలా చేస్తూనే తాము అల్లాహ్‌ను నమ్మేవాళ్ళం అని చెప్పుకుంటున్నారు." దీనికి జవాబుగా అల్లాహ్ ఏమన్నాడంటే; మీరు ఆ మాయలమారి షైతాన్ మరియు అతని సహచరుల దుష్ప్రేరణలకు లోనుకాకండి. జిబహ్ చేయకుండానే చచ్చిపోయిన జంతువులపై అల్లాహ్ పేరు ఉచ్చరింపబడక పోవటం వల్ల వాటిని తినటం హలాల్ (ధర్మసమ్మతం) కాజాలదు (అయితే సముద్రంలోని మృత జంతువులను మాత్రం తినవచ్చు).

أَوَمَن كَانَ مَيْتًا فَأَحْيَيْنَٰهُ وَجَعَلْنَا لَهُۥ نُورًا يَمْشِى بِهِۦ فِى ٱلنَّاسِ كَمَن مَّثَلُهُۥ فِى ٱلظُّلُمَٰتِ لَيْسَ بِخَارِجٍ مِّنْهَا ۚ كَذَٰلِكَ زُيِّنَ لِلْكَٰفِرِينَ مَا كَانُوا۟ يَعْمَلُونَ (122)

**122** మృతుడుగా ఉన్న ఒక వ్యక్తికి మేము జీవితం ప్రసాదించి, అతనికి జ్యోతి నొసగగా, దానిని పుచ్చుకుని అతను జనుల మధ్య సంచరిస్తున్నాడు. ఇలాంటి వ్యక్తి, కటిక చీకట్లలో కూరుకుపోయి వాటి నుండి ఏమాత్రం బయటపడలేని వ్యక్తి లాంటివాడా?[168] ఇదే విధంగా సత్య తిరస్కారులకు వారి పనులు వారికెంతో అందమైనవిగా తోస్తాయి.

وَكَذَٰلِكَ جَعَلْنَا فِى كُلِّ قَرْيَةٍ أَكَٰبِرَ مُجْرِمِيهَا لِيَمْكُرُوا۟ فِيهَا ۖ وَمَا يَمْكُرُونَ إِلَّا بِأَنفُسِهِمْ وَمَا يَشْعُرُونَ (123)

**123** ఇదే విధంగా మేము ప్రతి పట్టణంలోనూ అక్కడి సర్దారులనే అపరాధాలకు ఒడిగట్టేవారుగా చేశాము – అక్కడ వారు తమ పన్నాగాలు పన్నటానికి![169] వాస్తవానికి వారు తమను తామే వంచించుకుంటున్నారు. కాని వారికి ఆ సంగతి తెలియటం లేదు.[170]

168. ఈ ఆయతులో అల్లాహ్ అవిశ్వాసిని మృతుని (నిర్జీవి)గానూ, విశ్వాసిని బ్రతికి ఉన్నవాని (సజీవి)గానూ అభివర్ణించాడు. ఎందుకంటే అవిశ్వాసి ఎల్లప్పుడూ అవిశ్వాసమనే అంధకార లోయల్లో తచ్చాడుతూ, వాటినుండి బయటపడలేకుండా ఉంటాడు. తత్ఫలితంగా అతడు వినాశానికి, పరాభవానికి గురవుతాడు. కాగా; విశ్వాసి హృదయానికి అల్లాహ్ ఈమాన్ (విశ్వాసం) ద్వారా జీవం పోస్తాడు. తద్వారా అతనికి జీవన మార్గాలు స్పష్టంగా కనిపిస్తాయి. తనకు సాఫల్య భాగ్యం లభించే బాటలో అతడు నడచిపోతాడు. ఈ విషయమే క్రింది ఆయతులలో కూడా చెప్పబడింది: "అల్లాహ్ విశ్వసించిన వారికి సంరక్షకుడు. ఆయన వారిని చీకట్లలో నుంచి వెలుగులోనికి తీసుకువస్తాడు. కాగా; అవిశ్వాసుల స్నేహితులు షైతానులు. వాళ్లు అవిశ్వాసులను వెలుగులో నుంచి చీకట్లలోనికి తీసుకుపోతారు" (అల్ బఖర – 257). "ఈ రెండు వర్గాల వారి ఉపమానం ఇది : ఒకడు గుడ్డివాడు, చెవిటివాడు. మరొకడు కళ్లున్నవాడు, వినగలిగేవాడు. వారిద్దరూ సమానులౌతారా?" (హూద్ – 24).

"అంధుడు, చూడగలిగేవాడూ సమానులు కాలేరు. అంధకారాలూ – కాంతి ఒకటి కాలేవు. చల్లదనాన్నిచ్చే నీడ – మలమలా మాడ్చే ఎండా ఒకే విధంగా ఉండవు. బ్రతికి ఉన్నవారూ – చనిపోయినవారూ సమానులు కాలేరు" (ఫాతిర్ :19-22).

169. ఆయతులో **'అకాబిర'** (أَكَٰبِرَ) అని ఉంది. ఇది 'అక్బర్'కు బహువచనం. అంటే 'పెద్దవారు' అని అర్థం. ఇక్కడ పెద్దవారంటే అవిశ్వాసుల, అవిధేయుల సర్దారులు అని భావం. ఎల్లప్పుడూ వీళ్ళే ప్రవక్తల, సత్యసందేశకుల మార్గంలో ప్రధాన అవరోధంగా ఉంటారు. సామాన్య జనులు కేవలం ఈ 'అయ్యావార్ల' వెనక ఉంటారు. అందుకే ఇక్కడ జనసామాన్యాన్ని గురించి ప్రస్తావించకుండా ఈ అయ్యావార్లనే ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది. అదీగాక ఇలాంటి వాళ్లు సాధారణంగా అధికార మదాంధులు, ఆస్తీ అంతస్తులు కలిగివుండే బడాయికోరులు అయి ఉంటారు. సమాజంలో తమ 'ప్రత్యేక ప్రతిపత్తి' సమసిపోయేలా చేసే ఏ సత్యధర్మ ఉద్యమం మొదలైనా దాన్ని ఆదిలోనే అణచివేయటానికి పడరానిపాట్లు పడతారు. దుష్టపన్నాగాలు పన్నుతారు. (ఈ అంశమే సబా సూరాలోని 31-33 ఆయతులలో, జుఖ్రుఫ్ సూరాలోని 23వ వచనంలో, నూహ్ సూరాలోని 22వ వాక్యంలో కూడా చర్చించబడింది).

170. అంటే వారి కుటిల నీతి యొక్క చెడు పర్యవసానం, వారి అనుంగు అనుచరుల పాపం కూడా వాళ్ళ నెత్తిమీదే పడుతుంది. (మరిన్ని వివరాలకై అన్కబూత్ సూరాలోని 13వ ఆయతును, అన్ నహ్ల్ సూరాలోని 25వ ఆయతును కూడా చూడండి).

**124** వారి వద్దకు ఏదైనా సూచన వచ్చినప్పుడు, "దైవప్రవక్తలకు ఇవ్వబడినదే మాకూ ఇవ్వబడనంతవరకూ[171] మేము విశ్వసించేది లేదు" అని వారు అంటారు. తన దౌత్యాన్ని ఎవరికి అంద జేయాలో[172] అల్లాహ్‌కే బాగా తెలుసు. అతి త్వరలోనే అపరాధులు అల్లాహ్ వద్దకు చేరుకుని పరాభవాన్నీ, తమ దుష్టపన్నాగాలకు గాను కఠినాతి కఠినమైన శిక్షను అనుభవిస్తారు.

وَإِذَا جَآءَتْهُمْ ءَايَةٌ قَالُوا لَن نُّؤْمِنَ حَتَّىٰ
نُؤْتَىٰ مِثْلَ مَآ أُوتِىَ رُسُلُ ٱللَّهِ ۘ ٱللَّهُ أَعْلَمُ
حَيْثُ يَجْعَلُ رِسَالَتَهُۥ ۗ سَيُصِيبُ ٱلَّذِينَ
أَجْرَمُوا صَغَارٌ عِندَ ٱللَّهِ وَعَذَابٌ شَدِيدٌۢ
بِمَا كَانُوا يَمْكُرُونَ ﴿124﴾

**125** కనుక అల్లాహ్, తాను సన్మార్గ భాగ్యం ప్రసాదించదలచిన వ్యక్తి హృదయాన్ని ఇస్లాం కొరకు విప్పుతాడు. అలాగే తాను అపమార్గాన వదిలేయదలచిన వ్యక్తి హృదయాన్ని ఆకాశానికెక్కే వానిలాగా[173] కుంచింపజేస్తాడు. ఈ విధంగా అల్లాహ్ విశ్వసిం చని వారికి మాలిన్యాన్ని అంటగడతాడు.[174]

فَمَن يُرِدِ ٱللَّهُ أَن يَهْدِيَهُۥ يَشْرَحْ صَدْرَهُۥ
لِلْإِسْلَٰمِ ۖ وَمَن يُرِدْ أَن يُضِلَّهُۥ يَجْعَلْ
صَدْرَهُۥ ضَيِّقًا حَرَجًا كَأَنَّمَا يَصَّعَّدُ فِى ٱلسَّمَآءِ ۚ
كَذَٰلِكَ يَجْعَلُ ٱللَّهُ ٱلرِّجْسَ عَلَى ٱلَّذِينَ
لَا يُؤْمِنُونَ ﴿125﴾

**126** ఇదే నీ ప్రభువు యొక్క రుజుమార్గం. ఉపదేశాన్ని స్వీకరించే వారి కోసం మేము ఈ ఆయతులను స్పష్టంగా విడమరచి చెప్పాము.

وَهَٰذَا صِرَٰطُ رَبِّكَ مُسْتَقِيمًا ۗ قَدْ فَصَّلْنَا ٱلْءَايَٰتِ
لِقَوْمٍ يَذَّكَّرُونَ ﴿126﴾

**127** వారి కొరకు వారి ప్రభువు వద్ద శాంతి నిలయం ఉంది. వారి మంచి పనుల మూలంగా[175] అల్లాహ్ వారికి రక్షకునిగా నిలుస్తాడు.

لَهُمْ دَارُ ٱلسَّلَٰمِ عِندَ رَبِّهِمْ ۖ وَهُوَ وَلِيُّهُم
بِمَا كَانُوا يَعْمَلُونَ ﴿127﴾

171. అంటే తమ వద్దకు కూడా జిబ్రయీల్ వంటి దైవదూతలు రావాలి, తమకు దైవప్రవక్తా పదవితో సత్కరించాలి అన్నది వారి మాటల్లోని అంతరార్థం.

172. ప్రవక్తగా ఎవరిని ఎన్నుకోవాలో, ఈ గురుతర బాధ్యతను నిర్వర్తించే యోగ్యత ఎవరిలో ఉందో అల్లాహ్‌కు బాగా తెలుసు. ఎందుకంటే ఆయన వివేకసంపన్నుడు. అందుకే ఆయన మక్కాలోని అధికార మదాంధులకు బదులు అబ్దుల్లాహ్ ఆమినా దంపతులకు కలిగిన పుత్రరత్నాన్ని, మొదటి నుంచే అనాథలకు అభాగ్యులకు, అగత్యపరులకు పెన్నిధిలా నిలిచిన నిరాడంబర జీవిని ప్రవక్తగా నియమించాడు.

173. అంటే మనిషి ఎంతగా బలాన్ని కూడగట్టుకొని ప్రయత్నించినా ఆకాశాలపైకి ఎలా ఎక్కలేడో అలాగే మనసులు కుంచించుకుపోయిన వ్యక్తులలో ఏకదైవారాధన (తౌహీద్), విశ్వాసం (ఈమాన్) జొరబడలేవు. ఒకవేళ అల్లాహ్ వారి హృదయ కవాటాలను తెరిస్తే అది వేరే విషయం.

174. అంటే అల్లాహ్ వారి మనసులను కుంచింపజేసినట్లే, వారిని తిరస్కార భావపు రొచ్చులో కూరుకుపోయేలా చేస్తాడు. ఆయతులో **'రిజ్స్'** అనే పదం ప్రయోగించబడింది. రిజ్స్ అంటే మాలిన్యం, అశుద్ధత, శిక్ష, షైతాన్ పీడన అన్న అర్థాలు వస్తాయి.

175. అంటే ప్రాపంచిక జీవితంలో తిరస్కారం, మార్గభ్రష్టత, అపమార్గాల నుంచి తమను కాపాడుకుని రుజుమార్గంపై పయనించిన విశ్వాసులకు పరలోక జీవితంలో అల్లాహ్ శాంతి నిలయాన్ని కేటాయిస్తాడు. వారి పట్ల అల్లాహ్ ప్రసన్నుడవుతాడు. వారిని అమితంగా ఇష్టపడతాడు. వారికి అండగా నిలుస్తాడు.

128 అల్లాహ్ వారందరినీ సమీకరించే రోజు, "ఓ జిన్నాతు వర్గీయులారా! మీరు మనుషుల్లోని చాలామందిని మీవారుగా చేసుకున్నారు"[176] అని అంటాడు. అప్పుడు వారితో సంబంధాలు పెట్టుకుని ఉన్న మనుషులు ఇలా అంటారు: "మా ప్రభూ! మేము ఒండొకరి ద్వారా లబ్ది పొందిన సంగతి నిజమే.[177] ఎట్టకేలకు నీవు మా కోసం నిర్ధారించిన గడువుకు[178] మేము చేరుకున్నాము." అప్పుడు అల్లాహ్ ఇలా అంటాడు: "ఇక నరకమే మీ అందరి నివాస స్థలం. అందులోనే మీరు కలకాలం పడి ఉంటారు. అయితే అల్లాహ్ ఏదయినా తలిస్తే అది వేరే విషయం"[179] నిస్సందేహంగా నీ ప్రభువు వివేక సంపన్నుడు, జ్ఞానవంతుడు.

وَيَوْمَ يَحْشُرُهُمْ جَمِيعًا ۚ يَٰمَعْشَرَ ٱلْجِنِّ قَدِ ٱسْتَكْثَرْتُم مِّنَ ٱلْإِنسِ ۖ وَقَالَ أَوْلِيَآؤُهُم مِّنَ ٱلْإِنسِ رَبَّنَا ٱسْتَمْتَعَ بَعْضُنَا بِبَعْضٍ وَبَلَغْنَآ أَجَلَنَا ٱلَّذِىٓ أَجَّلْتَ لَنَا ۚ قَالَ ٱلنَّارُ مَثْوَىٰكُمْ خَٰلِدِينَ فِيهَآ إِلَّا مَا شَآءَ ٱللَّهُ ۗ إِنَّ رَبَّكَ حَكِيمٌ عَلِيمٌ ﴿١٢٨﴾

129 ఈ విధంగా కొందరు దుర్మార్గులను (కాఫిర్లను) మేము– వారు చేసుకున్న కర్మల కారణంగా – మరి కొందరికి సన్నిహితులుగా చేస్తాము.[180]

وَكَذَٰلِكَ نُوَلِّى بَعْضَ ٱلظَّٰلِمِينَ بَعْضًۢا بِمَا كَانُوا۟ يَكْسِبُونَ ﴿١٢٩﴾

176. అంటే మానవుల్లోని ఒక పెద్ద వర్గాన్ని మీరు సన్మార్గం నుంచి తప్పించి మీ అనుయాయులుగా చేసుకున్నారు. ఈ విషయమే అల్లాహ్ యాసీన్ సూరాలో కూడా ప్రస్తావించాడు. ఆయన ఇలా సెలవిచ్చాడు: "ఓ ఆదం సంతతివారలారా! షైతానును పూజించవద్దనీ, వాడు మీకు బహిరంగ శత్రువనీ, మీరు నా దాస్యం మాత్రమే చేయాలనీ, ఇదే సరైన మార్గమనీ నేను మీకు తాకీదు చేయలేదా? ఈ షైతాను మీలోని ఒక పెద్ద వర్గాన్నిపెడత్రోవ పట్టించాడు. అయినా మీరు గ్రహించలేకపోయారా?" (యాసీన్ : 60 – 62).

177. ఇంతకీ జిన్నులు–మానవులు ఒండొకరి ద్వారా పొందిన లబ్ది ఏమిటీ? దీనికి రెండు భావార్థాలు చెప్పబడ్డాయి. ఒకటి : జిన్నులు మానవుల ద్వారా లబ్ది పొందడమంటే వారు మానవుల్ని తమ అనుయాయులుగా చేసుకున్నారు. వారి ద్వారా తమ ఉద్దేశ్యాలను నెరవేర్చుకున్నారు. మానవులు జిన్నుల ద్వారా లబ్దిపొందడమంటే అర్థం– షైతానులు చెడు పనులను మనుషులకు అందమైనవిగా, మనోహరమైనవిగా అనిపించేలా చేశారు. తత్ఫలితంగా మనుషులు వాటివైపుకు వ్యామోహితులై, ఆ రసాస్వాదనలో చిక్కుకుపోయారు. రెండో అర్థం : షైతానుల, జిన్నాతుల ద్వారా 'జోస్యం' రూపంలో వ్యాపింపజేయబడే విషయాలను మనుషులు నిజమని ధృవీకరిస్తూ, వాటిని అనుసరించసాగారు. ఈ విధంగా జిన్నాతులు మనుషులను అవివేకుల్ని చేసి, వారిని తమ స్వార్థప్రయోజనాల కోసం వాడుకున్నారు. ఇక మనుషులు జిన్నాతుల ద్వారా పొందిన లబ్ది ఏమిటంటే జిన్నాతులు చెప్పే కల్లబొల్లి కబుర్లను విని మానవులు కొందరు ఆనందంతో పరవశించిపోయేవారు. మరికొందరు జ్యోతిష్యులు, సోదిచెప్పేవారు ఈ మాటలను తమ ప్రాపంచిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకునేవారు.

178. అంటే ప్రాపంచిక జీవితంలో మేము నిరాకరిస్తూ ఉండే తీర్పుదినం ఎట్టకేలకు రానేవచ్చింది. దానికి సమాధానంగా అల్లాహ్, "మరైతే నరకాగ్నికి ఆహుతి అవండి. అదే మీకు తగిన స్థానం" అని అంటాడు.

179. అవిశ్వాసులను శాశ్వితమైన నరక శిక్షకు గురిచేయాలన్నదే దేవుని ప్రణాళిక. దివ్య ఖుర్ఆన్లో మాటిమాటికీ ఆయన ఈ పరిణామాన్ని ప్రస్తావిస్తున్నాడు. ఈ విషయంలో ఎవరూ సందిగ్ధానికి లోను కానవసరం లేదు. ఆయన తిరుగులేని అధికారం కలవాడు. ఆయన ఏ సమయంలోనయినా, ఏ అపరాధినయినా నరకం నుంచి బయటికి తీయదలిస్తే, తీయగలడు కూడా. ఆయన్ని ఈ నిర్ణయం గైకొనకుండా అడ్డగించేవారు కూడా ఎవరూ లేరు (ఐసరుత్తఫాసీర్).

**130** ఓ జిన్నాతు మరియు మానవ వర్గీయులారా! ఏమిటీ, నా ఆదేశాలను మీకు విడమరచి చెప్పే, ఈనాటి ఈ దినం గురించి మిమ్మల్ని హెచ్చరించే ప్రవక్తలు స్వయంగా మీనుండే మీ వద్దకు రాలేదా?[181] (అని అల్లాహ్ తరపున ప్రశ్నించబడినప్పుడు), "అవును వచ్చారు. మాకు వ్యతిరేకంగా స్వయంగా మేమే సాక్ష్య మిస్తున్నాం" అని అంటారు. ప్రాపంచిక జీవితం వారిని మోసానికి గురి చేసింది. తాము తిరస్కారులయ్యామన్న సంగతిని గురించి వారు స్వయంగా సాక్ష్యమిస్తారు.[182]

يَٰمَعْشَرَ ٱلْجِنِّ وَٱلْإِنسِ أَلَمْ يَأْتِكُمْ رُسُلٌ مِّنكُمْ
يَقُصُّونَ عَلَيْكُمْ ءَايَٰتِى وَيُنذِرُونَكُمْ لِقَآءَ يَوْمِكُمْ
هَٰذَا ۚ قَالُوا۟ شَهِدْنَا عَلَىٰٓ أَنفُسِنَا ۖ وَغَرَّتْهُمُ
ٱلْحَيَوٰةُ ٱلدُّنْيَا وَشَهِدُوا۟ عَلَىٰٓ أَنفُسِهِمْ
أَنَّهُمْ كَانُوا۟ كَٰفِرِينَ ﴿١٣٠﴾

**131** ఎందుకంటే, నీ ప్రభువు ఏ సీమను కూడా అక్కడి ప్రజలు (సత్యాసత్యాలు) తెలుసుకోకుండా ఉన్న స్థితిలో-వారి తిరస్కార వైఖరి మూలంగా నాశనం చేయడు.[183]

ذَٰلِكَ أَن لَّمْ يَكُن رَّبُّكَ مُهْلِكَ ٱلْقُرَىٰ بِظُلْمٍ
وَأَهْلُهَا غَٰفِلُونَ ﴿١٣١﴾

**132** ప్రతి ఒక్కరికీ వారి ఆచరణలను బట్టి అంతస్తులు లభిస్తాయి. నీ ప్రభువు వారి పనుల విషయంలో అజాగ్రత్తగా లేడు.[184]

وَلِكُلٍّ دَرَجَٰتٌ مِّمَّا عَمِلُوا۟ ۚ وَمَا رَبُّكَ بِغَٰفِلٍ
عَمَّا يَعْمَلُونَ ﴿١٣٢﴾

180. అంటే నరకంలో వారు పరస్పరం దగ్గరగా ఉంటారని అర్థమవుతోంది. దీనికి మరో భావం ఏమిటంటే; ఏ విధంగానయితే జిన్నుల్ని-మానవుల్ని ఒండొకరి స్నేహితులుగా, సహాయకులుగా చేశామో అదేవిధంగా దుర్మార్గుల పట్ల వ్యవహారం చేస్తాము. అంటే ఒక దుర్మార్గుణ్ణి మరో దుర్మార్గునికి అప్పగిస్తాము. దుర్మార్గుల్లో ఒకడు ఇంకొకడిపై ప్రతీకారం తీర్చుకుంటూ ఉంటాడు.

181. దైవదౌత్యం (రిసాలత్), ప్రవక్తా పదవి (నబువ్వత్) విషయంలో జిన్నాతులు మానవులకు లోబడి ఉన్నారు. జిన్నాతులలో వేరుగా దైవప్రవక్తలు రాలేదు. అయితే దైవప్రవక్తల సందేశాన్ని తమ వర్గానికి అందజేసి, వారిని మేల్కొలిపేవారు జిన్నాతులలో ఉంటారు. అయితే మనుజ జాతికన్నా ముందు నుంచే జిన్నుల ఉనికి ఉండటం వల్ల వారి మార్గదర్శకత్వం కోసం కూడా వారిలో నుంచి ప్రవక్త ఉద్భవించి ఉండవచ్చు, అటుపిమ్మట ఆదం (అలైహిస్సలాం) ప్రభవించిన తరువాత జిన్నులు మానవ ప్రవక్తలకు లోబడి మసలుకుని ఉంటారన్న భావన కూడా ఉంది. మొత్తమ్మీద అంతిమ దైవప్రవక్త (సఅసం) గారి సందేశం మానవులు, జిన్నులందరినీ ఉద్దేశించిందన్న విషయంలో మటుకు సందేహానికి ఆస్కారం లేదు.

182. హష్ర్ మైదానంలో అవిశ్వాసులు పెక్కు ప్లేటులు ఫిరాయిస్తారు. ఒక్కోసారి తాము ముష్రిక్కులం కామని అంటారు (అల్ అన్‌ఆమ్-23). ఒక్కోసారి వారు తమ అపరాధాన్ని ఒప్పుకోవటం వినా మార్గాంతరం ఉండదు. ఈ ఆయతులో కూడా వారు తమ తప్పును ఒప్పుకుంటారని చెప్పబడింది.

183. అంటే - దేవుడు వివిధ జాతుల వద్దకు తన ప్రవక్తలను పంపి, ధర్మాధర్మాలను స్పష్టంగా బోధించనంతవరకూ ఆ జాతులపై తన శిక్షను అవతరింపజేయడు. ఈ విషయమే సూరె ఫాతిర్‌లోని 24వ ఆయతులో, సూరె అన్ నహ్ల్‌లోని 26వ ఆయతులో, సూరె బనీ ఇస్రాయీల్‌లోని 15వ ఆయతులో, సూరె ముల్క్‌లోని 8, 9 ఆయతులలో కూడా అల్లాహ్ విశదీకరించాడు.

184. మానవులకు, జిన్నులకు వారి ఆచరణలను బట్టి తరగతులు, కేటగిరీలు నిర్ధారించబడతాయి. దీనిద్వారా అవగతమయ్యే ఇంకొక విషయమేమిటంటే మానవుల్లాగానే జిన్నాతులు కూడా స్వర్గ నరకాలలో ప్రవేశిస్తారు.

وَرَبُّكَ الْغَنِيُّ ذُو الرَّحْمَةِ ۚ إِن يَشَأْ يُذْهِبْكُمْ وَيَسْتَخْلِفْ مِن بَعْدِكُم مَّا يَشَاءُ كَمَا أَنشَأَكُم مِّن ذُرِّيَّةِ قَوْمٍ آخَرِينَ ﴿١٣٣﴾

**133** ఇంకా నీ ప్రభువు ఏ అక్కరా లేనివాడు, కనికరించే వాడు.[185] ఆయన గనక తలచుకుంటే మీ అందరినీ తుద ముట్టించి, మిమ్మల్ని వేరొక వంశం నుంచి పుట్టించినట్లే, మీ స్థానంలో తాను కోరినవారిని వసింపజేస్తాడు.[186]

إِنَّ مَا تُوعَدُونَ لَآتٍ ۖ وَمَا أَنتُم بِمُعْجِزِينَ ﴿١٣٤﴾

**134** మీకు వాగ్దానం చెయ్యబడుతున్నది ముమ్మాటికీ వచ్చి తీర్తుంది. మీరు (అల్లాహ్‌ను) అశక్తుణ్ణి చేయలేరు.[187]

قُلْ يَا قَوْمِ اعْمَلُوا عَلَىٰ مَكَانَتِكُمْ إِنِّي عَامِلٌ ۖ فَسَوْفَ تَعْلَمُونَ مَن تَكُونُ لَهُ عَاقِبَةُ الدَّارِ ۗ إِنَّهُ لَا يُفْلِحُ الظَّالِمُونَ ﴿١٣٥﴾

**135** ఓ ప్రవక్తా! వారికి ఇలా చెప్పు : "ఓ నా జాతి ప్రజలారా! మీ పని మీరు చేయండి. నా కర్తవ్యాన్ని నేను నెరవేరుస్తూ ఉంటాను.[188] ఈ లోకంలో మేలైన పరిణామం ఎవరికి చెందు తుందో త్వరలోనే మీకు తెలిసిపోతుంది. అన్యాయానికి పాల్పడే వారు నిశ్చయంగా ఎన్నటికీ సాఫల్యం పొందలేరు."[189]

185. అల్లాహ్ నిరపేక్షాపరుడు (గనీ). ఏ అక్కరా లేనివాడు. ఆయన తన దాసులైన మానవులపైగానీ, జిన్నాతులపైగానీ ఆధారపడి లేడు. వారిలో ఎవరయినా ఆయన దాస్యం చేయకపోయినంత మాత్రాన, ఎవరయినా ఆయన్ని విశ్వసించకపోయినంత మాత్రాన ఆయనకు కలిగే నష్టం ఏమీలేదు. అయితే ఆయన దయామయుడు. తన గుణగణాల ననుసరించి ఆయన సాధారణంగా దయాదాక్షిణ్యాలతో మెలగుతాడు. ఆయనలోని నిరపేక్షాగుణం దాసులను కనికరించటంలో ప్రతిబంధకంగా ఉండబోదు.

186. దేవుని అసాధారణమైన శక్తిసామర్థ్యాల గురించి, మహోన్నతమైన, అపరిమితమైన ఆయన సామర్థ్యాన్ని గురించి ఇందులో వివరించబడింది. ఏ విధంగానయితే ఆయన పూర్వం అనేక జాతులను – తప్పు అక్షరాన్ని చెరిపేసినట్లే చెరిపేసి వాటి స్థానంలో కొత్త జాతులను తీసుకువచ్చాడో అదేవిధంగా ఇప్పుడు మిమ్మల్ని సమూలంగా నిర్మూలించి మీ స్థానంలో ఇంకొక జాతిని తీసుకురాగలడు. వారు మీలాంటి గర్విష్టులై ఉండరు. (మరిన్ని వివరాల కోసం అన్ నిసా సూరాలోని 133వ ఆయతును, ఇబ్రాహీమ్ సూరాలోని 20వ ఆయతును, ఫాతిర్ సూరాలోని 15 – 17 ఆయతులను, ముహమ్మద్ (స) సూరాలోని 38వ ఆయతును చూడండి).

187. వాగ్దానం చేయబడుతున్నది ఏమిటీ అంటే అదే 'ప్రళయదినం.' మీరు దేవుణ్ణి అశక్తుణ్ణి చేయలేరు అంటే, ఆయన మిమ్మల్ని మలిసారి లేపటం తథ్యం. ఈ పని చెయ్యకుండా మీలో ఎవరూ ఆయన్ని ఆపలేరు. మీరు మట్టిలో కలిసి, కుళ్ళి కృశించిపోయినా, గాలిలో, నీటిలో మీరు కొట్టుకుపోయినా ఆయన మిమ్మల్ని యథారూపంలో బ్రతికించి నిలబెడతాడు.

188. 'మీరు చేస్తున్న పని మంచిదే, దాన్ని కొనసాగించండి' అని దీని మతలబు ఎంతమాత్రం కాదు. నిజానికి ఇది తీవ్రమయిన హెచ్చరిక. హూద్ సూరాలో కూడా ఈ విధంగా వార్నింగ్ ఇవ్వటం జరిగింది: (ఓ ప్రవక్తా!) విశ్వసించటానికి నిరాకరించిన వారితో ఇలా అను – "మీరు మీ పద్ధతి ప్రకారం పనిచేస్తూ ఉండండి, మేము మా పద్ధతి ప్రకారం పనిచేస్తూ ఉంటాము. (పర్యవసానం కోసం) మీరూ నిరీక్షించండి, నేనూ నిరీక్షిస్తాను" (హూద్ : 121, 122).

189. అనతి కాలంలోనే అల్లాహ్ వారికి సత్యమేదో, అసత్యమేదో రుజువు చేశాడు. హిజ్రీ 8వ సంవత్సరంలో మక్కా విజయం వరించగానే పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రజలు తండోపతండాలుగా వచ్చి ఇస్లాం స్వీకరించ సాగారు. చూస్తూ చూస్తూ ఉండగానే యావత్తు అరేబియా ద్వీపం ఇస్లాం ఒడిలోకి వచ్చేసింది. రోజు రోజుకూ ఇస్లాం పరిధి విస్తరించసాగింది.

وَجَعَلُوا لِلّٰهِ مِمَّا ذَرَاَ مِنَ الْحَرْثِ وَالْاَنْعَامِ
نَصِيْبًا فَقَالُوْا هٰذَا لِلّٰهِ بِزَعْمِهِمْ وَهٰذَا
لِشُرَكَآئِنَا ۚ فَمَا كَانَ لِشُرَكَآئِهِمْ فَلَا يَصِلُ
اِلَى اللّٰهِ ۚ وَمَا كَانَ لِلّٰهِ فَهُوَ يَصِلُ اِلٰى
شُرَكَآئِهِمْ ۗ سَآءَ مَا يَحْكُمُوْنَ ﴿١٣٦﴾

**136** అల్లాహ్ సృష్టించిన పంట పొలాలలో నుంచి, పశువులలో నుంచి వీళ్లు కొంత భాగాన్ని అల్లాహ్ కోసం నిర్ధారించారు. పైపెచ్చు "ఇది అల్లాహ్ భాగం, ఇది మేము నిలబెట్టిన సహవర్తుల భాగం" అని స్వయంగా తామే తీర్మానించుకొని చెబుతారు.[190] సహవర్తుల కోసం నిర్ధారించిన భాగం అల్లాహ్‌కు ఎలాగూ చేరదు.[191] కాని అల్లాహ్ కోసం నిర్ధారించినది మాత్రం వారు నిలబెట్టిన సహవర్తులకు ఇట్టే చేరిపోతుంది.[192] వారి ఈ తీర్పు ఎంత ఘోరమైనది!?

وَكَذٰلِكَ زَيَّنَ لِكَثِيْرٍ مِّنَ الْمُشْرِكِيْنَ قَتْلَ
اَوْلَادِهِمْ شُرَكَآؤُهُمْ لِيُرْدُوْهُمْ وَلِيَلْبِسُوْا
عَلَيْهِمْ دِيْنَهُمْ ۗ وَلَوْ شَآءَ اللّٰهُ مَا فَعَلُوْهُ
فَذَرْهُمْ وَمَا يَفْتَرُوْنَ ﴿١٣٧﴾

**137** మరి ఇలాగే చాలామంది ముష్రిక్కుల దృష్టిలో వారి సహవర్తులు, వారిని నాశనం చేయడానికీ, వారి మత ధర్మాన్ని వారికి సందేహాస్పదంగా[193] చేయటానికి వారి సంతాన హత్యను వారికి మంచిదిగా తోచినట్లు చేశారు.[194] అల్లాహ్ తలచుకుని ఉంటే వారలా చేసి ఉండేవారు కాదు.[195] కనుక నీవు వారినీ, వారు కల్పించే కల్పనలనూ వదిలెయ్యి.

190. ఈ ఆయతులో ముష్రిక్కులు తమంతట తాముగా కల్పించుకునే విశ్వాసాలు ఎంత విచిత్రంగా ఉంటాయో వివరించటం జరిగింది. అల్లాహ్ ప్రసాదించిన పంటపొలాలలో నుంచీ, పశువులలో నుంచి వారు ఒక వాటాను నిజదైవం కోసం, మరో వాటాను తమ దేవీదేవతల కోసం, స్వాములవారి కోసం కేటాయిస్తారు. దేవుని వాటాను అగత్యపరుల కోసం, అతిథిమర్యాద కోసం, బంధువుల హక్కులు నెరవేర్చటం కోసం వెచ్చిస్తారు. దేవతల వాటాను ఆలయ పూజారుల కోసం, నిర్వాహకుల కోసం, సాంస్కృతిక ఉత్సవాల కోసం వెచ్చిస్తారు. కాని దేవతల కోసం నిర్ధారించిన భాగంలో ఆశించిన మేరకు పంటలు పండకపోతే అప్పుడు అల్లాహ్ వాటాలోని ఉత్పత్తులను తమ దేవతల పద్దులోకి తరలిస్తారు. తద్భిన్నంగా దేవతల వాటాలోని ఉత్పత్తులను మాత్రం అల్లాహ్ వాటాలోనికి ఎన్నటికీ తరలించరు. అదేమంటే "అల్లాహ్ అక్కర లేనివాడు కదా!" అంటూ సర్దిచెప్పుకుంటారు.

191. అంటే అల్లాహ్ భాగంలో లోటు ఏర్పడితే దేవతల భాగంలోని ఒక్క పైసా కూడా ఇటు రానివ్వరు.

192. అయితే దేవతల భాగంలో లోటు బడ్జెట్ ఉంటే మాత్రం అల్లాహ్ భాగంలో నుంచి తీసుకుని సంబరాలు జరుపుకుంటారు. అంటే వారి మనసులలో అల్లాహ్ కన్నా దేవీదేవతల భక్తి, భయం అధికంగా ఉన్నాయన్నమాట! నేటి ముష్రిక్కులను చూసినా పరిస్థితి ఇదేకదా!

193. అంటే వారి ధర్మంలో బహుదైవోపాసనా భావాలను జొప్పించి అలా చేయాలన్నది వారి వ్యూహం.

194. ఆనాడు వారు తమకు పుట్టిన ఆడ పిల్లలను సజీవంగా పాతిపెట్టడం, తమ దేవతల మెప్పుకోసం సంతానాన్ని బలి ఇవ్వటం వంటి దురాచారాలను ఈ వాక్యం సూచిస్తోంది.

195. అంటే అల్లాహ్ గనక కోరుకుంటే వాళ్లు ఈ దురాగతాలకు పాల్పడకుండా ఆపేవాడే. ఆయన గనక ప్రజలకు గల ఈ స్వేచ్ఛాధికారాన్ని జప్తు చేసుకుంటే వారు ఆ పనులను చేయగలిగేవారే కాదు. కాని ఆయన అలా చేస్తే "ఈ ప్రపంచం మానవునికి పరీక్షా స్థలం" అన్న మాటకు అర్థమే ఉండదు. పైగా ఇది బలాత్కారం క్రిందికి వస్తుంది. మరి ప్రకృతి ధర్మంలో బలాత్కారానికి తావులేదు. అందుకే అల్లాహ్ మనిషికి ఒకింత "వదులు" ఇచ్చి పరీక్షిస్తున్నాడు.

وَقَالُوا هَٰذِهِ أَنْعَامٌ وَحَرْثٌ حِجْرٌ لَا يَطْعَمُهَا
إِلَّا مَنْ نَشَاءُ بِزَعْمِهِمْ وَأَنْعَامٌ حُرِّمَتْ ظُهُورُهَا
وَأَنْعَامٌ لَا يَذْكُرُونَ اسْمَ اللَّهِ عَلَيْهَا افْتِرَاءً
عَلَيْهِ ۚ سَيَجْزِيهِمْ بِمَا كَانُوا يَفْتَرُونَ ﴿١٣٨﴾

**138** "ఈ కొన్ని పశువులు, పంట పొలాలు అందరికీ సమ్మతం కావు. మేము కోరినవారు తప్ప ఇతరులెవరూ వాటిని తినటం సమ్మతం కాదు"[196] అని వారు తమంతటతాముగా – కల్పించుకొని–చెబుతారు. కొన్ని పశువులపై స్వారీ చేయటం, వాటి ద్వారా బరువు లాగించటం నిషేధించబడింది (అని అంటారు).[197] మరి కొన్ని పశువులపై (జిబహ్ చేసే సమయంలో) వారు అల్లాహ్ పేరు ఉచ్చరించరు, అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టటానికిగాను (వారు ఇలా చేస్తారు).[198] వారు కల్పించే ఈ అబద్ధాలకుగాను త్వరలోనే అల్లాహ్ వారికి దాని ప్రతిఫలం ఇస్తాడు.

وَقَالُوا مَا فِي بُطُونِ هَٰذِهِ الْأَنْعَامِ خَالِصَةٌ
لِذُكُورِنَا وَمُحَرَّمٌ عَلَىٰ أَزْوَاجِنَا ۖ وَإِنْ يَكُنْ مَيْتَةً
فَهُمْ فِيهِ شُرَكَاءُ ۚ سَيَجْزِيهِمْ وَصْفَهُمْ ۚ إِنَّهُ
حَكِيمٌ عَلِيمٌ ﴿١٣٩﴾

**139** "ఈ పశువుల గర్భాలలో ఉన్నది కేవలం మా పురుషుల కోసమే. మా స్త్రీల కోసం అది నిషిద్ధం. ఒకవేళ అది చచ్చినదైతే అందరికీ అందులో భాగం ఉంటుంది"[199] అని కూడా వారంటారు. వారి ఈ తప్పుడు మాటలకుగాను అల్లాహ్ త్వరలోనే వారిని దండిస్తాడు.[200] నిశ్చయంగా ఆయన మహావివేకి, మహాజ్ఞాని.

196. అజ్ఞాన కాలంలోని ప్రజల మూఢత్వానికి సంబంధించిన మూడు నిదర్శనాలు ఇక్కడ పేర్కొనబడ్డాయి. ఈ ఆయతులో పేర్కొనబడినది మొదటి మూఢాచారం. ఫలానా పశువులను, ఫలానా పంటపొలాలను ఉపయోగించటం అధర్మం అని వారు తమకు తాముగా నిర్ణయించుకునేవారు. తాము అనుమతించినవారు మాత్రం వాటిని తినవచ్చునని చెప్పేవారు. ఈ అనుమతి విగ్రహాల పూజారులకు, ముజావర్లకు లభించేది.

197. వివిధ రకాల జంతువులను వారు తమ దేవతల పేర అచ్చువేసి వదిలేసేవారు. అలాంటి పశువులను వాహనాలుగా ఉపయోగించటాన్ని, వాటిపై బరువు వేయటాన్ని నిషేధించారు. ఇది వారి అజ్ఞానానికి రెండో నిదర్శనం. బహీరా, సాయిబా మొదలగు పశువులు అలాంటివే. (మరిన్ని వివరాలకై అల్ మాయిద సూరా 164వ పాదసూచిక చదవండి).

198. ఇది వారి అజ్ఞానానికి మూడో నిదర్శనం. దైవప్రసాదితమయిన పశువులను వారు జిబహ్ చేసే సమయంలో అల్లాహ్ పేరు ఉచ్చరించే బదులు, తమ దేవీదేవతల పేరు ఉచ్చరించేవారు. ఆ పశువులపై కూర్చొని వారు హజ్ యాత్రకు వెళ్ళేవారు కారని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. అయితే మొత్తానికి ఈ పద్ధతులన్నీ వారు స్వయంగా కల్పించుకున్నవే అయి ఉండేవి. కాని వారు స్వయంగా అల్లాహ్‌యే వాటిని నిర్ధారించాడని అబద్ధాలు చెప్పేవారు. అల్లాహ్ ఆదేశం మేరకే తాము ఆ పనులు చేస్తున్నామన్న భావనను ప్రజలలో కలిగించటానికి ప్రయత్నించేవారు.

199. ఇది మరో మూఢనమ్మకం. వారు తమ దేవీదేవతల పేర అచ్చువేసిన పశువులలో కొన్నింటి గురించి ఇలా అనేవారు: "ఈ పశువులిచ్చే పాలుగానీ, వాటి గర్భాలలో పెరుగుతున్న దూడగానీ సజీవంగా ఉంటే అది మా మగవాళ్ళకే ప్రత్యేకం. అది మా ఆడవాళ్ళకు నిషిద్ధం. ఒకవేళ ఆ దూడ చచ్చినదైతే అప్పుడు అందరూ దాన్ని పంచుకోవచ్చు."

200. ఇలాంటి తప్పుడు మాటలు మాట్లాడేవారిని, వక్రభాష్యాలు చెప్పేవారినీ, తమ స్వప్రయోజనాల కోసం లేని విషయాన్ని అల్లాహ్‌కు ఆపాదించేవారిని అల్లాహ్ త్వరలోనే పట్టుకుంటాడనీ, తన నిర్ణయాధికారాలను ప్రవేశపెట్టడంలో ఆయన మహావివేకి అనీ, తన దాసులు చేసే ప్రతి పనిని ఆయన కనిపెట్టుకుని ఉన్నాడని ఈ ఆయతులో చెప్పబడింది.

قَدْ خَسِرَ الَّذِينَ قَتَلُوٓا اَوْلَادَهُمْ سَفَهًا بِغَيْرِ
عِلْمٍ وَّحَرَّمُوا مَا رَزَقَهُمُ اللّٰهُ افْتِرَآءً عَلَى اللّٰهِ ؕ
قَدْ ضَلُّوْا وَمَا كَانُوْا مُهْتَدِيْنَ ﴿١٤٠﴾

**140** మూర్ఖత్వం కొద్దీ, ఏ ఆధారమూ లేకుండానే తమ సంతానాన్ని హత్యచేసిన వారూ, అల్లాహ్ ఉపాధిగా ప్రసాదించిన వస్తువులను అల్లాహ్‌కు అబద్ధాలను అంటగడుతూ నిషేధించు కున్నవారూ ముమ్మాటికీ నష్టానికి గురయ్యారు. నిశ్చయంగా వారు మార్గ విహీనతకు లోనయ్యారు. వారు సన్మార్గాన లేరు.

وَهُوَ الَّذِيْٓ اَنْشَاَ جَنّٰتٍ مَّعْرُوْشٰتٍ وَّغَيْرَ
مَعْرُوْشٰتٍ وَّالنَّخْلَ وَالزَّرْعَ مُخْتَلِفًا اُكُلُهٗ
وَالزَّيْتُوْنَ وَالرُّمَّانَ مُتَشَابِهًا وَّغَيْرَ مُتَشَابِهٍ ؕ
كُلُوْا مِنْ ثَمَرِهٖٓ اِذَآ اَثْمَرَ وَاٰتُوْا حَقَّهٗ يَوْمَ حَصَادِهٖ ۖ
وَلَا تُسْرِفُوْا ؕ اِنَّهٗ لَا يُحِبُّ الْمُسْرِفِيْنَ ﴿١٤١﴾

**141** ఆయనే పందిళ్ళపై ఎక్కించబడే తోటలను, పందిళ్ళపై ఎక్కించబడని తోటలను, ఖర్జూర చెట్లను, పంటపొలాలను సృజించాడు. వాటి ద్వారా రకరకాల ఆహార వస్తువులు[201] లభ్యమవుతాయి. జైతూను (ఆలివ్), దానిమ్మ వృక్షాలను కూడా సృజించాడు. వాటిలో కొన్ని పరస్పరం పోలి ఉంటాయి. మరికొన్ని పోలి ఉండవు.[202] వాటన్నింటి పండ్లు పండినప్పుడు వాటిని తినండి. పంటకోసే రోజున తప్పనిసరిగా చెల్లించవలసిన దాని హక్కును చెల్లించండి.[203] మితిమీరకండి.[204] మితిమీరే వారిని అల్లాహ్ ఎట్టిపరిస్థితిలోనూ ఇష్టపడడు.[205]

201. అరబీలో **'మారుషాత్'** (**مَّعْرُوْشٰتٍ**) అన్న పదం ఉంది. ఇది 'అర్ష్' అనే మూలపదం నుంచి వచ్చింది. అర్ష్ అంటే ఎత్తుకు లేపటం అని అర్థం. ఇక్కడ మారుషాత్ అంటే తీగవలె ఉండి నిటారుగా నిలబడలేని మొక్కలు. ఈ తీగలు పందిళ్ళపైకి, కప్పులపైకి ఎక్కించబడతాయి. ఉదాహరణకు: ద్రాక్షతోటలు, కాకరకాయ, పొట్లకాయ మొక్కలు, మల్లెతీగలు మొదలగునవి. మరికొన్ని తీగెలు పందిళ్ళపైకి ఎక్కించబడవు. ఖుర్ఆన్ వీటిని 'గైరు మారూషాత్'గా పేర్కొన్నది. ఉదాహరణకు : పుచ్చకాయ, కర్బూజా, దోసకాయ వంటివి. లేక తీగలుగా ఉండకుండా గట్టి కాండం కలిగిన చెట్లను కూడా 'గైరు మారూషాత్'గా పేర్కొనవచ్చు. ఈ తీగెల ద్వారా ఉత్పత్తి అయ్యే పండ్లు, కూరగాయలు, ఇంకా ఖర్జూరపండ్లు, ఆహార ధాన్యాల రంగు వేరు, రుచి వేరు. పోషకవిలువలు వేరుగా ఉంటాయి. కాని వాటన్నింటినీ పుట్టించినవాడు మాత్రం ఒక్కడే – ఆయనే అల్లాహ్.

202. ఇదే సూరాలోని 99వ ఆయతుకు వివరణ చూడండి.

203. అంటే పొలాలలో కోత కోసినప్పుడు, చెట్ల పండ్లు కోసినప్పుడు పేదల హక్కును చెల్లించాలి. దీనిని కొంతమంది పండితులు స్వచ్ఛంద దానధర్మం (నఫిల్ సదఖా)గా పేర్కొన్నారు. మరికొంతమంది దీనిని తప్పకుండా చేయవలసిన దానం (వాజిబ్ సదఖా)గా పేర్కొన్నారు. దీనినే 'ఉష్ర్' అని పిలుస్తారు. ఉష్ర్ అంటే పదోవంతు అని అర్థం. వర్షాల ద్వారా సాగు అయ్యే నేలనుంచి వచ్చిన పంటలో 10వ భాగం, అదే బావుల ద్వారా, విద్యుత్తు పంపుసెట్ల ద్వారా సాగు అయ్యే నేలనుంచి వచ్చిన పంటలోనయితే ఉష్ర్‌లో సగభాగం అంటే మొత్తం పంటలో 20వ వంతు చెల్లించ వలసి ఉంటుంది.

204. అంటే, దానధర్మాలలో కూడా హద్దు మీరకూడదు. విచ్చలవిడిగా దానాలు చేయటం వల్ల మీరు స్వయంగా ఇతరుల ముందు చేయి చాపవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ 'హద్దు మీరటం' అనే హెచ్చరిక జకాత్ సొమ్మును వసూలుచేసే అధికారుల్ని దృష్టిలో పెట్టుకుని చేయబడిందని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. ఆయతు పూర్వాపరాల దృష్ట్యా అన్నపానీయాల విషయంలో మితిమీరరాదన్నది అసలు దీని ఉద్దేశమని ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయపడ్డారు. ఎందుకంటే మితిమీరిన తిండివల్ల మెదడు మొద్దుబారుతుంది. శారీరక రోగాలు వస్తాయి. బరువు పెరుగుతుంది. 'హద్దు మీరకూడదు' అన్న తాకీదు ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకునే చేయబడి ఉండవచ్చు. దివ్య ఖుర్ఆన్‌లో

142 పశువులలో ఎత్తుగా ఉండే వాటిని, పొట్టిగా ఉండేవాటినీ[206] పుట్టించినవాడు కూడా ఆయనే. అల్లాహ్ మీకు ఇచ్చిన దానిని తినండి.[207] కాని షైతాను అడుగు జాడల్లో నడవకండి.[208] నిశ్చయంగా వాడు మీ బహిరంగ శత్రువు.

وَمِنَ الْأَنْعَامِ حَمُولَةً وَفَرْشًا ۚ كُلُوا مِمَّا رَزَقَكُمُ
اللَّهُ وَلَا تَتَّبِعُوا خُطُوَاتِ الشَّيْطَانِ ۚ إِنَّهُ لَكُمْ
عَدُوٌّ مُبِينٌ (142)

143 (ఇవి ఆయన సృష్టించిన) ఎనిమిది ఆడమగలు.[209] అంటే గొఱ్ఱెలలో రెండు రకాలు, మేకలలో రెండు రకాలు.[210] "అల్లాహ్ నిషేధించినది ఆ రెండు మగ పశువులనా లేక రెండు ఆడ పశువులనా లేక ఆ రెండు ఆడపశువుల గర్భాలలో ఉన్న వాటినా?[211] మీరు సత్యవంతులే అయితే ప్రమాణబద్ధంగా నాకు తెలియజేయండి"[212] అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు.

ثَمَانِيَةَ أَزْوَاجٍ ۖ مِنَ الضَّأْنِ اثْنَيْنِ وَمِنَ
الْمَعْزِ اثْنَيْنِ ۗ قُلْ آلذَّكَرَيْنِ حَرَّمَ أَمِ
الْأُنْثَيَيْنِ أَمَّا اشْتَمَلَتْ عَلَيْهِ أَرْحَامُ الْأُنْثَيَيْنِ ۖ
نَبِّئُونِي بِعِلْمٍ إِنْ كُنْتُمْ صَادِقِينَ (143)

---

ఇతర చోట్ల కూడా దేవుడు తిండి విషయంలో మితిమీరరాదని ఉపదేశించాడు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే భోజనాదుల విషయంలో కూడా మనిషి హద్దుల్లో ఉండాలి. లేకపోతే ఇది కూడా అతిక్రమణ క్రిందికే వస్తుంది. కాని నేటి ముస్లిములు ఈ "అతి"ని తమ పరువు ప్రతిష్ఠలతో ముడిపడిన అంశంగా భావించి, వృధా ఖర్చు ఎక్కువ చేస్తున్నారు.

205. అందుకే "అతి" ఏ విషయంలో కూడా వాంఛనీయం కాదు. దానధర్మాలలోనయినా, విందు భోజనాలలోనయినా, పండుగలు పబ్బాలలోనయినా– మధ్యేమార్గం ఉత్తమం.

206. ఆయతులో **'హమూలతన్'** (**حَمُولَةً**) అని ఉంది. అంటే బరువు మోసే పశువులు అని అర్థం. ఉదాహరణకు : ఒంటె, ఎద్దు, గాడిద, కంచెర గాడిద ఇత్యాదివి. **'ఫర్షన్'** (**فَرْشًا**) అంటే నేలకు అతుక్కుని ఉన్నవి. గొఱ్ఱెలు, మేకలు వంటి పశువులు. వాటి పాలు, మాంసం ఆహారంగా పనికివస్తాయి.

207. అంటే పొలాల ద్వారా, తోటల ద్వారా, పశువుల ద్వారా – ఆహారం రూపంలో – మీకు ప్రసాదించిన దానిని భుజించండి అని భావం.

208. ముష్రిక్కులు షైతాన్ అడుగుజాడలలో నడుచుకుంటూ దేవుడు ధర్మసమ్మతం చేసిన ఎన్నో వస్తువులను తమ కోసం నిషేధించుకున్నారు. అలాగే దేవుడు నిషిద్ధంగా ఖరారు చేసిన వస్తువుల్ని తమ కొరకు ధర్మసమ్మతం చేసుకున్నారు. షైతాన్‌ను అనుసరించటమంటే ఇదే!

209. అరబీలో **'అజ్వాజ్'** అని ఉంది. ఇది **'జౌజున్'**కు బహువచనం. జౌజున్ అంటే అర్థం జత. ఒకే కోవకు చెందిన ఆలుమగలను కలిపి 'జత'గా వ్యవహరిస్తారు. అయితే ఒక్కోసారి 'జత'లోని ఆడమగ ఇద్దరినీ కూడా ప్రత్యేకంగా జత అని చెబుతారు. ఎందుకంటే వాటిలోని ప్రతి ఒక్కటి రెండోదానికి జతగా ఉంటుంది. ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులో కూడా 'అజ్వాజ్' అన్న పదం ఆడ మగ అన్న అర్థంలోనే ఉపయోగించబడింది. అంతేగాని ఇక్కడ అజ్వాజ్ అంటే జతలు అని భావం కాదు. అలా అనుకుంటే ఎనిమిది ఆడ మగలకు బదులు 16 ఆడ మగలు అయిపోతాయి. కాని ఈ సంఖ్య సరైనది కాదని ఆయతులోని తర్వాతి భాగమే స్పష్టం చేస్తున్నది.

210. రెండు రకాలంటే ఆడ, మగ అని అర్థం. గొర్రె జాతిలో ఆడ మగ, మేక జాతిలో ఆడ మగ, (కొండజాతి గొర్రె, పొట్టేలు కూడా గొర్రె క్రిందికే వస్తాయి).

211. బహుదైవారాధకులు తమంతట తాముగా ధర్మ సమ్మతములైన కొన్ని జంతువులను నిషిద్ధంగా ఖరారు చేసేవారు. ఆ నేపథ్యంలో అల్లాహ్ వారిని ప్రశ్నిస్తున్నాడు – ఏమిటీ, అల్లాహ్ వాటిలోని మగ పశువులను నిషేధించాడా? లేక

**144** అలాగే ఒంటెలలో రెండు రకాలు,[213] ఆవులలో రెండు రకాలను (ఆయన పుట్టించాడు). మరి వీటిలో అల్లాహ్ నిషేధించినది రెండు పోతులనా? లేక రెండు పడ్డలనా? లేక ఆ రెండు పడ్డల కడుపులలో ఉన్న దూడలను నిషేధించాడా? అని (ఓ ప్రవక్తా!) వాళ్ళను అడుగు. ఈ మేరకు అల్లాహ్ మీకు ఆదేశించినప్పుడు మీరక్కడ ఉన్నారా?[214] ఏ ఆధారమూ లేకుండానే– ప్రజల్ని అపమార్గం పట్టించే ఉద్దేశంతో– అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదించే వానికన్నా పరమ దుర్మార్గుడు ఎవడుంటాడు?[215] ఇలాంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

وَمِنَ الْإِبِلِ اثْنَيْنِ وَمِنَ الْبَقَرِ اثْنَيْنِ ۗ قُلْ آلذَّكَرَيْنِ حَرَّمَ أَمِ الْأُنثَيَيْنِ أَمَّا اشْتَمَلَتْ عَلَيْهِ أَرْحَامُ الْأُنثَيَيْنِ ۖ أَمْ كُنتُمْ شُهَدَاءَ إِذْ وَصَّاكُمُ اللَّهُ بِهَٰذَا ۚ فَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا لِّيُضِلَّ النَّاسَ بِغَيْرِ عِلْمٍ ۗ إِنَّ اللَّهَ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ ﴿144﴾

**145** ఓ ప్రవక్తా! వారికి చెప్పు : (వహీ ద్వారా) నా వద్దకు వచ్చిన ఆజ్ఞలలో చచ్చిన జంతువు, ప్రవహించే రక్తం, పందిమాంసం – అది పరమ అశుద్ధం గనక! – ఇంకా దైవేతరుల పేర కోయబడిన జంతువు[216] తప్ప మరేదీ తినేవాడి కోసం నిషేధించబడి

قُل لَّا أَجِدُ فِي مَا أُوحِيَ إِلَيَّ مُحَرَّمًا عَلَىٰ طَاعِمٍ يَطْعَمُهُ إِلَّا أَن يَكُونَ مَيْتَةً أَوْ دَمًا مَّسْفُوحًا أَوْ لَحْمَ خِنزِيرٍ فَإِنَّهُ رِجْسٌ أَوْ فِسْقًا أُهِلَّ لِغَيْرِ

ఆడపశువులను నిషేధించాడా? లేక ఆ ఆడపశువుల గర్భాలలో పెరుగుతున్న పిల్ల జంతువులను నిషేధించాడా? అని. కాని యదార్థానికి అల్లాహ్ వాటిలో దేనినీ హరామ్ (నిషిద్ధం) గావించలేదు.

212. బహీరా, సాయిబా, వసీలా, హామ్ మొదలగు జంతువులను మీరు 'హరామ్'గా ఖరారు చేయటం వెనుక ఏదన్నా ఆధారం, ప్రమాణం ఉంటే నాకు చూపండి. అలాంటిదేమీ మీ దగ్గర లేనిపక్షంలో మీ మాటల్లో ఏమాత్రం పసలేదని అనవలసి వస్తుంది. (పైన పేర్కొనబడిన జంతువుల వివరాల కోసం అల్ మాయిద సూరా 164వ పాదసూచిక చదవండి).

213. అంటే ఒంటెలలోని ఆడ మగ రకాలు. ఈ రెండేసి రకాలను కూడా కలుపుకుంటే మొత్తం 8 రకాలు అవుతాయి.

214. అంటే, ధర్మాధర్మాలను అల్లాహ్ నిర్ధారిస్తున్న సమయంలో మీరు అక్కడ హాజరై ఉన్నారా? లేరు కదా? మరలాంటప్పుడు మీ అంతట మీరుగా కొన్ని వస్తువులను ఎందుకు నిషిద్ధంగా నిర్ధారించుకున్నారు? ఇది ధర్మావలంబనలో కల్పించబడిన 'అభూత కల్పన' కాదా? ఈ మేరకు మీకు అధికారం ఎవరిచ్చారు?

215. దేవుడు నిర్ధారించిన ధర్మంలో అయోమయ స్థితిని సృష్టించేవాడు అందరికన్నా పెద్ద దుర్మార్గుడనబడతాడు. అంతిమ దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా తెలియజేశారని హదీసులో ఉంది: నేను 'అమ్ర్ బిన్ లుహై'ని నరకంలో తన ప్రేగులు తానే లాగుతుండగా చూశాను. ఎందుకంటే అతడు అందరికన్నా ముందు విగ్రహాల పేర వసీలా, హామ్ తదితర జంతువులను వదిలిపెట్టే పోకడకు నాంది పలికాడు" (సహీహ్ బుఖారీ: తఫ్సీర్ సూరతుల్ మాయిద; సహీహ్ ముస్లిం : కితాబుల్ జన్నతి). ఈ హదీసుకు వివరణగా ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: అమ్ర్ బిన్ లుహై ఖుజాఅ తెగ సర్దారులలో ఒకడు. జుర్హుమ్ తెగ వారి తరువాత ఇతను కాబా గృహ నిర్వాహకునిగా నియమితుడయ్యాడు. ఇబ్రాహీమ్ ధర్మంలో అందరికన్నా ముందు మార్పుకు పాల్పడి, హిజాజ్ క్షేత్రంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి, విగ్రహారాధన కోసం ప్రజల్ని పురికొల్పినవాడు ఇతనే (ఇబ్నె కసీర్). మొత్తమ్మీద ఈ ఆయతు ద్వారా మనకు అవగతమయ్యేదేమిటంటే అల్లాహ్ ఈ ఎనిమిది రకాల పశువులను సృష్టించి మనుజ జాతికి ఎంతో మేలు చేశాడు. మరి అటువంటప్పుడు మనుషులు వాటిలో కొన్ని పశువులను తమ కోసం నిషిద్ధంగా ఖరారు చేసుకోవటం దేవుని మహోపకారాన్ని త్రోసిపుచ్చటమే. పైగా ఇది షిర్క్ క్రిందికి కూడా వస్తుంది.

216. ఈ ఆయతులో నిషిద్ధం (హరామ్) గావించబడిన నాలుగు వస్తువుల వివరాలు అల్ బఖరా సూరాలోని 173వ

اللّٰهِ بِهٖ ۚ فَمَنِ اضْطُرَّ غَيْرَ بَاغٍ وَّلَا عَادٍ فَاِنَّ رَبَّكَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿145﴾

నట్లు నాకు కనిపించదు. అయితే గత్యంతరం లేని పరిస్థితిలో – రుచికోసం కాకుండా, హద్దు మీరకుండా ఉంటే (వాటిని తింటే అట్టి స్థితిలో) నీ ప్రభువు క్షమించేవాడూ, కరుణించేవాడు.

وَعَلَى الَّذِيْنَ هَادُوْا حَرَّمْنَا كُلَّ ذِيْ ظُفُرٍ ۚ وَمِنَ الْبَقَرِ وَالْغَنَمِ حَرَّمْنَا عَلَيْهِمْ شُحُوْمَهُمَآ اِلَّا مَا حَمَلَتْ ظُهُوْرُهُمَآ اَوِ الْحَوَايَآ اَوْ مَا

**146** యూదులకు మేము గోళ్ళు గల జంతువులన్నింటినీ నిషేధించాము.[217] ఇంకా వారికి, ఆవు మరియు మేకలలో వాటి వీపులకు తగిలివున్న కొవ్వునీ, ప్రేగులపై ఉన్నదానినీ, ఎముక లతో కలిసి ఉన్న దానిని తప్ప – మిగిలిన క్రొవ్వును కూడా నిషేధించాము.[218] వారి తలబిరుసుతనం మూలంగా మేము

వచనంలో ఇంతకు ముందే వచ్చాయి. మరోసారి వాటిని పునరావృతం చేయటం జరిగింది. ఈ నాలుగు వస్తువులే గాకుండా మరికొన్ని జంతువులు కూడా షరీయతులో నిషేధించబడి ఉండగా ఈ నాల్గింటిని మాత్రమే ప్రస్తావించటంలోని మర్మం ఏమిటీ? అన్న ప్రశ్న యిక్కడ ఉత్పన్నం కావచ్చు. అసలు విషయం ఏమిటంటే వెనుకటి ఆయతుల్లో బహుదైవారాధకుల మూఢ నమ్మకాలు, ఆచార దురాచారాలు ఖండించబడుతూ వచ్చాయి. వాటిలో కొన్ని జంతువుల ప్రస్తావన కూడా వచ్చింది. అవి వాస్తవానికి ధర్మ సమ్మతం (హలాల్) అయి ఉన్నప్పటికీ వాళ్లు తమ మూర్ఖత్వంతో – కావాలని – వాటిని నిషిద్ధం (హరామ్) చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మహాప్రవక్త (సఅసం) హలాల్ వస్తువులను గురించి నొక్కి చెబుతూ ఫలానా ఫలానా వస్తువులు మాత్రమే హరామ్ గావించబడినట్లు విశదీకరించారు. అంటే చచ్చిన జంతువులు, జిబహ్ చేసే సమయంలో స్రవించే పశువుల రక్తం, పరమ అశుద్ధం అయిన పంది మాంసం, అల్లాహ్ పేరుగాక ఇతరత్రా భాగస్వాముల పేర్లు ఉచ్చరించి జిబహ్ చేయబడిన పశువుల మాంసం తప్ప మీరు అజ్ఞానంతో హరామ్ చేసుకుంటున్న వాటిని అల్లాహ్ హలాల్ (ధర్మసమ్మతం) గావించాడు. ఒకవేళ అవి గనక 'హరామ్' అయివుంటే వాటిని అల్లాహ్ తప్పకుండా నాకు పంపిన 'వహీ'లో ప్రస్తావించి ఉండేవాడు.

ఈ ఆయతుపై వ్యాఖ్యానిస్తూ ఇమామ్ షౌకానీ ఇలా అన్నారు : ఒకవేళ ఈ ఆయతు మక్కాలో అవతరించిన ఆయతు అయి ఉండకపోతే ధర్మంలో నిషిద్ధమైనవి ఈ నాలుగు వస్తువులు మాత్రమే అన్న విషయం స్వీకారయోగ్యం అయి ఉండేది. కాని ఖుర్ఆన్‌లోని అల్ మాయిద సూరాలో కూడా మరికొన్ని నిషిద్ధ వస్తువుల ప్రస్తావన వచ్చింది. అంతిమ దైవప్రవక్త (స) కూడా కొన్ని నిషిద్ధ వస్తువులను వివరించారు. అందువల్ల అవి కూడా ఈ నిషిద్ధాలలో చేర్చబడతాయి. అదీగాక ఆయన (స) పశువుల, క్రూర జంతువుల ధర్మాధర్మాలను (హలాల్ – హరామ్‌లను) తెలుసుకోవడానికి రెండు మూల సూత్రాలను చెప్పారు (అల్ మాయిద సూరా 2వ పాదసూచికలో ఆ వివరాలు వచ్చాయి). పంది మాంసంతో పాటే, దైవేతరుల పేరున మొక్కుకోబడిన జంతువులు 'హరామ్' అని స్పష్టం చేయటం గమనార్హం. ఒకవేళ అలాంటి జంతువులను జిబహ్ చేసే సమయంలో 'బిస్మిల్లాహ్' చెప్పినప్పటికీ – యదార్థానికి అవి దైవేతరుల మెప్పు పొందే సంకల్పంతో వాటి ఆస్థానాల, దర్గాల వద్ద జిబహ్ చేయటం వల్ల – నిస్సందేహంగా అవి హరామ్‌గానే పరిగణించబడతాయి. దేవుని విధేయతా పరిధిని దాటిపోతే అది **ఫిస్ఖ్** క్రిందికి వస్తుంది. అల్లాహ్ పేరు మీదనే జంతువులను జిబహ్ చేయాలనీ, కేవలం ఆయన సామీప్యం పొందే ఉద్దేశ్యంతోనే ఆయన పేరున మొక్కుకోవాలనీ, అన్యథా అది **ఫిస్ఖ్** (ఘోరమైన పాపం) మరియు షిర్క్ (బహుదైవోపాసన) అవుతుందని పరమ ప్రభువు స్పష్టం చేశాడు.

217. గోళ్లు గల జంతువులు అంటే ఇక్కడ భావం వ్రేళ్లు చీలకుండా అతుక్కుపోయి వున్నవి అని. ఉదాహరణకు : ఒంటె, నిప్పుకోడి, బాతు మొదలగునవి. ఈ రకమయిన పక్షులు, పశువులన్నీ యూదుల దురాగతాల కారణంగా వారికి నిషేధించబడ్డాయి.

218. అంటే మేకల (లేక గొఱ్ఱెల), ఆవుల వీపుకు అంటుకుని ఉన్న క్రొవ్వు, వాటి ప్రేగులకు, ఎముకలకు చుట్టుకుని వున్న క్రొవ్వు మటుకు ధర్మసమ్మతం గావించబడింది. మిగిలిన క్రొవ్వు అంతా వారి కొరకు నిషిద్ధం.

వారికి ఈ శిక్ష విధించాము.[219] ముమ్మాటికీ మేము చెప్పేది నిజం.[220]

اخْتَلَطَ بِعَظْمٍ ۚ ذَٰلِكَ جَزَيْنَاهُم بِبَغْيِهِمْ ۖ
وَإِنَّا لَصَادِقُونَ ﴿١٤٦﴾

147 ఆ తరువాత కూడా వాళ్ళు నిన్ను ధిక్కరిస్తే, "మీ ప్రభువు విస్తృతమైన కారుణ్యం కలవాడు.[221] అయితే ఆయన శిక్ష అపరాధ జనులపై నుంచి తొలగిపోదు"[222] అని వారికి చెప్పెయ్యి.

فَإِن كَذَّبُوكَ فَقُل رَّبُّكُمْ ذُو رَحْمَةٍ وَاسِعَةٍ
وَلَا يُرَدُّ بَأْسُهُ عَنِ الْقَوْمِ الْمُجْرِمِينَ ﴿١٤٧﴾

148 "అల్లాహ్ తలచుకొని ఉంటే మేముగానీ, మా తాత ముత్తాతలుగానీ షిర్క్‌కు పాల్పడేవారం కాము; ఏ వస్తువునూ నిషిద్ధంగా ఖరారు చేసేవారం కూడా కాము"[223] అని ముష్రిక్కులు అంటారు. వీరికి పూర్వం గతించిన వారు కూడా ఇలాగే ధిక్కార వైఖరిని అవలంబించారు. కడకు వారు మా శిక్షను చవి చూశారు.[224] (ఓ ప్రవక్తా!) వారిని అడుగు: "మీ దగ్గర ఏదైనా ప్రమాణం ఉంటే, దాన్ని మా ముందు సమర్పించండి.[225] మీరు కేవలం ఊహలను అనుసరిస్తారు. అంచనాలతో మాట్లాడతారు."

سَيَقُولُ الَّذِينَ أَشْرَكُوا لَوْ شَاءَ اللَّهُ مَا أَشْرَكْنَا
وَلَا آبَاؤُنَا وَلَا حَرَّمْنَا مِن شَيْءٍ ۚ كَذَٰلِكَ
كَذَّبَ الَّذِينَ مِن قَبْلِهِمْ حَتَّىٰ ذَاقُوا بَأْسَنَا ۗ قُلْ
هَلْ عِندَكُم مِّنْ عِلْمٍ فَتُخْرِجُوهُ لَنَا ۖ إِن
تَتَّبِعُونَ إِلَّا الظَّنَّ وَإِنْ أَنتُمْ إِلَّا تَخْرُصُونَ ﴿١٤٨﴾

---

219. యూదుల అవిధేయతకు శిక్షగా మేము వారిపై ఇలాంటి ఆంక్షల్ని విధించాము. అంతకుమించి వారు చెప్పే మాటల్లో వాస్తవం లేదు. తమ పూర్వీకులైన హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం) ఈ వస్తువులను తమ కోసం నిషేధించినందు వల్ల, తాము కూడా ఆయన అనుయాయులుగా వాటిని నిషిద్ధంగా భావిస్తున్నామని వారు చెప్పేవన్నీ కల్లబొల్లి కబుర్లు మాత్రమే.

220. అంటే యూదులు చెప్పేది పచ్చి అబద్ధం.

221. అంటే, వారు దైవప్రవక్తను 'అసత్యవాది' అంటూ ఆరోపించి, ఆయన్ని (స) తిరస్కరించినప్పటికీ వారిని శిక్షించటంలో దేవుడు ఏమాత్రం తొందరపడడు. ఎందుకంటే ఆయనలోని కరుణ అటువంటిది. అపరాధులకు ఆయన ఆఖరి క్షణం వరకూ తప్పును సరిదిద్దుకునే అవకాశం ఇస్తాడు.

222. దేవుడు వ్యక్తులకయినా, సమూహాలకైనా గడువు ఇచ్చాడంటే దాని భావం ఆయన వారిని శిక్షించకుండా వదలిపెట్టేశాడని ఎంతమాత్రం కాదు. ఆయన గనక ఎవరినయినా శిక్షించాలని నిర్ణయించుకున్నాడంటే ఇక వారికి మూడినట్లే. ఆయన నిర్ణయాన్ని తప్పించే, వాయిదా వేయించే శక్తి ఎవరికీ లేదు.

223. ఈ విధంగా అపార్థానికి గురి కావలసిన అవసరం లేదు. దైవప్రణాళిక వేరు – దైవప్రీతి వేరు. ఈ రెంటినీ ఒకే అర్థంలో తీసుకున్నప్పుడు మనిషి సందిగ్ధానికి లోనవుతాడు. దేవుడు తలచుకోలేదు గనక మేము షిర్క్‌కు పాల్పడ్డామని చెప్పి ముష్రిక్కులు తప్పును దేవునిపై నెట్టడానికి ప్రయత్నిస్తారు. కాని దేవుడు మనిషికి ఇవ్వబడిన 'స్వేచ్ఛ'ను హరించి, బలవంతంగా అతని మెడను వంచి తన దారికి తేదలచటం లేదు. తనకు నచ్చిన మార్గాన్ని ఎంపిక చేసుకునే నిర్ణయాధికారం ఉండి కూడా సరైన మార్గాన్ని – సన్మార్గాన్ని – మనిషి ఎన్నుకుంటాడా లేదా? అని పరమ ప్రభువు పరీక్షిస్తున్నాడు. ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలం అని ఇంతకుముందు కూడా చెప్పుకోవటం జరిగింది.

224. ఒకవేళ తాము ఒడిగడుతూ ఉన్న ఈ షిర్క్ (బహుదైవోపాసన) దైవేచ్ఛే అయి ఉంటే, మరి వీరిపై దేవుని ఆపద ఎందుకు విరుచుకుపడినట్లు? దైవప్రణాళిక (పరీక్ష) వేరు – దైవ ప్రసన్నత వేరు అన్న విషయానికి ఈ దైవశిక్ష ఒక నిదర్శనం.

225. అంటే; "మేము చేసే పనులన్నింటికీ దేవుని ఆమోదముద్ర ఉంది" అన్నదే మీ వాదన అయితే దానికి ఏదన్నా

**149** ఇంకా వారికి ఇలా చెప్పు: "పరిపూర్ణమైన వాదన అల్లాహ్‌దే. ఆయనే గనక తలచుకుంటే మీ అందరినీ సన్మార్గంపై నడిపించే వాడే."

قُلْ فَلِلّٰهِ الْحُجَّةُ الْبَالِغَةُ ۚ فَلَوْ شَآءَ
لَهَدٰىكُمْ اَجْمَعِيْنَ ﴿149﴾

**150** "అల్లాహ్ ఈ వస్తువుల్ని నిషేధించాడు అని సాక్ష్యమిచ్చే మీ సాక్షులను[226] తీసుకురండి" అని వారిని అడుగు. మరి వారు గనక అలా సాక్ష్యమిస్తే నీవు మాత్రం వారితోపాటు సాక్ష్యం ఇవ్వకు.[227] వారి మిథ్యా భావాలను అనుసరించకు. మా ఆయతులను ధిక్కరించేవారి, పరలోకాన్ని విశ్వసించనివారి, ఇంకా ఇతరులను తమ ప్రభువుకు సమానులుగా నిలబెట్టేవారి కోరికలను అనుసరించకు.[228]

قُلْ هَلُمَّ شُهَدَآءَكُمُ الَّذِيْنَ يَشْهَدُوْنَ اَنَّ اللّٰهَ
حَرَّمَ هٰذَا ۚ فَاِنْ شَهِدُوْا فَلَا تَشْهَدْ مَعَهُمْ ۚ وَلَا
تَتَّبِعْ اَهْوَآءَ الَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِنَا وَالَّذِيْنَ
لَا يُؤْمِنُوْنَ بِالْاٰخِرَةِ وَهُمْ بِرَبِّهِمْ يَعْدِلُوْنَ ﴿150﴾

**151** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "రండి, మీ ప్రభువు మీపై నిషేధించిన వస్తువులు ఏవో మీకు చదివి వినిపిస్తాను.[229] అవేమంటే; అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి.[230]

قُلْ تَعَالَوْا اَتْلُ مَا حَرَّمَ رَبُّكُمْ عَلَيْكُمْ اَلَّا تُشْرِكُوْا
بِهٖ شَيْـًٔا وَّبِالْوَالِدَيْنِ اِحْسَانًا ۚ وَلَا تَقْتُلُوْٓا

---

ఆధారం (రుజువు) ఉందా? ఉంటే నాకు చూపండి అని దీని భావం. వారి దగ్గర ఏ ప్రమాణమూ లేదు. పైగా వారు మూఢ నమ్మకాల అంధకార లోయల్లో తచ్చాడుతున్నారు.

226. అంటే – ముష్రిక్కులు తమంతట తాముగా కొన్ని జంతువుల్ని నిషేధించుకుని వాటిని అల్లాహ్ నిషేధించాడని బుకాయించేవారు.

227. ఎందుకంటే వారి సాక్ష్యాలు నమ్మశక్యం కావు. అబద్ధాలు చెప్పటంలో, లేనిమాటల్ని ఇతరులకు ఆపాదించటంలో వారు నిష్ణాతులు.

228. అంటే – వారు నిజదైవానికి ఇవ్వవలసినంత గౌరవాన్ని, దైవేతరులకు కూడా ఇచ్చి ఆరాధనలో వారిని చేర్చుకునేవారు.

229. నిజానికి దేవుడు నిషేధించినవి మీరు భావిస్తున్న వస్తువులు కావు. దేవుడు నిషేధించినవైతే ఈ ఆయతులో పేర్కొనబడిన పనులే. మీరు వీటి విషయంలో ఆయనకు భయపడుతూ జీవించండి. ఎందుకంటే మిమ్మల్ని పుట్టించినవాడూ, మిమ్మల్ని పోషిస్తున్నవాడూ, సమస్త విషయాలను కనిపెట్టుకుని ఉన్నవాడూ ఆయనే. కాబట్టి దేన్ని నిషేధించాలో, మరి దేనిని ధర్మసమ్మతంగా ఖరారు చేయాలో ఆయనకు మాత్రమే బాగా తెలుసు. అందుకే మీ ప్రభువు నిషేధించిన అసలు విషయాలేమిటో నేను మీకు చదివి వినిపిస్తున్నాను. మీరు వీటికి కట్టుబడి ఉంటే చాలు. అంతేగాని, మీ అంతట మీరుగా ధర్మాధర్మాలను నిర్ణయించుకుని, మీ స్వయానికి అన్యాయం చేసుకోకండి.

230. అల్లాహ్ శక్తిమంతుడు అన్న సంగతి మీకు తెలిసిన మీదట, ఆయన దైవత్వంలో ఇంకొక వస్తువును భాగస్వామ్యంగా చేయకూడదు. ఇది షిర్క్ క్రిందికి వస్తుంది. షిర్క్ అతి పెద్ద అన్యాయం, దురాగతం. దీనికి క్షమాభిక్ష అనేది లేనే లేదు. షిర్క్‌కు పాల్పడే వానికోసం స్వర్గం నిషేధించబడింది. నరకయాతన అతని నొసటిరాత అయిపోతుంది. ఈ విషయాలు దివ్య ఖుర్ఆన్‌లో పదే పదే పునరావృతం అయ్యాయి. దేవుని అంతిమ ప్రవక్త (సఅసం) కూడా అనేక హదీసుల్లో ఈ విషయాలను ఉదాహరణలతో సహా విడమరచి చెప్పారు. అయినప్పటికీ ప్రజలు షైతాను మాయాజాలంలో పడి 'షిర్క్'కు ఒడిగడుతూనే ఉన్నారు.

అరబీ మూలంలో **'అన్ లా తుష్‌రికూ'** –కు ముందు **'అవ్‌సాకుమ్'** అనే పదం మార్జితముగా ఉన్నట్లు భావించవలసి ఉంటుంది. అప్పుడు 'మీరు షిర్క్ చేయరాదని అల్లాహ్ గట్టిగా తాకీదు చేశాడు' అన్న భావం వస్తుంది.

తల్లిదండ్రుల యెడల ఉత్తమరీతిలో మెలగండి.[231] పేదరికపు భయంతో మీ సంతానాన్ని హతమార్చకండి. మేము మీకూ ఆహారం ఇస్తున్నాము, వారికీ ఇస్తాము.[232] సిగ్గు మాలిన పనులు– అవి బాహాటంగా జరిగేవైనా, గుట్టుగా జరిగేవైనా – వాటి దరిదాపులక్కూడా వెళ్ళకండి. సత్య (న్యాయ) బద్ధంగా తప్ప అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణినీ హతమార్చకండి.[233] మీరు ఆలోచించి పనిచేస్తారని, అల్లాహ్ మీకీ విషయాలను గురించి గట్టిగా తాకీదు చేశాడు.

أولادكم من إملاق ۖ نحن نرزقكم وإياهم ۖ
ولا تقربوا الفواحش ما ظهر منها وما بطن ۖ
ولا تقتلوا النفس التي حرم الله إلا بالحق ۚ
ذلكم وصاكم به لعلكم تعقلون ﴿151﴾

**152** “తండ్రిలేని బిడ్డ, యుక్తవయస్సుకు చేరుకునే వరకూ–ఉత్తమ రీతిలో తప్ప[234] – అతని ఆస్తి దరిదాపులకు కూడా వెళ్ళకండి. కొలతలు తూనికలలో పూర్తిగా, న్యాయంగా వ్యవహరించండి.[235] మేము ఏ ప్రాణిపైన కూడా శక్తికి మించిన భారం మోపము.[236]

ولا تقربوا مال اليتيم إلا بالتي هي أحسن
حتى يبلغ أشده ۖ وأوفوا الكيل والميزان
بالقسط ۖ لا نكلف نفسا إلا وسعها ۖ وإذا

231. ఖుర్ఆన్‌లో అనేకచోట్ల అల్లాహ్ తౌహీద్ (దేవుని ఏకత్వం) మరియు ఇతాఅత్ (విధేయత) గురించి తాకీదు చేసినప్పుడల్లా తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన గురించి నొక్కి చెప్పటం గమనార్హం. దీన్నిబట్టి మనకు బోధపడేదేమిటంటే ప్రభువు విధేయత తర్వాత తల్లిదండ్రుల విధేయత కూడా చాలా ముఖ్యమే. ఎవరయినా సరే తల్లిదండ్రుల పట్ల బాధ్యతా నిర్వహణలో విఫలమైతే, వారు ప్రభువు ఆజ్ఞల్ని పాలించటంలో కూడా పూర్తిగా సఫలీకృతులవుతారన్న ఆశలేదు.

232. ఒకప్పుడు అజ్ఞానకాలంలో క్రూరాతి క్రూరంగా సాగిన ఈ సంతాన హత్యాకాండ నేడు కుటుంబ నియంత్రణ, భ్రూణహత్యల రూపంలో యావత్తు ప్రపంచంలో నిరాఘాటంగా కొనసాగుతోంది. అల్లాహ్ మనల్ని దాన్నుంచి రక్షించుగాక!

233. అంటే ప్రతీకార న్యాయం (ఖిసాస్) రీత్యా హంతకుణ్ణి వధించటం ధర్మసమ్మతమే. క్షమాభిక్ష పెడితే అది వేరే విషయం. కాని హతుని వారసులు గనక క్షమాభిక్ష పెట్టనిపక్షంలో హంతకునికి మరణదండన విధించటం అవసరం అవుతుంది. ఎందుకంటే, “ప్రతీకార న్యాయంలో మీ మనుగడ ఉంది” (అల్ బఖర – 179).

234. తండ్రిలేని బిడ్డ సంరక్షణా బాధ్యతను ఒకసారి మీరు ఒప్పుకున్న తర్వాత ఆ బాధ్యతను సజావుగా నిర్వర్తించటం, ఆ అనాథ శ్రేయాన్ని అభిలషిస్తూ ఉండటం మీ కర్తవ్యం. మరి ‘శ్రేయోభిలాష’ కోరేదేమిటీ? అంటే వారసత్వ హక్కుగా ఆ అనాథకు లభించిన నగదునుగానీ, పొలాలనుగానీ, ఇంటి స్థలాలనుగానీ స్వాహా చేయకుండా, అతను యుక్త వయస్సుకు చేరుకునేదాకా కాపాడాలి. సాధ్యమైనంతవరకు అనాథ ఆస్తిపాస్తులను అభివృద్ధి చేయడానికి కృషిచేయాలి. ఎందుకంటే ఆ పసివాడు తన ఆస్తిపాస్తుల్ని కాపాడుకునే స్థితిలో లేడు. తనను నిలదీసి అడిగేవారెవరూ లేరుకదా అని ఈ ఆస్తిపాస్తుల్ని కబళించకూడదు. ఎందుకంటే అందరికన్నా పెద్ద సంరక్షకుడైన అల్లాహ్ ప్రతి దానిపై నిఘావేసి ఉన్నాడు. కాబట్టి అనాథ సొమ్ముకు పర్యవేక్షకులుగా ఉన్నవారు అనుక్షణం ఆయనకు భయపడుతూ ఉండాలి.

235. కొలతలు తూనికలలో మోసం చేయటం, పుచ్చుకునే సమయంలో లెక్క ప్రకారం పూర్తిగా పుచ్చుకుని, ఇచ్చేటప్పుడు తక్కువగా కొలచి ఇవ్వటం, తూకంలో ద్రోహానికి పాల్పడటం కడు నీచమైన పని. నైతిక దివాలాకోరుతనానికి ఇది ప్రతిబింబం. దైవప్రవక్త హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) జాతివారు వినాశానికి గురికావటానికి గల కారణాల్లో ఇది కూడా ఒకటి అన్న సంగతి విస్మరించరానిది.

قُلْتُمْ فَاعْدِلُوا وَلَوْ كَانَ ذَا قُرْبَىٰ ۖ وَبِعَهْدِ اللَّهِ
أَوْفُوا ۚ ذَٰلِكُمْ وَصَّاكُم بِهِ لَعَلَّكُمْ تَذَكَّرُونَ ﴿١٥٢﴾

పలికితే న్యాయమే పలకండి. న్యాయసమ్మతంగా మాట్లాడండి– వ్యవహారం మీ బంధువుకు సంబంధించినదైనా సరే! అల్లాహ్‌తో చేసిన బాసను నెరవేర్చండి. మీరు సదా జ్ఞాపక ముంచుకునేం దుకు గాను అల్లాహ్ మీకిలా తాకీదు చేశాడు.

وَأَنَّ هَٰذَا صِرَاطِي مُسْتَقِيمًا فَاتَّبِعُوهُ ۖ وَلَا تَتَّبِعُوا
السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَن سَبِيلِهِ ۚ ذَٰلِكُمْ
وَصَّاكُم بِهِ لَعَلَّكُمْ تَتَّقُونَ ﴿١٥٣﴾

**153** ఇదే[237] నా రుజుమార్గం. కనుక మీరు దీనినే అనుసరిం చండి.[238] ఇతరత్రా మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని అల్లాహ్ మార్గం నుండి వేరు పరుస్తాయి. మీరు భయభక్తుల వైఖరిని అవలంబించేటందుకుగాను అల్లాహ్ మీకు ఈ విధంగా తాకీదు చేశాడు.

ثُمَّ آتَيْنَا مُوسَى الْكِتَابَ تَمَامًا عَلَى الَّذِي أَحْسَنَ
وَتَفْصِيلًا لِّكُلِّ شَيْءٍ وَهُدًى وَرَحْمَةً

**154** తరువాత మేము ఉత్తమంగా ఆచరించేవారిపై అనుగ్రహం పరిపూర్తి కావటానికి, ఆజ్ఞలన్నీ స్పష్టంగా వివరించటానికి, మార్గదర్శకత్వం లభించటానికీ, కరుణించబడటానికి,[239] వారు

236. అంటే మేము చేసిన ఈ ఆజ్ఞలు ఆచరణ యోగ్యం కానటువంటివి కావు. కష్టసాధ్యమైనవి కూడా కావు. ఒకవేళ అవి మీ పాలిట కష్టతరం అయి ఉంటే మేము వాటిని గురించి ఆజ్ఞాపించి ఉండేవారమే కాము. ఎందుకంటే మా దాసులను కష్టాలపాలు చెయ్యాలన్నది మా ఉద్దేశం కాదు. కాబట్టి మీరు ప్రాపంచిక జీవితంలో గౌరవోన్నతుల్ని, పరలోక జీవితంలో సాఫల్యాన్ని పొందగోరితే మా ఆదేశాలను విధిగా పాటించవలసి ఉంటుంది.

237. **'ఇదే'** నా రుజుమార్గం అని అనబడింది. ఇంతకీ ఏమిటీ ఆ "ఇది"? అంటే అది ఖుర్ఆన్ కావచ్చు లేదా ఇస్లాం ధర్మం కావచ్చు లేదా ఈ ఆజ్ఞలు కూడా కావచ్చు. తౌహీద్ (ఏకదైవారాధన), మఆద్ (పరలోకం), రిసాలత్ (దైవదౌత్యం)– ఈ మూడే అవి. ఇస్లాం ధర్మం ఈ మూడు మూలాంశాల వైపే పరిభ్రమిస్తూ ఉంటుంది. కాబట్టి దాన్ని ఏ భావంలో తీసుకున్నా సారాంశం మాత్రం ఒక్కటే.

238. **'రుజుమార్గం'** అన్నది ఒక్కటే. దాన్ని దైవమార్గం అనండీ, ఖుర్ఆన్ మార్గం అనండి, దైవప్రవక్త(స) మార్గం అనండి– ఎలా అనుకున్నా అది మాత్రం ఒకే మార్గం, సరళమార్గం, సాఫల్య మార్గం – అదే రుజుమార్గం. ఆ మార్గాలు అనేకం కావు. కనుక ఒకే మార్గంపై నడవాలి. అనేక మార్గాలపై నడవకూడదు. ఇదే ముస్లిం సమాజ ఐక్యతకు, ఏకత్వానికి ఆయుఃపట్టు. ఈ దారిలో నుంచి పెడదారులు తీసినందువల్ల ముస్లిం సమాజం వర్గాలుగా, ముఠాలుగా చీలి, చెల్లాచెదురయి పోయింది. మరి చూడబోతే "ఇతర మార్గాలపై పోకండి, అవి మిమ్మల్ని దైవమార్గం నుంచి వేరుపరుస్తాయి" అని ముస్లిం సమాజానికి ముందే తాకీదు చేయటం జరిగింది. వేరొకచోట దేవుడు ఏమని ఆదేశించాడంటే; "మీరు ధర్మాన్ని స్థాపించండి. అందులో చీలికను తేకండి" (సూరె షూరా). అంటే విభేదానికి, చీలికకు ధర్మంలో ఎంతమాత్రం అనుమతి లేదు. ఈ విషయాన్నే మహాప్రవక్త (సఅసం) చాలా స్పష్టంగా – నేలపై తన చేత్తో ఒక గీతగీసి "ఇది దేవుని రుజుమార్గం" అని పలికారు. ఆ గీతకు ఇరుప్రక్కలా మరి కొన్ని గీతలు గీసి "ఇవి (వంకర టింకర) దారులు. వీటిపై షైతాన్ పొంచి ఉన్నాడు. వాడు ఈ దారులపైకి మనుషుల్ని పిలుస్తూ ఉన్నాడు" అని అప్రమత్తం చేశారు. తరువాత ఆయన (స) "ఇదే నా రుజుమార్గం..." అన్న వచనాన్ని పారాయణం చేశారు (ముస్నదె అహ్మద్ – సంపుటి: 1; పేజీ–435, 465). అహ్మద్ షాకిర్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. ఆయన కుడి ప్రక్కన రెండు గీతల్ని, ఎడమ ప్రక్కన రెండు గీతల్ని– మొత్తం నాలుగు గీతల్ని గీసి వాటిని షైతాను త్రోవలుగా వర్ణించారని ఇబ్నె మాజాలోని ఒక ఉల్లేఖనంలో మరింత స్పష్టంగా ఉంది.

239. ఇది ఖుర్ఆన్ బోధనా శైలికి ఒక నిదర్శనం. ఖుర్ఆన్ ప్రస్తావన వచ్చినప్పుడు చాలా చోట్ల తౌరాతు గ్రంథ ప్రస్తావనను

لَعَلَّهُم بِلِقَاءِ رَبِّهِمْ يُؤْمِنُونَ ﴿١٥٤﴾

తమ ప్రభువును కలుసుకునే విషయమై దృఢ విశ్వాసం కలిగి ఉండటానికిగాను మూసాకు గ్రంథాన్ని వొసగాము.

وَهَٰذَا كِتَابٌ أَنزَلْنَاهُ مُبَارَكٌ فَاتَّبِعُوهُ وَاتَّقُوا لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴿١٥٥﴾

**155** మరియు ఇది (ఈ ఖుర్ఆన్) మేము అవతరింపజేసిన ఒక శుభప్రదమైన గ్రంథం.[240] కాబట్టి మీరు దీనిని అనుసరించండి. భయభక్తులతో మెలగండి. తద్వారా మీరు కరుణించబడే అవకాశం ఉంది.

أَن تَقُولُوا إِنَّمَا أُنزِلَ الْكِتَابُ عَلَىٰ طَائِفَتَيْنِ مِن قَبْلِنَا وَإِن كُنَّا عَن دِرَاسَتِهِمْ لَغَافِلِينَ ﴿١٥٦﴾

**156** "మాకు పూర్వముండిన రెండు వర్గాలపై మాత్రం గ్రంథం[241] అవతరింపజేయబడింది. వారు ఏమి చదివేవారో, మరేమి చదివించేవారో అసలు మాకేమీ తెలియదు"[242] అని మీరు అనకుండా ఉండటానికీ,

أَوْ تَقُولُوا لَوْ أَنَّا أُنزِلَ عَلَيْنَا الْكِتَابُ لَكُنَّا أَهْدَىٰ مِنْهُمْ ۚ فَقَدْ جَاءَكُم بَيِّنَةٌ مِّن رَّبِّكُمْ وَهُدًى وَرَحْمَةٌ ۚ فَمَنْ أَظْلَمُ مِمَّن كَذَّبَ بِآيَاتِ اللَّهِ وَصَدَفَ عَنْهَا ۗ سَنَجْزِي الَّذِينَ يَصْدِفُونَ عَنْ آيَاتِنَا سُوءَ الْعَذَابِ

**157** "ఒకవేళ మాకే గనక గ్రంథం వొసగబడి ఉంటే మేము వారికన్నా ఎక్కువ రుజువర్తనులం అయ్యేవాళ్ళం" అని అనకుండా ఉండటానికిగాను (మేము ఖుర్ఆన్ గ్రంథాన్ని మీ వద్దకు పంపాము). ఇప్పుడు మీవద్దకు మీ ప్రభువు తరఫునుంచి ఒక స్పష్టమైన గ్రంథం, మార్గదర్శక సాధనం మరియు కారుణ్యం వచ్చేసింది.[243] అయినప్పటికీ అల్లాహ్ ఆయతులను అసత్యాలని కొట్టిపారేసి, వాటి నుంచి (ప్రజలను) ఆపే వాడికన్నా[244]

తీసుకురావటం జరిగింది. అలాగే తౌరాతును ప్రస్తావించినపుడు ఖుర్ఆన్ కూడా ప్రస్తావించబడింది. ఇలాంటి ఎన్నో ఉదాహరణలను హాఫిజ్ ఇబ్నె కసీర్ నకలు చేశారు. ఒకప్పుడు తౌరాతు గ్రంథం కూడా ఒక సమగ్రమైన గ్రంథంగా ఉండేదనీ, ధర్మావలంబనకు సంబంధించిన సర్వవిషయాలూ అందులో ఉండేవనీ, ఆ విధంగా అది ప్రజలకు మార్గదర్శక గ్రంథంగా, కారుణ్యప్రదంగా అలరారేదనీ దివ్య ఖుర్ఆన్ యొక్క వివరణా తీరునుబట్టి బోధపడుతోంది.

240. **'ఈ గ్రంథం'** అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం. అందులో ఇహపరాల శ్రేయోసాఫల్యాలు, శుభాలు ఇమిడి ఉన్నాయి.

241. అంటే, యూదులకు, క్రైస్తవులకు గ్రంథాలు వొసగబడినట్లుగా మాకు వొసగబడలేదు అనే మాట మీనుండి రాకుండా ఉండటానికిగాను మేము దివ్య ఖుర్ఆన్ను అవతరింపజేశాము.

242. అది మా భాషలో లేదు, ఎలా చదివేది? ఎలా చదివించేది? అని మీరు సాకులు చెప్పకుండా ఉండటానికి మీరు మాట్లాడేభాష – అరబీ భాష – లోనే ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము.

243. ఇక మీరు సాకులు చెప్పి, తప్పించుకునే అవకాశం ఎంతమాత్రం లేదు.

244. అంటే శుభాల సరోవరం, సంపూర్ణ మార్గదర్శకత్వం గల గ్రంథం వచ్చేసిన తరువాత కూడా సన్మార్గాన్ని (ఇస్లాంను) అవలంబించి, దైవకారుణ్యాన్ని పొందలేకపోయినవాడు, పైగా దీనిని ధిక్కరించి దీనిపట్ల వైముఖ్య ధోరణి కనబరచినవాడు ముమ్మాటికీ దుర్మార్గుడే. ఆయతులో **'యస్దిఫూన్'** (يَصْدِفُونَ) అని అనబడింది. దీనికి ఒక అర్థం విముఖత. మరో అర్థం ఇతరులను కూడా సత్యం వైపుకు పోకుండా అడ్డుకోవటం.

بِمَا كَانُوا يَصْدِفُونَ ﴿١٥٧﴾

పరమ దుర్మార్గుడు ఇంకెవడుంటాడు? మేము త్వరలోనే మా ఆయతుల నుండి ఆపేవారిని, వారి ఈ ఆపుదల కారణంగా ఘోరంగా శిక్షిస్తాము.

هَلْ يَنظُرُونَ إِلَّا أَن تَأْتِيَهُمُ الْمَلَائِكَةُ أَوْ يَأْتِيَ
رَبُّكَ أَوْ يَأْتِيَ بَعْضُ آيَاتِ رَبِّكَ ۗ يَوْمَ يَأْتِي بَعْضُ
آيَاتِ رَبِّكَ لَا يَنفَعُ نَفْسًا إِيمَانُهَا لَمْ تَكُنْ آمَنَتْ
مِن قَبْلُ أَوْ كَسَبَتْ فِي إِيمَانِهَا خَيْرًا ۗ قُلِ
انتَظِرُوا إِنَّا مُنتَظِرُونَ ﴿١٥٨﴾

**158** ఏమిటీ, తమ వద్దకు దైవదూతలు రావాలనీ, లేక నీ ప్రభువే స్వయంగా ప్రత్యక్షమవ్వాలనీ లేక నీ ప్రభువు వద్ద నుంచి ఏదైనా (గొప్ప) నిదర్శనం రావాలని వీళ్లు వేచి ఉన్నారా?[245] నీ ప్రభువు వద్ద నుంచి ఏదయినా గొప్ప సూచన వచ్చేసిన రోజున, ముందు నుంచీ విశ్వసించకుండా ఆ రోజునే విశ్వసించినవాని విశ్వాసం,[246] లేక విశ్వసించి కూడా ఏ సత్కార్యమూ[247] చేయని వాని విశ్వాసం అతనికి ఏ విధంగానూ ఉపయోగపడదు. కనుక "మీరూ నిరీక్షించండి, మేము కూడా నిరీక్షిస్తూ ఉంటాము"[248] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

245. దివ్య ఖుర్ఆన్‌ను అవతరింపజేయటం ద్వారానూ, ముహమ్మద్ (స)ను అంతిమ ప్రవక్తగా పంపటం ద్వారానూ మేము సందేశాన్ని అందజేసే ఏర్పాటును సంపూర్ణంగావించాము. ఇప్పటికీ వీళ్లు మార్గ విహీనతను విడనాడకపోతే ఎవరయినా చేసేదేముందీ? దైవదూతలు వచ్చి ప్రాణం తీసినపుడు విశ్వసిద్దామనో, ప్రభువు దిగివచ్చినప్పుడు – అంటే ప్రళయం సంభవించినపుడు విశ్వసిద్దామనో వీళ్లు వేచి ఉన్నారా? ప్రళయానికి ముందు దేవుడు ఉనికిలోకి తెచ్చే సూచనలను కళ్లారా చూసుకొనో లేక దేవుని ముందు హాజరుపరచబడినప్పుడో విశ్వసిద్దామని వీరు ఎదురు చూస్తున్నారా? ఒకవేళ చివరి ఘడియల్లో వారికి జ్ఞానోదయం అయినా, అది వారికి ఎలాంటి ప్రయోజనాన్నీ చేకూర్చదు. వాళ్లు పెద్ద సూచన కోసం నిరీక్షించి తమ దూరదృష్టిని ప్రదర్శిస్తున్నామని అనుకుంటున్నారేమో! ఇది వారి దూరదృష్టి కాదు, అవివేకానికి ప్రబల తార్కాణం. దేవుని నిదర్శనాలు, అద్భుతాలు కళ్లముందు కనిపిస్తున్నప్పుడు విశ్వసించటం ఏమాత్రం గొప్పతనం కాదు. కరడుగట్టిన అవిశ్వాసులు, పాపాత్ములు కూడా అలాంటి పరిస్థితిలో పశ్చాత్తాపం చెందుతారు. కాని వారి పశ్చాత్తాపం స్వీకరించబడదు. సహీహ్ హదీసులో ఉంది : "(తూర్పున ఉదయించే) సూర్యుడు పడమటి దిక్కున ఉదయించనంతవరకూ ప్రళయం సంభవించదు. సూర్యుడు పడమటి దిశలో ఉదయించటం చూసి ప్రజలంతా (అల్లాహ్‌ను) విశ్వసిస్తారు" అని మహనీయ ముహమ్మద్ (స) తెలిపారు. తరువాత ఆయన (స) ఈ ఆయతును పారాయణం చేశారు : "ముందు నుంచీ విశ్వసించకుండా ఆ రోజున విశ్వసించేవాని విశ్వాసం అతనికేవిధంగానూ పనికి రాదు" (సహీహ్ బుఖారీ : తఫ్సీర్ అల్ అన్ఆమ్ సూరా).

246. అంటే దైవతిరస్కారి యొక్క 'విశ్వాసం' అతనికేవిధంగానూ ప్రయోజనం చేకూర్చదు.

247. దీనిభావం ఏమిటంటే పాపాత్ముడైన విశ్వాసి (మోమిన్) ఆ రోజు తన పాపాలపై సిగ్గుతో కుంచించుకుపోయినప్పటికీ ఆ ఘడియలో అది స్వీకారయోగ్యమవదు. ప్రాణం పోయేముందు చేసే దానధర్మాలుగానీ, పుణ్య కార్యాలుగానీ సాఫల్యానికి ఉపయోగపడవని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది.

248. అల్లాహ్‌ను విశ్వసించకుండా తలబిరుసుతనం చూపేవారికీ, విశ్వసించినా సత్కార్యాలు చేయకుండా అజాగ్రత్తగా ఉండేవారికీ ఇది ఒక హెచ్చరిక. దివ్య ఖుర్ఆన్‌లో ఈ విషయం ముహమ్మద్ సూరాలోని 18వ ఆయతులో, మోమిన్ సూరాలోని 85వ ఆయతులో కూడా వివరించబడింది.

**159** ఎవరు తమ ధర్మాన్ని ముక్క చెక్కలుగా చేసి, వర్గాలుగా ముఠాలుగా విడిపోయారో[249] వాళ్ళతో నీకే సంబంధమూ లేదు. వాళ్ళ వ్యవహారం దైవాధీనమై ఉంది. తర్వాత వాళ్లు చేసిందేమిటో ఆయన వారికి తెలియజేస్తాడు.

إِنَّ الَّذِينَ فَرَّقُوا دِينَهُمْ وَكَانُوا شِيَعًا لَّسْتَ مِنْهُمْ فِي شَيْءٍ ۚ إِنَّمَا أَمْرُهُمْ إِلَى اللَّهِ ثُمَّ يُنَبِّئُهُم بِمَا كَانُوا يَفْعَلُونَ ﴿١٥٩﴾

**160** సత్కార్యం చేసినవాని సత్కార్యానికి పదిరెట్లు లభిస్తాయి.[250] దుష్కార్యానికి ఒడిగట్టిన వాని దుష్కార్యానికి దానికి సరిపడా శిక్ష మాత్రమే విధించబడుతుంది.[251] వారికి ఎలాంటి అన్యాయం జరగదు.

مَن جَاءَ بِالْحَسَنَةِ فَلَهُ عَشْرُ أَمْثَالِهَا ۖ وَمَن جَاءَ بِالسَّيِّئَةِ فَلَا يُجْزَىٰ إِلَّا مِثْلَهَا وَهُمْ لَا يُظْلَمُونَ ﴿١٦٠﴾

**161** (ఓ ప్రవక్తా!) ఈ విధంగా చెప్పు: "నా ప్రభువు నాకు రుజుమార్గం చూపించాడు. అదొక స్థిరమైన ధర్మం. ఎలాంటి వక్రతా లేనిది, అల్లాహ్ వైపు ఏకాగ్రతతో మరలిన ఇబ్రాహీమ్ విధానం అది. ఆయన ముష్రిక్కులలోని వాడు కాడు."

قُلْ إِنَّنِي هَدَانِي رَبِّي إِلَىٰ صِرَاطٍ مُّسْتَقِيمٍ دِينًا قِيَمًا مِّلَّةَ إِبْرَاهِيمَ حَنِيفًا ۚ وَمَا كَانَ مِنَ الْمُشْرِكِينَ ﴿١٦١﴾

**162** ఇంకా ఈ విధంగా ప్రకటించు : "నిస్సందేహంగా నా నమాజు, నా సకల ఆరాధనలు, నా జీవనం, నా మరణం - ఇవన్నీ సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే.

قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ﴿١٦٢﴾

**163** ఆయనకు భాగస్వాములెవరూ లేరు. దీని గురించే నాకు ఆజ్ఞాపించబడింది. ఆజ్ఞాపాలన చేసే వారిలో నేను మొదటి వాణ్ణి."[252]

لَا شَرِيكَ لَهُ ۖ وَبِذَٰلِكَ أُمِرْتُ وَأَنَا أَوَّلُ الْمُسْلِمِينَ ﴿١٦٣﴾

249. భిన్న వర్గాలుగా చీలిపోయిన వారు యూదులు, క్రైస్తవులనీ కొందరు, ముష్రిక్కులని కొందరూ అభిప్రాయపడ్డారు. ముష్రిక్కులలో కొందరు దేవీ దేవతల్ని, మరికొందరు దైవదూతలను, ఇంకొందరు నక్షత్రాలను, విగ్రహాలను పూజిస్తారు. అయితే ఈ ఆయతు భావం చాలా విస్తృతమయింది. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) మార్గాన్ని విడనాడి ఇతర ధర్మాలను, ఇతరత్రా పద్ధతులను అవలంబించే వారందరికీ ఇది వర్తిస్తుంది. అరబీలో **'షియఅన్' (شِيَعًا)** అని ఉంది. వర్గాలు, గ్రూపులు, ముఠాలు అని దీని అర్థం. ఒకప్పుడు ధర్మావలంబన విషయంలో ఒకే త్రాటిపై ఉండి, ఆ తరువాత తమ గురువుల, మత పెద్దల మాటలకు పెద్ద పీటవేసి, వారి పాదచిహ్నాలలో నడుస్తూ మూల ధర్మాన్ని వదిలిన వారందరికీ ఈ పదం వర్తిస్తుంది (ఫత్హుల్ ఖదీర్).

250. తనను విశ్వసించి, మంచిపనులు చేసే దాసుల పట్ల అల్లాహ్ చేసే దాక్షిణ్య వ్యవహారానికి, ఆయన ఔదార్యానికి ఇది ఒక నిదర్శనం. ఒక సత్కార్యానికి ఆయన పదింతల పుణ్యం ప్రసాదిస్తున్నాడు. ఇది ఆయన వొసగే కనీస పుణ్యఫలం. కొన్ని పుణ్యకార్యాలకు ఆయన ప్రసాదించే పుణ్యఫలం ఎన్నోరెట్లు ఉంటుందని, ఆయన లెక్క లేనంతగా వొసగుతాడని ఖుర్ఆన్ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. అది వేలాది రెట్లు కూడా కావచ్చు.

251. దాసుడు తప్పుచేసి, ఆ తప్పుపై పశ్చాత్తాపం కూడా చెందకుండా ఉంటే లేదా అతని పుణ్యకార్యాలు అతని పాపాలను మరుగుపరచలేనంత తక్కువగా ఉంటే లేదా ఆ దాసుని దుష్కర్మలు క్షంతవ్యం కానంత తీవ్రంగా ఉంటే అట్టి పరిస్థితిలో అతన్ని శిక్షించటం అనివార్యం అవుతుంది. ఇది దైవసాంప్రదాయం. కాని దేవుడు అతను చేసిన ఒక్కొక్క

**164** (ఓ ప్రవక్తా!) వారిని అడుగు: "ఏమిటీ, నేను అల్లాహ్‌ను కాదని వేరొక ప్రభువును వెతుక్కోవాలా?! వాస్తవానికి ప్రతిదానికీ ప్రభువు ఆయనే.[253] ఎవరు చేసిన పనులకు వారే బాధ్యులు. బరువును మోసేవాడెవడూ ఇంకొకడి బరువును మోయడు.[254] ఆ తర్వాత మీరంతా మీ ప్రభువు వద్దకే పోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు ఏ ఏ విషయాలలో విభేదించుకున్నారో వాటి వాస్తవాలను తెలియజేస్తాడు.[255]

قُلْ اَغَيْرَ اللّٰهِ اَبْغِىْ رَبًّا وَّهُوَ رَبُّ كُلِّ شَىْءٍ ؕ وَلَا تَكْسِبُ كُلُّ نَفْسٍ اِلَّا عَلَيْهَا ۚ وَلَا تَزِرُ وَازِرَةٌ وِّزْرَ اُخْرٰى ۚ ثُمَّ اِلٰى رَبِّكُمْ مَّرْجِعُكُمْ فَيُنَبِّئُكُمْ بِمَا كُنْتُمْ فِيْهِ تَخْتَلِفُوْنَ ﴿164﴾

పాపకార్యానికి దానికి సమానమైన శిక్ష మాత్రమే విధిస్తాడుగాని అంతకుమించి శిక్షించడు. ఎందుకంటే దైవాగ్రహంపై దైవానుగ్రహం ఎల్లప్పుడూ పై చేయిగా ఉంటుంది.

252. "దీని గురించి మాత్రమే నాకు ఆజ్ఞాపించబడింది. ఆజ్ఞాపాలన చేసేవారిలో నేను తొలివాడను" అని దేవుడు తన అంతిమ ప్రవక్త (స) ద్వారా ప్రకటన గావించాడు. ఒకే అల్లాహ్‌ను ఆరాధించాలన్న దానికి (తౌహీదె ఉలూహియ్యత్‌కు) సంబంధించి దైవప్రవక్తలందరూ ఇచ్చిన సందేశం కూడా ఇదే.

వేరొకచోట దేవుడు ఇలా సెలవిచ్చాడు : "(ఓ ప్రవక్తా!) మేము నీకు పూర్వం ఎందరు ప్రవక్తలను పంపినా వారికి వహీ ద్వారా 'నేను తప్ప మరో దేవుడు లేడు. కాబట్టి మీరు నన్నే ఆరాధించండి' అనే విషయాన్ని మాత్రమే తెలియజేశాము" (అల్ అంబియా-25). హజ్రత్ నూహ్ అలైహిస్సలాం కూడా అదే అన్నారు: "నేను మాత్రం ముస్లిం అయి ఉండాలని నాకు ఆదేశించబడింది" (యూనుస్ - 72). అలాగే దేవుడు తన ప్రవక్త అయిన హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం నుద్దేశించి, "విధేయుడవు అయిపో" అని ఆజ్ఞాపించినంతనే "నేను సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కు విధేయుణ్ణి అయిపోయాను" అని బదులిచ్చారు (అల్ బఖర - 131). అదేవిధంగా హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం)లు "మీరు ముస్లిములు (దైవవిధేయులు)గా తప్ప మరణించకండి" అని తమ సంతానానికి తాకీదు చేశారు. "ఓ అల్లాహ్! నేను ఇస్లాం ధర్మంపై ఉన్న స్థితిలోనే మరణమొసగు" అని దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) అల్లాహ్‌ను వేడుకున్నారు (యూసుఫ్ - 101). "ఒకవేళ మీరు ముసల్మానులే అయితే మీరు అల్లాహ్‌నే నమ్మండి" అని దైవప్రవక్త హజ్రత్ మూసా అలైహిస్సలాం తన జాతి వారికి ఉపదేశించారు (యూనుస్-84). "మేము ముస్లింలము అయ్యాము అన్న విషయానికి నీవే సాక్షివి" అని దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) అనుచరులైన హవారీలు ప్రతిస్పందించారు. ఈ విధంగా దైవప్రవక్తలందరూ, వారి అనుయాయులు కూడా ఏకదైవారాధన (తౌహీదె ఉలూహియ్యత్)ను బోధించే ఇస్లాం ధర్మాన్నే అవలంబించారు. కాకపోతే ఆయా కాలాల, పరిస్థితుల దృష్ట్యా షరీయతు ఆదేశాలలో కొంత వైవిధ్యం ఉండేది. మౌలికంగా ప్రవక్తలందరూ ఉపదేశించిన ధర్మం ఒక్కటే. అదే ఇస్లాం.

253. ఇక్కడ **'ప్రభువు'** అంటే భావం అల్లాహ్‌యే. బహుదైవారాధకులు, అవిశ్వాసులు తిరస్కరిస్తున్న నిజదైవం అన్నమాట! బహుదైవారాధకులు దేవుని పోషకత్వాన్ని, పర్యవేక్షణను ఒప్పుకునేవారు. అంతవరకూ చిక్కులేదు కాని వారు ఆయన దైవత్వంలో మాత్రం ఇంకొకరికి భాగస్వామ్యం కల్పించేవారు.

254. న్యాయం విషయంలో అల్లాహ్ సాటిలేని మేటి. ఆయన అందరి పట్లా న్యాయంగా వ్యవహరిస్తాడు. ఒకరి పాపభారం ఇంకొకరి నెత్తిమీద మోపటం జరగదు. ఎవరు చేసుకున్న పనులకు వారే బాధ్యులు.

255. ప్రవక్తలందరూ ఇచ్చిన సందేశం ఒక్కటే. అదే ఏకదైవారాధన. ఒకవేళ మీరు గనక ఈ 'దేవుని ఏకత్వం' (తౌహీద్) విషయంలో ఏకీభవించకుండా వాదులాడుకుంటే ఎవరయినా చేసేదేముంది?! మీ పద్ధతిని మీరు పాటించండి. మా పనిని మేము చేస్తూపోతాము. తీర్పుదినాన సర్వోన్నతుడైన న్యాయాధిపతి సమక్షంలో మీకూ - మాకూ మధ్య న్యాయ నిర్ణయం చేయబడుతుంది.

**165** ఆయనే మిమ్మల్ని భూమండలంలో ఖలీఫాలుగా చేశాడు.[256] మీకు ప్రసాదించిన వాటిలో[257] మిమ్మల్ని పరీక్షించే నిమిత్తం కొందరికి మరికొందరిపై ఉన్నత స్థానాలను ప్రసాదించాడు. నిశ్చయంగా నీ ప్రభువు శిక్షించటంలో వేగవంతుడు. అలాగే ఆయన అపారంగా క్షమించేవాడు, కరుణించేవాడు కూడాను.

وَهُوَ الَّذِي جَعَلَكُمْ خَلَائِفَ الْأَرْضِ وَرَفَعَ بَعْضَكُمْ فَوْقَ بَعْضٍ دَرَجَاتٍ لِّيَبْلُوَكُمْ فِي مَا آتَاكُمْ ۗ إِنَّ رَبَّكَ سَرِيعُ الْعِقَابِ وَإِنَّهُ لَغَفُورٌ رَّحِيمٌ ﴿١٦٥﴾

256. అంటే మీకు అధికారాలు ఇచ్చాడు. లేదా ఒకరి తర్వాత ఇంకొకరిని వారసునిగా (ఖలీఫా)గా చేశాడు.

257. అంటే కలిమిలేములు, కష్టసుఖాలు, ఆరోగ్యం, అనారోగ్యం, విద్యా వివేకాలు, ప్రగతీ వికాసాలు – ఇత్యాదివన్నీ మనిషికి పరీక్ష వంటివి. ఏ స్థితిలోనయినా మనిషి ధర్మమార్గంలో నడవాలన్నదే దేవుని అభిమతం.

7వ సూరా

# అల్ ఆరాఫ్

## ఎత్తయిన ప్రదేశాలు

అవతరణ
మక్కాలో

ఆయతులు
206

### పరిచయం

*ఈమాన్ (ధార్మిక విశ్వాసం), తౌహీద్ (ఏక దైవారాధన), మరణానంతర జీవితం, శిక్షా బహుమానాలు, దైవవచనాల అవతరణ, ప్రవక్తల పరంపరలను గురించి ఈ సూరాలో నొక్కి చెప్పడం జరిగింది. ఈ సూరాలోని 46వ ఆయతులో వచ్చిన విషయం ఆధారంగా ఈ సూరాకు* ***'అల్ ఆరాఫ్'*** *అని పేరు పెట్టబడింది.*

*దివ్యఖుర్‌ఆన్ ఒక దివ్యవాణి అనీ, అల్లాహ్ తరఫున మానవాళికి ఒక అనుగ్రహంగా ప్రసాదించబడిందనీ, మానవాళి ఇహలోకంలో సంతోషం, పరలోకంలో సాఫల్యం పొందడానికి దీనికి కట్టుబడాలనీ, ఇందులోని ఆదేశాలను పాటించాలనీ, హెచ్చరికలను గుర్తుంచుకోవాలని ఈ సూరా ప్రారంభ వచనాల్లో నొక్కి చెప్పబడింది. ఈ సూరాలో అల్లాహ్ ప్రసాదించిన మరొక అనుగ్రహం గురించి కూడా ప్రస్తావించడం జరిగింది. యావత్తు మానవాళిని ఒకే తండ్రి ఆదమ్ (అస) నుంచి సృష్టించడం జరిగిందనీ, ఆ విధంగా మానవాళి సమస్తం ఒకే కుటుంబం అని గుర్తుచేయడం జరిగింది.*

*మనిషికి ప్రసాదించబడిన ఉన్నత స్థానాన్ని ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. మానవాళిని తప్పుదారి పట్టించడానికి, మన జీవిత విధానాన్ని మార్గభ్రష్టం చేసేలా ప్రభావితం చేయడానికి, ఆ విధంగా మనలను అల్లాహ్‌కు, అల్లాహ్ ధర్మానికి దూరం చేయడానికి షైతాన్ అలుపెరుగక, నిరంతరాయంగా ప్రయత్నిస్తూనే ఉన్నాడని తెలియజేసింది. మానవాళిని ఉద్దేశించి, షైతాన్‌కు విధేయత చూపవద్దనీ, షైతాన్ చూపించే పైపై ఆకర్షణకు దాసోహం అయిపోవద్దని హెచ్చరించింది.*

*ఈ సూరా గత జాతుల గురించి, వారి ప్రవక్తల గురించి ప్రస్తావించింది. ఇందులో ఆదమ్, నూహ్, హూద్, సాలిహ్, లూత్, షుఐబ్, మూసా (వారిపై శాంతి వర్షించుగాక!) గురించిన వివరాలు ప్రస్తావించింది. మానవాళికి పితామహుడైన ఆదమ్ (అస) మాత్రమే కాదు, మిగిలిన ప్రవక్తలు అందరూ కూడా ఒకే విధమైన సందేశాన్ని, ఏక దైవారాధన సందేశాన్ని మానవాళికి అందించారని ఈ సూరా తెలియజేసింది. ప్రవక్తలందరూ తమ జాతుల ప్రజలను విగ్రహారాధన మానుకోమనీ, కేవలం అల్లాహ్ ఒక్కడిని మాత్రమే ఆరాధించాలనీ, ఎవరినీ అల్లాహ్‌కు సమానంగా నిలబెట్టరాదని బోధించారు. ఈ సూరాలో గ్రంథ ప్రజల గురించి సంక్షిప్తంగా ప్రస్తావనలు కూడా ఉన్నాయి. వారి గ్రంథాలు, అంటే తౌరాత్, ఇంజీల్ గ్రంథాల్లో ప్రవక్త ముహమ్మద్ (స) పేరు ప్రస్తావించబడిందని ఈ సూరా తెలుపుతోంది.*

# సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 4 | 97, 51 28, 22, 18 | 'సముద్రం చీలటం' 'హెచ్చరించే దూతలు' 'అల్లాహ్ పథకం' 'నిష్ఫలం' 'జలప్రళయం' | ఎన్నో మానవ సముదాయాలను వారి తలబిరుసు వైఖరి కారణంగా అల్లాహ్ నాశనం చేశాడని ప్రపంచ చరిత్ర చెబు తోంది. అల్లాహ్ వాటిని మనకొరకు గుణపాఠ సాధనాలుగా చేశాడు. ఉదాహరణకు కొన్ని సంఘటనలను ఇక్కడ మనం తెలుసుకోవచ్చు. |
| 11-25 | 4,6 | 'మానవ సృష్టి' 'ఇబ్లీస్ ప్రతీకారం' | భూమ్మీద కాలుమోపిన మొట్టమొదటి మానవుడు. మనిషి అంటే షైతాన్‌కు ఎందుకంత అసూయ, కోపం? |
| 59-64 | 14 | 'దైవప్రవక్త నూహ్' | నూహ్ ప్రవక్తను 'మరొక ఆదం' అని పిలుస్తారెందుకని? ఆయన తన జాతి ప్రజలకు ఎంతకాలం పాటు ఇస్లాం సందేశం అందజేశారు? తలబిరుసులైన ఆయన జాతి ప్రజలు ఏ విధంగా శిక్షించబడ్డారు? |
| 65-72 | 21 | 'దైవప్రవక్త హూద్' | హూద్ ప్రవక్త ఏ జాతివారి వైపు పంపబడ్డారు? జాతి ప్రజల నుంచి ఆయనకు ఏం సమాధానం లభించింది? తిరస్కారు లను అల్లాహ్ ఏ విధంగా శిక్షించాడు? |
| 73-79 | 25 | 'దైవప్రవక్త సాలిహ్' | సాలిహ్ ప్రవక్త పంపబడిన జాతి పేరేమిటి? వారు ఏ కళల్లో నిష్ణాతులు? అల్లాహ్ వారికి ఏ మహిమను చూపించాడు? చివరికి వారి కథ ఎలా ముగిసింది? |
| 80-84 | 50 | 'దైవప్రవక్త లూత్' | ప్రపంచంలో అత్యంత నీచమైన ఒక కార్యానికి లూత్ జాతి శ్రీకారం చుట్టింది? ఏమిటి ఆ నీచకార్యం? దైవప్రవక్త హిత బోధ విని వారు ఆ పనిని మానుకున్నారా? లేక అంధులుగానే వ్యవహరించారా? |
| 85-93 | 81 | 'దైవప్రవక్త షుఐబ్' | షుఐబ్ ప్రవక్త పంపబడిన జాతివారిని 'అయికా జనులు' అంటారు, ఎందుకని? వారిలోని ఏ సాంఘిక నేరాన్ని రూపుమాపటానికి షుఐబ్ ప్రవక్త కృషి చేశారు? |
| 103-162 | 83 | 'దైవప్రవక్త మూసా' | ఖుర్ఆన్‌లో అత్యధిక సార్లు ప్రస్తావనకు వచ్చిన గాథ ఇది. ఆ గాథ మొత్తం ఒకే చోట ధారావాహికంగా.... |
| 163-166 | 133 | 'సబ్బత్ నియమ అతిక్రమణ' | శనివారం వాళ్లు ఎవరు? వారిపై అల్లాహ్ ఆగ్రహం ఎందుకు విరుచుకుపడింది? అల్లాహ్ వారిని ఏ విధంగా శిక్షించాడు? |

## అల్ ఆరాఫ్ సూరా

## سُورَةُ الأَعْرَافِ

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

الٓمٓصٓ ﴿1﴾

**1** అలిఫ్ – లామ్ – మీమ్ – సాద్.

كِتٰبٌ اُنْزِلَ اِلَيْكَ فَلَا يَكُنْ فِيْ صَدْرِكَ حَرَجٌ
مِّنْهُ لِتُنْذِرَ بِهٖ وَذِكْرٰى لِلْمُؤْمِنِيْنَ ﴿2﴾

**2** ఇదొక గ్రంథం. దీని ఆధారంగా నీవు హెచ్చరించటానికిగాను ఇది నీ వద్దకు పంపబడింది. కాబట్టి (ఓ ప్రవక్తా!) దీని పట్ల నీ మనసులో ఎటువంటి సంకోచం[1] ఉండకూడదు. విశ్వసించిన వారికి ఇది హితబోధిని (జ్ఞాపిక!).

اِتَّبِعُوْا مَاۤ اُنْزِلَ اِلَيْكُمْ مِّنْ رَّبِّكُمْ وَلَا تَتَّبِعُوْا مِنْ
دُوْنِهٖۤ اَوْلِيَآءَ ؕ قَلِيْلًا مَّا تَذَكَّرُوْنَ ﴿3﴾

**3** (ప్రజలారా!) మీ ప్రభువు తరఫున మీకు వొసగబడిన దానిని మీరు అనుసరించండి.[2] అల్లాహ్‌ను వదలి ఇతర సంరక్షకులను అనుసరించకండి. మీరు బహుకొద్దిగా మాత్రమే హితబోధను గ్రహిస్తారు.

وَكَمْ مِّنْ قَرْيَةٍ اَهْلَكْنٰهَا فَجَآءَهَا بَاْسُنَا
بَيَاتًا اَوْ هُمْ قَآئِلُوْنَ ﴿4﴾

**4** ఎన్నో జనవాసాలను మేము రూపుమాపాము. వాటిపై మా శిక్ష రాత్రి వేళనో లేక మధ్యాహ్నం వారు విశ్రమిస్తున్న సమయంలోనో[3] వచ్చి పడింది.

1. అంటే సత్యప్రచారం నీ మనస్సుకు కష్టంగా తోయకూడదు. సత్యధర్మ ప్రచారం చేస్తే తిరస్కారులు నిన్ను ఎక్కడ ఈసడించుకుంటారో, ఎక్కడ వేధింపులు మొదలవుతాయోనన్న భయం కూడా నీలో కలగకూడదు. ఎందుకంటే అల్లాహ్ నీకు అండగా ఉన్నాడు. ఆయన నీకు సహాయపడుతున్నాడు. మూలంలో వచ్చిన **'హరజ్'** అనే పదాన్ని సంశయం, సందేహం, అనుమానం అన్న అర్థంలో తీసుకుంటే, ఈ గ్రంథం అల్లాహ్ తరఫు నుంచి అవతరించబడిందన్న విషయంలో నీవు ఏమాత్రం సందేహానికి, అనుమానానికి లోనుకారాదన్న భావం వస్తుంది. ఈ మాటలు ప్రవక్తనుద్దేశించి చెప్పబడినప్పటికీ ముస్లిం సమాజ సభ్యులు దీని అసలు సంబోధితులు. ముఖ్యంగా సత్యధర్మోన్నతికై జీవితాలను అంకితం చేసినవారు ఈ వాక్యాల ద్వారా స్ఫూర్తి పొందవలసి ఉంటుంది.

2. **"ప్రభువు తరఫున వొసగబడిన దానిని అనుసరించండి"** అంటే ఖుర్‌ఆన్‌ను మరియు దైవప్రవక్త (స) ప్రబోధనలను (హదీసులను) అనుసరించండి అని భావం. ఎందుకంటే "నేను ఖుర్‌ఆన్ మరియు దాని లాంటిదే ఇచ్చి పంపబడ్డాను" అని మహాప్రవక్త (స) చెప్పారు. కనుక ఈ రెండింటినీ అనుసరించటం అవసరం. ఈ రెండు మినహా ఇతరత్రా విధానాలను అనుసరించవలసిన అవసరం లేదు. పైగా వాటిని నిర్ద్వంద్వంగా నిరాకరించాలి. ఎందుకంటే అల్లాహ్‌ను వదలి ఇతరత్రా మీ ఊహాకల్పిత స్వాములను అనుసరించరాదని ఆ తరువాతి వాక్యంలోనే తాకీదు చేయబడింది. అజ్ఞానకాలంలో సర్దారుల, జ్యోతిష్యుల మాటలకు ఎనలేని ప్రాధాన్యత ఉండేది. ధర్మాధర్మాలను కూడా వీళ్ళే నిర్ణయించేవారు.

3. మా శిక్ష జనులు విశ్రాంతి తీసుకుంటూ ఆదమరచి నిద్రపోతున్న వేళనే వచ్చిపడిందని భావం. మూలంలో **'ఖాయిలూన్'** అని అనబడింది. ఇది 'ఖైలూలతున్' నుంచి వచ్చిన పదం. మధ్యాహ్నం వేళ విశ్రాంతి తీసుకోవటాన్ని 'ఖైలూలహ్' అంటారు.

فَمَا كَانَ دَعْوٰىهُمْ اِذْ جَآءَهُمْ بَاْسُنَآ اِلَّآ اَنْ قَالُوْٓا اِنَّا كُنَّا ظٰلِمِيْنَ ⑤

5 వారిపై మా శిక్ష వచ్చిపడినప్పుడు “మేము నిజంగానే దుర్మార్గులం”[4] అన్న మాట తప్ప మరోమాట వారినోటి నుండి రాలేదు.

فَلَنَسْـَٔلَنَّ الَّذِيْنَ اُرْسِلَ اِلَيْهِمْ وَلَنَسْـَٔلَنَّ الْمُرْسَلِيْنَ ⑥

6 ఎవరి వద్దకు ప్రవక్తలు పంపబడ్డారో వారిని తప్పకుండా అడుగుతాము. ప్రవక్తలను కూడా మేము తప్పకుండా ప్రశ్నిస్తాము.[5]

فَلَنَقُصَّنَّ عَلَيْهِمْ بِعِلْمٍ وَّمَا كُنَّا غَآىِٕبِيْنَ ⑦

7 మాకు ప్రతిదీ తెలుసు గనక తర్వాత వారి ముందు ఉన్నదున్నట్టు విప్పి చెబుతాము[6] – మాకు ఏదీ తెలియకుండా లేదు.

وَالْوَزْنُ يَوْمَىِٕذِ الْحَقُّ ۚ فَمَنْ ثَقُلَتْ مَوَازِيْنُهٗ فَاُولٰٓىِٕكَ هُمُ الْمُفْلِحُوْنَ ⑧

8 ఆ రోజు బరువు (తూకం) కూడా సత్యమే. ఎవరి త్రాసు బరువుగా ఉంటుందో వారే సాఫల్యం పొందేవారు.

وَمَنْ خَفَّتْ مَوَازِيْنُهٗ فَاُولٰٓىِٕكَ الَّذِيْنَ خَسِرُوْٓا اَنْفُسَهُمْ بِمَا كَانُوْا بِاٰيٰتِنَا يَظْلِمُوْنَ ⑨

9 మరెవరి త్రాసు తేలికగా ఉంటుందో వారు, మా ఆయతుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తించినందుకుగాను చేజేతులా నష్టాన్ని కొనితెచ్చుకునేవారు.[7]

4. అయితే చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు. గడువు ఇవ్వబడినప్పుడు వారు దాన్ని సద్వినియోగం చేసుకోలేదు. ఖుర్ఆన్‌లోనే మరోచోట సెలవీయబడినట్లు – “మా శిక్షను చూచిన మీదట వారి విశ్వాసం, వారికేవిధంగానూ ప్రయోజనకరం కాలేదు” (మోమిన్ – 85).

5. “మీ వద్దకు ప్రవక్తలు వచ్చారా? లేదా? వారు నా సందేశాన్ని మీకు అందజేశారా? లేదా?” అని దేవుడు తిరస్కారులను నిలదీసి అడుగుతాడు. దానికి వారు, “ఓ అల్లాహ్! ప్రవక్తలు మా వద్దకు వచ్చిన మాట నిజమే. కాని మేమే మా అదృష్టం తగలబడి వారి పట్ల దురుసుగా ప్రవర్తించాము” అని ఒప్పుకుంటారు. “మీరు నా సందేశాన్ని హెచ్చుతగ్గులు లేకుండా మీ సమాజాల వారికి అందజేశారా? మీ సమాజాల వారు ఎటువంటి వైఖరిని అవలంబించారు?” అని ప్రవక్తలను కూడా ప్రశ్నిస్తాడు. దానికి ప్రవక్తలు జరిగినదంతా చెప్పుకుంటారు. ఈ వివరాలు దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల పునరావృతం అయ్యాయి.

6. మాకు గోప్యమైన విషయాలు, బహిరంగ విషయాలు – అన్నీ తెలుసు గనక మేము వారి ఎదుట (ప్రవక్తల, ప్రవక్తల సమాజాల ముందు) వారు చెప్పినదీ, చేసినదీ అంతా పూసగుచ్చినట్లుగా చెబుతాము.

7. ఈ వాక్యాలలో కర్మల – సత్కర్మల – బరువు గురించి చెప్పబడింది. ప్రళయదినాన అందరి కర్మలూ ఈ విధంగా తూయబడతాయి. దివ్య ఖుర్ఆన్‌లోనూ, హదీసులలోనూ పలుచోట్ల ఈ తూకం ప్రస్తావనకు వచ్చింది. కర్మలు తూకం వేయబడినపుడు ఎవరి సత్కర్మల తక్కెడ బరువుగా ఉంటుందో వారు మోక్షం పొందుతారు. మరెవరి సత్కర్మల త్రాసు తేలికగా ఉంటుందో వారు పరాభవం పాలవుతారు. కర్మలకు ఒక రూపు, ఆకారం లేనప్పుడు అవి త్రాసులో ఎలా తూయబడతాయి? అన్న ప్రశ్న యిక్కడ జనించటం సహజం. తీర్పుదినాన దేవుడు కర్మలకు ఆకృతిని ఇచ్చి మరీ తరాజులో తూకం వేయిస్తాడని కొంతమంది వ్యాఖ్యాతలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. మనిషి కర్మలు నమోదై ఉన్న రిజిస్టర్లు, చిట్టాలు తూయబడతాయని మరి కొంతమంది వ్యాఖ్యానించారు. సరాసరి సదరు మనిషే తూయబడతాడని ఇంకొంతమంది అభిప్రాయం వ్యక్తపరిచారు. మూడు విధాలుగా అభిప్రాయపడిన ఈ ముగ్గురూ తమ తమ అభిప్రాయాలకనుగుణంగా ప్రామాణిక హదీసులను ఉదాహరిస్తున్నారు. ఈ మూడింటినీ మేళవిస్తూ ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అన్నారు: “ఈ మూడు అభిప్రాయాలూ సరైనవే కావచ్చు. కొందరి విషయంలో

وَلَقَدْ مَكَّنّٰكُمْ فِي الْأَرْضِ وَجَعَلْنَا لَكُمْ فِيهَا مَعَايِشَ ۗ قَلِيلًا مَّا تَشْكُرُونَ ⑩

**10** నిశ్చయంగా మేము మిమ్మల్ని భువిపై నివసింపజేశాము. మీ కొరకు అందులో జీవన సామగ్రిని సమకూర్చాము. అయినప్పటికీ మీరు కృతజ్ఞత తెలుపుకునేది బహు తక్కువ.

وَلَقَدْ خَلَقْنٰكُمْ ثُمَّ صَوَّرْنٰكُمْ ثُمَّ قُلْنَا لِلْمَلٰٓئِكَةِ اسْجُدُوا لِاٰدَمَ ۖ فَسَجَدُوٓا إِلَّآ إِبْلِيسَ ۗ لَمْ يَكُن مِّنَ السّٰجِدِينَ ⑪

**11** మేము మిమ్మల్ని సృష్టించాము.[8] మరి మేమే మీ రూపురేఖలను తీర్చిదిద్దాము. ఆ తరువాత దూతలను, "ఆదం ముందు సాష్టాంగపడండి" అని ఆదేశించాము. ఒక్క ఇబ్లీసు తప్ప అందరూ సాష్టాంగపడ్డారు. వాడు మాత్రం సాష్టాంగ పడేవారిలో చేరలేదు.

قَالَ مَا مَنَعَكَ أَلَّا تَسْجُدَ إِذْ أَمَرْتُكَ ۖ قَالَ أَنَا خَيْرٌ مِّنْهُ خَلَقْتَنِي مِن نَّارٍ وَخَلَقْتَهُ مِن طِينٍ ⑫

**12** "నేను నిన్ను ఆజ్ఞాపించినప్పటికీ సాష్టాంగపడకుండా ఏ విషయం నిన్ను అడ్డుకుంది?"[9] అని (అల్లాహ్) అడిగితే, "నేను అతనికంటే ఘనుడను. నీవు నన్ను అగ్నితో సృష్టించావు, అతన్నేమో మట్టితో చేశావు"[10] అని ఇబ్లీసు చెప్పాడు.

---

వారి కర్మలు, మరి కొందరి రికార్డులు తూకం వేయబడవచ్చు. ఇంకొందరిని ప్రత్యక్షంగా తూయవచ్చు" (వివరాలకు తఫ్సీర్ ఇబ్నె కసీర్ చూడండి). మొత్తానికి 'త్రాసు మరియు కర్మల బరువు' ఖుర్ఆన్ హదీసుల ద్వారా సత్యమని రూఢీ అవుతోంది. కనుక దానిని త్రోసిపుచ్చటం లేదా దానికి వక్రభాష్యాలు చెప్పటం మార్గవిహీనతగా పరిగణించబడుతుంది. సాంకేతికంగా, వైజ్ఞానికంగా ప్రపంచం ఎంతో పురోగమించిన ఈ యుగంలో కూడా బరువు తూకానికి సంబంధించి ఇలాంటి సందేహాలకు ఆస్కారం కలగకూడదు!

8. ఇక్కడ **"మిమ్మల్ని సృష్టించాము"** అన్నప్పటికీ, ఆది మానవుడైన ఆదం (అలైహిస్సలామ్)నే ఇది సూచిస్తోంది. ఎందుకంటే మనందరి మూలపురుషుడు ఆయనే కదా!

9. అరబీలో **"అన్ లా తస్జుద"** అని ఉంది. అసలు ఇది "అన్ తస్జుద" మాత్రమే. ఇక్కడ 'లా' అన్న పదం అధికంగా వచ్చింది. (అరబీలో ఈ విధంగా అధికపదాలు, అక్షరాలు రావటం కద్దు). 'అన్ తస్జుద' అంటే నిన్ను సజ్దా చేయకుండా ఎవరు ఆపారు? అని అర్థం. లేక ఈ వాక్యాన్ని మనం ఈ విధంగా కూడా విపులంగా చెప్పుకోవచ్చు. 'సజ్దా చేయటంలో నీకు అవరోధంగా ఉన్నదేమిటి?" (ఇబ్నె కసీర్, ఫత్హుల్ ఖదీర్). షైతాన్ యదార్థానికి దైవదూతల (ఫరిష్తాల) కోవకు చెందినవాడు కాడు. వాడసలు జిన్నాతుల వర్గానికి చెందినవాడని ఖుర్ఆన్ ద్వారానే విదితమవుతున్నది (అల్ కహఫ్ – 50). కాకపోతే ఆకాశంలో దైవదూతల సమూహంతో కలసి ఉన్నందున "సాష్టాంగపడండి" అన్న దైవాజ్ఞ అందరితోపాటు అతనికీ వర్తించింది. కాని అతను దైవాజ్ఞను పాటించలేదు. అందుచేత అతన్ని నిలదీయటం జరిగింది. శపించటం కూడా జరిగింది.

10. ఇది షైతాన్ మూర్ఖత్వానికి ప్రబల నిదర్శనం. అధముడైన వానికి సాష్టాంగపడమని శ్రేష్ఠుడికి ఎక్కడయినా ఆజ్ఞాపించబడుతుందా? షైతాన్ పప్పులో కాలేసింది ఇక్కడే. తాను ఆదం కన్నా శ్రేష్ఠుడినని వాడు భ్రమపడ్డాడు. అదలా ఉంచితే దైవాజ్ఞ దైవాజ్ఞే. ఆయన అనుజ్ఞ ముందు నిమ్నోన్నతలకు తావులేదు. ఆజ్ఞను అతను శిరసావహించకుండా గర్వాన్ని ప్రదర్శించాడు. ఇది అతని మొదటి తప్పు. మట్టితో చేయబడిన ప్రాణికంటే అగ్నితో సృష్టించబడిన తాను గొప్పవాడినని షైతాన్ భావించటం రెండో తప్పు. అల్లాహ్ హజ్రత్ ఆదము (అలైహిస్సలాం)ను తన స్వహస్తాలతో చేసి, అందులో తాను స్వయంగా ఊపిరిపోశాడు. ఇదీ ఆదంకు దేవుని తరఫున లభించిన విశిష్టత. ఈ వైశిష్ట్యం ముందు ప్రపంచంలోని ప్రతిదీ దిగదుడుపే. వాస్తవాలను విస్మరించి, అంచనాలపై ఆధారపడటం షైతాన్ చేసిన మూడవ తప్పు. దేవుణ్ణి నమ్మేవాడెవడూ ఇలాంటి కాకిలెక్కలు వేయడు. కాగా; షైతాన్ అంచనా కూడా సరైన

13 "అలాగయితే నువ్వు ఆకాశం నుంచి దిగిపో.[11] ఆకాశంలో ఉండి అహంకారం ప్రదర్శించే హక్కు నీకెంతమాత్రం లేదు. కాబట్టి ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. నిశ్చయంగా నువ్వు తుచ్ఛుల కోవకు చెందినవాడవు"[12] అని అల్లాహ్ అన్నాడు.

قَالَ فَاهْبِطْ مِنْهَا فَمَا يَكُونُ لَكَ أَن تَتَكَبَّرَ فِيهَا فَاخْرُجْ إِنَّكَ مِنَ الصَّاغِرِينَ ﴿١٣﴾

14 "అలాగయితే అందరూ తిరిగి లేపబడే రోజు వరకూ నాకు గడువు ఇవ్వు" అని ఇబ్లీసు అడిగాడు.

قَالَ أَنظِرْنِي إِلَىٰ يَوْمِ يُبْعَثُونَ ﴿١٤﴾

15 "నీకు గడువు ఇవ్వబడింది"[13] అని అల్లాహ్ చెప్పాడు.

قَالَ إِنَّكَ مِنَ الْمُنظَرِينَ ﴿١٥﴾

16 "నీవు నన్ను భ్రష్టుణ్ణి చేసిన కారణంగా[14] నేను వీళ్ళ కోసం (అంటే మానవుల కోసం) నీ రుజుమార్గంలో (మాటువేసి) కూర్చుంటాను.

قَالَ فَبِمَا أَغْوَيْتَنِي لَأَقْعُدَنَّ لَهُمْ صِرَاطَكَ الْمُسْتَقِيمَ ﴿١٦﴾

17 ఆపైన "ముందు నుంచీ, వెనుక నుంచీ, కుడి వైపు నుంచీ, ఎడమ వైపు నుంచీ[15] వాళ్ళపై దాడి చేస్తాను. వారిలో చాలా మందిని నీవు కృతజ్ఞులుగా పొందవు"[16] అని ఇబ్లీసు సవాలు చేశాడు.

ثُمَّ لَآتِيَنَّهُم مِّن بَيْنِ أَيْدِيهِمْ وَمِنْ خَلْفِهِمْ وَعَنْ أَيْمَانِهِمْ وَعَن شَمَائِلِهِمْ ۖ وَلَا تَجِدُ أَكْثَرَهُمْ شَاكِرِينَ ﴿١٧﴾

అంచనా కాదు. నిప్పు 'మట్టి'కన్నా ఉత్తమమైందన్న అతని ఊహ సహేతుకమేనా?! అగ్నిలో కాల్చేగుణం ఉన్నమాట నిజమే. కాల్చటం, మండటం, వేడినివ్వటం తప్ప అది ఏం చేస్తుంది? కాని మట్టినే చూడండి – అందులో స్థిరత్వం ఉంది. అది నీటిని పీలుస్తుంది. మొక్కల్ని మొలకెత్తిస్తుంది. మరమ్మత్తుకు అనువుగా ఉంటుంది. సృష్టితాలకు నిలకడను ప్రసాదిస్తుంది. మొత్తమ్మీద మట్టిలోని ఈ గుణాలు అగ్నికన్నా ఎన్నో రెట్లు మేలైనవి. ఈ ఆయతు ద్వారా తెలిసిన మరో విషయం ఏమిటంటే షైతాన్ అగ్నితో సృజించబడ్డాడు. హదీసు ప్రకారం "దైవదూతలు కాంతితో సృష్టించబడగా, ఇబ్లీస్ అగ్నిజ్వాలతో సృజించబడ్డాడు. ఆదం (అలైహిస్సలాం) మట్టితో సృజించబడ్డారు" (సహీహ్ ముస్లిం : కితాబుజ్జుహ్ద్).

11. అరబీలో **'మిన్హా'** (ఇక్కడి నుంచి) అని ఉంది. దీనిని చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు 'స్వర్గం' అన్న భావంలో తీసుకున్నారు. మరికొంతమంది 'అత్యున్నత లోకంలో వాడికి గల స్థానం' అన్న అర్థం తీసుకున్నారు. మన ఉర్దూ అనువాదకులు ఈ రెండో అర్థం ప్రకారమే 'ఆస్మాన్' (ఆకాశం) అని అనువాదం చేశారు.

12. దైవాదేశాల ముందు వినమ్రతను వ్యక్తం చేసే బదులు తలబిరుసుతనం ప్రదర్శించేవాడు గౌరవమర్యాదలకు కాదు, పరాభవానికి అర్హుడౌతాడు.

13. అల్లాహ్ ఇబ్లీసు అభ్యర్థనను మన్నిస్తూ వాడికి గడువును, అవకాశాన్ని ఇచ్చాడు. ఈ అవకాశం కూడా దైవప్రణాళిక ననుసరించే ఇవ్వబడింది. అందలి ఔచిత్యాన్ని దేవుడే బాగా ఎరుగు. తన దాసులుగా రాణించేవారెవరో, షైతాన్ దాసులుగా మారిపోయే వారెవరో పరీక్షించటం కూడా ఈ 'ప్రణాళిక'లో ఓ ముఖ్యాంశం కావచ్చు.

14. **'నన్ను భ్రష్టుణ్ణి చేశావు'** అని ఇబ్లీసు ఏకంగా దైవాన్నే తప్పుపట్టడం విచిత్రంగా అనిపించవచ్చు. నిజానికి ఇది దైవప్రణాళికలో భాగం అన్న సంగతి మరువరాదు. 'ఒకవేళ దేవుడు తలచుకుని ఉంటే మేము షిర్క్ చేసే వాళ్ళం కాము' అని ముష్రిక్కులు అనటం కూడా ఇటువంటిదే.

15. అంటే మంచీ – చెడుల మార్గాల్లో తిష్ఠవేస్తాను. మంచి వైపుకుపోయే వారిని అడ్డుకుంటాను. చెడు వైపుకు వెళ్ళే వారిని ప్రోత్సహిస్తాను. వారు పాల్పడే చెడు వారి కంటికి ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాను.

قَالَ اخْرُجْ مِنْهَا مَذْءُومًا مَّدْحُورًا ۖ لَّمَن تَبِعَكَ مِنْهُمْ لَأَمْلَأَنَّ جَهَنَّمَ مِنكُمْ أَجْمَعِينَ ﴿١٨﴾

**18** అప్పుడు అల్లాహ్, "తుచ్ఛుడవై, ధూర్తుడవై ఇక్కడినుంచి వెళ్ళిపో. వారిలో ఎవరు నీ మాట వింటారో మీ అందరితోనూ నరకాన్ని నింపుతాను" అన్నాడు.

وَيَا آدَمُ اسْكُنْ أَنتَ وَزَوْجُكَ الْجَنَّةَ فَكُلَا مِنْ حَيْثُ شِئْتُمَا وَلَا تَقْرَبَا هَٰذِهِ الشَّجَرَةَ فَتَكُونَا مِنَ الظَّالِمِينَ ﴿١٩﴾

**19** "ఓ ఆదమ్! నువ్వూ, నీ భార్య–ఇద్దరూ స్వర్గంలో ఉండండి. మరి మీరు కోరిన చోటునుంచి (మీకు నచ్చిన దాన్ని తీసుకుని) తినండి. కాని ఈ వృక్షం వద్దకు మాత్రం పోకండి.[17] పోయారా, మీరిద్దరూ దుర్మార్గుల్లో చేరిపోతారు" (అని మేము చెప్పాము).

فَوَسْوَسَ لَهُمَا الشَّيْطَانُ لِيُبْدِيَ لَهُمَا مَا وُورِيَ عَنْهُمَا مِن سَوْآتِهِمَا وَقَالَ مَا نَهَاكُمَا رَبُّكُمَا عَنْ هَٰذِهِ الشَّجَرَةِ إِلَّا أَن تَكُونَا مَلَكَيْنِ أَوْ تَكُونَا مِنَ الْخَالِدِينَ ﴿٢٠﴾

**20** తరువాత షైతాను, పరస్పరం వారిరువురికి కనబడకుండా ఉన్న వారి మర్మ స్థానాలను వారి ముందు బహిర్గతం[18] చేసే ఉద్దేశంతో వారిద్దరి ఆంతర్యాలలో దుష్ప్రేరణను రేకెత్తించాడు.[19] "మీరు దైవదూతలై పోతారేమో, ఎల్లకాలం సజీవులుగా ఉండే వారిలో కలిసిపోతారేమోనని మీ ప్రభువు మీ ఇద్దరినీ ఈ వృక్షం వద్దకు పోకుండా వారించాడు సుమా!" అని షైతాను వారితో అన్నాడు.

وَقَاسَمَهُمَا إِنِّي لَكُمَا لَمِنَ النَّاصِحِينَ ﴿٢١﴾

**21** "నేను మీ శ్రేయోభిలాషిని"[20] అని వారిద్దరి ముందు ఒట్టేసి మరీ చెప్పాడు.

16. **'షాకిరీన్'** (కృతజ్ఞులు) అనే పదానికి మరో అనువాదం **'మువహ్హిదీన్'** (ఏక దైవోపాసకులు) అని కూడా చేయబడింది. అంటే నీ దాసులలో చాలా మందిని బహుదైవారాధకులుగా మార్చేస్తాను అన్నది షైతాను అభిమతం. అన్నట్టే వాడు తన పనిని చేసుకుపోతున్నాడు. ఆ విషయాన్నే ఖుర్ఆన్ ఈ విధంగా పేర్కొంది : "వారి విషయంలో తాను ఊహించినది నిజమని షైతాను నిరూపించాడు. విశ్వాసులకు చెందిన ఒక సమూహం తప్ప మిగిలిన జనులంతా వాడిని అనుసరించారు." (సబా–20). అందుకే నిరంతరం షైతాన్ కీడు నుంచి శరణువేడుతూ ఉండమని, వాడి పన్నాగాల పట్ల అప్రమత్తంగా ఉండమని ఖుర్ఆన్ హదీసులు మనకు గట్టిగా తాకీదు చేస్తున్నాయి.
17. ఆ వృక్షాన్ని వదలిపెట్టి స్వర్గంలో మీకు ఇష్టమైన దానిని, మీకు కావలసినంతగా తీసుకుని తినండి. ఒక్కగానొక్క వృక్షాన్ని నిషేధించటంలోని దేవుని ఉద్దేశం – ఆయన మనిషిని పరీక్షించదలిచాడు.
18. ఆదం – హవ్వాలపై ఉన్న స్వర్గ ఆచ్ఛాదనను తొలగించి వారిద్దరినీ తలవంచుకునేలా చేయాలన్నది అసలు షైతాను ఎత్తుగడ. స్వర్గంలో వారిద్దరికీ ఆచ్ఛాదనగా ఇవ్వబడిన దానిని తొలగించటంలో షైతాన్ కృతకృత్యుడయ్యాడు. మూలంలో **'సౌఆత్'** అనే పదం ఉపయోగించబడింది. దీని ఏకవచనం 'సౌఅతున్'; అంటే మర్మావయవాలన్నమాట. అసలు ఇది 'సూవున్' అన్న ధాతువు నుంచి ఏర్పడింది. 'సూవున్' అంటే తప్పు, బాధ అని అర్థం. మర్మావయవాలను బహిరంగపరచటాన్ని తప్పుగా భావిస్తారు కనుక వాటిని 'సౌఆత్' అని పిలుస్తారు.
19. **'వస్వసతున్'** అనే పదానికి మెల్లిగా వచ్చే శబ్దం, మనసులో జనించే మాట అనే అర్థాలు వస్తాయి. ఆంతర్యంలో షైతాను నూరిపోసే చెడు భావాలను, దుష్ట ఆలోచనలను 'వస్వస'గా వ్యవహరిస్తారు.
20. మొదట్లో ఆదం – హవ్వాలకు స్వర్గంలో సకల సౌఖ్యాలూ వొసగబడ్డాయి. వారిద్దరూ హాయిగా, ఆనందంగా ఉండే వారు. అయితే ఈ స్వర్గ సుఖాలు శాశ్వితం కావనీ, మీరిద్దరూ ఎల్లకాలం స్వర్గంలో ఉండటం అల్లాహ్‌కు ఇష్టంలేదనీ,

22 ఆ విధంగా వాడు వారిద్దరినీ మోసపుచ్చి క్రిందికి[21] తీసుకువచ్చాడు. వారిద్దరూ ఆ వృక్షం రుచి చూడగానే ఇద్దరి మర్మ స్థానాలూ ఒండొకరి ముందు బహిర్గతం అయిపోయాయి. అప్పుడు వారిరువురూ స్వర్గంలోని ఆకులను తమపై కప్పుకో సాగారు.[22] వారి ప్రభువు వారిని పిలిచి, "మీరుభయులూ ఆ చెట్టు వద్దకు పోరాదని నేను మిమ్మల్ని వారించలేదా? షైతాను మీ బద్ధవిరోధి అని నేను మీకు ముందే చెప్పలేదా?"[23] అన్నాడు.

فَدَلّٰىهُمَا بِغُرُوْرٍ ۚ فَلَمَّا ذَاقَا الشَّجَرَةَ بَدَتْ لَهُمَا سَوْاٰتُهُمَا وَطَفِقَا يَخْصِفٰنِ عَلَيْهِمَا مِنْ وَّرَقِ الْجَنَّةِ ؕ وَنَادٰىهُمَا رَبُّهُمَاۤ اَلَمْ اَنْهَكُمَا عَنْ تِلْكُمَا الشَّجَرَةِ وَاَقُلْ لَّكُمَاۤ اِنَّ الشَّيْطٰنَ لَكُمَا عَدُوٌّ مُّبِيْنٌ ﴿22﴾

23 వారిద్దరూ, "మా ప్రభూ! మేము మా స్వయానికి ఎంతో అన్యాయం చేసుకున్నాము. ఇప్పుడు నీవు గనక మాకు క్షమాభిక్ష పెట్టి, మాపై దయదలచకపోతే నిశ్చయంగా మేము నష్టపోతాము"[24]అని వేడుకున్నారు.

قَالَا رَبَّنَا ظَلَمْنَاۤ اَنْفُسَنَا ٚ وَاِنْ لَّمْ تَغْفِرْ لَنَا وَتَرْحَمْنَا لَنَكُوْنَنَّ مِنَ الْخٰسِرِيْنَ ﴿23﴾

24 "దిగిపోండి. మీరు ఒండొకరికి విరోధులు. భూమిలో మీకు నివాస స్థానం ఉంటుంది. ఒక నిర్ణీత కాలం వరకూ మీరు అక్కడే లబ్ది పొందవలసి ఉంటుంది" అని సెలవిచ్చాడు.

قَالَ اهْبِطُوْا بَعْضُكُمْ لِبَعْضٍ عَدُوٌّ ۚ وَلَكُمْ فِي الْاَرْضِ مُسْتَقَرٌّ وَّمَتَاعٌ اِلٰى حِيْنٍ ﴿24﴾

25 "మీరు అక్కడే బ్రతకాలి. అక్కడే చావాలి. మరి అక్కడి నుంచే మీరు వెలికి తీయబడతారు" అని కూడా అల్లాహ్ సెలవిచ్చాడు.

قَالَ فِيْهَا تَحْيَوْنَ وَفِيْهَا تَمُوْتُوْنَ وَمِنْهَا تُخْرَجُوْنَ ﴿25﴾

అందుకే 'ఆ చెట్టు'ను సమీపించరాదన్న ఆంక్షను విధించాడని చెప్పాడు. "ఆ చెట్టు ఫలాన్ని గనక తింటే మనిషి దైవదూత అయిపోతాడు. ఇక అతనికి మరణం అనేదే రాదు. నేను మీ మంచిని కాంక్షించేవాణ్ణి గనక ఈ సంగతి చెబుతున్నాను. లేకపోతే నాకెందుకు ఈ గొడవ" అంటూ షైతాన్ తన మాయమాటలతో వారిద్దరినీ బోల్తా కొట్టించాడు. కల్లా కపటం కాననివారు ఆదం – హవ్వాలు. సాధారణంగా ఇలాంటి నిష్కల్మష మనస్కులు మోసగాళ్ళ మాయోపాయాలకు బలైపోతుంటారు.

21. అసలు మూలంలో **'దల్లా'** అనే మాట వచ్చింది. దీని మూలపదం 'తద్‌లియహ్'. ఏదైనా వస్తువును పై నుంచి క్రిందికి వదలటాన్ని 'తద్‌లియహ్' లేక 'ఇద్‌లా' అంటారు. షైతాన్ ఈ ఆది దంపతులను వారున్న ఉన్నత స్థానం నుంచి అధోగతి వైపుకు పురికొల్పి 'నిషిద్ధవృక్షాన్ని' రుచిచూసే దాకా దిగజార్చాడని ఇక్కడ భావం.

22. ఆదం మరియు హవ్వాలు తెలియక చేసిన తప్పుకు ప్రతిఫలం ఇది. దాని మూలంగా వారి మర్మస్థానాలు బహిర్గతం అయ్యాయి. వారిద్దరూ సిగ్గుతో కుంచించుకుపోతూ స్వర్గంలోని ఆకులను ఆ 'స్థానాలపై' గబగబా అతికించుకోసాగారు. ఈ నేపథ్యంలో వహబ్ బిన్ ముంబ ఇలా అంటున్నారు : "అంతకు మునుపు వారికి అల్లాహ్ తరఫున జ్యోతిర్మయమైన దుస్తులు ప్రదానం చేయబడ్డాయి. వాటికంటూ ఓ ప్రత్యేక రూపు లేకపోయినప్పటికీ అవి వారి మర్మస్థానాలకు ఆచ్ఛాదనగా ఉండేవి" (ఇబ్నె కసీర్).

23. అంటే – మిమ్మల్ని నేను ముందుగానే జాగరూక పరచినప్పటికీ మీరు షైతాన్ వలలో పడిపోయారే! అన్నది దీని భావం. దీన్నిబట్టి విదితమయ్యేదేమంటే షైతాన్ వేసే ఎత్తుగడలు, రచించే వ్యూహాలు మహా సుందరంగా, మనోహరంగా ఉంటాయి. వాడి ఎత్తులకు గమ్మత్తుగా చిత్తవకుండా ఉండాలంటే నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నిరంతరం ఆ శాపగ్రస్తుని కీడు నుంచి దేవుని శరణువేడుకుంటూ ఉండాలి.

يَٰبَنِيٓ ءَادَمَ قَدۡ أَنزَلۡنَا عَلَيۡكُمۡ لِبَاسٗا يُوَٰرِي
سَوۡءَٰتِكُمۡ وَرِيشٗاۖ وَلِبَاسُ ٱلتَّقۡوَىٰ ذَٰلِكَ خَيۡرٞۚ
ذَٰلِكَ مِنۡ ءَايَٰتِ ٱللَّهِ لَعَلَّهُمۡ يَذَّكَّرُونَ ٢٦

**26** ఓ ఆదం సంతతి వారలారా! మేము మీ కోసం దుస్తుల్ని దించాము. అవి మీ మర్మస్థానాలను కప్పి ఉంచటమేగాకుండా, మీ శరీరానికి శోభాయమానంగా కూడా ఉంటాయి.[25] అయితే భయభక్తులతో కూడుకున్న దుస్తులు[26] ఇంతకన్నా మంచివి.[27] ఇవి వీళ్లు జ్ఞాపకముంచుకునేందుకుగాను అల్లాహ్ (చేసిన) సూచనలలోనివి.

يَٰبَنِيٓ ءَادَمَ لَا يَفۡتِنَنَّكُمُ ٱلشَّيۡطَٰنُ كَمَآ أَخۡرَجَ أَبَوَيۡكُم
مِّنَ ٱلۡجَنَّةِ يَنزِعُ عَنۡهُمَا لِبَاسَهُمَا لِيُرِيَهُمَا
سَوۡءَٰتِهِمَآۚ إِنَّهُۥ يَرَىٰكُمۡ هُوَ وَقَبِيلُهُۥ مِنۡ حَيۡثُ

**27** ఓ ఆదం సంతతి వారలారా! షైతాను మీ తల్లిదండ్రులను స్వర్గం నుంచి బయటికి తీయించి, వారి మర్మస్థానాలు వారికి కనిపించేలా చేయటానికి వారి దుస్తుల్ని ఎలా తొలగింపజేశాడో అలాగే వాడు మిమ్మల్ని కూడా చెరపకూడదు సుమా! వాడూ,

24. క్షమాపణకై వేడుకోవటానికి హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) అల్లాహ్ వద్ద నేర్చుకున్న వచనాలివే. అల్ బఖరా సూరా లోని 37వ ఆయతులో ఇది వివరంగా వచ్చింది. మనిషికీ – షైతానుకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం ఇదే. షైతాన్ దైవాజ్ఞను ధిక్కరించటమేగాక, తన చేష్టను సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. దానికోసం తర్కంలోకి వెళ్ళాడు. ఊహాగానాలు చేశాడు. తత్కారణంగా దైవ సన్నిధిలో ఛీత్కారానికి గురయ్యాడు. కాని హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)నే చూడండి – ఆయన తన తప్పుపై సిగ్గుతో కుమిలిపోయారు. దైవసన్నిధిలో పశ్చాత్తాపం చెందారు. క్షమాభిక్ష పెట్టమని అర్థించారు. అప్పుడు దేవుడు ఆయన్ని క్షంతవ్యుడుగా ఖరారు చేశాడు. ఈ విధంగా రెండు మార్గాలు స్పష్టంగా ముందుకు వచ్చాయి. ఒకటి: షైతాను మార్గం. రెండవది : సజ్జనుల మార్గం. తప్పుచేసింది గాక దానిపై పాతుకుపోవటం, లేనిపోని ఆధారాలు, నిదర్శనాలు చూపి అది ఒప్పని సమర్థించుకోజూడటం షైతాను మార్గం. మానవ దౌర్బల్యం వల్ల తప్పు జరిగినప్పుడు సిగ్గుతో కుంచించుకుపోవటం, దైవసన్నిధిలోకి వచ్చి అణకువతో పశ్చాత్తాపపడటం, క్షమాపణ కోసం దీనాతిదీనంగా వేడుకోవటం సజ్జనుల మార్గం– ఇదే రుజుమార్గం. దేవుడు మనకు కూడా ఇటువంటి సద్బుద్ధి నొసగుగాక!

25. దుస్తులు రెండు విధాలుగా మనిషికి ఉపయోగపడతాయి. ఒకటి : అవి అతని మర్మస్థానాలను కప్పుతాయి. రెండు: అతని ఒంటికి అలంకారంగా ఉంటాయి. అతన్ని నాగరికత గల మనిషిగా నలుగురిలో నిలబెడతాయి. ఈ రెండు ఉద్దేశాలు నెరవేరడానికి గాను దేవుడు వస్త్రాలను సమకూర్చాడు. అంటే వస్త్రాల తయారీకి కావలసిన పత్తి పంటను, కలపను భూమండలంపై ఉత్పత్తి చేశాడు. 'సౌఆత్' అంటే శరీరంలో కప్పి ఉంచవలసిన అవయవాలు; రీషా అంటే అందం, అలంకరణ నిమిత్తం ధరించే దుస్తులు.

26. **'భయభక్తులు గల దుస్తులు'** అంటే ఏమిటీ? ప్రపంచంలో అల్లాహ్‌కు భయపడుతూ జీవితం గడిపినవారు ప్రళయదినాన ధరించే దుస్తులని కొందరు అభిప్రాయపడగా, ఇది నిజానికి విశ్వాసం (ఈమాన్) అని మరికొందరు భావించారు. సదాచరణ మరియు దైవభీతి అని ఇంకొందరు వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద అంతరార్థం ఒక్కటే – దుస్తులు మనిషిలో గర్వాన్ని, అహంకారాన్ని సృజించేవిగా కాకుండా దేవుని పట్ల భీతినీ, అణకువను పెంపొందించేవిగా, సదాచరణల వైపుకు పురికొల్పేవిగా ఉండాలి.

27. సభ్యతా సంస్కారాలను ప్రతిబింబింపజేసే మంచిదుస్తులు, అందమైన దుస్తులు తొడగటంలో తప్పులేదు గాని ఆడంబరాలు, అట్టహాసాలకన్నా నిరాడంబరత వాంఛనీయం అంటుంది ఇస్లాం. మనిషి ధరించిన దుస్తుల ద్వారా అతనిలో మానవీయత, వినయ వినమ్రతలు, దైవం పట్ల భయభక్తులు వ్యక్తం కావాలి. అంతేగాక కొత్తబట్టలు తొడిగినప్పుడల్లా క్రింది దుఆ కూడా చేయాలి: "అల్‌హమ్దు లిల్లాహిల్లజీ కసానీ మా ఉవారీ బిహీ ఔరతీ వ అతజమ్మలు

لَا تَرَوْنَهُمْ ۗ اِنَّا جَعَلْنَا الشَّيٰطِيْنَ اَوْلِيَآءَ لِلَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ ﴿27﴾

వాడి సైన్యం, మీరు వారిని చూడలేని చోటు నుంచి మిమ్మల్ని చూస్తున్నారు.[28] మేము అవిశ్వాసులకు షైతానులను స్నేహితులుగా చేశాము.[29]

وَاِذَا فَعَلُوْا فَاحِشَةً قَالُوْا وَجَدْنَا عَلَيْهَآ اٰبَآءَنَا وَاللّٰهُ اَمَرَنَا بِهَا ۗ قُلْ اِنَّ اللّٰهَ لَا يَاْمُرُ بِالْفَحْشَآءِ ۗ اَتَقُوْلُوْنَ عَلَى اللّٰهِ مَا لَا تَعْلَمُوْنَ ﴿28﴾

**28** వారు సిగ్గుమాలిన పని చేసినప్పుడల్లా, "మేము మా తాత ముత్తాతలను కూడా ఇలా చేస్తుండగా చూశాము. అల్లాహ్ కూడా మాకు ఇలాగే చేయమని ఆజ్ఞాపించాడు" అని చెబుతారు. "సిగ్గుమాలిన పనులు చెయ్యమని అల్లాహ్ ఎన్నటికీ ఆజ్ఞాపించడు. మీకు ఏ విషయాలైతే తెలియవో అల్లాహ్‌కు అటువంటి వాటిని ఆపాదిస్తారేమిటీ?"[30] అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు.

బిహీ ఫీ హయాతీ" (తిర్మిజీ – అబ్వాబుద్దావాత్, ఇబ్నె మాజ: కితాబుల్లిబాస్). (నా శరీరాన్ని కప్పుకోవటానికి, జీవితంలో అలంకరణను ఆస్వాదించటానికి అనువైన దుస్తుల్ని నాకు ప్రసాదించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు). మహాప్రవక్త (సఅసం) కొత్తబట్టలు తొడగినప్పుడల్లా ఈ దుఆ చేసేవారు.

28. విశ్వాసులకు ఇది హెచ్చరిక! మీలోని అజాగ్రత్తను, సోమరితనాన్ని పసిగట్టి షైతాను మరియు అతని అనుచరులు మిమ్మల్ని భ్రష్టుపట్టించే దుస్థితి రాకూడదు సుమా! మీ మాతాపితలను కూడా వాడు పెడత్రోవ పట్టించి, స్వర్గం నుంచి బయటికి తీయటంలో, దిగంబరుల్ని చేయటంలో సఫలీకృతుడయ్యాడు. అదీగాక వారు కంటికి కనిపించకుండా మీ మీద దాడిచేస్తారు. కనుక మీరు మరింత అప్రమత్తంగా ఉండాలి. వాళ్ల కీడు నుంచి దేవుని రక్షణను కోరుకుంటూ ఉండాలి.

29. అవిశ్వాసులు, ఆత్మవంచన చేసుకునేవారు మాత్రమే షైతాను గాలానికి తేలిగ్గా తగులుతారు. అయితే విశ్వసించిన వారిపై కూడా వాడు వల విసురుతూనే ఉంటాడు. ఏదీ సాధ్యం కాకపోతే వారిని 'ప్రదర్శనాబుద్ధి'కి లోనుచేసి, వారి సత్కర్మలను వృథా చేయజూస్తాడు.

30. ఇస్లాంకు పూర్వం ముష్రిక్కులు బట్టలు విడిచేసి – నగ్నంగా – కాబా గృహప్రదక్షిణ చేసేవారు. పైపెచ్చు వారు తమ ఈ చేష్టను సమర్థించుకోవటానికి – "మా తల్లికడుపులో నుంచి జన్మించినప్పుడు మేము ఏ స్థితిలో ఉన్నామో ఆ స్థితిలోనే ప్రదక్షిణ చేస్తున్నామ"ని సగర్వంగా చెప్పుకునేవారు. అంతేకాదు, నిస్సిగ్గుగా ఇలా చెప్పేవారు: "మేము దుస్తులు ధరించి ఉన్నప్పుడు దేవుని అవిధేయతకు ఒడిగట్టే వాళ్ళము. కాబట్టి ఈ దుస్తులతో కాబా గృహప్రదక్షిణ చేయటం భావ్యం కాదు." అందుకే వాళ్లు దుస్తుల్ని తీసేసి నగ్నంగా తిరిగేవారు. వారి స్త్రీలు కూడా దాదాపు నగ్నంగా ప్రదక్షిణ చేసేవారు. తమ మర్మాంగం దగ్గర కాస్తంత గోచిగుడ్డ తగిలించుకునేవారు. ఒక్కోసారి తోలు ముక్కను చుట్టుకునేవారు. తాము ఒడిగడుతున్న ఈ లజ్జావిహీనమైన చేష్ట కోసం వారు రెండు సాకులు చెప్పేవారు. ఒకటి – మా తాతముత్తాతలు కూడా ఇలా చేస్తుండగా మేము చూసి ఉన్నాము. రెండు: ఈ విధంగా చేయమని అల్లాహ్ స్వయంగా మమ్మల్ని ఆదేశించాడు. అల్లాహ్ దీనిని ఖండిస్తూ, ఇలాంటి సిగ్గుమాలిన పోకడల్ని అవలంబించమని దేవుడెలా ఆజ్ఞాపిస్తాడు? అని ప్రశ్నించాడు. అంటే మీరు స్వయంగా దుష్టపోకడకు పాల్పడి, దానిని దైవానికి అంటగడుతున్నారు. తాతముత్తాతలు, గురుజనులు చెప్పిందే వేదమని భావించేవారికి, గుడ్డిగా వ్యక్తిపూజ చేసేవారికి ఈ ఆయతు హెచ్చరిక కావాలి! ఎందుకంటే 'సత్యం' గురించి వారికి నొక్కి చెప్పినప్పుడల్లా వారు దాన్ని తృణీకరించటమేగాకుండా తమ పూర్వీకులు తమకెప్పుడూ అలా చెప్పలేదనీ, తమ ఇమాములు, పీరు సాహెబ్‌లు చెప్పిన విధానమే తమకు అనుసరణీయమని సమాధానమిస్తారు. ఈ తృణీకరణ గుణమే యూదుల్ని యూదత్వంపై, క్రైస్తవుల్ని క్రైస్తవ విధానంపై, బిద్అతీలను బిద్అత్‌పై అతుక్కుపోయేలా చేసింది.

**29** (ఓ ప్రవక్తా!) ఈ విధంగా చెప్పు: నా ప్రభువు న్యాయం[31] గురించి ఆదేశించాడు. సజ్దా చేసే ప్రతిసారీ మీ దిశ సరిగ్గా[32] ఉండేటట్లు చూసుకోమని, ధర్మాన్ని (ఇబాదత్‌ను) కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకోమని ఆయన ఆజ్ఞాపించాడు. మొదటిసారి అల్లాహ్ మిమ్మల్ని ఎలా పుట్టించాడో మలిసారి కూడా మీరు అలాగే పుట్టించబడతారు.

قُلۡ اَمَرَ رَبِّیۡ بِالۡقِسۡطِ ۟ وَ اَقِیۡمُوۡا وُجُوۡهَكُمۡ عِنۡدَ كُلِّ مَسۡجِدٍ وَّ ادۡعُوۡهُ مُخۡلِصِیۡنَ لَهُ الدِّیۡنَ ۬ؕ كَمَا بَدَاَكُمۡ تَعُوۡدُوۡنَ ﴿۲۹﴾

**30** అల్లాహ్ ఒక వర్గానికి సన్మార్గం చూపించాడు. మరో వర్గంపై అపమార్గం రూఢీ అయింది. వారు అల్లాహ్‌ను వదలి షైతానులను తమ స్నేహితులుగా చేసుకున్నారు. పైపెచ్చు – తాము సన్మార్గాన ఉన్నామని వారు అనుకుంటున్నారు.

فَرِیۡقًا هَدٰی وَ فَرِیۡقًا حَقَّ عَلَیۡهِمُ الضَّلٰلَةُ ؕ اِنَّهُمُ اتَّخَذُوا الشَّیٰطِیۡنَ اَوۡلِیَآءَ مِنۡ دُوۡنِ اللّٰهِ وَ یَحۡسَبُوۡنَ اَنَّهُمۡ مُّهۡتَدُوۡنَ ﴿۳۰﴾

**31** ఓ ఆదం సంతతివారలారా! మీరు మస్జిదుకు హాజరైన ప్రతిసారీ వస్త్రాలంకరణ పట్ల[33] శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి. కాని మితిమీరకండి. మితిమీరిపోయే వారిని ఆయన (అల్లాహ్) ఇష్టపడడు.[34]

یٰبَنِیۡۤ اٰدَمَ خُذُوۡا زِیۡنَتَكُمۡ عِنۡدَ كُلِّ مَسۡجِدٍ وَّ كُلُوۡا وَ اشۡرَبُوۡا وَ لَا تُسۡرِفُوۡا ۚ اِنَّهُ لَا یُحِبُّ الۡمُسۡرِفِیۡنَ ﴿۳۱﴾

31. ఇక్కడ 'న్యాయం' అంటే భావం కొందరు వ్యాఖ్యాతల దృష్టిలో 'లా ఇలాహ ఇల్లల్లాహ్.' అంటే తౌహీద్.

32. ఈ ఆయతుపై వ్యాఖ్యానిస్తూ ఇమామ్ షౌకానీ ఇలా అన్నారు : "మీరు నమాజు చేస్తున్నప్పుడు మీ ముఖాలు కాబా దిశలో ఉండేట్టు సరిచూసుకోండి. మీరు ఏ మస్జిదులో నిలబడినా ఈ విషయాన్ని మాత్రం విస్మరించకూడదు." ఇమామ్ ఇబ్నె కసీర్ ఉద్దేశం మరోవిధంగా ఉంది. ఆయన ఇక్కడ, దిశను సవ్యంగా ఉంచుకోవటం అంటే నిలకడ అనీ, అదీ దైవప్రవక్తను అనుసరించటంలో నిలకడతనమని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాతి వాక్యంలో వచ్చిన 'ధర్మాన్ని అల్లాహ్ కొరకే ప్రత్యేకించుకొని' అన్న మాటకు భావం, అల్లాహ్ కోసం చిత్తశుద్ధితో పనిచేయటమని చెబుతూ, మనిషి చేసే ఏ ఆచరణ అయినా దైవసన్నిధిలో స్వీకృతిని పొందాలంటే ఒకటి : అది షరీఅత్‌కు అనుగుణంగా ఉండాలనీ, రెండు: ఆ పని కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే చేసి ఉండాలని నొక్కి వక్కాణించారు. పై ఆయతులో ఈ రెండు విషయాల గురించి తాకీదు చేయబడిందని చెప్పారు.

33. అరబీ మూలంలో **'జీనత్'** అని అనబడింది. ఇక్కడ జీనత్ అంటే వస్త్రధారణ అని భావం. ఆనాడు ముష్రిక్కులు బట్టలు విడిచి నగ్నంగా కాబా గృహప్రదక్షిణ చేస్తుండటం వల్ల ఈ ఆయతు అవతరించింది. బట్టలు తొడుక్కుని, సంస్కారవంతుల్లా దైవారాధన చేయాలని, తవాఫ్ చేయాలని వారికి తాకీదు చేయటం జరిగింది.

**'జీనత్'** అంటే భావం అలంకరణ నిమిత్తం బట్టలు తొడుక్కోవటమని మరికొంతమంది తలపోస్తున్నారు. ఈ ఆయతును ఆధారంగా చేసుకొని నమాజు సమయంలో మర్మావయవాలను (నాభి నుంచి మోకాళ్ళ వరకు) తప్పనిసరిగా కప్పి ఉంచాలన్న విషయాన్ని కూడా నిరూపించటం జరిగింది. పైగా హదీసుల్లోనయితే మనిషి ఒంటరిగా ఉన్నాసరే నాభి నుంచి మోకాళ్ల వరకు కప్పి ఉంచటం ఎట్టి పరిస్థితిలోనయినా అత్యవసరమని చెప్పబడింది (ఫత్‌హుల్ ఖదీర్). జుమా నమాజు సందర్భంగానూ, పండుగ సందర్భాలలోనూ సుగంధ ద్రవ్యాలను పూసుకోవటం అభిలషణీయం. ఇది కూడా అలంకరణ (జీనత్) లో అంతర్భాగమే (ఇబ్నె కసీర్).

34. ఆయతులో **'ఇస్రాఫ్'** అన్న పదం వాడబడింది. ఇస్రాఫ్ అంటే మితిమీరటం అని అర్థం. ఏ విషయంలోనూ, ఆఖరికి అన్నపానీయాల విషయంలో సయితం 'అతి' మంచిదికాదు. ఒక హదీసులో మహనీయ ముహమ్మదు (స)

32 (ఓ ప్రవక్తా!) వారిని అడుగు : "అల్లాహ్ తన దాసుల కొరకు సృజించిన అలంకార వస్తువులను, పరిశుద్ధమైన ఆహార వస్తువులను నిషేధించినదెవరు?" ప్రళయదినాన విశ్వసించిన వారికై ప్రత్యేకించబడిన ఈ వస్తువులన్నీ ఇహలోక జీవితంలో కూడా విశ్వాసుల కోసం ఉన్నాయి[35] అని (ఓ ప్రవక్తా!) వాళ్ళకు చెప్పు. ఈ విధంగా మేము జ్ఞానసంపన్నుల కోసం మా ఆయతులన్నింటినీ విపులీకరిస్తూ ఉంటాము.

قُلْ مَنْ حَرَّمَ زِينَةَ اللّٰهِ الَّتِيْٓ اَخْرَجَ لِعِبَادِهٖ وَالطَّيِّبٰتِ مِنَ الرِّزْقِ ۭ قُلْ هِيَ لِلَّذِيْنَ اٰمَنُوْا فِي الْحَيٰوةِ الدُّنْيَا خَالِصَةً يَّوْمَ الْقِيٰمَةِ ۭ كَذٰلِكَ نُفَصِّلُ الْاٰيٰتِ لِقَوْمٍ يَّعْلَمُوْنَ ﴿32﴾

33 "నా ప్రభువు నిషేధించినవి ఇవి మాత్రమే : బాహాటంగానూ,[36] గోప్యంగానూ చేసే సిగ్గుమాలిన పనులు, పాపంతో కూడుకున్న ప్రతి విషయమూ, అన్యాయంగా ఒకరిమీద

قُلْ اِنَّمَا حَرَّمَ رَبِّيَ الْفَوَاحِشَ مَا ظَهَرَ مِنْهَا وَمَا بَطَنَ وَالْاِثْمَ وَالْبَغْيَ بِغَيْرِ الْحَقِّ وَاَنْ

వారు ఇలా ఉపదేశించారు: "మీకిష్టమైనది తినండి. మీకు నచ్చిన వాటిని తొడగండి. కాని రెండు విషయాలకు మాత్రం దూరంగా ఉండండి. అవేమంటే : 1. అతి 2. గర్వం" (సహీహ్ బుఖారీ : కితాబుల్లిబాస్.....). "తినండి, త్రాగండి, కాని మితిమీరకండి" అన్న ఒక చిన్న వాక్యంలో అల్లాహ్ యావత్తు వైద్యశాస్త్రాన్ని ఇమిడ్చి ఉంచాడని కొంతమంది సలఫ్లు అభిప్రాయపడ్డారు (ఇబ్నె కసీర్).

35. కాబా గృహ ప్రదక్షిణ సమయంలో వస్త్రధారణను ముష్రిక్కులు ఇష్టపడనట్లే, మరికొన్ని వస్తువులను కూడా వారు తమకోసం నిషేధించుకున్నారు. అదేమంటే, దైవసామీప్యం పొందడం కోసం తాము అలా చేస్తున్నామని వారు చెప్పేవారు (నేటి మన సూఫీలు కూడా కొందరు ఇలాగే చేస్తుంటారు.) ఎన్నో ధర్మసమ్మతమైన జంతువులను వారు తమ దేవీదేవతల పేరు మీద వదలి వాటి మాంసం తినటాన్ని నిషేధించుకున్నారు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమని సెలవిచ్చాడంటే, ప్రజల శోభ కోసం మేము ప్రసాదించిన సామగ్రిని, పరిశుద్ధ ఆహారపదార్థాలను నిషేధించడానికి వాళ్ళెవరు? వాళ్లు కొన్ని వస్తువులను తమంతట తాముగా నిషేధించుకున్నంత మాత్రాన అవి హరామ్ అయిపోవు. ఈ పరిశుద్ధమైన, పవిత్రమైన వస్తువుల్ని వాస్తవానికి అల్లాహ్ విశ్వాసుల కోసమే సృష్టించాడు. కాకపోతే అవిశ్వాసులు, దేవుని అవిధేయులు కూడా వాటి ద్వారా లబ్ధి పొందుతారు. ఒకవిధంగా చెప్పాలంటే ప్రాపంచిక వస్తువులను, ఇక్కడి సుఖ సౌఖ్యాలను జుర్రుకోవటంలో వారు ముస్లింలకన్నా ఎంతో ముందంజలో ఉంటారు. అయితే ఈ 'బులపాటం' క్షణికమైనది, తాత్కాలికమైనది. దేవుని ప్రణాళికననుసరించి ఇలా జరుగుతోంది. కాని ప్రళయదినాన ఈ వరాలన్నీ విశ్వాసులకే ప్రత్యేకించబడతాయి. అవిశ్వాసుల కొరకు స్వర్గం నిషేధించబడినట్లే అన్నపానీయాలు కూడా వారికి నిషిద్ధం అయిపోతాయి.

36. బహిరంగమైన నీతిమాలిన పనులంటే పబ్లిగ్గా వేశ్యల వద్దకు పోవటం అనీ, గోప్యమైన నీతిమాలిన పనులంటే 'ప్రియురాలి'తో చాటుమాటు సరసాలు జరపటమనీ కొందరు వ్యాఖ్యానించారు. మరికొంతమంది విద్వాంసుల దృష్టిలో బాహాటమైన నీతిమాలిన పనంటే భావం మహ్రమ్ గావించబడిన (నిషేధించబడిన) స్త్రీ పురుషులను వివాహమాడటం. మొత్తమ్మీద మనిషిని నైతికంగా దిగజార్చి, సామాజికంగా, ఆధ్యాత్మికంగా దివాలా తీయించే పనులన్నీ నీతిబాహ్యమైన పనుల జాబితాలోకే వస్తాయి. ఉదాహరణకు : సినీమాలు, అశ్లీల సాహిత్యం, నగ్న అర్ధనగ్న పోస్టర్లు, నీతిబాహ్యతను పెంచిపోషించే సభలు, సమ్మేళనాలు, విశృంఖలత్వం, అడ్డూ అదుపూలేని రీతిలో స్త్రీ పురుషుల కలయిక, వివాహాది శుభకార్యాల సందర్భంగా జరిగే అపసవ్యమైన పోకడలు, అవధులు మీరిన ఆనంద ప్రలాపనలు – ఇవన్నీ బాహాటమైన నీతిబాహ్య విషయాలుగానే భావించబడతాయి. అల్లాహ్ మనల్ని వాటి నుంచి రక్షించుగాక!

تُشْرِكُوا بِاللّٰهِ مَا لَمْ يُنَزِّلْ بِهٖ سُلْطٰنًا وَّاَنْ تَقُوْلُوْا عَلَى اللّٰهِ مَا لَا تَعْلَمُوْنَ ﴿33﴾

దుర్మార్గానికి ఒడిగట్టటం,[37] అల్లాహ్ ఏ ప్రమాణమూ అవతరింప జేయకపోయినప్పటికీ మీరు అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పించటం, (నిజంగా అల్లాహ్ అన్నాడని) మీకు తెలియని విషయాన్ని మీరు అల్లాహ్ పేరుతో చెప్పటం (వీటిని అల్లాహ్ నిషేధించాడు)" అని ఓ ప్రవక్తా! వారికి చెప్పు.

وَلِكُلِّ اُمَّةٍ اَجَلٌ ۚ فَاِذَا جَآءَ اَجَلُهُمْ لَا يَسْتَاْخِرُوْنَ سَاعَةً وَّلَا يَسْتَقْدِمُوْنَ ﴿34﴾

**34** ప్రతి సమాజానికీ ఒక గడువు[38] నిర్ధారించబడి ఉంది. వారి నిర్ణీత సమయం వచ్చేసినప్పుడు ఒక్క క్షణం కూడా వారు వెనకా ముందూ కాలేరు.

يٰبَنِيْٓ اٰدَمَ اِمَّا يَاْتِيَنَّكُمْ رُسُلٌ مِّنْكُمْ يَقُصُّوْنَ عَلَيْكُمْ اٰيٰتِيْ ۙ فَمَنِ اتَّقٰى وَاَصْلَحَ فَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ﴿35﴾

**35** ఓ ఆదం సంతతివారలారా! ఒకవేళ మీలో నుంచే (నియుక్తులైన) ప్రవక్తలు మీవద్దకు వచ్చి, నా ఆదేశాలను వారు మీకు వినిపించినపుడు భయభక్తుల (తఖ్వా) వైఖరిని అవలంబించి, తమ్ము తాము సరిదిద్దుకున్న వారికి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు.[39]

وَالَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِنَا وَاسْتَكْبَرُوْا عَنْهَآ اُولٰٓئِكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ﴿36﴾

**36** మరెవరయితే మా ఆదేశాలను అసత్యాలని ధిక్కరించి, వాటిపట్ల దురహంకారాన్ని ప్రదర్శిస్తారో వారు నరక వాసులవుతారు. అందులో వారు ఎల్లకాలం పడి ఉంటారు.[40]

37. దేవుని పట్ల అవిధేయతకు పాల్పడటాన్నే పాపం అంటారు. "నీ మనసును తొలిచే ప్రతి విషయమూ, ఇతరులకు తెలియటాన్ని నీవు సహించలేని ప్రతి విషయమూ పాపమే" అని మహాప్రవక్త (స) ప్రవచించారు (ముస్లిం–కితాబుల్ బిర్ర్). మరికొంతమంది దృష్టిలో మనిషి స్వయానికి పరిమితం అయి ఉన్నంతవరకూ అది పాపమనబడుతుంది. కాని దాని కీడు ఇతరులకు కూడా కలిగితే అది దుర్మార్గంగా పరిగణించబడుతుంది. అన్యాయంగా ఒకరి మీద దౌర్జన్యానికి ఒడిగట్టటం అంటే వారి హక్కును కాలరాయటం, వేరొకరి సొమ్మును స్వాహా చేయటం, ఒకరిని కొట్టడం తిట్టడం, నలుగురిలో నవ్వులపాలు చేయటం అని అర్థం.

38. నిర్ధారిత గడువు అంటే 'ఆచరణా కాలం' అని అర్థం. వ్యక్తులనూ, వర్గాలనూ, జాతులనూ పరీక్షించే నిమిత్తం దేవుడు ఒక నిర్ణీత గడువును ఇచ్చాడు. ఆ గడువును మహదవకాశంగా భావించి అందులో వారు మంచిపనులు చేస్తారో లేక పెడసరి ధోరణులను అవలంబిస్తారో అల్లాహ్ చూడదలుస్తున్నాడు. ఈ గడువు ఒక్కోసారి పూర్తి జీవితకాలం ఇవ్వబడుతుంది. అంటే ఇహలోక జీవితంలో వారెలా తైతక్కలాడినా దేవుడు పట్టుకోడు. పరలోకంలోనే వారి భరతం పడతాడు. అంటే వీరి నిర్ణీత గడువు (అజలుమ్ ముసమ్మా) ప్రళయం అన్నమాట. ఇక ఎవరినయితే అల్లాహ్ ప్రపంచంలోనే శిక్షిస్తాడో, వారి 'నిర్ణీత గడువు' ఆయన వారిని పట్టుకొని శిక్షకు గురిచేయటం వరకు అవుతుందన్నమాట.

39. భయభక్తుల వైఖరిని అవలంబించి సత్కార్యాలు చేసిన విశ్వాసుల సత్ఫరిణామం ఎలాంటిదో యిక్కడ చెప్పబడింది. దివ్య ఖుర్ఆన్ అనేకచోట్ల విశ్వాసాన్ని (ఈమాన్) గురించి చెప్పినప్పుడు, సత్కార్యాలను (అమలుస్సాలెహ్) గురించి కూడా ప్రస్తావిస్తుంది. దీనిద్వారా అవగతం అయ్యేదేమిటంటే దైవసమక్షంలో సదాచరణలు గల విశ్వాసమే ఎన్నదగినది.

40. విశ్వాసుల విధానానికి విరుద్ధంగా దైవాజ్ఞలను ధిక్కరించి, భూమిలో విర్రవీగుతూ నడిచే వారి దుష్పరిణామం ఎలా

37 అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టేవాని కంటే లేదా ఆయన ఆయతులను అసత్యాలని కొట్టిపారేసేవాని కంటే పరమ దుర్మార్గు డెవడుంటాడు? అటువంటి వారికోసం రాసిపెట్టి ఉన్న భాగం వారికి లభించి తీరుతుంది.[41] ఆఖరికి మా దూతలు వారి ప్రాణాలు స్వాధీనం చేసుకోవటానికి వారివద్దకు వచ్చినప్పుడు "అల్లాహ్‌ను వదలి మీరు ఆరాధిస్తూ ఉన్నవారు ఇప్పుడెక్క డున్నారు?" అని అడుగుతారు. "వారంతా మా వద్ద నుంచి మటుమాయమై పోయారు" అని వాళ్ళు చెబుతారు. తాము అవిశ్వాసులుగా ఉండేవారన్న విషయాన్ని గురించి వారు స్వయంగా సాక్ష్యమిస్తారు.

فَمَنْ اَظْلَمُ مِمَّنِ افْتَرٰى عَلَى اللّٰهِ كَذِبًا اَوْ كَذَّبَ بِاٰيٰتِهٖ ؕ اُولٰٓئِكَ يَنَالُهُمْ نَصِيْبُهُمْ مِّنَ الْكِتٰبِ ؕ حَتّٰٓى اِذَا جَآءَتْهُمْ رُسُلُنَا يَتَوَفَّوْنَهُمْ ۙ قَالُوْٓا اَيْنَ مَا كُنْتُمْ تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ ؕ قَالُوْا ضَلُّوْا عَنَّا وَشَهِدُوْا عَلٰٓى اَنْفُسِهِمْ اَنَّهُمْ كَانُوْا كٰفِرِيْنَ ﴿٣٧﴾

38 "మీకు పూర్వం గతించిన[42] జిన్నాతు, మానవ సమూహాలతో చేరి, (వారితో పాటు) మీరు కూడా నరకంలోకి ప్రవేశించండి" అని అల్లాహ్ వారితో అంటాడు. వారిలోని ప్రతి సమూహమూ అందులో (నరకంలో) పడుతున్నప్పుడు, తన సహవాస సమూ హానికి శాపనార్థాలు పెడుతుంది.[43] ఆఖరికి వారంతా అందులో

قَالَ ادْخُلُوْا فِيْٓ اُمَمٍ قَدْ خَلَتْ مِنْ قَبْلِكُمْ مِّنَ الْجِنِّ وَالْاِنْسِ فِى النَّارِ ؕ كُلَّمَا دَخَلَتْ اُمَّةٌ لَّعَنَتْ اُخْتَهَا ؕ حَتّٰٓى اِذَا ادَّارَكُوْا فِيْهَا جَمِيْعًا ۙ قَالَتْ اُخْرٰىهُمْ لِاُوْلٰىهُمْ رَبَّنَا هٰٓؤُلَآءِ

ఉంటుందో యిక్కడ చిత్రీకరించబడింది. ఈ రెండు పరిణామాలను ఇక్కడ ప్రస్తావించటంలోని ముఖ్యోద్దేశం ఏమిటంటే, జనులు అంతిమ పరిణామం రీత్యా తమకు ప్రయోజనకరం అయ్యేదానిని అవలంబించాలి. తమ పాలిట హానికరంగా పరిణమించేదానిని పరిత్యజించాలి.

41. ఈ వాక్యానికి పలు భావార్థాలు వ్యక్తపరచబడ్డాయి. **'రాసిపెట్టి ఉన్నది'** అంటే మనిషి ఆచరణలు, ఉపాధి, వయస్సు అని అర్థమని కొందరన్నారు. అంటే వారికోసం రాసిపెట్టి ఉన్న ఉపాధిని, ఆయుషును పొందిన తరువాత, ఇంకా వారి అదృష్టంలో రాసిపెట్టబడివున్న ఆచరణలు చేసిన తరువాతనే వారు మృత్యువు ఒడిలోకి వెళతారు. క్రింది ఆయతు కూడా ఈ భావంలోనే చెప్పబడింది: "అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టేవారు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు. ప్రపంచంలో కొన్నాళ్లు లబ్ధి పొందినా ఎట్టకేలకు వారు మా వైపుకు మరలి రావలసినవారే" (యూనుస్-69, 70).

42. అరబీలో **'ఉమమున్'** (اُمَمٌ) అనే పదం వచ్చింది. ఉమ్మతున్ అనేది ఏకవచనం. ఉమమున్ అంటే సమాజాలు; అవిశ్వాసం, బహుదైవారాధన, అవిధేయతల విషయంలో ఇంచుమించు ఒకేవిధంగా ఉన్న వర్గాలు, సమూహాలు అని ఇక్కడ దాని భావం. మూలంలోని ఆయతులో "ఉద్‌ఖులూ ఫీ ఉమమిన్" (వర్గాల్లోకి ప్రవేశించండి) అని ఉంది. 'ఫీ' అంటే 'లోనికి' అని అర్థం వస్తుంది. అయితే ఇక్కడ ఇది 'మఅ' (తోపాటు) అనే అర్థంలో వాడబడి ఉండ వచ్చు. అప్పుడు వాక్యం ఇలా రూపొందుతుంది : "ఉద్‌ఖులూ మఅ ఉమమిన్" అంటే మీకంటే ముందు ఇక్కడికి వచ్చిన మీలాంటి మానవ, జిన్నాతు వర్గాలతోపాటు మీరూ నరకంలోకి ప్రవేశించండని ఈ ఆయతు భావం.

43. ఒక సమూహం మరో సమూహాన్ని ఆడిపోసుకుంటుంది. ఈ ఆయతులో ఒక వర్గాన్ని మరోవర్గం పాలిట 'తోబుట్టువు' (ఉఖ్‌తున్)గా చిత్రీకరించటం జరిగింది. ధర్మం లేక మార్గవిహీనత దృష్ట్యా ఒక సమూహం మరో సమూహానికి తోబుట్టువు లాంటిది. ఈ ఆయతు ప్రకారం నరకాగ్నికి ఆహుతి అయ్యే సమూహాలు పరస్పరం అక్కాచెల్లెళ్ల వంటివి. ఎందుకంటే అవి అవలంబించిన మతం సరైంది కాదు. మార్గవిహీనతకు సంబంధించిన వ్యవహారాలలో అవి ఒండొకదానికి చేదోడు వాదోడుగా ఉండేవి. కనుక వాటి గమ్యస్థానం కూడా ఒక్కటే అయింది. అదే నరకం!

اَضَلُّوْنَا فَاٰتِهِمْ عَذَابًا ضِعْفًا مِّنَ النَّارِ ۬ؕ قَالَ لِكُلٍّ ضِعْفٌ وَّلٰكِنْ لَّا تَعْلَمُوْنَ ﴿۳۸﴾

చేరిపోయిన తరువాత,[44] తరువాతి వారు మొదటివారి నుద్దేశించి,[45] "ప్రభూ! అసలు మమ్మల్ని అపమార్గం పట్టించిన వాళ్లు వీళ్ళే. కనుక వీళ్లకు రెట్టింపు నరక శిక్షను విధించు"[46] అని అంటారు. అప్పుడు అల్లాహ్, "అందరికీ రెట్టింపు శిక్షే పడుతుంది.[47] కాని ఆ సంగతి మీకు అర్థం కాదు" అంటాడు-

وَقَالَتْ اُوْلٰىهُمْ لِاُخْرٰىهُمْ فَمَا كَانَ لَكُمْ عَلَيْنَا مِنْ فَضْلٍ فَذُوْقُوا الْعَذَابَ بِمَا كُنْتُمْ تَكْسِبُوْنَ ﴿۳۹﴾

**39** మొదటివారు తమ తరువాతి వారినుద్దేశించి, "మీకు మాపై ఎలాంటి ప్రాధాన్యతా లభించలేదు. కాబట్టి మీరు కూడా మీరు సంపాదించుకున్న దానికి ప్రతిఫలంగా శిక్షను రుచి చూడండి" అంటారు.

اِنَّ الَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِنَا وَاسْتَكْبَرُوْا عَنْهَا لَا تُفَتَّحُ لَهُمْ اَبْوَابُ السَّمَآءِ وَلَا يَدْخُلُوْنَ الْجَنَّةَ حَتّٰى يَلِجَ الْجَمَلُ فِيْ سَمِّ الْخِيَاطِ ؕ وَكَذٰلِكَ نَجْزِى الْمُجْرِمِيْنَ ﴿۴۰﴾

**40** ఎవరు మా ఆయతులను అసత్యాలని ధిక్కరించి, వాటి పట్ల గర్వాతిశయంతో విఱ్ఱవీగారో వారి కోసం ఆకాశ ద్వారాలు తెరువబడవు.[48] ఒంటె సూది రంధ్రంలో నుంచి దూరిపోనంత వరకూ[49] వారు స్వర్గంలో ప్రవేశించలేరు. అపరాధులను మేము ఈ విధంగానే శిక్షిస్తాం.

44. ఈ మార్గవిహీనులంతా ఒకచోటికి చేరిన తరువాత 'త్వంశుంఠ' వైఖరిని అవలంబిస్తారు. మీ మూలంగానే ఇలా జరిగిందని ఒక వర్గం వారంటే, మీరు మాత్రం తక్కువ తిన్నారా? అని ఇంకొక వర్గం చురక అంటిస్తుంది. మొత్తమ్మీద వారి ఈ నిందారోపణలు వారికేమాత్రం ప్రయోజనం చేకూర్చవు.

45. తరువాతి వారంటే చివర్లో నరకాగ్నిలోకి ప్రవేశించేవారనీ, మొదటివారంటే మొదట ప్రవేశించేవారనీ భావం. లేక తరువాతి వారంటే అనుయాయులనీ, మొదటివారంటే అగ్రశ్రేణికి చెందినవారనీ, నాయకులు లీడర్లనీ భావం. ఈ నాయకాగ్రేసరులు తాము స్వయంగా చెడిపోయినది గాకుండా తమ అనుచరగణాన్ని కూడా చెడగొట్టారు. కాబట్టి తమ అనుయాయుల కన్నా ముందు ఈ 'నాయకులు' నరకంలో పడవేయబడతారు.

46. 'ఫలితం' తెలిశాక సంజాయిషీలు మొదలయ్యాయి. తమ నాయకమన్యుల, గురుజనుల తప్పులు వారికంటికి అప్పుడు కనిపించసాగాయి. దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట, మరింత స్పష్టంగా ఈ సంగతి చెప్పబడింది : "మా ప్రభూ! మేము మా సర్దారులకు, పెద్దలకు విధేయత చూపాము. వాళ్ళే మమ్మల్ని సన్మార్గం నుంచి పెడదారి పట్టించారు. కనుక ఓ అల్లాహ్! వీళ్లకు రెండింతల శిక్ష విధించు. వీళ్ళను తీవ్రంగా శపించు" (అల్ అహ్జాబ్ – 67, 68).

47. అంటే ఇప్పుడు మీరు వగచి లాభం ఏమిటి? ఒకరినొకరు నిందించుకోవటం వల్ల ప్రయోజనం ఏమిటి? మేలుకోవలసిన సమయంలో మీరు మేలుకోలేదు. మీలో ప్రతిఒక్కరూ అపరాధే. ఎవరూ తక్కువేమీ కాదు. కనుక అందరికీ ఏ మోతాదులో దరువు పడాలో ఆ మోతాదులోనే పడింది. శిక్ష అనుభవిస్తూ కూడా ఇతరులపై అక్కసును వెళ్లగక్కటం ఎందుకు? దుష్టనాయకులకు – వారి శిష్యులకు మధ్య జరిగే సంవాదన సబా సూరాలోని 31, 32 ఆయతులలో కూడా వివరంగా వచ్చింది.

48. ఈ వాక్యంపై వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. 'వారికోసం ఆకాశ ద్వారాలు తెరువబడవు' అంటే వారి కర్మల కోసం అని కొందరూ, వారి ఆత్మల కోసం అని మరికొందరు, వారి ప్రార్థనల కోసమని ఇంకొందరు

لَهُمْ مِّنْ جَهَنَّمَ مِهَادٌ وَّمِنْ فَوْقِهِمْ
غَوَاشٍ ۚ وَكَذٰلِكَ نَجْزِي الظّٰلِمِيْنَ ﴿41﴾

**41** వారి క్రింద నరకాగ్నితో చేయబడిన పాన్పు[50] ఉంటుంది. పైన దుప్పటి కూడా (దానితోనే తయారైనదయి ఉంటుంది). దుర్మార్గులకు మేము విధించే శిక్ష ఇలాగే ఉంటుంది.

وَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ لَا نُكَلِّفُ
نَفْسًا اِلَّا وُسْعَهَآ ۡ اُولٰٓئِكَ اَصْحٰبُ الْجَنَّةِ ۚ
هُمْ فِيْهَا خٰلِدُوْنَ ﴿42﴾

**42** మరెవరు విశ్వసించి, మంచి పనులు చేశారో–ఏ వ్యక్తిపై కూడా మేము శక్తికి మించిన భారం వేయము–[51] యదార్థానికి వారే స్వర్గవాసులు. అందులో వారు కలకాలం ఉంటారు.

وَنَزَعْنَا مَا فِيْ صُدُوْرِهِمْ مِّنْ غِلٍّ تَجْرِيْ مِنْ
تَحْتِهِمُ الْاَنْهٰرُ ۚ وَقَالُوا الْحَمْدُ لِلّٰهِ الَّذِيْ هَدٰىنَا

**43** వారి ఆంతర్యాల్లో ఏ కాస్తయినా విద్వేషం ఉంటే దాన్ని మేము తొలగిస్తాము.[52] వారి (నివాసాల) క్రింద నుంచి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. "మమ్మల్ని ఈ స్థానం వరకూ చేర్చిన అల్లాహ్‌కు (కోట్లాది) కృతజ్ఞతలు. అల్లాహ్‌యే గనక మాకు

అభిప్రాయపడ్డారు. అంటే ఇలాంటి పాపాత్ముల ఆచరణలు, ఆత్మలు, దుఆలు పైకిపోవటానికి ఆకాశద్వారాలు తెరచుకోవు. మరోవిధంగా చెప్పాలంటే వారి ఆచరణలు, వేడుకోళ్లు స్వీకారయోగ్యం కావు. వారి ఆత్మలు భువిపైకి తిప్పి పంపబడతాయి (ముస్నదె అహ్మద్, రెండవ సంపుటిలోని ఒక హదీసు ద్వారా కూడా ఈ సంగతి మనకు తెలుస్తున్నది). మూడు విషయాలూ (ఆచరణలు, ఆత్మలు, దుఆలు) ఇందులోకి రావచ్చునని ఇమామ్ షౌకానీ వ్యాఖ్యానించారు.

49. విషయాన్ని తేలిగ్గా బోధపరచటానికి ఒంటె ఉపమానం ఇవ్వబడింది. ఒంటె సూది రంధ్రం నుంచి దూరిపోతుందని అసలు దీని భావం కాదు. ఒక చిన్న సూది రంధ్రం నుంచి ఒంటె దూరిపోవటం ఎలా అసంభవమో ఈ దుర్మార్గులు స్వర్గంలో ప్రవేశించటం కూడా అలాగే అసంభవం అన్నది దీని అంతరార్థం. ఆనాడు అరబ్బులకై ఒంటె సుప్రసిద్ధ పశువు అవటం మూలంగా దానిని ఉదాహరణగా తీసుకోవటం జరిగింది. దీన్నే అరబీలో 'తాలీఖ్ బిల్ మహాల్' అంటారు. అంటే ఏదయినా విషయాన్ని అసంభవమైన విషయంతో ముడిపెట్టటాన్ని 'తాలీఖ్ బిల్ మహాల్'గా పేర్కొంటారు. ఉదా : పై ఆయతులో దైవతిరస్కారుల స్వర్గ ప్రవేశాన్ని, సూది రంధ్రం గుండా ఒంటె ప్రవేశించటం అనే విషయంతో ముడిపెట్టటం జరిగింది. ఇదే తాలీఖ్ బిల్ మహాల్.

50. నరకంలో పడినవారికి పడుకోవటానికి పరుపుగానీ, కప్పుకోవటానికి దుప్పటిగానీ ఉండవు. అగ్ని జ్వాలలే వారి పరుపు. అగ్ని మంటలే వారు కప్పుకునే దుప్పటిగా ఉంటాయి. నరకంలోని వ్యథాభరితమైన స్థితిని చిత్రీకరించటానికి ఇలా చెప్పటం జరిగింది. **గవాష్** ( **غَوَاشٍ** ) : ఇది గాషియతున్‌కు బహువచనం. కప్పివేసేది అని భావం.

51. విశ్వాసం (ఈమాన్) మరియు సదాచరణలు (అమలుస్సాలెహ్) అనేవి మనిషి శక్తికి మించినవి ఎంతమాత్రం కావు. ఒక మనిషి ఎంత భారాన్ని మోయగలుగుతాడో, మరే ఆచరణలను ఏ ఇబ్బందీ లేకుండా చేయగలుగుతాడో అతన్ని పుట్టించిన వానికి బాగా తెలుసు. వాస్తవమేమిటంటే దేవుడు విధించిన విధులను మనిషి అలవోకగా నెరవేర్చగలుగుతాడు. మనిషి కోసం దేవుడు సమ్మతించి ఆమోదించిన జీవన విధానం (ఇస్లాం) సర్వకాల సర్వావస్థల్లో ఆచరణ యోగ్యమైనది.

52. అరబీలో **'ఘిల్' (غِلٍّ)** అనే పదం వాడబడింది. ఘిల్ అంటే మనసులోని ఏదో ఒక మూలలో అణగారి ఉండే 'కలక' లేక 'నకారాత్మకత' లేక 'కల్మషం' అని అర్థం. ఆంతర్యాల్లో తిష్ఠవేసి ఉన్న కొద్దిపాటి వ్యతిరేకభావం కూడా స్వర్గవాసులకు శోభించదు. ఎందుకంటే దానిమూలంగా స్వర్గవాసులలో పరస్పరం విరోధభావం, ఓర్వలేనితనం వంటివి జనించవచ్చు. అందుకే అల్లాహ్ దానిని సయితం దూరంచేసి స్వర్గవాసులపై ప్రత్యేకంగా దయదలిచాడు.

لِلّٰهِ الَّذِیْ هَدٰىنَا لِهٰذَا ۗ وَمَا كُنَّا لِنَهْتَدِیَ لَوْلَاۤ اَنْ هَدٰىنَا اللّٰهُ ۚ لَقَدْ جَآءَتْ رُسُلُ رَبِّنَا بِالْحَقِّ ؕ وَنُوْدُوْۤا اَنْ تِلْكُمُ الْجَنَّةُ اُوْرِثْتُمُوْهَا بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿43﴾

మార్గదర్శకత్వం[53] వహించకుండా ఉంటే మేము ఎన్నటికి కూడా ఈ స్థితికి చేరుకునే వాళ్ళంకాము. మా ప్రభువు (తరఫున వచ్చిన) ప్రవక్తలు నిజంగా సత్యాన్నే తీసుకువచ్చారు" అని వారు అంటారు. అప్పుడు వారిని పిలిచి ఇలా చెప్పబడుతుంది: "మీరు చేసుకున్న సత్కర్మలకు బదులుగా[54] మీరు ఈ స్వర్గానికి వారసులయ్యారు."

وَنَادٰۤی اَصْحٰبُ الْجَنَّةِ اَصْحٰبَ النَّارِ اَنْ قَدْ وَجَدْنَا مَا وَعَدَنَا رَبُّنَا حَقًّا فَهَلْ وَجَدْتُّمْ

**44** స్వర్గవాసులు నరకవాసులను కేకవేసి పిలుస్తూ, "మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాన్ని మేము నిజమైనదిగా పొందాము. మరి మీరు కూడా మీ ప్రభువు చేసిన వాగ్దానాన్ని నిజమైనదిగా పొందారా?"[55] అని ప్రశ్నిస్తారు. "అవును" అని వారు సమాధాన

ఫలితంగా వారి హృదయాలు నిష్కల్మషంగా – అద్దం వలె – ఉంటాయి. వారి మనసుల్లో తోటి స్వర్గవాసి పట్ల వైరభావం లేశమయినా ఉండదు.

ఈ వాక్యానికి వ్యాఖ్యానంగా మరికొంతమంది విద్వాంసులు ఏమన్నారంటే స్వర్గవాసులకు కూడా – వారి సత్కర్మలను, త్యాగాలనుబట్టి – అంతస్థులు, తరగతులు కేటాయించబడతాయి. కాని ఈ తరగతుల మూలంగా వారిలో ఎవరూ ఇంకొకరి పట్ల అసూయచెందరు.

మొదటి వ్యాఖ్యానానికి ఒక హదీసు ద్వారా సమర్థన లభిస్తోంది. అదేమంటే స్వర్గవాసులను స్వర్గానికీ–నరకానికి మధ్య ఒక వారధిపై ఆపటం జరుగుతుంది. వారిమధ్య అప్పటివరకూ గల అరమరికలను, ఒకరి ద్వారా ఇంకొకరికి కలిగిన ఇబ్బందులను తెలియజేసి వాటి లెక్క తేల్చటం జరుగుతుంది. కడకు వారంతా స్వచ్ఛంగా తయారవుతారు. అప్పుడు వారికి స్వర్గంలో ప్రవేశించేందుకు అనుమతి లభిస్తుంది (సహీహ్ బుఖారీ : కితాబుల్ మజాలిమ్ – బాబు ఖిసాసిల్ మజాలిమ్). ఉదాహరణకు: దైవప్రవక్త (సఅసం) ప్రియసహచరుల మధ్య నెలకొన్న కొన్ని అవాంఛనీయ ఘటనలు – ఆనాటి రాజకీయ స్థితిగతుల దృష్ట్యా ఇవి అనివార్యం అయ్యాయి. ఒకసారి హజ్రత్ అలీ (రజి) గారు ఇలా అన్నారు : "వారి ఆంతర్యాల్లో ఏకాస్త 'విద్వేషం' ఉన్నా దాన్ని మేము తొలగిస్తాము' అని ఏ విశ్వాసుల్ని దృష్టిలో పెట్టుకుని అల్లాహ్ సెలవిచ్చాడో వారిలో నేను, నాతోపాటు ఉస్మాన్ (రజి), తల్హా (రజి), జుబైర్ (రజి)లు కూడా ఉంటారని నేను ఆశిస్తున్నాను" (ఇబ్నె కసీర్).

53. సన్మార్గాన్ని అవలంబించే సద్బుద్ధి లభించినా, సత్కర్మలు చేయగలిగినా, ఆ సత్కర్మలు దైవసన్నిధిలో స్వీకృతిని పొందినా– ఇదంతా దేవుని కటాక్షం, ప్రత్యేక సహాయం వల్లనే జరిగింది తప్ప అందులో మా గొప్పదనం ఏమీలేదని స్వర్గవాసులు చెబుతారు. ఒకవేళ దైవకృపే గనక లేకపోతే తాము ఈ రోజు ఈ స్థితికి చేరుకుని ఉండేవారం కామని కూడా వారు అంగీకరిస్తారు. ఇంచుమించు ఇదే భావాన్ని కలిగివున్న ఒక హదీసులో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "బాగా తెలుసుకోండి! దేవుడు కటాక్షించనంతవరకూ మీలో ఎవరినీ కేవలం అతని సదాచరణ స్వర్గానికి చేర్చదు." ఇది విన్న ప్రియసహచరులు, "దైవప్రవక్తా (స)! తమరి విషయంలోనూ అంతేనా?!" అని సందేహపడ్డారు. దానికి "అవును. నా విషయంలోనూ అంతే. దైవకారుణ్యం నన్ను తన ఒడిలోకి చేర్చుకోనంత వరకూ నేను సయితం స్వర్గంలోకి వెళ్ళలేను" అని ఆయన (స) వివరించారు (సహీహ్ బుఖారీ: కితాబుర్రిఖాఖ్; సహీహ్ ముస్లిం : కితాబ్ సిఫతుల్ ఖియామ).

54. ఈ వాక్యం ఇంతకు ముందు వచ్చిన 'వివరణ'కు వ్యాఘాతంగా అనిపించవచ్చు. కాని యిక్కడ గమనించవలసిన ఓ ముఖ్య విషయం ఏమిటంటే సదాచరణ చేసే ఆలోచన మనిషికి కలగటం కూడా దైవకృపే.

مَّا وَعَدَ رَبُّكُمْ حَقًّا ۖ قَالُوا نَعَمْ ۚ فَأَذَّنَ مُؤَذِّنٌ
بَيْنَهُمْ أَن لَّعْنَةُ اللَّهِ عَلَى الظَّالِمِينَ ﴿44﴾

మిస్తారు. అప్పుడు ప్రకటించేవాడొకడు వారి మధ్య, “ఈ దుర్మార్గు లపై అల్లాహ్ శాపం పడుగాక!” అని ప్రకటిస్తాడు.

الَّذِينَ يَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ وَيَبْغُونَهَا
عِوَجًا ۚ وَهُم بِالْآخِرَةِ كَافِرُونَ ﴿45﴾

45 వారు అల్లాహ్ మార్గం నుంచి విముఖత చూపేవారు, అందులో వక్రతలను వెతికేవారు. పరలోకాన్ని సయితం త్రోసి పుచ్చేవారు.

وَبَيْنَهُمَا حِجَابٌ ۚ وَعَلَى الْأَعْرَافِ رِجَالٌ
يَعْرِفُونَ كُلًّا بِسِيمَاهُمْ ۚ وَنَادَوْا أَصْحَابَ
الْجَنَّةِ أَن سَلَامٌ عَلَيْكُمْ ۚ لَمْ يَدْخُلُوهَا
وَهُمْ يَطْمَعُونَ ﴿46﴾

46 వారిరువురి మధ్య ఒక గోడ[56] అడ్డుగా ఉంటుంది. ‘ఆరాఫ్’ పైన చాలామంది[57] ఉంటారు. వారు ప్రతి ఒక్కరినీ వారి చిహ్నా లను బట్టి గుర్తుపడతారు.[58] వారు స్వర్గవాసులను పిలిచి, “అస్సలాము అలైకుమ్ (మీకు శాంతి కలుగుగాక)!” అని అంటారు. ఈ ఆరాఫ్ వారు అప్పటికింకా స్వర్గంలో ప్రవేశించి ఉండరు. అయితే తమకూ స్వర్గం లభిస్తుందన్న ఆశతో ఉంటారు.[59]

وَإِذَا صُرِفَتْ أَبْصَارُهُمْ تِلْقَاءَ أَصْحَابِ النَّارِ
قَالُوا رَبَّنَا لَا تَجْعَلْنَا مَعَ الْقَوْمِ الظَّالِمِينَ ﴿47﴾

47 వారి దృష్టి నరకవాసులపై పడినప్పుడు, “ఓ ప్రభూ! మమ్మల్ని ఈ దుర్మార్గులలో చేర్చకు” అని ప్రార్థిస్తారు.

55. బద్ర్ యుద్ధంలో హతమార్చబడి, బావిలో పడవేయబడ్డ అవిశ్వాసులను ఉద్దేశించి మహాప్రవక్త (సఅసం) కూడా ఇలాగే ప్రశ్నించారు : దానిపై హజ్రత్ ఉమర్ స్పందిస్తూ, “తమరు చనిపోయిన వారినుద్దేశించి ప్రశ్నిస్తున్నారా?” అని అన్నారు. దానికి ఆయన (స), “దైవసాక్షి! నేను వారికి చెబుతున్నదానిని వాళ్లు మీకన్నా బాగా వింటున్నారు. కాని ఇప్పుడు వారికి సమాధానమిచ్చే శక్తిలేదు” అని చెప్పారు (సహీహ్ ముస్లిం: కితాబుల్ జన్న, కితాబుల్ మగాజీ).

56. వారి మధ్య అంటే స్వర్గ – నరకాల మధ్య అనీ అర్థం కావచ్చు. విశ్వాసుల – అవిశ్వాసుల మధ్య అనీ కావచ్చు. మూలంలో **‘హిజాబ్’ (حِجَابٌ)** అని వచ్చింది. అసలు హిజాబ్ అంటే అడ్డంగా ఉండేదని అర్థం. ‘అడ్డుగోడ’ అని ఇక్కడ దాని భావం. వారిమధ్య అడ్డుగోడ ఏర్పడుతుంది. అల్ హదీద్ సూరాలో కూడా దీని ప్రస్తావన వచ్చింది. “వారి మధ్య ఒక గోడ అడ్డుగా నిలబెట్టబడుతుంది. దానికి ఒక తలుపు కూడా ఉంటుంది” (అల్ హదీద్ – 13). ఇదే ‘ఆరాఫ్’ గోడ.

57. ఎవరు వీరు? వీళ్ల విషయంలో ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. అధిక సంఖ్యాకుల అభిప్రాయంలో, వారి సత్కర్మలు – దుష్కర్మలు సరిసమానంగా ఉంటాయి. వారి సత్కర్మలు వారిని నరకంలోకి వెళ్ళకుండా ఒక వైపు నుంచి లాగుతుంటే, మరో వైపు నుంచి వారి దుష్కర్మలు వారిని స్వర్గంలోకి వెళ్ళకుండా ఆపుతుంటాయి. దేవుని అంతిమ నిర్ణయం వెలువడేవరకూ వారు రెంటికీ మధ్య – అనిశ్చిత స్థితిలో – ఉంటారు.

58. **‘సీమావున్’** అంటే చిహ్నాలు, గుర్తులు, ఆనవాళ్ళు అని అర్థం. ఆనాడు స్వర్గవాసుల ముఖాలు దేదీప్యమానంగానూ, ప్రఫుల్లంగానూ ఉంటాయి. కాగా; నరకవాసుల ముఖాలపై నలుపు ఆవరించి ఉంటుంది. వారి కళ్లు నీలి రంగులో కాంతిహీనంగా ఉంటాయి. ఈ లక్షణాలను బట్టి స్వర్గవాసులెవరో, నరకవాసులెవరో వారు గుర్తుపడతారు.

59. ఆయతులోని **‘యత్మవూన’ (يَطْمَعُونَ)** అనే పదాన్ని కొందరు ‘యాలమూన’ అన్న భావంలో తీసుకున్నారు. అంటే తమకు త్వరలో స్వర్గం ప్రాప్తిస్తుందన్న సంగతి వారికి తెలిసే ఉంటుంది.

**48** 'ఆరాఫ్'పై ఉన్నవారు ఎంతోమందిని (నరకవాసుల్ని) వారి ఆనవాళ్ల ద్వారా గుర్తుపట్టి పిలుస్తూ, ఇలా అంటారు : "మీ వర్గాలుగానీ, మీ బడాయిగానీ మీకు ఏమాత్రం పనికి రాలేదే![60]

وَنَادَىٰٓ أَصْحَٰبُ ٱلْأَعْرَافِ رِجَالًا يَعْرِفُونَهُم
بِسِيمَىٰهُمْ قَالُوا۟ مَآ أَغْنَىٰ عَنكُمْ جَمْعُكُمْ وَمَا
كُنتُمْ تَسْتَكْبِرُونَ ﴿48﴾

**49** 'అల్లాహ్ వీళ్లపై దయచూపడు'[61] అని మీరు ప్రమాణాలు చేసి చెప్పేవారు వీరేనా?" అని అడుగుతారు. అప్పుడు "స్వర్గంలో ప్రవేశించండి. ఇక మీకు భయంగానీ, దుఃఖంగానీ ఉండదు" అని వారితో అనబడుతుంది.

أَهَٰٓؤُلَآءِ ٱلَّذِينَ أَقْسَمْتُمْ لَا يَنَالُهُمُ ٱللَّهُ
بِرَحْمَةٍ ۚ ٱدْخُلُوا۟ ٱلْجَنَّةَ لَا خَوْفٌ عَلَيْكُمْ
وَلَآ أَنتُمْ تَحْزَنُونَ ﴿49﴾

**50** నరకవాసులు స్వర్గవాసులను పిలుస్తూ, "మాపైన కొద్దిగా నీళ్ళయినా పోయండి లేదా అల్లాహ్ మీకు ప్రసాదించిన దాంట్లోంచి ఏ కాస్తయినా ఇటు పడేయండి" అని ప్రాధేయ పడతారు. దానికి సమాధానంగా వారు, "ఈ రెండింటినీ అల్లాహ్ అవిశ్వాసుల కొరకు నిషేధించాడు"[62] అని అంటారు.

وَنَادَىٰٓ أَصْحَٰبُ ٱلنَّارِ أَصْحَٰبَ ٱلْجَنَّةِ أَنْ أَفِيضُوا۟
عَلَيْنَا مِنَ ٱلْمَآءِ أَوْ مِمَّا رَزَقَكُمُ ٱللَّهُ ۚ قَالُوٓا۟ إِنَّ
ٱللَّهَ حَرَّمَهُمَا عَلَى ٱلْكَٰفِرِينَ ﴿50﴾

**51** వారు ఇహలోకంలో మతధర్మాన్ని ఆటగా, తమాషాగా తీసుకున్నారు. ఇహలోక జీవితం వారిని మోసానికి గురిచేసింది. కాబట్టి వారు ఈనాటి సమావేశాన్ని విస్మరించినట్లే,[63] మా ఆయతులను త్రోసిపుచ్చినట్లే ఈ రోజు మేము (కూడా) వీళ్లను విస్మరిస్తాము.

ٱلَّذِينَ ٱتَّخَذُوا۟ دِينَهُمْ لَهْوًا وَلَعِبًا وَغَرَّتْهُمُ
ٱلْحَيَوٰةُ ٱلدُّنْيَا ۚ فَٱلْيَوْمَ نَنسَىٰهُمْ كَمَا نَسُوا۟
لِقَآءَ يَوْمِهِمْ هَٰذَا وَمَا كَانُوا۟ بِـَٔايَٰتِنَا
يَجْحَدُونَ ﴿51﴾

---

60. ఇహలోక జీవితంలో అహంకారం ప్రదర్శిస్తూ, తమ మందీమార్బలాన్ని, ఆస్తిపాస్తుల్ని చూసుకుని మీసాలు మెలేస్తూ ఉండిన నరకవాసుల్ని గుర్తుపట్టి 'ఆరాఫ్ వాళ్లు' ఈ విధంగా పలుకుతారు: ఏ అనుంగు అనుచరులను, మరే పదవులను చూసుకుని మీరు బడాయిని చాటుకునేవారో అవి ఈ రోజు మీకు పనికిరాకుండా పోయాయే!

61. ఇహలోకంలో విశ్వసించిన పేదవాళ్లను, బానిసలను, అగత్యపరులను చూసి అవిశ్వాసుల్లోని ధన మదాంధులు, గర్విష్టులు అవహేళన చేసేవారు. మీ దేవునికి ఈ పేదవాళ్ళే కావలసివచ్చారా? వీళ్ళనేనా దేవుడు కరుణించేది?? అంటూ నలుగురిలో వారిని అవమానపరచేవారు. వీళ్లు నిజంగానే మీ దేవుడికి ప్రియమైన వారైతే ఇలా దరిద్రులుగా ఎందుకు తగలడ్డారు? అని రెచ్చగొట్టేవారు. అంతటితో ఆగకుండా; "ప్రళయదినాన సయితం దేవుడు మాపైనే దయదలుస్తాడు. చూస్తూ ఉండండి!" అని పేద ముస్లింలను ఉసిగొల్పుతూ ఉండేవారు. ఆ మాటలనే ఆరాఫ్‌వారు ప్రళయ దినాన గుర్తుచేసి, ఈ ధన మదాంధులను దెప్పిపొడుస్తారు. మరికొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం స్వయంగా అల్లాహ్‌యే ఈ మాటలు అంటాడు. ఆరాఫ్ వాసులు నరకవాసుల్ని ఉద్దేశించి, "మీ మందీమార్బలం, మీ ఆస్తిపాస్తులు ఈ రోజు మీకు ఎందుకూ పనికిరాకుండా పోయాయి" అని చెప్పినప్పుడు, అల్లాహ్ స్వర్గవాసుల వంక సంజ్ఞచేసి, "దైవ కారుణ్యానికి నోచుకోరని మీరు ఏ నిరుపేదల గురించి పద్దాక ప్రమాణాలు చేసి మరీ చెప్పేవారో ఆ నిరుపేదలు వీరే" అనంటాడు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

62. ఆహారపదార్థాలు ఆనాడు స్వర్గవాసులకు ప్రత్యేకం అన్న విషయం ఇంతకు ముందు (32వ ఆయతులో) కూడా వచ్చింది. స్వర్గవాసుల నోట కూడా ఇక్కడ ఈ మాట వెలువడింది.

وَلَقَدْ جِئْنٰهُمْ بِكِتٰبٍ فَصَّلْنٰهُ عَلٰى عِلْمٍ هُدًى وَّرَحْمَةً لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ ﴿52﴾

52 మేము ఈ జనుల వద్దకు, మా సంపూర్ణ జ్ఞానంతో బహు స్పష్టంగా విశదీకరించిన గ్రంథాన్ని చేరవేశాము.[64] విశ్వసించినవారికి అది మార్గదర్శక సాధనం మరియు కారుణ్యం.

هَلْ يَنْظُرُوْنَ اِلَّا تَاْوِيْلَهٗ ؕ يَوْمَ يَاْتِيْ تَاْوِيْلُهٗ يَقُوْلُ الَّذِيْنَ نَسُوْهُ مِنْ قَبْلُ قَدْ جَآءَتْ رُسُلُ رَبِّنَا بِالْحَقِّ ۚ فَهَلْ لَّنَا مِنْ شُفَعَآءَ فَيَشْفَعُوْا

53 ఈ గ్రంథంలో తెలియజేయబడిన తుదిఫలితం[65] ఎప్పుడు వస్తుందా అని మాత్రమే తప్ప మరో దానికోసం వీరు నిరీక్షించటం లేదు. ఏ రోజున దీని తుది ఫలితం వచ్చేస్తుందో ఆ రోజు, ముందు నుంచీ దీనిని విస్మరిస్తూ వచ్చినవారే ఇలా అంటారు: "మా ప్రభువు (తరఫున నియుక్తులైన) ప్రవక్తలు నిజంగానే సత్య బద్ధమైన విషయాలు తెచ్చారు. ఇప్పుడు మా కోసం సిఫారసు చేసే సిఫారసుదారులెవరయినా మాకు లభిస్తారా? లేదా లోగడ

63. ఈ కోవకు చెందిన వారినుద్దేశించి దేవుడు ఈ విధంగా ప్రశ్నిస్తాడని హదీసులో వచ్చింది – "నేను నీకు ఆలుబిడ్డల్ని ఇవ్వలేదా? నీకు గౌరవోన్నతుల్ని ప్రసాదించలేదా? గుఱ్ఱాలను, ఒంటెలను నీ అధీనంలో ఉంచలేదా? నువ్వు అధికారాన్ని వెలగబెడుతూ ప్రజల నుంచి 'పన్ను' వసూలు చేయలేదా?" అని దేవుడు నిలదీసి అడిగినప్పుడు, "అవును ప్రభూ! నువ్వు చెప్పేవన్నీ నిజమే" అని అంగీకరిస్తాడు. "మరి నా ముందు హాజరయ్యే విషయంపై నీకు నమ్మకం ఉండేదా?" అని అల్లాహ్ అతన్ని అడగ్గా, 'లేదు' అని అతను బదులిస్తాడు. "ఏ విధంగా నువ్వు నా పట్ల విస్మరణకు గురయ్యావో అదేవిధంగా ఈ రోజు నేను నిన్ను విస్మరిస్తున్నాను" అని అల్లాహ్ అంటాడు (సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్).

ప్రపంచ జీవితంలో మోసపోయినవారు మాత్రమే తమ ధర్మాన్ని వినోద వస్తువుగా, వేళాకోళంగా తీసుకుంటారని కూడా ఈ ఆయతు ద్వారా అవగతమవుతోంది. ఇలాంటివారి హృదయాల నుండి దైవభీతి, పరలోక చింతన మటుమాయం అయిపోవటం వల్ల ధర్మావలంబనలో వారు కొత్తపుంతలు తొక్కుతారు. తమ ఇచ్ఛానుసారం కొంగ్రొత్త విషయాలను జొప్పిస్తారు. అలాగే తాము కోరిన భాగాలను ధర్మంలోనుంచి తొలగించటమో, వాటి ప్రాముఖ్యాన్ని ఉద్దేశ్యపూర్వకంగా ఉపేక్షించటమో చేస్తారు. ఈ విధంగా వారు దైవధర్మాన్ని ఒక ఆట వస్తువుగా చేసుకుంటారు. మతాన్ని కాలక్షేపం కోసం వాడుకుంటారు. కాలక్షేపం కోసమే ధర్మంలో బిద్అత్‌లకు బీజం నాటుతారు. పైపెచ్చు అదే సిసలయిన ధర్మంగా భావించి సంబరపడుతూ ఉంటారు. ఇది ఘోర అపరాధం. ఎందుకంటే వారి ఈ చేష్ట మూలంగా దైవధర్మం ఒక తమాషాగా మారిపోతుంది. దైవాదేశాల, ధార్మిక విధుల ప్రాముఖ్యం అడుగంటిపోతుంది.

64. తన సంపూర్ణ జ్ఞానానికి అనుగుణంగా ఖుర్‌ఆన్‌ను ఇచ్చిపంపినట్లు దేవుడు నరకవాసుల్ని ఉద్దేశించే చెబుతున్నాడు. ఆ గ్రంథంలో ప్రతి విషయమూ తేటతెల్లం చెయ్యబడి ఉంది. కాకపోతే వీళ్లు దాని ద్వారా లబ్ది పొందలేదు. అది వారి దౌర్భాగ్యం. దానికి ఎవరేం చేస్తారు? విశ్వసించినవాళ్ళైతే ఈ మార్గదర్శక సాధనం, మరియు దైవకారుణ్యం ద్వారా తనివితీరా సత్యామృతాన్ని ఆస్వాదించారు. "(ప్రజలకు సత్యాసత్యాల భేదాన్ని విడమరచి చెప్పే) ప్రవక్తను పంపనంతవరకూ మేము ఎవరినీ శిక్షించము" (బనీ ఇస్రాయీల్–15) అన్న సూత్రాన్ననుసరించి తాను చేయవలసిన దంతా చేశానని దేవుడు ఈ ఆయతు ద్వారా తెలియజెప్పాడు.

65. మూలంలో **'తావీల్'** అనే పదం వచ్చింది. ఏదయినా విషయంలోని వాస్తవికతను, దాని పరిణామాన్ని 'తావీల్' అని అంటారు. అంటే దైవగ్రంథమైన ఈ ఖుర్‌ఆన్ ద్వారా వాగ్దానాలు, హెచ్చరికలు, స్వర్గ–నరకాలు అన్నీ వివరించబడ్డాయి. కాని వీరు ఈ ప్రపంచ జీవిత పరిణామాన్ని తమ కళ్లారా వీక్షించాలని ఎదురు చూసేవారు. వారు ఎదురు చూసిన ఆ ఘడియ రానే వచ్చింది.

لَنَآ اَوْ نُرَدُّ فَنَعْمَلَ غَيْرَ الَّذِيْ كُنَّا نَعْمَلُ ۭ قَدْ خَسِرُوْٓا اَنْفُسَهُمْ وَضَلَّ عَنْهُمْ مَّا كَانُوْا يَفْتَرُوْنَ ﴿53﴾

మేము చేసిన (చెడు) కర్మలకు భిన్నమైన కర్మలు చేసేందుకు మళ్లీ మేము (ఇహలోకానికి) తిరిగి పంపబడతామా?" – నిస్సందేహంగా వీళ్లు తమ స్వయానికి నష్టం చేకూర్చుకున్నారు. వీళ్లు కల్పిస్తూ వచ్చిన విషయాలన్నీ వీళ్ల నుంచి మటుమాయం అయ్యాయి.[66]

اِنَّ رَبَّكُمُ اللّٰهُ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ فِيْ سِتَّةِ اَيَّامٍ ثُمَّ اسْتَوٰى عَلَي الْعَرْشِ ۣ يُغْشِي

**54** నిస్సందేహంగా అల్లాహ్‌యే మీ ప్రభువు. ఆయన ఆకాశాలను, భూమిని ఆరు రోజులలో సృష్టించాడు.[67] ఆ తరువాత సింహాసనంపై (అర్ష్‌పై) ఆసీనుడయ్యాడు.[68] ఆయన రాత్రిని

66. అంటే ఏ పరిణామం కోసం ఎదురుచూస్తూ ఉన్నారో ఆ పరిణామం కళ్ల ముందుకు వచ్చిన తర్వాత సత్యాన్ని స్వీకరించి ప్రయోజనం ఏమీ ఉండదు. తమను ఆదుకునే వారెవరో వస్తారని దిక్కులు చూడటం, మరోసారి ప్రాపంచిక జీవితం లభిస్తుందని ఆశపడటం అవివేకం తప్ప మరేమీ కాదు. ఇచ్చిన అవకాశాన్ని వారు దుర్వినియోగం చేసుకున్నారు. అల్లాహ్‌ను వదలి వారు పూజించిన చిల్లరదేవుళ్లంతా వారికిప్పుడు కనబడకుండా పోయారు. ఇప్పుడు వారిని నరకాగ్ని నుంచి కాపాడే నాథుడెవడూ లేడు.

67. ఆది, సోమ, మంగళ, బుధ, గురు, శుక్రవారాలే ఈ ఆరు రోజులు. శుక్రవారం (జుమా) నాడే ఆదిమానవుడైన హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) సృష్టించబడ్డారు. శనివారం నాడు ఏ సృష్టీ జరగలేదని అనబడుతోంది. అందుకే అది 'యౌముస్సబ్త్' గా పిలువబడింది. అరబీలో 'సబ్త్' అంటే త్రెంచటం, తెగ్గొట్టటం అన్న అర్థాలు వస్తాయి. అంటే ఆ రోజు సృష్టి ప్రక్రియ పరిసమాప్తమయింది. ఇక ఆ 'రోజు'కు అర్థం ఏమిటీ? అన్నది ప్రశ్న. ప్రాపంచిక జీవితంలో సూర్యోదయంతో మన దినం మొదలవుతుంది. సూర్యాస్తమయంతో ఆ దినం సమాప్తమవుతుంది. లేక ఆ 'రోజు' దైవసన్నిధిలో లెక్కించబడే లెక్క ప్రకారం లేక ప్రళయం గురించి చెప్పబడే లెక్క ప్రకారం వెయ్యేండ్లకు సమానమా? రెండోదే సరైనదని అనిపిస్తుంది. ఎందుకంటే సృష్టి ప్రక్రియకు శ్రీకారం చుట్టబడినప్పుడు సూర్యచంద్రుల వ్యవస్థ లేదు. భూమ్యాకాశాల సృష్టి జరిగిన మీదటే ఈ సూర్యచంద్రాదుల వ్యవస్థ నెలకొల్పబడింది. అదలా ఉంచితే ఇది ఊర్ధ్వలోకాలకు సంబంధించిన వ్యవహారం. భూవ్యవస్థతో దీనికి సంబంధమే లేదు. కాబట్టి ఆ రోజు ఎంత? ఏమిటీ? అన్న సంగతి ఆ అల్లాహ్‌కే బాగా తెలుసు. మనం మాత్రం ఇదమిత్థంగా దాని గురించి ఒక అభిప్రాయానికి రాలేము.

ఇకపోతే అల్లాహ్ ఏ విషయంలోనయినా దాన్ని చేయ సంకల్పించి 'అయిపో' అని అంటే అది అయిపోతుంది. అయినప్పటికీ ఆయన ఒక్కో వస్తువును వేర్వేరు దశలలో– క్రమబద్ధంగా – సృష్టించాడంటే అందులో కూడా ఏదో మర్మం, పరమార్థం దాగి ఉంటుంది. అది ఆయనకే తెలుసు. ఈ విధంగా దేవుడు మనుజ జాతికి విశ్రాంతిని, అంచెల వారీగా పనిచేయటాన్ని నేర్పాడని కొంతమంది విద్వాంసులు ఒక మర్మాన్ని మాత్రం అభివ్యక్తం చేశారు. (యదార్థం అల్లాహ్‌కే ఎరుక!)

68. అరబీలో **'ఇస్తవా'** అనే పదం ఉపయోగించబడింది. ఇది అసలు 'ఇస్తివావున్' నుంచి ఏర్పడింది. ఇస్తివావున్ అంటే ఎత్తుకు వెళ్లటం, ఆగటం అని అర్థం వస్తుంది. సలఫ్ విద్వాంసులు ఈ పదానికి ఎలాంటి పోలికలు, ఉపమానాలు ఇవ్వకుండా – ఈ అర్థాన్నే వివరించారు. అల్లాహ్ అర్ష్‌పై అధీష్టించాడు. దానిపైన ఆసీనుడై ఉన్నాడు. అయితే ఎలా ఆసీనుడవుతాడు, ఆసీనుడై ఉన్నప్పటి దేవుని స్థితి ఎలా ఉంటుంది? అన్న విషయాలను ఎవరూ వర్ణించలేరు. వర్ణించకూడదు కూడా. నయీమ్ బిన్ హమ్మాద్ ఇలా అన్నారు: "అల్లాహ్‌ను సృష్టితో పోల్చినవాడు కూడా కుఫ్ర్‌కు (అవిశ్వాసానికి) పాల్పడ్డాడు. అలాగే అల్లాహ్ తన గురించి వివరించిన విషయాలలో ఏదేని విషయాన్ని తిరస్కరించిన

الَّيْلَ النَّهَارَ يَطْلُبُهٗ حَثِيْثًا ۙ وَّالشَّمْسَ وَالْقَمَرَ وَالنُّجُوْمَ مُسَخَّرٰتٍۢ بِاَمْرِهٖ ؕ اَلَا لَهُ الْخَلْقُ وَالْاَمْرُ ؕ تَبٰرَكَ اللّٰهُ رَبُّ الْعٰلَمِيْنَ ﴿54﴾

పగటిపై కప్పివేస్తాడు. అది దాన్ని వేగంగా వెంబడిస్తూ వస్తుంది.[69] ఇంకా ఆయన సూర్యచంద్రులను, నక్షత్రాలను తన ఆజ్ఞకు కట్టుబడి ఉండే విధంగా సృష్టించాడు. వినండి! సృష్టి ప్రక్రియ ఆయన స్వంతం. ఆజ్ఞాపన ఆయన సొత్తు. సకల లోకాల ప్రభువైన అల్లాహ్ అపారమైన శుభాలు కలవాడు.

اُدْعُوْا رَبَّكُمْ تَضَرُّعًا وَّخُفْيَةً ؕ اِنَّهٗ لَا يُحِبُّ الْمُعْتَدِيْنَ ﴿55﴾

**55** మీరు మీ ప్రభువును కడు దీనంగా వేడుకోండి. గోప్యంగా కూడా విన్నవించుకోండి. హద్దు మీరిపోయే వారిని ఆయన సుతరామూ ఇష్టపడడు.

وَلَا تُفْسِدُوْا فِى الْاَرْضِ بَعْدَ اِصْلَاحِهَا وَادْعُوْهُ خَوْفًا وَّطَمَعًا ؕ اِنَّ رَحْمَتَ اللّٰهِ قَرِيْبٌ مِّنَ الْمُحْسِنِيْنَ ﴿56﴾

**56** సంస్కరణ జరిగిన తరువాత భూమిపై కల్లోలాన్ని సృష్టించకండి. భయపడుతూ, ఆశపడుతూ అల్లాహ్‌ను ఆరాధించండి. నిస్సందేహంగా అల్లాహ్ కారుణ్యం సజ్జనులకు చాలా దగ్గరే[70] ఉంది.

وَهُوَ الَّذِىْ يُرْسِلُ الرِّيٰحَ بُشْرًاۢ بَيْنَ يَدَىْ

**57** తన కారుణ్య జల్లు కురిసేముందు గాలులను శుభవార్త సూచకంగా పంపేది ఆయనే.[71] ఆఖరికి అవి బరువైన మేఘా

వాడు కూడా 'కుఫ్ర్'కు ఒడిగట్టినట్లే." అయితే అల్లాహ్ గురించి, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వివరించిన విషయాన్ని విడమరచి చెప్పటం మటుకు వర్ణన అనిపించుకోదు. కాబట్టి అల్లాహ్ గురించి మూలాధారాలతో నిరూపితం అయివున్న విషయాలను యథాతథంగా–హెచ్చుతగ్గులు లేకుండా, పోలికలకు, వర్ణనలకు తావీయకుండా– విశ్వసించటం అనివార్యం (ఇబ్నె కసీర్).

69. ఆయతులో **'హసీసన్'** (حَثِيْثًا) అన్న పదం ప్రయోగించబడింది. 'హసీసన్' అంటే అత్యంత వేగంగా రావటం అని అర్థం. అంటే ఒకదాని తరువాత ఒకటి (పగలు – రేయి) వెంట వెంటనే వస్తాయి. పగటి వెలుగు విరజిమ్మగానే రాత్రి చీకట్లు పటాపంచలై పోతాయి. అలాగే రాత్రి చీకటి అలుముకోగానే పగటి వెలుతురు అంతరించిపోతుంది. సర్వత్రా అంధకారం అలుముకుంటుంది.

70. ఈ ఆయతులలో నాలుగు ముఖ్యాంశాలు వివరించబడ్డాయి: 1. అల్లాహ్‌ను కడు దీనాతిదీనంగా, ఆర్ద్రంగా వేడుకోవాలి. లోలోపలే – మెల్లగా – మొరపెట్టుకోవాలి. హదీసులో ఇలా అనబడింది : "ప్రజలారా! మీ స్వయం పట్ల మృదువుగా వ్యవహరించండి (అంటే మెల్లగా వేడుకోండి) మీరు ఎవరిని మొరపెట్టుకుంటున్నారో ఆయన చెవిటివాడూ కాదు, కనిపెట్టనివాడు కూడా కాదు. ఆయన మీ మొరలను ఆలకించేవాడు, మీకు అతి చేరువలో ఉన్నవాడు" (సహీహ్ బుఖారీ : కితాబుద్దావాత్; ముస్లిం: కితాబుల్ జన్నహ్).

2. దుఆ (ప్రార్థన, వేడుకోలు) చేసే సమయంలో మనిషి మితిమీరకూడదు. అంటే దుఆ సమంజసంగా, సహేతుకంగా ఉండాలి. అసంభవమైన, అపసవ్యమైన విషయాలను అర్థించకూడదు.

3. సంస్కరణ జరిగిన తరువాత, వ్యవస్థ ఏర్పడిన తరువాత అవ్యవస్థను, అరాచకాన్ని సృష్టించరాదు. అల్లాహ్ ఆదేశాలను ఉల్లంఘించి అశాంతి అలజడులను వ్యాపింపజేయటం మహాపరాధం.

4. మనిషి దైవాగ్రహానికి ఎంతగా భయపడాలో, దైవానుగ్రహాల పట్ల అంతే ఆశాభావం కలిగి ఉండాలి. ఉత్తమరీతిలో దైవాన్ని మొరపెట్టుకునేవారు దేవుని దృష్టిలో ఉత్తములు. నిశ్చయంగా దైవకారుణ్యం సత్కార్యాన్ని ఉత్తమరీతిలో నెరవేర్చేవారికి సమీపంలో ఉంటుంది.

رَحْمَتِهِ ۚ حَتَّىٰ إِذَا أَقَلَّتْ سَحَابًا ثِقَالًا سُقْنَاهُ
لِبَلَدٍ مَّيِّتٍ فَأَنزَلْنَا بِهِ الْمَاءَ فَأَخْرَجْنَا بِهِ
مِن كُلِّ الثَّمَرَاتِ ۚ كَذَٰلِكَ نُخْرِجُ الْمَوْتَىٰ
لَعَلَّكُمْ تَذَكَّرُونَ ﴿٥٧﴾

లను ఎత్తుకున్నప్పుడు,[72] మేము ఆ మేఘాలను నిర్జీవంగా పడివున్న ఏదేని ప్రదేశం వైపుకు తరలిస్తాము. ఆపైన ఆ మేఘాల ద్వారా వర్షాన్ని కురిపిస్తాము. ఆ వర్షపు నీటి ద్వారా అన్నిరకాల పండ్లు ఫలాలను ఉత్పన్నం చేస్తాము.[73] మృతులను కూడా మేము ఇలాగే లేపి నిలబెడతాము. మీరు (నీతిని) గ్రహించేటందుకు గాను[74] (మేము ఇన్ని విధాలుగా విషయాన్ని విడమరచి చెబుతున్నాము సుమా!).

وَالْبَلَدُ الطَّيِّبُ يَخْرُجُ نَبَاتُهُ بِإِذْنِ
رَبِّهِ ۖ وَالَّذِي خَبُثَ لَا يَخْرُجُ إِلَّا نَكِدًا ۚ
كَذَٰلِكَ نُصَرِّفُ الْآيَاتِ لِقَوْمٍ يَشْكُرُونَ ﴿٥٨﴾

**58** మంచి నేల తన ప్రభువు ఆదేశానుసారం పుష్కలమైన పంట నిస్తుంది. (దీనికి భిన్నంగా) చెడ్డ నేల చాలా తక్కువ ఉత్పత్తిని మాత్రమే ఇస్తుంది.[75] ఈ విధంగా మేము కృతజ్ఞులై ఉండేవారి కోసం నిదర్శనాలను పలు విధాలుగా విశ్లేషించి చెబుతాము.

---

71. తన పరిపోషకత్వాన్నీ (రుబూబియ్యత్‌ను), ఆరాధనా హక్కు (ఉలూహియ్యత్)ను చాటిచెప్పే మరికొన్ని నిదర్శనాలను కూడా అల్లాహ్ ఇక్కడ పొందుపరచాడు. మరణానంతర జీవితం ఒక వాస్తవం అన్న విషయాన్ని విశదీకరించాడు. ఈ వాక్యంలో ఆయన వర్షాన్ని తన దయగా, కరుణగా పేర్కొన్నాడు. అది కురవక ముందే చల్లని గాలులు వీచి శుభ సంకేతాన్ని ఇస్తాయి. ప్రాణులకు ఆ వాతావరణం ఎంతో ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ కలిగిస్తుంది. బుష్‌రన్ : ఇది, బషీర్‌కు బహువచనం. శుభవార్తను అందజేసేవి అని అర్థం. 'రహ్మతున్' అంటే కారుణ్యం.

72. బరువైన మేఘాలంటే నీటితో నిండిన మేఘాలని భావం.

73. **"అన్నిరకాలైన పండ్లు ఫలాలు పండిస్తాము"** – అంటే ఒక్కో కోవకు చెందిన పండు ఒక్కోవిధంగా ఉంటుంది. వాటి రంగువేరు, రూపువేరు, రుచివేరు, వాటి పోషక విలువలు వేరుగా ఉంటాయి. ఇవన్నీ మానవ మనుగడకు మహదానుగ్రహాలుగా ఉన్నాయి.

74. మేము వర్షపునీటి ద్వారా మృతభూమిని బ్రతికించి, దాన్నుంచి రకరకాల పంటలు ఉత్పన్నం చేసినట్లే తీర్పుదినాన, మరణించి మట్టిలో కలసిపోయిన మానవులను బ్రతికించి నిలబెడతాము, వారి నుంచి లెక్క తీసుకుంటాము.

75. అయితే ఇదొక ఉపమానం కూడా కావచ్చు. మూలంలో **అల్ బలదుత్తయ్యిబు** (మంచి నేల) మరియు **అల్ బలదుల్ ఖబీసు** (చెడు నేల) అనే రెండు పదాలు వచ్చాయి. అల్ బలదుత్తయ్యిబు అంటే విషయాన్ని త్వరితంగా గ్రహించేవాడు, హితబోధను స్వీకరించే హృదయం, విశ్వాసి హృదయం, పవిత్రుడైన మనిషి అని భావం. దీనికి భిన్నంగా అల్ బలదుల్ ఖబీస్ అంటే, మందమతి, హితబోధను గ్రహించని మనసు, అవిశ్వాసి హృదయం, అపవిత్రుడైన మనిషి అని భావం. మోమిన్ (విశ్వాసి) హితోపదేశాన్ని శీఘ్రంగా గ్రహిస్తాడు. అతడు వర్షపు నీటిని వెంటనే పీల్చుకుని, నవజీవనాన్ని నింపుకున్న సారవంతమైన భూమి లాంటివాడు. దైవవాక్యాలు విన్నప్పుడల్లా అతని మేను పులకిస్తుంది. అతని విశ్వాసం తేజోవంతమవుతుంది. అతని మంచిపనుల్లో మరింత వృద్ధి జరుగుతుంది.

దీనికి భిన్నంగా సత్యామృతాన్ని ఆస్వాదించలేనివాడు సారంలేని నేల లాంటివాడు. ఆ నేల వర్షపునీటిని పీల్చదు. పీల్చినా దాని నుండి మంచి మొక్కలు మొలకెత్తవు. పండే పంటలు కూడా నాసిరకం అయి ఉంటాయి. ఈ విషయమే హదీసులో ఈ విధంగా చెప్పబడింది. ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా సెలవిచ్చారు : "అల్లాహ్ నాకు ఇచ్చిపంపిన జ్ఞానం మరియు సన్మార్గం నేలపై ధారాపాతంగా కురిసే వర్షం లాంటిది. ఆ నేలలోని సారవంతమైన

**59** మేము నూహ్ (అలైహిస్సలాం)ను అతని జాతి వద్దకు పంపాము. అప్పుడతను, "ఓ నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప వేరెవరూ మీ ఆరాధనకు అర్హులు కారు. మీ విషయంలో ఒక మహా దినం నాటి శిక్ష గురించి నాకు భయంగా ఉంది" అన్నాడు.

لَقَدْ أَرْسَلْنَا نُوحًا إِلَىٰ قَوْمِهِۦ فَقَالَ يَٰقَوْمِ
ٱعْبُدُوا۟ ٱللَّهَ مَا لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرُهُۥٓ إِنِّىٓ
أَخَافُ عَلَيْكُمْ عَذَابَ يَوْمٍ عَظِيمٍ (59)

**60** దానికి అతని జాతి పెద్దలు, "నువ్వు స్పష్టమైన అపమార్గానికి గురైనట్లు మాకు కనిపిస్తోంది"[76] అన్నారు.

قَالَ ٱلْمَلَأُ مِن قَوْمِهِۦٓ إِنَّا لَنَرَىٰكَ
فِى ضَلَٰلٍ مُّبِينٍ (60)

**61** "ఓ నా జాతి వారలారా! నేనేమాత్రం దారి తప్పలేదు. నిజానికి నేను సర్వలోక ప్రభువు తరఫున పంపబడిన ప్రవక్తను.

قَالَ يَٰقَوْمِ لَيْسَ بِى ضَلَٰلَةٌ وَلَٰكِنِّى رَسُولٌ
مِّن رَّبِّ ٱلْعَٰلَمِينَ (61)

**62** "నా ప్రభువు సందేశాన్ని మీకు అందజేస్తున్నాను. నేను మీ మేలుకోరేవాడిని. మీకు తెలియని విషయాలు అల్లాహ్ తరఫు నుంచి నాకు తెలుసు.

أُبَلِّغُكُمْ رِسَٰلَٰتِ رَبِّى وَأَنصَحُ لَكُمْ وَأَعْلَمُ
مِنَ ٱللَّهِ مَا لَا تَعْلَمُونَ (62)

**63** "ఏమిటీ? మిమ్మల్ని హెచ్చరించటానికి, మీరు భయభక్తుల వైఖరిని అవలంబించి తద్వారా మీరు కరుణించబడేటందుకు మీ వద్దకు స్వయంగా మీ నుంచే ఒక వ్యక్తి ద్వారా మీ ప్రభువు తరఫు నుండి 'ఉపదేశం' అందటం మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తిందా?"[77] అని (నూహ్) అన్నాడు.

أَوَعَجِبْتُمْ أَن جَآءَكُمْ ذِكْرٌ مِّن رَّبِّكُمْ عَلَىٰ
رَجُلٍ مِّنكُمْ لِيُنذِرَكُمْ وَلِتَتَّقُوا۟ وَلَعَلَّكُمْ
تُرْحَمُونَ (63)

---

క్షేత్రాలు ఆ వర్షపు నీటిని బాగా పీల్చి పచ్చిక బయళ్ళను మొలకెత్తించాయి (పుష్కలంగా పంటలను ఉత్పత్తి చేశాయి). ఆ నేలలోని మరికొన్ని భాగాలు గట్టివి. ఆ భాగాలలో నీరు నిలవటానికైతే నిలిచింది (గాని దాన్ని ఆ నేల పీల్చలేదు). అయినప్పటికీ ఆ నీటి ద్వారా ప్రజలు ప్రయోజనం పొందారు. స్వయంగా త్రాగటమే గాక ఆ నీటితో తమ పొలాలు తడుపుకున్నారు. సేద్యం చేశారు. అయితే నేలలోని ఇంకొక భాగం పూర్తిగా బరువైన రాతి ప్రదేశం. ఆ ప్రదేశం నీటిని గ్రహించనూ లేదు, మొక్కల్ని మొలకెత్తించనూ లేదు (నా సందేశం పట్ల ప్రజల వ్యవహారం కూడా దీన్ని పోలి ఉంటుంది). అల్లాహ్ ధర్మాన్ని అర్థం చేసుకొని, నేను తెచ్చిన దానితో ప్రయోజనం పొందినవాని ఉపమానం ఇది. అతను స్వయంగా విద్య నేర్చుకున్నాడు, ఇతరులకు కూడా నేర్పాడు. అలాగే ఏమీ నేర్చుకోకుండా, నేను తెచ్చిన సన్మార్గాన్ని అవలంబించని వ్యక్తి ఉపమానం కూడా ఇందులో ఉంది" (సహీహ్ బుఖారీ: కితాబుల్ ఇల్మ్).

76. షిర్క్ (బహుదైవారాధన) మనిషి విజ్ఞతా వివేచనలను హరిస్తుంది. షిర్క్ వాతనబడిన మనిషికి సన్మార్గం దుర్మార్గంగా, దుర్మార్గం సన్మార్గంగా కనబడుతుంది. నూహ్ జాతి కూడా 'షిర్క్' అనే వ్యాధికి గురైంది. వాళ్ల పరిస్థితి ఎంత నికృష్టంగా తయారయ్యిందంటే అంధకార లోయల్లో నుంచి కాంతి శిఖరాల వైపుకు, షిర్క్ జాడ్యం నుంచి ఏకదైవారాధన (తౌహీద్) వైపుకు పిలిచే ప్రవక్తే వారి కంటికి మార్గవిహీనుడుగా కానరాసాగాడు.

77. హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం)కూ, హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)కు మధ్య పది కాలాల లేక పది తరాల అంతరం ఉంది. నూహ్ ప్రవక్త కాలానికి కొంచెం ముందు వరకు ప్రజలు దైవధర్మమయిన ఇస్లాంపై స్థిరంగా ఉండేవారు. రాను రాను వారిలో దేవుని ఏకత్వం (తౌహీద్) పట్ల విముఖత ఎలా ప్రబలిందంటే, తమలోని కొంతమంది

**64** అయినప్పటికీ వాళ్లు ఆయన (మాట)ను అసత్యమని ధిక్కరించారు. మేము నూహును, నావలో అతని వెంట ఉన్న అతని సహచరులను రక్షించి, మా ఆయతులను ధిక్కరించిన వారందరినీ ముంచి వేశాము. నిశ్చయంగా వారు మరీ గ్రుడ్డి జనులుగా[78] వ్యవహరించారు.

فَكَذَّبُوهُ فَأَنجَيْنَاهُ وَالَّذِينَ مَعَهُ فِي الْفُلْكِ
وَأَغْرَقْنَا الَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا ۚ إِنَّهُمْ كَانُوا
قَوْمًا عَمِينَ ﴿٦٤﴾

**65** మేము ఆద్‌జాతి వద్దకు వారి సోదరుడైన హూద్‌ను పంపాము.[79] "నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్య దైవం లేదు. మరలాంటప్పుడు మీరు భయపడరా?" అని అతను చెప్పాడు.

وَإِلَىٰ عَادٍ أَخَاهُمْ هُودًا ۗ قَالَ يَا قَوْمِ
اعْبُدُوا اللَّهَ مَا لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرُهُ ۚ
أَفَلَا تَتَّقُونَ ﴿٦٥﴾

**66** దానికి అతని జాతిలోని అవిశ్వాస సర్దారులు, "నువ్వు మాకు తెలివి తక్కువ వానిలా కనిపిస్తున్నావు.[80] పైగా నువ్వు అబద్ధాల కోరువని మా అభిప్రాయం" అన్నారు.

قَالَ الْمَلَأُ الَّذِينَ كَفَرُوا مِن قَوْمِهِ إِنَّا
لَنَرَاكَ فِي سَفَاهَةٍ وَإِنَّا لَنَظُنُّكَ مِنَ
الْكَاذِبِينَ ﴿٦٦﴾

**67** "ఓ నా జాతివారలారా! నాలో ఏ మాత్రం తెలివితక్కువ తనం లేదు. నేను సకల లోకాల ప్రభువు తరఫున పంపబడిన ప్రవక్తను.

قَالَ يَا قَوْمِ لَيْسَ بِي سَفَاهَةٌ وَلَٰكِنِّي
رَسُولٌ مِّن رَّبِّ الْعَالَمِينَ ﴿٦٧﴾

పుణ్యపురుషులు చనిపోయినప్పుడు, వారి అభిమానులు కొందరు వారి పేరు మీద గుంపటాలు, గోపురాలు కట్టడం మొదలెట్టారు. అక్కడ వారి చిత్రపటాలు కూడా వ్రేలాడదీశారు. వారిని చూసినప్పుడల్లా దైవాన్ని గుర్తుకు తెచ్చుకొని దైవధ్యానంలో లీనం కావచ్చని ఆశించారు. కాలక్రమేణా వారు ఆ చిత్రపటాలను చూసి ఆ సజ్జనుల విగ్రహాలను నిలబెట్టారు. ఆ విగ్రహాలే క్రమక్రమంగా దేవతలుగా రూపొందారు. వాటి ముందు పూజా పునస్కారాలు మొదలయ్యాయి. ఆ విధంగా నూహ్ జాతి ప్రజల దృష్టిలో వద్, సువా, యవూఖ్, యగూస్, నస్ర్ అనే సజ్జనులు ఆరాధ్య దైవాలుగా మారిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో అల్లాహ్ నూహ్ (అలైహిస్సలాం)ను ప్రవక్తగా నియమించి పంపాడు. ఆయన దాదాపు 950 సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు దైవసందేశాన్ని వినిపించారు. తన జాతి వారిలో తిష్ఠవేసిన బహుదైవారాధనను రూపుమాపడానికి ఆయన శాయశక్తులా కృషిచేశారు. కాని బహు కొద్దిమంది మాత్రమే ఆయన బోధను విన్నారు. మిగిలినవారంతా అహంకారంతో విర్రవీగారు. అప్పుడు అల్లాహ్ విశ్వసించిన ఆ కొద్దిమందిని తప్ప మిగిలిన వారందరినీ ముంపుకు గురిచేశాడు. అచ్చం తమలాంటి ఒక మానవమాత్రుడు తమ మధ్య ప్రవక్తగా రావటమేమిటీ? అని వాళ్లు ఆశ్చర్యపోయేవారు. ఆ మాటే దైవప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) ఇక్కడ ప్రస్తావించారు.

78. అంటే సత్యం పట్ల వారు అంధులుగా తయారయ్యారు. ఒక విషయం సత్యమని తెలిసినా దాన్ని సమర్థించాలనే, దాన్ని ఆశ్రయించాలనే ఆలోచన, ఇంగిత జ్ఞానం వారికి లేకుండా పోయింది.

79. ఆదు జాతి అంటే ప్రప్రథమ ఆదు జాతి అని భావం. వీరు యమన్‌లోని ఇసుక గుట్టలలో నివసించేవారు. శరీర దారుఢ్యంలోనూ, కండ బలంలోనూ వారు సాటిలేని వారుగా పరిగణించబడేవారు. దైవప్రవక్త హూద్ (అలైహిస్సలాం) ఈ జాతికి చెందినవారే.

80. ఆద్ జాతి ప్రజలు కండ బలంలోనైతే అందరికన్నా ముందంజవేశారు గాని బుద్ధిబలంలో మాత్రం మరీ

أُبَلِّغُكُمْ رِسٰلٰتِ رَبِّيْ وَاَنَا لَكُمْ نَاصِحٌ
اَمِيْنٌ (68)

**68** "నా ప్రభువు సందేశాలను మీకు చేరవేసేవాణ్ణి. మీరు నమ్మ దగ్గ మీ శ్రేయోభిలాషిని.

اَوَعَجِبْتُمْ اَنْ جَآءَكُمْ ذِكْرٌ مِّنْ رَّبِّكُمْ
عَلٰى رَجُلٍ مِّنْكُمْ لِيُنْذِرَكُمْ ؕ وَاذْكُرُوْٓا
اِذْ جَعَلَكُمْ خُلَفَآءَ مِنْۢ بَعْدِ قَوْمِ نُوْحٍ
وَّزَادَكُمْ فِي الْخَلْقِ بَصْۜطَةً ۚ فَاذْكُرُوْٓا
اٰلَآءَ اللّٰهِ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ (69)

**69** "ఏమిటీ, మిమ్మల్ని హెచ్చరించటానికి స్వయంగా మీనుండే ఒక వ్యక్తి ద్వారా, మీ ప్రభువు తరఫునుండి మీ వద్దకు హితోపదేశం రావటం మీకు ఆశ్చర్యం కలిగించిందా? అల్లాహ్ మిమ్మల్ని నూహ్ జాతి అనంతరం వారసులుగా చేసి, మీకు ఎక్కువ శరీర సౌష్ఠవాన్ని ప్రసాదించిన సంగతిని గుర్తుంచుకోండి.[81] అల్లాహ్ అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకుంటూ ఉండండి. తద్వారా మీరు సాఫల్యం పొందుతారు" అని హూద్ బోధ పరచాడు.

قَالُوْٓا اَجِئْتَنَا لِنَعْبُدَ اللّٰهَ وَحْدَهٗ وَنَذَرَ
مَا كَانَ يَعْبُدُ اٰبَآؤُنَا ۚ فَاْتِنَا بِمَا تَعِدُنَآ
اِنْ كُنْتَ مِنَ الصّٰدِقِيْنَ (70)

**70** "మేము అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలనీ, మా తాత ముత్తాతలు పూజిస్తూ వచ్చిన వాటిని వదలివేయమని (చెప్పటానికేనా) నువ్వు మా వద్దకు వచ్చింది?[82] ఒకవేళ నువ్వు సత్యవంతుడవే అయితే ఏ శిక్షను గురించి నువ్వు మమ్మల్ని బెదిరిస్తున్నావో దాన్ని మా వద్దకు రప్పించు చూద్దాం"[83] అని వారు అన్నారు.

---

వెనుకబడిపోయారు. తాము పూజిస్తూ వస్తున్న తమ తాతముత్తాతల విగ్రహాలను విడిచిపెట్టి ఒకే దైవాన్ని ఆరాధించమని ప్రబోధించే ప్రవక్త వారి కంటికి బుద్ధిమాంద్యం కలవాడుగా కనిపించాడు.

81. "ఇంతటి బలాధిక్యత గల మరొకజాతి ఇంతవరకు అసలు పుట్టించబడలేదు" అని దేవుడు మరోచోట ప్రస్తావించాడు (అల్ ఫజ్ర్:8). ఈ బలపరాక్రమాలే వాళ్ల తల పొగరును కూడా పెంచాయి. తమకంటే బలవంతులు ఈ ప్రపంచంలో ఎవరున్నారు? (మన్ అషద్దు మిన్నా ఖువ్వతన్) అంటూ వారు మీసాలు మెలేయసాగారు."వారిని సృష్టించిన దైవం వారికన్నా బలవంతుడన్న సంగతి వారికి అర్థం కావటంలేదా?" అని అల్లాహ్ ప్రశ్నించాడు (హామీమ్ అస్సజ్దహ్-15).

82. తాతముత్తాతల అంధానుసరణ అన్ని కాలాల్లోనూ, అన్ని జాతుల్లోనూ అపమార్గానికి ప్రధాన కారణంగా నిలిచింది. ఆదు జాతి కూడా ఈ అంధానుసరణకే గురయ్యింది. 'షిర్కు'ను వదలి 'తౌహీద్' మార్గాన్ని అవలంబించటానికి వారు సుతరామూ ఒప్పుకోలేదు. దురదృష్టవశాత్తూ ముస్లింలలో కూడా తమ పెద్దల ఆచారాలను అనుసరించే ఈ జాడ్యం ప్రబలంగా ఉంది.

83. మక్కాలోని ఖురైషులు కూడా అంతిమ దైవప్రవక్త (స)తో ఇదే మాటన్నారు : "ఓ దేవా! ఇది నిజంగా నీ తరఫు నుండి వచ్చిన సత్యమే అయితే, ఆకాశం నుంచి మాపై రాళ్లవర్షం కురిపించు లేదా మరేదైనా బాధాకరమైన శిక్షను మాపై అవతరింపజెయ్యి" (అన్‌ఫాల్ - 32) అని అన్నారు. బహుదైవోపాసన మనిషి అణువణువునూ పెనవేసుకుపోయినప్పుడు అతని మతి ఇలాగే చెడిపోతుంది. వారిలో ఏమాత్రం ఇంగిత జ్ఞానమున్నా, "దేవా! ఇది సత్యమే అయివుంటే దాన్ని గ్రహించే సద్బుద్ధిని మాకు వొసగు" అని వారు ప్రార్థించి ఉండాల్సింది. మొత్తానికి ఆద్‌జాతి వారు నిర్మాణాత్మక పంథాను అనుసరించేబదులు విచ్ఛిన్నకరమయిన మార్గాన్నే ఎన్నుకుని దైవాగ్రహాన్ని చేజేతులా కొనితెచ్చుకున్నారు.

**71** అప్పుడు హూద్ ఇలా అన్నాడు : "ఇక మీ ప్రభువు శిక్ష,[84] ఆయన ఆగ్రహం మీపై విరుచుకుపడినట్లే. ఏమిటీ, మీరూ మీ తాతముత్తాతలూ కల్పించుకున్న పేర్ల విషయంలో నాతో గొడవపడుతున్నారా?[85] వాటి గురించి (అవి ఆరాధ్య దైవాలని నిర్ధారించే) ఏ ప్రమాణాన్నీ అల్లాహ్ అవతరింపజెయ్యలేదు. కాబట్టి మీరూ నిరీక్షించండి, మీతోపాటు నేను కూడా నిరీక్షిస్తాను."

قَالَ قَدْ وَقَعَ عَلَيْكُم مِّن رَّبِّكُمْ رِجْسٌ
وَغَضَبٌ ۖ أَتُجَادِلُونَنِي فِي أَسْمَاءٍ
سَمَّيْتُمُوهَا أَنتُمْ وَآبَاؤُكُم مَّا نَزَّلَ
اللَّهُ بِهَا مِن سُلْطَانٍ ۚ فَانتَظِرُوا إِنِّي
مَعَكُم مِّنَ الْمُنتَظِرِينَ ﴿٧١﴾

**72** ఎట్టకేలకు మేము అతన్నీ, అతని సహచరులను మా కృపతో కాపాడాము. అయితే మా ఆయతులు అబద్ధాలంటూ కొట్టి పారేసినవారి వేరును త్రెంచివేశాము. వారు ఎట్టి పరిస్థితిలోనూ విశ్వసించేవారు కారు.[86]

فَأَنجَيْنَاهُ وَالَّذِينَ مَعَهُ بِرَحْمَةٍ مِّنَّا
وَقَطَعْنَا دَابِرَ الَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا
وَمَا كَانُوا مُؤْمِنِينَ ﴿٧٢﴾

**73** ఇంకా మేము సమూదు జాతి వద్దకు వారి సోదరుడైన సాలిహ్ (అలైహిస్సలాం) ను పంపాము.[87] అతడు (తన వారినుద్దేశించి), "ఓ నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్‌ను ఆరాధించండి.

وَإِلَىٰ ثَمُودَ أَخَاهُمْ صَالِحًا ۗ قَالَ يَا قَوْمِ اعْبُدُوا
اللَّهَ مَا لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرُهُ ۖ قَدْ جَاءَتْكُم بَيِّنَةٌ

84. ఆయతులో **'రిజ్‌సున్'** (رِجْسٌ) అని అనబడింది. అంటే మాలిన్యం అని అర్థం. కాని అసలు పదం **'రిజ్‌జున్'** (ᵠq…). ఈ పదంలోని 'జ' అక్షరం 'స' అక్షరంగా రూపాంతరం చెందింది. **రిజ్‌జున్** (رِجزٌ) అంటే శిక్ష అని అర్థం. ఒకవేళ 'రిజ్‌సున్'నే అసలు పదంగా భావించినట్లయితే, ఇక్కడ అది అయిష్టత, ఆగ్రహం అనే అర్థంలో ఉంటుంది. (ఇబ్నె కసీర్).

85. వారు తాము ఆరాధించే చిల్లరదేముళ్లకు కొన్ని నామకరణాలు చేసుకున్నారు. ఉదాహరణకు: సదా, సుమూద్, హబా – నూహ్ జాతివారికి ఐదుగురు దేవుళ్లు ఉన్నట్లు. వారిపేర్లు ఖుర్‌ఆన్‌లో వేరేచోట ప్రస్తావనకు వచ్చాయి. అలాగే అరేబియాలోని ముష్రిక్కులు కూడా లాత్, మనాత్, ఉజ్జా, హుబల్ తదితరులను తమ ఆరాధ్య దైవాలుగా కల్పించుకున్నారు. అంతెందుకు, ఈనాడు కూడా బహుదైవోపాసనా భావాలకు ప్రభావితులైన ముస్లింలు సయితం తమ ఆరాధ్యులకు ఇలాంటి పేర్లు కొన్నింటిని సృష్టించుకున్నారు. ఉదాహరణకు : దాతా గంజెబక్ష్, ఖాజా గరీబ్ నవాజ్, బాబా ఫరీద్ షకర్ గంజ్, ముష్కిల్ కుషా తదితర పేర్లు ఆనాటి బహుదైవారాధకులు కల్పించుకునే వాటికి ఏమాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి కదూ!

86. ఆద్ జాతిపై భయంకరమైన గాలివాన వచ్చింది. అది ఏడు రాత్రులు, ఎనిమిది దినాల వరకూ నిరంతరం వీచింది. దాంతో జనవాసాలన్నీ నేలమట్టం అయ్యాయి. తమ బలపరాక్రమాలపై గర్వపడే ఆద్‌జాతి వారి శవాలు కుప్పకూలి ఖర్జూరపు బొద్దుల వలె కానరాసాగాయి. (మరిన్ని వివరాల కోసం చూడండి : అల్ హాఖ్ఖా సూరా : 6 – 8; హూద్ సూరా : 53 – 56; అల్ అహ్‌ఖాఫ్ సూరా : 24, 25).

87. సమూద్ జాతివారు హిజాజ్ క్షేత్రానికీ – సిరియా ప్రాంతానికి మధ్యన గల 'వాదిల్ ఖురా' అనే లోయలో నివసించే వారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరులతో కలసి హిజ్రీ 9వ సంవత్సరంలో 'తబూక్' పోరాటానికి వెళుతున్నప్పుడు సమూద్ జాతివారు నివసించిన ఈ లోయ గుండా వెళ్ళవలసి వచ్చింది. అప్పుడు ఆయన (సఅసం) తన సహచరులనుద్దేశించి, "దైవశిక్షకు గురైనవారి ప్రదేశాల మీదుగా సాగిపోతున్నప్పుడు, విలపిస్తూ, దైవశిక్ష

مِّن رَّبِّكُمْ ۖ هَٰذِهِۦ نَاقَةُ ٱللَّهِ لَكُمْ ءَايَةً ۖ فَذَرُوهَا
تَأْكُلْ فِىٓ أَرْضِ ٱللَّهِ ۖ وَلَا تَمَسُّوهَا بِسُوٓءٍ
فَيَأْخُذَكُمْ عَذَابٌ أَلِيمٌ ﴿73﴾

ఆయన తప్ప మరొకరెవరూ మీకు ఆరాధ్యులు కారు. మీ వద్దకు మీ ప్రభువు వద్ద నుంచి ఒక స్పష్టమైన నిదర్శనం వచ్చేసింది. ఇది అల్లాహ్ యొక్క ఆడ ఒంటె. ఇది మీ కోసం ఒక సూచనగా ఉంది. కాబట్టి దేవుని భూమిపై మేతమేస్తూ తిరగటానికి దాన్ని వదలిపెట్టండి. దురుద్దేశంతో దాన్ని తాకకండి. (ఒకవేళ మీరు గనక ఈ మాటను ఖాతరు చేయకపోతే) బాధాకరమైన శిక్ష ఒకటి మిమ్మల్ని పట్టుకుంటుంది.

وَٱذْكُرُوٓا۟ إِذْ جَعَلَكُمْ خُلَفَآءَ مِنۢ بَعْدِ عَادٍ
وَبَوَّأَكُمْ فِى ٱلْأَرْضِ تَتَّخِذُونَ مِن
سُهُولِهَا قُصُورًا وَتَنْحِتُونَ ٱلْجِبَالَ
بُيُوتًا ۖ فَٱذْكُرُوٓا۟ ءَالَآءَ ٱللَّهِ وَلَا تَعْثَوْا۟
فِى ٱلْأَرْضِ مُفْسِدِينَ ﴿74﴾

**74** "మీరు (మీ గతాన్ని గురించి) కాస్త గుర్తుకు తెచ్చుకోండి– ఆదు జాతి అనంతరం అల్లాహ్ మిమ్మల్ని వారసులుగా చేశాడు. మీకు భూమిపై నివాసాన్ని ప్రసాదించగా, దాని మైదానంపై మీరు భవనాలు నిర్మిస్తున్నారు.[88] కొండలను తొలచి వాటిలో గృహాలు నిర్మించుకుంటున్నారు.[89] కనుక మీరు అల్లాహ్ అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకోండి. భువిపై సంక్షోభాన్ని సృష్టించకండి."[90]

قَالَ ٱلْمَلَأُ ٱلَّذِينَ ٱسْتَكْبَرُوا۟ مِن قَوْمِهِۦ
لِلَّذِينَ ٱسْتُضْعِفُوا۟ لِمَنْ ءَامَنَ مِنْهُمْ

**75** జాతిలోని గర్విష్ఠులైన సర్దారులు విశ్వసించిన బలహీన వర్గాల వారిని, "సాలిహ్ తన ప్రభువు తరఫున పంపబడిన ప్రవక్తే నన్న విషయం నిజంగానే మీకు తెలుసా?" అని అడిగారు.

నుంచి శరణువేడుకుంటూ వెళ్ళండి" అని బోధించారు (సహీహ్ బుఖారీ: కితాబుస్సలాత్; సహీహ్ ముస్లిం: కితాబుజ్జుహ్ద్).

సమూదు జాతి వద్దకు హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) ప్రవక్తగా పంపబడ్డారు. ఆదు జాతి అనంతరం జరిగిన సంఘటన ఇది. "నువ్వు నిజంగా ప్రవక్తవైతే ఈ రాతిబండల నుంచి ఒక ఆడ ఒంటెను బయటికి తీయి. అది రాయి నుంచి బయటికి రావటం మేము కళ్లారా చూడాలి" అని వారు ఆయన్ని డిమాండు చేశారు. ఈ మహిమను చూపిన తరువాత కూడా మీరు గనక అల్లాహ్‌ను విశ్వసించకపోతే మీరు వినాశానికి గురవుతారు సుమా! అని సాలెహ్ ముందుగానే జాగరూకపరచారు. సాలెహ్ జాతి ప్రజల కోర్కెపై అల్లాహ్ ఒక ఆడ ఒంటెను ప్రత్యక్షపరిచాడు. దురుద్దేశంతో దాని జోలికిపోతే దైవాగ్రహం విరుచుకుపడుతుందని సమూద్ జాతికి హెచ్చరిక చేయబడింది. కాని ఆ దుర్మార్గులు ఒంటెను చిత్రహింసలు పెట్టి దారుణంగా చంపేశారు. ఇది జరిగిన మూడు రోజులకే ఆపద వచ్చిపడింది. ఒక భయంకరమైన కేక ద్వారా వారంతా తుడిచిపెట్టబడ్డారు. వారు తమ నివాస గృహాలలో బోర్లాపడి ప్రాణాలు విడిచారు.

88. అంటే మెత్తని నేల నుంచి మట్టిని సేకరించి, ఇటుకలు తయారుచేసి వాటిద్వారా అందమైన మేడలు, మిద్దెలు కట్టేవారు. ఈ రకమయిన ఇటుకల నిర్మాణాలు ఇప్పటికీ జరుగుతున్నాయి.

89. ఇది వారి శక్తి సామర్థ్యాలకు, ప్రజ్ఞాపాటవాలకు, కళాత్మక విలువలకు ప్రబల నిదర్శనం.

90. అంటే దేవుడు మీకు ప్రసాదించిన ఈ వరాలకుగాను కృతజ్ఞులై ఉండండి. విధేయతను కనబరచండి. చేసిన మేలును మరచి భూమిపై విర్రవీగకండి. దైవాదేశాలను ఉల్లంఘించి భూమిపై కల్లోలాన్ని, అరాచకాన్ని, అవ్యవస్థను సృష్టించకండి.

దానికి వారు, "నిస్సందేహంగా! ఆయనకు ఇచ్చి పంపబడిన దానిపై మాకు పూర్తి నమ్మకం ఉంది"[91] అని సమాధానమిచ్చారు.

أَتَعْلَمُونَ أَنَّ صَالِحًا مُّرْسَلٌ مِّن رَّبِّهِ ۚ
قَالُوا إِنَّا بِمَا أُرْسِلَ بِهِ مُؤْمِنُونَ ﴿٧٥﴾

**76** "అయితే మీరు నమ్మే విషయాన్ని మేము త్రోసిపుచ్చు తున్నాం"[92] అని ఆ అహంకారులు అన్నారు.

قَالَ الَّذِينَ اسْتَكْبَرُوا إِنَّا بِالَّذِي آمَنتُم بِهِ
كَافِرُونَ ﴿٧٦﴾

**77** తరువాత, వారు ఆడ ఒంటెను చంపేశారు. తమ ప్రభువు ఆజ్ఞ పట్ల తలబిరుసుతనం ప్రదర్శించారు. "ఓ సాలిహ్! నిజంగానే నువ్వు దైవప్రవక్తవైతే, మమ్మల్ని బెదిరిస్తూ వచ్చిన దానిని మాపైకి తీసుకురా!" అని అన్నారు.

فَعَقَرُوا النَّاقَةَ وَعَتَوْا عَنْ أَمْرِ رَبِّهِمْ وَقَالُوا
يَا صَالِحُ ائْتِنَا بِمَا تَعِدُنَا إِن كُنتَ مِنَ
الْمُرْسَلِينَ ﴿٧٧﴾

**78** అంతే, భూకంపం వారిని పట్టుకుంది.[93] వాళ్లు తమ ఇండ్లలో బోర్లాపడి, అలాగే ఉండిపోయారు.

فَأَخَذَتْهُمُ الرَّجْفَةُ فَأَصْبَحُوا فِي دَارِهِمْ
جَاثِمِينَ ﴿٧٨﴾

**79** అప్పుడు సాలిహ్ (అలైహిస్సలాం) వారి నుండి ముఖం త్రిప్పుకుని, "నా జాతి ప్రజలారా! నా ప్రభువు సందేశాన్ని నేను మీకు అందజేశాను. మీ శ్రేయాన్ని అభిలషించాను. కాని మీకు శ్రేయోభిలాషులంటే ఇష్టం లేకపోయింది."[94] అని చెబుతూ వెళ్ళి పోయారు.

فَتَوَلَّىٰ عَنْهُمْ وَقَالَ يَا قَوْمِ لَقَدْ أَبْلَغْتُكُمْ رِسَالَةَ
رَبِّي وَنَصَحْتُ لَكُمْ وَلَٰكِن لَّا تُحِبُّونَ
النَّاصِحِينَ ﴿٧٩﴾

**80** మేము లూతు (అలైహిస్సలామ్)ను పంపాము.[95] అతను తన జాతివారిని ఉద్దేశించి, "మీరు ఇంత సిగ్గుమాలిన చేష్టకు

وَلُوطًا إِذْ قَالَ لِقَوْمِهِ أَتَأْتُونَ الْفَاحِشَةَ

91. అంటే, సాలెహ్ తెచ్చిన ఏక దైవారాధనా సందేశం వాస్తవానికి మా అంతరాత్మ ప్రబోధమే. అందుకే ఆయన చెప్పేది సత్యం అని మా మనస్సాక్షి కూడా చెబుతోంది. అందుచేత మేము ఆయన సందేశాన్ని విశ్వసిస్తున్నాం అని ఆ పేద ముస్లింలు చెప్పారు. ఇకపోతే 'సాలిహ్ నిజంగా దైవప్రవక్తేనా?' అన్న వారి ప్రశ్నకు, వారు సమాధానం కూడా చెప్పదలచుకోలేదు. ఎందుకంటే, వారి దృష్టిలో అసలు అది చర్చనీయాంశమే కాదు. సాలిహ్ దైవప్రవక్త అన్న విషయాన్ని వారు ఒక తిరుగులేని సత్యంగా తలపోసేవారు.

92. సమాజంలోని ఈ నాయకులకు సరైన సమాధానం లభించినప్పటికీ వారు సకారాత్మకంగా స్పందించలేదు సరికదా గర్వాహంకారంతో తిరస్కరించారు. సమాజంలోని ఈ బలహీన వర్గాల అభిప్రాయాన్ని సమర్థించడానికి వారికి అహం అడ్డుపడింది.

93. ఇక్కడ **రజ్ఫతున్** (భూకంపం) అనే పదం వాడబడింది. వేరొకచోట **సైహతున్** (పెద్దకేక) అనే పదం వచ్చింది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే ఈ రెండు రకాల శిక్షలూ వీళ్ళపై ఒకేసారి వచ్చిపడ్డాయి. అంటే – పైనుండి భయంకరమైన అరుపు, క్రింది నుంచి భూప్రకంపన! ఈ రెండు శిక్షలూ కలిసి వారిని సర్వనాశనం చేసి వేశాయి.

94. హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) నోట ఈ పలుకులు ఆపదకు ముందు వెలువడి ఉండవచ్చు. లేక ఆపద తరువాత ఆయన ఈ విధంగా పలికి ఉండవచ్చు. బద్ర్ యుద్ధం ముగిసిన తరువాత అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యుద్ధభూమిలో పడివున్న అవిశ్వాసుల, ముష్రిక్కుల శవాలను చూసి పలికినట్లు.

مَا سَبَقَكُم بِهَا مِنْ أَحَدٍ مِّنَ الْعَٰلَمِينَ ⑧⓪

పాల్పడుతున్నారేమిటి? మీకు పూర్వం లోకంలో ఎవరూ ఇలాంటి పాడు పని చెయ్యలేదే!

إِنَّكُمْ لَتَأْتُونَ الرِّجَالَ شَهْوَةً مِّن دُونِ النِّسَاءِ ۚ بَلْ أَنتُمْ قَوْمٌ مُّسْرِفُونَ ⑧①

**81** "అయ్యో! మీరు స్త్రీలను వదలి,[96] పురుషులతో కామవాంఛ తీర్చుకుంటున్నారా?![97] అసలు మీరు మరీ బరితెగించి వ్యవహరిస్తున్నారు"[98] అని అన్నారు.

95. హ|జత్ లూత్ (అలైహిస్సలాం), ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి సోదరుని కుమారులు. ఈయన హ|జత్ ఇబ్రాహీంను విశ్వసించినవారే. తర్వాత ఈయన్ని కూడా దేవుడు తన ప్రవక్తగా నియమించి ఒక ప్రాంతానికి పంపాడు. జోర్డాన్‌కీ–బైతుల్ మఖ్దిస్‌కి మధ్యనున్న ఈ బస్తీ 'సద్దూమ్'గా పిలువబడేది. ఇది సస్యశ్యామల ప్రాంతం. ఇక్కడ పంటలు విరివిగా పండేవి. దివ్యఖుర్ఆన్ ఈ ప్రదేశాన్ని 'మూతఫికాత్'గా పేర్కొన్నది. లూత్ (అలైహిస్సలాం) అన్నిటికంటే ముందు లేక ఏకదైవారాధనా సందేశంతోపాటే (...ఇక్కడ ఒక విషయం గమనార్హం. ప్రతి ప్రవక్త తన జాతికి మొట్ట మొదటగా ఏకదైవారాధనా – తౌహీద్ – సందేశమే ఇస్తాడు. ప్రవక్తలందరూ అలాగే చేశారు. వెనుక గడిచిన ప్రవక్తల సందేశాల్లో మనం ఈ విషయాన్ని గమనించవచ్చు.) తన జాతి ప్రజల్లో ఉన్న స్వలింగ సంపర్కపు జాడ్యాన్ని నిర్మూలించటానికి ఉపక్రమించారు. తను ప్రవక్త అవటంతోనే ఏకంగా ఆయన తన జాతిలో తిష్ఠవేసిన నీతిబాహ్యమైన ఈ పనిని తూలనాడారంటే, వారిలో ఆ రోగం ఎంతగా ప్రబలిపోయిందో అవగతమవుతోంది. ప్రపంచంలో అందరికన్నా ముందు లూత్ జాతి మాత్రమే ఈ ముదనష్టపు చేష్టకు పాల్పడిందని కూడా ఆయన వ్యక్తంచేసిన ఆందోళనను బట్టి అర్థమవుతోంది. అందుకే ఆయన అన్నింటికంటే ముందు లేక తౌహీద్ సందేశంతోపాటే ఈ నీతిబాహ్యతను సమాజం నుంచి పారద్రోలటానికి నడుం బిగించారు. అందరు ప్రవక్తల్లాగా ఆయన తన జాతి వారికి అన్నింటికంటే ముందు తౌహీద్ సందేశం అందజేసే విషయానికి ప్రాధాన్యత ఇవ్వకపోవటానికి మరొక కారణం – ఇబ్రాహీమ్ ప్రవక్త ద్వారా ఆ ప్రాంతం వారికి అంతకు ముందే తౌహీద్ సందేశం అంది ఉండవచ్చు. మొత్తానికి లూత్ జాతివారు అత్యంత నీచమైన చేష్టకు పాల్పడ్డారు. ఆ ముదనష్టపు జాతి పేరు మీదుగానే స్వలింగ సంపర్కాన్ని 'లవాతత్' అని పేర్కొనటం జరుగుతోంది.

ఈ స్వలింగ సంపర్కాని (Homosexuality) కి పాల్పడిన వారికి విధించవలసిన శిక్షపై ఇమాముల, పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వ్యభిచారానికి పాల్పడిన వారికి విధించే శిక్షే వీరికి కూడా విధించాలని కొంతమంది అభిప్రాయపడ్డారు. అంటే హోమో సెక్సువాలిటీకి ఒడిగట్టినవారు వివాహితులైతే శిలాశిక్ష విధించాలనీ, అవివాహితులైతే నూరు కొరడా దెబ్బలు కొట్టాలనీ అన్నారు. ఈ పాడు పని చేసినవారు ఎలాంటి వారైనాసరే రాళ్లు రువ్వే శిక్ష పడాల్సిందేనని మరికొంతమంది ఇమాములు వ్యాఖ్యానించారు. ఈ నీతిబాహ్యమైన చేష్టను చేసినవారికి, చేయించుకున్నవారికి – ఇద్దరికీ మరణ శిక్ష విధించాలని అభిప్రాయపడ్డారు. అయితే సమకాలీన రాజ్యాధికారి ఈ పాపానికి తగు శిక్ష విధించాలనీ, మరణదండన మాత్రం విధించరాదన్నది ఇమామ్ అబూ హనీఫా అభిమతం (తొహ్ఫతుల్ అహ్వజి–సంపుటి :5).

96. అంటే మీరు మీ లైంగిక కోర్కెల్ని తీర్చుకోవటానికి ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా – సిగ్గులేకుండా – మగవాళ్ళ దగ్గరికి పోతారా?! మీరు ఒడిగడుతున్న ఈ చేష్ట అత్యంత హేయమైనది, హేతువుకు విరుద్ధమైనది. జంతువుల్లో సయితం లేని ఈ పాడు బుద్ధి మీకెలా పుట్టింది?

97. మగవారి లైంగిక వాంఛల పరిపూర్తికై, వారి తృప్తికై, సౌఖ్యానికై దేవుడు ఆడవారిని పుట్టించాడు. కాని ఈ దుర్మార్గుల స్వభావమే చెడిపోయింది. వీరు స్త్రీలను వదలి పురుషుల మల విసర్జనా మార్గాన్ని వాడుకోసాగారు.

98. ప్రకృతి విరుద్ధమైన ఈ పని బరితెగించిన చేష్టగా, దైవాదేశాల అతిక్రమణగా పేర్కొనబడింది. అయితే నాగరికతా ధ్వజవాహకులమని చెప్పుకునే పాశ్చాత్య దేశాలవారు నేడు ఈ సిగ్గుమాలిన పనిని చట్టబద్ధంగా చేసుకుంటున్నారు. పైగా

وَمَا كَانَ جَوَابَ قَوْمِهِۦٓ إِلَّآ أَن قَالُوٓا۟ أَخْرِجُوهُم مِّن قَرْيَتِكُمْ ۖ إِنَّهُمْ أُنَاسٌ يَتَطَهَّرُونَ ﴿٨٢﴾

**82** దానికి అతని జాతి వారు ఇచ్చిన జవాబు ఇదే: "వీళ్లను మీ బస్తీ నుంచి వెళ్లగొట్టండి. మహా పవిత్రులట వీళ్ళు."[99]

فَأَنجَيْنَٰهُ وَأَهْلَهُۥٓ إِلَّا ٱمْرَأَتَهُۥ كَانَتْ مِنَ ٱلْغَٰبِرِينَ ﴿٨٣﴾

**83** అప్పుడు మేము లూత్ (అలైహిస్సలాం)ను, అతని ఇంటి వారిని కాపాడాము. అతని భార్యను తప్ప! ఆమె దైవశిక్షకు గురయినవారితో ఉండిపోయింది.[100]

وَأَمْطَرْنَا عَلَيْهِم مَّطَرًا ۖ فَٱنظُرْ كَيْفَ كَانَ عَٰقِبَةُ ٱلْمُجْرِمِينَ ﴿٨٤﴾

**84** మేము వారిపై ఒక ప్రత్యేకమైన వర్షాన్ని కురిపించాము.[101] చూడు! ఆ అపరాధులకు పట్టిన గతేమిటో![102]

وَإِلَىٰ مَدْيَنَ أَخَاهُمْ شُعَيْبًا ۗ قَالَ يَٰقَوْمِ ٱعْبُدُوا۟ ٱللَّهَ مَا لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرُهُۥ ۖ قَدْ جَآءَتْكُم بَيِّنَةٌ مِّن رَّبِّكُمْ ۖ فَأَوْفُوا۟ ٱلْكَيْلَ وَٱلْمِيزَانَ

**85** ఇంకా మేము మద్‌యన్ (వైపుకు) వారి సోదరుడైన షుఐబ్ (అలైహిస్సలాం)ను పంపాము.[103] అతను (తన జాతి వారి నుద్దేశించి), "నా జాతి వారలారా! మీరు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప మీరు ఆరాధించదగిన వేరొక దైవం

ఈ లతుకోరు పనిని 'ప్రాథమిక హక్కు' (Fundamental Right) గా ఖరారు చేసుకుంటున్నారు. అంటే పాశ్చాత్య ప్రపంచం దృష్టిలో ఇప్పుడది నేరమూ కాదు. చెడు పని కూడా కాదు. ఎందుకంటే వారి నాగరికత బాగా 'ముదిరి'పోయింది.

99. నీతిబాహ్యత, దుర్మార్గం, సామాజిక రుగ్మతలు వ్రేళ్లూనుకుపోయిన సమాజంలో సజ్జనుల హితబోధలు ఒక్కోసారి వింతగా తోస్తాయి. దైవప్రవక్త హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) మరియు ఆయన వెంటనున్న కొద్దిమంది సౌశీల్యవంతులు ఆ దుర్మార్గుల కంటికి వింత మనుషుల్లా కనిపించారు. తమ సొసైటీలో ఈ పవిత్రులకు చోటు లేదు అని తెగేసి చెప్పే దుస్సాహసానికి పాల్పడ్డారు. కామంతో కళ్లు మూసుకుపోయిన వానికి సిగ్గూ ఉండదు, భయమూ ఉండదు అన్న దానికి ఇదొక ప్రబల నిదర్శనం. మంచి వైపుకు, సౌశీల్యం పారిశుద్ధ్యాల వైపుకు ఆహ్వానించేవారు వారి దృష్టికి అధములుగా కనిపిస్తారు. మంచివారినే వారు చులకన చేస్తారు.

**"మహా పవిత్రులట వీళ్ళు"** అని అనటంలోని వారి ఉద్దేశం ఏమిటి? బహుశా వారు తాము చూస్తున్న వాస్తవికతను గురించి చెప్పి ఉంటారు. అంటే, మేము చేస్తున్న ఈ పని వీరికి పాపంగా కనిపిస్తుంది కాబట్టి, అసలు వీళ్ళు మనతోపాటు ఈ బస్తీలో ఉండకపోవటమే మంచిది, వీళ్లను ఇక్కణ్ణుంచి పంపేయండి అన్నది వాళ్ళ ఉద్దేశం కావచ్చు. లేక కేవలం ఎగతాళికే వారు ఆ మాట అని ఉండవచ్చు.

100. ఆమె దైవప్రవక్త భార్యే అయినప్పటికీ ముస్లిం కాలేదు. పైగా అపరాధులకు అండగా నిలిచింది.

101. ఏమిటీ ఆ ప్రత్యేక వర్షం? అది రాళ్ళ వర్షం అని ఖుర్‌ఆన్‌లో మరో చోట చెప్పబడింది. "మేము వారిపై ఎడతెగకుండా రాళ్ళవాన కురిపించాము" (హూద్ – 82). "మేము ఆ పట్టణాన్ని తలక్రిందులు చేసి వేశాము" అని అంతకుముందు అనబడింది.

102. అంటే – (ఓ ముహమ్మద్! – సఅసం) పబ్లిగ్గా దైవాజ్ఞల్ని ఉల్లంఘించి, దైవప్రవక్తలను చులకన చేసిన వారికి పట్టిన గతేమిటో చూశావుగా! కాబట్టి నువ్వు ఈ అవిశ్వాసుల ఆగడాలకు ఏమాత్రం జంకకుండా నీ కర్తవ్యాన్ని నువ్వు సజావుగా నిర్వర్తించు అని దేవుడు ఓదారుస్తున్నాడు.

103. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కొడుకు లేక మనవడి పేరు మద్‌యన్. ఆయన పేరు మీదే ఆయన వంశం మద్‌యన్‌గా పిలువబడింది. ఈ వంశస్థులు స్థిరపడ్డ ప్రదేశం కూడా మద్‌యన్‌గా వ్యవహరించబడింది. ఈ ప్రదేశం

وَلَا تَبْخَسُوا النَّاسَ اَشْيَآءَهُمْ وَلَا تُفْسِدُوْا فِي الْاَرْضِ بَعْدَ اِصْلَاحِهَا ۗ ذٰلِكُمْ خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ﴿85﴾

లేదు. మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి స్పష్టమయిన నిదర్శనం వచ్చేసింది. కాబట్టి మీరు కొలతలు, తూనికలలో ఖచ్చితంగా (పూర్తిగా) వ్యవహరించండి. ప్రజలకు వారి వస్తువులను తగ్గించి ఇవ్వకండి.[104] సంస్కరణ జరిగిన తరువాత భూమిలో అల్లకల్లోలాన్ని సృష్టించకండి. మీరు గనక నమ్మేవారే అయితే మీ మేలు ఇందులోనే ఉంది.

وَلَا تَقْعُدُوْا بِكُلِّ صِرَاطٍ تُوْعِدُوْنَ وَتَصُدُّوْنَ عَنْ سَبِيْلِ اللّٰهِ مَنْ اٰمَنَ بِهٖ وَتَبْغُوْنَهَا عِوَجًا ۚ وَاذْكُرُوْٓا اِذْ كُنْتُمْ قَلِيْلًا فَكَثَّرَكُمْ ۪ وَانْظُرُوْا كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُفْسِدِيْنَ ﴿86﴾

**86** "అల్లాహ్‌ను విశ్వసించేవారిని బెదిరించే ఉద్దేశంతో, అల్లాహ్ మార్గం నుంచి అడ్డుకునే ఆలోచనతో, అందులో వక్రతలను వెతుకుతూ రహదారుల్లో కూర్చోకండి.[105] మీరు అల్ప సంఖ్యలో ఉండగా అల్లాహ్ మీ జనసంఖ్యను అధికం చేసిన సంగతిని కాస్త గుర్తుచేసుకోండి. కల్లోలాన్ని రేకెత్తించే వారి కథ ఎలా ముగిసిందో కూడా చూడండి!

హిజాజ్‌కు వెళ్ళే దారిలో "మఆన్"కు సమీపంలో ఉంది. వీరినే ఖుర్ఆన్‌లో మరోచోట "అస్‌హాబుల్ అయ్‌కహ్" (వన వాసులు) అని కూడా అనటం జరిగింది. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) వీళ్ళ వైపుకు ప్రవక్తగా పంపబడ్డారు (సూరె షుఅరా 176 వ ఆయతుకు వివరణను చూడండి).

**గమనిక :** ప్రతి ప్రవక్తా ఆ జాతి సోదరుడుగా పేర్కొనబడ్డారు. అంటే ఆ జాతికి లేక ఆ తెగకు చెందిన వ్యక్తి అన్నమాట! 'స్వయంగా మీ నుండే మీ ప్రవక్తను ప్రభవింపజేశాము' అని మరోచోట అనబడింది. దైవప్రవక్త మానవ మాత్రుడై ఉంటారనీ, మానవ మార్గదర్శకత్వం కోసం మానవ జాతి నుంచే దేవుడు తన ప్రవక్తలను ఎన్నుకుంటాడని దీన్నిబట్టి అర్థమవుతోంది.

104. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) తన జాతివారికి ఏక దైవారాధనా సందేశం యిచ్చిన తరువాత, కొలతలు తూనికల్లో వారు చేస్తున్న అన్యాయాన్ని ఎత్తిచూపారు. కొలచి ఇచ్చినా, తూకం వేసి ఇచ్చినా పూర్తిగా ఇవ్వాలని, అందులో మోసం చేయరాదని ఉపదేశించారు. ఈ జాడ్యం ఎంత భయంకరమైనదంటే దాని వాతనపడిన జాతులు నైతికంగా దివాలా తీస్తాయి. పుచ్చుకునేటప్పుడు పూర్తిగా పుచ్చుకుని ఇచ్చేటప్పుడు తగ్గించి ఇవ్వటం దగా, మోసంగా పరిగణించబడుతుంది. ఇలాంటి వారికి వినాశం తప్పదని ముతఫ్ఫిఫీన్ సూరాలో హెచ్చరించబడింది.

105. దైవమార్గం నుండి ప్రజలను ఆపే ఉద్దేశంతో అందులో వక్రతలు తీయటం అన్ని రకాల ప్రజలలో ఉన్న జబ్బే. ఈనాటి సోకాల్డ్ తత్వవేత్తల్లో, పాశ్చాత్య సంస్కృతికి ప్రభావితులైన పండితులలో కూడా ఈ 'జబ్బు' ఉంది (అల్లాహ్ ఈ జబ్బు నుంచి మనల్ని కాపాడుగాక!). వారు దారుల్లో బైఠాయించటంలో రకరకాల దురాలోచనలు ఉండేవి. ఉదాహరణకు: వచ్చేపోయేవారిని అటకాయించటం, వెక్కిరించటం. సాధారణంగా అలగాజనం, తుంటరులు ఇలాంటి చేష్టలకు పాల్పడతారు. మంచివారు, మర్యాదస్తులు ఇలాంటి పిచ్చిపనులు చేయరు.

హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) సందేశానికి ప్రభావితులై ఆయన దగ్గరికి వెళ్ళేవారిని అడ్డుకోవాలన్నది కూడా వారి ఉద్దేశం కావచ్చు. వచ్చేపోయే వారిని ఆపి, నిలువుదోపిడీ చేసుకునే ఉద్దేశంతో కూడా వారు దారుల్లో మాటేసి కూర్చొనేవారేమో! లేక మామూళ్ళు, సుంకాలు వసూలు చేసేందుకు ప్రజలను అడ్డుకునేవారేమో! పైన పేర్కొనబడిన ఏ అర్థంలో తీసుకున్నా అది వారికి వర్తిస్తుందని ఇమామ్ షౌకానీ అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఈ దురలవాట్లన్నీ వారిలో ఉండి ఉండవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

**87** “అల్లాహ్ నాకిచ్చి పంపిన సందేశాన్ని మీలో కొందరు విశ్వసించగా, మరికొందరు విశ్వసించలేదు. కాబట్టి అల్లాహ్ మన మధ్య తీర్పుచేసే వరకూ ఓపిక పట్టండి. ఆయన అందరి లోకెల్లా అత్యుత్తమంగా తీర్పు చెప్పేవాడు.”[106]

وَإِن كَانَ طَآئِفَةٌ مِّنكُمْ ءَامَنُوا۟ بِٱلَّذِىٓ
أُرْسِلْتُ بِهِۦ وَطَآئِفَةٌ لَّمْ يُؤْمِنُوا۟ فَٱصْبِرُوا۟ حَتَّىٰ
يَحْكُمَ ٱللَّهُ بَيْنَنَا ۚ وَهُوَ خَيْرُ ٱلْحَٰكِمِينَ ﴿٨٧﴾

**88** దురహంకారులైన అతని జాతి సర్దారులు (అతన్నుద్దేశించి), “ఓ షుఐబ్! మీరంతా మా మతంలోకి తిరిగి వచ్చేస్తే సరి![107] లేకపోతే నిన్నూ, నీతోపాటు విశ్వసించినవారిని మా పురము నుంచి వెళ్ళగొడతాం” అని హెచ్చరించారు. దీనికి సమాధానంగా షుఐబ్ ఇలా అన్నారు: “ఏమిటీ, ఆ మతం మాకే మాత్రం ఇష్టం లేకపోయినా మేమందులో కలసి పోవలసిందేనా?!”[108]

قَالَ ٱلْمَلَأُ ٱلَّذِينَ ٱسْتَكْبَرُوا۟ مِن قَوْمِهِۦ
لَنُخْرِجَنَّكَ يَٰشُعَيْبُ وَٱلَّذِينَ ءَامَنُوا۟ مَعَكَ
مِن قَرْيَتِنَآ أَوْ لَتَعُودُنَّ فِى مِلَّتِنَا ۚ قَالَ
أَوَلَوْ كُنَّا كَٰرِهِينَ ﴿٨٨﴾

**89** “అల్లాహ్ మమ్మల్ని మీ ధర్మం నుంచి విముక్తి కలిగించిన తరువాత మళ్ళీ మేము గనక అందులోకే వచ్చి కలసిపోతే, మేము అల్లాహ్‌కు పెద్ద అబద్ధాన్ని అంటగట్టిన వాళ్ళం అవుతాము.[109]

قَدِ ٱفْتَرَيْنَا عَلَى ٱللَّهِ كَذِبًا إِنْ عُدْنَا فِى مِلَّتِكُم
بَعْدَ إِذْ نَجَّىٰنَا ٱللَّهُ مِنْهَا ۚ وَمَا يَكُونُ لَنَآ أَن نَّعُودَ

106. ‘అవిశ్వాసం’ విషయంలో రాజీపడకూడదు. పైగా అవిశ్వాస మార్గాన్ని ఎన్నుకున్న వారిని స్పష్టంగా హెచ్చరించాలి. ఎందుకంటే దైవనిర్ణయం ప్రకారం మిథ్యాదైవాలపై సత్యవాదులకు విజయం లభించటం తథ్యం. కనుక ఈ ఆయతులో ‘సహనం వహించండి’ అంటే నిజంగా సహనం వహించమని కాదు. పైగా ఇదొక హెచ్చరిక. ఖుర్‌ఆన్‌లోనే వేరొకచోట అవిశ్వాసులను ఈ విధంగా హెచ్చరించటం జరిగింది : “అయితే నిరీక్షించండి, మీతో పాటు మేమూ నిరీక్షిస్తాం” (అత్ తౌబా : 52). ఇదీ అటువంటి వార్నింగే!

107. ఇది వారి జాత్యహంకారానికి పరాకాష్ఠ! వారు దైవప్రవక్త ఇచ్చిన ఏక దైవారాధనా సందేశాన్ని తిరస్కరించటంతోనే ఆగలేదు. అంతకన్నా ముందుకుపోయి దైవప్రవక్తను, ప్రవక్త అనుయాయులను తమ పూర్వీకుల మతంలోకి తిరిగి రమ్మనీ, లేకుంటే అందరినీ వెళ్లగొడతామని బెదిరించారంటే వారి గర్వాహంకారం ఏ స్థాయికి చేరుకుందో అంచనా వేయవచ్చు. షుఐబ్ ప్రవక్త అనుయాయులు అవిశ్వాస మతాన్ని విడనాడి ఇస్లాం స్వీకరించారు. కనుక జాతి సర్దారులు వారిని తమ పూర్వీకుల మతంలోకి తిరిగి రమ్మని బెదిరించారు. ఇంతవరకు సరే. కాని షుఐబ్ ప్రవక్తను తన పూర్వీకుల మతంలోకి రమ్మని ఎందుకు కోరారు? అంటే ఆయన కూడా ప్రవక్త కాక ముందు తన పూర్వీకుల మతాన్ని అనుసరిస్తుండేవారా? అన్న సందేహం ఈ సందర్భంగా కలుగుతుంది. దీనికి సమాధానం ఏమిటంటే, ప్రవక్త కాకముందు షుఐబ్ తమ ధర్మాన్ని అనుసరించేవారని సర్దారులు అనుకున్నదేగాని అది వాస్తవం కాకపోవచ్చు. (ఎందుకంటే ప్రవక్తలు ఎన్నడూ అవిశ్వాస మతాన్ని అవలంబించరు). లేక జాతి సర్దారులు సాధారణ ముస్లింలను దృష్టిలో పెట్టుకొని ఈ మాట అని ఉండవచ్చు.

108. మీ పూర్వీకుల మతంలోకి తిరిగి రావటం, ఈ నగరం నుంచి బయటికి వెళ్ళటం మాకు ఇష్టం లేకపోయినా మీరు మమ్మల్ని బలవంతంగా మతం మార్పిస్తారా? దేశం నుంచి వెళ్ళగొడ్తారా? అంటే – మీ మతంలోకి తిరిగి రమ్మని కోరటంగానీ, ఈ ప్రదేశం నుండి వెళ్ళగొడ్తామని బెదిరించటం గాని మీకు తగదు అని భావం.

109. ఏ తాతముత్తాతల భ్రష్టమతం నుంచి అల్లాహ్ మమ్మల్ని కాపాడాడో, తిరిగి మేము అదే భ్రష్టమతంలోకి వెళితే, అప్పుడు మేము ఏకంగా సర్వోన్నత ప్రభువుకే అసత్యాన్ని ఆపాదించిన వారమవుతాము.

فِيهَآ إِلَّآ أَن يَشَآءَ ٱللَّهُ رَبُّنَا ۚ وَسِعَ رَبُّنَا كُلَّ
شَىْءٍ عِلْمًا ۚ عَلَى ٱللَّهِ تَوَكَّلْنَا ۚ رَبَّنَا ٱفْتَحْ بَيْنَنَا
وَبَيْنَ قَوْمِنَا بِٱلْحَقِّ وَأَنتَ خَيْرُ ٱلْفَٰتِحِينَ ﴿٨٩﴾

మీ మతంలోకి మేము తిరిగి రావటమనేది జరగదు – మా ప్రభువైన అల్లాహ్ రాసిపెట్టినదయితే అది వేరే విషయం.[110] మా ప్రభువు జ్ఞానం అన్నింటినీ ఆవరించి ఉంది. మేము అల్లాహ్‌నే నమ్ముకున్నాము.[111] ఓ ప్రభూ! మాకూ – మా జాతివారికీ మధ్య న్యాయంగా తీర్పు చెయ్యి. నీవు అందరికన్నా ఉత్తమంగా తీర్పు చేసేవాడవు."[112]

وَقَالَ ٱلْمَلَأُ ٱلَّذِينَ كَفَرُوا۟ مِن قَوْمِهِۦ لَئِنِ ٱتَّبَعْتُمْ
شُعَيْبًا إِنَّكُمْ إِذًا لَّخَٰسِرُونَ ﴿٩٠﴾

**90** అతని జాతిలోని అవిశ్వాస నాయకులు, "మీరు గనక షుఐబ్ మార్గంలో పోయారంటే తీవ్రంగా నష్టపోతారు!"[113] అని హెచ్చరించారు.

فَأَخَذَتْهُمُ ٱلرَّجْفَةُ فَأَصْبَحُوا۟ فِى دَارِهِمْ
جَٰثِمِينَ ﴿٩١﴾

**91** అంతే, భూకంపం వాళ్ళను కబళించింది. దాంతో వారు తమ ఇళ్ళల్లో బోర్లాపడినట్లే ఉండిపోయారు.[114]

110. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) తన దృఢ సంకల్పాన్ని వెలిబుచ్చిన తరువాత మిగిలిన వ్యవహారాన్ని దైవానికి అప్పగించారు. అంటే మాకుగా మేము మళ్లీ మిథ్యా వాదాన్ని అవలంబించేది లేదు. ఒకవేళ దేవుడు తలిస్తే అది వేరే విషయం అని ఆయన చెప్పదలిచారు. 'దేవుడు తలిస్తే అది వేరే విషయం' – షుఐబ్ ప్రవక్త గారి ఈ మాట ఖుర్‌ఆన్‌లో వచ్చిన, "ఒంటె సూది రంధ్రం గుండా పోనంతవరకూ..."(ఆరాఫ్-40) అన్న వాక్యం వంటిదనీ (అంటే తాము తిరిగి మార్గభ్రష్టతను ఎన్నుకోవటం అసంభవమని ఆయన చెప్పదలిచారని) కొంతమంది పండితులు వ్యాఖ్యానించారు.

111. అంటే ఆయన మాకు విశ్వాసం (ఈమాన్) పై నిలకడను ప్రసాదిస్తాడనీ, మాకు – అవిశ్వాసులకు మధ్య అడ్డుగా ఉంటాడనీ, మాపై తన అనుగ్రహాలను పరిపూర్తిగావిస్తాడనీ, తన ఆగ్రహం నుంచి మమ్మల్ని కాపాడతాడని మేము గట్టిగా నమ్ముతున్నాము.

112. ఆయన గనక నిర్ణయించుకున్నాడంటే విశ్వాసులను సురక్షితంగా ఉంచి, తిరస్కారులనూ దురహంకారులనూ నిర్మూలిస్తాడు. ఈ మాటల ద్వారా హజ్రత్ షుఐబ్ బహుశా దైవశిక్ష అవతరించాలని కోరుకున్నారు.

113. కొలతలు, తూనికల్లో మోసం చేసి స్వల్ప వ్యవధిలోనే ధనాన్ని మూటగట్టుకునే ఈ వర్తకులకు నిజాయితీగా నడుచుకునే వారు నష్టపోయేవారుగా కనిపించారు. ఎందుకంటే ఈ అవిశ్వాసుల దృష్టి ఎంతసేపటికీ స్వల్పకాలిక ప్రయోజనాలపైనే నిలిచి ఉండేది. పరలోకంలో ప్రభువు వద్ద లభించే శాశ్వత ప్రయోజనాలంటే వారికి గిట్టేది కాదు. అందుకే షుఐబ్ (అలైహిస్సలాం) అడుగుజాడల్లో నడిచేవారు ప్రాపంచికంగా నష్టపోతారని వారిపై మొసలి కన్నీరు కార్చారు. అయితే సత్యామృతాన్ని ఆస్వాదించినవారు మాత్రం ఈ ప్రాపంచిక లాభం కోసం తమ విశ్వాసాన్ని పణంగా పెట్టడానికి ఏమాత్రం సుముఖత వ్యక్తపరచలేదు.

114. ఇక్కడ **రజ్‌ఫహ్** (భూకంపం) అనబడింది. హూద్ సూరాలోని 94వ ఆయతులో **సైహతున్** (కేక) అనే పదం వాడబడింది. అష్ షుఅరా సూరాలోని 189వ వచనంలో **'జుల్లతున్'** (మేఘ ఛాయ) అనే పదం ఉంది. దీనిపై ఇబ్నె కసీర్ వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు : దైవశిక్షలో ఈ మూడూ కలిసి ఉన్నాయి. అంటే ఆకాశం మేఘావృతం అయి ఉన్న రోజు ఈ ఆపద వచ్చింది. తొలుత మేఘం వారికి నీడనిచ్చింది. ఆ నీడ నుంచి నిప్పురవ్వలు పడ్డాయి. ఆ తరువాత ఆకాశం నుంచి భయంకరమైన అరుపు వచ్చింది. అంతలోనే భూమి ప్రకంపించింది. ఆ దెబ్బకు వారి పై ప్రాణాలు పైకే లేచిపోయాయి. కుప్పకూలిన రాబందుల్లా వారంతా నేలకొరిగారు.

الَّذِيْنَ كَذَّبُوْا شُعَيْبًا كَاَنْ لَّمْ يَغْنَوْا فِيْهَا ۚ
اَلَّذِيْنَ كَذَّبُوْا شُعَيْبًا كَانُوْا هُمُ الْخٰسِرِيْنَ ﴿92﴾

**92** షుఐబును ధిక్కరించినవారి పరిస్థితి ఆ ఇండ్లలో వారెప్పుడూ నివసించనే లేదన్నట్టుగా మారిపోయింది.[115] షుఐబును ధిక్కరించినవారే నష్టపోయారు.[116]

فَتَوَلّٰى عَنْهُمْ وَقَالَ يٰقَوْمِ لَقَدْ اَبْلَغْتُكُمْ رِسٰلٰتِ
رَبِّيْ وَنَصَحْتُ لَكُمْ ۚ فَكَيْفَ اٰسٰى عَلٰى قَوْمٍ
كٰفِرِيْنَ ﴿93﴾

**93** అప్పుడు షుఐబ్ వాళ్లనుండి ముఖం తిప్పుకొని మరలిపోతూ, "ఓ నా జాతి జనులారా! నా ప్రభువు ఆదేశాలను నేను మీకు అందజేశాను. నిత్యం మీ బాగోగులను కోరుకున్నాను. అలాంటప్పుడు ఈ తిరస్కారుల (దుర్గతి)పై నేనెందుకు బాధపడాలి?"[117] అని అన్నారు.

وَمَآ اَرْسَلْنَا فِيْ قَرْيَةٍ مِّنْ نَّبِيٍّ اِلَّآ اَخَذْنَآ
اَهْلَهَا بِالْبَاْسَآءِ وَالضَّرَّآءِ لَعَلَّهُمْ يَضَّرَّعُوْنَ ﴿94﴾

**94** మేము ఏ ప్రవక్తను ఏ బస్తీలో పంపినా అక్కడి జనులు అణకువతో మెలగాలన్న ఉద్దేశంతో వారిని అభాగ్యానికి, అనారోగ్య స్థితికీ లోను చేశాము.[118]

ثُمَّ بَدَّلْنَا مَكَانَ السَّيِّئَةِ الْحَسَنَةَ حَتّٰى عَفَوْا
وَّقَالُوْا قَدْ مَسَّ اٰبَآءَنَا الضَّرَّآءُ وَالسَّرَّآءُ
فَاَخَذْنٰهُمْ بَغْتَةً وَّهُمْ لَا يَشْعُرُوْنَ ﴿95﴾

**95** ఆ తరువాత వారి దురవస్థను మంచి స్థితిగా మార్చాము. వారు బాగా అభివృద్ధి చెందినప్పుడు, "(ఇదేమీ కొత్త విషయం కాదు) మా తాతముత్తాతలకు కూడా కష్టసుఖాలు ఎదురయ్యాయి" అని అన్నారు. అప్పుడు మేము వారిని అకస్మాత్తుగా పట్టుకున్నాము.[119] (తమకు ఆ పరిస్థితి ఎదురవుతుందని) వాళ్లకు ఏమాత్రం తెలియదు.

115. అంటే దేవుని శిక్ష అవతరించకముందు దైవప్రవక్తను, ప్రవక్త అనుయాయులను వెళ్ళగొట్టాలని నిశ్చయించుకున్న ఈ జాత్యోన్మాదులు దైవశిక్ష అవతరించిన తరువాత నామరూపాల్లేకుండా పోయారు. ఒకప్పుడు అసలు అక్కడ వారుండేవారా?! అన్నట్లుగా అయిపోయారు.

116. నష్టపోయేది ప్రవక్తను ధిక్కరించేవారేగాని ప్రవక్తకు విధేయత చూపేవారు కారు. ఈ అవిశ్వాసులు ఇహలోకంలోనే కాదు, పరలోకంలో కూడా నష్టానికి గురవుతారు. పరలోకంలో లభించే శిక్ష మరింత కఠినంగా ఉండబోతోంది.

117. దైవాగ్రహం విరుచుకుపడిన తరువాత ఆయన ఆ ప్రదేశం నుంచి నిష్క్రమిస్తూ చెప్పిన మాటలివి. దైవ సందేశాన్ని హెచ్చుతగ్గులు లేకుండా అందజేసే నా కర్తవ్యాన్ని నేను సజావుగా నిర్వర్తించాను. మీ బాగోగులను కోరుకున్నాను. కాని నా మాటలను మీరు ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. అలాంటప్పుడు మీ దుష్పరిణామంపై నేనెందుకు బాధ పడాలి? అన్నది హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) గారి పలుకుల్లోని అంతరార్థం.

118. అంటే అస్వస్థతకు లోనుచేసి శారీరకంగా వారిని బాధపెట్టడంతోపాటు పేదరికానికీ, దుర్భిక్షానికి గురిచేసి వారి సహనాన్ని పరీక్షించాము. మా ప్రవక్త పట్ల వారు కనబరచిన నిరాదరణ, అనాసక్తత కారణంగా మేము వారిని ఈ స్థితికి లోనుచేశాము. ఈ విధంగానయినా వారిలోని పొగరు అణిగి వారు వినయవినమ్రతలను అలవరచుకుంటారేమోనన్న ఉద్దేశంతో మేమిలా చేశాము అని దేవుడంటున్నాడు.

119. ఎడతెగని రోగాలు, ఆర్థిక ఇబ్బందుల ద్వారా కూడా వారిలో పరివర్తన రాలేదు. వారు తమ ప్రభువు వైపుకు మరలిరాలేదు. అప్పుడు మేము వారి దుస్థితిని చక్కదిద్దాము. వారికి కలిమిని ప్రసాదించాము. ఆరోగ్య సంపదను

وَلَوْ أَنَّ أَهْلَ الْقُرَىٰ آمَنُوا وَاتَّقَوْا لَفَتَحْنَا
عَلَيْهِم بَرَكَاتٍ مِّنَ السَّمَاءِ وَالْأَرْضِ وَلَٰكِن
كَذَّبُوا فَأَخَذْنَاهُم بِمَا كَانُوا يَكْسِبُونَ (96)

**96** ఈ బస్తీలో నివసించే వాళ్ళేగనక విశ్వసించి, భయభక్తులతో మెలగి ఉన్నట్లయితే మేము వాళ్ల కోసం భూమ్యాకాశాల శుభాల(ద్వారాల)ను తెరచేవాళ్ళం. కాని వాళ్ళు ధిక్కారానికి పాల్పడ్డారు. అందువల్ల వారి (చెడు) సంపాదనకు కారణంగా మేము వాళ్ళను పట్టుకున్నాము.

أَفَأَمِنَ أَهْلُ الْقُرَىٰ أَن يَأْتِيَهُم بَأْسُنَا
بَيَاتًا وَهُمْ نَائِمُونَ (97)

**97** అయినప్పటికీ ఈ బస్తీల వాళ్లు రాత్రివేళ నిద్రపోతున్నప్పుడు తమపై మా శిక్ష వచ్చిపడదని నిశ్చింతగా ఉన్నారా?

أَوَأَمِنَ أَهْلُ الْقُرَىٰ أَن يَأْتِيَهُم بَأْسُنَا ضُحًى
وَهُمْ يَلْعَبُونَ (98)

**98** ఏమిటీ, పొద్దెక్కుతుండగా తాము ఆటపాటల్లో నిమగ్నులై ఉన్నప్పుడు (హటాత్తుగా) మా ఆపద విరుచుకుపడుతుందన్న భయం ఈ బస్తీల వాళ్లకు బొత్తిగా లేదా?

أَفَأَمِنُوا مَكْرَ اللَّهِ ۚ فَلَا يَأْمَنُ مَكْرَ اللَّهِ
إِلَّا الْقَوْمُ الْخَاسِرُونَ (99)

**99** ఏమిటీ, వాళ్ళు దేవుని ఈ వ్యూహం గురించి నిశ్చింతగా ఉన్నారా? నష్టపోయే వారు తప్ప మరొకరెవరూ దేవుని వ్యూహం గురించి నిర్లక్ష్యంగా ఉండరు.[120]

أَوَلَمْ يَهْدِ لِلَّذِينَ يَرِثُونَ الْأَرْضَ مِن بَعْدِ
أَهْلِهَا أَن لَّوْ نَشَاءُ أَصَبْنَاهُم بِذُنُوبِهِمْ ۚ وَنَطْبَعُ

**100** ఏమిటీ, అక్కడి ప్రజల వినాశం తరువాత భూమికి వారసులు అయిన వాళ్లకి (ఆ సంఘటనలు) కనువిప్పు కలిగించ లేదా? మేము గనక తలచుకుంటే వారిని వారి పాపాల

కూడా వొసగాము. ఆ విధంగానయినా వారు కృతజ్ఞులుగా మెలగుతారని ఆశించాము. కాని ఆ తరువాత కూడా వారి ఆలోచనా సరళిలో కించిత్ మార్పు రాలేదు. ఈ ఎగుళ్ళూదిగుళ్ళు ఎప్పుడూ ఉండేవేననీ, తమ పూర్వీకులు కూడా మంచి రోజులను చెడ్డరోజులను ఎదుర్కొన్నారని ఎంతో ధీమాగా చెప్పారు. అంటే కటిక దారిద్ర్యం కూడా వారిలో వినమ్రతను సృజించలేదు, సిరిసంపదలు కూడా వారిలో కృతజ్ఞతా భావాన్ని పెంపొందించలేదు. కాలచక్రంలో వచ్చే ఈ మార్పుల వెనుక ఉన్న అంతరార్థాన్నీ, దైవప్రణాళికను గురించి యోచించేందుకు వారు ఏమాత్రం ఆసక్తి కనబరచలేదు. ఇక వారిలో పరివర్తన రానేరాదని తేలిన తరువాత మేము హటాత్తుగా వారిని ముట్టడించాము. అందుకే హదీసులో విశ్వాసుల పరిస్థితి దీనికి – పూర్తిగా – భిన్నంగా ఉంటుందని చెప్పబడింది. సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు ప్రాప్తించినపుడు వారు దైవానికి కృతజ్ఞులై ఉంటారు. కష్టాలు కలిగినప్పుడు ఓర్పు వహిస్తారు. ఈ రెండు అవస్థలూ వారి పాలిట శ్రేయోదాయకంగా, పుణ్యప్రదంగా పరిణమిస్తాయి (సహీహ్ ముస్లిం: కితాబుజ్జుహ్ద్).

120. ఈ ఆయతులో అల్లాహ్ చాలా ముఖ్యమైన ఒక విషయాన్ని ప్రస్తావించాడు. అదేమంటే; విశ్వాసాన్ని (ఈమాన్‌ను), భయభక్తుల వైఖరి (తఖ్వా)ని ఎవరు అవలంబించినాసరే వారికోసం ఆకాశాల నుంచి, భూమిలో నుంచి శుభాల ద్వారాలు తెరచుకుంటాయి. అంటే వారి అవసరాల కనుగుణంగా ఆకాశం నుంచి ప్రయోజనకరమైన వర్షం వారి ప్రాంతాలలో కురుస్తుంది. భూమిలో నుంచి పంటలు పుష్కలంగా పండుతాయి. తత్ఫలితంగా వారి దశ తిరుగుతుంది. వారు సిరిసంపదలతో తులతూగుతారు. దీనికి భిన్నంగా తిరస్కారానికి, ధిక్కారానికి పాల్పడిన మానవ సముదాయాలు దైవాగ్రహాన్ని చేజేతులా కొనితెచ్చుకుంటాయి. రేయింబవళ్ళలో ఏ క్షణాన వారు ఏ ఆపదలో చిక్కుకుంటారో తెలీదు. ఆనందంతో ఆడుతూ పాడుతూ ఉండే జనవాసాలు అకస్మాత్తుగా– కొన్ని నిముషాలలోనే – నామరూపాల్లేకుండా

عَلٰى قُلُوْبِهِمْ فَهُمْ لَا يَسْمَعُوْنَ ﴿١٠٠﴾

మూలంగా నాశనం చేయగలమనీ? వారి హృదయాలపై (తిరస్కార) ముద్ర వేసేస్తే ఇక వారు ఏమీ వినలేరనీ?[121]

تِلْكَ الْقُرٰى نَقُصُّ عَلَيْكَ مِنْ اَنْۢبَآئِهَا ۚ وَلَقَدْ جَآءَتْهُمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ ۚ فَمَا كَانُوْا لِيُؤْمِنُوْا بِمَا كَذَّبُوْا مِنْ قَبْلُ ۚ كَذٰلِكَ يَطْبَعُ اللّٰهُ عَلٰى قُلُوْبِ الْكٰفِرِيْنَ ﴿١٠١﴾

**101** ఈ బస్తీల గాథలను స్థూలంగా మేము నీకు వివరిస్తున్నాము. వాళ్ళందరి వద్దకూ వారి ప్రవక్తలు స్పష్టమయిన మహిమలను తీసుకువచ్చారు.[122] అయితే మొదట్లో ఒకసారి వారు త్రోసి పుచ్చిన దానిని తరువాత విశ్వసించేవారు కాదు.[123] ఈ విధంగా అల్లాహ్ తిరస్కారుల హృదయాలపై ముద్ర వేసేస్తాడు.

పోవచ్చు. అందుకే మనుషులు దేవుని వ్యూహాల పట్ల అశ్రద్ధకు, మరుపుకు, నిర్లక్ష్యానికీ లోనై ఉండకూడదు. వారి నిర్లక్ష్యం వల్ల వారికి నష్టం తప్ప ఇంకొకటి ఏదీ కలగదు. **"మక్ర్"** అనే పదానికి భావం తెలుసుకునేందుకు ఆలి ఇమ్రాన్ సూరా 54వ ఆయతు వివరణ చూడండి.

121. పాపాలకు ఫలితంగా దైవశిక్షే అవతరిస్తుందన్న నియమం లేదు. హృదయాలకు తాళాలు కూడా పడిపోవచ్చు. అదేగనక జరిగితే పెద్ద పెద్ద శిక్షలు, ప్రమాదాలు కూడా వారిని ఏమరుపాటు నుంచి జాగృతం చేయలేవు. ఈ ఆయతులో అల్లాహ్ చెప్పిన ఒక ముఖ్య విషయం ఏమిటంటే, లోగడ మేము అనేక జాతులను పట్టుకున్నట్లే వీళ్లను కూడా అపరాధాల కారణంగా పట్టుకుని శిక్షించగలము. రెండో విషయం ఏమిటంటే నిరంతరం నేరాలకు, పాపాలకు పాల్పడుతూ పోతున్నందున ప్రజల హృదయాలకు తాళం పడిపోతుంది. తత్ఫలితంగా సత్యవాణి వారి హృదయ కవాటాలను తట్టదు. వారి ముందు ఎన్ని హెచ్చరికలు చేసినా, మరెన్ని హితబోధలు చేసినా బధిర శంఖారావమే అవుతుంది.

122. వెనుకటి పుటల్లో కొంతమంది ప్రవక్తల గాథలు వచ్చాయి. వారంతా తమ తమ జాతుల వద్దకు దేవుని నిదర్శనాలను, మహిమలను తీసుకుని వచ్చారు. ప్రవక్తల ద్వారా సందేశాన్ని అందజేసే కార్యక్రమం పరిపూర్తి కానంతవరకూ విశ్వప్రభువు ఏ జాతినీ శిక్షించదు. ఎందుకంటే, "ఒక ప్రవక్తను పంపనంతవరకూ మేము ఏ జాతిపైనా శిక్షను అవతరింపజెయ్యము" అని ఆయన స్పష్టం చేశాడు (బనీ ఇస్రాయీల్ – 15).

123. దీనికి ఒక అర్థం ఇది: వారు విశ్వసించేవారు కారని 'మీసాఖ్' దినాన వారి నుండి వాగ్దానం తీసుకున్నప్పుడే అల్లాహ్‌కు తెలుసు. అందుకే వారి వద్దకు ప్రవక్తలు వచ్చినప్పుడు – అల్లాహ్ జ్ఞానం ప్రకారమే – వారు విశ్వసించలేదు. ఎందుకంటే వారి నొసట 'ఈమాన్' (విశ్వాసం) రాసిపెట్టిలేదు. దీనినే హదీసులో **"ఫకుల్లున్ ముయస్సరున్ లిమా ఖులిఖ లహు"**గా అభివర్ణించటం జరిగింది. అంటే ప్రతి ఒక్కరికీ వారు దేనికోసం పుట్టించబడ్డారో అదే సులభం అవుతుంది (సహీహ్ బుఖారీ: అల్లైల్ సూరా వ్యాఖ్యానం).

రెండవ అర్థం ఇది: దైవప్రవక్తలు వారి వద్దకు వచ్చినప్పుడు – అంతకుముందే వారు సత్యాన్ని తిరస్కరించి ఉండటం మూలంగా – విశ్వసించలేదు. అంటే మొదట్లో వారు దేనిని త్రోసిపుచ్చారో ఆ పాపమే వారిని చుట్టుకుని, వారి అవిశ్వాసానికి కారణ భూతం అయింది. విశ్వసించే భాగ్యం వారి నుండి జప్తు చేసుకోబడింది. దాన్నే తరువాతి వాక్యంలో "హృదయాలకు సీలు వేయబడటం"గా చెప్పటం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌లోనే వేరొకచోట ఈ విషయం ఇలా చెప్పబడింది : "(ఓ ప్రవక్తా!) ఒకవేళ సూచనలు వచ్చినా వారు (దౌర్భాగ్యులు) విశ్వసించేవారు కారు అన్న సంగతి నీకేం తెలుసు? తొలిసారి వారు దానిని విశ్వసించని విధంగానే మేము వారి హృదయాలను, వారి చూపులను మళ్ళిస్తున్నాము. మేము వారిని వారి తలబిరుసుతనంలోనే దారి తప్పి తిరిగేలా వదలివేస్తాము" (అన్ఆమ్ సూరా – 109, 110).

**102** వారిలో చాలామందిని మేము మాట నిలుపుకునేవారుగా చూడలేదు.[124] వారిలో చాలామందిని మేము అవిధేయులుగానే పొందాము.

وَمَا وَجَدْنَا لِأَكْثَرِهِم مِّنْ عَهْدٍ ۖ وَإِن وَجَدْنَا أَكْثَرَهُمْ لَفَاسِقِينَ ﴿١٠٢﴾

**103** వారి తర్వాత మేము మూసా (అలైహిస్సలాం)కు మా సూచనలిచ్చి ఫిరౌను వద్దకు, అతని అధికారుల వద్దకు పంపాము.[125] కాని వారు మా సూచనల పట్ల చాలా ఘోరంగా ప్రవర్తించారు. అయితే చూడు! ఆ కల్లోల జనకులకు ఏ గతి పట్టిందో![126]

ثُمَّ بَعَثْنَا مِن بَعْدِهِم مُّوسَىٰ بِآيَاتِنَا إِلَىٰ فِرْعَوْنَ وَمَلَئِهِ فَظَلَمُوا بِهَا ۖ فَانظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُفْسِدِينَ ﴿١٠٣﴾

**104** మూసా (అలైహిస్సలాం) ఇలా అన్నాడు : "ఓ ఫిరౌన్! నేను సర్వలోక ప్రభువు తరఫున పంపబడిన ప్రవక్తను.

وَقَالَ مُوسَىٰ يَا فِرْعَوْنُ إِنِّي رَسُولٌ مِّن رَّبِّ الْعَالَمِينَ ﴿١٠٤﴾

**105** అల్లాహ్ పేరుతో సత్యాన్ని తప్ప మరేమాట అయినా చెప్పటం నాకేమాత్రం శోభించదు, నేను మీ దగ్గరకు మీ ప్రభువు వద్దనుంచి స్పష్టమైన సూచనను కూడా తీసుకువచ్చాను.[127] కాబట్టి ఇస్రాయీలు వంశీయులను నాతో పంపు."[128]

حَقِيقٌ عَلَىٰ أَن لَّا أَقُولَ عَلَى اللَّهِ إِلَّا الْحَقَّ ۚ قَدْ جِئْتُكُم بِبَيِّنَةٍ مِّن رَّبِّكُمْ فَأَرْسِلْ مَعِيَ بَنِي إِسْرَائِيلَ ﴿١٠٥﴾

124. **'మాట నిలుపుకోవటం'** అంటే ఏ విషయంలో? దీన్ని కొంతమంది **'అహ్దె అలస్త్'** అంటే **'ఆలమె అర్వాహ్'** (ఆత్మల అవస్థ)లో తీసుకున్న వాగ్దానంగా భావించారు. మరికొంతమంది, శిక్ష నుంచి తప్పించుకోవటానికి వారు తమ ప్రవక్తలతో చేసిన వాగ్దానం అన్న భావంలో తీసుకున్నారు. వారు తమ మధ్య చేసుకునే వివిధ రకాల ఒప్పందాలు అని ఇంకా కొంతమంది వ్యాఖ్యాతలు భావించారు. ఏ విషయమై వాగ్దానం చేసినా దాన్ని పాలించటం అవశ్యం. వాగ్దాన భంగం కూడా పాపంగానే పరిగణించబడుతుంది.

125. ఇంతవరకు ప్రస్తావించబడిన ప్రవక్తల తరువాత – ఇక్కణ్ణుంచి ఒక గొప్ప ప్రవక్త, హజ్రత్ మూసా (అలైహిస్సలాం) వృత్తాంతం మొదలవుతుంది. ఈయన ఈజిప్టులో నిరంకుశ చక్రవర్తిగా రాజ్యమేలుతున్న ఫిరౌను వద్దకు, అతని జాతి వారి వద్దకు దైవ సూచనలను, అద్భుతాలను తీసుకుని వెళ్ళారు.

126. అంటే ధరణిలో చెలరేగిపోయిన ఈ అధికార మదాంధులు ఆఖరికి సముద్రంలో ముంచివేయబడ్డారు. ఆ వివరాలు రాబోతున్నాయి.

127. తాను దైవప్రవక్తనని నిరూపించుకోవటానికి మూసా (అలైహిస్సలాం) ఆ పెద్ద సూచనను గురించి ప్రస్తావించారు. ఆ పెద్ద సూచన లేక మహిమ ఏమిటో మున్ముందు వివరంగా రాబోతోంది.

128. ఇస్రాయీలు సంతతివారు వాస్తవానికి సిరియా ప్రాంతవాసులు. అయితే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కాలంలో వీరు ఈజిప్టు వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. కాని ఫిరౌను రాజ వంశస్థులు వీరిని (ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించి), బానిసల్ని చేసుకున్నారు. రకరకాలుగా వారిని వేధించసాగారు. (అల్ బఖరా సూరాలో ఈ వివరాలు వచ్చాయి. మున్ముందు కూడా మరిన్ని వివరాలు రానున్నాయి). ఇలాంటి పరిస్థితుల్లో విచ్చేసిన మూసా, తొలుత వారికి దైవ సందేశాన్ని అందజేశారు. ఈ సందేశాన్ని ఫిరౌను, అతని దర్బారు అధికారులు త్రోసిపుచ్చటంతో, కనీసం ఇస్రాయీలు సంతతి వారినైనా విడిచిపెడితే తమ పూర్వీకుల నివాసస్థలానికి (సిరియాకు) వెళ్ళి గౌరవప్రదంగా అల్లాహ్‌ను ఆరాధిస్తూ బ్రతకవచ్చని హజ్రత్ మూసా ఆశించారు. ఫిరౌను దర్బారులో ఆయన ఈ ప్రతిపాదనే చేశారు.

106 దానికి ఫిరౌను, "ఒకవేళ నువ్వు ఏదన్నా మహిమను తెచ్చివుంటే, నీ వాదనలో నువ్వు సత్యవంతుడవే అయితే, దాన్ని ప్రదర్శించు" అన్నాడు.

قَالَ إِن كُنتَ جِئْتَ بِآيَةٍ فَأْتِ بِهَا إِن كُنتَ مِنَ الصَّادِقِينَ ﴿١٠٦﴾

107 అతను (మూసా) తన చేతి కర్రను పడవేశాడు. తక్షణం అది స్పష్టమైన సర్పంగా మారిపోయింది.

فَأَلْقَىٰ عَصَاهُ فَإِذَا هِيَ ثُعْبَانٌ مُّبِينٌ ﴿١٠٧﴾

108 తర్వాత అతను తన చేతిని బయటికి తీయగానే, ప్రేక్షకు లందరికీ అది ధగధగా మెరిసిపోతున్నట్టు కనిపించింది.[129]

وَنَزَعَ يَدَهُ فَإِذَا هِيَ بَيْضَاءُ لِلنَّاظِرِينَ ﴿١٠٨﴾

109 (ఈ పరిస్థితిని గమనించిన) ఫిరౌను జాతి సర్దారులు, "నిజం గానే ఇతగాడు మహా నైపుణ్యంగల మాంత్రికుడే"[130] అన్నారు.

قَالَ الْمَلَأُ مِن قَوْمِ فِرْعَوْنَ إِنَّ هَٰذَا لَسَاحِرٌ عَلِيمٌ ﴿١٠٩﴾

110 "మిమ్మల్ని మీ భూమి (దేశం) నుంచి వెళ్ళగొట్టాలని ఇతను కోరుతున్నాడు. ఇప్పుడేం చేయాలనుకుంటున్నారో మీరే చెప్పండి" (అని సంప్రతింపులు చేసుకున్నారు.)

يُرِيدُ أَن يُخْرِجَكُم مِّنْ أَرْضِكُمْ فَمَاذَا تَأْمُرُونَ ﴿١١٠﴾

111 వారిలా అన్నారు : "(ఓ ఫిరౌన్!) తమరు ఇతనికీ ఇతని సోదరునికీ కొంత గడువు ఇవ్వండి. ఈలోగా సమీకరించే భటులను వివిధ పట్టణాలలోకి పంపించండి.

قَالُوا أَرْجِهْ وَأَخَاهُ وَأَرْسِلْ فِي الْمَدَائِنِ حَاشِرِينَ ﴿١١١﴾

112 వారు నిపుణులైన మాంత్రికులందరిని తీసుకువస్తారు."[131]

يَأْتُوكَ بِكُلِّ سَاحِرٍ عَلِيمٍ ﴿١١٢﴾

129. ఫిరౌన్ కోరిందే తడవుగా, మూసా తన నిజాయితీని నిరూపించుకోవటానికి అల్లాహ్ తనకు ఇచ్చి పంపిన రెండు మహిమలనూ ప్రదర్శించారు.

130. మహిమలను చూసిన మీదట విశ్వసించవలసిందిపోయి ఫిరౌను అధికారులు ప్లేటు ఫిరాయించారు. ఆ సూచనలను ఇంద్రజాలంగా ఖరారు చేసి, ఆయన్ని ఓ మాంత్రికుడుగా చిత్రించారు. రాజ్యాధికారానికి ఎసరుపెట్టడానికే మూసా ఈ వల పన్నాడని ఆరోపించారు. ఆ కాలంలో ఇంద్రజాలం, మాంత్రికవిద్య బాగా ప్రాచుర్యంలో ఉండేది. అందువల్ల వాళ్లు మహిమలను కూడా మాంత్రిక విద్యగా భ్రమపడ్డారు. మహిమలలో మానవమాత్రుల ప్రమేయం ఏమీ ఉండదు. అవి దేవుని తరఫున ప్రస్ఫుటం అవుతాయి. అయితే మొత్తమ్మీద మూసా (అలైహిస్సలాం) కు వ్యతిరేకంగా తమ చక్రవర్తిని రెచ్చగొట్టడానికి ఫిరౌను దర్బారులోని అధికారులకు ఇదొక సాధనంగా ఉపయోగపడింది.

131. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) కాలంలో జాలవిద్య మంచి ఊపుమీద ఉండేది. అందుకే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) చూపిన మహిమలను కూడా వారు జాలవిద్య అనే అనుకున్నారు. జాలవిద్యకు విరుగుడు జాల విద్యేనని తలపోసి మాంత్రికవిద్యలో ఆరితేరిన వారిని సమీకరించారు. ఈ విషయమే వేరొకచోట మరింత విపులంగా చెప్పబడింది. "ఓ మూసా! ఏమిటీ, జాలవిద్యా శక్తితో మమ్మల్ని మా స్వస్థలం నుంచే వెళ్ళగొట్టాలనుకుంటున్నావా? మేము కూడా ఇలాంటి జాలవిద్యను నీకు వ్యతిరేకంగా తీసుకువస్తాము. అనువైన చోటును, సమయాన్ని నిర్ణయించుకుందాం. ఇద్దరం కూడా దీనికి కట్టుబడి ఉండాలి" అని ఫిరౌను మరియు అతని దర్బారులోని వారు

113 ఆ విధంగా మాంత్రికులు ఫిరౌను వద్దకు వచ్చారు, "మేము గనక గెలిస్తే మాకేదైనా పారితోషికం లభిస్తుందా?" అని విన్నవించుకున్నారు.

وَجَآءَ السَّحَرَةُ فِرْعَوْنَ قَالُوٓا اِنَّ لَنَا لَاَجْرًا اِنْ كُنَّا نَحْنُ الْغٰلِبِيْنَ ﴿١١٣﴾

114 "ఔను, అంతేకాదు, మీరు నా సన్నిహితుల్లో చేరుతారు"[132] అని ఫిరౌను అన్నాడు.

قَالَ نَعَمْ وَاِنَّكُمْ لَمِنَ الْمُقَرَّبِيْنَ ﴿١١٤﴾

115 అప్పుడా మాంత్రికులు, "ఓ మూసా! నువ్వు పడవేస్తావా? లేక మమ్మల్నే పడవేయమంటావా?!"[133] అని ప్రశ్నించారు.

قَالُوْا يٰمُوْسٰٓى اِمَّآ اَنْ تُلْقِيَ وَاِمَّآ اَنْ نَّكُوْنَ نَحْنُ الْمُلْقِيْنَ ﴿١١٥﴾

116 "మీరే పడవెయ్యండి"[134] అని మూసా బదులిచ్చాడు. అప్పుడు ఆ మాంత్రికులు (తమ త్రాళ్ళను) పడవేసి ప్రజలకు కనికట్టు చేశారు. వారందరినీ భీతావహస్థితికి లోనుచేసి ఓ పెద్ద[135] మాయాజాలాన్ని ప్రదర్శించారు.

قَالَ اَلْقُوْا ۚ فَلَمَّآ اَلْقَوْا سَحَرُوْٓا اَعْيُنَ النَّاسِ وَاسْتَرْهَبُوْهُمْ وَجَآءُوْ بِسِحْرٍ عَظِيْمٍ ﴿١١٦﴾

117 అప్పుడు, "నీ చేతి కర్రను పడవెయ్యి" అని మేము మూసాను ఆదేశించాము. చేతిలోని కర్రను పడవెయ్యగానే అది వారి (కనికట్టు) క్రీడా విన్యాసాలను మింగేయసాగింది.[136]

وَاَوْحَيْنَآ اِلٰى مُوْسٰٓى اَنْ اَلْقِ عَصَاكَ ۚ فَاِذَا هِيَ تَلْقَفُ مَا يَاْفِكُوْنَ ﴿١١٧﴾

ప్రతిపాదించగా, "ఉత్సవ దినాన, పొద్దెక్కేవేళ అయితే బావుంటుంది. ఆ లెక్క ప్రకారం జనులంతా అక్కడ గుమిగూడతారు" అని మూసా (అలైహిస్సలాం) సమాధానమిచ్చారు (తాహా : 57 – 59).

132. మాంత్రికులు, ఇంద్రజాలికులు సాధారణంగా డబ్బు కోసం, ప్రాపంచిక పదవుల కోసం, పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడుతుంటారు. ఒండొకరిని మించిపోయేందుకు కొత్త కొత్త మెళకువలను నేర్చుకుంటూ ఉంటారు. 'కోటి విద్యలు కూటి కొరకే' అన్న సామెత ఈ మాంత్రికుల విషయంలో అతికినట్లే సరిపోతుంది. ఫిరౌను తరఫునుంచి వచ్చిన బంగారు అవకాశాన్ని వాళ్లు జారవిడుచుకుంటారా?! ఇలాంటి అవకాశాలు జీవితంలో ఎప్పుడోగాని రావు. అందుకే వాళ్లు, ఈ 'మ్యాజిక్ షో' లో గెలిస్తే తమకు లభించే పారితోషికాలేమిటీ? అని బేరసారాలు మొదలెట్టారు. "పారితోషికాలే కాదు, పురస్కారాలు కూడా లభిస్తాయి. రివార్డులతో పాటూ అవార్డులూ దక్కుతాయి. నా సామీప్యం పొందిన వారిలో మీకూ సీటు దొరుకుతుంది" అని ఫిరౌను చక్రవర్తి వారికి గాలం వేశాడు.

133. మాంత్రికులకు తమ 'విద్య'పై అపారమయిన నమ్మకం ఉండబట్టే వాళ్లు ద్విగుణీకృత ఉత్సాహంతో మూసా (అలైహిస్సలాం)కు సవాలు విసిరారు. తమ కనికట్టు క్రీడ ముందు మూసా ప్రదర్శించే మహిమలు వెలవెలబోతాయని వాళ్లు కాకిలెక్కలు వేశారు. ఒకవేళ మూసా తమకంటే ముందే తన మహిమలను చూపినా వచ్చే నష్టం ఏమీలేదని, దానికి విరుగుడు తమ వద్ద ఎలాగూ ఉందని వాళ్లు ధీమాతో ఉన్నారు.

134. మూసా (అలైహిస్సలాం) దైవప్రవక్త. దేవుని సహాయం ఆయనకు తోడుగా ఉంది. అందుకే ఆయన ఏమాత్రం జంకకుండా, భీతిచెందకుండా, "ఒకవేళ మీరే ముందుగా మీ విద్యను ప్రదర్శించదలిస్తే కానివ్వండి" అని అన్నారు. మొదటి ఛాన్సు మాంత్రికులకే ఇవ్వటంలోని మరొక మర్మం ఏమిటంటే, వాళ్ల విన్యాసం తరువాత దైవసహాయంతో హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ప్రదర్శించే మహిమ ప్రజలపై సకారాత్మక ప్రభావం చూపుతుంది. మానవమాత్రుల తంత్రాలకూ – దేవుని మహిమలకు మధ్య గల స్పష్టమైన వ్యత్యాసాన్ని ప్రజలు గ్రహించి, ఇస్లాం వైపుకు మొగ్గుతారు.

135. ఈ మాంత్రికులు 70వేల మంది వరకూ ఉంటారని కొన్ని ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఈ సంఖ్య అతిశయోక్తిగానే

**118** ఈ విధంగా సత్యం తేటతెల్లమయింది. వారు చేసినదంతా అసత్యంగా మిగిలిపోయింది.

فَوَقَعَ الْحَقُّ وَبَطَلَ مَا كَانُوْا يَعْمَلُوْنَ ﴿118﴾

**119** వారు (ఫిరౌను, అతని తొత్తులు) ఓడిపోయి, పరాభవంపాలై వెనుతిరిగారు.

فَغُلِبُوْا هُنَالِكَ وَانْقَلَبُوْا صٰغِرِيْنَ ﴿119﴾

**120** అయితే మాంత్రికులు మాత్రం సాష్టాంగపడిపోయారు.

وَاُلْقِيَ السَّحَرَةُ سٰجِدِيْنَ ﴿120﴾

**121** "సర్వలోకాలకూ ప్రభువు[137] అయిన వానిని విశ్వసించాము" అని పలికారు.

قَالُوْۤا اٰمَنَّا بِرَبِّ الْعٰلَمِيْنَ ﴿121﴾

**122** అంటే, మూసా, హారూనుల[138] ప్రభువును (విశ్వసించాము అన్నారు).

رَبِّ مُوْسٰى وَهٰرُوْنَ ﴿122﴾

**123** "ఏమిటీ, నా అనుమతి పొందకుండానే మీరితన్ని విశ్వసిస్తారా? ముమ్మాటికీ ఇదంతా ఈ నగరం నుంచి ప్రజలను వెళ్ళగొట్టేందుకు మీరందరూ కలిసి పన్నిన పన్నాగమే. అసలు సంగతి మీకు ఇప్పుడు తెలుస్తుంది.[139]

قَالَ فِرْعَوْنُ اٰمَنْتُمْ بِهٖ قَبْلَ اَنْ اٰذَنَ لَكُمْ ۚ اِنَّ هٰذَا لَمَكْرٌ مَّكَرْتُمُوْهُ فِى الْمَدِيْنَةِ لِتُخْرِجُوْا مِنْهَاۤ اَهْلَهَا ۚ فَسَوْفَ تَعْلَمُوْنَ ﴿123﴾

---

కనిపిస్తున్నది. వారిలో ఒక్కొక్కరు ఒక్కో త్రాడునూ, కర్రను విసిరారు. చూచేవారికి అవి అటూఇటూ పరుగెత్తేవిగా కానవచ్చాయి. ఆ విధంగా తాము ఓ పెద్ద ఇంద్రజాలాన్ని ప్రదర్శించామని అనుకున్నారు మాంత్రికులు.

136. కనికట్టు ఎంతయినా కనికట్టే. అదొక వింత, కల్పన, వశీకరణ మాత్రమే. అది వాస్తవాల ముందు ఏమాత్రం నిలబడలేదు. అందుకే దైవాజ్ఞతో మూసా (అలైహిస్సలాం) లాఠీని పడవేసేసరికి ఆ మాయాజాలం అంతమయి పోయింది. మూసా (అలైహిస్సలాం) క్రిందపడవేసిన ఆ కర్ర భయంకరమైన సర్పంగా మారి వాటన్నింటిని మింగేసింది.

137. సాష్టాంగపడటంతోనే ఊరుకోకుండా వారు తమ నిజప్రభువును విశ్వసిస్తున్నట్లు ప్రకటించటం విశేషం! వారు గనక పబ్లిగ్గా అలా ప్రకటించకుండా ఉంటే, బహుశా వారు తమ చక్రవర్తి అయిన ఫిరౌను గౌరవార్థం సాష్టాంగ పడ్డారేమోనని జనులు పొరబడటానికి ఆస్కారం కలిగేది. ఎందుకంటే అక్కడి ప్రజలు అప్పటి వరకూ ఫిరౌనునే ప్రభువుగా తలపోస్తూ వచ్చారు. అందుకే సత్యాన్ని కనుగొన్న ఆ మాంత్రికులు తాము విశ్వసిస్తున్నది కథాకథిత ప్రభువు అయిన ఫిరౌనును కాదనీ, మూసా హారూనులు విశ్వసించే సర్వోన్నత ప్రభువుకే తాము సజ్దా చేస్తున్నామని స్పష్టపరిచారు.

138. ఇంద్రజాలంలోని నిజానిజాలేమిటో మాంత్రికులకు క్షుణ్ణంగా తెలుసు. ఆ రోజు మూసా (అలైహిస్సలాం) వారిముందు ప్రదర్శించినది ఇంద్రజాలం కాదని వారికి అర్థమైపోయింది. ఈయన నిజంగా దేవుని తరఫున నియుక్తమైన ప్రత్యేక ప్రతినిధి అనీ, దైవసహాయంతోనే ఈయన ఈ అపురూపమైన మహిమను ప్రదర్శిస్తున్నాడని కూడా వాళ్లు తెలుసుకున్నారు. అందుకే వాళ్లు మూసా, హారూనులను, వారిద్దరినీ పంపిన విశ్వప్రభువును విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సంఘటన ద్వారా అవగతమయిందేమిటంటే సత్యం సత్యమే అవుతుంది. అసత్యం అసత్యమే అవుతుంది. సత్యం గెలిచేముందు అసత్యం చేసే ఆర్భాటం ఎంతో మనోరంజకంగా అనిపించవచ్చు. కాని అది ఎక్కువసేపు ఆగదు. సత్యాన్ని అణగద్రొక్కాలనీ, మరుగుపరచాలనీ ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సత్యం పైకి ఉబికివస్తుంది.

139. కథ అడ్డం తిరిగేసరికి ఫిరౌను ఖంగుతిన్నాడు. ఈ పరిణామాన్ని అతడు కలలో కూడా ఊహించి ఉండడు. అందుకే ఆశ్చర్యపోయాడు. ఆ తరువాత కాస్త తేరుకుని, తన సార్వభౌమత్వానికి ఎసరుపెట్టడానికి వారంతా కలిసి కుట్రపన్ను

**124** "నేను ఒక ప్రక్క నుంచి మీ చేతిని, మరో ప్రక్కనుంచి మీ కాలినీ నరుకుతాను. ఆ తరువాత మిమ్మల్నందరినీ ఉరి తీస్తాను"[140] అని అన్నాడు ఫిరౌన్.

لَأُقَطِّعَنَّ أَيْدِيَكُمْ وَأَرْجُلَكُم مِّنْ خِلَافٍ ثُمَّ لَأُصَلِّبَنَّكُمْ أَجْمَعِينَ ﴿124﴾

**125** దానికి వారిలా అన్నారు : "మేము (చనిపోయి) ఎలాగూ మా ప్రభువు వద్దకు చేరుకోవలసిన వారమే.[141]

قَالُوا إِنَّا إِلَىٰ رَبِّنَا مُنقَلِبُونَ ﴿125﴾

**126** "మా ప్రభువు సూచనలు మా వద్దకు వచ్చినప్పుడు, వాటిని విశ్వసించటం తప్ప మాలో నీకు కనిపించిన దోషం ఏమిటీ?[142] ఓ ప్రభూ! మాపై సహనాన్ని కురిపించు.[143] నీకు విధేయులు (ముస్లింలు)గా ఉన్న స్థితిలోనే మరణాన్ని వొసగు!"[144]

وَمَا تَنقِمُ مِنَّا إِلَّا أَنْ آمَنَّا بِآيَاتِ رَبِّنَا لَمَّا جَاءَتْنَا ۚ رَبَّنَا أَفْرِغْ عَلَيْنَا صَبْرًا وَتَوَفَّنَا مُسْلِمِينَ ﴿126﴾

**127** ఫిరౌను జాతి సర్దారులు (తమ చక్రవర్తినుద్దేశించి), "ఏమిటీ, నువ్వు మూసా (అలైహిస్సలాం)ను, అతని జాతి వారిని రాజ్యంలో కల్లోలం వ్యాపింపజేయటానికి,[145] నిన్నూ,[146] నీ

وَقَالَ الْمَلَأُ مِن قَوْمِ فِرْعَوْنَ أَتَذَرُ مُوسَىٰ وَقَوْمَهُ لِيُفْسِدُوا فِي الْأَرْضِ وَيَذَرَكَ وَآلِهَتَكَ ۚ

తున్నారని తూలనాడాడు. విశ్వసించిన మాంత్రికులందరినీ దేశద్రోహులుగా ఖరారు చేసి, వారికి తన తడాఖా చూపిస్తానని రంకెలు వేశాడు.

140. ఒక ప్రక్కనుంచి చేయి, మరో ప్రక్కనుంచి కాలు నరకటమంటే – కుడిచేయి మరియు ఎడమ కాలు తీయటమో లేక ఎడమ చేయి మరియు కుడి కాలు తీయటమోనని భావం. అంతేకాదు, పబ్లిగ్గా ఉరితీసి తనను ధిక్కరించేవారికి పట్టే గతేమిటో అందరికీ తెలిసివచ్చేలా చేస్తానని ప్రకటించాడు ఫిరౌన్.

141. వారి మాటల్లో రెండు అర్థాలు ఉండవచ్చు : 1. నువ్వు గనక మా పట్ల ఈ వ్యవహారం చేశావంటే, ప్రళయదినాన పరమ ప్రభువు నుంచి నువ్వు కూడా ఇటువంటి పరిస్థితిని ఎదుర్కోవలసి ఉంటుంది. ఆనాడు ఆయన నిన్ను కఠినాతికఠినంగా శిక్షిస్తాడు. ఎందుకంటే మరణించిన పిదప మనమంతా ఆ సర్వాధికారి వద్దకే పోవలసి ఉంటుంది. ఆయన ఆగ్రహం నుంచి తప్పించుకోగల వాడెవడు? ఈ విధంగా ఇహలోకంలో ఫిరౌన్ విధించదలచిన శిక్షకు ప్రతిగా అతన్ని పరలోక శిక్ష గురించి భయపెట్టడం జరిగింది. 2. మృత్యువు ఏదో ఒకనాడు మాకు రావలసిందే. మరి అలాంటప్పుడు ఆ మృత్యువు ఉరికంభం రూపంలో వచ్చినా, మరే రూపంలో వచ్చినా – దానికి భయపడవలసిన అవసరం ఏముంది!

142. "సర్వోన్నత ప్రభువును విశ్వసించటమే నీ దృష్టిలో నేరమయిందా? అది చిత్రహింసలుపెట్టి చంపేంత నేరమా? నిశితంగా చూస్తే అసలది నేరమే కాదు. అది మాలోని వినయశీలానికి, రుజువర్తనకు ప్రతిబింబం. యదార్థం ఏదో మాముందు స్పష్టం అయ్యాక మేము ప్రాపంచిక స్వప్రయోజనాలన్నింటినీ కాలదన్ని యదార్థాన్ని అవలంబించాము" అని వారన్నారు. ఆ తర్వాత వారు తమ ప్రభువు వైపుకు మరలి, దీనాతి దీనంగా వేడుకున్నారు.

143. నీవు ప్రసాదించే సహనంతోనే మేము ఈ దుర్మార్గుని ఆగడాలను, వేధింపులను సహించగల్గుతాము. ఎన్ని బాధలెదురైనా విశ్వాసం (ఈమాన్) పై స్థిరంగా నిలబడగలుగుతాము.

144. అంటే ధర్మమార్గంలో మాకెదురయ్యే కష్టాలు, బాధలు ఏ దశలోనూ మా విశ్వాసాన్ని సడలించకూడదు.

145. తరతరాలుగా జరుగుతున్నదే యిది. ప్రజా జీవితాల్లో విద్వేషాన్ని నూరిపోసే అసాంఘీక శక్తులు నిత్యం సజ్జనులనే కల్లోల జనకులుగా నిందిస్తూ వచ్చాయి. వారు అనుసరించే ఏకదైవారాధనను ఫండమెంటలిజంగా అభివర్ణించాయి. ఫిరౌను జాతివారు కూడా ఈ విషయంలో ఎవరికీ తీసిపోలేదు.

ఆరాధ్య దైవాలను పరిత్యజించటానికి వదలి పెడతావా?" అన్నారు. దానికి ఫిరౌను, "మేము ఇప్పుడే వాళ్ల మగపిల్లలను చంపేయటం మొదలు పెట్టాము. వారి ఆడవారిని మాత్రం బ్రతకనిస్తాము. వాళ్ళపై మాకు అన్ని విధాలా తిరుగులేని అధికారం ఉంది"[147] అని బదులిచ్చాడు.

قَالَ سَنُقَتِّلُ أَبْنَاءَهُمْ وَنَسْتَحْيِي نِسَاءَهُمْ وَإِنَّا فَوْقَهُمْ قَاهِرُونَ ﴿١٢٧﴾

**128** మూసా తన జాతి వారితో, "అల్లాహ్ సహాయాన్ని అర్థించండి, సహనం వహించండి. ఈ భూమి అల్లాహ్‌ది. తన దాసులలో తాను కోరిన వారిని ఆయన దీనికి వారసులుగా చేస్తాడు. అల్లాహ్‌కు భయపడే వారికే ఎట్టకేలకు అంతిమ విజయం లభిస్తుంది"[148] అన్నాడు.

قَالَ مُوسَىٰ لِقَوْمِهِ اسْتَعِينُوا بِاللَّهِ وَاصْبِرُوا ۖ إِنَّ الْأَرْضَ لِلَّهِ يُورِثُهَا مَن يَشَاءُ مِنْ عِبَادِهِ ۖ وَالْعَاقِبَةُ لِلْمُتَّقِينَ ﴿١٢٨﴾

**129** అతని జాతివారు, "మేము సదా పీడించబడ్డాము – నీవు రాకముందూ,[149] నీవు వచ్చిన తరువాత కూడా[150] (మేము పీడించబడుతున్నాము)" అన్నారు. "త్వరలోనే అల్లాహ్ మీ శత్రువును తుదముట్టించి, మిమ్మల్ని భూమికి ప్రతినిధులుగా చేస్తాడు. ఆ తరువాత మీ ప్రవర్తన ఎలా ఉంటుందో చూస్తాడు"[151] అని మూసా వారిని ఓదార్చాడు.

قَالُوا أُوذِينَا مِن قَبْلِ أَن تَأْتِيَنَا وَمِن بَعْدِ مَا جِئْتَنَا ۚ قَالَ عَسَىٰ رَبُّكُمْ أَن يُهْلِكَ عَدُوَّكُمْ وَيَسْتَخْلِفَكُمْ فِي الْأَرْضِ فَيَنظُرَ كَيْفَ تَعْمَلُونَ ﴿١٢٩﴾

---

146. ఫిరౌను సయితం తనను సర్వోన్నత ప్రభువుగా ఊహించుకునేవాడు. **'అన రబ్బుకుముల్ ఆలా'** (నేనే మీ సర్వోన్నత ప్రభువును) అని సగర్వంగా చెప్పుకున్నాడు కూడా. అయితే ఆనాడు అతనితోపాటు ప్రజలు కల్పించుకున్న ఇంకితర చిట్టిపొట్టి దైవాలు కూడా ఉండేవి.

147. ఫిరౌను పలుకుల్లోని ఆంతర్యం ఏమిటంటే; ఈ బదుగువర్గాల వాళ్లు మా పరిపాలనా యంత్రాంగంలో ఎలాంటి అడ్డంకులనూ సృష్టించలేరు. పుట్టిన మగపిల్లలను చంపే ఈ పథకం ఫిరౌనీయుల సూచన మేరకే అమలుపరచబడింది. అంతకు ముందు కూడా ఈ పథకం అమలు జరగటానికి కారకులు వీరే. అప్పటికి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఇంకా పుట్టలేదు. కాని అల్లాహ్ మహిమ చూడండి! ఏ రాజ్యాధికారి తన రాజ్యపరిధిలోని మగపిల్లలను చంపే ప్రణాళికను ప్రవేశపెట్టాడో స్వయంగా అతని అంతఃపురంలోనే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) పెరిగిపెద్ద వారయ్యే మహత్తర ఏర్పాటు చేశాడా ప్రభువు. దేవుని ఎత్తుగడల ముందు మానవ మాత్రుల ఎత్తుగడలు నిలుస్తాయా? అల్లాహ్ తన ఎత్తుగడల్లో సాటిలేని మేటి.

148. ఫిరౌన్ తరఫున మరోసారి దౌర్జన్యాలు, అమానుషాలు మొదలైనపుడు హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన జాతి వారినుద్దేశించి పలికిన ఓదార్పు పలుకులివి. పరిస్థితులు ఎప్పుడూ ఒకవిధంగా ఉండవనీ, కష్టకాలంలో సహాయం కొరకు సృష్టికర్తనే అర్థించాలనీ, ఓర్పు వహిస్తే తప్పకుండా విజయం వరిస్తుందని ధైర్యం చెప్పారు.

149. అంటే మూసా (అలైహిస్సలాం) జన్మించక ముందు కూడా ఫిరౌన్ చక్రవర్తులు ఇస్రాయీల్ సంతతి వారిపై చేసిన జులుంను వారు ఈ సందర్భంగా ప్రస్తావించారు.

150. ఇంద్రజాలికుల వైఫల్యం తరువాత ఫిరౌన్ చక్రవర్తులు మరోసారి తమపై కన్నెర్రజేసి, దౌర్జన్యకాండను మొదలెట్టారని వారు నిరాశతో చెప్పారు.

**130** మేము ఫిరౌను జనులను – గుణపాఠం గ్రహిస్తారన్న ఉద్దేశంతో – దుర్భిక్షానికీ, పండ్లు ఫలాల ఉత్పత్తుల కొరతకూ గురిచేసి[152] పరీక్షించాము.

وَلَقَدْ أَخَذْنَآ آلَ فِرْعَوْنَ بِالسِّنِينَ وَنَقْصٍ
مِّنَ الثَّمَرَٰتِ لَعَلَّهُمْ يَذَّكَّرُونَ (130)

**131** (వారి గుణం ఎటువంటిదంటే) మేలు కలిగినపుడు 'ఇది మాకు తగినదే' అని అనేవారు. కీడు కలిగినప్పుడు దానిని, "మూసా మరియు అతని సహవాసుల మూలంగా కలిగిన దరిద్రం"గా చెప్పుకునేవారు[153] వినండి! వారి దరిద్రం అల్లాహ్ వద్ద ఉంది.[154] కాని వారిలోని అధికులకు ఆ సంగతి తెలియదు.

فَإِذَا جَآءَتْهُمُ الْحَسَنَةُ قَالُوا۟ لَنَا هَٰذِهِۦ ۖ
وَإِن تُصِبْهُمْ سَيِّئَةٌ يَطَّيَّرُوا۟ بِمُوسَىٰ
وَمَن مَّعَهُۥٓ ۗ أَلَآ إِنَّمَا طَٰٓئِرُهُمْ عِندَ
اللَّهِ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ (131)

**132** "నీవు మాపై మంత్ర ప్రయోగం చేయడానికి ఎటువంటి (అద్భుత) సూచనను తెచ్చినా మేము నీ మాటను నమ్మము గాక నమ్మము"[155] అని వారు (మూసాకు) చెప్పేశారు.

وَقَالُوا۟ مَهْمَا تَأْتِنَا بِهِۦ مِنْ ءَايَةٍ لِّتَسْحَرَنَا بِهَا
فَمَا نَحْنُ لَكَ بِمُؤْمِنِينَ (132)

---

151. భీతి చెందకండి. శీఘ్రంగానే దేవుడు నిరంకుశ నాయకులను తుదముట్టించి, భూమండలంలో మీకు గౌరవోన్నతుల్ని, అధికారాన్ని ప్రసాదిస్తాడు. దుర్మార్గం ఎక్కువ కాలం సాగదు. దేవుడు మీకు అధికారాన్ని ప్రసాదించిన మీదట మీరు సయితం పరీక్షించబడతారు. ప్రస్తుతం ఆయన మిమ్మల్ని బాధలకు, అణచివేతకు గురిచేసి మీ స్వభావాన్ని పరీక్షిస్తున్నాడు. మున్ముందు ఆయన మీకు అధికారాన్ని, ఆస్తిపాస్తుల్ని ప్రసాదించి పరీక్షిస్తాడు. కలిమిలోనూ, లేమిలోనూ ఆయనపెట్టిన పరీక్షలో నికార్సుగా నెగ్గుకువచ్చేవారే ధన్యులు అని మూసా (అలైహిస్సలాం) తన వారికి బోధపరచారు.

152. అంటే అనావృష్టి ఏర్పడి వ్యవసాయం జరిగేది కాదు. వృక్షాలకు తెగులుపట్టి పండ్ల ఉత్పత్తి బాగా తెబ్బతినేది. ఫిరౌను జనుల్లోని పొగరును అణచి, వారిలో ఆధ్యాత్మిక చింతనను, దైవభీతిని సృజించే ఉద్దేశంతో దేవుడు వారిని ఈ విధంగా పరీక్షించాడు. **ఆలి ఫిరౌన్** అంటే ఫిరౌన్ జాతివారు; **'సినీన్'** అంటే కరువు కాటకాలు.

153. అంటే – ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే ఆ ఘనత తమదేనని గొప్పలు చెప్పుకునేవారు. గడ్డుకాలం వస్తేమటుకు మూసాను, ఆయన అనుయాయుల్ని దోషులుగా నిలబెట్టేవారు. మీ మూలంగానే మాకీ దరిద్రం పట్టుకుందని ఆడిపోసుకునేవారు. **"హసనహ్"** అంటే మంచిది, ధాన్యం, పండ్ల ఉత్పత్తుల్లో అధిక దిగుబడులు అని ఇక్కడ భావం. **'సయ్యిఅహ్'** అంటే దానికి విరుద్ధమైనది, చెడ్డది అని భావం.

154. ఆయతులో **'తాయిరున్'** అనే పదం ఉంది. 'తాయిరు' అంటే ఎగిరేదని అర్థం. అంటే పక్షి అన్నమాట! ఆనాడు పక్షులను ఎగురవేసి అవి కుడి దిశకు లేక ఎడమ దిశకు పోవటాన్నిబట్టి వారు 'శకునాలు' చూసేవారు. తాము అనుకున్న దిశలో గాకుండా పక్షులు మరొక వైపుకు ఎగిరిపోతే దాన్ని 'అపశకునం'గా భావించేవారు. అప్పట్నుంచి 'తాయిరున్' అనే పదానికి శకునం అన్న అర్థం స్థిరపడిపోయింది. ఇక్కడ ఇది ఈ అర్థంలోనే ఉపయోగించబడింది. శకునమైనా – అపశకునమైనా, సౌభాగ్యమైనా – దౌర్భాగ్యమైనా, కలిమి అయినా – లేమి అయినా అంతా అల్లాహ్ చేతుల్లోనే ఉన్నాయనీ, మూసానుగానీ, అతని అనుయాయులనుగానీ దోషులుగా నిలబెట్టడం అర్థం పర్థం లేని విషయమనీ అల్లాహ్ ఈ ఆయతులో చెప్పాడు. 'తాయిరుహుమ్ ఇందల్లాహి' (వారి అపశకునం, దరిద్రం అల్లాహ్ వద్ద ఉంది) అంటే వారి దరిద్రానికి, అపశకునానికి కారణాలేమిటో అల్లాహ్‌కు తెలుసు అని అర్థం. వారి దరిద్రానికి కారణం దైవతిరస్కారం, ధర్మం పట్ల వైముఖ్య ధోరణి తప్ప మరేదీ కాదు. వారు తిరస్కార వైఖరికి పాల్పడటంతో అల్లాహ్ తరఫు నుంచి వారికి దరిద్రం చుట్టుకున్నదని కూడా భావం కావచ్చు.

فَأَرْسَلْنَا عَلَيْهِمُ الطُّوفَانَ وَالْجَرَادَ وَالْقُمَّلَ
وَالضَّفَادِعَ وَالدَّمَ آيَاتٍ مُّفَصَّلَاتٍ
فَاسْتَكْبَرُوا وَكَانُوا قَوْمًا مُّجْرِمِينَ (133)

**133** ఆ తరువాత మేము వారిపై తుఫానును, మిడతల దండును పంపాము. ధాన్యపు పురుగులను, కప్పల రక్తాన్నీ వదిలాము. వాస్తవానికి ఇవన్నీ స్పష్టమయిన మహిమలు.[156] అయినప్పటికీ వారు అహంకారాన్ని చూపారు. అసలు విషయం ఏమిటంటే వారు అపరాధజనులు.

وَلَمَّا وَقَعَ عَلَيْهِمُ الرِّجْزُ قَالُوا يَا مُوسَى
ادْعُ لَنَا رَبَّكَ بِمَا عَهِدَ عِندَكَ ۖ لَئِن
كَشَفْتَ عَنَّا الرِّجْزَ لَنُؤْمِنَنَّ لَكَ وَلَنُرْسِلَنَّ
مَعَكَ بَنِي إِسْرَائِيلَ (134)

**134** వారిపై ఏదన్నా ఆపద వచ్చిపడినప్పుడు, "ఓ మూసా! నీకు నీ ప్రభువు చేసిన వాగ్దానం గురించి మా కోసం నీ ప్రభువును ప్రార్థించు. ఈ ఆపదను గనక నువ్వు మానుంచి దూరం చేస్తే మేము నిన్ను తప్పకుండా విశ్వసిస్తాము. ఇస్రాయీలు సంతతి వారిని కూడా (విడుదల చేసి) నీతో పంపిస్తాము" అని అనేవారు.

فَلَمَّا كَشَفْنَا عَنْهُمُ الرِّجْزَ إِلَىٰ أَجَلٍ هُم
بَالِغُوهُ إِذَا هُمْ يَنكُثُونَ (135)

**135** ఆ తరువాత మేము వారు చేరుకోవలసిన ఒక నిర్ణీత గడువు వరకూ ఆ ఆపదను వారి నుంచి తొలగించగానే ఆడిన మాటను తప్పేవారు.[157]

155. వారిలో కరడు గట్టిన అవిశ్వాసానికీ, మొండితనానికి ఇది మచ్చుతునక అన్నమాట! దేవుని తరఫున పంపబడిన మహిమలను, సూచనలను కూడా వాళ్లు 'ఇంద్రజాలం' గానే పరిగణించారు.

156. మూలంలో **'తూఫాన్'** అని వచ్చింది. తూఫాన్ అంటే ఇక్కడ భావం వరదలు లేక విపరీతమైన వర్షం కావచ్చు. వర్షం, వరదల మూలంగా వారు ముంపుకు గురయ్యేవారు. లేక విపరీతమైన ప్రాణ నష్టం అని కావచ్చు. దానివల్ల ప్రతి ఇంట్లో ఏడ్పులు, ఆర్తనాదాలు వినిపించేవి. అలాగే మిడతల దండువచ్చి రాత్రికి రాత్రే వారి పంటల్ని, పండ్లు ఫలాలను తినేసేది. ఆయతులో **'ఖుమ్మల్'** అనే పదం వచ్చింది. దీనికి రెండు అర్థాలున్నాయి. 1. పేలు 2. ధాన్యపు పురుగులు. పేలు వారి శరీరంలో, బట్టల్లో ఎక్కువైపోయి రోత పుట్టించేవి. ధాన్యపు పురుగులు ఆహారధాన్యాల్లో పడి లోలోపలి నుంచే వాటిని డొల్ల చేసేవి. దీంతో వారి ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై పోయేది. కప్పలు వారి వంటపాత్రల్లో, పడకగదుల్లో, ఆహారపదార్థాల్లో ఎక్కడంటే అక్కడే పడిఉండేవి. దాంతో వారు తినటం, త్రాగటం, నిద్రపోవటం గగనమైపోయేది. ఒక్కమాటలో చెప్పాలంటే దైవికంగా జరిగిన ఈ శాస్తి వల్ల వారి బ్రతుకు దుర్భరమై పోయింది. మంచినీరు త్రాగబోతే అది రక్తంలా కనిపించేది. ఆ కాలంలో ముక్కునుంచి రక్తం కారే వ్యాధి సర్వత్రా ప్రబలిపోయిందని మరికొంతమంది వ్యాఖ్యానించారు. వారిలో దైవభీతిని, పాపభీతిని, పరలోక చింతనను రగుల్గొల్పి సద్వర్తనులుగా తీర్చిదిద్దే నిమిత్తం దేవుడు నిరంతరం ఈ రకమయిన 'నోటీసులు' పంపేవాడు. **జరాదున్** అంటే మిడతలు; **జఫాదివు** అంటే కప్పలు. దీని ఏకవచన పదం **జఫ్‌దఅతున్; 'దమున్'** అంటే రక్తం; **'ఆయాతున్ ముఫస్సలాత్'** అంటే విడివిడిగా, ఒక దాని తర్వాత ఒకటి వచ్చిన మహిమలు, సూచనలు.

157. ఒక ఆపద చుట్టుకోగానే మూసా (అలైహిస్సలాం) దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చేవారు. వారి విన్నపం మేరకు మూసా తన ప్రభువును వేడుకునేవారు. ఆపద తొలగిపోగానే రుజువర్తనులయ్యే బదులు తమ తిరస్కార వైఖరిపై పాతుకుపోయేవారు. మళ్లీ ఆపదవస్తే మళ్లీ అదే వరుస! ఈ విధంగా ఉండుండి అయిదుసార్లు ప్రకృతి వైపరీత్యాలు వీళ్లపై వచ్చిపడ్డాయి. అయితే వారి మనోమస్తిష్కాలలో తిష్ఠవేసివున్న అహంభావం, పెడసరితనం సత్యపథంలో పెద్ద ప్రతిబంధకంగా నిలిచింది. ఇన్ని హెచ్చరికలను చూసిన తరువాత కూడా వాళ్లు విశ్వాస భాగ్యానికి నోచుకోలేక పోయారు.

**136** ఆ తర్వాత మేము వారికి ప్రతీకారం చేశాము. వారిని సముద్రంలో ముంచి వేశాము. ఎందుకంటే, వారు మా ఆయతులను అసత్యాలని ధిక్కరించేవారు, వాటి పట్ల బొత్తిగా నిర్లక్ష్యం వహించేవారు.[158]

فَانْتَقَمْنَا مِنْهُمْ فَأَغْرَقْنٰهُمْ فِي الْيَمِّ بِأَنَّهُمْ
كَذَّبُوا بِاٰيٰتِنَا وَكَانُوا عَنْهَا غٰفِلِيْنَ ﴿136﴾

**137** అత్యంత బలహీన వర్గంగా[159] పరిగణించబడే జనులను మేము ఆ భూభాగంలోని తూర్పుపడమరలకు వారసులుగా చేశాము. అందులో శుభాలు నింపాము.[160] ఈ విధంగా ఇస్రాయీలు సంతతివారు పాటించిన సహనం మూలంగా, నీ ప్రభువు వారి విషయంలో చేసిన మంచి వాగ్దానం నెరవేరింది.[161] ఇంకా ఫిరౌనూ, అతని జాతివారూ చేసిన నిర్మాణాలనూ, లేపిన భవనాలనూ మేము నేలమట్టం చేసేశాము.[162]

وَأَوْرَثْنَا الْقَوْمَ الَّذِيْنَ كَانُوْا يُسْتَضْعَفُوْنَ
مَشَارِقَ الْأَرْضِ وَمَغَارِبَهَا الَّتِيْ بٰرَكْنَا فِيْهَا ۭ
وَتَمَّتْ كَلِمَتُ رَبِّكَ الْحُسْنٰى عَلٰى بَنِيْٓ إِسْرَآءِيْلَ ۙ
بِمَا صَبَرُوْا ۭ وَدَمَّرْنَا مَا كَانَ يَصْنَعُ فِرْعَوْنُ
وَقَوْمُهٗ وَمَا كَانُوْا يَعْرِشُوْنَ ﴿137﴾

158. దెబ్బపై దెబ్బ పడిన తరువాత కూడా వారి మత్తు వదలకపోవటంతో వారిని దండించటం అనివార్యం అయిపోయింది. దైవ తిరస్కారానికి పాల్పడిన ఈ దుర్మార్గులు కడకు సముద్రంలో ముంచివేయబడ్డారు. దివ్య ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల ఈ వివరాలు వచ్చాయి.

159. బలహీన వర్గంగా పరిగణించబడే వారెవరంటే ఇస్రాయీల్ సంతతివారే. ఫిరౌన్ చక్రవర్తులు వారిని బానిసలుగా చేసుకున్నారు. రకరకాలుగా వారిని వేధించేవారు. ఈ కారణంగా వారు ఈజిప్టు దేశంలో దళితవర్గంగా భావించబడేవారు. అయితే ఈ బడుగువర్గాన్నే, దేవుడు భూమికి వారసులుగా చేశాడు. అంటే ఒకప్పుడు పరాజితులుగా ఉండే వారిని విజేతలుగా నిలబెట్టాడు. అవును మరి! "ఆయన తాను కోరినవారికి గౌరవం ప్రసాదిస్తాడు. తాను కోరినవారిని పరాభవం పాల్జేస్తాడు" (ఆలి ఇమ్రాన్ – 26).

160. **'భూభాగం'** అంటే ఆనాటి సిరియా పరిధిలోని పాలస్తీనా ప్రాంతం. అమాలిఖా తరువాత అల్లాహ్ బనీ ఇస్రాయీల్‌కు కూడా ఇక్కడ ఆధిక్యతను వొసగాడు. మూసా, హారూన్‌ల మరణానంతరం–హజ్రత్ యూషా బిన్ నూన్ అమాలిఖాను ఓడించి ఇస్రాయీలు సంతతి కోసం సిరియాలో మార్గం సుగమం చేశారు. ఈ భూభాగంలో అల్లాహ్ శుభాలను, సమృద్ధిని పొందుపరచాడు. ఈ సిరియా ప్రాంతం భౌతికంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో కీలకమైన క్షేత్రం. ఎంతోమంది ప్రవక్తలు ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. అక్కడే చనిపోయి సమాధి చేయబడ్డారు. ఇక భౌతికంగా చూస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమైనది. పంటలు పుష్కలంగా పండేవి. మూలంలో 'మషారిఖ్', 'మగారిబ్' అనే రెండు పదాలు వచ్చాయి. మషారిఖ్, 'మష్‌రిఖ్'కు బహువచనం. మష్‌రిఖ్ అంటే తూర్పు దిక్కు. మగారిబ్, 'మగ్‌రిబ్'కు బహువచనం. మగ్‌రిబ్ అంటే పడమటి దిక్కు. ఏ ప్రదేశానికయినా తూర్పు పడమరలు ఒక్కొక్కటే ఉంటాయి. మరి ఇక్కడ తూర్పులు, పడమరలు అని బహువచనం ఎందుకు ప్రయోగించబడింది? అంటే ఆ శుభవంతమైన నేలలోని తూర్పు భాగాలు మరియు పడమటి భాగాలని ఇక్కడ దాని భావం.

161. ఇంతకుముందు ఈ సూరాలోని 128, 129వ ఆయతులలో హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ప్రస్తావించిన వాగ్దానమే ఇది. ఖసస్ సూరాలో కూడా దీని ప్రస్తావన ఉంది : "భూమిలో అణచివేతకు గురైన వారిని అనుగ్రహించాలనీ, వారికి సారథ్యం వొసగాలనీ, వారిని రాజ్యానికి వారసులుగా చేయాలనీ, రాజ్యంలో వారికి ప్రాబల్యాన్ని ప్రసాదించాలనీ, ఫిరౌను హామాను మరియు వారి సైన్యాలకు వారు భయపడే దానిని చూపాలనీ మేము కోరుతున్నాము" (అల్ ఖసస్– 5, 6). ఫిరౌన్ రాజవంశస్థులు తమపై సాగించిన దురాగతాలను సహించి, విజ్ఞతను ప్రదర్శించినందుకు అల్లాహ్ వారిపై ప్రత్యేకంగా కనికరించాడు.

**138** మేము ఇస్రాయీలు సంతతివారిని సముద్రం దాటించాము. వారు సాగిపోతున్న దారిలో, తమ విగ్రహాలను అంటి పెట్టుకుని ఉన్న ఒక జాతి ప్రజలు వారికి కనిపించారు. "ఓ మూసా! వీళ్లకు ఈ ఆరాధ్య దైవాలు ఉన్నట్లు మాక్కూడా ఒక దేముణ్ణి చేసిపెట్టవా?!" అని వారు కోరారు. దానికి మూసా, "నిజంగానే మీరు మూర్ఖజనులు" అన్నాడు.[163]

وَجٰوَزْنَا بِبَنِيْٓ اِسْرَآءِيْلَ الْبَحْرَ فَاَتَوْا عَلٰى قَوْمٍ يَّعْكُفُوْنَ عَلٰٓى اَصْنَامٍ لَّهُمْ ۚ قَالُوْا يٰمُوْسَى اجْعَلْ لَّنَآ اِلٰهًا كَمَا لَهُمْ اٰلِهَةٌ ۗ قَالَ اِنَّكُمْ قَوْمٌ تَجْهَلُوْنَ ﴿١٣٨﴾

**139** "వీళ్ళు ఏ పనిలో నిమగ్నులై ఉన్నారో అది నాశనం చేయబడుతుంది. వీళ్ళు చేస్తున్న ఈ పని ఒక మిథ్య"[164] (అని అన్నాడు).

اِنَّ هٰٓؤُلَآءِ مُتَبَّرٌ مَّا هُمْ فِيْهِ وَبٰطِلٌ مَّا كَانُوْا يَعْمَلُوْنَ ﴿١٣٩﴾

**140** "ఏమిటీ, అల్లాహ్‌ను కాదని నేను మీకోసం మరో ఆరాధ్య దైవాన్ని అన్వేషించాలా? మరి చూడబోతే ఆయన మీకు సమస్త లోకవాసులపై ప్రాధాన్యతను ఇచ్చి ఉన్నాడు"[165] అని కూడా మూసా (అలైహిస్సలాం) అన్నాడు.

قَالَ اَغَيْرَ اللّٰهِ اَبْغِيْكُمْ اِلٰهًا وَّهُوَ فَضَّلَكُمْ عَلَى الْعٰلَمِيْنَ ﴿١٤٠﴾

**141** మేము మిమ్మల్ని ఫిరౌనీయుల నుండి విముక్తి కల్పించిన సందర్భాన్ని కాస్త జ్ఞాపకం చేసుకోండి – వాళ్ళు మిమ్మల్ని

وَاِذْ اَنْجَيْنٰكُمْ مِّنْ اٰلِ فِرْعَوْنَ يَسُوْمُوْنَكُمْ

162. **'మా కాన యస్‌నవు'** అని వచ్చింది. అంటే వారు తయారుచేస్తూ ఉండినవని అర్థం. వారి కర్మాగారాలు, భవనాలు, ఆయుధాలు మొదలగునవన్నీ అందులోకి వచ్చేస్తాయి. ఆ తర్వాత 'మా కానూ యారిషూన్' (వారు ఎత్తుకు లేపినవి) అని అనబడింది. అంటే వారు నిర్మించిన ఎత్తయిన మేడలు, పందిళ్ల సహాయంతో పండించే ద్రాక్ష తోటలు మొదలగునవన్నీ ఇందులోకి వస్తాయి. ఆయతుకు అర్థం ఏమిటంటే మేము వారితోపాటు వారి మేడలు మిద్దెలను, వారి వ్యవసాయక్షేత్రాలను, వారి పారిశ్రామిక వాడలను, వారి సంస్కృతీ నాగరికతలకు ప్రతీకలుగా నిలిచివున్న అపురూప నిర్మాణాలను నేలమట్టం చేశాము.

163. అజ్ఞానానికి పరాకాష్ఠ అంటే ఇదే కాబోలు! లేకపోతే ఏమిటీ? ఫిరౌన్ వంటి అతిపెద్ద శత్రువు చెరనుంచి దేవుడు తమకు విముక్తిని ప్రసాదించిన తరువాత కూడా, తమ కళ్లముందరే దేవుడు సైనికుల సమేతంగా ఫిరౌనును సముద్రంలో ముంచివేసి, అసాధారణమైన రీతిలో తమను సముద్రానికి ఆవలి ఒడ్డున చేర్చాక కూడా – ఒడ్డుకు చేరుకున్న తరువాత శక్తిమంతుడైన నిజదైవాన్ని మరచిపోయి మానవుడు తన చేత్తో తయారుచేసిన విగ్రహాల కోసం వెంపర్లాడటం అజ్ఞానం మాత్రమే కాదు, అల్లాహ్ పట్ల కృతఘ్నత కూడా అవుతుంది. ఆ విగ్రహాలు రాతితో చేయబడి ఉండేవనీ, అవీ ఆవును పోలి ఉండేవనీ అనబడుతోంది.

164. అంటే ఆ విగ్రహారాధకుల్ని చూసి మీరు మోసపోకండి. వారిని చూసి, మేమూ అదే పని చేస్తామని అనటం వివేకం అనిపించుకోదు. వారి దుష్కర్మకు వారెలాగూ దుష్ఫలితం అనుభవిస్తారు. వారితోపాటు మీరు కూడా పాడైపోతారా?! అని మూసా (అలైహిస్సలాం) తన అనుయాయులను మందలించారు.

165. మీకు ఇన్ని మహోపకారాలు చేసి, కష్టాల కడలి నుంచి గట్టెక్కించి, బానిస బ్రతుకు నుంచి గౌరవప్రదమైన జీవితం వైపుకు ప్రస్థానం చేయించిన ఏకైక దైవాన్ని కాదని నేను మీకోసం రాతి విగ్రహాలను, కొయ్య బొమ్మలను చేసిపెట్టాలా? ఉపకారం చేసిన ప్రభువుపట్ల నేనెలా కృతఘ్నతకు పాల్పడగలను? వచ్చే ఆయతులలో దేవుని మరిన్ని ఉపకారాలు ప్రస్తావించబడ్డాయి.

سُوْٓءَ الْعَذَابِ ۚ يُقَتِّلُوْنَ اَبْنَآءَكُمْ وَيَسْتَحْيُوْنَ
نِسَآءَكُمْ ؕ وَفِيْ ذٰلِكُمْ بَلَآءٌ مِّنْ رَّبِّكُمْ عَظِيْمٌ ﴿141﴾

విపరీతమైన యాతనలకు గురిచేసేవారు. మీ కుమారులను చంపేసి, మీ స్త్రీలను మాత్రం బ్రతకనిచ్చేవారు. అందులో మీకు మీ ప్రభువు తరఫున పెద్ద పరీక్ష ఉండింది.[166]

وَوٰعَدْنَا مُوْسٰى ثَلٰثِيْنَ لَيْلَةً وَّاَتْمَمْنٰهَا بِعَشْرٍ
فَتَمَّ مِيْقَاتُ رَبِّهٖٓ اَرْبَعِيْنَ لَيْلَةً ۚ وَقَالَ مُوْسٰى
لِاَخِيْهِ هٰرُوْنَ اخْلُفْنِيْ فِيْ قَوْمِيْ وَاَصْلِحْ
وَلَا تَتَّبِعْ سَبِيْلَ الْمُفْسِدِيْنَ ﴿142﴾

**142** మేము మూసా (అలైహిస్సలాం)కు ముప్ఫై రాత్రుల వాగ్దానం చేశాము. అదనంగా మరో పది రాత్రులతో వాటిని సంపూర్ణం చేశాము. ఆ విధంగా ప్రభువు నిర్ధారించిన పూర్తి గడువు నలభై రాత్రులు అయింది.[167] అప్పుడు మూసా (అలైహిస్సలాం) తన సోదరుడైన హారూనునుద్దేశించి, "నేను వెళ్ళాక నా జాతి ప్రజలలో నీవు నాకు ప్రాతినిధ్యం వహించు. వీళ్ళను తీర్చిదిద్దుతూ ఉండు. విచ్ఛిన్నకారుల అభిప్రాయాలను అనుసరించకు" అని చెప్పారు.[168]

وَلَمَّا جَآءَ مُوْسٰى لِمِيْقَاتِنَا وَكَلَّمَهٗ رَبُّهٗ ۙ قَالَ
رَبِّ اَرِنِيْٓ اَنْظُرْ اِلَيْكَ ؕ قَالَ لَنْ تَرٰىنِيْ وَلٰكِنِ
انْظُرْ اِلَى الْجَبَلِ فَاِنِ اسْتَقَرَّ مَكَانَهٗ فَسَوْفَ

**143** మేము నిర్ధారించిన సమయానికి మూసా (అలైహిస్సలాం) వచ్చి, అతని ప్రభువు అతనితో సంభాషించిన తర్వాత అతను, "నా ప్రభూ! నాకు నీ దర్శనం కలిగించు. నేను ఓసారి నిన్ను చూస్తాను" అని విన్నవించుకోగా, "ఎట్టి పరిస్థితిలోనూ నువ్వు నన్ను చూడలేవు.[169] అయితే అదిగో! ఆ కొండ వైపు దృష్టిని

166. ఈ కఠిన పరీక్షల గురించి ఇంతకుముందు 'బఖరా సూరా'లోనూ చర్చించటం జరిగింది. 'ఇబ్రాహీమ్ సూరా'లో కూడా ఈ ప్రస్తావన రానున్నది.

167. ఫిరౌన్‌ను, అతని సైన్యాన్ని సముద్రంలో ముంచివేసి, బనీ ఇస్రాయీల్‌ను ఆపదనుంచి గట్టెక్కించిన తరువాత, వారి మార్గదర్శకత్వం నిమిత్తం వారికి గ్రంథాన్ని ప్రసాదించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అందుకే అల్లాహ్ తన ప్రవక్త మూసా (అలైహిస్సలాం)ను 30 రాత్రుల కోసం తూరు పర్వతం (సినాయ్ కొండ) పైకి పిలుచుకున్నాడు. మరో 10 రాత్రులను పెంచి మొత్తం 40 రాత్రుల గడువును నిర్ధారించాడు. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన ప్రభువు వద్దకు పోతూ పోతూ, తన సోదరుడు మరియు దైవప్రవక్త కూడా అయిన హారూన్ (అలైహిస్సలాం)ను తన ప్రత్యామ్నాయ ప్రతినిధిగా నియమించి మరీ పోయారు. అనుక్షణం తన జాతి ప్రజలను కనిపెట్టుకుని ఉండాలనీ, ఎప్పటికప్పుడు వారిలోని చెడుగులను దూరం చేస్తూ ఉండాలనీ, విచ్ఛిన్నకర శక్తుల బారిన పడకుండా వాళ్ళను కాపాడాలనీ గట్టిగా తాకీదు చేసి వెళ్ళారు. తన జాతి జనుల మేలును మూసా (అలైహిస్సలాం) ఎంతగా కోరుకునేవారో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

168. హజ్రత్ హారూన్ (అలైహిస్సలాం) సయితం ఒక ప్రవక్త. జాతిని సంస్కరించవలసిన బాధ్యత ఆయనకు తెలియదని కాదు, తెలుసు. కాకపోతే ఒక సహోదరునిగా కర్తవ్య పాలనను జ్ఞాపకం చేసే ఉద్దేశంతో మూసా (అలైహి) ఈ విధంగా బోధపరచారు. ఇక్కడ 'మీఖాత్' అంటే నిర్ణీత సమయం అని అర్థం.

169. మూసా (అలైహిస్సలాం) తూరు పర్వతంపైకి వెళ్ళినప్పుడు ఆయన ప్రభువు ఆయనతో సంభాషణ జరిపాడు. సంభాషణ జరుపుతున్నప్పుడు అల్లాహ్‌ను చూడాలన్న కుతూహలం మూసా (అలైహిస్సలాం)లో సహజంగానే కలిగింది. తనలోని కుతూహలాన్ని ఆయన బయటపెట్టారు. దానికి సమాధానంగా అల్లాహ్, "నువ్వు నన్ను సుతరామూ చూడలేవు

సారించు. అది గనక యధాస్థితిలో ఉండగలిగితే నువ్వు కూడా నన్ను చూడగలుగుతావు" అని ఆయన సెలవిచ్చాడు. ఆ తరువాత అతని ప్రభువు తేజస్సు ఆ కొండపై ప్రసరించగానే ఆ తేజస్సు దాన్ని తుత్తునియలు చేసేసింది. మూసా స్పృహతప్పి పడి పోయాడు.[170] స్పృహలోకి రాగానే, "(ప్రభూ!) నీవు పరమ పవిత్రుడవు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాప పడుతున్నాను. అందరి కన్నా ముందు నేనే నిన్ను విశ్వసిస్తున్నాను"[171] అని మనవి చేసుకున్నాడు.

تَرٰىنِیْ ۚ فَلَمَّا تَجَلّٰی رَبُّهٗ لِلْجَبَلِ جَعَلَهٗ دَكًّا وَّخَرَّ مُوْسٰی صَعِقًا ۚ فَلَمَّاۤ اَفَاقَ قَالَ سُبْحٰنَكَ تُبْتُ اِلَیْكَ وَاَنَا اَوَّلُ الْمُؤْمِنِیْنَ ﴿143﴾

**144** "ఓ మూసా! నిన్ను ప్రవక్తగా ఎన్నుకుని, నీతో సంభాషించి జనులపై నీకు ప్రాధాన్యతనిచ్చాను. కాబట్టి నేను ఇచ్చిన దానిని పుచ్చుకో. కృతజ్ఞుడవై ఉండు"[172] అని అల్లాహ్ సెలవిచ్చాడు.

قَالَ یٰمُوْسٰۤی اِنِّی اصْطَفَیْتُكَ عَلَی النَّاسِ بِرِسٰلٰتِیْ وَبِكَلَامِیْ ۖ فَخُذْ مَاۤ اٰتَیْتُكَ وَكُنْ مِّنَ الشّٰكِرِیْنَ ﴿144﴾

(లన్‌తరానీ)" అని అన్నాడు. ఈ ఆయతులో "లన్" అనే పదం వచ్చింది, ఇది ఎన్నటికీ అసంభవం అన్న అర్థాన్ని సూచిస్తోంది కాబట్టి ఇహలోకంలోగానీ, పరలోకంలోగానీ అల్లాహ్ దర్శనం అసంభవం అని మూతజిలా అనే వర్గం వారు వ్యాఖ్యానించారు. కాని ఈ వ్యాఖ్య సహీహ్ హదీసులకు విరుద్ధమైనది. ప్రళయదినాన విశ్వాసులు అల్లాహ్‌ను చూస్తారనీ, స్వర్గ ప్రవేశం తరువాత కూడా దర్శనభాగ్యం ప్రాప్తిస్తుందని వివిధ ప్రామాణిక, దృఢమైన మరియు ముతవాతిర్ హదీసుల ద్వారా మనకు తెలుస్తోంది. మహాప్రవక్త (సఅసం) వారి ప్రవచనాలపై, ఆయన (స) విధానంపై నమ్మకం గల వారంతా ఈ విషయాన్ని నమ్ముతారు. కాకపోతే ఇహలోకంలో మాత్రం దైవదర్శన భాగ్యం ఎవరికీ లభించదు. ఇహలోకంలో దైవాన్ని కంటితో చూచే శక్తి ఎవరికీ లేదు కూడా. ఆఖరికి ప్రవక్తలకు కూడా లేదు. ఈ ఆయతులో ఆ విషయమే చెప్పబడింది. అయితే పరలోకంలో అల్లాహ్ కంటిచూపులో మరింత శక్తిని ఇస్తాడు. తత్ఫలితంగా కళ్లు దైవదర్శన జ్యోతికి తట్టుకోగలుగుతాయి.

170. పర్వతం సయితం ఆ తేజస్సుకు తట్టుకోలేకపోయింది. ఆ జ్యోతిర్మయ స్థితికి తాళలేక దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) కూడా కళ్లు తిరిగి పడిపోయారు.

మహనీయ ముహమ్మదు (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ప్రళయదినాన అందరూ స్పృహ కోల్పోతారు (ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయం ప్రకారం, హష్ర్ మైదానంలో జనుల వ్యవహారాల తీర్పు చేసేందుకు అల్లాహ్ తేజరిల్లినప్పుడు మానవులంతా స్పృహ కోల్పోతారు). తరువాత అందరూ స్పృహలోకి వస్తారు. అయితే అందరికన్నా ముందు నాకు స్పృహ వస్తుంది. అప్పటికే మూసా (అలైహిస్సలాం) 'అర్ష్' (దైవసింహాసనం) కాలిని పట్టుకుని నిలబడి ఉంటారు. ఆయన నాకన్నా ముందే స్పృహలోకి వస్తారో లేక తూరు పర్వతంపై ఒకసారి స్పృహ కోల్పోయినందుకు ప్రతిగా అల్లాహ్ ఆయనకు ఈసారి స్పృహ కోల్పోవటం నుంచి మినహాయింపు ఇస్తాడో తెలియదు మరి!" (సహీహ్ బుఖారీ : తఫ్సీర్ సూరతుల్ ఆరాఫ్; సహీహ్ ముస్లిం : బాబు ఫజాయెలి మూసా అలైహిస్సలాం).

171. అంటే ఓ అల్లాహ్! నీ ఔన్నత్యాన్నీ, నీ శక్తిని అంగీకరిస్తున్నాను. నేను అశక్తుణ్ణనీ, ఇహ లోకంలో నిన్ను చూడగలిగే శక్తి నాలో లేదని కూడా నేను ఒప్పుకుంటున్నాను అన్నది హజ్రత్ మూసా (అలైహిస్సలాం) మాటల్లోని ఆంతర్యం.

172. అల్లాహ్ తన ప్రవక్త మూసా (అలైహిస్సలాం)తో మలిసారి మాట్లాడిన సందర్భం ఇది. ఇంతకుముందు నిప్పు తీసుకోవటానికి వెళ్ళినప్పుడు తొలిసారి ఆయన మూసాతో మాట్లాడి, ప్రవక్తా పదవిని వొసగాడు.

**145** మరి మేము మూసాకు పలకలపై అన్ని రకాల ఉపదేశాలనూ, అన్ని విషయాలకు సంబంధించిన వివరాలను వ్రాసి ఇచ్చాము.[173] అతనికి ఇలా ఉపదేశించాము: "ఇక నువ్వు వీటిని చాలా గట్టిగా పట్టుకో. వీటిలోని ఉత్తమ ఆదేశాలను పాలించమని నీ జాతి వారికి ఆజ్ఞాపించు.[174] అతి త్వరలోనే దుర్మార్గుల స్థానాన్ని మీకు చూపిస్తాను.[175]

وَكَتَبْنَا لَهُ فِي الْأَلْوَاحِ مِن كُلِّ شَيْءٍ مَّوْعِظَةً
وَتَفْصِيلًا لِّكُلِّ شَيْءٍ فَخُذْهَا بِقُوَّةٍ وَأْمُرْ قَوْمَكَ
يَأْخُذُوا بِأَحْسَنِهَا ۚ سَأُرِيكُمْ دَارَ الْفَاسِقِينَ ﴿١٤٥﴾

**146** ఏ హక్కూ లేకుండా భూమిపై గర్వాన్ని ప్రదర్శించేవారిని నా ఆదేశాల నుంచి మరలిస్తాను. ఒకవేళ సూచనలన్నింటినీ తిలకించినా కూడా వారు వాటిని విశ్వసించరు.[176] సరైన మార్గం వారికి కానవస్తే వారు దానిని తమ మార్గంగా చేసుకోరు. పెడదారి కనిపిస్తే మాత్రం దాన్ని తమ మార్గంగా చేసుకుంటారు.[177] మా ఆయతులను ధిక్కరించి, వాటిపట్ల నిర్లక్ష్య వైఖరిని కనబరచటం వల్ల వారికీ దురవస్థ పట్టింది.[178]

سَأَصْرِفُ عَنْ آيَاتِيَ الَّذِينَ يَتَكَبَّرُونَ فِي الْأَرْضِ
بِغَيْرِ الْحَقِّ وَإِن يَرَوْا كُلَّ آيَةٍ لَّا يُؤْمِنُوا بِهَا
وَإِن يَرَوْا سَبِيلَ الرُّشْدِ لَا يَتَّخِذُوهُ سَبِيلًا وَإِن
يَرَوْا سَبِيلَ الْغَيِّ يَتَّخِذُوهُ سَبِيلًا ۚ ذَٰلِكَ بِأَنَّهُمْ
كَذَّبُوا بِآيَاتِنَا وَكَانُوا عَنْهَا غَافِلِينَ ﴿١٤٦﴾

173. అంటే, తౌరాతు గ్రంథం పలకల రూపంలో ఇవ్వబడింది. అందులో ధర్మాదేశాలు, చేయవలసిన పనులు, నిషిద్ధాంశాలు, ప్రబోధనలు, హెచ్చరికలు అన్నీ క్షుణ్ణంగా తెలియపరచబడ్డాయి.

174. అంటే; పొద్దస్తమానం రాయితీలను, వెసులుబాటును వెతుక్కుంటూ ఉండకుండా ఇవ్వబడిన ధర్మాదేశాలను పాటించాలి అని భావం.

175. ఆయతులో **'దార్'** అనే పదం వాడబడింది. దార్ అంటే నిలయం, నివాసం, గృహం అన్న అర్థాలు వస్తాయి. కాని ఇక్కడ నివాసం అనే పదం పర్యవసానం, గతి అన్న భావంలో ప్రయోగించబడింది. అంటే అవిధేయుల ముగింపు దారుణంగానే ఉంటుంది. లేక అవిధేయుల దేశంపై మీకు అధికారం కల్పిస్తామని దీనర్థం కావచ్చు. అవిధేయుల దేశమంటే సిరియా ప్రాంతమన్నమాట. ఆనాడు ఆ ప్రాంతంలో అమాలిఖా జాతి రాజ్యం ఉండేది. అమాలిఖా జాతివారు అల్లాహ్ పట్ల పరమ అవిధేయులు (ఇబ్నె కసీర్).

176. ఇక్కడ **'గర్వం'** అంటే భావం దైవాదేశాలకన్నా, దైవవచనాల కన్నా తమ వాదనే సరైందన్న భావాన్ని వ్యక్తపరచటం, ఇతరులను చిన్నచూపు చూడటం అన్నమాట! ఈ అహంభావం మానవునికి ఎంతమాత్రం శోభించదు. ఎందుకంటే అల్లాహ్ సృష్టికర్త. తాను ఎంతపెద్ద వాడనుకున్నప్పటికీ మనిషి మనిషే. అతను సృష్టికర్త చేత సృష్టించబడిన ఒక ప్రాణి మాత్రమే. సృష్టిలో ఒక భాగం అయివుండి సృష్టికర్తనే ఎదిరించటం, ఆయన ఆదేశాలపట్ల పెడసరి పోకడను అవలంబించటం, ఆయన నిదర్శనాల పట్ల ఉపేక్షను కనబరచటం అన్యాయం! అక్రమం!! అధర్మం!!! అందుకే అహంకారాన్ని, అల్లాహ్ అమితంగా అసహ్యించుకుంటాడు. ఈ ఆయతులో అహంకారుల దుష్పరిణామం ఎలా ఉంటుందో అవగతం చేయబడింది. ఇటువంటి పొగరుబోతులను అల్లాహ్ తన ఆయతులకు ఆమడ దూరంగానే ఉంచుతాడు. మరి ఈ దూరం క్రమేణా పెరుగుతూపోతుంది. ఆఖరికి వారు సత్యం వైపుకు తిరిగిరాలేనంత దూరానికి వెళ్ళిపోతారు. మరోచోట సెలవీయబడినట్లు : "ఎవరి విషయంలో నీ ప్రభువు మాట నిజమని రూఢీ అయిందో వారి వద్దకు అన్ని రకాల నిదర్శనాలు వచ్చేసినప్పటికీ – వ్యధాభరితమయిన శిక్షను కళ్ళారా చూడనంతవరకూ – వారు విశ్వసించరు గాక విశ్వసించరు" (యూనుస్ – 96, 97).

177. దైవాదేశాల పట్ల వైముఖ్య ధోరణి కనబరచేవారిలో ఉండే మరో దురలవాటు, మరో విచిత్ర మనస్తత్వం ఇక్కడ ఎత్తిచూపబడింది. అదేమంటే; సన్మార్గం వైపుకు దర్శకత్వం వహించే విషయం ఏదయినా వారి దృష్టికి వచ్చినప్పుడు

وَالَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا وَلِقَاءِ الْآخِرَةِ حَبِطَتْ أَعْمَالُهُمْ ۚ هَلْ يُجْزَوْنَ إِلَّا مَا كَانُوا يَعْمَلُونَ ﴿١٤٧﴾

**147** ఇంకా మా ఆయతులను, అంతిమ దినాన కలుసుకునే విషయాన్ని అసత్యాలని తిరస్కరించిన వారి కర్మలన్నీ వృథా అయిపోయాయి. వారికి వారు చేస్తూ ఉండినదాని (శిక్షే) ఇవ్వబడుతుంది."[179]

وَاتَّخَذَ قَوْمُ مُوسَىٰ مِن بَعْدِهِ مِنْ حُلِيِّهِمْ عِجْلًا جَسَدًا لَّهُ خُوَارٌ ۚ أَلَمْ يَرَوْا أَنَّهُ لَا يُكَلِّمُهُمْ وَلَا يَهْدِيهِمْ سَبِيلًا ۘ اتَّخَذُوهُ وَكَانُوا ظَالِمِينَ ﴿١٤٨﴾

**148** మూసా జాతివారు అతను వెళ్ళిన తర్వాత తమ నగలతో ఆవుదూడ విగ్రహాన్ని తయారుచేసి, దానిని తమ ఆరాధ్య దైవంగా కొలవసాగారు. అందులో నుంచి ఒకలాంటి శబ్దం వచ్చేది. అది తమతో మాట్లాడలేదనీ, తమకు ఏ దారీ చూపదనీ వారు ఆలోచించలేదా? అయినప్పటికీ వారు దాన్ని ఆరాధ్య దైవంగా ఖరారు చేసుకున్నారు. చాలా పెద్ద అన్యాయానికి పాల్పడ్డారు.[180]

---

నుదురు చిట్లిస్తారు, కసురుకుంటారు. కాని మార్గ విహీనత వైపుకు దారితీసే విషయం ముందుకు వస్తేమటుకు మహదానందంతో దాన్ని అవలంబిస్తారు. దివ్య ఖుర్‌ఆన్ వివరించిన ఈ వాస్తవం అన్ని కాలాల్లోనూ, అన్ని మానవ సముదాయాల్లోనూ మనకు కానవస్తుంది. ఆఖరికి శ్రేష్ఠ సమాజంగా పిలువబడిన ముస్లిం సమాజంలో సయితం నేడు ఈ పరిస్థితి నెలకొని ఉందని నిర్ద్వంద్వంగా చెప్పడానికి విచారిస్తున్నాము. సదాచరణ కోసం పిలుపు ఇచ్చినపుడు జనులు ముఖం చాటేస్తున్నారు. అదే దుష్కార్యాలు తారసపడినపుడు వాటి వైపుకు ఎగబడుతున్నారు.

178. ప్రజలు మంచికి బదులు చెడు వైపుకు, సత్యం బదులు అసత్యం వైపుకు ఎగబడటానికి గల కారణం ఏమిటో ఇక్కడ చెప్పబడింది. దైవాజ్ఞలను అసత్యమని ధిక్కరించే వారిలో క్రమక్రమంగా దైవభీతి, పాపభీతి క్షీణించిపోతుంది. బాధ్యతా భావన, పూచీభావన బొత్తిగా లేకుండా పోతుంది. తత్కారణంగా దయ, జాలి, కరుణ, ప్రేమ వంటి సద్గుణాలు వారి ఆంతర్యాల నుంచి పలాయనం చిత్తగిస్తాయి. వారి హృదయాలు విస్మరణకు, పరధ్యానానికి లోనవుతాయి. వారి మనో క్షేత్రాలలో భక్తీ ఉండదు, భీతీ ఉండదు. విశృంఖలత్వానికి వారు అలవడ్తారు. నేడు ఈ పరిస్థితి సర్వత్రా సర్వ సామాన్యం అయిపోయింది.

179. దేవుని వాక్యాలను ధిక్కరించి, పరలోకాన్ని త్రోసిపుచ్చేవారికి పట్టే గతేమిటో ఇక్కడ స్పష్టంగా చెప్పటం జరిగింది. ఎందుకంటే వారి కర్మలు సత్యంపైనగానీ, న్యాయం ధర్మంపైనగానీ నిలబడి లేవు. అన్యాయం అధర్మం వారి ఆచరణలకు పునాదులుగా ఉన్నాయి. అందుచేత వారి కర్మల చిట్టాలో కుల్లు, కీడు తప్ప మరొకటి ఉండదు. వారి కర్మలకు అల్లాహ్ దృష్టిలో పూచిక పుల్లంత విలువ కూడా ఉండదు. కాకపోతే వారి దురాగతాలకు తగ్గ దుష్ఫలితం తప్పకుండా వారికి లభిస్తుంది.

180. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) నలభై రాత్రుల కోసం తూరు పర్వతంపైకి వెళ్ళినప్పుడు సామిరీ అనే వ్యక్తి ప్రజల నగలను సేకరించి వాటితో ఆవుదూడను తయారు చేశాడు. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) గుఱ్ఱపు డెక్కలుపడిన చోటునుంచి సేకరించిన మట్టిని కూడా ఆ దూడ నిర్మాణంలో ఉపయోగించాడు. అల్లాహ్ ఆ మట్టిలో జీవన ప్రభావాన్ని ఉంచాడు. అందువల్ల ఆ దూడలో నుంచి ఒక విధమైన అరుపు వినవచ్చేది. అది ఎద్దు అరుపును పోలిఉండేది (అయితే దివ్య ఖుర్‌ఆన్‌లోని వాక్యాల ద్వారా తెలిసేదేమంటే అది స్పష్టంగా మాట్లాడే శక్తి మాత్రం కలిగిలేదు). అది నిజంగా రక్తమాంసాలు గల ఆవుదూడగా తయారయిందా? లేక బంగారు బొమ్మగానే ఉండి అందులోకి ఏదో ఒక విధంగా గాలి – జొరబడినప్పుడల్లా ఎద్దు అరుపును పోలిన శబ్దం వచ్చేదా అన్న విషయమై భేదాభిప్రాయాలున్నాయి (ఇబ్నె కసీర్). ఈ శబ్దాన్ని సొమ్ము చేసుకుంటూ సామిరీ బనీ ఇస్రాయీల్‌ను పెడత్రోవ

وَلَمَّا سُقِطَ فِيٓ أَيۡدِيهِمۡ وَرَأَوۡاْ أَنَّهُمۡ قَدۡ ضَلُّواْ
قَالُواْ لَئِن لَّمۡ يَرۡحَمۡنَا رَبُّنَا وَيَغۡفِرۡ لَنَا لَنَكُونَنَّ
مِنَ ٱلۡخَٰسِرِينَ ﴿149﴾

**149** తమకు పశ్చాత్తాపం కలిగి, తాము నిజంగానే మార్గభ్రష్టతకు లోనయ్యామన్న సంగతి అర్థమయ్యాక వారు, సిగ్గుపడ్డారు.[181] "మా ప్రభువే గనక మాపై దయజూపక పోతే, మా తప్పును మన్నించకపోతే మేము ఘోరంగా నష్టపోతాము" అని అన్నారు.

وَلَمَّا رَجَعَ مُوسَىٰٓ إِلَىٰ قَوۡمِهِۦ غَضۡبَٰنَ أَسِفٗا
قَالَ بِئۡسَمَا خَلَفۡتُمُونِي مِنۢ بَعۡدِيٓۖ أَعَجِلۡتُمۡ
أَمۡرَ رَبِّكُمۡۖ وَأَلۡقَى ٱلۡأَلۡوَاحَ وَأَخَذَ بِرَأۡسِ أَخِيهِ
يَجُرُّهُۥٓ إِلَيۡهِۚ قَالَ ٱبۡنَ أُمَّ إِنَّ ٱلۡقَوۡمَ ٱسۡتَضۡعَفُونِي

**150** మూసా (అలైహిస్సలాం) తన జాతి వారి వద్దకు కోపంతో, విచారంతో తిరిగివచ్చి, "నేను వెళ్ళగానే ఇంత చెడ్డ నిర్వాకానికి పాల్పడతారా? మీ ప్రభువు ఆజ్ఞలు అందకముందే మీరు తొందర పడ్డారా?" అని చెప్పి, (చేతిలోని) పలకలను విసురుగా ఓ ప్రక్కన పెట్టేసి,[182] తన సోదరుని జుత్తు పట్టుకుని తన వైపుకు ఈడ్వ సాగాడు. అప్పుడు హారూను (అలైహిస్సలాం), "ఓ నా తల్లి పుత్రుడా![183] వీళ్ళు నన్ను ఏ మాత్రం లెక్క చేయలేదు. నన్ను

పట్టించాడు. "ఇదే మీ సిసలైన దైవం. మూసా దీనిని మరచిపోయి, దైవాన్వేషణలో ఎక్కడో కొండల మీదికి పోయాడు" అంటూ దుష్ప్రచారం మొదలెట్టాడు. (ఈ వృత్తాంతం తాహా సూరాలో రానున్నది).

181. మూలంలో **'సుఖిత ఫీ ఐదీహిమ్'** అన్న వాక్యం ఉంది. దీని శాబ్దిక అర్థం చేతుల్లోకి పడిపోవటం. అసలు ఇదొక అరబీ జాతీయం. చేసిన తప్పుకు పశ్చాత్తాపంతో, సిగ్గుతో కుంచించుకుపోవటమని దీని భావం. మూసా (అలైహిస్సలాం) తిరిగివచ్చాకగాని వారు చేసిన ఘోర అపరాధం ఏమిటో వారికి తెలిసి రాలేదు. మూసా (అలైహిస్సలాం) ఆగ్రహోదగ్రులై, తీవ్రంగా మందలించిన తరువాత వారు పశ్చాత్తాపపడి, క్షమాపణ కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. తాహా సూరాలో ఈ సంగతి వివరంగా రానున్నది. కాని విశేషమేమిటంటే, మూసా ప్రవక్త వచ్చి వారిని మందలించారనే సంగతి చెప్పకుండానే ఈ ఆయతులో ఆయన జాతి వారు పశ్చాత్తాపపడిన విషయం వివరించబడింది. పైగా మూసా ప్రవక్త మందలించారనే విషయం దీని తర్వాతి వాక్యంలో చర్చించబడింది. జాతి ప్రజలు చేసిన నిర్వాకాన్ని, ఆ తర్వాత వారు పలికిన పలుకుల్ని ఒకేచోట ప్రస్తావించే ఉద్దేశంతో ఈ విధంగా చెప్పి ఉండవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

182. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తిరిగివచ్చేసరికి పరిస్థితుల స్వరూపం మారిపోయింది. ఏ జాతిని సంస్కరించేందుకు తాను అహోరాత్రులు శ్రమిస్తున్నారో ఆ జాతి వారు 40 రోజుల్లోనే గాడి తప్పి ఆవుదూడను పూజించటం మొదలెట్టారు. మూసా (అలైహిస్సలాం) ఆగ్రహోదగ్రులయ్యారు. ఆవేదన చెందారు. ఆ సమయంలో ఆయన తూరు పర్వతంపై నుంచి తెచ్చిన మార్గదర్శక పలకలను క్రిందపెట్టిన తీరు చూసేవారికి విసిరివేసినట్లుగా కనిపించింది. దివ్య ఖుర్‌ఆన్ దీనిని "పడవేయటం" (అల్‌ఖా) గా అభివర్ణించింది. ఒకవేళ 'ఆయన పారేశారు', 'విసిరివేశారు' అన్న భావంలో తీసుకున్నా ఆ సందర్భంలో ఆయన వాటిపట్ల అమర్యాదగా ప్రవర్తించారని అనలేము. ఎందుకంటే 'షిర్క్' సహించరాని విషయం. తన జాతి ప్రజలు 'షిర్క్' చేష్టకు పాల్పడటం ఆయనకు పట్టరాని కోపం తెప్పించింది. తాను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించే 'ధర్మానికి' దుర్గతిపట్టడంతో రోషం వల్ల ఆయన ద్వారా ఆ కరకు వైఖరి ప్రదర్శించబడింది.

183. హజ్రత్ మూసా (అలైహిస్సలాం), హజ్రత్ హారూన్ (అలైహిస్సలాం)లు స్వంత అన్నదమ్ములు. మరలాంటప్పుడు 'నా తల్లి పుత్రుడా!' అని పలకటంలోని ఆంతర్యం ఏమిటీ? అంటే ఈ సంబోధనా తీరులో ఆప్యాయత, మృదుత్వం ఇమిడి ఉన్నాయి.

وَكَادُوا يَقْتُلُونَنِي فَلَا تُشْمِتْ بِيَ الْأَعْدَاءَ
وَلَا تَجْعَلْنِي مَعَ الْقَوْمِ الظَّالِمِينَ ﴿١٥٠﴾

చంపేయటానికి కూడా సిద్ధమయ్యారు.[184] కాబట్టి నా స్థితిపై శత్రువులు నవ్వుకునేలా చేయకు.[185] నన్ను ఈ దుర్మార్గుల వర్గంలో జమకట్టకు”[186] అని సంజాయిషీ ఇచ్చారు.

قَالَ رَبِّ اغْفِرْ لِي وَلِأَخِي وَأَدْخِلْنَا فِي
رَحْمَتِكَ ۖ وَأَنْتَ أَرْحَمُ الرَّاحِمِينَ ﴿١٥١﴾

**151** అప్పుడు, “ఓ ప్రభూ! నన్నూ, నా సోదరుణ్ణి క్షమించు. మా ఇద్దరినీ నీ కారుణ్యంలో చేర్చుకో. నువ్వు కరుణించే వారందరిలో కెల్లా గొప్ప కరుణామయుడవు” అని (మూసా) వేడుకున్నాడు.

إِنَّ الَّذِينَ اتَّخَذُوا الْعِجْلَ سَيَنَالُهُمْ غَضَبٌ مِنْ
رَبِّهِمْ وَذِلَّةٌ فِي الْحَيَاةِ الدُّنْيَا ۚ وَكَذَٰلِكَ
نَجْزِي الْمُفْتَرِينَ ﴿١٥٢﴾

**152** ఆవుదూడను పూజించిన వారిపై అతి త్వరలోనే వారి ప్రభువు తరఫు నుంచి ఆగ్రహం, అవమానం – ప్రాపంచిక జీవితంలోనే[187] – పడుతుంది. అసత్యాలను అల్లేవారిని మేము ఈ విధంగానే శిక్షిస్తాము.[188]

وَالَّذِينَ عَمِلُوا السَّيِّئَاتِ ثُمَّ تَابُوا مِنْ بَعْدِهَا
وَآمَنُوا إِنَّ رَبَّكَ مِنْ بَعْدِهَا لَغَفُورٌ رَحِيمٌ ﴿١٥٣﴾

**153** మరెవరయితే తప్పు చేసిన తరువాత పశ్చాత్తాపం చెంది, విశ్వసిస్తారో వారిని నీ ప్రభువు – ఈ పశ్చాత్తాపం తరువాత– క్షమిస్తాడు, కనికరిస్తాడు.[189]

184. షిర్క్ లాంటి ఘోర అపరాధం నుంచి తన జాతి వారిని ఆపటంలో చెందిన వైఫల్యానికి గల కారణాన్ని హారూన్ (అలైహిస్సలాం) ఇక్కడ వివరించారు. ఒకవైపు తన బలహీన పరిస్థితి. మరోవైపు ఇస్రాయీల్ సంతతి వారి వైరవైఖరి. వారు తనను హతమార్చటానికి సయితం సిద్ధమయ్యారు. ప్రాణాలను కాపాడుకోవటానికి తాను – తాత్కాలికంగా – మౌనం వహించాల్సి వచ్చిందని ఆయన సంజాయిషీ ఇచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఈ విధంగా వ్యవహరించేందుకు అనుమతి ఉంటుంది.

185. ఈ పరిస్థితిలో నా జుత్తు పట్టుకుని లాగితే శత్రువులు చూచి అవహేళన చేస్తారు. ఇది వాస్తవానికి నన్ను నిలదీయాల్సిన సందర్భం కాదు. అసలు ఈ తప్పుకు పాల్పడిన వారిని దండించాలి, వారి కీడు నుంచి జాతివారిని కాపాడాలి అన్నది హారూన్ మాటల్లోని ఆంతర్యం.

186. ఎందుకంటే నేను షిర్క్‌కు పాల్పడటం గానీ, అందుకు అనుమతించటంగానీ చేయలేదు. వారి చేష్టను చూసి ఆనందించనూ లేదు. పైగా లోలోనే కుమిలిపోయాను. అనివార్య స్థితిలో మాత్రమే ఈ దుష్టపోకడపై మౌనం వహించాను. అలాంటప్పుడు నన్ను దుర్మార్గుల పంక్తిలో నిలబెట్టడం ఎంతవరకు సబబు? అని హారూన్ చెప్పారు. విషయం మూసా (అలైహిస్సలాం)కు అర్థమయింది. అందుకే తామిద్దరినీ క్షమించమనీ, కరుణించమనీ దైవాన్ని వేడుకున్నారు మూసా (అలైహిస్సలాం).

187. దైవాగ్రహం ఎలా విరుచుకుపడిందంటే, వారు చేసిన షిర్కు పనికి మరణమే ప్రాయశ్చిత్తంగా ఖరారు చేయబడింది. అంతకు ముందు వారు జీవించినంత కాలం అవమానం, పరాభవాలకు అర్హులుగా చేయబడ్డారు.

188. ఈ శిక్ష వారికొక్కరికే పరిమితం కాదు. ఎవరు అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టినా, మరెవరు సత్యమార్గంలో కల్లబొల్లి మాటలతో ప్రజల్ని పెడత్రోవ పట్టించినా వారు శిక్షార్హులౌతారు.

189. అయితే చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెంది, దేవుని వైపుకు మరలితే అలాంటివారి పాలిట దేవుడు క్షమాశీలి, దయామయుడు. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే పశ్చాత్తాపం (తౌబా) ద్వారా అన్ని రకాల పాపాలూ క్షమించబడతాయి. అయితే అది నిజమైన, నిష్కల్మషమైన తౌబా (పశ్చాత్తాపం) అయి ఉండాలి.

وَلَمَّا سَكَتَ عَن مُّوسَى الْغَضَبُ أَخَذَ الْأَلْوَاحَ ۖ
وَفِي نُسْخَتِهَا هُدًى وَرَحْمَةٌ لِّلَّذِينَ هُمْ لِرَبِّهِمْ
يَرْهَبُونَ ﴿١٥٤﴾

**154** కోపం చల్లారిన తరువాత మూసా (అలైహిస్సలాం) పలకలను ఎత్తుకున్నాడు. వాటిపై రాయబడి ఉన్నదానిలో తమ ప్రభువుకు భయపడేవారి కొరకు సన్మార్గమూ, కారుణ్యమూ ఉండినవి.[190]

وَاخْتَارَ مُوسَىٰ قَوْمَهُ سَبْعِينَ رَجُلًا لِّمِيقَاتِنَا ۖ
فَلَمَّا أَخَذَتْهُمُ الرَّجْفَةُ قَالَ رَبِّ لَوْ شِئْتَ
أَهْلَكْتَهُم مِّن قَبْلُ وَإِيَّايَ ۖ أَتُهْلِكُنَا بِمَا فَعَلَ
السُّفَهَاءُ مِنَّا ۖ إِنْ هِيَ إِلَّا فِتْنَتُكَ تُضِلُّ بِهَا
مَن تَشَاءُ وَتَهْدِي مَن تَشَاءُ ۖ أَنتَ وَلِيُّنَا
فَاغْفِرْ لَنَا وَارْحَمْنَا ۖ وَأَنتَ خَيْرُ الْغَافِرِينَ ﴿١٥٥﴾

**155** మేము నిర్ధారించిన సమయం కోసం మూసా (అలైహిస్సలాం) తన జాతికి చెందిన డెబ్భై మందిని ఎన్నుకున్నాడు. మరి వారిని భూకంపం కబళించి[191] నప్పుడు మూసా (అలైహిస్సలాం) ఇలా నివేదించుకున్నాడు : "నా ప్రభూ! నీవు గనక తలచుకుని ఉంటే ఇంతకు ముందే వీళ్ళనూ, నన్నూ తుదముట్టించి ఉండేవాడివి. ఏమిటీ (ప్రభూ!) మాలోని కొంతమంది అవివేకులు చేసిన పనికి మమ్మల్నందరినీ నాశనం చేస్తావా? ఈ సంఘటన వాస్తవానికి నీ తరఫున పెట్టబడిన ఒక పరీక్ష. ఇలాంటి పరీక్షల ద్వారా నీవు కోరిన వారిని అపమార్గానికి గురిచేసి, నీవు కోరిన వారిని సన్మార్గంపై నిలపగలవు. నువ్వే మా సంరక్షకుడవు. కనుక మాకు క్షమాభిక్ష పెట్టు. మాపై దయజూపు. నీవు క్షమించే వారందరిలోకీ ఉత్తమ క్షమాశీలివి.[192]

190. అరబీలో **'నుస్ఖతిహా'** (نُسْخَتِهَا) అనబడింది. ఏ మూలం నుంచి అయితే విషయాన్ని నకలు చేస్తారో ఆ మూలాన్ని 'నుస్ఖా'గా పేర్కొంటారు. అలాగే నకలు చేసిన సరిక్రొత్త ప్రతిని కూడా 'నుస్ఖా' అనే అంటారు. ఇక్కడ నుస్ఖా అంటే ప్రప్రథమంగా తౌరాతు విషయాలు లిఖించబడిన పలకలు అని భావం. లేదా పలకలను విసురుగా పడవేయటం వల్ల అవి పగిలిపోగా, వాటిని అతికించి, అందలి విషయాలను నకలుచేసి, తాజాగా రూపొందించిన 'ప్రతి' అన్న భావం కూడా వస్తుంది. అయితే మొదటి అర్థమే సరైంది అనవచ్చు. ఎందుకంటే మూసా ఆ 'పలకలను ఎత్తుకున్నాడు' అని తరువాత అనబడింది. దీన్నిబట్టి ఆ పలకలు పగిలిపోలేదని అర్థమవుతోంది.

తౌరాతు గ్రంథం కూడా దివ్య ఖుర్ఆన్ మాదిరిగా దైవానికి భయపడేవారి కొరకు మాత్రమే మార్గదర్శకంగా, కారుణ్యప్రదంగా అభివర్ణించబడింది. ఎందుకంటే, చిత్తశుద్ధితో సన్మార్గం పొందాలన్న తపనతో పారాయణంచేసే వారికే దైవగ్రంథాలు ప్రయోజనం చేకూరుస్తాయి. ఎట్టి పరిస్థితిలోనూ "సత్యం కనవద్దు, సత్యం వినవద్దు, సత్యం అనవద్దు" అన్న సూత్రానికి కట్టుబడి జీవితాంతం దైవగ్రంథాన్ని అధ్యయనం చేసినా మార్గదర్శకత్వం లభించదు.

191. ఈ 70 మందికి సంబంధించిన వివరాలు దీని తరువాత వివరణలో వస్తాయి. మూసా (అలైహిస్సలాం) ఎంపికచేసి, తూరు పర్వతంపైకి తీసుకువెళ్ళిన ఆ 70 మంది శిక్షగా అంతమొందించబడ్డారని ఈ వాక్యంలో చెప్పబడింది. ఈ పరిస్థితి ఎదురయినప్పుడు హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఇలా ప్రార్థించారు .....

192. ఇస్రాయీల్ సంతతికి చెందిన ఈ 70 మంది ఎవరు? ఈ విషయంలో ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భేదాభిప్రాయం ఉంది. పలు అభిప్రాయాలు ముందుకు వచ్చాయి–

**మొదటి అభిప్రాయం :** మూసా (అలైహిస్సలాం) తన జాతి వారికి తౌరాతులో ఉన్న దైవాజ్ఞలను వినిపించినప్పుడు, "ఇవి నిజంగా దైవాజ్ఞలని మేమెలా నమ్మాలి? దేవుడు మాట్లాడుతుండగా మేము ఖుద్దుగా విననంతవరకూ మేము వీటిని దైవాజ్ఞలుగా విశ్వసించము" అని వారు మొండిగా అన్నారు. అందువల్ల ఆయన 70 మందిని ప్రత్యేకంగా

وَاكْتُبْ لَنَا فِيْ هٰذِهِ الدُّنْيَا حَسَنَةً وَّفِي الْاٰخِرَةِ
اِنَّا هُدْنَآ اِلَيْكَ ؕ قَالَ عَذَابِيْٓ اُصِيْبُ بِهٖ
مَنْ اَشَآءُ ۚ وَرَحْمَتِيْ وَسِعَتْ كُلَّ شَيْءٍ ؕ
فَسَاَكْتُبُهَا لِلَّذِيْنَ يَتَّقُوْنَ وَيُؤْتُوْنَ الزَّكٰوةَ
وَالَّذِيْنَ هُمْ بِاٰيٰتِنَا يُؤْمِنُوْنَ ﴿156﴾

**156** మా కోసం ప్రపంచంలోనూ, పరలోకంలో కూడా మేలును వ్రాయి. మేము నీ వైపుకే మరలాము."[193] (సమాధానంగా అల్లాహ్ ఈ విధంగా) సెలవిచ్చాడు : "నేను కోరిన వారికి మాత్రమే శిక్ష విధిస్తాను. అయితే నా కారుణ్యం అన్ని వస్తువులనూ ఆవరించి ఉంది.[194] భయభక్తుల వైఖరిని అవలంబిస్తూ, జకాతును చెల్లిస్తూ, మా ఆయతులను విశ్వసించేవారి పేర ఈ కారుణ్యాన్ని తప్పకుండా వ్రాస్తాను."

ఎన్నుకుని, వాళ్ళను తూర పర్వతం మీదకు తీసుకెళ్ళారు. అక్కడ అల్లాహ్ హజ్రత్ మూసా (అలైహిస్సలాం)తో మాట్లాడటం వీళ్ళంతా విన్నారు. తీరా ఈ సంభాషణ విన్న మీదట వాళ్లు,–'మేము మా కళ్ళారా అల్లాహ్‌ను చూడనంత వరకూ విశ్వసించబోము' అని మారాము చేశారు.

**రెండవ అభిప్రాయం** : ఆవుదూడను ఆరాధ్య దైవంగా చేసుకుని, మహాపరాధానికి పాల్పడిన జాతివారందరి తరఫున దేవుణ్ణి క్షమాభిక్ష వేడుకోవటానికి ఎన్నుకోబడినవారే ఈ 70 మంది. వీళ్లచేత పశ్చాత్తాపం చేయించి, క్షమాభిక్షను వేడుకునే సంకల్పంతో దైవప్రవక్త మూసా వారిని పర్వతం పైకి వెంట బెట్టుకుని వెళ్ళారు. తీరా అక్కడికి చేరుకున్న పిదప వారు 'అల్లాహ్‌ను చూడాల్సిందే'నని పట్టుబట్టారు.

**మూడవ అభిప్రాయం :** ఈ 70 మంది ఎవరంటే, తమ జాతికి చెందినవారు ఆవుదూడను తయారుచేసి, దానిని పూజిస్తుండటం చూసి కూడా తమకేమీ పట్టనట్లుగా – నిర్లిప్తంగా – ఉండిపోయారు. వారిని ఆపేందుకు ప్రయత్నించ లేదు.

**నాల్గవ అభిప్రాయం :** దైవాదేశానుసారం ఈ 70 మంది తూరు పర్వతంపైకి తీసుకువెళ్ళేందుకు ఇస్రాయీల్ సంతతిలో నుంచి ప్రత్యేకంగా ఎన్నుకోబడ్డారు. అక్కడికెళ్ళాక వీళ్లు ప్రార్థనలు చేశారు. వారు చేసిన ప్రార్థనల్లో ఒకటి ఈ విధంగా ఉంది– "అల్లాహ్! నీవు ఇంతకు మునుపు ఎవరికీ ప్రసాదించనటువంటి, ఇక మీదట కూడా ఎవరికీ ప్రసాదించకుండా ఉండేటటువంటి దానిని మాకు ప్రత్యేకంగా ప్రసాదించు." ఈ అభ్యర్థన అల్లాహ్‌కు నచ్చలేదు. ఈ సంకుచిత స్వభావం మూలంగా వారు భూకంపం ద్వారా అంతమొందించబడ్డారు.

పైన పేర్కొనబడిన ఈ నాలుగు అభిప్రాయాలలో రెండవ అభిప్రాయం వైపుకు చాలామంది వ్యాఖ్యాతలు మొగ్గుచూపారు. ఇది అల్ బఖరా సూరాలోని 56వ వచనంలో ప్రస్తావనకు వచ్చిన సంఘటనేనని వారు అభిప్రాయపడ్డారు. అయితే పిడుగు పడి వారంతా అంతమయ్యారని అక్కడ చెప్పబడింది. ఈ ఆయతులో 'భూకంపం' (రజ్ఫహ్) అని చెప్పబడింది. ఈ రెంటిపై వ్యాఖ్యానిస్తూ, బహుశా ఒకేసారి రెండు ఆపదలూ వచ్చి ఉంటాయనీ, పైనుంచి పిడుగుపడటం, క్రింది నుంచి భూమి ప్రకంపించటం రెండూ సంభవించి ఉంటాయని పండితులు అభిప్రాయపడ్డారు. అయితే, వీళ్ళని తుదముట్టించటమే ధ్యేయం అయినప్పుడు మొదటిసారి ఆవుదూడను పూజించినప్పుడే ఆ శిక్ష విధించి ఉంటే సమంజసంగా ఉండేది కదా! అని మూసా (అలైహిస్సలాం) మొరపెట్టుకోవటంతో పాటు, దైవ కారుణ్యం కొరకు వేడుకున్నారు. అప్పుడు వారంతా మళ్లీ బ్రతికించబడ్డారు.

193. అంటే ; పశ్చాత్తాపం చెందాము.

194. దైవ కారుణ్యంలో అంతటి విస్తృతి ఉండబట్టే లోకంలోని సజ్జనులూ – దుర్జనులూ, విశ్వాసులూ – అవిశ్వాసులు, అందరూ ఆ కారుణ్యం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. హదీసులో ఇలా ఉంది: "అల్లాహ్ కారుణ్యం 100 భాగాలుగా ఉంది. ఆయన కారుణ్యంలోని ఒక భాగం మూలంగానే ప్రాణులు ఒండొకరిపై దయాదాక్షిణ్యాలు కురిపిస్తున్నారు. క్రూరమృగాలు సయితం ఆ చలువవల్ల తమ పిల్లలపై వాత్సల్యాన్ని కనబరుస్తున్నాయి. కాగా; ఆ కారుణ్యం యొక్క 99 భాగాలను ఆయన తన వద్ద ఉంచుకున్నాడు" (సహీహ్ ముస్లిం–హదీసు నెంబరు : 2108; ఇబ్నెమాజ – హదీసు నెంబరు : 4293).

الَّذِينَ يَتَّبِعُونَ الرَّسُولَ النَّبِيَّ الْأُمِّيَّ الَّذِي
يَجِدُونَهُ مَكْتُوبًا عِندَهُمْ فِي التَّوْرَاةِ
وَالْإِنجِيلِ يَأْمُرُهُم بِالْمَعْرُوفِ وَيَنْهَاهُمْ عَنِ
الْمُنكَرِ وَيُحِلُّ لَهُمُ الطَّيِّبَاتِ وَيُحَرِّمُ عَلَيْهِمُ
الْخَبَائِثَ وَيَضَعُ عَنْهُمْ إِصْرَهُمْ وَالْأَغْلَالَ الَّتِي
كَانَتْ عَلَيْهِمْ ۚ فَالَّذِينَ آمَنُوا بِهِ وَعَزَّرُوهُ
وَنَصَرُوهُ وَاتَّبَعُوا النُّورَ الَّذِي أُنزِلَ مَعَهُ ۙ
أُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ﴿١٥٧﴾

**157** ఈ సందేశహరుణ్ణి, నిరక్షరాసి అయిన ఈ ప్రవక్తను అనుసరించేవారు (కరుణించబడతారు), అతని ప్రస్తావన తమ వద్ద ఉన్న తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో లిఖితపూర్వకంగా లభిస్తుంది.[195] ఆ ప్రవక్త మంచిని చెయ్యమని వారికి ఆదేశిస్తాడు. చెడుల నుంచి వారిస్తాడు.[196] పరిశుద్ధమైన వస్తువులను ధర్మ సమ్మతంగా ప్రకటిస్తాడు. అశుద్ధమైన వాటిని నిషిద్ధంగా ఖరారు చేస్తాడు. వారిపై ఉన్న బరువులను దించుతాడు. వారికి వేయబడి వున్న సంకెళ్లను (విప్పుతాడు).[197] కనుక ఎవరు ఈ ప్రవక్తను విశ్వసించి, అతనికి ఆదరువుగా నిలుస్తారో, తోడ్పాటునందిస్తారో, ఇంకా అతనితోపాటు పంపబడిన జ్యోతిని అనుసరిస్తారో వారే సాఫల్యం పొందేవారు.[198]

195. ఈ ఆయతు ద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి దైవదౌత్యాన్ని (రిసాలత్‌ను) సత్యమని ధృవీకరించేవరకూ, దాన్ని మనసారా విశ్వసించేవరకూ పరలోక సాఫల్యం సిద్ధించదు. మనిషి దైవప్రవక్త వివరించిన విధంగా విశ్వసించినప్పుడే అతని 'విశ్వాసం' ఆమోదించబడుతుంది. ఈ ఆయతు ద్వారా కూడా "అన్ని మతాలూ ఒక్కటే" అని చెప్పేవారి పునాదులు కదిలిపోతాయి.

196. షరీయతు దృష్టిలో మంచిదిగా ఉండేదే వాస్తవానికి మంచిది. షరీయతు దృష్టిలో చెడుగా పరిగణించబడే ప్రతిదీ చెడే.

197. పురాతన ధర్మశాస్త్రాల (షరీఅతుల)లో ఉండిన బరువులు, సంకెళ్లు ఇవి. ఉదా: హత్య చేసినవాణ్ణి చంపటం విధిగా ఉండేది (ముహమ్మదీయ షరీఅతులో మాదిరిగా ఆనాడు రక్తపరిహారం చెల్లించుకునే వెసులుబాటు ఉండేది కాదు, హతుని వారసులు క్షమాభిక్ష పెట్టినా కూడా హంతకునికి మరణదండన తప్పేది కాదు). దుస్తులకు ఒకసారి మలినం అంటుకుందంటే ఆ గుడ్డను అంతవరకు కత్తిరించి పారేయవలసి వచ్చేది. ఇస్లామీయ షరీయతు ఇందులో సడలింపుల వైఖరిని అవలంబించింది. మాలిన్యం అంటుకున్న దుస్తులను ఉతికి ఆరేస్తే సరిపోతుందని ఆదేశించింది. హతుని వారసులకు రక్తపరిహారం చెల్లించే అవకాశం కల్పించింది. ఒకవేళ హతుని వారసులు క్షమించి వదలిపెట్టదలిస్తే దానికోసం ద్వారాలు తెరచి ఉంచింది. "నేను సరళమైన, ఏకోన్ముఖమైన ధర్మంతోపాటు పంపబడ్డాను" అని అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు స్వయంగా చెప్పారు (ముస్నదె అహ్మద్ – సంపుటి : 5, పేజీ – 266). కాని అత్యంత శోచనీయమైన విషయమేమిటంటే సరళమైన విధానాలను అనుసరించవలసిన ముస్లిం సమాజం, ఆచార సంప్రదాయాల పేరిట మోయలేనంత భారాన్ని తన మీద వేసుకుంటోంది. అజ్ఞాన కాలంనాటి గుదిబండలను మెడలో వేసుకుని సతమతమవుతోంది. తత్ఫలితంగా వివాహాది శుభకార్యాలు వారి నడ్డి విరుస్తున్నాయి. మృతుల పేరిట వారు జరిపే లేనిపోని తతంగాలు వారి ఆర్థిక వ్యవస్థనే అతలాకుతలం చేస్తున్నాయి. అల్లాహ్ మన సోదరులకు సద్బుద్ధి నొసగుగాక!

198. ఈ చివరి వాక్యం ద్వారా బోధపడే ముఖ్యాంశం కూడా అదే – అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను విశ్వసించి, ఆయన అడుగు జాడలలో నడుచుకునే వారే సాఫల్యభాగ్యం పొందుతారు. ఆయన (సఅసం) సందేశాన్ని విశ్వసించనివారు సాఫల్యం పొందరు. పైగా వారు నష్టపోతారు. సాఫల్యం అంటే అర్థం పరలోక సాఫల్యం అన్నమాట. ముహమ్మద్ (సఅసం) సందేశాన్ని త్రోసిపుచ్చినవారు ఇహలోకంలో సర్వత్రా సాఫల్యాలు పొందితే అది సిసలయిన సాఫల్యం అనిపించుకోదు. నేడు పాశ్చాత్య దేశాలకు చెందిన యూదులు, క్రైస్తవులు, ముష్రిక్కులు ఆర్థికంగా వైజ్ఞానికంగా ముందుకు దూసుకుపోతున్న మాట వాస్తవమే. కాని వారి ఈ ప్రగతి తాత్కాలికమైనది. అది వారి పాలిట ఓ పరీక్షలాంటిది. ఈ ప్రగతి వారి పరలోక సాఫల్యానికి సంకేతం కానేకాదు.

**158** (ఓ ముహమ్మద్!) వారికి చెప్పు : "ఓ ప్రజలారా! నేను భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి అయిన అల్లాహ్ తరపున మీ అందరి వద్దకు పంపబడిన ప్రవక్తను. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేదు. ఆయనే బ్రతికించేవాడు, ఆయనే మరణాన్ని ఇచ్చేవాడు. కనుక అల్లాహ్‌ను విశ్వసించండి. సందేశహరుడు, నిరక్షరాసి అయిన ఆయన ప్రవక్తను కూడా విశ్వసించండి – ఆ ప్రవక్త అల్లాహ్‌ను మరియు ఆయన ఆదేశాలను విశ్వసిస్తాడు. అతన్ని అనుసరించండి. తద్వారా మీరు సన్మార్గం పొందుతారు."[199]

قُلْ يَاَيُّهَا النَّاسُ اِنِّيْ رَسُوْلُ اللّٰهِ اِلَيْكُمْ جَمِيْعًا الَّذِيْ لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ يُحْيٖ وَيُمِيْتُ ۖ فَاٰمِنُوْا بِاللّٰهِ وَرَسُوْلِهِ النَّبِيِّ الْاُمِّيِّ الَّذِيْ يُؤْمِنُ بِاللّٰهِ وَكَلِمٰتِهٖ وَاتَّبِعُوْهُ لَعَلَّكُمْ تَهْتَدُوْنَ ﴿158﴾

**159** మూసా జాతి వారిలో సత్యం ప్రకారం మార్గదర్శకత్వం వహించే, సత్యాన్ననుసరించి న్యాయ నిర్ణయాలు గైకొనే వర్గం కూడా ఒకటుంది.[200]

وَمِنْ قَوْمِ مُوْسٰۤى اُمَّةٌ يَّهْدُوْنَ بِالْحَقِّ وَبِهٖ يَعْدِلُوْنَ ﴿159﴾

అలాగే ఈ ఆయతులో "ఆయనతో పాటు పంపబడిన జ్యోతిని అనుసరించేవారు..." అని సెలవీయబడింది. ఈ వాక్యం ద్వారానూ, అల్ మాయిదా సూరాలోని 15వ ఆయతు ద్వారానూ అవగతమయ్యేదేమిటంటే 'జ్యోతి' అంటే అర్థం దివ్య ఖుర్‌ఆన్. అంతేగాని 'జ్యోతి' అంటే ముహమ్మద్ అని భావం ఎంతమాత్రం కాదు. ఆయన లక్షణాలలో ఒక లక్షణం 'జ్యోతి' అన్నమాట వాస్తవమే! ఆ జ్యోతి మూలంగానే దైవతిరస్కారపు, బహు దైవత్వపు అంధకారాలు దూరమయ్యాయి. కాని అంతమాత్రాన 'ఆయన జ్యోతి అల్లాహ్ జ్యోతిలో అంతర్భాగం' అని భావించటానికి వీల్లేదు. ధర్మంలో కొత్తపుంతలు తొక్కిన బిద్‌అతీలు ముహమ్మద్ ప్రవక్త స్వయంగా దేవుని జ్యోతి అని నిరూపించటానికి విఫల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇది చాలా పెద్ద పొరపాటు. దివ్య ఖుర్‌ఆన్ వాక్యాలు వారి ఈ భావనను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాయి. (మరిన్ని వివరాల కోసం అల్ మాయిదా సూరాలోని 15వ ఆయతుకు వివరణను చూడండి).

199. ఈ ఆయతు కూడా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి దైవదౌత్యం (రిసాలత్) యావత్ ప్రపంచ మానవులందరికీ వర్తిస్తుందన్న విషయాన్ని, దానిపై ఉంచవలసిన విశ్వాసాన్ని నొక్కి వక్కాణిస్తోంది. "సమస్త మానవులారా! నేను విశ్వప్రభువు తరపున మీ అందరివైపుకూ ప్రవక్తగా పంపబడ్డాను" అన్న సత్యాన్ని ప్రకటించమని దేవుడు తన ప్రవక్త (స)కు ఆజ్ఞాపిస్తున్నాడు. ఆయన (స) సమస్త మానవుల సాఫల్యం కోసం, ముక్తి కోసం పంపబడిన ప్రవక్త. కాబట్టి ఇప్పుడు సన్మార్గం మరియు మోక్షం అనేవి యూద మతంలోగానీ, క్రైస్తవ మతంలోగానీ, వేరితర మతాలలోగానీ లేదు. మోక్షం అనేది ఏ మత ధర్మంలోనయినా ఉంది అంటే అది ఇస్లాంలోనే. ఇస్లాం ధర్మాన్ని ఆశ్రయించి, దానిని ఖచ్చితంగా అవలంబించినవారు మాత్రమే మోక్షం పొందుతారు. ఈ ఆయతులోనూ, ఇంతకు ముందు వచ్చిన ఆయతులోనూ ముహమ్మద్ (స) నిరక్షరాసి అయిన ప్రవక్త (నబీయె ఉమ్మి)గా వ్యవహరించబడ్డారు. ఇది ఆయన ప్రత్యేకతలలో ఒక ప్రత్యేకత. ఉమ్మీ అంటే చదవటం, వ్రాయటం రానివాడు అని అర్థం. ఆయన ఏ బడికీ వెళ్ళలేదు. ఏ అధ్యాపకుని ముందూ చదువుకోవటానికి కూర్చోలేదు. ఏ పలకపైనా అక్షరాలు దిద్దలేదు. అయినప్పటికీ ఆయన (స) అద్భుతమైన, అద్వితీయమైన ఖుర్‌ఆన్‌ను సమర్పించారు. ఆయన (స) ప్రవచనాలు, శిక్షణలు యావత్తు విద్యా జగత్తునే ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఏ కవిపుంగవుడూ, మరే సాహితీవేత్తా, ఇంకా ఏ మేధావీ చెప్పని వివేకవచనాలు ఆయన (స) నోట జాలువారాయి. అటువంటి దివ్య వచనాలను, సమస్త మానవాళినీ అంధకార లోయల్లో నుంచి కాంతిశిఖరాల ఉన్నతికి చేర్చే నీతిసూత్రాలను ఒక దైవప్రవక్త మాత్రమే అందించగలుగుతాడు

**160** మేము (మూసా జాతి) వారిని పన్నెండు తెగలుగా విభజించి, వేర్వేరు సమూహాలుగా చేశాము.[201] మూసా జాతి వారు అతన్ని నీళ్ళు అడిగినప్పుడు, "నీ చేతి కర్రను ఫలానా రాతిపై కొట్టు" అని మేమతన్ని ఆదేశించాము. అంతే! (అతను కర్రతో కొట్టగానే) ఆ రాతి బండ నుంచి పన్నెండు ఊటలు చిమ్ముకువచ్చాయి. ప్రతి తెగవారూ తాము నీళ్లు తాగవలసిన చోటును తెలుసుకున్నారు. మేము వారిపై మబ్బుల ద్వారా నీడను కల్పించాము. వారిపై 'మన్న సల్వా'లను (ఆహారంగా) దించాము. "మేము మీకు ప్రసాదించిన పరిశుద్ధమైన పదార్థాలను తినండి" (అని వారికి చెప్పాము.) అయితే వారు (కృతఘ్నతకు పాల్పడి) మాకు చేకూర్చిన నష్టం ఏమీలేదు. వారు తమ స్వయానికే నష్టం చేకూర్చుకునేవారు.

وقطعناهم اثنتي عشرة أسباطا أمما وأوحينا
إلى موسى إذ استسقاه قومه أن اضرب
بعصاك الحجر فانبجست منه اثنتا عشرة
عينا قد علم كل أناس مشربهم وظللنا
عليهم الغمام وأنزلنا عليهم المن والسلوى
كلوا من طيبات ما رزقناكم وما ظلمونا ولكن
كانوا أنفسهم يظلمون ﴿160﴾

**161** "మీరు ఈ పట్నంలోకి పోయి నివసించండి, అక్కడ మీరు కోరిన చోటినుంచి తీసుకుని తినండి. 'హిత్తతున్' అని పలుకుతూ, సాష్టాంగపడుతూ ద్వారం గుండా ప్రవేశించండి. మేము మీ తప్పులను క్షమిస్తాము. సత్కార్యాలు చేసేవారికి మరింతగా అనుగ్రహిస్తాము" అని వారికి ఆజ్ఞాపించబడినప్పుడు,

وإذ قيل لهم اسكنوا هذه القرية وكلوا منها
حيث شئتم وقولوا حطة وادخلوا الباب
سجدا نغفر لكم خطيئاتكم سنزيد
المحسنين ﴿161﴾

**162** వారిలోని దుర్మార్గులు తమకు ఇవ్వబడిన వాక్కును మరొక మాటతో మార్చివేశారు. అందువల్ల మేము వారిపై ఆకాశం నుంచి ఆపదను పంపాము. ఎందుకంటే వారు చాలా అన్యాయంగా ప్రవర్తించేవారు.[202]

فبدل الذين ظلموا منهم قولا غير الذي
قيل لهم فأرسلنا عليهم رجزا من السماء
بما كانوا يظلمون ﴿162﴾

---

అని లోకమంతా ఒప్పుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదే నిరక్షరాసి అయిన అంతిమ దైవప్రవక్త (సఅసం) వారి విశిష్ఠత.

200. అంటే యూద మతాన్ని వీడి ఇస్లాం స్వీకరించిన కొద్దిమంది. అబ్దుల్లా బిన్ సలాం (రజి) తదితరులు. (అల్లాహ్ వారిపట్ల ప్రసన్నుడగుగాక!)

201. ఆయతులో **'అస్బాతున్'** అని ఉంది. ఇది 'సిబ్తున్' అనే పదానికి బహువచనం. సిబ్తున్ అంటే మనుమడు. ఇక్కడ 'అస్బాతున్' అన్న పదం తెగలు అన్న భావంలో ఉపయోగించబడింది. హజ్రత్ యాఖూబు (అలైహిస్సలాం) గారి పన్నెండుమంది కుమారుల ద్వారా పన్నెండు వంశాలు లేక తెగలు ఉనికిలోకి వచ్చాయి. ఒక్కో తెగపై ఒక్కో నఖీబ్‌ను (పర్యవేక్షకుణ్ణి) అల్లాహ్ నియమించాడు (అల్ మాయిద – 12). ఈ పన్నెండు తెగల వారిలో ఒక్కొక్కరికి ఒక్కో విషయంలో ప్రత్యేకత ఉండేది. ఆ ప్రత్యేకతల మూలంగా వారు వేర్వేరు సమూహాలుగా గుర్తింపబడేవారు. వారికి ఆ ప్రత్యేకతలు తన అనుగ్రహం వల్లనే లభించాయని అల్లాహ్ ఈ ఆయతులో పేర్కొంటున్నాడు.

202. ఈ సూరాలో 160వ ఆయతు నుండి 162వ ఆయతు వరకు వివరించబడిన విషయాలన్నీ ఇంతకు ముందు అల్ బఖరా సూరా ప్రారంభంలో వచ్చాయి. వివరణ కోసం అల్ బఖరా సూరాను చూడండి.

وَسْـَٔلْهُمْ عَنِ الْقَرْيَةِ الَّتِىْ كَانَتْ حَاضِرَةَ
الْبَحْرِ ۘ اِذْ يَعْدُوْنَ فِى السَّبْتِ اِذْ تَاْتِيْهِمْ
حِيْتَانُهُمْ يَوْمَ سَبْتِهِمْ شُرَّعًا وَّيَوْمَ لَا يَسْبِتُوْنَ ۙ
لَا تَاْتِيْهِمْ ۛۚ كَذٰلِكَ ۛۚ نَبْلُوْهُمْ بِمَا كَانُوْا
يَفْسُقُوْنَ ﴿163﴾

**163** (ఓ ప్రవక్తా!) సముద్ర తీరాన నివసించిన బస్తీ[203] ప్రజల స్థితిగతులను గురించి వారిని[204] (యూదులను) అడుగు. వారు శనివారం నాటి విషయంలో హద్దుమీరి ప్రవర్తించేవారు. మరి ఆ శనివారం నాడే చేపలు పైపైకి తేలియాడుతూ వారి ముందుకు వచ్చేవి. శనివారం కాని దినాలలో అవి వారి ముందుకు వచ్చేవి కావు. వారి అవిధేయత మూలంగా[205] మేము వారిని ఈ విధంగా పరీక్షకు గురి చేసేవారము.

وَاِذْ قَالَتْ اُمَّةٌ مِّنْهُمْ لِمَ تَعِظُوْنَ قَوْمًا ۙ
اۨللّٰهُ مُهْلِكُهُمْ اَوْ مُعَذِّبُهُمْ عَذَابًا شَدِيْدًا ؕ
قَالُوْا مَعْذِرَةً اِلٰى رَبِّكُمْ وَلَعَلَّهُمْ يَتَّقُوْنَ ﴿164﴾

**164** ఇంకా వారిలో ఒక వర్గం (మంచిని ప్రబోధించే వారినుద్దేశించి), "అల్లాహ్ నాశనం చేయబోయే లేక కఠినంగా శిక్షించబోయేవారికి[206] ఎందుకు (అనవసరంగా) ఉపదేశిస్తారు?" అని చెప్పగా, "మీ ప్రభువు సమక్షంలో సంజాయిషీ ఇవ్వగలిగే స్థితిలో ఉండటానికి (ఈ పని చేస్తున్నాము). అలాగే బహుశా ఈ జనులు (దైవాగ్రహానికి) భయపడినా భయపడవచ్చు" అని వారు సమాధానమిచ్చారు.

203. ఇంతకీ ఆ బస్తీ ఏది? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. అది 'అయ్‌లా' అని కొందరూ, తబ్‌రియా అని కొందరు, 'ఏలియా' అని మరికొందరు, సిరియా తీర ప్రాంతంలోని పురము అని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. 'అయ్‌లా' అని చాలామంది భావించారు. ఇది మద్‌యన్ ప్రాంతానికి – తూరు పర్వతానికి మధ్యన ఖుల్జుమ్ సముద్రతీరాన ఉంది.

204. **"వారిని అడుగు"** అంటే, ఎవరు వారు? వారు యూదులని తెలుస్తోంది. ఈ విధంగా అడగటం ద్వారా యూదులకు చెప్పదలచినదేమిటంటే, ఆ విషయం మీకు మాత్రమే తెలుసని అనుకుంటున్నారేమో! అంతిమ దైవప్రవక్త (స)కు ఆ వృత్తాంతం క్షుణ్ణంగా తెలుసు. ఆయన దైవప్రవక్త (స) అనడానికి ఇదొక తార్కాణం. ఒకవేళ ఆయనపై దైవసందేశం (వహీయే) గనక అవతరించి ఉండకపోతే ఆయనకు ఈ యదార్థ గాథలు తెలిసేవి కావు.

205. పూర్వకాలంలో యూదులపై సంభవించిన సంఘటన ఇది. శనివారం నాడు చేపలు పట్టరాదని దేవుడు వారికి ఆంక్ష విధించాడు. కాని వారి పరీక్ష నిమిత్తం ఆ రోజే చేపలు నీళ్ళపైన తేలియాడుతూ వాళ్లను ఊరించేవి. శనివారం తప్ప ఇతర దినాలలో చేపలు ఇలా పైకి వచ్చేవి కావు. అప్పుడు యూదులు తమ అతి తెలివిని ప్రదర్శించారు. వారు సముద్రపు ఒడ్డున గోతులు త్రవ్వేవారు. గోతుల్లో పడిన చేపలను మరునాడు పట్టుకునేవారు. ఈ విధంగా వారు దొడ్డిదోవలో దైవాజ్ఞను ఉల్లంఘించారు. అరబీలో 'హీతానున్' అని వచ్చింది. ఇది 'హూతున్'కు బహువచనం. అంటే చేపలు అని అర్థం. అలాగే 'షుర్రఅన్' అనే మరో పదం వచ్చింది. ఇది 'షారివున్'కు బహువచనం. షారివున్ అంటే నీటిపైకి తేలియాడుతూ వచ్చేదని భావం.

206. ఈ వర్గంవారు మంచివారే. వారెన్నడూ ఈ ఉల్లంఘనకు పాల్పడలేదు. పైగా శనివారం నాడు గోతులు త్రవ్వేవారికి అలాంటి ద్రోహానికి పాల్పడవద్దని నచ్చజెప్పేవారు కూడా. కాని ఎంతకీ వారు వినకపోవటంతో నిరాశచెందారు. కాని మరికొంతమంది మాత్రం నియమాన్ని ఉల్లంఘించేవారిని పదే పదే హెచ్చరిస్తూ ఉండేవారు. అప్పుడు మొదటివర్గం వారు వీరిని ఉద్దేశించి "మీరెందుకు అనవసరంగా ఇంత శ్రమపడతారు? మీరెంతగా ప్రయత్నించినా ఈ దుర్మార్గులు మాట వినరు" అని అంటుండేవారు. లేక దుర్మార్గులే మంచివారితో ఆ మాట అని ఉండవచ్చు. "మీ దృష్టిలో మేము దైవాగ్రహానికి, దైవశిక్షకు గురయ్యేవారమే అయితే, అది మా అదృష్టంలో రాసిపెట్టబడి ఉంటే ఇక మీరెందుకు

فَلَمَّا نَسُوا مَا ذُكِّرُوا بِهِ أَنجَيْنَا الَّذِينَ يَنْهَوْنَ عَنِ السُّوءِ وَأَخَذْنَا الَّذِينَ ظَلَمُوا بِعَذَابٍ بَئِيسٍ بِمَا كَانُوا يَفْسُقُونَ ﴿١٦٥﴾

**165** మరి వారికి చేస్తూ వచ్చిన హితబోధను వారు విస్మరించినప్పుడు,[207] ఆ చెడు పోకడ నుంచి వారిస్తూ వచ్చిన వారిని మేము రక్షించి, దుర్మార్గానికి పాల్పడిన వారందరినీ వారి అవిధేయతల కారణంగా ఒక కఠినమైన శిక్షతో పట్టుకున్నాము.[208]

فَلَمَّا عَتَوْا عَن مَّا نُهُوا عَنْهُ قُلْنَا لَهُمْ كُونُوا قِرَدَةً خَاسِئِينَ ﴿١٦٦﴾

**166** అనగా వారు, తమకు వారించబడిన విషయంపై బరితెగించి పోయినప్పుడు, "ఇక మీరు నీచులైన కోతులుగా మారిపొండి"[209] అని అన్నాము.

وَإِذْ تَأَذَّنَ رَبُّكَ لَيَبْعَثَنَّ عَلَيْهِمْ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ مَن يَسُومُهُمْ سُوءَ الْعَذَابِ ۗ إِنَّ رَبَّكَ لَسَرِيعُ الْعِقَابِ ۖ وَإِنَّهُ لَغَفُورٌ رَّحِيمٌ ﴿١٦٧﴾

**167** ప్రళయదినం వరకూ యూదులను తీవ్ర యాతనకు గురిచేస్తూ ఉండేవారిని వారిపై విధిస్తాను అని నీ ప్రభువు ప్రకటించిన విషయం స్మరించదగినది. నిస్సందేహంగా నీ ప్రభువు శిక్షించటంలో వడిగలవాడు.[210] నిస్సందేహంగా ఆయన క్షమించేవాడు, కనికరించేవాడు కూడా.[211]

అనవసరంగా మాకు హితబోధ చేస్తారు?" అని వారు తమను నచ్చజెప్పే సజ్జనులతో అంటుండేవారు. దానికి సజ్జనులు ఇలా జవాబు చెప్పేవారు: "దైవ సమక్షంలో దోషులుగా నిలబడే దుస్థితి రాకుండా ఉండాలని మేమీ పని చేస్తున్నాము. సమాజంలో చెడులు పెచ్చరిల్లినప్పుడు, ఎల్లెడలా పాపకార్యాలు జరుగుతున్నప్పుడు వేడుక చూస్తూ ఉండిపోవటం, వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నించకపోవటం కూడా అపరాధమే. ఈ నేరానికి పాల్పడినందుకు దేవుడు శిక్షించవచ్చు. ఒకవేళ మా ఉపదేశం వల్ల వారు మనసు మార్చుకుని మంచివైపుకు వచ్చినా రావచ్చు."
మొదటి వ్యాఖ్యానం ప్రకారం ఆ కాలంలో మూడు వర్గాలుండేవి : 1. దైవాజ్ఞల్ని ఉల్లంఘించి చేపలు పట్టే వర్గం. 2. తను స్వయంగా దైవాజ్ఞల్ని ఉల్లంఘించకుండా, ఉల్లంఘిస్తున్నవారిని ఆపకుండా నిర్లిప్తంగా ఉండిపోయిన వర్గం. 3. తను స్వయంగా దైవాజ్ఞల్ని ఉల్లంఘించకుండా ఉండటమే కాకుండా ఉల్లంఘిస్తున్న వారిని అడ్డుకున్న వర్గం. రెండవ వ్యాఖ్యానం ప్రకారమయితే రెండు వర్గాలవుతాయి. 1. దైవాజ్ఞల్ని ఉల్లంఘించే వర్గం. 2. వారిని అడ్డుకున్న వర్గం.

207. అంటే – ఎంతగా నచ్చజెప్పినా వారు వినలేదు. తమ దుర్మార్గంపై పాతుకుపోయారు.

208. అంటే శిక్షించబడిన వారు, దైవాజ్ఞలను ఉల్లంఘించి తమ ఆత్మలకు అన్యాయం చేసుకుని, తమను తాము నరకాగ్నికి ఆహుతి చేసుకున్న దుర్మార్గులు. అంతేకాదు, దైవాదేశాలను పెడచెవినపెట్టి భూమిలో విగ్రవీగటాన్ని అలవాటుగా చేసుకున్న అవిధేయులు కూడాను.

209. ఇప్పుడు ఇంతకీ దేవుడు కాపాడినది కేవలం అవిధేయతను అడ్డుకున్న వర్గాన్నేనా? కడదాకా మంచిని ప్రబోధిస్తూ ఉండిన ఈ వర్గాన్ని తప్ప మిగిలిన రెండు వర్గాలను కూడా దేవుడు శిక్షించాడా? లేక పబ్లిగ్గా దైవాజ్ఞలను ధిక్కరిస్తూ, నిరంతరం పాపాలు చేస్తూపోయిన పాపాత్ముల వర్గాన్ని శిక్షించి మిగిలిన రెండు వర్గాలను దేవుడు రక్షించాడా??– ఈ విషయంలో ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఇమామ్ ఇబ్నె కసీర్ మాత్రం రెండో అభిప్రాయం వైపుకే మొగ్గారు. **'అతౌ'** (عَتَوْا) అంటే అల్లాహ్ పట్ల అవిధేయతకు పాల్పడుతూ వారు హద్దులు మీరిపోయారని భావం.

210. యూదుల గత చరిత్రనంతటినీ తిరగవేస్తే ఈ సంగతి స్పష్టంగా అర్థమవుతుంది. వారు ఇతరులకు స్వామి ద్రోహం

وَقَطَّعْنٰهُمْ فِي الْاَرْضِ اُمَمًا ۚ مِنْهُمُ الصّٰلِحُوْنَ وَمِنْهُمْ دُوْنَ ذٰلِكَ ۫ وَبَلَوْنٰهُمْ بِالْحَسَنٰتِ وَالسَّيِّاٰتِ لَعَلَّهُمْ يَرْجِعُوْنَ ﴿168﴾

**168** మేము వారిని (యూదులను) భూమండలంపై అనేక వర్గాలుగా చీల్చి (చెల్లాచెదురుగా చేసి) ఉంచాము. వారిలో కొందరు సజ్జనులూ మరియు తద్భిన్నంగా ఉండేవారు కూడా ఉన్నారు. బహుశా వారు మరలి వస్తారేమోనని మేము వారిని మంచి స్థితిలోనూ, దుస్థితిలోనూ పరీక్షించాము.[212]

فَخَلَفَ مِنْۢ بَعْدِهِمْ خَلْفٌ وَّرِثُوا الْكِتٰبَ يَاْخُذُوْنَ عَرَضَ هٰذَا الْاَدْنٰى وَ يَقُوْلُوْنَ سَيُغْفَرُ لَنَا ۚ وَاِنْ يَّاْتِهِمْ عَرَضٌ مِّثْلُهٗ

**169** మరి వారి తరువాత వారికి వారసులైనవారు వారి నుంచి గ్రంథాన్ని పొందారు.[213] వారు తుచ్ఛమైన ఐహిక సంపదను తీసుకుంటున్నారు.[214] పైగా, "మేము తప్పకుండా క్షమించబడ తాము"[215] అని అంటున్నారు. అలాంటి సొమ్మే మళ్లీ లభిస్తే మళ్లీ

చేస్తూ, ఇతరుల చేత ఛీత్కరించబడుతూ, అవమానాల పాలవుతూ, చెట్టుకొకరు పుట్టకొకరుగా ప్రపంచంలో విసిరివేయ బడ్డారు. ప్రస్తుతం ఇస్రాయీల్ పేరుతో వారు స్థాపించిన ప్రభుత్వం వారికి శాంతీ సుస్థిరతలను ప్రసాదించలేదు. అమాయక జీవుల గోరీలపై ఇస్రాయీల్ జాత్యహంకారపు సౌధాన్ని నిర్మిస్తున్న ఈ వంచనాశిల్ప నిష్ణాతులు అనుక్షణం భయోత్పాతంతో కూడిన వాతావరణంలో ఊపిరి పీలుస్తూ ఉన్నారు. ఈనాడు వారు రాజ్యాధికారాన్ని కలిగి వుండటం దివ్య ఖుర్‌ఆన్ వివరించిన ఈ యదార్థానికి ఏమాత్రం భిన్నంగా లేదు. ఎందుకంటే, "వారికి ప్రజల్లో ఎవరైనా శరణు ఇస్తే తప్ప" (వ హబ్‌లిమ్ మినన్నాసి) అని ఖుర్‌ఆన్ స్వయంగా పేర్కొంది. ఈనాడు వారి అధికారానికి అండదండ లెవరివో ప్రజలు స్పష్టంగా గమనించవచ్చు. (మరిన్ని వివరాల కోసం ఆలి ఇమ్రాన్ సూరా 112వ ఆయతుకు వివరణను చూడండి). ఆయతులో **తఅజ్జన** (**تَاَذَّنَ**) అని వచ్చింది. ఇది **'ఈఅ్‌లామ్'** అన్న అర్థంలో వాడబడింది. ఈఅ్‌లామ్ అంటే తెలియపరచటం. నీ ప్రభువు ఆ యూదులకు బాగా తెలియపరచిన సందర్భాన్ని కూడా జ్ఞాపకం చేసుకోండి అని దాని భావం. తర్వాత 'లయబ్‌అసన్న' అని చెప్పబడింది. ఇందులో మొదటి అక్షరమైన 'ల' (లామ్) తాకీదు కోసం తీసుకురాబడింది. ఇది ఇక్కడ ప్రమాణపు అర్థాన్ని ఇస్తుంది. అంటే తాను ప్రళయం వరకూ యూదులపై, వారిని కఠినంగా శిక్షించేవారిని నియమిస్తూ ఉంటానని అల్లాహ్ గట్టిగా ప్రమాణం చేసి చెబుతున్నాడు.

211. ఒకవేళ వీరిలో ఎవరయినా పశ్చాత్తాపం చెంది, ఇస్లాం స్వీకరించినట్లయితే ఈ పరాభవం నుంచి, పీడన నుంచి ముక్తి పొందే అవకాశం ఉంది.

212. యూదులు ప్రపంచంలో వివిధ వర్గాలుగా విభజించబడి ఉంటారనీ, వారిలో కొందరు మంచివారూ ఉంటారని ఈ ఆయతులో చెప్పబడింది. కొన్నిసార్లు వారు కలిమి ద్వారా, మరికొన్ని సార్లు లేమి ద్వారా పరీక్షించబడతారు. కిరాతక చర్యలను మాని, పశ్చాత్తాపం చెంది, నిజప్రభువు వైపుకు మరలి వస్తారన్న ఉద్దేశంతో దేవుడు వారిని వివిధ రకాలుగా పరీక్షించాడు.

213. అరబీలో **'ఖల్‌ఫున్'** (**خَلْفٌ**) అన్న పదం వచ్చింది. అనర్హులు, దక్షత లోపించినవారు, అసమర్థులు అని దాని అర్థం. దీనికి భిన్నంగా **'ఖలఫున్'** (**خَلَفٌ**) అనే మరొక పదముంది. దీనికి మంచి సంతానం అనే అర్థం వస్తుంది.

214. అరబీలో **'అద్‌నా'** అనబడింది. అద్‌నా అంటే దగ్గరలో ఉన్నది, శీఘ్రంగా లభించేది అని అర్థం. లేక ఇది 'దనాఅతున్' నుంచి ఏర్పడిన పదం కావచ్చు. దీనికి అల్పమైన వస్తువులు, క్రిందపడివున్న వస్తువులు అన్న అర్థం వస్తుంది. మొత్తానికి ప్రాపంచిక వస్తువుల పట్ల వారికి గల పేరాశను ఎత్తిచూపటం అసలు ఉద్దేశం.

215. అంటే – ఓ వైపు ప్రపంచాన్ని ప్రోగుచేసుకునే యావతో అహోరాత్రులు అర్రులు చాస్తూనే, మరోవైపు దేవుని క్షమా భిక్షపై ఆశపెట్టుకుని ఉండేవారు. నేటి ముస్లింల పరిస్థితి కూడా దీనికి భిన్నంగా లేదు మరి!

يَأْخُذُوهُ ۚ أَلَمْ يُؤْخَذْ عَلَيْهِمْ مِيثَاقُ الْكِتَابِ أَنْ لَا يَقُولُوا عَلَى اللَّهِ إِلَّا الْحَقَّ وَدَرَسُوا مَا فِيهِ ۗ وَالدَّارُ الْآخِرَةُ خَيْرٌ لِلَّذِينَ يَتَّقُونَ ۗ أَفَلَا تَعْقِلُونَ ﴿١٦٩﴾

దాన్ని కూడా తీసేసుకుంటారు. అల్లాహ్ పేరుతో సత్యం తప్ప మరోమాట చెప్పకూడదని[216] గ్రంథంలో ఉన్నటువంటి ప్రమాణం వారి నుండి తీసుకోబడలేదా? (మరి చూడబోతే) అందులో (గ్రంథంలో) ఉన్న దానిని వారు స్వయంగా చదివారు.[217] భయ భక్తులు కలిగి ఉండేవారి కోసం పరలోక నిలయం ఎంతో మేలైనది. మరి ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకోరేమిటీ?

وَالَّذِينَ يُمَسِّكُونَ بِالْكِتَابِ وَأَقَامُوا الصَّلَاةَ إِنَّا لَا نُضِيعُ أَجْرَ الْمُصْلِحِينَ ﴿١٧٠﴾

**170** ఎవరు గ్రంథానికి కట్టుబడి ఉంటూ, నమాజులను నెలకొల్పుతూ ఉన్నారో అట్టి సంస్కర్తల పుణ్య ఫలాన్ని మేము వృథా చేయము.[218]

وَإِذْ نَتَقْنَا الْجَبَلَ فَوْقَهُمْ كَأَنَّهُ ظُلَّةٌ وَظَنُّوا أَنَّهُ وَاقِعٌ بِهِمْ خُذُوا مَا آتَيْنَاكُمْ بِقُوَّةٍ وَاذْكُرُوا مَا فِيهِ لَعَلَّكُمْ تَتَّقُونَ ﴿١٧١﴾

**171** మేము పర్వతాన్ని పైకెత్తి కప్పు మాదిరిగా వారిపై నిలిపిన సంఘటన కూడా గుర్తుచేసుకోదగినదే. అది తమపైన పడటం ఖాయం అని వారంతా అనుకున్నారు. (ఆ సమయంలో మేము వారితో), "మేము మీకు వొసగిన దానిని (గ్రంథాన్ని) గట్టిగా పట్టుకోండి. ఇందలి ఆదేశాలను జ్ఞాపకముంచుకోండి. తద్వారా మీరు దైవ భీతిపరులు (ముత్తఖీన్) అవుతారు"[219] (అని చెప్పాము).

216. ఇంత చేసింది చాలదన్నట్లు అల్లాహ్ పేరుతో అసత్యాలను కూడా కల్పించేవారు. ఉదాహరణకు : అల్లాహ్ తమను క్షమిస్తాడని చెప్పటం.

217. అరబీలో **'వ దరసూ మాఫీహి'** అని వచ్చింది. దర్స్ అంటే చదవటం. గ్రంథంలో ఉన్న వాటిని వారు చదివారని భావం. అయితే 'దరస' అన్న పదానికి చెరిపివేయటం అనే అర్థం కూడా వస్తుంది. అరబీలో 'దరసతి రీహుల్ ఆసార' అంటారు. అంటే గాలి చిహ్నాలను చెరిపివేసిందని అర్థం. ఈ అర్థం గనక తీసుకొంటే యూదులు గ్రంథంలోని విషయాలను చెరిపివేసేవారు, వాటి ఆచరణను వదలిపెట్టేవారని అర్థం చేసుకోవలసి ఉంటుంది.

218. మరి వారిలో భయభక్తుల వైఖరిని అవలంబిస్తూ గ్రంథాన్ని తు.చ. తప్పకుండా అనుసరించేవారినీ, అంటే ప్రక్షిప్తాలకు, మార్పులకు లోనుకాని తౌరాతు గ్రంథాన్ని అనుసరిస్తూ - అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను విశ్వసించి, నమాజును నాగాలేకుండా చేసే సద్వర్తనుల పుణ్యఫలాన్ని మేము వృథా కానివ్వము. ఈ మాటలు యూదుల్లోని సద్వర్తనుల్ని దృష్టిలో పెట్టుకుని చెప్పబడ్డాయన్నది గమనార్హం. అంటే వారు ముస్లింలుగా మారి, ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని సత్యమని ధృవీకరించినట్లయితే అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను విశ్వసించనంతవరకూ ఎవరికీ పరలోక సాఫల్యం ప్రాప్తించదు.

219. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన జాతి వారి వద్దకు తౌరాతు గ్రంథాన్ని తెచ్చి, అందులోని ఆజ్ఞలను చదివి వినిపిస్తున్నప్పుడు జరిగిన సంఘటన ఇది. ఎందుకంటే వారు షరా మామూలుగా ఈ ఆజ్ఞలను శిరసావహిం చేందుకు నిరాకరించారు. దానికి అల్లాహ్ ఆగ్రహించి పర్వతాన్ని పైకిలేపి, దాన్ని వారిపై పడవేసి నుజ్జునుజ్జు చేసి వేస్తానని హెచ్చరించాడు. ఈ దృశ్యానికి వారు భయకంపితులై, తౌరాతు గ్రంథాన్ని ఖచ్చితంగా పాటిస్తామని వాగ్దానం చేశారు.

మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం పర్వతాన్ని పైకెత్తే ఈ సంఘటన స్వయంగా బనీ ఇస్రాయీల్ కోరికపైనే

172 నీ ప్రభువు ఆదం సంతతి వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, స్వయంగా వారినే వారికి సాక్షులుగా పెట్టి, "నేను మీ ప్రభువును కానా?" అని అడిగినప్పుడు "ఎందుకు కావు? (నువ్వే మా ప్రభువువి). ఈ విషయానికి మేమంతా సాక్షులుగా ఉన్నాం"[220] అని వారు చెప్పారు. 'దీని గురించి మాకేమీ తెలియదు' అని ప్రళయ దినాన మీరు అనకుండా ఉండటానికీ

وَإِذْ أَخَذَ رَبُّكَ مِنْ بَنِي آدَمَ مِنْ ظُهُورِهِمْ ذُرِّيَّتَهُمْ وَأَشْهَدَهُمْ عَلَىٰ أَنْفُسِهِمْ أَلَسْتُ بِرَبِّكُمْ ۖ قَالُوا بَلَىٰ ۛ شَهِدْنَا ۛ أَنْ تَقُولُوا يَوْمَ الْقِيَامَةِ إِنَّا كُنَّا عَنْ هَٰذَا غَافِلِينَ ﴿١٧٢﴾

173 లేదా "మొదట్లో మా పూర్వీకులు షిర్కుకు పాల్పడ్డారు. మేము వారి తరువాతివారి సంతతిలో పుట్టినవారము. ఆ దుర్జనులు చేసిన పాపానికి నువ్వు మమ్మల్ని వినాశానికి గురిచేస్తావా?!"[221] అని మీరు అనకుండా ఉండటానికిగాను (మేము ముందే మీ నుండి ఈ విధంగా ఖరారు చేయించాము.)

أَوْ تَقُولُوا إِنَّمَا أَشْرَكَ آبَاؤُنَا مِنْ قَبْلُ وَكُنَّا ذُرِّيَّةً مِنْ بَعْدِهِمْ ۖ أَفَتُهْلِكُنَا بِمَا فَعَلَ الْمُبْطِلُونَ ﴿١٧٣﴾

సంభవించింది. "ఈ పర్వతాన్ని దేవుడు మాపైకి ఎత్తినప్పుడే మేము తౌరాతు గ్రంథాన్ని విశ్వసిస్తాము" అని వారు మొండికేసినప్పుడు దేవుడు దాన్ని పైకెత్తాడు. కాని రెండో వ్యాఖ్యానం కన్నా మొదటి వ్యాఖ్యానమే సరైనదని అనిపిస్తోంది (యదార్థం మాత్రం దైవానికే ఎరుక). ఇక్కడ కేవలం "పర్వతం" అని అనబడింది. అదే అల్ బఖరా సూరాలోని (63 మరియు 93 ఆయతుల్లో) రెండుసార్లు ఈ సంఘటన ప్రస్తావనకు వచ్చినప్పుడు ఆ పర్వతం 'తూరు పర్వతం' అని అనబడింది.

220. ఈ వాగ్దానం **"అహదె అలస్త్"**గా సుప్రసిద్ధం. ఆదిమానవుడైన ఆదం (అలైహిస్సలాం) ను సృష్టించిన తరువాత అల్లాహ్, ఆదం వెన్ను నుంచి పుట్టే సంతతి ద్వారా ఈ మేరకు ముందుగానే ఖరారు తీసుకున్నాడు. దీని వివరాలు ఒక హదీసులో ఉన్నాయి. హదీసు ప్రకారం : "అరఫా దినాన అల్లాహ్ నూమాన్ అనే చోట ఆదం వీపుల నుంచి ప్రమాణం తీసుకున్నాడు. ఆదం వీపు నుండి, ఆయనకు పుట్టబోయే సంతానమంతటినీ ఒక్కసారిగా వెలికితీసి, వారిని తన ఎదుట నిలబెట్టి **"అలస్తు బి రబ్బికుమ్?"** (నేను మీ ప్రభువును కానా?) అని ప్రశ్నించాడు. **"బలా-షహిద్‌నా"** (ఎందుకు కావు? నువ్వే మా ప్రభువువి అన్న దానికి మేమంతా సాక్షులుగా ఉన్నాం) అని వారు బదులిచ్చారు. (ముస్నదె అహ్మద్-సంపుటి:1, పేజీ-272; హాకిమ్ - సంపుటి: 2, పేజీ - 544). ఇమామ్ షౌకానీ ఈ హదీసుపై వ్యాఖ్యానిస్తూ "దీని ప్రామాణికత విషయంలో ఎవరి నుంచీ ఆక్షేపణలు వ్యక్తం కాలేదు" అని చెప్పారు (ఫత్‌హుల్ ఖదీర్). ఆయన ఇంకా ఇలా వ్యాఖ్యానించారు : ఇది 'ఆలమె జర్ర్' (పరమాణువుల లోకం) అనబడుతుంది. దీని గురించిన ఈ వ్యాఖ్యానమే సరైనది. సత్యబద్ధమైనది. దీన్నుంచి ఇతరత్రా అర్థాలు తీయటం సరైనది కాదు. ఎందుకంటే ఇది 'మర్ఫూ' హదీసు. ప్రవక్త సహచరుల ద్వారా ఇది రూఢీ అవుతోంది. దీనిపై ఊహాగానాలు చేయటం, అన్వయింపుకు ఆస్కారం కల్పించటం సబబుకాదు."

మొత్తమ్మీద అల్లాహ్ ఒక్కడే విశ్వప్రభువు అన్న ఈ 'అహదె అలస్త్' భావన ప్రతి మనిషి నైజంలోనూ ఇమిడి ఉంది. ఈ భావాన్నే మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా స్పష్టపరిచారు : "ప్రతి పిల్లవాడు సహజత్వం (నైజం, ఇస్లాం) పైనే పుడతాడు. కాకపోతే అతని తల్లిదండ్రులు అతన్ని యూదునిగానో, క్రైస్తవునిగానో, మజూసీగానో మార్చివేస్తారు. జంతువు ఈనినప్పుడు దాని పిల్ల సయితం సురక్షితంగా ఉంటుంది. దాని ముక్కుగానీ, చెవులుగానీ కోయబడి ఉండవు. (సహీహ్ బుఖారీ : కితాబుల్ జనాయెజ్; ముస్లిం-కితాబుల్ ఖద్ర్). సహీహ్ ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడని చెప్పబడింది : "నేను నా దాసులను హనీఫ్‌గా - ఏకాగ్రతతో దేవుని వైపు మరలేవారిగా-పుట్టించాను. కాని షైతాన్ వారిని వారి (సహజ) ధర్మం నుండి మరల్చి మార్గవిహీనుల్ని చేస్తాడు"-

وَكَذٰلِكَ نُفَصِّلُ الْاٰيٰتِ وَلَعَلَّهُمْ يَرْجِعُوْنَ ﴿١٧٤﴾

**174** వారు మరలివస్తారేమోనని మేము ఈ విధంగా ఆయతు
లను విడమరచి చెబుతున్నాము.

وَاتْلُ عَلَيْهِمْ نَبَاَ الَّذِيْٓ اٰتَيْنٰهُ اٰيٰتِنَا
فَانْسَلَخَ مِنْهَا فَاَتْبَعَهُ الشَّيْطٰنُ فَكَانَ
مِنَ الْغٰوِيْنَ ﴿١٧٥﴾

**175** (ఓ ప్రవక్తా!) మేము మా ఆయతులను ప్రసాదించగా,
వాటినుండి తిరిగిపోయిన వాని వృత్తాంతాన్ని వారికి చదివి
వినిపించు. చివరకు షైతాను అతని వెంటపడగా, అతడు
మార్గభ్రష్టులలో చేరిపోయాడు.[222]

وَلَوْ شِئْنَا لَرَفَعْنٰهُ بِهَا وَلٰكِنَّهٗٓ اَخْلَدَ اِلَى الْاَرْضِ
وَاتَّبَعَ هَوٰىهُ ۚ فَمَثَلُهٗ كَمَثَلِ الْكَلْبِ ۚ اِنْ
تَحْمِلْ عَلَيْهِ يَلْهَثْ اَوْ تَتْرُكْهُ يَلْهَثْ ؕ
ذٰلِكَ مَثَلُ الْقَوْمِ الَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِنَا ۚ فَاقْصُصِ
الْقَصَصَ لَعَلَّهُمْ يَتَفَكَّرُوْنَ ﴿١٧٦﴾

**176** మేము గనక తలిస్తే ఈ ఆయతుల వల్ల అతనికి ఔన్నత్యాన్ని
ప్రసాదించి ఉండేవారం. కాని అతనేమో ప్రపంచం వైపుకే
మొగ్గాడు. తన మనోవాంఛలనే అనుసరించసాగాడు. అందువల్ల
అతని పరిస్థితి కుక్క పరిస్థితిలా తయారయింది. నువ్వు దాన్ని
తరిమినా అది నాలుకను బయటపెట్టి రొప్పుతూ ఉంటుంది.
దాన్ని దాని మానాన వదలి పెట్టినా (నాలుక తీసి) రొప్పుతూనే
ఉంటుంది.[223] మా ఆయతులను అసత్యాలని త్రోసిపుచ్చిన వారి
పరిస్థితి కూడా ఇలాంటిదే. కాబట్టి నువ్వు వారికి ఈ గాథలను
వినిపిస్తూ ఉండు. బహుశా అలాగైనా వారు యోచన
చేస్తారేమో![224]

మొత్తం హదీసు (సహీహ్ ముస్లిం : కితాబుల్ జన్నహ్). ప్రకృతి ధర్మం అన్నా, దేవుని ఏకత్వం అన్నా, దేవుడు పంపిన షరీయతు అన్నా ఇదే. ఇప్పుడది ఇస్లాం రూపంలో సురక్షితంగా ఉంది.

221. రేపటిరోజున మీరు సాకులు చెప్పకుండా ఉండటానికీ, వేరొకరిపై తప్పును నెట్టివేసి చేతులు దులుపుకోకుండా ఉండటానికి గాను మేము ముందుగానే మీచేత ప్రమాణం చేయించాము, నీవే మా ప్రభువువి అని మీచేత చెప్పించామని అల్లాహ్ ఈ ఆయతులో గుర్తుచేస్తున్నాడు.

222. ఒకానొక ప్రత్యేక వ్యక్తిని గురించి ఇక్కడ పేర్కొనటం జరిగిందని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అతనికి గ్రంథ జ్ఞానం ఉండేది. దాని ద్వారా అతను కాంతిని పొందే బదులు ప్రాపంచిక ప్రయోజనాల వెనుక పరుగులు తీశాడు. షైతాన్ వెనుకపడి మార్గభ్రష్టుడయ్యాడు. ఇంతకీ ఎవడు వాడు? ఎచటివాడు? – దీనికి సంబంధించిన ప్రామాణిక ఆధారాలు లేవు. కాబట్టి దాని లోతుల్లోకి పోనవసరం లేదు. సాధారణంగా ఇలాంటి వ్యక్తులు ప్రతి కాలంలోనూ పుడుతూ ఉంటారు. ఈ వాక్యం ఇలాంటి దౌర్భాగ్యానికి లోనయిన వ్యక్తులకు వర్తిస్తుంది.

223. అరబీలో **'యల్‌హస్'** (**يَلْهَثْ**) అనబడింది. దీని మూలపదం 'లహసున్.' లహసున్ అంటే, అలసట లేక దప్పిక వల్ల నాలుక చాచి రొప్పటం అన్న అర్థం వస్తుంది. కుక్కను తరిమికొట్టినా, లేక దాన్ని దాని మానాన వదలిపెట్టినా– అది మొరగటం మానదు. అలాగే దానికి కడుపునిండా తిండిపెట్టినా లేక ఆకలితో మాడ్చినా, అది ఆరోగ్యంగా ఉన్నా లేక జబ్బుపడినా, అది అలసిపోయినా లేక విశ్రాంతి తీసుకున్నా – అన్నివేళలా అది నాలుకను బయటికి తీసి రొప్పుతూ ఉంటుంది. పొద్దస్తమానం ప్రపంచం వెనకాల పరుగెత్తే పేరాశాపరుని పరిస్థితి కూడా ఇటువంటిదే. అతనికి హితబోధ చేసినా – చేయకపోయినా అతనికేమీ పట్టదు. ఎంతసేపటికీ ఇంకా ఇంకా కూడబెట్టే తపనలోనే ఉంటాడు. సరిగ్గా విశ్రాంతి తీసుకోలేడు. ప్రశాంతంగా నిద్రపోలేడు. అనవసరంగా ఆయాసపడుతూ ఉంటాడు.

224. ఇలాంటి దృష్టాంతాల ద్వారా విషయాన్ని విప్పి చెబితే బహుశా గుణపాఠం గ్రహించి, మార్గవిహీనత నుండి తమను కాపాడుకుంటారేమో! కనుక అలాంటి వారి అంతరాత్మను పట్టి పదే పదే కుదుపుతూ ఉండాలి.

سَاءَ مَثَلًا الْقَوْمُ الَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا
وَأَنفُسَهُمْ كَانُوا يَظْلِمُونَ ﴿١٧٧﴾

177 మా ఆయతులను అసత్యాలని ధిక్కరిస్తూ, తమ స్వయానికి నష్టం చేకూర్చుకునే ప్రజల పరిస్థితి కూడా చాలా చెడ్డది.[225]

مَن يَهْدِ اللَّهُ فَهُوَ الْمُهْتَدِي ۖ وَمَن
يُضْلِلْ فَأُولَٰئِكَ هُمُ الْخَاسِرُونَ ﴿١٧٨﴾

178 అల్లాహ్ ఎవడికి సన్మార్గం చూపుతాడో అతడే సన్మార్గం పొందినవాడవుతాడు. మరెవరిని ఆయన అపమార్గం పట్టిస్తాడో వారే నష్టపోయినవారవుతారు.[226]

وَلَقَدْ ذَرَأْنَا لِجَهَنَّمَ كَثِيرًا مِّنَ الْجِنِّ
وَالْإِنسِ ۖ لَهُمْ قُلُوبٌ لَّا يَفْقَهُونَ بِهَا
وَلَهُمْ أَعْيُنٌ لَّا يُبْصِرُونَ بِهَا وَلَهُمْ
آذَانٌ لَّا يَسْمَعُونَ بِهَا ۚ أُولَٰئِكَ كَالْأَنْعَامِ
بَلْ هُمْ أَضَلُّ ۚ أُولَٰئِكَ هُمُ الْغَافِلُونَ ﴿١٧٩﴾

179 ఎంతోమంది జిన్నులను, మానవులను మేము నరకం కోసం పుట్టించాము.[227] వారికి హృదయాలున్నాయి. కాని వాటితో వారు ఆలోచించరు. వారికి కళ్లున్నాయి. కాని వాటితో వారు చూడరు. వారికి చెవులున్నాయి. కాని వాటితో వారు వినరు. వారు పశువుల్లాంటివారు. కాదు, వాటికన్నా ఎక్కువగానే దారి తప్పారు. పరధ్యానంలో పడిపోయిన వారంటే వీరే.[228]

وَلِلَّهِ الْأَسْمَاءُ الْحُسْنَىٰ فَادْعُوهُ بِهَا ۖ
وَذَرُوا الَّذِينَ يُلْحِدُونَ فِي أَسْمَائِهِ ۚ
سَيُجْزَوْنَ مَا كَانُوا يَعْمَلُونَ ﴿١٨٠﴾

180 అల్లాహ్‌కు మంచి మంచి పేర్లున్నాయి. కాబట్టి మీరు ఆ పేర్లతో ఆయన్నే పిలవండి.[229] ఆయన పేర్ల విషయంలో వక్రంగా వాదించే వారిని వదలి పెట్టండి.[230] వారు చేస్తూ ఉండినదానికి వారు తప్పకుండా శిక్షించబడతారు.

225. దైవ వాక్యాలను ధిక్కరించటం వల్ల దైవానికి వాటిల్లే నష్టం ఏమీ ఉండదు. ధిక్కరించినవారే నష్టపోతారు. వారి అంతిమ పరిణామం ఘోరంగా ఉండబోతుంది.

226. ఇది దైవప్రణాళికలో అంతర్భాగం. దీని గురించి ఇంతకుముందు రెండు మూడుసార్లు చర్చించటం జరిగింది.

227. ఇది **"విధివ్రాత"** తో ముడిపడి ఉన్న వ్యవహారం. అంటే ప్రతి మనిషీ, ప్రతి జిన్నూ ప్రపంచంలోకి పోయాక అతడు మంచి పనులు చేస్తాడో, చెడు పనులు చేస్తాడో దైవానికి ముందు నుంచే తెలుసు. ఆ విధివ్రాతనే ఆయన వ్రాశాడు. ఈ ఆయతులో నరకాగ్నికి ఆహుతి కాబోయే వారి గురించి ఆయన ప్రస్తావించాడు. వారి లక్షణాలు కొన్నింటిని తరువాతి వాక్యంలో పేర్కొనటం జరిగింది. అటువంటి లక్షణాలు ఎవరిలో పొడసూపినా, వారి పరిణామం దారుణంగా ఉండబోతుందని గ్రహించాలి.

228. కళ్లు, చెవులు, మనోమస్తిష్కాలు దైవ ప్రసాదితాలు. ఈ వరాలను పొందిన మానవుడు వాటిని మహాభాగ్యంగా భావించి, సద్వినియోగం చేసుకోవాలి. వాటికి పదునుపెట్టి దైవాన్ని, సత్యాన్ని శోధించాలి. ఈ అవయవాలను కలిగి ఉండి కూడా వాటిచేత ఈ పని చేయించుకోలేనివాడు దేనికీ పనికిరానివాడే. పైగా అతను 'చతుష్పాదం' కన్నా హీనం అన్నమాట. ఎందుకంటే పొలాల్లో, అడవుల్లో సంచరించే జంతువులు సయితం తమకు కలిగే లాభనష్టాలను కాస్తో కూస్తో బేరీజువేసి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడుతూ ఉంటాయి. కాని అల్లాహ్ ఎవరినయితే అపమార్గాన వదలివేశాడో వారిలో ఈ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా ఉండదు. తమ పాలిట ఏది లాభదాయకం? మరేది నష్టకరం? అనేదాన్ని గురించి వారు బొత్తిగా ఆలోచించరు. అందుకే వారు పరధ్యానానికి, ప్రమత్తతకు లోనైనవారుగా కూడా ఖరారు చేయబడ్డారు.

229. అల్లాహ్‌కు గల ఆ మంచి నామాల ద్వారా ఆయన గుణగణాలు, ఔదార్యం, ఔన్నత్యం, ప్రతాపం వ్యక్తమవుతుంటాయి. బుఖారీ, ముస్లింలలోని హదీసులో అల్లాహ్‌కు 99 పేర్లు ఉన్నట్లు తెలియజేయబడింది. "ఎవరయితే వాటిని గణిస్తూ

وَمِمَّنْ خَلَقْنَآ أُمَّةٌ يَهْدُونَ بِالْحَقِّ وَبِهِۦ يَعْدِلُونَ ﴿١٨١﴾

181 మేము సృష్టించిన వారిలో సత్యాని కనుగుణంగా మార్గదర్శకత్వం వహించే, సత్యాన్ననుసరించి న్యాయంచేసే మానవ సముదాయం కూడా ఒకటుంది.

وَٱلَّذِينَ كَذَّبُوا۟ بِـَٔايَـٰتِنَا سَنَسْتَدْرِجُهُم مِّنْ حَيْثُ لَا يَعْلَمُونَ ﴿١٨٢﴾

182 మా ఆయతులను అసత్యాలని ధిక్కరించిన వారిని మేము–వారికి తెలియకుండానే – క్రమక్రమంగా (మా ఉచ్చులో) బిగిస్తూ పోతాము.

وَأُمْلِى لَهُمْ ۚ إِنَّ كَيْدِى مَتِينٌ ﴿١٨٣﴾

183 వారికి కొంత గడువును ఇస్తున్నాను. నిశ్చయంగా నా వ్యూహం ఎంతో పకడ్బందీగా[231] ఉంటుంది.

أَوَلَمْ يَتَفَكَّرُوا۟ ۗ مَا بِصَاحِبِهِم مِّن جِنَّةٍ ۚ إِنْ هُوَ إِلَّا نَذِيرٌ مُّبِينٌ ﴿١٨٤﴾

184 ఏమిటీ, తమ సహవాసిపై ఏ మాత్రం ఉన్మాద ప్రభావం లేదన్న విషయాన్ని గురించి వారు ఆలోచించలేదా? అతను స్పష్టంగా హెచ్చరించేవాడు మాత్రమే[232] (అతను ఎంతమాత్రం ఉన్మాది కాదు).

ఉంటాడో అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు. అల్లాహ్ బేసి సంఖ్యలో ఉన్నాడు (ఆయన ఒక్కడు). బేసి సంఖ్యను ఆయన ఎంతో ఇష్టపడతాడు" (బుఖారీ–కితాబుద్దావాత్; ముస్లిం – కితాబుజ్జిక్ర్). "గణించటం" అంటే కేవలం లెక్కించటం అని భావించకండి. గణించటంతోపాటు వాటిని దృఢంగా విశ్వసించాలి. చిత్తశుద్ధితో, భక్తితో ఈ నామాలను స్మరించాలి. ఒక్కో నామంలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలి. వాటిని కంఠస్థం చేసుకోవాలి. ఆ గుణగణాలు తమ వ్యక్తిగత జీవితంలో ప్రతిబింబించేలా ప్రవర్తించాలి (మిర్ఖాత్, మిష్కాత్ వ్యాఖ్యాన గ్రంథం). కొన్ని ఉల్లేఖనాలలో 99 నామాలు ప్రస్తావించబడి ఉన్నాయి. కాని ఈ ఉల్లేఖనాలలో బలహీనత ఉంది. ఆ పేర్లు ఉల్లేఖకులు తమ తరఫునుంచి జోడించుకున్నవేగాని, అవి హదీసులో అంతర్భాగం కావని పండితులు తేల్చిచెప్పారు (ఈ విధంగా ఉల్లేఖకులు హదీసుల్లో తమ తరఫున జోడించి చెప్పే మాటలను 'ముద్రజ్' అంటారు). అల్లాహ్ పేర్లు 99 మాత్రమే కావు. అంతకన్నా అధికంగా ఉన్నాయి అని కూడా విద్వాంసులు తెలిపారు (ఇబ్నె కసీర్, ఫత్హుల్ ఖదీర్).

230. అరబీలో **'యుల్హిదూన్'** అని అనబడింది. ఇది 'ఇల్హాద్' నుండి వచ్చింది. 'ఇల్హాద్' అంటే ఒక వైపుకు మొగ్గిపోవటం అని అర్థం. సమాధిలో ఒక ప్రక్కగా తవ్విన గోతిని 'లిహ్ద్' అని పిలుస్తారు. ధర్మంలో ఇల్హాద్కు పాల్పడే వారంటే వక్రీకరణకు ఒడిగట్టే వారు, పెడత్రోవపట్టేవారు అని భావం. దైవనామాల విషయంలో పెడదారి తీసే రకాలు మూడు. 1. అల్లాహ్ పేర్లను మార్చివేయటం. ముష్రిక్కులు ఇదే చేశారు. ఉదాహరణకు : అల్లాహ్కు ప్రత్యామ్నాయంగా తమ తరఫున 'లాత్' అనే పేరున ఒక విగ్రహాన్ని తయారు చేసుకోవటం. అలాగే ఆయన గుణగణాలలో ఒకటైన 'అజీజ్'ను పోలిన 'ఉజ్జా' అనే విగ్రహాన్ని చేసుకోవటం. 2. అల్లాహ్ పేర్లలో తమ తరఫున మరికొన్ని అదనపు పేర్లు చేర్చుకోవటం – ఇందుకు అల్లాహ్ అనుమతించలేదు. 3. అల్లాహ్ నామాలను కుదించటం. ఉదాహరణకు : ఆయనకు గల పేర్లలో ఏదో ఒక్క పేరుతోనే పిలవటం. ఆయన గుణగణాలను సూచించే పేర్లతో పిలవటాన్ని తప్పుగా భావించటం (ఫత్హుల్ ఖదీర్). అల్లాహ్ నామాలను ఇతరత్రా వాటితో పోల్చటం, వాటినుండి ఇతరత్రా అర్థాలు తీయటం కూడా 'వక్రీకరణ' క్రిందికి రావచ్చు (ఐసరుత్తఫాసీర్).

231. ఇది కూడా దేవుని పరీక్షలో భాగమే. వ్యక్తుల విషయంలోనూ, జాతుల విషయంలోనూ దేవుని సంప్రదాయం ఒక్కటే– ప్రతి ఒక్కరికీ ఆయన గడువు ఇస్తాడు. నిర్మాణాత్మక దిశలో సాగిపోతున్నంత కాలం ఆయన పట్టు బిగుసుకోదు.

185 ఏమిటి, ఆకాశాల మరియు భూమి యొక్క వ్యవస్థను, అల్లాహ్ సృష్టించిన ఇతర వస్తువులను వారు గమనించలేదా? వారి కాలం దగ్గరపడి ఉండవచ్చు[233] నన్న సంగతిని గురించి కూడా వారు ఆలోచించలేదా? మరి ఖుర్ఆన్ తరువాత, వారు విశ్వసించే ఇంకొక వస్తువు ఏముంటుంది?[234]

أَوَلَمْ يَنظُرُوا فِي مَلَكُوتِ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا خَلَقَ اللَّهُ مِن شَيْءٍ وَأَنْ عَسَىٰ أَن يَكُونَ قَدِ اقْتَرَبَ أَجَلُهُمْ ۖ فَبِأَيِّ حَدِيثٍ بَعْدَهُ يُؤْمِنُونَ ﴿١٨٥﴾

186 అల్లాహ్ అపమార్గాన వదలి పెట్టేసిన వారిని సన్మార్గం పైకి ఎవరూ తీసుకురాలేరు. వారు తమ తలబిరుసుతనంలోనే తచ్చాడుతూ ఉండేలా అల్లాహ్ వారిని వదలివేస్తాడు.

مَن يُضْلِلِ اللَّهُ فَلَا هَادِيَ لَهُ ۚ وَيَذَرُهُمْ فِي طُغْيَانِهِمْ يَعْمَهُونَ ﴿١٨٦﴾

187 "ఇంతకీ ఆ ఘడియ[235] ఎప్పుడొస్తుందీ?'[236] అని వారు నిన్ను ప్రళయం గురించి అడుగుతున్నారు కదూ! "ఆ జ్ఞానం మాత్రం నా ప్రభువు వద్దనే ఉంది.[237] ఆ సమయం ఆసన్నమై

يَسْأَلُونَكَ عَنِ السَّاعَةِ أَيَّانَ مُرْسَاهَا ۖ قُلْ إِنَّمَا عِلْمُهَا عِندَ رَبِّي ۖ لَا يُجَلِّيهَا لِوَقْتِهَا

ఆయన వదులు ఇస్తూనే ఉంటాడు. కాని వ్యక్తులయినా, జాతులైనా విచ్ఛిన్నకర ధోరణిని అవలంబిస్తూ ఇతరులకు ప్రాణ సంకటంగా పరిణమించే పక్షంలో దేవుని చట్టం నెమ్మదిగా జోక్యం చేసుకుంటుంది. కాని నలువైపుల నుంచీ తాము ముట్టడించబడుతున్నామన్న సంగతి వారికి తెలీదు. ఒక్కసారిగా పట్టుబడినప్పుడు అవాక్కవుతారు.

232. **'సహవాసిగా ఉన్నవాడు'** అంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అని భావం. ఆయన మాంత్రికుడనీ, ఉన్మాది అనీ ముష్రిక్కులు నానా విధాలుగా నిందించేవారు. (దైవం మన్నించుగాక!) కాని వాస్తవానికి ఆయన ఉన్మాది కారు. మీరు మీ మెదడుకు మేత పెట్టకపోవటం వల్ల లేదా మరీ నిర్లక్ష్యంగా ఉండటం మూలంగా మీకిలాంటి లేనిపోని శంక కలుగుతున్నది. ఏ ప్రవక్తను గురించి మీరు ఇలాంటి అభాండాలు మోపుతున్నారో అతను వాస్తవానికి మేము పంపిన ప్రవక్త. అతను మానసికంగా ఎంతో ఆరోగ్యవంతునిగా ఉన్నాడు. మీకు స్వర్గలోక శుభవార్తను అందజేస్తున్నాడు. నరకాగ్ని గురించి భయపెడుతున్నాడు. కాబట్టి మీరు అతని సందేశం పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించకండి అని దేవుడంటున్నాడు.

233. కనీసం ఈ విషయాల గురించైనా వారు చిత్తశుద్ధితో ఆలోచిస్తే యదార్థాలు వారికి తెలిసివస్తాయి. అప్పుడు వారు అల్లాహ్‌ను విశ్వసించి, ప్రవక్తకు విధేయులుగా మసలుకుంటారు. షిర్కును మానుకుంటారు. మరణ ఘడియలు సమీపించినపుడు తాము అవిశ్వాస స్థితిలో ఉండకూడదన్న విషయం వారిని కర్తవ్యోన్ముఖుల్ని చేస్తుంది. కాని వారు అనుదినం తమ కళ్లముందు కదలాడే ఈ దృశ్యాలపై బొత్తిగా ఆలోచించక – నిశ్చింతగా ఉండటం మూలంగా సత్యం కొరకు వారి హృదయకవాటాలు తెరచుకోవటం లేదు.

234. ఆయతులో **'హదీసు'** అనే పదం ప్రయోగించబడింది. ఇక్కడ హదీసు అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం. అంటే అంతిమ దైవప్రవక్త (సఅసం) వారి సందేశాన్ని, ఖుర్ఆన్‌ను విన్న తరువాత కూడా వారు విశ్వసించకపోతే, ఇక వారిని ప్రభావితం చేసే మరో అద్భుత వస్తువు ఏముందనీ?

235. ప్రళయదినం **'ఘడియ'** (السَّاعة) అని ఎందుకు అనబడిందంటే అది ఏ క్షణంలో అకస్మాత్తుగా వచ్చిపడుతుందో ఎవరికీ తెలియదు. అది వచ్చిన మరుక్షణమే విశ్వవ్యవస్థ అంతా తలక్రిందులైపోతుంది.

236. అంటే ప్రళయదినం ఎప్పుడు సంభవిస్తుంది? అని భావం.

237. ఆ సంఘటన ఎప్పుడు సంభవిస్తుంది? అనేది ఏ మానవమాత్రునికి గానీ, దైవదూతకు గానీ తెలీదు. ఈ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే పరిమితం. ఆ సమయం వచ్చినప్పుడు ఆయన స్వయంగా దాన్ని నెలకొల్పుతాడు.

إِلَّا هُوَ ۚ ثَقُلَتْ فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ لَا تَأْتِيكُمْ إِلَّا بَغْتَةً ۗ يَسْأَلُونَكَ كَأَنَّكَ حَفِيٌّ عَنْهَا ۖ قُلْ إِنَّمَا عِلْمُهَا عِندَ اللَّهِ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ ﴿١٨٧﴾

నపుడు ఆయన మాత్రమే దాన్ని ప్రత్యక్షపరుస్తాడు. అది ఆకాశాలలోనూ, భూమిలోనూ మహా బరువైనది (విపత్కరమైన సంఘటన)గా ఉంటుంది.[238] అది అకస్మాత్తుగానే మీపై వచ్చిపడుతుంది" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. నీవు దాని గురించి పరిశోధన చేసి కనుగొన్నట్లే[239] వారు నిన్ను అడుగుతున్నారు. "దాని జ్ఞానం కేవలం అల్లాహ్ వద్ద మాత్రమే ఉంది. కాని చాలా మంది ఈ విషయాన్ని తెలుసుకోరు" అని వారికి చెప్పు.

قُل لَّا أَمْلِكُ لِنَفْسِي نَفْعًا وَلَا ضَرًّا إِلَّا مَا شَاءَ اللَّهُ ۚ وَلَوْ كُنتُ أَعْلَمُ الْغَيْبَ لَاسْتَكْثَرْتُ مِنَ الْخَيْرِ وَمَا مَسَّنِيَ السُّوءُ ۚ إِنْ أَنَا إِلَّا نَذِيرٌ وَبَشِيرٌ لِّقَوْمٍ يُؤْمِنُونَ ﴿١٨٨﴾

**188** (ఓ ప్రవక్తా! వారికి) చెప్పు: "అల్లాహ్ తలచినంత మాత్రమే తప్ప నేను సయితం నా కోసం లాభంగానీ, నష్టంగానీ చేకూర్చుకునే అధికారం నాకు లేదు. నాకే గనక అగోచర విషయాలు తెలిసివుంటే నేనెన్నో ప్రయోజనాలు పొంది ఉండేవాణ్ణి. ఏ నష్టమూ నాకు వాటిల్లేది కాదు. నిజానికి నేను విశ్వసించే వారికి హెచ్చరించేవాణ్ణి, శుభవార్తలు అందజేసేవాణ్ణి మాత్రమే."[240]

هُوَ الَّذِي خَلَقَكُم مِّن نَّفْسٍ وَاحِدَةٍ وَجَعَلَ مِنْهَا زَوْجَهَا لِيَسْكُنَ إِلَيْهَا ۖ

**189** ఆ అల్లాహ్‌యే మిమ్మల్ని ఒకే ప్రాణి (వ్యక్తి) నుంచి పుట్టించాడు.[241] మరి అతని నుండే అతని జంటను కూడా సృష్టించాడు[242] – అతనా జంట ద్వారా ప్రశాంతతను పొంద

238. దీనికి ఇంకొక అర్థం ఏమిటంటే దాని జ్ఞానం భూమ్యాకాశాల వారిపై భారంగా ఉంటుంది. ఎందుకంటే అది గోప్యమైనది. గోప్యమైనది ఎప్పుడూ గుండెలపై బరువుగానే ఉంటుంది.

239. అరబీలో **'హఫియ్యున్' (حَفِيٌّ)** అని ఉంది. వెంటపడి అడగటం, పరిశోధించటం అని దానర్థం. ప్రళయదినం గురించి వారు నిన్ను అడుగుతున్న తీరును చూస్తుంటే, నువ్వు నీ ప్రభువు వెంటపడి మరీ దాని గురించి తెలుసుకున్నావని వారనుకున్నట్టు అనిపిస్తుంది అని పై ఆయతుకు భావం.

240. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారి ఈ సమాధానం ద్వారా తేటతెల్లమయ్యే దేమిటంటే ఆయన(స)కు అగోచర విషయాల జ్ఞానం లేదు. అగోచరాల జ్ఞానం అల్లాహ్‌కే పరిమితం. ఖుర్‌ఆన్ ఈ యదార్థాన్ని ఇంత స్పష్టంగా చెప్పేసినప్పటికీ బిద్అతీలు మహాప్రవక్త (స)ను 'అగోచరాల జ్ఞాని'గా అభివర్ణించటం వారి అజ్ఞానానికీ, అన్యాయానికి నిదర్శనం. ఒక యుద్ధంలో ఆయన (స) ముఖారవిందానికి గాయం కూడా అయింది. ఆయన పల్లు రాలాయి. "తమ ప్రవక్తను సయితం గాయపరచిన ఈ జాతి ఎలా సాఫల్యం పొందుతుంది?" అని ఆయన (స) ఆవేదన చెందటం కూడా మనం గమనించాము. హదీసు సీరత్ గ్రంథాలలో ఈ సంఘటనలన్నీ పొందుపరచబడి ఉన్నాయి. ఆయన ధర్మపత్ని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పై నీలాపనిందలు మోపబడినప్పుడు ఆయన (సఅసం) పూర్తిగా ఒక నెల రోజులపాటు ఎంతో వ్యాకులతకు లోనయ్యారు. ఒక యూద స్త్రీ ఆయన్ని విందుకు ఆహ్వానించి, విందు భోజనంలో విషం కలిపిపెట్టింది. ఆ భోజనాన్ని ఆయన (స)తో పాటు ఆయన సహచరులు కొందరు తిన్నారు కూడా. ఆ విష ప్రభావంతో కొందరు సహచరులు మృత్యువాతన కూడా పడ్డారు. మహాప్రవక్త (స) సయితం జీవితాంతం ఆ విష ప్రభావంతో బాధపడేవారు. ఈ సంఘటనల ద్వారా అవగతమయ్యేదేమిటంటే, నిజంగా ఆయనకు అగోచర విషయాల జ్ఞానం ఉండి ఉంటే ఇన్ని రకాలుగా నష్టపోవలసిన పరిస్థితి ఆయన (స)కు ఎదురయ్యేది కాదు.

فَلَمَّا تَغَشَّاهَا حَمَلَتْ حَمْلًا خَفِيفًا فَمَرَّتْ
بِهِ ۖ فَلَمَّا أَثْقَلَت دَّعَوَا اللَّهَ رَبَّهُمَا لَئِنْ
آتَيْتَنَا صَالِحًا لَّنَكُونَنَّ مِنَ الشَّاكِرِينَ ﴿١٨٩﴾

టానికి![243] ఆ తరువాత అతను తన సహధర్మచారిణితో సమాగమం జరపగా[244] ఆమె ఒక తేలికైన భారం దాల్చింది (గర్భవతి అయింది). ఆమె ఆ భారాన్ని మోసుకుంటూ తిరిగేది.[245] మరి భారం అధికమైనప్పుడు భార్యాభర్తలిరువురూ తమ ప్రభువైన అల్లాహ్‌ను, "నీవు గనక మాకు ఏ లోపమూ లేని బిడ్డను ప్రసాదిస్తే మేము నీకు తప్పకుండా కృతజ్ఞులమై ఉంటామ"ని[246] ప్రార్థించసాగారు.

241. అంటే ఆది మానవుడైన హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) అన్నమాట.

242. జంట అంటే తొలి మానవ జంట అయిన హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) మరియు హజ్రత్ హవ్వాలని భావం. హజ్రత్ హవ్వా హజ్రత్ ఆదం నుంచే సృజించబడ్డారు. మరిన్ని వివరాలకు నిసా సూరాలోని 1వ ఆయతుకు వ్యాఖ్యానం చూడండి.

243. ఏ జీవి అయినా తన జాతికే చెందిన మరో (ఆపోజిట్) ప్రాణితో జతకట్టినప్పుడు మాత్రమే దానికి సుఖం, తృప్తి, ఆనందం, హాయి ప్రాప్తిస్తాయి. తనకు ఈడూ జోడూ లేనంతవరకూ, తన జంటతో కలసి సహజీవనం సాగించనంతవరకూ దాని మనసు కుదుటపడదు. ఈ విషయాన్ని అల్లాహ్ మరోచోట ఈ విధంగా సెలవిచ్చాడు : "అల్లాహ్ సూచనలలో ఒక సూచన ఏమిటంటే ఆయన మీకోసం, స్వయంగా మీ జాతిలోనుంచే జంటలను సృజించాడు– మీరు వారి ద్వారా సుఖం పొందేందుకు! ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలను, పరస్పరం దయా స్వభావాన్ని కూడా పొందుపరచాడు" (అర్రూమ్ – 21). అంటే సృష్టికర్త స్త్రీ – పురుషుల మధ్య అమితమైన ప్రేమను, ఆకర్షణను పొందుపరచాడు. సహజమైన వారి ఈ కోర్కెలు జంటగా ఉన్నప్పుడే – ఆలుమగలుగా కలసి ఉన్నప్పుడే – నెరవేరుతాయి. భార్యకు భర్త ద్వారా, భర్తకు భార్య ద్వారా లభించే ప్రేమాదరణలు, పరస్పర సహాయసహకారాలు వర్ణించనలవి కానివి. లోకంలో ఇంకొకరి ద్వారా ఈ నిజమైన ప్రేమానురాగాలు ప్రాప్తించవు.

244. తొలి మానవ జంట ద్వారా ఏవిధంగా మనుజ జాతి వ్యాపించిందో తెలియజేయబడింది. అరబీలో **'తఘష్షాహా'** (**تَغَشّٰهَا**) అని ఉంది. అంటే పురుషుడు స్త్రీని **'ఆక్రమించాడు'** అని అసలు అర్థం. అంటే రతిక్రీడ కోసం ఆమె వద్దకు పోయాడని భావం.

245. పురుషుని వీర్యకణం స్త్రీ అండంతో కలసి ఫలదీకరణ జరిగినప్పుడు ఆమె గర్భంలో తేలికపాటి భారం మాత్రమే ఉంటుంది. మరి అది పిండంగా మారి, ఆ తరువాత శరీరాకృతి పొందుతున్నప్పుడు క్రమక్రమంగా బరువు పెరుగుతుంది.

246. గర్భస్థ శిశువు పూర్ణపరిణతి పొంది – ప్రసవకాలం సమీపిస్తున్నప్పుడు దంపతుల ఆలోచనలు పరిపరి విధాలుగా పరుగులు తీస్తుంటాయి. తియ్యని కలలతో పాటు మనసులో భయాందోళనలు కూడా చోటుచేసుకుంటాయి. తమకు పుట్టబోయే శిశువు అందంగా ఆరోగ్యంగా ఉండాలనీ, అవిటివాడై ఉండకూడదని ఆశిస్తారు. ఆ బిడ్డ తమకు ఆశాజ్యోతిగా, తమ కంటికి చలువగా ఉండాలని కాంక్షిస్తారు. ఒకవేళ అవిటివాడుగా పుడితే తమ గతేం కావాలి? అన్న శంక కూడా ఒక్కోసారి పీడిస్తూ ఉంటుంది. ప్రసవ వేదన నుంచి ఎలా గట్టెక్కాలి? అన్న భయం కూడా వెంటాడుతూ ఉంటుంది. ప్రసవ సమయంలో భార్యకు ఫిట్స్ లాంటివి రావచ్చునన్న అనుమానం ఉన్నప్పుడు భీతి ఆవరిస్తుంది. అలాంటి పరిస్థితిలో ఆ దంపతులిద్దరూ భయంతోనూ, భక్తితోనూ, ఆశతోనూ తమ ప్రభువును ఆశ్రయించి ఎలాగయినా తమను ఈ గండం నుంచి గట్టెక్కించమనీ, పండంటి బిడ్డను ప్రసాదించమని వేడుకుంటారు. తమ మనోరథాన్ని గనక ఈడేరిస్తే జీవితాంతం రుణపడి ఉంటామని 'మాట' ఇస్తారు.

**190** మరి అల్లాహ్ వారికి (ఏ లోపమూ లేని) బిడ్డను ప్రసాదిం చగానే, ఆ 'ప్రసాదితం'లో వారిద్దరూ ఆయనకు భాగస్వాముల్ని కల్పించటం మొదలెట్టారు.[247] వారు చేసే ఈ భాగస్వామ్య చేష్టలకు అల్లాహ్ అతీతుడు, ఉన్నతుడు.

فَلَمَّآ اٰتٰىهُمَا صَالِحًا جَعَلَا لَهٗ شُرَكَآءَ فِيْمَآ
اٰتٰىهُمَا ۚ فَتَعٰلَى اللّٰهُ عَمَّا يُشْرِكُوْنَ ﴿١٩٠﴾

**191** ఏమిటీ, ఏ వస్తువునూ సృష్టించలేని వారినీ, వారే స్వయంగా ఒకరి చేత సృష్టించబడిన వారిని వీళ్లు (అల్లాహ్‌కు) భాగస్వాము లుగా నిలబెడుతున్నారా?

اَيُشْرِكُوْنَ مَا لَا يَخْلُقُ شَيْـًٔا وَّهُمْ يُخْلَقُوْنَ ﴿١٩١﴾

**192** వారు వీళ్ళకు ఏ సహాయమూ చేయలేరు. కనీసం తమకు తాము కూడా సహాయం చేసుకోలేరు.

وَلَا يَسْتَطِيْعُوْنَ لَهُمْ نَصْرًا وَّلَآ
اَنْفُسَهُمْ يَنْصُرُوْنَ ﴿١٩٢﴾

**193** ఒకవేళ మీరు వారిని సన్మార్గం వైపుకు పిలిస్తే వారు మీ మాట వినరు.[248] మీరు వారిని పిలిచినా, మౌనం వహించినా ఒక్కటే.

وَاِنْ تَدْعُوْهُمْ اِلَى الْهُدٰى لَا يَتَّبِعُوْكُمْ ۗ
سَوَآءٌ عَلَيْكُمْ اَدَعَوْتُمُوْهُمْ اَمْ اَنْتُمْ صَامِتُوْنَ ﴿١٩٣﴾

**194** మీరు అల్లాహ్‌ను వదలి ఎవరెవరిని మొరపెట్టుకుంటున్నారో వారంతా మీలాంటి దాసులే.[249] మీరు మొరపెట్టుకుంటూనే ఉండండి. (ఈ బహుదైవోపాసనలో) మీరు గనక సత్యవంతు లయితే వారు మీ మొరలను ఆలకించి వాటికి సమాధానం ఇవ్వాలి.

اِنَّ الَّذِيْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ عِبَادٌ
اَمْثَالُكُمْ فَادْعُوْهُمْ فَلْيَسْتَجِيْبُوْا لَكُمْ اِنْ
كُنْتُمْ صٰدِقِيْنَ ﴿١٩٤﴾

**195** ఏమిటి, వారు నడవగలగటానికి వారికేమయినా కాళ్లు న్నాయా? వారు దేనినయినా పట్టుకోవటానికి వారికి చేతు లున్నాయా? చూడగలగటానికి వారికి కళ్లున్నాయా?

اَلَهُمْ اَرْجُلٌ يَّمْشُوْنَ بِهَآ ۚ اَمْ لَهُمْ اَيْدٍ يَّبْطِشُوْنَ
بِهَآ ۚ اَمْ لَهُمْ اَعْيُنٌ يُّبْصِرُوْنَ بِهَآ ۚ اَمْ لَهُمْ

247. అల్లాహ్ వారి మనోరథం ఈడేర్చాడు. గండం నుంచి గట్టెక్కారు. పండంటి బిడ్డను కూడా వారు పొందారు. కాని ఆ 'వరప్రసాదం'లో వారు షిర్కుకు ఒడిగట్టడం మొదలెట్టారు. అతని నామకరణం మొదలుకుని మొక్కుబడులు తీర్చేవరకూ వారు చేసే ప్రతి పనిలోనూ 'షిర్కు' చోటు చేసుకుంది. ఆపద సమయంలో నిజదైవం జ్ఞప్తికి వచ్చాడు. ఆపదలు తొలగిపోయాక దర్గాలు, దైవేతర ఆస్థానాలు గుర్తుకు వచ్చాయి. ఇది మనిషిలోని స్వామిద్రోహానికి, ద్వంద్వ స్వభావానికి ఒక నిదర్శనం.

248. అంటే మీరు సూచించిన మార్గాన్ని వారు అనుసరించరు. మీ సలహాలను లక్ష్యపెట్టరు. దీనికి మరో అర్థం : మీరు వారిని మార్గదర్శకత్వం వైపుకు పిలిస్తే మీ మాట వినరు. మీకు ఎలాంటి సమాధానం ఇవ్వరు (ఫత్‌హుల్ ఖదీర్).

249. అంటే, వారు బ్రతికి ఉన్నప్పుడు మీలాగే – మనిషిలా – జీవించారు. ఇప్పుడైతే వారికన్నా మీరే నయం. ఇప్పుడు మీరు చూడగలరు. కాని వారు చూడనైనాలేరు. మీరు వినగలరు. కాని వారు కనీసం విననైనాలేరు. మీరు ఎదుటివారి ఉద్దేశ్యాన్ని గ్రహించగలరు. కాని వారికి ఆ మాత్రం శక్తి కూడా లేదు. మీరు సమాధానం ఇవ్వగలరు. వారు సమాధానం కూడా ఇవ్వలేరు. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే ముష్రిక్కులు ఎవరి విగ్రహాలను తయారుచేసి

اَذَانٌ يَّسْمَعُوْنَ بِهَا ۖ قُلِ ادْعُوْا شُرَكَآءَكُمْ ثُمَّ كِيْدُوْنِ فَلَا تُنْظِرُوْنِ ﴿١٩٥﴾

వినగలగటానికి వారికి చెవులున్నాయా?[250] (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీరు మీ భాగస్వాములందర్నీ పిలుచుకోండి. మరి మీరంతా కలసి నాకు కీడు కలిగించే వ్యూహాన్నీ రచించండి. నాకు కొద్దిపాటి గడువు కూడా ఇవ్వకండి."[251]

اِنَّ وَلِیِّ َۧ اللّٰهُ الَّذِیْ نَزَّلَ الْكِتٰبَ ۖ وَهُوَ یَتَوَلَّى الصّٰلِحِیْنَ ﴿١٩٦﴾

**196** "ఈ గ్రంథాన్ని అవతరింపజేసిన అల్లాహ్‌యే మున్మాటికీ నా సహాయకుడు. సజ్జనులైన దాసుల రక్షకుడు ఆయనే."

وَالَّذِیْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِهٖ لَا یَسْتَطِیْعُوْنَ نَصْرَكُمْ وَلَاۤ اَنْفُسَهُمْ یَنْصُرُوْنَ ﴿١٩٧﴾

**197** "కాగా; మీరు అల్లాహ్‌ను వదలి ఎవరిని పిలుస్తున్నారో వారు మీకు సహాయపడలేరు. తమ స్వయానికి కూడా వారు సహాయం చేసుకోలేరు.[252]

وَاِنْ تَدْعُوْهُمْ اِلَى الْهُدٰى لَا یَسْمَعُوْا ؕ وَتَرٰىهُمْ یَنْظُرُوْنَ اِلَیْكَ وَهُمْ لَا یُبْصِرُوْنَ ﴿١٩٨﴾

**198** "ఒకవేళ మీరు వారికేదయినా చెప్పటానికి పిలిచినా వారు మీ మాటను వినలేరు.[253] వారు నిన్ను చూస్తున్నట్లుగానే నీకు కనిపిస్తుంది. కాని వాస్తవానికి వారసలు ఏమీ చూడలేరు."

خُذِ الْعَفْوَ وَاْمُرْ بِالْعُرْفِ وَاَعْرِضْ عَنِ الْجٰهِلِیْنَ ﴿١٩٩﴾

**199** (ప్రవక్తా!) మన్నింపుల వైఖరిని అవలంబించు.[254] మంచిని ప్రబోధిస్తూ ఉండు.[255] మూర్ఖులను పట్టించుకోకు.[256]

---

పూజిస్తున్నారో వారంతా ఒకప్పుడు మనలాంటి మనుషులే. సహీహ్ బుఖారీలో స్పష్టంగా చెప్పబడినట్లు హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) కాలం నాటి ప్రజలు పూజించే ఐదు విగ్రహాలు అంతకు ముందు గతించిన సజ్జనులే.

250. అంటే – ఇప్పుడు వారివద్ద ఏ శక్తీ మిగిలి ఉండలేదు. మరణం రావటంతోనే వారి కనే, వినే, గ్రహించే శక్తులు నశించాయి. ఇప్పుడు వారి పేరున కల్పించబడిన రాతి విగ్రహాలో, చెట్టుపుట్టలో, గుంపటాలు గోపురాలో, దర్గాలు ఆస్థానాలో మిగిలి ఉన్నాయి అంతే!

251. వారు మీకు సహాయపడతారన్న వాదనలో మీరు సత్యవంతులే అయితే నాకు వ్యతిరేకంగా ఉపాయం ఆలోచించమని వారిని కోరండి.

252. తనకు తాను సాయం చేసుకోలేనివాడు ఇతరులకు ఏం సాయం చేయగల్గుతాడు?

253. 193వ ఆయతులో చెప్పబడిన విషయమే ఇక్కడా చెప్పబడింది.

254. కొంతమంది పండితులు ఈ వాక్యాన్ని "మోతాదుకు మించి వున్న సొమ్ముల్ని మాత్రం తీసుకో" అన్న భావంలో తీసుకున్నారు. ఇది జకాత్ విధిగా చేయబడకముందు ఉన్న ఆదేశం (ఫత్‌హుల్ బారీ–సంపుటి: 8, పేజీ–305). అయితే ఇతర వ్యాఖ్యాతలు దీనిని నైతికోపదేశంగా భావించి 'మన్నింపుల వైఖరిని అవలంబించు' అన్న అర్థంలో తీసుకున్నారు. ఇమామ్ ఇబ్నె జరీర్, ఇమామ్ బుఖారీ తదితరులు ఈ అర్థానికే ప్రాముఖ్యతనిచ్చారు. ఇమామ్ బుఖారీ ఈ ఆయతుకు వ్యాఖ్యానంగా హజ్రత్ ఉమర్ (రజి) గారి ఒక సంఘటనను ఉదాహరించారు : దీని ప్రకారం ఉయైనా బిన్ హిస్న్ అనే ఒక సహచరుడు హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరకు వచ్చి,"మీరు మాకు ఇవ్వవలసినంత హక్కు ఇవ్వటం లేదు. మా మధ్య న్యాయం కూడా చేయటం లేదు" అని తీవ్రంగా విమర్శించారు. ఈ మాటలు విని హజ్రత్ ఉమర్ (రజి) ఆగ్రహం చెందారు. ఈ పరిస్థితిని గమనించిన హజ్రత్ ఉమర్ (రజి) సలహాదారు హుర్ర్ బిన్

**200** షైతాను తరఫు నుంచి ఏదైనా దుష్ప్రేరణ కలిగినట్లయితే అల్లాహ్ శరణు వేడుకో.[257] నిశ్చయంగా ఆయన బాగా వినే వాడు, తెలిసినవాడూను.

وَإِمَّا يَنزَغَنَّكَ مِنَ الشَّيْطَانِ نَزْغٌ فَاسْتَعِذْ بِاللَّهِ ۚ إِنَّهُ سَمِيعٌ عَلِيمٌ ﴿٢٠٠﴾

**201** నిశ్చయంగా అల్లాహ్ భీతిపరులు (ముత్తఖీన్) తమకు ఎప్పుడైనా షైతాన్ తరఫు నుంచి చెడు ఆలోచన తట్టినప్పుడు వారు (తమ ప్రభువు యొక్క ఔన్నత్య) స్మరణలో నిమగ్నులై పోతారు. దాంతో వెంటనే వారికి కనువిప్పు కలుగుతుంది.[258]

إِنَّ الَّذِينَ اتَّقَوْا إِذَا مَسَّهُمْ طَائِفٌ مِّنَ الشَّيْطَانِ تَذَكَّرُوا فَإِذَا هُم مُّبْصِرُونَ ﴿٢٠١﴾

**202** ఇక షైతానుల సోదరులను వారు మార్గవిహీనత వైపుకు లాక్కుపోతుంటారు. (వారిని భ్రష్టు పట్టించటంలో) ఏ లోటూ రానివ్వరు.[259]

وَإِخْوَانُهُمْ يَمُدُّونَهُمْ فِي الْغَيِّ ثُمَّ لَا يُقْصِرُونَ ﴿٢٠٢﴾

---

ఖైస్ (ఉయైనా బిన్ హిస్న్ భ్రాతృజుడు) హజ్రత్ ఉమర్ కోపాన్ని చల్లార్చడానికి దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతును పఠించారు. అంటే "మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని చెయ్యమని ఆదేశించు. మూర్ఖులను పట్టించుకోకు" అన్న దైవోపదేశాన్ని జ్ఞాపకం చేశారు. తరువాత (తన పినతండ్రి అయిన) ఈయనగారు కూడా మూర్ఖుదేననీ, కాబట్టి ఈయన్ని క్షమించి వదలిపెట్టడం ఉత్తమమనీ హజ్రత్ ఉమర్ (రజి) కి సలహా యిచ్చారు. ఈ మాటలు వినగానే హజ్రత్ ఉమర్ (రజి) ఆ వ్యక్తిని క్షమించారు. "దైవగ్రంథంలోని ఆదేశాన్ని విన్నవెంటనే హజ్రత్ ఉమర్ (రజి) దాని ముందు తలవంచేవారు." (సహీహ్ బుఖారీ – అల్ ఆరాఫ్ సూరా వ్యాఖ్యానం). అన్యాయపరుల్ని మన్నించాలనీ, తెగత్రెంపులు చేసుకునేవారితో సంబంధాలను మరింతగా పెంపొందించుకోవాలనీ, చెడును మంచి ద్వారా ఎదుర్కోవాలని ప్రబోధించే ఇతర హదీసుల ద్వారా కూడా ఈ ఆయతు యొక్క ఈ భావానికి సమర్థన లభిస్తోంది.

255. అరబీలో **'ఉర్ఫ్'** అని ఉంది. అంటే అర్థం మారూఫ్ (మంచి).

256. అంటే–మంచిని ప్రబోధించే మీ కర్తవ్యాన్ని మీరు నెరవేర్చిన మీదట కూడా వారు సన్మార్గానికి రాకుండా పిడివాదనకు దిగితే, అటువంటి అజ్ఞానులతో వాదోప వాదాలు జరిపి మీ విలువైన కాలాన్ని వృధా చేయకండి. అలాంటి మూర్ఖులను ఉపేక్షించటమే మంచిది.

257. ఈ నేపథ్యంలో మీరు ఎంతో ఓర్పుతో, నేర్పుతో వ్యవహరించాలి. ఈ అవకాశాన్ని అదనుగా భావించి, షైతాను మిమ్మల్ని రెచ్చగొడతాడు. ప్రత్యర్థుల పట్ల పరిపరి ఆలోచనల్ని రేకెత్తించి, మీలోని ప్రతీకార భావాలను పరాకాష్ఠకు చేర్చే ప్రయత్నం చేస్తాడు. దీనివల్ల మీకు తీవ్రమయిన నష్టం వాటిల్లవచ్చు. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో మీరు షైతాను ప్రేరణల నుంచి, దుష్టశక్తుల కవ్వింపుల నుంచి అల్లాహ్ శరణు వేడుకుంటూ ఉండాలి.

258. షైతాను ప్రేరణల విషయంలో అల్లాహ్ భీతిపరులు అవలంబించే పద్ధతి ఏమిటో యిక్కడ వివరించబడింది. అరబీలో **'తాయిఫ్' (طَائِفٌ)** అని ఉంది. మనసులోగాని లేక కలలోగాని కలిగే భావనల్ని 'తాయిఫ్' లేక 'తీఫ్' అంటారు. ఇక్కడ వీటిని షైతాను ప్రేరణలుగా అభివర్ణించటం గమనించదగిన విషయం. ఎందుకంటే షైతాను ప్రేరణలు కూడా మనోభావనల రూపంలోనే కలుగుతాయి (ఫత్‌హుల్ ఖదీర్).

259. షైతానులు అవిశ్వాసులను మార్గభ్రష్టత్వం వైపుకు లాక్కుపోతారు. ఈ ప్రయత్నంలో వారు ఏ లోటూ రానివ్వరు. అవిశ్వాసులు మార్గభ్రష్టత్వం వైపు వెళ్ళటంలో ఏ లోటూ చేయరు అన్న భావం కూడా వస్తుంది.

وَإِذَا لَمْ تَأْتِهِم بِآيَةٍ قَالُوا لَوْلَا اجْتَبَيْتَهَا ۚ قُلْ إِنَّمَا أَتَّبِعُ مَا يُوحَىٰ إِلَيَّ مِن رَّبِّي ۚ هَٰذَا بَصَائِرُ مِن رَّبِّكُمْ وَهُدًى وَرَحْمَةٌ لِّقَوْمٍ يُؤْمِنُونَ ﴿٢٠٣﴾

**203** నీవు వారి ముందు ఏదైనా మహిమను ప్రదర్శించకపోతే, "నువ్వీ మహిమను ఎందుకు తేలేదు?"[260] అని వారంటారు. "నా ప్రభువు తరఫునుంచి నాకు పంపబడిన ఆదేశాన్ని మాత్రమే నేను అనుసరిస్తాను. విశ్వసించేవారికి ఇందులో (దివ్య ఖుర్ఆన్‌లో) మీ ప్రభువు తరఫు నుంచి ఎన్నో నిదర్శనాలున్నాయి. ఇది మార్గదర్శకత్వం మరియు కారుణ్యం "[261] అని ఓ ప్రవక్తా! వారికి తెలియజెయ్యి.

وَإِذَا قُرِئَ الْقُرْآنُ فَاسْتَمِعُوا لَهُ وَأَنصِتُوا لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴿٢٠٤﴾

**204** దివ్య ఖుర్ఆన్ పారాయణం జరుగుతున్నప్పుడు దానిని శ్రద్ధగా వినండి, నిశ్శబ్దంగా ఉండండి. తద్వారా మీరు కరుణించబడవచ్చు.[262]

260. అంటే; వారు కోరినప్పుడల్లా, వారు కోరిన మహిమనల్లా వారికి చూపుతూ ఉండాలన్న మాట! వారి డిమాండ్లు ఏ రీతిలో ఉంటాయో బనీ ఇస్రాయీల్ సూరాలోని 90 – 93 ఆయతులలో వివరించబడ్డాయి.

261. ఓ ప్రవక్తా! వారికి చెప్పు : మహిమలను ప్రదర్శించే అధికారం సమస్తం నా ప్రభువు అధీనంలో ఉంది. నేను నాకు అందజేయబడే వహీ (దైవవాణి)ని అనుసరించేవాణ్ణి మాత్రమే. మహిమల పట్ల మీకు అంతగా మోజుంటే ఈ ఖుర్ఆన్‌నే చూడండి. ఖుర్ఆన్ ఖుద్దుగా ఒక గొప్ప మహిమ. ఇందులో మీ ప్రభువు తరఫునుంచి జ్ఞాన జ్యోతులు (నిదర్శనాలు, ఆధారాలు) ఉన్నాయి. మీ కొరకు మార్గదర్శకత్వం ఉంది. కారుణ్యం ఉంది. మీరు దీన్ని విశ్వసించి, మీ హృదయాలకు హత్తుకోవాలి. అయితే విశ్వాసం లేనంతవరకూ అది మీ మనోక్షేత్రంలో నాటుకోదు.

262. అవిశ్వాసులనుద్దేశించి చెప్పబడిన మాటలివి. ఆనాడు దివ్య ఖుర్ఆన్‌ను వినిపిస్తున్నప్పుడు అవిశ్వాసులు గలాటా చేసేవారు. "ఈ ఖుర్ఆన్‌ను వినకండి, గలాటా చేయండి" అని తమ వర్గంవారిని ఉసిగొల్పేవారు (హామీమ్ అస్సజ్దహ్-26). మీరు ఇలా గొడవచేసే బదులు ప్రశాంతంగా వింటే, దానిపై చింతన చేస్తే బహుశా దేవుడు మీపై దయదలచి, మీకు సన్మార్గ భాగ్యం ప్రసాదించవచ్చని వారికి హితబోధ చేయటం జరిగింది. 'ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండండి' అన్న ఆదేశాన్ని కొందరు ఇమాములు సర్వసాధారణమైన ఆదేశంగా పరిగణించారు. ప్రతి ఒక్కరికీ ఈ ఆదేశం వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు. అంటే ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఖుర్ఆన్ పఠిస్తున్నా– నమాజులో పఠిస్తున్నా, మరితర సమయాలలో పఠిస్తున్నా – అందరూ నిశ్శబ్దంగా దాన్ని వినాల్సిందేననీ వ్యాఖ్యానించారు. ఈ సూత్రం ప్రకారం ఖుర్ఆన్ బిగ్గరగా పఠించబడే సామూహిక నమాజులలో ఇమాము వెనుక నిలబడి ఉన్నవారు (ముఖ్తదీలు) ఫాతిహా సూరాను పఠించటం కూడా 'నియమోల్లంఘన' క్రిందికే వస్తుందని చెప్పారు.

కాని ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే ఖుర్ఆన్ బిగ్గరగా చదివే నమాజులలో ఇమాము వెనుక నిలబడి ఉన్నవారంతా ఫాతిహా సూరా పఠించాలని మహాప్రవక్త (సఅసం) స్వయంగా చెప్పి ఉన్నారు. ప్రామాణిక హదీసుల ద్వారా ఈ సంగతి రూఢీ అవుతోంది. కాబట్టి ఈ ఆయతులోని 'దైవాజ్ఞ' అవిశ్వాసులకు మాత్రమే వర్తిస్తుందని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఈ సూరా మక్కాలో అవతరించిన సూరా అవటం వల్ల కూడా వీరి అభిప్రాయానికి సమర్థన లభిస్తోంది. ఒకవేళ ఈ దైవాదేశాన్ని సర్వసాధారణమైన ఆదేశంగా భావించినా, దైవప్రవక్త (సఅసం) ముక్తదీలకు ఈ ఆజ్ఞ నుంచి వినాయింపు ఇచ్చి ఉన్నారు. కనుక ఈ సర్వసాధారణమైన ఆజ్ఞ ముక్తదీలకు మాత్రం వర్తించదు. వారు జహ్రీ నమాజుల్లో సైతం ఇమాము వెనుక ఫాతిహా సూరా పఠించటం అవసరం. ఖుర్ఆన్‌లోని ఈ సర్వసాధారణమైన ఆజ్ఞను ప్రామాణికమైన, దృఢమైన హదీసులే ప్రత్యేకిస్తున్నాయన్న విషయం గమనార్హం. ఖుర్ఆన్‌లోని ఇటువంటి సర్వసాధారణమైన ఆజ్ఞల్ని హదీసుల ద్వారా ప్రత్యేకించే పద్ధతికి

وَاذْكُرْ رَّبَّكَ فِي نَفْسِكَ تَضَرُّعًا وَّخِيفَةً وَّدُونَ الْجَهْرِ مِنَ الْقَوْلِ بِالْغُدُوِّ وَالْآصَالِ وَلَا تَكُنْ مِّنَ الْغٰفِلِيْنَ ﴿٢٠٥﴾

**205** నీవు నీ మనసులోనే – కడు వినమ్రతతో, భయంతో – నీ ప్రభువును స్మరించు. ఉదయం, సాయంత్రం బిగ్గరగా కాకుండా మెల్లగా నోటితో కూడా (స్మరించు). విస్మరించే వారిలో చేరిపోకు.

إِنَّ الَّذِيْنَ عِنْدَ رَبِّكَ لَا يَسْتَكْبِرُوْنَ عَنْ عِبَادَتِهٖ وَيُسَبِّحُوْنَهٗ وَلَهٗ يَسْجُدُوْنَ ﴿٢٠٦﴾

**206** నీ ప్రభువుకు చేరువలో ఉన్నవారు ఆయన ఆరాధన పట్ల గర్వాతిశయంతో మెలగరు. పైగా వారు (అణకువతో) ఆయన పవిత్రతను కొనియాడుతూ, ఆయన ముందు సాష్టాంగపడుతూ ఉంటారు.

మరెన్నో ఉదాహరణలున్నాయి. ఉదాహరణకు "వ్యభిచారం చేసిన స్త్రీ పురుషులిరువురికీ కొరడా దెబ్బలు కొట్టండి" (అన్ నూర్ : 2) అన్న సర్వసాధారణమైన ఆజ్ఞ నుంచి వివాహితులైన వ్యభిచారులను మినహాయిస్తారు. "దొంగతనం చేసిన పురుషుడు, దొంగతనం చేసిన స్త్రీ – ఇరువురి చేతులనూ నరకండి" (మాయిద: 38) అన్న సర్వసాధారణమైన ఆదేశం నుంచి పావు దీనారు కంటే తక్కువ విలువను కలిగివున్న వస్తువును లేక భద్రంగా లేని వస్తువులను దొంగిలించిన వారిని మినహాయిస్తారు. ఇలాంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. అలాగే పై ఆయతులోని "శ్రద్ధగా వినండి, నిశ్శబ్దంగా ఉండండి" అన్న సర్వసాధారణమైన ఆజ్ఞ నుంచి ముక్తదీలకు వినాయింపు లభిస్తుంది. జహ్రీ నమాజుల్లో కూడా వారు ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించటం అనివార్యం. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) ఈ మేరకు గట్టిగా తాకీదు చేసి ఉన్నారు (ఈ గ్రంథం ప్రారంభంలోని ఫాతిహా సూరా వ్యాఖ్యానంలో ఆ హదీసులు పేర్కొనబడ్డాయి).

8 వ సూరా

# అల్ అన్‌ఫాల్

## యుద్ధప్రాప్తి

అవతరణ మదీనాలో

ఆయతులు 75

### పరిచయం

*ఈ సూరాలో ముఖ్యంగా బద్ర్ యుద్ధాన్ని ప్రస్తావించడం జరిగింది. క్రీ.శ. 624లో అంటే హిజ్రీ శకం 2లో బద్ర్ యుద్ధం జరిగింది. అప్పుడప్పుడే రూపురేఖలు దిద్దుకుంటున్న మదీనాలోని ముస్లిం సమాజానికి ఈ యుద్ధం ఒక కీలకమైన మలుపు అయ్యింది. పూర్తిగా అల్లాహ్‌పై ఆధారపడటాన్ని ఈ సూరా ప్రముఖంగా ప్రస్తావించింది. విజయానికి కావలసినవి సహనం, దైవభక్తి, దైవభీతి మాత్రమే అని నొక్కి చెప్పింది. యుద్ధ సమయంలో, యుద్ధ రంగంలో పాటించవలసిన యుద్ధ నియమాలను ఈ సూరాలో చెప్పడం జరిగింది. యుద్ధ నియమాలు, యుద్ధ ఖైదీలతో వ్యవహరించవలసిన తీరు, యుద్ధసొత్తు, యుద్ధ విరమణ, శాంతి ఒప్పందాలకు సంబంధించిన నియమ నిబంధనలను ఈ సూరా తెలియజేసింది. ఈ సూరాలో యుద్ధ ప్రణాళికలు, సైనికుల సంఖ్య గురించిన ప్రస్తావనతో పాటు, యుద్ధ సామగ్రికి సంబంధించిన బలహీనతల విషయంలో తగిన శ్రద్ధ చూపాలని బోధించింది. ముస్లిం సైనికులను ఉద్దేశిస్తూ ధైర్యంగా, మడమ తిప్పని దృఢచిత్తంతో శత్రువులను ఎదుర్కోవాలని ప్రోత్సహించింది. అల్లాహ్ ఆదేశాలను, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆదేశాలను అమలు చేయాలని, ధైర్యసాహసాలతో స్థిరంగా యుద్ధం చేయాలనీ, యుద్ధరంగం నుంచి వెన్నుచూపి పారిపోరాదనీ, సైనిక రహస్యాలను శత్రువుకు చెప్పరాదనీ, అభిప్రాయభేదాలను తొలగించుకోవాలనీ, యుద్ధసొత్తుపై దృష్టి పెట్టరాదనీ, యుద్ధానికి ముఖ్య లక్ష్యం ప్రాపంచిక సంపద కారాదని ఉద్బోధించింది.*

*యుద్ధ సమయంలోను, యుద్ధ విరమణ, శాంతి సంప్రదింపుల సమయాల్లో కూడా శత్రువుతో చర్చలు సాధ్యమే అని ఈ సూరా చెప్పింది. ఇస్లామ్ సందేశాన్ని ప్రస్తావిస్తూ, ఇహపరలోకాల్లో సంతోష సాఫల్యాలను సాధించే సందేశంగా నొక్కి చెప్పింది. వర్ణం, జాతి, హోదాలు ఏవయినాగాని ముస్లిములందరూ ఒక్కటే అని ఈ సూరా ఉద్బోధిస్తుంది. ధార్మిక విశ్వాసం, దైవభీతి, దేవుని ఏకత్వం పునాదులపై ఏకమైన ఒకే జాతిగా ముస్లిములను అభివర్ణించింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 7-17 | 250 | 'బద్ర్ యుద్ధం' | బద్ర్ యుద్ధానికి దారితీసిన పరిస్థితులేవి? ఈ యుద్ధంలో విజయం ఎవరిని వరించింది? యుద్ధానంతరం దైవప్రవక్త (స) మక్కా ఖైదీల పట్ల ఎలా వ్యవహరించారు? |
| 52 | 97, 51<br>28, 22<br>18 | 'సముద్రం చీలటం' 'హెచ్చరించే దూతలు' 'అల్లాహ్ పథకం' 'నిష్ఫలం' 'జలప్రళయం' | ఫిర్ఔనీయులకు ఏ గతి పట్టింది? వారికి పూర్వం గతించిన వారంటే ఎవరు? వారిలో ఎవరెవరిపై ఏఏ రకాల శిక్షలు అవతరించాయి? |

## అల్ అన్‌ఫాల్ సూరా

## سُوْرَةُ الْاَنْفَالِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** వారు నిన్ను యుద్ధప్రాప్తి (అన్‌ఫాల్) గురించి అడుగుతున్నారు.[1] (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఈ యుద్ధప్రాప్తి (అన్‌ఫాల్) అల్లాహ్‌కు, ప్రవక్తకు చెందినవి.[2] కాబట్టి మీరు అల్లాహ్‌కు భయపడండి. మీ పరస్పర సంబంధాలను చక్కదిద్దుకోండి. మీరు విశ్వసించినవారే అయితే అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి."[3]

يَسْـَٔلُوْنَكَ عَنِ الْاَنْفَالِ ۭ قُلِ الْاَنْفَالُ لِلّٰهِ وَالرَّسُوْلِ ۚ
فَاتَّقُوا اللّٰهَ وَاَصْلِحُوْا ذَاتَ بَيْنِكُمْ ۠ وَاَطِيْعُوا
اللّٰهَ وَرَسُوْلَهٗٓ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ①

**2** నిజమైన విశ్వాసులు ఎటువంటి వారంటే – అల్లాహ్ ప్రస్తావన రాగానే వారి హృదయాలు భయంతో వణుకుతాయి. అల్లాహ్ ఆయతులు వారి ముందు పఠించబడినపుడు, అవి వారి విశ్వాసాన్ని మరింత వృద్ధిచేస్తాయి. వారు తమ ప్రభువునే నమ్ముకుంటారు.[4]

اِنَّمَا الْمُؤْمِنُوْنَ الَّذِيْنَ اِذَا ذُكِرَ اللّٰهُ وَجِلَتْ
قُلُوْبُهُمْ وَاِذَا تُلِيَتْ عَلَيْهِمْ اٰيٰتُهٗ زَادَتْهُمْ
اِيْمَانًا وَّعَلٰي رَبِّهِمْ يَتَوَكَّلُوْنَ ②

1. **'అన్‌ఫాల్' (انفال)** అనేది 'నఫిల్' అనే పదానికి బహువచనం. 'నఫిల్' అంటే 'అదనం' అని అసలు అర్థం. ధర్మ సంస్థాపనార్థం సత్య తిరస్కారులతో యుద్ధానికి తలపడినప్పుడు ప్రాప్తించే సొమ్ములను 'అన్‌ఫాల్' అంటారు. ఈ సొమ్ములను మాలె గనీమత్ (విజయధనం, యుద్ధప్రాప్తి) గా కూడా వ్యవహరిస్తారు. దీన్ని 'నఫిల్' అనడానికి మరో కారణమేమంటే గతించిన సమాజాలపై ఈ సొమ్ము నిషిద్ధం అయి ఉండేది. కాగా; ముహమ్మద్ (సఅసం) అనుచర సమాజం కోసం ఇది ధర్మసమ్మతం గావించబడింది. లేదా ధర్మయుద్ధం (జిహాద్) చేసినందుకు (పరలోకంలో) ఎలాగూ పుణ్యఫలం లభిస్తుంది. అయితే అదనంగా కొంత ప్రతిఫలం ఇహలోకంలోనే వారికి ఇచ్చే ఉద్దేశంతో యుద్ధప్రాప్తిని ముస్లిముల కోసం దేవుడు ఆమోదించాడు.
2. అంటే – యుద్ధప్రాప్తిని ఎప్పుడు, ఎలా పంచాలి? ఎవరికెంత ఇవ్వాలి? అనే విషయాన్ని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త చూసుకుంటారు. దైవాదేశానుసారం దైవప్రవక్త ఈ సొమ్మును పంచిపెడతారు. దాని గురించి మీరు ఆదుర్దా చెందనవసరం లేదు. మీ ఇష్టానుసారం మీరు పంచుకోవటం కూడా తగదు అని దీని భావం.
3. పై ఆయతులో పేర్కొనబడిన ఈ మూడు విషయాలకు కట్టుబడి ఉండనంతవరకూ మీ విశ్వాసం పరిపూర్ణం కాజాలదు. అవేమంటే – 1. దైవానికి భయపడుతూ ఉండాలి. 2. పరస్పర సంబంధాలు సజావుగా ఉండేలా జాగ్రత్తపడాలి. 3. దైవానికి, దైవ ప్రవక్త(స)కు సదా విధేయత కనబరచాలి. ముఖ్యంగా యుద్ధప్రాప్తిని పంపిణీ చేస్తున్నప్పుడు ఎంతో నిగ్రహంతో ఈ మూడు ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించవలసి ఉంటుంది. ఎందుకంటే సొమ్ముల పంపకం అంతర్యంలో అసూయా ద్వేషాలను రగుల్గొల్పి పరస్పరం కత్తులు దూసుకునే పరిస్థితిని సృష్టించవచ్చు. ఈ రోగాన్ని నయం చేయడానికి పరస్పరం అన్నదమ్ముల్లా మెలగటం, త్యాగ నిరతిని కల్గిఉండటం అవసరం. సొమ్ములు పంచబడుతున్నప్పుడు కక్కుర్తిపడే స్వభావం ఉత్పన్నం కావచ్చు. అందుకే 'తఖ్వా' (దైవభీతి) ఎంతైనా అవసరం. ఇంతచేసినా ఎక్కడయినా, ఏదైనా వెలితి ఏర్పడితే 'దైవం మరియు దైవప్రవక్త (స) యెడల గల విధేయతా భావం' సర్దుకుపోయేలా చేస్తుంది.
4. ఈ ఆయతులలో విశ్వాసుల నాలుగు ముఖ్య లక్షణాలు పేర్కొనబడ్డాయి : 1. వారు కేవలం అల్లాహ్‌కు మాత్రమే

الَّذِينَ يُقِيمُونَ الصَّلٰوةَ وَمِمَّا رَزَقْنٰهُمْ يُنْفِقُونَ ③

3 వారు నమాజును నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదిం చిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చుపెడతారు.

أُولٰٓئِكَ هُمُ الْمُؤْمِنُونَ حَقًّا ۚ لَهُمْ دَرَجٰتٌ عِنْدَ رَبِّهِمْ وَمَغْفِرَةٌ وَرِزْقٌ كَرِيمٌ ④

4 నిజమైన విశ్వాసులంటే వీరే. వీరి కొరకు వీరి ప్రభువు వద్ద ఉన్నత స్థానాలు ఉన్నాయి. మన్నింపు ఉంది. గౌరవప్రదమైన ఆహారం ఉంది.

విధేయులై ఉందరు. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు కూడా విధేయత చూపుతారు. మరోవిధంగా చెప్పాలంటే వారు కేవలం ఖుర్‌ఆన్‌ను అనుసరించరు. ఖుర్‌ఆన్‌తో పాటు హదీసులను కూడా అనుసరిస్తారు. 2. అల్లాహ్ ప్రస్తావన వచ్చినప్పుడు ఒక్కసారిగా ఆయన ప్రతాపం, ఔన్నత్యం వారి మనసుల్లో మెదలుతుంది. దాంతో వారి హృదయాలు భీతితో కంపిస్తాయి. 3. దివ్య ఖుర్‌ఆన్ పారాయణం వల్ల వారి 'విశ్వాసం' (ఈమాన్) మరింత పెరుగుతుంది. (దీన్ని బట్టి బోధపడేదేమిటంటే విశ్వాసంలో తరుగుదల – పెరుగుదల అనేవి జరుగుతుంటాయి. హదీసువేత్తల దృక్పథం కూడా ఇదే). 4. వారు తమ ప్రభువునే నమ్ముకుంటారు. దీన్నే 'తవక్కుల్' అంటారు. బాహ్యంలో చేయ వలసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లన్నీ చేసి, తరువాత ఆ వ్యవహారాన్ని దైవానికి అప్పగించటమే 'తవక్కుల్'. అంటే మనిషి తన విచక్షణాజ్ఞానాన్ని ఉపయోగించి, ప్రయత్నంలో ఏ లోటూ రానివ్వకుండా జాగ్రత్త పడటంతోపాటు, తన స్వయం కృషిపై మాత్రమే ధీమాను వ్యక్తం చేయకుండా, అల్లాహ్ తలిస్తే ఆ లక్ష్యం సిద్ధిస్తుంది అని దృఢనమ్మకం కలిగి ఉండటమన్నమాట! ఎందుకంటే అల్లాహ్ తలచుకోనంతవరకూ మనిషి లక్ష్యం ఏదీ సిద్ధించదు– అతను తన ప్రయత్నంలో ఎంత పకడ్బందీగా వ్యవహరించినాసరే. అందుకే నిజమైన విశ్వాసులకు తమ కార్యదక్షతపై, కృషిపై ఎంత ధీమా ఉన్నప్పటికీ అనుక్షణం వారు దైవసహాయాన్ని, దైవసమ్మతిని కోరుకుంటూ ఉంటారు. దేవుని అండదండలు లేకుండా ఏదీ సాధించలేమని దృఢ నమ్మకం కలిగి ఉంటారు. ఈ విషయంలో వారు ఎన్నడూ అలసత్వానికి, పరధ్యానానికీ, ప్రమత్తతకు లోనుకారు. తరువాతి ఆయతులలో వారి మరికొన్ని లక్షణాలు పేర్కొనబడ్డాయి. వాటి ద్వారా వారికి లభించే అంతస్తులు ఏమిటో విశదీకరించబడ్డాయి.

**బద్ర్ యుద్ధ పూర్వాపరాలు:** బద్ర్ యుద్ధం నేపథ్యంలోనే ఈ ఆయతులు అవతరించాయి. చరిత్రగతిని మార్చిన ఈ చారిత్రక యుద్ధం హిజ్రీ 2వ సంవత్సరంలో జరిగింది. విశ్వాసులకు – అవిశ్వాసులకు మధ్య జరిగిన తొలి సంగ్రామం అది! అదీగాక ఈ యుద్ధం ఎలాంటి సన్నాహాలు, పథకాలు లేకుండా అకస్మాత్తుగా జరిగింది. ఆయుధాలు, సాధనసంపత్తులు బొత్తిగా లేకపోవటం వల్ల కొంతమంది ముస్లిములు ఈ యుద్ధం కోసం మానసికంగా సిద్ధమైలేరు. (అప్పటికింకా ముస్లిం కాని) అవిశ్వాసుల నాయకుడు అబూ సుఫ్యాన్ సారథ్యంలో ఒక వర్తకబిడారు సిరియా నుంచి మక్కా వైపుకు సాగిపోతోంది. మరోవైపు మదీనాలోని ముహాజిర్ ముస్లిముల ఆర్థికపరిస్థితి దయనీయంగా ఉంది. ఎందుకంటే వారు దైవమార్గంలో ఇల్లూ వాకిలినీ, ఆస్తిపాస్తులను, ఉత్పత్తి కారకాలను – అన్నింటినీ మక్కాలో వదలివచ్చేశారు. వాటన్నింటినీ అవిశ్వాసులు కబళించారు. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా మక్కా అవిశ్వాసుల మదాన్ని అణచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందువల్ల ఈ వర్తక బిడారుపై దాడి చేయాలని మహాప్రవక్త (స) సంకల్పించుకున్నారు. ఈ సంకల్పంతోనే ముస్లింలు మదీనా నుంచి బయలుదేరారు. ఈ సమాచారం అబూ సుఫ్యాన్‌కు అందింది. దాంతో ఆయన తన వర్తకబిడారు పయనించే దిశను మార్చటమేగాక, మక్కాకు కబురంపారు. ఈ వార్త అబూజహల్ ఆవేశాన్ని మరింత పెంచింది. హుటాహుటిన ఒక సైనిక దళాన్ని తీసుకుని తమ వర్తక బిడారు వచ్చే బద్ర్ వైపుకు దూసుకుపోయాడు అబూ జహల్. ఈ కదలికలను సునిశితంగా గమనించిన మహాప్రవక్త (సఅసం) తన సహచరులతో సంప్రతింపులు జరిపారు. దైవ వాగ్దానాన్ని కూడా గుర్తు చేశారు. వర్తక బిడారుగానీ, సైనిక దళంగానీ – ఈ రెంటిలో ఏదో ఒకటి తమ వశం కాబోతుందని తెలియజేశారు. అకస్మాత్తుగా యుద్ధం అనేసరికి కొంతమంది ముస్లిములు వెనుకంజవేశారు. కాని ఇతర సహచరులు మాత్రం దైవప్రవక్త (స)తో కలసి శత్రువుతో తలపడటమే మంచిదని సలహా యిచ్చారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయతులు అవతరించాయి.

**5** (ఈ అన్‌ఫాల్ వ్యవహారంలో కూడా ఇదివరకు ఉత్పన్నమైన పరిస్థితి వంటిదే ఉత్పన్నమవుతోంది. అప్పుడు) నీ ప్రభువు నిన్ను సత్యంతో నీ గృహం నుంచి బయటకు తీసుకువచ్చాడు.[5] విశ్వసించిన వారిలోని ఒక వర్గం వారికి ఇది ఇష్టంలేదు.[6]

كَمَآ أَخْرَجَكَ رَبُّكَ مِنۢ بَيْتِكَ بِٱلْحَقِّ
وَإِنَّ فَرِيقًا مِّنَ ٱلْمُؤْمِنِينَ لَكَٰرِهُونَ ⑤

**6** వారు ఈ సత్యం గురించి – అది సత్యమని స్పష్టం అయిన తరువాత కూడా[7] – తాము మృత్యువు వైపుకు తరుమబడుతున్నట్లు, దాన్ని తాము కళ్ళారా చూస్తున్నట్లుగానే (భీతిల్లి) నీతో వాదులాటకు దిగారు.[8]

يُجَٰدِلُونَكَ فِى ٱلْحَقِّ بَعْدَ مَا تَبَيَّنَ كَأَنَّمَا
يُسَاقُونَ إِلَى ٱلْمَوْتِ وَهُمْ يَنظُرُونَ ⑥

**7** ఆ రెండు బృందాలలో ఏదో ఒక బృందం మీ చేతికి చిక్కుతుందని[9] అల్లాహ్ మీకు వాగ్దానం చేసిన సమయాన్ని ఓసారి జ్ఞాపకం చేసుకోండి! అప్పుడు మీరు నిరాయుధులైన బృందం చేజిక్కాలని ఉబలాటపడ్డారు.[10] అదే సమయంలో అల్లాహ్ తన ఆదేశాల ద్వారా సత్యాన్ని సత్యంగా తేటతెల్లం చేసి, అవిశ్వాసులను కూకటి వేళ్లతో పెకలించాలని సంకల్పించుకున్నాడు.

وَإِذْ يَعِدُكُمُ ٱللَّهُ إِحْدَى ٱلطَّآئِفَتَيْنِ
أَنَّهَا لَكُمْ وَتَوَدُّونَ أَنَّ غَيْرَ ذَاتِ ٱلشَّوْكَةِ
تَكُونُ لَكُمْ وَيُرِيدُ ٱللَّهُ أَن يُحِقَّ ٱلْحَقَّ
بِكَلِمَٰتِهِۦ وَيَقْطَعَ دَابِرَ ٱلْكَٰفِرِينَ ⑦

5. ఈ మాటల్లోని ఆంతర్యం ఏమిటంటే "యుద్ధప్రాప్తి" పంపకం విషయంలో ముస్లింల మధ్య భిన్నాభిప్రాయాలు పొడసూపినట్లే అంతకుముందు శత్రువులను ఎదుర్కొనే విషయంలో కూడా రెండు రకాల అభిప్రాయాలు ముందుకు వచ్చాయి. యుద్ధప్రాప్తిని పంపిణీ చేసే అధికారం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు ఉండటం ఒక విధంగా ముస్లింలకు శ్రేయోదాయకం అయింది. అదేవిధంగా నిరాయుధులైన వర్తక బిడారును ఎదుర్కొనే బదులు సమర సన్నాహాలతో వచ్చిన ఖురైషు సైనికులను ఎదుర్కొనే పరిస్థితిని కల్పించి అల్లాహ్ ముస్లింలకు అపారమైన మేలు చేశాడు. ఈ నిర్ణయం వల్ల అల్లాహ్ తన వాగ్దానం సత్యమని నిరూపించాడు. బద్ర్ సంగ్రామం వల్ల ముస్లింల ఆత్మస్థయిర్యం ఎన్నో రెట్లు పెరిగింది. అదే సమయంలో మక్కా అవిశ్వాసులకు నడుం విరిగినంత పనయింది. కాబట్టి అల్లాహ్ మీకు చేసిన ఉపకారాలను మరచిపోకండి. అదనంగా ప్రాప్తించిన సొమ్ముల విషయంలో అనవసరంగా గొడవపడి, మీ మధ్యగల సంఘీభావాన్ని పాడు చేసుకోకండి. ఎట్టి పరిస్థితిలోనూ మీకు మేలు చేకూరాలన్నదే అల్లాహ్ అభిమతం.

6. ఖురైషు సైన్యాన్ని ఎదుర్కోవటం పట్ల వ్యక్తమయిన అయిష్టత ఇది. కొద్దిమంది మాత్రమే ఈ విధంగా అభిప్రాయపడ్డారు. అదీ తమవద్ద ఆయుధ సామగ్రి లేకపోవటం వల్ల వర్తక బిడారును లక్ష్యంగా పెట్టుకోవటం మంచిదన్నది వారి ఉద్దేశం. మదీనా నగరం పొలిమేరలు దాటి ముందుకు పోరాదన్నది వారి అభిమతం కాదు.

7. అంటే – వర్తక బృందం ఎలాగో తప్పించుకుని వెళ్ళిపోయిందనీ, ఇక ఖురైషు సైనికులను ప్రతిఘటించటమే తమ ముందున్న కర్తవ్యమన్న సంగతి ప్రస్ఫుటం అయింది.

8. ముస్లింలలో నెలకొన్న ఈ ఆందోళనకు కారణం వారి దగ్గర ఆయుధ ఒనరులు లేకపోవటమే. కాని వారొకటి ఊహిస్తుండగా, దైవప్రణాళిక మరోవిధంగా ఉంది.

9. అంటే వర్తకబిడారు మీకు దొరికితే యుద్ధం జరగకుండానే వాణిజ్య సామగ్రి అంతా మీకు దక్కుతుంది. ఒకవేళ సైనిక వర్గమే గనక మీకు ఎదురుపడితే యుద్ధం జరుగుతుంది. యుద్ధంలో గెలుపుతో పాటు, యుద్ధప్రాప్తి కూడా మీ స్వంతమవుతుంది.

8 అపరాధులకు ఎంతగా సహించరానిదయినా సరే[11] సత్యం సత్యంగా, అసత్యం అసత్యంగా నిగ్గుతేలాలన్నది (ఆయన అభిమతం).

لِيُحِقَّ الْحَقَّ وَيُبْطِلَ الْبَاطِلَ وَلَوْ كَرِهَ الْمُجْرِمُونَ ﴿٨﴾

9 సహాయం కోసం మీరు మీ ప్రభువును మొరపెట్టుకున్న ఆ సందర్భాన్ని కూడా జ్ఞప్తికి తెచ్చుకోండి–మరి అల్లాహ్ మీ మొరను ఆలకించి, "నేను వెయ్యిమంది దూతలతో మీకు సహాయం చేస్తాను. వారు ఎడతెగకుండా – ఒకరి వెనుక ఒకరు – వస్తుం టారు"[12] అని చెప్పాడు.

إِذْ تَسْتَغِيثُونَ رَبَّكُمْ فَاسْتَجَابَ لَكُمْ أَنِّي مُمِدُّكُم بِأَلْفٍ مِّنَ الْمَلَائِكَةِ مُرْدِفِينَ ﴿٩﴾

10 మీకు శుభవార్తను అందించటానికీ, తద్వారా మీ మనసులు కుదుటపడటానికి అల్లాహ్ ఈ విధంగా తోడ్పడ్డాడు. తోడ్పాటు అనేది కేవలం అల్లాహ్ వద్ద నుంచే లభిస్తుంది సుమా![13] నిస్సందేహంగా అల్లాహ్ శక్తిమంతుడు, వివేక సంపన్నుడు.

وَمَا جَعَلَهُ اللَّهُ إِلَّا بُشْرَىٰ وَلِتَطْمَئِنَّ بِهِ قُلُوبُكُمْ ۚ وَمَا النَّصْرُ إِلَّا مِنْ عِندِ اللَّهِ ۚ إِنَّ اللَّهَ عَزِيزٌ حَكِيمٌ ﴿١٠﴾

11 తన తరఫున మీకు నిశ్చింతను ప్రసాదించేందుకు అల్లాహ్ మీపై నిద్ర మత్తును[14] ఆవరింపజేసిన సందర్భాన్ని కూడా ఓసారి జ్ఞాపకం చేసుకోండి! మిమ్మల్ని పరిశుభ్రపరచటానికి, షైతాను

إِذْ يُغَشِّيكُمُ النُّعَاسَ أَمَنَةً مِّنْهُ وَيُنَزِّلُ عَلَيْكُم مِّنَ السَّمَاءِ مَاءً لِّيُطَهِّرَكُم بِهِ وَيُذْهِبَ

10. వర్తక బిడారు తారసపడితే సునాయాసంగా సొమ్మును చేజిక్కించుకోవచ్చు కదా! అని మీరు లోలోపలే అనుకున్నారు.

11. అల్లాహ్ అభీష్టం మరోలా ఉంది. ఒకసారి మీరు ఎలాగైనా శత్రువును మార్కొంటే, శత్రువు బలం కాస్తా క్షీణిస్తుంది. ఈ పరిణామం దుర్మార్గులకు మింగుడుపడినా, పడకపోయినా దైవసంకల్పం మాత్రం జరిగి తీరుతుంది.

12. ఈ యుద్ధంలో ముస్లిం యోధుల సంఖ్య 313 మాత్రమే. మరోవైపు అవిశ్వాసులు మూడింతలు అధికంగా ఉన్నారు. అంటే వారు దాదాపు 1000 మంది వరకూ ఉన్నారు. చూడబోతే ముస్లింల దగ్గర సరైన ఆయుధాలు కూడా లేవు. అదే సమయంలో అవిశ్వాసులు సాయుధులై వచ్చారు. ఇలాంటి పరిస్థితిలో ముస్లింలకు అల్లాహ్ అండదండలు తప్పితే మరో దిక్కులేదు. అందువల్ల వారు దీనాతిదీనంగా అల్లాహ్ సహాయాన్ని అర్థించసాగారు. మహాప్రవక్త (సఅసం) స్వయాన ఒక ప్రత్యేక శిబిరంలో ఎంతో ఆర్ద్రంగా తన ప్రభువును మొరపెట్టుకోవటంలో నిమగ్నులై ఉన్నారు (సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ). అల్లాహ్ వారి ప్రార్థనలను ఆలకించి, ఆమోదముద్ర వేశాడు. వారి సహాయార్థం ఒకరి తరువాత ఒకరు చొప్పున వెయ్యిమంది దైవ దూతలను – ఎడతెగకుండా – పంపించాడు.

13. నిజానికి సహాయం అనేది అల్లాహ్ వద్ద నుంచే వస్తుంది. ఆయన తలచుకుంటే దూతలతో నిమిత్తం లేకుండా నేరుగా కూడా మీకు సహాయం చేయగలడు. అయితే మిమ్మల్ని సంతుష్టపరచటానికి, మీ ఆందోళనను దూరం చేయటానికి దూతలను దింపుతానన్న శుభవార్తను అందజేశాడు. అలా అని దైవదూతలు యుద్ధంలో పాల్గొనలేదని దీని భావం ఎంతమాత్రం కాదు. వారు కూడా యుద్ధంలో క్రియాత్మకంగా పాల్గొన్నారనీ, అనేకమంది అవిశ్వాసులకు దరువు వేశారని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం – కితాబుల్ మగాజీ, ఫజాయిలె సహాబా).

14. ఉహుద్ యుద్ధంలో మాదిరిగానే బద్ర్‌యుద్ధంలో కూడా అల్లాహ్ ముస్లింలపై నిద్రమత్తును ఆవరింపజేశాడు. తద్వారా వారికి మనో స్థిమితం కలిగింది. గుండెదడ తగ్గింది.

عَنكُمْ رِجْزَ الشَّيْطَانِ وَلِيَرْبِطَ عَلَىٰ قُلُوبِكُمْ وَيُثَبِّتَ بِهِ الْأَقْدَامَ ﴿١١﴾

ప్రేరణలను మీనుండి పారద్రోలటానికీ,[15] మీకు గుండె దిటవును కలిగించటానికి, మీ కాళ్ళకు నిలకడను ప్రసాదించటానికి[16] ఆయన (ఆ సందర్భంగా) మీపై ఆకాశం నుంచి వర్షం కురిపించాడు.

إِذْ يُوحِي رَبُّكَ إِلَى الْمَلَائِكَةِ أَنِّي مَعَكُمْ فَثَبِّتُوا الَّذِينَ آمَنُوا ۚ سَأُلْقِي فِي قُلُوبِ الَّذِينَ كَفَرُوا الرُّعْبَ فَاضْرِبُوا فَوْقَ الْأَعْنَاقِ وَاضْرِبُوا مِنْهُمْ كُلَّ بَنَانٍ ﴿١٢﴾

**12** (ఆ సందర్భాన్ని కూడా ఓ సారి జ్ఞాపకం చేసుకోండి) నీ ప్రభువు దూతలను ఈ విధంగా ఆదేశించాడు : “నేను మీ వెంటే ఉన్నాను. కాబట్టి మీరు విశ్వాసులకు ధైర్యాన్ని కలిగించండి. నేను ఇప్పుడే అవిశ్వాసుల గుండెల్లో దడ పుట్టిస్తాను.[17] మీరు వారి మెడలపై కొట్టండి. వారి వ్రేళ్ల కణుపులపై కొట్టండి.”[18]

ذَٰلِكَ بِأَنَّهُمْ شَاقُّوا اللَّهَ وَرَسُولَهُ ۚ وَمَن يُشَاقِقِ اللَّهَ وَرَسُولَهُ فَإِنَّ اللَّهَ شَدِيدُ الْعِقَابِ ﴿١٣﴾

**13** అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ఎదిరించినందుకు వారికి శిక్ష ఇది. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ఎదిరించిన వారిని నిస్సందేహంగా అల్లాహ్ కఠినంగా శిక్షిస్తాడు.

ذَٰلِكُمْ فَذُوقُوهُ وَأَنَّ لِلْكَافِرِينَ عَذَابَ النَّارِ ﴿١٤﴾

**14** కనుక (ఇహలోకంలో) ఈ శిక్షను చవిచూడండి. తిరస్కారులకు ఇక నరకాగ్ని శిక్ష ఎలాగూ తప్పదు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا لَقِيتُمُ الَّذِينَ كَفَرُوا زَحْفًا فَلَا تُوَلُّوهُمُ الْأَدْبَارَ ﴿١٥﴾

**15** ఓ విశ్వసించినవారలారా! మీరు అవిశ్వాసులతో ముఖాముఖీ అయినప్పుడు వారికి వెన్నుచూపకండి.[19]

---

15. ఆ సమయంలో దేవుడు వారికి ప్రసాదించిన మూడవ అనుగ్రహం ఏమిటంటే వారు విడిది చేసిన ప్రదేశం వారికి అనువుగా ఉండేందుకు వర్షం కురిపించాడు. దాంతో వారు తహారత్, వుజూ చేసి పరిశుభ్రత నొందడానికీ, బడలికను తీర్చుకోవడానికి వీలు కలిగింది. “మీరు సజ్జనులైన దాసులై ఉండి కూడా నీళ్లకు దూరం అయి పోయారే!? అశుద్ధావస్థలో పోరాడితే మీకు విజయం ఎలా వరిస్తుంది?” అని షైతాను పదేపదే ఆంతర్యంలో జనింపజేస్తున్న దుష్ప్రేరణలను పారద్రోలడానికి మంచి అవకాశం లభించింది.

16. ఇది దేవుని నాల్గవ అనుగ్రహం. ఆయన ముస్లిం యోధులకు గుండె ధైర్యాన్ని ఇవ్వటమేగాక, కదలని కొండలా రణరంగంలో నిలబడటానికి వారి పాదాలకు స్థిరత్వాన్ని ప్రసాదించాడు.

17. అల్లాహ్ తన తరఫున, తన దూతల తరఫున బద్ర్ యుద్ధ మైదానంలో ముస్లింలకు వివిధ రకాలుగా అందించిన సహాయం గురించి ఈ ఆయతులో చెప్పబడింది.

18. ఆయతులో **“బనాన్”** (بنان) అనబడింది. బనాన్ అంటే కాళ్లు చేతుల వ్రేళ్ల యొక్క కణుపులు లేదా వ్రేళ్ల కొనలు అని అర్థం. వాటిపై గనక గట్టిగా దెబ్బపడితే యుద్ధంలో ఆయుధాలు పట్టలేరు. కత్తులు ఝుళిపించలేరు. వేగంగా దూసుకుపోలేరు.

19. అరబీలో **‘జహ్ఫన్’** (زحفا) అని ఉంది. అంటే పరస్పరం ఎదురుపడటం, ముఖాముఖీ అవటం అని అర్థం. యుద్ధరంగంలో ముస్లిములు అవిశ్వాసులతో ముఖాముఖీ అయినప్పుడు వెన్నుచూపి పారిపోయేందుకు అనుమతి లేదు. ఒక హదీసులో ఈ విధంగా అనబడింది: “ఏడు వినాశకరమైన విషయాలకు దూరంగా ఉండండి.” ఆ ఏడింటిలో ఒకటి; “ప్రతిఘటన (జహ్ఫ్) జరిగే రోజున వెన్నుచూపి పారిపోవటం” (సహీహ్ బుఖారీ – హదీసు నెంబరు : 2766 – కితాబుల్ వసాయ; సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

وَمَنْ يُوَلِّهِمْ يَوْمَئِذٍ دُبُرَهُ إِلَّا مُتَحَرِّفًا لِقِتَالٍ أَوْ مُتَحَيِّزًا إِلَى فِئَةٍ فَقَدْ بَاءَ بِغَضَبٍ مِنَ اللَّهِ وَمَأْوَاهُ جَهَنَّمُ وَبِئْسَ الْمَصِيرُ ﴿16﴾

**16** ఆ సమయంలో రణనీతిలో భాగంగా వెనక్కి తిరగటమో లేదా (తన) సైనిక దళంలో ఆశ్రయం పొందేందుకు తిరిగి రావటమో తప్పితే[20] – (ఆ సమయంలో) శత్రువుకు వెన్నుచూపి పలాయనం చిత్తగించినవాడు దైవాగ్రహంలో చిక్కుకుంటాడు. నరకం అతని నివాసం అవుతుంది. అది అత్యంత చెడ్డ గమ్య స్థానం.[21]

فَلَمْ تَقْتُلُوهُمْ وَلَٰكِنَّ اللَّهَ قَتَلَهُمْ ۚ وَمَا رَمَيْتَ إِذْ رَمَيْتَ وَلَٰكِنَّ اللَّهَ رَمَىٰ ۚ وَلِيُبْلِيَ الْمُؤْمِنِينَ مِنْهُ بَلَاءً حَسَنًا ۚ إِنَّ اللَّهَ سَمِيعٌ عَلِيمٌ ﴿17﴾

**17** వాళ్ళను మీరు చంపలేదు. కాని అల్లాహ్ వాళ్ళను చంపాడు.[22] (గుప్పెడు మన్నును) నువ్వు విసిరినప్పుడు, దాన్ని విసిరింది నువ్వు కాదు. అల్లాహ్ దాన్ని విసిరాడు.[23] విశ్వాసుల శ్రమకు తన తరఫున మంచి ప్రతిఫలం ఇచ్చేందుకు[24] అల్లాహ్ ఇలా చేశాడు. నిశ్చయంగా అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

20. వెన్నుచూపే విషయంలో రెండు మినాయింపులున్నాయి. 1. రణతంత్రంలో భాగంగా వెనక్కి తగ్గటం, ఓ వైపుకు తిరిగిపోవటం లేదా మెరుపుదాడి చేసే ఉద్దేశంతో వెనక్కి తిరగటం, శత్రువును ఏమార్చే సంకల్పంతో పారిపోవటం. బహుశా వీరు ధైర్యం చాలక – ఓటమిని అంగీకరించి – పరుగులు తీస్తున్నారని శత్రువు అనుకునే విధంగా ఎత్తుగడ వేయటం. ఈ రణనీతి ఒక్కోసారి ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకే ఈ పద్ధతిని అవలంబించటం "వెన్నుచూపటం" క్రిందికి రాదు. పై ఆయతులో దీన్ని 'తహర్రుఫ్'గా పేర్కొనటం జరిగింది. 2. తన మిత్రపక్షంలో చేరే ఉద్దేశంతోనో, లేదా తన వాళ్ల సహాయం పొందే ఆలోచనతోనో పరుగులు తీయటం కూడా "వెన్ను చూపటం" క్రిందికి రాదు. పై ఆయతులో ఇది 'తహయ్యుజ్'గా పేర్కొనబడింది.

21. ఈ రెండు ఉద్దేశాలతో తప్ప – ఇతరత్రా కారణాలతో – పిరికిపందలా కదనరంగం నుంచి పారిపోయేవాడు కఠిన శిక్షకు పాత్రుడవుతాడు.

22. బద్ర్ యుద్ధ వాస్తవాలన్నీ మీ కళ్లముందున్నాయి. ఆ యుద్ధంలో మీకు లభించిన గెలుపు వాస్తవానికి మీ శౌర్యంవల్లనో, మీ ప్రజ్ఞాపాటవాల వల్లనో కాదు. అడుగడుగునా అల్లాహ్ మీకు తోడ్పాటునందించాడు. అవిశ్వాసులను మట్టి కరిపించామని మిడిసిపడకండి. నిజానికి వారిని మట్టి కరిపించింది మీరు కాదు, అల్లాహ్ తన ప్రణాళికను అనుసరించి ఇదంతా చేశాడు. అల్లాహ్ అండగా నిలవబట్టే మీరు ఒక బలోపేతమైన శక్తిగా రూపొందగలిగారు.

23. బద్ర్ యుద్ధంలో మహాప్రవక్త (సఅసం) ఒక పిడికెడు ఇసుకను అవిశ్వాసుల సైనిక పంక్తుల వైపుకు విసిరారు. ఆ మట్టిని అల్లాహ్ శత్రు సైనికులందరి కళ్ళల్లో పడేలా చేశాడు. తద్వారా వారి కళ్లు మసకబారాయి. ఆ కీలక సమయంలో వారికేమీ పాలుపోలేదు. ఇది కూడా ఆ క్షణంలో దేవుని తరఫున ప్రస్ఫుటం గావించబడిన ఒక అద్భుతమే. ఈ అద్భుతం ముస్లింల విజయానికి ఎంతగానో దోహదపడింది. ఆ విషయాన్నే అల్లాహ్ ఇక్కడ గుర్తు చేస్తున్నాడు – ఓ ప్రవక్తా! మట్టిని విసిరింది నువ్వే అయినప్పటికీ మేము దాన్ని శత్రువుపాలిట అత్యంత ప్రమాదకరంగా మార్చాము. మేమే గనక ఈ పనిచేసి ఉండకపోతే గుప్పెడు మన్ను అంతపెద్ద శత్రు సమూహాన్ని ఏం చేయగలుగుతుంది? కాబట్టి ఈ విజయం మీలో గర్వానికి చోటివ్వరాదు. మీలో దేవునిపట్ల కృతజ్ఞతా భావం పెంపొందాలి.

24. ఆ సందర్భంగా మీకు అందిన దైవసహాయం కూడా ముమ్మాటికీ దైవానుగ్రహమే. మీరు చేసిన కృషికన్నా, ప్రదర్శించిన పోరాటపటిమ కన్నా ఎక్కువ ప్రతిఫలాన్ని దేవుడు మీకు ఇవ్వటానికే ఇదంతా చేశాడు. అరబీలో **'బలావున్'** అని వచ్చింది. దీనికి పరీక్ష, అనుగ్రహం అని రెండు విభిన్న అర్థాలు ఉన్నాయి. అయితే ఇక్కడ ఇది అనుగ్రహం అనే అర్థంలోనే వాడబడింది.

**18** (ఒకటైతే) ఇది జరిగిపోయింది. (రెండవదేమిటంటే) అల్లాహ్ అవిశ్వాసుల కుయుక్తులను బలహీనపరచదలచాడు.[25]

ذَٰلِكُمْ وَأَنَّ اللَّهَ مُوهِنُ كَيْدِ الْكَافِرِينَ ﴿١٨﴾

**19** (ఓ సత్య తిరస్కారులారా!) మీరు తీర్పును కోరుతున్నట్లయితే, ఇదిగో, ఆ తీర్పు మీ ముందుకు వచ్చేసింది.[26] ఇకనయినా మీరు మానుకుంటే అది మీకెంతో మంచిది. ఒకవేళ మీరు మళ్లీ అవే చేష్టలకు పాల్పడితే మేము కూడా అదేవిధంగా సమాధానం ఇవ్వవలసి వస్తుంది. మీ జన సమూహం ఎంత అధికంగా ఉన్నప్పటికీ అది మీకేవిధంగానూ పనికిరాదు – అల్లాహ్ విశ్వాసులకు తోడుగా ఉన్నాడు.

إِن تَسْتَفْتِحُوا فَقَدْ جَاءَكُمُ الْفَتْحُ ۖ وَإِن
تَنتَهُوا فَهُوَ خَيْرٌ لَّكُمْ ۖ وَإِن تَعُودُوا نَعُدْ
وَلَن تُغْنِيَ عَنكُمْ فِئَتُكُمْ شَيْئًا وَلَوْ كَثُرَتْ
وَأَنَّ اللَّهَ مَعَ الْمُؤْمِنِينَ ﴿١٩﴾

**20** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయులై ఉండండి. అంతా వింటూనే అతని (విధేయత) పట్ల విముఖులు కాకండి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَطِيعُوا اللَّهَ وَرَسُولَهُ
وَلَا تَوَلَّوْا عَنْهُ وَأَنتُمْ تَسْمَعُونَ ﴿٢٠﴾

**21** వినకుండా (వినిపించుకోకుండా)నే "మేము విన్నాము"[27] అని అనే వారిలా మీరు తయారవకండి.

وَلَا تَكُونُوا كَالَّذِينَ قَالُوا سَمِعْنَا وَهُمْ
لَا يَسْمَعُونَ ﴿٢١﴾

**22** తమ బుద్ధిని ఉపయోగించని చెవిటివారు, మూగవారు మాత్రమే అల్లాహ్ దృష్టిలో అత్యంత నీచమైన జంతువులు.[28]

إِنَّ شَرَّ الدَّوَابِّ عِندَ اللَّهِ الصُّمُّ الْبُكْمُ
الَّذِينَ لَا يَعْقِلُونَ ﴿٢٢﴾

25. ఇది రెండో ఉద్దేశ్యం. అల్లాహ్ మీ శత్రువుల వెన్ను విరిచి, సత్యానికి వ్యతిరేకంగా వారు రచిస్తున్న వ్యూహాలను నీరుగార్చాలని సంకల్పించుకున్నాడు. బద్ర్ యుద్ధం ద్వారా ఈ రెండు లక్ష్యాలూ నెరవేరాయి.

26. అబూ జహల్‌తో సహా అనేకమంది కురైషు నాయకులు మక్కా నుంచి యుద్ధానికి బయలు దేరేటప్పుడు, "ఓ అల్లాహ్! రేపు (జరగబోయే యుద్ధంలో), మాలో కరడుగట్టిన అవిధేయులను, బంధుత్వ సంబంధాలను త్రెంచేవారిని నీవు నాశనం చెయ్యి" అని ప్రార్థించారు. బంధుత్వ సంబంధాల విచ్ఛిన్నానికి పాల్పడేది ముస్లింలేనని వారు అనుకునేవారు. అందుకే వారు ఈ విధంగా ప్రార్థన చేశారు. ఒకవిధంగా చెప్పాలంటే అల్లాహ్ వారు కోరుకున్న దానినే వారికిచ్చాడు. కరడుగట్టిన అవిధేయులు, సంబంధాలను చెడగొట్టిన కఠినాత్ములు యుద్ధంలో కుప్పకూలిపోయారు. ఆ విషయాన్నే అల్లాహ్ ఈ ఆయతులో అవిశ్వాసులకు జ్ఞాపకం చేస్తూ "ఏ సత్యాసత్యాల, ధర్మాధర్మాల తీర్పు జరగాలని మీరు కోరుకున్నారో అది జరిగిపోయింది. కాబట్టి ఇకనయినా మీరు మీ తిరస్కార వైఖరిని విడనాడినట్లయితే అది మీ పాలిట శ్రేయస్కరం అవుతుంది. ఒకవేళ మరోసారి కయ్యానికి కాలు దువ్వారంటే మళ్లీ మేము ముస్లింలకే సాయపడతాము. మీరెంత పెద్ద సైన్యాన్ని తెచ్చినా అది మీకు ఉపయోగపడదు" అని అల్లాహ్ అంటున్నాడు.

27. ఆదేశాన్ని విన్న తరువాత కూడా దాన్ని అమలు చేయకపోవటం ఇస్లాం విధానం కాదు. పైగా అది అవిశ్వాస విధానం. కాబట్టి ఈ వైఖరికి దూరంగా ఉండండి. ఇలాంటి వారు చెవిటివారు, మూగవారు, బుద్ధిలేనివారు, ఇంకా దైవం దృష్టిలో అల్పమైన జీవులని దీని తరువాతి ఆయతులో చెప్పబడింది; ఆయతులో 'దవాబ్బ్' అనబడింది. ఇది 'దాబ్బతున్'కు బహువచనం. భూమి మీద నడిచే ప్రతిదీ **'దాబ్బతున్'** గానే పిలువబడుతుంది. మొత్తానికి దవాబ్బ్ అంటే అర్థం మొత్తం సృష్టిరాశులు.

**23** ఒకవేళ వారిలో ఏకాస్త మంచితనం ఉందనిపించినా అల్లాహ్ వారికి వినగలిగే భాగ్యం ప్రసాదించి ఉండేవాడు.[29] ఇప్పుడు గనక వారికి వినిపిస్తే వారు నిర్లక్ష్యంగా ముఖం త్రిప్పుకుని వెళ్ళి పోతారు.[30]

وَلَوْ عَلِمَ اللَّهُ فِيهِمْ خَيْرًا لَّأَسْمَعَهُمْ ۖ
وَلَوْ أَسْمَعَهُمْ لَتَوَلَّوا وَّهُم مُّعْرِضُونَ ﴿٢٣﴾

**24** ఓ విశ్వాసులారా! మీకు జీవితాన్నిచ్చే వస్తువు వైపుకు ప్రవక్త మిమ్మల్ని పిలిచినప్పుడు మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పిలుపుకు అనుకూలంగా స్పందించండి.[31] అల్లాహ్ మనిషికీ– అతని మనసుకూ మధ్య అడ్డుగా వస్తాడనీ,[32] మీరంతా ఆయన వద్దకే సమీకరించబడతారన్న సంగతిని తెలుసుకోండి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اسْتَجِيبُوا لِلَّهِ وَلِلرَّسُولِ
إِذَا دَعَاكُمْ لِمَا يُحْيِيكُمْ ۖ وَاعْلَمُوا أَنَّ اللَّهَ يَحُولُ
بَيْنَ الْمَرْءِ وَقَلْبِهِ وَأَنَّهُ إِلَيْهِ تُحْشَرُونَ ﴿٢٤﴾

28. ఈ మాటే దివ్య ఖుర్‌ఆన్‌లో మరోచోట ఈ విధంగా చెప్పబడింది : "వారికి హృదయాలున్నాయి. కాని వాటితో వారు అర్థం చేసుకోరు. వారికి కళ్లున్నాయి. కాని వాటితో వారు చూడరు. వారికి చెవులున్నాయి. కాని వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. కాదు, వాటికన్నా మార్గభ్రష్టులు. అసలు విషయం ఏమిటంటే వారు (అల్లాహ్ విషయంలో) పరధ్యానానికి లోనయ్యారు" (అల్ ఆరాఫ్ – 179).

29. అంటే, వారి వినేశక్తిని వారి కొరకు ప్రయోజనకరంగా చేసి, వారి అవగాహనను పెంచి ఉండేవాడు. తద్వారా వారు సత్యాన్ని పరికించి, దాన్ని గ్రహించి ఉండేవారు. కాని వారిలో మంచిని గ్రహించాలన్న తపన ఏ కోశానా లేకపోవటం చేత అల్లాహ్ వారిలో గ్రాహ్య శక్తి లేకుండా చేశాడు. వారిలో అవగాహనా మాంద్యం ఏర్పడింది.

30. ఎందుకంటే సత్యామృతాన్ని ఆస్వాదించాలన్న జిజ్ఞాస వారిలో బొత్తిగా లేదు. ఇలాంటి పరిస్థితిలో వారికి ఎంతగా ఉపదేశించినా వారు పట్టించుకోరు. పైగా నుదురు చిట్లిస్తూ, అసహనాన్ని వ్యక్తపరుస్తూ మీ సమావేశాల నుంచి నిష్క్రమిస్తారు.

31. అరబీలో **"లిమా యుహ్‌యీకుమ్"** అనబడింది. 'జీవికను ప్రసాదించే విషయాలు' అని దీని అర్థం. కొంతమంది దీన్ని 'జిహాద్' అన్న అర్థంలో తీసుకుని, జిహాద్ ద్వారానే గౌరవప్రదమైన జీవితం ప్రాప్తిస్తుందని వ్యాఖ్యానించారు. ఇంకా కొంతమంది వ్యాఖ్యాతలు దీన్ని ఖుర్‌ఆన్‌లోని ఆజ్ఞలు, నిషిద్ధాంశాలు మరియు షరీయతు ఆదేశాలు అన్న భావంలో తీసుకున్నారు. ఆ విధంగా జిహాద్ కూడా ఇందులోకి వచ్చేస్తుందని వారు అభిప్రాయపడ్డారు. స్థూలంగా దీని మతలబు ఏమిటంటే; మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త చెప్పినట్లుగా వింటే మీ జీవితాలు బాగుపడతాయి. మీ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. మీ పరువు ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి.

32. ఈ వాక్యంపై ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు పలువురు పలు విధాలుగా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అల్లాహ్, మనిషికీ – అతని మనసుకూ మధ్య అడ్డుగా రావటం అంటే మృత్యువు రావటం. మృత్యువు ఏదో ఒకనాడు ప్రతి ఒక్కరినీ కబళిస్తుంది, అది దాపురించకముందే మీరు అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి అని కొందరు వ్యాఖ్యానించగా, అల్లాహ్ మనిషి హృదయానికి ఎంత చేరువలో ఉంటాడో వివరించటానికి ఇలా వర్ణించటం జరిగిందని మరి కొందరు భావించారు. అంటే ఆయన గుండెల్లోని గుట్టును సయితం బాగా ఎరిగినవాడు. ఏ వస్తువూ, మరే లోగుట్టూ ఆయనకు తెలియకుండా లేదు. ఇమామ్ ఇబ్నె జరీర్ గారి వ్యాఖ్యానం ఇలా వుంది : "తన దాసుల మనోభావాలపై దైవానికి పూర్తి అధికారం ఉంది. ఆయన తలచుకున్నప్పుడల్లా వారికీ – వారి ఆంతర్యాలకు మధ్య అడ్డుగా నిలుస్తూ ఉంటాడు. దైవేచ్ఛ లేకుండా మనిషి ఏ వస్తువునూ తన కొరకు పొందలేడు." మరికొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యాన్ని బద్ర్ రణరంగానికి సంబంధించినదిగా భావించారు. శత్రువుల భారీ సమూహాన్ని చూసి, ముస్లింలు లోలోపలే భయపడ్డారు. అప్పుడు అల్లాహ్ వారికీ – వారి హృదయాలకీ మధ్య అడ్డుగా నిలిచి వారిలోని

وَاتَّقُوْا فِتْنَةً لَّا تُصِيْبَنَّ الَّذِيْنَ ظَلَمُوْا مِنْكُمْ خَآصَّةً ۚ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ شَدِيْدُ الْعِقَابِ ﴿25﴾

**25** ఏ ఉపద్రవమైతే మీలోని దుర్మార్గులకు మాత్రమే పరిమితం కాకుండా (సాధారణంగా సమాజంలోని వారినందరినీ) కబళి స్తుందో దాని బారి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి.[33] అల్లాహ్ చాలా కఠినంగా శిక్షించేవాడన్న సంగతిని తెలుసుకోండి!

وَاذْكُرُوْٓا اِذْ اَنْتُمْ قَلِيْلٌ مُّسْتَضْعَفُوْنَ فِي الْاَرْضِ تَخَافُوْنَ اَنْ يَّتَخَطَّفَكُمُ النَّاسُ فَاٰوٰىكُمْ وَاَيَّدَكُمْ بِنَصْرِهٖ وَرَزَقَكُمْ مِّنَ الطَّيِّبٰتِ لَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿26﴾

**26** ఒకప్పటి మీ పరిస్థితిని కాస్త జ్ఞప్తికి తెచ్చుకోండి –అప్పట్లో మీరు అవనిలో అల్ప సంఖ్యలో ఉండేవారు. మరీ బలహీను లుగా పరిగణించబడేవారు. ప్రజలు మిమ్మల్ని మట్టుబెడతారేమో నని మీరు భయంతో బిక్కుబిక్కుమంటూ ఉండేవారు. అలాంటి పరిస్థితిలో అల్లాహ్ మీకు ఆశ్రయమిచ్చి, తన సహాయంతో మీకు బలిమిని ఇచ్చాడు. మీకు పరిశుభ్రమైన, పరిశుద్ధమైన ఆహార వస్తువులను ప్రసాదించాడు – మీరు కృతజ్ఞులై ఉండేం దుకు.[34]

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَخُوْنُوا اللّٰهَ وَالرَّسُوْلَ وَتَخُوْنُوْٓا اَمٰنٰتِكُمْ وَاَنْتُمْ تَعْلَمُوْنَ ﴿27﴾

**27** ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ (వారి హక్కుల విషయంలో) ఉద్దేశ్యపూర్వకంగా ద్రోహం తలపెట్ట కండి. అప్పగింతల విషయంలో కూడా ద్రోహానికి పాల్పడకండి.[35]

---

భయాందోళనను దూరం చేశాడు. వారికి మనో నిబ్బరాన్ని కలిగించాడు. పైన పేర్కొనబడిన భావార్థాలన్నీ ఈ ఆయతుకు వర్తిస్తాయని ఇమామ్ షౌకానీ అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

కాగా; సహనస్థయిర్యాల కోసం ప్రార్థించమని తాకీదు చేసే హదీసులు ఇమామ్ ఇబ్నె జరీర్ వ్యాఖ్యానాన్ని సమర్థించేవిగా ఉన్నాయి. ఉదాహరణకు: మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఈ విధంగా ప్రవచించారు : "ఆదం సంతతి హృదయాలు–ఒకే హృదయంలా – కరుణామయుని రెండు వ్రేళ్ల మధ్యన ఉన్నాయి. ఆయన వాటిని తాను తలచిన విధంగా మళ్ళిస్తూ ఉంటాడు." ఆ తరువాత ఆయన(స) ఇలా ప్రార్థించారు – **"అల్లాహుమ్మ ముసర్రిఫల్ ఖులూబి సర్రిఫ్ ఖులూబనా ఇలా తాఅతిక"** (హృదయాలను మరలించే ఓ అల్లాహ్! మా హృదయాలను నీ విధేయత వైపుకు మళ్ళించు) (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఖద్ర్). మరికొన్ని ఉల్లేఖనాలలో **"సబ్బిత్ ఖల్బీ అలా దీనిక"** అని ఉంది (సుననె తిర్మిజీ–అబ్వాబుల్ ఖద్ర్). అంటే నా హృదయాన్ని నీ ధర్మంపై స్థిరంగా నిలుపు అని భావం.

33. అధికారం చేజిక్కగానే సామాన్యులను, ప్రముఖులను – అందరినీ ఒకే విధంగా పరిగణించి వారిపై అన్యాయం చేసేవారు అని ఒక అర్థం. లేదా ప్రకృతి వైపరీత్యాలు. పెనుగాలులు, వరదలు, భూకంపాలు లాంటి ఆపదలు వచ్చిపడినప్పుడు ఆ ప్రదేశంలో నివసించే సజ్జనులు, దుర్జనులు – అందరూ వాటి వాతన పడతారని దీని భావం కావచ్చు. లేదా కొన్ని హదీసుల ప్రకారం సమాజంలో మంచిని ప్రబోధించే, చెడులను నిర్మూలించే పనిని విడనాడటం మూలంగా జరిగే చెడు పర్యవసానాన్ని గురించి హెచ్చరించటానికి ఈ ఆయతు అవతరించి ఉంటుంది.

34. మక్కాలో ఇస్లాం సందేశ ప్రచారం మొదలెట్టిన తొలిదశలో ముస్లింల పరిస్థితి ఎలా ఉండేదో, అడుగడుగునా ఎటువంటి ప్రమాదాలు పొంచి ఉండేవో ఇక్కడ గుర్తు చేయబడింది. ఆ తరువాత మదీనాకు ప్రస్థానం చేసిన పిదప ముస్లింలు నిలదొక్కుకోగలిగారు. మరి కొన్నాళ్ల తర్వాత దైవసహాయంతో ఓ తిరుగులేని శక్తిగా ఆవిర్భవించారు.

35. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త హక్కుల విషయంలో 'ద్రోహం' చేయటమంటే నలుగురిలో ఉన్నప్పుడు విధేయత

وَاعْلَمُوٓا أَنَّمَآ أَمْوَالُكُمْ وَأَوْلَادُكُمْ فِتْنَةٌ ۙ
وَأَنَّ اللّٰهَ عِندَهُۥٓ أَجْرٌ عَظِيمٌ ﴿٢٨﴾

**28** మీ సిరిసంపదలు, మీ సంతానం మీ పాలిట ఒక పరీక్ష అన్న సంగతిని తెలుసుకోండి.[36] అల్లాహ్ వద్ద గొప్ప పుణ్యఫలం ఉందన్న విషయాన్ని కూడా (విస్మరించకండి).

يَٰٓأَيُّهَا الَّذِينَ ءَامَنُوٓا إِن تَتَّقُوا اللّٰهَ يَجْعَل لَّكُمْ
فُرْقَانًا وَيُكَفِّرْ عَنكُمْ سَيِّـَٔاتِكُمْ وَيَغْفِرْ لَكُمْ ۗ
وَاللّٰهُ ذُو الْفَضْلِ الْعَظِيمِ ﴿٢٩﴾

**29** ఓ విశ్వాసులారా! మీరు గనక అల్లాహ్ యెడల భయ భక్తులతో[37] మెలిగినట్లయితే ఆయన మీకు నిర్ణయాత్మకమైన ఒక వస్తువును (ఫుర్ఖాన్‌ను) ప్రసాదిస్తాడు. మీ పాపాలను మీ నుండి దూరం చేస్తాడు. మిమ్మల్ని క్షమిస్తాడు. ఆయన గొప్ప అనుగ్రహం కలవాడు.

وَإِذْ يَمْكُرُ بِكَ الَّذِينَ كَفَرُوا لِيُثْبِتُوكَ أَوْ يَقْتُلُوكَ
أَوْ يُخْرِجُوكَ ۚ وَيَمْكُرُونَ وَيَمْكُرُ اللّٰهُ ۖ

**30** (ఓ ప్రవక్తా!) సత్య తిరస్కారులు నీకు వ్యతిరేకంగా వ్యూహ రచన చేసిన సంఘటనను కూడా గుర్తుకు తెచ్చుకో. నిన్ను బందీగా పట్టుకోవాలా? లేక నిన్ను హత్య చేయాలా? లేక నిన్ను దేశం నుంచి వెళ్ళగొట్టాలా?[38] అని వారు తమ తరఫున ఎత్తులు

---

కనబరచి, ఏకాంతంలో ఉన్నప్పుడు తద్భిన్నంగా వ్యవహరించటం అన్నమాట! వారు చేయమన్న వాటిలో దేన్నయినా పరిత్యజించటం, చేయకూడదన్నవాటిని ఉద్దేశ్యపూర్వకంగా చేయటం కూడా ద్రోహబుద్ధి క్రిందికే వస్తుంది. ఇకపోతే అప్పగింతలు. ఎవరయినా తమ దగ్గర ఏదైనా వస్తువునుగానీ, నగదునుగానీ అమానతు (అప్పగింత)గా భద్రపరిస్తే, దానిని సంబంధిత వ్యక్తులు వచ్చేవరకూ సురక్షితంగా ఉంచాలి. దానిని కాజేయకూడదు. అప్పగింతలను కాపాడవలసిందిగా అంతిమ దైవప్రవక్త (స) వారు పదే పదే తాకీదు చేశారు. తన ప్రసంగాలలో దైవప్రవక్త (స) తరచూ, "అప్పగింతలను కాపాడని వానిలో విశ్వాసంలేదు. వాగ్దానాన్ని నిలబెట్టుకోనివానిలో ధర్మం లేదు" అని నొక్కి వక్కాణించేవారని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది (ముస్నదె అహ్మద్ – సంపుటి : 3, పేజీ – 135).

36. ఆస్తిపాస్తుల పట్ల, ఆలుబిడ్డల పట్ల గల మితిమీరిన మమకారమే మనిషిని ద్రోహానికి (ఖియానత్‌కు) పాల్పడేలా చేస్తుంది. ధనవ్యామోహంలో దారుణంగా చిక్కుకున్నవాడే దైవానికీ, దైవప్రవక్తకూ ద్రోహం తలపెడతాడు. అందుకే సంపద, సంతానం మనిషికి ఒక పరీక్ష అని చెప్పటం జరిగింది. ఈ రెండింటి ద్వారా మనిషి పరీక్షించబడతాడు. ఒకవైపు మనిషి ఆస్తిపాస్తులను, ఆలుబిడ్డలను ప్రేమిస్తూనే మరోవైపు అమానతులను కాపాడతాడా లేదా? అల్లాహ్‌పట్ల, ఆయన ప్రవక్తపట్ల నిష్కల్మషమైన అభిమానం కలిగి ఉంటాడా లేదా? తనపై మోపబడిన విధులను సజావుగా నిర్వర్తిస్తాడా? లేదా?– వీటన్నింటినీ అతను సక్రమంగా నెరవేరిస్తే దేవుడు పెట్టిన పరీక్షలో నెగ్గినట్లే. అన్యధా పరీక్ష తప్పినట్లే. ఇట్టి పరిస్థితిలో ఈ సిరిసంపదలు, ఈ కన్నబిడ్డలే అతని పరాభవానికి ప్రధాన కారణంగా నిలుస్తారు.

37. **'తఖ్వా'** (భయభక్తులు) అంటే అసలేమిటీ? దేవుడు చేయమన్నదానిని ఖచ్చితంగా చేయటం! చేయకూడదు అన్న దాని జోలికి పోకుండా జాగ్రత్తపడటం!! 'ఫుర్ఖాన్' అంటే సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను స్పష్టంగా వేరుపరచే గీటురాయి అని భావం. ఈ ఆయతుకు భావం ఏమిటంటే తఖ్వా (భయభక్తుల) వల్ల మనసు కుదుటపడుతుంది. మనోనేత్రం తేజోవంతం అవుతుంది. సన్మార్గం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. తద్వారా మనిషి సంశయాలకు, సందేహాలకు లోనుకాకుండా ఉంటాడు. ఎక్కడయినా అస్పష్టత, సందిగ్ధం ఏర్పడితే, పెడత్రోవపట్టే అనుమానం వస్తే తన మనోనేత్రం ద్వారా సత్యాసత్యాలను వీక్షించి మరీ రుజుమార్గంలో పయనిస్తాడు. దైవ సహాయం, మోక్షం, సాఫల్యం అన్న భావంలో కూడా ఇది తీసుకోబడుతుంది. 'తఖ్వా' ద్వారా ఈ ప్రయోజనాలన్నీ చేకూరుతాయి. వీటికి తోడు తప్పులు మన్నించబడతాయి. దేవుని మహదానుగ్రహం కూడా ప్రాప్తిస్తుంది.

38. ఒకరోజు రాత్రి మక్కాలోని "దారున్నద్వా"లో సత్యతిరస్కారులు మహాప్రవక్త (స)కు వ్యతిరేకంగా పన్నిన పన్నాగం

వేస్తుండగా, అల్లాహ్ పై ఎత్తులు వేస్తూ ఉన్నాడు. ఎత్తులు వేయడంలో అల్లాహ్ సాటిలేని మేటి.[39]

وَاللّٰهُ خَيْرُ الْمٰكِرِيْنَ ﴿30﴾

31 వారి ముందు మా ఆయతులను చదివి వినిపించినపుడు, “మేం విన్నాంలే. మేము గనక తలచుకుంటే ఇలాంటి మాటల్ని మేమూ చెప్పగలం. ఇవి పూర్వీకుల నుంచి వస్తున్న కట్టుకథలు తప్ప మరేమీ కావు” అంటారు.

وَإِذَا تُتْلٰى عَلَيْهِمْ اٰيٰتُنَا قَالُوْا قَدْ سَمِعْنَا
لَوْ نَشَآءُ لَقُلْنَا مِثْلَ هٰذَآ اِنْ هٰذَآ اِلَّآ
اَسَاطِيْرُ الْاَوَّلِيْنَ ﴿31﴾

32 (అంతేకాదు), “ఓ అల్లాహ్! ఈ ఖుర్ఆన్ నిజంగా నీ తరఫు నుండే వచ్చి ఉంటే, మాపై ఆకాశం నుంచి రాళ్ళ వాన కురిపించు లేదా మాపై ఏదైనా వ్యధాభరితమైన శిక్షను తీసుకురా” అని కూడా అన్నారు.

وَاِذْ قَالُوا اللّٰهُمَّ اِنْ كَانَ هٰذَا هُوَ الْحَقَّ
مِنْ عِنْدِكَ فَاَمْطِرْ عَلَيْنَا حِجَارَةً
مِّنَ السَّمَآءِ اَوِ ائْتِنَا بِعَذَابٍ اَلِيْمٍ ﴿32﴾

33 (ఓ ప్రవక్తా!) వారి మధ్య నువ్వు ఉన్నంతకాలం అల్లాహ్ వారిపైకి శిక్షను తీసుకురాడు.[40] వారు క్షమాపణకై వేడుకుంటూ ఉండగా కూడా అల్లాహ్ వారిని శిక్షించడు.[41]

وَمَا كَانَ اللّٰهُ لِيُعَذِّبَهُمْ وَاَنْتَ فِيْهِمْ ؕ وَمَا
كَانَ اللّٰهُ مُعَذِّبَهُمْ وَهُمْ يَسْتَغْفِرُوْنَ ﴿33﴾

34 అల్లాహ్ వారిని శిక్షించకుండా ఎందుకు వదలిపెట్టాలి? చూడబోతే వారు మస్జిదె హరామ్‌కు ధర్మకర్తలు (ముతవల్లీలు) కారు. అయినప్పటికీ (జనులను) మస్జిదె హరామ్‌కు రాకుండా

وَمَا لَهُمْ اَلَّا يُعَذِّبَهُمُ اللّٰهُ وَهُمْ يَصُدُّوْنَ
عَنِ الْمَسْجِدِ الْحَرَامِ وَمَا كَانُوْٓا اَوْلِيَآءَهٗ ؕ

ఇది. ఎట్టకేలకు వారు ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం వివిధ తెగలకు చెందిన యువకులు కలసి ‘ఆయనపై అందరూ ఒకేసారి దాడి జరిపి ఆయన్ని హత్యచేయాలి. దానివల్ల ప్రతిహత్యగా ఎవరూ హతమార్చబడరు. కాకపోతే ఎంతోకొంత రక్తపరిహారం ఇచ్చి వ్యవహారాన్ని పరిష్కరించుకోవచ్చు’ అని ఆ కుట్రపన్నారు.

39. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ఒకరోజు రాత్రి సంబంధిత యువకులంతా ఆయన (స) కోసం ఇంటిబయట ఎదురుచూడసాగారు. ఆయన (సఅసం) బయటికి రాగానే అకస్మాత్తుగా దాడిచేసి చంపాలని అనుకున్నారు. ఈ కుట్రను గురించి అల్లాహ్ ఆయన (స)కు ముందుగానే తెలియజేశాడు. ఆయన (స) ఇంటినుంచి బయటకు వచ్చినపుడు ఒక గుప్పెడు మట్టిని తీసుకుని వారి తలలపై వేస్తూ వచ్చేశారు. ఆ క్షణాన ఆ దుర్మార్గులకు ఏమీ పాలుపోలేదు. దైవప్రవక్త (స) అక్కడి నుంచి సౌర్ గుహ వద్దకు చేరుకున్నారు. అవిశ్వాసుల ఎత్తులకు అల్లాహ్ వేసిన పై ఎత్తు ఇది. ఎత్తులు వేయటంలో, ప్రణాళికా రచన చేయటంలో అల్లాహ్ అందరికన్నా శ్రేష్ఠుడు. మూలంలో ‘మక్ర్’ అని ఉంది. మక్ర్ గురించి మరిన్ని వివరాలకు ఆలి ఇమ్రాన్ సూరాలోని 54వ ఆయతు వివరణ చూడండి.

40. ఏదైనా ఒక జాతివారిని దైవప్రవక్త సంస్కరిస్తూ ఉండగా, ఆ జాతి ప్రజలపై దేవుని శిక్ష రాదు. వారిమధ్య నుంచి ప్రవక్త నిష్క్రమించిన తరువాతే శిక్ష వచ్చిపడుతుంది. ఈ విధంగా మక్కాలో మహాప్రవక్త (సఅసం) ఉనికి అక్కడి అవిశ్వాసులకు ఒక వరంగా పరిణమించింది.

41. అంటే భవిష్యత్తులో వారు ముస్లింలుగా మారి క్షమాపణ కోరుకుంటారు అని దీని భావం కావచ్చు. లేదా కాబా గృహ ప్రదక్షిణ చేసే సమయంలో మక్కాలోని ముష్రిక్కులు “క్షమించు ప్రభూ! మమ్మల్ని క్షమించు” అని వేడుకుంటూ ఉండటం వల్ల దేవుడు వారిపై ఒక్కసారిగా పెద్ద ఆపదను అవతరింపజెయ్యకుండా దయదలచి ఉంటాడు.

اِنۡ اَوۡلِيَآؤُهٗۤ اِلَّا الۡمُتَّقُوۡنَ وَلٰـكِنَّ اَكۡثَرَهُمۡ لَا يَعۡلَمُوۡنَ ﴿34﴾

అడ్డుకుంటున్నారు. అల్లాహ్ భీతిపరులు తప్ప మరొకరు దానికి ధర్మకర్తలు కాలేరు. కాని వారిలో చాలా మందికి ఈ సంగతి తెలీదు.[42]

وَمَا كَانَ صَلَاتُهُمۡ عِنۡدَ الۡبَيۡتِ اِلَّا مُكَآءً وَّتَصۡدِيَةً ؕ فَذُوۡقُوا الۡعَذَابَ بِمَا كُنۡتُمۡ تَكۡفُرُوۡنَ ﴿35﴾

**35** కాబా గృహం వద్ద వారు చేసే నమాజ్ ఈలలు వేయటం, చప్పట్లు చరచటం తప్ప[43] మరొకటి కాదు. కనుక మీరు ఒడిగట్టిన తిరస్కార వైఖరికి ప్రతిఫలంగా ఈ శిక్షను చవిచూడండి.

اِنَّ الَّذِيۡنَ كَفَرُوۡا يُنۡفِقُوۡنَ اَمۡوَالَهُمۡ لِيَصُدُّوۡا عَنۡ سَبِيۡلِ اللّٰهِ ؕ فَسَيُنۡفِقُوۡنَهَا ثُمَّ تَكُوۡنُ عَلَيۡهِمۡ حَسۡرَةً ثُمَّ يُغۡلَبُوۡنَ ؕ وَالَّذِيۡنَ كَفَرُوۡۤا اِلٰى جَهَنَّمَ يُحۡشَرُوۡنَ ﴿36﴾

**36** నిశ్చయంగా ఈ సత్య తిరస్కారులు ప్రజలను అల్లాహ్ మార్గంలోకి రాకుండా అడ్డుకోవటానికి తమ సంపదలను ఖర్చు పెడుతున్నారు. వారు తమ సొమ్ములను ఇలా ఖర్చుపెడుతూనే ఉంటారు. అయితే ఆ సొమ్ములే వారి పాలిట దుఃఖదాయకంగా పరిణమిస్తాయి. ఆ తరువాత వారు ఓడిపోతారు. సత్యతిరస్కారులు నరకం వైపుకు ప్రోగు చేయబడతారు.[44]

42. మక్కాలోని ముష్రిక్కులు తమను తాము కాబాగృహ ముతవల్లీలుగా తలపోసేవారు. అందువల్ల వారు తాము ఇష్టపడిన వారిని కాబాగృహ ప్రదక్షిణకు అనుమతించి, తాము ఇష్టపడని వారిని అక్కడికి రాకుండా ఆపేవారు. ఆ విధంగా వారు ముస్లింలను కూడా మస్జిదె హరామ్‌ను సందర్శించకుండా నిలువరించారు. మరి చూడబోతే వారు దానికి ముతవల్లీలు కానేకారు. బలవంతంగా పెత్తందారులై కూర్చున్నారు. దానిపై అల్లాహ్ ఏమన్నాడంటే; సజ్జనులు మాత్రమే ఈ పవిత్ర గృహానికి ధర్మకర్తలు కాగలరు. అవిశ్వాసులకు, బహుదైవారాధకులకు దీని అర్హత లేదు. ఈ ఆయతులో వారికి పరాభవం, ఓటమి కలుగుతాయని ఉంది. అంటే ముస్లిములకు లభించే మక్కా విజయం అన్నమాట! ఆ రోజు అవిశ్వాసుల ముఖాలు మాడిపోతాయి. వారు అవమాన భారంతో కుమిలిపోతారు. ఇంతకు ముందు ఆయతులో ప్రవక్త ఉండగా ఆ జాతిపై ఆపద విరుచుకుపడదు అని అనబడింది కదా! అన్న సందేహం జనించవచ్చు. అంటే జాతి జనులందరినీ రూపుమాపే పెద్ద తరహా విపత్తులు రావు. కాకపోతే వారి వెకిలిచేష్టల ఫలితంగా వారి మెడలు వంచే శిక్షలు వారిపై వస్తూ ఉంటాయి. అవి ఒకవిధంగా వారి పాలిట హెచ్చరికల్లాంటివి. వాటిని చవిచూసిన తరువాతయినా వారు గుణపాఠం నేర్చుకోవాలి.

43. మక్కా ముష్రిక్కులు (బహు దైవారాధకులు) నగ్నంగా కాబాగృహ ప్రదక్షిణ జరపటంతోపాటు అలగాజనుల మాదిరిగా ఈలలు వేసి, చప్పట్లు కొట్టి, పిచ్చిపిచ్చిగా గంతులు వేసేవారు. తమ ఈ చేష్టల్ని దైవారాధనగా తలపోసేవారు. ఈ 'పిచ్చి' నేటికీ కొంత మంది మూర్ఖ సూఫీలలో ఉంది. వారు తమ ఆశ్రమాల వద్ద, ఆస్థానాల దగ్గర, మస్జిదుల దగ్గర ఇలాంటి పూనకాలకు పాల్పడుతుంటారు. డప్పులు వాయించటం, పూనకంతో ఊగిపోవటం అక్కడ మామూలే. దాన్నే వారు తమ నమాజుగా చెప్పుకుంటారు. మైమరచిన నాట్యంతో మా ప్రియనేస్తాన్ని (అల్లాహ్‌ను) మెప్పిస్తాం అని సగర్వంగా చెప్పుకుంటుంటారు. (అల్లాహ్ మన్నించుగాక!)

44. బద్ర్ యుద్ధంలో మక్కా ఖురైషులు ఘోరంగా ఓడిపోయారు. ఓడిపోయిన సైన్యం కాళ్ళీడ్చుకుంటూ మక్కా చేరుకుంది. మరో వైపునుంచి అబూ సుఫ్యాన్ వర్తక బిడారు కూడా వచ్చేసింది. తమకు లభించిన ఓటమిపై వారు తీవ్రంగా సమీక్షించుకున్నారు. ప్రాణనష్టం సంభవించిన కుటుంబీకులు అబూసుఫ్యాన్ వద్దకు పోయి వాణిజ్యంలో తమకు లాభంగా వచ్చిన సొమ్మును ముస్లింలపై ప్రతీకారం తీర్చుకునేందుకు వెచ్చించమని కోరారు. ముస్లింలు తమను కోలుకోలేనంతగా దెబ్బతీశారనీ, అందువల్ల వారిపై మరోసారి యుద్ధానికి దిగటం అవశ్యమని పట్టుబట్టారు. ఈ ఆయతు ఈ నేపథ్యంలోనే అవతరించింది. ఇలాంటి కార్యకలాపాల కోసం తమ సొమ్ముల్ని వ్యయపరచేవారు

**37** అల్లాహ్ అపవిత్రులను పవిత్రుల నుంచి వేరుపరచటానికీ,[45] అపవిత్రులను పరస్పరం కలిపి, ఒకే గుంపుగా చేసి, ఆపైన వారందరినీ నరకంలో పడవెయ్యటానికి ఇలా చేస్తాడు. పూర్తిగా నష్టపోయేవారంటే వీరే.

لِيَمِيزَ اللَّهُ الْخَبِيثَ مِنَ الطَّيِّبِ وَيَجْعَلَ
الْخَبِيثَ بَعْضَهُ عَلَىٰ بَعْضٍ فَيَرْكُمَهُ جَمِيعًا
فَيَجْعَلَهُ فِي جَهَنَّمَ ۚ أُولَٰئِكَ هُمُ الْخَاسِرُونَ ﴿٣٧﴾

**38** (ఓ ప్రవక్తా!) ఈ అవిశ్వాసులకు చెప్పు : "వారు గనక మానుకుంటే గతంలో వారివల్ల జరిగిన పాపాలన్నీ క్షమించ బడతాయి.[46] ఒకవేళ వారు మళ్ళీ అదే వైఖరిని అవలంబిస్తే గత జాతులపై విధించబడిన ఉత్తర్వుల ఉపమానం ఉండనే ఉంది."[47]

قُل لِّلَّذِينَ كَفَرُوا إِن يَنتَهُوا يُغْفَرْ لَهُم
مَّا قَدْ سَلَفَ وَإِن يَعُودُوا فَقَدْ مَضَتْ
سُنَّتُ الْأَوَّلِينَ ﴿٣٨﴾

**39** ఫిత్నా (షిర్క్) సమసిపోనంత వరకూ,[48] ధర్మం మొత్తం అల్లాహ్‌దే అయిపోనంత వరకూ[49] వారితో పోరాడండి. ఒకవేళ వారు గనక తమ వైఖరిని మానుకుని దారికివస్తే అల్లాహ్ వారి కర్మలను చూస్తాడు.[50]

وَقَاتِلُوهُمْ حَتَّىٰ لَا تَكُونَ فِتْنَةٌ وَيَكُونَ الدِّينُ
كُلُّهُ لِلَّهِ ۚ فَإِنِ انتَهَوْا فَإِنَّ اللَّهَ بِمَا يَعْمَلُونَ
بَصِيرٌ ﴿٣٩﴾

---

ఎంత సొమ్మును ఖర్చుపెట్టినా వారికి లభించేది కడకు పరాభవమేననీ, ఓటమి వారి నొసట వ్రాసి ఉందనీ, పరలోకంలోనయితే వ్యథాభరితమైన శిక్ష ఎలాగూ తప్పదని చెప్పటం జరిగింది.

45. ఈ వేర్పాటు పరలోకంలోగానీ, ఇహలోకంలోగానీ జరగవచ్చు. పరలోకంలో ఈ విభజన జరిగే పక్షంలో సజ్జనులు దుర్మార్గుల సమూహం నుండి వేరుపరచబడతారు. దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడినట్లు "ఓ అపరాధులారా! ఈ రోజు మీరు వేరైపొండి" అని అనబడుతుంది (యాసీన్ – 59). అంటే సజ్జనుల నుండి అపరాధులను, అవిశ్వాసులను, ముష్రిక్కులను, అవిధేయులను ఏరివేసి, వారందరినీ ఒక గుంపుగాచేసి నరకంలోకి నెట్టివేయటం జరుగుతుంది. లేదా ఇహలోకంలోనే వారికి ఇది వర్తిస్తుందని అనుకుంటే దీని భావం ఇది: అవిశ్వాసులు అల్లాహ్ మార్గం నుంచి ప్రజలను నిరోధించటానికి ఎంత సంపదను వెచ్చిస్తారో వెచ్చించనివ్వండి. మేము వారికి ఈ అవకాశం ఇస్తాము. ఈ విధంగా మేము మేలిరకపు సరకు నుంచి తప్పా తాలును వేరుపరుస్తాము. అవిశ్వాసులను విశ్వాసుల నుంచి, కపటులను నిష్కల్మష మనస్కుల నుంచి విభజిస్తాము. ఈ విధంగా చూసినపుడు ఈ ఆయతు ద్వారా లభించే సారాంశమేమిటంటే అవిశ్వాసుల ద్వారా మేము మిమ్మల్ని పరీక్షిస్తాము. వారు మీపై యుద్ధానికి వస్తారు. తమ సిరిసంపదల్ని మీకు వ్యతిరేకంగా విరివిగా వ్యయపరుస్తారు. అపవిత్రులను పవిత్రుల నుండి ఏరిపారెయ్యడానికి ఈ ప్రక్రియ అవసరం (ఇబ్నె కసీర్).

46. **'మానుకోవటం'** అంటే గత వైఖరిని మానుకుని ఇస్లాం జీవన విధానాన్ని అవలంబించటం అని భావం. హదీసులో పేర్కొనబడినట్లు ; "ఎవరు ఇస్లాంను స్వీకరించి సదాచార మార్గాన్ని అనుసరించారో, వారిని అజ్ఞాన కాలంలో చేసిన పాపాల గురించి ప్రశ్నించటం జరగదు. మరెవరు ఇస్లాం స్వీకరించిన తరువాత కూడా చెడులను విడనాడలేదో వారు గతంలో చేసిన పాపాలను గురించి, ఆ తరువాత చేసిన పాపాలను గురించి కూడా ప్రశ్నించబడతారు (సహీహ్ బుఖారీ : కితాబు ఇస్తితాబతిల్ ముర్తదీన్; సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్). "ఇస్లాం గతంలోని పాపాలన్నింటినీ తుడిచిపెడుతుంది" అని వేరొక హదీసులో ఉంది (ముస్నదె అహ్మద్–సంపుటి : 4, పేజీ–199).

47. అంటే వారు తమ అవిశ్వాసంపై, వైరభావంపై మొండికేస్తే వారి పర్యవసానం తీవ్రంగా ఉంటుంది. అటువంటి అసత్యవాదులను శిక్షించి, సజ్జనులకు రక్షణ కల్పించటం దేవుని సంప్రదాయం. ఆలస్యంగానయినాసరే అది అపరాధులపై పట్టు బిగించటం ఖాయం.

40 ఒకవేళ వారు (దారికి రాకుండా) తిరిగిపోతే[51] అల్లాహ్‌యే మీ రక్షకుడని[52] నమ్మండి. ఆయన ఉత్తమ సంరక్షకుడు, ఉత్తమ సహాయకుడూను.[53]

وَإِنْ تَوَلَّوْا فَاعْلَمُوا أَنَّ اللَّهَ مَوْلَاكُمْ ۚ نِعْمَ الْمَوْلَىٰ وَنِعْمَ النَّصِيرُ ﴿٤٠﴾

41 మీరు అల్లాహ్‌ను, సత్యాసత్యాలను వేరుపరిచే రోజున,[54] అనగా రెండు సైన్యాలు మార్కొనిన రోజున[55] మేము మా దాసునిపై అవతరింపజేసిన దానిని[56] విశ్వసించినట్లయితే – మీకు లభించిన ఎలాంటి యుద్ధప్రాప్తి అయినాసరే,[57] అందులోని ఐదోవంతు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందుతుందని తెలుసుకోండి.[58] అల్లాహ్‌కు ప్రతి దానిపై అధికారం ఉంది.

وَاعْلَمُوا أَنَّمَا غَنِمْتُمْ مِنْ شَيْءٍ فَأَنَّ لِلَّهِ خُمُسَهُ وَلِلرَّسُولِ وَلِذِي الْقُرْبَىٰ وَالْيَتَامَىٰ وَالْمَسَاكِينِ وَابْنِ السَّبِيلِ إِنْ كُنْتُمْ آمَنْتُمْ بِاللَّهِ وَمَا أَنْزَلْنَا عَلَىٰ عَبْدِنَا يَوْمَ الْفُرْقَانِ يَوْمَ الْتَقَى الْجَمْعَانِ ۗ وَاللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿٤١﴾

48. అరబీలో **'ఫిత్నా'** (فِتْنَةٌ) అనబడింది. ఫిత్నా అంటే యిక్కడ 'షిర్క్' (బహుదైవారాధన) అని భావం. ఈ షిర్కు నిర్మూలించబడనంతవరకూ దానికి వ్యతిరేకంగా పోరాడుతూ ఉండాలి.

49. అంటే భూమండలంపై సర్వత్రా దైవధర్మం, దేవుడు సమ్మతించిన జీవన సంవిధానపు పతాకం రెపరెపలాడే రోజు వచ్చేవరకూ దాని ఉన్నతి కోసం మీరు పోరాడుతూనే ఉండాలి.

50. వారు తాము ఇస్లాం స్వీకరించామని చెప్పి, ఇస్లామీయ విధుల్ని నెరవేర్చటం మొదలెడితే చాలు, మీరు పోరాటం ఆపండి. మీరు బాహ్యాచరణల్ని మాత్రమే చూడగల్గుతారు. అంతరంగ స్థితి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. కాబట్టి మీరు వారి లోగుట్టును గురించి ఆందోళన చెందనవసరం లేదు. ఆ సంగతిని సర్వజ్ఞాని అయిన అల్లాహ్ చూసుకుంటాడు.

51. అంటే – వారుగాని ఇస్లాంను స్వీకరించకుండా మీకు వ్యతిరేకంగా విచ్ఛిన్నకర ధోరణిని కొనసాగించినట్లయితే అల్లాహ్ తప్పకుండా మీకు తోడ్పాటునందిస్తాడు.

52. మీరు గనక విశ్వాసులుగా జీవించినట్లయితే అల్లాహ్ మీకు అండగా ఉంటాడు.

53. అల్లాహ్‌ను నమ్ముకున్నవారు, ఆయనను తమ సంరక్షకునిగా చేసుకున్నవారు మాత్రమే అంతిమ విజయం సాధిస్తారు. తనను నమ్ముకున్న వారిని అల్లాహ్ ఎన్నడూ నిరాధారులుగా వదలిపెట్టడు.

54. సత్యాసత్యాలను నిర్ణయించే రోజు అంటే బద్ర్ యుద్ధం జరిగిన రోజు అని భావం. బద్ర్ యుద్ధం హిజ్రీ శకం రెండవ సంవత్సరం, రమజాన్ నెల 17వ తేదీన జరిగింది. ఇది విశ్వాసులకు – అవిశ్వాసులకు మధ్య జరిగిన ప్రప్రథమ సంగ్రామం అవటం వల్లనూ, ఈ సంగ్రామంలో అల్లాహ్ ముస్లింలకు విజయాన్ని ప్రసాదించి ఇస్లాం సత్యమని స్పష్టంగా నిరూపించటం వల్లనూ ఈ దినాన్ని నిర్ణయాత్మక దినం (యౌముల్ ఫుర్ఖాన్)గా పేర్కొనటం జరిగింది.

55. రెండు సైన్యాలలో ఒకటి ముస్లింలది; రెండవది మక్కాకు చెందిన అవిశ్వాసులది.

56. అంటే కీలక యుద్ధం జరిగిన రోజున అల్లాహ్ అవతరింపజేసిన ఆయతులపైన, దైవదూతల ద్వారా అందజేసిన సహాయంపైన గట్టినమ్మకం ఉన్నట్లయితే...

57. యుద్ధప్రాప్తి (మాలె గనీమత్) అంటే యుద్ధంలో విజయానంతరం చేజిక్కే అవిశ్వాసుల ధనం అని అర్థం. పూర్వ సమాజాల వారికి ఈ సొమ్ము ధర్మసమ్మతంగా ఉండేదికాదు. యుద్ధానంతరం దైవవిరోధుల నుండి వశమైన సిరిసంపదలను ఒకచోట ప్రోగుచేసేవారు. ఆకాశం నుంచి అగ్ని వచ్చి దాన్ని పూర్తిగా భస్మీపటలం చేసేసేది. అయితే ముస్లిం సమాజం కోసం ఈ సొమ్ము ధర్మసమ్మతం (హలాల్) గావించబడింది. యుద్ధం జరగకుండానే – ఒడంబడికల

إِذْ أَنْتُمْ بِالْعُدْوَةِ الدُّنْيَا وَهُمْ بِالْعُدْوَةِ الْقُصْوٰى
وَالرَّكْبُ أَسْفَلَ مِنْكُمْ ۚ وَلَوْ تَوَاعَدْتُّمْ
لَاخْتَلَفْتُمْ فِي الْمِيعٰدِ ۙ وَلٰكِنْ لِّيَقْضِيَ اللّٰهُ
أَمْرًا كَانَ مَفْعُولًا ۙ لِّيَهْلِكَ مَنْ هَلَكَ عَنْ
بَيِّنَةٍ وَّيَحْيٰى مَنْ حَيَّ عَنْ بَيِّنَةٍ ۗ وَإِنَّ
اللّٰهَ لَسَمِيعٌ عَلِيمٌ ﴿42﴾

**42** ఆ సమయంలో మీరు దగ్గరలో ఉన్న అంచున ఉన్నారు. వారు దూరాన ఉన్న అంచున ఉన్నారు.[59] బిడారు మాత్రం మీకు దిగువన ఉంది.[60] ఒకవేళ మీరు గనక పరస్పరం తీర్మానం చేసుకుని ఉంటే నిర్ధారిత సమయానికి అక్కడ చేరుకునే విషయంలో మీరు విభేదించుకునేవారు.[61] కాని అల్లాహ్, ముందే నిర్ణయించబడిన ఒక పనిని చేసి తీరటానికి – నాశనమయ్యేవాడు స్పష్టమైన ఆధారంపై నాశనమవడానికీ, బ్రతికివున్నవాడు కూడా స్పష్టమైన ప్రమాణంపై బ్రతికి ఉండడానికి గాను[62] (ఈ విధంగా వ్యూహ రచన చేశాడు). నిశ్చయంగా అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

ద్వారా, కప్పం ద్వారా, జిజ్‌యా ద్వారా–వసూలు అయ్యే సొమ్ములను “ఫై”గా వ్యవహరిస్తారు. ఒక్కోసారి యుద్ధప్రాప్తి కూడా “ఫై”గా వ్యవహరించబడుతుంది. ఈ సొమ్ము ఎక్కువ పరిమాణంలో ఉన్నా, తక్కువ పరిమాణంలో ఉన్నా–అది ఖరీదైనదైనా, అతి సామాన్యమైనదైనా–దాన్నంతటినీ ఒక చోట ప్రోగుచేసి నిర్ణీత పద్ధతి ప్రకారం విభజించటం జరుగుతుంది. వాటాలు పంపిణీ కానంతవరకూ ఏ సైనికుడూ తనకు దొరికిన ఏ వస్తువునూ తన దగ్గర ఉంచుకోలేదు.

58. వాస్తవానికి అల్లాహ్‌కు ఏ వస్తువూ అక్కరలేదు. కాకపోతే ప్రతిదీ అల్లాహ్ ప్రసాదితమే గనక, ఆయన ఆజ్ఞలే శిరసా వహించబడతాయి గనక యిక్కడ ‘అల్లాహ్ వాటా’ అని అనబడింది. యదార్థానికి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వాటా అంటే అది ఒకే వాటా. యుద్ధప్రాప్తిగా లభించిన సొమ్మును ఐదు భాగాలుగా విభజించి నాలుగు భాగాలు యుద్ధంలో పాల్గొన్న ముస్లిం యోధుల మధ్య పంచబడతాయి. వీటిలో కూడా కాలి నడకన యుద్ధానికి వచ్చినవానికి ఒక వంతు, వాహనం ద్వారా యుద్ధంలో పాల్గొన్న వానికి మూడు వంతులు లభిస్తాయి. ‘ఖుమున్’గా వ్యవహరించబడే ఐదవ భాగం దైవప్రవక్త (స) అధీనంలోకి వస్తుంది. ఆ ఐదవ భాగం కూడా మరో ఐదు భాగాలుగా విభజించబడుతుంది అని అనబడింది. అందులో నుంచి ఒక భాగం దైవప్రవక్త (స)కు చెందుతుంది. ఈ భాగంలో నుంచి దైవప్రవక్త (స) తాను కోరిన ముస్లింల కోసం ఖర్చుపెట్టగలరు. “నాకు లభించిన ఐదవభాగం కూడా ముస్లింల శ్రేయస్సు కొరకు వెచ్చించబడుతుంది” అని దైవప్రవక్త (స) సెలవీయటం గమనార్హం (సుననె నసాయి, సహీహ్). రెండవ భాగం దైవప్రవక్త (స) బంధువులకు లభిస్తుంది. మూడవ భాగం తండ్రిలేని బిడ్డలకు దక్కుతుంది. నాల్గవ, ఐదవ భాగాలు వరుసగా నిరుపేదలకు, బాటసారులకు చెందుతాయి. ఈ ‘ఖుమున్’ సొమ్ము సమయ సందర్భాలనుబట్టి ఖర్చుచేయబడాలని పండితులు చెబుతారు.

59. అంటే మదీనా నగరానికి చేరువలో ఉన్న అంచు. కాగా; అవిశ్వాసులు దీనికి దూరాన ఉన్న మరో అంచున ఉన్నారు. మూలంలో **‘దున్‌యా’, ‘ఖుస్‌వా’** అనే రెండు పదాలు వచ్చాయి. ‘దున్‌యా’ అనేది దునువ్వున్ నుంచి ఏర్పడింది. సమీపంలోనిది అని దీని అర్థం. ‘ఖుస్‌వా’ అంటే దూరంగా ఉన్నది అని అర్థం.

60. బిడారు అంటే అబూసుఫ్యాన్ సారథ్యంలో సిరియా నుంచి మక్కానగరం వైపుకు సాగిపోతున్న వర్తకబిడారు. అసలు ఆ వర్తక బిడారును అటకాయించే లక్ష్యంతోనే ముస్లింలు బయలుదేరారు. ఈ బిడారు పశ్చిమ దిక్కున పర్వతానికి చాలా దూరాన పల్లపు ప్రాంతంలో ఉంది. కాని యుద్ధం జరిగిన బద్ర్ క్షేత్రం మాత్రం మెరక ప్రదేశంలో ఉంది.

61. అంటే యుద్ధం ఫలానా తేదీన, ఫలానా చోట జరగాలి అని ఉభయవర్గాల వారు ముందుగానే నిశ్చయించుకుని ఉంటే బహుశా ఏదో ఒక వర్గం యుద్ధాన్ని దాటవేసే యత్నం చేసి ఉండేదేమో! అయితే నిర్ణయాత్మకమైన ఈ యుద్ధం జరిగి తీరాల్సిందేనని దేవుడు రాసిపెట్టేశాడు. అందుచేత ఇరువర్గాల వారూ ‘బద్ర్’ అనే స్థలంలో ఒండొకరిని ఎదుర్కొనక తప్పని పరిస్థితులు సృష్టించబడ్డాయి.

إِذْ يُرِيكَهُمُ اللَّهُ فِي مَنَامِكَ قَلِيلًا ۖ وَلَوْ أَرَاكَهُمْ كَثِيرًا لَّفَشِلْتُمْ وَلَتَنَازَعْتُمْ فِي الْأَمْرِ وَلَٰكِنَّ اللَّهَ سَلَّمَ ۗ إِنَّهُ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ﴿43﴾

**43** (ఓ ప్రవక్తా! ఆ సమయంలో) అల్లాహ్ నీ కలలో వారి సంఖ్యను అల్పంగా చేసి చూపించాడు. వారిని అధిక సంఖ్యలో చూపి ఉంటే, మీరు జడుసుకుని, ఈ వ్యవహారంలో మీరు పరస్పరం గొడవపడి ఉండేవారు. అయితే అల్లాహ్ (మిమ్మల్ని) కాపాడాడు. నిశ్చయంగా ఆయన గుండెల్లోని గుట్టును (సయితం) బాగా ఎరిగినవాడు.[63]

وَإِذْ يُرِيكُمُوهُمْ إِذِ الْتَقَيْتُمْ فِي أَعْيُنِكُمْ قَلِيلًا وَيُقَلِّلُكُمْ فِي أَعْيُنِهِمْ لِيَقْضِيَ اللَّهُ أَمْرًا كَانَ مَفْعُولًا ۗ وَإِلَى اللَّهِ تُرْجَعُ الْأُمُورُ ﴿44﴾

**44** నిర్ణయించబడిన కార్యాన్ని పూర్తి చేసేందుకు[64] మీరు పరస్పరం మార్కొన్న సమయంలో అల్లాహ్, మీ కళ్లకు వారు (శత్రువులు) కొద్దిమందిగా కనిపించేలా చేశాడు. అదే సమయంలో వారి కళ్లకు కూడా మిమ్మల్ని కొద్దిమందిగానే[65] చూపించాడు. సమస్త వ్యవహారాలూ అల్లాహ్ వైపుకే మళ్ళించబడతాయి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا لَقِيتُمْ فِئَةً فَاثْبُتُوا وَاذْكُرُوا اللَّهَ كَثِيرًا لَّعَلَّكُمْ تُفْلِحُونَ ﴿45﴾

**45** ఓ విశ్వాసులారా! మీరు ఏ ప్రత్యర్థి సైన్యాన్ని అయినా ఎదుర్కోవలసి వచ్చినప్పుడు నిలకడ చూపండి. అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించండి. తద్వారా మీకు విజయం ప్రాప్తించవచ్చు.[66]

62. అల్లాహ్ ప్రణాళిక ననుసరించి బద్ర్ రణరంగంలో ఇరువర్గాల వారూ ముఖాముఖీ కావలసి వచ్చింది. ఆ యుద్ధం తరువాత విశ్వాసం (ఈమాన్)పై బ్రతికి ఉన్నవారికి ఇస్లాం ఒక సత్యధర్మం అన్న సంగతి తెలిసిపోవాలి. అతను కడదాకా ఆ సత్యంపై జీవించాలి. ఈ సత్య ధర్మం పట్ల అతను ఎన్నడూ ఊగిసలాటకు లోనుకాకుండా ఉండాలి. ఎందుకంటే బద్ర్ సంగ్రామంలో అతను సత్యాన్ని కళ్లారా చూశాడు కాబట్టి! అలాగే ఎవరయినా అవిశ్వాసం (కుఫ్ర్)పై వధించబడితే వారు ఎన్నుకున్న మార్గం అపమార్గం అన్న సంగతి కూడా ఈ యుద్ధంలో స్పష్టమయిపోయింది.

63. మహాప్రవక్త (సఅసం) గారు స్వప్నంలో అవిశ్వాసులు బహుకొద్దిమంది ఉన్నట్లు చూశారు. ఆ విషయమే ఆయన (స) తన సహచరులకు చెప్పారు. దీంతో ప్రియసహచరుల ఆత్మ విశ్వాసం పెరిగింది. ఒకవేళ, అవిశ్వాసులు చాలామంది ఉన్నారన్న సంగతి వారికి తెలిస్తే వారు ధైర్యం కోల్పోయేవారు. యుద్ధం చేయాలా? వద్దా? అని వారు తటపటాయించేవారు. ఈ రెండు విపత్తుల నుంచి కూడా అల్లాహ్ వారిని కాపాడాడు.

64. అల్లాహ్ సంకల్పించినది జరిగి తీరటానికిగాను పరిస్థితుల స్వరూపం ఈ విధంగా మలచబడింది.

65. ముస్లింలు కూడా ముష్రిక్కులకు చాలా కొద్దిమందిగా కనిపించేలా చేయటంలోని మర్మం ఏమిటంటే, ఒకవేళ ముస్లింలు భారీ సైన్యంగా వారి కంటికి కానవచ్చి ఉంటే బహుశా వారు యుద్ధం చేయకుండా తోక ముడిచేవారేమో! యుద్ధానికి ముందు ముస్లింలు వారి కంటికి గుప్పెడు మనుషులుగానే కానవచ్చారు. తీరా యుద్ధం మొదలయ్యాక పరిస్థితి మారిపోయింది. ముస్లింలు తమకన్నా రెట్టింపు ఉన్నట్లు అవిశ్వాసులకు అనిపించింది. ఆలి ఇమ్రాన్ సూరాలోని 13వ ఆయతు ద్వారా ఈ విషయం రూఢీ అయింది. ముస్లింల పట్ల అవిశ్వాసుల గుండెల్లో దడ పెంచటానికే దైవికంగా ఇలా జరిగింది. అంటే తొలుత అవిశ్వాసుల్లో సమరోత్సాహాన్ని నూరిపోసి, తీరా కదన రంగంలో కాలుదువ్విన పిమ్మట వారి ఉత్సాహాన్ని నీరు గార్చాలి. ఇదీ ఈ సందర్భంగా అల్లాహ్ తరఫున అవలంబించబడిన రణనీతి.

66. ఇక్కడ ముస్లింలకు రణనీతి గురించి ఉపదేశించబడింది. శత్రువులను యుద్ధరంగంలో ఎదుర్కొన్నప్పుడు వారు ఎలా వ్యవహరించాలో తాకీదు చేయటం జరిగింది. 1. అన్నిటికన్నా ముందు వారిలో స్థిరత్వం ఉండాలి. కదన

وَاَطِيْعُوا اللّٰهَ وَرَسُوْلَهٗ وَلَا تَنَازَعُوْا فَتَفْشَلُوْا وَتَذْهَبَ رِيْحُكُمْ وَاصْبِرُوْا ؕ اِنَّ اللّٰهَ مَعَ الصّٰبِرِيْنَ ﴿46﴾

**46** ఇంకా మీరందరూ అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయులై ఉండండి. పరస్పరం గొడవ పడకండి. అలా చేస్తే (గొడవపడ్డా రంటే) మీరు పిరికివారై పోతారు. మీ శక్తి సన్నగిల్లిపోతుంది. అందుకే సహన స్థయిర్యాలను పాటించండి. స్థయిర్యం కనబరచే వారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు.[67]

وَلَا تَكُوْنُوْا كَالَّذِيْنَ خَرَجُوْا مِنْ دِيَارِهِمْ بَطَرًا وَّرِئَآءَ النَّاسِ وَيَصُدُّوْنَ عَنْ سَبِيْلِ اللّٰهِ ؕ وَاللّٰهُ بِمَا يَعْمَلُوْنَ مُحِيْطٌ ﴿47﴾

**47** అహంకారాన్ని ప్రదర్శిస్తూ, ప్రజల ముందు తమ బడాయిని చాటుకుంటూ తమ ఇండ్ల నుంచి బయలుదేరిన వారి మాదిరిగా, అల్లాహ్ మార్గం నుండి ప్రజలను ఆపే వారిలాగా మీరు తయారవకండి.[68] వారి ఆగడాలపై అల్లాహ్ పట్టు బిగించనున్నాడు.

وَاِذْ زَيَّنَ لَهُمُ الشَّيْطٰنُ اَعْمَالَهُمْ وَقَالَ لَا غَالِبَ لَكُمُ الْيَوْمَ مِنَ النَّاسِ وَاِنِّيْ جَارٌ لَّكُمْ ۚ فَلَمَّا

**48** ఆ సమయంలో షైతాను వారి కార్యకలాపాలను వారికి ఎంతో రమణీయమైనవిగా చేసి చూపాడు. "ఈ రోజు మిమ్మల్ని ఓడించేవాడు జనులలో ఎవడూలేడు. నేను సయితం మీకు

రంగంలో మొక్కవోని సాహసాన్ని ప్రదర్శించాలి. ఈ నిలకడ లేనంత వరకూ యుద్ధమైదానంలో నిలబడటం కష్టం. అయితే రణనీతిలో భాగంగా ఓ వైపుకు తప్పుకోవటం, వెనక్కి తగ్గటం వంటివి అధైర్యం క్రిందికి రావు. ఇలాంటి ఎత్తుగడలకు వినాయింపు ఉంటుంది. దీని గురించి ఇంతకు ముందు కూడా చర్చించటం జరిగింది. 2. రెండో ముఖ్య విషయం ఏమిటంటే కదనరంగంలో సయితం అల్లాహ్‌ను మరచిపోకూడదు. పైగా ఆ క్షణాల్లో అల్లాహ్‌ను వీలయినంత ఎక్కువగా స్మరించాలి. అనుక్షణం ఆయన అండదండలను కోరుకుంటూ ఉండాలి. యుద్ధరంగంలో వారు అల్ప సంఖ్యలో ఉన్నప్పుడు దైవసహాయాన్ని అర్థిస్తూ ఉండాలి. అధిక సంఖ్యలో ఉన్నప్పుడు కూడా దైవధ్యానం అవసరమే. ఎందుకంటే వారి సంఖ్యాబలం వారిలో గర్వాహంకారాన్ని సృజించకుండా ఉండటానికి దైవనామస్మరణ అవసరం. దైవనామస్మరణ ద్వారా వారి నిజస్థితి ఎల్లప్పుడూ వారికి జ్ఞాపకముంటుంది. వారెన్నడూ తమ శక్తియుక్తుల ద్వారా గెలవలేరనీ, దేవుని తోడ్పాటుతోనే గెలుపు సిద్ధిస్తుందన్న యదార్థం సదా వారి మనసులలో మెదలుతూవుండాలి.

67. మూడవ ముఖ్య ఉపదేశం ఇది. యుద్ధం లాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో దైవం పట్ల, దైవప్రవక్త పట్ల అవిధేయతను ప్రదర్శిస్తే దాని పరిణామం ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించటం కష్టం కాదు. ఆ మాటకొస్తే సాధారణ సమయాల్లో కూడా దైవం మరియు దైవప్రవక్త విధేయతకు కట్టుబడి ఉండాల్సిందే. ఇక యుద్ధంలాంటి అసాధారణ పరిస్థితుల్లోనయితే ఈ విధేయతా భావం మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. ఈ సందర్భంగా ఎక్కడ, ఏ కాస్త అవిధేయత తొంగిచూసినా దైవసహాయం నిలిచిపోవచ్చు. 4. నాల్గో ముఖ్యాంశం ఏమిటంటే అనైక్యతకు, అంతఃకలహాలకు తావీయకుండా అందరూ ఒకే త్రాటిపై ఉండాలి. మనస్పర్థలు మనో నిబ్బరాన్ని నీరు గారుస్తాయి. దీనిమూలంగా మీ శక్తి క్షీణిస్తుంది. 5. యుద్ధరంగంలో ఎట్టి పరిస్థితిలోనూ సహన స్థయిర్యాలను విడనాడకూడదు. ఒకవేళ ఓటమి కళ్లముందు కదలాడుతున్నాసరే వెన్ను చూపరాదు. మహనీయ ముహమ్మద్ (స) వారు ఒక హదీసులో ఇలా ప్రవచించారు: "ప్రజలారా! శత్రువుతో తలపడే స్థితిని కాంక్షించకండి. సదా అల్లాహ్ నుండి శాంతిని కోరుతూ ఉండండి. ఒకవేళ శత్రువును ఎదుర్కోవలసిన అగత్యమే గనక ఏర్పడితే అప్పుడు సహనస్థయిర్యాలను చూపండి (ధైర్యంగా పోరాడండి). స్వర్గం ఖడ్గాల నీడలో ఉందని బాగా తెలుసుకోండి" (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్).

68. మక్కాకు చెందిన అవిశ్వాసులు తమ వర్తక బృందాన్ని ఆదుకోవటానికి, ముస్లింలతో యుద్ధం చేయడానికి బయలు దేరినప్పుడు అహంకారంతో విర్రవీగుతూ, తమ శౌర్యాన్ని జబ్బచరచి ప్రజల ముందు ప్రదర్శిస్తూ మరీ వచ్చారు. ఆ విషయాన్నే అల్లాహ్ యిక్కడ ప్రస్తావిస్తూ, ముస్లింలకు అలాంటి బడాయి ఎన్నటికీ శోభించదని తాకీదు చేస్తున్నాడు.

تَرَآءَتِ الْفِئَتٰنِ نَكَصَ عَلٰى عَقِبَيْهِ وَقَالَ اِنِّيْ بَرِيْٓءٌ مِّنْكُمْ اِنِّيْٓ اَرٰى مَا لَا تَرَوْنَ اِنِّيْٓ اَخَافُ اللّٰهَ ۭ وَاللّٰهُ شَدِيْدُ الْعِقَابِ ﴿48﴾

అండగా ఉన్నాను!" అని చెప్పాడు. కాని తీరా ఆ ఇరుపక్షాలు పరస్పరం ఎదురుపడినప్పుడు వాడు తన మడమలపై వెనుతిరిగి పోయాడు. "ఈ వ్యవహారంలో మీతో నాకెలాంటి సంబంధంలేదు. మీరు చూడనిది నేను చూస్తున్నాను.[69] నేను అల్లాహ్‌కు భయ పడుతున్నాను.[70] అల్లాహ్ చాలా కఠినంగా శిక్షించేవాడు"[71] అని అన్నాడు.

اِذْ يَقُوْلُ الْمُنٰفِقُوْنَ وَالَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ غَرَّ هٰٓؤُلَاۗءِ دِيْنُهُمْ ۭ وَمَنْ يَّتَوَكَّلْ عَلَى اللّٰهِ فَاِنَّ اللّٰهَ عَزِيْزٌ حَكِيْمٌ ﴿49﴾

**49** ఆ సందర్భంగా కపటులు, హృదయాలలో రోగం ఉన్న వారు[72] కూడా ఇలా అన్నారు : "వీళ్ళ ధర్మం వీళ్ళని మోసంలో పడవేసింది."[73] కాని ఎవరు అల్లాహ్‌ను నమ్ముకున్నారో నిశ్చయంగా అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేకవంతుడు[74] (అని తెలుసుకోవాలి).

وَلَوْ تَرٰٓى اِذْ يَتَوَفَّى الَّذِيْنَ كَفَرُوا الْمَلٰۗىِٕكَةُ يَضْرِبُوْنَ وُجُوْهَهُمْ وَاَدْبَارَهُمْ ۚ وَذُوْقُوْا عَذَابَ الْحَرِيْقِ ﴿50﴾

**50** (ఓ ప్రవక్తా!) దూతలు సత్యతిరస్కారుల ప్రాణాలు తీస్తూ ఉన్నప్పటి దృశ్యాన్ని నువ్వు చూడగలిగితే ఎంత బావుండు! వారు వాళ్ల ముఖాలపై, పిరుదులపై కొడుతూ ఉంటారు. ఇంకా ఇలా అంటూ ఉంటారు : "ఇదిగో, దహించివేసే శిక్షను చవి చూడండి.[75]

69. ముష్రిక్కులు మక్కా నుంచి బయలుదేరినప్పుడు వారికి వారి ప్రత్యర్థి తెగ అయిన బనీ బకర్ బిన్ కినాన పట్ల కొంత భయాందోళన ఉండేది. ఆ తెగవారు వెనుక నుంచి వచ్చి తమను చుట్టుముడతారేమోనని ముష్రిక్కులు అనుమానించారు. ఆ సమయంలో బనీ బకర్ సర్దారు అయిన సురాఖా బిన్ మాలిక్ ఆకారంలో షైతాను ప్రత్యక్షమై ముష్రిక్కులకు విజయం వరిస్తుందన్న శుభవార్త అందించాడు. పైగా తన సహాయ సహకారాలు వారికి తోడుగా ఉంటాయని హామీ ఇచ్చాడు. కాని యుద్ధ రంగంలో అల్లాహ్ తరఫున దూతలు దిగిరావటం చూసి షైతాను తోక ముడిచాడు.

70. అల్లాహ్ పట్ల భయము, భీతి ఏర్పడగానే షైతానుకు చెమటలు పట్టాయి. ముస్లింలకు దేవుని ప్రత్యేక తోడ్పాటు ఉందని, ముస్లింల ముందు ఈ రోజు ముష్రిక్కులు నిలువలేరని ఆ జిత్తులమారికి అర్థమైపోయింది.

71. ఈ పలుకులు షైతానువీ కావచ్చు లేక షైతాను ఈ విధంగా పలికాడని అల్లాహ్ తరఫున చెప్పబడినవీ కావచ్చు.

72. అంటే అప్పుడప్పుడే ఇస్లాం స్వీకరించిన ముస్లింలు అయి ఉండవచ్చు. వారి ఆంతర్యాలలో ఇస్లాం ఇంకా బలపడి ఉండకపోవటం మూలంగా ముస్లింలకు విజయం చేకూరుతుందో లేదో నన్న శంక వారిలో కలిగి ఉంటుంది. లేదా ముష్రిక్కులనుద్దేశించి ఇలా అని ఉండవచ్చు లేదా మదీనాలో నివసించే యూదుల్ని ఉద్దేశించి ఈ విధంగా అని ఉండవచ్చు.

73. అంటే గుప్పెడుమంది, సరైన ఆయుధాలు కూడా లేకుండా అంతపెద్ద సైన్యాన్ని ఎలా ఎదుర్కోవాలని వీళ్లు బయలు దేరారు? వీళ్లు విశ్వసిస్తున్న ధర్మం వీళ్లని మోసంలో పడవేసింది. వీళ్లు మత పిచ్చిలో పడి వివేచనను కోల్పోతున్నారు. ఏమాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా కేవలం ఆవేశంతో దూసుకుపోతున్నారని మొసలి కన్నీరు కార్చసాగారు.

74. శక్తిమంతుడైన అల్లాహ్‌ను నమ్ముకున్న విశ్వాసుల సహన స్థైర్యాల సంగతి ఈ ప్రాపంచిక పూజారులకు ఏం తెలుసు?! ఏ ఏ మార్గాల నుంచి అల్లాహ్ తోడ్పాటునందిస్తాడో, ఏ దిశ నుంచి శత్రువుల వెన్ను విరుస్తాడో ఈ సందేహాలస్వాములకు ఇంకా తెలియదు. తెలిస్తే వారు ఇలాంటి కాకిలెక్కలు వేయరు అన్నది ఈ పలుకుల సారాంశం.

ذٰلِكَ بِمَا قَدَّمَتْ اَيْدِيْكُمْ وَاَنَّ اللّٰهَ لَيْسَ بِظَلَّامٍ لِّلْعَبِيْدِ ﴿٥١﴾

51 "ఇది మీ చేతులు ముందుగానే చేసి పంపుకున్న పాపానికి ప్రతిఫలం. అంతేగాని అల్లాహ్ తన దాసులకు అన్యాయం చేసేవాడు కాదు."[76]

كَدَاْبِ اٰلِ فِرْعَوْنَ ۙ وَالَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ؕ كَفَرُوْا بِاٰيٰتِ اللّٰهِ فَاَخَذَهُمُ اللّٰهُ بِذُنُوْبِهِمْ ؕ اِنَّ اللّٰهَ قَوِيٌّ شَدِيْدُ الْعِقَابِ ﴿٥٢﴾

52 (వీళ్ల ధోరణి) ఫిరౌను అనుయాయుల, వారి పూర్వీకుల ధోరణిని పోలి ఉన్నది.[77] వారు అల్లాహ్ ఆయతులను తిరస్కరించగా, అల్లాహ్ వారి పాపాల కారణంగా వారిని పట్టుకున్నాడు. నిస్సందేహంగా అల్లాహ్ బలవంతుడు, కఠినంగా శిక్షించేవాడూను.

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ لَمْ يَكُ مُغَيِّرًا نِّعْمَةً اَنْعَمَهَا عَلٰى قَوْمٍ حَتّٰى يُغَيِّرُوْا مَا بِاَنْفُسِهِمْ ۙ وَاَنَّ اللّٰهَ سَمِيْعٌ عَلِيْمٌ ﴿٥٣﴾

53 ఇలా ఎందుకు జరుగుతుందంటే, అల్లాహ్ ఏ జాతివారికైనా అనుగ్రహాన్ని ప్రసాదించిన తర్వాత వారు స్వయంగా తమకు తామై తమ స్థితిని మార్చుకుంటేనే తప్ప[78] అల్లాహ్ తాను ప్రసాదించిన అనుగ్రహాన్ని మార్చడు. నిశ్చయంగా అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

75. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు బద్ర్ యుద్ధంలో హతులైన ముష్రిక్కుల గురించి ఈ విధంగా చెప్పబడిందని అభిప్రాయపడ్డారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "ముష్రిక్కులు ముస్లిం యోధుల వైపుకు దూసుకువచ్చినప్పుడు ముస్లింలు తమ ఖడ్గాలతో వారి ముఖాలపై వేటు వేసేవారు. ఆ దెబ్బల నుంచి తప్పించుకోవటానికి ముష్రిక్కులు వీపు తిప్పుకుని పారిపోయే యత్నం చేసేవారు. అప్పుడు దైవదూతలు వారి పిరుదులపై ఖడ్గాలతో వాయించేవారు." అయితే ఈ ఆయతు సర్వ సాధారణమయింది. దైవవచనాలను త్రోసిపుచ్చిన అవిశ్వాసులు, ముష్రిక్కులందరికీ ఇది వర్తిస్తుంది. దీని భావం ఏమిటంటే మరణ ఘడియలలో దైవదూతలు వారి ముఖాలపై, పిరుదులపై కొడతారు. అల్ అన్ఆమ్ సూరాలో చెప్పబడినట్లు: "దైవదూతలు వారిని కొట్టడానికి తమ చేతుల్ని చాపుతారు" (93). ప్రళయదినాన అవిశ్వాసులను నరకం వైపుకు తీసుకుపోతున్నప్పుడు ఈ విధంగా కొడతారనీ, అప్పుడు నరక ద్వారపాలకుడు, "సరే, ఇక దహించే శిక్షను అనుభవించండి" అని అంటాడనీ మరి కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు.

76. మీ స్వయంకృతాల మూలంగానే ఈ దెబ్బలు మీకు పడుతున్నాయి. ఉత్తుత్తిగా అల్లాహ్ తన దాసులను శిక్షించడు. వాస్తవానికి ఆయన న్యాయశీలుడు. అన్ని రకాల అన్యాయాలకు, దౌర్జన్యాలకు ఆయన అతీతుడు. ఒక హదీసె ఖుద్‌సీలో అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చాడు: "నా దాసులారా! అన్యాయం చేయటాన్ని నేను స్వయంగా నా కొరకు నిషేధించుకున్నాను. మీమధ్య కూడా దీనిని నిషిద్ధపరచాను. కాబట్టి మీరు ఒండొకరిపై అన్యాయానికి పాల్పడకండి. నా దాసులారా! ఇదిగో, నేను నమోదు చేసిన మీ కర్మలను చూసుకోండి. ఎవరు తమ కర్మలలోని మేలును చూసుకుంటారో వారు దైవస్తోత్రం చేయాలి. మరెవరు తమ కర్మలలో తద్భిన్నమైన దాన్ని చూస్తారో వారు తమ ఆత్మలనే నిందించుకోవాలి" (సహీహ్ ముస్లిం, కితాబుల్ బిర్ర్).

77. అరబీలో **'దఅబ్'** అనే పదం వాడబడింది. అంటే అలవాటు, ధోరణి, పోకడ అని అర్థం. అంటే పైగంబరులను ధిక్కరించటంలో వీళ్ల ధోరణి (లేక పోకడ) ని చూస్తుంటే, వీళ్లు ఫిరౌను అనుంగు అనుచరుల్లాగా, వారి పూర్వీకులైన అవిశ్వాసుల్లాగా కనిపిస్తున్నారు. పూర్వం వారు కూడా ఈ రకంగానే తమ ప్రవక్తలను త్రోసిపుచ్చేవారు.

78. ఏ జాతి అయినాసరే తన సత్ప్రవర్తన నుండి మరలిపోకుండా ఉన్నంతవరకూ, అంటే దైవానుగ్రహాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించకుండా, మంచిపట్ల వైముఖ్యం ప్రదర్శించకుండా ఉన్నంతవరకూ అల్లాహ్ వారిపై తన అనుగ్రహాల వర్షాన్ని కురిపిస్తూనే ఉంటాడు. ఒకవేళ వారిలో గనక విచ్ఛిన్నకర ధోరణి ప్రబలిపోయి, వారు భూమిలో చెలరేగిపోవటం

كَدَأْبِ آلِ فِرْعَوْنَ وَالَّذِينَ مِنْ
قَبْلِهِمْ كَذَّبُوا بِآيَاتِ رَبِّهِمْ فَأَهْلَكْنَاهُمْ
بِذُنُوبِهِمْ وَأَغْرَقْنَا آلَ فِرْعَوْنَ
وَكُلٌّ كَانُوا ظَالِمِينَ ﴿54﴾

**54** (వీళ్ళ పోకడ) ఫిరౌను అనుచరుల, వారి పూర్వీకుల పోకడను పోలి ఉన్నది – వారు తమ ప్రభువు నిదర్శనాలను ధిక్కరించారు. అప్పుడు మేము వారి పాపాల కారణంగా వారిని నాశనం చేశాము. ఫిరౌనీయులను ముంచివేశాము. వారంతా దుర్మార్గులే.[79]

إِنَّ شَرَّ الدَّوَابِّ عِنْدَ اللَّهِ الَّذِينَ كَفَرُوا
فَهُمْ لَا يُؤْمِنُونَ ﴿55﴾

**55** సత్యాన్ని తిరస్కరించి, ఎన్నటికీ దానిని విశ్వసించకుండా ఉండేవారే అల్లాహ్ దృష్టిలో అత్యంత హీనమైన జంతువులు.[80]

الَّذِينَ عَاهَدْتَ مِنْهُمْ ثُمَّ يَنْقُضُونَ
عَهْدَهُمْ فِي كُلِّ مَرَّةٍ وَهُمْ لَا يَتَّقُونَ ﴿56﴾

**56** నువ్వు వారితో ఒప్పందం చేసుకున్నావు. అయినా వారు తమ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తున్నారు. పైపెచ్చు ఏమాత్రం భయపడటం లేదు.[81]

فَإِمَّا تَثْقَفَنَّهُمْ فِي الْحَرْبِ فَشَرِّدْ بِهِمْ مَنْ
خَلْفَهُمْ لَعَلَّهُمْ يَذَّكَّرُونَ ﴿57﴾

**57** కాబట్టి యుద్ధంలో నువ్వు ఎప్పుడైనా వారిపై ఆధిక్యం పొందితే వారి వెనుక ఉన్నవారు సయితం బెంబేలెత్తి పారి పోయేలా వారిని గట్టిగా వాయించు.[82] ఆ విధంగానయినా వారికి బుద్ధిరావచ్చు.

మొదలెడితే అల్లాహ్ వారిపై అనుగ్రహాలకు బదులు ఆగ్రహ వర్షం కురిపిస్తాడు. 'శిక్ష' అనే కొరడాను ఝుళిపిస్తాడు. ఇది దేవుని సంప్రదాయం. వేరే మాటల్లో చెప్పాలంటే జాతులలో పాపాలు మితిమీరిపోయిన కారణంగానే అల్లాహ్ తన అనుగ్రహాల ద్వారాన్ని మూసివేస్తాడు. కనుక దైవానుగ్రహాలను పొందడానికి ప్రజలు పాపాలకు దూరంగా ఉండాలి. అవిధేయతా ధోరణిని మానుకుని విధేయతా భావాన్ని అలవరచుకోవాలి. జరిగిన తప్పులపై పశ్చాత్తాపం చెందాలి. క్షమాభిక్షకై వేడుకోవాలి.

79. ఈ విషయం ఇంతకుముందు కూడా వచ్చింది. అయితే ఈ వచనంలో వారిని ముంచివేశాము, నాశనం చేశాము అన్న పదాలు వచ్చాయి. అల్లాహ్ వారిని సముద్రంలో ముంచి వారిపై ఎలాంటి అన్యాయానికీ పాల్పడలేదనీ, వారి అపరాధాల మూలంగానే వారికీ గతి పట్టిందని కూడా స్పష్టం చేయటం జరిగింది. యదార్థానికి అల్లాహ్ ఎవరిపై దౌర్జన్యం చేసేవాడు కాడు. "నీ ప్రభువు తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడు" (హామీమ్ అస్సజ్దహ్ – 46).

80. "మనుషులందరికన్నా అల్పులు" (షర్రన్నాసి) అని అనే బదులు **"జంతువులన్నింటి కన్నా హీనులు"** (షర్రద్దవాబ్బి) అని అనటం గమనార్హం. దవాబ్బ్ అన్న పదాన్ని సాధారణంగా జంతువుల కోసం వాడతారు. దీనిప్రకారం వారు మానవులు, పశువుల కన్నా హీనులు అన్న భావం వస్తుంది. అవిశ్వాసులు మనుషులే అయినప్పటికీ సత్య తిరస్కారం మూలంగా వారు జంతువుల్లా మారిపోయారు. కాదు, జంతువుల కన్నా హీనంగా తయారయ్యారు.

81. అవిశ్వాసుల ఇంకొక దుష్ట లక్షణం, దురలవాటు ఇక్కడ ప్రస్తావించబడింది. వారు పదే పదే ఒడంబడికను ఉల్లంఘిస్తూ ఉంటారు. నియమోల్లంఘనకు పాల్పడుతున్నప్పుడూ వారిలో ఏ కోశానా భయభక్తులుండవు. సిగ్గూ ఎగ్గూ ఉండవు. యూద తెగ అయిన బనూ ఖురైజా నుద్దేశ్యించి ఈ మాటలనబడ్డాయని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. యుద్ధ సమయాలలో అవిశ్వాసులకు ఏ విధంగానూ సహాయం అందించబోమని అంతకుముందు యూదులు మహాప్రవక్త (స)తో ఒప్పందం చేసుకున్నారు. కాని తీరా యుద్ధ సమయంలో వారు ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించి దైవప్రవక్త (సఅసం)కు మోసం చేశారు.

وَاِمَّا تَخَافَنَّ مِنْ قَوْمٍ خِيَانَةً فَانْۢبِذْ اِلَيْهِمْ عَلٰى سَوَآءٍ ؕ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْخَآئِنِيْنَ ﴿58﴾

**58** ఒకవేళ ఏ జాతి వారైనా నమ్మక ద్రోహానికి పాల్పడవచ్చన్న భయం నీకు కలిగితే – సరిసమానంగా – వారి ఒప్పందాన్ని వారి ముందు విసిరివెయ్యి.[83] నమ్మక ద్రోహం చేసేవారిని అల్లాహ్ ఎంతమాత్రం ఇష్టపడడు.[84]

وَلَا يَحْسَبَنَّ الَّذِيْنَ كَفَرُوْا سَبَقُوْا ؕ اِنَّهُمْ لَا يُعْجِزُوْنَ ﴿59﴾

**59** తాము (శిక్ష నుండి తప్పించుకుని) ముందుకు సాగిపోయామని అవిశ్వాసులు ఎన్నడూ తలపోయరాదు. ఎట్టి పరిస్థితిలోనూ వారు మమ్మల్ని అశక్తుల్ని చేయలేరు.

وَاَعِدُّوْا لَهُمْ مَّا اسْتَطَعْتُمْ مِّنْ قُوَّةٍ وَّمِنْ رِّبَاطِ الْخَيْلِ تُرْهِبُوْنَ بِهٖ عَدُوَّ اللّٰهِ وَعَدُوَّكُمْ وَاٰخَرِيْنَ مِنْ دُوْنِهِمْ ۚ لَا تَعْلَمُوْنَهُمْ ۚ اَللّٰهُ يَعْلَمُهُمْ ؕ وَمَا تُنْفِقُوْا مِنْ شَيْءٍ فِيْ سَبِيْلِ اللّٰهِ يُوَفَّ اِلَيْكُمْ وَاَنْتُمْ لَا تُظْلَمُوْنَ ﴿60﴾

**60** మీరు వాళ్లను ఎదుర్కోవటానికి శాయశక్తులా బలాన్ని కూడగట్టుకోవటం[85] ద్వారా, కట్టివుంచిన గుఱ్ఱాల ద్వారా సన్నద్ధులై ఉండండి. ఈ సన్నాహాల ద్వారా మీరు అల్లాహ్ విరోధులను, మీ విరోధులను, మీకు తెలియకుండా ఉన్న – కాని అల్లాహ్‌కు మాత్రం బాగా తెలిసిన – ఇతర శత్రువులను కూడా భయకంపితుల్ని చేయవచ్చు. అల్లాహ్ మార్గంలో మీరు వెచ్చించేదంతా మీకు పూర్తిగా తిరిగి ఇవ్వబడుతుంది. మీకెలాంటి అన్యాయమూ జరగదు.

82. **"షర్రిద్ బిహిమ్"** అంటే (అదను చూసి) వారికి దెబ్బ కొట్టు అని భావం. ఆ దెబ్బకు వారు అదిరిపోవాలి. వారేకాదు, వారికి తోడ్పడటానికి వెనుక నుంచి వస్తున్న మిత్ర పక్షాల్లో సయితం కలవరం మొదలవ్వాలి. ఈ దెబ్బకు వారంతా హడలిపోయి పలాయనం చిత్తగించాలి. మరోసారి కన్నెత్తి చూడటానికి కూడా సాహసించని విధంగా వారికి బుద్ధి చెప్పాలి అన్న భావం వస్తుంది.

83. **'నమ్మక ద్రోహం'** అంటే సంధి చేసుకుని, లోపాయికారిగా మూడో పక్షంతో చేతులు కలపటం లేదా అదను చూసి జారుకోవటం అని యిక్కడ భావం. ఎవరయినా ఇలాంటి ద్వంద్వ ప్రవృత్తిని కలిగిఉంటే, వారి కదలికల్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. వారి ద్రోహబుద్ధి బయటపడగానే వారితో చేసుకున్న సంధిని భగ్నం చేస్తున్నట్లు ప్రకటించాలి. మీకూ – మాకూ మధ్య ఇకమీదట ఎలాంటి మైత్రీ సంబంధాలు లేవు అని నిర్దిష్టంగా చెప్పేయాలి.

84. ఒకవేళ ఇలాంటి నమ్మకద్రోహం (మోసం) ముస్లింల తరఫున జరిగినా సరే అది కూడా క్షమార్హం కాదు. మాట నిలుపుకునే వారిని మాత్రమే అల్లాహ్ ప్రేమిస్తాడు.

హజ్రత్ ముఆవియా (రజి) కాలంలో ఆయనకు – రోమనులకు మధ్య నిర్యుద్ధ సంధి కుదిరింది. సంధి గడువు ముగియబోతుండగా సరిహద్దుల వెంబడి ముఆవియా (రజి) తమ సేనలను మోహరించసాగారు. గడువు సమాప్తమైన మరుక్షణాన రోమను రాజ్యంపై దండయాత్ర చేయాలన్నది ఆయన అభిమతం. ఈ సంగతి అమ్ర్ బిన్ అబస (రజి) అనే సహాబీకి తెలిసింది. ఈ యుద్ధ సన్నాహాలను ఆయన నమ్మక ద్రోహంగా, మోసపూరిత చర్యగా అభివర్ణించారు. ఆ సందర్భంగా ఆయన దైవప్రవక్త (సఅసం)గారి ఒక హదీసును ఉటంకిస్తూ ముఆవియా (రజి) చేస్తున్న పని సంధి ఒప్పందాలకు విరుద్ధమని చెప్పారు. దాంతో హజ్రత్ ముఆవియా (రజి) వెనక్కి తగ్గారు. తమ సేనలను సరిహద్దు రేఖ నుంచి వెనక్కి పిలిపించుకున్నారు. (ముస్నదె అహ్మద్ – సంపుటి :5, పేజీ – 111; అబూదావూద్ – కితాబుల్ జిహాద్; తిర్మిజీ – అబ్వాబుస్సియర్....)

85. ఈ ఆయతులో శక్తిమేరకు బలాన్ని కూడగట్టుకోవటమంటే విలువిద్యలో రాటుదేలటం అని మహనీయ ముహమ్మద్

**61** ఒకవేళ వారు సంధివైపు మొగ్గు చూపితే (ఓ ప్రవక్తా!) నువ్వు కూడా సంధి వైపుకు మొగ్గుచూపు. అల్లాహ్‌పై భారం మోపు.[86] నిశ్చయంగా ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

وَإِن جَنَحُوا لِلسَّلْمِ فَاجْنَحْ لَهَا وَتَوَكَّلْ عَلَى اللَّهِ ۚ إِنَّهُ هُوَ السَّمِيعُ الْعَلِيمُ ﴿٦١﴾

**62** ఒకవేళ వారు నిన్ను మోసగించదలిస్తే, నీకు అల్లాహ్ చాలు. ఆయనే తన సహాయం ద్వారానూ, విశ్వాసుల ద్వారానూ నీకు తోడ్పడ్డాడు.

وَإِن يُرِيدُوا أَن يَخْدَعُوكَ فَإِنَّ حَسْبَكَ اللَّهُ ۚ هُوَ الَّذِي أَيَّدَكَ بِنَصْرِهِ وَبِالْمُؤْمِنِينَ ﴿٦٢﴾

**63** వారి హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను పొందుపరచినది కూడా ఆయనే. భూమిలో వున్న సమస్తాన్నీ ఖర్చుపెట్టినా నువ్వు పరస్పరం వారి హృదయాలను కలపలేక పోయేవాడవు. అల్లాహ్‌యే వారి మనసులను కలిపాడు.[87] నిశ్చయంగా ఆయన సర్వాధిక్యుడు, వివేచనాశీలి.

وَأَلَّفَ بَيْنَ قُلُوبِهِمْ ۚ لَوْ أَنفَقْتَ مَا فِي الْأَرْضِ جَمِيعًا مَّا أَلَّفْتَ بَيْنَ قُلُوبِهِمْ وَلَٰكِنَّ اللَّهَ أَلَّفَ بَيْنَهُمْ ۚ إِنَّهُ عَزِيزٌ حَكِيمٌ ﴿٦٣﴾

**64** ఓ ప్రవక్తా! నీకూ, నిన్ను అనుసరించే విశ్వాసులకూ అల్లాహ్‌యే చాలు.

يَا أَيُّهَا النَّبِيُّ حَسْبُكَ اللَّهُ وَمَنِ اتَّبَعَكَ مِنَ الْمُؤْمِنِينَ ﴿٦٤﴾

---

(స) వారి ద్వారా రూఢీ అవుతోంది (సహీహ్ ముస్లిం: కితాబుల్ ఇమార...). ఎందుకంటే ఆ కాలంలో అదొక గొప్ప యుద్ధ సాధనంగా ఉండేది. యుద్ధాల కోసం అశ్వబలం ఎంతగా అవసరమో, విలుకాండ్ర అవసరం కూడా అంతే ఉండేది. అయితే ఈ కాలంలో వీటి అవసరం అంతగా లేదు. ఇది యుద్ధ విమానాల, టాంకర్ల, బాంబుల, మిజైళ్ళ యుగం. ఇప్పుడు వీటిని సమకూర్చుకున్నవారే శక్తిమంతులనబడతారు.

86. పరిస్థితులు యుద్ధానికి సానుకూలంగా లేనిపక్షంలో, శత్రువులు సయితం సంధికోసం సుముఖంగా ఉన్నపక్షంలో సంధికి సిద్ధమవటం ఆక్షేపణీయం కాదు. ఒకవేళ ఈ సంధీ సంప్రతింపుల ద్వారా శత్రువు మిమ్మల్ని దొంగదెబ్బ తీయజూస్తాడని అనుమానముంటే, మీరేమాత్రం కలవరం చెందనవసరం లేదు. అట్టి పరిస్థితిలో వ్యవహారమంతా అల్లాహ్‌కు అప్పగించండి. అల్లాహ్ మిమ్మల్ని శత్రువు దుష్ట పన్నాగాల నుంచి సురక్షితంగా ఉంచుతాడు. మీకు ఆయన ఒక్కడే చాలు. అయితే ముస్లింలు సైనికంగా బలహీనంగా ఉన్నప్పుడు, సంధి ద్వారా ఇస్లాం మరియు ముస్లింలకు మేలు కలుగుతుందని భావించినప్పుడు మాత్రమే మీరు సంధికి ఒప్పుకోవాలి. వ్యవహారం తద్భిన్నంగా ఉన్నప్పుడు – అంటే, ముస్లింలు సైనికంగా బలోపేతంగా ఉండి, శత్రువులు బలహీనంగా ఉన్నప్పుడు సంధికోసం యత్నించకుండా నిర్ణయాత్మకమైన పోరుకోసమే సిద్ధపడాలి. ముహమ్మద్ సూరాలోని 35వ ఆయతు ద్వారా, అన్‌ఫాల్ సూరాలోని 39వ ఆయతు ద్వారా కూడా ఈ విషయం నిరూపితం అవుతున్నది.

87. ఈ ఆయతులలో అల్లాహ్ తన ప్రవక్త (స)కు, ముస్లిములకూ చేసిన మహోపకారాలను జ్ఞాపకం చేస్తున్నాడు. ఆయన చేసిన ఓ మహోపకారం ఏమిటంటే విశ్వాసుల ద్వారా తన ప్రవక్త (స)కు సహాయం అందజేశాడు. వారు అడుగడుగునా ప్రవక్తకు ఆదరువుగా నిలిచారు. అహోరాత్రులు సహాయ సహకారాలందించారు. అసాధారణమైన త్యాగాలు చేశారు. విశ్వాసులకు దేవుడు చేసిన మహోపకారం ఏమిటంటే, ఆయన వారి మధ్య మమతానురాగాలను పెంపొందించాడు. వేర్వేరైన వారి మనసుల్ని ఒకటిగా చేశాడు. వారందరూ పలికేది ఒకేమాటగా, వారు నడిచేది ఒకే బాటగా చేశాడు. అంతకు ముందైతే వారు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ప్రతీకారేచ్ఛతో రగిలిపోయేవారు. కాని ఆ తరువాత వారు ఒండొకరికి ప్రాణస్నేహితులుగా మారి పోయారు. తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న

يَا أَيُّهَا النَّبِيُّ حَرِّضِ الْمُؤْمِنِينَ عَلَى الْقِتَالِ ۚ
إِن يَكُن مِّنكُمْ عِشْرُونَ صَابِرُونَ يَغْلِبُوا
مِائَتَيْنِ ۚ وَإِن يَكُن مِّنكُم مِّائَةٌ يَغْلِبُوا
أَلْفًا مِّنَ الَّذِينَ كَفَرُوا بِأَنَّهُمْ قَوْمٌ
لَّا يَفْقَهُونَ ﴿٦٥﴾
الْآنَ خَفَّفَ اللَّهُ عَنكُمْ وَعَلِمَ أَنَّ فِيكُمْ ضَعْفًا ۚ
فَإِن يَكُن مِّنكُم مِّائَةٌ صَابِرَةٌ يَغْلِبُوا مِائَتَيْنِ ۚ

**65** ఓ ప్రవక్తా! విశ్వాసులను యుద్ధానికై ప్రేరేపించు.[88] మీలో గనక ధైర్య స్థైర్యాలు గలవారు ఇరవైమంది ఉంటే, వారు రెండొందల మందిని జయిస్తారు. ఒకవేళ మీలో వందమంది ఉంటే వారు వెయ్యిమంది అవిశ్వాసులను జయిస్తారు.[89] ఎందు కంటే వారు (అవిశ్వాసులు) అవివేకులు.

**66** సరే, అల్లాహ్ ఇప్పుడు మీ బరువును తగ్గిస్తున్నాడు. మీలో బలహీనత ఉన్న సంగతి ఆయనకు బాగా తెలుసు. కనుక మీలో వందమంది ధైర్యస్థైర్యాలు గలవారుంటే వారు రెండొందల

హత్యాకాండను నిరోధించి, ప్రాణశత్రువుల మధ్య బహు స్వల్పవ్యవధిలో ప్రేమైక భావాలను, సోదర భావాలను పెంపొందించటమంటే మామూలు విషయం కాదు. ఇది కేవలం దైవకృప మాత్రమే. భూమండలంలో ఉన్న నిధులు, నిక్షేపాలన్నింటినీ వెచ్చించినా ఈ లక్ష్యం సిద్ధించదు. ఆలి ఇమ్రాన్ సూరాలోని 103వ వచనంలో కూడా అల్లాహ్ తన ఈ ఉపకారాన్ని గుర్తుచేశాడు.

మహనీయ ముహమ్మద్ (సఅసం) సయితం హునైన్ పోరాటం ద్వారా సమకూరిన యుద్ధప్రాప్తిపై విశ్వాసుల మధ్య ఏర్పడిన మనస్పర్థలను దూరం చేయడానికి ఈ ఉపకారాన్ని జ్ఞాపకం చేశారు: ఆయన (స) ఇలా ప్రసంగించారు: "ఓ అన్సారు వర్గీయులారా! మీరు మార్గవిహీనులై ఉండగా అల్లాహ్ నా ద్వారా మీకు సన్మార్గ భాగ్యం ప్రసాదించిన సంగతి నిజం కాదా? మీరు లేమికి గురై ఉండగా అల్లాహ్ నా ద్వారా మీకు కలిమిని ప్రసాదించలేదా?? మీరు చెల్లాచెదురుగా పడి ఉండగా అల్లాహ్ నా ద్వారా మిమ్మల్ని సంగఠితం చేసిన సంగతి నిజం కాదా???" దైవప్రవక్త(స) ఒక్కో ప్రశ్న వేస్తుంటే, అన్సారులు దాన్ని సత్యమని ధృవీకరిస్తూ పోయారు. "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఉపకారాలు ఇంతకన్నా అధికమే" అని వారు ప్రతిసారీ చెప్పేవారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ మగాజీ ; సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్).

88. యుద్ధం కొరకు విశ్వాసులను ప్రోత్సహించమని అల్లాహ్ తన ప్రవక్తను ఆదేశించాడు. ఈ ఆదేశానుసారం మహాప్రవక్త (సఅసం) యుద్ధానికి ముందు తన సహచరులలో యుద్ధకాంక్షను నూరిపోసేవారు. దుష్టశిక్షణ నిమిత్తం, ధర్మసంస్థాపన కోసం శాయ శక్తులా పోరాడాలనీ, దీనికి బదులుగా అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడని పలికేవారు. బద్ర్ యుద్ధ సందర్భంగా ముష్రిక్కులు భారీ సంఖ్యలో సాయుధులై వచ్చినప్పుడు ఆయన (స) తన ప్రియసహచరుల నుద్దేశించి, "భూమ్యాకాశాలంత వెడల్పుగల స్వర్గంలో ప్రవేశించటానికి సిద్ధంగా ఉండండి" అని చెప్పారు. ఆ మాటలు విన్న ఉమైర్ బిన్ హుమామ్ (రజి) ఆశ్చర్యపోతూ, "ఏమిటీ, అది భూమ్యాకాశాలంత వెడల్పు ఉంటుందా?" అని ప్రశ్నించారు. "అవును" అని ప్రవక్త (స) బదులిచ్చారు. ఇది విని ఆయన అమితానందానికి లోనయ్యారు. 'మరి నేను కూడా ఆ స్వర్గంలో ప్రవేశించగలనా?' అని ఆశగా అడిగారు. "నీకూ ఆ స్వర్గ భాగ్యం ప్రాప్తిస్తుంది" అని పలికారు దైవప్రవక్త (స). అంతే! ఆయన తన ఖడ్గం ఒరను తుంచివేశారు. ఖర్జూర పండ్లు తీసి తినసాగారు. అంతలోనే ఏమనుకున్నారో ఖర్జూరపండ్లు పారేసి "ఈ పండ్లన్నీ తినేవరకూ నేను బ్రతికి ఉంటే అది కూడా సుదీర్ఘ జీవితమే" అని చెబుతూ కదన రంగంలోకి దూకారు. వీరోచితంగా పోరాడుతూ అమరగతిని ఆస్వాదించారు – రజి అల్లాహు అన్హు. (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఇమార).

89. ఇది ముస్లింల శౌర్యానికీ, విశ్వాసం (ఈమాన్) ద్వారా లభించిన ఆత్మ విశ్వాసానికి ప్రబల తార్కాణం. 20 మంది ముస్లిములు రెండు వందల మంది అవిశ్వాసులను, వందమంది ముస్లిములు వెయ్యిమంది అవిశ్వాసులను ఓడిస్తారని ఈ వాక్యంలో శుభవార్త ఇవ్వబడింది.

وَاِنْ يَّكُنْ مِّنْكُمْ اَلْفٌ يَّغْلِبُوْٓا اَلْفَيْنِ بِاِذْنِ اللّٰهِ ؕ وَاللّٰهُ مَعَ الصّٰبِرِيْنَ ﴿66﴾

మందిని ఓడిస్తారు. ఒకవేళ మీలో గనక వెయ్యి మంది ఉంటే వారు దైవాజ్ఞానుసారం రెండువేల మందిని ఓడిస్తారు.[90] అల్లాహ్ ధైర్యస్థయిర్యాలు గలవారికి తోడుగా ఉంటాడు.[91]

مَا كَانَ لِنَبِيٍّ اَنْ يَّكُوْنَ لَهٗٓ اَسْرٰى حَتّٰى يُثْخِنَ فِى الْاَرْضِ ؕ تُرِيْدُوْنَ عَرَضَ الدُّنْيَا ۖ وَاللّٰهُ يُرِيْدُ الْاٰخِرَةَ ؕ وَاللّٰهُ عَزِيْزٌ حَكِيْمٌ ﴿67﴾

**67** రాజ్యంలో బాగా రక్తపాతంతో కూడిన యుద్ధం జరగనంత వరకూ యుద్ధ ఖైదీలను తన వద్ద ఉంచుకోవటం ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక సంపదలను కోరుకుంటున్నారు. కాని అల్లాహ్ (మీ కోసం) పరలోకాన్ని కోరుకుంటున్నాడు.[92] అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేకవంతుడు.

90. ఇంతకుముందు వచ్చిన ఆదేశం ముస్లింలకు భారంగా తోచింది. ఎందుకంటే అది 1 : 10 నిష్పత్తితో కూడుకున్నది. అంటే వెయ్యిమంది అవిశ్వాసులు ఒక వైపున ఉండి, ముస్లిములు మరోవైపు వందమంది ఉన్నాసరే జిహాద్ (ధర్మయుద్ధం) చేయాల్సిందేనని మునుపటి ఆయతులో చెప్పబడింది. తరువాత అల్లాహ్ వారికి కొంత వెసులు బాటును కల్పిస్తూ ఆ నిష్పత్తిని 1:10 నుంచి 1:2 కు తగ్గించాడు. అంటే వందమంది ముస్లిములు రెండువందల మంది అవిశ్వాసులకు సమానమని పేర్కొన్నాడు. (సహీహ్ బుఖారీ – అన్‌ఫాల్ సూరా వ్యాఖ్యానం). ఇంతకన్నా తక్కువ నిష్పత్తి ఉన్నప్పుడు వారు ధర్మయుద్ధం చేయటం విధి (ఫర్జ్) కాదు.

91. దైవసహాయానికి నోచుకోవాలంటే ముస్లింలు మొక్కవోని సాహసాన్ని ప్రదర్శించాలి. కదన రంగంలో కదలని కొండలా స్థిరత్వాన్ని కనబరచాలి. అనుక్షణం దేవుని పట్ల అచంచలమైన భక్తీ విశ్వాసాలను కలిగి ఉండాలి. అప్పుడు అల్లాహ్ వారికి తన వాగ్దానం ప్రకారం సాయపడతాడు.

92. బద్ర్ యుద్ధంలో 70 మంది అవిశ్వాసులు వధించబడ్డారు. మరో 70 మంది వరకూ ఖైదీలుగా పట్టుబడ్డారు. అది విశ్వాసానికీ–అవిశ్వాసానికీ మధ్య జరిగిన ప్రప్రథమ పోరు కావటం వల్ల ఖైదీల పట్ల అవలంబించవలసిన విధానంపై చర్చ జరిగింది. ఎందుకంటే అప్పటి వరకూ ఈ వ్యవహారంపై స్పష్టమైన ఆదేశాలేవీ లేవు. అందువల్ల మహాప్రవక్త (స) ఆ 70 మంది యుద్ధఖైదీల గురించి తన సహచరులను సంప్రతించారు. వారిని హతమార్చాలా? లేక నష్టపరిహారం తీసుకుని వదలిపెట్టాలా? సూత్రబద్ధంగా ఆ రెండు విషయాలపై పరిశీలనకు ఆస్కారం ఉండటం వల్ల రెండింటిపై కూడా చర్చ జరిగింది. అయితే ఒక్కోసారి నియమ నిబంధనలను అలా ప్రక్కనబెట్టి పరిస్థితుల స్వరూపం దృష్ట్యా సముచితమైన నిర్ణయం గైకొనవలసి ఉంటుంది. ఇక్కడా అలాంటి పరిస్థితే ఏర్పడింది. అయితే నియమ నిబంధనలకు ప్రాముఖ్యం ఇస్తూ ఎక్కువ ప్రయోజనకరమైన దానికన్నా తక్కువ ప్రయోజనకరమైన విషయం వైపుకు మొగ్గటం జరిగింది. ఎక్కువ ప్రయోజనకరమైన అంశానికి ప్రాధాన్యత ఇచ్చి ఉంటే బావుండేది. తక్కువ లాభదాయకమైన అంశం వైపుకు మొగ్గినందుకు అల్లాహ్ తరఫున హెచ్చరిక వచ్చింది.

ఈ సంప్రతింపులు జరిగినప్పుడు, మిథ్యావాదుల మదం అణగాలంటే యుద్ధఖైదీలను వధించటం చాలా అవసరమని హజ్రత్ ఉమర్ (రజి) తదితరులు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఖైదీలుగా పట్టుబడిన వారిలో ఎంతోమంది అవిశ్వాసుల నాయకులు ఉన్నారు. వారిని గనక విడుదల చేసేస్తే వారు ప్రతీకారభావంతో ఇస్లాం మరియు ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నవచ్చు. అయితే హజ్రత్ అబూబక్ర్ (రజి) మొదలగువారి అభిప్రాయం తద్భిన్నంగా ఉంది. ఖైదీల నుండి పరిహారం తీసుకుని వారిని విడుదల చేయాలని, ఆ విధంగా వచ్చిన సొమ్ము ద్వారా సైనికశక్తిని మెరుగుపరచుకోవాలని వీరు అభిప్రాయపడ్డారు. దైవప్రవక్త (సఅసం) కు కూడా ఈ అభిప్రాయమే నచ్చింది. ఈ నేపథ్యంలోనే ఈ ఆయతులు అవతరించాయి. ఆనాటి అరేబియా స్థితిగతుల దృష్ట్యా సత్య తిరస్కారుల పొగరును అణచివేసే చర్యకు ప్రాధాన్యత ఇచ్చి ఉంటే బావుండేదని, ఈ పరిహారం (ఫిదియా) తీసుకుని బందీలను విడిచిపెట్టడం అనేది స్వల్ప ప్రయోజనంతో కూడుకున్న నిర్ణయమనీ, ఈ నిర్ణయం దూరదృష్టితో కూడుకున్నది కాదనీ ఇందులో

68 ఒకవేళ ముందు నుంచే అల్లాహ్ వద్ద ఆ విషయం రాసి ఉండకపోతే,[93] మీరు తీసుకున్న దానిపై మీకు పెద్ద శిక్షపడి ఉండేది.

لَوْلَا كِتٰبٌ مِّنَ اللّٰهِ سَبَقَ لَمَسَّكُمْ فِيْمَآ اَخَذْتُمْ عَذَابٌ عَظِيْمٌ ﴿68﴾

69 కాబట్టి, మీరు పొందిన ధర్మబద్ధమైన, పరిశుద్ధమైన యుద్ధ ప్రాప్తిని నిస్సంకోచంగా తినండి.[94] అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించే వాడూను.

فَكُلُوْا مِمَّا غَنِمْتُمْ حَلٰلًا طَيِّبًا ۖ وَّاتَّقُوا اللّٰهَ ۗ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿69﴾

70 ఓ ప్రవక్తా! మీ అధీనంలోవున్న ఖైదీలతో ఇలా చెప్పు: "అల్లాహ్ మీ హృదయాలలో ఏ కాస్త మంచి సంకల్పాన్ని[95] చూసినా, మీనుండి పుచ్చుకున్న దానికన్నా మేలైన దాన్నే మీకు ప్రసాదిస్తాడు.[96] మీ తప్పుల్ని కూడా క్షమిస్తాడు. అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు."

يٰٓاَيُّهَا النَّبِيُّ قُلْ لِّمَنْ فِيْٓ اَيْدِيْكُمْ مِّنَ الْاَسْرٰٓى ۙ اِنْ يَّعْلَمِ اللّٰهُ فِيْ قُلُوْبِكُمْ خَيْرًا يُّؤْتِكُمْ خَيْرًا مِّمَّآ اُخِذَ مِنْكُمْ وَيَغْفِرْ لَكُمْ ۗ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿70﴾

71 ఒకవేళ వారు నీకు ద్రోహం చేయాలని అనుకుంటే, ఇంతకు ముందు వారు అల్లాహ్‌కే ద్రోహం తలపెట్టారు. ఎట్టకేలకు ఆయన వాళ్లను నీ కప్పగించాడు.[97] అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేక వంతుడు.

وَاِنْ يُّرِيْدُوْا خِيَانَتَكَ فَقَدْ خَانُوا اللّٰهَ مِنْ قَبْلُ فَاَمْكَنَ مِنْهُمْ ۗ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ﴿71﴾

---

చెప్పటం జరిగింది. అయితే అసత్యం పూర్తిగా అణగారిపోయి, అసత్యవాదుల బలం క్షీణించినప్పుడు వారిని ఖైదీలుగా పెట్టుకున్నా, పరిహారం తీసుకుని వదలిపెట్టినా, ముస్లిం ఖైదీలకు బదులుగా వారి మార్పిడీ చేసినా, లేక యుద్ధ ఖైదీలను బానిసలుగా చేసుకున్నా ఫరవాలేదు.

93. ఇంతకీ అల్లాహ్ వద్ద రాసిపెట్టబడిన ఆ విషయం ఏమిటీ? అన్న దానిపై ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల మధ్య భేదాభిప్రాయం ఉంది. యుద్ధ ప్రాప్తి (మాలె గనీమత్) ధర్మసమ్మతం గావించబడిందన్న విషయం అందులో లిఖించబడిందని, యుద్ధప్రాప్తి ధర్మసమ్మతం కావటంవల్ల మీరు గైకొన్న చర్యలో తప్పేమీలేదని చెప్పబడిందని కొందరు అభిప్రాయ పడ్డారు. ఆ విషయం ముందుగా రాసిపెట్టి ఉంది గనక సరిపోయింది. లేకపోతే మిమ్మల్ని కఠినంగా దండించవలసి వచ్చేది అన్నది ఈ మాటల అంతరార్థం. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి మన్నింపు ఈ వాక్యాల్లోని ప్రధానాంశమని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. కారుణ్యమూర్తి అయిన ముహమ్మద్ (సఅసం) ఉనికివల్ల శిక్ష తప్పిందని ఇంకొంతమంది ఉటంకించారు (వివరాలకు 'ఫత్‌హుల్ ఖదీర్' చూడండి).

94. **యుద్ధప్రాప్తి** (మాలె గనీమత్) గా ముట్టిన సొమ్ము ధర్మసమ్మతమనీ, పవిత్రమైనదనీ, ఖైదీలనుంచి పరిహారం తీసుకుని వదలిపెట్టడం కూడా సమ్మతమేననీ ఇక్కడ చెప్పబడింది. "రాసిపెట్టబడిన విషయం" బహుశా ఇదే అయి ఉండవచ్చుని విద్వాంసులు భావించారు.

95. అంటే విశ్వసించి ముస్లింగా మారే ఆలోచన గనక మీ మనసుల్లో ఉంటే.

96. అంటే – మీనుంచి తీసుకోబడిన ఫిదియా (పరిహారం) కన్నా మేలైన దాన్ని ఇస్లాం స్వీకారం తరువాత అల్లాహ్ మీకు అనుగ్రహిస్తాడు. అదే జరిగింది కూడా. హజ్రత్ అబ్బాస్ (రజి) తదితరులు కూడా ఆ యుద్ధఖైదీలలో ఉన్నారు. వారు ఇస్లాం స్వీకరించిన తరువాత అల్లాహ్ వాళ్లకు ప్రాపంచిక సిరిసంపదల్ని పుష్కలంగా ప్రసాదించాడు.

**72** ఎవరు విశ్వసించి, వలసపోయారో, అల్లాహ్ మార్గంలో తమ ధనప్రాణాల ద్వారా పోరాడారో వారూ,[98] వారికి ఆశ్రయమిచ్చి సహాయపడినవారూ[99] – వారంతా ఒండొకరికి మిత్రులు.[100] మరెవరు విశ్వసించినప్పటికీ (తమ ఇల్లూ వాకిలిని విడిచి) వలసపోలేదో, వారు వలసపోయి మీ వద్దకు రానంతవరకూ[101] వారితో మీకెలాంటి స్నేహబంధం లేదు. కాకపోతే ధార్మిక వ్యవహారాలలో వారెప్పుడు మీ సహాయం కోరినా, మీరు వారికి సహాయపడటం అవసరం.[102] అయితే మీతో ఒప్పందం చేసుకున్నవారికి వ్యతిరేకంగా మాత్రం కాదు.[103] మీరు చేసే పనులన్నింటినీ అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.

إِنَّ الَّذِينَ آمَنُوا وَهَاجَرُوا وَجَاهَدُوا بِأَمْوَالِهِمْ
وَأَنفُسِهِمْ فِي سَبِيلِ اللَّهِ وَالَّذِينَ آوَوا
وَّنَصَرُوا أُولَٰئِكَ بَعْضُهُمْ أَوْلِيَاءُ بَعْضٍ ۚ
وَالَّذِينَ آمَنُوا وَلَمْ يُهَاجِرُوا مَا لَكُم مِّن
وَلَايَتِهِم مِّن شَيْءٍ حَتَّىٰ يُهَاجِرُوا ۚ وَإِنِ
اسْتَنصَرُوكُمْ فِي الدِّينِ فَعَلَيْكُمُ النَّصْرُ إِلَّا
عَلَىٰ قَوْمٍ بَيْنَكُمْ وَبَيْنَهُم مِّيثَاقٌ ۗ وَاللَّهُ
بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ﴿٧٢﴾

**73** అవిశ్వాసులు ఒండొకరికి మిత్రులు. ఒకవేళ మీరు కూడా అలా ఉండకపోతే భువిలో ఉపద్రవం (ఫిత్నా) మొదలవుతుంది. పెద్ద కల్లోలమే చెలరేగుతుంది.[104]

وَالَّذِينَ كَفَرُوا بَعْضُهُمْ أَوْلِيَاءُ بَعْضٍ ۚ
إِلَّا تَفْعَلُوهُ تَكُن فِتْنَةٌ فِي الْأَرْضِ
وَفَسَادٌ كَبِيرٌ ﴿٧٣﴾

97. ముస్లింగా మారామని నోటితో ప్రకటించి, మోసం చేసే ప్రయత్నం గనక చేస్తే వారే నష్టపోతారు. అంతకుముందు వారు ఒకసారి కుఫ్ర్‌కు, షిర్క్‌కు ఒడిగట్టి ఏం సాధించారనీ? బందీలుగా ముస్లింలకు చిక్కటం తప్ప వారు పొందిందేమీ లేదు. అందుకే వారు ఇకనయినా గుణపాఠం గ్రహించాలి. ఒకవేళ మళ్లీ షిర్కు మార్గంలోకి పోతే మరిన్ని పరాజయాలను, పరాభవాలను ఎదుర్కొనవలసి ఉంటుంది.

98. ఈ ప్రియసహచరులు **'ముహాజిర్లు'** అనబడతారు. దైవప్రవక్త (స) సహచరులలో వారు అత్యుత్తమ శ్రేణికి చెందినవారు.

99. ముహాజిర్లకు సహాయపడిన వారు **'అన్సార్లు'** అనబడతారు. ముహాజిర్ల తరువాతి స్థానం వీరిదే.

100. అంటే – వారు ఒకరికొకరు సహాయకులు, సంరక్షకులు. ఒండొకరికి వారసులు కూడా అని మరికొంతమంది వ్యాఖ్యానించారు. ఎందుకంటే హిజ్రత్ (వలస) అనంతరం మహాప్రవక్త (స) ముహాజిర్లకు – అన్సార్లకు మధ్య **'సోదర బంధం'** ఏర్పరచారు. ఆ సోదర భావాన్ని గౌరవిస్తూ వారు తమ ఆస్తిపాస్తుల్లో వారసత్వ భాగం కూడా ఇవ్వసాగారు. అయితే తరువాత ఈ వారసత్వ ఆజ్ఞ రద్దు చేయబడింది.

101. వీరు ప్రవక్త సహచరులలో తృతీయ శ్రేణికి చెందినవారు. వీరు ఇస్లాం స్వీకరించిన పిదప తమ ప్రదేశాలలోనే, తమ తెగవారి మధ్య ఉండిపోయారు. అందుకే అన్సార్ల సహాయసహకారాలకు, ఆస్తిపాస్తుల్లో వాటా పొందటానికి వారు హక్కుదారులు కారని స్పష్టం చేయబడింది.

102. ఒకవేళ (ముష్రిక్కుల బారినుంచి) తమ ధర్మాన్ని రక్షించుకునే నిమిత్తం వారు మీ సహాయం కోరితే అప్పుడు మీరు తప్పకుండా వారికి సహాయం అందించాలి.

103. ఒకవేళ మీరు ఏ తెగతోనయినా లోగడ నిర్యుద్ధ సంధిచేసుకుని ఉన్నపక్షంలో, ఆ తెగకు వ్యతిరేకంగా తమకు సహాయపడమని ఇతర ప్రదేశాల ముస్లింలు మిమ్మల్ని ప్రాధేయపడినప్పటికీ మీరు దురభిమానంతో వ్యవహరించ కూడదు. మీరు మీ సోదరులకు సహాయపడటం కన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం చాలా ముఖ్యం.

104. అంటే అవిశ్వాసులు పరస్పరం ఎలా కలసికట్టుగా ఉంటూ ఒకరికొకరు సహాయ సహకారాలను అందించుకుంటున్నారో అదేవిధంగా మీరు కూడా పరస్పరం అన్నదమ్ములుగా ఉంటూ, ఒకరికొకరు తోడ్పాటునందించుకుంటూ, మరోవైపు

74 ఎవరు విశ్వసించి, స్వస్థలాన్ని విడిచి వలసపోయారో, అల్లాహ్ మార్గంలో పోరాటం సలిపారో, మరెవరు (వారికి) ఆశ్రయమిచ్చి ఆదుకున్నారో – వారే నిజమయిన విశ్వాసులు. వారి కొరకు మన్నింపూ ఉంది, గౌరవప్రదమయిన ఉపాధి కూడా ఉంది.[105]

وَالَّذِينَ آمَنُوا وَهَاجَرُوا وَجَاهَدُوا فِي سَبِيلِ اللَّهِ وَالَّذِينَ آوَوا وَّنَصَرُوا أُولَٰئِكَ هُمُ الْمُؤْمِنُونَ حَقًّا ۚ لَّهُم مَّغْفِرَةٌ وَرِزْقٌ كَرِيمٌ ﴿٧٤﴾

75 మరెవరు ఆ తరువాత విశ్వసించి, వలసపోయారో, మీతో కలసి పోరాడారో– వారు కూడా మీవారే.[106] కాని దైవాజ్ఞ ప్రకారం వారిలో కొందరు మరికొందరికి బంధుత్వ సంబంధాల కారణంగా ఎక్కువ సన్నిహితులు.[107] నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు.

وَالَّذِينَ آمَنُوا مِن بَعْدُ وَهَاجَرُوا وَجَاهَدُوا مَعَكُمْ فَأُولَٰئِكَ مِنكُمْ ۚ وَأُولُو الْأَرْحَامِ بَعْضُهُمْ أَوْلَىٰ بِبَعْضٍ فِي كِتَابِ اللَّهِ ۗ إِنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿٧٥﴾

అవిశ్వాసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే రాజ్యంలో అశాంతి అలజడులు రేకెత్తే ప్రమాదం ఉంది. అదీగాక విశ్వాసులు– అవిశ్వాసులు అన్ని విషయాలలోనూ కలసిమెలసి ఉండటం వల్ల ధార్మికంగా, షరీయతుపరంగా కొన్ని ఇబ్బందులు ఏర్పడతాయి. “అవిశ్వాసులు ఒండొకరికి మిత్రులు” అనే వాక్యాన్ని కొంతమంది విద్వాంసులు ‘పరస్పరం వారసత్వ హక్కును కలిగి ఉంటారు’ అన్న భావంలో తీసుకున్నారు. అవిశ్వాసులు ఒండొకరి ఆస్తికి హక్కుదారులు కాగలరుగాని ఒక విశ్వాసి అవిశ్వాసి ఆస్తికి హక్కుదారుడు కాలేడు. అలాగే ఒక అవిశ్వాసి విశ్వాసి ఆస్తికీ హక్కుదారుడు కాలేడు. ఈ వారసత్వ వ్యవహారం షరీయతుతో ముడిపడినది. హదీసులలో ఈ అంశం కూలంకషంగా చెప్పబడింది. వారసత్వ హక్కు విషయంలో మీరు కేవలం రక్త సంబంధాలను ప్రాతిపదికగా చేసుకుని విశ్వాసం (ఈమాన్) మరియు అవిశ్వాసం (కుఫ్ర్)కు మధ్య గల వ్యత్యాసాన్ని ఉపేక్షించినట్లయితే భువిలో సంక్షోభం తలెత్తుతుంది. అరాచకం అవ్యవస్థలు తాండవిస్తాయి. జీవితం దుర్భరమైపోతుంది.

105. ఈ ముహాజిర్ – అన్సార్ల ప్రస్తావన ఇంతకుముందు కూడా వచ్చింది. ఇంతకుముందు వచ్చిన ప్రస్తావనలో సోదర బంధం గురించి నొక్కి వక్కాణించబడింది. ఇక్కడ పరస్పర సహాయసహకారాల శ్రేష్ఠత గురించి చెప్పటం జరిగింది.

106. వీరు 4వ వర్గానికి చెందినవారు. ప్రాధాన్యత రీత్యా వీరు మొదటి రెండు వర్గాలకన్నా (ముహాజిర్ల, అన్సార్లకన్నా) వెనుకంజలో ఉన్నారు. అయితే మూడవ వర్గం (హిజ్రత్ చేయనివర్గం) కన్నా వీరిది పైచేయి.

107. ధార్మికంగా ఏర్పరచబడిన ‘సోదరబంధం’ ఆధారంగా ఇంతకుముందు వారసత్వ హక్కు లభించేది. అయితే ఇప్పుడు ఈ విధానం రద్దుపరచబడింది. ఇకనుంచి బంధుత్వ సంబంధాల ప్రాతిపదికపై వారసత్వ హక్కు సంక్రమిస్తుంది. ఆ బంధుత్వ సంబంధం రక్త సంబంధమైనా అయి ఉండాలి లేదా అత్తవారి తరఫున ఏర్పడిన బంధుత్వమైనా అయి ఉండాలి. దైవాజ్ఞ ప్రకారం లేక దైవగ్రంథం ప్రకారం అంటే భావం, “లౌహె మహ్‌ఫూజ్”లో మొదటినుంచీ ఈ ఆదేశమే ఉంది. కాకపోతే – తాత్కాలికంగా – దైవమార్గంలో సర్వస్వాన్నీ వదలివచ్చిన వారిని ఆర్థికంగా ఆదుకునే ఉద్దేశంతో ముహాజిర్లకూ – అన్సార్లకూ మధ్య ధార్మిక సోదరబంధం ఏర్పరచబడింది. దానివల్ల ముహాజిర్లకు ఎంతో వెసులుబాటు కలిగింది. ఆ అవసరం తీరిపోయాక తాత్కాలిక ఆదేశం రద్దుపరచబడింది. శాశ్విత ప్రాతిపదికగల ఆదేశం చెలామణిలోకి వచ్చింది.

9వ సూరా

# అత్ తౌబా

## పశ్చాత్తాపం

అవతరణ మదీనాలో

ఆయతులు 129

### పరిచయం

*దైవతిరస్కారులకు, అల్లాహ్ ఏకత్వాన్ని కాదన్నవారికి దూరంగా ఉండాలని ఈ సూరా ముఖ్యంగా బోధిస్తుంది. అల్లాహ్ ఒకే ఒక్క దేవుడన్న విశ్వాసం కలిగి ఉన్న వ్యక్తినీ, తౌహీద్ (ఏక దైవారాధన)కు కట్టుబడిన వ్యక్తిని స్నేహితునిగా చేసుకోవాలని బోధించడం జరిగింది. అల్లాహ్‌కు సమానంగా ఎవరినీ నిలబెట్టరాదనీ, ఎవరినీ అల్లాహ్‌కు భాగస్వాములు చేయరాదని ఈ సూరా హెచ్చరించింది. మన ప్రార్థనలు, ఆరాధనలు పూర్తిగా అల్లాహ్‌కే పరిమితం కావాలని బోధిస్తుంది. ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అంటే మత గురువులు, వలీలు, మధ్యవర్తుల వంటి వారి ప్రమేయం లేకుండా స్వయంగా అల్లాహ్‌ను వేడుకోవచ్చుని ఈ సూరా స్పష్టం చేసింది. ఇస్లామీయ సామాజిక నడవడిని ఈ సూరా నిర్దేశించింది. అలాగే సంస్కరణా సూత్రాలను కూడా ప్రతిపాదించింది. ఈ సూరా హిజ్రీ శకం 9లో అవతరించింది. అంటే క్రీ.శ. 630లో. ఈ సంవత్సరం వేసవిలోనే ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తబూక్ దండయాత్రకు ఏర్పాట్లు చేసారు. సిరియా రాజధాని డెమస్కస్ వెళ్ళే దారిలో తబూక్ ఉంది. ఇది బైజాంటైన్ సామ్రాజ్యం ఎల్లలకు దగ్గరగా ఉంది. మండువేసవిలో తబూక్ వరకు పోవడం ఒక సుదీర్ఘ ప్రయాణం. నిజమైన విశ్వాసులకు, వారి విశ్వాస బలానికి ఇది కఠిన పరీక్ష. ఈ పరీక్ష ఇస్లామీయ సమాజంలోని కపట విశ్వాసులను, వారి ద్వంద్వ ప్రవృత్తిని బయటపెట్టే పరీక్ష. తబూక్ యుద్ధం ప్రాముఖ్యత దృష్ట్యా ముస్లిం రాజ్య సరిహద్దుల భద్రత కోసం యూదు, క్రైస్తవ తెగలతో శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కాని ఆ తెగలు ఏకపక్షంగా ఒప్పందాలను రద్దుచేసుకున్నాయి. అందువల్ల శాంతి ఒప్పందాలను రద్దు చేసుకున్న తెగలతో యుద్ధ స్థితిలో ఉన్నట్లు ఈ సూరా ప్రకటించింది. అయితే ఈ ఒప్పందాలపై సంతకాలు చేయని ఇతర యూద, క్రైస్తవ తెగలకు ఈ యుద్ధ స్థితి వర్తించదని తెలిపింది.*

*ఈ సూరా కొన్ని ఇస్లామీయ చట్టపరమైన అంశాలను ప్రస్తావించింది.*

*1. జకాత్ (సదఖా) మొత్తాన్ని నిరుపేదలకు (అంటే చేయిచాచి అర్థించేవారికి), అవసరార్థులకు (అవసరమున్నా చేయిచాచి అర్థించని వారికి), బాటసారులకు, ఈ మొత్తాలను సేకరించి పంపిణీ చేసేవారికి, ఖైదీల విముక్తికి, రుణగ్రస్తుల భారం తగ్గించడానికి, హృదయాలను గెలుచుకోవడానికి (ఇస్లాం స్వీకరించినవారికి, ఇస్లాం స్వీకరించడానికి దగ్గరిలో ఉన్నవారికి), దైవమార్గంలో ఖర్చు చేయాలి.*

*2. నిస్సహాయులు, వ్యాధిగ్రస్తులు, అల్లాహ్ కోసం ఖర్చు చేయడానికి ఏదీ లేనివారు అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త (సఅసం) పట్ల తమ విధుల విషయంలో నిజాయితీగా ఉన్నవారు పోరాట సైన్యంలో చేరడానికి మినహాయింపు ఇవ్వడం జరిగింది.*

# సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 13 | 243, 244 | 'వలస' 'హత్యకు కుట్ర' | ఇస్లాం ప్రారంభ కాలంలో ముస్లింలపై, ముహమ్మద్(స)పై మక్కా బహుదైవారాధకులు దారుణాలకు, దౌర్జన్యాలకు తెగబడ్డారు. మరి వారు ఎలాంటి అతిక్రమణలకు పాల్పడ్డారు? ముహమ్మద్ (స) తన దేశం వదలి ఎందుకు వెళ్ళవలసి వచ్చింది? – తదితర విషయాలు తెలుసుకోవాలంటే ఇవి చదవాల్సిందే! |
| 25-27 | 325 | 'హునైన్ యుద్ధం' | హునైన్ యుద్ధం ఎప్పుడు, ఎవరితో జరిగింది? దాని ఫలితాలేమిటి? |
| 30 | 159, 184 187, 198 | 'ఉజైర్ – వందేళ్ళు నిదురపోయిన మనిషి' 'మర్యమ్' 'ప్రవక్త ఈసా జననం' 'నేడు మనకు తెలిసిన క్రైస్తవ విశ్వాసాలు' | మరణానంతర జీవితం గురించి అల్లాహ్ చూపించిన సజీవ నిదర్శనం ఇది. ఈసాప్రవక్త జీవిత వాస్తవ విశేషాలేవి? యేసు ప్రవక్త శిలువ వేయబడ్డారా? లేక ఆకాశాలకు ఎత్తుకోబడ్డారా? ఆయన దేవుడా? దేవుని కుమారుడా? లేక దైవప్రవక్తా? |
| 40 | 245 | 'గాలింపు' | అసలు దైవప్రవక్త (స) గుహలో ఎందుకు ఉన్నట్టు?! ఆ గుహకు పేరేమైనా ఉందా? అసలు గుహలో దాక్కోవలసిన పరిస్థితి ఆయనకు ఎందుకు ఎదురయింది? ఆ సమయంలో ఆయన వెంట ఉన్నదెవరు? |
| 69, 70 | 14, 21, 25, 50, 81 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవప్రవక్త సాలిహ్' 'దైవ ప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారావాహికంగా ఇక్కడ దొరుకుతాయి. |
| 107-110 | 348 | 'కపటుల మస్జిదు' | కపట విశ్వాసులు నూతన మస్జిదును నిర్మించి మదీనా నగరంలో కొత్త కుంపటి పెట్టాలని ఎందుకు కోరుకున్నారు? అల్లాహ్ దానిని 'మస్జిదె జిరార్' (నష్టకరమైన మస్జిద్) అని ఎందుకు పేర్కొన్నాడు? కపటుల కుటిల పన్నాగాలు ఎలా బట్టబయలు అయ్యాయి? |
| 118 | 331 | 'ముగ్గురు ముస్లింల బహిష్కారం' | ఎవరు ఆ ముగ్గురు ముస్లింలు? దైవప్రవక్త (స) వారిని ఎందుకు కొద్దికాలం పాటు సంఘం నుంచి బహిష్కరించారు? |

## سُوْرَةُ التَّوْبَة

بَرَآءَةٌ مِّنَ اللّٰهِ وَرَسُوْلِهٖٓ اِلَى الَّذِيْنَ
عٰهَدْتُّمْ مِّنَ الْمُشْرِكِيْنَ ﴿1﴾

فَسِيْحُوْا فِى الْاَرْضِ اَرْبَعَةَ اَشْهُرٍ وَّاعْلَمُوْٓا
اَنَّكُمْ غَيْرُ مُعْجِزِى اللّٰهِ ۙ وَاَنَّ اللّٰهَ مُخْزِى
الْكٰفِرِيْنَ ﴿2﴾

## అత్ తౌబా[1] సూరా

**1** మీరు ఒప్పందాలు కుదుర్చుకున్న ముష్రిక్కులతో ఇకమీదట ఎలాంటి సంబంధాలుండబోవని అల్లాహ్ తరఫున, ఆయన ప్రవక్త తరఫున ప్రకటించబడుతోంది.[2]

**2** కనుక (ఓ ముష్రిక్కులారా!) ఇక మీరు నాలుగు మాసాల వరకు రాజ్యంలో సంచరించండి.[3] మీరు అల్లాహ్‌ను అశక్తుణ్ణి చెయ్యలేరన్న సంగతిని బాగా తెలుసుకోండి. అల్లాహ్ అవిశ్వాసు లను పరాభవం పాల్జేస్తాడు[4] (అన్న సంగతిని కూడా మరువ కండి).

1. ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు దీనికి అనేక పేర్లు ఉన్నట్లు తెలిపారు. వాటిలో రెండు పేర్లు మాత్రం సుప్రసిద్ధం. ఒకటి : తౌబా (పశ్చాత్తాపం, క్షమాపణ). ఈ సూరాకు 'తౌబా' అనే పేరు రావటానికి ప్రధాన కారణం ఏమిటంటే కొంతమంది విశ్వాసుల పశ్చాత్తాపం దైవసన్నిధిలో స్వీకరించబడినట్లు ఇందులో తెలుపబడింది. రెండు : తెగత్రెంపులు. ఇకమీదట ముష్రిక్కులతో ఎలాంటి సంబంధం ఉండబోదని బాహాటంగా ప్రకటించటం జరిగింది. **"బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్"** (అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను) అనే వచనం లేకుండా మొదలైన ఏకైక సూరా ఇది. దీనికి కూడా పెక్కు కారణాలను ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు పొందుపరిచారు. వాటిలో ఒకటి ఎంతో సమంజసంగా, సహేతుకంగా కనిపించే కారణం ఏమిటంటే ఇంతకుముందు గడచిన అన్‌ఫాల్ సూరాలోని అంశాలకు– తౌబా సూరాలోని అంశాలకు మధ్య ఎంతో సామ్యం ఉంది. ఒక విధంగా ఈ సూరా అన్‌ఫాల్ సూరా తతిమ్మా భాగం. **'సబ్‌యె తివాల్'**గా పిలువబడే ఏడు పెద్ద సూరాలలో ఇది ఏడవది.

2. మక్కా విజయం తర్వాత మహాప్రవక్త (సఅసం) – హిజ్రీ 9వ ఏట – తన ప్రియ సహచరులైన హజ్రత్ అబూబక్ర్ (రజి), హజ్రత్ అలీ (రజి) ఇంకా ఇతర సహచరులకు దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వాక్యాలను ఇచ్చి, దీనిగురించి మక్కా నగరంలో బహిరంగంగా ప్రకటన గావించమని పురమాయించారు. దైవప్రవక్త (స) ఆదేశానుసారం వారు ఈ ఫర్మానాను వెలువరించారు. ఇకమీదట ఎవరూ నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణ చెయ్యడానికి వీల్లేదనీ, వచ్చే ఏడాది నుంచి ముష్రిక్కులకు దైవగృహాన్ని సందర్శించి హజ్ నెరవేర్చే అనుమతి కూడా ఉండబోదని వారు ప్రకటించారు (సహీహ్ బుఖారీ – కితాబుస్సలాత్, ముస్లిం – కితాబుల్ హజ్).

3. నిరవధిక గడువు కోసం ఒప్పందం కుదుర్చుకున్న ముష్రిక్కులను లేదా నాలుగు మాసాలకన్నా తక్కువ వ్యవధి కోసం సంధి చేసుకున్న ముష్రిక్కులను లేదా నాలుగు మాసాల కన్నా ఎక్కువ ఒక నిర్ణీత కాలం కొరకు సంధిచేసుకున్న ముష్రిక్కులను ఉద్దేశ్యించి ఈ 'తెగత్రెంపుల ప్రకటన' చేయబడింది. అదీ వాగ్దాన భంగానికి పాల్పడుతున్న తిరస్కారులకే ఈ ప్రకటన వర్తిస్తుంది. మొత్తమ్మీద వాళ్ళందరికీ నాలుగు నెలల గడువు నిర్ధారించబడింది. ఈ గడువు లోపల వారు ఇస్లాం స్వీకరిస్తే వారికి అక్కడ నివసించడానికి అనుమతి ఇవ్వబడుతుంది. అన్యథా వారు నాలుగు మాసాల అనంతరం అరేబియా ద్వీపాన్ని విడిచిపోవలసి ఉంటుంది. పై రెండు మార్గాలలో ఏ ఒక్క దానినైనా వారు అవలంబించని పక్షంలో వారు విరోధులుగా పరిగణించబడతారు. అప్పుడు వారితో యుద్ధం చేయటం ముస్లింల విధ్యుక్త ధర్మం అయిపోతుంది. అరేబియా ద్వీపం నుంచి అంధకారాన్ని, బహుదైవోపాసనను రూపుమాపి ఏకదైవోపాసనా కాంతి రేఖలను ప్రసరింపజేయడానికి ఈ చర్య గైకొనవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

3 అల్లాహ్ తరఫు నుంచీ, ఆయన ప్రవక్త తరఫు నుంచీ పెద్ద హజ్ దినాన[5] ప్రజలకు తెలియజేయునది ఏమనగా, అల్లాహ్ ముష్రిక్కులకు ఏ విధంగానూ బాధ్యుడు కాడు – ఆయన ప్రవక్త కూడా. కాబట్టి ఇప్పటికయినా మీరు పశ్చాత్తాపం చెందితే అది మీకే శ్రేయస్కరం. ఒకవేళ మీరు విముఖులైతే, మీరు ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్‌ను ఓడించలేరన్న సంగతిని తెలుసుకోండి. (ఓ ప్రవక్తా!) అవిశ్వాసులకు వ్యధాభరితమైన శిక్ష ఉంటుందన్న శుభవార్తను వినిపించు.

وَأَذَانٌ مِّنَ اللَّهِ وَرَسُولِهِ إِلَى النَّاسِ يَوْمَ
الْحَجِّ الْأَكْبَرِ أَنَّ اللَّهَ بَرِيءٌ مِّنَ الْمُشْرِكِينَ ۙ
وَرَسُولُهُ ۚ فَإِن تُبْتُمْ فَهُوَ خَيْرٌ لَّكُمْ ۖ وَإِن
تَوَلَّيْتُمْ فَاعْلَمُوا أَنَّكُمْ غَيْرُ مُعْجِزِي اللَّهِ ۗ
وَبَشِّرِ الَّذِينَ كَفَرُوا بِعَذَابٍ أَلِيمٍ ③

4 అయితే మీరు ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత మీకు ఎలాంటి నష్టం చేకూర్చడం గానీ, మీకు వ్యతిరేకంగా ఎవరికైనా సహాయం చేయటంగానీ చేయకుండా ఉన్న ముష్రిక్కులకు మాత్రం (ఈ ప్రకటన నుంచి) మినహాయింపు ఉంది. మీరు కూడా వారితోపాటు వారి ఒప్పంద గడువును పూర్తిచేయండి.[6] నిశ్చయంగా అల్లాహ్ భయభక్తులుగల వారిని ప్రేమిస్తాడు.

إِلَّا الَّذِينَ عَاهَدتُّم مِّنَ الْمُشْرِكِينَ ثُمَّ لَمْ
يَنقُصُوكُمْ شَيْئًا وَلَمْ يُظَاهِرُوا عَلَيْكُمْ أَحَدًا
فَأَتِمُّوا إِلَيْهِمْ عَهْدَهُمْ إِلَىٰ مُدَّتِهِمْ ۚ إِنَّ اللَّهَ
يُحِبُّ الْمُتَّقِينَ ④

5 మరి నిషిద్ధ (గౌరవప్రదమైన) మాసాలు[7] గడచిపోగానే ముష్రిక్కులను ఎక్కడ కనబడితే అక్కడే చంపండి,[8] వారిని నిర్బంధించండి,[9] వారిని ముట్టడించండి. ప్రతి మాటు వద్ద

فَإِذَا انسَلَخَ الْأَشْهُرُ الْحُرُمُ فَاقْتُلُوا
الْمُشْرِكِينَ حَيْثُ وَجَدتُّمُوهُمْ وَخُذُوهُمْ

4. మీకు ఇవ్వబడుతున్న ఈ గడువును మా బలహీనతగా తలపోయకండి. మీ మేలును కోరి మీకు ఈ వెసులుబాటు కల్పించటం జరిగింది. దీన్ని బంగారు అవకాశంగా భావించి, మీరు దారికి వస్తే సరి. లేకపోతే మీరు దైవప్రణాళిక నుంచి తప్పించుకోలేరన్న సంగతిని బాగా అర్థం చేసుకోండి. మీరు తిరగబడి అవమానం పాలు కావటం తప్ప మిగిలేదేమీ ఉండదు. కనుక ఈలోగా ఆత్మావలోకనం చేసుకుని ముస్లింలుగా మారండి అన్నది ఈ వాక్యంలోని అంతరార్థం.

5. బుఖారీ, ముస్లిం తదితర ప్రామాణిక హదీసుల ద్వారా నిరూపితమయ్యేదేమిటంటే జిల్‌హజ్ నెల పదవ తేదీ, ఖుర్బానీ ఇచ్చే దినాన్ని **'పెద్ద హజ్ దినం'** (యౌముల్ హజ్జిల్ అక్బర్) అని అంటారు (తిర్మిజీ – హదీసు నెంబరు: 957, బుఖారీ – 4655, ముస్లిం – 982). ఆ రోజునే 'మినా' మైదానంలో ఈ తెగత్రెంపుల ప్రకటన చేయబడింది. జిల్‌హజ్ నెల 10వ తేదీని 'పెద్ద హజ్ దినం'గా వ్యవహరించటానికి ప్రధాన కారణమేమిటంటే, ఆ రోజున అన్నిటికన్నా ముఖ్యమైన హజ్ క్రియలు నెరవేర్చబడతాయి. ప్రజలు 'ఉమ్రహ్'ను చిన్న హజ్‌గా వ్యవహరించేవారు. అందుకే ఉమ్రహ్ నుంచి దీన్ని స్పష్టంగా వేరుపరచడానికి హజ్‌ను 'పెద్దహజ్'గా అభివర్ణించటం జరిగింది. శుక్రవారం రోజున వచ్చిన హజ్ 'పెద్దహజ్' అని ప్రజాబాహుళ్యంలో ప్రాచుర్యం జరిగింది. దీనికెలాంటి ఆధారమూ లేదు.

6. ఇది ముష్రిక్కుల్లోని నాల్గవ వర్గం. వారితో ఉన్న ఒప్పందం గడువు ముగిసే వరకూ వారు అక్కడ నివసించేందుకు అనుమతి ఉంటుంది. ఎందుకంటే వారు ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలకు తావీయకుండా నిజాయితీగా ఒప్పందానికి కట్టుబడి ఉన్నారు. అందుచేత ముస్లింలు కూడా వారి విషయంలో మాటకు కట్టుబడి ఉండవలసిందిగా తాకీదు చేయబడింది.

7. ఇంతకీ నిషిద్ధ మాసాలంటే ఏవి? ఈ విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. రజబ్, జీఖఅద, జిల్‌హజ్ మరియు

وَاحْصُرُوْهُمْ وَاقْعُدُوْا لَهُمْ كُلَّ مَرْصَدٍ ۚ فَاِنْ تَابُوْا وَاَقَامُوا الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ فَخَلُّوْا سَبِيْلَهُمْ ۗ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ⑤

వారికొరకు పొంచి కూర్చోండి.[10] ఒకవేళ వారు పశ్చాత్తాపం చెంది, నమాజును నెలకొల్పితే, జకాతును విధిగా చెల్లిస్తే వారి మార్గాన వారిని వదలిపెట్టండి.[11] నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు.

وَاِنْ اَحَدٌ مِّنَ الْمُشْرِكِيْنَ اسْتَجَارَكَ فَاَجِرْهُ حَتّٰى يَسْمَعَ كَلٰمَ اللّٰهِ ثُمَّ اَبْلِغْهُ مَاْمَنَهٗ ۗ ذٰلِكَ بِاَنَّهُمْ قَوْمٌ لَّا يَعْلَمُوْنَ ⑥

**6** ఒకవేళ ముష్రిక్కులలోని ఏ వ్యక్తి అయినా నీ శరణు కోరితే, అతను దైవవాణి వినేంతవరకు అతనికి నువ్వు ఆశ్రయమివ్వు. ఆ తరువాత అతన్ని అతని సురక్షిత స్థానానికి చేర్చు.[12] వారు తెలియని వారవటంచేత వారి పట్ల ఈ విధంగా వ్యవహరించాలి.[13]

ముహర్రమ్ మాసాలే ఆ నాలుగు మాసాలని ఒక అభిప్రాయం ఉంది. కాగా; జిల్‌హజ్ నెల 10వ తేదీన ఈ 'ప్రకటన' వెలువడింది. ఈ రకంగా ఈ ప్రకటన చేయబడిన రోజునుంచి కేవలం 50 రోజుల గడువు ఇవ్వబడింది. ఈ గడువు ముగియగానే ముష్రిక్కులను పట్టి, వారిని హతమార్చేందుకు అనుమతి ఇవ్వబడింది. అయితే ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. ఈ ఆయతులో ప్రస్తావించబడిన నిషిద్ధమాసాలు ఆ నిషిద్ధ మాసాలు కావనీ, వాస్తవానికి ఇది జిల్‌హజ్ 10వ తేదీనుంచి, రబీవుస్సానీ 10వ తేదీవరకు గల గడువు అని ఆయన అభిప్రాయపడ్డారు. మరి వీటిని నిషిద్ధ మాసాలు (అష్‌హురె హురుమ్) అని ఎందుకు అనటం జరిగింది? అంటే తెగత్రెంపుల ప్రకటన జరిగిన తర్వాత ఆ నాలుగు నెలల్లో ముష్రిక్కులతో యుద్ధం చేయటానికిగాని, వారికి వ్యతిరేకంగా ఎటువంటి చర్యను గైకొనటానికిగాని అనుమతి లేకపోయింది. తెగత్రెంపుల ప్రకటన జరిగిన తీరునుబట్టి ఈ రెండవ అభిప్రాయమే సహేతుకం అనిపిస్తోంది. వాస్తవం అల్లాహ్‌కే ఎరుక.

8. కొంతమంది వ్యాఖ్యాతలు ఈ ఆదేశాన్ని సర్వసాధారణమైన ఆదేశంగా భావించారు. అంటే పుణ్యక్షేత్రం (హరమ్) పరిధిలోపల కనిపించినా, బయట కనిపించినా వారిని వధించాల్సిందే అన్న అర్థంలో తీసుకున్నారు. మరి కొంతమంది అల్ బఖరా సూరాలోని ఆయతును ఉదాహరిస్తూ, పుణ్య క్షేత్రం (హరమ్) సరిహద్దులకు ఆవల కనిపించినపుడు మాత్రమే వధించాలని అభిప్రాయపడ్డారు. అల్ బఖరా సూరాలో ఇలా అనబడింది: "మస్జిదె హరామ్ వద్ద వారు మీపై దాడి చేయనంతవరకూ మీరు వారిని చంపకండి. ఒకవేళ వారు గనక మీపై యుద్ధానికి వస్తే వారితో పోరాడేందుకు మీకూ అనుమతి ఉంటుంది" (అల్ బఖర: 191) (ఇబ్నె కసీర్).

9. అంటే వారిని ఖైదీలుగా పట్టుకోండి. లేదా తుదముట్టించండి.

10. వారు దొరికినప్పుడే వారిని వధించవచ్చులే అని అనుకోకండి. వారి స్థానాలను, కోటలను, వారు తలదాచుకున్న ప్రదేశాలను దిగ్బంధం చేయండి. అన్ని చోట్లా వారికోసం మాటేయండి. మీ అనుమతి లేకుండా వారు ఎటూ కదలలేని పరిస్థితిని సృష్టించండి.

11. ఇప్పుడు వారికి వ్యతిరేకంగా ఎలాంటి చర్యలూ గైకొనకూడదు. ఎందుకంటే ఇప్పుడు వారు ముస్లింలయ్యారు. ఇస్లాం స్వీకరించాక నమాజ్‌ను పాటించటం, జకాతు అనే దానాన్ని విధిగా చెల్లించటం అవశ్యమని కూడా ఈ ఆయతు ద్వారా రూఢీ అవుతోంది. ఎవరైనా వీటిలో ఏ ఒక్కదానినైనా తిరస్కరిస్తే అతడు ముస్లింగా పరిగణించబడడు. మహాప్రవక్త (స) మరణించినప్పుడు జకాత్ చెల్లించటానికి నిరాకరించిన వారినుద్దేశించి హజ్రత్ అబూబక్ర్ (రజి) ఈ ఆయతునే ఉదాహరించారు. "దైవసాక్షి! నమాజుకూ – జకాతుకు మధ్య భేదం చూపేవారితో నేను పోరాడి తీరుతాను" అని ఆయన (రజి) వక్కాణించారు (ముత్తఫకున్ అలైహి). అంటే నమాజు మాత్రం చేసి, జకాతు చెల్లించటానికి మొహం చాటేసే వారిని క్షమించబోను అన్నది ఆయన మాటల్లోని అంతరార్థం.

12. ఈ ఆయతులో ప్రస్తావిత అవిశ్వాసుల విషయంలో సడలింపుల వైఖరిని అవలంబించమని చెప్పబడింది. వారు మీ

كَيْفَ يَكُوْنُ لِلْمُشْرِكِيْنَ عَهْدٌ عِنْدَ اللّٰهِ وَعِنْدَ رَسُوْلِهٖٓ اِلَّا الَّذِيْنَ عٰهَدْتُّمْ عِنْدَ الْمَسْجِدِ الْحَرَامِ ۚ فَمَا اسْتَقَامُوْا لَكُمْ فَاسْتَقِيْمُوْا لَهُمْ ؕ اِنَّ اللّٰهَ يُحِبُّ الْمُتَّقِيْنَ ⑦

**7** అల్లాహ్ వద్ద, ఆయన ప్రవక్త వద్ద ముష్రిక్కులకు ఒప్పందం ఎలా సాధ్యం? అయితే మీరు మస్జిదె హరామ్ దగ్గర ఎవరితో ఒప్పందం చేసుకున్నారో[14] వారు మీ ఒప్పందానికి కట్టుబడి ఉన్నంతవరకూ మీరు కూడా వారి ఒప్పందాన్ని గౌరవించండి. నిశ్చయంగా అల్లాహ్ భయభక్తులు గల వారిని ప్రేమిస్తాడు.[15]

كَيْفَ وَاِنْ يَّظْهَرُوْا عَلَيْكُمْ لَا يَرْقُبُوْا فِيْكُمْ اِلًّا وَّلَا ذِمَّةً ؕ يُرْضُوْنَكُمْ بِاَفْوَاهِهِمْ وَتَاْبٰى قُلُوْبُهُمْ ۚ وَاَكْثَرُهُمْ فٰسِقُوْنَ ⑧

**8** వారి వాగ్దానాలు ఏ మేరకు నమ్మశక్యం? మీపై వారికి ఏకాస్త ఆధిక్యత లభించినా వారు మీ విషయంలో ఏ బంధుత్వాన్నీ, ఏ ఒడంబడికనూ ఖాతరుచేయరు.[16] వారు తమ నోటి మాటలతో మిమ్మల్ని సముదాయించే ప్రయత్నం చేస్తున్నారు. కాని వారి హృదయాలు మాత్రం ఎంతకీ అంగీకరించటం లేదు. వారిలో అత్యధికులు అవిధేయులు.

اِشْتَرَوْا بِاٰيٰتِ اللّٰهِ ثَمَنًا قَلِيْلًا فَصَدُّوْا عَنْ سَبِيْلِهٖ ؕ اِنَّهُمْ سَآءَ مَا كَانُوْا يَعْمَلُوْنَ ⑨

**9** వారు అల్లాహ్ వాక్కులను అతి స్వల్పమైన ధరకు అమ్మేశారు. ఆయన మార్గం నుంచి ప్రజలను ఆపారు. వారి చేష్టలు బహు చెడ్డవి.

---

శరణుకోరినప్పుడు వారికి ఆశ్రయం ఇవ్వండి. ఆ విధంగా వారు ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటారు. కొంతకాలం మీ వద్ద ఉండి దైవవచనాలు వింటారు. ఇస్లాం ప్రబోధనలను తెలుసుకుంటారు. తద్వారా వారి ప్రవర్తనలో పరివర్తన రావచ్చు. వారి పాషాణ హృదయాలు కరగవచ్చు. ఆఖరికి వారు ఇస్లాం స్వీకరించవచ్చు. ఒకవేళ అప్పటికీ వారు ఇస్లాం వైపు మొగ్గుచూపకపోతే వారిని వారి సురక్షిత స్థానాలకు చేర్చండి. ఎందుకంటే మీరు వారికి ఆశ్రయమిచ్చి ఉన్నారు. ఒకసారి మాట ఇచ్చాక ఆఖరిక్షణం వరకూ దానికి కట్టుబడి ఉండటం అవసరం. కాబట్టి వారు వారి సురక్షిత స్థానాలకు చేరుకునే వరకూ వారిని కాపాడే బాధ్యత మీపైన ఉంటుంది.

13. శరణు కోరినవారికి అభయం, ఆశ్రయం ఇవ్వటానికి గల కారణాలలో ఒక ముఖ్య కారణం ఏమిటంటే, వారు తెలియనివారు. ఇస్లాం గురించి, ఇస్లాం ప్రవక్త ప్రబోధనలను గురించి వారికి పూర్తిగా తెలిస్తే బహుశా వారి ధోరణిలో మార్పు రావచ్చునేమో! వారు కూడా ఇస్లాంను స్వీకరించి పరలోక మోక్షం పొందుతారేమో!! హుదైబియా ఒప్పందం తర్వాత ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. ముస్లింల రక్షణ కోరుతూ మదీనా వచ్చిన ఎంతోమంది అవిశ్వాసులు ముస్లింల సత్ప్రవర్తనను చూచి, ఇస్లాం బోధనలను తెలుసుకుని ఇస్లాం స్వీకరించారు.

14. ప్రస్తుతం ఏ ముష్రిక్కులయితే మీతో ఒప్పందాన్ని పాటిస్తున్నారో, వారితో తప్ప మరెవరితోనూ మీకు ఇకమీదట ఒప్పందం లేదు.

15. అంటే, వాగ్దానాన్ని నిలబెట్టుకునే అలవాటు అల్లాహ్ దృష్టిలో ఎంతో ఇష్టకరమైనది. అందుకే వ్యవహారం చేసేటప్పుడు ఆచితూచి అడుగు వేయటం అవసరం.

16. ముష్రిక్కులు చెప్పేవన్నీ కల్లబొల్లి కబుర్లే. వారి వ్యవహారం గోడమీది పిల్లి వాటం. తాము బలంగా ఉన్నామని భావించినప్పుడు వారు అదను చూసి వెన్నుపోటు పొడుస్తారు. బంధుత్వ సంబంధాలను సైతం ఖాతరు చేయరు. ఒప్పందాలను గౌరవించాలన్న ధ్యాస కూడా వారికుండదు. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల దృష్టిలో ఇంతకు ముందు వచ్చిన ఆయతు ముష్రిక్కులను ఉద్దేశించి చెప్పబడింది. కాగా; ఈ ఆయతులో యూదుల గురించి ప్రస్తావన ఉంది. ఎందుకంటే అల్లాహ్ ఇక్కడ, ఆయతులను కొద్దిపాటి మూల్యానికి అమ్మేశారని చెప్పాడు. ఈ విధంగా దైవవచనాలను అమ్ముకునే అలవాటు యూదులకే ఉంది.

لَا يَرْقُبُوْنَ فِيْ مُؤْمِنٍ اِلًّا وَّ لَا ذِمَّةً ؕ وَ اُولٰٓئِكَ هُمُ الْمُعْتَدُوْنَ ⑩

**10** ఏ ముస్లిం విషయంలోనూ వారు బంధుత్వ సంబంధాలను, ఒప్పంద మర్యాదలనూ ఏమాత్రం ఖాతరు చేయరు. హద్దులు మీరేవారు వీరే.[17]

فَاِنْ تَابُوْا وَ اَقَامُوا الصَّلٰوةَ وَ اٰتَوُا الزَّكٰوةَ فَاِخْوَانُكُمْ فِى الدِّيْنِ ؕ وَ نُفَصِّلُ الْاٰيٰتِ لِقَوْمٍ يَّعْلَمُوْنَ ⑪

**11** ఇప్పటికయినా వారు పశ్చాత్తాపం చెంది, నమాజ్‌ను నెలకొల్పుతూ, జకాత్‌ను విధిగా చెల్లించటం మొదలెడితే వారు మీ ధార్మిక సోదరులే.[18] తెలిసినవారి కోసం మేము మా ఆయతు లను ఈ విధంగా విడమరచి చెబుతున్నాము.

وَ اِنْ نَّكَثُوْٓا اَيْمَانَهُمْ مِّنْۢ بَعْدِ عَهْدِهِمْ وَ طَعَنُوْا فِيْ دِيْنِكُمْ فَقَاتِلُوْٓا اَئِمَّةَ الْكُفْرِ ۙ اِنَّهُمْ لَآ اَيْمَانَ لَهُمْ لَعَلَّهُمْ يَنْتَهُوْنَ ⑫

**12** ఒకవేళ ఒప్పందం చేసుకున్న తరువాత కూడా వీళ్లు తమ ప్రమాణాలను భంగపరచి, మీ ధర్మాన్ని ఎగతాళి చేస్తే మీరు కూడా ఆ అవిశ్వాస నాయకులతో తలపడండి.[19] ఇంక వారి ప్రమాణాలకు ఏపాటి విలువాలేదు. బహుశా (తగిన శాస్తి జరిగిన తరువాతనే) వారు (తమ దుశ్చేష్టలను) మానుకుంటారేమో.

17. పదే పదే ఈ ద్రోహబుద్ధిని గురించి ప్రస్తావించటం వెనుక గల ముఖ్యోద్దేశం ముష్రిక్కుల, యూదుల హృదయాలలో ఇస్లాం పట్ల గల ద్వేషాన్ని, వైరభావాన్ని బట్టబయలు చేయటమే.

18. తౌహీద్ (దేవుని ఏకత్వం), రిసాలత్ (దైవదౌత్యం)ను అంగీకరించిన పిదప ఇస్లాంలో అత్యంత కీలకమయిన అంశం నమాజ్. ఇది అల్లాహ్ హక్కు. ఆరాధనకు సంబంధించిన పలు కోణాలు ఇందులో ఉన్నాయి. అందరితో కలసి పంక్తులు తీరి నిలబడటం, వంగటం, సాష్టాంగపడటం, దీనాతిదీనంగా దైవానికి విన్నపాలు చేసుకోవటం, దైవనామ స్మరణ చేయటం, దాసుడు తన అశక్తతను, దీనస్థితిని తెలుపుకోవటం, క్షమాభిక్షకై వేడుకోవటం, సన్మార్గం చూపమని ప్రార్థించటం – ఇవన్నీ ఆరాధనలోని ముఖ్యాంశాలే. ఇవన్నీ అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడాలి.

నమాజు తరువాత రెండవ ముఖ్యాంశం (విధి) జకాత్. అందులో దైవారాధనతో పాటు దాసుల హక్కులు కూడా ఇమిడి ఉన్నాయి. జకాత్‌ను విధిగా చెల్లించటం వల్ల ఎన్నో సామాజిక, ఆర్థిక సమస్యలు పరిష్కృతం అవుతాయి. ఆయా జాతుల, తెగల, ప్రాంతాలలోని అగత్యపరులు, నిరుపేదలు, వికలాంగులు లబ్ది పొందుతారు. అందుకే కలిమయె షహాదత్ (సాక్ష్యవచనం) తరువాత ఇస్లాంలో ఈ రెండు ఆరాధనలకు పెద్దపీట వేయబడింది. అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడనీ, ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్తయని ప్రజలు సాక్ష్యం ఇచ్చే వరకూ నమాజ్‌ను నెలకొల్పి, జకాత్‌ను ఇచ్చే వరకూ వారితో పోరాడవలసిందిగా నాకు ఆజ్ఞాపించబడింది" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్, ముస్లిం – కితాబుల్ ఈమాన్). "ఎవరు జకాత్‌ను చెల్లించరో వారి నమాజ్ నమాజే కాదు" అని హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) చెప్పారు.

19. **'ఐమాన్'** అని అరబీలో ఉంది. 'ఐమాన్' అనే పదం 'యమీన్' అనే పదానికి బహు వచనం. 'ఐమాన్' అంటే ప్రమాణాలు అని అర్థం. **"అయిమ్మహ్"** అనేది "ఇమామ్" అనే పదానికి బహువచనం. 'అయిమ్మ' అంటే పీష్వాలు, నాయకులు, సర్దారులు అన్న అర్థాలు వస్తాయి. వారు గనక ఒప్పందాన్ని బేఖాతరు చేసి ఇస్లాం జీవన విధానాన్ని అవహేళన చేయటం మొదలుపెట్టారంటే, పైకి వారెన్ని మాటలు ఒట్టేసి చెప్పినా వాటికి ఎలాంటి విలువా ఉండదు. అవన్నీ కల్లబొల్లి కబుర్లు తప్ప మరేమీ కావని గ్రహించండి. అట్టి పరిస్థితిలో ఈ అవిశ్వాస ధ్వజవాహకులతో పోరాడండి. పోరాటం తరువాతనే వారు బహుశా దారికి రావచ్చు.

ఈ ఆయతును ఆధారంగా చేసుకుని హనఫీ విద్వాంసులు ఏమంటారంటే, "జిమ్మీలు (ఇస్లామీయ రాజ్యవ్యవస్థలో

13 తమ ప్రమాణాలను భంగం చేసిన వారితో, ప్రవక్తను దేశం నుంచి బహిష్కరించే[20] పథకం వేసిన వారితో మీరు ఎందుకు యుద్ధం చేయరు?[21] (చూడబోతే) తొలిసారి మీపై కవ్వింపు చర్యలకు ఒడిగట్టినది కూడా వారేకదా![22] ఏమిటీ, మీరు వారికి భయపడుతున్నారా? మీరే గనక విశ్వాసులైతే మీరు భయపడటానికి అల్లాహ్‌యే ఎక్కువ అర్హుడు.

أَلَا تُقَاتِلُونَ قَوْمًا نَّكَثُوا أَيْمَانَهُمْ
وَهَمُّوا بِإِخْرَاجِ الرَّسُولِ وَهُم بَدَءُوكُمْ
أَوَّلَ مَرَّةٍ ۚ أَتَخْشَوْنَهُمْ ۚ فَاللَّهُ أَحَقُّ أَن
تَخْشَوْهُ إِن كُنتُم مُّؤْمِنِينَ ﴿13﴾

14 వారితో యుద్ధం చేయండి. అల్లాహ్ మీ చేతుల మీదుగా వారిని దండిస్తాడు. వారిని అవమానపరుస్తాడు. వారికి వ్యతిరేకంగా మీకు సాయం చేసి, విశ్వాసుల గుండెలను చల్ల బరుస్తాడు.

قَاتِلُوهُمْ يُعَذِّبْهُمُ اللَّهُ بِأَيْدِيكُمْ وَيُخْزِهِمْ
وَيَنصُرْكُمْ عَلَيْهِمْ وَيَشْفِ صُدُورَ قَوْمٍ
مُّؤْمِنِينَ ﴿14﴾

15 వారి హృదయాలలోని దుఃఖాన్ని, కోపాన్ని దూరం చేస్తాడు.[23] ఆయన, తాను కోరినవారి వైపుకు కారుణ్యంతో మరలుతాడు. అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు, వివేకవంతుడు.

وَيُذْهِبْ غَيْظَ قُلُوبِهِمْ ۗ وَيَتُوبُ اللَّهُ
عَلَىٰ مَن يَشَاءُ ۗ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿15﴾

---

నివసించే ముస్లిమేతరులు) ఒకవైపు ఇస్లాం పట్ల అసభ్యకరంగా మాట్లాడుతూ, మరోవైపున వాగ్దాన భంగానికి పాల్పడకుండా ఉంటే అట్టి పరిస్థితిలో వారిని తుదముట్టించకూడదు. ఎందుకంటే చంపటానికి ఖుర్ఆన్ రెండు (2) షరతులను ప్రస్తావించింది. అందుచేత ఈ రెండు నియమాలను – ఏకకాలంలో – ఉల్లంఘించనంతవరకూ జిమ్మీలు మరణ దండనకు అర్హులు కాజాలరు." అయితే ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, తదితర విద్వాంసుల దృష్టిలో అవిశ్వాసులు ఇస్లాం ధర్మాన్ని అవహేళన చేసే చేష్టకు ఒడిగట్టడంతోనే వారు శిక్షార్హులైపోతారు. ఎందుకంటే ధర్మాన్ని ఎగతాళి చేసినవాడు ఇతరత్రా వాగ్దానాలను, ఒప్పందాలన్నింటినీ కాలరాచినట్లే. ఇక వారి ప్రమాణాలకు, సంజాయిషీలకు పూచిక పుల్లంత విలువ కూడా ఉండదు (ఫత్‌హుల్ ఖదీర్).

20. మక్కాలోని అవిశ్వాస నాయకులు 'దారున్నద్వా' లో సమావేశమై దైవప్రవక్త (సఅసం) కు వ్యతిరేకంగా గైకొనవలసిన చర్య గురించి మంతనాలు సాగించేవారు. ఆయన్ని దేశం నుంచి బహిష్కరించాలా? లేక నిర్బంధించాలా? లేక హత్యచేయాలా? అన్న అంశంపై తీవ్రంగా తర్జన భర్జన జరిగేది. ఆ విషయమే ఈ ఆయతులో ప్రస్తావించబడింది.

21. ఈ వాక్యంలో అల్లాహ్ ముస్లిములను దుష్టశిక్షణ కోసం యుద్ధం చేయమని ప్రేరేపిస్తున్నాడు.

22. రెండు సంఘటనలలో ఏదో ఒక దానిని దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా అనబడి ఉండవచ్చు. ఒకటి : బద్ర్ యుద్ధ సందర్భంగా ముష్రిక్కులు అవలంబించిన విధానం. అసలు వారు మక్కా నుంచి బయలుదేరింది తమ వర్తక బృందాన్ని కాపాడుకోవటానికే. కాని తమ వర్తక బిడారు సురక్షితంగా మక్కా వైపుకు సాగిపోయిందని తెలిసిన తరువాత కూడా వారు సమర సన్నాహాలను మానుకోలేదు. బద్ర్ మైదానంలో ముస్లింలతో తలపడే పరిస్థితులను ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించారు. వారి కవ్వింపు చర్యల వల్ల ఎట్టకేలకు యుద్ధం అనివార్యమైంది. రెండు : బనీ బకర్ అనే తెగకు ఖురైషులు చేసిన సహాయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ వాక్యం అవతరించి ఉండవచ్చు. దైవప్రవక్త (స)తో మైత్రీ ఒప్పందం చేసుకున్న ఖుజాఅ తెగపై వారు దండెత్తినప్పుడు బనీ బకర్ తెగకు మక్కా ఖురైషులు తోడ్పాటునందించారు. ఈ తోడ్పాటు ఒప్పందానికి విరుద్ధం.

23. ఒకప్పుడు ముస్లింలు బలహీనులుగా ఉన్నప్పుడు అవిశ్వాసులు వారిపై అంతులేని దౌర్జన్యాలు చేసేవారు. అందుకే ముస్లింల గుండెల్లో వారిపట్ల మంటలు రగిలేవి. ఆ విషయాన్నే అల్లాహ్ యిక్కడ గుర్తుచేస్తూ, వారు మీ చేతుల్లో హతులైనప్పుడు వారికి కలిగే పరాభవాన్ని చూసి మీ గుండెలు చల్లబడతాయి అని చెబుతున్నాడు.

16 ఏమిటీ, మీరు ఇట్టే వదలివేయబడతారని భావిస్తున్నారా?[24] వాస్తవానికి మీలో యోధులు ఎవరో,[25] అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, విశ్వాసులను తప్ప వేరొకరెవరినీ ఆప్తమిత్రులుగా చేసుకోనివారు ఎవరో[26] అల్లాహ్ ఇంతవరకు (వేరుపరచి) చూడనే లేదు. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.[27]

أَمْ حَسِبْتُمْ أَن تُتْرَكُوا وَلَمَّا يَعْلَمِ اللَّهُ الَّذِينَ جَاهَدُوا مِنكُمْ وَلَمْ يَتَّخِذُوا مِن دُونِ اللَّهِ وَلَا رَسُولِهِ وَلَا الْمُؤْمِنِينَ وَلِيجَةً ۚ وَاللَّهُ خَبِيرٌ بِمَا تَعْمَلُونَ ﴿16﴾

17 ముష్రిక్కులు తాము స్వయంగా తమ అవిశ్వాసాన్ని గురించి సాక్ష్యమిస్తున్నప్పుడు వారు అల్లాహ్ మస్జిదుల నిర్వహణకు ఎంతమాత్రం తగరు.[28] వారి కర్మలన్నీ వృథా అయిపోయాయి.[29] శాశ్వతంగా వారు నరకాగ్నిలో ఉంటారు.

مَا كَانَ لِلْمُشْرِكِينَ أَن يَعْمُرُوا مَسَاجِدَ اللَّهِ شَاهِدِينَ عَلَىٰ أَنفُسِهِم بِالْكُفْرِ ۚ أُولَٰئِكَ حَبِطَتْ أَعْمَالُهُمْ وَفِي النَّارِ هُمْ خَالِدُونَ ﴿17﴾

24. అంటే మీరు పరీక్షించబడతారు. లేమి ద్వారా, నిరంతర కష్టాల ద్వారా మీ సహన స్థయిర్యాలు పరికించబడతాయి. ఆ తరువాతే మీకు గౌరవోన్నతులు, శ్రేయోసాఫల్యాలు సిద్ధిస్తాయి.

25. యుద్ధం జరిగినప్పుడే సిసలయిన వీరులు, శూరులు ఎవరో తెలుస్తుంది.

26. **"వలీజతున్"** అంటే ప్రగాఢమిత్రుడు, నమ్మదగ్గ నేస్తం అని అర్థం. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తతో శత్రుత్వం వహిస్తున్న వారితో స్నేహ సంబంధాలు పెట్టుకోరాదనీ, వారిని ఆంతరంగిక మిత్రులుగా చేసుకోరాదని ఆదేశించబడటం కూడా ముస్లింలకు ఓ పెద్ద పరీక్షే. నికార్సయిన విశ్వాసులను, మేలిమి బంగారాన్ని వేరుపరచడానికి ఆనాడు ఈ విధంగా ఆదేశించవలసి వచ్చింది మరి.

27. అల్లాహ్‌కు మీ ఆంతర్యాల గురించి తెలియదని కాదు, ఆయనకు లోగుట్టు అంతా తెలుసు. కాకపోతే కీలకమైన పోరుకు ముందు నాణ్యమైన సరకు ఏదో–తప్పా తాలూ ఏదో, కల్మషం లేని వారెవరో – కల్మషం ఉన్నవారెవరో, విధేయులెవరో, అవిధేయులెవరో తేల్చివేయడానికి అల్లాహ్ ఈ నిర్ణయం చేశాడు.

28. **'మసాజిదల్లాహ్'** అంటే మక్కాలోని ఆరాధనా గృహమైన 'మస్జిదె హరామ్' అని భావం. బహువచనంలో ఇది ప్రస్తావించబడటానికి కారణం ప్రపంచంలోని మస్జిదులన్నింటి దిశ (ఖిబ్లా) దీనివైపుకు ఉండటమే. లేక అరబ్బుల్లో ఒకే వస్తువు కోసం బహువచన ప్రయోగం కూడా సమ్మతంగా ఉండేది కాబట్టి ఆ విధంగా చెప్పి ఉండవచ్చు. అల్లాహ్ గృహమైన మస్జిదె హరామ్‌ను తీర్చిదిద్దటం, సేవలందించటం ధర్మపరాయణుల పని. కుఫ్ర్‌కు (తిరస్కారానికి), షిర్క్ (బహుదైవారాధన)కు ఒడిగట్టేవారు ఈ సేవకు అనర్హులు. వారు తల్బియాలో ఇలా పలికేవారు: **లబ్బైక్! లా షరీకలక్ – ఇల్లా షరీకన్ హువలక్, తమ్‌లికుహు వ మా మలక్** (హాజరయ్యాను ప్రభూ! నీకు భాగస్వాములెవరూ లేరు. కాని ఒక భాగస్వామి మాత్రం ఉన్నాడు. అతను నీవాడే. అయితే అతనికి, అతను యజమాని అయిన వాటికి అసలు యజమానివి మాత్రం నీవే) (సహీహ్ ముస్లిం – బాబుత్తల్‌బియా). ఈ విధంగా అరబ్బు ముష్రిక్కులు స్వయంగా తమ షిర్క్ పోకడల్ని ఒప్పుకునేవారు. లేక ఇక్కడ సాక్ష్యమివ్వటం లేక ఒప్పుకోవటం అంటే భావం ఏ మతం వారైనా తమ మతం గురించి తాము యూదులమనో, క్రైస్తవులమనో, బహుదైవారాధకులమనో చెప్పుకోవటం కూడా కావచ్చు.

29. వారి కర్మలు (అంటే కాబా గృహ ప్రదక్షిణ, హజ్ యాత్రీకులకు మంచి నీరు త్రాపించటం మొదలగునవి) పైకి ఎంతో మంచిపనులుగానే కనిపిస్తున్నప్పటికీ విశ్వాసం (ఈమాన్) లోపించిన కారణంగా అవి నిష్ఫలం అయిపోతాయి. వారి సదాచరణలు మేడిపండు వంటివి. పైకి అందంగానే ఉంటాయి. పొట్ట విప్పి చూస్తే ఉండేది పురుగులే. లేదా వారి సత్కర్మలు సువాసనలేని పువ్వుల వంటివి; రుచిలేని పండ్ల వంటివి.

18 అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసిస్తూ, నమాజులను నెలకొల్పుతూ, జకాత్‌ను విధిగా చెల్లిస్తూ, అల్లాహ్‌కు తప్ప వేరొకరికి భయపడనివారు మాత్రమే అల్లాహ్ మస్జిదుల నిర్వహణకు తగినవారు. సన్మార్గ భాగ్యం[30] పొందినవారు వీరేనని ఆశించవచ్చు.

إِنَّمَا يَعْمُرُ مَسَٰجِدَ ٱللَّهِ مَنْ ءَامَنَ بِٱللَّهِ
وَٱلْيَوْمِ ٱلْءَاخِرِ وَأَقَامَ ٱلصَّلَوٰةَ وَءَاتَى ٱلزَّكَوٰةَ
وَلَمْ يَخْشَ إِلَّا ٱللَّهَ ۖ فَعَسَىٰٓ أُو۟لَٰٓئِكَ أَن
يَكُونُوا۟ مِنَ ٱلْمُهْتَدِينَ ﴿١٨﴾

19 ఏమిటీ, మీరు హజ్ యాత్రీకులకు మంచినీళ్లు సరఫరా చేయటాన్ని, మస్జిదె హరామ్‌కు సేవలు చేయటాన్ని; అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించి అల్లాహ్ మార్గంలో యుద్ధం చేసే వారితో సమానంగా పరిగణించారా? వారు అల్లాహ్ దృష్టిలో సమానులు కాజాలరు.[31] అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు.[32]

أَجَعَلْتُمْ سِقَايَةَ ٱلْحَآجِّ وَعِمَارَةَ ٱلْمَسْجِدِ
ٱلْحَرَامِ كَمَنْ ءَامَنَ بِٱللَّهِ وَٱلْيَوْمِ ٱلْءَاخِرِ وَجَٰهَدَ
فِى سَبِيلِ ٱللَّهِ ۚ لَا يَسْتَوُۥنَ عِندَ ٱللَّهِ ۗ وَٱللَّهُ
لَا يَهْدِى ٱلْقَوْمَ ٱلظَّٰلِمِينَ ﴿١٩﴾

30. విశ్వాసం (ఈమాన్) సత్కర్మలు ఏవో ఇక్కడ తెలియజేయటం జరిగింది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరయినా ఒక వ్యక్తి నాగా లేకుండా మస్జిద్‌కు వస్తుంటే అతను 'విశ్వాసి' అని మీరంతా సాక్ష్యమివ్వండి" (తిర్మిజీ – అత్ తౌబా సూరా వ్యాఖ్యానం). ఈ ఆయతులో అల్లాహ్‌పై విశ్వాసం, అంతిమ దినంపై విశ్వాసం తరువాత ప్రస్తావించబడిన అంశాలలో 1. నమాజ్, 2. జకాత్, 3. దైవభీతి ఉన్నాయి. దీన్నిబట్టి ఇస్లాం ధర్మంలో నమాజ్ జకాత్‌లకూ, దైవభీతికి (తఖ్వాకు) గల ప్రాముఖ్యత ఎటువంటిదో విదితమవుతోంది.

31. ముష్రిక్కులు హజ్ యాత్రీకులకు మంచినీరును సరఫరా చేసి, కాబా గృహ నిర్వహణను పర్యవేక్షించి తాము గొప్ప పుణ్యకార్యం చేసినట్లు గర్వపడేవారు. వారు చేసే ఈ పనిముందు విశ్వాసానికీ, జిహాద్‌కూ ఎలాంటి ప్రాధాన్యతా లేదని భావించేవారు. వారి గర్వాన్ని అణచటానికి అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు. "మీరు హాజీలకు నీళ్లు అందించి, మస్జిదె హరామ్ వద్ద బందోబస్తు ఏర్పాటుచేసి ధన్యులమయ్యామని సంబరపడిపోతున్నారు కాబోలు! ముమ్మాటికీ మీ ఈ పనులు విశ్వాసంతో, దైవమార్గంలో పోరాటంతో సరితూగలేవు" అని దేవుడు స్పష్టపరచాడు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే ముష్రిక్కులు చేసే ఈ సత్కార్యం కూడా దైవసమక్షంలో 'స్వీకృతి' పొందదు – ఒకవేళ ఆ సత్కార్యం లోక కళ్యాణానికి ఉద్దేశించినదైనాసరే! అల్లాహ్ ఆయతుల పట్ల విరోధం కలిగి ఉన్న కారణంగా వారి మంచిపనులన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయినాయి.

కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఈ ఆయతు అవతరణ వెనుక గల వృత్తాంతం ఇలా ఉంది: ఒకరోజు మస్జిదె నబవీలోని వేదిక సమీపంలో కొంతమంది ముస్లిం సహచరులు 'ఏ సత్కార్యం గొప్పది?' అన్న అంశంపై తర్జన భర్జన చేసుకున్నారు. ఇస్లాం స్వీకరించిన తరువాత దైవసన్నిధిలో అన్నిటికన్నా గొప్ప సత్కార్యం హజ్ యాత్రీకులకు నీరు త్రాపటమే అని ఒక వ్యక్తి అభిప్రాయపడ్డాడు. మస్జిదె హరామ్‌ను తీర్చిదిద్దటం గొప్ప పని అని మరోవ్యక్తి వాదించాడు. మీరు చెప్పుకునే మంచి పనులకన్నా దైవమార్గంలో పోరాడటం శ్రేష్ఠమైన పని అని మూడవ వ్యక్తి చెప్పాడు. వారు ఆ విధంగా వాదోపవాదాలు చేసుకోవటాన్ని హజ్రత్ ఉమర్ (రజి) విని, వాళ్లను మందలించారు. దైవప్రవక్త (సఅసం) వారి వేదిక (మింబర్) దగ్గిర ఇలా హెచ్చు స్వరంతో మాట్లాడుకోవటం ఎంతమాత్రం వాంఛనీయం కాదని చీవాట్లు పెట్టారు. ఆ రోజు శుక్రవారం. హదీసు ఉల్లేఖకులలో ఒకరైన హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) ఇలా అంటున్నారు: "నేను శుక్రవారం నమాజు అనంతరం దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి, మా మధ్య జరిగిన సంభాషణ నంతటినీ వివరించి సమాధానం అడిగాను. దానిపై ఈ ఆయతు అవతరించింది" (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఇమార). అల్లాహ్‌ను విశ్వసించటం, అంతిమ దినం సత్యమని నమ్మటం, దైవప్రసన్నతను బడసే ఉద్దేశంతో

**20** విశ్వసించి, వలసపోయి (హిజ్రత్ చేసి), దైవమార్గంలో తమ ధన ప్రాణాలను ఒడ్డి పోరాడినవారు మాత్రమే అల్లాహ్ సన్నిధిలో ఉన్నత శ్రేణికి చెందినవారు. సాఫల్యం పొందేవారు కూడా వీరే.

الَّذِينَ آمَنُوا وَهَاجَرُوا وَجَاهَدُوا فِي سَبِيلِ
اللَّهِ بِأَمْوَالِهِمْ وَأَنفُسِهِمْ أَعْظَمُ دَرَجَةً
عِندَ اللَّهِ ۚ وَأُولَٰئِكَ هُمُ الْفَائِزُونَ ⑳

**21** వారి ప్రభువు వారికి తన కారుణ్యాన్ని, ప్రసన్నతను, (స్వర్గ) వనాలను అనుగ్రహిస్తానని శుభవార్త ఇస్తున్నాడు. అక్కడ వారి కోసం శాశ్వతమైన అనుగ్రహాలున్నాయి.

يُبَشِّرُهُمْ رَبُّهُم بِرَحْمَةٍ مِّنْهُ وَرِضْوَانٍ
وَجَنَّاتٍ لَّهُمْ فِيهَا نَعِيمٌ مُّقِيمٌ ㉑

**22** వాటిలో వారు కలకాలం ఉంటారు. నిశ్చయంగా అల్లాహ్ వద్ద గొప్ప ప్రతిఫలం ఉంది.[33]

خَالِدِينَ فِيهَا أَبَدًا ۚ إِنَّ اللَّهَ عِندَهُ
أَجْرٌ عَظِيمٌ ㉒

**23** ఓ విశ్వాసులారా! మీ తండ్రులు, మీ సోదరులు విశ్వాసం కన్నా అవిశ్వాసాన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నట్లయితే వారిని మీ స్నేహితులుగా చేసుకోకండి. మీలో ఎవరు వారిని అభిమానిస్తారో వారు దుర్మార్గులవుతారు.[34]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَتَّخِذُوا آبَاءَكُمْ وَإِخْوَانَكُمْ
أَوْلِيَاءَ إِنِ اسْتَحَبُّوا الْكُفْرَ عَلَى الْإِيمَانِ ۚ وَمَن
يَتَوَلَّهُم مِّنكُمْ فَأُولَٰئِكَ هُمُ الظَّالِمُونَ ㉓

---

దైవమార్గంలో పోరాడటం అన్నిటికన్నా ముఖ్యమైన, మహత్పూర్వకమైన ఆచరణలని ఇక్కడ నిర్ద్వంద్వంగా చెప్పేయటం జరిగింది.

సమయం సందర్భం దృష్ట్యా ఇక్కడ జిహాద్ (దైవమార్గంలో పోరాటం) గురించి మాత్రమే చెప్పాల్సింది. అయితే దైవాన్ని విశ్వసించనంతవరకూ ఏ సత్కార్యమూ స్వీకారయోగ్యమవదు గనక 'ఈమాన్ బిల్లాహ్' ప్రస్తావన కూడా వచ్చింది. మొత్తానికి దైవమార్గంలో పోరాటానికి మించిన సదాచరణ ఏదీ లేదని దీని ద్వారా రూఢీ అవుతోంది.

అదే సమయంలో ఈ ఆయతు ద్వారా బహుదైవోపాసకుల మూఢనమ్మకాలను ఖండించటంతో పాటు, ఆచరణల్లో కొన్నిటిపై మరికొన్నిటికి షరీఅత్‌పరమైన ఏ నిదర్శనం లేకుండానే తమకు తాముగా ప్రాధాన్యతనిచ్చుకోవటం విశ్వాసులకు శోభాయమానం కాదని హెచ్చరించటం కూడా దేవుని అభిమతమే. ఏది గొప్పది? ఏది కాదు? లాంటి అంశాలను నిర్ణయించే అధికారం కేవలం అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకు మాత్రమే ఉంది. దేవుడు, దైవప్రవక్త ఆజ్ఞాపించిన పనిని నిర్వర్తించటం వరకే విశ్వాసుల పని.

32. తాము సజ్జనులమని వాళ్లు ఎన్ని డాంబికాలు చెప్పుకున్నా వాస్తవానికి వారు సజ్జనులు కారు. పైగా వారు దుర్జనులు. ఏకదైవోపాసనను బహుదైవోపాసనతో కలగాపులగం చేసి లోకంలో అంధకారాన్ని వ్యాపింపజేసిన పరమ దుర్మార్గులు. అందుకే అల్లాహ్ షిర్క్‌ను చాలా పెద్ద జులుంగా, దుర్మార్గంగా ఖరారు చేశాడు. ఈ దుర్మార్గం మూలంగానే వారు సన్మార్గానికి దూరమైపోయారు. అందుచేత సన్మార్గ భాగ్యం పొందిన ముస్లింలకూ – అంధకార లోయల్లో తచ్చాడే ఈ దుర్మార్గులకు ఏ విధంగానూ పోలిక లేదు.

33. ఒక్కడైన అల్లాహ్‌ను విశ్వసించి, దైవమార్గంలో తమ ఇల్లూ వాకిలినీ, పాడిపంటలను, సిరిసంపదలను – అన్నింటినీ విడిచిపెట్టి హిజ్రత్ చేసిన (వలసపోయిన) వారి, దైవమార్గంలో తమ సర్వస్వాన్ని ధారబోసి పోరాడిన వారి గొప్పదనం ఇక్కడ ప్రస్తావించబడింది. దైవసన్నిధిలో వీరికి ఉన్నత పదవులు లభిస్తాయి. వారి జీవితం సార్థకమవుతుంది. వారు సఫలీకృతులయ్యారు. దైవప్రీతికి, దైవకారుణ్యానికి, శాశ్వితమైన దైవానుగ్రహాలకు నోచుకున్న ధన్యజీవులు వీరే. అంతేగాని సోకాల్డ్ ధర్మావలంబీకులకు, తమ తాత ముత్తాతల రీతీ రివాజును అంటిపెట్టుకొని ఉన్న ప్రబుద్ధులకు ఈ భాగ్యం ప్రాప్తించదు.

24 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఒకవేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ సమీప బంధువులు, మీరు సంపాదించిన సిరిసంపదలు, కుంటుపడుతుందేమోనని మీరు భయపడే మీ వర్తకం, మీకెంతో ప్రియమైన మీ గృహాలు మీకు అల్లాహ్ కన్నా, ఆయన ప్రవక్త కన్నా, ఆయన మార్గంలో సలిపే పోరాటం కన్నా ఎక్కువ ప్రియమైనవైతే అల్లాహ్ తీసుకు వచ్చే తీర్పు (శిక్ష) కొరకు ఎదురు చూడండి. అల్లాహ్ అవిధేయులకు సన్మార్గం చూపడు.[35]

قُلْ إِن كَانَ آبَاؤُكُمْ وَأَبْنَاؤُكُمْ وَإِخْوَانُكُمْ وَأَزْوَاجُكُمْ وَعَشِيرَتُكُمْ وَأَمْوَالٌ اقْتَرَفْتُمُوهَا وَتِجَارَةٌ تَخْشَوْنَ كَسَادَهَا وَمَسَاكِنُ تَرْضَوْنَهَا أَحَبَّ إِلَيْكُم مِّنَ اللَّهِ وَرَسُولِهِ وَجِهَادٍ فِي سَبِيلِهِ فَتَرَبَّصُوا حَتَّىٰ يَأْتِيَ اللَّهُ بِأَمْرِهِ ۗ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الْفَاسِقِينَ ﴿٢٤﴾

34. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల ప్రస్తావనకు వచ్చింది. (చూడండి : ఆలి ఇమ్రాన్ సూరా – 28, 118. అల్ మాయిద – 51, అల్ ముజాదలా – 22). ఇక్కడ హిజ్రత్ (వలస), జిహాద్ (దైవమార్గంలో పోరాటం) అన్న శీర్షికల నేపథ్యంలో ఈ ప్రస్తావన వచ్చింది. దైవమార్గంలో మీరు వలసపోవలసి వచ్చినప్పుడు గానీ, పోరాడవలసి వచ్చినప్పుడు గానీ బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, రాగద్వేషాలు పనికిరావు. ఇంకా ఇప్పటివరకూ ఇస్లాం స్వీకరించని మీ తండ్రుల పట్ల, మీ అన్నదమ్ముల పట్ల మీ ఆంతర్యాల్లో ఉన్న ప్రేమానురాగాలు మిమ్మల్ని కట్టిపడేయకూడదు. విశ్వాసం లేని కారణంగా వారు మీ ఆప్తులు కానేకారు. పైగా ఇప్పుడు వారు మీకు శత్రువులుగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితిలో మీరు గనక వారితో ప్రేమాభిమానాలు కలిగి ఉన్నట్లయితే ఈ ద్వంద్వ స్వభావం మిమ్మల్ని దుర్మార్గానికి లోను చేస్తుంది.

35. మానవ నైజం వాంఛించే, ఇష్టపడే పలు అంశాలు ఇక్కడ ప్రస్తావనకు వచ్చాయి. **'అషీర'** అంటే మనిషి రేయింబవళ్లు సహజీవనం సాగించే దగ్గరి బంధువులు, వంశస్థులు, తెగలు అని భావం. మనిషి ఆస్తిపాస్తులను, అయిన వారిని ఎంతో ఇష్టపడతాడు. తన వర్తకంలో ఎలాంటి స్తబ్ధత ఏర్పడకుండా ఉండాలనీ, తన వాణిజ్య సామగ్రి విక్రయం కాకుండా గిడ్డంగులలో పడి ఉండరాదని కోరుకుంటాడు. అలాగే తన ఆలుబిడ్డల, కుటుంబ సభ్యుల రక్షణ కోసం కంచుకోటల్లాంటి మేడలుండాలనీ, సురక్షితమైన సౌధాలలో వారు సుఖపడాలని కాంక్షిస్తాడు. అతను అలా కోరుకోవటం సహజం కూడాను. అందులో తప్పు కూడా లేదు. కాని ఈ ప్రాపంచిక వస్తువుల పట్ల గల మక్కువ వల్ల దైవాన్ని, దైవప్రవక్తను, దైవమార్గంలో జరపవలసిన పోరాటాన్ని అతను విస్మరించినట్లయితే అది అల్లాహ్ దృష్టిలో చాలా తీవ్రమయిన విషయంగా పరిగణించబడుతుంది. ఈ రకమయిన విస్మరణ పాపం, అవిధేయత క్రిందికి వస్తుంది. ఈ అవిధేయతకు పాల్పడిన మనిషి సన్మార్గానికి దూరమైపోతాడు.

హదీసులలో మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు కూడా ఈ విషయాన్ని స్పష్టంగా వివరించారు : ఉదాహరణకు ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు : "దైవప్రవక్తా (సఅసం)! తమరు నాకు నా ప్రాణం తప్ప మిగిలిన వస్తువులన్నింటికన్నా ప్రియతములు." అప్పుడు ఆయన (సఅసం), "ఎవరయినాసరే తన ప్రాణం కన్నా అధికంగా నన్ను ప్రేమించనంతవరకూ అతను విశ్వాసి కాజాలడు" అని అన్నారు. ఈ మాట వినగానే "అయితే దైవసాక్షి! ఇకనుంచి నేను నా ప్రాణం కన్నా ఎక్కువగా తమరిని ప్రేమిస్తాను" అని హజ్రత్ ఉమర్ (రజి) చెప్పారు. అప్పుడు ఆయన (స), "ఓ ఉమర్! ఇప్పుడు నువ్వు విశ్వాసివి అయ్యావు" అని పలికారు (సహీహ్ బుఖారీ– కితాబుల్ ఐమాన్, వన్నుజూర్).

వేరొక ఉల్లేఖనం ప్రకారం ఆయన (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. మీలో ఎవరయినాసరే తన తండ్రికన్నా, తన సంతానం కన్నా, సమస్త జనులకన్నా అధికంగా నన్ను ప్రేమించనంత వరకూ – అతను విశ్వాసి కాజాలడు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్). వేరొక హదీసులో జిహాద్ ప్రాముఖ్యాన్ని వెల్లడిస్తూ ఇలా అన్నారు : "మీరు నిర్ణీత గడువుపై వస్తువును అరువుగా ఇచ్చి, మళ్లీ దాన్ని

لَقَدْ نَصَرَكُمُ اللّٰهُ فِيْ مَوَاطِنَ كَثِيْرَةٍ ۙ
وَّيَوْمَ حُنَيْنٍ ۙ اِذْ اَعْجَبَتْكُمْ كَثْرَتُكُمْ
فَلَمْ تُغْنِ عَنْكُمْ شَيْـًٔا وَّضَاقَتْ عَلَيْكُمُ
الْاَرْضُ بِمَا رَحُبَتْ ثُمَّ وَلَّيْتُمْ مُّدْبِرِيْنَ ۚ (25)

**25** లోగడ చాలా సందర్భాలలో అల్లాహ్ మీకు సహాయం చేసి ఉన్నాడు. హునైన్ యుద్ధం జరిగిన రోజున కూడా (మిమ్మల్ని ఆదుకున్నాడు). ఆ సందర్భంగా మీరు మీ అధిక సంఖ్యపై గర్వ పడ్డారు. కాని ఆ సంఖ్యాబలం మీకే విధంగానూ ప్రయోజనం కలిగించలేదు. భూమి విశాలంగా ఉండి కూడా మీకోసం ఇరుకైపోయింది. అప్పుడు మీరు వెన్ను చూపి మరలిపోయారు.

ثُمَّ اَنْزَلَ اللّٰهُ سَكِيْنَتَهٗ عَلٰى رَسُوْلِهٖ وَعَلَى
الْمُؤْمِنِيْنَ وَاَنْزَلَ جُنُوْدًا لَّمْ تَرَوْهَا ۚ وَعَذَّبَ
الَّذِيْنَ كَفَرُوْا ۗ وَذٰلِكَ جَزَاۤءُ الْكٰفِرِيْنَ (26)

**26** ఆ తరువాత అల్లాహ్ తన ప్రవక్తపై, విశ్వాసులపై తన తరఫు నుంచి స్థిమితాన్ని అవతరింపజేశాడు. మీకు కానరాని సేనలను పంపించాడు. సత్య తిరస్కారులను శిక్షించాడు. సత్యాన్ని తిరస్క రించేవారికి లభించవలసిన ప్రతిఫలం ఇదే.

ثُمَّ يَتُوْبُ اللّٰهُ مِنْۢ بَعْدِ ذٰلِكَ عَلٰى مَنْ
يَّشَاۤءُ ۗ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ (27)

**27** ఆ తరువాత కూడా అల్లాహ్ తాను కోరినవారిని మన్నించి, వారిపై దయ చూపుతాడు.[36] అల్లాహ్ క్షమాగుణం కలవాడు, దయామయుడు.

---

తక్కువ ధరకు కొనుగోలు చేసే వ్యాపారాన్ని ('బైవు ఈనా'ను) మొదలెట్టినప్పుడు, ఆవుల తోకలు పట్టుకుని వ్యవసాయపు పనులలో లీనమైపోయి జిహాద్ (ధర్మయుద్ధం)ను విస్మరించినపుడు అల్లాహ్ మిమ్మల్ని పరాభవానికి లోనుచేస్తాడు. మీరు మీ ధర్మం వైపుకు మరలిరానంతవరకూ ఈ పరాభవం నుంచి బయటపడలేరు" (అబూ దావూద్ – కితాబుల్ బుయూ; ముస్నదె అహ్మద్ – సంపుటి : 2, పేజీ – 42).

36. మక్కా – తాయిఫ్ నగరాల మధ్యలో ఉన్న పర్వత లోయ హునైన్. ఇక్కడ హవాజిన్, సఖీఫ్ తెగల వారుండేవారు. ఈ రెండు తెగలవారు కూడా విలువిద్యలో ఆరితేరినవారు. ముస్లింలను ఎదుర్కోవాలన్న ఉద్దేశంతో వారు చాలా కాలంగా సమర సన్నాహాలు సాగిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న దైవప్రవక్త (స) 12వేల మంది సైనికులతో హునైన్ లోయకు చేరుకున్నారు. మక్కా విజయం తరువాత 18, 19 రోజులకు షవ్వాల్ మాసంలో జరిగిన సంఘటన ఇది. హవాజిన్, సఖీఫ్ తెగలు సర్వవిధాలా సమరానికి సిద్ధం అయ్యారు. వివిధ చోట్ల విలుకాండ్రను మోహరించారు. అదే సమయంలో మరోవైపు ముస్లింలలో ఒకింత గర్వం తొణికిసలాడసాగింది. ఎందుకంటే ఇప్పుడు వారి వద్ద సైనికుల కొరతలేదు. వారు దైవసహాయంపై ఆధారపడటం కన్నా ఎక్కువగా తమ సంఖ్యాబలంపై ఆధారపడ్డారు. ఈ రోజు తమను ఓడించే మొనగాడు ఎవడూ లేడన్న తలంపు వారిలో కలిగింది. ఈ ధోరణి అల్లాహ్‌కు నచ్చలేదు. ఒక్కసారిగా హవాజిన్ విలుకాండ్రు ముస్లిం సేనలపై బాణవర్షం కురిపించేసరికి ముస్లిం యోధులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. వారి సైనిక పంక్తులలో కలవరం మొదలయింది. వారు వెన్నుచూపి పలాయనం చిత్తగించసాగారు. కదనరంగంలో దైవప్రవక్త (స) సహా మరోవందమంది సైనికులు మాత్రమే నిలిచారు. పారిపోతున్న ముస్లింల నుద్దేశించి దైవప్రవక్త (స), "ఓ దైవదాసులారా! నా దగ్గరకు రండి. నేను దైవప్రవక్తను" అని పిలవసాగారు. కాని లాభం లేకపోయింది. "నేను దైవప్రవక్తను. నేను చెప్పేది అబద్ధం కాదు. నేను అబ్దుల్ ముత్తలిబ్ పుత్రుడను" అని నినదించసాగారు. ఆ కలకలంలో దైవప్రవక్త (స) మాటలు వారికి వినపడలేదు. హెచ్చుస్వరం గల హ[జత్ అబ్బాస్ (రజి) నుద్దేశించి, ముస్లిములను సమీకరించమని ఆయన (స) ఆజ్ఞాపించారు. హ[జత్ అబ్బాస్ (రజి) ఎలుగెత్తి ప్రకటించటంతో ముస్లింలు తేరుకున్నారు. తమ పిరికితనంపై సిగ్గుపడ్డారు. యుద్ధ మైదానంలోకి తిరిగివచ్చి, వీరోచితంగా పోరాడారు. మరోవైపు నుంచి వారికి దైవసహాయం అందింది. దేవుడు వారి మనసులను కుదుటపరచాడు. గుండె ధైర్యాన్ని కలిగించాడు. తత్ఫలితంగా శత్రువులపట్ల వారి గుండెల్లో పుట్టిన దడ కాస్తా తగ్గిపోయింది. ఇంకోవైపు

**28** ఓ విశ్వాసులారా! ముష్రిక్కులు అశుద్ధులు.[37] కాబట్టి ఈ ఏడాది తరువాత వారు మస్జిదె హరామ్ దరిదాపులకు కూడా రాకూడదు.[38] ఒకవేళ మీకు దారిద్ర్య భయం ఉంటే అల్లాహ్ గనక తలిస్తే తన కృపతో మిమ్మల్ని సంపన్నులుగా చేస్తాడు.[39] అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేకవంతుడు.

يا أيها الذين آمنوا إنما المشركون نجس
فلا يقربوا المسجد الحرام بعد عامهم
هذا ۚ وإن خفتم عيلة فسوف يغنيكم الله
من فضله إن شاء ۚ إن الله عليم حكيم ﴿٢٨﴾

**29** అల్లాహ్‌నూ, అంతిమదినాన్నీ విశ్వసించని, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నిషేధించిన వస్తువులను నిషిద్ధంగా భావించని, సత్యధర్మాన్ని అవలంబించని గ్రంథవహులతో – వారు పరాభవం పాలై తమ స్వహస్తాలతో జిజ్‌యా[40] చెల్లించనంతవరకూ యుద్ధం చేయండి.

قاتلوا الذين لا يؤمنون بالله ولا باليوم
الآخر ولا يحرمون ما حرم الله ورسوله
ولا يدينون دين الحق من الذين أوتوا
الكتاب حتى يعطوا الجزية عن يد وهم
صاغرون ﴿٢٩﴾

నుంచి దైవదూతలు దిగివచ్చి శత్రువుల వెన్ను విరిచారు. ఎట్టకేలకు ముస్లింలకు విజయం వరించింది. ఈ యుద్ధంలో 6 వేలమంది అవిశ్వాసులను ముస్లింలు ఖైదీలుగా పట్టుకున్నారు. (ఆ తరువాత వారంతా దైవప్రవక్త – సఅసం – ఆదేశంపై వదలివేయబడ్డారు). పెద్ద ఎత్తున యుద్ధప్రాప్తి లభించింది. యుద్ధానంతరం ఆ తెగల నాయకులెంతోమంది ఇస్లాం స్వీకరించారు. ఈ వృత్తాంతాన్నే అల్లాహ్ ఈ మూడు ఆయతులలో సంక్షిప్తంగా వివరించాడు.

37. **'ముష్రిక్కులు అశుద్ధులు'** అంటే భావం వారి నమ్మకాలలో, ఆలోచనలలో 'శుద్ధి'లేదు. వారు స్వచ్ఛమయిన తౌహీద్ (దేవుని ఏకత్వం)లో షిర్క్ (బహుదైవోపాసన) అనే అశుద్ధతను కల్తీ చేశారు. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం అవిశ్వాసులు అంతర్బాహ్య అశుద్ధతలకు లోనై ఉంటారు. విశ్వాసపరంగా వారు ఎలాగూ అశుద్ధులే. అయితే బాహ్యపరంగా కూడా వారు మూత్రవిసర్జన తరువాత 'తహారత్' (శుచి, శుభ్రతల)ను పాటించరు. అందుకే వారు ఖుర్‌ఆన్‌లో అశుద్ధులుగా ఖరారు చేయబడ్డారు.

38. ఈ **'తెగత్రెంపుల ప్రకటన'** ఇంతకుముందు కూడా సవివరంగా పేర్కొనబడింది. అయితే 'మస్జిదె హరామ్ దరిదాపులకు కూడా రాకూడద'న్న ఆజ్ఞ మక్కాలోని ఒక్క కాబా గృహానికి మాత్రమే పరిమితమని, ఇతర మస్జిదులలో ముస్లిమేతరులు ప్రవేశించవచ్చునని కొందరు విద్వాంసులు వాదించారు. ఎందుకంటే మహాప్రవక్త మదీనా నగరంలో సుమామా బిన్ ఉసాల్ (రజి)ను మస్జిద్‌లో నిర్బంధించి ఉంచారు. కడకు అల్లాహ్ ఆయన మనసులో ఇస్లాంపట్ల, దైవప్రవక్త (స) పట్ల ప్రేమాభిమానాలను పొందుపరచాడు. ఆ విధంగా ఆయన ముస్లింగా మారారు.

చాలామంది పండితుల దృష్టిలో 'మస్జిదె హరామ్' అంటే కేవలం కాబా గృహం ఒక్కటే కాదు, హరమ్ పరిధి మొత్తం అని దాని భావం. ఆ హరమ్ పరిధుల్లో ప్రవేశించటానికి ముష్రిక్కులు అర్హులు కారు. కొన్ని ఆధారాల ప్రకారం జిమ్మీలకు, సేవకులకు ఈ ఆదేశం నుంచి మినహాయింపు ఇవ్వబడింది. కాగా; హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఈ ఆయతును ఆధారంగా చేసుకుని తన పరిపాలనా కాలంలో యూదులను, క్రైస్తవులను సయితం మస్జిదులలో ప్రవేశించటాన్ని నిషేధించారు (ఇబ్నె కసీర్).

39. హజ్ యాత్రా సమయంలో ముస్లిమేతరులు కూడా మక్కా నగరానికి రావటం వల్ల వ్యాపారం బాగా జరిగేది. ఈ నిషేధం వల్ల బహుశా తమ వర్తకం దెబ్బతిని, తాము ఆర్థికంగా కృంగిపోతామేమోనని కొంతమంది ముస్లింలు లోలోపలే భయపడ్డారు. ఆ విషయాన్నే అల్లాహ్ యిక్కడ ప్రస్తావిస్తూ, ముస్లింలు లేమి గురించి భయపడవలసిన పనిలేదనీ, అల్లాహ్ తలచుకుంటే వారు ఆర్థికంగా మరింత పుంజుకుంటారని అభయమిచ్చాడు. జరిగింది కూడా అదే. నిరంతర విజయాల ద్వారా యుద్ధప్రాప్తి పుష్కలంగా ప్రాప్తించేది. క్రమక్రమంగా అరేబియా ప్రాంతమంతా

وَقَالَتِ الْيَهُوْدُ عُزَيْرُ ۨابْنُ اللّٰهِ وَقَالَتِ
النَّصٰرَى الْمَسِيْحُ ابْنُ اللّٰهِ ؕ ذٰلِكَ قَوْلُهُمْ
بِاَفْوَاهِهِمْ ۚ يُضَاهِـُٔوْنَ قَوْلَ الَّذِيْنَ كَفَرُوْا
مِنْ قَبْلُ ؕ قٰتَلَهُمُ اللّٰهُ ۚ اَنّٰى يُؤْفَكُوْنَ ﴿30﴾

30 "ఉజైర్ అల్లాహ్ కుమారుడు" అని యూదులంటున్నారు. "మసీహ్ (ఏసు క్రీస్తు) అల్లాహ్ కుమారుడు" అని నసారా (క్రైస్తవులు) అంటున్నారు. ఇవి వారి నోటి మాటలు మాత్రమే. తమ పూర్వీకుల్లోని అవిశ్వాసులు చెప్పిన మాటలనే వీళ్ళు అనుక రిస్తున్నారు. అల్లాహ్ వారిని నాశనం చేయుగాక! (సత్యం నుండి) వారెలా తిరిగిపోతున్నారు!?

اِتَّخَذُوْۤا اَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ اَرْبَابًا مِّنْ
دُوْنِ اللّٰهِ وَالْمَسِيْحَ ابْنَ مَرْيَمَ ۚ وَمَاۤ اُمِرُوْۤا اِلَّا
لِيَعْبُدُوْۤا اِلٰهًا وَّاحِدًا ۚ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ ؕ سُبْحٰنَهٗ
عَمَّا يُشْرِكُوْنَ ﴿31﴾

31 వారు అల్లాహ్‌ను వదలి తమ పండితుల (అహ్‌బార్)ను, సన్యాసుల (రుహ్‌బాన్)ను తమ ప్రభువులుగా చేసు కున్నారు[41]– మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను కూడా. నిజానికి వారికి, ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించవలసిందిగా ఆజ్ఞాపించబడింది. ఆయన తప్ప మరో ఆరాధ్యదైవం లేదు. వారు నిర్ధారించుకుంటున్న భాగస్వామ్యాలకు ఆయన అతీతుడు, పవిత్రుడు.

ఇస్లాం ఒడిలోకి వచ్చేసింది. పీడన అణగారిపోయింది. మునుపటికన్నా హెచ్చు సంఖ్యలో హజ్ యాత్రీకులు మక్కాకు రాసాగారు. ఫలితంగా ఈ క్షేత్రంలో వ్యాపారం బాగా పుంజుకుంది. లేమి స్థానే కలిమి వచ్చింది. (నేటికీ అక్కడ ఇదే స్థితి ఉంది).

40. ముష్రిక్కులను అణచివేయమని ఆదేశించిన తరువాత, ఇప్పుడు గ్రంథవహులైన యూదుల, క్రైస్తవుల గురించి చెప్పబడుతోంది. వారు ఇస్లాం స్వీకరించనయినా స్వీకరించాలి లేదా జిజ్‌యా (కప్పం) చెల్లించి ముస్లింల రక్షణలో నయినా ఉండాలి. ముస్లిం రాజ్యపరిధిలో నివసించే ముస్లిమేతరులు సాలీనా ఆ ప్రభుత్వానికి చెల్లించే నిర్ణీత మొత్తాన్నే **'జిజ్‌యా'** అంటారు. ఈ జిజ్‌యాను పుచ్చుకున్న ముస్లిం ప్రభుత్వం వారి ధనమాన ప్రాణాలను రక్షించే బాధ్యతను తీసుకుంటుంది.

ఇకపోతే గ్రంథవహులైన యూదులు, క్రైస్తవులు. వారు అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించేవారే అయినప్పటికీ వారు అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించటం లేదని అనబడటం గమనార్హం. దీన్నిబట్టి తేటతెల్లమయ్యేదేమిటంటే అల్లాహ్ ఆజ్ఞాపించినట్లుగా, ఆయన ప్రవక్త (స) చూపినట్లుగా అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసించకపోతే అది 'విశ్వాసం'గా పరిగణించబడదు. గ్రంథవహుల విశ్వాసాన్ని బూటకపు విశ్వాసంగా ఖరారు చేయడానికి మరో కారణమేమిటంటే యూదులు ఉజైర్‌ను, క్రైస్తవులు ఈసా (ఏసుక్రీస్తు)ను దేవుని కుమారులుగా కల్పించుకున్నారు. తరువాతి ఆయతులో ఈ విషయం వస్తుంది.

41. హజ్రత్ అదీ బిన్ హాతిమ్ (రజి) హదీసు ద్వారా ఈ విషయం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఆయన ఇలా అన్నారు – ఈ ఆయతును విన్నప్పుడు నేను దైవప్రవక్త (సఅసం)ను, "యూదులు, క్రైస్తవులు ఎన్నడూ తమ పండితులను పూజించలేదు కదా! మరలాంటప్పుడు వారు తమ పండితులను, సన్యాసులను ప్రభువులుగా చేసుకున్నారని ఎందుకు అనబడింది?" అని విన్నవించుకున్నాను. దానికి ఆయన (సఅసం), "వారు తమ పండితులను ప్రత్యక్షంగా పూజించకపోవచ్చు. కాని తమ పండితులు ధర్మసమ్మతం (హలాల్)గా ఖరారు చేసిన వస్తువులను వీరూ ధర్మసమ్మతంగా ఖరారు చేశారు. తమ పండితులు అధర్మం (హరామ్)గా నిర్ధారించిన విషయాలను వీరూ అధర్మంగా నిర్ధారించారు. అవునా! వీళ్లు వారిని పూజించారనడానికి ఇదే తార్కాణం" అని వివరించారు (సహీహ్ తిర్మిజీ – లిల్ అల్‌బానీ : 2471). ధర్మాధర్మాలను నిర్ధారించే అధికారం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఈ అధికారం వేరొకరెవరికయినా ఉందని ఏ వ్యక్తయినా అంగీకరిస్తే అతడు వారి పోషకత్వాన్ని (రుబూబియత్‌ను), వారి దైవత్వాన్ని (ఉలూహియ్యత్‌ను)

**32** వారు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో (ఊది) ఆర్పివేయాలని కోరుతున్నారు. అయితే అల్లాహ్ – అవిశ్వాసులకు ఎంతగా సహించరానిదైనా సరే[42] – తన జ్యోతిని పరిపూర్ణం చేయకుండా వదలిపెట్టటానికి అంగీకరించడు.

يُرِيدُونَ أَن يُطْفِئُوا نُورَ اللَّهِ بِأَفْوَاهِهِمْ وَيَأْبَى
اللَّهُ إِلَّا أَن يُتِمَّ نُورَهُ وَلَوْ كَرِهَ الْكَافِرُونَ ﴿٣٢﴾

**33** ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు – ముష్రిక్కులకు ఎంత సహించరానిదయినా సరే, ఇతర ధర్మాలపై దానికి ఆధిక్యతను వొసగటానికి![43]

هُوَ الَّذِي أَرْسَلَ رَسُولَهُ بِالْهُدَىٰ وَدِينِ
الْحَقِّ لِيُظْهِرَهُ عَلَى الدِّينِ كُلِّهِ وَلَوْ كَرِهَ
الْمُشْرِكُونَ ﴿٣٣﴾

**34** ఓ విశ్వసించిన వారలారా! పండితుల (అహ్‌బార్)లలో, సన్యాసుల (రుహ్‌బాన్)లలో చాలా మంది అక్రమంగా ప్రజల సొమ్ములను స్వాహా చేస్తున్నారు. వారిని అల్లాహ్ మార్గం నుంచి ఆపుతున్నారు.[44] ఎవరు వెండీ, బంగారాలను పోగుచేస్తూ వాటిని దైవమార్గంలో ఖర్చు పెట్టడంలేదో వారికి బాధాకరమైన శిక్ష ఉందన్న శుభవార్తను వినిపించు.[45]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِنَّ كَثِيرًا مِّنَ الْأَحْبَارِ
وَالرُّهْبَانِ لَيَأْكُلُونَ أَمْوَالَ النَّاسِ بِالْبَاطِلِ
وَيَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ ۗ وَالَّذِينَ يَكْنِزُونَ
الذَّهَبَ وَالْفِضَّةَ وَلَا يُنفِقُونَهَا فِي سَبِيلِ اللَّهِ
فَبَشِّرْهُم بِعَذَابٍ أَلِيمٍ ﴿٣٤﴾

---

అంగీకరించినట్లవుతుంది. స్థూలంగా చెప్పుకున్నట్లయితే అతను ఆ వ్యక్తికి దైవత్వపు స్థానం ఇస్తున్నాడన్నమాట. తమ పీష్వాలకు, మత గురువులకు హలాల్ – హరామ్‌లను నిర్ణయించే హోదాలు కట్టబెట్టేవారికి ఈ ఆయతులో చాలా పెద్ద హెచ్చరిక ఉంది. ఏదేని విషయంలో ఖుర్ఆన్ హదీసులు స్పష్టంగా మార్గదర్శకత్వం వహిస్తున్నప్పటికీ “మా ధర్మవేత్త దృష్టిలో మాత్రం ఇలా చేయటం సబబు కాదు, దానికి బదులు ఈ విధంగా చేయటం సమంజసం” లాంటి వ్యాఖ్యలు చేసేవారికి కూడా ఈ ఆయతు హెచ్చరిక లాంటిది.

42. అంటే – అల్లాహ్ తన ప్రవక్త (సఅసం) ద్వారా మానవాళికి పంపిన మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్ని తమ పిడివాదంతో, స్వయం కల్పిత విషయాలతో రూపుమాపాలని యూదులు, క్రైస్తవులు, ముష్రిక్కులు అభిలషిస్తున్నారు. వారి ఈ ప్రయత్నం ఎన్నటికీ సఫలీకృతం కాజాలదు. ఇది సూర్యకిరణాలను, చంద్రుని వెలుగును నోటితో ఊది ఆర్పివేయాలను కోవటం వంటిదే. ఇది ఎలా అసంభవమో దేవుడు తన అంతిమ ప్రవక్త (స)కు ఇచ్చి పంపిన సత్యధర్మాన్ని రూపు మాపటం కూడా అలాగే అసంభవం. అది మత ధర్మాలన్నింటిపై ఆధిపత్యం వహించి తీరుతుంది. నిఘంటువు ప్రకారం ‘కాఫిర్’ అంటే దాచిపెట్టేవాడు, కప్పిపుచ్చేవాడు అని అర్థం. ఈ రకంగా ‘రేయి’ని కూడా ‘కాఫిర్’గా వ్యవహరిస్తారు. ఎందుకంటే అది తన చీకట్లలో వస్తువులన్నింటినీ దాచిపెట్టేస్తుంది. విత్తనాన్ని నేలలో కప్పిపుచ్చే రైతును కూడా **‘కాఫిర్’** అని అంటారు. ఇక ధార్మిక పరిభాషలో ‘కాఫిర్’ అంటే అల్లాహ్ జ్యోతిని దాచాలని అనుకునేవాడు, ఇస్లాం మరియు ముస్లింలకు వ్యతిరేకంగా ఆంతర్యంలో జనించే వ్యతిరేకతను, కాపట్యాన్ని, విరోధభావాన్ని లోలోపలే అణచిపెట్టుకున్నవాడు అని భావం.

43. ఆధారాల, ప్రమాణాల రీత్యా ఈ **‘ఆధిక్యత’** ఎప్పటికీ ఉంటుంది. అయితే ముస్లింలు ధర్మపరాయణులుగా, రుజువర్తనులుగా వ్యవహరించిన నాడు ప్రాపంచికంగా కూడా ఆధిక్యత ప్రాప్తించింది. ఇప్పటికయినా సరే ముస్లింలు తమ ఆశయాన్ని గుర్తించి, రుజుమార్గంలో పయనిస్తే ప్రాబల్యం ఖాయం. ఎందుకంటే ఏనాటికయినా అల్లాహ్ పక్షం వారే విజయం సాధిస్తారని దేవుడు వాగ్దానం చేశాడు. ఇక దేవుని తోడ్పాటుకు కావలసిన అర్హతను ముస్లింలు సంపాదించుకోవటమే ఆలస్యం.

44. ఆయతులో **‘అహ్‌బార్’** అని అనబడింది. ఇది ‘హిబ్ర్’ అనే పదానికి బహువచనం. విషయాన్ని చక్కగా, మనోహరంగా

**35** ఏ రోజున ఈ ఖజానాను నరకాగ్నిలో కాల్చి దాంతో వారి నొసటిపై, పార్శ్వాలపై, వీపులపై వాతలు వేయడం జరుగుతుందో అప్పుడు, "ఇదీ మీరు మీ కోసం సమీకరించినది. కాబట్టి ఇప్పుడు మీ ఖజానా రుచి చూడండి" (అని వారితో అనబడు తుంది).

يَوْمَ يُحْمَىٰ عَلَيْهَا فِي نَارِ جَهَنَّمَ فَتُكْوَىٰ بِهَا جِبَاهُهُمْ وَجُنُوبُهُمْ وَظُهُورُهُمْ ۖ هَٰذَا مَا كَنَزْتُمْ لِأَنفُسِكُمْ فَذُوقُوا مَا كُنتُمْ تَكْنِزُونَ ﴿٣٥﴾

**36** నిశ్చయంగా నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర – అల్లాహ్ గ్రంథంలో[46] పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజునుంచీ (ఈ లెక్క ఇలాగే సాగుతున్నది). వాటిలో

إِنَّ عِدَّةَ الشُّهُورِ عِندَ اللَّهِ اثْنَا عَشَرَ شَهْرًا فِي كِتَابِ اللَّهِ يَوْمَ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ

---

విశ్లేషించి చెప్పే వారిని అసలు **'అహ్‌బార్'** గా వ్యవహరిస్తారు. అందమైన నగిషీగల దుస్తులను 'సౌబున్ ముహబ్బర్' అంటారు. ఇక్కడ అహ్‌బార్ అంటే యూదపండితులని భావం. మూలంలో **'రుహ్‌బాన్'** అనే మరొక పదం ఉంది. ఇది 'రాహిబ్'కు బహువచనం. రుహ్‌బాన్ అంటే ఇక్కడ క్రైస్తవ మతాచార్యులు అని భావం. కొంతమంది పండితులు ఇక్కడ రుహ్‌బాన్ అంటే క్రైస్తవ సూఫీలని చెబుతారు. వీరి దృష్టిలో క్రైస్తవ పండితులను **'ఖిస్సీసీన్'** అని పిలుస్తారు. మొత్తానికి ఈ గురువులు, సన్యాసులు దైవవాక్కుల్లో మార్పులు, చేర్పులు చేసి ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా విషయాన్ని విపులీకరించే ప్రయత్నం చేసేవారు. ఈ విధంగా వారు ప్రజలను సిసలయిన దైవమార్గానికి, సత్యధర్మానికి దూరంగా ఉంచేవారు. మరోవైపున వారు అక్రమ పద్ధతుల్లో ప్రజల నుంచి సొమ్ములను గుంజుకునేవారు. దురదృష్ట వశాత్తూ ఈనాడు చాలామంది ముస్లింలు కూడా ఈ రుగ్మతకు లోనై ఉన్నారు. "మీరు వెనుకటి సమాజాల విధానాన్ని, సంప్రదాయాన్ని తప్పకుండా అనుసరిస్తారు" అన్న మహనీయ ముహమ్మద్ (స) వారి భవిష్యవాణి ఈ సందర్భంగా గమనార్హం (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఏతిసామ్).

45. ఇది జకాత్ ఆదేశం రాకపూర్వం వినిపించబడిన ఆజ్ఞ అని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) తెలిపారు. జకాత్ ఉత్తర్వు అవతరించిన మీదట అల్లాహ్ జకాత్‌ను సిరిసంపదలను పరిశుద్ధపరచే సాధనంగా ఖరారు చేశాడు. అందుకే విద్వాంసులేమంటారంటే; ఏ సొమ్ము నుంచి జకాత్ చెల్లించబడిందో అది **'కంజ్'** (పోగు చేయబడిన నిధి) అని అనబడదు. అయితే జకాత్ చెల్లించబడని సంపదను **కంజ్** అనీ, నిల్వ అనీ అనవచ్చు. జకాత్ చెల్లించకుండా ధనాన్ని కుప్పతెప్పలుగా పోగుచేసే వారికి ఈ ఆయతు తీవ్రమయిన నోటీసు లాంటిది. అందుకే సహీహ్ హదీసులో ఇలా అనబడింది : "ఏ వ్యక్తి అయితే తన సంపదపై జకాత్‌ను విధిగా చెల్లించడో అతని సంపద ప్రళయదినాన అగ్ని పలకలుగా చేయబడుతుంది. వాటితో అతని నొసటిపై, రెండు ప్రక్కలపై, నడుముపై వాతలు వెయ్యబడతాయి. ఆ రోజు యాభైవేల సంవత్సరాలంత పొడవు ఉంటుంది. ప్రజలందరి తీర్పు జరిగేవరకూ అతను ఆ యాతనను అనుభవిస్తూనే ఉంటాడు. ఆ తరువాత అతన్ని స్వర్గానికో, నరకానికో తీసుకుపోవటం జరుగుతుంది" (సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్). అపమార్గం పట్టిన పండితుల, మతాచార్యుల తరువాత కోట్లకు పడగలెత్తే పెట్టుబడిదారుల (మూడవ వర్గం) పరిస్థితి ఇది. ఈ మూడు వర్గాల వారు జాతుల నిర్మాణంలోనూ, పతనంలోనూ కీలకపాత్ర పోషిస్తారు. అందుకే తీర్పుదినాన వారిపట్ల దేవుని వ్యవహారం కూడా అదేవిధంగా ఉంటుంది.

46. "అల్లాహ్ గ్రంథంలో" **(ఫీ కితాబిల్లాహ్)** అంటే 'లౌహెమహ్‌ఫూజ్'లో అని అర్థం. అంటే 'విధివ్రాత' అని భావించాలి. ఆదిలోనే అల్లాహ్ ఈ నెలల సంఖ్యను నిర్ధారించి ఉన్నాడు. వాటిలో నాలుగు మాసాలు పవిత్రమైనవి. ఆ నాలుగు మాసాలలో యుద్ధాలు చేయటం, హత్యలకు, కొట్లాటలకు దిగటం ప్రత్యేకంగా నిషేధించబడింది. ఈ విషయాన్నే అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "కాలం తిరిగి తిరిగి యథాస్థితికి – అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి – వచ్చేసింది. ఏడాదిలో పన్నెండు మాసాలుంటాయి. వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (పవిత్రమైనవి). వాటిలో మూడు మాసాలు ఒకదాని తరువాత ఒకటి వస్తాయి. అవే జుల్‌ఖఅద, జిల్‌హజ్, ముహర్రం.

مِنْهَآ اَرْبَعَةٌ حُرُمٌ ؕ ذٰلِكَ الدِّيْنُ الْقَيِّمُ ۙ
فَلَا تَظْلِمُوْا فِيْهِنَّ اَنْفُسَكُمْ وَقَاتِلُوا الْمُشْرِكِيْنَ
كَآفَّةً كَمَا يُقَاتِلُوْنَكُمْ كَآفَّةً ؕ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ
مَعَ الْمُتَّقِيْنَ ﴿36﴾

నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి.) ఇదే సరైన ధర్మం.[47] కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి.[48] ముష్రిక్కులు మీ అందరితో పోరాడుతున్నట్లే మీరు కూడా వారందరితో పోరాడండి.[49] అల్లాహ్ భయభక్తులుగల వారికి తోడుగా ఉంటాడన్న సంగతిని తెలుసుకోండి.

اِنَّمَا النَّسِیْٓءُ زِيَادَةٌ فِى الْكُفْرِ يُضَلُّ بِهِ
الَّذِيْنَ كَفَرُوْا يُحِلُّوْنَهٗ عَامًا وَّيُحَرِّمُوْنَهٗ
عَامًا لِّيُوَاطِـُٔوْا عِدَّةَ مَا حَرَّمَ اللّٰهُ فَيُحِلُّوْا
مَا حَرَّمَ اللّٰهُ ؕ زُيِّنَ لَهُمْ سُوْٓءُ اَعْمَالِهِمْ ؕ
وَاللّٰهُ لَا يَهْدِى الْقَوْمَ الْكٰفِرِيْنَ ﴿37﴾

**37** నెలలను ముందుకు, వెనక్కి మార్చటం ఓ అదనపు అవిశ్వాస చేష్ట.[50] ఈ చేష్ట ద్వారా అవిశ్వాసులు మార్గభ్రష్టతలో పడవేయబడుతున్నారు. ఒక ఏడాది వారు దాన్ని ధర్మసమ్మతం చేసుకుని, మరో ఏడాది దాన్నే నిషిద్ధంగా ఖరారు చేసుకుంటారు. అల్లాహ్ నిషిద్ధ పరచిన మాసాల గణనలో సారూప్యం సాధించడానికి,[51] అల్లాహ్ నిషేధించిన దానిని ధర్మసమ్మతం చేసుకోవటానికి (వారు ఇలా చేస్తారు). వారి దుష్టచేష్టలు వారికి అందమైనవిగా చూపబడ్డాయి. అవిశ్వాస జనులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

నాల్గవ మాసం రజబ్. ఇది జమాదివుల్ ఆఖిర్ నెలకీ – షాబాన్ నెలకీ మధ్యన ఉంటుంది" (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్; సహీహ్ ముస్లిం – కితాబుల్ ఖసామ). 'కాలం తిరిగి యథాస్థితికి రావట'మంటే అరబ్బు ముష్రిక్కులు నెలల లెక్కింపులో చేస్తూ వచ్చిన ముందూ వెనకలు ఇప్పుడిక అంతమయ్యాయి అని భావం.

47. అంటే ఈ నెలలు అల్లాహ్ నిర్ధారించిన లెక్క ప్రకారం ఉండటమే సరైన ధర్మం. వాటిలో 4 మాసాలు నిషిద్ధమాసాలు. ఈ లెక్కే సరైనది, సంపూర్ణమైనది.

48. అంటే ఈ నిషిద్ధ (పవిత్ర) మాసాలలో కయ్యానికి కాలుదువ్వి, హత్యలు లూటీలు దహనాలకు పాల్పడి, దేవుని అవిధేయతలకు ఒడిగట్టి మీ స్వయానికి నష్టం చేకూర్చుకోకండి.

49. ఒకవేళ పవిత్ర మాసాలకు గల మర్యాదను కాపాడకుండా అవిశ్వాసులు మీపై దాడి చేసిన పక్షంలో మీరు వారికి గుణపాఠం నేర్పేందుకు ఈ పవిత్ర మాసాలలో సయితం యుద్ధం చేయవచ్చు.

50. ఆయతులో **'నసీ'** అని అనబడింది. 'నసీ' అంటే వెనక్కి నెట్టటం అని అర్థం. అరేబియాలో సయితం నిషిద్ధ మాసాలలో హత్యలు, దోపిడీలు చేయటాన్ని, యుద్ధాలు మొదలెట్టడాన్ని అవాంఛనీయమైన చర్యగా భావించేవారు. అయితే నిరంతరం మూడు నెలల దాకా ఎలాంటి మారణకాండకు, దోపిడీ దొమ్మీలకు పాల్పడకుండా ఉండాలంటే వారివల్ల అయ్యేది కాదు. ఈ సమస్యను పరిష్కరించడానికి వారు డొంకతిరుగుడు పద్ధతిని అవలంబించారు. అరాచకం సృష్టించడానికి అనువుగా ఉన్న సమయంలో వారు నిర్విఘ్నంగా అరాచకం సృష్టించి, "ఈ నెలకు బదులుగా ఫలానా నెలను పవిత్రమైన మాసంగా పరిగణిద్దాం" అని లజ్జావిహీనంగా ప్రకటించేవారు. ఉదాహరణకు : ముహర్రమ్ నెలకు గల మర్యాదను కాలరాచి, దాని స్థానంలో సఫర్ మాసాన్ని పవిత్ర (నిషిద్ధ) మాసంగా ఖరారు చేసేవారు. ఈ రకంగా వారు పవిత్ర మాసాలను ముందుకూ, వెనక్కీ నెట్టి మనోవాంఛల దాస్యం చేసేవారు. ఆ విధంగా వారు అవిశ్వాసంలో ఎంతో ముందుకు దూసుకుపోయారు. ఎందుకంటే వారి మార్పులు చేర్పుల ముఖ్యోద్దేశం యుద్ధాలుచేసి ప్రాపంచిక ప్రయోజనాలను జుర్రుకోవటం తప్ప మరేమీకాదు. కాలం తిరిగి తిరిగి తన సిసలైన స్థితికి వచ్చిందని చెబుతూ మహాప్రవక్త (స) సయితం ఈ దురాచారాన్ని అరికట్టారు. అంటే ఇకమీదట నెలల ఈ క్రమం ఆదినుంచీ వస్తున్న క్రమంలోనే ఉంటుంది.

**38** ఓ విశ్వాసులారా! "అల్లాహ్ మార్గంలో బయలుదేరండి" అని మీతో అనబడినప్పుడు మీరు నేలకు అతుక్కు పోతారే మిటి? అసలు మీకేమైపోయింది?[52] మీరు పరలోకానికి బదులు ఇహలోక జీవితాన్నే కోరుకున్నారా? అయితే వినండి! ప్రాపంచిక జీవితపు సకల సామగ్రి పరలోకం ముందు అత్యల్పమైనది.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا مَا لَكُمْ إِذَا قِيلَ لَكُمُ
انفِرُوا فِي سَبِيلِ اللَّهِ اثَّاقَلْتُمْ إِلَى الْأَرْضِ ۚ
أَرَضِيتُم بِالْحَيَاةِ الدُّنْيَا مِنَ الْآخِرَةِ ۚ
فَمَا مَتَاعُ الْحَيَاةِ الدُّنْيَا فِي الْآخِرَةِ إِلَّا
قَلِيلٌ ﴿٣٨﴾

**39** మీరు గనక (దైవమార్గంలో) బయలు దేరకపోతే అల్లాహ్ మీకు బాధాకరమైన శిక్ష విధిస్తాడు. మీకు బదులుగా మరో జాతిని (మీ స్థానంలో) తీసుకువస్తాడు. మీరు అల్లాహ్‌కు ఎంత మాత్రం నష్టం కలిగించలేరు. అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు.

إِلَّا تَنفِرُوا يُعَذِّبْكُمْ عَذَابًا أَلِيمًا وَيَسْتَبْدِلْ
قَوْمًا غَيْرَكُمْ وَلَا تَضُرُّوهُ شَيْئًا ۗ وَاللَّهُ عَلَىٰ
كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿٣٩﴾

**40** మీరు గనక అతనికి (ప్రవక్తకు) తోడ్పడకపోతే (పోనివ్వండి), అవిశ్వాసులు దేశం నుంచి అతనిని వెళ్ళగొట్టినప్పుడు- అతను ఇద్దరిలో రెండవవాడు. వారిద్దరూ గుహలో ఉన్నప్పుడు, అతను తన సహచరునితో, "బాధపడకు. నిశ్చయంగా అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు"[53] అని ఓదార్చినప్పుడు అల్లాహ్‌యే వారికి తోడ్పడ్డాడు. (ఆ ఘడియలో) అల్లాహ్ తన తరఫునుంచి

إِلَّا تَنصُرُوهُ فَقَدْ نَصَرَهُ اللَّهُ إِذْ أَخْرَجَهُ الَّذِينَ
كَفَرُوا ثَانِيَ اثْنَيْنِ إِذْ هُمَا فِي الْغَارِ إِذْ يَقُولُ
لِصَاحِبِهِ لَا تَحْزَنْ إِنَّ اللَّهَ مَعَنَا ۖ فَأَنزَلَ اللَّهُ
سَكِينَتَهُ عَلَيْهِ وَأَيَّدَهُ بِجُنُودٍ لَّمْ تَرَوْهَا وَجَعَلَ

51. ఒక నెలకు గల పవిత్రతను కాలరాసి, మరో నెలను పవిత్ర మాసంగా ఖరారు చేసుకోవటంలో వారి ఉద్దేశం ఏమిటంటే, సంవత్సరకాలంలో అల్లాహ్ నిషేధించిన నాలుగు మాసాల గణనను ఎలాగయినా పూరించాలన్నదే. అంటే ఒక తప్పు చేసి, దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నంలో మరో తప్పు చేయటం అన్నమాట! అలా తప్పు మీద తప్పు చేసిందిగాక తాము చేసేదంతా సరైనదేనని మనసుకు సర్దిచెప్పుకోవటం ఇంకొక తప్పు. ఆ విధంగా అల్లాహ్ వారి దృష్టికి వారి దురాగతాలను అందమైనవిగా చూపించాడు. వారెంతసేపటికీ సంఖ్యను పూరించే విషయంపైనే దృష్టిని నిలిపారుగాని, ఆ మాసాలను నిషేధించటంలో దేవుని ఉద్దేశం ఏమిటీ? అని ఆలోచించలేదు. మారణకాండను, దోపిడీలను నిరోధించడానికే అల్లాహ్ ఆ మాసాలను 'హరామ్'గా నిర్ధారించాడు. కాని వారు మాత్రం మారణకాండను సృష్టించే తమ పైశాచిక ఉద్దేశంతో నెలల క్రమాన్ని మార్చారు. దేవుడు నియమించిన హద్దులను అతిక్రమించి, ఆయన ఆదేశాలతో చెలగాటమాడటమంటే ఇదే.

52. రోమను చక్రవర్తి, క్రైస్తవుడైన హెరిక్లస్ ముస్లింలకు వ్యతిరేకంగా పెద్ద సమర సన్నాహాలు చేస్తున్నాడని వర్తమానం అందటంతో దైవప్రవక్త (సఅసం) కూడా యుద్ధానికి సిద్ధమవమని తన సహచరులకు ఆదేశించారు. ఇది హిజ్రీ 9వ సంవత్సరం షవ్వాల్ మాసంలో జరిగిన సంఘటన. తీవ్రమైన ఎండలు. అందునా సుదీర్ఘ ప్రయాణం. కొంతమంది ముస్లిములకు, కపటులకు ఈ ఆదేశం భారంగా తోచింది. ఆ విషయమే ఈ ఆయతులో చెప్పబడింది.

ఈ యుద్ధం తబూక్ యుద్ధంగా పిలువబడింది. కాని వాస్తవానికి ఈ యుద్ధం జరగలేదు. ముస్లింలు 20 రోజుల వరకూ సిరియా సరిహద్దు ప్రాంతంలోని తబూక్‌లో రోము సేనల కోసం ఎదురుచూసి, తిరిగి వచ్చేశారు. ఈ ప్రయాణంలో చాలీచాలని ఒనరులతో యుద్ధానికి బయలుదేరిన ముస్లింలు ఎన్నో అవస్థలు పడ్డారు. అందుకని ఈ

كَلِمَةَ الَّذِيْنَ كَفَرُوا السُّفْلٰى ؕ وَ كَلِمَةُ اللّٰهِ هِيَ الْعُلْيَا ؕ وَاللّٰهُ عَزِيْزٌ حَكِيْمٌ ﴿40﴾

అతనిపై ప్రశాంతతను అవతరింపజేశాడు. మీకు కానరాని సైన్యాలతో[54] అతన్ని ఆదుకున్నాడు. ఆయన అవిశ్వాసుల మాటను అట్టడుగు స్థితికి దిగజార్చాడు. అల్లాహ్ వాక్కు మాత్రమే సర్వోన్నతమైనది, సదా పైన ఉండేది.[55] అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేకవంతుడు.

اِنْفِرُوْا خِفَافًا وَّثِقَالًا وَّجَاهِدُوْا بِاَمْوَالِكُمْ وَاَنْفُسِكُمْ فِيْ سَبِيْلِ اللّٰهِ ؕ ذٰلِكُمْ خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ﴿41﴾

**41** తేలిక అనిపించినాసరే, బరువు అనిపించినాసరే[56]- బయలు దేరండి. దైవ మార్గంలో మీ ధన ప్రాణాలొడ్డి పోరాడండి. మీరు గనక తెలుసుకోగలిగితే ఇదే మీ కొరకు మేలైనది.

సైన్యాన్ని "జైషుల్ ఉస్‌రా" (ఇబ్బందుల్ని ఎదుర్కొన్న సైన్యం) అని పిలిచారు; **'ఇస్సాఖల్‌తుమ్'** అంటే 'మీరు అలసత్వం ప్రదర్శిస్తున్నారు, వెనక్కి తగ్గుతున్నారు' అని భావం. ఈ సందర్భంగా బద్ధకాన్ని ప్రదర్శించిన ముస్లింలు బహుకొద్దిమందే అయినా ముస్లిములందరినీ ఉద్దేశించి ఈ ఆయతు సంబోధిస్తోంది (ఫత్‌హుల్ ఖదీర్).

53. జిహాద్ (ధర్మయుద్ధం) పట్ల బద్ధకం చూపి, ఆ బెడదనుంచి ఏదో ఒక విధంగా తప్పించుకోజూస్తున్న వారిని ఉద్దేశించి ఈ హెచ్చరిక చేయబడింది – ఒకవేళ మీరు అల్లాహ్‌కు సహాయపడదలచకపోతే ఆయనకు మీ అవసరం లేదు. ఎవరి ఆసరాలేని సంక్లిష్ట పరిస్థితిలో అల్లాహ్ తన ప్రవక్తకు చేయూతనిచ్చి ఆదుకున్నాడు. గుహలో తలదాచుకున్న సందర్భంలో శత్రువులు అతి సమీపంలోకి వచ్చేసినపుడు దైవప్రవక్తకు తోడుగానున్న హజ్రత్ అబూబక్ర్ (రజి) దుఃఖంతో విలపించారు. ఆ కీలక సమయంలో, "విలపించకు. అల్లాహ్ మనతో ఉన్నాడు" అని దైవప్రవక్త (స) ఆయన్ని సముదాయించారు. ఈ వివరాలు హదీసులో కూడా ఉన్నాయి. హజ్రత్ అబూబక్ర్ (రజి) ఇలా అంటున్నారు: "మేము గుహలో ఉన్నప్పుడు, నేను దైవప్రవక్తతో, 'ముష్రిక్కుల దృష్టి గనక వారి పాదాలపై పడిందంటే మనం పట్టుబడ్డట్లే' అని అన్నాను. దానికి దైవప్రవక్త (స), 'ఓ అబూబక్ర్! ఏ ఇద్దరికి తోడుగా – మూడవవానిగా– అల్లాహ్ ఉన్నాడో వారి గురించి నీ అభిప్రాయమేమిటీ?' అని అన్నారు" (సహీహ్ బుఖారీ – అత్ తౌబా సూరా వ్యాఖ్యానం). అంటే అల్లాహ్ అండగా నిలిచిన వారికి ఎవరూ ఏ కీడూ తలపెట్టలేరు అని భావం.

54. దైవప్రవక్త (స)కు రెండు విధాలుగా తోడ్పడినట్లు అల్లాహ్ ఇక్కడ గుర్తు చేశాడు. ఒకటి: ఆయనపై ప్రశాంతస్థితిని అవతరింపజేశాడు. రెండు : ఆకాశం నుంచి తన దూతలను పంపి వారి ద్వారా శత్రువుల ప్రయత్నాలను వమ్ము చేశాడు.

55. అవిశ్వాసుల మాట అంటే 'షిర్క్' అనీ, దైవవాక్కు అంటే తౌహీద్ అనీ భావం. హదీసులో ఇలా ఉంది: "ఒక వ్యక్తి తన శౌర్యాన్ని ప్రదర్శించే ఉద్దేశంతో పోరాడుతాడు. మరోవ్యక్తి వర్గ దురభిమానంతో పోరాడుతాడు. ఇంకొక వ్యక్తి నలుగురిలో తన పేరు ప్రతిష్ఠలు మార్మోగిపోవాలన్న సంకల్పంతో పోరాడుతాడు. ఈ ముగ్గురిలో వాస్తవానికి దైవమార్గంలో పోరాడినవాడెవడు?" అని కొందరు దైవప్రవక్త(స)ను ప్రశ్నించగా, "దైవవాక్కు ఉన్నతికై పోరాడేవాడే వాస్తవానికి దైవమార్గంలో పోరాడిన వాడు" అని ఆయన (సఅసం) జవాబిచ్చారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇల్మ్; ముస్లిం – కితాబుల్ ఇమార).

56. దీనిపై పలు భావాలు వ్యక్తపరచబడ్డాయి. ఉదాహరణకు : వ్యక్తిగత స్థాయిలోనయినా– సామూహిక స్థాయిలోనయినా అనీ ఒక అర్థం. ఇష్టమున్నా – లేకపోయినా అని మరో అర్థం. పేదలైనా–ధనికులైనా అని ఇంకొక అర్థం. యువకులైనా–వృద్ధులైనా అని వేరొక అర్థం. కాలి నడకన అయినాసరే – వాహనంపై స్వారీ అయినాసరే అని ఇంకో అర్థం. భార్యాపిల్లలు గలవారైనా – లేనివారయినా అని ఒక అర్థం. వారు మునుముందుకు దూసుకుపోయే వారైనా సరే– ఆలస్యంగా వచ్చి సైన్యంలో కలిసే వారైనాసరే అనేది మరో అర్థం. పైన పేర్కొనబడిన పరిస్థితులన్నింటికీ ఈ ఆయతు వర్తించగలదని ఇమామ్ షౌకానీ అభిప్రాయపడ్డారు. అందుకే ఈ ఆయతును "తేలిక అనిపించినా సరే – బరువు అనిపించినాసరే వెడలిపోండి" అన్న అర్థంలో తీసుకుంటే ఈ భావాలన్నీ ఇందులో ఇమిడిపోతాయి.

**42** (ఓ ప్రవక్తా!) త్వరగా సొమ్ములు లభించి,[57] ప్రయాణం సులభతరమై ఉంటే వాళ్లు తప్పక నీ వెనుక వచ్చి ఉండేవారే.[58] కాని సుదీర్ఘ ప్రయాణం అనేసరికి అది వారికి దుర్భరంగా తోచింది. ఇప్పుడు వాళ్లు, "మాలోనే గనక శక్తీ స్థోమతలు ఉండి ఉంటే తప్పకుండా మీ వెంట వచ్చి ఉండేవారం" అని అల్లాహ్‌పై ఒట్టేసి మరీ చెబుతారు. వాస్తవానికి వారు తమను తాము నాశనం చేసుకుంటున్నారు.[59] వారు అబద్ధాలకోరులన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు.

لَوْ كَانَ عَرَضًا قَرِيبًا وَسَفَرًا قَاصِدًا لَّاتَّبَعُوكَ
وَلَٰكِن بَعُدَتْ عَلَيْهِمُ الشُّقَّةُ ۚ وَسَيَحْلِفُونَ
بِاللَّهِ لَوِ اسْتَطَعْنَا لَخَرَجْنَا مَعَكُمْ يُهْلِكُونَ
أَنفُسَهُمْ وَاللَّهُ يَعْلَمُ إِنَّهُمْ لَكَاذِبُونَ ﴿٤٢﴾

**43** అల్లాహ్ నిన్ను మన్నించుగాక! నీ సమక్షంలో సత్యవంతులెవరో తేలి, అబద్ధం చెప్పేవారెవరో కూడా నువ్వు తెలుసుకోకుండానే అసలు నువ్వు వారికి అనుమతి ఎందుకిచ్చావు?[60]

عَفَا اللَّهُ عَنكَ لِمَ أَذِنتَ لَهُمْ حَتَّىٰ يَتَبَيَّنَ لَكَ
الَّذِينَ صَدَقُوا وَتَعْلَمَ الْكَاذِبِينَ ﴿٤٣﴾

**44** అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించేవారు తమ ధన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే విషయంలో తమకు సెలవు ఇవ్వమని నిన్ను ఎట్టి పరిస్థితిలోనూ విన్నవించుకోరు.[61] భయభక్తులు గల వారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు.

لَا يَسْتَأْذِنُكَ الَّذِينَ يُؤْمِنُونَ بِاللَّهِ وَالْيَوْمِ
الْآخِرِ أَن يُجَاهِدُوا بِأَمْوَالِهِمْ وَأَنفُسِهِمْ ۗ
وَاللَّهُ عَلِيمٌ بِالْمُتَّقِينَ ﴿٤٤﴾

57. యుద్ధానికి బయలుదేరకపోవటానికి తగు కారణమేదీ లేకపోయినప్పటికీ ఏవో సాకులు చెప్పి మహాప్రవక్త (సఅసం) నుంచి అనుమతి పొందినవారి గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. ప్రాపంచిక లబ్ధి (యుద్ధప్రాప్తి) తేలిగ్గా చేతికి అందుతుందంటే వారు ఎగబడి వచ్చేవారే.

58. అంటే అలవోకగా యుద్ధప్రాప్తి (మాలె గనీమత్) వచ్చిపడుతుందనుకుంటే వారు ఏమాత్రం బద్ధకం వహించకుండా, నీ వెనుక పరుగెత్తుకుని వచ్చేవారు. సుదీర్ఘ ప్రయాణం అనేసరికి కుంటిసాకులు చెప్పి తప్పించుకున్నారు.

59. అబద్ధపు ప్రమాణాలు చేయటం మహాపరాధం అని తెలిసి కూడా వారు ఈ దుస్సాహసానికి ఒడిగట్టారు. ఈ విధంగా చేసి వారు తమ ఆత్మలనే వంచించుకున్నారు.

60. దైవప్రవక్త (సఅసం) నుద్దేశించి దేవుడు చెప్పే మాటలివి. యుద్ధంలో పాల్గొనలేమని వారు సాకులు చెప్పినప్పుడు 'నిజంగానే వారు పాల్గొనలేని స్థితిలో ఉన్నారా?' అనే విషయాన్ని పరిశోధించకుండానే ఎందుకు అనుమతి ఇచ్చేశావు? అని సున్నితంగా మందలించాడు. ఈ మందలింపులో కూడా వాత్సల్యం ఇమిడి ఉంది. అందుకే ఈ అలసత్వాన్ని మన్నించినట్లు వాక్యం మొదట్లోనే చెప్పబడింది. అనుమతి ఇవ్వటంలో తొందరపాటు జరిగిందనీ, విషయం లోతుల్లోకి వెళ్ళకుండానే ఉదార దృష్టితో వ్యవహారం చేయబడిందని తెలియజేయటం ఈ మాటల్లోని మర్మం. ఆరా తీసి, తగు కారణంపై రాలేకపోయేవారికి 'అనుమతి' ఇచ్చే అధికారం ఆయన (స)కు ఎలాగూ ఉంది. ఆ మాటే నూర్ సూరాలో కూడా చెప్పబడింది: "(ఓ ప్రవక్తా!) ఏ పనికైనా వారు నీ అనుమతి అడిగితే, నీవు కోరినవారికి అనుమతి ఇస్తూ ఉండు" (నూర్ - 62). "నీవు కోరినవారికి" అంటే తగు కారణం ఉన్నవారికి అనుమతి ఇచ్చే హక్కు నీకు ఉంది అని భావం.

61. నికార్సయిన విశ్వాసుల సద్గుణం ఇక్కడ ఉదాహరించబడింది. కీలక సమయాల్లో వారు ఎన్నడూ కుంటిసాకులు చూపరు. పైగా వారు సమధికోత్సాహంతో, చిత్తశుద్ధితో దైవమార్గంలో తమ సర్వస్వాన్నీ ఒడ్డి పోరాడుతారు.

45 అల్లాహ్‌పై, అంతిమ దినంపై విశ్వాసం లేనివారు మాత్రమే నీ నుండి ఇలాంటి సెలవును కోరుతారు. వారి హృదయాలు సంశయానికి లోనై ఉంటాయి. వారు తమ సంశయాలు, సందేహాలలోనే ఊగిసలాడుతున్నారు.[62]

إِنَّمَا يَسْتَأْذِنُكَ الَّذِينَ لَا يُؤْمِنُونَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ وَارْتَابَتْ قُلُوبُهُمْ فَهُمْ فِي رَيْبِهِمْ يَتَرَدَّدُونَ ﴿45﴾

46 యుద్ధానికి బయలుదేరాలన్న ఉద్దేశమే గనక వారికి ఉండి ఉంటే వారు ఎలాగయినా ప్రయాణ సామగ్రిని సమకూర్చుకుని ఉండేవారు.[63] కాని వారు బయలుదేరటం అల్లాహ్‌కు అస్సలు ఇష్టంలేదు. అందుకే వారిని కదలకుండా ఆపేశాడు.[64] “వెనుక ఉండిపోయే వారితోనే మీరూ ఉండిపోండి”[65] అని వారికి చెప్ప బడింది.

وَلَوْ أَرَادُوا الْخُرُوجَ لَأَعَدُّوا لَهُ عُدَّةً وَلَٰكِن كَرِهَ اللَّهُ انبِعَاثَهُمْ فَثَبَّطَهُمْ وَقِيلَ اقْعُدُوا مَعَ الْقَاعِدِينَ ﴿46﴾

62. కుంటిసాకులు చెప్పి యుద్ధం నుంచి తప్పించుకునేందుకు దైవప్రవక్త (సఅసం) నుంచి అనుమతి పొందిన కపటుల నుద్దేశించి చెప్పబడిన మాటలివి. వారికి అల్లాహ్‌పై, పరలోక దినంపై అస్సలు నమ్మకం లేదు. ఈ విశ్వాస రాహిత్యమే వారిని ఈ పలాయన వాదానికి పురికొల్పింది. విశ్వాస (ఈమాన్) బీజమే గనక వారి మనో క్షేత్రంలో నాటుకుని ఉంటే వారు ధర్మయుద్ధం నుంచి పరారయ్యే ఎత్తులు వేయటంగానీ, ఊగిసలాటలో పడటంగానీ చేసేవారు కాదు.

**గమనిక :** ఈ జిహాద్‌లో పాల్గొనే వ్యవహారంలో ముస్లింలలో నాలుగు వర్గాలున్నాయన్న సంగతి గమనించదగినది. మొదటివర్గం : ఆజ్ఞాపించగానే ఎలాంటి తాత్సారం చేయకుండా యుద్ధానికి సిద్ధమైనవారు. రెండవ వర్గం: మొదట్లో అటూ ఇటూ ఊగిసలాడినప్పటికీ తరువాత వెంటనే తేరుకుని విధేయత కనబరచినవారు. మూడవ వర్గం : వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, వాహనం లేని కారణంగా సుదీర్ఘ ప్రయాణం చేయలేనివారు. వారికి అల్లాహ్ సయితం అనుమతి ఇచ్చేశాడు. (వారి ప్రస్తావన 91, 92 ఆయతులలో రానున్నది). నాల్గవ వర్గం: కేవలం బద్ధకం, అలసత్వం మూలంగా యుద్ధానికి బయలుదేరలేక పోయినవారు. దైవప్రవక్త (స) ప్రయాణం నుంచి తిరిగి రాగానే వారు ఆయన (స) సమక్షంలో హాజరై తమ తప్పును ఒప్పుకున్నారు. తమను తాము దోషులుగా నిలబెట్టుకున్నారు.

ఈ నాలుగు వర్గాలను అలా ఉంచితే నయవంచకుల (మునాఫిక్‌ల) వర్గం మరొకటి ఉంది.

ఇక్కడ ముస్లింల మొదటి వర్గంతోపాటు ఈ నయవంచకుల (కపటుల) వర్గం ప్రస్తావన వచ్చింది. ముస్లింల మిగతా మూడు వర్గాల ప్రస్తావన మున్ముందు రాబోతోంది.

63. ఇవి కూడా కపటులనుద్దేశించి చెప్పబడిన మాటలే. వారు అబద్ధాలు చెప్పి తప్పించుకున్నారు. అందరితో కలసి బయలుదేరాలన్న ఆలోచన వారికి ఉండి ఉంటే ముందు నుంచే ప్రయాణ సన్నాహాలు చేసుకునేవారు. కాని వారి ఉద్దేశాలు ముందు నుంచే మంచివి కావు.

64. **‘సబ్బతహుమ్’** (فَثَبَّطَهُمْ) అంటే అల్లాహ్ వారిని ఆపివేశాడు అని అర్థం. కపటులు యుద్ధానికి బయలుదేరకుండా అల్లాహ్ వారిని ఆపాడు. ఎందుకంటే వారి రాకవల్ల కలిగే మేలుకన్నా కీడు ఎక్కువ. వారి వెనుకంజ వారికొరకు ఇష్టకరమైనదిగా చేయబడింది. అందుకే వారు ముస్లింలతో కలసి బయలుదేరకుండా మదీనాలోనే ఉండిపోయారు (ఐసరుత్తఫాసీర్). భావమేమిటంటే వారి మనసుల్లోని కుల్లు ఎటువంటిదో అల్లాహ్‌కు తెలుసు. అందుకే ఆయన తన ప్రణాళికనుసరించి, వారు యుద్ధంలో పాల్గొనకుండా చేశాడు.

65. ఈ మాట బహుశా విధివ్రాతననుసరించి అయినా చెప్పబడి ఉంటుంది లేదా వారి ప్రవర్తన కారణంగా కోపంతో దైవప్రవక్త (స) తరఫునయినా చెప్పబడి ఉంటుంది – “సరే! ఇక చేసేదేముంది. మీరు కూడా స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, అవిటివారి మాదిరిగా వారితో కలసి ఇండ్లలో కూర్చుని ఉండండి” అని!

**47** ఒకవేళ వారు మీతో కలసి బయలుదేరి ఉండినట్లయితే మీకు కీడు చేయటం[66] తప్ప మరి దేనినీ పెంచి ఉండేవారు కారు. పైగా మీ మధ్య అదే పనిగా గుర్రాలను పరుగెత్తించేవారు. మీలో చీలికను తెచ్చే ప్రయత్నాల్లో ఉండేవారు.[67] వారి మాటలను వినేవారు స్వయంగా మీలోనే ఉన్నారు.[68] ఆ దుర్మార్గుల సంగతి అంతా అల్లాహ్‌కు తెలుసు.

لَوْ خَرَجُوا فِيكُم مَّا زَادُوكُمْ إِلَّا خَبَالًا وَّلَا
أَوْضَعُوا خِلَالَكُمْ يَبْغُونَكُمُ الْفِتْنَةَ ۚ وَفِيكُمْ
سَمَّاعُونَ لَهُمْ ۗ وَاللَّهُ عَلِيمٌ بِالظَّالِمِينَ ﴿47﴾

**48** వారు ఇంతకు ముందు కూడా విభేదాలను సృష్టించే ప్రయత్నాలు చేశారు. నీ కార్యక్రమాలను తలక్రిందులుగా చేసే చేష్టలకు కూడా ఒడిగట్టారు. కడకు వారి ఇష్టానికి వ్యతిరేకంగా[69] సత్యం వచ్చేసింది, దైవాజ్ఞే ఆధిపత్యం వహించింది.[70]

لَقَدِ ابْتَغَوُا الْفِتْنَةَ مِن قَبْلُ وَقَلَّبُوا
لَكَ الْأُمُورَ حَتَّىٰ جَاءَ الْحَقُّ وَظَهَرَ أَمْرُ
اللَّهِ وَهُمْ كَارِهُونَ ﴿48﴾

**49** “నాకు అనుమతి ఇవ్వండి. నన్ను పరీక్షకు గురి చేయకండి” అని వారిలో ఒకడంటాడు. తెలుసుకోండి! వారు పరీక్షకు గురయ్యే ఉన్నారు. నిశ్చయంగా నరకం అవిశ్వాసులను చుట్టుముట్టేస్తుంది.[71]

وَمِنْهُم مَّن يَقُولُ ائْذَن لِّي وَلَا تَفْتِنِّي ۚ
أَلَا فِي الْفِتْنَةِ سَقَطُوا ۗ وَإِنَّ جَهَنَّمَ لَمُحِيطَةٌ
بِالْكَافِرِينَ ﴿49﴾

66. కపటులు రాకపోవటం ఒక విధంగా మంచిదే. వచ్చి ఉంటే వారు పొద్దస్తమానం ముస్లిం సైనిక పంక్తుల్లో విభేదాలను, మనస్పర్థలను సృష్టించి గందరగోళాన్ని వ్యాపింపజేసి ఉండేవారు.

67. **“గుర్రాలను పరుగెత్తించేవారు”** అంటే అర్థం చాడీలు, పరోక్షనిందల ద్వారా మీమధ్య అపోహలను చాలా వేగంగా వ్యాపింపజేసేవారు. ఆ విధంగా మీ మధ్యగల ఐకమత్యాన్ని, సంఘటితత్వాన్ని కొల్లగొట్టి మిమ్మల్ని చెల్లాచెదురుగా చేసి ఉండేవారు. కాబట్టి వారు రాకపోవటం ఒక విధంగా మీకు మంచిదే.

68. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే కపటులకు గూఢచారులుగా పనిచేసేవారు కొందరు ముస్లింలలోనూ జొరబడి ఉండేవారు. వారు ఎప్పటికప్పుడు ముస్లింల కదలికలను గురించి కపటులకు సమాచారం అందజేస్తూ ఉండేవారు.

69. కపటులు ఏనాడూ ఇస్లాం పురోగతిని మనస్ఫూర్తిగా కోరుకోలేదు. దైవప్రవక్త (స) మక్కా నుంచి మదీనాకు వలస వచ్చినప్పటినుంచే వారు లోలోపల అసూయా ద్వేషాలతో ఉడికిపోతున్నారు. ఇస్లాం మరియు ముస్లింలకు వెన్నుపోటు పొడిచే ఏ అవకాశం దొరికినా వారు జారవిడువలేదు. ముస్లింల సైనిక శిబిరాలలో చీలికలను తీసుకువచ్చేందుకు పన్నాగాలు పన్నేవారు. ముస్లింలకు ఎప్పుడు, ఏ మేలు జరిగినా అసూయ చెందేవారు. బద్ర్ రణరంగంలో ముస్లింలకు లభించిన అపూర్వ విజయాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఉహుద్ యుద్ధ సందర్భంగా మార్గమధ్యంలోనే వేరైపోయి, ముస్లింలకు కష్టాలు పెంచారు. ఈ రకంగా వారి కపట చేష్టలు నిరాఘాటంగా సాగాయి. అయినా వారు దైవకార్యాన్ని అడ్డుకోలేకపోయారు. చివరకు ముస్లింలకు మక్కా విజయం కూడా వరించింది. అరేబియాలోని జనులంతా తండోపతండాలుగా ఇస్లాంలో ప్రవేశించటం చూసి ఓర్వలేక లోలోపలే కుమిలి పోయారు.

70. అందుకే గతంలోని వారి కపట చేష్టల గురించి, భవిష్యత్తులో వారు సాగించబోయే విచ్ఛిన్నకర కార్యకలాపాల గురించి మీకు తెలియజేయటం జరిగింది. వారు మీతో రాలేదని బాధపడకండి. వారు రాకపోవటంలోనే మీ శ్రేయస్సు ఇమిడి ఉంది. వారు ఎక్కడున్నా ఉపద్రవాన్నే పుట్టిస్తారు.

71. **“నన్ను పరీక్షకు గురి చేయకండి”** లేక “నన్ను ఉపద్రవానికి లోను చేయకండి” అంటే భావం – ఒకవేళ తమరు ఇంటిపట్టునే ఉండటానికి నాకు అనుమతి ఇవ్వకపోతే, అనుమతి పొందకుండానే నేను ఇంటిపట్టున ఉండిపోవలసి

50 నీకు ఏదైనా మేలు కలిగితే వారికది బాధ కలిగిస్తుంది. ఒకవేళ నీపై ఏదైనా ఆపద వస్తే, "(అలాంటిదేదో జరుగుతుందనే) మేము ముందుగానే జాగ్రత్తపడ్డామ"ని చెబుతూ, సంబరపడుతూ వెళ్ళిపోతారు.[72]

اِنۡ تُصِبۡكَ حَسَنَةٌ تَسُؤۡهُمۡ‌ۚ وَاِنۡ تُصِبۡكَ مُصِيۡبَةٌ يَّقُوۡلُوۡا قَدۡ اَخَذۡنَاۤ اَمۡرَنَا مِنۡ قَبۡلُ وَيَتَوَلَّوْا وَّهُمۡ فَرِحُوۡنَ ﴿50﴾

51 "అల్లాహ్ మాకు రాసిపెట్టినది తప్ప మరొకటి మాకు జరగదు. ఆయనే మా సంరక్షకుడు. విశ్వాసులైనవారు అల్లాహ్‌నే నమ్ముకోవాలి"[73] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

قُلْ لَّنۡ يُّصِيۡبَـنَاۤ اِلَّا مَا كَتَبَ اللّٰهُ لَـنَا‌ۚ هُوَ مَوۡلٰٮنَا‌ۚ وَعَلَى اللّٰهِ فَلۡيَتَوَكَّلِ الۡمُؤۡمِنُوۡنَ ﴿51﴾

52 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "మీరు మా విషయంలో దేనికోసం ఎదురుచూస్తున్నారో అది రెండు మేళ్ళలో ఒకటి తప్ప మరొకటేముంది?[74] కాగా; మీ విషయంలో మేమూ నిరీక్షిస్తున్నాము– అల్లాహ్ తాను స్వయంగానయినా మిమ్మల్ని శిక్షిస్తాడు లేదా మా చేతుల మీదుగానయినా (శిక్ష విధిస్తాడు)[75] కాబట్టి మీరూ ఎదురు చూస్తూ ఉండండి. మరోవైపు మేమూ మీతోపాటే ఎదురు చూస్తూ ఉంటాము."

قُلۡ هَلۡ تَرَبَّصُوۡنَ بِنَاۤ اِلَّاۤ اِحۡدَى الۡحُسۡنَيَيۡنِ‌ؕ وَنَحۡنُ نَـتَـرَبَّصُ بِكُمۡ اَنۡ يُّصِيۡبَكُمُ اللّٰهُ بِعَذَابٍ مِّنۡ عِنۡدِهٖۤ اَوۡ بِاَيۡدِيۡنَا‌ ۖ فَتَرَبَّصُوۡۤا اِنَّا مَعَكُمۡ مُّتَرَبِّصُوۡنَ ﴿52﴾

వస్తుంది. ఒకవేళ అదే గనక జరిగితే ఆ పాపం నన్ను చుట్టుకుంటుంది. ఈ రకంగా ఇబ్బందిపెట్టడమంటే, పాపానికి గురిచేయటమని భావం. అంటే నేను పాపకార్యానికి ఒడిగట్టేలా చేయకండి అని అతను చెప్పదలిచాడు.

దీన్ని మరో అర్థంలో తీసుకుంటే; "నన్ను బలవంతంగా మీ వెంట లాక్కుపోయి, ప్రాణాలు తీయకండి" అని భావం వస్తుంది. జద్ద్ బిన్ ఖైస్ అనే వ్యక్తి వచ్చి, "నన్ను మాత్రం మీవెంట తీసుకువెళ్ళకండి. రోమను స్త్రీలను చూసి నన్ను నేను నిగ్రహించుకోలేను" అని అన్నాడని చెప్పబడుతోంది. ఈ మాటలు వినగానే మహాప్రవక్త (స) ముఖం త్రిప్పుకుని, అతనికి అనుమతి ఇచ్చేశారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. "వారు ఇప్పటికే పరీక్షకు గురై ఉన్నారు" అని అనబడింది. జిహాద్ కొరకు బయలుదేరమన్న ప్రవక్త ఆదేశాన్ని పెడచెవినపెట్టడమే ఓ అపరాధం. ఈ అపరాధానికి వారు ఎలాగూ ఒడిగట్టారు. మరణానంతరం నరకాగ్ని వారిని నలువైపుల నుంచి చుట్టుముట్టనుంది. ఈ రోజు వారు యుద్ధం నుంచి తప్పించుకున్నా, ఆ రోజు నరకాగ్ని బారినుంచి మాత్రం తప్పించుకోలేరు.

72. సందర్భం దృష్ట్యా ఇక్కడ **'మేలు'** అంటే విజయమనీ, 'ఆపద' అంటే అపజయం అనీ భావం. జయాపజయాలు యుద్ధంలో సహజం. కాని కపటుల ఆలోచనలు ఇందుకు భిన్నంగా ఉంటాయి. ముస్లింలకు ఎప్పుడయినా ఓటమి ఎదురైతే లోలోపలే సంతోషించటం, తామేదో ఘనకార్యం సాధించినట్లు సంబరపడటం వారి కుళ్ళుమోతుతనానికి ప్రబల నిదర్శనం. వారు పైకి మీ శ్రేయోభిలాషులుగా కనిపిస్తున్నప్పటికీ లోపలినుంచి వారు మీ బాగోగులను కోరుకోవటం లేదు. వారి మనస్సుల్లో మీపట్ల వైరభావం, విద్వేషం పేరుకుని ఉంది.

73. కపటుల ఇకిలింతలకు ముస్లిములు మానసికంగా కృంగిపోరాదనీ, వారు ఉత్తమ సహనంతో మెలగాలనీ, అల్లాహ్‌పైనే భారం మోపాలని ఈ ఆయతులో ఉపదేశించబడింది. అల్లాహ్ తరపున రాసిపెట్టినది జరిగి తీరుతుందన్న నమ్మకం ఉన్నప్పుడు, మంచి జరిగినా చెడు జరిగినా అదంతా విధివ్రాతలో భాగమేనన్న యదార్థం బోధపడినప్పుడు మనిషి ఏ కష్టాన్నయినా సంతోషంతో సహిస్తాడు. ప్రతికూల పవనాలకు ఎదురీదుతాడు. ఆపదలు అతని ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంచుతాయి.

74. అంటే – విజయమో, వీరస్వర్గమో రెండింటిలో ఏదో ఒకటి అయి ఉంటుంది. మాకోసం అదే మేలైనది.

قُلْ أَنفِقُوا طَوْعًا أَوْ كَرْهًا لَّن يُتَقَبَّلَ مِنكُمْ ۖ إِنَّكُمْ كُنتُمْ قَوْمًا فَاسِقِينَ ﴿٥٣﴾

**53** వారికి చెప్పు: "మీరు ఇష్టపూర్వకంగా ఖర్చుపెట్టినా, ఇష్టం లేకుండా ఖర్చుపెట్టినా అది ఎట్టి పరిస్థితిలోనూ స్వీకార యోగ్య మవదు.[76] నిశ్చయంగా మీరు అవిధేయులే."

وَمَا مَنَعَهُمْ أَن تُقْبَلَ مِنْهُمْ نَفَقَاتُهُمْ إِلَّا أَنَّهُمْ كَفَرُوا بِاللَّهِ وَبِرَسُولِهِ وَلَا يَأْتُونَ الصَّلَاةَ إِلَّا وَهُمْ كُسَالَىٰ وَلَا يُنفِقُونَ إِلَّا وَهُمْ كَارِهُونَ ﴿٥٤﴾

**54** వారు పెట్టే ఖర్చు స్వీకరించబడక పోవటానికి కారణం ఇది తప్ప మరొకటేమీ కాదు: వారు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను తిరస్కరించారు. ఒకవేళ వారు నమాజుకు వచ్చినా బద్ధకంతో వస్తారు. (దైవ మార్గంలో) ఖర్చుపెట్టినా అయిష్టంగానే ఖర్చు పెడతారు.[77]

فَلَا تُعْجِبْكَ أَمْوَالُهُمْ وَلَا أَوْلَادُهُمْ ۚ إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُعَذِّبَهُم بِهَا فِي الْحَيَاةِ الدُّنْيَا وَتَزْهَقَ أَنفُسُهُمْ وَهُمْ كَافِرُونَ ﴿٥٥﴾

**55** వారి సిరిసంపదలు, సంతానం నిన్ను ఆశ్చర్యానికి లోనుచేయ కూడదు.[78] వాటి ద్వారా ప్రాపంచిక జీవితంలోనే వారిని శిక్షిం చాలనీ,[79] సత్యాన్ని తిరస్కరించిన స్థితిలోనే వారి ప్రాణాలు పోవాలని[80] అల్లాహ్ కోరుతున్నాడు.

75. అయితే మేము మాత్రం మీ విషయంలో రెండు హానికరమైన వాటిలో ఏదో ఒక దానికోసం నిరీక్షిస్తూ ఉంటాము. మీరు దేవుడు అవతరింపజేసే శిక్షకయినా గురవుతారు. లేదా మా చేతుల మీదుగానయినా అల్లాహ్ మిమ్మల్ని దండిస్తాడు (మీరు హతులవటమో, ఖైదీలుగా పట్టుబడటమో జరుగుతుంది). ఈ రెండింటిలో దేన్నయినా అల్లాహ్ చేయగల సమర్థుడు.

76. మీరు ఖర్చుపెట్టినా, ఖర్చుపెట్టకపోయినా ఒక్కటే. ఎందుకంటే దైవమార్గంలో ఖర్చుపెట్టబడినది స్వీకార యోగ్యమవ్వా లన్నా, మరేదయినా సత్కార్యం స్వీకృతి పొందాలన్నా – ఈమాన్ (విశ్వాసం) అనివార్యం. కాని ఈ విశ్వాసమే మీలో కొరవడింది. "వారిని క్షమించమని నీవు ప్రార్థించినా, ప్రార్థించకపోయినా ఒక్కటే" (తౌబా : 80) అన్న దివ్య వచనం లాంటిదే ఇది కూడా.

77. వీరి దానధర్మాలు ఆమోదయోగ్యం కాకపోవడానికి మూడు కారణాలు ఇందులో తెలుపబడ్డాయి: 1. వారిలోని అవిశ్వాసం, సత్యంపట్ల వైముఖ్య ధోరణి. 2. బద్ధకంతో నమాజు చేయటం. నమాజు చేస్తే పుణ్యఫలం లభిస్తుందన్న ఆశాభావంగానీ, నమాజును విడనాడితే శిక్షపడుతుందన్న భీతిగానీ వారిలో లేవు. ఎందుకంటే దైవభీతి, ఆశావహ దృక్పథం కూడా విశ్వాసానికి (ఈమాన్‌కు) ప్రబల తార్కాణాలే. కాని వారిలో ఈ గుణాలే లోపించాయి. 3. అన్యమనస్కంగా దానధర్మాలు చేయటం; మనస్ఫూర్తిగా చేయని దానం ఎలా ఆమోద ముద్ర పొందుతుంది? ఈ మూడు కారణాలలో ఏ ఒక్కటి లోపించినా వారి సత్కార్యాలు సమ్మతించబడనట్లే.

78. ఎందుకంటే ఇదంతా పరీక్షించే నిమిత్తం ఇలా జరుగుతోంది. దివ్య ఖుర్‌ఆన్‌లో దేవుడు పలుచోట్ల ఈ విషయం ప్రస్తావించాడు. ఉదాహరణకు : 1. "వీరిలోని పలు రకాల ప్రజలకు మేము ఇచ్చిన ప్రాపంచిక జీవితపు తళుకు బెళుకులను కన్నెత్తి కూడా చూడకు. వారిని పరీక్షించే నిమిత్తమే వారికిదంతా ఇచ్చాము" (తాహా – 131). 2. "మేము వారికి సిరిసంతానాదులను ప్రసాదించి తోడ్పడుతూ ఉంటే, వారికి మేళ్ళు చేయటంలో మేము తొందర పడుతున్నామని వారు భావిస్తున్నారా? (ముమ్మాటికీ కాదు) వారసలు అర్థం చేసుకోలేదు" (మోమినూన్–55, 56).

79. ఇమామ్ ఇబ్నె కసీర్, ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ తదితరులు జకాత్, దానధర్మాల నేపథ్యంలో దీని భావం తీసుకున్నారు. అంటే కపటుల నుంచి (తాము ముస్లిములమని పైకి చెప్పుకుంటున్న కారణంగా) జకాత్, సదఖాత్ వంటి సొమ్ములను తీసుకుని ప్రాపంచికంగా కూడా వారిని (ఆర్థికంగా) దెబ్బతీయాలి.

وَيَحْلِفُونَ بِاللَّهِ إِنَّهُمْ لَمِنكُمْ وَمَا هُم
مِّنكُمْ وَلَٰكِنَّهُمْ قَوْمٌ يَفْرَقُونَ ﴿٥٦﴾

**56** “మేము మీతోనే ఉన్నాము” అని వారు అల్లాహ్ మీద ఒట్టేసి మరీ చెబుతున్నారు. వాస్తవానికి వారు మీ వారు కారు. వారసలు పిరికిపందలు.[81]

لَوْ يَجِدُونَ مَلْجَأً أَوْ مَغَارَاتٍ أَوْ مُدَّخَلًا
لَّوَلَّوْا إِلَيْهِ وَهُمْ يَجْمَحُونَ ﴿٥٧﴾

**57** వారికి రక్షణా స్థలంగానీ, గుహలుగానీ, తలదూర్చే చిన్న బిలంగానీ – ఏది కనిపించినా వారు దాని వైపుకు పగ్గాలు త్రెంచుకుని పారిపోతారు.[82]

وَمِنْهُم مَّن يَلْمِزُكَ فِي الصَّدَقَاتِ فَإِنْ
أُعْطُوا مِنْهَا رَضُوا وَإِن لَّمْ يُعْطَوْا مِنْهَا
إِذَا هُمْ يَسْخَطُونَ ﴿٥٨﴾

**58** దానాల పంపిణీ విషయంలో నిన్ను నిందించేవారు[83] కూడా వారిలో ఉన్నారు. అందులో నుంచి వారికి లభిస్తే సంతోషిస్తారు. లభించకపోతే వెంటనే కోపాన్ని వెళ్ళగ్రక్కుతారు.[84]

وَلَوْ أَنَّهُمْ رَضُوا مَا آتَاهُمُ اللَّهُ وَرَسُولُهُ
وَقَالُوا حَسْبُنَا اللَّهُ سَيُؤْتِينَا اللَّهُ مِن فَضْلِهِ
وَرَسُولُهُ إِنَّا إِلَى اللَّهِ رَاغِبُونَ ﴿٥٩﴾

**59** అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఇచ్చిన దానితో తృప్తి చెంది, “మాకు అల్లాహ్ చాలు. అల్లాహ్ తన కృపతో మాకు మరింత అనుగ్రహిస్తాడు. ఆయన ప్రవక్త కూడా మాకు వొసగుతాడు. మేము మాత్రం అల్లాహ్‌పైనే ఆశలు పెట్టుకున్నాము” అని వారు చెప్పి ఉంటే (ఎంత బావుండేది)!

إِنَّمَا الصَّدَقَاتُ لِلْفُقَرَاءِ وَالْمَسَاكِينِ وَالْعَامِلِينَ
عَلَيْهَا وَالْمُؤَلَّفَةِ قُلُوبُهُمْ وَفِي الرِّقَابِ

**60** దానాలను కేవలం నిరుపేదల కొరకూ,[85] అభాగ్య జీవుల కొరకు, వాటి వసూళ్ల కోసం నియమితులైన వారికొరకు, హృదయాలను ఆకట్టుకోవలసి ఉన్నవారి కొరకు, మెడలను విడిపించ

80. అయితే వారి ముగింపు మాత్రం అవిశ్వాస స్థితిలో అవుతుంది. ఎందుకంటే వారు ఎన్నడూ దైవప్రవక్తను మనసారా విశ్వసించలేదు. తమ కపట చేష్టలను కొనసాగిస్తూ, అడుగడుగునా అవరోధాలే కల్పించారు.

81. “మేము మీ వారమే” అని వారు మాటిమాటికీ అబద్ధపు ప్రమాణాలు చేస్తున్నారంటే అర్థం ఏమిటీ? వారు మీకు భయపడుతున్నారు. పబ్లిగ్గా మిమ్మల్ని ఎదిరించే ధైర్యం వారికి లేదు.

82. మీ మధ్య వారు ఎప్పుడు నిలబడి ఉన్నా గత్యంతరంలేక నిలబడి ఉంటున్నారే తప్ప మనస్ఫూర్తిగా మాత్రం కాదు. ఏ కాస్త సందు దొరికినా ఉన్నపళంగా పారిపోయి తలదాచుకోవాలని చూస్తూ ఉంటారు.

83. ఇది వారిలోని మరో పెద్ద దుష్ట లక్షణం. ఆఖరికి వారు దైవప్రవక్త (సఅసం) న్యాయశీలంపై వేలెత్తే వరకూ పోయారు (దైవం మన్నించుగాక!). ఇబ్నె జుల్ ఖువైసర గురించి ఇలా అనబడింది: ఒకసారి దైవప్రవక్త (సఅసం) విజయధనాన్ని పంచిపెడుతుండగా అతను వచ్చి, “న్యాయసమ్మతంగా పంచిపెట్టండి” అన్నాడు. దానికి దైవప్రవక్త (స) ఎంతో వ్యాకులతకు లోనయ్యారు. “నీ ధోరణి కడు శోచనీయం! నేనే న్యాయం చేయలేకపోతే ఇంక న్యాయం చేసేవాడెవడుంటాడు?” అన్నారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ మనాఖిబ్, సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్).

84. వారీవిధంగా ఆరోపించటంలోని అసలు ఉద్దేశం ప్రాపంచిక స్వప్రయోజనాలే. ఇలాంటి దబాయింపులకు జడుసుకుని తమకు కాస్త ఎక్కువ ఇస్తారనీ, తమకు ఆ సొమ్ము పుచ్చుకునే అర్హత ఉన్నా లేకున్నా ఇచ్చి తీరుతారనేది వాళ్ళ ఉద్దేశం.

85. సదఖాత్‌కు (దానధర్మాలకు) అర్హులు ఎవరో, వాటిని ఏ ఏ పద్దుల్లో ఖర్చుపెట్టాలో స్పష్టంగా విశదపరచటానికి ఈ ఆయతులో పేర్లు పెట్టి మరీ చెప్పటం జరిగింది. ఇక్కడ సదఖాత్ (దానాలు) అంటే “సదఖాతె వాజిబ” (విధిగా

وَالْغٰرِمِيْنَ وَفِيْ سَبِيْلِ اللّٰهِ وَابْنِ السَّبِيْلِ ؕ فَرِيْضَةً مِّنَ اللّٰهِ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ﴿60﴾

టానికీ, రుణగ్రస్తుల కొరకూ, దైవమార్గం కొరకూ, బాటసారుల కొరకూ[86] వెచ్చించాలి. ఇది అల్లాహ్ తరఫున నిర్ణయించబడిన ఒక విధి. అల్లాహ్ మహాజ్ఞాని, మహావివేకి.

చెల్లించవలసిన దానాలు) అని అర్థం. అంటే జకాత్ అన్నమాట. ఈ ఆయతులో పేర్కొనబడిన 8 పద్దులు మినహా మిగిలిన పద్దుల్లో ఈ మొత్తాన్ని ఖర్చుపెట్టడానికి వీల్లేదు. ఈ ఎనిమిది పద్దుల్లోనూ విధిగా పంచిపెట్టాలా? లేక అవసరాన్ని బట్టి వాటిలోని కొన్ని పద్దుల్లో ఇస్తే సరిపోతుందా? అన్న విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. ఇమామ్ షాఫయి మొదటి అభిప్రాయం వైపుకు మొగ్గుచూపారు. అయితే ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫా తదితరులు రెండవ అభిప్రాయం వైపుకు మొగ్గారు. రెండవ అభిప్రాయమే చాలా వరకు సమంజసం.

ఇమామ్ షాఫయి ప్రకారం జకాత్ పైకాన్ని 8 పద్దుల్లో ఖర్చుపెట్టడం అవసరం. అంటే పరిస్థితులను, అవసరాలను పట్టించుకోకుండా పంపిణీ చేయవలసిన జకాత్‌ను ఎనిమిది వాటాలుగా చేసి ఎనిమిది పద్దుల్లోనూ ఎంతో కొంత ఇవ్వాల్సిందే. కాగా; రెండవ అభిప్రాయం ప్రకారం అవసరాన్ని, పరమార్థాలను అంచనావేసి ఏ ఏ పద్దుల్లో వెచ్చించటం ఎక్కువ ప్రయోజనకరమో ఆ పద్దులకు జకాత్ మొత్తాన్ని కేటాయించాలి. ఇతర పద్దుల్లో కేటాయించటానికి జకాత్ సొమ్ము మిగలకపోయినా ఫరవాలేదు. ఈ రెండవ అభిప్రాయంలో ఉన్నంత సమంజసత్వం మొదటి అభిప్రాయంలో లేదు.

86. **ఆ ఎనిమిది (8) పద్దుల తఫ్సీళ్లు ఇవి : 1, 2.** నిరుపేదలు, అభాగ్యజీవులు: ఈ రెండు పదాలకు దగ్గరి సంబంధం ఉంది. ఒకదానిలో రెండవ అర్థం ఇమిడి ఉంటుంది. ఈ రెండింటినీ విడదీసి చెప్పటంపై భేదాభిప్రాయం వ్యక్తమయింది. నిరుపేదలన్నా, అగత్యపరులన్నా అవసరాలు తీరనివారు; తమ జీవితావసరాలు తీరటానికి ఎంత ప్రయత్నించినా తగినన్ని వస్తువులకు నోచుకోని వారు అని భావం. అభాగ్య జీవులు అన్న పదానికి నిర్వచనం చెప్పే హదీసు ఒకటి ఉంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "ఒక్కో ముద్దకోసం ఇల్లిల్లూ ముష్టెత్తుకుంటూ తిరిగే వాడు అభాగ్యుడు (మిస్కీన్) కాదు. అసలు అభాగ్యుడు అంటే తన జీవనావసరాలు తీరేటంత సంపాదన లేనివాడు. అతను (తన ఆత్మాభిమానం మూలంగా) తన వాలకాన్ని, ఇతరులు తనను బిచ్చగాడు అనుకునేలా తయారుచేసుకోడు (తన పేదరికాన్ని దాచిపెట్టుకుంటాడు). తనంతట తానుగా ఎవరిముందూ చేయిచాచి అడగడు" (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్). ఇదీ హదీసులో ఇవ్వబడిన అభాగ్యుని నిర్వచనం.

అయితే హ్జ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ప్రభృతుల నిర్వచనం ప్రకారం అభాగ్యుడు (మిస్కీన్) అనేవాడు భిక్షాటన చేస్తాడు. జనుల ముందు యాచించి తన అక్కరలను తీర్చుకుంటాడు. కాగా; 'నిరుపేద' (ఫఖీర్) అనబడేవాడు తనకు అవసరం ఉండి కూడా చేయి చాచి అర్థించడు. ప్రజల ముందు తన అవసరాలను గురించి చెప్పుకోడు (ఇబ్నె కసీర్).

**3. జకాత్ వసూళ్లకై నియమితులైనవారు :** అంటే సామూహిక స్థాయిలో జకాత్ సొమ్మును – అధికారికంగా – ప్రజల నుంచి వసూలు చేయటానికి ప్రభుత్వం తరఫున నియుక్తులైన ఉద్యోగులు. వాటి లెక్కలు చూసే, పంపిణీ వ్యవస్థలో పనిచేసేవారు కూడా ఈ కోవలోనే వస్తారు. వారందరి జీతభత్యాలు ఈ జకాత్ పద్దు నుంచి ఇవ్వవచ్చు.

**4. హృదయాలను ఆకట్టుకోవలసి ఉన్నవారు :** ఇస్లాం ధర్మావగాహనపట్ల ఆసక్తి కనబరుస్తున్న ముస్లిమేతరులు. తామెదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు గనక తీరిపోతే ఏకాగ్రతతో ధర్మచింతన చేయగలిగే అవకాశం ఉన్నవారు. అప్పుడప్పుడే ఇస్లాం స్వీకరించిన నవ ముస్లిములు. ఇస్లాం శిక్షణ కోసం జీవనోపాధిని వదలుకుని వచ్చినవారు. వారికి చేసే ఆర్థిక సాయం వల్ల ఇస్లాం ధర్మంపై నిలకడ ప్రాప్తించే అవకాశం ఉన్నవారు. తాము పొందిన ఆర్థిక సహాయంతో తమ జీవనావసరాలను తీర్చుకోవటంతోపాటు తమ ప్రాంతాలలో నివసించే బలహీన ముస్లింలకు చేదోడు వాదోడుగా ఉంటారని ఆశించబడేవారు–వీళ్లంతా మనసులు గెలుచుకోవలసి ఉన్నవారి జాబితాలోకి వస్తారు.

**61** ప్రవక్తను బాధించేవారు కూడా వారిలో కొందరున్నారు. "ఈయన చెప్పుడు మాటలు వినేవాడు" అని వారంటున్నారు. వారికి చెప్పు: "ఆ వినేవాడు మీ మేలును కోరేవాడే.[87] అతడు అల్లాహ్‌ను విశ్వసిస్తాడు. ముస్లింల మాటల్ని నమ్ముతాడు. మీలో విశ్వసించిన వారి యెడల అతడు కారుణ్యమూర్తి. దైవప్రవక్త (సఅసం)ను బాధించే వారికి బాధాకరమైన శిక్ష ఖాయం."

وَمِنْهُمُ الَّذِيْنَ يُؤْذُوْنَ النَّبِيَّ وَيَقُوْلُوْنَ هُوَ اُذُنٌ ؕ قُلْ اُذُنُ خَيْرٍ لَّكُمْ يُؤْمِنُ بِاللّٰهِ وَيُؤْمِنُ لِلْمُؤْمِنِيْنَ وَرَحْمَةٌ لِّلَّذِيْنَ اٰمَنُوْا مِنْكُمْ ؕ وَالَّذِيْنَ يُؤْذُوْنَ رَسُوْلَ اللّٰهِ لَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿61﴾

**62** మిమ్మల్ని సంతోషపెట్టడానికి వారు మీముందు అల్లాహ్‌పై ప్రమాణాలు చేస్తూ పోతారు. వారు విశ్వాసులే గనక అయితే వారి ఈ సంతోషపెట్టే ధోరణికి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త అందరికంటే ఎక్కువ హక్కుదారులు.

يَحْلِفُوْنَ بِاللّٰهِ لَكُمْ لِيُرْضُوْكُمْ ۚ وَاللّٰهُ وَرَسُوْلُهٗۤ اَحَقُّ اَنْ يُّرْضُوْهُ اِنْ كَانُوْا مُؤْمِنِيْنَ ﴿62﴾

ఇలాంటి వారందరిపై జకాత్ మొత్తాన్ని వెచ్చించవచ్చు. ఆయా వ్యక్తులు స్థితిమంతులైనప్పటికీ వారికి ఇవ్వవచ్చు. అయితే హనఫీల దృక్పథం ప్రకారం ఈ రకమైన 'వ్యయం' సమాప్తమైపోయింది. కాని ఇది సరైందికాదు. పరిస్థితుల స్వభావస్వరూపాలను దృష్టిలో పెట్టుకుని ఎప్పుడైనా ఈ విధంగా ఖర్చుపెట్టవచ్చు. అన్ని కాలాల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం అవుతూ ఉంటాయి.

**5. మెడలు విడిపించటం :** అంటే బానిసల విముక్తి. 'ముకాతబత్' (వ్రాతపూర్వక ఒప్పందం) చేసుకున్న బానిసలకు మాత్రమే ఈ పద్దు వర్తిస్తుందని కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు. బానిసల్లో ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇమామ్ షౌకానీ రెండవ అభిప్రాయానికే ప్రాధాన్యత ఇచ్చారు.

**6. రుణగ్రస్తులు (గారిమీన్) :** ఆలుబిడ్డల పోషణార్థం అప్పుచేసి, ఆ అప్పుల భారం నుంచి బయటపడలేకపోయినవారు. అంటే తమ వద్దనున్న వస్తుసామగ్రిని, ఉత్పత్తి కారకాలను అమ్మివేసినా అప్పుల ఊబినుంచి బయటపడగల స్థితిలో లేనివారని భావం. రుణగ్రస్తులకు జామీనుగా ఉండటానికి అంగీకరించిన కారణంగా, అనూహ్యమైన రీతిలో రుణాన్ని చెల్లించవలసిన భారం మీద పడినవారు. అనుకోని విధంగానూ, ప్రకృతి వైపరీత్యాలవల్లనూ వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయి రుణగ్రస్తులైనవారు – వీరందరికీ జకాత్ పద్దునుంచి ఆర్థిక సాయం అందించవచ్చు.

**7. దైవమార్గంలో (ఫీ సబీలిల్లాహ్) :** అంటే ధర్మయుద్ధం కోసం అన్నమాట. యుద్ధ సామగ్రిని సమకూర్చుకోవటానికి, యోధుల అవసరాలను తీర్చడానికి జకాత్‌ను వెచ్చించటం సమ్మతమే. హజ్, ఉమ్రాలు కూడా దైవమార్గం (ఫీ సబీలిల్లాహ్) పద్దు క్రిందకి వస్తాయని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. అలాగే దైవధర్మ ప్రచారం కోసం కూడా ఈ మొత్తాన్ని వెచ్చించవచ్చని కొంతమంది విద్వాంసులు భావించారు. ఎందుకంటే ఇది కూడా జిహాద్ మాదిరిగానే సత్యధర్మ ఉన్నతికై జరిగే కృషి అని వారు సూత్రీకరించారు.

**8. బాటసారుల (ఇబ్నుస్సబీల్) కొరకు :** అంటే ఒక వ్యక్తి స్థితిమంతుడైనప్పటికీ ప్రయాణ సమయంలో – అనూహ్యమైన రీతిలో – సహాయానికి అర్హుడైనవాడు (ఆర్థిక అవసరం ఏర్పడినవాడు). ఇలాంటి వారికి కూడా జకాత్ పద్దు నుంచి ఆర్థిక సహాయం చేయవచ్చు.

87. ఇక్కడి నుంచి మళ్ళీ కపటుల ప్రస్తావన మొదలయింది. దైవప్రవక్త (స) ప్రతి ఒక్కడి చెప్పుడు మాటలు వింటారని వారు అపవాదు వేశారు. అసలు విషయం ఏమిటంటే, దైవప్రవక్తలోని మృదుత్వాన్ని, మన్నింపుల గుణాన్ని అర్థం చేసుకోవటంలో వారు పొరబడ్డారు. అందుకే అల్లాహ్ వారి అపోహను ఖండించాడు. "మా ప్రవక్తలో హానికరమైన గుణం ఏదీలేదు. పైపెచ్చు ఆయన (స) మీ శ్రేయోభిలాషి. మీ గురించి ఆయన ఏది విన్నా అందులో మీ కొరకు మేలు తప్ప మరొకటి లేదు" అని అల్లాహ్ స్పష్టం చేశాడు.

**63** ఎవడు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ఎదిరిస్తాడో అతని కొరకు నరకాగ్ని (కాచుకొని) ఉంటుందనీ, అందులో అతను కలకాలం ఉండవలసి వస్తుందనీ, అది ఘోర పరాభవమనీ వారికి తెలియదా?

أَلَمْ يَعْلَمُوٓا أَنَّهُۥ مَن يُحَادِدِ ٱللَّهَ وَرَسُولَهُۥ
فَأَنَّ لَهُۥ نَارَ جَهَنَّمَ خَٰلِدًا فِيهَا ۚ
ذَٰلِكَ ٱلْخِزْىُ ٱلْعَظِيمُ ﴿٦٣﴾

**64** తమ గుండెల్లో దాగివున్న గుట్టును రట్టుచేసే సూరా ఏదైనా (ముస్లిములపై) అవతరిస్తుందేమోనన్న భయం ఈ కపటులను అనుక్షణం వెంటాడుతూ ఉంటుంది. (ప్రవక్తా!) వారికి చెప్పు: మీరు ఎగతాళి చేస్తూనే ఉండండి. దేని గురించి మీరు భయపడు తున్నారో దాన్ని అల్లాహ్ ఎలాగూ బయటపెట్టనున్నాడు.

يَحْذَرُ ٱلْمُنَٰفِقُونَ أَن تُنَزَّلَ عَلَيْهِمْ سُورَةٌ
تُنَبِّئُهُم بِمَا فِى قُلُوبِهِمْ ۚ قُلِ ٱسْتَهْزِءُوٓا
إِنَّ ٱللَّهَ مُخْرِجٌ مَّا تَحْذَرُونَ ﴿٦٤﴾

**65** (మీరు చెప్పుకుంటూ ఉన్న విషయం ఏమిటి? అని) నువ్వు వారిని అడిగితే, "అబ్బే ఏమీలేదు. ఏదో సరదాగా, నవ్వులాటకు ఇలా చెప్పుకుంటున్నాము" అని వారంటారు. "ఏమిటీ, మీరు అల్లాహ్‌తో, ఆయన ఆయతులతో, ఆయన ప్రవక్తలతో పరిహాస మాడుతున్నారా?[88] అని అడుగు.

وَلَئِن سَأَلْتَهُمْ لَيَقُولُنَّ إِنَّمَا كُنَّا نَخُوضُ
وَنَلْعَبُ ۚ قُلْ أَبِٱللَّهِ وَءَايَٰتِهِۦ وَرَسُولِهِۦ كُنتُمْ
تَسْتَهْزِءُونَ ﴿٦٥﴾

**66** "మీరింక సాకులు చెప్పకండి. మీరు విశ్వసించిన తరువాత అవిశ్వాసానికి ఒడిగట్టారు.[89] ఒకవేళ మేము మీలో కొందరిని మన్నించినా,[90] మరికొందరిని వారి నేరాలకుగాను కఠినంగా శిక్షిస్తాము"[91] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

لَا تَعْتَذِرُوا قَدْ كَفَرْتُم بَعْدَ إِيمَٰنِكُمْ ۚ
إِن نَّعْفُ عَن طَآئِفَةٍ مِّنكُمْ نُعَذِّبْ
طَآئِفَةًۢ بِأَنَّهُمْ كَانُوا مُجْرِمِينَ ﴿٦٦﴾

88. ఆ కాలంలో కపటులు దైవవాక్యాల పట్ల వేళాకోళంగా మాట్లాడేవారు. ముస్లిములను ఎగతాళి చేసేవారు. ఆఖరికి దైవప్రవక్త (సఅసం)పై ఎత్తిపొడుపు మాటలు మాట్లాడటానికి కూడా వెనుకాడేవారు కారు. వారు ఎంత పకడ్బందీగా ఉన్నా వారి వెకిలిచేష్టలు దైవప్రవక్త (స) కు తెలియకుండా ఉండేవి కావు. 'ఇంతకీ మీ ఉద్దేశం ఏమిటీ?' అని నిలదీసి అడిగితే విషయాన్ని దాటవేసేవారు. ఏదో వేళాకోళానికి అలా చెప్పుకున్నామంతే అని అనేవారు. "మీ వేళాకోళానికి దేవుడు, దైవవచనాలు, దైవప్రవక్తే కావలసి వచ్చారా?" అని అల్లాహ్ ప్రశ్నిస్తున్నాడు. దీని భావమేమిటంటే, మీరు అంతగా వేళాకోళపు మాటలు చెప్పుకోవాలనుకుంటే ప్రపంచంలో ఎన్నో విషయాలు ఉన్నాయి. నిస్సందేహంగా మీ మనస్సుల్లో ఉన్న కుళ్లుకు, కాపట్య రోగానికి ఇది నిదర్శనం. దైవం పట్ల, దైవప్రవక్త (స) పట్ల మీ ఆంతర్యాల్లో తిష్ఠవేసిన నకారాత్మక భావాన్ని కూడా మీ ధోరణి వెల్లడి చేస్తోంది.

89. దైవాన్ని, దైవప్రవక్తను పరిహసించిన మీదట మీ విశ్వాసానికి (ఈమాన్‌కు) ఇక ఎలాంటి అర్థమూ లేదు. ఇప్పటివరకూ కాపట్యం మీ మనసుల్లో దాగి ఉన్నప్పటికీ పైకి మీరు ముస్లింల సరసన నిలబడగలిగేవారు. ఇప్పుడు మీ బండారం బయట పడిపోయింది. ఇక నుంచి మిమ్మల్ని ముస్లింలుగా పరిగణించే ఆస్కారం కూడా లేకుండా పోయింది.

90. **'ఆ కొందరు'** ఎవరు? అంటే తమవల్ల జరిగిన తప్పిదాలను తెలుసుకుని, పశ్చాత్తాపం చెంది, నిజమైన ముస్లింలుగా మసలుకోవటం మొదలెట్టినవారు.

**67** కపటులైన పురుషులూ, స్త్రీలూ– వారంతా ఒక్కటే.[92] వారు చెడు విషయాల గురించి ఆజ్ఞాపించి, మంచి విషయాల నుంచి ఆపుతారు. తమ గుప్పెళ్ళను మూసి ఉంచుతారు.[93] వారు అల్లాహ్‌ను విస్మరించారు. అందుకే అల్లాహ్ కూడా వారిని విస్మ రించాడు.[94] నిశ్చయంగా కపటులే పాపాత్ములు (అవిధేయులు).

اَلْمُنٰفِقُوْنَ وَالْمُنٰفِقٰتُ بَعْضُهُمْ مِّنْۢ بَعْضٍ ۘ
يَاْمُرُوْنَ بِالْمُنْكَرِ وَيَنْهَوْنَ عَنِ الْمَعْرُوْفِ
وَيَقْبِضُوْنَ اَيْدِيَهُمْ ؕ نَسُوا اللّٰهَ فَنَسِيَهُمْ ؕ
اِنَّ الْمُنٰفِقِيْنَ هُمُ الْفٰسِقُوْنَ (67)

**68** కపటులైన పురుషులకూ, స్త్రీలకూ, ఇంకా అవిశ్వాసులకూ అల్లాహ్ నరకాగ్ని గురించి వాగ్దానం చేసి వున్నాడు. అందులో వారు సదా పడి ఉంటారు. వారికి తగినది కూడా అదేను. వారిపై అల్లాహ్ యొక్క శాపం పడింది. వారి కొరకు శాశ్వితమైన శిక్ష ఉంది.

وَعَدَ اللّٰهُ الْمُنٰفِقِيْنَ وَالْمُنٰفِقٰتِ وَالْكُفَّارَ
نَارَ جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَا ؕ هِيَ حَسْبُهُمْ ۚ
وَلَعَنَهُمُ اللّٰهُ ۚ وَلَهُمْ عَذَابٌ مُّقِيْمٌ (68)

**69** (కపటులారా! చూడబోతే మీ పరిస్థితి కూడా) మీ పూర్వీకుల మాదిరిగానే ఉంది.[95] వారు మీకన్నా బలవంతులు. మీకన్నా ఎక్కువ సిరిసంపదలు, సంతానం కలవారు. వారు తమ వంతు భాగ్యాన్ని వాడుకున్నారు, మీరు కూడా మీ వంతు భాగ్యాన్ని

كَالَّذِيْنَ مِنْ قَبْلِكُمْ كَانُوْٓا اَشَدَّ مِنْكُمْ
قُوَّةً وَّاَكْثَرَ اَمْوَالًا وَّاَوْلَادًا ؕ فَاسْتَمْتَعُوْا
بِخَلَاقِهِمْ فَاسْتَمْتَعْتُمْ بِخَلَاقِكُمْ كَمَا

91. వీరు మాత్రం తమ అపరాధాలపై సిగ్గు చెందలేదు. తత్ఫలితంగా వారిలో తిరస్కారం, కాపట్యం నానాటికీ పెరగసాగాయి. అందుకే వారికి విధించబడే శిక్ష కూడా కఠినంగా ఉంటుందని చెప్పబడింది.

92. **"మేము మీ వారమే"** అని కపటులు దేవునిపై ప్రమాణం చేసి చెప్పినప్పటికీ దేవుడు వారి బండారాన్ని బయటపెట్టేశాడు. కపటుల్లోని పురుషులు, స్త్రీలు అందరూ ఒకే కోవకు చెందినవారనీ, వారు తమ వర్గం నుంచి సహాయసహకారాలు అందించుకుంటారే తప్ప ముస్లిములకు ఏమాత్రం తోడ్పడజాలరని స్పష్టం చేశాడు. కాపట్యంలోనూ, ఇస్లాం పట్ల విరోధంలోనూ వీరు పరస్పరం పోటీపడతారు. వీరి గుణగణాలు విశ్వాసుల గుణగణాలకు పూర్తి విరుద్ధంగా ఉంటాయి. విశ్వాసులు మంచిని గురించి ఆజ్ఞాపించగా కపటులు చెడుల గురించి ఆజ్ఞాపిస్తారు. విశ్వాసులు చెడు పనుల నుంచి వారిస్తే ఈ నయవంచకులు మంచిపనుల నుంచి ప్రజలను ఆపుతారు.

93. గుప్పెళ్ళను మూసి ఉంచటమంటే భావం పిసినారితనం వహించటం. ఈ కపటులు ఎంగిలి చేత్తో కాకిని కూడా తోలరు. విశ్వాసులు దైవమార్గంలో మనస్ఫూర్తిగా ఖర్చు పెడితే ఈ కపటులు ఒక్కొక్క పైసాను కూడబెట్టే ప్రయత్నంలో ఉంటారు.

94. దేవుని పట్ల వారి వ్యవహారం ఎలా ఉంటుందో, వారిపట్ల దేవుని వ్యవహారం కూడా అలాగే ఉంటుంది. వారు దైవాన్ని విస్మరించారు. దేవుడు కూడా వారిని విస్మరించాడు. ప్రపంచంలో వారు అల్లాహ్ ఆదేశాలను పాటించకుండా ఉంటే, పరలోకంలో అల్లాహ్ వారిని తన దయానుగ్రహాలకు దూరంగా ఉంచుతాడు. అంతేగాని విస్మరించటం అంటే అల్లాహ్ నిజంగానే మరిచిపోతాడని కాదు. మరిచిపోవటమనే బలహీనత ఆయనలో ఉండదు (ఫత్‌హుల్ ఖదీర్).

95. కార్యకలాపాల రీత్యానూ, ముగింపు రీత్యానూ మీరు కూడా పూర్వకాలంలోని అవిశ్వాసులను పోలి ఉన్నారు అని భావం.

اسْتَمْتَعَ الَّذِيْنَ مِنْ قَبْلِكُمْ بِخَلَاقِهِمْ
وَخُضْتُمْ كَالَّذِيْ خَاضُوْا ۭ اُولٰۗىِٕكَ حَبِطَتْ
اَعْمَالُهُمْ فِي الدُّنْيَا وَالْاٰخِرَةِ ۚ وَاُولٰۗىِٕكَ
هُمُ الْخٰسِرُوْنَ ﴿69﴾

జుర్రుకున్నారు,[96] మీ పూర్వీకులు తమవంతు భాగ్యాన్ని జుర్రు కున్నట్లు. వారి మాదిరిగానే మీరు కూడా వేళాకోళపు వాదనల్లో పడ్డారు.[97] వారి కర్మలు ప్రపంచంలోనూ, పరలోకంలోనూ వృధా అయిపోయాయి. నష్టానికి గురైనవారంటే వీరే.[98]

اَلَمْ يَاْتِهِمْ نَبَاُ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ قَوْمِ
نُوْحٍ وَّعَادٍ وَّثَمُوْدَ ڏ وَقَوْمِ اِبْرٰهِيْمَ وَاَصْحٰبِ
مَدْيَنَ وَالْمُؤْتَفِكٰتِ ۭ اَتَتْهُمْ رُسُلُهُمْ
بِالْبَيِّنٰتِ ۚ فَمَا كَانَ اللّٰهُ لِيَظْلِمَهُمْ وَلٰكِنْ
كَانُوْٓا اَنْفُسَهُمْ يَظْلِمُوْنَ ﴿70﴾

**70** ఏమిటీ, వారికి తమ పూర్వీకులైన నూహ్ జాతి వారి, ఆద్ సమూద్ జాతి వారి, ఇబ్రాహీమ్ జాతివారి, మద్‌యన్ వారి, తలక్రిందులుగా చేయబడిన బస్తీలవారి[99] సమాచారం అంద లేదా? వారి వద్దకు వారి ప్రవక్తలు నిదర్శనాలను తీసుకు వచ్చారు.[100] అల్లాహ్ వారికెలాంటి అన్యాయం చేయలేదు. వారు తమ స్వయానికి తామే అన్యాయం చేసుకున్నారు.[101]

96. పూర్వీకులు ప్రాపంచిక ప్రయోజనాలను కొంతకాలం పాటు జుర్రుకున్నట్లే మీరు కూడా మీ వంతు భోగభాగ్యాలను జుర్రుకోండి. ఎట్టకేలకు వారికి పట్టిన గతే మీకూ పట్టబోతోంది.

97. అంటే దైవవచనాలను, దైవప్రవక్తను ధిక్కరించే ఉద్దేశంతో మీరు ఇదంతా చేశారు. మీ పూర్వీకులు విషయలాలసలో మునిగి ఉన్నట్లే మీరు కూడా మునిగిపోయారని కూడా భావం కావచ్చు. 'పూర్వీకులు' అంటే గ్రంథవహులైన యూదులు, క్రైస్తవులని భావం. ఒక హదీసులో మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఇలా ప్రబోధించారు: "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను! మీరు మీ పూర్వీకుల పద్ధతులను అనుసరిస్తారు. ఒక్కో జానెడు, ఒక్కో మూరెడు, ఒక్కో గజం మీరు వారిని ఆదర్శంగా తీసుకుంటారు. చివరకు వారు ఏదైనా ఉడుం ఉండే కన్నంలోకి దూరితే మీరు కూడా ఆ కన్నంలో దూర్తారు." "పూర్వీకులంటే ఎవరు? గ్రంథ వహులా?" అని జనులు ప్రశ్నించగా "ఇంకెవరు?" అని ఆయన (స) ప్రతిస్పందించారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఏతెసామ్; ముస్లిం – కితాబుల్ ఇల్మ్). **'బాఅన్ బి బాయిన్'** (ఒక్కో గజం) అన్న పదం ఈ హదీసులో లేదు. తఫ్‌సీరె తబ్రీలో నకలు చేయబడిన ఒక ఉల్లేఖనంలో ఈ పదాలు ఉన్నాయి.

98. ఈ రకమయిన దుర్గుణాలు కలవారు పరలోకంలో నష్టపోవటం ఖాయం. మీ పూర్వీకుల్లోని సత్యతిరస్కారులు కూడా ఇలాంటి అవలక్షణాల మూలంగానే శిక్షార్హులయ్యారు. మీకూ అదే గతి పడుతుంది. ఎందుకంటే మీ పరిస్థితి కూడా వారికి ఏమాత్రం భిన్నంగాలేదు. పైగా సిరిసంపదలలో, సంతానంలో వారు మీకన్నా మరింత బలంగా ఉండేవారు. అయినప్పటికీ దైవాగ్రహం ముందు ఎందుకూ పనికి రాకుండా పోయారు. అలాంటప్పుడు మీరెంత? మీ జోరెంత??

99. ఇక్కడ గత కాలంలోని ఆరు జాతుల ప్రస్తావన వచ్చింది. వారంతా సిరియా ప్రాంతవాసులే. మరి ఈ ప్రాంతం అరేబియాకు మరీ దూరాన లేదు. బహుశా వారి గాథలను వీరు తమ తాతముత్తాతల ద్వారా విని ఉంటారు. నూహ్ జాతివారు ఉప్పెనలో ముంచి వేయబడ్డారు. ఆద్ జాతివారు అత్యంత బలశాలురైనప్పటికీ తీవ్రమైన గాలికి కుప్పకూలి పోయారు. సమూద్ జాతి వారు భయంకరమైన కేక ద్వారా తుదముట్టించబడ్డారు. ఇబ్రాహీము కాలం నాటి నిరంకుశ చక్రవర్తి నమ్రూద్ బిన్ కన్‌ఆన్ బిన్ కోష్, దోమ ద్వారా చంపబడ్డాడు. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) కాలం నాటి మద్‌యన్ వాసులు శబ్దం, భూకంపం, దట్టమైన మేఘాల ద్వారా రూపుమాపబడ్డారు. హజ్రత్ లూత్ జాతి వారు నివసించే 'సద్దూమ్' అనే బస్తీ తలక్రిందులుగా చేసివేయబడింది. ఒకవైపున వారిపై ఆకాశం నుంచి రాళ్ల వాన కురుస్తుండగా మరోవైపు నుంచి వారు పైకెత్తి అమాంతం క్రిందపడవేయబడ్డారు. దాంతో ఆ బస్తీ అంతా అతలాకుతలమై పోయింది. అందుకే వీరిని 'మూతఫికాత్ వాసులు' అని పిలుస్తారు. మూతఫికాత్ అంటే తల్లక్రిందులుగా చేయబడినవి అని అర్థం.

**71** విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ – వారంతా ఒండొకరికి మిత్రులుగా (సహాయకులుగా, చేదోడువాదోడుగా) ఉంటారు.[102] వారు మంచిని గురించి ఆజ్ఞాపిస్తారు. చెడుల నుంచి వారిస్తారు.[103] నమాజులను నెలకొల్పుతారు, జకాత్‌ను చెల్లిస్తారు. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు.[104] అల్లాహ్ అతి త్వరలో తన కారుణ్యాన్ని కురిపించేది వీరి పైనే. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేచనాశీలి.

وَالْمُؤْمِنُوْنَ وَالْمُؤْمِنٰتُ بَعْضُهُمْ اَوْلِيَآءُ
بَعْضٍ ۘ يَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَيَنْهَوْنَ عَنِ
الْمُنْكَرِ وَيُقِيْمُوْنَ الصَّلٰوةَ وَيُؤْتُوْنَ الزَّكٰوةَ
وَيُطِيْعُوْنَ اللّٰهَ وَرَسُوْلَهٗ ؕ اُولٰٓئِكَ
سَيَرْحَمُهُمُ اللّٰهُ ؕ اِنَّ اللّٰهَ عَزِيْزٌ حَكِيْمٌ ﴿71﴾

**72** విశ్వసించిన ఇలాంటి స్త్రీ పురుషులకు, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. శాశ్వతంగా ఉండే స్వర్గవనాలలో పరిశుభ్రమైన మేడలు[105] వారి కొరకు ఉంటాయి. వీటన్నింటికన్నా గొప్పదైన అల్లాహ్ ప్రసన్నత[106] వారికి లభిస్తుంది. గొప్ప సాఫల్యం అంటే ఇదే.

وَعَدَ اللّٰهُ الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ جَنّٰتٍ
تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَا
وَمَسٰكِنَ طَيِّبَةً فِيْ جَنّٰتِ عَدْنٍ ؕ وَرِضْوَانٌ
مِّنَ اللّٰهِ اَكْبَرُ ؕ ذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿72﴾ ع

100. మరి చూడబోతే వారిపై దేవుని శిక్ష ఊరకే అవతరించలేదు. వారిలో ప్రతి జాతి వద్దా – స్వయంగా వారిలోనుంచే– ఒక ప్రవక్త ప్రభవింపజేయబడ్డాడు. కాని వారు తమ ప్రవక్తల మాటలను బొత్తిగా ఖాతరు చేయలేదు. పైగా వారిని ధిక్కరించారు. వారితో శత్రుత్వం వహించారు. పర్యవసానంగా వారు దైవాగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది.

101. వారి పెడసరి పోకడలే వారిని నిలువునా ముంచాయి. అకారణంగా అల్లాహ్ ఎవరిపైనా తన శిక్షా కొరడాను ఝుళిపించడు.

102. నిందార్హమైన కపటుల దుర్గుణాలకు దీటుగా ప్రశంసనీయమైన విశ్వాసుల సద్గుణాల ప్రస్తావన ఇక్కడ వచ్చింది. వారిలోని మొదటి సుగుణం ఏమిటంటే; వారు పరస్పరం స్నేహితులుగా మసలుకుంటారు. ఒండొకరికి సహాయ సహకారాలందించుకుంటారు, సుఖదుఃఖాలలో పాలు పంచుకుంటారు. హదీసులో చెప్పబడినట్లు; "ఒక విశ్వాసి సాటి విశ్వాసికి గోడలాంటివాడు. ఆ గోడలోని ఒక ఇటుక ఇంకో ఇటుకకు పుష్టినిస్తుంది" (సహీహ్ బుఖారీ – కితాబుస్సలాత్; సహీహ్ ముస్లిం).

మరో హదీసులో ఇలా అనబడింది: "పరస్పర ప్రేమానురాగాలను పంచుకోవటంలోనూ, ఒండొకరిపై దయ జూపటంలోనూ విశ్వాసుల ఉపమానం ఒక శరీరం లాంటిది. శరీరంలోని ఏదైనా ఒక అవయవం బాధకు గురైనప్పుడు మొత్తం శరీరానికి నొప్పి కలుగుతుంది. శరీరమంతా వ్యాకులతకు లోనవుతుంది" (సహీహ్ ముస్లిం, సహీహ్ బుఖారీ – కితాబుల్ అదబ్).

103. ఇది విశ్వాసుల్లోని రెండవ ముఖ్య సుగుణం. మంచి (మారూఫ్) అంటే షరీయత్ దృష్టిలో మంచివిగా పరిగణించబడే అంశాలు. చెడు (మున్కర్) అంటే షరీయత్ దృష్టిలో చెడ్డవిగా భావించబడే విషయాలు. అంతేగానీ ప్రజలు తమ మనోవాంఛలను బట్టి మంచివిగా భావించే ప్రతిదీ మంచిది కాజాలదు. అలాగే ప్రజలు తాము చెడుగా భావించినదల్లా చెడు అనిపించుకోదు.

104. నమాజ్ **'హుఖూఖుల్లాహ్'** (దేవుని హక్కుల) జాబితాలోకి రాగా, జకాత్ **'హుఖూఖుల్ ఇబాద్'** (దాసుల హక్కుల) జాబితాలోకి వస్తుంది. ఈ రెండు విధులను నెరవేర్చటంతో పాటు విశ్వాసులు సమస్త వ్యవహారాల్లో దైవానికి, దైవప్రవక్త(స)కు విధేయులై వారు తెలియపరచిన విధానానికి కట్టుబడి ఉంటారని చెప్పటం గమనార్హం.

**73** ఓ ప్రవక్తా! అవిశ్వాసులతో, కపటులతో పోరాడుతూ ఉండు.[107] వారి పాలిట కఠినంగా ప్రవర్తించు.[108] వారి అసలు నివాసస్థలం నరకమే. అది అత్యంత చెడ్డ స్థలం.[109]

**74** "మేమలా చెప్పలేద"ని వారు ప్రమాణాలు చేసి చెబుతున్నారు. యదార్థానికి అవిశ్వాస వాక్కు వారి నోట వెలువడింది. ఇస్లాంను స్వీకరించిన తరువాత వారు కుఫ్ర్‌కు (తిరస్కారానికి) ఒడిగట్టారు.[110] వారు చేయలేకపోయిన దానిని గురించి కూడా నిశ్చయించుకున్నారు.[111] అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) తమ

يَاَيُّهَا النَّبِيُّ جَاهِدِ الْكُفَّارَ وَالْمُنٰفِقِيْنَ وَاغْلُظْ عَلَيْهِمْ ؕ وَمَاْوٰىهُمْ جَهَنَّمُ ؕ وَبِئْسَ الْمَصِيْرُ ﴿73﴾

يَحْلِفُوْنَ بِاللّٰهِ مَا قَالُوْا ؕ وَلَقَدْ قَالُوْا كَلِمَةَ الْكُفْرِ وَكَفَرُوْا بَعْدَ اِسْلَامِهِمْ وَهَمُّوْا بِمَا لَمْ يَنَالُوْا ۚ وَمَا نَقَمُوْٓا اِلَّآ اَنْ اَغْنٰىهُمُ اللّٰهُ

105. ఆ భవనాలలో ముత్యాలు, పగడాలు పొదగబడి ఉంటాయి. అరబీలో **'అద్న్'** అని అనబడింది. దీనికి పలు అర్థాలున్నాయి. వాటిలో ఒక అర్థం 'శాశ్వితమైనది' అని.

106. స్వర్గవాసులకు స్వర్గంలో ప్రాప్తించే అనుగ్రహాలన్నింటికన్నా దైవప్రసన్నత రూపంలో లభించే వరం ఎంతో మహత్పూర్వకమైనదై ఉంటుందని హదీసు ద్వారా కూడా రూఢీ అవుతోంది (సహీహ్ బుఖారీ, ముస్లిం – కితాబుర్రిఖాఖ్, కితాబుల్ జన్నహ్).

107. అవిశ్వాసులతో, కపటులతో పోరాటాన్ని కొనసాగిస్తూ ఉండవలసిందిగా, వారిపట్ల కఠినంగా వ్యవహరించవలసిందిగా ఈ ఆయతులో దైవప్రవక్త (సఅసం)కు ఆదేశించబడింది. ఆయన తర్వాత ఈ ఆదేశం ఆయన సమాజానికి వర్తిస్తుంది. అవిశ్వాసులతో పాటు కపటులతో కూడా పోరాడాలా? ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. 1. ఒకవేళ కపటుల కపట చేష్టలు, ఇస్లాం వ్యతిరేక కార్యకలాపాలు బట్టబయలైన పక్షంలో అవిశ్వాసులతో పోరాడినట్లే వారితోనూ పోరాడవచ్చని ఒక అభిప్రాయం ఉంది. 2. తొలుత కపటులకు నోటితో హితబోధ చేయాలనీ, వారు గనక నైతికమైన అపరాధాలకు పాల్పడితే శిక్షలు విధించాలనీ, వారిపట్ల అదే జిహాద్ అనీ మరో అభిప్రాయం వ్యక్తమయింది. 3. అవిశ్వాసులతో జిహాద్ చేసి, కపటులతో కఠినంగా ప్రవర్తించాలని ఇంకో అభిప్రాయం వెల్లడైంది. ఈ మూడు అభిప్రాయాల్లోనూ పరస్పర వైరుధ్యం ఏమీలేదనీ, పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలోపెట్టుకుని ఈ మూడింటిలో ఎక్కడ ఏ విధానం సమంజసంగా ఉంటే దాన్ని అవలంబించవచ్చునని ఇమామ్ ఇబ్నె కసీర్ వ్యాఖ్యానించారు.

108. అరబీలో **'వగ్‌లుజ్'** (وَاغْلُظْ) అని ఉంది. ఇది 'గిల్‌జా' అనే మూలపదం నుంచి వచ్చింది. గిల్‌జా అంటే కఠినంగా ప్రవర్తించటం, శక్తిని ఉపయోగించి శత్రువుకు వ్యతిరేకంగా చర్య గైకొనటం అని అర్థం. అంతేగాని నోటి కరకుదనం దాని భావం కాదు. ఎందుకంటే అది దైవప్రవక్త (సఅసం) గారి ఉత్తమ నైతికతకే విరుద్ధం. ఆయన ఆ పని చేయలేరు. దేవుడు కూడా తన ప్రవక్తకు, ఆ పని చేయమని ఆజ్ఞాపించడు.

109. పోరాడటం, కఠినంగా ప్రవర్తించటం అనేవి ఇహలోకంతో ముడిపడినవి. పరలోకంలోనయితే వారి నివాస స్థలం నరకం అవుతుంది. అది బహు చెడ్డ నివాస స్థలం.

110. ఈ ఆయతు నేపథ్యంలో ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అనేక సంఘటనలను, విషయాలను ప్రస్తావించారు. వాటన్నింటి ద్వారా కపటులు దైవప్రవక్త (స)ను కించపరచే విధంగా మాట్లాడినట్లు విదితమవుతోంది. వారు చెప్పిన ఆ మాటల్ని కొంతమంది ముస్లింలు విని, దైవప్రవక్త (స) కు చెప్పారు. దైవప్రవక్త (స) వారిని నిలదీసి అడిగినప్పుడు తాము ఏ పాపం ఎరుగమని చెప్పారు. అలా చెప్పలేదని ప్రమాణాలు కూడా చేశారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. దైవప్రవక్త (సఅసం) ను కించపరచే విధంగా మాట్లాడటం కూడా 'కుఫ్ర్' (అవిశ్వాసం) అని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. దైవప్రవక్త (స) విషయంలో వేళాకోళంగా మాట్లాడేవాడు ముస్లింగా మిగిలి ఉండడు.

111. ఇంతకీ వారు చేయలేకపోయిన ఆ దుష్ట సంకల్పం ఏది? ఈ నేపథ్యంలో అనేక సంఘటనలు పేర్కొనబడ్డాయి.

చలువతో వారిని సంపన్నులుగా చేసినందుకే[112] వారు ఈ విధంగా ప్రతీకారం తీర్చుకుంటున్నారు. వారు ఇప్పటికైనా పశ్చాత్తాపం చెందితే అది వారి కొరకు శ్రేయస్కరం అవుతుంది. ఒకవేళ వారు ముఖం త్రిప్పుకున్నట్లయితే ప్రపంచంలోనూ, పరలోకంలోనూ అల్లాహ్ వారికి వ్యధాభరితమైన శిక్షకు గురిచేస్తాడు. భూమండలంలో వారిని సమర్థించేవాడు, సహాయపడే వాడెవడూ ఉండడు.

وَرَسُولُهُۥ مِن فَضْلِهِۦ ۚ فَإِن يَتُوبُوا۟ يَكُ
خَيْرًا لَّهُمْ ۖ وَإِن يَتَوَلَّوْا۟ يُعَذِّبْهُمُ ٱللَّهُ
عَذَابًا أَلِيمًا فِى ٱلدُّنْيَا وَٱلْـَٔاخِرَةِ ۚ وَمَا
لَهُمْ فِى ٱلْأَرْضِ مِن وَلِىٍّ وَلَا نَصِيرٍ ﴿٧٤﴾

**75** "ఒకవేళ అల్లాహ్ తన కృపతో మాకు సంపదను వొసగినట్లయితే మేము తప్పకుండా దానధర్మాలు చేసి, సద్వర్తనుల్లో చేరతాము" అని అల్లాహ్‌తో వాగ్దానం చేసినవారు కూడా వారిలో ఉన్నారు.

وَمِنْهُم مَّنْ عَٰهَدَ ٱللَّهَ لَئِنْ ءَاتَىٰنَا مِن فَضْلِهِۦ
لَنَصَّدَّقَنَّ وَلَنَكُونَنَّ مِنَ ٱلصَّٰلِحِينَ ﴿٧٥﴾

**76** కాని అల్లాహ్ తన కృపతో వారికి కలిమిని ప్రసాదించగా, వారు అందులో పిసినారితనం ప్రదర్శించసాగారు. మాటను దాటవేస్తూ, ముఖం చాటేశారు.[113]

فَلَمَّآ ءَاتَىٰهُم مِّن فَضْلِهِۦ بَخِلُوا۟ بِهِۦ وَتَوَلَّوا۟
وَّهُم مُّعْرِضُونَ ﴿٧٦﴾

ఉదాహరణకు : తబూక్ నుంచి తిరిగి వస్తున్నప్పుడు కపటులు దైవప్రవక్త (స) కు వ్యతిరేకంగా ఒక కుట్ర పన్నారు. అయితే అందులో వారు సఫలీకృతులు కాలేకపోయారు. మహాప్రవక్త (సఅసం) తన సైనిక దళానికి కొంతదూరంలో– ఒంటరిగా – వస్తున్న సమయంలో పది పన్నెండు మంది కపటులు ఒక పర్వత కనుమలో ఆయన్ని వెంబడించారు. అదను చూసి ఆయన (స)పై దాడిచేయాలనీ, దాంతో ఆయన (స) కథ సమాప్తమవుతుందని (దైవం మన్నించుగాక!) వారంతా పథకం వేశారు. అంతలోనే మహాప్రవక్త (స) వహీ (దైవసంకేతం) ద్వారా ఈ విషయం తెలుసుకుని జాగ్రత్తపడ్డారు.

112. ముస్లింలు మక్కా నుంచి మదీనాకు వలసవెళ్ళాక మదీనా పురము ఇస్లాంకు కేంద్రస్థానంగా మారింది. తత్కారణంగా వాణిజ్యపరంగా కూడా మదీనాకు ప్రాముఖ్యత పెరిగింది. మదీనావాసుల ఆర్థిక పరిస్థితి మునుపటికన్నా ఎంతో మెరుగుపడింది. కపటులు సయితం ఈ వర్తకం ద్వారా బాగా బలపడ్డారు. ఆ విషయాన్నే అల్లాహ్ ఇక్కడ ప్రస్తావిస్తూ, అల్లాహ్ వారిపై దయదలచినందుకు ఈ విధంగా ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారా? అని ప్రశ్నించాడు. తమ లేమిని కలిమిగా మార్చినందుకు వారు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవలసిందిపోయి, ఈ విధంగా అరాచకానికి పాల్పడటం వారి దుష్టబుద్ధికి తార్కాణం.

**గమనిక:** దైవం మరియు దైవప్రవక్త (స) తమ దయతో వారిని ధనవంతుల్ని చేశారన్న వాక్యాన్ని అర్థం చేసుకోవటంలో కొందరు పొరబడేందుకు ఆస్కారముంది. ఈ వాక్యంలో 'చలువ' (ఫజ్ల్) అనే పదం ఒక్క అల్లాహ్‌కే వర్తిస్తుంది. కాకపోతే మదీనా వాసుల కలిమి కోసం దేవుడు తన ప్రవక్తను సాధనంగా చేశాడంతే. ఆయన (స) మదీనావాసుల మధ్య ఉండబట్టి ఆ నగరం భౌగోళికంగా అన్ని విధాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది – అది వేరే విషయం. కాని కలిమిలేములు, లాభనష్టాలు, సుఖదుఃఖాలు – ఇవన్నీ దైవాజ్ఞతో కలుగుతాయి – అన్న విషయం మరువరాదు.

113. ఈ ఆయతు ప్రవక్త సహచరుడైన హజ్రత్ సాలబ బిన్ హాతిబ్ అన్సారీని ఉద్దేశించినదని కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఖరారు చేశారు. కాని ఈ విషయం ప్రామాణికమైనది కాదు. ఈ మాట కూడా కపటుల్లోని ఒక వర్గాన్ని ఉద్దేశించి అనబడింది అన్నదే నిజమైంది.

77 ఫలితం ఏమయిందంటే, అల్లాహ్‌తో చేసిన వాగ్దానానికి విరుద్ధంగా ప్రవర్తించిన కారణంగానూ, అబద్ధాలు చెబుతూ ఉన్నందుకుగానూ అల్లాహ్ వారి హృదయాలలో కాపట్యాన్ని ఉంచాడు. అల్లాహ్‌ను కలుసుకునే రోజు వరకూ అది వారిలో ఉంటుంది.

فَأَعْقَبَهُمْ نِفَاقًا فِي قُلُوبِهِمْ إِلَىٰ يَوْمِ يَلْقَوْنَهُ بِمَا أَخْلَفُوا اللَّهَ مَا وَعَدُوهُ وَبِمَا كَانُوا يَكْذِبُونَ ﴿٧٧﴾

78 ఏమిటీ, తమ లోగుట్టు గురించి, తమ గుసగుసల గురించి అల్లాహ్‌కు అంతా తెలుసుననీ, అల్లాహ్ అగోచర విషయాలన్నింటినీ ఎరిగినవాడనీ వారికి తెలియదా?[114]

أَلَمْ يَعْلَمُوا أَنَّ اللَّهَ يَعْلَمُ سِرَّهُمْ وَنَجْوَاهُمْ وَأَنَّ اللَّهَ عَلَّامُ الْغُيُوبِ ﴿٧٨﴾

79 విశాల మనసుతో దానధర్మాలు చేసే విశ్వాసులను నిందించే వారిని, (అల్లాహ్ మార్గంలో ఇచ్చేందుకు) తాము చెమటోడ్చి సంపాదించినది తప్ప[115] మరేదీ తమ వద్ద లేని వారిని అవహేళన చేస్తూ మాట్లాడే వారిని అల్లాహ్ కూడా ఆటపట్టిస్తాడు.[116] వారి కోసం వ్యధాభరితమైన శిక్ష ఉంది.

الَّذِينَ يَلْمِزُونَ الْمُطَّوِّعِينَ مِنَ الْمُؤْمِنِينَ فِي الصَّدَقَاتِ وَالَّذِينَ لَا يَجِدُونَ إِلَّا جُهْدَهُمْ فَيَسْخَرُونَ مِنْهُمْ ۙ سَخِرَ اللَّهُ مِنْهُمْ وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿٧٩﴾

114. అల్లాహ్‌తో వాగ్దానం చేసి, దానికి విరుద్ధంగా ప్రవర్తించే కపటులకు ఇందులో తీవ్రమయిన హెచ్చరిక ఉంది. తమ మనోభావాలను గురించి అల్లాహ్‌కు ఏమీ తెలియదని బహుశా వారనుకుంటున్నారేమో! కాని అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు. ఎందుకంటే ఆయన రహస్య విషయాల జ్ఞాని. అంతర్బాహ్య విషయాలన్నీ ఆయనకు క్షుణ్ణంగా తెలుసు.

115. అరబీలో **'ముత్తవ్వియీన్'** అని ఉంది. ముత్తవ్వియీన్ అంటే జకాత్ వంటి విధిదానాలే గాకుండా, స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగా ఇంకా ఎక్కువగా దానధర్మాలు చేసేవారు. అలాగే మరికొందరు, దైవమార్గంలో దానధర్మాలు చేయటం తమకు విధి కాకపోయినప్పటికీ మనఃపూర్వకంగా ఎంతో కొంత ఇచ్చుకోవాలన్న భావనతో కూలినాలి చేసి, చెమటోడ్చి సంపాదించి, దాన్ని తెచ్చి దైవమార్గంలో సమర్పించుకుంటారు. తమకు లభించే వేతనం తమ ఇంటివారలకు తినిపించటానికే సరిపోకపోయినా, అందులో నుంచే కొంత మొత్తాన్ని ప్రేమతో తెచ్చి సమర్పించుకునే త్యాగధనులు వారు. వారు తెచ్చి ఇచ్చిన సొమ్ము చిన్నదే కావచ్చు కాని వారి మనస్సు చాలా పెద్దది. అందులో చిత్తశుద్ధి కలగలిసి ఉంది. అంకితభావం ఉంది. దైవవాక్కును ఉన్నత స్థాయికి చేర్చే ప్రయత్నంలో తామూ పాలుపంచుకోవాలన్న ఆరాటం కూడా ఇమిడి ఉంది.

యుద్ధ సమయంలో విరాళాలు ఇవ్వవలసిందిగా దైవప్రవక్త (సఅసం) అప్పీలు చేసినప్పుడు ముస్లింలు స్తోమతకు తగ్గట్టుగా విరాళాలు ఇచ్చేవారు. కలవారు తమ స్థాయికి తగ్గట్టుగా తెచ్చిఇస్తే, లేనివారు కూడా తమకు ఉన్నంతలోనుంచే తెచ్చి ఇచ్చేవారు. ప్రవక్త పిలుపును పురస్కరించుకుని దైవమార్గంలో తమ సర్వస్వాన్నీ తెచ్చి ధారబోస్తున్న ఈ రెండు రకాల అభిమాన ధనులను చూసి ఓర్వలేక కపటులు వారి ప్రయత్నాలపై నీళ్లు కుమ్మరించేవారు. వారిపై ఛలోక్తులు విసిరేవారు. ఎత్తిపొడుపు మాటలతో వారిని కవ్వించేవారు. ఎవరయినా ఎక్కువ సొమ్మును తెచ్చి ఇస్తే, "గొప్ప దాతనని అందరి చేతా అనిపించుకోవటానికే ఇలా చేస్తున్నాడ"ని నిందించేవారు. ఎవరయినా కొద్దిపాటి సొమ్మును తెచ్చి ఇస్తే, "ఈ కొద్ది మొత్తంతోనే లక్ష్యం సిద్ధిస్తుందా?" అని గేలి చేసేవారు. "నువ్వు ఇచ్చే ఈ కొద్దిపాటి సొమ్మే దేవుడికి కావలసి వచ్చిందా?" అని వెటకారంగా చెప్పేవారు (సహీహ్ బుఖారీ–అత్ తౌబా సూరా వ్యాఖ్యానం; ముస్లిం–కితాబుజ్జకాత్). ఈవిధంగా కపటులు అడుగడుగునా ముస్లింలను అవహేళన చేస్తూ, రెచ్చగొడుతూ ఉండేవారు.

116. ముస్లింలను వారు ఈ విధంగా ఆటపట్టిస్తూ ఉంటే అల్లాహ్ చూస్తూ ఊరుకుంటాడని అనుకోరాదు. అల్లాహ్ కూడా వారిని ఆటపట్టిస్తాడు. ఆయన పట్టించే ఆట అత్యంత అవమానకరంగా, కోలుకోలేనంత తీవ్రంగా ఉంటుంది.

**80** (ఓ ప్రవక్తా!) వారి మన్నింపు కోసం నీవు వేడుకున్నా, వేడుకోకపోయినా ఒక్కటే. ఒకవేళ నువ్వు డెబ్భైసార్లు వారి మన్నింపు కోసం వేడుకున్నాసరే అల్లాహ్ క్షమించదుగాక క్షమించదు.[117] ఎందుకంటే, వారు అల్లాహ్ పట్లా, ఆయన ప్రవక్త పట్లా తిరస్కార వైఖరిని అవలంబించారు.[118] ఇటువంటి అవిధేయులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.[119]

اِسْتَغْفِرْ لَهُمْ اَوْ لَا تَسْتَغْفِرْ لَهُمْ ؕ اِنْ تَسْتَغْفِرْ لَهُمْ
سَبْعِيْنَ مَرَّةً فَلَنْ يَّغْفِرَ اللّٰهُ لَهُمْ ؕ ذٰلِكَ بِاَنَّهُمْ
كَفَرُوْا بِاللّٰهِ وَرَسُوْلِهٖ ؕ وَاللّٰهُ لَا يَهْدِى الْقَوْمَ
الْفٰسِقِيْنَ ﴿80﴾

**81** వెనుక ఉండిపోయినవారు, దైవ ప్రవక్త (సఅసం) వెళ్ళిన తరువాత, తాము ఆ విధంగా (ఇంట్లో) ఉండిపోయినందుకు సంబరపడ్డారు.[120] దైవమార్గంలో తమ ధన ప్రాణాలొడ్డి పోరాడటం వారికి బొత్తిగా ఇష్టంలేదు. పైపెచ్చు "ఇంత తీవ్రమైన ఎండవేడిలో బయలుదేరకండి" అని అన్నారు. (ఓ ప్రవక్తా!) "నరకాగ్ని ఇంతకన్నా ఎక్కువ వేడిగా ఉంటుంది" అని వారికి చెప్పు. ఆ సంగతిని వారు గ్రహిస్తే ఎంత బావుండు![121]

فَرِحَ الْمُخَلَّفُوْنَ بِمَقْعَدِهِمْ خِلٰفَ رَسُوْلِ اللّٰهِ
وَكَرِهُوْۤا اَنْ يُّجَاهِدُوْا بِاَمْوَالِهِمْ وَاَنْفُسِهِمْ
فِىْ سَبِيْلِ اللّٰهِ وَقَالُوْا لَا تَنْفِرُوْا فِى الْحَرِّ ؕ قُلْ
نَارُ جَهَنَّمَ اَشَدُّ حَرًّا ؕ لَوْ كَانُوْا يَفْقَهُوْنَ ﴿81﴾

**82** కాబట్టి ఇప్పుడు వారు తమ నిర్వాకానికి (లభించే) ప్రతిఫలంపై బహుకొద్దిగా నవ్వాలి, చాలా ఎక్కువగా ఏడ్వాలి.[122]

فَلْيَضْحَكُوْا قَلِيْلًا وَّلْيَبْكُوْا كَثِيْرًا ۚ جَزَآءًۢ بِمَا
كَانُوْا يَكْسِبُوْنَ ﴿82﴾

117. 70 సార్లు అనే పదం ఆధిక్యతా భావం (Supremacy) కొరకు ప్రయోగించబడింది. ఎన్నిసార్లు వారి క్షమాపణ కోసం విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని సుతరామూ క్షమించడు అని అసలు దీని భావం. 70 కంటే ఎక్కువ సార్లు సిఫారసు చేస్తే క్షమిస్తాడన్నది దీని అర్థం ఎంతమాత్రం కాదు.

118. క్షమాభిక్ష ఎందుకు పెట్టబడదో ఇక్కడ చెప్పటం జరిగింది. ప్రజలు 'సిఫారసు' కోసం ఎదురు చూసి మోసపోరాదు. విశ్వాసం మరియు సత్కర్మల మూలధనంతో వారు దైవసమక్షంలో హాజరుకావాలి. ఈ పరలోక సామగ్రే గనక లేకుండాపోతే ఎవరి సిఫారసూ అక్కడ చెల్లనేరదు. అసలు అలాంటి అవిధేయుల కోసం సిఫారసు చేసే అనుమతి కూడా అల్లాహ్ ఇవ్వడు.

119. **'సన్మార్గం'** అంటే ఇక్కడ విశ్వాసానికి (ఈమాన్‌కు) చేర్చే మార్గం అని భావం. మామూలుగా దారి చూపడమంటే అది ప్రపంచంలో విశ్వాసులకు, అవిశ్వాసులకు అందరికీ చూపబడింది. ఉదాహరణకు : 1. "మేము మనిషికి మార్గం చూపాము. ఆపై అతను కృతజ్ఞుడవుతాడో, కృతఘ్నుడవుతాడో చూడాలి (దహర్ – 3). 2. "మేము అతనికి (మంచీ–చెడులకు సంబంధించిన) రెండు మార్గాలు చూపెట్టాము" (బలద్ – 10).

120. కుంటిసాకులు చెప్పి తబూక్ పోరాటానికి వెళ్ళకుండా ఉండిపోయిన కపటుల గురించి మరోసారి ప్రస్తావించబడింది. మూలంలో **'ఖిలాఫ్'** అని వచ్చింది. ఖిలాఫ్ అంటే వెనుక లేక వ్యతిరేకంగా అని అర్థం. దైవప్రవక్త (సల్లం) యుద్ధానికి బయలుదేరిన తర్వాత కపటులు ఆయన వెనుక మదీనాలో ఉండిపోయారనో లేక ఆయన పద్ధతికి వ్యతిరేకంగా మదీనాలో ఉండిపోయారనో ఈ ఆయతుకు భావం.

121. నరకాగ్ని తాపం ముందు ఈ వేసవి తాపం లెక్కలోకి రాదన్న సంగతి వారికి తెలిస్తే వారు ఎంతమాత్రం వెనుక ఉండేవారు కాదు. ప్రపంచంలోని ఈ వేడి నరకాగ్ని వేడిలో 70వ భాగం అని, ప్రపంచంలోని ఎండవేడికన్నా నరకాగ్ని వేడి 69 రెట్లు అధికంగా ఉంటుందని హదీసు ద్వారా తెలుస్తోంది (సహీహ్ బుఖారీ – బదవుల్ ఖల్ఖ్).

122. వారి నవ్వులాటలు చాలా పరిమితమైనవి. మా శిక్ష మొదలైన తరువాత వారు ఇక ఏడుస్తూ ఉండవలసిందే.

**83** ఒకవేళ అల్లాహ్ నిన్ను వారిలోని ఏ వర్గం వద్దకైనా[123] తిరిగి తీసుకువెళితే, అప్పుడు వారు నీ వద్దకు వచ్చి, యుద్ధ మైదానానికి రావటానికి నీ అనుమతి గనక అడిగితే,[124] "ఇక మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ నాతో కలసి రాలేరు. నాతో కలసి శత్రువులతో పోరాడనూ లేరు. మీరు తొలిసారే కూర్చుని ఉండటానికి ఇష్ట పడ్డారు.[125] కాబట్టి మీరు ఇప్పుడు కూడా వెనుక ఉండిపోయే వారిలోనే కూర్చుని ఉండండి"[126] అని చెప్పెయ్యి.

فَإِن رَّجَعَكَ اللَّهُ إِلَىٰ طَائِفَةٍ مِّنْهُمْ فَاسْتَأْذَنُوكَ لِلْخُرُوجِ فَقُل لَّن تَخْرُجُوا مَعِيَ أَبَدًا وَلَن تُقَاتِلُوا مَعِيَ عَدُوًّا ۖ إِنَّكُمْ رَضِيتُم بِالْقُعُودِ أَوَّلَ مَرَّةٍ فَاقْعُدُوا مَعَ الْخَالِفِينَ ﴿83﴾

**84** వారిలో ఎవడైనా చస్తే నువ్వు వాడి అంత్యక్రియల నమాజు కూడా ఎన్నటికీ చేయకు. వాడి సమాధి వద్ద కూడా నిలబడకు.[127] వారు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను తిరస్కరించినవారు. వారు చచ్చేవరకూ దుష్టులుగా, అవిధేయులుగానే ఉన్నారు.[128]

وَلَا تُصَلِّ عَلَىٰ أَحَدٍ مِّنْهُم مَّاتَ أَبَدًا وَلَا تَقُمْ عَلَىٰ قَبْرِهِ ۖ إِنَّهُمْ كَفَرُوا بِاللَّهِ وَرَسُولِهِ وَمَاتُوا وَهُمْ فَاسِقُونَ ﴿84﴾

---

123. అంటే కపటుల వర్గం అని భావం. తబూక్ యుద్ధం నుండి దేవుడు నిన్ను సురక్షితంగా నీ స్థిరనివాసం వరకు చేరిస్తే ఇంటిపట్టున ఉండిపోయిన ఆ కపటులు నక్క వినయం ప్రదర్శిస్తూ నీ వద్దకు వస్తారు.

124. మరోసారి యుద్ధమేదయినా సంభవిస్తే తప్పకుండా తమరి వెంట వస్తామని భరోసా యిస్తారు.

125. మొదటిసారి పిలిచినపుడు మీరు ఎలాగూ రాలేదు. కాబట్టి మరో యుద్ధానికి రావటానికి కూడా మీరు అర్హత కోల్పోయారు.

126. అంటే యుద్ధం చేయలేక ఇండ్లలో ఉండిపోయే స్త్రీలు, చిన్నపిల్లలు, ముసలివారు, అవిటివారు ఎలాంటి వారో మీరూ అంతే. కాబట్టి మీరు మీ ఇండ్లలోనే కాలక్షేపం చేస్తూ ఉండిపోండి – ఈ మాటల్లో వ్యంగ్య ధోరణి ఉంది. ఒకవేళ తబూక్ యుద్ధంలో పాల్గొనలేకపోయామే! అన్న బాధ నిజంగా మీ మనసుల్లో ఉంటే, మీరు ఇంకా ఇంకా అలాంటి బాధతో కుమిలిపోతూ ఉండాలి.

127. ఈ ఆయతు కపటుల సర్దారు అయిన అబ్దుల్లాహ్ బిన్ ఉబై నేపథ్యంలో అవతరించినప్పటికీ దీని ఆదేశం మాత్రం సర్వసాధారణమైనది. కుఫ్ర్ (అవిశ్వాసం), నిఫాఖ్ (కాపట్యరోగం)పై మరణించిన వారందరూ ఈ పరిధిలోకి వస్తారు. దీని పూర్వరంగం ఇది :

కపటాగ్రేసరుడు అయిన అబ్దుల్లాహ్ బిన్ ఉబై మరణించినప్పుడు అతని కుమారుడు, నికార్సయిన ముస్లిం అయిన అబ్దుల్లాహ్ దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి ఈ విధంగా విన్నవించుకున్నారు – 'దైవప్రవక్తా! తమరు మీ చొక్కాను ప్రదానం చేస్తే (శుభం కోసం) నేను నా తండ్రి 'కఫన్' కొరకు దాన్ని ఉపయోగిస్తాను. అలాగే తమరు ఆయన అంత్యక్రియల (జనాజా) నమాజును చేయించండి.' కారుణ్యమూర్తి (సఅసం) అప్పటికప్పుడే తన చొక్కాను ప్రదానం చేశారు. అతని అంత్యక్రియల నమాజు చేయించటానికి వెళ్ళారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సఅసం) నుద్దేశించి, "ఇలాంటి వంచకుల కోసం ప్రార్థించవద్దని అల్లాహ్ మిమ్మల్ని తాకీదు చేశాడు కదా! అలాంటప్పుడు మీరు ఇతని మన్నింపు కోసం ఎందుకు వేడుకుంటారు?" అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (స), "అల్లాహ్ నాకు 'వేడుకోవద్దని' అనలేదు. వారి మన్నింపు కోసం డెబ్బయిసార్లు వేడుకున్నా మన్నించబోను అని మాత్రమే చెప్పాడు. కాబట్టి నేను డెబ్బయి కన్నా ఎక్కువసార్లే వారి మన్నింపు కోసం అర్థిస్తాను" అని బదులిచ్చారు. తరువాత ఆయన (సఅసం) అతని జనాజా నమాజును చేయించారు. దానిపై ఈ ఆయతు అవతరించింది. ఇక

وَلَا تُعۡجِبۡكَ اَمۡوَالُهُمۡ وَاَوۡلَادُهُمۡ ؕ اِنَّمَا يُرِيۡدُ اللّٰهُ اَنۡ يُّعَذِّبَهُمۡ بِهَا فِى الدُّنۡيَا وَتَزۡهَقَ اَنۡفُسُهُمۡ وَهُمۡ كٰفِرُوۡنَ ﴿85﴾

**85** వారి ఆస్తిపాస్తులను, సంతానాన్ని చూసి నువ్వు ఆశ్చర్య పోకూడదు. వారిని ఈ వస్తువుల ద్వారా ఇహలోకంలోనే శిక్షిం చాలనీ, ప్రాణాలు పోయేదాకా వారు అవిశ్వాసులుగానే ఉండా లనీ అల్లాహ్ కోరుతున్నాడు.

وَاِذَاۤ اُنۡزِلَتۡ سُوۡرَةٌ اَنۡ اٰمِنُوۡا بِاللّٰهِ وَجَاهِدُوۡا مَعَ رَسُوۡلِهِ اسۡتَاۡذَنَكَ اُولُوا الطَّوۡلِ مِنۡهُمۡ وَقَالُوۡا ذَرۡنَا نَكُنۡ مَّعَ الۡقٰعِدِيۡنَ ﴿86﴾

**86** "అల్లాహ్‌ను విశ్వసించండి, ఆయన ప్రవక్తతో కలసి పోరా డండి" అని ఆజ్ఞాపించే సూరా అవతరింపజేయబడినప్పుడు వారిలోని శ్రీమంతుల వర్గం ఒకటి నీ దగ్గరకు వచ్చి, "మమ్మల్ని కూర్చుని ఉండేవారితోపాటే ఉండనివ్వండి"[129] అంటూ అనుమతి కోరుతుంది.

رَضُوۡا بِاَنۡ يَّكُوۡنُوۡا مَعَ الۡخَـوَالِفِ وَطُبِعَ عَلٰى قُلُوۡبِهِمۡ فَهُمۡ لَا يَفۡقَهُوۡنَ ﴿87﴾

**87** వారు ఇండ్లల్లో ఉండే ఆడవారి వెంట ఉండటానికే ఇష్ట పడ్డారు. వారి హృదయాలపై ముద్ర వేయబడింది. కాబట్టి ఇప్పుడు ఏ విషయమూ వారికి అర్థం కాదు.[130]

---

మీదట కపటుల క్షమాభిక్ష కోసం ఎంతమాత్రం విజ్ఞాపన చేయరాదని గట్టిగా తాకీదు చేయబడింది (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ బరాత్; ముస్లిం – కితాబు సిఫాతిల్ మునాఫిఖీన్....).

128. జీవితాంతం సత్యాన్ని తిరస్కరిస్తూ, ద్రోహాన్ని తలపెడుతూ తిరస్కార స్థితిలోనే ప్రాణాలు విడిచిన వారి అంత్యక్రియల ప్రార్థనలో పాల్గొనటంగానీ, వారి మన్నింపు కోసం అల్లాహ్‌ను వేడుకోవటంగానీ తగదని ఈ ఆయతులో స్పష్టంగా చెప్పబడింది.

వారి మన్నింపుకై ప్రార్థించటానికి దైవప్రవక్త (స) ఎంతగా పరితపించేవారో అంచనా వేయడానికి ఈ హదీసును అధ్యయనం చేయండి: "దైవప్రవక్త (సఅసం) ఖనన వాటికకు వచ్చేసరికే అబ్దుల్లా బిన్ ఉబై ఖననం చేయబడ్డాడని తెలిసింది. అప్పుడు ఆయన (స) సమాధిలో నుంచి అతని శవాన్ని బయటికి తీయించారు. అతని మృతదేహాన్ని తన మోకాళ్లపై ఉంచి తన లాలాజలాన్ని వేశారు. తన చొక్కాను తొడిగించారు" (సహీహ్ బుఖారీ – కితాబుల్లిబాస్; సహీహ్ ముస్లిం – కితాబు సిఫాతిల్ మునాఫిఖీన్....).

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే విశ్వాస భాగ్యానికి నోచుకోకపోయిన వారి మన్నింపు కోసం ఎంత గొప్పవారు, పుణ్యపురుషులు ప్రార్థించినప్పటికీ అది వారి కొరకు ప్రయోజనకరం కాజాలదు.

129. కుంటిసాకులు చెప్పి, వంటింటి కుందేళ్ళతో కలిసి కూర్చోదలచిన కపటుల గురించి చెప్పబడిన మాటలివి. చూడబోతే వారు ధనవంతులు. వారికి ఏ లోటూ లేదు. అలాంటప్పుడు వారు దైవమార్గంలో ఇతరులకన్నా ముందంజ వేయాల్సింది. కాని వెనుకంజవేశారు. తగు కారణంపై యుద్ధంలో పాల్గొనక పోవటం సబబే. అలాంటివారు అనుమతి పొందవచ్చు. కాని ఈ పెద్ద పెద్ద ఆసాములకేమైపోయిందనీ? వారెందుకు గాజులు తొడుక్కుని కూర్చోవాలను కుంటున్నారు? అంటే దైవధర్మం పట్ల, దైవప్రవక్త పట్ల, పరలోక సాఫల్యం పట్ల వారికెలాంటి ఆసక్తీ లేదన్నమాట!

130. మనిషి తరచూ తన ఆత్మను వంచించుకుంటూ, తప్పు మీద తప్పు చేస్తూ పోతున్నప్పుడు దేవుడు అతని హృదయ కవాటాలను మూసివేస్తాడు. సత్యాన్ని చూడగలిగే అతని మనోనేత్రంపై తెరపడిపోతుంది. సత్యాన్ని పరికించగలిగే అతని మస్తిష్కం ముడుచుకుపోతుంది. ఆ తరువాత అతనిలో విచక్షణా జ్ఞానం క్షీణించిపోతుంది.

**88** కాని స్వయంగా ప్రవక్తనూ, ఆయనతో పాటు విశ్వసించిన వారినీ చూడండి; వారు తమ ధనప్రాణాలతో దైవమార్గంలో పోరాడుతున్నారు. కాబట్టి మేళ్లు గలవారు వీరే. సాఫల్యభాగ్యం పొందేవారు కూడా వీరే.

لٰكِنِ الرَّسُوْلُ وَالَّذِيْنَ اٰمَنُوْا مَعَهٗ
جٰهَدُوْا بِاَمْوَالِهِمْ وَاَنْفُسِهِمْ ؕ وَاُولٰٓئِكَ
لَهُمُ الْخَيْرٰتُ ۫ وَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ﴿88﴾

**89** వీరి కోసమే అల్లాహ్, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గ వనాలను సిద్ధం చేసి ఉంచాడు. వాటిలో వారు శాశ్వతంగా ఉంటారు. గొప్ప విజయ భాగ్యం అంటే ఇదే.[131]

اَعَدَّ اللّٰهُ لَهُمْ جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ
خٰلِدِيْنَ فِيْهَا ؕ ذٰلِكَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿89﴾

**90** పల్లెవాసుల్లోని సాకులు చెప్పేవాళ్లు కూడా తమకు (యుద్ధం నుంచి) సెలవు ఇవ్వమని కోరుతూ వచ్చారు. అల్లాహ్‌తోనూ, ఆయన ప్రవక్తతోనూ అబద్ధాలాడినవారు ఎలాగూ కూర్చునే ఉండి పోయారు. వారిలో అవిశ్వాస పోకడను ప్రదర్శించిన వారికి బాధాకరమైన శిక్ష తప్పదు.[132]

وَجَآءَ الْمُعَذِّرُوْنَ مِنَ الْاَعْرَابِ لِيُؤْذَنَ لَهُمْ
وَقَعَدَ الَّذِيْنَ كَذَبُوا اللّٰهَ وَرَسُوْلَهٗ ؕ سَيُصِيْبُ
الَّذِيْنَ كَفَرُوْا مِنْهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿90﴾

**91** బలహీనులపై, రోగపీడితులపై, ఖర్చు పెట్టడానికి తమ వద్ద ఏమీలేనివారిపై – ఏ దోషమూ లేదు. అయితే వారు అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల శ్రేయోభిలాషులై ఉండాలి. అలాంటి సజ్జనులపై ఆరోపణలకు ఏ ఆస్కారమూ లేదు. అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, కరుణించేవాడూను.[133]

لَيْسَ عَلَى الضُّعَفَآءِ وَلَا عَلَى الْمَرْضٰى وَلَا
عَلَى الَّذِيْنَ لَا يَجِدُوْنَ مَا يُنْفِقُوْنَ حَرَجٌ
اِذَا نَصَحُوْا لِلّٰهِ وَرَسُوْلِهٖ ؕ مَا عَلَى الْمُحْسِنِيْنَ
مِنْ سَبِيْلٍ ؕ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿91﴾

131. అయితే చిత్తశుద్ధిగల విశ్వాసుల పరిస్థితి ఈ నయవంచకుల (మునాఫిఖ్‌ల) వైఖరికి భిన్నంగా ఉంటుంది. వారు ఎల్లప్పుడూ అల్లాహ్ ఆదేశాన్ని శిరసావహిస్తారు. తమ సంపదలతో, తమ ప్రాణాలతో దైవమార్గంలో పోరాడుతారు. దేవుడు వాగ్దానం చేసిన శుభాలు, మేళ్లన్నీ వారికే స్వంతమవుతాయి. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ప్రాపంచిక, పారలౌకిక భోగభాగ్యాలన్నీ వారికే లభిస్తాయి. ఇదే అసలు సిసలయిన సాఫల్యం.

132. ఈ **'సాకులు చెప్పేవాళ్ళు'** ఎవరు? దీనిపై ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భేదాభిప్రాయం ఉంది. వారు మదీనా నగరానికి కడుదూరంలో నివసించే ఎడారివాసులని కొందరు భావిస్తున్నారు. వారు దైవప్రవక్త (స) వద్దకు వచ్చి అబద్ధాలు చెప్పి యుద్ధం నుంచి అనుమతి పొందారు. మరికొంతమంది కనీసం అనుమతి కూడా పొందలేదు. ఈ విధంగా చూస్తే కపటులలో రెండు రకాల ప్రస్తావన వచ్చిందని భావించవలసి ఉంటుంది. వ్యధాభరితమైన దైవశిక్షకు వీరుభయులూ పాత్రులవుతారు.

ఖుర్ఆన్ వ్యాఖ్యాతలలోని మరోవర్గం వారు **'ముఅజ్జిరూన్'** అనే పదాన్ని "నిజంగానే తగు కారణంగల వారు" అన్న అర్థంలో తీసుకున్నారు. ఈ విధంగా చూసినప్పుడు ఆయతులోని చివరి భాగం మాత్రమే కపటులకు వర్తిస్తుంది. అంటే; ఈ ఆయతులో రెండు వర్గాల ప్రస్తావన వచ్చింది. **మొదటి వర్గం :** నిజంగానే తగు కారణంపై యుద్ధానికి వెళ్ళలేకపోయిన ముస్లింలు. **రెండవ వర్గం :** ఏ కారణమూ లేకుండానే అబద్ధాలు చెప్పి ఇంట్లో కూర్చున్న కపటులు. ఆయతు చివర్లో వ్యధాభరితమైన శిక్ష గురించి ప్రస్తావించబడినది ఈ కపటులను ఉద్దేశించే – యదార్థం దైవానికే ఎరుక!

133. ఈ ఆయతులో బలమైన కారణం వల్ల యుద్ధంలో పాల్గొనలేకపోయిన వారి ప్రస్తావన వచ్చింది. ఉదాహరణకు:

**92** నీ వద్దకు వచ్చి, తమకు వాహనాలు సమకూర్చుమని విన్న వించుకునే వారిపై కూడా ఎలాంటి ఆక్షేపణలకు ఆస్కారం లేదు. "మీకు ఇవ్వటానికి నా వద్ద ఏ వాహనమూ లేదు" అని నువ్వు వారికి చెప్పినప్పుడు వారు దుఃఖవదనులౌతారు. వారి కళ్లల్లో నుంచి కన్నీరు ఉబికి వస్తుండగా (క్లిష్ట పరిస్థితిలో) ఖర్చు పెట్టడానికి తమ వద్ద ఏమీ లేనందుకు వారు విలపిస్తూ తిరిగి వెళ్ళిపోతారు.[134]

وَّلَا عَلَى الَّذِينَ إِذَا مَا أَتَوْكَ لِتَحْمِلَهُمْ قُلْتَ
لَا أَجِدُ مَا أَحْمِلُكُمْ عَلَيْهِ تَوَلَّوا وَّأَعْيُنُهُمْ
تَفِيضُ مِنَ الدَّمْعِ حَزَنًا أَلَّا يَجِدُوا
مَا يُنفِقُونَ ﴿92﴾

**93** స్థితిమంతులై ఉండి కూడా నీ నుండి అనుమతిని కోరేవారిపై మాత్రం దోషం ఉంది. వారు ఇంటిపట్టున ఉండే ఆడవారి వెంట ఉండటానికే ఇష్టపడ్డారు. వారి హృదయాలపై అల్లాహ్ ముద్ర వేశాడు. అందువల్ల వారు తెలుసుకోలేకపోతున్నారు.[135]

إِنَّمَا السَّبِيلُ عَلَى الَّذِينَ يَسْتَأْذِنُونَكَ
وَهُمْ أَغْنِيَاءُ رَضُوا بِأَن يَكُونُوا مَعَ الْخَوَالِفِ
وَطَبَعَ اللَّهُ عَلَى قُلُوبِهِمْ فَهُمْ لَا يَعْلَمُونَ ﴿93﴾

---

(1). బలహీనులు (వృద్ధులు), అంధులు, వికలాంగులు, (2). వ్యాధిగ్రస్తులు, (3). యుద్ధం కొరకు బయలుదేరటానికి కావలసిన కనీస సామగ్రి కూడా లేనివారు. ఇలాంటి వారు రానందుకు నిందించకూడదు. వారు అల్లాహ్ పట్ల, ప్రవక్త పట్ల విధేయత కలిగి ఉంటే చాలు. జిహాద్ (యుద్ధం) పట్ల వారిలో సదుద్దేశం ఉండాలి. తాము శక్తిమంతులమై ఉంటే తప్పక ఈ పోరాటంలో పాల్గొనేవారమన్న మంచి ఆలోచన వారిలో ఉంటే చాలు. వారు యుద్ధం చేయలేక పోయినా దైవం పట్ల, దైవప్రవక్త పట్ల విరోధభావం కలిగిఉన్న వారిని వారు అసహ్యించుకోవాలి. అలాంటి సజ్జనులు యుద్ధం చేయలేకపోయినప్పటికీ నిందార్హులు కారు.

134. చిత్తశుద్ధి ఉన్నప్పటికీ ఆర్థిక ఒనరులు లేనందున యుద్ధంలో పాల్గొనలేకపోయిన ముస్లింల గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. మీకు ఇద్దామంటే ఏ వాహనమూ లేదే! అని ప్రవక్త చెప్పినప్పుడు వారు బాధపడతారు. యుద్ధంలో పాల్గొనలేక పోతున్నందుకు వారి కళ్లల్లోనుంచి కన్నీరు ఉబికివస్తుంది. వారు నికార్సయిన ముస్లింలు. అల్లాహ్ వారితో ప్రసన్నుడవుగాక! వారిపై వేలెత్తడానికి ఏ ఆస్కారమూ లేదు. అల్లాహ్ అంతర్బాహ్యాల స్థితిని బాగా ఎరిగినవాడు. ఆయన వాళ్లకు యుద్ధం నుంచి మినహాయింపును ఇచ్చాడు. అలాంటి నిష్కల్మష మనస్కుల గురించి ఒక హదీసు ఉంది. మహనీయ ముహమ్మద్(స) వారు ధర్మయుద్ధంలో పాల్గొంటున్న ముస్లింలతో, ఈ సజ్జనుల గురించి ప్రస్తావిస్తూ ఇలా వక్కాణించారు– "మీ వెనుక మదీనాలో కొంతమంది ఉన్నారు. మీరు ఏ లోయను దాటినా, ఏ మార్గం గుండా నడచిపోయినా ఆ పుణ్య ఫలంలో మీతో పాటు వారూ సమాన భాగస్థులే." "వారు మదీనాలో కూర్చుండి పోయినప్పటికీ వారికీ పుణ్యఫలం ఎలా లభిస్తుంది?" అని సహచరులు (రజి) సందేహపడగా, "తగు కారణం వారిని కట్టిపడేసింది" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్; సహీహ్ ముస్లిం – కితాబుల్ ఇమార....)

135. 86, 87వ ఆయతులలో ప్రస్తావించబడిన కపటులే మళ్లీ యిక్కడ ప్రస్తావనకు వచ్చారు. చిత్తశుద్ధిగల ముస్లింల మానసిక పరిస్థితి ఇలా ఉండగా మరోవైపున కపటుల ధోరణి తద్భిన్నంగా ఉంటుందని తెలియజెప్పడానికే వీళ్ల ఉపమానం ఇవ్వబడింది. మూలంలో '**ఖవాలిఫ్**' అని అనబడింది. ఇది ఖాలిఫతున్‌కు బహువచనం. 'ఖాలిఫతున్' అంటే వెనుక ఉండిపోయినవారు. అంటే మహిళలు, బాలబాలికలు, వికలాంగులు, వృద్ధులు, బలహీనులు. వారు యుద్ధంలో పాల్గొనలేరు. కాని తగు కారణమేదీ లేకుండానే బాధ్యతల నుంచి పలాయనం చిత్తగించే శ్రీమంతులు (కపటులు) ఇక్కడ తీవ్రంగా నిందించబడ్డారు. అకారణంగా ఇలా వెనుక ఉండిపోవటం ఎంతఘోరమైన తప్పిదమో వారికి తెలిసి ఉంటే, వారిలా చేసేవారు కాదు.

**94** మీరు వారి వద్దకు తిరిగి వెళ్ళినప్పుడు, వారు మీ దగ్గరకు వచ్చి సాకులు చెబుతారు. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను : "సాకులు చెప్పకండి. మీరు చెప్పే ఏ మాటనూ మేము నమ్మ బోము. మీ సమాచారమంతా అల్లాహ్ మాకు తెలియజేశాడు. ఇకమీదట కూడా అల్లాహ్, ఆయన ప్రవక్త మీ కార్యకలాపా లను గమనిస్తూనే ఉంటారు. తరువాత మీరంతా గోచరాగోచర విషయాలన్నీ తెలిసిన వానివైపుకు మరలింపబడతారు. మరి మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో ఆయన మీకు తెలుపుతాడు."

يَعْتَذِرُونَ إِلَيْكُمْ إِذَا رَجَعْتُمْ إِلَيْهِمْ ۚ
قُل لَّا تَعْتَذِرُوا لَن نُّؤْمِنَ لَكُمْ قَدْ نَبَّأَنَا اللَّهُ
مِنْ أَخْبَارِكُمْ ۚ وَسَيَرَى اللَّهُ عَمَلَكُمْ وَرَسُولُهُ
ثُمَّ تُرَدُّونَ إِلَىٰ عَالِمِ الْغَيْبِ وَالشَّهَادَةِ فَيُنَبِّئُكُم
بِمَا كُنتُمْ تَعْمَلُونَ (94)

**95** మీరు వారి వద్దకు తిరిగి వెళ్ళినప్పుడు, మీరు వారిని వారి మానాన వదలిపెడతారన్న ఉద్దేశంతో, వారు మీ ముందు అల్లాహ్‌పై ప్రమాణాలు చేయటం మొదలెడతారు. కాబట్టి మీరు వాళ్ళను వాళ్ళ మానాన వదలిపెట్టండి. వాళ్ళు పరమ అశుద్ధులు. వారు సంపాదించుకున్న దానికి ప్రతిఫలంగా వారి నివాస స్థానం నరకం అవుతుంది.

سَيَحْلِفُونَ بِاللَّهِ لَكُمْ إِذَا انقَلَبْتُمْ إِلَيْهِمْ لِتُعْرِضُوا
عَنْهُمْ ۖ فَأَعْرِضُوا عَنْهُمْ ۖ إِنَّهُمْ رِجْسٌ ۖ وَمَأْوَاهُمْ
جَهَنَّمُ جَزَاءً بِمَا كَانُوا يَكْسِبُونَ (95)

**96** మీరు వారిపట్ల ప్రసన్నులవుతారన్న ఉద్దేశంతోనే వారు ప్రమాణాలు చేస్తారు. ఒకవేళ మీరు వారి పట్ల ప్రసన్నులైనా అల్లాహ్ మాత్రం ఆ అవిధేయుల పట్ల ప్రసన్నుడు అవడు.[136]

يَحْلِفُونَ لَكُمْ لِتَرْضَوْا عَنْهُمْ ۖ فَإِن تَرْضَوْا عَنْهُمْ
فَإِنَّ اللَّهَ لَا يَرْضَىٰ عَنِ الْقَوْمِ الْفَاسِقِينَ (96)

136. తబూక్ యుద్ధ సందర్భంగా కల్లబొల్లి కబుర్లు చెప్పి, యుద్ధం నుంచి తప్పించుకున్న నయవంచకుల (కపటుల, మునాఫిఖ్‌ల) ప్రస్తావన ఈ (94-96) ఆయతులలో ఉంది. దైవప్రవక్త (సఅసం), ప్రవక్త ప్రియసహచరులు క్షేమంగా మదీనాకు తిరిగివచ్చేసరికి, వారు బిక్కచచ్చిపోయారు. అందరి సమక్షంలోకీ వచ్చి మరోసారి కుంటిసాకులు చెప్పటం మొదలెట్టారు. పదే పదే దేవునిపేర ప్రమాణాలు చేయసాగారు. ఆ విధంగానయినా ముస్లింల విశ్వాసాన్ని చూరగొనా లన్నది వాళ్ల తాపత్రయం. కాని వాళ్ల మనోభిరామం ఏమిటో అల్లాహ్ తనప్రవక్తకు తెలియపరచాడు. వాళ్ల కల్లబొల్లి కబుర్లను నమ్మరాదని కూడా తాకీదు చేశాడు. ఆ మాటే దైవప్రవక్త వాళ్లకు చెప్పేశారు. ఆయన (స) ఇలా అన్నారు: మేము మీ బూటకపు సంజాయిషీని ఎలా నమ్మేది? మీ మాటల్లో ఏ మేరకు వాస్తవం ఉందో సమీప భవిష్యత్తులో మరింత స్పష్టంగా తెలిసిపోతుంది. మీ కార్యకలాపాలను అల్లాహ్ బాగా కనిపెట్టుకుని ఉన్నాడు. దైవప్రవక్త (స) కూడా మీ పోకడలపై, కదలికలపై నిఘా వేసి ఉంచారు. ఒకవేళ అప్పటికీ మీరు ముస్లిములను ఏమార్చగలిగినప్పటికీ, ఆఖరికి మీరంతా మరలి పోవలసింది అల్లాహ్ వద్దకే కదా! మీ లోగుట్టు అంతా ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. ఆయన్ని మీరు ఎట్టి పరిస్థితిలోనూ మోసపుచ్చలేరు. మీ చిట్టాపద్దులన్నింటినీ ఆయన మీ ముందుంచేస్తాడు.

మీరు చూసీ చూడనట్లుగా, తెలిసీ తెలియనట్లుగా వ్యవహరిస్తారేమోనని వాళ్లు ఆశలు పెట్టుకున్నారు. అందుకే వారు మాట్లాడితే "దేవుని తోడు" అంటున్నారు. కాబట్టి నువ్వు వాళ్లను వాళ్ల మానాన వదలిపెట్టు. తమ ఆలోచనల రీత్యా, ఆచరణల దృష్ట్యా వాళ్లు పరమ అశుద్ధులు. వారు చేసిన పాపానికి ప్రతిఫలం నరకం తప్ప మరొకటి కాదు.

(ఓ ముహమ్మద్!) నీ మెప్పు పొందాలన్న తాపత్రయంతో వాళ్లు అదేపనిగా ప్రమాణాలు చేస్తారు. వాళ్లు ఒట్టి మూర్ఖులు. వాళ్ల హామీలను నువ్వు నమ్మినా, వారి ఆంతర్యాలలో తిష్ఠవేసివున్న తిరస్కారవైఖరి గురించి అల్లాహ్‌కు తెలియదని ఎలా అనుకున్నారట?! ఒకవేళ నువ్వు వారిని నమ్మినా, ఆ అవిధేయులను దేవుడు మాత్రం నమ్మడు.

**97** పల్లెటూరి బైతులు అవిశ్వాసం, కాపట్యంలో మరింత కరడుగట్టినవారు.[137] అల్లాహ్ తన ప్రవక్తపై అవతరింపజేసిన ఆదేశాల గురించి వారికి తెలియకుండా ఉండే అవకాశాలు ఎక్కువ.[138] అల్లాహ్ మహాజ్ఞాని, గొప్ప వివేకవంతుడు.

اَلْاَعْرَابُ اَشَدُّ كُفْرًا وَّنِفَاقًا وَّاَجْدَرُ اَلَّا يَعْلَمُوْا حُدُوْدَ مَآ اَنْزَلَ اللّٰهُ عَلٰى رَسُوْلِهٖ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ﴿97﴾

**98** తాము ఖర్చుపెట్టేదంతా ఒక విధంగా తమపై విధించబడిన జరిమానా[139] అని భావించేవారు కూడా ఈ పల్లెవాసులలో కొందరున్నారు.[140] మీపై చెడ్డ కాలం[141] ఎప్పుడు వస్తుందా! అని వారు ఎదురు చూస్తున్నారు. చెడ్డకాలం వాళ్లపైనే వచ్చి పడు తుంది.[142] అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ ఎరిగినవాడు.

وَمِنَ الْاَعْرَابِ مَنْ يَّتَّخِذُ مَا يُنْفِقُ مَغْرَمًا وَّيَتَرَبَّصُ بِكُمُ الدَّوَآئِرَ ؕ عَلَيْهِمْ دَآئِرَةُ السَّوْءِ ؕ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ﴿98﴾

**99** మరి ఈ పల్లెజనులలోనే అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించేవారు కూడా ఉన్నారు. తాము ఖర్చుపెట్టే సొమ్మును దైవ సామీప్యం పొందే, దైవప్రవక్త వేడుకోలుకు (దుఆకు) సాధనంగా

وَمِنَ الْاَعْرَابِ مَنْ يُّؤْمِنُ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ وَيَتَّخِذُ مَا يُنْفِقُ قُرُبٰتٍ عِنْدَ اللّٰهِ وَصَلَوٰتِ

137. ఇంతవరకూ మదీనా నగరంలో నివసించే కపటుల గురించి వచ్చింది. మదీనా చుట్టుప్రక్కల గల పల్లెప్రాంతాలలో కూడా మరికొంతమంది కపటులు ఉండేవారు. వీరిని 'ఆరాబ్' అని అనేవారు. 'ఆరాబీ' దీని ఏకవచనం. నగరవాసుల, పట్టణవాసుల సభ్యతా సంస్కారాలతో పోల్చిచూస్తే వీళ్లలో మొరటుతనం, కరకుతనం మరీ ఎక్కువ. అవిశ్వాసం, కాపట్యం విషయంలో కూడా అదే పరిస్థితి! అంటే పట్టణ ప్రాంతాలలో నివసించే కపటులకన్నా పల్లె ప్రాంతాల కపటులు మరింత కర్కశులుగా ఉండేవారు. ఆ మాటకొస్తే దైవాదేశాల గురించి కూడా వారికి అంతగా తెలీదు. ఈ ఆయతులో వారి గురించే చెప్పబడింది. కొన్ని హదీసుల ద్వారా కూడా ఈ పల్లెటూరి బైతుల ప్రవర్తన ఎలా ఉండేదో తెలుస్తోంది. ఉదాహరణకు : ఒకసారి కొంతమంది పల్లెటూరి బైతులు (ఆరాబీలు) దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చారు. "ఏమిటీ, మీరు చిన్న పిల్లలను ముద్దాడుతున్నారా?" అని వారు ఆశ్చర్యంగా అడిగారు. "అవును" అని ప్రవక్త సహచరులు (రజి) జవాబిచ్చారు. "దైవసాక్షి! మేము మాత్రం అలా ముద్దుపెట్టుకోము" అని వాళ్ళు అన్నారు. దానికి దైవప్రవక్త (స), "దేవుడు మీ మనసుల్లో నుంచి దయాదాక్షిణ్యాలను, ప్రేమానురాగాలను తీసివేస్తే దానికి నేనేం చేయను?" అని చురక అంటించారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ అదబ్; సహీహ్ ముస్లిం – కితాబుల్ ఫజాయెల్).

138. ఎందుకంటే వారు నగరానికి దూరాన ఉండేవారు. దైవం మరియు దైవప్రవక్త (స) వారి ఉపదేశాలను వినే అవకాశం వారికి చాలా తక్కువగా లభించింది.

139. మూలంలో **'మగ్రమ్'** అని చెప్పబడింది. అసలు ఇది "గుర్‌మున్" నుంచి వచ్చింది. పరిహారాన్ని, జరిమానాను 'గుర్‌మున్' అంటారు. ఈ ఆయతుకు భావం ఏమిటంటే దైవమార్గంలో ఖర్చు పెట్టాలంటే కపటులకు మనసొప్పేది కాదు. గత్యంతరం లేక ఖర్చుపెడుతున్నట్లు భావించేవారు.

140. ఇప్పుడు ఈ పల్లెవాసులలో రెండు రకాల వారున్నారు. వీరు మొదటి రకానికి చెందినవారు.

141. అరబీలో **'దవాయిర్'** అని అనబడింది. ఇది 'దాయిరతున్'కు బహువచనం. దాయిరతున్ అంటే కాలచక్రం. ఇక్కడ కష్టం, ఆపద అని భావం. కాలచక్రంలో ఎగుళ్లు దిగుళ్లు సహజమే. అయితే ముస్లింలపై కష్టకాలం వస్తే బావుండునని వాళ్లు అనుకుంటూ ఉండేవారు.

142. యదార్థానికి వారి దుష్ట సంకల్పం మూలంగా చెడ్డకాలం వారిపైనే వచ్చిపడుతుంది. వారే దానికి అర్హులు. లేక చెడ్డకాలం వారిమీదే పడుగాక! అని ఇది వారికి శాపం కావచ్చు.

الرَّسُولِ ۚ أَلَآ إِنَّهَا قُرْبَةٌ لَّهُمْ ۚ سَيُدْخِلُهُمُ
اللَّهُ فِي رَحْمَتِهِ ۗ إِنَّ اللَّهَ غَفُورٌ رَّحِيمٌ ﴿٩٩﴾

ఉపయోగపడే వస్తువుగా వారు తలపోస్తారు.[143] తెలుసుకోండి! వారు చేసే ఈ ఖర్చు నిశ్చయంగా వారి యెడల సామీప్య సాధనం అవుతుంది. అల్లాహ్ తప్పకుండా వారిని తన కారుణ్యంలో చేర్చు కుంటాడు.[144] నిస్సందేహంగా అల్లాహ్ క్షమాశీలుడు, దయా మయుడు.

وَالسَّابِقُونَ الْأَوَّلُونَ مِنَ الْمُهَاجِرِينَ وَالْأَنصَارِ
وَالَّذِينَ اتَّبَعُوهُم بِإِحْسَانٍ رَّضِيَ اللَّهُ عَنْهُمْ
وَرَضُوا عَنْهُ وَأَعَدَّ لَهُمْ جَنَّاتٍ تَجْرِي تَحْتَهَا
الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا أَبَدًا ۚ ذَٰلِكَ الْفَوْزُ
الْعَظِيمُ ﴿١٠٠﴾

**100** ముహాజిర్లలో, అన్సార్లలో ప్రప్రథమంగా ముందంజ వేసిన వారితోనూ, తరువాత చిత్తశుద్ధితో వారిని అనుసరించిన వారి తోనూ[145] అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు.[146] వారు అల్లాహ్ పట్ల ప్రసన్నులయ్యారు. క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలను అల్లాహ్ వారి కోసం సిద్ధంచేసి ఉంచాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. గొప్ప సాఫల్యం అంటే ఇదే.

143. వీరు పల్లెవాసుల్లో రెండవ కోవకు చెందినవారు. పట్టణ ప్రాంతాలకు కడు దూరాన ఉన్నప్పటికీ అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించే భాగ్యం అల్లాహ్ వీరికి వొసగాడు. విశ్వాసం (ఈమాన్) చలువ వల్ల అల్లాహ్ వారిలోని అజ్ఞానాన్ని, అనాగరికతను కూడా పారద్రోలాడు. తత్ఫలితంగా వారు దైవమార్గంలో చేసే ఖర్చును జరిమానాగా భావించేబదులు దైవసామీప్యాన్ని పొందే అత్యుత్తమ సాధనంగా తలపోసేవారు. తాము చేసే దానధర్మాల ద్వారా దైవప్రవక్త (సఅసం) గారి దీవెనలు లభిస్తాయని భావించేవారు. దానధర్మాలు చేసే వారికోసం మహాప్రవక్త (సఅసం) దుఆ (వేడుకోలు) చేసేవారని దీనిద్వారా సంకేతం లభిస్తోంది. తన వద్దకు 'సదఖా' ను తెచ్చిన ఒక వ్యక్తినుద్దేశించి, "ఓ అల్లాహ్! అబూ ఔఫా కుటుంబీకులపై కారుణ్యాన్ని కురిపించు" అని ఆయన దుఆ చేశారు (సహీహ్ బుఖారీ: హదీసు నెంబరు – 4166; సహీహ్ ముస్లిం – హదీసు నెంబరు: 756).

144. దైవకారుణ్యం వారికి ప్రాప్తిస్తుందన్న దానికి, వారు దైవకారుణ్యానికి అర్హులు అన్నదానికి ఇది ప్రబల తార్కాణం.

145. ఈ ఆయతులో మూడు వర్గాల గురించి చెప్పబడింది. 1. ముహాజిర్లు 2. అన్సారులు 3. ముహాజిర్లను, అన్సార్లను చిత్తశుద్ధితో అనుసరించేవారు.

**1. ముహాజిర్లు :** ఇస్లాం ధర్మం కోసం దైవాజ్ఞపై, దైవప్రవక్త ఆదేశంపై మక్కా తదితర ప్రాంతాల నుంచి మదీనాకు వలసపోయినవారు. దీనికోసం తమ ఇల్లూ వాకిలినీ, ఆస్తిపాస్తులను, ఆప్తులను సయితం వదులుకున్నవారు.

**2. అన్సారులు :** మదీనాలో నివసించే విశ్వాసులు. వీరు అడుగడుగునా దైవప్రవక్త (సఅసం)కు ఆదరువుగా నిలిచారు. దైవమార్గంలో మదీనాకు ప్రస్థానం (హిజ్రత్) చేసి వచ్చిన ముహాజిర్లను అన్నివిధాలా ఆదుకున్నారు. వారిని తమ అన్నదమ్ముల్లా చూసుకున్నారు. వారికోసం తమ సర్వస్వాన్నీ త్యాగం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ రెండు వర్గాల గురించి ప్రస్తావిస్తూ వారిలో "ప్రప్రథమంగా ముందంజవేసిన వారు" (సాబిఖూన్, అవ్వలూన్) అని చెప్పటం గమనార్హం. ఇంతకీ ముందంజ వేసిన ఆ ధన్యజీవులు ఎవరు?– ఈ విషయంలో వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు ఖిబ్లాల వైపుకు తిరిగి నమాజ్ చేసిన తొల్దొలి ముస్లింలు – అంటే బైతుల్ మఖ్దిస్ ఖిబ్లాగా ఉన్నకాలంలోనే ఇస్లాం స్వీకరించిన ముహాజిర్ మరియు అన్సారులు 'సాబిఖూన్ అవ్వలూన్'గా పరిగణించబడతారని కొంతమంది పండితులు భావించగా, హుదైబియా ఒడంబడిక సందర్భంగా 'బైతె రిజ్వాన్' (రిజ్వాన్ ప్రమాణం)లో పాల్గొన్న సహాబీలు వీరు అని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. బద్ర్ రణరంగంలో పాల్గొన్నవారని ఇంకొంతమంది చెప్పారు. ఇమామ్ షౌకానీ దృష్టిలో పైన ప్రస్తావించబడిన వారంతా ఈ అత్యుత్తమ శ్రేణికి చెందినవారే.

**101** ఇకపోతే; మీ చుట్టుప్రక్కల ఉండే పల్లెవాసులలోనూ, మదీనాలో నివసించే వారిలోనూ కొందరు వంచకులు (మునాఫిక్‌లు) ఉన్నారు. వారు వంచనలో మహా మొండివారు.[147] (ఓ ప్రవక్తా!) నువ్వు వారిని ఎరుగవు.[148] వారెవరో మాకు తెలుసు. మేము వారికి రెట్టింపు శిక్షను విధిస్తాము.[149] అనంతరం వారు ఘోరమైన శిక్ష వైపుకు తరలించబడతారు.

وَمِمَّنْ حَوْلَكُمْ مِّنَ الْاَعْرَابِ مُنٰفِقُوْنَ ۛؕ
وَمِنْ اَهْلِ الْمَدِيْنَةِ ۛ مَرَدُوْا عَلَى النِّفَاقِ
لَا تَعْلَمُهُمْ ؕ نَحْنُ نَعْلَمُهُمْ ؕ سَنُعَذِّبُهُمْ
مَّرَّتَيْنِ ثُمَّ يُرَدُّوْنَ اِلٰى عَذَابٍ عَظِيْمٍ ﴿101﴾

**102** తమ తప్పులను ఒప్పుకున్నవారు[150] మరికొందరున్నారు. వారు మిశ్రమమైన కర్మలు చేశారు – కొన్ని సత్కార్యాలు, కొన్ని దుష్కార్యాలు![151] అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడన్న ఆశ ఉంది.[152] నిశ్చయంగా అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు.

وَاٰخَرُوْنَ اعْتَرَفُوْا بِذُنُوْبِهِمْ خَلَطُوْا عَمَلًا
صَالِحًا وَّاٰخَرَ سَيِّئًا ؕ عَسَى اللّٰهُ اَنْ يَّتُوْبَ
عَلَيْهِمْ ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿102﴾

---

**3. చిత్తశుద్ధితో ముహాజిర్లను, అన్సార్లను అనుసరించేవారు :** వీరు బహుశా తాబయీలు అయి ఉంటారనీ, దైవప్రవక్త (సఅసం) ను తమ కళ్లతో చూడకపోయినప్పటికీ ప్రవక్త ప్రియసహచరుల (రజి) జీవితాలను చూసి, ప్రభావితులై వారిని ఖచ్చితంగా అనుసరించినవారని కొంతమంది అభిప్రాయపడ్డారు. కాగా; ప్రళయదినం వరకూ ముహాజిర్లను, అన్సార్లను ప్రేమిస్తూ వారి అడుగుజాడలలో నడిచే ముస్లింలంతా ఈ కోవలోకి వస్తారని మరికొంతమంది పండితులు సూత్రీకరించారు.

146. “అల్లాహ్ వారితో ప్రసన్నుడయ్యాడు” అంటే అల్లాహ్ వారి సత్కర్మలను ఆమోదించాడనీ, మానవ సహజమైనవారి దౌర్బల్యాలను క్షమించాడని అర్థం. ఒకవేళ ఆయన గనక అప్రసన్నుడై ఉంటే వారికి స్వర్గలోక శుభవార్త ఇవ్వబడి ఉండేది కాదు. దేవుని ఈ ప్రసన్నత తాత్కాలికమైనది కాదు, అది శాశ్వతమైనది. అల్లాహ్ వారి తప్పులను మన్నించి వారిపట్ల సంతుష్టుడైనప్పుడు మనం ఆ మహనీయుల జీవితాలపై, వారి చర్యలపై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేయటం ఎంతమాత్రం తగదు. పైగా మనం వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి. నిజాయితీగా వారిని అనుసరిస్తే అది దైవప్రసన్నతను చూరగొనే సాధనమవుతుంది. ఒకవేళ మనం ఆ మహనీయుల పట్ల వైరభావం గానీ, ద్వేషంగానీ పెంచుకున్నామంటే అది దేవుని అప్రసన్నతకు కారణం కావచ్చు.

147. మూలంలో **“మరదూ అలన్నిఫాఖ్”** అని ఉంది. అరబీలో ‘మరద’ లేక ‘తమర్రద’ అనే పదాలకు నునుపు, జారుడుతనం, ఒకటిగా నుండటం అనే అర్థాలు వస్తాయి. అందుకే ఆకులులేని కొమ్మను, వెంట్రుకలు ఉండని గుర్రాన్ని, అలాగే ముఖంపై వెంట్రుకలు మొలవని పిల్లవాణ్ణి కూడా అరబీలో ‘అమ్‌రద్’ అని అంటారు. మొత్తానికి పై ఆయతులో ‘మరదూ అలన్నిఫాఖ్’ అంటే కాపట్యం కోసం వారు తమను అంకితం చేసుకున్నారు, కాపట్యంలో రాటుదేలారు, దానిమీద పాతుకుపోయారు అని భావం.

148. ఈ వాక్యం ద్వారా అంతిమ దైవప్రవక్త (స)కు అగోచర విషయాల జ్ఞానం లేదని స్పష్టంగా బోధపడుతున్నది. అంతిమ దైవప్రవక్త (స)కు రహస్య విషయాల జ్ఞానం ఉందని వితండవాదన చేసే ప్రబుద్ధుల (అహ్లె బిద్అతీల)కు ఈ వాక్యం కనువిప్పు కలిగించాలి!

149. రెట్టింపు శిక్ష అంటే ఒకటి ప్రాపంచిక జీవితంలో కలిగే పరాభవం, మరొకటి పరలోక శిక్ష అని కొంతమంది వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే ఈ రెట్టింపు శిక్ష పడుతుందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు.

150. బలమైన కారణమేదీలేకుండా, కేవలం సోమరితనం మూలంగా తబూక్ పోరాటానికి వెళ్ళలేకపోయిన నికార్సయిన ముస్లింలనుద్దేశ్యించి ఈ విధంగా అనబడింది. వారు తమ తప్పును ఒప్పుకోవటమే గాక, దైవనిర్ణయం కోసం నిరీక్షించారు.

**103** (ఓ ప్రవక్తా!) నువ్వు వారిని పరిశుద్ధపరచటానికీ, వారిని తీర్చిదిద్దటానికీ వారి సంపదల నుంచి దానాలను తీసుకో. వారి బాగోగుల కోసం ప్రార్థించు.[153] నిస్సందేహంగా నీ ప్రార్థన (దుఆ) వల్ల వారికి శాంతి లభిస్తుంది. అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

خُذْ مِنْ أَمْوَالِهِمْ صَدَقَةً تُطَهِّرُهُمْ وَتُزَكِّيهِمْ بِهَا وَصَلِّ عَلَيْهِمْ ۖ إِنَّ صَلَوٰتَكَ سَكَنٌ لَّهُمْ ۗ وَاللَّهُ سَمِيعٌ عَلِيمٌ ﴿١٠٣﴾

**104** ఏమిటీ, అల్లాహ్‌యే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడనీ, దానధర్మాలను ఆమోదిస్తాడనీ,[154] పశ్చాత్తాపాన్ని అంగీకరించటంలోనూ, దయజూపటంలోనూ అల్లాహ్‌యే మేటి అనీ వారికి తెలియదా?

أَلَمْ يَعْلَمُوا أَنَّ اللَّهَ هُوَ يَقْبَلُ التَّوْبَةَ عَنْ عِبَادِهِ وَيَأْخُذُ الصَّدَقَٰتِ وَأَنَّ اللَّهَ هُوَ التَّوَّابُ الرَّحِيمُ ﴿١٠٤﴾

**105** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీ పనులు మీరు చేస్తూపోండి. మీ పనులను అల్లాహ్ స్వయంగా చూస్తాడు. ఆయన ప్రవక్త మరియు విశ్వాసులు కూడా (చూస్తారు). గోప్యమైన వాటినీ,

وَقُلِ اعْمَلُوا فَسَيَرَى اللَّهُ عَمَلَكُمْ وَرَسُولُهُ وَالْمُؤْمِنُونَ ۖ وَسَتُرَدُّونَ إِلَىٰ عَٰلِمِ الْغَيْبِ

151. **'సత్కార్యాలు'** అంటే యుద్ధానికి ముందు వారు చేసుకున్న మంచిపనులు. **'దుష్కార్యాలు'** అంటే తబూక్ యుద్ధానికి వారు సకాలంలో బయలుదేరకపోవటం.

152. అల్లాహ్ **'ఆశ ఉంది'** అని అన్నాడంటే, ఇక అది తప్పకుండా జరుగుతుందనే అర్థం. నిజాయితీగా చెందిన పశ్చాత్తాపాన్ని ఆయన తప్పకుండా సమ్మతిస్తాడు. ఎట్టకేలకు జరిగింది కూడా అదే. అల్లాహ్ తన దయతో వారివైపుకు మరలి, వారి తప్పులను క్షమించాడు.

153. ఇది సర్వసాధారణమైన ఆదేశం. ఇక్కడ 'సదఖా' (దానం) అంటే అర్థం విధిగా చెల్లించవలసిన దానమూ (జకాత్) కావచ్చు లేక స్వచ్ఛందంగా చెల్లించే దానమూ (సదఖయె నాఫిలా) కావచ్చు. ఈ దానధర్మాల ద్వారా వారిని పరిశుద్ధపరచమనీ, వారి జీవితాలను తీర్చిదిద్దమనీ అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (స)ను ఆదేశించాడు. ఈ వాక్యం ద్వారా తేటతెల్లమయ్యే ఒక ముఖ్యాంశం ఏమిటంటే దానధర్మాలు మనిషి నీతీ నడవడికలను సంస్కరిస్తాయి. అతని ఆచరణలను చక్కదిద్దుతాయి. అదీగాక దానధర్మాలు ఒక విశ్వాసిలోని విశ్వసనీయతను, చిత్తశుద్ధినీ వ్యక్తపరుస్తాయి. 'సదఖా' ఇచ్చేవాడు తన ఈమాన్ (విశ్వాసం)లో 'సాదిఖ్' (సత్యసంధుడు) అయి ఉంటాడు. ఈ ఆయతు ద్వారా బోధపడే మరో ముఖ్యాంశం ఏమిటంటే సదఖా వసూలు చేసే వ్యక్తి సదఖా ఇచ్చే వారి కోసం ప్రార్థించాలి (దుఆ చేయాలి). తన ప్రవక్తకు సయితం అల్లాహ్ ఆ మేరకు ఆదేశించాడు. ఈ ఆదేశానుసారం దైవప్రవక్త (స) దుఆ చేసేవారు కూడా. సర్వసాధారణమైన ఈ ఆదేశం ద్వారా తెలిసేదేమంటే జకాత్‌ను వసూలు చేసే బాధ్యత సమకాలీన పరిపాలకునిపై ఉంటుంది. ఒకవేళ ఎవరయినా ఈ మొత్తాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తే హజ్రత్ అబూబక్ర్ (రజి), మరియు ఇతర సహాబీల వైఖరిననుసరించి వాళ్లకు వ్యతిరేకంగా జిహాద్ (యుద్ధం) చేయటం అవసరం (ఇబ్నె కసీర్).

154. **"దానధర్మాలను ఆమోదిస్తాడు"** అంటే వాటిలో సమృద్ధిని కలిగిస్తాడు. వాటిని పెంచుతాడు. (అయితే ఆ సొమ్ము ధర్మసమ్మతమైన పద్ధతిలోనే సంపాదించబడి ఉండాలి). హదీసులో ఈ విధంగా చెప్పబడింది : "మీలో ఒక వ్యక్తి గుర్రపు పిల్లను పెంచిపోషించినట్లే అల్లాహ్ మీ సదఖాను (దానాన్ని) పెంచిపోషిస్తాడు. కడకు ఒక ఖర్జూర పండుకు సమానంగా ఉండే దానం (ప్రవర్ధమానమై) ఉహుద్ పర్వతంలా తయారవుతుంది" అని మహనీయ ముహమ్మదు (స) వారు ప్రవచించారు (సహీహ్ బుఖారీ– కితాబుజ్జకాత్; ముస్లిం – కితాబుజ్జకాత్).

وَالشَّهَادَةِ فَيُنَبِّئُكُم بِمَا كُنتُمْ تَعْمَلُونَ ﴿١٠٥﴾

బహిరంగమైన వాటినీ ఎరిగినవాని వద్దకు మీరు ఎలాగూ మరలక తప్పదు. మీరు చేస్తూ ఉన్న దాన్నంతటినీ ఆయన మీకు తెలియజేస్తాడు.[155]

وَآخَرُونَ مُرْجَوْنَ لِأَمْرِ اللَّهِ إِمَّا يُعَذِّبُهُمْ وَإِمَّا يَتُوبُ عَلَيْهِمْ ۗ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿١٠٦﴾

**106** ఇంకా కొందరున్నారు – వాళ్ల వ్యవహారం దైవాదేశం వచ్చే వరకూ వాయిదా వేయబడింది.[156] అల్లాహ్ వారిని శిక్షించనూ వచ్చు[157] లేదా క్షమించనూవచ్చు.[158] అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేకవంతుడు.

وَالَّذِينَ اتَّخَذُوا مَسْجِدًا ضِرَارًا وَكُفْرًا وَتَفْرِيقًا بَيْنَ الْمُؤْمِنِينَ وَإِرْصَادًا لِّمَنْ حَارَبَ اللَّهَ وَرَسُولَهُ مِن قَبْلُ ۚ وَلَيَحْلِفُنَّ إِنْ أَرَدْنَا

**107** (కపటులలో) మరికొంతమంది కూడా ఉన్నారు – కీడు కలిగించే, అవిశ్వాసంతో కూడిన మాటలు చెప్పుకునే ఉద్దేశంతో, విశ్వాసుల మధ్య చీలికను తెచ్చే లక్ష్యంతో, అంతకు మునుపు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను వ్యతిరేకించిన వ్యక్తికి ఆసరా ఇచ్చే ఆలోచనతో వారు ఒక మస్జిదును నిర్మించారు.[159] (ఈ కట్టడాన్ని

155. మీ కర్మలను ఒక్క అల్లాహ్‌యేకాదు, దైవప్రవక్త (సఅసం), ప్రవక్త సహచరులైన విశ్వాసులు కూడా గమనిస్తారు. ఈ మాటలు కపటులను ఉద్దేశించి చెప్పబడ్డాయి. వారి ఉద్దేశాలు ఎటువంటివో అల్లాహ్ తన ప్రవక్తకు తెలియజేయగా, సందర్భాన్ని అవసరాన్ని బట్టి ప్రవక్త కూడా తన సహచరులకు ఆ కపటుల కర్మలను గురించి కొన్ని విషయాలు తెలియపరుస్తూ ఉంటారు. తద్వారా ముస్లింలు జాగ్రత్తపడతారు.

156. తబూక్ యుద్ధ సందర్భంగా వెనుక ఉండిపోయిన వారిలోని ఒక వర్గం కపటులదైతే, ఏ కారణమూ లేకుండా – బద్ధకం మూలంగా – వెనుక ఉండిపోయిన వారు మరికొందరు. అయితే వీళ్లు కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయకుండా తమ తప్పిదాన్ని ఒప్పుకున్నారు. కాని అప్పటికప్పుడే వారికి క్షమాభిక్ష లభించలేదు. వాళ్ల వ్యవహారం దైవానికి అప్పగించబడింది. ఆ వర్గం గురించిన ప్రస్తావనే యిక్కడ వచ్చింది. ఆ విధంగా చేసిన తప్పును ఒప్పుకున్న వారు మొత్తం ముగ్గురు. వారి వృత్తాంతం ముమ్మందు రాబోతుంది.

157. ఒకవేళ వారు తమ తప్పుపై హటం చేస్తే అల్లాహ్ వారిని శిక్షిస్తాడు.

158. వారు గనక మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ వారిని క్షమిస్తాడు.

159. కపటుల ఓ తుచ్ఛమైన చేష్ట గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. వారు ఒక మస్జిదును నిర్మించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు, చలిగాలులు వీస్తున్నప్పుడు తమలోని బలహీనులు, వృద్ధులు దూరం నుంచి మస్జిదె నబవీ వరకూ రావటం కష్టంగా ఉందనీ, వారి సౌలభ్యం కోసమే తాము మరొక మస్జిదును కట్టామని వారు దైవప్రవక్త (స) ను నమ్మబలికారు. తమరు గనక ఓసారి ఆ మస్జిదుకు వచ్చి నమాజు చేస్తే తమకు ఎంతో శుభం కలుగుతుందని దైవప్రవక్త (సఅసం)కు విజ్ఞప్తి చేశారు. కాని ఆ సమయంలో ఆయన (సఅసం) తబూక్‌కు బయలుదేరుతున్నారు. ప్రయాణం నుంచి తిరిగి వచ్చాక, అక్కడికి వచ్చి నమాజు చేస్తానని వాగ్దానం చేశారు. అయితే తబూక్ నుంచి తిరిగి వస్తున్నప్పుడు అల్లాహ్, వహీ ద్వారా ఆ మస్జిదు నిర్మాణం వెనుక ఉన్న దురుద్దేశాలను బట్టబయలు చేశాడు. ముస్లింల మధ్య మనస్పర్ధలను సృష్టించటం, అవిశ్వాసాన్ని వ్యాపింపజేయటం, దైవానికి, దైవప్రవక్తకు శత్రువుగా వ్యవహరిస్తున్నవారి కోసం ఆసరాను సమకూర్చటం వారి అసలు ఉద్దేశమని తెలిసిపోయింది.

إِلَّا الْحُسْنَىٰ ۖ وَاللَّهُ يَشْهَدُ إِنَّهُمْ لَكَاذِبُونَ (107)

నిర్మించటంలో) తమ ఉద్దేశం మేలు చేయటం తప్ప మరొకటి కాదని వారు ప్రమాణాలు చేస్తారు. వారు అబద్ధాలకోరులన్న విషయానికి అల్లాహ్‌యే సాక్షి.[160]

لَا تَقُمْ فِيهِ أَبَدًا ۚ لَمَسْجِدٌ أُسِّسَ عَلَى التَّقْوَىٰ
مِنْ أَوَّلِ يَوْمٍ أَحَقُّ أَن تَقُومَ فِيهِ ۚ فِيهِ رِجَالٌ
يُحِبُّونَ أَن يَتَطَهَّرُوا ۚ وَاللَّهُ يُحِبُّ الْمُطَّهِّرِينَ (108)

**108** నువ్వు ఎన్నడూ అందులో నిలబడకు.[161] అయితే తొలి నాటి నుంచే భయభక్తుల పునాదిపై నిర్మించబడిన మస్జిదు నువ్వు నిలబడటానికి అన్ని విధాలా తగినది.[162] బాగా పరిశుద్ధతను పొందటాన్ని ఇష్టపడేవారు అందులో ఉన్నారు.[163] బాగా పరిశుద్ధతను పాటించే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.

أَفَمَنْ أَسَّسَ بُنْيَانَهُ عَلَىٰ تَقْوَىٰ مِنَ اللَّهِ
وَرِضْوَانٍ خَيْرٌ أَم مَّنْ أَسَّسَ بُنْيَانَهُ عَلَىٰ
شَفَا جُرُفٍ هَارٍ فَانْهَارَ بِهِ فِي نَارِ جَهَنَّمَ ۗ
وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ (109)

**109** తన కట్టడాన్ని దైవభీతి, దైవప్రసన్నతల పునాదిపై కట్టిన వాడు ఉత్తముడా? లేక కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఏదైనా లోయ యొక్క డొల్ల అంచున తన కట్టడాన్ని కట్టినవాడు ఉత్తముడా? అటు పిమ్మట అది అతనితోపాటే నరకాగ్నిలో పడి పోయింది.[164] ఇలాంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపదు.

160. అంటే అబద్ధపు ప్రమాణాలు చేసి వారు దైవప్రవక్తను మోసగించాలనుకున్నారు. అయితే వారి కుటిల పన్నాగాలనుంచి అల్లాహ్ తన ప్రవక్తను కాపాడాడు. వారి సంకల్పంలో ఏమాత్రం శుద్ధిలేదనీ, వారు చెబుతున్నదంతా అబద్ధమని అల్లాహ్ తెలియజేశాడు.

161. అంటే – లోగడ నువ్వు చేసిన వాగ్దానాన్నుసరించి ఆ మస్జిదుకు వెళ్ళకు అని అల్లాహ్ ఆదేశించాడు. ఈ ఆదేశాన్ని ఆయన (స) శిరసావహించటమేగాక కొంతమంది సహచరులను పంపి ఆ కట్టడాన్ని కూల్చివేయించారు. దీని ఆధారంగానే ఆరాధన కోసం గాక కేవలం ముస్లింల ఐకమత్యాన్ని కొల్లగొట్టే ఉద్దేశంతో నిర్మించబడే మస్జిదును విద్వాంసులు **"మస్జిదె జిరార్"** గా అభివర్ణిస్తారు. ముస్లింలలోని చీలికను నివారించటానికీ, వారి సంఘటిత వ్యవస్థకు విఘాతం కలగకుండా ఉండటానికి అటువంటి మస్జిదులను కూల్చివేయటం అవసరమని కూడా పండితులు అభిప్రాయ పడుతున్నారు.

162. అన్ని విధాలా తగిన ఆ మస్జిదు ఇంతకీ ఏది? "మస్జిదె ఖుబా" నేపథ్యంలో ఇలా అనబడిందా? లేక 'మస్జిదె నబవీ'ని దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా ఉపదేశించబడిందా? ఈ విషయమై పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ రెండు మస్జిదులకూ ఈ ఆదేశం వర్తిస్తుందని సలఫ్‌లోని ఒక వర్గం భావించింది.

ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు : ఈ వాక్యం మస్జిదె ఖుబా నేపథ్యంలో అనబడిందని అనుకుంటే, కొన్ని హదీసుల ద్వారా భయభక్తుల ప్రాతిపదికపై నిర్మించబడిన మస్జిదు 'మస్జిదె నబవీ' అని తెలుస్తోంది. ఈ రెండింటి మధ్య వ్యాఘాతం కూడా లేదు. ఒకవేళ తొలినాటి నుంచే మస్జిదె ఖుబాలో ఈ గుణం (భయభక్తుల గుణం) సమృద్ధిగా ఉందని అనుకుంటే, మస్జిదె నబవీ ఆసాంతం భయభక్తులతో తొణికిసలాడుతూ ఉంది.

163. పరిశుద్ధతను బాగా పాటించే ఈ సజ్జనులు ఎవరు? వారు ఖుబా వాసులని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. "అల్లాహ్ మీ శుచీ శుభ్రతలను కొనియాడాడు, ఇంతకీ మీరు ఏం చేస్తారు?" అని దైవప్రవక్త (స) వాళ్లను ఒకసారి దర్యాప్తు చేయగా, "మేము మట్టి పెడ్డలను ఉపయోగించటంతో పాటు, నీరును కూడా ఉపయోగిస్తాం" అని వారు వివరించారు (ఇబ్నె కసీర్).

ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా వ్యాఖ్యానించారు: "ఒకే ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలన్న సత్సంకల్పంతో

**110** (తమ మనసుల్లోని) అనుమానం మూలంగా వారు కట్టిన ఆ కట్టడం నిత్యం వారి హృదయాలను (ముల్లు మాదిరిగా) కెలుకు తూనే ఉంటుంది. వారి హృదయాలు పగిలి తునాతునకలై పోతే అది వేరే విషయం.[165] అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేక సంపన్నుడు.

لَا يَزَالُ بُنْيَانُهُمُ الَّذِي بَنَوْا رِيبَةً فِي قُلُوبِهِمْ
إِلَّا أَن تَقَطَّعَ قُلُوبُهُمْ ۗ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿١١٠﴾

**111** నిస్సందేహంగా అల్లాహ్ ముస్లింల నుండి, వారి ధన ప్రాణాలను స్వర్గానికి బదులుగా కొన్నాడు.[166] వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు; చంపుతారు, చంపబడతారు. దీనిపై తౌరాతులోనూ, ఇంజీలులోనూ, ఖుర్ఆన్‌లోనూ సత్యమైన వాగ్దానం చేయబడింది. వాగ్దానాన్ని నెరవేర్చటంలో అల్లాహ్‌ను మించిన వాడెవడుంటాడు?[167] కాబట్టి మీరు ఖరారు చేసిన ఈ వర్తకానికిగాను సంబరపడండి.[168] ఘన విజయం అంటే ఇదే.

إِنَّ اللَّهَ اشْتَرَىٰ مِنَ الْمُؤْمِنِينَ أَنفُسَهُمْ وَأَمْوَالَهُم
بِأَنَّ لَهُمُ الْجَنَّةَ ۚ يُقَاتِلُونَ فِي سَبِيلِ اللَّهِ فَيَقْتُلُونَ
وَيُقْتَلُونَ ۖ وَعْدًا عَلَيْهِ حَقًّا فِي التَّوْرَاةِ
وَالْإِنجِيلِ وَالْقُرْآنِ ۚ وَمَنْ أَوْفَىٰ بِعَهْدِهِ مِنَ اللَّهِ
فَاسْتَبْشِرُوا بِبَيْعِكُمُ الَّذِي بَايَعْتُم بِهِ ۚ
وَذَٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيمُ ﴿١١١﴾

---

నిర్మించిన పురాతన మస్జిదులలో నమాజ్ చేయటం అభిలషణీయం అన్న దానికి ఈ ఆయతు నిదర్శనం. అలాగే సజ్జనులు పాల్గొనే సామూహిక నమాజుకు హాజరవటం, శుచీ శుభ్రతల విషయంలో చాలా ఖచ్చితంగా ఉండేవారితో కలసి నమాజు చేయటం కూడా అభిలషణీయమే.”

164. ఈ ఆయతులో కపటి కర్మలకు–విశ్వాసి కర్మలకు మధ్య ఉండే స్పష్టమైన వ్యత్యాసం తెలియజేయడానికి ఈ ఉపమానం ఇవ్వబడింది. విశ్వాసి ఎప్పుడు ఏ మంచి పనిచేసినా అది దైవభీతి, దైవప్రసన్నతలపై ఆధారపడి ఉంటుంది. కాగా; కపటి చేసే సత్కార్యం ప్రదర్శనా బుద్ధితో కూడుకుని ఉంటుంది. లేదా దాని వెనుక మరేదైనా దురుద్దేశం ఉండి ఉంటుంది. అతని ఈ సదాచరణ నీరు ప్రవహించే లోయప్రక్కన గల ఇసుక గట్టు లాంటిది. ఆ నీరు వేగంగా ప్రవహిస్తూ క్రింది నుంచి నేలను కొద్దికొద్దిగా కోస్తూ ఉంటుంది. తత్కారణంగా ఆ గట్టు ఏమాత్రం భరోసాలేనిది. అక్కడ కట్టబడిన కట్టడం ఏ క్షణంలోనయినా – పేకమేడలా – కుప్పకూలిపోవచ్చు. మదీనా నగరంలో కపటులు నిర్మించిన మస్జిదు కూడా అలాంటిదే. అది వారిని నరకాగ్నిలో పడవేయటం ఖాయం.

165. హృదయాలు తునాతునకలై పోవటం అంటే, మృత్యువు వారిని కబళించే వరకూ వారు తలపెట్టిన విచ్ఛిన్నకర పని వారి గుండెల్లో సందేహపు గునపంలా గుచ్చుకుంటూనే ఉంటుంది. తద్వారా వారి హృదయాల్లోని కాపట్యం మరింత పెరుగుతుంది. వారు పోయి నరకాగ్నిలో పడేవరకూ అంతే.

166. విశ్వాసుల ధనప్రాణాలను స్వర్గానికి బదులుగా కొన్నానని అల్లాహ్ చెప్పటం ఆయన మహదనుగ్రహానికి ఒక నిదర్శనం. ఎందుకంటే ధనప్రాణాలు కూడా స్వయంగా అల్లాహ్ ప్రసాదించినవే. వాటిని తన మార్గంలో వెచ్చించినందుకు అమూల్యమైన స్వర్గాన్ని ప్రసాదిస్తానని అనటం గొప్ప కటాక్షం. ఎంత చక్కని బేరం ఇది!

167. సత్యమైన ఈ వాగ్దానాన్ని అల్లాహ్ వెనుకటి గ్రంథాలలోనూ చేశాడు. ఖుర్ఆన్ గ్రంథంలోనూ చేశాడు. వాగ్దానాన్ని నెరవేర్చటంలో అల్లాహ్‌కు సాటి రాగల వారెవరుంటారు?

168. ముస్లింలనుద్దేశించి ఈ మాటలనబడుతున్నాయి. అయితే ముస్లింలు ఈ వాణిజ్య వ్యవహారం చేసినప్పుడు మాత్రమే వారికి ఈ శుభవార్త వర్తిస్తుంది. అంటే దైవమార్గంలో ధనప్రాణాలను అర్పించటానికి వారు ఎన్నడూ వెరవకూడదు.

**112** వారు ఎలాంటి వారంటే; (దైవ సన్నిధిలో) పశ్చాత్తాపం చెందుతూ, ఆరాధనలు చేస్తూ ఉంటారు, అల్లాహ్ స్తోత్రం చేస్తారు, ఉపవాసాలుంటారు (లేక అల్లాహ్ మార్గంలో భూమి మీద సంచారం చేస్తూ ఉంటారు), అల్లాహ్ సమక్షంలో వంగుతూ, సాష్టాంగపడుతూ ఉంటారు. మంచి పనుల గురించి ప్రబోధిస్తూ, చెడు విషయాల నుంచి నిరోధిస్తూ ఉంటారు. ఇంకా అల్లాహ్ నిర్ధారించిన హద్దులను కాపాడుతారు.[169] ఇలాంటి విశ్వాసులకు (ఓ ప్రవక్తా!) శుభవార్తను వినిపించు.[170]

اَلتَّآئِبُوْنَ الْعٰبِدُوْنَ الْحٰمِدُوْنَ السَّآئِحُوْنَ الرّٰكِعُوْنَ السّٰجِدُوْنَ الْاٰمِرُوْنَ بِالْمَعْرُوْفِ وَالنَّاهُوْنَ عَنِ الْمُنْكَرِ وَالْحٰفِظُوْنَ لِحُدُوْدِ اللّٰهِ ؕ وَبَشِّرِ الْمُؤْمِنِيْنَ ﴿112﴾

**113** ముష్రిక్కులు బంధువులైనాసరే, వారు నరకవాసులని స్పష్టమైపోయిన తరువాత వారి మన్నింపు కోసం దైవాన్ని వేడుకోవటం ప్రవక్తకు గానీ, విశ్వాసులకు గానీ ఎంత మాత్రం తగదు.[171]

مَا كَانَ لِلنَّبِيِّ وَالَّذِيْنَ اٰمَنُوْٓا اَنْ يَّسْتَغْفِرُوْا لِلْمُشْرِكِيْنَ وَلَوْ كَانُوْٓا اُولِيْ قُرْبٰى مِنْۢ بَعْدِ مَا تَبَيَّنَ لَهُمْ اَنَّهُمْ اَصْحٰبُ الْجَحِيْمِ ﴿113﴾

169. ఏ ముస్లింల ధనప్రాణాలను స్వర్గానికి బదులుగా అల్లాహ్ కొనుగోలు చేశాడో ఆ ముస్లింల మరికొన్ని సుగుణాలు యిక్కడ ప్రస్తుతించబడ్డాయి. వారు తమ వల్ల జరిగిపోయిన తప్పిదాలపై సిగ్గుతో కుంచించుకుపోతారు. క్షమాభిక్ష పెట్టమని అల్లాహ్‌ను దీనంగా వేడుకుంటారు. నాగా లేకుండా తమ ప్రభువును ఆరాధిస్తారు. ఉపవాసాలు పాటిస్తారు. అరబీలో **'సాయిహూన్'** అని ఉంది. ఈ పదాన్ని చాలామంది వ్యాఖ్యాతలు ఉపవాసాలు అన్న అర్థంలో తీసుకోగా, కొంతమంది భూ సంచారం, దైవమార్గంలో పోరాటం అన్న భావంలో తీసుకున్నారు. కాని మొదటి అర్థమే (ఉపవాసాలు అనేదే) సరైనది. ఇమామ్ ఇబ్నె కసీర్ ప్రభృతులు 'ఉపవాసాలు' అన్న అర్థం వైపుకే మొగ్గుచూపారు. అలాగే దైవారాధన కోసం కొండల్లోకో, కోనల్లోకో పోయి తిష్ఠవేయటం, మఠాలలో, ఆశ్రమాలలో కఠోర అభ్యాసాలకు పూనుకోవటం కూడా దీని అర్థం కాదు. ఎందుకంటే ఇలాంటి ధోరణులు 'రుహ్‌బానియత్' (వైరాగ్యం) క్రిందికి వస్తాయి. ఇలాంటి వైరాగ్యాన్ని, సన్యాసత్వాన్ని ఇస్లాం సుతరామూ ఇష్టపడదు. అయితే ఉపద్రవం పుట్టి, అరాచకం చెలరేగిన క్లిష్టపరిస్థితుల్లో ధర్మాన్ని రక్షించుకోవటానికి పట్టణాలను, జనవాసాలను వదలి పొలాల్లో, పర్వత ప్రాంతాలలోకి వెళ్ళవచ్చు అని హదీసు ద్వారా విదితమవుతోంది (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్).

170. మనో వాక్కాయ కర్మల చేత ఇస్లాం ప్రబోధనలకు ప్రతిరూపంగా నిలిచి, అల్లాహ్ హద్దులను గౌరవించే వ్యక్తి మాత్రమే పరిపూర్ణమైన విశ్వాసి కాగలడు. అతను దేవుని హద్దులను కేవలం గౌరవించటమే కాదు, వాటిని ప్రాణంకన్నా మిన్నగా ప్రేమిస్తాడు. వాటిని కాపాడుతాడు. ఇలాంటి పరిపూర్ణ విశ్వాసులే దేవుని శుభవార్తకు అర్హులు. దివ్య ఖుర్‌ఆన్‌లో **"ఆమనూ వ అమిలుస్సాలిహాతి"** (విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు) అని అనేకసార్లు చెప్పబడటం గమనార్హం. ఆ సత్కార్యాలు ఏవేవో ఈ ఆయతులో క్లుప్తంగా చెప్పబడ్డాయి.

171. దీని వివరాలు సహీహ్ బుఖారీలో వచ్చాయి. దైవప్రవక్త (సఅసం) సంరక్షకులు, పినతండ్రి అయిన అబూ తాలిబ్‌కు అంతిమ ఘడియలు సమీపించినపుడు దైవప్రవక్త (స) ఆయన వద్దకు వచ్చారు. అక్కడ అబూజహల్, అబ్దుల్లా బిన్ అబూ ఉమయ్యా కూడా కూర్చుని ఉన్నారు. ఆయన (స) తన బాబాయి నుద్దేశించి, "బాబాయీ! మీరు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' పలకండి. దాని ఆధారంగా నేను దైవసమక్షంలో మీ గురించి వాదిస్తాను" అని ప్రాధేయపడ్డారు. దానికి అబూజహల్, అబ్దుల్లా బిన్ అబూ ఉమయ్యా, "ఓ అబూ తాలిబ్! ఈ స్థితిలో అబ్దుల్ ముత్తలిబ్ మతాన్ని విడిచి పెడతారా?" అని ఆక్షేపించారు. (కడకు అబూతాలిబ్ అవిశ్వాస స్థితిలోనే కన్ను మూశారు). "దేవుని తరఫున

وَمَا كَانَ اسْتِغْفَارُ إِبْرَاهِيمَ لِأَبِيهِ إِلَّا عَن مَّوْعِدَةٍ وَعَدَهَا إِيَّاهُ فَلَمَّا تَبَيَّنَ لَهُ أَنَّهُ عَدُوٌّ لِّلَّهِ تَبَرَّأَ مِنْهُ ۚ إِنَّ إِبْرَاهِيمَ لَأَوَّاهٌ حَلِيمٌ (114)

**114** మరి ఇబ్రాహీము (అలైహిస్సలాం) తన తండ్రి మన్నింపుకై ప్రార్థించాడంటే, అతను తండ్రికిచ్చిన మాట ప్రకారం అలా చేశాడు. అయితే అతని తండ్రి అల్లాహ్ విరోధి అని స్పష్టమవగానే అతని పట్ల విసిగిపోయాడు.[172] నిశ్చయంగా ఇబ్రాహీము (అలైహిస్సలాం) మృదు మనస్కుడు, సహనశీలి.[173]

وَمَا كَانَ اللَّهُ لِيُضِلَّ قَوْمًا بَعْدَ إِذْ هَدَاهُمْ حَتَّىٰ يُبَيِّنَ لَهُم مَّا يَتَّقُونَ ۚ إِنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ (115)

**115** అల్లాహ్ ఏ జాతికైనా సన్మార్గం చూపిన తరువాత – ఆ జాతి ప్రజలు మానుకోవలసిన విషయాలను వారికి విడమరచి చెప్పనంతవరకూ – వారిని అపమార్గానికి లోనుచేయడు.[174] నిశ్చయంగా అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు.

إِنَّ اللَّهَ لَهُ مُلْكُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۖ يُحْيِي وَيُمِيتُ ۚ وَمَا لَكُم مِّن دُونِ اللَّهِ مِن وَلِيٍّ وَلَا نَصِيرٍ (116)

**116** నిస్సందేహంగా భూమ్యాకాశాల సామ్రాజ్యం అల్లాహ్‌దే. జీవింపజేసేదీ, మరణాన్ని ప్రసాదించేదీ ఆయనే. అల్లాహ్ తప్ప మీకు మరో సంరక్షకుడుగానీ, సహాయకుడుగానీ లేడు.

---

వారించబడనంత వరకూ నేను ఆయన మన్నింపు కోసం ప్రార్థిస్తూనే ఉంటాను" అని మహాప్రవక్త (స) చెప్పారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. బహుదైవారాధకులు ఆప్తులయినాసరే వారి మన్నింపు కోసం అల్లాహ్‌ను వేడుకోరాదని ఇందులో నిర్ధిష్టంగా చెప్పటం జరిగింది (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్: అత్ తౌబా సూరా). అల్ ఖసస్ సూరాలోని 56వ ఆయతు కూడా ఈ నేపథ్యంలోనే అవతరించింది (ఓ ప్రవక్తా! నీవు కోరిన వారికి నీవు సన్మార్గం చూపలేవు....).

ముస్నదె అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స), తన తల్లి మన్నింపుకై ప్రార్థించేందుకు అనుమతి కోరగా ఈ ఆయతు అవతరించింది (ముస్నదె అహ్మద్– సంపుటి : 5,పేజీ – 355). అయితే మహాప్రవక్త (సఅసం) వారు "అల్లాహ్! నా జాతి వారికి ఏమీ తెలియదు. వీళ్ళని క్షమించు" అని చేసిన ప్రార్థన మాత్రం ఈ ఆయతుకు విరుద్ధం కాదు. ఎందుకంటే అది జాతి జనుల మార్గదర్శకత్వం కోసం చేసిన దుఆ. అంటే వారు నా స్థానాన్ని, స్థాయిని అర్థం చేసుకోలేకపోవటం చేత అలా ప్రవర్తిస్తున్నారు. కనుక వారికి సద్బుద్ధిని వొసగు. ఆ విధంగానయినా వారు నీ మన్నింపుకై అర్హతను సంపాదిస్తారు అన్నది ఆయన (స) వేడుకోలులోని మర్మం. బ్రతికి ఉన్న అవిశ్వాసుల, ముష్రిక్కుల మార్గదర్శకత్వం కోసం ప్రార్థించటం సమ్మతమే.

172. తన తండ్రి దైవవిరోధి అనీ, అతని నివాస స్థలం నరకమని స్పష్టమైపోయిన తరువాత హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కూడా అతని మన్నింపు కోసం ప్రార్థించటం మానేశారు.

173. అంతకు మునుపు హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన తండ్రి మన్నింపు కోసం తాపత్రయ పడటానికి కారణం ఆయన మృదుస్వభావి కావటమే.

174. ఈ ఆయతు నేపథ్యంలో ఉన్న అసలు విషయం ఇది : "ముష్రిక్కుల మన్నింపుకై ప్రార్థించరాదు" అని అల్లాహ్ ఆదేశించిన సంగతి తెలుసుకుని ప్రవక్త ప్రియసహచరులు (రజి) ఆందోళనకు గురయ్యారు. ఎందుకంటే అప్పటివరకూ చనిపోయిన తమ పూర్వీకుల మన్నింపుకోసం వారు దుఆ (వేడుకోలు) చేసేవారు. తమవల్ల జరిగిన ఈ తప్పుకుగాను తాము దైవసమక్షంలో నిలదీయబడతామేమోనన్నది వారి అనుమానం. వారి ఈ అనుమానాన్ని దూరం చేయటానికి ఈ ఆయతు అవతరింపజేయబడింది. ఏ ఏ పనులకు దూరంగా ఉండాలో స్పష్టంగా వివరించనంతవరకూ ఎవరినీ తప్పు పట్టటం జరగదనీ, 'అలా చేయకూడదు' అని చెప్పిన తరువాత కూడా దాన్ని ఖాతరు చేయనివారే నిలదీయబడతారనీ, అలాంటి నిర్లక్ష్య జనులను అల్లాహ్ అపమార్గాన వదలివేస్తాడని ఇందులో చెప్పటం జరిగింది.

لَقَدْ تَّابَ اللّٰهُ عَلَى النَّبِيِّ وَالْمُهٰجِرِيْنَ وَالْاَنْصَارِ الَّذِيْنَ اتَّبَعُوْهُ فِيْ سَاعَةِ الْعُسْرَةِ مِنْۢ بَعْدِ مَا كَادَ يَزِيْغُ قُلُوْبُ فَرِيْقٍ مِّنْهُمْ ثُمَّ تَابَ عَلَيْهِمْ ؕ اِنَّهٗ بِهِمْ رَءُوْفٌ رَّحِيْمٌ ﴿117﴾

**117** ప్రవక్త వైపుకు, కష్టకాలంలో ప్రవక్తను వెన్నంటివున్న ముహాజిర్ల, అన్సార్ల వైపుకు అల్లాహ్ (దయా భావంతో) మరలాడు,[175] వారిలో కొందరి హృదయాలు తడబాటుకు లోనైనప్పుడు,[176] తర్వాత ఆయన వారి పొరపాటును మన్నించాడు. నిశ్చయంగా ఆయన వారి యెడల వాత్సల్యం కలవాడు, కరుణామయుడు.

وَّعَلَى الثَّلٰثَةِ الَّذِيْنَ خُلِّفُوْا ؕ حَتّٰٓى اِذَا ضَاقَتْ عَلَيْهِمُ الْاَرْضُ بِمَا رَحُبَتْ وَضَاقَتْ عَلَيْهِمْ اَنْفُسُهُمْ

**118** ఏ 'ముగ్గురి' వ్యవహారం వాయిదా వేయబడిందో వారి వైపుకు కూడా (అల్లాహ్ దయతో మరలాడు).[177] భూమి విశాలంగా ఉండి కూడా వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు

175. తబూక్ యుద్ధం కోసం సన్నాహాలు ప్రారంభించిన సమయాన్ని "కష్టకాలం" గా ఖరారు చేయటం జరిగింది. అసలే ఎండా కాలం. అదీగాక ఆ సమయంలో పంటలు కోతకొచ్చి ఉన్నాయి. మరోవైపు సుదీర్ఘ ప్రయాణం. సౌకర్యాలు చూస్తే అంతంత మాత్రమే. అందుకే ఆ సేనా వాహిని 'జైషుల్ ఉస్‌రహ్' (ఇబ్బందుల్ని ఎదుర్కొన్న సైన్యం)గా పిలువబడింది.

అల్లాహ్ వారి వైపుకు దయాభావంతో మరలటంలోని ప్రధాన ఉద్దేశం వారిని మన్నించటమే. మరి వారు చేసిన తప్పు ఏమిటీ? అంటే పెద్ద పెద్ద తప్పులు చేస్తేనే క్షమాభిక్ష అవసరమనీ, చిన్న చిన్న తప్పిదాలకు క్షమాపణ అవసరం లేదని అనుకోకూడదు. మనిషికి తెలియకుండానే అతని వల్ల ఎన్నో చిన్న చిన్న పొరపాట్లు జరిగిపోతుంటాయి. తనలోని లోటుపాట్ల గురించి ఒక్కోసారి మనిషికి ధ్యాస కూడా ఉండదు. దైవప్రవక్త (స) నోట జాలువారిన ఆజ్ఞను శిరసావహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే ముహాజిర్లు, అన్సార్లలో ఉండే చిన్న చిన్న లోటుపాట్లను మన్నించటానికి అల్లాహ్ వారిపై తన కటాక్ష వీక్షణాలను ప్రసరింపజేశాడని దీని భావం.

176. ఈ వాక్యం ఆ సజ్జనులలోని రెండవ వర్గాన్ని ఉద్దేశించినది. ఆదేశం వినగానే వారు ఒకింత సంశయానికి లోనైనప్పటికీ, తొందరగానే తేరుకుని తమ కర్తవ్యం వైపుకు సమాయత్తం అయ్యారు. హృదయాలు తడబాటుకు లోనయ్యాయంటే భావం సత్యధర్మం పట్ల, దైవప్రవక్త పట్ల వారిలో విసుగుపుట్టిందని ఎంతమాత్రం కాదు. కాకపోతే తమకున్న అరకొర సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని జిహాద్‌లో పాల్గొనేదెలా? అన్న మీమాంసకు గురయ్యారు. కాని ఉచితానుచితాలను బేరీజు వేసుకుని మళ్లీ తమ గురుతర బాధ్యతకై నడుం బిగించారు.

177. అరబీలో **'ఖుల్లిఫూ' (خُلِّفُوْا)** అని అనబడింది. 'ఖుల్లిఫూ' అంటే వ్యవహారం వాయిదా వేయబడినవారు అని అర్థం. యాభై రోజుల పాటు వారు ఒంటరివారుగా జీవించారు. ఆ తరువాత వారి పశ్చాత్తాపం స్వీకరించబడింది. ఆ ముగ్గురు సహాబీలు వీరు : 1. కాబ్ బిన్ మాలిక్ 2. మురారా బిన్ రబీ 3. హిలాల్ బిన్ ఉమయ్యా. నిజానికి వీళ్లు ముగ్గురూ నిజాయితీ తత్పరత గల ముస్లింలే. అంతకుముందు జరిగిన యుద్ధాలన్నింటిలోనూ పాల్గొన్నారు. తబూక్ యుద్ధ సందర్భంగా వారు కించిత్ అలసత్వానికి లోనయ్యారు. తరువాత వారి పొరపాటు వారికి తెలిసివచ్చింది. తమవల్ల – తెలిసీ తెలియక – ఒక తప్పు ఎలాగూ జరిగిపోయింది. ఆ తప్పును సమర్థించుకునే ప్రయత్నంలో మరో తప్పుచేసి (అబద్ధం చెప్పి) కపటుల సరసన నిలబడటం ఎందుకు? అని వారు ఆత్మావలోకనం చేసుకున్నారు.

ఆఖరికి వారు దైవప్రవక్త (సఅసం) సమక్షంలోకి వచ్చి తమ తప్పును ఒప్పుకున్నారు. తమకు ఏ శిక్ష విధించినా దాన్ని ఈ లోకంలోనే భరించటానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (స) ఆ ముగ్గురి వ్యవహారాన్ని దైవాధీనం చేశారు. దైవనిర్ణయం జరిగే వరకూ వేచి ఉండమన్నారు. ఆ ముగ్గురు సహచరులతో సామాజిక సంబంధాలను త్రెంచుకోవాలనీ, వారితో మాట్లాడనూ వద్దని దైవప్రవక్త (స) తన సహచరులకు తాకీదు చేశారు. నలభై రాత్రులు గడచిన తరువాత, తమ భార్యలకు సయితం దూరంగా ఉండాలని వారికి ఆదేశించబడింది. మరో పదిరోజులు దుర్భరంగా గడిచాయి.

కూడా వారికి భారమైపోయాయి.[178] అల్లాహ్ పట్టు నుంచి తమను కాపాడుకోవటానికి ఆయన వైపుకు మరలటం తప్ప మార్గాంతరం లేదని వారు గ్రహించారు. ఇక మీదట కూడా వారు ఈ విధంగా మరలి వచ్చేటందుకుగాను అల్లాహ్ వారి వైపుకు మరలాడు.[179] నిశ్చయంగా అల్లాహ్ అమితంగా పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, అపారంగా కరుణించేవాడూను.

وَظَنُّوٓا۟ أَن لَّا مَلْجَأَ مِنَ ٱللَّهِ إِلَّآ إِلَيْهِ ثُمَّ تَابَ
عَلَيْهِمْ لِيَتُوبُوٓا۟ ۚ إِنَّ ٱللَّهَ هُوَ ٱلتَّوَّابُ ٱلرَّحِيمُ (118)

**119** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతుల వెంట ఉండండి.[180]

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱتَّقُوا۟ ٱللَّهَ وَكُونُوا۟ مَعَ
ٱلصَّٰدِقِينَ (119)

**120** దైవప్రవక్తను విడిచి వెనుక ఉండి పోవటం మదీనాలో నివసించేవారికి గానీ, చుట్టుప్రక్కల నివసించే పల్లెటూరి వాళ్ళకు గానీ ఏ మాత్రం శోభాయమానం కాదు.[181] తమ ప్రాణాలను ఆయన ప్రాణంకన్నా మిన్నగా భావించటం కూడా వారికి తగదు.[182] ఎందుకంటే దైవమార్గంలో వారికి దాహం అయినా,[183] అలసట కలిగినా, ఆకలైనా, అవిశ్వాసులను కోపం తెప్పించే

مَا كَانَ لِأَهْلِ ٱلْمَدِينَةِ وَمَنْ حَوْلَهُم مِّنَ
ٱلْأَعْرَابِ أَن يَتَخَلَّفُوا۟ عَن رَّسُولِ ٱللَّهِ وَلَا يَرْغَبُوا۟
بِأَنفُسِهِمْ عَن نَّفْسِهِۦ ۚ ذَٰلِكَ بِأَنَّهُمْ لَا يُصِيبُهُمْ
ظَمَأٌ وَلَا نَصَبٌ وَلَا مَخْمَصَةٌ فِى سَبِيلِ ٱللَّهِ

అప్పుడు ఈ ఆయతు అవతరించింది. ఎట్టకేలకు అల్లాహ్ వారి పరిస్థితిపై దయదలిచాడు. వారి తప్పును క్షమించాడు. నిష్కల్మషమైన వారి పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలన్నీ హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ స్వయంగా తెలిపిన హదీసులో ఉన్నాయి. (ఆ వివరాల కోసం సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణంలో తబూక్ యుద్ధానికి సంబంధించిన అధ్యాయాన్ని చూడండి. సహీహ్ ముస్లింలోని పశ్చాత్తాప ప్రకరణంలో కూడా ఈ హదీసు ఉంది).

178. సంఘ బహిష్కరణకు గురైనప్పుడు ఆ ముగ్గురు సహచరులు అనుభవించిన వేదనకు ఇది మచ్చుతునక.

179. మొత్తం యాభై రోజుల తరువాత అల్లాహ్ వారిపై కనికరించాడు.

180. కల్లాకపటంలేని వారి సిసలైన పశ్చాత్తాపాన్ని ఆమోదించటమే గాకుండా అల్లాహ్ తన గ్రంథంలో 'తౌబా' పేరుతో దాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాడు. అల్లాహ్ వారితోనూ, వారు అల్లాహ్‌తోనూ ప్రసన్నులవుగాక! అందుకే సదా అల్లాహ్‌కు భయపడుతూ ఉండాలనీ, సత్యాన్ని సమర్థించాలనీ, సత్యవంతులతోనే ఉండాలనీ ముస్లిములకు ఆదేశించ బడింది. మనసులో దైవభీతి ఉన్నవాడు సత్యవంతుడుగానే ఉంటాడు, సత్యవంతులతోనే ఉంటాడు. అబద్ధాలకోరు మనసులో భక్తీ భయమూ ఉండవు. అందుకే హదీసులో అనబడింది : "విశ్వాసి (మోమిన్) వల్ల ఏ తప్పయినా జరిగిపోవచ్చునేమో గాని అతను అబద్ధాలకోరు మాత్రం అయి ఉండడు."

181. తబూక్ యుద్ధంలో పాల్గొనాల్సిందిగా అందరికీ ప్రకటన చేయబడింది. అందువల్ల వికలాంగులు, వృద్ధులు, షరీయతు పరమైన కారణం గలవారు తప్ప మిగిలిన వారంతా యుద్ధంలో పాల్గొనాల్సిందే. కాని మదీనా నగరంలోనూ, దాని పరిసర ప్రాంతాలలోనూ నివసించే కొంతమంది ఈ యుద్ధ ప్రకటన తరువాత కూడా వెనుకంజ వేశారు. వారి ఈ ధోరణి ఏమాత్రం సహించరానిదని ఈ ఆయతులో అల్లాహ్ మందలించాడు.

182. తమ ప్రాణాలపై వారికి ఉన్నంత తీపి దైవప్రవక్త (సఅసం) ప్రాణం పట్ల లేకపోవటం కడు శోచనీయం. నిజానికి వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి దైవప్రవక్త (సఅసం) కు రక్షకులుగా నిలువవలసింది.

183. వారు వెనుకంజ ఎందుకు వేయకూడదో ఇక్కడ చెప్పబడింది. దైవమార్గంలో వారు ఆకలి దప్పులను సహించినా,

స్థలం గుండా వారు సాగిపోయినా,[184] శత్రువుల సంగతి చూసుకున్నా[185]–వాటన్నింటిపై వారి పేర సత్కార్యం లిఖించబడుతుంది. ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్ సద్వర్తనుల పుణ్య ఫలాన్ని వృధా కానివ్వడు.

وَلَا يَطَـُٔونَ مَوْطِئًا يَغِيظُ ٱلْكُفَّارَ وَلَا يَنَالُونَ مِنْ
عَدُوٍّ نَّيْلًا إِلَّا كُتِبَ لَهُم بِهِۦ عَمَلٌ صَٰلِحٌ ۚ إِنَّ ٱللَّهَ
لَا يُضِيعُ أَجْرَ ٱلْمُحْسِنِينَ ﴿١٢٠﴾

**121** అలాగే వారు (దైవమార్గంలో) చిన్న మొత్తంలో ఖర్చు చేసినా, పెద్ద మొత్తంలో ఖర్చుచేసినా, ఏ లోయను దాటివెళ్ళినా[186] – అల్లాహ్ వారి సత్కార్యాలకు అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదించే నిమిత్తం – అవన్నీ వారిపేర వ్రాయబడ్డాయి.

وَلَا يُنفِقُونَ نَفَقَةً صَغِيرَةً وَلَا كَبِيرَةً وَلَا
يَقْطَعُونَ وَادِيًا إِلَّا كُتِبَ لَهُمْ لِيَجْزِيَهُمُ ٱللَّهُ
أَحْسَنَ مَا كَانُوا۟ يَعْمَلُونَ ﴿١٢١﴾

**122** విశ్వాసులందరూ (పోరాటానికి) బయలుదేరవలసిన అవసరం లేదు. కాబట్టి వారి ప్రతి పెద్ద సమూహంలో నుంచి ఒక చిన్న సమూహం బయలుదేరి (తే చాలు. మిగిలినవారు) ధర్మావగాహనను పెంపొందించుకుని, వారు తమ వద్దకు తిరిగి వచ్చినప్పుడు, వారు భయభక్తులను అలవరచుకునేందుకుగాను వారికి భయబోధ చేయాల్సింది.[187] కాని ఇలా ఎందుకు జరగ లేదు?

وَمَا كَانَ ٱلْمُؤْمِنُونَ لِيَنفِرُوا۟ كَآفَّةً ۚ فَلَوْلَا نَفَرَ
مِن كُلِّ فِرْقَةٍ مِّنْهُمْ طَآئِفَةٌ لِّيَتَفَقَّهُوا۟ فِى ٱلدِّينِ
وَلِيُنذِرُوا۟ قَوْمَهُمْ إِذَا رَجَعُوٓا۟ إِلَيْهِمْ لَعَلَّهُمْ
يَحْذَرُونَ ﴿١٢٢﴾

వ్యయప్రయాసలకోర్చినా, శత్రువుల ఆగ్రహావేశాలకు కారణభూతమయ్యే చర్యలు గైకొన్నా, శత్రువులను చంపినా, వారిని బందీలుగా పట్టుకున్నా– ఇవన్నీ వారి ఖాతాలో సత్కార్యాలుగా నమోదవుతాయి. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే మనిషి మస్జిదులోనో, ఏకాంత కుహరంలోనో కూర్చుని ప్రార్థన చేసుకోవటం, దైవధ్యానం చేయటం, గ్రంథ పారాయణం చేయటం మాత్రమే సత్కార్యం కాదు. దైవ మార్గంలో పరిశ్రమించటం, ఆ మార్గంలో ఎదురయ్యే కష్టాలను సహించటం, బాధలను భరించటం, ఆఖరికి శత్రువుల గుండెల్లో సింహస్వప్నంలా మారే చర్యలను చేపట్టటం – వాటిలో ప్రతిదీ దైవసన్నిధిలో సత్కార్యం (అమలె సాలెహ్)గా లిఖించబడుతుంది. అందుకే కేవలం ఆరాధన మీద ఆసక్తి కొద్దీ జిహాద్ పట్ల అనాసక్తతను, విసుగును ప్రదర్శించటం కూడా సబబు కాదు. అలాంటప్పుడు అకారణంగా దాన్నుంచి తప్పించుకోజూడటం ఎంతవరకు సమంజసం అనిపించుకుంటుంది?

184. అంటే కాలి నడకన లేక గుఱ్ఱాల ద్వారా వారు ఏ ప్రాంతం మీదుగానయినా సాగిపోతున్నప్పుడు దైవవిరోధుల గుండెల్లో దడ పుట్టాలి. కసితో వారు అట్టుడికిపోవాలి. ఈ విధమైన భీతావహ వాతావరణాన్ని అవసరమైనచోట సృష్టించటం కూడా సత్కార్యమేనని చెప్పబడటం గమనార్హం.

185. **"వలా యనాలూన మిన్ అదువ్విన్ నైలన్"** అంటే శత్రువు నుంచి ఏదైనా తీసుకోవటం, వారి సంగతి చూడటం అని అర్థం. మరింత విపులంగా చెప్పాలంటే వారిని చిత్తు చిత్తుగా ఓడించటం, నిర్బంధించటం, యుద్ధప్రాప్తిని తీసుకోవటం అని భావం.

186. పర్వతాల మధ్య గల లోతట్టు ప్రదేశాలను, నీరు ప్రవహించే పల్లపు నేలను లోయ అనవచ్చు. సాధారణ ప్రదేశాలు అని ఇక్కడ దాని భావం. దైవమార్గంలో ఇలాంటి లోయల గుండా ప్రయాణించటం కూడా పుణ్యమే. అవసరాన్నిబట్టి ఈ మార్గంలో తక్కువ ఖర్చుపెట్టినా, ఎక్కువ ఖర్చుపెట్టినా – అవన్నీ మీ కర్మల రికార్డులో నమోదవుతాయి. దానికిగాను అల్లాహ్ అత్యుత్తమ పుణ్యఫలం ప్రసాదిస్తాడు.

187. ఈ ఆయతుకు రెండు రకాల భావార్థాలు చెప్పబడ్డాయి. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ ఆయతు కూడా జిహాద్ (ధర్మయుద్ధం) ఆదేశ పరిధిలోకే వస్తుంది. దీని ప్రకారం దీని భావమేమిటంటే; వెనుకటి ఆయతులలో

**123** ఓ విశ్వాసులారా! మీ పరిసరాలలో ఉన్న అవిశ్వాసులతో పోరాడండి.[188] వారు మీలోని కాఠిన్యాన్ని చవిచూడాలి.[189] అల్లాహ్ భయభక్తులు గలవారికి తోడుగా ఉన్నాడని తెలుసుకోండి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا قَاتِلُوا الَّذِينَ يَلُونَكُم مِّنَ الْكُفَّارِ وَلْيَجِدُوا فِيكُمْ غِلْظَةً ۚ وَاعْلَمُوا أَنَّ اللَّهَ مَعَ الْمُتَّقِينَ ﴿123﴾

**124** ఏదైనా ఒక సూరా అవతరించినప్పుడల్లా కపటుల్లోని కొందరు, “ఈ సూరా మీలో ఎవరి విశ్వాసాన్ని వృద్ధి పరచింది?”[190] అని (వెటకారంగా) అడుగుతారు. విశ్వాసుల విశ్వాసాన్ని ఈ సూరా వృద్ధిచేసింది. దానిపై వారు సంతోషిస్తున్నారు.[191]

وَإِذَا مَا أُنزِلَتْ سُورَةٌ فَمِنْهُم مَّن يَقُولُ أَيُّكُمْ زَادَتْهُ هَٰذِهِ إِيمَانًا ۚ فَأَمَّا الَّذِينَ آمَنُوا فَزَادَتْهُمْ إِيمَانًا وَهُمْ يَسْتَبْشِرُونَ ﴿124﴾

“వెనుక ఉండిపోయిన వారి”ని గట్టిగా మందలించటం వల్ల ప్రవక్త సహచరులు జిహాద్ ఆదేశాల విషయంలో చాలా జాగ్రత్త పడసాగారు. ఎప్పుడు ఏ యుద్ధ ప్రకటన వెలువడినా, మరే అత్యవసర పరిస్థితి ఎదురైనా వారంతా సిద్ధమయ్యేవారు. అయితే ప్రతి యుద్ధమూ తబూక్ యుద్ధం లాంటిదై ఉండదనీ, ప్రతి చిన్న పోరుకై అందరూ వెడలిపోనవసరం లేదనీ, అవసరం మేరకు ఎంతో కొంతమంది వెళితే సరిపోతుందని ఉపదేశించబడింది. అంటే ఒక సమూహం యుద్ధ మైదానానికి వెళితే, మరో సమూహం ఉన్నచోటనే ఉండి ధర్మజ్ఞానాన్ని ఆర్జించాలనీ, ధర్మావగాహనను పెంపొందించుకుని తమ సైనిక దళం కదన రంగం నుంచి తిరిగి వచ్చినప్పుడు వారికి కూడా ధర్మాధర్మాలను విడమరచి చెప్పాలని ఈ కోవకు చెందిన ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

దీని రెండవ మతలబు ఇది : ఈ ఆయతు ధర్మయుద్ధానికి సంబంధించినది కాదు. ధర్మజ్ఞానాన్ని ఆర్జించాలని ఈ ఆయతు నొక్కి చెబుతోంది. దాని పద్ధతిని గురించి వివరిస్తోంది. అదేమిటంటే, ధర్మవిద్య కోసం ప్రతి పెద్ద జన సమూహం నుంచి, ప్రతి తెగనుంచీ కొంతమంది తమ ఇల్లూ వాకిలిని వదలి జ్ఞాన పీఠాలకు, ధార్మిక విశ్వవిద్యాలయాలకు వెళ్ళాలి. ధర్మజ్ఞానానికి సంబంధించిన వివిధ విభాగాలలో పాండిత్యాన్ని పెంపొందించుకోవాలి. ఆ తరువాత వారు తమ తమ ప్రదేశాలకు తిరిగి వెళ్ళి ప్రజలకు ధర్మాధర్మాలను విడమరచి చెప్పాలి. మంచిని ప్రబోధించాలి, చెడుల నుంచి వారించాలి. ధర్మావగాహన (తఫఖ్ఖుహ్ ఫిద్దీన్) అంటే ఇదే. షరీఅత్‌లోని ఆదేశాలను, నిషిద్ధాంశాలను గురించి తెలుసుకోవటం.

188. అవిశ్వాసులతో ఏ క్రమంలో పోరాడాలో ఈ ఆయతులో చెప్పబడింది. ముందు వారు తమ సమీపంలో ఉండే సత్య తిరస్కారులను సన్మార్గానికి తెచ్చే ప్రయత్నం చేయాలి. ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడు, పీడనను నిరోధించే నిమిత్తం వారిపై యుద్ధ ప్రకటన చేయాలి. దైవప్రవక్త (సఅసం) వారి విధానం కూడా ఇదే. ఆయన (స) మొదట అరేబియా ద్వీపంలోపల ఉన్న ముష్రిక్కులను ఎదుర్కొన్నారు. ఈ బెడద సద్దుమణిగాక మక్కా, తాయఫ్, యమన్, యమామ, హిజ్ర్, ఖైబర్, హజర్‌మోత్ తదితర ప్రాంతాలపై దృష్టిని సారించి వాటిని జయించారు. దాంతో అరేబియాలోని తెగల వారంతా తండోపతండాలుగా వచ్చి ఇస్లాం స్వీకరించారు. ఆపైన గ్రంథవహుల వంతు వచ్చింది. హిజ్రీ 9వ ఏట ఆయన (స) రోమనులను ప్రతిఘటించేందుకు తబూక్‌కు బయలు దేరారు. తబూక్ అరేబియా ద్వీపానికి ఆనుకుని ఉంది. ఆయన (సఅసం) అవలంబించిన ఈ అంచెల వారీ విధానాన్నే ఆయన (స) తదనంతరం ధర్మ ఖలీఫాలు కూడా అవలంబించారు. వారు రోము సామ్రాజ్యానికి చెందిన క్రైస్తవుల మెడలు వంచారు. ఈరాన్‌కు చెందిన జోరాష్ట్రియన్లను ఓడించారు.

189. మరో మాటలో చెప్పాలంటే ధర్మ తిరస్కారుల పట్ల ముస్లిములలో మెతకదనం పనికిరాదు. “వారు తిరస్కారుల పట్ల కర్కశులుగానూ, ఒండొకరి (ముస్లింల) పట్ల జాలిగుండెలు గల వారిగానూ ఉంటారు” అని ప్రవక్త సహచరుల గురించి ఒకచోట చెప్పబడింది (ఫతహ్–29). “వారు విశ్వాసుల పట్ల మృదువుగానూ, తిరస్కారుల పట్ల కఠినంగానూ వ్యవహరిస్తారు” అని మరోచోట సెలవీయబడింది (అల్ మాయిద – 54). విశ్వాసం (ఈమాన్) వాంఛించే విశిష్ట గుణం ఇది.

وَاَمَّا الَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ فَزَادَتْهُمْ
رِجْسًا اِلٰى رِجْسِهِمْ وَمَاتُوْا وَهُمْ كٰفِرُوْنَ ﴿125﴾

**125** కాగా; ఎవరి హృదయాలు రోగగ్రస్తమై ఉన్నాయో వారి అశుద్ధతలో ఈ సూరా మరింత అశుద్ధతను పెంచింది. ఆఖరికి వారు అవిశ్వాస స్థితిలోనే చచ్చారు.[192]

اَوَلَا يَرَوْنَ اَنَّهُمْ يُفْتَنُوْنَ فِيْ كُلِّ عَامٍ مَّرَّةً
اَوْ مَرَّتَيْنِ ثُمَّ لَا يَتُوْبُوْنَ وَلَا هُمْ يَذَّكَّرُوْنَ ﴿126﴾

**126** ఏమిటీ, ప్రతి ఏటా ఒకటి లేక రెండు సార్లు తాము ఏదో ఒక ఆపదలో చిక్కుకు పోవటాన్ని వారు గమనించటం లేదా?[193] అయినాసరే వారు పశ్చాత్తాపం చెందటంగానీ, గుణపాఠం నేర్చుకోవటంగానీ జరగటం లేదు.

وَاِذَا مَآ اُنْزِلَتْ سُوْرَةٌ نَّظَرَ بَعْضُهُمْ اِلٰى بَعْضٍ ؕ
هَلْ يَرٰىكُمْ مِّنْ اَحَدٍ ثُمَّ انْصَرَفُوْا ؕ صَرَفَ
اللّٰهُ قُلُوْبَهُمْ بِاَنَّهُمْ قَوْمٌ لَّا يَفْقَهُوْنَ ﴿127﴾

**127** ఏదైనా సూరా అవతరించినప్పుడు వారు ఒకరినొకరు చూసుకుంటారు. "ఎవడైనా (ముస్లిం) మిమ్మల్ని చూడటం లేదు కదా!" (అన్నది ఆ చూపులకు అర్థం). ఆ తరువాత (నెమ్మదిగా) వెళ్లిపోతారు.[194] అల్లాహ్ వారి హృదయాలను త్రిప్పేశాడు. ఎందుకంటే వారు బొత్తిగా అర్థం చేసుకోనివారు.[195]

---

190. ఈ ఆయతు ద్వారా కపటులలో తిష్ఠవేసి ఉన్న కుల్లునంతటినీ బట్టబయలు చేయటం జరిగింది. వారు లేని సమయంలో ఏదైనా ఒక కొత్త సూరాగానీ, సూరాలోని ఏదైనా భాగం గానీ అవతరించినట్లు వారికి తెలిస్తే, వెటకారంగా 'ఇంతకీ ఈ సూరా ద్వారా ఎవరి విశ్వాసం పెరిగిందబ్బా?!' అని చెప్పుకుంటారు.

191. ఏ సూరా అవతరించినా విశ్వాసుల విశ్వాసాన్ని అది తప్పకుండా వృద్ధిపరుస్తుంది. ఆ వృద్ధిపై వారు తృప్తిచెందుతారు, సంతోషిస్తారు అని అల్లాహ్ సెలవిస్తున్నాడు. విశ్వాసం (ఈమాన్)లో తరుగుదల, పెరుగుదల జరుగుతూ ఉంటుందన్న దానికి కూడా ఈ ఆయతు నిదర్శనమే. హదీసువేత్తల దృక్పథం కూడా ఇదే.

192. **'రోగం'** అంటే కాపట్య రోగం అని అర్థం. దీనిమూలంగా వారు దైవవచనాల పట్ల నిత్యం శంకకు లోనవుతుంటారు. కొత్తగా అవతరించే ఏ సూరా అయినాసరే ఈ వంచకుల వ్యాధిని నయం చేయదు సరికదా, వారిలోని కల్మషాన్ని అది మరింత పెంచుతుంది. క్రమక్రమంగా వారిలోని కాపట్య రోగం ముదిరిపోవటం వల్ల పశ్చాత్తాప భాగ్యం కూడా వారికి ప్రాప్తించదు. కాపట్యం మరియు అవిశ్వాస స్థితిలోనే వారు కన్నుమూస్తారు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ మరోచోట చెప్పినట్లు – "మేము ఈ ఖుర్ఆన్ భాగాల అవతరణా క్రమంలో అవతరింపజేసే ప్రతి భాగమూ విశ్వాసుల కోసం వ్యాధినివారణ, కారుణ్యం. అయితే అల్లాహ్ వాటి ద్వారా దుర్మార్గులకు నష్టాన్ని మాత్రమే పెంచుతాడు" (బనీ ఇస్రాయీల్ – 82). మరోవిధంగా చెప్పాలంటే అది వారి దౌర్భాగ్యానికి పరాకాష్ఠ. ఏ ఏ విషయాల ద్వారా జనులు సన్మార్గ భాగ్యం పొందుతారో వాటి ద్వారానే వారు మార్గభ్రష్టులు అవుతుంటారు. అంతేమరి! మనిషి జీర్ణాశయం (ఉదరం) గనక చెడిపోతే శక్తిని, స్వస్థతను చేకూర్చవలసిన ఆహారపదార్థాలే అతని రోగాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి.

193. అరబీలో **'యుఫ్తనూన్'** (يُفْتَنُوْنَ) అని ఉంది. అంటే పరీక్షించబడుతూ ఉండటం అని అసలు అర్థం. రకరకాలుగా వారు పరీక్షించబడుతూ ఉన్నారు. ఒక్కోసారి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. ఒక్కోసారి వ్యాధులకు లోనవుతున్నారు. యుద్ధాల ద్వారా కూడా పరీక్షించబడుతున్నారు. పూర్వాపరాల దృష్ట్యా ఈ మూడవ అర్థమే సరైనదిగా తోస్తోంది.

194. అంటే కపటుల కుయుక్తుల్ని బట్టబయలుచేసే ఆయతులు అవతరించినప్పుడు భుజాలు తడుముకుంటారు. పరస్పరం చూపులతోనే పలకరించుకుంటారు. ఆ స్థితిలో ఏ ముస్లిమైనా తమను చూస్తే తమ గతేంకాను! అన్నది ఆ చూపుల్లోని ఉద్దేశం. అందుకే అక్కణ్ణుంచి మెల్లగా జారుకుంటారు.

لَقَدْ جَاءَكُمْ رَسُولٌ مِّنْ أَنفُسِكُمْ عَزِيزٌ عَلَيْهِ
مَا عَنِتُّمْ حَرِيصٌ عَلَيْكُم بِالْمُؤْمِنِينَ رَءُوفٌ
رَّحِيمٌ ﴿128﴾

**128** మీ దగ్గరకు స్వయంగా మీలో నుంచే ఒక ప్రవక్త వచ్చాడు.[196] మీకు కష్టం కలిగించే ప్రతిదీ అతనికి బాధ కలిగి స్తుంది.[197] అతను మీ మేలును ఎంతగానో కోరుకుంటున్నాడు.[198] విశ్వాసుల యెడల అతను వాత్సల్యం కలవాడు, దయా మయుడు.[199]

فَإِن تَوَلَّوْا فَقُلْ حَسْبِيَ اللَّهُ لَا إِلَٰهَ إِلَّا هُوَ
عَلَيْهِ تَوَكَّلْتُ وَهُوَ رَبُّ الْعَرْشِ الْعَظِيمِ ﴿129﴾

**129** ఇక వారు గనక వైముఖ్య ధోరణిని కనబరిస్తే[200] "నాకు అల్లాహ్ చాలు.[201] ఆయన తప్ప వేరొక ఆరాధ్యుడు లేనేలేడు. నేను మాత్రం ఆయన్నే నమ్ముకున్నాను. ఆయన మహోన్నతమైన పీఠానికి (అర్షకు) అధిపతి"[202] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

195. అంటే దైవవాక్యాలపై ఏమాత్రం యోచన చేయని కారణంగా అల్లాహ్ వారి హృదయాలను బంజరు భూములుగా మార్చేశాడు. వారి హృదయాలలో కాఠిన్యం, కరకుదనం మరీ ఎక్కువైపోయింది. సత్యం, సన్మార్గం, మృదుత్వం వంటి మాటలు వారి బుర్రకెక్కవు.

196. మహనీయ ముహమ్మద్ (సఅసం) రూపంలో దేవుడు ముస్లింలకు చేసిన మహోపకారాన్ని సూరా చివర్లో ప్రస్తావించాడు. ఆయన (సఅసం) మొదటి లక్షణం ఏమిటంటే ఆయన మీలాంటి మానవమాత్రుడే–మానవాతీతుడు గానీ, దైవదూతగానీ కాదు. చెడు విశ్వాసాలు కలిగివున్నవారు కొందరు 'ముహమ్మద్ (సఅసం) నిలువెల్లా దేవుని జ్యోతి' అనీ, ఇంకేదేదో అనీ సామాన్య ప్రజల విశ్వాసాన్ని (ఈమాన్‌ను) పాడుచేస్తున్నారు. అటువంటి వారికి ఈ ఆయతు కనువిప్పుకావాలి.

197. అరబీలో **'అనతున్'** అని ఉంది. మనిషికి బాధకలిగించేది అని దానర్థం. ప్రాపంచిక కష్టాలు, పరలోక శిక్షలు అన్నీ అందులోకి వచ్చేస్తాయి. మొత్తానికి భావం ఏమిటంటే, మీకు కష్టం అనిపించే ప్రతిదానిపై ఆ ప్రవక్త బాధపడతాడు. మిమ్మల్ని అనవసరంగా ప్రయాసకు లోను చేయాలన్నది ఆయన అభిమతం కానేకాదు. అనుక్షణం ఆయన (స) మీ సౌలభ్యాన్ని కోరుకుంటూ ఉంటాడు. "నేను సరళమైన, ఏకాగ్రతతో కూడుకున్న ధర్మం ఇచ్చి పంపబడ్డాను" అని ఆయన (స) చెప్పటం ఈ సందర్భంగా గమనార్హం (ముస్నదె అహ్మద్ – సంపుటి : 5, పేజీ – 266; సంపుటి : 6, పేజీ – 233). వేరొక హదీసులో "నిశ్చయంగా ఈ ధర్మం సరళమైనది" అని ఆయన (స) ప్రవచించినట్లు ఉంది (సహీహ్ బుఖారీ : కితాబుల్ ఈమాన్).

198. అంటే మీ సన్మార్గాన్నీ, మీ ఇహపరాల సాఫల్యాన్ని అభిలషిస్తున్నాడు. మీరు నరకాగ్నికి ఆహుతి కావటం ఆయనకు ఎంతమాత్రం ఇష్టం లేదు. అందుకే ఆయన (స) ఓసారి ఇలా వక్కాణించారు: "నేను మీ నడుం పట్టి లాగుతూ ఉన్నాను. కాని మీరు మాత్రం నన్ను విడిపించుకుని కావాలని పోయి నరకంలో పడుతున్నారు" (సహీహ్ బుఖారీ – కితాబుర్రిఖాఖ్).

199. ఇది ఆయన నాల్గవ సుగుణం. ఇవన్నీ ఆయన ఉత్తమ నైతికతకు, మంచి నడవడికకు ప్రతీకలు. నిశ్చయంగా ఆయన (స) నైతికంగా ఉన్నత స్థానాన్ని అధిరోహించినవారు– సల్లల్లాహు అలైహి వ సల్లం.

200. అంటే ఆయన (స) తెచ్చిన షరీయతు పట్ల, కారుణ్య ధర్మమైన ఇస్లాం పట్ల వారు గనక విముఖత చూపితే....

201. సత్య తిరస్కారానికి పాల్పడే వారి కుయుక్తుల నుండి తనను అల్లాహ్‌యే కాపాడుతాడు అని భావం.

202. హజ్రత్ అబూదర్దా (రజి) ఉల్లేఖించారు : ఏ వ్యక్తి, ఈ ఆయతు (హస్బియల్లాహు)ను ఉదయం – సాయంత్రం ఏడేసిసార్లు పఠిస్తాడో అతని కష్టాలు తీర్చటానికి అల్లాహ్ చాలు" (సుననె అబూ దావూద్ – 5081).

10 వ సూరా

# యూనుస్

## దైవప్రవక్త యూనుస్

అవతరణ మక్కాలో

ఆయతులు 109

### పరిచయం

*యూనుస్ (అస) ప్రాచీన కాలంలో పుట్టిన ప్రవక్త. ఆయన ఇరాక్‌కు ఉత్తరాన ఉన్న నైనవహ్ పట్టణానికి పంపించబడ్డారు. ఈ సూరా మక్కా కాలంలో అవతరించింది. దివ్య ఖుర్‌ఆన్ అల్లాహ్ తరఫున అవతరించిన గ్రంథమనీ, ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై దేవుడు ఈ గ్రంథాన్ని అవతరింపచేసాడని ఈ సూరా ముఖ్యంగా నొక్కి చెప్పింది. ఒకవేళ దివ్య ఖుర్‌ఆన్‌ను ముహమ్మద్ ప్రవక్త (సఅసం) స్వయంగా రచించి, అల్లాహ్ పంపిన దివ్య గ్రంథమని చెబుతున్నట్లయితే, ఇలాంటి ఒక్క సూరానయినా ఎవరూ ఎందుకు రాయలేక పోతున్నారని ప్రశ్నించింది. దేవుని ఏకత్వం (తౌహీద్) ప్రాముఖ్యాన్ని గుర్తించాలని ఈ సూరా ప్రజలకు గట్టిగా చెప్పింది. విశ్వప్రభువు గురించి మరింతగా తెలుసుకోవాలనీ, ఆయన్ను మాత్రమే ఆరాధించాలనీ, ఆయన చట్టాలకు కట్టుబడాలనీ, కష్టాల్లో ఉన్నప్పుడు తమకు నష్టం గాని లాభం గాని కలుగజేసే శక్తిలేని ఇతరులను (దేవీ దేవతలను, స్వాములను, వలీలు, పీరులు, బాబాలు, చెట్లు పుట్టలు, రాళ్ళు వగైరాలను) వేడుకునే బదులు కేవలం అల్లాహ్‌కే మొరపెట్టుకోవాలని ఈ సూరా ఉద్బోధించింది. మరోవిధంగా చెప్పాలంటే, అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను చేర్చరాదు. అల్లాహ్‌ను మాత్రమే వేడుకోవాలి. ఈ సందర్భంగా అల్లాహ్‌కు కుమారుడు ఎవరూ లేరని గట్టిగా చెప్పడం జరిగింది. దేనినీ ఆయనకు సంబంధించినదిగా చేర్చడానికి వీలులేదు.*

*చివర్లో యూనుస్ ప్రవక్త (అస) గురించిన క్లుప్తమైన ప్రస్తావన ఉంది. ఆయన జాతి ప్రజలు ఆయన్ను తిరస్కరించారు. అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టేవారు. వినాశానికి చేరువయ్యారు. కాని వినాశం సూచనలు కనబడగానే, ఆలస్యం చేయకుండా వాళ్ళు పశ్చాత్తాపం ప్రకటించారు. అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. వారిపై విధించిన శిక్షను ఉపసంహరించాడు. దివ్య ఖుర్‌ఆన్‌ను సందేహిస్తున్న అవిశ్వాసుల వైఖరినీ, ముహమ్మద్ ప్రవక్త (సఅస)ను మాంత్రికుడిగా భావించే అవిశ్వాసుల ధోరణిని ఈ సూరాలో ప్రశ్నించడం జరిగింది. అవిశ్వాసుల లక్షణాలను ఈ సూరా వివరించింది. వారు సర్వవ్యాపితమైన అల్లాహ్ చిహ్నాలను లక్ష్యపెట్టరు. తమకు లాభం గాని, నష్టం గాని కలిగించలేని వాటిని పూజిస్తారు. అవి తమకోసం దేవునికి సిఫారసు చేస్తాయని భావిస్తారు. వాళ్ళు ప్రాపంచిక జీవితంలో మునిగిపోయినవారు, అల్లాహ్‌ను కలవటానికి ఇష్టపడరు. వాళ్ళు తమకు తామే నష్టం చేసుకుంటున్నారు. చివరకు వారే అపజయం పాలవుతారు. వారు అధర్మానికి కట్టుబడినవారు, చెవిటివారు, మూగవారు, అల్లాహ్ గురించి అబద్ధాలు కల్పిస్తుంటారు.*

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 98 | 155 | 'దైవప్రవక్త యూనుస్' | చేపకడుపులో సజీవంగా మిగిలిన దైవప్రవక్త గాథ ఇది. ఇతర జాతులకు భిన్నంగా యూనుస్ ప్రవక్త పంపబడిన జాతివారికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకత..... ఏంటో మీరే చదివి తెలుసుకోండి. |

## యూనుస్[1] సూరా

## سُورَةُ يُونُسَ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** అలిఫ్ – లామ్ – రా. ఇవి వివేకంతో నిండివున్న గ్రంథ వాక్యాలు.[2]

الٓر تِلْكَ ءَايَٰتُ ٱلْكِتَٰبِ ٱلْحَكِيمِ ﴿١﴾

**2** ఏమిటీ, "ప్రజలను హెచ్చరించు, విశ్వసించినవారికి వారి ప్రభువు వద్ద పూర్తి ప్రతిఫలం, ఉన్నత స్థానం[3] ఉందన్న శుభవార్తను వినిపించు" అంటూ వారిలోని ఒక మనిషి వద్దకు మేము వహీ (సందేశం) పంపటం ప్రజలను ఆశ్చర్యచకితుల్ని[4] చేసిందా? (పైగా) తిరస్కారులు, "ఇతడు ముమ్మాటికీ పచ్చి మాంత్రికుడే"[5] అని పలికారు.

أَكَانَ لِلنَّاسِ عَجَبًا أَنْ أَوْحَيْنَآ إِلَىٰ رَجُلٍ مِّنْهُمْ أَنْ أَنذِرِ ٱلنَّاسَ وَبَشِّرِ ٱلَّذِينَ ءَامَنُوٓا۟ أَنَّ لَهُمْ قَدَمَ صِدْقٍ عِندَ رَبِّهِمْ ۗ قَالَ ٱلْكَٰفِرُونَ إِنَّ هَٰذَا لَسَٰحِرٌ مُّبِينٌ ﴿٢﴾

---

1. ఈ సూరా మక్కాలోనే అవతరించింది. అయితే ఇందులోని రెండు ఆయతులు (మరి కొందరి ప్రకారం మూడు ఆయతులు) మాత్రం మదీనాలో అవతరించిన ఆయతులుగా భావించబడుతున్నాయి (ఫత్‌హుల్ ఖదీర్).

2. **"అల్ హకీమ్"** అనేది దివ్య ఖుర్ఆన్ గుణవాచకం. వివేకంతో కూడుకున్నది అని దీని అర్థం. ఈ పదానికి మరికొన్ని అర్థాలు కూడా వస్తాయి. ఉదాహరణకు: **అల్ ముహ్కమ్.** అంటే ధర్మాధర్మాలను, దైవాజ్ఞలను, దేవుడు నియమించిన పరిమితులను విశదీకరించటంలో, విధించటంలో స్థిరమైనది. తిరుగులేనిది. **హాకిమ్ :** ప్రజల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాల విషయంలో తీర్పు చెప్పేది (అల్ బఖర : 23). హాకిమ్ అన్న పదానికి 'మహ్కూమ్ ఫీహ్' (తీర్పు చేయబడినది) అని కూడా అర్థం రావచ్చు. అల్లాహ్ ఈ గ్రంథంలో న్యాయంతో, సమతూకంతో కూడుకున్న తీర్పులు చేశాడు.

3. మూలంలో **'ఖదమ సిద్ఖిన్'** అని ఉంది. అంటే ఉన్నత స్థానం, ఉత్తమ పుణ్యఫలం, ఒక విశ్వాసి తన పరలోక జీవితం కోసం ముందుగా పంపుకునే సదాచరణలు.

4. అందులో వారు ఆశ్చర్యపోవలసిన విషయం ఏమీ లేదని ఆయతు భావం. అలాగే దేవుని మందలింపు కూడా అందులో ఇమిడి ఉంది. మానవజాతిలో నుంచే ఒక ప్రవక్తను దేవుడు ఎన్నుకోవటం ఆశ్చర్యకరం కారాదు. ఎందుకంటే ప్రవక్త అనేవాడు మనుజ జాతికి చెందినవాడై ఉండటమే సమంజసం. ఎందుకంటే మనుషుల మనో భావాలు, వారి అవసరాలు, బలహీనతలు అన్నీ అతనికి తెలిసి ఉంటాయి. అందువల్ల ప్రవక్తను ప్రజలూ, ప్రజలు ప్రవక్తనూ సరిగ్గా అర్థం చేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. దీనికి బదులు ప్రవక్త దైవదూతల జాతికో, జిన్నుల కోవకో చెందినవాడై ఉంటే దైవదౌత్య లక్ష్యం నెరవేరకపోవచ్చు. ఎందుకంటే ప్రజలు అటువంటి ప్రవక్తకు దగ్గరయ్యే బదులు భయపడి అల్లంత దూరాన వెళ్ళిపోవచ్చు. అదలా ఉంచితే జిన్ను లేక దైవదూత అయిన ప్రవక్తను ప్రజలు తమ కళ్ళతో చూడలేకపోతారు. ఒకవేళ జిన్నును లేక దైవదూతను మానవాకారంలో పంపితే మళ్లీ అదే అభ్యంతరం వ్యక్తమవుతుంది, 'ఇతను కూడా మాలాంటి మానవుడేగా!' అని.

5. ప్రవక్తను ధిక్కరించేందుకు తగు కారణం దొరకనప్పుడల్లా అవిశ్వాసులు, "అతడు మాంత్రికుడు" అని నిందించి వెళ్ళిపోయేవారు.

إِنَّ رَبَّكُمُ اللّٰهُ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ فِيْ
سِتَّةِ اَيَّامٍ ثُمَّ اسْتَوٰى عَلَى الْعَرْشِ يُدَبِّرُ الْاَمْرَ ؕ
مَا مِنْ شَفِيْعٍ اِلَّا مِنْۢ بَعْدِ اِذْنِهٖ ؕ ذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمْ
فَاعْبُدُوْهُ ؕ اَفَلَا تَذَكَّرُوْنَ ③

**3** నిశ్చయంగా మీ ప్రభువు అల్లాహ్‌యే. ఆయన ఆకాశాలను, భూమినీ ఆరు రోజులలో సృష్టించాడు. తర్వాత సింహాసనాన్ని (అర్ష్‌ను) అధిష్ఠించాడు.[6] ఆయన సమస్త వ్యవహారాలను నిర్వహిస్తున్నాడు.[7] ఆయన అనుమతి లేకుండా (ఆయన సమక్షంలో) సిఫారసు చేయగల వాడెవడూలేడు.[8] అటువంటి అల్లాహ్‌యే మీ ప్రభువు. కాబట్టి మీరు ఆయన్నే ఆరాధించండి.[9] అయినా (ఇంత చెప్పినా) మీరు గుణపాఠం గ్రహించరా?

اِلَيْهِ مَرْجِعُكُمْ جَمِيْعًا ؕ وَعْدَ اللّٰهِ حَقًّا ؕ اِنَّهٗ يَبْدَؤُا
الْخَلْقَ ثُمَّ يُعِيْدُهٗ لِيَجْزِيَ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا
الصّٰلِحٰتِ بِالْقِسْطِ ؕ وَالَّذِيْنَ كَفَرُوْا لَهُمْ شَرَابٌ
مِّنْ حَمِيْمٍ وَّعَذَابٌ اَلِيْمٌۢ بِمَا كَانُوْا يَكْفُرُوْنَ ④

**4** మీరంతా ఆయన వద్దకే మరలిపోవలసి ఉంది. అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. నిస్సందేహంగా ఆయనే తొలిసారి పుట్టిస్తాడు, మరి విశ్వసించి, మంచి పనులు చేసినవారికి న్యాయ సమ్మతంగా పుణ్య ఫలం ప్రసాదించేందుకు మలిసారి పుట్టించే వాడు కూడా ఆయనే. సత్యాన్ని తిరస్కరించినవారికి వారి తిరస్కార వైఖరి మూలంగా త్రాగటానికి సలసలా కాగే నీరు, బాధాకరమైన శిక్ష ఉంటుంది.[10]

هُوَ الَّذِيْ جَعَلَ الشَّمْسَ ضِيَآءً وَّالْقَمَرَ نُوْرًا
وَّقَدَّرَهٗ مَنَازِلَ لِتَعْلَمُوْا عَدَدَ السِّنِيْنَ

**5** సూర్యుణ్ణి ప్రకాశమానంగానూ, చంద్రుణ్ణి కాంతిమంతం గానూ చేసినవాడు ఆయనే.[11] మీరు సంవత్సరాల సంఖ్యను, లెక్కలను తెలుసుకోవటానికి చంద్రుని దశలను కూడా ఆయనే

6. దీని వివరణ కోసం అల్ ఆరాఫ్ సూరా 54వ ఆయతుకు ఇవ్వబడిన వ్యాఖ్యానాన్ని చూడండి.

7. ఆయన భూమ్యాకాశాలను సృష్టించి వాటిని వాటి మానాన వదలిపెట్టలేదు. పైగా సమస్త విశ్వమండలాన్ని సజావుగా నడిపే వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఆ వ్యవస్థలో ఎక్కడా ఎలాంటి వెలితిగానీ, వ్యాఘాతంగానీ కనిపించదు. ప్రతి వస్తువు ఆయన ఆదేశానుసారం తన పరిధిలో తనవంతు విధిని సక్రమంగా నిర్వర్తిస్తూ ఉంది.

8. ఇది ముష్రిక్కులను, అవిశ్వాసులను ఉద్దేశించి చెప్పబడిన మాట. వారి విశ్వాసాలు మిథ్యా విశ్వాసాలు. వారు విగ్రహాలను, జిన్నులను కొలిచేవారు. దైవసమక్షంలో అవి తమను ఆదుకుంటాయని దృఢంగా నమ్మేవారు. సిఫారసు స్వీకరించబడటం సంగతి అటుంచి, కనీసం అల్లాహ్ అనుమతి లేకుండా సిఫారసు కూడా ఎవరూ చేయలేరని స్పష్టం చేయబడింది. ఆ అనుమతి కూడా అల్లాహ్ తాను కోరినవారికే – కొన్ని షరతులపై – ఇస్తాడు.

1. "సిఫారసు వినటానికి అల్లాహ్ కోరిన వారి విషయంలో తప్ప వేరెవరి గురించీ వారు సిఫారసు చేయలేరు." (అంబియా – 28).

2. "అల్లాహ్ ఎవరి విషయంలో ఏదైనా విన్నపం వినదలుస్తాడో, ఎవడు ఆయనకు ఇష్టమైనవాడో, వాని విషయంలో అనుమతి ఇస్తే తప్ప వారి సిఫారసు ఏమాత్రం ఉపయోగపడదు." (అన్ నజ్మ్ – 26).

9. అంటే సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, నిర్వహణకర్త, సర్వాధికారి అయిన అల్లాహ్ మాత్రమే మీ ఆరాధనలకు, ఉపాసనలకు అర్హుడు.

10. ఈ ఆయతులో ప్రళయ దిన సంభవం గురించి, దైవ సన్నిధిలో మానవులందరి సమావేశం గురించి, శిక్షా బహుమానాల గురించి చెప్పటం జరిగింది. ఈ అంశం దివ్య ఖుర్ఆన్‌లో పదే పదే పునరావృతం అవుతూ ఉంటుంది. పరిపరి విధాలుగా చెప్పి దైవభీతినీ, పరలోక చింతనను మనిషిలో కలిగించటం ఖుర్ఆన్ ప్రత్యేకత.

وَالْحِسَابَ ؕ مَا خَلَقَ اللّٰهُ ذٰلِكَ اِلَّا بِالْحَقِّ ۚ
يُفَصِّلُ الْاٰيٰتِ لِقَوْمٍ يَّعْلَمُوْنَ ⑤

నిర్ధారించాడు.[12] అల్లాహ్ వీటిని సత్యబద్ధంగా తప్ప (నిరర్థకంగా) పుట్టించలేదు. తెలుసుకోగల వారికోసం ఆయన ఈ సూచనలను విడమరచి చెబుతున్నాడు.

اِنَّ فِي اخْتِلَافِ الَّيْلِ وَالنَّهَارِ وَمَا خَلَقَ اللّٰهُ فِي
السَّمٰوٰتِ وَالْاَرْضِ لَاٰيٰتٍ لِّقَوْمٍ يَّتَّقُوْنَ ⑥

**6** నిస్సందేహంగా రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావటంలోనూ, భూమ్యాకాశాలలో అల్లాహ్ సృష్టించిన వస్తువు లన్నింటిలోనూ దైవభీతి గలవారి కోసం సూచనలున్నాయి.

اِنَّ الَّذِيْنَ لَا يَرْجُوْنَ لِقَآءَنَا وَرَضُوْا بِالْحَيٰوةِ الدُّنْيَا
وَاطْمَاَنُّوْا بِهَا وَالَّذِيْنَ هُمْ عَنْ اٰيٰتِنَا غٰفِلُوْنَ ⑦

**7** మమ్మల్ని కలుసుకునే విషయంపై నమ్మకం లేనివారికీ, ప్రాపంచిక జీవితంతోనే సంతోషించిన వారికీ, దానితోనే సంతృప్తి చెందిన వారికీ, మా ఆయతుల పట్ల నిర్లక్ష్యభావం ప్రదర్శించిన వారికీ –

اُولٰٓئِكَ مَاْوٰىهُمُ النَّارُ بِمَا كَانُوْا يَكْسِبُوْنَ ⑧

**8** వారు ఆర్జించిన దాని ప్రతిఫలంగా వారి నివాసం నరకాగ్ని అవుతుంది.

اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ يَهْدِيْهِمْ
رَبُّهُمْ بِاِيْمَانِهِمْ ۚ تَجْرِيْ مِنْ تَحْتِهِمُ الْاَنْهٰرُ
فِيْ جَنّٰتِ النَّعِيْمِ ⑨

**9** నిశ్చయంగా – విశ్వసించి, సత్కార్యాలు చేసినవారికి వారి ప్రభువు వారి విశ్వాసం కారణంగా వారిని గమ్యస్థానానికి చేరు స్తాడు[13] – క్రింద కాలువలు ప్రవహించే అనుగ్రహభరితమైన స్వర్గవనాలలోకి!

11. ఆయన సూర్యుణ్ణి ప్రకాశమానంగానూ, చంద్రుణ్ణి కాంతిని విరజిమ్మేదిగానూ చేశాడు. నిశ్చయంగా సూర్యచంద్రులు దేవుని సూచనలలోనివి. విశ్వవ్యవస్థను నడపటంలో, ప్రాణుల మనుగడలో అవి పోషిస్తున్న పాత్ర అద్వితీయం. లోకానికి సూర్యుడు వేడినివ్వగా, చంద్రుడు వెలుగునిస్తున్నాడు. వాటి అవసరం తమకు ఎంతగా ఉందో మానవులకు తెలియనిది కాదు. సూర్యుడు స్వయం ప్రకాశకమనీ, దీనికి భిన్నంగా చంద్రుడు స్వయం ప్రకాశకం కాదనీ, దాని కాంతి సూర్యుని నుంచి పరివర్తనం చెంది వస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు (ఫత్హుల్ ఖదీర్).

12. అంటే మేము చంద్రుని పెరిగే తరిగే దశలను నిర్ధారించాము. అవి మొత్తం 28 దశలు (మజిలీలు). అది ఒక్కో రాత్రి ఒక్కో దశకు చేరుకుంటుంది. ఈ విధి నిర్వహణలో అది ఏ లోటూ రానివ్వదు. మొదటి దశలలో అది చిన్నగా, కరవాలం లాగా కానవస్తుంది. ఆ తరువాత క్రమక్రమంగా అది పెరగసాగుతుంది. 14వ దశకు (14వ మజిలీకి) చేరుకునేసరికి పూర్ణచంద్రునిలా మారుతుంది. ఆ తరువాత అది మళ్ళీ నిరంతరం క్షీణిస్తూపోతుంది. కడకు అది ఒకటీ లేక రెండు రాత్రులు కనిపించకుండా పోతుంది. ఆ తరువాత – సరికొత్తగా – నెలవంక రూపంలో దర్శనమిస్తుంది. ఈ పెరిగే తరిగే దశల ద్వారా మీరు సంవత్సరాల, నెలల లెక్కను నిర్ధారిస్తారు. కొన్ని రోజులలో పగలు 12 గంటలు, రాత్రి 12 గంటలు ఉంటాయి. కొన్ని సీజన్లలో రాత్రి పెద్దదై పగలు చిన్నదవుతుంది. మరికొన్ని సీజన్లలో రాత్రి చిన్నదై పగలు సుదీర్ఘంగా ఉంటుంది. ఈ పెరగటం – తరగటంలో కూడా అనేక ప్రాపంచిక పారలౌకిక ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. ఈ నెల పొడుపు ద్వారానే హజ్, రమజాన్ ఉపవాసాలు, నిషిద్ధ మాసాల లెక్క కట్టడం జరుగుతుంది.

13. దీనికి మరో అర్థం ఈ విధంగా చెప్పబడింది : "ప్రపంచంలో వారు విశ్వాసంపై స్థిరంగా ఉన్న కారణంగా ప్రళయదినాన అల్లాహ్ 'పుల్‌సిరాత్'ను దాటిపోవటాన్ని సులభతరం చేస్తాడు." మరికొంతమంది ఇలా అభిప్రాయపడ్డారు: ప్రళయదినాన

**10** “అల్లాహ్! నీవు పవిత్రుడవు”[14] అనే మాట వారి నోట వెలువడుతుంది. “అస్సలాము అలైకుమ్ (మీకు శాంతి కలుగు గాక)!”[15] అని వారు పరస్పరం శాంతిపూర్వకంగా చెప్పు కుంటారు. “సర్వలోక ప్రభువగు అల్లాహ్‌కే సకల స్తోత్రాలు” అన్నది వారి ముగింపు వాక్యం అయి ఉంటుంది.

دَعْوٰىهُمْ فِيْهَا سُبْحٰنَكَ اللّٰهُمَّ وَتَحِيَّتُهُمْ فِيْهَا سَلٰمٌ ۚ وَاٰخِرُ دَعْوٰىهُمْ اَنِ الْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ⑩

**11** ప్రజలు లాభం కోసం ఎంత తొందర పెడతారో అంతే తొందరగా అల్లాహ్ వారికి నష్టం చేకూర్చితే వారి వాగ్దానం ఎప్పుడో పూర్తయిపోయి ఉండేది.[16] కనుక మా వద్దకు మరలి రావటంపై నమ్మకంలేని వారిని, వారు తమ తలబిరుసుతనంలో తచ్చాడుతూ ఉండేందుకు – వారి మానాన వారిని వదలి పెడతాము.

وَلَوْ يُعَجِّلُ اللّٰهُ لِلنَّاسِ الشَّرَّ اسْتِعْجَالَهُمْ بِالْخَيْرِ لَقُضِيَ اِلَيْهِمْ اَجَلُهُمْ ۗ فَنَذَرُ الَّذِيْنَ لَا يَرْجُوْنَ لِقَآءَنَا فِيْ طُغْيَانِهِمْ يَعْمَهُوْنَ ⑪

**12** మనిషికి ఏదైనా కష్టం కలిగినప్పుడు పడుకొని, కూర్చొని, నిలబడీ మమ్మల్ని మొరపెట్టుకుంటాడు. మరి మేము అతని కష్టాన్ని అతన్నుంచి తొలగించినప్పుడు, తనకు కలిగిన ఏ

وَاِذَا مَسَّ الْاِنْسَانَ الضُّرُّ دَعَانَا لِجَنْۢبِهٖٓ اَوْ قَاعِدًا اَوْ قَآئِمًا ۚ فَلَمَّا كَشَفْنَا عَنْهُ ضُرَّهٗ مَرَّ كَاَنْ

అల్లాహ్ ఈ భాగ్యవంతులకు ఒక ‘కాంతి’ని ప్రసాదిస్తాడు. వారు ఆ కాంతిలో అలవోకగా తమ గమ్యస్థానాన్ని చేరుకుంటారు. ఈ విషయం ‘అల్ హదీద్’ సూరాలో కూడా చెప్పబడింది.

14. స్వర్గవాసులు ఎల్లప్పుడూ దైవస్తోత్రం చేస్తూ, దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉంటారు. వారు ఏది పలికినా అందులో దైవ ప్రశంస ఉట్టిపడుతూ ఉంటుంది. “మనిషి ఉఛ్వాస నిశ్వాసలు ఎంత సహజమో స్వర్గవాసుల అధరాలపై దైవస్తోత్రం, దేవుని పవిత్ర వచనాలు ఆలాపించబడటం కూడా అంతే సహజం” అన్న హదీసు ఈ సందర్భంగా గమనించదగినది (సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్....).

15. అంటే స్వర్గవాసులు ఒకరినొకరు **‘సలాం’**తో పలకరిస్తూ, ఒండొకరి శ్రేయాన్ని అభిలషిస్తూ ఉంటారు. దైవదూతలు సయితం వారికి సలాం చేస్తూ ఉంటారు.

16. దీనికి ఒక అర్థం ఇది: మనిషి మేలు కోసం హడావిడి చేసినట్లే కీడు కోసం కూడా హడావిడి చేస్తాడు. “నీవు సత్య వంతుడవే అయితే నీవు మాటిమాటికీ హెచ్చరిస్తున్న ఆ శిక్షను కాస్త తీసుకురా చూద్దాం” అని ప్రవక్తకు సవాలు విసురుతాడు. వారు కోరుతున్నట్లు మేము గనక మా శిక్షను వారిపైకి పంపి ఉంటే వారి కథ ఎప్పుడో కంచికి చేరి ఉండేది. కాని మేము వారిపట్ల పట్టు విడుపుల వైఖరిని అవలంబిస్తున్నాము అని అల్లాహ్ అంటున్నాడు. దీనికి మరో అర్థం ఇది కావచ్చు: మానవుడు తనకు మేలు చేకూర్చమని ప్రార్థించినట్లే (దాన్ని మేము ఆమోదిస్తాము కూడా) కష్టకాలంలో చిరాకుతో చిందులేస్తూ తన కోసం, తన ఆలుబిడ్డల కోసం కీడును కోరుకుంటాడు. శాపనార్థాలు పెడుతూ ఉంటాడు. వాటిని మేము ఉపేక్షిస్తున్నాము. నోటితో అలాంటి పాడుమాటలంటున్నాడేగాని, మనస్ఫూర్తిగా అతడలా కోరుకోడుకదా! వారు కోరిందే తడవుగా మేము వారి శాపనార్థాలకు ఆమోదముద్ర వేసినట్లయితే వారెప్పుడో మృత్యు ఒడిలోకి చేరి ఉండేవాళ్లు. అందుకే హదీసులో ఇలా అనబడింది: “మీరు మీ విషయంలో, మీ కన్నపిల్లల విషయంలో, మీ ఆస్తిపాస్తుల, వర్తక వాణిజ్యాల విషయంలో ఎన్నడూ చెడుగా ప్రార్థించకండి. దేవుడు ప్రార్థనలు ఆమోదించే ఘడియలలో ఒకవేళ మీరు అలాంటి చెడు ప్రార్థనలు చేస్తే అవి ఆమోదముద్ర పొందే ప్రమాదముంది” (సుననె అబూ దావూద్ – కితాబుల్ విత్ర్; ముస్లిం – కితాబుజ్జుహ్ద్).

لَّمْ يَدْعُنَآ إِلَىٰ ضُرٍّ مَّسَّهُۥ ۚ كَذَٰلِكَ زُيِّنَ
لِلْمُسْرِفِينَ مَا كَانُوا۟ يَعْمَلُونَ ﴿١٢﴾

కష్టానికీ, ఎప్పుడూ, మమ్మల్ని ప్రార్థించనే లేదన్నట్లుగా వ్యవహరిస్తాడు.[17] ఈ విధంగా హద్దుమీరి పోయే వారి పనులు వారికి ఎంతో రమణీయంగా చెయ్యబడ్డాయి.[18]

وَلَقَدْ أَهْلَكْنَا ٱلْقُرُونَ مِن قَبْلِكُمْ لَمَّا ظَلَمُوا۟ ۙ
وَجَآءَتْهُمْ رُسُلُهُم بِٱلْبَيِّنَٰتِ وَمَا كَانُوا۟ لِيُؤْمِنُوا۟ ۚ
كَذَٰلِكَ نَجْزِى ٱلْقَوْمَ ٱلْمُجْرِمِينَ ﴿١٣﴾

**13** మేము మీకు పూర్వం ఎన్నో జాతులను – వారు అన్యాయానికి ఒడిగట్టినప్పుడు – తుదముట్టించాము. వారి వద్దకు వారి ప్రవక్తలు కూడా సూచనలు తీసుకువచ్చారు. కాని వారు విశ్వసిస్తే కదా?! మేము అపరాధ జనులకు ఇలాంటి శిక్షనే విధిస్తాము.[19]

ثُمَّ جَعَلْنَٰكُمْ خَلَٰٓئِفَ فِى ٱلْأَرْضِ مِنۢ بَعْدِهِمْ
لِنَنظُرَ كَيْفَ تَعْمَلُونَ ﴿١٤﴾

**14** మరి వారి తర్వాత – మీరు ఏ విధంగా పని చేస్తారో చూడటానికి మేము వారి స్థానంలో మిమ్మల్ని భూమికి వారసులుగా తీసుకువచ్చాము.[20]

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ ءَايَاتُنَا بَيِّنَٰتٍ ۙ قَالَ ٱلَّذِينَ
لَا يَرْجُونَ لِقَآءَنَا ٱئْتِ بِقُرْءَانٍ غَيْرِ هَٰذَآ أَوْ بَدِّلْهُ ۚ
قُلْ مَا يَكُونُ لِىٓ أَنْ أُبَدِّلَهُۥ مِن تِلْقَآئِ نَفْسِىٓ ۖ

**15** వారి ముందు స్పష్టమైన మా వాక్యాలను చదివి వినిపించినప్పుడు,[21] మమ్మల్ని కలిసే నమ్మకం లేనివారు “ఇది తప్ప వేరొక ఖుర్‌ఆన్‌ను తీసుకు రా[22] లేదా ఇందులో కొంత సవరణ చెయ్యి” అంటారు. (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : “నా తరఫున ఇందులో సవరణ చేసే అధికారం నాకేమాత్రం లేదు.[23] నా వద్దకు ‘వహీ’

17. మానవనైజం ఇక్కడ కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరించబడింది. ప్రజల్లో అధికుల ధోరణి ఇలాగే ఉంటుంది. దైవాన్ని విశ్వసించే చాలామందిలో సయితం ఈ వైఖరి కనిపిస్తూ ఉంటుంది. వారు దీనాతిదీనంగా ప్రార్థిస్తారు. పదే పదే లెంపలేసుకుంటారు. దైవ సన్నిధిలో కుమిలి కుమిలి ఏడుస్తారు. వారి స్థితిపై దయదలచి అల్లాహ్ వారిని ఆపదల నుంచి గట్టెక్కించగానే ఎంతో నిర్లక్ష్యంగా, తల ఎగురవేస్తూ తిరుగుతారు. అసలు తాము ఎన్నడూ దైవసన్నిధిలో నిస్సహాయస్థితిని వ్యక్తపరచనే లేదన్నట్లుగా ప్రవర్తిస్తారు. చేసిన మేలును మరచిపోయి కృతఘ్నులుగా మసలుకోవటం అంటే ఇదే!

18. వారి పనులు వారికి రమణీయంగా చూపబడటంలోని ఉద్దేశం వారిని పరీక్షించటం కావచ్చు లేదా వారికి కొంత గడువు ఇచ్చే నిమిత్తం కావచ్చు. షైతాను ప్రేరణల ద్వారా కూడా వారికి అలా అనిపించవచ్చు. లేదా చెడుల వైపుకు పురికొల్పే మానవ మనస్సు వల్ల కూడా వారి చేష్టలు వారికి ఎంతో అందంగా కనిపించవచ్చు (యూసుఫ్ – 53). హద్దుమీరే వారు మాత్రమే ఇలాంటి పరిస్థితుల ప్రభావానికి లోనవుతుంటారు. ఈ ఆయతులోని భావం ఏమిటంటే ప్రార్థించటం పట్ల వైముఖ్యం, దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవటం పట్ల నిర్లక్ష్యం, మనోవాంఛలకు దాసోహమనటం వంటివి వారికి అందంగా, ఆకర్షణీయంగా చేయబడ్డాయి (ఫత్‌హుల్ ఖదీర్).

19. గత సమాజాల మాదిరిగానే మీరు కూడా వినాశానికి లోను చేయబడతారని ఈ వాక్యంలో మక్కా అవిశ్వాసులు హెచ్చరించబడ్డారు.

20. **ఖలాయిఫ్** అనే పదం **ఖలీఫా** అన్న పదానికి బహువచనం. మీరు గత సమాజాలకు బదులుగా లేక పరస్పరం వారసులుగా చేయబడతారు అని దీని భావం.

21. అంటే అల్లాహ్ దైవత్వాన్నీ, ఆయన ఏకత్వాన్ని నిరూపించే అంశాలను వారి ముందు ప్రస్తావించినప్పుడు.

إِنْ أَتَّبِعُ إِلَّا مَا يُوحَىٰ إِلَيَّ ۖ إِنِّي أَخَافُ إِنْ عَصَيْتُ رَبِّي عَذَابَ يَوْمٍ عَظِيمٍ (15)

ద్వారా పంపబడే దానిని నేను (యధాతథంగా) అనుసరించేవాణ్ణి మాత్రమే. ఒకవేళ నేను గనక నా ప్రభువు పట్ల అవిధేయతకు పాల్పడినట్లయితే ఒక మహా దినమున విధించబడే శిక్షకు భయ పడుతున్నాను."[24]

قُلْ لَوْ شَاءَ اللَّهُ مَا تَلَوْتُهُ عَلَيْكُمْ وَلَا أَدْرَاكُمْ بِهِ ۖ فَقَدْ لَبِثْتُ فِيكُمْ عُمُرًا مِنْ قَبْلِهِ ۚ أَفَلَا تَعْقِلُونَ (16)

**16** "అల్లాహ్ కోరితే దీన్ని నేను మీకు చదివి వినిపించటంగానీ, అల్లాహ్ దాని గురించి మీకు తెలియజేయటంగానీ జరిగి ఉండేదే కాదు.[25] ఎందుకంటే ఇంతకు ముందు నేను నా జీవితకాలంలో ఓ పెద్దభాగం మీ మధ్యనే గడిపాను. అసలు మీరు బుద్ధిని ఉపయోగించరా?"[26] అని అడుగు.

فَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا أَوْ كَذَّبَ بِآيَاتِهِ ۚ إِنَّهُ لَا يُفْلِحُ الْمُجْرِمُونَ (17)

**17** కనుక అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టే, లేక ఆయన వాక్యాలను అబద్ధాలుగా ఖరారుచేసే వాడికన్నా పరమ దుర్మార్గుడు ఎవడుంటాడు? ఇలాంటి అపరాధులు ఎట్టిపరిస్థితిలోనూ సాఫల్యం పొందరు.

وَيَعْبُدُونَ مِنْ دُونِ اللَّهِ مَا لَا يَضُرُّهُمْ وَلَا يَنْفَعُهُمْ وَيَقُولُونَ هَٰؤُلَاءِ شُفَعَاؤُنَا

**18** వారు అల్లాహ్‌ను వదలి[27] తమకు నష్టాన్నిగానీ, లాభాన్నిగానీ చేకూర్చలేని వాటిని[28] పూజిస్తున్నారు. ఇంకా, "అల్లాహ్ సమక్షంలో ఇవి మాకు సిఫారసు చేస్తాయి"[29] అని చెబుతున్నారు.

22. అంటే – ఈ ఖుర్‌ఆన్‌కు బదులుగా మరో ఖుర్‌ఆన్‌నయినా తీసుకురండి లేదంటే ఈ గ్రంథంలో మా అభిమతానికనుగుణంగా మార్పులైనా చేయండి. అలా చేయకపోతే మేము మీ సందేశాన్ని ఆలకించబోము అన్నది వారి మాటల ఉద్దేశం.

23. మీరు చేసే ఈ రెండు డిమాండ్లలో ఏ ఒక్కదానినీ నేను నెరవేర్చలేను. నా ఇష్టానుసారం దైవగ్రంథంలో మార్పులు చేసే అధికారం నాకు లేనేలేదు అని మహాప్రవక్త (స) చెప్పారు.

24. విశ్వప్రభువు అయిన అల్లాహ్ తరఫున నాకు అందజేయబడే వాణిని ఖచ్చితంగా అనుసరించటమే నా కర్తవ్యం. అందులో గనక నేను ఏమైనా హెచ్చుతగ్గులు చేస్తే తీర్పుదినాన దేవుని పట్టునుండి నన్ను నేను కాపాడుకోలేను అని దైవప్రవక్త (స) చేత చెప్పించబడుతోంది.

25. ఇదంతా దేవుని తరఫున ప్రణాళికాబద్ధంగా జరుగుతోంది. చదివి వినిపించాలన్నది ఆయన తలంపు గనకనే నేను మీకు ఆ ఆజ్ఞలను చదివి వినిపించాను. దైవాభిమతం మరోవిధంగా ఉంటే అసలు ఇదంతా జరిగేదే కాదు; మూలంలోని **'అద్‌రాకుమ్ బిహీ'** అనే పదాన్ని కొందరు **'ఆలమకుమ్ బిహీ అలా లిసానీ'** అని తర్జుమా చేశారు. అంటే 'అల్లాహ్ నా నోటి ద్వారా మీకు ఈ ఖుర్‌ఆన్ గురించి ఏమీ తెలిపి ఉండేవాడు కాదు' అని భావం.

26. దైవప్రవక్తగా నియుక్తంగాక మునుపు నేను 40 సంవత్సరాలపాటు మీ మధ్య ఉన్నాను. నేనెవరో మీకు బాగా తెలుసు. నేనెప్పుడైనా ఏ గురువు దగ్గరైనా పాఠాలు నేర్చుకున్నానా? నా సత్యసంధతపై, నా నిజాయితీపై మీరు స్వయంగా సాక్ష్యమిచ్చారు. అలాంటి నేను అల్లాహ్‌కు అబద్ధాలను ఆపాదించటం సంభవమా?– దీని భావం ఏమిటంటే దివ్యఖుర్‌ఆన్ సాంతం దేవుని తరఫున వచ్చినది. అది నా విరచితం కానేకాదు. అందులో సవరణలు చేసే అధికారం నాకు లేదు.

"ఏమిటీ, ఆకాశాలలో గానీ, భూమిలో గానీ అల్లాహ్‌కు తెలియని దానిని గురించి మీరు ఆయనకు తెలియజేస్తున్నారా?"[30] వారు కల్పించే భాగస్వామ్యాల నుంచి ఆయన పవిత్రుడు, ఉన్నతుడు[31] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

عِنْدَ اللّٰهِ ؕ قُلْ اَتُنَبِّـُٔوْنَ اللّٰهَ بِمَا لَا يَعْلَمُ
فِي السَّمٰوٰتِ وَلَا فِي الْاَرْضِ ؕ سُبْحٰنَهٗ وَتَعٰلٰى
عَمَّا يُشْرِكُوْنَ ﴿18﴾

**19** మొదట్లో జనులంతా ఒకే సంఘంగా ఉండేవారు. తరువాత వారు విభేదించుకున్నారు.[32] నీ ప్రభువు తరఫునుంచి ముందుగానే ఒక విషయం ఖరారు కాకుండా ఉన్నట్లయితే, వారు విభేదించు కునే విషయం ఎప్పుడో తేల్చివెయ్యబడేది.[33]

وَمَا كَانَ النَّاسُ اِلَّاۤ اُمَّةً وَّاحِدَةً فَاخْتَلَفُوْا ؕ
وَلَوْلَا كَلِمَةٌ سَبَقَتْ مِنْ رَّبِّكَ لَقُضِيَ بَيْنَهُمْ
فِيْمَا فِيْهِ يَخْتَلِفُوْنَ ﴿19﴾

**20** "అతని ప్రభువు తరఫున అతనిపై ఏదైనా సూచన ఎందుకు అవతరించదు?"[34] అని వారంటున్నారు. "రహస్య జ్ఞానం అల్లాహ్ వద్ద మాత్రమే ఉంది.[35] కాబట్టి మీరూ నిరీక్షించండి, మీతోపాటు నేనూ నిరీక్షిస్తున్నాను" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

وَيَقُوْلُوْنَ لَوْلَاۤ اُنْزِلَ عَلَيْهِ اٰيَةٌ مِّنْ رَّبِّهٖ ۚ
فَقُلْ اِنَّمَا الْغَيْبُ لِلّٰهِ فَانْتَظِرُوْا ۚ اِنِّيْ مَعَكُمْ
مِّنَ الْمُنْتَظِرِيْنَ ﴿20﴾ ع

27. ముష్రిక్కులు అల్లాహ్ దాస్య పరిమితులను ఉల్లంఘించేవారు. అంతేగాని అల్లాహ్ దాస్యాన్ని పూర్తిగా త్యజించేవారు కారు. అంటే అల్లాహ్‌ను ఆరాధించటంతో పాటు దైవేతరులను కూడా పూజించేవారు.

28. ఆరాధ్యదైవం అయినవాడు తన విధేయులకు బహుమానం ప్రసాదించాలి. తన మాటను విననివారిని శిక్షించాలి. ఆ మాత్రం చేతకానివాడు 'దేవుడు' కాజాలడు. కాని వీరు పూజించే వాటికి ఆ 'శక్తి' లేదు.

29. అంటే వారి సిఫారసు వల్ల దేవుడు మా అక్కరలన్నీ తీరుస్తాడు. మా దురవస్థను చక్కదిద్దుతాడు. మా విరోధుల మంచిస్థితిని చెడగొట్టేస్తాడు అని వారు నమ్మేవారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే తాము కొలిచే చిల్లర దేవుళ్ళు స్వయంగా తమ అవసరాలను తీరుస్తారన్న నమ్మకం ముష్రిక్కులకు ఉండేది కాదు. కాకపోతే వారు సర్వాధిపతి అయిన దేవుని వద్ద 'సాధనం' (వసీలా)గా ఉపయోగపడతారని నమ్మేవారన్నమాట!

30. అంటే – నీకు సహవర్తులు కూడా ఉన్నారు. నీ సమక్షంలో సిఫారసు చేసేవారు కూడా ఉన్నారయ్యా! అన్న సంగతిని వారు అల్లాహ్‌కు తెలియపరచాలనుకుంటున్నారా? ఆ సంగతి దైవానికి తెలియదని వీరు అనుకుంటున్నారా?

31. బహుదైవారాధకుల ఈ మాటలు నిరాధారమైనవనీ, వారు కల్పించే ఈ అసత్యాలతో అల్లాహ్‌కు ఎట్టి సంబంధం లేదనీ, ఆయన పవిత్రుడు, అధికుడని ఇందులో స్పష్టం చేయటం జరిగింది.

32. అంటే – ఈ షిర్క్ (బహుదైవారాధన) ప్రజలు తమకు తాముగా కల్పించుకున్నదే తప్ప ముందు నుంచీ ఉన్నది కాదు. ప్రారంభంలో మనుషులంతా ఒకే ధర్మాన్ని అవలంబించేవారు. ఒకే సంఘంగా ఉండేవారు. అదే ఇస్లాం. అది తౌహీద్ (ఏక దైవారాధన)పై ఆధారపడి ఉండేది. దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) కాలం వరకూ జనులు ఈ తౌహీద్‌పైనే ఉన్నారు. ఆ తరువాత వారిలో చీలిక వచ్చింది. కొంతమంది అల్లాహ్‌తో పాటు మరికొందరిని కూడా దైవత్వంలో భాగస్వాములుగా చేసుకున్నారు.

33. అంటే–దేవుడు తన సృష్టితాలకు నిర్ణీత గడువు నిర్ధారించకుండా ఉంటే, సత్యాసత్యాలను వారికి క్షుణ్ణంగా తెలియ జెప్పేవరకూ వారిపై ఎలాంటి చర్యా గైకొనరాదన్నమాట ముందుగానే ఖరారు చేయకుండా ఉన్నట్లయితే వారి సంగతిని ఏనాడో తేల్చేసి ఉండేవాడు. విశ్వాసులను సుఖసౌఖ్యాలకు, అవిశ్వాసులను వ్యథలకు లోనుచేసి ఉండేవాడు.

34. **'సూచన'** (ఆయత్) అంటే ఏదైనా గొప్ప మహిమ లేక చమత్కారం అని భావం. ఉదాహరణకు: సమూద్ జాతి

وَإِذَآ أَذَقْنَا ٱلنَّاسَ رَحْمَةً مِّنۢ بَعْدِ ضَرَّآءَ مَسَّتْهُمْ
إِذَا لَهُم مَّكْرٌ فِىٓ ءَايَاتِنَا ۚ قُلِ ٱللَّهُ أَسْرَعُ مَكْرًا ۚ
إِنَّ رُسُلَنَا يَكْتُبُونَ مَا تَمْكُرُونَ ﴿٢١﴾

**21** ప్రజలపై ఆపద వచ్చిపడిన తరువాత మేము వారికి (మా) కారుణ్యం రుచి చూపితే,[36] వెంటనే వారు మా ఆయతులకు వ్యతిరేకంగా ఎత్తులు వేయటం మొదలెడతారు.[37] "ఎత్తులు వేయటంలో అల్లాహ్ మీకంటే చాలా వేగం"[38] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. నిశ్చయంగా మా దూతలు మీ ఎత్తులను వ్రాస్తున్నారు.

هُوَ ٱلَّذِى يُسَيِّرُكُمْ فِى ٱلْبَرِّ وَٱلْبَحْرِ ۖ حَتَّىٰٓ
إِذَا كُنتُمْ فِى ٱلْفُلْكِ وَجَرَيْنَ بِهِم بِرِيحٍ طَيِّبَةٍ
وَفَرِحُوا۟ بِهَا جَآءَتْهَا رِيحٌ عَاصِفٌ وَجَآءَهُمُ
ٱلْمَوْجُ مِن كُلِّ مَكَانٍ وَظَنُّوٓا۟ أَنَّهُمْ أُحِيطَ بِهِمْ ۙ

**22** ఆయనే మిమ్మల్ని భూమిలోనూ, సముద్రంలోనూ నడుపుతున్నాడు.[39] ఆ విధంగా మీరు ఓడలలో పయనమవుతున్నప్పుడు, అవి ప్రజలను సానుకూలమైన గాలుల ద్వారా తీసుకుపోతుంటాయి. ఆ అనుకూల పవనాలకు ప్రజలు ఆనంద డోలికల్లో తేలియాడుతుండగా (అకస్మాత్తుగా) వారిపై ఉధృతమైన గాలి వీస్తుంది. అన్ని వైపులనుంచీ వారిపై అలలు వచ్చిపడతాయి. తాము (ఆపదలో దారుణంగా) చిక్కుకు పోయామన్న సంగతిని

కొరకు ఒంటె పుట్టుకు వచ్చింది. అలాగే వీళ్ళ (కురైషుల) కోసం సఫా పర్వతాన్ని బంగారు పర్వతంగా చేయాలనో లేదా మక్కాలోని పర్వతాలన్నింటినీ రూపుమాపి వాటి స్థానంలో నదీనదాలను ప్రవహింపజెయ్యాలనో వీళ్లు కోరుకుంటున్నారా?

35. అల్లాహ్ గనక తలచుకుంటే ఈ అద్భుతాలు చేసి చూపగలడు. కాని ఆ తరువాత కూడా వారు గనక విశ్వసించకపోతే దైవశాసనం అమల్లోకి వస్తుంది. దేవుడు తన సంప్రదాయానుసారం వారిని తుదముట్టించవలసి వస్తుంది. అందుకే- ఏ జాతి అయినా కోరగానే దాని కోర్కెను ఆయన తీర్చడు. మహిమలు ఎవరి పాలిట శ్రేయస్కరంగా పరిణమిస్తాయో, మరెవరి పాలిట హానికరం అవుతాయో ఆయనకు బాగా తెలుసు. అలాగే ఒక జాతి వారికి, వారు కోరిన మహిమలు వారికి చూపబడకపోతే వారికి ఎంత గడువు ఇవ్వాలో కూడా ఆయనకే తెలుసు. అందుకే, "మీరూ నిరీక్షించండి. మీతోపాటు నేను కూడా నిరీక్షిస్తాను" అని చెప్పటం జరిగింది.

36. **'ఆపద తరువాత కారుణ్యం'** అంటే లేమి, దుర్భిక్షం, దారిద్ర్యం, కష్టాల తరువాత కలిమి ప్రాప్తించటం, ఆర్థిక ఒనరులు పుష్కలంగా లభ్యమవటం అని అర్థం.

37. అంటే; వారు మా ప్రసాదితాలకుగాను కృతజ్ఞతలు తెలుపుకునే బదులు ధిక్కార వైఖరికి ఒడిగడతారు. షిర్క్‌కు పాల్పడతారు. దైవప్రసాదితాల పట్ల వారు అవలంబిస్తున్న ఈ వైఖరి కడు శోచనీయం. వారి ఎత్తుగడలు బహుచెడ్డవి.

38. అల్లాహ్ ఎత్తుగడలు వారి ఎత్తులకన్నా చాలా వేగంగా సాగుతాయి. ఏ క్షణంలోనయినా ఆయన వారిని పట్టుకోగలడు. వారికి కొంత గడువు ఇవ్వటం అవసరమనుకుంటే ఇవ్వనూ గలడు. అరబీలో **'మక్ర్'** అంటే రహస్య ఉపాయం, రహస్య వ్యూహరచన అన్న అర్థాలు వస్తాయి. అది మంచిదీ కావచ్చు, చెడ్డదీ కావచ్చు. అయితే ఈ ఆయతులో 'మక్ర్' అనే పదం అల్లాహ్ పట్టు, ఆయన విధించే శిక్ష అన్న భావంలో ఉపయోగించబడింది.

39. అరబీ (ఆయతు)లో **'యుసయ్యిరుకుమ్'** అని ఉంది. అంటే ఆయన మిమ్మల్ని నడుపుతున్నాడు, సంచరించే సద్బుద్ధినొసగుతున్నాడు అని భావం. అంటే ఆయన ప్రసాదించిన కాళ్ళతో మీరు నడుస్తున్నారు. ఆయన సమకూర్చిన వాహనాలపై మీరు ప్రయాణిస్తున్నారు. అలాగే ఓడల్ని, విమానాలను తయారుచేసే తెలివితేటలను ఆయన మీకు ప్రసాదించాడు. వాటి ద్వారా మీరు సముద్రయానం కూడా చేయగల్గుతున్నారు.

వారు గ్రహిస్తారు.[40] (ఆ క్షణంలో) తమ విశ్వాసాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని, "(అల్లాహ్!) నువ్వు గనక మమ్మల్ని ఈ ఆపద నుంచి గట్టెక్కిస్తే మేము తప్పకుండా నీకు కృతజ్ఞులమై ఉంటామ"ని మొరపెట్టుకుంటారు.[41]

دَعَوُا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ ۚ لَئِنْ اَنْجَيْتَنَا مِنْ هٰذِهٖ لَنَكُوْنَنَّ مِنَ الشّٰكِرِيْنَ ﴿22﴾

40. ఒక శత్రుసేన ఏదైనా పట్టణాన్ని, జాతిని ముట్టడించినప్పుడు అక్కడ ఎలాంటి భయంకర పరిస్థితి ఏర్పడుతుందో సముద్ర ప్రయాణంలో పెనుతుఫాను వచ్చినప్పుడు కూడా ఇంచుమించు అలాంటి పరిస్థితే ఏర్పడుతుంది. ప్రయాణీకులు దిక్కుతోచని పరిస్థితికిలోనై, ఆకాశం వైపు చూస్తారు. ఆ ఆపద నుంచి గట్టెక్కించే వాడు ఆ నిజదైవం తప్ప వేరొకరెవరూ కారన్న వాస్తవం ఆ క్షణంలో వారికి తెలిసివస్తుంది.

41. ఆ క్లిష్ట సమయంలో వారి అణువణువూ **'దేవుని ఏకత్వం'** గురించి సాక్ష్యమిస్తుంది. సాధారణ సమయాలలో వారిలో పొడసూపే బహుదైవారాధన విపత్కర పరిస్థితిలో ఏమాత్రం ఉండదు. తమ ధర్మాన్ని (దీన్‌ను) అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని అత్యంత దీనంగా ప్రార్థిస్తారు. సాధారణ సమయాలలో వారు గురువుల, వలీల, హజ్రత్‌ల వద్దకు పోతారు. దైవత్వంలో ఈ పుణ్యపురుషులకు కూడా ఎంతో కొంత భాగం ఉందని వాదిస్తారు. వాళ్ల ఆసరాతోనే తాము అల్లాహ్ సామీప్యం పొందుతామని సగర్వంగా ప్రకటిస్తారు. కాని ఇలాంటి ఆపదల్లో చిక్కుకున్నప్పుడు ఈ పైశాచిక ఫిలాసఫీలన్నింటినీ వారు మరచిపోతారు. ఆ కీలక సమయంలో వారికి ఒక్కడైన అల్లాహ్ మాత్రమే జ్ఞాపకం వస్తాడు.

దీన్నిబట్టి అర్థమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే మానవుడు తన నైజం రీత్యా 'దేవుడు ఒక్కడే' అన్న విషయాన్ని తెలుసుకుంటాడుగాని పరిస్థితుల ప్రభావానికి లోనై అతడు ఈ ప్రకృతి ధర్మాన్ని లోలోపలే అణచివేస్తాడు. పీకలలోతు కష్టాల్లో కూరుకుపోయినప్పుడు ఆ సహజధర్మం జాగృతమవుతుంది. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే మానవ నైజం వాంఛించేది, మానవ సమాజం కాంక్షించేది ఏకదైవోపాసనే. దానిపట్ల అతడు వైముఖ్యం చూపలేడు. ఎందుకంటే దానిపట్ల అతడు గనక వైముఖ్యం చూపాడంటే ప్రకృతిపట్ల వైముఖ్యం చూపినట్లే. ఇలాంటి వైముఖ్యం అతన్ని మార్గవిహీనతకు లోనుచేస్తుంది.

రెండోదేమంటే; బహుదైవోపాసకులు ఇలాంటి ఆపదల్లో చిక్కుకున్నప్పుడల్లా తమ స్వకల్పిత దైవాలందరినీ వదలిపెట్టేసి ఒక్కడైన అల్లాహ్‌ను (నిజదైవాన్ని) మాత్రమే మొరపెట్టుకునేవారు. అబూ జహల్ కుమారుడగు హజ్రత్ ఇక్రిమ (రజి) గురించి ఇలా అనబడింది: ఈయన మక్కా విజయం తరువాత నగరం నుంచి పలాయనం చిత్తగించి మరో దేశానికి వెళ్ళిపోయే ఉద్దేశంతో ఓడలో కూర్చున్నారు. ఓడ తుఫానులో చిక్కుకుంది. "మీరంతా కలసి ఒక్కడైన అల్లాహ్‌ను ప్రార్థించండి. ఈ రోజు ఈ పెనుగాలి నుంచి ఒక్క అల్లాహ్ తప్ప మరెవరూ కాపాడలేరు" అని ఓడ నడిపేవాడు ప్రయాణీకులకు విజ్ఞప్తి చేశాడు. హజ్రత్ ఇక్రిమాకు ఈ మాటలు కనువిప్పు కలిగించాయి.

సముద్రంలో పెను తుఫాను నుంచి కాపాడేవాడు అల్లాహ్ అయినప్పుడు, భూభాగంపై కూడా ఆ అల్లాహ్‌యే అందరినీ కాపాడేవాడై ఉంటాడు అని ఆయన అంతరాత్మ ప్రబోధించింది. ఈ తుఫాను బారినుంచి గనక తాను బ్రతికి బయటపడితే తిన్నగా మక్కాకు తిరిగివెళ్ళి ఇస్లాం స్వీకరిస్తానని ఆయన సంకల్పించుకున్నారు. ఆఖరికి అనుకున్నట్లే ఆయన మక్కా నగరానికి తిరిగి వచ్చి, దైవప్రవక్త (స) వారి సమక్షంలో ముస్లిం అయ్యారు (సుననె నసాయి, అబూ దావూద్ – హదీసు నెంబరు : 2683; అల్‌బానీ గారు దీనిని 'అస్ సహీహా' గ్రంథంలో పేర్కొన్నారు. నెం. 1723). కాని అత్యంత శోచనీయమైన విషయం ఏమిటంటే నేడు ముహమ్మద్ (స) గారి అనుచర సమాజం షిర్క్ (బహుదైవోపాసనా) ఊబిలో దారుణంగా కూరుకుపోయి ఉంది. ఆపద సమయాలలో సయితం వారు అల్లాహ్ వైపుకు మరలటంలేదు సరికదా, మృత్యు ఒడిలోకి చేరిన పుణ్యపురుషుల సమాధులనే ఆశ్రయించి, సహాయం కొరకు వాళ్ళనే మొరపెట్టుకుంటున్నారు. **ఫయిన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.**

فَلَمَّآ اَنْجٰىهُمْ اِذَا هُمْ يَبْغُوْنَ فِى الْاَرْضِ بِغَيْرِ الْحَقِّ ؕ
يٰۤاَيُّهَا النَّاسُ اِنَّمَا بَغْيُكُمْ عَلٰۤى اَنْفُسِكُمْ ۙ مَّتَاعَ
الْحَيٰوةِ الدُّنْيَا ۫ ثُمَّ اِلَيْنَا مَرْجِعُكُمْ فَنُنَبِّئُكُمْ
بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿23﴾

**23** మరి అల్లాహ్ వారిని కాపాడగానే వారు భూమిలో అన్యాయంగా తిరగబడతారు.[42] ప్రజలారా! మీ ఈ తిరుగుబాటు ధోరణి మీకే హానికరం.[43] ప్రాపంచిక జీవితపు ప్రయోజనాలు కొన్నాళ్ళు మాత్రమే. ఆ తరువాత మీరు మా వద్దకే మరలి రావలసిఉంది. అప్పుడు మేము, మీరు చేస్తూ ఉండిన కర్మలన్నింటినీ మీకు తెలియబరుస్తాము.

اِنَّمَا مَثَلُ الْحَيٰوةِ الدُّنْيَا كَمَآءٍ اَنْزَلْنٰهُ مِنَ
السَّمَآءِ فَاخْتَلَطَ بِهٖ نَبَاتُ الْاَرْضِ مِمَّا يَاْكُلُ
النَّاسُ وَالْاَنْعَامُ ؕ حَتّٰۤى اِذَاۤ اَخَذَتِ الْاَرْضُ
زُخْرُفَهَا وَازَّيَّنَتْ وَظَنَّ اَهْلُهَاۤ اَنَّهُمْ قٰدِرُوْنَ
عَلَيْهَاۤ ۙ اَتٰىهَاۤ اَمْرُنَا لَيْلًا اَوْ نَهَارًا فَجَعَلْنٰهَا
حَصِيْدًا كَاَنْ لَّمْ تَغْنَ بِالْاَمْسِ ؕ كَذٰلِكَ نُفَصِّلُ
الْاٰيٰتِ لِقَوْمٍ يَّتَفَكَّرُوْنَ ﴿24﴾

**24** ప్రాపంచిక జీవితపు ఉపమానం మేము ఆకాశం నుంచి కురిపించిన వర్షపు నీరు లాంటిది. ఆ నీటి ద్వారా మనుషులకు, పశువులకు ఆహారంగా ఉపయోగపడే భూ ఉత్పత్తులు దట్టంగా మొలకెత్తాయి. క్రమంగా ఆ నేల అందంగా ముస్తాబై, నవ నవలాడుతున్నప్పుడు, ఇక అది పూర్తిగా తమ స్వంతమైనట్లేనని దాని యజమానులు భావించారు. అప్పుడు అకస్మాత్తుగా రాత్రిపూటనో, పగటిపూటనో మా తరఫున ఒక ఆజ్ఞ (ఆపద) దానిపై వచ్చి పడింది. అసలు నిన్న అక్కడ ఏమీ లేనట్లే మేము దానిని తుడిచిపెట్టేశాము.[44] ఈ విధంగా మేము చింతనచేసే వారి కోసం ఆయతులను స్పష్టంగా విడమరచి చెబుతాము.

وَاللّٰهُ يَدْعُوْۤا اِلٰى دَارِ السَّلٰمِ ؕ وَيَهْدِىْ
مَنْ يَّشَآءُ اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿25﴾

**25** అల్లాహ్ మిమ్మల్ని శాంతి నిలయం వైపుకు పిలుస్తున్నాడు. ఇంకా, తాను కోరిన వారికి ఆయన రుజుమార్గంపై నడిచే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు.

لِلَّذِيْنَ اَحْسَنُوا الْحُسْنٰى وَزِيَادَةٌ ؕ وَلَا يَرْهَقُ
وُجُوْهَهُمْ قَتَرٌ وَّلَا ذِلَّةٌ ؕ اُولٰٓئِكَ اَصْحٰبُ
الْجَنَّةِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ﴿26﴾

**26** సత్కార్యాలు చేసిన వారి కొరకు మేలున్నది. మరింత బహుమానం కూడా ఉన్నది.[45] వారి ముఖాలపై నలుపుగానీ, పరాభవంగానీ ఆవరించవు. వారు స్వర్గవాసులు. అందులో వారు కలకాలం ఉంటారు.

42. ఇది మనిషిలోని కృతఘ్నతా భావానికి, చేసిన మేలును మరచిపోయే స్వభావానికి తార్కాణం. ఈ సూరాలోని 12వ ఆయతులో కూడా అతనిలోని ఈ 'కృతఘ్నత'ను ఎత్తిచూపటం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల ఇలాంటి ప్రస్తావన పునరావృతమవుతూ ఉంటుంది. మనిషిలోని ఈ 'చెడుగు'ను పారద్రోలటమే దీని అసలు ఉద్దేశం.

43. మీ మిడిసిపాటు కొన్నాళ్లు మాత్రమే. ప్రాపంచిక జీవితం క్షణభంగురం. మీరు ఎంత అదిరిపడినా కడకు మావద్దకు రాకతప్పదు. మీ చిట్టాపద్దులన్నీ మీ ముందు సమర్పించబడతాయి. మీ దుష్కర్మలపై మిమ్మల్ని నిలదీయటం, శిక్షించటం కూడా ఖాయం.

44. **"హసీదన్"** (حَصِيْدًا) అంటే కోతకోసిన చేను అని భావం. ప్రాపంచిక జీవితంలోని ఆర్భాటాలు, తళుకు బెళుకుల వాస్తవికతను వివరించడానికి దేవుడు ఈ ఉపమానం ఇచ్చాడు. చేనులో మొలచిన మొక్కలు ఎంత అందంగా, శోభాయమానంగా కనిపించినప్పటికీ ఏదో ఒక రోజు అవి ఎండిపోవటం, లేక వాటికి తెగులుపట్టడం లేక కోతకోసి

وَالَّذِينَ كَسَبُوا السَّيِّئَاتِ جَزَاءُ سَيِّئَةٍ بِمِثْلِهَا
وَتَرْهَقُهُمْ ذِلَّةٌ ۖ مَا لَهُمْ مِنَ اللَّهِ مِنْ عَاصِمٍ ۖ
كَأَنَّمَا أُغْشِيَتْ وُجُوهُهُمْ قِطَعًا مِنَ اللَّيْلِ مُظْلِمًا ۚ
أُولَٰئِكَ أَصْحَابُ النَّارِ ۖ هُمْ فِيهَا خَالِدُونَ ﴿27﴾

**27** దుష్కార్యాలు చేసిన వారికి వారి దుష్కార్యాలకు సమానంగా శిక్ష విధించబడుతుంది.[46] పరాభవం వారిని క్రమ్ముకుంటుంది. అల్లాహ్ నుండి వారిని కాపాడే వాడెవడూ ఉండడు. ఒకవిధంగా వారి ముఖాలు రాత్రి యొక్క చీకటి తెరలు చుట్టబడినట్లే ఉంటాయి.[47] వారు నరక వాసులు. అందులో వారు కలకాలం పడి ఉంటారు.

وَيَوْمَ نَحْشُرُهُمْ جَمِيعًا ثُمَّ نَقُولُ لِلَّذِينَ أَشْرَكُوا
مَكَانَكُمْ أَنْتُمْ وَشُرَكَاؤُكُمْ ۚ فَزَيَّلْنَا بَيْنَهُمْ ۖ وَقَالَ
شُرَكَاؤُهُمْ مَا كُنْتُمْ إِيَّانَا تَعْبُدُونَ ﴿28﴾

**28** మేము వారందరినీ సమావేశపరచే రోజు[48] కూడా ప్రస్తావించ దగినదే. అప్పుడు మేము మాకు సహవర్తుల్ని కల్పించే వారి నుద్దేశించి, "ఆగండి, మీరూ, మీరు కల్పించిన సహవర్తులూను!"[49] అని అంటాము. ఆ తరువాత వారి మధ్య చీలికను తెస్తాము.[50] అప్పుడు వారు నిలబెట్టిన భాగస్వాములు "మీరసలు మమ్మల్ని పూజించనే లేదు" (అని అంటారు).

కుప్పలు వేయటం, కుప్పలు నూర్చివేయటం–ఇదంతా జరిగేదే. అలాగే మనిషి ఈ ప్రాపంచిక జీవితంలో ఎంతగా అదిరిపడినా, తిరగబడినా– ఏదో ఒకనాడు కుప్పకూలి పోవలసినవాడే. ఆ తరువాత గోతిలో దింపబడి గోరీకట్టబడేవాడే. ఎట్టకేలకు తన్ను సృష్టించిన వాని సమక్షంలో హాజరుపరచబడేవాడే.

45. ఈ **"మరింత"** అన్న దానికి పలు అర్థాలు చెప్పబడ్డాయి. అయితే అల్లాహ్ దర్శన భాగ్యమే ఆ అదనపు బహుమానం అని హదీసులో చెప్పబడింది. స్వర్గవాసులకు స్వర్గంలోని అనుగ్రహాలన్నీ ప్రసాదించిన మీదట దైవదర్శన భాగ్యం కూడా కలిగించబడుతుంది (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

46. ఇంతకు ముందు ఆయతులో స్వర్గవాసుల ప్రస్తావన వచ్చింది. వారికి వారి సదాచరణల పుణ్యఫలం ఎన్నో రెట్లు పెంచి ఇవ్వబడుతుందనీ, వారికి దైవదర్శన భాగ్యం కూడా కలుగుతుందని చెప్పబడింది. ఇక్కడ ఈ ఆయతులో చెడుపనులు (పాపాలు) చేసిన వారికి వారి చెడు కార్యాలకు సమానంగా మాత్రమే ప్రతిఫలం ఇవ్వబడుతుందని స్పష్టం చేయబడింది. చెడు పనులు (సయ్యిఆత్) అంటే అవిశ్వాస వైఖరి, షిర్క్, దైవ ధిక్కారం తదితర పాపకార్యాలు అని భావం.

47. వారి ముఖాలపై క్రమ్ముకునే దట్టమైన నలుపు గురించి చెప్పడానికి ఆధిక్యతా భావంతో కూడిన వర్ణన చేయబడింది. అయితే విశ్వాసుల ముఖాలు దీనికి భిన్నంగా – దేదీప్య మానంగా – వెలిగిపోతూ ఉంటాయి. వివరాలకు ఆలి ఇమ్రాన్ సూరా 106వ ఆయతును, అబస్ సూరాలో 38 – 41 ఆయతులను చూడగలరు.

48. "అందరినీ (జమీఅన్)" అంటే ఆది నుంచీ అంతం వరకూ గల మానవులను, జిన్నులను అల్లాహ్ సమావేశపరచే రోజు అన్నమాట! ఆ మాటే కహఫ్ సూరాలో ఇలా అనబడింది : "మేము వారందరినీ సమీకరిస్తాము. ఏ ఒక్కరినీ వదలిపెట్టము" (47).

49. వారికి ప్రతిగా విశ్వాసులందరినీ ఒకచోట చేర్చుతాము. అంటే ఒక వైపు అవిశ్వాసులు, ముష్రిక్కులుంటే, మరోవైపున విశ్వాసులు ఉంటారు. ఆనాడు ప్రజలు రెండు వర్గాలుగా విడిపోతారు. వివరాలకు యాసీన్ సూరాలోని 59వ వచనాన్ని, అర్రూమ్ సూరాలోని 43వ వచనాన్ని చూడండి.

50. అంటే ప్రపంచంలో వారిమధ్య ఉండే ప్రగాఢ సంబంధం తెగిపోతుంది. వారు ఒండొకరికి శత్రువులుగా తయారవుతారు.

**29** "ఈ వ్యవహారంలో మీకూ – మాకూ మధ్య సాక్షిగా అల్లాహ్ చాలు. మీరు మమ్మల్ని పూజించిన సంగతి కూడా మాకు తెలీదాయె"[51] (అని అంటారు).

فَكَفٰى بِاللّٰهِ شَهِيْدًاۢ بَيْنَنَا وَبَيْنَكُمْ اِنْ كُنَّا عَنْ عِبَادَتِكُمْ لَغٰفِلِيْنَ ﴿29﴾

**30** అక్కడ ప్రతి వ్యక్తీ తాను పూర్వం చేసుకున్న తన కర్మలను పరీక్షించుకుంటాడు.[52] వారు తమ నిజ యజమాని అయిన అల్లాహ్ వైపుకు మరలించబడతారు. వారు కల్పిస్తూ ఉండిన అబద్ధాలన్నీ వారి నుండి మటు మాయమవుతాయి.[53]

هُنَالِكَ تَبْلُوْا كُلُّ نَفْسٍ مَّآ اَسْلَفَتْ وَ رُدُّوْٓا اِلَى اللّٰهِ مَوْلٰىهُمُ الْحَقِّ وَضَلَّ عَنْهُمْ مَّا كَانُوْا يَفْتَرُوْنَ ﴿30﴾

**31** "ఆకాశం నుండి, భూమి నుండి మీకు ఉపాధిని సమకూర్చే వాడెవడు? చెవులపై, కళ్లపై పూర్తి అధికారం కలవాడెవడు? ప్రాణమున్న దానిని ప్రాణము లేని దానినుండీ, ప్రాణము లేని దానిని ప్రాణమున్న దాని నుండీ వెలికితీసేవాడెవడు? సమస్త కార్యాల నిర్వహణకర్త ఎవరు?" అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. "అల్లాహ్‌యే"[54] అని వారు తప్పకుండా చెబుతారు. "మరలాంటప్పుడు మీరు (దేవుని శిక్షకు) ఎందుకు భయపడరు?

قُلْ مَنْ يَّرْزُقُكُمْ مِّنَ السَّمَآءِ وَالْاَرْضِ اَمَّنْ يَّمْلِكُ السَّمْعَ وَالْاَبْصَارَ وَمَنْ يُّخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَيُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَمَنْ يُّدَبِّرُ الْاَمْرَ ؕ فَسَيَقُوْلُوْنَ اللّٰهُ ۚ فَقُلْ اَفَلَا تَتَّقُوْنَ ﴿31﴾

అసలు వారు తమనెప్పుడూ పూజించలేదు అని వారి బూటకపు దైవాలు తెగేసి చెబుతారు. ఆ విధంగా చిల్లర దేవుళ్ల పేర వారు చేసిన ఆరాధనలు, మొక్కుబడులు, అర్పణలు అన్నీ వారి పాలిట హానికరంగా పరిణమిస్తాయి.

51. ఇంతకన్నా అవమానం ఇంకేముంటుంది? జీవితాంతం వారు ఎవరిని నమ్ముకున్నారో వారే ఆ రోజు వారి తెలివి తక్కువతనాన్ని దుయ్యబడతారు. కావాలంటే ఈ విషయంలో అల్లాహ్‌నే అడగండి. సాక్షిగా అల్లాహ్ చాలు అని కుండబద్దలు గొట్టి మరీ చెబుతారు. అల్లాహ్ సాక్ష్యం తరువాత వేరొకరి సాక్ష్యం అవసరం కూడా ఉండదు. ఈ ఆయతు ద్వారా తెలిసే మరో ముఖ్య విషయం ఏమిటంటే; ముష్రిక్కులు కేవలం రాతి బొమ్మలను, చెట్టుపుట్టలను మాత్రమే పూజించరు. వారు మనుషులను కూడా (వారి మరణానంతరం) విగ్రహాలుగా తయారుచేసి పూజిస్తారు. హజ్రత్ నూహ్ (అలైహి స్సలాం) కాలంనాటి ప్రజలు కూడా ఇదే పని చేశారు. సహీహ్ బుఖారీలో ఈ సంగతి వివరంగా ఉంది. కాని దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఈ కాలపు సమాధి పూజారులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవటంలేదు. వారు చేస్తున్న సమాధి పూజను ఖుర్ఆన్ ఖండిస్తోందని వారికి ఈ ఆయతులు చూపిస్తే, దానికి వారు, కాదు ఈ ఆయతు కేవలం రాళ్ళు రప్పలు, చెట్టుపుట్టల పూజను మాత్రమే ఖండిస్తున్నదని అంటారు. వారి ఈ వైఖరి కడు శోచనీయం. మరో గమనార్హ విషయమేమిటంటే, మనిషి ఎంత గొప్పవాడయినా– అతడు ప్రవక్త అయినాసరే – చనిపోయిన తరువాత ప్రపంచంలో ఏం జరుగుతుందో అతనికి తెలీదు. అతని వీరభక్తులు అతని కోసం రొమ్ములు బాదుకున్నా, అతని సమాధి వద్ద సాష్టాంగ ప్రణామాలు చేసినా, అతని గోరీవద్ద తిరునాళ్ల జరిపించినా, జంతు బలులు ఇచ్చినా అతనికేమీ తెలియదు. ప్రళయదినాన దైవసమక్షంలో వారు ఆ మాటే నిర్ద్వంద్వంగా చెప్పేస్తారు. అల్ అహ్‌ఖాఫ్ సూరా 5, 6 ఆయతులలోనూ ఈ విషయం చెప్పబడింది.

52. అంటే తన కర్మలను తెలుసుకుంటాడు లేదా వాటిని చవిచూస్తాడు, అనుభవిస్తాడు అని భావం.

53. అంటే వారు కల్పించిన ఏ చిల్లర దేవుడూ ఆనాడు వారిని ఆదుకోడు. వారికోసం సిఫారసు చేయటం అటుంచి అసలు వారు వారికి కనపడనయినా కనపడరు.

54. ఈ ఆయతు ద్వారా తెలిసేది కూడా అదే – బహు దైవారాధకులు దేవుని సృష్టినీ, పోషకత్వాన్ని, పరిపాలనను, ప్రణాళికా రచనను అంగీకరించేవారు. ఇవన్నీ అంగీకరిస్తూ కూడా వారు "ఆ ఒక్క దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలి"

32 ఆ అల్లాహ్‌యే మీ నిజప్రభువు. సత్యం తరువాత మార్గ విహీనత తప్ప ఇంకేముంటుంది? మరి మీరు ఎటు మరలిపో తున్నారు?"[55] అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు.

فَذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمُ الْحَقُّ ۚ فَمَاذَا بَعْدَ الْحَقِّ اِلَّا الضَّلٰلُ ۚ فَاَنّٰى تُصْرَفُوْنَ ﴿32﴾

33 ఈ విధంగా "వారు విశ్వసించరు" అన్న నీ ప్రభువు మాట అవిధేయుల విషయంలో సత్యమని రుజువైపోయింది.[56]

كَذٰلِكَ حَقَّتْ كَلِمَتُ رَبِّكَ عَلَى الَّذِيْنَ فَسَقُوْٓا اَنَّهُمْ لَا يُؤْمِنُوْنَ ﴿33﴾

34 "ఏమిటీ, మీరు భాగస్వాములుగా నిలబెట్టిన వారిలో తొలిసారి సృష్టించి, మలిసారి కూడా దాన్ని పునరావృతం చేసే వాడెవడైనా ఉన్నాడా?" అని వారిని అడుగు. "అల్లాహ్‌యే తొలిసారి సృష్టిస్తాడు. మలిసారి కూడా ఆయనే సృష్టిస్తాడు. మరలాంటప్పుడు మీరు (సత్యం నుండి) ఎటు కొట్టుకుపోతు న్నారు?"[57] అని వారిని అడుగు.

قُلْ هَلْ مِنْ شُرَكَآىِٕكُمْ مَّنْ يَّبْدَؤُا الْخَلْقَ ثُمَّ يُعِيْدُهٗ ؕ قُلِ اللّٰهُ يَبْدَؤُا الْخَلْقَ ثُمَّ يُعِيْدُهٗ فَاَنّٰى تُؤْفَكُوْنَ ﴿34﴾

35 "మీ భాగస్వాములలో సత్యం వైపుకు మార్గదర్శకత్వం వహించేవాడెవడయినా ఉన్నాడా?" అని వారిని అడుగు. "సత్యం వైపుకు మార్గదర్శకత్వం వహించేవాడు అల్లాహ్ మాత్రమే.[58] అలాంటప్పుడు సన్మార్గం చూపేవాడు అనుసరణకు ఎక్కువ

قُلْ هَلْ مِنْ شُرَكَآىِٕكُمْ مَّنْ يَّهْدِيْٓ اِلَى الْحَقِّ ؕ قُلِ اللّٰهُ يَهْدِيْ لِلْحَقِّ ؕ اَفَمَنْ يَّهْدِيْٓ اِلَى

అన్న విషయం దగ్గరకొచ్చేసరికి పేచీ పెట్టేవారు. ఆయన దైవత్వంలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించేవారు. అందుకే అల్లాహ్ వారిని నరకాగ్నికి ఇంధనంగా ఖరారు చేశాడు. ఈనాడు కూడా తమను నిజమైన విశ్వాసులుగా చెప్పుకునేవారు – చాలామంది– ఈ 'ఏక దైవారాధన' (తౌహీద్) దగ్గరకొచ్చేసరికి పప్పులో కాలేస్తుంటారు. అల్లాహ్ వారి హృదయాలలో 'నిష్కల్మషమైన విశ్వాసాన్ని' ప్రోది చేయుగాక!

55. ప్రభువు, పాలకుడు, పోషకుడు, సృష్టికర్త, ఆరాధ్య దైవం అల్లాహ్‌యే అని మీకు తెలిసినప్పుడు ఆయన్ని వదలి ఇతర దైవాల వైపుకు మీరు పరుగులు తీయటం ఎంతవరకు సమంజసం? అది అపమార్గం తప్ప మరేమీ కాదన్న సంగతి మీకు అర్థం కావటం లేదా? అసలు మీకేమైపోయిందీ? అన్నది దీని భావం.

56. అంటే అన్ని విషయాలూ తెలిసిన మీదట కూడా వారు 'షిర్క్'ను మానుకోవటంలేదంటే ఇక వారు 'విశ్వసించబోరు' అన్న ప్రభువు మాట అక్షర సత్యం అని నిరూపితం అయింది. ఎందుకంటే వక్రమార్గం వదలి తిన్నని మార్గంపైకి రావాలన్న తపన వారిలో ఏ కోశానా లేదు. అలాంటప్పుడు సన్మార్గంగానీ, విశ్వాసంగానీ వారికెలా ప్రాప్తిస్తుంది? ఆ మాటే దివ్యఖుర్ఆన్‌లో మరోచోట ఈ విధంగా చెప్పబడింది:"అయితే శిక్షించాలన్న విషయం అవిశ్వాసులపై రూఢీ అయిపోయింది" (అజ్జుమర్–71).

57. బహుదైవారాధకుల షిర్క్‌లోని డొల్లతనాన్ని బయటపెట్టడానికి వారికీవిధమైన ప్రశ్నలు వేయబడ్డాయి. అల్లాహ్‌ను కాదని మీరు పూజించే ఈ మీ దేవుళ్లు ఈ జగతిని మొదటిసారి సృష్టించారా? పోనీ రెండవసారి సృష్టించే శక్తిని కలిగి ఉన్నారా?? లేదుకదా! మొదటిసారి పుట్టించిన వాడూ, ప్రళయదినాన రెండవసారి అందరినీ తిరిగి లేపేవాడూ అల్లాహ్‌యే. మరలాంటప్పుడు మీరు ఈ సత్యమార్గాన్ని వదలిపెట్టి ఏ వెల్లువలో కొట్టుకుపోతున్నారు?

58. దారి తప్పిన బాటసారులకు సరైన మార్గం చూపేవాడు, హృదయాలను అపమార్గం నుంచి సన్మార్గం వైపుకు మళ్ళించేవాడు కూడా అల్లాహ్‌యే. అల్లాహ్‌ను వదలి వారు నిలబెట్టుకున్న భాగస్వాములలో ఎవరికీ ఈ శక్తిలేదు.

అర్హుడా? లేక ఇతరులు సన్మార్గం చూపే వరకూ తనంతట తానుగా సన్మార్గం తెలుసుకోలేనివాడా?[59] అసలు మీకేమై పోయింది? మీరు ఇలాంటి నిర్ణయాలు గైకొంటున్నారేమిటి?"[60] అని వారిని అడుగు.

الْحَقِّ اَحَقُّ اَنْ يُّتَّبَعَ اَمَّنْ لَّا يَهِدِّيْٓ اِلَّآ اَنْ يُّهْدٰى ۚ فَمَا لَكُمْ ۣ كَيْفَ تَحْكُمُوْنَ ﴿٣٥﴾

**36** వారిలో అధికులు కేవలం ఊహలను, అనుమానాలను అనుసరిస్తున్నారు. నిశ్చయంగా అనుమానం సత్యం ముందు దేనికీ పనికిరాదు.[61] వారు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.[62]

وَمَا يَتَّبِعُ اَكْثَرُهُمْ اِلَّا ظَنًّا ۭ اِنَّ الظَّنَّ لَا يُغْنِيْ مِنَ الْحَقِّ شَيْـــًٔا ۭ اِنَّ اللّٰهَ عَلِيْمٌۢ بِمَا يَفْعَلُوْنَ ﴿٣٦﴾

**37** ఈ ఖుర్ఆన్ అల్లాహ్ (పంపిన వహీ ద్వారా) కాకుండా (ఇతరుల ప్రమేయంతో) చేయబడిన కల్పన కాదు. పైగా ఇది తనకు పూర్వం ఉన్న వాటిని (అవతరించిన గ్రంథాలను) ధృవీక రించేది,[63] ఇంకా గ్రంథం (లోని మౌలిక ఆదేశాలను) విపులీకరిం చేది.[64] ఇది సర్వలోకాల ప్రభువు తరఫునుంచి[65] వచ్చిందన్న విషయంలో సందేహానికి ఆస్కారమే లేదు.[66]

وَمَا كَانَ هٰذَا الْقُرْاٰنُ اَنْ يُّفْتَرٰى مِنْ دُوْنِ اللّٰهِ وَلٰكِنْ تَصْدِيْقَ الَّذِيْ بَيْنَ يَدَيْهِ وَتَفْصِيْلَ الْكِتٰبِ لَا رَيْبَ فِيْهِ مِنْ رَّبِّ الْعٰلَمِيْنَ ﴿٣٧﴾

**38** ఏమిటీ, దీనిని (ఖుర్ఆన్ గ్రంథాన్ని) అతనే స్వయంగా కల్పించుకున్నాడని వారంటున్నారా? "మరయితే మీరు దీనిలాంటి

اَمْ يَقُوْلُوْنَ افْتَرٰىهُ ۭ قُلْ فَاْتُوْا بِسُوْرَةٍ مِّثْلِهٖ

59. అన్నీ తెలిసినవాడు, అందరి మొరలనూ ఆలకించేవాడు, సన్మార్గం చూపేవాడు మీ విధేయతకు తగినవాడా? లేక చెవిటివాడుగా, గుడ్డివాడుగా ఉండేవాడు మీ అనుసరణకు యోగ్యుడా? వాడికి సయితం దారి తెలీదు. మీకు దారి ఎలా చూపిస్తాడు?

60. మీరు సృష్టికర్తను, సృష్టించబడిన వారినీ ఒకే వరుసలో ఎలా నిలబెడుతున్నారు? మీ బుద్ధి ఈ విషయాన్ని ఎలా అంగీకరిస్తుంది?

61. వాస్తవాల, నిదర్శనాల, ఆధారాల ముందు అంచనాలు, కాకిలెక్కలు, మూఢనమ్మకాలు, ఊహలు ఏమాత్రం నిలువజాలవన్న సంగతి తెలిసి కూడా వారు ఊహలనే అనుసరించటం కడు శోచనీయం. దివ్య ఖుర్ఆన్‌లో 'జన్న్' అనే పదం అనుమానం, నిశ్చయం అన్న భావంలో కూడా వాడబడుతుంది. అయితే యిక్కడ మాత్రం 'అనుమానం' అన్న భావంలోనే వాడబడింది.

62. అంటే మంకుతనంతో మూర్ఖంగా వ్యవహరించినందుకు ఆయన వారిని శిక్షించటం ఖాయం. ఎందుకంటే తమ వద్ద తమ వాదనకు కావలసిన ఆధారాలు లేకపోయినప్పటికీ వారు తమ వైఖరిపై మొండిపట్టు పట్టారు. హఠం చేశారు. దేవుడు ప్రసాదించిన బుద్ధిజ్ఞానాలను ఏమాత్రం ఉపయోగించలేదు.

63. ఈ ఉద్గ్రంథం మానవులు చేసిన కల్పన కానేకాదు. ఇది దైవగ్రంథం. వెనుకటి గ్రంథాలను ఇది ధృవీకరిస్తుంది.

64. సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను (హలాల్ – హరామ్‌లను) ఇది స్పష్టంగా వేరుపరచి చూపిస్తుంది.

65. ఈ విషయాలన్నింటి ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే ఈ గ్రంథం (ఖుర్ఆన్) విశ్వప్రభువైన అల్లాహ్ తరఫున పంపబడినది.

66. ఇది చేసే ప్రబోధనలలోగానీ, ఇందులో ప్రస్తావించబడిన మాజీ వృత్తాంతాల పట్లగానీ, భవిష్యత్తులో సంభవించబోయే

وَادْعُوا مَنِ اسْتَطَعْتُمْ مِنْ دُونِ اللَّهِ إِنْ
كُنْتُمْ صَادِقِينَ ﴿38﴾

ఒక్క సూరానైనా (రచించి) తీసుకురండి. ఒకవేళ మీరు సత్య వంతులే అయితే అల్లాహ్‌ను తప్ప ఎవరెవరిని పిలుచుకుంటారో పిలుచుకోండి"[67] అని వారికి చెప్పు.

بَلْ كَذَّبُوا بِمَا لَمْ يُحِيطُوا بِعِلْمِهِ وَلَمَّا يَأْتِهِمْ
تَأْوِيلُهُ ۚ كَذَٰلِكَ كَذَّبَ الَّذِينَ مِنْ قَبْلِهِمْ
فَانْظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ الظَّالِمِينَ ﴿39﴾

**39** పైగా వారు తమ జ్ఞాన పరిధిలోకి తీసుకోని దానిని అసత్య మని ధిక్కరించారు.[68] ఇంకా దాని అంతిమ ఫలితం వారి ముందుకు రాలేదు.[69] వారికి పూర్వం గతించినవారు కూడా ఇలాగే ధిక్కరించారు. మరి ఆ దుర్మార్గులకు పట్టిన గతేమిటో చూడు![70]

وَمِنْهُمْ مَنْ يُؤْمِنُ بِهِ وَمِنْهُمْ مَنْ لَا يُؤْمِنُ
بِهِ ۚ وَرَبُّكَ أَعْلَمُ بِالْمُفْسِدِينَ ﴿40﴾

**40** వారిలో కొందరు దీనిని విశ్వసిస్తారు. మరికొందరు దీనిని విశ్వసించరు. కల్లోల జనకుల గురించి నీ ప్రభువుకు బాగా తెలుసు.[71]

దానిని గురించి అది చెప్పిన విషయాలలోగానీ సంశయంలో పడవలసిన పనిలేదు. ఎందుకంటే ఇది మానవ ప్రోక్తం కాదు. ఇది దైవవాణి.

67. ఇన్ని ఆధారాలు, నిదర్శనాలు మీ ముందుకు వచ్చిన మీదట కూడా ఇది దైవగ్రంథం కాదనీ, ఇది ముహమ్మద్(సఅసం) చేసుకున్న కల్పన అని మీకు అనుమానం ఉంటే, ముహమ్మద్ (స) కూడా మీలాంటి మానవమాత్రుడే నన్న విషయాన్ని మరువకండి. అతనూ మీలాగే అరబీ భాష మాట్లాడతాడు. అతను ఒక్కడు మాత్రమే. ఒకవేళ మీరు మీ వాదనలో సత్యవంతులే అయితే మీరంతా కలసి ఇలాంటి ఒక్క సూరాను రచించండి. ఈ పని కోసం మీరు ప్రపంచంలోని మహాకవులను, పెద్ద పెద్ద సాహితీ పరులను పిలుచుకోండి – దివ్య ఖుర్ఆన్ యొక్క ఈ సవాలు నేటికీ ఉంది. ఈ సవాలుకు సరైన సమాధానం ఇంతవరకు ఎవరి తరఫునా రాలేదు. ఇది ముమ్మాటికీ మానవ రచన కాదనీ, ఇది దైవగ్రంథమని చెప్పడానికి ప్రబల నిదర్శనం ఇది!

68. అంటే – దివ్య ఖుర్ఆన్‌పై వారు యోచన చేయకుండానే, దాని లోతుల్లోకి పోకుండానే – స్థూలదృష్టితో – దాన్ని త్రోసిపుచ్చారు.

69. వెనుకటి గాథలను, రాబోయే కాలంలో జరగబోయే విషయాలను గురించి ఖుర్ఆన్ చెప్పిన వాస్తవాలు ఇంతవరకు వారి బుర్రకెక్కలేదు. అసలు వారు తమ మెదడుకు పని తగిలించకుండానే త్రోసిపుచ్చటం మొదలెట్టారు. దీనికి రెండో భావం ఏమిటంటే ఖుర్ఆన్‌పై తగురీతిలో చింతన చేయకుండానే దాన్ని ధిక్కరించారు. వారు గనక చిత్తశుద్ధితో అందలి అంశాలపై ఆలోచించి ఉంటే అది నిశ్చయంగా దివ్య వచనమని వారికి బోధపడి ఉండేది. దాని కోసం వారి హృదయ కవాటాలు తప్పక తెరచుకుని ఉండేవి. అరబీలో **'తావీల్'** అనే పదం ఉంది. పైన ఆయతులో దాన్ని 'అంతిమ ఫలితం' అని తర్జుమా చేయటం జరిగింది. ఒకవేళ పై ఆయతుకు ఈ రెండవ భావం తీసుకున్నట్లయితే, అప్పుడు 'తావీల్' అనే పదానికి ఖుర్ఆన్ మర్మాలు, పరమార్థాలు స్పష్టంగా బోధపడటం అనే అర్థం వస్తుంది.

70. అవిశ్వాసులకు, ముష్రిక్కులకు ఈ ఆయతు హెచ్చరిక లాంటిది. గతంలో మీలాగే ధిక్కరించిన వారికి ఏ గతి పట్టిందో మీకు ఎరుకే. ఒకవేళ మీ ధోరణిలో గనక ఆశించిన మార్పు కనబడకపోతే మీకూ అదే దుర్గతి పట్టవచ్చు అని అల్లాహ్ చెబుతున్నాడు.

71. సత్యం కోసం తహతహలాడే సజ్జనులెవరో, తప్పులెన్నే కుత్సిత మనస్కులెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు. సజ్జనులకు ఆయన సన్మార్గం చూపటంలో జాప్యం చేయడు. కాని అపమార్గం వైపుకే పదే పదే పోదలుస్తున్న వారిని వారి మానాన వదిలేస్తాడు. ఆయన న్యాయశీలుడు. ఎవరు దేనికి తగినవారో దాని ప్రకారమే ఆయన నిర్ణయం చేస్తాడు.

**41** ఒకవేళ వారు నిన్ను ధిక్కరిస్తూనే ఉంటే, "నా పని నాది. మీ పని మీది. నా పనుల బాధ్యత మీపై లేదు. మీ పనుల బాధ్యత నాపై లేదు"[72] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పెయ్యి.

وَاِنۡ كَذَّبُوۡكَ فَقُلْ لِّىۡ عَمَلِىۡ وَلَـكُمۡ عَمَلُكُمۡ‌ ۚ
اَنۡـتُمۡ بَرِيۡٓــُٔوۡنَ مِمَّاۤ اَعۡمَلُ وَاَنَا بَرِىۡٓءٌ مِّمَّا
تَعۡمَلُوۡنَ ﴿41﴾

**42** వారిలో కొందరు నీ మాటలను శ్రద్ధగా వింటుంటారు. ఏమిటీ, ఏ మాత్రం అర్థం చేసుకోలేని చెవిటి వారికి నీవు వినిపించగలవా?[73]

وَمِنۡهُمۡ مَّنۡ يَّسۡتَمِعُوۡنَ اِلَيۡكَ‌ ؕ اَفَاَنۡتَ
تُسۡمِعُ الصُّمَّ وَلَوۡ كَانُوۡا لَا يَعۡقِلُوۡنَ ﴿42﴾

**43** వారిలో కొందరు నిన్ను చూస్తారు. కాని (కొద్దిపాటి) మనో నేత్రం కూడా లేని అంధులకు నువ్వు మార్గం చూపగలవా?[74]

وَمِنۡهُمۡ مَّنۡ يَّنۡظُرُ اِلَيۡكَ‌ ؕ اَفَاَنۡتَ تَهۡدِى
الۡعُمۡىَ وَلَوۡ كَانُوۡا لَا يُبۡصِرُوۡنَ ﴿43﴾

**44** అల్లాహ్ ప్రజలకు ఏ కాస్త అన్యాయం కూడా చేయడు. కాని ప్రజలే తమకు తాము అన్యాయం చేసుకుంటారు.[75]

اِنَّ اللّٰهَ لَا يَظۡلِمُ النَّاسَ شَيۡـــًٔا وَّلٰـكِنَّ النَّاسَ
اَنۡفُسَهُمۡ يَظۡلِمُوۡنَ ﴿44﴾

72. శక్తివంచన లేకుండా ప్రబోధించిన పిదప కూడా వారు తమ ధిక్కార వైఖరిని మానుకోకపోతే, "బోధించటం వరకే నా పని. ఆ పనిని నేను శాయశక్తులా నెరవేర్చాను. ఇక మీ పర్యవసానానికి సంబంధించిన బాధ్యత నాపై ఎంతమాత్రం లేదు. అందరూ దైవసమక్షంలో హాజరు కావలసినవారే. అక్కడ ప్రతి ఒక్కరూ తమ తమ కర్మలకు జవాబు ఇవ్వవలసి ఉంటుంది" అని వాళ్ళకు చెప్పమని అల్లాహ్ తన ప్రవక్తకు సూచించాడు. అల్ కాఫిరూన్ సూరాలోనూ ఈ మాటే అనబడింది. ఇదే మాటను దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కూడా చెప్పినట్లు అల్ ముమ్తహిన సూరా (4వ ఆయతు)లో ప్రస్తావించబడింది: "మీతోనూ, నిజదైవాన్ని వదలి మీరు పూజించే ఇతర దైవాలతోనూ మాకు ఎలాంటి సంబంధం లేదు. మేము మిమ్మల్ని (మీ మిథ్యా విశ్వాసాలను) త్రోసిపుచ్చుతున్నాము."

73. వారు ఏదో మొక్కుబడిగా ఖుర్ఆన్ వింటారేగాని, దాని ద్వారా మంచిని గ్రహించాలన్న కోరిక వారిలో ఏ కోశానా ఉండదు. అందుకే వారికి ఉపదేశించటం చెవిటివారి ముందు శంఖం ఊదటం లాంటిదే. హితబోధ వారికేమాత్రం ప్రయోజనకారి కాజాలదు. ఒకవ్యక్తి చెవిటివాడై ఉండి, ఆపైన అతనికి బుద్ధి కూడా లేకపోతే లాభమేమీ ఉండదు. చెవిటివాడై ఉండి కనీసం సైగల ద్వారా విషయాన్ని గ్రహించినా ఫరవా లేదు. ఆ మాత్రం గ్రాహ్యశక్తి కూడా లేని బధిరుడు దేనికీ పనికిరాడు.

74. అలాగే మరి కొంతమంది నీ వంక చూస్తుంటారు. కాని వారి చూపుల్లోని ఉద్దేశం వేరు. అందుకే ఒక అంధునికి మార్గం చూపటం ఎంతో, ఇలాంటి వారికి మార్గదర్శకత్వం వహించటం కూడా అంతే. అందునా కంటిచూపుతో పాటు మనోనేత్రం కూడా లేని అంధులకు మార్గం చూపటం మరీ కష్టం. కొంతమంది గుడ్డివారు కంటిచూపును కోల్పోయినప్పటికీ తమ మనో నేత్రం ద్వారా వారు సన్మార్గంలో ఎంతో ముందంజ వేస్తారు. కాని వీళ్లు రెండు రకాల చూపులనూ కోల్పోయారు.

మహాప్రవక్త (సఅసం)ను ఓదార్చడానికి ఈ ఉదాహరణ ఇవ్వబడింది. తన దగ్గరకు వచ్చే రోగికి చికిత్స చేయించుకునే విషయంలో ఏమాత్రం చిత్తశుద్ధిలేదని వైద్యునికి తెలిసినప్పుడు వైద్యుడు కూడా ఆ రోగిపట్ల శ్రద్ధచూపడు. ఆ రోగి కోసం తన తెలివితేటలను, విలువైన కాలాన్ని వృథాచేయడు.

75. అంటే దేవుడు వారికి శక్తి సామర్థ్యాలన్నింటినీ ప్రసాదించాడు. వారికి కళ్ళిచ్చాడు. వాటితో వారు చూడగలుగుతున్నారు. వారికి చెవులిచ్చాడు. వాటితో వారు వింటున్నారు. బుద్ధిజ్ఞానాలను ఇచ్చాడు. వాటిద్వారా వారు మంచీచెడులను, సత్యాసత్యాలను పరికించగలుగుతున్నారు. అయితే వీటన్నింటినీ ఉపయోగించి కూడా వారు సన్మార్గం తెలుసుకోలేక పోతున్నారంటే అది దేవుడు చేసిన అన్యాయం కానేకాదు. వారంతట వారే తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటున్నారు.

45 అల్లాహ్ వారిని సమీకరించే ఆ రోజు గురించి జ్ఞాపకం చెయ్యి. అప్పుడు వారికి తాము (ప్రపంచ జీవితంలో) దినములో ఒక గడియకాలం[76] ఆగి ఉన్నామేమో!?[77] అనిపిస్తుంది. అల్లాహ్‌ను కలుసుకునే విషయాన్ని అసత్యమని త్రోసిపుచ్చినవారు నిస్సందేహంగా నష్టపోయారు. వారు సన్మార్గం పొందేవారు కారు.

وَيَوْمَ يَحْشُرُهُمْ كَأَن لَّمْ يَلْبَثُوٓا۟ إِلَّا سَاعَةً مِّنَ ٱلنَّهَارِ يَتَعَارَفُونَ بَيْنَهُمْ ۚ قَدْ خَسِرَ ٱلَّذِينَ كَذَّبُوا۟ بِلِقَآءِ ٱللَّهِ وَمَا كَانُوا۟ مُهْتَدِينَ ﴿٤٥﴾

46 మేము వారికి వాగ్దానం చేస్తున్న దానిలో ఎంతో కొంత నీకు చూపించినా లేక (అది పొడసూపకముందే) మేము నీకు మరణ మొసగినా - (ఏం జరిగినా సరే) వారు ఎలాగూ మా వద్దకు రావలసినవారే. అదీగాక వారి చేష్టలన్నింటికీ అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు.[78]

وَإِمَّا نُرِيَنَّكَ بَعْضَ ٱلَّذِى نَعِدُهُمْ أَوْ نَتَوَفَّيَنَّكَ فَإِلَيْنَا مَرْجِعُهُمْ ثُمَّ ٱللَّهُ شَهِيدٌ عَلَىٰ مَا يَفْعَلُونَ ﴿٤٦﴾

47 ప్రతి సమాజానికీ ఒక ప్రవక్త ఉన్నాడు. కాబట్టి వారి ప్రవక్త వారి వద్దకు వచ్చేసినపుడు వారి వ్యవహారంలో న్యాయబద్ధంగా తీర్పు చెయ్యబడుతుంది.[79] వారికెలాంటి అన్యాయం జరగదు.

وَلِكُلِّ أُمَّةٍ رَّسُولٌ ۖ فَإِذَا جَآءَ رَسُولُهُمْ قُضِىَ بَيْنَهُم بِٱلْقِسْطِ وَهُمْ لَا يُظْلَمُونَ ﴿٤٧﴾

48 "మీరు సత్యవంతులే అయితే ఆ వాగ్దానం ఎప్పుడు సంభవిస్తుంది?" అని వారు అడుగుతున్నారు.

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا ٱلْوَعْدُ إِن كُنتُمْ صَٰدِقِينَ ﴿٤٨﴾

76. ప్రళయదినపు స్థితిగతులను చూసేసరికి వారికి దిమ్మ తిరిగిపోతుంది. ప్రాపంచిక జీవితంలోని భోగభాగ్యాలు అన్నీ వారి స్మృతిపథంలో నుంచి చెరిగిపోతాయి. ప్రపంచంలో తాము మహా అయితే ఒక రోజులో కొద్దిసేపు ఉండి ఉంటామని వారికి అనిపిస్తుంది."బహుశా ఒక దినంలో ఉదయమో సాయంత్రమో ఉండి ఉంటాము" అని వారికి అనిపిస్తుంది. (అన్నాజియాత్-46).

77. ప్రళయదినంలోనూ అనేక పరిస్థితులుంటాయి. ఒక స్థితిలో వారు ఒండొకరిని గుర్తుపడతారు. మరొక దశలో గుర్తుపట్టలేరు. "వారి మధ్య బంధుత్వాల ధ్యాస ఉండదు. ఒకరింకొకరిని కనీసం అడిగి చూడరు" (అల్ మోమినూన్-101). ఇంకొక సమయంలో పరస్పరం నిందారోపణలు మొదలెడతారు. మీ మూలంగానే మేము పెడదారి పట్టామని ఒకరంటే, మీ వల్లనే మేము నష్టపోయామని ఇంకొకరంటారు.

78. ఒకవేళ ఈ తిరస్కారులు కూడా తమ తిరస్కార వైఖరిపై మొండికేస్తే గత సమాజాల మాదిరిగా వీళ్లపై కూడా దైవాగ్రహం విరుచుకుపడటం ఖాయం అని ఈ ఆయతులో చెప్పబడింది. (ఓ ప్రవక్తా!) నువ్వు బ్రతికి ఉండగానే కొన్ని శిక్షలు మేము ఈ తిరస్కారులకు విధించవచ్చు. తద్వారా నీ కంటికి చలువ లభిస్తుంది. ఒకవేళ ఆ శిక్షను వారు చవిచూడకముందే మేము నిన్ను లేపుకున్నా చింతించవలసిన పనిలేదు. ఎందుకంటే వారు మా వద్దకు రాక తప్పదు. వారి చిట్టా పద్దులన్నీ మా వద్ద ఉన్నాయి. అప్పుడు వాళ్లు మా పట్టునుంచి ఎలా తప్పించుకోగలుగుతారు? ఇహలోకంలో వారు - మా ప్రణాళికననుసరించి - ఒకవేళ తప్పించుకోగలిగినా పరలోకంలో మాత్రం మా శిక్ష నుండి సుతరామూ తప్పించుకోలేరు. ఎందుకంటే విధేయులకు బహుమానం వొసగి, అవిధేయులను దండించటమే ప్రళయదినం ముఖ్యోద్దేశం.

79. దీనికి రెండు అర్థాలు ఉన్నాయి. 1. ఒకటేమంటే; మేము ప్రతి జాతిలోనూ ప్రవక్తను పంపిస్తాము. సందేశాన్ని అందజేసే తన కర్తవ్యాన్ని ప్రవక్త నెరవేర్చిన పిదప మేము వారిమధ్య న్యాయంతో కూడుకున్న తీర్పుచేస్తాము. అంటే

49 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "అల్లాహ్ తలచినది తప్ప-నా అధీనంలో స్వయంగా నా లాభనష్టాలు కూడా లేవు. ప్రతి సమాజానికీ ఒక నిర్ణీత గడువు ఉంది. వారి సమయం వచ్చి నప్పుడు వారు ఒక గడియ కూడా వెనకా ముందు జరగరు."[80]

قُلْ لَّآ اَمْلِكُ لِنَفْسِىْ ضَرًّا وَّلَا نَفْعًا اِلَّا مَا شَآءَ اللّٰهُ ؕ لِكُلِّ اُمَّةٍ اَجَلٌ ؕ اِذَا جَآءَ اَجَلُهُمْ فَلَا يَسْتَاْخِرُوْنَ سَاعَةً وَّلَا يَسْتَقْدِمُوْنَ ﴿49﴾

50 (ఓ ప్రవక్తా!) ఇలా అను: "చెప్పండి, దైవశిక్ష మీపై రాత్రిపూట విరుచుకుపడినా, పగటిపూట వచ్చిపడినా ఆ విషయంలో నేరస్థులకు అంత ఆత్రం ఎందుకట?!"[81]

قُلْ اَرَءَيْتُمْ اِنْ اَتٰىكُمْ عَذَابُهٗ بَيَاتًا اَوْ نَهَارًا مَّاذَا يَسْتَعْجِلُ مِنْهُ الْمُجْرِمُوْنَ ﴿50﴾

51 ఏమిటీ, అది వచ్చిపడినప్పుడు దాన్ని విశ్వసిస్తారా?! ఇప్పుడా విశ్వసించేది?![82] దీనికోసం మీరు మహా తొందర పెట్టేవారు కదా!"

اَثُمَّ اِذَا مَا وَقَعَ اٰمَنْتُمْ بِهٖ ؕ آٰلْـٰٔنَ وَقَدْ كُنْتُمْ بِهٖ تَسْتَعْجِلُوْنَ ﴿51﴾

దైవప్రవక్తను, అతన్ని విశ్వసించిన వారందరినీ కాపాడి, ధిక్కరించిన వారిని నాశనం చేస్తాము. ఎందుకంటే "ప్రవక్తను పంపించకముందే ప్రజలను శిక్షించటం మా సంప్రదాయం కాదు" (బనీ ఇస్రాయీల్ – 15). తప్పు చేయకముందే ఎవరినయినా శిక్షిస్తే అప్పుడది అన్యాయం అనిపించుకుంటుంది (ఫత్హుల్ ఖదీర్). 2. దీనికి రెండవ అర్థం ఇది: ఇది ప్రళయదినం నేపథ్యంలో చెప్పబడింది. ప్రళయదినాన ఒక్కో సమాజం అల్లాహ్ సమక్షంలో పిలువబడినప్పుడు ఆ సమాజంతో పాటు ప్రవక్త కూడా ఉంటాడు. అందరి కర్మల చిట్టా కూడా సమర్పించబడుతుంది. వివిధ దైవదూతలు కూడా సాక్షులుగా హాజరవుతారు. ఈ విధంగా ప్రవక్తకు – ఆయన అనుచర సమాజానికి మధ్య న్యాయంగా తీర్పు చేయబడుతుంది. ముహమ్మద్ (సఅసం) అనుచర సమాజ సభ్యుల వ్యవహారం అందరికన్నా ముందు తేల్చబడుతుందని హదీసు ద్వారా తెలుస్తోంది. మహనీయ ముహమ్మద్ (స) వారు ఇలా ప్రవచించారు : "మనం అందరికన్నా ఆఖరిలో వచ్చినప్పటికీ ప్రళయదినాన అందరికన్నా ముందు ఉంటాము. సృష్టితాలందరికన్నా ముందు మన తీర్పు జరుగుతుంది" (సహీహ్ ముస్లిం – కితాబుల్ జుముఅ) (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

80. "ఏదీ, నువ్వు పదే పదే హెచ్చరిస్తున్న ఆ శిక్షను తీసుకు రా చూద్దాం" అని ముష్రిక్కులు ప్రవక్త ముహమ్మద్ (స)ను డిమాండు చేసినపుడు ఇవ్వబడిన సమాధానం ఇది! మిమ్మల్ని దండించే సంగతి అటుంచి నేను సయితం నా స్వయానికి ఎలాంటి మేలుగానీ, కీడుగానీ కలిగించుకోలేను. ఈ అధికారం అంతా అల్లాహ్ అధీనంలో ఉంది. ఆయన తన ప్రణాళికననుసరించి ఎవరికయినా లాభంగానీ, నష్టంగానీ చేకూరుస్తాడు. అదీగాక, ప్రతి జాతికీ ఆయన ఒక గడువు రాసిపెట్టాడు. గడువు ముగియక ముందు ఆయన ఎవరినీ పట్టుకోడు. ఒకసారి ఆ గడువు ముగిసిందంటే దాన్ని ఒక్క క్షణం కూడా వెనక్కీ ముందుకూ జరపటం ఎవరితరం కాదు.

**హెచ్చరిక :** ఇక్కడ గమనార్హమైన అత్యంత ముఖ్య విషయం ఏమిటంటే మనుజ జాతిలోకెల్లా శ్రేష్ఠులయిన మహాప్రవక్త ముహమ్మద్ (స) వారే ఒకరికి లాభనష్టాలు చేకూర్చే శక్తి కలిగిలేనపుడు ఇక మామూలు మనుషుల్లో ఈ పని చేయగల మొనగాడు ఎవడుంటాడు? మరలాంటప్పుడు దైవప్రవక్త (స) నుద్దేశించి "యా రసూలల్లాహ్! మాకు సహాయపడండి" అని ప్రార్థించటంగానీ, "యా గౌసుల్ ఆజం దస్తగీర్! మమ్మల్ని ఆదుకోండి" అని మొరపెట్టు కోవటంగానీ ఎంతవరకు సమ్మతం? ఈ ధోరణి దివ్యఖుర్ఆన్‌లోని ఈ ఆయతుకు, ఖుర్ఆన్‌లోని స్పష్టమైన బోధనలకు విరుద్ధం కాదా? కేవలం విరుద్ధమే కాదు, ఇది బహుదైవోపాసన క్రిందికి వస్తుంది. మొరపెట్టుకోవలసింది సృష్టికర్తనే గాని సృష్టితాలను కాదు.

81. శిక్ష ఎంతో అవాంఛనీయమైనది. మనసులు దాన్ని అసహ్యించుకుంటాయి. మానవ నైజం దాన్ని ఎన్నడూ కోరుకోదు కదా! మరలాంటప్పుడు ఈ పాపాత్ములు దైవశిక్ష విషయంలో ఎందుకింత ఆదుర్దా చెందుతున్నారు? దానివల్ల వారికి ఒరిగేదేమిటట?!

ثُمَّ قِيلَ لِلَّذِينَ ظَلَمُوا ذُوقُوا عَذَابَ الْخُلْدِ
هَلْ تُجْزَوْنَ إِلَّا بِمَا كُنتُمْ تَكْسِبُونَ ﴿52﴾

**52** అప్పుడు దుర్మార్గులతో ఇలా చెప్పబడుతుంది: “ఇక శాశ్వత మైన శిక్షను చవిచూడండి. మీరు సంపాదించుకున్న దాని ఫలితమే మీకు లభించింది.”

وَيَسْتَنبِئُونَكَ أَحَقٌّ هُوَ ۖ قُلْ إِي وَرَبِّي
إِنَّهُ لَحَقٌّ ۖ وَمَا أَنتُم بِمُعْجِزِينَ ﴿53﴾

**53** “ఏమిటీ, అది నిజమేనా?” అని వారు నిన్ను అడుగుతున్నారు. “అవును. నా ప్రభువు తోడు! అది (ఆ శిక్ష) పడటం సత్యం. అది సంభవించకుండా ఆపే శక్తి మీకు లేదు” అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.[83]

وَلَوْ أَنَّ لِكُلِّ نَفْسٍ ظَلَمَتْ مَا فِي الْأَرْضِ لَافْتَدَتْ
بِهِ ۗ وَأَسَرُّوا النَّدَامَةَ لَمَّا رَأَوُا الْعَذَابَ ۖ
وَقُضِيَ بَيْنَهُم بِالْقِسْطِ ۚ وَهُمْ لَا يُظْلَمُونَ ﴿54﴾

**54** దుర్మార్గానికి (షిర్క్‌కు) పాల్పడిన ప్రతి మనిషి దగ్గరా భూమి నిండిపోయేంత (సొమ్ము) ఉన్నాసరే అతను దాన్ని పరిహారంగా ఇచ్చి తనను విడిపించుకునేందుకు ప్రయత్నిస్తాడు.[84] శిక్షను చూసినపుడు వారు లోలోపలే సిగ్గుతో కుమిలిపోతారు. వారి మధ్య న్యాయసమ్మతంగా తీర్పు జరుగుతుంది. వారికెలాంటి అన్యాయం జరగదు.

أَلَا إِنَّ لِلَّهِ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ ۗ أَلَا إِنَّ
وَعْدَ اللَّهِ حَقٌّ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ ﴿55﴾

**55** వినండి! ఆకాశాలలో, భూమిలో ఉన్న సమస్తమూ అల్లాహ్ సొత్తే. గుర్తుంచుకోండి! అల్లాహ్ వాగ్దానం సత్యం. అయితే చాలా మంది (ఈ సత్యాన్ని) తెలుసుకోరు.

هُوَ يُحْيِي وَيُمِيتُ وَإِلَيْهِ تُرْجَعُونَ ﴿56﴾

**56** ఆయనే ప్రాణం పోస్తాడు, మరి ఆయనే ప్రాణం తీస్తాడు. మీరంతా ఆయన వద్దకే మరలించబడతారు.[85]

82. శిక్షపడిన తరువాత విశ్వసించి ప్రయోజనం ఏముంటుంది చెప్పండి?

83. మనుషులు మట్టిలో కలసి, కృశించిపోయిన తరువాత కూడా ప్రళయదినాన లేపబడటం, ప్రశ్నించబడటం ఎలా సంభవం? అన్నది వారి ఉద్దేశం. దానికి అల్లాహ్ ఇచ్చే సమాధానం ఇది : ఓ ప్రవక్తా! మీ తనువులు కాటిమట్టిలో కలిసిపోయినా, లేక మీరు మాడి మసైపోయినా మిమ్మల్ని తిరిగి లేపటం తథ్యం. ఇలా చేయటం మీ ప్రభువు శక్తికి అతీతం ఏమీ కాదు. ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు : “ఈ ఆయతును పోలిన మరో రెండు ఆయతులు మాత్రమే దివ్య ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. ఆ గడువు సంభవించటం తథ్యమని ప్రమాణం చేసి మరీ చెప్పమని దేవుడు ఈ వాక్యాలలో తన ప్రవక్త (స) కు ఆజ్ఞాపిస్తున్నాడు. 1. సబా సూరాలోని 3వ ఆయతు. 2. తగాబున్ సూరాలోని 7వ ఆయతు.

84. ప్రపంచంలోని సిరిసంపదలన్నింటినీ పరిహారంగా ఇచ్చే పక్షంలో క్షమాభిక్ష పెట్టబడుతుందని అంటే, దానికోసం మనిషి సంతోషంగా సిద్ధపడతాడు. కాని అక్కడ ఎవరి దగ్గరా ఏమీ ఉండదుకదా! కాబట్టి శిక్ష నుంచి తప్పించుకునే దారి కూడా ఉండదు.

85. ఈ ఆయతులలో భూమ్యాకాశాలలో ఉన్నవన్నీ దేవునివేననీ, ఆయన వాగ్దానం నెరవేరి తీరుతుందనీ, ఆయనే జీవన్మరణాల ప్రదాత అనీ, ఆయన సమక్షంలో అందరూ హాజరుకాక తప్పదనీ చెప్పబడింది. ఇంతకుముందు చెప్పబడిన విషయాలే మరోసారి చెప్పబడ్డాయి. సర్వాధికారి అయిన ఆయన పట్టునుంచి మీరు ఎలా తప్పించు కుంటారు? ఆయన నిర్ధారించిన లెక్కల ఘడియను మీరు ఎలా దాటి పోగలుగుతారు? అని చెప్పటం దీని ఉద్దేశం.

**57** ప్రజలారా! మీ ప్రభువు తరఫు నుంచి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది.[86] అది హృదయాలలో ఉన్న వ్యాధుల నుంచి స్వస్థత నొసగేది,[87] నమ్మేవారి కోసం మార్గదర్శకం, కారుణ్యం.[88]

يَا أَيُّهَا النَّاسُ قَدْ جَاءَتْكُمْ مَوْعِظَةٌ مِنْ رَبِّكُمْ وَشِفَاءٌ لِمَا فِي الصُّدُورِ وَهُدًى وَرَحْمَةٌ لِلْمُؤْمِنِينَ ﴿٥٧﴾

**58** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "అల్లాహ్ ప్రదానం చేసిన ఈ బహుమానానికి, కారుణ్యానికి జనులు సంతోషించాలి.[89] వారు కూడబెట్టే దానికంటే ఇది ఎంతో మేలైనది."

قُلْ بِفَضْلِ اللَّهِ وَبِرَحْمَتِهِ فَبِذَٰلِكَ فَلْيَفْرَحُوا هُوَ خَيْرٌ مِمَّا يَجْمَعُونَ ﴿٥٨﴾

**59** "అల్లాహ్ మీ కోసం ఆహారాన్ని అవతరింపజేయగా దానిలో కొంతభాగాన్ని మీరు మీ కోసం నిషేధించుకుని, మరికొంత భాగాన్ని ధర్మసమ్మతం చేసుకున్నారే దీనికి మీ సమాధానం ఏమిటి!?"[90] అని వారిని అడుగు. "ఏమిటీ, ఈ మేరకు అల్లాహ్ మీకు ఆదేశించాడా? లేక మీరే అల్లాహ్‌కు అబద్ధాలను అంటగడుతున్నారా?" అని వారిని అడుగు.

قُلْ أَرَأَيْتُمْ مَا أَنْزَلَ اللَّهُ لَكُمْ مِنْ رِزْقٍ فَجَعَلْتُمْ مِنْهُ حَرَامًا وَحَلَالًا قُلْ آللَّهُ أَذِنَ لَكُمْ أَمْ عَلَى اللَّهِ تَفْتَرُونَ ﴿٥٩﴾

86. మనస్ఫూర్తిగా దివ్య ఖుర్ఆన్‌ను పారాయణం చేసేవారి కొరకు, దాని లోతుల్లోకి పోదలచేవారి కొరకు అది నిస్సందేహంగా హితబోధిని. బోధకుడు వైద్యుని లాంటివాడు. మనిషి శరీరానికి హాని కలిగించే వస్తువుల నుండి వైద్యుడు అతన్ని వారిస్తాడు. అలాగే దివ్యఖుర్ఆన్ కూడా మానవునికి నష్టం కలిగించే విషయాల నుండి ఆపుతుంది. ధిక్కరించిన కారణంగా ఎదుర్కోవలసిన విపత్కర పరిణామాల గురించి ముందుగా హెచ్చరిస్తుంది. మనిషి పరలోక జీవితాన్ని నాశనం చేసే విధానాల నుండి కూడా అది ఆపుతుంది.

87. అంటే దేవుని ఏకత్వం (తౌహీద్), దైవదౌత్యం (రిసాలత్), సత్యవిశ్వాసాల పట్ల ఆంతర్యంలో జనించే సందేహాలను పటాపంచలు చేస్తుంది. మనసులలో పేరుకునే కుఫ్ర్ (సత్య తిరస్కారం), నిఫాఖ్ (కాపట్యం) లాంటి తుప్పును తొలగిస్తుంది.

88. ఆ మాటకొస్తే దైవగ్రంథమయిన ఖుర్ఆన్ మానవులందరికీ మార్గదర్శకమే. అయితే విశ్వసించిన వారు మాత్రమే ఆ జ్ఞాన సుధ ద్వారా ప్రయోజనం పొందుతారు. ఆ విధంగా అది వారి పాలిట కారుణ్యం అవుతుంది. ఈ విషయమే దివ్య ఖుర్ఆన్‌లోని బనీ ఇస్రాయీల్ సూరా 82వ ఆయతులో, అలిఫ్ లామ్ మీమ్ అస్సజ్దా సూరా 44వ ఆయతులో కూడా చెప్పబడింది. అలాగే "భయభక్తులుగల వారి కొరకు మార్గదర్శకం" అన్న వాక్యానికి ఇవ్వబడిన వివరణను కూడా చూడగలరు. (అల్ బఖర : 2)

89. ఆశించిన గొప్ప లక్ష్యం సిద్ధించినప్పుడు మనిషి ఆనందంతో పరవశించిపోతాడు. దివ్య ఖుర్ఆన్‌ను అల్లాహ్ ముస్లిములకు ప్రసాదించి వారికి మహోపకారం చేశాడు. కనుక దానిపై ముస్లిములు సంబరపడాలి. వారి హృదయాంతరాళాలలో కృతజ్ఞతా భావం ఉప్పొంగాలి. అయితే సంతోషాతిశయంతో సభలు, సమావేశాలు నిర్వహించాలనీ, అట్టహాసం చేయాలనీ, విద్యుద్దీపాలు అలంకరించి వైభవాన్ని చాటిచెప్పుకోవాలనీ, అనవసరంగా డబ్బును తగలెట్టాలని దీని భావం ఎంతమాత్రం కాదు సుమా! నేడు కొంతమంది ధర్మంలో కొత్తపుంతలు తొక్కుతూ, ఈ ఆయతును ఆధారంగా చేసుకొని "ఈదె మీలాదున్నబీ" పేరుతో సృష్టించిన ఆచారం కూడా ఇటువంటిదే.

90. నిషేధించుకోవటం అంటే ఆనాడు ముష్రిక్కులు కొన్ని జంతువులను తమ విగ్రహాల పేర వదిలేసేవారు. ఈ వివరాలు ఇంతకుముందు అల్ అన్ఆమ్ సూరాలో వచ్చాయి.

**60** అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టే వారు ప్రళయదినం గురించి ఏమనుకుంటున్నారు?[91] నిస్సందేహంగా మానవుల పట్ల అల్లాహ్ అనుగ్రహం కలవాడు.[92] కాని వారిలో చాలా మంది కృతజ్ఞతా పూర్వకంగా వ్యవహరించరు.[93]

وَمَا ظَنُّ الَّذِينَ يَفْتَرُونَ عَلَى اللَّهِ الْكَذِبَ
يَوْمَ الْقِيَامَةِ ۗ إِنَّ اللَّهَ لَذُو فَضْلٍ عَلَى النَّاسِ
وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَشْكُرُونَ ﴿٦٠﴾

**61** (ఓ ప్రవక్తా!) నువ్వు ఏ స్థితిలోవున్నా – ఖుర్‌ఆనులోని ఏ భాగాలను పారాయణం చేసినా, (ప్రజలారా!) మీరు ఏ పని చేసినా, మీరు మీ కార్యక్రమాలలో తలమునకలై ఉన్నప్పుడు మేము మిమ్మల్ని గమనిస్తూనే ఉంటాము. భూమిలో, ఆకాశాలలో ఉన్న రవంత వస్తువు కూడా నీ ప్రభువు నుండి గోప్యంగా లేదు– దానికంటే చిన్నదయినా సరే, పెద్దదయినా సరే – స్పష్టమైన గ్రంథంలో నమోదు కాకుండా లేదు.[94]

وَمَا تَكُونُ فِي شَأْنٍ وَمَا تَتْلُو مِنْهُ
مِنْ قُرْآنٍ وَلَا تَعْمَلُونَ مِنْ عَمَلٍ إِلَّا
كُنَّا عَلَيْكُمْ شُهُودًا إِذْ تُفِيضُونَ فِيهِ ۚ
وَمَا يَعْزُبُ عَنْ رَبِّكَ مِنْ مِثْقَالِ ذَرَّةٍ
فِي الْأَرْضِ وَلَا فِي السَّمَاءِ وَلَا أَصْغَرَ مِنْ
ذَٰلِكَ وَلَا أَكْبَرَ إِلَّا فِي كِتَابٍ مُبِينٍ ﴿٦١﴾

**62** వినండి! అల్లాహ్ స్నేహితులకు[95] భయముగానీ, దుఃఖంగానీ ఉండదు.[96]

أَلَا إِنَّ أَوْلِيَاءَ اللَّهِ لَا خَوْفٌ عَلَيْهِمْ
وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٦٢﴾

91. అంటే తీర్పుదినాన అల్లాహ్ తమపట్ల చేసే వ్యవహారం గురించి ఏం ఆలోచిస్తున్నారు? అని దీని భావం.

92. దేవుడు ఇహలోకంలో తప్పుచేసిన మానవులను వెంటనే పట్టుకోడు. దానికోసం ఆయన ఒక గడువును నిర్ధారించి పెట్టాడు అని దీనికి ఒక అర్థం. లేదా ప్రపంచంలో దేవుడు తన దాసులకు ప్రసాదించే అనుగ్రహాలు విచక్షణా రహితంగా ఉంటాయి. ఆహారాన్ని ప్రసాదించే విషయంలో ఆయన విశ్వాసులనీ – అవిశ్వాసులనీ, విధేయులనీ– అవిధేయులనీ భేదభావం చూపడు. అలాగే మానవులకు ఉపయోగకరమైన, లాభదాయకమైన వస్తువులను ఆయన ధర్మసమ్మతం (హలాల్) గావించాడు. వాటిని నిషేధించలేదు (హరామ్ చేయలేదు).

93. అంటే వారు దైవానుగ్రహాలకు కృతజ్ఞతలు తెలుపుకోరు. లేదా దేవుడు ధర్మసమ్మతంగా ఖరారు చేసిన వాటిని అధర్మంగా చేసుకుంటారు.

94. ఈ ఆయతులో దేవుడు తన ప్రవక్తను, ముస్లిములను ఉద్దేశ్యించి ఈ విధంగా చెప్పాడు: దేవుడు తన సృష్టిరాశుల స్థితిగతులన్నింటినీ చూస్తున్నాడు. ఒక్కో ఘడియ, ఒక్కో క్షణం ఆయన మీ కదలికలను కనిపెడుతూ ఉన్నాడు. భూమ్యాకాశాలలోని ఏ చిన్న వస్తువూ, మరే పెద్ద వస్తువూ ఆయన నుంచి దాగిలేదు. ఈ విషయమే అల్ అన్‌ఆమ్ సూరాలోని 59వ ఆయతులోనూ, 38వ ఆయతులోనూ చెప్పబడింది. హూద్ సూరాలోని 6వ వచనంలో కూడా దీని ప్రస్తావన వచ్చింది.

95. అవిధేయుల గురించి చెప్పిన తరువాత అల్లాహ్ తనకు ప్రియతములైన విధేయుల గురించి చెబుతున్నాడు. వారు అల్లాహ్‌కు ప్రియతములు (ఔలియా అల్లాహ్). 'ఔలియా' అనే పదం 'వలీ' అనే పదానికి బహువచనం. నిఘంటువు పరంగా 'వలీ' అంటే సన్నిహితుడని అర్థం. దీని ప్రకారం 'ఔలియా అల్లాహ్' అంటే చిత్తశుద్ధితో అల్లాహ్‌కు విధేయత కనబరచి, చెడుల నుండి తమను కాపాడుకుని, దైవసామీప్యం పొందేందుకు నిరంతరం పాటుపడినవారు అని అర్థం. అల్లాహ్ స్వయంగా తరువాతి ఆయతులో 'ఔలియా అల్లాహ్'ను నిర్వచించాడు. వారు విశ్వసించటంతోపాటు, తన పట్ల భయభక్తుల విధానాన్ని కలిగివుంటారని వివరించాడు.

దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే దైవసామీప్యం పొందగోరేవారు నిష్కల్మషమైన విశ్వాసం కలిగి ఉండటంతోపాటు, భయభక్తులతో కూడుకున్న జీవితం గడపాలి. ప్రతి దైవభీతిపరుడూ అల్లాహ్‌కు ప్రియతముడే (వలీఅల్లాహ్‌యే).

**63** వారు విశ్వసించిన వార్తై, (చెడుల విషయంలో అల్లాహ్‌కు) భయపడేవారై ఉంటారు.

الَّذِيْنَ اٰمَنُوْا وَ كَانُوْا يَتَّقُوْنَ ﴿63﴾

**64** ప్రాపంచిక జీవితంలోనూ, పరలోకంలోనూ వారికి శుభవార్త కలదు.[97] అల్లాహ్ వాక్కుల్లో మార్పు ఉండదు. ఇదే గొప్ప విజయం.

لَهُمُ الْبُشْرٰى فِى الْحَيٰوةِ الدُّنْيَا وَ فِى الْاٰخِرَةِ ؕ لَا تَبْدِيْلَ لِكَلِمٰتِ اللّٰهِ ؕ ذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿64﴾

**65** (ఓ ప్రవక్తా!) వారి మాటలు నిన్ను దుఃఖానికి లోను చేయ కూడదు. యదార్థానికి సర్వాధిపత్యం అల్లాహ్‌దే. ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

وَ لَا يَحْزُنْكَ قَوْلُهُمْ ۘ اِنَّ الْعِزَّةَ لِلّٰهِ جَمِيْعًا ؕ هُوَ السَّمِيْعُ الْعَلِيْمُ ﴿65﴾

**66** ఆకాశాలలో, భూమిలో ఉన్నవారందరూ అల్లాహ్‌వారేనన్న సంగతిని బాగా తెలుసుకోండి. అల్లాహ్‌ను వదలి ఇతరత్రా భాగస్వాములను పూజించేవారు దేన్ని అనుసరిస్తున్నట్లు?! వారు నిరాధారమైన ఊహలను అనుసరిస్తున్నారు. అంచనాలపై[98] ఆధారపడుతున్నారు.

اَلَاۤ اِنَّ لِلّٰهِ مَنْ فِى السَّمٰوٰتِ وَمَنْ فِى الْاَرْضِ ؕ وَمَا يَتَّبِعُ الَّذِيْنَ يَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ شُرَكَآءَ ؕ اِنْ يَّتَّبِعُوْنَ اِلَّا الظَّنَّ وَاِنْ هُمْ اِلَّا يَخْرُصُوْنَ ﴿66﴾

కాని జనులు మాత్రం దీన్ని ఒక ప్రహసనంగా మార్చారు. మహిమలు చూపేవారే దేవుని 'ప్రియతములు' కాగలుగుతారని భాష్యం చెప్పారు. తమ భాష్యాన్ని సమర్థించుకోవటానికి, తాము ఇష్టపడే 'వలీల'కు స్వకల్పిత మహిమలను ఆపాదించారు. దైవసామీప్యం పొందటానికీ – మహిమలు ప్రదర్శించటానికి అసలు సంబంధమే లేదు. ఒకవేళ ఎవరి ద్వారానయినా ఏదైనా మహిమ ప్రదర్శితమైతే అది దైవేచ్ఛ, దైవప్రణాళిక అనుకోవాలి. అంతేగాని, అది ఆ వలీ తరఫు నుంచి జరిగింది ఏమీకాదు. అలాగే ఒక ధర్మనిష్ఠాపరుని ద్వారా, ఒక విశ్వాసి ద్వారా ఏదన్నా మహిమ ప్రదర్శితం కాకపోయినంత మాత్రాన వారి భక్తితత్పరతను శంకించనవసరమూ లేదు. ఎవరి ఆంతర్యాల్లో ఎంత భక్తి ఉందో అల్లాహ్‌కే బాగా తెలుసు.

96. **'భయము'** భవిష్యత్తుకూ, **'దుఃఖం'** గతానికీ సంబంధించినది. వారు దైవానికి భయపడుతూ జీవితం గడపటం వల్ల ప్రళయదినపు భీతావహ స్థితి గురించి అంతగా భయపడవలసిన అవసరం ఉండదు. పైగా వారు తమ విశ్వాసం (ఈమాన్), భయభక్తుల (తఖ్వా) మూలంగా దైవకారుణ్యం పట్ల ఆశపెట్టుకుని ఉంటారు. దైవానుగ్రహం తమపై ఉంటుందన్న భరోసా వారికి ఉంటుంది. అలాగే ఇహలోకంలో తాము వదలిపోయిన దాని గురించిగానీ, తాము జుర్రుకోలేక పోయిన సుఖాల పట్ల గానీ వారికి ఎలాంటి చీకూ చింతా ఉండదు. ఎందుకంటే ఇదంతా దైవేచ్ఛకను గుణంగా జరిగిందన్న సంగతి వారికి బాగా తెలుసు. అందువల్ల వారి ఆంతర్యాలలో ఎలాంటి అసంతృప్తి, వ్యాకులత జనించదు. పైగా దైవేచ్ఛపై వారి హృదయాలు పూర్తిగా రాజీపడిపోతాయి.

97. ప్రపంచంలో శుభవార్త అంటే సత్య కలలు లేక మరణ సమయంలో దైవదూతలు వారికి అందజేసే శుభవార్త కావచ్చు. ఖుర్ఆన్ హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది.

98. అంటే వారు చేసే షిర్కుకు ఎలాంటి ఆధారమూ లేదు. వారు సంశయాలలో, ఊహలలో విహరించే జీవులు మాత్రమే. కాకిలెక్కలు వేసి, గాలి మేడలు కట్టేవారు మాత్రమేగాని వాస్తవాలపై దృష్టిని సారించరు. వాస్తవ జగత్తులోకి వచ్చి, హేతుబద్ధంగా విషయాన్ని తరచిచూస్తే అల్లాహ్‌కు సహవర్తులు ఎవరూ లేరన్న యదార్థం వారికి తెలిసి ఉండేది. భూమ్యాకాశాల నిర్మాణంలో ఆయన ఒక్కడైనప్పుడు, పోషకత్వంలో ఆయనకు భాగస్వాములు ఎవరూ లేనప్పుడు మరి "ఆరాధన"లో భాగస్వాములు ఎక్కడినుంచి ఊడిపడ్డారు?

**67** మీరు విశ్రాంతి తీసుకునేటందుకు ఆయనే మీ కోసం రాత్రిని చేశాడు. పగటిని చూడగలగటానికి అనువుగా చేశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారి కోసం నిదర్శనాలున్నాయి.

هُوَ الَّذِيْ جَعَلَ لَكُمُ الَّيْلَ لِتَسْكُنُوْا فِيْهِ
وَالنَّهَارَ مُبْصِرًا ۭ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ
لِّقَوْمٍ يَّسْمَعُوْنَ (67)

**68** అల్లాహ్ సంతానం కలిగి ఉన్నాడని వారంటున్నారు. సుబ్‌హానల్లాహ్! (అల్లాహ్ పరమ పవిత్రుడు). ఆయన ఏ అవసరమూ లేనివాడు.[99] ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా ఆయన సొత్తే.[100] దీనికిగాను (మీరు ఆపాదించే అసత్యానికి గాను) మీవద్ద ఏ ఆధారమూ లేదు. అల్లాహ్‌ను గురించి మీకు తెలియని మాటలంటున్నారా?

قَالُوا اتَّخَذَ اللّٰهُ وَلَدًا سُبْحٰنَهٗ ۭ هُوَ الْغَنِيُّ ۭ
لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۭ اِنْ
عِنْدَكُمْ مِّنْ سُلْطٰنٍۢ بِهٰذَا ۭ اَتَقُوْلُوْنَ عَلَى
اللّٰهِ مَا لَا تَعْلَمُوْنَ (68)

**69** అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టే వారు[101] ఎట్టి పరిస్థితిలోనూ సాఫల్యం పొందలేరని[102] (ఓ ప్రవక్తా!) వారికి తెలుపు.

قُلْ اِنَّ الَّذِيْنَ يَفْتَرُوْنَ عَلَى اللّٰهِ الْكَذِبَ
لَا يُفْلِحُوْنَ (69)

**70** వారికి ఈ ప్రపంచంలో కొద్దిపాటి భోగముంది. ఆ తరువాత వారు మా వద్దకు రావలసి ఉంటుంది. ఆ పిదప మేము వారికి వారి తిరస్కారానికి బదులుగా కఠినమైన శిక్ష రుచి చూపిస్తాము.

مَتَاعٌ فِي الدُّنْيَا ثُمَّ اِلَيْنَا مَرْجِعُهُمْ ثُمَّ نُذِيْقُهُمُ
الْعَذَابَ الشَّدِيْدَ بِمَا كَانُوْا يَكْفُرُوْنَ (70)

99. అక్కరలేనివాడికి ఆలుబిడ్డల అవసరం కూడా ఉండదు. సంతానం చేయూతనిస్తుంది. ఒకరు చేయూత నివ్వవలసిన అవసరం ఆయనకు లేనప్పుడు బిడ్డల అవసరం కూడా ఎందుకుంటుంది?

100. భూమ్యాకాశాలలోని వస్తువులన్నీ ఆయన సొత్తు అయినప్పుడు అవన్నీ ఆయన ఆజ్ఞలకు లోబడి ఉంటాయి. ఆయన చెప్పినట్లు వింటాయి. ఆయన ఆజ్ఞలను శిరసావహించటానికి అన్నీ సిద్ధంగా ఉన్నప్పుడు ఆయనకు వేరొకరిపై ఆధారపడవలసిన అవసరం ఏముంటుంది? తన తరువాత తన రాజ్యానికి, ఆస్తిపాస్తులకు వారసుణ్ణి చేయాలనుకున్నవాడికి కొడుకుల అవసరం ఏర్పడుతుంది. కాని అల్లాహ్‌కు అలాంటి అవసరాలు లేవు. ఆయన నిత్యుడు. కాబట్టి అటువంటి ఒకే ఒక్క దేవునికి సంతానాన్ని ఆపాదించటం మహాపరాధం. "కరుణామయునికి సంతానం ఉన్నదని వారు చేసే వాదన మూలంగా ఆకాశాలు పగిలిపోతాయేమో, భూమి బ్రద్దలవుతుందేమో! పర్వతాలు పగిలి తుత్తునియలు అవుతాయేమో!" (మర్యమ్ - 90, 91) అని చెప్పటాన్నిబట్టి ఈ ఆరోపణ దేవుని ఆగ్రహానికి ఎంతగా కారణభూతమవుతుందో ఊహించవచ్చు.

101. **'ఇఫ్తిరా'** అంటేనే అబద్ధాన్ని అంటగట్టడం అని అర్థం. ఆపైన **కజిబ్** అని కూడా అనబడింది. విషయాన్ని నొక్కి చెప్పటం కోసం ఈ విధంగా పర్యాయ పదాలను ఉపయోగించటం జరిగింది. అంటే వారు అబద్ధాలను కల్పించటమే గాక, వాటిని అల్లాహ్‌కు అంటగట్టారు.

102. సిసలైన సాఫల్యం అంటే అది పరలోక సాఫల్యమేనని దీనిద్వారా విదితమవుతోంది. తాత్కాలిక ప్రపంచ జీవితంలో ఆస్తిపాస్తుల్ని కూడబెట్టడం సాఫల్యం అనిపించుకోదు. పరలోకంలో అల్లాహ్ ఆగ్రహం నుంచి, ఆయన శిక్ష నుంచి తప్పించుకోవటమే అసలు సిసలు విజయం. ఎంతోమంది దేవుని అవిధేయులు, అసత్యవాదులు సిరిసంపదలతో తులతూగుతూ ఉండటం చూసి కొందరు సందిగ్ధంలో పడవచ్చు. కాని ఈ కలిమి సాఫల్యానికి ప్రతీక కాదు. అందుకే దీని తరువాతి వచనంలో స్పష్టం చేయబడింది - "ఈ ప్రపంచంలోని కొన్ని భోగభాగ్యాలను అనుభవించండి.

**71** నువ్వు వారికి నూహ్ (అలైహిస్సలాం) గాథను వినిపించు. అప్పుడు అతను తన జాతి వారితో, "ఓ నా జాతివారలారా! నేను మీ మధ్య ఉండటం, దైవాజ్ఞలను ఉపదేశించటం మీకు సహింప శక్యం కాకపోతే (పోనివ్వండి), నేను మాత్రం అల్లాహ్‌నే నమ్ము కున్నాను. మీరు మీ భాగస్వాములతో కలసి మీ వ్యూహం విషయంలో గట్టి నిర్ణయానికి రండి!.[103] ఆ పిదప మీ వ్యూహ రచన మీలో ఎలాంటి శంకకు కారణం కాకూడదు.[104] ఆపైన నా విషయంలో ఏం చేయాలనుకున్నారో చేయండి. నాకు గడువు ఇవ్వవలసిన అవసరం కూడా లేదు" అని అన్నాడు.

وَاتْلُ عَلَيْهِمْ نَبَاَ نُوْحٍ ۘ اِذْ قَالَ لِقَوْمِهٖ يٰقَوْمِ اِنْ كَانَ كَبُرَ عَلَيْكُمْ مَّقَامِيْ وَتَذْكِيْرِيْ بِاٰيٰتِ اللّٰهِ فَعَلَى اللّٰهِ تَوَكَّلْتُ فَاَجْمِعُوْٓا اَمْرَكُمْ وَشُرَكَآءَكُمْ ثُمَّ لَا يَكُنْ اَمْرُكُمْ عَلَيْكُمْ غُمَّةً ثُمَّ اقْضُوْٓا اِلَيَّ وَلَا تُنْظِرُوْنِ ﴿71﴾

**72** అప్పటికీ మీరు విముఖత చూపితే, నేను మీ నుండి ఎలాంటి ప్రతిఫలం కోరలేదు.[105] నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత కేవలం అల్లాహ్‌ది. ముస్లింగా ఉండాలని నాకు ఆదేశించబడింది.[106]

فَاِنْ تَوَلَّيْتُمْ فَمَا سَاَلْتُكُمْ مِّنْ اَجْرٍ ؕ اِنْ اَجْرِيَ اِلَّا عَلَى اللّٰهِ ۙ وَاُمِرْتُ اَنْ اَكُوْنَ مِنَ الْمُسْلِمِيْنَ ﴿72﴾

ఆ తరువాత ఎలాగూ మీరు మా వద్దకు రాకతప్పదు" అని! అంటే పరలోకంతో పోల్చుకున్నప్పుడు ఈ ప్రపంచం క్షణభంగురం. ఇక్కడి భోగవిలాసాలు తాత్కాలికమైనవి. ఆ తరువాత వారు వ్యథాభరితమైన శిక్షను అనుభవించవలసి ఉంటుంది.

కాబట్టి నేడు ప్రపంచంలో ఆర్థికంగా, వైజ్ఞానికంగా, శాస్త్రీయపరంగా ప్రగతిపథంలో దూసుకుపోతున్న అవిశ్వాసులు, ముష్రిక్కులు, దైవధిక్కారులు ధన్యులయ్యారనీ, వారిపట్ల దేవుడు ప్రసన్నుడయ్యాడనీ భావించకూడదు. ప్రపంచంలో పరిశ్రమించిన ప్రతి ఒక్కరికీ ప్రగతీ వికాసాలు ప్రాప్తిస్తాయి. విశ్వాసులైనా, అవిశ్వాసులైనా భౌతిక ప్రగతి విషయంలో ఒక్కటే. అదలా ఉంచితే ఒక్కోసారి దేవుడు వ్యక్తులను, జాతులను, సమూహాలను పరీక్షించే నిమిత్తం కూడా కీర్తిప్రతిష్ఠలను ఇస్తాడు. ఈ విషయం ఇంతకుముందు కూడా పదే పదే చెప్పటం జరిగింది.

103. అంటే నాకు వ్యతిరేకంగా మీరు పన్నబోయే కుట్రలో మీ చిల్లర దేవుళ్లు కూడా తోడ్పడతారని మీరనుకుంటే వారిని కూడా మీతో చేర్చుకోండి.

104. అరబీలో **'గుమ్మతన్' (غُمَّةً)** అని ఉంది. పైన ఆయతులో దాన్ని 'శంక' (అనుమానం) అని తర్జుమా చేయటం జరిగింది. ఈ పదానికి దాపరికం, అస్పష్టత అనే అర్థాలు కూడా ఉన్నాయి. దాని ప్రకారం పై ఆయతుకు భావం ఇలా వస్తుంది: మీరు నాకు వ్యతిరేకంగా జరిపే పన్నాగం చాలా స్పష్టంగా ఉండాలి. ఈ విషయంలో ఏమాత్రం దాపరికానికి ఆస్కారం ఉండకూడదు.

105. ఈ సందేశాన్ని అందజేసి మీనుంచి డబ్బును గుంజాలని చూస్తున్నాడు అని ఒకవేళ అనుకుంటున్నారేమో! నాకు మీ ప్రతిఫలం ఏమీ అక్కరలేదు. నాకు ప్రతిఫలాన్ని ఇచ్చే బాధ్యతను అల్లాహ్ తీసుకున్నాడు. మీ శ్రేయోభిలాషిగా మాత్రమే మీకు ఈ సందేశాన్ని అందజేస్తున్నాను.

106. దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) గారి ఈ మాటల ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే దైవప్రవక్తలందరూ అందజేసిన ధర్మం ఇస్లాం ధర్మమే. వారు ప్రవేశపెట్టిన షరీయతులు, అవలంబించిన విధానాలు అనేకం ఉన్నప్పటికీ 'మూలధర్మం' మాత్రం ఒక్కటే – అదే ఇస్లాం! అల్ మాయిద సూరాలోని 48వ వచనం ద్వారా కూడా ఈ విషయం విదితమవుతోంది. (ఈ విషయాన్ని మరింత విపులంగా తెలుసుకునేందుకు దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులను కూడా అధ్యయనం చేయగలరు : అన్ నహ్ల్ సూరా 91వ ఆయతు, అల్ బఖరా సూరా–131, 132 ఆయతులు,

فَكَذَّبُوهُ فَنَجَّيْنَاهُ وَمَن مَّعَهُ فِي الْفُلْكِ وَجَعَلْنَاهُمْ
خَلَائِفَ وَأَغْرَقْنَا الَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا ۖ فَانظُرْ
كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُنذَرِينَ ﴿٧٣﴾

**73** అయినా వారు అతన్ని ధిక్కరిస్తూనే ఉన్నారు.[107] అందుచేత మేము అతన్నీ, అతనితోపాటు ఓడలో ఉన్నవారినీ కాపాడాము. వారిని వారసులుగా చేశాము.[108] మా ఆయతులను అసత్యాలని త్రోసిపుచ్చిన వారిని ముంచివేశాము. చూడు! హెచ్చరించబడిన వారికి ఏ గతి పట్టిందో!

ثُمَّ بَعَثْنَا مِن بَعْدِهِ رُسُلًا إِلَىٰ قَوْمِهِمْ فَجَاءُوهُم
بِالْبَيِّنَاتِ فَمَا كَانُوا لِيُؤْمِنُوا بِمَا كَذَّبُوا بِهِ مِن
قَبْلُ ۚ كَذَٰلِكَ نَطْبَعُ عَلَىٰ قُلُوبِ الْمُعْتَدِينَ ﴿٧٤﴾

**74** మరి నూహ్ (అలైహిస్సలాం) అనంతరం మేము అనేకమంది ప్రవక్తలను వారి జాతుల వద్దకు పంపాము. వారు తమ జనుల వద్దకు స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చారు.[109] కాని వారు మొదట్లో ధిక్కరించిన విషయాన్ని మళ్ళీ అంగీకరించటం అన్నది జరగనేలేదు.[110] ఈ విధంగా మేము హద్దు మీరి పోయేవారి హృదయాలపై సీలు వేసేస్తాము.[111]

ثُمَّ بَعَثْنَا مِن بَعْدِهِم مُّوسَىٰ وَهَارُونَ
إِلَىٰ فِرْعَوْنَ وَمَلَئِهِ بِآيَاتِنَا فَاسْتَكْبَرُوا
وَكَانُوا قَوْمًا مُّجْرِمِينَ ﴿٧٥﴾

**75** మరి ఆ ప్రవక్తల తరువాత మేము మూసాను, హారూనును[112] ఫిరౌను వద్దకు, అతని సర్దారుల వద్దకు మా సూచనలను[113] ఇచ్చి పంపాము. కాని వారు అహంకారం ప్రదర్శించారు. వారు అపరాధ జనులు.[114]

---

యూసుఫ్ సూరా–101, యూనుస్ సూరా–84, అల్ ఆరాఫ్ సూరా–126, అన్ నమ్ల్ సూరా 44, అల్ మాయిద సూరా–44 మరియు 111 ఆయతులు, అల్ అన్ఆమ్ సూరా – 162, 163).

107. ఎంతకాలం ఉపదేశించినా నూహ్ జాతి ప్రజలు తమ ధిక్కార వైఖరిని మానుకోలేదు. అందువల్ల అల్లాహ్ ప్రవక్త నూహ్‌ను, ఆయన్ని విశ్వసించేవారిని ఓడలో కూర్చోబెట్టి వారిని కాపాడాడు. మిగిలిన ధిక్కారులందరినీ ఉప్పెనలో ముంచివేశాడు. ఆఖరికి అవిధేయుడైన నూహ్ కుమారుణ్ణి కూడా వదలిపెట్టలేదు.

108. ఈ ఉప్పెన బారినుంచి కాపాడబడిన విధేయులను వారి పూర్వీకులకు వారసులుగా చేశాడు. ఆ తరువాత మానవజాతి మనుగడ వీళ్ల ద్వారానే సాగింది. ముఖ్యంగా దైవప్రవక్త నూహ్‌కు చెందిన ముగ్గురు కుమారుల ద్వారా మానవ పరంపర ముందుకు సాగింది. అందుకే హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం)ను 'మరొక ఆదం' (ఆదమె సానీ)గా అభివర్ణిస్తూ ఉంటారు.

109. వారు తీసుకువచ్చిన సూచనలు ఎంత స్పష్టమైనవంటే మంచి మనసు ఉన్నవారెవరూ వాటిని చూసిన తరువాత ప్రవక్తల మాటను తిరస్కరించరు.

110. కాని ఆయా జాతుల వారు దైవప్రవక్తల సందేశాన్ని ఖాతరు చెయ్యలేదు. మొదట ప్రవక్తలు వచ్చి దైవసందేశం వినిపించినప్పుడు వారు ముందూ వెనుకా ఆలోచించకుండా ఒక్కసారిగా త్రోసిపుచ్చారు. ఒకసారి త్రోసిపుచ్చిన తరువాత మళ్ళీ దానిపై పునఃపరిశీలన చేయటానికీ, ఒకవేళ పునఃపరిశీలన జరిపినా దాన్ని అంగీకరించటానికి వాళ్ళకు అహం అడ్డుపడింది. తత్ఫలితంగా వారు శాశ్వతంగా విశ్వాస భాగ్యానికి దూరమైపోయారు.

111. అంటే మునుపటి జాతులవారి ధిక్కారవైఖరి కారణంగా వారి హృదయాలపై ఎలా ముద్రపడిపోయిందో అలాగే భవిష్యత్తులో కూడా దైవప్రవక్తలను త్రోసిపుచ్చి, దైవవచనాలను ధిక్కరించిన వారి హృదయాలపై సీలుపడుతుంది. తమ పూర్వీకుల మాదిరిగానే వారు కూడా సన్మార్గానికి నోచుకోకుండా పోతారు.

112. ప్రత్యేకంగా ఎవరి పేరూ తీసుకోకుండా అనేకమంది ప్రవక్తల గురించి చెప్పిన తరువాత మూసా, హారూను

**76** అటు పిమ్మట మా వద్ద నుంచి వారికి సత్యబద్ధమైన నిదర్శనం చేరగా వారు "ఇది పచ్చి మంత్రజాలం" అని అన్నారు.[115]

فَلَمَّا جَآءَهُمُ الْحَقُّ مِنْ عِنْدِنَا قَالُوْۤا
اِنَّ هٰذَا لَسِحْرٌ مُّبِيْنٌ (76)

**77** "ఏమిటీ, సత్యంతో కూడుకున్న నిదర్శనం మీ వద్దకు వచ్చేసిన తరువాత దాని గురించి ఇలాంటి మాటలంటారా? ఇది మంత్రజాలమా? మంత్రజాలం చేసేవారు సఫలీకృతులు కాలేరు"[116] అని మూసా (అలైహిస్సలాం) చెప్పాడు.

قَالَ مُوْسٰۤى اَتَقُوْلُوْنَ لِلْحَقِّ لَمَّا جَآءَكُمْ ؕ
اَسِحْرٌ هٰذَا ؕ وَلَا يُفْلِحُ السّٰحِرُوْنَ (77)

**78** దానికి వారు, "మేము మా తాత ముత్తాతలను ఏ పద్ధతిపై చూశామో ఆ పద్ధతి నుంచి మమ్మల్ని తప్పించటానికి నువ్వు మా వద్దకు వచ్చావా?! ఇలా చేసి మీరిద్దరూ భూమిలో పెద్దరికం పొందాలనుకుంటున్నారా?[117] మేమెన్నటికీ మీ ఇద్దరినీ విశ్వసించబోము" అని చెప్పారు.

قَالُوْۤا اَجِئْتَنَا لِتَلْفِتَنَا عَمَّا وَجَدْنَا عَلَيْهِ اٰبَآءَنَا
وَتَكُوْنَ لَكُمَا الْكِبْرِيَآءُ فِى الْاَرْضِ ؕ وَمَا نَحْنُ
لَكُمَا بِمُؤْمِنِيْنَ (78)

**79** "ఆరితేరిన మాంత్రికులందరినీ నా ముందు హాజరుపరచండి" అని ఫిర్ఔన్ ఆదేశించాడు.

وَقَالَ فِرْعَوْنُ ائْتُوْنِىْ بِكُلِّ سٰحِرٍ عَلِيْمٍ (79)

**80** మాంత్రికులు వచ్చినప్పుడు, "మీరు పడవేయాలనుకున్న వాటిని పడవెయ్యండి" అని మూసా వారితో అన్నాడు.

فَلَمَّا جَآءَ السَّحَرَةُ قَالَ لَهُمْ مُّوْسٰۤى اَلْقُوْا
مَاۤ اَنْتُمْ مُّلْقُوْنَ (80)

---

(అలైహిస్సలాం)లను పేరుపెట్టి ప్రస్తావించటం గమనార్హం. వారి ప్రాముఖ్యత, గొప్పదనాల దృష్ట్యా వారిని ప్రత్యేక రీతిలో ప్రస్తావించటం జరిగి ఉండవచ్చు.

113. దైవప్రవక్త మూసా(అలైహిస్సలాం) తీసుకువచ్చిన ఈ మహిమలను, ముఖ్యంగా బనీ ఇస్రాయీల్ సూరా 101వ ఆయతులో ప్రస్తావించబడిన 9 స్పష్టమైన నిదర్శనాలను.

114. అప్పటికే వారు నేరాలకు, పాపాలకు అలవాటుపడిపోయి ఉన్నారు. అందువల్ల దేవుడు పంపిన నిదర్శనాలను తేలిగ్గా కొట్టిపారేయడానికి వారు ఏమాత్రం జంకలేదు. ఎందుకంటే ఒక నేరం మరో నేరానికి మార్గం సుగమం చేస్తుంది. చెడు చేస్తున్నప్పుడు మనసులో ఏ కోశానా భక్తి, భయమూ ఉండదు. ఫిరౌన్ జనులు అప్పటికే దుర్మార్గంలో బహుదూరం వెళ్ళి ఉండటం వల్ల మూసా (అలైహిస్సలాం) సందేశాన్ని త్రోసిపుచ్చడానికి ఏమాత్రం తడబడలేదు.

115. ఒక సత్యాన్ని తిరస్కరించటానికి తగు కారణం దొరకనప్పుడు దాన్నుంచి తమను తప్పించుకోవటానికి "ఇది కనికట్టు విద్యలా ఉంది" అని చెప్పేస్తే పోతుంది అని వారు అనుకున్నారు.

116. కాస్త ఆలోచించండి : సత్యవాక్కును, ప్రబల నిదర్శనాలను మీరు కనికట్టుగా చిత్రీకరిస్తారా? ఇది మీకు ఇంద్రజాలంగా కనిపిస్తోందా? ఇంద్రజాలికులు ఎన్నడూ లక్ష్యం సాధించలేరు తెలుసా?! నేను మాంత్రికుణ్ణి కాను. దేవుని తరఫున పంపబడిన ప్రవక్తను. నాకు ఆయన అండదండలున్నాయి. ఆయన నాకు మహిమలను, స్పష్టమైన సూచనలను ఇచ్చాడు. అలాంటప్పుడు నేను మంత్రతంత్రాలను గానీ, మాంత్రికులను గానీ ఆశ్రయించవలసిన పని ఏముంటుంది? దైవ ప్రసాదితాలైన నిదర్శనాల ముందు మంత్రాలెంత? అని హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఫిరౌన్ దర్బారులోని సర్దారులకు నచ్చజెప్పారు.

117. హేతువు ముందు, ప్రమాణబద్ధమైన ఆధారాల ముందు నిలువలేని వారు మంకుతనానికి దిగివస్తారు. తమ వైఖరిపై మొండికేస్తూ నోటికొచ్చినది వాగుతారు. ఫిరౌను దర్బారులోని పెద్దలు కూడా అదే చేశారు. మా తాతముత్తాతల

81 వారు పడవేయగానే మాంత్రికులతో మూసా ఇలా అన్నాడు: "మీరు తెచ్చినది మంత్రజాలం. అల్లాహ్ ఇప్పుడే దానిని మిథ్యగా చేసి చూపిస్తాడు.[118] అల్లాహ్ ఇలాంటి కల్లోల జనకుల పనిని చక్కబడనివ్వడు.[119]

فَلَمَّآ اَلْقَوْا قَالَ مُوْسٰى مَا جِئْتُمْ بِهِ ۙ السِّحْرُ ۭ اِنَّ اللّٰهَ سَيُبْطِلُهٗ ۭ اِنَّ اللّٰهَ لَا يُصْلِحُ عَمَلَ الْمُفْسِدِيْنَ ﴿81﴾

82 అపరాధులకు మింగుడుపడక పోయినాసరే అల్లాహ్ తన ఆదేశాల[120] ద్వారా సత్యాన్ని సత్యంగా నిరూపిస్తాడు.

وَيُحِقُّ اللّٰهُ الْحَقَّ بِكَلِمٰتِهٖ وَلَوْ كَرِهَ الْمُجْرِمُوْنَ ﴿82﴾

83 మూసా (అలైహిస్సలాం)ను అతని జాతికి చెందిన కొద్ది మంది[121] మాత్రమే విశ్వసించారు. ఆ కొద్దిమంది కూడా, ఫిరౌనుకు, అతని సర్దారులకు – వారు తమను ఎక్కడ వేధిస్తారో నని భయపడుతూ ఉండేవారు.[122] అవును మరి! ఆ రాజ్యంలో ఫిరౌన్ ప్రాబల్యం కలిగి ఉండేవాడు, దానికితోడు హద్దుమీరి పోయేవాడు.[123]

فَمَآ اٰمَنَ لِمُوْسٰٓى اِلَّا ذُرِّيَّةٌ مِّنْ قَوْمِهٖ عَلٰي خَوْفٍ مِّنْ فِرْعَوْنَ وَمَلَا۟ىِٕهِمْ اَنْ يَّفْتِنَهُمْ ۭ وَاِنَّ فِرْعَوْنَ لَعَالٍ فِي الْاَرْضِ ۚ وَاِنَّهٗ لَمِنَ الْمُسْرِفِيْنَ ﴿83﴾

మతాచారాల నుండి మమ్మల్ని తొలగించదలుస్తున్నావా? మా అధికారాన్ని, రాజవైభవాన్ని చూసి అసూయతో కొత్తపథకాలు వేస్తున్నావా? మా పదవులను మా నుండి కొల్లగొట్టి వాటిని నువ్వూ, నీ సోదరుడూ ఆక్రమించుకో దలుస్తున్నారా? అందుకే మేము నీ మాటను నమ్మము పో అని ఎడాపెడా వాగి, దైవప్రవక్తను ఓడించే ప్రయత్నం చేశారు. ఆ విధంగా పూర్వీకుల అంధానుసరణ, ప్రాపంచిక పదవుల వ్యామోహం సత్య స్వీకారంలో వారికి అవరోధంగా నిలిచాయి. ఆ తరువాత ఫిరౌన్ చక్రవర్తి సుప్రసిద్ధ ఇంద్రజాలికులను పిలిపించాడు. ఆ తాంత్రికులకూ – మూసాకు మధ్య పోటీ జరిగింది. ఇంతకుముందు అల్ ఆరాఫ్ సూరాలో ఈ పోటీ గురించి వివరంగా చెప్పబడింది. తాహా సూరాలోనూ ఈ విషయం రానున్నది.

118. చివరకు జరిగింది కూడా అదే. ఎంతయినా సత్యం సత్యమే. అసత్యం అసత్యమే. సత్యం గెలిచే ముందు అసత్యం చేసే ఆర్భాటం జాస్తిగా ఉన్నప్పటికీ చివరకు అసత్యం మట్టి కరుస్తుంది. ఫిరౌను దర్బారుకు ఎంతో అట్టహాసంతో వచ్చిన మాంత్రికులు తాము ప్రదర్శించవలసిన విద్యనంతా ప్రదర్శించారు. కాని వారి పాచికలు పారలేదు. దైవాజ్ఞతో హజ్రత్ మూసా (అ) తన లాఠీని పడవేసిన మరుక్షణమే అది వారి ఇంద్రజాలాన్ని అమాంతం మింగేసింది.

119. మరి ఆ మాంత్రికులు కూడా తక్కువ వారు కారు. ప్రాపంచిక ప్రయోజనాల కోసం వారు ఈ క్షుద్రవిద్యలను, మంత్రతంత్రాలను నేర్చుకున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా తమ కనికట్టును ప్రదర్శించి ప్రజలను మోసగించేవారు. ఈ రోజు వారి పాపం పండింది. వారి పాచికలలో పసలేదని తేల్చివేసే రోజు వచ్చింది. లోకాన్ని పెడత్రోవపట్టించే వారి ఆటలను దేవుడు అట్టే కాలం సాగనివ్వడు.

120. అరబీలో **'కలిమాత్'** అని ఉంది. ఆయతులో దాన్ని 'ఆదేశాలు' అని తర్జుమా చేయటం జరిగింది. దీనికి 'నిదర్శనాలు' అన్న అర్థం కూడా వస్తుంది. అల్లాహ్ తన ప్రవక్తలపై అవతరింపజేసే గ్రంథాలలో ఈ నిదర్శనాలను పొందుపరుస్తూ ఉంటాడు. అలాగే 'కలిమాత్' అంటే దైవాజ్ఞతో దైవప్రవక్తల ద్వారా ఉనికిలోకి వచ్చే 'మహిమలు' కూడా కావచ్చు. లేక 'అయిపో' అనే మాట ద్వారా అల్లాహ్ జారీచేసే ఉత్తర్వు అని కూడా దాని భావం కావచ్చు.

121. ఈ ఆయతులో **'ఖౌమిహీ'** (అతని జాతికి) అనే పదం మూసా వర్గానికి చెందిన జనులకు వర్తిస్తుందా? లేక ఫిరౌను జనులకు వర్తిస్తుందా? అన్న విషయంలో వ్యాఖ్యాతల మధ్య ద్వంద్వాభిప్రాయాలున్నాయి. కొంతమంది ఇది మూసా (అలైహి)కు వర్తిస్తుందని అన్నారు. ఎందుకంటే ఆయతులో ఈ పదానికి ముందు ఆయన ప్రస్తావనే ఉంది. కాని ఇమామ్ ఇబ్నె కసీర్ తదితరుల అభిప్రాయంలో ఈ పదం ఫిరౌను జాతికి వర్తిస్తుంది. అంటే ఫిరౌను అనుయాయుల్లోని

**84** మూసా (అలైహిస్సలామ్) తన వారినుద్దేశించి, “నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్‌ను విశ్వసించేవారే అయితే, మీరు ముస్లిములే అయితే ఆయన్నే నమ్ముకోండి” అన్నాడు.[124]

وَقَالَ مُوسٰى يٰقَوْمِ إِنْ كُنْتُمْ اٰمَنْتُمْ بِاللّٰهِ فَعَلَيْهِ تَوَكَّلُوْٓا إِنْ كُنْتُمْ مُّسْلِمِيْنَ ﴿84﴾

**85** దానికి వారు, “మేము అల్లాహ్‌నే నమ్ముకున్నాము. మా ప్రభూ! మమ్మల్ని ఈ దుర్మార్గుల పరీక్షా సాధనంగా చేయకు.”

فَقَالُوْا عَلَى اللّٰهِ تَوَكَّلْنَا ۚ رَبَّنَا لَا تَجْعَلْنَا فِتْنَةً لِّلْقَوْمِ الظّٰلِمِيْنَ ﴿85﴾

**86** “నీ కృపతో మమ్మల్ని ఈ అవిశ్వాసుల చెర నుండి విడిపించు”[125] అని వేడుకున్నారు.

وَنَجِّنَا بِرَحْمَتِكَ مِنَ الْقَوْمِ الْكٰفِرِيْنَ ﴿86﴾

**87** “మీరిద్దరూ మీ వాళ్ళకోసం ఈజిప్టులో నివాస గృహాలను ఏర్పాటు చేయండి. ఆ ఇళ్లు ఖిబ్లా దిశలో ఉండేట్లు చూసుకోండి.[126] నమాజును నెలకొల్పండి. (మూసా!) నీవు విశ్వాసులకు శుభవార్తను అందజేయి” అని మేము మూసాకు, అతని సోదరునికీ వహీ పంపాము.

وَاَوْحَيْنَآ اِلٰى مُوسٰى وَاَخِيْهِ اَنْ تَبَوَّاٰ لِقَوْمِكُمَا بِمِصْرَ بُيُوْتًا وَّاجْعَلُوْا بُيُوْتَكُمْ قِبْلَةً وَّاَقِيْمُوا الصَّلٰوةَ ۗ وَبَشِّرِ الْمُؤْمِنِيْنَ ﴿87﴾

కొంతమంది మూసా సందేశాన్ని స్వీకరించారు. వీరి వాదన ప్రకారం ఇస్రాయీలు జాతివారు అప్పటికే తమను కాపాడే ఒక మార్గదర్శకుని కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తూ ఉన్నారు. మూసా (అలైహిస్సలాం) రూపంలో ఆ ప్రవక్త రాగానే వారు మారు మాట్లాడకుండా ఆయన పక్షాన నిలిచారు (ఒక్క ఖారూన్ తప్ప). అందువల్ల **“జుర్రియ్యతున్ మ్మిన్ ఖౌమిహీ”** అంటే “ఫిరౌన్ జాతికి చెందిన కొద్దిమంది” అని భావించటమే సరైనది. వారు దైవప్రవక్త మూసాను విశ్వసించారు. ఆ కొద్దిమందిలో ఫిరౌను భార్య (హజ్రత్ ఆసియా) కూడా ఉంది.

122. ఈ వాక్యాన్ని బట్టి కూడా మూసాను విశ్వసించిన ఆ కొద్దిమంది ఫిరౌను జాతికి చెందిన వారేనని రూఢీ అవుతోంది. ఎందుకంటే తమ చక్రవర్తి, తమ అధికారులు తమను ఎక్కడ వేధిస్తారోనన్న భయం వారికి ఉండేది. ఆ మాటకొస్తే ఇస్రాయీలు సంతతివారు తరతరాలుగా ఫిరౌను చక్రవర్తులకు బానిసలుగా మారి, వారికి ఊడిగం చేస్తూ, అవమానాలు భరిస్తూనే ఉన్నారు. మూసాను విశ్వసించినందుకు సరికొత్తగా వారు ఫిరౌనుకు భయపడవలసిన అగత్యం లేదు. ఎటొచ్చీ ఇబ్బందిని ఎదుర్కోవలసిన పరిస్థితి ఫిరౌను శిబిరంలో నుంచి మూసా శిబిరంలోనికి వచ్చిన వారికే ఏర్పడింది.

123. వారలా భయపడటంలో అర్థం లేకపోలేదు. ఎందుకంటే ఫిరౌన్ చక్రవర్తి దురాగతాలను, నియంతృత్వ వైఖరిని గురించి వారికి బాగా తెలుసు.

124. తరతరాలుగా ఫిరౌన్ దౌర్జన్యాలను భరిస్తూ వస్తున్న ఇస్రాయీల్ జాతివారికి మూసా ప్రవక్త వచ్చిన తర్వాత కూడా కష్టాలు తప్పలేదు. అందుకే వారు ఎల్లప్పుడూ భయాందోళనలకు లోనై ఉండేవారు. ఆ కారణంగానే వారు మూసాతో ఇలా అన్నారు: “ఓ మూసా! నీవు రాక మునుపు మేము ఫిరౌన్ జనుల చేత ఎలా వేధించబడే వారమో నీవు వచ్చిన తరువాత కూడా అలాగే వేధించబడుతూనే ఉన్నాము. పరిస్థితిలో మార్పులేదు.” దీనికి సమాధానంగా హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఇలా సముదాయించారు: నా ప్రభువు త్వరలోనే మీ శత్రువును తుదముట్టిస్తాడు. అయితే మీరు ఒక్కడైన ఆ అల్లాహ్‌నే నమ్ముకోవాలి. సహాయం కోసం ఆయన్నే అర్థించాలి. ఎట్టి పరిస్థితిలోనూ మీరు సహనం కోల్పోరాదు (అల్ ఆరాఫ్ సూరా 128, 129 ఆయతుల ఆధారంగా).

125. ఒక్కడైన అల్లాహ్‌పై భారం మోపటంతోపాటు వారు దైవసన్నిధిలో దీనాతిదీనంగా ప్రార్థించారు. నిస్సందేహంగా దుఆ విశ్వాసుల కొరకు గొప్ప ఆయుధం, ఆశ్రయం కూడా.

126. అంటే మీరు మీ నివాస గృహాలనే మస్జిదులుగా చేసుకోండి. వాటి దిశ మీ ఖిబ్లా (అయిన బైతుల్ మఖ్దిస్) వైపుకు

**88** మూసా ఇలా విన్నవించుకున్నాడు : "మా ప్రభూ! నీవు ఫిరౌనుకు, అతని సర్దారులకు ప్రపంచ జీవితంలో అందమైన సాధనసంపత్తులను, ఐశ్వర్యాన్నీ ఇచ్చావు. వారు ప్రజలను నీ మార్గం నుంచి తప్పించటానికే ఇదంతా ఇచ్చావా ప్రభూ!? మా ప్రభూ! వారి సిరిసంపదలను సర్వనాశనం చెయ్యి![127] బాధాకర మైన శిక్షను చూసే వరకూ వారు విశ్వసించకుండా ఉండేలా వారి గుండెలను కఠినమైనవిగానే ఉంచు."[128]

وَقَالَ مُوْسٰى رَبَّنَآ اِنَّكَ اٰتَيْتَ فِرْعَوْنَ وَمَلَاَهٗ زِيْنَةً وَّاَمْوَالًا فِى الْحَيٰوةِ الدُّنْيَا ۙ رَبَّنَا لِيُضِلُّوْا عَنْ سَبِيْلِكَ ۚ رَبَّنَا اطْمِسْ عَلٰٓى اَمْوَالِهِمْ وَاشْدُدْ عَلٰى قُلُوْبِهِمْ فَلَا يُؤْمِنُوْا حَتّٰى يَرَوُا الْعَذَابَ الْاَلِيْمَ ﴿88﴾

**89** "మీరిద్దరి విన్నపం ఆమోదించబడింది. కాబట్టి మీరు నిలకడగా ఉండండి.[129] జ్ఞానంలేని వారి మార్గాన్ని అనుసరించ కండి"[130] అని అల్లాహ్ సెలవిచ్చాడు.

قَالَ قَدْ اُجِيْبَتْ دَّعْوَتُكُمَا فَاسْتَقِيْمَا وَلَا تَتَّبِعٰٓنِّ سَبِيْلَ الَّذِيْنَ لَا يَعْلَمُوْنَ ﴿89﴾

ఉండేలా చూసుకోండి. దైవారాధన కోసం మీరు బహిరంగ ప్రదేశాలలో ఉన్న ఆలయాలకు వెళ్ళనవసరం లేదు. ఎందుకంటే ఆ ఆరాధనా స్థలాలలో ఫిరౌను జనులు మిమ్మల్ని వేధించే అవకాశం ఉంది.

127. ఎంతగా హితబోధచేసినా, ఎన్ని ప్రబల నిదర్శనాలను చూపినా, ఎన్ని మహిమలను ప్రదర్శించినా ఫిరౌను, అతని జనులు మంచిని గ్రహించక పోవటంతో దైవప్రవక్త మూసా(అ) వారిని శపిస్తూ ప్రార్థించారు. ఆ ప్రార్థననే దేవుడు ఇక్కడ ప్రస్తావించాడు.

128. ఒకవేళ వారు విశ్వసించినా నీ శిక్షను చవిచూసిన తరువాతే విశ్వసించేలా చూడు. అంటే వారి విశ్వాసం వారికి లాభదాయకం కాకుండా ఉండాలి.

ఒక దైవప్రవక్త తన జాతి జనులను శపిస్తాడా? ఇలా శపించటం ప్రవక్తకు శోభాయమానమేనా? అన్న ప్రశ్న చదువరులలో ఈ సందర్భంగా జనించటం సహజం. ప్రవక్తలు సదా మానవుల శ్రేయాన్ని అభిలషించే వారై ఉంటారు. వారసలు శాపనార్థాలు పెట్టరు. చివరి క్షణం వరకూ వారు తమ జాతివారి మార్గదర్శకత్వం కోసం తహతహలాడతారు. వారిని సన్మార్గాన నడిపించటానికి శాయశక్తులా కృషి చేస్తారు. కాని ప్రవక్తల మంచితనాన్ని జాతి జనులు నిర్లక్ష్యంచేసి, విశ్వసించకుండా దుర్మార్గానికి దిగినపుడు – గత్యంతరం లేని పరిస్థితిలో – ఆ వ్యవహారాన్ని దైవాధీనం చేస్తారు. అప్రయత్నంగా ప్రవక్తల నోట వెలువడే ఈ శాపపు పలుకులు కూడా దైవ ప్రణాళిక ననుసరించే ఉంటాయి. దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) విషయంలో కూడా అదే జరిగింది. 950 సంవత్సరాల పాటు సందేశ ప్రధానమైన కృషి జరిపిన పిదప ఆయన తన జాతి వారిని శపించారు – "ప్రభూ! భూమండలంపై ఒక్క అవిశ్వాసి కూడా మిగలకుండా తుదముట్టించు!" అని ఆయన (అలైహిస్సలాం) అన్నారంటే ఆయన వారిపట్ల ఎంతగా విసుగెత్తిపోయారో అర్థం చేసుకోవచ్చు. (నూహ్ – 26)

129. దీనికి ఒక అర్థం: "మీరు చేసిన శాపనార్థంపై స్థిరంగా ఉండండి. అది నెరవేరటంలో కొంత వ్యవధి పట్టవచ్చు. మీ మొరను ఆమోదించటం జరిగింది. అయితే దానికి కార్యరూపం ఎప్పుడు ఇవ్వాలి? ఎలా ఇవ్వాలి? అనేది దైవప్రణాళికలో అంతర్భాగం." ఈ విధంగా ప్రార్థించిన నలభై సంవత్సరాల తరువాత ఫిరౌను, అతని జనులు సముద్రంలో ముంచివేయబడ్డారనీ, శపించిన దానిని బట్టి తీరా మునిగిపోతున్న సమయంలో ఫిరౌను తన విశ్వాసాన్ని ప్రకటించాడనీ, కాని ఆ విశ్వాసం అతనికెలాంటి లాభం చేకూర్చలేకపోయిందని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు చెప్పారు. "మీరు నిలకడగా ఉండండి" అన్న ఆదేశంలోని మరో అర్థం ఇదికూడా కావచ్చు: ప్రజలకు మార్గదర్శకత్వం వహించే, వారిని సంస్కరించే మీ పనిని మీరు సజావుగా నిర్వర్తిస్తూ ఉండండి. ఇస్రాయీలు సంతతి వారిని ఫిరౌను ముష్కరుల చెర నుంచి విడిపించే ఉద్యమంలో ఎలాంటి లోటూ రానివ్వకండి.

**90** మేము ఇస్రాయీలు వంశీయులను సముద్రం దాటించాము.[131] వారి వెనుకే ఫిరౌను తన సైన్యాన్ని తీసుకుని దౌర్జన్యానికి, అతిక్రమణకు పాల్పడే ఉద్దేశంతో వెంబడించాడు.[132] తీరా (సముద్రంలో) మునిగిపోతున్నప్పుడు; "బనీ ఇస్రాయీల్ విశ్వసించిన దేవుణ్ణి నేనూ విశ్వసిస్తున్నాను. ఆ దేవుడు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. నేనూ ముస్లింలలోని వాడనే" అని ఫిరౌను పలికాడు.

وَجٰوَزْنَا بِبَنِيْٓ اِسْرَاۗءِيْلَ الْبَحْرَ فَاَتْبَعَهُمْ فِرْعَوْنُ
وَجُنُوْدُهٗ بَغْيًا وَّعَدْوًا ۭ حَتّٰٓي اِذَآ اَدْرَكَهُ الْغَرَقُ ۙ
قَالَ اٰمَنْتُ اَنَّهٗ لَآ اِلٰهَ اِلَّا الَّذِيْٓ اٰمَنَتْ
بِهٖ بَنُوْٓا اِسْرَاۗءِيْلَ وَاَنَا مِنَ الْمُسْلِمِيْنَ ﴿٩٠﴾

**91** ఇప్పుడా విశ్వసించేది?! ఇంతకు ముందు తలబిరుసుతనాన్ని ప్రదర్శిస్తూ, కల్లోల జనకులలో చేరి ఉండేవాడివి కదా![133]

اٰۗلْــٰٔنَ وَقَدْ عَصَيْتَ قَبْلُ وَكُنْتَ مِنَ
الْمُفْسِدِيْنَ ﴿٩١﴾

**92** కాబట్టి ఈ రోజు, నీవు నీ తర్వాతి తరాలకు గుణపాఠం అయ్యే నిమిత్తం నీ శవాన్ని మాత్రమే రక్షిస్తాము.[134] యదార్థమేమిటంటే జనులలో చాలామంది మా సూచనలను నిర్లక్ష్యం చేస్తారు (అని సమాధానం ఇవ్వబడింది).

فَالْيَوْمَ نُنَجِّيْكَ بِبَدَنِكَ لِتَكُوْنَ لِمَنْ
خَلْفَكَ اٰيَةً ۭ وَاِنَّ كَثِيْرًا مِّنَ النَّاسِ
عَنْ اٰيٰتِنَا لَغٰفِلُوْنَ ﴿٩٢﴾

130. అంటే దైవ సంప్రదాయాన్ని, ఆయన శాసనాన్ని, ఆయన ప్రణాళికను లక్ష్యపెట్టని మూర్ఖజనుల మార్గాన్ని అనుసరించకండి. దానికి బదులు మీరు మీ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఉండండి. నిగ్రహంతో పనిచేయండి. అల్లాహ్ తన ప్రణాళికననుసరించి త్వరగానో, ఆలస్యంగానో తన వాగ్దానాన్ని నెరవేరుస్తాడు. ఎందుకంటే ఆయన వాగ్దాన భంగం చేసేవాడు కాడు.

131. అంటే సముద్రాన్ని చీల్చి అందులో దారిని ఏర్పరచాము. మిమ్మల్ని ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు చేర్చాము. (అల్ బఖరా సూరా 50వ ఆయతులో ఇది వచ్చింది. మరిన్ని వివరాలు షుఅరా సూరాలో కూడా రానున్నాయి).

132. దైవాజ్ఞపై సముద్రం చీలిపోయి అందులో మార్గం ఏర్పడినప్పుడు ఫిరౌన్ కూడా తన సేనల్ని ఆ మార్గం గుండా ముందుకు నడిపించాడు. రాత్రికి రాత్రే మూసా ఇస్రాయీలు సంతతివారిని తన చెరనుంచి విడిపించుకుని పోవటాన్ని అతను జీర్ణం చేసుకోలేకపోయాడు. వాళ్లను వెంబడించి, ముట్టడించి, తిరిగి తన రాజ్యానికి తీసుకురావాలనీ, మరోసారి వాళ్లను బానిసలుగా చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. అందుకే ఇస్రాయీలు వంశస్థులను వెంబడించాడు. మరోవైపు దైవప్రవక్త మూసా (అ) తన జాతివారిని తీసుకుని సముద్రం దాటగానే దైవాజ్ఞపై సముద్రంలోని నీళ్లు కలసిపోయాయి. ఫిరౌన్ సమేతంగా అతని సైన్యమంతా సాగర గర్భంలో కలసి పోయింది.

133. ఇప్పుడు విశ్వసించి ప్రయోజనం ఏమీ లేదు. విశ్వసించవలసిన సమయంలో నువ్వు పొగరుబోతులా ప్రవర్తించావు. బలహీనులపై దౌర్జన్యానికి ఒడిగట్టావు అని అతనికి సమాధానం ఇవ్వబడింది.

134. ఫిరౌను సముద్రంలో మునిగినప్పుడు చాలామందికి ఆ విషయం నమ్మశక్యం కాలేదు. అందుకే దైవాజ్ఞపై సముద్రం అతని శవాన్ని ఒడ్డుకు విసిరేసింది. అందరూ అతని శవాన్ని తదేకంగా తిలకించారు. నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కూలిపోయినట్లు నేల నాలుగు చెరగులా చండశాసనుడిలా చెలరేగిపోయిన ఆ నిరంకుశ చక్రవర్తి అంతం ఇలా అనూహ్యంగా జరిగిపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగించి ఉండవచ్చు. చరిత్ర తిరిగే వివిధ మలుపుల్లో అదీ ఒక మేలి మలుపే. భావితరాలకు అదొక గుణపాఠం. నేటికీ ఫిరౌను శవం ఈజిప్టు మ్యూజియంలో - మమ్మీగా చేసి - భద్రపరచబడి ఉందని అనబడుతోంది. నిజము దేవుడెరుగు!

وَلَقَدْ بَوَّأْنَا بَنِيٓ إِسْرَآءِيلَ مُبَوَّأَ صِدْقٍ
وَّرَزَقْنٰهُمْ مِّنَ الطَّيِّبٰتِ ۚ فَمَا اخْتَلَفُوْا حَتّٰى
جَآءَهُمُ الْعِلْمُ ۗ إِنَّ رَبَّكَ يَقْضِيْ بَيْنَهُمْ يَوْمَ
الْقِيٰمَةِ فِيْمَا كَانُوْا فِيْهِ يَخْتَلِفُوْنَ ﴿93﴾

**93** మేము ఇస్రాయీలు సంతతి వారికి చాలా మంచి నివాస స్థలాన్ని, తినటానికి పరిశుద్ధమైన ఆహార పదార్థాలను ఇచ్చాము. వారివద్దకు (మంచీచెడుల) జ్ఞానం వచ్చిన తరువాతే వారు విభేదించుకున్నారు![135] నిశ్చయంగా నీ ప్రభువు ప్రళయదినాన వారు విభేదించుకుంటూ ఉన్న విషయాలపై వారి మధ్య తీర్పు చేస్తాడు.

فَإِنْ كُنْتَ فِيْ شَكٍّ مِّمَّآ أَنْزَلْنَآ إِلَيْكَ فَسْئَلِ
الَّذِيْنَ يَقْرَءُوْنَ الْكِتٰبَ مِنْ قَبْلِكَ ۚ لَقَدْ جَآءَكَ
الْحَقُّ مِنْ رَّبِّكَ فَلَا تَكُوْنَنَّ مِنَ الْمُمْتَرِيْنَ ﴿94﴾

**94** మరి మేము నీ వద్దకు పంపిన దానిపై ఏమాత్రం సందేహమున్నా నీకు పూర్వపు గ్రంథాన్ని పారాయణం చేస్తున్నవారిని అడిగిచూడు. నిశ్చయంగా నీ వద్దకు నీ ప్రభువు తరఫు నుంచి సత్యం (తో కూడిన గ్రంథం) వచ్చింది. కనుక నువ్వు ఎంత మాత్రం శంకించేవారిలో చేరకు.[136]

وَلَا تَكُوْنَنَّ مِنَ الَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِ
اللّٰهِ فَتَكُوْنَ مِنَ الْخٰسِرِيْنَ ﴿95﴾

**95** అల్లాహ్ ఆయతులను అసత్యాలని ధిక్కరించిన వారిలో కూడా చేరకు. నువ్వు గనక అలా చేశావంటే నష్టపోయిన వారిలో చేరిపోతావు సుమా![137]

إِنَّ الَّذِيْنَ حَقَّتْ عَلَيْهِمْ كَلِمَتُ
رَبِّكَ لَا يُؤْمِنُوْنَ ﴿96﴾

**96** ఎవరి విషయంలో నీ ప్రభువు మాట నిజమని నిరూపితమయిందో వారు ఎన్నటికీ విశ్వసించరు.

وَلَوْ جَآءَتْهُمْ كُلُّ اٰيَةٍ حَتّٰى يَرَوُا الْعَذَابَ
الْأَلِيْمَ ﴿97﴾

**97** ఒకవేళ వారి వద్దకు నిదర్శనాలన్నీ చేరినా సరే–వ్యధాభరితమైన శిక్షను చూడనంతవరకూ[138] (వారు విశ్వసించరు).

135. దైవానుగ్రహాలపై వారు కృతజ్ఞులుగా మెలగవలసింది పోయి విముఖతకు పాల్పడ్డారు. పోనీ, తెలియకపోవటం వల్ల వ్యతిరేకించారా అంటే అదీ కాదు. అన్నీ క్షుణ్ణంగా తెలిసి కూడా వ్యతిరేకతకు పాల్పడ్డారు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే అసూయా ద్వేషాలు మరియు పెద్దరికం వ్యతిరేకతకు ప్రధాన కారణాలుగా నిలుస్తాయి.

136. ఇక్కడ సామాన్య జనులనో లేక మహాప్రవక్త (స) ద్వారా ఆయన అనుచర సమాజాన్నో ఉద్దేశించి ఈ విధంగా ఉపదేశించటం జరిగింది. ఎందుకంటే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు తనపై అవతరిస్తున్న 'వహీ' గురించి ఏమాత్రం సందేహం ఉండేది కాదు. కనుక "గ్రంథ పారాయణం చేస్తున్న వారిని అడిగి నీ సందేహం తీర్చుకో" అనే మాట మహనీయ ముహమ్మద్ (సఅసం) వారిని ఉద్దేశించి చెప్పటం అనేది జరగనే జరగదు. ఈ వాక్యంలోని భావార్థం ఇది : "దివ్య ఖుర్ఆన్‌కు మునుపు వచ్చిన గ్రంథాలు (తౌరాత్, ఇంజీలు మొదలగునవి) ఎవరెవరి వద్ద ఉన్నాయో వారిని అడిగి, అందులో అంతిమ దైవప్రవక్త (స) గురించి పేర్కొనబడిన గుణగణాలను గురించి తెలుసుకోండి."

137. ఈ వాక్యం కూడా పారాయణం చేసే వారందరికీ వర్తిస్తుంది. దీనిపట్ల గల ధిక్కారవైఖరి నష్టానికీ, వినాశానికి దారి తీస్తుందని ఇందులో చెప్పబడింది.

138. వారు చెడుల చెట్లుగా, పాపాల పుట్టలుగా మారిపోయారు. పాపకార్యాలకు నిరంతరం పాల్పడుతూ ఉండటం వల్ల వారి హృదయాల నుంచి సత్యాన్ని గ్రహించే శక్తి నశించిపోయింది. ఇక ఏ హితబోధ కూడా వారి హృదయ కవాటాలను తట్టలేదు. ఏ ప్రబల నిదర్శనమూ వారి బుర్రకెక్కదు. ఎందుకంటే వారి మేధ ముకుళించుకుపోయింది.

فَلَوْلَا كَانَتْ قَرْيَةٌ اٰمَنَتْ فَنَفَعَهَآ اِيْمَانُهَآ اِلَّا قَوْمَ يُوْنُسَ ؕ لَمَّآ اٰمَنُوْا كَشَفْنَا عَنْهُمْ عَذَابَ الْخِزْيِ فِى الْحَيٰوةِ الدُّنْيَا وَمَتَّعْنٰهُمْ اِلٰى حِيْنٍ ﴿98﴾

**98** (ఈ విధంగా ఆపదకు చేరువయిన తరువాత) విశ్వాస ప్రకటన చేసే వారి విశ్వాసం – ఒక్క యూనుస్ జాతి వారికి తప్ప ఇతర బస్తీవాసులెవరికీ లాభదాయకం కాలేదు.[139] వారు (యూనుస్ జాతిప్రజలు) విశ్వసించగానే ప్రపంచ జీవితంలో అవమానకరమైన శిక్షను వారి నుంచి తొలగించాము. ఒక నిర్ణీత సమయం వరకూ జీవనలాభం పొందే అవకాశం వారికి కల్పించాము.[140]

ఒకవేళ వారి కళ్లు తెరచుకున్నా పీకల లోతు కష్టాలలో మునిగినప్పుడే తెరచుకుంటాయి. ఆ సమయంలో వారు చేసే విశ్వాస ప్రకటన వారిని గండం నుంచి గట్టెక్కించదు. "మా శిక్షను చూసిన తరువాత వారు ప్రకటించే విశ్వాసం వారికే మాత్రం ప్రయోజనం చేకూర్చదు" (అల్ మోమిన్ – 85).

139. ఒక్క యూనుస్ (అలైహిస్సలాం) జాతి జనులకు మాత్రం ఈ విషయంలో మినహాయింపు ఇవ్వబడింది. సాధారణంగా దైవశిక్ష వచ్చిపడే సమయంలో లెంపలేసుకుంటే ఆ పశ్చాత్తాపం ఆ జాతికి ఎలాంటి లాభమూ చేకూర్చదు.

దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) జాతిపై నుంచి తప్పించబడిన ఆ శిక్ష పూర్వాపరాలు ఇవి! ఎంతగా ఉపదేశించినా తన జాతివారు తన మాటను ఖాతరు చేయకపోవటంతో హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) విసుగు చెందారు. "ఫలానా రోజు మీపై దైవాగ్రహం విరుచుకుపడుతుంది" అని తన జాతివారికి చెప్పి అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. కారు మేఘాల రూపంలో ఆ విపత్తు క్రమ్ముకుంటూ ఉండగా ఆ బస్తీలోని వారంతా తమ పసిపిల్లలను, మహిళలను, పశువులను తీసుకుని ఒక బహిరంగ స్థలంలోకి వచ్చి దీనాతి దీనంగా వేడుకున్నారు. తమవల్ల జరిగిన తప్పుపై పశ్చాత్తాపం చెందారు. ఎట్టకేలకు అల్లాహ్ వారి మొరలను ఆలకించాడు. వారి అభ్యర్థనలను ఆమోదించి, ఆపదను వారిపై నుంచి తొలగించాడు.

అదే సమయంలో–మరోవైపు–హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) వచ్చేపోయే జనులను తన జాతివారి స్థితిగతుల గురించి ఆరా తీసేవారు. వారిపై నుంచి శిక్ష తప్పించబడిందనీ, దేవుడు వాళ్ళను మన్నించి మరో అవకాశం ఇచ్చాడని తెలుసుకున్నారు. కాని తనను ధిక్కరించిన తన జాతి ప్రజల్లోకి పోవటానికి ఆయన మనసు ఒప్పుకోలేదు. ఆ విధంగా ఆయన తన జాతిపై అలక వహించి మరో తీరప్రాంతానికి వెళ్ళిపోయారు. అప్పుడు అక్కడ ఏం జరిగింది? అనేది మరోచోట వస్తుంది (ఫత్హుల్ ఖదీర్).

అయితే ఈ నేపథ్యంలో ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. యూనుస్ జాతివారు ఎప్పుడు విశ్వసించారు? విశ్వాస ప్రకటన లాభదాయకం కాని ఘడియలో విశ్వసించారా? లేక ఆ ఘడియ రాక మునుపే వారు తమ తప్పుని సరిదిద్దుకుని ఈమాన్ స్వీకరించారా? అల్లాహ్ యూనుస్ జాతిని తన సంప్రదాయం నుంచి ప్రత్యేక వినాయింపుని ఇచ్చినట్లు ప్రకటించటాన్ని బట్టి మొదటి అభిప్రాయమే సరైనదనిపిస్తోంది. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.

140. ప్రాపంచిక శిక్షను తొలగించినట్లు ఇక్కడ ఖుర్ఆన్ చెప్పింది. కాని పరలోక శిక్ష గురించి వివరించలేదు. కాబట్టి పరలోక శిక్ష నుంచి వారింకా తప్పించబడలేదు అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అయితే విశ్వసించిన కారణంగా వారి ఐహిక శిక్ష తొలగించబడిందని ఖుర్ఆన్ స్పష్టం చేయటం వల్ల పరలోక శిక్ష గురించి విడమరచి చెప్పాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే పరలోక శిక్ష అనేది విశ్వాసం ఉందా? లేదా? అన్న అంశంపై ఆధారపడి ఉంటుంది. విశ్వసించిన మీదట యూనుస్ జాతి గనక తన విశ్వాసంపై స్థిరత్వం కనబరచి ఉంటే నిశ్చయంగా అది పరలోక శిక్ష నుంచి కూడా బయటపడుతుంది.

وَلَوْ شَآءَ رَبُّكَ لَاٰمَنَ مَنْ فِى الْاَرْضِ كُلُّهُمْ
جَمِيْعًا ۗ اَفَاَنْتَ تُكْرِهُ النَّاسَ حَتّٰى يَكُوْنُوْا
مُؤْمِنِيْنَ (99)

**99** నీ ప్రభువు గనక తలచుకుంటే భూమండలంలోని జను లంతా విశ్వసించి ఉండేవారే.[141] అలాంటప్పుడు (ఓ ముహమ్మద్-స!) జనులు విశ్వసించాల్సిందేనని నువ్వు వారిపై బలవంతం చేస్తావా?

وَمَا كَانَ لِنَفْسٍ اَنْ تُؤْمِنَ اِلَّا بِاِذْنِ اللّٰهِ ۗ
وَيَجْعَلُ الرِّجْسَ عَلَى الَّذِيْنَ لَا يَعْقِلُوْنَ (100)

**100** వాస్తవానికి దైవాజ్ఞ కానంతవరకూ ఎవడూ విశ్వసించడు. బుద్ధిహీనులపై అల్లాహ్ అశుద్ధతను వేసేస్తాడు.[142]

قُلِ انْظُرُوْا مَاذَا فِى السَّمٰوٰتِ وَالْاَرْضِ ۗ وَمَا
تُغْنِى الْاٰيٰتُ وَالنُّذُرُ عَنْ قَوْمٍ لَّا يُؤْمِنُوْنَ (101)

**101** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఆకాశాలలో, భూమిలో ఏ వస్తువులయితే ఉన్నాయో వాటిని కాస్త (నిశితదృష్టితో) చూడండి!" విశ్వసించని వారికి సూచనలుగానీ, హెచ్చరికలుగానీ లాభ దాయకం కాజాలవు.

فَهَلْ يَنْتَظِرُوْنَ اِلَّا مِثْلَ اَيَّامِ الَّذِيْنَ خَلَوْا
مِنْ قَبْلِهِمْ ۗ قُلْ فَانْتَظِرُوْٓا اِنِّىْ مَعَكُمْ مِّنَ
الْمُنْتَظِرِيْنَ (102)

**102** బహుశా వీళ్లు తమకు పూర్వం గతించిన వారికి ఎదురయిన సంఘటనల లాంటి వాటి కోసం ఎదురుచూస్తున్నారేమో! "సరే. అలా అయితే మీరూ నిరీక్షించండి. మీతో పాటే నేనూ నిరీక్షిస్తాను"[143] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

ثُمَّ نُنَجِّىْ رُسُلَنَا وَالَّذِيْنَ اٰمَنُوْا كَذٰلِكَ ۚ
حَقًّا عَلَيْنَا نُنْجِ الْمُؤْمِنِيْنَ (103)

**103** మరి మేము మా ప్రవక్తలను, విశ్వసించిన వారిని కాపాడే వారము. అదే విధంగా విశ్వసించిన వారిని కాపాడటం మా విధి.

قُلْ يٰٓاَيُّهَا النَّاسُ اِنْ كُنْتُمْ فِىْ شَكٍّ مِّنْ دِيْنِىْ
فَلَآ اَعْبُدُ الَّذِيْنَ تَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ وَلٰكِنْ

**104** (ప్రవక్తా!) వారికి చెప్పు:[144] "ప్రజలారా! నా ధర్మం పట్ల మీకు సందేహం ఉంటే (వినండి), అల్లాహ్‌ను వదలిపెట్టి మీరు పూజించే వారిని నేను పూజించను.[145] అయితే మీ ప్రాణాలను

141. కాని ఇది దైవేచ్ఛ కానేకాదు. ఒకవేళ అలా చేసి ఉంటే అది ఆయన ప్రణాళికకు విరుద్ధం అవుతుంది. అందలి పరమార్థాన్ని దేవుడే ఎరుగు. భూలోకంలోని జనులంతా ముస్లిములుగా మారాలన్న కాంక్ష అంతిమ దైవప్రవక్త (సఅసం) వారిలో తీవ్రంగా ఉండేది. కాని అల్లాహ్ మాత్రం అలా కోరుకోవటం లేదు. అందుకే – విశ్వసించమని నువ్వు జనులను ఎలా బలవంతం చెయ్యగలవు? అని ప్రశ్నించటం జరిగింది. బలవంతంగా వారి మెడలు వంచే శక్తి నీలో లేదు. అలాగే దానికి సంబంధించిన బాధ్యత కూడా నీపై లేదు అని అల్లాహ్ తన ప్రవక్త (సఅసం) కు స్పష్టం చేశాడు.

142. **'అశుద్ధం'** అంటే భావం అవిశ్వాసం, శిక్ష. అంటే దైవ వచనాలపై యోచన చెయ్యని వారు అవిశ్వాసంలోనే మగ్గుతూ ఉంటారు. కడకు వారు దైవశిక్షకు పాత్రులవుతారు.

143. ఏ నిదర్శనం, ఏ హెచ్చరికా వీరిమీద ప్రభావం చూపదు. కనుక వీరు విశ్వసించరు. అలాంటి వీరు వెనుకటి సమాజాలపై వచ్చి పడిన విపత్తులు తమపై కూడా రావాలని కోరుకుంటున్నారా? ఒకవేళ అదే వారి మనోగతం అయివుంటే దానికోసం వారిని ఎదురు చూడమనండి. ఆపద గనక వచ్చి పడిందంటే అవిధేయులను కాపాడేవాడెవడూ ఉండడు మరి!

أَعْبُدُ اللَّهَ الَّذِي يَتَوَفَّاكُمْ ۖ وَأُمِرْتُ أَنْ أَكُونَ مِنَ الْمُؤْمِنِينَ ﴿١٠٤﴾

స్వాధీనం చేసుకునే అల్లాహ్‌ను నేను ఆరాధిస్తున్నాను.[146] విశ్వసించే వారిలో ఉండాలని నాకు ఆదేశించబడింది.”

وَأَنْ أَقِمْ وَجْهَكَ لِلدِّينِ حَنِيفًا وَلَا تَكُونَنَّ مِنَ الْمُشْرِكِينَ ﴿١٠٥﴾

**105** “పూర్తి ఏకాగ్రతతో (ఈ) ధర్మం వైపుకు అభిముఖం కావాలనీ,[147] షిర్క్ చేసేవారిలో చేరిపోరాద”ని కూడా నాకు చెప్పబడింది.

وَلَا تَدْعُ مِنْ دُونِ اللَّهِ مَا لَا يَنْفَعُكَ وَلَا يَضُرُّكَ ۖ فَإِنْ فَعَلْتَ فَإِنَّكَ إِذًا مِنَ الظَّالِمِينَ ﴿١٠٦﴾

**106** “అల్లాహ్‌ను వదలిపెట్టి నీకు ఎలాంటి లాభాన్నిగానీ, కీడునుగానీ కలిగించలేని దానిని నువ్వు ఆరాధించకు. ఒకవేళ అలాంటి పని చేశావంటే నువ్వు కూడా దుర్మార్గుల్లో ఒకడివవుతావు”[148] (అని హెచ్చరించబడింది).

وَإِنْ يَمْسَسْكَ اللَّهُ بِضُرٍّ فَلَا كَاشِفَ لَهُ إِلَّا هُوَ ۖ وَإِنْ يُرِدْكَ بِخَيْرٍ فَلَا رَادَّ لِفَضْلِهِ ۚ يُصِيبُ بِهِ مَنْ يَشَاءُ مِنْ عِبَادِهِ ۚ وَهُوَ الْغَفُورُ الرَّحِيمُ ﴿١٠٧﴾

**107** ఒకవేళ అల్లాహ్ నీకేదైనా బాధకు గురిచేస్తే ఆయన తప్ప మరొకరెవరూ దానిని దూరం చేయలేడు. ఒకవేళ ఆయన నీకు ఏదైనా మేలు చెయ్యగోరితే ఆయన కృపను అడ్డుకునేవాడు కూడా ఎవడూ లేడు.[149] ఆయన తన కృపను తన దాసులలో తాను కోరిన వారిపై కురిపిస్తాడు. ఆయన అమితంగా క్షమించే వాడు, అపారంగా కనికరించేవాడు.

144. నీ పద్ధతి – బహుదైవారాధకుల పద్ధతి వేర్వేరని నీవు ప్రజలకు సూటిగా చెప్పేయి. ఏక దైవారాధన విషయంలో ఎలాంటి రాజీకి, సడలింపులకు తావు లేదు అన్న సంగతి అందరికీ స్పష్టంగా తెలిసిపోవాలి అని దేవుడు ఈ వాక్యం ద్వారా తన ప్రవక్తకు చెబుతున్నాడు.

145. నేను అవలంబించే ధర్మం సత్యధర్మం. ఏకదైవారాధన గురించి నొక్కిచెప్పే ధర్మం ఇది. ఒకవేళ ఈ ధర్మం పట్ల మీకు ఇప్పటికీ సంశయాలు, అనుమానాలుంటే అది మీ తలరాత. నేను మాత్రం నా మతధర్మాన్నే అవలంబిస్తాను. మీరు పూజించే చిల్లర దేముళ్ళను నేను ఎట్టి పరిస్థితిలోనూ పూజించలేను అన్నది ముహమ్మద్(సఅసం) మాటల మర్మం.

146. ఎందుకంటే జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన తాను కోరిన సమయంలో వాటిని ఇస్తాడు, తీసుకుంటాడు.

147. **‘హనీఫ్’** అంటే ఒకే వైపు తిరిగేవాడు అని అర్థం. అంటే అన్ని మతాలను, కాల్పనిక వ్యవస్థలను, దురాచారాలను వదలి మనిషి సత్యధర్మమైన ఇస్లాంపైనే మనసును లగ్నం చేయటం, చిల్లర దేవుళ్ల వైపు నుంచి ముఖం తిప్పుకొని అల్లాహ్ వైపు తిరగటం అని భావం.

148. అల్లాహ్‌ను కాదని లాభనష్టాలను కలిగించలేని వ్యక్తులను, శక్తులను, వస్తువులను పూజిస్తే అది జులుం (అన్యాయం, అధర్మం) అనిపించుకుంటుంది. ‘జులుం’ అంటే ఏమిటీ? ఒక వస్తువును దాని నిజస్థానం నుంచి తొలగించి, ఇమడని చోట పెట్టడం. కాబట్టి ఆరాధన (దాస్యం) అనేది అల్లాహ్ హక్కు. అందరినీ సృష్టించి, అందరికీ జీవన సామగ్రిని సమకూరుస్తున్న శక్తిమంతుని వదలిపెట్టి వేరొకరిని ఆరాధించటం అంటే అది అపచారం, అన్యాయం అవుతుంది. అందుకే ‘షిర్క్’ను చాలా పెద్ద అన్యాయంగా అభివర్ణించటం జరిగింది. ఈ ఆయతులో కూడా మహాప్రవక్త (సఅసం)ను ఉద్దేశించి ఈ మాటలనబడినా అవి సమస్త మానవులను దృష్టిలో పెట్టుకుని చెప్పబడినవే.

149. **‘మేలు’** అనే దానిని అల్లాహ్ ఇక్కడ తన కటాక్షంగా, అనుగ్రహంగా, కృపగా పేర్కొనటంలోని మర్మం ఏమిటంటే

**108** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: “ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుంచి సత్యం వచ్చేసింది.[150] కాబట్టి ఇప్పుడు ఎవడైనా సన్మార్గానికి వస్తే అతడు తన (మంచి) కోసమే సన్మార్గానికి వస్తాడు.[151] మరెవడైనా అపమార్గానికి లోనైతే ఆ అపమార్గం అతనికే హానికరం[152] అవుతుంది. నేను మీపై నియమించబడిన కావలివాణ్ణి మాత్రం కాను.”[153]

قُلْ يَٰٓأَيُّهَا ٱلنَّاسُ قَدْ جَآءَكُمُ ٱلْحَقُّ مِن رَّبِّكُمْ
فَمَنِ ٱهْتَدَىٰ فَإِنَّمَا يَهْتَدِى لِنَفْسِهِۦ ۖ وَمَن ضَلَّ
فَإِنَّمَا يَضِلُّ عَلَيْهَا ۖ وَمَآ أَنَا۠ عَلَيْكُم بِوَكِيلٍ ﴿١٠٨﴾

**109** (ఓ ప్రవక్తా!) నువ్వు నీ వద్దకు పంపబడే వహీని అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తీర్పు చేసేవరకూ ఓపిక పట్టు.[154] ఆయన తీర్పుచేసే వారిలోకెల్లా శ్రేష్ఠుడు.[155]

وَٱتَّبِعْ مَا يُوحَىٰٓ إِلَيْكَ وَٱصْبِرْ حَتَّىٰ يَحْكُمَ
ٱللَّهُ ۚ وَهُوَ خَيْرُ ٱلْحَٰكِمِينَ ﴿١٠٩﴾

---

దాసులు తమ ఆచరణల ద్వారా ఆ ‘మేలు’ పొందటానికి యోగ్యులు కానప్పటికీ ఆయన తన కృపతో వారికి దానిని ప్రసాదిస్తాడు.

150. **‘సత్యం’** అంటే దివ్య ఖుర్‌ఆన్ అనీ, ఇస్లాం ధర్మం అని భావం. అందులో ఒకే దేవుణ్ణి ఆరాధించటం, ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని విశ్వసించటం చాలా అవసరం.

151. ప్రళయదినాన అల్లాహ్ శిక్ష నుంచి బయటపడినవానికే ఈ ప్రయోజనం కలుగుతుంది.

152. అంటే అతను నడచిన పెడదారి, తీర్పుదినాన దైవాగ్రహానికి కారణభూతమై అతన్ని నరకాగ్నికి ఆహుతి చేస్తుంది. అంతేగాని అల్లాహ్‌కు కలిగే నష్టం ఏమీ ఉండదు. ఎవరయినా సన్మార్గాన్ని అవలంబిస్తే అతని ఈ అవలంబన వల్ల అల్లాహ్ శక్తిలో జరిగే వృద్ధి ఏమీ ఉండదు. అలాగే ఎవరయినా అపమార్గాన నడిస్తే దానివల్ల దైవానికి కలిగే కీడు కూడా ఏమీ ఉండదు. మొత్తానికి విశ్వాసాన్ని, సన్మార్గాన్ని అవలంబించమనే ఈ ఉపదేశాలు, అపమార్గానికి దూరంగా ఉండమనే ఈ హెచ్చరికలు మానవుల శ్రేయస్సు కోసమేగాని ఇందులో దేవుని స్వార్థం ఏమీ లేదు.

153. అనుక్షణం మిమ్మల్ని కనిపెట్టుకుని ఉండే బాధ్యత నాపై లేదు. ఎలాగయినా సరే మిమ్మల్ని ముస్లింలుగా మార్చివేయాలన్న లక్ష్యం కూడా నాకు ఇవ్వబడలేదు. నేను మీకు దైవసందేశాన్ని అందజేసేవాణ్ణి మాత్రమే. సన్మార్గగాములకు స్వర్గలోక శుభవార్తను వినిపించటం, దుర్మార్గులను నరకాగ్ని గురించి హెచ్చరించటం నా కర్తవ్యం. ఈ సందేశాన్ని విని, దాన్ని నమ్మి, తదనుగుణంగా నడుచుకుంటే సరి. కాదు, కూడదు అనంటే నేనేం చేయగలను? బలవంతంగా ఒప్పించటం నా బాధ్యత కాదు.

154. **‘వహీ’** ద్వారా నీకు పంపబడిన దానిని నువ్వు ఖచ్చితంగా అవలంబించు. చేయమన్న వాటిని చేస్తూ ఉండు. వారించిన వాటికి దూరంగా ఉండు. ఏ విషయంలోనూ లోటు రానివ్వకు. ఈ మార్గానుసరణలో ఎదురయ్యే కష్టనష్టాలను, వ్యతిరేకతలను సహనంతో, స్థయిర్యంతో ఎదుర్కో అని అల్లాహ్ తన సందేశహరునికి ఉపదేశిస్తున్నాడు.

155. ఎందుకంటే ఆయన పరిజ్ఞానం పరిపూర్ణమైనది. ఆయన శక్తి అసాధారణమైనది. ఆయన అధికారం అపరిమితమైనది. ఆయన కారుణ్యం కూడా విస్తృతమైనది. అందువల్ల ఆయన తీర్పును మించిన అత్యుత్తమ తీర్పు మరొకటి ఉండదు.

11 వ సూరా

# హూద్

## దైవప్రవక్త హూద్

అవతరణ
మక్కాలో

ఆయతులు
123

### పరిచయం

ఈ సూరా దివ్య ఖుర్‌ఆన్‌లోని రెండు ముఖ్యమైన విషయాలను నొక్కి చెప్పింది. దివ్య ఖుర్‌ఆన్ నిర్దిష్టమైనదనీ, నిర్ణయాత్మక మైనదనీ, వివరణాత్మకమైనదనీ స్పష్టం చేసింది. దివ్య ఖుర్‌ఆన్ బోధనల వివరణ స్వయంగా దివ్యఖుర్‌ఆన్ అందిస్తుందని కూడా ఈ సూరా విస్పష్టం చేసింది. ప్రాచీన కాలానికి చెందిన ప్రవక్త హూద్ (అస) పేరును ఈ సూరాకు పెట్టడం జరిగింది. ఈ సూరాలో ఆయనకు సంబంధించిన గాధను తెలుపడం జరిగింది. దక్షిణ అరేబియాలో ఆ కాలంలో నివసించిన ఆద్ జాతి వద్దకు ఆయన ప్రవక్తగా పంపబడ్డారు. ఈ సూరా ఏక దైవారాధన (తౌహీద్) గురించి నొక్కిచెబుతూ, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గురించి వివరిస్తూ ప్రారంభమయ్యింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) హెచ్చరిక చేసేవారనీ, శుభవార్త అందించేవారని ఈ సూరా విశదీకరించింది. ఈ సూరాలో అనేకమంది ప్రాచీన కాలానికి చెందిన ప్రవక్తల ప్రస్తావనలు వచ్చాయి. ఈ ప్రవక్తలు అందరూ ఏక దైవారాధనను, మరణించినవారు మళ్ళీ లేపబడతారని బోధించారు. ఈ బోధనలు ప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధనల వంటివే. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఈ సూరా అవతరించింది. అందువల్లనే ఈ సూరాలో గత కాలాలకు చెందిన ప్రవక్తల గాధలను వివరించడం జరిగింది. ఈ సూరా అవతరించిన కాలంలోనే ముహమ్మద్ (సఅసం) సతీమణి హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్‌హా) మరణించారు. ప్రవక్త పినతండ్రి అబూ తాలిబ్ కూడా మరణించారు. అబూ తాలిబ్ చివరి వరకు అవిశ్వాసిగానే ఉన్నప్పటికీ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు జీవితాంతం వెన్నుదన్నుగా నిలిచారు. ఈ క్లిష్ట సమయంలో అవిశ్వాసుల అణచివేతలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, అపహాస్యాలు అధికమయ్యాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను, ప్రవక్త సహచరులను అవిశ్వాసులు బాధించడం తీవ్రమయ్యింది. ఈ నేపథ్యంలో ప్రవక్త (సఅసం)కు ఊరట ఇవ్వడానికి, ఆయన స్థయిర్యాన్ని పెంచడానికి, విశ్వాసాన్ని దృఢతరం చేయడానికి ఆయా ప్రవక్తల గురించి తెలుపడం జరిగింది.

మనిషి గురించి, అల్లాహ్ శక్తిసామర్థ్యాల గురించి ఈ సూరాలో ప్రస్తావనలు ఉన్నాయి. మనిషికి దేవుని కారుణ్యం దూరమైతే అతను నిరాశపడిపోతాడు. అల్లాహ్ తనకు గతంలో చేసిన మేళ్ళకు కృతజ్ఞతలు తెలుపడం మరిచిపోతాడు. కాని, తనకు ఏ కష్టం లేనప్పుడు గర్వంతో విర్రవీగుతాడు. ఈ సందర్భంగా అల్లాహ్ అన్ని విధాల శక్తి సామర్థ్యాలు కలిగిన వాడన్న విషయాన్ని స్పష్టంగా వివరించడం జరిగింది. ప్రతి ప్రాణికి పూర్తి పోషణను ఇస్తుంది అల్లాహ్ మాత్రమేననీ, ఆయనే భూమ్యాకాశాలను సృష్టించాడనీ, వృద్ధ మహిళకు కూడా గర్భం దాల్చే వరం ఆయన ప్రసాదించగలడని ఈ సూరా వివరించింది.

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 25-99 | 14, 21, 25, 50, 81, 83 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవప్రవక్త సాలిహ్' 'దైవ ప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' 'దైవప్రవక్త మూసా' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారా వాహికంగా ఇక్కడ దొరుకుతాయి. |

## హూద్[1] సూరా

## سُوْرَةُ هُوْدٍ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** అలిఫ్ – లామ్ – రా. ఇది ఒక గ్రంథం. దీని వాక్యాలు నిర్దుష్ట మైనవిగా చేయబడ్డాయి.[2] అవి వివేచనాపరుడు,[3] సర్వం ఎరిగిన వాని తరఫు నుండి స్పష్టంగా విశదీకరించబడ్డాయి.[4]

الٓرٰ ۟ كِتٰبٌ اُحْكِمَتْ اٰيٰتُهٗ ثُمَّ فُصِّلَتْ مِنْ لَّدُنْ حَكِيْمٍ خَبِيْرٍ ①

**2** అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ ఆరాధించరాదు (అని వాటిలో చెప్పబడింది). నేను ఆయన తరఫున మిమ్మల్ని భయపెట్టేవాడిని, మీకు శుభవార్తను వినిపించేవాడిని.

اَلَّا تَعْبُدُوْۤا اِلَّا اللّٰهَ ؕ اِنَّنِيْ لَكُمْ مِّنْهُ نَذِيْرٌ وَّبَشِيْرٌ ②

**3** ఇంకా మీరు మీ తప్పుల మన్నింపు కోసం మీ ప్రభువును వేడుకోండి. తర్వాత (పశ్చాత్తాపంతో) ఆయన వైపుకే మరలండి. ఒక నిర్ధారిత కాలం వరకూ ఆయన మీకు మంచి (జీవన) సామగ్రిని[5] సమకూరుస్తాడు. ఎక్కువగా ఆచరణ చేసే ప్రతి

وَّاَنِ اسْتَغْفِرُوْا رَبَّكُمْ ثُمَّ تُوْبُوْۤا اِلَيْهِ يُمَتِّعْكُمْ مَّتَاعًا حَسَنًا اِلٰۤى اَجَلٍ مُّسَمًّى وَّيُؤْتِ كُلَّ ذِيْ

1. ఈ సూరాలో కూడా దైవ వచనాలను, దైవ సందేశహరులను ధిక్కరించి, దైవాగ్రహానికి గురైన అనేక జాతుల ప్రస్తావన వచ్చింది. అవి చరిత్రపుటల్లో దోషపూరితమైన వాక్యాల్లాగా చెరిపివేయబడ్డాయి. లేదా అవి గుణపాఠం గరిపే నిమిత్తం చరిత్రపుటల్లో మిగిలి ఉన్నాయి. అంతిమ దైవప్రవక్త (సఅసం) జీవితంపై తీవ్ర ప్రభావం చూపిన సూరాలలో ఇదొకటి. హదీసు ప్రకారం హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్ (రజి) దైవప్రవక్త (స) నుద్దేశించి, "మీలో వృద్ధాప్యపు ఛాయలు తొంగిచూస్తున్నాయేమిటీ?" అని అడిగినప్పుడు, "హూద్ సూరా, వాఖియ సూరా, 'అమ్మ యతసాఅలూన్' (నబా), 'ఇజష్షమ్సు కువ్విరత్' (అత్తక్‌వీర్) సూరాలు నన్ను (తొందరగా) ముసలివాణ్ణి చేసేశాయి" అని ఆయన(స) చెప్పారు (తిర్మిజీ–నెంబరు: 3297; సహీహ్ తిర్మిజీ–లిల్ అల్‌బానీ–3: 113).
2. పదాల కూర్పు రీత్యా, భావార్థం దృష్ట్యా ఇవి చాలా పటిష్టమైనవి. క్రమబద్ధమైనవి. వాటిమధ్య ఎక్కడా ఎలాంటి అవరోధంగానీ, వైరుధ్యం గానీ కానరాదు.
3. ఆయన వివేచనాపరుడు. కనుక ఆయన అవతరింపజేసిన వాక్యాలలో కూడా విజ్ఞతా వివేచనలు తొణికిసలాడుతూ ఉన్నాయి. అందలి ప్రతి మాటా, ప్రతి ఆదేశం యుక్తితో కూడుకున్నది. పరమార్థాలతో నిండినది. అదీగాక ఆయన అన్నీ తెలిసినవాడు. కర్మల పర్యవసానం, వ్యవహారాల అంతిమ పరిణామం ఏ విధంగా ఉంటుందో ఆయనకు బాగా తెలుసు. కాబట్టి ఆయన ఉపదేశాలను అవలంబించటం ద్వారానే మనిషి దుష్పరిణామం నుంచి తనను కాపాడుకోగలుగుతాడు.
4. ఇందలి ఆదేశాలు, శాసనాలు, జాతుల గాథలు, విశ్వాసాలు, సామాజిక నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి లాంటి అంశాలన్నీ క్షుణ్ణంగా విడమరచి చెప్పబడ్డాయి. ఒక విషయాన్ని ఇంత స్పష్టంగా, సూటిగా, హృదయానికి హత్తుకునేలా ఖుర్‌ఆన్ తప్ప మరే గ్రంథమూ వివరించలేదు.
5. సాధారణంగా దివ్య ఖుర్‌ఆన్ ప్రాపంచిక సామగ్రిని **"మోసపుచ్చే సామగ్రి"**గా అభివర్ణిస్తూ ఉంటుంది. కాని ఈ ఆయతులో జీవన సామగ్రిని "మంచి సామగ్రి"గా పేర్కొంది. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే పరలోకాన్ని విస్మరించి ప్రాపంచిక సుఖసౌఖ్యాలే సర్వస్వం అని తలపోసే వారిపట్ల అది మోసపుచ్చే సామగ్రిగా పరిణమిస్తుంది. పరలోకంలో

فَضْلٍ فَضْلَهُ ۖ وَإِن تَوَلَّوْا فَإِنِّي أَخَافُ عَلَيْكُمْ عَذَابَ يَوْمٍ كَبِيرٍ ③

ఒక్కరికీ ఎక్కువ పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఒకవేళ మీరు గనక విముఖత ప్రదర్శించిన పక్షంలో ఒకానొక మహా దినాన[6] మిమ్మల్ని చుట్టుముట్టే శిక్ష గురించి నేను భయపడుతున్నాను.

إِلَى اللَّهِ مَرْجِعُكُمْ ۖ وَهُوَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ④

**4** మీరు మరలిపోవలసింది అల్లాహ్ వద్దకే. ఆయన అన్నింటిపై అధికారం కలవాడు.

أَلَا إِنَّهُمْ يَثْنُونَ صُدُورَهُمْ لِيَسْتَخْفُوا مِنْهُ ۚ أَلَا حِينَ يَسْتَغْشُونَ ثِيَابَهُمْ يَعْلَمُ مَا يُسِرُّونَ وَمَا يُعْلِنُونَ ۚ إِنَّهُ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ⑤

**5** వారు తమ (గోప్య) విషయాలను (అల్లాహ్ నుండి) రహస్యంగా పెట్టడానికి తమ రొమ్ములను ముడుచుకుంటున్నారు.[7] వినండి! వారు బట్టలతో తమను తాము కప్పుకున్నప్పుడు కూడా వారు దాచేదీ, బయల్పరచేదీ – అంతా ఆయన తెలుసుకుంటాడు. నిశ్చయంగా ఆయన గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు.

وَمَا مِن دَابَّةٍ فِي الْأَرْضِ إِلَّا عَلَى اللَّهِ رِزْقُهَا وَيَعْلَمُ مُسْتَقَرَّهَا وَمُسْتَوْدَعَهَا ۚ كُلٌّ فِي كِتَابٍ مُّبِينٍ ⑥

**6** భూమిలో సంచరించే ప్రాణులన్నింటికీ ఆహారాన్ని సమకూర్చే బాధ్యత అల్లాహ్‌దే.[8] అవి ఆగి ఉండే, అప్పగించబడే స్థానాలు[9] కూడా ఆయనకు తెలుసు. అవన్నీ స్పష్టమైన గ్రంథంలో నమోదై ఉన్నాయి.

---

వారు ఎటూ పరాభవం పాలు కాకతప్పదు. అయితే పరలోక చింతన కలిగి ప్రపంచ జీవితంలో దేవుడు విధించిన పరిమితులకు లోబడి మసలుకునే వారి పాలిట ఆ సామగ్రి "మంచి సామగ్రి"గా ఉపయోగపడుతుంది. ఎందుకంటే వారు దైవానుగ్రహాలను దుర్వినియోగపరచలేదు.

6. **'మహాదినం'** (యౌమున్ కబీర్) అంటే ప్రళయదినం అని అర్థం.

7. ఈ వాక్యం ఏ నేపథ్యంలో అవతరించింది? అన్న ప్రశ్నపై ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. కనుక దీని భావార్థంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ సూరాకు వ్యాఖ్యానంగా సహీహ్ బుఖారీలో వివరించబడిన అవతరణా నేపథ్యం ప్రకారం; తమలోని మితిమీరిన లజ్జాప్రీడల మూలంగా కొంతమంది ముస్లింలు కాలకృత్యాలు తీర్చుకునే సమయంలోనూ, భార్యతో సంభోగించే సమయంలోనూ నగ్నం కావటానికి ఇష్టపడేవారు కాదు. అనుక్షణం అల్లాహ్ తమను గమనిస్తున్నాడన్న భావనతో వారు ఆ సందర్భాలలో తమ మర్మస్థానాన్ని మరుగుపరచడానికి మరీ జాగ్రత్తలకు పోయి తమ రొమ్ములను ముడుచుకుని, చాటుగా ఉంచుకునే ప్రయత్నం చేసేవారు. మలమూత్ర విసర్జన సమయంలో మరీ ఒదిగి కూర్చునేవారు. అలాగే రాత్రి చీకటిలో పడకలపై తమ భార్యతో రతిక్రీడలో పాల్గొనే సమయంలో కూడా మరీ సిగ్గుతో కుంచించుకుపోయేవారు. తమను తాము వస్త్రంలో చుట్టుకునేవారు. అయితే సర్వకాల సర్వావస్థల్లో అల్లాహ్ వారిని గమనిస్తూ ఉన్నాడనీ, వారి గోప్య విషయాలు, బహిర్గత విషయాలు – అన్నీ ఆయనకు తెలుసుననీ ఈ వాక్యంలో చెప్పబడింది. సిగ్గు, వ్రీడ మనిషికి ఆభరణం వంటివే. కాని ఈ విషయాల్లో మాత్రం మరీ అంత బిడియం పనికిరాదు. ఏ శక్తిమంతుని కోసం వారలా చేస్తున్నారో ఆయన అనుక్షణం వారిని గమనిస్తూనే ఉన్నాడు. మరలాంటప్పుడు వారు అంతగా ముడుచుకుని ప్రయోజనం ఏమిటి? కాబట్టి ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తిస్తే చాలు.

8. నేలపై సంచరించే ప్రాణులు – వారు మానవులైనా, జిన్నులైనా, పక్షులైనా, పశువులైనా, భూభాగంలో ఉండేవైనా,

7 మీలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం[10] ఆయన ఆరు రోజులలో ఆకాశాలనూ, భూమినీ సృష్టించాడు. (అంతకు ముందు) ఆయన సింహాసనం (అర్ష్) నీటిపై ఉండేది.[11] "మీరు చనిపోయిన తరువాత మళ్లీ లేపబడతారు" అని నువ్వు వారికి చెప్పావంటే, "ఇది పచ్చి ఇంద్రజాలం తప్ప మరొకటి కాదు" అని అవిశ్వాసులు తప్పకుండా సమాధానమిస్తారు.

وَهُوَ الَّذِي خَلَقَ السَّمٰوٰتِ وَالْأَرْضَ فِي سِتَّةِ أَيَّامٍ وَكَانَ عَرْشُهُ عَلَى الْمَاءِ لِيَبْلُوَكُمْ أَيُّكُمْ أَحْسَنُ عَمَلًا ۗ وَلَئِن قُلْتَ إِنَّكُم مَّبْعُوثُونَ مِن بَعْدِ الْمَوْتِ لَيَقُولَنَّ الَّذِينَ كَفَرُوا إِنْ هٰذَا إِلَّا سِحْرٌ مُّبِينٌ ⑦

8 ఒకవేళ మేము వారికి పడే శిక్షను కొంత వ్యవధి వరకు వాయిదా వేస్తే, "ఆ శిక్ష పడకుండా అడ్డుకుంటున్న వస్తువు ఏది?" అంటారు. వినండి! అది వచ్చిపడిన రోజు వారి నుంచి అది తొలగిపోవటం అనేది జరగదు. దేని గురించి వారు పరిహాసిం చేవారో అదే వారిని చుట్టుముడుతుంది.[12]

وَلَئِنْ أَخَّرْنَا عَنْهُمُ الْعَذَابَ إِلَىٰ أُمَّةٍ مَّعْدُودَةٍ لَّيَقُولُنَّ مَا يَحْبِسُهُ ۗ أَلَا يَوْمَ يَأْتِيهِمْ لَيْسَ مَصْرُوفًا عَنْهُمْ وَحَاقَ بِهِم مَّا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ⑧

నీటిలో ఉండేవైనా–అన్నింటికీ ఆహారాన్ని ప్రసాదించేవాడు అల్లాహ్‌యే. ఆయా ప్రాణులకు వాటి అవసరాలకనుగుణంగా ఆయన ఆహార మొసగుతాడు.

9. **ఆగి ఉండే స్థానం** (ముస్తఖర్రున్), **అప్పగించబడే స్థానం** (ముస్తౌదవున్) గురించి పండితుల మధ్య అభిప్రాయభేదం ఉంది. పగలల్లా నేలపై సంచరించి రాత్రి ఆగి ఉండేస్థానమే నివాస స్థానమని, శాశ్వతంగా స్థిరపడే స్థానమే అప్పగించబడే చోటని కొందరు అభిప్రాయపడ్డారు. కాగా; మాతృగర్భం ఆగిఉండే చోటని, తండ్రి వెన్ను ద్వారా వెలువడేది అప్పగించబడే స్థానమని మరికొందరు వ్యాఖ్యానించారు. ప్రపంచ జీవితంలో ప్రాణులు స్థిరనివాసం ఏర్పరచుకున్న స్థలాలు వాటి నివాస స్థానాలనీ, మరణానంతరం వారు ఖననం చేయబడే సమాధులు అప్పగింత స్థానాలని ఇంకొంత మంది సూత్రీకరించారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

అయితే ఇమామ్ షౌకానీ ఇలా అంటున్నారు: "మాతృగర్భం నివాస స్థానం. మరణానంతరం చేర్చబడే చోటు అప్పగించబడే స్థానం." ఇమామ్ హాకిమ్ గారి ఒక ఉల్లేఖనం ఆధారంగా ఈ అభిప్రాయమే పరిగణనలోకి తీసుకోదగ్గది. మొత్తానికి ఈ వాక్యాన్ని ఏ భావార్థంలో తీసుకున్నా ఒకటి మాత్రం సత్యం – అదేమంటే వీటన్నింటి జ్ఞానం అల్లాహ్‌కు ఉంది. అందుకే ఆయన అందరికీ ఉపాధిని ఇస్తున్నాడు. అందరినీ పోషించే తన బాధ్యతను ఆయన అత్యుత్తమంగా నిర్వర్తిస్తున్నాడు.

10. అంటే భూమ్యాకాశాల నిర్మాణం వెనుక ఓ ఉద్దేశం ఉంది. ఓ లక్ష్యం ఉంది. మానవుల్లో (మరియు జిన్నుల్లో) ఎవరు సదాచరణ చేసి దైవప్రసన్నతను చూరగొంటారో చూసేందుకు దేవుడు ఈ నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టాడు.

**గమనిక:** 'ఎవరు ఎక్కువ ఆచరిస్తారో' అని ఇక్కడ అనబడలేదు. 'ఎవరు మంచిపనులు చేస్తారో' అని మాత్రమే అల్లాహ్ పేర్కొన్నాడు. ఇక్కడ దేవుడు ఆచరణ పరిమాణాన్ని చూడటం లేదు, అందలి చిత్తశుద్ధిని మాత్రమే చూస్తున్నాడు. 1. చేసే మంచి పని వెనుక దైవాన్ని మెప్పించే ఉద్దేశం ఉండాలి. 2. ఆ పని దైవప్రవక్త (స) చూపిన పద్ధతికి అనుగుణంగా ఉండాలి. ఈ రెండింటిలో ఏ ఒక్కటి లోపించినా – అదెంత మంచి పనయినా సరే, ఎంత పెద్ద పరిమాణంలో ఉన్నాసరే – అది 'సదాచరణ' అనిపించుకోదు. దైవసన్నిధిలో దానికి ఎలాంటి విలువా ఉండదు.

11. ఈ విషయమే హదీసులో కూడా వివరించబడింది : "భూమ్యాకాశాల సృష్టికి 50వేల సంవత్సరాల క్రితం దేవుడు ప్రాణుల విధివ్రాతను నిర్ధారించాడు. ఆ సమయంలో ఆయన సింహాసనం నీటిపై ఉండేది" (సహీహ్ ముస్లిం–కితాబుల్ ఖద్ర్; సహీహ్ బుఖారీ–కితాబు బద్యిల్ ఖల్ఖ్).

وَلَىِٕنْ اَذَقْنَا الْاِنْسَانَ مِنَّا رَحْمَةً ثُمَّ نَزَعْنٰهَا مِنْهُ ۚ اِنَّهٗ لَيَـُٔوْسٌ كَفُوْرٌ ﴿9﴾

**9** మేము మనిషికి ఏదైనా మా కారుణ్యం రుచిని చూపి, దాన్ని గనక అతన్నుంచి తిరిగి తీసేసుకుంటే అతను నిరాశ చెందుతాడు; కృతఘ్నుడుగా మారిపోతాడు.[13]

وَلَىِٕنْ اَذَقْنٰهُ نَعْمَاۤءَ بَعْدَ ضَرَّاۤءَ مَسَّتْهُ لَيَقُوْلَنَّ ذَهَبَ السَّيِّاٰتُ عَنِّيْ ۗ اِنَّهٗ لَفَرِحٌ فَخُوْرٌ ﴿10﴾

**10** అతనికి కలిగిన కష్టాల తరువాత మేము గనక అతనికేదైనా అనుగ్రహం రుచి చూపితే, "(హమ్మయ్య!) నా దురవస్థలన్నీ దూరమైపోయాయి"[14] అని అంటాడు. నిశ్చయంగా అతడు మిడిసి పడతాడు. గొప్పలు చెప్పుకుంటాడు.[15]

اِلَّا الَّذِيْنَ صَبَرُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ ۗ اُولٰۤىِٕكَ لَهُمْ مَّغْفِرَةٌ وَّاَجْرٌ كَبِيْرٌ ﴿11﴾

**11** అయితే సహనం వహించి, మంచి పనులు చేసేవారు మాత్రం అటువంటి వారు కారు. ఇలాంటి వారి కోసమే మన్నింపూ, గొప్ప పుణ్యఫలమూ ఉన్నాయి.[16]

12. దైవశిక్ష కోసం హడావిడి చేయటాన్ని ఇక్కడ పరిహాసంగా, వేళాకోళంగా చెప్పటం జరిగింది. ఎందుకంటే వేళాకోళం చేసే ఉద్దేశంతోనే వాళ్లు పదే పదే ఈ డిమాండు చేసేవారు. అల్లాహ్ ఇచ్చే గడువును ఆషామాషీగా భావించరాదనీ, ఏ క్షణంలోనయినా ఆయన ఉచ్చు బిగుసుకుంటుందని ఇక్కడ హెచ్చరించటం జరిగింది.

13. సాధారణంగా మనిషి చంచల స్వభావుడు. అన్నింటికీ తొందరే. గర్హనీయమైన ఆ స్వభావం గురించి ఈ ఆయతులోనూ, దీని తరువాతి ఆయతులోనూ వివరించబడింది. నిరాశ చెందటమనేది భవిష్యత్తుకు సంబంధించినది. కృతఘ్నత అనేది గతంలో జరిగిపోయిన దానికి సంబంధించినది.

14. గడ్డు రోజులు గడచిపోయాయనీ, మంచి రోజులు వచ్చాయని, ఇక తనకు తిరుగు లేదనీ చెప్పుకుంటాడు. ఈ ధోరణి అతనికి శోభాయమానం కాదు. ఎందుకంటే కేవలం దైవ కృపవల్లనే అతని కష్టాలు దూరమై మంచిరోజులు వచ్చాయి. కాబట్టి అతను వెనుకటి రోజులను జ్ఞాపకం చేసుకుంటూ నిత్యం అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండాలి. అణకువతో మెలగాలి. బీరాలు పోకూడదు.

**'ఉమ్మత్' అనే పదానికి పలు అర్థాలు:** ఎనిమిదవ ఆయతులో 'ఉమ్మతున్' అనే పదం వచ్చింది. ఇది దివ్యఖుర్‌ఆన్‌లో వివిధ సందర్భాల్లో విభిన్న అర్థాల్లో ఉపయోగించబడింది. అసలు ఇది 'ఉమ్మ్' నుంచి వచ్చింది. ఉమ్మ్ అంటే ఉద్దేశం, సంకల్పం అని అర్థం. ఇక్కడ ఈ ఆయతులో ఉమ్మతున్ అనే పదం 'శిక్ష అవతరింపజేయటానికి ఉద్దేశింపబడిన గడువు' అన్న అర్థంలో వాడబడింది (ఫత్‌హుల్ ఖదీర్). యూసుఫ్ సూరా 45వ ఆయతులోనూ ఇదే అర్థంలో ఉపయోగించబడింది. ఇది తప్ప వేరితర అర్థాల్లో ఉపయోగించబడిన సందర్భాలు : నాయకుడు, ఇమాము అన్న అర్థంలో, **'ఇన్న ఇబ్‌రాహీమ కాన ఉమ్మతన్'** (నహ్ల్ : 12); ధర్మం అన్న అర్థంలో, **'ఇన్నా వజద్‌నా ఆబాఅనా అలా ఉమ్మతిన్'** (జుఖ్‌రుఫ్ :23); సముదాయం, సమూహం అన్న అర్థంలో, **'వలమ్మా వరద మాఅ మద్‌యన వజద అలైహి ఉమ్మతమ్ మినన్నాస్'** (ఖసస్ : 23); 'ప్రవక్త పంపబడిన సమాజం' అన్న అర్థంలో, **'వలికుల్లి ఉమ్మతిర్రసూల్'** (యూనుస్ : 47); ఈ సమాజాన్ని 'ఉమ్మతె దావత్'గా కూడా వ్యవహరిస్తారు. అదేవిధంగా ఆయా ప్రవక్తలను విశ్వసించినవారిని కూడా ఉమ్మత్ లేక ఉమ్మతె ఇత్తిబా లేక ఉమ్మతె ఇజాబత్ అని పిలుస్తారు (ఇబ్నె కసీర్).

15. అంటే తనకు కలిగిన కలిమిపై ఉబ్బిపోతాడు. ఇతరులను చిన్నచూపు చూస్తాడు. సాటి ప్రజల ముందు అనుచితమైన రీతిలో బడాయిని చాటుకుంటాడు. ఇది అతని అల్పబుద్ధికి తార్కాణం. అయితే అల్లాహ్‌ను విశ్వసించి, ఓర్పు వహించేవారు, మంచిపనులు చేసేవారిలో ఈ అవగుణాలు ఉండవు.

16. సదాచార సంపన్నులు ఎప్పుడూ ఒకేవిధంగా ప్రవర్తిస్తారు. కలిమిలోనూ – లేమిలోనూ, కష్టాలలోనూ – సుఖాలలోనూ వారు అల్లాహ్ ఆదేశాలకు లోబడి వ్యవహరిస్తారు. కష్టకాలంలో ఓర్పు వహిస్తారు. దైవానుగ్రహంపై ఆశాభావం

فَلَعَلَّكَ تَارِكٌۢ بَعۡضَ مَا يُوحَىٰٓ إِلَيۡكَ وَضَآئِقُۢ
بِهِۦ صَدۡرُكَ أَن يَقُولُواْ لَوۡلَآ أُنزِلَ عَلَيۡهِ كَنزٌ
أَوۡ جَآءَ مَعَهُۥ مَلَكٌۚ إِنَّمَآ أَنتَ نَذِيرٞۚ وَٱللَّهُ
عَلَىٰ كُلِّ شَيۡءٖ وَكِيلٌ ⑫

**12** (ఓ ప్రవక్తా!) బహుశా నీ వద్దకు పంపబడే వహీలో ఏదైనా భాగాన్ని వదలివేస్తావేమో! "ఇతనిపై ధనాగారం ఎందుకు అవతరించలేదు? పోనీ, ఇతనితోపాటు దైవదూత అయినా ఎందుకు రాలేదు?" అని వారు చెప్పే మాటలు నీకు మనస్తాపం కలిగించినట్లున్నాయి. చూడు! నువ్వు భయపెట్టేవాడివి మాత్రమే.[17] అన్ని విషయాలకు బాధ్యుడు అల్లాహ్.

أَمۡ يَقُولُونَ ٱفۡتَرَىٰهُۖ قُلۡ فَأۡتُواْ بِعَشۡرِ سُوَرٖ مِّثۡلِهِۦ
مُفۡتَرَيَٰتٖ وَٱدۡعُواْ مَنِ ٱسۡتَطَعۡتُم مِّن دُونِ ٱللَّهِ
إِن كُنتُمۡ صَٰدِقِينَ ⑬

**13** ఏమిటీ, అతనే (ప్రవక్తే) ఈ ఖురానును కల్పించుకున్నాడని వాళ్ళంటున్నారా? "మరైతే మీరు కూడా ఇలాంటి పది సూరాలు కల్పించి తీసుకురండి. మీరు సత్యవంతులే అయితే, అల్లాహ్‌ను తప్ప మీరు పిలువగలిగితే దీని సహాయం కోసం ఎవరినైనా పిలుచుకోండి"[18] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

కలిగి ఉంటారు. కలిమి ప్రాప్తించినపుడు కృతజ్ఞతా పూర్వకంగా మసలుకుంటారు. అగత్యపరుల, ఆత్మీయుల హక్కును గుర్తిస్తారు. సత్కార్యాలలో ఇతోధికంగా పాలుపంచుకుంటారు. అందుకే ఒక హదీసులో మహనీయ ముహమ్మదు (సఅసం) వారు ఇలా ప్రవచించారు – "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! అల్లాహ్ విశ్వాసి (మోమిన్) కొరకు ఏ నిర్ణయం గైకొన్నా అందులో మేలు ఉంటుంది. ఒకవేళ అతనికి సుఖం ప్రాప్తిస్తే అందుకు అతడు కృతజ్ఞతలు చెల్లిస్తాడు. ఆ విధంగా అది అతనికి శుభకరం అవుతుంది (అంటే కృతజ్ఞత తెలిపినందుకు పుణ్యఫలం లభిస్తుంది). ఒకవేళ అతనికి కష్టం కలిగితే దానిపై అతడు సహనం వహిస్తాడు. అదీ అతని పాలిట శుభకరమే. (ఎందుకంటే సహనం వహించినందుకు అతనికి మంచి ప్రతిఫలం ఇవ్వబడుతుంది). ఈ విశిష్టత విశ్వాసికి తప్ప వేరితరులకు లభించలేదు" (సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్....). మరొక హదీసులో ఇలా అనబడింది: "విశ్వాసికి ఏ బాధ, దుఃఖం కలిగినా – ఆఖరికి అతనికి ముల్లు గుచ్చుకున్నా తత్కారణంగా అల్లాహ్ అతని తప్పులను మన్నిస్తాడు" (ముస్నదె అహ్మద్ – సంపుటి : 3, పేజీ – 4). అల్ మఆరిజ్ సూరా 19, 22 ఆయతులలో కూడా ఈ విషయం చర్చించబడింది.

17. ముహమ్మద్ (సఅసం) ప్రవక్తతో పాటు ఎవరయినా ఒక దైవదూత ఎందుకు రావటం లేదు? లేదా ధనాగారం ఎందుకు దింపబడలేదు? అని మక్కాలోని బహుదైవారాధకులు ప్రశ్నించేవారు. ఆ ప్రశ్నల్లో వెటకారం ఉండేది. అల్ ఫుర్ఖాన్ సూరా 8వ ఆయతులో కూడా ఈ ప్రస్తావన వచ్చింది. మరోచోట ఇలా సెలవీయబడింది : (ఓ ప్రవక్తా!) వారు నీ గురించి కల్పిస్తున్న మాటల వలన నీ మనసు నొచ్చుకుంటుందని మాకు తెలుసు" (అల్ హిజ్ర్ – 98). అందుకే దేవుడు ఇక్కడ తన సందేశహరుణ్ణి ఓదారుస్తున్నాడు – వారి మాటలకు నువ్వు బాధపడవలసిన అవసరం లేదు. బహుశా నీ వైపుకు పంపబడే వహీలోని కొన్ని విషయాలు ఈ బహుదైవారాధకులకు మింగుడు పడకపోవచ్చు. అందుకని నువ్వు ఆ విషయాలు వారికి వినిపించకుండా ఉంటావేమో! అలా జరగకూడదు సుమా! నువ్వు మాత్రం నీ పనిని సజావుగా చేసుకుంటూ పో. సందేశాన్ని యధాతథంగా చేరవేయటమే నీ కర్తవ్యం అని అల్లాహ్ ఈ సందర్భంగా ఉపదేశించాడు.

18. ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా వ్యాఖ్యానించారు : దేవుడు ఈ ఆయతులో అవిశ్వాసులకు సవాలు చేశాడు. ఈ ఖుర్ఆన్ ముహమ్మద్ (స) రచన అన్న మీ వాదనలో మీరు సత్యవంతులే అయితే అలాంటి ఒక ఉదాహరణను మీరు కూడా సమర్పించండి. మీరు కోరిన వారిని మీ సహాయం కోసం పిలుచుకోండి. కాని మీరు మాత్రం ఈ పనిని చేయలేరు. ఈ విధంగా సెలవీయబడింది: "ఇలా చెప్పు–ఒకవేళ మానవులు, జిన్నులూ అందరూ కలిసి ఈ ఖుర్ఆను వంటి

فَاِلَّمْ يَسْتَجِيْبُوْا لَكُمْ فَاعْلَمُوْٓا اَنَّمَآ اُنْزِلَ بِعِلْمِ اللّٰهِ وَاَنْ لَّآ اِلٰهَ اِلَّا هُوَ ۚ فَهَلْ اَنْتُمْ مُّسْلِمُوْنَ ﴿14﴾

**14** మరి వారు గనక మీ సవాలును స్వీకరించకపోతే, ఈ ఖుర్ఆన్ దైవజ్ఞానంతో అవతరింపజేయబడిందనీ, ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనే లేదని తెలుసుకోండి. మరి ఇప్పుడైనా మీరు ముస్లింలవుతారా?[19]

مَنْ كَانَ يُرِيْدُ الْحَيٰوةَ الدُّنْيَا وَزِيْنَتَهَا نُوَفِّ اِلَيْهِمْ اَعْمَالَهُمْ فِيْهَا وَهُمْ فِيْهَا لَا يُبْخَسُوْنَ ﴿15﴾

**15** ఎవరయితే ప్రాపంచిక జీవితం పట్ల, దాని అందచందాల పట్ల వ్యామోహితులవుతున్నారో అలాంటి వారికి వారి కర్మలను (వాటి ఫలితాన్ని) మేము ఇక్కడే పూర్తిగా ఇచ్చేస్తాము. ఇక్కడ (ప్రపంచంలో) వారికి ఏ లోటూ జరగదు.

اُولٰٓئِكَ الَّذِيْنَ لَيْسَ لَهُمْ فِي الْاٰخِرَةِ اِلَّا النَّارُ ۖ وَحَبِطَ مَا صَنَعُوْا فِيْهَا وَبٰطِلٌ مَّا كَانُوْا يَعْمَلُوْنَ ﴿16﴾

**16** అయితే అలాంటి వారికి పరలోకంలో అగ్ని తప్ప మరేమీ లభించదు. ప్రపంచంలో వారు చేసుకున్నదంతా వృథా అయి పోతుంది. వారు చేసే పనులన్నీ మిథ్యగా మారిపోతాయి.[20]

اَفَمَنْ كَانَ عَلٰى بَيِّنَةٍ مِّنْ رَّبِّهٖ وَيَتْلُوْهُ شَاهِدٌ مِّنْهُ وَمِنْ قَبْلِهٖ كِتٰبُ مُوْسٰٓى اِمَامًا وَّرَحْمَةً ۭ

**17** ఒక వ్యక్తి తన ప్రభువు తరఫు నుండి వచ్చిన నిదర్శనాన్ని కలిగివున్నాడు, దాంతోపాటు అల్లాహ్ వద్ద నుంచి వచ్చిన దానిని సాక్షిగా కలిగి ఉన్నాడు, అంతకు మునుపు మార్గదర్శకంగా, కారుణ్యంగా ఉన్న మూసా గ్రంథాన్ని (కూడా సాక్షిగా) కలిగి ఉన్నాడు. అటువంటి వ్యక్తి (ఇతరులతో ఎలా సమానుడవు

దానిని తీసుకువచ్చే ప్రయత్నం చేసినా తీసుకురాలేరు – వారు పరస్పరం సహాయం చేసుకున్నాసరే" (బనీ ఇస్రాయీల్–88). ఆ తరువాత దేవుడు పది సూరాలైనా రచించి తెమ్మని సవాలు విసిరాడు. ఈ సూరాలోని ఈ ఆయతులో అదే చెప్పబడింది. పోనీ కనీసం ఒక్క సూరానయినా తయారుచేసి చూపండి అని యూనుస్ సూరాలోని 39వ ఆయతులోనూ, అల్ బఖరా సూరా మొదట్లోనూ సూచించబడింది (తఫ్సీర్ ఇబ్నె కసీర్). "ఒకవేళ వారు తమ వాదనలో సత్యవంతులే అయితే ఇలాంటి ఔన్నత్యం గల వాణిని రచించి తీసుకురావాలి" అని కూడా ఆఖరిలో సవాలు చేయబడింది (తూర్– 34). అయితే ఖుర్ఆన్ ఆయతుల, సూరాల అవతరణా క్రమం మాత్రం, పై సవాలు యొక్క అనుక్రమణికను సమర్థించటం లేదన్న విషయం కూడా గమనార్హం. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.

19. ఈ సవాలును స్వీకరించలేని పక్షంలో మీరు ఈ వాణి ముందు తలవంచటం ధర్మం. ఇది ముమ్మాటికీ దైవవాణి అని మీరు ఒప్పుకుని, దైవధర్మాన్ని స్వీకరించాలి. ఒకవేళ మీరు విధేయతా మార్గాన్ని అవలంబించకపోతే మీరు చెప్పేవన్నీ కల్లబొల్లి కబుర్లు అని అనవలసి ఉంటుంది.

20. ఈ రెండు ఆయతుల్లో ప్రదర్శనాబుద్ధితో పనిచేసేవారి గురించి ప్రస్తావించబడిందని కొంతమంది భావించారు. గ్రంథవహులైన యూదులను, క్రైస్తవులను దృష్టిలో పెట్టుకుని అవతరించాయని మరికొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించగా, ప్రాపంచిక వ్యామోహంలో చిక్కుకుపోయిన వారినుద్దేశించి ఇలా హెచ్చరించబడిందని ఇంకొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ప్రాపంచిక కీర్తి ప్రతిష్ఠల కోసం ప్రాకులాడేవారు కూడా కొన్ని మంచిపనులు చేస్తారు. వారు కోరిన దాన్ని దేవుడు వారికి ప్రపంచంలోనే ఇచ్చేస్తాడు. పరలోకంలో వారి కొరకు శిక్ష తప్ప మరొకటి మిగిలి ఉండదు. ఈ చర్చనీయాంశమే బనీ ఇస్రాయీల్ సూరా 18, 21 ఆయతులలోనూ, సూరయె షూరా 20వ ఆయతులోనూ వచ్చింది.

తాడు?)[21] ఇలాంటివారే దానిని (ఖుర్‌ఆన్‌ను) విశ్వసిస్తారు.[22] అన్ని వర్గాలలోనూ ఎవరెవరు దానిని త్రోసిపుచ్చుతారో – వారికి వాగ్దానం చెయ్యబడిన – గమ్యస్థానం నరకం.[23] కనుక (ఓ ప్రవక్తా!) దీని విషయంలో నువ్వు ఎలాంటి సందేహానికి లోను కారాదు. నిస్సందేహంగా ఇది నీ ప్రభువు తరఫునుంచి వచ్చిన సత్యం. కాని చాలా మంది (ఈ సత్యాన్ని) విశ్వసించరు.[24]

أُولَٰٓئِكَ يُؤْمِنُونَ بِهِۦ ۚ وَمَن يَكْفُرْ بِهِۦ مِنَ الْأَحْزَابِ فَالنَّارُ مَوْعِدُهُۥ ۚ فَلَا تَكُ فِى مِرْيَةٍ مِّنْهُ ۚ إِنَّهُ الْحَقُّ مِن رَّبِّكَ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يُؤْمِنُونَ ﴿17﴾

**18** అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టే వాడికన్నా పరమదుర్మార్గుడు ఎవడుంటాడు?[25] ఇలాంటి వారంతా తమ ప్రభువు సమక్షంలో హాజరుపరచబడతారు. "తమ ప్రభువుపై అసత్యాలను కల్పించిన వారు వీళ్ళే" అని సాక్షులు సాక్ష్యమిస్తారు. వినండి! (అలాంటి) దుర్మార్గులపై దేవుని శాపం పడుతుంది.[26]

وَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا ۚ أُولَٰٓئِكَ يُعْرَضُونَ عَلَىٰ رَبِّهِمْ وَيَقُولُ الْأَشْهَادُ هَٰٓؤُلَآءِ الَّذِينَ كَذَبُوا عَلَىٰ رَبِّهِمْ ۚ أَلَا لَعْنَةُ اللَّهِ عَلَى الظَّٰلِمِينَ ﴿18﴾

21. అవిశ్వాసులకు, సత్యతిరస్కారులకు ప్రతిగా విశ్వాసభాగ్యం పొందినవారు ఎలాంటివారో ఇక్కడ చెప్పబడింది. "ప్రభువు తరఫునుంచి వచ్చిన నిదర్శనాన్ని అనుసరించటం" అంటే మానవ నైజంలో దేవుడు పొందుపరచివున్న దానిని (దేవుని ఏకత్వాన్ని) అంగీకరించటం, ఆయన్నే ఆరాధించటం అని అర్థం. ఈ నేపథ్యంలో అంతిమ దైవప్రవక్త (స) వారు ఇలా అన్నారు: "ప్రతి పిల్లవాడూ తన సహజ ధర్మంపై పుడతాడు. కాని ఆ తరువాత అతని తల్లిదండ్రులు అతన్ని యూదునిగానో, క్రైస్తవునిగానో, జోరాస్ట్రియనుగానో మారుస్తారు....." (సహీహ్ బుఖారీ – కితాబుల్ జనాయెజ్; ముస్లిం– కితాబుల్ ఖద్ర్). **'యత్‌లూహు'** అంటే దాని వెనుక అని అర్థం. అల్లాహ్ తరఫునుంచి వచ్చిన దానిని సాక్షిగా కలిగి ఉండటమని ఇక్కడ దాని భావం. ఇక్కడ సాక్షి అంటే ఖుర్‌ఆన్ కావచ్చు లేక ముహమ్మద్ (సఅసం) కావచ్చు. ఆయన ఆ సహజధర్మం వైపుకే ప్రజలను పిలిచారు. దాన్ని విశదపరచారు.

ఈ ఆయతులో రెండు క్యారెక్టర్‌లు మన ముందుంచబడ్డాయి. ఒకవైపు సత్యధర్మాన్ని, దైవగ్రంథాన్ని, దైవాన్ని నమ్మని వాడున్నాడు. మరోవైపు దేవుని తరఫున ఒక స్పష్టమయిన నిదర్శనంపై ఒకడు నిలబడి ఉన్నాడు. అతనికి సాక్షిగా ఖుర్‌ఆన్ ఉంది (లేక ముహమ్మద్ (స) అతనికి సాక్షిగా ఉన్నారు). వీటన్నింటితోపాటు తౌరాతు గ్రంథం కూడా అతని సత్యతను సమర్థిస్తోంది. ఈ ఇద్దరు వ్యక్తులు సమానులవుతారా? ముమ్మాటికీ కాలేరు. ఎందుకంటే వారిలో ఒకడు విశ్వాసి (మోమిన్), మరొకడు అవిశ్వాసి (కాఫిర్). ఒకరివద్ద అనేక ఆధారాలు, నిదర్శనాలుండగా ఇంకొకనివద్ద అసలేమీ లేదు.

22. అంటే పైన పేర్కొనబడిన గుణగణాలు గలవారు దైవగ్రంథమైన ఖుర్‌ఆన్‌ను, దైవప్రవక్త (స)ను విశ్వసిస్తారు.

23. **"అన్ని వర్గాలు"** (అహ్‌జాబ్) అంటే భూమండలంపై నివసించిన అన్ని మతాలవారు అన్నమాట! వారిలో ఎవరు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను విశ్వసించకపోయినా వారి నివాస స్థానం నరకం అవుతుంది. ఆ మాటే హదీసులో ఈ విధంగా అనబడింది: మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు– "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ఈ ఉమ్మత్ (సమాజంలోని) ఏ యూదుడు, మరే క్రైస్తవుడు అయినా నా దైవదౌత్యం గురించి విన్న మీదట కూడా విశ్వసించకపోతే అతడు నరకానికి ఆహుతి అవుతాడు" (సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్). ఈ విషయం ఇంతకుముందు బఖరా సూరా 62వ ఆయతులోనూ, నిసా సూరా 150, 152 ఆయతులలోనూ వచ్చింది).

24. ఈ అంశం దివ్య ఖుర్‌ఆన్‌లో పెక్కు చోట్ల చర్చకు వచ్చింది. ఉదా : 1. ("ఓ ప్రవక్తా!) నువ్వు ఎంతగా కోరినా వీరిలో చాలామంది విశ్వసించరు సుమా!" (యూసుఫ్–103). 2. "ఇబ్లీసు తన అనుమానాన్ని నిజం చేసి చూపాడు. విశ్వాసుల ఒక వర్గం తప్ప అందరికందరూ అతని అనుయాయులైపోయారు" (సబా – 20).

**19** వారు దైవమార్గం నుంచి (జనులను) ఆపుతారు. అందులో
వక్రతను వెతుకుతారు[27] – వారే పరలోకాన్ని తిరస్కరించేవారు.

الَّذِينَ يَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ وَيَبْغُونَهَا
عِوَجًا وَهُم بِالْآخِرَةِ هُمْ كَافِرُونَ ⑲

**20** వారు భూమిపై (అల్లాహ్‌ను) నిస్సహాయునిగానూ చేయలేక
పోయారు, అల్లాహ్‌కు వ్యతిరేకంగా వారిని సమర్థించేవారు
కూడా లేకపోయారు. వారికి విధించబడే శిక్ష రెండింతలు చేయ
బడుతుంది. వారు వినగలిగే వారూ కాదు, చూడగలిగే వారూ
కాదు.[28]

أُولَٰئِكَ لَمْ يَكُونُوا مُعْجِزِينَ فِي الْأَرْضِ وَمَا
كَانَ لَهُم مِّن دُونِ اللَّهِ مِنْ أَوْلِيَاءَ ۘ يُضَاعَفُ
لَهُمُ الْعَذَابُ ۚ مَا كَانُوا يَسْتَطِيعُونَ السَّمْعَ
وَمَا كَانُوا يُبْصِرُونَ ⑳

**21** తమను తాము స్వయంగా నష్టానికి గురిచేసుకున్నవారు వీరే.
వారు కల్పించుకున్నదంతా వారి నుండి మటుమాయమై
పోయింది.

أُولَٰئِكَ الَّذِينَ خَسِرُوا أَنفُسَهُمْ وَضَلَّ
عَنْهُم مَّا كَانُوا يَفْتَرُونَ ㉑

**22** నిశ్చయంగా పరలోకంలో అందరికన్నా ఘోరంగా నష్టపోయే
వారంటే వారే.

لَا جَرَمَ أَنَّهُمْ فِي الْآخِرَةِ هُمُ الْأَخْسَرُونَ ㉒

**23** ఇకపోతే విశ్వసించి మంచి పనులు చేసినవారూ, తమ
ప్రభువు వైపుకు మొగ్గినవారూ – వారే స్వర్గ వాసులు. అందులో
వారు కలకాలం ఉంటారు.

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ وَأَخْبَتُوا إِلَىٰ
رَبِّهِمْ أُولَٰئِكَ أَصْحَابُ الْجَنَّةِ ۖ هُمْ فِيهَا
خَالِدُونَ ㉓

---

25. భూమండలంలో దేవుడు ఎవరికి విశేషాధికారాలు ఇవ్వలేదో వారికి ఆ అధికారాలున్నాయని తమకు తాముగా చెప్పుకోవటం, పరలోకంలో సిఫారసు చేసే అధికారం ఎవరెవరికి లేదో వారికి ఆ ప్రత్యేక అధికారం ఉందని కోతలు కోయటం – ఇవన్నీ అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదించటం క్రిందికి వస్తాయి.

26. ఈ ఆయతు నేపథ్యంలో క్రింది హదీసును తాత్పర్యంగా చదివి చూడండి: "తీర్పుదినాన దేవుడు ఒక విశ్వాసి (మోమిన్)ని నిలదీసి, అతను తన తప్పులు ఒప్పుకునేలా చేస్తాడు. 'నువ్వు ఫలానా తప్పు చేశావు. ఫలానా పొరపాటుకు కూడా పాల్పడ్డావు. ఇవన్నీ నీకు ఖుద్దుగా తెలుసు కదూ!' అని అడిగితే 'అవును. నా వల్ల ఈ తప్పులు జరిగిన సంగతి నిజమే' అని విశ్వాసి ధృవీకరిస్తాడు. అప్పుడు దేవుడు, 'నేను ఇహలోకంలో కూడా నీ తప్పులను మరుగు పరచాను. ఈ రోజు కూడా వాటిని మన్నిస్తున్నాను పో' అనంటాడు. అయితే ఇతరులతో (అవిశ్వాసులతో) ఆయన చేసే వ్యవహారం తద్భిన్నంగా ఉంటుంది. సాక్షుల సమక్షంలో వారు పిలువబడతారు. 'తమ ప్రభువుపై లేనిపోని మాటలను కల్పించిన వారు వీరే' అని ఆ క్షణంలో సాక్షులంతా సాక్ష్యమిస్తారు" (సహీహ్ బుఖారీ : హూద్ సూరా వ్యాఖ్యానం).

27. అంటే దైవధర్మం పట్ల ప్రజలలో విరక్తిని, ఏహ్యాభావాన్ని కలిగించే దురుద్దేశంతో వంకరలను అన్వేషిస్తూ ఉంటారు. పసలేని ఆరోపణలకు పూనుకుంటారు.

28. అంటే సత్యంపట్ల వారిలో విముఖత, అక్కసు ఏ స్థాయికి చేరిందంటే దాని గురించి వినటానికీ, దాన్ని చూడటానికి కూడా వారికి శక్తిలేకపోయింది. లేదా దీనికి మరో భావం ఇది కావచ్చు : దేవుడు వారికి చూచేందుకు కళ్లను, వినేందుకు చెవులనూ ఇచ్చాడు. కాని వారు సత్యాన్ని కనలేదు, వినలేదు. అంటే వారొక విధంగా శరీరావయవాల ద్వారా ప్రయోజనం పొందలేని జీవులు. "వారి చెవులుగానీ, వారి కళ్లుగానీ, వారి హృదయాలుగాని వారికెలాంటి ప్రయోజనాన్నీ చేకూర్చలేకపోయాయి" (అహ్‌ఖాఫ్ – 26). ఎందుకంటే సత్యం వారి చెవులకెక్కలేదు. సత్యం వారి

**24** ఈ రెండు వర్గాల ఉదాహరణ ఇలా ఉంది : వారిలో ఒకడు గుడ్డివాడు, చెవిటివాడు.[29] మరొకడు చూడగలిగే, వినగలిగే వాడు – వీరిద్దరూ పోలికలో సమానులవుతారా? అయినా మీరు గుణపాఠం గ్రహించరే?!

مَثَلُ الْفَرِيقَيْنِ كَالْأَعْمَىٰ وَالْأَصَمِّ وَالْبَصِيرِ وَالسَّمِيعِ ۚ هَلْ يَسْتَوِيَانِ مَثَلًا ۚ أَفَلَا تَذَكَّرُونَ ﴿24﴾

**25** మేము నూహు (అలైహిస్సలాం)ను ప్రవక్తగా చేసి అతని జాతి వద్దకు పంపాము. "నేను మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించే వాడను.

وَلَقَدْ أَرْسَلْنَا نُوحًا إِلَىٰ قَوْمِهِ إِنِّي لَكُمْ نَذِيرٌ مُبِينٌ ﴿25﴾

**26** "మీరు అల్లాహ్‌ను తప్ప మరొకరిని ఆరాధించకండి.[30] మీరు బాధాకరమైన దినాన శిక్షించబడతారేమోనన్న భయం నాకుంది'[31] (అని అతను చెప్పాడు.)

أَنْ لَا تَعْبُدُوا إِلَّا اللَّهَ ۖ إِنِّي أَخَافُ عَلَيْكُمْ عَذَابَ يَوْمٍ أَلِيمٍ ﴿26﴾

**27** అప్పుడు అతని జాతికి చెందిన అవిశ్వాసుల సర్దారులు ఇలా సమాధానమిచ్చారు: "మా దృష్టిలో నువ్వు మాలాంటి ఒక మానవ మాత్రుడివే తప్ప మరేమీ కావు.[32] ఇంకా మేము

فَقَالَ الْمَلَأُ الَّذِينَ كَفَرُوا مِنْ قَوْمِهِ مَا نَرَاكَ إِلَّا بَشَرًا مِثْلَنَا وَمَا نَرَاكَ اتَّبَعَكَ إِلَّا الَّذِينَ

కంటికి ఆనలేదు. అందుకే నరకాగ్నికి ఆహుతి అయ్యే సమయంలో వాళ్లు స్వయంగా ఇలా అంటారు : "మేమే గనక వినేవారము, గ్రహించేవారమే అయి ఉంటే నరకానికి ఆహుతి అయ్యేవారిలో చేరే వాళ్ళం కాము" (అల్ ముల్క్ – 10).

29. వెనుకటి వచనాలలో విశ్వాసులు, భాగ్యవంతులు ఒక వర్గంగానూ, అవిశ్వాసులు, అభాగ్యులు మరో వర్గంగానూ చిత్రీకరించబడ్డారు. ఆ విషయమే ఈ ఆయతులో మరింత స్పష్టంగా, ఉదాహరణ సమేతంగా చెప్పబడింది. వారిలో ఒకరు వినే, కనే శక్తిగల వారు. ఇంకొకరు వినలేని, చూడలేని అవిటివారు. అందుకే వారు తమకు ప్రయోజనం చేకూర్చే విషయాలకు నోచుకోలేకపోతారు. దీనికి భిన్నంగా విశ్వాసులు బుద్ధిమంతులై ఉంటారు. వారు సత్యాన్ని చూస్తారు. సత్యాన్ని పరికిస్తారు. సత్యాసత్యాల మధ్య గల తేడాను తెలుసుకుంటారు. తరువాత సత్యాన్ని గ్రహించి, తదనుగుణంగా ఆచరిస్తారు. అసత్యాన్ని పరిత్యజిస్తారు. ప్రమాణబద్ధమైన అంశాలను స్వాగతిస్తారు. సందేహాస్పదమైన అంశాలకు ఆమడ దూరాన ఉంటారు. మరి ఈ రెండు వర్గాల వారు ఎన్నటికైనా సమానులవుతారా? ముమ్మాటికీ సమానులు కాజాలరు. ఆ విషయమే మరోచోట ఇలా అనబడింది: "స్వర్గవాసులు, నరకవాసులు ఎన్నటికీ సమానులు కాలేరు. స్వర్గవాసులు మాత్రమే విజయం పొందినవారు" (అల్ హష్ర్ – 20). వేరొకచోట ఈ విషయమే ఈ విధంగా వివరించబడింది : "గుడ్డివాడు – కళ్లున్నవాడూ సమానులు కాలేరు. చీకట్లూ–వెలుగూ ఒకటి కావు. నీడ–ఎండా సమానం కావు. బ్రతికి ఉన్నవారు – చనిపోయిన వారూ సమానులు కాలేరు" (ఫాతిర్ – 19, 20).

30. దైవప్రవక్తలందరూ తమ తమ జాతుల వారికి ఇచ్చిన ఏకదైవోపాసనా సందేశమే ఇది. ఉదాహరణకు ఈ ఆయతును గమనించండి – "(ఓ ప్రవక్తా!) మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా అతనికి వహీ ద్వారా, 'నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక మీరు నాకే దాస్యం చేయండి' అనే విషయాన్నే తెలియజేశాము" (అంబియా – 25).

31. అంటే; మీరు గనక నన్ను విశ్వసించి, ఏక దైవారాధనా సందేశాన్ని విని, తదనుగుణంగా వ్యవహరించకపోతే దైవాగ్రహం నుంచి తప్పించుకోలేరు.

32. ఈ రకమయిన సందేహాన్ని ఇంతకుముందు కూడా ప్రస్తావించటం జరిగింది. తమలాంటి ఒక సాధారణ మనిషి

هُمْ أَرَاذِلُنَا بَادِيَ الرَّأْيِ ۚ وَمَا نَرَىٰ لَكُمْ عَلَيْنَا مِن فَضْلٍ بَلْ نَظُنُّكُمْ كَاذِبِينَ ﴿٢٧﴾

గమనిస్తున్నాము, మాలోని అల్పులైనవారే[33] ఆలోచించకుండా, అర్థం చేసుకోకుండా[34] నిన్ను అనుసరిస్తున్నారు. కనుక మాపై మీకెలాంటి ప్రాధాన్యతగాని ఉన్నట్లు కానరావటం లేదు. పైగా మేము మిమ్మల్ని అబద్ధాలకోరులుగా భావిస్తున్నాము."

قَالَ يَا قَوْمِ أَرَأَيْتُمْ إِن كُنتُ عَلَىٰ بَيِّنَةٍ مِّن رَّبِّي وَآتَانِي رَحْمَةً مِّنْ عِندِهِ فَعُمِّيَتْ عَلَيْكُمْ أَنُلْزِمُكُمُوهَا وَأَنتُمْ لَهَا كَارِهُونَ ﴿٢٨﴾

**28** నూహ్ ఇలా అన్నాడు : "నా జాతివారలారా! ఒకవేళ నేను నా ప్రభువు తరఫున వచ్చిన స్పష్టమైన నిదర్శనంపై ఉండి, ఆయన నాకు తన ప్రత్యేక కారుణ్య భాగాన్ని[35] కూడా కలుగజేసి ఉండి, అది మీకు కనిపించకపోతే[36] (నేనేం చేయను?!) మీకిష్టం లేకపోయినా బలవంతంగా మేము దాన్ని మీ మీద ఎలా రుద్దగలం?[37]

తమ దగ్గరకు దైవప్రవక్తగా రావటం, సన్మార్గం వైపుకు పిలుపు ఇవ్వటం అవిశ్వాసులకు వింతగా తోచేది. అంతెందుకూ, నేటికీ కొంతమంది "బిద్అతీలు" ఈ రకమైన సంశయానికి లోనై ఉన్నారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను "మానవమాత్రుడు" అనంటే వారు ఒప్పుకోరు.

33. తరతరాల చరిత్రను తరచిచూసినా తెలిసే సత్యం యిదే – సత్యాన్ని మొదట్లో నమ్మి నడుచుకునే వారు సమాజంలోని పేదవారు, అనామకులు, అభాగ్యజీవులై ఉంటారు. సమాజంలో కులీనులుగా, శ్రీమంతులుగా పిలువబడేవారు ఈ 'భాగ్యానికి' నోచుకోరు. రాను రాను ఈ విషయం సుప్రసిద్ధమయిపోయింది – దైవప్రవక్తల అనుయాయులంటే వారు దళిత జనులే అయి ఉంటారని! రోము చక్రవర్తి హెరిక్లస్ హజ్రత్ అబూ సుఫ్యాన్ (రజి)ను తన దర్బారులో వేసిన ప్రశ్నలలో కూడా ఈ సంగతి ప్రస్తావనకు వచ్చింది. "ఆయన్ని (స) అనుసరించేవారిలో సమాజంలోని గొప్పవారు ఎక్కువ మంది ఉన్నారా? లేక బడుగువర్గాల వారు అధికంగా ఉన్నారా?" అని రోము చక్రవర్తి అడిగాడు. "బడుగువర్గాల వారే" అని అబూ సుఫ్యాన్ (రజి) చెప్పారు. "ప్రవక్తల్ని అనుసరించేది అలాంటి వారేకదా!" అని హెరిక్లస్ అన్నాడు (సహీహ్ బుఖారీ – హదీసు నెంబరు: 7). ధనిక వర్గాలవారే అందరికన్నా ముందు దైవప్రవక్తలను త్రోసిపుచ్చారన్న సంగతి ఖుర్ఆన్ ద్వారా కూడా రూఢీ అవుతోంది (జుఖ్రుఫ్ – 23). ధన మదాంధులు, అధికార మదాంధులు అయిన సత్యతిరస్కారులు నిరుపేద ముస్లింలను చిన్నచూపు చూసేవారు. దేవుడికి ఈ అనామకులే దొరికారా?! అని ఎగతాళి చేసేవారు. యదార్థమేమిటంటే సత్యామృతాన్ని ఆస్వాదించినవారు ఆర్థికంగా బలహీనులైనప్పటికీ, సామాజికంగా వారు ఉన్నత కుటుంబాలకు చెందినవారు కాకపోయినప్పటికీ ఆంతర్యాలలో నాటుకున్న విశ్వాసం (ఈమాన్) మూలంగా వారే అందరికన్నా ఎక్కువ ఆదరణీయులు, మర్యాదస్తులు.

34. విశ్వాసులు (మోమిన్లు) దైవాజ్ఞల్ని, దైవప్రవక్త ఉపదేశాలను విన్నప్పుడు వాటిని వెంటనే శిరసావహిస్తారే తప్ప, దైవాజ్ఞల ముందు తమ స్వంత అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వరు. "ఆదేశం విన్నాము – శిరసావహిస్తున్నాము" అన్నదే వారి సమాధానం అయి ఉంటుంది. విశ్వాసుల ఈ విధేయతా భావాన్ని చూసి అవిశ్వాసులు అసూయతో వక్రభాష్యాలు చెప్పేవారు. అర్థం పర్థం లేకుండా, ఆలోచించకుండా ప్రతి చిన్న విషయాన్ని గుడ్డిగా అనుసరిస్తున్నారని, దైవప్రవక్త (స) ఈ అమాయకులను తాను కోరిన దిశలో తీసుకుపోతున్నాడని విమర్శించేవారు. ఈ 'అనుసరణ' వాస్తవానికి విశ్వాసులలోని సుగుణమేగాని లోపం కాదు. అయితే అవిశ్వాసుల కంటికి అది లోపంగా కానవచ్చేది.

35. స్పష్టమయిన సూచన (బయ్యినహ్) అంటే ఈమాన్ (విశ్వాసం) అనీ, కారుణ్యం అంటే నబువ్వత్ (దైవ ప్రవక్తా పదవి) అని భావం. అల్లాహ్ హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం)కు వీటిని అనుగ్రహించాడు.

36. అంటే కళ్లుండి కూడా మీరు దానిని చూడలేకపోయారు. అందువల్ల దాని విలువ ఏమిటో మీకు బోధపడలేదు, మీరు దాన్ని అవలంబించలేదు. పైగా ఎంతసేపటికీ మీరు దానిని త్రోసిపుచ్చే ప్రయత్నంలోనే ఉన్నారు.

**29** "నా జాతి ప్రజలారా! ఈ కర్తవ్య నిర్వహణకుగాను నేను మీ నుంచి ఎలాంటి ధనాన్నీ కోరటంలేదు.[38] నా ప్రతిఫలమైతే అల్లాహ్ వద్ద ఉంది. నేను విశ్వాసులను నా వద్ద నుంచి గెంటి వేయలేను.[39] వారెలాగూ తమ ప్రభువును కలుసుకో వలసినవాళ్ళే. కాని మీరు మాత్రం నాకు అజ్ఞానంగా[40] ప్రవర్తిస్తున్నట్లు కనిపిస్తున్నారు.

وَيٰقَوْمِ لَآ اَسْـَٔلُكُمْ عَلَيْهِ مَالًا ۗ اِنْ اَجْرِيَ اِلَّا
عَلَى اللّٰهِ وَمَآ اَنَا۠ بِطَارِدِ الَّذِيْنَ اٰمَنُوْا ۗ اِنَّهُمْ
مُّلٰقُوْا رَبِّهِمْ وَلٰكِنِّيْٓ اَرٰىكُمْ قَوْمًا تَجْهَلُوْنَ (29)

**30** "నా జాతి జనులారా! ఒకవేళ నేను వారిని నా వద్ద నుంచి గెంటివేసినట్లయితే, అల్లాహ్‌కు వ్యతిరేకంగా నాకు సహాయపడే వాడెవడుంటాడు?[41] మీరు బొత్తిగా హితబోధను గ్రహించరా?

وَيٰقَوْمِ مَنْ يَّنْصُرُنِيْ مِنَ اللّٰهِ اِنْ طَرَدْتُّهُمْ ۗ
اَفَلَا تَذَكَّرُوْنَ (30)

**31** "నా దగ్గర అల్లాహ్ నిధులున్నాయని నేను మీతో అనటం లేదే! (వినండి!) నా దగ్గర అగోచర జ్ఞానం కూడా లేదు. నేను దైవ దూతనని కూడా అనటం లేదు. మీరు చిన్నచూపు చూస్తున్న వారికి అల్లాహ్ ఏ మేలూ చెయ్యబోడని కూడా నేను చెప్పటం లేదు.[42] వారి ఆంతర్యాలలో ఉన్నదానిని అల్లాహ్ బాగా ఎరిగిన వాడు. ఒకవేళ నేను గనక అలాంటి మాట ఏదైనా అంటే నేనూ దుర్మార్గుల్లో ఒకడిగా పరిగణించబడతాను."[43]

وَلَآ اَقُوْلُ لَكُمْ عِنْدِيْ خَزَاۤىِٕنُ اللّٰهِ وَلَآ اَعْلَمُ
الْغَيْبَ وَلَآ اَقُوْلُ اِنِّيْ مَلَكٌ وَّلَآ اَقُوْلُ لِلَّذِيْنَ
تَزْدَرِيْٓ اَعْيُنُكُمْ لَنْ يُّؤْتِيَهُمُ اللّٰهُ خَيْرًا ۗ
اَللّٰهُ اَعْلَمُ بِمَا فِيْٓ اَنْفُسِهِمْ ۚ اِنِّيْٓ اِذًا لَّمِنَ
الظّٰلِمِيْنَ (31)

37. మీలో ఇంతటి సంకుచితత్వం ఉన్నప్పుడు మార్గదర్శకత్వం మీకెలా లభిస్తుంది? దైవానుగ్రహానికి మీరెలా నోచు కుంటారు?

38. ఈ సందేశం ఇచ్చి మీ నుండి రుసుము తీసుకుంటానని బహుశా మీరు వెనుకాడుతున్నారేమో! మీ సొమ్ము ఏమీ నాకక్కరలేదు. నాకు పుణ్యఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది. ఎందుకంటే నేను ఆయన ఆదేశానుసారమే ఈ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. ఆయన మెప్పు కోసమే పనిచేస్తున్నాను.

39. ఈ వాక్యం ద్వారా విదితమయ్యేదేమిటంటే; నూహ్ (అలైహిస్సలాం) కాలం నాటి సంఘపెద్దలు కూడా నూహ్ (అ) ను విశ్వసించిన బలహీన ముస్లింలను దూరంగా ఉంచమని నూహ్ (అ)పై ఒత్తిడితెచ్చారు. మక్కాకు చెందిన కురైషు నాయకులు కూడా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) పై ఈ విధంగానే ఒత్తిడి తీసుకువచ్చారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు: "(ఓ ప్రవక్తా!) రేయింబవళ్ళూ తమ ప్రభువును మొరపెట్టు కునేవారినీ, ఆయన ప్రసన్నతను బడసే ప్రయత్నంలో నిమగ్నులై ఉన్నవారినీ నువ్వు నీ దగ్గరి నుంచి గెంటివేయకు" (అల్ అన్ఆమ్ - 52).

మరోచోట ఈ విధంగా సెలవిచ్చాడు : "(ఓ ప్రవక్తా!) తమ ప్రభువు ప్రసన్నతను కోరుతూ ఉదయం, సాయంత్రం ఆయనను ప్రార్థించే వారి సహచర్యంతో నీ మనసును సంతృప్తపరచుకో. నీ కళ్లు (చూపులు) వారిపై గాకుండా మరొకరి వైపుకు పోకూడదు" (అల్ కహఫ్ - 28).

40. అంటే దైవం మరియు దైవప్రవక్త అనుయాయులను అల్పులుగా, అధములుగా తలపోయటం, వాళ్లను దూరంగా ఉంచమని ప్రవక్తను డిమాండు చేయటం మీ అజ్ఞానానికి పరాకాష్ఠ. వాళ్లను దూరంగా ఉంచటం కాదుకదా, కనీసం ఉపేక్షించటం కూడా తగదు. వాళ్లు గౌరవ సత్కారాలకు అర్హులు. త్యాగధనులు.

41. ఇలాంటి త్యాగధనులను దూరం చేసుకోవటమంటే దైవాగ్రహాన్ని కొనితెచ్చుకోవటమే.

32 “ఓ నూహ్! నువ్వు మాతో వాదించావు. మరీ మరీ వాదించావు.[44] మరి నువ్వు సత్యవంతుడవే అయితే మమ్మల్ని హెచ్చరించే దానిని (శిక్షను) తీసుకురా”[45] అని అతని జాతి వారు అన్నారు.

قَالُوْا يٰنُوْحُ قَدْ جٰدَلْتَنَا فَاَكْثَرْتَ جِدَالَنَا
فَاْتِنَا بِمَا تَعِدُنَآ اِنْ كُنْتَ مِنَ الصّٰدِقِيْنَ ﴿32﴾

33 “దానిని తెచ్చేవాడు కూడా అల్లాహ్‌యే – ఆయన గనక తలచుకుంటే (తెచ్చి తీరుతాడు). మీరు మాత్రం ఆయన్ని ఓడించ లేరు.[46]

قَالَ اِنَّمَا يَاْتِيْكُمْ بِهِ اللّٰهُ اِنْ شَآءَ وَمَآ اَنْتُمْ
بِمُعْجِزِيْنَ ﴿33﴾

34 “అల్లాహ్ మిమ్మల్ని అపమార్గాన వదిలేయదలచుకుంటే[47] నేను మీ శ్రేయాన్ని ఎంతగా అభిలషించినా నా శ్రేయోభిలాష మీకేవిధంగానూ ఉపకరించదు. ఆయనే మీ అందరి ప్రభువు.[48] ఆయన వైపునకే మీరంతా మరలించబడతారు” అని (నూహు) సమాధానమిచ్చాడు.

وَلَا يَنْفَعُكُمْ نُصْحِيْٓ اِنْ اَرَدْتُّ اَنْ اَنْصَحَ
لَكُمْ اِنْ كَانَ اللّٰهُ يُرِيْدُ اَنْ يُّغْوِيَكُمْ هُوَ
رَبُّكُمْ وَاِلَيْهِ تُرْجَعُوْنَ ﴿34﴾

---

42. అంతేకాదు, అల్లాహ్ వారికి విశ్వాసం (ఈమాన్) అనే గొప్పవరాన్ని ప్రసాదించాడు. దాని ప్రాతిపదికపై వారికి పరలోకంలో స్వర్గలోక సుఖాలు ఎలాగూ ప్రాప్తిస్తాయి. అయితే ఇహలోకంలో కూడా అల్లాహ్ తలిస్తే ఈ పేద ముస్లిలు గౌరవోన్నతులను పొందుతారు. మీరు వారిని అల్పులుగా భావించినంతమాత్రాన వారికి కలిగిన నష్టం ఏమీలేదు. కాకపోతే దేవుని సజ్జనులైన దాసులను అకారణంగా అవమానపరచినందుకు మీరే దైవసమక్షంలో నేరస్థులుగా నిలదీయబడతారు.

43. వాళ్ల గురించి నాకు తెలియని విషయాన్ని నేనెలా చెప్పగలను? ఒకవేళ అనుచితంగా ఏదన్నా అంటే నేను అన్యాయస్థులలో ఒకణ్ణి అవుతాను.

44. నువ్వు ఎంతగా వాదించినా మేము నీ మాట వినబోము.

45. ధిక్కారవైఖరికి ఒడిగట్టే వారంతా చెప్పేది ఇదే. నూహు జాతివారు కూడా ఆ మాటే అన్నారు. నువ్వు నీ వాదనలో నిజాయితీ గలవాడవే అయితే నువ్వు పదే పదే హెచ్చరిస్తున్న ఆ ఆపదను మాపై తీసుకురా, చూద్దాం అని పెడసరిగా పలికారు. వారిలోనే గనక సత్యాన్ని స్వీకరించే గుణం ఉండి ఉంటే వారి సమాధానం మరో విధంగా ఉండి ఉండేది. నువ్వు నిజంగానే దైవ ప్రవక్తవు అయితే మాకు సద్బుద్ధి నొసగమని దేవుణ్ణి ప్రార్థించు అని వారు చెప్పి ఉండేవారు.

46. శిక్షను ఎప్పుడు, ఎక్కడ తీసుకురావాలి? అన్నది దైవానికే తెలుసు. ఒకసారి ఆయన ఈ నిర్ణయం గైకొన్నాడంటే, ఆయన శిక్షను ఆపగలిగే శక్తి ఎవరికీ లేదు.

47. మూలంలోని **‘ఇగ్‌వా’ (اِغْوَاء)** అన్న పదం ఇక్కడ ‘ఇజ్‌లాల్’ (అపమార్గం పట్టించటం) అనే అర్థంలో వాడబడింది. అంటే; మీరు సన్మార్గం వైపుకు తిరిగి రాలేనంత దూరాన – అపమార్గంలోకి వెళ్ళిపోతే అల్లాహ్ మిమ్మల్ని మీ మానాన వదలివేస్తాడు. ఆయన మిమ్మల్ని పట్టించుకోవటం మానేశాడంటే ఇక మిమ్మల్ని సన్మార్గంలోకి తీసుకురావటం ఎవరి తరమూ కాదు. ఈ స్థితిలో మీ మేలును కోరి నేను ఎంతగా ప్రయత్నించినా నా ప్రయత్నం మీకు లాభం చేకూర్చదు. ఎందుకంటే మీరు మార్గవిహీనత యొక్క ఆఖరి అంచుకు చేరుకున్నారు.

48. సన్మార్గం – అపమార్గం కూడా ఆయన చేతుల్లోనే ఉన్నాయి. మీరంతా ఆయన వద్దకే చేర్చబడతారు. అక్కడ ఆయన మీ కర్మల ఫలాన్ని మీకు ఇస్తాడు. సత్కర్మలు చేసినవారికి బహుమానాన్ని ఇస్తాడు. దుష్కర్మలు చేసినవారికి శిక్షను విధిస్తాడు.

أَمْ يَقُولُونَ افْتَرَاهُ ۖ قُلْ إِنِ افْتَرَيْتُهُ فَعَلَيَّ
إِجْرَامِي وَأَنَا بَرِيءٌ مِّمَّا تُجْرِمُونَ ﴿٣٥﴾

**35** ఏమిటీ, అతను (ముహమ్మదు) స్వయంగా దీనిని (ఖుర్‌ఆన్‌ను) కల్పించుకున్నాడని వాళ్లంటున్నారా? (ఓ ముహమ్మద్!) వారికి చెప్పు : "ఒకవేళ నేనే గనక దాన్ని కల్పించుకుని ఉంటే నా నేరం నాపై పడుతుంది. మీరు చేస్తున్న నేరానికి మాత్రం నేను బాధ్యుణ్ణి కాను."[49]

وَأُوحِيَ إِلَىٰ نُوحٍ أَنَّهُ لَن يُؤْمِنَ مِن قَوْمِكَ إِلَّا
مَن قَدْ آمَنَ فَلَا تَبْتَئِسْ بِمَا كَانُوا يَفْعَلُونَ ﴿٣٦﴾

**36** "నీ జాతివారిలో (ఇంతవరకూ) విశ్వసించినవారు తప్ప, ఇక మీదట ఎవరూ విశ్వసించబోరు. కాబట్టి నువ్వు వారి చేష్టలపై దుఃఖించకు"[50] అని నూహు వద్దకు వహీ పంపబడింది.

وَاصْنَعِ الْفُلْكَ بِأَعْيُنِنَا وَوَحْيِنَا وَلَا تُخَاطِبْنِي
فِي الَّذِينَ ظَلَمُوا ۚ إِنَّهُم مُّغْرَقُونَ ﴿٣٧﴾

**37** "మా కళ్ల ముందరే, మా వహీ అనుసారం ఒక ఓడను తయారుచెయ్యి.[51] మా ముందు దుర్మార్గుల ఊసు ఎత్తకు. వారంతా ఎలాగూ ముంచివేయబడేవారే"[52] (అని అల్లాహ్ సెలవిచ్చాడు).

---

49. ఇంతకీ ఈ వాక్యం (35వ ఆయతు) ఎవరెవరికి సంబంధించినది? కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ సంవాదన హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం)కీ – అతని జాతి జనులకు మధ్య జరిగింది. మరి కొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం ఈ ఆయతు అంతిమ దైవప్రవక్త ముహమ్మదు (స)కూ – ఆయన సమకాలీనులైన మక్కా ముష్రిక్కులకూ వర్తిస్తుంది. ఈ ఆయతుకు భావం ఇది : "ఒకవేళ ఈ ఖుర్‌ఆన్ నా స్వీయరచన అన్నది మీ ఆరోపణ అయితే, ఆ నేరానికి శిక్షను నేను అనుభవిస్తాను. కాని మీ సంగతేమిటి? మీరు ఈ వాణిని ధిక్కరించి ఎంతపెద్ద నేరానికి పాల్పడుతున్నారో ఆలోచించారా? మీ పాపభారం నాపై పడదు. దాన్ని మీరే అనుభవించాల్సి ఉంటుంది. దీని గురించి మీకు బొత్తిగా ధ్యాస లేదే?!"

50. దైవప్రవక్త నూహు (అలైహిస్సలాం) తన జాతి వారితో విసుగెత్తిపోయి, "ప్రభూ! వీరిలో ఒక్క అవిశ్వాసిని కూడా భూమండలంపై సజీవంగా వదలిపెట్టకు" అని దీనంగా ప్రార్థించినప్పుడు, దేవుడు పలికిన పలుకులు ఇవి.

51. **"మా కళ్ల ముందర"** అని ఆయతులో ఉంది. అంటే "మా పర్యవేక్షణలో" అని భావం. విశ్వప్రభువు అయిన అల్లాహ్‌కు కళ్లు ఉంటాయన్న దానికి ఈ ఆయతు ద్వారా సమర్థన లభిస్తోంది. కాబట్టి అల్లాహ్‌కు గల ఈ 'లక్షణం' పై కూడా మనం విశ్వాసం కలిగి ఉండాలి. "మా వహీ (సూచన) అనుసారం" అంటే ఆ ఓడ ఏ పరిమాణంలో ఉండాలి, దాని పొడవెంత? వెడల్పు ఎంత? ఎన్ని గదులు నిర్మించాలి? దానికోసం ఏ రకపు కొయ్యను ఉపయోగించాలి? ఏ రీతిలో దాన్ని మలచాలి? అన్న విషయాలన్నింటినీ అల్లాహ్ సూచించి ఉంటాడని ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అయితే దీనికి సంబంధించిన సంపూర్ణ జ్ఞానం అల్లాహ్‌కే ఉంది.

52. ఇక్కడ **"దుర్మార్గులు"** అంటే బహుశా నూహు భార్య, అతని కుమారుడు కావచ్చునని కొంతమంది వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. వారిద్దరూ "విశ్వాసులు" కాలేదు. ముంపుకు గురైన వారిలో వారిద్దరూ ఉన్నారు. మరికొంతమంది ప్రకారం అవిశ్వాసులంతా ఈ కోవలోకి వస్తారు. "మార్గభ్రష్టతపై పాతుకుపోయిన ఆ దుర్మార్గులకు గడువు ఇమ్మని కోరకు. ఎందుకంటే వారిని శిక్షించే సమయం ఆసన్నమయింది" అన్నది ఆ పలుకుల అంతరార్థం కావచ్చు. లేదా "దుర్మార్గులను శిక్షించే విషయమై తొందరపెట్టకు. వారిని ఎప్పుడు శిక్షించాలో, ఏ శిక్షకు గురిచెయ్యాలో మాకు బాగా తెలుసు. నిర్ధారిత సమయం ప్రకారం వారెలాగూ ముంపుకు గురవుతారు" అన్నది దివ్య వచనంలోని సారాంశం అయి ఉండవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

**38** అతను (నూహు) ఓడ నిర్మాణంలో నిమగ్నుడయ్యాడు. అతని జాతి నాయకులలో అతని వద్ద నుంచి సాగిపోయేవారంతా అతన్ని ఎగతాళి చేసేవారు.[53] "మీరు మా స్థితిపై నవ్వి పోతున్నారా? మీరు మా స్థితిపై నవ్విపోతున్నట్లే మేము కూడా ఒకనాడు మీ స్థితిపై నవ్వుతాము.

وَيَصْنَعُ الْفُلْكَ وَكُلَّمَا مَرَّ عَلَيْهِ مَلَأٌ مِّن
قَوْمِهِ سَخِرُوا مِنْهُ ۚ قَالَ إِن تَسْخَرُوا مِنَّا
فَإِنَّا نَسْخَرُ مِنكُمْ كَمَا تَسْخَرُونَ (38)

**39** "పరాభవానికి గురిచేసే శిక్ష, శాశ్వతంగా ఉండే శిక్ష ఎవరిపై వచ్చిపడుతుందో[54] అతి త్వరలోనే మీకు తెలిసిపోతుంది" అని నూహు పలికాడు.

فَسَوْفَ تَعْلَمُونَ مَن يَأْتِيهِ عَذَابٌ يُخْزِيهِ
وَيَحِلُّ عَلَيْهِ عَذَابٌ مُّقِيمٌ (39)

**40** తుదకు మా ఆదేశం వచ్చి, పొయ్యి పొంగినప్పుడు,[55] "ఈ ఓడలోకి ప్రతి (జీవ) రాసి నుంచి రెండేసి (ఒకటి ఆడ, ఇంకొకటి మగ జంతువు) చొప్పున ఎక్కించుకో.[56] నీ ఇంటివారలను కూడా తీసుకో. ఎవరి విషయంలోనయితే ముందుగానే మాట ఖరారయిందో వారిని వదిలేయి.[57] ఇంకా విశ్వాసులందరిని కూడా ఎక్కించుకో"[58] అని మేము (అతనికి) చెప్పాము. అయితే అతనితోబాటు విశ్వసించినవారు బహు కొద్దిమంది మాత్రమే.[59]

حَتَّىٰ إِذَا جَاءَ أَمْرُنَا وَفَارَ التَّنُّورُ قُلْنَا احْمِلْ فِيهَا
مِن كُلٍّ زَوْجَيْنِ اثْنَيْنِ وَأَهْلَكَ إِلَّا مَن سَبَقَ
عَلَيْهِ الْقَوْلُ وَمَنْ آمَنَ ۚ وَمَا آمَنَ مَعَهُ
إِلَّا قَلِيلٌ (40)

53. "ఓహో! తమరు ప్రవక్త కావాలనుకున్నారు. ఇప్పుడు వడ్రంగిగా మారుతున్నారా నూహు!?" అని వారు ఎగతాళి చేసేవారు. "అది సరే! నేలపై ఓడను నిర్మించి ఏం చేసుకుంటారు?" అని కూడా ఆటపట్టించేవారు.

54. అంటే, శాశ్వతమైన నరకాగ్ని శిక్ష! ఇహలోక జీవితం ముగిసిన తర్వాత వారి పరలోక జీవితం కొరకు ఇది సిద్ధం చేయబడింది.

55. **"పొయ్యి"** (తన్నూర్) అనే పదంపై పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రొట్టెను కాల్చే పొయ్యి అని కొందరు భావించారు. కొన్ని ప్రత్యేక స్థలాలు అని మరికొందరన్నారు. పొయ్యి అంటే భూమి ఉపరితలం అని ఇంకా కొందరు అభిప్రాయపడ్డారు. హాఫిజ్ ఇబ్నె కసీర్ మాత్రం మూడవ అభిప్రాయానికే ప్రాధాన్యత ఇచ్చారు. అంటే దైవాగ్రహం విరుచుకుపడినప్పుడు నేల నాలుగు చెరగులా నీటి ఊటలు పొంగి పొరలాయి. దానికి తోడు ఆకాశం నుంచి కుండపోతగా వర్షం కురవటం మొదలయింది. క్షణ క్షణానికీ నీటిమట్టం పెరిగిపోయింది అని దీని భావం.

56. అంటే, పశుపక్షాదులలో నుంచి ఒక ఆడ, ఒక మగ చొప్పున (ఒక్కో జత చొప్పున) ఓడలోకి ఎక్కించుకోమని హజ్రత్ నూహు (అలైహిస్సలాం)కు ఆదేశమివ్వబడింది. వృక్షజాతికి చెందిన వాటిని కూడా తీసుకున్నారని కొందరు వ్యాఖ్యానించారు.

57. అంటే; వారు ముంచివేయబడటం ఖాయమని రాసిపెట్టి ఉంది. ఎవరు వారు? అంటే అవిశ్వాసులన్నమాట! లేదా నూహు కుటుంబీకులలో అవిధేయతకు ఒడిగట్టిన ఆ 'ఇద్దరు' (నూహు కుమారుడు, నూహు భార్య). కొడుకు (కన్ఆన్ లేక యామ్), భార్య (వాయిలా) – వీరిరువురూ నూహు సందేశాన్ని త్రోసిపుచ్చారు. అందుచేత ఓడలో కూర్చునే ఆయన ఇంటివారల నుంచి వారిద్దరినీ వేరుచేయటం జరిగింది.

58. విశ్వసించి, విధేయత కనబరచే వారందరినీ నీవెంట ఓడలోకి ఎక్కించుకో అని అర్థం.

59. **'బహు కొద్దిమంది'** అంటే ఎందరు? వారు 80 మంది వరకూ ఉంటారని కొందరు చెప్పగా, 80 కన్నా తక్కువే

41 “మీరు ఈ ఓడలో కూర్చోండి – అల్లాహ్ పేరుతోనే – దీని గమనం, దీని ఆగటం.[60] నిశ్చయంగా నా ప్రభువు అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు” అని (నూహు) అన్నాడు.

وَقَالَ ارْكَبُوا فِيهَا بِسْمِ اللَّهِ مَجْرٖهَا وَمُرْسٰىهَا ۚ إِنَّ رَبِّي لَغَفُورٌ رَّحِيمٌ ﴿41﴾

42 ఆ ఓడ వారిని పర్వతాల్లాంటి అలల్లో నుంచి తీసుకుపో సాగింది.[61] నూహ్ (అలైహిస్సలాం) ఒడ్డున ఉన్న తన కుమారుణ్ణి ఉద్దేశించి, “ఒరేయ్ నాయనా! మాతోపాటే వచ్చి కూర్చోరా. అవిశ్వాసులతో వెళ్ళకురా”[62] అని బిగ్గరగా పిలిచాడు.

وَهِيَ تَجْرِي بِهِمْ فِي مَوْجٍ كَالْجِبَالِ وَنَادٰى نُوحٌ ابْنَهُ وَكَانَ فِي مَعْزِلٍ يّٰبُنَيَّ ارْكَبْ مَّعَنَا وَلَا تَكُنْ مَّعَ الْكٰفِرِينَ ﴿42﴾

అని మరికొందరు అభిప్రాయపడ్డారు. విశ్వసించిన వారిలో నూహు (అలైహిస్సలాం)గారి ముగ్గురు కుమారులు (సామ్, హామ్, యాఫిస్), వారి భార్యలు కూడా ఉన్నారు. ఈ ముగ్గురితో పాటు నాల్గవ ఆమె కూడా ఉంది. ఆమె నూహ్‌గారి అవిశ్వాస కుమారుడైన యామ్ లేక కన్ఆన్ యొక్క భార్య. (అతను అవిశ్వాసుల్లో చేరి ముంపుకు గురైపోయాడు). కాని ఇస్లాం స్వీకరించిన కారణంగా అతని భార్యకు మాత్రం ఓడలో కూర్చునే అవకాశం ఇవ్వబడింది (ఇబ్నె కసీర్).

60. అంటే అల్లాహ్ పేరుతోనే అది నీటిపై పయనిస్తుంది. అల్లాహ్ పేరుతోనే ఆగుతుంది. అంటే విశ్వాసులు నిర్భయంగా, నిస్సంకోచంగా ఓడలోకి ఎక్కవచ్చుని, ఓడలోకి ఎక్కిన వారంతా దేవుని ఆశ్రయంలోకి వచ్చేసినట్లేనని అభయమివ్వటానికి ఈ విధంగా అనబడింది. ఈ విషయాన్నే అల్లాహ్ మరోచోట ఈ విధంగా సెలవిచ్చాడు: “ఓ నూహు! నువ్వూ, నీ సహచరులూ ఓడలో కూర్చున్నప్పుడు ఇలా పలకండి – ‘దుర్మార్గ జాతి నుంచి మాకు విముక్తి నొసగిన అల్లాహ్‌కే స్తుతిస్తోత్రములు.’ ఇంకా ఇలా పలకండి: ‘నా ప్రభూ! నన్ను శుభంతో దించు. దించటంలో నువ్వే ఉత్తముడవు’ (అల్ మోమినూన్–28,29).

ఈ ఆయతు ఆధారంగా కొంతమంది పండితులు ఓడలోగానీ, మరే ఇతర వాహనంపైగాని ఎక్కినప్పుడు **“బిస్మిల్లాహి మజ్‌రేహా వ ముర్సాహ”** అని పలకటం అభిలషణీయం అని అన్నారు. అయితే హదీసు ద్వారా నిరూపితం అయిన ప్రార్థన మాత్రం ఇది : **“సుబ్‌హానల్లజీ సఖ్ఖరలనా హాజా వమా కున్నా లహూ ముఖ్‌రినీన్. వ ఇన్నా ఇలా రబ్బినా ల మున్‌ఖలిబూన్.”**

61. నేల చెరువైపోయింది. ఆ నీటిలో కొండలు, గుట్టలు సయితం మునిగిపోయాయి. దైవాదేశానుసారం ఆ ఓడ నూహును, అతని అనుయాయులను మోసుకొని వరద వెల్లువలో పయనిస్తోంది. దేవుని పర్యవేక్షణలో పయనిస్తున్నది గనకనే విశ్వాసులు అందులో సురక్షితంగా ఉన్నారు. లేకపోతే అంతపెద్ద జలప్రళయంలో ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాల మధ్య ఓడ ప్రయాణమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే ఆ సంఘటనను అల్లాహ్ గుర్తుచేస్తూ, దాన్ని తన మహోపకారంగా అభివర్ణించాడు: 1. “నీటి వెల్లువ ఉధృతమైనప్పుడు మేము మిమ్మల్ని ఓడలో ఎక్కించాము. దీన్ని మీకు గుణపాఠంగా, జ్ఞాపికగా చేసేందుకు, జ్ఞాపకముంచుకునే చెవులు దానిని ఎల్లకాలం జ్ఞాపకం ఉంచుకోగలిగేందుకు మేము ఈ విధంగా చేశాము” (అల్ హాఖ్ఖ – 11, 12). 2. “మేము అతన్ని పలకలు, మేకులు గల ఓడలోకి ఎక్కించాము. అది మా కళ్ళముందరే నడుస్తూ ఉండేది. తిరస్కరించబడినవాని తరఫున జరిగిన ప్రతీకారం ఇది” (అల్ ఖమర్ – 13, 14).

62. వాడు హజ్రత్ నూహు (అలైహిస్సలాం)గారి నాల్గవ కుమారుడు. అసలు పేరు యామ్. ‘కన్ఆన్’ అనే బిరుదాంకితుడు. ఇస్లాంను స్వీకరించి తమతో వచ్చి చేరమనీ, తిరస్కారుల వెంట పోవద్దని దైవప్రవక్త నూహు అతన్ని బ్రతిమాలారు. కాని తలపొగరుతో అతను తండ్రి మాటను తిరస్కరించి జల ప్రళయానికి బలైపోయాడు.

**43** దానికి వాడు, "(నాన్నా!) నేను ఏదయినా ఒక పెద్ద పర్వతాన్ని ఆశ్రయిస్తాను. అది నన్ను ఈ నీళ్ళ నుంచి కాపాడుతుంది"[63] అని జవాబిచ్చాడు. "అల్లాహ్ ఉత్తర్వు నుండి ఈ రోజు కాపాడే వాడెవడూ లేడురా! అల్లాహ్ తాను దయదలచిన వారిని మాత్రమే కాపాడతాడు" అని నూహ్ చెప్పాడు. అంతలోనే వారిద్దరి మధ్యా ఒక అల అడ్డుగా వచ్చింది. అంతే! వాడు కూడా ముంపుకు గురైనవారిలో చేరిపోయాడు.[64]

قَالَ سَآوِي إِلَىٰ جَبَلٍ يَعْصِمُنِي مِنَ الْمَاءِ ۚ قَالَ
لَا عَاصِمَ الْيَوْمَ مِنْ أَمْرِ اللَّهِ إِلَّا مَن رَّحِمَ ۚ
وَحَالَ بَيْنَهُمَا الْمَوْجُ فَكَانَ مِنَ الْمُغْرَقِينَ ﴿٤٣﴾

**44** "ఓ భూమీ! నీ నీళ్ళంతటినీ మ్రింగెయ్యి.[65] ఓ ఆకాశమా! ఇక ఆగిపో (కురిసింది చాలు)!" అని సెలవీయబడింది. అప్పటికప్పుడే నీరంతా ఇంకిపోయింది. కావలసిన పని పూర్తయింది.[66] ఓడ 'జూదీ'[67] పర్వతంపై నిలిచింది. "దుర్మార్గులు (దేవుని) అభిశాపానికి గురవుదురుగాక!"[68] అని సెలవీయబడింది.

وَقِيلَ يَا أَرْضُ ابْلَعِي مَاءَكِ وَيَا سَمَاءُ أَقْلِعِي
وَغِيضَ الْمَاءُ وَقُضِيَ الْأَمْرُ وَاسْتَوَتْ عَلَى
الْجُودِيِّ ۖ وَقِيلَ بُعْدًا لِّلْقَوْمِ الظَّالِمِينَ ﴿٤٤﴾

**45** నూహ్ (అలైహిస్సలాం) తన ప్రభువును పిలుస్తూ, "నా ప్రభూ! నా కుమారుడు కూడా నా కుటుంబీకుడే కదా! నిశ్చయంగా నీ వాగ్దానం సత్యమైనది. నీవు పాలకుల్లోకెల్లా గొప్ప పాలకుడవు"[69] అని విన్నవించుకున్నాడు.

وَنَادَىٰ نُوحٌ رَّبَّهُ فَقَالَ رَبِّ إِنَّ ابْنِي مِنْ أَهْلِي
وَإِنَّ وَعْدَكَ الْحَقُّ وَأَنتَ أَحْكَمُ الْحَاكِمِينَ ﴿٤٥﴾

---

63. ఎత్తయిన పర్వత శిఖరం మీదికిపోతే సురక్షితంగా ఉండగలననీ, నీటి మట్టం అంత ఎత్తుకు చేరుకోదని వాడు భావించాడు.
64. తండ్రీ కొడుకుల మధ్య ఈ సంభాషణ జరుగుతుండగానే వారి మధ్య పర్వతం లాంటి ఓ పెద్ద కెరటం ఉవ్వెత్తున లేచి అమాంతం అతన్ని కబళించింది.
65. భూమిలో నీరు ఇంకిపోవటాన్ని మ్రింగివేయటంగా ఇక్కడ అభివర్ణించటం జరిగింది. ఇందలి మర్మం ఏమిటంటే నీరు కొద్దికొద్దిగా ఇంకిపోలేదు. ఒక్కసారిగా – పశువు గడ్డిని నమలి మ్రింగినట్లే – భూమి ఆ నీటినంతటినీ ఒక్కసారిగా పీల్చేసింది. ఇదంతా దైవాజ్ఞ ప్రకారం జరిగిందన్న సంగతిని మరువరాదు.
66. అవిశ్వాసులందరినీ జలప్రళయం ద్వారా రూపుమాపాలన్న దైవకార్యం అమల్లోకి వచ్చింది.
67. **'జూది'** అనేది ఒక పర్వతం పేరు. ఇది మౌసిల్‌కు దగ్గరలో ఉందని కొందరు భావిస్తున్నారు. నూహ్ జాతివారు కూడా ఈ ప్రాంతంలోనే నివసించారు.
68. అరబీలో **'బుఅ్దన్'** ( بُعْدًا ) అనే పదం ఉంది. ఇది దేవుని అభిశాపం, దెబ్బ అన్న అర్థంలో ప్రయోగించబడింది. దేవుని శాపానికి, దైవాగ్రహానికి గురైన జాతుల కోసం దివ్య ఖుర్ఆన్ ప్రత్యేకంగా ఈ పదాన్ని అనేక చోట్ల ప్రయోగించింది.
69. పుత్రవాత్సల్యం మనసులో పొంగిపొరలగా ఆ క్షణంలో హజ్రత్ నూహు (అలైహిస్సలాం) అలా వేడుకుని ఉంటారు! తన కుమారుడు బ్రతికుంటే విశ్వసించేవాడు అని నూహు ప్రవక్త అనుకున్నారనీ, అందుచేతనే ఆయన ఆ విధంగా ప్రార్థించారని కొంతమంది చెబుతారు.

46 దీనికి సమాధానంగా, “ఓ నూహు! ముమ్మాటికీ వాడు నీ కుటుంబీకుడు కాడు.[70] వాడి పనులు ఏమాత్రం మంచివి కావు.[71] నీకు తెలియని వాటిగురించి నన్ను అడగకు.[72] (ఈ విధంగా అడిగి) నువ్వు అజ్ఞానులలో ఒకడివి కారాదని నేను నీకు ఉపదేశిస్తున్నాను”[73] అని అల్లాహ్ అన్నాడు.

قَالَ يٰنُوۡحُ اِنَّهٗ لَيۡسَ مِنۡ اَهۡلِكَ‌ ۚ اِنَّهٗ عَمَلٌ
غَيۡرُ صَالِحٍ‌ ‌ۖ فَلَا تَسۡـَٔـلۡنِ مَا لَـيۡسَ لَـكَ بِهٖ عِلۡمٌ‌ ؕ
اِنِّىۡۤ اَعِظُكَ اَنۡ تَكُوۡنَ مِنَ الۡجٰهِلِيۡنَ ﴿46﴾

47 “నా ప్రభూ! నాకు తెలియని దాని గురించి నిన్ను అర్థించటం నుండి నీ శరణు వేడుతున్నాను. నీవు గనక నన్ను క్షమించి దయదలచకపోతే నేను నష్టపోయేవారిలో చేరిపోతాను”[74] అని నూహు అభ్యర్థించాడు.

قَالَ رَبِّ اِنِّىۡۤ اَعُوۡذُ بِكَ اَنۡ اَسۡـَٔلَكَ مَا لَـيۡسَ
لِىۡ بِهٖ عِلۡمٌ‌ ؕ وَاِلَّا تَغۡفِرۡ لِىۡ وَتَرۡحَمۡنِىۡۤ اَكُنۡ
مِّنَ الۡخٰسِرِيۡنَ ﴿47﴾

48 అప్పుడు ఈ విధంగా సెలవీయబడింది: “ఓ నూహు! మా తరఫునుండి ప్రశాంతంగా దిగు.[75] నీపైన, నీతోటి వారిపైన శుభాలు కలుగుతాయి. ఇంకా అనేక సమూహాలకు కూడా మేము తప్పకుండా లాభం చేకూర్చుతాము.[76] కాని తర్వాత వారికి మా తరఫున బాధాకరమైన శిక్ష కూడా పడుతుంది.”[77]

قِيۡلَ يٰـنُوۡحُ اهۡبِطۡ بِسَلٰمٍ مِّنَّا وَبَرَكٰتٍ عَلَيۡكَ
وَعَلٰٓى اُمَمٍ مِّمَّنۡ مَّعَكَ‌ ؕ وَاُمَمٌ سَنُمَتِّعُهُمۡ ثُمَّ
يَمَسُّهُمۡ مِّنَّا عَذَابٌ اَلِيۡمٌ ﴿48﴾

70. కన్నకొడుకు కుటుంబీకుడే అవుతాడు కదా! అన్న ఉద్దేశంతో హజ్రత్ నూహు (అలైహిస్సలాం) వాడు తన వాడని భావించారు. అయితే ఈమాన్ ప్రాతిపదికపై వాడు నూహు మనిషి కాజాలడని దేవుడు తేల్చి చెప్పాడు. మనిషి బయటివాడైనా సరే విశ్వాసం (ఈమాన్) ఉంటే అతను విశ్వాసుల పరివారంలో సభ్యుడై పోతాడు. కాని విశ్వాసం (ఈమాన్) లేనప్పుడు - వారు ప్రవక్త కుమారులైనా, ప్రవక్త సతీమణులైనా సరే - ప్రవక్త కుటుంబ సభ్యులుగా పరిగణించబడరు.

71. వాడు నూహు మనిషిగా ఎందుకు పరిగణించబడడో అల్లాహ్ యిక్కడ వివరించాడు– వాడిలో విశ్వాసం లేదు సరికదా, వాడు చేసిన పనులు కూడా మంచివి కావు. ఆసాంతం చెడుల చెట్టు వాడు. అలాంటి వాణ్ణి ప్రవక్త కూడా దేవుని పట్టునుంచి కాపాడలేరు. పుణ్యపురుషుల ఆశీర్వాదం పొంది, సన్యాసుల, పీఠాధిపతుల ప్రసన్నతను చూరగొంటే మంచిపనులు చేయాల్సిన అవసరం కూడా ఉండదని తలపోసే ప్రబుద్ధులకు ఈ సంఘటన కనువిప్పు కావాలి. ఒక గొప్ప ప్రవక్త కడుపున పుట్టిన వ్యక్తినే అతని నిర్లక్ష్యం రక్షించలేనపుడు సామాన్య మానవులు ఏ లెక్కలోకి వస్తారట?!

72. ఈ వాక్యం ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే ప్రవక్తకు అగోచర జ్ఞానం ఉండదు. అతనికి దేవుడు వహీ ద్వారా తెలియజేసినంత పరిజ్ఞానమే ఉంటుంది. తన అభ్యర్థన స్వీకారయోగ్యం కాజాలదన్న సంగతి హజ్రత్ నూహు (అలైహిస్సలాం) గారికి తెలిసి ఉంటే, ఆయన ప్రభువు సన్నిధిలో ఈ విధంగా విన్నవించుకునేవారే కాదు.

73. ఇది దేవుని తరఫున ప్రవక్త నూహుకు చేయబడిన హితోపదేశం. ఆచరణాశీలురైన విజ్ఞానులకు దేవుని సమక్షంలో లభించే అంతస్తును నూహుకు కూడా ప్రసాదించేందుకు గాను అల్లాహ్ ఆయనకు ఈ విధంగా ఉపదేశించాడు.

74. కుమారుని విషయంలో తాను చేసుకున్న విజ్ఞప్తిలో ఔచిత్యం లేదని గ్రహించిన వెంటనే హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) క్షమాపణ కోరుకున్నారు. తనపై దయజూపమని ప్రార్థించారు. ఇదీ ప్రవక్తలలో ఉండే సుగుణం.

75. **‘దిగు’** అంటే ఓడలో నుంచి దిగమని చెప్పటం దాని ఆంతర్యం కావచ్చు. లేదా పర్వతంపై నుంచి దిగమన్నది కూడా దాని భావం అయి ఉండవచ్చు.

49 (ఓ ముహమ్మద్!) ఇవి అగోచర సమాచారాలు. వీటిని మేము నీకు వహీ ద్వారా తెలియజేస్తున్నాము. ఇంతకు మునుపు నీకు గానీ, నీ జాతి వారికిగానీ వీటి గురించి ఏమీ తెలియదు.[78] కనుక నీవు ఓర్పు వహిస్తూ ఉండు, నిస్సందేహంగా సత్ఫలితం భయభక్తులు గలవారికే లభిస్తుంది.[79]

تِلْكَ مِنْ اَنْۢبَآءِ الْغَيْبِ نُوْحِيْهَآ اِلَيْكَ ۚ مَا كُنْتَ
تَعْلَمُهَآ اَنْتَ وَلَا قَوْمُكَ مِنْ قَبْلِ هٰذَا ۛ
فَاصْبِرْ ۛ اِنَّ الْعَاقِبَةَ لِلْمُتَّقِيْنَ ﴿٤٩﴾

50 మరి మేము ఆద్ జాతి వైపుకు వారి సోదరుడైన హూద్‌ను పంపాము.[80] అతను (తన వారినుద్దేశించి) ఇలా అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు. మీరు కల్పించేవన్నీ అబద్ధాలు తప్ప మరేమీ కావు."[81]

وَاِلٰى عَادٍ اَخَاهُمْ هُوْدًا ۗ قَالَ يٰقَوْمِ اعْبُدُوا اللّٰهَ
مَا لَكُمْ مِّنْ اِلٰهٍ غَيْرُهٗ ۗ اِنْ اَنْتُمْ اِلَّا مُفْتَرُوْنَ ﴿٥٠﴾

51 "ఓ నా జాతి ప్రజలారా! ఈ పనికై నేను మీనుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు. నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత నన్ను సృష్టించినవానిదే. అయినప్పటికీ మీరు వివేకవంతులుగా వ్యవహరించరే?!"[82]

يٰقَوْمِ لَآ اَسْـَٔلُكُمْ عَلَيْهِ اَجْرًا ۗ اِنْ اَجْرِيَ اِلَّا عَلَى
الَّذِيْ فَطَرَنِيْ ۗ اَفَلَا تَعْقِلُوْنَ ﴿٥١﴾

76. ఆ సమూహాలు ఏవి? నూహుతో పాటు ఓడలోకి ఎక్కినవారా? లేక భావి తరాలవారా? భావితరాల వారిని దృష్టిలో పెట్టుకునే ఈ విధంగా అనబడి ఉంటుంది బహుశా.

77. ఓడ ద్వారా రక్షించబడిన వారికి కలిగే సంతానం గురించి ఇక్కడ చెప్పబడుతోంది. వారి ఈ సంతాన పరంపర ప్రళయం వరకూ నడుస్తుంది. అంటే దైవాజ్ఞల్ని ధిక్కరించిన వారికి మేము అశాశ్వతమైన ప్రాపంచిక జీవితంలో జీవన సామగ్రిని ప్రసాదిస్తాము. అయితే వాళ్లు పరలోకంలో మా శిక్షనుంచి ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేరు.

78. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) నుద్దేశించి చెప్పబడిన మాటలివి – ఈ మాటల ద్వారా ఆయన (సఅసం) కు రహస్య విషయాల జ్ఞానం లేదని స్పష్టం చేయబడింది. ఈ సమాచారం మేము పంపించబట్టి నీకు తెలిసింది, అంతకు ముందు నువ్వుగానీ, నీ జాతివారు గానీ వీటిని ఎరుగరు అని దేవుడు ఖచ్చితంగా చెప్పాడు.

79. (ఓ ముహమ్మద్!) నీ జాతి జనులు నిన్ను ధిక్కరిస్తున్నప్పటికీ, అనుదినం నిన్ను వేధిస్తున్నప్పటికీ నువ్వు చింతించవలసిన పని లేదు. ఓపికతో నీ కార్యక్రమాన్ని నువ్వు నిర్వర్తిస్తూ ఉండు. ఎందుకంటే నీకు మా తోడ్పాటు ఉంది. అంతిమ విజయం మీ వాళ్ళకే వరిస్తుంది. అంతిమ విజయం ఎన్నటికయినా భక్తిపరులదే అవుతుంది అని అల్లాహ్ తన ప్రవక్తను ఓదార్చాడు. అరబీలో **'ఆఖిబత్'** అని ఉంది. ఇహలోకంలోగాని, పరలోకంలోగాని కలిగే మంచి పరిణామం అని ఇక్కడ దాని భావం.

ఈ ఆయతు ద్వారా సజ్జనులకు లభించే సంకేతం ఏమిటంటే ప్రారంభంలో వారు ఎన్ని బాధలను భరించవలసి వచ్చినప్పటికీ, చివరకు వారు దేవుని అండదండలతో సఫలీకృతులవుతారు. దివ్యఖుర్ఆన్‌లోనే మరోచోట సెలవీయ బడినట్లు; 1. "నిశ్చయంగా మేము మా ప్రవక్తలకూ, విశ్వాసులకూ ప్రాపంచిక జీవితంలో కూడా తోడ్పడ తాము, సాక్షులు నిలబడే రోజున కూడా తోడ్పడతాము" (మోమిన్ – 51).

2. "తప్పక వారే సహాయం పొందుతారనీ, తప్పక మా సైన్యమే గెలుస్తుందనీ మా దాసులైన ప్రవక్తల విషయంలో మా వాగ్దానం ముందుగానే వెలువడింది" (సాఫ్ఫాత్: 171 – 173).

80. **"సోదరుడు"** అంటే అదే జాతికి చెందిన వ్యక్తి అని భావం.

52 "ఓ నా జాతివారలారా! మీ పోషకుని (అంటే అల్లాహ్) సమక్షంలో మీ తప్పుల మన్నింపుకై ప్రార్థించండి. ఆయన సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి. ఆయన మీపై (ఆకాశం నుండి) ధారాపాతంగా వర్షం కురిపిస్తాడు. మీకున్న బలిమికి మరింత శక్తినీ, బలాన్నీ చేకూరుస్తాడు.[83] మీరు మాత్రం అపరాధులుగా తిరిగిపోకండి."[84]

وَيٰقَوْمِ اسْتَغْفِرُوْا رَبَّكُمْ ثُمَّ تُوْبُوْٓا اِلَيْهِ يُرْسِلِ السَّمَآءَ عَلَيْكُمْ مِّدْرَارًا وَّيَزِدْكُمْ قُوَّةً اِلٰى قُوَّتِكُمْ وَلَا تَتَوَلَّوْا مُجْرِمِيْنَ ﴿52﴾

53 దానికి వారు, "ఓ హూద్! నువ్వు మా వద్దకు ఏ నిదర్శనాన్నీ తేలేదు. నువ్వు (నోటితో) చెప్పినంతమాత్రాన మేము మా ఆరాధ్య దైవాలను వదలిపెట్టలేము. నిన్ను మేము విశ్వసించబోవటం లేదు.[85]

قَالُوْا يٰهُوْدُ مَا جِئْتَنَا بِبَيِّنَةٍ وَّمَا نَحْنُ بِتَارِكِيْٓ اٰلِهَتِنَا عَنْ قَوْلِكَ وَمَا نَحْنُ لَكَ بِمُؤْمِنِيْنَ ﴿53﴾

54 పైగా మా ఆరాధ్యదైవాలలో ఎవరో నిన్ను ఏదైనా వ్యాధికి గురిచేసి ఉంటారని మేము అనుకుంటున్నాము"[86] అని పలికారు. అప్పుడు హూద్ ఇలా సమాధానమిచ్చాడు : "అల్లాహ్ తప్ప మీరు

اِنْ نَّقُوْلُ اِلَّا اعْتَرٰىكَ بَعْضُ اٰلِهَتِنَا بِسُوْٓءٍ ؕ قَالَ

81. అంటే – దైవత్వంలో అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించి మీరు ఆయనకు అబద్ధాన్ని అంటగట్టారని భావం.

82. మీ శ్రేయోభిలాషిని కాకపోతే నేనెందుకిలా వేతనం పుచ్చుకోకుండానే అహోరాత్రులు పనిచేస్తాను? ఈ మాత్రం విషయాన్ని అర్థం చేసుకునే ఇంగిత జ్ఞానం కూడా మీకు లేదా? "నా జాతి ప్రజలారా!" అని ఆయన మాటిమాటికీ సంబోధించటాన్ని బట్టి, అది దైవసందేశం అందజేసే విధానం అని తెలుస్తోంది. 'ఓ సత్య తిరస్కారులారా!' అనో, 'ఓ బహుదైవారాధకులారా!' అనో ఆయన పిలవకుండా "నా జాతి ప్రజలారా!" అని పిలవటం గమనార్హం. ఈ పిలుపులో ఆప్యాయత, శ్రేయోభిలాష ఉట్టిపడుతున్నాయి.

83. దైవప్రవక్త హూద్ తన జాతి వారికి చేసిన ఈ ఉపదేశంలో ఎన్నో పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. దైవాన్ని క్షమాభిక్ష కోరటం వల్ల, ఆయన ముందు పశ్చాత్తాపం చెందటం వల్ల వారికి క్షమాభిక్ష లభించటంతో పాటు మరెన్నో అనుగ్రహాలు కూడా లభిస్తాయి. దేవుడు వారిపట్ల ప్రసన్నుడవుతాడు. ఆకాశం నుంచి పుష్కలంగా వర్షం కురిపించి పంటలు పండిస్తాడు. పాడిపంటల, సిరిసంపదల ద్వారా వారి శక్తియుక్తులకు మరింత బలం చేకూరుతుంది. ఈ విషయమే దివ్య ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల పునరావృతమయింది. (ఉదాహరణకు : నూహ్ సూరాలోని 11వ ఆయతును చూడగలరు). అందుకే మహనీయ ముహమ్మదు (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు: "ఎవరయితే ఎల్లప్పుడూ పాపాల మన్నింపు కోసం దైవాన్ని వేడుకుంటూ ఉంటాడో అతన్ని అల్లాహ్ అన్ని రకాల చీకూ చింతల నుంచి విముక్తిని, అన్ని రకాల బాధల నుండి బయటపడే మార్గాన్నీ తెరుస్తాడు. అతడు ఊహించని చోట్లనుంచి అతనికి ఉపాధిని ప్రసాదిస్తాడు" (అబూ దావూద్ – కితాబుల్ విత్ర్; ఇబ్నె మాజ).

84. అంటే, నా మాటను నమ్మండి. నేను చేసే హితబోధ పట్ల విముఖులు కాకండి. నా సందేశాన్ని గనక మీరు ఆలకించకపోతే దైవసమక్షంలో నేరస్థులుగా హాజరు కావలసి ఉంటుంది.

85. ఒక ప్రవక్త ఏది చెప్పినా ప్రమాణబద్ధంగానే చెబుతాడు. అతని దగ్గర ప్రబల తార్కాణాలు ఉంటాయి. కాని స్థూల దృష్టి గలవారికి అవి కానరావు. హూద్ జాతికి చెందిన సత్యతిరస్కారులు కూడా స్థూల దృష్టి కలవారే. వారు తమ అసత్యంపై మొండికేశారు. వారు ఆవేశంలో ప్రవక్త మాటల్లోని ఔచిత్యాన్ని పరికించే జ్ఞానాన్ని కోల్పోయారు. నువ్వు ఏదైనా స్పష్టమైన నిదర్శనాన్ని చూపనంతవరకు నీ మాటలను నమ్మబోము, మా ఆరాధ్య దైవాలను కూడా వదలుకోము అని తెగేసి చెప్పారు.

إِنِّيٓ أُشۡهِدُ ٱللَّهَ وَٱشۡهَدُوٓاْ أَنِّي بَرِيٓءٞ مِّمَّا تُشۡرِكُونَ (54)

భాగస్వాములుగా నిలబెట్టే వారందరితో నేను విసుగెత్తిపోయాను. (వారితో నాకెలాంటి సంబంధం లేదు).[87] నేను ఈ విషయానికి అల్లాహ్‌ను సాక్షిగా పెడుతున్నాను–మీరు కూడా దీనికి సాక్షులుగా ఉండండి.”

مِن دُونِهِۦۖ فَكِيدُونِي جَمِيعٗا ثُمَّ لَا تُنظِرُونِ (55)

**55** “సరే. మీరంతా కలసి నాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నండి. నాకు ఏమాత్రం కూడా గడువు ఇవ్వకండి.[88]

إِنِّي تَوَكَّلۡتُ عَلَى ٱللَّهِ رَبِّي وَرَبِّكُمۚ مَّا مِن دَآبَّةٍ إِلَّا هُوَ ءَاخِذُۢ بِنَاصِيَتِهَآۚ إِنَّ رَبِّي عَلَىٰ صِرَٰطٖ مُّسۡتَقِيمٖ (56)

**56** “నేను కేవలం అల్లాహ్‌నే నమ్ముకున్నాను. ఆయన నాకూ ప్రభువే. మీ అందరికీ ప్రభువే. ప్రతి ప్రాణి యొక్క జుట్టు ఆయన చేతిలోనే ఉంది.[89] నిశ్చయంగా నా ప్రభువు సన్మార్గాన ఉన్నాడు.[90]

فَإِن تَوَلَّوۡاْ فَقَدۡ أَبۡلَغۡتُكُم مَّآ أُرۡسِلۡتُ بِهِۦٓ إِلَيۡكُمۡۚ وَيَسۡتَخۡلِفُ رَبِّي قَوۡمًا غَيۡرَكُمۡ وَلَا تَضُرُّونَهُۥ شَيۡـًٔاۚ إِنَّ رَبِّي عَلَىٰ كُلِّ شَيۡءٍ حَفِيظٞ (57)

**57** ఒకవేళ మీరు మరలిపోదలిస్తే (పొండి), నేను మాత్రం నాకిచ్చి పంపబడిన సందేశాన్ని మీకు అందజేశాను.[91] నా ప్రభువు మీ స్థానంలో ఇంకొకరిని తీసుకువస్తాడు. మీరు ఆయనకు ఏ విధమైన కీడూ కలిగించలేరు.[92] నిస్సందేహంగా నా ప్రభువు అన్నింటినీ పర్యవేక్షిస్తున్నాడు.”[93]

86. అంటే నువ్వు మా దేవీ దేవతలను పదే పదే కించపరుస్తూ మాట్లాడుతుండటం వల్ల అవి ఆగ్రహించాయి. వాటిలో ఏదో ఒక దేవత నిన్ను పట్టుకుని పిచ్చివాణ్ణిగా చేసేసి ఉంటుంది. నీ మతి చెడిపోయింది అంటూ వాళ్ళు హజ్రత్ హూద్ (అలైహిస్సలాం)ను చులకన చేశారు. ఈ రోగం నేటి ముస్లిం సమాజంలో కూడా కొంతమందిలో ఉంది. చనిపోయిన పుణ్యపురుషులు ఏ శక్తీ కలిగి ఉండరు అని అంటే వారు ఒప్పుకోరు. పైగా ఆ పుణ్యపురుషుల పట్ల ఈ విధంగా అమర్యాదగా మాట్లాడినందుకు వారు శపిస్తారని, ఆపదలకు గురిచేస్తారని చెబుతారు. దేవుడు ఈ దుష్టపోకడల నుంచి, అబద్ధాల బారి నుంచి మనందరినీ రక్షించుగాక!

87. మీ దేవుళ్ళు నన్ను పిచ్చివాణ్ణిగా చేశాయన్న మీ అనుమానంలో ఎలాంటి వాస్తవం లేదు. లాభనష్టాలు చేకూర్చే శక్తి అసలు వాటికి ఉంటే కదా! మీ చిల్లర దేవుళ్లతో విసుగెత్తిపోయాను అని హజ్రత్ హూద్ చెప్పారు.

88. మీరు పూజించే ఈ చిల్లర దేవుళ్ళు ఏదైనా చెయ్యగలుగుతాయన్న వాదనలో మీరు సత్యవంతులే అయితే రండి! మీరూ, మీ దేవుళ్ళూ కలసి నాకు వ్యతిరేకంగా ఏ వ్యూహాన్ని రచిస్తారో రచించండి అని హూద్ చెప్పారు. దైవప్రవక్త మాటల్లో ఎంతటి దూరదృష్టి ఉంటుందో, మరెంతటి ఆత్మ విశ్వాసం ఉంటుందో ఈ మాటల ద్వారా విదితమవుతోంది.

89. ఎవరి అధీనంలో సమస్త అధికారాలూ ఉన్నాయో ఆ శక్తిమంతుడే మీకూ, నాకూ ప్రభువు. ఆయన్ని వదలిపెట్టి మీరు పూజించే మీ 'దేవుళ్ళ' దగ్గర ఏ శక్తీ, మరే అధికారమూ లేదు. పైగా వారి జుత్తు కూడా దేవుని చేతిలోనే ఉంది. దేవుడు తాను కోరిన వారికి లాభంగానీ, నష్టంగానీ కలిగించగలడు. కాని మీ బూటకపు దేముళ్లకు అలా చేయటం చేతకాదు.

90. అంటే ఆయన తౌహీద్ (ఏకదైవారాధనా) మార్గం వైపుకు పిలుస్తున్నాడు. ఈ తౌహీద్ మార్గమే రుజుమార్గం. ఆయన పిలిచే మార్గంపై నడిచినప్పుడే మీరు సాఫల్యం పొందగలరు. ఈ మార్గం పట్ల వైముఖ్యం ప్రదర్శించారంటే మీకు వినాశం తప్పదు.

91. దీంతో నా బాధ్యత తీరిపోతుంది. ఒకవేళ మీరు నా మార్గాన రాకపోతే దానికి నేను బాధ్యుణ్ణి కాను.

وَلَمَّا جَآءَ اَمْرُنَا نَجَّيْنَا هُوْدًا وَّالَّذِيْنَ اٰمَنُوْا مَعَهٗ بِرَحْمَةٍ مِّنَّا ۚ وَنَجَّيْنٰهُمْ مِّنْ عَذَابٍ غَلِيْظٍ ﴿58﴾

**58** మరి మా ఆజ్ఞ (అమల్లోకి) వచ్చినప్పుడు మేము హూద్‌నూ, అతనితోపాటు విశ్వసించిన అతని సహచరులనూ మా ప్రత్యేక కృపతో కాపాడాము. ఘోరమైన శిక్ష నుంచి వారిని రక్షించాము.[94]

وَتِلْكَ عَادٌ ۟ۙ جَحَدُوْا بِاٰيٰتِ رَبِّهِمْ وَعَصَوْا رُسُلَهٗ وَاتَّبَعُوْٓا اَمْرَ كُلِّ جَبَّارٍ عَنِيْدٍ ﴿59﴾

**59** ఇదీ ఆద్ జాతి (వృత్తాంతం). వీరు తమ ప్రభువు ఆయతులను త్రోసిపుచ్చారు. ఆయన ప్రవక్తల పట్ల అవిధేయతకు పాల్పడ్డారు.[95] ఇంకా అహంకారి, అవిధేయీ అయిన ప్రతి వ్యక్తినీ వారు అనుసరించారు.[96]

وَاُتْبِعُوْا فِيْ هٰذِهِ الدُّنْيَا لَعْنَةً وَّيَوْمَ الْقِيٰمَةِ ؕ اَلَآ اِنَّ عَادًا كَفَرُوْا رَبَّهُمْ ؕ اَلَا بُعْدًا لِّعَادٍ قَوْمِ هُوْدٍ ﴿60﴾

**60** ప్రపంచంలోనూ వారికి శాపం అంటగట్టబడింది. ప్రళయ దినాన కూడా అది (వారిని) వెన్నంటి ఉంటుంది.[97] చూడండి! ఆద్ జాతి వారు తమ ప్రభువును తిరస్కరించారు. హూద్ జాతి వారైన ఆదు జనులు (దైవకారుణ్యానికి) దూరం చెయ్యబడ్డారు.[98]

92. అంటే మిమ్మల్ని తుదముట్టించి, మీకు ప్రత్యామ్నాయంగా ఇంకొకరిని తీసుకువస్తాడు. మీ రాజ్యాలకు, మీ భూములకు, మీ సిరిసంపదలకు వారు వారసులవుతారు. ఆయనకు అలా చేయటం ఏమాత్రం కష్టం కాదు. ఆయన ప్రణాళికను అడ్డుకునే శక్తి కూడా మీకు లేదు.

93. అంటే – నాకు వ్యతిరేకంగా మీరు పన్నే కుట్రలు కుతంత్రాల నుంచి ఆయన నన్ను కాపాడతాడు. షైతాను కుయుక్తుల నుంచి కూడా రక్షిస్తాడు. ప్రతి ఒక్కరికీ ఆయన వారి కర్మలను బట్టి సత్కరించటమో, శిక్షించటమో చేస్తాడు. ఎందుకంటే ఎవరి ఆంతర్యంలో ఏముందో, ఎవరెంత నికార్సయిన వారో ఆయన పసిగడుతూనే ఉన్నాడు.

94. **'ఘోరమైన శిక్ష'** అంటే ప్రచండ వేగంతో వీచే పెనుగాలుల ద్వారా ఆద్ జాతిని నాశనం చేసి, ప్రవక్త హూద్‌ను, విశ్వసించిన వారిని దేవుడు రక్షించాడు.

95. ఆద్ జాతివారు దేవుని 'ప్రవక్తల పట్ల అవిధేయతకు పాల్పడ్డారు' అని అనబడింది. మరి చూడబోతే ఆద్ జాతి వైపుకు పంపబడిన ప్రవక్త (హూద్) ఒక్కరే. ఒక ప్రవక్తను ధిక్కరించటం ప్రవక్తలందరినీ ధిక్కరించటం వంటిదే అన్న భావంలో అలా అనబడి ఉండవచ్చు. లేక ఆదు జాతిలో తిరస్కార గుణం పరాకాష్ఠకు చేరింది. ఒకవేళ దైవప్రవక్త హూద్ (అలైహిస్సలాం) తరువాత మరికొంతమంది ప్రవక్తలను వారివైపుకు పంపినా వారు ఆ ప్రవక్తల మాటను ఖాతరు చేసి ఉండేవారు కారు. లేదా ఇంకా కొంతమంది ప్రవక్తలు వారి వద్దకు చేరగా వారు ఆ ప్రవక్తలను కూడా ధిక్కరించి ఉంటారు!

96. ఒకవైపు వారు దైవప్రవక్త సందేశాన్ని ధిక్కరించారు. మరోవైపు అవిధేయులు, సత్య విరోధులు అయిన తమ జాతి సర్దారుల వెనుక మారు మాట్లాడకుండా నడిచారు.

97. **'శాపం అంటగట్టబడటం'** అంటే దైవకారుణ్యం నుంచి, మంచి విషయాల నుంచి వారు దూరం చేయబడ్డారని భావం. సామాన్య జనుల తరఫున ఛీత్కరించబడ్డారని కూడా చెప్పవచ్చు. ప్రపంచంలో విశ్వాసులు ఎప్పుడు వీళ్ళ గురించి ప్రస్తావించినా వీళ్ళను మంచివాళ్ళుగా ప్రస్తావించరు. చెడ్డవాళ్ళుగానే జ్ఞాపకం చేసుకుంటారు. ఇక పరలోకంలోనయితే సాక్షులందరి ముందు వారికి ఎదురయ్యే పరాభవం, అవమానం గురించి వేరుగా చెప్పనక్కరలేదు.

98. **"దూరం చెయ్యబడ్డారు"** (బుఅ్దన్) అంటే వారు దేవుని అనుగ్రహానికి నోచుకోకుండా పోయారు, దేవుని అభిశాపానికి గురయ్యారు, వినాశం పాలయ్యారు అని భావం.

وَإِلَىٰ ثَمُودَ أَخَاهُمْ صَٰلِحًا ۚ قَالَ يَٰقَوْمِ ٱعْبُدُوا۟
ٱللَّهَ مَا لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرُهُۥ ۖ هُوَ أَنشَأَكُم مِّنَ
ٱلْأَرْضِ وَٱسْتَعْمَرَكُمْ فِيهَا فَٱسْتَغْفِرُوهُ ثُمَّ تُوبُوٓا۟
إِلَيْهِ ۚ إِنَّ رَبِّى قَرِيبٌ مُّجِيبٌ ﴿٦١﴾

**61** మరి సమూద్ జాతి వైపుకు వారి సోదరుడైన సాలిహ్‌ను పంపాము.[99] అతను (వారినుద్దేశించి), "ఓ నా జాతి వారలారా! మీరు అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్య దైవం లేదు.[100] ఆయనే మిమ్మల్ని భూమి నుండి పుట్టించి,[101] అందులో మిమ్మల్ని వసింపజేశాడు.[102] కాబట్టి మీరు మన్నింపు కోసం ఆయన్నే వేడుకోండి, ఆయన వైపుకే మరలండి (పశ్చాత్తాపం చెందండి). నిశ్చయంగా నా ప్రభువు చాలా సమీపంలో ఉన్నాడు. ఆయన ప్రార్థనలను ఆలకించి ఆమోదిస్తాడు" అని చెప్పాడు.

قَالُوا۟ يَٰصَٰلِحُ قَدْ كُنتَ فِينَا مَرْجُوًّا قَبْلَ هَٰذَآ ۖ
أَتَنْهَىٰنَآ أَن نَّعْبُدَ مَا يَعْبُدُ ءَابَآؤُنَا وَإِنَّنَا لَفِى
شَكٍّ مِّمَّا تَدْعُونَآ إِلَيْهِ مُرِيبٍ ﴿٦٢﴾

**62** (దానికి సమాధానంగా వారు) ఇలా అన్నారు: "ఓ సాలిహ్! ఇంతకు మునుపు వరకూ మేము నీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాము. ఏమిటీ, మా తాతముత్తాతలు పూజిస్తూ వచ్చిన వారిని పూజించకుండా నువ్వు మమ్మల్ని ఆపుతున్నావా?! నువ్వు మమ్మల్ని ఏ ధర్మం వైపుకు పిలుస్తున్నావో దానిపై మాకు తీవ్రమయిన సందేహం ఉంది."[103]

99. సమూద్ జాతివారు అరేబియాలోని తబూక్ – మదీనా నగరాలకు మధ్యన గల మదాయనె సాలెహ్ (హిజ్ర్) అనే ప్రదేశంలో ఉండేవారు. ఆద్ జాతి తరువాత భూమండలంపై ఉనికిలోకి వచ్చిన జాతి ఇది. దైవప్రవక్త సాలెహ్ (అలైహిస్సలాం)ను కూడా ఈ ఆయతులో సమూద్ జనుల సోదరునిగా పేర్కొనటం జరిగింది. అంటే సాలెహ్ సమూదు జాతికి చెందిన వ్యక్తియేనన్నమాట!

100. హజ్రత్ సాలెహ్ కూడా ప్రవక్తలందరి లాగానే తన జాతి వారిని అన్నింటికంటే ముందు ఏకదైవారాధన (తౌహీద్) వైపుకు ఆహ్వానించారు.

101. అంటే తొలుత ఆయన మిమ్మల్ని నేల నుంచి వెలికి తీశాడు. అంటే మీ మూల పురుషుడైన ఆదం (అలైహిస్సలాం) మట్టితో సృజించబడగా, ప్రపంచంలోని మానవులంతా ఆదం వెన్ను నుంచి తీయబడ్డారు. అంటే మట్టికీ – మనిషికీ అవినాభావ సంబంధం ఉంది. దీనికి మరో అర్థం కూడా ఉంది: "మీరు తినే ఆహార వస్తువులన్నీ మట్టిలో నుంచే పుడతాయి. ఈ ఆహారం ద్వారానే మీలో రేతస్సు (వీర్యం) ఉత్పత్తి అవుతుంది. ఆ రేతస్సు కణాలు మాతృగర్భాలలోకి వెళ్ళి ఆగుతాయి. ఆ తరువాత అవి మానవ నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుడతాయి. దీనంతటికీ మూలం మట్టే."

102. అంటే భూమండలంలోని వివిధ ప్రదేశాలలో జనవాసాలను స్థిరపరచే తెలివితేటలను, శక్తియుక్తులను ఆయన మీలో పొందుపరచాడు. దాంతో మీరు నివాసం కొరకు భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అందమైన ఇళ్లు, పారిశ్రామిక వాడలు నిర్మిస్తున్నారు. ఆహారం కోసం వ్యవసాయం చేస్తున్నారు. ఇతరత్రా జీవనావసరాలను తీర్చుకునేందుకు తరుణోపాయం ఆలోచిస్తున్నారు.

103. ప్రవక్త అయినవాడు ఆ జాతి జనులలో నైతికంగా ఉన్నత స్థానాన్ని అధిరోహించి ఉంటాడు. సత్యవంతుడు, నిజాయితీపరుడు అయి ఉంటాడు. అప్పగింతల విషయంలో నమ్మకస్థుడుగా పేరుమోసి ఉంటాడు. అటువంటి వ్యక్తిపట్ల సహజంగానే ఆ జాతి ప్రజలు ఆశలు పెంచుకుని ఉంటారు. ఆ మాటే సాలెహ్ జాతిజనులు యిక్కడ చెప్పారు. అయితే సాలెహ్ తన జాతి వారిని 'దేవుని ఏకత్వం' వైపుకు పిలిచేసరికి వారి ఆశల పల్లకి కూలిపోయింది!

**63** "ఓ నా జాతి ప్రజలారా! మీరే చెప్పండి, నేను నా ప్రభువు తరఫున ఒక బలమైన నిదర్శనాన్ని పొంది ఉండి,[104] ఆయన నాకు తన కారుణ్యాన్ని కూడా ప్రసాదించి ఉండగా, నేను ఆయన పట్ల అవిధేయతను కనబరిస్తే[105] ఆయనకు వ్యతిరేకంగా నన్ను ఆదుకో గలవాడెవడు? మీరు నాకు మరింత నష్టాన్ని కలిగించటం తప్ప ఏమీ చెయ్యలేరు."[106]

قَالَ يٰقَوۡمِ اَرَءَيۡتُمۡ اِنۡ كُنۡتُ عَلٰى بَيِّنَةٍ مِّنۡ رَّبِّىۡ وَاٰتٰىنِىۡ مِنۡهُ رَحۡمَةً فَمَنۡ يَّنۡصُرُنِىۡ مِنَ اللّٰهِ اِنۡ عَصَيۡتُهٗ فَمَا تَزِيۡدُوۡنَنِىۡ غَيۡرَ تَخۡسِيۡرٍ ﴿63﴾

**64** "ఓ నా జాతివారలారా! అల్లాహ్ మీ కోసం ఒక సూచనగా పంపిన ఆడ ఒంటె ఇది. మీరు ఈ ఒంటెను అల్లాహ్ భూమిపై స్వేచ్ఛగా మేస్తూ తిరిగేలా వదిలిపెట్టండి. దానికి ఎలాంటి కీడూ తలపెట్టకండి. మీరు గనక దాని జోలికి పోయారంటే తొందరగానే శిక్ష మీపై విరుచుకుపడుతుంది"[107] అని సాలిహ్ వారికి చెప్పాడు.

وَيٰقَوۡمِ هٰذِهٖ نَاقَةُ اللّٰهِ لَـكُمۡ اٰيَةً فَذَرُوۡهَا تَاۡكُلۡ فِىۡۤ اَرۡضِ اللّٰهِ وَلَا تَمَسُّوۡهَا بِسُوۡٓءٍ فَيَاۡخُذَكُمۡ عَذَابٌ قَرِيۡبٌ ﴿64﴾

**65** అయినాసరే వారు ఆ ఒంటె కాళ్ళను నరికేశారు. అప్పుడు సాలిహ్ "మీరు మీ ఇళ్ళల్లో మూడు రోజుల పాటు ఉండి జీవితాన్ని అనుభవించండి. ఈ వాగ్దానం (నిర్ధారిత గడువు) అబద్ధం కానేరదు"[108] అని చెప్పాడు.

فَعَقَرُوۡهَا فَقَالَ تَمَتَّعُوۡا فِىۡ دَارِكُمۡ ثَلٰثَةَ اَيَّامٍ‌ ؕ ذٰ لِكَ وَعۡدٌ غَيۡرُ مَكۡذُوۡبٍ ﴿65﴾

నిన్నటిదాకా కొనియాడినవారే ఇప్పుడు తెగనాడసాగారు. నిన్నటివరకూ ప్రశంసల వర్షం కురిపించినవారే ఈ రోజు నుంచి ఆరోపణాస్త్రాలు సంధించసాగారు. ఆయన ప్రబోధించే ఏకదైవారాధనా సందేశం వారిని అయోమయంలో పడవేసింది. అనుమానాలను రేకెత్తించింది.

104. **"బలమైన నిదర్శనం"** అంటే 'విశ్వాసం' నమ్మకం అని భావం. దేవుడు తన ప్రవక్తకు విశ్వాస భాగ్యంతోపాటు తన ప్రత్యేక కరుణానుగ్రహాన్ని (దైవదౌత్యాన్ని) కూడా ప్రసాదిస్తాడు.

105. **"అవిధేయత కనబరచటం"** అంటే దేవుడు ఇన్ని మహోపకారాలు చేసిన మీదట కూడా నేను ఆయన మార్గం వైపుకు మానవాళిని పిలిచే పనిని మానేస్తే, ఏకదైవారాధనా సిద్ధాంతాన్ని విస్మరిస్తే దేవుడు ఊరుకుంటాడా? ఎట్టి పరిస్థితిలోనూ ఊరుకోడు. ఒకవేళ ఆయన నన్ను పట్టుకుంటే ఆయన బారినుంచి మీరు నన్ను రక్షించగలరా? రక్షించలేరు.

106. దేవుని పట్టునుండి మీరు నన్ను కాపాడలేరు సరికదా, నన్ను ఇంకా నష్టానికి గురిచేస్తారు.

107. సమూద్ జాతి వారి కోరికపై దేవుడు ఈ ఒంటెను – వారికళ్ల ముందరే – ఒక కొండ లేక బండరాయి నుంచి వెలికి తీశాడు. అందుకే దానిని "దేవుని ఒంటె" అని పిలువటం జరిగింది. ఎందుకంటే అది దైవాజ్ఞానుసారం – ప్రకృతి ప్రక్రియకు విరుద్ధంగా – ఓ మహిమగా సృష్టించబడింది. దానికెలాంటి అపకారం చెయ్యరాదని కూడా ముందుగానే తాకీదు చేయబడింది. అన్యథా దైవ శిక్షకు గురి కావలసి వస్తుందని హెచ్చరిక జారీ చేయబడింది.

108. అంత పెద్ద సూచనను సయితం ఆ దుర్మార్గులు ఖాతరు చెయ్యలేదు. ఆ ఒంటెను చూసిన తరువాత దైవాన్ని విశ్వసించవలసింది పోయి, దైవధిక్కారానికి పాల్పడుతూ ఆ ఒంటెను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఆ తరువాత వారికి మూడు రోజుల గడువు ఇవ్వబడింది. గడువు ముగిసిన వెంటనే దైవశిక్ష అవతరిస్తుందని వార్నింగ్ ఇవ్వబడింది.

**66** మరి మా ఉత్తర్వు (అమలుపరచబడే సమయం) ఆసన్న మైనప్పుడు[109] మేము సాలిహ్‌ను, అతనితోపాటు విశ్వాసులను మా కారుణ్యంతో కాపాడాము. ఆ దినపు అవమానం నుంచి కూడా వారిని రక్షించాము. నిస్సందేహంగా నీ ప్రభువు బలవంతుడు, ఆధిక్యత గలవాడు.

فَلَمَّا جَآءَ اَمْرُنَا نَجَّيْنَا صٰلِحًا وَّالَّذِيْنَ اٰمَنُوْا مَعَهٗ بِرَحْمَةٍ مِّنَّا وَمِنْ خِزْيِ يَوْمِئِذٍ ؕ اِنَّ رَبَّكَ هُوَ الْقَوِيُّ الْعَزِيْزُ ﴿66﴾

**67** ఇకపోతే దుర్మార్గులను భయంకరమైన అరుపు[110] ఒకటి కబళించింది. దాంతో వారు తమ ఇళ్ళల్లోనే సాగిలపడి (చచ్చి) పోయారు[111] –

وَاَخَذَ الَّذِيْنَ ظَلَمُوا الصَّيْحَةُ فَاَصْبَحُوْا فِيْ دِيَارِهِمْ جٰثِمِيْنَ ﴿67﴾

**68** – అసలు వారెప్పుడూ అక్కడ నివసించనే లేదన్నట్లుగా![112] తెలుసుకోండి! సమూద్ జాతి వారు తమ ప్రభువును తిరస్కరించారు. తెలుసుకోండి! సమూద్ జాతివారు (దైవకారుణ్యానికి) దూరం చేయబడ్డారు.

كَاَنْ لَّمْ يَغْنَوْا فِيْهَا ؕ اَلَآ اِنَّ ثَمُوْدَاۡ كَفَرُوْا رَبَّهُمْ ؕ اَلَا بُعْدًا لِّثَمُوْدَ ﴿68﴾

**69** మా ద్వారా పంపబడిన దూతలు శుభవార్తను[113] మోసుకుని ఇబ్రాహీము దగ్గరకు వెళ్ళారు. అతనికి 'సలామ్' చేశారు.[114] అతను కూడా 'ప్రతిసలాం'[115] చేశాడు. మరి అతను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వేపిన ఆవుదూడను తెచ్చాడు.[116]

وَلَقَدْ جَآءَتْ رُسُلُنَآ اِبْرٰهِيْمَ بِالْبُشْرٰى قَالُوْا سَلٰمًا ؕ قَالَ سَلٰمٌ فَمَا لَبِثَ اَنْ جَآءَ بِعِجْلٍ حَنِيْذٍ ﴿69﴾

109. దేవుడు చేసిన వాగ్దానం ప్రకారం వచ్చిన శిక్షే యిది. మూడు రోజుల గడువు ఇవ్వబడింది. గడువు ముగియగానే నాల్గవ రోజున అది సంభవించింది. హ్రజత్ సాలెహ్ (అలైహిస్సలాం), ఆయనను విశ్వసించిన వారు తప్ప మిగిలిన వారంతా ఈ శిక్షకు గురయ్యారు.

110. అరబీలో **'సైహ్'** అని ఉంది. అంటే ఈ శిక్ష పెద్ద అరుపు, భయంకరమైన గర్జన రూపంలో వచ్చింది. కొంతమంది వ్యాఖ్యాతలు దీన్ని దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) పెట్టిన కేకగా అభిప్రాయపడ్డారు. మరికొంతమంది దీన్ని ఆకాశ గర్జనగా అభివర్ణించారు. మొత్తానికి ఈ కేకతో వారి గుండెలు పగిలి, పై ప్రాణాలు పైకే లేచిపోయాయి. అంతలోనే భూమి కూడా ప్రకంపించింది. అంతా అతలాకుతలం అయిపోయింది. అల్ ఆరాఫ్ సూరా 78వ వచనంలో ఈ ప్రస్తావన ఉంది.

111. చూడబోతే వారంతా, గాలివానకు కుప్పకూలిన రాబందుల్లా కనిపించారు. ముఖాలు మట్టిలో కలసినట్లున్నాయి.

112. ఆ బస్తీవాసులు నామరూపాల్లేకుండా నిర్మూలించబడ్డారు. కనీసం ఒకప్పుడు వారక్కడ నివసించిన ఆనవాళ్లు కూడా లేనట్లుగా చెరిపివేయబడ్డారు.

113. ఇది వాస్తవానికి హ్రజత్ లూత్ (అలైహిస్సలాం)కు – ఆయన జాతి జనులకు సంబంధించిన వృత్తాంతంలోని ఓ భాగం. హ్రజత్ లూత్ (అలైహిస్సలాం) హ్రజత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి బాబాయి లేక పెదనాన్న కొడుకు. లూత్ జాతివారు నల్ల సముద్రానికి నైరుతి దిశలో నివసించేవారు. ఆ కాలంలో హ్రజత్ ఇబ్రాహీం పాలస్తీనా ప్రాంతంలో ఉన్నారు. లూత్ జాతిని నాశనం చేయాలని నిర్ణయించుకుని దేవుడు తన దూతలను పంపించాడు. లూత్ జాతి వద్దకు పోతూ పోతూ దైవదూతలు ఇబ్రాహీము దగ్గరకు వచ్చి, ఆయనకు సంతానం కలుగుతుందన్న శుభవార్తను అందించారు.

**70** అయితే వారి చేతులు దాని వైపుకు చేరకపోవటం చూసి అతను వారిని శంకించాడు. లోలోపలే భయపడసాగాడు.[117] అప్పుడు వారు, “భయపడకు. మేము లూత్ జాతి వైపుకు పంపబడ్డాము”[118] అన్నారు.

فَلَمَّا رَاٰۤ اَيْدِيَهُمْ لَا تَصِلُ اِلَيْهِ نَكِرَهُمْ وَاَوْجَسَ مِنْهُمْ خِيْفَةً ؕ قَالُوْا لَا تَخَفْ اِنَّاۤ اُرْسِلْنَاۤ اِلٰى قَوْمِ لُوْطٍ ؕ (70)

**71** అక్కడ నిలబడి ఉన్న అతని భార్య నవ్వేసింది.[119] ఆ సమయంలో మేము ఆమెకు ఇస్‌హాఖ్ గురించి, ఇస్‌హాఖు తరువాత యాఖూబు గురించిన శుభవార్తను వినిపించాము.

وَامْرَاَتُهٗ قَآئِمَةٌ فَضَحِكَتْ فَبَشَّرْنٰهَا بِاِسْحٰقَ ۙ وَمِنْ وَّرَآءِ اِسْحٰقَ يَعْقُوْبَ (71)

**72** “అయ్యో! నా దౌర్భాగ్యం! నేను ముసలిదాన్ని. నా భర్త కూడా వృద్ధుడే. అయినా నాకు సంతానం కలుగుతుందా? ఇదేదో వింతగా ఉందే!”[120] అని ఆమె అన్నది.

قَالَتْ يٰوَيْلَتٰۤى ءَاَلِدُ وَاَنَا عَجُوْزٌ وَّهٰذَا بَعْلِىْ شَيْخًا ؕ اِنَّ هٰذَا لَشَىْءٌ عَجِيْبٌ (72)

114. అంటే – మీపై శాంతి కలుగుగాక! అని దీవించారు.

115. మీకు కూడా శాంతి కలగాలని ఆకాంక్షిస్తున్నాను అని హజ్రత్ ఇబ్రాహీము (అలైహిస్సలాం) పలికారు.

116. ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) అతిథులకు చాలా మర్యాదలు చేసేవారు. వచ్చిన వారెవరో, ఎందుకు వచ్చారో తెలుసుకోకుండానే ఆయన భోజన ఏర్పాట్లలో నిమగ్నులయ్యారు. కాల్చిన (వేపుడు) ఆవుదూడను వారికోసం సమర్పించారు. దీన్నిబట్టి తెలిసే మరో ముఖ్య విషయం ఏమిటంటే అతిథులు కోరినదే పెట్టాలని ఏమీలేదు. ఇంట్లో తినడానికి ఏముంటే అదే అతిథులకూ పెట్టవచ్చు.

117. అతిథుల చేతులు భోజనం వైపుకు పోకపోవటంతో హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) లోలోపలే భయపడ్డారు. ఆ కాలంలో ఇంటికి వచ్చిన వారు ఆతిథ్యాన్ని స్వీకరించకపోతే వారు మంచి ఉద్దేశంతో రాలేదని జనులు అనుకునేవారు. అందుకే ప్రవక్త మనసు కీడును శంకించింది. దైవప్రవక్తలకు రహస్య జ్ఞానం ఉండదన్న విషయానికి ఈ సంఘటన కూడా ఒక నిదర్శనమే. ఇబ్రాహీం (అ)కే గనక రహస్య విషయాల జ్ఞానం ఉండి ఉంటే మానవాకారంలో వచ్చిన దైవదూతల కోసం భోజనాన్ని సమర్పించటంగానీ, మనసులో భయపడటంగానీ చేసేవారు కాదు.

118. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ముఖ కవళికలను చూసి, ఆయన భయాందోళనకు గురై ఉన్నారని దైవదూతలు గ్రహించి ఉండవచ్చు. లేదా హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారే స్వయంగా తన భయాందోళనను వెలిబుచ్చి ఉండవచ్చు. అల్ హిజ్ర్ సూరాలోని 52వ వచనం ద్వారా ఇదే తెలుస్తోంది : “మీరంటే మాకెందుకో భయమేస్తున్నది.” అందుకే దైవదూతలు ఆయనకు అభయమిచ్చారు. ‘భయపడకండి. మీరు భయపడుతున్నట్లుగా మేము మీ కీడును తలపెట్టి రాలేదు. వాస్తవానికి మేము దేవుని తరఫు నుంచి పంపబడ్డాము. లూత్ జాతివారిని శిక్షించటానికి వెళుతున్నాము’ అని చెప్పారు.

119. దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) భార్య ఎందుకు నవ్వింది? అన్నది ప్రశ్న. ఆమెకు లూత్ జాతివారి నీతిబాహ్యమైన చేష్ట గురించి ముందు నుంచే తెలుసు. వారిని దండించే సమయం వచ్చిందని తెలియగానే సంతోషంతో అలా నవ్వేసి ఉంటుందని కొందరు భావించారు. “ఆకాశం నుంచి శిక్ష విరుచుకుపడబోతున్నా ఈ దుర్మార్గులకు కనువిప్పు కలగటం లేదే?! వీళ్ల పరధ్యానం గురించి ఏమనాలి?!” అన్న ఆశ్చర్యంతో ఆమె అలా నవ్వి ఉండవచ్చుని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. వార్ధక్యంలో కొడుకు పుడతాడన్న వార్త విని ఆమెకు నవ్వొచ్చి ఉంటుందని ఇంకా కొంతమంది వ్యాఖ్యాతలు తలపోశారు.

120. ఆశ్చర్యాన్ని ప్రకటించిన ఇబ్రాహీము (అలైహిస్సలాం) సతీమణి పేరు సారా. అప్పటికే ఆమె వృద్ధాప్యానికి చేరుకుంది.

**73** దానికి దైవదూతలు, "నువ్వు దైవ శక్తి పట్ల ఆశ్చర్యపడు తున్నావా?![121] (ఇబ్రాహీము) ఇంటివారలారా! మీపై అల్లాహ్ కారుణ్యం, ఆయన శుభాలు కురియుగాక![122] నిశ్చయంగా ఆయన స్తుతించదగినవాడు, మహా ఘనతకలవాడు" అని చెప్పారు.

قَالُوٓا۟ أَتَعْجَبِينَ مِنْ أَمْرِ ٱللَّهِ رَحْمَتُ ٱللَّهِ وَبَرَكَٰتُهُۥ عَلَيْكُمْ أَهْلَ ٱلْبَيْتِ ۚ إِنَّهُۥ حَمِيدٌ مَّجِيدٌ ﴿٧٣﴾

**74** ఇబ్రాహీము భయాందోళనలు తొలగిపోయి, శుభవార్త కూడా అతనికి అందిన మీదట, అతను లూత్ జాతి వారి విషయంలో మాతో వాదించసాగాడు.[123]

فَلَمَّا ذَهَبَ عَنْ إِبْرَٰهِيمَ ٱلرَّوْعُ وَجَآءَتْهُ ٱلْبُشْرَىٰ يُجَٰدِلُنَا فِى قَوْمِ لُوطٍ ﴿٧٤﴾

**75** నిశ్చయంగా ఇబ్రాహీం ఎంతో సహనశీలి. మృదు మనస్కుడు. నమ్రతతో అల్లాహ్ వైపుకు మరలేవాడు.

إِنَّ إِبْرَٰهِيمَ لَحَلِيمٌ أَوَّٰهٌ مُّنِيبٌ ﴿٧٥﴾

**76** "ఓ ఇబ్రాహీం! ఈ ఆలోచనను వదలి పెట్టు. నీ ప్రభువు ఉత్తర్వు వచ్చేసింది. ఎవరూ తప్పించలేని శిక్ష వారిపై వచ్చి పడటం తథ్యం"[124] (అని దైవదూతలు పలికారు).

يَٰٓإِبْرَٰهِيمُ أَعْرِضْ عَنْ هَٰذَآ ۖ إِنَّهُۥ قَدْ جَآءَ أَمْرُ رَبِّكَ ۖ وَإِنَّهُمْ ءَاتِيهِمْ عَذَابٌ غَيْرُ مَرْدُودٍ ﴿٧٦﴾

**77** మేము పంపిన దూతలు లూత్ వద్దకు చేరుకున్నప్పుడు వారి రాకపై అతను దుఃఖవదనుడయ్యాడు. లోలోపలే కుంచించుకు పోతూ, "ఇది చాలా గడ్డురోజు"[125] అని అన్నాడు.

وَلَمَّا جَآءَتْ رُسُلُنَا لُوطًا سِىٓءَ بِهِمْ وَضَاقَ بِهِمْ ذَرْعًا وَقَالَ هَٰذَا يَوْمٌ عَصِيبٌ ﴿٧٧﴾

భర్త ఇబ్రాహీం కూడా ముసలివారే. ఆ వయసులో సంతాన భాగ్యం కలుగుతుందంటే మరి ఆశ్చర్యపోవలసిన విషయమే కదా!

121. దేవుని మహిమ పట్ల ఆశ్చర్యం చెందరాదని దీని భావం. మూల కారకాల అవసరం అల్లాహ్‌కు లేదు. ఆయన ఎప్పుడు, ఏది తలచుకున్నా 'అయిపో' అని ఆదేశించగానే అది అయిపోతుంది.

122. ఇబ్రాహీం సతీమణిని దైవదూతలు ఇక్కడ "ఇంటివారలు" (అహ్లె బైత్)గా సంబోధించారు. అదీగాక బహువచన పుంలింగ పదాన్ని ఉపయోగించటం జరిగింది. ఈ వాక్యం ద్వారా గృహస్థుల (అహ్లె బైత్)లో అందరికన్నా ముందు చేరే మనిషి అర్ధాంగి అని అవగతం అవుతోంది. మరో విషయం ఏమిటంటే 'ఇంటి ఆడవారి' కోసం బహువచన పుంలింగ పదం ఉపయోగించవచ్చు. అల్ అహ్‌జాబ్ సూరా 33వ ఆయతులో కూడా దైవప్రవక్త (సఅసం) సతీమణులనుద్దేశించి 'ఇంటివారలు' (అహ్లె బైత్) అనే పదం ప్రయోగించటం జరిగింది. వారిని బహువచన పుంలింగ పదంతో సంబోధించటం జరిగింది.

123. **"వాదించటం"** అంటే ఎందుకు శిక్షిస్తారు? అని దెబ్బలాడటం కాదు. శిక్ష అవతరించే ఆ ప్రదేశంలో దైవప్రవక్త (లూత్) కూడా ఉంటున్నాడు కదా! అన్నది ఆయన ఆవేదన. అప్పుడు దైవదూతలు, "లూత్ (అలైహిస్సలాం) కూడా అక్కడ ఉంటున్నాడన్న సంగతి మాకు తెలుసు. అయితే మేము అతని భార్య ఒకామె తప్ప - అతన్నీ, అతని ఇంటివారినీ రక్షిస్తాము" అని సమాధానమిచ్చారు (అన్‌కబూత్ - 32).

124. ఇప్పుడు తర్జన భర్జన జరిపి లాభం లేదు. విధివ్రాత ప్రకారం దైవనిర్ణయం జరిగి పోయింది. వాదోపవాదాల వల్లగానీ, వేడుకోళ్ల వల్లగానీ ఆ 'తీర్పు' మార్చబడదు అని దైవ దూతలు ఇబ్రాహీంకు స్పష్టం చేశారు.

125. హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) అంతగా మనస్తాపం చెందడానికి కారణం ఏమిటంటే దైవదూతలు మీసాలు కూడా

78 (మరో వైపునుంచి) అతని జాతి వారు పరుగులు తీస్తూ అతని వద్దకు వచ్చారు. వారు మొదటినుంచే ఇటువంటి నీచపు పనులు చేస్తుండేవారు.[126] "నా జాతి ప్రజలారా! ఇదిగో, నా కూతుళ్ళు[127] ఉన్నారు. మీ కొరకు వీరు పరిశుద్ధులు. మీరు అల్లాహ్‌కు భయ పడండి. నా అతిథుల విషయంలో నన్ను నవ్వులపాలు చెయ్య కండి. ఏమిటీ, మీలో ఒక్కడైనా మంచివాడు లేడా?"[128] అని లూతు నచ్చజెప్పాడు.

وَجَآءَهُۥ قَوْمُهُۥ يُهْرَعُونَ إِلَيْهِ وَمِن قَبْلُ كَانُوا۟
يَعْمَلُونَ ٱلسَّيِّـَٔاتِ ۚ قَالَ يَٰقَوْمِ هَٰٓؤُلَآءِ بَنَاتِى
هُنَّ أَطْهَرُ لَكُمْ ۖ فَٱتَّقُوا۟ ٱللَّهَ وَلَا تُخْزُونِ فِى
ضَيْفِىٓ ۖ أَلَيْسَ مِنكُمْ رَجُلٌ رَّشِيدٌ ﴿٧٨﴾

79 "నీ కూతుళ్ళపై మాకెలాంటి హక్కు లేదన్న సంగతి నీకు బాగా తెలుసు. మాకిష్టమైనది ఏదో కూడా నీకు తెలుసు కదా!"[129] అని వారు సమాధానమిచ్చారు.

قَالُوا۟ لَقَدْ عَلِمْتَ مَا لَنَا فِى بَنَاتِكَ مِنْ حَقٍّ
وَإِنَّكَ لَتَعْلَمُ مَا نُرِيدُ ﴿٧٩﴾

80 "(అయ్యో!) మిమ్మల్ని ప్రతిఘటించే బలం నాకుంటే ఎంత బావుండేది! లేదా నేను ఆశ్రయం పొందటానికి ఏదైనా దృఢమైన ఆధారం ఉంటే ఎంత బావుండేది!"[130] అని లూత్ అన్నాడు.

قَالَ لَوْ أَنَّ لِى بِكُمْ قُوَّةً أَوْ ءَاوِىٓ إِلَىٰ
رُكْنٍ شَدِيدٍ ﴿٨٠﴾

---

మొలవని నవయువకుల రూపంలో వచ్చారు. తన జాతి పురుషుల సిగ్గుమాలిన చేష్టల గురించి ఆయనకు తెలుసు కాబట్టి పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి ఆయన వ్యాకులతకు లోనయ్యారు. వచ్చిన ఆ అందమైన నవయువకులు అతిథులు కానేకారనీ, వారు దైవశాసనాన్ని అమలుపరచడానికి వచ్చిన దైవదూతలని ఆయనకు తెలీదు.

126. లూత్ ఇంటికి అందమైన కొందరు యువకులు వచ్చి ఉన్నారని తెలియగానే ఆ స్వలింగ సంపర్క రోగగ్రస్తులు ఉండబట్టలేక పరుగెత్తుకుని వచ్చారు. ఆ యువకులను తమ తమ ఇళ్లకు తీసుకుపోయి వాళ్ళను ఆ పాడుపని కోసం ఉపయోగించుకోవాలనుకున్నారు.

127. అంటే – లైంగిక కోర్కెల్ని తీర్చుకోవాలన్నదే మీ ఉద్దేశ్యమైతే అందుకోసం 'నా కూతుళ్లు' ఉన్నారు. వారిని వివాహ మాడండి. మీ కోర్కెల్ని ధర్మబద్ధంగానూ, సహజపద్ధతిలోనూ తీర్చుకోండి. ఇదే మీ కొరకు అన్ని విధాలా శ్రేయస్కరం అని లూత్ చెప్పదలిచారు. ఇక్కడ 'కూతుళ్లు' అంటే ఎవరు? తన జాతికి చెందిన మహిళలను ఆయన కూతుళ్లుగా చెప్పుకున్నారని చాలామంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే దైవప్రవక్త తన జాతివారి కొరకు పితామహుని వంటివాడు. అలా చెప్పటంలోని ఆయన ఆంతర్యం ఏమిటంటే సమాజంలో ఇంతమంది ఆడపిల్లలు ఉండగా మీకేం పోయే రోగం వచ్చింది? మీరు ఆ అమ్మాయిలను పెళ్లి చేసుకుని మీ సహజ కోరికల్ని తీర్చుకోవచ్చుకదా! (ఇబ్నె కసీర్).

128. ఏమిటీ? నా ఇంటికి వచ్చిన అతిథులతో దుర్వ్యవహారం చేసి నన్ను అవమానాలపాలు చేస్తారా? మీలో ఆ మాత్రం అర్థం చేసుకునే వారు లేరా? అతిథి మర్యాదకు కళంకం తెస్తారా? మీ దుష్ట బుద్ధిని అడ్డుకునే సజ్జనుడు మీలో ఒక్కడూ లేడా?

దైవప్రవక్త లూత్ ఇంతగా కలత చెందడానికి కారణం అప్పటివరకూ ఆయన ఆ అతిథులను మానవ మాత్రులుగా తలపోయటమే. ఆ వచ్చిన వారు మనుషులు కారనీ, దుర్మార్గుల భరతం పట్టడానికి దివి నుంచి భువికి దిగివచ్చిన దైవదూతలని ఆయనకు తెలీదు. వారు దైవదూతలన్న సంగతి ఆయనకు ముందు నుంచే తెలిసి ఉంటే కలవరం చెందేవారు కారు. దైవప్రవక్తలకు రహస్య విషయాల జ్ఞానం ఉండదని చెప్పడానికి ఇది కూడా ఒక ప్రబల తార్కాణమే.

129. అంటే ఆ దుర్మార్గులు సహజమైన, ధర్మసమ్మతమైన ఒక పద్ధతిని త్రోసిపుచ్చి అసహజమైన, అహేతుకమైన, అధర్మమైన

**81** అప్పుడు దైవదూతలు “ఓ లూత్! మేము నీ ప్రభువు తరఫున పంపబడినవారము. వారు నీ దాకా రాలేరు. కాబట్టి నువ్వు నీ ఇంటివారిని తీసుకుని కొంత రాత్రి ఉండగానే బయలుదేరు. మీలో ఎవరూ వెనుతిరిగి చూడకూడదు. అయితే నీ భార్య; వారందరికీ పట్టే గతే ఆవిడకూ పట్టనున్నది. వారి కోసం ఉదయ సమయం నిశ్చయించబడింది. ఏమిటీ, ఉదయ సమయం దగ్గరలో లేదా?”[131] అని పలికారు.

قَالُوْا يٰلُوْطُ اِنَّا رُسُلُ رَبِّكَ لَنْ يَّصِلُوْٓا
اِلَيْكَ فَاَسْرِ بِاَهْلِكَ بِقِطْعٍ مِّنَ الَّيْلِ
وَلَا يَلْتَفِتْ مِنْكُمْ اَحَدٌ اِلَّا امْرَاَتَكَ ؕ
اِنَّهٗ مُصِيْبُهَا مَآ اَصَابَهُمْ ؕ اِنَّ مَوْعِدَهُمُ
الصُّبْحُ ؕ اَلَيْسَ الصُّبْحُ بِقَرِيْبٍ ﴿81﴾

**82** మరి మా ఉత్తర్వు(ను అమలుపరచే సమయం) రాగానే ఆ బస్తీని తలక్రిందులుగా చేసేసి, వారిపై నిరాఘాటంగా గులక రాళ్ళను కురిపించాము.

فَلَمَّا جَآءَ اَمْرُنَا جَعَلْنَا عَالِيَهَا سَافِلَهَا وَاَمْطَرْنَا
عَلَيْهَا حِجَارَةً مِّنْ سِجِّيْلٍ ۙ مَّنْضُوْدٍ ﴿82﴾

**83** అవి నీ ప్రభువు తరఫున గుర్తు వేయబడినవి. అవి ఈ దుర్మార్గులకు ఎంతో దూరాన లేవు.[132]

مُّسَوَّمَةً عِنْدَ رَبِّكَ ؕ وَمَا هِيَ مِنَ
الظّٰلِمِيْنَ بِبَعِيْدٍ ﴿83﴾

---

చేష్టను అవలంబించారు. పరమ జుగుప్సాకరమైన ఈ పనిలో లూత్ జాతివారు ఎంత ముందుకు వెళ్ళిపోయారో, వారి కళ్లు ఎలా మూసుకుపోయాయో దీన్నిబట్టి బోధపడుతోంది.

130. **‘బలం’** అంటే బాహుబలం, ఒనరులు, సంతానబలం అని భావం. ‘దృఢమైన ఆధారం’ అంటే తనను సమర్థించే తెగగానీ, వంశంగానీ ఉంటే వారిని ఆశ్రయించే వాడినే! అన్నది ఆయన ఆవేదన. ఎంతటి నిస్సహాయస్థితిలో ఆయన ఈ మాటలన్నారో అర్థమవుతోంది. నన్ను ఆదుకునేవారు, నా తరఫున మాట్లాడేవారు ఈ రోజు ఉండి ఉంటే అతిథుల విషయంలో నేను అవమానం పాలు కాకుండా ఉండేవాడినే! అని ఆందోళన చెందారు. దైవప్రవక్త హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) గారి ఈ ఆకాంక్ష దైవంపై భారం మోపే విషయానికి విరుద్ధం కాజాలదు. ప్రాపంచికంగా మనిషి తన రక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుని ఆ పైన దైవంపై భారం వేయాలి. ఇదే సరైనది. అంతేగాని చేతులు ముడుచుకు కూర్చుని, అన్నింటికీ దేవుడే ఉన్నాడు అంటే అసలుకే నష్టం వాటిల్లుతుంది. కాబట్టి హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) పలుకుల్లో విపరీతమైన అంశం ఏమీ లేదు. ఈ సంఘటన ద్వారా విదితమయ్యే మరో ముఖ్య విషయం ఏమిటంటే దైవప్రవక్తలకు అగోచర జ్ఞానం ఉండదు. అలాగే వారు సర్వాధికారాలు కలిగి ఉండరు. దైవప్రవక్తలకు సర్వాధికారాలు ఉండి ఉంటే ఈ సందర్భంగా హజ్రత్ లూత్ అత్యంత దీనంగా ఇలా చెప్పుకుని ఉండేవారు కారు. ఈ రోజుల్లో కొందరు దైవప్రవక్త (స)కు సర్వాధికారాలుండేవని నమ్ముతున్నారు. ఈ నమ్మకం సరైనది కాదు. పై ఆయతు వారి ఈ నమ్మకాన్ని ఖండిస్తున్నది.

131. ఒకవైపు లూత్ గారి దీనావస్థను, మరోవైపు ఆ జాతిజనుల విశృంఖలత్వాన్ని గమనించిన దైవదూతలు జోక్యం చేసుకోవలసిన తరుణం వచ్చేసింది. “ఓ లూత్! మీరు ఆందోళన చెందనవసరం లేదు. వాళ్లు మా దాకా కాదుకదా, కనీసం మీ దాకా కూడా రాలేరు. రాత్రి పొద్దుపోయాక మీ మనుషులను వెంటబెట్టుకుని ఇక్కడి నుంచి వెళ్ళిపోండి. తెల్లవారగానే ఈ పట్టణవాసులు నాశనం చేయబడతారు” అని వారు ధైర్యం చెప్పారు.

132. **“అవి”** అంటే ఏవి? ఆయా ఊళ్లను ధ్వంసం చేయటానికి వాటిపై విసరబడిన ‘రాళ్ళు’ అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడగా, ఈ ఆయతులో “అవి” అనే సర్వనామం నాశనమైన ఆ ‘ఊళ్ళ’నే సూచిస్తున్నదని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. ఆ ఊళ్లు సిరియా–మదీనాల మధ్య ఉండేవి. “దుర్మార్గులు” అంటే మక్కాకు చెందిన సత్య తిరస్కారులు. వెనుకటి జాతులకు పట్టిన దుర్గతే మీకూ పడుతుంది జాగ్రత్త! అని హెచ్చరించటం ఈ వాక్యాల ప్రధాన ఉద్దేశం.

84 ఇంకా మేము మద్‌యన్ వారి వైపుకు[133] వారి సోదరుడగు షుఐబ్‌ను పంపాము. అతనిలా ప్రబోధించాడు : “ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీ ఆరాధ్య దేవుడెవడూ లేడు. కొలతలు తూనికలలో తగ్గించి ఇవ్వకండి.[134] మీరు ఆర్థికంగా మంచిస్థితిలో ఉన్నట్టు చూస్తున్నాను.[135] మీ విషయంలో చుట్టుముట్టే దినపు శిక్ష గురించి నేను భయపడు తున్నాను.[136]

وَاِلٰى مَدْيَنَ اَخَاهُمْ شُعَيْبًا ۚ قَالَ يٰقَوْمِ
اعْبُدُوا اللّٰهَ مَا لَكُمْ مِّنْ اِلٰهٍ غَيْرُهٗ ۚ وَلَا
تَنْقُصُوا الْمِكْيَالَ وَالْمِيْزَانَ اِنِّيْٓ اَرٰىكُمْ بِخَيْرٍ
وَّاِنِّيْٓ اَخَافُ عَلَيْكُمْ عَذَابَ يَوْمٍ مُّحِيْطٍ ﴿84﴾

85 “ఓ నా జాతివారలారా! కొలతలు, తూనికలలో పూర్తిగా, న్యాయంగా వ్యవహరించండి (పూర్తిగా ఇవ్వండి). ప్రజలకు వారి వస్తువులను తగ్గించి ఇవ్వకండి.[137] భూమిలో సంక్షోభాన్ని సృష్టించ కండి.[138]

وَيٰقَوْمِ اَوْفُوا الْمِكْيَالَ وَالْمِيْزَانَ بِالْقِسْطِ
وَلَا تَبْخَسُوا النَّاسَ اَشْيَآءَهُمْ وَلَا تَعْثَوْا
فِي الْاَرْضِ مُفْسِدِيْنَ ﴿85﴾

86 “మీరు విశ్వాసులే అయితే – అల్లాహ్ ధర్మసమ్మతంగావించిన మిగులు[139] మాత్రమే మీ కొరకు శ్రేయస్కరమైనది. నేను మీపై కావలివాణ్ణి మాత్రం కాను.”[140]

بَقِيَّتُ اللّٰهِ خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ۚ
وَمَآ اَنَا عَلَيْكُمْ بِحَفِيْظٍ ﴿86﴾

133. మద్‌యన్ ప్రజలెవరు? ఎక్కడివారు? తదితర వివరాలకై అల్ ఆరాఫ్ సూరా 85వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి.

134. తొలుత ఏకదైవోపాసన వైపుకు పిలిచిన తర్వాత, ఆ జాతివారిలో ప్రబలిన ఒక జాడ్యం – కొలతలు తూనికలలో వారు చేసే మోసం – గురించి ఆయన వారిని హెచ్చరించారు. ఎవరయినా తమ వద్దకు ఏదైనా వస్తువును, ఆహారధాన్యాన్ని తెస్తే కొలతలోనూ, తూకంలోనూ మోసంతో ఎక్కువ పుచ్చుకునేవారు. మరి అవే వస్తువుల్ని కొనుగోలు దారులకు అమ్మేటప్పుడు తగ్గించి ఇచ్చేవారు. ఈ విధంగా వారిలో మోసం పరాకాష్ఠకు చేరింది.

135. దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తున్నాడు. మీ పాడిపంటలలో, సిరిసంపదలలో వృద్ధినొసగాడు. ఆర్థికంగా మీరు చాలా మెరుగైన స్థితిలో ఉన్నారు. అలాంటప్పుడు ఈ కక్కుర్తి పనులు ఎందుకు చేస్తారు? ఇచ్చిపుచ్చుకొనేటప్పుడు న్యాయంగా – ఖచ్చితంగా – వ్యవహరించవచ్చు కదా! మీరు దైవానికి భయపడరెందుకు? అని హజ్రత్ షుఐబ్ నచ్చజెప్పారు.

136. మీరు గనక ఈ మోసబుద్ధిని మానుకోకపోతే ప్రళయదినాన మీరు దేవుని శిక్ష నుంచి తప్పించుకోలేరు. ‘చుట్టుముట్టే దినం’ అంటే ప్రళయదినం అన్నమాట! ఆ రోజు ఏ పాపాత్ముడు కూడా దేవుని పట్టునుంచి తప్పించుకుని పారిపోలేడు.

137. ప్రవక్తల సందేశం రెండు ప్రధానాంశాలతో కూడుకుని ఉంటుంది. 1. దేవుని హక్కులను నెరవేర్చటం. 2. దాసుల హక్కులను నెరవేర్చటం. ఇక్కడ దైవారాధన దేవుని హక్కయితే కొలతలు తూనికల్లో న్యాయంగా వ్యవహరించటం దాసుల హక్కు. ఎందుకంటే దైవసన్నిధిలో ఇది కూడా చాలా ముఖ్యం. కొలతలు తూనికలలో అన్యాయం చేసేవారిని హెచ్చరిస్తూ ప్రత్యేకంగా ఒక సూరాయే అవతరించింది: “తగ్గించి ఇచ్చేవారికి మూడుతుంది. ప్రజల నుంచి పుచ్చుకునే సమయంలో వారు కొలిచి, తూచి పూర్తిగా తీసుకుంటారు. కాని ప్రజలకు కొలచిగానీ, తూకంగానీ వేసి ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు.....” (ముతప్ఫిఫీన్ : 1 – 3).

138. దాసుల హక్కులను కాలరాచే ప్రతి చేష్టా సమాజంలో అశాంతి అలజడులకు దారితీస్తుంది. ఈ ఆయతుల్లో ప్రస్తావించ బడిన “కొలతలు, తూనికలలో మోసం” కూడా భువిపై అలజడిని సృష్టించటం క్రిందికే వస్తుంది.

قَالُوْا يٰشُعَيْبُ اَصَلٰوتُكَ تَاْمُرُكَ اَنْ نَّتْرُكَ
مَا يَعْبُدُ اٰبَآؤُنَآ اَوْ اَنْ نَّفْعَلَ فِيْٓ اَمْوَالِنَا
مَا نَشٰٓؤُا ؕ اِنَّكَ لَاَنْتَ الْحَلِيْمُ الرَّشِيْدُ ﴿87﴾

**87** వారిలా అన్నారు : “ఓ షుఐబ్! మేము మా తాతముత్తాతలు పూజిస్తూ వస్తున్న దైవాలను వదలిపెట్టాలనీ, మా సొమ్ములను మా ఇష్టప్రకారం ఖర్చుపెట్టడం[141] మానుకోవాలని నీ నమాజు[142] నీకు ఆజ్ఞాపిస్తోందా? నువ్వు మరీ ఉదాత్త హృదయునిలా, రుజు వర్తనునిలా[143] ఉన్నావే?!”

قَالَ يٰقَوْمِ اَرَءَيْتُمْ اِنْ كُنْتُ عَلٰى بَيِّنَةٍ مِّنْ رَّبِّيْ
وَرَزَقَنِيْ مِنْهُ رِزْقًا حَسَنًا ؕ وَمَآ اُرِيْدُ اَنْ اُخَالِفَكُمْ
اِلٰى مَآ اَنْهٰىكُمْ عَنْهُ ؕ اِنْ اُرِيْدُ اِلَّا الْاِصْلَاحَ
مَا اسْتَطَعْتُ ؕ وَمَا تَوْفِيْقِيْٓ اِلَّا بِاللّٰهِ ؕ عَلَيْهِ
تَوَكَّلْتُ وَاِلَيْهِ اُنِيْبُ ﴿88﴾

**88** దానికి షుఐబు ఇలా సమాధానమిచ్చాడు : “ఓ నా జాతి సోదరులారా! చూడండి, నేను నా ప్రభువు వద్ద నుంచి ఒక స్పష్టమైన నిదర్శనాన్ని పొందిఉన్నాను. ఆయన నాకు తన వద్ద నుండి అత్యుత్తమమైన ఉపాధిని ప్రసాదించాడు.[144] (అలాంటప్పుడు నేను అక్రమార్జనకు పాల్పడగలనా?) ఏ విషయాలను మానుకోమని మిమ్మల్ని గట్టిగా చెబుతున్నానో వాటి వైపుకు నేను స్వయంగా మొగ్గిపోయే ఉద్దేశం నాకు లేనేలేదు.[145] శాయశక్తులా దిద్దుబాటు చేయాలన్నదే నా ఉద్దేశం.[146] నా ఈ సద్వర్తన అంతా దైవసహాయంపైనే ఆధారపడి ఉంది.[147] నేను ఆయన్నే నమ్ముకున్నాను. ఆయన వైపుకే మరలుతున్నాను.

139. **‘బఖియ్యతుల్లాహ్’** అంటే నిజాయితీగా వ్యాపారం చేసిన తరువాత అందులో వచ్చే లాభం (మిగులు). ఇలాంటి మిగులు శ్రేయోదాయకం. అందుకే అది ‘దేవుని మిగులు’గా అభివర్ణించబడింది.

140. అంటే – దైవ సందేశాన్ని యధాతథంగా అందజేయటమే నా పని. ఆ పనిని దైవాజ్ఞానుసారం నేను చేస్తూ పోతున్నాను. మిమ్మల్ని బలవంతం చేసే లేక దండించే అధికారం నాకు లేదు. ఆ అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది.

141. **‘జకాత్’** నేపథ్యంలో వారిలా అన్నారని ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు కొంతమంది అభిప్రాయపడ్డారు. దైవాజ్ఞ అవతరించినప్పుడల్లా, దానధర్మాలు చేయమని చెప్పినప్పుడల్లా దేవుని అవిధేయులకు ప్రాణం మీదికొచ్చేది. మా తెలివి తేటల్తో, మేము చెమటోడ్చి సంపాదిస్తున్నప్పుడు ఖర్చుపెట్టే విషయంలో మీ ఆంక్షలేమిటీ? మా సొమ్ముల్లోని ఒక నిర్ణీత భాగాన్ని నిర్ణీత పద్దుల క్రింద వేరుచేసి ఇమ్మని మమ్మల్నెందుకు బలవంతం చేస్తారు? అని ప్రశ్నించేవారు. అలాగే సంపాదించే పద్ధతులను నియంత్రించటం వారికి నచ్చేది కాదు. న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలతో తమకు నిమిత్తం లేదనీ, వాణిజ్య రంగంలో తమపై ఎటువంటి ఆంక్షలు కూడా ఉండరాదని వారు చెప్పేవారు. కొలతలు, తూనికలలో మోసం చేయరాదని చెప్పటంతో బహుశా వారి గొంతులో పచ్చి వెలక్కాయ ఇరుక్కుంది. ఆ విషయాన్ని బాహాటంగా చెప్పలేక, తమ సొమ్ముల విషయంలో తలదూర్చరాదని అన్నారు.

142. ఇక్కడ **‘సలాత్’** (నమాజు) అంటే దైవారాధన, ధర్మం, దైవగ్రంథ పఠనం అని భావం.

143. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) గార్కి వారు ఇచ్చిన ఈ బిరుదులు (రుజువర్తనుడు, ఉదాత్త హృదయుడు) సదుద్దేశ్యంతో ఇచ్చినవి కావు. వెటకారంగా వారు ఈ పదాలను ప్రయోగించారు.

144. **‘అత్యుత్తమమైన ఉపాధి’** అనే పదం ‘దైవదౌత్యం’ అన్న భావంలో కూడా తీసుకోబడింది (ఇబ్నె కసీర్).

145. ఏ ఏ పనులు చేయరాదని మీకు ఇంతకాలంగా ఉపదేశిస్తూ వస్తున్నానో వాటిని నేనే చేయాలా? ఇది అసంభవం.

146. నేను మిమ్మల్ని ఏ పని చేయమని చెప్పినా, మరే పని నుంచి మిమ్మల్ని ఆపినా మీ మంచికోసమే. మిమ్మల్ని సంస్కరించాలని, మీ జీవితాలను తీర్చిదిద్దాలని నేను అభిలషిస్తున్నాను.

89 “ఓ నా జాతి వారలారా! నాకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న మీ మొండివైఖరి నూహ్ జాతిపై, హూద్ జాతిపై, సాలెహ్ జాతిపై వచ్చిపడిన శిక్షల్లాంటి శిక్షలకే మిమ్మల్ని కూడా పాత్రులుగా చేస్తుం దేమో (జాగ్రత్త!) ఇక లూతు జాతివారైతే మీకు ఎంతో దూరాన కూడా లేరు.[148]

وَيٰقَوْمِ لَا يَجْرِمَنَّكُمْ شِقَاقِيْٓ اَنْ يُّصِيْبَكُمْ مِّثْلُ مَآ اَصَابَ قَوْمَ نُوْحٍ اَوْ قَوْمَ هُوْدٍ اَوْ قَوْمَ صٰلِحٍ ؕ وَمَا قَوْمُ لُوْطٍ مِّنْكُمْ بِبَعِيْدٍ ﴿89﴾

90 “మీరు క్షమాపణ కోసం మీ ప్రభువును వేడుకోండి. మరి ఆయన వైపుకే మరలండి. నిశ్చయంగా నా ప్రభువు అమిత దయా మయుడు, అపార ప్రేమమయుడు.”

وَاسْتَغْفِرُوْا رَبَّكُمْ ثُمَّ تُوْبُوْٓا اِلَيْهِ ؕ اِنَّ رَبِّيْ رَحِيْمٌ وَّدُوْدٌ ﴿90﴾

91 “ఓ షుఐబ్! నువ్వు చెప్పేవాటిలో చాలా విషయాలు మాకు అర్థం కావటం లేదు.[149] మేము నిన్ను మా మధ్య ఎంతో బలహీను నిగా చూస్తున్నాము.[150] నీ వంశస్థులే లేకపోతే ఈ పాటికి నీపై రాళ్ళు రువ్వి ఉండేవాళ్ళం.[151] మా దృష్టిలో నువ్వు ఘనాపాటివి ఏమీ కావు”[152] అని వాళ్ళు చెప్పారు.

قَالُوْا يٰشُعَيْبُ مَا نَفْقَهُ كَثِيْرًا مِّمَّا تَقُوْلُ وَاِنَّا لَنَرٰىكَ فِيْنَا ضَعِيْفًا ۚ وَلَوْلَا رَهْطُكَ لَرَجَمْنٰكَ ۖ وَمَآ اَنْتَ عَلَيْنَا بِعَزِيْزٍ ﴿91﴾

92 దానికి అతను ఇలా అన్నాడు: “ఓ నా జాతి వారలారా! మీ దృష్టిలో నా వంశస్థులు అల్లాహ్ కన్నా ఎక్కువ గౌరవనీయులా?! తత్కారణంగానే మీరు ఆయన్ని వెనక్కి నెట్టేశారా?[153] నిశ్చయంగా నా ప్రభువు మీ కార్యకలాపాలన్నింటినీ పరివేష్ఠించి ఉన్నాడు.”

قَالَ يٰقَوْمِ اَرَهْطِيْٓ اَعَزُّ عَلَيْكُمْ مِّنَ اللّٰهِ ؕ وَاتَّخَذْتُمُوْهُ وَرَآءَكُمْ ظِهْرِيًّا ؕ اِنَّ رَبِّيْ بِمَا تَعْمَلُوْنَ مُحِيْطٌ ﴿92﴾

147. సత్యాన్ని వ్యాపింపజేయాలన్న నా సంకల్పం దేవుని తోడ్పాటుతోనే పూర్తవుతుంది. కాబట్టి సర్వవిషయాల్లో, సర్వకాల సర్వావస్థల్లో నేను అల్లాహ్‌నే నమ్ముకుంటాను. ఆయన వైపుకే మరలుతాను.

148. అంటే, వారు నివసించిన పట్టణం మీ పట్టణానికి ఎంతో దూరంలో లేదు అని ఒక అర్థం. ఏ కారణంగా వారు శిక్షకు గురయ్యారో ఆ కారణంలో మరియు మీరు అవలంబిస్తున్న అవినీతి వైఖరిలో పెద్దగా తేడా ఏమీ లేదని ఇంకో అర్థం.

149. వారు వెటకారంగానయినా అలా అని ఉంటారు లేక మరణానంతర జీవితం, ప్రళయదినం, స్వర్గం – నరకం లాంటి విషయాలు అర్థంగాక అయినా అలా చెప్పి ఉంటారు.

150. బహుశా హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) గారి శారీరక బలహీనతను దృష్టిలో పెట్టుకుని వాళ్ళు అలా అని ఉంటారు. ఆయనకు కంటి చూపు తక్కువగా ఉండేదనీ, లేక ఆయన మరీ బక్కపలచగా ఉండేవారనీ కొంతమంది చెబుతారు. తమను ఎదుర్కొనే శక్తి షుఐబ్‌కు ఏమాత్రం లేదన్నది వాళ్ళ మాటల్లోని ఉద్దేశం.

151. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) వంశస్థులు కూడా బహుశా సత్యతిరస్కారుల పక్షానే నిలిచారు. అందుకే ఆ తెగవారిని గౌరవిస్తూ వారు ఒకింత రాయితీ ప్రకటించారు. మొత్తానికి వాళ్ళ మాటల్లో తీవ్రమయిన హెచ్చరిక దాగి ఉంది. ఇప్పటికయినా నువ్వు మెతక వైఖరిని అవలంబించు. లేకపోతే ఎంతోకాలం నిన్ను సహించలేము అని వారు హెచ్చరించదలిచారు.

152. మా దృష్టిలో నీకు ఎలాంటి ప్రాముఖ్యం లేదు. ఏదో నీ వంశస్థుల మొహం చూసి ఊరుకుంటున్నాము. నిన్ను శిక్షించాలంటే ఎంతో సేపు పట్టదు అన్నది ఈ వాక్యంలోని ఆంతర్యం.

**93** (షుఐబ్ ఇంకా ఇలా అన్నాడు:) "ఓ నా జాతి సోదరులారా! మీరు మీ స్థానాలలో మీ పనులు చేస్తూ ఉండండి. నేనూ నా పని చేసుకుంటాను. పరాభవానికి లోను చేసే శిక్ష ఎవరికి పడు తుందో, అసత్యవాది ఎవరో అతి త్వరలోనే మీకు తెలిసిపోతుంది. మీరూ ఎదురు చూడండి, మీతోపాటు నేనూ ఎదురు చూస్తాను."[154]

وَيَٰقَوۡمِ ٱعۡمَلُواْ عَلَىٰ مَكَانَتِكُمۡ إِنِّي عَٰمِلٞۖ سَوۡفَ
تَعۡلَمُونَ مَن يَأۡتِيهِ عَذَابٞ يُخۡزِيهِ وَمَنۡ
هُوَ كَٰذِبٞۖ وَٱرۡتَقِبُوٓاْ إِنِّي مَعَكُمۡ رَقِيبٞ ﴿٩٣﴾

**94** మరి మా ఉత్తర్వు (శిక్ష) వచ్చేసినప్పుడు, మేము షుఐబును, అతని వెంటనున్న విశ్వాసులను మా ప్రత్యేక కటాక్షంతో కాపాడాము. దుర్మార్గానికి ఒడిగట్టినవారిని మాత్రం భయం కరమైన శబ్దం కబళించింది.[155] దాంతో వారు తమ ఇళ్లల్లో బోర్లాపడి పడినట్లే ఉండిపోయారు –

وَلَمَّا جَآءَ أَمۡرُنَا نَجَّيۡنَا شُعَيۡبٗا وَٱلَّذِينَ ءَامَنُواْ مَعَهُۥ
بِرَحۡمَةٖ مِّنَّا وَأَخَذَتِ ٱلَّذِينَ ظَلَمُواْ ٱلصَّيۡحَةُ
فَأَصۡبَحُواْ فِي دِيَٰرِهِمۡ جَٰثِمِينَ ﴿٩٤﴾

**95** – అసలు వారక్కడ ఎప్పుడూ నివసించనే లేదన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. వినండి! సమూదు వారు దూరం చేయ బడినట్లే మద్‌యను వారు కూడా (దైవకారుణ్యానికి) దూరం అవుదురుగాక![156]

كَأَن لَّمۡ يَغۡنَوۡاْ فِيهَآۗ أَلَا بُعۡدٗا لِّمَدۡيَنَ
كَمَا بَعِدَتۡ ثَمُودُ ﴿٩٥﴾

**96** ఇంకా – మేము మూసాకు మా సూచనలను, స్పష్టమైన నిదర్శనాలను[157] ఇచ్చి పంపాము.

وَلَقَدۡ أَرۡسَلۡنَا مُوسَىٰ بِـَٔايَٰتِنَا وَسُلۡطَٰنٖ مُّبِينٍ ﴿٩٦﴾

153. ఏమిటీ? నా వంశస్థులను చూసి నన్ను వదలిపెడుతున్నారా? నాకు దైవదౌత్యం అందించి, నా ద్వారా మీ జీవితాలను తీర్చిదిద్దగోరుతున్న ఏకైక దేవునిపట్ల మీకు బొత్తిగా భయభక్తులు లేవా?! షుఐబ్ (అలైహిస్సలాం) 'నా వంశస్థులు నాకన్నా గౌరవనీయులా?' అని అనలేదు. 'నా వంశస్థులు అల్లాహ్‌కన్నా ఎక్కువ గౌరవనీయులా?' అని ప్రశ్నించారు. ప్రవక్తను కించపరచటమంటే దేవుణ్ణి కించపరచటమేనని చెప్పటం దీని ఉద్దేశం. ఎందుకంటే ప్రవక్త దేవుని తరపున నియమించబడినవాడు. ఈ రకంగా సత్యప్రేమికులైన విద్వాంసులను పరిహసించటం కూడా దైవధర్మాన్ని పరిహసించటం వంటిదే. ఎందుకంటే వారు దైవధర్మానికి ప్రతినిధులు. దైవప్రవక్తలకు వారసులు. మూలంలో **'వత్తఖజ్‌తుమూహు'** అని ఉంది. ఇందులో 'హు' అనే సర్వనామం అల్లాహ్‌ను సూచిస్తోంది. అంటే అల్లాహ్ నాకిచ్చి పంపిన విషయాన్ని మీరు ఏ మాత్రం ఖాతరు చేయకుండా, వీపు వెనుక పడేశారు, పూర్తిగా నిర్లక్ష్యం చేశారు అని దాని భావం.

154. తన జాతివారు బహుదైవారాధనపై, సత్య తిరస్కారంపై మొండికేసి హితబోధను బొత్తిగా వినకపోవటంతో హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం), "సరే! మీ అభిమతంపై మీరుండండి. సత్యమేదో – అసత్యమేదో, రక్షించబడేదెవరో – శిక్షించబడేదెవరో తొందరగానే మీకు తెలిసివస్తుంది" అని చెప్పేశారు.

155. భయంకరమైన ఆ శబ్దానికి వారి గుండెలు పగిలిపోయాయి. పై ప్రాణాలు పైకే లేచిపోయాయి. అదే సమయంలో భూమి కూడా ప్రకంపించింది. ఆరాఫ్ సూరా (91) లోనూ, అన్‌కబూత్ సూరా (40) లోనూ ఈ వివరాలు ఉన్నాయి.

156. అంటే దేవుని శాపం, దేవుని దెబ్బ వారిపై పడింది. దైవానుగ్రహాలకు వారు నోచుకోకుండా పోయారు.

إِلَىٰ فِرْعَوْنَ وَمَلَإِيْهٖ فَاتَّبَعُوٓا أَمْرَ فِرْعَوْنَ ۚ
وَمَآ أَمْرُ فِرْعَوْنَ بِرَشِيْدٍ ﴿97﴾

**97** ఫిరౌను వద్దకు, అతని సర్దారుల[158] వద్దకు పంపాము. అయినప్పటికీ వారు ఫిరౌను ఆదేశాలనే అనుసరించారు. మరి (చూడబోతే) ఫిరౌను ఆదేశాలలో ఏ ఒక్కటీ సరియైనది కాదు.[159]

يَقْدُمُ قَوْمَهٗ يَوْمَ الْقِيٰمَةِ فَأَوْرَدَهُمُ النَّارَ ۖ
وَبِئْسَ الْوِرْدُ الْمَوْرُوْدُ ﴿98﴾

**98** వాడు ప్రళయదినాన తన జాతికి సారథ్యం వహిస్తూ వస్తాడు. వారందరినీ నరకంలోకి తీసుకుపోయి నిలబెడతాడు.[160] వారు నిలబెట్టబడే ఆ చోటు అత్యంత చెడ్డది.[161]

وَأُتْبِعُوْا فِيْ هٰذِهٖ لَعْنَةً وَّيَوْمَ الْقِيٰمَةِ ۚ
بِئْسَ الرِّفْدُ الْمَرْفُوْدُ ﴿99﴾

**99** ఇహలోకంలోనూ వారికి శాపం అంటగట్టబడింది. ప్రళయ దినాన కూడా అది వారిని వెంబడిస్తుంది.[162] వారికి ఇవ్వబడిన బహుమతి బహుచెడ్డది.[163]

ذٰلِكَ مِنْ أَنْبَآءِ الْقُرٰى نَقُصُّهٗ عَلَيْكَ
مِنْهَا قَآئِمٌ وَّحَصِيْدٌ ﴿100﴾

**100** ఇవి (తుదముట్టించబడిన) బస్తీలకు సంబంధించిన కొన్ని సమాచారాలు. వీటిని మేము నీకు వివరిస్తున్నాము. వాటిలో కొన్ని నిలిచి ఉన్నాయి. మరికొన్ని సమూలంగా తుడిచిపెట్ట బడ్డాయి.[164]

---

157. **'సూచనలు'** అంటే తౌరాతు గ్రంథమనీ, 'స్పష్టమైన నిదర్శనాల'ంటే మహిమలు అని కొంతమంది పండితులు భావించారు. మరికొంత మంది దృష్టిలో సూచనలు అంటే దేవుడిచ్చిన 9 సూచనలు, నిదర్శనం అంటే మూసా చేతిలోని కర్ర అని భావం. ఆయన చేతిలోని కర్ర కూడా ఆ తొమ్మిది సూచనలలో అంతర్భాగమే అయినప్పటికీ ఆ నిదర్శనానికి ఉన్న విశిష్టత దృష్ట్యా దాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది.

158. **'మలవున్'** అంటే జాతిలోని ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులు, మేధావులు, మర్యాదస్థులు అని అర్థం. ఫిరౌనుతోపాటు అతని దర్బారుకు చెందిన ప్రముఖులను యిక్కడ ప్రస్తావించటం జరిగింది. ఎందుకంటే జాతుల ఉత్థాన పతనాలలో ఈ "మానవ నవనీతం" పోషించే పాత్ర కీలకమైనదై ఉంటుంది. వాళ్ల సలహాలనే రాజు పరిగణనలోకి తీసుకుంటాడు. రాజ్య ప్రజలు కూడా ఈ ప్రముఖుల (పెద్దల) సూచనలనే అనుసరిస్తారు. ఒకవేళ ఈ పెద్దలే గనక హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను విశ్వసించి ఉంటే యావత్తు ఫిరౌను జాతి వారి వెనుక నడచి ఉండేది.

159. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అందజేసిన సందేశం మార్గదర్శకం అయినదైనప్పటికీ వారు దాన్ని త్రోసిపుచ్చి ఫిరౌను ఉత్తర్వును అనుసరించారు. మరి చూడబోతే ఫిరౌను ఆజ్ఞ సన్మార్గానికి చాలా దూరాన ఉంది.

160. ప్రపంచంలో ఫిరౌను తన జాతి వారికి రాజుగా ఉన్నట్లే పరలోకంలో కూడా ముందుండు ఉంటాడు. వారందరినీ నరకానికి గొనిపోతాడు.

161. అరబీలో **"విర్ద్"** అని ఉంది. అసలు విర్ద్ అంటే చెరువు గట్టు దగ్గర నీరు త్రాగే స్థలం అని అర్థం. కాని యిక్కడ నరకాన్ని విర్ద్‌గా పేర్కొనటం జరిగింది. అది నరకంలోని అత్యంత చెడ్డ స్థలం అనీ, దుష్టులు, దుర్మార్గులు అక్కడికి తీసుకుపోబడతారని తెలుస్తోంది.

162. **'లానతున్'** అంటే శాపం, ధూత్కారం, దైవానుగ్రహం నుంచి దూరం చేయబడటం అనే అర్థాలు వస్తాయి. ఫిరౌనీయులు గనక విశ్వసించకపోతే ప్రపంచంలోనూ దైవకారుణ్యానికి దూరమవుతారు. పరలోకంలోనూ దూరం చేయబడతారు.

163. కానుక లేక బహుమానాన్ని **'రిఫ్ద్'** అంటారు. ఇక్కడ **'రిఫ్ద్'** అనే పదం శిక్ష నేపథ్యంలో ప్రయోగించబడింది. అందుచేత

وَمَا ظَلَمْنٰهُمْ وَلٰكِنْ ظَلَمُوْٓا اَنْفُسَهُمْ فَمَآ اَغْنَتْ عَنْهُمْ اٰلِهَتُهُمُ الَّتِيْ يَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ مِنْ شَيْءٍ لَّمَّا جَآءَ اَمْرُ رَبِّكَ ؕ وَمَا زَادُوْهُمْ غَيْرَ تَتْبِيْبٍ (101)

**101** మేము వారికి ఏమాత్రం అన్యాయం చేయలేదు.[165] కాని వారే తమ స్వయానికి అన్యాయం చేసుకున్నారు.[166] నీ ప్రభువు ఉత్తర్వు వచ్చినప్పుడు, అల్లాహ్‌ను వదలి వారు పూజించే వారి ఆరాధ్య దైవాలు వారికెలాంటి ప్రయోజనమూ చేకూర్చలేదు. పైగా వారి నష్టాన్ని మరింత అధికం చేశారు.[167]

وَكَذٰلِكَ اَخْذُ رَبِّكَ اِذَآ اَخَذَ الْقُرٰى وَهِيَ ظَالِمَةٌ ؕ اِنَّ اَخْذَهٗٓ اَلِيْمٌ شَدِيْدٌ (102)

**102** బస్తీలలో నివసించే దుర్మార్గులను పట్టదలచుకున్నప్పుడు నీ ప్రభువు పట్టుకునే తీరు ఇలాగే ఉంటుంది. నిశ్చయంగా ఆయన పట్టు బాధాకరంగానూ, కఠినంగానూ ఉంటుంది.[168]

اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيَةً لِّمَنْ خَافَ عَذَابَ الْاٰخِرَةِ ؕ ذٰلِكَ يَوْمٌ مَّجْمُوْعٌ ۙ لَّهُ النَّاسُ وَذٰلِكَ يَوْمٌ مَّشْهُوْدٌ (103)

**103** నిశ్చయంగా పరలోక శిక్షకు భయపడేవారికి ఇందులో గుణపాఠపు సూచన ఉంది.[169] అది జనులంతా సమీకరించబడే రోజు. ఇంకా అది అందరూ హాజరుపరచబడే రోజు.[170]

وَمَا نُؤَخِّرُهٗٓ اِلَّا لِاَجَلٍ مَّعْدُوْدٍ (104)

**104** మేము దానిని (తీర్పుదినమును) ఒక నియమిత గడువు వరకు మాత్రమే వాయిదా వేస్తాము.[171]

---

దీన్ని చెడ్డ బహుమానం అన్న అర్థంలో తీసుకోవటం జరిగింది. వాక్యంలో **'మర్‌ఫూద్'** అనే మరోపదం కూడా ఉంది. అంటే ఇవ్వబడిన కానుక అని అర్థం. మాటలో చేవ తీసుకురావటం కోసం (బీస రిఫ్‌దుల్ మర్‌ఫూద్) అని రెండేసి పర్యాయపదాలను ప్రయోగించటం జరిగింది.

164. అంటే మేము నాశనం చేసిన ఆ పట్టణాలలో కొన్ని అక్కడక్కడా తమ ఉనికిని చాటుకుంటూ – శిథిలావస్థలో – నిలిచిఉన్నాయి. మరికొన్ని పట్టణాలయితే కోతకోసిన చేను మాదిరిగా నిర్మూలించబడ్డాయి. నిలిచి ఉన్న పట్టణాలు భావితరాలకు ఒక గుణపాఠంగా ఉండగా, నేలమట్టం చేయబడిన పట్టణాలు కేవలం చరిత్ర పుటల్లో మాత్రమే మిగిలాయి. అరబీ మూలంలో **'ఖాయిమున్'** మరియు **'హసీదున్'** అని రెండు పదాలు ఉపయోగించబడ్డాయి. ఖాయిమున్ అంటే నిలిచివున్నవి, హసీదున్ అంటే కోతకోయబడినవి అని అర్థం.

165. మేము వారిని శిక్షించామంటే వారికి అన్యాయం చేశామని అనుకోకండి. అది వారి స్వయంకృత ఫలితమే.

166. ధిక్కారానికి, పాపాలకు పాల్పడి వారు తమకు తామే అన్యాయం చేసుకున్నారు.

167. తమ చిట్టిపొట్టి దేవతలు, చిల్లర దేముళ్ళు ఆపద సమయంలో తమకు అండగా నిలుస్తారని వారు భావించారు. కాని తీరా దైవాగ్రహం విరుచుకుపడిన వేళ వారు నిస్సహాయంగా ఉండిపోవటంతో తమ విశ్వాసం మూఢ విశ్వాసం మాత్రమేనని వారికి తెలిసివచ్చింది. లాభనష్టాలను చేకూర్చే శక్తి, అధికారం ఒక్క అల్లాహ్‌కు తప్ప వేరొకరికి లేదన్న సంగతి కూడా వారికి బోధపడింది.

168. అంటే గతంలో ఆయన కొన్ని దుష్ట జాతులను అంతమొందించినట్లే భవిష్యత్తులో కూడా ఆయన దుర్మార్గులను పట్టుకుని శిక్షించగలడు – ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ దుర్మార్గునికీ తప్పకుండా గడువు ఇస్తాడు. అయితే అతన్ని పట్టుకోవాలని నిశ్చయించుకున్నప్పుడు అకస్మాత్తుగా పట్టుకుంటాడు. అప్పుడతనికి ఎలాంటి గడువూ ఇవ్వడు."

169. అంటే దేవుడు పట్టుకునే విధములోనూ, వివిధ జాతుల వారు నాశనం గావించబడటంలోనూ – పరలోక భీతి ఉన్న వారికి – గుణపాఠం కలదు.

170. లెక్క మరియు ప్రతిఫలం కోసం.

يَوْمَ يَاْتِ لَا تَكَلَّمُ نَفْسٌ اِلَّا بِاِذْنِهٖ ۚ
فَمِنْهُمْ شَقِيٌّ وَّسَعِيْدٌ ﴿105﴾

**105** అది వచ్చేసిన రోజు ఆయన అనుమతి లేకుండా పల్లెత్తు మాట అనే ధైర్యం ఎవరికీ ఉండదు.[172] వారిలో కొందరు దౌర్భాగ్యులూ ఉంటారు, కొందరు సౌభాగ్యవంతులూ ఉంటారు.

فَاَمَّا الَّذِيْنَ شَقُوْا فَفِى النَّارِ لَهُمْ فِيْهَا
زَفِيْرٌ وَّشَهِيْقٌ ﴿106﴾

**106** అయితే దౌర్భాగ్యులు నరకంలో ఉంటారు. అక్కడ వారు అరుస్తూ, పెడబొబ్బలు పెడుతూ ఉంటారు.

خٰلِدِيْنَ فِيْهَا مَا دَامَتِ السَّمٰوٰتُ وَالْاَرْضُ اِلَّا مَا
شَآءَ رَبُّكَ ۗ اِنَّ رَبَّكَ فَعَّالٌ لِّمَا يُرِيْدُ ﴿107﴾

**107** నీ ప్రభువు వేరొకటి తలిస్తే తప్ప[173] భూమ్యాకాశాలున్నంత వరకూ వారు అందులోనే శాశ్వతంగా ఉంటారు.[174] నిశ్చయంగా నీ ప్రభువు తాను కోరిందల్లా చేసి తీరుతాడు.

وَاَمَّا الَّذِيْنَ سُعِدُوْا فَفِى الْجَنَّةِ خٰلِدِيْنَ
فِيْهَا مَا دَامَتِ السَّمٰوٰتُ وَالْاَرْضُ اِلَّا مَا شَآءَ
رَبُّكَ ۗ عَطَآءً غَيْرَ مَجْذُوْذٍ ﴿108﴾

**108** ఇక సౌభాగ్యవంతులుగా చేయబడినవారు – నీ ప్రభువు కోరితే తప్ప,[175] వారు భూమ్యాకాశాలున్నంత వరకూ స్వర్గంలోనే-కలకాలం – ఉంటారు. ఇది అనంతమైన వరం.[176]

---

171. అంటే – ప్రళయదినం సంభవించటంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందంటే; అల్లాహ్ దానికొక గడువును నిర్ధారించాడు. ఆ గడువు ముగియగానే అది సంభవిస్తుంది. ఒక్క క్షణం కూడా అటూ ఇటూ అవదు.

172. అల్లాహ్ అనుమతిస్తేనే తప్ప ఆనాడు ఎవరూ మరొకరి కోసం సిఫారసు చేసేందుకు సాహసించరు. "ఆ రోజు ప్రవక్తలకు తప్ప వేరొకరికి మాట్లాడే ధైర్యం ఉండదు. ప్రవక్తల అధరాలు కూడా 'ఓ అల్లాహ్! మమ్మ కాపాడు' అని మాత్రమే అంటుంటాయి" అని మహనీయ ముహమ్మద్ (సఅసం) ప్రవచించారు (సహీహ్ బుఖారీ : కితాబుల్ ఈమాన్; ముస్లిం – కితాబుల్ ఈమాన్).

173. **"నీ ప్రభువు వేరొకటి తలిస్తే తప్ప"** అన్న వాక్యం వినాయింపుతో కూడుకున్నది. ఈ వినాయింపు విశ్వాసులు, ఏకదైవోపాసకులైన పాపాత్ములకు వర్తిస్తుంది. అవిశ్వాసులు ఎలాగూ శాశ్వత నరకాగ్నికి ఆహుతి కాక తప్పదు. కాని విశ్వసించినవారు – వారు పాపాత్ములైనప్పటికీ – ఏదో ఒకనాడు నరకాగ్ని నుంచి విముక్తి పొంది స్వర్గంలో ప్రవేశింపజేయబడతారు.

174. **"భూమ్యాకాశాలున్నంత వరకూ"** అనే పదాన్ని చదివి కొంతమంది పొరబడే అవకాశముంది. అవిశ్వాసులకు విధించబడే శిక్ష శాశ్వతమైంది కాదనీ, భూమ్యాకాశాల ఉనికి ఉన్నంత కాలమే ఉంటుందని వారనుకోవచ్చు. కాని ఇది సరైనది కాదు. ఖుర్ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబ్బుల నానుడిని కూడా అది దృష్టిలో పెట్టుకుంది. ఆనాడు అరబ్బులు ఏదైనా వస్తువుకు శాశ్వతస్థితిని కల్పించటానికి "భూమ్యాకాశాలున్నంత వరకూ ఇది ఉంటుంది" అని అనేవారు. ఈ విధంగానే ఖుర్ఆన్, అవిశ్వాసులు, ముష్రిక్కులు శాశ్వతంగా నరకంలో ఉంటారని చెప్పటానికి భూమ్యాకాశాల ప్రస్తావన తెచ్చింది.

దీనికి మరో భావం ఇది – భూమ్యాకాశాలంటే ప్రపంచంలో ఉన్న భూమ్యాకాశాలు కావు. ప్రళయం తరువాత ఈ భూమ్యాకాశాలు నశిస్తాయి. పరలోకపు భూమ్యాకాశాలు వేరుగా ఉంటాయి. "ఆ రోజు ఈ భూమి మరో భూమిగా మార్చబడుతుంది. ఆకాశాలు కూడా (మార్చివేయబడతాయి)" అని దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట చెప్పబడటం కూడా ఈ సందర్భంగా గమనార్హమే (ఇబ్రాహీమ్-48). పరలోకపు ఈ భూమ్యాకాశాలు స్వర్గం – నరకం మాదిరిగా ఎల్లకాలం ఉంటాయి. అవి నశించవు (ఇబ్నె కసీర్).

పై రెండు భావాలలో ఏ భావాన్ని తీసుకున్నా అవిశ్వాసులకు విధించబడే శిక్ష (నరకాగ్ని శిక్ష) శాశ్వితమైనది అన్న విషయం తేటతెల్లమైపోతుంది. ఇమామ్ షౌకానీ గారు ఈ ఆయతుకు మరిన్ని మతలబులు విశదీకరించారు. విద్వాంసులు, మేధావులు వాటిని పరిశోధించవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

فَلَا تَكُ فِي مِرْيَةٍ مِّمَّا يَعْبُدُ هَٰؤُلَاءِ ۚ مَا يَعْبُدُونَ
إِلَّا كَمَا يَعْبُدُ آبَاؤُهُم مِّن قَبْلُ ۚ وَإِنَّا لَمُوَفُّوهُمْ
نَصِيبَهُمْ غَيْرَ مَنقُوصٍ ﴿١٠٩﴾

**109** కనుక (ఓ ముహమ్మద్!) వారు పూజించేవాటి విషయంలో నువ్వు సందేహాలకు లోనుకారాదు. ఇంతకు మునుపు వారి తాత ముత్తాతలు పూజించినట్లుగానే వీళ్ళూ పూజిస్తున్నారు. మేము వాళ్ళందరికీ వారి వారి భాగాన్ని పూర్తిగా – ఏ మాత్రం తగ్గించ కుండా – ఇస్తాము.[177]

وَلَقَدْ آتَيْنَا مُوسَى الْكِتَابَ فَاخْتُلِفَ فِيهِ ۚ
وَلَوْلَا كَلِمَةٌ سَبَقَتْ مِن رَّبِّكَ لَقُضِيَ بَيْنَهُمْ ۚ
وَإِنَّهُمْ لَفِي شَكٍّ مِّنْهُ مُرِيبٍ ﴿١١٠﴾

**110** నిశ్చయంగా మేము మూసా (అలైహిస్సలాం)కు గ్రంథాన్ని ఇచ్చాము. మరి అందులో విభేదించుకోవటం జరిగింది.[178] ఒకవేళ ముందుగానే నీ ప్రభువు తరఫున మాట ఖరారు కాకుండా ఉన్నట్లయితే, వారిమధ్య తీర్పు జరిగిఉండేది.[179] ఈ విషయంలో వారికి తీవ్రమయిన సందేహం ఉంది.

وَإِنَّ كُلًّا لَّمَّا لَيُوَفِّيَنَّهُمْ رَبُّكَ أَعْمَالَهُمْ ۚ
إِنَّهُ بِمَا يَعْمَلُونَ خَبِيرٌ ﴿١١١﴾

**111** వారిలో ప్రతి ఒక్కరికీ నీ ప్రభువు వారి కర్మల యొక్క పూర్తి ప్రతిఫలం ఇస్తాడు. నిశ్చయంగా ఆయనకు వారు చేస్తున్న పనులన్నీ తెలుసు.

فَاسْتَقِمْ كَمَا أُمِرْتَ وَمَن تَابَ مَعَكَ
وَلَا تَطْغَوْا ۚ إِنَّهُ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ﴿١١٢﴾

**112** కనుక (ఓ ముహమ్మద్!) నీకు ఆజ్ఞాపించబడినట్లుగా నువ్వూ, నీతోపాటు (పశ్చాత్తాపభావంతో) మరలి వచ్చిన వారూ గట్టిగా నిలబడి ఉండండి. హద్దు మీరకండి.[180] నిస్సందేహంగా అల్లాహ్ మీ కర్మలన్నింటినీ చూస్తున్నాడు.

---

175. అంటే విశ్వాసులు, విధేయులు అయిన దాసులు ముందునుంచి స్వర్గంలో ఉన్నట్లు "అవిధేయులగు విశ్వాసులు" ముందు నుంచి స్వర్గంలో ఉండరు. తమ అవిధేయత, అపరాధాల కారణంగా వారు కొంతకాలం నరక యాతనను అనుభవిస్తారు. ఆ తరువాత దైవప్రవక్తల, విశ్వాసుల సిఫారసుపై వారు నరకం నుంచి విడుదల చేయబడి స్వర్గంలో స్థానం కల్పించబడతారు. ప్రామాణిక హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది.

176. **'అనంతమైన వరం'** అంటే ఎన్నటికీ తరిగిపోనిది, కరిగిపోనిది, చెరిగిపోనిది – ఎడతెగకుండా ప్రాప్తించే దైవానుగ్రహం. అమూల్యమైన దైవకానుక! దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే తప్పులు చేసిన విశ్వాసులను (మోమిన్లను) మన్నించి, ఒకసారి నరకం నుంచి విముక్తి కల్పించి స్వర్గంలో చోటు ఇచ్చిన తరువాత ఇక వారిని స్వర్గంలో నుంచి తీసివెయ్యటం అనేది జరుగదు. వారు కలకాలం స్వర్గంలోనే ఉంటారు. ఆ స్వర్గవాసులంతా స్వర్గంలో దైవానుగ్రహాలను ఆస్వాదిస్తూ ఉంటారు. అందులో ఎలాంటి అంతరాయంగానీ, అడ్డంకిగానీ ఉండదు.

177. అంటే, వారికి విధించవలసిన శిక్ష విషయంలో ఎలాంటి వెసులుబాటూ ఉండదు. పడవలసిన శిక్ష పడి తీరుతుంది.

178. ఆ గ్రంథాన్ని (తౌరాతును) కొందరు విశ్వసించగా, కొందరు త్రోసిపుచ్చారు. వెనుకటి ప్రవక్తల విషయంలో కూడా ఈ వ్యవహారం జరిగింది. నువ్వు ఒక్కడివే ఈ పరిస్థితిని ఎదుర్కోవటం లేదు. కాబట్టి వాళ్ళ చేష్టలపై నువ్వు కుమిలిపోకు – అని దేవుడు తన అంతిమ ప్రవక్త ముహమ్మదు (సఅసం)కు ఈ ఆయతులో ఓదార్పు మాటలు చెబుతున్నాడు.

179. అంటే వారిని శిక్షించవలసిన సమయాన్ని దేవుడు ముందే నిర్ధారించి ఉన్నాడు. అదే గనక లేకుండా ఉంటే వాళ్ల సంగతి అప్పటికప్పుడే తేల్చివేయబడేది.

113 చూడండి! ఎట్టి పరిస్థితిలోనూ దుర్మార్గుల పక్షాన మొగ్గకండి. మొగ్గారో మీక్కూడా నిప్పు (నరకాగ్ని) అంటుకుంటుంది.[181] మరి అల్లాహ్ తప్ప మిమ్మల్ని ఆదుకునే వాడెవడూ ఉండడు. మీకు సహాయమూ అందదు.

وَلَا تَرْكَنُوٓا۟ إِلَى ٱلَّذِينَ ظَلَمُوا۟ فَتَمَسَّكُمُ ٱلنَّارُ وَمَا لَكُم مِّن دُونِ ٱللَّهِ مِنْ أَوْلِيَآءَ ثُمَّ لَا تُنصَرُونَ ﴿113﴾

114 దినము యొక్క రెండు అంచులలోనూ నమాజును స్థాపించు – రాత్రి ఘడియలలో కూడా![182] నిశ్చయంగా పుణ్య కార్యాలు పాపకార్యాలను దూరం చేస్తాయి.[183] హితబోధను గ్రహించగలిగే వారికి ఇదొక హితోపదేశం.

وَأَقِمِ ٱلصَّلَوٰةَ طَرَفَىِ ٱلنَّهَارِ وَزُلَفًا مِّنَ ٱلَّيْلِ ۚ إِنَّ ٱلْحَسَنَٰتِ يُذْهِبْنَ ٱلسَّيِّـَٔاتِ ۚ ذَٰلِكَ ذِكْرَىٰ لِلذَّٰكِرِينَ ﴿114﴾

180. ఈ ఆయతులో మహాప్రవక్త (సఅసం)కు, ఆయన ప్రియ సహచరులకు సహన స్థయిర్యాల ఉపదేశం చేయబడింది. శత్రువును జయించటానికి ఈ ఆయుధం ఎంతో అవసరం. అలాగే వారు మితిమీరి ప్రవర్తించకూడదు. మితిమీరటం విశ్వాసులకు ఏ విధంగానూ శోభించదు. కడకు శత్రువుతో వ్యవహారం చేసే సమయంలో కూడా ఆజ్ఞోల్లంఘనకు పాల్పడేందుకు అనుమతి లేదు.

181. అలా అని దుర్మార్గుల విషయంలో మెతక వైఖరిని అవలంబిస్తూ, వారితో రాజీపడిపోయి వారి నుంచి సహాయ సహకారాలను అందుకోరాదు. ఒకవేళ మీరలా చేస్తే మీరు వారిలోని ఇతర విషయాలను కూడా ఇష్టపడుతున్నారని వారు భ్రమపడవచ్చు. మీలోని ఈ దోషం మిమ్మల్ని కూడా నరకాగ్నికి పాత్రులుగా చేస్తుంది. దుర్మార్గులైన పరిపాలకులతో సన్నిహిత సంబంధాలు పెట్టుకోరాదన్న అంశం కూడా ఇందులో ఇమిడి ఉంది. అయితే ధర్మోన్నతికి సంబంధించిన విషయాలపై సమాలోచన జరిపితే తప్పులేదు. అలాంటి సందర్భాలలో మనసులో వారిపట్ల ఏహ్యాభావం కలిగి ఉంటూనే సంప్రతింపులు జరపవచ్చు. కొన్ని హదీసుల ద్వారా కూడా ఈ మేరకు ఆధారం లభిస్తుంది.

182. **“రెండు అంచులు”** అంటే ఏమిటి? సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తరువాత (మగ్రిబ్ సమయంలో) చేసే నమాజు అని కొందరు భావిస్తున్నారు. కేవలం ఇషా నమాజ్ అని మరికొందరన్నారు. ఇది మగ్రిబ్, ఇషా నమాజులకు సంబంధించిన ఆజ్ఞ అని ఇంకా కొంతమంది అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయం ఇలా ఉంది: “బహుశా ఈ ఆయతు ‘మేరాజ్’కు పూర్వం అవతరించి ఉంటుంది. మేరాజ్ సందర్భంగా రోజుకు 5 పూటల నమాజులు విధించబడ్డాయి. అంతకు మునుపు రోజుకు రెండు నమాజులే ఉండేవి – ఒకటి : సూర్యోదయానికి ముందు, రెండు: సూర్యాస్తమయానికి ముందు. రాత్రి చివరి ఘడియలలో ‘తహజ్జుద్’ నమాజు చేయబడేది. ఆ తరువాత తహజ్జుద్ నమాజ్ ఉమ్మత్ (ముస్లిం సమాజం) కొరకు మాఫీ చేయబడింది. కొంతమంది అభిప్రాయం ప్రకారం ఈ తహజ్జుద్ నమాజు ఆయన (సఅసం) కూడా తప్పనిసరిగా చేయనవసరం లేదని అనబడింది” (ఇబ్నె కసీర్). నిజము దేవుడెరుగు.

183. హదీసుల ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. ఉదాహరణకు : “ఐదు నమాజులు, ఒక శుక్రవారం (నమాజు) రెండో శుక్రవారం వరకు, ఒక రమజాన్ (లోని ఆరాధనలు) రెండవ రమజాన్ వరకు పాపాలను దూరం చేస్తాయి. కాకపోతే మనిషి పెద్ద పెద్ద పాపాలకు దూరంగా ఉండాలి” అని హదీసులో ఉంది (సహీహ్ ముస్లిం – కితాబుత్తహార...). మరో హదీసు ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: “చెప్పండి! మీలో ఎవరి వాకిలి ముందైనా ఒక పెద్ద కాలువ ఉండి, అతను ప్రతి రోజూ అందులో ఐదుసార్లు స్నానం చేస్తూ ఉన్నట్లయితే, అప్పటికీ అతని శరీరంపై దుమ్ము ధూళీ పేరుకుని ఉంటుందా?” ‘లేదు’ అని సహచరులు (రజి) సమాధానమిచ్చారు. అప్పుడు ఆయన (స), “ఐదు పూటల నమాజులూ అంతే. వాటి ద్వారా అల్లాహ్ పాపాలను తొలగిస్తాడు” అని చెప్పారు (బుఖారీ – కితాబుల్ మవాఖీత్; ముస్లిం – కితాబుల్ మసాజిద్).

**115** నువ్వు సహనంతో మసలుకో. నిశ్చయంగా సద్వర్తనుల పుణ్యఫలాన్ని అల్లాహ్ వృథా కానివ్వడు.

وَاصْبِرْ فَإِنَّ اللّٰهَ لَا يُضِيْعُ اَجْرَ الْمُحْسِنِيْنَ ﴿115﴾

**116** మీకు పూర్వం గతించిన కాలాలవారిలో భూమిలో కల్లోలాన్ని వ్యాపింపజేయకుండా అడ్డుకునే మంచివారు ఎందుకు లేరు? ఉన్నా బహుకొద్దిమంది మాత్రమే ఉండేవారు. వారిని మేము రక్షించాము.[184] కాగా; దుర్మార్గులైన వారు తమకు ప్రసాదించబడిన సుఖసౌఖ్యాల వెంటపడ్డారు. వారు అపరాధులు.[185]

فَلَوْلَا كَانَ مِنَ الْقُرُوْنِ مِنْ قَبْلِكُمْ اُولُوْا بَقِيَّةٍ
يَّنْهَوْنَ عَنِ الْفَسَادِ فِي الْاَرْضِ اِلَّا قَلِيْلًا مِّمَّنْ
اَنْجَيْنَا مِنْهُمْ ۚ وَاتَّبَعَ الَّذِيْنَ ظَلَمُوْا مَاۤ اُتْرِفُوْا
فِيْهِ وَكَانُوْا مُجْرِمِيْنَ ﴿116﴾

**117** పురములలో నివసించేవారు మంచి పనులు చేస్తున్నప్పుడు నీ ప్రభువు అలాంటి పురములను అన్యాయంగా తుదముట్టించడు.

وَمَا كَانَ رَبُّكَ لِيُهْلِكَ الْقُرٰى بِظُلْمٍ وَّ اَهْلُهَا
مُصْلِحُوْنَ ﴿117﴾

**118** నీ ప్రభువు గనక తలచుకుంటే మనుషులందరినీ ఒకే సమూహంగా చేసి ఉంచేవాడు. కాని వారు మాత్రం విభేదించుకునే వారుగానే ఉంటారు.

وَلَوْ شَآءَ رَبُّكَ لَجَعَلَ النَّاسَ اُمَّةً
وَّاحِدَةً وَّلَا يَزَالُوْنَ مُخْتَلِفِيْنَ ﴿118﴾

**119** కాని నీ ప్రభువు దయచూపినవారు మాత్రం అలా చేయరు. ఆయన వారిని పుట్టించిందే అందుకోసం.[186] "నేను నరకాన్ని జిన్నాతులు, మనుషులు – అందరితోనూ నింపుతాను"[187] అని నీ ప్రభువు అన్నమాట నెరవేరింది.

اِلَّا مَنْ رَّحِمَ رَبُّكَ ۚ وَلِذٰلِكَ خَلَقَهُمْ ۚ
وَتَمَّتْ كَلِمَةُ رَبِّكَ لَاَمْلَئَنَّ جَهَنَّمَ مِنَ
الْجِنَّةِ وَالنَّاسِ اَجْمَعِيْنَ ﴿119﴾

184. అంటే దుర్మార్గులను దుర్మార్గానికి ఒడిగట్టకుండా ఆపే సజ్జనులు పూర్వకాలంలో ఎందుకు ఉండలేదు? అని ప్రశ్నించిన తరువాత, "వారు ఉండేవారు. కాని చాలా కొద్దిమంది మాత్రమే ఉండేవారు" అని స్వయంగా ఆయనే సెలవిచ్చాడు. ఆ సమయంలో మేము ఆ సజ్జనులను కాపాడి, కల్లోల జనకులను మా శిక్ష ద్వారా తుదముట్టించాము అని ఆయన వివరించాడు.

185. ఈ దుష్టులు తమ దురాగతాలను ఎంతకీ మానుకోలేదు. తమకు లభించిన సుఖాలను జుర్రుకుంటూ, విషయలాలసకు లోనై అదే సర్వస్వం అనుకున్నారు. ఎట్టకేలకు వారిపై 'శిక్ష' విరుచుకుపడింది.

186. **'అందుకోసం'** అన్న పదంపై ద్వంద్వాభిప్రాయాలున్నాయి. ఈ పదాన్ని కొందరు 'అభిప్రాయభేదం' అన్న భావంలో తీసుకోగా, మరికొందరు 'దైవకారుణ్యం' అన్న అర్థంలో తీసుకున్నారు. రెండు విధాలుగా తీసుకున్నా పూర్వరంగం మాత్రం ఒక్కటే – అదే మానవాళిని 'పరీక్షించటం'! సత్యధర్మం విషయంలో విభేదించి, తనదైన అభిమతాన్ని అవలంబించేవాడు పరీక్షలో తప్పుతాడు. సత్యధర్మాన్ని నమ్మి నడుచుకునేవాడు పరీక్షలో ఉత్తీర్ణుడవుతాడు, దైవ కారుణ్యానికి నోచుకుంటాడు.

187. ఈ విషయం దేవుని విధివ్రాతలో అంతర్భాగం. మానవులు, జిన్నాతులలో కొందరు స్వర్గలోకానికి అర్హతను సంపాదించుకోగా, కొందరు నరకాగ్నికి పాత్రులుగా నిలుస్తారు. ఆ విధంగా స్వర్గ – నరకాలు మానవులు – జిన్నాతులతో నింపబడతాయి. హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది. ఒక హదీసు ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు : "స్వర్గం – నరకం పరస్పరం వాదులాడుకున్నాయి. 'నా లోకి

وَكُلًّا نَّقُصُّ عَلَيْكَ مِنْ أَنۢبَآءِ ٱلرُّسُلِ
مَا نُثَبِّتُ بِهِۦ فُؤَادَكَ ۚ وَجَآءَكَ فِى هَٰذِهِ
ٱلْحَقُّ وَمَوْعِظَةٌ وَذِكْرَىٰ لِلْمُؤْمِنِينَ ﴿120﴾

**120** (ఓ ప్రవక్తా!) ప్రవక్తల ఈ సమాచారాలన్నింటినీ మేము నీ మనోనిబ్బరం కోసం నీకు తెలియపరుస్తున్నాము. ఈ సూరాలో కూడా నీకు సత్యం లభించింది. విశ్వాసులకు ఇది హితోపదేశం మరియు జ్ఞాపిక.

وَقُل لِّلَّذِينَ لَا يُؤْمِنُونَ ٱعْمَلُوا۟ عَلَىٰ
مَكَانَتِكُمْ ۖ إِنَّا عَٰمِلُونَ ﴿121﴾

**121** విశ్వసించనివారితో, "మీరు మీ పద్ధతి ప్రకారం పనులు చేస్తూ ఉండండి, మా పనులు మేము చేస్తూ ఉంటాము.

وَٱنتَظِرُوٓا۟ ۖ إِنَّا مُنتَظِرُونَ ﴿122﴾

**122** మీరూ నిరీక్షించండి, మేమూ నిరీక్షిస్తూ ఉంటాము"[188] అని (ఓ ప్రవక్తా!) చెప్పు.

وَلِلَّهِ غَيْبُ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ وَإِلَيْهِ يُرْجَعُ
ٱلْأَمْرُ كُلُّهُۥ فَٱعْبُدْهُ وَتَوَكَّلْ عَلَيْهِ ۚ وَمَا رَبُّكَ
بِغَٰفِلٍ عَمَّا تَعْمَلُونَ ﴿123﴾

**123** భూమ్యాకాశాల రహస్య జ్ఞానం అల్లాహ్ వద్దనే ఉంది. సమస్త వ్యవహారాలూ ఆయన వైపుకే మరలించబడతాయి. కాబట్టి (ఓ ప్రవక్తా!) నువ్వు ఆయన్నే ఆరాధించాలి. ఆయన్నే నమ్ముకోవాలి. మీరు చేసే పనులు అల్లాహ్‌కు తెలియకుండా లేవు.

వచ్చే వారంతా బలహీనులు, అట్టడుగు వర్గాల వారే ఉన్నారెందుకనీ?' అని స్వర్గం అన్నది. 'నా లోనికి వచ్చేవారంతా పొగరుబోతులు, గర్విష్టులు, అధికార మదాంధులు అయి ఉంటారు తెలుసా?!' అని నరకం అన్నది. అప్పుడు అల్లాహ్ స్వర్గాన్ని ఉద్దేశించి, 'నువ్వు నా కారుణ్యానికి ప్రతీకవు. నీ ద్వారా నేను తలచిన వారినల్లా కరుణిస్తాను' అని అన్నాడు. అలాగే ఆయన నరకాన్ని ఉద్దేశించి, 'నువ్వు నా శిక్షకు ప్రతీకవు. నీ ద్వారా నేను కోరిన వారిని శిక్షిస్తాను' అన్నాడు. ఆయన స్వర్గ నరకాలను – రెండిటినీ నింపేస్తాడు. స్వర్గంలో సదా ఆయన అనుగ్రహం ఉంటుంది. అల్లాహ్ మరికొన్ని ప్రాణులను కూడా సృష్టిస్తాడు. వారు స్వర్గంలో మిగిలి వున్న స్థలాలలో నివసిస్తారు. కాని నరక స్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. ఎంతోమంది నరకవాసులు అందులోకి చేరినప్పటికీ అది, 'ఇంకా ఎందరు మిగిలి ఉన్నారు?' అని ఆవురావురుమంటుంటుంది. అప్పుడు అల్లాహ్ అందులో తన కాలు మోపుతాడు. అప్పుడది, "చాలు, చాలు. నీ గౌరవ వైభవాల సాక్షిగా!" అని అంటుంది (సహీహ్ బుఖారీ–కితాబుత్తౌహీద్; ముస్లిం – కితాబుల్ జన్నహ్).

188. అంటే – పరిణామం రీత్యా ఎవరు సఫలీకృతులవుతారో శీఘ్రంగానే మీకు తెలిసిపోతుంది. దుర్మార్గుల పర్యవసానం దారుణంగా ఉంటుందన్న సంగతి కూడా మీకు తెలిసివస్తుంది. ఈ ఫలితం తొందరగానే తేలిపోయింది కూడా. దేవుడు ముస్లిములకు ఆధిక్యతను వొసగాడు. అనతి కాలంలోనే యావత్తు అరేబియా ద్వీపం ఇస్లాం ఒడిలోకి వచ్చేసింది.

12వ సూరా

# యూసుఫ్

## దైవప్రవక్త యూసుఫ్

అవతరణ మక్కాలో

ఆయతులు 111

### పరిచయం

*దివ్య ఖుర్‌ఆన్ స్పష్టమైన గ్రంథమనీ, సత్ప్రవర్తనను, నైతిక నడవడికను బోధించే గ్రంథమని ఈ సూరా నొక్కి చెప్పింది. దివ్య ఖుర్‌ఆన్‌లో సవివరంగా తెలుపబడిన గాథ యూసుఫ్ ప్రవక్త (అస)కు సంబంధించిన గాథ. ఆధ్యాత్మిక, నైతిక బోధనలు నిండుగా ఉన్న గాథ ఇది. యూసుఫ్ (అస) ఎదుర్కొన్న కష్టాలు, ఇబ్బందులు, సవాళ్ళతో గడిచిన ఆయన జీవితం ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు తెలుపడం జరిగింది. ఆయనకు ఊరట నివ్వడానికి, ఈ గాథ ద్వారా పాఠాలు గ్రహించడానికి దీనిని వివరించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ సూరా అవతరించిన కాలంలో యూసుఫ్ (అస) మాదిరి కష్టాలను, సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. ప్రవక్త (సఅసం) సతీమణి హజ్రత్ ఖదీజా (రజి), ఆయన పినతండ్రి అబూ తాలిబ్‌లు మరణించిన నేపథ్యం అది. యూసుఫ్ ప్రవక్త జీవిత గాథను ఖుర్‌ఆన్ చాలా క్లుప్తంగా చెప్పినప్పటికీ, దాని వివరణా తీరు మాత్రం ఎంతో అద్భుతంగా ఉంది. యూసుఫ్ ప్రవక్త చిన్నతనంలో చూసిన ఓ కలతో ఈ కథ ప్రారంభమయి, ఎన్నో మలుపులు తిరిగి, చివరికి ఆయన కన్న కల సాకారం అవటంతో అది ముగుస్తుంది. నిజంగా జరిగిన ఈ కథలో విశ్వాసులకు మార్గదర్శకత్వం, హితబోధ ఉన్నాయి. ఇక చదవండి....*

### సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 4-101 | 60 | 'దైవప్రవక్త యూసుఫ్' | దివ్యఖుర్‌ఆన్‌లో చాలా విపులంగా, ధారావాహికంగా చెప్ప బడిన దైవ ప్రవక్త గాథ ఇదొక్కటే. ఇందులో హాస్యం, మానవ బలహీనతలు, ఉన్నత గుణగణాలు, ఈర్ష్యా అసూయలు, విద్వేషం, అహం, వాంఛలు, మోసం, కుట్ర, క్రూరత్వం, సహనం, విశ్వాసం, ధైర్యం, సద్వర్తనం, సానుభూతి వంటి అనేక గుణగణాలు మన ముందుకు వస్తాయి. |

## యూసుఫ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** అలిఫ్ – లామ్ – రా. ఇవి స్పష్టమైన గ్రంథ వాక్యాలు.

**2** మీరు అర్థం చేసుకునేటందుకు మేము దీనిని అరబీ ఖుర్‌ఆనుగా అవతరింపజేశాము.[1]

**3** (ఓ ప్రవక్తా!) మేము నీ వద్దకు 'వహీ' ద్వారా ఈ ఖుర్‌ఆన్‌ను పంపి, (దీనిద్వారా) అత్యుత్తమమైన గాథలను[2] నీకు చెబుతున్నాము. నిశ్చయంగా ఇంతకు మునుపు నీకు దీని (ఈ గాథల) గురించి ఏమీ తెలియదు.[3]

## سُوْرَةُ يُوْسُفَ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

الٓرٰ ۚ تِلْكَ اٰيٰتُ الْكِتٰبِ الْمُبِيْنِ ﴿1﴾

اِنَّاۤ اَنْزَلْنٰهُ قُرْءٰنًا عَرَبِيًّا لَّعَلَّكُمْ تَعْقِلُوْنَ ﴿2﴾

نَحْنُ نَقُصُّ عَلَيْكَ اَحْسَنَ الْقَصَصِ بِمَاۤ
اَوْحَيْنَاۤ اِلَيْكَ هٰذَا الْقُرْاٰنَ ۖۗ وَاِنْ كُنْتَ مِنْ
قَبْلِهٖ لَمِنَ الْغٰفِلِيْنَ ﴿3﴾

1. దైవగ్రంథాల అవతరణలోని ప్రధాన ఉద్దేశం మానవాళికి సన్మార్గం చూపటమే. ప్రజలు అర్థం చేసుకునే భాషలో అది ఉన్నప్పుడే దాని ఉద్దేశం నెరవేరుతుంది. అందుకే ప్రతి ఆకాశ గ్రంథమూ ఆ జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే అవతరించింది. దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన నేల అరేబియా నేల. తొలుత అరబ్బులను ఉద్దేశించి అది అవతరించింది. వారు మాట్లాడేది అరబీ భాష. అందువల్ల దివ్య ఖుర్‌ఆన్ అరబీలో అవతరించింది. అదలా ఉంచితే అరబీ భాష తన నుడికారపు సొంపుసొంపుల దృష్ట్యా, గాంభీర్యం దృష్ట్యా, మనోభావాన్ని అభివ్యక్తం చేయటంలోని అందచందాల రీత్యా ప్రపంచంలోనే చాలా గొప్ప భాషగా ప్రసిద్ధిచెందింది. అందువల్ల అల్లాహ్ ఈ శ్రేష్ఠమైన (ఖుర్‌ఆన్) గ్రంథాన్ని, శ్రేష్ఠమైన (అరబీ) భాషలో, శ్రేష్ఠులైన ప్రవక్త (ముహమ్మద్ – సఅసం)పై, శ్రేష్ఠుడైన దైవదూత (జిబ్రయీల్) ద్వారా అవతరింప జేశాడు. ప్రప్రథమంగా అది అవతరించిన స్థలం (మక్కా) కూడా లోకంలోకెల్లా శ్రేష్ఠమైన స్థలమే. అది అవతరించిన నెల (రమజాన్) కూడా నెలలన్నింటిలోకీ శ్రేష్ఠమైనదే మరి!
2. ఆయతులో **'ఖసస్'** అనే పదం ఉంది. ఖసస్ అంటే ఏదేని ఒక విషయం వెంటపడటం, దానికి సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలన్నింటినీ వెలికితీసి, విశదీకరించటం అని అర్థం. అంటే ఆసక్తికరమైన గాథ, వృత్తాంతం, చరితము అని భావం. ఈ పదం కట్టుకథలకు, కాలక్షేపానికి చదువుకునే కల్పనా గాథలకు ఎంతమాత్రం వర్తించదు. గతంలో సంభవించిన ఒకానొక యదార్థ సంఘటనను శోధించి, దానిని వెలుగులోకి తీసుకురావటం అన్నమాట. ఈ వృత్తాంతం కూడా మాజీలో జరిగిన వాస్తవగాథే. ఈ గాథలో అసూయాద్వేషాలకు పట్టే గతి ఎలా ఉంటుందో, దేవుని అండదండలున్న వారు ఎలా నికార్సుగా నెగ్గుకువస్తారో, చెడుల వైపుకు పురికొల్పే మనసు మనిషిచేత ఎన్ని తప్పులు చేయిస్తుందో, మానవ సహజమైన దౌర్బల్యాలు మనిషిని ఎలా తప్పుదోవ పట్టిస్తాయో అత్యంత మనోహరంగానూ, గుణపాఠం గరిపే విధంగానూ చిత్రీకరించబడ్డాయి. అందుకే ఖుర్‌ఆన్ దీనిని అత్యుత్తమమైన గాథ (అహ్సనుల్ ఖసస్)గా అభివర్ణించింది.
3. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయతు ద్వారా మరోసారి తేటతెల్లమయ్యేదేమిటంటే మహనీయ ముహమ్మద్ (సఅసం) గారికి రహస్య విషయాల జ్ఞానం లేదు. ఒకవేళ ఆయన(స)కు ఈ అగోచర జ్ఞానం ఉండి ఉంటే 'ఇంతకు మునుపు నీకు దీని గురించి ఏమీ తెలియదు' అని అల్లాహ్ సెలవిచ్చి ఉండేవాడు కాదు. ఇంకో విషయం ఏమిటంటే; ఆయన (సఅసం) దేవుని సత్యసంధుడైన ప్రవక్త. ఎందుకంటే 'వహీ' ద్వారానే ఆయన (స)కు ఈ వాస్తవగాథ చెప్పబడింది. అంతేగాని ఆయన (స) ఏ గురువు వద్దనో విని లోకానికి చాటిచెప్పిన శిష్యుడు కారు. నిశ్చయంగా అల్లాహ్‌యే ఈ చారిత్రక వాస్తవాన్ని 'వహీ' సందేశం ద్వారా ఆయన వద్దకు చేర్చాడు.

**4** యూసుఫ్ తన తండ్రితో,[4] "నాన్నా! నేను (కలగన్నాను. ఆ
కలలో) పదకొండు నక్షత్రాలను, సూర్యచంద్రులను చూశాను.[5]–
అవి నాకు సాష్టాంగ ప్రణామం చేస్తున్నట్లు కనిపించాయి" అని
చెప్పినప్పుడు,

إِذْ قَالَ يُوسُفُ لِأَبِيهِ يَا أَبَتِ إِنِّي رَأَيْتُ أَحَدَ عَشَرَ
كَوْكَبًا وَالشَّمْسَ وَالْقَمَرَ رَأَيْتُهُمْ لِي سَاجِدِينَ ④

**5** "నా ముద్దుల బాబూ! నువ్వు కన్న కలను గురించి నీ సోదరు
లకు మాత్రం చెప్పకురా. బహుశా వారు నీకు వ్యతిరేకంగా
కుట్ర[6] పన్నవచ్చురా. నిశ్చయంగా షైతాన్ మనిషికి బద్ధవిరోధి.[7]

قَالَ يَا بُنَيَّ لَا تَقْصُصْ رُؤْيَاكَ عَلَىٰ إِخْوَتِكَ
فَيَكِيدُوا لَكَ كَيْدًا ۖ إِنَّ الشَّيْطَانَ لِلْإِنسَانِ
عَدُوٌّ مُّبِينٌ ⑤

**6** "అలాగే[8] (నువ్వు కలగన్నట్లుగానే) జరుగుతుంది. నీ ప్రభువు
నిన్ను (తన కార్యం కొరకు) ఎన్నుకుంటాడు. నీకు విషయాల
లోతును అందుకునే విద్యను (లేక స్వప్నాల సారాంశాన్ని గ్రహించే
జ్ఞానాన్ని) కూడా నేర్పుతాడు. తన అనుగ్రహాన్ని నీపై పరిపూర్ణం
గావిస్తాడు.[9] – యాఖూబు సంతానాన్ని కూడా (అనుగ్ర

وَكَذَٰلِكَ يَجْتَبِيكَ رَبُّكَ وَيُعَلِّمُكَ مِن تَأْوِيلِ
الْأَحَادِيثِ وَيُتِمُّ نِعْمَتَهُ عَلَيْكَ وَعَلَىٰ آلِ
يَعْقُوبَ كَمَا أَتَمَّهَا عَلَىٰ أَبَوَيْكَ مِن قَبْلُ

4. ఓ ముహమ్మద్ (సఅసం)! నీ జాతి వారికి (మక్కాలోని ఖురైషులకు) యూసుఫ్ (అలైహిస్సలాం) చరితమును వినిపించు. యూసుఫ్ తండ్రి పేరు యాఖూబు! ఈ తండ్రీ కొడుకులు దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీము సంతతికి చెందినవారు. హదీసు ద్వారా కూడా ఈ వంశ వృక్షం వివరించబడింది. యూసుఫ్ (అలైహిస్సలాం) ఇబ్రాహీము (అలైహిస్సలాం) గారికి మునిమనవడు అవుతారు (ముస్నదె అహ్మద్ – సంపుటి : 2, పేజీ – 96).

5. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం పదకొండు నక్షత్రాలంటే యూసుఫ్ (అలైహిస్సలాం) గారి పదకొండుమంది సోదరులు, సూర్యచంద్రులంటే ఆయన తల్లిదండ్రులని భావం. ఈ స్వప్నంలోని నిగూఢార్థం 40 లేక 80 సంవత్సరాల తర్వాత ఈ పదకొండు మంది సోదరులు తమ తల్లిదండ్రుల సమేతంగా ఈజిప్టు వెళ్ళి యూసుఫ్ (అలైహిస్సలాం) ముందు ప్రణమిల్లినప్పుడు స్పష్టమయింది. ఈ సూరా చివరి భాగంలో ఈ సంఘటన రానున్నది.

6. యూసుఫ్ కన్న కలను గురించి వినగానే, ఆయన అంతస్తును దేవుడు పెంచనున్నాడని తండ్రి యాఖూబుకు అర్థమై పోయింది. ఈ సంగతి తెలుసుకుని అతని అన్నలు అసూయతో అతనికి కీడు తలపెడతారేమోనన్న భయం కూడా ఆయనకు కలిగింది. అందుకే ఆ కల గురించి అన్నలెవరికీ చెప్పవద్దని తాకీదు చేశారు.

7. సోదరులు కీడెందుకు తలపెడతారో కూడా ఆయన వివరించారు. షైతాన్ ఎలాగూ మనిషికి బద్ధవిరోధి. వాడు ఎల్లవేళలా మనిషిని కవ్వించి, పెడత్రోవ పట్టించి, అసూయాద్వేషాలను రగుల్గొల్పాలని చూస్తుంటాడు. యూసుఫ్ (అలైహిస్సలాం) సోదరుల గుండెల్లో అసూయాగ్నిని రాజేసి, వారి మధ్య కలతలు రేపడానికి షైతాన్‌కు ఇంతకన్నా మంచి అదను దొరకదు. చివరకు అతను చేసింది కూడా అదే. హజ్రత్ యాఖూబు (అలైహిస్సలాం) గారి అనుమానం నిజమయింది.

8. అత్యంత ఉన్నతమైన స్వప్నాన్ని చూపించటం కోసం అల్లాహ్ నిన్ను ఎన్నుకున్నట్లే, తన మహాకార్యం కోసం నిన్ను నియమిస్తాడు. కలల నిగూఢార్థాన్ని విడమరచి చెప్పే విద్యను నీకు నేర్పుతాడు. **'తావీలుల్ అహాదీస్'** అంటే విషయాల లోతులకు చేరటం అని అసలు అర్థం. ఇక్కడ మాటల లోతులకు చేరటం అంటే కలల భావార్థాన్ని విశదీకరించటం అన్నమాట!

9. అనుగ్రహాన్ని పరిపూర్ణం గావించటమంటే ప్రవక్త పదవిని వొసగటం అని అర్థం లేదా ఈజిప్టు రాజ్యంలో యూసుఫ్ (అ)కు ప్రాప్తమయిన అనుగ్రహాలు కావచ్చు.

إِبۡرَٰهِيمَ وَإِسۡحَٰقَۚ إِنَّ رَبَّكَ عَلِيمٌ حَكِيمٞ ⑥

హిస్తాడు).[10] ఆయన లోగడ నీ తాత ముత్తాతలైన ఇబ్రాహీము, ఇస్‌హాఖులకు తన అనుగ్రహాన్ని సంపూర్ణంగా ప్రసాదించినట్లు. నిశ్చయంగా నీ ప్రభువు మహాజ్ఞాని, గొప్ప వివేకవంతుడు” అని అతని తండ్రి (యాఖూబ్) ఉపదేశించాడు.

۞ لَّقَدۡ كَانَ فِي يُوسُفَ وَإِخۡوَتِهِۦٓ ءَايَٰتٞ لِّلسَّآئِلِينَ ⑦

**7** నిశ్చయంగా యూసుఫ్ మరియు అతని సోదరుల గాథలో అడిగేవారి కోసం (గొప్ప)[11] సూచనలున్నాయి.

إِذۡ قَالُواْ لَيُوسُفُ وَأَخُوهُ أَحَبُّ إِلَىٰٓ أَبِينَا مِنَّا
وَنَحۡنُ عُصۡبَةٌ إِنَّ أَبَانَا لَفِي ضَلَٰلٖ مُّبِينٍ ⑧

**8** అప్పుడు వారిలా చెప్పుకున్నారు: “మనం ఒక (బలమైన) జట్టుగా[12] ఉన్నప్పటికీ మన తండ్రి మనకన్నా యూసుఫును, అతని సోదరుణ్ణే[13] ఎక్కు వగా ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో మా తండ్రి స్పష్టమైన తప్పు చేస్తున్నారు[14] అనేది మాత్రం ముమ్మాటికీ నిజం.

ٱقۡتُلُواْ يُوسُفَ أَوِ ٱطۡرَحُوهُ أَرۡضٗا يَخۡلُ لَكُمۡ وَجۡهُ
أَبِيكُمۡ وَتَكُونُواْ مِنۢ بَعۡدِهِۦ قَوۡمٗا صَٰلِحِينَ ⑨

**9** “(అందుకే) యూసుఫ్‌ను చంపేయండి లేదా అతన్ని ఏదైనా (తెలియని) చోట పారేయండి. అప్పుడైనా మీ తండ్రి శ్రద్ధాసక్తులు మీ వైపుకు మళ్ళవచ్చు. ఆ తరువాత మీరు మంచివారుగా మారాలి.”[15]

قَالَ قَآئِلٞ مِّنۡهُمۡ لَا تَقۡتُلُواْ يُوسُفَ وَأَلۡقُوهُ
فِي غَيَٰبَتِ ٱلۡجُبِّ يَلۡتَقِطۡهُ بَعۡضُ ٱلسَّيَّارَةِ
إِن كُنتُمۡ فَٰعِلِينَ ⑩

**10** అప్పుడు వారిలో ఒకడు, “యూసుఫ్‌ను చంపకండి. (ఒకవేళ ఏదైనా చేయాలనే అనుకుంటే) అతన్ని ఏదైనా లోతైన బావిలో పడవెయ్యండి[16] – వచ్చేపోయే బాటసారుల బృందం ఏదైనా అతన్ని ఎత్తుకుపోతుంది”[17] అని అన్నాడు.

10. అంటే యూసుఫ్ (అ) సోదరులు, వారి సంతానమన్నమాట! తరువాత వారు కూడా దైవానుగ్రహానికి అర్హులయ్యారు.

11. అంటే – ఈ గాథలో దేవుని గొప్ప శక్తియుక్తులు, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సత్యసంధతకు సంబంధించిన నిదర్శనాలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడ కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు ఆ పదకొండు మంది సోదరుల పేర్లు, వారి వివరాలను కూడా పేర్కొన్నారు.

12. మేము పదిమంది సోదరులం (ఒకే తల్లిబిడ్డలం) ఒక వైపున ఉండగా, మా సవతి సోదరులైన ఇద్దరి వైపుకు (యూసుఫ్, బిన్‌యామిన్‌ల వైపుకు) మా తండ్రి మొగ్గటం అన్యాయం. వారిద్దరూ తండ్రికి కన్నుల పండువగా, మానస పుత్రులుగా విరాజిల్లుతున్నారు.

13. అతని సోదరుడు అంటే యూసుఫ్ సొంత సోదరుడగు బిన్‌యామిన్ అని భావం.

14. మూలంలో **‘జలాల్’** (ضَلٰلٍ) అనే పదం వచ్చింది. జలాల్ అంటే అపమార్గం, పెడదారి అని అసలు అర్థం. కాని ఇక్కడ ‘పెడదారి’ అంటే తప్పు అని అర్థం. తమకన్నా యూసుఫ్, బిన్‌యామిన్‌లపైనే తమ తండ్రి ఎక్కువ మమకారం చూపి తప్పు చేస్తున్నారని ఆ పదిమందీ తలపోశారు.

15. అంటే ఒక తప్పు చేసిన పిదప (యూసుఫ్‌ను చంపటమో, బావిలో పడవేయటమో చేసిన తరువాత) పశ్చాత్తాపం చెంది, సజ్జనులుగా జీవిద్దాం అన్నది అతని మాటల్లోని మర్మం.

**11** వారంతా అన్నారు: "నాన్నగారూ! తమరు యూసుఫ్ విషయంలో మమ్మల్ని బొత్తిగా నమ్మరేమిటీ? మేము అతని బాగోగులను కోరేవారమే కదా![18]

قَالُوْا يٰۤاَبَانَا مَا لَكَ لَا تَاْمَنَّا عَلٰى يُوْسُفَ
وَاِنَّا لَهٗ لَنٰصِحُوْنَ ﴿11﴾

**12** "రేపు మీరతన్ని ఎలాగైనాసరే మాతో పంపండి. అక్కడతను బాగా తిని, ఆడుకుంటాడు. అతన్ని కాపాడే బాధ్యత మాది కదా?"

اَرْسِلْهُ مَعَنَا غَدًا يَّرْتَعْ وَيَلْعَبْ وَاِنَّا
لَهٗ لَحٰفِظُوْنَ ﴿12﴾

**13** (యాఖూబు – అలైహిస్సలాం) ఇలా సమాధానమిచ్చారు: "మీరతన్ని తీసుకువెళ్ళటం నన్ను వ్యాకుల పరుస్తోంది. మీరు పరధ్యానంలో ఉండగా ఎక్కడ తోడేలు వచ్చి అతన్ని తినేస్తుందో నన్న భయం కూడా నన్ను వెంటాడుతోంది."[19]

قَالَ اِنِّيْ لَيَحْزُنُنِيْۤ اَنْ تَذْهَبُوْا بِهٖ وَاَخَافُ
اَنْ يَّاْكُلَهُ الذِّئْبُ وَاَنْتُمْ عَنْهُ غٰفِلُوْنَ ﴿13﴾

**14** దానికి వారు, "(నాన్నా!) మాలాంటి (బలిష్టమైన) జట్టు ఉండగా తోడేలు వచ్చి ఇతన్ని తినేస్తే మేము ఏమాత్రం చేతకాని చవటలం అవుతాము"[20] అని చెప్పారు.

قَالُوْا لَئِنْ اَكَلَهُ الذِّئْبُ وَنَحْنُ عُصْبَةٌ
اِنَّاۤ اِذًا لَّخٰسِرُوْنَ ﴿14﴾

16. అరబీలో **"గయాబతిల్ జుబ్బ్"** అని ఉంది. జుబ్బ్ అంటే అర్థం బావి. గయాబతున్ అంటే లోతుగా ఉండేది అని అర్థం. సాధారణంగా బావి అనేది లోతుగానే ఉంటుంది. అందులో పడిన వస్తువు కనిపించదు. కాకపోతే లోతైన బావి అనటంలో భావ ఆధిక్యత (Supremacy) ఉంది.

17. రాకపోకలు జరిపే బాటసారులు మంచినీరు తోడుకోవటానికి బావికి వచ్చినప్పుడు వారెలాగూ యూసుఫ్‌ను చూసి, అతన్ని తమతో తీసుకువెళతారు. ఆ పదిమంది సోదరుల్లో ఒకడు సోదరప్రేమతో ఈ విధమైన సలహా యిచ్చాడు. హత్య చేయటంకన్నా ఇలా బావిలో పడవెయ్యటం కొంతలో కొంత మెరుగు అన్నది అతని ఉద్దేశం. అతను భయ పడుతూనే ఈ సలహా ఇచ్చాడు. ఆ సమయంలో ఆ పదిమంది సోదరుల అసూయాగ్ని తీవ్రంగా రాజుకుని ఉంది. అందుకే అతను 'అంతగా కావాలనుకుంటే.... ఈ విధంగా చేయండి' అని చెప్పవలసి వచ్చింది. ఆ క్షణంలో అతను తన అభిప్రాయాన్ని తెగేసి చెప్పి ఉంటే బహుశా వారు అతని మాటను కూడా ఖాతరు చేసి ఉండేవారు కాదేమో!

18. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే, ఇంతకు ముందు కూడా యూసుఫ్ సోదరులు యూసుఫ్‌ను తమ వెంట పంపమని ప్రతిపాదించి ఉంటారు. ఆ ప్రతిపాదనను తండ్రి యాఖూబు తిరస్కరించి ఉంటారు.

19. సైరుకు, షికార్లకు పోవాలనీ, ఆటలాడుకోవాలని, బులబాటం తీర్చుకోవాలని మానవ నైజం వాంఛిస్తుంది. అందుకే వ్యర్థ వ్యసనాలకు దారి తీయని ఆటలపై, విహార యాత్రలపై ఇస్లాం ఆంక్షలు విధించలేదు. అందుకే హజ్రత్ యాఖూబు (అలైహిస్సలాం) కూడా వారి క్రీడావినోదాలపై అభ్యంతరం తెలుపలేదు. బహుశా మీరు మీ క్రీడా వినోదాల్లో మునిగి ఉన్నప్పుడు తోడేలు వచ్చి యూసుఫ్‌ను భక్షిస్తుందేమోనని నాకు అనుమానంగా ఉందని మాత్రమే చెప్పారు. ఆ కాలంలో ఎడారి ప్రదేశాలలో తోడేళ్ళు ఎక్కువగా ఉండేవి.

20. మేమింతమందిమి ఉండగా తోడేలు అక్కడికి రావటానికి ఎలా సాహసిస్తుంది? మీరు నిశ్చింతగా ఉండండి. మమ్మల్ని నమ్మండి! అని అన్నదమ్ములు చెప్పారు.

**15** ఆ విధంగా వాళ్ళు అతన్ని తీసుకుపోయి, లోతైన బావిలో పడవేయాలని నిశ్చయించుకున్నారు. అప్పుడు మేము యూసుఫ్‌కు 'వహీ' పంపుతూ, "నువ్వు (ఒకానొక రోజు) తప్పకుండా వారికి ఈ వ్యవహారాన్ని తెలియజేస్తావు. కాని అప్పుడు వారు (నిన్ను) గుర్తుపట్టే స్థితిలో ఉండరు" అని తెలిపాము.[21]

فَلَمَّا ذَهَبُوا بِهِ وَأَجْمَعُوا أَن يَجْعَلُوهُ فِي غَيَابَتِ
الْجُبِّ ۚ وَأَوْحَيْنَا إِلَيْهِ لَتُنَبِّئَنَّهُم بِأَمْرِهِمْ هَٰذَا وَهُمْ
لَا يَشْعُرُونَ ﴿١٥﴾

**16** రాత్రయ్యేసరికి వారంతా లబోదిబోమంటూ తమ తండ్రి వద్దకు వచ్చారు.

وَجَاءُوا أَبَاهُمْ عِشَاءً يَبْكُونَ ﴿١٦﴾

**17** "ఓ నాన్నా! మేము యూసుఫ్‌ను సామాను వద్ద వదలిపెట్టి పరుగు పందెంలో మునిగిపోయాము. అంతలోనే తోడేలు వచ్చి అతన్ని తినేసింది. మేము నిజం చెప్పినా మీరు మా మాటను నమ్మరు" అన్నారు.[22]

قَالُوا يَا أَبَانَا إِنَّا ذَهَبْنَا نَسْتَبِقُ وَتَرَكْنَا يُوسُفَ
عِندَ مَتَاعِنَا فَأَكَلَهُ الذِّئْبُ ۖ وَمَا أَنتَ بِمُؤْمِنٍ
لَّنَا وَلَوْ كُنَّا صَادِقِينَ ﴿١٧﴾

**18** అతని (యూసుఫ్) చొక్కాను బూటకపు (నకిలీ) రక్తంతో రంగరించి తెచ్చారు. "(ఇది నిజం కాదు). ఇది మీ మనో కల్పిత మైన మాట మాత్రమే. సరే. ఇక ఓర్పు వహించటమే ఉత్తమం.[23] మీరు కల్పించే మాటలపై నేను అల్లాహ్ సహాయాన్నే అర్థిస్తున్నాను"[24] అని ఆయన (యాఖూబు) పలికారు.

وَجَاءُوا عَلَىٰ قَمِيصِهِ بِدَمٍ كَذِبٍ ۚ قَالَ بَلْ
سَوَّلَتْ لَكُمْ أَنفُسُكُمْ أَمْرًا ۖ فَصَبْرٌ جَمِيلٌ ۖ
وَاللَّهُ الْمُسْتَعَانُ عَلَىٰ مَا تَصِفُونَ ﴿١٨﴾

---

21. దివ్య ఖుర్‌ఆన్ ఎంతో క్లుప్తంగా ఈ వృత్తాంతాన్ని వివరిస్తోంది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వారు యూసుఫ్ (అలైహిస్సలాం)ను బావిలో పడవేసినప్పుడు, దేవుడు ఈ 'వహీ' సందేశం పంపి, ఆందోళన చెందవలసిన పనిలేదనీ, నిన్ను రక్షించటమే గాక ఉన్నత స్థానాలకు కూడా చేరుస్తానని యూసుఫ్‌కు భరోసా యిచ్చాడు. నీపట్ల ఈ దుర్వ్యవహారం చేసిన నీ సోదరులు ఏదో ఒక రోజు ముప్పేత్తుకుంటూ నీ దగ్గరకు వస్తారు. అప్పుడు నువ్వు వారి నిర్దాక్షిణ్య చర్యను జ్ఞాపకం చేస్తావు. వారు సిగ్గుతో కుమిలిపోయే స్థితి వస్తుంది అని దేవుడు తన ప్రవక్త (యూసుఫ్)కు తెలియపరచాడు. ఆ సమయంలో యూసుఫ్ పసివాడే. అయితే ప్రవక్తగా నియుక్తులు కాబోయే వారికి బాల్యం నుండే దేవుని 'వహీ' అందుతుందన్న దానికి ఇదొక తార్కాణం. హజ్రత్ ఈసా, యహ్యా (అలైహిమస్సలాం) లకు కూడా బాల్యంలోనే దైవ సందేశం అందింది.

22. మీ దృష్టిలో మేము సత్యవంతులం, నమ్మదగ్గవారం అయినప్పటికీ యూసుఫ్ విషయం దగ్గరకొచ్చేసరికి మీరు మమ్మల్ని నమ్మరు. ఇప్పుడైతే మరీను. ఇప్పుడు మేమేం చెప్పినా మీకు అబద్ధమే అనిపిస్తుంది.

23. వారు ఒక మేకపిల్లను కోసి, దాని రక్తాన్ని చొక్కాకు తగిలించారని అనబడుతోంది. కట్టుకథలు అల్లేవారు ఎక్కడో ఒక చోట తప్పటడుగు వేస్తారు. చొక్కాను రక్తంలో రంగరిస్తే సరిపోతుందన్న ఆలోచన వారికి వచ్చిందిగాని వారు చొక్కాను ఏమాత్రం చించలేదు. తోడేలే గనక యూసుఫ్‌ను తిని ఉంటే చొక్కాను చించి ఉండాల్సింది. ఆ చొక్కాను చూడగానే యాఖూబు గార్కి అనుమానం కలిగింది. దానికి తోడు యూసుఫ్ కన్న కలకు భావార్థం కూడా ఆయనకు తెలుసు. అందుకే తన ముద్దుల కొడుకు విషయంలో వారు చెప్పేదంతా అబద్ధమని ఆయనకు అర్థమైపోయింది. అయితే ఏం చేయగలరు? ఓపిక పట్టి, దైవ సహాయాన్ని అర్థించటం వినా మార్గాంతరం లేదు.

24. కపటులు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పై నీలాపనిందలు మోపినపుడు కూడా ఆమె దైవప్రవక్త (సఅసం) కు

19 ఒక ప్రయాణీకుల బృందం అటువైపు వచ్చింది. వారు నీళ్ళు తెచ్చే తమ మనిషిని నీళ్ళ కొరకు పంపగా, అతడు తన బొక్కెనను బావిలో వేశాడు – (యూసుఫ్‌ను చూడగానే) “శుభం శుభం, ఇదిగో ఇక్కడ ఒక బాలుడున్నాడ”ని అన్నాడు.[25] వారు అతన్ని వర్తక సామగ్రిగా పరిగణించి దాచిపెట్టారు.[26] అయితే వారు చేస్తున్నదంతా అల్లాహ్‌కు తెలుసు![27]

وَجَآءَتۡ سَيَّارَةٞ فَأَرۡسَلُواْ وَارِدَهُمۡ فَأَدۡلَىٰ دَلۡوَهُۥۖ قَالَ يَٰبُشۡرَىٰ هَٰذَا غُلَٰمٞۚ وَأَسَرُّوهُ بِضَٰعَةٗۚ وَٱللَّهُ عَلِيمُۢ بِمَا يَعۡمَلُونَ ١٩

వివరణగా ఈ మాటలే అన్నారు. ఆమె ఇలా చెప్పారు: “దైవసాక్షి! నేను నా కోసం, మీ కోసం కూడా యూసుఫ్ తండ్రి యాఖూబ్‌కు ఎదురయిన ఉపమానాన్నే ఉదాహరిస్తున్నాను. ఆ సమయంలో ఆయన (యాఖూబ్) ‘సహనమే మంచిది’ అన్నారు. నేను కూడా సహనం వహించటం తప్ప వేరే దారిలేదు” (సహీహ్ బుఖారీ – యూసుఫ్ సూరా వ్యాఖ్యానం).

25. ఆయతులో **‘వారిద్’** అని ఉంది. వారిద్ అనే వాడెవడంటే అతను ఒక వర్తక బిడారు పయనించే దారిలో కొంచెం ముందుగానే వెళ్ళి మంచినీటి వసతి గల స్థలం కనుగొని, వర్తక బిడారు ఆగడానికి ఏర్పాట్లు చేస్తాడు. ఆ వ్యక్తి బావిలో చేదను వేయగానే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) త్రాడు పట్టుకున్నారు. అందమైన బాలుడు కనిపించగానే ఆ వ్యక్తి ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయి ఆ బాలుణ్ణి పైకి లాక్కున్నాడు.

26. అరబీలో **‘బిజాఅతున్’** అని ఉంది. అంటే వ్యాపార వస్తువు అని అర్థం. ఇంతకీ హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం)ను వ్యాపార వస్తువుగా ఖరారు చేసి ఆయన్ని దాచిపెట్టినవారెవరు? ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. హాఫిజ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు – “బావి నుంచి హజ్రత్ యూసుఫ్ (అ) బొక్కెన ద్వారా బయటకు తీయబడినప్పుడు సోదరులు కూడా అక్కడ నిలబడి ఉన్నారు. యూసుఫ్ తమ సోదరుడన్న సంగతిని ఆ సోదరులు ఉద్దేశ్యపూర్వకంగా కప్పిపుచ్చారు. యూసుఫ్ కూడా ప్రాణ భయంతో ఆ సమయంలో ఏమీ మాట్లాడలేదు. ఆ సమయంలో నోరెత్తి సంకట స్థితిని కొనితెచ్చుకునేకన్నా మౌనం వహించటం మేలని తలపోసి ఉంటారు! తాము ఆ అందమైన బాలుణ్ణి అమ్మటానికి తెచ్చామని సోదరులు బావి దగ్గరికి వచ్చిన వ్యక్తితో చెప్పారు. తాను సోదరుల చేతుల్లో హతమయ్యేకంటే అమ్ముడుపోవటమే మేలని భావించి ఉంటారు యూసుఫ్. అందుకే ఆ సమయంలో కూడా ఆయన మెదలకుండా ఉండిపోయారు. తర్వాత ఆ వ్యక్తి, ఒక అందమైన బాలుడు అమ్మకానికి ఉన్నాడన్న సంగతి తన బృందంవారికి తెలియజేశాడు.”

కాని ఈ వ్యాఖ్యానం మూల విషయంతో సమన్వయం చెందటం లేదు. ఇమామ్ షౌకానీ అభిప్రాయం ప్రకారం ఆ బాలుణ్ణి వ్యాపార వస్తువుగా దాచిపెట్టుకున్నవారు–వారిద్ మరియు అతని సహచరులే. అయితే వారు బిడారు సభ్యులందరికీ ఈ సంగతి తెలియపరచలేదు. ఈ అబ్బాయి బావిలో దొరికాడని తెలిస్తే అతన్ని ఉమ్మడి సొత్తుగా భావించి, అందరూ వాటా అడుగుతారు. అందుకే వారు తమ బిడారు వద్దకు వెళ్ళి, బావి యజమానులు ఈ అబ్బాయిని తమకు సమర్పించుకున్నారని చెప్పారు. ఆ విధంగా వారు ఈజిప్టు అంగడిలో అతన్ని అమ్మేసి ఆ లాభాన్ని కొద్దిమందే పంచుకోవాలనుకున్నారు.

అయితే ఈ అభిప్రాయం కూడా పూర్తిగా అతికినట్లుగా లేదు. బహుశా పరిసర ప్రాంతాల వారికి భయపడి ఆ బృందం వారందరూ ఆ బాలుణ్ణి దాచిపెట్టి ఉంటారు. ఆ బాలుడు ఆడుకుంటూ ఇటు వచ్చి పొరపాటున బావిలో పడిపోయాడేమో. చుట్టుప్రక్కలవారు బహుశా ఆ అబ్బాయిని వెతుక్కుంటూ రావచ్చు. తమ దగ్గర ఆ అబ్బాయి ఉన్నాడని తెలిస్తే అసలుకే నష్టం. కాబట్టి ఆ పసివాణ్ణి దాచిపెట్టడం ఉత్తమం అని భావించి వారు ఆ పని చేసి ఉంటారు – ఈ మూడవ అభిప్రాయమే వాస్తవానికి దగ్గరలో ఉంది.

27. యూసుఫ్ పట్ల జరిగే వ్యవహారమంతటినీ అల్లాహ్ గమనిస్తూనే ఉన్నాడు. దేవుని విధివ్రాత అమలులోకి రావలసిన అవసరం కూడా ఉందికదా మరి! అందుకే అల్లాహ్ ఇదంతా జరగనిచ్చాడు. అదీగాక ఈ వృత్తాంతంలో అంతిమ

وَشَرَوْهُ بِثَمَنٍۭ بَخْسٍ دَرَٰهِمَ مَعْدُودَةٍ ۚ وَكَانُوا۟ فِيهِ مِنَ ٱلزَّٰهِدِينَ ⑳

20 వాళ్ళు[28] అతన్ని అతి తక్కువ ధరకు, అనగా కొన్ని దిర్హములకే అమ్మేశారు. ఎందుకంటే యూసుఫ్ వ్యవహారంలో వారికి అంతగా ఆసక్తి లేదు.[29]

وَقَالَ ٱلَّذِى ٱشْتَرَىٰهُ مِن مِّصْرَ لِٱمْرَأَتِهِۦٓ أَكْرِمِى مَثْوَىٰهُ عَسَىٰٓ أَن يَنفَعَنَآ أَوْ نَتَّخِذَهُۥ وَلَدًا ۚ وَكَذَٰلِكَ مَكَّنَّا لِيُوسُفَ فِى ٱلْأَرْضِ وَلِنُعَلِّمَهُۥ مِن تَأْوِيلِ ٱلْأَحَادِيثِ ۚ وَٱللَّهُ غَالِبٌ عَلَىٰٓ أَمْرِهِۦ وَلَٰكِنَّ أَكْثَرَ ٱلنَّاسِ لَا يَعْلَمُونَ ㉑

21 ఈజిప్టువారిలో యూసుఫును కొన్న వ్యక్తి తన భార్యతో,[30] "ఇతన్ని గౌరవాదరణలతో ఉంచు. బహుశా ఇతని వల్ల మనకు లాభం కలగవచ్చు. లేదా ఇతన్ని మనం మన కొడుకుగానయినా చేసుకోవచ్చు" అన్నాడు. ఈ విధంగా మేము, స్వప్నాల సారాన్ని గ్రహించే విద్యను నేర్పడానికి ఈజిప్టు భూభాగంపై యూసుఫ్‌కు నిలదొక్కుకునే అవకాశం కల్పించాము.[31] అల్లాహ్ తన నిర్ణయాన్ని అమలుపరచి తీరుతాడు. కాని ప్రజలలో చాలామందికి ఈ విషయం తెలియదు.

وَلَمَّا بَلَغَ أَشُدَّهُۥٓ ءَاتَيْنَٰهُ حُكْمًا وَعِلْمًا ۚ وَكَذَٰلِكَ نَجْزِى ٱلْمُحْسِنِينَ ㉒

22 మరి అతను (యూసుఫ్) నిండు యౌవన దశకు చేరుకున్నప్పుడు మేమతనికి నిర్ణయం గైకొనే శక్తినీ, జ్ఞానాన్నీ ప్రసాదించాము.[32] సదాచార సంపన్నులకు మేము ఈ విధంగానే ప్రతిఫలాన్ని అనుగ్రహిస్తాము.

దైవప్రవక్త (సఅసం)కు 'సంకేతం' ఉంది. ఈ సంఘటన ద్వారా దేవుడు మహనీయ ముహమ్మద్ (స)కు చెప్పదలచిందేమిటంటే, (ఓ ప్రవక్తా!) నీ జాతి ప్రజలు నిన్ను అడుగడుగునా వేధిస్తున్న సంగతి మాకు తెలియదని కాదు, అంతా తెలుసు. మేము తలచుకుంటే వారి ఆగడాలను ఇట్టే అరికట్టగలం. కాని యూసుఫ్ (అలైహిస్సలాం) సోదరులకు గడువు ఇచ్చినట్లుగానే నేను నీ జాతి సర్దారులకు కూడా విడుపు ఇస్తూ పోతున్నాను. ఎట్టకేలకు మేము యూసుఫ్‌ను ఈజిప్టు అధికార పీఠంపై కూర్చోబెట్టాము. అతని సోదరులను అత్యంత నిస్సహాయ స్థితిలో తీసుకువచ్చి అతని ఆస్థానంలో నిలబెట్టాము. ఓ ముహమ్మద్ (స)! నీ విషయంలో కూడా అలాగే జరుగుతుంది. ఈ రోజు నిన్ను అదేపనిగా వేధిస్తున్న ఈ పొగరుబోతులు ఒకానొక రోజు నీ సమక్షంలోకి వచ్చి అశక్తులై నిలబడతారు. నీవు పెట్టే క్షమాభిక్ష కోసం ఆశతో ఎదురుచూస్తారు. కనుక నువ్వు ఆవేదన చెందకు అని అల్లాహ్ ఆయన్ని (సఅసం) ఓదార్చాడు. ఎట్టకేలకు జరిగింది కూడా అదే. రెండు దశాబ్దాలు తిరక్కముందే ఆ ఘడియ రానే వచ్చింది. మక్కా విజయం సందర్భంగా ఈ చరిత్ర పునరావృతమయింది.

28. **'వాళ్ళు'** అంటే సోదరులూ కావచ్చు లేదా ఈ వ్యాఖ్యానం ప్రకారం ఆ బిడారు వారూ కావచ్చు.

29. తేరగా దొరికిన వస్తువు పట్ల మనిషి ప్రవర్తన ఇలాగే ఉంటుంది. ఆ వస్తువు ఎంత విలువైనదో మనిషి అంచనా వేయలేడు. యూసుఫ్ విషయంలో వాళ్ళ అనాసక్తతకు కారణం ఇదే. వచ్చిన మటుకే చాలని వాళ్ళనుకున్నారు.

30. ఆ కాలంలో రయ్యాన్ బిన్ వలీద్ అనే వ్యక్తి ఈజిప్టును పాలించేవాడనీ, యూసుఫ్ (అలైహిస్సలాం)ను కొనుగోలు చేసిన ఈజిప్టు అజీజు ఆ చక్రవర్తి దర్బారులో ఆర్థిక మంత్రిగా ఉండేవాడని ప్రతీతి. అతని భార్య పేరు 'రాయీల్' అని కొందరు, 'జులైఖా' అని మరికొందరు తెలిపారు. నిజము దేవుడెరుగు.

31. అంటే, మేము యూసుఫ్ (అ)ను దుర్మార్గులైన సోదరుల బారినుంచి రక్షించినట్లే అతనికి ఈజిప్టులో మంచి నివాసస్థలంలో ఉంచాము.

32. అంటే ఆయనకు దైవదౌత్యాన్నీ లేక దైవదౌత్యం కంటే ముందు బుద్ధి కుశలతను, నిర్ణయశక్తిని ప్రసాదించాము.

وَرَاوَدَتْهُ الَّتِيْ هُوَ فِيْ بَيْتِهَا عَنْ نَّفْسِهٖ وَغَلَّقَتِ الْاَبْوَابَ وَقَالَتْ هَيْتَ لَكَ ؕ قَالَ مَعَاذَ اللّٰهِ اِنَّهٗ رَبِّيْۤ اَحْسَنَ مَثْوَایَ ؕ اِنَّهٗ لَا يُفْلِحُ الظّٰلِمُوْنَ ﴿23﴾

**23** అతను (యూసుఫ్) ఉంటున్న ఇంటి స్త్రీ అతని మానసిక ఏకాగ్రతను దెబ్బతీస్తూ కవ్వించటం మొదలెట్టింది. (ఒకసారి) తలుపులు మూసేసి, 'రా....రా!' అని అంది. "అల్లాహ్ శరణు! ఆయన నా ప్రభువు. ఆయన నన్ను చాలా మంచి స్థితిలో ఉంచాడు. అన్యాయం చేసేవారు ఎన్నటికీ బాగుపడరు"[33] అని యూసుఫ్ అన్నాడు.

وَلَقَدْ هَمَّتْ بِهٖ وَهَمَّ بِهَا ۚ لَوْلَاۤ اَنْ رَّاٰ بُرْهَانَ رَبِّهٖ ؕ كَذٰلِكَ لِنَصْرِفَ عَنْهُ السُّوْٓءَ وَالْفَحْشَآءَ ؕ اِنَّهٗ مِنْ عِبَادِنَا الْمُخْلَصِيْنَ ﴿24﴾

**24** ఆమె అతన్ని (యూసుఫ్‌ను) ఆశించింది. ఒకవేళ అతను గనక తన ప్రభువు నిదర్శనాన్ని[34] చూసి ఉండకపోతే అతను కూడా ఆమెను ఆశించి ఉండేవాడే. (కాని అలా జరగలేదు).[35] ఎందుకంటే మేము అతన్నుంచి చెడును, నీతిబాహ్యతను దూరం చేశాము.[36] నిశ్చయంగా అతను మా ప్రత్యేక దాసులలో ఒకడు.

---

33. ఇక్కణ్ణుంచి హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం)కు సరికొత్త పరీక్ష మొదలయ్యింది. యూసుఫ్‌ను గౌరవదృష్టితో చూడాలని అజీజు తన భార్యకు మరీ మరీ చెప్పినప్పటికీ, ఆమె యూసుఫ్ అందచందాలకు ముగ్ధురాలై ఆయన్ని మోహించింది. పాపకార్యం కోసం ఆయన్ని పిలిచింది. కాని యూసుఫ్ (అలైహి) ఆమె పిలుపును త్రోసిపుచ్చారు.

34. అంటే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) దైవ నిదర్శనాన్ని చూసి ఉండకపోతే ఆ పనిని చేసి ఉండేవారే. ఇంతకీ ఆ 'నిదర్శనం' ఏమిటి? దీనిపై పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మొత్తానికి ఆయనకు దేవుని తరఫున ఒకానొక సూచన అందింది. దాన్ని చూడగానే ఆయన తన మనసులోని 'వాంఛ'ను అణగద్రొక్కటంలో కృతకృత్యులయ్యారు. అల్లాహ్ తన ప్రవక్తలను ఈ విధంగానే రక్షిస్తూ ఉంటాడు.

35. అసలు యూసుఫ్ మనసులో కోరిక రగలనే లేదు అని కొంతమంది వ్యాఖ్యాతలు ఇక్కడ అభిప్రాయపడ్డారు. మరి కొంతమంది ఏమంటారంటే; యూసుఫ్ (అలైహిస్సలాం) ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన సంగతి నిజమే. అయితే తనకు తానుగా ఆయన సమ్మోహితుడు కాలేదు. ఈజిప్టు అధికారి భార్య ప్రోద్బలంపై, ఒత్తిడిపై ఆయన ఎదలో కోరిక రగిలింది. మరో విషయమేమిటంటే పాపకార్యపు తలంపు రావటం సౌశీల్యానికి విరుద్ధాంశం కాదు. ఆ తలంపుకు కార్యరూపం ఇస్తే అప్పుడది సౌశీల్యానికి విరుద్ధం అవుతుంది (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).

కాగా; పరిశోధకులైన కొంతమంది వ్యాఖ్యాతలు ఇలా అభిప్రాయపడ్డారు: తన ప్రభువు నిదర్శనాన్నే గనక చూసి ఉండకపోతే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కూడా ఆమెను ఆశించేవారే. అంటే ఆయన దైవ నిదర్శనాన్ని చూడటం వల్ల అజీజ్ భార్య గురించి సంకల్పించుకోలేదు. పైగా చెడు పని కోసం ఆమె పిలవగానే 'అల్లాహ్ శరణు' అని చెప్పారు. ఆమెను ఆశించలేదు అనంటే అసలామె గురించి మనసులో అలజడి కలగలేదని కాదు. మనసులో అలజడి కలగటం వేరు – ఆశించటం వేరు. మనసులో అలజడి ఏమాత్రం కలగని వ్యక్తి పాపకార్యం నుంచి తన్ను రక్షించుకోవటం గొప్ప విషయం ఏమీ కాదు. మనసులో కోర్కె రగిలినప్పటికీ మనిషి దాన్ని అదుపు చేసుకుని, పాపకార్యం నుంచి తనను రక్షించుకోవటమే గొప్ప విషయం. ఈ ఇంద్రియ నిగ్రహంలో హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) నిరుపమానమైన ఆదర్శాన్ని మన ముందుంచారు.

36. అంటే – యూసుఫ్ (అలైహిస్సలాం)కు నిదర్శనాన్ని చూపి చెడు నుంచి లేక చెడు ఉద్దేశ్యం నుంచి కాపాడినట్లే అన్ని విషయాలలోనూ అతన్ని నీతి బాహ్యతకు దూరంగా ఉంచే ఏర్పాటు చేశాము. ఎందుకంటే అతను మేము మా కార్యం కోసం ఎంపిక చేసిన ప్రత్యేక దాసుల్లో ఒకడు.

**25** వారిద్దరూ తలుపు వైపు పరుగెత్తారు.[37] ఆ స్త్రీ యూసుఫ్ చొక్కాను వెనుక వైపునుంచి లాగి చింపేసింది. తలుపు వద్దనే ఆమె భర్త వారిద్దరికీ ఎదురుపడ్డాడు. "నీ ఇల్లాలి పట్ల దురుద్దేశం కలవాడికి కారాగార శిక్ష విధించటమో లేక మరేదైనా కఠిన శిక్ష విధించటమో తప్ప వేరే శిక్ష ఏముంటుంది?" అని ఆమె (భర్తను) ప్రశ్నించింది.[38]

وَاسْتَبَقَا الْبَابَ وَقَدَّتْ قَمِيصَهُ مِنْ دُبُرٍ وَّأَلْفَيَا
سَيِّدَهَا لَدَا الْبَابِ ۚ قَالَتْ مَا جَزَاءُ مَنْ أَرَادَ بِأَهْلِكَ
سُوءًا إِلَّا أَنْ يُسْجَنَ أَوْ عَذَابٌ أَلِيمٌ ﴿25﴾

**26** "ఈమె గారే నన్ను వలలో వేసుకోవటానికి ప్రయత్నించింది"[39]అని యూసుఫ్ చెప్పాడు. ఆమె వంశానికే చెందిన ఒక వ్యక్తి సాక్ష్యమిస్తూ,[40] "ఇతని చొక్కా గనక ముందు వైపునుంచి చినిగి ఉంటే స్త్రీ చెప్పేది నిజం. ఇతను చెప్పేది అబద్ధం.

قَالَ هِيَ رَاوَدَتْنِي عَنْ نَّفْسِي وَشَهِدَ شَاهِدٌ مِّنْ
أَهْلِهَا ۚ إِنْ كَانَ قَمِيصُهُ قُدَّ مِنْ قُبُلٍ فَصَدَقَتْ
وَهُوَ مِنَ الْكَاذِبِينَ ﴿26﴾

**27** ఒకవేళ ఇతని చొక్కా గనక వెనుకవైపు నుంచి చినిగి ఉంటే స్త్రీ చెప్పేది అబద్ధం. ఇతను చెప్పేది నిజం" అన్నాడు.

وَإِنْ كَانَ قَمِيصُهُ قُدَّ مِنْ دُبُرٍ فَكَذَبَتْ
وَهُوَ مِنَ الصَّادِقِينَ ﴿27﴾

**28** యూసుఫ్ చొక్కా వెనుక వైపు నుంచి చినిగి ఉండటం గమనించిన ఆమె భర్త ఇలా అన్నాడు : "ఇవి మీ ఆడవాళ్ల మాయోపాయాలు. నిశ్చయంగా మీ మాయోపాయాలు మహా ఘోరంగా ఉంటాయి![41]

فَلَمَّا رَأَى قَمِيصَهُ قُدَّ مِنْ دُبُرٍ قَالَ إِنَّهُ
مِنْ كَيْدِكُنَّ ۖ إِنَّ كَيْدَكُنَّ عَظِيمٌ ﴿28﴾

37. ఆమె ఉద్దేశం బాగా లేదని గ్రహించగానే యూసుఫ్ (అలైహిస్సలాం) బయటపడేందుకు తలుపు వైపుకు పరుగెత్తారు. ఆయన్ని పట్టుకోవటానికి ఆ స్త్రీ కూడా వెంబడించింది. ఆ విధంగా వారిద్దరూ తలుపు వైపుకు పరుగెత్తారు.

38. భర్తను చూడగానే ఆమె టక్కున ప్లేటు ఫిరాయించింది. క్షణాల్లో కథను అల్లేసింది. తన తప్పు బయటపడే సమయం రాగానే ఏ పాపం ఎరుగని యూసుఫ్ (అలైహిస్సలాం)ను దోషిగా నిలబెట్టింది.

39. ఈ పరిస్థితికి మొదట ఆశ్చర్యపోయిన యూసుఫ్ (అలైహిస్సలాం) కాస్త తేరుకుని, అసలేం జరిగిందో వివరించారు. ఏ విధంగా ఆమె తనపై వల పన్నిందీ, తానెందుకు తలుపు వైపుకు పరుగెత్తుకుని వచ్చిందీ మొత్తం పూసగుచ్చినట్లు చెప్పారు.

40. తీర్పు ఇచ్చిన ఆ వ్యక్తి ఎవరోకాదు, స్వయంగా ఆమె వంశస్థుడే. ఆ వ్యక్తి అభిప్రాయాన్ని ఇక్కడ 'సాక్ష్యం'గా పేర్కొనటం గమనార్హం. ఎందుకంటే అప్పటికింకా వ్యవహారం తేలలేదు. ఈ కథలో 'పాలు త్రాగే పసిపిల్లాడు సాక్ష్యమిచ్చాడు' అన్న విషయం ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా రూఢీ కావటం లేదు. బుఖారీ, ముస్లిం గ్రంథాలలో పాలు త్రాగే ముగ్గురు పసిపిల్లలు మాట్లాడినట్లు ఒక హదీసు ఉంది. యూసుఫ్ వ్యవహారం గురించి తీర్పు చెప్పిన వ్యక్తి పసిపిల్లవాడు అన్నమాట అందులో ఎక్కడా లేదు.

41. ఇవి ఈజిప్టు అజీజ్ పలికిన మాటలు. తన భార్య పన్నిన కుట్రను గ్రహించి ఆడవారి చేష్టలపై ఈ విధంగా వ్యాఖ్యానించాడు. అంతేగాని ఇది అల్లాహ్ పలికినది కాదు. అదలా ఉంచితే ఈ మాట స్త్రీలందరికీ వర్తించదు. అందుచేత స్త్రీలందరికీ ఈ మాటను అన్వయింపజేసి, దీని ఆధారంగా మోసానికి మారుపేరు మగువ అని తీర్మానించటం సమంజసం కాదు. ఖుర్ఆన్ ఉద్దేశం యిది కాదు. ఈ పలుకుల ఆధారంగా కొంతమంది ఇలాంటి చవుకబారు వ్యాఖ్యలు చేశారు. అవి సరైనవి కావు.

**29** "యూసుఫ్! ఈ విషయాన్ని ఇంతటితో వదిలెయ్యి.[42] (ఏమే!) నువ్వు మాత్రం నీ తప్పుకు (అల్లాహ్‌ను) క్షమాపణ వేడుకో. ముమ్మాటికీ తప్పు నీదే" (అన్నాడు).[43]

يُوسُفُ أَعْرِضْ عَنْ هَٰذَا ۚ وَاسْتَغْفِرِي
لِذَنبِكِ ۖ إِنَّكِ كُنتِ مِنَ الْخَاطِئِينَ ﴿٢٩﴾

**30** నగర స్త్రీలలో గుసగుసలు మొదలయ్యాయి – "అజీజ్ భార్య తన వద్దనున్న (యువ) బానిసపై (మోజుపడి), తన ఉద్దేశాన్ని నెరవేర్చుకోవటానికి వల పన్నుతోంది. ఆమె మనసులో అతని పట్ల ప్రేమ గూడు కట్టుకుంది. (ఎంతయినా) మా దృష్టిలో ఆమె చేసేది ఘోరమైన తప్పే" అని వారు చెప్పుకోసాగారు.[44]

وَقَالَ نِسْوَةٌ فِي الْمَدِينَةِ امْرَأَتُ الْعَزِيزِ تُرَاوِدُ
فَتَاهَا عَن نَّفْسِهِ ۖ قَدْ شَغَفَهَا حُبًّا ۖ إِنَّا لَنَرَاهَا
فِي ضَلَالٍ مُّبِينٍ ﴿٣٠﴾

**31** వారి మోసపు మాటల గురించి విని ఆమె వాళ్ళను పిలిపించింది.[45] వారి కోసం ఒక సదనాన్ని ఏర్పాటు చేసింది.[46] వారిలో ఒక్కొక్కరికి ఒక్కో కత్తి ఇచ్చి, (వారంతా ఆసీనులైన తరువాత)

فَلَمَّا سَمِعَتْ بِمَكْرِهِنَّ أَرْسَلَتْ إِلَيْهِنَّ وَأَعْتَدَتْ
لَهُنَّ مُتَّكَأً وَآتَتْ كُلَّ وَاحِدَةٍ مِّنْهُنَّ سِكِّينًا

42. అంటే, దీనిపై రాద్ధాంతం చేసి, సర్వత్రా దీనిని చర్చనీయాంశం చేయనవసరం లేదు అన్నది అజీజ్ మాటల ఆంతర్యం.

43. హ్రజత్ యూసుఫ్ (అలైహిస్సలాం) నిర్దోషి అన్న సంగతి అజీజ్‌కు స్పష్టంగా అర్థమైపోయింది. అందుకే అతను తన ఇల్లాలికి చీవాట్లు పెట్టాడు.

44. సుగంధ పరిమళాన్ని గుబాళించకుండా తెరలచాటున కప్పి ఉంచటం ఎంత అసంభవమో, ప్రేమ పురాణాలను గుట్టుచప్పుడు కాకుండా ఉంచటం కూడా అంతే అసంభవం. ఈ సంఘటనను మరిచిపోమని అజీజ్, తన బానిస (యూసుఫ్)కు నచ్చజెప్పాడు. హ్రజత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కూడా ఎవరికీ ఆ సంగతి చెప్పి ఉండరు. అయినప్పటికీ అంతఃపుర ప్రాంగణంలో జరిగిన ఈ సంఘటన దావానలంలా నగరంలో వ్యాపించింది. ప్రజలు చిలువలు పలువలుగా దీనిని గురించి చెప్పుకోసాగారు. ముఖ్యంగా మహిళామణులు దానికి మరింత మసాలాను తగిలించారు. "ఎంత విడ్డూరం! అంతగా ప్రేమించాలనే అనుకుంటే అందగాణ్ణి, ఆస్తీ అంతస్తూ ఉన్నవాణ్ణి ప్రేమించాల్సింది. తన ఇంట్లో బానిసగా ఉన్న ఎవడో అనామకుడిపై జులైఖా మనసు పారేసుకుంది. మూర్ఖత్వం కాకపోతే ఏమిటీ??" – ఈ రకంగా సాగాయి వారి కబుర్లు.

45. ఈజిప్టు మహిళల ఈ గుసగుసలను, వ్యంగ్యంతో కూడుకున్న మాటలను **"మోసపు మాటలు"** (మక్ర్)గా అభివర్ణించటం జరిగింది. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఈ విధంగా ఎందుకు చెప్పబడిందంటే చాడీలు చెప్పుకునే ఆ కాంతామణులకు యూసుఫ్ అందచందాల గురించి తెలీదని కాదు, తెలుసు. అతను గొప్ప అందగాడని వారంతా కేవలం విని ఉన్నారు. కాని చూడలేదు. ఆ సౌందర్య మూర్తిని తాము కూడా చూడాలంటే అజీజ్ భార్యను రెచ్చగొట్టాలి. అందుకే వాళ్లు ఈ రకంగా రెచ్చగొట్టి, తమ ఎత్తుగడలో కృతకృత్యులయ్యారు. ఇక్కడ వీళ్ల పరిస్థితి ఇలా ఉంటే అక్కడ జులైఖా తన గురించి నగర స్త్రీలు చెప్పుకుంటున్న మాటలు విని రుసరుస లాడింది. తాను మనసు పారేసుకున్న మనిషి, వాళ్ళంతా అనుకుంటున్నట్లుగా ఒక సాధారణ బానిస కాదనీ, అపురూప సౌందర్యమూర్తి అని నిరూపించాలనుకుంది. అతన్ని ఓసారి చూసిన ఆడది ఎవరయినాసరే అతన్ని మోహించకుండా ఉండజాలదన్నది ఆమె ఉద్దేశం. అందుకే ఆమె ఆ స్త్రీలందరినీ విందుకు ఆహ్వానించింది.

46. ఎంతో ఖరీదైన ఆసనాలను ఏర్పాటు చేసింది. అందమైన దిండ్లను పరచింది. నేటి అరేబియాలో కూడా ఈ దృశ్యాలు సర్వత్రా కానవస్తాయి. దీవానియాలలో, హోటళ్లలో, ఎడారి డేరాలలో సయితం వారు కొలువు తీరే దృశ్యాన్ని చూసినపుడు వారి గత చరిత్ర ఒక్కసారిగా స్మృతిపథంలో మెదలుతుంది.

وَقَالَتِ اخْرُجْ عَلَيْهِنَّ ۚ فَلَمَّا رَأَيْنَهُ أَكْبَرْنَهُ
وَقَطَّعْنَ أَيْدِيَهُنَّ وَقُلْنَ حَاشَ لِلَّهِ مَا هَٰذَا بَشَرًا
إِنْ هَٰذَا إِلَّا مَلَكٌ كَرِيمٌ ﴿31﴾

"వీళ్ల ముందుకు రా!"[47] అని (యూసుఫ్‌ను) ఆదేశించింది. ఆ స్త్రీలు అతన్ని చూడగానే దిగ్భ్రమతో (మైమరచి) తమ చేతులనే కోసుకున్నారు.[48] "హాషాలిల్లాహ్! (దైవ మహిమ!) ఇతను మానవమాత్రుడు కాడు. నిశ్చయంగా ఇతను (దివి నుంచి భువికి దిగివచ్చిన) గొప్ప దైవదూతే!"[49] అన్న మాటలు వారి నోట (అప్రయత్నంగా) వెలువడ్డాయి.

قَالَتْ فَذَٰلِكُنَّ الَّذِي لُمْتُنَّنِي فِيهِ ۖ وَلَقَدْ رَاوَدتُّهُ
عَن نَّفْسِهِ فَاسْتَعْصَمَ ۖ وَلَئِن لَّمْ يَفْعَلْ مَا آمُرُهُ
لَيُسْجَنَنَّ وَلَيَكُونًا مِّنَ الصَّاغِرِينَ ﴿32﴾

**32** అప్పుడు ఆమె (అజీజ్ భార్య) ఇలా అన్నది : "ఎవరి విషయంలో మీరంతా నన్ను నిందిస్తున్నారో ఆ వ్యక్తి ఇతనే.[50] నేను ఇతన్ని వల్లో వేసుకోవాలని ప్రయత్నించాను. కాని ఇతను తప్పించుకున్నాడు. నేను ఆజ్ఞాపించిన పనిని ఇతను చేయకపోతే చెరసాలపాలై, తీవ్రమైన అవమానానికి గురవుతాడు."[51]

قَالَ رَبِّ السِّجْنُ أَحَبُّ إِلَيَّ مِمَّا يَدْعُونَنِي إِلَيْهِ ۖ
وَإِلَّا تَصْرِفْ عَنِّي كَيْدَهُنَّ أَصْبُ إِلَيْهِنَّ وَأَكُن
مِّنَ الْجَاهِلِينَ ﴿33﴾

**33** అప్పుడు యూసుఫ్, "ప్రభూ! ఈ స్త్రీలు దేనికోసం నన్ను పిలుస్తున్నారో దానికన్నా కారాగారమే నాకు ప్రీతికరమైనది. నీవు గనక వీళ్ల జిత్తులను నా నుండి దూరం చేయకపోతే, నేను వీళ్ల వలలో పడిపోయి, అవివేకులలో చేరిపోతాను!"[52] అని మొర పెట్టుకున్నాడు.

47. అంటే మొదట యూసుఫ్ (అలైహిస్సలాం)ను దాచిపెట్టింది. స్త్రీలంతా పండ్లు కోయటానికి కత్తులు పట్టుకోగానే అందరిముందుకు రమ్మని అజీజ్ భార్య యూసుఫ్ (అలైహిస్సలాం)ను ఆదేశించింది.

48. యూసుఫ్ (అలైహిస్సలాం)పై దృష్టిపడగానే వారికి మతిపోయినంత పనయింది. ఆ అందాల యువకుణ్ణి వారు తదేకంగా తిలకిస్తూ ఊహాలోకాల్లో విహరించసాగారు. పండ్లు కోసుకోబోయి తమ చేతులు కోసుకున్నారు. ఫలితంగా వారి చేతులకు గాట్లు పడి రక్తసిక్తం అయినాయి. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) సుందర స్వరూపులు. ఆయన సౌందర్యం గురించి హదీసు కూడా ఉంది. "యూసుఫ్‌కు సౌందర్యంలో సగభాగం ఇవ్వబడింది" (సహీహ్ ముస్లిం- కితాబుల్ ఈమాన్).

49. అందచందాల రీత్యా దైవదూతలు మనిషికన్నా శ్రేష్ఠులు అని దీని భావం ఎంతమాత్రం కాదు. ఎందుకంటే దైవదూతలను మానవులు చూడలేదు. అదీగాక మానవుణ్ణి అత్యుత్తమమైన రీతి (ఆకృతి)లో పుట్టించామని దేవుడు స్వయంగా ఖుర్ఆన్‌లో సెలవిచ్చాడు. కాకపోతే మానవుల్లో అంతటి సౌందర్యమూర్తిని తాము ఎన్నడూ చూడలేదని చెప్పడానికి వారు దైవదూతగా అభివర్ణించారంతే.

దైవప్రవక్తలు కూడా మానవ మాత్రులే అయి ఉంటారు. అయితే వారిలోని కొన్ని ప్రత్యేకతల, సుగుణాల దృష్ట్యా వారిని మానవత నుంచి వేరుచేసి వారినొక ప్రత్యేక సృష్టిగా ఖరారుచేసే ప్రయత్నం అన్ని కాలాల్లోనూ జరిగింది. దైవసందేశ పరంపరలోని పరమార్థాన్ని గ్రహించని ప్రబుద్ధులు ఈ రకమయిన కల్పనలు చేసుకున్నారు.

50. తన ఎత్తుగడ ఫలిస్తోందని గ్రహించగానే అజీజ్ భార్య మరింతగా రెచ్చిపోయింది. యూసుఫ్‌ను చూడగానే మతిచలించిన స్త్రీలనుద్దేశించి, 'అబ్బో, ఒక్క చూపుకే అంత ఇదై పోయారే?! మరలాంటప్పుడు నేనితని ప్రేమలో పడినందుకు అవాకులు చెవాకులు ఎందుకు ప్రేలినట్లు? ఇప్పుడర్థమయిందా నా ప్రేమ రహస్యం ఏమిటో?' అని చెప్పింది.

34 అతని ప్రభువు అతని ప్రార్థనను ఆమోదించాడు. ఆ మగువల మాయోపాయాలను అతన్నుంచి తొలగించాడు. నిశ్చయంగా ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

فَاسْتَجَابَ لَهُ رَبُّهُ فَصَرَفَ عَنْهُ كَيْدَهُنَّ ۚ إِنَّهُ هُوَ السَّمِيعُ الْعَلِيمُ ﴿٣٤﴾

35 నిదర్శనాలన్నిటిని చూసిన తరువాత కూడా యూసుఫ్‌ను కొంత కాలంపాటు కారాగారంలో ఉంచటమే ఉచితమని వారు భావించారు.[53]

ثُمَّ بَدَا لَهُمْ مِنْ بَعْدِ مَا رَأَوُا الْآيَاتِ لَيَسْجُنُنَّهُ حَتَّىٰ حِينٍ ﴿٣٥﴾

36 అతనితో పాటు మరో ఇద్దరు యువకులు కూడా కారా గారానికి వచ్చారు. వారిలో ఒకడు, "నేను సారాయి పిండు తున్నట్లు కలగన్నాన"ని అన్నాడు. రెండో అతను, "నేను (కలలో) నా తలపై రొట్టెలు ఎత్తుకొని ఉన్నాను. వాటిని పక్షులు తింటు న్నాయ"ని చెప్పాడు. "దీని మర్మం ఏమిటో కాస్త మాకు చెప్పండి. చూస్తుంటే, మీరు మాకు మంచివారుగా కనిపిస్తున్నారు"[54] అని వారిద్దరూ విన్నవించుకున్నారు.

وَدَخَلَ مَعَهُ السِّجْنَ فَتَيَانِ ۖ قَالَ أَحَدُهُمَا إِنِّي أَرَانِي أَعْصِرُ خَمْرًا ۖ وَقَالَ الْآخَرُ إِنِّي أَرَانِي أَحْمِلُ فَوْقَ رَأْسِي خُبْزًا تَأْكُلُ الطَّيْرُ مِنْهُ ۖ نَبِّئْنَا بِتَأْوِيلِهِ ۖ إِنَّا نَرَاكَ مِنَ الْمُحْسِنِينَ ﴿٣٦﴾

37 అప్పుడు యూసుఫ్ ఇలా అన్నాడు : "ఇక్కడ మీకు ఇవ్వబడే భోజనం మీవద్దకు రాకముందే నేను మీకు వాటి భావార్థాన్ని వివరిస్తాను. ఇదంతా నా ప్రభువు నాకు నేర్పిన విద్యయే.[55]

قَالَ لَا يَأْتِيكُمَا طَعَامٌ تُرْزَقَانِهِ إِلَّا نَبَّأْتُكُمَا بِتَأْوِيلِهِ قَبْلَ أَنْ يَأْتِيَكُمَا ۚ ذَٰلِكُمَا مِمَّا عَلَّمَنِي رَبِّي ۚ

51. మగతలో ఉన్న ఆ స్త్రీలను చూసేసరికి జులైఖా మరింతగా రెచ్చిపోయింది. సిగ్గూ ఎగ్గూ ఏమీలేకుండా తన మనసులోని చెడు తలంపును మరోసారి బాహాటంగా వ్యక్తపరచింది.

52. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) మనసులోనే ఇలా ప్రార్థించారు. ఎందుకంటే ప్రార్థన (దుఆ) విశ్వాసి పాలిట ఒక ఆయుధం. హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ఏడుగురు వ్యక్తులను అల్లాహ్ తీర్పుదినాన తన సింహాసనం క్రింద నీడను కల్పిస్తాడు. వారిలో ఒకడు ఎవడంటే అంతగత్తె, అధికార దర్పం గల స్త్రీ పాపకార్యం వైపుకు పిలిచినప్పుడు "నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను" అంటూ తిరస్కరించేవాడు. (సహీహ్ బుఖారీ – కితాబుల్ అజాన్; ముస్లిం – కితాబుజ్జకాత్).

53. యూసుఫ్ (అలైహిస్సలాం) నిర్దోషి, శీలవంతుడు అని తెలిసి కూడా ఆయన్ని కొంతకాలం పాటు జైల్లో పెట్టాలని ఈజిప్టు అధికారి నిర్ణయించటం గమనార్హం. ఆ విధంగానయినా తన భార్య బెడద నుంచి యూసుఫ్‌ను దూరంగా ఉంచవచ్చని అతడు భావించి ఉంటాడు.

54. ఆ యువకులిద్దరూ రాజదర్బారులోని సేవకులు. వారిలో ఒకడు చక్రవర్తికి మద్యం త్రాగించే పనిపై నియమించబడ్డాడు. రెండవ వ్యక్తి రొట్టెలను కాల్చేవాడు. వారు చేసిన ఏదో తప్పిదంపై చెరసాల పాలయ్యారు. ఆ చెరసాలలోనే వారు హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం)కు సన్నిహితులయ్యారు. హజ్రత్ యూసుఫ్ (అ) దైవప్రవక్త. ఏది మాట్లాడినా ఆచితూచి మాట్లాడటం, దైవారాధనలో ఎక్కువ సమయం గడపటం, క్రమశిక్షణతో మెలగటం, సాటి ఖైదీల పట్ల మృదువుగా వ్యవహరించటం – ఇదంతా ఆ యువకులిద్దరూ ఆసక్తితో గమనించేవారు. అదీగాక మాటల లోతులను అందుకునే విశేష జ్ఞానాన్ని దేవుడు ఆయనకు ప్రసాదించాడు. ఇవన్నీ ఆయన్ని జైల్లో ఓ అరుదైన వ్యక్తిగా నిలబెట్టాయి. తమ కలల గూఢార్థాన్ని యూసుఫ్ (అలైహిస్సలాం) వివరిస్తారన్న ఆశతో వారు ఆయన్ని ఆశ్రయించారు. ఈ

(అసలు విషయం ఏమిటంటే) అల్లాహ్‌ను నమ్మనివారి, పర లోకాన్ని తిరస్కరించేవారి మతాన్ని నేను వదలిపెట్టాను.[56]

إِنِّي تَرَكْتُ مِلَّةَ قَوْمٍ لَّا يُؤْمِنُونَ بِاللَّهِ وَهُم بِالْآخِرَةِ هُمْ كَافِرُونَ ﴿٣٧﴾

**38** “నేను నా తాత తండ్రులైన ఇబ్రాహీం, ఇస్‌హాఖ్, యాఖూబ్‌ల ధర్మానికి[57] కట్టుబడి ఉన్నాను. అల్లాహ్‌కు భాగస్వామిగా వేరితరులను కల్పించటం మాకు ఎంత మాత్రం తగదు.[58] మాపైన, సమస్త జనులపైన గల దేవుని అనుగ్రహం ఇది. కాని ప్రజల్లో చాలా మంది కృతజ్ఞతాపూర్వకంగా మెలగరు.

وَاتَّبَعْتُ مِلَّةَ آبَائِي إِبْرَاهِيمَ وَإِسْحَاقَ وَيَعْقُوبَ ۚ مَا كَانَ لَنَا أَن نُّشْرِكَ بِاللَّهِ مِن شَيْءٍ ۚ ذَٰلِكَ مِن فَضْلِ اللَّهِ عَلَيْنَا وَعَلَى النَّاسِ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَشْكُرُونَ ﴿٣٨﴾

**39** “ఓ కారాగార సహచరులారా![59] అనేక మంది విభిన్న ప్రభువులు మేలా? లేక సర్వాధిక్యుడైన ఒక్క అల్లాహ్ మేలా?[60] (మీరే చెప్పండి!)

يَا صَاحِبَيِ السِّجْنِ أَأَرْبَابٌ مُّتَفَرِّقُونَ خَيْرٌ أَمِ اللَّهُ الْوَاحِدُ الْقَهَّارُ ﴿٣٩﴾

ఆయతు చివరిలో యూసుఫ్‌ను **‘ముహ్‌సిన్’** గా పేర్కొనటం జరిగింది. ‘ముహ్సిన్’ అంటే ఇక్కడ స్వప్నాల సారాంశాన్ని బాగా వివరించేవాడు అని కూడా కొంతమంది అభిప్రాయపడ్డారు.

55. నేను మీకు తెలిపే కలల సారాంశం కేవలం నా ప్రభువు ప్రసాదించిన విద్య మాత్రమే. ఇది జ్యోతిష్కుల, సోది చెప్పేవారిలాగా అంచనాల ఆధారంగా చెప్పే విద్య కాదు. వారు చెప్పే జోస్యం తప్పని తేలవచ్చు. కాని నేను చెప్పేది మాత్రం నిశ్చయంగా జరుగుతుంది. ఎందుకంటే ఇది దైవప్రసాదిత విద్య. కాబట్టి ఇందులో ఊహలకు, కాకిలెక్కలకు ఎలాంటి ఆస్కారం లేదు.

56. తనకు ఈ విద్య ఎందుకు ఇవ్వబడిందో యూసుఫ్ (అలైహిస్సలాం) ఇక్కడ వివరించారు. తాను దైవధిక్కారుల, పరలోక ధిక్కారుల పద్ధతిని విడనాడి తన పెద్దలు అవలంబించిన రుజుమార్గాన్ని అనుసరించటం వల్లనే తనకు ఈ దైవానుగ్రహం లభించిందని చెప్పటం విశేషం!

57. ఆయతులో **‘ఆబా’** అని ఉంది. ఆబా అంటే అర్థం తండ్రులు. యూసుఫ్ (అలైహిస్సలాం) తాతముత్తాతలను కూడా ‘తండ్రులు’గా పేర్కొనటం గమనార్హం. తాతముత్తాతలు కూడా ఒక విధంగా తండ్రులేకదా! అందుకే అరబీలో తాతముత్తాతలను కూడా ‘ఆబా’గానే వ్యవహరిస్తారు. యూసుఫ్ (అలైహిస్సలామ్) మొదట ముత్తాత పేరును, తరువాత తాత పేరును, ఆ తరువాత తండ్రి పేరును తీసుకువచ్చారు. వారంతా దైవప్రవక్తలే. రుజుమార్గాన నడచిన పుణ్య పురుషులే.

58. కలల భావార్థం తెలిపేముందు, వారితో సంభాషించేందుకు దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఏకదైవోపాసనా సిద్ధాంతాన్ని చాటిచెప్పటం, బహుదైవారాధనను ఖండించటం గమనార్హ విషయం. ప్రపంచంలోకి వచ్చిన ప్రతి ప్రవక్తా ప్రజలకు మొట్టమొదటగా ఈ తౌహీద్ (ఏకదైవ) సందేశాన్నే అందజేశాడు. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) గారి ఈ సంభాషణా శైలి మనందరికీ అనుసరణీయం.

59. చెరసాల సహచరులుగా ఎందుకు సంబోధించబడ్డారంటే, వారంతా చాలా రోజులుగా చెరసాలలో సహజీవనం సాగిస్తున్నారు.

60. **‘విభిన్న దేవుళ్ళు’** అనేది సంఖ్యాపరంగానూ, వివిధ రకాల దృష్ట్యానూ, గుణగణాల రీత్యానూ వర్తిస్తుంది. అంటే వాటి లక్షణాలు వేరు, జాతులు వేరు. స్వభావ స్వరూపాలు వేరు. వాటి సంఖ్య లెక్కకు మించినది. వాటి అభిరుచులు వేరు. దేవతల ఈ కలగూరగంప మేలా? లేక గుణగణాల రీత్యా, శక్తియుక్తుల రీత్యా, అధికారాల రీత్యా శక్తిమాన్యుడు ఒకే ఒక్కడైన అల్లాహ్ మేలా?

**40** "ఆయనను వదలి మీరు పూజిస్తున్నవి మీరూ, మీ తాత ముత్తాతలూ స్వయంగా కల్పించుకున్న కొన్ని పేర్లు తప్ప మరేమీ కావు. వాటికి సంబంధించి అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింప జెయ్యలేదు.[61] పరిపాలనాధికారం అల్లాహ్‌కు తప్ప వేరొకరికి లేదు. మీరంతా ఆయన దాస్యాన్ని తప్ప ఇంకొకరి దాస్యం చేయ రాదన్నదే ఆయన ఆజ్ఞ. ఇదే సరైన – స్థిరమైన – ధర్మం.[62] కాని చాలామంది ఈ విషయాన్ని తెలుసుకోరు.[63]

مَا تَعۡبُدُونَ مِن دُونِهِۦٓ إِلَّآ أَسۡمَآءٗ سَمَّيۡتُمُوهَآ
أَنتُمۡ وَءَابَآؤُكُم مَّآ أَنزَلَ ٱللَّهُ بِهَا مِن سُلۡطَٰنٍۚ
إِنِ ٱلۡحُكۡمُ إِلَّا لِلَّهِۚ أَمَرَ أَلَّا تَعۡبُدُوٓاْ إِلَّآ إِيَّاهُۚ ذَٰلِكَ
ٱلدِّينُ ٱلۡقَيِّمُ وَلَٰكِنَّ أَكۡثَرَ ٱلنَّاسِ لَا يَعۡلَمُونَ ﴿٤٠﴾

**41** "చెరసాల జీవితం గడుపుతున్న నా సహవాసులారా![64] మీరిద్దరిలో ఒకడు తన చక్రవర్తికి మధువును పోయడానికి నియమించబడతాడు.[65] మరొకతను శిలువ వేయబడతాడు.[66] పక్షులు అతని తలను పొడిచి తింటాయి. మీరిద్దరూ ఏ విషయం గురించి వాకబు చేశారో దాని నిర్ణయం జరిగిపోయింది."[67]

يَٰصَٰحِبَيِ ٱلسِّجۡنِ أَمَّآ أَحَدُكُمَا فَيَسۡقِي رَبَّهُۥ
خَمۡرٗاۖ وَأَمَّا ٱلۡأٓخَرُ فَيُصۡلَبُ فَتَأۡكُلُ ٱلطَّيۡرُ
مِن رَّأۡسِهِۦۚ قُضِيَ ٱلۡأَمۡرُ ٱلَّذِي فِيهِ تَسۡتَفۡتِيَانِ ﴿٤١﴾

61. మీరు పూజిస్తున్న చిల్లరదేవుళ్ళు ఖుద్దుగా మీరు నిలబెట్టుకున్నవే. వాటికి పేర్లు కూడా మీరే పెట్టుకున్నారు. దైవత్వాన్ని కూడా మీరే ఆపాదించారు. ఈ విషయంలో అల్లాహ్ తరఫున ఏ ఆధారమూ, మరే నిదర్శనమూ పంపబడలేదు. జహాంగీరు దర్గాలో పలావులు వండినా, ఉజాలెషా వాకిలివద్ద కోళ్లు కోసినా, కస్మూరులో క్యాంపు చేసినా, కాకానీలో కవ్వాలీ ప్రోగ్రాములు పెట్టినా, మస్తాన్‌వలీ పేరున మొక్కుబడులు తీర్చినా– ఇదంతా మీ స్వయంకృతమే. వీటికి సంబంధించిన ఏ ఆధారాన్నీ అల్లాహ్ అవతరింపజేయలేదు.

62. ఈ సవ్యమైన జీవన విధానం (ఇస్లాం) వైపుకే నేను మిమ్మల్ని పిలుస్తున్నాను. ఈ ధర్మం ప్రకారం ఒక్కడైన అల్లాహ్ మాత్రమే పూజనీయుడు.

63. ఈ కారణంగానే చాలామంది బహుదైవారాధనకు ఒడిగడుతున్నారు.

1. "వారిలో చాలామంది అల్లాహ్‌ను విశ్వసిస్తూ కూడా ఆయనతో పాటు ఇతరులను సహవర్తులుగా నిలబెడుతున్నారు." (యూసుఫ్ – 106)

2. "(ఓ ప్రవక్తా!) నీవు ఎంతగా కోరుకున్నా జనులలో చాలామంది విశ్వసించరు" (యూసుఫ్ – 103).

64. **'దేవుడు ఒక్కడే'** అన్న తౌహీద్ సందేశం వైపుకు వారిని పిలిచిన తరువాత హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) వారిద్దరి కలల భావార్థాన్ని తెలియజేశారు.

65. కలలో ద్రాక్ష రసాన్ని పిండుతున్నట్లు చూసిన వ్యక్తి ఇతను. అయితే ఫలానా వ్యక్తికి 'ఇది వర్తిస్తుంది' అని ఆయన విడమరచి చెప్పకుండా, ఒకరికి ఇలా జరుగుతుంది అని అన్నారు. ఉరి శిక్షకు గురయ్యేది ఎవరో తెలిస్తే మానసికంగా కృంగిపోతాడనే ఉద్దేశంతో అలా చెప్పారు.

66. తలపై రొట్టెలు మోస్తూ ఉన్నట్లు కలగన్న వ్యక్తే ఇతను.

67. అంటే కలల ద్వారా వారికి తెలుపబడిన ఈ సంగతి విధివ్రాతలో ముందు నుంచే పొందుపరచబడి ఉంది. కాబట్టి ఇది జరిగి తీరుతుంది. కల గురించి హదీసులో ఇలా ఉంది : మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు :– "స్వప్నం – దాని భావార్థం వివరించబడనంతవరకూ పక్షి కాళ్లలో ఉంటుంది. భావం విశదీకరించ బడిన తరువాత అది జరిగి తీరుతుంది" (ముస్నదె అహ్మద్ – 'ఇబ్నె కసీర్' ఆధారంగా).

وَقَالَ لِلَّذِي ظَنَّ أَنَّهُ نَاجٍ مِّنْهُمَا اذْكُرْنِي عِندَ
رَبِّكَ فَأَنسَاهُ الشَّيْطَانُ ذِكْرَ رَبِّهِ فَلَبِثَ فِي
السِّجْنِ بِضْعَ سِنِينَ (42)

**42** వారిద్దరిలో విడుదల చేయబడతాడని భావించిన వానితో యూసుఫ్, "నీ చక్రవర్తి ముందు నా గురించి కాస్త ప్రస్తావించు" అన్నాడు. కాని చక్రవర్తి ముందు ప్రస్తావన తీసుకురాకుండా షైతాన్ అతన్ని మరుపుకు లోనుచేశాడు. సంవత్సరాల తరబడి యూసుఫ్ కారాగారంలోనే ఉండిపోయాడు.[68]

وَقَالَ الْمَلِكُ إِنِّي أَرَىٰ سَبْعَ بَقَرَاتٍ سِمَانٍ يَأْكُلُهُنَّ
سَبْعٌ عِجَافٌ وَسَبْعَ سُنبُلَاتٍ خُضْرٍ وَأُخَرَ يَابِسَاتٍ
يَا أَيُّهَا الْمَلَأُ أَفْتُونِي فِي رُؤْيَايَ إِن كُنتُمْ لِلرُّؤْيَا
تَعْبُرُونَ (43)

**43** (ఒక రోజు) చక్రవర్తి (సభాసదులను ఉద్దేశించి) "బాగా బలిసిన ఏడు ఆవులను బక్కచిక్కిన ఏడు ఆవులు తినేస్తున్నట్లు, ఏడు ధాన్యపు వెన్నులు పచ్చగా ఉండగా మరో ఏడు వెన్నులు ఎండిపోయి ఉన్నట్లు నేను కలగన్నాను. ఓ సభాసదులారా! మీరు గనక కలల భావార్థం చెప్పగలిగితే నేను కన్న ఈ కలకు భావం ఏమిటో చెప్పండి" అన్నాడు.

قَالُوا أَضْغَاثُ أَحْلَامٍ ۖ وَمَا نَحْنُ بِتَأْوِيلِ
الْأَحْلَامِ بِعَالِمِينَ (44)

**44** దానికి వారు, "ఇవి పీడ కలకు సంబంధించిన విషయాలు. ఇలాంటి పీడ కలల భావం మాకు తెలియదు"[69] అని సమాధాన మిచ్చారు.

وَقَالَ الَّذِي نَجَا مِنْهُمَا وَادَّكَرَ بَعْدَ أُمَّةٍ
أَنَا أُنَبِّئُكُم بِتَأْوِيلِهِ فَأَرْسِلُونِ (45)

**45** ఆ ఇద్దరు ఖైదీలలో విడుదల అయిన వ్యక్తికి చాలా కాలం తరువాత (యూసుఫ్ సంగతి) జ్ఞాపకం వచ్చింది. "దీని భావం నేను వివరిస్తాను. బయటికెళ్ళేందుకు నాకు అనుమతి ఇవ్వండి"[70] అని కోరాడతను.

68. అరబీలో **'బిజ్అ'** (**بِضْع**) అనే పదం వచ్చింది. మూడు నుంచి తొమ్మిది వరకు గల సంఖ్యను **'బిజ్అ'**గా వ్యవహరిస్తారు. వహబ్ బిన్ ముంబహ్ ఇలా అంటున్నారు : దైవప్రవక్త హజ్రత్ అయ్యూబ్ (అలైహిస్సలాం) ఏడేండ్లు పరీక్షించబడ్డారు. యూసుఫ్ (అలైహిస్సలాం) కారాగారంలో ఏడు సంవత్సరాలు గడిపారు. కొంతమంది పన్నెండేళ్లనీ, మరికొందరు పద్నాలుగేళ్లని తలపోశారు. నిజము దేవుడెరుగు.

69. అరబీలో **'అజ్గాస్'** (**أَضْغَاثُ**) అనేపదం వచ్చింది. ఇది 'జిగ్సున్'కు బహువచనం. జిగ్సున్ అంటే 'గడ్డిమోపు' అని అర్థం. తర్వాత మూలంలో **'అహ్లామ్'** అనే మరో పదం కూడా ఉంది. ఇది 'హిల్మున్'కు బహువచనం. మొత్తానికి వ్యవహారం ప్రకారం 'అజ్గాసు అహ్లామ్' అన్న మాటకు పీడకలలు, చెల్లాచెదురు భావనలు అన్న అర్థం వస్తుంది. వీటికి ఓ అర్థం అంటూ ఏమీ ఉండదు. ఈ కలగన్నది ఈజిప్టు రాజు. అజీజ్ అతని దగ్గర మంత్రిగా ఉండేవాడు. ఈ కల ద్వారా అల్లాహ్ తన ప్రవక్త (యూసుఫ్ – అలైహిస్సలాం)ను జైలునుంచి విడుదల చేయించదలిచాడు. అందుకే చక్రవర్తి దర్బారులోని ప్రముఖులు, జ్యోతిష్కులు, తాంత్రికులు ఈ పీడ కలకు భావం చెప్పలేకపోయారు. ఈ కలను వారు త్రోసిపుచ్చలేదుగానీ, అందలి మర్మాన్ని విప్పటంలో మాత్రం సఫలీకృతులు కాలేకపోయారు.

70. జైలులో హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం)కు తోడుగా ఉన్న ఇద్దరు వ్యక్తులలో ఇతనొకడు. ఇతను జైలునుంచి విడుదల అయ్యాడు. రాజుగారి ముందు తన ప్రస్తావనను తీసుకురమ్మని లోగడ యూసుఫ్ (అ) అతనికి చెప్పి ఉన్నారు. చాలా కాలం తర్వాత, స్వప్నానికి భావం చెప్పాలనేసరికి ఆ సంగతి అతనికి గుర్తుకు వచ్చింది. రాజుగారి దగ్గర అనుమతి పొంది గబగబా యూసుఫ్ (అలైహిస్సలాం) దగ్గరికి వచ్చాడు.

46 “సత్యవంతుడవైన ఓ యూసుఫ్! ఈ కలకు భావం ఏమిటో కాస్త మాకు చెప్పండి – బలిసిన ఏడు ఆవులను బక్క చిక్కిన ఏడు ఆవులు భక్షిస్తున్నాయి. పచ్చగా కళకళలాడే ఏడు ధాన్యపు వెన్నులుండగా, మరో ఏడు వెన్నులు ఎండిపోయి ఉన్నాయి. (మీరు గనక దీని గూఢార్థం చెబితే) నేను తిరిగి వెళ్ళి, వారికి దీని గురించి చెబుతాను. వారు విషయం తెలుసు కుంటారు” (అని ఆ వ్యక్తి అభ్యర్థించాడు).

يُوسُفُ أَيُّهَا الصِّدِّيقُ أَفْتِنَا فِي سَبْعِ
بَقَرَاتٍ سِمَانٍ يَأْكُلُهُنَّ سَبْعٌ عِجَافٌ وَسَبْعِ
سُنْبُلَاتٍ خُضْرٍ وَأُخَرَ يَابِسَاتٍ لَعَلِّي أَرْجِعُ إِلَى
النَّاسِ لَعَلَّهُمْ يَعْلَمُونَ ﴿46﴾

47 (యూసుఫ్) ఇలా వివరించాడు: “మీరు ఏడు సంవత్సరాల పాటు నిరాఘాటంగా – ఆనవాయితీ ప్రకారం – సేద్యంచేయాలి. కోతలు కోసిన తరువాత మీరు తినటానికి కొంత భాగాన్ని తీసుకుని మిగిలిన ధాన్యాన్ని కంకుల సమేతంగా ఉంచేయండి.

قَالَ تَزْرَعُونَ سَبْعَ سِنِينَ دَأَبًا فَمَا حَصَدْتُمْ
فَذَرُوهُ فِي سُنْبُلِهِ إِلَّا قَلِيلًا مِمَّا تَأْكُلُونَ ﴿47﴾

48 “ఆ తరువాత తీవ్రమైన (దుర్భిక్షంతో కూడుకున్న) ఏడు సంవత్సరాలు వస్తాయి. మీరు ముందుగా వాటికోసం నిలువ చేసి ఉంచిన దానిని అవి హరిస్తాయి.[71] ఒకవేళ కొద్దిగా ఏమైనా మిగిలితే అది మీరు దాచిపెట్టి ఉంచుకున్నదే.[72]

ثُمَّ يَأْتِي مِنْ بَعْدِ ذَٰلِكَ سَبْعٌ شِدَادٌ يَأْكُلْنَ
مَا قَدَّمْتُمْ لَهُنَّ إِلَّا قَلِيلًا مِمَّا تُحْصِنُونَ ﴿48﴾

49 “ఆ తరువాత వచ్చే సంవత్సరంలో ప్రజలపై పుష్కలంగా వర్షాలు కురుస్తాయి. అందులో వారు (ద్రాక్ష) రసాన్ని కూడా దండిగా తీస్తారు.[73]

ثُمَّ يَأْتِي مِنْ بَعْدِ ذَٰلِكَ عَامٌ فِيهِ يُغَاثُ
النَّاسُ وَفِيهِ يَعْصِرُونَ ﴿49﴾

71. దేవుడు హ్రజత్ యూసుఫ్ (అలైహిస్సలాం)కు విషయావగాహనను కూడా ప్రసాదించాడు. అందువల్ల ఆయన వెంటనే ఆ కలలోని నిగూఢార్థాన్ని వెలికితీశారు. బలిసిన ఏడు ఆవులంటే పంటలు పుష్కలంగా పండే ఏడు సంవత్సరాలన్నమాట! ఏడు బక్కచిక్కిన ఆవులంటే కరువు కాటకాలు సంభవించే ఏడు సంవత్సరాలు. నవనవలాడే ఏడు వెన్నులంటే అవి మంచి దిగుబడులకు సంకేతం. ఎండిన ఏడు వెన్నులంటే ఈ ఏడు సంవత్సరాలలో అనావృష్టి ఏర్పడి నేల బీటలు వారుతుంది. సర్వత్రా దుర్భిక్షం తాండవిస్తుంది. కేవలం మతలబు చెప్పి ఊరుకోకుండా ఆ ప్రమాదం నుంచి బయటపడే మార్గం కూడా చూపెట్టారు. వరుసగా ఏడేళ్లు సేద్యం చేసి, ధాన్యం బాగా పండించమని చెప్పారు. వెన్నుల సమేతంగా ఆహారధాన్యాలను నిలువ చేయమని చెప్పటం దూరదృష్టితో కూడుకున్న విషయం. అలా కుప్పలుగా ఉంచటం వల్ల ధాన్యం ఎక్కువ కాలం నిలువ ఉంటుంది.

72. అంటే తదుపరి సేద్యం కోసం ఆ ధాన్యం విత్తనాలుగా పనికి వస్తాయి.

73. అంటే కరువు కాటకాల కాలం ముగియగానే మళ్లీ వర్షాలు కురుస్తాయి. పంటలు బాగా పండుతాయి. మీరు ద్రాక్ష పండ్ల నుంచి బాగా రసం పిండుతారు. జైతూను (ఆలివ్) పండ్ల నుంచి నూనె తీస్తారు. పశువుల పాలు పిండుతారు. చూడండి! ఒక చిన్న కలలో ఎంత ఘనమయిన చరిత్ర ఇమిడి ఉందో! దైవానుగ్రహం పొందిన వ్యక్తి మాత్రమే ఇలాంటి సూక్ష్మాతి సూక్ష్మ విషయాలను చక్కగా విశ్లేషించి చెప్ప గలుగుతాడు. అందుకే ఆ మహా మేధావిని తన దర్బారులో హాజరుపరచమని రాజుగారు ఆదేశించారు.

**50** "అతన్ని నా దగ్గరకు తీసుకురండి"[74] అని రాజు ఆజ్ఞాపించాడు. (రాజ) దూత యూసుఫ్ వద్దకు చేరుకున్నప్పుడు, "నువ్వు నీ రాజు వద్దకు తిరిగివెళ్ళి, తమ చేతులను కోసుకున్న మహిళామణుల వ్యవహారంలోని నిజానిజాలేమిటో తేల్చమని అతన్ని అడుగు. నిశ్చయంగా వారి జిత్తుల గురించి నా ప్రభువుకు అంతా తెలుసు" అన్నాడు యూసుఫ్.[75]

وَقَالَ الْمَلِكُ ائْتُوْنِیْ بِهٖ ۚ فَلَمَّا جَآءَهُ الرَّسُوْلُ
قَالَ ارْجِعْ اِلٰی رَبِّكَ فَسْئَلْهُ مَا بَالُ النِّسْوَةِ الّٰتِیْ
قَطَّعْنَ اَیْدِیَهُنَّ ؕ اِنَّ رَبِّیْ بِكَیْدِهِنَّ عَلِیْمٌ (50)

**51** అప్పుడు రాజు (సంబంధిత స్త్రీలను పిలిపించి), "ఓ నారీమణులారా! మీరంతా వల పన్ని, యూసుఫ్ మనసును చలింపజేయటానికి ప్రయత్నించినప్పుడు అసలేం జరిగింది?" అని అడిగాడు. దానికి వారు, "హాషలిల్లాహ్! (అల్లాహ్ మమ్మల్ని రక్షించు గాక!) మేము యూసుఫ్‌లో ఏ దోషాన్నీ చూడలేదు" అని జవాబిచ్చారు.[76] తర్వాత అజీజ్ భార్య కూడా ఈ విధంగా చెప్పింది: "ఇప్పుడు నిజం బయటపడింది. అతని మనసును కవ్వించినది నేనే. అతను మాత్రం సత్యవంతుడు."[77]

قَالَ مَا خَطْبُكُنَّ اِذْ رَاوَدْتُّنَّ یُوْسُفَ عَنْ نَّفْسِهٖ ؕ
قُلْنَ حَاشَ لِلّٰهِ مَا عَلِمْنَا عَلَیْهِ مِنْ سُوْٓءٍ ؕ قَالَتِ
امْرَاَتُ الْعَزِیْزِ الْـٰٔنَ حَصْحَصَ الْحَقُّ ۫ اَنَا رَاوَدْتُّهٗ
عَنْ نَّفْسِهٖ وَاِنَّهٗ لَمِنَ الصّٰدِقِیْنَ (51)

**52** నేను అతని (అజీజు) పరోక్షంలో అతనికెలాంటి ద్రోహం చేయలేదనీ,[78] ద్రోహబుద్ధిగల వారి టక్కరి జిత్తులను అల్లాహ్ పారనివ్వడని[79] (అజీజ్) తెలుసుకోవటానికి నేనిలా చేశాను (అన్నాడు యూసుఫ్).

ذٰلِكَ لِیَعْلَمَ اَنِّیْ لَمْ اَخُنْهُ بِالْغَیْبِ وَاَنَّ اللّٰهَ
لَا یَهْدِیْ كَیْدَ الْخَآئِنِیْنَ (52)

74. స్వప్నంలోని భావాన్ని తెలియజేయటంతో పాటు, సంకట స్థితినుంచి రాజ్య ప్రజలను రక్షించే ఉపాయాన్ని కూడా యూసుఫ్ (అలైహిస్సలాం) చెప్పేసరికి రాజు ఎంతో ప్రభావితుడయ్యాడు. సుదీర్ఘ కాలంగా చెరసాలలో మగ్గుతున్న ఆ మనిషి మామూలు 'మనిషి' కాదనీ, అతనొక 'మహా మనీషి' అనీ, అసాధారణమైన ప్రజ్ఞాపాటవాలు అతనిలో దాగి ఉన్నాయని రాజుకు అర్థమయింది. అందుకే వెంటనే ఆయన్ని దర్బారుకు పిలవమని రాజు ఆజ్ఞాపించాడు.

75. రాజుగారిలో జనించిన ఉదార భావాన్ని గ్రహించగానే యూసుఫ్ (అలైహిస్సలాం) సమయోచితంగా వ్యవహరించారు. రాజుగారి దయాదాక్షిణ్యాలపై విడుదలై రావటం, తనకు అంటగట్టిన కళంకాన్ని అలాగే ఉంచుకోవటం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదు. అందుకే ముందుగా ఆ కేసుపై విచారణ జరిపించమని కోరారు. ఆ విధంగా నిష్కళంకమైన జీవితం గడపాలని నిశ్చయించుకున్నారు. ఎందుకంటే ప్రజాబాహుళ్యాన్ని దైవధర్మం వైపుకు పిలిచే వ్యక్తి శీలవంతుడనీ, నిజాయితీపరుడని ప్రజలకు తెలియటం చాలా అవసరం.

76. రాజుగారు నిలదీసి అడిగేసరికి ఆ స్త్రీలంతా నీళ్లు నమిలారు. నెమ్మదిగా నిజం బయటపెట్టారు.

77. అజీజ్ భార్య కూడా నిజాన్ని ఒప్పుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. యూసుఫ్ సత్యం మూర్తీభవించిన వాడనీ, ఏ పాపం ఎరుగని ఆ శీలవంతుణ్ణి తానే మోహించే యత్నం చేశానని ఆమె ఒప్పుకుంది.

78. జైల్లో ఉన్న యూసుఫ్ (అలైహిస్సలామ్)కు ఈ వివరాలన్నీ తెలియజేసినప్పుడు ఆయన ఈ మాటలన్నారు. అయితే అసలు ఈ పలుకులు యూసుఫ్ ప్రవక్త పలికినవేనా? లేక ఇవి జులైఖా అన్న మాటలా? అన్న విషయంలో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. రాజుగారి దగ్గరకు వెళ్ళినప్పుడు యూసుఫ్ (అ) పలికిన మాటలివి అని కొందరు చెప్పగా, ఇవి కూడా జులైఖా పలుకులేనని కొందరు వ్యాఖ్యానించారు. యూసుఫ్ లేని సమయంలో

**53** నేను నా మనసు పవిత్రతను గురించి చాటుకోవటం లేదు.[80] నిశ్చయంగా మనసైతే చెడు వైపుకే పురికొల్పుతుంది.[81] అయితే నా ప్రభువు దయదలచిన వారి విషయంలో మటుకు అలా జరగదు.[82] నిస్సందేహంగా నా ప్రభువు అపారంగా క్షమించే వాడు, అమితంగా దయదలిచేవాడు.

وَمَآ أُبَرِّئُ نَفْسِيٓ ۚ إِنَّ ٱلنَّفْسَ لَأَمَّارَةٌۢ
بِٱلسُّوٓءِ إِلَّا مَا رَحِمَ رَبِّيٓ ۚ إِنَّ رَبِّي غَفُورٌ
رَّحِيمٌ (53)

**54** “అతన్ని నా వద్దకు పిలుచుకు రండి. నేనతన్ని నా ఆంత రంగిక కార్యదర్శిగా నియమించుకుంటాను”[83] అని రాజు చెప్పాడు. అతనితో మాట్లాడిన తరువాత, “ఈ రోజు నుంచి మీరు మా దగ్గర గౌరవనీయులు, నమ్మకస్థులు”[84] అని రాజు పలికాడు.

وَقَالَ ٱلْمَلِكُ ٱئْتُونِي بِهِۦٓ أَسْتَخْلِصْهُ لِنَفْسِي ۖ
فَلَمَّا كَلَّمَهُۥ قَالَ إِنَّكَ ٱلْيَوْمَ لَدَيْنَا مَكِينٌ
أَمِينٌ (54)

**55** అప్పుడు (యూసుఫ్) ఇలా అన్నాడు: “రాజ్యంలోని ఖజానా లపై నన్ను (పర్యవేక్షకునిగా) నియమించండి.[85] నేను వాటిని కాపాడతాను. ఆ పరిజ్ఞానం నాకున్నది.”[86]

قَالَ ٱجْعَلْنِي عَلَىٰ خَزَآئِنِ ٱلْأَرْضِ ۖ
إِنِّي حَفِيظٌ عَلِيمٌ (55)

అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చి ద్రోహం చెయ్యలేదన్నది ఆమె మాటల్లోని భావం అని కూడా వారు చెప్పారు. ఇంకొక భావం ఇది : “నేను నా భర్తకు ద్రోహం చెయ్యలేదు. చెడు సంకల్పం చేసుకున్న మాట నిజమేగాని అతను లేని సమయంలో నేనే పాపానికీ ఒడిగట్టలేదు” అని ఆమె చెప్పదలిచింది – ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ అభిప్రాయానికే ప్రాధాన్యత నిచ్చారు.

79. అసత్యం చేసే ఆర్భాటం ఎంత జాస్తి అయినప్పటికీ ఫలితం దృష్ట్యా నాస్తి అవుతుంది. లేదా అసత్యం ఆటలు కొంతకాలం సాగినా ఆఖరికి సత్యమే గెలుస్తుంది. సత్యాన్ని ఆశ్రయించినవారు కొంతకాలం కఠిన పరీక్షలు ఎదుర్కొన్నా చివరికి వారు విజేతలుగా నిలుస్తారు.

80. ఈ పలుకులను హజ్రత్ యూసుఫ్ పలుకులుగా భావించినట్లయితే; అది ఆయన వినమ్రతకు ప్రతిరూపం అనుకోవాలి. ఎందుకంటే ఆయన సౌశీల్యం, పవిత్రత గురించి ఇంతకు ముందే నిరూపితం అయింది.

ఒకవేళ ఈ పలుకులను ఈజిప్టు అధికారి భార్య పలుకులుగా పరిగణించినట్లయితే (ఇమామ్ ఇబ్నె కసీర్ కూడా ఇలా పరిగణించినవారిలో ఒకరు) అది వాస్తవం కూడా. ఎందుకంటే ఆమె తన తప్పును ఒప్పుకుంది. హజ్రత్ యూసుఫ్ (అలైహి స్సలాం)ను రెచ్చగొట్టింది తానేనని రాజు సమక్షంలో పలికింది.

81. మనిషి వల్ల తప్పులు ఎందుకు జరుగుతాయో ఇక్కడ చెప్పటం జరిగింది.

82. దైవకృపకు నోచుకున్నవాడు మాత్రమే ఆంతర్యంలో జనించే దుష్ప్రేరణల నుండి, చెడు తలంపుల నుండి తనను కాపాడుకోగలుగుతాడు. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) దైవానుగ్రహంతోనే ఆ స్త్రీ బిగించిన ఉచ్చులో నుంచి బయటపడగలిగారు.

83. యూసుఫ్ (అలైహిస్సలాం) గారు ప్రజ్ఞాపాటవాలు, తెలివి తేటలుగల వ్యక్తి మాత్రమే గాక నీతిమంతుడు, నిజాయితీ పరుడు కూడా. ఈ సంగతిని గ్రహించిన ఈజిప్టు చక్రవర్తి (రయ్యాన్ బిన్ వలీద్) ఆయన్ని తన దగ్గరకు పిలుచుకురమ్మని చెప్పాడు. ఆయన్ని తన ఆంతరంగిక సలహాదారునిగా నియమించుకుంటానని అన్నాడు.

84. అరబీలో **‘మకీన్’ ‘అమీన్’** అనే పదాలు వచ్చాయి. ఇక్కడ మకీన్ అంటే ఉన్నత స్థానం కలవాడు అనీ, అమీన్ అంటే రాజ్యానికి సంబంధించిన కీలక విషయాలు తెలిసిన వ్యక్తి అనీ అర్థం.

وَكَذٰلِكَ مَكَّنَّا لِيُوسُفَ فِى الْاَرْضِۚ يَتَبَوَّاُ مِنْهَا حَيْثُ يَشَآءُؕ نُصِيْبُ بِرَحْمَتِنَا مَنْ نَّشَآءُ وَلَا نُضِيْعُ اَجْرَ الْمُحْسِنِيْنَ ﴿56﴾

**56** ఈ విధంగా మేము యూసుఫ్‌కు (ఈజిప్టు రాజ్య) భూ భాగంలో అధికారాన్ని ప్రసాదించాము. అక్కడ తాను కోరినచోట నివసించే సౌలభ్యం అతనికి ఇచ్చాము.[87] మేము కోరినవారికి (ఇలాగే) మా కారుణ్య భాగ్యాన్ని ప్రసాదిస్తాము. సజ్జనుల పుణ్య ఫలాన్ని మేము వృథా కానివ్వము.[88]

85. ఆయతులో **'ఖజాయిన్'** (ఖజానాలు) అనే పదం వచ్చింది. 'ఖిజానతున్' (ఖజాన) అనే పదానికి ఇది బహువచనం. వస్తువులను భద్రపరిచే స్థలాన్ని ఖజానాగా వ్యవహరిస్తారు. అయితే ఈ ఆయతులో చెప్పబడిన ఖజానాలంటే ధాన్యా గారాలు, ఆహార గిడ్డంగులు అని భావం. ఈ ఆహార ధాన్యాలను హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) తన అధీనంలోకి తీసుకోవాలనుకోవటం గమనార్హం. ఎందుకంటే (స్వప్నం ప్రకారం) రాబోయే కాలంలో దుర్భిక్షం ఏర్పడనున్నది. ఆ గడ్డు పరిస్థితిని ఎదుర్కోవటానికి ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి.

రాజ్య ఖజానాలను తనకప్పగించమని హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కోరినంత మాత్రాన ఆయనకు పదవీ వ్యామోహం ఉందని భావించనవసరం లేదు. సాధారణ పరిస్థితుల్లో ప్రజలు తమంతట తాముగా పదవుల్ని కోరుకోరాదు. ఇస్లాం దృష్టిలో అది అధర్మంగా పరిగణించబడుతుంది. కాని దేశంలో అరాచకం, అవ్యవస్థ, ఆర్థికమాంద్యం లాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆయా రంగాలలో నిష్ణాతులైనవారు తగు సూచనలివ్వటంతోపాటు, దేశానికి తమ అవసరం ఉందని భావిస్తే, ఆ పదవీ బాధ్యతలను స్వీకరించటానికి ముందుకు రావచ్చు. రావాలి కూడా. ఎందుకంటే సంక్షోభాన్ని సకాలంలో ఎదుర్కోవటం చాలా అవసరం. లేకపోతే బ్రతుకు దుర్భరం అవుతుంది. అదలా ఉంచితే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) తనంతట తానుగా పదవిని కోరలేదు. ఏదయినా పదవి ఇస్తానని రాజుగారు చెప్పినప్పుడు, తనకు ఇతరత్రా పదవులు ఇచ్చేబదులు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చే బాధ్యతను అప్పగించమని ప్రతిపాదించారు. అదీ విశేషం!

86. కాపాడటం కూడా అలా ఇలా కాదు. చాలా ఖచ్చితంగా వ్యవహరిస్తాను. దుబారా ఖర్చును తగ్గిస్తాను. పొదుపు చర్యలు గైకొంటాను. ఆహార గిడ్డంగులను కనిపెట్టుకుని ఉంటాను. తద్వారా సాధ్యమైనంతవరకు ఎక్కువ నిల్వలు జరుగుతాయి. ఈ జమా ఖర్చులపై నాకు పూర్తి అవగాహన ఉంది. కాబట్టి ఈ వైపరీత్యం పట్ల మీరు నిశ్చింతగా ఉండండి అని హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) రాజుగారికి భరోసా ఇచ్చారు.

87. అంటే రాజ్య పరిధిలో మేము యూసుఫ్ (అలైహిస్సలాం)కు ఇచ్చిన అధికారాలు ఎంత కీలకమైనవంటే యూసుఫ్ ఏది చెబితే రాజు అదే చేస్తాడు. ఒక ఇంటి యజమాని తన ఇంట్లో ఎలా శాసిస్తాడో అలాగే యూసుఫ్ ఈజిప్టు రాజ్యంలో అధికార బాధ్యతలను నెరవేర్చారు. ఈజిప్ట్ మొత్తం ఆయన పర్యవేక్షణలో ఉండేది. తాను తలచిన చోట ఆయన నివసించగలిగేవారు.

88. సోదరుల ఆగడాలను సహించినందుకు, జులైఖా బిగించిన ఉచ్చులో పడకుండా ఆత్మ నిగ్రహం కనబరచినందుకు, మొక్కవోని సహనస్థయిర్యాలతో కారాగార జీవితం గడిపినందుకు మేము యూసుఫ్‌కు ఇచ్చిన బహుమానం ఇది (ఈ ప్రాపంచిక పదవి). ఒక మంత్రి ఇంట బానిసగా అడుగిడిన వ్యక్తిని సత్ప్రవర్తన, సౌశీల్యం మూలంగా మంత్రి స్థాయికి చేర్చాడు అల్లాహ్. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) పిలుపుపై ఈజిప్టు చక్రవర్తి ఇస్లాం స్వీకరించాడని కొందరు చెబుతున్నారు. ఈజిప్టు అజీజ్ యొక్క అసలు పేరు ఇత్‌ఫీర్. కొంత కాలానికి అతను చనిపోయాడనీ, అతని మరణానంతరం జులైఖాతో యూసుఫ్ (అలైహిస్సలాం) వివాహం జరిగిందనీ, ఇద్దరు పిల్లలు కూడా పుట్టారని మరికొందరు అంటున్నారు. ఆ ఇద్దరిలో ఒకరిపేరు అఫ్‌రాయీమ్, రెండో వాని పేరు మీషా. అఫ్రాయీమే యూషా బిన్ నూన్ అనీ, హజ్రత్ అయ్యూబ్ (అలైహిస్సలాం) భార్యయగు రహ్మత్‌కు ఆయన తండ్రి అని కూడా చెప్పబడింది (తఫ్సీర్ ఇబ్నె కసీర్). అయితే ఈ కథనం ప్రమాణబద్ధమైన ఉల్లేఖనాల ద్వారా నిరూపితం కాలేదు. అందువల్ల యూసుఫ్ (అలైహిస్సలాం) జులైఖాను నికాహ్ చేసుకున్నారన్నది సరైనదిగా అనిపించదు. అదలా ఉంచితే; ఆ స్త్రీ

**57** విశ్వసించి, భయభక్తుల వైఖరిని అవలంబించిన వారి(కి లభించే) పరలోక పుణ్యఫలం చాలా శ్రేష్ఠమైనది.

وَلَاَجۡرُ الۡاٰخِرَةِ خَيۡرٌ لِّلَّذِيۡنَ اٰمَنُوۡا وَكَانُوۡا يَتَّقُوۡنَ ﴿57﴾

**58** యూసుఫ్ సోదరులు వచ్చి, అతని సమక్షంలో హాజరయ్యారు. అతను వాళ్ళను గుర్తుపట్టాడుగాని వాళ్ళు మాత్రం అతన్ని గుర్తుపట్టలేదు.[89]

وَجَآءَ اِخۡوَةُ يُوۡسُفَ فَدَخَلُوۡا عَلَيۡهِ فَعَرَفَهُمۡ وَهُمۡ لَهٗ مُنۡكِرُوۡنَ ﴿58﴾

**59** వారి సామానును సిద్ధం చేయించిన తరువాత, "(మరోసారి మీరు నా వద్దకు వచ్చినప్పుడు), మీ తండ్రికి జన్మించిన మీ (సవతి) సోదరుణ్ణి కూడా తీసుకురండి. నేనెలా పూర్తిగా కొలిచి ఇస్తున్నానో, ఎంత చక్కగా అతిథి మర్యాద చేస్తున్నానో మీరు చూడటం లేదా!" అని అన్నాడు.[90]

وَلَمَّا جَهَّزَهُمۡ بِجَهَازِهِمۡ قَالَ ائۡتُوۡنِىۡ بِاَخٍ لَّكُمۡ مِّنۡ اَبِيۡكُمۡ‌ ۚ اَلَا تَرَوۡنَ اَنِّىۡۤ اُوۡفِى الۡكَيۡلَ وَاَنَا خَيۡرُ الۡمُنۡزِلِيۡنَ ﴿59﴾

**60** "మీరు గనక అతన్ని తీసుకురాని పక్షంలో నా తరపున మీకు (ధాన్యం) కొలిచి ఇవ్వటం జరగదు. అసలు మీరు నా దరిదాపులకు కూడా రాకూడదు"[91] (అని వారికి చెప్పాడు).

فَاِنۡ لَّمۡ تَاۡتُوۡنِىۡ بِهٖ فَلَا كَيۡلَ لَكُمۡ عِنۡدِىۡ وَلَا تَقۡرَبُوۡنِ ﴿60﴾

---

నడవడిక ఎటువంటిదో ఇంతకు ముందే తెలుపబడింది. అలాంటి స్త్రీ ఒక ప్రవక్త దాంపత్య జీవితంలోకి రావటం అన్నది ఎంతో అసమంజసంగా, అసంబద్ధంగా తోస్తుంది.

89. ఏడు సంవత్సరాలు పంటలు పుష్కలంగా పండి, ఆ తరువాత కరువు కాటకాలు ఏర్పడినప్పుడు జరిగిన సంఘటన ఇది. ఈజిప్టులోని ప్రధాన నగరాలు, ప్రాంతాలన్నింటినీ కరువు రక్కసి కబళించింది. ఆఖరికి హజ్రత్ యాఖూబు (అలైహిస్సలాం) కుటుంబీకులు నివసించే కన్ఆన్ ప్రాంతం కూడా కరువు వాతన పడింది. పంటలు పొంగిపొరలే కాలంలో హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలు ఫలించాయి. ఆహార వస్తువుల సరఫరాను క్రమబద్ధం చేసి అన్ని ప్రాంతాల వారికి న్యాయసమ్మతంగా ఇవ్వటంతో ఆయన పేరు రాజ్యంలో మార్మోగిపోయింది. ఈజిప్టు చక్రవర్తి కరువు ప్రాంతాలకు ఆహారపదార్థాలను సరఫరా చేస్తున్నాడన్న సంగతి కన్ఆన్ వాసులకు కూడా తెలిసింది. తండ్రి యాఖూబ్ (అలైహిస్సలాం) ఆదేశంపై యూసుఫ్ సోదరులు కూడా తమ ఇళ్లల్లో ఉన్న సొమ్మును తీసుకుని రాజదర్బారులోనికి ప్రవేశించారు. వారిని చూడగానే వారు తమ సోదరులన్న సంగతిని యూసుఫ్ (అ) గ్రహించారు. కాని ఆ అభాగ్య సోదరులకు తెలియదు – కొన్నేండ్ల క్రితం తాము తమ స్వహస్తాలతో బావిలో పడవేసిన సహోదరుడు యూసుఫే ఈ మహామనీషి అని!

90. యూసుఫ్ (అలైహిస్సలాం) తన పుట్టుపూర్వోత్తరాల గురించి వారికి చెప్పకుండా, వారి సంగతులన్నింటినీ వారినుంచి రాబట్టారు. వారు తమ వంశపరంపరను గురించీ, కుటుంబ పరిస్థితుల గురించీ పూర్తి సమాచారం అందించారు. తాము పదిమంది సోదరులం ఒకే తల్లిబిడ్డలమనీ, మరో ఇద్దరు సవతి సోదరులు కూడా ఉన్నారనీ, వారిలో ఒకతను అడవిలో తోడేలు వాతన పడ్డాడని చెప్పారు. సవతి సోదరుడైన బిన్యామీన్‌ను తమ పితామహుడు తన వెంటే ఉంచుకున్నారని, అతన్ని తమ వెంట పంపించలేదని కూడా చెప్పారు. తన తమ్ముణ్ణి చూడాలన్న కుతూహలం యూసుఫ్‌లో జనించింది. మరోసారి వచ్చేటప్పుడు అతన్ని కూడా వెంటబెట్టుకు రావాలని తాకీదు చేశారు.

91. ఆ సోదరుణ్ణి (బిన్యామీన్‌ను) కూడా పిలుచుకురాకపోతే ధాన్యం గిన్యం లభించదని హెచ్చరించారు. అలా గట్టిగా చెబితే ఎలాగైనా తన తమ్ముణ్ణి తీసుకువస్తారన్న ఉద్దేశంతో హజ్రత్ యూసుఫ్ చాలా ఖచ్చితంగా మాట్లాడారు.

**61** “సరే! అతని తండ్రి అతనిని పంపటానికి సమ్మతించేలా మేము ప్రయత్నం చేస్తాము. మేము అలా తప్పకుండా చేస్తాము”[92] అని వారు సమాధానమిచ్చారు.

قَالُوْا سَنُرَاوِدُ عَنْهُ اَبَاهُ وَاِنَّا لَفٰعِلُوْنَ ﴿61﴾

**62** “వారి మూలధనాన్ని (డబ్బును) వారి మూటలలోనే ఉంచండి.[93] వారు తమ ఇంటివారల వద్దకు పోయినప్పుడు, తమ మూలధనాన్ని గుర్తించి బహుశా తిరిగి వస్తారు” అని యూసుఫ్ తన సేవకులకు[94] ఆజ్ఞాపిస్తూ చెప్పాడు.

وَقَالَ لِفِتْيٰنِهِ اجْعَلُوْا بِضَاعَتَهُمْ فِيْ رِحَالِهِمْ لَعَلَّهُمْ يَعْرِفُوْنَهَآ اِذَا انْقَلَبُوْٓا اِلٰٓى اَهْلِهِمْ لَعَلَّهُمْ يَرْجِعُوْنَ ﴿62﴾

**63** వారు తిరిగి తమ తండ్రి వద్దకు వచ్చినప్పుడు, “నాన్నా! ఇక మీదట మనకు ధాన్యం కొలవటంపై ఆంక్ష విధించబడింది.[95] కాబట్టి మేము కొలపాత్ర నిండా ధాన్యం తీసుకురావటానికి మీరు మా తమ్ముణ్ణి మా వెంట పంపండి. అతన్ని రక్షించే బాధ్యత మాది” అని విన్నవించుకున్నారు.

فَلَمَّا رَجَعُوْٓا اِلٰٓى اَبِيْهِمْ قَالُوْا يٰٓاَبَانَا مُنِعَ مِنَّا الْكَيْلُ فَاَرْسِلْ مَعَنَآ اَخَانَا نَكْتَلْ وَاِنَّا لَهٗ لَحٰفِظُوْنَ ﴿63﴾

**64** “లోగడ ఇతని సోదరుని విషయంలో నేను మిమ్మల్ని నమ్మినట్లుగానే ఇతని విషయంలో కూడా నమ్మమంటున్నారు కదూ![96] అల్లాహ్‌యే అత్యుత్తమ రక్షకుడు. ఆయనే కరుణించే వారందరిలోకీ గొప్ప కరుణాకరుడు”[97] అని (యాఖూబ్) పలికాడు.

قَالَ هَلْ اٰمَنُكُمْ عَلَيْهِ اِلَّا كَمَآ اَمِنْتُكُمْ عَلٰٓى اَخِيْهِ مِنْ قَبْلُ ۭ فَاللّٰهُ خَيْرٌ حٰفِظًا ۠ وَّهُوَ اَرْحَمُ الرّٰحِمِيْنَ ﴿64﴾

92. అంటే అతన్ని పంపమని మేము మా నాన్నగారిని శతవిధాలా నచ్చజెప్పుతాము. మా ప్రయత్నంలో మేము సఫలీకృతులవుతామన్న నమ్మకం మాకుంది అని వారు హామీ ఇచ్చారు.

93. **“మూలధనం”** అంటే ఆహార ధాన్యాలను కొనుగోలు చేయడానికి ఆ అన్నదమ్ములంతా కలసి తెచ్చుకున్న సొమ్ము అన్నమాట! వారి సొమ్ములను గుట్టుచప్పుడు కాకుండా వారి మూటా ముల్లెల్లో పెట్టేయటంలోని మర్మం ఏమిటంటే, మరోసారి వారు ఆహారధాన్యాల కోసం రావాలంటే ఇంట్లో డబ్బు ఉండాలి. డబ్బు లేకపోతే రాకపోవచ్చు, వచ్చినా చాలా ఆలస్యంగా రావచ్చు. అందుకే వారి డబ్బును వారి సామానులో సర్దిపెట్టమని ఆదేశించారు.

94. మూలంలోని **‘ఫిత్‌యాన్’** (యువకులు) అనే పదానికి రాజదర్బారులో పనిచేసే సేవకులు, బానిసలు అని భావం.

95. దీని భావం ఏమిటంటే ఇకనుంచి బిన్‌యామీన్ వస్తేగాని మాకు ధాన్యం లభించదు. కాబట్టి అతన్ని మా వెంట తప్పకుండా పంపండి. ఇదివరకు యూసుఫ్ (అలైహిస్సలాం) విషయంలో అలసత్వం కనబరిచామన్న ఉద్దేశంతో మీరు బిన్‌యామీన్‌ను పంపరేమో! ఒకవేళ అతన్ని గనక మావెంట పంపకపోతే మనమంతా ఇక్కట్లపాలు కావలసి వస్తుంది. మీరు నిశ్చింతగా ఉండండి. మేము మా సోదరుణ్ణి జాగ్రత్తగా చూసుకుంటాం.

96. మీ మాటలను ఎలా నమ్మేది? ఇదివరకు యూసుఫ్‌ను తీసుకెళ్ళినప్పుడు కూడా మీరు చాలా ‘కబుర్లు’ చెప్పారు. అతన్ని రక్షించలేని వారు ఇతన్ని మాత్రం ఎలా రక్షిస్తారు? అన్నది యాఖూబు మాటల్లోని భావం.

97. అయినప్పటికీ తీవ్రమయిన ఆహారవస్తువుల కొరత మూలంగా బిన్‌యామీన్‌ను వారి వెంట పంపడానికి అంగీకరించక తప్పలేదు. అల్లాహ్‌పై భారం మోపి అన్యమనస్కంగానే అంగీకారాన్ని వ్యక్తపరిచారు ఆ సహనశీలి.

**65** వారు తమ సామాను విప్పినప్పుడు, తమ సొమ్ము తమకు వాపసు చేయబడిన సంగతి తెలుసుకున్నారు. "నాన్నగారూ! మనకు ఇంకేం కావాలి?![98] చూడండి, మన సొమ్ము కూడా మనకు వాపసు చేయబడింది. మళ్లీ వెళ్ళి మన కుటుంబం కోసం ఆహారపదార్థాలను తెచ్చుకుంటాం. మా తమ్ముణ్ణి కూడా జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉంటాం. ఒక ఒంటె మోయగలిగేంత ధాన్యాన్ని అదనంగా తెచ్చుకుంటాం.[99] ఈ పాటి కొలత (అదనపు ధాన్యప్రాప్తి) చాలా తేలిక"[100] అని ప్రాధేయపడ్డారు.

وَلَمَّا فَتَحُوا مَتَاعَهُمْ وَجَدُوا بِضَاعَتَهُمْ رُدَّتْ
إِلَيْهِمْ ۖ قَالُوا يَا أَبَانَا مَا نَبْغِي ۖ هَٰذِهِ بِضَاعَتُنَا
رُدَّتْ إِلَيْنَا ۖ وَنَمِيرُ أَهْلَنَا وَنَحْفَظُ أَخَانَا وَنَزْدَادُ
كَيْلَ بَعِيرٍ ۖ ذَٰلِكَ كَيْلٌ يَسِيرٌ ﴿٦٥﴾

**66** "మీరతన్ని తిరిగి నా దగ్గరకు చేరుస్తామని దేవుని సాక్షిగా మాటిస్తే తప్ప, నేనతన్ని మీ వెంట పంపించను. ఒకవేళ మీరంతా నిర్బంధించబడితే అది వేరే విషయం"[101] అని యాఖూబ్ (అలైహిస్సలాం) పలికాడు. అప్పుడు వారంతా ఆ మేరకు అతనికి మాటిచ్చారు. "మనం ఆడిన మాటలను అల్లాహ్ గమనిస్తూనే ఉన్నాడ"ని యాఖూబ్ అన్నాడు.

قَالَ لَنْ أُرْسِلَهُ مَعَكُمْ حَتَّىٰ تُؤْتُونِ مَوْثِقًا مِنَ
اللَّهِ لَتَأْتُنَّنِي بِهِ إِلَّا أَنْ يُحَاطَ بِكُمْ ۖ فَلَمَّا آتَوْهُ
مَوْثِقَهُمْ قَالَ اللَّهُ عَلَىٰ مَا نَقُولُ وَكِيلٌ ﴿٦٦﴾

**67** ఇంకా (యాఖూబ్) ఇలా ఉపదేశించాడు : "నా కుమారులారా! మీరంతా ఒకే ద్వారం గుండా (నగరంలోనికి) ప్రవేశించకండి.[102] వేర్వేరు ద్వారాల గుండా వెళ్ళండి. అల్లాహ్ తరఫున మీపై విధించబడే ఏ విషయం నుంచి కూడా నేను మిమ్మల్ని

وَقَالَ يَا بَنِيَّ لَا تَدْخُلُوا مِنْ بَابٍ وَاحِدٍ وَادْخُلُوا
مِنْ أَبْوَابٍ مُتَفَرِّقَةٍ ۖ وَمَا أُغْنِي عَنْكُمْ مِنَ اللَّهِ

98. అంటే – రాజుగారు మాకు అతిథి మర్యాద చేశాడు, ధాన్యం ఇచ్చాడు, మేమిచ్చిన డబ్బును కూడా మాకు తిరిగి ఇచ్చేశాడు – మనకు ఇంకేం కావాలి?

99. అంటే ఒక్కో వ్యక్తికి ఒక్కో ఒంటె మోయగలిగేంత ధాన్యం ఇవ్వబడుతోంది. మీరు బిన్‌యామీన్‌ను కూడా పంపితే అదనంగా మరో ఒంటె మోయగలిగేంత ధాన్యం లభిస్తుంది.

100. ఒక ఒంటె మోయగలిగినంత ధాన్యం ఇవ్వటం రాజుకు కష్టమేమీ కాదు అన్నది దీని భావం. లేక ఇప్పుడు మేము తెచ్చుకున్న ధాన్యం కొద్దిపాటిదే. బిన్‌యామీన్ కూడా మాకు తోడుగా ఉంటే మరింత ధాన్యం తెచ్చుకోవచ్చు. ఆ విధంగా మన అవసరాలు తీరుతాయి అన్నది కూడా వారి పలుకుల ఉద్దేశం కావచ్చు.

101. మీరేదైనా సామూహిక ఆపదలో చిక్కుకోవటమో లేక పట్టుబడటమో లేక హత్యకు గురికావటమో జరిగితే తప్ప బిన్‌యామీన్ విషయంలో మాట తప్పకూడదు అని గట్టిగా తాకీదు చేశారు. ఆ మేరకు వారిచేత ప్రమాణం కూడా చేయించుకున్నారు.

102. ఆ 11మంది సోదరులంతా కలసి ఈజిప్టుకు బయలుదేరినప్పుడు కన్నకొడుకులకు తండ్రి చేసిన హితబోధ ఇది. వారంతా ఒకేతండ్రి బిడ్డలు, రంగు రూపు ఇంచుమించు ఒక్కటే. ఒకే సమయంలో ఒకే మార్గం గుండా పోతుంటే జనులు చూసి ఆశ్చర్యపోతారు. అసూయ చెందుతారు. దాంతో దిష్టి తగలవచ్చు. అందుకే వారిని చెడు చూపునుంచి రక్షించడానికి తండ్రి ఈ విధంగా సలహా యిచ్చారు. "దిష్టి తగలటం సత్యం" అని హదీసు ద్వారా కూడా రూఢీ అవుతోంది (సహీహ్ బుఖారీ – కితాబుత్తిబ్; సహీహ్ ముస్లిం – కితాబుస్సలామ్). దిష్టినుంచి కాపాడుకునే వేడుకోలు

مِنْ شَيْءٍ ۖ إِنِ الْحُكْمُ إِلَّا لِلَّهِ ۖ عَلَيْهِ تَوَكَّلْتُ ۖ
وَعَلَيْهِ فَلْيَتَوَكَّلِ الْمُتَوَكِّلُونَ ﴿67﴾

తప్పించలేను. ఆయన ఆజ్ఞ మాత్రమే చెల్లుబాటవుతుంది.[103] నేను పూర్తిగా ఆయన్నే నమ్ముకున్నాను. నమ్ముకునే వారంతా ఆయన్నే నమ్ముకోవాలి."

وَلَمَّا دَخَلُوا مِنْ حَيْثُ أَمَرَهُمْ أَبُوهُمْ مَا كَانَ
يُغْنِي عَنْهُمْ مِنَ اللَّهِ مِنْ شَيْءٍ إِلَّا حَاجَةً فِي
نَفْسِ يَعْقُوبَ قَضَاهَا ۚ وَإِنَّهُ لَذُو عِلْمٍ لِمَا
عَلَّمْنَاهُ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ ﴿68﴾

**68** తమ తండ్రి ఆజ్ఞాపించిన మార్గాల ద్వారానే వారు (నగరం లోకి) ప్రవేశించారు. అల్లాహ్ నిర్ధారించిన దానినుండి యాఖూబ్ సుతరామూ వారిని తప్పించలేడు. కాకపోతే మనసులో జనించిన ఒక విషయాన్ని వెలిబుచ్చాడంతే.[104] నిస్సందేహంగా అతను మేము నేర్పిన విద్య వల్ల జ్ఞాని అయినవాడు. కాని చాలామందికి తెలియదు.[105]

وَلَمَّا دَخَلُوا عَلَىٰ يُوسُفَ آوَىٰ إِلَيْهِ أَخَاهُ ۖ قَالَ
إِنِّي أَنَا أَخُوكَ فَلَا تَبْتَئِسْ بِمَا كَانُوا يَعْمَلُونَ ﴿69﴾

**69** వారంతా యూసుఫ్ వద్దకు వెళ్ళినప్పుడు, అతను తన సోదరుణ్ణి (వేరుగా) తన దగ్గర కూర్చోబెట్టుకుని, "నేను నీ అన్నను (యూసుఫ్‌ను). కాబట్టి వీళ్ళ దుశ్చేష్టలపై నువ్వు బాధ పడకు"[106] అని ఓదార్చాడు.

---

వచనాలను కూడా మహాప్రవక్త (స) తన అనుచర సమాజానికి నేర్పారు. ఉదాహరణకు: మీకేదైనా వస్తువు నచ్చితే **"బారకల్లాహు"** అనండి అని ఆయన ఉపదేశించారు (ముఅత్తా ఇమామ్ మాలిక్). ఎవరి దిష్టి తగిలిందో వారితో, 'స్నానం చేసి ఆ నీటిని దిష్టి తగిలిన వారి శరీరంపై పోయమ'ని చెప్పాలి. అలాగే **"మాషా అల్లాహు లా ఖువ్వత ఇల్లా బిల్లాహి"** (అల్లాహ్ కోరినదే జరుగుతుంది. అల్లాహ్ తప్ప ఇంకొకరి శక్తి ఎందుకూ పనికిరాదు) అన్న ఖుర్ఆన్ వాక్యాన్ని కూడా పలకవచ్చు (అల్ కహఫ్-39). అదేవిధంగా దిష్టి తగిలిన వారి ముందు 'ఖుల్అవూజు బిరబ్బిల్ ఫలఖ్', 'ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్' సూరాలు కూడా పఠించి, ఊదాలి (జామె తిర్మిజీ).

103. అంటే ఇవన్నీ మనిషి తన వంతు తీసుకోవలసిన జాగ్రత్తలు మాత్రమే. వాస్తవానికి దేవుని విధివ్రాతలో ఎలాంటి మార్పూ ఉండదు. ఆయన నిర్ణయించినదే ఈ లోకంలో చెల్లుతుంది.

104. అంటే ఆయన చెప్పినంతమాత్రాన అల్లాహ్ చేయదలచుకున్నది చేయకుండా ఉండదు. అయితే తన మనసులో వచ్చిన ఒక మాటను హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం) తనయులకు చెప్పి తన వంతు బాధ్యతను నెరవేర్చారంతే.

105. ఆయన (యాఖూబ్) అలా అన్నాడంటే దేవుని సూచనానుసారమే అన్నాడు. మనిషి తీసుకునే ముందు జాగ్రత్త చర్య ఏదీ దేవుని విధివ్రాతను మార్చజాలదు. కాకపోతే దేవుడు నేర్పిన విద్య వెలుగులో దైవప్రవక్త (అలైహిస్సలాం) ఉపాయం సూచించారు. చాలామందికి ఈ విషయం తెలియదు.

106. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఇద్దరేసి వ్యక్తులకు ఒక్కో గది చొప్పున విడిది కోసం ఏర్పాటు చేయబడింది. ఆ విధంగా ఐదు గదులలో పదిమంది అన్నదమ్ములు సర్దుకోగా బిన్‌యామీన్ ఒంటరిగా మిగిలిపోయాడు. అప్పుడు హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) అతనికి ఒక గదిని ప్రత్యేకంగా కేటాయించి, ఏకాంతంలో అన్ని విషయాలూ అతనితో చర్చించారు. తన సోదరులు తనతో చేసిన వ్యవహారం గురించి వివరంగా చెప్పారు. జరిగిన దానిపై బాధ పడవద్దని అతనికి నచ్చజెప్పారు. బిన్‌యామీన్ ఆందోళన చెందకుండా ఉండటానికి తనతో అక్కడే ఉంచుకోవటానికి ముందుగా వేసిన పథకం గురించి కూడా ఆ సందర్భంగా అతనికి చెప్పారని మరి కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు (ఇబ్నె కసీర్).

**70** ఆ తరువాత వారి సామగ్రిని వారికిచ్చే ఏర్పాటు చేసి, తన (సొంత) సోదరుని సామానులో మాత్రం మంచినీరు త్రాగే ఒక గిన్నెను ఉంచాడు.[107] తరువాత పిలుపు ఇచ్చేవాడొకడు, "ఓ బిడారు జనులారా![108] మీరే ఈ దొంగతనం చేశారు"[109] అని ఎలుగెత్తి మరీ చెప్పాడు.

فَلَمَّا جَهَّزَهُم بِجَهَازِهِمْ جَعَلَ السِّقَايَةَ فِي رَحْلِ أَخِيهِ ثُمَّ أَذَّنَ مُؤَذِّنٌ أَيَّتُهَا الْعِيرُ إِنَّكُمْ لَسَارِقُونَ ﴿٧٠﴾

**71** వాళ్ళు వారి వైపుకు తిరిగి, "మీదే వస్తువు పోయింది?" అని అడిగారు.

قَالُوا وَأَقْبَلُوا عَلَيْهِم مَّاذَا تَفْقِدُونَ ﴿٧١﴾

**72** "రాజు గారి గిన్నెపోయింది. దాన్ని తెచ్చిన వారికి ఒక ఒంటె బరువు ధాన్యం లభిస్తుంది. ఆ బాధ్యత నాది"[110] అని చెప్పాడు.

قَالُوا نَفْقِدُ صُوَاعَ الْمَلِكِ وَلِمَن جَاءَ بِهِ حِمْلُ بَعِيرٍ وَأَنَا بِهِ زَعِيمٌ ﴿٧٢﴾

**73** "అల్లాహ్ తోడు! మేము రాజ్యంలో అరాచకాన్ని సృష్టించ టానికి రాలేదు, మేము దొంగలం అంతకన్నా కాము.[111] ఈ సంగతి మీకూ బాగా తెలుసు" అని వారు సమాధానమిచ్చారు.

قَالُوا تَاللَّهِ لَقَدْ عَلِمْتُم مَّا جِئْنَا لِنُفْسِدَ فِي الْأَرْضِ وَمَا كُنَّا سَارِقِينَ ﴿٧٣﴾

**74** "అలాగా. మరి మీ మాట అబద్ధమని తేలితే (దొంగిలించిన) అతనికి ఏ శిక్ష విధించాలి?"[112] అని వారు (రాజభటులు) ప్రశ్నిం చారు.

قَالُوا فَمَا جَزَاؤُهُ إِن كُنتُمْ كَاذِبِينَ ﴿٧٤﴾

107. నీరు త్రాగే ఆ పాత్ర (లేక గిన్నె) బంగారు లేదా వెండితో చేయబడినదనీ, దానితో ధాన్యం కూడా కొలిచేవారని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు భావిస్తున్నారు. ఈ పాత్రను గుట్టుచప్పుడు కాకుండా బిన్‌యామీన్ సామానులో పెట్టించటం జరిగింది.

108. ఆయతులో **'అల్ ఈర్'** (**الْعِيرُ**) అనబడింది. ధాన్యం మోసే ఒంటెలను, గాడిదలను, కంచర గాడిదలను 'అల్ ఈర్'గా వ్యవహరిస్తారు. ఈ ఆయతులో 'అయ్యతుహల్ ఈర్' అనబడింది. అంటే సామగ్రిని తీసుకుపోతున్న ఓ బిడారు జనులారా! అని అర్థం వస్తుంది.

109. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) ముందుగా వేసుకున్న పథకం ప్రకారం బిడారు జనులను వాకబు చేస్తున్నారని పిలుపు ఇచ్చే రాజభటునికి తెలియదు మరి! అందుకే "మీరు దొంగలు" అని తకీమని చెప్పేశాడు. అంటే రాజుగారి సమ్మతం లేకుండానే ఆ ఖరీదైన పాత్ర మీ సామానులోకి ఎలా వచ్చి చేరింది? అన్నది అతని మాటలోని ఉద్దేశం.

110. అంటే సామాను చెక్ చేయకముందే ఆ పాత్రను తెచ్చి ఇచ్చిన వారికి బహుమానం లభిస్తుంది. లేదా ఒక ఒంటె మోయగలిగేంత ధాన్యం ఇవ్వబడుతుంది అని ఇందుమూలంగా నేను మీకు హామీ ఇస్తున్నాను అని ఆ రాజభటుడు చెప్పాడు.

111. యూసుఫ్ (అలైహిస్సలాం) గారి వ్యూహరచన గురించి సోదరులకు తెలీదాయె. అందుకే వారు దేవునిపై ఒట్టేసి మరీ చెప్పారు – ఆ దొంగతనానికి తాము పాల్పడలేదని! తాము రాజ్యంలో అరాచకాన్ని సృష్టించటానికి రాలేదని కూడా చెప్పారు.

112. ఒకవేళ మీ సామానులో రాజుగారి పాత్ర దొరికితే ఏం చేయమంటారు?

75 "ఎవరి సామానులో అది దొరుకుతుందో శిక్షగా అతనే (బానిసగా) ఉంచుకోబడాలి.[113] మేము అలాంటి దుర్మార్గులకు విధించే శిక్ష ఇదే"[114] అని వారు బదులిచ్చారు.

قَالُوا جَزَآؤُهُ مَنْ وُّجِدَ فِي رَحْلِهِ فَهُوَ جَزَآؤُهُ ۚ كَذٰلِكَ نَجْزِي الظّٰلِمِيْنَ ﴿75﴾

76 అప్పుడు యూసుఫ్ తన తమ్ముని సామానును సోదా చేసే ముందు వాళ్ళ సామానును సోదా చేశాడు. ఆ తరువాత ఆ పాత్రను తన తమ్ముని సంచిలో నుంచి తీశాడు.[115] ఈ విధంగా మేము యూసుఫ్ కోసం ఉపాయం సూచించాము.[116] ఎందుకంటే అల్లాహ్ తలిస్తే తప్ప – అక్కడి రాజు ధర్మం (రాజ్య శాసనం) ప్రకారం అతను తన తమ్ముణ్ణి తనతో ఆపుకోలేడు.[117] మేము కోరినవారి అంతస్థులను పెంచుతాము.[118] ప్రతి జ్ఞానినీ మించిన జ్ఞాని ఒకడున్నాడు.[119]

فَبَدَاَ بِاَوْعِيَتِهِمْ قَبْلَ وِعَآءِ اَخِيْهِ ثُمَّ اسْتَخْرَجَهَا مِنْ وِّعَآءِ اَخِيْهِ ۚ كَذٰلِكَ كِدْنَا لِيُوْسُفَ ۚ مَا كَانَ لِيَاْخُذَ اَخَاهُ فِيْ دِيْنِ الْمَلِكِ اِلَّآ اَنْ يَّشَآءَ اللّٰهُ ۚ نَرْفَعُ دَرَجٰتٍ مَّنْ نَّشَآءُ ۚ وَفَوْقَ كُلِّ ذِيْ عِلْمٍ عَلِيْمٌ ﴿76﴾

77 వాళ్ళు ఇలా అన్నారు : "ఇతను దొంగతనం చేశాడంటే (ఆశ్చర్యం చెందనవసరం లేదు), ఇంతకుముందు ఇతని అన్న కూడా దొంగతనం చేసిఉన్నాడు."[120] వారి ఈ మాటను యూసుఫ్

قَالُوْٓا اِنْ يَّسْرِقْ فَقَدْ سَرَقَ اَخٌ لَّهٗ مِنْ قَبْلُ ۚ فَاَسَرَّهَا يُوْسُفُ فِيْ نَفْسِهٖ وَلَمْ يُبْدِهَا لَهُمْ ۚ

113. తమ పితామహుని (యాఖూబ్) షరీయతు (శాసనాంగం) ప్రకారం వారు 'శిక్ష' ను గురించి వివరించారు. దాని ప్రకారం దొంగతనం చేసిన వ్యక్తిని కొంత కాలంపాటు, దొంగిలించబడిన వస్తువు యజమానులకు అప్పగించేవారు.

114. ఇవి కూడా యూసుఫ్ (అలైహిస్సలాం) సోదరులు పలికిన మాటలే. మరి కొంతమంది అభిప్రాయం ప్రకారం ఇవి యూసుఫ్ సహచరుల పలుకులు. 'మేము కూడా దుర్మార్గులను ఇలాగే శిక్షిస్తాము' అని వారు చెప్పారు. అయితే 'రాజుగారి చట్టం ప్రకారం ఆయన తన సోదరుణ్ణి అక్కడ ఆపి ఉంచలేకపోయేవారు' అన్న తరువాతి ఆయతును బట్టి ఈ రెండవ అభిప్రాయం పొసగదు.

115. తాను ముందుగా వేసిన పథకం ప్రకారం ఇదంతా చేస్తున్నానన్న అనుమానం రాకుండా ఉండటానికి ముందు సవతి సోదరుల సామానును వెతికిన తరువాత, ఆఖరిలో బిన్‌యామీన్ సంచిని వెతికారు హజ్రత్ యూసుఫ్.

116. అంటే మేము 'వహీ' ద్వారా ఈ ఉపాయాన్ని యూసుఫ్‌కు సూచించామని అల్లాహ్ సెలవిచ్చాడు. దీనిద్వారా తెలిసేదేమంటే ఏదయినా మంచి ఉద్దేశ్యం కోసం ఇటువంటి వ్యూహం పన్నవచ్చు. పైకి అది 'ఎత్తుగడ'లా అగుపించినా ఫర్వాలేదు. అయితే దానికోసం అవలంబించే పద్ధతి మాత్రం షరీఅతు మూలాలకు విరుద్ధంగా పోకూడదు (ఫత్‌హుల్ ఖదీర్).

117. అంటే ఆనాడు ఈజిప్టులో చెలామణీలో ఉన్న రాజ్య శాసనం ప్రకారం యూసుఫ్ తన సొంత సోదరుడైన బిన్ యామీన్‌ను ఆపుకోవటం సాధ్యం కాదు. అందుకే ఇలాంటి పని చేసిన వాడికి ఏం చేయాలో మీరే చెప్పండి? అని వారినే ప్రశ్నించారు.

118. అంటే యూసుఫ్‌ను ప్రత్యేకంగా దయదలచి అత్యున్నత శిఖరాలకు చేర్చినట్లే అల్లాహ్ తాను కోరిన వారి శ్రేణులను పెంచుతూ ఉంటాడు.

119. ప్రతి జ్ఞానినీ మించిన జ్ఞాని ఇంకొకడుంటాడు. అందుచేత ఎంతటి విద్వాంసుడు అయినాసరే తనే ఈ లోకంలో అందరికన్నా గొప్ప విద్వాంసుణ్ణి అని తలపోయకూడదు. అలాగే ప్రతి జ్ఞానిపై సర్వజ్ఞాని అయిన అల్లాహ్ ఉన్నాడు అని మరి కొంతమంది వ్యాఖ్యానించారు.

قَالَ أَنتُمْ شَرٌّ مَّكَانًا ۖ وَاللَّهُ أَعْلَمُ بِمَا تَصِفُونَ ﴿77﴾

లోలోపలే దిగమ్రింగాడు. తన మనో భావాన్ని వారి ముందు ఏ మాత్రం బయటపెట్టకుండానే, "మీరు ఇంతటి నీచ స్థితికి దిగజారారు![121] మీరు కల్పించి చెప్పే విషయాలు అల్లాహ్‌కు బాగా తెలుసు" అని (లోలోన) అనుకున్నాడు.

قَالُوا يَا أَيُّهَا الْعَزِيزُ إِنَّ لَهُ أَبًا شَيْخًا كَبِيرًا فَخُذْ أَحَدَنَا مَكَانَهُ ۖ إِنَّا نَرَاكَ مِنَ الْمُحْسِنِينَ ﴿78﴾

**78** అప్పుడు వారు, "ఓ అజీజ్![122] (ఓ ఈజిప్టు అధినేతా!) ఇతని తండ్రి మరీ ముసలివాడు. మీరు ఇతనికి బదులుగా మాలో ఎవరినయినా సరే తీసేసుకోండి (ఇతన్ని మాత్రం విడిచిపెట్టండి). మీరు మాకు పుణ్యాత్మునిలా కనబడుతున్నారు"[123] అని విన్నవించుకున్నారు.

قَالَ مَعَاذَ اللَّهِ أَن نَّأْخُذَ إِلَّا مَن وَجَدْنَا مَتَاعَنَا عِندَهُ إِنَّا إِذًا لَّظَالِمُونَ ﴿79﴾

**79** "అల్లాహ్ శరణు! ఎవరి దగ్గర మా వస్తువు దొరికిందో అతన్ని వదిలేసి మరొకరిని ఎలా పట్టుకోగలం? అలా గనక చేస్తే మేము ముమ్మాటికీ అన్యాయస్థులం అవుతాము"[124] అని యూసుఫ్ చెప్పాడు.

فَلَمَّا اسْتَيْأَسُوا مِنْهُ خَلَصُوا نَجِيًّا ۖ قَالَ كَبِيرُهُمْ أَلَمْ تَعْلَمُوا أَنَّ أَبَاكُمْ قَدْ أَخَذَ عَلَيْكُم مَّوْثِقًا

**80** వాళ్ళు అతని విషయంలో నిరాశచెంది, ఏకాంతంలో కూర్చుని పరస్పరం సంప్రతించుకోసాగారు.[125] వారిలో అందరికన్నా పెద్దవాడు ఇలా అన్నాడు : "అల్లాహ్ పేరు మీద మీచేత

120. తమ నిర్దోషిత్వాన్ని, అమాయకత్వాన్ని చాటుకోవటానికి వారు చెప్పిన మాటలివి! ఎందుకంటే యూసుఫ్, బిన్‌యామీన్‌లు ఎలాగూ వారి సొంత సోదరులు కారు – సవతి సోదరులు మాత్రమే. అందుకే వారు తమను అత్యంత నీతిమంతులుగా చిత్రించుకుని, సవతి సోదరుల గుణగణాలను వక్రీకరించి చెప్పారు.

121. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) గారి ఈ మాటల్ని బట్టి, వాళ్లు యూసుఫ్‌పై దొంగతనపు అబద్ధాన్ని అంటగట్టడంలో అత్యంత హేయంగా ప్రవర్తించారని అర్థమవుతోంది.

122. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) ను వారు 'అజీజ్' (ఈజిప్టు అధికారి) అని సంబోధించటానికి కారణం ఏమిటంటే ఆ సమయంలో కీలకమైన అధికారాలన్నీ ఆయన చేతిలోనే ఉన్నాయి. రాజుగారు అలంకార ప్రాయంగా మాత్రమే ఉండేవాడు.

123. తండ్రి ఎలాగూ ముసలివాడే. కాని వారి మనసులో ఉన్న అసలు ఉద్దేశం ఏమిటంటే; ఒకప్పుడు తాము యూసుఫ్ విషయంలో ఘోర పాపానికి పాల్పడ్డారు. చరిత్ర పునరావృతమయ్యేలా ఉంది. ఈసారి గనక తాము బిన్‌యామీన్ లేకుండా తండ్రి దగ్గరికి వెళ్ళితే అంతకన్నా నామోషీ ఇంకొకటి ఉండదు. యూసుఫ్ లాగే బిన్‌యామీన్‌ను కూడా నాకు దక్కకుండా చేశారా! అని తండ్రి విలపిస్తాడు. అందుకే వారు, అప్పటివరకూ యూసుఫ్ తమకు చేసిన ఉపకారాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి మరో ఉపకారం చెయ్యమని ప్రాధేయపడ్డారు. ఆయన్ని మనసున్న మంచి మనిషిగా పేర్కొన్నారు.

124. 'బిన్‌యామీన్' ను తన వెంట ఉంచుకోవటం యూసుఫ్ (అలైహిస్సలాం) ప్రధాన లక్ష్యం. అందుచేత ఆయన వారి ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చారు.

125. ఎందుకంటే తమ సవతి సోదరుడైన బిన్‌యామీన్‌ను వదలివెళ్ళటం అనేది ఇప్పుడు వారికి చిక్కుల్లో పడవేసే

مِّنَ اللَّهِ وَمِن قَبْلُ مَا فَرَّطتُمْ فِي يُوسُفَ ۖ فَلَنْ أَبْرَحَ الْأَرْضَ حَتَّىٰ يَأْذَنَ لِي أَبِي أَوْ يَحْكُمَ اللَّهُ لِي ۖ وَهُوَ خَيْرُ الْحَاكِمِينَ ﴿٨٠﴾

ప్రమాణం చేయించి మీతండ్రి మీ నుంచి మాట తీసుకున్న సంగతి మీకు తెలియదా? ఇంతకుముందు మీరు యూసుఫ్ విషయంలో కూడా తప్పు చేసి ఉన్నారు. కాబట్టి! నాన్నగారు స్వయంగా నాకు అనుమతి ఇవ్వనంతవరకూ[126] లేదా అల్లాహ్‌యే నా వ్యవహారంలో ఏదో ఒక తీర్పు చేయనంత వరకూ నేను ఈ భూభాగం నుంచి కదలను. ఆయన తీర్పు చేసే వారందరిలోకెల్లా ఉత్తముడు."[127]

ارْجِعُوا إِلَىٰ أَبِيكُمْ فَقُولُوا يَا أَبَانَا إِنَّ ابْنَكَ سَرَقَ وَمَا شَهِدْنَا إِلَّا بِمَا عَلِمْنَا وَمَا كُنَّا لِلْغَيْبِ حَافِظِينَ ﴿٨١﴾

**81** "మీరంతా నాన్నగారి దగ్గరకు తిరిగి వెళ్ళి ఇలా చెప్పండి: 'నాన్నగారూ! మీ కుమారుడు దొంగతనం చేశాడు. మేము మాకు తెలిసినదాని గురించి మాత్రమే సాక్ష్యం ఇచ్చాము.[128] అగోచర విషయాలను మేము కాపాడేవారము కాము![129]

وَاسْأَلِ الْقَرْيَةَ الَّتِي كُنَّا فِيهَا وَالْعِيرَ الَّتِي أَقْبَلْنَا فِيهَا ۖ وَإِنَّا لَصَادِقُونَ ﴿٨٢﴾

**82** కావాలంటే మేము విడిదిచేసిన పట్టణ వాసులను, తిరుగు ప్రయాణంలో మేము ఎవరితోపాటు తిరిగి వచ్చామో ఆ బిడారు జనులను కూడా అడిగి తెలుసుకోండి. మేము నిజం చెబుతున్నాము."[130]

విషయమే. ఇప్పుడు తమ తండ్రికి మొహం చూపెట్టే అర్హత కూడా వారికి లేదు. అందుకే పరస్పరం సంప్రతించు కోసాగారు.

126. పెద్ద కొడుకు మరీ డీలా పడిపోయాడు. తండ్రి సమక్షంలో వచ్చి నిలబడే నైతిక ధైర్యం అతనికి లేకుండాపోయింది. అందుకే నిజానిజాలను విచారించి, తన తప్పు ఏమీలేదని తండ్రి నిర్థారించుకునేదాకా ఇంటికి రాకూడదని నిశ్చయించుకున్నాడు.

127. "అల్లాహ్‌యే ఏదో ఒక తీర్పు చేయనంతవరకూ..." అన్న మాటల్లోని ఆంతర్యం ఏమిటంటే ఈజిప్టు పాలకుడు బిన్‌యామీన్‌ను వదలనంత వరకూ లేదా తన ఖడ్గబలంతో విజృంభించి తన తమ్ముణ్ణి విడిపించుకునిపోయే శక్తిని దేవుడు తనకు ఇవ్వనంతవరకూ ఇంటికి రాను గాక రాను.

128. అంటే – నాన్నా! బిన్‌యామీన్‌ను సురక్షితంగా మా వెంట తీసుకువస్తామని మేము మీకు మాట ఇచ్చిన సంగతి నిజమే. మాకు తెలిసినంతవరకు మేము ఈ మేరకు మాటిచ్చాము. కాని ఆ తరువాత ఇలా జరుగుతుందని మాకేం తెలుసు? గత్యంతరంలేని స్థితిలో మేము బిన్‌యామీన్‌ను వదలి రావలసి వచ్చింది. ఈ మాటలకు మరో భావం ఇది: దొంగతనం చేసిన వాడికి విధించే శిక్ష ఏమిటీ? అని అడిగితే మాకు తెలిసిన శిక్షను గురించి మేము చెప్పాము. కాని ఆ శిక్ష మా తమ్మునికే పడుతుందని మేము ఊహించనయినా లేదు. శిక్షకు సంబంధించి మేము చేసిన ప్రతిపాదనలో ఎలాంటి దురుద్దేశమూ లేదు. అయితే సామాను వెతికేసరికి ఆ దొంగ బిన్‌యామీనేనని తేలింది. ఇందులో మా దోషం ఏముంది చెప్పండి?! అని వాళ్ళు చెప్పదలిచారు.

129. అంటే భవిష్యత్తులో సంభవించబోయే పరిణామాలు మా పట్ల ఇలా విపత్కరంగా ఉంటాయని ఊహించలేదు.

130. **'పట్టణం'** (అల్ ఖర్‌యా) అంటే తాము ధాన్యం కొనుగోలు చేయడానికి వెళ్ళిన ఈజిప్టు అని భావం. **'బిడారు వారు'** (ఈర్) అంటే ప్రయాణంలో తమతో కలసి వచ్చిన జనులు అని అర్థం. మేము ఇచ్చే సంజాయిషీపై మీకు ఏమాత్రం

قَالَ بَلْ سَوَّلَتْ لَكُمْ اَنْفُسُكُمْ اَمْرًا ۗ فَصَبْرٌ جَمِيْلٌ ۗ عَسَى اللّٰهُ اَنْ يَّاْتِيَنِيْ بِهِمْ جَمِيْعًا ۗ اِنَّهٗ هُوَ الْعَلِيْمُ الْحَكِيْمُ ﴿٨٣﴾

83 "కానేకాదు. ఇది మీ స్వీయకల్పన మాత్రమే.[131] సరే, ఇప్పుడు ఓర్పు వహించడమే మంచిది. బహుశా అల్లాహ్ వారందరినీ త్వరలోనే నా దగ్గరకు చేర్చవచ్చు![132] నిశ్చయంగా ఆయన సర్వం తెలిసినవాడు, వివేచనాపరుడూను" అని (యాఖూబ్) చెప్పాడు.

وَتَوَلّٰى عَنْهُمْ وَقَالَ يٰۤاَسَفٰى عَلٰى يُوْسُفَ وَابْيَضَّتْ عَيْنٰهُ مِنَ الْحُزْنِ فَهُوَ كَظِيْمٌ ﴿٨٤﴾

84 మరి వారందరి వైపు నుంచి ముఖం త్రిప్పుకుని, (ఆవేదనతో) "అహ్! యూసుఫ్"[133] అన్నాడు. దుఃఖంతో ఆయన కళ్లు తెల్లగా పాలిపోయాయి.[134] బాధను లోలోపలే అణచిపెట్టుకునేవాడు.

قَالُوْا تَاللّٰهِ تَفْتَؤُا تَذْكُرُ يُوْسُفَ حَتّٰى تَكُوْنَ حَرَضًا اَوْ تَكُوْنَ مِنَ الْهٰلِكِيْنَ ﴿٨٥﴾

85 కొడుకులు (తమ తండ్రినుద్దేశించి), "దైవసాక్షి! తమరు అనుక్షణం యూసుఫ్‌నే తలచుకుంటూ, కడకు ఆ బాధతోనే కృంగి కృశించిపోయేలా లేదా ప్రాణం విడిచేలా ఉన్నారే!"[135] అని చెప్పారు.

అనుమానం ఉన్నా మీరు ఈజిప్టు దేశానికి వెళ్ళి అక్కడివారిని దర్యాప్తు చేసుకోవచ్చు. మేము చెప్పేది పూర్తిగా నిజం. ఇందులో మేము మా తరఫున ఎలాంటి హెచ్చుతగ్గులు చేయటం లేదు అని తమ పితామహునికి చెప్పమని అన్న పురమాయించాడు.

131. వాస్తవ స్థితి గురించి హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం) కు తెలీదు. దానికి సంబంధించి దేవుని తరఫు నుంచి వహీ కూడా రాలేదు. అందుకే ఆయన ఈ విధంగా స్పందించారు. ఒకప్పుడు యూసుఫ్ (అలైహిస్సలాం) విషయంలో వారు కట్టుకథను అల్లినట్లే ఈసారి కూడా మాటను కల్పిస్తున్నారని తలపోశారాయన. బిన్‌యామీన్ పట్ల వీళ్లు చేసిన వ్యవహారం ఏమిటి? అన్నది కూడా ఆయనకు ఖచ్చితంగా తెలీదు. అయితే ఒకప్పటి యూసుఫ్ సంఘటనను దృష్టిలో పెట్టుకుని తన కొడుకులను అనుమానించారు. అలాంటి అనుమానం రావటం సహజం కూడా.

132. మరోసారి సహనం పాటించటం తప్ప మార్గాంతరం లేకపోయింది. సహనంతోపాటు 'ఆశ'ను కూడా ఆయన వదలుకోలేదు. "వారందరినీ" అంటే 1. యూసుఫ్‌ను, 2. బిన్‌యామీన్‌ను, 3. మొహం చెల్లక ఇంటికి రాకుండా అక్కడ ఉండిపోయిన పెద్ద కుమారుణ్ణి అని భావం.

133. అంటే ఇప్పుడు బిన్‌యామీన్ సంఘటన, ఒకప్పటి యూసుఫ్ ఘటనను కూడా జ్ఞాపకం వచ్చేలా చేసింది. దాంతో ఆయన బాధతో 'ఓ యూసుఫా!' అంటూ విలపించారు.

134. దుఃఖంతో అదేపనిగా విలపిస్తూ ఉండటం వల్ల నల్లగా ఉండే కనుపాపలు కాస్తా తెల్లగా మారిపోయాయి.

135. తండ్రి ఆవేదనను గమనించిన కొడుకులు చెప్పిన మాటలివి. ఆ మాటల్లో కూడా ఒకింత సానుభూతి, ఆత్మీయతలతోపాటు, అసూయ, ఓర్వలేనితనం కూడా తొంగి చూస్తున్నాయి. సాధారణంగా మనిషి నిరంతరం – ఒకదాని తరువాత ఇంకొకటి – కష్టాలు ఎదురవుతున్నప్పుడు, నిరంతరం మనసుకు గాయాలవుతున్నప్పుడు, ప్రేమలో విఫలమైనప్పుడు ఎంతో కృంగిపోతాడు. పొద్దస్తమానం 'యూసుఫ్! యూసుఫ్!' అని తండ్రి కలవరించేసరికి కొడుకుల్లోని అసూయాగ్ని జ్వాల మరోసారి ప్రజ్వరిల్లింది. దాన్ని ఆపుకోలేక వారు ఆ విధంగా మాట్లాడారు. అరబీలో **'హరజన్'** (**حَرَضًا**) అని ఉంది. వృద్ధాప్యం, విపరీతమైన ప్రేమ లేక వరుసగా ఎదురవుతున్న కష్టాల వల్ల మనిషికి కలిగే శారీరక అనారోగ్యాన్నీ లేక బుద్ధిమాంద్యాన్ని 'హరజున్' అని అంటారు.

قَالَ إِنَّمَآ أَشْكُواْ بَثِّى وَحُزْنِىٓ إِلَى ٱللَّهِ
وَأَعْلَمُ مِنَ ٱللَّهِ مَا لَا تَعْلَمُونَ ﴿86﴾

**86** “నేను నా ఆవేదనను, దుఃఖాన్ని గురించి నా దైవానికే ఫిర్యాదు చేసుకుంటున్నాను. అల్లాహ్ తరఫున మీకు తెలియని విషయాలు నాకు తెలుసు”[136] అని దానికి ఆయన బదులిచ్చాడు.

يَٰبَنِىَّ ٱذْهَبُواْ فَتَحَسَّسُواْ مِن يُوسُفَ وَأَخِيهِ
وَلَا تَاْيْـَٔسُواْ مِن رَّوْحِ ٱللَّهِ إِنَّهُۥ لَا يَاْيْـَٔسُ
مِن رَّوْحِ ٱللَّهِ إِلَّا ٱلْقَوْمُ ٱلْكَٰفِرُونَ ﴿87﴾

**87** “ఒరేయ్ అబ్బాయిలూ! మీరు వెళ్ళి యూసుఫ్‌ను గురించీ, అతని సోదరుని గురించీ బాగా దర్యాప్తు చేయండి.[137] అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. అల్లాహ్‌ను తిరస్కరించిన వారు మాత్రమే ఆయన కారుణ్యం పట్ల నిరాశ చెందుతారు”[138] అని అన్నాడు.

فَلَمَّا دَخَلُواْ عَلَيْهِ قَالُواْ يَٰٓأَيُّهَا ٱلْعَزِيزُ مَسَّنَا
وَأَهْلَنَا ٱلضُّرُّ وَجِئْنَا بِبِضَٰعَةٍ مُّزْجَىٰةٍ فَأَوْفِ
لَنَا ٱلْكَيْلَ وَتَصَدَّقْ عَلَيْنَآ إِنَّ ٱللَّهَ يَجْزِى
ٱلْمُتَصَدِّقِينَ ﴿88﴾

**88** తరువాత వారు యూసుఫ్ దగ్గరకు వెళ్ళి,[139] “ఓ అజీజ్! (ఈజిప్టు అధినేతా!) మాకూ, మా కుటుంబానికీ గడ్డుకాలం వచ్చింది.[140] మేము కొద్ది మొత్తాన్ని మాత్రమే తెచ్చాము. కనుక మాకు పూర్తి ధాన్యాన్ని కొలచి ఇవ్వండి.[141] మాకు దానం చెయ్యండి.[142] అల్లాహ్ దాన ధర్మాలు చేసేవారికి తప్పకుండా మంచి ప్రతిఫలం ఇస్తాడు” అని అభ్యర్థించారు.

قَالَ هَلْ عَلِمْتُم مَّا فَعَلْتُم بِيُوسُفَ
وَأَخِيهِ إِذْ أَنتُمْ جَٰهِلُونَ ﴿89﴾

**89** “అజ్ఞాన స్థితిలో మీరు యూసుఫ్ పట్లా, అతని సోదరుని పట్లా ఎలా వ్యవహరించారో మీకు తెలుసా?”[143] అని యూసుఫ్ అడిగాడు.

136. బహుశా లోగడ యూసుఫ్ (అలైహిస్సలాం) కన్న కలను దృష్టిలో పెట్టుకుని ఆయన అలా అని ఉంటారు. ఆ కల ఫలించటం తథ్యమనీ, దాని ప్రకారం యూసుఫ్ (అ) బ్రతికే ఉంటారని, ఏదో ఒకనాడు వీళ్ళంతా యూసుఫ్‌కు ప్రణమిల్లుతారని, తామంతా ఒకచోట కలుసుకోవటం ఖాయం అని యాఖూబ్ (అలైహిస్సలాం) కు గట్టినమ్మకం ఉండేది.

137. ఆయనకు అంత నమ్మకం ఉండబట్టే యూసుఫ్‌ను, అతని తమ్ముణ్ణి వెతకమని కొడుకులకు ఆదేశించారు మరి!

138. “మార్గభ్రష్టులైన వారు మాత్రమే తమ ప్రభువు కారుణ్యం పట్ల నిరాశకు లోనవుతారు”ని వేరొకచోట సెలవీయబడింది (అల్ హిజ్ర్ – 56). దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సయితం విశ్వాసులు నిగ్రహం కోల్పోకుండా, నిరాశా నిస్పృహలకు లోనుగాకుండా ఉండాలి. దైవకారుణ్యం పట్ల ఆశావహ దృక్పథం కలిగి ఉండాలి.

139. వారు ఈజిప్టుకు వెళ్ళటం ఇది మూడవసారి.

140. అంటే, ధాన్యం కొనుగోలు చేయడానికి మేము తెచ్చిన మూల్యం చాలా తక్కువ.

141. మేము తెచ్చిన అల్ప మొత్తాన్ని చూడకుండా, మాకు పూర్తి ధాన్యం కొలవండి.

142. మేము తెచ్చిన కొద్దిపాటి మొత్తాన్ని స్వీకరించి మాకు దానం చేయండి. మాపట్ల పరోపకార భావంతో మెలగండి అని అర్థం. మరికొంతమంది వ్యాఖ్యాతల దృష్టిలో– “మా తమ్ముడు బిన్‌యామీన్‌ను విడుదల చేసి మాకు ఉపకారం చేయండి” అని దీనికి భావం.

143. అత్యంత దీనంగా దానం చేయమని అర్థించటంతోపాటు (లేదా బిన్‌యామీన్‌ను విడుదల చేయమని విజ్ఞప్తి చేయటంతో

**90** "ఏమిటీ, (నిజంగా) నువ్వు యూసుఫువేనా?!"[144] అని వారు ఆశ్చర్యపోయారు. "అవును. నేను యూసుఫ్‌నే. ఇతను (బిన్ యామిన్) నా సోదరుడు. అల్లాహ్ మాపై దయదలిచాడు. అసలు విషయం ఏమిటంటే భయభక్తులతో, సహన స్థయిర్యాలతో మెలిగే సజ్జనుల ప్రతిఫలాన్ని అల్లాహ్ వృధాపోనివ్వడు"[145] అని యూసుఫ్ చెప్పాడు.

قَالُوٓا ءَاِنَّكَ لَاَنۡتَ يُوۡسُفُ‌ؕ قَالَ اَنَا يُوۡسُفُ
وَهٰذَاۤ اَخِىۡ‌ قَدۡ مَنَّ اللّٰهُ عَلَيۡنَا‌ؕ اِنَّهٗ مَنۡ
يَّتَّقِ وَيَصۡبِرۡ فَاِنَّ اللّٰهَ لَا يُضِيۡعُ اَجۡرَ
الۡمُحۡسِنِيۡنَ ۝٩٠

**91** "దైవసాక్షి! దేవుడు నీకు మాపై ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. మొమ్మాటికీ మేమే దోషులం"[146] అని వారంతా చెప్పారు.

قَالُوۡا تَاللّٰهِ لَقَدۡ اٰثَرَكَ اللّٰهُ عَلَيۡنَا
وَاِنۡ كُنَّا لَخٰطِـِٕيۡنَ ۝٩١

**92** అప్పుడు యూసుఫ్, "ఈ రోజు మీపై ఎలాంటి నిందా లేదు.[147] అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక! ఆయన కరుణించే వారందరిలోకీ గొప్పగా కరుణించేవాడు."

قَالَ لَا تَثۡرِيۡبَ عَلَيۡكُمُ الۡيَوۡمَ‌ؕ يَغۡفِرُ اللّٰهُ
لَـكُمۡ‌ وَهُوَ اَرۡحَمُ الرّٰحِمِيۡنَ ۝٩٢

**93** "నా ఈ చొక్కాను తీసుకెళ్ళి, నా తండ్రి ముఖంపై వేయండి. దాంతో ఆయనకు చూపు తిరిగివస్తుంది.[148] మరి మీ కుటుంబీకు లందరినీ నా దగ్గరకు పిలుచుకు రండి"[149] అని చెప్పాడు.

اِذۡهَبُوۡا بِقَمِيۡصِىۡ هٰذَا فَاَلۡقُوۡهُ عَلٰى وَجۡهِ اَبِىۡ
يَاۡتِ بَصِيۡرًا‌ ۚ وَاۡتُوۡنِىۡ بِاَهۡلِكُمۡ اَجۡمَعِيۡنَ ۝٩٣

---

పాటు) తమ తండ్రి వృద్ధాప్యాన్ని కూడా వారు ఈ సందర్భంగా ప్రస్తావించారు. కొడుకు దూరం అవటం వల్ల ఆయనకు కలిగిన వేదనను గురించి కూడా జ్ఞాపకం చేశారు. దాంతో యూసుఫ్ (అలైహిస్సలాం) గుండె కరిగిపోయింది. తమ సోదరుల దురాగతాలను జ్ఞాపకం చేశారు. వారు అజ్ఞాన స్థితిలో ఆ విధంగా చేశారని కూడా యూసుఫ్ (అలైహిస్సలాం) అభిప్రాయపడ్డారు.

144. యూసుఫ్ (అలైహిస్సలాం)ను బాల్యంలో కన్‌ఆన్‌లోని ఒక లోతైన బావిలో ఎలా పడవేసిందీ ఈజిప్టు పాలకుడు జ్ఞాపకం చేసేసరికి సోదరులందరూ ఉలిక్కిపడ్డారు. పరిశీలనగా చూచి, "నువ్వే యూసుఫువా!" అని ఆశ్చర్యపోతూ అడిగారు.

145. వారి ప్రశ్నకు 'అవున'ని జవాబివ్వటంతో పాటు దేవుని మహోపకారాలను యూసుఫ్ ఈ సందర్భంగా స్మరించారు. సహనానికి, సదమరవర్తనకు సర్వోన్నత ప్రభువు ఇచ్చే ప్రతిఫలం గొప్పగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మీరు నన్ను చంపడానికి కుట్రలు పన్నారు. కాని చూడండి! ఆ కృపాశీలుడు నన్ను కాపాడాడు. పైగా ఆయన తన కటాక్షంతో నన్ను కీర్తి శిఖరాలకు చేర్చాడు. ఈజిప్టు రాజ్యాధికారం సయితం నాకు ఇచ్చాడు – అని కృతజ్ఞతా పూర్వకంగా తన మనోభావాన్ని వెల్లడించారాయన.

146. తమ సోదరుని గౌరవోన్నతులను చూసేసరికి వారికి జ్ఞానోదయం అయింది. సిగ్గుతో కుంచించుకుపోయారు. తాము నిజంగా అపరాధులమని ఒప్పుకున్నారు.

147. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కూడా ఈ సందర్భంగా ఒక దైవప్రవక్తగానే వ్యవహరించారు. తమ సోదరుల పట్ల మన్నింపుల వైఖరిని అవలంబించారు. ఈ రోజు మీపై నిందలు నిష్ఠూరాలు లేవు. ఎలాంటి ఫిర్యాదులూ లేవు అని చెప్పి వారి మనసులను జయించారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సారథ్యంలో మక్కా విజయం జరిగినప్పుడు కూడా సరిగ్గా ఇదే పరిస్థితి. అడుగడుగునా ఆయన (స) ను వేధించిన మక్కా అవిశ్వాసులు అత్యంత నిస్సహాయస్థితిలో మహనీయ ముహమ్మద్ (స) సమక్షంలో నిలబడ్డారు. ఆ సందర్భంగా ఆయన(స) కూడా యూసుఫ్ (అలైహిస్సలాం) గారి పలుకులనే ఉచ్చరిస్తూ వారందరినీ క్షమించి వదిలిపెట్టేశారు–సల్లల్లాహు అలైహి వ సల్లం!

**94** (ఇక్కడ ఈజిప్టు నుంచి) ఈ బిడారు సెలవు తీసుకోగానే, (అక్కడ కన్ఆన్‌లో) "నాకు మతిభ్రమించిందని మీరు అనుకో నంటే (ఒక విషయం చెబుతాను) – నాకు యూసుఫ్ సువాసన వస్తోంది"[150] అని తండ్రి చెప్పాడు.

وَلَمَّا فَصَلَتِ الْعِيرُ قَالَ أَبُوهُمْ إِنِّي لَأَجِدُ رِيحَ يُوسُفَ لَوْلَا أَن تُفَنِّدُونِ ﴿٩٤﴾

**95** "అల్లాహ్ తోడు! మీరు ఇప్పటికీ ఆ పాత భ్రమలోనే[151] పడి ఉన్నారు" అని అక్కడి వారు చెప్పారు.

قَالُوا تَاللَّهِ إِنَّكَ لَفِي ضَلَالِكَ الْقَدِيمِ ﴿٩٥﴾

**96** ఆ తరువాత శుభవార్త అందించేవాడు వచ్చి అతని ముఖంపై ఆ చొక్కాను వేయగానే అతనికి కంటిచూపు వచ్చేసింది.[152] "మీకు తెలియని విషయాలెన్నో అల్లాహ్ తరఫున నాకు తెలుసని నేను మీకు చెప్పలేదా?!"[153] అన్నాడాయన.

فَلَمَّا أَن جَاءَ الْبَشِيرُ أَلْقَاهُ عَلَىٰ وَجْهِهِ فَارْتَدَّ بَصِيرًا ۖ قَالَ أَلَمْ أَقُل لَّكُمْ إِنِّي أَعْلَمُ مِنَ اللَّهِ مَا لَا تَعْلَمُونَ ﴿٩٦﴾

**97** "ఓ నాన్నగారూ! మా పాపాల మన్నింపుకై (దైవసన్నిధిలో) అర్థించండి. మేము నిజంగానే దోషులం" అని వారు (కొడుకులు) విన్నవించుకున్నారు.

قَالُوا يَا أَبَانَا اسْتَغْفِرْ لَنَا ذُنُوبَنَا إِنَّا كُنَّا خَاطِئِينَ ﴿٩٧﴾

**98** "సరే! త్వరలోనే నేను మీ మన్నింపుకోసం నా ప్రభువును వేడుకుంటాను.[154] ఆయన అపారంగా మన్నించేవాడు, అమితంగా కరుణించేవాడు" అని అతను (యాఖూబ్) చెప్పాడు.

قَالَ سَوْفَ أَسْتَغْفِرُ لَكُمْ رَبِّي ۖ إِنَّهُ هُوَ الْغَفُورُ الرَّحِيمُ ﴿٩٨﴾

148. ముఖంపై చొక్కాను వేయగానే పోయిన కంటిచూపు తిరిగి రావటం ఒక మహిమ లాంటిదే.

149. అంటే, తన కుటుంబ సభ్యులందరినీ యూసుఫ్ (అలైహిస్సలాం) ఈజిప్టు నగరానికి ఆహ్వానించారు.

150. ఈజిప్టు నుంచి యూసుఫ్ (అలైహిస్సలాం) చొక్కాను తీసుకుని వారు బయలుదేరగానే అక్కడ యాఖూబు (అలైహిస్సలాం) గార్కి – అల్లాహ్ తరఫున శుభసూచకంగా – ముద్దుల కొడుకు సువాసన రాసాగింది. దైవాజ్ఞ కానంతవరకూ దైవప్రవక్తకు సయితం ఏ విషయమూ తెలియదనడానికి ఇదొక మచ్చుతునక. ఒకప్పుడు పరిసరాల్లోని బావిలో పడి ఉన్న కొడుకు గురించి తండ్రికి తెలియలేదు. కాని ఇప్పుడు ఎక్కడో దూరాన ఉన్న తన కొడుకు చొక్కా వాసన ఆయన ముక్కు పుటాలను తాకింది. ఇదంతా దైవమహిమ కాకపోతే ఏమిటీ?

151. అంటే, మీరు మీ ముద్దుల కుమారుని ప్రేమలో మరీ పిచ్చివారై పోవటం వల్ల మీకలా అనిపిస్తోంది. ఇది కేవలం మీ భ్రమ. మీరు పొరబడుతున్నారు. ఇంతకాలం గడిచిపోయాక యూసుఫ్ చొక్కా వాసన రావటమేమిటీ? అని ఇంటివారు ఆయన మాటల్ని తీసిపారేశారు. **జలాల్ (ضَلٰل)** : ప్రేమలో పిచ్చివారవటం చేత మతి స్థిమితాన్ని కోల్పోవటం అని ఇక్కడ దీని భావం.

152. యూసుఫ్ చొక్కాను తెచ్చి ఆయన ముఖంపై వేయగానే అల్లాహ్ మహిమతో హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం)గారు చూడగలిగారు.

153. అంటే – మీకెవరికీ లేని జ్ఞానం – వహీ జ్ఞానం – ఒకటి నాకు అల్లాహ్ తరఫు నుంచి లభిస్తుంది. ఈ 'వహీ' ద్వారా దేవుడు తన ప్రవక్తలకు అవసరం మేరకు కొన్ని విషయాలను తెలియజేస్తాడు.

154. అప్పటికప్పుడే క్షమాపణ కోసం ఆయన ప్రార్థించకుండా, 'త్వరలోనే ప్రార్థిస్తాను' అని వాగ్దానం చేయటం గమనార్హం.

**99** తరువాత ఈ కుటుంబీకులంతా యూసుఫ్ వద్దకు చేరుకున్న ప్పుడు, యూసుఫ్ తన తల్లిదండ్రులకు తన దగ్గర స్థానం ఇచ్చాడు.[155] "అల్లాహ్‌కు సమ్మతమైనట్లయితే మీరంతా సురక్షితంగా ఈజిప్టులోకి వచ్చేయండి" అని అన్నాడు.

فَلَمَّا دَخَلُوا عَلَىٰ يُوسُفَ آوَىٰ إِلَيْهِ أَبَوَيْهِ وَقَالَ ادْخُلُوا مِصْرَ إِن شَاءَ اللَّهُ آمِنِينَ ﴿٩٩﴾

**100** అతను తన తల్లిదండ్రులను[156] ఎత్తయిన సింహాసనంపై కూర్చోబెట్టాడు. వారందరూ అతని ముందు సాష్టాంగపడ్డారు.[157] అప్పుడు అతనిలా అన్నాడు : "నాన్నగారూ! పూర్వం నేను కన్న కలకు భావం ఇది.[158] నా ప్రభువు దీన్ని నిజం చేసి చూపాడు. కారాగారం నుండి బయటకు తీసినపుడు ఆయన నాకు మహోపకారం చేశాడు.[159] నాకూ – నా సోదరులకూ మధ్య షైతాన్ చిచ్చుపెట్టిన తరువాత [160] అందరినీ ఎడారి ప్రాంతం

وَرَفَعَ أَبَوَيْهِ عَلَى الْعَرْشِ وَخَرُّوا لَهُ سُجَّدًا ۖ وَقَالَ يَا أَبَتِ هَٰذَا تَأْوِيلُ رُؤْيَايَ مِن قَبْلُ قَدْ جَعَلَهَا رَبِّي حَقًّا ۖ وَقَدْ أَحْسَنَ بِي إِذْ أَخْرَجَنِي مِنَ السِّجْنِ وَجَاءَ بِكُم مِّنَ الْبَدْوِ مِن بَعْدِ أَن نَّزَغَ الشَّيْطَانُ بَيْنِي وَبَيْنَ

అంటే రాత్రి పొద్దుపోయాక – దేవుని ప్రియతమ దాసులు దైవారాధన చేసే చివరి భాగంలో – దైవసన్నిధిలో మీ మన్నింపు కోసం ప్రార్థిస్తాను అన్నది ఆ మాటలోని మర్మం అయి ఉండవచ్చు. మరో కారణం వల్ల ఆయన 'ప్రార్థన' (దుఆ)ను వాయిదా వేసి ఉండవచ్చు. అదేమంటే; ఒకప్పుడు ఈ అన్నదమ్ములంతా యూసుఫ్‌ను బాధించారు. మనసు నొప్పించారు. అందుచేత క్షమాపణ విషయంలో యూసుఫ్‌తో సంప్రతించవలసిన అవసరం కూడా ఉంది. అందుకే ఆయన తక్షణం 'దుఆ' చేయకుండా తాత్సారం చేసి ఉండవచ్చు.

155. అంటే వారిని సాదరంగా ఆహ్వానించి, వారికి తగిన స్థానాన్ని కేటాయించారు. వారిని సత్కరించారు.

156. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం యూసుఫ్ (అలైహిస్సలాం) గారి కన్న తల్లి ఏనాడో – బిన్‌యామీన్ పుట్టినప్పుడే – చనిపోయింది. ప్రస్తుత తల్లి ఆయన సవతి తల్లి, పినతల్లి! యూసుఫ్ కన్నతల్లి మరణానంతరం హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం) అతని పినతల్లిని వివాహం చేసుకున్నారు. ఈ పినతల్లే ఇప్పుడు తన తండ్రి వెంట ఈజిప్టు వచ్చింది (ఫత్‌హుల్ ఖదీర్). అయితే ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. ఆమె యూసుఫ్ గారి సవతి తల్లి కానేకాదని, కన్నతల్లేనని ఆయన అభిప్రాయపడ్డారు (ఇబ్నె కసీర్).

157. ఈ వాక్యానికి కొంతమంది 'యూసుఫ్ (అలైహిస్సలామ్) పట్ల గౌరవం కొద్దీ వారంతా వినమ్రతతో తలలు వంచారు' అని తర్జుమా చేశారు. కాని ఖుర్ఆన్‌లో మాత్రం "వారు యూసుఫ్ ముందు సాష్టాంగపడ్డారు" అని ఉంది. అయితే ఈ సాష్టాంగ ప్రణామం గౌరవ సూచకంగా చేసిందేగాని, పూజాభావంతో చేసింది మాత్రం కాదు. ఒకరి గౌరవార్థం సాష్టాంగ ప్రణామం చేయటం హజ్రత్ యాఖూబ్ గారి షరీయతు (ధర్మశాస్త్రం) లో ధర్మసమ్మతంగా భావించబడేది. ఆ తరువాత ముహమ్మద్ (స) గారి షరీయతులో షిర్క్ (బహుదైవారాధన)ను సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ఒకరి గౌరవార్థం సాష్టాంగ ప్రణామం చేయటం కూడా నిషేధించబడింది.

158. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కన్న కలను దేవుడు నిజం చేసి చూపాడు. నిజమే. కాని కఠినాతి కఠినమయిన పరీక్షల తరువాత ఈ కల ఫలించింది. ఎట్టకేలకు అల్లాహ్ ఆయన్ని రాజ్య పీఠంపై కూర్చోబెట్టాడు. తల్లిదండ్రులు, అన్నదమ్ములంతా ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశారు.

159. దేవుడు చేసిన మహోపకారాలను స్మరించేటప్పుడు తాను బావి నుంచి ఎలా బయటపడిందీ చెప్పకపోవటం గమనార్హం. తన సోదరులను ఆ సందర్భంగా అవమానపరచటం భావ్యం కాదనుకుని ఆయన అలా చేశారు. ఇది ఒక ప్రవక్తలోని ఉత్తమగుణానికి మచ్చుతునక.

నుంచి తీసుకొచ్చి కలిపాడు.[161] నా ప్రభువు తన సంకల్పాన్ని ఎవరూ గ్రహించలేని యుక్తుల ద్వారా నెరవేరుస్తాడు. ఆయన అన్నీ తెలిసినవాడూ, వివేకవంతుడూను.

إِخْوَتِيٓ ۚ إِنَّ رَبِّي لَطِيفٌ لِّمَا يَشَآءُ ۚ إِنَّهُۥ هُوَ
الْعَلِيمُ الْحَكِيمُ ﴿100﴾

**101** "నా ప్రభూ! నీవు నాకు రాజ్యాన్ని ప్రసాదించావు.[162] ఇంకా, నీవు నాకు కలల భావార్థాన్ని వివరించే విద్యను నేర్పావు.[163] ఓ భూమ్యాకాశాల సృష్టికర్తా! ఇహంలోనూ, పరంలోనూ నువ్వే నా సంరక్షకుడవు. ముస్లింగా ఉన్న స్థితిలోనే నాకు మరణం వొసగు.[164] నన్ను సజ్జనులలో చేర్చు" అని వేడుకున్నాడు.

رَبِّ قَدْ ءَاتَيْتَنِي مِنَ الْمُلْكِ وَعَلَّمْتَنِي
مِن تَأْوِيلِ الْأَحَادِيثِ ۚ فَاطِرَ السَّمَٰوَٰتِ
وَالْأَرْضِ أَنتَ وَلِيِّۦ فِي الدُّنْيَا وَالْآخِرَةِ ۖ
تَوَفَّنِي مُسْلِمًا وَأَلْحِقْنِي بِالصَّٰلِحِينَ ﴿101﴾

**102** (ఓ ముహమ్మద్!) ఇది అగోచర సమాచారాలలోనిది. దీన్ని మేము నీకు వహీ ద్వారా తెలియపరుస్తున్నాము. వారంతా కూడబలుక్కుని, కుతంత్రం చేస్తున్నప్పుడు నువ్వు వారి దగ్గర లేవు.[165]

ذَٰلِكَ مِنْ أَنۢبَآءِ الْغَيْبِ نُوحِيهِ إِلَيْكَ ۖ وَمَا كُنتَ
لَدَيْهِمْ إِذْ أَجْمَعُوٓا۟ أَمْرَهُمْ وَهُمْ يَمْكُرُونَ ﴿102﴾

160. ఇది కూడా ఆయన ఉత్తమ నైతికతకు ప్రబల నిదర్శనమే. తనకు – తన సోదరులకు మధ్య ఏర్పడిన కలతలకు ప్రధాన కారకుడు షైతానని చెప్పి ఎంతో విజ్ఞతతో వ్యవహరించారాయన. చాలా కాలం తర్వాత అందరూ ఏకమవుతున్నప్పుడు పాత కథను ఆయన తిరగదోడదలచుకోలేదు.

161. అంటే ఈజిప్టు రాజ్యాన్ని పాలించే అనుగ్రహాన్ని ప్రసాదించాడు.

162. అంటే ఈజిప్టు రాజ్యంలో తిరుగులేని అధికారాలను ప్రసాదించావు అని భావం.

163. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) దైవప్రవక్త. ఆయనపై దేవుని తరఫు నుంచి వహీ అవతరించేది. అయితే కొన్ని ప్రత్యేక విషయాల పరిజ్ఞానం ఆయనకు తెలుపబడేది. అందుచేత దైవదౌత్య పరిజ్ఞానంతో ప్రవక్తలు కలల భావార్థాన్ని కూడా గ్రహించేవారు. అయితే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం)కు మాత్రం కలల మర్మాన్ని అందుకునే విద్యలో మరింత ప్రావీణ్యత ఉండేది. కారాగారంలోని ఇద్దరు సహవాసులు కన్న కలలకు, ఈజిప్ట్ రాజు కన్న కలకు ఆయన విడమరచి చెప్పిన భావార్థమే దీనికి ప్రబల తార్కాణం.

164. దేవుని మహదానుగ్రహాలను జ్ఞాపకం చేసుకుంటూ, దేవుని గుణగణాలను కూడా ప్రస్తావిస్తూ ఆయన (అలైహిస్సలాం) దుఆ చేశారు. తనకు మరణం వస్తే ఇస్లాం స్థితిలో రావాలనీ, తనను సజ్జనుల సరసన నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు. 'సజ్జనులు' అంటే యూసుఫ్ గారి పూర్వీకులు అన్నమాట! అంటే హజ్రత్ ఇబ్రాహీం, ఇస్హాఖ్ తదితరులని భావం. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) ఈ సందర్భంగా మరణాన్ని కోరుకున్నారని కొంతమంది అపార్థం చేసుకున్నారు. ఈ అభిప్రాయం సరైనది కాదు. ఆఖరి క్షణం వరకూ దైవ విధేయుడుగా ఉంచమని మాత్రమే ఆయన ఈ సందర్భంగా వేడుకున్నారు.

165. అంటే; యూసుఫ్ సోదరులు యూసుఫ్‌ను బావిలో పడవేసినప్పుడు గానీ, అతన్ని తోడేలు తినేసిందని వారు తమ తండ్రికి అబద్ధం చెప్పినప్పుడు గానీ, యూసుఫ్ చొక్కాను బూటకపు రక్తంలో రంగరించి తెచ్చినప్పుడుగానీ (ఓ ముహమ్మద్!) నువ్వు అక్కడ లేవు అని అల్లాహ్ గుర్తు చేస్తున్నాడు.

అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు రహస్య విషయాల జ్ఞానం లేదు అన్న సంగతి ఈ ఆయతు ద్వారా కూడా రూఢీ అవుతోంది. అయితే అల్లాహ్ 'వహీ' ద్వారా ఆయనకు ఈ వృత్తాంతాన్ని తెలియపరచాడు. దైవప్రవక్త (స)కు రహస్య విషయాల జ్ఞానం ఉంటుందనే వాదనను ఖండించే వాక్యాలు మరికొన్ని చోట్ల ఉన్నాయి (ఉదాహరణకు దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆలి ఇమ్రాన్ సూరా–44, అల్ ఖసస్ సూరా–44, 45, సాద్ సూరా–69, 70).

**103** నువ్వు ఎంతగా పరితపించినా వారిలో చాలామంది విశ్వసించేవారు కారు.[166]

وَمَآ أَكۡثَرُ ٱلنَّاسِ وَلَوۡ حَرَصۡتَ بِمُؤۡمِنِينَ (103)

**104** ఈ పనికి గాను నువ్వు వారి నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ (వేతనాన్ని) అడగటం లేదు.[167] ఇది సమస్త జగతికీ ఒక హిత బోధ.[168]

وَمَا تَسۡـَٔلُهُمۡ عَلَيۡهِ مِنۡ أَجۡرٍۚ إِنۡ هُوَ إِلَّا
ذِكۡرٞ لِّلۡعَٰلَمِينَ (104)

**105** ఆకాశాలలో, భూమిలో ఎన్నో సూచనలున్నాయి. కాని వారు వాటిని పట్టించుకోకుండానే సాగిపోతుంటారు.[169]

وَكَأَيِّن مِّنۡ ءَايَةٖ فِي ٱلسَّمَٰوَٰتِ وَٱلۡأَرۡضِ
يَمُرُّونَ عَلَيۡهَا وَهُمۡ عَنۡهَا مُعۡرِضُونَ (105)

**106** వారిలో చాలా మంది అల్లాహ్‌ను విశ్వసిస్తూ కూడా ఆయనతోపాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతున్నారు.[170]

وَمَا يُؤۡمِنُ أَكۡثَرُهُم بِٱللَّهِ إِلَّا وَهُم مُّشۡرِكُونَ (106)

---

166. ప్రజలు గుణపాఠం నేర్చుకుని, ప్రవక్తల మార్గాన్ని అనుసరిస్తారేమోనని దేవుడు పూర్వకాలపు వాస్తవ గాథలను విశదీకరిస్తున్నాడు. కాని జనులలో చాలామంది మొండి ఘటాలే. ఈ వృత్తాంతాల ద్వారా వారి హృదయాలు ద్రవించటం లేదు. ఆ గాథలు విని వారు తన్మయత్వానికైతే లోనవుతారు. 'ఆహా!' అని కొందరంటే 'ఓహో!' అని మరి కొందరంటారు. కాని వ్యవహారం అంతవరకే. హితబోధను మాత్రం వారు గ్రహించరు. వారి వెనుక ఎంతగా శ్రమించినా ఫలితం శూన్యం.
167. పోనీ, దైవప్రవక్త (సఅసం) వాళ్ల దగ్గర ఈ సందేశానికిగాను జీతం అడుగుతున్నాడా? అంటే అదీ లేదు. దైవప్రవక్తకు ఉత్తమ ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది.
168. మార్గదర్శకత్వం వచ్చేసిన తరువాత వారు చిత్తశుద్ధితో చింతన చేయాలి. దాని ద్వారా తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలి. ఒకవేళ వారు గనక దాన్ని లక్ష్యపెట్టకపోతే అది వారి దౌర్భాగ్యం. దైవానికిగానీ, దైవప్రవక్త (స)కు గానీ కలిగే నష్టం ఏమీలేదు. దివ్య ఖుర్‌ఆన్ సమస్త మానవాళి మార్గదర్శకత్వం కోసం వచ్చిన అంతిమ దైవగ్రంథం.
169. భూమ్యాకాశాల నిర్మాణం, వాటి మధ్య ఉన్న అసంఖ్యాక వస్తువులే వాటిని సృష్టించినవాడు ఒకడున్నాడు అనే విషయానికి ప్రబల నిదర్శనాలు. ఇవన్నీ ఒకానొక సూత్రధారి, ప్రణాళికా రచయిత లేకుండా వాటంతట అవే ఉనికిలోకి రాలేవన్న సంగతి నిశితంగా పరిశీలిస్తే అర్థమైపోతుంది. కాని వీళ్లు అనుదినం వాటిని చూస్తూ కూడా, ఏమాత్రం ఆలోచించకుండానే ముందుకు సాగిపోతుంటారు. వారికి మనసైతే ఉంది గాని ఆలోచించే మనసు లేదు. నిజదైవాన్ని కనుగొనాలన్న చింతన లేదు.
170. ఈ యదార్థాన్ని దివ్య ఖుర్‌ఆన్ ఎన్నోచోట్ల స్పష్టంగా చాటిచెప్పింది. భూమ్యాకాశాల సృష్టికర్త, పాలకుడు, పోషకుడు అల్లాహ్‌యేనన్న విషయాన్ని వాళ్ళూ ఒప్పుకుంటారు. అయినప్పటికీ ఆరాధనలో వారు అల్లాహ్‌తోపాటు వేరితర దైవాలకు భాగస్వామ్యం కల్పిస్తారు. ఈ విధంగా వారు ముష్రిక్కులవుతున్నారు. ప్రతి యుగంలోనూ మానవులు తౌహీదె రుబూబియత్ (విశ్వానికి సృష్టికర్త, అందరి ప్రభువు, పరిపోషకుడు ఒక్కడే అన్న) విషయాన్ని విశ్వసించారు గాని తౌహీదె ఉలూహియత్ (అంటే మానవులందరూ ఆ ఒక్క దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలి అన్న విషయం) దగ్గరి కొచ్చేసరికి విముఖత చూపుతూ వచ్చారు. వివిధ పేర్లతో ఎంతోమంది చిల్లర దేవుళ్లను కల్పించుకున్నారు. నేటి సమాధి పూజారుల పరిస్థితి కూడా దీనికి ఏమాత్రం భిన్నంగా లేదు. సమాధుల్లో ఖననం చేయబడిన పుణ్యాత్ములు దైవికశక్తులను కలిగివుంటారనే భ్రమతో వారిని ప్రార్థిస్తారు, పూజిస్తారు. కష్టాలు వచ్చినప్పుడు దేవుణ్ణి మొరపెట్టుకునే బదులు వారిని మొరపెట్టుకుంటూ ఉంటారు. (అల్లాహ్ మనల్ని ఇటువంటి మార్గభ్రష్టతల నుంచి రక్షించుగాక!)

**107** ఏమిటీ, దైవశిక్షలలో ఏ శిక్ష కూడా తమపై వచ్చిపడదనీ, అకస్మాత్తుగా – తమకు తెలియకుండా – ప్రళయం విరుచుకు పడదని వారు నిశ్చింతగా ఉన్నారా?

أَفَأَمِنُوا أَن تَأْتِيَهُمْ غَاشِيَةٌ مِّنْ عَذَابِ اللَّهِ
أَوْ تَأْتِيَهُمُ السَّاعَةُ بَغْتَةً وَهُمْ لَا يَشْعُرُونَ ﴿107﴾

**108** (ఓ ప్రవక్తా!) నువ్వు వాళ్ళకు చెప్పేయి : "నా మార్గమైతే ఇదే. నేనూ, నా అనుయాయులూ పూర్తి అవగాహనతో, దృఢ నమ్మకంతో అల్లాహ్ వైపుకు పిలుస్తున్నాము.[171] అల్లాహ్ పరమ పవిత్రుడు.[172] నేను, అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించే (షిర్క్ చేసే) వారిలోని వాణ్ణికాను."

قُلْ هَٰذِهِ سَبِيلِي أَدْعُو إِلَى اللَّهِ ۚ عَلَىٰ بَصِيرَةٍ
أَنَا وَمَنِ اتَّبَعَنِي ۖ وَسُبْحَانَ اللَّهِ وَمَا أَنَا مِنَ
الْمُشْرِكِينَ ﴿108﴾

**109** (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం మేము పట్టణవాసుల్లో నుంచి పంపిన ప్రవక్తలందరూ పురుషులే. వారి వద్దకు మేము వహీ పంపుతూ ఉండేవాళ్ళం.[173] ఏమిటీ, తమకు పూర్వం గతించిన వారి కథ ఎలా ముగిసిందో వీళ్ళు భూమిపై సంచరించి చూడ లేదా? నిశ్చయంగా భయభక్తులు గల వారికి పరలోక నిలయం ఎంతో మేలైనది. అయినా మీరు అర్థం చేసుకోరా?!

وَمَا أَرْسَلْنَا مِن قَبْلِكَ إِلَّا رِجَالًا نُّوحِي إِلَيْهِم مِّنْ
أَهْلِ الْقُرَىٰ ۗ أَفَلَمْ يَسِيرُوا فِي الْأَرْضِ فَيَنظُرُوا
كَيْفَ كَانَ عَاقِبَةُ الَّذِينَ مِن قَبْلِهِمْ ۗ وَلَدَارُ
الْآخِرَةِ خَيْرٌ لِّلَّذِينَ اتَّقَوْا ۗ أَفَلَا تَعْقِلُونَ ﴿109﴾

**110** చివరకు ప్రవక్తలు ఆశలు వదులుకోగా,[174] తమతో అబద్ధం చెప్పబడిందని వారు (జాతి జనులు)[175] ఊహాగానాలు చేస్తుండగా, అకస్మాత్తుగా వారికి (ప్రవక్తలకు) మా తోడ్పాటు అందింది.[176] మరి మేము కోరిన వారిని కాపాడాము.[177] అసలు విషయం ఏమిటంటే మా శిక్ష అపరాధ జనుల నుంచి తొలగించబడదు.

حَتَّىٰ إِذَا اسْتَيْأَسَ الرُّسُلُ وَظَنُّوا أَنَّهُمْ قَدْ
كُذِبُوا جَاءَهُمْ نَصْرُنَا فَنُجِّيَ مَن نَّشَاءُ ۖ
وَلَا يُرَدُّ بَأْسُنَا عَنِ الْقَوْمِ الْمُجْرِمِينَ ﴿110﴾

171. అంటే, ఈ తౌహీద్ (ఏకదైవారాధనా) మార్గమే నా మార్గం. నేనే కాదు ప్రవక్తలందరి మార్గం కూడా ఇదే. పూర్తి విశ్వాసంతోనూ, ప్రమాణబద్ధమైన ఆధారాలతోనూ నేను ఈ మార్గం వైపుకు పిలుస్తున్నాను. నన్ను అనుసరించే వారు కూడా ఈ మార్గం వైపుకే పిలుస్తున్నారు.

172. అల్లాహ్ పరిశుద్ధుడు. దోషరహితుడు. సాటిలేనివాడు. ప్రజలు కల్పించే భాగస్వామ్యాలకు, పోలికలకు ఆయన అతీతుడు.

173. పైగంబరులు (దైవప్రవక్తలు) పురుషులే అయ్యారనీ, స్త్రీలకు ప్రవక్తా పదవి లభించలేదని ఈ ఆయతు ద్వారా రూఢీ అవుతోంది. అలాగే ప్రవక్తలు నాగరికులై ఉంటారు. ప్రవక్తలుగా నియమితులైన వారిలో పల్లెటూరి బైతులు, ఆటవికులు, అనాగరికులు ఎవరూ లేరు. ఎందుకంటే ఈ పల్లెటూరి బైతులు నగరవాసులకన్నా మొరటుగా, కర్కశులుగా ఉంటారు. అయితే నగరవాసులు మృదుస్వభావులుగా, సంస్కారవంతులుగా ఉంటారు. జాతిని సంస్కరించే – ప్రవక్త పదవీ – బాధ్యతను తీసుకున్నవారు నాగరికులుగా, సంస్కారవంతులుగా ఉండటం చాలా అవసరం కదా!

174. తమ జాతి ప్రజలు ఎంతకీ విశ్వసించకపోవటంతో దైవప్రవక్తలు ఒక్కోసారి వారి విషయంలో నిరాశకు లోనయ్యేవారు.

175. **"వారు"** అంటే ఎవరు? దీనికి పలు అర్థాలు చెప్పబడ్డాయి. అయితే తిరస్కార వైఖరికి ఒడిగట్టిన జాతి జనులు అనేది అత్యంత సమంజసమైన భావం. దైవశిక్ష అవతరిస్తుందని ప్రవక్తలు మొదట చెప్పినప్పుడు వారు భయపడేవారు.

لَقَدۡ كَانَ فِي قَصَصِهِمۡ عِبۡرَةٞ لِّأُوْلِي ٱلۡأَلۡبَٰبِۗ مَا كَانَ حَدِيثٗا يُفۡتَرَىٰ وَلَٰكِن تَصۡدِيقَ ٱلَّذِي بَيۡنَ يَدَيۡهِ وَتَفۡصِيلَ كُلِّ شَيۡءٖ وَهُدٗى وَرَحۡمَةٗ لِّقَوۡمٖ يُؤۡمِنُونَ ١١١

**111** నిశ్చయంగా వీరి (ఈ జాతుల) గాథలలో విజ్ఞత గలవారికి గుణపాఠం ఉంది. ఈ ఖుర్ఆన్ కల్పితమైన విషయం ఎంత మాత్రం కాదు. పైగా ఇది తనకు పూర్వం ఉన్న గ్రంథాలను ధ్రువీకరిస్తుంది, ప్రతి విషయాన్నీ స్పష్టంగా విడమరచి చెబుతుంది. విశ్వసించే జనులకు ఇది సన్మార్గం, కారుణ్యం.[178]

కాని ఆ శిక్ష రావటంలో ఆలస్యం అయ్యేసరికి, ఈ ప్రవక్త కేవలం కోతలు కోస్తున్నాడనీ, దైవశిక్ష అవతరించటం అనేది ఉత్తిదే అని వారు తలపోసేవారు.

ఈ వాక్యం ద్వారా దేవుడు తన అంతిమ ప్రవక్త (సఅసం)ను ఓదారుస్తున్నాడు. నీ జాతి ప్రజలలో ధిక్కార వైఖరిని అవలంబిస్తున్న వారిని శిక్షించటంలో తాత్సారం జరుగుతున్నందుకు నువ్వు దిగులు చెందకు. ఈ తాత్సారం ఇప్పుడే కాదు, నీకు పూర్వం గతించిన జాతుల విషయంలో కూడా జరిగింది. మేము వారికి కొంతకాలం పాటు విడుపును ఇస్తూ పోతాము. ఈ 'విడుపు'లో కూడా పరమార్థం దాగి ఉంది. ఎంతకీ మా శిక్ష అవతరించకపోవటంతో పైగంబరులు కించిత్ నిరాశకు గురయ్యేవారు. మరోవైపు అవిశ్వాసులైన జనులు కూడా "దైవశిక్ష రావటం అనేది ఉత్తుత్తి మాటే"నని తేలిగ్గా తీసుకునేవారు. అలాంటి సమయంలో మేము అకస్మాత్తుగా జోక్యం చేసుకునేవాళ్ళం. మా ఈ జోక్యం ప్రవక్తలకు, ప్రవక్త అనుయాయులకు తోడ్పాటుగా ఉండగా, ప్రవక్తను ధిక్కరించిన దుర్మార్గుల పాలిట అశనిపాతంలా పరిణమించేది.

176. అవిధేయులకు ఇవ్వబడే గడువు గురించి ఇందులో చెప్పబడింది. ఒక్కోసారి దైవప్రవక్తలు తమ జాతిప్రజల దుర్మార్గానికి ఓర్చుకోలేక దైవశిక్ష ఎంత తొందరగా వస్తే అంత మంచిదని ఎదురు చూస్తూ ఉంటారు. అదే సమయంలో అల్లాహ్ – తన ప్రవక్తల ఆశలకు, ఆకాంక్షలకు విరుద్ధంగా – తలబిరుసులకు అవకాశం ఇస్తూనే పోతాడు. ఈ దశలో ఒకవైపు దైవప్రవక్తల అనుయాయులు కూడా తిరస్కారులపై విధించబడే శిక్ష విషయంలో నిరాశకు లోనవుతారు. తిరస్కార జనులు మాత్రం మరింతగా చెలరేగి పోతుంటారు. కడకు వారి పాపం పండుతుంది. నిర్ణయించిన ఘడియ రాగానే నింగినున్న వాడు అకస్మాత్తుగా ఆ శిక్షను అవతరింపజేస్తాడు.

177. 'కాపాడబడేవారెవరు?' అంటే విశ్వసించినవారు.

178. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) లాంటి అత్యుత్తమ చరితాన్ని, ఇంకా అనేక జాతుల యదార్థ గాథలను వివరించిన ఈ పవిత్ర ఖుర్ఆన్ కాల్పనిక విషయం ఎంతమాత్రం కాదు. ఇది వెనుకటి ఆకాశ గ్రంథాలను ధృవీకరించే గ్రంథరాజం. మనిషి జీవన ధర్మానికి సంబంధించిన సమస్త విషయాలు ఇందులో ఉన్నాయి. విశ్వసించిన వారి కొరకు ఇది మార్గదర్శనం మరియు కారుణ్యం.

13వ సూరా

# అర్ రాద్

## ఉరుము

అవతరణ మదీనాలో

ఆయతులు 43

### పరిచయం

*దివ్య ఖుర్ఆన్ దేవుని తరఫున అవతరించిన దైవ వచనమనీ ఈ సూరా నొక్కి చెబుతుంది. ఈ సూరాలోని 13వ ఆయత్‌లో ప్రస్తావించబడిన 'అర్ రాద్' (ఉరుము) పేరు ఈ సూరాకు పెట్టడం జరిగింది. ఈ సూరా ఇతర ఇస్లామీయ విశ్వాసాలను కూడా తెలియజేసింది. తౌహీద్ (ఏక దైవారాధన), మరణించినవారు మళ్ళీ లేపబడడం మొదలైన ఇస్లామీయ విశ్వాసాల గురించి ఉద్బోధించింది. దైవ వచనాల అవతరణకు, ముహమ్మద్ (సఅసం) ప్రవక్త పదవికి సంబంధించి అవిశ్వాసుల మనసుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయటానికి కూడా ఈ సూరా ప్రయత్నించింది. ప్రకృతిలో, విశ్వంలో మనిషికి స్పష్టంగా అల్లాహ్ శక్తిసామర్థ్యాలు కనబడుతున్నాయి. మనిషి ఆలోచించి అర్థం చేసుకోవడానికి ఇవి చాలు.*

*విశ్వాసులు – అవిశ్వాసులకు మధ్య తేడాలను ఈ సూరా వివరించింది. విశ్వాసులు బుద్ధి వివేకాలతో వ్యవహరిస్తారు. అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తారు. అల్లాహ్ పట్ల తమ ధార్మిక బాధ్యతలను నిర్వర్తిస్తారు. అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడి ఉంటారు. అల్లాహ్‌కు భయపడతారు. తీర్పుదినానికి భయపడతారు. సహనాన్ని పాటిస్తారు. నమాజులు స్థిరంగా పాటిస్తారు. రహస్యంగానూ, బహిరంగంగానూ దానధర్మాలు చేస్తారు.*

*అవిశ్వాసులను వర్ణిస్తూ, వారు బుద్ధివివేకాలను ఉపయోగించని వారని ఈ సూరా పేర్కొంది. వారు మహత్యాలు చూపండని అడుగుతారు. ప్రకృతిలోనూ, విశ్వంలోనూ ఉన్న అల్లాహ్ చిహ్నాలను చూసి ఆలోచించరు. మరణించినవారు మళ్ళీ లేపబడతారన్న నిజాన్ని విశ్వసించడానికి నిరాకరిస్తారు. ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరిస్తారు. ప్రవక్తలను అవహేళన చేస్తారు. కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడతారు. అల్లాహ్‌ను గాక ఇతరులను సంరక్షకులుగా చేసుకుంటారు. అల్లాహ్ పట్ల తమ నైతిక బాధ్యతలను విస్మరిస్తారు. మానవ సంబంధాలను, కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నపరుస్తారు. బీదలు, అనాథల పట్ల తమ బాధ్యతలను గుర్తించడానికి నిరాకరిస్తారు. భూమిపై కల్లోలాన్ని, అవినీతిని వ్యాపింపజేస్తారు. ప్రాపంచిక జీవిత సుఖభోగాల్లో మునిగి ఉంటారు. అల్లాహ్ శాపానికి గురైనవారు, ఓటమికి గురైనవారు, నరకానికి ఆహుతయ్యే వారు వీరే.*

*ఈ సూరా గ్రంథప్రజల గురించి క్లుప్తంగా ప్రస్తావించింది. అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టరాదని వారికి నొక్కి చెప్పడం జరిగింది. వీరిలో కొందరు దైవ వచనాల అవతరణను విశ్వసిస్తారు. కాగా; కొందరు నిరాకరిస్తారని ఈ సూరా పేర్కొంది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన ఉద్యమాన్ని కొనసాగించాలని బోధించింది. ఆయన (స) మానవాళికి మార్గదర్శకుడనీ, హెచ్చరిక చేసేవాడని నొక్కి చెప్పింది.*

## అర్ రాద్ సూరా

سُوۡرَةُ الرَّعۡدِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

**1** అలిఫ్ – లామ్ – మీమ్ – రా. ఇవి ఖుర్ఆన్ గ్రంథ వాక్యాలు. నీ ప్రభువు తరఫునుంచి నీపై అవతరింపజేయబడేదంతా పరమ సత్యం. కాని చాలా మంది విశ్వసించరు.

الٓمّٓرٰ ۚ تِلۡكَ اٰيٰتُ الۡكِتٰبِ ؕ وَالَّذِىۡۤ اُنۡزِلَ اِلَيۡكَ مِنۡ رَّبِّكَ الۡحَـقُّ وَلٰـكِنَّ اَكۡثَرَ النَّاسِ لَا يُؤۡمِنُوۡنَ ۞ 1

**2** స్తంభాలు లేకుండా (నే) ఆకాశాలను అంతేసి ఎత్తుకు లేపిన వాడే అల్లాహ్. దీన్ని మీరు చూస్తూనే ఉన్నారు. మరి ఆయన అర్ష్ (సింహాసనం)పై ఆసీనుడయ్యాడు.[1] సూర్యచంద్రులను నియంత్రణలో ఉంచినది కూడా ఆయనే – ప్రతి ఒక్కటీ నిర్ధారిత సమయంలో తిరుగుతోంది.[2] కార్యక్రమాల నిర్వహణకర్త కూడా ఆయనే. మీరు మీ ప్రభువును కలుసుకునే విషయాన్ని నమ్మగలందులకు ఆయన తన నిదర్శనాలను స్పష్టంగా వివరిస్తున్నాడు.

اَللّٰهُ الَّذِىۡ رَفَعَ السَّمٰوٰتِ بِغَيۡرِ عَمَدٍ تَرَوۡنَهَا ثُمَّ اسۡتَوٰى عَلَى الۡعَرۡشِ وَسَخَّرَ الشَّمۡسَ وَالۡقَمَرَ ؕ كُلٌّ يَّجۡرِىۡ لِاَجَلٍ مُّسَمًّى ؕ يُدَبِّرُ الۡاَمۡرَ يُفَصِّلُ الۡاٰيٰتِ لَعَلَّكُمۡ بِلِقَآءِ رَبِّكُمۡ تُوۡقِنُوۡنَ ۞ 2

1. దేవుడు అర్ష్‌పై ఆసీనుడయ్యే విషయం ఇంతకుముందు కూడా ప్రస్తావించబడింది. హదీసువేత్తలు ఈ విషయాన్ని 'అలా ఇలా' అని వర్ణనలు చేయరు. దేవుని గుణగణాలకు సంబంధించి ఖుర్ఆన్ హదీసులలో ఎలా చెప్పబడితే అలా–హెచ్చుతగ్గులు లేకుండా–విశ్వసించటం మన విధి. కొన్ని వర్గాలు దీనిపై ఊహాగానాలు చేశాయి. అర్ష్ (దైవ సింహాసనం) ఫలానా పీఠాన్ని పోలి ఉంటుందనీ, దేవుడు ఈ విధంగా ఆసీనుడవుతాడని ఊహించి చెప్పటం సమంజసం కాదు. "ఆయన్ని పోలిన వస్తువు ఏదీ లేదు. ఆయన అంతా వింటాడు. అన్నీ చూస్తాడు" (అష్ షూరా– 11).

2. దీని అర్థమేమిటంటే సూర్యచంద్రులు దేవుని అదుపులో ఉన్నాయి. వాటి పరిభ్రమణానికి సంబంధించి దేవుడు నిర్ధారించిన సమయాన్ని, నియమాలను అవి ఖచ్చితంగా పాటిస్తున్నాయి. ప్రళయదినం వరకూ అవి అలాగే నడుస్తూ ఉంటాయి. "సూర్యుడు – శక్తిమంతుడూ, జ్ఞాని అయిన దేవుడు నిర్దేశించిన నియమం ప్రకారం తన నిజస్థానం దిశగా పయనిస్తున్నాడు" (యాసీన్–38). మరో అర్థం ఏమిటంటే సూర్యుడు, చంద్రుడు–రెండూ తమ తమ గమ్యస్థానాల వైపుకు సాగిపోతున్నాయి. చంద్రుడు ఒక నెలలో తన నిర్ణీత గమ్యాన్ని పూర్తి చేయగా సూర్యుడు ఏడాది కాలంలో తన లక్ష్యాన్ని ఛేదిస్తాడు. "మేము చంద్రుని మజిలీలను నిర్ధారించాము" (యాసీన్ – 39) అన్న వచనం కూడా ఈ సందర్భంగా గమనించదగినది.

పెద్ద పెద్ద గ్రహాలలో సూర్యచంద్రులు రెండూ ముఖ్యమైనవే. అందువల్ల ఈ రెంటి పేర్లు మాత్రమే ఖుర్ఆన్‌లో ప్రస్తావనకు వచ్చాయి. ఈ రెండు గ్రహాలు కూడా దేవుని అదుపు అజమాయిషీలో పనిచేస్తున్నాయి. ఇతర గ్రహాలు కూడా దైవాజ్ఞలను తు.చ. తప్పకుండా పాటిస్తున్నాయి. కాబట్టి దైవాజ్ఞలకు కట్టుబడి తమ విధిని నిర్వర్తించేవేవీ ఆరాధ్య దైవాలు కాజాలవు. సర్వాన్నీ తన అదుపులో ఉంచుకున్న అపారశక్తిమంతుడు మాత్రమే ఆరాధ్యుడు, పూజ్యుడు కాగలుగుతాడు. అందుకే చెప్పబడింది –

**3** ఆయనే భూమిని విశాలంగా పరచి అందులో పర్వతాలను, నదీనదాలను సృష్టించాడు.[3] ఇంకా అందులో అన్నిరకాల పండ్లను రెండేసి జతలుగా సృష్టించాడు.[4] ఆయనే పగటిపై రాత్రిని కప్పేస్తాడు. నిశ్చయంగా చింతన చేసేవారి కోసం ఇందులో పలు నిదర్శనాలున్నాయి.

وَهُوَ الَّذِىْ مَدَّ الْاَرْضَ وَجَعَلَ فِيْهَا رَوَاسِىَ
وَاَنْهٰرًا ؕ وَمِنْ كُلِّ الثَّمَرٰتِ جَعَلَ فِيْهَا زَوْجَيْنِ
اثْنَيْنِ يُغْشِى الَّيْلَ النَّهَارَ ؕ اِنَّ فِىْ ذٰلِكَ لَاٰيٰتٍ
لِّقَوْمٍ يَّتَفَكَّرُوْنَ ③

**4** భూమిలో అనేక (రకాల) నేలలు ఒక దానికొకటి ఆనుకుని ఉన్నాయి.[5] (అందులో) ద్రాక్ష తోటలూ ఉన్నాయి, పంటపొలాలూ ఉన్నాయి. ఖర్జూరపు చెట్లూ ఉన్నాయి. వాటిలో కొన్ని శాఖలుగా చీలి ఉండగా, మరికొన్ని వేరే రకంగా ఉన్నాయి.[6] వాటన్నింటికీ ఒకే నీరు సరఫరా అవుతోంది. అయినప్పటికీ మేము ఆ పండ్లలో ఒకదానికి మరోదానిపై శ్రేష్ఠతను ప్రసాదిస్తున్నాము.[7] నిశ్చయంగా విజ్ఞులకు ఇందులో ఎన్నో సూచనలున్నాయి.

وَفِى الْاَرْضِ قِطَعٌ مُّتَجٰوِرٰتٌ وَّجَنّٰتٌ مِّنْ اَعْنَابٍ
وَّزَرْعٌ وَّنَخِيْلٌ صِنْوَانٌ وَّغَيْرُ صِنْوَانٍ يُّسْقٰى بِمَآءٍ
وَّاحِدٍ ۫ وَنُفَضِّلُ بَعْضَهَا عَلٰى بَعْضٍ فِى الْاُكُلِ ؕ
اِنَّ فِىْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يَّعْقِلُوْنَ ④

1. "సూర్యచంద్రులకు సాష్టాంగపడకండి. వాటిని సృష్టించిన అల్లాహ్‌కు మాత్రమే సాష్టాంగపడండి-నిజంగానే మీరు ఆయన్ని ఆరాధించవలసి ఉంటే" (హామీమ్ సజ్దా-37).

2. "సూర్యచంద్ర నక్షత్రాదులన్నీ ఆయన ఆజ్ఞలకు కట్టుబడి ఉన్నాయి" (అల్ ఆరాఫ్-54).

3. భూమి పొడవు వెడల్పులను అంచనా వేయటం సామాన్యులకు సాధ్యం కాదు. అది సువిశాలమైనది. మరి ఆ సువిశాలమైన నేలలో ఆయన పర్వతాలను మేకులుగా పాతిపెట్టాడు. అందులో నదీనదాలను, కాలువలను, సెలయేళ్లను ప్రవహింపజేశాడు. వాటిద్వారా మనిషి తన దాహాన్ని తీర్చుకోవటమేగాకుండా తన పొలాలకు, తోటలకు కూడా నీటిని సరఫరా చేసుకుంటున్నాడు. తద్వారా రకరకాల పండ్లు, ఆహార ధాన్యాలు పండుతున్నాయి. వాటి రంగులు వేరు, రుచులు వేరు.

4. జత అంటే ఆడ – మగ అని అర్థం. వృక్షశాస్త్రంలో జరిగిన నూతన పరిశోధనలు కూడా ఈ విషయాన్ని సత్యమని ధృవీకరిస్తున్నాయి. మరో భావంలో తీసుకుంటే 'జత' అనే పదం చాలా విస్తృతమయింది. పులుపు – తీపి, నలుపు-తెలుపు, వెలుగు – చీకటి, చలి – వేడి ఇత్యాది అర్థాలు కూడా వస్తాయి. అంటే ప్రతి వస్తువుకూ విరుద్ధమైన వస్తువును కూడా సృష్టించాడు.

5. సారవంతమైన నేలతోపాటు చవుడు నేల కూడా ఉంటుంది. సారవంతమైన నేలలో పంటలు పుష్కలంగా పండుతాయి. చవుడు నేలలో ముళ్ల చెట్లు మాత్రమే మొలుస్తాయి. అలాగే ఒక భూభాగంలో ఖనిజ సంపద ఉండగా, దానికి ప్రక్కనే ఉన్న మరో భూభాగంలో చమురు నిల్వలుంటాయి. మీరు మీ ప్రభువు చేసిన సృష్టిలోని ఏ ఏ వైవిధ్యాలను ఖండించగలరు? అరబీలో **'ముతజావిరాత్'** అనే పదం వచ్చింది. అంటే పరస్పరం దగ్గరగా, కలిసుండే భాగాలు అని అర్థం.

6. మూలంలో **'సిన్‌వాన్'** మరియు **'గైరు సిన్‌వాన్'** అనే రెండు పదాలు వచ్చాయి. వీటికి పలు అర్థాలు చెప్పబడ్డాయి. సిన్‌వాన్ అంటే కలిసి ఉండేదనీ, గైరు సిన్‌వాన్ అంటే విడివిడిగా ఉండేదని ఒక అర్థం. సిన్‌వాన్ అంటే అనేక శాఖలుగా, కాండాలుగా విస్తరించే ఒకే వృక్షం. ఉదాహరణకు : దానిమ్మ వృక్షం, అత్తి (పండు) వృక్షం, కొన్ని రకాల ఖర్జూర చెట్లు. గైరు సిన్‌వాన్ అంటే అనేక కాండాలుగా కాకుండా ఒకే కాండం కలిగి ఉండే వృక్షం. ఇది రెండో అర్థం.

7. అంటే ఒకే రకమైన నేల, ఒకే విధమైన నీరు. గాలి కూడా ఒక్కటే. కాని పండ్లు రుచిలోనూ, రంగులోనూ వేర్వేరుగా

وَإِنْ تَعْجَبْ فَعَجَبٌ قَوْلُهُمْ ءَإِذَا كُنَّا تُرٰبًا ءَإِنَّا لَفِيْ خَلْقٍ جَدِيْدٍ ۬ؕ اُولٰٓئِكَ الَّذِيْنَ كَفَرُوْا بِرَبِّهِمْ ۚ وَاُولٰٓئِكَ الْاَغْلٰلُ فِيْٓ اَعْنَاقِهِمْ ۚ وَاُولٰٓئِكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ⑤

5 (ఓ ప్రవక్తా!) ఒకవేళ నువ్వు ఆశ్చర్యపడవలసి ఉంటే; "ఏమిటీ, మేము (మరణించి) మట్టి అయిపోయిన తరువాత మళ్లీ క్రొత్తగా పుట్టించబడతామా?!" అన్న వారి మాటలపై ఆశ్చర్య పోవాలి.[8] తమ ప్రభువు పట్ల తిరస్కార వైఖరిని అవలంబించిన వారు వీరే. పట్టాలు వేయబడేది వీరి మెడలలోనే. నరకవాసులు కూడా వారే. అందులో వారు కలకాలం ఉంటారు.

وَيَسْتَعْجِلُوْنَكَ بِالسَّيِّئَةِ قَبْلَ الْحَسَنَةِ وَقَدْ خَلَتْ مِنْ قَبْلِهِمُ الْمَثُلٰتُ ؕ وَاِنَّ رَبَّكَ لَذُوْ مَغْفِرَةٍ لِّلنَّاسِ عَلٰى ظُلْمِهِمْ ۚ وَاِنَّ رَبَّكَ لَشَدِيْدُ الْعِقَابِ ⑥

**6** మేలుకు ముందే వారు కీడు కోసం నిన్ను తొందరపెడుతున్నారు కదూ! వారికి పూర్వం అలాంటి ఉదాహరణలు (శిక్షలు) గడచి ఉన్నాయి.[9] నిశ్చయంగా ప్రజలు దుర్మార్గాలకు పాల్పడిన తరువాత కూడా నీ ప్రభువు వారిపట్ల క్షమాశీలుడుగా ఉంటాడు.[10] అయితే నీ ప్రభువు శిక్షించే విషయంలో కూడా మహా కఠినుడు సుమా![11]

ఉంటాయి. అలాగే ఆహార ధాన్యాల నాణ్యతలో కూడా తేడాలుంటాయి. వీటన్నింటిలోనూ సృష్టికర్త అపార శక్తి సామర్థ్యాలు తొణకిసలాడుతూ ఉంటాయి.

8. అంటే మొదటిసారి పుట్టించిన మహాశక్తిమంతునికి మలిసారి పుట్టించటం ఏమాత్రం కష్టసాధ్యం కాదు. అయితే "మేము మలిసారి సృష్టించబడటం ఎలా సంభవం?" అని అవిశ్వాసులు ప్రశ్నిస్తున్నారు. అత్యంత ఆశ్చర్యకరమయిన ప్రశ్న అంటే యిదే.

9. దైవాగ్రహం మూలంగా తుదముట్టించబడిన జాతుల ఉదాహరణలు చరిత్రలో కోకొల్లలు. అయినప్పటికీ వీళ్లు దేవుని శిక్ష కోసం హడావిడి చేస్తున్నారు. 'ఓ ప్రవక్తా! నువ్వు మాటిమాటికీ మమ్మల్ని హెచ్చరిస్తున్నావే! ఏదీ ఆ శిక్ష రాదేమి?' అని వారు గుచ్చి గుచ్చి అడుగుతున్నారు. తమ పూర్వీకులలో అనేక జాతులకు పట్టిన గతేమిటో వారు చూడట్లేదా?

10. ప్రజలు విచ్చలవిడిగా విహరిస్తూ, ఎడతెగకుండా అత్యాచారాలను చేస్తున్నప్పటికీ వారిని దండించటంలో దేవుడు తొందరపడడు. వారికి అవకాశం ఇస్తూనే పోతాడు. ఒక్కోసారి ఈ 'వదులు' ఎంత సుదీర్ఘంగా ఉంటుందంటే, వారి వ్యవహారాన్ని-తీర్పుదినం కోసం అట్టేపెట్టేస్తాడు. ఆ దేవుని ఔదార్యం, జాలి, కరుణ మూలంగా కొన్ని జాతుల వారు ఇహలోకంలో 'బతికిపోతారు'. ప్రజలు దురాగతాలకు పాల్పడిన వెంటనే ఆయన ఒక్కొక్కరి పనిపట్టడం ప్రారంభిస్తే భూమండలంలో అసలు ఒక్క మనిషి కూడా బ్రతికి బట్టకట్టలేడు. "అల్లాహ్యే గనక ప్రజల దురాగతాల కారణంగా వారిని పట్టుకోవటం మొదలెడితే, భూమండలంలో ఏ ప్రాణినీ వదలిపెట్టే వాడు కాడు" (ఫాతిర్ - 45).

11. ఇది అల్లాహ్ యొక్క మరో గుణం. మనిషి కేవలం ఒకే కోణం నుంచి చూడకూడదు. రెండవ కోణంపై కూడా దృష్టిని సారించాలి. ఒకే కోణంపై దృష్టిని నిలపటం వల్ల ఎన్నో విషయాలు దృష్టిలోకి రాకుండా పోతాయి. అందుకే దివ్య ఖుర్ఆన్ చాలాచోట్ల దేవుని క్షమ, కరుణ గురించి ప్రస్తావించినప్పుడల్లా ఆయన ఆగ్రహోదగ్ర రూపాన్ని కూడా మన ముందుంచింది. అందుకే ఆశాభావంతో పాటు భీతి భావన కూడా మనసులో ఉండాలి. ఎందుకంటే కేవలం ఆశాభావమే ఉంటే మనిషిలో మొండి ధైర్యం వచ్చేస్తుంది. పాపభీతి లేకుండాపోతుంది. అదే సమయంలో మనిషి పొద్దస్తమానం భీతితో కృంగిపోనూరాదు. నిరంతర భీతిమూలంగా మనిషికి దైవకారుణ్యం పట్ల ఆశ సన్నగిల్లిపోతుంది. కాబట్టి చెప్పవచ్చిందేమంటే మనిషి నాణానికి ఇరువైపులా చూడాలి. ఒకే వైపుపై దృష్టిని నిలపటం వల్ల అతను మధ్యేమార్గాన్ని వీడే ప్రమాదముంటుంది. అందుకే అనబడింది: "విశ్వాసం (ఈమాన్) భీతికీ-ఆశాభావానికి మధ్య

**7** "అతనిపై అతని ప్రభువు తరఫున ఏదైనా సూచన (మహిమ) ఎందుకు అవతరించలేదు?" అని అవిశ్వాసులు అంటున్నారు. (ఓ ప్రవక్తా!) వాస్తవానికి నువ్వు వారిని హెచ్చరించేవాడివి మాత్రమే.[12] ప్రతి జాతికీ మార్గదర్శకుడంటూ ఒకడున్నాడు.[13]

وَيَقُولُ الَّذِينَ كَفَرُوا لَوْلَا أُنزِلَ عَلَيْهِ آيَةٌ مِّن
رَّبِّهِ ۗ إِنَّمَا أَنتَ مُنذِرٌ ۖ وَلِكُلِّ قَوْمٍ هَادٍ ⑦

**8** ప్రతి స్త్రీ తన గర్భంలో మోసే దానిని గురించి,[14] గర్భం తరగటం, పెరగటం గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు.[15] ప్రతి వస్తువుకూ ఆయన వద్ద ఒక పరిమాణం నిర్ధారితమై ఉంది.[16]

اللَّهُ يَعْلَمُ مَا تَحْمِلُ كُلُّ أُنثَىٰ وَمَا تَغِيضُ
الْأَرْحَامُ وَمَا تَزْدَادُ ۖ وَكُلُّ شَيْءٍ عِندَهُ
بِمِقْدَارٍ ⑧

**9** ఆయన గోప్యంగా ఉన్న దానినీ, బహిర్గతమై ఉన్నదానినీ ఎరిగినవాడు, అందరికంటే గొప్పవాడు, సర్వోన్నతుడు.

عَالِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ الْكَبِيرُ الْمُتَعَالِ ⑨

**10** మీలో ఎవరయినాసరే తమ మాటను మెల్లిగా చెప్పినా, బిగ్గరగా చెప్పినా, ఎవరయినా రాత్రిపూట దాక్కున్నా, పగటిపూట సంచరిస్తున్నా – అల్లాహ్‌కు మాత్రం వారంతా సమానమే.

سَوَاءٌ مِّنكُم مَّنْ أَسَرَّ الْقَوْلَ وَمَن جَهَرَ بِهِ
وَمَنْ هُوَ مُسْتَخْفٍ بِاللَّيْلِ وَسَارِبٌ بِالنَّهَارِ ⑩

---

ఉంది" అని. అంటే రెండింటికీ నడుమ గల సమత్వానికీ, సమతూకానికీ మారుపేరే ఈమాన్ (విశ్వాసం). అంటే మనిషి దైవాగ్రహం పట్ల మరీ నిర్భయంగా, నిశ్చింతగా ఉండకూడదు, అలా అని దైవ కారుణ్యం పట్ల నిరాశ కూడా చెందకూడదు (ఈ అంశాన్ని మరింత కూలంకషంగా తెలుసుకోవడానికి అల్ అన్ఆమ్ సూరా 47వ ఆయతును, అల్ ఆరాఫ్ సూరా 167వ ఆయతును, అల్ హిజ్ర్ సూరా 49, 50 ఆయతులను చూడండి).

12. పరిస్థితుల స్వరూపాన్ని, అవసరాలను బట్టి అల్లాహ్ ఒక్కో ప్రవక్తకు ఒక్కో విధమైన నిదర్శనాన్ని, మహిమను ఇచ్చాడు. అయితే దైవ తిరస్కారులు తమ మనోభిరామం ప్రకారం మహిమల్ని కోరేవారు. ఉదాహరణకు : మక్కాలోని ఖురైషులనే తీసుకోండి. 'సఫా' పర్వతాన్ని 'బంగారు' పర్వతంగా చేయమనీ, వారు కోరినట్లుగా మహిమను చూపకపోతే, "ఈయనగారిపై దేవుని సూచన అవతరించదేమీ?" అని వ్యంగ్యంగా ప్రశ్నించేవారు. దానికి సమాధానంగా అల్లాహ్ ఇలా అన్నాడు : "ఓ ప్రవక్తా! సందేశం అందజేయటం, హెచ్చరించటం వరకే నీ పని. దాన్ని నువ్వు చేస్తూ ఉండు. ఎవరు నమ్మినా, నమ్మకపోయినా నీకు కలిగే నష్టం ఏమీ లేదు. ఎందుకంటే సన్మార్గ భాగ్యం ప్రసాదించటం మా పని. సన్మార్గం చూపించటం నీ పనైతే, సన్మార్గంపై నడిపింప జేయటం మా పని."

13. అంటే – అన్ని జాతుల మార్గదర్శకత్వం కోసం దేవుడు మార్గదర్శకులను పంపించాడు. ఆయా జాతి ప్రజలు సన్మార్గాన్ని అవలంబించారా? లేదా? అన్నది తరువాతి సంగతి. కాని సన్మార్గాన్ని చూపించటానికి మాత్రం ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్త వచ్చాడు. "ప్రతి సమాజంలోనూ హెచ్చరించేవాడు తప్పకుండా వచ్చాడు" (ఫాతిర్ – 24).

14. మాతృ గర్భాలలో ఏముందీ? ఆడ శిశువు ఉందా? మగ శిశువు ఉందా? శిశువు అందంగా ఉందా? అంద వికారంగా ఉందా? ఆ శిశువులో మంచితనం ఉందా? దుష్ట స్వభావం ఉందా? అది దీర్ఘాయుషు కలదా? అల్పాయుషు కలదా? – ఇత్యాది విషయాలన్నీ అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.

15. ఇది గర్భధారణా గడువుకు సంబంధించినది. సాధారణంగా ఇది 9 మాసాల గడువు అయి ఉంటుంది. ఒక్కోసారి ఆ గడువు ఏడెనిమిది మాసాలూ అవుతుంది. ఒక్కోసారి నవ మాసాలకన్నా కొంచెం ఎక్కువగానూ ఉంటుంది.

16. అంటే – పుట్టబోయే శిశువు వయస్సు ఎంత? దానికి ఉపాధి ఏ పరిమాణంలో ఇవ్వాలి? తదితర విషయాలన్నీ ఆయన దగ్గర నిర్ధారితం అవుతాయి.

11 మనిషికి ముందూ వెనుకా (ఆయన నియమించిన) కావలి వాళ్ళు[17] అంటి ఉన్నారు. వారు దైవాజ్ఞానుసారం అతన్ని కనిపెట్టు కుని ఉంటారు. ఏ జాతి అయినా సరే స్వయంగా తన మనోమయ స్థితిని మార్చుకోనంతవరకూ అల్లాహ్ కూడా దాని స్థితిని మార్చదు .[18] అల్లాహ్ ఏ జాతినయినా శిక్షించాలనుకుంటే ఇక ఆ శిక్ష తొలగిపోయే ప్రసక్తే ఉండదు. ఆయన తప్ప వారిని రక్షించే వారు కూడా ఎవరూ ఉండరు.

لَهٗ مُعَقِّبٰتٌ مِّنْۢ بَیْنِ یَدَیْهِ وَ مِنْ خَلْفِهٖ یَحْفَظُوْنَهٗ مِنْ اَمْرِ اللّٰهِ ؕ اِنَّ اللّٰهَ لَا یُغَیِّرُ مَا بِقَوْمٍ حَتّٰی یُغَیِّرُوْا مَا بِاَنْفُسِهِمْ ؕ وَ اِذَاۤ اَرَادَ اللّٰهُ بِقَوْمٍ سُوْٓءًا فَلَا مَرَدَّ لَهٗ ۚ وَ مَا لَهُمْ مِّنْ دُوْنِهٖ مِنْ وَّالٍ ﴿۱۱﴾

12 ఆయనే మీకు మెరుపులను చూపిస్తున్నాడు. వాటివల్ల మీకు భయం కలగటంతోపాటు, మీలో ఆశలు కూడా చిగురిస్తు న్నాయి.[19] ఇంకా (ఆయనే) బరువైన మబ్బులను సృజిస్తున్నాడు.[20]

هُوَ الَّذِیْ یُرِیْكُمُ الْبَرْقَ خَوْفًا وَّ طَمَعًا وَّ یُنْشِئُ السَّحَابَ الثِّقَالَ ﴿ۚ۱۲﴾

13 ఉరుము సయితం ఆయన పవిత్రతను కొనియాడుతోంది, ఆయన్ని ప్రశంసిస్తోంది. దూతలు కూడా ఆయన భీతివల్ల ఆయన్ని స్తుతిస్తున్నారు.[21] ఆయనే పిడుగులను పంపి, తాను కోరినవారిపై పడవేస్తున్నాడు.[22] అవిశ్వాసులు అల్లాహ్ విషయంలో పిడి వాదానికి దిగుతున్నారు! ఆయన మహా శక్తిమంతుడు![23]

وَ یُسَبِّحُ الرَّعْدُ بِحَمْدِهٖ وَ الْمَلٰٓئِكَةُ مِنْ خِیْفَتِهٖ ۚ وَ یُرْسِلُ الصَّوَاعِقَ فَیُصِیْبُ بِهَا مَنْ یَّشَآءُ وَ هُمْ یُجَادِلُوْنَ فِی اللّٰهِ ۚ وَ هُوَ شَدِیْدُ الْمِحَالِ ﴿ؕ۱۳﴾

14 ఆయన్ని (అల్లాహ్‌ను) వేడుకోవటమే సత్యం.[24] ఆయన్ని వదలి వారు వేడుకుంటున్న వారంతా వారి ప్రార్థనలకు ఏ సమాధా నమూ ఇవ్వలేరు. ఒక వ్యక్తి తన రెండు చేతులనూ నీళ్ళ వైపుకు

لَهٗ دَعْوَةُ الْحَقِّ ؕ وَ الَّذِیْنَ یَدْعُوْنَ مِنْ دُوْنِهٖ لَا یَسْتَجِیْبُوْنَ لَهُمْ بِشَیْءٍ اِلَّا كَبَاسِطِ كَفَّیْهِ

17. అరబీలో **'ముఅఖ్ఖిబాత్'** అని ఉంది. ఇది 'ముఅఖ్ఖిబతున్'కు బహువచనం. ఒకరి వెనుక ఒకరు వచ్చేవారని దాని అర్థం. అంటే దైవదూతలన్నమాట! వారు వంతుల వారీగా వస్తారు. పగటిపూట డ్యూటీ చేసే దూతలు నిష్క్రమించగానే రాత్రిపూట డ్యూటీ చేసే దూతలు వచ్చేస్తారు.

18. దీని సారాంశం కోసం అన్‌ఫాల్ సూరా 53వ ఆయతు క్రింద ఇవ్వబడిన వివరణను చూడండి.

19. ఒకవైపు బాటసారులు ఈ మేఘాల గర్జనలకు భయకంపితులవుతుంటే, మరోవైపు ఇండ్లలో కూర్చున్న రైతులు, వ్యవసాయదారులు ఆశతో ఆకాశం వంక చూస్తారు. వర్షం ఎంత ఎక్కువగా కురిస్తే అంత మంచిదని భావిస్తారు.

20. బరువైన మబ్బులంటే వర్షపు నీటితో నిండిన మేఘాలు అని భావం.

21. వేరొకచోట ప్రస్తావనకు వచ్చినట్లు "ఆయన పవిత్రతను ప్రశంసించని వస్తువంటూ ఏదీ లేదు" (బనీ ఇస్రాయీల్-44).

22. అంటే ఈ పిడుగుల ద్వారా తాను కోరిన వారిని అంతమొందిస్తాడు.

23. అరబీ మూలంలో **'మిహాల్'** అనే పదం ఉంది. మిహాల్ అంటే శక్తి, పట్టుకోవటం, వ్యూహం, ఎత్తుగడ తదితర అర్థాలు వస్తాయి. అంటే అల్లాహ్ అపారశక్తిశాలి, నిలదీసి నిగ్గుతేల్చేవాడు, గట్టిగా పట్టుకునేవాడు, పకడ్బందీగా వ్యూహరచన చేసేవాడు అని భావం.

చాచి, ఆ నీరు తన నోటిలోనికి వచ్చి పడాలని అనుకుంటే అది అతని నోటిలోనికి రాదు.[25] (అల్లాహ్‌ను కాదని చిల్లర దేవుళ్లను పిలిచేవారి) ఈ పిలుపు కూడా అంతే. ఈ అవిశ్వాసుల ప్రార్థన లన్నీ అధర్మమైనవే.[26]

إِلَى الْمَاءِ لِيَبْلُغَ فَاهُ وَمَا هُوَ بِبَالِغِهِ ۚ وَمَا دُعَاءُ الْكَافِرِينَ إِلَّا فِي ضَلَالٍ ⑭

**15** ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సృష్టితాలన్నీ – తమకు ఇష్టమున్నా, లేకపోయినా – అల్లాహ్‌కు సాష్టాంగపడుతున్నాయి. వాటి నీడలు సయితం ఉదయం సాయంత్రం[27] (ఆయనకే సాష్టాంగ ప్రణామం చేస్తున్నాయి).

وَلِلَّهِ يَسْجُدُ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ طَوْعًا وَكَرْهًا وَظِلَالُهُم بِالْغُدُوِّ وَالْآصَالِ ۩ ⑮

**16** "భూమ్యాకాశాలకు ప్రభువు ఎవరు?" అని వారిని అడుగు. "అల్లాహ్‌యే"[28]అని వారికి చెప్పు. "అయినప్పటికీ మీరు ఆయన్ని కాదని, తమ స్వయానికి సయితం లాభంగానీ, నష్టంగానీ

قُلْ مَن رَّبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ قُلِ اللَّهُ ۚ قُلْ أَفَاتَّخَذْتُم مِّن دُونِهِ أَوْلِيَاءَ لَا يَمْلِكُونَ

24. అంటే భయం కలిగినప్పుడు గానీ, ఆశలు రేకెత్తినప్పుడుగానీ ఆ ఒక్క నిజ దైవాన్ని మొరపెట్టుకోవటమే న్యాయం. ఎందుకంటే అందరి మొరలను ఆలకించేవాడు, వాటికి ఆమోదముద్ర వేసేవాడు ఆయనే. వేరొక అర్థం ప్రకారం ఆయన్ని ఆరాధించటమే ధర్మం. సమంజసం. ఆయన తప్ప వేరొకరు ఆరాధనకు అర్హులు కారు. ఎందుకంటే ఈ సృష్టికి కర్త, యజమాని, ప్రణాళికా రచయిత ఆయనే. అందుకే ఆయన్ని ఆరాధించటమే ధర్మం. ఆయన్ని మొరపెట్టుకోవటమే సత్యం.

25. అల్లాహ్‌ను వదలి వేరితరులను పిలిచేవారి ఉపమానం ఇక్కడ ఇవ్వబడింది. అతని ఉపమానం ఎటువంటిదంటే, అతను నీళ్లవైపుకు తన రెండు చేతులనూ చాచి 'ఓ జలమా! నువ్వు నా నోటిలోకి వచ్చేయి' అంటే వస్తుందా? చేతులు చాచే వాని అవసరం ఏమిటో నీటికి ఎలా అర్థమవుతుంది? అలాగే అల్లాహ్‌ను వదలి ఈ ముష్రిక్కులు (బహు దైవారాధకులు) ఎవరెవరిని పిలుస్తున్నారో వారికి తమను పిలిచే వారి అవసరాలు, అక్కరలేమిటో తెలియవు. వారి అక్కరలను తీర్చే శక్తి వాటికి లేదు.

26. వ్యర్థమైనవి కూడా. ఎందుకంటే ఈ మొరల వల్ల వారికి ఒరిగేదేమీ లేదు.

27. ఈ ఆయతులో దేవుని ఔన్నత్యం, ఆధిక్యత చాటిచెప్పబడ్డాయి. ప్రతి వస్తువు ఆయన అదుపాజ్ఞల్లో ఉందనీ, ప్రతిదీ ఆయనకు లోబడి వ్యవహరిస్తోందనీ, ఆయన ముందు సాష్టాంగ ప్రణామం చేస్తున్నదని చెప్పబడింది. కొందరు ఇష్టపూర్వకంగా సాష్టాంగ ప్రణామం చేస్తే, మరి కొందరు అన్యమనస్కంగా చేస్తారు. విశ్వాసులు మనస్ఫూర్తిగా మోకరిల్లగా, అవిశ్వాసులు గత్యంతరం లేక తలవంచుతారు. వారే కాదు, వారి నీడలు సయితం ఉదయం, సాయంత్రం దైవసన్నిధిలో సాష్టాంగప్రణామం చేస్తాయి. ఈ మాటే మరోచోట ఇలా అనబడింది : "వారు దేవుడు సృష్టించిన ఏ వస్తువును కూడా గమనించటం లేదా? ఆ వస్తువుల నీడలు కుడి ఎడమల వైపు నుంచి అల్లాహ్ ముందు ఎలా సాష్టాంగపడుతున్నాయో వారు చూడటం లేదా?" (అన్ నహ్ల్ – 48). ఈ 'సజ్దా' (సాష్టాంగ ప్రణామం) ఎటువంటిది? సృష్టిలోని ప్రతి వస్తువు అల్లాహ్‌కు సాష్టాంగ ప్రణామం ఏ విధంగా చేస్తున్నది? ఈ విషయం అల్లాహ్‌కే తెలుసు. దీనికి మరో అర్థం ఇది కావచ్చు : అవిశ్వాసులతో సహా సృష్టిరాసులన్నీ దైవాజ్ఞలకు కట్టుబడి ఉన్నాయి. దైవాజ్ఞలను ధిక్కరించే ధైర్యం ఎవరికీ లేదు. అల్లాహ్ ఒకరికి ఆరోగ్య భాగ్యం ప్రసాదించినా, అనారోగ్యానికి గురిచేసినా, కలిమినిచ్చినా, లేమికి గురిచేసినా, జీవితాన్ని ప్రసాదించినా, మరణమొసగినా – ఈ అధికారాలను త్రోసి పుచ్చటం ఏ అవిశ్వాసి తరమూ కాదు.

28. ఇక్కడ స్వయానా దైవప్రవక్త (స) చేతే ఈ సమాధానం చెప్పించబడింది. అయితే ఆ కాలంలోని బహుదైవారాధకులు

لِاَنۡفُسِهِمۡ نَفۡعًا وَّلَا ضَرًّا ؕ قُلۡ هَلۡ يَسۡتَوِى الۡاَعۡمٰى وَالۡبَصِيۡرُ ۙ اَمۡ هَلۡ تَسۡتَوِى الظُّلُمٰتُ وَالنُّوۡرُ ۚ اَمۡ جَعَلُوۡا لِلّٰهِ شُرَكَآءَ خَلَقُوۡا كَخَلۡقِهٖ فَتَشَابَهَ الۡخَلۡقُ عَلَيۡهِمۡ ؕ قُلِ اللّٰهُ خَالِقُ كُلِّ شَىۡءٍ وَّهُوَ الۡوَاحِدُ الۡقَهَّارُ ⑯

చేకూర్చలేని వారిని మీ రక్షకులుగా చేసుకుంటున్నారా?"[29] అని వారిని అడుగు. "గుడ్డివాడూ – చూడగలిగేవాడు సమానులు కాగలరా? అంధకారాలూ – వెలుగూ ఒకటి కాగలవా?[30] పోనీ, వారి దృష్టిలో 'సృష్టి' అనేది సందేహాస్పదం కావటానికి, వారు అల్లాహ్‌కు భాగస్వాములుగా చేర్చినవారుగాని అల్లాహ్ మాదిరిగా దేన్నయినా సృష్టించారా?" అనికూడా వారిని అడుగు."అల్లాహ్‌యే అన్నింటినీ సృష్టించినవాడు. ఆయన ఒక్కడే.[31] ఆయన సర్వాధిక్యుడు" అని వారికి స్పష్టంగా చెప్పు.

اَنۡزَلَ مِنَ السَّمَآءِ مَآءً فَسَالَتۡ اَوۡدِيَةٌ ۢ بِقَدَرِهَا فَاحۡتَمَلَ السَّيۡلُ زَبَدًا رَّابِيًا ؕ وَمِمَّا يُوۡقِدُوۡنَ عَلَيۡهِ فِى النَّارِ ابۡتِغَآءَ حِلۡيَةٍ اَوۡ مَتَاعٍ زَبَدٌ مِّثۡلُهٗ ؕ كَذٰلِكَ يَضۡرِبُ اللّٰهُ الۡحَـقَّ وَالۡبَاطِلَ ؕ فَاَمَّا الزَّبَدُ

**17** ఆయనే ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించాడు. ప్రతి నదీ, ప్రతి కాలువా తన వైశాల్యాన్నిబట్టి ఆ నీటిని గ్రహించి బయలు దేరింది.[32] వరద వచ్చినప్పుడు నీళ్ళ ఉపరితలంపైకి నురుగు కూడా వచ్చింది.[33] నగల తయారీ కోసం, సామానుల కోసం అగ్నిలో కాల్చే వాటిపై (లోహాలపై) కూడా (ఈ విధమైన) నురుగే వస్తుంది.[34] ఈ విధంగా అల్లాహ్ సత్యాసత్యాల ఉదాహరణను

కూడా భూమ్యాకాశాల ప్రభువు అల్లాహ్‌యేనన్న సంగతిని ఒప్పుకునేవారని ఖుర్‌ఆన్‌లో ఇతర చోట్ల ప్రస్తావనకు వచ్చింది.

29. అల్లాహ్‌యే భూమ్యాకాశాలకు ప్రభువు అన్న సంగతి మీకు తెలిసినప్పుడు, మీరు ఆయన్ని వదిలేసి తమ స్వయానికి సయితం లాభంగానీ, నష్టంగానీ చేకూర్చుకోలేని బూటకపు స్వాముల వెనుక పడ్డారేమిటీ?

30. కళ్లున్నవాడు – కళ్లు లేనివాడు సమానులు కానట్లే ఏకదైవారాధకుడు – బహుదైవారాధకుడు కూడా సమానులు కాజాలరు. ఎందుకంటే ఏకదైవారాధకునికి (మువహ్హిద్‌కు) తౌహీద్ అనే జ్యోతి లభించింది. కాని బహుదైవోపాసకుడు ఈ భాగ్యానికి నోచుకోలేదు. ఏక దైవారాధకుడు మనోనేత్రంతో తౌహీద్ జ్యోతిని చూడగలుగుతాడు. కాని బహు దైవారాధకునికి ఆ జ్యోతి కానరాదు. ఎందుకంటే అతడు (మనోనేత్రం లోపించిన) గుడ్డివాడు. అతడు అజ్ఞానం, మూఢనమ్మకాల అంధకారంలో తచ్చాడుతూ ఉంటాడు. అందుకే అతడు ఏకదైవారాధకునితో సమానుడు కాజాలడు.

31. అసలు విషయం ఏమిటంటే 'సృష్టి' విషయంలో వారికెలాంటి అనుమానాలూ లేవు. సర్వాన్నీ సృష్టించినవాడు అల్లాహ్‌యేనని వారికి తెలుసు. తెలిసి కూడా వారు ఇలా ప్రవర్తిస్తున్నారు.

32. రెండు పర్వతాలకు మధ్య ఉండే లోయ ఎంత విస్తృతంగా ఉంటే అది అంతే ఎక్కువ నీటిని సమీకరించుకోగలుగుతుంది. ఇక్కడ దివ్య ఖుర్‌ఆన్ అవతరణను ఆకాశం నుంచి కురిసే వర్షంతో పోల్చటం జరిగింది. వర్షపు నీరు ఎలా మానవ తకు ప్రయోజనం చేకూరుస్తుందో దివ్య ఖుర్‌ఆన్ కూడా అలాగే ప్రయోజనం కలిగిస్తుంది. మానవ శరీరంలో ఉండే 'హృదయం' కూడా జలాశయం వంటిదే. ఆంతర్యం ఎంత విశాలవంతంగా ఉంటే అంతే ఎక్కువ ఖుర్‌ఆన్ భావామృతాన్ని అది గ్రహించగలుగుతుంది.

33. వర్షపు నీరు పొంగిపొరలుతున్నప్పుడు నీటిపైన ఏర్పడే నురుగు అట్టే సమయం ఉండదు. దాన్ని గాలి ఎగరేసుకుపోతుంది. లేదా అది ఎండకు ఇగిరిపోతుంది. అలాగే సత్యం వచ్చేసిన తరువాత అసత్యం నిష్క్రమిస్తుంది. ఆంతర్యంలో 'విశ్వాసం' అనే జ్యోతి చోటుచేసుకునేసరికి మిథ్యాభావాలన్నీ పటాపంచలై పోతాయి.

34. ఇది ఇంకొక ఉదాహరణ. బంగారు నగలు చేయాలన్నా, ఇత్తడి రాగి పాత్రలను తయారు చేయాలన్నా బంగారం,

స్పష్టపరుస్తున్నాడు.[35] కడకు నురుగంతా పనికి రాకుండా (ఎగిరి) పోతుంది.[36] ప్రజలకు ఉపయోగపడే వస్తువు మాత్రం భూమిలో మిగిలి ఉంటుంది.[37] ఈ విధంగా అల్లాహ్ ఉదాహరణల ద్వారా (విషయాన్ని) వివరిస్తున్నాడు.[38]

فَيَذْهَبُ جُفَآءً ۚ وَأَمَّا مَا يَنفَعُ ٱلنَّاسَ فَيَمْكُثُ
فِى ٱلْأَرْضِ ۚ كَذَٰلِكَ يَضْرِبُ ٱللَّهُ ٱلْأَمْثَالَ ﴿١٧﴾

**18** తమ ప్రభువు ఆజ్ఞను పాటించేవారి కొరకు మేలు ఉంది. ఆయన ఆజ్ఞను పాటించనివారు భూమిలో ఉన్న సమస్త సంపదకు యజమానులైనా, అంతకు మరింత సంపద కూడా వారికి ఉన్నా, దాన్నంతటినీ తమకు (విధించబడే శిక్షకు) బదులుగా ఇవ్వటానికి సిద్ధమవుతారు.[39] చెడ్డ (కఠినమైన) లెక్క[40] తీసుకోబడేది వారి నుంచే. నరకం వారి నివాసమవుతుంది. అది బహుచెడ్డ స్థలం.

لِلَّذِينَ ٱسْتَجَابُوا۟ لِرَبِّهِمُ ٱلْحُسْنَىٰ ۚ وَٱلَّذِينَ
لَمْ يَسْتَجِيبُوا۟ لَهُۥ لَوْ أَنَّ لَهُم مَّا فِى ٱلْأَرْضِ جَمِيعًا
وَمِثْلَهُۥ مَعَهُۥ لَٱفْتَدَوْا۟ بِهِۦٓ ۚ أُو۟لَٰٓئِكَ لَهُمْ
سُوٓءُ ٱلْحِسَابِ ۙ وَمَأْوَىٰهُمْ جَهَنَّمُ ۖ وَبِئْسَ
ٱلْمِهَادُ ﴿١٨﴾

**19** ఏమిటీ, నీ ప్రభువు తరఫున నీపై అవతరింపజేయబడినది నిలువెల్లా సత్యమని తెలుసుకున్న వాడునూ, గుడ్డివాడు ఒక్కటే అవుతారా?[41] విజ్ఞులు మాత్రమే హితబోధను గ్రహిస్తారు.[42]

أَفَمَن يَعْلَمُ أَنَّمَآ أُنزِلَ إِلَيْكَ مِن رَّبِّكَ ٱلْحَقُّ
كَمَنْ هُوَ أَعْمَىٰٓ ۚ إِنَّمَا يَتَذَكَّرُ أُو۟لُوا۟ ٱلْأَلْبَٰبِ ﴿١٩﴾

---

రాగి, ఇత్తడి వంటి లోహాలను అగ్నిలో కాల్చి, కరిగించి వాటికి పట్టిన తుప్పును, కల్తీని తొలగిస్తారు. అలా కాల్చేటప్పుడు ఆ లోహాలపై పొంగువస్తుంది. చూస్తూ ఉండగానే – కళ్ళముందరే ఆ నురుగు కాస్తా వాయువులో కలసిపోయి, మేలిమి లోహం మాత్రం మిగిలి ఉంటుంది.

35. సత్యాసత్యాల, ధర్మాధర్మాల ఉపమానం కూడా ఇటువంటిదే. అవి పరస్పరం ఎదుర్కొన్నప్పుడు అసత్యం ఎక్కువ కాలం ఉండదు. నీటిలోని నురుగులాగా, లోహంపైని కల్తీ సరుకులాగా అది తొలగిపోక తప్పదు.

36. అది ఎవరికీ ఎలాంటి ప్రయోజనాన్నీ చేకూర్చదు. క్రమంగా క్షీణించిపోతుంది. కరిగిపోతుంది, ఎగిరిపోతుంది. అసత్యం కూడా అంతే. సత్యం రాకముందు అది ఎంత ఆర్భాటం చేస్తుందో, సత్యం వచ్చిన పిదప అంతే వేగంగా గాల్లో కలసిపోతుంది.

37. అంటే కాల్చబడిన బంగారం, వెండి, ఇత్తడి, రాగి వంటి లోహాలు మేలిమి సరకు – నాణ్యమైన సరకు – రూపంలో మిగిలి ఉంటాయి. ప్రజలు వాటిని ఉపయోగంలోకి తీసుకువస్తారు. వాటి అస్థిత్వంలో క్షీణత రాదు. వాటి ప్రయోజనాలు కూడా దీర్ఘకాలికమైనవి.

38. అంటే విషయాన్ని ప్రజల మనస్సులో నాటుకునేలా చేయడానికి అల్లాహ్ ఇలాంటి ఉదాహరణలను ఇస్తూ ఉంటాడు. అల్ బఖరా సూరాలోని ఆరంభంలో కూడా కపటుల పరిస్థితిని విశదపరచటానికి ఇలాంటి ఉదాహరణలే ఇచ్చాడు. అలాగే నూర్ సూరాలోని 39, 40 ఆయతులలో అవిశ్వాసుల కోసం రెండు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా తన ప్రవచనాల (హదీసుల)లో ఇలాంటి ఉపమానాల ద్వారా ఎన్నో విషయాలను విడమరచి చెప్పారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

39. ఈ విషయం ఇంతకు ముందు కూడా రెండు మూడుసార్లు వచ్చింది.

40. ఇలాంటి వారి నుంచి చాలా కఠినంగా లెక్క తీసుకోబడుతుంది. ప్రతి చిన్న, పెద్ద దుష్కర్మపై వారు నిలదీయబడతారు.

الَّذِيْنَ يُوْفُوْنَ بِعَهْدِ اللّٰهِ وَلَا يَنْقُضُوْنَ الْمِيْثَاقَ ⑳

**20** (వారి గుణగణాలు ఇవి:) వారు అల్లాహ్‌కు ఇచ్చిన మాటను నిలుపుకుంటారు.[43] చేసుకున్న ఒప్పందాన్ని భంగపరచరు.[44]

وَالَّذِيْنَ يَصِلُوْنَ مَآ اَمَرَ اللّٰهُ بِهٖٓ اَنْ يُّوْصَلَ وَيَخْشَوْنَ رَبَّهُمْ وَيَخَافُوْنَ سُوْٓءَ الْحِسَابِ ㉑

**21** వేటినయితే కలిపి ఉంచమని అల్లాహ్ ఆదేశించాడో వాటిని కలిపి ఉంచుతారు.[45] వారు తమ ప్రభువుకు భయపడుతూ ఉంటారు. తమ నుండి కఠినంగా లెక్క తీసుకోబడుతుందేమోనని జడుస్తూ ఉంటారు.

وَالَّذِيْنَ صَبَرُوا ابْتِغَآءَ وَجْهِ رَبِّهِمْ وَاَقَامُوا الصَّلٰوةَ وَاَنْفَقُوْا مِمَّا رَزَقْنٰهُمْ سِرًّا وَّعَلَانِيَةً وَّيَدْرَءُوْنَ بِالْحَسَنَةِ السَّيِّئَةَ اُولٰٓئِكَ لَهُمْ عُقْبَى الدَّارِ ㉒

**22** వారు తమ ప్రభువు ప్రసన్నతను చూరగొనే ఉద్దేశంతో సహనం పాటిస్తారు.[46] నమాజులను నెలకొల్పుతారు.[47] మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి గోప్యంగానూ, బహిరంగం గానూ ఖర్చుపెడతారు.[48] చెడును సయితం మంచితనంతో పార ద్రోలుతారు.[49] అంతిమ నిలయం ఉన్నది ఇలాంటి వారి కొరకే.[50]

కఠిన లెక్క తీసుకోబడిన వాడు దేవుని పట్టునుంచి తప్పించుకోవటం అసంభవం. అందుకే "వారి నివాస స్థానం నరకం" అని ఆ తరువాతి వాక్యంలో చెప్పబడింది.

41. ఒక వ్యక్తి దివ్య ఖుర్ఆన్‌లోని అంశాలన్నీ పరమ సత్యమని దృఢ నమ్మకం కలిగి ఉండగా, మరో వ్యక్తి అడుగడుగునా ఖుర్ఆన్ భాగాలపై అనుమానం పెంచుకుంటున్నాడు. సంశయాల్లో–సందేహాల్లో ఊగిసలాడుతున్నాడు – వీరిరువురూ సమానులు కాగలరా? ఎట్టిపరిస్థితిలోనూ సమానులు కాజాలరు. కల్తీ–మేలిమి సమానం కానట్లే, నీరు–నురుగు సమానం కానట్లే ఈ విశ్వాసి – అవిశ్వాసి సమానులు కాజాలరు.

42. ఇంగితజ్ఞానం, నిష్కల్మషత్వం లేనివారు హితబోధను గ్రహించలేరు. అలాగే తమ హృదయాల్ని నిరంతర పాపాలతో మలినం చేసుకున్నవారు, చెడు భావాలతో తమ మస్తిష్కాలను చెడగొట్టుకున్న వారు కూడా ఈ ఖుర్ఆన్ ద్వారా నీతిని గ్రహించలేరు.

43. విజ్ఞత, వివేచన గల వారి గుణగణాలు ఇక్కడ వివరించబడ్డాయి. వారు దైవాజ్ఞలను ఖచ్చితంగా పాటిస్తారు. అంటే దేవుడు చేయమన్న వాటిని చేస్తారు. చేయకూడదని చెప్పిన వాటిని విడనాడతారు. అంటే వారు తమ హద్దుల్లో ఉంటారు. నియమాలను ఉల్లంఘించరు. మూలంలో 'వాగ్దానం' గురించిన ప్రస్తావన వచ్చింది. ఇక్కడ వాగ్దానం అంటే దేవుని ఆజ్ఞలు, నిషిద్ధాంశాలూ కావచ్చు లేక 'అలస్తు' వాగ్దానం కూడా కావచ్చు. దీని గురించి అల్ ఆరాఫ్ సూరాలో కూడా వచ్చింది.

44. అంటే మనుషులు పరస్పరం చేసుకునే వివిధ రకాల ఒప్పందాలు, వాగ్దానాలు లేదా దైవానికి – దాసులకు మధ్య గల బాసలు.

45. అంటే వారు బంధుత్వ సంబంధాలను పెంపొందించటానికీ, బంధుత్వ హక్కులను నెరవేర్చటానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు. తెగత్రెంపుల వైఖరికి దూరంగా ఉంటారు.

46. అంటే దైవాజ్ఞల ఉల్లంఘనకు పాల్పడే విషయంలో భయపడతారు. పాపకార్యాలకు దూరంగా ఉంటారు. దైవాజ్ఞల్ని ఉల్లంఘించకుండా జాగ్రత్తపడటం, పాపకార్యాలకు దూరంగా ఉండటం కూడా ఒక రకంగా సహనమే. అంతేకాదు, వారు కష్టాలు, బాధలు ఎదురైనప్పుడు కూడా ఓర్పు వహిస్తారు. ఇతరుల వల్ల ఎదురయ్యే అవరోధాలను కూడా నిగ్రహంతో అధిగమిస్తారు. కోపాన్ని దిగమ్రింగుతారు. వారి ఈ వైఖరి వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఒక్కటే – దైవప్రీతిని బడయటం!

**23** శాశ్వతంగా[51] ఉండే స్వర్గవనాలలోకి వారు ప్రవేశిస్తారు. వారి పూర్వీకులలో, వారి భార్యాబిడ్డలలో సజ్జనులైనవారు కూడా[52] (వారితోపాటే స్వర్గానికి వెళతారు). దైవదూతలు అన్ని ద్వారాల నుండి వారివద్దకు వస్తారు.

جَنّٰتُ عَدۡنٍ يَّدۡخُلُوۡنَهَا وَمَنۡ صَلَحَ مِنۡ
اٰبَآئِهِمۡ وَاَزۡوَاجِهِمۡ وَذُرِّيّٰتِهِمۡ وَالۡمَلٰٓئِكَةُ
يَدۡخُلُوۡنَ عَلَيۡهِمۡ مِّنۡ كُلِّ بَابٍ ۚ (23)

**24** "మీరు చూపిన సహనానికి బదులుగా మీపై శాంతి కురియు గాక! (మీకు లభించిన) ఈ అంతిమ గృహం ఎంత మంచిది!" అని వారు అంటారు.

سَلٰمٌ عَلَيۡكُمۡ بِمَا صَبَرۡتُمۡ فَنِعۡمَ عُقۡبَى الدَّارِ ؕ (24)

**25** మరెవరయితే అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడికను దృఢ పరచిన తరువాత భంగపరుస్తారో, ఇంకా అల్లాహ్ కలపమని ఆజ్ఞాపించిన వాటిని త్రెంచేస్తారో, భూమిలో అలజడిని సృష్టిస్తారో వారే శాపానికి అర్హులు. వారికోసం బహుచెడ్డ నిలయం ఉంది.[53]

وَالَّذِيۡنَ يَنۡقُضُوۡنَ عَهۡدَ اللّٰهِ مِنۡۢ بَعۡدِ مِيۡثَاقِهٖ
وَيَقۡطَعُوۡنَ مَاۤ اَمَرَ اللّٰهُ بِهٖۤ اَنۡ يُّوۡصَلَ
وَيُفۡسِدُوۡنَ فِى الۡاَرۡضِ ۙ اُولٰٓئِكَ لَهُمُ اللَّعۡنَةُ
وَلَهُمۡ سُوۡٓءُ الدَّارِ (25)

47. నమాజులను నియమబద్ధంగా చేస్తారు. నిర్ణీత వేళలలో చేస్తారు. నమాజులలో అణకువను, ఏకాగ్రతను, భక్తినీ కలిగి ఉంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు చేసినట్లుగా నమాజులు చేస్తారు. అంతేగాని తమ యిష్టానుసారం చేయరు.

48. అంటే దైవమార్గంలో ఖర్చుపెట్టవలసిన సమయం సందర్భాలను గుర్తెరిగి అయినవారికీ, కానివారికి కూడా గుట్టుగానూ, బహిరంగంగానూ దానధర్మాలు చేస్తారు. అవసరాల్లో వారిని ఆదుకుంటారు.

49. అంటే ఎవరివల్ల ఏ అవాంఛనీయమైన పరిస్థితి వారికి ఎదురైనా హుందాగా స్పందిస్తారు. రెచ్చిపోకుండా – నిగ్రహం కనబరుస్తారు. నకారాత్మకంగా కాకుండా సకారాత్మకంగా స్పందిస్తారు. వీలయినంతవరకు ఉపేక్షను కనబరుస్తారు. లేదా మన్నింపుల వైఖరిని అవలంబిస్తారు. ఈ విషయమే దివ్య గ్రంథంలో వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది : "(ఓ ప్రవక్తా!) చెడును అత్యుత్తమమైన మంచిద్వారా పారద్రోలు. (నువ్వు గనక అలా చేశావంటే) నీకు బద్ధవిరోధిగా ఉన్నవాడే నీకు ఆప్త మిత్రుడై పోతాడు" (హామీమ్ అస్సజ్దా – 34).

50. అంటే, ఎవరెవరిలోనయితే ఈ ఉత్తమ గుణాలుంటాయో, ఎవరు నైతికంగా ఈ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారో వారి కొరకు పరలోకంలో నెమ్మది నెలవు ఉంది.

51. అరబీలో **'అద్న్'** (عَدۡنٍ) అని ఉంది. అద్న్ అంటే స్థిరమైనది, ఎల్లప్పటికీ ఉండేది అని అర్థం.

52. వారితో పాటు వారి రక్త సంబంధీకుల్లోని సజ్జనులను కూడా అల్లాహ్ ఒకచోట చేరుస్తాడు. ఒకరినొకరు చూసుకుని ఆనందిస్తారు. ఆ విధంగా వారి కళ్లకు చలువ ప్రాప్తిస్తుంది. స్వర్గంలో అధమాతి అధమ శ్రేణిలో ఉండే బంధువులను కూడా అల్లాహ్, ఉన్నతశ్రేణిలో ఉన్న బంధువులతో తీసుకుపోయి కలుపుతాడు. ఈ విధంగా సెలవిచ్చాడాయన: "విశ్వసించిన వారితోపాటు వారి సంతానం కూడా విశ్వసించి వారిని అనుసరించి ఉంటే, వారి సంతానాన్ని కూడా మేము వారితో కలుపుతాము. వారి పుణ్యఫలాన్ని మేము ఏ మాత్రం తగ్గించము" (తూర్–21).

ఈ ఆయతు ద్వారా బోధపడే మరో ముఖ్య విషయం ఏమిటంటే, విశ్వసించి, సత్కార్యాలు చేసిన బంధుమిత్రులను దేవుడు స్వర్గంలో ఒక చోట చేరుస్తాడు. నిజమే. అయితే విశ్వాసం (ఈమాన్), సదాచరణ (అమలె సాలెహ్)ల పెట్టుబడి లేని బంధుమిత్రులకు ఇది వర్తించదు. ఇవి రెండూ లేనివారు అత్యంత సమీప బంధువులైనప్పటికీ వారు వాళ్లను స్వర్గంలో కలుసుకోలేరు. ఎందుకంటే స్వర్గ ప్రవేశం అనేది వంశం, బంధుత్వాల ఆధారంగా జరగదు.

**26** అల్లాహ్ తాను కోరిన వారి ఉపాధిని పెంచుతాడు, తాను కోరిన వారికి తగ్గిస్తాడు.[54] వారు ప్రాపంచిక జీవితంలోనే పూర్తిగా లీనమైపోయారు.[55] యదార్థానికి పరలోకం ముందు ప్రాపంచిక జీవితం అత్యంత (అల్పమైన) సామగ్రి మాత్రమే.[56]

اَللّٰهُ يَبْسُطُ الرِّزْقَ لِمَنْ يَّشَآءُ وَيَقْدِرُ ؕ وَفَرِحُوْا بِالْحَيٰوةِ الدُّنْيَا ؕ وَمَا الْحَيٰوةُ الدُّنْيَا فِى الْاٰخِرَةِ اِلَّا مَتَاعٌ ﴿۲۶﴾

**27** “అతనిపై (ముహమ్మద్‌పై) అతని ప్రభువు తరఫు నుంచి ఏదైనా మహిమ ఎందుకు అవతరించదు?” అని అవిశ్వాసులు అంటున్నారు. “అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు, తన వైపుకు మరలేవారికి ఆయన సన్మార్గం చూపుతాడు” అని వారికి చెప్పు.

وَيَقُوْلُ الَّذِيْنَ كَفَرُوْا لَوْلَاۤ اُنْزِلَ عَلَيْهِ اٰيَةٌ مِّنْ رَّبِّهٖ ؕ قُلْ اِنَّ اللّٰهَ يُضِلُّ مَنْ يَّشَآءُ وَيَهْدِىْۤ اِلَيْهِ مَنْ اَنَابَ ﴿۲۷﴾

**28** విశ్వసించిన వారి హృదయాలు అల్లాహ్ స్మరణ ద్వారా తృప్తి చెందుతాయి. తెలుసుకోండి! అల్లాహ్ స్మరణ ద్వారానే హృదయాలు నెమ్మదిస్తాయి.[57]

اَلَّذِيْنَ اٰمَنُوْا وَتَطْمَئِنُّ قُلُوْبُهُمْ بِذِكْرِ اللّٰهِ ؕ اَلَا بِذِكْرِ اللّٰهِ تَطْمَئِنُّ الْقُلُوْبُ ﴿۲۸﴾

---

దానికోసం విశ్వాసం, సదాచరణ చాలా అవసరం. “ఎవరి కర్మ అయితే అతన్ని వెనక్కి నెట్టివేసిందో అతని వంశం అతన్ని ముందుకు తీసుకుపోజాలదు” (సహీహ్ ముస్లిం – కితాబుజ్జిక్ర్ వ ద్దుఆ ....) అన్న హదీసు ఈ సందర్భంగా గమనార్హం.

53. సజ్జనులతో పాటు దుర్జనుల ప్రస్తావన కూడా వచ్చింది. దుర్జనులకు పట్టే గతేమిటో తెలిపి, మానవులు ఆ దుష్పరిణామం పట్ల అప్రమత్తంగా ఉండేట్లు చేయటం దీని ఉద్దేశం.

54. అవిశ్వాసుల, ముష్రిక్కుల కొరకు పరలోకంలో చెడ్డ నివాసం ఉందని అంటూనే అల్లాహ్ వారికి ప్రపంచ జీవితంలో అన్ని రకాల సౌకర్యాలను, వసతులను కల్పిస్తున్నాడు కదా! అన్న సందేహం జనించవచ్చు. అందుకే ప్రాపంచిక జీవనోపాధిని పెంచే, తగ్గించే అధికారం అల్లాహ్ చేతిలో ఉందని ఇక్కడ స్పష్టపరచటం జరిగింది. ఆయన తాను కోరిన వారికి ఎక్కువగానూ, తాను తలచిన వారికి తక్కువగానూ ఇచ్చే అధికారం కలిగి ఉన్నాడు. ఈ హెచ్చుతగ్గుల్లో ఉన్న నిగూఢార్థం ఆయనకే తెలుసు. ఎవరికయినా ఆస్తిపాస్తులు, ఆదాయం అధికంగా ఉన్నంత మాత్రాన అల్లాహ్ వారిని అమితంగా ప్రేమిస్తున్నాడని దీని అర్థం ఎంతమాత్రం కాదు. అలాగే ఎవరికయినా జీవనోపాధి తక్కువగా లభిస్తుంటే అల్లాహ్ వారిపై ఆగ్రహించాడని అర్థం కాదు.

55. ఒక వ్యక్తి లేక ఒక జాతి దైవాజ్ఞలను నిరంతరం ధిక్కరిస్తున్నప్పటికీ దేవుడు వారికి పుష్కలంగా ఉపాధిని ప్రసాదిస్తుంటే అది సంతోషించదగ్గ విషయం అనుకోకండి. వారికి దేవుడు పెట్టిన గడువు అది. గడువు ముగియగానే వారంతా దేవుని ఉచ్చులో పడి గిలగిలా కొట్టుకుంటారు.

56. హదీసులో ఇలా ఉంది: “ఒక వ్యక్తి సముద్రంలో వేలును ముంచి తీస్తే అతని వేలికి ఎంత నీరు తగులుతుందో పరలోకం ముందు ప్రపంచ స్థాయి కూడా అంతే” (సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్). వేరొక హదీసు ప్రకారం మహనీయ ముహమ్మద్ (సఅసం) సాగిపోతున్నదారిలో ఒక చచ్చిన మేకపిల్ల పడి ఉంది. దాన్ని చూచి ఆయన (స) ఇలా అన్నారు – “దైవసాక్షి! ఈ మేక పిల్లను పారవేస్తున్నప్పుడు దీని యజమానుల దృష్టిలో ఇది ఎంత అల్పమైన వస్తువో అల్లాహ్ దృష్టిలో ఈ ప్రపంచం అంతకన్నా అల్పమైనది.” (సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్ వర్రిఖాఖ్).

57. అల్లాహ్ స్మరణ అంటే ఆయన ఏకత్వాన్ని, గొప్పదనాన్ని కొనియాడటం అని భావం. ఇలా చేయటం వల్ల ఒక వైపు

29 విశ్వసించి, మంచిపనులు చేసినవారు సౌభాగ్యవంతులు.[58] వారి కొరకు మంచి నివాసం ఉంటుంది.

الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ طُوبَىٰ لَهُمْ وَحُسْنُ مَآبٍ ﴿٢٩﴾

30 (ఓ ముహమ్మద్!) అదే విధంగా మేము నిన్ను ఈ సమాజం లోకి పంపాము[59] – ఇంతకు మునుపు ఎన్నో సమాజాలు గతించాయి – మా తరఫున నీపై అవతరించిన వాణిని నువ్వు వారికి చదివి వినిపించటానికి. కరుణామయుడైన అల్లాహ్‌ను వారు తిరస్కరిస్తున్నారు.[60] వారికి చెప్పు: "ఆయనే నా పోషకుడు. ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధనకు అర్హులు కానేకారు.[61] నేను ఆయన్నే నమ్ముకున్నాను – ఆయన వైపుకే నేను మరలు తున్నాను."

كَذَٰلِكَ أَرْسَلْنَاكَ فِي أُمَّةٍ قَدْ خَلَتْ مِن قَبْلِهَا أُمَمٌ لِّتَتْلُوَ عَلَيْهِمُ الَّذِي أَوْحَيْنَا إِلَيْكَ وَهُمْ يَكْفُرُونَ بِالرَّحْمَٰنِ ۚ قُلْ هُوَ رَبِّي لَا إِلَٰهَ إِلَّا هُوَ عَلَيْهِ تَوَكَّلْتُ وَإِلَيْهِ مَتَابِ ﴿٣٠﴾

31 ఒకవేళ ఏదైనా (ఆకాశ గ్రంథమైన) ఖుర్‌ఆన్ ద్వారా పర్వతాలు నడిపింపబడినా, భూమి బ్రద్దలు కొట్టబడినా, లేదా శవాల చేత మాట్లాడించినా (వీళ్లు మాత్రం విశ్వసించేవారు కారు) – వాస్తవానికి ఈ పనులన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి.[62] అల్లాహ్ గనక తలచుకుంటే సమస్త మానవాళినీ

وَلَوْ أَنَّ قُرْآنًا سُيِّرَتْ بِهِ الْجِبَالُ أَوْ قُطِّعَتْ بِهِ الْأَرْضُ أَوْ كُلِّمَ بِهِ الْمَوْتَىٰ ۗ بَل لِّلَّهِ الْأَمْرُ جَمِيعًا ۗ أَفَلَمْ يَيْأَسِ الَّذِينَ آمَنُوا أَن لَّوْ يَشَاءُ اللَّهُ لَهَدَى النَّاسَ جَمِيعًا ۗ وَلَا يَزَالُ الَّذِينَ

విశ్వాసుల మనసులు కుదుటపడుతుంటే, మరోవైపు అవిశ్వాసుల ఆంతర్యాల్లో కలవరం మొదలవుతుంది. లేదా దైవారాధన, ఖుర్‌ఆన్ పారాయణం, దుఆలు, స్వచ్ఛంద (నఫిల్) నమాజులు విశ్వాసుల హృదయాలకు శక్తినీ, తృప్తినీ చేకూరుస్తాయి. అలాగే దైవాజ్ఞలను ఖచ్చితంగా పాటించటం వల్ల విశ్వాసుల గుండెలు నిమ్మళిస్తాయి. లేకపోతే అవి వ్యాకులతకు లోనై ఉంటాయి.

58. ఆయతులో **'తూబా'** అని ఉంది. దీనికి పలు అర్థాలున్నాయి. ఉదాహరణకు : మేలు, మంచిది, విచిత్రం, ఎల్లరూ ఈర్ష్యచెందేలా ఉండే భాగ్యం, స్వర్గంలోని ప్రత్యేక వృక్షం లేక ప్రత్యేక స్థలం. వీటన్నింటి భావం ఒక్కటే – స్వర్గంలో వారికి ప్రాప్తించే దైవానుగ్రహాలు, అంతస్తులు చాలా గొప్పవి అని.

59. మా సందేశాన్ని ప్రజలకు అందజేయడానికి మేము నిన్ను ప్రవక్తగా నియమించినట్లే, లోగడ కూడా మేము ఎన్నో జాతుల వారి వద్దకు ఎంతోమంది ప్రవక్తలను పంపి ఉన్నాము. వీళ్లు నిన్ను ధిక్కరిస్తున్నట్లే వెనుకటి జాతుల వారు కూడా తమ ప్రవక్తలను ధిక్కరించారు. ధిక్కార వైఖరి కారణంగా వెనుకటి జాతులకు పట్టిన గతేమిటో వీళ్లు చూడాలి. నిర్భయంగా, నిశ్చింతగా ఉండటం మంచిది కాదు. ఇప్పటికయినా వారు రుజువర్తనులు కాకపోతే వీరికీ అదే గతి పట్టవచ్చు. తస్మాత్ జాగ్రత్త!

60. **'కరుణామయుడు'** (రహ్మాన్) అనే సరికి మక్కాకు చెందిన ముష్రిక్కులు బెదిరిపోయేవారు. 'హుదైబియా ఒప్పందం' సందర్భంగా "కరుణామయుడు, కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో...." అని ఒడంబడిక పత్రంపై రాస్తే ఆ పదాలేమిటో తమకు అర్థం కావటం లేదని చెప్పి మార్పులు చేయించారు (ఇబ్నె కసీర్).

61. ఆ కరుణామయుడు ఎవరనుకున్నారు? ఆయన నా ప్రభువు. ఆయన తప్ప మరో ఆరాధ్య దేవుడు లేనేలేడు.

62. ఈ వాక్యానికి వ్యాఖ్యానంగా ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: "ప్రతి ఆకాశ గ్రంథం (దైవగ్రంథం) 'ఖుర్‌ఆన్' అనబడుతుంది. ఒక హదీసులో ఇలా ఉంది – 'దైవప్రవక్త హజ్రత్ దావూదు (అలైహిస్సలాం) ఒక జంతువును సిద్ధం చేయమని ఆజ్ఞాపించి, అది సిద్ధం చేయబడేలోపే ఒకసారి ఖుర్‌ఆన్‌ను పారాయణం చేసేవారు' (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా). దీని ప్రకారం ఇక్కడ ఖుర్‌ఆన్ అంటే జబూర్ గ్రంథమని భావం.

كَفَرُوْا تُصِيْبُهُمْ بِمَا صَنَعُوْا قَارِعَةٌ اَوْتَحُلُّ قَرِيْبًا مِّنْ دَارِهِمْ حَتّٰى يَاْتِيَ وَعْدُ اللّٰهِ ؕ اِنَّ اللّٰهَ لَا يُخْلِفُ الْمِيْعَادَ ﴿31﴾

సన్మార్గంపైకి తేగలడు. విశ్వాసుల మనసు కుదుటపడటానికి ఈ ఒక్క విషయం సరిపోదా? అవిశ్వాసులకు వారి అవిశ్వాస పోకడల ఫలితంగా ఎల్లప్పుడూ ఏదో ఒక ఆపద వస్తూనే ఉంటుంది లేదా వారి ఇళ్లకు సమీపంలోనే అది వచ్చిపడుతూ ఉంటుంది.[63] అల్లాహ్ వాగ్దానం నెరవేరే వరకూ ఈ స్థితి నెలకొనే ఉంటుంది.[64] నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానానికి వ్యతిరేకంగా చేయడు.

وَلَقَدِ اسْتُهْزِئَ بِرُسُلٍ مِّنْ قَبْلِكَ فَاَمْلَيْتُ لِلَّذِيْنَ كَفَرُوْا ثُمَّ اَخَذْتُهُمْ ۫ فَكَيْفَ كَانَ عِقَابِ ﴿32﴾

**32** (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం ఎంతో మంది ప్రవక్తలు పరిహసించబడ్డారు. మరి నేను కూడా అవిశ్వాసులకు (కొంత) విడుపు ఇచ్చాను. ఆ తరువాత (అకస్మాత్తుగా) పట్టుకున్నాను. అప్పుడు నా శిక్ష ఎంత భయంకరంగా ఉందో(చూశారా!)[65]

اَفَمَنْ هُوَ قَآئِمٌ عَلٰى كُلِّ نَفْسٍ بِمَا كَسَبَتْ ۚ وَجَعَلُوْا لِلّٰهِ شُرَكَآءَ ؕ قُلْ سَمُّوْهُمْ ؕ اَمْ تُنَبِّـُٔوْنَهٗ

**33** ఏమిటీ, ఒక్కొక్క ప్రాణి చేసే కర్మలను పర్యవేక్షిస్తున్నటువంటి అల్లాహ్‌కా వీళ్లు సహవర్తుల్ని కల్పించేది?[66] వారిని అడుగు: "కాస్త వారి పేర్లయినా చెప్పండి![67] ఏమిటీ, భూమిలో అల్లాహ్‌కే

ఈ ఆయతుకు సారాంశం ఏమిటంటే పర్వతాలను కదిలించే, భూమిని చీల్చే, శవాలచేత మాట్లాడించే శక్తి గల దైవగ్రంథం ఏదయినా పూర్వం అవతరించి ఉంటే అటువంటి శక్తి ఈ ఖుర్ఆన్ గ్రంథంలో మిగతా వాటన్నింటికంటే ఎక్కువగా ఉండేది. ఎందుకంటే ఈ ఖుర్ఆన్ గ్రంథం పురాతన గ్రంథాలన్నింటికంటే ఎంతో మహత్పూర్వక మైనది. దేవుడు గనక తలచుకుంటే ఇలాంటి అద్భుతాలను గ్రంథం ద్వారా చేసి చూపించగలడు. కాని లాభం ఏమిటీ? ఎన్ని అద్భుతాలను ప్రదర్శించినా వీళ్ళల్లోని తిరస్కారపు తిక్క కుదరదు. వాళ్లు సన్మార్గానికి రావటం, రాకపోవటం అన్నది దైవేచ్ఛపై ఆధారపడి ఉంది – మహిమలపై ఆధారపడి లేదు. దేవుడు ఏది చేయాలంటే అది చేయగలడు.

63. వారికి కనువిప్పు కలిగించేందుకు అవి వారి పరిసరాలలోనే వివిధ రకాలుగా సంభవిస్తూ ఉంటాయి. వారు సయితం వాటిని గమనిస్తూ ఉంటారు.

64. ప్రళయం సంభవించే వరకూ లేదా ఇస్లాంను అనుసరించేవారికి సంపూర్ణ ఆధిక్యత లభించేవరకూ 'హెచ్చరికల' రూపంలో ఆపదలు అప్పుడప్పుడూ వస్తూనే ఉంటాయి.

65. "అల్లాహ్ దుర్మార్గుడికి గడువు ఇస్తూ పోతాడు. ఆఖరికి అతన్ని పట్టుకున్నాడంటే వదలిపెట్టే ప్రసక్తే ఉండదు" అని హదీసులో ఉంది. ఇలా ప్రవచించిన తరువాత మహనీయ ముహమ్మద్ (స) ఈ ఆయతును పారాయణం చేశారు: "నీ ప్రభువు ఏదైనా దుర్మార్గపు పట్టణాన్ని పట్టదలచుకుంటే ఆయన పట్టు ఇలాగే ఉంటుంది. నిజంగా ఆయన పట్టు చాలా కఠినంగానూ, బాధాకరంగానూ ఉంటుంది" (హూద్ – 102). (సహీహ్ బుఖారీ – హూద్ సూరా వ్యాఖ్యానం; సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

66. అంటే, సర్వాధికారాలు గల అల్లాహ్ – ఏ అధికారమూ లేని మిథ్యా దైవాలు ఒకటి కాగలరా? అల్లాహ్‌ను కాదని వారు పూజించే మిథ్యా దైవాలకు ఒకరికి మేలుగానీ, కీడుగానీ కలిగించే శక్తి లేదు. అవి చూడలేవు. వినలేవు. పలకలేవు. ఆలోచించే శక్తి కూడా వాటికి లేదు. అలాంటప్పుడు సర్వాధికారి అయిన నిజ దైవంతో వాటిని సమానంగా భావించటం సమంజసమేనా?

بِمَا لَا يَعْلَمُ فِي الْأَرْضِ أَمْ بِظَاهِرٍ مِّنَ الْقَوْلِ ۗ بَلْ زُيِّنَ لِلَّذِينَ كَفَرُوا مَكْرُهُمْ وَصُدُّوا عَنِ السَّبِيلِ ۗ وَمَن يُضْلِلِ اللَّهُ فَمَا لَهُ مِنْ هَادٍ (33)

తెలియని విషయాలు మీరు ఆయనకు తెలియపరుస్తున్నారా? లేక పై పై మాటలు చెబుతున్నారా?[68] అసలు విషయం ఏమిటంటే తిరస్కార వైఖరిపై మొండికేసిన వారికి, వారి కుతంత్రాలు అందంగా (కానవచ్చేలా) చేయబడ్డాయి.[69] వారు సన్మార్గం నుంచి ఆపివేయబడ్డారు. అల్లాహ్ అపమార్గానికి లోనుచేసినవారిని ఎవరూ సన్మార్గానికి తేలేరు.[70]

لَهُمْ عَذَابٌ فِي الْحَيَاةِ الدُّنْيَا ۖ وَلَعَذَابُ الْآخِرَةِ أَشَقُّ ۖ وَمَا لَهُم مِّنَ اللَّهِ مِن وَاقٍ (34)

**34** అలాంటి వారికి ప్రాపంచిక జీవితంలోనూ శిక్ష ఉంది.[71] ఇక పరలోక శిక్ష అయితే ఇంతకంటే ఎంతో కఠినమైనది.[72] అల్లాహ్ ఆగ్రహం నుంచి వాళ్ళను కాపాడే వాడెవడూ ఉండడు.

مَّثَلُ الْجَنَّةِ الَّتِي وُعِدَ الْمُتَّقُونَ ۖ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ ۖ أُكُلُهَا دَائِمٌ وَظِلُّهَا ۚ تِلْكَ عُقْبَى الَّذِينَ اتَّقَوا ۖ وَّعُقْبَى الْكَافِرِينَ النَّارُ (35)

**35** (అల్లాహ్ పట్ల) భయభక్తులు కలిగివుండే వారికి వాగ్దానం చేయబడిన స్వర్గం ఇలా ఉంటుంది : దాని క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. దాని పండ్లు ఫలాలు ఎన్నటికీ తరగనివి. దాని నీడ కూడా శాశ్వతమైనది. భయభక్తులు కలవారి అంతిమ పరిణామం ఇది.[73] కాగా; తిరస్కారుల అంతిమ పరిణామం నరకం.

---

67. మీరు నిజదైవాన్ని వదలి పూజిస్తున్న మిథ్యా దైవాల పేర్లేమిటో కాస్త చెప్పండి – వాటికి ఏ పాటి శక్తి ఉందో చూద్దాం. అల్లాహ్‌కు ఏమీ తెలియదని మీరు అనుకుంటున్నారా? మీరు ఆయనకే కబుర్లు చెప్పేటంతటి వారయ్యారా? మీరు పూజిస్తున్న మిథ్యా దైవాలకు ఏ పాటి వాస్తవికత లోకంలో ఉండివున్నా అల్లాహ్‌కు దాని గురించి తెలిసి ఉండేది. ఆయనకు తెలియని విషయమంటూ ఏదీ లేదు.

68. అంటే మీరు పూజిస్తున్న బూటకపు దైవాల గురించి మీరు చెప్పుకునేవన్నీ ఊహాజనితమైన మాటలే! వాటికెలాంటి ఆధారం లేదు. అవి మిమ్మల్ని ఉద్ధరిస్తాయని తలపోసి ఏవేవో పేర్లు పెట్టుకున్నారు. వాటికి లేనిపోని మహిమల్ని అంటగట్టారు. నిజానికి మీరు అనుకునేవి ఏవీ అవి చేయలేవు. "నిజానికి ఇవి మీరు, మీ తాతముత్తాతలు పెట్టుకున్న కొన్ని పేర్లు మాత్రమే. వాటికి సంబంధించిన ఏ ఆధారాన్నీ అల్లాహ్ పంపలేదు. వీరు కేవలం ఊహలను, మనోవాంఛలను అనుసరిస్తున్నారు" (నజ్మ్ – 23).

69. కుతంత్రాలు అంటే వారి అంధ విశ్వాసాలు, దుష్కర్మలు. వారి పనులు వారికి చాలా అందమైనవిగా కనిపించేలా షైతాన్ వల పన్నాడు. వారు నడిచే అపమార్గం సయితం వారికి ఎంతో చక్కని మార్గంగా, రాచబాటగా కనిపిస్తుంది.

70. దివ్య ఖుర్ఆన్‌లోనే మరోచోట ఈ విధంగా సెలవీయబడింది : 1. "అల్లాహ్ ఏ వ్యక్తినయినా మార్గభ్రష్టుణ్ణి చేయదలిస్తే, అల్లాహ్ (పట్టు) నుంచి అతన్ని కాపాడటానికి నువ్వేమీ చెయ్యలేవు" (అల్ మాయిద – 41). 2. ఇంకో చోట ఇలా అనబడింది : "(ఓ ప్రవక్తా!) వారిని సన్మార్గానికి తీసుకురావాలని నువ్వు కోరుకున్నా, తాను మార్గభ్రష్టతకు గురిచేసిన వానిని అల్లాహ్ సన్మార్గంపైకి తీసుకురాడు. వారిని ఆదుకునే వారు ఎవరూ లేరు" (అన్ నహ్ల్ – 37).

71. అంటే యుద్ధ సందర్భాలలో ముస్లిముల ద్వారా వారికి కలిగే ధననష్టం, ప్రాణనష్టం, ఖైదీలుగా పట్టుబడటం అన్నమాట!

72. పరలోక నష్టంతో పోల్చుకుంటే ప్రాపంచిక నష్టం బహుస్వల్పం. ఎందుకంటే పరలోకం శాశ్వతమైనది, ప్రపంచం తాత్కాలికమైనది. పరలోకానికి నశింపులేదు. కాని ప్రపంచం నశిస్తుంది. ప్రపంచంలోని అగ్నికన్నా నరకాగ్ని 69 రెట్లు తీవ్రమైనది. అందుచేత పరలోక శిక్ష కఠినాతికఠినంగా ఉంటుందని అంటే ఆశ్చర్యపోనవసరం లేదు. అందుకే

36 (ఓ ప్రవక్తా!) ఎవరికైతే మేము గ్రంథం ఇచ్చి ఉన్నామో[74] వారు, నీపై అవతరింపజేయబడే దాని పట్ల సంతోషిస్తూ ఉంటారు.[75] ఇతర వర్గాలవారు ఇందులోని కొన్ని భాగాలను తిరస్కరిస్తున్నారు.[76] "నేను అల్లాహ్‌ను ఆరాధించాలనీ, ఆయనకు భాగస్వామ్యం కల్పించరాదని మాత్రమే నాకు ఆజ్ఞాపించబడింది. కాబట్టి ఆయన వైపుకే నేను పిలుపు ఇస్తున్నాను. ఆయన వైపే నేను మరలుతున్నాను" అని నువ్వు వారికి చెప్పేయి.

وَالَّذِيْنَ اٰتَيْنٰهُمُ الْكِتٰبَ يَفْرَحُوْنَ بِمَآ اُنْزِلَ
اِلَيْكَ وَمِنَ الْاَحْزَابِ مَنْ يُّنْكِرُ بَعْضَهٗ ؕ قُلْ
اِنَّمَآ اُمِرْتُ اَنْ اَعْبُدَ اللّٰهَ وَلَآ اُشْرِكَ بِهٖ ؕ
اِلَيْهِ اَدْعُوْا وَاِلَيْهِ مَاٰبِ ﴿36﴾

37 ఇదే విధంగా మేము ఈ ఖుర్ఆన్‌ను అరబీ భాషలో (ఉన్న) ఉత్తర్వుగా పంపాము.[77] జ్ఞానం వచ్చేసిన తరువాత[78] కూడా నువ్వు గనక వారి కోరికలను[79] అనుసరించావంటే అల్లాహ్ (శిక్ష) నుండి నీకు సహాయపడేవాడు గాని, నిన్ను రక్షించేవాడు గాని ఎవడూ ఉండడు.[80]

وَكَذٰلِكَ اَنْزَلْنٰهُ حُكْمًا عَرَبِيًّا ؕ وَلَئِنِ اتَّبَعْتَ
اَهْوَآءَهُمْ بَعْدَ مَا جَآءَكَ مِنَ الْعِلْمِ ۙ مَا لَكَ
مِنَ اللّٰهِ مِنْ وَّلِيٍّ وَّلَا وَاقٍ ﴿37﴾ ع

ఒకసారి మహాప్రవక్త ముహమ్మద్ (స) శాప ప్రమాణం (లిఆన్) చేసే ఆలుమగలను ఉద్దేశించి, "ప్రపంచంలో పడే శిక్ష పరలోకంలో విధించబడే శిక్ష కన్నా చాలా తేలికపాటిది సుమా!" అని హెచ్చరించారు (సహీహ్ ముస్లిం – కితాబులిఆన్).

73. ఒకవైపు అవిశ్వాసులకు పట్టే దుర్గతిని తెలియజేయటంతోపాటు విశ్వాసుల మంచి పరిణామం ఎలా ఉంటుందో కూడా వివరించటం జరిగింది. స్వర్గప్రాప్తి కోసం దాసులు పుణ్యకార్యాలు చేయాలన్న ఉద్దేశంతో ఈ శుభవార్త వినిపించబడింది. ఈ ఆయతుకు తాత్పర్యంగా ఇమామ్ ఇబ్నె కసీర్ తన గ్రంథంలో స్వర్గ లోకంలోని అనుగ్రహాలను, వాటిపై దాసులు చెందే సంతోషం గురించి మనోహరంగా చిత్రీకరించారు. తత్సంబంధితమైన హదీసులను ఆయన ఇక్కడ క్రోడీకరించారు.

74. అంటే ముస్లిములు అని భావం. వారు దివ్య ఖుర్ఆన్‌లోని ఆదేశాలను ఖచ్చితంగా అమలు పరుస్తారు. ఎప్పుడు ఏ ఆజ్ఞ అవతరించినా సంతోషంతో దాన్ని గ్రహిస్తారు.

75. దివ్య ఖుర్ఆన్‌ను సత్యబద్ధమైన గ్రంథంగా నిరూపించే అంశాలు అవతరించినప్పుడల్లా వారు చాలా ఆనందిస్తారు.

76. తిరస్కరించే మరికొన్ని వర్గాల వారెవరంటే, వారే యూదులు, క్రైస్తవులు, అవిశ్వాసులు, ముష్రిక్కులు. కొంతమంది విద్వాంసుల దృష్టిలో ఇక్కడ గ్రంథం అంటే 'తౌరాత్, ఇంజీల్' అని భావం. వారిలో ఎవరెవరు ముస్లింలుగా మారారో వారు సంతోషిస్తారు. ముస్లింలుకాని యూదులు, క్రైస్తవులు తిరస్కరిస్తారు.

77. అంటే (ఓ ప్రవక్తా!) మేము లోగడ అనేకమంది ప్రవక్తలపై అనేక గ్రంథాలను వారి స్థానిక భాషలలో అవతరింపజేసినట్లే ఈ ఖుర్ఆన్ గ్రంథాన్ని మేము అరబీలో అవతరింపజేశాము. ఎందుకంటే నీ ముందున్న అరబ్బుల భాష అరబీ భాష. వారికి అరబీ తప్ప మరో భాష రాదు. అలాంటప్పుడు ఇది అరబీలో గాకుండా వేరొక భాషలో అవతరిస్తే అది ప్రజలకు అర్థం కాదు. అర్థమే కానపుడు వారు ఉపదేశం ఎలా గ్రహిస్తారు? కాబట్టి మేము దివ్య ఖుర్ఆన్‌ను అరబీలో అవతరింపజేసి వారికి (అరబ్బులకు) ఎంతో మేలు చేశాము.

78. ఇది 'వహీ' ద్వారా అంతిమ దైవప్రవక్త (స)కు ప్రత్యేకంగా ప్రసాదించబడిన విషయ పరిజ్ఞానం. గ్రంథవహుల (యూదుల, క్రైస్తవుల) విశ్వాసాలు, మతాచారాలు కూడా ముందుగానే ఆయనకు క్షుణ్ణంగా అవగతం చేయబడ్డాయి.

79. అంటే, ఆనాటి యూదులు, క్రైస్తవులు అంతిమ దైవప్రవక్త (స) నుండి కొన్ని విషయాలను ఆశించేవారు. ఉదాహరణకు:

38 నీకు పూర్వం కూడా మేము చాలా మంది ప్రవక్తలను పంపి ఉన్నాము. మేము వారిని భార్యాబిడ్డలు కలవారుగానే చేశాము.[81] అల్లాహ్ అనుజ్ఞ లేకుండా ఏ నిదర్శనాన్నయినా తీసుకురావటమనేది ఏ ప్రవక్త వల్ల కూడా కాని పని.[82] ప్రతి నిర్ధారిత వాగ్దానం లిఖితమై ఉంది.[83]

وَلَقَدۡ أَرۡسَلۡنَا رُسُلًا مِّن قَبۡلِكَ وَجَعَلۡنَا لَهُمۡ أَزۡوَٰجًا وَذُرِّيَّةً ۚ وَمَا كَانَ لِرَسُولٍ أَن يَأۡتِيَ بِـَٔايَةٍ إِلَّا بِإِذۡنِ ٱللَّهِ ۗ لِكُلِّ أَجَلٍ كِتَابٌ ﴿٣٨﴾

39 అల్లాహ్ తాను కోరినదాన్ని చెరిపివేస్తాడు, తాను కోరినదాన్ని అలాగే ఉండనిస్తాడు. మూలగ్రంథం (లౌహె మహ్ఫూజ్) ఆయన దగ్గరే ఉంది.[84]

يَمۡحُواْ ٱللَّهُ مَا يَشَآءُ وَيُثۡبِتُ ۖ وَعِندَهُۥٓ أُمُّ ٱلۡكِتَٰبِ ﴿٣٩﴾

తాము పుణ్యక్షేత్రంగా భావించే బైతుల్ మఖ్దిస్‌నే 'ఖిబ్లా'గా ఉంచాలని కోరేవారు. అలాగే మరికొన్ని మత విశ్వాసాల పట్ల ముహమ్మద్ ప్రవక్త (స) ఉదారంగా – చూసీ చూడనట్లుగా – వ్యవహరించాలని కూడా వారు ఆశించేవారు. అయితే వారి మెప్పుకోసం, వారి మనోవాంఛలను అనుసరించవలసిన అవసరం ఏమీ లేదని అల్లాహ్ తన ప్రవక్తకు నిర్ద్వంద్వంగా చెప్పాడు.

80. ఈ ఆయతులో ముస్లిం సమాజానికి చెందిన విద్వాంసులకు కూడా హెచ్చరిక ఉంది. వారు తాత్కాలిక ప్రయోజనాల కోసం ధర్మాన్ని తాకట్టుపెట్టే నీచమైన పని చేయరాదు. ఖుర్ఆన్ హదీసుల స్పష్టమైన ఆదేశాలు ఉండగా ఇతరుల కోర్కెల్ని అనుసరించకూడదు. ఒకవేళ వారు గనక అలా చేస్తే వారిని అల్లాహ్ పట్టు నుంచి ఆదుకునే వాడెవడూ ఉండడు.

81. (ఓ ముహమ్మద్!) నీతో సహా ఈ లోకంలోకి వచ్చిన మా ప్రవక్తలంతా మానవమాత్రులే. వారికీ వంశాలు, కుటుంబాలు ఉండేవి. వారికీ ఆలుబిడ్డలుండేవారు. వారు కూడా అందరిలాగే అన్నపానీయాలు తీసుకునేవారు. వారు దైవదూతలుగానీ, మానవాకారంలో వున్న మరే యితర ప్రాణులుగానీ కారు – అక్షరాలా మనుజ జాతికి చెందినవారు. ఒకవేళ వారు గనక దైవదూతలు అయివుంటే మనుషుల్లో– అందరిలో ఒకరిలా – కలసిపోయి వారితో ముచ్చటించ లేకపోయేవారు. ఒకవేళ అదేగనక జరిగి వుంటే ప్రవక్తగా చేసి పంపటంలోని మా ఉద్దేశం నెరవేరేది కాదు. పోనీ, వారు దైవదూతలై ఉండి మానవాకారంలో ప్రత్యక్షమై ఉంటే వారికి ఒక కుటుంబం, వంశం, వర్ణం అంటూ ఏమీ ఉండేవి కావు. వారికి ఆలుబిడ్డలు కూడా ఉండేవారు కారు.

కాబట్టి అవగతమయ్యేదేమిటంటే మానవాళికి సన్మార్గం చూపటానికి దేవుని తరఫున ఎన్నుకోబడిన ప్రవక్తలంతా మానవ జాతికి చెందినవారే. 'సన్యాసత్వం', 'వైరాగ్యం' వంటి వాటికి ఇస్లాంలో చోటు లేదని కూడా ఈ ఆయతు ద్వారా స్పష్టమవుతోంది.

82. అద్భుతాలు, చమత్కారాలు చేసి చిటికెలో పరిస్థితుల స్వరూపాన్ని మార్చివేసే శక్తి, అధికారం ప్రవక్తలకు లేదు. అనుయాయులు కోరగానే వారు వాటిని తీసుకురాలేరు. ఈ శక్తి అల్లాహ్‌కు మాత్రమే ఉంది. సమయ సందర్భాలను బట్టి ఆయన తాను కోరిన ప్రవక్తలకు కొన్ని నిదర్శనాలను అందజేస్తాడు. ఎవరికి ఏ మహిమ చూపాలి? ఎప్పుడు చూపాలి? ఎందుకు చూపాలి? అనేవి ఆయన అభిమతంపై ఆధారపడి ఉంటాయి.

83. దేవుడు వాగ్దానం చేసిన ప్రతి దానికీ ఒక సమయం నిర్ధారితమై ఉంది. ఆ సమయం వచ్చినపుడు అది జరిగి తీరుతుంది. అల్లాహ్ తన వాగ్దానం నిలుపుకుంటాడు. అసలు ఆయతు పదాలు ఇవి : **"లికుల్లి అజలిన్ కితాబ్."** దాని ప్రకారం 'ప్రతి నిర్ధారిత వాగ్దానం లిఖితమై ఉంది' అన్న అర్థం వస్తుంది. కొంతమంది ఈ వాక్యంలో పదాలు ముందువి వెనక్కి, వెనుకవి ముందుకి వచ్చాయని అభిప్రాయపడ్డారు. (అరబీ భాషలో ఇలా జరగటం కద్దు). అసలు వాక్యం ఇలా ఉంటుంది : **"లికుల్లి కితాబిన్ అజలున్."** అల్లాహ్ వ్రాసిపెట్టిన ప్రతి పని నిర్ధారిత సమయంలో

**40** (ఓ ప్రవక్తా!) వారికి చేసివున్న వాగ్దానాలలో దేన్నయినా మేము నీకు చూపించినా లేక (అంతకు ముందే) మేము నీ ప్రాణాన్ని స్వాధీనం చేసుకున్నా (ఏది ఏమైనాసరే...) సందేశాన్ని చేరవేయటమే నీ పని. లెక్క తీసుకునే బాధ్యత మాది.

وَإِن مَّا نُرِيَنَّكَ بَعْضَ الَّذِي نَعِدُهُمْ أَوْ نَتَوَفَّيَنَّكَ فَإِنَّمَا عَلَيْكَ الْبَلَاغُ وَعَلَيْنَا الْحِسَابُ ﴿٤٠﴾

**41** మేము భూమిని దాని అంచుల (ఎల్లల)నుంచి ఎలా కుదించు కుంటూ వస్తున్నామో[85] వారు గమనించటం లేదా? అల్లాహ్ ఆదేశాలు జారీ చేస్తాడు, ఆయన ఆదేశాలను పునఃపరిశీలించే వాడెవడూ లేడు.[86] ఆయన చాలా వేగంగా లెక్క తీసుకునేవాడు కూడా.

أَوَلَمْ يَرَوْا أَنَّا نَأْتِي الْأَرْضَ نَنقُصُهَا مِنْ أَطْرَافِهَا ۚ وَاللَّهُ يَحْكُمُ لَا مُعَقِّبَ لِحُكْمِهِ ۚ وَهُوَ سَرِيعُ الْحِسَابِ ﴿٤١﴾

**42** వీరికి పూర్వం (గతించిన) ప్రజలు కూడా పెద్ద పెద్ద కుట్రలు పన్నారు. అయితే (అసలు సిసలు) తంత్రాలన్నీ అల్లాహ్ అధీనంలో ఉన్నాయి.[87] ఎవరేం చేస్తున్నదీ ఆయనకు తెలుసు.[88]

وَقَدْ مَكَرَ الَّذِينَ مِن قَبْلِهِمْ فَلِلَّهِ الْمَكْرُ جَمِيعًا ۖ يَعْلَمُ مَا تَكْسِبُ كُلُّ نَفْسٍ ۗ وَسَيَعْلَمُ

జరుగుతుంది అని దాని అర్థం. అది అవిశ్వాసులు కోరినంత మాత్రాన సంభవించదు. ఏది ఎప్పుడు జరగాలనేది దేవుని యుక్తిపైనే ఆధారపడి ఉంటుంది.

84. దీనికి ఒక అర్థం ఇది : దేవుడు తాను కోరిన ఆదేశాన్ని రద్దుపరచి, తాను కోరిన దాన్ని మిగిల్చి ఉంచుతాడు. మరొక అర్థం ఇది : ఆయన వ్రాసిన విధివ్రాతలో కొన్నింటిని తొలగించటం, కొన్నింటిని యథాతథంగా ఉంచటం వంటివి చేస్తూ ఉంటాడు. ఆ సురక్షిత ఫలకం (లౌహె మహ్ఫూజ్) ఆయన వద్దనే ఉంది. కొన్ని హదీసుల ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. ఉదాహరణకు : "మనిషి పాపాల కారణంగా ఉపాధికి దూరం చేయబడతాడు. దుఆ (ప్రార్థన) వల్ల విధివ్రాతలో మార్పు సంభవిస్తుంది. బంధువుల హక్కు నెరవేర్చటం వల్ల ఆయుషు పెరుగుతుంది" అని ఒక హదీసులో ఉంది (ముస్నదె అహ్మద్ – సంపుటి – 5; పేజీ – 277). కొంతమంది ప్రవక్త ప్రియసహచరులు ఈ విధంగా వేడుకునేవారని తెలుస్తోంది : "ఓ అల్లాహ్! నువ్వు మా కొరకు దౌర్భాగ్యాన్ని రాసివుంటే దాన్ని చెరిపి వెయ్యి. ఒకవేళ మా కొరకు సౌభాగ్యాన్ని రాసివుంటే దాన్ని అలాగే ఉంచు. ఎందుకంటే నువ్వు కోరినది చెరిపివేయగలవు. నువ్వు కోరినది మిగిల్చి ఉంచగలవు. మూలగ్రంథం నీ వద్దనే ఉంది." హజ్రత్ ఉమర్ (రజి) కాబా గృహ ప్రదక్షిణ చేస్తూ – విలపిస్తూ – ఈ విధంగా ప్రార్థించేవారు: "ఓ అల్లాహ్! నీవు నా నొసట దౌర్భాగ్యాన్నీ, పాపాన్ని రాసివుంటే దాన్ని చెరిపివెయ్యి. ఎందుకంటే నీవు కోరినదాన్ని చెరిపి వేయగలవు. నీవు కోరిన దాన్ని మిగిల్చి ఉంచగలవు. మూలగ్రంథం నీ వద్దనే ఉంది. కనుక (ఓ ప్రభూ!) నీవు దౌర్భాగ్యాన్ని సౌభాగ్యంగా, మన్నింపుగా మార్చు" (ఇబ్నె కసీర్). "జరగవలసిన దాన్ని కలము ముందుగానే లిఖించింది, దాని తడి ఆరిపోయింది" (సహీహ్ బుఖారీ– హదీసు నెంబరు:5076) అన్న హదీసు ఆధారంగా దీనిపై కొందరు అభ్యంతరం లేవనెత్తే అవకాశం ఉంది. అయితే ఈ చెరిపివేత, మిగిల్చివేత కూడా విధివ్రాతలో అంతర్భాగమే అని సమాధానపడవలసిఉంటుంది (ఫత్హుల్ ఖదీర్).

85. అంటే అరేబియాలోని తమ రాజ్య భూభాగం నానాటికీ ఎలా కుంచించుకుపోతుందో, ఇస్లాం ఎంత శీఘ్రగతిన విస్తరిస్తున్నదో ఈ ముష్రిక్కులు చూడటం లేదా? అని దీని భావం.

86. అల్లాహ్ తరఫున జారీ అయిన ఆదేశాలను నిలువరించే, రద్దు పరచే దమ్ము ఎవరికీ లేదు.

87. మక్కాకు చెందిన ముష్రిక్కులకు పూర్వం కూడా ప్రజలు తమ ప్రవక్తలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నేవారు. అయితే అల్లాహ్ ఎత్తుగడల ముందు వీరి పాచికలేవీ పారలేదు. అలాగే వీళ్ళ కుట్రలు కూడా ఇక మీదట దైవప్రణాళిక ముందు దేనికీ పనికి రాకుండా పోతాయి.

الْكُفّٰرُ لِمَنْ عُقْبَى الدَّارِ ﴿42﴾

ఇహలోక పుణ్యఫలం ఎవరి కోసం ఉందో అవిశ్వాసులు త్వరలోనే తెలుసుకుంటారు.

وَيَقُولُ الَّذِينَ كَفَرُوا لَسْتَ مُرْسَلًا ۚ قُلْ كَفٰى بِاللّٰهِ شَهِيدًا بَيْنِي وَبَيْنَكُمْ ۙ وَمَنْ عِنْدَهُ عِلْمُ الْكِتٰبِ ﴿43﴾

**43** "నువ్వు ప్రవక్తవు కావు" అని ఈ అవిశ్వాసులు అంటున్నారు."ఈ విషయమై నాకూ – మీకూ మధ్య సాక్షిగా అల్లాహ్ చాలు.[89] (గ్రంథజ్ఞానం గలవారు కూడా (ఈ విషయానికి సాక్షులుగా ఉంటారు)"[90] అని వారికి చెప్పు.

88. దాని ప్రకారమే ఆయన బహుమానం వొసగటమో, శిక్షను విధించటమో చేస్తాడు. సత్కార్యాలు చేసిన వారికి బహుమానం, దుష్కార్యాలు చేసిన వారికి శిక్ష.

89. నేను ఆయన తరఫున పంపబడిన సత్యవంతుడైన ప్రవక్తననీ, ఆయన సందేశాన్ని ప్రజలకు అందజేసే వాడినని ఆయనకు తెలుసు. అలాగే మీరు అబద్ధం చెబుతున్నారని కూడా ఆయనకు తెలుసు.

90. ఇక్కడ గ్రంథజ్ఞానం కలవారంటే తౌరాత్, ఇంజీల్ గ్రంథాలను అధ్యయనం చేసినవారని భావం. గ్రంథవహులుగా ఉండి, ఇస్లాం స్వీకరించినవారు – అంటే అబ్దుల్లా బిన్ సలాం, సల్మాన్ ఫార్సీ, తమీమ్ దారీ తదితర ప్రముఖులకు కూడా నేను దైవప్రవక్తనన్న సంగతి తెలుసు. అరేబియాలోని ముష్రిక్కులు కీలకమైన వ్యవహారాలలో తీర్పుకోసం గ్రంథవహుల (యూదుల, క్రైస్తవుల) వద్దకు వెళ్ళేవారు. వారి ముందు ధర్మ సందేహాలను వెలిబుచ్చేవారు. ఈ విషయాన్ని అల్లాహ్ ఇక్కడ ప్రస్తావిస్తూ, ముహమ్మద్ (స) దైవప్రవక్త అన్న విషయంలో ఏదన్నా సందేహం ఉంటే గ్రంథవహులను కూడా అడిగి తెలుసుకోమని చెప్పాడు.

అయితే మరికొంతమంది విద్వాంసులు ఇక్కడ 'గ్రంథం' అనే పదాన్ని 'ఖుర్ఆన్' అన్న భావంలో తీసుకున్నారు. గ్రంథజ్ఞానం కలవారంటే వారు ముస్లింలే అని అభిప్రాయపడ్డారు. ఈ వాక్యంలో 'గ్రంథం' అంటే **'లౌహె మహ్ఫూజ్'** అని ఇంకా కొంతమంది భావించారు. గ్రంథజ్ఞానం కలవారు అంటే అల్లాహ్‌యేనని వారు అభిప్రాయపడ్డారు. అయితే వీటన్నింటిలోకీ మొదటి అభిప్రాయమే చాలావరకు సరైనదని అనిపిస్తోంది.

**14 వ సూరా**

# ఇబ్రాహీమ్

## దైవప్రవక్త ఇబ్రాహీమ్

అవతరణ
**మక్కాలో**

ఆయతులు
**52**

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా తౌహీద్ (ఏక దైవారాధన)ను నొక్కి చెప్పింది. తీర్పు దినాన్ని, దైవగ్రంథాలను, దైవప్రవక్తలను విశ్వసించడం తదితర ధార్మిక విశ్వాసాల గురించి బోధించింది. ఈ సూరాలోని 35వ వాక్యంలో ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) పేరు ప్రస్తావనకు వచ్చింది. ఈ సూరాకు ఆయన పేరునే పెట్టడం జరిగింది. ప్రవక్తలందరి సందేశం, బోధనలు ఒక్కటేననీ ఈ సూరా వివరించింది. సమస్త ఆరాధనలకు అర్హుడైన ఒకే ఒక్క దేవుని గురించి ప్రజలకు తెలియజేయడానికే వారంతా ప్రయత్నించారు. ప్రజలను అజ్ఞానాంధకారం నుంచి వెలుగు మార్గానికి తీసుకురావడానికి, ఆ విధంగా వారిని కాపాడడానికి కృషి చేశారు. అల్లాహ్ వివిధ జాతుల వద్దకు పంపిన ప్రవక్తలు కూడా సాధారణ మానవులే. ఆయా జాతుల భాషల్లో దేవుని సందేశాన్ని వారికి చేరవేయడానికి ఈ ప్రవక్తలు ప్రభవించారు. కాని ఈ ప్రవక్తలను, వారి సందేశాన్ని ఆయా జాతులు నిరాకరించడానికి, తిరస్కరించడానికి ముఖ్య కారణం వాళ్ళు కూడా తమ వంటి సాధారణ మానవులు కావడమే. ప్రవక్తలందరూ తమ తమ జాతి ప్రజల నుంచి ఒకే విధమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. నిరంకుశ అధికారులు, దుర్మార్గులు తమ సహచరులతో కలిసి ఆయా ప్రవక్తలపై యుద్ధాలను ప్రకటించారు. ఈ సూరాలో తీర్పుదినాన్ని వర్ణించడం జరిగింది. ఆ రోజు షైతాన్ తాను మానవులను మోసగించానని ఒప్పుకుంటాడు. వాళ్ళు చేసిన పనులకు తనకు బాధ్యత లేదని అంటాడు.*

*అల్లాహ్‌కు బదులు విగ్రహాలను ఆరాధించే మక్కాలోని అరబ్బు తెగల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. వారి అంతం ఎలా ఉంటుందో కూడా ఈ సూరా తెలిపింది. వారు చివరకు నరకాగ్నికి గురవుతారు. తీర్పు దినాన అవిశ్వాసులకు ఎదురయ్యే బీభత్సకర పరిస్థితుల వర్ణన కూడా ఈ సూరాలో కనబడుతుంది.*

*ఈ సూరాలో మూసా ప్రవక్త (అస), ఇస్రాయీల్ సంతతికి సంబంధించిన కథను క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. ఫిర్‌ఔన్ వంటి నిరంకుశ పాలకుడి దౌర్జన్యాల నుంచి అల్లాహ్ వారిని రక్షించాడు. ఫిర్‌ఔన్ వారి కుమారులను హతమార్చేవాడు. వారి స్త్రీలను విడిచి పెట్టేవాడు. అల్లాహ్ ఇస్రాయీల్ సంతతిని అనుగ్రహించాడు. అల్లాహ్ వారిపై కురిపించిన అనుగ్రహానికి గాను వారు అల్లాహ్‌కు కృతజ్ఞత చూపవలసింది. కాని వారు అలా చేయలేదు. తలబిరుసు వైఖరి అవలంబించారు. ఈ సూరా క్లుప్తంగా అల్లాహ్ శక్తి సామర్థ్యాలను వర్ణించింది. దివ్యఖుర్‌ఆన్ మానవాళి కొరకు దేవుని తరఫున అవతరించిన దివ్య సందేశమన్న వ్యాఖ్యతో ఈ సూరా ప్రారంభమై అదే వ్యాఖ్యతో ముగుస్తుంది.*

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 35-41 | 30 | 'దైవప్రవక్త ఇబ్రాహీమ్' | ఇబ్రాహీమ్ ప్రవక్త ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక సమాజం అని అల్లాహ్ స్వయంగా అన్నాడు (సూరె నహ్ల్: 120). ఆయన జీవితం ఏక దైవారాధనకు పెట్టింది పేరు. ఆయన పేరు వింటేనే 'తౌహీద్' (ఏక దైవారాధన) గుర్తుకు వస్తుంది. ఆ సమాచారం మొత్తం చక్కని కథా రూపంలో. |

## ఇబ్రాహీం సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** అలిఫ్ లామ్ రా. (ఓ ముహమ్మద్ – సఅసం!) నువ్వు ప్రజలను అంధకారాల నుంచి వెలికితీసి కాంతి వైపుకు తీసుకురావటానికి[1] మహోన్నతమైన ఈ గ్రంథాన్ని మేము నీ వైపు పంపాము – వారి ప్రభువు ఆజ్ఞపై.[2] తిరుగులేనివాడు, స్తోత్రములకు అర్హుడైనవాని మార్గం వైపుకు (తీసుకురావటానికి).

**2** ఆకాశాలలో, భూమిలో ఉన్న సమస్తమూ ఆ అల్లాహ్‌దే. తిరస్కారుల కొరకు కఠిన శిక్ష మూలంగా వినాశం ఉంది.

**3** వారు పరలోకానికి బదులు ప్రాపంచిక జీవితాన్నే ప్రేమిస్తు న్నారు. అల్లాహ్ మార్గం నుంచి (ప్రజలను) ఆపుతూ అందులో వక్రతను సృజించగోర్తున్నారు.[3] మార్గభ్రష్టతలో వారు చాలా దూరం వెళ్ళిపోయారు.[4]

**4** మేము ఏ ప్రవక్తను పంపినా, అతడు విషయాన్ని స్పష్టంగా విడమరచి చెప్పడానికి వీలుగా తన జాతి వారి భాషలో మాట్లాడే వానిగా చేసి పంపాము.[5] ఆపైన అల్లాహ్ తాను కోరినవారిని

## سُوْرَةُ اِبْرٰهِيْمَ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

الٓرٰ ۚ كِتٰبٌ اَنْزَلْنٰهُ اِلَيْكَ لِتُخْرِجَ النَّاسَ مِنَ
الظُّلُمٰتِ اِلَى النُّوْرِ ۙ بِاِذْنِ رَبِّهِمْ اِلٰى صِرَاطِ
الْعَزِيْزِ الْحَمِيْدِ ﴿1﴾

اللّٰهِ الَّذِيْ لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۗ
وَوَيْلٌ لِّلْكٰفِرِيْنَ مِنْ عَذَابٍ شَدِيْدِ ﴿2﴾

الَّذِيْنَ يَسْتَحِبُّوْنَ الْحَيٰوةَ الدُّنْيَا عَلَى الْاٰخِرَةِ
وَيَصُدُّوْنَ عَنْ سَبِيْلِ اللّٰهِ وَيَبْغُوْنَهَا عِوَجًا ۗ
اُولٰٓئِكَ فِيْ ضَلٰلٍۢ بَعِيْدٍ ﴿3﴾

وَمَآ اَرْسَلْنَا مِنْ رَّسُوْلٍ اِلَّا بِلِسَانِ قَوْمِهٖ
لِيُبَيِّنَ لَهُمْ ۗ فَيُضِلُّ اللّٰهُ مَنْ يَّشَآءُ وَيَهْدِيْ

---

1. ఈ విషయమే ఈ గ్రంథంలో మరికొన్ని చోట్ల కూడా చెప్పబడింది. ఉదాహరణకు : 1. "మిమ్మల్ని కారు చీకట్ల నుంచి వెలికితీసి వెలుగు వైపుకు తెచ్చేందుకు తన దాసునిపై స్పష్టమయిన సూచనలు అవతరింపజేసేది ఆయనే కదా!" (హదీద్ – 9)

   2. "అల్లాహ్ విశ్వాసుల రక్షకుడు. ఆయన వారిని అంధకారాల నుండి వెలికితీసి జ్యోతి వైపుకు తీసుకువస్తాడు." (అల్ బఖర – 257)

2. సన్మార్గం చూపటం వరకే ప్రవక్త పని. ఎవరయినా ఆ మార్గాన్ని అవలంబించారంటే కేవలం దైవకృపతోనే, దైవాజ్ఞతోనే అవలంబిస్తారు. ఎందుకంటే అసలైన మార్గదర్శి ఆయనే. ఎవరి విషయంలోనయినా దైవాజ్ఞ గనక కాకపోతే ప్రవక్త ఎంతగా బోధపరచినా వారికి సన్మార్గ భాగ్యం ప్రాప్తించదు. ఇలాంటి ఉదాహరణలు ప్రవక్తల గాథల్లో కోకొల్లలు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వారు ఎంతగా పరితపించినా తన పినతండ్రి అబూతాలిబ్‌ను ముస్లింగా మార్చలేకపోయారన్నది గమనార్హం.

3. అంటే ఇస్లాం ప్రబోధనల పట్ల ప్రజల్లో అపోహల్ని పెంచిపోషించే ఉద్దేశంతో వాటిలో తప్పులెన్నుతూ ఉంటారు. ఒక విషయాన్ని దాని సందర్భం నుంచి తప్పించి, వక్రీకరించేందుకు యత్నిస్తారు. లేదా మూలాంశాన్ని తమ మనో వాంఛల కనుగుణంగా మలచుకునే ప్రయత్నం చేస్తారు.

4. ఎందుకంటే వారిలో పైన పేర్కొనబడినటువంటి రుగ్మతలెన్నో చోటుచేసుకున్నాయి. పరలోకంకన్నా ప్రాపంచిక జీవితానికి ప్రాధాన్యత ఇవ్వటం, దైవమార్గం నుంచి ప్రజలను ఆపటం వాటిలో కొన్ని మాత్రమే.

مَنْ يَّشَآءُ ۭ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ④

అపమార్గం పట్టిస్తాడు, తాను కోరిన వారికి సన్మార్గం చూపిస్తాడు. ఆయన సర్వాధిక్యుడు, వివేకవంతుడు.[6]

وَلَقَدْ اَرْسَلْنَا مُوْسٰى بِاٰيٰتِنَآ اَنْ اَخْرِجْ قَوْمَكَ
مِنَ الظُّلُمٰتِ اِلَى النُّوْرِ ڏ وَذَكِّرْهُمْ بِاَيّٰىمِ اللّٰهِ ۭ
اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّكُلِّ صَبَّارٍ شَكُوْرٍ ⑤

**5** మేము మూసాకు మా సూచనలిచ్చి పంపుతూ, “నువ్వు నీ జాతి వారిని అంధకారాల నుంచి – వెలికి తీసి – వెలుగులోకి తీసుకురా.[7] అల్లాహ్ యొక్క మహోపకారాలను వారికి జ్ఞాపకం చేయి”[8] అని చెప్పిన సందర్భాన్ని (గుర్తుకు తెచ్చుకోండి). నిశ్చయంగా ఇందులో సహనమూర్తులు, కృతజ్ఞతా మనస్కులైన ప్రతి ఒక్కరికీ సూచనలు ఉన్నాయి.[9]

وَاِذْ قَالَ مُوْسٰى لِقَوْمِهِ اذْكُرُوْا نِعْمَةَ اللّٰهِ عَلَيْكُمْ
اِذْ اَنْجٰىكُمْ مِّنْ اٰلِ فِرْعَوْنَ يَسُوْمُوْنَكُمْ سُوْۗءَ
الْعَذَابِ وَيُذَبِّحُوْنَ اَبْنَاۗءَكُمْ وَيَسْتَحْيُوْنَ
نِسَاۗءَكُمْ ۭ وَفِيْ ذٰلِكُمْ بَلَاۗءٌ مِّنْ رَّبِّكُمْ عَظِيْمٌ ⑥

**6** మూసా తన జాతి వారితో ఇలా అన్నప్పటి విషయం కూడా గుర్తుంచుకోదగినదే : “అల్లాహ్ మీకు చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసుకోండి – మిమ్మల్ని తీవ్రంగా వేధిస్తూ ఉన్న ఫిరౌను జనుల చెర నుండి ఆయన మీకు విముక్తిని కల్పించాడు. వారు మీ కొడుకులను చంపేసి, మీ స్త్రీలను మాత్రమే బ్రతకనిచ్చేవారు. ఇది మీకు మీ ప్రభువు తరఫున పెద్ద పరీక్షగా[10] ఉండేది.”

5. ఇది కూడా దేవుని గొప్ప ఉపకారమే. మానవుల మార్గదర్శకత్వం కోసం ఆయన తన గ్రంథాలను అవతరింపజేయటం తోపాటు, తన ప్రవక్తలను కూడా పంపాడు. అంతేకాదు, ఆ ప్రవక్తలు తమ జాతి ప్రజలు మాట్లాడే భాషలో బోధపరచే వారుగా చేసి పంపాడు. ప్రజలు తొందరగా అర్థం చేసుకోవాలన్నదే దీని ముఖ్యోద్దేశం.

6. అయితే ప్రవక్త ఎంత చక్కగా బోధపరచినా, విషయాన్ని ఎంతగా విడమరచి చెప్పినా అల్లాహ్ కోరనంతవరకూ ఎవరికీ సన్మార్గ భాగ్యం లభించదు.

7. ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)! మేము నిన్ను నీ జాతి వారి వద్దకు పంపినట్లే, నీపై ఖుర్ఆన్ గ్రంథాన్ని అవతరింపజేసినట్లే పూర్వం మేము మూసా (అలైహిస్సలాం)కు కూడా సూచనలిచ్చి అతని జాతి ప్రజల వద్దకు పంపాము. అవిశ్వాసం, అజ్ఞానాంధకారంలో మగ్గుతూ ఉన్న బనీ ఇస్రాయీల్‌ను విశ్వాసం, కాంతిరేఖల వైపుకు తెచ్చేందుకే మేము అతన్ని నియమించి పంపాము. ‘సూచనలు’ అంటే అల్లాహ్ మూసా (అలైహిస్సలాం)కు ఇచ్చిన మహిమలు. లేక బనీ ఇస్రాయీల్ సూరాలో పేర్కొనబడిన 9 మహిమలు కూడా కావచ్చు.

8. ఆయతులో **‘అయ్యామిల్లాహ్’** అనబడింది. అంటే ఇస్రాయీల్ సంతతి వారికి దేవుడు చేసిన మహోపకారాలని ఇక్కడ భావం. ఆ మహోపకారాల గురించి ఇంతకు ముందు కూడా అనేకసార్లు ప్రస్తావించటం జరిగింది. ‘వారు ఎదుర్కొన్న సంక్లిష్ట ఘడియలను, ఆ సమయంలో అల్లాహ్ వారిపై కురిపించిన అనుగ్రహాలను జ్ఞాపకం చెయ్యి’ అన్న అర్థం కూడా వస్తుంది. ఆ సందర్భాలలో అల్లాహ్ వారిని గండం నుంచి గట్టెక్కించాడు. వాటిలో కొన్ని సంఘటనలు ఈ సూరాలో కూడా రాబోతున్నాయి.

9. **‘సహనం’, ‘కృతజ్ఞత’** – ఈ రెండూ ఎంతో ఉత్తమమైన గుణాలు. విశ్వాసం వీటిమీదనే ఆధారపడి ఉంటుంది. అందుకే ఇక్కడ కేవలం ఆ రెండిటిని మాత్రమే ప్రస్తావించటం జరిగింది. మూలంలో వీటికోసం ‘సబ్బార్’ మరియు ‘షకూర్’ అనే పదాలు వాడబడ్డాయి. సబ్బార్ అంటే అత్యధికంగా సహనం వహించేవాడు, షకూర్ అంటే అత్యధికంగా కృతజ్ఞతలు తెలుపుకునేవాడు. కృతజ్ఞతకు ముందు సహనం గురించి ప్రస్తావించటం గమనార్హ విషయం. సహనంతోనే కృతజ్ఞత వస్తుంది. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: “విశ్వాసి వ్యవహారం

وَإِذْ تَأَذَّنَ رَبُّكُمْ لَئِن شَكَرْتُمْ لَأَزِيدَنَّكُمْ
وَلَئِن كَفَرْتُمْ إِنَّ عَذَابِي لَشَدِيدٌ ⑦

**7** “మీరు గనక కృతజ్ఞులుగా మెలిగితే, నేను మీకు మరింత అధికంగా అనుగ్రహిస్తాను.[11] ఒకవేళ మీరు గనక (చేసిన) మేలును మరచిపోతే నిశ్చయంగా నా శిక్ష చాలా కఠినమైనది[12] (అని మరువకండి)” అని మీ ప్రభువు మిమ్మల్ని సావధానపరచిన విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోండి![13]

وَقَالَ مُوسَىٰ إِن تَكْفُرُوا أَنتُمْ وَمَن فِي
الْأَرْضِ جَمِيعًا فَإِنَّ اللَّهَ لَغَنِيٌّ حَمِيدٌ ⑧

**8** మూసా ఇంకా ఇలా అన్నాడు: “ఒకవేళ మీరూ, భూమండలం లోని వారందరూ కూడా దేవుని పట్ల, మేలును మరచి ప్రవర్తించినా (ఆయనకు వాటిల్లే నష్టం ఏమీ లేదు) ఆయన ఏ అక్కరా లేనివాడు, ప్రశంసనీయుడు.”[14]

أَلَمْ يَأْتِكُمْ نَبَأُ الَّذِينَ مِن قَبْلِكُمْ قَوْمِ نُوحٍ
وَعَادٍ وَثَمُودَ ۛ وَالَّذِينَ مِن بَعْدِهِمْ ۛ

**9** ఏమిటీ, మీకు పూర్వం గతించిన వారి సమాచారాలు మీకు చేరలేదా? నూహ్ జాతి, ఆద్, సమూదు జాతి, ఇంకా వాటి తరువాత వచ్చిన వారి సంగతులు, వారి గురించి అల్లాహ్‌కు

కూడా కదు విచిత్రమైనది. అల్లాహ్ అతని కోసం ఏ నిర్ణయం చేసినా అది అతని పాలిట శ్రేయస్కరంగా పరిణమిస్తుంది. ఆ నిర్ణయం వల్ల అతనికి బాధ కలిగి, దానిపై అతను సహనం వహిస్తే అది కూడా అతనికి మేలే చేకూరుస్తుంది. ఒకవేళ అతనికేదైనా సంతోషం కలిగి దానిపై అతను కృతజ్ఞతాపూర్వకంగా మెలిగితే అది కూడా అతని పాలిట శుభకరమే అవుతుంది.” (సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్)

10. అదొక పెద్ద పరీక్షగా పరిణమించినా, అల్లాహ్ మిమ్మల్ని ఆ ఆపద నుంచి విముక్తినిచ్చి మహోపకారం చేశాడు. అందుకేనేమో కొంతమంది అనువాదకులు ఆయతులోని ‘బలావున్’ అనే పదాన్ని పరీక్ష అని అనువదిస్తే, మరికొందరు ‘ఉపకారం’ అని తర్జుమా చేశారు.

11. దేవుడు చేసిన మేలును దాసులు మరువకూడదు. పైగా ఆ మేళ్లకుగాను వారు కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరించాలి. కృతజ్ఞతా భావం వల్ల అనుగ్రహాలలో మరింత సమృద్ధి జరుగుతుంది. మరిన్ని కానుకలను దేవుడు వొసగుతాడు.

12. దేవుడు చేసిన మేళ్ళను మరచిపోవటం (కృతఘ్నుతకు పాల్పడటం) తీవ్రమయిన విషయం. మేలును మరచిన వారిపై దేవుడు ఆగ్రహిస్తాడు. “స్త్రీలలో చాలామంది తమ భర్తల పట్ల కృతఘ్నులుగా మెలగటం వల్ల నరకంలోకి పోతార”న్న మహాప్రవక్త (స) ప్రవచనం ఈ సందర్భంగా గమనించదగినది (సహీహ్ ముస్లిం).

13. ఈ విధంగా నొక్కి చెప్పటాన్నిబట్టి అల్లాహ్ దృష్టిలో ఇది ఎంత ముఖ్యమైన విషయమో అవగతం అవుతోంది. ఇందులో దేవుని తరఫున హెచ్చరిక ఉంది (ఇబ్నె కసీర్).

14. కృతజ్ఞతా భావం మనిషి స్వయానికే లాభం చేకూరుస్తుంది. అలాగాకుండా అతడు కృతఘ్నునిగా వ్యవహరించటం వల్ల దైవానికి కలిగే నష్టం ఏమీ ఉండదు. ఎటొచ్చీ నష్టపోయేది మానవుడే. లోకమంతా దేవుని ఉపకారాలను మరచిపోయినా దైవానికి అనర్థం ఏమీ కలగదు. హదీసె ఖుద్సీలో ఇలా వుంది : “ఓ నా దాసులారా! మీ ప్రప్రథములు, మీ కట్టకడపటివారు, ఇంకా సమస్త మానవులు, జిన్నులు మీలోని అత్యధిక ధర్మపరాయణుని హృదయంలా పరివర్తనం చెందినా (అంటే అందరూ నికార్సయిన దైవభక్తిపరులుగా మారిపోయినా) దానివల్ల నా పాలనలో, సామ్రాజ్యంలో, వైభవంలో ఎలాంటి వృద్ధీ జరుగదు. నా దాసులారా! మీ ప్రథములు, చివరివారూ, ఇంకా సమస్త మానవులు, జిన్నులు మీలోని పరమ దుర్మార్గుని హృదయంగా మారిపోయినా నా పాలనలో, సామ్రాజ్యంలో ఏ లోటూ ఏర్పడదు. నా దాసులారా! మీ తొలివారు, తుదివారు, ఇంకా సమస్త మానవులు, జిన్నులు – అందరూ ఒక

لَا يَعْلَمُهُمْ إِلَّا اللّٰهُ ۚ جَآءَتْهُمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ فَرَدُّوْٓا اَيْدِيَهُمْ فِيْٓ اَفْوَاهِهِمْ وَقَالُوْٓا اِنَّا كَفَرْنَا بِمَآ اُرْسِلْتُمْ بِهٖ وَاِنَّا لَفِيْ شَكٍّ مِّمَّا تَدْعُوْنَنَآ اِلَيْهِ مُرِيْبٍ ⑨

తప్ప ఇంకెవరికీ తెలియదు. వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తీసుకుని వచ్చారు. కాని వాళ్ళు తమ చేతులను తమ నోటిలో పెట్టుకున్నారు.[15] "మీకు ఏ విషయం ఇచ్చి పంపటం జరిగిందో దాన్ని మేము తిరస్కరిస్తున్నాము. ఏ విషయం వైపుకు మీరు మమ్మల్ని పిలుస్తున్నారో దానిపై మాకు తీవ్రమైన సందేహం ఉంది"[16] అని అన్నారు.

قَالَتْ رُسُلُهُمْ اَفِي اللّٰهِ شَكٌّ فَاطِرِ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۗ يَدْعُوْكُمْ لِيَغْفِرَ لَكُمْ مِّنْ ذُنُوْبِكُمْ وَيُؤَخِّرَكُمْ اِلٰٓى اَجَلٍ مُّسَمًّى ۗ قَالُوْٓا اِنْ اَنْتُمْ اِلَّا بَشَرٌ مِّثْلُنَا ۗ تُرِيْدُوْنَ اَنْ تَصُدُّوْنَا عَمَّا كَانَ يَعْبُدُ اٰبَآؤُنَا فَاْتُوْنَا بِسُلْطٰنٍ مُّبِيْنٍ ⑩

**10** "ఏమిటీ, భూమ్యాకాశాల నిర్మాత అయిన అల్లాహ్‌పైనే మీకు అనుమానం ఉందా? మీ పాపాలన్నింటినీ క్షమించి,[17] ఒక నిర్ణీత కాలం వరకు మీకు గడువు ఇవ్వడానికే ఆయన మిమ్మల్ని పిలుస్తున్నాడు" అని వారి ప్రవక్తలు అన్నారు. దానికి వారు, "మీరూ మాలాంటి మనుషులే తప్ప మరేమీ కాదు.[18] మా తాత ముత్తాతలు పూజిస్తూ వచ్చిన దేవుళ్ళ ఆరాధన నుండి మమ్మల్ని ఆపాలన్నది మీ ఉద్దేశం.[19] మరైతే స్పష్టమైన ప్రమాణాన్ని మా ముందు తీసుకురండి"[20] అని చెప్పారు.

---

మైదానంలో గుమిగూడి నన్ను అర్థించినా, నేను ఒక్కో వ్యక్తికి అతని అభ్యర్థన మేరకు ప్రసాదించినా నా ఖజానాలో, నా సామ్రాజ్యంలో ఏర్పడే లోటు అత్యల్పమే. సూదిని సముద్రంలో ముంచి తీయటం వలన సముద్రపు నీటిలో ఏర్పడే లోటు ఎంతో ఇదీ అంతే." (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్)

15. ఈ పదానికి విద్వాంసులు పలు అర్థాలు చెప్పారు. ఉదాహరణకు : 1. వారు తమ చేతులను తమ నోళ్ళలో పెట్టుకుని, 'మేము చెప్పేది ఒక్కటే–అదేమిటంటే నీ మాటను మేము త్రోసిపుచ్చుతున్నాము' అని అన్నారు. 2. వారు తమ చేతి వ్రేళ్లను తమ నోళ్ల వైపుకు సంజ్ఞ చేస్తూ, 'నోరు మూసుకోండి, వీళ్లు వినిపించే సందేశాన్ని అసలు పట్టించుకోకండి' అని అన్నారు. 3. వారు ఆశ్చర్యార్థకంగా తమ చేతులను తమ నోళ్లపై పెట్టుకున్నారు (నవ్వు ఆపుకుంటూ ఉన్నట్టుగా). 4. వారు తమ చేతులను ప్రవక్తల నోటికి అడ్డుగా పెట్టి, 'చాల్లే ఊరుకోండి' అని అన్నారు. 5. వారు కోపాన్ని పట్టలేక తమ చేతులను తమ నోళ్లల్లో పెట్టుకుని కరచుకున్నారు. ఉదాహరణకు కపటులు "మీపై ఉన్న కసితో తమ వ్రేళ్లు కొరుక్కుంటారు" (ఆలి ఇమ్రాన్ – 119)– ఇమామ్ షౌకానీ, ఇమామ్ తబ్రీ వంటి వారు ఈ ఆఖరి భావాన్నే తీసుకున్నారు.

16. ఆయతులో **'మురీబ్'** అని ఉంది. అంటే మనసును మాటిమాటికీ తొలచివేస్తూ ఉండే సందేహం.

17. మీ బాగోగుల్ని కోరే సృష్టికర్తపైనే మీకు అనుమానం ఉందా? ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకేముంటుందీ? అన్నది ప్రవక్తల మాటల్లోని అంతరార్థం.

18. అందరిలాంటి మనిషి దైవసందేశాన్ని ప్రజల వద్దకు ఎలా తీసుకువస్తాడు? అని అవిశ్వాసులు వాపోయేవారు.

19. తాతముత్తాతల ఆచార సంప్రదాయాలు సదా ప్రజలకు సత్యపథంలో అవరోధాలుగానే నిలిచాయి. ఈనాడు మీరు పిలిచే ధర్మం కోసం, ఒక్కగానొక్క దేవుని కోసం మేము మా పూర్వీకులు పూజించిన ఇంతమంది దేముళ్ళను వదులుకోవాలా? ఇదెలా సాధ్యం? అని వారు మండిపడేవారు.

20. ప్రమాణాలు, సూచనలు ప్రవక్తల దగ్గర లేవని దీని అర్థం కాదు. సూచనలు వారి వెంట ఉండేవి. కాని అవిశ్వాసులు ఉన్న సూచనలను వదిలేసి లేని సూచనల కోసం డిమాండు చేసేవారు. మక్కాలోని ముష్రిక్కులదీ ఇదే వరస. వారు

قَالَتْ لَهُمْ رُسُلُهُمْ إِن نَّحْنُ إِلَّا بَشَرٌ مِّثْلُكُمْ وَلَٰكِنَّ اللَّهَ يَمُنُّ عَلَىٰ مَن يَشَاءُ مِنْ عِبَادِهِ ۖ وَمَا كَانَ لَنَا أَن نَّأْتِيَكُم بِسُلْطَانٍ إِلَّا بِإِذْنِ اللَّهِ ۚ وَعَلَى اللَّهِ فَلْيَتَوَكَّلِ الْمُؤْمِنُونَ ⑪

11 వారి ప్రవక్తలు వారితో ఇలా అన్నారు: "అవును, మేమూ మీలాంటి మనుషులమే. అయితే అల్లాహ్ తన దాసులలో తాను కోరిన వారిపై ప్రత్యేకంగా దయదలుస్తాడు.[21] అల్లాహ్ అనుజ్ఞ లేకుండా మేము ఏ ప్రమాణాన్ని కూడా మీ వద్దకు తేలేము.[22] విశ్వాసులైనవారు కేవలం అల్లాహ్‌నే నమ్ముకోవాలి.[23]

وَمَا لَنَا أَلَّا نَتَوَكَّلَ عَلَى اللَّهِ وَقَدْ هَدَانَا سُبُلَنَا ۚ وَلَنَصْبِرَنَّ عَلَىٰ مَا آذَيْتُمُونَا ۚ وَعَلَى اللَّهِ فَلْيَتَوَكَّلِ الْمُتَوَكِّلُونَ ⑫

12 "ఇంతకీ మనం అల్లాహ్‌ను ఎందుకు నమ్మకూడదు? మనకు మన మార్గాలను చూపింది ఆయనే కదా! దైవసాక్షి! మీ వేధింపులపై మేము ఓపిక పడతాము. నమ్ముకునే వారు అల్లాహ్‌ను మాత్రమే నమ్ముకోవాలి."[24]

وَقَالَ الَّذِينَ كَفَرُوا لِرُسُلِهِمْ لَنُخْرِجَنَّكُم مِّنْ أَرْضِنَا أَوْ لَتَعُودُنَّ فِي مِلَّتِنَا ۖ فَأَوْحَىٰ إِلَيْهِمْ رَبُّهُمْ لَنُهْلِكَنَّ الظَّالِمِينَ ⑬

13 తిరస్కారులు తమ ప్రవక్తల నుద్దేశించి, "మేము మిమ్మల్ని దేశం నుంచి వెళ్ళగొడ్తాము. లేదంటారా, మీరు మా మతంలోకి తిరిగి వచ్చేయండి" అని బెదిరించారు. అప్పుడు వారి ప్రభువు వారి వద్దకు 'వహీ' (సందేశం) పంపిస్తూ, "మేము ఈ దుర్మార్గులను నాశనం చేస్తాము.[25]

وَلَنُسْكِنَنَّكُمُ الْأَرْضَ مِن بَعْدِهِمْ ۚ ذَٰلِكَ لِمَنْ خَافَ مَقَامِي وَخَافَ وَعِيدِ ⑭

14 "వారి తరువాత మేము మిమ్మల్ని ఈ ధరణిపై వసింపజేస్తాము.[26] నా సమక్షంలో నిలబడే విషయమై భయపడేవారికి, నా హెచ్చరికపై భీతిల్లేవారికి లభించే బహుమానం ఇది"[27] (అని అభయ మిచ్చాడు).

మహాప్రవక్త (సఅసం)ను చిత్రవిచిత్రమైన మహిమల కోసం డిమాండు చేసేవారు. బనీ ఇస్రాయీల్ సూరాలో ఈ వివరాలు రానున్నాయి.

21. మానవమాత్రులు దైవప్రవక్తలు కాలేరన్న మీ అభిప్రాయం సరైనది కాదు. మానవతకు సన్మార్గం చూపటానికి దేవుడు మానవుల్లో నుంచే తాను కోరిన వారిని ఎన్నుకుని, వారి ద్వారా తన సందేశాన్ని అందజేస్తాడు అని ప్రవక్తలు సమాధానమిచ్చారు.

22. మహిమలు ఎవరికి చూపాలి? ఎప్పుడు చూపాలి? ఏ మహిమ చూపాలి? అసలు మహిమను చూపాల్సిన అవసరం ఉందా లేదా? – ఇవన్నీ దైవాధీనం. ఆ విషయంలో మాకు ఎలాంటి అధికారం లేదు అని దైవప్రవక్తలు చెప్పారు.

23. ఇక్కడ **"విశ్వాసులైన వారు"** అనే పదానికి భావంలో మొట్టమొదటి వరుసలో దైవ ప్రవక్తలు వస్తారు. ప్రవక్తలు నిత్యం దైవాన్నే నమ్ముకుంటారు. దైవంపైనే భారం మోపుతారు. అందుచేతనే అడుగడుగునా ఆయన మాకు మార్గదర్శకత్వం వహిస్తున్నప్పుడు మేము ఆయన్ని గాక మరెవరిని నమ్ముకోవాలి? అని ప్రవక్తలు స్పందించారు.

24. దుష్టశక్తుల కీడు నుంచి సజ్జనులను కాపాడేవాడు అల్లాహ్‌యే. కాబట్టి ఎంతసేపటికీ మహిమల కోసం ప్రాకులాడే బదులు ఆయన శక్తియుక్తులపై నమ్మకం కలిగి ఉండటం సమంజసం. ఒకవేళ మహిమలు అంతగా అవసరం అనుకుంటే ఆయనే వాటిని పంపిస్తాడు అన్నది ప్రవక్తల మాటల్లోని ఆంతర్యం.

25. ఖుర్‌ఆన్‌లో ఇతరచోట్ల కూడా దేవుడు ఈ విధంగా అభయమిచ్చాడు. ఉదాహరణకు: 1. "మేము పంపిన దాసులకు (ప్రవక్తలకు) తప్పక సహాయం చేయటం జరుగుతుంది. మా సైన్యమే తప్పక గెలుస్తుంది అన్న మా నిర్ణయం

**15** వారు తీర్పును కోరారు.[28] (అప్పుడు) పొగరుబోతు, సత్య విరోధి అయిన ప్రతి ఒక్కడూ పరాభవం పాలయ్యాడు.

وَاسْتَفْتَحُوا وَخَابَ كُلُّ جَبَّارٍ عَنِيدٍ ﴿15﴾

**16** అతడి (చావు) వెనుకే నరకం ఉన్నది. అక్కడ అతడికి త్రాగటానికి చీము నెత్తురుతో కూడుకున్న నీరు ఇవ్వబడు తుంది.[29]

مِّن وَرَائِهِ جَهَنَّمُ وَيُسْقَىٰ مِن مَّاءٍ صَدِيدٍ ﴿16﴾

**17** అతడు అతి కష్టమ్మీద ఒక్కొక్క గుక్కెడూ త్రాగుతాడు. కాని గొంతులోకి దించలేకపోతాడు. అన్నిచోట్ల నుంచీ మృత్యువు వచ్చి కబళించబోతున్నట్లు అతనికి అనిపిస్తుంది. కాని అతడు చావడు.[30] మరి అతడి వెనుక కూడా మరో దుర్భరమైన శిక్ష ఉంటుంది.

يَتَجَرَّعُهُ وَلَا يَكَادُ يُسِيغُهُ وَيَأْتِيهِ الْمَوْتُ مِن كُلِّ مَكَانٍ وَمَا هُوَ بِمَيِّتٍ ۖ وَمِن وَرَائِهِ عَذَابٌ غَلِيظٌ ﴿17﴾

ముందుగానే జరిగిపోయింది" (సాఫ్ఫాత్ :171-173). 2. "నేనూ, నా ప్రవక్తలు మాత్రమే ప్రాబల్యం వహిస్తాము అని అల్లాహ్ రాసిపెట్టేశాడు" (ముజాదల-21).

26. ఈ విషయాన్ని కూడా దేవుడు తన గ్రంథంలో పలుచోట్ల పలు విధాలుగా విశదీకరించాడు- 1."జబూర్‌లో మేము హితోపదేశం చేసిన తరువాత, మా పుణ్యదాసులు భూమికి వారసులవుతారని వ్రాశాము" (అంబియా - 105). 2. అల్ ఆరాఫ్ సూరాలోని 128, 137 ఆయతులను కూడా చూడండి.

ఈ వాగ్దానం మేరకు దేవుడు తన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు సహాయం అందించాడు. ఆయన (స) ఇష్టం లేకపోయినప్పటికీ - గత్యంతరం లేని పరిస్థితిలో - మక్కా నుంచి మదీనాకు వలసపోవలసి వచ్చింది. కాని ఆ తరువాత కొన్నేండ్లలోనే ఆయన (స) విజేతగా మక్కాకు తిరిగి వచ్చారు. ఒకప్పుడు మక్కాలో ఆయన్ని (స) నానా హింసలు పెట్టిన దుర్మార్గులు ఆ రోజు ఆయన (స) ఎదుట తలలు వంచుకుని నిస్సహాయులై నిలబడ్డారు. కాని ఆయన(స) మాత్రం పగ తీర్చుకోలేదు. 'ఈ రోజు మీపై ఎలాంటి ఫిర్యాదూ లేదు' అంటూ అందరినీ వదలివేశారు.

27. ఈ విషయమే మరో చోట ఇలా చెప్పబడింది: 1. "తన ప్రభువు ఎదుట నిలబడవలసి ఉంటుందని భయపడుతూ, తన మనోవాంఛలను అదుపులో పెట్టుకున్న వ్యక్తికి స్వర్గ నివాసం లభిస్తుంది (నాజియాత్ - 40, 41). 2. రహ్మాన్ సూరాలో ఇలా వుంది - "తన ప్రభువు ఎదుట నిలబడవలసి ఉందని భయపడుతూ ఉండే వ్యక్తి కోసం రెండు (స్వర్గ) తోటలున్నాయి." (46)

28. దేవుని తీర్పు కోసం అర్థించిన వారు దుర్మార్గులైన ముష్రిక్కులు కూడా కావచ్చు. ఉదాహరణకు : అన్‌ఫాల్ సూరాలో అవిశ్వాసులు ఈ విధంగా ప్రార్థించారు : "అల్లాహ్! ఈ సత్యం (ఖుర్ఆన్) నీ దగ్గర నుంచే వచ్చినదైతే, నువ్వు మాపై ఆకాశం నుంచి రాళ్ల వర్షమైనా కురిపించు లేదా మాపై ఏదైనా బాధాకరమైన శిక్షనయినా అవతరింపజెయ్యి" (32). బద్ర్ యుద్ధ సందర్భంగా కూడా ముష్రిక్కులు ఈ విధంగానే కోరుకున్నారు. అన్‌ఫాల్ సూరాలోని 19వ వచనంలో అల్లాహ్ దాన్ని ప్రస్తావించాడు. ఒకవేళ ఈ విధంగా తీర్పును కోరినవారు దైవప్రవక్తలనుకుంటే, దేవుడు వారి మొరను ఆలకించి వారికి తోడ్పాటును అందించాడు. దుష్టులను శిక్షించాడు అని భావం వస్తుంది.

29. అది నరకవాసుల శరీరాల నుంచి ప్రవహించిన చీము, నెత్తురు (సదీద్) అయి ఉంటుంది. వారికి దాహం అయినప్పుడు త్రాగటానికి అది ఇవ్వబడుతుంది. కొన్ని హదీసుల్లో అది "నరకవాసుల శరీరాల నుంచి పిండబడిన పసరు (ఉసారతు అహ్లిన్నారి)"గా అభివర్ణించబడింది (ముస్నదె అహ్మద్-సంపుటి: 5, పేజీ-171). మరికొన్ని హదీసుల ప్రకారం

18 తమ పరిపోషకుని పట్ల తిరస్కార వైఖరిని అవలంబించిన వారి ఉపమానం వారి కర్మలు తుఫాను రోజున వీచే పెనుగాలి వాతన పడిన బూడిద లాంటివి.[31] తాము చేసుకున్న కర్మలలో దేనిపైనా వారికి అధికారం ఉండదు. బహు దూరపు మార్గభ్రష్టత అంటే ఇదే.

مَثَلُ الَّذِينَ كَفَرُوا بِرَبِّهِمْ أَعْمَالُهُمْ كَرَمَادٍ اشْتَدَّتْ بِهِ الرِّيحُ فِي يَوْمٍ عَاصِفٍ لَا يَقْدِرُونَ مِمَّا كَسَبُوا عَلَىٰ شَيْءٍ ذَٰلِكَ هُوَ الضَّلَالُ الْبَعِيدُ ﴿١٨﴾

19 ఏమిటీ, అల్లాహ్ భూమ్యాకాశాలను సత్యబద్ధంగా (అత్యంత యుక్తితో) సృష్టించటాన్ని నువ్వు చూడటం లేదా? ఆయన గనక తలచుకుంటే మీ అందరినీ తుద ముట్టించి, మరో సరికొత్త సృష్టిని తేగలడు.

أَلَمْ تَرَ أَنَّ اللَّهَ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ بِالْحَقِّ إِنْ يَشَأْ يُذْهِبْكُمْ وَيَأْتِ بِخَلْقٍ جَدِيدٍ ﴿١٩﴾

20 అలా చేయటం అల్లాహ్‌కు ఏమాత్రం కష్టతరం కాదు.[32]

وَمَا ذَٰلِكَ عَلَى اللَّهِ بِعَزِيزٍ ﴿٢٠﴾

21 వారంతా అల్లాహ్‌కు ఎదురుగా నిలబడతారు.[33] అప్పుడు బలహీనులు, (ప్రపంచంలో) పెద్ద మనుషులుగా చెలామణి అయినవారిని ఉద్దేశించి, "మేము (ఒకప్పుడు) మీకు అనుయాయులుగా ఉండేవాళ్ళం. మరి మీరు ఇప్పుడు మా నుంచి దైవశిక్షలలో ఏ కొంచెమైనా శిక్షను తొలగించగలరా?" అని అడుగుతారు. దానికి వారు ఇలా సమాధానమిస్తారు : "అల్లాహ్ గనక మాకు సన్మార్గం చూపి ఉంటే మేము కూడా తప్పకుండా మీకు మార్గదర్శకత్వం వహించి ఉండేవాళ్ళం. ఇప్పుడు మనం అసహనాన్ని ప్రదర్శించినా, సహనం వహించినా ఒక్కటే. మనకిక తప్పించుకునే మార్గం ఏదీ లేదు."[34]

وَبَرَزُوا لِلَّهِ جَمِيعًا فَقَالَ الضُّعَفَاءُ لِلَّذِينَ اسْتَكْبَرُوا إِنَّا كُنَّا لَكُمْ تَبَعًا فَهَلْ أَنْتُمْ مُغْنُونَ عَنَّا مِنْ عَذَابِ اللَّهِ مِنْ شَيْءٍ قَالُوا لَوْ هَدَانَا اللَّهُ لَهَدَيْنَاكُمْ سَوَاءٌ عَلَيْنَا أَجَزِعْنَا أَمْ صَبَرْنَا مَا لَنَا مِنْ مَحِيصٍ ﴿٢١﴾

ఈ నీరు (సదీద్) ఎంత వేడిగా ఉంటుందంటే నరకవాసి దాన్ని త్రాగటానికి నోటి దగ్గరకు తీసుకోగానే అతని ముఖంపైని చర్మం ఉడికి క్రిందపడిపోతుంది. ఆ నీరును ఒక గుక్కెడు త్రాగగానే కడుపులోని ప్రేగులు మల విసర్జనా మార్గం నుంచి బయటికి వచ్చేస్తాయి. (అల్లాహ్ మనల్ని రక్షించుగాక!)

30. ఈ యాతనలను భరించలేక అతను మరణాన్ని కోరుకుంటాడు. కాని ఇక అతనికి మరణమనేదే ఉండదు. శాశ్వితమైన నరక యాతనను అనుభవిస్తూ ఉండటమే అతని పని.

31. ప్రళయదినాన దైవ తిరస్కారుల కర్మలకు పట్టే గతి కూడా అలాంటిదే. వారి కర్మలకు ఏ విధమైన మంచి ఫలితమూ లభించదు.

32. మీరు గనక ఈ ధిక్కార వైఖరిని మానుకోకపోతే దేవుడు మిమ్మల్ని తుదముట్టించి, మీ స్థానంలో ఇంకొకరిని తీసుకువస్తాడు. ఈ విషయమే ఫాతిర్ సూరా (15 – 17), ముహమ్మద్ సూరా (38), అల్ మాయిద సూరా (54), నిసా సూరా (133) లలో కూడా చర్చించబడింది.

33. ప్రళయదినాన మహ్షర్ మైదానంలో అందరూ దేవుని ఎదుట హాజరుకావలసిందే. ఆనాడు ఎవరూ ముఖం చాటేయలేరు.

34. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఆనాడు అపరాధులు పరస్పరం ఇలా చెప్పుకుంటారు: "ఈనాడు స్వర్గంలో

**22** సమస్త వ్యవహారంపై తీర్పు జరిగిపోయిన తరువాత షైతాన్ ఇలా అంటాడు[35] : "అల్లాహ్ మీకు సత్యబద్ధమైన వాగ్దానం చేశాడు. నేను మాత్రం మీకు చేసిన వాగ్దానాలకు విరుద్ధంగా ప్రవర్తించాను.[36] నాకు మీపై ఎలాంటి అధికారమూ లేదు.[37] కాకపోతే, నేను మీకు పిలుపునిచ్చాను. మీరు నా మాటను అంగీకరించారు.[38] కాబట్టి మీరు (ఇప్పుడు) నన్ను నిందించకండి; మిమ్మల్ని మీరే నిందించుకోండి.[39] మీ మొరలను నేను ఆలకించలేను. నా మొరను మీరూ ఆలకించలేరు.[40] ఇంతకు మునుపు మీరు నన్ను దైవత్వంలో భాగస్థునిగా నిలబెట్టారన్న విషయాన్ని నేను ఎంత మాత్రం ఒప్పుకోను.[41] నిశ్చయంగా అటువంటి దుర్మార్గుల కోసం వ్యధాభరితమైన శిక్ష ఉంది."[42]

وَقَالَ الشَّيْطٰنُ لَمَّا قُضِيَ الْاَمْرُ اِنَّ اللّٰهَ
وَعَدَكُمْ وَعْدَ الْحَقِّ وَوَعَدْتُّكُمْ فَاَخْلَفْتُكُمْ ؕ
وَمَا كَانَ لِيَ عَلَيْكُمْ مِّنْ سُلْطٰنٍ اِلَّاۤ اَنْ
دَعَوْتُكُمْ فَاسْتَجَبْتُمْ لِيْ ۚ فَلَا تَلُوْمُوْنِيْ وَلُوْمُوْۤا
اَنْفُسَكُمْ ؕ مَاۤ اَنَا بِمُصْرِخِكُمْ وَمَاۤ اَنْتُمْ بِمُصْرِخِيَّ ؕ
اِنِّيْ كَفَرْتُ بِمَاۤ اَشْرَكْتُمُوْنِ مِنْ قَبْلُ ؕ اِنَّ الظّٰلِمِيْنَ
لَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿22﴾

ప్రవేశించిన వారు ఒకప్పుడు (ప్రపంచంలో) దైవసన్నిధిలో విలపిస్తూ, దీనాతి దీనంగా వేడుకుంటూ ఉండేవారు. కాబట్టి రండి, మనమంతా కలసి – సామూహికంగా – దైవసన్నిధిలో కన్నీరు పెట్టుకుందాం. అత్యంత దీనంగా క్షమాపణకై ఆయన్ని వేడుకుందాం." వారు అలాగే వేడుకుంటారు. కాని ఫలితం శూన్యం. "స్వర్గవాసులకు వారు వహించిన అత్యుత్తమమైన సహనం మూలంగా స్వర్గం లభించింది. కాబట్టి మనం కూడా సహనం వహిద్దాం రండి" అని చెప్పుకుని సహన దీక్షబూనుతారు. కాని దీనివల్ల కూడా వారికి ఏ ప్రయోజనమూ చేకూరదు. అప్పుడు వారు ఇలా అంటారు: "ఇక మనం సహనం వహించినా, అసహనంతో చిందులేసినా – రెండూ ఒక్కటే." వారి ఈ సంభాషణ నరకంలోనే జరుగుతుంది. దివ్య ఖుర్ఆన్‌లో ఇతర చోట్ల కూడా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. (ఉదాహరణకు : మోమిన్ : 47, 48; అల్ ఆరాఫ్ : 38 – 39; అహ్‌జాబ్ : 66, 68). అంతేగాక వారు పరస్పరం వాదులాడుకుంటారు. నిందించుకుంటారు. హష్ర్ మైదానంలో వారు పరస్పరం జగడం చేసుకుంటారని ఇమామ్ ఇబ్నె కసీర్ వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం సబా సూరాలోని 31 – 33 ఆయతులను చూడండి.

35. అంటే విశ్వాసులు స్వర్గంలో ప్రవేశించి, అవిశ్వాసులు, ముష్రిక్కులు నరకంలో ప్రవేశించిన తరువాత షైతాన్ నరకవాసులను ఉద్దేశించి ఈ విధంగా చెబుతాడు.

36. అంటే తన ప్రవక్తల మార్గాన్ని అనుసరించినవారే మోక్షం పొందుతారని దేవుడు చేసిన వాగ్దానం నిజమైనది. దానికి ప్రతిగా నేను చేసిన వాగ్దానాలన్నీ బూటకమైనవి, మోసపూరితమైనవి అని షైతాన్ కుండబద్దలు గొట్టినట్టుగా చెబుతాడు. ఆ మాటే మరోచోట ఈ విధంగా ప్రస్తావించబడింది: "షైతాన్ మానవులకు (బూటకపు) వాగ్దానాలు చేసి, వారిలో ఆశలు రేకెత్తిస్తాడు. కాని షైతాన్ వాగ్దానాలన్నీ మోసంతో కూడుకున్నవే." (నిసా – 120)

37. నా మాటలు ప్రమాణబద్ధమైనవి కావు. నిరాధారమైనవి. అదీగాక నేను ఎన్నడూ మిమ్మల్ని బలవంతం చేయలేదు.

38. నేను కేవలం మీకు పిలుపు ఇచ్చాను. పసలేని నా మాటలను మీరు ఇట్టే నమ్మేశారు. మరోవైపు మీరు ప్రవక్తల ప్రామాణికమైన మాటలను త్రోసిపుచ్చారు.

39. తప్పంతా మీదేగాని నాది కాదు. మీరు బొత్తిగా ఆలోచించలేదు. స్పష్టమైన దైవ నిదర్శనాలను తేలిగ్గా కొట్టిపారేసి, బూటకపు వాదాన్ని గుడ్డిగా అనుసరించారు.

40. ఈనాడు మీరు చిక్కుకుని ఉన్న ఆపద నుంచి నేను మిమ్మల్ని గట్టెక్కించలేను. అలాగే మీరు కూడా నన్ను చుట్టుముట్టి ఉన్న దైవాగ్రహం నుంచి కాపాడజాలరు.

23 విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు క్రింద సెలయేరులు ప్రవహించే స్వర్గ వనాలలో ప్రవేశింపజెయ్యబడతారు. తమ ప్రభువు అనుజ్ఞపై వారక్కడ కలకాలం ఉంటారు.[43] 'సలామ్'తో సహా అక్కడ వారికి స్వాగతం లభిస్తుంది.[44]

وَأُدْخِلَ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا بِإِذْنِ رَبِّهِمْ ۖ تَحِيَّتُهُمْ فِيهَا سَلَامٌ ﴿٢٣﴾

24 అల్లాహ్ పరిశుద్ధ వచనాన్ని దేంతో పోల్చాడో మీరు గమనించలేదా? అది ఒక పరిశుద్ధ వృక్షం వంటిది. అది బాగా వ్రేళ్లూనుకుని ఉంది. దాని శాఖలు ఆకాశంలో ఉన్నాయి.

أَلَمْ تَرَ كَيْفَ ضَرَبَ اللَّهُ مَثَلًا كَلِمَةً طَيِّبَةً كَشَجَرَةٍ طَيِّبَةٍ أَصْلُهَا ثَابِتٌ وَفَرْعُهَا فِي السَّمَاءِ ﴿٢٤﴾

25 తన ప్రభువు ఆజ్ఞతో అది ఎల్లప్పుడూ పండ్లను ఇస్తోంది.[45] ప్రజలు గుణపాఠం నేర్చుకునేందుకుగాను అల్లాహ్ వారి ముందు ఈ ఉపమానాలను వివరిస్తున్నాడు.

تُؤْتِي أُكُلَهَا كُلَّ حِينٍ بِإِذْنِ رَبِّهَا ۗ وَيَضْرِبُ اللَّهُ الْأَمْثَالَ لِلنَّاسِ لَعَلَّهُمْ يَتَذَكَّرُونَ ﴿٢٥﴾

26 (దీనికి భిన్నంగా) అశుద్ధ వచనం ఉపమానం అశుద్ధ వృక్షం వంటిది. అది నేల ఉపరితలంపై నుంచే పెకలించి వేయబడింది. దానికి స్థిరత్వం అనేదే లేదు.[46]

وَمَثَلُ كَلِمَةٍ خَبِيثَةٍ كَشَجَرَةٍ خَبِيثَةٍ اجْتُثَّتْ مِن فَوْقِ الْأَرْضِ مَا لَهَا مِن قَرَارٍ ﴿٢٦﴾

41. మీరు నన్ను అల్లాహ్‌కు భాగస్థునిగా చేశారన్న విషయాన్ని కూడా నేను త్రోసిపుచ్చుతున్నాను. ఒకవేళ మీరు ఆ పని చేసివుంటే అది మీ మూర్ఖత్వం మాత్రమే. సకల ప్రాణులను పుట్టించినవాడే వారిని కనిపెట్టుకుని ఉంటాడు. ఆయనకు సహవర్తులుగా నిలబడే అర్హత ఎవరికుంది? అని షైతాన్ ఖచ్చితంగా చెప్పేస్తాడు.

42. ఈ వాక్యం కూడా షైతాన్ నోట వెలువడేదేనని, ఇది అతని ప్రసంగంలోని ముగింపు వాక్యమని కొందరు అభిప్రాయ పడ్డారు. అయితే ఈ చివరి వాక్యం మాత్రం దైవప్రోక్తమని మరి కొంతమంది వ్యాఖ్యాతలు భావిస్తున్నారు.

43. దౌర్భాగ్యులకు, దైవధిక్కారులకు ప్రతిగా అదృష్టవంతులకు, విశ్వాసులకు లభించే స్వాగత సత్కారాలివి. ప్రజలలో విశ్వాస భావాలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతోనే ఇక్కడ అవిశ్వాసులతోపాటు విశ్వాసులను కూడా ప్రస్తావించటం జరిగింది.

44. స్వర్గవాసులు అక్కడ పరస్పరం ఇచ్చుకునే కానుక ఒండొకరికి సలాం చేసుకోవటమే. దైవదూతలు కూడా అన్ని ద్వారాల గుండా వచ్చి వారికి సలాం చేస్తూ ఉంటారు.

45. ఎండాకాలమనీ, శీతాకాలమని తేడా లేకుండా అన్ని సీజన్లలోనూ పండ్లనిచ్చే వృక్షం ఎలాంటిదో దైవవిశ్వాసి కూడా అలాంటివాడే. అలాగే విశ్వాసి (మోమిన్) సదాచరణలు రేయింబవళ్లు – క్షణం క్షణం – గగనతలం వైపుకు సాగి పోతుంటాయి. 'పరిశుద్ధ వచనం' (కలిమతున్ తయ్యిబహ్) అంటే అది 'లా ఇలాహ ఇల్లల్లాహ్' లేక ఇస్లాం. 'పరిశుద్ధ వృక్షం' (షజరతున్ తయ్యిబహ్) అంటే ఖర్జూరపు చెట్టు. ప్రామాణికమైన హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇల్మ్; ముస్లిం – కితాబు సిఫతిల్ ఖియామతి).

46. **'అశుద్ధ వచనం'** (కలిమతున్ ఖబీసహ్) అంటే అవిశ్వాసం (కుఫ్ర్) అని భావం. 'అశుద్ధ వృక్షం' (షజరతున్ ఖబీసహ్) అంటే ఉమ్మెత్త చెట్టు అన్నమాట! దాని వ్రేళ్లు పైపైనే ఉంటాయి. ఒక్క తోపు తోస్తే అది పడిపోతుంది. అలాగే అవిశ్వాసి కర్మలు ఏమాత్రం పస లేనివి. అవి ఆకాశానికేగటంగానీ, దైవసన్నిధిలో ఆమోదముద్ర పొందటం గానీ జరగవు.

يُثَبِّتُ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا بِالْقَوْلِ الثَّابِتِ فِي الْحَيٰوةِ الدُّنْيَا وَفِي الْاٰخِرَةِ ۚ وَيُضِلُّ اللّٰهُ الظّٰلِمِيْنَ ۙ وَيَفْعَلُ اللّٰهُ مَا يَشَآءُ ﴿27﴾

**27** విశ్వసించినవారికి అల్లాహ్ స్థిరమైన మాటపై ప్రాపంచిక జీవితంలోనూ, పరలోకంలోనూ నిలకడను ప్రసాదిస్తాడు.[47] అయితే అన్యాయపరులను మాత్రం ఆయన అపమార్గానికి లోను చేస్తాడు. అల్లాహ్ తాను తలచుకున్నది చేసి తీరుతాడు.

اَلَمْ تَرَ اِلَى الَّذِيْنَ بَدَّلُوْا نِعْمَتَ اللّٰهِ كُفْرًا وَّاَحَلُّوْا قَوْمَهُمْ دَارَ الْبَوَارِ ﴿28﴾

**28** అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహానికి బదులుగా కృతఘ్నతకు పాల్పడి, తమ జాతిని వినాశకర కుహరంలోనికి దించిన[48] వారి వైపు నీవు దృష్టిని సారించలేదా?!

جَهَنَّمَ ۚ يَصْلَوْنَهَا ۭ وَبِئْسَ الْقَرَارُ ﴿29﴾

**29** అంటే – నరకంలోనికి. వారంతా అందులోకి ప్రవేశిస్తారు. అది అత్యంత చెడ్డ నివాస స్థానం.

وَجَعَلُوْا لِلّٰهِ اَنْدَادًا لِّيُضِلُّوْا عَنْ سَبِيْلِهٖ ۭ قُلْ تَمَتَّعُوْا فَاِنَّ مَصِيْرَكُمْ اِلَى النَّارِ ﴿30﴾

**30** ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి పెడత్రోవ పట్టించటానికి వారు అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించారు. "సరే! సుఖాలను జుర్రుకోండి. చివరికి మీరు మరలిపోవలసింది నరకానికే"[49] అని (ఓ ప్రవక్తా!) నీవు చెప్పు.

47. ఇక్కడ నిలకడ లేక స్థిరత్వం అంటే భావం ఏమిటి? దీనికి తాత్పర్యంగా ఉన్న హదీసులో ఇలా వుంది: "మరణానంతరం సమాధిలో ముసల్మానును ప్రశ్నించినప్పుడు, దానికి సమాధానంగా అతను, అల్లాహ్ తప్ప వేరే దేవుడు లేడనీ, ముహమ్మద్ (స) దైవ సందేశహరుడని చెబుతాడు. ఈ దైవవాక్కు భావం ఇదే." (సహీహ్ బుఖారీ – ఇబ్రాహీం సూరా వ్యాఖ్యానం ; ముస్లిం – స్వర్గ ప్రకరణం).

మరో హదీసులో ఇలా వుంది – "దాసుణ్ణి సమాధిలో ఉంచి, అతని సావాసులు వెళ్ళిపోయిన తరువాత, అతడు (మృతుడు) వారి పాదరక్షల సవ్వడి వింటాడు. అప్పుడు అతని వద్దకు ఇద్దరు దైవదూతలు వస్తారు. అతన్ని లేపి, 'ఆ వ్యక్తి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?' అని ప్రశ్నిస్తారు. అతను గనక విశ్వాసి అయి ఉంటే 'ఆయన దైవదాసుడు, దైవసందేశహరుడు' అని సమాధానం ఇస్తాడు. అప్పుడు దైవదూతలు అతనికి నరక నివాసం చూపెట్టి, 'దీనికి బదులుగా అల్లాహ్ నీకు స్వర్గంలో నివాసం కల్పించాడు' అని అంటారు. అతను ఆ రెండు నివాసాలనూ చూసు కుంటాడు. అతని సమాధి అతని పాలిట డెబ్భయి చేతుల బారు విశాలవంతం చేయబడుతుంది. ప్రళయం సంభవించే వరకూ అతని సమాధి అనుగ్రహభరితంగా చేయబడుతుంది" (సహీహ్ ముస్లిం – స్వర్గ ప్రకరణం). వేరొక 'అసర్' ఉల్లేఖనంలో ఇలా ఉంది: నీ ప్రభువు ఎవరు? నీ ధర్మం ఏది? నీ ప్రవక్త ఎవరు? అని దైవదాసుణ్ణి ప్రశ్నించటం జరుగుతుంది. అప్పుడు విశ్వాసి (మోమిన్) అయిన దాసునికి అల్లాహ్ నిలకడను ప్రసాదిస్తాడు. దాంతో అతను "అల్లాహ్ నా ప్రభువు. ఇస్లాం నా ధర్మం. ముహమ్మద్ (స) నా ప్రవక్త" అని తడుముకోకుండా జవాబిస్తాడు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

48. తమ జాతిని వినాశానికి నెట్టివేసిన వారెవరంటే మక్కాకు చెందిన తిరస్కారులు (సహీహ్ బుఖారీ – ఇబ్రాహీం సూరా వ్యాఖ్యానం). వారు ముహమ్మద్ (సఅసం) దైవదౌత్యాన్ని నిరాకరించి, కయ్యానికి కాలుదువ్వి, బద్ర్ యుద్ధంలో ముస్లింలతో తలపడి తమ జాతికి చెందిన ఎంతోమందిని చంపించారు. అదే సమయంలో దైవాన్ని, దైవప్రవక్తను విశ్వసించిన ముస్లింలు, దైవానుగ్రహాల పట్ల కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరించి స్వర్గ ప్రవేశానికి అర్హులయ్యారు. మరోవైపు దైవానుగ్రహాలను కాదన్నవారు నరకానికి పాత్రులయ్యారు.

49. ప్రపంచంలో మీరెన్ని వెర్రివేషాలు వేసినా, ఎంత బులపాటం తీర్చుకున్నా మీ గమ్యస్థానం మటుకు నరకమేనని ఇక్కడ హెచ్చరించటం జరిగింది.

**31** (ఓ ప్రవక్తా!) క్రయవిక్రయాలుగానీ, స్నేహ బంధాలుగానీ ఉండని రోజు రాకముందే నమాజులను నెలకొల్పమనీ, మేము ప్రసాదించిన దానిలో నుంచి గోప్యంగానూ, బహిరంగంగానూ ఖర్చు పెట్టమని విశ్వాసులైన నా దాసులకు చెప్పు.[50]

قُل لِّعِبَادِيَ الَّذِينَ آمَنُوا يُقِيمُوا الصَّلَاةَ وَيُنفِقُوا
مِمَّا رَزَقْنَاهُمْ سِرًّا وَعَلَانِيَةً مِّن قَبْلِ أَن يَأْتِيَ
يَوْمٌ لَّا بَيْعٌ فِيهِ وَلَا خِلَالٌ ﴿31﴾

**32** భూమ్యాకాశాలను సృష్టించి, ఆకాశాల నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా మీ ఆహారం కోసం పండ్లు ఫలాలను ఉత్పన్నం చేసినవాడే అల్లాహ్. ఆయనే తన ఆజ్ఞతో సముద్రంలో నౌకలు నడవటానికి వాటిని మీకు లోబరచాడు. ఆయనే నదీ నదాలను మీ అధీనంలో ఉంచాడు.[51]

اللَّهُ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ وَأَنزَلَ
مِنَ السَّمَاءِ مَاءً فَأَخْرَجَ بِهِ مِنَ الثَّمَرَاتِ
رِزْقًا لَّكُمْ ۖ وَسَخَّرَ لَكُمُ الْفُلْكَ لِتَجْرِيَ
فِي الْبَحْرِ بِأَمْرِهِ ۖ وَسَخَّرَ لَكُمُ الْأَنْهَارَ ﴿32﴾

**33** ఆయనే నిరంతర ప్రయాణం చేస్తూ పోతున్న సూర్యచంద్రులను మీకు లోబరచాడు.[52] రేయింబవళ్ళను కూడా ఆయన మీ సేవకై కట్టుబడి ఉండేలా చేశాడు.[53]

وَسَخَّرَ لَكُمُ الشَّمْسَ وَالْقَمَرَ دَائِبَيْنِ ۖ
وَسَخَّرَ لَكُمُ اللَّيْلَ وَالنَّهَارَ ﴿33﴾

---

50. నమాజులను నెలకొల్పమన్న ఆదేశంలో అనేక భావాలు ఇమిడి ఉన్నాయి: నమాజులను వేళకు చేయాలి. నమాజులోని ముఖ్యాంశాలన్నింటినీ సజావుగా నెరవేర్చాలి. ఫర్జ్ నమాజులను సామూహికంగా చేయాలి. నమాజులలో మరుపుకు, అలసత్వానికి, సోమరితనానికి ఎలాంటి తావీయకుండా భక్తిశ్రద్ధలతో చేయాలి. నమాజు చేస్తున్నప్పుడు వినమ్రత, దీనావస్థ ఉట్టిపడుతూ ఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మన నమాజులు దైవప్రవక్త (సఅసం) వారి నమాజులను పోలివుండాలి.

    దైవమార్గంలో ఖర్చుపెట్టడమంటే జకాత్ ఇవ్వటం, దానధర్మాలు చేయటమని భావం. అలాగే బంధుత్వ హక్కులను నెరవేర్చాలి. అగత్యపరులను ఆదుకోవాలి. కేవలం తన కోసం, తన ఆలుబిడ్డల కోసమే ఖర్చుపెట్టుకుని అల్లాహ్ సూచించిన వివిధ పద్దుల్ని విస్మరిస్తే అది దైవమార్గంలో 'ఖర్చు' అనిపించుకోదు. తీర్పుదినాన ఎలాంటి లావాదేవీలు, సర్దుబాట్లు జరగవు. ఆ ఘడియ రాకముందే దేవుడిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

51. దేవుడు తన ప్రాణులకు చేసిన అసంఖ్యాకమైన ఉపకారాలలో మచ్చుకు కొన్ని యిక్కడ ప్రస్తావించబడ్డాయి. ఆయన ఆకాశాన్ని కప్పుగానూ, భూమిని పాన్పుగానూ చేశాడు. ఆకాశం నుంచి వర్షం కురిపించి రకరకాల వృక్షాలను, పచ్చికలను మొలకెత్తించాడు. రకరకాల పంటలు పండించాడు. వాటిలో మనిషికి ఆరోగ్యాన్నీ, శక్తినీ ఇచ్చే రుచికరమైన పండ్లు కూడా ఉన్నాయి. వివిధ రకాల ఆహారధాన్యాలున్నాయి. వాటి రంగు వేరు, రూపాలు వేరు. రుచులు వేరు. వాటి ప్రయోజనాలు కూడా వేర్వేరుగా ఉంటాయి. ఓడలను, పడవలను ఆయన మీకు స్వాధీనపర్చాడు. అవి అలల తాకిడిని తట్టుకుంటూ మిమ్మల్ని దూరతీరాలకు మోసుకుపోతుంటాయి. వాటిద్వారా మీరు ఒక రాజ్యం నుంచి మరో రాజ్యానికి మీ వర్తక సామగ్రిని చేరవేస్తుంటారు. ఇంకా ఆయన నేల నుంచి, పర్వత కనుమల నుంచి నీటి ఊటలను సృష్టించాడు. అవి నదీనదాలుగా, కాలువలుగా ప్రవహిస్తున్నాయి. వాటిద్వారా మీరు దాహం తీర్చుకోవటమే గాక, వ్యవసాయం కూడా చేస్తున్నారు.

52. అవి నిత్యం తమ విధినిర్వహణలో నిమగ్నమై ఉన్నాయి. వాటికి విరామం లేదు. సెలవు లేదు. అలసట లేదు. తమకు నిర్ధారించిన పరిధిని అవి ఎన్నడూ అతిక్రమించవు. వాటి మధ్య ఎన్నడూ ఎలాంటి సంఘర్షణగానీ, వ్యాఘాతంగానీ ఏర్పడదు. ఇదంతా దైవకృప మాత్రమే.

53. రేయింబవళ్ల మధ్య కూడా ఒక అవగాహన ఉంది. కొన్నిసార్లు రేయి పగలులోని కొంతభాగాన్ని తీసుకుని సుదీర్ఘమవుతే, కొన్నిసార్లు పగలు రేయిలోని కొంతభాగాన్ని ఆక్రమించుకుని పొడవాటి పగలుగా కొనసాగుతుంటుంది. రేయింబవళ్ల

وَاٰتٰىكُمْ مِّنْ كُلِّ مَا سَاَلْتُمُوْهُ ۭ وَاِنْ تَعُدُّوْا نِعْمَتَ اللّٰهِ لَا تُحْصُوْهَا ۭ اِنَّ الْاِنْسَانَ لَظَلُوْمٌ كَفَّارٌ ﴿34﴾

**34** మరి ఆయనే మీరు అడిగిన దానినల్లా మీకు ఇచ్చి ఉన్నాడు.[54] మీరు అల్లాహ్ చేసిన మేళ్లను లెక్కించదలిచినా లెక్కించలేరు.[55] నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు, మేలును మరిచే వాడు.[56]

وَاِذْ قَالَ اِبْرٰهِيْمُ رَبِّ اجْعَلْ هٰذَا الْبَلَدَ اٰمِنًا وَّاجْنُبْنِيْ وَبَنِيَّ اَنْ نَّعْبُدَ الْاَصْنَامَ ﴿35﴾

**35** ఇబ్రాహీమ్ (ప్రార్థించిన ఆ సందర్భాన్ని కూడా కాస్త జ్ఞాపకం చేసుకోండి. అతను) ఇలా వేడుకున్నాడు: "నా ప్రభూ! ఈ నగరాన్ని శాంతి భద్రతల నగరంగా చేయి.[57] నన్నూ, నా సంతానాన్నీ విగ్రహ పూజ నుంచి కాపాడు."

رَبِّ اِنَّهُنَّ اَضْلَلْنَ كَثِيْرًا مِّنَ النَّاسِ ۚ فَمَنْ تَبِعَنِيْ فَاِنَّهٗ مِنِّيْ ۚ وَمَنْ عَصَانِيْ فَاِنَّكَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿36﴾

**36** "నా ప్రభూ! అవి ఎంతో మందిని పెడదారి పట్టించాయి.[58] కనుక నన్ను అనుసరించినవాడే నా వాడు. కాని ఎవడైనా నాకు అవిధేయత చూపితే నువ్వు అమితంగా క్షమించేవాడవు, కనికరించే వాడవు."

---

మధ్య గల ఈ పెరుగుదల – తరుగుదల సృష్టి మొదలైనప్పటినుండే ఉంది. అయినప్పటికీ వాటి మధ్య ఎన్నడూ స్పర్థ రాలేదు. అవ్యవస్థ ఏర్పడలేదు.

54. అంటే మీరు అర్థించిన మీ జీవితావసరాలన్నింటినీ ఆయన మీకు సమకూర్చాడు. అంతేకాదు– మీరు అడిగిన దాన్నీ ఆయన ఇస్తున్నాడు. మీరు అడగని దాన్ని కూడా ఇస్తున్నాడు. ఎందుకంటే మీకు ఏ ఏ వస్తువుల అవసరం ఉందో, అవి లేకపోవటం వల్ల మీ మనుగడకు ఎలా ముప్పు వాటిల్లుతుందో ఆయనకు తెలుసు. ఒక్క మాటలో చెప్పాలంటే భూమండలంపై మీ జీవన వ్యవస్థకు సంబంధించిన సకల వస్తుసామగ్రిని ఆయన మీకు ప్రసాదిస్తున్నాడు.

55. అల్లాహ్ అనుగ్రహాలు అగణ్యమైనవి. వాటిని ఎవరయినా గణించదలిస్తే గణించలేరు. ఆయన చేసిన మేళ్లకు కృతజ్ఞతలు తెలుపుకోదలిస్తే అదీ మీ వల్ల కాదు. దాసులు దేవుని వరాలకు కృతజ్ఞతలు తెలుపుకోవటం కూడా ఒక దైవానుగ్రహమే. ఒక 'అసర్' ఉల్లేఖనంలో హజ్రత్ దావూద్ (అలైహిస్సలాం) గారి ప్రవచనం నకలు చేయబడింది– "అల్లాహ్! కృతజ్ఞత తెలుపుకోవటమనేది కూడా నీ తరఫున ప్రసాదించబడిన ఒక వరమే అయినపుడు, ఏ రీతిన నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకోను?" దానికి సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "దావూద్! ఇప్పుడు నువ్వు కృతజ్ఞతలు చెల్లించావు. ఎందుకంటే నాకు కృతజ్ఞతలు తెలుపుకునే శక్తిలేదని నువ్వు అంగీకరించావు. అదే నీలోని కృతజ్ఞతాభావానికి ప్రతీక." (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

56. దేవుడు చేసిన మేళ్ళను మనిషి విస్మరించాడంటే అతను తన ఆత్మకు అన్యాయం చేసుకున్నట్లే లెక్క. ముఖ్యంగా అవిశ్వాసి చాలా అధికంగా దేవుని మహోపకారాలను మరచిపోతుంటాడు.

57. **'ఈ నగరం'** అంటే 'మక్కా' అని భావం. ఇతరత్రా విషయాలను అర్థించే ముందు ఆయన (అలైహిస్సలాం) మక్కా నగరాన్ని శాంతియుతంగా ఉంచమని అర్థించటం విశేషం! ఎందుకంటే నగరంలో ప్రశాంత పరిస్థితులు నెలకొని ఉన్నప్పుడే ప్రజలు దైవానుగ్రహాలలోని మాధుర్యాన్ని ఆస్వాదించగలుగుతారు. శాంతి, సుస్థిరతలు కొరవడిన చోట మనిషికి ఎన్ని కానుకలు, పురస్కారాలు ప్రాప్తించినా అవి రుచించవు. అశాంతి అలజడుల వాతావరణంలో మనిషి క్షణం క్షణం భయాందోళన చెందుతూ ఉంటాడు. నేడు ప్రపంచంలోని వివిధ సమాజాలను, వివిధ ప్రదేశాలను పరికిస్తే ఈ సంగతి అర్థమవుతుంది. అయితే మక్కాలోనూ, ఆ నగరం ఉన్న సవూదీ అరేబియాలోనూ పరిస్థితి దీనికి భిన్నంగా కనిపిస్తుంది. ఇది ప్రవక్తల పితామహుడు చేసిన ప్రార్థనా ఫలమే. (అల్లాహ్ ఆ స్థలాన్ని అశాంతి అలజడుల నుండి, ఉపద్రవాల నుండి రక్షించుగాక!) ఈ ఆయతు ద్వారా అల్లాహ్ మక్కాలోని ఖురైషులకు చెప్పదలచిన ముఖ్య

رَبَّنَآ إِنِّيٓ أَسۡكَنتُ مِن ذُرِّيَّتِي بِوَادٍ غَيۡرِ ذِي زَرۡعٍ
عِندَ بَيۡتِكَ ٱلۡمُحَرَّمِ رَبَّنَا لِيُقِيمُواْ ٱلصَّلَوٰةَ فَٱجۡعَلۡ
أَفۡـِٔدَةٗ مِّنَ ٱلنَّاسِ تَهۡوِيٓ إِلَيۡهِمۡ وَٱرۡزُقۡهُم مِّنَ
ٱلثَّمَرَٰتِ لَعَلَّهُمۡ يَشۡكُرُونَ ﴿37﴾

**37** “మా ప్రభూ! నా సంతానంలో కొందరిని[59] పంటలు పండని కటికలోయలో, నీ పవిత్రగృహం వద్ద వసింపజేశాను. మా ప్రభూ! వారు నమాజును నెలకొల్పేందుకే[60] (ఇక్కడ వదలిపెట్టాను). కనుక ప్రజలలో కొందరి[61] మనసులు వారి వైపుకు మొగ్గేలా చేయి. వారికి తినటానికి పండ్లు ఫలాలను ప్రసాదించు – వారు కృతజ్ఞులుగా మెలిగేందుకు.[62]

رَبَّنَآ إِنَّكَ تَعۡلَمُ مَا نُخۡفِي وَمَا نُعۡلِنُۗ
وَمَا يَخۡفَىٰ عَلَى ٱللَّهِ مِن شَيۡءٖ فِي ٱلۡأَرۡضِ
وَلَا فِي ٱلسَّمَآءِ ﴿38﴾

**38** “ఓ మా ప్రభూ! మేము దాస్తున్నదీ, బహిర్గతం చేస్తున్నదీ అంతా నీకు తెలుసు.” భూమిలోగాని, ఆకాశాలలోగాని ఏ వస్తువూ అల్లాహ్ నుండి దాగి లేదు.[63]

ٱلۡحَمۡدُ لِلَّهِ ٱلَّذِي وَهَبَ لِي عَلَى ٱلۡكِبَرِ
إِسۡمَٰعِيلَ وَإِسۡحَٰقَۚ إِنَّ رَبِّي لَسَمِيعُ ٱلدُّعَآءِ ﴿39﴾

**39** “ఈ ముసలితనంలో నాకు ఇస్మాయీల్, ఇస్హాఖులను ప్రసాదించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు. నిశ్చయంగా నా ప్రభువు మొరను ఆలకించేవాడు.”

విషయం ఏమిటంటే, ఖురైషులారా! మీకు మేము చేసిన పలు ఉపకారాలలో ఒక మహోపకారం ఏమిటంటే మేము మిమ్మల్ని మక్కా వంటి ప్రతిష్ఠాత్మక నగర పౌరులుగా చేశాము. ఈ మహదానుగ్రహాన్ని మరువకండి.

58. అంటే ఈ విగ్రహారాధన మూలంగా చాలామంది మార్గభ్రష్టులైపోయారు. విగ్రహాలు మనిషికి సన్మార్గం చూపలేవు.

59. **‘సంతానంలో కొందరిని’** అన్నది గమనార్హం. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారికి మొత్తం ఎనమండుగురు కుమారులనీ, వారిలో హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) ని మాత్రమే ఆయన మక్కా లోయలో తెచ్చి వదిలారని కొన్ని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది (ఫత్‌హుల్ ఖదీర్).

60. ఆరాధనల్లో ఆయన యిక్కడ కేవలం నమాజును ప్రస్తావించటాన్ని బట్టి నమాజుకు గల ప్రాముఖ్యత వెల్లడవుతోంది.

61. **‘ప్రజలలో కొందరు’** అంటే ‘ముస్లింలు’ అని భావం. మీరే చూడండి! ఈనాడు ప్రపంచం నలుమూలల నుండీ ముస్లింలు ఎలా భక్తి శ్రద్ధలతో మక్కా వైపుకు తరలి వస్తున్నారో! ఒక్క హజ్ సీజన్‌లోనే కాదు, ఏడాది అంతా వారు కదలివస్తూనే ఉంటారు. ఏడాదిలోని అన్ని మాసాలలోనూ, అన్ని వారాలలోనూ, అన్ని దినాలలోనూ కాబా గృహం భక్తుల ప్రదక్షిణతో కళకళలాడుతూ ఉంటుంది. ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) తన ప్రార్థనలో ‘అఫ్‌యిదతమ్ మినన్నాసి’ (ప్రజల్లో కొందరి మనసులను) అని అనే బదులు ‘అఫ్‌యిదతన్నాసి’ (ప్రజల మనసులను) అని ఉంటే క్రైస్తవులు, యూదులు, జొరాష్ట్రియన్లు ఇంకా ఇతర ప్రజలందరూ కూడా మక్కా నగరానికి వచ్చేవారు. కాని ‘మిన్’ అన్న పదం ఈ ప్రార్థనను ముస్లింల వరకే పరిమితం చేసింది (ఇబ్నె కసీర్).

62. ఇబ్రాహీము (అలైహిస్సలాం) గారి ఈ ప్రార్థనను కూడా అల్లాహ్ ఆలకించాడు. నీరూ, పచ్చికా లేని ఆ కొండ ప్రాంతంలో నేడు ప్రపంచమంతటి నుంచీ రకరకాల పండ్లు, కూరగాయలు పుష్కలంగా వచ్చిపడుతున్నాయి. హజ్ సీజన్‌లోనూ, రమజాన్ మాసంలోనూ లక్షలాదిమంది జనులు అక్కడకు వచ్చి విడిది చేసినా ఆహార సరఫరాలలో ఎలాంటి కొరతా ఏర్పడదు. కాబా గృహ నిర్మాణం జరిగిన మీదట ఆయన ఈ ప్రార్థన చేశారని అనబడుతోంది. “శాంతి నగరంగా చేయి” అన్న మొదటి దుఆను ఇస్మాయీల్‌ను వదలిపెట్టినప్పుడు చేశారు (ఇబ్నె కసీర్).

63. అల్లాహ్! నా విన్నపాలలోని ఉద్దేశాన్ని నీవు బాగా ఎరుగుదువు. ఈ నగరవాసుల కోసం నేను అంతగా వేడుకోవటానికి కారణం నీ ప్రసన్నతను చూరగొనటమే. నిజానిజాలన్నీ ఎరిగినవాడవు నువ్వే. భూమ్యాకాశాల్లోని ఏ వస్తువూ నీ నుండి దాగి లేదు.

**40** "నా ప్రభూ! నన్ను నమాజును నెలకొల్పేవానిగా చెయ్యి. నా సంతతి నుండి కూడా [64] (ఈ వ్యవస్థను నెలకొల్పే వారిని నిలబెట్టు). ప్రభూ! నా ప్రార్థనను ఆమోదించు."

رَبِّ اجْعَلْنِيْ مُقِيْمَ الصَّلٰوةِ وَمِنْ ذُرِّيَّتِيْ ۖ رَبَّنَا وَتَقَبَّلْ دُعَآءِ ﴿40﴾

**41** "మా ప్రభూ! నన్ను, నా తల్లిదండ్రులను,[65] విశ్వాసులను లెక్క తేల్చే రోజున క్షమించు."

رَبَّنَا اغْفِرْ لِيْ وَلِوَالِدَيَّ وَلِلْمُؤْمِنِيْنَ يَوْمَ يَقُوْمُ الْحِسَابُ ﴿41﴾

**42** దుర్మార్గుల కార్యకలాపాల పట్ల అల్లాహ్ అశ్రద్ధ వహిస్తున్నాడని అనుకోకు. ఆయన వారికి ఒకానొక రోజు వరకు గడువు ఇస్తున్నాడు – ఆ రోజు వారు కన్నులు తేలవేస్తారు.[66]

وَلَا تَحْسَبَنَّ اللّٰهَ غَافِلًا عَمَّا يَعْمَلُ الظّٰلِمُوْنَ ۗ اِنَّمَا يُؤَخِّرُهُمْ لِيَوْمٍ تَشْخَصُ فِيْهِ الْاَبْصَارُ ﴿42﴾

**43** తలలు పైకెత్తి పరుగులు తీస్తుంటారు.[67] వారి చూపులు స్వయంగా వారి వైపుకు కూడా తిరిగిరావు. వారి హృదయాల్లో శూన్యం ఆవరిస్తుంది.[68]

مُهْطِعِيْنَ مُقْنِعِيْ رُءُوْسِهِمْ لَا يَرْتَدُّ اِلَيْهِمْ طَرْفُهُمْ ۚ وَاَفْـِٕدَتُهُمْ هَوَآءٌ ﴿43﴾

**44** (ఓ ప్రవక్తా!) శిక్ష వచ్చే రోజు గురించి ప్రజలను హెచ్చరించు. ఆ సమయంలో దుర్మార్గులు, "ప్రభూ! మాకు కొద్దిపాటి వ్యవధిని ఇస్తే మేము నీ పిలుపును అందుకుని, నీ ప్రవక్తలను అనుసరిస్తాము" అని అంటారు. (అప్పుడు వారితో ఇలా అనబడు

وَاَنْذِرِ النَّاسَ يَوْمَ يَاْتِيْهِمُ الْعَذَابُ فَيَقُوْلُ الَّذِيْنَ ظَلَمُوْا رَبَّنَآ اَخِّرْنَآ اِلٰٓى اَجَلٍ قَرِيْبٍ ۙ نُّجِبْ دَعْوَتَكَ وَنَتَّبِعِ الرُّسُلَ ؕ اَوَلَمْ تَكُوْنُوْٓا

64. తన కోసమే గాకుండా, తన సంతానం కోసం కూడా ఆయన (అలైహిస్సలాం) ప్రార్థించటం గమనించదగిన విషయం. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే ధర్మ సంస్థాపన కోసం కృషిచేసేవారు తమ ఇంటివారల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సంతాన శిక్షణ విషయంలో ఏమాత్రం అలసత్వం చూపకూడదు. పైగా అందరికన్నా ముందు తన ఇంటివారి నుంచే దైవసందేశ కార్యక్రమాన్ని మొదలెట్టాలి. "(ఓ ప్రవక్తా!) నీ సమీప బంధువులను హెచ్చరించు" అని దేవుడు తన అంతిమ ప్రవక్త (సఅసం)ను ఆజ్ఞాపించిన సంగతిని మనం మరువరాదు (షుఅరా – 214).

65. తన తండ్రి 'దైవ విరోధి' అన్న విషయం ప్రస్ఫుటం కాకముందు హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఈ విధంగా ప్రార్థించారు. అయితే తండ్రి తనవాడు కాదని తెలిసిపోయిన తరువాత ఆయన అతని కోసం ప్రార్థించలేదు. ఎందుకంటే ముష్రిక్కుల కోసం ప్రార్థించటం ధర్మసమ్మతం కాదు – ఒకవేళ వారు రక్త సంబంధీకులైనా సరే!

66. అంటే – ప్రళయదినపు భీతావహ స్థితికి వారు ఠారెత్తిపోతారు. ఒకవేళ ప్రపంచంలో ఎవరైనా శిక్ష నుండి తప్పించుకున్నా, ప్రళయదినాన మాత్రం వారు దేవుని పట్టునుంచి ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేరు. ఆనాడు అవిశ్వాసుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. కనుగుడ్లు తేలేసి, పైపైనే చూస్తూ పిచ్చివారిలా అటూ ఇటూ పరుగెత్తుతూ ఉంటారు.

67. అరబీలో **'ముహ్తియీన'** అని ఉంది. అంటే వారు వేగంగా పరుగెత్తుతూ ఉంటారు. వేరొక చోట ఇలా ఉంది : "వారు పిలిచేవాని వైపు వేగంగా పరుగెత్తుతూ ఉంటారు" (అల్ ఖమర్–8). ఆశ్చర్యం, ఆందోళన మూలంగా వారి తలలు పైకి లేసి ఉంటాయి.

68. వారికి కనిపించే దృశ్యాలు ఎంత భయంకరంగా ఉంటాయంటే, ఒక్క క్షణం కోసం కూడా వారి చూపులు క్రిందికి వాలవు. ఆఖరికి తమను గురించిన ధ్యాస కూడా వారి కళ్లకు ఉండదు. భయంతో వారి గుండెలు అదిరిపోతాయి. ఆంతర్యాల్లో శూన్యం ఏర్పడుతుంది. మొత్తమ్మీద వారి దీనావస్థ వర్ణనాతీతంగా ఉంటుంది.

اَقْسَمْتُمْ مِّنْ قَبْلُ مَا لَكُمْ مِّنْ زَوَالٍ ﴿٤٤﴾

తుంది), “ఏమిటీ, ప్రపంచం నుండి నిష్క్రమించటమనేది మాకు లేనే లేదని ఇంతకు ముందు మీరు ఒట్టేసి మరీ చెప్పలేదా?”[69]

وَّسَكَنْتُمْ فِىْ مَسٰكِنِ الَّذِيْنَ ظَلَمُوْۤا اَنْفُسَهُمْ وَتَبَيَّنَ لَكُمْ كَيْفَ فَعَلْنَا بِهِمْ وَضَرَبْنَا لَكُمُ الْاَمْثَالَ ﴿٤٥﴾

45 “తమకు తాము అన్యాయం చేసుకున్న వారి ఇండ్లలో మీరు మీ నివాసాలను ఏర్పరచుకోలేదా? వారి పట్ల మేము ఎలా వ్యవహరించామో మీకు అవగతం కాలేదా? (మీకు బోధపడేం దుకు) మేము ఎన్నో ఉదాహరణలను వివరించాము కదా!”[70]

وَقَدْ مَكَرُوْا مَكْرَهُمْ وَعِنْدَ اللّٰهِ مَكْرُهُمْ ؕ وَاِنْ كَانَ مَكْرُهُمْ لِتَزُوْلَ مِنْهُ الْجِبَالُ ﴿٤٦﴾

46 వాళ్ళు తమ ఎత్తుల్ని తాము వేసి చూసుకున్నారు. వారి ఎత్తుగడలన్నీ అల్లాహ్ దృష్టిలో ఉన్నాయి.[71] వారి ఎత్తుగడలు పర్వతాలను కదిలించేటంతటి భీకరమైనవేమీ కావు.[72]

فَلَا تَحْسَبَنَّ اللّٰهَ مُخْلِفَ وَعْدِهٖ رُسُلَهٗ ؕ اِنَّ اللّٰهَ عَزِيْزٌ ذُو انْتِقَامٍ ﴿٤٧﴾

47 (ఓ ప్రవక్తా!) అల్లాహ్ తన ప్రవక్తలకు చేసిన వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరిస్తాడని అనుకోకు.[73] నిశ్చయంగా అల్లాహ్ సర్వాధిక్యుడు, ప్రతీకారం చేసేవాడు.[74]

يَوْمَ تُبَدَّلُ الْاَرْضُ غَيْرَ الْاَرْضِ وَالسَّمٰوٰتُ وَبَرَزُوْا لِلّٰهِ الْوَاحِدِ الْقَهَّارِ ﴿٤٨﴾

48 ఏ రోజున ఈ భూమి మరో భూమిగా మార్చివేయబడు తుందో, ఆకాశం సయితం[75] (మారిపోతుందో), అప్పుడు అందరూ సర్వశక్తిమంతుడు, ఒకే ఒక్కడైన అల్లాహ్ ముందుకు వస్తారు.

69. ప్రపంచంలో పదే పదే ప్రమాణాలు చేసి కోతలు కోసిన సంగతిని అప్పుడే మరచి పోయారా? లెక్కా గిక్కా ఏమీ ఉండవనీ, స్వర్గం – నరకం అనేవన్నీ ఉత్తుత్తిమాటలే అని కొట్టిపారేసింది మీరు కాదా?! మీ ప్రాపంచిక వైభవం ఎన్నటికీ తరగదని గొప్పలు చెప్పింది మీరు కాదా?

70. మీరు గుణపాఠం నేర్చుకుంటారేమోనన్న ఉద్దేశంతో వెనుకటి జాతుల గాధలను మీకు విడమరచి చెప్పటం జరిగింది. మీరు నివసించిన వివిధ ప్రదేశాలలో గతించిన దుర్మార్గుల అద్భుత కట్టడాల అవశేషాలు మిమ్మల్ని ఆలోచింపజేయటం లేదా? వాటిద్వారా కూడా మీకు జ్ఞానోదయం కాకపోతే మీ ఖర్మ. మీకూ అదే గతి పట్టవచ్చు – ఎదురు చూడండి.

71. వారు తమ అసత్యాన్ని సమర్థించుకోవటానికీ, సత్యాన్ని తృణీకరించటానికి పన్నవలసిన పన్నాగాలన్నీ పన్నారు. వారి పన్నాగాల గురించి అల్లాహ్‌కు తెలియదని అనుకోకండి. ఆయన దగ్గర అంతా నమోదై ఉంది.

72. ఈ వాక్యానికి రెండు అర్థాలు వస్తాయి. 1. వారి ఎత్తులు పర్వతాలను కదిలించేటంతటి అమోఘమైనవి ఏమీ కావు. 2. నిశ్చయంగా వారి ఎత్తులు ఎంత భయంకరమైనవంటే వాటి ధాటికి పర్వతాలే కదిలిపోతాయి.

అయితే అల్లాహ్ వారి ఎత్తుల్ని పారనివ్వలేదు. ఉదాహరణకు మరో చోట అల్లాహ్ ముష్రిక్కుల షిర్కు గురించి ఇలా సెలవిచ్చాడు: “కరుణామయుడు (అల్లాహ్) సంతానం కలిగివున్నాడు”అన్న వారి మాట ఎంత తీవ్రమైనదంటే దాని మూలంగా ఆకాశాలు చీలిపోయి, భూమి బ్రద్దలై, పర్వతాలు తునాతునకలై పోవటానికి సిద్ధంగా ఉన్నాయి.” (మర్యమ్-90, 91)

73. ఇహపరాలలో తోడ్పడతానని దేవుడు తన ప్రవక్తలకు చేసిన వాగ్దానం సత్యమైనది. ఆయన ఎన్నటికీ వాగ్దాన భంగం చేయడు.

49 ఆ రోజు అపరాధులంతా ఒకచోట సంకెళ్ళతో బంధించబడి ఉండటం నువ్వు చూస్తావు.

وَتَرَى الْمُجْرِمِينَ يَوْمَئِذٍ مُّقَرَّنِينَ فِي الْأَصْفَادِ ﴿49﴾

50 వారి దుస్తులు గంధకంతో చేయబడిన దుస్తులై ఉంటాయి.[76] అగ్నిజ్వాలలు వారి ముఖాలను సయితం ఆవరించి ఉంటాయి.

سَرَابِيلُهُم مِّن قَطِرَانٍ وَتَغْشَىٰ وُجُوهَهُمُ النَّارُ ﴿50﴾

51 అల్లాహ్ ప్రతి వ్యక్తికీ అతని సంపాదనకు తగిన ప్రతిఫలం ఇవ్వటానికే ఇదంతా ఏర్పరచబడింది. నిశ్చయంగా అల్లాహ్ చాలా వేగంగా లెక్క తీసుకుంటాడు.

لِيَجْزِيَ اللَّهُ كُلَّ نَفْسٍ مَّا كَسَبَتْ ۚ إِنَّ اللَّهَ سَرِيعُ الْحِسَابِ ﴿51﴾

52 ఈ ఖుర్ఆన్[77] సమస్త మానవుల కొరకు ఒక సందేశం. తద్వారా వారిని హెచ్చరించటానికి, అల్లాహ్ ఒక్కడే ఆరాధ్య దైవమని వారు గ్రహించటానికి, ఇంకా విజ్ఞులు గ్రహించగలగ టానికి (ఇది పంపబడింది).

هَٰذَا بَلَاغٌ لِّلنَّاسِ وَلِيُنذَرُوا بِهِ وَلِيَعْلَمُوا أَنَّمَا هُوَ إِلَٰهٌ وَاحِدٌ وَلِيَذَّكَّرَ أُولُو الْأَلْبَابِ ﴿52﴾

74. అంటే తనను నమ్ముకున్న వారికోసం తన శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటాడు.

75. ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) ఇలా అంటున్నారు: "భూమ్యాకాశాలలోని గుణమైనా మారిపోతుంది లేదా అవి పూర్తిగా రూపుమాపబడి సరికొత్తగానయినా ఏర్పరచబడతాయి. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "ప్రళయ దినాన ప్రజలు తెల్లటి నేలపై సమీకరించబడతారు. ఆ నేల మైదాపిండితో చేయబడిన రొట్టెలా ఉంటుంది. అందులో ఎవరికీ తమ ప్రత్యేక జెండా (చిహ్నం) ఉండదు" (సహీహ్ ముస్లిం – సిఫతుల్ ఖియామ). "భూమ్యాకాశాలు మార్చబడుతున్నప్పుడు మనుషులు ఎక్కడుంటారు?" అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అడగ్గా, "సిరాత్" (అంటే పుల్ సిరాత్)పై ఉంటారని మహాప్రవక్త (సఅసం) చెప్పారు. (పుల్ సిరాత్ అనేది ఒక వంతెన). ఒక యూద వ్యక్తి వెలిబుచ్చిన సందేహానికి మహనీయ ముహమ్మద్ (స) సమాధానమిస్తూ, "ఆ రోజు ప్రజలు వంతెనకు సమీపంలో చీకటిలో ఉంటారు" అని అన్నారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ హైజ్).

76. అవి అగ్నికి వెంటనే భగ్గుమంటాయి.

77. అరబీలో 'ఇది' అని మాత్రమే అనబడింది. ఇక్కడ 'ఇది' అంటే ఖుర్ఆన్ అని భావం. లేక వెనుక నుంచి చెప్పుకుంటూ వస్తోన్న వివరణలు అని కూడా కావచ్చు.

15వ సూరా

# అల్ హిజ్ర్

## రాతి ప్రదేశం

అవతరణ మక్కాలో

ఆయతులు 99

### పరిచయం

*దైవ వచనాల అవతరణ, ప్రవక్తల పరంపర, మరణించిన వారిని మళ్ళీ లేపడం, శిక్షా బహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. అల్లాహ్ ఒక్కడే అన్న నిదర్శనాలను చూపిస్తూ ఈ విశ్వాసాల గురించి తెలుపడం జరిగింది. ఈ సూరాలోని 80వ ఆయతులో రాతి ప్రదేశం గురించి ప్రస్తావన ఉంది. ఈ పేరునే సూరాకు పెట్టడం జరిగింది. మదీనా నుంచి సిరియాకు వెళ్ళే దారిలో ఉన్న అరబ్బు ప్రదేశం ఇది. ఈ ప్రాంతంలోనే సమూద్ జాతి నివసించేది. సమూద్ జాతి ప్రజలు కొండలు తొలిచి తమ నివాసాలు నిర్మించుకునేవారు. ఈ జాతి వద్దకు సాలిహ్ ప్రవక్త (అస)ను పంపడం జరిగింది. కాని సమూద్ జాతి ఆయన్ను తిరస్కరించింది. ఆయనను అవహేళన చేసింది. కొండలను తొలిచి వారు నిర్మించుకున్న నివాసాలు వారి నిర్మాణ సామర్థ్యానికి నిదర్శనంగా ఉండేవి. దృఢమైన ఆ నివాసాలు కొండల్లో సురక్షితంగా ఉండేవి. కాని వారి ప్రవక్త సాలిహ్ (అస) ద్వారా వారికి చేరవేయబడిన దివ్య సందేశాన్ని, సత్యాన్ని వారు తిరస్కరించడం వల్ల వారిపై శిక్ష విరుచుకుపడింది. ఒక భయంకరమైన భూకంపం, వెనువెంటనే నిప్పులు కక్కిన అగ్నిపర్వత పేలుళ్ళు వారిని తుడిచిపెట్టేశాయి.*

*మక్కాలోని అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను పిచ్చివాడన్నారు, ఆయన సందేశాన్ని తిరస్కరించారు. ఆయన ప్రవక్త పదవిని ప్రశ్నించారు. అల్లాహ్ స్వయంగా దివ్య ఖుర్ఆన్‌ను పరిరక్షిస్తున్నాడని ఈ సూరా స్పష్టమైన ప్రకటన చేసింది. దివ్యఖుర్ఆన్ అన్ని కాలాల్లోనూ ఎలాంటి మార్పులు చేర్పులకు గురికాకుండా సురక్షితంగా ఉంటుందని ప్రకటించింది. ఆదమ్ (అస) షైతాన్‌ల గాథ మార్గదర్శకత్వానికి, మార్గభ్రష్టత్వానికి ఉదాహరణగా గుణపాఠం గరుపుతుంది. ఈ గాథను క్లుప్తంగా ఈ సూరాలో ప్రస్తావించడం జరిగింది. అల్లాహ్ ఆదేశాలను షైతాన్ తిరస్కరించాడు. ఆదమ్ (అస) ముందు సాష్టాంగపడడానికి నిరాకరించాడు. అల్లాహ్ శాపానికి గురయ్యాడు. షైతాన్ తాను ప్రజలను మార్గభ్రష్టులు చేస్తానని, దైవ వచనాలను నిరాకరించేలా, సత్యాన్ని తిరస్కరించేలా చేస్తానని అన్నాడు.*

*ఈ సూరాలో అనేకమంది ప్రవక్తల గురించి క్లుప్తంగా ప్రస్తావనలు ఉన్నాయి. ఇబ్రాహీమ్, లూత్, షుఐబ్, సాలిహ్ (వారందరిపై శాంతి కురియుగాక)ల గురించి ప్రస్తావనలు ఉన్నాయి. ఈ ప్రవక్తల జాతి ప్రజలు అహంకారంతో వ్యవహరించారు. తమ ప్రవక్తలను అవహేళన చేశారు. కాని చివరకు ఆయా జాతులు దేవుని ఆగ్రహానికి గురయ్యాయి. ఆయా ప్రవక్తలను, వారి అనుచరులను దేవుడు కాపాడాడు. వారు చివరకు విజయాన్ని పొందారు. ఆయా ప్రవక్తల గురించిన ఈ ప్రస్తావనలు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు సాంత్వనను ఇచ్చాయి. ఎక్కువగా దైవప్రార్థన చేయాలనీ, దృఢంగా నిలబడాలనీ, స్థిరచిత్తంతో వ్యవహరించాలనీ, దేవుని ఔన్నత్యాన్ని కొనియాడాలనీ, ఆయన్ను స్తుతించాలనీ, ఆయనపట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలని బోధించడం జరిగింది.*

## అల్ హిజ్ర్ సూరా

سُوْرَةُ الْحِجْرِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 అలిఫ్ లామ్ రా. ఇవి దైవగ్రంథపు వాక్యాలు. స్పష్టమైన ఖుర్ఆన్‌లోనివి.[1]

الٓرٰ تِلْكَ اٰيٰتُ الْكِتٰبِ وَقُرْاٰنٍ مُّبِيْنٍ ﴿1﴾

2 తాము ముస్లింలమై ఉంటే బావుండేదే! అని అవిశ్వాసులు ఆశపడే సమయం కూడా వస్తుంది.[2]

رُبَمَا يَوَدُّ الَّذِيْنَ كَفَرُوْا لَوْ كَانُوْا مُسْلِمِيْنَ ﴿2﴾

3 నువ్వు వాళ్ళను తింటూ, అనుభవిస్తూ, (బూటకపు) ఆశల్లో మునిగిపోయి ఉండేలా వదిలిపెట్టు. త్వరలోనే (వాస్తవం) స్వయంగా వారికే తెలిసివస్తుంది.[3]

ذَرْهُمْ يَاْكُلُوْا وَيَتَمَتَّعُوْا وَيُلْهِهِمُ الْاَمَلُ فَسَوْفَ يَعْلَمُوْنَ ﴿3﴾

4 మేము ఏ పట్టణాన్ని తుదముట్టించినా రాసిపెట్టిన ఒక నిర్ధారిత గడువు ప్రకారమే తుదముట్టించాము.

وَمَآ اَهْلَكْنَا مِنْ قَرْيَةٍ اِلَّا وَلَهَا كِتَابٌ مَّعْلُوْمٌ ﴿4﴾

5 ఏ సముదాయం కూడా తన నిర్ధారిత సమయానికి ముందు గానీ, వెనుకగానీ పోజాలదు.[4]

مَا تَسْبِقُ مِنْ اُمَّةٍ اَجَلَهَا وَمَا يَسْتَاْخِرُوْنَ ﴿5﴾

6 "ఓ జిక్ర్ (ఖుర్ఆన్) అవతరించిన మనిషీ! ఖచ్చితంగా నువ్వు పిచ్చివాడివే."

وَقَالُوْا يٰۤاَيُّهَا الَّذِيْ نُزِّلَ عَلَيْهِ الذِّكْرُ اِنَّكَ لَمَجْنُوْنٌ ﴿6﴾

1. గ్రంథం అన్నా, స్పష్టమైన ఖుర్ఆన్ అన్నా రెండూ ఒక్కటే – అదే దివ్య ఖుర్ఆన్. ఇది అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) పై అవతరించింది. "మీ వద్దకు అల్లాహ్ వద్దనుంచి కాంతి మరియు స్పష్టమైన గ్రంథం వచ్చేసింది" (అల్ మాయిద – 15) అని చెప్పబడినట్లే ఇక్కడా పర్యాయపదం వాడబడింది. దివ్య ఖుర్ఆన్ యొక్క ఔన్నత్యాన్ని, పరిపూర్ణతను చాటి చెప్పటానికే ఇలాంటి వర్ణనలు వస్తాయి.
2. వారీవిధంగా ఎప్పుడు కోరుకుంటారు? దైవదూతలు వారి ప్రాణాలు తీసుకునేటప్పుడు లేదా నరకాగ్ని వారికి చూపబడినప్పుడు లేదా నరకాగ్నికి ఆహుతి అయినప్పుడు లేదా విశ్వాసులైన పాపాత్ములు కొంతకాలం పాటు నరక శిక్షను అనుభవించిన మీదట నరకం నుంచి బయటికి తీసేటప్పుడు లేదా హష్ర్ మైదానంలో లెక్కలు తేల్చేటప్పుడు– ముస్లింలు స్వర్గవాసులుగా ప్రకటించబడుతున్నప్పుడు వారికి ఈ కోరిక పుట్టుకువస్తుంది. 'మేము కూడా ముస్లింలం అయివుంటే ఎంత బావుండేది' అని. కాని ప్రయోజనం ఏమిటి?
3. హెచ్చరికగా ఇలా అనటం జరిగింది. ఈ అవిశ్వాసులకు, ముష్రిక్కులకు ఇప్పుడు ఎంత చెప్పినా మింగుడు పడటం లేదు. వీళ్లని వదలిపెట్టు. ప్రాపంచిక భోగభాగ్యాలలో మునిగి ఉండనివ్వు. తాము అవలంబించే ధిక్కారవైఖరి ఎంత ఘోరంగా పరిణమిస్తుందో తొందరగానే వారికి అర్థమైపోతుంది అని అల్లాహ్ అంటున్నాడు.
4. ఈ ఆయతులో అల్లాహ్ చెప్పదలచిన విషయం ఇది: అవిధేయత కారణంగా ఏ పట్టణాన్ని మేము నాశనం చేయ దలచినా వెంటనే నాశనం చేయము. దానికోసం ఒక గడువును నిర్ధారిస్తాము. గడువు ముగిసే వరకూ ఆ బస్తీ వాసులకు అవకాశం ఇస్తూనే ఉంటాము. కాని ఆ ఘడియ వచ్చిందంటే ఒక్క క్షణం కూడా అటూ ఇటూ జరగదు.

**7** “ఒకవేళ నువ్వు సత్యవంతుడవే అయితే దైవదూతలను మా వద్దకు ఎందుకు తీసుకురావు?”[5] అని వారు అంటారు.

لَوْ مَا تَأْتِينَا بِالْمَلَٰٓئِكَةِ إِن كُنتَ مِنَ
الصَّٰدِقِينَ ⑦

**8** సత్యబద్ధత లేకుండా మేము (మా) దూతలను పంపము. ఆ సమయంలో వారికి గడువు ఇవ్వబడదు.[6]

مَا نُنَزِّلُ الْمَلَٰٓئِكَةَ إِلَّا بِالْحَقِّ وَمَا كَانُوٓا
إِذًا مُّنظَرِينَ ⑧

**9** మేమే ఈ ఖుర్ఆన్‌ను అవతరింపజేశాము. మరి మేమే దీనిని రక్షిస్తాము.[7]

إِنَّا نَحْنُ نَزَّلْنَا الذِّكْرَ وَإِنَّا لَهُۥ
لَحَٰفِظُونَ ⑨

**10** మేము నీకు పూర్వం గతించిన సమాజాలలో కూడా ప్రవక్తలను పంపాము.

وَلَقَدْ أَرْسَلْنَا مِن قَبْلِكَ فِى شِيَعِ الْأَوَّلِينَ ⑩

**11** అయితే తమ వద్దకు ఏ ప్రవక్త వచ్చినా వాళ్ళు అతన్ని పరిహసించేవారు.[8]

وَمَا يَأْتِيهِم مِّن رَّسُولٍ إِلَّا كَانُوا بِهِۦ
يَسْتَهْزِءُونَ ⑪

**12** ఈ విధంగానే మేము అపరాధుల హృదయాల్లోకి దీనిని (అవిశ్వాసాన్ని) పోనిస్తాము.[9]

كَذَٰلِكَ نَسْلُكُهُۥ فِى قُلُوبِ الْمُجْرِمِينَ ⑫

---

5. ఇది అవిశ్వాసుల విరోధానికి పరాకాష్ఠ! వారు అంతిమ దైవప్రవక్త (సఅసం)ను ఉన్మాదిగా అభివర్ణించారు. అసత్యవాది అని అన్నారు. నువ్వు చెప్పేది నిజమైతే దైవదూతల్ని మా కళ్ల ముందు ఎందుకు హాజరుపరచవు? అని నిలదీశారు.

6. దైవదూతలు రావలసిన సమయంలోనే వస్తారు. వారిని ఎప్పుడు పంపాలి? ఎందుకు పంపాలి? ఎవరిని శిక్షించటానికి పంపాలి? అన్న సంగతి మాకు బాగా తెలుసు. మా దూతలు దివి నుంచి భువికి దిగి వచ్చారంటే మీ కథ కంచికి చేరినట్లే అన్న విషయాన్ని విస్మరించకండి. అప్పుడు మీరు ఎంతగా ప్రాధేయపడినా మీకు వ్యవధి ఇవ్వబడదు అని ఈ వాక్యంలో పరమ ప్రభువు సెలవిచ్చాడు.

7. అంటే దివ్య ఖుర్ఆన్‌ను స్వార్థపరుల కుయుక్తుల నుండి, ప్రక్షిప్తాల బారినుండి, మార్పులు చేర్పుల నుంచి కాపాడి– స్వచ్ఛంగా ఉంచే బాధ్యతను మేము స్వయంగా తీసుకున్నాము అని దేవుడంటున్నాడు. దేవుని ఈ వాక్కు సత్యమని గత 1400 సంవత్సరాలుగా రూఢీ అవుతూనే ఉంది. 14 వందల సంవత్సరాల తరువాత కూడా ఈ పవిత్ర గ్రంథం ఎలాంటి మార్పులు చేర్పులకు గురికాకుండా – యథాతథంగా– ఉంది. దారిలో పెడదారి తీసిన కొన్ని వర్గాలు, సముదాయాలు తమ కాల్పనిక సిద్ధాంతాల కోసం ఖుర్ఆన్ ఆయతులకు వక్రభాష్యాలైతే చెప్పగలిగారేమో గాని వెనుకటి ఆకాశ గ్రంథాల మాదిరిగా ఈ అంతిమ గ్రంథంలోని మూలానికి ఎలాంటి విఘాతం కల్పించలేక పోయారు.

   ఇదిలా వుండగా ఖుర్ఆన్ భావాన్ని వక్రీకరించే స్వార్థపరుల ఆటలు కట్టించే సజ్జనులు అన్ని కాలాల్లోనూ ప్రభవించారు. దైవ వచనాలకు తప్పుడు వ్యాఖ్యలు చేసే ప్రబుద్ధులు ఎప్పుడు, ఎక్కడ తలెత్తినా ఈ సజ్జనులు ఊరుకోలేదు. ఈ వాక్యంలో దివ్య ఖుర్ఆన్‌ను “జ్ఞాపిక” (జిక్ర్) గా అభివర్ణించటం జరిగింది. అంటే ఇది లోకవాసుల పాలిట జ్ఞాపిక, హితోపదేశం అన్నమాట. దివ్య ఖుర్ఆన్‌తో పాటు అది అవతరించిన అంతిమ దైవప్రవక్త (సఅసం) జీవిత చరిత్ర, ఆయన ప్రబోధనలు కూడా సురక్షితంగా ఉన్నాయి. తత్ఫలితంగా ఖుర్ఆన్, హదీసు, సీరత్‌ల వెలుగులో ఇస్లాం ధర్మం వైపుకు మానవాళికి పిలుపునిచ్చే పని చాలా సులభతరం అయింది. ముహమ్మద్ ప్రవక్త (స) అనుయాయుల మాదిరిగా వెనుకటి సమాజాల వారికి ఇన్ని సౌలభ్యాలు ప్రాప్తం కాలేదు.

8. (ఓ ముహమ్మద్!) అవిశ్వాసుల ఈ దుర్వ్యవహారం నీకొక్కడికే పరిమితం కాదు, లోగడ అన్ని జాతుల వారూ మా సందేశహరుల పట్ల ఇలాగే వ్యవహరించారు. కాబట్టి నువ్వు ఏమాత్రం దిగులు చెందకు అని అల్లాహ్ ఓదారుస్తున్నాడు.

13 వారు దానిని విశ్వసించరు. పూర్వీకుల విధానం కూడా ఇలాగే ఉండేది.[10]

لَا يُؤْمِنُوْنَ بِهٖ وَقَدْ خَلَتْ سُنَّةُ الْاَوَّلِيْنَ ⑬

14 ఒకవేళ మేము వారికోసం ఆకాశ ద్వారం తెరిచినా, అందు లోకి వారు ఎక్కి పోతున్నా సరే,

وَلَوْ فَتَحْنَا عَلَيْهِمْ بَابًا مِّنَ السَّمَآءِ فَظَلُّوْا فِيْهِ يَعْرُجُوْنَ ⑭

15 "మాకేదో కనికట్టు లాంటిది చేయబడింది. అంతేకాదు, మాకేదో చేతబడి చేయబడింది"[11] అని అంటారు వారు.

لَقَالُوْٓا اِنَّمَا سُكِّرَتْ اَبْصَارُنَا بَلْ نَحْنُ قَوْمٌ مَّسْحُوْرُوْنَ ⑮

16 నిశ్చయంగా మేము ఆకాశంలో బురుజులను నిర్మించాము.[12] చూపరుల కోసం దానిని అందంగా ముస్తాబు చేశాము.

وَلَقَدْ جَعَلْنَا فِي السَّمَآءِ بُرُوْجًا وَّزَيَّنّٰهَا لِلنّٰظِرِيْنَ ⑯

17 ఇంకా, దానిని ధూత్కారి అయిన ప్రతి షైతాను బారి నుంచి రక్షించాము.[13]

وَحَفِظْنٰهَا مِنْ كُلِّ شَيْطٰنٍ رَّجِيْمٍ ⑰

9. వారు దైవప్రవక్త పట్ల వేళాకోళంగా వ్యవహరించారంటే వారి ఆంతర్యాల్లో ఉన్న భావాలు అటువంటివి మరి. వారు నిరంతరం పాపాలకు, దుర్మార్గాలకు పాల్పడుతూ ఉండటం వల్ల వారి హృదయాలకు తుప్పు పట్టింది. వారి ఆలోచనలు పెడత్రోవ పట్టాయి. మహనీయుల పట్ల, పైగంబరుల పట్ల ఇలాంటి పరిహాసాలాడటం వారికి పరిపాటి అయిపోయింది.

10. ధిక్కార వైఖరికి, ఎగతాళికైనా ఒక హద్దు ఉంటుంది. వారు ఆ హద్దును అతిక్రమించగానే వారి పని పట్టాలని అల్లాహ్ నిర్ధారించాడు.

11. వారికి నమ్మకం కలిగేలా చేయడానికి దైవదూతలను భువిపైకి దించటమే కాదు, ఆకాశ ద్వారం తెరచి వారిని పైకి పిలుచుకున్నా వారు ప్రవక్తల సందేశాన్ని సత్యమని ధృవీకరించరు. ఎందుకంటే సత్యధర్మ వ్యతిరేకతలో వారు చాలా దూరం వెళ్ళి పోయారు. యదార్థాలను కళ్ల ముందు ప్రత్యక్షపరచినా కనికట్టు లాంటిది ఏదో జరిగిపోయిందని వాపోతారు వారు.

12. అరబీలో **'బురూజ్'** అని ఉంది. ఇది 'బుర్జున్'కు బహువచనం. అసలు బుర్జ్ అన్న పదానికి ప్రదర్శన, బయటికి కనిపించేది అనే అర్థాలున్నాయి. 'తబర్రుజ్' అనే పదం కూడా దీని నుంచి వచ్చినదే. స్త్రీ తన అందం, అలంకరణను ప్రదర్శించటాన్ని 'తబర్రుజ్' అంటారు. ఈ ఆయతులో ఆకాశంలోని నక్షత్రాలను 'బురూజ్'గా వ్యవహరించటం జరిగింది. ఎందుకంటే నక్షత్రాలు కూడా ఎత్తయిన ఆకాశంలో అందరికీ కనిపిస్తూ ఉంటాయి.

అయితే కొంతమంది వ్యాఖ్యాతలు 'బురుజులు' అంటే సూర్యచంద్రులు, తదితర గ్రహరాశులని అభిప్రాయపడ్డారు. అవి మొత్తం 12. వాటి పేర్లు వరుసగా ఇవి : 1. మేషం 2. వృషభం (సౌర్) 3. మిథునం (జౌజా) 4. కర్కాటకం (సర్తాన్) 5. సింహం (అసద్) 6.కన్య 7. తుల (మీజాన్) 8. వృశ్చికం (అఖ్రబ్) 9. ధనుస్సు (ఖౌస్) 10. మకరం 11. కుంభం (దల్వున్) 12. మీనం (హూత్). అరబ్బులు ఈ రాశులను (మజిలీలను) బట్టి వాతావరణాన్ని తెలుసుకునేవారు. ఇలా చేయటంలో తప్పు లేదు. అయితే వాటి ద్వారా వార ఫలాలను చూడటం, ఫలానా విపత్తులు సంభవించనున్నాయని ఎద్దేవా చేయటం మాత్రం సమంజసం కాదు. ఏది జరిగినా అది దైవప్రణాళిక ప్రకారం జరుగుతుంది. దేవుడు ఈ ఆయతులో బురుజులను (నక్షత్రాలను) గురించి ప్రస్తావించి తన అపురూప శక్తి సామర్థ్యాలను, అనితర సాధ్యమైన తన నిర్మాణ ప్రక్రియను మనకు విశదపరుస్తున్నాడు. తన ఈ పనితనం మూలంగా ఆకాశం అందంగా ముస్తాబు అయిందని కూడా తెలుపుతున్నాడు.

13. అరబీలో **'రజీమ్'** అనే పదం ఉంది. ఇది 'రజమ్' నుండి వచ్చింది. రాళ్లు రువ్వటాన్ని 'రజమ్' అంటారు. షైతానును

**18** కాకపోతే దొంగచాటుగా (ఎవడైనా అక్కడి రహస్య విషయాలను) వినటానికి ప్రయత్నించినప్పుడు స్పష్టమైన అగ్నిజ్వాల ఒకటి వాడ్ని వెంటాడుతుంది.[14]

إِلَّا مَنِ اسْتَرَقَ السَّمْعَ فَأَتْبَعَهُ شِهَابٌ مُّبِينٌ ⑱

**19** ఇంకా మేము భూమిని పరచి, దానిపై పర్వతాలను పాతి పెట్టాము. మరి అందులో ప్రతి వస్తువునూ నిర్ణీత మోతాదులో[15] మొలిపించాము.

وَالْأَرْضَ مَدَدْنَاهَا وَأَلْقَيْنَا فِيهَا رَوَاسِيَ وَأَنبَتْنَا فِيهَا مِن كُلِّ شَيْءٍ مَّوْزُونٍ ⑲

**20** అందులోనే మేము మీ జీవనోపాధికి వనరులను సమకూర్చాము[16] ఇంకా మీరు జీవనోపాధి కల్పించని వాటికి కూడా.[17]

وَجَعَلْنَا لَكُمْ فِيهَا مَعَايِشَ وَمَن لَّسْتُمْ لَهُ بِرَازِقِينَ ⑳

'రజీమ్' అని ఎందుకన్నారంటే వాడు చాటుమాటుగా ఆకాశంలోకి పోయి, అక్కడి విషయాలను తెలుసుకోవటానికి ప్రయత్నించినప్పుడు అగ్ని గోళాలు అతనిపై విరుచుకుపడతాయి.

'రజీమ్' అనే పదం ఆగ్రహించబడినవాడు, ఛీత్కరించబడినవాడు, శపించబడినవాడు అన్న భావంలో కూడా తీసుకోబడుతుంది. ఎందుకంటే సాధారణంగా రాళ్ల వాన కురిసేది ఇలాంటి దుష్టులపైనే.

అల్లాహ్ ఈ ఆయతు ద్వారా చెప్పదలచిన ముఖ్య విషయం ఏమిటంటే, మేము నక్షత్రాల ద్వారా ఆకాశాన్ని తీర్చిదిద్దటంతో పాటు, వాటిని (నక్షత్రాలను) షైతానులను తరిమికొట్టే సాధనాలుగా కూడా చేశాము.

14. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే షైతానులు ఆకాశంలోని విశేషాలను వినటానికి అక్కడకు వెళతారు. వారు అక్కడికి వెళ్ళినప్పుడు తారలు వారిపై తెగిపడతాయి. ఆ దెబ్బకు కొందరు షైతానులు చచ్చిపోగా మరి కొందరు ఎలాగో చావును తప్పించుకుని, ఒకటీ అరా విషయాలను తెలుసుకుని వస్తారు. ఆ వివరాలు హదీసులో ఈ విధంగా వస్తున్నాయి : మహనీయ ముహమ్మద్ (స) ఈ విధంగా ప్రవచించారు – "అల్లాహ్ ఆకాశంలో ఏదైనా నిర్ణయం గైకొన్నప్పుడు, దాన్ని విన్న దైవదూతలు (అణకువ కొద్దీ) తమ రెక్కలను రెపరెపలాడిస్తారు. బండరాయిపై సంకెళ్ళతో కొడితే ఎలాంటి ధ్వని వస్తుందో ఆ రెక్కల ధ్వని కూడా అలాగే ఉంటుంది. ఆ భయం తొలగిపోయిన తరువాత దైవదూతలు పరస్పరం చర్చించుకుంటారు. 'ప్రభువు ఇంతకీ ఏం చెప్పాడు?' అని కొందరడిగితే, 'సత్యమే చెప్పాడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు' అని కొందరు చెబుతారు. దొంగచాటుగా ఈ విషయాలను వినడానికి వెళ్ళిన షైతానులు, ఒకటీ అరా సమాచారం ఎలాగో సేకరించి తమకు కొంత దూరాన నిలిచివున్న షైతానుల చెవిన పడేస్తారు. అలా అలా ఆ సమాచారం భువిపైకి వస్తుంది. తమ మిత్రులైన జ్యోతిష్యులకు, మంత్రగాళ్లకు, సోదె చెప్పేవారికి వారు ఆ సమాచారాన్ని అందజేస్తారు. వారు ఆ విషయానికి వంద అబద్ధాలు జోడించి ప్రజలకు చెబుతారు" (చూడండి : సహీహ్ బుఖారీ – అల్ హిజ్ర్ సూరా వ్యాఖ్యానం).

15. అరబీలో **'మౌజూన్'** (**مَّوْزُونٍ**) అని ఉంది. ఇది 'మాలూమ్' (నిర్ణీతమైన) అన్న అర్థంలో ఉపయోగించబడి ఉండవచ్చు లేక తగురీతిలో, అవసరానికి అనుగుణంగా అన్న అర్థంలోనయినా ఇది ఉపయోగించబడి ఉండవచ్చు. అంటే ప్రాణుల అవసరాల మేరకు వస్తువులను పుట్టించాము.

16. అరబీలో **'మఆయిష్'** అని ఉంది. ఇది 'మయీషతున్'కు బహువచనం. అంటే భువిపై మీ జీవిక కోసం కావలసిన వస్తు సామగ్రిని, వనరులను పుష్కలంగా సమకూర్చామని భావం.

17. అంటే మీ అధీనంలో ఉన్న మీ సేవకులకు, నౌకర్లకు, బానిసలకు కూడా మేమే ఆహారాన్ని సమకూరుస్తున్నాము. మీ వద్ద ఉన్న పశువులకు కూడా మేము ఆహారం ఇస్తున్నాం. ఆ పశువులను మీరు వాహనాలుగా ఉపయోగిస్తున్నారు. వాటి ద్వారా వస్తు సామగ్రిని తరలిస్తున్నారు. వ్యవసాయం చేస్తున్నారు. అలాగే మీ దగ్గర ఉన్న సేవకులతో మీరు

21 అన్ని వస్తువుల ఖజానాలు మా వద్దనే ఉన్నాయి.[18] ప్రతి వస్తువునూ మేము తగు మోతాదులో అవతరింపజేస్తాము.

وَإِن مِّن شَيْءٍ إِلَّا عِندَنَا خَزَآئِنُهُۥ وَمَا نُنَزِّلُهُۥٓ إِلَّا بِقَدَرٍ مَّعْلُومٍ ﴿٢١﴾

22 మేమే బరువైన గాలులను[19] పంపిస్తున్నాము. మరి ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, దాన్ని మీకు త్రాపిస్తున్నాము. ఈ (జల) నిధిని సమకూర్చుకోవటం అన్నది మీ వల్ల కాని పని.[20]

وَأَرْسَلْنَا ٱلرِّيَٰحَ لَوَٰقِحَ فَأَنزَلْنَا مِنَ ٱلسَّمَآءِ مَآءً فَأَسْقَيْنَٰكُمُوهُ وَمَآ أَنتُمْ لَهُۥ بِخَٰزِنِينَ ﴿٢٢﴾

23 ప్రాణం పోసేదీ, ప్రాణం తీసేది కూడా మేమే. (ఎట్టకేలకు) వారసులం కూడా మేమే.

وَإِنَّا لَنَحْنُ نُحْيِۦ وَنُمِيتُ وَنَحْنُ ٱلْوَٰرِثُونَ ﴿٢٣﴾

24 మీకు పూర్వం సాగిపోయిన వారినీ మేము ఎరుగుదుము. తరువాత వచ్చే వారిని కూడా ఎరుగుదుము.

وَلَقَدْ عَلِمْنَا ٱلْمُسْتَقْدِمِينَ مِنكُمْ وَلَقَدْ عَلِمْنَا ٱلْمُسْتَـْٔخِرِينَ ﴿٢٤﴾

25 నీ ప్రభువు వారందరినీ సమీకరిస్తాడు. నిశ్చయంగా అతడు మహా వివేకవంతుడు, అన్నీ తెలిసినవాడు.

وَإِنَّ رَبَّكَ هُوَ يَحْشُرُهُمْ ۚ إِنَّهُۥ حَكِيمٌ عَلِيمٌ ﴿٢٥﴾

26 మేము మనిషిని కుళ్ళి, బాగా ఎండిన మట్టితో సృష్టించాము.[21]

وَلَقَدْ خَلَقْنَا ٱلْإِنسَٰنَ مِن صَلْصَٰلٍ مِّنْ حَمَإٍ مَّسْنُونٍ ﴿٢٦﴾

---

పని చేయించుకుంటున్నారు. చూసేవారికి మీరు పోషకులుగా కనిపిస్తున్నప్పటికీ వాస్తవానికి వారి పోషకులు మీరు కాదు. వారికీ, మీకూ–అందరికీ జీవనోపాధిని ప్రసాదించేది మేమే. మీరు వారికి ఆహారం పెట్టకపోతే వారు ఆకలితో మాడి చచ్చిపోతారని అనుకోకండి.

18. ఇక్కడ **'ఖజానాలు'** అంటే అర్థం వర్షం అని కొంతమంది భావించారు. ఎందుకంటే ఉత్పత్తులన్నింటికీ మూలం ఇదే. కాని ఈ పదాన్ని 'విశ్వంలోని ఖజానాలు' అన్న భావంలో తీసుకోవటం చాలా వరకు సమంజసం. వాటిని అల్లాహ్ తన ప్రణాళిక ప్రకారం ఉనికిలోనికి తెస్తుంటాడు.

19. ఈ ఆయతులో **'బరువైన గాలులు'** అని చెప్పబడటం గమనార్హం. దాన్నే అరబీలో **'రియాహ లవాఖిహ'** అని పేర్కొనటం జరిగింది. ఆ గాలులు నీళ్లతో నిండిన మేఘాలను మోసుకొని అటూ ఇటూ కదులుతుంటాయి. కనుకనే అవి 'బరువైన గాలులు'గా చెప్పబడ్డాయి. సూడి ఒంటెను అరబీలో 'లఖ్‌హా' అంటారు. లవాఖిహ అన్న పదం కూడా లఖ్‌హా నుంచి వచ్చినదే.

20. మేము కురిపించే ఈ వర్షాలకు మీరు వెలకట్టలేరు. ఈ జల సంపదను నిలువ చేసుకునే శక్తి కూడా మీలో లేదు. ఆ నీటిని కాలువల, చెరువుల, సెలయేళ్ల, బావుల ద్వారా మేము నిలువ చేసి ఉంచుతున్నాం. ఇది ముమ్మాటికీ మా దయానుగ్రహమేనని మరువకండి. ఒకవేళ ఆ నీటిని మేము నేలలో ఇంకిపోయేలా చేస్తే లేక నీటిమట్టాన్ని నేల అడుగుభాగానికి తీసుకుపోతే మీరు ఇక్కట్ల పాలు కావలసివచ్చేది. ఇలాంటి పరిస్థితులు ప్రపంచంలో అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఉత్పన్నం కావటం అనుభవైక విషయమే. ప్రజలు గుణపాఠం గరిపేందుకుగాను అల్లాహ్ ఇలాంటి ఉదాహరణలను ఇస్తున్నాడు.

21. వివిధ స్థితులలో ఉన్న మట్టి, వివిధ పేర్లతో పిలువబడుతుంది. ఎండు మట్టి 'తురాబ్'గా పిలువబడుతుంది. తడిసిన మట్టి 'తీన్'గా వ్యవహరించబడుతుంది. బాగా అడుసు తొక్కి ముద్దగా చేసి, నానబెట్టిన మట్టిని **"హమయిమ్ మస్‌నూన్"** అంటారు. అది ఎండినప్పుడు టంగు టంగుమని శబ్దం వస్తుంది. దాన్నే అరబీలో 'సల్‌సాల్' అంటారు. అదేగనక కాల్చబడితే 'ఫఖ్ఖార్' (ఇటుక, పెంకు) అవుతుంది. ఈ ఆయతులో తెలుపబడిన సృష్టి ప్రక్రియను బట్టి విదితమయ్యేదేమిటంటే ఆది మానవుడైన ఆదం ఆకారం నానబెట్టిన, కుళ్ళిన మట్టితో చేయబడింది. అది బాగా

**27** అంతకు ముందు మేము జిన్నాతులను తీవ్రమైన ఉష్ణ జ్వాలతో సృష్టించాము.[22]

وَالْجَآنَّ خَلَقْنٰهُ مِنْ قَبْلُ مِنْ نَّارِ السَّمُوْمِ ﴿27﴾

**28** " కుళ్ళి, బాగా ఎండిపోయిన (నల్లని) మట్టితో నేను ఒక మానవుణ్ణి సృష్టించబోతున్నాను" అని నీ ప్రభువు దూతలతో అన్నాడు.

وَاِذْ قَالَ رَبُّكَ لِلْمَلٰٓئِكَةِ اِنِّيْ خَالِقٌۢ بَشَرًا مِّنْ صَلْصَالٍ مِّنْ حَمَاٍ مَّسْنُوْنٍ ﴿28﴾

**29** "నేను అతణ్ణి పూర్తిగా తయారుచేసి, అతనిలో నా ఆత్మను ఊదినప్పుడు మీరంతా అతని ముందు సాష్టాంగపడండి."

فَاِذَا سَوَّيْتُهٗ وَنَفَخْتُ فِيْهِ مِنْ رُّوْحِيْ فَقَعُوْا لَهٗ سٰجِدِيْنَ ﴿29﴾

**30** దూతలందరూ సాష్టాంగపడ్డారు[23] –

فَسَجَدَ الْمَلٰٓئِكَةُ كُلُّهُمْ اَجْمَعُوْنَ ﴿30﴾

**31** – ఒక్క ఇబ్లీసు తప్ప! సాష్టాంగపడే వారితో చేరటానికి వాడు నిరాకరించాడు.

اِلَّآ اِبْلِيْسَ ؕ اَبٰٓى اَنْ يَّكُوْنَ مَعَ السّٰجِدِيْنَ ﴿31﴾

**32** "ఓ ఇబ్లీస్! సాష్టాంగపడేవారితో నువ్వు ఎందుకు చేరలేదు?" అని (అల్లాహ్) నిలదీశాడు.

قَالَ يٰٓاِبْلِيْسُ مَا لَكَ اَلَّا تَكُوْنَ مَعَ السّٰجِدِيْنَ ﴿32﴾

**33** "కుళ్ళి, ఎండిన (నల్లని) మట్టితో నీవు సృష్టించిన మనిషి ముందు నేను మోకరిల్లబోను"[24] అని వాడు (షైతాను తెగేసి) చెప్పాడు.

قَالَ لَمْ اَكُنْ لِّاَسْجُدَ لِبَشَرٍ خَلَقْتَهٗ مِنْ صَلْصَالٍ مِّنْ حَمَاٍ مَّسْنُوْنٍ ﴿33﴾

---

ఎండిన తరువాత అందులో ప్రాణం పోయటం జరిగింది. ఈ మాటే ఖుర్ఆన్‌లో మరో చోట ఈ విధంగా చెప్పటం జరిగింది – 'అల్లాహ్ మనిషిని పెంకులా శబ్దం చేసే మట్టితో సృష్టించాడు" (అర్ రహ్మాన్ – 14).

22. **'జిన్'** అంటే దాగినది, కానరానిది అని అసలు అర్థం. అది కంటికి కానరాదు గనకనే దానికాపేరు వచ్చింది. రహ్మాన్ సూరాలో అల్లాహ్ జిన్నుల సృష్టి గురించి 'మారిజిమ్ మిన్నార్' (అగ్నిజ్వాల నుంచి) అని చెప్పాడు. సహీహ్ ముస్లింలోని ఒక హదీసులో ఇలా ఉంది: "ఖులిఖతిల్ మలాయికతు మిన్ నూరిన్ వ ఖులిఖల్ జాన్ను మిమ్ మారిజిమ్ మిన్నార్ వ ఖులిఖ ఆదము మిమ్మా వుసిఫ లకుమ్" (అనువాదం : దైవదూతలు కాంతితో పుట్టించబడ్డారు. జిన్నాతులు అగ్నిజ్వాలతో పుట్టించబడ్డారు. మరి ఆదం దేంతో సృష్టించబడ్డారో మీకు ఇప్పటికే తెలుపబడింది) (కితాబుజ్జుహ్ద్). దీనిప్రకారం 'తీవ్రమైన ఉష్ణ జ్వాలతో' అన్నా, 'అగ్ని జ్వాలతో' అన్నా భావం ఒక్కటే అని తెలుస్తోంది.

23. ఈ **'సాష్టాంగ ప్రణామం'** (సజ్దా) గౌరవార్థం చేయమన్నదేగాని, దాస్యం నిమిత్తం కాదు. అదీగాక ఇది అల్లాహ్ ఆజ్ఞ. దాన్ని పాటించటం తప్పనిసరి అన్న విషయంలో సందేహానికి లేశమైనా ఆస్కారం లేదు. అయితే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) షరీయతు ప్రకారం గౌరవార్థం కూడా ఈ రకమయిన సాష్టాంగ ప్రణామం చెయ్యటం సమ్మతం కాదు.

24. ఆదం మనుజ జాతికి చెందినవాడు కావటం, అందునా అతను మట్టితో చేయబడటం – ఈ రెండు విషయాలు షైతాన్‌కు అల్పంగా తోచాయి. ఇది షైతాన్ పుర్రెలో పుట్టిన ఆలోచన. వాస్తవానికి ఇది సరైనది కాదు.
దైవప్రవక్తలు కూడా మానవమాత్రులే. మానవులందరికీ మూల పురుషుడైన ఆదం మట్టితో సృజించబడ్డారు. మట్టితో సృజించబడినంత మాత్రాన, అలాగే మానవులైనంత మాత్రాన దైవప్రవక్తల ఔన్నత్యానికి వాటిల్లిన ముప్పు ఏమీ లేదు.

**34** "అయితే ఇక్కణ్ణుంచి వెళ్ళిపో, నువ్వు ధూత్కరించబడ్డావు.

قَالَ فَاخْرُجْ مِنْهَا فَإِنَّكَ رَجِيمٌ (34)

**35** ప్రళయదినం వరకూ నీపై నా అభిశాపం ఉంటుంది" అని అల్లాహ్ సెలవిచ్చాడు.

وَإِنَّ عَلَيْكَ اللَّعْنَةَ إِلَىٰ يَوْمِ الدِّينِ (35)

**36** "ప్రభూ! ప్రజలు (మరణానంతరం) తిరిగి లేపబడే రోజు వరకూ నాకు గడువు ఇవ్వు" అని వాడు విన్నవించుకున్నాడు.

قَالَ رَبِّ فَأَنظِرْنِي إِلَىٰ يَوْمِ يُبْعَثُونَ (36)

**37** "సరే! నీకు గడువు ఇవ్వబడింది" అని అల్లాహ్ సెలవిచ్చాడు.

قَالَ فَإِنَّكَ مِنَ الْمُنظَرِينَ (37)

**38** " ఆ నిర్ధారిత సమయం వచ్చే రోజు వరకూ" (అన్నాడు).

إِلَىٰ يَوْمِ الْوَقْتِ الْمَعْلُومِ (38)

**39** "ఓ ప్రభూ! నీవు నన్ను అపమార్గం పట్టించినందు వల్ల, నేను వారికి (మానవులకు) భూమండలంలో పాపాన్ని అందంగా కనిపించేలా చేస్తాను. వారినందరినీ పెడత్రోవ పట్టిస్తాను" అని ఇబ్లీసు చెప్పాడు.

قَالَ رَبِّ بِمَا أَغْوَيْتَنِي لَأُزَيِّنَنَّ لَهُمْ فِي الْأَرْضِ وَلَأُغْوِيَنَّهُمْ أَجْمَعِينَ (39)

**40** "నీ ద్వారా ఎన్నుకోబడిన ప్రత్యేక దాసులను తప్ప" (అన్నాడు).

إِلَّا عِبَادَكَ مِنْهُمُ الْمُخْلَصِينَ (40)

**41** (అల్లాహ్) ఇలా సెలవిచ్చాడు : "నన్ను చేరే రుజుమార్గం మాత్రం ఇది.[25]

قَالَ هَٰذَا صِرَاطٌ عَلَيَّ مُسْتَقِيمٌ (41)

**42** "నా దాసులపై నీ అధికారం సాగదు.[26] నీ అధికారం నిన్ను అనుసరించే భ్రష్టులపై మాత్రమే సాగుతుంది."

إِنَّ عِبَادِي لَيْسَ لَكَ عَلَيْهِمْ سُلْطَانٌ إِلَّا مَنِ اتَّبَعَكَ مِنَ الْغَاوِينَ (42)

**43** (అలాంటి) వారందరి కోసం వాగ్దానం చేయబడిన చోటు నరకం.[27]

وَإِنَّ جَهَنَّمَ لَمَوْعِدُهُمْ أَجْمَعِينَ (43)

**44** దానికి ఏడు ద్వారాలు ఉంటాయి. ఒక్కో ద్వారం వారిలోని ఒక్కో వర్గం కోసం కేటాయించబడింది.[28]

لَهَا سَبْعَةُ أَبْوَابٍ لِّكُلِّ بَابٍ مِّنْهُمْ جُزْءٌ مَّقْسُومٌ (44)

---

25. అంటే, ఆఖరికి మీరంతా ఇక్కడకు రావలసిన వారే. నన్ను, నా ప్రవక్తలను అనుసరించిన వారికి నేను మంచి బహుమానం వొసగుతాను. షైతాన్ పాద చిహ్నాలలో నడచిన వారికి కఠిన శిక్ష నరక రూపంలో విధిస్తాను.

26. సజ్జనులైన నా దాసుల ముందు నీ ఆటలు సాగవు. అంతమాత్రాన సజ్జనులైన దాసుల ద్వారా ఏ పాపం జరగదని దీని భావం కాదు. మనిషి వల్ల తప్పు జరగటం పరిపాటే. అయితే సజ్జనులైన దాసులు తప్పును తెలుసుకోగానే పశ్చాత్తాపభావంతో కుమిలిపోతారు. ఇకమీదట అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్తపడతారు. కాని జరిగిన తప్పుపై పశ్చాత్తాపపడకుండా నిశ్చింతగా ఉన్నవాడు నిరంతరం తప్పులు చేస్తూ పోతాడు. ఆఖరికి శాశ్వితమైన వినాశం వాడి తలరాతగా మారిపోతుంది.

27. ఓ షైతాన్! నీ అనుయాయులంతా నరకానికి ఇంధనంగా మారుతారు.

28. పాపాత్ముల్లో రకరకాల వారుంటారు. కొందరు ముష్రిక్కులైతే, మరికొందరు దైవధిక్కారులు అయి ఉంటారు. కొందరు వ్యభిచారులైతే, మరికొందరు వడ్డీసొమ్మును తిన్నవారై ఉంటారు. కొందరు దోపిడీ దొంగలైతే, మరికొందరు

**45** నిశ్చయంగా దైవభక్తిగలవారు ఉద్యానవనాల, సెలయేరుల మధ్యన ఉంటారు.[29]

إِنَّ الْمُتَّقِينَ فِي جَنَّاتٍ وَعُيُونٍ ﴿٤٥﴾

**46** ప్రశాంతంగా, నిశ్చింతగా అందులోనికి ప్రవేశించండి[30] (అని వారితో అనబడుతుంది).

ادْخُلُوهَا بِسَلَامٍ آمِنِينَ ﴿٤٦﴾

**47** వారి హృదయాలలో ఏ కాస్త కోపం, ద్వేషం మిగిలివున్నా దాన్ని మేము తొలగిస్తాము.[31] వారంతా అన్నదమ్ములై ఎదురెదురుగా ఆసనాలపై కూర్చుని ఉంటారు.

وَنَزَعْنَا مَا فِي صُدُورِهِم مِّنْ غِلٍّ إِخْوَانًا عَلَىٰ سُرُرٍ مُّتَقَابِلِينَ ﴿٤٧﴾

**48** అక్కడ వారికి ఏ బాధా అంటుకోదు. అక్కణ్ణుంచి వారిని ఎన్నటికీ వెళ్ళగొట్టడం కూడా జరగదు.

لَا يَمَسُّهُمْ فِيهَا نَصَبٌ وَمَا هُم مِّنْهَا بِمُخْرَجِينَ ﴿٤٨﴾

**49** (ఓ ప్రవక్తా!) నేను అమితంగా క్షమించేవాడిననీ, అపారంగా కరుణించేవాడిననీ, నా దాసులకు తెలియజేయి.

نَبِّئْ عِبَادِي أَنِّي أَنَا الْغَفُورُ الرَّحِيمُ ﴿٤٩﴾

**50** అలాగే నా శిక్షకూడా అత్యంత బాధాకరమైన శిక్షేనని (చెప్పు).

وَأَنَّ عَذَابِي هُوَ الْعَذَابُ الْأَلِيمُ ﴿٥٠﴾

**51** వారికి ఇబ్రాహీమ్ అతిథుల గురించి (కూడా) వినిపించు.

وَنَبِّئْهُمْ عَن ضَيْفِ إِبْرَاهِيمَ ﴿٥١﴾

---

నరహంతకులై ఉంటారు. వారిలో ఒక్కొక్కరికి ఒక్కో ద్వారం ప్రత్యేకించబడుతుంది. లేక ఏడు ద్వారాలుంటాయంటే నరకంలోనే ఏడు విభాగాలు లేక తరగతులు ఉంటాయని కావచ్చు. ఆ విభాగాలు ఇవి: 1. జహన్నమ్ 2.లజా 3.హుతమ 4.సయీర్ 5.సఖర్ 6.జహీమ్ 7.హావియ. వీటిలో అన్నిటికన్నా మొదటి విభాగం ఏకదైవోపాసకులైన పాపులకు ఇవ్వబడుతుంది. వారు కొంతకాలం శిక్షను అనుభవించిన మీదట సిఫారసుపై నరకం నుంచి తీయబడతారు. తరువాత యూదులు, ఆ తరువాత క్రైస్తవులు, ఆ తరువాత సాబియీలు, ఆ తరువాత జొరాష్ట్రియన్లు, ఆ తరువాత ముష్రిక్కులు, ఆ తరువాత కపటులు ఆయా విభాగాలకు తరలించబడతారు. అన్నిటికంటే పైన ఉండే విభాగం పేరు జహన్నమ్. ఆ తర్వాత – పైన పేర్కొనబడినట్లు – వరుసగా తరగతులుంటాయి (ఫత్హుల్ ఖదీర్).

29. నరకం మరియు నరకవాసుల ప్రస్తావన తరువాత స్వర్గం – స్వర్గవాసుల గురించి ప్రస్తావించటం జరిగింది. స్వర్గం పట్ల ప్రజలలో ఆసక్తినీ, ఆశను కలిగించటం దీని ఉద్దేశం. 'దైవభక్తిగలవారు' (ముత్తఖీన్) అంటే షిర్క్‌కు దూరంగా ఉండే ఏక దైవారాధకులు. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం పాపకార్యాలకు దూరంగా ఉండే విశ్వాసులందరూ 'దైవభక్తిపరుల' కోవకు చెందుతారు. స్వర్గంలోని వనాలు, కాలువలు, సెలయేరులు స్వర్గవాసుల కోసం ఉమ్మడిగానూ ఉండవచ్చు లేదా ప్రతి ఒక్కరికీ వేర్వేరు వనాలు, సెలయేరులూ ఉండవచ్చు. లేదా ఒక్కొక్కరికి ఒక్కో వనం, ఒక్కో సెలయేరు చొప్పున కూడా ఉండవచ్చు.

30. అన్ని రకాల విపత్తుల నుంచి నిశ్చింతగా, అన్ని రకాల భయాందోళనల నుంచి నిర్భయంగా ఉంటూ – స్వర్గంలో ప్రవేశించమని భావం. లేదా ఒక ముస్లిం మరో ముస్లిం కోసం లేదా దైవదూతలు స్వర్గవాసుల కోసం ఈ విధంగా ప్రార్థించవచ్చు. లేదా అల్లాహ్ తరఫున స్వర్గవాసులందరికీ ఈ విధంగా అభయం ఇవ్వబడవచ్చు.

31. ప్రపంచంలో వీరిమధ్య ఉండే అసూయ, ఓర్వలేనితనం, కినుక వంటి నకారాత్మక భావాలు వారి ఆంతర్యాల నుంచి సాంతం తీసివేయబడతాయి. ఒండొకరిపట్ల వారి హృదయాలు నిర్మలంగా – అద్దంలా – ఉండేటట్లు చేసి, ఆపైన స్వర్గంలోకి ప్రవేశం కల్పించటం జరుగుతుంది.

52 వారు అతని దగ్గరకు వచ్చి 'సలామ్' చెప్పినప్పుడు "మిమ్మల్ని చూస్తే మాకెందుకో భయమేస్తున్నది"[32] అని అతను అన్నాడు.

إِذْ دَخَلُوا عَلَيْهِ فَقَالُوا سَلَامًا قَالَ إِنَّا مِنكُمْ وَجِلُونَ ﴿52﴾

53 "భయపడకు. మేము నీకు జ్ఞాన సంపన్నుడైన కుమారుడు పుడతాడన్న శుభవార్తను అందజేస్తున్నాము" అని వారన్నారు.

قَالُوا لَا تَوْجَلْ إِنَّا نُبَشِّرُكَ بِغُلَامٍ عَلِيمٍ ﴿53﴾

54 "ఏమిటీ, వృద్ధాప్యం వచ్చేసిన తరువాత మీరు నాకు ఈ శుభవార్త వినిపిస్తున్నారా? ఈ శుభవార్తను అసలు మీరు ఎలా వినిపిస్తున్నారు?" అని అతను అన్నాడు.

قَالَ أَبَشَّرْتُمُونِي عَلَىٰ أَن مَّسَّنِيَ الْكِبَرُ فَبِمَ تُبَشِّرُونَ ﴿54﴾

55 దానికి వారు, "మేము నిజమైన శుభవార్తనే నీకు అందజేస్తు న్నాము. కాబట్టి నువ్వు నిరాశచెందిన వారిలో చేరకు"[33] అని సమాధానమిచ్చారు.

قَالُوا بَشَّرْنَاكَ بِالْحَقِّ فَلَا تَكُن مِّنَ الْقَانِطِينَ ﴿55﴾

56 "మార్గభ్రష్టులు మాత్రమే తమ ప్రభువు కారుణ్యం పట్ల నిరాశ చెందుతారు"[34] అని అతను (ఇబ్రాహీము) అన్నాడు.

قَالَ وَمَن يَقْنَطُ مِن رَّحْمَةِ رَبِّهِ إِلَّا الضَّالُّونَ ﴿56﴾

57 (ఆ తరువాత ఇబ్రాహీం వారినుద్దేశించి) "ఓ అల్లాహ్ తరఫున పంపబడినవారలారా! ఇంతకీ మీరు వచ్చిన పనేమిటి?[35] అని ప్రశ్నించాడు.

قَالَ فَمَا خَطْبُكُمْ أَيُّهَا الْمُرْسَلُونَ ﴿57﴾

58 వారు ఇలా సమాధానమిచ్చారు: "మేమొక నేరస్థుల మూక వైపు పంపబడ్డాము.

قَالُوا إِنَّا أُرْسِلْنَا إِلَىٰ قَوْمٍ مُّجْرِمِينَ ﴿58﴾

32. హజ్రత్ ఇబ్రాహీం(అ)కు వారిపట్ల భయం కలగటానికి అసలు కారణం ఆయన భోజనం కొరకు వడ్డించిన దూడ మాంసాన్ని వారు తినకపోవటమే. హూద్ సూరాలోనూ ఈ సంఘటన వివరంగా వచ్చింది. ఈ సంఘటన ద్వారా ముందుకు వచ్చే ఓ ముఖ్య విషయం ఏమిటంటే దైవప్రవక్తలకు సయితం రహస్య విషయాల జ్ఞానం ఉండదు. వారికి అగోచర విషయాల జ్ఞానం గనక ఉండి ఉంటే, తన ఇంటికి వచ్చిన అతిథులు మానవమాత్రులు కారనీ, వారు దివి నుంచి భువికి దిగి వచ్చిన దైవదూతలని తెలిసిపోయేది. వారి కోసం భోజన ఏర్పాట్లు చేయవలసిన అవసరం కూడా ఉండేదికాదు. దైవదూతలు మనుషుల మాదిరిగా అన్నపానీయాలను తీసుకోరు.

33. ఎందుకంటే ఇది దేవుని వాగ్దానం. ఆయన వాగ్దానం నెరవేరకపోవటం అన్నది జరగదు. ఆయన తలచుకున్నదల్లా చేసి తీరుతాడు. ఏ విషయం కూడా ఆయనకు అసాధ్యం కాదు.

34. అంటే తాను దైవకారుణ్యం పట్ల ఏమాత్రం నిరాశ చెందటం లేదనీ, కాకపోతే ముసలితనంలో సంతానం కలుగుతుందన్న సమాచారమే తనను కించిత్ ఆశ్చర్యానికి లోను చేసిందని హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) చెప్పదలిచారు.

35. వీళ్లు (దైవదూతలు) కేవలం సంతాన శుభవార్తను ఇవ్వటానికే రాలేదనీ, వారేదో ముఖ్యమైన ఉత్తర్వును అమలు పరచటానికే వచ్చి ఉంటారని దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) గార్కి అనిపించింది. ఆ మాటే ఆయన వారిని అడిగారు.

**59** “అయితే లూత్ కుటుంబీకులందరినీ మేము కాపాడుతాము–

إِلَّآ اٰلَ لُوْطٍ ؕ اِنَّا لَمُنَجُّوْهُمْ اَجْمَعِيْنَ ﴿59﴾

**60** “ఒక్క అతని (లూత్) భార్యను తప్ప! ఆమె (కూడా) వెనుక ఉండిపోయేవారిలో చేరిపోతుందని మేము నిర్ధారించాము.”

اِلَّا امْرَاَتَهٗ قَدَّرْنَآ ۙ اِنَّهَا لَمِنَ الْغٰبِرِيْنَ ﴿60﴾

**61** పంపబడిన దూతలు లూత్ ఇంటివారల వద్దకు వచ్చినప్పుడు,

فَلَمَّا جَآءَ اٰلَ لُوْطِ ِۨالْمُرْسَلُوْنَ ﴿61﴾

**62** “మీరు అపరిచిత వ్యక్తుల్లా ఉన్నారే!”[36] అని అతను (లూత్) అన్నాడు.

قَالَ اِنَّكُمْ قَوْمٌ مُّنْكَرُوْنَ ﴿62﴾

**63** “కాదు, కాని వీళ్లు ఏ విషయంలో అనుమానానికి లోనై ఉన్నారో దాన్ని మేము నీ దగ్గరకు తీసుకువచ్చాము.[37]

قَالُوْا بَلْ جِئْنٰكَ بِمَا كَانُوْا فِيْهِ يَمْتَرُوْنَ ﴿63﴾

**64** “మేము నీ వద్దకు (స్పష్టమైన) సత్యాన్ని తెచ్చాము. మేము చెప్పేది నిజం.[38]

وَاَتَيْنٰكَ بِالْحَقِّ وَاِنَّا لَصٰدِقُوْنَ ﴿64﴾

**65** “నువ్వు నీ కుటుంబ సమేతంగా ఈ రాత్రికి రాత్రే ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. నువ్వు మాత్రం వీళ్ళ వెనుక ఉండాలి.[39] (జాగ్రత్త!) మీలో ఎవరూ వెనుతిరిగి కూడా చూడకూడదు. మీకు ఆదేశించబడిన వైపుకు వెళ్ళిపోండి” అని వారు చెప్పారు.

فَاَسْرِ بِاَهْلِكَ بِقِطْعٍ مِّنَ الَّيْلِ وَاتَّبِعْ اَدْبَارَهُمْ وَلَا يَلْتَفِتْ مِنْكُمْ اَحَدٌ وَّامْضُوْا حَيْثُ تُؤْمَرُوْنَ ﴿65﴾

**66** (ఈ విధంగా) తెలతెలవారుతుండగా వారు సమూలంగా త్రుంచి వేయబడతారన్న మా నిర్ణయాన్ని[40] మేము అతనికి తెలియజేశాము.

وَقَضَيْنَآ اِلَيْهِ ذٰلِكَ الْاَمْرَ اَنَّ دَابِرَ هٰٓؤُلَآءِ مَقْطُوْعٌ مُّصْبِحِيْنَ ﴿66﴾

**67** నగరవాసులు మహా సంబరపడుతూ (లూత్ ఇంటికి) వచ్చారు.[41]

وَجَآءَ اَهْلُ الْمَدِيْنَةِ يَسْتَبْشِرُوْنَ ﴿67﴾

---

36. ఆ దైవదూతలు అందమైన యువకుల రూపంలో వచ్చారు. అంతకు ముందు అలాంటి నవ యువకులను లూత్ (అలైహిస్సలాం) తన ప్రాంతంలో ఎన్నడూ చూడలేదు. అందుకే ఆయన వాళ్ళనుద్దేశించి, మీరెవరో కొత్తవారిలా ఉన్నారే! అని సందేహపడ్డారు.
37. అంటే దైవశిక్ష. ఏ శిక్షను నీ జాతి జనులు ఇంతకాలంగా శంకిస్తున్నారో దాన్నే మేము ఈనాడు తీసుకువచ్చాము.
38. **‘(స్పష్టమైన) సత్యం’** అంటే కూడా ఇక్కడ ‘దైవశిక్ష’ అనే భావం. ‘మేము చెప్పేది పూర్తిగా నిజం’ అని వారు అనటం గమనార్హం. అంటే మీజాతి వారి పాపం పండింది. వారికి మూడే సమయం వచ్చేసింది. మేము చెప్పే మాటలు మీకు వింతగా తోస్తాయేమో! కాని ఇది వాస్తవం అన్నది వారి మాటల్లోని గూఢార్థం.
39. అంటే నీ సందేశాన్ని అనుసరించే దాసులలో ఏ ఒక్కరినీ ఇక్కడ వదలకుండా చూసుకో అని భావం.
40. తెల్లవారుతుండగా ఆ ప్రాంతంలో నివసించే పాపాత్ములంతా తుదముట్టించబడతారన్న తన నిర్ణయాన్ని దేవుడు తన దూతల ద్వారా లూత్ (అలైహిస్సలాం)కు తెలియజేశాడు. ఆయతులో అసలు **‘దాబిర్’** అనే పదం వచ్చింది. దాబిర్

**68** “వీళ్ళు నా అతిథులు. మీరు (వీళ్ళ ముందు) నా పరువు తీయకండి” అని (లూత్) అన్నాడు.[42]

قَالَ إِنَّ هَٰؤُلَاءِ ضَيْفِي فَلَا تَفْضَحُونِ ﴿٦٨﴾

**69** “అల్లాహ్‌కు భయపడండి. నన్ను అవమానపరచకండి” (అని అన్నాడు).

وَاتَّقُوا اللَّهَ وَلَا تُخْزُونِ ﴿٦٩﴾

**70** “ఏమిటీ, లోకంలోని జనులందరినీ వెనకేసుకు రావద్దని మేము నిన్ను వారించలేదా?”[43] అని వారంతా అన్నారు.

قَالُوا أَوَلَمْ نَنْهَكَ عَنِ الْعَالَمِينَ ﴿٧٠﴾

**71** “మీకు అంతగా కావాలనుకుంటే, ఇదిగో నా ఈ కూతుళ్ళు ఉన్నారు”[44] అని (లూత్) ప్రాధేయపడ్డాడు.

قَالَ هَٰؤُلَاءِ بَنَاتِي إِن كُنتُمْ فَاعِلِينَ ﴿٧١﴾

**72** (ఓ ముహమ్మద్!) నీ ఆయుష్షు సాక్షిగా! వారు తమ (ముదనష్టపు) కైపులో గుడ్డివారయి పోయారు.[45]

لَعَمْرُكَ إِنَّهُمْ لَفِي سَكْرَتِهِمْ يَعْمَهُونَ ﴿٧٢﴾

అంటే చివరగా మిగిలిపోయే వ్యక్తి అని అర్థం. తెల్లారేసరికల్లా అతడు కూడా తుదముట్టించబడతాడనీ, దుర్మార్గుల్లో ఒక్కడు కూడా మిగలడని పై ఆయతుకు భావం.

41. ఒక వైపు లూత్ (అలైహిస్సలాం) ఇంట్లో ఆ నేరస్థుల వినాశానికి సంబంధించిన వ్యూహ రచన జరుగుతుండగా, మరోవైపు ఆ జాతిలోని దుర్మార్గులు అందమైన నవయువకులు లూత్ ఇంటికి వచ్చి ఉన్నారని తెలుసుకుని ఆనందంతో ఎగిరి గంతేశారు. ఎందుకంటే వారు లోనై ఉన్న దురలవాటు అటువంటిది. పరుగులు తీస్తూ వచ్చి, నీతిమాలిన పని కోసం ఆ కుర్రవాళ్ళను తమకు అప్పగించమని లూత్ (అలైహిస్సలాం)ను కోరారు.

42. వారు తన అతిథులనీ, వారిని అప్పగించలేననీ, తన పరువు ప్రతిష్ఠలను మంటగలప వద్దని హోమో సెక్సువల్స్‌గా తయారైన తన జాతి ప్రజలను హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) ప్రాధేయపడ్డారు.

43. దాంతో వారు రెచ్చిపోయారు. లూత్! చాలించు నీ అధిక ప్రసంగం. ఈ అపరిచిత వ్యక్తులకు నువ్వేమవుతావు. ప్రతి ఒక్కరినీ ఎందుకిలా వెనకేసుకువస్తావు? మన ఊరికి వచ్చిన అపరిచిత వ్యక్తులకు అండగా నిలువరాదనీ, వారికి అతిథి మర్యాదలు చేయరాదని ఇంతకుముందే చెప్పామా? లేదా? అని గొడవ చేశారు. ఆ వచ్చిన అపరిచిత వ్యక్తులు దైవదూతలని హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) గార్కి తెలియక ముందు ఈ సంభాషణ సాగింది. హూద్ సూరాలో కూడా దీని వివరాలు వచ్చాయి.

44. అంటే ఆయన తన జాతికి చెందిన ఆడపిల్లలను దృష్టిలో పెట్టుకుని ‘నా కూతుళ్ళు ఉన్నారు’ అని చెప్పారు. మీరు వారిని వివాహం చేసుకుని, ధర్మసమ్మతమైన రీతిలో – సహజ పద్ధతిలో – మీ లైంగిక వాంఛల్ని తీర్చుకోండి. ఇలాంటి పాడు పనులను మానుకోండి అన్నది ఆయన మాటల్లోని ఆంతర్యం.

45. ఈ ఆయతులో దేవుడు తన అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఉద్దేశించి, ఆయన జీవితంపై ఒట్టేసి మరీ చెబుతున్నాడు. దీన్నిబట్టి అంతిమ దైవప్రవక్త (స) వారి ఔన్నత్యం ఎటువంటిదో మనకు అర్థం అవుతోంది. అయితే ఈ విధంగా ప్రమాణం చేసి చెప్పటం దైవానికే చెల్లు. ఆయన తిరుగులేనివాడు. ఆయన కోరిన దానిపై ప్రమాణం చేసి చెప్పగలడు. ఆయన్ని ఎందుకు? ఎలా? అని నిలదీసే హక్కు అధికారం ఎవరికీ లేదు.

తప్ప తాగిన మనిషి ఎలా మత్తులో మునిగిపోయి మంచీ చెడుల విచక్షణా జ్ఞానం కోల్పోతాడో అలాగే లూత్ జాతివారు కూడా స్వలింగ సంపర్క కైపులో – కళ్లు మూసుకు పోయినట్లుగా – తేలిపోసాగారు. ఆ సమయంలో హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) చేసిన ప్రతిపాదనను పట్టించుకునే స్థితిలో కూడా వారు లేరు అని దేవుడు తెలియజేశాడు.

**73** సూర్యోదయం అవుతున్న సమయంలో ఒక భయంకరమైన ప్రేలుడు వారిని ముట్టడించింది.[46]

فَاَخَذَتْهُمُ الصَّيْحَةُ مُشْرِقِيْنَ (73)

**74** చివరికి మేము ఆ నగరాన్ని తలక్రిందులుగా చేసివేశాము.[47] వారిపై కంకర రాళ్ల వర్షం కురిపించాము.[48]

فَجَعَلْنَا عَالِيَهَا سَافِلَهَا وَاَمْطَرْنَا عَلَيْهِمْ حِجَارَةً مِّنْ سِجِّيْلٍ (74)

**75** నిస్సందేహంగా యోచన చేసేవారి కొరకు[49] ఇందులో ఎన్నో సూచనలున్నాయి.

اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّلْمُتَوَسِّمِيْنَ (75)

**76** ఈ పట్టణం (జనులు) వచ్చేపోయే రహదారిపైనే ఉంది.[50]

وَاِنَّهَا لَبِسَبِيْلٍ مُّقِيْمٍ (76)

**77** విశ్వసించిన వారి కోసం ఇందులో గొప్ప సూచన ఉంది.

اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيَةً لِّلْمُؤْمِنِيْنَ (77)

**78** అయ్కా వారు (అడవి జనులు) కూడా దుర్మార్గులే.[51]

وَاِنْ كَانَ اَصْحٰبُ الْاَيْكَةِ لَظٰلِمِيْنَ (78)

---

46. సూర్యుని లేలేత కిరణాలు పడుతున్న సమయంలో ఒకే ఒక్క శబ్దం వచ్చింది. అత్యంత భయంకరమైన ఈ కేక హజ్రత్ జిబ్రీల్ (అలైహిస్సలాం)దని కొంతమంది అభిప్రాయపడ్డారు.

47. వారి నివాస స్థలాలు భూమి నుంచి ఆకాశానికి ఎత్తి, వాటిని తలక్రిందులుగా చేసి విసిరివేయటం జరిగిందని అనబడుతోంది. ఆ విధంగా వారు తమ ఇల్లూ వాకిలి సమేతంగా తలక్రిందులుగా చేసివేయబడ్డారు. అయితే కేవలం పై కప్పులతో సహా ఇళ్లు కూలిపోవటం మాత్రమే దీని భావమని మరికొందరంటారు.

48. ఆ తర్వాత వారిపై ఒక ప్రత్యేక రకమైన కంకర రాళ్లు కూడా కురిపించబడ్డాయి. ఈ విధంగా వారు మూడు రకాల శిక్షలకు గురిచేయబడ్డారు. భావితరాల కొరకు ఇదొక గుణపాఠం అయ్యేలా చేయబడింది.

49. ఆయతులో **'ముతవస్సిమీన్'** అని వుంది. నిశితదృష్టితో విషయాన్ని పరికించేవారిని, యోచన చేసేవారిని 'ముతవస్సిమీన్' అంటారు. అలాంటివారి కోసం ఇందులో గుణపాఠం ఉంది.

50. అంటే ప్రధాన రహదారి అని భావం. మదీనా నుంచి సిరియాకు వెళ్ళే మార్గంలో శిథిలావస్థలో ఉన్న లూత్ (అలైహిస్సలాం) జాతి ప్రజల పట్టణాలు కానవస్తాయి. అటువైపు వచ్చేపోయే వారంతా ఆ దారి గుండా సాగవలసిందే. అవి మొత్తం అయిదు పేటలు. 1. సద్దూమ్ (ముఖ్యపట్టణం) 2. సాబ 3. సావహ్ 4. అస్ర 5. దూమా. వీటిని నాశనం చేసిన తీరు గురించి ఒక కథనం ఈ విధంగా ఉంది : హజ్రత్ జిబ్రీల్ (అలైహిస్సలాం) తన రెక్కలపై ఈ పేటలను ఎత్తుకుని నింగికేసి సాగిపోయారు. ఆకాశాన ఉన్నవారు కూడా వారి కుక్కలు మొరగటాన్ని, కోళ్లు కూతవేయటాన్ని విన్నారు. ఆ తరువాత వారిని నేలకేసి గిరాటు కొట్టారని అనబడుతోంది (ఇబ్నె కసీర్). అయితే ఈ కథనానికి ప్రామాణికమైన ఆధారాలు లేవు.

51. దట్టమైన వృక్షాలను **'అయ్కహ్'** అని అంటారు. వారు నివసించే చోట దట్టమైన చెట్లు ఉండటం వల్ల వారిని వనవాసులనీ, అడవి జనులనీ అన్నారు. అంటే హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) జాతి ప్రజలన్నమాట. హజ్రత్ షుఐబ్ హజ్రత్ లూత్ తరువాత పంపబడ్డారు. ఈయన ప్రదేశం కూడా హిజాజ్ – సిరియా ప్రాంతాలకు నడుమ, లూత్ జాతిప్రజల శిథిల పట్టణాలకు సమీపంలోనే ఉంది. ఈ ప్రదేశం 'మద్యన్'గా వ్యవహరించబడింది. బహుశా ఇది హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి కొడుకు లేక మనవడి పేరు అయి ఉంటుంది. ఆ (మద్యన్) పేరే ఆ బస్తీకి స్థిరపడింది.

ఇంతకీ ఆ బస్తీ జనుల తప్పేమిటంటే వారు అల్లాహ్తో పాటు దైవత్వంలో వేరొకరిని కూడా భాగస్వాములుగా చేసుకునేవారు. దారి దోపిడీలు చేసేవారు. కొలతలు తూనికల్లో మోసానికి పాల్పడేవారు. వారిని శిక్షించే సమయం

**79** (ఆఖరికి) వారికి కూడా మేము ప్రతీకారం చేశాం. ఈ రెండు పట్టణాలు కూడా ప్రధాన రహదారి మీదే ఉన్నాయి.[52]

فَانْتَقَمْنَا مِنْهُمْ ۘ وَإِنَّهُمَا لَبِإِمَامٍ مُّبِينٍ ﴿79﴾

**80** హిజ్ర్ వారు కూడా ప్రవక్తలను ధిక్కరించారు.[53]

وَلَقَدْ كَذَّبَ أَصْحَابُ الْحِجْرِ الْمُرْسَلِينَ ﴿80﴾

**81** (మరి చూడబోతే) మేము వారికి మా సూచనలను కూడా వొసగాము. అయినప్పటికీ వారు వాటిపట్ల విముఖతే చూపుతూ వచ్చారు.[54]

وَآتَيْنَاهُمْ آيَاتِنَا فَكَانُوا عَنْهَا مُعْرِضِينَ ﴿81﴾

**82** వారు నిర్భయంగా[55] పర్వతాలను తొలచి ఇండ్లు నిర్మించే వారు.

وَكَانُوا يَنْحِتُونَ مِنَ الْجِبَالِ بُيُوتًا آمِنِينَ ﴿82﴾

**83** ఆఖరికి వారిపై కూడా తెల తెలవారుతుండగా ఒక కేక విరుచుకుపడింది.[56]

فَأَخَذَتْهُمُ الصَّيْحَةُ مُصْبِحِينَ ﴿83﴾

**84** అంతే! వారి సంపాదన వారికి ఏమాత్రం పనికిరాకుండా పోయింది.

فَمَا أَغْنَىٰ عَنْهُمْ مَا كَانُوا يَكْسِبُونَ ﴿84﴾

**85** మేము ఆకాశాలనూ, భూమినీ, వాటి మధ్యనున్న సమస్త వస్తువులనూ సత్యబద్ధంగానే సృష్టించాము.[57] ప్రళయ ఘడియ రావటం తథ్యం. కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు హుందాగా (వారిని) మన్నిస్తూ ఉండు.

وَمَا خَلَقْنَا السَّمَاوَاتِ وَالْأَرْضَ وَمَا بَيْنَهُمَا إِلَّا بِالْحَقِّ ۗ وَإِنَّ السَّاعَةَ لَآتِيَةٌ ۖ فَاصْفَحِ الصَّفْحَ الْجَمِيلَ ﴿85﴾

---

ఆసన్నమైనపుడు ఆకాశాన కారుమేఘాలు క్రమ్ముకున్నాయి. మరో వైపు నుంచి భయంకరమైన శబ్దం వినిపించింది. ఇంకోవైపు నుంచి భూమి ప్రకంపించింది. దాంతో ఆ బస్తీవాసులు నామరూపాల్లేకుండా పోయారు.

52. ఇక్కడ **'ఇమామిన్ మ్ముబీన్'** అంటే జాతీయ రహదారి అని భావం. అంటే రేయింబవళ్లు ప్రజలు రాకపోకలు సాగించే దారి అన్నమాట! "రెండు పట్టణాలు కూడా" అంటే లూత్ జాతి ప్రజలు నివసించిన పట్టణం, షుఐబ్ జాతి ప్రజలు నివసించిన మద్‌యన్ పట్టణం అని అర్థం. ఈ రెండు పట్టణాలు ఒకదానికొకటి చాలా దగ్గరలోనే ఉన్నాయి.

53. హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) జాతివారు (సమూద్ జాతివారు) నివసించిన బస్తీల పేరు హిజ్ర్. వారు 'హిజ్ర్ వాసులు' (అస్‌హాబుల్ హిజ్ర్)గా పిలువబడ్డారు. ఈ బస్తీ మదీనాకు – తబూక్‌కు మధ్య ఉండేది. వీళ్లు తమ ప్రవక్త అయిన సాలెహ్ (అలైహిస్సలాం)ను తిరస్కరించారు. కాని ఆయతులో అల్లాహ్ వారు 'ప్రవక్తలను ధిక్కరించారు" అని సెలవిచ్చాడు. ఏ జాతి అయినా ఒక ప్రవక్తను ధిక్కరిస్తే ప్రవక్తలందరినీ ధిక్కరించినట్లే.

54. వారు పదే పదే దేవుని నిదర్శనాల కోసం డిమాండు చేసేవారు. వారి డిమాండు మేరకే ఒక ఆడ ఒంటె బండరాయి నుంచి సృజించబడింది. కాని ఆ దుర్మార్గులు దాన్ని కూడా దారుణంగా చంపేశారు.

55. అంటే అత్యంత సాహసోపేతంగా, ఇంకా అనవసరంగా వారు పెద్ద పెద్ద కొండల్ని తొలచి, సురక్షితమైన స్థావరాలను ఏర్పరచుకునేవారు. హిజ్రీ 9వ సంవత్సరంలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ బస్తీ గుండా సాగిపోతున్నప్పుడు తలకు గుడ్డ చుట్టుకుని, తన వాహనాన్ని వేగంగా పోనిచ్చారు. తన ప్రియ సహచరుల్ని ఉద్దేశించి, "దుఃఖంతో విలపిస్తూ, దైవాగ్రహం పట్ల భీతిల్లుతూ ఈ (శిథిల) పట్టణాన్ని దాటండి" అని తాకీదు చేశారు (ఇబ్నె కసీర్). సహీహ్ బుఖారీలోనూ (433) ముస్లింలోనూ (2285) ఈ ఉల్లేఖనం ఉంది.

86 నిశ్చయంగా నీ ప్రభువే (సర్వాన్నీ) సృష్టించినవాడు, (సర్వమూ) తెలిసినవాడు.

إِنَّ رَبَّكَ هُوَ الْخَلَّاقُ الْعَلِيمُ ﴿٨٦﴾

87 మేము నీకు ఏడు ఆయతులను ఇచ్చి ఉన్నాము.[58] అవి పదే పదే పునరావృతం అవుతుంటాయి. ఇంకా మహోన్నతమైన ఖుర్ఆన్‌ను నీకు ప్రసాదించాము.

وَلَقَدْ آتَيْنَاكَ سَبْعًا مِّنَ الْمَثَانِي وَالْقُرْآنَ الْعَظِيمَ ﴿٨٧﴾

88 వారిలోని పలు వర్గాల వారికి మేము ఇచ్చిన ప్రాపంచిక సంపద వైపుకు నువ్వు ఆబగా చూడకు. వారి స్థితిపై దిగులు చెందకు. విశ్వాసుల కోసం నీ (వాత్సల్య భరిత) రెక్కలను వంచి పెట్టు.[59]

لَا تَمُدَّنَّ عَيْنَيْكَ إِلَىٰ مَا مَتَّعْنَا بِهِ أَزْوَاجًا مِّنْهُمْ وَلَا تَحْزَنْ عَلَيْهِمْ وَاخْفِضْ جَنَاحَكَ لِلْمُؤْمِنِينَ ﴿٨٨﴾

89 "నేను స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి మాత్రమే" అని వారికి చెప్పు.

وَقُلْ إِنِّي أَنَا النَّذِيرُ الْمُبِينُ ﴿٨٩﴾

56. మూడు రోజుల తరువాత మీపై ఆపద రానున్నదని హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) తన జాతి వారిని హెచ్చరించారు. మూడు రోజులు గడచిపోయాయి. నాల్గవ రోజు దైవాగ్రహం వారిపై అమాంతం విరుచుకుపడింది.

57. పై వాక్యంలో సత్యం అంటే భూమ్యాకాశాల సృష్టివల్ల ఒనగూడే ప్రయోజనాలు అని భావం. లేదా సత్యబద్ధం అంటే సజ్జనులకు బహుమానం, దుర్జనులకు శిక్ష విధించటం అని భావం కావచ్చు. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో వేరొక చోట ఇలా ప్రస్తావించబడింది: "భూమ్యాకాశాలలో వున్న సమస్తమూ అల్లాహ్‌దే–ఆయన దుర్జనులకు వారి దుష్కర్మల ప్రతిఫలం, సజ్జనులకు వారి సత్కర్మల ప్రతిఫలం ఇచ్చేటందుకు (ఈ వ్యవస్థ ఏర్పరచబడింది)" (అన్ నజ్మ్ – 31).

58. అసలు మూలంలో **"సబ్వు మసానీ"** అని వచ్చింది. సబ్వున్ అంటే ఏడు; మసానీ అంటే పునరావృతమయ్యేవి అని అర్థం; అయితే ఈ "పునరావృతమయ్యే ఏడు" (సబ్వు మసానీ) అంటే భావం ఏమిటి? అన్న విషయంపై ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. మొత్తానికి 'సబ్వు మసానీ' అంటే 'సూరె ఫాతిహా' అన్న విషయమే అన్నిటికంటే సరైనది, సమంజసమైనదీను. సూరె ఫాతిహాలో ఏడు ఆయతులున్నాయి. అవి ప్రతి నమాజులోనూ మాటిమాటికీ పఠించబడుతూ ఉంటాయి. హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : **అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్** – ఇది నాకు ఇవ్వబడిన సబ్వు మసానీ మరియు మహోన్నతమైన ఖుర్ఆను (సహీహ్ బుఖారీ – సూరతుల్ హిజ్ర్ వ్యాఖ్యానం). మరో హదీసులో ఇలా ఉంది: 'ఉమ్ముల్ ఖుర్ఆన్' (అంటే సూరె ఫాతిహా)యే సబ్వు మసానీ మరియు మహోన్నతమైన ఖుర్ఆన్ (సహీహ్ బుఖారీ – హిజ్ర్ సూరా వ్యాఖ్యానం). ఫాతిహా సూరా ఖుర్ఆన్‌లోని ఒక భాగం. అందుకని దాన్ని 'మహోన్నతమైన ఖుర్ఆన్' అని కూడా అనటం జరిగింది.

59. మేము నీకు ఫాతిహా సూరాను, మహోన్నతమైన ఖుర్ఆన్‌లాంటి గొప్ప అనుగ్రహాలను ప్రసాదించాము గనక నువ్వు ఐహిక సంపత్తి కొరకు అర్రులు చాచకు. ప్రాపంచిక తళుకు బెళుకులపై ఆశపడకు. ఇవన్నీ క్షణభంగురం. అలాగే నీ సందేశాన్ని తిరస్కరించే వారిని తలచుకుని బాధపడకు. నిన్ను విశ్వసించి, నీ అడుగుజాడలలో నడిచే విశ్వాసుల పట్ల మృదువుగా మెలగు. 'రెక్కలను వంచి ఉంచటం' అనేది ఒక అరబీ జాతీయం. సాధారణంగా పక్షులు తమ పిల్లల మీద ప్రేమ చూపించదలచినప్పుడు వాటిమీద తమ రెక్కలను పరుస్తాయి. అంటే పిల్లలను తమ రెక్కల క్రిందికి తీసుకుంటాయన్నమాట. ఆ విధంగా అరబీ భాషలో వాత్సల్యం చూపటం, మృదువుగా వ్యవహరించటం కోసం 'రెక్కలను వంచి ఉంచటం' అనే జాతీయాన్ని వాడటం పరిపాటి అయింది.

**90** ఆ విభజనకారులపై మేము పంపినటువంటిదే (ఇది).[60]
كَمَآ أَنزَلْنَا عَلَى ٱلْمُقْتَسِمِينَ ﴿٩٠﴾

**91** – వారు ఈ దైవగ్రంథాన్ని ముక్క చెక్కలుగా చేశారు.
ٱلَّذِينَ جَعَلُوا۟ ٱلْقُرْءَانَ عِضِينَ ﴿٩١﴾

**92** నీ ప్రభువు సాక్షిగా! మేము వారందరినీ తప్పకుండా నిలదీసి అడుగుతాము,
فَوَرَبِّكَ لَنَسْـَٔلَنَّهُمْ أَجْمَعِينَ ﴿٩٢﴾

**93** వారు చేస్తూ ఉండిన పనుల గురించి.
عَمَّا كَانُوا۟ يَعْمَلُونَ ﴿٩٣﴾

**94** కాబట్టి (ఓ ప్రవక్తా!) నీకు ఆదేశించబడిన దానిని వారికి విడమరచి చెప్పు.[61] బహుదైవారాధకులను (ముష్రిక్కులను) పట్టించుకోకు.
فَٱصْدَعْ بِمَا تُؤْمَرُ وَأَعْرِضْ عَنِ ٱلْمُشْرِكِينَ ﴿٩٤﴾

**95** నిన్ను పరిహసించే వారి సంగతి చూసుకోవటానికి మేము చాలు.
إِنَّا كَفَيْنَٰكَ ٱلْمُسْتَهْزِءِينَ ﴿٩٥﴾

**96** వారు అల్లాహ్‌తోపాటు వేరే ఆరాధ్యుడిని నిలబెడుతున్నారు. త్వరలోనే (యదార్థం) వారికి తెలిసిపోతుంది.
ٱلَّذِينَ يَجْعَلُونَ مَعَ ٱللَّهِ إِلَٰهًا ءَاخَرَ ۚ فَسَوْفَ يَعْلَمُونَ ﴿٩٦﴾

**97** వారి మాటల వల్ల నీకు మనస్తాపం కలుగుతుందన్న సంగతి మాకు బాగా తెలుసు.
وَلَقَدْ نَعْلَمُ أَنَّكَ يَضِيقُ صَدْرُكَ بِمَا يَقُولُونَ ﴿٩٧﴾

60. ఈ ఆయతులకు కొందరు వ్యాఖ్యాతలు చెప్పిన అర్థం ఇది: మీకు విషయాన్ని విడమరచి చెబుతున్నాను. రానున్న ఆపద గురించి స్పష్టంగా హెచ్చరిస్తున్నాను. ఈ శిక్ష విభజనకారుల (ముఖ్‌తసిమీన్)పై అవతరించిన శిక్ష వంటిదే. ఇంతకూ దైవగ్రంథాన్ని ముక్కచెక్కలుగా చేసిన ఆ విభజనకారులెవరు? వారు ఖురైషులని కొందరు భావించారు. అంటే వారు దివ్య ఖుర్‌ఆన్‌లోని కొన్ని భాగాలను కవిత్వంగా, కొన్ని భాగాలను జాలవిద్యలో భాగంగా, మరికొన్ని భాగాలను పూర్వీకుల గాథలుగా ఖరారు చేశారు.

అయితే ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన 'విభజనకారులు' (ముఖ్‌తసిమీన్) అనే పదం గ్రంథవహులకు వర్తిస్తుందనీ, 'ఖుర్‌ఆన్' అనే పదం తౌరాత్, ఇంజీలులకు వర్తిస్తుందని మరికొంత మంది వ్యాఖ్యానించారు. వాళ్లు (గ్రంథవహులైన యూదులు, క్రైస్తవులు) ఆకాశ గ్రంథాలను పలు భాగాలుగా విభజించారు.

('ముఖ్‌తసిమీన్' అనే పదానికి విభజనకారులు అని గాకుండా 'ప్రమాణం చేసినవారు' అని కూడా ఒక శాబ్దిక అర్థం వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని) కొంతమంది అసలు ఈ ఆయతు దైవప్రవక్త సాలిహ్ (అలైహిస్సలామ్) జాతివారిని ఉద్దేశించి చెప్పబడిందని వాదించారు. ఎందుకంటే ఆ జాతివారు, తాము సాలిహ్ ప్రవక్తను, ఆయన ఇంటివారిని హతమారుస్తామని పరస్పరం ప్రమాణాలు చేసుకున్నారు. ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఇలా ఉంది : "దేవునిపై ప్రమాణం చేసి ఇలా ప్రతిజ్ఞ చేయండి; మేము సాలిహ్‌పై, ఆయన ఇంటివారిపై ఈ రాత్రి దాడిచేస్తాము" (అన్ నమ్ల్: 49). అంతేకాదు, వారు తమ ఆకాశ గ్రంథాన్ని కూడా ముక్కలు ముక్కలుగా చేసేశారు. అరబీ మూలంలో **'ఇజీన్' (عِضِينَ)** అనే పదం ఉంది. పైన ఆయతులో దాన్ని ముక్క చెక్కలుగా అని అనువదించాం. దానికి గ్రంథంలోని కొన్ని విషయాలను నమ్మటం, మరికొన్నింటిని తిరస్కరించటం అని మరో అర్థం కూడా చెప్పబడింది.

61. **'ఇస్‌దా'** అంటే విడమరచి చెప్పటం, విశదీకరించటం అని అర్థం. ఈ ఆయతు అవతరించకముందు మహాప్రవక్త

| | |
|---|---|
| **98** అందుకే నీ ప్రభువు పవిత్రతను కొనియాడు. ఆయన్ని స్తుతిస్తూ ఉండు. సాష్టాంగపడేవారిలో చేరిపో. | فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَكُن مِّنَ السَّاجِدِينَ ﴿٩٨﴾ |
| **99** నిశ్చయమైనది (అనగా మరణం) వచ్చేవరకూ[62] నీ ప్రభువును ఆరాధిస్తూ ఉండు. | وَاعْبُدْ رَبَّكَ حَتَّىٰ يَأْتِيَكَ الْيَقِينُ ﴿٩٩﴾ |

(సఅసం) రహస్యంగా ధర్మ ప్రచారం చేసేవారు. ఈ ఆయతు అవతరించగానే బహిరంగ ప్రచారం మొదలెట్టారు (ఫత్‌హుల్ ఖదీర్).

62. బహుదైవారాధకులు ఆయన్ని (స) మాంత్రికుడనీ, ఉన్మాది అనీ, కథలు చెప్పేవాడనీ నిందించేవారు. దెప్పిపొడుపు మాటలు అనేవారు. దాంతో సహజంగానే ఆయన(స) మనసు నొచ్చుకునేది. అందుచేత అల్లాహ్ ఆయన్ని ఓదార్చాడు. మూర్ఖుల మాటల్ని పట్టించుకోరాదని హితబోధ చేయటంతో పాటు, దైవారాధనలో ఎక్కువ సమయం కేటాయించాలనీ, దైవస్తోత్రం చేయటంవల్ల దేవుని పవిత్రతను కొనియాడటం వల్ల మనసు కుదుటపడుతుందని, దీనిద్వారా దైవసహాయం కూడా అందుతుందని ఉపదేశించాడు. పై ఆయతుల్లో సాష్టాంగపడటమంటే 'నమాజు' అని భావం. నిశ్చయమైనది అంటే మరణం అని అర్థం.

16వ సూరా

# అన్ నహ్ల్

## తేనెటీగ

అవతరణ మక్కాలో

ఆయతులు 128

### పరిచయం

ఇస్లామీయ విశ్వాసాలు – దేవుని ఆధిపత్యం, దైవ వచనాల అవతరణ, మృతులను మళ్ళీ లేపడం మొదలైన వాటిని ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 68వ ఆయతులో తేనెటీగ ప్రస్తావన ఉంది. ఆ పేరునే దీనికి పెట్టడం జరిగింది. మానవాళికి దేవుని అనుగ్రహాలను ఈ సూరా వివరించింది. తేనెటీగ ఒక తెలివయిన కీటకం. దేవుని ప్రేరణతో అది పని చేస్తుంది. సృష్టించే అల్లాహ్ సామర్థ్యాన్ని తేనెటీగ చాటిచెబుతుంది. ఇది సృష్టించే స్వచ్ఛమైన తేనె అల్లాహ్ మానవాళికి అనుగ్రహించిన మేళ్ళలో ఒకటి. తేనెలో మానవాళికి స్వస్థత దాగి ఉంది.

అల్లాహ్ సృజనాత్మక శక్తి గురించిన వివరాలు ఈ సూరా మనకు అందిస్తుంది. అల్లాహ్ ఒక్కడే అని అర్థం చేసుకోవడానికి ఈ వివరాలు తోడ్పడుతాయి. ఆయన సర్వ శక్తిసంపన్నుడనీ, ఒకే ఒక్కడనీ చాటిచెప్పే వివరాలివి. మనిషి బహిరంగంగా వ్యతిరేకతకు పాల్పడుతున్నప్పటికీ, ఆలోచించే వారికి, తమ బుద్ధివివేకాలను ఉపయోగించేవారికి, అల్లాహ్ సృజనాత్మక శక్తి సామర్థ్యాలను చాటిచెప్పే ఈ వివరాలు స్పష్టమైన నిదర్శనాలనీ, వారు వీటిని తమ హృదయాల్లో ప్రతిష్ఠించుకుంటారనీ, అల్లాహ్ పట్ల కృతజ్ఞతలు చూపుతారనీ, అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించడానికి వెనుకాడరని వివరించింది.

ఈ సూరా విగ్రహారాధన ఆచారాలను, విశ్వాసాలను ఖండిస్తుంది. మక్కాలోని విగ్రహారాధక అరబ్బులను ఉద్దేశించి, వారు ఆరాధిస్తున్నవి వారు తమ సొంత చేతులతో తయారు చేసుకున్నవేనని తెలిపింది. నిర్జీవమైన ఈ శిలా ప్రతిమలు లేదా కలపతో చేసిన బొమ్మలను ఎలా ఆరాధిస్తున్నారని ప్రశ్నించింది.

వారు మాట వినని జనమనీ, పరలోకంలో అపజయంపాలయ్యే జనమని తేల్చి చెప్పింది. ఈ సందర్భంగా అజ్ఞాన కాలంలోని అనాచారాలను, ఆడ శిశువులను సజీవంగా పాతిపెట్టే దురాచారాలను తీవ్రంగా ఖండించడం జరిగింది.

అల్లాహ్ అనుగ్రహాలను, ఆయన చేసిన మేళ్ళను నిర్లక్ష్యం చేస్తే దేవుని ఆగ్రహం విరుచుకుపడుతుందని గట్టిగా హెచ్చరించడం జరిగింది. ఇబ్రాహీమ్ ప్రవక్త (అస)ను ఇక్కడ విధేయతకు, కృతజ్ఞతకు నమూనాగా చూపించడం జరిగింది. ప్రజలను ఇస్లాం వైపునకు వివేకంతో, మృదువుగా ఆహ్వానించాలని ఇక్కడ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు చెప్పడం జరిగింది. స్థిరచిత్తంతో పని చేయాలనీ, అవిశ్వాసుల కుట్రల్ని చూసి నిరాశ చెందరాదని బోధించడం జరిగింది.

## అన్ నహ్ల్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** అల్లాహ్ ఆజ్ఞ వచ్చేసింది. కనుక దాని కోసం తొందర పెట్ట కండి.[1] ఆయన పరమ పవిత్రుడు. వీరు కల్పించే భాగస్వామ్యాల నుండి ఆయన పవిత్రుడు, ఉన్నతుడు.

**2** “నేను తప్ప వేరే ఆరాధ్య దైవం లేదు. కనుక మీరు నాకు భయ పడండి” అని ప్రజలను హెచ్చరించటానికి, ఆయనే దూతలకు తన ‘వహీ’ని ఇచ్చి,[2] తన ఆదేశానుసారం దాన్ని తన దాసులలో తాను కోరిన వారిపై[3] అవతరింపజేస్తాడు–

**3** ఆయన ఆకాశాలను, భూమిని సత్యబద్ధంగా సృష్టించాడు.[4] వారు కల్పించే భాగస్వామ్యాలకు (షిర్కుకు) ఆయన అతీతుడు, ఉన్నతుడు.

**4** ఆయన మనిషిని వీర్యపు బొట్టుతో సృష్టించాడు. కాని వాడు పచ్చి తగవులమారిగా తయారయ్యాడు.[5]

## سُورَةُ النَّحْلِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

أَتَىٰ أَمْرُ اللَّهِ فَلَا تَسْتَعْجِلُوهُ ۚ سُبْحَانَهُ وَتَعَالَىٰ عَمَّا يُشْرِكُونَ ①

يُنَزِّلُ الْمَلَائِكَةَ بِالرُّوحِ مِنْ أَمْرِهِ عَلَىٰ مَنْ يَشَاءُ مِنْ عِبَادِهِ أَنْ أَنْذِرُوا أَنَّهُ لَا إِلَٰهَ إِلَّا أَنَا فَاتَّقُونِ ②

خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ بِالْحَقِّ ۚ تَعَالَىٰ عَمَّا يُشْرِكُونَ ③

خَلَقَ الْإِنْسَانَ مِنْ نُطْفَةٍ فَإِذَا هُوَ خَصِيمٌ مُبِينٌ ④

---

1. ఏ ప్రళయం చాలా దూరాన ఉందని మీరు అనుకుంటున్నారో అది చాలా సమీపంలోనే ఉంది. దాని కోసం తొందర పెట్టకండి అని దీనికి ఒక అర్థం. లేదా ముష్రిక్కులు తొందరపెడుతున్న ఆ శిక్ష చాలా దగ్గరలోనే ఉంది అని భావం. ప్రళయం లేక ఆ శిక్ష సంభవించటం నిశ్చయం గనుక ‘రాబోతోంది’ అని చెప్పకుండా ‘వచ్చేసింది’ అని భూతకాలంలో చెప్పటం జరిగింది.
2. ఈ ఆయతులో **‘రూహ్’** అంటే వహీ (దైవ వాణి) అని భావం. ఉదాహరణకు మరో ఆయతును కూడా చూడండి: “(ఓ ప్రవక్తా!) ఇదే విధంగా మేము నీ వైపు మా ఆజ్ఞతో సందేశాన్ని పంపాము. ఇంతకు ముందు నీకు గ్రంథం అంటే ఏమిటో, విశ్వాసం అంటే ఏమిటో తెలీదు.” (షూరా – 52)
3. **‘తాను కోరిన దాసులు’** అంటే ప్రవక్తలన్నమాట. “తన సందేశాన్ని ఎవరికి పంపాలో అల్లాహ్‌కు బాగా తెలుసు” (అల్ అన్ఆమ్-124). “ఆయన తన దాసులలో తాను కోరిన వారిపై తన ఆదేశానుసారం వహీని అవతరింపజేస్తాడు” (మోమిన్–15).
4. అంటే దేవుడు ఈ భూమ్యాకాశాలను నిరర్థకంగా, ఆషామాషీగా పుట్టించలేదు. దీని వెనుక ఒక గొప్ప ఆశయం ఉంది. ఆ ఆశయం ఏమిటంటే, మంచి చేసినవారికి మంచి ప్రతిఫలం ఇవ్వటం చెడు చేసినవారికి తగిన శిక్ష విధించటం.
5. అంటే అత్యంత అల్పమైన ఒక జిగటు పదార్థం పురుషుని నుంచి వెలువడుతుంది. రేతస్సుగా, వీర్యంగా పిలువబడే దీని కణం స్త్రీ గర్భాశయంలోకి వెళ్ళి, వివిధ దశలను అధిగమించి ఒక సంపూర్ణ మానవ ఆకారంగా మారుతుంది. తరువాత అల్లాహ్ అందులో ప్రాణం పోస్తాడు. తరువాత దాన్ని మాతృగర్భంలో నుంచి తీసి ప్రపంచంలో ప్రవేశపెడ్తాడు. ఈ ప్రపంచంలోనే అతడు పెరిగి పెద్దవాడవుతాడు. కాని అతను ఒకప్పటి తన హీన స్థితిని మరచిపోయి, తనకు ఈ ఉన్నతిని ప్రసాదించిన ప్రభువు విషయంలోనే పేచీలు పెడతాడు. నిజ ప్రభువుకు ఇతరులను సాటి కల్పిస్తాడు.

**5** ఆయనే పశువులను సృష్టించాడు. వాటిలో మీ కొరకు వేడినిచ్చే దుస్తులు, ఇతరత్రా ఎన్నో ప్రయోజనాలున్నాయి.[6] మరికొన్ని (పశువులు) మీకు ఆహారంగా కూడా ఉపయోగ పడతాయి.

وَالْأَنْعَامَ خَلَقَهَا لَكُمْ فِيهَا دِفْءٌ وَمَنَافِعُ وَمِنْهَا تَأْكُلُونَ ⑤

**6** మీరు వాటిని మేపుకుని రావటంలోనూ, మేపటానికి తోలుకు పోవటంలోనూ అందం (కళ) ఉట్టిపడుతూ ఉంటుంది.[7]

وَلَكُمْ فِيهَا جَمَالٌ حِينَ تُرِيحُونَ وَحِينَ تَسْرَحُونَ ⑥

**7** మీరెంతో ప్రయాసపడితేగాని చేరుకోలేని ప్రదేశాలకు అవి మీ బరువులను మోసుకునిపోతాయి. నిశ్చయంగా మీ ప్రభువు వాత్సల్యం కలవాడు, దయామయుడు.

وَتَحْمِلُ أَثْقَالَكُمْ إِلَىٰ بَلَدٍ لَّمْ تَكُونُوا بَالِغِيهِ إِلَّا بِشِقِّ الْأَنفُسِ ۚ إِنَّ رَبَّكُمْ لَرَءُوفٌ رَّحِيمٌ ⑦

**8** మీరు స్వారీ చేయటానికీ, మీకు శోభాయమానంగా ఉండటానికి ఆయన గుర్రాలనూ, కంచర గాడిదలనూ, గాడిదలనూ సృష్టించాడు.[8] మీకు తెలియని ఇంకా ఎన్నో వస్తువులను ఆయన సృష్టిస్తూ ఉంటాడు.[9]

وَالْخَيْلَ وَالْبِغَالَ وَالْحَمِيرَ لِتَرْكَبُوهَا وَزِينَةً ۚ وَيَخْلُقُ مَا لَا تَعْلَمُونَ ⑧

6. దేవుడు తాను చేసిన మరో మేలును ఈ ఆయతులో జ్ఞాపకం చేశాడు. ఆయనే చతుష్పాదాలను(ఆవులు, గేదెలు, మేకలు, ఒంటెలు తదితర పశువులను) పుట్టించాడు. వాటి చర్మాలు, వెంట్రుకలు మీకు ఉపయోగపడుతున్నాయి. వాటి పాలు మీకు ఆహారంగా ఉపయోగపడుతుంది. వాహనంగా మీరు వాటిని ఉపయోగిస్తారు. వాటి ద్వారా వ్యవసాయం చేస్తారు. కొన్ని పశువుల మాంసాన్ని కూడా మీరు తింటారు.

7. పొలాలకు, పచ్చిక మైదానాలకు పశువులను తోలుకు పోవటంలోనూ, మేపుకుని తిరిగి రావటంలోనూ అందం ఉందని చెప్పటం గమనార్హం. పల్లెసీమల్లో ఉదయం, సాయంత్రం రైతులు పశువులను తోలుకుపోతున్నప్పుడు ఆ దృశ్యం ఎంత రమణీయంగా, చూడముచ్చటగా ఉంటుందో చూసే వారికే తెలుస్తుంది; **'తురీహూన'** అంటే పశువుల్ని మేపుకొని సాయంత్రం పూట ఇంటికి తోలుకొని పోవటం. **'తస్‌రహూన'** అంటే ఉదయం పూట పశువుల్ని మేతకు తోలుకొని వెళ్ళటం.

8. దేవుడు ఈ పశువులను సృష్టించటంలోని అసలు ఉద్దేశం మీరు వాటిపై స్వారీ చేయటమే అయినప్పటికీ అందులో మీ ఠీవి, దర్పం కూడా ఉన్నాయి. గుర్రం, గాడిద, కంచర గాడిదల పేర్లను వేరుగా ఒకచోట ప్రస్తావించినందువల్ల కొంతమంది ధర్మవేత్తలేమంటారంటే గాడిద, కంచర గాడిద మాంసం నిషిద్ధమైనట్లే గుర్రం మాంసం కూడా నిషేధించబడింది. ఏ పశువుల మాంసం ధర్మసమ్మతమో వాటి పేర్లు ఇంతకు ముందు ప్రస్తావనకు వచ్చాయి. అందువల్ల ఈ ఆయతులో ప్రస్తావించబడిన మూడు జంతువులు కేవలం వాహనాలుగా మాత్రమే ఉపయోగించబడాలి. అయితే ఈ వాదన సరైనది కాదు. ఎందుకంటే గుర్రపు మాంసం ధర్మసమ్మతమేనని ప్రామాణిక హదీసులు చెబుతున్నాయి. గుర్రపు మాంసం తినటానికి మహాప్రవక్త (సఅసం) వారు అనుమతించారని హజ్రత్ జాబిర్(రజి) తెలిపారు (సహీహ్ బుఖారీ– కితాబు జ్జబాయిహ్; ముస్లిం – కితాబుస్సైద్). అంతేకాదు, ప్రవక్త ప్రియసహచరులు ప్రవక్త (స) వారి సమక్షంలోనే ఖైబర్‌లోనూ, మదీనాలోనూ గుర్రాన్ని జిబహ్ చేసి, దాని మాంసం వండి తిన్నారు. ఈ చర్యను మహాప్రవక్త (సఅసం) వారించలేదు (సహీహ్ ముస్లిం–కితాబుస్సైద్; ముస్నదె అహ్మద్–సంపుటి :3; అబూ దావూద్ – కితాబుల్ అత్‌యిమ). అందుకే అత్యధికమంది ధర్మవేత్తలు, సలఫ్ మరియు ఖలఫ్ పండితులందరూ కూడా గుర్రపు మాంసాన్ని ధర్మసమ్మతంగా భావిస్తున్నారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

ఈ ఆయతులో గుర్రం ప్రస్తావన స్వారీ నేపథ్యంలో మాత్రమే ఎందుకు వచ్చిందంటే, అది సాధారణంగా స్వారీ

وَعَلَى اللّٰهِ قَصْدُ السَّبِيْلِ وَمِنْهَا جَآئِرٌ ؕ وَلَوْ شَآءَ لَهَدٰىكُمْ اَجْمَعِيْنَ ﴿٩﴾

**9** సన్మార్గం చూపే బాధ్యత అల్లాహ్‌పై ఉంది.[10] కొన్ని వక్ర మార్గాలు కూడా ఉన్నాయి. ఆయన గనక తలచుకుంటే మీ అందరినీ సన్మార్గాన నడిపించేవాడే.[11]

هُوَ الَّذِيْٓ اَنْزَلَ مِنَ السَّمَآءِ مَآءً لَّكُمْ مِّنْهُ شَرَابٌ وَّمِنْهُ شَجَرٌ فِيْهِ تُسِيْمُوْنَ ﴿١٠﴾

**10** ఆయనే మీ కోసం ఆకాశం నుంచి నీళ్ళను కురిపిస్తున్నాడు. దాన్ని మీరూ త్రాగుతారు. దానివల్ల మొలకెత్తిన పచ్చికను (వృక్షాలను) మీ పశువులకు కూడా మేపుతారు.

يُنْۢبِتُ لَكُمْ بِهِ الزَّرْعَ وَالزَّيْتُوْنَ وَالنَّخِيْلَ وَالْاَعْنَابَ وَمِنْ كُلِّ الثَّمَرٰتِ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيَةً لِّقَوْمٍ يَّتَفَكَّرُوْنَ ﴿١١﴾

**11** దాంతోనే (ఆ నీటితోనే) ఆయన మీ కోసం పొలాలను పండిస్తాడు. జైతూను (ఆలివ్), ఖర్జూరం, ద్రాక్ష మరియు అన్ని రకాల పండ్లను పండిస్తాడు. నిశ్చయంగా చింతన చేసేవారి కోసం ఇందులో గొప్ప సూచన[12] ఉంది.

وَسَخَّرَ لَكُمُ الَّيْلَ وَالنَّهَارَ ۙ وَالشَّمْسَ وَالْقَمَرَ ؕ وَالنُّجُوْمُ مُسَخَّرٰتٌۢ بِاَمْرِهٖ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يَّعْقِلُوْنَ ﴿١٢﴾

**12** ఆయనే మీ కోసం రేయింబవళ్ళనూ, సూర్యచంద్రులను నియంత్రణలో పెట్టాడు. నక్షత్రాలుకూడా ఆయన ఆజ్ఞకు కట్టుబడి ఉన్నాయి. బుద్ధిమంతుల కోసం ఇందులో ఎన్నో నిదర్శనాలున్నాయి.[13]

---

కోసమే ఉపయోగించబడుతుంది. ప్రపంచమంతటా అది ఖరీదైన జంతువుల్లో ఒకటిగా ఉంది. అందువల్ల దాన్ని ఆహారంగా ఉపయోగించటం అరుదు. గొర్రెలు, మేకల మాదిరిగా గుర్రాన్ని మాంసం కోసం కోయరు. అంత మాత్రాన ప్రమాణం ఏదీ లేకుండానే దాని మాంసం నిషిద్ధం అని భావించటం సరైనది కాదు.

9. భూమి లోపలి భాగంలోనూ, సముద్రాలలోనూ, కటిక ఎడారి ప్రదేశాలలోనూ, కారడవులలోనూ అల్లాహ్ ఎన్నో ప్రాణులను సృష్టిస్తూ ఉంటాడు. వాటి జ్ఞానం అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ తెలీదు. దైవప్రసాదితమైన తెలివితేటలను, మేధను ఉపయోగించి మనిషి చేసే కొంగ్రొత్త ఆవిష్కరణలు కూడా ఇందులోకి వస్తాయి. ఉదాహరణకు : బస్సు, రైలుబండి, ఓడ, విమానం, రాకెట్టు మొదలగునవి. భవిష్యత్తులో ఆవిష్కరించబడే వస్తువులు కూడా ఇందులో భాగమే.

10. అందుకే ఆయన సన్మార్గం ఎలా ఉంటుందో వివరించాడు. అపమార్గం ఏదో కూడా విడమరచి చెప్పాడు.

11. ఆయన గనక తలచుకుంటే అందరినీ సన్మార్గాన నడిపించేవాడే. ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే అది 'బలాత్కారం' అనబడేది. బలాత్కారం జరిగితే మనిషి పరీక్షించబడడు. అందుకే ఆయన మనిషికి స్వేచ్ఛను వొసగాడు. సన్మార్గమేదో, అపమార్గమేదో తెలియపరచి ఆ రెంటిలో ఏదో ఒక దానిని మనిషి ఎంపిక చేసుకునే అధికారం ప్రసాదించాడు.

12. వర్షపు నీటి ద్వారా కలిగే ప్రయోజనాలు ఈ ఆయతులలో వివరించబడ్డాయి. ప్రతి ఒక్కరూ నిత్యం వీటిని వీక్షిస్తూనే ఉంటారు. వెనుకటి సూరాలలో ఈ విషయం వివరంగా చెప్పటం జరిగింది.

13. రేయింబవళ్లు ఎలా తరుగుతూ పెరుగుతూ ఉంటాయో, సూర్యచంద్రులు తమ నిర్ణీత స్థానాల వైపుకు ఎలా సాగిపోతుంటాయో మీరు గమనిస్తూనే ఉన్నారు. అయితే ఈ నిర్ధారిత వ్యవస్థలో ఎప్పుడూ, ఎక్కడా ఎలాంటి అవరోధంగానీ, అస్తవ్యస్త స్థితిగానీ ఏర్పడదు. ఆకాశంలో మెరిసే నక్షత్రాలు రాత్రి చీకటిలో ఏ విధంగా బాటసారులకు మార్గదర్శకత్వం వహిస్తున్నాయో చూడండి. ఇవన్నీ దేవుని మహోన్నత సామ్రాజ్యానికి, అద్భుతమైన వ్యవస్థకు చిహ్నాలే కదా!

**13** ఇంకా రంగురంగుల వస్తువులెన్నింటినో ఆయన మీకోసం భూమిలో సృష్టించాడు. నిస్సందేహంగా గుణపాఠం గ్రహించే వారికోసం ఇందులో చాలా పెద్ద సూచన ఉంది.[14]

وَمَا ذَرَأَ لَكُمْ فِي الْأَرْضِ مُخْتَلِفًا أَلْوَانُهُ ۗ
إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً لِّقَوْمٍ يَذَّكَّرُونَ ﴿١٣﴾

**14** ఆయనే సముద్రాన్ని మీకు వశపరిచాడు – మీరు అందులో నుంచి (తీయబడిన) తాజా మాంసాన్ని తినటానికీ, మీరు తొడిగే ఆభరణాలను అందులో నుంచి వెలికితీయటానికీ. నీవు చూస్తావు! ఓడలు అందులో నీటిని చీల్చుకుంటూ పోతుంటాయి. మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి, కృతజ్ఞతాపూర్వకంగా మసలుకోవటానికి[15] (ఈ ఏర్పాటు చేయబడింది).

وَهُوَ الَّذِي سَخَّرَ الْبَحْرَ لِتَأْكُلُوا مِنْهُ لَحْمًا طَرِيًّا
وَتَسْتَخْرِجُوا مِنْهُ حِلْيَةً تَلْبَسُونَهَا ۖ وَتَرَى
الْفُلْكَ مَوَاخِرَ فِيهِ وَلِتَبْتَغُوا مِن فَضْلِهِ
وَلَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿١٤﴾

**15** భూమి మిమ్మల్ని తీసుకుని కంపించకుండా ఉండటానికి ఆయన పర్వతాలను అందులో పాతిపెట్టాడు.[16] మీరు మీ గమ్యాలను చేరుకోవటానికి ఆయన నదులను, త్రోవలను కూడా సృష్టించాడు.[17]

وَأَلْقَىٰ فِي الْأَرْضِ رَوَاسِيَ أَن تَمِيدَ بِكُمْ
وَأَنْهَارًا وَسُبُلًا لَّعَلَّكُمْ تَهْتَدُونَ ﴿١٥﴾

**16** ఇంకా ఎన్నో సూచనలను నిర్ణయించి పెట్టాడు. నక్షత్రాల ద్వారా కూడా జనులు మార్గాలను కనుగొంటారు.

وَعَلَامَاتٍ ۚ وَبِالنَّجْمِ هُمْ يَهْتَدُونَ ﴿١٦﴾

14. అంటే – భూమిలో, అల్లాహ్ సృష్టించిన ఖనిజ సంపదల్లో, చమురు నిల్వలలో, వృక్షాలలో, రాళ్ల రప్పలలో, పశు పక్షాదులలో కూడా గమనించేవారికి సూచనలున్నాయి. ఇవన్నీ యదార్థానికి మానవుల ప్రయోజనార్థమే సృష్టించ బడ్డాయి.

15. ఉవ్వెత్తున లేచిపడే కెరటాలు గల సముద్రాన్ని ఆయన మానవునికి లోబరచటంతోపాటు, దానివల్ల ఒనగూడే మూడు ప్రయోజనాలను కూడా ఈ సందర్భంగా జ్ఞాపకం చేస్తున్నాడు– 1. చేపల రూపంలో మీరు సముద్రం నుంచి తాజా మాంసాన్ని తింటున్నారు (చేపలు చచ్చిపోయినా తినటం ధర్మసమ్మతమే. అలాగే కాబా గృహ యాత్ర నిమిత్తం పోతూ ఇహ్రామ్ దీక్ష బూనినవారు కూడా చేపలను పట్టవచ్చు). 2. సముద్రంలో నుంచి మీరు ముత్యాలు, పగడాలు, చిప్పలు తదితర వస్తువులు తీస్తారు. వాటిలో కొన్ని చాలా ఖరీదైనవై ఉంటాయి. వాటితో మీరు ఆభరణాలు కూడా తయారు చేస్తారు. 3. సముద్రాలలో మీరు పడవలను, ఓడలను నడుపుతారు. ఈ జలమార్గం ద్వారా ఒక దేశం నుంచి ఇంకో దేశానికి వెళతారు. మీ సరకులను తరలిస్తూ ఉంటారు. తద్వారా మీకు లాభాలు వస్తాయి. అల్లాహ్ నుంచి ఇన్ని ప్రయోజనాలు పొందుతున్న మీరు ఆయనకు కృతజ్ఞులై జీవించాలి.

16. పర్వతాల ద్వారా దేవుడు మీకు చేసిన మహోపకారాన్ని ఇక్కడ జ్ఞాపకం చేస్తున్నాడు. భూమి గనక నిత్యం కంపిస్తూ ఉంటే అందులో మీరు ప్రశాంతంగా నిలదొక్కుకోలేకపోయేవారు. అప్పుడప్పుడూ (కొన్ని సెకన్లపాటు) వచ్చే భూకంపాలు ఎంతటి ధన ప్రాణ నష్టాన్ని సృష్టిస్తాయో మీకు తెలిసిందే.

17. కాలువలు, నదీనదాలు కూడా కడు విచిత్రమైనవే. ఎక్కడో పర్వత కనుమల్లో పుట్టి, పల్లపు ప్రాంతాల వైపుకు పరవళ్లు తొక్కి, వేలాది లక్షలాది మంది జనుల, పశువుల అవసరాలను తీరుస్తూ ఆఖరికి సముద్రంలోకి వెళ్ళి కలుస్తాయి. ఈ వాగుల ద్వారా మీరు ప్రయోజనం పొందుతున్నారు.

17 ఏమిటీ, (సర్వాన్నీ) సృష్టించేవాడూ – ఏమీ సృష్టించలేనివాడు ఇద్దరూ ఒకటేనా? మీరు బొత్తిగా ఆలోచించరా?[18]

أَفَمَن يَخْلُقُ كَمَن لَّا يَخْلُقُ ۗ أَفَلَا تَذَكَّرُونَ ﴿17﴾

18 ఒకవేళ మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే లెక్కించలేరు. నిశ్చయంగా అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించేవాడు.

وَإِن تَعُدُّوا نِعْمَةَ اللَّهِ لَا تُحْصُوهَا ۗ إِنَّ اللَّهَ لَغَفُورٌ رَّحِيمٌ ﴿18﴾

19 మీరు గోప్యంగా ఉంచేదీ, బహిర్గతం చేసేదీ – అంతా అల్లాహ్‌కు తెలుసు.[19]

وَاللَّهُ يَعْلَمُ مَا تُسِرُّونَ وَمَا تُعْلِنُونَ ﴿19﴾

20 అల్లాహ్‌ను వదలి వాళ్లు పిలుస్తున్నవారు ఏ వస్తువునూ సృష్టించలేరు. పైగా వారు స్వయంగా సృష్టించబడినవారు.[20]

وَالَّذِينَ يَدْعُونَ مِن دُونِ اللَّهِ لَا يَخْلُقُونَ شَيْئًا وَهُمْ يُخْلَقُونَ ﴿20﴾

21 వారు నిర్జీవులేగాని సజీవులు కారు.[21] తాము ఎప్పుడు (బ్రతికించి) లేపబడతారో కూడా వారికి తెలీదు.[22]

أَمْوَاتٌ غَيْرُ أَحْيَاءٍ ۖ وَمَا يَشْعُرُونَ أَيَّانَ يُبْعَثُونَ ﴿21﴾

22 మీరందరి ఆరాధ్య దైవం అల్లాహ్ ఒక్కడే. అయితే పరలోకం పట్ల నమ్మకం లేనివారి హృదయాలు ఈ విషయాన్ని తిరస్కరిస్తున్నాయి. వారు స్వయంగా అహంకారంతో విర్రవీగుతున్నారు.[23]

إِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ ۚ فَالَّذِينَ لَا يُؤْمِنُونَ بِالْآخِرَةِ قُلُوبُهُم مُّنكِرَةٌ وَهُم مُّسْتَكْبِرُونَ ﴿22﴾

18. ఈ అనుగ్రహాలన్నింటినీ ప్రసాదించిన దేవుని ఉనికి, ఆయన ఏకత్వం (తౌహీద్) గురించి ఇక్కడ నొక్కి చెప్పటం జరిగింది. ఒక్కడైన ఆ సృష్టికర్త కాకుండా మీరు ఆరాధించే ఇతరత్రా చిల్లర దేముళ్లు దేనికీ పనికిరానివి. అవి ఏ వస్తువునయినా సృష్టించగలవా? అవి స్వయంగా సృష్టించబడినవే. మరలాంటప్పుడు సృష్టికర్త – సృష్టితాలు ఎలా సమానం కాగలవు? మరి అలాంటప్పుడు మీరు వారిని అల్లాహ్‌కు సమానంగా ఎలా నిలబెడుతున్నారు? ఈ పాటి విషయాన్ని కూడా మీరు గ్రహించలేరా?

19. దానిని బట్టి ఆయన తీర్పుదినాన బహుమానం వొసగటమో, శిక్ష విధించటమో చేస్తాడు. సత్కర్మలు చేసిన వారికి బహుమానం లభిస్తుంది. దుష్కర్మలు చేసిన వారికి శిక్ష విధించబడుతుంది.

20. మనిషి ప్రవర్తన కూడా మహా విచిత్రమైనది. సమస్త జగతిని సృష్టించిన కర్తను కాదని అతను అత్యంత అల్పమైన వస్తువులను పూజిస్తున్నాడు. తనను సృష్టించిన దైవాన్ని వదిలేసి తాను తన చేతులతో చేసిన మట్టి బొమ్మల ముందు మోకరిల్లుతున్నాడు.

21. **'నిర్జీవులు'** అనే పదంలో రాళ్లు రప్పలు, విగ్రహాలు, చెట్టుపుట్టలు, చనిపోయినవారు కూడా చేరి ఉన్నారు. వారు ఎప్పుడు తిరిగి లేపబడతారో వారికే తెలీదు అని అనటాన్ని బట్టి ఈ మాట రాళ్ళు, రప్పల వంటి నిర్జీవాల గురించి కాకుండా చనిపోయిన పుణ్యపురుషులను దృష్టిలో పెట్టుకొని చెప్పబడి ఉంటుందని ఇట్టే బోధపడుతుంది. అదీగాక వారిని కేవలం 'నిర్జీవులు' అని అనటంతోనే ఆగిపోలేదు. పైగా 'వారు సజీవంగా లేరు' అని కూడా స్పష్టంగా చెప్పబడింది. ఈ వాక్యం ద్వారా సమాధులను పూజించేవారి చర్య నిర్ద్వంద్వంగా ఖండించబడింది. సమాధులలో ఖననం చేయబడిన సజ్జనులు బ్రతికి ఉంటారన్న వాళ్ల విశ్వాసం కూడా ఖండించబడింది. ఒకసారి మరణం వచ్చిన తరువాత మృతులకు ప్రాపంచిక జీవితం లభించదనీ, ప్రపంచంతో ఇక వారికి ఎలాంటి సంబంధాలూ మిగిలుండవని కూడా దీనిద్వారా అవగతం అవుతోంది.

لَا جَرَمَ أَنَّ ٱللَّهَ يَعْلَمُ مَا يُسِرُّونَ وَمَا يُعْلِنُونَ ۚ
إِنَّهُۥ لَا يُحِبُّ ٱلْمُسْتَكْبِرِينَ ﴿٢٣﴾

**23** నిశ్చయంగా అల్లాహ్‌కు వారు దాచేది, బహిర్గతం చేసేది-అంతా తెలుసు. గర్విష్ఠులను ఆయన ఏ మాత్రం ఇష్టపడడు.[24]

وَإِذَا قِيلَ لَهُم مَّاذَآ أَنزَلَ رَبُّكُمْ ۙ قَالُوٓا۟
أَسَٰطِيرُ ٱلْأَوَّلِينَ ﴿٢٤﴾

**24** "ఇంతకీ మీ ప్రభువు ఏం అవతరింపజేశాడ"ని వారిని అడిగినప్పుడు, "పాతకాలపు కట్టుకథలు"[25] అని చెబుతారు.

لِيَحْمِلُوٓا۟ أَوْزَارَهُمْ كَامِلَةً يَوْمَ ٱلْقِيَٰمَةِ ۙ وَمِنْ
أَوْزَارِ ٱلَّذِينَ يُضِلُّونَهُم بِغَيْرِ عِلْمٍ ۗ
أَلَا سَآءَ مَا يَزِرُونَ ﴿٢٥﴾

**25** పర్యవసానంగా ప్రళయదినాన వారు తమ (పాప) భారమంతటినీ మోయటంతోపాటు, అజ్ఞానంతో తాము పెడదారి పట్టించిన వారి బరువును మోయటంలో కూడా భాగస్థులవుతారు. చూడండి! ఎంత చెడ్డ బరువును వారు తమ నెత్తిపై వేసుకుంటున్నారో![26]

قَدْ مَكَرَ ٱلَّذِينَ مِن قَبْلِهِمْ فَأَتَى ٱللَّهُ بُنْيَٰنَهُم
مِّنَ ٱلْقَوَاعِدِ فَخَرَّ عَلَيْهِمُ ٱلسَّقْفُ مِن فَوْقِهِمْ
وَأَتَىٰهُمُ ٱلْعَذَابُ مِنْ حَيْثُ لَا يَشْعُرُونَ ﴿٢٦﴾

**26** వీరి పూర్వీకులు కూడా కుట్రలు పన్నారు. (చివరికి) అల్లాహ్ వారి (కుట్రల) కట్టడాలను కూకటి వ్రేళ్లతో పెకలించివేశాడు. వారి (కట్టడాల) కప్పులు వారి (నెత్తి) మీదే పడ్డాయి.[27] వారు ఊహించనైనాలేని చోటునుంచి వారిపై శిక్ష వచ్చి పడింది.[28]

22. అలాంటప్పుడు వారి నుంచి పుణ్యంగానీ, ప్రయోజనాలుగానీ ఆశించటం ఎంతవరకు సమంజసం?

23. అంటే **'దేవుడు ఒక్కడే'** అనేసరికి తిరస్కారులు, బహుదైవోపాసకుల గొంతులో పచ్చివెలక్కాయ ఇరుక్కుంటుంది. "ఏమిటీ, ఇతడు దేవుళ్ళందరినీ ఒకే ఆరాధ్యదైవంగా చేసేశాడా!? కడు విచిత్రంగా ఉందే!" అని అంటారు (సాద్-5). వేరొకచోట ఇలా అనబడింది - "ఒక్కడైన అల్లాహ్‌ను గురించి ప్రస్తావించినప్పుడు, పరలోకాన్ని నమ్మని అవిశ్వాసుల హృదయాలు కుంచించుకుపోతాయి. అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్యుల ప్రస్తావన తీసుకురాగానే వారు సంతోషంతో పొంగిపోతారు." (జుమర్-45)

24. తమను తాము గొప్పవారుగా ఊహించుకుంటూ, సత్యబద్ధమైన విషయాన్ని త్రోసి పుచ్చటం, ఇతరులను అల్పులుగా, అధములుగా ఎంచటమే గర్వం, అహంకారం (ఇస్తిక్‌బార్). హదీసులో కూడా గర్వాహంకారానికి ఇవ్వబడిన నిర్వచనం ఇదే. ఈ గర్వాన్ని, అహంకారాన్ని అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు. "ఎవరి ఆంతర్యంలోనయినా అణువంత గర్వం ఉన్నాసరే అతను స్వర్గంలో ప్రవేశించలేడు" అని హదీసులో ఉంది. (సహీహ్ ముస్లిం - కితాబుల్ ఈమాన్).

25. వారు ఆ విధంగా అంటూ ఉన్నప్పుడు నిర్లక్ష్యం, వెటకారం, వేళాకోళం ఆ మాటల్లో తొంగిచూస్తూ ఉంటాయి. ఇవి దేవుడు అవతరింపజేసిన వాక్యాలేమీ కావు. ముహమ్మద్ (సఅసం) ఎవరో చెప్పుకుంటూ ఉండగా విని, ఆ కథలను మాకు అప్పజెబుతున్నాడు అన్నది వారి ఉద్దేశం.

26. ఇతరుల పాపభారాన్ని కూడా వారి నెత్తిమీద పడవేయటానికే అల్లాహ్ ఈ మాటల్ని వారిచేత చెప్పిస్తున్నాడు. హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది; మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు- "ఎవరయితే జనులను సన్మార్గం వైపుకు పిలిచాడో అతనికి, అతని పిలుపు వల్ల సన్మార్గ భాగ్యం ప్రాప్తించిన వారందరి పుణ్యం లభిస్తుంది. మరెవరయితే అపమార్గం వైపుకు జనులను పిలిచాడో అతను తన పిలుపు వల్ల అపమార్గం పాలైన వారందరి పాపభారాన్ని మోయవలసి ఉంటుంది" (అబూ దావూద్ - కితాబుస్సున్నహ్).

27. ఇస్రాయీలీయుల కథనాల ఆధారంగా కొంతమంది వ్యాఖ్యాతలు ఈ ఆయతుపై ఇలా వ్యాఖ్యానించారు : బహుశా

**27** మళ్ళీ ప్రళయదినాన కూడా అల్లాహ్ వారిని పరాభవానికి లోనుచేస్తాడు. "నా భాగస్వాములు ఏరి? వారి గురించి మీరు జగడమాడేవారు కదా?!"[29] అని వారిని ప్రశ్నిస్తాడు. అప్పుడు జ్ఞానమొసగబడిన వారు చెబుతారు[30]– "ఈ రోజు పరాభవం, కీడు పడేది అవిశ్వాసులపైనే" అని!

ثُمَّ يَوْمَ الْقِيَامَةِ يُخْزِيهِمْ وَيَقُولُ أَيْنَ شُرَكَائِيَ
الَّذِينَ كُنتُمْ تُشَاقُّونَ فِيهِمْ ۚ قَالَ الَّذِينَ أُوتُوا
الْعِلْمَ إِنَّ الْخِزْيَ الْيَوْمَ وَالسُّوءَ عَلَى الْكَافِرِينَ ﴿٢٧﴾

**28** వారు తమ ఆత్మలకు తాము అన్యాయం చేసుకుంటూ ఉండగా దైవదూతలు వారి ప్రాణాలు తీసుకుంటున్నప్పుడు, వెంటనే పూర్తిగా లొంగిపోయి వారు, "మేము ఏ పాపం ఎరుగం"[31] అని అంటారు. "ఎందుకెరుగరు? మీరు ఏమేం చేసే వారో అల్లాహ్‌కు బాగా తెలుసు.[32]

الَّذِينَ تَتَوَفَّاهُمُ الْمَلَائِكَةُ ظَالِمِي أَنفُسِهِمْ ۖ
فَأَلْقَوُا السَّلَمَ مَا كُنَّا نَعْمَلُ مِن سُوءٍ ۚ بَلَىٰ
إِنَّ اللَّهَ عَلِيمٌ بِمَا كُنتُمْ تَعْمَلُونَ ﴿٢٨﴾

**29** "ఇక మీరు కలకాలం ఉండేందుకు గాను నరకద్వారాలలో ప్రవేశించండి"[33] అని వారితో అనబడుతుంది. గర్విష్ఠుల నివాస స్థానం ఎంత చెడ్డది!?"

فَادْخُلُوا أَبْوَابَ جَهَنَّمَ خَالِدِينَ فِيهَا ۖ
فَلَبِئْسَ مَثْوَى الْمُتَكَبِّرِينَ ﴿٢٩﴾

---

నమ్రూద్ లేక 'బుఖ్తె నస్సర్'ల నేపథ్యంలో ఇలా అనబడింది. వారు ఏదో ఒక విధంగా ఆకాశానికి ఎక్కి అల్లాహ్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నారు. కాని వారు విఫలురై వెనుతిరిగి వచ్చారు.

ఈ విషయం ఒక ఉపమానంగా చెప్పబడిందనీ, అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించే, అల్లాహ్‌ను నిరాకరించే వారి ఆచరణలు (కర్మలు) పునాదులు కదిలి పేకమేడల్లా కూలిపోయే కట్టడాల మాదిరిగా వృథా అయిపోతాయని చెప్పటం దీని అసలు ఉద్దేశమని మరికొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

అయితే; దైవప్రవక్తలను ధిక్కరించి, దైవాగ్రహానికి పాత్రులైన వారికి ఏ గతి పట్టిందో వివరించటం దీని అసలు ఉద్దేశం. ఉదాహరణకు : ఆద్ జాతి, లూత్ జాతి వారు. హష్ర్ సూరా (2)లో చెప్పినట్లు, వారు ఎన్నడూ ఊహించని వైపునుంచి అల్లాహ్ శిక్ష వారిపైకి వచ్చింది.

28. వారి ఊహకు తట్టని చోటి నుంచి దేవుని శిక్ష వారిపై వచ్చిపడింది.

29. ప్రాపంచిక శిక్షలు స్వల్పమైనవి. పరలోకంలో వారికి విధించబడే శిక్షలు మరీ ఘోరంగా ఉంటాయి. ప్రపంచంలోనూ వారు అవమానం పొందారు. పరలోకంలో కూడా దేవుడు వారిని మరోసారి అవమానానికి గురిచేస్తాడు. ఏ బూటకపు దైవాలను మీరు నాకు సహవర్తులుగా కల్పించారో, ఎవరిని చూసుకుని మీరు విశ్వాసులతో దెబ్బలాడేవారో ఆ దైవాలు ఎక్కడ? అని నిలదీస్తాడు.

30. అంటే ధర్మజ్ఞానం గలవారు, ధర్మాన్ని ఖచ్చితంగా అవలంబించినవారు ఈ మాటలంటారు.

31. దుర్మార్గులైన ముష్రిక్కులు చావుబ్రతుకుల్లో కొట్టుమిట్టాడే సమయంలో జరిగే సంభాషణ ఇక్కడ ప్రస్తావించబడింది. దైవదూతలు వారి ప్రాణాలు తీయబోతున్నప్పుడు వారు దైవదూతలకు లొంగిపోతారు. తాము ఏ చెడుచేష్టకూ పాల్పడలేదని అమాయకంగా అంటారు. మహ్షర్ మైదానంలో కూడా వాళ్ళ ధోరణి ఇలాగే ఉంటుంది. శిక్ష నుంచి తప్పించుకోవటానికి వారు అబద్ధపు ప్రమాణాలు చేస్తారు. "అల్లాహ్‌తోడు! ఓ ప్రభూ! మేము బహుదైవారాధనకు ఒడిగట్టలేదు" అని అంటారు (అల్ అన్ఆమ్–23). "అల్లాహ్ వారందరినీ లేపి తన దగ్గర సమావేశపరచే రోజున, వారు మీ ముందు ప్రమాణాలు చేసినట్లే అల్లాహ్ ముందు కూడా ప్రమాణాలు చేస్తారు." (ముజాదలహ్–18)

32. మీరు చెప్పేదంతా అబద్ధం. మీ జీవితమంతా పాపాల పుట్టగానే ఉంది. మీ దుష్కర్మలన్నీ అల్లాహ్ వద్ద నమోదై

وَقِيلَ لِلَّذِينَ اتَّقَوْا مَاذَا أَنزَلَ رَبُّكُمْ ۚ قَالُوا
خَيْرًا ۗ لِّلَّذِينَ أَحْسَنُوا فِي هَٰذِهِ الدُّنْيَا حَسَنَةٌ ۚ
وَلَدَارُ الْآخِرَةِ خَيْرٌ ۚ وَلَنِعْمَ دَارُ الْمُتَّقِينَ ﴿٣٠﴾

**30** “మీ ప్రభువు ఏం అవతరింపజేశాడు?” అని దైవభీతిపరులను అడిగినప్పుడు “మేలైనదాన్నే (అవతరింపజేశాడు)” అని వారు చెబుతారు. మేలు చేసిన వారికి ఈ ప్రపంచంలో మేలు చేకూరుతుంది. ఇక పరలోక నిలయమైతే మరింత మేలైనది. దైవభీతిపరులకు లభించే ఈ నిలయం ఎంత చక్కనిది!

جَنَّاتُ عَدْنٍ يَدْخُلُونَهَا تَجْرِي مِن تَحْتِهَا
الْأَنْهَارُ ۖ لَهُمْ فِيهَا مَا يَشَاءُونَ ۚ كَذَٰلِكَ
يَجْزِي اللَّهُ الْمُتَّقِينَ ﴿٣١﴾

**31** కలకాలం ఉండే స్వర్గ వనాలలో వారు ప్రవేశిస్తారు. వాటి క్రింద సెలయేళ్లు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారు కోరినదల్లా వారి కోసం ఉంటుంది. భయభక్తులు కలవారికి అల్లాహ్ ఇలాంటి ప్రతిఫలాన్నే ప్రసాదిస్తాడు మరి.

الَّذِينَ تَتَوَفَّاهُمُ الْمَلَائِكَةُ طَيِّبِينَ ۙ يَقُولُونَ
سَلَامٌ عَلَيْكُمُ ۙ ادْخُلُوا الْجَنَّةَ بِمَا كُنتُمْ
تَعْمَلُونَ ﴿٣٢﴾

**32** వారు పవిత్రులుగా ఉన్న స్థితిలో దైవ దూతలు వారి ప్రాణాలు స్వాధీనం చేసుకుంటూ, “మీకు శాంతి కల్గుగాక![34] మీరు చేసుకున్న సత్కర్మల ఫలితంగా స్వర్గంలో ప్రవేశించండి”[35] అని అంటారు.

هَلْ يَنظُرُونَ إِلَّا أَن تَأْتِيَهُمُ الْمَلَائِكَةُ أَوْ يَأْتِيَ
أَمْرُ رَبِّكَ ۚ كَذَٰلِكَ فَعَلَ الَّذِينَ مِن قَبْلِهِمْ ۚ وَمَا
ظَلَمَهُمُ اللَّهُ وَلَٰكِن كَانُوا أَنفُسَهُمْ يَظْلِمُونَ ﴿٣٣﴾

**33** ఏమిటీ, తమ వద్దకు దైవదూతలు రావాలనో లేక నీ ప్రభువు ఉత్తర్వు రావాలనో వీళ్ళు ఎదురు చూస్తున్నారా?[36] వీరి పూర్వీకులు కూడా అలాగే చేశారు.[37] అల్లాహ్ వారికి ఎలాంటి అన్యాయమూ చేయలేదు.[38] వారంతట వారే తమ స్వయానికి అన్యాయం చేసుకున్నారు.[39]

---

ఉన్నాయి. ఈ రోజు మీ ఈ నిరాకరణ వల్ల మీకు కలిగే ప్రయోజనం ఏమీ లేదు అని దైవదూతలు సూటిగా చెబుతారు.

33. ఇమామ్ ఇబ్నె కసీర్ (రహ్మ.లై) ఇలా అంటున్నారు: “వారు మరణించిన తక్షణమే వారి ఆత్మలు నరకానికి వెళ్ళిపోతాయి. వారి దేహాలు మాత్రం సమాధుల్లో ఉంటాయి. అల్లాహ్ తన సంపూర్ణ శక్తితో వారి శరీరాలకూ– ఆత్మలకూ మధ్య ఒకింత సంబంధాన్ని సృష్టించి వారిని సమాధి శిక్షకు లోనుచేస్తూ ఉంటాడు (ఉదయం, సాయంత్రం వారికి అగ్ని సమర్పించబడుతుంది) ప్రళయం సంభవించగానే వారి ఆత్మలు వారి శరీరాల్లోకి వచ్చి చేర్తాయి. అప్పుడు వారు శాశ్వత ప్రాతిపదికపై నరకంలోకి ప్రవేశింపజేయబడతారు.

34. దుర్మార్గులైన ముష్రిక్కుల చెడు పర్యవసానానికి ప్రతిగా విశ్వాసుల, సజ్జనుల పర్యవసానం ఎంత ఉత్తమంగా ఉంటుందో ఈ ఆయతులో చెప్పబడింది. “ఓ ప్రభూ! మమ్మల్ని కూడా ఆ సజ్జనుల కోవలోకి చేర్చు” (ఆమీన్).

35. దేవుడు కరుణించనంతవరకూ ఏ వ్యక్తీ – కేవలం తన ఆచరణ ఆధారంగా – స్వర్గంలోకి పోలేడని అల్ ఆరాఫ్ సూరా 43వ ఆయతు క్రింద ఇవ్వబడిన హదీసులో ఉంది. అయితే ఇక్కడ “మీ ఆచరణల ఫలితంగా మీరు స్వర్గంలో ప్రవేశించండి” అని అనబడింది. అంత మాత్రం చేత దీనిని పరస్పర విరుద్ధమైన అంశం అని భావించ నక్కరలేదు. దైవ కారుణ్యం పొందాలంటే సదాచరణ అవసరం. అంటే సదాచరణ దైవకారుణ్యానికి సాధనం వంటిది. కాబట్టి సదాచరణ ప్రాముఖ్యతను కొట్టివేయటానికి ఎంతమాత్రం వీల్లేదు. సదాచరణ లేనంతవరకు దేవుని కారుణ్య భాగ్యం లభించదు. అందువల్ల సదాచరణా అవసరమే. దైవకారుణ్యమూ అవసరమే. వేరొక హదీసులో ఈ విధంగా

فَأَصَابَهُمْ سَيِّئَاتُ مَا عَمِلُوا وَحَاقَ بِهِم
مَّا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ﴿٣٤﴾

**34** కాబట్టి వారి దుష్కర్మల ఫలితాలు వారికి లభించాయి. దేని గురించి వారు నవ్విపోయేవారో అదే వారిని చుట్టుముట్టింది.[40]

وَقَالَ الَّذِينَ أَشْرَكُوا لَوْ شَاءَ اللَّهُ مَا عَبَدْنَا مِن
دُونِهِ مِن شَيْءٍ نَّحْنُ وَلَا آبَاؤُنَا وَلَا حَرَّمْنَا مِن
دُونِهِ مِن شَيْءٍ ۚ كَذَٰلِكَ فَعَلَ الَّذِينَ مِن قَبْلِهِمْ ۚ
فَهَلْ عَلَى الرُّسُلِ إِلَّا الْبَلَاغُ الْمُبِينُ ﴿٣٥﴾

**35** ముష్రిక్కులు ఇలా అన్నారు : "అల్లాహ్ గనక తలచుకుని ఉంటే మేమూ, మా తాతముత్తాతలూ ఆయన్ని తప్ప ఇంకొక రెవరినీ ఆరాధించేవాళ్ళం కాము. ఆయన ఉత్తర్వులేకుండా ఏ వస్తువునూ నిషేధించే వాళ్ళం కాము." వీరి పూర్వీకులు చేసింది కూడా అదే. కనుక ప్రవక్తల బాధ్యత సందేశాన్ని స్పష్టంగా అందజేయటం తప్ప మరొకటి కాదు.[41]

చెప్పబడింది : "నిశ్చయంగా అల్లాహ్ మీ ముఖాలను, మీ సిరిసంపదలను చూడదు. ఆయన మీ హృదయాలను, మీ ఆచరణలను చూస్తాడు." (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్)

36. వీళ్లు కూడా ప్రాణం తీసే దైవదూతల రాకకోసం లేక శిక్షకు గురిచేసే దేవుని ఆర్డినెన్సు కోసం ఎదురు చూస్తున్నారా?

37. ఇలాంటి తలబిరుసుతనాన్ని వీళ్ళ పూర్వీకులు కూడా ప్రదర్శించారు. చివరికి వాళ్ళు దైవాగ్రహానికి గురయ్యారు.

38. అల్లాహ్ వారి వద్దకు తన ప్రవక్తలను పంపించి, తన గ్రంథాలను అవతరింపజేసి, వారి సన్మార్గం కోసం చేయవలసిందంతా చేశాడు. వారు ఏ సాకూ చూపి తప్పించుకోలేని పరిస్థితిని సృష్టించాడు. ఈ దుర్మార్గులు అహంకారంతో దైవ సూచనలను ధిక్కరించి, కష్టాలను కోరితెచ్చుకున్నారు.

39. దైవప్రవక్తలను ధిక్కరించటం అంటే తమకు తాము అన్యాయం చేసుకోవటమే.

40. మీరు గనక దారికి రాకపోతే, దైవాన్ని విశ్వసించకపోతే దైవాగ్రహం మీపై విరుచుకు పడుతుందని దైవప్రవక్తలు వారితో చెప్పినప్పుడు వారు నవ్విపోయేవారు. వికటాట్టహాసం చేసేవారు. ఏదీ, నువ్వు మాటిమాటికీ హెచ్చరిస్తున్న ఆ శిక్షను నీ ప్రభువు తీసుకురాడేమి? అని గేలి చేసేవారు. అందుకే వారు వేళాకోళం చేసే ఆ శిక్షే వారిని చుట్టు ముట్టింది. అప్పుడు దాన్నుంచి బయటపడే దారి ఏదీ వారికి లేకుండా పోయింది.

41. ఈ ఆయతులో దేవుడు ముష్రిక్కులలో ఏర్పడి ఉన్న ఒక అపోహను దూరం చేశాడు. ముష్రిక్కులు ఈ విధంగా అనేవారు: "మేము అల్లాహ్‌ను వదలి ఇతరులను పూజిస్తున్నాము. లేదా ఆయన ఆదేశంతో నిమిత్తం లేకుండానే కొన్ని వస్తువులను అధర్మంగా ఖరారు చేసుకుంటున్నాము. ఒకవేళ మేము చేసే ఈ పనులు తప్పనుకుంటే అల్లాహ్ తన అసాధారణ శక్తితో ఎందుకు ఆపటం లేదు? ఆయనే గనక కోరితే మేమసలు ఈ పనులు చేయలేకపోయేవాళ్ళం. ఆయన అడ్డుకోవటం లేదు గనక మేము చేసే పనులన్నీ ఆయన అభిమతం ప్రకారమే ఉన్నాయి." అల్లాహ్ వారి ఊహలను ఖండించటానికి ఒకే ఒక్క మాటన్నాడు – "సందేశాన్ని అందజేయటం వరకే ప్రవక్తల బాధ్యత" అని! అంటే అల్లాహ్ మమ్మల్ని ఎందుకు అడ్డుకోవటం లేదు? అన్న వారి ఆలోచనలో పసలేదు. అడ్డుకోలేదని ఎవరన్నారు? వారి బహు దైవోపాసనా చేష్టల్ని ప్రవక్తల ద్వారా అడ్డుకోవటమూ జరిగింది, ఖండించటం కూడా జరిగింది. అసలు అందుకే ఆయన అన్ని జాతులలోనూ తన ప్రవక్తల్ని పంపించాడు. తన గ్రంథాలను కూడా అవతరింపజేశాడు. వచ్చిన ప్రతి ప్రవక్తా అన్నిటికన్నా ముందు తన జాతి వారిని బహుదైవారాధన నుండి కాపాడే ప్రయత్నమే చేశాడు. దీని భావం ఏమిటంటే ప్రజలు షిర్క్ చేయటాన్ని దేవుడు ఎంతమాత్రం ఇష్టపడడు. ప్రజలు చేసే షిర్క్ ఆయనకు సమ్మతమై ఉంటే మరి ఆయన ప్రవక్తలను పంపవలసిన అవసరమే ఉండేది కాదు.

కాని మీరు ఎంతగా బోధపరచినప్పటికీ ప్రవక్తల మాటను తిరస్కరించి, బహుదైవారాధనా మార్గాన్నే అవలంబించారు. అయితే అల్లాహ్ మిమ్మల్ని అడ్డుకోలేదు. ఎందుకంటే ధర్మావలంబన విషయంలో తన దాసులను బలాత్కరించటం

وَلَقَدْ بَعَثْنَا فِي كُلِّ أُمَّةٍ رَّسُولًا أَنِ اعْبُدُوا اللَّهَ وَاجْتَنِبُوا الطَّاغُوتَ ۖ فَمِنْهُم مَّنْ هَدَى اللَّهُ وَمِنْهُم مَّنْ حَقَّتْ عَلَيْهِ الضَّلَالَةُ ۚ فَسِيرُوا فِي الْأَرْضِ فَانظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُكَذِّبِينَ (36)

**36** మేము ప్రతి సముదాయంలోనూ ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా (ప్రజలారా!) "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప ఇతరత్రా మిథ్యా దైవాలకు దూరంగా ఉండండి" అని బోధపరచాము. ఆ తరువాత అల్లాహ్ కొందరికి సన్మార్గం చూపాడు. మరికొందరిపై అపమార్గం రూఢీ అయిపోయింది.[42] ధిక్కరించినవారికి పట్టిన గతేమిటో మీరు స్వయంగా భువిలో తిరిగి చూడండి.

إِن تَحْرِصْ عَلَىٰ هُدَاهُمْ فَإِنَّ اللَّهَ لَا يَهْدِي مَن يُضِلُّ ۖ وَمَا لَهُم مِّن نَّاصِرِينَ (37)

**37** (ఓ ప్రవక్తా!) నువ్వు వారిని సన్మార్గానికి తీసుకురావాలని తీవ్రంగా కోరుకున్నప్పటికీ, అల్లాహ్ తాను అపమార్గాన వదిలేసిన వారికి సన్మార్గం చూపడు. వారిని ఆదుకునేవారు కూడా ఎవరూ ఉండరు.[43]

وَأَقْسَمُوا بِاللَّهِ جَهْدَ أَيْمَانِهِمْ ۙ لَا يَبْعَثُ اللَّهُ مَن يَمُوتُ ۚ بَلَىٰ وَعْدًا عَلَيْهِ حَقًّا وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ (38)

**38** "చనిపోయిన వారిని అల్లాహ్ తిరిగి లేపడు"[44] అని వారు అల్లాహ్‌పై గట్టిగా ప్రమాణాలు చేసి మరీ చెబుతారు. ఎందుకు లేపడు? (తప్పకుండా మళ్లీ బ్రతికించి లేపుతాడు) ఇది ఆయన వాగ్దానం – దాన్ని నెరవేర్చటాన్ని ఆయన విధిగా చేసుకున్నాడు. కాని చాలామందికి ఈ విషయం తెలియదు.[45]

لِيُبَيِّنَ لَهُمُ الَّذِي يَخْتَلِفُونَ فِيهِ وَلِيَعْلَمَ الَّذِينَ كَفَرُوا أَنَّهُمْ كَانُوا كَاذِبِينَ (39)

**39** వారు విభేదించుకునే విషయాన్ని అల్లాహ్ వారికి స్పష్టంగా తెలియజేయటానికి, తాము అబద్ధాలకోరులం అని అవిశ్వాసులు స్వయంగా తెలుసుకోవటానికి[46] (వారిని తిరిగి బ్రతికించటం జరుగుతుంది).

---

ఆయన విధానం కానేకాదు. ఇది ఆయన ప్రణాళికలో అంతర్భాగం. దాని ప్రకారమే ఆయన మానవుల స్వేచ్ఛాధికారాన్ని హరించకుండా వారికి ఒకింత స్వేచ్ఛను ఇచ్చాడు. స్వేచ్ఛ ఇవ్వకుండా పరీక్షించటం కూడా సాధ్యం కాదు. అయితే ఈ స్వేచ్ఛాధికారాన్ని దుర్వినియోగ పరచరాదని, దానిని దైవప్రసన్నత బడసే మార్గంలోనే వినియోగించాలని దైవప్రవక్తలు తమ జాతి ప్రజలకు నొక్కి వక్కాణించారు. దైవప్రవక్తలు చేయగలిగింది చేశారు. కాని మీరు మాత్రం ఈ స్వేచ్ఛాధికారాన్ని దుర్వినియోగం చేసి శాశ్వితమైన శిక్షను కొనితెచ్చుకున్నారు.

42. అవిశ్వాసులలో ఏర్పడివున్న అపోహను తొలగించటానికి అల్లాహ్ మరోసారి నొక్కి పలుకుతున్నాడు – మేము ప్రతి సమాజంలోనూ మా ప్రవక్తను పంపాము. అతని ద్వారా మా సందేశాన్ని అందజేశాము. ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించమని చెప్పాము. కాని అపమార్గంలో చిక్కుకుపోయిన వారు మా సందేశాన్ని ఏమాత్రం ఖాతరు చేయలేదు.

43. ఇక్కడ అల్లాహ్ చెప్పదలచిన విషయం ఇది : ఓ ముహమ్మద్! ప్రజలంతా సన్మార్గంపైకి రావాలన్నది నీ కోరిక. కాని దైవశాసనం ప్రకారం అపమార్గం పాలైన వారిని నువ్వు ఎంతచేసినా దారికి తేలేవు. వారు దుష్పరిణామానికి చేరుకోవటం తథ్యం. అక్కడ వారిని ఆదుకునే నాథుడెవడూ ఉండడు.

44. మరణించి, మట్టిలో కలసిపోయాక మృతులు తిరిగి బ్రతికించబడతారన్న సంగతి వారికి వింతగానూ, అసంభవంగానూ

**40** మేము దేన్నయినా చేయాలని సంకల్పించుకున్నప్పుడు 'అయిపో' అని అంటే చాలు, అది అయిపోతుంది.[47]

إِنَّمَا قَوْلُنَا لِشَيْءٍ إِذَا أَرَدْنَاهُ أَن نَّقُولَ لَهُ
كُن فَيَكُونُ ﴿40﴾

**41** దౌర్జన్యానికి గురైన తరువాత దైవమార్గంలో (ఇల్లూ వాకిలిని వదలి) వలసపోయిన[48] వారికి మేము ప్రపంచంలోనూ ఉత్తమ నివాసాన్ని కల్పిస్తాము.[49] ఇక పరలోకంలో లభించే పుణ్యఫలమైతే మరింత గొప్పది.[50] ఈ విషయాన్ని జనులు తెలుసుకుంటే ఎంత బావుండు!

وَالَّذِينَ هَاجَرُوا فِي اللَّهِ مِن بَعْدِ مَا ظُلِمُوا
لَنُبَوِّئَنَّهُمْ فِي الدُّنْيَا حَسَنَةً ۖ وَلَأَجْرُ الْآخِرَةِ أَكْبَرُ
لَوْ كَانُوا يَعْلَمُونَ ﴿41﴾

అనిపించేది. అందుకే మరణానంతర జీవితం గురించి ప్రవక్త ప్రస్తావించినప్పుడు వారు దాన్ని తేలిగ్గా కొట్టిపారేసేవారు. ఆ సంగతి ధృవీకరించటం అటుంచి, 'ముమ్మాటికీ అలా జరగదు' అని దృఢంగా ప్రమాణాలు చేసి చెప్పేవారు.

45. ఈ అజ్ఞానం మూలంగానే వారు ప్రవక్తలను ధిక్కరించి, ఎదిరించి అవిశ్వాస సాగరంలో మునిగిపోతారు.

46. ప్రళయదినం ఎందుకు వస్తుందో ఇక్కడ తెలియజేయబడింది. ప్రజలు ఏ విషయంలో విభేదించుకుని ప్రపంచంలో గొడవపడేవారో దానిపై అల్లాహ్ ప్రళయదినాన తీర్పు వినిపిస్తాడు. సత్యవాదులకు, రుజువర్తనులకు బహుమతిని ఇచ్చి అసత్యవాదులకు, మార్గవిహీనులకు శిక్ష విధిస్తాడు. మరణానంతర జీవితం అనేది బూటకం అని ఒట్టేసి చెప్పే అవిశ్వాసులకు ఆనాడు యదార్థం తెలిసివస్తుంది – తామే అసత్యవాదులమని!

47. ప్రళయం సంభవించే విషయం జనుల దృష్టిలో కష్టసాధ్యంగా, అసాధ్యంగా కనిపించవచ్చు గాక. కాని అల్లాహ్‌కు అది ఎంతమాత్రం కష్టసాధ్యం కాదు. భూమ్యాకాశాలను కూల్చటానికి ఆయనకు కూలివాళ్ల, ఇంజినీర్ల, యంత్రపరికరాల అవసరం లేదు. 'అయిపో' అన్న ఒక్క మాట చాలు. రెప్పపాటు సమయంలో ఆ ప్రళయం సంభవిస్తుంది. "ప్రళయం సంభవించటానికి రెప్పపాటు సమయం లేక అంతకన్నా తక్కువ సమయం చాలు." (అన్ నహ్ల్-77)

48. **'హిజ్రత్'** అంటే దైవధర్మం కోసం, దైవప్రసన్నత కోసం తమకెంతో ప్రియమైన ఇల్లూ వాకిలిని, తామెంతగానో అభిమానించే ఊరును, బంధుమిత్రులను వదలి ధర్మావలంబనకు అనుకూలంగా ఉన్న వేరొక ప్రదేశానికి తరలి వెళ్ళటం అని అర్థం. అలా వలసపోయిన వారిని 'ముహాజిర్లు' (హిజ్రత్ చేసినవారు)గా వ్యవహరిస్తారు. ఈ ముహాజిర్లు ఎవరయినా కావచ్చు. అయితే ఈ ఆయతు – తమ జాతి జనుల వేధింపులకు తాళలేక మక్కానుంచి అబిసీనియాకు తరలివెళ్ళిన ముస్లిముల నేపథ్యంలో అవతరించిందనటానికి కూడా ఆస్కారం ఉంది. ఇలా వెళ్ళిన స్త్రీ పురుషులు మొత్తం వంద లేక వందమందికి పైగానే ఉన్నారు. అబిసీనియాకు వలసపోయిన ఈ ముస్లిల బృందంలో హజ్రత్ ఉస్మాన్ గనీ(రజి), ఆయన సతీమణి, మహాప్రవక్త(స) పుత్రిక అయిన హజ్రత్ రుఖయ్య (ర.అన్హా) కూడా ఉన్నారు.

49. మంచి నివాసం అంటే "మంచి ఉపాధి" అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. మరి కొంతమంది దీన్ని ఆనాటి ముస్లిల కేంద్రస్థానమైన మదీనా అని భావించారు. రెండు అభిప్రాయాలలోనూ వైరుధ్యం లేదని ఇమామ్ ఇబ్నె కసీర్ (రహ్మ.లై) అంటున్నారు. మొత్తానికి దైవప్రీతి కొరకు తమ ఆస్తిపాస్తులను, వర్తక సామగ్రిని వదలి వెళ్ళిన వారిని అల్లాహ్ వృధా కానివ్వలేదు. ప్రాపంచిక జీవితంలోనే వారికి మంచి ప్రతిఫలాన్ని ప్రసాదించాడు. మేలైన ఉపాధిని అనుగ్రహించాడు. యావత్తు అరేబియా వారి పాదాక్రాంతం అయింది. ఇక పరలోకంలో వారికి లభించే అనుగ్రహాలు మరింత మేలైనవి.

50. హజ్రత్ ఉమర్ (రజి.అన్హు) తన పరిపాలనా కాలంలో ముహాజిర్లకు, అన్సార్లకు పెన్షన్లు నిర్ధారించారు. ఒక్కో ముహాజిర్‌కు ఆయన పెన్షన్‌ను చెల్లిస్తూ, "ప్రపంచంలో మీకు అల్లాహ్ చేసిన వాగ్దానం ఇదే" అని చెప్పేవారు. ఇంకా ఇలా అనేవారు : "పరలోకంలో నీ పేరున సమకూర్చబడిన నిధి ఇంతకన్నా గొప్పది" (ఇబ్నె కసీర్).

الَّذِينَ صَبَرُوا وَعَلَىٰ رَبِّهِمْ يَتَوَكَّلُونَ ﴿42﴾

**42** వారు సహన స్థయిర్యాలను ప్రదర్శిస్తూ, (సతతం) తమ పరిపోషకుణ్ణే నమ్ముకుని ఉండేవారు.

وَمَا أَرْسَلْنَا مِن قَبْلِكَ إِلَّا رِجَالًا نُّوحِي إِلَيْهِمْ ۚ فَاسْأَلُوا أَهْلَ الذِّكْرِ إِن كُنتُمْ لَا تَعْلَمُونَ ﴿43﴾

**43** (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం కూడా మేము పురుషులనే (ప్రవక్తలుగా నియమించి) పంపాము. వారి వద్దకు మా వహీని పంపేవారము. ఒకవేళ మీకు తెలియకపోతే (గ్రంథ) జ్ఞానం గల వారిని అడిగి తెలుసుకోండి.[51]

بِالْبَيِّنَاتِ وَالزُّبُرِ ۗ وَأَنزَلْنَا إِلَيْكَ الذِّكْرَ لِتُبَيِّنَ لِلنَّاسِ مَا نُزِّلَ إِلَيْهِمْ وَلَعَلَّهُمْ يَتَفَكَّرُونَ ﴿44﴾

**44** (మేము వారిని) స్పష్టమైన నిదర్శనాలతోనూ, గ్రంథాల తోనూ (పంపి ఉన్నాము. అలాగే) ప్రజల వద్దకు పంపబడిన దానిని నువ్వు వారికి స్పష్టంగా విడమరచి చెప్పేందుకు, తద్వారా వారు యోచన చేసేందుకుగాను మేము నీపై ఈ జ్ఞాపిక (గ్రంథము)ను అవతరింపజేశాము.

أَفَأَمِنَ الَّذِينَ مَكَرُوا السَّيِّئَاتِ أَن يَخْسِفَ اللَّهُ بِهِمُ الْأَرْضَ أَوْ يَأْتِيَهُمُ الْعَذَابُ مِنْ حَيْثُ لَا يَشْعُرُونَ ﴿45﴾

**45** ఏమిటి నీచాతి నీచమైన కుట్రలు పన్నేవారు, అల్లాహ్ తమను నేలలో కూరుకుపోయేలా చేస్తాడనిగానీ లేక తాము ఊహించనైనా లేని చోటు నుంచి తమ వైపుకు శిక్ష వచ్చిపడు తుందని గానీ భయపడటంలేదా?

أَوْ يَأْخُذَهُمْ فِي تَقَلُّبِهِمْ فَمَا هُم بِمُعْجِزِينَ ﴿46﴾

**46** లేదా తాము విహరిస్తుండగా[52] తమను పట్టుకుంటాడని గానీ – అలా అయితే వారు ఎట్టి పరిస్థితిలోనూ (అల్లాహ్‌ను) నిస్సహాయుణ్ణి చేయలేరు సుమా!

أَوْ يَأْخُذَهُمْ عَلَىٰ تَخَوُّفٍ فَإِنَّ رَبَّكُمْ لَرَءُوفٌ رَّحِيمٌ ﴿47﴾

**47** లేదా తమను భయాందోళనలకు లోనుచేసి పట్టుకుంటాడని గానీ[53] వారు భయపడటం లేదా? నిశ్చయంగా నీ ప్రభువు అసామాన్య వాత్సల్యం కలవాడు, అనంత కరుణామయుడు.[54]

51. **'అహ్లుజ్జిక్ర్'** (జ్ఞానం గలవారు) అంటే మునుపటి దైవగ్రంథాలను, దైవప్రవక్తలను గురించి తెలిసినవారు, గ్రంథవహులు అని భావం. విషయం మీకు బోధపడకపోతే ఈ గ్రంథవహులను అడిగి తెలుసుకోండి. మేము ఇంతకు ముందు ఏ ప్రవక్తను పంపినా మానవుల్లో నుంచే ఎన్నుకుని పంపాము. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) మానవ మాత్రుడైతే ఇది వింత విషయం ఏమీ కాదు. ఆయన (స) మానవమాత్రుడని చెప్పి మీరు ఆయన (స) సందేశాన్ని త్రోసిపుచ్చటంలో అర్థంపర్థం లేదు. ఈ విషయంలో మీకు ఏ కాస్త అనుమానం ఉన్నా, వెనుకటి ప్రవక్తలు మనుజ జాతిలో నుంచి పంపబడ్డారో లేక దైవదూతల్లో నుంచి పంపబడ్డారో గ్రంథవహులను అడిగి తెలుసుకోండి. ఒకవేళ వారు దైవదూతలని మీకు సమాధానం లభిస్తే అప్పుడు నిరాకరించటంలో అర్థముంటుంది. ఒకవేళ వారంతా 'మానవమాత్రులే' నని తెలిసినపుడు, మరి ముహమ్మద్ (స) ప్రవక్తను మానవమాత్రుడన్న కారణంపై త్రోసిపుచ్చటం ఎంతవరకు సమంజసం?

52. దీనికి పలు అర్థాలు వస్తాయి. ఉదాహరణకు: 1.మీరు వ్యాపార నిమిత్తం ప్రయాణిస్తున్నప్పుడు, 2. వ్యాపారాన్ని అభివృద్ధిపరచటానికి మీరు వివిధ సరికొత్త పద్ధతులను అవలంబిస్తున్నప్పుడు, 3. లేదా రాత్రిపూట విశ్రమించేందుకు

**48** ఏమిటీ, వారు అల్లాహ్ సృష్టించిన వాటిలో ఏ వస్తువును కూడా (నిశిత దృష్టితో) చూడలేదా? వాటినీడలు కుడివైపు, ఎడమ వైపు వాలుతూ, అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడుతుంటాయి. తమ వినమ్రతను చాటుకుంటూ ఉంటాయి. (దీన్ని వారు గమనించటం లేదా?).[55]

أَوَلَمْ يَرَوْا إِلَىٰ مَا خَلَقَ اللَّهُ مِن شَيْءٍ يَتَفَيَّأُ ظِلَالُهُ عَنِ الْيَمِينِ وَالشَّمَائِلِ سُجَّدًا لِّلَّهِ وَهُمْ دَاخِرُونَ ﴿٤٨﴾

**49** నిశ్చయంగా ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్త ప్రాణులు, దూతలు – అందరూ అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడుతున్నారు – ఏమాత్రం అహంకారం చూపటం లేదు.

وَلِلَّهِ يَسْجُدُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ مِن دَابَّةٍ وَالْمَلَائِكَةُ وَهُمْ لَا يَسْتَكْبِرُونَ ﴿٤٩﴾

**50** తమపైనున్న ప్రభువు పట్ల వారు భయంతో వణికిపోతున్నారు.[56] తమకు ఆజ్ఞాపించబడిన దానినల్లా పాటిస్తున్నారు.[57]

يَخَافُونَ رَبَّهُم مِّن فَوْقِهِمْ وَيَفْعَلُونَ مَا يُؤْمَرُونَ ۩ ﴿٥٠﴾

**51** అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "ఇద్దరు ఆరాధ్య దైవాలను కల్పించుకోకండి. ఆరాధ్య దైవం మటుకు ఆయన ఒక్కడే.[58] కాబట్టి మీరంతా కేవలం నాకే భయపడండి."

وَقَالَ اللَّهُ لَا تَتَّخِذُوا إِلَٰهَيْنِ اثْنَيْنِ ۖ إِنَّمَا هُوَ إِلَٰهٌ وَاحِدٌ ۖ فَإِيَّايَ فَارْهَبُونِ ﴿٥١﴾

మీరు మీ పడకలపైకి పోతున్నప్పుడు. **'తఖల్లుబ్'** అనే పదంలో ఈ అర్థాలన్నీ ఇమిడి ఉన్నాయి. అల్లాహ్ ఏ స్థితిలో, మరే క్షణంలోనయినా మిమ్మల్ని పట్టుకొని శిక్షించగలడు.

53. ఈ 'భయాందోళనకు' అనేక కారణాలుండవచ్చు. ఒక్కోసారి మనిషి చేసిన ఘోరమైన పాపం అతని మనసును అనుక్షణం తొలచివేస్తూ ఉంటుంది. దాంతో అతని గుండెలో గుబులు పుడుతుంది. తాను చేసిన అపరాధానికి దైవ శిక్ష ఎప్పుడు పడుతుందో ఏమోనని అతను అదే పనిగా భయపడిపోతుంటాడు. ఇది కూడా పనిష్మెంట్‌లో భాగమే.

54. దీని అర్థం ఏమిటంటే ఆయన తన దాసుల పాపాలపై వెంటనే పట్టుకోడు. ప్రతి ఒక్కరికీ కొంత గడువు ఇస్తాడు. ఈ గడువులో చాలామంది పాపాత్ములు తప్పు తెలుసుకుని పశ్చాత్తాపం చెందుతారు. దైవసన్నిధిలో క్షమాభిక్షను అర్థిస్తారు. తద్వారా ఎందరో పాపాత్ములు పుణ్యాత్ములుగా మారతారు.

55. ఈ వాక్యంలో అల్లాహ్ గొప్పదనం, ఆయన మహిమౌన్నత్యాల గురించి చెప్పబడింది. సృష్టిలోని వస్తువులన్నీ ఆయన ముందు తలవంచుతున్నాయి. మనుషులు, దైవదూతలు, చెట్లుచేమలు, పశుపక్ష్యాదులూ, రాళ్లు రప్పలు, కొండలు గుట్టలు – అన్నీ తమ విధేయతా భావాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ప్రతి వస్తువుకు నీడ ఉంటుంది. ఆ నీడ ఉదయం సాయంత్రం కుడి ప్రక్కకు, ఎడమ ప్రక్కకు వాలుతూ దైవసన్నిధిలో సాష్టాంగపడుతూ తన అశక్తతను అభివ్యక్తం చేస్తూ ఉంటుంది. సూర్యుడు వాలగానే ప్రతివస్తువు దైవసన్నిధిలో తలవంచేస్తుందని ఇమామ్ ముజాహిద్ వ్యాఖ్యానించారు.

56. దైవభీతి ప్రభావం వారిలో వ్యక్తమవుతూ ఉంటుంది.

57. వారు దైవాజ్ఞలను ఎన్నడూ ధిక్కరించరు. ఆజ్ఞ కాగానే శిరసావహిస్తారు. చేయమన్న దాన్ని చేస్తారు. చేయవద్దన్న దాని జోలికి పోనేపోరు.

58. ఎందుకంటే అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. లోకంలో ఇద్దరు దేవుళ్లు గనక ఉంటే అసలు లోకమే నడవదు. అంతటా అరాచకం, అలజడి, అవ్యవస్థ, అస్తవ్యస్తత ఏర్పడుతుంది. **"లవ్‌కాన ఫీహిమా ఆలిహతున్ ఇల్లల్లాహు లఫసదతా."** (ఒకవేళ ఆకాశంలో, భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్లు కూడా ఉంటే, అప్పుడు భూమ్యాకాశాల

52 ఆకాశాలలో, భూమిలో ఉన్న సమస్తమూ ఆయనదే. ఆయన్ని ఆరాధించటం సదా అవశ్యం.[59] మరలాంటప్పుడు మీరు అల్లాహ్‌కు గాక ఇతరులకు భయపడతారా?

وَلَهُ مَا فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ وَلَهُ الدِّيْنُ وَاصِبًا ۭ اَفَغَيْرَ اللّٰهِ تَتَّقُوْنَ ﴿52﴾

53 మీ దగ్గరున్న భాగ్యాలన్నీ అల్లాహ్ ప్రసాదించినవే.[60] ఇప్పటికీ మీకేదైనా కష్టంవస్తే మీరు ఆయనకే మొరపెట్టుకుంటారు.[61]

وَمَا بِكُمْ مِّنْ نِّعْمَةٍ فَمِنَ اللّٰهِ ثُمَّ اِذَا مَسَّكُمُ الضُّرُّ فَاِلَيْهِ تَجْــَٔرُوْنَ ﴿53﴾

54 మరి ఆయన ఆ కష్టాన్ని మీనుండి తొలగించినప్పుడు మీలోని కొందరు తమ ప్రభువుకు సహవర్తుల్ని కల్పించటం మొద లెడతారు.

ثُمَّ اِذَا كَشَفَ الضُّرَّ عَنْكُمْ اِذَا فَرِيْقٌ مِّنْكُمْ بِرَبِّهِمْ يُشْرِكُوْنَ ﴿54﴾

55 మా ప్రసాదితాల పట్ల కృతఘ్నుతా వైఖరిని అవలంబించ టానికే వారలా చేస్తారు![62] సరే. కొంత లబ్ధిని పొందండి. చివరకు (దాని పర్యవసానం ఏమిటో) మీకే తెలుస్తుంది.[63]

لِيَكْفُرُوْا بِمَآ اٰتَيْنٰهُمْ ۭ فَتَمَتَّعُوْا ۣ فَسَوْفَ تَعْلَمُوْنَ ﴿55﴾

వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది) (అంబియా – 22). కాబట్టి జోరాస్ట్రియన్లు అవలంబించే 'ద్విత్వం' (ఇద్దరు దేముళ్ళ భావన) అయినా, క్రైస్తవులు నమ్మే 'త్రిత్వం' (ముగ్గురు దైవాల భావన) అయినా, మరెందరో అనుసరించే 'బహుదైవోపాసన' అయినా సహజమైనవి, స్వీకారయోగ్యమైనవి కావు. ఇవన్నీ అధర్మమైనవి. సమస్త సృష్టికి కర్త ఒక్కడే అయినప్పుడు, విశ్వ పరిపాలనా వ్యవస్థనంతటినీ ఆయన ఒక్కడే నడుపుతున్నప్పుడు ఆరాధ్యుడు కూడా ఆయన ఒక్కడే కాగలడు. ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మంది ఆరాధ్యులు ఉండనే ఉండరు.

59. ఆయన్ని ఆరాధించటం, ఆయనకు విధేయత చూపటం అవశ్యం. నిత్యం ఆయన్నే ఆరాధిస్తూ ఉండాలి. అరబీలో **'వాసిబ్'** (وَاصِب) అనే పదం వచ్చింది. వాసిబ్ అంటే నిత్యం, ఎల్లప్పుడూ ఉండేది అని కూడా అర్థం వస్తుంది. ఉదాహరణకు వేరొకచోట ఇలా అనబడింది: "వలహుమ్ అజాబున్ వాసిబ్" (వారికి నిత్యం ఉండే శిక్ష పడుతుంది) (సాఫ్ఫాత్– 9).
దైవారాధన దేవుని హక్కు. ఆయన ఆరాధన స్వచ్ఛంగా, నిర్మలంగా ఉండాలి. ఈ విషయాన్నే ఖుర్‌ఆన్ మరో చోట ఇలా ప్రస్తావించింది : "అల్లాహ్‌నే ఆరాధించండి– ఆరాధనను ఆయనకు మాత్రమే ప్రత్యేకిస్తూ. వినండి! నిష్కల్మషమైన భక్తితో ఆరాధించటం ఆయనకు మాత్రమే తగును." (జుమర్ – 23)

60. అనుగ్రహాలన్నీ ఒక్కడైన అల్లాహ్ ప్రసాదించినపుడు ఆరాధనలు, ఉపాసనలు ఇంకొకరికి చేయటం ఎంతవరకు సబబు?

61. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే దేవుడు ఒక్కడేనన్న విశ్వాసం మానవ మనోభూమిలోనూ, మానవ నైజంలోనూ గట్టిగా నాటుకుని ఉంది. కష్టకాలంలో అది ఒక్కసారిగా ఉబికివస్తుంది. నలుదిక్కుల నుంచీ నిరాశానిస్పృహల కారు మేఘాలు ఆవరించినపుడు ఆ నిజ దేవుడే గుర్తుకు వస్తాడు.

62. కాని ఈ మనిషి ఎంతటి కృతఘ్నుడో చూడండి. గండం నుంచి గట్టెక్కగానే నిజదైవం చేసిన మేలును మరచిపోయి, మళ్లీ షిర్క్ చేయటం మొదలెడతాడు.

63. ఇదొక హెచ్చరిక, ఇలాంటి హెచ్చరిక ఇంతకు ముందు కూడా వచ్చింది. "సరే. సుఖాలను జుర్రుకోండి. చివరికి మీ గమ్యస్థానం నరకమే." (ఇబ్రాహీమ్ – 30)

**56** మేము ప్రసాదించిన ఉపాధిలోనుంచి ఒక భాగాన్ని వారు తమకు ఏమాత్రం తెలియని వారి కోసం కేటాయిస్తున్నారు.[64] అల్లాహ్ సాక్షి! మీరు అంటగడుతున్న ఈ అబద్ధం గురించి మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నించటం జరుగుతుంది.[65]

وَيَجْعَلُوْنَ لِمَا لَا يَعْلَمُوْنَ نَصِيْبًا مِّمَّا رَزَقْنٰهُمْ ؕ تَاللّٰهِ لَتُسْـَٔلُنَّ عَمَّا كُنْتُمْ تَفْتَرُوْنَ ﴿56﴾

**57** వారు పరమ పవిత్రుడైన అల్లాహ్ కోసం కూతుళ్ళను నిర్ణయించి, తమ కోసమేమో తమ మనసు కోరిన దాన్ని నిర్ధారించుకుంటున్నారు.[66]

وَيَجْعَلُوْنَ لِلّٰهِ الْبَنٰتِ سُبْحٰنَهٗ ۙ وَلَهُمْ مَّا يَشْتَهُوْنَ ﴿57﴾

**58** వారిలో ఎవరికైనా కూతురు పుట్టిందన్న శుభవార్తను వినిపిస్తే, వాడి మొహం నల్లగా మారిపోతుంది. లోలోపలే కుత కుత లాడిపోతాడు.

وَاِذَا بُشِّرَ اَحَدُهُمْ بِالْاُنْثٰى ظَلَّ وَجْهُهٗ مُسْوَدًّا وَّهُوَ كَظِيْمٌ ﴿58﴾

**59** ఈ దుర్వార్త విన్న తరువాత (ఇక లోకులకు ముఖం ఎలా చూపేది? అని) అతడు నక్కి నక్కి తిరుగుతుంటాడు. ఈ అవమానాన్ని ఇలాగే భరిస్తూ బిడ్డను అట్టిపెట్టుకోవాలా? లేక దానిని మట్టిలో పూడ్చిపెట్టాలా? అని (పరిపరి విధాలుగా) ఆలోచిస్తాడు. చూడు! ఎంతటి జుగుప్సాకరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు వీరు!?[67]

يَتَوَارٰى مِنَ الْقَوْمِ مِنْ سُوْٓءِ مَا بُشِّرَ بِهٖ ؕ اَيُمْسِكُهٗ عَلٰى هُوْنٍ اَمْ يَدُسُّهٗ فِى التُّرَابِ ؕ اَلَا سَآءَ مَا يَحْكُمُوْنَ ﴿59﴾

64. ఎవరెవరిని వారు తమ అక్కరలు తీర్చేవారుగా, ఆపదలను తొలగించేవారుగా తలపోస్తున్నారో వారు రాతిబొమ్మలు, విగ్రహాలు మాత్రమే. లేదా షైతానులు, జిన్నాతులు, తదితర పైశాచిక శక్తులు మాత్రమే. వాటి వాస్తవికత గురించి వీరికి బొత్తిగా తెలీదు. అలాగే వీరు మొరపెట్టుకునే సమాధిలోని మృతుల పట్ల ఏ వ్యవహారం జరుగుతుందో కూడా వీరికి తెలీదు. తాము మొరపెట్టుకుంటున్న ఆ మృతులు నిజంగా దేవుని ప్రియతమ దాసులో లేక మరో కోవకు చెందినవారో ఎవరికి తెలుసు? ఆ యదార్థం సామాన్య జనులెవరికీ తెలీదు. కాని అసలు విషయం తెలీకపోయినప్పటికీ ఈ ప్రబుద్ధులు లేనిపోని మహిమలను ఆపాదించి వారిని అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పిస్తున్నారు. అల్లాహ్ తన కరుణతో వారికి ప్రసాదించిన సిరిసంపదల్లోంచి ఒక నిర్ణీత భాగాన్ని (మొక్కుబడుల పేరిట) తాము కల్పించిన ఈ (మిథ్యా) భాగస్వాములకు కేటాయిస్తున్నారు. అల్లాహ్ భాగం అల్లాహ్‌కు దక్కకపోయినా వారికి బాధ అనిపించదు. కాని తాము కల్పించిన దైవేతరుల భాగంలో మాత్రం ఏ లోటూ రానివ్వరు. అల్ అన్ఆమ్ సూరా 136వ వచనంలో ఈ విషయం స్పష్టంగా చెప్పబడింది.

65. అల్లాహ్‌కు భాగస్వాములు (Partners) ఉన్నారని చెప్పి మీరు చాలా పెద్ద అబద్ధాన్ని ఆయనకు ఆపాదిస్తున్నారు. దీని గురించి మీరు తీర్పుదినాన తప్పకుండా ప్రశ్నించబడతారు.

66. అరేబియాలోని కొన్ని తెగలవారు (ఖుజాఅ, కనాన) దైవదూతలను పూజించేవారు. పైగా వారిని దేవుని కుమార్తెలుగా అభివర్ణించేవారు. అల్లాహ్‌కు సంతానాన్ని కల్పించటమే అన్యాయం అనుకుంటే, ఆడ సంతానాన్ని కల్పించటం మరో అన్యాయం. అంటే తమకు అసలేమాత్రం నచ్చని ఆడ సంతానాన్ని అల్లాహ్‌కు ఆపాదించి, తామిష్టపడే మగ సంతానాన్ని మాత్రం తమ కోసం ప్రత్యేకించుకున్నారు. దీని గురించి దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట ఇలా చెప్పబడింది: “ఏమిటీ, మీ కోసం మగపిల్లలూను, ఆయన కోసం ఆడపిల్లలా? ఇది మరీ అధ్వాన్నమైన పంపకం కదా!” (నజ్మ్-21, 22). అంటే మీకు ఎప్పుడూ అబ్బాయిలే పుట్టాలనీ, అమ్మాయిలు పుట్టకూడదని కోరుకుంటున్నారు కదూ!

60 పరలోకాన్ని విశ్వసించనివారి ఉపమానం మాత్రమే చెడ్డది.[68] అల్లాహ్ అత్యున్నతమైన గుణగణాల దర్పం కలవాడు. ఆయన సర్వాధిక్యుడు, వివేక సంపన్నుడు కూడా.[69]

لِلَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ بِالْاٰخِرَةِ مَثَلُ السَّوْءِ ۚ وَلِلّٰهِ الْمَثَلُ الْاَعْلٰى ۭ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿60﴾

61 అల్లాహ్‌యే గనక ప్రజలు పాల్పడే (ఒక్కో) అఘాయిత్యంపై వారిని నిలదీసినట్లయితే భూమండలంపై ఒక్క ప్రాణి కూడా మిగిలి ఉండదు.[70] కాని ఆయన వారికి ఒక నిర్ణీత కాలం వరకు విడుపునిస్తున్నాడు.[71] మరి వారి కోసం నిర్ణయించబడిన ఆ సమయం వచ్చేసిందంటే వారు ఒక్క ఘడియ వెనక్కిగానీ, ముందుకు గానీ జరగలేరు.

وَلَوْ يُؤَاخِذُ اللّٰهُ النَّاسَ بِظُلْمِهِمْ مَّا تَرَكَ عَلَيْهَا مِنْ دَاۗبَّةٍ وَّلٰكِنْ يُّؤَخِّرُهُمْ اِلٰٓى اَجَلٍ مُّسَمًّى ۚ فَاِذَا جَاۗءَ اَجَلُهُمْ لَا يَسْتَاْخِرُوْنَ سَاعَةً وَّلَا يَسْتَقْدِمُوْنَ ﴿61﴾

62 వారు తమ కోసం ఇష్టపడని దానిని అల్లాహ్‌కు కేటాయిస్తు న్నారు.[72] తమకు మంచే జరుగుతుందని వారి నోళ్లు అబద్ధాలు

وَيَجْعَلُوْنَ لِلّٰهِ مَا يَكْرَهُوْنَ وَتَصِفُ اَلْسِنَتُهُمُ

67. ఇలా చెప్పటంలోని ఉద్దేశం మగబుద్ధిని తెలియజేయటమేగాని, దైవానికి ఆడపిల్లలంటే గిట్టదని ఎంతమాత్రం కాదు. ఆయన దృష్టిలో ఆడ – మగ విచక్షణ లేదు. లింగ ప్రాతిపదికపై నిమ్నోన్నతా భేదభావాలు కూడా ఆయన వద్ద చెల్లవు. అరబ్బులలోని అనుచిత వైఖరిని, దౌష్ట్యాన్ని ఎండగట్టడానికి ఇలా చెప్పటం జరిగింది. తమ మనసుకు నచ్చిన వాటిని తమ కోసం ఎంపిక చేసుకుని, తమకు గిట్టని వాటిని మాత్రం దేవుని పద్దుకు కేటాయించేవారు. వారి ధోరణి అన్యాయం అని చెప్పటమే ఈ ఆయతులోని ఉద్దేశం.

68. అవిశ్వాసులలోని దుష్ట స్వభావాన్ని, దుష్కర్మలను ఎత్తిచూపటం ఈ వాక్యంలోని ఉద్దేశం. అజ్ఞానం, అవిశ్వాసం కూడా చెడు ఉపమానాల్లోనివే. పరలోకాన్ని నిరాకరించే ఈ అవిశ్వాసులు అల్లాహ్‌కు ఆలుబిడ్డలను కల్పించి అత్యంత ఘోరమైన ఉదాహరణను నెలకొల్పారు.

69. దేవుని ప్రతి గుణమూ సృష్టిలోని ప్రాణుల గుణగణాలకన్నా ఉన్నతమైనది. ఉదాహరణకు: దేవుని జ్ఞానం ఎంతో విస్తృతమైనది, ఆయన శక్తియుక్తులు అనంతమైనవి, ఆయన ప్రసాదితాలు అనుపమమైనవి. ఆయన తిరుగులేనివాడు, పాలకుడు, పోషకుడు, సర్వమూ వినేవాడు, సర్వాన్నీ కనిపెట్టుకుని ఉన్నవాడు (ఫత్‌హుల్ ఖదీర్).

చెడు ఉపమానం అంటే లోపభూయిష్టమైనది, దోషమున్నది అని భావం. అత్యున్నతమైన ఉపమానం అంటే పరిపూర్ణ మైనది. ఈ అత్యున్నతమైన ఉపమానం సర్వవిధాలా అల్లాహ్‌కే తగును (ఇబ్నె కసీర్).

70. ఇది అల్లాహ్‌లోని ఉదాత్త గుణానికి, మృదు వైఖరికి ప్రబల నిదర్శనం. తన దాసుడు మాటిమాటికీ తన ఆజ్ఞలను ఉల్లంఘించి, అన్యాయాలకు పాల్పడుతున్నప్పటికీ ఆయన అప్పటికప్పుడే పట్టుకుని అతని మెడ వంచటం లేదు. ఆయనే గనక మనిషి చేసే ఒక్కో తప్పుపై తన కొరడాను ఝుళిపించటం మొదలెడితే ఏ ఒక్కడూ బ్రతికి బట్టకట్టలేడు. ఎందుకంటే మనిషివల్ల జరిగే తప్పులు లెక్కకు మించినవై ఉంటాయి. దుర్మార్గాలకు పాల్పడే ఒక ప్రజా సముదాయాన్ని దేవుడు శిక్షించదలచుకున్నప్పుడు ఆ సముదాయంలో ఉండే మంచివాళ్లు కూడా దాని వాతన పడతారు. ఆ విధంగా ఊళ్ళకు ఊళ్ళే, నగరాలకు నగరాలే తుడిచిపెట్టుకుపోతాయి.

అయితే పరలోకంలో మంచివాళ్లు మాత్రం అల్లాహ్ దగ్గర సఫలీకృతులవుతారు. హదీసులో ఈ విషయం వివరంగా వచ్చింది. (చూడండి : సహీహ్ బుఖారీ – హదీసు నెం.2118; ముస్లిం – హ.నెం. 2206, 2210)

71. ఇలా విడుపు ఇవ్వటంలో ఔచిత్యం లేకపోలేదు. అదేమంటే 1. అల్లాహ్ వారిని పట్టుకున్నప్పుడు కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ఆస్కారమేదీ వారి వద్ద మిగిలి ఉండకూడదు. 2. వారు కాకపోయినా వారి సంతతిలోనయినా అల్లాహ్‌ను విశ్వసించేవారు పుట్టవచ్చు.

ప్రేలుతున్నాయి.[73] అసంభవం. వారి కోసం ఉన్నది నరకాగ్ని మాత్రమే. అందరికన్నా ముందు అందులోకి పోయేది వాళ్ళే.[74]

الْكَذِبَ اَنَّ لَهُمُ الْحُسْنٰى ؕ لَا جَرَمَ اَنَّ لَهُمُ
النَّارَ وَاَنَّهُمْ مُّفْرَطُوْنَ ﴿٦٢﴾

**63** అల్లాహ్ సాక్షి! (ఓ ప్రవక్తా!) మేము నీకు పూర్వం గతించిన సమాజాల వద్దకు కూడా మా ప్రవక్తలను పంపి ఉన్నాము. కాని షైతాన్ వారి దుష్కర్మలను వారికి అందమైనవిగా చేసి చూపాడు.[75] నేటికీ ఆ షైతాను వారి నేస్తంగా ఉన్నాడు.[76] వారి కోసం వ్యధాభరితమైన శిక్ష ఉంది.

تَاللّٰهِ لَقَدْ اَرْسَلْنَاۤ اِلٰۤى اُمَمٍ مِّنْ قَبْلِكَ
فَزَيَّنَ لَهُمُ الشَّيْطٰنُ اَعْمَالَهُمْ فَهُوَ
وَلِيُّهُمُ الْيَوْمَ وَلَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿٦٣﴾

**64** వారు విభేదించుకునే ప్రతి విషయాన్నీ నువ్వు వారికి స్పష్టంగా విడమరచి చెప్పాలని[77] మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. విశ్వసించిన జనులకు ఇది మార్గదర్శకత్వం మరియు కారుణ్యం.

وَمَاۤ اَنْزَلْنَا عَلَيْكَ الْكِتٰبَ اِلَّا لِتُبَيِّنَ لَهُمُ
الَّذِى اخْتَلَفُوْا فِيْهِ ۙ وَهُدًى وَّرَحْمَةً لِّقَوْمٍ
يُّؤْمِنُوْنَ ﴿٦٤﴾

72. అంటే వారు కూతుళ్ళను అల్లాహ్‌కు అంటగడుతున్నారు. ఈ విషయంలోని తీవ్రతను నొక్కి చెప్పే ఉద్దేశంతో దాన్ని పునరావృతం చేయటం జరిగింది.

73. వారు చేసే ఇంకో చెడ్డ పని ఏమిటంటే; అల్లాహ్‌పట్ల అన్యాయంగా ప్రవర్తించిందిగాక, తమకంతా మేలు జరుగుతుందని కోతలు కోసేవారు. ప్రపంచంలో తమకు మంచి జరుగుతున్నట్లే పరలోకంలో కూడా తప్పక మంచి జరుగుతుందని బుకాయించేవారు.

74. నిశ్చయంగా వారికి వారు కోరుకునే 'మంచి' జరుగుతుంది. అదేమిటో తెలుసా? అది 'నరకం' తప్ప మరొకటి కాదు. నరకంలో ప్రవేశించేవారికి వారు ముందు ఉంటారు. **'ఫరతున్'** అంటే ముందు ఉండటం, ముందుకుపోవటం అని అర్థం. హదీసులో కూడా ఈ పదం ఇదే అర్థంలో తీసుకోబడింది. **"అన ఫరతుకుమ్ అలల్ హౌజ్"** (నేను కౌసర్ సరస్సు వద్ద ముందు నుంచే మీ కోసం ఉంటాను) (సహీహ్ బుఖారీ–హ.నెం. 6584; ముస్లిం–హ.నెం. 1793).

ఆయతులో ఉన్న **"ముఫ్రతూన్"** అనే పదానికి మరో అర్థం కూడా చెప్పబడింది – నరకంలో వేయబడిన తరువాత వారు బొత్తిగా విస్మరించబడతారని!

75. దీని భావం ఏమిటంటే, (ఓ ముహమ్మద్ – సఅసం!) మక్కా ప్రజలు నిన్ను ధిక్కరిస్తున్నట్లే వెనుకటి జాతుల వారు కూడా తమ ప్రవక్తలను ధిక్కరించేవారు. వారు చేసే ప్రతి చెడు పని వారి కంటికి మంచిదిగానే కనిపించేది. ఎందుకంటే వారు షైతాన్ మాయాజాలానికి గురయ్యారు.

76. ఆయతులో ఉన్న **'అల్ యౌమ'** (నేడు) అనే పదం నేటి పరిస్థితులకూ వర్తిస్తుంది లేక పరలోకానికి కూడా వర్తించవచ్చు. అంటే పరలోకంలో షైతాన్ వాళ్ళకు దోస్తుగా ఉంటాడు. 'వాళ్ళు' అంటే మక్కాకు చెందిన అవిశ్వాసులని కూడా అర్థం చేసుకోవచ్చు. అనగా ఒకప్పుడు గతకాలంలోని జాతులను పెడత్రోవ పట్టించిన షైతాను ఈనాడు ఈ మక్కా అవిశ్వాసులకు స్నేహితునిగా నిలిచి, వారు అంతిమ దైవప్రవక్త (స) సందేశాన్ని ఆలకించకుండా అడ్డుకుంటున్నాడు. ఆ శాపగ్రస్తుణ్ణి నమ్ముకున్న వారెవరూ బాగుపడరు. నమ్ముకున్నవారిని నట్టేటా ముంచటమే వాడి పని.

77. అంతిమ దైవప్రవక్త (సఅసం) పదవీ బాధ్యతలు మరియు ఆయనకు అంతిమ గ్రంథం ప్రసాదించబడటంలోని అసలు ఉద్దేశం ఏమిటో ఈ ఆయతులో చెప్పబడింది. విశ్వాసాల విషయంలోనూ, షరీయతు ఆదేశాలలోనూ ఆనాటి గ్రంథవహులైన యూదుల – క్రైస్తవుల మధ్య ఉన్న విభేదాలను, ముష్రిక్కుల – జోరాష్ట్రియన్ల మధ్య ఉన్న

**65** అల్లాహ్ ఆకాశం నుంచి నీళ్ళను కురిపించి, దాని ద్వారా–భూమి చచ్చిపోయిన తరువాత దానిని తిరిగి బ్రతికిస్తున్నాడు. వినేవారి కోసం నిశ్చయంగా ఇందులో నిదర్శనం ఉంది.

وَاللّٰهُ اَنْزَلَ مِنَ السَّمَآءِ مَآءً فَاَحْيَا بِهِ الْاَرْضَ
بَعْدَ مَوْتِهَا ؕ اِنَّ فِىْ ذٰلِكَ لَاٰيَةً لِّقَوْمٍ
يَّسْمَعُوْنَ ﴿65﴾

**66** మీ కోసం పశువులలో[78] కూడా ఒక గుణపాఠం ఉంది. వాటి కడుపులలో ఉన్న పేడకు – రక్తానికి మధ్యలో నుంచి స్వచ్ఛమైన పాలు మీకు త్రాగిస్తున్నాము. త్రాగేవారికి అది కమ్మగా ఉంటుంది.[79]

وَاِنَّ لَكُمْ فِى الْاَنْعَامِ لَعِبْرَةً ؕ نُسْقِيْكُمْ مِّمَّا
فِىْ بُطُوْنِهٖ مِنْۢ بَيْنِ فَرْثٍ وَّدَمٍ لَّبَنًا خَالِصًا
سَآئِغًا لِّلشّٰرِبِيْنَ ﴿66﴾

**67** ఇంకా ఖర్జూరం, ద్రాక్షపండ్ల నుంచి మీరు మత్తుపానీయాన్ని తయారు చేస్తారు.[80] (వాటి నుంచి) మంచి ఆహారాన్ని కూడా గ్రహిస్తున్నారు. విజ్ఞత గలవారి కోసం ఇందులోనూ గొప్ప సూచన ఉంది.

وَمِنْ ثَمَرٰتِ النَّخِيْلِ وَالْاَعْنَابِ تَتَّخِذُوْنَ
مِنْهُ سَكَرًا وَّرِزْقًا حَسَنًا ؕ اِنَّ فِىْ ذٰلِكَ
لَاٰيَةً لِّقَوْمٍ يَّعْقِلُوْنَ ﴿67﴾

**68** నీ ప్రభువు తేనెటీగకు ఈ సంకేతమిచ్చాడు:[81] "కొండల్లో, చెట్లలో, ప్రజలు కట్టుకున్న ఎత్తయిన పందిళ్ళలో నీ ఇండ్లను (తెట్టెలను) నిర్మించుకో.

وَاَوْحٰى رَبُّكَ اِلَى النَّحْلِ اَنِ اتَّخِذِىْ مِنَ الْجِبَالِ
بُيُوْتًا وَّمِنَ الشَّجَرِ وَمِمَّا يَعْرِشُوْنَ ﴿68﴾

అయోమయ స్థితిని విశ్లేషించి, సత్యమేదో– అసత్యమేదో పూసగుచ్చినట్లు చెప్పటం ప్రవక్త(స) వారి ప్రధాన బాధ్యత. సత్యాన్ని అవలంబించి, అసత్యాన్ని విడనాడమని ప్రజలకు ప్రబోధించటం ఆయన కర్తవ్యం!

78. **'అన్ఆమ్'** (పశువులు) అంటే ఒంటెలు, ఆవులు, మేకలు అని భావం.

79. ఈ పశువులు తినే గడ్డి, ఆకులు తదితర వస్తువులు వాటి కడుపులలోకి పోయి రక్తం, పేడ, మూత్రం, పాలుగా మారతాయి. రక్తం నరాలలోకి వెళ్ళగా, పేడ మూత్రం వంటి వ్యర్థాలు బయటికి విసర్జించబడతాయి. వాటి మధ్యలో నుంచే తయారైన పాలు పొదుగులలోకి వెళతాయి. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆ పాలలో ఒక్క బొట్టు రక్తంగానీ, ఒక చుక్క వ్యర్థ పదార్థంగానీ కలవదు. పాలు ఎంతో స్వచ్ఛంగా, తెల్లగా ఉంటాయి. కమ్మగా, రుచికరంగా ఉంటాయి. శరీరానికి శక్తినిస్తాయి. ఆకలి తీరుస్తాయి. మనసుకు, మస్తిష్కానికి తృప్తినీ, హాయినీ ఇస్తాయి.

80. మద్యపానం నిషేధించబడని రోజులలో అవతరించిన వాక్యం ఇది. అందుకే ధర్మ సమ్మతమైన వస్తువులతోపాటు మద్యం కూడా ప్రస్తావనకు వచ్చింది. అయితే ఇక్కడ కూడా **'సకరన్'** (మత్తు పదార్థం) అని అన్న తర్వాత మళ్లీ **'రిజ్ఖన్ హసనన్'** (మంచి ఆహారం) అని ప్రత్యేకంగా పేర్కొని మత్తు పదార్థాలు మంచి ఆహారం కానేకావని చూచాయగా చెప్పటం జరిగింది. అదీగాక ఈ సూరా మక్కాలో అవతరించిన సూరా. అందుకే మద్యం గురించి ఇందులో కొద్దిగా అయిష్టతను వ్యక్తం చేయటం జరిగింది. తరువాత మదీనా సూరాలలో క్రమక్రమంగా మద్య నిషేధానికి సంబంధించిన ఆజ్ఞలు వచ్చాయి.

81. అరబీలో **"అవ్హా"** అని ఉంది. అంటే సంకేతమిచ్చాడు, తెలివితేటల్ని ప్రసాదించాడు, దాని నైజంలో ఆ విషయాన్ని నూరిపోశాడు అన్న అర్థాలు వస్తాయి. తమ భౌతిక అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన తెలివితేటల్ని, జీవనోపాయాన్ని అల్లాహ్ జంతువులకు సయితం ప్రసాదించాడు.

ثُمَّ كُلِي مِن كُلِّ الثَّمَرَاتِ فَاسْلُكِي سُبُلَ رَبِّكِ ذُلُلًا ۚ يَخْرُجُ مِن بُطُونِهَا شَرَابٌ مُّخْتَلِفٌ أَلْوَانُهُ فِيهِ شِفَاءٌ لِّلنَّاسِ ۗ إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً لِّقَوْمٍ يَتَفَكَّرُونَ ﴿٦٩﴾

**69** "అన్ని రకాల పండ్లను తిను. నీ ప్రభువు సులభతరం చేసిన మార్గాలలో విహరిస్తూ ఉండు." వాటి కడుపులలో నుంచి పానకం ఒకటి వెలువడుతుంది.[82] దాని రంగులు వేర్వేరుగా ఉంటాయి.[83] అందులో ప్రజలకు స్వస్థత ఉంది.[84] ఆలోచించేవారి కోసం ఇందులో (గొప్ప) సూచన ఉంది.

وَاللَّهُ خَلَقَكُمْ ثُمَّ يَتَوَفَّاكُمْ ۚ وَمِنكُم مَّن يُرَدُّ إِلَىٰ أَرْذَلِ الْعُمُرِ لِكَيْ لَا يَعْلَمَ بَعْدَ عِلْمٍ شَيْئًا ۚ إِنَّ اللَّهَ عَلِيمٌ قَدِيرٌ ﴿٧٠﴾

**70** అల్లాహ్‌యే మిమ్మల్నందరినీ పుట్టించాడు. మరి ఆయనే మీకు చావునిస్తాడు. మీలో అత్యంత దుర్భరమైన వయస్సుకు చేర్చబడే వారు కూడా ఉంటారు– అన్నీ తెలిసి ఉండి కూడా ఏమీ తెలియని వారవటానికి![85] నిస్సందేహంగా అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వాధికారి.

82. తేనెటీగలు పర్వతాల్లో, చెట్లపైనా, మానవులు కట్టే ఎత్తైన కట్టడాలలో అపురూపంగా తమ తెట్టెలను నిర్మించుకుంటాయి. ఆ నిర్మాణంలో ఎక్కడా ఖాళీ స్థలం ఉండదు, లోపం ఉండదు. తరువాత అవి పరిసరాల్లో ఉన్న తోటల్లో, అడవుల్లో, పొలాల్లో, పర్వత లోయల్లో విహరిస్తాయి. అన్ని రకాల పండ్ల, పుష్పాల రసాన్ని పీలుస్తాయి. వెళ్ళిన మార్గాల గుండానే తిరిగి వచ్చి తమ తమ తెట్టెలపై వాలుతాయి. వాటి నుండి విసర్జితమయ్యే పదార్థాన్ని దివ్య ఖుర్ఆన్ 'పానకం'గా అభివర్ణించింది. మనసుకు, మస్తిష్కానికీ తృప్తినీ, శక్తినీ చేకూర్చే పానకం అన్నమాట!

83. ఆ పానకం ఎర్రగానూ, తెల్లగానూ, పసుపు పచ్చగానూ, కుంకుమ పువ్వు రంగులోనూ ఉంటుంది. ఆ తేనెటీగలు పీల్చే వివిధ రకాల పండ్లను, పుష్పాలనుబట్టి ఆ రంగులో మార్పు వస్తూ ఉంటుంది.

84. ఈ తేనె చాలా వ్యాధులకు నివారణ వంటిది. అయితే ప్రతి రోగానికీ అది మందు అని భావించకూడదు. వైద్యులు కూడా ఆ మాటే అన్నారు. నిస్సందేహంగా తేనె రోగాన్ని నివారించే పానకమే. అయితే కొన్ని ప్రత్యేక వ్యాధులకు మాత్రమే అది మందుగా ఉపయోగపడుతుందిగాని అన్ని వ్యాధులకు కాదు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు తీపి వస్తువు, తేనె చాలా ఇష్టమని హదీసు ద్వారా తెలియవస్తోంది (సహీహ్ బుఖారీ – పానీయాల ప్రకరణం). మరో ఉల్లేఖనం ప్రకారం ఆయన (సఅసం) ఇలా అన్నారు : "మూడింటిలో రోగం నుంచి స్వస్థత ఉంది – 1. శస్త్ర చికిత్స ద్వారా శరీరంలోని చెడు రక్తం తీయటంలో. 2. తేనె సేవించటంలో. 3. కాల్చి వాతలు పెట్టడంలో. అయితే వాతలు పెట్టే చర్య నుండి నేను నా అనుచర సమాజాన్ని వారిస్తున్నాను" (బుఖారీ – మందుల ప్రకరణం). తేనెకు సంబంధించిన హదీసులో ఒక సంఘటన – "విరేచనాలకు మందుగా తేనెను ఉపయోగించమని ఆయన (సఅసం) ఒకతనికి సలహా యిచ్చారు. తేనె సేవించాక విరేచనాలు మరింత ఎక్కువయ్యాయి. ఆ విషయమే వచ్చి చెబితే తేనె త్రాగించమని ఆయన (స) రెండవసారి సూచించారు. ఈసారి తేనె త్రాగితే మరిన్ని విరేచనాలయ్యాయి. అతిసార వ్యాధి ముదిరిందని కుటుంబ సభ్యులు అనుకున్నారు. మళ్లీ మహాప్రవక్త (స) వద్దకు వచ్చి సంప్రతిస్తే ఆయన (స) మూడవసారి ఇలా అన్నారు: "అల్లాహ్ సత్యవంతుడు. కాకపోతే నీ సోదరుని కడుపే అబద్ధమైనది. వెళ్ళి అతనికి తేనె త్రాగించు." మూడవసారి తేనె త్రాగించేసరికి అతనికి సంపూర్ణ స్వస్థత చేకూరింది. (బుఖారీ – మందుల ప్రకరణం; ముస్లిం – సలాం ప్రకరణం).

85. మితిమీరిన వయోభారంతో మనిషి జ్ఞాపక శక్తి క్షీణిస్తుంది. బుద్ధి మందగిస్తుంది. చాదస్తం ఎక్కువవుతుంది. మరీ పసిపిల్లాడిలా ప్రతి దానికీ మారాం చేస్తాడు. **'అర్‌జలుల్ ఉమ్ర్'** (హీన వయోదశ) అంటే ఇదే. ఇలాంటి వార్ధక్యం నుంచే మహాప్రవక్త (సఅసం) శరణు వేడారు.

**71** అల్లాహ్‌యే ఉపాధి విషయంలో మీలో ఒకరికి ఇంకొకరిపై ఆధిక్యతను వొసగి ఉన్నాడు. ఆధిక్యత వొసగబడినవారు తమ ఉపాధిని తమ క్రిందనున్న బానిసలకు తామూ– వారూ సమానులయ్యేలా ఇవ్వరు.[86] మరి వీరు అల్లాహ్ అనుగ్రహాలనే తిరస్కరిస్తున్నారా?[87]

وَاللّٰهُ فَضَّلَ بَعْضَكُمْ عَلٰى بَعْضٍ فِى الرِّزْقِ ۚ
فَمَا الَّذِيْنَ فُضِّلُوْا بِرَآدِّىْ رِزْقِهِمْ عَلٰى مَا
مَلَكَتْ اَيْمَانُهُمْ فَهُمْ فِيْهِ سَوَآءٌ ؕ
اَفَبِنِعْمَةِ اللّٰهِ يَجْحَدُوْنَ ﴿71﴾

**72** అల్లాహ్ మీ కోసం స్వయంగా మీలో నుంచే మీ భార్యలను సృష్టించాడు. మరి మీ భార్యల ద్వారా మీ కొరకు మీ కుమారులను, మీ మనవళ్ళను పుట్టించాడు. ఇంకా, మీకు తినటానికి మంచి మంచి వస్తువులను సమకూర్చాడు. అయినప్పటికీ ప్రజలు మిథ్యనే నమ్ముకుంటున్నారా?[88] వారు అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతఘ్నుతకు పాల్పడుతున్నారా??

وَاللّٰهُ جَعَلَ لَكُمْ مِّنْ اَنْفُسِكُمْ اَزْوَاجًا وَّجَعَلَ
لَكُمْ مِّنْ اَزْوَاجِكُمْ بَنِيْنَ وَحَفَدَةً وَّرَزَقَكُمْ
مِّنَ الطَّيِّبٰتِ ؕ اَفَبِالْبَاطِلِ يُؤْمِنُوْنَ وَبِنِعْمَتِ
اللّٰهِ هُمْ يَكْفُرُوْنَ ﴿72﴾

**73** వారు అల్లాహ్‌ను వదలి, తమకు ఆకాశాల నుంచిగానీ, భూమి నుంచిగానీ ఎలాంటి ఉపాధినీ సమకూర్చలేని వారిని, ఏ శక్తిసామర్థ్యమూ లేనివారిని పూజిస్తున్నారా?[89]

وَيَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ مَا لَا يَمْلِكُ
لَهُمْ رِزْقًا مِّنَ السَّمٰوٰتِ وَالْاَرْضِ شَيْــًٔا
وَّلَا يَسْتَطِيْعُوْنَ ﴿73﴾

**74** కాబట్టి అల్లాహ్‌కు పోలికలను కల్పించకండి.[90] నిశ్చయంగా అల్లాహ్‌కు అన్నీ తెలుసు. మీకు తెలియదు.

فَلَا تَضْرِبُوْا لِلّٰهِ الْاَمْثَالَ ؕ اِنَّ اللّٰهَ يَعْلَمُ
وَاَنْتُمْ لَا تَعْلَمُوْنَ ﴿74﴾

---

86. మీ క్రింద పనిచేసే కూలివాళ్లు, బానిసలు మీ స్థాయికి ఎదిగిపోతారన్న ఉద్దేశ్యంతో మీ దగ్గరున్న సిరిసంపదలను మీరు విశాల మనసుతో ఇవ్వరాయె. మరి అటువంటప్పుడు దేవుని దాసులైన మనుషులను మీరు అమాంతం దైవాలుగా నిలబెట్టి, వారిని పూజించటాన్ని అల్లాహ్ మాత్రం ఎలా ఇష్టపడతాడనుకున్నారు?

    ఈ ఆయతు ద్వారా బోధపడే మరో ముఖ్యాంశం ఏమిటంటే ఆర్థికంగా మనుషుల మధ్య ఉండే తేడాపాడాలు ప్రకృతి సిద్ధంగా ఉన్నవే. నిరంకుశ, నియంతృత్వ చట్టాల ద్వారా ఈ ప్రకృతి ధర్మాన్ని రూపుమాపటం సరైనది కాదు. అలా చేయటం వల్ల కలిగే చేటు ఏమిటో కమ్యూనిస్టు వ్యవస్థ ద్వారా ప్రపంచానికి తెలిసివచ్చింది. ఆర్థిక సమానత్వం పేరుతో మనిషి సంపాదనను నియంత్రించటం అసహజం. ఆర్థిక సమానత్వం అంటే సంపాదించే, ప్రగతిని సాధించే సమాన అవకాశాలు అందరికీ కల్పించాలి.

87. అంటే వారు దైవప్రసాదితమైన సంపదలో నుంచి దైవేతరుల కోసం నైవేద్యాలను తీయటం, దైవేతరులకు మొక్కుబడులు చెల్లించటం వంటి పనులకు పాల్పడి దేవుడు చేసిన మేళ్ళను మరచిపోతున్నారు.

88. ఈ ఆయతులో అల్లాహ్ తన ఉపకారాలను జ్ఞాపకంచేసి, అన్నీ ప్రసాదించేవాడు అల్లాహ్ అయిఉండగా, జనులు ఆయన్ని విడనాడి, ఇతరుల ముందు తలవంచుతున్నారనీ, ఇది అధర్మమనీ చెప్పాడు.

89. ఇంతకీ వారు నమ్ముకునేది, పూజాపునస్కారాలు చేసేది ఎవరికి? ఏదీ చేతకానివారికా? ఏ సహాయమూ చేయలేనివారికా? ఏ గండం నుంచీ గట్టెక్కించలేని వారికా?

90. రాజ్యాధిపతిని కలుసుకోవాలన్నా, ఆయనకేదైనా విన్నపాలు చేసుకోవాలన్నా నేరుగా రాజ్యాధిపతిని కలుసుకోవటం సాధ్యపడదనీ, అతని ఆంతరంగికుల్ని, కార్యదర్శుల్ని కలుసుకుంటేనే రాజ్యాధిపతి దర్శనం సాధ్యమవుతుందని ముష్రిక్కులు ఉదాహరణలు ఇస్తుంటారు. దేవుడు కూడా సర్వోన్నతుడనీ, ఆయన దాకా చేరాలంటే చిట్టిపొట్టి

**75** అల్లాహ్ ఒక ఉదాహరణ ఇస్తున్నాడు: ఇతరుల యాజమాన్యంలో ఉన్న ఒక బానిస ఉన్నాడు. అతనికి ఏ అధికారమూ లేదు. కాగా; మరో వ్యక్తి ఉన్నాడు – అతనికి మేము మా వద్ద నుంచి మంచి ఉపాధిని సమకూర్చాము. అందులో నుంచి అతడు రహస్యంగానూ, బహిర్గతంగానూ ఖర్చుపెడతాడు. మరి వీరిద్దరూ సమానులేనా?[91] సర్వస్తోత్రాలూ అల్లాహ్ కొరకే. అయితే వీరిలో చాలామందికి తెలీదు.

ضَرَبَ اللّٰهُ مَثَلًا عَبْدًا مَّمْلُوْكًا لَّا يَقْدِرُ
عَلٰى شَيْءٍ وَّمَنْ رَّزَقْنٰهُ مِنَّا رِزْقًا حَسَنًا
فَهُوَ يُنْفِقُ مِنْهُ سِرًّا وَّجَهْرًا ۗ هَلْ يَسْتَوٗنَ ۚ
اَلْحَمْدُ لِلّٰهِ ۚ بَلْ اَكْثَرُهُمْ لَا يَعْلَمُوْنَ ﴿75﴾

**76** అల్లాహ్ మరో ఇద్దరు వ్యక్తుల ఉదాహరణను కూడా ఇస్తున్నాడు[92] : వారిలో ఒకడు మూగవాడు. ఏదీ చెయ్యలేడు. పైగా అతను తన యజమానికి భారంగా తయారయ్యాడు. అతన్ని ఎక్కడికి పంపినా మేలును తీసుకురాడు. మరొకతను న్యాయం గురించి ఆదేశిస్తున్నాడు.[93] పైగా అతను సన్మార్గాన ఉన్నాడు. వీరిద్దరూ ఒకటేనా?

وَضَرَبَ اللّٰهُ مَثَلًا رَّجُلَيْنِ اَحَدُهُمَآ اَبْكَمُ لَا
يَقْدِرُ عَلٰى شَيْءٍ وَّهُوَ كَلٌّ عَلٰى مَوْلٰىهُ ۙ اَيْنَمَا
يُوَجِّهْهُّ لَا يَاْتِ بِخَيْرٍ ۗ هَلْ يَسْتَوِيْ هُوَ ۙ وَمَنْ
يَّاْمُرُ بِالْعَدْلِ ۙ وَهُوَ عَلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿76﴾

**77** ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న నిగూఢ విషయాలు అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.[94] ప్రళయ వ్యవహారం రెప్పపాటు కాలంలో, లేదా అంతకన్నా తక్కువ సమయంలోనే జరిగిపోతుంది. నిశ్చయంగా అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు.[95]

وَلِلّٰهِ غَيْبُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۗ وَمَآ اَمْرُ
السَّاعَةِ اِلَّا كَلَمْحِ الْبَصَرِ اَوْ هُوَ اَقْرَبُ ۗ
اِنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ﴿77﴾

దేవుళ్ళను కాకా పట్టడం, వారిని సంతోషపరచటం అవసరమని వాళ్లు చెబుతారు. ఆ విషయాన్నే ప్రస్తావిస్తూ ఇక్కడ అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి : "మీరు అల్లాహ్‌ను మీలాంటి మనుషులతో పోల్చకండి. ఎందుకంటే ఆయన సాటిలేని మేటి. ఆయన్ని సరిపోలిన వారు ఎవరూ లేరు. ఒక రాజ్యాధికారికి అగోచర జ్ఞానం ఉండదు. అతడు అందరినీ చూడలేడు. అందరి మొరలను ఆలకించనూలేడు. కాగా; అల్లాహ్ అందరి మొరలనూ ఆలకిస్తాడు. అందరినీ కనిపెట్టుకుని ఉంటాడు. రాత్రి చీకటిలో జరిగే కార్యకలాపాలు కూడా ఆయనకు ఎరుకే. మరలాంటప్పుడు మానవ మాత్రుడైన ఒక రాజ్యాధికారి విశ్వప్రభువు అయిన అల్లాహ్‌తో ఎలా సరితూగుతాడు?

91. కొందరి అభిప్రాయం ప్రకారం ఇది బానిస – స్వేచ్ఛాజీవుల ఉదాహరణ. వారిలో ఒకడు బానిస – మరొకడు స్వేచ్ఛాజీవి. వారిద్దరూ సమానులు కాలేరు. మరికొందరి ఉద్దేశ్యంలో ఇది విశ్వాసి – అవిశ్వాసుల ఉదాహరణ. వారిలో ఒకరు విశ్వాసి – మరొకరు అవిశ్వాసి. వారిద్దరూ సమానులు కాలేరు. దీని భావం ఏమిటంటే ఒక బానిస, ఒక స్వేచ్ఛా జీవి ఇద్దరూ మనుషులే. ఇద్దరూ దేవుని చేత చేయబడినవారే. ఎన్నో విషయాలలో వారి మధ్య పోలికలున్నాయి. కాని గౌరవ మర్యాదల రీత్యా మీ దృష్టిలోనే వారిద్దరిలో చాలా పెద్ద తేడా ఉంది. మరలాంటప్పుడు మహోన్నతుడు అయిన అల్లాహ్‌తో, రాతి విగ్రహాలు లేక సమాధులు ఎలా సరితూగుతాయి?

92. ఈ రెండవ ఉదాహరణ మొదటి ఉదాహరణకన్నా మరింత స్పష్టమైనది.

93. ఎందుకంటే ఇతను వింటాడు, చెబుతాడు. ప్రతి పనీ చెయ్యగలుగుతాడు. పైగా ఇతను సన్మార్గంపై ఉన్నాడు. ఆలోచించగలడు. మంచీ – చెడుల విచక్షణా జ్ఞానం కూడా ఇతనికి ఉంది. కుడి ఎడమల అపవాదాలకు దూరంగా

**78** అల్లాహ్ మిమ్మల్ని మీ మాతృ గర్భాల నుండి – మీకేమీ తెలీని స్థితిలో బయటికి తీశాడు.[96] మీ కొరకు చెవులను, కళ్లను, హృదయాలను తయారుచేసినది ఆయనే[97] – మీరు కృతజ్ఞులుగా వ్యవహరిస్తారని![98]

وَاللّٰهُ اَخْرَجَكُمْ مِّنْۢ بُطُوْنِ اُمَّهٰتِكُمْ لَا تَعْلَمُوْنَ شَيْـًٔا ۙ وَّجَعَلَ لَكُمُ السَّمْعَ وَالْاَبْصَارَ وَالْاَفْـِٕدَةَ ۙ لَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿78﴾

**79** శూన్యాకాశంలో ఆజ్ఞాబద్ధులై ఉన్న పక్షులను వారు చూడ లేదా? అల్లాహ్ తప్ప వాటిని ఆ స్థితిలో నిలిపి ఉంచేవారెవరూ లేరు.[99] నిశ్చయంగా విశ్వసించేవారి కోసం ఇందులో గొప్ప సూచనలున్నాయి.

اَلَمْ يَرَوْا اِلَى الطَّيْرِ مُسَخَّرٰتٍ فِيْ جَوِّ السَّمَآءِ ؕ مَا يُمْسِكُهُنَّ اِلَّا اللّٰهُ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ ﴿79﴾

---

ఉంటున్నాడు. ఏ విధంగానయితే ఇతనూ – మూగవాడు సమానులు కాలేరో అదేవిధంగా సర్వశక్తుడైన అల్లాహ్, ప్రజలు కల్పించే మిథ్యా దైవాలు ఒక్కటి కాలేవు.

94. భూమ్యాకాశాలలో అసంఖ్యాకమైన వస్తువులు నిగూఢమై ఉన్నాయి. వాటిలో ప్రళయం కూడా ఒకటి. ఆ జ్ఞానం ఒక్క అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ లేదు. కాబట్టి ఆరాధ్యుడు కూడా ఆయన ఒక్కడే. విగ్రహాలుగానీ, మరణించిన వ్యక్తులుగానీ ఆరాధ్య దైవాలు కాలేవు. ఎవరికీ ఎటువంటి లాభనష్టాలు కలిగించే శక్తి వాటికి లేదు.

95. ఆయన శక్తి ఎంత గొప్పదంటే సువిశాలమైన ఈ జగతి, ఈ భువన భాండవాలన్నీ ఆయన ఆజ్ఞపై రెప్పపాటు సమయంలో – అంతకన్నా తక్కువ సమయంలోనే కూలిపోతాయి. ఇది అతిశయోక్తి కాదు – వాస్తవం. ఎందుకంటే ఆయన శక్తి అనంతమైనది. దాన్ని మనం అంచనా వేయలేము. 'అయిపో' అని ఆయన జారీచేసిన ఒకే ఒక్క ఆర్డర్‌పై అంతా అయిపోతుంది. ప్రళయం కూడా ఇందులో అంతర్భాగమే.

96. మీరు పుట్టిన క్షణంలో మీకెలాంటి లోక జ్ఞానం లేదు. అదృష్ట దురదృష్టాలంటే ఏమిటో, లాభనష్టాలంటే ఏమిటో ఆ సమయంలో మీకు తెలీదు.

97. చెవుల ద్వారా మీరు వినగలుగుతారనీ, కళ్ల ద్వారా చూడగలుగుతారనీ, హృదయంతో ఆలోచించి అర్థం చేసుకుంటారని వీటన్నింటినీ ఆయన మీకు ప్రసాదించాడు. మనిషి ఆలోచనలకు, బుద్ధివివేకాలకు కేంద్రబిందువు అతని హృదయం. దాంతో విషయంలోని ఉచితానుచితాలను, మంచీచెబ్బరలను మనిషి బేరీజువేస్తాడు. మనిషి పెరిగి పెద్దవాడయ్యే కొద్దీ అతని ఈ శక్తులు, పంచేంద్రియాలు పెరుగుతుంటాయి. అతను యుక్త వయస్సుకు చేరుకునేటప్పటికి అతని ఈ శక్తియుక్తులు కూడా బలవత్తరమవుతాయి. కడకు అవి పూర్ణ పరిణతిని సంతరించుకుంటాయి.

98. మరి ఈ తెలివితేటల్ని, ఈ శక్తియుక్తుల్ని అల్లాహ్ ఎందుకు ప్రసాదించినట్టు? మనిషి ఈ శరీరావయవాలను దైవేచ్ఛకనుగుణంగా వినియోగించుకోవాలనీ, దైవారాధన, దైవవిధేయత కోసం వెచ్చించాలనేకదా! ఆ విధంగా వాటిని ఉపయోగిస్తేనే దేవుని ఈ అనుగ్రహాలకు క్రియాత్మకంగా కృతజ్ఞత తెలుపుకున్నట్లవుతుంది. హదీసులో ఈ విధంగా చెప్పబడింది: "నా దాసుడు నా సామీప్యం పొందటానికి అవలంబించే వస్తువులలో అన్నిటికన్నా ఎక్కువ ప్రీతికరమైనవి నేను అతనిపై నియమించిన విధులు. ఇవి గాక స్వచ్ఛంద ఆరాధనల ద్వారా కూడా అతను నా సామీప్యం పొందే ప్రయత్నం చేస్తాడు. కడకు నేనతన్ని ప్రేమించసాగుతాను. నేనతన్ని ప్రేమించసాగినప్పుడు అతను వినే చెవులనై పోతాను. అతను కనే కళ్లనైపోతాను. అతను పట్టుకునే చేతులనై పోతాను. అతను నడిచే కాళ్లనైపోతాను. అతను అడిగిన దాన్నల్లా అతనికిస్తాను. అతను గనక దేని బారి నుంచైనా నా శరణువేడితే నేనతనికి శరణు ఇస్తాను." (సహీహ్ బుఖారీ – కితాబుర్రిఖాఖ్).

**గమనిక :** ఈ హదీసును అర్థం చేసుకోవటంలో కొందరు పొరబడ్డారు. దీని ఆధారంగా దేవుని ప్రియతమ దాసుల (ఔలియా అల్లాహ్)కు దేవుని శక్తులు అబ్బాయని మతలబు తీశారు. హదీసుకు అసలు అర్థం ఏమిటంటే దాసుడు

80 అల్లాహ్ మీ కొరకు మీ ఇండ్లను విశ్రాంతి స్థలాలుగా చేశాడు. ఇంకా ఆయనే మీ కోసం పశువుల చర్మాలతో ఇళ్ళను చేశాడు. ప్రయాణ దినాన, విడిది చేసిన దినాన కూడా అవి మీకు తేలిగ్గా – అనువైనవిగా – ఉంటాయి.[100] ఇంకా వాటి ఉన్ని తోనూ, రోమాలతోనూ, వెంట్రుకలతోనూ ఆయన ఎన్నో సామానులను, కొంతకాలం వరకూ ఉపయోగపడే వస్తువులనూ తయారుచేశాడు.[101]

وَاللّٰهُ جَعَلَ لَكُمْ مِّنْۢ بُيُوْتِكُمْ سَكَنًا وَّجَعَلَ
لَكُمْ مِّنْ جُلُوْدِ الْاَنْعَامِ بُيُوْتًا تَسْتَخِفُّوْنَهَا
يَوْمَ ظَعْنِكُمْ وَيَوْمَ اِقَامَتِكُمْ ۙ وَمِنْ اَصْوَافِهَا
وَاَوْبَارِهَا وَاَشْعَارِهَآ اَثَاثًا وَّمَتَاعًا اِلٰى حِيْنٍ ﴿80﴾

81 మరి అల్లాహ్యే మీ కోసం తాను సృష్టించిన వస్తువులతో నీడను ఏర్పాటు చేశాడు.[102] మరి ఆయనే మీకోసం కొండలలో గుహలను చేశాడు. ఇంకా ఆయనే మీకోసం, మిమ్మల్ని వేడిమి నుంచి కాపాడే చొక్కాలను, యుద్ధ సమయాలలో మీకు రక్షా కవచంగా ఉపయోగపడే చొక్కాలను కూడా చేశాడు.[103] ఈ విధంగా ఆయన – మీరు ఆజ్ఞల్ని శిరసావహించేవారౌతారని– తన అనుగ్రహాలను పరిపూర్తి చేస్తున్నాడు.

وَاللّٰهُ جَعَلَ لَكُمْ مِّمَّا خَلَقَ ظِلٰلًا وَّجَعَلَ لَكُمْ
مِّنَ الْجِبَالِ اَكْنَانًا وَّجَعَلَ لَكُمْ سَرَابِيْلَ تَقِيْكُمُ
الْحَرَّ وَسَرَابِيْلَ تَقِيْكُمْ بَاْسَكُمْ ؕ كَذٰلِكَ يُتِمُّ
نِعْمَتَهٗ عَلَيْكُمْ لَعَلَّكُمْ تُسْلِمُوْنَ ﴿81﴾

82 అప్పటికీ వారు విముఖత చూపినట్లయితే (ఓ ప్రవక్తా!) విషయాన్ని స్పష్టంగా అందజేయటం వరకే నీ బాధ్యత.

فَاِنْ تَوَلَّوْا فَاِنَّمَا عَلَيْكَ الْبَلٰغُ الْمُبِيْنُ ﴿82﴾

తన ఆరాధనలను, ధర్మాన్ని కేవలం అల్లాహ్ కోసం ప్రత్యేకించుకున్నప్పుడు ప్రతి పనిలో అల్లాహ్ ప్రసన్నతను చూరగొనటమే అతని లక్ష్యం అయి ఉంటుంది. ఏ విషయాన్ని వినటానికి, మరే వస్తువుని చూడటానికి దేవుడు అనుమతించాడో వాటిని మాత్రమే వింటాడు, చూస్తాడు. షరీయతు సమ్మతించిన మార్గంలోనే నడుస్తాడు. ధర్మసమ్మతమైన వాటినే చేత్తో ముట్టుకుంటాడు. ఏ వస్తువును ఉపయోగించినా దైవేచ్ఛమేరకే ఉపయోగిస్తాడు తప్ప ఆయన అభిమతానికి విరుద్ధంగా ఉపయోగించడు.

99. అల్లాహ్ మాత్రమే వాటికి ఆ శక్తినీ, తెలివినీ ఇచ్చి, పవనాలను వాటి విహారానికి తోడ్పడేవిగా చేశాడు.

100. అంటే తోలు గుడారాలన్నమాట. ప్రయాణానికి బయలుదేరేటప్పుడు మీరు వాటిని తేలిగ్గా తీసుకుపోగలుగుతారు. అవసరమైన చోట చలి తీవ్రత నుంచి తట్టుకోవడానికి మీరు వాటిని గుడారాలుగా ఉపయోగించుకుంటారు.

101. **అస్వాఫ్** – ఇది **'సూఫున్'**కు బహువచనం. సూఫున్ అంటే గొర్రెల ఉన్ని అని అర్థం. మూలంలో **'అవ్బార్'** అని మరొక పదం ఉంది. ఇది **'వబ్రున్'**కు బహువచనం. ఒంటెల రోమాలు అని దానర్థం. ఇంకొక పదం **'అష్ఆర్'.** ఇది **'షఅరున్'**కు బహువచనం. మేకల వెంట్రుకలని ఇక్కడ దాని భావం. వీటితో రకరకాల వస్తువులు తయారవుతాయి. వాటిద్వారా మనిషి లాభాలూ ఆర్జిస్తాడు. ఒక నిర్ణీత కాలం వరకు ఆ వస్తువులన్నీ ఉపయోగించుకుంటాడు. నేడు అంతర్జాతీయ స్థాయిలో ఈ పరిశ్రమకు ఉన్న ప్రాధాన్యం ఎనలేనిది.

102. అంటే చెట్ల నీడలని భావం.

103. అంటే ఉన్ని వస్త్రాలు, కాటన్ దుస్తులు. ఇవి సాధారణంగా అందరికీ ఉపయోగపడతాయి. యుద్ధ సమయాలలో యోధులు ధరించే కవచాలు వారిని ప్రత్యర్థి నుంచి కాపాడతాయి. ఇవన్నీ యదార్థానికి దైవ ప్రసాదితాలే.

يَعْرِفُونَ نِعْمَتَ اللَّهِ ثُمَّ يُنْكِرُونَهَا وَأَكْثَرُهُمُ الْكَافِرُونَ (83)

**83** వీరు అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించి కూడా నిరాకరిస్తు న్నారు. పైగా వారిలో చాలా మంది చేసిన మేలును మరిచే వారే.[104]

وَيَوْمَ نَبْعَثُ مِنْ كُلِّ أُمَّةٍ شَهِيدًا ثُمَّ لَا يُؤْذَنُ لِلَّذِينَ كَفَرُوا وَلَا هُمْ يُسْتَعْتَبُونَ (84)

**84** ఏ రోజున మేము ప్రతి సమాజం నుంచీ ఒక సాక్షిని నిలబెడతామో (ఆ రోజున) అవిశ్వాసులకు (సంజాయిషీ ఇచ్చుకునే) అనుమతి ఇవ్వబడదు. 'పశ్చాత్తాప పడండి' అని కూడా వారితో అనటం జరగదు.[105]

وَإِذَا رَأَى الَّذِينَ ظَلَمُوا الْعَذَابَ فَلَا يُخَفَّفُ عَنْهُمْ وَلَا هُمْ يُنْظَرُونَ (85)

**85** ఆ దుర్మార్గులు శిక్షను చూసినప్పుడు దాన్ని వారి నుంచి తేలిక చేయటంగానీ, వారికి విడుపు ఇవ్వటంగానీ జరగదు.[106]

وَإِذَا رَأَى الَّذِينَ أَشْرَكُوا شُرَكَاءَهُمْ قَالُوا رَبَّنَا هَٰؤُلَاءِ شُرَكَاؤُنَا الَّذِينَ كُنَّا نَدْعُو مِنْ دُونِكَ ۖ فَأَلْقَوْا إِلَيْهِمُ الْقَوْلَ إِنَّكُمْ لَكَاذِبُونَ (86)

**86** ఈ ముష్రిక్కులు తాము (అల్లాహ్‌కు) భాగస్వాములుగా నిలబెట్టే వారిని చూడగానే, "ఓ మా ప్రభూ! మేము నిన్ను వదిలేసి మొరపెట్టుకున్న మా భాగస్వాములు వీరే" అని అంటారు. అప్పుడు వారు (ఆ భాగస్వాములు), "మీరు చెప్పేది పచ్చి అబద్ధం"[107] అని వారి మాటను ఖండిస్తారు.

104. ఈ అనుగ్రహాలన్నింటినీ సృష్టించినవాడు, వాటిని ఉపయోగించే తెలివితేటల్ని ప్రసాదించినవాడు అల్లాహ్‌యేనని తెలిసి కూడా వారు ఆయన్ని నిరాకరిస్తున్నారు. ఆయన పట్ల కృతఘ్నులుగా వ్యవహరిస్తున్నారు – అంటే ఒక్కడైన అల్లాహ్‌ను వదలి ఇతరులను పూజిస్తున్నారు.

105. అంటే – ప్రతి జాతికీ, ప్రతి సమాజానికీ (ఆ సమాజానికి సందేశం అందజేసిన) ప్రవక్త సాక్షిగా నిలబడి తాను వారికి సందేశాన్ని అందజేశాననీ, కాని వారు దాన్ని ఏమాత్రం ఖాతరు చేయలేదని చెబుతాడు. అప్పుడు అవిశ్వాసులకు సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం ఏదీ ఇవ్వబడదు. ఎందుకంటే యదార్థానికి వారి వద్ద సంజాయిషీ ఇచ్చుకోదగ్గ కారణం ఏదీ మిగిలి ఉండదు. చేసిన తప్పులపై పశ్చాత్తాపపడమని కూడా వారికి సలహా ఇవ్వబడదు. ఎందుకంటే పశ్చాత్తాపం చెందటానికి ఇవ్వబడిన గడువు ముగిసింది. **"లా యుస్తాతబూన"**కు మరొక అర్థం, వారికి తమ ప్రభువును ప్రసన్నుణ్ణి చేసే అవకాశం ఇవ్వబడదు అని. ఎందుకంటే ఆ అవకాశం వారికి ప్రపంచంలో ఇవ్వగా దాన్ని వారు చేజార్చుకున్నారు. ఇది కర్మ స్థలం కాదు, ప్రతిఫలం ఇవ్వబడే స్థలం. కర్మస్థలానికి కాలం చెల్లింది. ఇప్పుడున్నది ఫలితాన్ని అనుభవించే నిలయం. ఇప్పుడెవరికీ సత్కర్మలు చేసుకునే అవకాశం ఇవ్వబడదు.

106. అంటే – శిక్ష విధించబడటం మొదలయ్యిందంటే మధ్యలో వారికి ఎలాంటి విరామం, విశ్రాంతి ఇవ్వబడదు. నిరంతరం శిక్ష పడుతూనే ఉంటుంది. విడుపు ఇవ్వబడదంటే, వారి నోటికి కళ్ళెం వేసి, శరీరాన్ని సంకెళ్లలో బిగించి నరకంలోకి నెట్టివేయటం జరుగుతుంది. లేక దాని భావం తప్పుల్ని సరిదిద్దుకునే అవకాశం ఏదీ వారికి ఇవ్వ బడదని కావచ్చు. ఎందుకంటే పరలోకం కర్మల స్థలం కాదు – అది కర్మల ఫలాన్ని అనుభవించే స్థలం.

107. మిథ్యా దైవాలను పూజించేవారు చెప్పేది అబద్ధం కాదు. అయినప్పటికీ, తాము భాగస్వాములుగా నిలబెట్టిన ఆ చిల్లర దేవుళ్లు మాత్రం స్పష్టంగా చెప్పేస్తారు – వీరు చెబుతున్నదంతా అబద్ధం అని! బహుశా వారు ఈ మాటల ద్వారా షిర్క్‌ను ఖండిస్తారేమో! అంటే మమ్మల్ని అల్లాహ్‌కు సహవర్తులుగా నిలబెట్టామని వీళ్ళు ఒట్టి అబద్ధం చెబుతున్నారు గాని అసలు అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరు ఉంటారు? అన్నది లేక వారు తమను పూజించిన సంగతి తమకు తెలియనే తెలియదు అన్నది వారి మాటల్లోని ఆంతర్యం కావచ్చు. ఈ విషయాన్ని ఖుర్ఆన్ పెక్కుచోట్ల ప్రస్తావించింది

**87** ఆ రోజు వారంతా అల్లాహ్ సమక్షంలో పూర్తిగా లొంగిపోవటానికి సిద్ధమవుతారు. వారు చేస్తూ ఉండిన కల్పనలన్నీ వారి నుంచి మటుమాయమౌతాయి.

وَأَلْقَوْا إِلَى اللَّهِ يَوْمَئِذٍ السَّلَمَ وَضَلَّ عَنْهُمْ
مَا كَانُوا يَفْتَرُونَ ﴿٨٧﴾

**88** ఎవరు తిరస్కరించారో, అల్లాహ్ మార్గం నుంచి (జనులను) ఆపారో వారికి మేము శిక్షపై శిక్షను పెంచుతూ పోతాము.[108] వారి దురాగతాలకు ఫలితం అది.

الَّذِينَ كَفَرُوا وَصَدُّوا عَنْ سَبِيلِ اللَّهِ زِدْنَاهُمْ
عَذَابًا فَوْقَ الْعَذَابِ بِمَا كَانُوا يُفْسِدُونَ ﴿٨٨﴾

**89** ఆ రోజు మేము ప్రతి సమాజంలో నుంచీ వారిపై ఒక సాక్షిని నిలబెడతాము. మరి (ఓ ప్రవక్తా!) నిన్ను వారందరిపై సాక్షిగా తీసుకువస్తాము.[109] మేము నీపై ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. అందులో ప్రతి విషయం విశదీకరించబడింది.[110] విధేయత చూపేవారికి (ముస్లింలకు) అది మార్గదర్శకం, కారుణ్యం, శుభవార్త.

وَيَوْمَ نَبْعَثُ فِي كُلِّ أُمَّةٍ شَهِيدًا عَلَيْهِمْ مِنْ
أَنْفُسِهِمْ وَجِئْنَا بِكَ شَهِيدًا عَلَى هَؤُلَاءِ ۚ
وَنَزَّلْنَا عَلَيْكَ الْكِتَابَ تِبْيَانًا لِكُلِّ شَيْءٍ
وَهُدًى وَرَحْمَةً وَبُشْرَى لِلْمُسْلِمِينَ ﴿٨٩﴾

---

కూడా. ఉదాహరణకు : "మీరు మమ్మల్ని పూజిస్తూ ఉండేవారన్న సంగతి మాకు బొత్తిగా తెలియదు. ఈ విషయంలో మీకూ – మాకూ మధ్య సాక్షిగా అల్లాహ్ చాలు" అని వారంటారు (యూనుస్ – 29). (ఇంకా చూడండి – అల్ అహ్ఖాఫ్-5,6; మర్యమ్-81, 82; అన్కబూత్ – 25; కహఫ్ – 52). అల్లాహ్‌కు భాగస్వాములుగా తమను కల్పించమని తామెన్నడూ వారికి చెప్పలేదన్నది వారి ఉద్దేశం కావచ్చు! ఒకవేళ ఆ చిల్లర దైవాలు చెట్టుపుట్టలు, రాళ్లు రప్పలై ఉంటే అల్లాహ్ వాటికి మాట్లాడేశక్తిని ప్రసాదిస్తాడు. అవి తమ పూజారుల పూజలను త్రోసిపుచ్చుతాయి. ఒకవేళ వారు షైతానులు, జిన్నాతులు అయి ఉంటే అవి మాట్లాడతాయన్న విషయంలో సందేహమే లేదు. ఒకవేళ వారు ప్రజలు పూజించే, మొక్కుబడులు చెల్లించే, శ్రద్ధాభక్తుల నివాళిని ఘటించే పుణ్యపురుషులు, ఔలియాలు అయి ఉంటే అల్లాహ్ మహ్షర్ మైదానంలోనే వారికి ఆ పూజలతో ఎలాంటి సంబంధం లేదని నిరూపించేసి అలా పూజించేవారిని నరకంలో పడవేస్తాడు. దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహిస్సలాం)ను ఆరాధ్య దైవంగా చేసుకున్న వారికి పట్టిన గతేమిటో అల్ మాయిద సూరా చివర్లో ప్రస్తావనకు రానే వచ్చింది.

108. స్వర్గంలో ప్రవేశించిన విశ్వాసులలో వివిధ అంతస్తులున్నట్లే నరకాగ్నిలోకి ప్రవేశించిన అవిశ్వాసులలో కూడా తేడాలుంటాయి. తాము అపమార్గం పాలైంది గాకుండా ఇతరుల్ని కూడా అపమార్గం పట్టించిన వారికి విధించబడే శిక్ష మరింత అధికంగా ఉంటుంది.

109. ప్రతి ప్రవక్తా తన అనుచర సమాజానికి సాక్షిగా ఉంటాడు. అంతిమ దైవప్రవక్త (సఅసం) మరియు ఆయన అనుచర సమాజ సభ్యులు ప్రవక్తలందరి విషయంలో సాక్షులుగా ఉంటారు. ఈ ప్రవక్తలందరూ సత్యవంతులనీ, వారు దైవసందేశాన్ని ప్రజలకు అందజేశారని సాక్ష్యం పలుకుతారు (సహీహ్ బుఖారీ – నిసా సూరా వ్యాఖ్యానం).

110. గ్రంథం అంటే దైవగ్రంథం మరియు దైవప్రవక్త (స) వారి వివరణలు (హదీసులు). తన ప్రవచనాలను కూడా దైవప్రవక్త (స) 'దైవగ్రంథం' గా ఖరారు చేశారు. అసీఫ్ తదితర వృత్తాంతాలలో కూడా ఈ సంగతి ఉంది (చూడండి: సహీహ్ బుఖారీ – కితాబుల్ ముహారిబీన్). 'ప్రతి విషయం' అంటే గతానికి, భవిష్యత్తుకు సంబంధించిన సమాచారాలన్నమాట. వాటిని గురించి తెలుసుకోవటం అవసరం. దానివల్ల ఎంతో ప్రయోజనం కూడా కలుగుతుంది. అలాగే ధర్మాధర్మాల వివరాలు, ఇంకా ప్రపంచంలోనూ పరలోకంలోనూ మనిషికి అవసరమైన విషయాలన్నీ కూడా ఇందులోకి వచ్చేస్తాయి. ఖుర్ఆన్, హదీసులు – రెండింటిలోనూ ఈ విషయాలన్నీ స్పష్టపరచబడ్డాయి.

90 అల్లాహ్ న్యాయం చేయమనీ, ఉపకారం (ఇహ్సాన్) చేయమనీ, బంధువుల హక్కులను నెరవేర్చమనీ ఆజ్ఞాపిస్తున్నాడు. ఇంకా – నీతిబాహ్యమైన పనుల నుండీ, చెడుల నుండీ, దౌర్జన్యం నుండీ ఆయన ఆపుతున్నాడు.[111] మీరు గుణపాఠం గ్రహించటానికి ఆయన స్వయంగా మీకు ఉపదేశిస్తున్నాడు.

إِنَّ ٱللَّهَ يَأْمُرُ بِٱلْعَدْلِ وَٱلْإِحْسَٰنِ وَإِيتَآئِ ذِى ٱلْقُرْبَىٰ وَيَنْهَىٰ عَنِ ٱلْفَحْشَآءِ وَٱلْمُنكَرِ وَٱلْبَغْىِ ۚ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُونَ ﴿٩٠﴾

111. (1) అరబీలో **'అద్ల్'** అనే పదం ఉంది. **'అద్ల్'** అంటే న్యాయం, సమత్వం, సమభావం అనే అర్థాలు వస్తాయి. అయినవారైనా, కానివారైనా అందరిపట్ల న్యాయంగా ప్రవర్తించాలి. ఒకరితో ఉన్న శత్రుత్వం, కక్ష మూలంగా లేక ఒకరిపట్ల గల ప్రేమ, ఆప్యాయత మూలంగా 'న్యాయం' కోరే మూలాంశాలను విడనాడరాదు. ఎట్టి పరిస్థితిలోనూ న్యాయం చేయాలి. అలాగే మనిషి సమత్వం, సమతూకాల నుండి జారిపోకూడదు. దురభిమానంతో, రాగద్వేషాలతో ఒక వైపుకు మొగ్గి పోకూడదు. ఆశ్రిత పక్షపాతానికి ఆస్కారమివ్వకూడదు. 'అద్ల్'కు మరో అర్థం మధ్యేమార్గం (ఏతిదాల్). అంటే మనిషి ఏ వ్యవహారంలోనయినా మధ్యేమార్గాన్ని వీడి కుడిఎడమల అతివాదాలకు లోనవకూడదు. ఆఖరికి ధర్మావలంబన విషయంలో కూడా అతడు ఈ సూత్రానికి కట్టుబడి ఉండాలి. అంటే ధర్మంలో హెచ్చుతగ్గులు చేయకూడదు. ఏదేని అంశంలో మితిమీరిన అభిమానంతో అతిశయిల్లకూడదు. లేనిపోని కొత్త అంశాలను ధర్మంలో ప్రవేశపెట్టకూడదు. ధర్మంలో లోటు కనబరచినా, అతిశయిల్లినా న్యాయం, సమత్వం, సమతౌల్యం దెబ్బతింటాయి.

(2) ఇక **'ఇహ్సాన్'** గురించి–ఇహ్సాన్ అంటే ఉత్తమంగా వ్యవహరించటం, మన్నింపుల వైఖరిని అవలంబించటం – అని ఒక అర్థం ఉంది. అలాగే న్యాయంగా ఇవ్వవలసిన దానికన్నా ఎక్కువ ఇవ్వటం; మేలు చేయటమే కాక, అత్యుత్తమ రీతిలో చేయటం అన్న అర్థాలు కూడా వస్తాయి. ఉదాహరణకు: ఒక వ్యక్తికి వంద రూపాయల వేతనం ఇస్తానని మాటిచ్చి, నూట పది లేక నూట ఇరవై ఇస్తే అది ఇహ్సాన్ (మేలు, ఉపకారం)గా పరిగణించబడుతుంది. అతనికి ఇవ్వవలసిన వందరూపాయలు అతని హక్కు. దాన్ని మీరు ఇస్తే న్యాయం చేసినట్టు. అంతకుమించి ఇస్తే అది ఉపకారం (ఇహ్సాన్).

న్యాయం ద్వారా సమాజంలో శాంతీ సుస్థిరతలు నెలకొంటాయి. అయితే ఉపకారం ద్వారా అంతరాల అగాధాలు పూడుకుంటాయి. హృదయాలు హత్తుకుంటాయి. సత్సంబంధాలు పెంపొందుతాయి. ఆత్మీయత ఆప్యాయతలు వెల్లివిరుస్తాయి. అలాగే మనిషి తాను విధిగా చేయవలసిన ఆరాధనలను నెరవేరిస్తే అతను అల్లాహ్ హక్కును నెరవేర్చిన వాడవుతాడు. అంతకు మించి అతను స్వచ్ఛంద (నవాఫిల్) ఆరాధనలు కూడా చేస్తే అది దైవసామీప్యానికి, దైవప్రీతికి మరింత దోహదకారి అవుతుంది.

"ఇహ్సాన్'కు ఇంకో అర్థం ఏదేని పనిని అత్యుత్తమ రీతిలో నిర్వర్తించటం. ఆరాధనలో ఏకాగ్రతను పొందటం, ధర్మాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకించి, నిష్కల్మషమైన మనసుతో ఆరాధించటం. అందుకే హదీసులో ఇలా అనబడింది: "మీరు అల్లాహ్‌ను చూస్తున్నట్లుగానే ఆరాధించండి."

(3) మూడవది **'ఈతాయి జిల్ ఖుర్బా'**. అంటే బంధువుల హక్కును ఇవ్వటం, వారికి సహాయం చేయటం అనే అర్థాలు వస్తాయి. హదీసులో ఇది **'సిలా రహ్మీ'**గా అభివర్ణించబడింది. ఈ హక్కు గురించి హదీసులో పదే పదే నొక్కి వక్కాణించటం జరిగింది. న్యాయం, ఉపకారాల తరువాత బంధువుల హక్కు గురించి ప్రత్యేకంగా నొక్కి పలకటాన్ని బట్టి దీనికి గల ప్రాముఖ్యం ఎటువంటిదో బోధపడుతోంది.

ఇవి మూడూ చేయవలసిన పనులు. ఇక చేయకూడని పనులు మరో మూడు ఉన్నాయి. అవేమంటే,

(1) **'ఫహ్షావున్'** : అంటే నీతిబాహ్యమైన పనులు. సిగ్గుమాలిన కార్యాలు. నేడు నీతిబాహ్యత సమాజంలో పెచ్చరిల్లింది. పైగా దానికి నాగరికత, ప్రగతి, కళ, సంస్కృతి అనే అందమైన పేర్లతో పిలవటం జరుగుతోంది. 'వినోద సామగ్రి' అనే పేరుతో దానికి లైసెన్సు ఇవ్వటం జరుగుతోంది. అయితే ఒక చెడ్డ వస్తువుకు అందమైన లేబిల్ తగిలించినంత మాత్రాన దాని గుణం మారిపోదు. అందుకే ఇస్లామీయ షరీయతు వ్యభిచారాన్ని, వ్యభిచారం వైపుకు దారితీసే

**91** మీరు పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు అల్లాహ్‌కు ఇచ్చిన మాటను నిలుపుకోండి. ప్రమాణాలను ఖరారు చేసుకున్న మీదట భంగపరచకండి. (ఎందుకంటే) మీరు అల్లాహ్‌ను మీ సాక్షిగా చేసుకున్నారు.[112] నిశ్చయంగా మీరు చేసేదంతా ఆయనకు తెలుసు.

وَأَوْفُوا بِعَهْدِ اللَّهِ إِذَا عَاهَدتُّمْ وَلَا تَنقُضُوا
الْأَيْمَانَ بَعْدَ تَوْكِيدِهَا وَقَدْ جَعَلْتُمُ اللَّهَ
عَلَيْكُمْ كَفِيلًا ۚ إِنَّ اللَّهَ يَعْلَمُ مَا تَفْعَلُونَ ﴿٩١﴾

**92** తన నూలును గట్టిగా వడికిన తరువాత, తనే స్వయంగా ముక్కలు ముక్కలుగా త్రెంచివేసిన[113] స్త్రీ మాదిరిగా అయిపోకండి. ఒక వర్గం మరో వర్గం కంటే మించిపోవాలన్న ఉద్దేశంతో[114] మీరు మీ ప్రమాణాలను పరస్పరం మోసగించుకునే సాధనాలుగా చేసుకుంటున్నారు.[115] అసలు విషయం ఏమిటంటే ఈ ప్రమాణం ద్వారా అల్లాహ్ మిమ్మల్ని పరీక్షిస్తున్నాడు. నిశ్చయంగా అల్లాహ్ ప్రళయ దినాన మీరు విభేదించుకునే విషయాలన్నింటినీ మీకు విడమరచి చెబుతాడు.

وَلَا تَكُونُوا كَالَّتِي نَقَضَتْ غَزْلَهَا مِن بَعْدِ قُوَّةٍ
أَنكَاثًا تَتَّخِذُونَ أَيْمَانَكُمْ دَخَلًا بَيْنَكُمْ أَن
تَكُونَ أُمَّةٌ هِيَ أَرْبَىٰ مِنْ أُمَّةٍ ۚ إِنَّمَا يَبْلُوكُمُ
اللَّهُ بِهِ ۚ وَلَيُبَيِّنَنَّ لَكُمْ يَوْمَ الْقِيَامَةِ مَا كُنتُمْ
فِيهِ تَخْتَلِفُونَ ﴿٩٢﴾

---

పనులను, విశృంఖలత్వాన్ని, అశ్లీలాన్ని, ఫేషన్ షోలను, స్త్రీ పురుషులు విచ్చలవిడిగా కలిసి తిరిగే వాతావరణాన్ని, ఇంకా ఇతరత్రా చెడు పోకడలను 'నీతిబాహ్యత'గా ఖరారు చేసింది. వీటికి ఎన్ని అందమైన పేర్లు పెట్టుకున్నప్పటికీ పాశ్చాత్య ప్రపంచం నుంచి దిగుమతి చేసుకున్న ఈ చెడుగులు ధర్మసమ్మతం కాజాలవు.

(2) **మున్కర్ :** షరీయతు అధర్మంగా ఖరారు చేసిన పనులన్నీ దీని క్రిందికి వస్తాయి.

(3) **బఘ్యున్ (بَغْي) :** అంటే దౌర్జన్యం, అక్రమం, దురాగతం, విపరీతం, అన్యాయం – ఇత్యాది దౌష్ట్యాలకు ఒడిగట్టడం. బంధుత్వ సంబంధాలను త్రెంచటం, దౌర్జన్యానికి ఒడిగట్టడం – ఇవి రెండూ ఎలాంటి అపరాధాలంటే వాటి మూలంగా అల్లాహ్ ఆగ్రహిస్తాడనీ, వాటికి పాల్పడినవారికి ప్రపంచంలో కూడా త్వరితగతిన శిక్షపడే అవకాశముంటుందని హదీసు ద్వారా తెలుస్తోంది (ఇబ్నుమాజా – కితాబుజ్జుహ్ద్, దౌర్జన్యాల అధ్యాయం).

112. **ఖసమ్** (ప్రమాణం) : పరస్పరం ఒప్పందాలు, ఒడంబడికలు చేసుకున్నప్పుడు వాటికి కట్టుబడి ఉంటామని ప్రమాణం చేసి మరీ చెబుతారు. ఇదొక రకమైన ప్రమాణం. ప్రమాణాలలో మరో రకం ఏదంటే మనిషి తనంతట తానుగా ఒట్టేసి చెబుతాడు – నేను ఫలానా పనిని చేస్తాననో లేక చేయననో. ఈ ఆయతులో ప్రస్తావించబడిన ప్రమాణం మొదటి కోవకు చెందినది. మీరు ప్రమాణం చేసి అల్లాహ్‌ను సాక్షిగా చేసుకున్నారు. కాబట్టి మీరు దాన్ని భంగపరచరాదు. చేసిన బాసకు కట్టుబడి ఉండాలి. ఆడిన మాటను తప్పకూడదు.

ఇక రెండవ కోవకు చెందిన ప్రమాణం గురించి హదీసులో ఏమనబడిందంటే, "ఏ వ్యక్తయినా ఏదేని విషయంలో ప్రమాణం చేసేసి, మరో విషయంలో మేలు ఉందని తలపోసి (అంటే ప్రమాణానికి విరుద్ధంగా చేయటంలో ఎక్కువ మేలుందని భావించి) నప్పుడు మేలుతో కూడుకున్న పనిని అతను నెరవేర్చాలి. అయితే ప్రమాణ భంగం చేసినందుకు పరిహారం చెల్లించాలి" (సహీహ్ ముస్లిం – హ.నెం.1272). దైవప్రవక్త (సఅసం) ఆచరణ కూడా ఇదే (సహీహ్ బుఖారీ – హ.నెం.6623; ముస్లిం – హ.నెం.1269).

113. గట్టిగా ప్రమాణం చేసిన తరువాత దాన్ని భంగపరచటం కూడా ఇటువంటిదే. నూలు వడికి స్వయంగా త్రెంపేసిన స్త్రీని ఒక ఉదాహరణగా చూపటం జరిగింది.

114. **"అర్బా"** (أَرْبَىٰ) అనే పదం ఇక్కడ 'అక్సర్' అనే అర్థంలో ప్రయోగించబడింది. అంటే సంఖ్యాపరంగా అతి ఎక్కువగా ఉండటం. ఒకప్పుడు మీరు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పుడు ప్రమాణం చేసి, ఇప్పుడు మీ సంఖ్యాబలాన్ని

**93** అల్లాహ్ గనక తలచుకుంటే మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు. కాని ఆయన తాను తలచిన వారిని అపమార్గా నికి లోనుచేస్తాడు, తాను తలచిన వారికి సన్మార్గం చూపుతాడు. మీరు చేస్తున్న పనులన్నింటి గురించి మీరు తప్పకుండా ప్రశ్నించ బడతారు.

وَلَوْ شَآءَ اللّٰهُ لَجَعَلَكُمْ اُمَّةً وَّاحِدَةً وَّلٰكِنْ
يُّضِلُّ مَنْ يَّشَآءُ وَيَهْدِيْ مَنْ يَّشَآءُ ؕ
وَلَتُسْـَٔلُنَّ عَمَّا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿٩٣﴾

**94** మీరు మీ ప్రమాణాలను పరస్పరం మోసగించుకోవటానికి సాధనాలుగా చేసుకోకండి. (మీ ధోరణి గనక ఇలాగే ఉంటే) నిలదొక్కుకున్న మీదట (మీ) అడుగులు తడబడతాయి. మీరు కఠినమైన శిక్షను చవిచూడవలసి ఉంటుంది. ఎందుకంటే మీరు అల్లాహ్ మార్గాన అడ్డు తగిలారు. మీకు పెద్ద శిక్షపడుతుంది.[116]

وَلَا تَتَّخِذُوْٓا اَيْمَانَكُمْ دَخَلًاۢ بَيْنَكُمْ فَتَزِلَّ
قَدَمٌۢ بَعْدَ ثُبُوْتِهَا وَتَذُوْقُوا السُّوْٓءَ بِمَا صَدَدْتُّمْ
عَنْ سَبِيْلِ اللّٰهِ ۚ وَلَكُمْ عَذَابٌ عَظِيْمٌ ﴿٩٤﴾

**95** మీరు అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని కొద్దిపాటి మూల్యానికి అమ్మివేయకండి. గుర్తుంచుకోండి! మీరు గనక తెలుసుకోగలిగితే అల్లాహ్ వద్ద ఉన్నదే మీ కొరకు శ్రేయోదాయకమైనది.

وَلَا تَشْتَرُوْا بِعَهْدِ اللّٰهِ ثَمَنًا قَلِيْلًا ؕ اِنَّمَا
عِنْدَ اللّٰهِ هُوَ خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ﴿٩٥﴾

**96** మీ దగ్గర ఉన్నదంతా నశించేదే. అల్లాహ్ వద్ద ఉన్నదే మిగిలి ఉండేది. ఓర్పు వహించేవారికి మేము వారి సదా చరణలకుగాను మంచి ప్రతిఫలాన్ని తప్పక ప్రసాదిస్తాము.

مَا عِنْدَكُمْ يَنْفَدُ وَمَا عِنْدَ اللّٰهِ بَاقٍ ؕ
وَلَنَجْزِيَنَّ الَّذِيْنَ صَبَرُوْٓا اَجْرَهُمْ بِاَحْسَنِ
مَا كَانُوْا يَعْمَلُوْنَ ﴿٩٦﴾

**97** సత్కార్యాలు చేసేవారు పురుషులైనా, స్త్రీలయినా– విశ్వాసులై ఉంటే మేము వారికి అత్యంత పవిత్రమైన జీవితాన్ని ప్రసాది స్తాము.[117] వారి సత్కర్మలకు బదులుగా సత్ఫలితాన్ని కూడా మేము వారికి తప్పకుండా ఇస్తాము.

مَنْ عَمِلَ صَالِحًا مِّنْ ذَكَرٍ اَوْ اُنْثٰى وَهُوَ مُؤْمِنٌ
فَلَنُحْيِيَنَّهٗ حَيٰوةً طَيِّبَةً ۚ وَلَنَجْزِيَنَّهُمْ اَجْرَهُمْ
بِاَحْسَنِ مَا كَانُوْا يَعْمَلُوْنَ ﴿٩٧﴾

---

చూసుకుని గర్వాంధకారంతో ప్రమాణాన్ని భంగపరచటం అవివేకం. దీనివలన మీ మనసులు కుదుటపడవు. ఒకప్పుడు మీరు బలహీనులుగా ఉన్నప్పటికీ మరో వర్గంతో చేసుకున్న ఒడంబడిక వల్ల మీరు నిశ్చింతగా ఉండగలిగే వారు. కాని మీరు ఇప్పుడు ఆడిన మాటను తప్పి కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. అజ్ఞానకాలంలో నైతిక దివాలాకోరుతనం వల్ల వారు పదే పదే ప్రమాణాలను త్రెంచి చిక్కుల్లో పడిపోయేవారు. ఇలాంటి నైతిక అధోగతికి దూరంగా ఉండాలని ముస్లింలకు తాకీదు చేయటం జరిగింది.

115. అంటే ఎదుటివారికి దగా, మోసం చేసే సంకల్పంతో ప్రమాణాన్ని ఆశ్రయించకండి.

116. వాగ్దాన భంగానికి పాల్పడవద్దని మరోసారి ముస్లింలకు తాకీదు చేయటం జరిగింది. ఈ నైతిక రుగ్మత మూలంగా మీ అడుగులు తడబడే ప్రమాదం ఉందనీ, మీలోని ఈ చంచల స్వభావాన్ని చూసి అన్యులు మీకు మరింత దూరం అవుతారనీ, ఒకవేళ అదేగనక జరిగితే దైవమార్గంలోకి రాకుండా ప్రజలను అడ్డుకున్న పాపం మీ నెత్తిమీద పడుతుందని కూడా ముస్లింలను హెచ్చరించటం జరిగింది. **ఐమాన్ :** ఇది **'యమీన్'**కు బహువచనం. యమీన్ అంటే ప్రమాణం అని అర్థం. ఇక్కడ 'ప్రమాణం' అంటే దైవ ప్రవక్త(స) సమక్షంలో చేసే ప్రతిజ్ఞ (బైత్) అని మరి కొంతమంది పండితులు భావించారు. అంటే ప్రవక్తకు ఇచ్చిన మాటను తప్పి ధర్మభ్రష్టులు కారాదన్న భావంలో ఈ వాక్యాన్ని

**98** (ఓ ముహమ్మద్!) ఖుర్ఆన్ పఠనానికి ఉపక్రమించినపుడు శాపగ్రస్తుడైన షైతాను బారి నుంచి అల్లాహ్ శరణు వేడుకో.[118]

فَإِذَا قَرَأْتَ الْقُرْاٰنَ فَاسْتَعِذْ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ﴿٩٨﴾

**99** విశ్వసించి, తమ ప్రభువుపైనే భారం మోపిన వారిపై వాడికి ఎలాంటి అధికారం ఉండదు.

إِنَّهٗ لَيْسَ لَهٗ سُلْطٰنٌ عَلَى الَّذِيْنَ اٰمَنُوْا وَعَلٰى رَبِّهِمْ يَتَوَكَّلُوْنَ ﴿٩٩﴾

**100** అయితే వాడితో స్నేహం చేసి, వాడిని అల్లాహ్‌కు భాగ స్వామిగా నిలబెట్టే వారిపై మాత్రం వాడి అధికారం నడుస్తుంది.

إِنَّمَا سُلْطٰنُهٗ عَلَى الَّذِيْنَ يَتَوَلَّوْنَهٗ وَالَّذِيْنَ هُمْ بِهٖ مُشْرِكُوْنَ ﴿١٠٠﴾

**101** మేము ఒక ఆయతు స్థానంలో మరో ఆయతును మార్చి నప్పుడు "నువ్వే కల్పిస్తున్నావు" అని వారంటారు. వాస్తవానికి తాను అవతరింపజేసిన దానిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు. అయితే వారిలో అత్యధికులకు అసలు విషయం తెలియదు.[119]

وَإِذَا بَدَّلْنَاۤ اٰيَةً مَّكَانَ اٰيَةٍ ۙ وَّاللّٰهُ أَعْلَمُ بِمَا يُنَزِّلُ قَالُوْۤا إِنَّمَاۤ أَنْتَ مُفْتَرٍ ۭ بَلْ أَكْثَرُهُمْ لَا يَعْلَمُوْنَ ﴿١٠١﴾

**102** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "విశ్వసించిన వారికి నిలకడను వొసగటానికి,[120] ముస్లింలకు సన్మార్గం చూపటానికీ, వారికి శుభవార్తను వినిపించటానికీ[121] నీ ప్రభువు వద్ద నుంచి పరిశుద్ధాత్మ (జిబ్రయీల్) దీన్ని సత్యసమేతంగా అవతరింప జేశాడు."[122]

قُلْ نَزَّلَهٗ رُوْحُ الْقُدُسِ مِنْ رَّبِّكَ بِالْحَقِّ لِيُثَبِّتَ الَّذِيْنَ اٰمَنُوْا وَهُدًى وَّبُشْرٰى لِلْمُسْلِمِيْنَ ﴿١٠٢﴾

---

తీసుకున్నారు. ఒకవేళ మీరు గనక ఈ అఘాయిత్యానికి పాల్పడితే మిమ్మల్ని చూసి ఇతరులు కూడా ఇస్లాం స్వీకరించకుండా ఆగిపోతారనీ, దాని మూలంగా మీరు రెట్టింపు శిక్షకు పాత్రులవుతారని చెప్పటం జరిగింది (ఫత్‌హుల్ ఖదీర్).

117. పవిత్ర జీవితం (మంచి జీవితం) అంటే ప్రాపంచిక జీవితమే. పరలోక జీవితం గురించిన ప్రస్తావన దీని తరువాతి వాక్యంలో చేయబడింది. దీని భావం ఏమిటంటే విశ్వసించి, దైవభక్తితో పరిశుద్ధ జీవితం గడిపే వారికి ప్రపంచంలో లభించే శాంతి, తృప్తి, మాధుర్యం, మనోనిబ్బరం ఒక అవిశ్వాసికి, అవిధేయునికి ప్రాప్తం కావు. పైగా అతను ఒకింత కలవరంతో, గుండె దడతో బ్రతుకుతూ ఉంటాడు. ఆ మాటే దివ్య ఖుర్ఆన్‌లో ఈ విధంగా చెప్పబడింది: "ఎవడు మా ధ్యానంపట్ల విముఖత చూపాడో వాడికి బ్రతుకు ఇరుకైపోతుంది (దుర్భరం అయిపోతుంది)" (తాహా-124).

118. ఈ విషయం దైవప్రవక్త (స) నుద్దేశ్యించి చెప్పబడినప్పటికీ, యావత్తు అనుచర సమాజానికి ఇది వర్తిస్తుంది. అంటే ఖుర్ఆన్ పారాయణాన్ని మొదలెట్టినప్పుడల్లా "అవూజుబిల్లాహి మినష్షయితా నిర్రజీమ్" పఠించాలి.

119. ఒక ఆజ్ఞను రద్దు చేసి మరో ఆజ్ఞను దాని స్థానంలో ప్రవేశపెట్టడంలోని ఔచిత్యం ఏమిటో అది అల్లాహ్‌కు బాగా తెలుసు. మానవ ప్రయోజనాల దృష్ట్యా ఆయన ఆ మేరకు మార్పులు తీసుకువస్తాడు. ఈ విషయాన్ని సాకుగా తీసుకుని అవిశ్వాసులు, "ఓ ముహమ్మద్ (స)! నువ్వు నీ ఇష్టానుసారం దైవవచనాలకు నీ సొంత భాష్యం జోడిస్తున్నావు" అని అనటం ఎంతమాత్రం తగదు. ఎందుకంటే ఇందలి ఉచితానుచితాల గురించి, పరమ రహస్యాల గురించి వారికేమీ తెలీదు. ఏ ఆదేశం ఎప్పుడు రద్దుపరచాలో, మరే ఆదేశాన్ని ప్రవేశపెట్టాలో అల్లాహ్‌కు బాగా తెలుసు (మరిన్ని వివరాలకై అల్ బఖర సూరా 106, 107వ ఆయతులకు వివరణను చూడండి).

103 "అతనికి ఒక మనిషి నేర్పుతున్నాడ"[123] ని ఈ అవిశ్వాసులు పలకటం మాకు బాగా తెలుసు. వాస్తవానికి వారు ఎవరిని దృష్టిలో పెట్టుకుని అలా అంటున్నారో అతని భాష అరబ్బేతర (అజమీ) భాష. కాగా; ఈ ఖుర్ఆన్ స్వచ్ఛమైన, స్పష్టమైన అరబీ భాషలో ఉంది.[124]

وَلَقَدْ نَعْلَمُ اَنَّهُمْ يَقُوْلُوْنَ اِنَّمَا يُعَلِّمُهٗ بَشَرٌ ؕ لِسَانُ الَّذِيْ يُلْحِدُوْنَ اِلَيْهِ اَعْجَمِيٌّ وَّهٰذَا لِسَانٌ عَرَبِيٌّ مُّبِيْنٌ ﴿103﴾

104 అల్లాహ్ ఆయతులను విశ్వసించని వారికి అల్లాహ్ తరఫున సన్మార్గం లభించదు. వారి కోసం బాధాకరమైన శిక్ష ఉంది.

اِنَّ الَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ بِاٰيٰتِ اللّٰهِ ۙ لَا يَهْدِيْهِمُ اللّٰهُ وَلَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿104﴾

105 అల్లాహ్ ఆయతులపై విశ్వాసం లేనివారు మాత్రమే అబద్ధాలను కల్పిస్తారు. వారే అసలు అబద్ధాలకోరులు.[125]

اِنَّمَا يَفْتَرِي الْكَذِبَ الَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ بِاٰيٰتِ اللّٰهِ ۚ وَاُولٰٓئِكَ هُمُ الْكٰذِبُوْنَ ﴿105﴾

120. దేనిని స్థిరపరచినా, మరి దేనిని రద్దు పరచినా అది ప్రభువు సమ్మతితోనే జరుగుతుంది. ఈ సంగతిని విశ్వాసులు గ్రహించి తృప్తి చెందుతారు. తద్వారా వారి పాదాలకు స్థిరత్వం లభిస్తుంది. వారి విశ్వాసం మరింత దృఢమవుతుంది.

121. దివ్య ఖుర్ఆన్ ముస్లింలకు మార్గదర్శకం మరియు శుభవార్త. ఎందుకంటే ఖుర్ఆన్ కూడా ఆకాశం నుంచి కురిసే వర్షం లాంటిదే. ఆ వర్షపు నీరును పీల్చిన కొన్ని నేలలు బాగా మొలకెత్తి, పండుతాయి. మరికొన్ని నేలల్లో ముళ్లచెట్లు తప్ప మరేమీ మొలకెత్తవు. విశ్వాసి హృదయం కూడా పరిశుద్ధమైనది, నిర్మలమైనది. దివ్య ఖుర్ఆన్ శుభం వల్ల, విశ్వాసజ్యోతి వల్ల అతని ఆంతర్యం ప్రకాశవంతమవుతుంది. కాని అవిశ్వాసి హృదయం చవుడు నేల వంటిది. అది తిరస్కారం, మార్గవిహీనతలతో నిండి ఉంటుంది. దివ్య ఖుర్ఆన్ భావ స్రవంతికి అది పులకించదు. సస్యశ్యామలంగా మారదు.

122. ఈ ఖుర్ఆన్ ముహమ్మద్ (సఅసం) స్వీయకల్పన కాదు. పైగా దీన్ని హజ్రత్ జిబ్రీల్ (అలైహిస్సలాం) వంటి పరిశుద్ధ దూత, సత్యసమేతంగా – తన ప్రభువు తరఫు నుంచి తీసుకువచ్చాడు. "దీనిని తీసుకొని విశ్వసనీయమైన ఆత్మ (జిబ్రీల్) నీ హృదయంపై అవతరించింది" అని వేరొకచోట చెప్పబడింది (షుఅరా –193, 194).

123. ఆ కాలంలో తౌరాతు, ఇంజీలు గ్రంథాల గురించి తెలిసిన కొంతమంది బానిసలుండేవారు. వారు క్రైస్తవులు, యూదులు. తరువాత వారు ఇస్లాం స్వీకరించారు. వారు అరబీ మాట్లాడేవారు. కాని వారి భాష స్వచ్ఛమయింది కాదు. ఆ బానిసలలోని ఒకానొక వ్యక్తి ముహమ్మద్(స)కు ఖుర్ఆన్ బోధిస్తున్నాడని మక్కాకు చెందిన ముష్రిక్కులు నిందించేవారు.

124. ఎవరెవరిని ఉద్దేశ్యించి వారు ఈ నింద మోపుతున్నారో వారికసలు స్పష్టంగా అరబీ మాట్లాడటమే రాదు. అదే సమయంలో ఖుర్ఆన్లోని అరబీ భాషను చూడండి. విషయ స్పష్టతలోనూ, భాషలోనూ, భావంలోనూ దాని శైలి అనుపమమైనది. అందులో ఉన్న సూరాలను పోలిన ఒక్క సూరాను కూడా ఎవరూ రచించి తేలేకపోయారాయె! మరలాంటప్పుడు వచ్చీరాని అరబీలో మాట్లాడే సామాన్యులు ఇంతటి అద్భుతమైన గ్రంథాన్ని ముహమ్మద్ (స)కు ఎలా నేర్పుతారు?

ఆనాడు అరేబియాలో స్వచ్ఛమైన అరబీ భాషలో అనర్గళంగా మాట్లాడలేనివారిని 'అజమీ' (మూగవాడు, భాష రానివాడు) అని అనేవారు. అరబ్బేతర వ్యక్తిని కూడా అజమీగా వ్యవహరించేవారు. అరబ్బేతర భాషలు కూడా అరబీతో ఏవిధంగానూ పోటీపడలేకపోయేవి.

125. మా ప్రవక్త (సఅసం) విశ్వాసుల నాయకుడు. సత్యసంధుడు. లేని విషయాన్ని అతడు ఎందుకు చెబుతాడు? అసలు వారే అబద్ధాలకోరులు. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ దైవగ్రంథం కావటం పట్ల వారు సంశయంలోపడ్డారు. పైపెచ్చు సత్యవంతుడైన మా ప్రవక్తపైనే అభాండాలు మోపడానికి సిద్ధమయ్యారు.

**106** ఎవరయితే విశ్వసించిన తరువాత అల్లాహ్ పట్ల తిరస్కార వైఖరికి పాల్పడతాడో – కాని బలవంతం చేయబడి (తిరస్కారాన్ని ప్రకటిస్తే), అదే సమయంలో అతని హృదయం విశ్వాసంపై స్థిరంగా ఉంటే[126] (అది వేరే విషయం) – అలాగాకుండా ఎవరైనా హృదయ పూర్వకంగా తిరస్కార వైఖరికి పాల్పడితే మాత్రం వారిపై దైవాగ్రహం పడుతుంది. అలాంటి వారి కోసమే చాలా పెద్ద శిక్ష[127] ఉంది.

مَنْ كَفَرَ بِاللّٰهِ مِنْۢ بَعْدِ اِيْمَانِهٖۤ اِلَّا مَنْ اُكْرِهَ وَقَلْبُهٗ مُطْمَىِٕنٌّۢ بِالْاِيْمَانِ وَلٰكِنْ مَّنْ شَرَحَ بِالْكُفْرِ صَدْرًا فَعَلَيْهِمْ غَضَبٌ مِّنَ اللّٰهِۚ وَلَهُمْ عَذَابٌ عَظِيْمٌ ﴿106﴾

**107** ఎందుకంటే వారు పరలోకంకన్నా ప్రాపంచిక జీవితాన్ని ఎక్కువగా ప్రేమించారు. నిశ్చయంగా అల్లాహ్ అవిశ్వాసులకు సన్మార్గం చూపడు.[128]

ذٰلِكَ بِاَنَّهُمُ اسْتَحَبُّوا الْحَيٰوةَ الدُّنْيَا عَلَى الْاٰخِرَةِۙ وَاَنَّ اللّٰهَ لَا يَهْدِى الْقَوْمَ الْكٰفِرِيْنَ ﴿107﴾

**108** వారి హృదయాలపై, వారి చెవులపై, వారి కళ్లపై అల్లాహ్ ముద్ర వేసేశాడు. విస్మరణకు (పరధ్యానానికి) గురైన వారంటే వీరే.[129]

اُولٰٓىِٕكَ الَّذِيْنَ طَبَعَ اللّٰهُ عَلٰى قُلُوْبِهِمْ وَسَمْعِهِمْ وَاَبْصَارِهِمْۚ وَاُولٰٓىِٕكَ هُمُ الْغٰفِلُوْنَ ﴿108﴾

**109** పరలోకంలో వారు ఘోరంగా నష్టపోతారన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు.

لَا جَرَمَ اَنَّهُمْ فِى الْاٰخِرَةِ هُمُ الْخٰسِرُوْنَ ﴿109﴾

**110** మరెవరయితే బాధలు భరించిన తరువాత (దైవ మార్గంలో) వలసపోయారో, తర్వాత (అల్లాహ్ మార్గంలో) పోరాటం చేశారో, సహన స్థయిర్యాలను కనబరిచారో వారిని నీ ప్రభువు – వీటన్నింటి తరువాత – క్షమిస్తాడు, కరుణిస్తాడు.[130]

ثُمَّ اِنَّ رَبَّكَ لِلَّذِيْنَ هَاجَرُوْا مِنْۢ بَعْدِ مَا فُتِنُوْا ثُمَّ جٰهَدُوْا وَصَبَرُوْۤاۙ اِنَّ رَبَّكَ مِنْۢ بَعْدِهَا لَغَفُوْرٌ رَّحِيْمٌ ﴿110﴾

126. ఏ వ్యక్తికయినా సత్య తిరస్కారం కోసం బలవంతం చేయగా అతను ప్రాణరక్షణ నిమిత్తం వాక్కు ద్వారా, కర్మ ద్వారా తిరస్కార (కుఫ్ర్) ప్రకటన చేసినప్పటికీ, అతని మనసు గనక విశ్వాసంపై స్థిరంగా ఉంటే అతను అవిశ్వాసి అవడు. అట్టి పరిస్థితిలో అతని భార్య అతన్నుంచి వేర్పడజాలదు. అవిశ్వాసానికి సంబంధించిన ఏ ఆదేశమూ అతనికి వర్తించదు. ఈ విషయంలో విద్వాంసులందరి మధ్యా ఏకాభిప్రాయం ఉందని ఖుర్తుబీ చెప్పారు (ఫత్‌హుల్ ఖదీర్).

127. ఇది ధర్మభ్రష్టత (ఇర్తిదాద్)కు ఒడిగట్టేవారికి లభించే శిక్ష. వారు దైవాగ్రహానికీ, పెద్ద శిక్షకు పాత్రులవుతారు. ప్రాపంచికంగా వారు హతమార్చబడతారని హదీసు ద్వారా విదితమవుతోంది (మరిన్ని వివరాల కోసం అల్ బఖరా సూరా 217, 256 ఆయతులకు వివరణను చూడండి).

128. విశ్వసించిన తరువాత అవిశ్వాస వైఖరికి (ధర్మభ్రష్టతకు) ఒడిగట్టడానికి గల కారణం ఇక్కడ పేర్కొనబడింది. ఒకటేమో, వారు ప్రాపంచిక వ్యామోహంలో దారుణంగా చిక్కుకుపోయారు. రెండోది : ఇంక వారు అల్లాహ్ దృష్టిలో సన్మార్గానికి యోగ్యులుగా మిగలలేదు.

129. ఎందుకంటే వారు హితబోధను వినరు, దైవ నిదర్శనాలను నిశిత దృష్టితో చూడరు. సత్యం వైపు పిలిచే అంశాలపై ఆలోచించరు. పైగా వారు ఏమరుపాటుకు, అజాగ్రత్తకు లోనై ఉన్నారు. తత్కారణంగా మార్గదర్శకత్వానికి సంబంధించిన మార్గాలన్నీ వారి కొరకు మూసుకుపోయాయి.

111 ఆ రోజు ప్రతి ఒక్కడూ తన ఆత్మ రక్షణ కోసం వాదులాడుతూ వస్తాడు.[131] అప్పుడు ప్రతి ఒక్కరికీ అతను చేసుకున్న కర్మల ప్రతిఫలమంతా ఇవ్వబడుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.[132]

يَوْمَ تَأْتِي كُلُّ نَفْسٍ تُجَادِلُ عَن نَّفْسِهَا وَتُوَفَّىٰ كُلُّ نَفْسٍ مَّا عَمِلَتْ وَهُمْ لَا يُظْلَمُونَ ﴿١١١﴾

112 అల్లాహ్ ఒక పట్నం ఉదాహరణను ఇస్తున్నాడు. ఆ పట్నం ఎంతో ప్రశాంతంగా, తృప్తిగా ఉండేది. దానికి అన్ని వైపుల నుంచీ పుష్కలంగా జీవనోపాధి లభించేది. మరి ఆ పట్నవాసులు అల్లాహ్ అనుగ్రహాలపై కృతఘ్నుత చూపగా, అల్లాహ్ వారి స్వయంకృతాలకు బదులుగా వారికి ఆకలి, భయాందోళనల రుచి చూపించాడు.[133]

وَضَرَبَ اللَّهُ مَثَلًا قَرْيَةً كَانَتْ آمِنَةً مُّطْمَئِنَّةً يَأْتِيهَا رِزْقُهَا رَغَدًا مِّن كُلِّ مَكَانٍ فَكَفَرَتْ بِأَنْعُمِ اللَّهِ فَأَذَاقَهَا اللَّهُ لِبَاسَ الْجُوعِ وَالْخَوْفِ بِمَا كَانُوا يَصْنَعُونَ ﴿١١٢﴾

130. మక్కాకు చెందిన బలహీన ముస్లింలనుద్దేశించి ఈ విధంగా అనబడింది. వారు ఇస్లాం స్వీకరించిన కారణంగా మక్కా అవిశ్వాసుల దౌర్జన్యాలకు గురయ్యారు. ఎట్టకేలకు వారికి దేశం విడిచి వెళ్ళవలసిందిగా ఆదేశించబడింది. వారు తమ ఆప్తులను, ఆస్తిపాస్తులను, ఇల్లూ వాకిలినీ వదలి అబిసీనియా, యస్రిబ్‌ల వైపుకు వలసపోయారు. తరువాత అవిశ్వాసులను ఎదుర్కొని పోరాడవలసి వచ్చినప్పుడు మగధీరుల్లా పోరాడారు. ఈ విధంగా వారు దైవమార్గంలో పెట్టబడిన పరీక్షలన్నింటిలోనూ మొక్కవోని సాహసాన్ని చూపి తమ నిష్కల్మష విశ్వాసాన్ని నిరూపించు కున్నారు. ఇంత చేసిన తరువాత కూడా ప్రభువు వారిని క్షమించకుండా, కరుణించకుండా ఉండటం అనేది ఎలా సంభవం? దీన్నిబట్టి తేలేదేమిటంటే దేవుని క్షమ, కరుణ కోసం విశ్వాసం (ఈమాన్) తోపాటు సదాచరణ (అమలె సాలెహ్) ఎంతయినా అవసరం. ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన ముహాజిర్లు కూడా విశ్వాసానికి, సదాచరణకు సంబంధించిన అత్యుత్తమమైన ఉదాహరణను నెలకొల్పారు. అందుకే దేవుడు వారిపట్ల ప్రసన్నుడయ్యాడు.

131. ప్రతి ఒక్కరికీ తమ స్వయానికి సంబంధించిన చింతే ఉంటుంది. ఎవరూ ఇంకొకరికి సహాయపడటానికి ముందుకు రారు. తండ్రిగానీ, కొడుకుగానీ, సోదరుడుగానీ, భార్యగానీ– ఎవరూ పలకరించే స్థితిలో ఉండరు. పైగా ఒండొకరి నుంచి పారిపోయే ప్రయత్నం చేస్తుంటారు. అన్న తన తమ్ముణ్ణి చూసి, బిడ్డలు తమ తల్లిదండ్రుల్ని చూసి, భర్త తన భార్యను చూసి పారిపోతుంటారు. "వారిలో ప్రతి ఒక్కరికీ ఆ రోజు తమను గురించి తప్ప ఇతరుల్ని గురించి పట్టించుకోలేని ఆపత్సమయం వస్తుంది" (అబస్ – 37).

132. అంటే మంచి పనులకు లభించవలసిన పుణ్యఫలాన్ని తగ్గించటం గానీ, చెడు పనులకు బదులుగా విధించవలసివున్న శిక్షను పెంచటం గానీ జరగదు. ఎవరికీ రవంత అన్యాయం కూడా జరగదు. చెడుకు ఎంత దుష్ఫలితం ఇవ్వబడాలో అంతే ఇవ్వబడుతుంది. అయితే పుణ్యకార్యానికి బదులుగా అల్లాహ్ పుణ్యఫలాన్ని తాను కోరినంతగా పెంచి ఇస్తాడు. తీర్పుదినాన విశ్వాసుల పట్ల అల్లాహ్ అవలంబించే దాక్షిణ్య వైఖరికి ఇదొక మచ్చుతునక. అల్లాహ్ మనందరినీ ఆ కోవలో చేర్చుగాక!

133. చాలామంది వ్యాఖ్యాతలు ఈ పట్నం మక్కా పట్టణం అయి ఉంటుందని భావించారు. ఒకప్పుడు మక్కా ప్రజల, వారి పరిసరాలలో నివసించే జనుల జీవన ప్రమాణాలు ఎలా ఉండేవో ఇందులో వివరించబడింది. అయితే వారి ధిక్కార వైఖరి కారణంగా దైవప్రవక్త (సఅసం) వారిని శపించారు : "ఓ అల్లాహ్! ముజర్ (తెగ)ను గట్టిగా పట్టుకో. హజ్రత్ యూసుఫ్ కాలంలో ఈజిప్టులో ఏర్పడిన దుర్భిక్షంలాంటి దుర్భిక్షానికి వీళ్ళను గురిచేయి" అని ప్రార్థించారు (బుఖారీ – 4821; ముస్లిం – 2156). పర్యవసానంగా అల్లాహ్ మక్కాలో శాంతిభద్రతల స్థానంలో భయోత్పాతాన్నీ, కలిమి స్థానంలో లేమిని సృష్టించాడు. తత్కారణంగా వారు బొమికలు, ఆకులు అలములు తిని జీవించాల్సినంత దుర్భర పరిస్థితి ఏర్పడింది.

**113** వారి వద్దకు స్వయంగా వారిలో నుంచే ఒక ప్రవక్త వచ్చాడు. అయినప్పటికీ వారతన్ని ధిక్కరించారు. ఫలితంగా శిక్ష వారిని పట్టుకున్నది.[134] ఎందుకంటే వారు పరమ దుర్మార్గులుగా ఉండేవారు.

وَلَقَدْ جَآءَهُمْ رَسُولٌ مِّنْهُمْ فَكَذَّبُوهُ فَأَخَذَهُمُ
الْعَذَابُ وَهُمْ ظٰلِمُونَ ﴿113﴾

**114** మీరు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించేవారు అయితే ఆయన మీకు ప్రసాదించిన ధర్మసమ్మతమైన, పరిశుద్ధమైన ఆహారాన్ని తినండి, అల్లాహ్ అనుగ్రహాలకుగాను కృతజ్ఞత చూపండి.[135]

فَكُلُوا مِمَّا رَزَقَكُمُ اللّٰهُ حَلٰلًا طَيِّبًا ۖ
وَّاشْكُرُوا نِعْمَتَ اللّٰهِ اِنْ كُنْتُمْ اِيَّاهُ
تَعْبُدُوْنَ ﴿114﴾

**115** నిశ్చయంగా, ఆయన చచ్చిన పశువు, రక్తం, పందిమాంసం, అల్లాహ్ పేరుగాక ఇతరుల పేరు ఉచ్చరించబడినవి మీకు నిషేధించాడు.[136] అయితే ఎవరయినా ఇష్టంతో కాకుండా, మితిమీరే ఉద్దేశం కూడా లేకుండా– గత్యంతరంలేని పరిస్థితిలో– (వాటిని తిన్నట్లయితే) అల్లాహ్ క్షమించేవాడు, జాలి చూపేవాడు.

اِنَّمَا حَرَّمَ عَلَيْكُمُ الْمَيْتَةَ وَالدَّمَ وَلَحْمَ
الْخِنْزِيْرِ وَمَآ اُهِلَّ لِغَيْرِ اللّٰهِ بِهٖ ۚ فَمَنِ
اضْطُرَّ غَيْرَ بَاغٍ وَّلَا عَادٍ فَاِنَّ اللّٰهَ
غَفُوْرٌ رَّحِيْمٌ ﴿115﴾

మరికొంతమంది విద్వాంసుల దృష్టిలో ఇది నిర్ధారితం కాని జనపదం. ఇది ఉపమానంగా మాత్రమే చూపబడింది. దైవానుగ్రహాలను తిరస్కరించిన వారికి పట్టే గతి ఎలా ఉంటుందో హెచ్చరించటం అసలు దీని ఉద్దేశం. మెజారిటీ ఉలమాలు ఈ విషయంలో తమదైన అభిప్రాయం కలిగి ఉన్నప్పటికీ వారు ఈ అభిప్రాయాన్ని కూడా త్రోసిపుచ్చలేదు.

134. శిక్ష అంటే ఇంతకుముందు వాక్యంలో ప్రస్తావనకు వచ్చిన ఆకలి, భయోత్పాతాల శిక్షే. లేదా బద్ర్ యుద్ధ సందర్భంగా అవిశ్వాసులకు ఎదురైన ఘోర పరాభవం కూడా కావచ్చు.

135. పరిశుద్ధమైన, ధర్మసమ్మతమైన వస్తువులను వదలి అపరిశుద్ధమైన, అధర్మమైన వస్తువులను ఉపయోగించటం, అల్లాహ్‌ను వదలి దైవేతరులను ఆరాధించటం అంటే ఒక విధంగా దేవుడు చేసిన మేలును మరచిపోవటమే.

136. ఈ ఆయతు ఇంతకుముందు కూడా మూడు సార్లు వచ్చింది – అల్ బఖరా సూరా– 173, అల్ మాయిద సూరా–3, అల్ అన్ఆమ్ సూరా–145. ఇక్కడ నాల్గవ సారి అల్లాహ్ ఈ నిషిద్ధాన్ని ప్రకటించాడు. ఇక్కడ పేర్కొనబడిన నిషిద్ధ జంతువులు గాక మరికొన్ని జంతువులు, మృగాలు కూడా నిషిద్ధమైనవి ఉన్నాయి. అయితే ఇక్కడ ప్రస్తావనకు వచ్చిన నాలుగు నిషిద్ధ వస్తువుల విషయంలో దేవుడు ముస్లింలను చాలా గట్టిగా తాకీదు చేస్తున్నాడు. వీటికి సంబంధించిన వివరణ లోగడ వచ్చింది. ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన నాలుగు నిషిద్ధ వస్తువులలో నాల్గవ దానికి కొందరు ప్రబుద్ధులు చెప్పిన వక్ర భాష్యం మూలంగా షిర్క్‌కు దొడ్డిదోవలు వెతికేందుకు కొందరికి ఆస్కారం ఏర్పడింది. అందుచేత ఇక్కడ దీనికి మరింత వివరణ ఇవ్వవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

దైవేతరుని పేర పశువులు విభిన్న రూపాల్లో వదలబడతాయి. వాటిలో **ఒకటి**: దైవేతరుల మెప్పును పొందే సంకల్పంతో వదలబడిన పశువును కోసేటప్పుడు ఆ దైవేతరుని పేరు ఉచ్చరించబడుతుంది. ఆ విధంగా ఆ దైవేతరుని ప్రసన్నత చూరగొనాలన్నది దీని ఉద్దేశం అయి ఉంటుంది.

**రెండవది :** జంతువు దైవేతరుని పేరు మీదే వదలబడినప్పటికీ ఆ జంతువును జిబహ్ చేసే సమయంలో అల్లాహ్ పేరునే ఉచ్చరిస్తారు. దర్గాల వద్దకు పోయేవారు, సమాధులను పూజించేవారు సాధారణంగా ఇలాగే చేస్తారు. వీళ్ల మేకలు, ఆవులు, కోళ్లు తదితర జంతువులను చనిపోయిన తమ పూర్వీకుల పేరు మీదే వదులుతారు. కాని వాటిని కోసేటప్పుడు మాత్రం 'బిస్మిల్లాహ్' పఠిస్తారు. ఆ విధంగా మొదటి పని ఖచ్చితంగా నిషిద్ధమేగాని రెండవ పని

وَلَا تَقُولُوا لِمَا تَصِفُ أَلْسِنَتُكُمُ الْكَذِبَ هَٰذَا
حَلَالٌ وَهَٰذَا حَرَامٌ لِّتَفْتَرُوا عَلَى اللَّهِ الْكَذِبَ ۚ
إِنَّ الَّذِينَ يَفْتَرُونَ عَلَى اللَّهِ الْكَذِبَ
لَا يُفْلِحُونَ ﴿116﴾

116 ఏ వస్తువునయినా తమ నోటితో 'ఇది ధర్మసమ్మతం' అని, 'ఇది నిషిద్ధమనీ' ఇష్టమొచ్చినట్లు అబద్ధం చెప్పేసి, అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదించకండి.[137] అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదించే వారు సాఫల్యాన్ని పొందలేరు.

మాత్రం ఆక్షేపణీయం కాదని సమర్థించుకుంటారు. ఎందుకంటే జిబహ్ సమయంలో తాము దైవేతరుని పేరు ఉచ్చరించలేదు కదా! అనంటారు. ఈ విధంగా షిర్క్ (బహుదైవోపాసన)కు ద్వారం తెరువబడింది. అయితే ధర్మవేత్తలు (ఫుకహా) ఈ రెండో పద్ధతిని కూడా హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేశారు. ఎందుకంటే ఇది కూడా **"వమా ఉహిల్ల లిగైరిల్లాహ్"** క్రిందికే వస్తుంది. అందుకే 'బైజావీ' గ్రంథంలో ఇలా అనబడింది: "దైవేతరుని పేర పిలువబడిన ప్రతి జంతువూ నిషిద్ధమే. ఒకవేళ దానిని జిబహ్ చేసే సమయంలో అల్లాహ్ పేరు పఠించబడినప్పటికీ అది నిజానికి దైవేతరుని కొరకు ఉద్దేశించినదే. ఎందుకంటే ఏ ముస్లిమైనా దైవేతరుని సామీప్యం పొందే ఉద్దేశంతో జంతువును బలి ఇస్తే అతడు ధర్మభ్రష్టుడైపోతాడని, అతను బలి ఇచ్చిన పశువు ధర్మభ్రష్టుని బలిదానంగానే పరిగణించబడుతుందని పండితులు ఏకాభిప్రాయం వెలిబుచ్చారు."

హనఫీ ఫిఖహ్‌కు చెందిన సుప్రసిద్ధ గ్రంథం 'దుర్రె ముఖ్తార్'లో ఇలా వుంది – "ఎవరయినా పరిపాలనాధీశుడు లేక పెద్ద నాయకుడు వచ్చినప్పుడు అతనికి అతిథి మర్యాద చేయాలన్న తలంపుతో కాకుండా అతనిపట్ల స్వామిభక్తితో, అతని మన్నన పొందే ఉద్దేశంతో పశువును కోసి వండిపెడితే అది హరామ్ (నిషిద్ధం) అవుతుంది. ఎందుకంటే అది కూడా 'దైవేతరుని పేర ఇచ్చిన జంతుబలి' క్రిందికే వస్తుంది. దానిని కోసినప్పుడు అల్లాహ్ పేరు ఉచ్చరించినా సరే! అల్లామా షామీ గారు కూడా ఈ అభిప్రాయాన్ని సమర్థించారు." (కితాబుజ్జబాయిహ్ – ప్రాచీన ముద్రణ. హిజ్రీ 1277, పేజీ – 277; ఫతావా షామీ – సంపుటి : 5, పేజీ – 203). అయితే కొందరు విద్వాంసులు ఈ రెండవ పరిస్థితిని "వమా ఉహిల్ల లిగైరిల్లాహ్" క్రిందికి చేర్చరు. కాని కారణం మాత్రం ఒకటే అయినందువల్ల (దైవేతరుని సామీప్యం పొందాలన్న తలంపు వల్ల) దాన్ని నిషిద్ధంగా భావిస్తారు. మొత్తమ్మీద దైవేతరుని పేర వదలబడిన జంతువు నిషిద్ధం అన్న విషయంలో మాత్రం అభిప్రాయభేదం లేదు. కాకపోతే వారు దాన్ని నిషిద్ధంగా ఖరారు చేసే పద్ధతిలో మాత్రమే వ్యత్యాసముంది. అదీగాక ఈ రెండో అంశం "విగ్రహాల వద్ద లేదా దైవేతరుల ఆస్థానాలలో జిబహ్ చేయబడేవి" అన్న కోవలోకి కూడా వస్తుంది. అల్ మాయిద సూరాలో తెలియజేయబడిన నిషిద్ధాంశాలలో దీని ప్రస్తావన వచ్చింది. ఆస్థానాలలో, దర్బార్లలో, జాతర స్థలాల వద్ద జిబహ్ చేయబడే పశువులు హరామ్ (నిషిద్ధం) అని హదీసు ద్వారా కూడా రూఢీ అవుతోంది. కాబట్టి ఎవరయినా తమ పశువులను ఆయా స్థలాలకు తీసుకువెళ్ళి జిబహ్ చేసినా, పంచిపెట్టినా దాని అసలు ఉద్దేశం ఒక్కటే – దైవేతర శక్తులను సంతోషపెట్టడం!

ఒక హదీసులో ఈ విధంగా అనబడింది – "ఒకానొక వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, 'బువానా' స్థలంలో ఒక ఒంటెను జిబహ్ చేయాలని మొక్కుకున్నాను అన్నాడు. దానికి ఆయన (సఅసం), 'ఆ స్థలంలో – అజ్ఞాన కాలంలో – పూజించబడే విగ్రహం ఏదైనా ఉండేదా?' అని ప్రశ్నించారు. 'లేదు' అని అక్కడున్నవారు చెప్పారు. "అక్కడ వారి పండుగలు ఏవైనా జరిగేవా?" అని ఆయన మళ్లీ ఆరా తీశారు. దానికి జనులు అటువంటిదేమీ లేదని చెప్పారు. అప్పుడాయన (సఅసం), 'మొక్కుబడిని తీర్చుకో' అని ఆ పృచ్ఛకునికి ఆదేశించారు." (అబూ దావూద్–కితాబుల్ ఐమాన్ వన్నుజూర్). ఈ హదీసును బట్టి అవగతమయ్యేదేమిటంటే, ఏదేని స్థలంలో ఒకప్పుడు విగ్రహాలు ఉండి, దాన్ని అక్కడి నుంచి తొలగించినప్పటికీ – అలాంటి నిర్జన ప్రదేశంలోకి పోయి జంతుబలి ఇవ్వటం అధర్మమే. మరి అలాంటప్పుడు పూజలకై, మొక్కు బడులు తీర్చుకోవటం కోసం జనం పోగయ్యే ఆస్థానాల్లో, దర్బారుల్లో జంతు బలులు సమర్పించటం ధర్మసమ్మతం ఎట్లా అవుతుంది?

137. కొన్ని జంతువులను విగ్రహాల పేరున వదలి, వాటిని తమ కోసం హరామ్ (నిషిద్ధం) చేసుకునే చేష్ట ఇందులో ఎత్తి చూపబడింది. ఉదాహరణకు : బహీరా, సాయిబ, వసీలా, హామ్ ఇత్యాదివి (చూడండి : అల్ మాయిద – 103, అల్ అన్ఆమ్ : 139 – 141 ఆయతుల సారాంశం).

**117** వారికి లభించే ప్రయోజనం బహు స్వల్పం. వారి కోసం వ్యధాభరితమైన శిక్ష ఉంది.

مَتَاعٌ قَلِيلٌ وَّلَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿117﴾

**118** యూదుల కొరకు మేము నిషేధించిన వాటిని గురించి మేము ఇంతకు ముందే నీకు వినిపించి ఉన్నాము.[138] మేము వారికి అన్యాయం చేయలేదు. కాని వారు తమ స్వయానికి తామే అన్యాయం చేసుకున్నారు.

وَعَلَى الَّذِيْنَ هَادُوْا حَرَّمْنَا مَا قَصَصْنَا عَلَيْكَ مِنْ قَبْلُ ۚ وَمَا ظَلَمْنٰهُمْ وَلٰكِنْ كَانُوْٓا اَنْفُسَهُمْ يَظْلِمُوْنَ ﴿118﴾

**119** మరి ఎవరయినా అజ్ఞానం వల్ల దురాగతాలకు పాల్పడి, ఆపైన పశ్చాత్తాపం చెందితే, దిద్దుబాటు కూడా చేసుకుంటే అప్పుడు నిశ్చయంగా నీ ప్రభువు అపారంగా క్షమించేవాడు, అమితంగా కనికరించేవాడు.

ثُمَّ اِنَّ رَبَّكَ لِلَّذِيْنَ عَمِلُوا السُّوْٓءَ بِجَهَالَةٍ ثُمَّ تَابُوْا مِنْۢ بَعْدِ ذٰلِكَ وَاَصْلَحُوْٓا اِنَّ رَبَّكَ مِنْۢ بَعْدِهَا لَغَفُوْرٌ رَّحِيْمٌ ﴿119﴾

**120** నిశ్చయంగా ఇబ్రాహీం ఒక అనుసరణీయ నాయకుడు.[139] నికార్సయిన దైవ విధేయుడు. అల్లాహ్ యందే మనస్సు నిలిపిన వాడు. అతడు బహుదైవారాధకులలో చేరినవాడు కాడు.

اِنَّ اِبْرٰهِيْمَ كَانَ اُمَّةً قَانِتًا لِّلّٰهِ حَنِيْفًا ۗ وَلَمْ يَكُ مِنَ الْمُشْرِكِيْنَ ﴿120﴾

**121** అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతజ్ఞతాభావం కలవాడు. అల్లాహ్ అతన్ని ఎన్నుకున్నాడు. అతనికి రుజుమార్గం చూపించాడు.

شَاكِرًا لِّاَنْعُمِهٖ ۭ اِجْتَبٰىهُ وَهَدٰىهُ اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿121﴾

**122** మేమతనికి ప్రపంచంలోనూ మేలును ప్రసాదించాము. పరలోకంలోనూ అతను సజ్జనులలో చేరి ఉంటాడు.

وَاٰتَيْنٰهُ فِى الدُّنْيَا حَسَنَةً ۭ وَاِنَّهٗ فِى الْاٰخِرَةِ لَمِنَ الصّٰلِحِيْنَ ﴿122﴾

**123** తరువాత మేము, ఏకాగ్రచిత్తుడైన ఇబ్రాహీం ధర్మాన్ని[140] అనుసరించమని నీ వద్దకు వహీ పంపాము. అతడు బహు దైవోపాసకులలో చేరినవాడు కాడు.

ثُمَّ اَوْحَيْنَآ اِلَيْكَ اَنِ اتَّبِعْ مِلَّةَ اِبْرٰهِيْمَ حَنِيْفًا ۭ وَمَا كَانَ مِنَ الْمُشْرِكِيْنَ ﴿123﴾

138. అల్ అన్ఆమ్ సూరా – 146వ ఆయతు సారాంశాన్ని, నిసా సూరా – 160వ ఆయతును కూడా చూడండి.

139. మూలంలో **'ఉమ్మతన్'** అని ఉంది. దీనికి నాయకుడు, ముందుండేవాడు అన్న అర్థాలు కూడా వస్తాయి. 'ఉమ్మత్' అంటే సమాజం, సంఘం అని మరో అర్థం. ఈ రెండో అర్థంలో తీసుకుంటే, హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) వాస్తవానికి ఒక్కరే అయినప్పటికీ, ఆయన కార్యదక్షత రీత్యా ఒక సంఘం వంటివారు. ('ఉమ్మత్' అనే పదానికి మరింత వివరణ కోసం హూద్ సూరా 8వ ఆయతుకు సారాంశం చూడండి).

140. అరబీలో **'మిల్లత్'** అని ఉంది. దేవుడు తన ప్రవక్త ద్వారా ప్రజల వద్దకు పంపి, అనివార్యంగా ఖరారు చేసిన ధర్మమని దీని అర్థం. అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (సఅసం) ప్రవక్తలందరికీ నాయకుడు అనటంలో సందేహం లేదు. అయినప్పటికీ ఇబ్రాహీమ్ ధర్మాన్ని అవలంబించమని ఆయన (స)కు ఆజ్ఞాపించబడటాన్ని బట్టి హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)గారి ప్రత్యేకత, విశిష్టత ఎటువంటిదో విదితమవుతోంది. సూత్రప్రాయంగా

إِنَّمَا جُعِلَ السَّبْتُ عَلَى الَّذِينَ اخْتَلَفُوا فِيهِ ۚ وَإِنَّ رَبَّكَ لَيَحْكُمُ بَيْنَهُمْ يَوْمَ الْقِيٰمَةِ فِيمَا كَانُوا فِيهِ يَخْتَلِفُونَ ﴿124﴾

**124** ఎవరు శనివారం విషయంలో విభేదించుకున్నారో వారికి మాత్రమే దాని విశిష్టత విధించబడింది.[141] అసలు విషయమేమి టంటే నీ ప్రభువు స్వయంగా ప్రళయదినాన వారి విభేదంపై వారి మధ్య తీర్పు చేస్తాడు.

اُدْعُ إِلَىٰ سَبِيلِ رَبِّكَ بِالْحِكْمَةِ وَالْمَوْعِظَةِ الْحَسَنَةِ ۖ وَجَادِلْهُمْ بِالَّتِي هِيَ أَحْسَنُ ۚ إِنَّ رَبَّكَ هُوَ أَعْلَمُ بِمَنْ ضَلَّ عَنْ سَبِيلِهِ ۖ وَهُوَ أَعْلَمُ بِالْمُهْتَدِينَ ﴿125﴾

**125** నీ ప్రభువు మార్గం వైపు జనులను వివేకంతోనూ, చక్కని ఉపదేశంతోనూ పిలువు. అత్యుత్తమ రీతిలో వారితో సంభాషణ జరుపు.[142] నిశ్చయంగా తన మార్గం నుంచి తప్పిన వారెవరో నీ ప్రభువుకు బాగా తెలుసు. సన్మార్గాన ఉన్నవారెవరో కూడా ఆయనకు బాగా తెలుసు.[143]

وَإِنْ عَاقَبْتُمْ فَعَاقِبُوا بِمِثْلِ مَا عُوقِبْتُمْ بِهِ ۖ وَلَئِنْ صَبَرْتُمْ لَهُوَ خَيْرٌ لِلصّٰبِرِينَ ﴿126﴾

**126** ఒకవేళ మీరు ప్రతీకారం తీర్చుకోదలచినా, మీకు ఏ మేరకు బాధపెట్టడం జరిగిందో ఆ మేరకే ప్రతీకారం తీర్చుకోండి. ఒకవేళ మీరు ఓర్చుకున్నట్లయితే, ఓర్పు వహించేవారి పాలిట ఇది ఎంతో శ్రేయస్కరమైనది.[144]

ప్రవక్తలందరి జీవన ధర్మం, శాసనాంగం (షరీయతు) ఒక్కటే. వాటిలో దేవుని ఏకత్వం (తౌహీద్), దైవదౌత్యం (రిసాలత్), పరలోకం (మఆద్) వంటి అంశాలకు ప్రధాన స్థానం ఉండింది.

141. ఇంతకీ ఏమిటా విభేదం? కొందరు ఇలా అభిప్రాయపడుతున్నారు : హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన జాతి ప్రజల కోసం శుక్రవారాన్ని విధించగా, బనీ ఇస్రాయీల్ వారు దీనిపై విభేదించి తమకు శనివారం కావాలన్నారు. అప్పుడు అల్లాహ్, "మూసా! వీళ్లు ఏ రోజును కోరుకున్నారో ఆ రోజునే ఉండనివ్వు" అని అన్నాడు. మరి కొందరి అభిప్రాయం ఈ విధంగా ఉంది : "భక్తిశ్రద్ధల నిమిత్తం వారంలో ఏదైనా ఒక రోజును నిర్ధారించుకోనందని అల్లాహ్ వారిని ఆజ్ఞాపించగా, ఆ రోజును నిర్ధారించుకునే విషయంలో వారి మధ్య అభిప్రాయభేదం తలెత్తింది. యూదులు తమ మనోరథం ప్రకారం శనివారాన్ని ఇష్టపడగా, క్రైస్తవులు ఆదివారాన్ని తమ కోసం ఎంపిక చేసుకున్నారు. అల్లాహ్ శుక్రవారాన్ని ముస్లింల కొరకు ప్రత్యేకించాడు."

ఇంకొక అభిప్రాయం ఇలా ఉంది : "యూదులను వ్యతిరేకించే ఉద్దేశ్యంతో క్రైస్తవులు ఆదివారాన్ని తమ కోసం విధించుకున్నారు. అలాగే ఆరాధనల విషయంలో కూడా యూదులకంటే భిన్నంగా ఉండాలన్న సంకల్పంతో క్రైస్తవులు 'సఖరయె బైతుల్ మఖ్దిస్' యొక్క తూర్పు భాగాన్ని తమ 'ఖిబ్లా' (అభిముఖం, దిక్కు)గా ఖరారు చేసుకున్నారు. కాగా; ముస్లిముల కోసం శుక్రవారాన్ని అల్లాహ్ స్వయంగా నిర్ధారించినట్లు హదీసులో ప్రస్తావించబడి ఉంది (చూడండి: సహీహ్ బుఖారీ – కితాబుల్ జుముఅ; ముస్లిం – కితాబుల్ జుముఅ).

142. ఈ ఆయతులో ధర్మపరిచయ (తబ్లీగ్, దావత్) కార్యక్రమానికి సంబంధించిన మూల సూత్రాలు తెలుపబడ్డాయి. అవి వివేకం, మంచి హితబోధ, మృదుత్వంతో కూడుకున్నవి. ఎదుటివారితో వాదోపవాదాలు జరపవలసి వచ్చినప్పుడు అత్యుత్తమ రీతిలో మాట్లాడాలి. నగుమోముతోనే విషయాన్ని విడమరచి చెప్పాలి. మీరు వారి శ్రేయాన్ని అభిలషించే వారన్న అభిప్రాయాన్ని ఎదుటివారిలో కలిగించాలి. దురుసు వైఖరి ఎంతమాత్రం తగదు.

143. పై సూత్రాల ననుసరించి బోధపరచటం వరకే మీ పని. జనులకు సన్మార్గభాగ్యం ప్రసాదించటమనేది అల్లాహ్ వంతు. ఎవరు సన్మార్గానికి వస్తారో, ఎవరు షైతాన్ అడుగుజాడల్లో నడుస్తారో ఆయనకు బాగా తెలుసు.

**127** (ఓ ముహమ్మద్‌– స!) నువ్వు సహనం వహించు. (అయితే) అల్లాహ్ తోడ్పాటు లేకుండా నువ్వు సహనం వహించలేవు. వారి పరిస్థితిపై బాధపడకు. వారు పన్నే కుట్రలు, కుయుక్తులకు లోలోపలే దుఃఖించకు.[145]

وَاصْبِرْ وَمَا صَبْرُكَ إِلَّا بِاللَّهِ وَلَا تَحْزَنْ عَلَيْهِمْ وَلَا تَكُ فِي ضَيْقٍ مِّمَّا يَمْكُرُونَ ﴿127﴾

**128** నిశ్చయంగా అల్లాహ్ తనకు భయపడుతూ జీవితం గడిపే వారికి, సద్వర్తనులకు తోడుగా ఉంటాడు.

إِنَّ اللَّهَ مَعَ الَّذِينَ اتَّقَوا وَّالَّذِينَ هُم مُّحْسِنُونَ ﴿128﴾

144. ప్రతీకారం తీర్చుకునేందుకు ధర్మంలో అనుమతి ఉంది. అయితే ప్రతీకారం హద్దు మీరకూడదు. హద్దు మీరితే మరి అదొక అన్యాయం, దౌర్జన్యంగా పరిణమిస్తుంది. కాని ఒకవేళ మన్నింపుల వైఖరిని అవలంబించి, తమకు కలిగిన బాధను లోలోపలే దిగమ్రింగినట్లయితే అది వారి ఉదార స్వభావాన్ని వెల్లడిస్తుంది. ఇలాంటి ఔదార్యం కురిపించే వారిని అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడు.

145. కుత్సిత మనస్కులు సజ్జనులకు వ్యతిరేకంగా ఎన్ని కుట్రలు పన్నినా వారి ఆటలు సాగవు. ఎందుకంటే అల్లాహ్ అండదండలు సజ్జనులకు వెన్నంటి ఉన్నాయి.

17వ సూరా

# బనీ ఇస్రాయీల్

## ఇస్రాయీల్ సంతతి

అవతరణ మక్కాలో

ఆయతులు 111

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఈమాన్ (ధార్మిక విశ్వాసం), తౌహీద్ (ఏకదైవారాధన), ప్రవక్తల పరంపర, మరణించిన వారిని మళ్ళీ బ్రతికించడం, శిక్షా బహుమానాల గురించి నొక్కి చెప్పింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) చేసిన రాత్రి యాత్ర ప్రస్తావనతో ఈ సూరా ప్రారంభమయ్యింది. మక్కాలోని పవిత్రమైన మస్జిదు నుంచి ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను సుదూరాన ఉన్న మస్జిదె అక్సా (జెరుసలేం)కు రాత్రివేళ తీసుకువెళ్ళడం జరిగింది. అక్కడి నుంచి ఆయన్ను వరుసగా ఏడు ఆకాశాలపైకి తీసుకువెళ్ళి అల్లాహ్ చిహ్నాలను చూపించడం జరిగింది. ఈ గగనారోహణయాత్ర ఒక అద్భుతమైన మహత్యం. ఇది అల్లాహ్ యొక్క అపార శక్తిసామర్థ్యాలను చాటిచెబుతుంది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు ఇవ్వబడిన ప్రత్యేక స్థానాన్ని కూడా తెలియజేస్తోంది.*

*ఈ సూరా ప్రారంభ వచనం అల్లాహ్ పవిత్రతను కొనియాడుతుంది. ఇస్రాయీల్ సంతతి ప్రజలు ప్రపంచంలో రెండుసార్లు కల్లోలం సృష్టిస్తారని ఇందులో చెప్పడం జరిగింది. వారు తీవ్రమైన హింసాకాండకు, దేవుని ఆగ్రహానికి గురిఅవుతారని చెప్పడం జరిగింది. వారు తమ వైఖరిని మార్చుకోవడానికి మరొక అవకాశం ఇస్తున్నట్లు ఈ సూరా తెలిపింది. ఈ సూరాలో ఆదమ్ (అస), షైతాన్‌ల గాథ గురించి క్లుప్తమైన ప్రస్తావన ఉంది. అల్లాహ్ ఆదేశాలపై తిరుగు బాటును ఈ గాథ తెలియజేసింది. అల్లాహ్ ఆదేశాలను తిరస్కరిస్తూ షైతాన్ తాను ఆదమ్(అస) ముందు తలవంచేది లేదని అన్నాడు. మానవులలో చాలామంది దారితప్పేలా తనను అనుసరించేలా చేస్తానని సవాలు చేశాడు. ఈ సూరాలో దివ్య ఖుర్ఆన్ ఒక మార్గదర్శకంగా, ఒక ఔషధంగా, ఒక కారుణ్యంగా అభివర్ణించబడింది. దానిని ఒక మహత్యంగా పేర్కొనడం జరిగింది. ఈ దైవగ్రంథం పట్ల సందేహం కలిగిన వారెవరైనా గాని, ఇలాంటిది మరొకటి రాసి చూపించాలని సవాలు చేయటం జరిగింది. యావత్తు మానవులు, జిన్నులు (కంటికి కనిపించని, అగ్నితో సృష్టించబడిన ప్రాణులు) కలిసి ఇలాంటి గ్రంథాన్ని రాయాలని ప్రయత్నించినా రాయలేరని చెప్పటం జరిగింది.*

*తాము మరణించిన తర్వాత, ఎముకలు కూడా దుమ్ముధూళిలో కలిసిపోయిన తర్వాత తమను మళ్ళీ బ్రతికించి నిలబెట్టడం అసాధ్యమని అవిశ్వాసులు వాదించసాగారు. ఈ సూరా వారి అనుమానాలను తొలగిస్తూ, వారి సందేహాలను నివృత్తిచేసే రుజువులను వారి ముందు ఉంచింది. మరణానంతరం వాళ్ళు దుమ్ము ధూళిలో కలిసిపోయినా లేక మరేవిధంగానైనా మారి పోయినా మరణించిన తర్వాత మళ్ళీ లేపి నిలబెట్టడం జరుగుతుందనీ, ఎందుకంటే, ఒకసారి వారిని సృష్టించిన దేవునికి వారిని మళ్ళీ సృష్టించడం సాధ్యమేనని చెప్పడం జరిగింది.*

# సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ **కథామాలికలో** చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 1 | 239 | 'ఇస్రా (రాత్రి ప్రయాణం)' | రాత్రికి రాత్రి కోట్ల కాంతి సంవత్సరాల దూరం వెళ్ళిరావటం సాధ్యమేనా? విశ్వసృష్టికర్త తలచుకుంటే అది సాధ్యం కాదంటారా? ఒక్క రాత్రిలోనే సప్తాకాశాలనూ సందర్శించి వచ్చిన ఆ అదృష్ట దైవదాసుని గురించి, ఆ వింత సంఘటన గురించి తెలుసుకోవచ్చు. |
| 2, 101-104 | 82-117 | 'దైవప్రవక్త మూసా, ఇస్రాయీల్ జాతి వారి విమోచన కర్త' | దైవప్రవక్త మూసా (అ) చరిత్ర దివ్యఖుర్‌ఆన్ గ్రంథంలో ఎన్నో విభాగాలుగా, ఎన్నో చోట్ల ప్రస్తావించబడింది. అలా అని చెప్పిన మాటే మళ్ళీ మళ్ళీ చెప్పబడలేదు. ప్రతిసారి ఏదో ఒక కొత్త విషయం! ఏదో ఒక సరికొత్త కోణం!! మరి ఆ వింత సంగతులన్నింటినీ మాలగా కూర్చుకొని చదువుకుంటే ఇంకెంత బాగుంటుంది?! |
| 3 | 14-20 | 'దైవప్రవక్త నూహ్' | పూర్వకాలంలో ఒకానొకప్పుడు యావత్ ప్రపంచంలో జల ప్రళయం వచ్చింది. అతి కొద్దిమంది మనుషులు, కొన్ని జంతువులు, పక్షులు లాంటి జీవులు మాత్రమే ఆ ఘోరకలి నుంచి బతికి బయటపడ్డాయి. నూహ్ ప్రవక్త కాలంలో ఈ సంఘటన జరిగింది. దాని గురించి పూర్తి సమాచారం. |
| 4-8 | 173 | 'చెల్లాచెదరైన బనీ ఇస్రాయీల్ ప్రజలు' | ప్రవక్తల ప్రబోధనల్ని పెడచెవిన పెట్టిన కారణంగా ఇస్రాయీల్ జాతి ప్రజలు తమ శత్రువుల చేతుల్లో ఘోర పరాజయం, అవమానం చవిచూశారు. ఆ చారిత్రక కథనమే ఇది! |
| 17, 59 | 14, 21, 25, 50 81 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవప్రవక్త సాలిహ్' 'దైవ ప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారావాహికంగా ఇక్కడ దొరుకుతాయి. |
| 61-65 | 4-7 | 'మానవ సృష్టి' 'ఇబ్లీస్ ప్రతీకారం' | భూమ్మీద కాలుమోపిన మొట్టమొదటి మానవుడు, మనిషి అంటే షైతాన్‌కు ఎందుకంత అసూయ, కోపం? |

## బనీ ఇస్రాయీల్[1] సూరా

## سُوْرَةُ بَنِیْٓ اِسْرَآءِیْلَ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِیْمِ

**1** తన దాసుణ్ణి రాత్రికి రాత్రే[2] మస్జిదె హరామ్ నుండి మస్జిదె అక్సా[3] వరకు తీసుకుపోయిన అల్లాహ్ పరిశుద్ధుడు.[4] దాని పరిసరాలను మేము శుభవంతం చేశాము.[5] ఎందుకంటే;

سُبْحٰنَ الَّذِیْٓ اَسْرٰی بِعَبْدِهٖ لَیْلًا مِّنَ الْمَسْجِدِ الْحَرَامِ اِلَی الْمَسْجِدِ الْاَقْصَا الَّذِیْ بٰرَكْنَا حَوْلَهٗ

---

1. ఇది మక్కాలో అవతరించిన సూరా. దీన్ని 'ఇస్రా సూరా' గా కూడా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఈ సూరాలో ఇస్రా (దైవప్రవక్తను రాత్రిపూట మజ్జిదె అక్సాకు తీసుకువెళ్ళిన) ప్రస్తావన ఉంది. సహీహ్ బుఖారీలోని ఒక ఉల్లేఖనం ప్రకారం, "సూరె కహఫ్, సూరె మర్యమ్, సూరె బనీ ఇస్రాయీల్ తొలికాలం(ఇతాఖ్)లో అవతరించిన సూరాలు. "ఇవి నా ప్రాచీన సంపదలు(తిలాద్)" అని మహాప్రవక్త (సఅసం) వక్కాణించినట్లు హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ తెలిపారు (బనీ ఇస్రాయీల్ సూరా వ్యాఖ్యానం). ఇతాఖ్, ఇది అతీఖ్‌కు బహువచనం. పాతది, ప్రాచీనమైనదని దీనికి అర్థం. తిలాద్, తాలిద్‌కు బహువచనం. ప్రాచీన సంపదను 'తాలిద్' అని అంటారు. మొత్తానికి ఈ హదీసు భావం ఏమిటంటే, మక్కాలో తొట్టతొలి కాలంలో అవతరించిన సూరాల్లో బనీ ఇస్రాయీల్ కూడా ఒకటన్నమాట. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి రాత్రీ బనీ ఇస్రాయీల్ సూరాను, జుమర్ సూరాను పారాయణం చేసే వారు (ముస్నదె అహ్మద్ – సంపుటి : 6, పేజీ – 68; తిర్మిజీ – హ.నెం.292, 3405; అల్‌బానీగారు తన సహీహ్ గ్రంథం 2వ సంపుటి 641వ హదీసులో దీన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).
2. **'ఇస్రా'** అంటే రాత్రి పూట తీసుకువెళ్ళటం అని అర్థం. ఇస్రా అంటేనే రాత్రిపూట తీసుకెళ్ళటం అనే అర్థం వస్తున్నప్పుడు వాక్యంలో మళ్లీ 'లైలన్' (రాత్రి) అనే పదం ఎందుకొచ్చింది? అనే సందేహం కలగవచ్చు. దానికి సమాధానం ఏమిటంటే, ఇక్కడ 'లైల్' అన్న పదం తక్కువ పరిమాణాన్ని సూచించటానికి తీసుకురాబడింది. 'అస్‌రా లైలన్' అంటే రాత్రివేళ – అది కూడా చాలా కొద్ది సమయంలో వెళ్ళి రావటం అనే అర్థం వస్తుంది. నలభై రాత్రులు ప్రయాణం చేస్తేనేగాని చేరుకోలేని మస్జిదె అక్సాకు ఒకే ఒక్క రాత్రిలో–అదీ రాత్రిలోని కొద్ది సమయంలో– తీసుకువెళ్ళటం అద్భుతం.
3. **'అక్సా'** అంటే 'దూరాన గల' అని అర్థం. అంటే 'బైతుల్ మఖ్దిస్' అన్నమాట. అది పాలస్తీనాలోని ఖుదుస్ (దీని పాత పేరు ఈలియా) నగరంలో ఉంది. మక్కాలోని మస్జిదుల్ హరామ్ నుంచి పాలస్తీనాలోని బైతుల్ మఖ్దిస్‌కు పోవాలంటే కనీసం నలభై రోజుల ప్రయాణం చేయాలి. అందుకే 'బైతుల్ మఖ్దిస్'ను 'మస్జిదె అక్సా' (దూరాన ఉన్న మస్జిద్)గా వ్యవహరించటం జరిగింది.
4. **'సుబ్‌హాన'** ఇది 'సబహ' – 'యస్‌బహు' అనే క్రియాపదాలకు ధాతువు పదం. అన్ని రకాల లోపాల నుంచి అల్లాహ్‌ను నేను పవిత్రునిగా భావిస్తున్నాను అని దీని భావం. సాధారణంగా గొప్ప సంఘటనల గురించి చెప్పినప్పుడు ఈ పదం ఉపయోగించబడుతుంది. ఈ సంఘటన ప్రజలకు వింతగా, అసంభవంగా తోచినప్పటికీ దేవుని దృష్టిలో ఇది ఏమంత పెద్ద విషయం కానేకాదు. ఎందుకంటే అతడు కారకాలకు, సాధనాలకు కట్టుబడినవాడు కాదు. రెప్పపాటులో ఆయన 'అయిపో' అన్న ఆదేశాన్ననుసరించి ఏదైనా చేసెయ్యగలడు. ఆయన బలహీనతలకు, దౌర్బల్యాలకు అతీతుడు, పరిశుద్ధుడు.
5. సహజసిద్ధంగానే ఈ ప్రదేశం పంట పొలాలతో, నదీనదాలతో సస్యశ్యామలంగా ఉంది. పైగా ఈ ప్రదేశంలో దైవప్రవక్తలు సంచరించారు. నివసించారు. ఈ ప్రాంతంలో చాలామంది ప్రవక్తలు సమాధి అయిఉన్నారు. ఈ రకంగా కూడా ఈ ప్రాంతం విశిష్టమైనది. అందుచేత దీన్ని శుభప్రదమైన స్థలంగా ఖరారు చెయ్యటం జరిగింది.

لِنُرِيَهُ مِنْ آيَاتِنَا ۚ إِنَّهُ هُوَ السَّمِيعُ الْبَصِيرُ ⑴

మేమతనికి మా (శక్తిసామర్థ్యాలకు సంబంధించిన) కొన్ని సూచనలను చూపదలిచాము.[6] నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే బాగా వినేవాడు, చూసేవాడు.

وَآتَيْنَا مُوسَى الْكِتَابَ وَجَعَلْنَاهُ هُدًى لِبَنِي إِسْرَائِيلَ أَلَّا تَتَّخِذُوا مِنْ دُونِي وَكِيلًا ⑵

2 మేము మూసాకు గ్రంథాన్ని వొసగాము. దానిని ఇస్రాయీల్ సంతతి కోసం మార్గదర్శకంగా చేశాము. "మీరు నన్ను తప్ప వేరెవరినీ మీ కార్యసాధకునిగా చేసుకోకండి" అని (వారికి ఆజ్ఞాపించాము).

ذُرِّيَّةَ مَنْ حَمَلْنَا مَعَ نُوحٍ ۚ إِنَّهُ كَانَ عَبْدًا شَكُورًا ⑶

3 నూహుతోపాటు మేము (ఓడలో) ఎక్కించిన వారి సంతానమా! అతడు (నూహు) మాత్రం కృతజ్ఞతాపూర్వకంగా మెలగిన మా దాసుడు[7] (అన్న సంగతిని తెలుసుకోండి).

6. దేవుని గొప్ప సూచనలను దైవప్రవక్త (సఅసం)కు చూపెట్టడం ఈ యాత్ర అసలు ఉద్దేశం. అంత సుదీర్ఘ యాత్ర ఒకే ఒక రాత్రిలోని అతి స్వల్పభాగంలో జరిగిపోవటం కూడా ఒక అద్భుతమే. ఆ రాత్రి దైవప్రవక్త (స) గగన లోకంలోకి తీసుకుపోబడ్డారు. వివిధ ఆకాశాలలో ఆయన (స) పలువురు దైవప్రవక్తల్ని కలుసుకున్నారు. ఏడవ ఆకాశంలో 'అర్ష్' పీఠానికి దిగువన ఉన్న 'సిద్రతుల్ ముస్తహా' వరకూ వెళ్ళారు. అక్కడ ఆయనకు నమాజుతో సహా కొన్ని దైవసూచనలు, దైవాదేశాలు ప్రసాదించబడ్డాయి. సహీహ్ హదీసులలో వాటి వివరాలు లభిస్తాయి. మహాప్రవక్త (స) గారి సహచరులు, వారి శిష్యులు మొదలుకుని నేటి విద్వాంసుల వరకూ – అందరూ ఒక విషయంలో మటుకు ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. అదేమంటే దైవప్రవక్త (సఅసం) గారి ఈ యాత్ర 'స్వప్నావస్థ'లో జరిగింది కాదు. – ఆయన పూర్తి మెలకువలో సశరీరంగా ఈ యాత్ర చేసి వచ్చారు. కళ్లారా అక్కడి స్థితిగతులను వీక్షించారు. అల్లాహ్ తన అపారమైన శక్తితో తన ప్రవక్తకు వీటన్నింటినీ దర్శనం చేయించాడు. ఈ యాత్రనే 'మేరాజ్' అంటారు. ఈ మేరాజులో రెండు భాగాలున్నాయి. మొదటిభాగం 'ఇస్రా' అనబడగా, రెండవభాగం 'మేరాజ్'గా వ్యవహరించబడుతుంది.

ఈ ఆయతులో చెప్పబడినట్లు తొలుత ఆయన (సఅసం) 'మస్జిదె అక్సా' వరకూ తీసుకుపోబడ్డారు. ఇక్కడికి చేరుకున్నాక ఆయన (సఅసం) దైవప్రవక్తలందరికీ (అలైహిముస్సలాం) నమాజులో సారథ్యం వహించారు. బైతుల్ మఖ్దిస్ నుండి ఆయన (స) గగన యాత్రకు తీసుకుపోబడ్డారు. ఇది ఆ యాత్రలో రెండోభాగం. ఇది 'మేరాజ్'గా పిలువబడుతోంది. నజ్మ్ సూరాలో దీనికి సంబంధించిన కొన్ని వివరాలు ప్రస్తావించబడ్డాయి. మిగిలిన అంశాలన్నీ హదీసులలో మనకు లభ్యమవుతాయి. మొత్తమ్మీద ఈ యాత్రనంతటినీ 'మేరాజ్ యాత్ర'గా వ్యవహరిస్తారు.

సోపానాలను, నిచ్చెనలను అసలు మేరాజ్‌గా వ్యవహరిస్తారు. మహాప్రవక్త (సఅసం) స్వయంగా ఇలా అన్నారు : **"ఉరిజ బీ ఇలస్సమాయి"** (నన్ను గగనానికి ఎక్కించటం జరిగింది). మేరాజ్ అన్న పదం ఈ 'ఉరిజ' అనే పదం నుంచి వచ్చినదే. ఈ యాత్రలోని రెండవభాగం మొదటి భాగం కన్నా ఎంతో ముఖ్యమైనది, అద్భుతమైనది. అందువల్ల 'మేరాజ్' అనే పదమే సర్వత్రా ప్రసిద్ధి చెందింది. ఇది ఏ సంవత్సరం, ఏ తేదీన సంభవించిందన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. అయితే 'హిజ్రత్'కు ముందు జరిగిందన్న విషయంలో మటుకు అందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. హిజ్రత్‌కు ఒక సంవత్సరం ముందు జరిగిందని కొందరు, కాదు అనేక సంవత్సరాల ముందు జరిగిందని మరికొందరు అభిప్రాయపడ్డారు. అలాగే నెల, తేదీల విషయంలో కూడా పలు అభిప్రాయాలు ముందుకు వస్తాయి. రబీవుల్ అవ్వల్ 17వ తేదీ అని కొందరంటే 27వ తేదీ అని కొందరన్నారు. రజబ్ నెల 27వ తేదీ అని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇంకొందరు ఇంకో తేదీని ప్రస్తావించారు (ఫత్‌హుల్ ఖదీర్).

7. నూహ్ (అలైహిస్సలాం) కాలంలో వచ్చిన పెను తుఫాను తరువాత మిగిలిన అతని సంతానమంతా ఎవరో కాదు,

وَقَضَيْنَآ إِلَىٰ بَنِىٓ إِسْرَٰٓءِيلَ فِى ٱلْكِتَٰبِ لَتُفْسِدُنَّ فِى ٱلْأَرْضِ مَرَّتَيْنِ وَلَتَعْلُنَّ عُلُوًّا كَبِيرًا ﴿٤﴾

4 మీరు భువిలో రెండుసార్లు కల్లోలాన్ని రేకెత్తిస్తారనీ, మరీ దారుణంగా చెలరేగి పోతారని ఇస్రాయీలు సంతతి వారికి మేము వారి గ్రంథంలో స్పష్టంగా తెల్చి వేశాము.

فَإِذَا جَآءَ وَعْدُ أُولَىٰهُمَا بَعَثْنَا عَلَيْكُمْ عِبَادًا لَّنَآ أُو۟لِى بَأْسٍ شَدِيدٍ فَجَاسُوا۟ خِلَٰلَ ٱلدِّيَارِ ۚ وَكَانَ وَعْدًا مَّفْعُولًا ﴿٥﴾

5 ఆ రెండింటిలో మొదటి వాగ్దానం వచ్చేసినప్పుడు, మీకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడే మా దాసులను పంపించాము. వారు మీ ఇళ్ళల్లోనికి చొచ్చుకుని వచ్చారు. ఎందుకంటే ఆ వాగ్దానం నెరవేరటం తథ్యం గనక.[8]

ثُمَّ رَدَدْنَا لَكُمُ ٱلْكَرَّةَ عَلَيْهِمْ وَأَمْدَدْنَٰكُم بِأَمْوَٰلٍ وَبَنِينَ وَجَعَلْنَٰكُمْ أَكْثَرَ نَفِيرًا ﴿٦﴾

6 మరి ఆ తరువాత మేము మీకు వారిపై ఆధిక్యతను వొసగి, మీ రోజులు మార్చాము. సంపద ద్వారా, సంతానం ద్వారా మీకు సహాయపడ్డాము. ఇంకా మిమ్మల్ని భారీ సంఖ్యాబలం గలవారు చేశాము.[9]

إِنْ أَحْسَنتُمْ أَحْسَنتُمْ لِأَنفُسِكُمْ ۖ وَإِنْ أَسَأْتُمْ فَلَهَا ۚ فَإِذَا جَآءَ وَعْدُ ٱلْءَاخِرَةِ لِيَسُۥٓـُٔوا۟ وُجُوهَكُمْ وَلِيَدْخُلُوا۟ ٱلْمَسْجِدَ كَمَا دَخَلُوهُ أَوَّلَ مَرَّةٍ وَلِيُتَبِّرُوا۟ مَا عَلَوْا۟ تَتْبِيرًا ﴿٧﴾

7 ఒకవేళ మీరు మంచి చేస్తే ఆ మంచి మీ స్వయం కోసమే. ఒకవేళ మీరు చెడుకు ఒడిగడితే అది మీ పాలిటే హానికరంగా పరిణమిస్తుంది. మరి రెండవ వాగ్దాన సమయం వచ్చినప్పుడు– మీ ముఖాలను వికృతం చేయటానికి మొదటిసారి లాగానే మళ్లీ అదే మస్జిదులోనికి జొరబడటానికి, తమకు దొరికిన దానినల్లా ధ్వంసం చేయటానికి[10] (మేము ఇతరులను మీపైకి పంపాము).

ఓడలో ఎక్కించబడినవారే. అందుకే ఇస్రాయీల్ సంతతి వారి నుద్దేశించి, "నూహ్ మీ తండ్రి, అతను కృతజ్ఞతాభావం నిండిన మా దాసుడు. మీరు కూడా మీ పితామహుని అడుగుజాడల్లో కృతజ్ఞతా వైఖరిని అవలంబించండి. మేము ముహమ్మద్ (సఅసం)ను ప్రవక్తగా చేసి పంపాము. మీరు అతన్ని ధిక్కరించి, మేము చేసిన మేలును మరువకండి" అని అల్లాహ్ ఈ ఆయతులో ఉపదేశిస్తున్నాడు.

8. హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) పుట్టక 600 ఏండ్ల క్రితం బాబిలోనియా చక్రవర్తి బుఖ్తెనసర్ చేతుల్లో యూదులకు ఎదురైన పరాభవం గురించి ఇక్కడ చెప్పబడింది. అతడు జెరూసలేంలో యూదులను నిర్దాక్షిణ్యంగా చంపాడు. చాలామంది యూదులను బానిసలుగా చేసుకున్నాడు. యూదులు దైవప్రవక్త హజ్రత్ షాయా (అలైహిస్సలాం)ను చంపినప్పుడో లేదా హజ్రత్ అర్మియా (అలైహిస్సలాం)ను నిర్బంధించి, తౌరాతు ఆజ్ఞలను ధిక్కరించి, అవనిలో కల్లోలాన్ని రేకెత్తించినప్పుడో ఈ సంఘటన జరిగింది. బుఖ్తెనసర్‌కు బదులు జాలూత్‌ను అల్లాహ్ యూదులపై వదిలాడని మరికొందరు అభిప్రాయపడ్డారు. అతడు యూదులపై ఎడతెగకుండా దౌర్జన్యాలు చేశాడు. చివరికి తాలూత్ నేతృత్వంలో హజ్రత్ దావూద్ (అలైహిస్సలాం) జాలూత్‌ను వధించారు.

9. అంటే బుఖ్తెనసర్ (లేదా జాలూత్) వధించబడిన తరువాత మీకు మంచి స్థితిని కలుగజేశాము. ఒకప్పుడు లేమితో బాధపడే మీకు మేము సిరిసంపదల్ని ప్రసాదించాము. సంతానాన్ని వొసగాము. అధికారాన్ని కూడా ఇచ్చాము. మీ సైనిక శక్తిని పెంచాము. ఆ విధంగా మీరు అనతికాలంలోనే ప్రపంచంలో మళ్లీ శక్తిని పుంజుకున్నారు.

10. రెండవసారి వారు, హజ్రత్ జకరియ్యా (అలైహిస్సలాం)ను వధించి కల్లోలాన్ని రేకెత్తించారు. హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు–

**8** మీ ప్రభువు మీపై కరుణ చూపే అవకాశం ఉంది. కాని మీరు గనక మళ్లీ అలాగే చేయటం మొదలెడితే మేము కూడా మళ్లీ అలాగే చేస్తాము.[11] మేము నరకాన్ని తిరస్కారుల కోసం కారాగారంగా చేసి ఉంచాము.[12]

عَسٰى رَبُّكُمْ اَنْ يَّرْحَمَكُمْ ۚ وَاِنْ عُدْتُّمْ عُدْنَا ۘ
وَجَعَلْنَا جَهَنَّمَ لِلْكٰفِرِيْنَ حَصِيْرًا ﴿8﴾

**9** నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ అన్నిటికంటే సవ్యమైన మార్గాన్ని చూపిస్తుంది. మంచి పనులు చేసే విశ్వాసులకు గొప్ప పుణ్యఫల ముందన్న శుభవార్తను అది వినిపిస్తుంది.

اِنَّ هٰذَا الْقُرْاٰنَ يَهْدِيْ لِلَّتِيْ هِيَ اَقْوَمُ وَيُبَشِّرُ
الْمُؤْمِنِيْنَ الَّذِيْنَ يَعْمَلُوْنَ الصّٰلِحٰتِ اَنَّ لَهُمْ
اَجْرًا كَبِيْرًا ﴿9﴾

**10** ఇంకా, పరలోకాన్ని నమ్మనివారి కోసం మేము వ్యధాభరిత మైన శిక్షను సిద్ధంచేసి ఉంచాము.

وَّاَنَّ الَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ بِالْاٰخِرَةِ اَعْتَدْنَا لَهُمْ
عَذَابًا اَلِيْمًا ﴿10﴾

**11**. మానవుడు తన కోసం మేలును అర్థించినట్లే కీడునూ అర్థిస్తున్నాడు. మానవుడు మహా తొందరపాటు స్వభావి.[13]

وَيَدْعُ الْاِنْسَانُ بِالشَّرِّ دُعَاۗءَهٗ بِالْخَيْرِ ۭ
وَكَانَ الْاِنْسَانُ عَجُوْلًا ﴿11﴾

**12** మేము రేయింబవళ్ళను (మా శక్తి) సూచనలుగా చేశాము. రాత్రి సూచనను మేము కాంతిహీనంగానూ, పగటి సూచనను కాంతిమంతంగానూ చేశాము– మీరు మీ ప్రభువు అనుగ్రహాన్ని

وَجَعَلْنَا الَّيْلَ وَالنَّهَارَ اٰيَتَيْنِ فَمَحَوْنَآ اٰيَةَ الَّيْلِ
وَجَعَلْنَآ اٰيَةَ النَّهَارِ مُبْصِرَةً لِّتَبْتَغُوْا فَضْلًا

అలైహిస్సలాం)ను హతమార్చేందుకు కుట్రపన్నారు. అయితే అల్లాహ్ ఈసాను సజీవంగా ఆకాశానికి లేపుకున్నాడు. వారి దురాగతాల ఫలితంగా అల్లాహ్ తిరిగి వారిపై రోము చక్రవర్తి అయిన టైటస్‌ను వదిలాడు. టైటస్ జెరూసలేముపై దండెత్తి యూదులను చిత్తు చిత్తుగా ఓడించాడు. ఎంతోమందిని ఖైదీలుగా పట్టుకున్నాడు. వారి ధనరాశులను కొల్లగొట్టాడు. వారి మతగ్రంథాలను కాళ్ల క్రింద తొక్కి ఘోరంగా అవమానపర్చాడు. బైతుల్ మఖ్దిస్, 'హైకలే సులైమానీ'లను ధ్వంసం చేశాడు. శాశ్వతంగా వారిని బైతుల్ మఖ్దిస్ నుంచి బహిష్కరించాడు. ఈ విధంగా వారికి చరిత్రలో అత్యంత ఘోరమైన పరాభవం మిగిలింది. ఈ విధ్వంసకాండ క్రీ.శ.70లో జరిగింది.

11. ఇదొక హెచ్చరిక. మీరు మీ ప్రవర్తనను సరిదిద్దుకుంటే దైవకారుణ్యానికి నోచుకునే అవకాశం ఉంది. ఇహపరాలలో మీకు గౌరవోన్నతులు ప్రాప్తిస్తాయి. ఒకవేళ – కుక్క తోక వంకర, ఎంత సరిచేసినా సరి కాదన్నట్లుగా వ్యవహరిస్తే మాత్రం మీమీద మళ్లీ కొరడా ఝుళిపించక తప్పదు. ఇంతకు ముందు రెండుసార్లు మీరు మా తడాఖాను చూసి ఉన్నారు.
కాని ఈ యూదులు తమ వైఖరిని మార్చుకోలేదు. మూసా, ఈసాల పట్ల చేసిన దుర్వ్యవహారమే వారు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల కూడా చేశారు. తత్ఫలితంగా యూదులు మూడవసారి ముస్లింల చేతిలో పరాభవానికి లోనయ్యారు. అత్యంత అవమానంతో వారు మదీనా, ఖైబర్ పట్టణాల నుంచి వెళ్ళిపోవలసి వచ్చింది.

12. ఇది ఇహలోక పరాభవం మాత్రమే. పరలోకంలో దుర్మార్గులకు నరకం రూపంలో పడే శిక్ష వేరుగా ఉంది. దాన్ని వారు అనుభవించక తప్పదు.

13. మానవుడు మహా ఆత్రగాడు, ధైర్యం లేనివాడు. అందువల్ల తనకు ఏ కాస్త బాధ కలిగినా కంగారుపడతాడు. అసహనంతో చిందులేస్తాడు. నిరాశతో తనకు మరణం వొసగమని ప్రార్థిస్తాడు. శుభంకోసం ఎంత ఆశగా అర్థిస్తాడో అశుభం కోసం కూడా అంతే ఆత్రంగా అర్థిస్తాడు. అయితే అశుభం కోసం అతడు చేసుకునే అభ్యర్థనలను అల్లాహ్ ఇట్టే ఆమోదించడు గనక అతడు 'బతికిపోతున్నాడు.' ఈ విషయమే యూనుస్ సూరా 11వ ఆయతులో కూడా వచ్చింది.

అన్వేషించగలగటానికి! సంవత్సరాల సంఖ్యను, లెక్కను తెలుసుకోగలగటానికి!![14] మేము ప్రతి విషయాన్ని బాగా విడమరచి చెప్పాము.[15]

مِّن رَّبِّكُمْ وَلِتَعْلَمُوا عَدَدَ السِّنِينَ وَالْحِسَابَ ۚ وَكُلَّ شَيْءٍ فَصَّلْنَاهُ تَفْصِيلًا ﴿١٢﴾

**13** మేము ప్రతి మనిషి యొక్క మంచి చెడులను అతని మెడలోనే వ్రేలాడదీశాము.[16] ప్రళయ దినాన మేము అతని కర్మల పత్రాన్ని (అతని సమక్షంలో) బయటపెడతాము. దాన్ని అతను తెరచిన పుస్తకంలా చూసుకుంటాడు.

وَكُلَّ إِنسَانٍ أَلْزَمْنَاهُ طَائِرَهُ فِي عُنُقِهِ ۖ وَنُخْرِجُ لَهُ يَوْمَ الْقِيَامَةِ كِتَابًا يَلْقَاهُ مَنشُورًا ﴿١٣﴾

**14** "(ఇదిగో!) నువ్వు స్వయంగా నీ పుస్తకాన్ని చదువుకో. ఈ రోజు నీ లెక్క తీసుకోవటానికి నువ్వే చాలు" (అని అతనితో అనబడుతుంది).

اقْرَأْ كِتَابَكَ كَفَىٰ بِنَفْسِكَ الْيَوْمَ عَلَيْكَ حَسِيبًا ﴿١٤﴾

**15** సన్మార్గాన్ని పొందేవాడు తన మేలు కోసమే సన్మార్గాన్ని పొందుతాడు. పెడదారి పట్టేవాడు తన కీడుకు తానే కారకుడౌతాడు. బరువు మోసే వాడెవడూ ఇంకొకరి బరువును తనపై వేసుకోడు.[17] ఒక ప్రవక్తను పంపనంతవరకూ ఎవరినయినా శిక్షించటం మా సంప్రదాయం కాదు.[18]

مَّنِ اهْتَدَىٰ فَإِنَّمَا يَهْتَدِي لِنَفْسِهِ ۖ وَمَن ضَلَّ فَإِنَّمَا يَضِلُّ عَلَيْهَا ۚ وَلَا تَزِرُ وَازِرَةٌ وِزْرَ أُخْرَىٰ ۗ وَمَا كُنَّا مُعَذِّبِينَ حَتَّىٰ نَبْعَثَ رَسُولًا ﴿١٥﴾

14. రాత్రిపూట మీరు నిద్రపోవాలనీ, అలసటను తీర్చుకోవాలన్న ఉద్దేశంతో ఆయన దాన్ని కాంతిహీనంగా చేశాడు. పగటిపూట మీరు కష్టపడి పనిచేసి, దైవప్రసాదితమైన జీవన భృతిని సంపాదించాలన్న ఉద్దేశంతో దాన్ని కాంతిమంతంగా చేశాడు. పైగా ఈ రేయింబవళ్ళ ద్వారా మీరు రోజుల, మాసాల, సంవత్సరాల సంఖ్యను గణిస్తారు. ఈ లెక్కవల్ల మీకు కలిగే ప్రయోజనాలు అసంఖ్యాకం. రాత్రి తరువాత పగలు, పగటి తరువాత రాత్రి రాకుండా ఉండేటట్లయితే నిత్యం రాత్రి లేక పగలే నెలకొని ఉండేవి. మీకు విశ్రాంతి తీసుకునే లేక ఉపాధిని అన్వేషించే అవకాశమే లభించేది కాదు. లెక్కా గిక్కా ఏమీ ఉండేది కాదు.

15. అంటే ప్రాపంచిక, ధార్మిక రంగాలకు సంబంధించిన అవసర విషయాలన్నీ స్పష్టంగా విశదీకరించటం జరిగింది. మనిషి వీటిద్వారా ప్రయోజనం పొంది తన ప్రాపంచిక జీవితాన్ని చక్కదిద్దు కోవటంతోపాటు, పరలోక జీవితాన్ని కూడా చక్కదిద్దుకొని సాఫల్యం పొందాలన్నదే దీని ముఖ్యోద్దేశం.

16. **'తాయిరున్'** అంటే అసలు పక్షి అని అర్థం. **'ఉనుఖున్'** అంటే మెడ. ఇమామ్ ఇబ్నె కసీర్ తాయిరున్ అనే పదాన్ని మనిషి కర్మల చిట్టా అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే అతను చేసే ప్రతి పని నమోదు చేయబడుతున్నది. అల్లాహ్ దగ్గర మనిషి కర్మల రికార్డు అంతా సురక్షితంగా ఉంటుంది. ప్రళయదినాన ఆ రికార్డును బట్టే అతని తీర్పు వెలువడుతుంది. **'తాయిర్'** అంటే మనిషి అదృష్టం (జాతకం) అని ఇమామ్ షౌకానీ భావించారు. ఎవరు సౌభాగ్యవంతుడు కానున్నాడో, మరెవరు దౌర్భాగ్యుడుగా తయారవుతాడో అల్లాహ్‌కు మొదటి నుంచే తెలుసు. ఆయన వారి మెడలలో అదృష్ట దురదృష్టాలను దండల మాదిరిగా వ్రేలాడదీశాడు. దాని ప్రకారమే మనిషి ఆచరణ చేస్తాడు. ఆ ఆచరణను బట్టే తీర్పు దినాన మనుషులకు తీర్పు వినిపించబడుతుంది.

17. అయితే తాము అపమార్గం పట్టడమే గాకుండా, ఇతరుల్ని కూడా అపమార్గం పట్టించిన వారికి వారి అపమార్గపు భారంతోపాటు, చెడగొట్టబడిన వారి పాపాల భారం కూడా మోపబడుతుంది. అయితే దీనివల్ల చెడగొట్టబడినవారి

**16** మేము ఏదైనా ఒక పట్టణాన్ని నాశనం చెయ్యాలని సంకల్పిం చుకున్నప్పుడు, అక్కడి స్థితిమంతులకు (కొన్ని) ఆజ్ఞలు జారీ చేస్తాము. కాని వారేమో అందులో అవిధేయతకు పాల్పడతారు. ఆ విధంగా వారిపై (శిక్షకు సంబంధించిన) మాట నిరూపితమవు తుంది. ఆపై మేము ఆ పట్టణాన్ని సర్వనాశనం చేసేస్తాము.[19]

وَإِذَآ أَرَدْنَآ أَن نُّهْلِكَ قَرْيَةً أَمَرْنَا مُتْرَفِيهَا
فَفَسَقُوا۟ فِيهَا فَحَقَّ عَلَيْهَا ٱلْقَوْلُ فَدَمَّرْنَٰهَا
تَدْمِيرًا ﴿16﴾

**17** మేము నూహు తరువాత కూడా ఎన్నో జాతులను తుద ముట్టించాము.[20] తన దాసుల పాపాలను తెలుసుకోవటానికి, చూడటానికి నీ ప్రభువు (ఒక్కడే) చాలు.

وَكَمْ أَهْلَكْنَا مِنَ ٱلْقُرُونِ مِنۢ بَعْدِ نُوحٍ ۗ وَكَفَىٰ
بِرَبِّكَ بِذُنُوبِ عِبَادِهِۦ خَبِيرًۢا بَصِيرًا ﴿17﴾

**18** ఎవడు తొందరగా లభించే ప్రాపంచిక లాభాలను కోరు కుంటాడో అతనికి మేము ఇహంలో తొందరగానే–మేము తలచిన వానికి తలచినంతగా – ఇస్తాము. ఎట్టకేలకు అతని కోసం మేము నరకాన్ని నియమిస్తాము. అందులోకి వాడు అత్యంత నికృష్ట స్థితిలో, కారుణ్యానికి దూరమైనవాడై ప్రవేశిస్తాడు.[21]

مَّن كَانَ يُرِيدُ ٱلْعَاجِلَةَ عَجَّلْنَا لَهُۥ فِيهَا مَا نَشَآءُ
لِمَن نُّرِيدُ ثُمَّ جَعَلْنَا لَهُۥ جَهَنَّمَ يَصْلَىٰهَا
مَذْمُومًا مَّدْحُورًا ﴿18﴾

పాపభారంలోనూ ఎలాంటి తగ్గింపూ రాదు. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇతర చోట్ల ఈ విషయం వచ్చింది. హదీసులలో కూడా దీని తప్సీళ్లు ఉన్నాయి.

18. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఇతర వచనాల ద్వారా అవగతమయ్యేదేమిటంటే, "మీ దగ్గరకు హెచ్చరిక చేసే మా ప్రవక్తలు రాలేదా?" అని వారిని అడగటం జరుగుతుంది. దానికి వారు 'వచ్చార'ని జవాబిస్తారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే ఏ జాతిలోనయినా దైవప్రవక్త రానంతవరకూ, దైవగ్రంథం వారిపై అవతరించనంతవరకూ దేవుడు వారిని శిక్షించడు. పరలోకంలో ఎవరికీ రవంత అన్యాయం జరగదు.

అలాగే చెవిటివారు, మతి స్థిమితంలేనివారు, బుద్ధి మందగించినవారు, ఇద్దరు ప్రవక్తల మధ్య గల – సంధికాలంలో మరణించినవారు కూడా ఉన్నారు. మరి వీళ్ళ సంగతేమిటీ? కొన్ని ఉల్లేఖనాల ద్వారా బోధపడేదేమిటంటే ప్రళయదినాన అల్లాహ్ కొంతమంది దూతలను వారి దగ్గరకు పంపిస్తాడు. "నరకంలోకి పోండి" అని దైవదూతలు వారితో అంటారు. సరేనంటూ వాళ్ల నరకంలోకి పోతే నరకం వారి పాలిట పూవనంలా అయిపోతుంది. 'కాదు' అని గనక అంటే వారు నరకంలోకి ఈడ్చబడతారు (ముస్నదె అహ్మద్–సంపుటి : 4, పేజీ – 24; ఇబ్నుమాజ– సంపుటి:9, పేజీ – 226; అల్లామా అల్ బానీ గారు సహీహ్ అల్ జామెవుస్సఘీర్ (881)లో దీనిని ప్రస్తావించారు). అయితే పసిపిల్లల విషయంలో మటుకు భేదాభిప్రాయం ఉంది. ముస్లింల పిల్లలు ఎలాగూ స్వర్గంలో ప్రవేశిస్తారు. ఎటొచ్చీ అవిశ్వాసుల, బహుదైవోపాసకుల పిల్లల విషయంలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. మహ్షర్ మైదానంలో వారికి పరీక్ష పెట్టడం జరుగుతుందనీ, దైవవిధేయతకు తలఒగ్గిన వారిని స్వర్గంలోకి, అవిధేయత చూపిన వారిని నరకంలోకి ప్రవేశం కల్పించటం జరుగుతుందని ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయపడ్డారు. ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ అభిప్రాయానికే ప్రాధాన్యత ఇచ్చారు. పరస్పర విరుద్ధంగా ఉన్న ఉల్లేఖనాలను ఈ అభిప్రాయం సమన్వయపరుస్తుందని కూడా ఆయన అన్నారు (వివరాల కోసం 'తఫ్సీర్ ఇబ్నె కసీర్' చూడండి). అయితే ముష్రిక్కుల చిన్న పిల్లలు కూడా స్వర్గంలో ప్రవేశిస్తారని సహీహ్ బుఖారీ ఉల్లేఖనం ద్వారా విదితమవుతోంది (3:251,12;348) (ఫత్‌హుల్ బారీ).

19. జాతుల వినాశానికి దారితీసే కారణాలు, సూత్రాలు ఇందులో చెప్పబడ్డాయి. మొదట సమాజంలోని స్థితిమంతులు దైవాజ్ఞల్ని ధిక్కరించటం మొదలెడతారు. ఇతరులు కూడా వారి పాదచిహ్నాలలో నడవటం మొదలెడతారు. ఈ విధంగా సమాజంలో అవిధేయత, చెడుగు సర్వసామాన్యమైపోతుంది. అప్పుడు వారు శిక్షకు పాత్రులవుతారు.

**19** మరెవరయితే పరలోకాన్ని కోరుకుని, దానికోసం కృషి చేయ
వలసిన విధంగా కృషిచేస్తాడో, విశ్వాసి అయి ఉంటాడో అలాంటి
వాని కృషి అల్లాహ్ వద్ద ఆదరణ పొందుతుంది.[22]

وَمَنْ أَرَادَ الْآخِرَةَ وَسَعَىٰ لَهَا سَعْيَهَا وَهُوَ
مُؤْمِنٌ فَأُولَٰئِكَ كَانَ سَعْيُهُم مَّشْكُورًا ﴿١٩﴾

**20** వారికీ, వీరికీ – ప్రతి ఒక్కరికీ – మేము (ప్రపంచంలో) నీ
ప్రభువు అనుగ్రహాల నుంచి వొసగుతూ పోతున్నాము. నీ ప్రభువు
ప్రసాదాలు (ఎవరి విషయంలో కూడా) ఆగిపోలేదు.[23]

كُلًّا نُّمِدُّ هَٰؤُلَاءِ وَهَٰؤُلَاءِ مِنْ عَطَاءِ رَبِّكَ ۚ
وَمَا كَانَ عَطَاءُ رَبِّكَ مَحْظُورًا ﴿٢٠﴾

**21** చూడు! వారిలో ఒకరిపై ఇంకొకరికి మేము ఎలా ఆధిక్యతను
ఇచ్చి ఉన్నామో! పరలోకం అంతస్థుల రీత్యా మరింత గొప్పది.
శ్రేష్ఠతరీత్యా మరింత ఉన్నతమైనది.[24]

انظُرْ كَيْفَ فَضَّلْنَا بَعْضَهُمْ عَلَىٰ بَعْضٍ ۚ
وَلَلْآخِرَةُ أَكْبَرُ دَرَجَاتٍ وَأَكْبَرُ تَفْضِيلًا ﴿٢١﴾

**22** అల్లాహ్‌తోపాటు వేరొక ఆరాధ్యుణ్ణి నిలబెట్టకు. అలా గనక
చేస్తే నువ్వు నిందితుడవై, నిస్సహాయుడవై కూర్చుంటావు.

لَّا تَجْعَلْ مَعَ اللَّهِ إِلَٰهًا آخَرَ فَتَقْعُدَ مَذْمُومًا
مَّخْذُولًا ﴿٢٢﴾

**23** నీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు: మీరు ఆయనను తప్ప
మరొకరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల
ఉత్తమంగా వ్యవహరించాలి. నీ సమక్షంలో వారిలో ఒకరుగాని,
ఇద్దరుగానీ వృద్ధాప్యానికి చేరుకుని ఉంటే వారి ముందు (విసుగ్గా)
"ఊహ్" అని కూడా అనకు. వారిని కసురుకుంటూ మాట్లాడకు.
పైగా వారితో మర్యాదగా మాట్లాడు.[25]

وَقَضَىٰ رَبُّكَ أَلَّا تَعْبُدُوا إِلَّا إِيَّاهُ وَبِالْوَالِدَيْنِ إِحْسَانًا ۚ
إِمَّا يَبْلُغَنَّ عِندَكَ الْكِبَرَ أَحَدُهُمَا أَوْ كِلَاهُمَا
فَلَا تَقُل لَّهُمَا أُفٍّ وَلَا تَنْهَرْهُمَا وَقُل لَّهُمَا
قَوْلًا كَرِيمًا ﴿٢٣﴾

---

20. వారు కూడా ఈ నియమాన్ననుసరించే తుదముట్టించబడ్డారు.

21. ప్రాపంచిక లాభాలను కోరుకున్న ప్రతి ఒక్కరికీ అవి ప్రాప్తించవు. అవి కూడా మేము తలచిన వారికి మాత్రమే దక్కుతాయి. అది కూడా వారు కోరుకున్నంతగా వారికి దొరకదు. మేము నిర్ణయించిన మోతాదులో మాత్రమే వారికి లభ్యమవుతుంది. అయితే ఈ ప్రాపంచిక వ్యామోహంలో దారుణంగా చిక్కుకుపోయిన వారికి చివరకు మిగిలేదేమిటో తెలుసా? శాశ్వితమైన పరాభవం! వ్యధాభరితమైన నరక శిక్ష!!

22. ఏ పుణ్యకార్యమైనా అల్లాహ్ సన్నిధిలో ఆదరణ పొందటానికి మూడు షరతులు పెట్టబడ్డాయి. 1. పరలోకాన్ని ఆశించటం – అంటే; చిత్తశుద్ధితో దైవప్రసన్నతను చూరగొనేందుకు కృషి చేయటం. 2. దానికి తగ్గట్టుగా పాటుపడటం– అంటే దైవప్రవక్త (స) విధానాన్ననుసరించి సదాచరణ చేయటం. 3. విశ్వాసి అయి ఉండటం – ఎందుకంటే విశ్వాసం లేకుండా ఏ సదాచరణ కూడా దైవసన్నిధిలో స్వీకృతి పొందదు. సదాచరణకు ఆమోద ముద్ర లభించాలంటే విశ్వాసంతో పాటు చిత్తశుద్ధి, దైవప్రవక్త విధాన అనుసరణ అవశ్యమన్నమాట!

23. అంటే ప్రాపంచిక ఆహార సామగ్రిని మేము విశ్వాసి – అవిశ్వాసి అన్న విచక్షణ లేకుండా అందరికీ ప్రసాదిస్తాము. ప్రాపంచిక సుఖభోగాలను ఆశించేవారికీ ఇస్తాము. పరలోక సాఫల్యాన్ని కోరేవారికీ ఇస్తాము. దేవుని అనుగ్రహాలు ఒకరికి అందకుండా ఎవరూ అడ్డుకోలేరు.

24. కాకపోతే ఈ ప్రాపంచిక వస్తుసామగ్రి ఒకరికి ఎక్కువగా, మరొకరికి తక్కువగా లభిస్తాయి–అందరికీ సమానంగా లభ్యం కాదు. అల్లాహ్ తన యుక్తినీ, ప్రణాళికనుబట్టి ఈ రకమైన పంపిణీ వ్యవస్థను ఏర్పరిచాడు. అయితే

**24** అణకువ, దయాభావం ఉట్టిపడే విధంగా నీ భుజాలను వారి ముందు అణచిపెట్టు.[26] "ఓ ప్రభూ! బాల్యంలో వీరు నన్ను (ప్రేమానురాగాలతో) పోషించినట్లుగానే నీవు వీరిపై దయజూపు" అని వారి కోసం ప్రార్థిస్తూ ఉండు.

وَاخْفِضْ لَهُمَا جَنَاحَ الذُّلِّ مِنَ الرَّحْمَةِ وَقُلْ
رَّبِّ ارْحَمْهُمَا كَمَا رَبَّيٰنِيْ صَغِيْرًا ﴿24﴾

**25** మీ ఆంతర్యాలలో ఏముందో మీ ప్రభువుకు బాగా తెలుసు. మీరు గనక మంచివారుగా మసలుకుంటే, అలా (మంచి వైపుకు) మరలివచ్చే వారిని అల్లాహ్ క్షమిస్తాడు.

رَبُّكُمْ اَعْلَمُ بِمَا فِيْ نُفُوْسِكُمْ ۚ اِنْ تَكُوْنُوْا
صٰلِحِيْنَ فَاِنَّهٗ كَانَ لِلْاَوَّابِيْنَ غَفُوْرًا ﴿25﴾

**26** బంధువుల, నిరుపేదల, ప్రయాణీకుల హక్కును వారికి ఇస్తూ ఉండు.[27] దుబారా ఖర్చు చేయకు.

وَاٰتِ ذَا الْقُرْبٰى حَقَّهٗ وَالْمِسْكِيْنَ وَابْنَ السَّبِيْلِ
وَلَا تُبَذِّرْ تَبْذِيْرًا ﴿26﴾

---

పరలోకంలో ఈ అంతస్థుల అసలు పరమార్థం స్పష్టమవుతుంది. అక్కడ విశ్వాసులు స్వర్గంలోకి, అవిశ్వాసులు నరకంలోకి వెళతారు.

25. ఈ ఆయతులో అల్లాహ్ తన ఆరాధన తరువాత, తల్లిదండ్రుల యెడల మంచిగా మెలగటాన్ని రెండో స్థానంలో ఉంచాడు. దీన్నిబట్టి తల్లిదండ్రుల విధేయత, వారి సేవ, వారి గౌరవ మర్యాదలు ఎంత ముఖ్యమైనవో విదితమవుతోంది. దైవదాస్యం కోరే ప్రధానాంశాలను నెరవేర్చటం ఎంత అవసరమో, ఆ తర్వాత మాతాపితల విధేయతలో ఇమిడి ఉన్న ముఖ్యాంశాలను నెరవేర్చటం కూడా అంతే అవసరం. హదీసుల ద్వారా కూడా ఈ సంగతి పదే పదే నొక్కి వక్కాణించబడింది. ముఖ్యంగా మాతాపితలు ముసలివారుగా ఉన్నప్పుడు వారి ముందు విసుగును, చిరాకును ప్రదర్శించకూడదు. వారిని కసురుకోకూడదు. ఎందుకంటే ముసలితనంలో వారు బలహీనులు, నిస్సహాయులు, దిక్కు తోచనివారై ఉంటారు. అదే సమయంలో వారి పిల్లలు యుక్తవయస్కులై ఉంటారు. సంపాదనాపరులై ఉంటారు. భావాలు భావనల రీత్యా తల్లిదండ్రులకు – పిల్లలకు మధ్య ఎంతో వైరుధ్యం ఉంటుంది. పరువం ఉరకలు వేసే వయసులో పిల్లలు తమ ముసలి తల్లిదండ్రుల అవసరాలను తెలుసుకుని తదనుగుణంగా మసలుకోవటమన్నది కించిత్ కష్టమైనపనే కావచ్చు. కాని ఈమాత్రం ఓపికను, సేవానిరతిని కనబరచినవాడే దైవసన్నిధిలో ప్రీతి పాత్రుడవుతాడు.

26. పక్షి తన పసిపిల్లలను తన వాత్సల్యభరితమైన నీడలోకి తీసుకోదలచినప్పుడు తన రెక్కలతో వాటిని కప్పేస్తుంది. వెచ్చని తన కౌగిలిలో ఆశ్రయాన్ని కల్పిస్తుంది. కాబట్టి మీరు కూడా మీ తల్లిదండ్రులతో అదేవిధంగా దయాభావంతో మెలగాలి. వారు మిమ్ము పసితనంలో పోషించినట్లుగానే మీరు వారిని పోషించాలి. పక్షి ఆకాశంలో ఎగిరి పోయేటప్పుడు తన రెక్కల్ని చాచుతుంది. నేల మీదికి దిగేటప్పుడు తన రెక్కలను ముడుచుకుంటుంది. అలాగే మీరు మీ తల్లిదండ్రుల ముందు వినయవినమ్రతలు చూపాలంటే మీలో కాస్తంత అణకువ ఉండాలి.

27. **'హక్కు'** అనే పదాన్ని ఉపయోగించటాన్నిబట్టి మనకు అర్థమయ్యేదేమిటంటే బంధువులకు, అగత్యపరులకు, బాటసారులకు ఎప్పుడన్నా ఏదన్నా యిచ్చి వారిని దెప్పిపొడవ కూడదు. ఎందుకంటే మీరు వారికి చేసేది ఉపకారం కాదు. వారి హక్కును వారికిస్తున్నారంతే. స్థితిమంతుల ఆస్తిపాస్తుల్లో, ధనధాన్యాలలో అల్లాహ్ ఈ 'హక్కు'ను ఉంచాడు. ధనవంతుడు గనక ఈ 'హక్కు'ను హక్కుదారులకు ఇవ్వకపోతే అతడు అల్లాహ్ సమక్షంలో పట్టుబడతాడు. ఈ జాబితాలో బంధువుల ప్రస్తావన అందరికన్నా ముందు రావటం గమనార్హం. బంధువులకు ఇవ్వవలసిన హక్కును ఇవ్వటం, వారిపట్ల ఉత్తమంగా మెలగటం – ఇదంతా 'సిలారహ్మీ'గా వ్యవహరించబడుతుంది. సిలారహ్మీ గురించి ఇస్లాం పదే పదే నొక్కి పలుకుతోంది.

**27** దుబారా ఖర్చు చేసేవారు షైతానుల సోదరులు. మరి షైతానేమో తన ప్రభువునకు కృతఘ్నుడు.[28]

إِنَّ الْمُبَذِّرِينَ كَانُوا إِخْوَانَ الشَّيَاطِينِ ۖ وَكَانَ الشَّيْطَانُ لِرَبِّهِ كَفُورًا (27)

**28** ఒకవేళ నువ్వు ఆశించే నీ ప్రభువు కారుణ్యాన్ని నువ్వు ఇంకా అన్వేషిస్తూ ఉన్నందువల్ల వారి నుంచి ముఖం తిప్పుకో వలసివస్తే మృదువుగా వారికి నచ్చజెప్పు.[29]

وَإِمَّا تُعْرِضَنَّ عَنْهُمُ ابْتِغَاءَ رَحْمَةٍ مِّن رَّبِّكَ تَرْجُوهَا فَقُل لَّهُمْ قَوْلًا مَّيْسُورًا (28)

**29** నీ చేతిని నీ మెడకు కట్టి ఉంచకు. అలాగని దానిని విచ్చల విడిగానూ వదలి పెట్టకు. అలా చేశావంటే నువ్వు నిందల పాలవుతావు, దిక్కుమాలిన స్థితికి లోనై కూర్చుంటావు.[30]

وَلَا تَجْعَلْ يَدَكَ مَغْلُولَةً إِلَىٰ عُنُقِكَ وَلَا تَبْسُطْهَا كُلَّ الْبَسْطِ فَتَقْعُدَ مَلُومًا مَّحْسُورًا (29)

**30** నిశ్చయంగా నీ ప్రభువు తాను కోరిన వారి కోసం ఉపాధిని విస్తృతపరుస్తాడు. తాను కోరిన వారికి పరిమితం చేస్తాడు.[31] నిస్సందేహంగా ఆయన తన దాసుల గురించి అన్నీ తెలిసిన వాడు, అంతా చూస్తున్నవాడు.

إِنَّ رَبَّكَ يَبْسُطُ الرِّزْقَ لِمَن يَشَاءُ وَيَقْدِرُ ۚ إِنَّهُ كَانَ بِعِبَادِهِ خَبِيرًا بَصِيرًا (30)

---

28. **'తబ్జీర్'** అనే పదం బిజ్రున్ (విత్తనం) నుంచి వచ్చింది. విత్తనాన్ని నేలలో చల్లేటప్పుడు అది సరిగ్గా పడిందా, సరైన చోటులోనే పడిందా? లేక అటూఇటూ పడిందా? అని చూడటం జరగదు. రైతు విత్తనాన్ని చల్లి ఇంటికెళ్ళిపోతాడు. దుబారా ఖర్చు కూడా అంతే. దుబారా ఖర్చుచేసేవాడు తాను ఎంత డబ్బు తగలెట్టిందీ, ఎక్కడ తగలెట్టిందీ చూడడు. పైగా అతను విత్తనం మాదిరిగా తన డబ్బును వెదజల్లుతాడు. ఈ విధంగా డబ్బును వృధా చేసేవాడు షైతాన్ సోదరునిగా పోల్చబడ్డాడు. అందుకే మానవుడు ఈ పోలిక నుంచి తన్ను రక్షించుకోవాలంటే అతను తన సంపాదనను అనవసరమైన పద్దుల్లో నిరర్థకంగా ఖర్చుపెట్టే అలవాటును మానుకోవాలి. షైతాన్ దేవుని మేలును మరచినవాడు. కాబట్టి మానవుడు అతని అడుగు జాడలలో నడచి తాను కూడా 'దేవుని కృతఘ్నుడు'గా మారకూడదు (ఫత్హుల్ ఖదీర్).
29. అడిగిన వారికి ఇవ్వాలంటే మీ దగ్గర ఉండాలి కదా! కొన్నిసార్లు మీ వద్దే లేని పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితిలో మీరు దేవుని నుంచి కలిమిని ఆశిస్తూ ఉంటారు. మీరేవిధంగా మీ ప్రభువుపై ఆశ పెట్టుకున్నారో అదే విధంగా చేయిచాచి అడిగేవారు కూడా మీపై ఎన్నో ఆశలుపెట్టుకుని అడుగుతారు. అలా అడిగినప్పుడు మీరు ఎంతో మృదువుగా, సున్నితంగా దాటవేయాలి. వారిని కసురుకోకూడదు. వారి మనసు నొప్పించే విధంగా మాట్లాడ కూడదు.
30. వెనుకటి ఆయతులో ధర్మం చేయటానికి నిరాకరిస్తే ఏవిధంగా నిరాకరించాలో చెప్పబడింది. ఈ ఆయతులో ఖర్చు పెట్టవలసిన తీరు గురించి చెప్పబడింది. మనిషి తన ఆలుబిడ్డలను సయితం విస్మరించేటంత పిసినారిగానూ మారరాదనీ, ముందూ వెనుకా చూసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా వృధాగానూ ఖర్చుపెట్టకూడదని ప్రబోధించబడింది. పిసినారితనం వల్ల మనిషి నలుగురి చేత విమర్శించబడతాడు, అప్రతిష్ఠ పాలవుతాడు. అలాగే దుబారా ఖర్చువల్ల మనిషి దివాలా తీస్తాడు. (మూలంలో **'మహ్సూర్'** అన్న పదం వచ్చింది. నడిచి నడిచి బాగా అలసిపోయి, ఇక నడవటానికి శక్తిలేకుండా పోయిన జంతువును 'మహ్సూర్'గా వ్యవహరిస్తారు). అలాగే దుబారా ఖర్చుచేసే మనిషి చేతిలో చిల్లగవ్వ కూడా లేకుండా చతికిలబడతాడు. 'చేతిని మెడకు బంధించి ఉంచకు' అంటే పరమ పీనాసిగా మారకు అని భావం. 'చేతిని మరీ విచ్చలవిడిగా వదలిపెట్టకు' అంటే ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టేసి, నెత్తిమీద గుడ్డ పెట్టుకుని కూర్చునే స్థితి రానీయకు అని అర్థం.
31. ఈ ఆయతులో విశ్వాసులకు ఓదార్పు ఉంది. ఎవరివద్దయినా పరిమితమైన ఒనరులు ఉంటే వారు దైవదృష్టిలో

**31** దారిద్ర్య భయంతో మీరు మీ సంతానాన్ని చంపేయకండి. వారికీ, మీకూ ఉపాధిని ఇచ్చేది మేమే. ముమ్మాటికీ వారి హత్య మహాపాతకం.[32]

وَلَا تَقْتُلُوا أَوْلَادَكُمْ خَشْيَةَ إِمْلَاقٍ ۖ نَحْنُ نَرْزُقُهُمْ
وَإِيَّاكُمْ ۚ إِنَّ قَتْلَهُمْ كَانَ خِطْئًا كَبِيرًا ﴿٣١﴾

**32** వ్యభిచారం దరిదాపులకు కూడా పోకూడదు సుమా! ఎందుకంటే అది నీతి బాహ్యమైన చేష్ట. మహా చెడ్డమార్గం.[33]

وَلَا تَقْرَبُوا الزِّنَىٰ ۖ إِنَّهُ كَانَ فَاحِشَةً وَسَاءَ سَبِيلًا ﴿٣٢﴾

**33** న్యాయసమ్మతంగా తప్ప – అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణినీ హతమార్చకూడదు.[34] అన్యాయంగా చంపబడినవాని వారసునికి మేము అధికారం ఇచ్చి ఉన్నాము. అయితే అతను వధించటంలో మితి మీరకూడదు. నిశ్చయంగా అతను సహాయం చేయబడినవాడు.[35]

وَلَا تَقْتُلُوا النَّفْسَ الَّتِي حَرَّمَ اللَّهُ إِلَّا بِالْحَقِّ ۗ
وَمَن قُتِلَ مَظْلُومًا فَقَدْ جَعَلْنَا لِوَلِيِّهِ سُلْطَانًا
فَلَا يُسْرِف فِّي الْقَتْلِ ۖ إِنَّهُ كَانَ مَنصُورًا ﴿٣٣﴾

---

ఆదరణకు నోచుకోలేదని భావం ఎంతమాత్రం కాదు. మనిషి ఉపాధిలో గల ఈ హెచ్చుతగ్గులలో దేవుని పరమార్థం దాగి ఉంది. ఆయన కోరితే తన శత్రువులను ఖారూన్ లాంటి కుబేరుల్లా చేసేస్తాడు. లేదా తాను ఇష్టపడే తన దాసులకు చాలీచాలని భృతిని మాత్రమే ప్రసాదిస్తాడు. ఇదంతా ఆయన లీల.

32. అల్ అన్ఆమ్ సూరాలోనూ ఈ విషయం వచ్చింది (151వ ఆయతు). దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) షిర్క్ తరువాత సంతానహత్యను అత్యంత ఘోరమైన అత్యాచారంగా పేర్కొన్నారు. (సహీహ్ బుఖారీ – అల్ బఖరా సూరా వ్యాఖ్యానం; సహీహ్ ముస్లిం– కితాబుత్తౌహీద్).

నేడు ప్రపంచంలో సంతాన హత్య ఎంతో పకడ్బందీగా, కుటుంబ నియంత్రణా పథకం లాంటి అందమైన ప్రణాళికలతో జరుగుతోంది. సంతానానికి మంచి శిక్షణ ఇచ్చే నెపంతో, స్త్రీల అందచందాలు తరగిపోకుండా ఉండాలనే సాకుతో ఈ ఫామిలీ ప్లానింగ్ స్కీమును అమలుపరచి సంతానాన్ని నేలపై కాలిడకుండా అడ్డుకుంటున్నారు.

33. ఇస్లాంలో వ్యభిచారం చాలా పెద్ద నేరం. వివాహితుడైన పురుషుడు లేక వివాహిత స్త్రీ గనక ఈ పాపానికి ఒడిగడితే అలాంటివారు ముస్లిం సమాజంలో మనుగడ సాగించలేరు. అలాంటి వారిని ఒక్క ఖడ్గపు వేటుతో కూడా చంపకూడదు. పైగా అలాంటివారిని రాళ్లు రువ్వి నిర్దాక్షిణ్యంగా చంపాలి. ఎందుకంటే ఆ దృశ్యం సమాజంలోని సభ్యులకు ఒక గుణపాఠం కావాలి. 'వ్యభిచారం చేయకూడదు' అని చెప్పలేదు. 'వ్యభిచారం దరిదాపులకు కూడా పోకూడదు' అని అనబడింది. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే వ్యభిచారానికి దారితీసే విషయాలన్నింటికీ దూరంగా ఉండాలి. ఉదాహరణకు : పరాయి స్త్రీని చూడటం, ఆమెతో కలసి తిరిగే, కబుర్లు చెప్పే ప్రయత్నం చేయటం, అలాగే స్త్రీలు విచ్చలవిడిగా బయటతిరగటం, తమకు రక్షణలేని చోట్ల తమవారు లేకుండా వెళ్లడం మంచిది కాదు. ఎందుకంటే చెడు చూపు వ్యభిచారానికి తొలిమెట్టు వంటిది.

34. న్యాయబద్ధంగా చంపటం అంటే ఖిసాస్ (ప్రతీకార న్యాయం) రూపంలో చంపటం అని అర్థం. మానవ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం హంతకునికి శిక్ష పడటం అవసరం. హతుని వారసులకు న్యాయం చేకూరటం కూడా అవసరమే. అలాగే వివాహితులై ఉండి అక్రమ లైంగిక సంబంధం ఏర్పరచుకున్న వారికి కూడా కఠిన శిక్ష వినిపించబడింది.

35. హతుని వారసులకు అధికారం ఇవ్వబడింది. ఇంతకీ ఏమిటీ ఆ అధికారం? అంటే రాజ్యాధికారి షరీయతుననుసరించి తీర్పు వినిపించిన తరువాత హతుని వారసుడు తాను తలచుకుంటే హంతకునిపై ప్రతీకారం తీర్చుకోగలడు. లేదా దియత్ (రక్తపరిహారం) పుచ్చుకుని ఊరుకోగలడు. లేదా హంతకునికి క్షమాభిక్ష పెట్టగలడు. ఒకవేళ ప్రతీకారం తీర్చుకోవాలన్నదే హతుని వారసుల అభిమతం అయివుంటే వారు ఈ విషయంలో హద్దు మీరకూడదు. అంటే ఒక

34 అత్యుత్తమమైన పద్ధతిలో తప్ప అనాథ ఆస్తి దరిదాపులకు కూడా వెళ్ళకండి – అతను యుక్త వయస్సుకు చేరేవరకు.[36] వాగ్దానాన్ని (చేసుకున్న ప్రతి ఒప్పందాన్ని) నెరవేర్చండి. ఎందుకంటే వాగ్దానం (ఒప్పందం) గురించి ప్రశ్నించబడుతుంది.[37]

وَلَا تَقْرَبُوْا مَالَ الْيَتِيْمِ اِلَّا بِالَّتِيْ هِيَ اَحْسَنُ حَتّٰى يَبْلُغَ اَشُدَّهٗ ۪ وَاَوْفُوْا بِالْعَهْدِ ۚ اِنَّ الْعَهْدَ كَانَ مَسْـُٔوْلًا ﴿34﴾

35 మీరు కొలచి ఇస్తున్నప్పుడు నిండుగా కొలిచి ఇవ్వండి. సరైన త్రాసుతో తూయండి. ఇదే ఉత్తమమైనది.[38] పర్యవసానం రీత్యా కూడా ఇదే మేలైనది.

وَاَوْفُوا الْكَيْلَ اِذَا كِلْتُمْ وَزِنُوْا بِالْقِسْطَاسِ الْمُسْتَقِيْمِ ۭ ذٰلِكَ خَيْرٌ وَّاَحْسَنُ تَاْوِيْلًا ﴿35﴾

36 నీవు తెలుసుకోవలసిన అవసరం లేని విషయాల వెంట పడకు.[39] ఎందుకంటే చెవి, కన్ను, హృదయం – వీటన్నింటి గురించి ప్రశ్నించటం జరుగుతుంది.[40]

وَلَا تَقْفُ مَا لَيْسَ لَكَ بِهٖ عِلْمٌ ۭ اِنَّ السَّمْعَ وَالْبَصَرَ وَالْفُؤَادَ كُلُّ اُولٰۗىِٕكَ كَانَ عَنْهُ مَسْـُٔوْلًا ﴿36﴾

37 నేలపై నిక్కుతూ నడవకు – నువ్వు నేలను చీల్చనూ లేవు. పర్వత శిఖరాలను అందుకునే ఎత్తుకు ఎదగనూ లేవు.[41]

وَلَا تَمْشِ فِي الْاَرْضِ مَرَحًا ۚ اِنَّكَ لَنْ تَخْرِقَ الْاَرْضَ وَلَنْ تَبْلُغَ الْجِبَالَ طُوْلًا ﴿37﴾

ప్రాణానికి బదులుగా ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మందిని చంపకూడదు. హంతకుణ్ణి చిత్రవధ చేయకూడదు. హతుని వారసుడు సహాయం పొందినవాడుగా ఖరారు చేయబడ్డాడు. అంటే అతన్ని ఆదుకోవలసిందిగా రాజ్యాధికారులకు తాకీదు చేయబడింది. అందుకుగాను హతుని వారసుడు కృతజ్ఞుడై ఉండాలే తప్ప అన్యాయానికి, అక్రమాలకు పాల్పడటం భావ్యం కాదు.

36. అన్యాయంగా ఒక ప్రాణిని చంపరాదని చెప్పటంతోపాటు, ఒకరి సొమ్మును అన్యాయంగా కబళించరాదని ప్రబోధించటం గమనార్హం. అనాథల ఆస్తి విషయంలోనైతే మరింత న్యాయంగా మసలుకోవాలి. అనాథలు యుక్త వయస్సుకు చేరుకునే వరకూ వారి ఆస్తిని కాపాడాలి. వీలైతే వారి ఆస్తిని మరింతగా పెంచాలి. అర్థంపర్థం లేకుండా ఖర్చుపెట్టి వారి ఆస్తికి నష్టం చేకూర్చకూడదు.

37. ఇక్కడ వాగ్దానం రెండు రకాలు. ఒకటి: మనిషి తాను అల్లాహ్‌కు చేసిన బాస. రెండు: మనిషి సాటి మనిషికి చేసిన వాగ్దానం. ఈ రెండు రకాల వాగ్దానాలనూ నెరవేర్చటం చాలా అవసరం. వాగ్దానాన్ని నిలబెట్టుకోకపోతే అల్లాహ్ సమక్షంలో సమాధానం ఇవ్వవలసి ఉంటుంది.

38. అంటే పుణ్యం రీత్యా మేలైనది. పైగా ఇలా ప్రవర్తించటం వలన ప్రజలలో నమ్మకం ఏర్పడుతుంది. వర్తకంలో పరపతి పెరుగుతుంది. అందుకే వ్యాపార లావాదేవీలలో నిజాయితీగా వ్యవహరించటం చాలా అవసరం.

39. అంటే తమకు తెలియని విషయాలలో అనవసర జోక్యం కల్పించుకోవటం, కూపీలు లాగటం, అతిగా అనుమానించటం ఎంతమాత్రం తగదు. అలాగే తెలియని విషయాలపై అధిక ప్రసంగం చేయటం, వాటిని ఆచరణలో పెట్టడం కూడా సమంజసం కాదు.

40. జాగ్రత్త! అక్కరకు రాని విషయాల వెనుకపడి మీ శక్తియుక్తులను దుర్వినియోగం చేశారంటే రేపు అల్లాహ్ సన్నిధిలో పట్టుబడతారు. నువ్వు విన్నావా? అని చెవిని, నువ్వు కన్నావా? అని కళ్ళను, నువ్వు తెలుసుకున్నావా? అని హృదయాన్ని నిలదీసి అడగటం జరుగుతుంది. ఎందుకంటే విషయ పరిజ్ఞానం ఈ మూడింటితోనే ముడిపడి ఉంటుంది. ప్రళయదినాన అల్లాహ్ ఈ శరీరావయవాలకు మాట్లాడే శక్తిని ఇస్తాడు.

41. నిక్కుతూ, నీల్గుతూ నడవటం అల్లాహ్‌కు సుతరామూ ఇష్టం లేదు. ఈ గర్వాహంకారం మూలంగానే శ్రీమంతుడైన

**38** వీటన్నింటిలో గల చెడుగు నీ ప్రభువు సన్నిధిలో (అత్యధికంగా) అసహ్యించుకోబడుతుంది.[42]

كُلُّ ذٰلِكَ كَانَ سَيِّئُهٗ عِنْدَ رَبِّكَ مَكْرُوْهًا ﴿38﴾

**39** ఇవన్నీ కూడా నీ ప్రభువు నీ వద్దకు వహీ ద్వారా పంపిన వివేచనాభరిత విషయాలు. నువ్వు అల్లాహ్‌తోపాటు వేరొకరిని ఆరాధ్యునిగా కల్పించకు. ఒకవేళ అలా చేశావంటే నిందితుడవై, ప్రతి మేలుకు దూరమైనవాడై నరకంలోకి నెట్టివేయబడతావు.

ذٰلِكَ مِمَّآ اَوْحٰٓى اِلَيْكَ رَبُّكَ مِنَ الْحِكْمَةِ ؕ وَلَا تَجْعَلْ مَعَ اللّٰهِ اِلٰهًا اٰخَرَ فَتُلْقٰى فِيْ جَهَنَّمَ مَلُوْمًا مَّدْحُوْرًا ﴿39﴾

**40** ఏమిటీ, మీ ప్రభువు మీ కోసం కొడుకుల్ని కేటాయించి, తన కోసమేమో దూతలను కూతుళ్ళుగా చేసుకున్నాడా? నిశ్చయంగా మీరు చాలా పెద్ద (ఘోరమైన) మాట అంటున్నారు.

اَفَاَصْفٰىكُمْ رَبُّكُمْ بِالْبَنِيْنَ وَاتَّخَذَ مِنَ الْمَلٰٓئِكَةِ اِنَاثًا ؕ اِنَّكُمْ لَتَقُوْلُوْنَ قَوْلًا عَظِيْمًا ﴿40﴾

**41** ప్రజలు హితవు గ్రహించటానికిగాను మేము ఈ ఖుర్‌ఆన్‌లో (విషయాన్ని) పలు విధాలుగా విడమరిచి చెప్పాము.[43] కాని దాని మూలంగా వారిలో సత్యం పట్ల దూరమే మరింతగా పెరుగుతోంది.

وَلَقَدْ صَرَّفْنَا فِيْ هٰذَا الْقُرْاٰنِ لِيَذَّكَّرُوْا ؕ وَمَا يَزِيْدُهُمْ اِلَّا نُفُوْرًا ﴿41﴾

**42** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: వారు చెబుతున్నట్లుగా అల్లాహ్‌తో పాటు వేరే ఆరాధ్య దైవాలు గనక ఉండి ఉంటే వారు ఇప్పటికే సింహాసనాధీశుని వైపుకు వెళ్ళే మార్గాన్ని అన్వేషించి ఉండేవారే.[44]

قُلْ لَّوْ كَانَ مَعَهٗٓ اٰلِهَةٌ كَمَا يَقُوْلُوْنَ اِذًا لَّابْتَغَوْا اِلٰى ذِي الْعَرْشِ سَبِيْلًا ﴿42﴾

---

ఖారూన్ తన సిరిసంపదల సమేతంగా నేలలో కూర్చివేయబడ్డాడు (అల్ ఖసస్-81). ఒక హదీసులో ఇలా ఉంది: "ఒక వ్యక్తి రెండేసి దుప్పట్లు ధరించి, విర్రవీగుతూ నడవసాగాడు. ఫలితంగా అతడు నేలలో కూర్చివేయబడ్డాడు. ప్రళయదినం వరకూ అతడు కూర్చివేయబడుతూనే ఉంటాడు" (సహీహ్ ముస్లిం - కితాబుల్ లిబాస్). అల్లాహ్‌కు దాసుల అణకువ, వినమ్రత ఎంతో ఇష్టం.

42. అంటే ప్రస్తావించబడిన విషయాలలో ఏవైతే చెడ్డవో వాటి జోలికి వెళ్ళకూడదు. ఎందుకంటే అల్లాహ్ వాటిని ఇష్టపడడు.

43. అంటే ఉపదేశాల ద్వారా, ఉపమానాల ద్వారా, నిదర్శనాల ద్వారా, సంఘటనల ద్వారా, ప్రోత్సాహం ద్వారా వారికి విషయాన్ని విశదీకరించటం జరిగింది. కాని వారు 'కుఫ్ర్' (అవిశ్వాసం, తిరస్కారం) అనే అంధకారంలో చిక్కుకుని ఉన్నారు. దాన్నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నారా! అంటే అదీ లేదు. పైగా వెలుగుకు మరింత దూరం అవుతున్నారు. ఎందుకంటే ఈ ఖుర్‌ఆన్ గ్రంథం పట్ల వారిలో అపోహలు ఉన్నాయి. దీన్ని వారు జాలవిద్యగా, కవిత్వంగా తలపోస్తున్నారు. ఈ అపోహ దూరం కానంతవరకూ ఖుర్‌ఆన్ వారికి మార్గదర్శకం కాజాలదు. ఎందుకంటే దివ్య ఖుర్‌ఆన్ ఆకాశం నుంచి కురిసే వానజల్లు వంటిది. సారవంతమైన నేల ఆ కారుణ్య బిందువులను గ్రహించి అది సస్యశ్యామలంగా మారుతుంది. ఒకవేళ ఆ నేల చవుడునేల, నిస్సారమైన భూమి అయివుంటే అది బురద బురదగా మారటం తప్ప ఎలాంటి ప్రయోజనాన్నీ ఇవ్వదు.

44. దీనికి ఒక అర్థం ఇది: ఒక రాజు మరో రాజ్యాధికారిపై సైన్యంతో దండెత్తి ఆ రాజ్యాన్ని వశపరచుకున్నట్లే ఈ

**43** ఆయన పరిశుద్ధుడు. వారు అనే ఈ మాటలకు ఎంతో అతీతుడు, ఎంతో ఉన్నతుడు.[45]

سُبْحٰنَهٗ وَتَعٰلٰى عَمَّا يَقُوْلُوْنَ عُلُوًّا كَبِيْرًا ﴿43﴾

**44** సప్తాకాశాలు, భూమి, వాటిలో ఉన్నవన్నీ ఆయన పవిత్ర తనే కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడని వస్తువంటూ ఏదీ లేదు. అయితే మీరు వాటి స్తుతిని గ్రహించలేరు.[46] ఆయన గొప్ప సహనశీలుడు, క్షమాగుణం కలవాడు.

تُسَبِّحُ لَهُ السَّمٰوٰتُ السَّبْعُ وَالْاَرْضُ وَمَنْ فِيْهِنَّ ؕ وَاِنْ مِّنْ شَيْءٍ اِلَّا يُسَبِّحُ بِحَمْدِهٖ وَلٰكِنْ لَّا تَفْقَهُوْنَ تَسْبِيْحَهُمْ ؕ اِنَّهٗ كَانَ حَلِيْمًا غَفُوْرًا ﴿44﴾

**45** (ఓ ప్రవక్తా!) నువ్వు ఖుర్‌ఆను పఠిస్తున్నప్పుడు, మేము నీకూ – పరలోకాన్ని నమ్మనివారికీ మధ్య కనిపించని ఒక తెరను వేసేస్తాము.[47]

وَاِذَا قَرَاْتَ الْقُرْاٰنَ جَعَلْنَا بَيْنَكَ وَبَيْنَ الَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ بِالْاٰخِرَةِ حِجَابًا مَّسْتُوْرًا ﴿45﴾

ఇతరత్రా ఆరాధ్య దైవాలు కూడా ప్రాబల్యం పొందే దారులు వెదికి ఉండేవి. కాని ఇప్పటివరకూ అలాంటిదేదీ జరగలేదు. మరి చూడబోతే తరతరాలుగా, యుగయుగాలుగా ఈ చిల్లర దేముళ్లు పూజలందుకుంటున్నారు. వారిపేర మొక్కుబడులు కూడా తీర్చుకోబడుతున్నాయి. కాని ఫలితం శూన్యం. కాబట్టి బోధపడేదేమంటే అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేదు. లాభనష్టాలు చేకూర్చేశక్తి కూడా వేరితరులకు లేదు.

రెండవ అర్థం: ఒకవేళ నిజంగానే వేరితర దేవుళ్లు ఉండి వుంటే వారు ఈ పాటికి అల్లాహ్ సామీప్యం పొంది, తమను కొలిచే ముష్రిక్కులను దేవుని ప్రీతిపాత్రులుగా చేసి ఉండేవారు.

45. తాము కొలిచే "చిట్టిపొట్టి దేముళ్లు" అల్లాహ్‌కు సహవర్తులని ముష్రిక్కులు చెప్పే మాటలకు అల్లాహ్ అతీతుడు, పవిత్రుడు. అల్లాహ్ ఎంతో ఉన్నతుడు.

46. అంటే విశ్వంలోని సమస్త వస్తువులు సృష్టికర్తకు విధేయులై, తమ తమ పద్ధతి ప్రకారం అతని స్తోత్రం చేస్తున్నాయి. అతని పవిత్రతను కొనియాడుతున్నాయి. కాకపోతే వాటి స్తోత్రాన్ని మనం అర్థం చేసుకోలేము. కొన్ని ఖుర్‌ఆన్ ఆయతుల ద్వారా, హదీసుల ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. ఉదాహరణకు : "మేము పర్వతాలను దావూదు – అలైహిస్సలాం-కు స్వాధీనపరచాము. అవి సాయంత్రం, ఉదయం అతనితోపాటు దైవస్తోత్రం చేసేవి" (స్వాద్ – 18). కొన్ని రాళ్లను ఉదాహరిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "వాటిలో కొన్ని అల్లాహ్ పట్ల భయంతో విరిగిపడతాయి" (అల్ బఖర-74). తాము దైవప్రవక్త (సఅసం)తో కలసి భోజనం చేస్తూ ఉండగా, భోజన పదార్థాల నుంచి స్తోత్ర శబ్దం వినవచ్చిందని కొంతమంది ప్రవక్త ప్రియసహచరులు (ర.అన్హుం) సాక్ష్యమిచ్చారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ మనాఖిబ్. హ.నెం.3579). చీమలు కూడా అల్లాహ్ స్తోత్రం చేస్తాయని మరొక హదీసు ద్వారా రూఢీ అవుతోంది (బుఖారీ-హ.నెం.3019; ముస్లిం-హ.నెం.1759). దైవప్రవక్త ఒకానొక వృక్షం మొదలుకు ఆనుకుని ప్రసంగించేవారు. తరువాత కొయ్య వేదిక తయారుచేయటంతో, దైవప్రవక్త (స) దానిని వదలిపెట్టేశారు. అప్పుడు దాన్నుంచి చిన్నపిల్లాడు ఏడ్చినట్లుగా శబ్దం వినిపించేది (బుఖారీ – 3583). అలాగే; మక్కాలో ఒక రాయి ఉండేది. అది దైవప్రవక్త (సఅసం)కు సలాం చేసేది (సహీహ్ ముస్లిం – హ.నెం.1782). ఈ ఆయతుల ద్వారా, ప్రామాణిక హదీసుల ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే చెట్లు చేమలు, రాళ్లు రప్పలలో కూడా ఒక విధమైన చైతన్యం ఉంటుంది. కాని అది మనకు అవగతం కాదు. తమకున్న ఆ చైతన్యాన్నిబట్టి అవి దైవస్తోత్రం చేస్తాయి. "అల్లాహ్ ఒక్కడే" అని ప్రతి వస్తువూ సాక్ష్యం ఇస్తూ ఉంటుంది.

47. అరబీలో **'మస్తూర్'** అని ఉంది. అంటే అడ్డు, ఆపు అని అర్థం. కళ్లకు కనిపించని అడ్డు తెర అన్న అర్థం కూడా వస్తుంది.

وَجَعَلْنَا عَلَىٰ قُلُوبِهِمْ أَكِنَّةً أَن يَفْقَهُوهُ وَفِيٓ
ءَاذَانِهِمْ وَقْرًا ۚ وَإِذَا ذَكَرْتَ رَبَّكَ فِي الْقُرْءَانِ
وَحْدَهُۥ وَلَّوْا۟ عَلَىٰٓ أَدْبَٰرِهِمْ نُفُورًا ﴿46﴾

**46** అంటే, వారు దానిని అర్థం చేసుకోకుండా వారి హృదయా లపై తెరలు వేసేస్తాము. వారి చెవులను మొద్దుబారజేస్తాము. నువ్వు ఈ ఖుర్‌ఆన్‌లో ఒక్కడైన అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని (తౌహీద్‌ను) ప్రస్తావించినప్పుడల్లా వారు తీవ్ర అయిష్టతను వ్యక్తం చేస్తూ వెనుతిరిగి వెళ్ళిపోతారు.[48]

نَّحْنُ أَعْلَمُ بِمَا يَسْتَمِعُونَ بِهِۦٓ إِذْ يَسْتَمِعُونَ إِلَيْكَ
وَإِذْ هُمْ نَجْوَىٰٓ إِذْ يَقُولُ الظَّٰلِمُونَ إِن تَتَّبِعُونَ
إِلَّا رَجُلًا مَّسْحُورًا ﴿47﴾

**47** వారు నీ వైపుకు చెవియొగ్గి వింటున్నప్పుడు ఏ ఉద్దేశ్యంతో వింటున్నారో మాకు బాగా తెలుసు. పరస్పరం చెవులు కొరు క్కుంటూ "చేతబడి ప్రభావానికి లోనైన వ్యక్తిని మీరు అనుస రిస్తున్నారు"[49] అని ఆ దుర్మార్గులు పలికేది కూడా (మాకు తెలుసు).

انظُرْ كَيْفَ ضَرَبُوا۟ لَكَ الْأَمْثَالَ فَضَلُّوا۟ فَلَا
يَسْتَطِيعُونَ سَبِيلًا ﴿48﴾

**48** చూడు, వారు నీ గురించి ఎలాంటి ఉదాహరణలు ఇస్తు న్నారో! వారు దారి తప్పుతున్నారు. ఇక వారు దారికి రావట మనేది వారి వల్ల కానిపని.[50]

وَقَالُوٓا۟ أَءِذَا كُنَّا عِظَٰمًا وَرُفَٰتًا أَءِنَّا
لَمَبْعُوثُونَ خَلْقًا جَدِيدًا ﴿49﴾

**49** "మేము (చచ్చి) ఎముకలై, తుత్తునియలైపోయిన తరువాత, మళ్లీ సరికొత్తగా సృష్టించబడి లేపబడతామా?" అని వారు అంటున్నారు (కదూ!)

۞ قُلْ كُونُوا۟ حِجَارَةً أَوْ حَدِيدًا ﴿50﴾

**50** వారికి చెప్పు: "మీరు రాళ్లయిపోయినా, ఇనుమై పోయినా"[51]

48. వారి హృదయాలపై వేసిన తెరల మూలంగానూ, వారి చెవులు మందగించటం వల్లనూ వారి గ్రాహ్యశక్తి క్షీణిస్తుంది. ఖుర్‌ఆన్ కోసం వారి హృదయకవాటాలు తెరచుకోవు. ఇక దేవుని ఏకత్వం (తౌహీద్) అనేసరికి వారు మరీ పెచ్చరిల్లిపోతారు. అసహనం, చిరాకు – ఇవి రెండూ వారి ముఖాలపై వ్యక్తమవుతాయి. ఆవేశంతో అక్కడి నుంచి వెను తిరిగిపోయేందుకు లేస్తారు. ఈ సన్మార్గం పట్ల వారిలో తిష్ఠవేసిన స్తబ్ధత, వైరభావం మూలంగానే అసలు వారు సన్మార్గ భాగ్యానికి నోచుకోలేకపోయారు. **'అకిన్నతున్'** అనేది 'కినాన్'కు బహువచనం. హృదయంపై పడే తెరలు అని అర్థం. **'వఖ్‌రున్'** : శబ్దం వినపడకుండా చెవులు మొద్దుబారటం.

49. వారు ఖుర్‌ఆన్ పారాయణాన్ని వినడానికైతే వింటున్నారు. కాని ఆ ఉద్గ్రంథాన్ని పారాయణం చేసే వ్యక్తి (సఅసం) పట్ల వారికి సదభిప్రాయం లేదు. అతనికేదో 'గాలి' సోకిందనీ, జాలవిద్య ప్రభావం వల్లనే అతను ఆ విధంగా పఠిస్తున్నాడనీ గుసగుసలు మొదలెట్టారు. వారి ఆంతర్యాలలో ఉన్న ఈ 'వక్రత' మూలంగానే వారసలు సన్మార్గానికి దూరమైపోయారు.

50. కొన్నిసార్లు మాంత్రికుడనీ, మరి కొన్నిసార్లు గాలిసోకినవాడనీ, కొన్నిసార్లు మతిభ్రమించినవాడనీ, ఇంకొన్నిసార్లు జోతిష్యుడనీ – రకరకాల కథలు అల్లుతున్నారు. ఆంతర్యంలో ఇంత కుళ్లు, ఇన్ని అనుమానాలు ఉంటే సన్మార్గ భాగ్యం ఎలా లభిస్తుంది?

51. లోహం (ఇనుము), మట్టికన్నా, ఎముకలకన్నా గట్టిది. దాన్నుంచి జీవితాన్ని వెలికి తీయటం మరీ కష్టం. అయినాసరే దైవానికి ఇది కష్టం కాదు.

51 "...లేక మీ మనసులకు ఎంతో కఠినమైనదిగా తోచే మరేదైనా సృష్టిగా మారినా సరే[52] (మీ పునరుత్థానం తథ్యం)." "మమ్మల్ని తిరిగి లేపేవాడెవడు?" అని వారు మళ్లీ అడుగుతారు. "తొలిసారి మిమ్మల్ని సృష్టించినవాడే (మలిసారి కూడా సృష్టిస్తాడు)" అని ఓ ప్రవక్తా! వారికి చెప్పు. దానిపై వారు తమ తలలను ఆడిస్తూ[53] "ఇంతకీ అది ఎప్పుడు సంభవిస్తుందీ?" అని అడుగుతారు. వారికి సమాధానమివ్వు – "అది త్వరలోనే సంభవించవచ్చు".[54]

أَوْ خَلْقًا مِّمَّا يَكْبُرُ فِي صُدُورِكُمْ ۚ فَسَيَقُولُونَ مَن يُعِيدُنَا ۖ قُلِ الَّذِي فَطَرَكُمْ أَوَّلَ مَرَّةٍ ۚ فَسَيُنْغِضُونَ إِلَيْكَ رُءُوسَهُمْ وَيَقُولُونَ مَتَىٰ هُوَ ۖ قُلْ عَسَىٰ أَن يَكُونَ قَرِيبًا ﴿51﴾

52 ఆ రోజు ఆయన మిమ్మల్ని పిలుస్తాడు.[55] అప్పుడు మీరు ఆయన్ని స్తుతిస్తూ (ఆయన పిలుపుకు) హాజరు పలుకుతారు. అప్పుడు మీరు 'మేము కొద్ది సమయం మాత్రమే (ప్రపంచంలో) ఉన్నామ'ని అనుకుంటారు."[56]

يَوْمَ يَدْعُوكُمْ فَتَسْتَجِيبُونَ بِحَمْدِهِ وَتَظُنُّونَ إِن لَّبِثْتُمْ إِلَّا قَلِيلًا ﴿52﴾

53 (ఓ ప్రవక్తా!) నా దాసులతో, వారు తమ నోట అత్యంత మంచి మాటలనే పలకాలని చెప్పు.[57] ఎందుకంటే షైతాన్ వారి మధ్య కలతలు రేపుతాడు.[58] నిశ్చయంగా షైతాన్ మానవుని పాలిట బహిరంగ శత్రువు.

وَقُل لِّعِبَادِي يَقُولُوا الَّتِي هِيَ أَحْسَنُ ۚ إِنَّ الشَّيْطَانَ يَنزَغُ بَيْنَهُمْ ۚ إِنَّ الشَّيْطَانَ كَانَ لِلْإِنسَانِ عَدُوًّا مُّبِينًا ﴿53﴾

52. ఇనుము కన్నా గట్టిగా ఉంటుందని మీరు తలపోసే మరే వస్తువుగా మీరు మారినాసరే, జీవం పోయటం అల్లాహ్‌కు కష్టసాధ్యం ఏమీ కాదు.

53. **'యున్‌ఘిజు' (يُنْغِضُ)** అంటే తలలాడించటం, తలలూపటం అని అర్థం. అయితే ఈ విధంగా వారు తలలాడించటంలో వెటకారం, ఎగతాళి భావన అంతర్లీనమై ఉంది.

54. **'త్వరలోనే'** అంటే ఏ ఘడియలోనైనా అది సంభవించవచ్చు. అందులో ఆశ్చర్యపడాల్సిందేమీలేదు. ఖుర్‌ఆన్‌లో **'అసా' (عَسَىٰ)** అనే పదం ఖాయం, నిశ్చయం అన్న భావంలో ఉపయోగించబడింది. అంటే ప్రళయం సంభవించటం ముమ్మాటికీ తథ్యం అన్నమాట!

55. **'పిలుస్తాడు'** అంటే సమాధుల నుంచి లేపి తన సన్నిధిలోకి హాజరుపరుస్తాడు. మీరంతా ఆయన స్తుతిస్తోత్రం చేస్తూ, ఆయన ఆజ్ఞల్ని శిరసావహిస్తూ హాజరవుతారు. లేదా ఆయన్ని గుర్తుపడుతూ ఆయన వద్దకు వస్తారు.

56. ఆ సమయంలో మీకు ఈ ప్రాపంచిక జీవితం బహు స్వల్పం అనిపిస్తుంది. "వారు దానిని చూసిననాడు, తాము ప్రపంచంలో ఒక దినములో ఉదయంగానీ, సాయంత్రంగానీ ఉన్నట్లు అనిపిస్తుంది" (నాజిఆత్ – 46). ఈ విషయమే ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల ప్రస్తావనకు వచ్చింది. ఉదాహరణకు : తాహా :102 – 104; అర్రూమ్–55; మోమినూన్: 112 –114. మొదటి సారి శంఖం ఊదబడినప్పుడు సమాధుల్లో ఉన్న వారంతా బ్రతికించబడతారనీ, రెండవ శబ్దంపై అందరూ లెక్కల కోసం మహ్షర్ మైదానంలో సమావేశమవుతారని అనబడుతోంది. రెండు శంఖారావాల మధ్య 40 ఏండ్ల అంతరం ఉంటుంది. ఈ మధ్య కాలంలో వారికి ఎలాంటి యాతనా ఉండదు. ఆ స్థితిలో వారు నిద్రపోతారు. రెండవ పిలుపుపై వారు లేచి, "వినాశకరం! ఈ నిద్రావస్థ నుంచి మమ్మల్ని ఎవరు లేపారు?" అని అంటారు (యాసీన్ – 52) (ఫత్‌హుల్ ఖదీర్). మొదటి విషయమే చాలావరకు సరైనది.

57. అంటే పరస్పరం సంభాషణ జరిపేటప్పుడు నోటిని అదుపులో పెట్టుకోండి. ఆచి తూచి మాట్లాడండి. సరైన,

54 మీ ప్రభువుకు మీ గురించి బాగా తెలుసు. ఆయన తలచుకుంటే మిమ్మల్ని కరుణిస్తాడు లేదా ఆయన కోరితే మిమ్మల్ని శిక్షిస్తాడు.[59] మేము నిన్ను వారిపై సంరక్షకునిగా చేసి పంపలేదు.[60]

رَبُّكُمۡ اَعۡلَمُ بِكُمۡ‌ؕ اِنۡ يَّشَاۡ يَرۡحَمۡكُمۡ اَوۡ اِنۡ يَّشَاۡ يُعَذِّبۡكُمۡ‌ؕ وَمَاۤ اَرۡسَلۡنٰكَ عَلَيۡهِمۡ وَكِيۡلًا ﴿54﴾

55 ఆకాశాలలో, భూమిలో ఉన్న వాటన్నింటి గురించి నీ ప్రభువుకు బాగా తెలుసు. మేము ప్రవక్తలలో కొందరికి మరి కొందరిపై శ్రేష్ఠతను ప్రసాదించాము.[61] ఇంకా, మేము దావూదుకు జబూరు (గ్రంథం) వొసగాము.

وَرَبُّكَ اَعۡلَمُ بِمَنۡ فِى السَّمٰوٰتِ وَالۡاَرۡضِ‌ؕ وَلَقَدۡ فَضَّلۡنَا بَعۡضَ النَّبِيّٖنَ عَلٰى بَعۡضٍ‌ وَّاٰتَيۡنَا دَاوٗدَ زَبُوۡرًا ﴿55﴾

56 వారికి చెప్పు: “మీరు అల్లాహ్‌ను వదలి ఆరాధ్య దైవాలుగా భావిస్తున్న వారిని పిలిచి చూడండి, వారు మీ నుండి ఏ కష్టాన్నీ దూరం చేయటంగానీ, మార్చటంగానీ చేయలేరు.”

قُلِ ادۡعُوا الَّذِيۡنَ زَعَمۡتُمۡ مِّنۡ دُوۡنِهٖ فَلَا يَمۡلِكُوۡنَ كَشۡفَ الضُّرِّ عَنۡكُمۡ وَلَا تَحۡوِيۡلًا ﴿56﴾

57 వీళ్లు ఎవరిని పిలుస్తున్నారో వారే స్వయంగా తమ ప్రభువు సామీప్యం కోసం మార్గాన్ని వెతుక్కుంటున్నారు. తమలో ఎవరు ఎక్కువ సామీప్యం పొందుతారోనని (పోటీపడుతున్నారు). వారు ఖుద్దుగా ఆయన కారుణ్యాన్ని ఆశిస్తున్నారు. ఆయన శిక్ష పట్ల భీతిల్లుతున్నారు.[62] (అవును మరి) నీ ప్రభువు శిక్ష భయపడదగినదే.

اُولٰۤـئِكَ الَّذِيۡنَ يَدۡعُوۡنَ يَبۡتَغُوۡنَ اِلٰى رَبِّهِمُ الۡوَسِيۡلَةَ اَيُّهُمۡ اَقۡرَبُ وَيَرۡجُوۡنَ رَحۡمَتَهٗ وَيَخَافُوۡنَ عَذَابَهٗ‌ ؕ اِنَّ عَذَابَ رَبِّكَ كَانَ مَحۡذُوۡرًا ﴿57﴾

---

సమంజసమైన మాటలనే చెప్పండి. అవిశ్వాసులను, ముష్రిక్కులను, గ్రంథవహులను సంబోధిస్తున్నప్పుడు అనురాగం, శ్రేయోభిలాష ఉట్టిపడేలా మాట్లాడండి. మృదువుగా మాట్లాడండి.

58. నోరుజారితే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. అనుచితమైన ఒక మాట మీ నోటి నుంచి వెలువడితే చాలు, అప్పటికే అవకాశం కోసం ఎదురుచూస్తున్న షైతాన్ అలవోకగా మీ మధ్య జొరబడతాడు. ఎందుకంటే వాడు మీ బద్ధవిరోధి గనక. వాడు మీ మధ్య తగవులు పెడతాడు. లేనిపోని అపార్థాల్ని సృష్టించి వేడుక చూస్తాడు. లేదా మీ యెడల అవిశ్వాసులలో, ముష్రిక్కులలో వైరభావాన్ని నూరిపోసి, గోరంత దాన్ని కొండంతగా చేసి చూపెడతాడు. అందుకే మహాప్రవక్త (సఅసం) వారు ఇలా ప్రబోధించారు : “మీలో ఎవరూ తమ సోదరుని (ముస్లిం) వైపుకు ఆయుధంతో సైగ చేయకూడదు. ఎందుకంటే – అతనికి తెలియదు – షైతాన్ అతని చేతిలోని ఆయుధానికి పని కల్పించవచ్చు (అది అతని సోదరుడైన ముస్లింకి తగిలి, అతని ప్రాణం పోవచ్చు). దాంతో ఇతను నరకానికి పోయే ప్రమాదముంది” (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఫితన్; సహీహ్ ముస్లిం–కితాబుల్ బిర్ర్).

59. **‘కరుణించటం’** అంటే సన్మార్గ భాగ్యం ప్రసాదించటం అని భావం. ‘శిక్షించటం’ అంటే షిర్క్‌కు లోనై ఉన్న స్థితిలోనే మీకు మృత్యువు వొసగుతాడు. ఈ విధానం అవిశ్వాసులకు వర్తిస్తుంది.

ఇదే విషయం ముస్లింలకైతే ఈ విధంగా అన్వయిస్తుంది – కరుణించదలిస్తే ఆయన శత్రువుల బారినుంచి మిమ్మల్ని రక్షిస్తాడు. శిక్షించదలిస్తే అవిశ్వాసులకు మీపై అధికారాన్ని, ఆధిక్యతను వొసగుతాడు.

60. వారిని తప్పకుండా అవిశ్వాస రొంపిలో నుంచి వెలికితీసే బాధ్యత నీపై లేదు. వారు అవిశ్వాస ఊబిలో కూరుకు పోయినందుకు నిన్ను నిలదీయటం కూడా జరగదు.

**58** ప్రళయదినానికి ముందే మేము ప్రతి పట్టణాన్ని నాశనం చేయటమో, లేదా దానిని ఘోరమైన విపత్తుకు గురి చేయటమో చేస్తాము. ఈ విషయం గ్రంథంలో లిఖితమై ఉంది.[63]

وَاِنۡ مِّنۡ قَرۡيَةٍ اِلَّا نَحۡنُ مُهۡلِكُوۡهَا قَبۡلَ يَوۡمِ الۡقِيٰمَةِ اَوۡ مُعَذِّبُوۡهَا عَذَابًا شَدِيۡدًا ؕ كَانَ ذٰلِكَ فِى الۡكِتٰبِ مَسۡطُوۡرًا ﴿58﴾

**59** పూర్వీకులు సూచనలను (మహిమలను) తిరస్కరించినందు వల్లనే మేము సూచనలను పంపటం ఆపేశాము.[64] మేము సమూదు వారికి స్పష్టమైన సూచనగా ఆడ ఒంటెను ఇచ్చాము.

وَمَا مَنَعَنَاۤ اَنۡ نُّرۡسِلَ بِالۡاٰيٰتِ اِلَّاۤ اَنۡ كَذَّبَ بِهَا الۡاَوَّلُوۡنَ ؕ وَاٰتَيۡنَا ثَمُوۡدَ النَّاقَةَ مُبۡصِرَةً فَظَلَمُوۡا بِهَا ؕ

61. ఈ విషయం అల్ బఖరా సూరా 253వ ఆయతులో కూడా వచ్చింది. ఇక్కడ మరోసారి – మక్కా అవిశ్వాసుల వెకిలి చేష్టలకు సమాధానంగా ప్రస్తావించబడింది. "దైవదౌత్యం కోసం దేవునికి ముహమ్మదే (స) దొరికాడా?" అన్న మక్కా అవిశ్వాసుల ప్రశ్న అర్థం లేనిది. వాస్తవానికి ప్రవక్త పదవికోసం ఎవరిని ఎంపిక చేయాలి? ఎవరికి ఎవరిపై ప్రాధాన్యత ఇవ్వాలి? ఎవరికి ఏది ప్రసాదించాలి? – ఇదంతా దైవనిర్ణయానికి లోబడి ఉంది.

62. అల్లాహ్‌ను వదలి వీరు మొక్కుకునే దైవాలు ఎవరు? దైవదూతలు, పుణ్యపురుషులు, విగ్రహాలు, వారి చిత్రపటాలు. లేదా యూదులు, క్రైస్తవులు దేవుని కుమారులుగా భావించి కొలిచే ఉజైర్ మరియు ఈసా (ఏసుక్రీస్తు)లు కూడా కావచ్చు. లేక విశ్వసించి ముస్లింలుగా మారిన జిన్నాతులయినా కావచ్చు. ముష్రిక్కులు వారిని దేవతలు అని చెప్పి ఆరాధించేవారు. మరి చూడబోతే వారు స్వయంగా తమ ప్రభువు సామీప్యం పొందే మార్గాన్ని అన్వేషిస్తున్నారు. వారు దేవుని కారుణ్యం పట్ల ఎన్నో ఆశలు పెంచుకున్నారు. దైవాగ్రహానికి భయపడుతున్నారు. ఈ గుణం రాళ్ళ రప్పలలో ఉండదు. కాబట్టి ఈ ఆయతులో ప్రజలు అల్లాహ్‌ను వదలి మొరపెట్టుకునే చిల్లరదేవుళ్లు రాళ్లు రప్పలు కావు. వారు దేవుని దాసులే. వారిలో మనుషులు, జిన్నులు, దైవదూతలు, దైవప్రవక్తలు చేరి ఉన్నారు. వీరికి సంబంధించి అల్లాహ్ ఏమంటున్నాడంటే వారివల్ల ఒరిగేదేమీ ఉండదు. వారు ఎవరి బాధనూ తొలగించలేరు. ఎవరి స్థితినీ మార్చలేరు. వారు స్వయంగా ప్రభువు సామీప్యం పొందేందుకు ఆరాటపడుతుంటారు. కాబట్టి చనిపోయిన పుణ్యపురుషుల సమాధుల వద్దకు పోయి పుష్పాంజలి ఘటిస్తే, సమాధులకు గలీబులు తొడిగిస్తే, సమాధుల వద్ద జాతర చేసి మొక్కుబడులు తీర్చుకుంటే ప్రళయ దినం నాడు వారు తమను ఆదుకుంటారని కొందరు చెప్పేమాటలు బూటకమే. ఎందుకంటే ఈ రకమయిన ప్రయత్నం 'వసీలా' కాదు. ఇది షిర్క్. ఘోరమైన అన్యాయం. అల్లాహ్ ముస్లిములందరినీ ఈ అన్యాయం నుంచి కాపాడుగాక!

63. ఇక్కడ గ్రంథం అంటే **"లౌహె మహ్‌ఫూజ్"** అని భావం. అవిశ్వాసులు నివసించే ప్రతి పట్టణాన్ని మేము మృత్యువు ద్వారా తుదముట్టిస్తాము అన్నమాట 'లౌహె మహ్‌ఫూజ్'లో లిఖించబడి ఉంది. 'పట్టణం' అంటే అక్కడ నివసించే పౌరులన్నమాట. వారి వినాశానికి కారణం వారి కుఫ్ర్, షిర్క్, తలబిరుసుతనం. ప్రళయదినానికి ముందు ఇది సంభవిస్తుంది.

64. సఫా పర్వతాన్ని బంగారు పర్వతంగా చేయి లేదా మక్కా పట్టణంలో ఉన్న పర్వతాలన్నింటినీ ఇక్కడి నుంచి తొలగించి సేద్యానికనుగుణంగా మార్చు అని మక్కాలోని అవిశ్వాసులు మహాప్రవక్త (సఅసం)ను కోరినపుడు ఈ ఆయతు అవతరించింది. వారి కోర్కెల్ని తీర్చటానికి మేము సిద్ధమే. కాని ఆ తరువాత కూడా వారు విశ్వసించేందుకు నిరాకరిస్తే ఇక వారి సర్వనాశనం తప్పదు అని అల్లాహ్ తన దూత జిబ్రీల్ (అలైహిస్సలాం) ద్వారా స్పష్టం చేశాడు. అప్పుడు మహాప్రవక్త (స) కూడా అవిశ్వాసుల కోర్కెను తీర్చకుండా ఉండటానికే సుముఖత చూపారు. ఎందుకంటే దైవప్రవక్త (స) తన జాతి ప్రజల యోగక్షేమాలను కోరుకున్నారు. తన జాతి వారు దైవసూచనలను ధిక్కరించి వినాశాన్ని కొనితెచ్చుకోవటం ఆయన (స)కు ఇష్టం లేదు (ముస్నదె అహ్మద్-సంపుటి :1, పేజీ –258).

వారు కోరుతున్నట్లుగా అద్భుతాలను చేయటం తనకు ఏమాత్రం కష్టం కాదనీ, అయితే పూర్వ జాతులకు పట్టిన దుర్గతి వీళ్లకు పట్టరాదన్న ఉద్దేశంతోనే తన నిదర్శనాలను ఆపి ఉంచానని అల్లాహ్ ఈ సందర్భంగా స్పష్టం

وَمَا نُرۡسِلُ بِالۡاٰيٰتِ اِلَّا تَخۡوِيۡفًا ﴿59﴾

కాని వారు దానిపై అఘాయిత్యానికి ఒడిగట్టారు.[65] మేము (యదార్థానికి) ప్రజలను భయపెట్టడానికి మాత్రమే సూచనలను పంపిస్తాము.

وَاِذۡ قُلۡنَا لَكَ اِنَّ رَبَّكَ اَحَاطَ بِالنَّاسِ‌ؕ وَمَا جَعَلۡنَا الرُّءۡيَا الَّتِىۡۤ اَرَيۡنٰكَ اِلَّا فِتۡنَةً لِّلنَّاسِ وَالشَّجَرَةَ الۡمَلۡعُوۡنَةَ فِى الۡقُرۡاٰنِ‌ؕ وَنُخَوِّفُهُمۡۙ فَمَا يَزِيۡدُهُمۡ اِلَّا طُغۡيَانًا كَبِيۡرًا ﴿60﴾

**60** నీ ప్రభువు ఈ జనులను చుట్టుముట్టి ఉన్నాడని మేము నీకు చెప్పిన సంగతిని (ఓ ప్రవక్తా!) జ్ఞాపకం చేసుకో.[66] మేము నీకు చూపిన దృశ్యం ప్రజల పాలిట ఓ పరీక్ష. అదేవిధంగా ఖుర్‌ఆనులో శపించబడిన వృక్షం కూడా (ఓ పరీక్షే).[67] మేము వారిని భయ పెడుతూనే ఉన్నాము. కాని మా భయబోధ వారిలోని పెద్ద తలబిరుసుతనాన్ని మరింతగా పెంచుతూ పోతుంది.[68]

وَاِذۡ قُلۡنَا لِلۡمَلٰٓـئِكَةِ اسۡجُدُوۡا لِاٰدَمَ فَسَجَدُوۡۤا اِلَّاۤ اِبۡلِيۡسَ ؕ قَالَ ءَاَسۡجُدُ لِمَنۡ خَلَقۡتَ طِيۡنًا‌ۚ ﴿61﴾

**61** "ఆదమ్‌కు సాష్టాంగపడండి" అని మేము దూతలకు ఆజ్ఞా పించినపుడు, ఒక్క ఇబ్లీసు తప్ప అందరూ సాష్టాంగపడ్డారు. (పైగా) వాడు, "ఏమిటీ, నీవు మట్టితో పుట్టించినవానికి నేను సాష్టాంగపడాలా?" అన్నాడు.

---

చేశాడు. గతించిన జాతులవారు పదే పదే దైవనిదర్శనాలను చూపమని తమ ప్రవక్తలపై ఒత్తిడి తెచ్చారు. తీరా ఆ నిదర్శనాలను చూపిన మీదట వారు అల్లాహ్‌ను విశ్వసించేందుకు నిరాకరించి మాట తప్పారు. పర్యవసానంగా వారు తుదముట్టించబడ్డారు.

65. సమూద్ జాతిని ఒక దృష్టాంతంగా ప్రస్తావించటం జరిగింది. సమూద్ జాతివారి కోర్కెపై అల్లాహ్ బండరాయి నుంచి ఒక ఒంటెను వెలికి తీశాడు. అయితే ఆ దుర్మార్గులు అల్లాహ్‌ను విశ్వసించలేదు సరికదా, ఆ ఒంటెను నిర్దాక్షిణ్యంగా చంపి వేశారు. ఫలితంగా మూడు రోజుల తరువాత వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది.

66. అంటే జనులు అల్లాహ్ ప్రాబల్యానికి, తిరుగులేని నిర్ణయాలకు లోబడి ఉన్నారు. ప్రజలు కోరినదల్లా జరగదు. అల్లాహ్ తలచినది మాత్రమే అవుతుంది. మక్కావాసులు అల్లాహ్ అధీనంలో ఉన్నారు. కాబట్టి (ఓ ముహమ్మద్!) నువ్వు నిర్భయంగా నీ ప్రచార కార్యక్రమాన్ని నడుపుతూ ఉండు. ఈ జనులు నీకెలాంటి కీడూ కలిగించలేరు. వీళ్ల బారినుంచి నిన్ను రక్షించటానికి మేమున్నాము. బద్ర్ యుద్ధంలోనూ, మక్కా విజయం సందర్భంలోనూ అల్లాహ్ అవిశ్వాసుల చేతుల్ని ఎలా కట్టిపడేశాడో విదితమే.

67. ఈ ఆయతులో ప్రస్తావించబడిన 'దృశ్యం' మేరాజ్ యాత్ర సందర్భంగా దైవప్రవక్తకు ప్రత్యక్షంగా చూపబడిన దృశ్య మని ప్రవక్త సహచరులు, వారి శిష్యులు అభిప్రాయపడ్డారు. విశ్వాసపరంగా బలహీనులైన చాలామంది ఈ సంఘటనను గురించి విని సందిగ్ధంలో పడిపోయారు. వారు ఇస్లాం ధర్మాన్ని వదలి మార్గవిహీనులుగా మారిపోయారు. శపించబడిన వృక్షం అంటే 'జఖ్ఖూమ్' వృక్షం అని భావం. మేరాజ్ యాత్ర సందర్భంగా అంతిమ దైవప్రవక్త (సఅసం) ఈ వృక్షాన్ని కూడా (నరకంలో) తిలకించారు. ఈ వృక్షాన్ని తినేవారు దేవుని చేత ధూత్కరించబడినవారు. "జఖ్ఖూమ్ వృక్షం పాపాత్ముల ఆహారంగా ఉంటుంది" అని వేరొకచోట ప్రస్తావించబడింది (అద్దుఖాన్-43, 44).

68. ఎందుకంటే అవిశ్వాసుల మనసులు నిర్మలమైనవి కావు. వారి ఆంతర్యాలలో కుల్లు ఉంది. వారిలో ఇస్లాం పట్ల వైరభావం పేరుకుపోయింది. అందుచేత వారికెన్ని నిదర్శనాలు చూపెట్టినా వారి మనసులు మారవు సరికదా వారి తలబిరుసుతనం మరింత పెరుగుతుంది.

قَالَ اَرَءَيْتَكَ هٰذَا الَّذِىْ كَرَّمْتَ عَلَىَّ لَئِنْ اَخَّرْتَنِ اِلٰى يَوْمِ الْقِيٰمَةِ لَاَحْتَنِكَنَّ ذُرِّيَّتَهٗۤ اِلَّا قَلِيْلًا ﴿62﴾

62 ఇంకా ఇలా అన్నాడు: "సరే! చూసుకో, నువ్వు ఇతనికి నాపై శ్రేష్ఠతనైతే వొసగావు. కాని నాకు కూడా ప్రళయదినం వరకూ విడుపు ఇస్తే నేను ఇతని సంతతిలో – కొద్ది మందిని తప్ప – అందరినీ లొంగదీసుకుంటాను."[69]

قَالَ اذْهَبْ فَمَنْ تَبِعَكَ مِنْهُمْ فَاِنَّ جَهَنَّمَ جَزَآؤُكُمْ جَزَآءً مَّوْفُوْرًا ﴿63﴾

63 (అల్లాహ్) అన్నాడు : "వెళ్లు. వారిలో ఎవరెవరు నిన్ను అనుసరిస్తారో వారికీ, నీకూ – అందరికీ నరకం సంపూర్ణ శిక్షగా ఉండనే ఉంది."

وَاسْتَفْزِزْ مَنِ اسْتَطَعْتَ مِنْهُمْ بِصَوْتِكَ وَاَجْلِبْ عَلَيْهِمْ بِخَيْلِكَ وَرَجِلِكَ وَشَارِكْهُمْ فِى الْاَمْوَالِ وَالْاَوْلَادِ وَعِدْهُمْ ؕ وَمَا يَعِدُهُمُ الشَّيْطٰنُ اِلَّا غُرُوْرًا ﴿64﴾

64 "వారిలో ఎవరెవరిని నువ్వు నీ స్వరంతో భ్రష్టులుగా చెయ్య గలవో చేసుకో.[70] (వీలైతే) వారిపై నీ అశ్వబలాన్నీ, పదాతి దళాన్ని తీసుకురా.[71] సిరిసంపదలలోనూ, సంతానంలోనూ వారికి భాగ స్వామిగా ఉండు.[72] వారికి (బూటకపు) వాగ్దానాలు చెయ్యి.[73] షైతాను వారికి చేసే వాగ్దానాలన్నీ మోసపూరితమైనవే.[74]

69. అంటే అతన్ని నా అదుపులోకి తీసుకుని, నేను కోరిన దారిలోకి అతన్ని నడిపిస్తాను. కాకపోతే కొద్దిమంది మాత్రమే నా ఎత్తులకు చిత్తవకుండా ఉండగలుగుతారు. ఆదం– ఇబ్లీస్‌ల ఈ వృత్తాంతం ఇంతకు ముందు కూడా అల్‌బఖర, అల్ ఆరాఫ్, అల్ హిజ్ర్ సూరాలలో వచ్చింది. ఇక్కడ నాల్గవసారి ప్రస్తావనకు వచ్చింది. సూరె కహఫ్, సూరె తాహా, సూరె స్వాద్‌లలోనూ ఇది పునరావృతం కానున్నది.

70. అరబీలో అసలు 'స్వరం' (సౌతున్) అని ఉంది. అంటే అతని పిలుపు, సందేశం, వ్యర్థప్రలాపన, కల్లబొల్లిమాటలు, పాటలు, ఆధ్యాత్మికతను హరించి దుష్టకోర్కెల్ని రగుల్గొల్పే విషయాలు అన్నీ ఇందులోకి వచ్చేస్తాయి. వీటిలో ఏది, ఎక్కడ లాభదాయకం అనుకుంటే దాన్ని అక్కడ ప్రయోగించటం షైతాన్ విధానం.

71. ఈ దళాలు మానవుల్లోనివీ కావచ్చు, జిన్నాతులలోనివీ కావచ్చు. మొత్తానికి అతని కార్యాచరణలో అతనికి తోడ్పడే వారంతా అతని సైనికులై ఉంటారు.

72. సిరిసంపదలలో షైతాన్ భాగస్వామిగా చేరటమంటే అక్రమ పద్ధతిలో ధనాన్ని ఆర్జించటమని భావం. అక్రమపద్ధతిలో డబ్బును తగలెట్టడం కూడా ఇందులోకే వస్తుంది. అలాగే దైవేతరుల పేర జంతు బలి ఇవ్వటం, దైవేతర ఆస్థానాల వద్ద అపసవ్యమైన కార్యక్రమాలు చేపట్టి డబ్బు ఖర్చుపెట్టడం కూడా ఇందులో అంతర్భాగమే.
ఇక సంతానంలో షైతాన్ భాగస్వామి కావటమంటే వ్యభిచారం, అక్రమ సంబంధాల ద్వారా పిల్లల్ని కనటం, తమ సంతానం కాని వారికి తాము తల్లిదండ్రులమని దావా వేయటం, అబ్దుల్ ఉజ్జా, అబ్దుల్లాత్ లాంటి పేర్లు పెట్టుకోవటం, ఇస్లామేతర పద్ధతిలో సంతానానికి శిక్షణ ఇవ్వటం, దారిద్ర్య భయంతో సంతానాన్ని హత్యచేయటం, భ్రూణ హత్యకు పాల్పడటం, సంతానాన్ని ఉద్దేశ్యపూర్వకంగా ముస్లిమేతర సంస్థలకు అప్పగించి ధర్మభ్రష్టతకు తోడ్పడటం, మస్నూన్ దుఆ పఠించకుండానే భార్యతో సమాగమం జరపటం – ఇవన్నీ సంతానం విషయంలో షైతాన్‌కు పార్ట్‌నర్‌షిప్ కట్టబెట్టడం క్రిందికే వస్తాయి.

73. అంటే "స్వర్గం – నరకం లాంటివేమీ ఉండవు. మరణానంతర జీవితం అనేది ఉత్తుత్తిదే. ఒకవేళ అలాంటిదేదైనా ఉంటే నేను చూసుకుంటాను కదా!" అని షైతాన్ ప్రజలను మభ్యపెడతాడు.

74. తప్పుడు పనిని అందమైనదిగా, మంచిపనిగా చేసి చూపటం షైతాన్ పని కదా!

**65** "(నువ్వు ఎంత చేసినా) నికార్సయిన నా దాసులపై నీకు ఏ అధికారమూ ఉండదు.[75] రక్షకుడుగా నీ ప్రభువు (ఒక్కడే) చాలు."[76]

إِنَّ عِبَادِي لَيْسَ لَكَ عَلَيْهِمْ سُلْطَانٌ ۚ وَكَفَىٰ بِرَبِّكَ
وَكِيلًا ﴿٦٥﴾

**66** మీ కోసం సముద్రంలో ఓడలను నడిపేవాడే మీ ప్రభువు. తద్వారా మీరు ఆయన ఉపాధిని అన్వేషించాలని. నిశ్చయంగా ఆయన మీ పట్ల ఎంతో దయగలవాడు.[77]

رَبُّكُمُ الَّذِي يُزْجِي لَكُمُ الْفُلْكَ فِي الْبَحْرِ لِتَبْتَغُوا
مِنْ فَضْلِهِ ۚ إِنَّهُ كَانَ بِكُمْ رَحِيمًا ﴿٦٦﴾

**67** సముద్రాలలో మీకు ఆపద ఎదురైనప్పుడు – మీరు మొర పెట్టుకునే వారంతా మటుమాయమైపోతారు – ఒక్క అల్లాహ్ మాత్రమే మిగిలి ఉంటాడు. మరి ఆయన మిమ్మల్ని కాపాడి ఒడ్డుకు చేర్చగానే మీరు ఆయన నుండి ముఖం త్రిప్పేసు కుంటారు. మానవుడు నిజంగానే చేసిన మేలును మరిచేవాడు.[78]

وَإِذَا مَسَّكُمُ الضُّرُّ فِي الْبَحْرِ ضَلَّ مَنْ تَدْعُونَ
إِلَّا إِيَّاهُ ۖ فَلَمَّا نَجَّاكُمْ إِلَى الْبَرِّ أَعْرَضْتُمْ ۚ
وَكَانَ الْإِنْسَانُ كَفُورًا ﴿٦٧﴾

**68** ఏమిటీ, (నేల మీదికి చేర్చిన తరువాత) అల్లాహ్ మిమ్మల్ని నేలలో కూర్చివేయడనీ, మీపై రాళ్లను కురిపించే తుఫానును పంపించడని మీరు నిర్భయంగా ఉన్నారా?[79] (ఒకవేళ అదే గనక జరిగితే) మీరు మీ కోసం ఏ రక్షకుడినీ పొందజాలరు.

أَفَأَمِنْتُمْ أَنْ يَخْسِفَ بِكُمْ جَانِبَ الْبَرِّ أَوْ يُرْسِلَ
عَلَيْكُمْ حَاصِبًا ثُمَّ لَا تَجِدُوا لَكُمْ وَكِيلًا ﴿٦٨﴾

**69** లేక అల్లాహ్ మిమ్మల్ని మరోసారి సముద్రయానానికి తీసుకు పోయి, మీ కృతఘ్నతా వైఖరికి శాస్తిగా మీపై ప్రచండమైన పెనుగాలులనుపంపి మిమ్మల్ని ముంచివేయడని మీరు నిశ్చింతగా ఉన్నారా? ఒకవేళ అదేగనక జరిగితే మీ తరఫున దీని గురించి మమ్మల్ని అడిగే వాడెవడూ మీకు దొరకడు.[80]

أَمْ أَمِنْتُمْ أَنْ يُعِيدَكُمْ فِيهِ تَارَةً أُخْرَىٰ فَيُرْسِلَ
عَلَيْكُمْ قَاصِفًا مِنَ الرِّيحِ فَيُغْرِقَكُمْ بِمَا كَفَرْتُمْ ۙ ثُمَّ
لَا تَجِدُوا لَكُمْ عَلَيْنَا بِهِ تَبِيعًا ﴿٦٩﴾

75. షైతాన్ మాయమాటలు, అతని పెత్తనం అందరిపై నడవదు. సజ్జనులైన దాసులు, దైవానికి భయపడేవారి ముందు వాడి ఆటలు సాగవు. బలహీన విశ్వాసం గలవారిని, ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయినవారిని మాత్రమే వాడు తొందరగా లొంగదీసుకుంటాడు.

76. నిష్కల్మషమైన విశ్వాసం గల దాసులు పొద్దస్తమానం అల్లాహ్‌నే నమ్ముకుంటారు. ప్రతి వ్యవహారంలోనూ అల్లాహ్‌పైనే భారం మోపుతారు. ఇటువంటి రుజువర్తనుల పనుల్ని చక్కబెట్టే బాధ్యతను అల్లాహ్ స్వయంగా తీసుకుంటాడు. వారిని అన్ని రకాల విపత్తుల నుండి, వ్యాకులత నుండి రక్షిస్తాడు.

77. అల్లాహ్ సముద్రాలను మానవుని పాదాక్రాంతం చేయటం నిజంగా ఆయన కృపే. మానవుడు ఈ సముద్రాలలో నావలను నడిపి ఒక దేశం నుంచి ఇంకో దేశానికి సాగిపోతున్నాడు. తన వర్తక సామగ్రిని సులువుగా ఇతర రాజ్యాలకు తరలిస్తున్నాడు. అంతేకాదు, మనిషికి లాభదాయకమైన వస్తువులు ఏవో కూడా ఆయన తెలియజేశాడు.

78. ఈ విషయం ఖుర్‌ఆన్‌లో ఎన్నో చోట్ల వచ్చింది.

79. తీరం దాటగానే మీరు అల్లాహ్‌ను మరచిపోయారు కదూ! ఏమిటీ, నేలలో ఇలాంటి ప్రమాదాలేవీ రావని అనుకుంటు న్నారా? నేలపై కూడా ఆయన మిమ్మల్ని పట్టుకోగలడు. నేలలో మిమ్మల్ని కూర్చివేయగలడు. లేదా రాళ్ల వాన

وَلَقَدْ كَرَّمْنَا بَنِيٓ ءَادَمَ وَحَمَلْنَٰهُمْ فِي ٱلْبَرِّ وَٱلْبَحْرِ وَرَزَقْنَٰهُم مِّنَ ٱلطَّيِّبَٰتِ وَفَضَّلْنَٰهُمْ عَلَىٰ كَثِيرٍ مِّمَّنْ خَلَقْنَا تَفْضِيلًا ﴿٧٠﴾

**70** మేము ఆదం సంతతికి గౌరవం వొసగాము.[81] వారికి నేల పైనా, నీటిలోనూ నడిచే వాహనాలను ఇచ్చాము.[82] ఇంకా పరిశుద్ధమైన వస్తువులను వారికి ఆహారంగా ప్రసాదించాము.[83] మేము సృష్టించిన ఎన్నో సృష్టితాలపై వారికి ఆధిక్యతను ఇచ్చాము.[84]

يَوْمَ نَدْعُوا۟ كُلَّ أُنَاسٍۭ بِإِمَٰمِهِمْ ۖ فَمَنْ أُوتِيَ كِتَٰبَهُۥ بِيَمِينِهِۦ فَأُو۟لَٰٓئِكَ يَقْرَءُونَ كِتَٰبَهُمْ وَلَا يُظْلَمُونَ فَتِيلًا ﴿٧١﴾

**71** ఆ రోజు (తీర్పు దినాన) మేము ప్రతి మానవ సముదాయాన్నీ దాని నాయకుని సమేతంగా పిలుస్తాము.[85] అప్పుడు తమ కర్మల పత్రం కుడి చేతికివ్వబడివారు (ఉత్సాహంగా) తమ కర్మల పత్రాన్ని చదువుకుంటారు. వారికి పీచంత అన్యాయం కూడా జరగదు.[86]

ద్వారా మిమ్మల్ని మట్టి కరిపించగలడు. ఎందుకంటే వెనుకటి జాతుల్లో కొన్నింటిని ఆయన ఈ రీతిలోనే శిక్షించాడు.

80. మీ ఓడలను తునాతునకలు చేసివేసే ప్రచండ గాలులను ('ఖాసిఫ్'ను) మీపైకి పంపి మిమ్మల్ని నడి సముద్రంలో ముంచివేయవచ్చు. అంత జరిగినా మీ తరఫున మమ్మల్ని నిలదీసి అడిగేవాడుగానీ, ప్రతీకారం తీర్చుకునే వాడుగానీ ఎవడూ ఉండడు. ఒకసారి సముద్ర ప్రమాదం నుంచి తప్పించుకోగానే మళ్లీ అలాంటి విపత్కర పరిస్థితి ఎదురు కాదని అనుకుంటున్నారా? ఒకవేళ అలా అనుకుంటే అది మీ మూర్ఖత్వం మాత్రమే.

81. ఈ గౌరవం మానవుడైన కారణంగా ప్రతి ఒక్కరికీ ప్రాప్తమై ఉంది – అతడు విశ్వాసి అయినాసరే, అవిశ్వాసి అయినాసరే! ఎందుకంటే ఈ గౌరవం మరియు శ్రేష్ఠత ఇతర ప్రాణులకు ప్రతిగా మనుజ జాతికి ఇవ్వబడింది. పశుపక్ష్యాదులు, రాళ్లు రప్పలు, చెట్లుచేమలకన్నా మానవుడు విభిన్నమైనవాడు. అల్లాహ్ మనిషికి ప్రసాదించిన రూపురేఖల్ని, తెలివితేటల్ని ఇతర సృష్టితాలెవరికీ ప్రసాదించలేదు. తనకు ఇవ్వబడిన తెలివితేటలతో మానవుడు తన సుఖసౌఖ్యాలకు సంబంధించిన అసంఖ్యాకమైన వస్తువులను కనుగొన్నాడు. కాని ఈ భాగ్యం జంతువులకు లభ్యం కాలేదు. అంతేకాదు మంచీచెడుల మధ్య, లాభనష్టాల మధ్య, తప్పొప్పుల మధ్యగల తేడాను కూడా మానవుడు తెలుసుకోగలుగుతాడు. తనకు లభించిన ఈ విచక్షణా జ్ఞానంతో అతను లోకంలోని ఇతర జీవాలతో లబ్ది పొందుతాడు. వాటిని తన చెప్పుచేతల్లో ఉంచుకుంటాడు. అంతేకాదు, తనకు అబ్బిన ఈ తెలివితేటల్తో అపురూపమైన కట్టడాలను నిర్మిస్తాడు. చలి వేడి నుంచి కాపాడే దుస్తులను తయారుచేసుకుంటాడు. ఆ మాటకొస్తే జగతిలోని వస్తువులన్నింటినీ అల్లాహ్ మానవపరం చేశాడు. గాలి, నీరు, సూర్యుడు, చంద్రుడు – ఇత్యాది వస్తువుల ద్వారా మానవుడు ఎంత గానో ప్రయోజనం పొందుతున్నాడు.

82. మానవుడు నేలపై గుర్రాలను, కంచెర గాడిదలను, గాడిదలను, ఒంటెలను తన వాహనాలుగా ఉపయోగిస్తాడు. అలాగే తన స్వహస్తాలతో తయారుచేసిన బండ్లను, రైళ్లను, బస్సుల్ని, విమానాలను, మోటారు వాహనాలను కూడా ఉపయోగిస్తాడు. అలాగే నీటిలో నావల ద్వారా, ఓడల ద్వారా ప్రయాణం చేస్తాడు. తన వర్తక సామగ్రిని ఈ వాహనాల ద్వారా ఒకచోటి నుంచి ఇంకో చోటికి తరలిస్తాడు.

83. ఆహార పదార్థాలుగా మానవునికి ఇవ్వబడినన్ని పరిశుద్ధ వస్తువులు లోకంలో ఏ ప్రాణికీ ఇవ్వబడలేదు. ఆహారధాన్యాలు, పప్పు దినుసులు, పండ్లుఫలాలు, రుచికరమైన, శక్తిదాయకమైన పానీయాలు, లెక్కకు మించినవి మానవునికి ఆహారంగా ఇవ్వబడ్డాయి. వాటి రంగు వేరు. రుచి వేరు. వాటి ప్రయోజనాలు వేరు. వాటిలోని విటమిన్లు వేర్వేరు, జగతిలో మానవ జాతికి వొసగబడిన ఈ ఆహారాలు అద్భుతమైనవి.

84. పైన పేర్కొనబడిన విభిన్న రకాల ప్రసాదాల దృష్ట్యా మానవుడు ఇతర ప్రాణులకన్నా భిన్నమైనవాడు. అందరికంటే ఘనుడు.

وَمَنْ كَانَ فِيْ هٰذِهٖٓ اَعْمٰى فَهُوَ فِى الْاٰخِرَةِ اَعْمٰى
وَاَضَلُّ سَبِيْلًا ﴿٧٢﴾

**72** ఇక ఈ ప్రపంచంలో గుడ్డిగా మెలగినవాడు, పరలోకంలో కూడా గుడ్డివాడుగానే ఉంటాడు. మార్గానికి బహుదూరాన తచ్చాడుతూ ఉంటాడు.[87]

وَاِنْ كَادُوْا لَيَفْتِنُوْنَكَ عَنِ الَّذِيْٓ اَوْحَيْنَآ اِلَيْكَ
لِتَفْتَرِيَ عَلَيْنَا غَيْرَهٗ ۖ وَاِذًا لَّاتَّخَذُوْكَ
خَلِيْلًا ﴿٧٣﴾

**73** (ఓ ప్రవక్తా!) వాళ్లు, మేము నీ వద్దకు పంపిన వహీ గురించి నిన్ను తడబాటుకు లోనుచేసే ఉద్దేశంతో, దీనికిబదులు మరి దేన్నయినా మా పేరున కల్పించి తీసుకురావాలని కోరు తున్నారు. నువ్వే గనక వారి కోరికను మన్నించి ఉంటే వాళ్లు నిన్ను స్నేహితునిగా చేసుకుని ఉండేవారు.

وَلَوْلَآ اَنْ ثَبَّتْنٰكَ لَقَدْ كِدْتَّ تَرْكَنُ اِلَيْهِمْ
شَيْـًٔا قَلِيْلًا ﴿٧٤﴾

**74** మేమే గనక నీకు నిలకడను ప్రసాదించి ఉండకపోతే, నువ్వు కొంతైనా వారివైపుకు మొగ్గేవాడివి.[88]

اِذًا لَّاَذَقْنٰكَ ضِعْفَ الْحَيٰوةِ وَضِعْفَ الْمَمَاتِ
ثُمَّ لَا تَجِدُ لَكَ عَلَيْنَا نَصِيْرًا ﴿٧٥﴾

**75** ఒకవేళ (నీ తరఫున) అదే గనక జరిగి ఉంటే మేము ఈ జీవితంలోనూ నీకు రెట్టింపు శిక్షను విధించేవాళ్లం. మరణం తర్వాత కూడా[89] రెండింతల శిక్షను విధించి ఉండేవాళ్ళం. మరి మాకు వ్యతిరేకంగా, నువ్వు ఏ సహాయకుడినీ పొందలేక పోయే వాడివి.

85. మూలంలో **'ఇమామ్'** అనే పదం ఉంది. అంటే నాయకుడు, సారథి అని అర్థం. అయితే వీటిలో ఈ పదాన్ని ఏ అర్థంలో తీసుకోవాలన్న దానిపై అభిప్రాయభేదం ఉంది. ఇక్కడ 'ఇమామ్' అంటే ప్రవక్త అని కొందరు అభిప్రాయపడ్డారు. అంటే ప్రతి మానవ సముదాయం తమ ప్రవక్త పేరు ఆధారంగా పిలువబడుతుంది. ఇమామ్ అంటే దైవప్రవక్తలపై అవతరించిన ఆకాశ గ్రంథం అని భావమని మరి కొంతమంది తలపోస్తున్నారు. అంటే ఓ తౌరాతు గ్రంథవారలారా! ఓ ఇంజీలు వారలారా! ఓ ఖుర్ఆన్ వారలారా! లాంటి పేర్లతో వివిధ అనుచర సమాజాలవారు పిలువబడతారు.

ఇదిలావుండగా 'ఇమామ్' అనే పదం కర్మల పత్రానికి వర్తిస్తుందని కొందరు వాదించారు. వారి వాదన ప్రకారం; ప్రతి ఒక్కరికీ వారి కర్మల పత్రం ఇవ్వబడిన తరువాత, అది వారి వెంట ఉంటుంది. దాని ప్రకారమే వారి వ్యవహారం తేల్చబడుతుంది. ఇమామ్ ఇబ్నె కసీర్, ఇమామ్ షౌకానీ ప్రభృతులు ఈ అభిప్రాయానికి ప్రాముఖ్యమిచ్చారు.

86. ఆనాడు ఎవరికి ఎంత బహుమానం ఇవ్వాలో, ఎవరికి ఎంత శిక్ష విధించాలో – ఖచ్చితంగా వ్యవహారం చేయబడుతుంది. ఎవరి ప్రతిఫలం కూడా తగ్గించబడదు. అణువంత అన్యాయం కూడా ఎవరికీ జరగదు.

87. **గుడ్డివాడు** (ఆమా) అంటే మనో నేత్రం లేనివాడు అని భావం. అతడు తన మనో నేత్రంతో సత్యాన్ని పరికించలేదు, దాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించలేదు. అందుకే అతడు సత్యధర్మానికి దూరమైపోయాడు. అందుకే అతను పరలోకంలో కూడా గుడ్డివాడుగా, తన ప్రభువు అనుగ్రహానికి నోచుకోనివాడుగా ఉండిపోయాడు.

88. ఈ ఆయతులో దైవప్రవక్తల సౌశీల్యం గురించి చెప్పబడింది. ఇది దేవుని తరఫున ప్రవక్తలకు ప్రసాదించబడే ప్రత్యేక వరం. మక్కాకు చెందిన బహుదైవారాధకులు తమ మాయమాటలతో అంతిమ దైవప్రవక్త (సఅసం) అడుగులు సత్యమార్గంపై తడబడేలా చేయాలని ఎత్తులు వేశారు. అయితే అల్లాహ్ తన ప్రవక్త (సఅసం)ను వాళ్ల కుయుక్తుల నుంచి కాపాడాడు. తన ప్రవక్తకు స్థిరత్వాన్ని ప్రసాదించాడు. తత్ఫలితంగా మహాప్రవక్త (సఅసం) తన మార్గం నుంచి ఒక్క అంగుళం కూడా వారి వైపుకు మొగ్గలేదు.

76 వాళ్లు నిన్ను ఈ భూభాగం నుంచి వెళ్ళగొట్టే ఉద్దేశంతో నిన్ను నిలదొక్కుకోకుండా చేయడానికి సిద్ధమయ్యారు.[90] ఒకవేళ అదే జరిగితే నీ తరువాత వాళ్లు కూడా అక్కడ ఎంతో కాలం నిలువ లేరు.[91]

وَاِنۡ كَادُوۡا لَيَسۡتَفِزُّوۡنَكَ مِنَ الۡاَرۡضِ لِيُخۡرِجُوۡكَ مِنۡهَا وَاِذًا لَّا يَلۡبَثُوۡنَ خِلٰفَكَ اِلَّا قَلِيۡلًا ﴿76﴾

77 నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలకు కూడా ఈ విధానమే వర్తించింది.[92] మా విధానంలో నువ్వు ఎలాంటి మార్పునూ కనుగొనలేవు.[93]

سُنَّةَ مَنۡ قَدۡ اَرۡسَلۡنَا قَبۡلَكَ مِنۡ رُّسُلِنَا وَلَا تَجِدُ لِسُنَّتِنَا تَحۡوِيۡلًا ﴿77﴾

78 నమాజును నెలకొల్పు – సూర్యుడు నెత్తి నుండి వాలినప్పటి నుంచి రాత్రి చీకటి అలుముకునే వరకు.[94] తెల్లవారు జామున ఖుర్‌ఆను పారాయణం చెయ్యి. నిశ్చయంగా తెల్లవారు జామున చేసే ఖుర్‌ఆన్ పారాయణానికి సాక్ష్యం ఇవ్వబడుతుంది.[95]

اَقِمِ الصَّلٰوةَ لِدُلُوۡكِ الشَّمۡسِ اِلٰى غَسَقِ الَّيۡلِ وَقُرۡاٰنَ الۡفَجۡرِؕ اِنَّ قُرۡاٰنَ الۡفَجۡرِ كَانَ مَشۡهُوۡدًا ﴿78﴾

89. మనిషి ఎంత ఉన్నత స్థానంలో ఉంటాడో అంతే గట్టిగా నిలదీయబడతాడనీ, అత్యున్నత కోవకు చెందినవారు తప్పు చేస్తే వారికి విధించబడే శిక్ష కూడా రెట్టింపు ఉంటుందని దీన్నిబట్టి అర్థమవుతోంది.

90. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను నగరం నుంచి వెళ్ళగొట్టాలని మక్కాకు చెందిన ఖురైషులు పన్నిన కుట్ర ఇది. అయితే అల్లాహ్ ఆయన్ని (సఅసం) వారి కుట్ర నుంచి కాపాడాడు.

91. ఒకవేళ వాళ్లు తమ దుష్టపన్నాగం ప్రకారం ఆయన్ని (సఅసం) మక్కా నుంచి వెళ్ళగొట్టి ఉంటే, వాళ్లు కూడా అక్కడ బతికి బట్టకట్టలేకపోయేవారు. ఎందుకంటే దైవాగ్రహం వారిపై విరుచుకుపడేది.

92. అంటే దైవప్రవక్తను తమ స్వస్థలం నుంచి వెళ్లగొట్టడం లేదా వెళ్ళగొట్టేందుకు కుట్రలు పన్నటం అనే ఈ పద్ధతి కొత్తదేమీ కాదు. గతకాలంలో మేము పంపిన ప్రవక్తలు కూడా ఈ విపత్కర స్థితిని ఎదుర్కొన్నారు. ఇది ఆనవాయితీగా వస్తున్నదే. అంతిమ దైవప్రవక్త (సఅసం) విషయంలో కూడా ఈ కుట్ర పన్నబడింది. ఇంతచేసీ తమ పంతం నెగ్గించుకున్న ఆ జాతులవారు నిక్షేపంగా ఉండగలిగారా? అంటే అదీ జరగలేదు. వారి దుష్టబుద్ధి మూలంగా దేవుడు వారిపై ఆగ్రహించాడు. వారిని కూడా సమూలంగా తుడిచిపెట్టేశాడు.

93. మక్కా అవిశ్వాసుల విషయంలో కూడా అదే జరిగింది. మహాప్రవక్త (సఅసం) మక్కా నుంచి మదీనాకు వలసపోయిన ఏడాదిన్నర కాలంలో బద్ర్ రణరంగంలో అవిశ్వాసులు ముస్లింల చేతిలో ఘోరపరాజయాన్ని చవిచూశారు. మరో ఆరేళ్ళకాలంలో మక్కా నగరం ఎలాంటి రక్తపాతం జరగకుండానే ముస్లింల వశమైంది. ఈ పరాభవం తరువాత అవిశ్వాసులు తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది.

94. ఈ ఆయతులో ఐదువేళల నమాజుల ప్రస్తావన ఉంది. **'దులూకున్'** అంటే సూర్యుడు నడినెత్తి మీది నుంచి వాలటమని అర్థం. **'ఘసఖ్' (غسق)** అంటే చీకటి, అంధకారం అని భావం. పొద్దు వాలిన తరువాత జుహ్ర్, అస్ర్ నమాజులు చేయబడతాయి. రాత్రి చీకటిపడిన తరువాత మగ్రిబ్, ఇషా నమాజులు జరుగుతాయి. తెల్లవారు జామున ఖుర్‌ఆన్ పారాయణం అంటే ఫజ్ర్ నమాజు అని భావం. ఇక్కడ 'ఖుర్‌ఆన్' అనే పదం అసలు 'నమాజ్' నేపథ్యంలో ప్రయోగించబడింది. ఫజ్ర్ నమాజును ఖుర్‌ఆన్ పారాయణంగా అభివర్ణించటంలోని అసలు ఉద్దేశం ఏమిటంటే ఈ నమాజులో ఖుర్‌ఆన్ సుదీర్ఘంగా పారాయణం చేయబడుతుంది.

95. ఫజ్ర్ వేళ దైవదూతలు దివి నుంచి భువికి దిగివస్తారు. అంతేకాదు, ఆ సమయంలో పగటిపూట విధులను నిర్వహించే

**79** రాత్రిపూట కొంతభాగం తహజ్జుద్ (నమాజు)లో ఖుర్‌ఆన్ పఠనం చెయ్యి.[96] ఇది నీ కొరకు అదనం.[97] త్వరలోనే నీ ప్రభువు నిన్ను "మఖామె మహ్మూద్"కు (ప్రశంసాత్మకమైన స్థానానికి) చేరుస్తాడు.[98]

وَمِنَ الَّيْلِ فَتَهَجَّدْ بِهٖ نَافِلَةً لَّكَ ۖ عَسٰٓى اَنْ يَّبْعَثَكَ رَبُّكَ مَقَامًا مَّحْمُوْدًا ﴿۷۹﴾

**80** ఈ విధంగా పలుకు: "నా ప్రభూ! నన్ను ఎక్కడికి తీసుకెళ్ళినా మంచిస్థితిలో తీసుకుని వెళ్ళు. ఎక్కడి నుంచి తీసినా మంచిస్థితి లోనే తియ్యి. నా కోసం నీ వద్ద నుండి అధికారాన్ని, తోడ్పాటును ప్రసాదించు."[99]

وَقُلْ رَّبِّ اَدْخِلْنِيْ مُدْخَلَ صِدْقٍ وَّاَخْرِجْنِيْ مُخْرَجَ صِدْقٍ وَّاجْعَلْ لِّيْ مِنْ لَّدُنْكَ سُلْطٰنًا نَّصِيْرًا ﴿۸۰﴾

---

దూతలు, రాత్రివేళ డ్యూటీ చేసిన దైవదూతలు కలుస్తారు. హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది (బుఖారీ– బనీ ఇస్రాయీల్ సూరా వ్యాఖ్యానం). మరో హదీసులో ఇలా ఉంది : రాత్రివేళ విధుల్ని నిర్వహించిన దూతలు అల్లాహ్ సన్నిధికి చేరుకున్నప్పుడు – తనకంతా తెలిసినప్పటికీ– "మీరు నా దాసుల్ని ఏ స్థితిలో వదలి వచ్చారు?" అని అల్లాహ్ ప్రశ్నిస్తాడు. దానికి వారు, "మేము వారివద్దకు వెళ్ళినప్పుడు కూడా వారు నమాజులో లీనమై ఉన్నారు. మేము వారి వద్దనుంచి తిరిగివస్తున్నప్పుడు కూడా వారు నమాజులోనే నిమగ్నులై ఉన్నారు" అని సమాధానమిస్తారు (బుఖారీ – కితాబుల్ మవాఖీత్; ముస్లిం – ఫజ్ర్, అస్ర్ నమాజుల ప్రాశస్త్యం).

96. **తహజ్జుద్ :** తహజ్జుద్ అన్న పదానికి విభిన్న అర్థాలున్నాయని కొంతమంది పండితులు చెబుతారు. అంటే ఈ పదానికి నిద్రపోవటం, నిద్ర నుంచి మేల్కొనటం – రెండు అర్థాలూ వస్తాయి. ఇక్కడ ఇది ఈ రెండవ అర్థంలోనే ఉపయోగించబడింది. మొత్తానికి తహజ్జుద్ అంటే రాత్రి చివరి వేళలో నిద్రలేచి నఫిల్ నమాజ్ (ఖియాముల్లైల్) చేయటం అని భావం. ఈ విషయంలో మితిమీరటం, రాత్రంతా జాగారం చేసి అదనపు (నఫిల్) నమాజులు చేస్తూ ఉండటం కూడా సంప్రదాయ విరుద్ధమే. దైవప్రవక్త (సఅసం) రాత్రి ప్రథమార్థంలో నిద్రించి రాత్రి చివరి భాగంలో మేల్కొని తహజ్జుద్ నమాజు చేసేవారు. ఇదే సరైన విధానం.

97. ఈ **'అదనపు నమాజు'** దైవప్రవక్త (సఅసం) కొరకు 'విధి'గా నిర్ణయించబడిందనీ, ఇది దైవప్రవక్త (స) యెడల చేయబడిన ప్రత్యేక వ్యవహారమనీ, ప్రతిరోజూ ఐదుపూటల నమాజులు 'విధి'గా ఉన్నట్లే తహజ్జుద్ నమాజు కూడా ఆయన (స) పాలిట 'విధి'గా ఉండేదనీ విద్వాంసులు కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఆయన అనుచర సమాజానికి ఈ 'తహజ్జుద్' నమాజు 'విధి' (ఫర్జ్) కాదు.

మరి కొంతమంది పండితులు ఇలా అభిప్రాయపడ్డారు –

"దైవప్రవక్త (సఅసం) వారి పాపాలు మన్నించబడినట్లు ప్రకటించబడినప్పటికీ, ఆయన (స) అంతస్తుల్ని ఉన్నతం చేయటానికి అల్లాహ్ ఈ ఆరవ నమాజును ఆయన కొరకు 'అదనం'గా ఉంచాడు. కాగా; ముస్లిం అనుచర సమాజంలోని ఇతరులకు ఇది పాపపరిహారంగానూ, సత్కర్మగానూ దోహదపడుతుంది."

ఇంకా కొంతమంది ఈ విధంగా వ్యాఖ్యానించారు : "అసలు ఇది అదనపు (నఫిల్) నమాజే. ఇది దైవప్రవక్త (స) పైగానీ, ఆయన అనుచర సమాజంపైగానీ 'విధి'గా మోపబడలేదు. కాకపోతే ముమ్మాటికీ ఈ నమాజు శ్రేష్ఠమైనది. ఆ వేళ చేసే ఈ నమాజుతో అల్లాహ్ ఎంతో ప్రసన్నుడవుతాడు. అయితే ఇది ఫర్జ్ నమాజ్‌గానీ, వాజిబ్ నమాజ్‌గానీ కాదు. దైవప్రవక్త (స)పై గానీ, ఆయన అనుయాయులపైగానీ ఇది ఫర్జ్ (విధి)గా నియమించబడలేదు."

98. తీర్పుదినాన అల్లాహ్ ఈ ప్రతిష్ఠాత్మకమైన స్థానాన్ని (మఖామె మహ్మూద్‌ను) తన అంతిమ ప్రవక్త (స)కు ప్రసాదిస్తాడు. ఈ అత్యున్నత స్థానం నుంచే ఆయన (స) తన అనుచరుల కొరకు సిఫారసు చేస్తారు. ఆ తరువాత ప్రజల లెక్కలు తేల్చబడతాయి.

99. మహాప్రవక్త (సఅసం) మక్కానుంచి మదీనాకు హిజ్రత్ (ప్రస్థానం) చేసి మదీనా నగరంలో ప్రవేశించే ముందు ఈ

**81** ఇంకా ఈ విధంగా ప్రకటించు: "సత్యం వచ్చేసింది. అసత్యం సమసిపోయింది. నిశ్చయంగా, అసత్యం సమసి పోవలసినదే."[100]

وَقُلۡ جَآءَ الۡحَقُّ وَزَهَقَ الۡبَاطِلُ ؕ اِنَّ الۡبَاطِلَ كَانَ زَهُوۡقًا ﴿81﴾

**82** మేము అవతరింపజేసే ఈ ఖుర్‌ఆన్ విశ్వాసుల కొరకు ఆసాంతం స్వస్థత, కారుణ్య ప్రదాయిని. అయితే దుర్మార్గులకు (దీని వల్ల) నష్టం కలగటం తప్ప మరే వృద్ధీ జరగదు.[101]

وَنُنَزِّلُ مِنَ الۡقُرۡاٰنِ مَا هُوَ شِفَآءٌ وَّرَحۡمَةٌ لِّلۡمُؤۡمِنِيۡنَ ۙ وَلَا يَزِيۡدُ الظّٰلِمِيۡنَ اِلَّا خَسَارًا ﴿82﴾

**83** మేము మానవుణ్ణి అనుగ్రహించినప్పుడు అతడు వైముఖ్య ధోరణిని ప్రదర్శిస్తూ, ఓ ప్రక్కకు తిరిగిపోతాడు. బాధ కలిగి నప్పుడు మాత్రం నిరాశకు గురవుతాడు.[102]

وَاِذَآ اَنۡعَمۡنَا عَلَى الۡاِنۡسَانِ اَعۡرَضَ وَنَاٰ بِجَانِبِهٖ ۚ وَاِذَا مَسَّهُ الشَّرُّ كَانَ يَــُٔوۡسًا ﴿83﴾

**84** వారికి చెప్పు : "ప్రతి ఒక్కడూ తన విధానం ప్రకారం ఆచరిస్తు న్నాడు. పూర్తిగా సన్మార్గంపై ఉన్నదెవరో నీ ప్రభువుకే బాగా తెలుసు."[103]

قُلۡ كُلٌّ يَّعۡمَلُ عَلٰى شَاكِلَتِهٖ ؕ فَرَبُّكُمۡ اَعۡلَمُ بِمَنۡ هُوَ اَهۡدٰى سَبِيۡلًا ﴿84﴾

**85** వారు ఆత్మను గురించి నిన్ను ప్రశ్నిస్తున్నారు. "ఆత్మ నా ప్రభువు ఆజ్ఞతో (ముడిపడి) ఉంది. మీకు ఒసగబడిన జ్ఞానం బహుస్వల్పం"[104] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

وَيَسۡـــَٔلُوۡنَكَ عَنِ الرُّوۡحِ ؕ قُلِ الرُّوۡحُ مِنۡ اَمۡرِ رَبِّىۡ وَمَاۤ اُوۡتِيۡتُمۡ مِّنَ الۡعِلۡمِ اِلَّا قَلِيۡلًا ﴿85﴾

---

వాక్యం అవతరించిందని కొంతమంది అభిప్రాయపడ్డారు. సత్యంతోపాటు ఈ లోకంలో తనువు చాలించి, సత్యసమేతంగా పునరుత్థానదినాన ప్రభువు వద్ద హాజరు కావాలన్నదే దీని భావమని మరికొంతమంది వ్యాఖ్యానించారు. అయితే ఇదొక వేడుకోలు అనీ, ఏ భావంలోకి తీసుకున్నా ఇది అన్వయిస్తుందని ఇమామ్ షౌకానీ భావిస్తున్నారు.

100. మక్కా విజయం సందర్భంగా మహాప్రవక్త (స) కాబా గృహంలోకి అడుగు పెట్టే సమయంలో అక్కడ 360 విగ్రహా లుండేవనీ, ఆ సమయంలో ఆయన చేతిలో ఒక బెత్తం ఉందనీ, ఆ బెత్తం కొనతో ఆయన (స) ఆ విగ్రహాలను తడుతూ ఈ విధంగా పలికారనీ (అంటే సత్యం వచ్చేసింది, అసత్యం తొలగిపోయింది అని అన్నారనీ), ఇంకా "సత్యం వచ్చేసింది. అసత్యం ముందునుంచే లేదు. ఇక తరువాత కూడా రాదు" అని అన్నారనీ హదీసులో ఉంది (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ బనీ ఇస్రాయీల్ వ కితాబుల్ మజాలిమ్; ముస్లిం – అల్ జిహాద్).

101. దాదాపు ఇదే భావం గల ఆయతు యూనుస్ సూరా (57వ వచనం)లో ఉంది. దాని సారాంశం చూడండి.

102. కలిమిలో మానవుని పరిస్థితి ఎలా ఉంటుందో, లేమిలో అతని స్వభావం ఎలా ఉంటుందో ఈ ఆయతులో చెప్పబడింది. సుఖాలు ప్రాప్తించినపుడు అతడు అల్లాహ్‌ను మరచిపోతాడు. మిడిసిపడతాడు. బాధలు మొదలైనపుడు నిరాశా నిస్పృహలకు లోనవుతాడు. దేవుడికే తన మీద దయలేదని నిందిస్తాడు. అయితే విశ్వసించినవారు మాత్రం అలా ప్రవర్తించరు. కలిమిలోనూ, లేమిలోనూ వారు అల్లాహ్‌ను స్మరిస్తారు. అల్లాహ్‌కు భయపడుతూ, ఆయన కారుణ్యం పట్ల ఆశాభావం కలిగి ఉంటారు. వివరాలకు హూద్ సూరాలోని 9 – 11 ఆయతులను చూడండి.

103. ఈ ఆయతు బహుదైవోపాసకులకు హెచ్చరిక వంటిది. హూద్ సూరాలోని 121, 122 ఆయతులలో చెప్పబడిన విషయమే ఇక్కడా చెప్పబడింది. .....**'షాకిలతున్'** అంటే సంకల్పం, పద్ధతి, ధర్మం, విధానం, నైజం, స్వభావం అనే అర్థాలువస్తాయి. ఈ ఆయతులో అవిశ్వాసులు తూలనాడబడ్డారు. విశ్వాసులు ప్రశంసించబడ్డారు. ఎందుకంటే ప్రతిమనిషీ, తాను ఎన్నుకునే జీవనమార్గం అతని గుణగణాలతో, అతని స్వభావంతో ముడిపడి ఉంటుంది.

104. ఆత్మ ఎంతో సూక్ష్మమైనది. కంటికి కానరానిది. కాని ప్రతి ప్రాణికీ అదే జీవనాధారం. అదెలా ఉంటుంది? దాని

**86** మేము గనక తలచుకుంటే, నీ వద్దకు పంపిన వహీ మొత్తాన్ని తిరిగి స్వాధీనం చేసుకోగలము.[105] ఆ తరువాత మాకు వ్యతిరేకంగా దానిని తిరిగి ఇప్పించగలిగే ఏ సహాయకుణ్ణీ నీవు పొందలేవు.[106]

وَلَئِن شِئْنَا لَنَذْهَبَنَّ بِالَّذِي أَوْحَيْنَا إِلَيْكَ
ثُمَّ لَا تَجِدُ لَكَ بِهِ عَلَيْنَا وَكِيلًا (86)

**87** నీ ప్రభువు అనుగ్రహంతో తప్ప![107] నిస్సందేహంగా నీపై ఉన్న ఆయన అనుగ్రహం చాలా గొప్పది.

إِلَّا رَحْمَةً مِّن رَّبِّكَ ۚ إِنَّ فَضْلَهُ كَانَ
عَلَيْكَ كَبِيرًا (87)

**88** వారికి చెప్పు: "ఒకవేళ సమస్త మానవులు, యావత్తు జిన్నులు కలిసి ఈ ఖుర్ఆను లాంటి గ్రంథాన్ని తేదలచినా - వారు ఒండొకరికి తోడ్పాటును అందజేసుకున్నా[108] ఇటువంటి దానిని తీసుకురావటం వారివల్ల కాని పని.

قُل لَّئِنِ اجْتَمَعَتِ الْإِنسُ وَالْجِنُّ عَلَىٰ أَن يَأْتُوا
بِمِثْلِ هَٰذَا الْقُرْآنِ لَا يَأْتُونَ بِمِثْلِهِ وَلَوْ كَانَ
بَعْضُهُمْ لِبَعْضٍ ظَهِيرًا (88)

**89** మేము ప్రజల బోధనార్థం ఈ ఖుర్ఆనులో అన్ని (విధాలు గాను) ఉపమానాలను ఇచ్చాము. కాని చాలా మంది తమ తిరస్కార వైఖరిని మానుకోలేదు.[109]

وَلَقَدْ صَرَّفْنَا لِلنَّاسِ فِي هَٰذَا الْقُرْآنِ مِن كُلِّ
مَثَلٍ فَأَبَىٰ أَكْثَرُ النَّاسِ إِلَّا كُفُورًا (89)

**90** వారిలా అన్నారు[110] : "నువ్వు మా కోసం భూమి నుంచి నీటి ఊటను ప్రవహింపజేయనంతవరకూ మేము నిన్ను నమ్మేది లేదు.

وَقَالُوا لَن نُّؤْمِنَ لَكَ حَتَّىٰ تَفْجُرَ لَنَا
مِنَ الْأَرْضِ يَنبُوعًا (90)

**91** "లేదా నీ కోసమైనా ఖర్జూరాలు, ద్రాక్ష పండ్లు గల తోట ఒకటి ఉండాలి. దాని మధ్యన నువ్వు అనేక కాలువలను ప్రవహింప జేయాలి.

أَوْ تَكُونَ لَكَ جَنَّةٌ مِّن نَّخِيلٍ وَعِنَبٍ
فَتُفَجِّرَ الْأَنْهَارَ خِلَالَهَا تَفْجِيرًا (91)

---

వాస్తవికత ఏమిటీ?-ఎవరికీ తెలియదు. దీని గురించి యూదులు కూడా ఒకసారి మహాప్రవక్త (సఅసం)ను ప్రశ్నించారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది (సహీహ్ బుఖారీ - బనీ ఇస్రాయీల్ సూరా వ్యాఖ్యానం). ఈ ఆయతు భావమేమిటంటే మీకున్న జ్ఞానం దైవజ్ఞానంతో పోల్చినట్లయితే చాలా స్వల్పం. మీరేమో ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారాయె. ఆత్మ గురించిన పరిజ్ఞానాన్ని దేవుడు తన సందేశహరులకే తెలుపలేదు. అయితే 'ఇది నా ప్రభువు ఆజ్ఞకు లోబడిన అంశం' అని మాత్రం తెలుసుకోండి. దాని వాస్తవికత ఏమిటో నా ప్రభువుకు మాత్రమే తెలుసు అని తన ప్రవక్త (స) ద్వారా దేవుడు తెలిపాడు.

105. అల్లాహ్ 'వహీ' ద్వారా ప్రసాదించిన కొద్దో గొప్పో జ్ఞానాన్ని కూడా తాను తలచుకుంటే జప్తు చేసుకోగలడు. అంటే మనోఫలకంపై నుంచి ఆ జ్ఞానాన్ని తొలగించగలడు.

106. అంటే; దేవుడు గనక ఈ జ్ఞానాన్ని ప్రవక్త నుంచి తీసేసుకుంటే దాన్ని ఆయన నుంచి తిరిగి ఇప్పించే వాడెవడూ ఉండడు.

107. కాని (ఓ ముహమ్మద్!) అల్లాహ్ నీపై దయదలిచాడు. నీకు ప్రసాదించిన జ్ఞానాన్ని ఆయన నీనుండి లాక్కోలేదు. ముమ్మాటికీ ఇది దైవకృపేనని తెలుసుకో.

108. దివ్య ఖుర్ఆన్ రచనకు సంబంధించిన ఈ ఛాలెంజీ ఇంతకు ముందు కూడా అనేకచోట్ల చేయబడింది. ఈ సవాలును ఇంతవరకు ఎవరూ స్వీకరించలేకపోయారు.

92 "లేదా నువ్వు చెబుతున్నట్లుగా ఆకాశాన్ని ముక్కలు ముక్కలుగా చేసి మాపై పడవెయ్యి లేదా నువ్వు ఖుద్దుగా అల్లాహ్‌ను, దూత లను తెచ్చి మా ఎదుట నిలబెట్టు.[111]

اَوْ تُسْقِطَ السَّمَآءَ كَمَا زَعَمْتَ عَلَيْنَا كِسَفًا
اَوْ تَاْتِيَ بِاللّٰهِ وَالْمَلٰٓئِكَةِ قَبِيْلًا ﴿92﴾

93 "లేదా నీ కోసం స్వర్ణ గృహం ఏదన్నా సిద్ధం కావాలి[112] లేదా నువ్వు ఆకాశానికి ఎక్కిపోవాలి. (ఒకవేళ నువ్వు అలా ఎక్కి పోయినా) మేము స్వయంగా చదవగలిగే[113] గ్రంథమేదైనా మాపై అవతరింపజేయనంతవరకూ నీ అధిరోహణను కూడా మేము నమ్మేది లేదు." (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "నా ప్రభువు పరమ పవిత్రుడు. నేను ప్రవక్తగా పంపబడిన ఒక మానవ మాత్రుణ్ణి మాత్రమే."[114]

اَوْ يَكُوْنَ لَكَ بَيْتٌ مِّنْ زُخْرُفٍ اَوْ تَرْقٰى فِي
السَّمَآءِ ؕ وَلَنْ نُّؤْمِنَ لِرُقِيِّكَ حَتّٰى تُنَزِّلَ
عَلَيْنَا كِتٰبًا نَّقْرَؤُهٗ ؕ قُلْ سُبْحَانَ رَبِّيْ هَلْ
كُنْتُ اِلَّا بَشَرًا رَّسُوْلًا ﴿93﴾

94 ప్రజల వద్దకు మార్గదర్శకత్వం వచ్చిన మీదట, విశ్వసించ నీయకుండా వారిని ఆపిన విషయమల్లా ఒక్కటే – "అల్లాహ్ ఒక మానవమాత్రుణ్ణి ప్రవక్తగా పంపాడా?!"[115] అని వారన్నారు.

وَمَا مَنَعَ النَّاسَ اَنْ يُّؤْمِنُوْٓا اِذْ جَآءَهُمُ الْهُدٰٓى
اِلَّآ اَنْ قَالُوْٓا اَبَعَثَ اللّٰهُ بَشَرًا رَّسُوْلًا ﴿94﴾

109. ఈ ఆయతు ఈ సూరా ఆరంభంలో కూడా వచ్చింది.

110. విశ్వసించడానికి మక్కా ఖురైషులు పెట్టిన షరతులివి.

111. అంటే నీ దేవుడు, దైవదూతలు మా కళ్లముందు ప్రత్యక్షమవ్వాలి. వారిని మేము కళ్లారా తిలకించాలి. అంతవరకూ మాకు నమ్మకం కుదరదు.

112. అరబీలో **'జుఖ్రుఫున్'** అని ఉంది. అంటే అందమైన, శోభాయమానమైన అని అసలు అర్థం. కాని ఈ ఆయతులో మాత్రం బంగారం అని అర్థం వస్తుంది.

113. నువ్వు తీసుకువచ్చే ఆ గ్రంథం మేమందరం సులభంగా చదవగలిగేలా ఉండాలి.

114. ఈ పలుకుల భావం ఇది : నా ప్రభువు దుర్బలుడు కాడు. ఆయన గనక తలచుకుంటే మీ డిమాండ్లన్నింటినీ ఇట్టే తీర్చగలడు. 'అయిపో' అన్న ఒక్క ఆజ్ఞతో అంతా అయిపోతుంది. కాని నేను మాత్రం మానవమాత్రుణ్ణి. మానవ మాత్రుని వల్ల ఇవన్నీ సంభవమా? కాదే! కాకపోతే నేను దేవుని తరఫున నియమించబడిన ప్రవక్తను. ప్రవక్త పనల్లా దైవాజ్ఞలను మానవాళివరకు చేరవేయటమే. ఆ పనిని నేను నెరవేరుస్తున్నాను. ప్రజలు కోరిన కోర్కెనల్లా మహిమల రూపంలో ప్రదర్శించటం దైవదౌత్య ప్రక్రియలో అంతర్భాగం కాదు. అయితే అల్లాహ్ కోరితే దైవదౌత్య ధృవీకరణ నిమిత్తం ఒకటీ అరా మహిమ చూపబడుతుంది. అంతే. దీనికి బదులు ప్రజలు కోరిన ప్రతి మహిమనూ చూపి తీరాల్సిందే అంటే దీనికి అడ్డూ ఆపూ ఉండదు. ప్రతి మనిషీ తన మనోవాంఛ ప్రకారం సరికొత్త మహిమ కావాలంటాడు. అప్పుడు ప్రవక్త పొద్దస్తమానం మహిమలు ప్రదర్శించటంలోనే తలమునకలై ఉండాల్సివస్తుంది. సందేశ ప్రధానమైన అసలు కార్యం కుంటుపడిపోతుంది. కాబట్టి మహిమలు అల్లాహ్ యుక్తినిబట్టి చూపబడతాయి. అందలి ఉచితానుచితాలు, మంచీ చెబ్బరలన్నీ దైవ ప్రణాళికకు లోబడి ఉంటాయి. ఆ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే పరిమితం. నేను సయితం ఆయన ప్రణాళికలో జోక్యం చేసుకోలేను.

115. తమలాంటి ఒక మానవమాత్రుడు దైవప్రవక్తగా తమ ముందుకు రావటం అవిశ్వాసులను, బహుదైవారాధకులను ఆశ్చర్యపరిచింది. తమ లాగా మాట్లాడేవాడు, తమ లాగానే తినేవాడు త్రాగేవాడు, తమలాగానే బంధుత్వ సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా ప్రవక్తగా ఎలా మారిపోయాడు? అనే విషయం వారిని నిర్ఘాంతపరిచింది. ఈ విషయమే విశ్వసించకుండా వారికి అడ్డుగా నిలిచింది.

**95** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఒకవేళ దైవదూతలు భూ మండలం మీద తిరుగుతూ, నివాసమేర్పరచుకుంటూ ఉన్నట్లయితే, మేము వారి వద్దకు కూడా ఆకాశం నుంచి దైవ దూతనే ప్రవక్తగా పంపి ఉండేవారం."[116]

قُلْ لَّوْ كَانَ فِي الْأَرْضِ مَلٰٓئِكَةٌ يَّمْشُوْنَ مُطْمَئِنِّيْنَ
لَنَزَّلْنَا عَلَيْهِمْ مِّنَ السَّمَآءِ مَلَكًا رَّسُوْلًا ﴿٩٥﴾

**96** వారితో అను : "నాకూ – మీకూ మధ్య సాక్షిగా అల్లాహ్ చాలు.[117] తన దాసుల గురించి ఆయనకు అంతా తెలుసు. ఆయన వారిని చూస్తూనే ఉన్నాడు."

قُلْ كَفٰى بِاللّٰهِ شَهِيْدًا بَيْنِيْ وَبَيْنَكُمْ ۭ اِنَّهٗ كَانَ
بِعِبَادِهٖ خَبِيْرًا بَصِيْرًا ﴿٩٦﴾

**97** అల్లాహ్ ఎవరికి సన్మార్గం చూపుతాడో అతనే సన్మార్గం పొందుతాడు. ఆయన మార్గవిహీనతకు లోనుచేసిన వారికి, ఆయన (శిక్ష)కు విరుద్ధంగా ఇతరులెవరినీ నువ్వు సహాయకులుగా పొందజాలవు.[118] అలాంటి వారిని మేము ప్రళయ దినాన ముఖాల ఆధారంగా సమీకరిస్తాము.[119] మరి చూడబోతే వారు గుడ్డివారు, మూగవారు, చెవిటివారై ఉంటారు.[120] నరకం వారి నివాసమవుతుంది. అది మందగించినప్పుడల్లా వారి కోసం దాన్ని రాజేస్తూ ఉంటాం.

وَمَنْ يَّهْدِ اللّٰهُ فَهُوَ الْمُهْتَدِ ۚ وَمَنْ يُّضْلِلْ فَلَنْ
تَجِدَ لَهُمْ اَوْلِيَاۗءَ مِنْ دُوْنِهٖ ۭ وَنَحْشُرُهُمْ يَوْمَ
الْقِيٰمَةِ عَلٰي وُجُوْهِهِمْ عُمْيًا وَّبُكْمًا وَّصُمًّا ۭ
مَاْوٰىهُمْ جَهَنَّمُ ۭ كُلَّمَا خَبَتْ زِدْنٰهُمْ سَعِيْرًا ﴿٩٧﴾

**98** వారు మా ఆయతులను తిరస్కరించి, "మేము ఎముకలై, తుత్తునియలు అయి పోయిన తరువాత కూడా మళ్లీ సరికొత్తగా పుట్టించబడతామా?!" అని చెప్పినందుకుగాను వారికి (లభించే) ప్రతిఫలం ఇది.[121]

ذٰلِكَ جَزَاۗؤُهُمْ بِاَنَّهُمْ كَفَرُوْا بِاٰيٰتِنَا وَقَالُوْٓا
ءَاِذَا كُنَّا عِظَامًا وَّرُفَاتًا ءَاِنَّا لَمَبْعُوْثُوْنَ
خَلْقًا جَدِيْدًا ﴿٩٨﴾

116. భూమి మీద మనుషులు నివసిస్తున్నప్పుడు వారివద్దకు వచ్చే ప్రవక్తలు కూడా మానవజాతికి చెందినవారే అయి ఉండాలి. మానవేతర వ్యక్తులు మానవజాతికి మార్గదర్శకత్వం వహించలేరు. ఒకవేళ దూతలు కూడా భువిపై నివసిస్తూ ఉంటే వారికి హితబోధ చేయడానికి దేవుడు దూతనే ప్రవక్తగా పంపి ఉండేవాడు. దైవదూతలు భూమ్మీద ఉండటం లేదు గనక ప్రవక్తగా దైవదూత రాలేదు.

117. అంటే సందేశాన్ని హెచ్చుతగ్గులు లేకుండా అందజేయటం నా కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని నేను సజావుగా నెరవేర్చాను. ఈ విషయానికి మీకూ – నాకూ మధ్య సాక్షిగా అల్లాహ్ చాలు. ఎందుకంటే నిర్ణయాలన్నీ గైకొనేవాడు ఆయనే.

118. నీ ప్రచారం ద్వారా ఎవరు విశ్వసిస్తారు? ఎవరు విశ్వసించరనేది అల్లాహ్ అధీనంలో ఉంది. నీ బాధ్యతల్లా సందేశాన్ని చేరవేయటమే.

119. "తలక్రిందులుగా చేసి (ముఖం ఆధారంగా) నడిపించటం ఎలా సాధ్యమవుతుంది?" అని ప్రవక్త ప్రియసహచరులు ఆశ్చర్యంగా అడిగారు. దానికి మహాప్రవక్త (సఅసం) "కాళ్ళపై నడిచే శక్తిని ప్రసాదించిన అల్లాహ్‌యే ముఖం ఆధారంగా నడిపించే శక్తిని కూడా కలిగి ఉన్నాడు" అని చెప్పారు (సహీహ్ బుఖారీ– అల్ ఫుర్కాన్ సూరా; ముస్లిం– సిఫతుల్ ఖియామ).

120. ప్రాపంచిక జీవితంలో వారు సత్యం పట్ల అంధులుగా, మూగవారుగా, చెవిటివారుగా వ్యవహరించారు. అందుకే తీర్పుదినాన వారికి తగిన శాస్తిగా గుడ్డివారుగా, మూగ వారుగా, చెవిటివారుగా చేసి హాజరుపరచటం జరుగుతుంది.

**99** ఏమిటీ, ఆకాశాలను, భూమిని సృష్టించిన అల్లాహ్ తమ లాంటి వారిని సృష్టించే శక్తి కలిగి ఉన్నాడన్న విషయంపై వారు దృష్టిని సారించలేదా?[122] ఏమాత్రం సంకోచానికి తావులేని ఒక సమయాన్ని ఆయన వారి కోసం నియమించి ఉన్నాడు.[123] కాని దుర్మార్గులు (ఎంత చెప్పినా) తిరస్కరించకుండా ఉండరు.

أَوَلَمْ يَرَوْا أَنَّ اللَّهَ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ
قَادِرٌ عَلَىٰ أَن يَخْلُقَ مِثْلَهُمْ وَجَعَلَ لَهُمْ أَجَلًا
لَّا رَيْبَ فِيهِ فَأَبَى الظَّالِمُونَ إِلَّا كُفُورًا ﴿٩٩﴾

**100** వారికి చెప్పు : "ఒకవేళ నా ప్రభువు కారుణ్య నిధులే గనక మీ అధీనంలోకి వస్తే, అప్పుడు మీరు అవి ఖర్చయిపోతాయే మోనన్న భయంతో[124] వాటిని ఆపి ఉంచేవారు. (అసలు విషయం ఏమిటంటే) మానవుడు సంకుచిత మనస్కుడు."

قُل لَّوْ أَنتُمْ تَمْلِكُونَ خَزَائِنَ رَحْمَةِ رَبِّي إِذًا
لَّأَمْسَكْتُمْ خَشْيَةَ الْإِنفَاقِ ۚ وَكَانَ الْإِنسَانُ قَتُورًا ﴿١٠٠﴾

**101** మేము మూసాకు స్పష్టమైన తొమ్మిది మహిమలను[125] ఇచ్చాము. (కావాలంటే) నువ్వు స్వయంగా ఇస్రాయీల్ వంశీయులను అడుగు. అతను వారి వద్దకు వచ్చినప్పుడు, "మూసా! నువ్వు చేతబడి చేయబడ్డావేమోనని నా అనుమానం" అన్నాడు ఫిరౌను.

وَلَقَدْ آتَيْنَا مُوسَىٰ تِسْعَ آيَاتٍ بَيِّنَاتٍ ۖ فَاسْأَلْ بَنِي
إِسْرَائِيلَ إِذْ جَاءَهُمْ فَقَالَ لَهُ فِرْعَوْنُ إِنِّي
لَأَظُنُّكَ يَا مُوسَىٰ مَسْحُورًا ﴿١٠١﴾

---

121. వీరిని నరకయాతనకు గురిచేయటానికి కారణమేమంటే, వీళ్లు మేము అవతరింపజేసిన వచనాలను సత్యమని ధృవీకరించలేదు. జగతిలో సర్వవ్యాప్తమై ఉన్న మా నిదర్శనాలపై యోచన చేయలేదు. ఏమాత్రం ఆలోచించకుండానే మరణానంతర జీవితాన్ని, తీర్పుదినాన్ని తేలిగ్గా కొట్టిపారేశారు. చచ్చి, ఎముకలుగా మారి, కృశించిపోయిన తరువాత మళ్లీ యధాతథంగా బ్రతికించబడటం అసలెలా సంభవం? అని అన్నారు.

122. భూమ్యాకాశాల నిర్మాత అయిన అల్లాహ్‌కు, వీరిలాంటి సృష్టితాలను సృజించటం, మరణానంతరం వారిని తిరిగి లేపటం కష్టసాధ్యం ఏమీ కాదు. ఈ సృష్టిప్రక్రియ భూమ్యాకాశాల సృష్టికన్నా ఎంతో సులువైనది. "మానవుణ్ణి సృష్టించటంకన్నా భూమ్యాకాశాలను సృష్టించటం గొప్ప పని" (మోమిన్ –57). ఈ విషయాన్నే అల్లాహ్ అహ్‌ఖాఫ్ సూరా 33వ ఆయత్‌లోనూ, యాసీన్ సూరా 81, 82వ ఆయత్‌లలోనూ విశదీకరించాడు.

123. ఈ **'నియమిత సమయం'** మృత్యువూ కావచ్చు లేక ప్రళయమూ కావచ్చు. సందర్భం దృష్ట్యా ప్రళయఘడియ అని భావించటమే చాలావరకు సమంజసంగా ఉంటుంది. అంటే మేము వారిని మళ్లీ బ్రతికించి సమాధుల నుంచి లేపటానికి ఒకానొక ఘడియను నిర్ణయించాము అని అల్లాహ్ సెలవిచ్చాడు. "మేము వీళ్ల వ్యవహారాన్ని ఒక నిర్ణీత ఘడియకోసం వాయిదా వేసి ఉంచాము" అన్న వచనం కూడా గమనార్హమే (హూద్ – 104).

124. **"ఖష్‌యతల్ ఇన్‌ఫాఖ్"** అంటే ఖర్చుపెట్టి అవజేసేస్తామేమో, ఆ తరువాత దరిద్రులుగా మారిపోతామేమో అని భయపడటం. కాని ఇది దేవుని కోశాగారం. అది ఎన్నటికీ తరిగేది కాదు. అయితే మానవుడు సంకుచిత మనస్కుడు, పీనాసి అవటం వల్ల ఎక్కడ ఖజానా ఖాళీ అయిపోతుందోనని బెంబేలెత్తిపోతుంటాడు. ఆ విషయాన్నే అల్లాహ్ మరోచోట ఈ విధంగా ప్రస్తావించాడు : "వారికే గనక అల్లాహ్ రాజ్యాధికారంలో భాగం లభిస్తే ప్రజలకు రవంత కూడా ఇవ్వరు" (నిసా – 53). అల్లాహ్ అపార కరుణామయుడు గనక సరిపోయింది. ఆయన తన దాసుల కోసం తన ధనాగారాలను, ముఖద్వారాలను తెరచిపెట్టేశాడు. హదీసులో ఇలా ఉంది – "అల్లాహ్ చేతులు నిండి ఉన్నాయి. ఆయన రేయింబవళ్లు ఖర్చు చేస్తుంటాడు. అయినా అందులో ఎలాంటి కొరతా ఏర్పడదు. కాస్త చూడండి! ఆయన భూమ్యాకాశాలను సృష్టించినప్పటినుంచీ ఏ మేరకు ఖర్చుచేసి ఉంటాడో!! కాని ఆయన చేతిలో ఉన్న దాంట్లో తరుగుదల అనేది రాలేదు (అవి నిండుగానే ఉన్నాయి)" (బుఖారీ– కితాబుత్తౌహీద్; ముస్లిం – కితాబుజ్జకాత్).

قَالَ لَقَدْ عَلِمْتَ مَاۤ اَنْزَلَ هٰۤؤُلَآءِ اِلَّا رَبُّ السَّمٰوٰتِ وَالْاَرْضِ بَصَآىِٕرَ ۚ وَاِنِّیْ لَاَظُنُّكَ یٰفِرْعَوْنُ مَثْبُوْرًا ﴿۱۰۲﴾

**102** మూసా ఇలా సమాధానమిచ్చాడు : "గుణపాఠంతో కూడు కున్న ఈ సూచనలను భూమ్యాకాశాల ప్రభువు తప్ప మరొక రెవరూ అవతరింపజేయలేదన్న విషయం నీకూ తెలుసు. ఓ ఫిరౌన్! నిశ్చయంగా నువ్వు వినాశానికి గురయ్యావని నేను భావిస్తున్నాను."

فَاَرَادَ اَنْ یَّسْتَفِزَّهُمْ مِّنَ الْاَرْضِ فَاَغْرَقْنٰهُ وَمَنْ مَّعَهٗ جَمِیْعًا ﴿۱۰۳﴾

**103** ఆ తరువాత ఫిరౌను, వారిని భూభాగం (రాజ్యం) నుంచే పెకలించివేయాలని గట్టిగా నిశ్చయించుకున్నప్పుడు మేము వాణ్ణీ, వాడి వెంటవున్న వారినే ముంచివేశాము.

وَّقُلْنَا مِنْۢ بَعْدِهٖ لِبَنِیْۤ اِسْرَآءِیْلَ اسْكُنُوا الْاَرْضَ فَاِذَا جَآءَ وَعْدُ الْاٰخِرَةِ جِئْنَا بِكُمْ لَفِیْفًا ﴿۱۰۴﴾

**104** ఆ తరువాత మేము ఇస్రాయీలు సంతతితో, "ఈ భూ భాగంపై[126] మీరు ఉండండి. అయితే పరలోక వాగ్దాన తరుణం ఆసన్నమైనప్పుడు మేము మీ అందరినీ కలిపి (ఒకే చోటికి) తీసుకువస్తాము" అని చెప్పాము.

وَبِالْحَقِّ اَنْزَلْنٰهُ وَبِالْحَقِّ نَزَلَ ؕ وَمَاۤ اَرْسَلْنٰكَ اِلَّا مُبَشِّرًا وَّنَذِیْرًا ﴿۱۰۵﴾

**105** మేము దీనిని (ఖుర్ఆన్‌ను) సత్యసమేతంగా అవతరింప జేశాము. ఇది కూడా సత్యంతోనే అవతరించింది.[127] మేము నిన్ను శుభవార్తను వినిపించేవానిగా, హెచ్చరించేవానిగా[128] మాత్రమే పంపాము.

125. ఆ తొమ్మిది సూచనలు ఇవి : 1. చేయి 2. చేతి కర్ర 3. కరువు కాటకాలు 4. ఆహార ధాన్యాలలో కొరత 5. తుఫాను 6. మిడుతల దండు 7. పేలు, నల్లులు 8. కప్పలు 9. రక్తం.

కరువు కాటకాలు, ఆహారధాన్యాల కొరత – ఇవి రెండూ ఒక సూచన క్రిందికి వస్తాయనీ, అయితే మంత్రగాళ్ళ మాయాజాలాన్ని చేతికర్ర మ్రింగివేయటం తొమ్మిదవ సూచనగా పరిగణించబడుతుందని ఇమామ్ హసన్ బస్రీ అభిప్రాయపడ్డారు. ఇవిగాక మరికొన్ని మహిమలు కూడా హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు ప్రసాదించబడ్డాయి. ఉదాహరణకు : చేతి కర్రతో ఆయన కొండ రాయిపై కొట్టగానే అందులో నుంచి పన్నెండు నీటి ఊటలు చిమ్మటం, మబ్బు తునకలు నీడను కల్పించటం, మన్న్ – సల్వా ఆహారపదార్థాలు అవతరించటం ఇత్యాదివి. కాని ఇక్కడ 9 సూచనలు అంటే ఫిరౌన్ మరియు అతని జాతివారు చూసిన 9 సూచనలే. అందుకే హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) సముద్రం చీలి రహదారిగా మారటాన్ని 'ఆ తొమ్మిది సూచనలలో' చేర్చి, "కరువు కాటకాలను, ఆహారధాన్యాల కొరతను" ఒకే సూచనగా నమోదు చేశారు. అయితే తిర్మిజీలోని ఒక ఉల్లేఖనంలో ఈ తొమ్మిది సూచనల వివరాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. కాని ప్రామాణికత రీత్యా ఆ ఉల్లేఖనం బలహీనమైనది.

126. **"ఈ భూభాగం"** అనగానే ఈజిప్టు రాజ్యం స్ఫురణకు వస్తుంది. ఫిరౌను చక్రవర్తి హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను, ఆయన జాతి వారైన ఇస్రాయీలీయులను తన రాజ్యం నుంచి వెళ్ళగొట్టాలని సంకల్పించుకున్నాడు. అయితే బనీ ఇస్రాయీల్ చరిత్ర చాటిచెప్పేదేమిటంటే వారు ఈజిప్టు రాజ్యం నుంచి వెళ్ళిపోయిన తరువాత తిరిగి ఈజిప్టులోకి ప్రవేశించలేదు. 40 సంవత్సరాలపాటు 'తీహ్' మైదానంలో ఉండి, అటు పిమ్మట పాలస్తీనాలో ప్రవేశించారు. ఆరాఫ్ సూరా ద్వారా మనకు తెలిసేది కూడా ఇదే. కాబట్టి 'ఈ భూభాగం' అంటే పాలస్తీనా ప్రదేశమని అనుకోవటం సమంజసం.

127. అంటే ఈ గ్రంథం సురక్షితంగా–ఎలాంటి మార్పులకు లోనుగాకుండా – మీ వద్దకు చేరింది. అందులో ఎలాంటి

106 నువ్వు నెమ్మది నెమ్మదిగా ప్రజలకు వినిపించటానికి వీలుగా మేము ఖుర్‌ఆను గ్రంథాన్ని కొద్ది కొద్దిగా చేసి[129] అవతరింపజేశాము. మేము దీనిని అంచెలవారీగా అవతరింపజేశాము.

وَقُرْاٰنًا فَرَقْنٰهُ لِتَقْرَاَهٗ عَلَى النَّاسِ عَلٰى مُكْثٍ وَّنَزَّلْنٰهُ تَنْزِيْلًا ﴿106﴾

107 వారికి చెప్పు : "మీరు దీనిని నమ్మినా నమ్మకపోయినా, దీనికి పూర్వం జ్ఞానం వొసగబడిన వారి ఎదుట ఇది పఠించబడినప్పుడల్లా వారు ముఖాల ఆధారంగా సాష్టాంగపడిపోతారు."[130]

قُلْ اٰمِنُوْا بِهٖٓ اَوْ لَا تُؤْمِنُوْا ۭ اِنَّ الَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ مِنْ قَبْلِهٖٓ اِذَا يُتْلٰى عَلَيْهِمْ يَخِرُّوْنَ لِلْاَذْقَانِ سُجَّدًا ﴿107﴾

108 "మా ప్రభువు పరమపవిత్రుడు. మా ప్రభువు వాగ్దానం నెరవేరటం తథ్యం"[131] అని అంటారు.

وَّيَقُوْلُوْنَ سُبْحٰنَ رَبِّنَآ اِنْ كَانَ وَعْدُ رَبِّنَا لَمَفْعُوْلًا ﴿108﴾

109 వారు విలపిస్తూ, ముఖాల ఆధారంగా (సాష్టాంగ) పడిపోతారు. ఈ ఖుర్‌ఆన్ వారి అణకువను (వినమ్రతను) మరింత పెంచుతుంది.[132]

وَيَخِرُّوْنَ لِلْاَذْقَانِ يَبْكُوْنَ وَيَزِيْدُهُمْ خُشُوْعًا ﴿109﴾

110 వారికి చెప్పు : "అల్లాహ్‌ను అల్లాహ్ అని పిలిచినా, రహ్మాన్ అని పిలిచినా – ఏ పేరుతో పిలిచినా – మంచి పేర్లన్నీ ఆయనవే."[133] నువ్వు నీ నమాజును మరీ బిగ్గరగానూ, మరీ మెల్లగానూ పఠించకు. వీటికి నడుమ మధ్యేమార్గాన్ని అవలంబించు.[134]

قُلِ ادْعُوا اللّٰهَ اَوِ ادْعُوا الرَّحْمٰنَ ۭ اَيًّا مَّا تَدْعُوْا فَلَهُ الْاَسْمَاۗءُ الْحُسْنٰى ۚ وَلَا تَجْهَرْ بِصَلَاتِكَ وَلَا تُخَافِتْ بِهَا وَابْتَغِ بَيْنَ ذٰلِكَ سَبِيْلًا ﴿110﴾

హెచ్చుతగ్గులూ చేయబడలేదు. ఎందుకంటే ఈ గ్రంథాన్ని దైవప్రవక్త (సఅసం) వరకు తీసుకువచ్చిన దైవదూత శక్తిసంపన్నుడు, నమ్మకస్థుడు, సింహాసనాధిపతి వద్ద ఆదరణ పొందినవాడు, దైవదూతలందరిపై ఆధిపత్యం గలవాడు. ఆయనే జిబ్రీల్ (అలైహిస్సలాం).

128. అంటే విధేయత చూపే విశ్వాసుల పాలిట శుభవార్తాహరుడు, అవిధేయుల పాలిట హెచ్చరించేవాడు అని భావం.

129. **'ఫరఖ్నాహు'** అన్న పదానికి 'మేము దీన్ని బాగా విడమరచి చెప్పాము' అనే అర్థం కూడా వస్తుంది.

130. దివ్య ఖుర్‌ఆన్ అవతరణకు పూర్వం ఉన్న ఆకాశ గ్రంథాలను అధ్యయనం చేసివున్న పండితులకు 'వహీ' అంటే ఏమిటో, దైవప్రోక్తం ఎలా ఉంటుందో తెలుసు. కాబట్టి ఖుర్‌ఆన్ పఠనాన్ని వినగానే వారు అణకువతో, భక్తితో సాష్టాంగపడతారు. అంతిమ దైవప్రవక్త (సఅసం)ను తెలుసుకునే వివేచనను తమకు ప్రసాదించినందుకు, దివ్య ఖుర్‌ఆన్ సత్యతను గ్రహించే సౌభాగ్యాన్ని తమకు వొసగినందుకు వారు నిజప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుకుంటారు.

131. ఏమీ తెలియని మక్కా అవిశ్వాసులు విశ్వసించకపోయినంత మాత్రాన (ఓ ప్రవక్తా!) నువ్వు ఖేదపడవలసిన అవసరం లేదు. వారు తిరస్కరించినప్పటికీ దైవదౌత్యం గురించిన అవగాహన ఉన్న జ్ఞానులు దానిని విశ్వసించారు. పైగా వారు ఖుర్‌ఆన్ పారాయణాన్ని విని దైవసన్నిధిలో సాష్టాంగపడ్డారు. ఆయన పవిత్రతను కొనియాడుతూ, ఆయన చేసిన వాగ్దానంపై తమకున్న ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. అది చాలు.

132. చుబుకముల ఆధారంగా ప్రణమిల్లిన విషయం మరోసారి ప్రస్తావనకు వచ్చింది. దేవునిపట్ల భక్తి, కృతజ్ఞతాభావం తొణికిసలాడగా చేసిన ప్రణామం మొదటి ప్రణామం (సజ్దా). ఖుర్‌ఆన్ పఠనాన్ని వినటం వల్ల తమలో జనించిన భయభక్తులకు, అశక్తతకు, దీనావస్థకు ప్రతీకగా చేసిన ప్రణామం రెండవ ప్రణామం.

وَقُلِ الْحَمْدُ لِلّٰهِ الَّذِىْ لَمْ يَتَّخِذْ وَلَدًا وَّلَمْ يَكُنْ لَّهٗ شَرِيْكٌ فِى الْمُلْكِ وَلَمْ يَكُنْ لَّهٗ وَلِىٌّ مِّنَ الذُّلِّ وَكَبِّرْهُ تَكْبِيْرًا ﴿١١١﴾

**111** ఇంకా ఇలా చెప్పు: "ప్రశంసలన్నీ అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన ఎవరినీ సంతానంగా చేసుకోలేదు. తన విశ్వ సామ్రాజ్యంలో ఆయనకు భాగస్వాములెవరూలేరు. ఒకరి సహాయ సహకారాలపై ఆధారపడటానికి ఆయన ఏ మాత్రం బలహీనుడు కాడు. కాబట్టి నువ్వు ఆయన గొప్పదనాన్ని ఘనంగా కీర్తిస్తూ ఉండు."

133. ఆ రోజుల్లో మక్కాలోని ముష్రికులకు అల్లాహ్ గుణవాచకాలైన 'రహ్మాన్', 'రహీమ్'లు తెలియవు. అందుకే మహాప్రవక్త (సఅసం) నోట 'రహ్మాన్' 'రహీమ్' లాంటి పదాలు విన్నప్పుడు వారు కించిత్ ఆశ్చర్యానికీ, అనుమానానికి గురయ్యేవారు. వారిలా చెప్పుకునేవారు : "ఈయనగారు ఒక్క అల్లాహ్‌ను పిలవమని మాకైతే బోధిస్తున్నాడు. తనేమో ఇద్దరేసి ముగ్గురేసి దైవాలను పిలుస్తున్నాడు." అప్పుడు ఈ ఆయతు అవతరించింది (ఇబ్నె కసీర్).

134. ఈ ఆయతు అవతరణా నేపథ్యాన్ని గురించి వివరిస్తూ హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు: మక్కాలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక్కొక్కప్పుడు దాక్కొని ఉండాల్సి వచ్చేది. ఆయన (స) తన సహచరులకు నమాజు చేయిస్తున్నప్పుడు కాస్త హెచ్చు స్వరంతో చేయించేవారు. బహుదైవారాధకులు ఖుర్‌ఆను విని ఖుర్‌ఆన్ గ్రంథాన్నీ, అల్లాహ్‌ను ఆడిపోసుకునేవారు. అప్పుడు అల్లాహ్ ఆయన్ని ఉద్దేశించి, 'ముష్రిక్కులు ఖుర్‌ఆన్‌ని విని దూషించటానికి ఆస్కారం కలిగేలా మరీ బిగ్గరగా పఠించకు. అలా అని నీ సహచరులకు కూడా వినబడకుండా పోయేలా మరీ మెల్లగానూ చదవకు' అని బోధపరిచాడు (బుఖారీ – తౌహీద్ ప్రకరణం; ముస్లిం– నమాజ్ ప్రకరణం).

ఒక సంఘటన – ఒక రోజు రాత్రి దైవప్రవక్త (సఅసం) నడచిపోతూ హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) నెమ్మదిగా నమాజ్ చేస్తూ ఉండటం చూశారు. ఆ తరువాత ఆయన (స) హజ్రత్ ఉమర్ (రజి)ను కూడా చూడటం జరిగింది. ఆయనేమో హెచ్చు స్వరంతో నమాజ్ చేస్తూ ఉన్నారు. ఆయన (స) వారిద్దరినీ దర్యాప్తు చేయగా, "నేను ఎవరిని విన్నపాలు చేసుకుంటూ ఉన్నానో ఆయన నా విన్నపాలను వింటూనే ఉన్నాడు" అని హజ్రత్ అబూబక్ర్ (రజి) చెప్పారు. "నా ఉద్దేశం నిద్రమత్తులో ఉన్నవారిని మేల్కొల్పటం, షైతాన్‌ను తరిమికొట్టడం" అని హజ్రత్ ఉమర్ (రజి) చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స) కంఠాన్ని కాస్త పెంచమని అబూబక్ర్‌కు సలహా యిచ్చి, నీ కంఠాన్ని కాస్త తగ్గించు అని ఉమర్‌కు సూచించారు (మిష్కాత్). కాగా; ఈ ఆయతు దుఆ నేపథ్యంలో అవతరించిందని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అన్నారు (బుఖారీ, ముస్లిం). – ఫత్‌హుల్ ఖదీర్ ఆధారంగా.

18వ సూరా

# అల్ కహఫ్

## గుహ

అవతరణ మక్కాలో

ఆయతులు 110

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ధార్మిక విశ్వాసానికి సంబంధించిన ప్రధాన సూత్రాలను చర్చించింది. అల్లాహ్ పట్ల, పరలోకం పట్ల, మరణానంతర జీవితం పట్ల విశ్వాసాన్ని పటిష్టం చేయడానికి ఈ చర్చ ఉద్దేశించింది. ప్రారంభ వచనాలు అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడుతూ ఆయన మహోన్నత అస్తిత్వాన్ని చాటిచెప్పాయి. ఈ సూరాలోని 9వ ఆయతులో ఒక గుహలో నిద్రపోయిన కొందరు విశ్వాసుల ప్రస్తావన ఉంది. ఈ కథ ఒక అద్భుతమైన సంఘటనను తెలిపింది. వారి సుదీర్ఘమైన నిద్ర దేవుని మహత్యాలలో ఒకటి. ఈ కథ ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. వారు కొందరు యువకులు. బహు దైవారాధనను తిరస్కరించిన యువకులు. విగ్రహాలను లేక ఇతర దేవుళ్ళను ఆరాధించడాన్ని ఇష్టపడని యువకులు. అందువల్ల దౌర్జన్యాలకు గురయిన ఆ యువకులు తమ ప్రాంతాన్ని వదిలి పారిపోయి వచ్చారు. వారు ఒక గుహలోకి వచ్చి నిద్రపోయారు. అలాగే నిద్రలో దాదాపు 309 సంవత్సరాలు గడిపారు. కాని వారు నిద్రలేచి తాము మహా అయితే కొన్ని గంటలు నిద్రపోయి ఉంటామని భావించారు. గుహలో నిద్రపోయిన ఆ యువకులు అల్లాహ్‌ను విశ్వసించిన యువకులు. అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ అర్థించనివారు. వారి కథ త్యాగాన్ని, స్థిరచిత్తాన్ని, అల్లాహ్ పట్ల దృఢమైన విశ్వాసాన్ని, సత్యం కోసం పోరాడటాన్ని ప్రతిబింబిస్తుంది. గుహలో వారి సుదీర్ఘ నిద్ర మరణాన్ని, మరణానంతరం మళ్ళీ లేపడాన్ని సూచిస్తుంది. మరణం, మరణానంతర జీవితం రెండూ అనివార్యమైనవిగా తెలుపుతుంది.*

*ఈ సూరాలో మూసా (అస) గురించిన ఒక సంఘటన కూడా ప్రస్తావించబడింది. దైవప్రవక్తగా, దేవుని సందేశాన్ని తీసుకు వచ్చిన మహనీయునిగా అత్యున్నత స్థానం కలిగినప్పటికీ మూసా ప్రవక్త (అస) జ్ఞానాన్ని ఇంకా సంపాదించాలన్న కుతూహలం మెండుగా కలిగినవారు, ఆయన మరో వ్యక్తి నుంచి జ్ఞానాన్ని సంపాదించడానికి ఎన్నడూ వెనుకాడలేదు. మూసా ప్రవక్త (అస) ఖిజర్ అనే మహనీయుని నుంచి జ్ఞానబోధ స్వీకరించడానికి ఆయనతో పాటు ఉన్నారు. ఆయన చెప్పినట్లు సహనం వహించడానికి ప్రయత్నించారు.*

*ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చిన మూడో కథ జుల్‌ఖర్‌నైన్‌కు సంబంధించినది. ఆయన న్యాయశీలుడైన గొప్ప పాలకుడు. ఒక పొరుగు దేశం ప్రజలు ఆయనకు మొరపెట్టుకుని, తమపై దాడులు చేస్తున్న అరాచక, అనాగరిక జాతులు యాజూజ్, మాజూజ్‌ల నుంచి రక్షణ కల్పించవలసినదిగా కోరారు. బలహీనులైన పొరుగువారిని కాపాడటానికి ఆ న్యాయశీలుడైన రాజు సంకల్పించాడు. యాజూజ్, మాజూజ్‌ల నుంచి వారిని రక్షించడానికి ఒక దృఢమైన గోడను నిర్మించాడు. ఈ సూరా తౌహీద్ (ఏక దైవారాధన) గురించి బలంగా చెబుతూ ముగుస్తుంది.*

# సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 9-22 | 207 | 'కొండ గుహవారు' | 300 యేండ్లు గుహలో నిద్రించిన యువకుల గాథ. |
| 32-44 | 151 | 'యహూదా - అతని సోదరుడు' | అల్లాహ్‌ను నిరాకరించటం మాత్రమే 'కుఫ్ర్' (దైవ ధిక్కారం) కాదు. అహం, గర్వం, ఆడంబరం, పరలోకాన్ని తిరస్కరించటం కూడా కుఫ్ర్‌కు దారి తీస్తాయని తెలిపే నిజమైన నీతి గాథ. |
| 50 | 4-7 | 'మానవ సృష్టి' 'ఇబ్లీస్ ప్రతీకారం' | ఆది మానవుని సృష్టికి ముందు ఆకాశ లోకాల్లో చోటు చేసుకున్న సంఘటనలు. తదనంతర పరిణామాలు. |
| 60-82 | 106 | 'మార్గదర్శి ఖిజర్' | అల్లాహ్ ఆదేశాల మర్మాలన్నింటినీ మనం అర్థం చేసుకోలేము. మనకు తప్పుగా కనబడుతున్న విషయం నిజానికి ఒక అనుగ్రహం కావచ్చు. మరి ఈ నిజాన్ని హృదయానికి హత్తుకునే లాగా బోధించిన గాథను విపులంగా చదువుకుందామా?! |
| 83-98 | 207 | 'జుల్ ఖర్నైన్ - మహా సాహస వంతుడు' | జుల్ ఖర్నైన్ గురించి దివ్యఖుర్ఆన్ చాలా గొప్పగా వర్ణించింది. హదీసుల్లో, చారిత్రక కథనాల్లో ఆయన గురించి ఇంకా ఏం చెప్పబడింది? తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే! |

## అల్ కహఫ్[1] సూరా

## سُوْرَةُ الْكَهْفِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** ప్రశంసలన్నీ అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయి. ఆయన తన దాసునిపై ఈ (ఖుర్ఆన్) గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఇందులో ఎలాంటి వక్రతనూ ఉంచలేదు.[2]

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِيْٓ اَنْزَلَ عَلٰى عَبْدِهِ الْكِتٰبَ
وَلَمْ يَجْعَلْ لَّهٗ عِوَجًا ۜ ﴿1﴾

**2** పైగా అన్నివిధాలా సరైనదిగా ఉంచాడు – తన వద్దనుంచి[3] విధించబడే కఠినమైన శిక్ష గురించి హెచ్చరించటానికి, మంచి పనులు చేసే విశ్వాసులకు ఉత్తమ ప్రతిఫలం ఉందని శుభవార్తలు ఇవ్వటానికి,

قَيِّمًا لِّيُنْذِرَ بَاْسًا شَدِيْدًا مِّنْ لَّدُنْهُ وَيُبَشِّرَ
الْمُؤْمِنِيْنَ الَّذِيْنَ يَعْمَلُوْنَ الصّٰلِحٰتِ اَنَّ لَهُمْ
اَجْرًا حَسَنًا ﴿2﴾

**3** అందులో వారు శాశ్వతంగా ఉంటారని (తెలుపటానికి),

مّٰكِثِيْنَ فِيْهِ اَبَدًا ﴿3﴾

**4** అల్లాహ్ సంతానం కలిగి ఉన్నాడని పలికేవారిని హెచ్చరించటానికి[4] (ఈ గ్రంథం అవతరింపజెయ్యబడింది).

وَّيُنْذِرَ الَّذِيْنَ قَالُوا اتَّخَذَ اللّٰهُ وَلَدًا ﴿4﴾

**5** యదార్థానికి వారికిగానీ, వారి తాత ముత్తాతలకుగానీ ఈ విషయం ఏమీ తెలియదు. వారి నోట వెలువడే ఈ మాట ఎంతో దారుణమైనది.[5] వారు చెప్పేదంతా పచ్చి అబద్ధమే.

مَا لَهُمْ بِهٖ مِنْ عِلْمٍ وَّلَا لِاٰبَآئِهِمْ ۗ كَبُرَتْ كَلِمَةً
تَخْرُجُ مِنْ اَفْوَاهِهِمْ ۗ اِنْ يَّقُوْلُوْنَ اِلَّا كَذِبًا ﴿5﴾

1. **'కహఫ్'** అంటే గుహ అని అర్థం. ఈ సూరాలో గుహవాళ్ళ వృత్తాంతం వచ్చింది. అందుకే ఈ సూరాకు కహఫ్ అనే పేరు వచ్చింది. ఈ సూరాలోని మొదటి 10 ఆయతులు, చివరి 10 ఆయతుల ప్రాశస్త్యం గురించి హదీసులు ఉన్నాయి. ఎవరయితే ఈ ఆయతులను కంఠస్థం చేసుకుంటాడో, వాటిని పారాయణం చేస్తాడో అతను దజ్జాల్ ఉపద్రవం నుంచి సురక్షితంగా ఉంటాడు (సహీహ్ ముస్లిం – అల్ కహఫ్ సూరా మహత్యం). శుక్రవారం నాడు ఈ సూరాను పారాయణం చేసిన వ్యక్తిపై, వచ్చే శుక్రవారం వరకు ఒక ప్రత్యేక కాంతి ఆవరిస్తుంది (ముస్తద్రక్ హాకిమ్- /368 – ఫీ సహీహ్ అల్ జామె అస్సఘీర్‌లో అల్‌బానీగారు దీన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు-6470). ఈ సూరా పఠనం వల్ల ఇంట్లో శాంతి, శుభం అవతరిస్తాయి. ఒకసారి దైవప్రవక్త ప్రియసహచరులొకరు (రజి) సూరె కహఫ్ పఠిస్తుండగా ఇంట్లోని ఒక పశువు బెదిరిపోయింది. ఆయన పరికించి చూడగా ఆయనకు, పైన ఒక 'మబ్బుతునక' కనిపించింది. ఆ మబ్బు తునక ఆయనకు నీడగా ఉంది. ఆ సహచరుడు జరిగినదంతా దైవప్రవక్త (సఅసం)కు వివరించగా, "ఈ సూరాను పఠిస్తూ ఉండండి. ఖుర్ఆన్ పారాయణ సమయంలో శాంతి అవతరిస్తుంది" అని ఆయన చెప్పారు (సహీహ్ బుఖారీ – అల్ కహఫ్ సూరా మహత్యం; ముస్లిం – కితాబుస్సలాత్).
2. లేదా ఎలాంటి వెలితీ ఇందులో లేదు. సమత్వం, సమతూకానికి విరుద్ధమైన అంశం కూడా ఈ గ్రంథంలో లేదు. పైగా ఇది ఎంతో సవ్యమైనది. విషయాన్ని సూటిగా చెప్పేది. ఖయ్యిమ్ అంటే దాసుల ప్రాపంచిక, పారలౌకిక పరమార్థాలతో కూడుకున్న గ్రంథం అన్న అర్థం కూడా వస్తుంది.
3. **'మిల్లదున్‌హు'** (తన వద్ద నుంచి) అంటే అల్లాహ్ తరఫున విధించబడే లేక అవతరింప జేయబడే శిక్ష అని భావం.
4. యూదులు, క్రైస్తవులు, బహుదైవారాధకులు ఇలాంటి మాటలనేవారు (అల్లాహ్ తన దూతలను కుమార్తెలుగా చేసుకున్నాడని చెప్పేవారు).

6 (ఓ ముహమ్మద్!) ఒకవేళ ఈ జనులు ఈ మాటను[6] విశ్వసించకపోతే నువ్వు వారి వెనుక దుఃఖంతో కుమిలిపోతూ నీ ప్రాణాలు పోగొట్టుకుంటావా ఏమి?

فَلَعَلَّكَ بَاخِعٌ نَّفْسَكَ عَلَىٰٓ اٰثَارِهِمْ اِنْ لَّمْ يُؤْمِنُوْا بِهٰذَا الْحَدِيْثِ اَسَفًا ⑥

7 జనులలో ఎవరు మంచి పనులు చేస్తారో పరీక్షించే నిమిత్తం మేము భూ మండలంలో ఉన్న దాన్నంతటినీ[7] భూమికి శోభాయమానంగా చేశాము.

اِنَّا جَعَلْنَا مَا عَلَى الْاَرْضِ زِيْنَةً لَّهَا لِنَبْلُوَهُمْ اَيُّهُمْ اَحْسَنُ عَمَلًا ⑦

8 దాని (భూమి)పై ఉన్న దానినంతటినీ మేము (నేలమట్టం చేసి) చదునైన మైదానంగా చేయనున్నాము.[8]

وَاِنَّا لَجٰعِلُوْنَ مَا عَلَيْهَا صَعِيْدًا جُرُزًا ⑧

9 ఏమిటీ, గుహవారిని, శిలాఫలకం వారిని నువ్వు మా శక్తి సూచనలలో మహా విచిత్రమైన సూచనగా తలపోస్తున్నావా?[9]

اَمْ حَسِبْتَ اَنَّ اَصْحٰبَ الْكَهْفِ وَالرَّقِيْمِ ۙ كَانُوْا مِنْ اٰيٰتِنَا عَجَبًا ⑨

10 ఆ యువకులు గుహలో ఆశ్రయం పొందినపుడు ఇలా ప్రార్థించారు: "మా ప్రభూ! నీ వద్ద నుంచి మాకు కారుణ్యాన్ని ప్రసాదించు. మా పనిలో మా కోసం సన్మార్గాన్ని సులభతరం చెయ్యి."[10]

اِذْ اَوَى الْفِتْيَةُ اِلَى الْكَهْفِ فَقَالُوْا رَبَّنَآ اٰتِنَا مِنْ لَّدُنْكَ رَحْمَةً وَّهَيِّئْ لَنَا مِنْ اَمْرِنَا رَشَدًا ⑩

5. అంటే అల్లాహ్‌కు సంతానం ఉంది అనేమాట ఓ పెద్ద అభాండం. అతి పెద్ద అబద్ధం.

6. **'ఈ మాట'** అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం. అవిశ్వాసులు, ముష్రిక్కులు విశ్వసించి సాఫల్యం పొందాలన్న ఆకాంక్ష ఆయన (స)లో చాలా తీవ్రంగా ఉండేది. వారు దానిని కాదని, విముఖత చూపినపుడు దైవప్రవక్త (స) కలత చెందేవారు. దుఃఖంతో విలపించేవారు. జాతి జనుల శ్రేయాన్ని దైవప్రవక్త ఎంతగా అభిలషిస్తాడో ఈ ఆయతు ద్వారా విదితమవుతోంది.

7. "భూమండలంలో ఉన్నదంతా" అంటే వృక్షాలు, ఖనిజసంపదలూ, పర్వతాలు, నదీనదాలు, జంతువులు – ఇవన్నీ ప్రపంచానికి అలంకారం వంటివి. ఈ వస్తువుల వల్ల ఈ భూమండలం బాగా ముస్తాబయింది.

8. **"సయీదన్"** (صَعِيْدًا) అంటే మైదానం అనీ, **"జురుజన్"** (جُرُزًا) అంటే చదునైన అని అర్థం. అంటే అందులో ఎలాంటి ఎత్తుపల్లాలుగానీ, వృక్షాలు గానీ ఉండవు. ఈ ప్రపంచం కళావిహీనమయ్యే, చదునైన మైదానంగా మారిపోయే సమయం రానున్నది. ఆ తరువాత మేము మంచి వారికి బహుమానం ఇస్తాము. చెడ్డవారిని శిక్షిస్తాము.

9. అంటే మా దృష్టిలో అది ఏమంత గొప్ప విచిత్రం కానేకాదు. అలా అనుకుంటే ఈ భూమ్యాకాశాల నిర్మాణం, వాటి పటిష్టమైన వ్యవస్థ, ఈ సూర్యచంద్ర నక్షత్రాలు, ఈ రేయింబవళ్ళ రాకపోకలు, ఈ విశ్వమండలంలో మరెన్నో నిదర్శనాలు అంతకన్నా విచిత్రమైనవే.
'కహ్ఫున్' అంటే పర్వత గుహ. ఇక 'రఖీమ్'పై పలువురు పలు విధాలుగా వ్యాఖ్యానించారు. రఖీమ్ అనేది ఆ యువకులు వదలివెళ్ళిన పట్టణం పేరని కొందరు అభిప్రాయపడ్డారు. వారు ఆశ్రయం పొందిన గుహ ఉన్న పర్వతాన్నే రఖీమ్ అంటారని మరి కొంతమంది చెప్పారు. రఖీమ్ అంటే శిలాఫలకం లేక గాజు ఫలకమనీ, ఆ ఫలకంపై ఆ గుహవాసుల పేర్లు లిఖించబడి ఉన్నాయని మరికొంతమంది భావిస్తున్నారు. ఇటీవల జరిగిన పరిశోధనల ప్రకారం ఈ మూడింటిలో మొదటి అభిప్రాయం చాలా వరకు సరైనదని తెలుస్తోంది. ఆ పర్వత గుహకు సమీపంలో ఒక జనవాసం ఉంది. అది ప్రస్తుతం 'రఖీబ్'గా పిలువబడుతోంది. బహుశా రఖీమ్ అనే పేరే రాను రాను రఖీబ్‌గా రూపాంతరం చెంది ఉండవచ్చు.

**11** అంతే! మేము ఆ గుహలో ఎన్నదగ్గ కొన్నేండ్లవరకూ వారి చెవులపై జోకొట్టి పడుకోబెట్టాము.[11]

فَضَرَبْنَا عَلَىٰٓ اٰذَانِهِمْ فِى الْكَهْفِ سِنِيْنَ عَدَدًا ﴿11﴾

**12** ఆ తరువాత, ఆ రెండు వర్గాల వారిలో ఎవరు ఆ స్థితిలో గడిపిన గరిష్ఠకాలాన్ని ఖచ్చితంగా లెక్కగడతారో తెలుసుకుందామని మేము వారిని తిరిగి లేపాము.[12]

ثُمَّ بَعَثْنٰهُمْ لِنَعْلَمَ اَىُّ الْحِزْبَيْنِ اَحْصٰى لِمَا لَبِثُوْٓا اَمَدًا ﴿12﴾

**13** వారి యదార్ధ గాథను మేము నీకు వివరిస్తున్నాము – తమ ప్రభువును విశ్వసించిన కొంతమంది యువకులు వారు.[13] మేము వారి సన్మార్గంలో వృద్ధినొసగాము.

نَحْنُ نَقُصُّ عَلَيْكَ نَبَاَهُمْ بِالْحَقِّ ؕ اِنَّهُمْ فِتْيَةٌ اٰمَنُوْا بِرَبِّهِمْ وَزِدْنٰهُمْ هُدًى ﴿13﴾

10. గుహవారు (అస్హాబె కహఫ్) గా పిలువబడేవారే ఈ నవయువకులు. తాము అవలంబించే సత్యధర్మాన్ని కాపాడుకునే ఉద్దేశ్యంతో వారు పర్వతగుహలో ఆశ్రయం పొందారు. గుహవారి ఈ వృత్తాంతం యువతరానికి గొప్ప గుణపాఠం వంటిది. విచ్చలవిడితనం, వ్యర్థ వ్యసనాలకు గురవుతున్న నేటి నవయువకులు ఈ వృత్తాంతం నుండి నీతిని గ్రహించి, తమ శక్తియుక్తులను దైవప్రీతిని పొందే మార్గంలో వెచ్చిస్తే ఎంత బావుండు!

11. అంటే బయటి రణగొణ ధ్వనుల మూలంగా వారికి నిద్రాభంగం కలగరాదన్న ఉద్దేశంతో వారి కర్ణపుటాలపై పొరలు కప్పి ఉంచాం. దాంతో వారు గాఢ నిద్రలోకి జారుకున్నారు.

12. రెండు వర్గాలంటే విభేదించే వారని భావం. ఈ రెండు వర్గాల వారు ఆ కాలానికి చెందినవారూ కావచ్చు లేక మహా ప్రవక్త (సఅసం) కాలంలో విభేదించుకున్న విశ్వాసులు – అవిశ్వాసులూ కావచ్చు. అసలు గుహలో ఆశ్రయం పొందిన యువకుల్లోనే రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయనీ, తాము ఇంత సమయం నిద్రపోయామని ఒక వర్గం అంటే, మరో వర్గం తాము అంతకంటే చాలా తక్కువ సమయమే నిద్రపోయి ఉంటాం అని అభిప్రాయపడిందని కొందరంటారు.

13. వివరంగా వారి వృత్తాంతం ఇది : ఈ యువకులు క్రైస్తవ మతస్థులని కొందరు భావిస్తున్నారు. ఏసుక్రీస్తు (హజ్రత్ ఈసా – అలైహిస్సలాం)కి పూర్వం వారని మరికొందరు అభిప్రాయపడ్డారు. హాఫిజ్ ఇబ్నె కసీర్ ఈ రెండవ అభిప్రాయం వైపుకు మొగ్గారు. ఆయన ప్రకారం పూర్వం దిఖియానూస్ అనే రాజు ఒకడుండేవాడు. అతడు బహుదైవారాధన వైపుకు, జాతరల వైపుకు ప్రజల్ని పురికొల్పేవాడు. అయితే దేవుడు ఒక్కడేనన్న సత్యాన్ని అల్లాహ్ ఈ కొద్దిమంది యువకులలో నూరిపోశాడు. భూమ్యాకాశాలను సృష్టించినవాడు, సమస్త జగతిని పోషిస్తున్నవాడే తమ నిజ దైవం కాగలడని వారు వాదించసాగారు. ఖుర్ఆన్‌లో **"ఫిత్‌యతున్" (فِتْيَةٌ)** అనే పదం ఉపయోగించ బడింది. దీనిద్వారా వారి సంఖ్య 9 లేక అంతకంటే తక్కువే ఉండి ఉంటుందని బోధపడుతుంది (ఎందుకంటే 'ఫిత్‌యతున్' అన్నది 9 లోపు సంఖ్యను సూచించే బహువచనం). వారంతా ప్రజా బాహుళ్యం నుంచి వేర్పడి – ప్రత్యేకంగా ఒకచోట చేరి–ఒక్కడైన సృష్టికర్తను ఆరాధించేవారు. వారి ఏకదైవారాధన సమాజంలో చర్చనీయాంశంగా మారింది. అలా అలా ఆ విషయం రాజుగారి చెవుల్లో కూడా పడింది. అతడు తన అధికారుల చేత వాళ్ళను రాజ దర్బారుకు పిలిపించి విచారించాడు. వారు తమ అంతరాత్మ ప్రబోధాన్ని నిర్భిష్టంగా చాటిచెప్పారు. అయితే పరిస్థితులు వారికి ఏమాత్రం అనుకూలంగా లేవు. ఒకవైపు బహుదైవారాధకులైన తమ జాతి జనుల విరోధం, మరోవైపు రాజుగారి భయం, అందువల్ల వారు తాము నమ్మిన ధర్మాన్ని కాపాడుకునేందుకు ఒక పర్వత గుహలో తలదాచుకున్నారు. అప్పుడు అల్లాహ్ వారిని గాఢమైన నిద్రకు లోనుచేశాడు. దాదాపు 309 సంవత్సరాలు వారు ఆ నిద్రావస్థలో ఉన్నారు.

14 వారు లేచి నిలబడి[14] ఈ ప్రకటన చేసినప్పుడు మేము వారి హృదయాలకు దృఢత్వాన్ని కలుగజేశాము;[15] "భూమ్యాకాశాలకు ప్రభువైనవాడే మా ప్రభువు. మేము ఆయన్ని తప్ప వేరొక ఆరాధ్య దైవాన్ని పిలవటమన్నది జరగని పని. ఒకవేళ మేము గనక అలా చేస్తే ఎంతో దుర్మార్గపు మాటను పలికిన వారమవుతాము."[16]

وَّرَبَطْنَا عَلٰى قُلُوْبِهِمْ اِذْ قَامُوْا فَقَالُوْا رَبُّنَا رَبُّ السَّمٰوٰتِ وَالْاَرْضِ لَنْ نَّدْعُوَا۟ مِنْ دُوْنِهٖۤ اِلٰهًا لَّقَدْ قُلْنَاۤ اِذًا شَطَطًا ﴿14﴾

15 "ఆయన్ని వదలి ఇతరులను ఆరాధ్య దైవాలుగా చేసుకున్న మన జాతి వారు వారి దైవత్వానికి సంబంధించిన స్పష్టమైన ప్రమాణాన్ని ఎందుకు తీసుకురావటం లేదు? అల్లాహ్‌కు అబద్ధాన్ని అంట గట్టేవాడికన్నా ఎక్కువ దుర్మార్గుడెవడుంటాడు?

هٰۤؤُلَاۤءِ قَوْمُنَا اتَّخَذُوْا مِنْ دُوْنِهٖۤ اٰلِهَةً ؕ لَوْلَا يَاْتُوْنَ عَلَيْهِمْ بِسُلْطٰنٍۢ بَيِّنٍ ؕ فَمَنْ اَظْلَمُ مِمَّنِ افْتَرٰى عَلَى اللّٰهِ كَذِبًا ﴿15﴾

16 "ఇప్పుడు మీరు వాళ్ళతోనూ, అల్లాహ్‌ను గాకుండా వారు పూజిస్తున్న ఇతర దైవాలతోనూ తెగత్రెంపులు చేసుకున్నారు. ఇక ఇప్పుడు ఏదన్నా గుహలోకి పోయి కూర్చోండి.[17] మీ ప్రభువు మీపై తన కారుణ్యాన్ని విస్తరింపజేస్తాడు. మీ కార్యసిద్ధికై సౌలభ్యాన్ని సమకూరుస్తాడు."

وَاِذِ اعْتَزَلْتُمُوْهُمْ وَمَا يَعْبُدُوْنَ اِلَّا اللّٰهَ فَاْوٗۤا اِلَى الْكَهْفِ يَنْشُرْ لَكُمْ رَبُّكُمْ مِّنْ رَّحْمَتِهٖ وَيُهَيِّئْ لَكُمْ مِّنْ اَمْرِكُمْ مِّرْفَقًا ﴿16﴾

17 సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు వారి గుహకు కుడిప్రక్కకు ఒరిగిపోవటాన్ని, అస్తమించే సమయంలో వారికి ఎడమ ప్రక్కకు జరిగిపోవటాన్ని నువ్వు చూస్తావు. వారేమో ఆ గుహలోని

وَتَرَى الشَّمْسَ اِذَا طَلَعَتْ تَّزٰوَرُ عَنْ كَهْفِهِمْ ذَاتَ الْيَمِيْنِ وَاِذَا غَرَبَتْ تَّقْرِضُهُمْ ذَاتَ

14. మూలంలో **'ఖామూ'** (قَامُوْا) అని వచ్చింది. ఇది ఖియామ్ నుంచి ఏర్పడిన పదం. 'నిలబడటం' అని దాని అర్థం. అయితే 'నిలబడటం' అంటే ఇక్కడ దాని భావం ఏమిటి? చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల దృష్టిలో ఇక్కడ నిలబడటం అంటే రాజు వారిని పిలిచి విచారించినప్పుడు, వారు రాజు ముందు ధైర్యంగా నిలబడి సత్యాన్ని నిర్ధిష్టంగా వెల్లడించటం అని అర్థం. అయితే ఆ యువకులు నగరానికి వెలుపల నిలబడి, అల్లాహ్ తరఫు నుంచి తమ మనసుల్లో కలిగిన తౌహీద్ (ఏకదైవారాధన భావాలను) పరస్పరం ఉపదేశించుకున్నారనీ, ఖుర్ఆన్‌లోని 'నిలబడటం' అన్న పదం ఆ సంఘటననే సూచిస్తున్నదని మరికొంతమంది పండితులు వ్యాఖ్యానించారు.

15. అంటే ధర్మరక్షణ కోసం తమ ఇల్లూ వాకిలినీ, బంధుమిత్రులను వదలి వలసపోవడానికి సిద్ధమైనపుడు మేము వారి హృదయాలకు స్థిరత్వాన్ని ప్రసాదించాము. వారిని వజ్రసంకల్పులుగా చేశాము. సత్యాన్ని నిర్భయంగా, నిర్ధిష్టంగా ప్రకటించే గుండె ధైర్యాన్ని ఇచ్చాము. వారి హృదయాలలో దృఢ విశ్వాసాన్ని ప్రోది చేశాము.

16. **'షతతా'** (شَطَطًا) అంటే అవాస్తవం, అబద్ధం, హద్దుమీరిన అని అర్థం.

17. మానసికంగా మనం ఎలాగూ మన జాతి వారికి దూరం అయిపోయాము. ఇప్పుడు భౌతికంగా కూడా వారితో సంబంధాలు త్రెంచుకోవటం మంచిది అని గుహవాళ్లు పరస్పరం చెప్పుకున్నారు. ఈ సమాలోచన తరువాత వారంతా ఒక గుహలోకి పోయి తలదాచుకున్నారు. నవ పథాన పురోగమిస్తున్న ఈ యువతరం కనిపించకపోయేసరికి ఆ జాతి ప్రజలు వాళ్ళను వెతకటం మొదలెట్టారు. కాని ఫలితం శూన్యం. ఎందుకంటే వారిప్పుడు సూక్ష్మద్రష్ట అయిన అల్లాహ్ రక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మక్కా

الشِّمَالِ وَهُمْ فِي فَجْوَةٍ مِّنْهُ ۚ ذَٰلِكَ مِنْ آيَاتِ
اللَّهِ ۗ مَن يَهْدِ اللَّهُ فَهُوَ الْمُهْتَدِ ۖ وَمَن يُضْلِلْ
فَلَن تَجِدَ لَهُ وَلِيًّا مُّرْشِدًا (17)

విశాలమైన స్థలంలో ఉన్నారు.[18] ఇది అల్లాహ్ సూచనల్లోనిది.[19] అల్లాహ్ సన్మార్గం చూపినవాడు మాత్రమే సన్మార్గాన ఉంటాడు. మరి ఆయన పెడత్రోవ పట్టించిన వానిని ఆదుకుని మార్గదర్శకత్వం వహించే వాడెవడినీ నీవు పొందలేవు.[20]

وَتَحْسَبُهُمْ أَيْقَاظًا وَهُمْ رُقُودٌ ۚ وَنُقَلِّبُهُمْ
ذَاتَ الْيَمِينِ وَذَاتَ الشِّمَالِ ۖ وَكَلْبُهُم
بَاسِطٌ ذِرَاعَيْهِ بِالْوَصِيدِ ۚ لَوِ اطَّلَعْتَ عَلَيْهِمْ
لَوَلَّيْتَ مِنْهُمْ فِرَارًا وَلَمُلِئْتَ مِنْهُمْ رُعْبًا (18)

**18** వారు మేల్కొని ఉన్నారని నువ్వు భావిస్తావు. కాని వారు నిద్రపోతూ ఉంటారు.[21] మేమే వారిని కుడి ప్రక్కకూ, ఎడమ ప్రక్కకూ ఒత్తిగిలి పడుకునేలా చేస్తూ ఉన్నాము.[22] వారి కుక్క కూడా గుహ ముఖద్వారం వద్ద తన ముందు కాళ్ళను చాపి (కూర్చుని) ఉండేది. ఒకవేళ నువ్వు వారిని తొంగి చూస్తే, వెనుతిరిగి పారిపోతావు. వారి గాంభీర్యం నిన్ను భయకంపితుణ్ణి చేస్తుంది.[23]

وَكَذَٰلِكَ بَعَثْنَاهُمْ لِيَتَسَاءَلُوا بَيْنَهُمْ ۚ قَالَ قَائِلٌ
مِّنْهُمْ كَمْ لَبِثْتُمْ ۖ قَالُوا لَبِثْنَا يَوْمًا أَوْ بَعْضَ يَوْمٍ ۚ
قَالُوا رَبُّكُمْ أَعْلَمُ بِمَا لَبِثْتُمْ فَابْعَثُوا أَحَدَكُم

**19** ఇదే విధంగా – వారు పరస్పరం ప్రశ్నించుకోవటానికి మేము వారిని లేపి కూర్చోబెట్టాము.[24] వారిలో ఒకతను "మీరు ఎంతసేపు ఇక్కడ విశ్రమించి ఉంటారు?" అని అడగ్గా, "ఒక రోజో లేక ఒక రోజుకన్నా తక్కువ సమయమో ఉండి ఉంటాం"[25] అని వారు

అవిశ్వాసులు వెతుక్కుంటూ సౌర్ గుహ వరకూ వచ్చి తిరిగి వెళ్ళినట్లే వారు కూడా ఆ పరిసరాలన్నీ వెతికారు. కాని గుహలోకి పోలేదు.

18. సూర్యుడు ఉదయించేవేళ ఆ గుహకు కుడి ప్రక్కనుంచి సాగిపోయేవాడు. అస్తమించే సమయంలో గుహకు ఎడమ ప్రక్కకు ఒరిగిపోతాడు. అంచేత వారిపై ఎండ పడేది కాదు. మరి చూడబోతే వాళ్లు గుహ లోపల – చాలా విస్తారమైన స్థలంలో – విశ్రాంతి పొందుతున్నారు. **'ఫజ్వతున్'** అంటే విశాలమైన స్థలం అని అర్థం.

19. అది సువిశాలమైన స్థలమైనప్పటికీ, దానిపై ఎండపడకుండా ఉండేలా సూర్యుడు కుడి ఎడమలకు వాలిపోవటం ముమ్మాటికీ అల్లాహ్ సూచనే.

20. ఉదాహరణకు ఆ జాతి ప్రజలే. చక్రవర్తి సమేతంగా ఆ జాతి జనులు సన్మార్గానికి నోచుకోలేకపోయారు. వారిని ఎవరూ దారికి తీసుకురాలేకపోయారు.

21. వారు మేల్కొని ఉన్నారని అనుకోవటానికి కారణం వారి కళ్లు తెరచుకుని ఉండటమే. మేల్కొని ఉండేవారు ఎలా ఉంటారో వారు కూడా సరిగ్గా అలాగే ఉన్నారు. పదే పదే అటూ యిటూ ఒత్తిగిలుతూ ఉండటం మూలంగా వారు మేల్కొని ఉన్నారనిపించేదని మరికొంతమంది చెబుతారు.

22. వారు ఆ విధంగా అటూ యిటూ దొర్లటంలో కూడా గొప్ప పరమార్థం ఉంది. ఆ ఏర్పాటు గనక జరిగి ఉండకపోతే నేల (మట్టి) వారిని తినేసేది. వారి శరీరాలు కుళ్ళిపోయేవి.

23. ఎవరూ వారి దగ్గరకు వెళ్ళకుండా ఉండటానికి అల్లాహ్ తరఫున జరిగిన అపురూపమైన రక్షణా ఏర్పాటు ఇది.

24. ఏవిధంగా మేము వారిని మా శక్తితో నిద్రపుచ్చామో అదేవిధంగా 309 సంవత్సరాల తరువాత వారిని మేల్కొలిపాము. వారు నిద్రపోయినప్పుడు ఎలా ఉన్నారో మెలకువ వచ్చిన తరువాత కూడా అలాగే ఉన్నారు. అందుకే వారు పరస్పరం ప్రశ్నించుకోసాగారు...

సమాధాన మిచ్చారు. మళ్ళీ ఇలా చెప్పారు : "మీరు ఎంతసేపు ఉన్నారన్న విషయం మీ ప్రభువుకే బాగా తెలుసు.[26] సరే, ఇప్పుడు ఈ వెండి (నాణెము)ని ఇచ్చి, మీలో ఒకరిని పట్టణానికి పంపండి – అతను వెళ్ళి అత్యంత పరిశుద్ధమైన భోజనం ఏదో కనుక్కుని,[27] అందులో నుంచి మీ కోసం తినటానికి తీసుకు వస్తాడు. అయితే అతను మృదువుగా, జాగ్రత్తగా వ్యవహరించాలి. మీ జాడ ఎవరికీ తెలియనివ్వకూడదు.[28]

بِوَرِقِكُمْ هٰذِهٖٓ اِلَى الْمَدِيْنَةِ فَلْيَنْظُرْ اَيُّهَآ اَزْكٰى طَعَامًا فَلْيَاْتِكُمْ بِرِزْقٍ مِّنْهُ وَلْيَتَلَطَّفْ وَلَا يُشْعِرَنَّ بِكُمْ اَحَدًا ⑲

**20** "వారు గనక మిమ్మల్ని పట్టుకున్నారంటే మీపై రాళ్ళయినా రువ్వుతారు లేదా మిమ్మల్ని తమ మతంలోకైనా తిరిగి రప్పించు కుంటారు. (అదే గనక జరిగితే) మీరెన్నటికీ సాఫల్యం పొంద లేరు."[29]

اِنَّهُمْ اِنْ يَّظْهَرُوْا عَلَيْكُمْ يَرْجُمُوْكُمْ اَوْ يُعِيْدُوْكُمْ فِيْ مِلَّتِهِمْ وَلَنْ تُفْلِحُوْٓا اِذًا اَبَدًا ⑳

**21** ఈ విధంగా అల్లాహ్ వాగ్దానం సత్యమనీ, ప్రళయం (సంభ వించటం)లో సందేహానికి తావులేదని ప్రజలు తెలుసుకోవ టానికి[30] మేము వారి పరిస్థితిని గురించి ప్రజలకు తెలియ జేశాము.[31] మరి వారేమో అప్పుడు[32] ఈ వ్యవహారంలో పరస్పరం తర్జనభర్జన చేసుకోసాగారు – "వీరి గుహపై ఒక

وَكَذٰلِكَ اَعْثَرْنَا عَلَيْهِمْ لِيَعْلَمُوْٓا اَنَّ وَعْدَ اللّٰهِ حَقٌّ وَّاَنَّ السَّاعَةَ لَا رَيْبَ فِيْهَا ۚ اِذْ يَتَنَازَعُوْنَ بَيْنَهُمْ اَمْرَهُمْ فَقَالُوا ابْنُوْا عَلَيْهِمْ بُنْيَانًا ۭ

25. వారు ఉదయం పూట గుహలో ప్రవేశించారు. మెలకువ వచ్చినప్పుడు సూర్యాస్తమయం కాబోతోంది. అందువల్ల తాము మహా అయితే ఒక దినమో లేక అంతకన్నా తక్కువ సమయమో నిద్రపోయి ఉంటామని అనుకున్నారు.

26. అయితే సుదీర్ఘకాలం నిద్రావస్థలో ఉండటం మూలంగా వారు ఖచ్చితంగా చెప్పలేక పోయారు. అందుకే వాళ్లు ఆ వ్యవహారాన్ని దైవానికే వదలిపెట్టారు. ఖచ్చితంగా తాము ఎంతసేపు నిద్రపోయిందీ అల్లాహ్‌కే తెలుసు అని చెప్పి తమ విజ్ఞతను చాటుకున్నారు.

27. మెలకువ రాగానే ఆకలి వేసింది. అది మానవ సహజం. మానవ అవసరాలలో అత్యంత ముఖ్యమైనది. అందుకే భోజనం గురించి ఆలోచించసాగారు.

28. తెలివిగా, చాకచక్యంగా మసలుకోవాలని వారు తాకీదు చేయటం అర్థం చేసుకోదగిన విషయమే. ఎందుకంటే తమ జాడను ఎవరయినా పసిగట్టారంటే కథ అడ్డం తిరుగుతుంది. తమ లక్ష్యం ప్రమాదంలో పడుతుంది.

29. తాము ఇంత ప్రయాసపడిందీ, ఇన్ని బాధలు భరించింది ధర్మరక్షణ కోసమే కదా! మరి ఇప్పుడు తమ ఉనికి గురించి తమ జాతి వారికి తెలిస్తే ఎలా? వారు తమను బలవంతంగా తీసుకుపోయి తమ తాతముత్తాతల మతంలో చేర్పిస్తారు. ఒకవేళ అదేగనక జరిగితే మనం ప్రాపంచికంగానూ, పారలౌకికంగానూ నష్టపోతాము.

30. ప్రళయం రావటం తథ్యం అనీ, మరణానంతర జీవితం సత్యమని తెలుసుకోగోరే వారికి ఈ గుహవారి వాస్తవ గాథలో గొప్ప సూచన ఉంది. సత్య తిరస్కారులకు కూడా ఈ గాథలో గొప్ప గుణపాఠం ఉంది.

31. అంటే మేము వారిని నిద్రపుచ్చి మేల్కొల్పినట్లే, వారి వృత్తాంతం గురించి జనులకు తెలియపరచాము. ఆ విషయం ఎలా తెలిసింది ప్రజలకు? అంటే ఒక కథనం ప్రకారం గుహవాసుల్లోని ఒక వ్యక్తి వెండి నాణెం తీసుకుని ఆహార

رَبُّهُمْ اَعْلَمُ بِهِمْ ؕ قَالَ الَّذِيْنَ غَلَبُوْا عَلٰۤى اَمْرِهِمْ لَنَتَّخِذَنَّ عَلَيْهِمْ مَّسْجِدًا ﴿21﴾

కట్టడం కట్టండి”[33] అని కొందరన్నారు. వీరి సంగతి వీరి ప్రభువుకే బాగా తెలుసు.[34] వీళ్ల వ్యవహారంలో పైచేయిగా ఉన్నవారు మాత్రం ఇలా అన్నారు: “మేము వీళ్లు ఉన్నచోట ఒక ఆరాధనాలయం కడతాము.”[35]

سَيَقُوْلُوْنَ ثَلٰثَةٌ رَّابِعُهُمْ كَلْبُهُمْ ۚ وَيَقُوْلُوْنَ خَمْسَةٌ سَادِسُهُمْ كَلْبُهُمْ رَجْمًۢا بِالْغَيْبِ ۚ

**22** “వాళ్లు ముగ్గురు, నాల్గోది వారి కుక్క” అని కొందరంటారు. “వారు అయిదుగురు. ఆరోది వారి కుక్క”[36] అని మరి కొందరంటారు. వారు తమకు తెలియని విషయంలో ఊహాగానాలు

పదార్థాల కోసం పట్నంలోకి వెళ్ళాడు. కాని 309 సంవత్సరాల క్రితం చెలామణీలో ఉన్న నాణెం చూపెట్టేసరికి దుకాణం యజమానికి అనుమానం వచ్చింది. అతను మరో వ్యక్తికి ఆ నాణాన్ని చూపెట్టాడు. అతను కూడా ఆశ్చర్యపోయాడు. అందరూ ఆ యువకుణ్ణి గుచ్చి గుచ్చి ప్రశ్నించసాగారు. తాను అదే పట్టణానికి చెందిన వ్యక్తిననీ, నిన్నంటే నిన్ననే ఈ పట్టణం విడిచివెళ్ళాననీ అతను స్థిరంగా చెప్పాడు. కాని ఆ ‘నిన్న’కు మూడు శతాబ్దాలు గడిచిపోయాయి. ప్రజలు ఎలా నమ్ముతారు? బహుశా ఇతనికి నిధులు దొరికి ఉంటాయనీ, వాటిని చెల్లించుకోవటానికే ఈ విధంగా చెబుతున్నాడని వారికి అనుమానం వచ్చింది. అలా అలా ఈ విషయం రాజ్యాధికారి వరకూ చేరింది. విచారణ జరిగిన తరువాత అతని సహాయంతో ఆ రాజ్యాధికారి ఆ గుహవరకూ చేరుకున్నాడు. వజ్ర సంకల్పులైన ఆ యువకులను చూశాడు. అనంతరం అల్లాహ్ ఆ గుహలోనే – నిద్రావస్థలోనే – వారికి మరణమొసగాడు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

32. ప్రళయదినం పట్ల, మరణానంతర జీవితం పట్ల వారు వాదోపవాదాలు జరుపు కుంటుండగా మేము ఈ వాస్తవ గాథను వారి దృష్టికి తెచ్చాము అని ఒక భావం. మూలంలోని **‘ఇజ్’** (اِذْ) అన్న పదానికి ‘ఆ సంఘటనను జ్ఞాపకం చేసుకోండి’ అన్న అర్థం కూడా వస్తుంది.

33. ఈ మాటలన్నది ఎవరు? అప్పటి విశ్వాసులు ఇలా పలికారని కొందరు భావిస్తున్నారు. రాజ్యాధికారి, అతని సలహాదారులు ఈ విధంగా అన్నారని మరికొందరు అభిప్రాయపడ్డారు. రాజ్యాధికారి తన సహచరులతో కలసి ఆ గుహ దగ్గరకు వెళ్ళాడు. వారిని పరామర్శించాడు. అనంతరం అల్లాహ్ వారిని అదే స్థలంలో నిద్రకు లోనుచేశాడు. అప్పుడు రాజ్యాధికారి “ఈ యువకుల రక్షణ నిమిత్తం ఒక కట్టడాన్ని నిర్మించండి” అని ఆదేశించాడు.

34. పరస్పరం వాదులాడుకుంటున్న వాళ్లనుద్దేశించి, “వారి సంగతి వారి ప్రభువుకే బాగా తెలుసు” అని అల్లాహ్ సెలవిచ్చాడు.

35. వాదోపవాదాలలో గెలిచిన వారెవరు? విశ్వాసులా? లేక అవిశ్వాసులా? ‘విశ్వాసులు’ అని అల్లామా షౌకానీ అభిప్రాయపడగా, ‘అవిశ్వాసులు’ అని ఇబ్నె కసీర్ అభిప్రాయపడ్డారు. ఎందుకంటే విశ్వాసులు ఇలాంటి సలహాలు ఇవ్వరు. సజ్జనుల సమాధులపై ఆరాధనాలయాలు కట్టడం అల్లాహ్‌కు సుతరామూ ఇష్టం లేదు. “అల్లాహ్ యూదులను, క్రైస్తవులను శపించుగాక! వారు తమ ప్రవక్తల, పుణ్యపురుషుల సమాధులను ఆరాధనాలయాలుగా చేసుకున్నారు” అన్న మహనీయ ముహమ్మదు (సఅసం) ప్రవచనం ఈ సందర్భంగా గమనార్హం (బుఖారీ – కితాబుల్ జనాయెజ్; ముస్లిం – కితాబుల్ మసాజిద్....). ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఇరాక్‌లో హజ్రత్ దానియేల్ (అలైహిస్సలాం) సమాధి కనుగొనబడింది. అయితే దాన్ని ఇతర సమాధుల మాదిరిగా కనుమరుగు చేయమని ఆయన ఆజ్ఞాపించారు. ఫలానా సమాధి ప్రవక్త సమాధి అని తెలిస్తే ప్రజలు దానిపట్ల అతిశయిల్లుతారన్న ఉద్దేశంతో ఆయన అలా చెప్పారు. (తఫ్సీర్ ఇబ్నె కసీర్)

36. గుహవారు అసలు ఎంతమంది? అన్న విషయంలో మహాప్రవక్త (స) కాలం నాటి విశ్వాసులు – అవిశ్వాసులలో వాదులాట జరిగేది. ముఖ్యంగా గ్రంథ జ్ఞానం గలవారు (యూదులు, క్రైస్తవులు) ఈ వ్యవహారంలో లేనిపోని ప్రశ్నలు గుప్పించేవారు.

وَيَقُولُونَ سَبْعَةٌ وَثَامِنُهُمْ كَلْبُهُمْ ۚ قُل رَّبِّي
أَعْلَمُ بِعِدَّتِهِم مَّا يَعْلَمُهُمْ إِلَّا قَلِيلٌ ۗ فَلَا
تُمَارِ فِيهِمْ إِلَّا مِرَاءً ظَاهِرًا وَلَا تَسْتَفْتِ
فِيهِم مِّنْهُمْ أَحَدًا ﴿22﴾

చేస్తున్నారు.[37] "వారు ఏడుగురు, ఎనిమిదోది వారి కుక్క"[38] అని ఇంకా కొంతమంది అంటారు. "వారి సంఖ్య గురించి నా ప్రభువు బాగా ఎరుగు. వారి సంఖ్య గురించి బహుకొద్ది మందికి మాత్రమే తెలుసు"[39] అని వారికి చెప్పు. కాబట్టి నువ్వు వారి విషయంలో స్థూలంగా మాత్రమే వాదించు.[40] ఇంకా (గుహ) వారిని గురించి వీళ్ళలో ఎవరినీ అడగకు.[41]

وَلَا تَقُولَنَّ لِشَيْءٍ إِنِّي فَاعِلٌ ذَٰلِكَ غَدًا ﴿23﴾

**23** ఏ విషయంలోనయినాసరే "రేపు నేను ఈ పని చేస్తాను" అని ఎట్టిపరిస్థితిలోనూ చెప్పకు.

إِلَّا أَن يَشَاءَ اللَّهُ ۚ وَاذْكُر رَّبَّكَ إِذَا نَسِيتَ
وَقُلْ عَسَىٰ أَن يَهْدِيَنِ رَبِّي لِأَقْرَبَ مِنْ هَٰذَا
رَشَدًا ﴿24﴾

**24** అయితే "అల్లాహ్ తలిస్తే చేస్తాను (ఇన్షాఅల్లాహ్)" అని అనాలి.[42] మరచిపోయినప్పుడల్లా నీ ప్రభువును స్మరించు.[43] "నా ప్రభువు దీనికన్నా సన్మార్గానికి దగ్గరగా ఉండే విషయం వైపుకు నాకు దారి చూపిస్తాడన్న ఆశ వుంది"[44] అని చెబుతూ ఉండు.

37. వాస్తవానికి ఆ విషయానికి సంబంధించిన నిజ జ్ఞానం వారిలో ఎవరికీ లేదు. అంచనాలపై కబుర్లు చెబుతున్నారు. కాకిలెక్కలు వేస్తున్నారు. చూడకుండా రాయి విసరటం లాంటిదే ఇది కూడా.

38. ఇక్కడ మూడు వర్గాల అభిప్రాయాలు ప్రస్తావనకు వచ్చాయి. మొదటి రెండు వర్గాల అభిప్రాయాలను ఊహాగానాలు (రజ్మమ్ బిల్ గైబ్)గా, బేరీజులుగా ఖరారుచేసిన తరువాత, మూడవ వర్గం అభిప్రాయాన్ని ప్రస్తావించటాన్నిబట్టి ఇది ప్రమాణ బద్ధమైనదనీ, వాస్తవానికి వారి సంఖ్య అంతేనని (అంటే వారు ఏడుగురు అని) కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు పేర్కొన్నారు (ఇబ్నె కసీర్).

39. కొంతమంది ప్రవక్త ప్రియసహచరులు (రజి), "గుహవారి సంఖ్య ఎంత? అన్న విషయం తెలిసిన బహుకొద్దిమందిలో మేమూ ఉన్నాం, మూడవ మాటలో అభిప్రాయపడినట్లు వారు ఏడుగురు మాత్రమే" అని చెప్పేవారు. (ఇబ్నె కసీర్)

40. అంటే 'వహీ' ద్వారా నీకు తెలియజేయబడిన విషయాలకే నువ్వు పరిమితం అయి ఉండాలి. లేదా సంఖ్యా నిర్ధారణ విషయంలో వాదోపవాదాలకు, తర్జనభర్జనలకు తావు కల్పించకూడదు. ఈ నిర్ధారణకు ఎలాంటి ఆధారమూ లేదు అని మాత్రం చెప్పి ఊరుకో.

41. పరస్పరం వాదోపవాదాలకు దిగిన వారిలో ఎవరినీ ఈ విషయం గురించి అడగకు. ఎందుకంటే చెప్పేవానికి అడిగే వానికన్నా ఎక్కువ జ్ఞానం ఉంటేనే కదా సరైన సమాధానం లభించేది! కాని యిక్కడ వ్యవహారం తద్భిన్నంగా ఉందాయె! (ఓ ప్రవక్తా!) నీవద్ద ఎంతో కొంత 'వాస్తవ జ్ఞాన' సాధనముంది (అంటే నీకు వహీ ద్వారా నిజానిజాలు తెలియజేయబడుతూ ఉంటాయి). కాని ఇతరుల వద్ద ఈ విషయ పరిజ్ఞానం అసలే లేదు. వారు కేవలం అంచనాలపై ఆధారపడుతున్నారు. ఊహాలోకాల్లో విహరిస్తున్నారు.

42. ఖుర్ఆన్ వ్యాఖ్యాతల కథనం ప్రకారం యూదులు మహాప్రవక్త (స)కు మూడు ప్రశ్నలు వేశారు. 1. 'ఆత్మ' (రూహ్) వాస్తవికత ఏమిటి? 2. అస్హాబె కహఫ్ (గుహవారు) ఇంతకీ ఎవరు? 3. జుల్ఖర్నైన్ ఎవరు? ఈ మూడు ప్రశ్నలే ఈ సూరా అవతరణకు కారణభూతమైనాయి. "నేను మీకు రేపు సమాధానం ఇస్తాను" అని మహాప్రవక్త(స) చెప్పారు. కాని ఆనాటి నుంచీ 15 రోజుల దాకా దైవదూత జిబ్రయీల్ దైవసందేశాన్ని తీసుకురాలేదు. ఆ తరువాత దైవసందేశం అవతరించింది – "ఇన్షా అల్లాహ్" అని చెప్పాలని అల్లాహ్ ఆయనకు ఆజ్ఞాపించాడు. ఆయతులోని 'రేపు' అనేమాట భవిష్యత్తుకు వర్తిస్తుంది. అంటే భవిష్యత్తులో ఎప్పుడు ఏ పనిచేయాలని సంకల్పించుకున్నా లేక

25 వారు తమ గుహలో మూడు వందల సంవత్సరాలు ఉన్నారు. మరో తొమ్మిదేండ్లు అదనం.[45]

وَلَبِثُوا فِي كَهْفِهِمْ ثَلٰثَ مِائَةٍ سِنِيْنَ وَازْدَادُوْا تِسْعًا ﴿25﴾

26 వారికి చెప్పు : "వారు అక్కడ ఖచ్చితంగా ఎంతకాలం ఉన్నారో అల్లాహ్‌కే తెలుసు. భూమ్యాకాశాల రహస్యం ఆయనకు మాత్రమే తెలుసు. ఆయనెంత చక్కగా చూసేవాడు! మరెంత చక్కగా వినేవాడు![46] అల్లాహ్ తప్ప వారిని ఆదుకునే వాడెవడూ లేడు. అల్లాహ్ తన పరిపాలనాధికారంలో (నిర్ణయాలలో) ఎవరినీ భాగస్వామిగా చేర్చుకోడు."

قُلِ اللّٰهُ اَعْلَمُ بِمَا لَبِثُوْا ۚ لَهٗ غَيْبُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ اَبْصِرْ بِهٖ وَاَسْمِعْ ؕ مَا لَهُمْ مِّنْ دُوْنِهٖ مِنْ وَّلِيٍّ ۫ وَّلَا يُشْرِكُ فِيْ حُكْمِهٖۤ اَحَدًا ﴿26﴾

27 నీ వద్దకు వహీ ద్వారా పంపబడిన నీ ప్రభువు గ్రంథాన్ని పఠిస్తూ ఉండు.[47] ఆయన వచనాలను మార్చగలవాడెవడూ లేడు. నువ్వు ఎట్టి పరిస్థితిలోనూ ఆయన ఆశ్రయం తప్ప వేరే ఆశ్రయాన్ని పొందజాలవు.[48]

وَاتْلُ مَاۤ اُوْحِيَ اِلَيْكَ مِنْ كِتَابِ رَبِّكَ ۚ لَا مُبَدِّلَ لِكَلِمٰتِهٖ ۚ وَلَنْ تَجِدَ مِنْ دُوْنِهٖ مُلْتَحَدًا ﴿27﴾

వాగ్దానం చేసినా "దైవం తలిస్తే..." అని తప్పకుండా చెప్పాలి. ఎందుకంటే ఏ పని గురించి మనిషి తన సంకల్పాన్ని ప్రకటిస్తున్నాడో అందులో దైవాభిమతం ఏమిటో, ఆ మేరకు దేవుడు అతనికి సద్బుద్ధిని ప్రసాదిస్తాడో లేదో కూడా అతనికి తెలీదు.

43. అంటే వాగ్దానం చేసే సమయంలో లేక మాట్లాడే సమయంలో 'ఇన్‌షా అల్లాహ్' అని అనటం మరచిపోతే, ఆ సంగతి జ్ఞాపకం రాగానే 'ఇన్‌షా అల్లాహ్' అని పలకాలి. లేదా అల్లాహ్‌ను స్తుతించాలి. ఆయన పవిత్రతను కొనియాడాలి. క్షమాపణకై ఆయన్ని వేడుకోవాలి.

44. అంటే ఏ పనిచేయాలని నేను సంకల్పించుకున్నానో, ఏ ఉద్దేశాన్నయితే నేను వ్యక్తపరిచానో ఆ విషయంలో అల్లాహ్ నేననుకున్న దానికన్నా ఎక్కువ శ్రేయోదాయకమైన మార్గాన్ని తెరువవచ్చు.

45. ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలలో అత్యధికమంది ఈ పలుకులను అల్లాహ్ పలుకులుగా ఖరారు చేశారు. సూర్యమానం ప్రకారం 300 సంవత్సరాలయితే, చంద్రమానం ప్రకారం 309 సంవత్సరాలవుతాయి.

మరికొంతమంది విద్వాంసుల దృష్టిలో ఈ పలుకులు సంఖ్యా విషయంలో వాదోపవాదాలు చేసుకున్న వారివి. దానికి ఆధారంగా వారు "అక్కడ వారు ఖచ్చితంగా ఎంతకాలం ఉన్నారో అల్లాహ్‌కు బాగా తెలుసు" అన్న తదుపరి ఆయతును ఉదాహరిస్తారు.

కాని మెజారిటీ విద్వాంసుల వ్యాఖ్యానం ప్రకారం దీని భావం ఇది : "గ్రంథం కల ప్రజలైనా, మరొకరయినా – తెలియజేయబడిన ఈ 'కాలం' పట్ల విభేదిస్తే, మీకు ఎక్కువ తెలుసా? లేక అల్లాహ్‌కు ఎక్కువ తెలుసా? అని నువ్వు వారికి చెప్పు. ఆయన 309 సంవత్సరాలని తెలియపరచాడంటే అదే సరైనదని భావించాలి. ఎందుకంటే ఆ యువకులు ఆ గుహలో ఖచ్చితంగా ఎంతకాలం ఉన్నారన్న సంగతి ఆయనకు మాత్రమే తెలుసు.

46. ఇది కూడా అల్లాహ్ పరిజ్ఞానానికీ, అజమాయిషీకి సంబంధించిన మరింత వివరణ.

47. ఆ మాటకొస్తే ఇది సర్వసాధారణమైన ఆజ్ఞయే. ఏ విషయం నీవద్దకు పంపబడినా దాన్ని పఠనం చేసుకో. ప్రజలకు దాని గురించి బోధపరచు అని అల్లాహ్ తన ప్రవక్త (సఅసం)కు తెలియజేశాడు. అయితే గుహవారి గాథ ముగింపు సందర్భంగా– ప్రత్యేకంగా – ఆజ్ఞాపించటాన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే, గుహవారి విషయంలో జనులు ఎవరెన్ని విధాలుగా చెప్పుకుంటూ తిరిగినా, అల్లాహ్ తన గ్రంథంలో వాళ్ల గురించి ఏ మేరకు విడమరచి చెప్పాడో అదే

وَاصْبِرْ نَفْسَكَ مَعَ الَّذِيْنَ يَدْعُوْنَ رَبَّهُمْ بِالْغَدٰوةِ وَالْعَشِيِّ يُرِيْدُوْنَ وَجْهَهٗ وَلَا تَعْدُ عَيْنٰكَ عَنْهُمْ ۚ تُرِيْدُ زِيْنَةَ الْحَيٰوةِ الدُّنْيَا ۚ وَلَا تُطِعْ مَنْ اَغْفَلْنَا قَلْبَهٗ عَنْ ذِكْرِنَا وَاتَّبَعَ هَوٰىهُ وَكَانَ اَمْرُهٗ فُرُطًا ﴿28﴾

**28** తమ ప్రభువును ఉదయం, సాయంత్రం వేడుకుంటూ, ఆయన ప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో ఉన్నవారి సహచర్యం పట్ల నీ మనసును సంతృప్త పరచుకో. జాగ్రత్త! వారి నుంచి నీ దృష్టిని మరల్చుకోకు.[49] ప్రాపంచిక జీవితపు అందాలను నీవు కోరు కుంటావేమో![50] చూడు! ఎవరి హృదయాన్ని మేము మా ధ్యానం పట్ల నిర్లక్ష్యానికి లోనుచేశామో, ఎవడు తన మనోవాంఛల వెనుక పరుగులు తీస్తున్నాడో, ఎవడి పనితీరు మితిమీరి పోయిందో[51] అతనికి విధేయత చూపకు.

وَقُلِ الْحَقُّ مِنْ رَّبِّكُمْ ۗ فَمَنْ شَآءَ فَلْيُؤْمِنْ وَّمَنْ شَآءَ فَلْيَكْفُرْ ۙ اِنَّآ اَعْتَدْنَا لِلظّٰلِمِيْنَ نَارًا ۙ اَحَاطَ بِهِمْ سُرَادِقُهَا ۭ وَاِنْ يَّسْتَغِيْثُوْا

**29** ఈ విధంగా ప్రకటించు : (ఆసాంతం) సత్యం(తో కూడుకున్న ఈ ఖుర్ఆన్) మీ ప్రభువు తరఫు నుంచి వచ్చింది. కనుక కోరిన వారు దీనిని విశ్వసించవచ్చు, కోరినవారు నిరాకరించవచ్చు. (అయితే సత్యాన్ని నిరాకరించిన) దుర్మార్గుల కోసం మేము అగ్నిని సిద్ధం చేసి ఉంచాము. దాని కీలలు వారిని చుట్టుముడ

సరైనది, ప్రామాణికమైనది. అంతవరకే నువ్వు జనులకు చదివి వినిపించు. అంతకుమించి ఇతరత్రా విషయాలను పట్టించుకోకు.

48. ఒకవేళ నువ్వు గనక ఈ విషయాలను విడమరచి చెప్పటానికి వెనుకంజవేసినా, విముఖత చూపినా లేక నీ ప్రభువు నుండి అందజేయబడిన వచనాలలో నువ్వు మార్పులు చేర్పులు చేసినా అల్లాహ్ పట్టునుంచి నిన్ను రక్షించేవాడెవడూ ఉండడు. ఈ విషయం అంతిమ దైవప్రవక్త (స) నుద్దేశించి చెప్పినప్పటికీ వాస్తవానికి ఇది ఆయన అనుచర సమాజానికి కూడా వర్తిస్తుంది.

49. ఇంతకుముందు అల్ అన్ఆమ్ సూరా (52)లో కూడా ఈ నిరుపేదల ప్రస్తావన వచ్చింది. వారు పేదవారైనప్పటికీ దైవధర్మాన్ని, మహాప్రవక్త (స) సహచర్యాన్ని ఎంతగానో కోరుకునే అభిమానధనులు. అయితే వారున్న సమావేశంలో వారితో కలసి కూర్చోవటానికి ఖురైషు కులీనులు ఎంతమాత్రం ఇష్టపడేవారు కాదు. హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) ఇలా తెలిపారు: మేము మొత్తం ఆరుగురం దైవప్రవక్త (సఅసం) దగ్గర కూర్చొని ఉన్నాం. నేను గాకుండా బిలాల్, ఇబ్నె మస్ఊద్, హుజలీ తెగకు చెందిన ఒక వ్యక్తి, మరో ఇద్దరు సహాబీలు ఉన్నారు. అప్పుడు మక్కాకు చెందిన ఖురైషు కులీనులు అక్కడకు వచ్చి, "కాస్త వీళ్ళందరినీ బయటికి పంపిస్తే మేము మీ ఎదుట కూర్చుని మీ బోధనను వింటాం" అని కోరారు. సరే! మంచిదేకదా! కనీసం ఈ విధంగానయినా వారు తన ఉపదేశాన్ని వింటే వాళ్ల హృదయ జగత్తు మారుతుందేమోనని భావించారు మహాప్రవక్త (సఅసం). అయితే ఎట్టి పరిస్థితిలోనూ అలాంటి పని చేయరాదని అల్లాహ్ తన ప్రవక్తను గట్టిగా హెచ్చరించాడు (సహీహ్ ముస్లిం – ఫజాయెలుస్సహాబా).

50. అంటే నిన్ను అమితంగా అభిమానించే ఈ పేదలను విస్మరించి సమాజంలోని శ్రీమంతులు, కులీనులపై దృష్టిని కేంద్రీకరించకు.

51. మూలంలో **'ఫురుతా'** ( **فُرُطًا** ) అనే పదం ఉపయోగించబడింది. ఈ పదం 'ఇఫ్రాత్' అనే మూలపదం నుంచి వచ్చిం దనుకుంటే 'హద్దుమీరిపోవటం' అని దానికి భావం. ఒకవేళ 'తఫ్రీత్' నుంచి ఏర్పడినదనుకుంటే దానికి 'అతి మితథోరణి' అన్న అర్థం వస్తుంది. అతి మితథోరణి అనర్థదాయకం.

يُغَاثُوا بِمَاءٍ كَالْمُهْلِ يَشْوِي الْوُجُوهَ ۚ بِئْسَ
الشَّرَابُ ۖ وَسَاءَتْ مُرْتَفَقًا ﴿٢٩﴾

తాయి. ఒకవేళ వారు సహాయం (ఉపశమనం, నీళ్లు) అడిగితే, నూనె మడ్డిలాంటి నీటితో వారికి సహాయం అందజేయబడు తుంది. అది ముఖాలను మాడ్చివేస్తుంది. అత్యంత అసహ్యకర మైన నీరు అది! అత్యంత దుర్భరమైన నివాసం (నరకం) అది!!

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ إِنَّا لَا نُضِيعُ
أَجْرَ مَنْ أَحْسَنَ عَمَلًا ﴿٣٠﴾

**30** ఇక విశ్వసించి, సత్కార్యాలు చేసినవారి విషయం – నిశ్చ యంగా మేము ఉత్తమ ఆచరణ చేసిన వారి ప్రతిఫలాన్ని వృధా కానివ్వము.[52]

أُولَٰئِكَ لَهُمْ جَنَّاتُ عَدْنٍ تَجْرِي مِنْ تَحْتِهِمُ
الْأَنْهَارُ يُحَلَّوْنَ فِيهَا مِنْ أَسَاوِرَ مِنْ ذَهَبٍ
وَيَلْبَسُونَ ثِيَابًا خُضْرًا مِنْ سُنْدُسٍ وَإِسْتَبْرَقٍ
مُتَّكِئِينَ فِيهَا عَلَى الْأَرَائِكِ ۚ نِعْمَ الثَّوَابُ ۖ وَحَسُنَتْ
مُرْتَفَقًا ﴿٣١﴾

**31** వారి కోసం శాశ్వితమైన స్వర్గవనాలున్నాయి. వారి క్రింది నుంచి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారు బంగారు కంకణాలు తొడిగించబడతారు.[53] సన్నగానూ, దళసరిగానూ ఉండే సుతిమెత్తని ఆకుపచ్చ రంగుగల పట్టు వస్త్రాలు ధరిస్తారు.[54] వారక్కడ ఆసనాలపై (దిండ్లకు) ఆనుకుని ఆసీనులై ఉంటారు. ఎంత చక్కటి పుణ్యఫలం అది! ఎంత అమోఘమైన విశ్రాంతి నిలయం అది!!

وَاضْرِبْ لَهُمْ مَثَلًا رَجُلَيْنِ جَعَلْنَا لِأَحَدِهِمَا
جَنَّتَيْنِ مِنْ أَعْنَابٍ وَحَفَفْنَاهُمَا بِنَخْلٍ وَجَعَلْنَا
بَيْنَهُمَا زَرْعًا ﴿٣٢﴾

**32** (ఓ ప్రవక్తా!) వారికి ఆ ఇద్దరు వ్యక్తుల ఉదాహరణను కూడా వినిపించు[55] – వారిలో ఒకతనికి మేము రెండు ద్రాక్ష తోటలను ఇచ్చాము. వాటి చుట్టూ ఖర్జూరపు చెట్ల కంచెను నిర్మించాము.[56] ఆ రెంటికీ మధ్య పచ్చని పంట పొలాలను కూడా వొసగాము.[57]

52. సాధారణంగా నరక యాతనను వర్ణించినప్పుడల్లా, దాంతోపాటే స్వర్గలోక సుఖాలను ప్రస్తావించటం ఖుర్ఆన్ బోధనా శైలికి ఒక నిదర్శనం. నరకయాతన నుంచి అల్లాహ్ శరణు వేడటంతోపాటు, స్వర్గాన్ని పొందాలన్న ఆశ, కోరిక, ఆరాటం ప్రజలలో జనించాలన్నదే దీని ముఖ్యోద్దేశం.

53. దివ్య ఖుర్ఆన్ అవతరించే కాలంలోనూ, అంతకు ముందు కాలంలోనూ రాజులు, తెగల నాయకులు, శ్రీమంతులు తమ చేతులకు బంగారు మురుగులు ధరించేవారు. ఇది అప్పటి ఆచారం. దీనివల్ల సమాజంలో వారి ప్రత్యేకత వ్యక్తమయ్యేది. ఆ విషయాన్నే ఖుర్ఆన్ ప్రస్తావిస్తూ స్వర్గవాసులకు కూడా ఈ వైశిష్ట్యం ప్రాప్తమవుతుందని తెలిపింది.

54. **"సుందుసున్"** అంటే పలుచని పట్టువస్త్రమనీ, **"ఇస్తబ్రఖున్"** అంటే దళసరి పట్టువస్త్రమనీ భావం. ప్రాపంచిక జీవితంలో బంగారు నగలు వేసుకోవటం, పట్టు వస్త్రాలు ధరించటం పురుషులకు నిషేధించబడింది. ఎవరయితే ఈ దైవాదేశాన్ని శిరసావహిస్తూ ఈ నిషిద్ధాంశాలకు దూరంగా ఉంటారో వారికి స్వర్గంలో ఈ వస్తువులన్నీ ప్రాప్తమవుతాయి. స్వర్గవాసులకు ఏ వస్తువూ నిషిద్ధం కాదు. అక్కడ వారు కోరినదల్లా లభిస్తుంది. "ఏ వస్తువుపై మీ మనసు పడినా, మీరు ఏది కోరినా అది స్వర్గంలో ఉంటుంది." (హామీమ్ సజ్దహ్: 31)

55. ఇంతకీ ఈ ఇద్దరు వ్యక్తులు ఎవరు? ఏ కాలానికి చెందినవారు? అవగాహన నిమిత్తం అల్లాహ్ ఈ ఇరువురు వ్యక్తు లను ఉపమానంగా పేర్కొన్నాడా? లేక నిజంగానే ఆ వ్యక్తులిద్దరు ఉండేవారా? ఒకవేళ ఉంటే వారు ఇస్రాయీల్

كِلْتَا الْجَنَّتَيْنِ اٰتَتْ اُكُلَهَا وَلَمْ تَظْلِمْ مِّنْهُ شَيْـًٔا ۙ وَّفَجَّرْنَا خِلٰلَهُمَا نَهَرًا ۙ﴿33﴾

**33** ఆ రెండు తోటలూ దిట్టంగా పండాయి. అందులో ఏ లోటూ చేయలేదు.[58] ఇంకా, ఆ రెండు తోటల మధ్య మేము ఒక కాలువను కూడా ప్రవహింపజేశాము.[59]

وَّكَانَ لَهٗ ثَمَرٌ ۚ فَقَالَ لِصَاحِبِهٖ وَهُوَ يُحَاوِرُهٗۤ اَنَا اَكْثَرُ مِنْكَ مَالًا وَّاَعَزُّ نَفَرًا ﴿34﴾

**34** మొత్తానికి అతని పంట పండింది. ఒకనాడతను మాటల సందర్భంగా తన స్నేహితునితో,[60] "నేను నీకన్నా ఎక్కువ ధన వంతుణ్ణి. మందీమార్బలం రీత్యా కూడా నీకంటే ఎక్కువ బలవంతుణ్ణే" అని అన్నాడు.[61]

وَدَخَلَ جَنَّتَهٗ وَهُوَ ظَالِمٌ لِّنَفْسِهٖ ۚ قَالَ مَاۤ اَظُنُّ اَنْ تَبِيْدَ هٰذِهٖۤ اَبَدًا ۙ﴿35﴾

**35** ఇలా అతను తన ఆత్మకు అన్యాయం చేసుకున్న స్థితిలో తన తోటలోకి వెళ్ళాడు. ఇలా అన్నాడు: "ఏనాటికైనా ఈ తోట నాశనమై పోతుందని నేననుకోను."

وَّمَاۤ اَظُنُّ السَّاعَةَ قَآئِمَةً ۙ وَّلَئِنْ رُّدِدْتُّ اِلٰى رَبِّىْ لَاَجِدَنَّ خَيْرًا مِّنْهَا مُنْقَلَبًا ﴿36﴾

**36** "ప్రళయ ఘడియ ఆసన్నమవుతుందని కూడా నేను భావించటం లేదు. ఒకవేళ (అలాంటిదేదైనా జరిగి) నేను నా ప్రభువు వద్దకు మరలింపబడినా, నిస్సందేహంగా నేను (ఆ మళ్ళింపు స్థానంలో) ఇంతకన్నా మంచి స్థితిలోనే ఉంటాను."[62]

సంతతికి చెందినవారా? లేక మక్కావాసులా? అన్న విషయంలో ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల మధ్య ద్వంద్వాభిప్రాయాలున్నాయి. మొత్తానికి ఆ ఇద్దరు వ్యక్తుల్లో ఒకతను విశ్వాసి, మరొకతను అవిశ్వాసి.

56. ఒక తోటకు నాలుగువైపులా ప్రహరీగోడ ఉన్నట్లుగానే మేము ఆ ఖర్జూర చెట్ల కంచెను చేశాము. ఆ ఖర్జూర చెట్లు స్వయంగా మంచి దిగుబడులను ఇవ్వటంతోపాటు, ఆ తోటకు ప్రహరీ గోడలా ఉపయోగపడేవి.

57. ఆ రెండు తోటల మధ్య సారవంతమైన నేల కూడా ఉండేది. అందులో ఆహార ధాన్యాలు పుష్కలంగా పండేవి. ఆ విధంగా ఆ రెండు తోటల ద్వారా పండ్లు ఫలాదులు, ఆహార ధాన్యాలు పొంగిపొర్లేవి.

58. అంటే ఆ తోటలు పండటంలో ఎలాంటి కొరతా చేసేవి కావు. పైగా దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా వచ్చేవి.

59. ఆ తోటలకు నీరు సరఫరా చేయటంలో ఆ రైతు ఇబ్బందిపడరాదన్న ఉద్దేశంతో, ఆరు తడి కోసం ఎదురుచూస్తూ ఉండాల్సిన పరిస్థితి రాకూడదన్న ఆలోచనతో నిత్యం గలగలా పారే సెలయేరును కూడా సమకూర్చాము.

60. ఆ తోటల యజమాని అయిన అవిశ్వాసి, తన పొరుగువాడైన విశ్వాసిని ఉద్దేశించి బీరాలు పోయాడు.

61. **"నఫరున్"** (نَفَرٌ) అంటే సంతానం, నౌకర్లు, పాలేర్లు అని భావం.

62. ధనమదంతో వాడి కళ్లు పొరలు కమ్మాయి. వాడి ఆలోచనలు పెడత్రోవపట్టాయి. మిడిసిపడటంతో పాటు ఊహాలోకాల్లో విహరించసాగాడు. ఏకంగా వాడు ప్రళయ దినాన్నే ధిక్కరించాడు. ఒకవేళ అలాంటిదేదైనా సంభవించినా అక్కడ కూడా తాను ఘనంగా సత్కరించబడతానని బీరాలు పోయాడు. అవిశ్వాసంలో అవధులు మీరిపోయిన వారి నోట ఇలాంటి అహంకారపూరితమైన మాటలే వెలువడతాయి. 1. ఉదాహరణకు: "ఒకవేళ నేను నా ప్రభువు వద్దకు తీసుకుపోబడినా అక్కడ కూడా సుఖాలు నా సొంతమవుతాయి" అని అంటాడు (హామీమ్ సజ్దా – 50). 2. "మా ఆయతులను తిరస్కరించి, (పరలోకంలో కూడా) 'నేను ధనపరంగానూ, సంతానపరంగానూ ఘనంగా అనుగ్రహించబడతాను' అని ప్రగల్భాలు పలికే వ్యక్తిని నువ్వు చూశావా?" (మర్యమ్ – 77).

قَالَ لَهٗ صَاحِبُهٗ وَهُوَ يُحَاوِرُهٗٓ اَكَفَرْتَ بِالَّذِيْ خَلَقَكَ مِنْ تُرَابٍ ثُمَّ مِنْ نُّطْفَةٍ ثُمَّ سَوّٰىكَ رَجُلًا ﴿37﴾

37 అప్పుడు అతని స్నేహితుడు అతనితో మాట్లాడుతూ ఇలా అన్నాడు : "ఏమిటీ, నిన్ను మట్టితో చేసి, ఆ తరువాత వీర్యపు బిందువుతో సృష్టించి, ఆపైన నిన్ను నిండు మనిషిగా తీర్చిదిద్దిన ఆయననే (ఆ ఆరాధ్య దైవాన్నే) తిరస్కరిస్తున్నావా?[63]

لٰكِنَّا۠ هُوَ اللّٰهُ رَبِّيْ وَلَآ اُشْرِكُ بِرَبِّيْٓ اَحَدًا ﴿38﴾

38 "నా మట్టుకు నేను ఆ అల్లాహ్‌యే నా ప్రభువు అని నమ్ముతున్నాను. నేను నా ప్రభువుకు సహవర్తునిగా ఎవరినీ కల్పించను.[64]

وَلَوْلَآ اِذْ دَخَلْتَ جَنَّتَكَ قُلْتَ مَا شَآءَ اللّٰهُ ۙ لَا قُوَّةَ اِلَّا بِاللّٰهِ ۚ اِنْ تَرَنِ اَنَا اَقَلَّ مِنْكَ مَالًا وَّوَلَدًا ﴿39﴾

39 "(మిత్రమా!) నువ్వు నీ తోటలోకి పోతున్నప్పుడు 'అల్లాహ్ తలచినదే అవుతుంది. అల్లాహ్ ద్వారా లభించే శక్తి తప్ప వేరే శక్తి ఏదీ లేదు'[65] అని ఎందుకు పలకలేదు? ఒకవేళ నువ్వు నన్ను సంపదలో, సంతానంలో నీకన్నా అల్పునిగా చూస్తున్నట్లయితే,

63. అహంభావంతో కూడిన అతని మాటల్ని విన్న స్నేహితుడు (మోమిన్) అతనికి ఈ విధంగా హితబోధ చేశాడు: "చూడు మిత్రమా! నువ్వు ఏం మాట్లాడుతున్నావో కాస్త ఆలోచించి మాట్లాడు. నువ్వు ఏకంగా సృష్టికర్తనే ధిక్కరిస్తున్నావు. మరి చూడబోతే ఆయనే నిన్ను మట్టితో చేశాడు. ఆ తరువాత నీటి బిందువుతో (రేతస్సు)తో సృజించాడు."

ఆది మానవుడైన ఆదం (అలైహిస్సలాం) మట్టితో సృజించబడటం వల్ల మానవులందరి అసలు మూలం మట్టిగానే భావించబడుతుంది. మరి సమాగమం మూలంగా తండ్రి వెన్నులోనుంచి వెలువడిన వీర్యకణం మాతృ గర్భంలోకి వెళ్ళి ఆగింది. అది నలుసుగా మారింది. నవమాసాలు అక్కడే పెరిగింది. ఆ తరువాత సంపూర్ణ మానవాకారంలో మనిషి తల్లి కడుపును చించుకుని పుడమిపై పాదం మోపాడు.

మరి కొంతమంది విద్వాంసుల దృష్టిలో మానవుడు మట్టితో చేయబడ్డాడు అంటే అర్థం ఇది : మానవుడు తినే ఆహారమంతా మట్టిలోనుంచి ఉత్పన్నమయినదే. ఆ ఆహారంతోనే పురుషుని వెన్నులో వీర్యం తయారవుతుంది. అది మాతృ (స్త్రీ) గర్భంలోకి పోయి మనిషి పుట్టుక ప్రక్రియను మొదలెడుతుంది. ఈ విధంగా మనిషికి – మట్టికీ అవినాభావ సంబంధముంది.

మేలును మరచిన మనిషికి అతని నిజస్వరూపాన్ని జ్ఞాపకం చేసే ఉద్దేశంతో ఇదంతా చెప్పటం జరిగింది. ఆ విధంగానయినా అతను తన సృష్టికర్త మరియు నిజప్రభువును తెలుసుకుని తన జీవిత పరమార్థాన్ని గ్రహిస్తాడని ఆశించబడుతోంది. అందుకే మిడిసిపడుతున్న తన స్నేహితుణ్ణి ఉద్దేశించి ఆ వ్యక్తి బోధపరచాడు – నీ ప్రభువు మేళ్లను విస్మరించకు. ఆయన నిన్ను ఏవిధంగా అత్యంత అల్పస్థానం నుంచి అత్యున్నత స్థానానికి చేర్చాడో కాస్త యోచన చేయి. అద్భుతమైన ఈ ప్రక్రియలో ఆయనకు ఎవరూ తోడ్పడలేదు. అందులో ఎవరి భాగస్వామ్యమూ లేదు. ఇదంతా చేసేవాడు ఒక్కగానొక్క అల్లాహ్‌యే. అటువంటి సాటిలేని ప్రభువునే నువ్వు తిరస్కరిస్తున్నావు. ఆహ్! ఈ మనిషి ఎటువంటి కృతఘ్నుడు!?

64. నేను మాత్రం ఎన్నటికీ నీలాగా మాట్లాడను. ఎందుకంటే నేను ఒకే ఒక్కడైన దేవుని పోషకత్వాన్ని, ఆయన ఏకత్వాన్ని అంగీకరించాను – విశ్వాసి అయిన ఈ మిత్రుని మాటల్నిబట్టి బోధపడేదేమిటంటే ఆ తోట యజమాని ముష్రిక్ మరియు కాఫిర్.

65. దైవానుగ్రహాల పట్ల ఎలా కృతజ్ఞతా భావంతో మసలుకోవాలో ఆ మిత్రుడు అతనికి చెప్పాడు. కళకళలాడే ఆ తోటలోపలికి ప్రవేశించినప్పుడు, **"మాషా అల్లాహు లా ఖువ్వత ఇల్లాబిల్లాహ్"** అని నువ్వు ఎందుకు పలకలేదు?

فَعَسٰى رَبِّيْٓ اَنْ يُّؤْتِيَنِ خَيْرًا مِّنْ جَنَّتِكَ وَيُرْسِلَ عَلَيْهَا حُسْبَانًا مِّنَ السَّمَآءِ فَتُصْبِحَ صَعِيْدًا زَلَقًا ﴿40﴾

40 "(తెలుసుకో!) నా ప్రభువు నాకు నీ తోట కన్నా మేలైనదాన్ని ప్రసాదించి,[66] నీ తోటపై ఆకాశం నుంచి ఏదన్నా శిక్షను పంపినా పంపవచ్చు (ఆశ్చర్యపోనవసరం లేదు). అప్పుడది తెల్లవారేసరికి చదునైన - నున్నని - మైదానంలా అయి పోవచ్చు![67]

اَوْ يُصْبِحَ مَآؤُهَا غَوْرًا فَلَنْ تَسْتَطِيْعَ لَهٗ طَلَبًا ﴿41﴾

41 "లేదా దీని నీరు భూమిలో ఇంకిపోనూ వచ్చు. దాన్ని వెతికి తీసుకురావటం నీ తరం కాకపోవచ్చు."[68]

وَاُحِيْطَ بِثَمَرِهٖ فَاَصْبَحَ يُقَلِّبُ كَفَّيْهِ عَلٰى مَآ اَنْفَقَ فِيْهَا وَهِيَ خَاوِيَةٌ عَلٰى عُرُوْشِهَا وَيَقُوْلُ يٰلَيْتَنِيْ لَمْ اُشْرِكْ بِرَبِّيْٓ اَحَدًا ﴿42﴾

42 అతని పండ్లన్నీ ముట్టడించబడ్డాయి.[69] దాని కోసం పెట్టిన పెట్టుబడిపై అతను చేతులు నలుపుకుంటూ ఉండి పోయాడు.[70] ఆ తోట తలక్రిందులై (తడికెలపై) పడి ఉంది.[71] "అయ్యో! నేను నా ప్రభువుకు సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టకుండా ఉంటే ఎంత బావుండేది!" అని (ఆ వ్యక్తి) అన్నాడు.[72]

---

ఏది జరిగినా దైవేచ్ఛతోనే జరుగుతుంది. ఆయన తలిస్తే దాన్ని అలాగే ఉండనిస్తాడు. ఆయన తలచుకుంటే నామరూపాలు లేకుండా చేసేస్తాడు. అందుకే హదీసులో ఈ విధంగా చెప్పబడింది : "ఎవరికయినాసరే తమ సంపద, సంతానం, స్థితి బాగా అనిపిస్తే వారు **'మాషా అల్లాహు లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్'** అని పలకాలి." (తఫ్సీర్ ఇబ్నె కసీర్ - ముస్నదె అబూయాలా ఆధారంగా).

66. ప్రపంచంలో లేదా పరలోకంలో లేదా ప్రపంచం మరియు పరలోకం - రెండింటిలోనూ నా ప్రభువు నన్ను కటాక్షించవచ్చు.

67. పాపాలకు ప్రతిఫలంగా వచ్చిపడే శిక్షను 'హుస్బాన్' అంటారు. అసలు ఈ పదం హిసాబ్ నుంచి వచ్చింది. ఆకాశం నుండి విరుచుకుపడే ఆగ్రహ జ్వాల - వడగాడ్పు - ద్వారా సృష్టికర్త ఇట్టే నిలదీసి నిముషాల్లో లెక్క తేల్చేస్తాడు. ఇప్పుడు నవనవలాడుతున్న ఈ తోట రేపు తెల్లవారేసరికల్లా నేలమట్టమై చదునైన మైదానంలా మారిపోయినా ఆశ్చర్యం లేదు.

68. లేదా నీ తోటల పచ్చదనానికి, నీ పంటపొలాల సేద్యానికి దోహదపడుతున్న ఈ కాలువ ఎండిపోవచ్చు. అందలి నీరు భూమి లోపలికి దిగిపోవచ్చు. నీరు గనక నేల అడుగుకి వెళ్ళిపోతే ఆ నీటిని నేల ఉపరితలంలోకి తీసుకురావటం నీ తరం కాదు. పెద్ద పెద్ద యంత్రాలు, పంపుసెట్లు కూడా పనికి రాకుండా పోతాయి. అర్థమయిందా?!

69. ఇది తోట వినాశానికి సంకేతం. అంటే అతని తోటంతా ధ్వంసం చేయబడింది.

70. తోట పెంపకానికి, సేద్యానికీ, ఎరువుల కోసం చేసిన ఖర్చులను తలచుకుని బాధపడసాగాడు. చేతులు నలుపు కున్నాడంటే తన తప్పిదంపై సిగ్గు చెందాడన్న భావం కూడా వస్తుంది.

71. నిన్నటి వరకూ ద్రాక్ష తీగెలు ఏ తడికెలపై, పందిళ్లపై ఉండేవో ఇప్పుడు అవన్నీ కుప్పకూలిపోయినై. పంటంతా విధ్వంసానికి గురైంది.

72. సర్వాధికారి అయిన అల్లాహ్‌కు ఇతరులను సాటి కల్పించటం, దైవానుగ్రహాలను పొందిన తరువాత కూడా ఆయన్ని కాదనటం, ఆయనకు వ్యతిరేకంగా గర్వాహంకారాన్ని, తలబిరుసుతనాన్ని ప్రదర్శించటం ఒక మానవ మాత్రునికి సుతరామూ శోభించదన్న యదార్థం ఇప్పుడతనికి బోధపడింది. కాని చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనమేమిటీ? అప్పటికే పూడ్చలేని నష్టం జరిగిపోయింది. ఇలా ఉంటుంది దేవుని దెబ్బ!

**43** అల్లాహ్ పట్టు నుంచి అతన్ని రక్షించి, సహాయపడటానికి అతని జన సమూహమేదీ రాలేదు.[73] స్వయంగా అతను కూడా ప్రతిఘటించలేకపోయాడు.

وَلَمْ تَكُن لَّهُۥ فِئَةٌ يَنصُرُونَهُۥ مِن دُونِ
ٱللَّهِ وَمَا كَانَ مُنتَصِرًا ﴿٤٣﴾

**44** సర్వాధికారాలు సత్యబద్ధుడైన అల్లాహ్‌వేననీ,[74] పుణ్యఫలం ప్రసాదించటంలోనూ ఆయనే ఉత్తముడనీ, పర్యవసానం రీత్యా కూడా ఆయనే అత్యుత్తముడనీ అక్కడే తేలిపోయింది.[75]

هُنَالِكَ ٱلْوَلَٰيَةُ لِلَّهِ ٱلْحَقِّ ۚ هُوَ خَيْرٌ
ثَوَابًا وَخَيْرٌ عُقْبًا ﴿٤٤﴾

**45** (ఓ ప్రవక్తా!) ప్రాపంచిక జీవితపు ఉదాహరణను కూడా వారికి తెలుపు. అది మేము ఆకాశం నుంచి కురిపించే వర్షపు నీరు వంటిది. దానివల్ల నేలలో దట్టమైన పచ్చిక మొలిచింది. ఆఖరికి అది పొట్టు పొట్టుగా మారిపోగా, గాలులు దాన్ని లేపుకుపోతాయి. అల్లాహ్ అన్నింటిపై అధికారం కలిగి ఉన్నాడు.[76]

وَٱضْرِبْ لَهُم مَّثَلَ ٱلْحَيَوٰةِ ٱلدُّنْيَا كَمَآءٍ أَنزَلْنَٰهُ
مِنَ ٱلسَّمَآءِ فَٱخْتَلَطَ بِهِۦ نَبَاتُ ٱلْأَرْضِ فَأَصْبَحَ
هَشِيمًا تَذْرُوهُ ٱلرِّيَٰحُ ۗ وَكَانَ ٱللَّهُ عَلَىٰ كُلِّ شَىْءٍ
مُّقْتَدِرًا ﴿٤٥﴾

73. ఏ మందీమార్బలాన్ని చూసుకుని అతను మురిసిపోయేవాడో వారెవరూ అతని తలరాతను మార్చలేకపోయారు. అతను సయితం దేవుని పట్టు నుంచి తనను కాపాడుకోలేకపోయాడు.

74. ఇలాంటి గడ్డు పరిస్థితిలో అందరికీ కనువిప్పు కలుగుతుంది. విశ్వాసులు, అవిశ్వాసులు అందరూ సాక్ష్యమిస్తారు– అల్లాహ్ తప్ప ఆ గండం నుంచి గట్టెక్కించే నిజదైవం ఎవరూ లేరని! కొమ్ములు తిరిగిన పొగరుబోతులు, అధికార మదాంధులు సయితం అలాంటి గడ్డు పరిస్థితిలో దేవుని ఏకత్వాన్ని విశ్వసించటానికి సమాయత్తమవుతారు. కాని ఆ తరుణంలో విశ్వసించటం వారికేవిధంగానూ లాభదాయకం కాజాలదు. ఫిరౌను వంటి అధికార మదాంధుడు కూడా సముద్రంలో మునిగే ముందు తన విశ్వాసాన్ని ప్రకటించాడు. ఆ విషయాన్నే దివ్య ఖుర్ఆన్ ఇలా పేర్కొంది: చివరకు ఫిరౌను మునిగిపోతున్నప్పుడు ఇలా అరవసాగాడు– "ఇస్రాయీలు సంతతి వారు విశ్వసించే దేవుడే నిజమైన దేవుడనీ, ఆయన తప్ప మరో దేవుడు లేడనీ నేను విశ్వసించాను. నేను కూడా విధేయతతో శిరస్సు వంచే వారిలో ఒకణ్ణి." (యూనుస్-90)

ఇతర అవిశ్వాసుల గురించి ఖుర్ఆన్‌లో ఈ విధంగా అనబడింది: "వారు తీరా మా శిక్షను చూశాక, 'మేమిప్పుడు ఒక్కడైన అల్లాహ్‌ను విశ్వసించాము. అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టిన వారందరినీ నిరాకరిస్తున్నాము' అని అంటారు." (మోమిన్ - 84)

75. తనను నమ్ముకున్న వారికి ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించేవాడు, వారి కథను సుఖాంతం చేసేవాడు అల్లాహ్ మాత్రమే.

76. ప్రపంచం ఎంత అస్థిరమైనదో, తాత్కాలికమైనదో ఈ ఆయతులో పచ్చిక మైదానపు ఉపమానం ద్వారా వివరించటం జరిగింది. ఆకాశం నుంచి వానజల్లు కురవగానే నేలలో పచ్చిక మొలకెత్తుతుంది. పొలాలు సస్యశ్యామలంగా మారతాయి. చెట్లు పచ్చగా మారి కళకళలాడుతుంటాయి. కాని కొన్ని మాసాలకే ఇవన్నీ ఎండిపోతాయి. అనావృష్టి మూలంగా నేల బీటలు వారుతుంది. లేదా పంటలు పండి, ఎండు గడ్డిగా తయారవుతాయి. కుప్పలు నూర్చినప్పుడు ఆ గడ్డి పొట్టుగా మారిపోతుంది. వేగంగా వీచే గాలులు ఆ పొట్టును ఒకచోటి నుంచి మరోచోటికి తీసుకుపోతుంటాయి. సుడిగాలి వచ్చినప్పుడు ఆ గడ్డి పరకలు గిరగిరా తిరుగుతూ, విలవిల్లాడుతాయి. ప్రాపంచిక జీవితం కూడా ఇంతే. ఈ ప్రాపంచిక వైభవాలు, ఆస్తిపాస్తులు, ఆలుపిల్లలు, అలంకారాలు నశ్వరమైనవి. ఒక పెనుగాలికో, ఒక ఉప్పెనకో, ఒక ఉధృతమైన వరదకో, ఒక భూకంపానికో, ఒక ప్రకృతి ప్రకోపానికో గురైనప్పుడు సర్వనాశనమైపోతాయి.

46 సిరిసంపదలైనా, సంతానమైనా ప్రాపంచిక జీవితానికి అలంకారం మాత్రమే.[77] అయితే మిగిలివుండే సత్కార్యాలు నీ ప్రభువు దగ్గర ప్రతిఫలం రీత్యా మేలైనవి. అత్యుత్తమం కాగలవని ఆశించబడేవి అవే.[78]

اَلْمَالُ وَالْبَنُوْنَ زِيْنَةُ الْحَيٰوةِ الدُّنْيَا ۚ وَالْبٰقِيٰتُ الصّٰلِحٰتُ خَيْرٌ عِنْدَ رَبِّكَ ثَوَابًا وَّخَيْرٌ اَمَلًا ﴿46﴾

47 మేము పర్వతాలను నడిపిస్తాము,[79] నువ్వు ఆ రోజున భూమిని చదును చేయబడి ఉన్నట్లుగా చూస్తావు. జనులందరినీ మేము (ఒకచోట) సమీకరిస్తాము. వారిలో ఏ ఒక్కరినీ వదలి పెట్టము.[80]

وَيَوْمَ نُسَيِّرُ الْجِبَالَ وَتَرَى الْاَرْضَ بَارِزَةً ۙ وَّحَشَرْنٰهُمْ فَلَمْ نُغَادِرْ مِنْهُمْ اَحَدًا ﴿47﴾

48 వారంతా నీ ప్రభువు సమక్షంలో వరుసగా[81] నిలబెట్టబడతారు. "నిశ్చయంగా – మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించినట్లుగానే మీరు మా వద్దకు వచ్చేశారు. కాని మీరు మాత్రం, మేమెన్నటికీ మీ కోసం వాగ్దాన సమయం నిర్ధారించము అనే తలపోసేవారు."

وَعُرِضُوْا عَلٰى رَبِّكَ صَفًّا ۗ لَقَدْ جِئْتُمُوْنَا كَمَا خَلَقْنٰكُمْ اَوَّلَ مَرَّةٍۢ ۚ بَلْ زَعَمْتُمْ اَلَّنْ نَّجْعَلَ لَكُمْ مَّوْعِدًا ﴿48﴾

వాస్తవానికి ఇవన్నీ ఆ ఏకైక ఆరాధ్యుని అధీనంలో ఉన్నాయి. ఆయన అధికారానికి లోబడి ఉన్నాయి. ప్రాపంచిక జీవితపు ఈ వాస్తవికతను అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావించాడు (యూనుస్–25; జుమర్ – 21; హదీద్ – 50 మొదలగునవి).

77. తమ ప్రాపంచిక సిరిసంపదలను, ఆలుబిడ్డలను, కులగోత్రాలను, తాతముత్తాతల ఘనకార్యాలను చూసుకుని మురిసిపోయేవారికి ఈ ఆయతు గుణపాఠం వంటిది. ఇవన్నీ క్షణభంగురమైన ప్రాపంచిక జీవితపు తాత్కాలిక అందాలు మాత్రమే. పరలోకంలో ఇవేమీ పనికిరావు. పరలోకంలో పనికివచ్చేవీ, ఆదుకునేవి సత్కార్యాలే.

78. ఇంతకీ ఆ మిగిలి ఉండే సత్కార్యాలు (బాఖియాతుస్సాలిహాత్) ఏవి? నమాజ్ అని కొందరు, దైవస్తోత్రం అని కొందరు, దేవుని పవిత్రతను కొనియాడటమని కొందరు, ఇతర సత్కార్యాలని కొందరు రకరకాలుగా వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఇవన్నీ 'సత్కార్యాల'లో అంతర్లీనమై ఉన్నాయి. విధ్యుక్త ధర్మాలు (ఫరాయజ్), తప్పనిసరిగా చేయాల్సిన పనులు (వాజిబాత్), ప్రవక్త సంప్రదాయాలు (సునన్), స్వచ్ఛంద ఆరాధనలు (నవాఫిల్) – ఇవన్నీ బాఖియాతు స్సాలిహాత్‌లో అంతర్భాగమే. అంతేకాదు, నిషిద్ధాంశాలకు దూరంగా ఉండటం కూడా సత్కార్యాలుగానే పరిగణించబడతాయి. వాటికి కూడా పుణ్యం లభిస్తుంది.

79. ప్రళయదినాన పరిస్థితి ఎంత భయానకంగా ఉంటుందో ఇక్కడ క్లుప్తంగా చెప్పబడింది. పర్వతాలను నడిపించటమంటే అవి తమ తమ స్థానాలలో ఉండవు. వాటిని దూదిపింజల్లా ఎగురవేస్తాము. అవి గాలిలో తేలియాడుతూ ఉంటాయి. "పర్వతాలు ఏకిన రంగు రంగుల ఉన్ని మాదిరిగా అయిపోతాయి" (అల్ ఖారియ – 5). మరిన్ని వివరాల కోసం చూడండి: తూర్ – 9, 10; నమల్ : 88; తాహా : 105 – 107) పర్వతాల్లాంటి భారీ వస్తువులే నేల నుండి పునాదులతో సహా పెకలించివేయ బడినప్పుడు ఇళ్లు, చెట్లు, తదితర కట్టడాలు మాత్రం ఎలా నిలబడగలుగుతాయి? అందుకే "నువ్వు భూమిని చదునైన ప్రదేశంలా చూస్తావు" అని అనబడింది.

80. అంటే తొలివారినీ – తుదివారినీ, చిన్నవారినీ – పెద్దవారినీ, విశ్వాసులను – అవిశ్వాసులనూ అందరినీ సమావేశ పరుస్తాము. ఏ ఒక్కడూ ఆ రోజు మా పట్టునుంచి తప్పించుకోలేడు. మరే ఒక్కడూ సమాధి నుంచి బయటపడి వేరేచోటికి పారిపోలేడు.

وَوُضِعَ الْكِتٰبُ فَتَرَى الْمُجْرِمِيْنَ مُشْفِقِيْنَ
مِمَّا فِيْهِ وَيَقُوْلُوْنَ يٰوَيْلَتَنَا مَالِ هٰذَا الْكِتٰبِ
لَا يُغَادِرُ صَغِيْرَةً وَّلَا كَبِيْرَةً اِلَّآ اَحْصٰىهَا ۚ
وَوَجَدُوْا مَا عَمِلُوْا حَاضِرًا ۗ وَلَا يَظْلِمُ رَبُّكَ
اَحَدًا ﴿49﴾

**49** కర్మల పత్రాలు (వారి) ముందు ఉంచబడతాయి. నేరస్తులు ఆ పత్రాల్లో రాయబడి ఉన్నదాన్ని చూసి భీతిల్లుతూ, "అయ్యో! మా దౌర్భాగ్యం! ఇదేమి పత్రం? ఇది ఏ చిన్న విషయాన్నీ, ఏ పెద్ద విషయాన్నీ వదలకుండా నమోదు చేసిందే?!" అని వాపోవటం నువ్వు చూస్తావు. తాము చేసినదంతా వారు ప్రత్యక్షంగా చూసుకుంటారు. నీ ప్రభువు ఎవరికీ అన్యాయం చేయడు.

وَاِذْ قُلْنَا لِلْمَلٰٓئِكَةِ اسْجُدُوْا لِاٰدَمَ
فَسَجَدُوْٓا اِلَّآ اِبْلِيْسَ ۗ كَانَ مِنَ الْجِنِّ
فَفَسَقَ عَنْ اَمْرِ رَبِّهٖ ۗ اَفَتَتَّخِذُوْنَهٗ
وَذُرِّيَّتَهٗٓ اَوْلِيَآءَ مِنْ دُوْنِيْ وَهُمْ لَكُمْ
عَدُوٌّ ۗ بِئْسَ لِلظّٰلِمِيْنَ بَدَلًا ﴿50﴾

**50** ఆదమ్ ముందు సాష్టాంగపడమని మేము దూతలకు ఆజ్ఞాపించినప్పుడు, ఒక్క ఇబ్లీసు తప్ప అందరూ సాష్టాంగపడ్డారు. అతడు జిన్నాతుల కోవకు చెందినవాడు.[82] వాడు తన ప్రభువు ఆజ్ఞను జవదాటాడు.[83] అయినప్పటికీ మీరు నన్ను వదిలేసి, మీ అందరికీ శత్రువు అయినవాణ్ణీ,[84] వాడి సంతానాన్నీ మీ స్నేహితులుగా చేసుకుంటున్నారా? ఇటువంటి దుర్మార్గులకు లభించే ప్రతిఫలం ఎంత చెడ్డది![85]

مَآ اَشْهَدْتُّهُمْ خَلْقَ السَّمٰوٰتِ وَالْاَرْضِ
وَلَا خَلْقَ اَنْفُسِهِمْ ۖ وَمَا كُنْتُ مُتَّخِذَ
الْمُضِلِّيْنَ عَضُدًا ﴿51﴾

**51** నేను భూమ్యాకాశాలను సృష్టించినప్పుడుగానీ, స్వయంగా వీళ్ళను పుట్టించినపుడుగానీ వారిని అక్కడ ఉంచలేదు.[86] అపమార్గం పట్టించే వారిని నేను నా సహాయకులుగా చేసుకోను.[87]

81. ఒకే వరుసలో లేదా అనేక వరుసల్లో వారు దైవసమక్షంలో హాజరుపరచబడతారు.

82. షైతాన్ దైవదూతల కోవకు చెందినవాడు కాదని దీన్నిబట్టి స్పష్టమైపోయింది. వాడే గనక దైవదూతల్లోని వాడై ఉంటే దైవాజ్ఞను జవదాటేవాడు కాడు. ఎందుకంటే దైవదూతలు ఎట్టి పరిస్థితిలోనూ దైవాజ్ఞను ధిక్కరించరు. "వారు అల్లాహ్ ఆజ్ఞకు ఎదురు చెప్పరు. వారికి ఆజ్ఞాపించిన దానిని మాత్రమే చేస్తారు." (తహ్రీమ్ – 6). ఇక్కడ ఒక ప్రశ్న ఉత్పన్నమవటం సహజం. మరతను దైవదూత కానప్పుడు, దైవాజ్ఞ అతనికి ఎలా వర్తిస్తుంది? దేవుడు తన దైవదూతల్ని మాత్రమే సంబోధించి ఈ మేరకు ఆజ్ఞాపించాడు కదా!? దీనికి సమాధానంగా 'రూహుల్ మఆనీ' గ్రంథకర్త ఏమంటున్నారంటే వాడు అసలు జిన్నాతుల జాతికి చెందినవాడే అయినప్పటికీ దైవదూతల వెంట ఉండేవాడు. అందుకే "ఆదమ్‌కు సాష్టాంగపడండి" అన్న ఆజ్ఞ షైతాన్‌కు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే "సజ్దా చేయమని నేను ఆజ్ఞాపిస్తే నువ్వు ఎందుకు సజ్దా చేయలేదు" అని అల్లాహ్ అతన్ని నిలదీయటం గమనార్హం.

83. అరబీలో **'ఫిస్ఖ్'** అనే పదం ప్రయోగించబడింది. ఫిస్ఖ్ అంటే వెడలటం అని అర్థం. ఎలుక తన బిలం నుండి బయటికి వెళ్ళటాన్ని అరబీలో "ఫసఖతిల్ ఫారతు మిన్ హుజ్‌రిహా" అని అనటం జరుగుతుంది. షైతాన్ కూడా వినయపూర్వకంగా ఆదమ్‌కు సజ్దా చేసేందుకు నిరాకరించి, తన ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించాడు.

84. మీరు అల్లాహ్‌ను వదలి మీ పితామహుడైన ఆదమ్ (అలైహిస్సలాం)పై అసూయ చెందినవాణ్ణి, అడుగడుగునా మీకు బద్ధవిరోధిగా ప్రవర్తిస్తున్నవాణ్ణి, మీ ప్రభువుకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్నవాణ్ణి, వాడి మానసపుత్రులను అనుసరించటం ఎంతవరకు సబబు?

85. "దుర్మార్గులు ఎంత దారుణమైన ప్రత్యామ్నాయాన్ని అవలంబించారు?" అన్న భావం కూడా ఈ వాక్యానికి వస్తుంది.

52 "నాకు భాగస్వాములని మీరు భావించిన (వారెక్కడ?) వారిని పిలవండి" అని ఆయన చెప్పిన రోజున వారు (తమ మిథ్యా దైవాలను) పిలుస్తారు. కాని వారిలో ఏ ఒక్కరూ సమాధానం ఇవ్వరు. మేము వారి మధ్యన వినాశాన్ని ఏర్పరుస్తాము.[88]

وَيَوْمَ يَقُولُ نَادُوا شُرَكَاءِيَ الَّذِينَ زَعَمْتُمْ فَدَعَوْهُمْ فَلَمْ يَسْتَجِيبُوا لَهُمْ وَجَعَلْنَا بَيْنَهُم مَّوْبِقًا ﴿٥٢﴾

53 అపరాధులు నరకాన్ని చూడగానే, తాము పడవలసి ఉన్నది అందులోనేనని అర్థం చేసుకుంటారు. దాన్నుంచి తప్పించుకునే మార్గం ఏదీ వారికి కనిపించదు.[89]

وَرَأَى الْمُجْرِمُونَ النَّارَ فَظَنُّوا أَنَّهُم مُّوَاقِعُوهَا وَلَمْ يَجِدُوا عَنْهَا مَصْرِفًا ﴿٥٣﴾

54 మేము ఈ ఖుర్‌ఆనులో ప్రజల కోసం పలు పలు విధాలుగా ఉపమానాలన్నింటినీ వివరించాము. కాని మానవుడు అందరి కన్నా ఎక్కువ తగవులమారి.[90]

وَلَقَدْ صَرَّفْنَا فِي هَٰذَا الْقُرْآنِ لِلنَّاسِ مِن كُلِّ مَثَلٍ ۚ وَكَانَ الْإِنسَانُ أَكْثَرَ شَيْءٍ جَدَلًا ﴿٥٤﴾

55 ప్రజల వద్దకు మార్గదర్శకత్వం వచ్చేసిన తరువాత కూడా వారు విశ్వసించకుండా, క్షమాభిక్షకై తమ ప్రభువును వేడు కోకుండా వారిని ఆపిన విషయం ఒక్కటే – అదేమిటంటే, గత

وَمَا مَنَعَ النَّاسَ أَن يُؤْمِنُوا إِذْ جَاءَهُمُ الْهُدَىٰ وَيَسْتَغْفِرُوا رَبَّهُمْ إِلَّا أَن تَأْتِيَهُمْ سُنَّةُ

అంటే వారు దైవవిధేయతను, ఆయనతో మైత్రిని కాదని షైతాన్ అడుగుజాడల్లో నడవటం, అతనితో దోస్తీ చేయటం బహుచెడ్డ ప్రత్యామ్నాయ మార్గం. దుర్మార్గుల ఈ పోకడ క్షమించరానిది.

86. అంటే భూమ్యాకాశాలను నిర్మించేటప్పుడుగానీ, లేదా ఖుద్దుగా ఈ షైతాన్ మూకను సృజించేటప్పుడుగానీ మేము వీళ్లను పిలిచి సంప్రతించలేదు. వారి సహాయ సహకారాలు కూడా పొందలేదు. వారసలు ఆ సమయంలో (సాక్షులుగా) లేరు కూడా. మరలాంటప్పుడు మీరు ఈ షైతానును, వాడి మానసపుత్రులను ఎందుకు ఆరాధిస్తున్నారు? వారి పాద చిహ్నాలలో ఎందుకు నడుస్తున్నారు?? నన్ను ఆరాధించటంలో, నాకు విధేయులై ఉండటంలో మీకు అవరోధంగా ఉన్న విషయం ఏమిటీ??? వాస్తవానికి ఈ సృష్టితాలన్నింటికీ కర్తను నేనేకదా! అని అల్లాహ్ చెబుతున్నాడు.

87. ఒకవేళ నేను ఎవరినయినా నా సహాయకులుగా తీసుకున్నా నా దాసులను పెడత్రోవ పట్టించి, నా ప్రసన్నతా మార్గానికి దూరం చేసేవారిని, స్వర్గ లోకానికి దూరం చేసేవారిని సహాయకులుగా తీసుకుంటానా?

88. **"మౌబిఖున్"** అంటే తెర, అవరోధం, అడ్డు అన్న అర్థాలు కూడా వస్తాయి. అంటే వారికీ – వారి మిథ్యా దైవాలకు మధ్య మేము అంతరాల అగాధాలను పెంచుతాము. వారిమధ్య శత్రుత్వం పెరుగుతుంది. వారు ఒండొకరిని కలుసుకునే అవకాశం లేకపోవటం వల్ల కూడా ఈ దూరాలు పెరుగుతాయి. అది నరకంలో ఒకలాంటి చీము నెత్తుటి జలసంధి అని కొందరు అభిప్రాయపడ్డారు. మరి కొంతమంది దాన్ని వినాశంగా పేర్కొన్నారు. అంటే ఈ బహుదైవారాధకులకు – వారి బూటకపు దేముళ్లకు మధ్య వినాశకర సామగ్రి అడ్డంకిగా ఉంటుంది.

89. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం అవిశ్వాసి 40 ఏళ్ల ప్రయాణానికి దూరంగా ఉండగానే, నరకమే తన గమ్యస్థానం అని అర్థం చేసేసుకుంటాడు (ముస్నదె అహ్మద్: సంపుటి – 3, పేజీ – 75).

90. మనిషికి సత్యమార్గాన్ని బోధపరచటానికి మేము ఈ ఖుర్‌ఆన్ గ్రంథంలో విభిన్న పద్ధతులను అవలంబించాము. ఉపదేశం, జ్ఞాపనం, ఉపమానాలు, నిదర్శనాలు, సంఘటనలు, ప్రమాణాలు మొదలైన విధానాలను అనుసరించాము. ఒకే విషయాన్ని పలురీతుల్లో విశదపరచాము. కాని మానవుడు పేచీకి పెదబాబు లాంటివాడు. పద్దాక పిడివాదానికి

الْأَوَّلِينَ أَوْ يَأْتِيَهُمُ الْعَذَابُ قُبُلًا ﴿٥٥﴾

కాలంలోని ప్రజలకు ఎదురైన వ్యవహారమే తమకూ ఎదురవ్వాలనీ[91] లేదా ప్రత్యక్షంగా తమ ముందుకు శిక్ష రావాలని వారు నిరీక్షించటం.[92]

وَمَا نُرْسِلُ الْمُرْسَلِينَ إِلَّا مُبَشِّرِينَ وَمُنذِرِينَ ۚ وَيُجَادِلُ الَّذِينَ كَفَرُوا بِالْبَاطِلِ لِيُدْحِضُوا بِهِ الْحَقَّ ۖ وَاتَّخَذُوا آيَاتِي وَمَا أُنذِرُوا هُزُوًا ﴿٥٦﴾

**56** మేము ప్రవక్తలను శుభవార్తలను అందజేయటానికి, హెచ్చరికలు చేయటానికి మాత్రమే పంపిస్తాము. అవిశ్వాసులు అసత్యం ఆధారంగా వాదులాడతారు. దాని ద్వారా సత్యాన్ని ఖండించటానికి (ప్రయత్నిస్తారు.) వారు నా ఆయతులను, వారికి చేస్తున్న హెచ్చరికలను ఆషామాషీగా తీసుకున్నారు.[93]

وَمَنْ أَظْلَمُ مِمَّن ذُكِّرَ بِآيَاتِ رَبِّهِ فَأَعْرَضَ عَنْهَا وَنَسِيَ مَا قَدَّمَتْ يَدَاهُ ۚ إِنَّا جَعَلْنَا عَلَىٰ قُلُوبِهِمْ أَكِنَّةً أَن يَفْقَهُوهُ وَفِي آذَانِهِمْ وَقْرًا ۖ وَإِن تَدْعُهُمْ إِلَى الْهُدَىٰ فَلَن يَهْتَدُوا إِذًا أَبَدًا ﴿٥٧﴾

**57** తన ప్రభువు వచనాల ద్వారా హితబోధ చేసినప్పటికీ, విముఖత చూపి, తన చేతులతో ముందుగా చేసి పంపుకున్న దానినే మరచిపోయిన వానికన్నా ఎక్కువ దుర్మార్గుడెవడుంటాడు? వారు దానిని (ఖుర్ఆనును) అర్థం చేసుకోకుండా మేము వారి హృదయాలపై తెరలు వేసేశాము. వారి చెవులకు చెవుడు కలిగించాము. నువ్వు సన్మార్గం వైపుకు వారిని పిలుస్తూ ఉన్నప్పటికీ, వారు ఎన్నటికీ సన్మార్గం పొందేవారు కారు.[94]

---

దిగుతాడు. అంచేత హితోపదేశం తొందరగా అతని బుర్రకెక్కదు. ఆధారాలు, నిదర్శనాలు అతని మనోనేత్రాన్ని తెరిపించవు.

91. అంటే; దైవవాణిని బాహాటంగా త్రోసిపుచ్చుతున్న తమకు, తమ పూర్వీకులకు ఎదురైన చేదు అనుభవం లాంటిది ఎందుకు ఎదురు కావటం లేదూ?! అన్నది వారి అనుమానం.

92. అంటే ఈ రెండు చేదు అనుభవాలను చవిచూసిన పిదప "విశ్వసించవచ్చు" అన్నది మక్కా అవిశ్వాసుల అభిమతం. కాని మతి చలించిన వారు మాత్రమే ఇలాంటి కాకిలెక్కలు వేస్తారు. శిక్షను చవిచూసిన పిమ్మట విశ్వసించినా అది లాభదాయకం కాజాలదని వారికి తెలియదా? శిక్ష అవతరించిన తరువాత అసలు తాము మిగిలి ఉంటే కదా విశ్వసించడానికి?!

93. అల్లాహ్ ఆయతులను పరిహసించటమనేది మామూలు విషయం కాదు. అది అత్యంత నీచమైన చేష్ట. అలాగే అసత్యం ఆధారంగా తమ వాగ్ధాటిని ప్రదర్శించి సత్యాన్ని అసత్యంగా నిరూపించే యత్నం చేయటం అత్యంత ఏహ్యమైన పని. ఇలాంటి అసత్య పూరిత ఆర్భాటాలతోనే అవిశ్వాసులు దైవప్రవక్తలను ధిక్కరించి, "నువ్వూ మాలాంటి ఒక మామూలు మనిషివే కదయ్యా! (యాసీన్ – 15). మేము నిన్ను ప్రవక్త అని ఎలా ఒప్పుకునేది? అని అనేవారు. మూలంలో **'లియుద్హిజూ' (لِيُدْحِضُوا)** అనే పదం వాడబడింది. 'దహజున్' దీని మూలపదం. జారటం అని దీనికి అర్థం. 'అతని కాలుజారింది' అని చెప్పటానికి పూర్వం అరబ్బీలో 'దహజత్ రిజ్లుహూ' అనేవారు. కాలక్రమంలో ఈ పదం 'ఏదయినా వస్తువు తొలగిపోవటం', 'అసత్యంగా తేలిపోవటం' అన్న అర్థాల్లో ఉపయోగించబడసాగింది. ఈ విధంగా అద్హజ, యుద్హిజు అన్న పదాలకు అసత్యంగా మార్చటం అన్న అర్థం వస్తోంది. (ఫత్హుల్ ఖదీర్).

94. ప్రభువు ఆదేశాలను త్రోసిపుచ్చి, తమ స్వయంకృతాలను మరచిపోయి, తమ ఆత్మలకు తీరని ద్రోహం చేసుకున్న

58 నీ ప్రభువు క్షమాగుణం కలవాడు, దయాశీలి. వారి చేష్టలకు శిక్షగా ఆయన గనక వారిని పట్టుకున్నట్లయితే, వారిని తొందర గానే శిక్షించి ఉండేవాడు. అసలు విషయం ఏమిటంటే వారి కోసం ఒక వాగ్దాన సమయం నిర్ధారితమై ఉంది. దాన్నుంచి తప్పించుకునిపోయే చోటేదీ వారికి దొరకదు.[95]

وَرَبُّكَ الْغَفُورُ ذُو الرَّحْمَةِ ۖ لَوْ يُؤَاخِذُهُم بِمَا كَسَبُوا لَعَجَّلَ لَهُمُ الْعَذَابَ ۚ بَل لَّهُم مَّوْعِدٌ لَّن يَجِدُوا مِن دُونِهِ مَوْئِلًا ﴿٥٨﴾

59 తమ దురాగతాల మూలంగా మేము సర్వనాశనం చేసిన వారి పట్టణాలు ఇవే. వీరి వినాశానికి కూడా మేము ఒక గడువును నిర్ధారించి పెట్టాము.[96]

وَتِلْكَ الْقُرَىٰ أَهْلَكْنَاهُمْ لَمَّا ظَلَمُوا وَجَعَلْنَا لِمَهْلِكِهِم مَّوْعِدًا ﴿٥٩﴾

60 “ఏళ్ళ తరబడి నడవవలసి వచ్చినా సరే,[97] రెండు సముద్రాలు కలిసే సాగర సంగమానికి[98] చేరుకోనంతవరకూ నేను నడుస్తూనే ఉంటాను” అని మూసా తన వెంటనున్న యువకునితో[99] చెప్పి నప్పుడు (జరిగిన సంఘటనను కాస్త జ్ఞప్తికి తెచ్చుకోండి).

وَإِذْ قَالَ مُوسَىٰ لِفَتَاهُ لَا أَبْرَحُ حَتَّىٰ أَبْلُغَ مَجْمَعَ الْبَحْرَيْنِ أَوْ أَمْضِيَ حُقُبًا ﴿٦٠﴾

కారణంగా వారి హృదయాలపై తెరలు కప్పబడ్డాయి. వారి చెవుల్లో బరువు వేయబడింది. తత్ఫలితంగా వారు ఖుర్ఆన్‌ను వినలేరు, దానిపై చింతన చేయలేరు, సన్మార్గం పొందలేరు. సన్మార్గం వైపుకు రమ్మని ఎంతగా ప్రాధేయపడినా అది వారి బుర్రకెక్కదు.

95. దాసులు చేసిన పాపాలపై వెంటనే పట్టుకోకుండా వారికి కొంత విడుపు ఇవ్వటం దేవుని దయాస్వభావానికి, క్షమాగుణానికి తార్కాణం. ఒకవేళ ఈ గడువు గనక ఆయన ఇవ్వకుండా ఉంటే తమ అకృత్యాలకుగాను ఒక్కొక్కరూ ఉచ్చులో బిగుసుకుంటూ పోయేవారు. ఆయన అందరికీ గడువు ఇచ్చాడు గనకనే మానవ మనుగడ కొనసాగుతోంది. అయితే దేవుడు రాసిపెట్టిన గడువు ముగిసినంతనే, జరగవలసింది జరిగితీరుతుంది. దాన్ని అడ్డుకునే శక్తి ఎవరికీ ఉండదు. దాన్నుంచి బయటపడగలిగే మార్గం కూడా ఉండదు. **'మౌయిల్'** అంటే శరణు. తప్పించుకునే మార్గం.

96. ఆద్, సమూద్ జాతులను, దైవప్రవక్త షుఐబు (అలైహి), లూత్ (అలైహి) జాతులను వారి దుర్మార్గాల కారణంగా కఠినంగా శిక్షించాము. అరేబియాలోని హిజాజ్ క్షేత్రంలో, దాని దరిదాపుల్లోనే ఈ పట్టణాల అవశేషాలున్నాయి. మా శిక్షను పంపేముందు వారికి ఉపదేశించటం జరిగింది. వారికి ఒక వ్యవధి కూడా ఇవ్వటం జరిగింది. కాని వారిలో మార్పు రాకపోవటంతో, వారి దుర్మార్గాలు మానవ మనుగడకే ముప్పుగా పరిణమించటంతో వారిపై మా కొరడాను ఝుళిపించవలసివచ్చింది. వారి ముగింపును భావి తరాలకు ఒక గుణపాఠంగా చేశాము.

అంతిమ దైవప్రవక్త (సఅసం)ను ధిక్కరిస్తున్న మక్కావాసులను బోధపరచటానికి ఇవ్వబడిన ఉదాహరణ ఇది. ఓ మక్కా అవిశ్వాసులారా! ఈనాడు మీకు గడువు ఇవ్వబడుతున్నదంటే మిమ్మల్ని నిలదీసి అడిగేవాడెవడూ లేడని అనుకోకండి! ప్రతి వ్యక్తికీ, ప్రతి సమూహానికీ, ప్రతి జాతికీ దేవుడు కొంత సమయం ఇస్తాడు. మీలో పరివర్తన వస్తేసరి. ఒకవేళ మీరు గనక మీ తిరస్కారవైఖరిని మానుకోకపోతే, వెనుకటి జాతులకు పట్టిన గతే మీకూ పడుతుంది. జాగ్రత్త!

97. **'హుఖుబ్'** అంటే 70 లేక 80 సంవత్సరాలని ఒక అర్థం. 'ఎంతకాలమైనా సరే' అనే అర్థం కూడా వస్తుంది. రెండో భావంలోనే దీన్ని తీసుకోవటం జరిగింది. అంటే నేను సాగర సంగమ స్థలానికి చేరుకునే వరకూ ప్రయాణం చేస్తూనే ఉంటాను. దాని కోసం ఎంతకాలం పట్టినాసరే నా ప్రయాణాన్ని ఆపను అన్నది హజ్రత్ మూసా (అలైహిస్సలాం)

61 తీరా వారిద్దరు సాగర సంగమానికి చేరుకున్నాక, అక్కడ తమ చేపను మరచి పోయారు. అదేమో సొరంగం మాదిరిగా దారి చేసుకుని సముద్రంలోకి జారుకుంది.

فَلَمَّا بَلَغَا مَجْمَعَ بَيْنِهِمَا نَسِيَا حُوتَهُمَا فَاتَّخَذَ سَبِيلَهُ فِي الْبَحْرِ سَرَبًا ﴿٦١﴾

62 వారుభయులూ ముందుకు సాగిపోయిన తరువాత మూసా తన (వెంటనున్న) యువకుణ్ణి ఉద్దేశించి, "మా ఉదయ భోజనం తీసుకురా. నిజంగానే ఈ ప్రయాణంలో చాలా ప్రయాస పడాల్సి వచ్చింది" అన్నాడు.

فَلَمَّا جَاوَزَا قَالَ لِفَتَاهُ آتِنَا غَدَاءَنَا لَقَدْ لَقِينَا مِنْ سَفَرِنَا هَٰذَا نَصَبًا ﴿٦٢﴾

63 దానికతను, "చూశారా (ఎంత పనయిందో)! మనం రాతి బండకు ఆనుకుని విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు నేను చేప సంగతి మరచేపోయాను. అసలేం జరిగిందో మీకు చెప్పకుండా షైతానే నన్ను మరుపుకు లోను చేశాడు. ఆ చేప చాలా విచిత్రంగా సముద్రంలోకి దారి చేసుకుని వెళ్ళిపోయింది" అని వివరించాడు.[100]

قَالَ أَرَأَيْتَ إِذْ أَوَيْنَا إِلَى الصَّخْرَةِ فَإِنِّي نَسِيتُ الْحُوتَ وَمَا أَنْسَانِيهُ إِلَّا الشَّيْطَانُ أَنْ أَذْكُرَهُ وَاتَّخَذَ سَبِيلَهُ فِي الْبَحْرِ عَجَبًا ﴿٦٣﴾

పలుకుల అంతరార్థం. ఇంతకీ ఆయన ఈ సుదీర్ఘ ప్రయాణానికి ఎందుకు పూనుకున్నారు? ఏ లక్ష్యం కోసం ఆయన ఇంత ప్రయాస పడవలసి వచ్చింది?? అన్న ప్రశ్నలు ఇక్కడ ఉదయిస్తాయి.

అసలు విషయం ఏమిటంటే ఆయన ఒక సందర్భంలో ఒక పృచ్ఛకుని ప్రశ్నకు బదులిస్తూ, "ప్రస్తుతం నా అంతటి జ్ఞాని లోకంలో ఎవడూ లేడు" అని అన్నారు. అల్లాహ్‌కు ఈ మాట నచ్చలేదు. "నీకంటే పెద్ద జ్ఞాని అయిన నా దాసుడొకడు (ఖిజర్) ఉన్నాడ"ని అల్లాహ్ 'వహీ' ద్వారా ఆయనకు తెలియపరచాడు. "ఓ అల్లాహ్! నేనాయన్ని ఎలా కలుసుకోగలను?" అని మూసా విన్నవించుకోగా, "రెండు సముద్రాలు కలుసుకునే స్థలంలో అతనుంటాడు. చేపను తీసుకెళ్ళండి. అది మీ తట్టలోనుంచి జారుకుని పోయినచోటే మీ గమ్యస్థానం అని తెలుసుకోండి" అని అల్లాహ్ సెలవిచ్చాడు (బుఖారీ – అల్ కహఫ్ సూరా). దైవాజ్ఞానుసారం ఆయన (అలైహిస్సలాం) ఒక చేపను కూడా తీసుకుని పయనమయ్యారు.

98. ఇంతకీ ఆ స్థలం ఎక్కడుంది? ఈ విషయమై ఖచ్చితమైన సమాచారం ఎవరివద్దా లేదు. అయితే ఆనాటి అక్కడి భౌగోళిక స్వరూపాన్ని బట్టి పండితులు సినాయ్ ద్వీపానికి దక్షిణ ప్రాంతాన ఉన్న అఖబా, సూయజ్ జల సంధులే ఆ సాగరాలనీ, అవి రెండూ ఒకచోట కలిసి, ఎర్ర సముద్రంలో విలీనమవుతాయనీ, బహుశా ఆ స్థలానికే దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) పయనమై ఉంటారని అభిప్రాయపడ్డారు. ఇతర వ్యాఖ్యాతలు వేసిన అంచనాల కన్నా ఈ అభిప్రాయమే అక్కడి నైసర్గిక స్వరూపంతో సమన్వయం చెందేలా ఉంది.

99. **'యువకుడు'** అంటే హజ్రత్ యూషా బిన్ నూన్ (అలైహిస్సలాం) అన్నమాట. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) మరణానంతరం ఆ అబ్బాయి ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడు.

100. అంటే ఆ చేప సజీవమై సముద్రంలోకి వెళ్ళిపోయింది. అల్లాహ్ దాని కోసం సముద్రంలో సొరంగం లాంటి దారిని ఏర్పరచాడు. ఆ చేప సముద్రంలోకి దూకటం, సొరంగం లాంటి దారి దాని కోసం సుగమం కావటం హజ్రత్ యూషా (అలైహిస్సలాం) కళ్లారా చూశారు. కాని ఆ సంగతి మూసాకు చెప్పటం మాత్రం మరచి పోయారు. విశ్రాంతి తీసుకున్న తరువాత వారిద్దరూ ఆ స్థలం నుంచి ముందుకు సాగిపోయారు. పగలు, రేయి నిరాఘాటంగా ప్రయాణించారు. మరునాడు ఉదయం హజ్రత్ మూసా (అలైహిస్సలాం) బాగా అలసిపోయారు. ఆకలేసింది. "టిఫిన్

64 “(అరె!) మనం వెతుక్కుంటూ వచ్చింది ఆ స్థలం కోసమే కదా!” అని మూసా అన్నాడు. ఆ తరువాత వారిద్దరూ తమ పాదచిహ్నాల ఆధారంగా వెనక్కి తిరిగి వచ్చారు.[101]

قَالَ ذَٰلِكَ مَا كُنَّا نَبْغِ ۚ فَارْتَدَّا عَلَىٰٓ ءَاثَارِهِمَا قَصَصًا ﴿٦٤﴾

65 అక్కడ వారు మా దాసులలోని ఒక దాసుణ్ణి[102] కనుగొన్నారు. మేము అతనికి మా వద్ద నుంచి ఓ ప్రత్యేక కారుణ్యాన్ని ప్రసాదించి ఉన్నాము.[103] ఇంకా మా వద్ద నుంచి అతనికి ఓ ప్రత్యేక విద్యను[104] నేర్పి ఉన్నాము.

فَوَجَدَا عَبْدًا مِّنْ عِبَادِنَآ ءَاتَيْنَٰهُ رَحْمَةً مِّنْ عِندِنَا وَعَلَّمْنَٰهُ مِن لَّدُنَّا عِلْمًا ﴿٦٥﴾

66 మూసా అతనితో, “మీకు నేర్పబడిన మంచి విద్యను మీరు నాకు నేర్పడానికి, నేను మీ వెంట ఉండవచ్చా?” అని అభ్యర్థించాడు.

قَالَ لَهُۥ مُوسَىٰ هَلْ أَتَّبِعُكَ عَلَىٰٓ أَن تُعَلِّمَنِ مِمَّا عُلِّمْتَ رُشْدًا ﴿٦٦﴾

67 దానికతను, “మీరు నా సహచర్యంలో ఉంటూ ఏమాత్రం ఓపిక పట్టలేరు.

قَالَ إِنَّكَ لَن تَسْتَطِيعَ مَعِىَ صَبْرًا ﴿٦٧﴾

---

వడ్డించు నాయనా!” అని తన శిష్యుణ్ణి కోరారు. ఆ యువకుడికి చేప సంగతి అప్పుడుగాని జ్ఞాపకం రాలేదు. “తమరికి చెప్పటం మరిచిపోయాను. మనం విశ్రాంతి తీసుకున్న ఆ స్థలం వద్దనే చేప బ్రతికి సముద్రంలోకి వెళ్ళిపోయింది. చిత్రవిచిత్రమైన పద్ధతిలో అది తన మార్గాన్ని తీసుకుంది. ఆ సంగతి మీకు చెప్పాలనే అనుకున్నాను. కాని షైతాను నన్ను పరధ్యానానికి లోను చేశాడు” అని చెప్పాడు.

101. ‘ఓ దైవదాసుడా! మనం వెళ్ళాల్సింది అక్కడికే కదా!’ అంటూ హజ్రత్ మూసా (అ) తన అడుగు జాడలను చూసుకుంటూ తిరోన్ముఖులయ్యారు. ఆ విధంగా వారు ఉభయులూ అంతకుముందు ఆగిన స్థలానికి–సాగర సంగమానికి – చేరుకున్నారు. ‘ఖససా’ అంటే వెంటపడటం, వెనుక నడవటం అని అర్థం. అడుగు జాడలను చూసుకుంటూ వాటి వెనుక నడుచుకుంటూ వెళ్ళారని దాని భావం.

102. **‘ఒక దాసుడు’** అంటే హజ్రత్ ఖిజర్ అని భావం. ప్రామాణిక హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ‘ఖిజర్’ అంటే ‘ఆకుపచ్చని’ అని అర్థం. ఒకసారి ఆ పుణ్యపురుషుడు తెల్లని, నున్నని నేలపై కూర్చోగా, ఆ భూప్రదేశం పచ్చగా మారి కళకళలాడసాగింది. అందుకే ఆయనకు ఖిజర్ అనే పేరు పడింది (సహీహ్ బుఖారీ–అల్ కహఫ్ సూరా వ్యాఖ్యానం).

103. అల్లాహ్ తన ప్రత్యేక దాసునికి ప్రసాదించిన ఆ “ప్రత్యేక కారుణ్యం” ఏమై ఉంటుంది? బహుశా ప్రవక్తపదవి కావచ్చునని చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. దేవుడు తన ప్రత్యేక దాసులకు అనుగ్రహించే ప్రత్యేక వరాలని మరికొంత మంది అభిప్రాయపడ్డారు.

104. ప్రవక్త పదవితో పాటు, మూసా (అలైహిస్సలాం) లాంటి గొప్ప ప్రవక్తలకే ఇవ్వని విశేష జ్ఞానాన్ని, యుక్తినీ అల్లాహ్ ఖిజర్కు అనుగ్రహించాడు. కొంతమంది సూఫీ ప్రముఖులు ఈ సంఘటనను ఆధారంగా చేసుకుని, ప్రవక్తలు కాని వారికి కూడా దేవుడు ‘నిగూఢ జ్ఞానాన్ని’ ఇస్తాడనీ, గురువు లేకుండానే ప్రభువు కటాక్షంతో ఈ విద్య వరిస్తుందనీ, ఇది ఖుర్ఆన్ హదీసు రూపంలో ఉన్న షరీయతు పరిజ్ఞానానికి భిన్నమైనదని చెబుతారు. కాని ఈ వాదన ఏమాత్రం సరైంది కాదు. హజ్రత్ ఖిజర్కు ప్రసాదించిన ‘ప్రత్యేక విద్య’ గురించి అల్లాహ్ ఖుద్దుగా స్పష్టీకరించాడు. కాని

**68** “అయినా మీరు మీ జ్ఞానపరిధిలోకి తీసుకోని విషయంపై[105] ఓపిక పట్టడం మీ వల్ల ఎలా సాధ్యమవుతుంది?” అన్నాడు.

وَكَيْفَ تَصْبِرُ عَلَىٰ مَا لَمْ تُحِطْ بِهِۦ خُبْرًا ﴿٦٨﴾

**69** “అల్లాహ్ తలిస్తే మీరు నన్ను సహనశీలిగా పొందుతారు. ఏ విషయంలోనూ నేను మీ ఆజ్ఞను జవదాటను” అని (మూసా) సమాధానమిచ్చాడు.

قَالَ سَتَجِدُنِىٓ إِن شَآءَ ٱللَّهُ صَابِرًا وَلَآ أَعْصِى لَكَ أَمْرًا ﴿٦٩﴾

**70** “సరే! నా వెంట రావాలన్నదే మీ అభిలాష అయితే (బాగా గుర్తుంచుకోండి!) ఏ విషయం గురించైనాసరే నేను స్వయంగా మీతో ప్రస్తావించనంతవరకూ నన్నేమీ అడగకూడదు” అన్నాడతను.

قَالَ فَإِنِ ٱتَّبَعْتَنِى فَلَا تَسْـَٔلْنِى عَن شَىْءٍ حَتَّىٰٓ أُحْدِثَ لَكَ مِنْهُ ذِكْرًا ﴿٧٠﴾

**71** వారిద్దరూ బయలుదేరారు. చివరకు ఒక పడవలో పయనమైనప్పుడు అతను (ఖిజరు) దాని చెక్క పలకలను పగులగొట్టారు. దానికి మూసా, “ఇదేమిటీ, పడవ ప్రయాణీకులందరినీ ముంచేయటానికా వీటిని పగులగొట్టారు? మీరు చాలా ఘోరమైన పనికి ఒడిగట్టారు” అని చెప్పనే చెప్పేశాడు.[106]

فَٱنطَلَقَا حَتَّىٰٓ إِذَا رَكِبَا فِى ٱلسَّفِينَةِ خَرَقَهَا ۖ قَالَ أَخَرَقْتَهَا لِتُغْرِقَ أَهْلَهَا لَقَدْ جِئْتَ شَيْـًٔا إِمْرًا ﴿٧١﴾

**72** “మీరు నా వెంట ఉండి ఓపిక పట్టలేరని ముందే చెప్పానా!?” అని (ఖిజరు) అన్నాడు.

قَالَ أَلَمْ أَقُلْ إِنَّكَ لَن تَسْتَطِيعَ مَعِىَ صَبْرًا ﴿٧٢﴾

**73** “నా మరుపుపై నన్ను పట్టుకోకండి. నా విషయంలో కఠినంగా వ్యవహరించకండి”[107] అని మూసా విన్నవించుకున్నాడు.

قَالَ لَا تُؤَاخِذْنِى بِمَا نَسِيتُ وَلَا تُرْهِقْنِى مِنْ أَمْرِى عُسْرًا ﴿٧٣﴾

**74** ఆ తరువాత వారుభయులూ ముందుకు సాగిపోయారు. వారికి ఒక అబ్బాయి తారసపడ్డాడు.[108] అతనా అబ్బాయిని చంపేశాడు. “మీరు పవిత్రమైన ఒక ప్రాణాన్ని తీసేశారు. అతను ఏ ప్రాణినీ హతమార్చి ఉండలేదుకదా! నిశ్చయంగా మీరు అత్యంత ఘోరకృత్యానికి పాల్పడ్డారు”[109] అని మూసా చెప్పాడు.

فَٱنطَلَقَا حَتَّىٰٓ إِذَا لَقِيَا غُلَٰمًا فَقَتَلَهُۥ قَالَ أَقَتَلْتَ نَفْسًا زَكِيَّةًۢ بِغَيْرِ نَفْسٍ لَّقَدْ جِئْتَ شَيْـًٔا نُّكْرًا ﴿٧٤﴾

---

ఇతరుల విషయంలో అలాంటి స్పష్టీకరణ లేదు. ఇదొక అసాధారణ విషయం. దాన్ని గనక సర్వసామాన్యం చేస్తే ప్రతి రోజూ ఓ కొత్త ఖిజర్ పుట్టుకువస్తాడు. కాబట్టి ఇలాంటి వక్రభాష్యాలను నమ్మవలసిన అవసరం లేదు.

105. అంటే ఏ విషయంపైనయినా సరే పూర్తి అవగాహన లేకుండా ఓపిక పట్టడం మీవల్ల సాధ్యమవుతుందా? అన్నది హజ్రత్ ఖిజర్ సందేహం.

106. ఖిజర్ ఆ పడవ చెక్కపలకలను ఎందుకు పగుల గొట్టారో హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు తెలీదు. అందుకే ఆ చేష్టను ఆయన సహించలేకపోయారు. తనకు తెలిసినంతవరకూ అది తప్పుడు పని. ఆ విషయాన్నే ఆయన మొహం మీద చెప్పేశారు. **'ఇమ్రన్'** (إِمْرًا) అంటే “మహా ఆందోళనకరమైన పని.”

75 "నా వెంట ఉంటూ మీరు ఏ మాత్రం సహనం పాటించలేరని ముందే చెప్పానా లేదా?" అని ఆయన అన్నాడు.

قَالَ اَلَمْ اَقُلْ لَّكَ اِنَّكَ لَنْ تَسْتَطِيْعَ مَعِيَ صَبْرًا ﴿٧٥﴾

76 "ఒకవేళ దీని తరువాత ఏ విషయంలోనయినా నేను మిమ్మల్ని ప్రశ్నిస్తే నన్ను మీ వెంట ఉండనివ్వకండి. ఇక మీదట నాపై చర్య గైకొనేందుకు తగిన కారణం[110] మీకు లభించింది" అని మూసా ప్రాధేయపడ్డాడు.

قَالَ اِنْ سَاَلْتُكَ عَنْ شَيْءٍۢ بَعْدَهَا فَلَا تُصٰحِبْنِيْ ۚ قَدْ بَلَغْتَ مِنْ لَّدُنِّيْ عُذْرًا ﴿٧٦﴾

77 వారిద్దరూ అక్కణ్ణుంచి బయలుదేరి ఒక పట్టణానికి చేరుకున్నారు. తమ కోసం భోజన ఏర్పాటు చేయమని అక్కడి ప్రజలను అభ్యర్థించగా వారికి ఆతిథ్యమివ్వటానికి స్థానికులు నిరాకరించారు.[111] అంతలో ఆ ఊరిలో కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఒక గోడపై వారి దృష్టి పడింది. ఆయన ఆ గోడను (యథాతథంగా) నిలబెట్టాడు.[112] "మీరు గనక తలచుకుంటే ఈ పనికి వేతనం తీసుకోవచ్చు కదా!"[113] అని మూసా అన్నాడు.

فَانْطَلَقَا ۥ حَتّٰۤى اِذَاۤ اَتَيَاۤ اَهْلَ قَرْيَةِ ِۣاسْتَطْعَمَاۤ اَهْلَهَا فَاَبَوْا اَنْ يُّضَيِّفُوْهُمَا فَوَجَدَا فِيْهَا جِدَارًا يُّرِيْدُ اَنْ يَّنْقَضَّ فَاَقَامَهٗ ؕ قَالَ لَوْ شِئْتَ لَتَّخَذْتَ عَلَيْهِ اَجْرًا ﴿٧٧﴾

107. అంటే; నా పట్ల కాస్త సడలింపుల వైఖరిని అవలంబించండి. ప్రతి చిన్న విషయంపై నన్ను నిలదీసి, నా లక్ష్యసాధన కఠినతరం చేయకండి.

108. అరబీలో **'గులామ్'** (غُلَام) అనబడింది. ఈ పదానికి చిన్నపిల్లవాడు, యువకుడు అని కూడా అర్థం వస్తుంది. అందుకే తెలుగు అనువాదంలో 'అబ్బాయి' అనటం జరిగింది.

109. అరబీలో **'నుక్రన్'** (نُكْرًا) అని ఉంది. అంటే ధర్మశాస్త్రం (షరీఅతు) ససేమిరా అనుమతించని కార్యం అని అర్థం. కొంతమంది దీన్ని మొదటి పని (పడవను పాడు చేయటం) కన్నా దారుణమైన పని అన్న అర్థంలో తీసుకున్నారు. అయితే మరికొంత మంది దీన్ని మొదటి పనికన్నా తక్కువ స్థాయి చెడుకార్యం అన్న అర్థంలో తీసుకున్నారు. ఎందుకంటే బాలుణ్ణి హత్యచేయటం అతని వరకే పరిమితం అయింది. కాని పడవలో సృష్టించిన లోపం ఆ పడవలో ప్రయాణించే వారందరి ముంపుకు కారణమవుతుందని వారు చెప్పదలిచారు (ఫత్హుల్ ఖదీర్). అయితే ఈ రెండింటిలో మొదటి అభిప్రాయమే సముచితమైనది. ఎందుకంటే హజ్రత్ మూసాకు ఉన్న ధార్మిక, షరీయతు పరిజ్ఞానం ప్రకారం ఈ పని (అబ్బాయి హత్య) షరీయతుకు విరుద్ధమైనది. అందుకే ఆయన దీనిని అత్యంత ఏహ్యమైన చేష్టగా భావించి, దానిపై తీవ్రమయిన ఆక్షేపణను తెలియజేశారు.

110. అంటే, ఇక మీదట గనక మిమ్మల్ని ప్రశ్నిస్తే మీ సహచర్య భాగ్యం నుంచి నన్ను దూరం చేద్దురుగాని. మీరు నాపై గైకొనే ఈ కఠిన చర్యను నేను శిరసావహిస్తాను. ఎందుకంటే సహనానికీ ఒక హద్దు ఉంటుంది. ఇప్పటికే నేను మధ్యలో ప్రశ్నలు వేసి మీ సహనాన్ని చాలా ఎక్కువగా పరీక్షించాను. కాబట్టి నాకు ఈ ఒక్క అవకాశం ఇవ్వండి.

111. అది పిసినారి ప్రజల పట్టణం. అందుకే వారు ప్రయాణీకులకు పట్టెడన్నం పెట్టి బాటసారుల హక్కును చెల్లించడానికి స్పష్టంగా నిరాకరించారు. మరి చూడబోతే అతిథులకు మర్యాద చేయటం, ప్రయాణీకులకు అన్నం పెట్టడం షరీయతు ప్రబోధించే నైతిక విషయాలలో ఓ ముఖ్యాంశం. అతిథిమర్యాద, ఆదరణ 'విశ్వాసం' (ఈమాన్) కోరే ప్రధానాంశాలలో ఒకటని మహనీయ ముహమ్మద్ (సఅసం) నొక్కి వక్కాణించారు. ఆయన (స) ఇలా అన్నారు : "అల్లాహ్ను, అంతిమదినాన్ని విశ్వసించేవాడు అతిథిని ఆదరించాలి, అతనికి మర్యాద చేయాలి."

قَالَ هٰذَا فِرَاقُ بَيْنِيْ وَبَيْنِكَ ۚ سَاُنَبِّئُكَ
بِتَاْوِيْلِ مَا لَمْ تَسْتَطِعْ عَّلَيْهِ صَبْرًا ﴿٧٨﴾

**78** దానికతను ఈ విధంగా సమాధానమిచ్చాడు : "ఇక మీకూ–నాకూ మధ్య చీలిక ఏర్పడినట్లే (మన సావాసం చెల్లిపోయింది).[114] మీరు సహించలేకపోయిన ఆ మూడు విషయాల పరమార్థాన్ని కూడా మీకు వివరిస్తాను[115] (వినండి)...."

اَمَّا السَّفِيْنَةُ فَكَانَتْ لِمَسٰكِيْنَ يَعْمَلُوْنَ فِى
الْبَحْرِ فَاَرَدْتُّ اَنْ اَعِيْبَهَا وَكَانَ وَرَآءَهُمْ
مَّلِكٌ يَّاْخُذُ كُلَّ سَفِيْنَةٍ غَصْبًا ﴿٧٩﴾

**79** "ఆ పడవ సంగతి – అది సముద్రంలో పనిచేసుకునే కొందరు నిరుపేదలది. నేను కావాలనే ఆ పడవలో కొంత లోపం ఏర్పర చాలనుకున్నాను. ఎందుకంటే, ఇంకాస్త ముందుకుపోతే కనిపించిన ప్రతి (మంచి) పడవనూ బలవంతంగా వశపరచుకునే రాజు ఒకడున్నాడు.

112. హజ్రత్ ఖిజర్ ఆ గోడను చేత్తో తాకగానే – విచిత్రంగా – అది నిటారుగా నిలబడి పోయింది. సహీహ్ బుఖారీలో ఈ విషయం వివరంగా వచ్చింది.

113. ఆ పట్టణ వాసులు తమను ఏమాత్రం పట్టించుకోకపోవటంతో దైవప్రవక్త (స) మూసాకు సహజంగానే కోపం వచ్చింది. దయాదాక్షిణ్యాలు ఏ కోశానా లేని ఈ జనులకు ఉచితంగా ఎందుకు సేవచేయాలి? గోడను మరమ్మత్తు చేసినందుకు వారి నుంచి ప్రతిఫలం పుచ్చుకుంటే తప్పేమిటీ? అన్నది ఆయన ఉద్దేశం. ఆ మాటే హజ్రత్ ఖిజర్‌ను అడిగేశారు ఉండబట్టలేక.

114. "మూసా! మీరు మూడోసారి నాకు అడ్డు తగిలారు. ఇప్పుడు మనం విడిపోయే సమయం వచ్చేసింది. మీరు చెప్పినట్లుగానే ఈ క్షణం నుంచీ మీతో తెగత్రెంపులు చేసుకుంటున్నాను" అని హజ్రత్ ఖిజర్ అన్నారు.

115. అయితే విడిపోయే ముందు ఆ మూడు సంఘటనల్లో దాగి వున్న నిగూఢార్థాన్ని మూసా (అలైహిస్సలాం)కి వివరించటం అవసరమని హజ్రత్ ఖిజర్ భావించారు. విడమరచి చెప్పకపోతే మూసా (అలైహి) అపోహకు గురయ్యే అవకాశముంది. అందుకే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన కళ్ల ముందర జరుగుతున్న దారుణాలను చూసి ఓర్చుకోలేకపోయారు.

ఇదిలా వుండగా హజ్రత్ ఖిజర్ చేసిన ఈ అద్భుతాల ఆధారంగా కొంతమంది, ఆయన మానవమాత్రుడై ఉండడనీ, ఒక దైవదూత మాత్రమే ఇలాంటి అద్భుతాలు చేస్తాడని వ్యాఖ్యానించారు. కాని దేవుడు తన ప్రవక్తల్లో ఎవరికయినా ఈ దివ్య జ్ఞానాన్ని ప్రసాదించి, వారిచేత అలాంటి పనులు చేయించుకోవటం అసంభవమేమీ కాదు. ఆ పనులు చేసిన వ్యక్తి ఖుద్దుగా, అందులో తన ప్రమేయం ఏమీలేదనీ, దైవాజ్ఞతోనే తానా పనులు చేశానని స్పష్టంచేసిన మీదట అందులో మరిన్ని కూపీలు లాగవలసిన అవసరం అసలే లేదు. ఉదాహరణకు : దైవిక ఉత్తర్వుల ననుసరించి కొందరు రోగగ్రస్తులవుతారు. కొందరు మరణిస్తారు. కొందరి వర్తకంలో స్తబ్దత ఆవరిస్తుంది. కొందరి పంటలు పాడైపోతాయి. కొందరి కర్మాగారాలు ఖాయిలా పడతాయి. కొన్ని మానవ సముదాయాలపై ఆపదలు వచ్చిపడతాయి. వాటిలో కొన్ని పనులు దైవాదేశంతో దైవదూతలు కూడా నిర్వర్తిస్తారు. ఏ విధంగానయితే ఈ పనులు షరీయతు స్వభావానికి విరుద్ధంగా కానరావో అదేవిధంగా హజ్రత్ ఖిజర్ ద్వారా సృష్టించబడిన ఈ సంఘటనలు కూడా దైవిక విషయాలతో ముడిపడి ఉండటం వల్ల వాటిని "షరీయతు త్రాసు"లో తూయటం సరికాదు.

అయితే ఇప్పుడు దైవదౌత్య పరంపర పరిసమాప్తమయింది. కాబట్టి ఈనాడు ఎవరయినా హజ్రత్ ఖిజర్ మాదిరిగా అలాంటి పనులు చేసి, తన చేష్టల్ని సమర్థించుకోవటానికి 'దివ్య జ్ఞానాన్ని' ఆశ్రయిస్తే అది ముమ్మాటికీ నిజం కాజాలదు. ఎందుకంటే హజ్రత్ ఖిజర్ సంఘటన దివ్య ఖుర్ఆన్ ద్వారా రూఢీ అయింది గనక అది మన కోసం నమ్మదగినది. దాన్ని నిరాకరించటానికి వీలులేదు. కాని ఈనాడు ఎవరయినా ఇలాంటి చేష్టలకు పూనుకుంటే చేష్టలుడిగి చూస్తూ ఉండిపోరాదు. దాన్ని ఖండించాలి. అడ్డుకోవాలి.

وَاَمَّا الْغُلٰمُ فَكَانَ اَبَوٰهُ مُؤْمِنَيْنِ
فَخَشِيْنَآ اَنْ يُّرْهِقَهُمَا طُغْيَانًا وَّكُفْرًا ﴿80﴾

**80** "ఇకపోతే ఆ అబ్బాయి సంగతి; అతని తల్లిదండ్రులు విశ్వాసులు. అతను తన తలబిరుసుతనంతో, తిరస్కారవైఖరితో వారిని వేధిస్తాడని మాకు భయమేసింది.

فَاَرَدْنَآ اَنْ يُّبْدِلَهُمَا رَبُّهُمَا خَيْرًا مِّنْهُ زَكٰوةً
وَّاَقْرَبَ رُحْمًا ﴿81﴾

**81** "అందుకే వారికి వారి ప్రభువు – అతనికి బదులుగా – అతనికన్నా సౌశీల్యవంతుడైన, దయార్ద్రతకు దగ్గరగా ఉండే బాలుడిని ప్రసాదించాలని మేము కోరుకున్నాము.

وَاَمَّا الْجِدَارُ فَكَانَ لِغُلٰمَيْنِ يَتِيْمَيْنِ فِى الْمَدِيْنَةِ
وَكَانَ تَحْتَهٗ كَنْزٌ لَّهُمَا وَكَانَ اَبُوْهُمَا صَالِحًا ۚ فَاَرَادَ
رَبُّكَ اَنْ يَّبْلُغَآ اَشُدَّهُمَا وَيَسْتَخْرِجَا كَنْزَهُمَا ۖ
رَحْمَةً مِّنْ رَّبِّكَ ۚ وَمَا فَعَلْتُهٗ عَنْ اَمْرِىْ ؕ ذٰلِكَ
تَاْوِيْلُ مَا لَمْ تَسْطِعْ عَّلَيْهِ صَبْرًا ﴿82﴾

**82** "ఇక గోడ సంగతంటారా, ఆ గోడ ఈ పట్టణంలో నివసించే ఇద్దరు అనాథ బాలలది. వారికి చెందవలసిన ఒక నిధి ఆ గోడ క్రింద పాతిపెట్టబడి ఉంది. వారి తండ్రి సజ్జనుడు. ఈ అనాథ లిద్దరూ యుక్త వయస్కులై నీ ప్రభువు దయానుగ్రహంతో తమ ఈ నిధిని వెలికి తీసుకోవాలన్నది నీ ప్రభువు సంకల్పం. అంతేగాని నా అంతట నేనుగా ఈ పని చేయలేదు.[116] మీరు సహించలేకపోయిన ఆ సంఘటనల వెనుక దాగివున్న వాస్తవికత ఇదే!"

وَيَسْئَلُوْنَكَ عَنْ ذِى الْقَرْنَيْنِ ؕ قُلْ سَاَتْلُوْا
عَلَيْكُمْ مِّنْهُ ذِكْرًا ﴿83﴾

**83** (ఓ ప్రవక్తా!) వారు నిన్ను జుల్‌ఖర్‌నైన్ గురించి అడుగుతున్నారు.[117] "నేను మీకు అతని వృత్తాంతం కొద్దిగా చదివి వినిపిస్తాన"ని వారికి చెప్పు.

116. హజ్రత్ ఖిజర్‌ను ఒక ప్రవక్తగా భావించే వారికి ఇది రెండవ ఆధారం. ఎందుకంటే ప్రవక్త కాని వారివద్దకు ఇలాంటి సందేశం 'వహీ' ద్వారా అందదు. లీలామాత్రంగానే వారు ఇన్ని అద్భుత కార్యాలను చేయలేరు. ప్రవక్త కానివారు తమకు ఇలాంటి దివ్య జ్ఞానం లభించిందని చెప్పినా అది నమ్మశక్యం కాదు.

హజ్రత్ ఖిజర్ జీవితంపై కూడా అభిప్రాయభేదాలున్నాయి. హజ్రత్ ఖిజర్ ఇప్పటికీ జీవించి ఉన్నారని కొందరు ప్రబుద్ధులు వాదిస్తారు. తమ ఈ అభిప్రాయాన్ని నిరూపించుకునే యత్నంలో, ఫలానా ఫలానా పుణ్యపురుషులు ఆయన్ని కలుసుకున్నారని కూడా చెబుతారు. కాని ఈ మేరకు షరీయతు ద్వారా మనకు ఏ ఆధారమూ లభించదు. హజ్రత్ ఖిజర్‌ను ప్రజలు చేతనావస్థలోనో, స్వప్నావస్థలోనో కలుసుకున్నారన్న విషయం కూడా స్వీకారయోగ్యం కాదు. ఆయన రూపురేఖలు ఎలా ఉంటాయో కూడా కనీసం తెలియనప్పుడు, ఆయన్ని ఎవరయినా ఎలా గుర్తు పట్టగలరు? అన్నది మరో ప్రశ్న. వాస్తవానికి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) మాత్రమే ఆయన్ని నిజంగా కలుసుకున్నారు. మిగతావన్నీ కాల్పనికమైనవి.

117. ఇది ముష్రిక్కుల మూడవ ప్రశ్నకు సమాధానం. యూదుల ప్రేరేపణపై వారు దైవప్రవక్త (సఅసం)కు ఈ ప్రశ్న వేశారు. 'జుల్‌ఖర్‌నైన్' అంటే "రెండు కొమ్ములు ఉన్నవాడు" అని అసలు అర్థం. అతని తలపై రెండు కొమ్ములు మొలిచి ఉండటం వల్ల అతనికి ఆ పేరు వచ్చింది లేదా అతడు తూర్పు నుంచి పశ్చిమం వరకు జైత్రయాత్రను కొనసాగించి సూర్యోదయం – సూర్యాస్తమయాలను రెండు దిక్కులలోనూ ప్రత్యక్షంగా తిలకించి ఉండటం వల్ల అతనికి ఆ పేరు వచ్చి ఉండవచ్చు. మరి కొంతమంది ప్రకారం అతని తలపై రెండు జడలు ఉండేవి. లేదా రెండు పిలకలు

84 మేము అతనికి భువిలో అధికారం ఇచ్చాము. అన్ని రకాల సాధన సంపత్తుల్ని[118] కూడా అతనికి సమకూర్చాము.

إِنَّا مَكَّنَّا لَهُۥ فِي الْأَرْضِ وَآتَيْنَاهُ مِن كُلِّ شَيْءٍ سَبَبًا (84)

85 అతను ఒక దిశలో పోసాగాడు.[119]

فَأَتْبَعَ سَبَبًا (85)

86 చివరకు అతను సూర్యుడు అస్తమించే ప్రదేశానికి చేరుకుని, సూర్యుడు ఒక బురద చెలమలో అస్తమిస్తుండగా చూశాడు.[120] దాని సమీపంలో అతను ఒక జాతి వారిని కూడా కనుగొన్నాడు. "ఓ జుల్‌ఖర్‌నైన్! నువ్వు వీళ్లను శిక్షించవచ్చు. లేదా వీరి విషయంలో మరేదయినా ఉత్తమ వైఖరిని అవలంబించవచ్చు"[121] అని మేమతనికి సెలవిచ్చాము.[122]

حَتَّىٰ إِذَا بَلَغَ مَغْرِبَ الشَّمْسِ وَجَدَهَا تَغْرُبُ فِي عَيْنٍ حَمِئَةٍ وَوَجَدَ عِندَهَا قَوْمًا ۗ قُلْنَا يَٰذَا الْقَرْنَيْنِ إِمَّا أَن تُعَذِّبَ وَإِمَّا أَن تَتَّخِذَ فِيهِمْ حُسْنًا (86)

ఉండేవి. అందుకే అతనికా పేరు వచ్చింది. ప్రాచీన వ్యాఖ్యాతలు బహుశా ఇతను అలెగ్జాండర్ అయి ఉంటాడని భావించారు. ఎందుకంటే అలెగ్జాండర్ జైత్రయాత్ర పశ్చిమ ప్రాంతం నుంచి తూర్పు దేశాల వరకూ వినా అప్రతిహతంగా సాగింది.

అయితే ఆధునిక ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. ముఖ్యంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈ విషయంలో చేసిన పరిశోధన శ్లాఘించదగినది. ఆయన పరిశోధనా సారాంశం ఇది : 1. ఖుర్‌ఆన్ విశదీకరించినట్టు జుల్ఖర్‌నైన్ శక్తిమంతుడు. అల్లాహ్ అతనికి గొప్ప శక్తి సామర్థ్యాలను, ఒనరులను సమకూర్చాడు. 2. అతడు ప్రాక్ పశ్చిమ రాజ్యాలను వరుసగా జయిస్తూ ఒక పర్వత ప్రాంతానికి చేరాడు. ఆ పర్వతానికి అవతల యాజూజ్ - మాజూజ్‌లు ఉండేవారు. 3. అతడు యాజూజ్ మాజూజ్‌ల దురాగతాలను అడ్డుకునే ఉద్దేశంతో వారి మార్గాన్ని మూసేందుకు అత్యంత పటిష్టమైన నిర్మాణం చేపట్టాడు. 4. అతడు న్యాయశీలుడైన చక్రవర్తి. 5. అల్లాహ్‌పట్ల, అంతిమదినం పట్ల విశ్వాసం గలవాడు. 6. అతడు మనోవాంఛల వెనుక పరుగెత్తే విషయలోలుడు కాడు. ప్రాపంచిక పటాటోపాలను, సిరిసంపదల్ని ఆశించేవాడు అంతకన్నా కాడు. అతడు ప్రాచీన పారసీక దేశస్థుడు. అతన్ని గ్రీకులు సాయిరిస్ అనీ, ఇబ్రానీలు ఖూరిస్ అనీ, అరబ్బులు కైఖుస్రూ అని పిలిచేవారు. క్రీ. పూ. 539కి చెందినవాడు. క్రీ.శ. 1838లో సాయిరిస్ అనే పేరుగల ఒక విగ్రహం కనుగొనబడింది. దాని రెండు భుజాలపై రెక్కలున్నాయి. తలపై పొట్టేలు మాదిరిగా రెండు కొమ్ములున్నాయి. (వివరాల కోసం తర్జుమానుల్ ఖుర్‌ఆన్ - మొదటి సంపుటి పేజీలు : 399 - 430 - ప్రథమ ముద్రణ చూడండి) యదార్థం మాత్రం అల్లాహ్‌కే తెలుసు.

118. **'సబబ్'** అంటే అసలు త్రాడు అని అర్థం. లక్ష్యసాధన కోసం ఉపయోగించే 'సాధనం' కొరకు కూడా ఈ పదం అన్వయిస్తుంది. ఈ రకంగా తీసుకుంటే దీనికి ఒనరులు, సాధన సంపత్తులు అన్న భావం వస్తుంది. వాటిననుసరించి అతడు విజయాలు సాధించాడు. శత్రువుల పొగరు అణచాడు. దుర్మార్గులైన చక్రవర్తులను మట్టి కరిపించాడు.

119. ఈ వచనంలో 'సబబ్' అంటే మార్గం అని అర్థం. అతడు దైవప్రసాదితమయిన ఒనరుల ద్వారా మరిన్ని కొంగ్రొత్త ఆవిష్కరణలకు పూనుకున్నాడు. మరిన్ని ఒనరులను సమకూర్చుకున్నాడు అన్న అర్థం కూడా వస్తుంది. ఉదాహరణకు: 'ఇనుము'ను సృష్టించినవాడు అల్లాహ్‌యే. ఆ ఇనుము ద్వారా ఎన్నో ఆయుధాలు, మరెన్నో యంత్రాలు, పనిముట్లు తయారవుతాయి.

120. ఈ ఆయతులో **'ఐనిన్'** అంటే నీటి గుంట లేక సముద్రం అని అర్థం. **'హమిఅతిన్'** అంటే బురద, రొంపి అని అర్థం. దీని భావమేమిటంటే జుల్ఖర్‌నైన్ పశ్చిమ దిశలో ఒక్కొక్క రాజ్యాన్నీ జయిస్తూ ఒక జనపదం వద్దకు చేరుకున్నాడు. అది అతని జైత్రయాత్రలో ఆఖరి మజిలీ. అక్కడ ఒక జలసంధి లేక సముద్రం ఉంది. అందలి నీళ్లు నల్లగా, బురద బురదగా ఉన్నాయి. సూర్యుడు ఆ బురదలో మునుగుతున్నట్లు అతనికి అనిపించింది. సూర్యాస్తమయం సమయంలో

قَالَ اَمَّا مَنْ ظَلَمَ فَسَوْفَ نُعَذِّبُهٗ ثُمَّ يُرَدُّ
اِلٰى رَبِّهٖ فَيُعَذِّبُهٗ عَذَابًا نُّكْرًا ﴿87﴾

**87** దానికతను, "దుర్మార్గానికి ఒడిగట్టిన వాణ్ణి మేము శిక్షిస్తాము.[123] తరువాత అతను తన ప్రభువు వద్దకు మరలించ బడతాడు. ఆయన అతనికి మరింత తీవ్రమైన శిక్ష విధిస్తాడు" అని అన్నాడు.

وَاَمَّا مَنْ اٰمَنَ وَعَمِلَ صَالِحًا فَلَهٗ جَزَآءَ
ۨالْحُسْنٰى ۚ وَسَنَقُوْلُ لَهٗ مِنْ اَمْرِنَا يُسْرًا ﴿88﴾

**88** "అయితే విశ్వసించి, మంచిపనులు చేసినవారికి ప్రతి ఫలంగా మేలు కలుగుతుంది. అలాంటి వారికి మేము సయితం మా పనిలో తేలికపాటి ఆదేశాలే ఇస్తాము" (అని అన్నాడు).

ثُمَّ اَتْبَعَ سَبَبًا ﴿89﴾

**89** ఆ తరువాత అతను మరో దారి పట్టాడు –[124]

حَتّٰٓى اِذَا بَلَغَ مَطْلِعَ الشَّمْسِ وَجَدَهَا تَطْلُعُ
عَلٰى قَوْمٍ لَّمْ نَجْعَلْ لَّهُمْ مِّنْ دُوْنِهَا سِتْرًا ﴿90﴾

**90** అతను సూర్యుడు ఉదయించే ప్రదేశానికి చేరుకున్నప్పుడు, అక్కడ సూర్యుడు ఒక జాతి వారిపై ఉదయించటం చూశాడు. మేము వారికీ – సూర్యునికీ మధ్య ఎలాంటి అడ్డునూ ఉంచలేదు.[125]

كَذٰلِكَ ۗ وَقَدْ اَحَطْنَا بِمَا لَدَيْهِ خُبْرًا ﴿91﴾

**91** ఇదీ పరిస్థితి! అతనికి సంబంధించిన విషయాలన్నీ మా జ్ఞానపరిధిలో ఉన్నాయి.[126]

---

సముద్రతీరంలో నిలబడినపుడు, నిలబడి చూచేవారికి సూర్యుడు సముద్రంలో మునిగిపోతున్నట్లో, లేక భూమిలో కూరుకుపోతున్నట్లో అగుపిస్తాడు. నిజానికి సూర్యుడు మునగడు. ఆకాశంలోనే ఉంటాడు – తన గమ్యం వైపుకు సాగిపోతుంటాడు.

121. అంటే మేము నీకు ఈ జాతివారిపై ఆధిక్యతను వొసగాము. ఇప్పుడు నువ్వు వారి దురాగతాలకుగాను వారిని హతమార్చినా, వాళ్ళను నిర్బంధించినా, పరిహారం తీసుకుని వారిని వదలిపెట్టినా – అది నీ ఇష్టం అని భావం.

122. **"మేము సెలవిచ్చాము"** అంటే 'వహీ' ద్వారా ఆ విషయం మేమతనికి తెలియజేశాము అని భావం. ఈ వాక్యం ఆధారంగా కొంతమంది, జుల్ఖర్నైన్‌కు దైవదౌత్యం (ప్రవక్త పదవి) లభించిందని భావించారు. అతనికి ప్రవక్త పదవి లభించలేదని అనేవారు, బహుశా ఆ కాలపు పైగంబరు ద్వారా అతనికి ఆ సూచన ఇవ్వబడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.

123. అంటే షిర్క్‌పై, తిరస్కారవైఖరిపై మొండికేసిన వారిని మేము శిక్షించి తీర్తాము.

124. అంటే ఇప్పుడు అతను పశ్చిమం నుంచి తూర్పు ప్రాంతం వైపుకు ప్రయాణం మొదలుపెట్టాడు.

125. తూర్పు దిశలో ఆఖరి జనవాసం వరకూ వెళ్ళిపోయాడు. సూర్యుడు వారిపై ఉదయించేవాడు అని అనటం జరిగింది. అక్కడి ప్రజలు మరీ అనాగరికులు. వారు ఇండ్లలో నివసించే బదులు మైదానాలలో, ఎడారులలో నివసించేవారు. దుస్తులు ధరించేవారు కారు. వారికీ – సూర్యునికీ మధ్య ఎలాంటి అడ్డు తెరా ఉండేది కాదంటే భావం ఇదే. వారి నగ్న శరీరాలపై సూర్యకిరణాలు ప్రసరించేవి.

126. అంటే జుల్ఖర్నైన్ శక్తి సామర్థ్యాల గురించి, అతని ప్రజ్ఞా పాటవాల గురించి మాకు అంతా తెలుసు. ఇంతకుముందు ప్రస్తావించినట్లు అతను తొలుత పశ్చిమ ప్రాంతాన్ని జయించి, తరువాత తూర్పు వైపుకు జైత్రయాత్రను సాగించాడు.

| | |
|---|---|
| **92** ఆ తరువాత అతను ఇంకొక మార్గాన్ని అనుసరించాడు.[127] | ثُمَّ أَتْبَعَ سَبَبًا ﴿92﴾ |
| **93** అతను రెండు కొండల మధ్య ప్రదేశానికి చేరుకున్నప్పుడు,[128] ఆ రెంటికీ నడుమ ఒక జాతివారిని చూశాడు. వారు అతని (ఒక్క) మాటనైనా అర్థం చేసుకునే స్థితిలో లేరు.[129] | حَتَّىٰٓ إِذَا بَلَغَ بَيْنَ ٱلسَّدَّيْنِ وَجَدَ مِن دُونِهِمَا قَوْمًا لَّا يَكَادُونَ يَفْقَهُونَ قَوْلًا ﴿93﴾ |
| **94** "ఓ జుల్ ఖర్నైన్![130] యాజూజ్ మాజూజ్‌లు ఈ దేశంలో కల్లోలాన్ని సృష్టిస్తున్నారు.[131] నువ్వు మాకూ – వారికీ మధ్య ఒక అడ్డుగోడను నిర్మిస్తావా? దానికయ్యే ఖర్చులు నీకు చెల్లించమంటావా?" అని వాళ్లు విన్నవించుకున్నారు. | قَالُوا۟ يَٰذَا ٱلْقَرْنَيْنِ إِنَّ يَأْجُوجَ وَمَأْجُوجَ مُفْسِدُونَ فِى ٱلْأَرْضِ فَهَلْ نَجْعَلُ لَكَ خَرْجًا عَلَىٰٓ أَن تَجْعَلَ بَيْنَنَا وَبَيْنَهُمْ سَدًّا ﴿94﴾ |
| **95** అతనిలా సమాధానమిచ్చాడు: "నాకు నా ప్రభువు అనుగ్రహించిన అధికారమే ఎంతో శ్రేష్ఠమైనది. మీరు మీ (శ్రమ) శక్తి ద్వారా నాకు సహాయపడండి చాలు.[132] నేను మీకూ – వారికీ మధ్య ఒక పటిష్టమైన గోడను నిర్మిస్తాను. | قَالَ مَا مَكَّنِّى فِيهِ رَبِّى خَيْرٌ فَأَعِينُونِى بِقُوَّةٍ أَجْعَلْ بَيْنَكُمْ وَبَيْنَهُمْ رَدْمًا ﴿95﴾ |
| **96** ".... నాకు ఇనుపరేకులను తెచ్చి ఇవ్వండి." ఆ విధంగా అతను ఆ రెండు పర్వతాల మధ్య గోడను – సమానంగా – లేపిన తరువాత,[133] "అగ్నిని రాజేయండి" అని ఆజ్ఞాపించాడు. ఆ ఇనుప రేకులు బాగా కాలి అగ్నిగా మారిన తరువాత "కరిగిన రాగిని తెండి, దానిపై పోస్తాను"[134] అని అన్నాడు. | ءَاتُونِى زُبَرَ ٱلْحَدِيدِ ۖ حَتَّىٰٓ إِذَا سَاوَىٰ بَيْنَ ٱلصَّدَفَيْنِ قَالَ ٱنفُخُوا۟ ۖ حَتَّىٰٓ إِذَا جَعَلَهُۥ نَارًا قَالَ ءَاتُونِىٓ أُفْرِغْ عَلَيْهِ قِطْرًا ﴿96﴾ |

127. అంటే తూర్పు – పశ్చిమ ప్రాంతాలను జయించిన తరువాత అతను మరో దిశలో సాగిపోయాడు.

128. ఆ రెండు పర్వతాలకు మధ్యన గల లోయలో ఒక జాతివారు నివసించేవారు. ఆ లోయకు అవతల నుంచి యాజూజ్ మాజూజ్ అనే దుర్మార్గులు దండెత్తివచ్చి వారిని వేధిస్తూ ఉండేవారు. అక్కడి ప్రజా జీవితాలను అస్తవ్యస్తం చేసేవారు. రక్తపాతం సృష్టించేవారు.

129. వారికి తాము మాట్లాడే భాష తప్ప మరో భాష రాదు.

130. మరి జుల్ఖర్నైన్‌కు వారు తమ బాధలను ఎలా చెప్పుకోగలిగారు? ఎవరయినా దుబాసీగా వ్యవహరించి ఉండవచ్చు. లేదా దేవుడు జుల్ఖర్నైన్‌కు ప్రసాదించిన సాధనసంపత్తులలో పలు భాషలను అర్థం చేసుకునే జ్ఞానం కూడా ఉండవచ్చు.

131. యాజూజ్ – మాజూజ్ అనేవి వాస్తవానికి రెండు జాతులవారు. ప్రామాణిక హదీసుల ప్రకారం వారు మానవ జాతికి చెందినవారే. ఇతర జాతుల వారికన్నా వారి సంఖ్య అధికంగా ఉంటుంది. వాళ్లతోనే నరకం ఎక్కువగా నిండుతుంది (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ హజ్; ముస్లిం – కితాబుల్ ఈమాన్).

132. అంటే మీరు మీ శారీరక శక్తిని వెచ్చించండి. గోడ నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తెచ్చి ఇవ్వండి. మిగతాదంతా నేను చూసుకుంటాను అని భావం.

133. **'బైనస్సదఫైన్'** అంటే రెండు పర్వత శిఖరాల మధ్య గల ఖాళీ ప్రదేశం. దాన్ని చిన్న ఇనుప పలకలతో నింపేశాడు.

134. **'ఖిత్రన్'** (قِطْرًا) అంటే కరిగిన సీసం, లోహం, రాగి, ధాతువు అన్న అర్థాలు వస్తాయి. ఇనుప రేకులను బాగా కాల్చి

97 ఇక వారిలో (యాజూజు మాజూజుల్లో) ఆ గోడను ఎక్కే శక్తి లేకపోయింది. దానికి రంధ్రం వేయటం కూడా వారి తరం కాదు.

فَمَا اسْطَاعُوٓا اَنْ يَّظْهَرُوْهُ وَمَا اسْتَطَاعُوْا لَهٗ نَقْبًا ﴿97﴾

98 "ఇది కేవలం నా ప్రభువు కటాక్షం. అయితే నా ప్రభువు వాగ్దాన సమయం వచ్చినపుడు ఆయన దాన్ని నేలమట్టం చేసేస్తాడు.[135] నిశ్చయంగా నా ప్రభువు వాగ్దానం నెరవేరటం తథ్యం" అని జుల్‌ఖర్‌నైన్ చెప్పాడు.

قَالَ هٰذَا رَحْمَةٌ مِّنْ رَّبِّيْ ۚ فَاِذَا جَآءَ وَعْدُ رَبِّيْ جَعَلَهٗ دَكَّآءَ ۚ وَكَانَ وَعْدُ رَبِّيْ حَقًّا ﴿98﴾

99 ఆ రోజు మేము వారిని (సముద్రపు అలల మాదిరిగా) ఒండొకరిలో చొచ్చుకుపోయేలా వదలిపెడతాము. శంఖం ఊదబడుతుంది. అంతే! మేము జనులందరినీ ఒకేసారి సమీకరిస్తాము.

وَتَرَكْنَا بَعْضَهُمْ يَوْمَئِذٍ يَّمُوْجُ فِيْ بَعْضٍ وَّنُفِخَ فِي الصُّوْرِ فَجَمَعْنٰهُمْ جَمْعًا ﴿99﴾

అగ్ని గోళంగా మారిన తరువాత వాటిపై రాగి లేక సీసం పోయటం వల్ల ఆ పర్వత కనుమ మూసుకుపోయింది. దాన్ని దాటి రావటం యాజూజ్ మాజూజ్ జాతులకు సాధ్యపడకుండా పోయింది.

135. ఈ గోడ నిర్మాణంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, దానికి రంధ్రంవేసి ఇవతలకు చొచ్చుకురావటం యాజూజు మాజూజువంటి క్రూరులకు సాధ్యం కాకపోయినప్పటికీ ప్రభువు వాగ్దాన సమయం ఆసన్నమైనప్పుడు అది ఎందుకూ పనికిరాదు. ఆయన దాన్ని తుత్తునియలుగా దంచివేసి నేలమట్టం చేసేస్తాడు. 'వాగ్దాన సమయం' అంటే ప్రళయదినానికి సమీపంలో యాజూజు మాజూజులు రావటం అన్నమాట. హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది.

ఉదాహరణకు ఒక హదీసులో, ఈ గోడలో పడే ఒక చిన్నపాటి రంధ్రం పరీక్షా ఘడియలు దాపురించాయనటానికి సంకేతంగా పేర్కొన్నారు అంతిమ దైవప్రవక్త (సఅసం). (సహీహ్ బుఖారీ – నెం. 3346; ముస్లిం – నెం. 2208).

వేరొక హదీసులో ఇలా ఉంది – "వారు ప్రతి రోజూ ఆ గోడను త్రవ్వటం మొదలెడతారు. విఫలురై ఆ పనిని మరునాడు చేద్దాం అని వదిలేస్తారు. దైవప్రణాళిక ప్రకారం వారు లక్ష్యాన్ని ఛేదించే సమయం వచ్చినప్పుడు 'ఇన్‌షా అల్లాహ్ దీన్ని రేపు త్రవ్వుదాం' అనంటారు. ఆ మరునాడు వారు ఆ గోడలోనుంచి దూరిపోవటంలో సఫలీకృతులవుతారు. అప్పుడు వారు రాజ్యంలో చెలరేగిపోతారు. ప్రజలు బిక్కుబిక్కుమంటూ తమ నివాసాల్లో దాక్కుంటారు. వారు ఆకాశం వైపుకు బాణాలు ప్రయోగించగా అవి రక్తసిక్తమై తిరిగి వస్తాయి. ఎట్టకేలకు అల్లాహ్ వారి ఆసనాలపై ఒక రకమయిన పురుగును సృష్టిస్తాడు. దాంతో వారు నాశనమయిపోతారు." (ముస్నదె అహ్మద్– 12/511; జామె తిర్మిజీ – 3153; అహాదీసుస్సహీహతు లిల్ అల్‌బానీ – 1735).

సహీహ్ ముస్లింలోని నవాస్ బిన్ సమ్ఆన్ (రజి) కథనం ఇలా వుంది – "యాజూజు మాజూజులు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) పునరాగమనం తరువాత ఉనికిలోకి వస్తారు" (కితాబుల్ ఫితన్). యాజూజు మాజూజులకు సంబంధించి ఇష్టానుసారం భాష్యం చెప్పే వారి మాటలను ఈ హదీసు ఖండిస్తోంది. ఉదాహరణకు : తాతారీలు ముస్లింలపై దండెత్తడాన్ని, మంగోలుల దండయాత్రలను, రష్యన్ల సామ్రాజ్యవాదాన్ని కొంతమంది యాజూజు మాజూజులుగా అభివర్ణిస్తే, ప్రపంచంపై పాశ్చాత్య జాతుల పెత్తనాన్ని మరికొందరు ఈ ఉపద్రవంగా ఖరారు చేశారు. అసలు ఇవన్నీ ఊహాగానాలు మాత్రమే. ప్రపంచ పటంపై ఎవరికయినా ఆధిక్యత లభిస్తే దాన్ని యాజూజు మాజూజుల ఉపద్రవంగా భావించకూడదు. వారు ఉనికిలోకి వచ్చినప్పుడు నరమేధం, విధ్వంసకాండ, అల్లకల్లోలం సర్వసామాన్యమయిపోయి మానవత విలవిల్లాడుతుంది. వారిని ఎదుర్కొనే శక్తి ముస్లింలలో ఉండదు. అయితే ఓ మహమ్మారి వచ్చి వారిని కబళిస్తుంది. దాంతో వారంతా ఒక్క క్షణంలోనే దాని వాతన పడతారు.

وَعَرَضْنَا جَهَنَّمَ يَوْمَئِذٍ لِّلْكٰفِرِيْنَ عَرْضًا ﴿100﴾

100 ఆ రోజు మేము నరకాన్ని అవిశ్వాసుల ముందు ప్రత్యక్ష పరుస్తాము.

الَّذِيْنَ كَانَتْ اَعْيُنُهُمْ فِيْ غِطَآءٍ عَنْ ذِكْرِيْ
وَكَانُوْا لَا يَسْتَطِيْعُوْنَ سَمْعًا ﴿101﴾

101 నా స్మరణ పట్ల వారి కళ్లు పొరలు క్రమ్ముకుని ఉండేవి. అప్పుడు వారు (సత్య వాక్కును) వినే స్థితిలో కూడా లేరు.

اَفَحَسِبَ الَّذِيْنَ كَفَرُوْٓا اَنْ يَّتَّخِذُوْا عِبَادِيْ مِنْ
دُوْنِيْٓ اَوْلِيَآءَ ۭ اِنَّآ اَعْتَدْنَا جَهَنَّمَ لِلْكٰفِرِيْنَ
نُزُلًا ﴿102﴾

102 ఇప్పుడీ అవిశ్వాసులు, నన్ను కాదని నా దాసులను తమ సహాయకులుగా చేసుకుందామని అనుకుంటున్నారా? [136] (వినండి!) మేము ఈ అవిశ్వాసుల ఆతిథ్యం కోసం నరకాన్ని సిద్ధంచేసి ఉంచాము.

قُلْ هَلْ نُنَبِّئُكُمْ بِالْاَخْسَرِيْنَ اَعْمَالًا ﴿103﴾

103 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : “చేసుకున్న కర్మల రీత్యా మీలో అందరికన్నా ఎక్కువగా నష్టపోయే వారెవరో నేను మీకు చెప్పనా?

اَلَّذِيْنَ ضَلَّ سَعْيُهُمْ فِي الْحَيٰوةِ الدُّنْيَا وَهُمْ
يَحْسَبُوْنَ اَنَّهُمْ يُحْسِنُوْنَ صُنْعًا ﴿104﴾

104 “తమ ప్రాపంచిక జీవితపు ప్రయత్నాలన్నీ వృధా అయి పోతున్నప్పటికీ, తాము చేసేదంతా సజావుగానే ఉందని భ్రమ పడేవారే వారు.”[137]

اُولٰۗىِٕكَ الَّذِيْنَ كَفَرُوْا بِاٰيٰتِ رَبِّهِمْ وَلِقَاۗىِٕهٖ
فَحَبِطَتْ اَعْمَالُهُمْ فَلَا نُقِيْمُ لَهُمْ يَوْمَ الْقِيٰمَةِ
وَزْنًا ﴿105﴾

105 తమ ప్రభువు ఆయతులను, ఆయన్ని కలుసుకోవలసి ఉందన్న విషయాన్ని త్రోసి పుచ్చినవారు వీరే.[138] అందువల్ల వారి కర్మలన్నీ వృధా అయిపోయాయి. కాబట్టి ప్రళయదినాన మేము వారి కర్మల బరువును తూయము.[139]

136. **‘హసిబ’ (حَسِبَ)** అంటే అనుకోవటం, తలపోయటం, భావించటం అనే అర్థాలు వస్తాయి. ‘నా దాసులు’ అంటే దైవదూతలు, ఈసా (ఏసుక్రీస్తు), పుణ్యపురుషులు. ప్రజలు వీరిని తమ సహాయకులుగా, అక్కరలు తీర్చేవారుగా భావించేవారు. అలాగే షైతానులు, జిన్నాతులను కూడా వారు పూజించేవారు. మందలింపు ధోరణిలో ఈ ఆయతు ప్రస్తావించబడింది. వారు నన్ను వదలి నా దాసులను పూజించేవారు కదా! ఇప్పుడు వారు నాకు వ్యతిరేకంగా తమను ఆదుకుంటారని వీళ్లు అనుకుంటున్నారా? అసంభవం. మేము ఈ అవిశ్వాసుల కోసం నరకాన్ని తయారుచేసిపెట్టాం. వీళ్ల నరకానికి ఆహుతి కాకుండా ఈ రోజు అడ్డుపడేవాడెవడూ లేడు. వారు జీవితాంతం నమ్ముకున్న వారి ‘దేముళ్లు’ ఎవరూ వారికి అండగా నిలవరు అని అల్లాహ్ ఈ ఆయతులో హెచ్చరించాడు.

137. చూడబోతే వారి ఆచరణలన్నీ దేవుని దృష్టిలో అత్యంత అసహ్యకరమైనవి. కాని వారు మాత్రం తమ కర్మలన్నీ చాలా మంచివని భావించి గర్వపడతారు. ఎవరు వారు? వారు యూదులు, క్రైస్తవులని కొందరు, బిద్అతీలు, ఖారిజీ వర్గీయులని మరి కొందరు అభిప్రాయపడ్డారు. ఈ ఆయతు ముష్రిక్కులను ఉద్దేశించినదని మరికొంతమంది వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఈ ఆయతు అందరినీ ఉద్దేశించినదే. గర్హనీయమైన ఈ పెడసరితనం ఉన్నవారందరికీ ఇది వర్తిస్తుంది.

138. **‘ప్రభువు ఆయతులు’** అంటే దేవుని ఏకత్వాన్ని రుజువు చేసే ఆధారాలు, సూచనలన్న మాట. అవి విశ్వమండలంలో సర్వత్రా వ్యాపించి ఉన్నాయి. ఆయన తన గ్రంథంలో అవతరింపజేసిన షరీయతు విషయాలు కూడా దీని భావపరిధిలోకి

**106** వారికి లభించే ప్రతిఫలం నరకం. ఎందుకంటే వారు (సత్యాన్ని) తిరస్కరించారు. నా ఆయతులను, నా ప్రవక్తలను పరిహసించారు.

ذٰلِكَ جَزَآؤُهُمْ جَهَنَّمُ بِمَا كَفَرُوْا وَاتَّخَذُوْٓا اٰيٰتِيْ وَرُسُلِيْ هُزُوًا ﴿106﴾

**107** అయితే విశ్వసించి, సత్కార్యాలు కూడా చేసిన వారికి ఆతిథ్యంగా ఫిరదౌసు[140] వనాలు ఉన్నాయి.

اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ كَانَتْ لَهُمْ جَنّٰتُ الْفِرْدَوْسِ نُزُلًا ﴿107﴾

**108** వారక్కడ కలకాలం ఉంటారు. ఆ స్థలాన్ని వదలి మరెక్కడి కైనా పోవాలని వారు ఎన్నటికీ కోరుకోరు.[141]

خٰلِدِيْنَ فِيْهَا لَا يَبْغُوْنَ عَنْهَا حِوَلًا ﴿108﴾

**109** (ఓ ప్రవక్తా!) ఈ విధంగా చెప్పు : "ఒకవేళ నా ప్రభువు మాటలను[142] వ్రాయటానికి సముద్రం సిరాగా మారిపోయినా సరే, నా ప్రభువు మాటలు పూర్తి కాకముందే, అది అయి పోతుంది." – మేము మళ్లీ దాని వంటిదే (మరో సముద్రం) దాని సహాయార్థం తెచ్చినాసరే."

قُلْ لَّوْ كَانَ الْبَحْرُ مِدَادًا لِّكَلِمٰتِ رَبِّيْ لَنَفِدَ الْبَحْرُ قَبْلَ اَنْ تَنْفَدَ كَلِمٰتُ رَبِّيْ وَلَوْ جِئْنَا بِمِثْلِهٖ مَدَدًا ﴿109﴾

**110** (ఓ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: "నేనూ మీలాంటి మానవ మాత్రుణ్ణే.[143] (కాకపోతే) 'మీ అందరి ఆరాధ్యదైవం ఒకే ఆరాధ్య

قُلْ اِنَّمَآ اَنَا بَشَرٌ مِّثْلُكُمْ يُوْحٰٓى اِلَيَّ اَنَّمَآ اِلٰهُكُمْ

---

వస్తాయి. ప్రవక్తలు వాటిని ప్రజలకు విడమరచి చెప్పారు. 'ప్రభువును కలుసుకోవలసి ఉందన్న విషయం' త్రోసిపుచ్చటం అంటే మరణానంతర జీవితాన్ని, తీర్పుదినాన్ని నిరాకరించటం అన్నమాట!

139. అంటే మా దృష్టిలో వారికీ, వారి కర్మలకు ఎలాంటి విలువా ఉండదు. కనీసం వారి ఆచరణలను తూకం వేయ డానికి మేము ధర్మకాటాను కూడా నెలకొల్పబోము. సత్కర్మలతోపాటు దుష్కర్మలను కూడా కలిగి వున్న ఏకదైవారాధకుల కర్మలను మాత్రమే మేము తూకం వేస్తాము. కాగా; ఈ సత్యతిరస్కారుల కర్మల రికార్డులలో అసలు సత్కార్యాలే ఉండవు. హదీసులో ఈ విధంగా చెప్పబడింది : "ప్రళయదినాన బాగా బలిసిన వ్యక్తి ఒకడు వస్తాడు. అల్లాహ్ సన్నిధిలో వాడి బరువు దోమ రెక్కంత కూడా ఉండదు." ఆ తరువాత మహాప్రవక్త (సఅసం) ఈ ఆయతును పఠించారు (సహీహ్ బుఖారీ – అల్ కహఫ్ సూరా).

140. **'ఫిరదౌసు వనం'** అనేది స్వర్గంలోని అత్యున్నత స్థానం (జన్నతుల్ ఫిర్దౌస్). అందుకే "మీరు అల్లాహ్‌ను స్వర్గం కోరినప్పుడల్లా జన్నతుల్ ఫిరదౌసును కోరండి. ఎందుకంటే అది స్వర్గంలోని అత్యున్నత స్థలం. స్వర్గంలోని సెలయేరులన్నీ అక్కడి నుంచే పుడతాయి" అని మహాప్రవక్త (సఅసం) ఉపదేశించారు (బుఖారీ – కితాబుత్తౌహీద్).

141. ఒకసారి స్వర్గంలో ప్రవేశించిన తరువాత స్వర్గవాసులు అక్కడి అనుగ్రహాలతో ఎన్నడూ విసుగుచెందరు. ఆ ప్రదేశాన్ని వదలి మరో చోటికి వెళ్ళాలన్న కోరిక వారిలో ఎన్నడూ జనించదు.

142. **'మాటలు'** (కలిమాత్) అంటే దేవుని సర్వవ్యాప్త జ్ఞానం, అందలి పరమార్థాలు, ఆయన ఏకత్వానికి సంబంధించిన ఆధారాలు, నిదర్శనాలని భావం. మానవమాత్రుని మేధ ఈ విషయాలన్నింటినీ అందుకోజాలదు. లోకంలోని వృక్షాలన్నీ 'కలము'గా మారినా, సమస్త సముద్రాల జలం సిరాగా మారినా, ఆ సిరాలాంటిదే మరి అంతటి సిరాను తెచ్చినా – కలములు అరిగిపోతాయి, సిరా అంతా అయిపోతుంది. కాని ప్రభువు మాటలు, ఆయన గుణగణాలు మాత్రం ఎన్నటికీ తరగవు.

దైవం' అన్న సందేశం (వహీ) నా వద్దకు పంపబడుతుంది.[144] కనుక తన ప్రభువును కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్నవాడు సత్కార్యాలు చేయాలి. తన ప్రభువు ఆరాధనలో[145] వేరొకరికి భాగస్వామ్యం కల్పించకూడదు."

إِلَٰهٌ وَاحِدٌ ۖ فَمَن كَانَ يَرْجُو لِقَاءَ رَبِّهِ فَلْيَعْمَلْ عَمَلًا صَالِحًا وَلَا يُشْرِكْ بِعِبَادَةِ رَبِّهِ أَحَدًا ﴿١١٠﴾

143. అందువల్ల నేను సయితం ప్రభువు మాటలన్నింటినీ మీకు వివరించలేను.

144. అయితే నా వద్దకు 'వహీ' (దైవవాణి) వస్తుంది. ఈ 'వహీ' ద్వారానే నేను గుహవారి గాథను, జుల్ఖర్నైన్ వృత్తాంతాన్ని వివరించాను. నా ప్రభువు అనుగ్రహంతోనే ఇది నాకు సాధ్యమయింది. తరాలు గతించినా, శతాబ్దాలు గడిచిపోయినా ఈ యదార్థ గాథలు కాలగర్భంలో కలిసిపోలేదు. ఎందుకంటే నా ప్రభువు వాటిని రక్షించాడు. నా వద్దకు పంపబడిన 'వహీ'లో మీకు తెలుపబడిన మరో ముఖ్య విషయం ఏమిటో తెలుసా?! అదే 'దేవుని ఏకత్వం'! మీ ఆరాధ్య దైవం ఒక్కడే! ఆయనకు సహవర్తులు ఎవరూ లేరు.

145. మహాప్రవక్త (సఅసం) వారు చూపిన పద్ధతి ననుసరించి చేసేదే సత్కార్యం (అమలె సాలెహ్). అంటే తన ప్రభువును కలుసుకోవాలని ఆరాటపడే వ్యక్తి అంతిమ దైవప్రవక్త (స) విధానాన్ని అనుసరించి సదాచరణ చేయాలి. ఆరాధనలో అల్లాహ్కు సాటి కల్పించకూడదు. ఎందుకంటే షిర్క్ (దైవత్వంలో సాటి కల్పించటం), బిద్అత్ (ప్రవక్త విధానానికి విరుద్ధంగా సత్కార్యం చేయటం) – ఇవి రెండూ ఆచరణలను సర్వనాశనం చేసేస్తాయి. కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఈ రెండు దుష్టపోకడల నుంచి మనల్ని రక్షించుగాక!

19వ సూరా

# మర్యమ్

(మర్యమ్ - దైవప్రవక్త ఈసా గారి మాతృమూర్తి)

అవతరణ మక్కాలో

ఆయతులు 98

## పరిచయం

*ఈ సూరా ప్రధానంగా తౌహీద్ (ఏక దైవారాధన)ను నొక్కి చెబుతుంది. మర్యమ్, ఈసాప్రవక్త (అస)ల గాథ ఈ సూరాలో ఉంది. మర్యమ్, జకరియాల గాథ ద్వారా ఈ సూరా మనకు అల్లాహ్ ఏకత్వానికి సంబంధించిన నిదర్శనాలను చూపిస్తోంది. ఆయన శక్తిసామర్థ్యాలను మనకు పరిచయం చేస్తుంది. అల్లాహ్‌కు ఎవరూ భాగస్వాములు లేరని, ఆయనకు కుమారులు ఎవరూ లేరని ఈ సూరా నొక్కి చెప్పింది. ఇందులో ధార్మిక విశ్వాసానికి సంబంధించిన మరో రెండు సూత్రాలను కూడా నొక్కి చెప్పడం జరిగింది. అవి : మరణానంతరం మళ్ళీ లేపబడడం, పరలోకంలో శిక్షా లేదా బహుమానాలు పొందడం. ఈ సూరాలోని 16వ ఆయత్‌లో ప్రారంభమయ్యే మర్యమ్ గాథ వల్ల ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది.*

*ఈ సూరాలో ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) గాథ గురించిన ప్రస్తావన కూడా ఉంది. ఆయనను సత్యసంధుడైన ప్రవక్తగా ఈ సూరా అభివర్ణించింది. నూహ్ (అస), మూసా (అస), హారూన్ (అస), ఇస్మాయీల్ (అస), ఇద్రీస్(అస)ల ప్రస్తావనలు ఈ సూరాలో వచ్చాయి. మరణానంతరం మళ్ళీ లేపబడడం జరుగుతుందన్న విషయాన్ని నిరాకరించే అవిశ్వాసుల గురించి కూడా ఇందులో ప్రస్తావనలు ఉన్నాయి. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరగదని వారు చేసే వాదనను తిప్పికొట్టడం జరిగింది. ఏమీ లేనప్పుడు వారిని సృష్టించడం జరిగినప్పుడు, మరణించిన తర్వాత మళ్ళీ లేపడం చాలా తేలికని చెప్పడం జరిగింది. మనిషికి ఇష్టం వచ్చిన మార్గం అవలంబించే స్వేచ్ఛ ఉందని, కాని సత్యాన్ని నిరాకరించడం వల్ల చివరకు దారుణమైన ఫలితాలు తప్పవని హెచ్చరించింది. తౌహీద్ (ఏకదైవారాధన) భావనను మళ్ళీ గట్టిగా చెబుతూ దేవునికి కుమారుడు ఎవరూ లేరని ఈ సూరా పునరుద్ఘాటించింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ **కథామాలికలో** చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 1-36 | 177-203 | 'ప్రవక్త జకరియా' నుంచి 'ఈసా ప్రవక్త' వరకు | లేక లేక పండు ముసలితనంలో, తన ప్రార్థనా ఫలితంగా జకరియా ప్రవక్తకు ఒక పిల్లవాడు పుట్టాడు. పెద్దయిన తర్వాత ఆ పిల్లవాడు కూడా తండ్రి అంతటి వాడయ్యాడు. కాని దైవ విరోధుల చేతుల్లో దారుణంగా హత్యచేయబడ్డాడు. సత్యధర్మ ప్రబోధకుల గుండెల్లో స్ఫూర్తిని రగిలించే వాస్తవ గాథ ఇది! |
| 41-49 | 30 | 'ఇబ్రాహీమ్ ప్రవక్త' | ఆయన పేరు వింటేనే 'తౌహీద్' (ఏక దైవారాధన) గుర్తుకు వస్తుంది. అటువంటి మహానుభావుని జీవితం చక్కని కథా రూపంలో. |
| 56, 57 | 12 | 'ఇద్రీసు ప్రవక్త' | ఇద్రీసు ప్రవక్త గురించి లభ్యమయ్యే సంక్షిప్త సమాచారం. |

## మర్యమ్ సూరా[1]

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1-2** కాఫ్ - హా - యా - ఐన్ - సాద్. నీ ప్రభువు తన దాసుడైన జకరియ్యాపై[2] దయదలచినప్పటి ప్రస్తావన ఇది.

**3** అతను తన ప్రభువును గోప్యంగా మొర పెట్టుకున్నప్పుడు[3] (జరిగిన సంఘటన ఇది).

**4** అతనిలా విన్నవించుకున్నాడు : "నా ప్రభూ! నా ఎముకలు బలహీనమై పోయాయి. వార్థక్యం వల్ల నా తల నెరసిపోయింది.[4] నిన్ను ప్రార్థించి నేనెన్నడూ విఫలుణ్ణి కాలేదు.[5]

**5 - 6** "నా తదనంతరం నా ఆప్తుల గురించి నాకు భయం పట్టుకుంది.[6] మరేమో నా భార్య గొడ్రాలు. కాబట్టి (ఓ అల్లాహ్!) నాకు వారసుడుగా ఉండటంతోపాటు, యాఖూబు సంతతికి కూడా వారసుడు అయ్యే ఒక వారసుణ్ణి నువ్వు నీ వద్ద నుంచి ప్రత్యేకంగా[7] నాకు అనుగ్రహించు. ప్రభూ! నువ్వతన్ని ప్రియతము నిగా చేయి."

## سُوْرَةُ مَرْيَمَ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

كٓهٰيٰعٓصٓ (1)
ذِكْرُ رَحْمَتِ رَبِّكَ عَبْدَهٗ زَكَرِيَّا (2)
اِذْ نَادٰى رَبَّهٗ نِدَآءً خَفِيًّا (3)
قَالَ رَبِّ اِنِّيْ وَهَنَ الْعَظْمُ مِنِّيْ وَاشْتَعَلَ الرَّاْسُ شَيْبًا وَّلَمْ اَكُنْۢ بِدُعَآىِٕكَ رَبِّ شَقِيًّا (4)
وَاِنِّيْ خِفْتُ الْمَوَالِيَ مِنْ وَّرَآءِيْ وَكَانَتِ امْرَاَتِيْ عَاقِرًا فَهَبْ لِيْ مِنْ لَّدُنْكَ وَلِيًّا (5)
يَّرِثُنِيْ وَيَرِثُ مِنْ اٰلِ يَعْقُوْبَ ۖ وَاجْعَلْهُ رَبِّ رَضِيًّا (6)

---

1. మహాప్రవక్త ముహమ్మద్ ప్రియసహచరులు అబిసీనియాకు వలస వెళ్ళినప్పుడు జరిగిన ఒక సంఘటన - ఈ సూరాలోని తొలి వచనాలను హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి) అబిసీనియా చక్రవర్తి అయిన నజాషీ దర్బారులో చదివి వినిపించినపుడు చక్రవర్తితో సహా వారందరి గడ్డాలు కన్నీటితో తడిసిపోయాయి. నజాషీ చక్రవర్తి అమితంగా ప్రభావితుడై ఇలా అన్నాడు : "ఈ ఖుర్ఆన్‌గానీ, హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) తెచ్చిన సందేశంగానీ- అన్నీ ఒకే కాగడా నుంచి విరజిమ్మే వెలుగు కిరణాలు" (ఫత్‌హుల్ ఖదీర్).
2. హజ్రత్ జకరియ్యా (అలైహిస్సలాం) ఇస్రాయీల్ సంతతిలో ప్రభవించిన ప్రవక్తలలో ఒకరు. వృత్తిపరంగా ఈయన వడ్రంగి. ఆ పని ద్వారానే ఆయనకు జీవనోపాధి లభించేది (సహీహ్ ముస్లిం - జకరియ్యా గొప్పదనం గురించిన అధ్యాయం).
3. ఏకాంతంలో - మెల్లిగా - వేడుకోవటానికి కారణమేమిటంటే ఈ విధమైన వేడుకోలు అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. ఈ విధమైన ప్రార్థనలో దాసునికి ఏకాగ్రత లభిస్తుంది. అతను ఎంతో దీనంగా, ఆర్ద్రంగా విలపిస్తూ తన గోడును వినిపించుకుంటాడు. ఆ విధంగా దాసుని దీనావస్థపై దైవకారుణ్యం కదలి వస్తుంది. ఆయన రహస్యంగా మొరపెట్టుకోవటానికి గల మరో కారణమేమిటంటే, అందరికీ తెలిసేలా ఆయన సంతాన ప్రాప్తికోసం ప్రార్థిస్తే ఈ ముసలితనంలో ఈయనగారికి ఎన్ని కోర్కెలున్నాయో చూడండి! అంటూ లోకులు ఎగతాళి చేస్తారు.
4. అంటే అగ్ని వల్ల కట్టెలు ఎలా మండుతాయో అలాగే ముసలితనం వల్ల నా తల వెంట్రుకలు మెరసిపోతున్నాయి.
5. నా బాహ్య పరిస్థితినిబట్టి చూస్తే నాకు సంతానం కలిగే అవకాశం లేనే లేదు. అయినప్పటికీ నేను నీ కారుణ్యంపట్ల నిరాశ చెందలేదు. నువ్వు గనక తలిస్తే ప్రతిదీ సాధ్యమే. ఇంతవరకు నేను నిన్ను ఏది అడిగినా నువ్వు నన్ను నిరాశపరచలేదు. కనుక ఓ ప్రభూ! ఈ కోరిక కూడా నువ్వు తప్పకుండా తీరుస్తావన్న ఆశ నాకుంది.

**7** "ఓ జకరియ్యా! మేము నీకు ఒక కుమారుని శుభవార్తను వినిపిస్తున్నాము – అతని పేరు యహ్యా. మేము ఇంతకు ముందు ఈ పేరుగల వానిని చేయలేదు"[8] (అని సెలవీయబడింది).

يٰزَكَرِيَّآ اِنَّا نُبَشِّرُكَ بِغُلٰمِ ۨاسْمُهٗ يَحْيٰى ۙ لَمْ نَجْعَلْ لَّهٗ مِنْ قَبْلُ سَمِيًّا ⑦

**8** "నా ప్రభూ! నాకు పిల్లవాడు ఎలా పుడతాడు? నా భార్యయేమో గొడ్రాలు.[9] నేనేమో వృద్ధాప్యపు ఆఖరి దశకు చేరుకున్న వాణ్ణి" అని జకరియ్యా చెప్పుకున్నాడు.

قَالَ رَبِّ اَنّٰى يَكُوْنُ لِيْ غُلٰمٌ وَّكَانَتِ امْرَاَتِيْ عَاقِرًا وَّقَدْ بَلَغْتُ مِنَ الْكِبَرِ عِتِيًّا ⑧

**9** "అలాగే అవుతుంది" అని సెలవీయబడింది. "అది నాకు చాలా తేలిక. ఇంతకు ముందు నీకంటూ ఒక అస్థిత్వమే లేనపుడు నేను నిన్ను పుట్టించలేదా?!"[10] అని నీ ప్రభువు అన్నాడు.

قَالَ كَذٰلِكَ ۚ قَالَ رَبُّكَ هُوَ عَلَيَّ هَيِّنٌ وَّقَدْ خَلَقْتُكَ مِنْ قَبْلُ وَلَمْ تَكُ شَيْـًٔا ⑨

**10** "నా ప్రభూ! (మరయితే) నా కొరకు ఏదన్నా ఆనవాలును నిర్ణయించు" అని అతను విన్నవించుకోగా, "నువ్వు కులాసాగా ఉన్నప్పటికీ మూడు రాత్రుల వరకూ ప్రజలతో మాట్లాడలేవు.[11] ఇదే నీ కొరకు ఆనవాలు" అని సెలవీయబడింది.

قَالَ رَبِّ اجْعَلْ لِّيْٓ اٰيَةً ۗ قَالَ اٰيَتُكَ اَلَّا تُكَلِّمَ النَّاسَ ثَلٰثَ لَيَالٍ سَوِيًّا ⑩

6. ఎందుకంటే ప్రజలకు బోధపరచే నేర్పు, మార్గదర్శకత్వం వహించే సామర్థ్యం ప్రస్తుతం నా బంధువులలో ఎవరిలోనూ లేవు. బోధకుడు లేని కారణంగా నా ఆప్తులు సయితం దారితప్పే ప్రమాదం ఉంది.

7. 'నువ్వు నీ వద్ద నుంచి ప్రత్యేకంగా అనుగ్రహించు' అంటే భావం ఇది : నేనా ముసలివాణ్ణి. నా భార్యేమో గొడ్రాలు. మాకు సంతానం కలిగే అవకాశాలు దాదాపు అడుగంటి పోయాయి. అయినప్పటికీ నీ కారుణ్యం ఎంతో విస్తృతమైనది. నువ్వు ఎవరినయినా కటాక్షించదలిస్తే ఎలాగయినా సరే కటాక్షించగలవు. నీ దగ్గర దేనికీ లోటులేదు.

8. అల్లాహ్ ఆయన ప్రార్థనకు ఆమోదముద్ర వేయటమే గాక, ఆయనకు కలగబోయే కుమారుని నామకరణం కూడా చేశాడు.

9. **'ఆఖిరున్' (عَاقِرٌ)** అంటే వయసు మీరిన కారణంగా (మెనోపాజ్ దశను దాటిపోయినందున) పిల్లల్ని కనే సామర్థ్యంలేని స్త్రీ అని ఒక అర్థం. మొదటినుంచీ వంధ్యురాలుగా ఉన్న స్త్రీని కూడా ఆఖిరున్‌గా వ్యవహరిస్తారు. ఈ ఆయతులో మటుకు ఈ పదం రెండవ భావంలోనే ప్రయోగించబడింది. నా భార్య మొదటినుంచీ గొడ్రాలు. మరోవంక నేను ముసలితనంతో పండిపోయాను. నా ఎముకలు సయితం బలహీనమైపోయాయి. అలాంటప్పుడు నాకు సంతానం కలగటం ఎలా సంభవం? అన్నది జకరియ్యా (అలైహిస్సలాం) మాటల అంతరార్థం. హజ్రత్ జకరియ్యా (అలైహిస్సలాం) భార్య పేరు ఇషా బిన్తె ఫాఖూద్ బిన్ మేల్ అనీ, ఈమె మర్యమ్ తల్లియగు హన్నా సోదరి అని చెప్పబడుతోంది. అయితే ఇషా కూడా హజ్రత్ మర్యమ్ తండ్రి అయిన హజ్రత్ ఇమ్రాన్ కుమార్తె అని మరో కథనం ఉంది. రెండవ కథనమే ప్రామాణికం అనిపిస్తోంది. ఈ విధంగా హజ్రత్ యహ్యా హజ్రత్ ఈసాలు ఇద్దరూ అక్కాచెల్లెళ్ళ కుమారులు (తల్లివరస సోదరులు) అవుతారు. ప్రామాణిక హదీసు ద్వారా కూడా ఇది రూఢీ అవుతోంది (ఫత్‌హుల్ ఖదీర్).

10. ఇవి దైవదూత పలుకులు. తనకు కొడుకు పుట్టబోతున్నాడన్న శుభవార్తను వినగానే హజ్రత్ జకరియ్యాకు ఆశ్చర్యం కలిగింది. ఆయన ఆశ్చర్యాన్ని దూరం చేయడానికి దైవదూత ఇలా అన్నాడు : అల్లాహ్ నీకు మగబిడ్డను ప్రసాదించాలని నిశ్చయించుకున్నాడు. కాబట్టి నీకు మగపిల్లవాడు పుట్టడం ఖాయం. ఈ పని ఆయనకు ఏమాత్రం కష్టతరం కాదు.

**11** అందువల్ల అతను తన కుటీరం నుంచి[12] తన జాతి ప్రజల వద్దకు వచ్చి, ఉదయం సాయంత్రం అల్లాహ్ పవిత్రతను కొనియాడమని[13] సైగ ద్వారా ఉపదేశించసాగాడు.

فَخَرَجَ عَلٰى قَوْمِهٖ مِنَ الْمِحْرَابِ فَاَوْحٰۤى اِلَيْهِمْ اَنْ سَبِّحُوْا بُكْرَةً وَّعَشِيًّا ⑪

**12** "ఓ యహ్యా! నా గ్రంథాన్ని[14] గట్టిగా పట్టుకో." మేమతనికి బాల్యం నుంచే విజ్ఞతను[15] వొసగాము.

يٰيَحْيٰى خُذِ الْكِتٰبَ بِقُوَّةٍ ؕ وَاٰتَيْنٰهُ الْحُكْمَ صَبِيًّا ⑫

**13** ఇంకా మా వద్ద నుంచి వాత్సల్యాన్నీ, పవిత్రతను[16] కూడా ప్రసాదించాము. అతను భయభక్తులు గలవాడు.

وَّحَنَانًا مِّنْ لَّدُنَّا وَزَكٰوةً ؕ وَكَانَ تَقِيًّا ⑬

**14** అతను తన తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండేవాడు. అతను దౌర్జన్యపరుడూ కాదు, అవిధేయుడూ కాదు.[17]

وَّبَرًّۢا بِوَالِدَيْهِ وَلَمْ يَكُنْ جَبَّارًا عَصِيًّا ⑭

ఒకప్పుడు అసలు నీ ఉనికే ఉండేది కాదు. అలాంటి నీకు ఆయన ఒక అస్థిత్వం ప్రసాదించినపుడు వృద్ధాప్యంలో నీకు కొడుకును ఇవ్వటంలో వింతేముందీ?!

11. **'మూడు రాత్రులు'** అంటే పగలు – రేయి కలుపుకుని మూడు రోజులు అని భావం. 'కులాసా' (సవియ్యన్) అంటే అస్వస్థతకు గానీ, వ్యాకులతకు గానీ లోనవకుండా క్షేమంగా ఉంటావు. క్షేమంగా ఉండి కూడా నువ్వు ఆ సమయంలో మాట్లాడలేవు. మాట్లాడలేకపోయావంటే 'శుభవార్త' వినే రోజు దగ్గరపడిందని అనుకో.

12. అరబీలో **'మిహ్రాబ్'** అని ఉంది. 'మిహ్రాబ్' అంటే ప్రార్థన చేసే ప్రత్యేక స్థలం, కుటీరం అని అర్థం. 'మిహ్రాబ్' అనే పదం 'హరబ్' నుంచి వచ్చింది. 'హరబ్' అంటే యుద్ధం, పోరాటం అని అసలు అర్థం. ఆరాధనాలయంలో ఉండి అల్లాహ్‌ను ఆరాధించటమంటే ఒకవిధంగా షైతాన్‌తో పోరాడటమే.

13. ఉదయం, సాయంత్రం దైవస్తోత్రం చేయటమంటే ఫజ్ర్, అస్ర్ నమాజులు చేయటమని భావం. లేదా ఆ రెండు వేళల్లో దైవధ్యానం చేయమనీ, ఆయన పవిత్రతను కొనియాడమనీ భావం.

14. అల్లాహ్ తన ప్రవక్త అయిన జకరియ్యా (అలైహిస్సలాం)కు యహ్యా (అలైహిస్సలాం)ను ప్రసాదించాడు. ఆ పిల్లవాడు కాస్త ఎదిగిన తరువాత – అతనింకా పిల్లవాడుగా ఉండగానే – తన గ్రంథాన్ని గట్టిగా పట్టుకోవలసిందిగా, గ్రంథాను సారం జీవితం గడపవలసినదిగా అతనికి ఆదేశించాడు. 'గ్రంథం' అంటే తౌరాత్ గ్రంథం కావచ్చు లేదా అతనిపై అవతరించిన మరేదైనా గ్రంథం కావచ్చు. దాని గురించి మనకు ఖచ్చితంగా తెలియదు.

15. ఈ ఆయతులో **'హుక్మ్'** అంటే వివేకం, విజ్ఞత, యుక్తి, నేర్పు, చైతన్యం–వీటిలో ఏదైనా కావచ్చు. గ్రంథంలో పొందు పరచబడిన ఆజ్ఞల్ని తెలుసుకునే గ్రాహ్యశక్తి, ఆచరణా సద్బుద్ధి కూడా కావచ్చు. లేక ప్రవక్త పదవి కూడా కావచ్చు. 'హుక్మ్' అనే పదంలో ఈ అర్థాలన్నింటినీ తీసుకున్నా అవి వర్తిస్తాయని ఇమామ్ షౌకానీ వ్యాఖ్యానించారు.

16. **'హనానన్'** ( حَنَانًا ) అంటే వాత్సల్యం దయాభావం అని అర్థం. అతను తన తల్లి దండ్రుల యెడల దయాభావంతో మెలగాలనీ, తన బంధుమిత్రులపై వాత్సల్యాన్ని కురిపించాలని మేమతనికి ఈ సద్గుణాలను ఇచ్చాము. అవిధేయత, కర్కశత్వం, అహంకారం వంటి దుర్గుణాల నుంచి అతన్ని దూరంగా ఉంచాము. అతని మనసును నిర్మలంగా, పవిత్రంగా ఉంచాము.

17. అంటే అతను తన తల్లిదండ్రుల యెడలగానీ, తన ప్రభువు పట్లగానీ అవిధేయుడుగా వ్యవహరించలేదు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే అల్లాహ్ ఎవరిలోనయినా దయా దాక్షిణ్యాలను, తల్లిదండ్రుల యెడల సేవాభావాన్ని సృజించాడంటే అతనిపై అమితంగా దయదలచాడన్నమాట! వీటికి భిన్నమైన గుణాలు ఎవరిలోనయినా ఉంటే వారు దైవకారుణ్యానికి దూరమయ్యారు.

15 అతను పుట్టిన రోజునా, మరణించే రోజునా, అతను తిరిగి బ్రతికించి లేపబడే రోజునా[18] అతనికి శాంతి కల్గుగాక!

وَسَلٰمٌ عَلَيْهِ يَوْمَ وُلِدَ وَيَوْمَ يَمُوْتُ وَيَوْمَ يُبْعَثُ حَيًّا ⑮

16 (ఓ ముహమ్మద్ – స!) ఈ గ్రంథంలో మర్యమ్ విషయాన్ని కూడా ప్రస్తావించు. అప్పుడామె తన వాళ్ళనుంచి వేరై, తూర్పు వైపుకు వచ్చింది.

وَاذْكُرْ فِي الْكِتٰبِ مَرْيَمَ ۘ اِذِ انْتَبَذَتْ مِنْ اَهْلِهَا مَكَانًا شَرْقِيًّا ⑯

17 ఆ తరువాత వారికి చాటుగా తెర వేసుకుంది.[19] అప్పుడు మేము ఆమె వద్దకు మా ఆత్మ (జిబ్రయీలు అలైహిస్సలాం)ను పంపాము. అతడు ఆమె ఎదుట సంపూర్ణ మానవాకారంలో వచ్చాడు.[20]

فَاتَّخَذَتْ مِنْ دُوْنِهِمْ حِجَابًا ۫ فَاَرْسَلْنَآ اِلَيْهَا رُوْحَنَا فَتَمَثَّلَ لَهَا بَشَرًا سَوِيًّا ⑰

18 “నేను నీ బారి నుంచి కరుణామయుని (అల్లాహ్) శరణు వేడుతున్నాను, నువ్వు ఏ మాత్రం దైవభీతి గలవాడవైనా (ఇక్కణ్ణుంచి వెళ్ళిపో)” అని ఆమె చెప్పింది.

قَالَتْ اِنِّيْٓ اَعُوْذُ بِالرَّحْمٰنِ مِنْكَ اِنْ كُنْتَ تَقِيًّا ⑱

18. మూడు సందర్భాలు మనిషి పాలిట ఎంతో సంక్లిష్టంగా, ఆందోళనాకరంగా ఉంటాయి. 1. మానవుడు తల్లి కడుపును చీంచుకుని బయటపడేటప్పుడు. 2. మృత్యు ఒడిలోకి జారుకునేటప్పుడు. 3. సమాధిలో నుంచి మళ్లీ లేపబడి- ప్రళయ దినాన- సమావేశపరచబడేటప్పుడు. ఈ మూడు సందర్భాలలోనూ యహ్యాకు శాంతి కలగాలని అల్లాహ్ సెలవిచ్చాడంటే నిజంగా ఆయన ధన్యజీవి.

ధార్మిక అంశాలకు విపరీతార్థాలు తీసే కొందరు ప్రబుద్ధులు (బిద్అతీలు) ఈ ఆయతును 'పుట్టినరోజు పండుగ' (ఈదె మీలాద్)కు ఆధారంగా తీసుకుంటారు. మరి ఆ లెక్కన 'చచ్చే రోజు'ను కూడా 'చచ్చిన రోజు పండుగ' (ఈదె వఫాత్)గా జరుపుకోవాలి కదా! ఎందుకంటే పై ఆయతులో పుట్టినరోజుతో పాటు చచ్చినరోజు కూడా 'శాంతి' కలుగుతుందని చెప్పబడింది. కాని వారు 'ఈదె వఫాత్' సంగతిని అలా వుంచితే, కనీసం 'వఫాత్'ని (అంటే అంతిమ దైవప్రవక్త మరణించారన్న విషయాన్ని) కూడా అంగీకరించరాయె. ఈ విధంగా వారు మహాప్రవక్త (స) వారి మరణ విషయాన్ని తిరస్కరించి ఖుర్ఆన్‌లోని మౌలిక సత్యాన్ని తృణీకరించటమే గాకుండా, ఈ ఆయతులోని ఒక భాగాన్ని ఒప్పుకుని, ఇందలి మరో భాగాన్ని త్రోసిరాజంటున్నారు. “ఏమిటీ, దైవగ్రంథంలోని కొన్ని భాగాలను విశ్వసించి, మరికొన్ని భాగాలను తిరస్కరిస్తారా?” (అల్ బఖర – 85).

19. ఆమె ప్రజల నుంచి ఎందుకు వేరైపోయింది. తెరచాటుకు ఎందుకు వెళ్ళింది? బహుశా ప్రార్థన కోసం వెళ్ళి ఉండవచ్చు. లేదా ఏకాగ్రతకోసం వేరై ఉండవచ్చు లేదా బహిష్టు స్థితినుంచి పరిశుద్ధతను పొందటానికి స్నానం చేసే ఉద్దేశంతో తెరను వేసుకుని ఉండవచ్చు. తూర్పు వైపున ఉన్న స్థలం అంటే 'బైతుల్ మఖ్దిస్'కి తూర్పు దిక్కున అని భావం.

20. ఈ ఆయతులో **'రూహ్'** అంటే దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) అని భావం. ఆయన్ని నిండు మనిషి రూపంలో దేవుడు ఆమె వద్దకు పంపాడు. ఒక అపరిచిత వ్యక్తి అడ్డూ ఆపూ లేకుండా తానున్న ఏకాంత వాసంలోకి జొరబడి వచ్చేసరికి ఆమె నిర్ఘాంతపోయింది. సహజంగానే భయపడింది. అతని ఉద్దేశ్యాన్ని శంకించింది. 'నువ్వు తలపోస్తు న్నట్లుగా నేను దురుద్దేశంతో రాలేదమ్మా! నేను నీ ప్రభువు తరఫున పంపబడిన దైవదూతను. ఆయన నీకు కుమారుణ్ణి ప్రసాదించనున్నాడని శుభవార్తను వినిపించటానికి నేను వచ్చాను' అని విన్నవించుకున్నాడు.

قَالَ إِنَّمَا أَنَا رَسُولُ رَبِّكِ لِأَهَبَ لَكِ غُلَامًا زَكِيًّا ﴿١٩﴾

**19** “నేను నీ ప్రభువు తరఫున పంపబడిన దూతను. నీకు ఒక పవిత్రుడైన పిల్లవాణ్ణి ఇవ్వటానికి వచ్చాను” అని అతనన్నాడు.

قَالَتْ أَنَّىٰ يَكُونُ لِي غُلَامٌ وَلَمْ يَمْسَسْنِي بَشَرٌ وَلَمْ أَكُ بَغِيًّا ﴿٢٠﴾

**20** “నాకు పిల్లవాడు కలగటమేమిటీ? నన్ను ఏ మగాడూ కనీసం తాకనైనా లేదే! నేను దుర్నడత గల దాన్ని కూడా కానే!!” అని ఆమె అన్నది.

قَالَ كَذَٰلِكِ قَالَ رَبُّكِ هُوَ عَلَيَّ هَيِّنٌ ۖ وَلِنَجْعَلَهُ آيَةً لِلنَّاسِ وَرَحْمَةً مِنَّا ۚ وَكَانَ أَمْرًا مَقْضِيًّا ﴿٢١﴾

**21** “జరిగేది మాత్రం ఇదే.[21] ‘అది నాకు చాలా సులువు. మేము అతన్ని జనుల కోసం ఒక సూచనగా,[22] మా ప్రత్యేక కృపగా[23] చేయదలిచాము. ఇదొక నిర్ధారిత విషయం’[24] అని నీ ప్రభువు సెలవిచ్చాడు” అని అతను వివరించాడు.

فَحَمَلَتْهُ فَانْتَبَذَتْ بِهِ مَكَانًا قَصِيًّا ﴿٢٢﴾

**22** అంతే, ఆమె గర్భవతి అయింది. ఈ కారణంగా ఆమె ఏకాంతం కోసం దూర ప్రదేశానికి వెళ్ళిపోయింది.

فَأَجَاءَهَا الْمَخَاضُ إِلَىٰ جِذْعِ النَّخْلَةِ قَالَتْ يَا لَيْتَنِي مِتُّ قَبْلَ هَٰذَا وَكُنْتُ نَسْيًا مَنْسِيًّا ﴿٢٣﴾

**23** ఆ తరువాత పురిటినొప్పులు ఆమెను ఒక ఖర్జూర చెట్టు క్రిందికి చేర్చాయి. “అయ్యో! నేను ఇంతకు మునుపే చచ్చిపోయి వుంటే, లోకులు నన్ను మరచిపోయి ఉంటే బావుండునే!”[25] అని ఆమె బాధపడసాగింది.

فَنَادَاهَا مِنْ تَحْتِهَا أَلَّا تَحْزَنِي قَدْ جَعَلَ رَبُّكِ تَحْتَكِ سَرِيًّا ﴿٢٤﴾

**24** అంతలో (దైవదూత) క్రింది నుంచే ఆమెను పిలిచి ఇలా అన్నాడు: “బాధ పడకు. నీ ప్రభువు నీ క్రింద ఒక నీటి ఊటను ప్రవహింపజేశాడు.

21. అంటే నీకు మగవాని పొందు లభించని మాట నిజమే. నువ్వు సౌశీల్యవతివన్న సంగతి కూడా నిజమే. అయినాసరే ఇది నీ ప్రభువు నిర్ణయం.

22. ఇక్కడ అల్లాహ్ చెప్పదలచినదేమిటంటే; “మేము ఏది చేయగోరినా కష్టసాధ్యం కాదు. మేము ఆ బాలుణ్ణి సృష్టి ప్రక్రియలో ఒక వినూత్న ఘట్టంగా, ఓ కొంగ్రొత్త ఆవిష్కరణగా చేయదలిచాము. ఇంతకు మునుపు మేము మీ పితామహుడైన ఆదామును స్త్రీ, పురుషుడు లేకుండానే సృజించాము. మీ మాతృమూర్తి అయిన హవ్వాను కేవలం పురుషుని నుంచి సృష్టించాము. మీ అందరినీ స్త్రీ – పురుషుల జంట ద్వారా అవనిలో వ్యాపింపజేశాము. ఇప్పుడు ఈసా (ఏసుక్రీస్తు) ను నాల్గవ తరహాలో – పురుషుడు లేకుండానే కేవలం స్త్రీ ద్వారా – సృజించి మా శక్తియుక్తులను మీకు చూపదలచాము. సృష్టికి సంబంధించిన ఈ స్వరూపాలు కూడా మా శక్తికి ప్రతీకలే.

23. **‘ప్రత్యేక కృప’** లేక ‘ప్రత్యేక కారుణ్యం’ అంటే దైవదౌత్యం అని భావం.

24. ఈ పలుకులు జిబ్రయీల్ (అలైహిస్సలాం)వి కావు. అల్లాహ్ పలుకులను జిబ్రయీల్ (ఆయన తరఫున) పలికారు. అల్లాహ్ సృష్టి అపురూపమైనదనీ, ఆయన ఒకసారి ఆ మేరకు నిర్ణయించుకున్న మీదట దానికిక తిరుగు ఉండదని చెప్పారు.

25. ‘నేను చచ్చిపోయినా బావుండేదే!’ అని ఆమె చెప్పటం అర్థం చేసుకోదగిన విషయమే. అన్నెంపున్నెం ఎరుగని తనకు గర్భం వచ్చింది. ఇప్పుడు పలువురు పలు ప్రశ్నలు వేస్తారు. తనకేం తెలీదు అంటే ఎవరూ నమ్మరు. ఒకప్పుడు

**25** “ఆ ఖర్జూరపు మొదలును నీ వైపుకు ఊపు. తాజా ఖర్జూర పండ్లు నీపై రాల్తాయి.[26]

وَهُزِّىٓ إِلَيْكِ بِجِذْعِ ٱلنَّخْلَةِ تُسَٰقِطْ عَلَيْكِ رُطَبًا جَنِيًّا ﴿٢٥﴾

**26** “ఇక హాయిగా తిను, త్రాగు, కన్నుల పండుగ చేసుకో.[27] ఏ మనిషైనా నీకు తారసపడితే, ‘నేను కరుణామయుని కోసం ఉపవాస వ్రతం పాటిస్తున్నాను. ఈ రోజు నేను ఎవరితోనూ మాట్లాడను’[28] అని చెప్పు.”

فَكُلِى وَٱشْرَبِى وَقَرِّى عَيْنًا ۖ فَإِمَّا تَرَيِنَّ مِنَ ٱلْبَشَرِ أَحَدًا فَقُولِىٓ إِنِّى نَذَرْتُ لِلرَّحْمَٰنِ صَوْمًا فَلَنْ أُكَلِّمَ ٱلْيَوْمَ إِنسِيًّا ﴿٢٦﴾

**27** ఆ తరువాత ఆమె ఆ పసివాణ్ణి ఎత్తుకుని తన జాతి వారి వద్దకు వచ్చింది. “ఓ మర్యమ్! నువ్వు పెద్ద పాపం చేశావు.

فَأَتَتْ بِهِۦ قَوْمَهَا تَحْمِلُهُۥ ۖ قَالُوا۟ يَٰمَرْيَمُ لَقَدْ جِئْتِ شَيْـًٔا فَرِيًّا ﴿٢٧﴾

**28** ఓ హారూన్ సోదరీ![29] నీ తండ్రీ చెడ్డవాడు కాడు. నీ తల్లి కూడా చెడు నడత గల స్త్రీ కాదే!” అని అందరూ అన్నారు.

يَٰٓأُخْتَ هَٰرُونَ مَا كَانَ أَبُوكِ ٱمْرَأَ سَوْءٍ وَمَا كَانَتْ أُمُّكِ بَغِيًّا ﴿٢٨﴾

**29** మర్యమ్ తన పసిపిల్లవాని వైపు సైగ చేసి చూపించింది. “ఒడిలో ఉన్న ఈ పసికందుతో మేమెలా మాట్లాడగలం?” అన్నారు వారంతా.

فَأَشَارَتْ إِلَيْهِ ۖ قَالُوا۟ كَيْفَ نُكَلِّمُ مَن كَانَ فِى ٱلْمَهْدِ صَبِيًّا ﴿٢٩﴾

**30** ఆ పసివాడు ఇలా పలికాడు : “నేను అల్లాహ్ దాసుడను. ఆయన నాకు గ్రంథం వొసగాడు. నన్ను తన ప్రవక్తగా నియమించాడు.[30]

قَالَ إِنِّى عَبْدُ ٱللَّهِ ءَاتَىٰنِىَ ٱلْكِتَٰبَ وَجَعَلَنِى نَبِيًّا ﴿٣٠﴾

---

ప్రజలు నన్ను ధర్మపరాయణురాలిగా, పుణ్యవతిగా పొగిడేవారు. మరి ఇప్పుడు నాపై అపనిందవేస్తే ఎలా తట్టుకోగలను? అన్నది ఆమె బాధతో.

26. **‘సరియ్యాన్’ (سَرِيًّا)** అంటే చిన్న సెలయేరు లేక నీటి ఊట అని అర్థం. కరుణామయుడైన అల్లాహ్ అద్భుతమైన రీతిలో ఆమె పాదాల క్రింద ఒక నీటి ఊటను సృష్టించాడు. ఎండిపోయిన చెట్టునుండి తాజా ఖర్జూరపండ్లను సమకూర్చాడు. పిలుపు ఇచ్చినవారు దైవదూత జిబ్రాయీల్ (అలైహిస్సలాం). ఆయన ఆ లోయ దిగువ భాగం నుంచి నినదించారు. ఇక్కడ సరియ్యాన్ అంటే సర్దారు అని అర్థమనీ, ఈ పదం ఈసా ప్రవక్తను సూచిస్తున్నదనీ, ఆయనే క్రింద నుంచి తల్లి మర్యమ్‌ను పిలిచారని కొంతమంది చెబుతారు.

27. అంటే ఆకలివేస్తే ఖర్జూర పండ్లు తిను. దాహమైతే ఆ నీరు త్రాగు. నీ పండంటి బిడ్డను చూసుకుని కన్నులపండుగ చేసుకో.

28. ఆ చెప్పటం కూడా నోటితో కాదు, ‘సంజ్ఞ’తో. అప్పట్లో ఉపవాస వ్రతమంటే అన్నపానీయాలను త్యజించటం, మౌనంగా ఉండటం అన్నమాట.

29. **‘హారూన్ సోదరీ!’** అని ఆమె సంబోధించబడటం గమనార్హం. అంటే బహుశా ఆమె కుటుంబంలో హారూన్ పేరు గల వ్యక్తి సుప్రసిద్ధుడై ఉండవచ్చు. లేదా దైవప్రవక్త హజ్రత్ హారూన్ (అలైహిస్సలాం)ను దృష్టిలో పెట్టుకునే అలా అని ఉండవచ్చు. లేదా భయభక్తులలో, సౌశీల్యం పారిశుద్ధ్యాలలో ఆమె హారూన్‌ను పోలివున్న స్త్రీ అయి ఉండటం చేత అలా పిలిచి ఉండవచ్చు. లేదా రూపురేఖలలో ఆమె హారూన్‌ని పోలి ఉండటం వల్ల ఆ విధంగా పిలిచి ఉండవచ్చు. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలాంటి ఉదాహరణలు ఉన్నాయి. (ఐసరుత్తఫాసీర్, ఇబ్నె కసీర్).

30. అంటే నాకు గ్రంథం వొసగాలనీ, ప్రవక్తగా ఎన్నుకోవాలని అల్లాహ్ ముందుగానే విధిరాత రాసినప్పుడే నిర్ణయించేశాడు.

**31** “నేనెక్కడున్నాసరే  ఆయన  నన్ను శుభవంతునిగా చేశాడు.[31] నేను  జీవించి ఉన్నంతకాలం  నమాజు,  జకాతులకు కట్టుబడి ఉండమని ఆయన నాకు ఆదేశించాడు.”

وَّجَعَلَنِىْ مُبٰرَكًا اَيْنَ مَا كُنْتُ ۠ وَاَوْصٰنِىْ بِالصَّلٰوةِ
وَالزَّكٰوةِ مَا دُمْتُ حَيًّا ﴿31﴾

**32** “ఇంకా – ఆయన నన్ను నా తల్లికి సేవచేసేవానిగా చేశాడు.[32] నన్ను దౌర్జన్యపరునిగానూ, దౌర్భాగ్యునిగానూ చేయలేదు.[33]

وَّبَرًّۢا بِوَالِدَتِىْ ۡ وَلَمْ يَجْعَلْنِىْ جَبَّارًا شَقِيًّا ﴿32﴾

**33** “నేను పుట్టిన రోజూ, నేను చనిపోయే రోజూ, నేను సజీవినై తిరిగి లేపబడేరోజూ నాపై శాంతి కలుగుతుంది.”

وَالسَّلٰمُ عَلَىَّ يَوْمَ وُلِدْتُّ وَيَوْمَ اَمُوْتُ
وَيَوْمَ اُبْعَثُ حَيًّا ﴿33﴾

**34**  ఇదీ మర్యమ్ కుమారుడైన ఈసా యదార్థ గాథ. ప్రజలు సంశయంలో పడివున్న సత్యవాక్కు  ఇదే.[34]

ذٰلِكَ عِيْسَى ابْنُ مَرْيَمَ ۚ قَوْلَ الْحَقِّ الَّذِىْ
فِيْهِ يَمْتَرُوْنَ ﴿34﴾

**35** అల్లాహ్‌కు సంతానం ఉండటం అనేది ఎంత మాత్రం తగదు. ఆయన  పరమ  పవిత్రుడు.  ఆయన ఏ పనినైనా  చేయాలని సంకల్పించుకున్నప్పుడు ‘అయిపో’ అని ఆజ్ఞాపిస్తాడు.  వెంటనే అది  అయిపోతుంది.[35]

مَا كَانَ لِلّٰهِ اَنْ يَّتَّخِذَ مِنْ وَّلَدٍ ۙ سُبْحٰنَهٗ ؕ
اِذَا قَضٰٓى اَمْرًا فَاِنَّمَا يَقُوْلُ لَهٗ كُنْ فَيَكُوْنُ ﴿35﴾ ؕ

31. నేనెక్కడ ఉన్నా దైవధర్మంపై స్థిరంగా ఉంటాను. నేనున్నచోట వస్తువులలో శుభం, సమృద్ధి కలుగుతుంది. లేదా దేవుడు నన్ను మంచిని గురించి ఆజ్ఞాపించేవానిగా, చెడుల నుంచి వారించే వానిగా చేశాడు.

32. కేవలం ‘తల్లిసేవ చేసేవానిగా చేశాడు’ అని అనటాన్నిబట్టి కూడా హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు) తండ్రి లేకుండా విశిష్ఠ రీతిలో పుట్టించబడ్డారని విదితమవుతోంది. లేకపోతే ఈసా కూడా యహ్యా మాదిరిగా తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా వ్యవహరించేవాడుగా ఖరారు చేయబడేవారు. కాని ఈసా విషయంలో కేవలం ‘తల్లిసేవ’ మాత్రమే ప్రస్తావించబడింది.

33. తల్లిదండ్రుల పట్ల సేవాభావం లేని వ్యక్తిలో బలాత్కార ధోరణి, కాఠిన్యం ప్రబలుతాయని, తత్కారణంగా అతడు దౌర్భాగ్యుడవుతాడని దీన్నిబట్టి అర్థమవుతోంది. హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) సంభాషణా తీరునుబట్టి అదంతా గతంలో జరిగినట్లనిపిస్తుంది. కాని  వాస్తవానికి  అది  భవిష్యత్తుతో ముడిపడి ఉంది. ఎందుకంటే ఈ మాటలు పలికినప్పుడు  ఆయన  పాలు త్రాగే పసిపిల్లవాడే. ఇవి అల్లాహ్ విధివ్రాతలోని విషయాలు. అవి అప్పటికి ఇంకా సంభవించకపోయినప్పటికీ గతంలో మాదిరిగానే సంభవించటం తథ్యం.

34. దైవప్రవక్త హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం)కు సంబంధించిన వాస్తవ విషయం ఇది! యూదులు, క్రైస్తవులు ఆయన గురించి చెబుతున్నటువంటి విషయాలు నిజమైనవి కావు. వారిలో కొందరు మర్యమ్ కుమారుడైన ఈసాను తెగనాడితే, మరికొందరు ఆయన పట్ల గల భక్తిలో అతిశయిల్లిపోయారు. వాస్తవానికి వారు ఆయన విషయంలో సందిగ్ధానికి లోనయ్యారు.

35. ఏ దేవునిలోనయితే ఈ గొప్ప గుణం, అసామాన్య శక్తి ఉంటుందో అతనికి సంతానం అవసరం ఏముంటుంది? తండ్రి లేకుండా ఓ జీవిని సృష్టించటం ఆయనకు కష్ట సాధ్యమా? అల్లాహ్‌కు కుమారుడు ఉన్నాడని చెప్పేవారైనా, ఏసుక్రీస్తు విశిష్ఠ జననాన్ని నిరాకరించే వారైనా అల్లాహ్ అసామాన్య ప్రజ్ఞాపాటవాలను త్రోసిపుచ్చినట్లే లెక్క.

**36** నిశ్చయంగా నాకూ, మీకందరికీ ప్రభువు అల్లాహ్ మాత్రమే. కనుక ఆయన్నే ఆరాధించండి. ఇదే రుజుమార్గం (అని ఈసా – ఏసుక్రీస్తు – బోధించాడు).

وَإِنَّ اللَّهَ رَبِّي وَرَبُّكُمْ فَاعْبُدُوهُ ۚ هَٰذَا
صِرَاطٌ مُّسْتَقِيمٌ (36)

**37** మరి ఈ ముఠాలు పరస్పరం విభేదించుకున్నాయి.[36] కాబట్టి సత్యతిరస్కారులు ఒక మహా (కఠినమైన) దినాన హాజరైనపుడు, వారికి మూడుతుంది.[37]

فَاخْتَلَفَ الْأَحْزَابُ مِن بَيْنِهِمْ ۖ فَوَيْلٌ لِّلَّذِينَ كَفَرُوا
مِن مَّشْهَدِ يَوْمٍ عَظِيمٍ (37)

**38** వారు మా సమక్షంలో హాజరైన రోజు ఎంత బాగా వింటూ, చూస్తూ ఉంటారు![38] కాని ఈ దుర్మార్గులు ఈనాడు మాత్రం స్పష్టమైన అపమార్గానికి లోనై ఉన్నారు.

أَسْمِعْ بِهِمْ وَأَبْصِرْ يَوْمَ يَأْتُونَنَا ۖ لَٰكِنِ الظَّالِمُونَ
الْيَوْمَ فِي ضَلَالٍ مُّبِينٍ (38)

**39** వ్యవహారం తేల్చబడి[39] వారు బాధపడే రోజు గురించి[40] (ఓ ముహమ్మద్ – సఅసం!) వారిని హెచ్చరించు. (ఏమైనా) వారు పరధ్యానానికి గురై ఉన్నారు. వారు విశ్వసించే రకం కాదు.

وَأَنذِرْهُمْ يَوْمَ الْحَسْرَةِ إِذْ قُضِيَ الْأَمْرُ وَهُمْ
فِي غَفْلَةٍ وَهُمْ لَا يُؤْمِنُونَ (39)

---

36. ముఠాలు, వర్గాలు (అహ్జాబ్) అంటే గ్రంథవహులలోని వివిధ వర్గాలు అని భావం. హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) పుట్టుకపై వారు అభిప్రాయభేదానికి గురయ్యారు. యూదులు ఆయన ఒక మాంత్రికుడనీ, అక్రమ సంతానం అని నిందించారు. అంటే, యూసుఫ్ నజ్జార్ కొడుకు అని చెప్పారు. ఏసు (ఈసా) 'దేవుని కుమారుడు' అని ప్రొటెస్టెంట్ వర్గీయులు సూత్రీకరించారు. 'ఈసా ముగ్గురిలో మూడవవాడు' అని కేథలిక్కులు వక్కాణించారు. 'ఆయనే దేవుడు' అని ఆర్థోడెక్స్ వర్గీయులన్నారు. ఈ విధంగా ఏసుక్రీస్తు (ఈసా – అలైహిస్సలాం) వ్యవహారంలో యూదులు పరమలోభత్వాన్ని ప్రదర్శించగా, క్రైస్తవులు అతివాదానికి పోయారు. వాస్తవానికి ఇవి రెండూ ఒక రకంగా సమతౌల్యం లోపించిన అతివాదాలే (ఐసరుత్త ఫాసీర్, ఫత్హుల్ ఖదీర్).
37. మర్యమ్ కుమారుడగు ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) విషయంలో వాస్తవాలను విస్మరించి, విభేదించుకుని కుడిఎడమల అపవాదాలను అనుసరించిన సత్య తిరస్కారులు తీర్పుదినాన దైవసమక్షంలో హాజరైనపుడు వినాశాన్ని చవిచూస్తారు.
38. ఇహలోకంలో మాత్రం వినీ విననట్లుగా, చూచీ చూడనట్లుగా నటిస్తున్నారు. కాని పరలోకంలో కళ్లముందున్న దృశ్యాలను బాగానే చూస్తారు. అక్కడ జరిగే విచారణను బాగానే వింటారు. కాని వారి ఈ చూడటంగానీ, వినటంగానీ వారికి ప్రయోజనకరం కాలేకపోతుంది. ఎందుకంటే వినవలసిన చోట వారు మా మాటను వినలేదు. గమనించవలసిన చోట వారు మా సూచనలను గమనించలేదు.
39. అంటే లెక్కలన్నింటినీ తేల్చేసి రికార్డులు చుట్టివేయబడినప్పుడు! అప్పుడు స్వర్గవాసులు స్వర్గంలోకి, నరకవాసులు నరకంలోకి వెళతారు. ఆ విషయమే హదీసులో ఇలా వుంది : "ఆ తరువాత 'మృత్యువు'ను ఒక పొట్టేలు రూపంలో తీసుకురావటం జరుగుతుంది. అది స్వర్గానికి – నరకానికీ మధ్య నిలబెట్టబడుతుంది. "ఇదేమిటో తెలుసా, దీన్ని గుర్తుపడతారా?" అని స్వర్గవాసుల్ని, నరకవాసుల్ని కూడా ప్రశ్నించటం జరుగుతుంది. 'ఇది మృత్యువు' అని అందరూ అంటారు. అది వారందరి సమక్షంలో కోయబడుతుంది. "స్వర్గవాసులారా! ఇక నుంచి స్వర్గలోక జీవితం మీ కొరకు శాశ్వతం. ఇక మీకు మరణం అన్నది ఉండదు" అని స్వర్గవాసులకు శుభవార్త ఇవ్వబడుతుంది. "ఓ నరక వాసులారా! ఈ నరకయాతన మీకు ఎల్లకాలం ఉంటుంది. ఇక మీకు మరణమనేదే ఉండదు' అని నరకంలోని వారికి అనబడుతుంది" (సహీహ్ బుఖారీ – మర్యమ్ సూరా; ముస్లిం – కితాబుల్ జన్నహ్).

**40** స్వయంగా మేమే భూమికీ, భూమిపై ఉండే వారందరికీ వారసులమవుతాము. వారంతా మా వద్దకే మరలించబడతారు.

إِنَّا نَحْنُ نَرِثُ الْأَرْضَ وَمَنْ عَلَيْهَا
وَإِلَيْنَا يُرْجَعُونَ ﴿40﴾

**41** ఈ గ్రంథంలో ఇబ్రాహీము (అలైహిస్సలాం) వృత్తాంతాన్ని కూడా ప్రస్తావించు. నిస్సందేహంగా అతను సత్యవంతుడైన ప్రవక్త.[41]

وَاذْكُرْ فِي الْكِتَابِ إِبْرَاهِيمَ ۚ
إِنَّهُ كَانَ صِدِّيقًا نَبِيًّا ﴿41﴾

**42** అతను తన తండ్రితో, "ఓ నాన్నా! వినలేని, చూడలేని, మీకు ఏమాత్రం ఉపయోగపడలేని వాటిని ఎందుకు పూజిస్తారు?

إِذْ قَالَ لِأَبِيهِ يَا أَبَتِ لِمَ تَعْبُدُ مَا لَا يَسْمَعُ
وَلَا يُبْصِرُ وَلَا يُغْنِي عَنْكَ شَيْئًا ﴿42﴾

**43** "ఓ పితామహా! చూడండి! మీ వద్దకు రాని జ్ఞానం నా వద్దకు వచ్చింది.[42] కనుక మీరు నన్ను అనుసరించండి. నేను మీకు సరైన మార్గం వైపుకు దర్శకత్వం వహిస్తాను.[43]

يَا أَبَتِ إِنِّي قَدْ جَاءَنِي مِنَ الْعِلْمِ مَا لَمْ يَأْتِكَ
فَاتَّبِعْنِي أَهْدِكَ صِرَاطًا سَوِيًّا ﴿43﴾

**44** "ఓ తండ్రీ! మీరు షైతాను దాస్యాన్ని విడనాడండి. నిశ్చయంగా షైతాన్ కరుణామయుడైన అల్లాహ్‌కు అవిధేయుడు.[44]

يَا أَبَتِ لَا تَعْبُدِ الشَّيْطَانَ ۖ إِنَّ الشَّيْطَانَ كَانَ
لِلرَّحْمَٰنِ عَصِيًّا ﴿44﴾

---

40. ప్రళయదినాన్ని బాధపడే రోజుగా, పశ్చాత్తాపభావంతో కుమిలిపోయే రోజుగా కూడా అభివర్ణించటం జరిగింది. ఎందుకంటే ఆ రోజు అందరూ బాధపడతారు. మేము పాపాలు చేయకుండా ఉంటే బావుండేది కదా! అని పాపాత్ములు బాధపడగా, తాము మరిన్ని పుణ్యకార్యాలు చేసి వుంటే మరింత బావుండేది! అని పుణ్యాత్ములు బాధపడతారు.

41. **'సిద్దీఖన్'** ( صِدِّيقًا ) అనేది సిద్ఖ్ (సత్యం) నుంచి వచ్చింది. ఇందులో భావఆధిక్యత ఉంది. అంటే సత్యసంధతలో అత్యున్నత శ్రేణికి చెందినవాడు. మాటలకు – చేతలకు మధ్య పూర్తి సమన్వయం సాధించినవాడు. ప్రవక్త పదవి తర్వాత దీని స్థానం అన్నిటికంటే గొప్పది. ప్రతి ప్రవక్తా తన కాలపు అతి గొప్ప సత్యవంతుడు, రుజువర్తనుడు అయి ఉంటాడు. అందుకే అతడు 'పైగంబర్'తో పాటు సిద్దీఖ్ (సత్యవంతుడు) కూడా అయి ఉంటాడు. అయితే ప్రతి సత్యవంతుడు 'ప్రవక్త' కాలేడు. దివ్య ఖుర్ఆన్‌లో హజ్రత్ మర్యమ్ సిద్దీఖాగా పిలువబడ్డారు. అంటే ఆమె భయభక్తులలో, సౌశీల్యం పారిశుద్ధ్యాలలో, రుజువర్తనలో అత్యున్నత శిఖరాలకు చేరుకున్న వనిత. అయినప్పటికీ ఆమె దైవసందేశవాహకురాలు (నబీయ) కారు. ముహమ్మద్ (స) అనుచర సమాజంలో కూడా సిద్దీఖులు (సత్యవంతులు) ఉన్నారు. వారిలో హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) అగ్రగణ్యులు. దైవప్రవక్తల తరువాత, మానవకోటిలో అత్యుత్తములుగా పరిగణించబడ్డారు – రజియల్లాహు అన్హు.

42. తద్వారా నేను సకల లోకాల ప్రభువును కనుగొన్నాను. మరణానంతర జీవితం ఉంది అనే విషయాన్ని తెలుసుకున్నాను. సృష్టికర్తను కాదని ఇతరత్రా వాటిని పూజించే వారికి పట్టే దుర్గతి ఎంత ఘోరంగా ఉంటుందో నాకు అర్థమయింది.

43. మీరు నా మార్గాన్ని అనుసరించారంటే, అది మీకు ముక్తిని ప్రసాదిస్తుంది.

44. షైతాన్ వేసిన ఉచ్చులో బిగుసుకుపోయిన మీరు వినలేని, కనలేని, లాభనష్టాలు చేకూర్చలేని అత్యంత నిస్సహాయమైన వాటిని పూజిస్తున్నారు. ఒక విధంగా ఇది షైతాన్ దాస్యమే. షైతానేమో దేవుని అవిధేయుడు. వాడు తన మాదిరిగానే ఎంతో మంది మానవులను కూడా దేవుని అవిధేయులుగా మార్చి సంబరపడాలని భావిస్తున్నాడు. కాబట్టి మీరు షైతాన్ ఎత్తులకు చిత్తయిపోకండి. మీరు నా మాట నమ్మండి.

يٰٓاَبَتِ اِنِّيْٓ اَخَافُ اَنْ يَّمَسَّكَ عَذَابٌ مِّنَ الرَّحْمٰنِ فَتَكُوْنَ لِلشَّيْطٰنِ وَلِيًّا ﴿45﴾

45 "ఓ నా తండ్రీ! తమరు ఎక్కడ కరుణామయుని ఆగ్రహానికి గురవుతారోనని, షైతాను సహవాసి[45] అయిపోతారోనని నాకు భయంగా ఉంది" అని అన్నప్పుడు...

قَالَ اَرَاغِبٌ اَنْتَ عَنْ اٰلِهَتِيْ يٰٓاِبْرٰهِيْمُ ۚ لَئِنْ لَّمْ تَنْتَهِ لَاَرْجُمَنَّكَ وَاهْجُرْنِيْ مَلِيًّا ﴿46﴾

46 "ఓ ఇబ్రాహీం! నువ్వు నా దైవాలకే విముఖత చూపుతున్నావా? విను! నువ్వు నీ వైఖరిని మానుకోకపోతే నేను నిన్ను రాళ్లతో కొడతాను. మర్యాదగా నన్ను నా మానాన వదలిపెట్టు"[46] అని అతని తండ్రి అన్నాడు.

قَالَ سَلٰمٌ عَلَيْكَ ۚ سَاَسْتَغْفِرُ لَكَ رَبِّيْ ؕ اِنَّهٗ كَانَ بِيْ حَفِيًّا ﴿47﴾

47 "సరే (నాన్నా). మీకు సలాం![47] నేను మాత్రం మీ మన్నింపు కోసం నా ప్రభువును వేడుకుంటూనే ఉంటాను.[48] నిశ్చయంగా ఆయన నాపై ఎంతో జాలి కలవాడు.

وَاَعْتَزِلُكُمْ وَمَا تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ وَاَدْعُوْا رَبِّيْ ۖ عَسٰٓى اَلَّآ اَكُوْنَ بِدُعَآءِ رَبِّيْ شَقِيًّا ﴿48﴾

48 "నేను మిమ్మల్నీ, అల్లాహ్‌ను విడిచి మీరు మొరపెట్టుకునే వారందరినీ వదలి పోతున్నాను. కేవలం నా ప్రభువును మాత్రమే వేడుకుంటాను. నా ప్రభువుని వేడుకుని విఫలుణ్ణి కానన్న నమ్మకం నాకుంది" అని (ఇబ్రాహీం) చెప్పాడు.

45. మీరు మీ తిరస్కార వైఖరిని మానుకోకుండా, షిర్కును విడనాడకుండా ఇదే స్థితిలో మరణిస్తే దేవుని శిక్షనుంచి మిమ్మల్ని ఎవరూ రక్షించలేరు. ఇహలోకంలోనే మీరు దైవాగ్రహానికి గురై, శాశ్వతంగా షైతాన్ సహోదరునిగా మారిపోయినా ఆశ్చర్య పోనవసరం లేదు. కన్నతండ్రి అయిన కారణంగా హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన తండ్రిని ఎంతో మర్యాదపూర్వకంగా సంబోధించారు. ఒకవైపు తండ్రి బహుదైవారాధనను ఖండిస్తూనే ఎంతో మృదువుగా మాట్లాడారు. ఆ పలుకుల్లో వినమ్రత, అనురాగం, ఆప్యాయత ఉట్టిపడుతున్నాయి. కాని ఎంత మృదువుగా చెప్పినా ఆ బహుదైవారాధకునికి కొడుకు చెప్పే ఏకదైవోపాసనా తత్వం ఒంటబట్టలేదు. కొడుకు మాటలకు అతడు చాలా తీవ్రంగా స్పందించాడు. నువ్వు గనక మా ఆరాధ్య దైవాల పట్ల వైముఖ్య ధోరణిని మానుకోకపోతే నీపై రాళ్లు రువ్వాల్సివస్తుందని కొడుకును హెచ్చరించాడు.

46. **'మలియ్యన్'** అంటే సుదీర్ఘకాలం అని అర్థం. 'సురక్షితంగా, మర్యాదగా' అనే అర్థం కూడా వస్తుంది. అంటే 'నన్ను నా మానాన వదలిపెట్టు. నన్ను అదేపనిగా రెచ్చగొట్టి నా చేత కాళ్లు చేతులు విరగ్గొట్టించుకునే స్థితిని తెచ్చుకోకు. పో యిక్కణ్ణుంచి' అన్నది తండ్రి మాటలోని ఆంతర్యం.

47. ఈ 'సలాం' అర్థం వేరు. ఒక ముస్లిం మరో ముస్లింకు చేసే 'సలాం' వంటిది కాదిది. "సరే. అలాగయితే ఇక నాకు సెలవీయండి" అన్న భావంలో ఈ పదం ప్రయోగించబడింది. "మూర్ఖులు వారితో వాదనకు దిగినపుడు 'మీకో సలాం' అని చెప్పేస్తారు" (అల్ ఫుర్ఖాన్ – 63) అనే వచనం ద్వారా కరుణామయుడైన దేవుని సిసలైన దాసుల నడవడిక ఎలా ఉంటుందో వివరించబడింది.

48. ముష్రిక్కుల మన్నింపుకోసం ప్రార్థించరాదన్న విషయం తెలియనపుడు హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) చెప్పిన మాటలివి. అయితే ఈ సంగతి తెలిసిన తరువాత ఆయన తన తండ్రి మన్నింపుకై ప్రార్థించటం మానేశారు. (తౌబా – 114)

49 ఆ విధంగా ఇబ్రాహీం వాళ్ళందరినీ, వారు అల్లాహ్‌ను కాదని పూజించే వారందరినీ వదలి పోయినప్పుడు, మేమతనికి ఇస్‌హాఖ్‌ను, యాఖూబును అనుగ్రహించాము.[49] వారిద్దరినీ ప్రవక్తలుగా చేశాము.

فَلَمَّا اعْتَزَلَهُمْ وَمَا يَعْبُدُونَ مِنْ دُونِ اللَّهِ وَهَبْنَا لَهُ إِسْحَاقَ وَيَعْقُوبَ وَكُلًّا جَعَلْنَا نَبِيًّا ﴿٤٩﴾

50 వారందరికీ మేము మా కరుణను ప్రసాదించి,[50] (భావి తరాల నోట) వారి శుభ నామస్మరణను ఉన్నతం[51] చేశాము.

وَوَهَبْنَا لَهُمْ مِنْ رَحْمَتِنَا وَجَعَلْنَا لَهُمْ لِسَانَ صِدْقٍ عَلِيًّا ﴿٥٠﴾

51 ఈ ఖుర్‌ఆను గ్రంథంలో మూసా విషయాన్ని కూడా ప్రస్తావించు. అతను ఎన్నుకోబడినవాడు,[52] సందేశ వాహకుడైన ప్రవక్త.

وَاذْكُرْ فِي الْكِتَابِ مُوسَىٰ إِنَّهُ كَانَ مُخْلَصًا وَكَانَ رَسُولًا نَبِيًّا ﴿٥١﴾

52 మేమతన్ని తూరు పర్వతం కుడివైపు నుంచి పిలిచాము. రహస్య సంభాషణ నిమిత్తం అతన్ని దగ్గరకు చేర్చాము.

وَنَادَيْنَاهُ مِنْ جَانِبِ الطُّورِ الْأَيْمَنِ وَقَرَّبْنَاهُ نَجِيًّا ﴿٥٢﴾

49. హజ్రత్ ఇస్‌హాఖ్ (అలైహిస్సలాం) హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి కుమారులు. హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం) ఇబ్రాహీం మనవడు. కొడుకును, మనవణ్ణి కూడా కొడుకులుగానే సంబోధించటం జరిగింది. తాను నమ్మిన ఏకదైవోపాసనా సిద్ధాంతం కోసం ఇల్లూవాకిలినీ, స్వదేశాన్ని విడిచి పుణ్యక్షేత్రం వైపుకు సాగిపోయిన ఇబ్రాహీంకు మేము అతని కంటిచలువగా ఇస్‌హాఖ్, యాఖూబు వంటి సంతాన భాగ్యాన్ని ప్రసాదించాము. తండ్రికి దూరమైన బాధను అతను మరచిపోయేందుకే మేమతనికి ఈ సౌభాగ్యం వొసగాము.

50. వారిద్దరినీ ప్రవక్తలుగా ఎన్నుకోవటంతో పాటు, మరిన్ని మేళ్లను కూడా వారికి అనుగ్రహించాము. వారికి సిరిసంపదల్ని ఇచ్చాము. సంతతిని ప్రసాదించాము. శతాబ్దాల తరబడి వారి వంశంలో ప్రవక్తల్ని పంపుతూ వచ్చాము. ఇది మామూలు అనుగ్రహం కాదు. అందుకే హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) 'ప్రవక్తల పితామహుడు'గా పిలువబడతారు.

51. వారు చిరస్మరణీయులుగా ఉంటారు. లోకం సదా వారిని గుర్తుంచుకుంటుంది. వారి సద్గుణాలను, జీవిత గాథలను గురించి భావితరాలవారు శ్రద్ధాసక్తులతో చెప్పుకుంటారు. దానికి వారు అర్హులు కూడా. నేడు ఆకాశ గ్రంథాలను నమ్మే మతస్థులంతా– ఆఖరికి ముష్రికులు కూడా – దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను, ఆయన వంశస్థులను సగౌరవంగా స్మరిస్తారు. వారి ధార్మిక సేవలను తలచుకుని తాదాత్మ్యం చెందుతారు. దైవమార్గంలో దేశం విడిచి వెళ్లినందుకు దేవుడు ఇబ్రాహీంకు ప్రసాదించిన గొప్పవరం ఇది.

52. **ముఖ్‌లసున్, ముస్తఫా, ముజ్తబా, ముఖ్తార్** – ఈ నాలుగు పదాల భావం ఒక్కటే. అంటే దైవదౌత్యం కోసం, ప్రవక్త పదవి కోసం ఎన్నుకోబడినవాడు. ప్రియతముడు. ఈ వాక్యంలో 'రసూల్' అనే పదం 'సందేశ వాహకుడు' అన్న భావంలో ప్రయోగించబడింది. 'నబీ' అంటే దైవసందేశాన్ని జనులకు వినిపించేవాడు లేదా దైవవాణి గురించి ప్రజలకు తెలియపరచేవాడు అని అర్థం. మౌలికంగా ఈ రెండింటి భావం ఒక్కటే. మానవుల మార్గదర్శకత్వం కోసం దేవుడు తానెన్నుకున్న దాసునికే తన సందేశాన్ని అందజేస్తాడు. ఆ వ్యక్తే రసూల్‌గానూ, నబీగానూ కూడా వ్యవహరించబడతాడు.

ఇంతకీ రసూల్‌కీ – నబీకి మధ్య తేడా ఉందా లేదా? ఉంటే అదేమిటీ? అన్న ప్రశ్నలు ప్రాచీన కాలం నుంచే ధర్మవేత్తల మధ్య ఉత్పన్నం అవుతున్నాయి. తేడా ఉందని అనే వారు ఇలా అంటారు : "దైవగ్రంథంతో పాటు, సరికొత్త షరీయతు (ధర్మ శాస్త్రం)ను తెచ్చినవారిని నబీగా, ప్రవక్త (రసూల్)గా కూడా వ్యవహరిస్తారు. తనకు

**53** ఇంకా మా ప్రత్యేక కృపతో అతని సోదరుడైన హారూనును ప్రవక్తగా చేసి అతనికి (సహాయకునిగా) ఇచ్చాము.

وَوَهَبْنَا لَهُ مِن رَّحْمَتِنَآ أَخَاهُ هَٰرُونَ نَبِيًّا ﴿٥٣﴾

**54** ఈ గ్రంథంలో ఇస్మాయీలు వృత్తాంతాన్ని గురించి కూడా ప్రస్తావించు. అతను వాగ్దాన పాలనలో సత్యవంతుడు. మా తరఫున పంపబడిన సందేశహరుడు, ప్రవక్త కూడా.

وَاذْكُرْ فِي الْكِتَٰبِ إِسْمَٰعِيلَ ۚ إِنَّهُ كَانَ صَادِقَ
الْوَعْدِ وَكَانَ رَسُولًا نَّبِيًّا ﴿٥٤﴾

**55** అతను తన కుటుంబీకులకు నమాజు గురించి, జకాత్ గురించి ఆదేశిస్తూ ఉండేవాడు. అతను తన ప్రభువు సన్నిధిలో ప్రియతముడు.

وَكَانَ يَأْمُرُ أَهْلَهُ بِالصَّلَوٰةِ وَالزَّكَوٰةِ
وَكَانَ عِندَ رَبِّهِ مَرْضِيًّا ﴿٥٥﴾

**56** ఇంకా ఈ గ్రంథంలో ఇద్రీసు గురించిన ప్రస్తావన కూడా చెయ్యి. అతను కూడా నిజాయితిపరుడైన ప్రవక్తే.

وَاذْكُرْ فِي الْكِتَٰبِ إِدْرِيسَ ۚ إِنَّهُ كَانَ صِدِّيقًا
نَّبِيًّا ﴿٥٦﴾

**57** మేమతన్ని ఉన్నత స్థానానికి లేపాము.[53]

وَرَفَعْنَٰهُ مَكَانًا عَلِيًّا ﴿٥٧﴾

**58** అల్లాహ్ అనుగ్రహించిన ప్రవక్తలు వీరు. వారు ఆదం సంతతికి చెందినవారు. నూహుతో పాటు మేము ఓడలోకి ఎక్కించిన వారి వంశీయులు. ఇబ్రాహీము, యాఖూబు (ఇస్రాయీలు) సంతతికి చెందినవారు. వారంతా మా ద్వారా సన్మార్గం పొందిన వారు, మా చేత ఎన్నుకోబడిన ప్రజల్లోని వారు. వారి ముందు కరుణామయుడైన దేవుని వచనాలు పారాయణం చేయబడినప్పుడు వారు విలపిస్తూ సాష్టాంగపడేవారు.[54]

أُولَٰٓئِكَ الَّذِينَ أَنْعَمَ اللَّهُ عَلَيْهِم مِّنَ النَّبِيِّينَ مِن
ذُرِّيَّةِ ءَادَمَ وَمِمَّنْ حَمَلْنَا مَعَ نُوحٍ وَمِن
ذُرِّيَّةِ إِبْرَٰهِيمَ وَإِسْرَٰٓءِيلَ وَمِمَّنْ هَدَيْنَا
وَاجْتَبَيْنَآ ۚ إِذَا تُتْلَىٰ عَلَيْهِمْ ءَايَٰتُ الرَّحْمَٰنِ
خَرُّوا سُجَّدًا وَبُكِيًّا ۩ ﴿٥٨﴾

పూర్వం వచ్చిన ప్రవక్తల ధర్మశాస్త్రం మరియు గ్రంథం ప్రకారం ప్రజలకు మార్గదర్శకత్వం వహించే ప్రవక్తలను కేవలం 'నబీ'గా వ్యవహరిస్తారు. వారిని 'రసూల్' అని అనరు.

కాని దివ్య ఖుర్ఆన్‌లో మాత్రం ఈ పదం రెండు రకాల ప్రవక్తల కోసం కూడా ప్రయోగించబడింది. కొన్నిచోట్ల ఈ రెండు పదాలు పోలికగా కూడా ప్రయోగించబడ్డాయి. ఉదాహరణకు : హజ్ సూరా 52వ ఆయతు.

53. హజ్రత్ ఇద్రీస్ (అలైహిస్సలాం) హజ్రత్ ఆదం తరువాత వచ్చిన ప్రవక్త అనీ, ఆయన హజ్రత్ నూహ్‌కు తాత లేక ముత్తాత అవుతారని అనబడుతోంది. అందరికన్నా ముందు దుస్తులు కుట్టినవారు ఈయనే.

'ఉన్నత స్థానానికి లేపటం' అంటే అర్థం ఏమిటీ? ఆయన ఈసా (ఏసుక్రీస్తు) లాగా ఆకాశానికి లేపుకోబడ్డారని కొందరు ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు భావించారు. కాని ఖుర్ఆన్‌లో వాడబడిన పద ప్రయోగాన్నిబట్టి ఈ అర్థం స్ఫురించదు. ప్రామాణిక హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ కావటం లేదు. కాబట్టి ఉన్నత స్థానానికి లేపటం అంటే ప్రవక్త పదవి ద్వారా దేవుడు ఆయనకు ఉన్నత స్థానం ప్రసాదించాడని భావించటం సమంజసంగా ఉంటుంది.

54. దైవ వచనాలను విన్నప్పుడు భక్తితో కళ్లు చెమర్చటం, విలపిస్తూ సజ్దాలో పడిపోవటం సజ్జనులైన దైవదాసుల ముఖ్య లక్షణం. ఖుర్ఆన్ పారాయణ క్రమంలో సజ్దా ఆయతులు వస్తే పఠనానంతరం అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడి

**59** ఆ తరువాత కొందరు అనర్హులు వచ్చి, నమాజులను వృధా చేశారు, మనోవాంఛలను అనుసరించసాగారు. తమకు కలిగిన నష్టం గురించి వారు ముమ్ముందు చూసుకుంటారు.[55]

فَخَلَفَ مِنۢ بَعۡدِهِمۡ خَلۡفٌ أَضَاعُواْ ٱلصَّلَوٰةَ
وَٱتَّبَعُواْ ٱلشَّهَوَٰتِۖ فَسَوۡفَ يَلۡقَوۡنَ غَيًّا ﴿٥٩﴾

**60** కాని పశ్చాత్తాపం చెంది, విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు (మాత్రం నష్టపోరు). వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవంత కూడా అన్యాయం జరగదు.[56]

إِلَّا مَن تَابَ وَءَامَنَ وَعَمِلَ صَٰلِحٗا فَأُوْلَٰٓئِكَ
يَدۡخُلُونَ ٱلۡجَنَّةَ وَلَا يُظۡلَمُونَ شَيۡـٔٗا ﴿٦٠﴾

**61** అగోచరాలైన, శాశ్వత స్వర్గవనాలలోకి (వారు ప్రవేశిస్తారు.) వాటిని గురించి కరుణామయుడు(అయిన అల్లాహ్) తన దాసులకు వాగ్దానం చేశాడు.[57] ఆయన వాగ్దానం నెరవేరటం తథ్యం.

جَنَّٰتِ عَدۡنٍ ٱلَّتِي وَعَدَ ٱلرَّحۡمَٰنُ عِبَادَهُۥ
بِٱلۡغَيۡبِۚ إِنَّهُۥ كَانَ وَعۡدُهُۥ مَأۡتِيّٗا ﴿٦١﴾

**62** అక్కడ వారు 'సలామ్'[58] తప్ప వ్యర్థమైన మాటలేవీ వినరు. వారికోసం అక్కడ ఉదయం సాయంత్రం వారి ఆహారం సమకూరుతూ ఉంటుంది.[59]

لَّا يَسۡمَعُونَ فِيهَا لَغۡوًا إِلَّا سَلَٰمٗاۖ وَلَهُمۡ رِزۡقُهُمۡ
فِيهَا بُكۡرَةٗ وَعَشِيّٗا ﴿٦٢﴾

---

ఈ విధంగా ప్రార్థించటం మస్నూన్ (సంప్రదాయం) : **సజద వజ్హియ లిల్లజీ ఖలఖహు వ సవ్వరహు వ షఖ్ఖ సమ్అహు వ బసరహూ బి హౌలిహీ వ ఖువ్వతిహీ** (అబూదావూద్, తిర్మిజీ, నసాయి – మిష్కాత్ ఆధారంగా). మరికొన్ని ఉల్లేఖనాలలో **ఫతబారకల్లాహు అహ్సనుల్ ఖాలిఖీన్** అనే వాక్యం అదనంగా ఉంది. (ఔనుల్ మాబూద్-1/533)

55. దైవానుగ్రహం పొందిన దైవదాసులను గురించిన ప్రస్తావించిన తరువాత తద్భిన్నంగా ప్రవర్తించిన అసమర్థులు, అయోగ్యుల ప్రస్తావన చేయబడింది. వారు దైవవాక్యాల పట్ల అశ్రద్ధ వహించారు. 'నమాజులను వృధా చేశారు' అంటే నమాజులను త్రోసిపుచ్చారు లేదా నమాజులను వేళకు చేయలేదు లేదా నమాజులను తమకిష్టం వచ్చినట్లు కుదించారు. లేదా తమకు తోచినట్లుగా నమాజు చేశారు. నియమబద్ధంగా చేయలేదు – ఇదంతా నమాజులను వృధా చేయటం క్రిందికే వస్తుంది. నమాజులతో ఈ విధంగా చెలగాటమాడినవారు పాపాత్ములుగా పరిగణించబడతారని ఈ ఆయతునుబట్టి విదితమవుతోంది. **'ఘయ్యా'** (غَيًّا) అంటే వినాశం, దుర్గతి అని అర్థం. లేదా ఘయ్యా నరకంలోని ఒక గుండం కూడా కావచ్చు.

56. మనోవాంఛలకు బానిసలై, నమాజులపట్ల నిర్లక్ష్యం వహించినవారు తమ తప్పును తెలుసుకుని దైవసన్నిధిలో క్షమాపణ వేడుకుంటే, ఇక మీదట సత్కార్యాలు చేస్తూ ఉంటే అలాంటివారు క్షమించబడతారు. వారు స్వర్గానికి అర్హులవుతారు.

57. ఇది వారి దృఢ విశ్వాసానికి ప్రతీక! వారు స్వర్గాన్ని ఎన్నడూ చూడలేదు. కాని అల్లాహ్ చేసిన వాగ్దానం ఆధారంగా వారు ఆ స్వర్గలోకం పొందే తపనలో విశ్వసించారు. మంచిపనులు చేశారు.

58. స్వర్గంలో ఎటుచూసినా దైవదూతలు వారికి 'సలాం' చేస్తూ ఉంటారు. స్వర్గవాసులు కూడా ఒండొకరికి సలాం చేస్తూ, కుశల ప్రశ్నలు వేసుకుంటూ ఉంటారు.

59. ఈ వచనంపై వ్యాఖ్యానిస్తూ ఇమామ్ అహ్మద్ ఇలా అన్నారు : స్వర్గంలో పగలూ – రేయి అనేవి ఉండవు. ఎటుచూసినా వెలుగు విరజిమ్ముతూ ఉంటుంది. హదీసు ప్రకారం, "స్వర్గంలో ప్రవేశించే మొదటి వర్గంవారి ముఖాలు పూర్ణచంద్రుని

**63** మేము మా దాసులలో భయభక్తులు కలిగి ఉండేవారిని వారసులుగా చేసే స్వర్గం ఇదే.

تِلْكَ الْجَنَّةُ الَّتِي نُورِثُ مِنْ عِبَادِنَا
مَنْ كَانَ تَقِيًّا ﴿٦٣﴾

**64** నీ ప్రభువు ఆజ్ఞ లేకుండా (దైవదూతలమైన) మేము దిగి రాలేము.[60] మాకు ముందూ, వెనుకా, వాటికి మధ్య ఉన్న వస్తువులన్నీ ఆయన సొత్తే. నీ ప్రభువు మరచిపోయేవాడు కాదు.

وَمَا نَتَنَزَّلُ إِلَّا بِأَمْرِ رَبِّكَ ۖ لَهُ مَا بَيْنَ أَيْدِينَا
وَمَا خَلْفَنَا وَمَا بَيْنَ ذَٰلِكَ ۚ وَمَا كَانَ رَبُّكَ
نَسِيًّا ﴿٦٤﴾

**65** ఆకాశాలకూ, భూమికీ, వాటి మధ్య నున్న సమస్తానికీ ప్రభువు ఆయనే. కనుక నువ్వు ఆయన్నే ఆరాధించు. ఆయన ఆరాధనపైనే స్థిరంగా ఉండు. నీకు తెలిసినంతవరకూ ఆయన పేరు గలవాడు ఎవడయినా ఉన్నాడా?[61]

رَبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا فَاعْبُدْهُ
وَاصْطَبِرْ لِعِبَادَتِهِ ۚ هَلْ تَعْلَمُ لَهُ سَمِيًّا ﴿٦٥﴾

**66** "ఏమిటీ, నేను చచ్చిన తరువాత మళ్లీ బ్రతికించి బయటికి తీయబడతానా?"[62] అని మనిషి[63] అంటున్నాడు.

وَيَقُولُ الْإِنْسَانُ أَإِذَا مَا مِتُّ لَسَوْفَ أُخْرَجُ حَيًّا ﴿٦٦﴾

**67** ఇంతకుముందు అతనికంటూ ఒక అస్థిత్వం లేనపుడు మేమతన్ని సృష్టించామన్న సంగతి ఈ మనిషికి జ్ఞాపకం లేదా?[64]

أَوَلَا يَذْكُرُ الْإِنْسَانُ أَنَّا خَلَقْنَاهُ مِنْ قَبْلُ
وَلَمْ يَكُ شَيْئًا ﴿٦٧﴾

---

వలె ప్రకాశిస్తూ ఉంటాయి. అక్కడ వారికి ఉమ్మి, చీముడు వంటివి రావు. మల మూత్ర విసర్జన వంటివి ఉండవు. వారి పాత్రలు, దువ్వెనలు బంగారంతో చేయబడినవై ఉంటాయి. వారి సుగంధ చెక్కలు గుబాళిస్తూ ఉంటాయి. వారికి పట్టే చెమట కస్తూరి వాసన కలిగి ఉంటుంది. ప్రతి స్వర్గవాసికి ఇద్దరు భార్యలుంటారు. వారి పిక్కల ఎముకల లోపలి భాగం సయితం కానవచ్చేంత స్వచ్ఛంగా, అందంగా ఉంటాయి. వారి మధ్య విద్వేషం, విభేదాలు ఉండవు. వారి హృదయాలు ఒకే హృదయంలా ఉంటాయి. వారు ఉదయం సాయంత్రం దైవస్తోత్రం చేస్తూ ఉంటారు." (సహీహ్ బుఖారీ - బద్వుల్ ఖల్ఖ్; ముస్లిం - కితాబుల్ జన్నహ్).

60. తన దగ్గరకు వీలైనంత తొందరగా వస్తూ ఉంటే బావుంటుందని మహాప్రవక్త (సఅసం) హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) ముందు అభిప్రాయపడ్డారు. దానికి సమాధానంగా ఈ ఆయతు అవతరించింది (సహీహ్ బుఖారీ- మర్యమ్ సూరా వ్యాఖ్యానం).

61. అల్లాహ్‌ను పోలినవాడుగానీ, ఆయనతో సరితూగేవాడుగానీ ఎవడూ లేనే లేడు. అటువంటప్పుడు ఆరాధనలో కూడా ఆయనకు సాటి కల్పించవలసిన పనిలేదు.

62. తాను మరణించి మట్టిలో కలిసిపోయిన తరువాత, తన ఎముకలు కుళ్ళి కృశించి పోయిన తరువాత, తాను ఇంకోసారి బ్రతికించబడటం ఎలా సంభవం? అన్నది మనిషి ఆలోచన.

63. ఇక్కడ 'మనిషి' అంటే మరణానంతర జీవితాన్ని తిరస్కరించే 'అవిశ్వాసి' అని భావం.

64. తొలిసారి అతన్ని పుట్టించినపుడు అసలు అతని ఉనికి అన్నదే లేదు. రూపురేఖలు అంతకన్నా లేవు. ఏమీలేని అతన్ని మేము నిండు మనిషిగా నిలబెట్టినప్పుడు, మరణించిన తరువాత అతన్ని తిరిగిలేపి నిలబెట్టడంలో వింతేముందీ? ఈ మనిషి ఎంతటి అవివేకి? తన్ను తానే మరచిపోతున్నాడు! తన్ను తాను మరచిపోతున్నందు వల్లనే అతను తన సృష్టికర్తను కూడా మరచిపోతున్నాడు.

**68** నీ ప్రభువు సాక్షి! నిశ్చయంగా మేము వాళ్ళను, (వాళ్ళతో పాటు) షైతానులను కూడా పోగు చేసి, నరకం చుట్టూ వారిని మోకాళ్ళ మీద పడి ఉన్న స్థితిలో హాజరు పరుస్తాము.[65]

فَوَرَبِّكَ لَنَحْشُرَنَّهُمْ وَالشَّيَاطِينَ ثُمَّ لَنُحْضِرَنَّهُمْ حَوْلَ جَهَنَّمَ جِثِيًّا ﴿٦٨﴾

**69** ఆ తరువాత కరుణామయుడైన అల్లాహ్ పట్ల ఎక్కువగా అహంకారంతో విర్రవీగే వారిని[66] మేము ఒక్కో వర్గం నుంచి వేరు పరుస్తాము.

ثُمَّ لَنَنزِعَنَّ مِن كُلِّ شِيعَةٍ أَيُّهُمْ أَشَدُّ عَلَى الرَّحْمَٰنِ عِتِيًّا ﴿٦٩﴾

**70** ఇంకా నరకంలోకి త్రోయబడటానికి ఎక్కువ అర్హులెవరో మాకు బాగా తెలుసు.[67]

ثُمَّ لَنَحْنُ أَعْلَمُ بِالَّذِينَ هُمْ أَوْلَىٰ بِهَا صِلِيًّا ﴿٧٠﴾

**71** మీలోని ప్రతి ఒక్కరూ అక్కడికి రావలసిందే. ఇది నీ ప్రభువు చేసిన తిరుగులేని నిర్ణయం. దాన్ని నిర్వర్తించే బాధ్యత ఆయనపై ఉంది.

وَإِن مِّنكُمْ إِلَّا وَارِدُهَا ۚ كَانَ عَلَىٰ رَبِّكَ حَتْمًا مَّقْضِيًّا ﴿٧١﴾

**72** తర్వాత మేము భయభక్తులు కలిగివున్న వారిని రక్షిస్తాము. దుర్మార్గులను అందులో మోకాళ్లపైపడి ఉన్న స్థితిలోనే వది లేస్తాము.[68]

ثُمَّ نُنَجِّي الَّذِينَ اتَّقَوا وَّنَذَرُ الظَّالِمِينَ فِيهَا جِثِيًّا ﴿٧٢﴾

65. మూలంలో **'జిసియ్యన్'** (جِثِيًّا) అని ఉంది. 'జాసిన్' అనే పదానికి బహువచనం. మోకాళ్ళ ఆధారంగా కిందపడేవాడిని జాసిన్ అంటారు. మలిసారి సృష్టించినపుడు మేము వీళ్ళనేగాకుండా, వీళ్ళ సోదరులైన షైతానులను కూడా మోకాళ్ళ మీద పడేసి ఈడుస్తాము. హదీసె ఖుద్సీలో ఈ విధంగా ఉంది: అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు – "ఆదం పుత్రుడు నన్ను ధిక్కరిస్తాడు. వాస్తవానికి అలా ధిక్కరించే అర్హత అతనికి లేనే లేదు. ఆదం పుత్రుడు నాకు బాధ కలిగిస్తాడు. వాస్తవానికి ఇది అతనికి ఏమాత్రం శోభనివ్వదు. అతడు నా పట్ల అవలంబించే ధిక్కార వైఖరి ఏమిటంటే, 'అల్లాహ్ నన్ను తొలిసారి పుట్టించినట్లుగా ఎట్టి పరిస్థితిలోనూ మళ్ళీ బ్రతికించడు' అని అతనంటాడు. నిజానికి తొలిసారి సృష్టించటం మలిసారి సృష్టించటం కన్నా సులభతరం ఏమీ కాదు (కష్టతరం అని అనుకుంటే అది తొలిసారి సృష్టించటమే). అతడు నాకు బాధ కలిగించే తీరు ఎలా ఉంటుందంటే, నాకు సంతానం ఉందని అతనంటాడు. నిజానికి నేను ఒక్కణ్ణే. అక్కరలేని వాణ్ణి. నేనెవరినీ కనలేదు. నేనెవరికీ సంతానం కూడా కాను. నాకు సరిసమానులు, సరిపోలినవారు ఎవరూ లేరు" (సహీహ్ బుఖారీ – ఇఖ్లాస్ సూరా వ్యాఖ్యానం).

66. అరబీ మూలంలో **'ఇతియ్యా'** (عِتِيًّا) అని ఉంది. ఇది 'ఆతిన్'కు బహువచనం. కరడుగట్టిన పొగరుబోతుని ఆతిన్ అంటారు. ఒక్కో వర్గంలోని తలబిరుసులను, పొగరుబోతు నాయకులను మేము ఏరి వారిని వేరుగా నిలబెడతాము. ఆ తరువాత వారందరినీ కట్టకట్టి నరకంలో విసరివేస్తాము. ఎందుకంటే ఈ తిరస్కారాగ్రేసరులు ఇతరులకన్నా ముందు నరకాగ్నికి ఆహుతి కావలసినవారు. వీళ్ల మూలంగానే అనేకులు సన్మార్గం తప్పారు.

67. ఎవరు నరకానికి ఆహుతి కావలసినవారో, ఎవరు ఎంత కఠిన శిక్షకు పాత్రులో మాకు బాగా తెలుసు.

68. ప్రామాణిక హదీసులలో ఈ ఆయతు వ్యాఖ్యానం ఇలా వుంది – నరకంపైన ఒక వంతెన నిర్మించబడుతుంది. ప్రతి విశ్వాసీ, ప్రతి అవిశ్వాసీ దాన్ని దాటిపోవలసి ఉంటుంది. విశ్వాసి అయిన వ్యక్తి తన కర్మలనుబట్టి తొందరగానో, ఆలస్యంగానో – మొత్తానికి దాటిపోతాడు. కొందరు రెప్పపాటు సమయంలో, కొందరు మెరుపువేగంతో, కొందరు

**73** స్పష్టమైన మా ఆయతులను వారి ముందు చదివి వినిపించి నపుడు అవిశ్వాసులు "ఇంతకీ మన ఇరు వర్గాలలో ఎవరు మంచి స్థితిలోఉన్నారో, ఎవరి సభలు ఉత్తమంగా ఉన్నాయో చెప్పండి?"[69] అని ముస్లిములతో అంటారు.

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ آيَاتُنَا بَيِّنَاتٍ قَالَ الَّذِينَ كَفَرُوا لِلَّذِينَ آمَنُوا أَيُّ الْفَرِيقَيْنِ خَيْرٌ مَّقَامًا وَأَحْسَنُ نَدِيًّا ﴿٧٣﴾

**74** మేము వీరికి మునుపు వీళ్లకన్నా ఎక్కువ సాధన సంపత్తులను, అట్టహాసాలను కలిగి ఉన్న ఎన్నో సముదాయాలను తుదముట్టించాము.[70]

وَكَمْ أَهْلَكْنَا قَبْلَهُم مِّن قَرْنٍ هُمْ أَحْسَنُ أَثَاثًا وَرِئْيًا ﴿٧٤﴾

**75** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "అపమార్గానికి లోనై ఉన్నవారికి కరుణామయుడైన అల్లాహ్ బాగా గడువు ఇస్తాడు. కడకు వారు– తమకు వాగ్దానం చేయబడుతున్న శిక్షను లేదా ప్రళయ గడియను చూచినపుడు ఎవరి స్థానం నికృష్టమైనదో, ఎవరి సమూహం బలహీనమైనదో తెలుసుకుంటారు."[71]

قُلْ مَن كَانَ فِي الضَّلَالَةِ فَلْيَمْدُدْ لَهُ الرَّحْمَٰنُ مَدًّا ۚ حَتَّىٰ إِذَا رَأَوْا مَا يُوعَدُونَ إِمَّا الْعَذَابَ وَإِمَّا السَّاعَةَ فَسَيَعْلَمُونَ مَنْ هُوَ شَرٌّ مَّكَانًا وَأَضْعَفُ جُندًا ﴿٧٥﴾

---

గాలిలా, మరికొందరు పక్షుల్లా వెళ్ళిపోతారు. కొందరేమో మేలుజాతి గుర్రాల్లాగా, ఇతర వాహనాల్లాగా దాటిపోతారు. కొందరు సునాయాసంగా దాటిపోతే, కొందరు దెబ్బలు తిని ఎలాగో దాటిపోగలుగుతారు. కొందరైతే నరకంలోకి జారిపడతారు. అయితే సిఫారసుపై వారు తరువాత నరకంలో నుంచి తీయబడతారు. కాని అవిశ్వాసులు మాత్రం ఆ వంతెనని దాటడంలో సఫలీకృతులు కాలేరు. వారంతా నరకంలో పడిపోతారు.

బుఖారీలోని ఒక హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది; "తమ సంతానంలో ముగ్గురు పిల్లలు యుక్త వయస్సుకు చేరకుండానే చనిపోయిన వారిని (తల్లిదండ్రులను) అగ్ని తాకదు. అయితే అల్లాహ్ వాగ్దానం నెరవేరటానికి మాత్రమే వారు నరకం నుండి సాగిపోతారు" (బుఖారీ – కితాబుల్ జనాయెజ్; ముస్లిం – కితాబుల్ బిర్ర్). 'ప్రభువు చేసిన తిరుగులేని – అంతిమ – నిర్ణయం' అంటే ఇదే. (వివరాల కోసం తఫ్సీర్ ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్‌లను చూడగలరు).

69. ఖుర్ఆన్ వంటి అద్భుత సందేశాన్ని ఎదుర్కోవటం చేతకాని ఖురైషు శ్రీమంతులు నిరుపేద ముస్లింల ఆర్థిక పరిస్థితి, నిరాడంబరమైన వారి సమావేశ స్థలాలను ఎత్తిచూపుతూ తమ డాబును, దర్పాన్ని చాటుకుంటున్నారు. ముస్లింలలో బిలాల్, అమ్మార్, సుహైబ్ లాంటి సహచరులు నిరుపేదలు. అవిశ్వాసుల దృష్టిలో వారు బలహీన వర్గానికి చెందినవారు. వారి సభావేదిక అయిన దారె అర్ఖమ్ చాలా సీదా సాదాగా ఉంటుంది. అదే సమయంలో అవిశ్వాసులైన అబూ జహల్, నజర్ బిన్ హారిస్, ఉత్బా, షైబా తదితర ప్రముఖుల సభావేదికలు ఎంతో అట్టహాసంగా ఉండేవి. పెద్ద పెద్ద మేడలలో వారు కొలువు తీరేవారు. ఈ ధన మదం, అధికార మదంతోనే వారు నిరుపేద ముస్లింలను చిన్నచూపు చూశారు.

70. ఈ ఆయతులో అల్లాహ్ ఇలా అంటున్నాడు : ప్రపంచంలో మీకు ప్రాప్తించిన భోగభాగ్యాలను, కీర్తి ప్రతిష్ఠలను చూసుకుని మురిసిపోకండి. మిడిసిపడకండి. మీ అంతస్థుల ప్రాతిపదికపై సత్యాసత్యాలు పరికించబడతాయని అనుకోకండి. ఈ ఆర్భాటాలు, అంతస్తులు మీకు పూర్వం గతించిన జాతులకు ఇంతకన్నా ఎక్కువే ఉండేవి. కాని సత్యాన్ని ధిక్కరించిన నేరానికి మేము వాళ్ళను నాశనం చేశాము. వారి ప్రాపంచిక సిరిసంపదలు, వారి వందిమాగధులు, వారి అధికారాలు వారికే విధంగానూ తోడ్పడలేకపోయాయి.

71. అవిశ్వాసులను, మార్గభ్రష్టులను తక్షణం పట్టుకోవటం దైవ సంప్రదాయం కాదు. ఆయన వారికి తగినంత

**76** ఇంకా, సన్మార్గం పొందినవారి సన్మార్గంలో అల్లాహ్ వృద్ధిని వొసగుతాడు.[72] మిగిలి ఉండే సత్కార్యాలు పుణ్యఫలం రీత్యానూ, పరిణామం రీత్యానూ నీ ప్రభువు సన్నిధిలో ఎంతో మేలైనవి.[73]

وَيَزِيدُ اللّٰهُ الَّذِينَ اهْتَدَوْا هُدًى ۗ وَالْبٰقِيٰتُ الصّٰلِحٰتُ خَيْرٌ عِنْدَ رَبِّكَ ثَوَابًا وَّخَيْرٌ مَّرَدًّا (76)

**77** మా ఆయతులను తిరస్కరించి, “నాకు సిరిసంపదలు, సంతానం తప్పకుండా వొసగబడతాయి” అని చెప్పేవాడిని నువ్వు చూశావా?

اَفَرَءَيْتَ الَّذِي كَفَرَ بِاٰيٰتِنَا وَقَالَ لَاُوْتَيَنَّ مَالًا وَّوَلَدًا (77)

**78** అగోచర విషయమేదయినా అతనికి తెలిసిపోయిందా? లేదా ఆ మేరకు కరుణామయుడైన అల్లాహ్ నుంచి ఏదన్నా వాగ్దానం పొంది ఉన్నాడా?

اَطَّلَعَ الْغَيْبَ اَمِ اتَّخَذَ عِنْدَ الرَّحْمٰنِ عَهْدًا (78)

**79** కానే కాదు. వాడు చెప్పేదంతా మేము వ్రాసిపెడతాము. వాడి కోసం శిక్షను పెంచుతూ పోతాము.

كَلَّا ۚ سَنَكْتُبُ مَا يَقُوْلُ وَنَمُدُّ لَهٗ مِنَ الْعَذَابِ مَدًّا (79)

**80** వాడు చెబుతున్న వస్తువులన్నింటినీ వాడి తదనంతరం మేము తీసేసుకుంటాము. వాడు ఒంటరిగా మా ముందు హాజరవుతాడు.[74]

وَّنَرِثُهٗ مَا يَقُوْلُ وَيَاْتِيْنَا فَرْدًا (80)

వ్యవధినిస్తాడు. గడువు ముగిసిన మీదటే నిజానిజాలు కళ్లముందు నిలుస్తాయి. దైవాగ్రహం వారిని నలువైపుల నుంచీ ముట్టడించినప్పుడు, ప్రళయ ఘడియ వచ్చేసినపుడు వారు వాస్తవ జగత్తులోకి వస్తారు. కాని ఆనాడు తప్పు తెలుసుకుని ప్రయోజనమేమీ ఉండదు. ఎందుకంటే తప్పును సరిదిద్దుకునే అవకాశం అక్కడ ఇవ్వబడదు.

72. హృదయాలలో తిరస్కారం (కుఫ్ర్), బహుదైవోపాసన (షిర్క్), మార్గభ్రష్టత్వం వంటి రోగాలు తిష్ఠవేసి ఉన్నవారు రోజురోజుకూ మార్గవిహీనతలో బహుదూరం వెళ్ళి పోతున్నట్లే, ఆంతర్యాలలో విశ్వాసం, సన్మార్గం ఉన్నవారు దినదినం తమ సన్మార్గంలో పురోగమిస్తూనే ఉంటారు.

73. ఈ వాక్యం ద్వారా అల్లాహ్ నిరుపేద ముస్లింలను ఓదార్చాడు. ఇహలోకంలో అవిశ్వాసులు తమ సిరిసంపదలను, సాధనసంపత్తులను చూసుకొని అదేపనిగా మిడిసిపడుతున్నారు. అవన్నీ అంతరించిపోయేవేనని ఆ మూర్ఖులు అర్థం చేసుకోవటం లేదు. ఓ నిరుపేద ముస్లింలారా! మీరు చేసే మంచి పనులే ఎప్పటికీ మిగిలి ఉంటాయి. పుణ్యఫలం దృష్ట్యా, గమ్యస్థానం రీత్యా అవి ఎంతో శ్రేష్ఠమైనవి. మీ పుణ్యకార్యాలకు గాను అల్లాహ్ అత్యుత్తమ పుణ్యఫలాన్ని మీకు పరలోకంలో ప్రసాదిస్తాడు.

74. ఈ ఆయతుల అవతరణా నేపథ్యం ఇది : హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) గారి తండ్రి ఆస్ బిన్ వాయల్ ఇస్లాం బద్ధ విరోధులలో ఒకడు. వాడు హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్‌కు కొంత సొమ్ము బాకీపడ్డాడు. తనకు రావలసిన సొమ్మును హజ్రత్ ఖబ్బాబ్ అడిగినపుడు, “నువ్వు ముహమ్మద్ (సఅసం) పట్ల తిరస్కార వైఖరిని అవలంబించనంత వరకూ నీ సొమ్మును నీకు ఇవ్వను” అని వాడు షరతు పెట్టాడు. “నువ్వు చచ్చి, మళ్లీ బ్రతికినా ఆ పని మాత్రం నేను చేయను” అని ఆయన చెప్పారు. “ఓహో! నేను చచ్చి మళ్లీ బ్రతుకుతానా?! ఒకవేళ అదే గనక జరిగితే అక్కడా నేను సిరిసంపదలతో, సంతానంతో అనుగ్రహించబడతాను. నీ బాకీని అప్పుడు చెల్లిస్తానులే” అని హేళన చేశాడు (సహీహ్ బుఖారీ–కితాబుల్ బుయూ; ముస్లిం – సిఫతుల్ ఖియామ). అతని ప్రగల్భాలకు సమాధానంగా అల్లాహ్

**81** వారు అల్లాహ్‌ను కాదని, ఇతరులను – తమకు ఆదరువుగా నిలుస్తారన్న ఉద్దేశంతో – ఆరాధ్యులుగా చేసుకున్నారు.

وَاتَّخَذُوا مِنْ دُوْنِ اللّٰهِ اٰلِهَةً لِّيَكُوْنُوْا لَهُمْ عِزًّا ﴿81﴾

**82** కాని అలా జరగనేరదు. వారి పూజలను వాళ్లు (వారి మిథ్యా దైవాలు) త్రోసి పుచ్చుతారు. పైగా వారికి శత్రువులుగా (వ్యతిరేకులుగా) మారతారు.[75]

كَلَّا ؕ سَيَكْفُرُوْنَ بِعِبَادَتِهِمْ وَيَكُوْنُوْنَ عَلَيْهِمْ ضِدًّا ﴿82﴾

**83** సత్యాన్ని తిరస్కరించేవారిని అదేపనిగా పురిగొల్పుతూ ఉండే షైతానులను మేము వారిపైకి వదలటాన్ని నువ్వు చూడలేదా?[76]

اَلَمْ تَرَ اَنَّاۤ اَرْسَلْنَا الشَّيٰطِيْنَ عَلَى الْكٰفِرِيْنَ تَؤُزُّهُمْ اَزًّا ﴿83﴾

**84** నువ్వు వారి విషయంలో ఏమాత్రం తొందరపడకు. మేము స్వయంగా వారి గడువును లెక్కిస్తున్నాము.[77]

فَلَا تَعْجَلْ عَلَيْهِمْ ؕ اِنَّمَا نَعُدُّ لَهُمْ عَدًّا ﴿84﴾

**85** భయభక్తులు గలవారిని కరుణామయుడైన అల్లాహ్ సన్నిధిలో అతిథులుగా మేము సమావేశపరచే రోజున,

يَوْمَ نَحْشُرُ الْمُتَّقِيْنَ اِلَى الرَّحْمٰنِ وَفْدًا ﴿85﴾

**86** అపరాధులను తీవ్రంగా దప్పికగొన్న స్థితిలో నరకం వైపుకు తోలుకుపోతాము.[78]

وَّنَسُوْقُ الْمُجْرِمِيْنَ اِلٰى جَهَنَّمَ وِرْدًا ﴿86﴾

**87** అప్పుడు కరుణామయుడు అయిన అల్లాహ్ తరఫున హామీ పొందినవారు తప్ప[79] ఇతరులెవరికీ సిఫారసు చేసే అధికారం ఉండదు.

لَا يَمْلِكُوْنَ الشَّفَاعَةَ اِلَّا مَنِ اتَّخَذَ عِنْدَ الرَّحْمٰنِ عَهْدًا ﴿87﴾

---

ఈ ఆయతులను అవతరింపజేశాడు – ఏమిటీ, పరలోకంలో కూడా తాను కటాక్షించబడతానని అంత ధీమాగా ఎలా చెబుతున్నాడు? వాడి దగ్గర ఏమన్నా రహస్య జ్ఞానం ఉన్నదా? లేక వాడు అల్లాహ్ నుండి ఆ మేరకు ఏదన్నా హామీ పొందాడా? వాడు ఇలాంటి పగటికలలు ఎన్ని కన్నా లాభం ఏమీ ఉండదు. వాడు ఏ సిరిసంపదల గురించి ఊహాలోకాల్లో విహరిస్తున్నాడో అది వాడి సొత్తు కాదు. వాడు చావగానే వాడి ఆస్తిపాస్తుల్ని మేము జప్తు చేసుకుంటాము. వాడి ఆస్తి ఏదీ వాడి వెంట రాదు. వాడు మా దగ్గరకు వచ్చేటప్పుడు ఒంటరిగానే వస్తాడు. వాడి ఆలుబిడ్డలు, ఆప్తమిత్రులు ఎవరూ వాడికి తోడుగా రారు. కాకపోతే వాడి తలబిరుసుతనానికి ప్రతిఫలంగా మేము వాడి యాతనను దినదిన ప్రవర్ధమానం చేస్తూపోతాము.

75. తాము పూజించే 'దేవుళ్లు' తమను ఆదుకుంటాయనీ, తమ గౌరవ ప్రపత్తులను కాపాడుతాయని వారు అనుకుంటున్నారు. ఆదుకోవటం సంగతి అటుంచండి, వారు వారికి శత్రువులుగా మారిపోతారు. అసలు వారెవరో తమకు తెలియదంటారు. వారికి వ్యతిరేకులుగా పరిణమిస్తారు.

76. అంటే ఈ పైశాచిక శక్తులు (షైతానులు) వారిని రెచ్చగొడ్తాయి. అపమార్గం వైపుకు తీసుకుపోతాయి. వారిచేత పాపకార్యాలు చేయిస్తుంటాయి.

77. గడువు పూర్తవగానే దైవాగ్రహం వారిని చుట్టుముట్టుతుంది. కనుక (ఓ ప్రవక్తా!) వారి విషయంలో నువ్వు తొందరపడాల్సిన అవసరం లేదు.

**88** కరుణామయుడైన అల్లాహ్‌కు సంతానం ఉంది అని వారంటున్నారు.

وَقَالُوا اتَّخَذَ الرَّحْمٰنُ وَلَدًا ﴿٨٨﴾

**89** నిజానికి మీరు చాలా దారుణమైన విషయాన్ని[80] తెచ్చారు.

لَقَدْ جِئْتُمْ شَيْئًا إِدًّا ﴿٨٩﴾

**90** త్వరలోనే ఆకాశాలు పగిలి, భూమి బ్రద్దలై, పర్వతాలు తుత్తునియలై పోతాయేమో,

تَكَادُ السَّمٰوٰتُ يَتَفَطَّرْنَ مِنْهُ وَتَنْشَقُّ الْاَرْضُ وَتَخِرُّ الْجِبَالُ هَدًّا ﴿٩٠﴾

**91** కరుణామయుడైన అల్లాహ్‌కు సంతానం ఉందని వారు చేసే వాదన కారణంగా.

اَنْ دَعَوْا لِلرَّحْمٰنِ وَلَدًا ﴿٩١﴾

**92** సంతానం కలిగి ఉండటం అనేది కరుణామయుని (ఔన్న త్యాని)కి ఏమాత్రం శోభించదు.

وَمَا يَنْۢبَغِيْ لِلرَّحْمٰنِ اَنْ يَّتَّخِذَ وَلَدًا ﴿٩٢﴾

**93** ఆకాశాలలో, భూమిలో ఉన్న వారందరూ కరుణామయుని వద్దకు దాసులుగా రావలసిందే.[81]

اِنْ كُلُّ مَنْ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ اِلَّآ اٰتِي الرَّحْمٰنِ عَبْدًا ﴿٩٣﴾

**94** వారందరినీ ఆయన చుట్టుముట్టి ఉన్నాడు. అందరినీ పూర్తిగా లెక్కపెట్టి ఉంచాడు.[82]

لَقَدْ اَحْصٰىهُمْ وَعَدَّهُمْ عَدًّا ﴿٩٤﴾

**95** వారంతా ప్రళయదినాన ఆయన సమక్షంలో ఒంటరిగా హాజరవుతారు.[83]

وَكُلُّهُمْ اٰتِيْهِ يَوْمَ الْقِيٰمَةِ فَرْدًا ﴿٩٥﴾

78. స్వర్గవాసులను గుఱ్ఱాలపై, ఒంటెలపై సాదరంగా ఆహ్వానించి, అతిథి మర్యాదలతో స్వర్గం వైపుకు తీసుకుపోగా, నరకవాసులను తీవ్రంగా దప్పికగొన్న స్థితిలో నరకం వైపుకు (పశువుల తరహాలో) తోలటం జరుగుతుంది.

79. హామీ పొందినవారంటే విశ్వాసులు, దైవభీతిపరులు అన్నమాట. సిఫారసు చేసే అనుమతి అందరికీ లభించదు. దైవభక్తిలో, విశ్వాసంలో ముందంజ వేసిన కొందరు సజ్జనులకు మాత్రం అల్లాహ్ సిఫారసు చేసే అనుమతి ఇస్తాడు.

80. **'ఇద్దన్'** ( اِدًّا ) అంటే చాలా తీవ్రమయిన మాట, పెద్ద విషయం, ఘోరమైన ఆపద అన్న అర్థాలు వస్తాయి. ఈ విషయం ఇంతకు ముందు కూడా వచ్చింది. అల్లాహ్‌కు బిడ్డలున్నారని అనటం ఎంత ఘోరమైన నేరమంటే, దానికి అల్లాహ్ అమితంగా ఆగ్రహిస్తాడు. వారి అపవాదుకు మిన్ను విరిగి మీద పడవచ్చు. భూమి ప్రకంపించ వచ్చు. పర్వతాలు బద్దలైపోవచ్చు.

81. అందరూ అల్లాహ్ ఆజ్ఞలకు లోబడి, ఆయన దాస్యం చేస్తున్నప్పుడు ఆయన ఇంకొకరిని కొడుకుగా చేసుకోవలసిన అవసరం ఏముంది? ఇలాంటి పని చేయటం ఆయన ఔన్నత్యానికి తగదు కదా!

82. అంటే; ఆది మానవుడైన ఆదం మొదలుకుని ప్రళయం సంభవించే క్షణం వరకూ ఈ లోకంలో ఉన్న సమస్త మానవులను, జిన్నులను కూడా ఆయన లెక్కించి ఉంచాడు. అందరూ ఆయన కనుసన్నలలో ఉన్నారు. ఆయన పర్యవేక్షణాపరిధి దాటి ఎవరూ లేరు. ఉండలేరు కూడా.

83. ఆనాడు ఏ ఒక్కరూ ఇంకొకరికి సహాయకులుగానో, వకాల్తా పుచ్చుకున్నవారు గానో కలసి రాలేరు. వారి ధనం

**96** నిశ్చయంగా విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారి యెడల కరుణామయుడైన అల్లాహ్ ప్రేమానురాగాలను సృజిస్తాడు.[84]

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ سَيَجْعَلُ لَهُمُ الرَّحْمَٰنُ وُدًّا ﴿٩٦﴾

**97** నువ్వు ఈ గ్రంథం ఆధారంగా భయభక్తులు గలవారికి శుభవార్తను వినిపించటానికీ, తగవులమారులను హెచ్చరించటానికీ[85] దీనిని నీ భాషలో చాలా సులభతరం చేశాము.[86]

فَإِنَّمَا يَسَّرْنَاهُ بِلِسَانِكَ لِتُبَشِّرَ بِهِ الْمُتَّقِينَ وَتُنذِرَ بِهِ قَوْمًا لُّدًّا ﴿٩٧﴾

**98** మేము వీరికి మునుపు ఎన్నో సమూహాలను తుదముట్టించాము. వారిలో ఏ ఒక్కరి జాడనైనా నువ్వు పసిగట్ట గలుగుతున్నావా? లేక కనీసం వారి నిట్టూర్పునైనా వింటున్నావా??[87]

وَكَمْ أَهْلَكْنَا قَبْلَهُم مِّن قَرْنٍ هَلْ تُحِسُّ مِنْهُم مِّنْ أَحَدٍ أَوْ تَسْمَعُ لَهُمْ رِكْزًا ﴿٩٨﴾

---

కూడా వారికి తోడుగా ఉండదు. "ఆ రోజు ధనంగానీ, కొడుకులుగానీ ప్రయోజనం చేకూర్చలేరు." (షుఅరా: 88). ప్రతి ఒక్కరూ ఒంటరిగా నిలబడి తన లెక్క ఇవ్వవలసి ఉంటుంది. మానవుడు ఎవరిపై ఆశలు పెట్టుకుంటాడో, ఎవరి సహాయసహకారాలు లభిస్తాయని కలలుగంటాడో వారంతా అప్పుడు కనుమరుగైపోతారు. ఆనాడు ఎవరూ ఎవరికీ ఎలాంటి సహాయమూ చేయరు.

84. అంటే ప్రపంచంలో వారు చేసే మంచిపనుల కారణంగా, మంచి నడవడిక మూలంగా ప్రజల హృదయాలలో వారిపట్ల ప్రేమను, గౌరవభావాన్ని జనింపజేస్తాడు. ఒక హదీసులో ఉంది: "అల్లాహ్ తన (సజ్జన) దాసులలో ఎవరినయినా ప్రియతమునిగా చేసుకున్నప్పుడు, జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను పిలిచి, 'నేను ఫలానా దాసుణ్ణి ప్రేమిస్తున్నాను. నువ్వు కూడా అతన్ని ప్రేమించు' అని అంటాడు. ఆ క్షణం నుంచీ జిబ్రయీల్ (అలైహిస్సలాం) కూడా ఆ వ్యక్తిని ప్రేమించటం మొదలెడతారు. అంతే కాదు, 'అల్లాహ్ ఫలానా దాసుణ్ణి ప్రేమిస్తున్నాడు' అని ఆయన ఆకాశంలో ప్రకటన గావిస్తారు. అంతే! ఆకాశవాసులంతా ఆ వ్యక్తిని ప్రేమించసాగుతారు. ఆ తరువాత భూ మండలంలో కూడా ఆ వ్యక్తి అందరికీ ఆమోదయోగ్యుడు (ప్రియతముడు)గా రాణిస్తాడు. అతని కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి" (సహీహ్ బుఖారీ – కితాబుల్ అదబ్).

85. **'లుద్దన్'** (**لُدًّا**) అంటే జగడం చేసేవారు, తగవు పెట్టుకునేవారు, పిడివాదానికి దిగేవారు, గొడవచేసేవారు అని అర్థం.– అంటే అవిశ్వాసులు, ముష్రిక్కులు అన్నమాట!

86. దివ్య ఖుర్ఆన్‌ను సులభతరం చేయటం అంటే ప్రవక్తకు తెలిసిన భాషలో అవతరింపజేసి, ప్రతి విషయాన్ని స్పష్టంగా పూసగుచ్చినట్లు చెప్పటం అని భావం.

87. పేరు మోసిన ఎన్నో జాతులు కాలగర్భంలో కలిసిపోయాయి. ఈనాడు వారి అడుగు జాడలు ఎక్కడా కానరావు. వారి గుండె చప్పుళ్లు ఎక్కడా వినిపించవు. కాబట్టి దైవప్రవక్త (సఅసం) సందేశాన్ని వేళాకోళంగా తీసుకున్నవారు ఈ సందర్భంగా ఆలోచించాలి. గతంలో వారికి పట్టిన దుర్గతే వీరికీ పట్టవచ్చు. వారు నిర్భయంగా, నిశ్చింతగా ఉండకూడదు అని దీని భావం.

20 వ సూరా

# తాహా

తాహా

అవతరణ మక్కాలో

ఆయతులు 135

## పరిచయం

*ఈ సూరా మూడు విషయాలను ముఖ్యంగా నొక్కి చెప్పింది. అవి : తౌహీద్ (ఏక దైవారాధన), ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం. ఈ సూరా ప్రారంభ పదాలైన తా హా అన్న అక్షర సమూహంతో ఈ సూరాకు పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅస) మక్కాలో అవిశ్వాసుల నుంచి ఎదుర్కున్న కష్టాలు, కుట్రలు, దౌర్జన్యాల నేపథ్యంలో ఆయనకు ఊరటగా ఈ సూరా అవతరించింది. ఒక ప్రవక్తగా ఆయన చేయవలసిన పనులను ఈ సూరా వివరించింది. దృఢచిత్తంతో, సహనంతో కృషి చేయాలని ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు చెప్పడం జరిగింది. రాత్రింబవలు, సూర్యోదయం సూర్యాస్తమయాల్లో దేవుని ఔన్నత్యాన్ని కొనియాడుతూ ఉండాలని, ఇతరులకు లభించిన వాటి గురించి ఆలోచించరాదని, తన కుటుంబాన్ని దైవప్రార్థనలు చేసేలా ప్రోత్సహించాలని ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు అల్లాహ్ ఉపదేశించాడు.*

*ఈ సూరాలో గత కాలానికి చెందిన ఇద్దరు ప్రవక్తల గురించి ప్రస్తావనలు ఉన్నాయి. మక్కా అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్(సఅస)ను ఆయన ప్రవక్త పదవి నిరూపించుకోవడానికి మహత్యాలు చూపించాలని సవాలు చేసినప్పుడు ప్రవక్తకు ఊరటనిస్తూ, గత కాలాల ప్రవక్తల వృత్తాంతాన్ని వివరించడం జరిగింది. మొదటి వృత్తాంతం మూసా ప్రవక్త (అస), ఫిర్ఔన్‌లకు సంబంధించినది. రెండవ గాథ ఆదమ్ (అస) గురించినది. ఈ గాథను క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. ఈ గాథ దేవుని కారుణ్యాన్ని, క్షమాగుణాన్ని ప్రతిబింబిస్తుంది. ఆదమ్ (అస) తన శత్రువైన షైతాన్ మాటలు విని అల్లాహ్ ఆదేశాన్ని అతిక్రమించినప్పటికీ అల్లాహ్ ఆయన పట్ల కారుణ్యాన్ని చూపాడు. ఈ సూరాలో తీర్పుదినం గురించిన వర్ణన వివరంగా ఉంది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 9-97 | 83 | 'దైవప్రవక్త మూసా, ఇస్రాయీల్ జాతివారి విమోచన కర్త' | దైవప్రవక్త మూసా (అ) చరిత్ర దివ్యఖుర్ఆన్ గ్రంథంలో ఎన్నో విభాగాలుగా, ఎన్నో చోట్ల ప్రస్తావించబడింది. అలా అని చెప్పిన మాటే మళ్ళీ మళ్ళీ చెప్పబడలేదు. ప్రతిసారి ఏదో ఒక కొత్త విషయం! ఏదో ఒక సరికొత్త కోణం!! మరి ఆ వింత సంగతులన్నింటినీ మాలగా కూర్చుకొని చదువుకుంటే ఇంకెంత బాగుంటుంది?! |
| 115-123 | 4-7 | 'మానవ సృష్టి' 'ఇబ్లీస్ ప్రతీకారం' | ఆది మానవుని సృష్టికి ముందు ఆకాశ లోకాల్లో చోటు చేసుకున్న సంఘటనలు. తదనంతర పరిణామాలు. |

# తాహా [1]సూరా

سُوۡرَةُ طٰهٰ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

1 తా హా.

طٰهٰ ﴿1﴾

2 (ఓ ముహమ్మద్ – సఅసం!) మేము ఈ ఖుర్ఆన్‌ను నీపై అవతరింపజేసింది నువ్వు కష్టాల్లో పడడానికి కాదు[2] –

مَاۤ اَنۡزَلۡنَا عَلَيۡكَ الۡقُرۡاٰنَ لِتَشۡقٰٓى ﴿2﴾

3 అల్లాహ్‌కు భయపడేవాని బోధనార్థం మాత్రమే (దీనిని అవతరింపజేశాము).

اِلَّا تَذۡكِرَةً لِّمَنۡ يَّخۡشٰى ﴿3﴾

4 భూమినీ, ఎత్తయిన ఆకాశాలనూ సృష్టించిన వాని తరఫున ఇది అవతరింపజేయబడింది.

تَنۡزِيۡلًا مِّمَّنۡ خَلَقَ الۡاَرۡضَ وَالسَّمٰوٰتِ الۡعُلٰى ﴿4﴾

5 ఆ కరుణామయుడు అర్ష్ (సింహాసనము) పై ఆసీనుడై ఉన్నాడు.[3]

اَلرَّحۡمٰنُ عَلَى الۡعَرۡشِ اسۡتَوٰى ﴿5﴾

6 ఆకాశాలలో, భూమిలో ఆ రెండింటి మధ్యనా, ఇంకా (నేల) అట్టడుగు భాగాన ఉన్న ప్రతిదీ ఆయనదే.[4]

لَهٗ مَا فِى السَّمٰوٰتِ وَمَا فِى الۡاَرۡضِ وَمَا بَيۡنَهُمَا وَمَا تَحۡتَ الثَّرٰى ﴿6﴾

7 నువ్వు మాటను బిగ్గరగా పలికినా (ఫరవాలేదు). ఆయనైతే మెల్లగా (పలికినా), అతి గోప్యంగా విన్నవించుకున్నా ప్రతిదీ తెలుసుకుంటాడు.[5]

وَاِنۡ تَجۡهَرۡ بِالۡقَوۡلِ فَاِنَّهٗ يَعۡلَمُ السِّرَّ وَاَخۡفٰى ﴿7﴾

1. హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరించటానికి పలువురు పలు కారణాలు వ్యక్తం చేశారు. వాటిలో ఒకటి తాహా సూరా పారాయణం. హజ్రత్ ఉమర్ తన బావగారినీ, చెల్లెలినీ దండించే ఉద్దేశంతో వాళ్ళ ఇంటికి వెళ్ళారు. అయితే అక్కడ ఆయన తాహా సూరా పఠనాన్ని విని, ప్రభావితులై ఇస్లాం స్వీకరించినట్లు కొన్ని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది (ఫత్‌హుల్ ఖదీర్).

2. (ఓ ముహమ్మద్!) మేము ఈ ఖుర్ఆన్ గ్రంథాన్ని భక్తిపరాయణుల ఉపదేశం కోసం అవతరింపజేశాము. ఈ అవిశ్వాసులు విశ్వసించనంతమాత్రాన నువ్వు దుఃఖంతో కుమిలి పోవలసిన అవసరం లేదు. "వాళ్లు విశ్వసించటం లేదన్న బాధతో, నువ్వు వారి వెనుక బాధతో కుమిలి కుమిలి, నీ ప్రాణాలకు ముప్పు కొనితెచ్చుకుంటావా ఏమిటీ?" (అల్ కహఫ్-6). మేము ఈ గ్రంథాన్ని ఒక జ్ఞాపికగా అవతరింపజేశాము. మానవ నైజంలో, ఆంతర్యంలో దాగివున్న దేవుని ఏకత్వపు భావన ప్రస్ఫుటం కావాలన్నదే దీని ఉద్దేశ్యం. అంతేగాని నిన్ను కష్టాల్లో పడవేయాలన్నది ఎంతమాత్రం కాదు.

3. అల్లాహ్ అర్ష్ అనే పీఠంపై ఆసీనుడై ఉన్నాడని ఆయతులో చెప్పబడింది. కాబట్టి దాన్ని యథాతథంగా విశ్వసించటం మన విధి. ఏవిధంగా ఆసీనుడయ్యాడు? లాంటి ప్రశ్నలు మనకు అనవసరం.

4. 'సరా' (ثرى) అంటే భూమిలో అత్యంత అడుగున ఉండే భాగం అని అర్థం.

5. దైవధ్యానం చేసినా, ఆయనకు ఏదన్నా విన్నపం చేసుకున్నా బిగ్గరగా చేయనవసరం లేదు. ఎందుకంటే ఆయన అతి

**8** ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. సుందరమైన పేర్లన్నీ ఆయనవే.[6]

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۭ لَهُ الْاَسْمَاۗءُ الْحُسْنٰى ﴿8﴾

**9** మూసా వృత్తాంతం నీకు చేరిందా?

وَهَلْ اَتٰىكَ حَدِيْثُ مُوْسٰى ﴿9﴾

**10** అతను నిప్పును చూసినప్పుడు తన ఇంటివారితో, "కాస్సేపు ఆగండి. నాకు నిప్పు కనిపించింది. వీలైతే కొంత నిప్పును అందులో నుంచి మీకోసం తెస్తాను లేదా (కనీసం) ఆ మంట ఉన్న చోటునుంచి దారినయినా కనుగొంటాను" అన్నాడు.[7]

اِذْ رَاٰ نَارًا فَقَالَ لِاَهْلِهِ امْكُثُوْٓا اِنِّىْٓ اٰنَسْتُ نَارًا لَّعَلِّيْٓ اٰتِيْكُمْ مِّنْهَا بِقَبَسٍ اَوْ اَجِدُ عَلَي النَّارِ هُدًى ﴿10﴾

**11** తీరా అతను అక్కడకు చేరుకోగానే, ఈ పిలుపు వచ్చింది[8]: "ఓ మూసా!

فَلَمَّآ اَتٰىهَا نُوْدِيَ يٰمُوْسٰى ﴿11﴾

**12** "నేనే నీ ప్రభువును. నువ్వు నీ చెప్పులు విడువు.[9] ఎందుకంటే (ఇప్పుడు) నువ్వు పవిత్రమైన 'తువా' లోయలో ఉన్నావు.[10]

اِنِّىْٓ اَنَا رَبُّكَ فَاخْلَعْ نَعْلَيْكَ ۚ اِنَّكَ بِالْوَادِ الْمُقَدَّسِ طُوًى ﴿12﴾

---

నెమ్మదిగా చెప్పినా గ్రహిస్తాడు. లేక **'అఖ్ఫా'** (اَخْفٰى) అన్న మాటకు అర్థం ఇది కూడా కావచ్చు. మానవుల విధివ్రాత గురించి కూడా ఆయనకు తెలుసు. ప్రళయదినం వరకు ఎవరి విషయంలో ఏం జరుగుతుందో ఆయనకు తెలుసు. అయితే ఈ విషయాలను ఆయన మానవులకు తెలియకుండా రహస్యంగా ఉంచాడు.

6. ఏ గుణగణాలైతే ఆయన గురించి వివరించబడ్డాయో వాటికి ఆయన అన్ని విధాలా తగినవాడు. ఆయన పిలువబడే అత్యుత్తమ నామాలు కూడా ఆయనకే శోభాయమానం. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. ఆయనకు గల పేర్లు ఇంకొకరికి లేవు. కాబట్టి వాటి సారాన్ని గ్రహించి ఆయన ఆగ్రహం గురించి ప్రజలను హెచ్చరించాలి. ఆయన పట్ల విశ్వాస భావం జనింపజేయాలి. ఆయనకే విధేయత చూపాలి. ఆయన్నే ప్రేమించాలి. మానవుడు రేపు ఆ సార్వభౌముని సమక్షంలో హాజరయ్యేటప్పుడు అవమాన భారంతో కుంచించుకుపోయే పరిస్థితి రాకుండా జాగ్రత్తపడాలి.

7. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన సతీమణి (ఒక కథనం ప్రకారం హజ్రత్ షుఐబ్ అలైహిస్సలాం పుత్రిక అయిన అఫ్రూర్)ని వెంటబెట్టుకుని మద్‌యన్ ప్రదేశం నుంచి తన తల్లి దగ్గరకు వెళుతున్నప్పుడు జరిగిన సంఘటన ఇది. రాత్రి వేళ అది. నలువైపులా అంధకారం అలుముకుని ఉంది. ముందుకు పోవలసిన దారి ఏదో తెలియక ఇబ్బందిపడసాగారు. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఆయన సతీమణికి ప్రసవ సమయం ఆసన్నమైంది. ఆ సమయంలో ఆమెకు వేడి (చలిమంట) అవసరమయింది. లేదా తీవ్రమయిన చలిమూలంగా వారికి చలిమంట వేసుకోవాలనిపించింది. అంతలోనే వారికి కొంతదూరంలో అగ్నిమంటలు కానవచ్చాయి. అప్పుడాయన తన ఇంటివారిని – అంటే ఇల్లాలిని – ఉద్దేశించి, (సేవకుడు, కొడుకు కూడా ఉండటం వల్ల బహువచనంలో సంబోధించారని కొందరు అభిప్రాయపడ్డారు). "మీరిక్కడే ఉండండి. మీకోసం కొంత నిప్పును తేగలనేమో! లేదా కనీసం అక్కణ్ణుంచి వెళ్ళే దారైనా కానవస్తుందేమో తెలుసుకుని వస్తాను" అని చెప్పారు మూసా (అలైహిస్సలాం).

8. మూసా (అలైహిస్సలాం) అగ్ని ఉన్న చోటికి వెళ్ళగానే అక్కడ ఒక చెట్టు నుంచి (ఖసస్ సూరా 30వ ఆయతులో ఉంది) ఈ పిలుపు వినవచ్చింది.

9. **"చెప్పులు విడువు"** అని ఎందుకు అనబడింది? చెప్పులు విడువటం వల్ల మనిషిలో అణకువ, వినమ్రత పెంపొందుతాయన్న ఉద్దేశంతో ఈ మేరకు ఆజ్ఞాపించబడిందని కొందరు అభిప్రాయపడ్డారు. ఆయన తొడిగిన చెప్పులు గాడిద చర్మంతో చేయబడినవనీ, శుద్ధి చేయకుండానే ఆయన వాటిని ధరించటం వల్ల అపవిత్రంగా పరిగణించబడ్డాయని

13 "నేను నిన్ను ఎన్నుకున్నాను.[11] ఇప్పుడు వహీ ద్వారా అంద జేయబడేదంతా శ్రద్ధగా విను –

وَاَنَا اخْتَرْتُكَ فَاسْتَمِعْ لِمَا يُوْحٰى ⑬

14 "నిశ్చయంగా నేనే అల్లాహ్‌ను. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి నువ్వు నన్నే ఆరాధించు.[12] నన్ను జ్ఞాపకం చేయ టానికి నమాజును నెలకొల్పు.[13]

اِنَّنِيْٓ اَنَا اللّٰهُ لَآ اِلٰهَ اِلَّآ اَنَا فَاعْبُدْنِيْ ۙ وَاَقِمِ الصَّلٰوةَ لِذِكْرِيْ ⑭

15 "ప్రళయ ఘడియ రావటం తథ్యం. ప్రతి వ్యక్తి తన కృషికి తగ్గ ప్రతిఫలం పొందటానికి ఆ సమయాన్ని నేను గోప్యంగా ఉంచదలిచాను.

اِنَّ السَّاعَةَ اٰتِيَةٌ اَكَادُ اُخْفِيْهَا لِتُجْزٰى كُلُّ نَفْسٍۢ بِمَا تَسْعٰى ⑮

16 "అయితే దానిని నమ్మకుండా, తన కోర్కెల వెనుక పరుగెత్తే వాడు ఎవడయినా నిన్ను ఆ విషయంలో అడ్డు తగలకూడదు సుమా! అన్యథా నువ్వు కూడా వినాశానికి గురవుతావు[14] (జాగ్రత్త!)"

فَلَا يَصُدَّنَّكَ عَنْهَا مَنْ لَّا يُؤْمِنُ بِهَا وَاتَّبَعَ هَوٰىهُ فَتَرْدٰى ⑯

మరికొందరు వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్య పొంతన లేకుండా ఉంది. శుద్ధిచేయని చెప్పులను ఎవరయినా ఎందుకు వేసుకుంటారు? అన్నది ఒక ప్రశ్న. ఆ లోయ, ఆయతులో చెప్పబడినట్లు పవిత్రమైన లోయ కావటం చేత ఆ మేరకు ఆజ్ఞాపించబడి ఉండవచ్చు బహుశా. ఈ నేపథ్యంలో రెండు విషయాలు గమనించదగినవి : 1. ఆ లోయ పవిత్రమైనది. దాని పవిత్రతను కాపాడటం అవసరం. 2. చెప్పులు విడిచి నగ్నపాదాలతో నిలబడితే ఆ లోయ పవిత్రతా ప్రభావం ఎక్కువగా మూసా (అలైహిస్సలాం)లో ప్రవేశించే అవకాశం ఉంటుంది – యదార్థం అల్లాహ్‌కే ఎరుక.

10. **'తువా'** (**طُوًى**) అనేది ఒక పర్వత లోయ.

11. అంటే ప్రవక్త పదవి కోసం నిన్ను ఎంపిక చేశాను. నీతో సంభాషించదలిచాను. నీ ద్వారా జనులకు సన్మార్గం చూప దలిచాను.

12. షరీయతుకు సంబంధించిన ఆదేశాలలో ఇది మొట్టమొదటిది; అత్యంత ముఖ్యమైనదీను. ప్రతి మనిషీ దీనికి కట్టుబడి ఉండాల్సిందే. దైవత్వం ఆయన స్వంతమైనపుడు, ఆరాధనలు, అర్చనలు కూడా ఆయనకే చెందాలి మరి!

13. ఇబాదత్ (దాస్యం, ఆరాధన) గురించి చెప్పిన తరువాత, నమాజును నెలకొల్పమని తాకీదు చేయటం గమనార్హం. 'ఇబాదత్' (ఆరాధన)లో నమాజు కూడా అంతర్భాగమే. అయినప్పటికీ నమాజు గురించి ప్రత్యేకంగా ఆదేశించటాన్నిబట్టి దాని ప్రాముఖ్యం అవగతం అవుతోంది. 'నా జ్ఞాపకం నిమిత్తం నమాజును స్థాపించు' అని చెప్పటం విశేషం! దైవనామస్మరణ కోసం మనిషి ఆరాధన చేస్తాడు. మరి ఆరాధనలో నమాజుకు గల ప్రాముఖ్యం ఎనలేనిది.

మరో భావం ఇది: నేను నీకు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నమాజు చెయ్యి. – అలసత్వానికి గురై ఉన్నప్పుడు, నిద్ర ముంచుకు వస్తున్నప్పుడు కాకుండా ఆ స్థితి నుండి బయటపడిన తర్వాత నేను గుర్తుకు రాగానే నమాజ్ చేయి అని కూడా దీనికి భావం కావచ్చు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఎవరైనా నమాజు చేయకుండా నిద్రపోతే, లేక మరుపుకు లోనవుతే జ్ఞాపకం రాగానే దాన్ని నెరవేర్చాలి. అదే దీని పరిహారం" (సహీహ్ బుఖారీ – కితాబుల్ మవాఖీత్ ; ముస్లిం – కితాబుల్ మసాజిద్).

14. ఒకవేళ ఇతరుల మాట విని నీలో పరలోకం పట్ల విశ్వాసం సన్నగిల్లినా, లేక పరలోకాన్ని నువ్వు స్మరించకపోయినా అది నీ పతనానికి దారితీస్తుంది.

**17** "నీ కుడిచేతిలో ఉన్నదేమిటి ఓ మూసా?!" (అని దేవుడు ప్రశ్నించగా)

وَمَا تِلْكَ بِيَمِينِكَ يَٰمُوسَىٰ ﴿١٧﴾

**18** "ఇది నా చేతి కర్ర. దీన్ని ఊతగా చేసుకుంటాను. దీంతో నా మేకల కోసం ఆకులు రాలుస్తాను. దీనివల్ల నాకింకా ఎన్నో ప్రయోజనాలున్నాయి" అని (మూసా) బదులిచ్చాడు.

قَالَ هِيَ عَصَايَ أَتَوَكَّؤُا۟ عَلَيْهَا وَأَهُشُّ بِهَا عَلَىٰ غَنَمِي وَلِيَ فِيهَا مَـَٔارِبُ أُخْرَىٰ ﴿١٨﴾

**19** "ఓ మూసా! దాన్ని పడవెయ్యి" అన్నాడు (అల్లాహ్).

قَالَ أَلْقِهَا يَٰمُوسَىٰ ﴿١٩﴾

**20** అతను దాన్ని పడవెయ్యగానే, అది పాముగా మారి పరుగెత్త సాగింది.

فَأَلْقَىٰهَا فَإِذَا هِيَ حَيَّةٌ تَسْعَىٰ ﴿٢٠﴾

**21** (అల్లాహ్) ఇలా సెలవిచ్చాడు : "దాన్ని పట్టుకో. భయపడకు. మేము వెంటనే దాన్ని పూర్వ స్థితిలోకి తీసుకువస్తాము."[15]

قَالَ خُذْهَا وَلَا تَخَفْ سَنُعِيدُهَا سِيرَتَهَا ٱلْأُولَىٰ ﴿٢١﴾

**22** నీ చేతిని చంకలో నొక్కి పెట్టు. అది ఎలాంటి లోపం లేకుండా తెల్లగా (ధగ ధగా) మెరిసిపోతూ వస్తుంది.[16] ఇది రెండవ మహిమ.

وَٱضْمُمْ يَدَكَ إِلَىٰ جَنَاحِكَ تَخْرُجْ بَيْضَآءَ مِنْ غَيْرِ سُوٓءٍ ءَايَةً أُخْرَىٰ ﴿٢٢﴾

**23** "నీకు మా గొప్ప సూచనలను చూపటానికే ఇదంతా చేస్తున్నాము."

لِنُرِيَكَ مِنْ ءَايَٰتِنَا ٱلْكُبْرَى ﴿٢٣﴾

**24** "ఇక నువ్వు ఫిరౌను వద్దకు వెళ్ళు. వాడు తలబిరుసుగా తయారయ్యాడు."[17]

ٱذْهَبْ إِلَىٰ فِرْعَوْنَ إِنَّهُۥ طَغَىٰ ﴿٢٤﴾

**25** అప్పుడు మూసా ఇలా విన్నవించుకున్నాడు : "ఓ నా ప్రభూ! నా కోసం నా ఛాతీ (మనసు)ని విశాలమైనదిగా చేయి.

قَالَ رَبِّ ٱشْرَحْ لِي صَدْرِي ﴿٢٥﴾

15. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు వొసగబడిన మహిమలలో ఇదొకటి.

16. 'ఏ లోపమూ లేకుండా తెల్లగా ప్రకాశిస్తూ వస్తుంది' అంటే ఇంతకుముందు చేతికి ఏదో లోపం లేక వ్యాధి ఉండేదేమో! అన్న అనుమానం రావచ్చు. బహుశా చేతికి బొల్లి (తెల్లమచ్చలు) ఉండేదేమో! అనుకోవచ్చు. కాని అదేమీ కాదు. వాస్తవానికి ఇది మూసాకు ప్రసాదించబడిన రెండవ మహిమ. ఈ విషయాన్నే దివ్య ఖుర్ఆన్ మరోచోట ఇలా చెప్పింది: "ఫిరౌను మరియు అతని పెద్దల ముందు ఉంచటానికి నీ ప్రభువు తరఫున వొసగబడిన రెండు నిదర్శనాలివి" (అల్ ఖసస్ – 32).

17. ఈ సందర్భంగా దేవుడు ఫిరౌను ప్రస్తావన తీసుకురావటానికి కారణం లేకపోలేదు. ఆ కాలంలో ఫిరౌను చక్రవర్తి మూసా (అలైహిస్సలాం) జాతివారైన ఇస్రాయీలులపై అణచివేత చర్యలకు పాల్పడి, వారిని బానిసలుగా చేసుకునేవాడు. అదీగాక వాడు మరీ బరితెగించి పోయాడు. రాజ్యంలో చెలరేగిపోతూ తనంతటివాడు లోకంలో లేడని చెప్పసాగాడు. "నేనే మీ సర్వోన్నత ప్రభువును" అని ప్రగల్భాలు పలికే వరకూ వచ్చింది వాడి వ్యవహారం.

26 “నా కార్యాన్ని నా కోసం సులభతరం చేయి. وَيَسِّرْ لِيٓ أَمْرِي ﴿٢٦﴾

27 “నా నాలుక ముడిని విప్పు, وَاحْلُلْ عُقْدَةً مِّن لِّسَانِي ﴿٢٧﴾

28 “ప్రజలు నా మాటను బాగా అర్థం చేసుకోగలిగేందుకు. يَفْقَهُوا قَوْلِي ﴿٢٨﴾

29 “నా కుటుంబంలో నుంచి ఒకతన్ని నాకు సహాయకునిగా నియమించు. وَاجْعَل لِّي وَزِيرًا مِّنْ أَهْلِي ﴿٢٩﴾

30 “అంటే, నా సోదరుడైన హారూనును (నియమించు)! هَارُونَ أَخِي ﴿٣٠﴾

31 “అతని ద్వారా నా బలాన్ని పెంచు. اشْدُدْ بِهِۦٓ أَزْرِي ﴿٣١﴾

32 “నా కార్యంలో అతన్ని నా భాగస్థునిగా[18] చేయి. وَأَشْرِكْهُ فِيٓ أَمْرِي ﴿٣٢﴾

33 “తద్వారా మేమిద్దరం నీ పవిత్రతను అత్యధికంగా కొనియాడ గలగటానికి! كَيْ نُسَبِّحَكَ كَثِيرًا ﴿٣٣﴾

34 “నిన్ను అత్యధికంగా స్మరిస్తూ ఉండటానికి!![19] وَنَذْكُرَكَ كَثِيرًا ﴿٣٤﴾

35 “నిశ్చయంగా నువ్వు మమ్మల్ని బాగా కనిపెట్టుకుని ఉండే వాడవు.”[20] إِنَّكَ كُنتَ بِنَا بَصِيرًا ﴿٣٥﴾

18. ఒకప్పుడు మూసా (అలైహిస్సలాం) ఫిరౌను అంతఃపురంలో పెరుగుతున్నప్పుడు ఖర్జూరం లేక ముత్యం బదులు నిప్పు రవ్వ నోట్లో వేసుకున్నారు. దాంతో ఆయన నాలుక కాలింది. మాట్లాడేటప్పుడు కొంత నత్తి వచ్చింది అని ఒక కథనం ఉంది (ఇబ్నె కసీర్).

ఫిరౌను వద్దకు వెళ్ళి నా సందేశాన్ని వినిపించు అని అల్లాహ్ తరఫున ఆదేశించబడినపుడు మూసా మదిలో రెండు సందేహాలు మెదిలాయి. ఒకటి : అసలే వాడు పెద్ద అహంకారి. నిరంకుశ చక్రవర్తి. తానే లోకానికి ప్రభువునని ప్రకటించే వరకూ పోయాడు. రెండు : అంతకుముందు మూసా చేతిలో ఫిరౌన్ జాతికి చెందిన ఒక వ్యక్తి చచ్చిపోయాడు. అందుకే ఆ సమయంలో మూసా తన ప్రాణాలను కాపాడుకునే ఉద్దేశంతో ఆ రాజ్యం విడిచి పారిపోయారు. ఒకవైపు ఫిరౌను తలబిరుసుతనం, మరోవైపు తన వల్ల జరిగిన అవాంఛనీయ సంఘటన! ఇవిగాక మరో భయం కూడా ఆయన్ని వెంటాడసాగింది. అదే నత్తివల్ల స్పష్టంగా మాట్లాడలేకపోవటం. అందుకే ఆయన, ప్రభూ! నా హృదయ కవాటాలను తెరువు. దైవదౌత్య బాధ్యతను సజావుగా నిర్వర్తించేలా నాకు ఓరిమిని ప్రసాదించు అని ప్రార్థించారు. ఫిరౌన్ కొలువులో నీ సందేశాన్ని చాలా స్పష్టంగా అందజేసేలా నా నాలుక ముడిని విప్పు. అవసరమైతే నాకు ఎదురయ్యే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వగలిగేలా నాకు తోడ్పడు అని వేడుకున్నారు. దాంతోపాటు 'నా సోదరుడైన హారూన్‌ను నాకు సహాయకునిగా నియమించు' అని విన్నవించుకున్నారు (హారూన్ మూసా కన్నా వయసులో పెద్దవారని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది). ఆయతు (29)లో **'వజీర్'** (وَزِيرٌ) అని అనబడింది. వజీర్ అంటే కార్యభారం మోసేవాడు అని అర్థం. అంటే రాజుగారి కార్యభారాన్ని మోసే మంత్రి లాంటివాడు అన్నమాట!

19. ఈ విధంగా మేమిద్దరం కలిసి దైవదౌత్య కార్యక్రమాన్ని నిర్వర్తించటంతో పాటు నీ స్తోత్రం చేస్తాము. నీ గొప్పదనాన్ని, పవిత్రతను కొనియాడుతూ ఉంటాము.

**36** (అల్లాహ్ ఈ విధంగా) సెలవిచ్చాడు:"మూసా! నువ్వు అడిగిన వన్నీ నీకు ఇవ్వబడ్డాయి.[21]

قَالَ قَدْ أُوتِيتَ سُؤْلَكَ يَٰمُوسَىٰ ﴿36﴾

**37** "మేము నీకు మరో మహోపకారం కూడా చేసి ఉన్నాము.[22]

وَلَقَدْ مَنَنَّا عَلَيْكَ مَرَّةً أُخْرَىٰٓ ﴿37﴾

**38** "అప్పట్లో మేము నీ తల్లికి పంపిన సందేశం ఇది –

إِذْ أَوْحَيْنَآ إِلَىٰٓ أُمِّكَ مَا يُوحَىٰٓ ﴿38﴾

**39** 'నువ్వు అతన్ని (మూసాను) పెట్టెలో పెట్టి నదిలో వదిలిపెట్టు. ఆ తరువాత నది ఆ పెట్టెను ఒడ్డుకు చేరుస్తుంది. నాకూ, ఇతనికీ శత్రువు అయినవాడు దాన్ని తీసుకుంటాడు.'[23] "అప్పుడు నేను నా తరఫున ఓ ప్రత్యేకమైన ప్రేమానురాగాన్ని నీపై వేశాను.[24] నువ్వు నా కనుసన్నలలో[25] పోషించబడేందుకే ఈ ఏర్పాటు చేశాను.

أَنِ ٱقْذِفِيهِ فِى ٱلتَّابُوتِ فَٱقْذِفِيهِ فِى ٱلْيَمِّ فَلْيُلْقِهِ
ٱلْيَمُّ بِٱلسَّاحِلِ يَأْخُذْهُ عَدُوٌّ لِّى وَعَدُوٌّ لَّهُۥ ۚ
وَأَلْقَيْتُ عَلَيْكَ مَحَبَّةً مِّنِّى وَلِتُصْنَعَ عَلَىٰ
عَيْنِىٓ ﴿39﴾

**40** "(జ్ఞాపకం చేసుకో) అప్పుడు నీ అక్క (పెట్టె నదిలో కొట్టుకు పోతున్న వైపుకే) నడుస్తూ వచ్చి, "మీరు గనక సెలవిస్తే ఇతన్ని చక్కగా సాకే[26] వారిని చూపిస్తాను" అని అంటుంది. ఈ ఉపాయం

إِذْ تَمْشِىٓ أُخْتُكَ فَتَقُولُ هَلْ أَدُلُّكُمْ عَلَىٰ مَن
يَكْفُلُهُۥ ۖ فَرَجَعْنَٰكَ إِلَىٰٓ أُمِّكَ كَىْ تَقَرَّ عَيْنُهَا

20. సర్వకాల సర్వావస్థల్లో మమ్మల్ని గమనిస్తూ ఉండేవాడవు నీవే. బాల్యంలో నువ్వు మాపై అమితంగా దయదలిచావు. ఇప్పుడు కూడా నీ కటాక్షాన్ని మాపై ప్రసరింపజేస్తూ ఉండు.

21. మూసా అలైహిస్సలామ్ అల్లాహ్‌ను తన నత్తిని పూర్తిగా తొలగించమని దుఆ చేయలేదు కాబట్టి ఆ తర్వాత కూడా ఆయనకు నత్తి ఉండిందని భావించటం సరికాదు. ఎందుకంటే ఈ ఆయతు ద్వారా అల్లాహ్ ఆయనకు ఉన్న నత్తి మొత్తాన్ని దూరం చేసినట్లు తెలుస్తోంది. పోతే ఫిరౌన్ దుర్మార్గుడు, మూసా ప్రవక్తను ఉద్దేశించి "మాట్లాడటం కూడా చేతకానివాడు" అని అనటం (జుఖ్రుఫ్ : 52వ ఆయతు); దీనికి సమాధానం ఏమిటంటే బహుశా అతను మూసా ప్రవక్తగారి పాత స్థితిని దృష్టిలో పెట్టుకొని ఆ మాట అని ఉంటాడు.

22. మూసా (అలైహిస్సలాం) ప్రార్థనను ఆలకించి, ఆమోదముద్ర వేయటంతో పాటు అతనికి మరింత ధైర్యాన్ని నూరి పోసేందుకు బాల్యంలో అతనికి చేసిన మహోపకారాన్ని కూడా దేవుడు ఈ సందర్భంగా జ్ఞాపకం చేశాడు. ఒకప్పుడు పుట్టిన మగ శిశువును ఫిరౌను చక్రవర్తి చంపేస్తాడన్న భయంతో మూసా తల్లి దైవ సంకేతం ప్రకారం ఆయన్ని పెట్టెలో పెట్టి నదిలోకి వదిలిపెట్టేసింది.

23. అటు దైవానికి, ఇటు స్వయంగా మూసాకు కూడా బద్ధ విరోధి అయిన ఫిరౌను చక్రవర్తి, నదిలో తేలియాడుతూ వచ్చి ఒడ్డున రాజమహలును తాకిన ఆ పెట్టెను తీసి, తెరచి చూశాడు. అందమైన, అమాయకుడైన ఆ పసివాణ్ణి పెంచుకుందామని అతని భార్య ప్రాధేయపడింది. భార్య కోరికను ఫిరౌను మన్నించాడు.

24. ఆ విధంగా అల్లాహ్ ఫిరౌను మనసులో లేదా జనుల హృదయాలలో ఆ బాలుడిపట్ల అనిర్వచనీయమైన అవ్యాజాను రాగాలను నూరిపోశాడు.

25. దైవలీల కూడా ఎలా ఉంటుందో చూడండి! ఏ పిల్లవాడు తన నిరంకుశ అధికారానికి ముప్పుగా పరిణమిస్తాడోనని ఫిరౌన్ తన రాజ్యంలో పుట్టే మగబిడ్డలందరినీ దారుణంగా చంపటం ఆనవాయితీగా చేసుకున్నాడో ఆ పిల్లవాణ్ణే అల్లాహ్ ఆ కిరాతకుని అంతఃపురంలో పెరిగిపెద్దవాడయ్యే అపూర్వమైన ఏర్పాటు చేశాడు. రాణిగారి దయాదాక్షిణ్యాలు ఆ పసికందుకు లభిస్తున్నాయి. కన్నతల్లి వెచ్చని ఒడిలో ఆ పసివాడు ఆమె చనుబాలు త్రాగుతున్నాడు. ఆ

ద్వారా – నీ తల్లి కంటిచలువ కోసం, ఆమె దుఃఖించకుండా ఉండటం కోసం మేము మళ్లీ నిన్ను నీ తల్లి దగ్గరకు చేర్చాము. ఆ తరువాత నువ్వు ఒక వ్యక్తిని చంపావు.[27] ఆ గండం నుంచి కూడా మేము నిన్ను కాపాడాము. ఆ విధంగా మేము నిన్ను బాగా పరీక్షించాము.[28] అటు పిమ్మట నువ్వు అనేక సంవత్సరాలపాటు మద్‌యను ప్రజల మధ్య గడిపావు.[29] ఆ తరువాత (మా) నిర్ణయం ప్రకారం ఓ మూసా! ఇదిగో, ఇలా వచ్చావు.[30]

وَلَا تَحْزَنَ ۚ وَقَتَلْتَ نَفْسًا فَنَجَّيْنٰكَ مِنَ الْغَمِّ وَفَتَنّٰكَ فُتُوْنًا ۚ فَلَبِثْتَ سِنِيْنَ فِيْۤ اَهْلِ مَدْيَنَ ۙ ثُمَّ جِئْتَ عَلٰى قَدَرٍ يّٰمُوْسٰى ﴿40﴾

**41** “నేను ప్రత్యేకంగా నా కోసం నిన్ను ఎంపిక చేసుకున్నాను.

وَاصْطَنَعْتُكَ لِنَفْسِيْ ﴿41﴾

**42** “ఇప్పుడు నువ్వూ, నీ సోదరుడూ నా సూచనలను తీసుకుని వెళ్లండి. (జాగ్రత్త!) నా ధ్యానం పట్ల బద్ధకం చూపకూడదు సుమా![31]

اِذْهَبْ اَنْتَ وَاَخُوْكَ بِاٰيٰتِيْ وَلَا تَنِيَا فِيْ ذِكْرِيْ ﴿42﴾

విధంగా అతనికి పాలు పట్టినందుకు ఆ దుర్మార్గుని నుంచి ఆ తల్లికి జీతం కూడా లభిస్తోంది. అదీ విచిత్రం! విశేషం!!

26. పెట్టెను నదిలో వదలిపెట్టినప్పుడు జరిగిన సంఘటన ఇది. చక్రవర్తి తన మగబిడ్డను చంపేస్తాడేమోనన్న భయం కొద్దీ అతన్ని పెట్టెలో ఉంచి నదిలో వదిలేసింది. కాని ఉండబట్టలేక తన కూతురును ఆ పెట్టెను వెంబడించమని కోరింది. ఆ పెట్టె ఏ ఒడ్డుకు చేరుతుందో, చివరకు ఏమవుతుందో గమనిస్తూ ఉండమని సూచించింది. దైవప్రణాళిక ననుసరించి హజ్రత్ మూసా సురక్షితంగా ఫిరౌను అంతఃపురానికి చేరుకున్నారు. పాలు తాగే వయస్సు. అందుకే పాలుపట్టే స్త్రీలు ఆఘమేఘాల మీద రప్పించబడ్డారు. ఊహు! మూసాకు ఎవరి పాలూ సహించలేదు. మరోవైపు ఈ దృశ్యాన్ని మూసా అక్క ఆసక్తితో గమనిస్తూ ఉంది. అదను చూసి ఆమె జోక్యం చేసుకుంది. “మీరు గనక అనుమతిస్తే ఈ పసివాణ్ణి చాలా చక్కగా సాకి, మీ సమస్యను పరిష్కరించే ఒకామెను పిలుచుకువస్తాన”ని ప్రతిపాదించింది. అంతకన్నా వారికి కావలసిందేముంటుందీ? ‘సరే’ అన్నారు. అంతే, ఆమె పరుగు పరుగున వచ్చి తన తల్లిని,– మూసా కన్న తల్లిని – పిలుచుకుని వెళ్ళింది. అప్పటి వరకూ ఏడుస్తూ ఉన్న ఆ అబ్బాయిని ఆ యమ్మ తన వెచ్చని ఒడిలోకి తీసుకుని చనుబాలిచ్చేసరికి గుటకలు వేస్తూ పాలు త్రాగాడు.

27. ఇది దేవుని మరో మహోపకారం. యుక్త వయస్సుకు చేరిన మూసా అసంకల్పికంగా ఒక ఫిరౌనీయుణ్ణి ఒక గుద్దు గుద్దేసరికి అతడు చచ్చి ఊరుకున్నాడు. ఈ సంఘటన ఖసస్ సూరాలో రానున్నది.

28. ఓ మూసా! మేము నిన్ను బాగా పరీక్షించాము. పరిపరి విధాలుగా మా గీటురాయిపై పరికించి చూశాము. ఉదాహరణకు: మగపిల్లలను ఊచకోత కోసే సంవత్సరంలోనే నీకు జన్మనిచ్చాము. నీ తల్లి నిన్ను నదీప్రవాహంలో వదిలిపెట్టింది. రాజ్యంలోని ఆయాలందరి పాలూ నీకు నిషేధించబడ్డాయి. నువ్వు ఒకప్పుడు ఫిరౌను గడ్డాన్ని పట్టుకున్నప్పుడే వాడు నిన్ను హతమార్చాలనుకున్నాడు. కాని అలా జరగలేదు. నీ చేత ఖిబ్తీ జాతీయుడొకడు చంపబడ్డాడు. ఇన్ని కష్టాలు ఎదురైనా మేము నిన్ను కాపాడుకుంటూ వచ్చాము.

29. ఆ వ్యక్తిని చంపిన తరువాత నువ్వు ప్రాణ భయంతో మద్‌యన్ ప్రాంతానికి వెళ్ళి ఏళ్లతరబడి అక్కడ ఉన్నావు.

30. రావలసిన సమయంలోనే నువ్వు ఈ పవిత్ర లోయలోకి వచ్చావు. ఎందుకంటే ఇక్కడే, ఈ సమయంలోనే నువ్వు నాతో సంభాషించాలని విధివ్రాతలో లిఖించబడి ఉంది. నువ్వు నా ప్రవక్తగా నియుక్తం కాబోతున్నావని కూడా

43 “మీరిద్దరూ ఫిరౌను వద్దకు వెళ్లండి. వాడు మరీ బరితెగించి పోయాడు.

اِذْهَبَآ اِلٰى فِرْعَوْنَ اِنَّهٗ طَغٰى ﴿43﴾

44 “వాడితో కాస్త మృదువుగా మాట్లాడండి[32] – బహుశా వాడు అర్థం చేసుకోవచ్చు లేదా భయపడవచ్చు.”

فَقُوْلَا لَهٗ قَوْلًا لَّيِّنًا لَّعَلَّهٗ يَتَذَكَّرُ اَوْ يَخْشٰى ﴿44﴾

45 “ప్రభూ! వాడు మాపై దౌర్జన్యానికి పాల్పడతాడేమోననీ లేదా (తలబిరుసుతనంతో) హద్దుమీరి పోతాడేమోనని మాకు భయంగా ఉంది”అని వారిద్దరూ అన్నారు.

قَالَا رَبَّنَآ اِنَّنَا نَخَافُ اَنْ يَّفْرُطَ عَلَيْنَآ اَوْ اَنْ يَّطْغٰى ﴿45﴾

46 “మీరు ఏ మాత్రం భయపడకండి. నేను మీతోనే ఉన్నాను. అంతా వింటూ, చూస్తూ ఉంటాను” అని సమాధానమిచ్చాడు ఆయన.[33]

قَالَ لَا تَخَافَآ اِنَّنِيْ مَعَكُمَآ اَسْمَعُ وَاَرٰى ﴿46﴾

47 “మీరు అతని దగ్గరకు వెళ్ళి ఇలా అనండి: ‘మేము నీ ప్రభువు తరఫున పంపబడిన సందేశహరులము. నువ్వు ఇస్రాయీలు సంతతి వారిని మా వెంట పంపించు. వారిని పీడించకు. మేము నీ ప్రభువు తరఫున నీవద్దకు సూచనను తెచ్చాము. సన్మార్గాన్ని అనుసరించిన వానికి మాత్రమే శాంతి ఉంది.[34]

فَاْتِيٰهُ فَقُوْلَآ اِنَّا رَسُوْلَا رَبِّكَ فَاَرْسِلْ مَعَنَا بَنِيْٓ اِسْرَآءِيْلَ ۙ۬ وَلَا تُعَذِّبْهُمْ ؕ قَدْ جِئْنٰكَ بِاٰيَةٍ مِّنْ رَّبِّكَ ؕ وَالسَّلٰمُ عَلٰى مَنِ اتَّبَعَ الْهُدٰى ﴿47﴾

48 “ధిక్కారవైఖరికి ఒడిగట్టి, విముఖత ప్రదర్శించేవానికి శిక్ష ఉంది అని మాకు వహీ ద్వారా తెలుపబడింది.”

اِنَّا قَدْ اُوْحِيَ اِلَيْنَآ اَنَّ الْعَذَابَ عَلٰى مَنْ كَذَّبَ وَتَوَلّٰى ﴿48﴾

---

వ్రాయబడింది. లేక మూలంలోని పదం **‘ఖదరిన్’** (قَدَرٍ)కు ఈ భావం కూడా కావచ్చు : ప్రవక్త పదవి కోసం అర్హత పొందే వయస్సులోనే – 40 ఏళ్ల ప్రాయంలోనే – నువ్వు ఇక్కడకు వచ్చావు.

31. దైవధర్మం వైపుకు ప్రజలను పిలిచే కార్యకర్తలకు ఈ ఆయతులో ఒక ముఖ్య సూచన ఉంది. సందేశ ప్రదాన కార్యక్రమాలలో వారు ఎంత తీరిక లేకుండా ఉన్నప్పటికీ దైవనామస్మరణను మరువకూడదు. నమాజుపట్ల బద్ధకం, అశ్రద్ధ, అలసత్వం క్షంతవ్యం కానివి.

32. దైవసందేశం అందజేసేవారిలో ఈ ‘సద్గుణం’ కూడా సమృద్ధిగా ఉండాలి. వారు మూర్తీభవించిన మృదుత్వంలా ఉండాలి. కరకుదనం, కాఠిన్యం వల్ల జనులు బెదిరిపోతారు. దగ్గరకు రావలసినవారు దూరమైపోతారు. దీనికి భిన్నంగా మృదువుగా బోధపరిస్తే విషయం వినేవారి మనసులో దిగిపోతుంది. తత్ఫలితంగా వారు సత్యాన్ని స్వీకరించే అవకాశం ఎంతైనా ఉంటుంది.

33. మీరు ఫిరౌను కొలువుకు వెళ్ళి ఏం చెబుతారో, దానికి సమాధానంగా వాడేమంటాడో అంతా నేను వింటూనే ఉంటాను. ఇటు మీ హావభావాలను, అటు అతని ప్రవర్తనా తీరును కూడా గమనిస్తూనే ఉంటాను. అక్కడి పరిస్థితినిబట్టి నేను మీకు తోడ్పడుతూ, వాడి ఆటలను కట్టిస్తూ ఉంటాను. కాబట్టి మీరు నిర్భయంగా, నిస్సంకోచంగా అతని వద్దకు వెళ్ళండి. జంకవలసిన అవసరం లేదు.

34. వాస్తవానికి ఈ ‘సలామ్’ శాంతి, సుస్థిరతల వైపుకు పిలుపు వంటిది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) రోము

**49** "ఇంతకీ మీరిద్దరి ప్రభువు ఎవరయ్యా ఓ మూసా?" అని (ఫిరౌను) అడిగాడు.

قَالَ فَمَنْ رَّبُّكُمَا يٰمُوْسٰى ﴿49﴾

**50** "ప్రతి వస్తువుకూ దాని ప్రత్యేక రూపును ఇచ్చి, తర్వాత దానికి మార్గాన్ని చూపినవాడే మా ప్రభువు'[35] అని (మూసా) చెప్పాడు.

قَالَ رَبُّنَا الَّذِيْٓ اَعْطٰى كُلَّ شَيْءٍ خَلْقَهٗ ثُمَّ هَدٰى ﴿50﴾

**51** "మరైతే పూర్వం గతించిన వారి సంగతేమిటీ?"[36] అని (ఫిరౌను) ప్రశ్నించగా,

قَالَ فَمَا بَالُ الْقُرُوْنِ الْاُوْلٰى ﴿51﴾

**52** "వారి సంగతి నా ప్రభువు వద్ద గ్రంథంలో ఉంది. నా ప్రభువు పొరబడటంగానీ, మరువటంగానీ జరగదు"[37] అని (మూసా) సమాధానమిచ్చాడు.

قَالَ عِلْمُهَا عِنْدَ رَبِّيْ فِيْ كِتٰبٍ ۚ لَا يَضِلُّ رَبِّيْ وَلَا يَنْسَى ﴿52﴾

**53** ఆయనే మీ కొరకు భూమిని పాన్పుగా చేశాడు. అందులో మీరు నడిచేందుకు మార్గాలను సుగమం చేశాడు. ఆకాశం నుంచి వర్షపు నీటిని కూడా కురిపించాడు. మరి ఆ వర్షపు నీటి ద్వారా రకరకాల పంటలను (పచ్చికలను) మేమే పండిస్తున్నాము.

الَّذِيْ جَعَلَ لَكُمُ الْاَرْضَ مَهْدًا وَّسَلَكَ لَكُمْ فِيْهَا سُبُلًا وَّاَنْزَلَ مِنَ السَّمَآءِ مَآءً ۭ فَاَخْرَجْنَا بِهٖٓ اَزْوَاجًا مِّنْ نَّبَاتٍ شَتّٰى ﴿53﴾

చక్రవర్తి హెరిక్లిస్‌కు లేఖ రాస్తూ, **"అస్లిం తస్లమ్"** (ఇస్లాం స్వీకరించు. రక్షణ పొందుతావు) అని వ్రాశారు. అలాగే లేఖ ప్రారంభంలో ఆయన **"వస్సలాము అలా మనిత్తబఅల్ హుదా"** (సన్మార్గాన్ని అవలంబించిన వానికి మాత్రమే శాంతి, రక్షణ ఉంది) అని కూడా రాయించారు (ఇబ్నె కసీర్).

35. అంటే, మనిషికి శోభనిచ్చే రూపును మనిషికి, పశువులకు తగిన ఆకారాన్ని పశువులకు ఇచ్చాడు. అలాగే విశ్వంలోని వస్తువులన్నింటికీ వాటికి అతికినట్లు సరిపోయే రూపురేఖలను ప్రసాదించాడు. "మార్గాన్ని నిర్దేశించాడు" అంటే ప్రతి ప్రాణికీ దాని స్వభావస్వరూపాల రీత్యా బ్రతకటానికి ఏమేమి కావాలో సమకూర్చాడు. బ్రతుకు తెరువును నేర్పాడు. తమ మనుగడకు అవసరమైన వాటిని సమకూర్చుకునే తెలివితేటలను ఇచ్చాడు. వాటి ప్రకారమే ఆ ప్రాణులు తమ జీవన పథాన్ని నిర్ణయించుకుంటాయి.

36. విషయాన్ని దాటవేయటానికి, వారి దృష్టిని మరోవైపుకు మరల్చడానికి ఫిరౌన్ వేసిన ఎత్తుగడ ఇది. దైవేతరులను పూజిస్తూ కాలం చేసిన పూర్వీకులకు పట్టే గతేమిటి? అని ప్రశ్నిస్తే, "వారంతా నరకానికి ఆహుతి అవుతార"ని మూసా చెబుతాడనీ, దీని ఆధారంగా తన సలహాదారులందరినీ మూసాపై ఉసిగొల్పవచ్చనీ ఫిరౌన్ ఆశించాడు.

37. ఫిరౌన్ ఎదురుదాడిని మూసా (అలైహిస్సలాం) చాలా తెలివిగా ఎదుర్కొన్నారు : వారికి పట్టే గతేమిటో నీకూ తెలీదు, నాకూ తెలీదు. వారి వ్యవహారం దైవాధీనం. వారి సంగతిని ఆయన గ్రంథంలో నమోదు చేసి ఉంచాడు. దాని ప్రకారం వారికి బహుమానం ఇవ్వటమో, శిక్షించటమో చేస్తాడు. అదీగాక, నా ప్రభువు సమస్తాన్నీ కనిపెట్టుకుని ఉన్నవాడు. ప్రతిదీ ఆయన జ్ఞానపరిధిలో ఉంది. ఏ చిన్న విషయం కూడా ఆయన దృష్టిని దాటిపోదు. దేనినీ ఆయన మరచిపోడు. ఆయన ద్వారా ఎన్నటికీ పొరపాటు జరగదు. అయితే మానవ మాత్రుల్లో ఈ రెండు లోపాలూ (పొరబడటం, మరచిపోవటం) ఉన్నాయి. మానవుల పరిజ్ఞానం చాలా పరిమితం. పైగా అందులో బోలెడన్ని లోపాలుంటాయి. వారు తరచూ మరచిపోతుంటారు. కాని నా ప్రభువు ఈ దౌర్బల్యాలకు అతీతుడు, పవిత్రుడు.

كُلُوا وَارْعَوْا أَنْعَامَكُمْ ۗ إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ لِّأُولِي النُّهَىٰ ﴿٥٤﴾

54 వాటిని మీరూ తినండి, మీ పశువులను కూడా మేపండి.[38] నిశ్చయంగా బుద్ధిమంతుల[39] కోసం ఇందులో ఎన్నో సూచన లున్నాయి.

مِنْهَا خَلَقْنَاكُمْ وَفِيهَا نُعِيدُكُمْ وَمِنْهَا نُخْرِجُكُمْ تَارَةً أُخْرَىٰ ﴿٥٥﴾

55 దీని (ఈ నేల)లో నుంచే మేము మిమ్మల్ని సృష్టించాము. మళ్లీ ఇందులోనికే మిమ్మల్ని చేరుస్తాము. మరి ఇందులో నుంచే మరోసారి మీ అందరినీ వెలికి తీస్తాము.[40]

وَلَقَدْ أَرَيْنَاهُ آيَاتِنَا كُلَّهَا فَكَذَّبَ وَأَبَىٰ ﴿٥٦﴾

56 మేము వాడికి (ఫిరౌనుకు) మా సూచనలన్నింటినీ చూపాము. అయినాసరే వాడు ఖండించాడు, త్రోసిపుచ్చాడు.

قَالَ أَجِئْتَنَا لِتُخْرِجَنَا مِنْ أَرْضِنَا بِسِحْرِكَ يَا مُوسَىٰ ﴿٥٧﴾

57 "ఓ మూసా? నువ్వు నీ మంత్రజాలంతో మమ్మల్ని మా రాజ్యం నుంచి వెళ్లగొట్టడానికి వచ్చావా?[41]

فَلَنَأْتِيَنَّكَ بِسِحْرٍ مِّثْلِهِ فَاجْعَلْ بَيْنَنَا وَبَيْنَكَ مَوْعِدًا لَّا نُخْلِفُهُ نَحْنُ وَلَا أَنتَ مَكَانًا سُوًى ﴿٥٨﴾

58 "సరే. మేము కూడా నీకు దీటుగా అటువంటి జాలవిద్యనే తీసుకువస్తాము. కాబట్టి నువ్వు నీకూ – మాకూ మధ్య పోటీకి ఒక పోటీ సమయాన్ని నిర్ణయించు.[42] మేముగానీ, నువ్వుగానీ మాట తప్పకూడదు. బహిరంగ స్థలంలో పోటీ జరగాలి"[43] అని (ఫిరౌన్) సవాలు చేశాడు.

38. అంటే మేము సృష్టించిన ఈ రకరకాల ఉత్పత్తులలో కొన్ని మీకు ఆహారంగా పనికివస్తే, మరికొన్ని మీ పశువులకు మేతగా ఉపయోగపడతాయి.

39. **'నుహా'** (النُّهَىٰ) అనేది **'నుహ్యతున్'** అనే పదానికి బహువచనం. నుహ్యతున్ అంటే బుద్ధీ, ఇంగిత జ్ఞానం అని అర్థం. 'ఉలున్నుహా' అంటే బుద్ధిమంతులు, అర్థం చేసుకోగలవారు అన్న అర్థాలు వస్తాయి. వారిని 'బుద్ధిమంతులు' అని సంబోధించటానికి కారణమేమంటే వారి అభిప్రాయంతోనే ఏదేని వ్యవహారంపై తుది నిర్ణయానికి రావటం జరుగుతుంది. ఒకవేళ ఈ పదం 'నహ్యున్' (ఆపటం) నుంచి వచ్చిందనుకుంటే వారు తమ మనసును పాపకార్యాల నుంచి ఆపుకుంటూ ఉంటారు గనక వారిని 'ఉలున్నుహా' అని అనటం జరుగుతుందని అర్థం చేసుకోవాలి (ఫత్హుల్ ఖదీర్).

40. మరణించిన వ్యక్తిని ఖననం చేసిన పిదప మూడు దోసిళ్ళ మట్టిని సమాధిపై వేసేటప్పుడు ఈ ఆయతును దైవప్రవక్త (సఅసం) పఠించేవారని కొన్ని ఉల్లేఖనాలలో ఉంది. కాని ఇలాంటి ఉల్లేఖనాలన్నీ చాలా బలహీనమైనవి. అయితే ఈ ఆయతు పఠించకుండానే మూడు దోసిళ్ల మట్టిని వేయాలన్న ఇబ్నుమాజ ఉల్లేఖనం మాత్రం ప్రామాణికమైనది (సహీహ్). అందుకే మృతుణ్ణి సమాధి చేసిన తరువాత అంత్యక్రియలలో పాల్గొన్నవారు, మూడేసి దోసిట్ల మట్టిని వేయటాన్ని పండితులు అభిలషణీయమైన అంశంగా ఖరారు చేశారు (చూడండి : అల్బానీచే విరచితమైన కితాబుల్ జనాయెజ్ – 152వ పేజీ, ఇర్వావుల్ గలీల్ –హదీసు నెం.251, సంపుటి–3, పేజీ–200).

41. ఫిరౌనుకు మా ప్రబల నిదర్శనాలతోపాటు, మేము మూసాకు ప్రసాదించిన రెండు మహిమలు (చేతికర్ర సర్పంగా మారటం, చంకలో పెట్టిన చేయి ధగధగా మెరిసి పోవటం) కూడా చూపటం జరిగింది. ఇదంతా కనికట్టు అని ఫిరౌన్ కొట్టిపారేశాడు. ఇలాంటి కనికట్టు కుతంత్రాలతో మమ్మల్ని మా రాజ్యం నుంచి వెళ్ళగొట్టాలను కుంటున్నారా? అని ఎద్దేవా చేశాడు.

59 "పర్వదినాన (పోటీ) పెట్టుకుందాం.[44] పొద్దెక్కిన తరువాత ప్రజలంతా గుమిగూడినప్పుడే" అని (మూసా) బదులిచ్చాడు.

قَالَ مَوْعِدُكُمْ يَوْمُ الزِّينَةِ وَأَنْ يُّحْشَرَ
النَّاسُ ضُحًى ﴿٥٩﴾

60 అంతే! ఫిరౌను వెళ్ళి తన తాంత్రిక ఒనరులన్నింటినీ సమకూర్చుకుని (సర్వ సన్నద్ధుడై) వచ్చాడు.[45]

فَتَوَلَّى فِرْعَوْنُ فَجَمَعَ كَيْدَهُ ثُمَّ أَتَى ﴿٦٠﴾

61 మూసా వాళ్లను ఉద్దేశించి, "మీకు మూడింది! అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టకండి. ఆయన మిమ్మల్ని శిక్ష ద్వారా సర్వ నాశనం చేసేస్తాడు. అబద్ధాన్ని కల్పించేవాడు ఎన్నటికీ సాఫల్యం పొందలేడని తెలుసుకోండి" అని అన్నారు.[46]

قَالَ لَهُمْ مُّوسَى وَيْلَكُمْ لَا تَفْتَرُوا عَلَى اللَّهِ
كَذِبًا فَيُسْحِتَكُمْ بِعَذَابٍ ۚ وَقَدْ خَابَ
مَنِ افْتَرَى ﴿٦١﴾

62 అప్పుడు వారు ఈ విషయంపై పరస్పరం మల్లగుల్లాలు పడ్డారు. రహస్య సంప్రదింపులు జరుపుకున్నారు.[47]

فَتَنَازَعُوا أَمْرَهُمْ بَيْنَهُمْ وَأَسَرُّوا النَّجْوَى ﴿٦٢﴾

63 వారిలా చెప్పుకున్నారు : "వీళ్ళిద్దరూ వట్టి మాంత్రికులే. తమ మంత్రశక్తితో మిమ్మల్ని మీ రాజ్యం నుంచి వెళ్లగొట్టాలనీ, మీ ఉత్తమ విధానాన్ని సర్వనాశనం చేయాలని వీళ్లు కోరుకుంటున్నారు.[48]

قَالُوا إِنْ هَذَانِ لَسَاحِرَانِ يُرِيدَانِ أَنْ
يُّخْرِجَاكُمْ مِّنْ أَرْضِكُمْ بِسِحْرِهِمَا
وَيَذْهَبَا بِطَرِيقَتِكُمُ الْمُثْلَى ﴿٦٣﴾

42. అంటే ఒక నిర్ణీత సమయాన్నీ లేక నిర్ణీత స్థలాన్నీ నిర్ధారించు అని భావం.

43. 'మకానన్ సువా' ( مَكَانًا سُوًى ) అంటే చదునైన మైదానం అని భావం. జనులంతా పోటీని తిలకించటానికి అనువుగా ఉండే మెట్టపల్లాలు లేని బహిరంగ ప్రదేశం లేక ఇరు వర్గాలవారు తమ విద్యా విన్యాసాలను ప్రదర్శించటానికి అనుకూలంగా ఉండే స్థలం అన్నమాట!

44. అంటే ఏడాదికోసారి జరిగే తిరునాళ్లు లేక పండుగ రోజు లేక సాంస్కృతిక దినోత్సవం కావచ్చు.

45. ఫిరౌన్ తన రాజ్యమంతటా గాలించి, మాంత్రికవిద్యలో ఆరితేరిన వారందరినీ కూడగట్టుకుని పోటీ స్థలానికి వచ్చాడు.

46. పోటీ ప్రారంభం కాకముందు ఫిరౌను తన మాంత్రికులకు ఆశల పల్లకిని చూపించాడు. వారు గనక పోటీలో గెలిస్తే ఖరీదైన పారితోషికాలు ఇస్తానని, తన ఆంతరంగికులుగా నియమించుకుంటానని ప్రోత్సహించాడు. అదే సమయంలో మూసా (అలైహిస్సలాం) వారికి హితబోధ చేస్తూ, దైవభీతిని నూరిపోశారు.

47. దైవప్రవక్త (అలైహిస్సలాం) ఉపదేశం వారిని ఆలోచనలో పడవేసింది. అప్పుడే వారిలో భేదాభిప్రాయాలు మొదలయ్యాయి. పరస్పరం గుసగుసలాడుకోసాగారు. చూడబోతే ఇతను మాంత్రికునిలా లేడే! ఇతని మాటలు కూడా మాంత్రికుని మాటల్లా లేవు. ఇతనొక మహనీయునిలా కనిపిస్తున్నాడని కొందరన్నారు. అదేం కాదు, ఇతను వట్టి మాంత్రికుడే అని మరి కొందరు అభిప్రాయపడ్డారు.

48. వారి మాటల్లోని అంతరార్థం ఏమిటంటే, ఈ మాంత్రికులిద్దరూ ఈ రోజు పోటీలో గెలిచారంటే రాజ్యంలోని రాజ వంశీయులు, అరిస్టోక్రాట్‌లు అందరూ వారికి అనుకూలురుగా మారిపోతారు. తత్ఫలితంగా మా పెత్తనం ప్రమాదంలో పడిపోతుంది. దాంతోపాటు మన పూర్వీకుల ఉత్తమ జీవన విధానాన్ని కూడా వీళ్లు నెమ్మదిగా మార్చేస్తారు. వారు తమ 'బహుదైవోపాసనా' విధానాన్ని ఉత్తమ జీవన విధానంగా అభివర్ణించుకోవటం గమనించదగిన విషయం. ఈనాడు అధర్మమైన పద్ధతులను అవలంబించేవారు "తమ అభిమతమే కరెక్టు" అని సగర్వంగా చెప్పుకుంటూ ఉంటారు. "వారిలోని (ముష్రిక్కులలోని) ప్రతి వర్గమూ తన వద్దనున్న దాన్ని చూసుకుని మురిసిపోతుంది" (రూమ్-32).

64 "కాబట్టి మీరు మీ తంత్రాలన్నింటినీ సమాయత్తం చేసుకోండి. ఆ తరువాత వరుసలు తీరి రండి. ఈ రోజు విజృంభించిన వాడే గెలుస్తాడు."

فَاَجْمِعُوْا كَيْدَكُمْ ثُمَّ ائْتُوْا صَفًّا ۚ وَقَدْ اَفْلَحَ الْيَوْمَ مَنِ اسْتَعْلٰى ﴿٦٤﴾

65 "ఓ మూసా! ముందు నువ్వయినా పడ వెయ్యి లేదా ముందు మేమైనా పడవేస్తాము" అని వారు చెప్పగా,

قَالُوْا يٰمُوْسٰۤى اِمَّاۤ اَنْ تُلْقِيَ وَاِمَّاۤ اَنْ نَّكُوْنَ اَوَّلَ مَنْ اَلْقٰى ﴿٦٥﴾

66 "ఫరవాలేదు, ముందు మీరే పడ వెయ్యండి"[49] అని మూసా అన్నాడు. అప్పుడు వారి త్రాళ్లు, వారి కర్రలు వారి మంత్రశక్తిచే పరుగెత్తుతున్నట్లు[50] అనిపించింది మూసాకు.

قَالَ بَلْ اَلْقُوْا ۚ فَاِذَا حِبَالُهُمْ وَعِصِيُّهُمْ يُخَيَّلُ اِلَيْهِ مِنْ سِحْرِهِمْ اَنَّهَا تَسْعٰى ﴿٦٦﴾

67 అందువల్ల మూసా మనసులోనే భయపడ్డాడు.

فَاَوْجَسَ فِيْ نَفْسِهٖ خِيْفَةً مُّوْسٰى ﴿٦٧﴾

68 అప్పుడు మేమిలా అన్నాము: "నువ్వు ఏమాత్రం భయపడకు. నిశ్చయంగా నీదే పైచేయి అవుతుంది.[51]

قُلْنَا لَا تَخَفْ اِنَّكَ اَنْتَ الْاَعْلٰى ﴿٦٨﴾

49. **"ముందు మీరే పడవెయ్యండి"** అని మూసా (అలైహిస్సలాం) చెప్పటం ఆయనలోని విజ్ఞతకు, వివేచనకు నిదర్శనం. ఎందుకంటే సవాలు విసిరిన వాడు ఫిరౌన్. పైగా వాడు తన పరిపాలనా యంత్రాంగాన్నంతటినీ కదిలించాడు. రాజ్యమంతా గాలించి గొప్ప గొప్ప మాంత్రికులందరినీ పోగుచేశాడు. వారికి వారి శక్తియుక్తులపై మితిమీరిన నమ్మకం ఉంది. అదే సమయంలో వారికి పోటీగా రంగంలో ఉన్నది తామిద్దరే. వారికి దీటైన జవాబివ్వటం అవసరం. 'ముందు మీరే మొదలెట్టండి' అని చెప్పటం ద్వారా తాను వారి కనికట్టు క్రీడలకు ఏమాత్రం భయపడటం లేదని ఆయన చెప్పకనే చెప్పేశారు. ఇది ఆయనకు లభించిన మొదటి నైతిక విజయం. మాటలతోనే ఆయన కొంతవరకు ఫిరౌన్ మాంత్రికుల మనోబలాన్ని దెబ్బతీశారు. ఇక దేవుని మహిమలు ప్రస్ఫుటం అయ్యాక వాటి ముందు క్షుద్రవిద్యలు ఎలాగూ నిలువలేవు. అప్పుడు మాంత్రికులు పునరాలోచనలో పడటం ఖాయం. మూసా ప్రదర్శించేది ఇంద్రజాలం కాదని, అతనికి నిజంగానే దేవుని అండదండలున్నాయని వారు గ్రహిస్తారు.

50. ఖుర్ఆన్‌లోని ఈ మాటల ద్వారా అవగతమయ్యేదేమిటంటే వారి త్రాళ్లు, లాఠీలు నిజంగా పాములుగా మారలేదు. కాకపోతే కనికట్టు వల్ల అలా అనిపించిందంతే. కనికట్టు వల్ల వస్తువు వాస్తవికత మారకపోయినప్పటికీ తాత్కాలికంగా అది ప్రేక్షకులలో భీతినీ, ఆశ్చర్యాన్నీ కలిగిస్తుంది. మరో విషయం ఏమిటంటే జాలవిద్య ఎంత ఉన్నతస్థాయికి చెందినదైనా సరే వస్తువు వాస్తవికతను మార్చజాలదు.

51. భయంకరమైన ఆ సన్నివేశానికి మూసా (అలైహిస్సలాం) భయపడటం సహజమే. ఆయన మనసులో భయపడినంత మాత్రాన అది ప్రవక్తృత్వానికి గానీ, ఆయన సౌశీల్యానికిగానీ విరుద్ధమైన విషయం ఏమీ కాదు. ఎందుకంటే ప్రవక్త కూడా మానవమాత్రుడే. మానవ సహజమైన దౌర్బల్యాలకు ప్రవక్త అతీతుడు కాదు.

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే, ఏ విధంగానయితే దైవప్రవక్తలకు మానవ లక్షణాలుంటాయో అదేవిధంగా వారు చేతబడి, క్షుద్రవిద్య, కనికట్టులాంటి వాటికి కూడా– తాత్కాలికంగా – 'ప్రభావితులు' అవుతారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై యూదులు చేతబడి చేసినప్పుడు, దాని 'ప్రభావం' ఆయన (స) దినచర్యపై కనిపించింది. అంతమాత్రం చేత దైవదౌత్య బాధ్యతల నిర్వహణలో ఏ లోటూ రాలేదు. ఎందుకంటే వారివల్ల తప్పులు జరగకుండా దేవుడు కాపాడుతూ ఉంటాడు. ఎవరయినా 'చేతబడి' చేసినంతమాత్రాన దాని మూలంగా దైవసందేశ ప్రదాన కార్యక్రమం స్థంభించదు.

దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) భయాందోళన వెనుక మరో కారణం కూడా ఉండి ఉండవచ్చు – తాను

**69** "నీ కుడి చేతిలో ఉన్న దానిని పడవేయి. అది వాళ్ల మాయా జాలాన్ని ఇట్టే మింగేస్తుంది. వాళ్లు కల్పించిందంతా మాంత్రికుల జిమ్మిక్కు మాత్రమే. మాంత్రికుడు ఏ విధంగా (ఎంత అట్టహాసంగా) వచ్చినా సఫలీకృతుడు కాలేడు."

وَأَلْقِ مَا فِي يَمِينِكَ تَلْقَفْ مَا صَنَعُوا ۖ إِنَّمَا
صَنَعُوا كَيْدُ سَاحِرٍ ۖ وَلَا يُفْلِحُ السَّاحِرُ حَيْثُ أَتَىٰ (69)

**70** ఎట్టకేలకు మాంత్రికులంతా సాష్టాంగపడి, "మేము హారూన్, మూసాల ప్రభువును విశ్వసించాము" అని ఎలుగెత్తి చాటారు.

فَأُلْقِيَ السَّحَرَةُ سُجَّدًا قَالُوا آمَنَّا بِرَبِّ هَارُونَ
وَمُوسَىٰ (70)

**71** "ఏమిటీ, నేను అనుమతించకముందే మీరు అతన్ని విశ్వసిస్తారా? నిశ్చయంగా మీకు మంత్ర విద్యను నేర్పిన మీ పెద్ద ఇతనే (అని ఇప్పుడర్థం అయింది). నేను ఒక ప్రక్కనుంచి మీ చేతుల్ని, మరో ప్రక్కనుంచి మీ కాళ్లను నరికించి,[52] మీ అందరినీ ఖర్జూరపు దూలాలకు ఉరి తీస్తాను. మాలో ఎవరి శిక్ష తీవ్రతరమైనదో, ఎక్కువ కాలం ఉంటుందో అప్పుడు మీకు తెలిసివస్తుంది" అని ఫిరౌన్ అన్నాడు.

قَالَ آمَنتُمْ لَهُ قَبْلَ أَنْ آذَنَ لَكُمْ ۖ إِنَّهُ لَكَبِيرُكُمُ
الَّذِي عَلَّمَكُمُ السِّحْرَ ۖ فَلَأُقَطِّعَنَّ أَيْدِيَكُمْ وَأَرْجُلَكُم
مِّنْ خِلَافٍ وَلَأُصَلِّبَنَّكُمْ فِي جُذُوعِ النَّخْلِ
وَلَتَعْلَمُنَّ أَيُّنَا أَشَدُّ عَذَابًا وَأَبْقَىٰ (71)

**72** వారు (మాంత్రికులు) ఈ విధంగా సమాధానమిచ్చారు: "మా వద్దకు వచ్చేసిన స్పష్టమైన నిదర్శనాలపై, మమ్మల్ని సృష్టించిన వానిపై[53] నీకు ప్రాధాన్యతనివ్వటమా?! అసంభవం. ఇప్పుడు నువ్వేం చేస్తావో చేసుకో. నువ్వేం నిర్ణయం చేసినా అది ప్రాపంచిక జీవితం వరకే.[54]

قَالُوا لَن نُّؤْثِرَكَ عَلَىٰ مَا جَاءَنَا مِنَ الْبَيِّنَاتِ
وَالَّذِي فَطَرَنَا ۖ فَاقْضِ مَا أَنتَ قَاضٍ ۖ
إِنَّمَا تَقْضِي هَٰذِهِ الْحَيَاةَ الدُّنْيَا (72)

---

తనచేతి కర్రను పడవేయకముందే జనులు ఈ మంత్రగాళ్ళ మాయాజాలానికి ఎక్కడ అమితంగా ప్రభావితులవుతారో! అదీగాక మంత్రగాళ్లు కూడా తమ కనికట్టు క్రీడా విన్యాసాల కోసం కర్రలనే ఉపయోగించారు. మూసా (అలైహి) వద్ద ఉన్నది కూడా చేతి కర్రే. ఆయన కూడా కర్రనే విసరవలసి ఉన్నది. ఇంతకీ ఎవరి కర్ర ఎవరి కర్రను మ్రింగిందీ? ఎవరు గెలిచారు? ఎవరు ఓడారు? ఇరు వర్గాల వారూ కర్రలనే కదా ప్రయోగించిందీ!? అని ప్రజలు ఎక్కడ అయోమయానికి గురవుతారోనని హజ్రత్ మూసా అనుమానించారు. మాయా జాలానికీ – దైవమహిమకు మధ్య గల స్పష్టమైన తేడాను ప్రజలకు తెలియజేయాలన్నది మూసా (అలైహిస్సలాం) ఆకాంక్ష. ఈ కోరిక నెరవేరేదెలా?! అని ఆయన సతమతం అయ్యారు.

దీన్నిబట్టి బోధపడే మరో విషయం ఏమిటంటే, తమ ద్వారా ఏ మహిమ లేక ఏ చమత్కారం ప్రస్ఫుటం కాబోతున్నదో ప్రవక్తలకు కూడా – ఒక్కోసారి – తెలియదు. అది దైవాధీనం. దేవుడు తాను తలచినది చేస్తాడు. మూసా (అలైహిస్సలాం) లోని భయాలను, సంశయాలను దూరం చేస్తూ దేవుడు ఇలా సెలవిచ్చాడు: "మూసా! నువ్వు ఎంతమాత్రం భీతిచెందనవసరం లేదు. నువ్వే గెలుస్తావు." ఈ మాటల ద్వారా ఆయనకు అభయం ఇచ్చాడు. చివరకు జరిగింది కూడా అదే.

52. **మిన్ ఖిలాఫిన్** (مِّنْ خِلَافٍ) అంటే 'ఆపోజిట్‌గా' అని భావం. అంటే కుడిచేయి నరికితే ఎడమ కాలు నరకటం, ఎడమ చేయి నరికితే కుడికాలు నరకటం అన్నమాట!

53. కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యాన్ని 'ప్రమాణం' అన్న భావంలో తీసుకున్నారు. అంటే – మమ్మల్ని పుట్టించిన

**73** “మా ప్రభువు మా తప్పులను క్షమించేటందుకు, (ముఖ్యంగా) నువ్వు బలవంతంగా మాచేత చేయించిన మాయాజాలపు మహా పరాధాన్ని మన్నించేటందుకు మేము ఆయన్ని విశ్వసించాము.[55] అల్లాహ్‌యే ఉత్తముడు, ఎప్పటికీ మిగిలి ఉండేవాడు.”[56]

إِنَّآ ءَامَنَّا بِرَبِّنَا لِيَغْفِرَ لَنَا خَطَٰيَٰنَا وَمَآ أَكْرَهْتَنَا عَلَيْهِ مِنَ ٱلسِّحْرِ ۗ وَٱللَّهُ خَيْرٌ وَأَبْقَىٰٓ ﴿٧٣﴾

**74** అసలు విషయం ఏమిటంటే, అపరాధిగా అల్లాహ్ సన్నిధి లోకి వచ్చేవాడి కోసం నరకం ఉన్నది. అందులో అతను చావనూ లేదు బ్రతకనూ లేదు.[57]

إِنَّهُۥ مَن يَأْتِ رَبَّهُۥ مُجْرِمًا فَإِنَّ لَهُۥ جَهَنَّمَ لَا يَمُوتُ فِيهَا وَلَا يَحْيَىٰ ﴿٧٤﴾

**75** మరెవరు ఆయన సన్నిధికి విశ్వాసిగా వస్తాడో, సత్కార్యాలు కూడా చేసి ఉంటాడో – అలాంటి వారి కోసం ఉన్నత తరగతు లున్నాయి.

وَمَن يَأْتِهِۦ مُؤْمِنًا قَدْ عَمِلَ ٱلصَّٰلِحَٰتِ فَأُو۟لَٰٓئِكَ لَهُمُ ٱلدَّرَجَٰتُ ٱلْعُلَىٰ ﴿٧٥﴾

---

వాని సాక్షిగా! ఈ సూచనలు మా వద్దకు వచ్చేసిన పిదప ఇక నీ మాటకు ఎలాంటి ప్రాముఖ్యమూ ఇవ్వబోము – అన్న భావం వస్తుంది. ఇది కూడా సరైనదే.

54. నీకు చేతనయింది చేసుకోపో! నీ అధికారం ఈ ప్రాపంచిక జీవితం వరకే చెల్లుబాటు అవుతుంది. కాని మేము విశ్వసించిన దేవుని సార్వభౌమత్వం ప్రపంచంలోనూ, పరలోకంలోనూ నడుస్తుంది. మరణించిన మరుక్షణం నుంచే మేము నీ వేధింపుల నుంచి విముక్తి నొందుతాం. ఎందుకంటే గుండెలోని ఆత్మ గొంతుదాటి పోయిన క్షణం నుంచే మా శరీరాలపై నీ బోడి పెత్తనం ఆగిపోతుంది. ఒకవేళ మేము గనక మా ప్రభువు పట్ల అవిధేయతకు ఒడిగడితే మరణానంతరం మేము మా ప్రభువు పట్టునుంచి శాశ్వతంగా తప్పించుకోలేము. ఆయన మమ్మల్ని కఠినంగా శిక్షిస్తాడు.

సర్వోన్నత ప్రభువును విశ్వసించిన తరువాత ఒక విశ్వాసి జీవితంలో ఏ గొప్ప పరివర్తన రావాలో, తాత్కాలికమైన ఇహలోకంపై శాశ్వితమైన పరలోక జీవితానికి ఎలా ప్రాధాన్యతనివ్వాలో, ఏకదైవారాధన మార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలను ఎలా ఓర్పుతో ఎదుర్కోవాలో మంత్రగాళ్లు నిరూపించారు. వారి మనోక్షేత్రంలో నాటుకున్న విశ్వాస (ఈమాన్) బీజం వారి వ్యవహార శైలిలో ఒక్కసారిగా అనూహ్యమైన మార్పు తీసుకువచ్చింది. విశ్వసించక ముందు వారు ఫిరౌన్ ఇవ్వబోయే పారితోషికాలపై, ప్రాపంచిక పదవులపై ఎంతో మోజుపడ్డారు. కాని విశ్వసించిన మరుక్షణమే ఈ ప్రలోభాలు వారి కంటికి చాలా అల్పంగా కనిపించాయి. బెదిరింపులకు, హెచ్చరికలకు కూడా వారు ఏమాత్రం తొణకలేదు. అదే విశ్వాస బలం!

55. అంటే మూసా (అలైహిస్సలాం)కి వ్యతిరేకంగా, నువ్వు మాచేత బలవంతంగా చేయించిన మిథ్యను అల్లాహ్ క్షమిస్తాడని మేము ఆశిస్తున్నాము.

56. “మా ఇద్దరిలో ఎవరి తడాఖా తీవ్రమైనదో, ఎప్పటికీ ఉంటుందో మీకు తెలిసివస్తుంది” అన్న ఫిరౌన్ బెదిరింపులకు వారు ఇచ్చిన సమాధానం ఇది: “ఓ ఫిరౌన్! నువ్వు కఠినాతి కఠినమైన శిక్ష గురించి మమ్మల్ని హెచ్చరిస్తున్నావు కదూ! సరే కానివ్వు. అశాశ్వితమైన ఇహలోక జీవితంలో తనువు చాలించిన తరువాత మేము శాశ్వితమైన పరలోక జీవితంలో అడుగుపెడతాము. మా ప్రభువు మాకు అక్కడ ప్రసాదించే పుణ్యఫలం అత్యుత్తమమైనది. ఎప్పటికీ మిగిలి ఉండేది.”

57. నరక యాతనకు తట్టుకోలేక మనిషి మృత్యువును కోరుకుంటాడు. కాని మరణం ఉండదు. రేయింబవళ్లు ఒకటే యాతన. అన్నపానీయాలుగా ‘జఖ్ఖూమ్’ లాంటి చేదువృక్షం, నరకవాసుల శరీరాల నుంచి పిండబడిన చీమునెత్తురు ఇవ్వబడతాయి. ఇదీ ఒక బ్రతుకేనా?! అల్లాహ్! ఈ దారుణమైన నరకయాతన నుంచి మమ్ము కాపాడు!

**76** శాశ్వతమైన స్వర్గవనాలున్నాయి. వాటి క్రింద సెలయేళ్లు ప్రవహిస్తుంటాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. పరిశుద్ధుడైన ప్రతి వ్యక్తికీ లభించే ప్రతిఫలం ఇదే.[58]

جَنّٰتُ عَدْنٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِيْنَ
فِيْهَا ؕ وَذٰلِكَ جَزٰٓؤُا مَنْ تَزَكّٰى ﴿76﴾

**77** "నా దాసులను రాత్రికి రాత్రే తీసుకుని బయలుదేరు.[59] వారి కోసం సముద్రంలో పొడి త్రోవను ఏర్పరచుకో.[60] ఎవరయినా వచ్చి పట్టుకుంటారేమోనని భీతిచెందకు. (ముంపుకు గురవుతామేమోనన్న) ఆందోళన కూడా అక్కరలేదు"[61] అని మేము మూసాకు వహీ ద్వారా తెలిపాము.

وَلَقَدْ اَوْحَيْنَآ اِلٰى مُوْسٰٓى ۙ اَنْ اَسْرِ بِعِبَادِيْ
فَاضْرِبْ لَهُمْ طَرِيْقًا فِى الْبَحْرِ يَبَسًا ۙ لَّا تَخٰفُ
دَرَكًا وَّلَا تَخْشٰى ﴿77﴾

**78** ఆ తరువాత ఫిరౌను తన సైన్యంతో వారిని వెంబడించాడు. అయితే సముద్రం వారందరినీ ఆవరించవలసిన విధంగానే ఆవరించింది.[62]

فَاَتْبَعَهُمْ فِرْعَوْنُ بِجُنُوْدِهٖ فَغَشِيَهُمْ
مِّنَ الْيَمِّ مَا غَشِيَهُمْ ﴿78﴾ؕ

**79** ఫిరౌను తన జాతివారిని అపమార్గానికి లోను చేశాడు. వారికి సన్మార్గం చూపలేదు.[63]

وَاَضَلَّ فِرْعَوْنُ قَوْمَهٗ وَمَا هَدٰى ﴿79﴾

58. ఇక నరకవాసుల దుర్భర స్థితికి ప్రతిగా, స్వర్గవాసులకు ప్రాప్తమయ్యే మనసైన సుఖ విలాసాల గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. విశ్వసించిన మీదట రుజుమార్గంపై నిలకడ చూపి, సత్కార్యాలు చేసి, తమ హృదయాలను పాపకార్యాల నుంచి కాపాడుకుని– పవిత్ర జీవితం గడిపిన వారికి మాత్రమే ఈ స్వర్గసుఖాలు ప్రాప్తిస్తాయి. ఎందుకంటే 'ఈమాన్' అనేది నోటితో పలికే కొన్ని వచనాలకు మారుపేరు కాదు. విశ్వాసంతోపాటు, చిత్తశుద్ధితో కూడిన సదాచరణ – ఈ రెండింటి సమాహారమే నిజమైన ఈమాన్.

59. ఫిరౌను దైవాన్ని విశ్వసించలేదు. పోనీ ఇస్రాయీలు సంతతి వారిని విడుదల చేశాడా! అంటే అదీ చేయలేదు. అందుకే దైవశాసనం అమల్లోకి వచ్చింది. తన జాతి వారిని తీసుకుని బయలుదేరమని అల్లాహ్ మూసాను ఆదేశించాడు.

60. ఈ వివరాలు 'అష్షుఅరా' సూరాలో రానున్నాయి. మూసా (అలైహిస్సలాం) దేవుని ఆజ్ఞానుసారం తన చేతి కర్రతో సముద్రంలో కొట్టారు. అంతే ! మరుక్షణమే సముద్రం చీలిపోయి కాలిబాట ఏర్పడింది.

61. అంటే వెనుక ఫిర్ఔన్ తన సేనలతో వచ్చిపట్టుకుంటాడేమోనని భయపడకు. సముద్రంలో మునిగిపోతామేమోనన్న ఆందోళన కూడా చెందనవసరం లేదు. అదంతా మేము చూసుకుంటాము కదా! అని అల్లాహ్ అభయమిచ్చాడు.

62. మూసా తన జనులను వెంటబెట్టుకుని తీరం దాటిపోతుండగా, మరోవైపు ఫిరౌన్ సముద్రంలో ఏర్పడిన పొడిమార్గం గుండా తన సైనికుల సమేతంగా వెంబడిస్తూ వస్తున్నాడు. మూసా హాయిగా తీరం దాటారు. అదే సమయంలో ఫిరౌన్ సైన్యం సముద్రం మధ్యలో ఉంది. వారిని శిక్షించే తరుణం ఆసన్నమయింది. మునుపటిలాగే కలిసిపొమ్మని దేవుడు సముద్రాన్ని ఆదేశించాడు. ఇరువైపుల నుంచీ సముద్ర జలం వారిని క్రమ్మేసింది– ఆ విధంగా వారి కథ ముగిసింది.

63. అవును. ఫిరౌను మాటలు కోటలు దాటాయి. కాని ఆ దుర్మార్గుడు తన సైన్యాన్ని తీరం దాటించలేకపోయాడు. ఎందుకంటే వాడు ఎంచుకున్న మార్గం తప్పుడు మార్గం – అది సన్మార్గం కాదు! అందుకే వాడికి, వాడి ముష్కర మూకకు పట్టిన గతి కూడా దుర్గతే. సముద్రంలో మునిగి చావాలని దేవుడు వారికి రాసిపెట్టాడు మరి!

80 ఓ ఇస్రాయీలు వంశీయులారా! చూడండి! మేము మిమ్మల్ని మీ శత్రువు చెరనుండి విడిపించాము. తూరు పర్వతం కుడివైపు గురించి మీకు వాగ్దానం చేశాము.[64] మీపై 'మన్న్' మరియు 'సల్వా'లను అవతరింపజేశాము.[65]

يَٰبَنِيٓ إِسۡرَٰٓءِيلَ قَدۡ أَنجَيۡنَٰكُم مِّنۡ عَدُوِّكُمۡ وَوَٰعَدۡنَٰكُمۡ جَانِبَ ٱلطُّورِ ٱلۡأَيۡمَنَ وَنَزَّلۡنَا عَلَيۡكُمُ ٱلۡمَنَّ وَٱلسَّلۡوَىٰ ﴿٨٠﴾

81 మేము ప్రసాదించిన పవిత్రమైన ఆహార పదార్థాలను తినండి. అందులో మితి మీరకండి.[66] మితిమీరితే మీపై నా ఆగ్రహం విరుచుకుపడుతుంది. నా ఆగ్రహం ఎవరిపై విరుచుకుపడినా వాడు పతనమైనట్టే.[67]

كُلُواْ مِن طَيِّبَٰتِ مَا رَزَقۡنَٰكُمۡ وَلَا تَطۡغَوۡاْ فِيهِ فَيَحِلَّ عَلَيۡكُمۡ غَضَبِيۖ وَمَن يَحۡلِلۡ عَلَيۡهِ غَضَبِي فَقَدۡ هَوَىٰ ﴿٨١﴾

82 అయితే పశ్చాత్తాపం చెంది, విశ్వసించి, సత్కార్యాలు చేసి, ఆపై సన్మార్గంపై స్థిరంగా ఉన్న వారిని[68] నేను అమితంగా క్షమిస్తాను.

وَإِنِّي لَغَفَّارٞ لِّمَن تَابَ وَءَامَنَ وَعَمِلَ صَٰلِحٗا ثُمَّ ٱهۡتَدَىٰ ﴿٨٢﴾

83 "ఓ మూసా! నిన్ను నీ జాతి వారి నుంచి (ఏమార్చి) ఇంత తొందరగా రావటానికి ప్రేరేపించిన విషయం ఏదీ?" (అని అల్లాహ్ కారణం అడిగాడు).

وَمَآ أَعۡجَلَكَ عَن قَوۡمِكَ يَٰمُوسَىٰ ﴿٨٣﴾

64. మీకు 'వాగ్దానం చేశాము' అన్న దానికి రెండు అర్థాలు కావచ్చు. ఒకటి: మూసా (అలైహిస్సలాం) మిమ్మల్ని – అంటే మీ ప్రతినిధులు కొంతమందిని – కూడా వెంటబెట్టుకుని తూరు పర్వతం వద్దకు రావాలి. మీ సమక్షంలోనే మేము మూసాతో సంభాషణ జరుపుతాము. రెండు : తూరు పర్వతంపై మూసా (అలైహిస్సలాం)ను పిలిచింది ఇస్రాయీలు సంతతివారి మేలు కొరకే. వారి మార్గదర్శకత్వం కొరకే కదా!

65. 'మన్న్ – సల్వా'ల అవతరణ గురించి ఇంతకుముందు అల్ బఖరా సూరాలో వివరంగా వచ్చింది. 'మన్న్' అనేది ఒక విధమైన తీపి పదార్థం. అది ఆకాశం నుంచి అవతరించేది. 'సల్వా' అనే పేరుగల పక్షులు అసంఖ్యాకంగా అక్కడ వాలేవి. అవసరం మేరకు వారు వాటిని పట్టుకుని వండుకునేవారు (ఇబ్నె కసీర్).

66. ఇక్కడ **'మితిమీరటం'** అంటే, ధర్మసమ్మతమైన వాటిని విడనాడి అధర్మమైన వాటిని భుజించటం అని అర్థం. మీరు మాత్రం హద్దులు మీరకండి. దైవానుగ్రహాలను విస్మరించకండి. కృతఘ్నులుగా మారకండి, దుబారా ఖర్చుచేయకండి అన్న అర్థాలు వస్తాయి. వీటన్నింటికీ **"తుగ్యాన్"** (మితిమీరటం) అనే పదం అన్వయించబడుతుంది. మీకు అవసరమైనన్ని పక్షులను మాత్రమే పట్టుకుని 'జిబహ్' చేయండి. అవసరానికి మించి వేటాడితే అతిశయిల్లినట్లవుతుంది అన్న భావంలో కూడా ఈ వాక్యాన్ని తీసుకోవచ్చు.

67. దీనికి మరో అర్థం: దైవాగ్రహాన్ని కొనితెచ్చుకున్నవాడు నరకంలోని గుండం (హావియ)లో పడినట్లే. అంటే హద్దుమీరి ప్రవర్తించి, దేవుని కోపానికి కారకుడైనవాడు నరకంలోని అత్యంత అట్టడుగు భాగంలో పడవేయబడతాడు.

68. అంటే ఎవరయినాసరే దేవుని క్షమాభిక్షకు నోచుకోవాలంటే నాలుగు అర్హతలను సంపాదించాలి : 1. అవిశ్వాస వైఖరి నుంచి, షిర్క్ నుంచి, పాపకార్యాల నుంచి పశ్చాత్తాపం చెందాలి. 2. ఒక్కడైన అల్లాహ్‌ను విశ్వసించాలి. 3. సదాచరణ చేయాలి. 4. జీవితాంతం రుజుమార్గంపై పయనించాలి. దైవ విధేయునిగానే తనువు చాలించాలి. రుజుమార్గంలో తడబాటు పనికిరాదు. ఒకసారి పశ్చాత్తాపం చెంది, రుజువర్తనులైన తరువాత మళ్లీ మిథ్యాభావాలకు, దైవేతరుల దాస్యానికి లోను కాకూడదు. ఒకవేళ అదేగనక జరిగితే దేవుని క్షమాభిక్షకు బదులు శిక్ష లభిస్తుంది.

قَالَ هُمْ أُولَاءِ عَلَىٰ أَثَرِي وَعَجِلْتُ إِلَيْكَ رَبِّ لِتَرْضَىٰ (84)

**84** "వాళ్లు నా వెనుకే వస్తున్నారు. ఇక నా విషయానికి వస్తే ఓ ప్రభూ! నువ్వు ప్రసన్నుడవు కావాలన్న ఉద్దేశంతోనే తొందరగా వచ్చేశాను"[69] అని అతను అన్నాడు.

قَالَ فَإِنَّا قَدْ فَتَنَّا قَوْمَكَ مِن بَعْدِكَ وَأَضَلَّهُمُ السَّامِرِيُّ (85)

**85** "మేము నీ జాతి వారిని నీ వెనుక పరీక్షకు గురిచేశాము. సామిరీ (అనేవాడు) వాళ్లను పెడదారి పట్టించాడు"[70] అని అల్లాహ్ సెలవిచ్చాడు.

فَرَجَعَ مُوسَىٰ إِلَىٰ قَوْمِهِ غَضْبَانَ أَسِفًا ۚ قَالَ يَا قَوْمِ أَلَمْ يَعِدْكُمْ رَبُّكُمْ وَعْدًا حَسَنًا ۚ أَفَطَالَ عَلَيْكُمُ الْعَهْدُ أَمْ أَرَدتُّمْ أَن يَحِلَّ عَلَيْكُمْ غَضَبٌ مِّن رَّبِّكُمْ فَأَخْلَفْتُم مَّوْعِدِي (86)

**86** మూసా ఆగ్రహోదగ్రుడై, దుఃఖవదనుడై జాతివారి వైపుకు తిరిగి వచ్చాడు. "ఓ నా జాతి ప్రజలారా! మీ ప్రభువు మీకు మంచి వాగ్దానం చేయలేదా?![71] ఆ గడువు మీకు మరీ అంత సుదీర్ఘం అనిపించిందా?![72] లేక మీ ప్రభువు ఆగ్రహం మీపై విరుచుకుపడాలనే మీరు కోరుకున్నారా? అందుకే మీరు నాకు చేసిన వాగ్దానానికి విరుద్ధంగా ప్రవర్తించారా?"[73] అని ఆవేదన చెందాడు.

قَالُوا مَا أَخْلَفْنَا مَوْعِدَكَ بِمَلْكِنَا وَلَٰكِنَّا حُمِّلْنَا أَوْزَارًا مِّن زِينَةِ الْقَوْمِ فَقَذَفْنَاهَا فَكَذَٰلِكَ أَلْقَى السَّامِرِيُّ (87)

**87** దానికి వారు, "మేము నీకు ఇచ్చిన మాటను మా అంతట మేముగా జవదాట లేదు.[74] మాపై వేయబడిన (ఫిరౌను) జనుల నగల భారాన్ని మేము తీసి (అగ్నిలో) పడవేశాము. అలాగే సామిరీ కూడా పడవేశాడు" (అని చెప్పారు).

69. సముద్రం దాటిన తరువాత హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన జాతికి చెందిన కొంతమంది ప్రముఖులను వెంటబెట్టుకుని తూరు పర్వతంవైపు బయలుదేరారు. అయితే తన ప్రభువును కలుసుకోవాలన్న ఆత్రుతతో ఆయన చాలా వేగంగా పయనించారు. ఆయన వేగాన్ని ఆయన సహచరులు అందుకోలేకపోయారు. నీ సహచరులను విడిచి ఇంత తొందరగా రావటానికి కారణమేమిటీ? అని అడిగితే ఆయన ఈ విధంగా బదులిచ్చారు. మరికొంతమంది ఈ వాక్యానికి భావం ఇదని చెప్పారు : "వారు తూరు పర్వతం సమీపంలోనే ఉన్నారు. నా రాకకోసం ఎదురు చూస్తున్నారు."

70. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) తూరు పర్వతం పైకి పోగానే సామిరీ అనే వ్యక్తి ఆవుదూడ (బొమ్మ)ను చేసి, దాన్ని పూజించమని ఇస్రాయీలు సంతతి వారిని కోరాడు. ఆ విషయం మూసాకు అల్లాహ్ ద్వారానే తెలిసింది. "నీ జాతివారిని మేము పరీక్షకు గురిచేశాము" అని అల్లాహ్ సెలవిచ్చాడు. అంతిమంగా మంచీచెడులకు కారకుడు విశ్వప్రభువైన అల్లాహ్‌యే గనుక ఆ విధంగా చెప్పబడింది. పోతే ఇహలోకపరంగా దానికి కారకుడయ్యింది సామిరీయే. అందుకే తర్వాతి వాక్యంలో "సామిరీ వాళ్లను పెడదారి పట్టించాడు" అని స్పష్టం చేయడం జరిగింది.

71. **'వాగ్దానం'** అంటే ధర్మంపై నిలకడగా ఉండే పక్షంలో స్వర్గం ప్రసాదిస్తానన్న దైవ వాగ్దానం కావచ్చు లేదా ప్రాబల్యం వొసగుతానన్న వాగ్దానం కావచ్చు లేదా తౌరాతు గ్రంథం ప్రసాదిస్తానన్న వాగ్దానం కావచ్చు.

72. దేవుని వాగ్దానాన్ని మీరు అంత త్వరగా ఎలా మరచిపోయారు? ఆయన వాగ్దానం చేసి ఎక్కువ కాలం కాలేదే?! మీరు ఆవుదూడను పూజించాల్సినంత అవసరం మీకేం వచ్చిపడింది? అన్నది మూసా మాటల్లోని అంతరార్థం.

73. మూసా తూరు పర్వతం నుంచి తిరిగివచ్చే వరకూ తాము దేవుని అవిధేయతకు పాల్పడబోమని వారు మూసాకు

**88** ఆ తరువాత అతను (కరిగించిన నగలతో) ప్రజలకు ఒక ఆవుదూడ విగ్రహమును చేసి పెట్టాడు. అందులో నుంచి (అంబా అనే) శబ్దం వినవచ్చేది. దాన్ని చూసి, "ఇదే మీకూ, మూసాకూ ఆరాధ్య దైవం.[75] కాకపోతే అతను (మూసా) మరచి పోయాడు" (అని వారు చెప్పసాగారు).

فَأَخْرَجَ لَهُمْ عِجْلًا جَسَدًا لَّهُ خُوَارٌ فَقَالُوا هَٰذَآ
إِلَٰهُكُمْ وَإِلَٰهُ مُوسَىٰ فَنَسِىَ ﴿٨٨﴾

**89** ఏమిటీ, అది వారు అడిగిన దానికి సమాధానం ఇవ్వజాల దనీ, తమకు ఎలాంటి కీడుగానీ, మేలుగానీ చేయలేదన్న[76] సంగతిని వాళ్లు గమనించటం లేదా?

أَفَلَا يَرَوْنَ أَلَّا يَرْجِعُ إِلَيْهِمْ قَوْلًا وَلَا يَمْلِكُ
لَهُمْ ضَرًّا وَلَا نَفْعًا ﴿٨٩﴾

**90** అంతకు ముందే హారూను (అలైహిస్సలాం) వారితో, "నా జాతి జనులారా! ఈ ఆవు దూడ ద్వారా మీరు సంకటస్థితిలో పడ్డారు. యదార్థానికి మీ నిజ ప్రభువు మాత్రం కరుణామయు డైన అల్లాహ్‌యే. కాబట్టి మీరందరూ నన్ను అనుసరించండి. నేను చెప్పినట్లు నమ్మి నడవండి"[77] అని ప్రబోధించాడు.

وَلَقَدْ قَالَ لَهُمْ هَٰرُونُ مِن قَبْلُ يَٰقَوْمِ إِنَّمَا
فُتِنتُم بِهِۦ ۖ وَإِنَّ رَبَّكُمُ ٱلرَّحْمَٰنُ فَٱتَّبِعُونِى
وَأَطِيعُوٓا۟ أَمْرِى ﴿٩٠﴾

**91** "మూసా తిరిగివచ్చేవరకు మేము దీన్ని సేవించుకుంటూ ఉంటాము"[78] అని వారు సమాధానమిచ్చారు.

قَالُوا۟ لَن نَّبْرَحَ عَلَيْهِ عَٰكِفِينَ حَتَّىٰ يَرْجِعَ إِلَيْنَا
مُوسَىٰ ﴿٩١﴾

---

వాగ్దానం చేసి ఉంటారు. లేదా తాము కూడా మూసా వెనుకే తూరు కొండపైకి వస్తామని మాట ఇచ్చి, ఆ తరువాత వారు ఆవుదూడను పూజించటంలో నిమగ్నులైపోయి ఉంటారు.

74. మేము ఉద్దేశ్యపూర్వకంగా ఈ తప్పు చేయలేదు. వ్యాకులత, మానసిక ఒత్తిడి మాచేత ఈ పొరబాటు చేయించింది అని వారు వివరణ ఇచ్చారు. ఇంతకీ ఏమిటీ ఆ వ్యాకులత? తరువాతి వాక్యంలో వివరించబడింది.

75. ఒక కథనం ప్రకారం వారు ఈ నగలను ఫిరౌనీయుల నుంచి చేబదులుగా తీసుకున్నారు. దాన్ని వారు ధరించటం సమ్మతం కాదు. కనుకనే వాటిని మోయలేని భారంగా పేర్కొనటం జరిగింది. వారంతా కలిసి ఆ నగలన్నింటినీ సేకరించి ఒక గోతిలో పడేశారు. అప్పటికే మార్గవిహీనతకు లోనై ఉన్న సామిరీ కూడా ఏదో తెచ్చిపడేశాడు (అది మన్ను మాత్రమే అని ముస్ముందు తెలుస్తుంది). తరువాత వాడు ఆ నగలన్నింటినీ కరిగించి ఒక ఆవుదూడ ఆకారంలో విగ్రహాన్ని తయారు చేశాడు. అందులోకి గాలిపోయి వచ్చినప్పుడల్లా 'అంబా' అనే ఆవు తరహా శబ్దం వినవచ్చేది. ఈ శబ్దం ఆధారంగా సామిరీ ఇస్రాయీల్ సంతతివారిని రెచ్చ గొట్టాడు. 'చూశారా! ఇదే మీ ఆరాధ్య దైవం. సిసలైన దైవం ఇక్కడే ఉండగా మూసా మార్గభ్రష్టుడై దైవాన్వేషణలో తూరు పర్వతంపైకి పోయాడు' అని ప్రజలకు నూరిపోశాడు.

76. వారి అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని ఎత్తిచూపుతూ అల్లాహ్ ఈ విధంగా అన్నాడు: తమ మొరలను ఆలకించలేని, బదులు పలకలేని విగ్రహాన్ని వారు పూజిస్తున్నారా? తమకు లాభంగానీ, నష్టంగానీ ఏమాత్రం చేకూర్చలేని బొమ్మ ముందు వారు మోకరిల్లుతున్నారా?

77. తన జాతి ప్రజలు సామిరీ మాయమాటలకు మోసపోయి ఆవుదూడను ఆరాధ్యదైవంగా చేసుకున్నప్పుడు హజ్రత్ హారూన్ (అలైహిస్సలాం) ఆవేదనతో చెప్పిన మాటలివి.

قَالَ يٰهٰرُوْنُ مَا مَنَعَكَ اِذْ رَاَيْتَهُمْ ضَلُّوْٓا ﴿92﴾

92 "ఓ హారూన్! వీళ్లు పెడదారి పట్టడం చూస్తూ కూడా (ఊరు
కున్నావా?) ఏ విషయం నిన్ను అడ్డుకుంది?

اَلَّا تَتَّبِعَنِ ۭ اَفَعَصَيْتَ اَمْرِيْ ﴿93﴾

93 "నువ్వు నా వెనుక రాలేదేమి? ఏమిటీ, నువ్వు కూడా నా
ఆజ్ఞను ఎదిరించావా?"[79] అని మూసా అడిగారు.

قَالَ يَبْنَؤُمَّ لَا تَاْخُذْ بِلِحْيَتِيْ وَلَا بِرَاْسِيْ ۚ اِنِّىْ خَشِيْتُ اَنْ تَقُوْلَ فَرَّقْتَ بَيْنَ بَنِيْٓ اِسْرَاۗءِيْلَ وَلَمْ تَرْقُبْ قَوْلِيْ ﴿94﴾

94 "ఓ నా మాతాపుత్రుడా! నా గడ్డాన్ని పట్టుకోకు. నా జుత్తు పట్టి
లాగకు.[80] 'నువ్వు ఇస్రాయీలు సంతతిలో చీలిక తెచ్చావు. నా
ఉత్తర్వుకోసం నిరీక్షించలేదు' అని నువ్వు అంటావేమోనన్న
భయంతో ఆగిపోయాను"[81] అని హారూన్ వివరించాడు.

قَالَ فَمَا خَطْبُكَ يٰسَامِرِيُّ ﴿95﴾

95 "సామిరీ! ఇక నీ సంగతేమిటీ?" అని (మూసా) అడిగాడు.

قَالَ بَصُرْتُ بِمَا لَمْ يَبْصُرُوْا بِهٖ فَقَبَضْتُ قَبْضَةً مِّنْ اَثَرِ الرَّسُوْلِ فَنَبَذْتُهَا وَكَذٰلِكَ سَوَّلَتْ لِيْ نَفْسِيْ ﴿96﴾

96 "వారు చూడని దాన్ని నేను చూశాను. నేను దైవసందేశవాహ
కుని పాద ముద్రలో నుంచి ఒక పిడికెడు మన్ను తీసుకుని
అందులో వేశాను.[82] నా మనసు కూడా నాకు దీనిని సరైనదిగా
సూచింపజేసింది" అని అతను జవాబిచ్చాడు.

78. ఆవుదూడను (విగ్రహాన్ని) పూజించటం వారికెంతో బాగా అనిపించింది. ఆ మోజులో వారు హారూన్ మాటల్ని కూడా లెక్కచేయకుండా పెడసరిగా సమాధానం ఇచ్చారు.

79. వీళ్లు నీ మాట లెక్కచేయనప్పుడు నువ్వు ఎందుకు వీళ్ల మధ్య ఆగిపోయావు? తక్షణం నువ్వు నా దగ్గరకు (తూరు పర్వతంపైకి) వచ్చి ఎందుకు చెప్పలేదు? నువ్వు నా ప్రతినిధిగా నీ కర్తవ్యాన్ని సక్రమంగా ఎందుకు నిర్వర్తించలేదు? అన్నది మూసా మాటల్లోని భావం.

80. తన జాతి ప్రజలు బహుదైవారాధనకు లోనుకావటం మూసాకు ఆశనిపాతం అయింది. ఈ సంగతి వినగానే ఆయన సహజంగానే ఆగ్రహం చెందారు. తన స్థానంలో ఉత్తరాధికారిగా నియమితుడైన తన సోదరుడు హారూన్ బాధ్యతా రాహిత్యం కూడా ఈ దుర్మార్గానికి ఒక కారణమని ఆయన తలపోశారు. అందుకే కోపంతో ఆయన తన సోదరుని గడ్డం పట్టుకున్నారు. తలవెంట్రుకలు పట్టి కుదిపారు. దాంతో హజ్రత్ హారూన్ బాధపడుతూ, తన పట్ల మరీ అంత దురుసుగా ప్రవర్తించరాదని కోరారు. అసలు జరిగిందేమిటో చెబుతాను వినమని చెప్పసాగారు...

81. "జాతి జనులు నన్ను మరీ బలహీనునిగా జమకట్టారు. చివరకు వారు నన్ను హతమార్చేందుకు కూడా సమాయత్త మయ్యారు" (ఆరాఫ్ – 142). ఈ ఆయతును బట్టి అవగతమయ్యేదేమిటంటే, హజ్రత్ హారూన్ (అలైహిస్సలాం) బాధ్యతా నిర్వహణలో ఏ లోటూ చేయలేదు. తన వంతు కర్తవ్యాన్ని ఆయన చక్కగానే నిర్వర్తించారు. ఆవుదూడ పూజ నుంచి వారిని ఆపారు. అయితే వ్యవహారం అంతఃకలహాలకు దారితీసేలా ఉంది. ఒకవేళ వారు గనక తనను హత్యచేస్తే ఆ విషయం వారిలో చీలికను తెస్తుంది. ఇప్పుడిప్పుడే ఫిరౌన్ కబంధహస్తాల నుంచి బయటపడి, స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్న ఒక బలహీన వర్గంలో రక్తపాతం సృష్టించబడటం, చీలిక రావటం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. మూసా (అలైహిస్సలాం) అక్కడ లేకపోవటం వలన, పరిస్థితుల నిజస్వరూపం గురించి ఆయనకు పూర్తిగా తెలీక పోవటం వల్ల ఆయన చాలా తీవ్రంగా స్పందించి, తన సోదరుణ్ణి గట్టిగా మందలించారు. వాస్తవం తెలిసిన తరువాత ఆయన ఆ పాపానికి మూలకారకుడైన వ్యక్తి (సామిరీ) వైపుకు మరలారు. ఈ సంఘటనను ఆధారంగా చేసుకుని ముస్లింల సమైక్యత కోసం బహుదైవారాధనా (షిర్క్) చేష్టల్ని చూసీచూడనట్లు వదిలేయటంలో

**97** అప్పుడు మూసా, "సరే! ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. నీకు శిక్ష ఏమిటంటే, నీవు జీవితాంతం 'అమ్మో నన్ను ముట్టుకోకండి'[83] అని అంటూ ఉంటావు. నీ నుంచి ఎట్టి పరిస్థితిలోనూ తప్పిపోని వాగ్దానం మరొకటి కూడా నీ కోసం ఉంది.[84] ఇన్నాళ్ళూ నువ్వు అంటి పెట్టుకుని ఉన్న నీ ఆరాధ్య దేవునికి పట్టే గతేమిటో కూడా చూసుకో. మేము దాన్ని కాల్చి, భస్మం చేసి సముద్రంలో విసిరేస్తాము"[85] అన్నాడు.

قَالَ فَاذْهَبْ فَإِنَّ لَكَ فِي الْحَيٰوةِ أَنْ تَقُولَ
لَا مِسَاسَ ۖ وَإِنَّ لَكَ مَوْعِدًا لَّنْ تُخْلَفَهُ ۚ وَانْظُرْ
إِلَىٰ إِلٰهِكَ الَّذِي ظَلْتَ عَلَيْهِ عَاكِفًا ۖ لَّنُحَرِّقَنَّهُ
ثُمَّ لَنَنْسِفَنَّهُ فِي الْيَمِّ نَسْفًا ﴿٩٧﴾

**98** యదార్థమేమిటంటే మీ అందరి ఆరాధ్యదైవం అల్లాహ్ మాత్రమే. ఆయన తప్ప వేరొక ఆరాధ్య దైవం లేనే లేదు. ఆయన జ్ఞానం అన్నింటినీ ఆవరించి ఉంది" (అని చెప్పాడు).

إِنَّمَا إِلٰهُكُمُ اللّٰهُ الَّذِي لَا إِلٰهَ إِلَّا هُوَ ۚ وَسِعَ
كُلَّ شَيْءٍ عِلْمًا ﴿٩٨﴾

**99** (ఓ ముహమ్మద్!) ఈ విధంగా మేము పూర్వం జరిగిన ఘటనలను[86] నీకు వివరిస్తూ ఉన్నాము. నిశ్చయంగా మేము నీకు మా వద్ద నుండి ఒక హితోపదేశాన్ని ఇచ్చి ఉన్నాము.[87]

كَذٰلِكَ نَقُصُّ عَلَيْكَ مِنْ أَنْبَاءِ مَا قَدْ سَبَقَ ۚ
وَقَدْ آتَيْنٰكَ مِنْ لَّدُنَّا ذِكْرًا ﴿٩٩﴾

తప్పులేదని ఎవరయినా తలపోస్తే అది సరైనది కాదు. నిజానికి హారూన్ (అలైహి) మాటల ఉద్దేశం అది కాదు. అదీగాక ముస్లిం సమాజ ఐక్యతకు అసలు ప్రాతిపదిక ఏకదైవారాధనే (తౌహీద్).

82. ఆయతులోని **'అర్రసూల్'** (الرَّسُولِ) అంటే దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) అని అత్యధికమంది ఇస్లామీయ విద్వాంసులు భావించారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) గుర్రంపై స్వారీ అవటం సామిరీకి కనిపించింది. ఆ అడుగుజాడల్లోని మట్టిని సామిరీ తీసుకుని భద్రపరిచాడు. ఆ మట్టిలో మహిమ ఉంది. ఆ పిడికెడు మట్టిని సామిరీ కరిగించిన నగలలో కలిపి ఆవుదూడ బొమ్మ చేశాడు లేదా బొమ్మను చేసిన పిదప ఆ మన్నును లోపల వేశాడు. ఆ మట్టి మహిమతో ఆ దూడలో నుంచి 'అంభా' అనే శబ్దం వచ్చేది. ఆ శబ్దం వారందరినీ మభ్యపెట్టింది. దాన్ని వారు ఆరాధ్య దైవంగా తలపోసి పూజాపునస్కారాలు మొదలెట్టారు.

83. "నాకు దూరంగా జరగండి. నన్ను ముట్టుకోవద్దు" అని జీవితాంతం చెబుతూ ఉంటావు- ఎందుకంటే అతన్ని ఎవరు తాకినా తాకినవారూ, స్వయంగా సామిరీ కూడా తీవ్రమైన జ్వరంతో బాధపడేవారు. అందుకే అతను మనుషులు దగ్గరకు రావటం చూచినప్పుడల్లా 'నన్ను తాకవద్దు' అని కేకలేసేవాడు. అలా కొంతకాలం గడిచింది. ఆ తరువాత వాడు మానవ సమాజాన్ని వదలి అడవుల్లోకి వెళ్ళిపోయాడు. అతని జీవితం సమకాలీన ప్రజలకు ఒక గుణపాఠంగా మిగిలిపోయింది. మానవ సముదాయాలను అపమార్గం పాలు చేయడానికి ఎవడెన్ని కొత్తపుంతలు తొక్కుతాడో ఇహపరలోకాల్లో అంతే పరాభవానికి లోనవుతాడు.

84. పరలోకంలో విధించబడే శిక్ష వేరుగా ఉంది. దాన్నుంచి తప్పించుకోవటం అసంభవం.

85. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే షిర్క్ (బహుదైవోపాసన)ను నిర్మూలించటం, దాని అవశేషాలను సయితం నామ రూపాలు లేకుండా చేయటం అవసరం. కొందరు బిద్అతీలు (ధర్మంలో కొత్త పుంతలు తొక్కేవారు) తలపోస్తున్నట్లుగా ఈ చర్య కించపరిచే చర్యకాదు. పైగా ఇది ఆత్మాభిమానంతో ముడిపడి ఉన్న అంశం. సత్యధర్మాన్ని ఆస్వాదించిన అభిమానధనులెవరూ, ధర్మావలంబీకుల్లో జొరబడిన ఇలాంటి అపసవ్యతను, అశుద్ధాన్ని సహించలేరు.

86. ఓ ముహమ్మద్ (స) ! మూసా (అలైహిస్సలాం) – ఫిర్ఔన్‌ల గాథను నీకు తెలిపినట్లే ఇతర ప్రవక్తల వృత్తాంతాలను కూడా నీకు సందర్భోచితంగా వినిపిస్తూ ఉంటాం. ఆ సంఘటనలన్నీ నీ మనసులో మెదలుతూ ఉండాలి. నీ జాతి ప్రజలకు ఆ గాథలను వివరిస్తూ ఉండు. తద్వారా వారు గుణపాఠం గరపవచ్చు.

مَنْ اَعْرَضَ عَنْهُ فَاِنَّهٗ يَحْمِلُ يَوْمَ الْقِيٰمَةِ وِزْرًا ﴿100﴾

100 దీనిపట్ల విముఖత చూపినవాడు[88] ప్రళయదినాన పెద్ద (పాప) భారం మోస్తాడు.[89]

خٰلِدِيْنَ فِيْهِ ؕ وَسَآءَ لَهُمْ يَوْمَ الْقِيٰمَةِ حِمْلًا ﴿101﴾

101 అందులో వాడు శాశ్వతంగా చిక్కుకుపోతాడు.[90] అలాంటి వారి కోసం ప్రళయ దినాన మహా చెడ్డ బరువు ఉంటుంది.

يَّوْمَ يُنْفَخُ فِى الصُّوْرِ وَنَحْشُرُ الْمُجْرِمِيْنَ يَوْمَئِذٍ زُرْقًا ﴿102﴾

102 శంఖం ఊదబడే రోజు – [91] మేము అపరాధులను ఆ రోజు (భయం మూలంగా) కళ్లు నీలి రంగులోకి మారి పోయిన స్థితిలో సమీకరిస్తాము.

يَّتَخَافَتُوْنَ بَيْنَهُمْ اِنْ لَّبِثْتُمْ اِلَّا عَشْرًا ﴿103﴾

103 వారు పరస్పరం, "మనం (ప్రపంచంలో) పది రోజులకన్నా ఎక్కువ ఉండి ఉండం" అని గుసగుసలాడుకుంటూ ఉంటారు.[92]

نَحْنُ اَعْلَمُ بِمَا يَقُوْلُوْنَ اِذْ يَقُوْلُ اَمْثَلُهُمْ طَرِيْقَةً اِنْ لَّبِثْتُمْ اِلَّا يَوْمًا ﴿104﴾

104 వారేం చెప్పుకుంటున్నారో మాకు బాగా తెలుసు. వారిలో (ధార్మికంగా) అందరికన్నా మంచి పద్ధతిపై ఉన్నవాడు,[93] "అసలు మీరు ఒక్క రోజు మాత్రమే ఉన్నారు" అంటాడు.

87. ఇక్కడ **'హితోపదేశం'** అంటే ఖుర్‌ఆన్ గ్రంథం అని భావం. ఈ గ్రంథం ద్వారా దాసుడు తన ప్రభువును జ్ఞాపకం చేస్తాడు. సన్మార్గం పొందుతాడు. సాఫల్యభాగ్యం పొందుతాడు.

88. అంటే ఈ గ్రంథాన్ని విశ్వసించనివాడు... ఇందులో గ్రంథస్థం అయి ఉన్న విషయాలను ఆచరణలో పెట్టనివాడు.

89. ఎందుకంటే వాడు చెడులచెట్టు, పాపాల పుట్ట అయి ఉంటాడు. వాడి కర్మల పత్రంలో సత్కర్మలనేవి ఉండవు – అన్నీ దుష్కర్మలే ఉంటాయి.

90. దాన్నుంచి తప్పించుకోవటంగానీ, పారిపోవటంగానీ జరగదు.

91. శంఖం అంటే అదొక రకమైన 'కొమ్ము'. దైవాజ్ఞానుసారం ఇస్రాఫీల్ (అలైహిస్సలాం) శంఖం పూరించగానే ప్రళయం సంభవిస్తుంది (ముస్నదె అహ్మద్ – 2/191). వేరొక హదీసులో మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "ఇస్రాఫీల్ అలైహిస్సలాం శంఖాన్ని నోటి ముద్దలాగా చేసుకుని సిద్ధంగా ఉన్నారు (అంటే నోటి దగ్గరే పెట్టుకుని ఉన్నారు) తలను వంచి, ఎప్పుడు ఆజ్ఞాపించబడుతుందో, ఎప్పుడు శంఖం పూరించవలసివస్తుందోనని ప్రభువు ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నారు. (తిర్మిజీ– సిఫతుల్ ఖియామ అధ్యాయం). ఇస్రాఫీల్ మొదటిసారి శంఖం ఊదగానే మృత్యువు సంభవిస్తుంది. రెండవసారి శంఖం ఊదగానే అల్లాహ్ ఆజ్ఞపై అందరూ లేచి హష్ర్ మైదానంలోకి హాజరవుతారు. ఈ ఆయతులో ప్రస్తావించబడినది రెండవసారి ఊదబడే శంఖం గురించే.

92. ఆనాడు సర్వత్రా నెలకొనే భీతావహ పరిస్థితి కారణంగా వారు పరస్పరం గుసగుస లాడుకుంటారు. బిగ్గరగా మాట్లాడుకోవటానికి భయపడతారు.

93. అంటే వారిలో అందరికన్నా ఎక్కువ బుద్ధిమంతుడు, వివేచనాపరుడు అన్నమాట. ప్రాపంచిక జీవితం వారికి కొన్ని రోజుల, కొన్ని ఘడియల జీవితం అనిపిస్తుంది. "ఆ ఘడియ సంభవించిన రోజున అపరాధులు, తాము ఒక గడియ కాలంకన్నా ఎక్కువగా ప్రపంచంలో ఉండలేదని ప్రమాణాలుచేసి మరీ చెబుతారు" (రూమ్ – 55). ఇదే విషయం ఈ గ్రంథంలో అనేకచోట్ల ప్రస్తావనకు వచ్చింది. ఉదాహరణకు: ఫాతిర్ సూరా – 37; మోమినూన్ : 112 – 114; నాజిఆత్). ఈ వాక్యాల సారాంశం ఏమిటంటే శాశ్వతమైన జీవితంపై క్షణభంగురమైన జీవితానికి ప్రాధాన్యత ఇవ్వకూడదు.

**105** వారు నిన్ను పర్వతాల పరిస్థితి గురించి అడుగుతున్నారు. వారికిలా చెప్పు: “నా ప్రభువు వాటిని తుత్తునియలుగా చేసి ఎగురవేస్తాడు.

وَيَسْـَٔلُونَكَ عَنِ الْجِبَالِ فَقُلْ يَنسِفُهَا رَبِّي نَسْفًا ﴿١٠٥﴾

**106** “మరి భూమిని చదునైన మైదానంగా చేసివేస్తాడు.

فَيَذَرُهَا قَاعًا صَفْصَفًا ﴿١٠٦﴾

**107** “అందులో నీకు ఎలాంటి వంకరలు గానీ, మెట్టపల్లాలు గానీ కానరావు.”

لَّا تَرَىٰ فِيهَا عِوَجًا وَلَا أَمْتًا ﴿١٠٧﴾

**108** ఆ రోజు వారందరూ పిలిచేవాని వెనుక పడిపోతుంటారు.[94] అందులో (ఆ అనుసరణలో) ఎలాంటి వంకరతనం ఉండదు.[95] కరుణామయుడైన అల్లాహ్ సమక్షంలో అందరి కంఠస్వరాలు తగ్గిపోయి ఉంటాయి. గుసగుసలు తప్ప నీకు మరొకటి వినిపించదు.[96]

يَوْمَئِذٍ يَتَّبِعُونَ الدَّاعِيَ لَا عِوَجَ لَهُ ۖ وَخَشَعَتِ الْأَصْوَاتُ لِلرَّحْمَٰنِ فَلَا تَسْمَعُ إِلَّا هَمْسًا ﴿١٠٨﴾

**109** ఆ రోజు కరుణామయుడు ఎవరికయినా అనుమతించి, అతని మాటను (వినడానికి) ఇష్టపడితే తప్ప – ఎవరి సిఫారసూ చెల్లనేరదు.[97]

يَوْمَئِذٍ لَّا تَنفَعُ الشَّفَاعَةُ إِلَّا مَنْ أَذِنَ لَهُ الرَّحْمَٰنُ وَرَضِيَ لَهُ قَوْلًا ﴿١٠٩﴾

**110** వారికి ముందూ వెనుకా ఉన్న స్థితిని గురించి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. అయితే వారికి మాత్రం ఆయన్ని గురించి పూర్తిగా తెలీదు.[98]

يَعْلَمُ مَا بَيْنَ أَيْدِيهِمْ وَمَا خَلْفَهُمْ وَلَا يُحِيطُونَ بِهِ عِلْمًا ﴿١١٠﴾

94. ఆ రోజు ఎత్తయిన పర్వతాలు, గుట్టలు, ఆకాశాన్నంటే పెద్ద పెద్ద కట్టడాలు– అన్నీ నేలమట్టమై సమానమైపోతాయి. నదులు, సముద్రాలలోని నీరు ఇంకిపోతుంది. నేలంతా చదునుగా అయిపోతుంది. ఆ తరువాత పిలిచే వాని నుంచి ఒక పిలుపు వినవస్తుంది. అందరూ ఆ పిలుపును అందుకుని అతన్ని అనుసరిస్తారు.

95. అంటే ఆ పిలిచేవాణ్ణి వదలి వారు ఇటూ ఇటూ వెళ్ళరు.

96. ఆనాడు సర్వత్రా నిశ్శబ్దం ఆవరిస్తుంది. అడుగుల సవ్వడి, గుసగుసలు తప్ప మరో శబ్దం వినబడదు.

97. ఆ రోజు ఎవరి సిఫారసూ ఎవరి కొరకూ పనికిరాదు. కాకపోతే కరుణామయుడైన దేవుడు అనుమతించిన కొందరు మాత్రమే సిఫారసు చేయగలుగుతారు. అదీ అందరికోసం సిఫారసు చేయలేరు. అల్లాహ్ ఎవరి విషయంలో ఏదన్నా వినడానికి సమ్మతిస్తాడో వారి విషయంలో మాత్రమే ఏదన్నా సిఫారసు చేయగలుగుతారు. ఎవరు వారు? ఏకదైవోపాసకులు – ఒక్కడైన అల్లాహ్‌ను నమ్మినవారు. షిర్క్‌కు దూరంగా ఉన్నవారు. ఈ విషయం దివ్య ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల చర్చించబడింది. ఉదాహరణకు: నజమ్ – 26; అంబియా – 28; సబా – 23; నబా – 38, ఆయతుల్ కుర్సీ (అనగా బఖర సూరా, 255వ ఆయతు).

98. వెనుకటి ఆయతులో సిఫారసుకు సంబంధించిన కొన్ని సూత్రాలు తెలుపబడ్డాయి. ఎవరు ఎంత పెద్ద నేరస్తులో, ఎవరు సిఫారసుకు అర్హులో, ఎవరు కారో అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. అందుకే ప్రవక్తల, సజ్జనుల చేత ఎవరి సిఫారసును ఆమోదించాలో అల్లాహ్‌యే నిర్ణయిస్తాడు. ఎందుకంటే ఏ పాపం క్షమార్హమో, ఏది కాదో ఆయనకు అంతా తెలుసు. ఆ నిర్ణయం గైకొనే అధికారం ఇతరులకు ఉండదు.

**111** (ఆనాడు) అందరి ముఖాలు సజీవుడు, నిత్యుడు అయిన అల్లాహ్ ఎదుట పూర్తిగా క్రిందికి వాలి ఉంటాయి. నిశ్చయంగా దుర్మార్గం (బరువు) మోసేవాడు నాశనమవుతాడు.[99]

وَعَنَتِ الْوُجُوهُ لِلْحَيِّ الْقَيُّومِ ۖ وَقَدْ خَابَ مَنْ
حَمَلَ ظُلْمًا ﴿١١١﴾

**112** ఇక సత్కార్యాలు చేసినవాడు; అతను విశ్వాసి కూడా అయివుంటే – అతనికి అన్యాయం జరుగుతుందన్న జంకుగానీ, తన హక్కు కాజేయబడుతుందన్న భీతిగానీ ఉండదు.[100]

وَمَن يَعْمَلْ مِنَ الصَّالِحَاتِ وَهُوَ مُؤْمِنٌ فَلَا
يَخَافُ ظُلْمًا وَلَا هَضْمًا ﴿١١٢﴾

**113** ఇదేవిధంగా (ఓ ప్రవక్తా!) మేము దీనిని నీపై అరబ్బీ ఖుర్ఆన్‌గా అవతరింపజేశాము. ప్రజలు భయభక్తులు కలిగి ఉండగలందులకు,[101] లేదా వారిలో ధర్మ చింతన రేకెత్తేందుకు[102] పలు విధాలుగా ఇందులో భయబోధ చేశాము.

وَكَذَٰلِكَ أَنزَلْنَاهُ قُرْآنًا عَرَبِيًّا وَصَرَّفْنَا فِيهِ
مِنَ الْوَعِيدِ لَعَلَّهُمْ يَتَّقُونَ أَوْ يُحْدِثُ
لَهُمْ ذِكْرًا ﴿١١٣﴾

**114** కనుక నిజ సామ్రాట్టు అయిన అల్లాహ్‌యే సర్వోన్నతుడు.[103] నీ వద్దకు పంపబడే 'వహీ' (దైవవాణి) పూర్తి కానంత వరకూ నువ్వు ఖుర్ఆన్ పఠించటంలో తొందరపడకు.[104] అయితే "ప్రభూ! నా జ్ఞానాన్ని పెంచు"[105] అని మాత్రం వేడుకో.

فَتَعَالَى اللَّهُ الْمَلِكُ الْحَقُّ ۗ وَلَا تَعْجَلْ بِالْقُرْآنِ
مِن قَبْلِ أَن يُقْضَىٰ إِلَيْكَ وَحْيُهُ ۖ وَقُل رَّبِّ
زِدْنِي عِلْمًا ﴿١١٤﴾

99. ఎందుకంటే ఆ రోజు అల్లాహ్ అందరికీ పూర్తి న్యాయం చేస్తాడు. ప్రతి హక్కుదారునికీ అతని హక్కును ఇప్పిస్తాడు. ఆఖరికి కొమ్ములుగల ఒక మేక కొమ్ములు లేని మేకను హింసించి ఉంటే దాని నష్టపరిహారం కూడా ఇప్పించబడుతుంది (సహీహ్ ముస్లిం–కితాబుల్ బిర్ర్; ముస్నదె అహ్మద్ – సంపుటి:2, పేజీ – 235). అందుకే మహనీయ ముహమ్మద్(స) వారు ఈ హదీసులోనే "ప్రతి హక్కుదారునికీ అతని హక్కును ఇవ్వండి" అని చెప్పారు. లేకపోతే తీర్పుదినాన ఇవ్వవలసి ఉంటుంది. మరో హదీసులో మహాప్రవక్త (స) ఇలా ప్రబోధించారు – "అన్యాయానికి దూరంగా ఉండండి. ఎందుకంటే అన్యాయం ప్రళయదినాన అంధకారంగా పరిణమిస్తుంది" (సహీహ్ ముస్లిం– కితాబుల్ బిర్ర్). తన నెత్తిన షిర్క్ భారాన్ని మోస్తూ వచ్చినవాడు ఘోర పరాభవానికి గురవుతాడు. ఎందుకంటే షిర్క్ చాలా పెద్ద అన్యాయం. క్షమార్హం కాని పాపం.

100. ఇతరుల పాపాల భారం గనక తనపై వేస్తే అది అన్యాయం అనిపించుకుంటుంది. పుణ్యకార్యాలకు తగిన ప్రతిఫలం ఇవ్వకపోతే హక్కు కాజేయబడినట్లవుతుంది. అయితే దేవుని న్యాయస్థానంలో ఇలాంటి అన్యాయం జరగదు.

101. అంటే పాపాలను, నిషిద్ధ (హరాం) విషయాలను, నీతిబాహ్యమైన పనులను పరిత్యజించి ధర్మసమ్మతమైన విధానాన్ని అవలంబించడానికిగాను.

102. అంటే వారిలో దైవవిధేయతా భావం జనించాలి. దైవసామీప్యం పొందటానికి వారు తాపత్రయపడాలి. వెనుకటి జాతుల స్థితిగతులను, సంఘటనలను తెలుసుకుని గుణపాఠం నేర్చుకోవాలి – ఇదే ఖుర్ఆన్ అవతరణా ఉద్దేశం.

103. ఆయన చేసే వాగ్దానం సత్యం. ఆయన హెచ్చరిక కూడా సత్యమే. స్వర్గనరకాలు కూడా సత్యమే. ఆయన తరఫున అవతరింపజెయ్యబడే ప్రతిదీ సత్యమే.

104. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవసందేశం తీసుకుని వచ్చి, ప్రవక్త (స)కు వినిపించినప్పుడు, దాన్ని కంఠస్థం చేసుకోవటానికి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) త్వరపడేవారు. ఒక్క అక్షరం కూడా మరచిపోకుండా పూర్తిగా జ్ఞాపకం చేసుకోవాలన్నది ప్రవక్త (స) ఉద్దేశం. అయితే ఈ విషయంలో తొందరపడవలసిన పనిలేదనీ, దైవవాణిని

115 మేము ఆదమ్‌కు ముందే గట్టిగా తాకీదు చేశాము. కాని అతను మరచిపోయాడు. మాకు అతనిలో సంకల్పబలం కనిపించ లేదు.[106]

وَلَقَدْ عَهِدْنَآ إِلَىٰٓ ءَادَمَ مِن قَبْلُ فَنَسِىَ وَلَمْ نَجِدْ لَهُۥ عَزْمًا ﴿١١٥﴾

116 "ఆదమ్‌కు సాష్టాంగపడండి" అని మేము దైవదూతలతో అన్నప్పుడు ఇబ్లీసు తప్ప అందరూ సాష్టాంగపడ్డారు. వాడు మాత్రం స్పష్టంగా నిరాకరించాడు.

وَإِذْ قُلْنَا لِلْمَلَٰٓئِكَةِ ٱسْجُدُوا۟ لِءَادَمَ فَسَجَدُوٓا۟ إِلَّآ إِبْلِيسَ أَبَىٰ ﴿١١٦﴾

ముందు శ్రద్ధగా వినాలనీ, ఆ తరువాతే కంఠస్థం చేయాలని అల్లాహ్ ఆయనకు తాకీదు చేశాడు. ఎందుకంటే విషయాన్ని మనోఫలకంపై ముద్రించే బాధ్యత తనదని అల్లాహ్ చెప్పాడు. దీని వివరాలు అల్ ఖియామ సూరాలో రానున్నాయి.

105. అంటే జ్ఞానాన్ని, అవగాహనా శక్తిని పెంపొందించమని అల్లాహ్‌ను తరచూ వేడుకుంటూ ఉండాలి. ఈ ఆయతు అందరికీ వర్తిస్తుంది. ముఖ్యంగా ఇస్లామీయ విద్వాంసులు ఈ ఆయతును అనునిత్యం దృష్టిలో పెట్టుకుని ధార్మిక తీర్పులు (ఫత్వాలు) ఇచ్చే సమయంలో విషయాన్ని పలు కోణాల నుంచి తరచి చూడాలి. స్థూలదృష్టితో, మిడిమిడి జ్ఞానంతో 'ఫత్వా'లు జారీ చేయకూడదు. తీర్పుకు సంబంధించి కావలసినంత సమాచారాన్ని సముపార్జించాలి. ఇందులో ఎలాంటి అలసత్వం చూపకూడదు. ధార్మిక పరిభాషలో 'ఇల్మ్' (జ్ఞానం) అంటే అసలు ఖుర్ఆన్ హదీసుల జ్ఞానమే. మిగిలిన విద్యలన్నీ కూటికి, కోట్లకు సంబంధించినవే. అంతిమ దైవప్రవక్త (సఅసం) తరచూ అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉండేది ఖుర్ఆన్ హదీసుల పరిజ్ఞానం కోసమే. ఈ 'జ్ఞానం' ద్వారా దాసునికి దైవంతో సంబంధం ఏర్పడుతుంది. ఇంకా ఈ జ్ఞానం ద్వారా మనిషి నడవడిక సంస్కరించబడుతుంది. ఏ విషయాల పట్ల దేవుడు ప్రసన్నుడవుతాడో, మరే విషయాలపట్ల అప్రసన్నుడవుతాడో తెలుసుకోవటానికి వీలవుతుంది. ఇలాంటి దుఆలలో ఇంకొక దుఆ ఇది : మహాప్రవక్త (స) ఈ దుఆ కూడా చేస్తూ ఉండేవారు: **"అల్లాహుమ్మన్ ఫానీ బిమా అల్లమ్తనీ వ అల్లిమ్నీ మా యన్ఫవునీ వ జిద్నీ ఇల్మన్. వల్‌హమ్దు లిల్లాహి అలా కుల్లి హాల్."** (ఇబ్నెమాజ) అనువాదం : ఓ అల్లాహ్! నీవు నాకు నేర్పిన విద్య ద్వారా నాకు ప్రయోజనాన్ని చేకూర్చు. ప్రయోజనం కలిగే విద్యనే నాకు నేర్పించు. నా జ్ఞానంలో వృద్ధినొసగు. సర్వావస్థల్లోనూ అల్లాహ్‌కే స్తోత్రం శోభిస్తుంది.

106. మరచిపోవటం అనేది మానవ సహజమైన దౌర్బల్యం. మానవుని మనోబలం కూడా తరచూ తడబడుతూ ఉంటుంది. ఈ రెండు బలహీనతల మూలంగానే షైతాన్ మనిషిపై సునాయాసంగా దాడిచేస్తాడు. ఒకవేళ ఈ బలహీనతల్లో దైవధిక్కారభావం, అవిధేయత వంటి అవలక్షణాలు అంతర్లీనం కాకుండా ఉన్నట్లయితే అవి క్షంతవ్యమే. అటువంటి బలహీనతలు ఒక ప్రవక్త సౌశీల్యానికి కూడా విరుద్ధమైనవి కావు. తిరుగుబాటు ధోరణి పొడసూపకుండా ఉన్నంతవరకూ దేవుడు తన దాసుల పొరబాట్లను దయతో మన్నిస్తాడు. కాకపోతే తన తప్పు తెలిసిరాగానే దాసుడు సిగ్గుతో కుంచించుకుపోతూ, తన ప్రభువు సాన్నిధ్యంలో మోకరిల్లాలి. క్షమాపణ వేడుకోవాలి (హజ్రత్ ఆదమ్ – అలైహిస్సలాం కూడా అదే చేశారు).

దేవుడు హజ్రత్ ఆదమ్ (అలైహిస్సలాం)కు ముందే బోధపరిచాడు : "షైతాన్ నీకూ, నీ అర్థాంగికీ బహిరంగ శత్రువు. వాడిపట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. వాడి మాయమాటలకు మోసపోవద్దు. అసూయతో వాడు మీరిద్దరినీ స్వర్గం నుంచి గెంటివేసే పరిస్థితి సృష్టించవచ్చు" అని. దీనినే 'వాగ్దానం'గా అభివర్ణించటం జరిగింది. ఈ మాటను హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) మరచిపోయారు. అసలు విషయం ఏమిటంటే ఒకానొక వృక్షం వద్దకు వెళ్ళరాదనీ, ఆ వృక్షం ఫలాన్ని తినరాదనీ అల్లాహ్ ఆయనకు సూచించాడు. ఆ చెట్టు దగ్గరకు పోరాదన్న విషయం ఆయన మనసులో పదిలమైంది. అయితే షైతాన్ అబద్ధపు ప్రమాణాలు చేసి ఆదమ్‌ను కవ్వించాడు. ఆ చెట్టు పండును తిన్నవాడు మృత్యువును జయిస్తాడనీ, అతనికి శాశ్విత సార్వభౌమాధికారం లభిస్తుందని ప్రేరేపించాడు. దాంతో ఆదమ్ సంకల్పబలం దెబ్బతిన్నది. ఆయన ఏమరుపాటుకు గురై, షైతాన్ వ్యూహంలో చిక్కుకున్నారు.

117 అప్పుడు మేము ఇలా అన్నాము : "ఓ ఆదమ్! వీడు నీకూ, నీ భార్యకూ బద్ధ విరోధి. (జాగ్రత్త!) వాడు మీరిద్దరినీ స్వర్గం నుంచి వెళ్లగొట్టే స్థితి రాకూడదు సుమా! ఒకవేళ అదేగనక జరిగితే నువ్వు కష్టాల్లో పడాల్సివస్తుంది.[107]

فَقُلْنَا يٰٓاٰدَمُ اِنَّ هٰذَا عَدُوٌّ لَّكَ وَلِزَوْجِكَ فَلَا يُخْرِجَنَّكُمَا مِنَ الْجَنَّةِ فَتَشْقٰى ﴿117﴾

118 "(ఇక్కడ నువ్వు ఎంతో హాయిగా ఉన్నావు). ఇక్కడ నీకు ఆకలీ ఉండదు, నువ్వు నగ్నంగానూ ఉండవు."

اِنَّ لَكَ اَلَّا تَجُوْعَ فِيْهَا وَلَا تَعْرٰى ﴿118﴾

119 "నీకు దప్పికగానీ, ఎండ బాధగానీ ఉండదు."

وَاَنَّكَ لَا تَظْمَؤُا فِيْهَا وَلَا تَضْحٰى ﴿119﴾

120 మరి షైతాను అతన్ని కవ్వించాడు. "ఓ ఆదమ్! నేను నీకు శాశ్వత జీవితాన్ని ప్రసాదించే వృక్షాన్ని, ఎన్నటికీ పాతబడని సామ్రాజ్యాన్ని చూపించనా?!" అన్నాడు.

فَوَسْوَسَ اِلَيْهِ الشَّيْطٰنُ قَالَ يٰٓاٰدَمُ هَلْ اَدُلُّكَ عَلٰى شَجَرَةِ الْخُلْدِ وَمُلْكٍ لَّا يَبْلٰى ﴿120﴾

121 ఆ విధంగా వారిద్దరూ ఆ వృక్షం నుండి (ఫలం) తినగానే వారి మర్మస్థానాలు బహిర్గతమైపోయాయి. వారిద్దరూ స్వర్గంలోని ఆకులతో వాటిని కప్పుకోసాగారు. ఆదమ్ తన ప్రభువు మాటను జవదాటి, దారి తప్పాడు.[108]

فَاَكَلَا مِنْهَا فَبَدَتْ لَهُمَا سَوْاٰتُهُمَا وَطَفِقَا يَخْصِفٰنِ عَلَيْهِمَا مِنْ وَّرَقِ الْجَنَّةِ وَعَصٰٓى اٰدَمُ رَبَّهٗ فَغَوٰى ﴿121﴾

122 దరిమిలా అతని ప్రభువు అతన్ని ఎన్నుకున్నాడు. అతని పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. అతనికి మార్గం చూపాడు.[109]

ثُمَّ اجْتَبٰهُ رَبُّهٗ فَتَابَ عَلَيْهِ وَهَدٰى ﴿122﴾

107. ఇక్కడ **'కష్టం'** అన్న పదం పరిశ్రమ అన్న భావంలో ప్రయోగించబడింది. స్వర్గంలో కష్టపడకుండానే అన్నపానీయాలు, విశ్రాంతి సౌకర్యాలు లభిస్తున్నాయి. ఒకవేళ స్వర్గం నుంచి బయటపడితే తిండి బట్టల కోసం, నివాసగృహం కోసం తీవ్రంగా కష్టపడాల్సి వస్తుంది. 'కష్టపడాల్సివస్తుంది' అని ఆదం-హవ్వాలిద్దరికీ చెప్పలేదు. కేవలం ఆదమ్‌కు మాత్రమే ఈ మాట అనబడింది. మరి చూడబోతే ఆ వృక్షాన్ని సమీపించి, దానిపండు తిన్నవారిలో వారిద్దరూ ఉన్నారు. దీని ఆధారంగా పండితులేమంటారంటే, కష్టపడి సంపాదించి ఆలుబిడ్డలను పోషించాల్సిన బాధ్యతను దేవుడు మగాడిపై వేశాడు. ఈ బాధ్యత స్త్రీపై మోపబడలేదు. ఈ బరువు నుంచి తప్పించి దేవుడు ఆమెను గృహసామ్రాజ్ఞిగా గౌరవించాడు. కాని నేటి ఆధునిక మానవుడు స్త్రీ స్వేచ్ఛ పేరుతో ఆమెపై అదనపు భారం మోపాడు. దేవుడు తనకు సామ్రాజ్ఞిగా ఇచ్చిన ఈ 'పురస్కారాన్ని' ఆధునిక మహిళ 'బానిస బంధనం'గా భావించి, గృహ సామ్రాజ్యాన్ని విడిచి అంగడిలోకి అడుగుపెట్టింది. తన మానమర్యాదలకు రక్షణ లేని స్వేచ్ఛా విపణిలో విహరించగోరుతోంది. ఆ విధంగా నేటి నారీమణి షైతాన్ పన్నిన అందమైన, ఆకర్షణీయమైన పద్మవ్యూహంలో దారుణంగా చిక్కుకుపోయింది.

108. షైతాన్ ప్రేరేపణపై ఆదమ్ నిషిద్ధ వృక్షం పండు తిని దైవాదేశాన్ని అతిక్రమించారు. పర్యవసానంగా సన్మార్గం నుంచి తప్పిపోయారు.

109. **'మార్గం చూపాడు'** అన్న వాక్యాన్ని ఆధారంగా తీసుకుని కొంతమంది చెప్పేదేమిటంటే ప్రవక్త పదవి లభించక మునుపు ఆదం వల్ల ఈ మరుపు జరిగింది. ఆ తరువాత దేవుడు ఆయన్ని క్షమించి, తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. అయితే ఇంతకు ముందు మేము ప్రస్తావించినట్లు ఆదం ప్రవక్త వల్ల జరిగిన ఈ 'పొరపాటు' సౌశీల్యానికి విరుద్ధమైనది కాదు. అది 'మరుపు' మాత్రమే. ఇలాంటివి మానవ సహజమైన దౌర్బల్యాల క్రిందికివస్తాయి. ఇంకో విషయం

قَالَ اهْبِطَا مِنْهَا جَمِيعًا بَعْضُكُمْ لِبَعْضٍ عَدُوٌّ ۚ
فَإِمَّا يَأْتِيَنَّكُمْ مِنِّي هُدًى فَمَنِ اتَّبَعَ هُدَايَ
فَلَا يَضِلُّ وَلَا يَشْقَىٰ ﴿123﴾

**123** (అల్లాహ్) ఇలా సెలవిచ్చాడు : "మీరిద్దరూ ఇక్కణ్ణుంచి దిగి పోండి. మీరు ఒండొకరికి శత్రువులు. ఇకమీదట మీ వద్దకు నా నుండి మార్గదర్శకత్వం గనక వస్తే, నా మార్గాన్ని అవలంబించే వాడు దారి తప్పటంగానీ, ప్రయాసకు లోనవటంగానీ జరగదు.

وَمَنْ أَعْرَضَ عَنْ ذِكْرِي فَإِنَّ لَهُ مَعِيشَةً
ضَنْكًا وَنَحْشُرُهُ يَوْمَ الْقِيَامَةِ أَعْمَىٰ ﴿124﴾

**124** అయితే నా ధ్యానం పట్ల విముఖత చూపినవాడి బ్రతుకు దుర్భరమైపోతుంది.[110] ప్రళయదినాన మేమతన్ని గుడ్డివానిగా చేసి లేపుతాము."[111]

قَالَ رَبِّ لِمَ حَشَرْتَنِي أَعْمَىٰ وَقَدْ كُنْتُ بَصِيرًا ﴿125﴾

**125** "ప్రభూ! నన్ను గుడ్డివానిగా చేసి లేపారేమిటీ? నాకు చూపు ఉండేదికదా!" అని అతను అంటాడు.

قَالَ كَذَٰلِكَ أَتَتْكَ آيَاتُنَا فَنَسِيتَهَا ۖ
وَكَذَٰلِكَ الْيَوْمَ تُنْسَىٰ ﴿126﴾

**126** "జరగవలసిన విధంగానే జరిగింది. (ఒకప్పుడు) నీ వద్దకు వచ్చిన మా ఆయతులను (వచనాలను, సూచనలను, మహిమలను) నువ్వు విస్మరించావు. అందుకే ఈనాడు నువ్వు కూడా విస్మరించబడుతున్నావు" అని అనబడుతుంది.

وَكَذَٰلِكَ نَجْزِي مَنْ أَسْرَفَ وَلَمْ يُؤْمِنْ بِآيَاتِ
رَبِّهِ ۚ وَلَعَذَابُ الْآخِرَةِ أَشَدُّ وَأَبْقَىٰ ﴿127﴾

**127** హద్దుమీరిపోయి, తన ప్రభువు ఆయతులను విశ్వసించేందుకు నిరాకరించిన ప్రతి ఒక్కరికీ మేము ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా పరలోక శిక్ష ఇంతకన్నా కఠినమైనది, ఎప్పటికీ ఉండేది.

---

ఏమిటంటే ఈ 'పొరబాటు' ధర్మ ప్రచారానికో, ప్రవక్త బాధ్యతల నిర్వహణకో లేక షరీఅత్ చట్టాలకో సంబంధించిన సమస్య కాదు. ఇది వ్యక్తి ప్రవర్తనకు సంబంధించిన అంశం. కనుక అది దైవాగ్రహానికి కారణమయ్యేంత తీవ్రమైన అపరాధం కూడా కాదు. అయితే మహనీయుల వల్ల జరిగే సాధారణమైన తప్పులు కూడా అసాధారణమైనవిగానే పరిగణించబడతాయి. కాబట్టి హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) దైవప్రవక్తగా నియుక్తులు కాకముందు నిషిద్ధవృక్షాన్ని సమీపించారని, ఆ తరువాత దేవుడు ఆయన్ని క్షమించి ప్రవక్తగా ఎన్నుకున్నాడని భావించటం సమంజసం కాదు.

"పశ్చాత్తాపభావంతో ఆదం కుమిలిపోయిన పిమ్మట మేము తిరిగి అతన్ని ఆ స్థానంలో తీసుకున్నాము. అతన్ని దివి నుంచి భువికి దింపాలని నిర్ణయించాము. ఇదంతా మా ప్రణాళిక ననుసరించి జరిగింది. మేము ఆదంకు శిక్షగా భువిపైకి దింపామని భావించరాదు" – ఈ ఆయతును ఈ భావంలోనే తీసుకోవాలి.

110. అలాంటి వారి సమాధి వారికోసం ఇరుకైపోతుందని కొంతమంది అభిప్రాయపడ్డారు. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం వారి జీవితాలలో ప్రశాంతత కరువైపోతుంది. వారు సతతం వ్యాకులతకు, అశాంతికి లోనై ఉంటారు. అల్లాహ్ ధ్యానం పట్ల అశ్రద్ధ వహించిన పెద్ద పెద్ద ధనవంతులు సయితం మనశ్శాంతి కరువైపోయి ఇరకాటంలో పడిపోవటం మనకు సర్వత్రా కనిపిస్తూనే ఉంటుంది.

111. నిజంగానే వారి కంటిచూపు పోవచ్చు లేక వారి మనోనేత్రం గుడ్డిదై పోతుంది. పరలోక శిక్షనుంచి బయటపడే మార్గం ఏదీ వారి మనసుకు కానరాదు. వారి మనోమస్తిష్కాలు స్తంభించిపోతాయి.

**128** వీరికి పూర్వం ఎన్నో సమూహాలను మేము తుదముట్టించాము. వారి నివాస స్థలాలలో (ప్రస్తుతం) వీళ్లు తిరుగుతున్నారు. ఈ విషయం కూడా వారికి సన్మార్గం చూపటం లేదా? నిశ్చయంగా ఇందులో వివేచన గల వారి కొరకు ఎన్నో సూచనలున్నాయి.

أَفَلَمْ يَهْدِ لَهُمْ كَمْ أَهْلَكْنَا قَبْلَهُم مِّنَ الْقُرُونِ يَمْشُونَ فِي مَسَاكِنِهِمْ ۗ إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ لِّأُولِي النُّهَىٰ ﴿128﴾

**129** నీ ప్రభువు తరఫు నుంచి మాట ముందే ఖరారు కాకుండా, గడువు ముందుగానే నిర్ధారించబడకుండా ఉన్నట్లయితే ఇప్పటికిప్పుడే వీళ్లకు, శిక్ష అంటుకొని ఉండేది.[112]

وَلَوْلَا كَلِمَةٌ سَبَقَتْ مِن رَّبِّكَ لَكَانَ لِزَامًا وَأَجَلٌ مُّسَمًّى ﴿129﴾

**130** కనుక (ఓ ముహమ్మద్!) వారు కల్పించే మాటలపై ఓర్పు వహించు. నీ ప్రభువు స్తోత్రంతోపాటు, ఆయన పవిత్రతను కొనియాడు. సూర్యోదయం కాకముందు, సూర్యాస్తమయానికి ముందు, రాత్రివేళల్లోనూ, పగటి అంచుల్లోనూ ప్రభువును ధ్యానిస్తూ ఉండు.[113] తద్వారా నువ్వు సంతృప్తిచెందే[114] అవకాశం ఉంది.

فَاصْبِرْ عَلَىٰ مَا يَقُولُونَ وَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ قَبْلَ طُلُوعِ الشَّمْسِ وَقَبْلَ غُرُوبِهَا ۖ وَمِنْ آنَاءِ اللَّيْلِ فَسَبِّحْ وَأَطْرَافَ النَّهَارِ لَعَلَّكَ تَرْضَىٰ ﴿130﴾

112. తమకు పూర్వం ఎన్ని జాతులు, మరెన్ని సమూహాలు గడిచాయో ఈ ధిక్కారులు, అవిశ్వాసులు చూడటం లేదా? చూడబోతే వీళ్లు తమ పూర్వీకులకు వారసులు. తమ పూర్వీకుల శిథిలాలపై కలియ తిరుగుతున్నారు. దైవధిక్కార వైఖరి మూలంగానే మేము వారిని శిక్షించాము. గుణపాఠం నేర్చుకోదలిచే వారికోసం వారి ముగింపులో పలు సూచనలున్నాయి. కాని మక్కాకు చెందిన ఈ అవిశ్వాసులు మరీ గుడ్డిగా వ్యవహరిస్తున్నారు. తలబిరుసుతనం బెడిసికొడుతుందని తెలిసి కూడా వీళ్లు దారికి రావటంలేదు. వారికోసం నిర్ధారించబడిన గడువు వచ్చేవరకూ వారికి విడుపు ఇవ్వబడుతూనే ఉంటుందని దేవుడు నిర్ణయం గైకొనకుండా ఉన్నట్లయితే, వెంటనే వారిపై దైవాగ్రహం విరుచుకుపడేది. వారంతా నాశనమై ఉండేవారు. కాబట్టి ధిక్కార వైఖరికి ఒడిగట్టినప్పటికీ తమపై శిక్ష అవతరించలేదన్న ధీమాతో వారు నిర్భయంగా ఉండరాదు. అసలు తమపై దేవుని శిక్షే అవతరించదని తలపోయరాదు. దేవుడు ఇచ్చిన నిర్ణీత గడువును మహదవకాశంగా భావించి రుజువర్తనులు కావాలి. గడువు ముగిసినంతనే ఆయన మీ భరతం పట్టడం ఖాయం అని తెలుసుకోండి.

113. కొంతమంది వ్యాఖ్యాతల దృష్టిలో ఇక్కడ ధ్యానం అంటే నమాజ్ అని భావం. ఐదుపూటల నమాజులన్నమాట. సూర్యోదయానికి ముందు ఫజ్ర్ నమాజ్, సూర్యాస్తమయానికి ముందు అస్ర్ నమాజ్, రాత్రివేళల్లో మగ్రిబ్ ఇషా నమాజులు, పగటి సమయంలో జుహ్ర్ నమాజు అని అర్థం. పగటిని గనక రెండు భాగాలుగా విభజిస్తే, అందులో జుహ్ర్ నమాజు పగటి యొక్క మొదటి భాగం చివర్లోనూ, రెండో భాగం ప్రారంభంలోనూ ఆచరించినట్లవుతుంది. అందుకనే మూలంలో 'అత్‌రాఫన్నహార్' (పగటి అంచుల్లో) అని చెప్పబడింది. మరికొందరు విద్వాంసుల ప్రకారం ఈ వేళల్లో తస్బీహ్ మరియు హమ్ద్ చేయటంలో నమాజులు, దుఆలు (ప్రార్థనలు), ఖుర్ఆన్ పఠనం, స్వచ్ఛంద ఆరాధనలు, దైవనామస్మరణ మొదలగునవి అన్నీ వచ్చేస్తాయి. 'ఓ ముహమ్మద్! నువ్వు ఈ ముష్రిక్కుల ధిక్కార వైఖరికి బాధపడకు. నీ మనసును దైవధ్యానంలో లగ్నం చేయి. దేవుని ఔన్నత్యాన్ని కీర్తిస్తూ ఉండు. వారి వ్యవహారాన్ని దైవానికి అప్పగించు. వాళ్ల సంగతి దేవుడు చూసుకుంటాడు' అని పై వాక్యాలకు భావం.

114. ఈ ధ్యానం వల్ల నీ మనసు నెమ్మదిస్తుంది. దేవుడు నిన్ను అత్యున్నత స్థానంలో ప్రతిష్ఠింపజేస్తాడు. దాంతో నువ్వు సంతోషిస్తావు.

**131** వారిలోని పలు రకాల జనులకు మేము ఇచ్చిన ప్రాపంచిక జీవిత వైభవాల వైపు ఆశగా చూడకు. వాటి ద్వారా వాళ్లను పరీక్షించటానికే మేము ఆ వస్తువులను వారికి ఇచ్చాము.[115] వాస్తవానికి నీ ప్రభువు ప్రసాదించిన ఉపాధి మాత్రమే మేలైనది, మిగిలి ఉండేదీను.[116]

وَلَا تَمُدَّنَّ عَيْنَيْكَ إِلَىٰ مَا مَتَّعْنَا بِهِۦٓ أَزْوَٰجًا
مِّنْهُمْ زَهْرَةَ ٱلْحَيَوٰةِ ٱلدُّنْيَا لِنَفْتِنَهُمْ فِيهِ ۚ
وَرِزْقُ رَبِّكَ خَيْرٌ وَأَبْقَىٰ (131)

**132** నీ కుటుంబీకులకు నమాజు గురించి తాకీదు చెయ్యి. నువ్వు సయితం దానిపై స్థిరంగా ఉండు.[117] మేము నీ నుంచి ఉపాధిని అడగటంలేదు. పైగా మేమే నీకు ఉపాధిని ఇస్తున్నాము. చివరికి మంచి జరిగేది భయభక్తులకే.

وَأْمُرْ أَهْلَكَ بِٱلصَّلَوٰةِ وَٱصْطَبِرْ عَلَيْهَا ۖ
لَا نَسْـَٔلُكَ رِزْقًا ۖ نَّحْنُ نَرْزُقُكَ ۗ وَٱلْعَٰقِبَةُ
لِلتَّقْوَىٰ (132)

**133** "ఈయనగారు తన ప్రభువు తరఫు నుంచి మా దగ్గరకు ఏదన్నా నిదర్శనాన్ని ఎందుకు తీసుకురాడు?"[118] అని వారు అంటున్నారు. ఏమిటీ, పూర్వ గ్రంథాల స్పష్టమైన నిదర్శనం వారి వద్దకు చేరలేదా?[119]

وَقَالُوا۟ لَوْلَا يَأْتِينَا بِـَٔايَةٍ مِّن رَّبِّهِۦٓ ۚ أَوَلَمْ
تَأْتِهِم بَيِّنَةُ مَا فِى ٱلصُّحُفِ ٱلْأُولَىٰ (133)

115. ఈ విషయం ఆలి ఇమ్రాన్ సూరా (196–197), అల్ హిజ్ర్ సూరా (87, 88), అల్ కహఫ్ సూరా (7)లో కూడా ఇంతకు ముందు వచ్చింది.

116. అంటే పరలోక పుణ్యఫలం అన్నమాట. అది ప్రాపంచిక సిరిసంపదలకంటే ఎంతో మేలైనది, శాశ్వతమైనది. 'హదీసె ఈలా'లో ఇలా ఉంది. హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సఅసం)ను పలకరించే ఉద్దేశంతో ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఆయన (సఅసం) కటిక చాపపై విశ్రమించి ఉన్నారు. ఇంట్లో రెండు తోలు వస్తువులు తప్ప మరేమీ లేవు. ఈ దృశ్యాన్ని చూసి హజ్రత్ ఉమర్ (రజి) కళ్లు చెమ్మగిల్లాయి. "ఉమర్! ఎందుకు విలపిస్తున్నావు?" అని దైవప్రవక్త (స) అడిగితే, 'దైవప్రవక్తా (స)! ఒక వైపు రోము, పారసీక చక్రవర్తులు సకల భోగభాగ్యాలతో తులతూగుతూ ఉండగా తమరు సృష్టిశ్రేష్ఠులై ఉండి కూడా ఇంతటి నిరాడంబర జీవితాన్ని గడుపుతున్నారే!?' అని విలపించారు ఉమర్ (రజి). దానికి మహాప్రవక్త (స), "ఉమర్! నువ్వు ఇప్పటికీ సంశయంలో పడి ఉన్నావా? వారికి భోగభాగ్యాలు ప్రాపంచిక జీవితంలోనే ఇచ్చేయబడ్డాయి (అంటే పరలోకంలో వారికేమీ లభించదు. పరలోక సౌఖ్యాలు మనకు లభిస్తాయి)" అని సముదాయించారు (బుఖారీ – తహ్రీమ్ సూరా, ముస్లిం – ఈలా అధ్యాయం).

117. ఈ ఆదేశం ప్రవక్తనుద్దేశించి ఇవ్వబడినప్పటికీ, సమస్త ముస్లిం జగతి ఈ ఆజ్ఞాపాలన క్రిందికి వస్తుంది. ముస్లింలలో ప్రతి ఒక్కరూ తాము స్వయంగా నమాజు వ్యవస్థకు కట్టుబడి ఉండటంతోపాటు తమ ఇంటి వారలకు కూడా నమాజు గురించి ఆదేశించాలి.

118. అంటే వారు కోరినట్లుగా ఏదన్నా దైవ మహిమ ఎందుకు రాదు? ఉదాహరణకు : – సమూద్ జాతికి ఒంటెను దైవ నిదర్శనంగా పుట్టించినట్లుగా దేవుడు తమ కోసం కూడా మక్కాలో ఏదన్నా అద్భుతం చేసి చూపడేమి? అన్నది వారి ఉద్దేశం.

119. అంటే – తౌరాత్, బైబిల్, జబూర్ వంటి గ్రంథాలు వారివద్దకు వచ్చాయి కదా! ఆ గ్రంథాలలో అంతిమ దైవప్రవక్త(స) గుణగణాల గురించి చెప్పబడలేదా? అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించడానికి అది చాలదా? వెనుకటి జాతుల వారు కోరినట్లుగా వారికి మహిమలు చూపినప్పటికీ వారు విశ్వసించలేదు. ఆ కారణంగా వారు నాశనం చేయబడ్డారు. ఆ సంగతి వీరికి తెలీదా? వీళ్లు కూడా ఏరికోరి వినాశాన్ని కొనితెచ్చుకోవాలనుకుంటున్నారా?

**134** ఒకవేళ మేము ఇతని (రాక)కి ముందే,[120] ఏదైనా శిక్ష ద్వారా వాళ్ళను అంతమొందించి ఉంటే, “మా ప్రభూ! నువ్వు మా వద్దకు ప్రవక్తను ఎందుకు పంపలేదు? పంపి ఉంటే మేము పరాభవానికి, అవమానానికి లోనవకముందే నీ సూచనలను అనుసరించి ఉండేవాళ్ళం కదా!” అని తప్పకుండా అని ఉండే వారు.

وَلَوْ اَنَّآ اَهْلَكْنٰهُمْ بِعَذَابٍ مِّنْ قَبْلِهٖ لَقَالُوْا رَبَّنَا
لَوْلَآ اَرْسَلْتَ اِلَيْنَا رَسُوْلًا فَنَتَّبِعَ اٰيٰتِكَ مِنْ
قَبْلِ اَنْ نَّذِلَّ وَنَخْزٰى ﴿134﴾

**135** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : “ప్రతి ఒక్కడూ (ఫలితం కోసం) నిరీక్షిస్తున్నాడు. కాబట్టి మీరు కూడా నిరీక్షించండి.[121] సన్మార్గాన ఉన్నదెవరో, మార్గదర్శకత్వం ఎవరు పొందారో త్వరలోనే మీరు తెలుసుకుంటారు.[122]

قُلْ كُلٌّ مُّتَرَبِّصٌ فَتَرَبَّصُوْا ۚ فَسَتَعْلَمُوْنَ مَنْ
اَصْحٰبُ الصِّرَاطِ السَّوِيِّ وَمَنِ اهْتَدٰى ﴿135﴾

120. అంటే అంతిమ దైవప్రవక్త (సఅసం) అని భావం.

121. అసత్యం ఆధిపత్యం వహిస్తుందో లేక సత్యం గెలుస్తుందో త్వరలోనే తెలిసిపోతుంది. దీనికోసం అవిశ్వాసులూ ఎదురు చూడాలి. విశ్వాసులూ ఎదురు చూడాలి.

122. దేవుని తోడ్పాటు ద్వారా సాఫల్య భాగ్యం పొందేవారెవరో మీకే తెలుస్తుంది. ఈ తోడ్పాటు ముస్లింలకు లభించింది. తద్వారా ముస్లింలే సన్మార్గాన ఉన్నారని, ఇస్లాం అనుయాయులే దేవుని మార్గదర్శకత్వాన్ని పొందారని అనతికాలంలోనే జగతికి తెలిసిపోయింది.

21 వ సూరా

# అల్ అంబియా

## దైవ ప్రవక్తలు

అవతరణ మక్కాలో

ఆయతులు 112

### పరిచయం

ఈ సూరా కొన్ని కీలకమైన విషయాలను చర్చించింది. ఏక దైవారాధన (తౌహీద్), ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతికించబడడం, పరలోకంలో శిక్ష లేదా బహుమానాలు పొందడం వంటి ముఖ్యమైన విశ్వాసాలకు సంబంధించిన కీలకమైన అంశాలను ఈ సూరా చర్చించింది. ఈ సూరాలో చర్చకు వచ్చిన ప్రవక్తల గాథల ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. కొందరు ప్రవక్తల గాథలను చాలా క్లుప్తంగా ఇందులో ప్రస్తావించడం జరిగింది.

ఈ సూరాలో తీర్పు దినం నాటి భయానక పరిస్థితి గురించి వర్ణన కూడా ఉంది. ఆ గొప్పదినం గురించి ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సూరా విమర్శించింది. వారు సత్యంతో ఆడుకుంటున్నారని, సత్యాన్ని పరిహసిస్తున్నారని, తిరస్కరిస్తున్నారని, ప్రవక్తలను అపహసిస్తున్నారని, మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈ సూరా హెచ్చరించింది. మరణానంతరం మళ్ళీ లేపబడే ఆ రోజున ఎదురయ్యే తీవ్రమైన పరిస్థితులను, అవిశ్వాసులకు అక్కడ ఎదురయ్యే భయానకమైన శిక్షలను ప్రస్తావించి గట్టిగా హెచ్చరించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల అవిశ్వాసుల వైఖరిని, వారు ఆయన్ను కవిత్వం చెబుతున్న వ్యక్తిగా, మంత్రగాడిగా ఆరోపించడాన్ని, దివ్యఖుర్ఆన్ ఒక కలల కథనంగా చెప్పడాన్ని కూడా ఈ సూరా ప్రస్తావిస్తూ, ఈ వైఖరి పట్ల తీవ్రమైన హెచ్చరికలు చేసింది. మనిషికి మరణం తప్పదని, ఈ జీవితం చాలా చిన్నదని, కాబట్టి మంచి పనులు చేయడానికి ప్రజలు పోటీ పడాలని ఈ సూరా బోధించింది.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 78-82 | 123 | 'ప్రవక్త దావూద్-జాలూత్' 'మధుర స్వరం కలిగిన పాలకుడు' | దావూద్, సులైమాన్ ప్రవక్తల సంపూర్ణ గాథలు |
| 83-84 | 163 | 'దైవప్రవక్త అయ్యూబ్' | సహనానికి మారుపేరుగా చరిత్రకెక్కిన మహా వ్యక్తి అయ్యూబ్ ప్రవక్త. అల్లాహ్ తనకు పెట్టిన అన్ని పరీక్షల్లోనూ ఆయన నికార్సుగా నెగ్గుకొచ్చారు. తన పిల్లలు దూరమయినా, తన సిరిసంపదలన్నీ నాశనమయినా కేవలం సహన సంపదతో జీవితమంతా గడిపిన మహా మనీషి అయ్యూబ్! |
| 87-88 | 155 | 'దైవప్రవక్త యూనుస్' | చేపకడుపులో సజీవంగా మిగిలిన దైవప్రవక్త గాథ ఇది. ఇతర జాతులకు భిన్నంగా యూనుస్ ప్రవక్త పంపబడిన జాతివారికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకత..... ఏంటో మీరే చదివి తెలుసుకోండి. |

## అల్ అంబియా సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** ప్రజల లెక్కల ఘడియ సమీపించింది.[1] అయినప్పటికీ వారు పరధ్యానంలో పడి, విముఖత చూపుతున్నారు.[2]

**2** వారి వద్దకు వారి ప్రభువు తరఫునుంచి క్రొత్తగా ఏ ఉపదేశం వచ్చినా దాన్ని వారు ఆడుకుంటూ వింటారు.[3] (ఆషామాషీగా తీసుకుంటారు).

**3** అసలు వారి హృదయాలు ప్రమత్తతలో పడి ఉన్నాయి. "ఇతనూ మీలాంటి మానవ మాత్రుడే కదా! మరలాంటప్పుడు మీరు చూస్తూ చూస్తూ ఇతని మాయాజాలంలో ఎందుకు పడి పోతున్నారు?"[4] అంటూ ఈ దుర్మార్గులు రహస్య మంతనాలు సాగించారు.

**4** "నా ప్రభువు భూమ్యాకాశాలలోని ప్రతి మాటనూ ఎరిగిన వాడు. ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు"[5] అని ప్రవక్త అన్నాడు.

## سُورَةُ الأَنبِيَاءِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

اقْتَرَبَ لِلنَّاسِ حِسَابُهُمْ وَهُمْ
فِي غَفْلَةٍ مُعْرِضُونَ ①

مَا يَأْتِيهِمْ مِنْ ذِكْرٍ مِنْ رَبِّهِمْ مُحْدَثٍ إِلَّا
اسْتَمَعُوهُ وَهُمْ يَلْعَبُونَ ②

لَاهِيَةً قُلُوبُهُمْ ۗ وَأَسَرُّوا النَّجْوَى الَّذِينَ ظَلَمُوا
هَلْ هَٰذَا إِلَّا بَشَرٌ مِثْلُكُمْ ۖ أَفَتَأْتُونَ السِّحْرَ
وَأَنْتُمْ تُبْصِرُونَ ③

قُلْ رَبِّي يَعْلَمُ الْقَوْلَ فِي السَّمَاءِ وَالْأَرْضِ ۖ
وَهُوَ السَّمِيعُ الْعَلِيمُ ④

---

1. లెక్కల ఘడియ అంటే ప్రళయదినం అని భావం. ఆ సమయం క్షణం క్షణం దగ్గర పడుతోంది. రాబోయే ప్రతి సమయం దగ్గరలో ఉన్నట్టే లెక్క. ఆ మాటకొస్తే మృత్యువు కూడా ప్రతి వ్యక్తి పాలిట ఒక 'ప్రళయం' లాంటిదే. అదలా ఉంచితే గడిచిపోయిన కాలం దృష్ట్యా ప్రళయ ఘడియ దగ్గరపడుతోంది. మిగిలి ఉన్న కాలం గడిచిన కాలంకన్నా చాలా తక్కువ.
2. వారు ప్రాపంచిక వ్యామోహంలో పడి తీర్పుదినం కొరకు సమకూర్చుకోవలసిన 'సామగ్రి' పట్ల అశ్రద్ధ చూపుతున్నారు. విశ్వాసం (ఈమాన్) కోరే సద్గుణాలను అలవరచుకోవటంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ వైముఖ్య ధోరణి వారి పాలిట హానికరంగా పరిణమిస్తుంది.
3. ప్రజల అవసరాల దృష్ట్యా, వారు ఎదుర్కొంటున్న పలు సమస్యల దృష్ట్యా వాటికి పరిష్కారంగా అవతరించే ఖుర్ఆన్‌లోని భాగాలను వారు చాలా తేలిగ్గా తీసుకుంటారు. వినీ విననట్లుగా, తెలిసీ తెలియనట్లుగా వ్యవహరిస్తారు. ఒకవేళ విన్నా దాన్ని వేళాకోళంగా తీసుకుంటున్నారు. ఆ ఉపదేశంపై వారు యోచన చేయరు. అది తమ సమస్యలన్నింటికీ సర్వోత్తమ పరిష్కారం అని వారు గ్రహించరు.
4. ఒక మానవమాత్రుడు దైవప్రవక్త అవటాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన్ని (స) మాంత్రికుడని నిందిస్తున్నారు. చూస్తూ చూస్తూ జాల విద్యలో ఎందుకు చిక్కుకుంటున్నారని సాటి ప్రజలను రెచ్చగొడుతున్నారు.
5. ఆయన (అల్లాహ్) తన దాసుల హృదయాల్లోని భావాలను సైతం వింటాడు. వారి ఆచరణలన్నింటినీ ఆయన తెలుసుకుంటాడు. నేను మీకు అందజేసే సందేశంలోని వాస్తవికత గురించి కూడా ఆయనకు తెలుసు.

5 అంతేకాదు, "ఈ ఖుర్‌ఆన్ పీడకలల పుట్ట. పైగా ఇతను స్వయంగా దీన్ని కల్పించాడు. అదికాదు, అసలితను ఒక కవి.[6] అదే కాకపోతే వెనుకటి ప్రవక్తలు ఇచ్చిపంపబడినట్లుగా ఇతగాడు కూడా మా వద్దకు ఏదైనా సూచనను ఎందుకు తీసుకురాడు?!"[7] అని వారంటున్నారు.

بَلْ قَالُوٓا أَضْغَاثُ أَحْلَامٍ بَلِ افْتَرَاهُ بَلْ هُوَ
شَاعِرٌ فَلْيَأْتِنَا بِآيَةٍ كَمَآ أُرْسِلَ الْأَوَّلُونَ ⑤

6 వీరికి మునుపు మేము నాశనం చేసిన ఏ జనవాసం కూడా విశ్వసించలేదు. ఇప్పుడు వీళ్లు మాత్రం విశ్వసిస్తారా?![8]

مَآ آمَنَتْ قَبْلَهُمْ مِّنْ قَرْيَةٍ أَهْلَكْنَاهَا ۚ
أَفَهُمْ يُؤْمِنُونَ ⑥

7 (ఓ ముహమ్మద్-సఅసం!) నీకు పూర్వం మేము ప్రవక్తలుగా పంపిన వారంతా పురుషులే.[9] వారివద్దకు మేము మా సందేశాన్ని (వహీని) పంపేవాళ్ళం. ఈ సంగతి మీకు తెలియకపోతే జ్ఞాను లను (గ్రంథ వహులను) అడిగి తెలుసుకోండి.[10]

وَمَآ أَرْسَلْنَا قَبْلَكَ إِلَّا رِجَالًا نُّوحِىٓ إِلَيْهِمْ
فَسْئَلُوٓا أَهْلَ الذِّكْرِ إِنْ كُنْتُمْ لَا تَعْلَمُونَ ⑦

6. రహస్య మంతనాలు సాగించే ఈ దుర్మార్గులు ఇంతటితో ఆగారా? అంటే ఆగలేదు మరి. ఏకంగా వారు ఈ ఖుర్‌ఆన్ గ్రంథాన్నే తమ అసత్య ప్రచారానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ గ్రంథం చెదరిన కలల సంకలనం అని చెప్పారు. పైగా వీటిని ముహమ్మద్ (స) కల్పించి చెబుతున్నాడని అన్నారు. అతనొక కవి అనీ, అతను వినిపించేది ఖుర్‌ఆన్ కాదనీ, అది కవిత్వమని విమర్శించారు. పైగా వారు ఏదో ఒక్క ఆరోపణాస్త్రాన్ని ప్రయోగించకుండా, రోజుకో అస్త్రాన్ని ప్రయోగించేవారు. గడియకో నిందను మోపేవారు.

7. సమూద్ జాతి వారికి ఆడ ఒంటెను చూపినట్లుగా, మూసా ప్రవక్త చేతి కర్ర ద్వారా పామును సృష్టించినట్లుగా ఈయన (ముహమ్మద్) గారు మా ముందు ఏదన్నా మహిమను ఎందుకు ప్రదర్శించటంలేదు? అని అవిశ్వాసులు అనేవారు.

8. పూర్వం మేము నాశనం చేసిన వివిధ జాతుల వారికి మహిమలు చూపలేదని కాదు, వారు కోరినట్లుగా మేము వారికి మహిమలు చూపాము. కాని మహిమల్ని చూసిన తరువాత కూడా వాళ్లు విశ్వసించేందుకు నిరాకరించారు. తత్కారణంగా వారు మా ఆగ్రహానికి పాత్రులయ్యారు. ఇప్పుడు ఈ మక్కావాసుల అభీష్టం మేరకు వారికి మా సూచనలను చూపినా వారు విశ్వసిస్తారని అనుకుంటున్నారా? ముమ్మాటికీ వీళ్లు విశ్వసించరు. వీళ్ల ధిక్కారవైఖరి ఇలాగే ఉంటుంది. వీళ్ల వైర స్వభావంలో మార్పు రాదు.

9. అంటే ప్రవక్తలంతా మానవమాత్రులే. పైగా వారంతా పురుషులే. మానవేతర వ్యక్తిగానీ, పురుషేతర వ్యక్తిగానీ ప్రవక్తగా రాలేదు, దైవదౌత్యం (ప్రవక్త పదవి) మానవమాత్రులకే పరిమితం. అందునా అది పురుష ప్రపంచానికే ప్రత్యేకం – దీన్నిబట్టి అవగతమయ్యే దేమిటంటే స్త్రీ మూర్తి ప్రవక్తగా నియుక్తం కాలేదు. స్త్రీ భౌతిక, శారీరక పరిస్థితుల దృష్ట్యా దైవదౌత్య బాధ్యత ఆమె కార్యపరిధిలోకి రాదు.

10. ఆయతులో చెప్పబడిన **"అహ్లుజ్జిక్రి"** (విద్యావంతులు) అంటే గ్రంథంకల ప్రజలు అని భావం. అంటే పూర్వం అవతరించిన ఆకాశగ్రంథాల జ్ఞానం కలవారు అన్నమాట. గత కాలంలో వచ్చిన ప్రవక్తలంతా మానవమాత్రులా? లేక మానవాతీతులా? అని వారిని అడగండి. 'ప్రవక్తలంతా మానవులే'నని వారు సమాధానమిస్తారు. ఈ వాక్యాన్ని ఆసరాగా తీసుకుని కొందరు మహానుభావులు **"తఖ్‌లీద్"** (ఎవరో ఒక పండితుని విధానాన్ని అనుసరించటం) సరైనదేనని అంటున్నారు. కాని ఈ ఆలోచన సరైనది కాదు. ఒక నిర్ణీత వ్యక్తి రూపొందించిన ఒక నిర్ణీత ఫికహ్‌ను (శాస్త్రాన్ని) ముందు పెట్టుకుని, ధర్మావలంబన విషయంలో దానిపైనే ఆధారపడటం, పూర్తిగా దాన్నే అనుసరించటం తఖ్‌లీద్. మరో విషయం ఏమిటంటే 'తఖ్‌లీద్'లో నిర్ణీత పండితుని దగ్గరి నుంచి ఎటువంటి సాక్ష్యాధారాలను అడక్కుండానే అతని అభిప్రాయాన్ని అనుసరించవలసి ఉంటుంది.

**8** మేము వారి శరీరాన్ని వారు అన్నం తినకుండా ఉండగలిగేలా నిర్మించలేదు. వారు ఎల్లకాలం ఉండేవారు కూడా కాదు.[11]

وَمَا جَعَلْنَاهُمْ جَسَدًا لَّا يَأْكُلُونَ الطَّعَامَ وَمَا كَانُوا خَالِدِينَ ⑧

**9** ఆ తరువాత మేము వారికి చేసిన వాగ్దానాలన్నింటినీ సత్యమైనవిగా నిరూపించాము. వారినీ, ఇంకా మేము కోరిన వాళ్ళనూ కాపాడాము. హద్దుమీరిపోయిన వారిని మాత్రం అంతమొందించాము.[12]

ثُمَّ صَدَقْنَاهُمُ الْوَعْدَ فَأَنجَيْنَاهُمْ وَمَن نَّشَاءُ وَأَهْلَكْنَا الْمُسْرِفِينَ ⑨

**10** నిశ్చయంగా మేము మీ వద్దకు (ఖుర్‌ఆన్) గ్రంథాన్ని పంపాము. అందులో మీ కొరకు హితబోధ ఉంది. అయినా మీరు గ్రహించరా?

لَقَدْ أَنزَلْنَا إِلَيْكُمْ كِتَابًا فِيهِ ذِكْرُكُمْ ۖ أَفَلَا تَعْقِلُونَ ⑩

**11** దురాగతాలకు ఒడిగట్టే ఎన్నో జనవాసాలను మేము చెరిగేశాము.[13] వారి తరువాత (వారి స్థానంలో) మేము మరో జాతిని ప్రభవింపజేశాము.

وَكَمْ قَصَمْنَا مِن قَرْيَةٍ كَانَتْ ظَالِمَةً وَأَنشَأْنَا بَعْدَهَا قَوْمًا آخَرِينَ ⑪

**12** వారు మా శిక్షను పసిగట్టగానే పలాయనం చిత్తగించారు.[14]

فَلَمَّا أَحَسُّوا بَأْسَنَا إِذَا هُم مِّنْهَا يَرْكُضُونَ ⑫

---

అయితే ఇక్కడ అరబీ ఆయతు (7)లోని విషయం అందుకు భిన్నంగా ఉంది. ఎలాగంటే పై ఆయతులో ప్రత్యేకంగా ఒకానొక వ్యక్తిని అడిగి తెలుసుకోండి అని అనబడలేదు. తౌరాతు, ఇంజీలు గ్రంథాలపై క్షుణ్ణంగా అవగాహనకు ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకోవచ్చన్న అర్థం ఇందులో ఇమిడి ఉంది. కనుక ఒక వ్యక్తి అనుసరణ (తఖ్‌లీద్)ను గురించి ఈ ఆయతు ఎంతమాత్రం ప్రబోధించటం లేదు. 'పండితులను అడిగి తెలుసుకోండి' అని మాత్రమే ప్రబోధించబడింది. సామాన్య ప్రజానీకం – ముఖ్యంగా ధర్మజ్ఞానం లేనివారు – పండితులను అడిగి తెలుసుకోక తప్పదు. ఈ విషయంపై విభేదించటానికి ఎవరూ సాహసించలేరు. ఒకే వ్యక్తిపై ఆధారపడాలన్న ఆదేశం కూడా అందులో లేదు. ఇకపోతే తౌరాతు ఇంజీలు గ్రంథాలు ఆకాశ గ్రంథాలా? లేక మానవ కల్పిత గ్రంథాలా? అవి గనక ఆకాశ గ్రంథాలై ఉంటే పండితుల ద్వారా వాటిలోని అసలు విషయాలను గురించి అడిగి తెలుసుకోండి – ఈ ఆయతుకు సరైన భావం ఇదే.

11. దైవప్రవక్తలు అన్నపానీయాలకు, జీవన్మరణాలకు అతీతులు కారు. ప్రవక్తలకు ఆకలి దప్పికలయ్యేవి. వారూ భోజనం చేసేవారు. వారూ కాలధర్మం చెందేవారు.

12. అంటే మేము మా వాగ్దానం ప్రకారం దైవప్రవక్తలను, విశ్వాసులను రక్షించి, హద్దుమీరి ప్రవర్తించే అవిశ్వాసులను, సత్యతిరస్కారులను, ముష్రిక్కులను మాత్రం తుద ముట్టించాము.

13. **'ఖసమ'** (قَصَمَ) అంటే అసలు ధ్వంసం చేయటం, విరగ్గొట్టడం అని అర్థం. అంటే మేము అరాచకానికి పాల్పడిన ఎన్నో జాతులను అంతమొందించాము. ఊకలా దంచివేశాము. "నూహ్ జాతి తరువాత మేము మరెన్నో జనవాసాలను తుద ముట్టించాము" అని వేరొకచోట అనబడింది. (బనీ ఇస్రాయీల్ – 17)

14. తమపై ఏదో ఆపద విరుచుకుపడబోతుందని వారికి అనిపించగానే దాన్నుంచి తప్పించుకునే ఉపాయాలు ఆలోచించ సాగారు. ఉదాహరణకు మేఘ గర్జనను విని లేక పెను తుఫాను ప్రమాదాన్ని పసిగట్టి, భూకంప సూచనలను అంచనావేసి సురక్షిత స్థానాలకు తరలిపోయే సన్నాహాలు చేయటం. మూలంలో 'రక్‌జున్' అనే పదం ప్రయోగించబడింది. మనిషి గుర్రం మొదలగు వాహనాలపైకి లంఘించి వాటిని వేగంగా పరుగెత్తించటానికి కాలితో వాటిని కొట్టడాన్ని **'రక్‌జున్'** (رکض) అంటారు. అప్పట్నుంచి ఈ పదం 'పరుగెత్తటం' అన్న అర్థంలో వాడబడుతోంది.

**13** "పారిపోకండి.[15] మీకు సుఖసౌఖ్యాలు ఇవ్వబడిన చోటికే, మీ విశ్రాంతి నిలయాల వైపే మరలిపోండి[16] – బహుశా మీరు దానిని గురించి ప్రశ్నించబడతారేమో!"[17] (అని వారితో అనబడింది).

لَا تَرْكُضُوا وَارْجِعُوا إِلَىٰ مَا أُتْرِفْتُمْ فِيهِ وَمَسَاكِنِكُمْ لَعَلَّكُمْ تُسْأَلُونَ ⑬

**14** (దానికి వారు) "మా పాడుగాను! నిశ్చయంగా మేమే దుర్మార్గులం" అని అనసాగారు.

قَالُوا يَا وَيْلَنَا إِنَّا كُنَّا ظَالِمِينَ ⑭

**15** చివరకు మేము వారిని కోతకోసిన చేనులా,[18] చల్లారిపోయిన అగ్నిలా చేసి వేసేంతవరకూ వారు ఆ విధంగా మొత్తుకుంటూనే[19] ఉండిపోయారు.

فَمَا زَالَت تِّلْكَ دَعْوَاهُمْ حَتَّىٰ جَعَلْنَاهُمْ حَصِيدًا خَامِدِينَ ⑮

**16** మేము ఆకాశాన్నీ భూమిని, వాటి మధ్యనున్న సమస్తాన్నీ ఏదో ఆటగా సృష్టించలేదు.[20]

وَمَا خَلَقْنَا السَّمَاءَ وَالْأَرْضَ وَمَا بَيْنَهُمَا لَاعِبِينَ ⑯

**17** ఏదో కాలక్షేపం చేసుకోవాలన్న ఉద్దేశమే మాకుంటే, నిజంగానే,[21] మా వద్దనున్న దానితోనే చేసుకుని ఉండేవారము.[22]

لَوْ أَرَدْنَا أَن نَّتَّخِذَ لَهْوًا لَّاتَّخَذْنَاهُ مِن لَّدُنَّا إِن كُنَّا فَاعِلِينَ ⑰

15. బహుశా దైవదూతలు ఈ మాటలన్నారు లేదా విశ్వాసులు వ్యంగ్యంగా వారికలా చెప్పారు.

16. అంటే – ఇప్పటివరకూ ఏ ప్రదేశంలో మీరు ఆనందాలను ఆస్వాదిస్తూ ఉండేవారో, ఏ భోగభాగ్యాలు మీ తలబిరుసుతనానికి కారణంగా నిలిచాయో, ఏ నివాసగృహాలు మీలో సోమరితనాన్ని పెంచిపోషించాయో, ఏ కట్టడాలను చూసుకుని మీరు మిడిసి పాటుకు లోనయ్యారో అక్కడికే తిరిగిపోండి.

17. కనీసం శిక్ష విధించబడిన తరువాత అయినా ఎవరయినా మీ దుఃఖంలో పాలుపంచుకుంటారేమో! ఇదంతా ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎందుకు జరిగింది?అని దర్యాప్తు చేస్తారేమో! ఇవి వెటకారంగా చెప్పబడిన మాటలు. వాస్తవానికి ఆపద వచ్చిపడిన తరువాత వారు ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే స్థితిలో ఎక్కడుంటారు గనక?

18. **'హసీద్'** ( حَصِيد ) అంటే కోతకోయబడిన పంట లేక సమూలంగా పెకలించి వేయబడిన పంట చేను అని అర్థం. **'ఖుమూద్'** అని చల్లారిపోయిన అగ్నిని అంటారు. చివరకు వారు కోతకోసిన చేనులా, అగ్ని చల్లారిపోయిన తరువాత బూడిద కుప్పలా ఎలా ఉంటుందో అలా అయిపోయారు. అంటే వారిలో శక్తిగానీ, యుక్తిగానీ, కదలికగానీ లేకుండా పోయింది.

19. అంటే తమలో జీవం ఉన్నంతవరకూ వారు తమ తప్పును ఒప్పుకుంటూనే ఉన్నారు.

20. పైగా ఈ సృష్టివెనుక ఎన్నో గొప్ప ఆశయాలు, పరమార్థాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఏమంటే నా దాసులు నా ముందు తలవంచాలి. నన్ను ధ్యానించాలి. పుణ్యాత్ములకు నేను పుణ్యఫలాన్నీ, పాపాత్ములకు పాపఫలాన్నీ ఇవ్వాలి.

21. అంటే ఏదో ఆషామాషీగా ఇదంతా సృష్టించటం మా ఉద్దేశం ఎంతమాత్రం కాదు. ఒకవేళ మా ఉద్దేశం అదే గనక అయివుంటే దానికోసం ఇంతపెద్ద వ్యవస్థ అవసరం లేదు.

22. ఆ మాత్రం వినోద సామగ్రిని మా వద్దనున్న దాంతోనే సమకూర్చుకోవచ్చు. ఇంతపెద్ద – సువిశాల – విశ్వమండలాన్ని ఉనికిలోనికి తెచ్చి, తెలివి తేటలు, ప్రజ్ఞాపాటవాలు గల జీవులను పుట్టించవలసిన అవసరమే ఉండేది కాదు. "చేసే

**18** అది కాదు. మేము సత్యాన్ని అసత్యంపై విసరికొడతాము. అది అసత్యం మాడు బద్దలుగొడుతుంది. దాంతో అది (అసత్యం) అంతమయిపోతుంది.[23] మీరు కల్పించే మాటలన్నీ మీ పాలిట వినాశకరంగా పరిణమిస్తాయి సుమా![24]

بَلْ نَقْذِفُ بِالْحَقِّ عَلَى الْبَاطِلِ فَيَدْمَغُهُ
فَإِذَا هُوَ زَاهِقٌ ۚ وَلَكُمُ الْوَيْلُ مِمَّا تَصِفُونَ ﴿١٨﴾

**19** భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే.[25] ఆయన వద్ద ఉన్నవారు[26] ఆయన్ని ఆరాధించటం పట్ల గర్వం ప్రదర్శించరు. (ఆయన దాస్యం చేస్తూ) అలసిపోరు.

وَلَهُ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ وَمَنْ
عِندَهُ لَا يَسْتَكْبِرُونَ عَنْ عِبَادَتِهِ
وَلَا يَسْتَحْسِرُونَ ﴿١٩﴾

**20** వారు రేయింబవళ్లు ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. ఏమాత్రం బద్దకం కూడా చూపరు.

يُسَبِّحُونَ اللَّيْلَ وَالنَّهَارَ لَا يَفْتُرُونَ ﴿٢٠﴾

**21** ఏమిటీ, వీరు భువిలో దేవుళ్ళుగా కల్పించుకున్నవారు వీరిని సజీవులుగా చేసి నిలబెడతారా?[27]

أَمِ اتَّخَذُوا آلِهَةً مِّنَ الْأَرْضِ هُمْ يُنشِرُونَ ﴿٢١﴾

**22** ఒకవేళ భూమ్యాకాశాలలో అల్లాహ్ గాక ఇతర దేవుళ్ళు కూడా ఉండి ఉంటే ఈ రెండింటిలో అరాచకం ఏర్పడేది.[28] కాబట్టి సింహాసనానికి (అర్ష్‌కు) అధిపతి అయిన అల్లాహ్ వారు కల్పించే భాగస్వామ్య (షిర్క్) విషయాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడు.

لَوْ كَانَ فِيهِمَا آلِهَةٌ إِلَّا اللَّهُ لَفَسَدَتَا ۚ فَسُبْحَانَ
اللَّهِ رَبِّ الْعَرْشِ عَمَّا يَصِفُونَ ﴿٢٢﴾

ఉద్దేశం మాకు లేదు" అని అనేకంటే "చేసే ఉద్దేశమే గనక మాకు ఉంటే" అన్న తర్జుమా అరబీ మూలం దృష్ట్యా ఎంతో సరైనది (ఫత్‌హుల్ ఖదీర్).

23. అద్భుతమైన ఈ సృష్టి వెనుకగల పరమార్థాలలో ఒకటేమంటే ఇక్కడ సత్యాసత్యాల, ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ కొనసాగుతుంది. కడకు మేము సత్యానికి గెలుపును, అసత్యానికి ఓటమిని ఇస్తాము. మేము సత్యాన్ని అసత్యంపై విసరికొడతాము. ఉపకారం ద్వారా అపకారాన్ని దెబ్బతీస్తాము. ధర్మం ద్వారా అధర్మం నడ్డి విరుస్తాము. ఈ విధంగా అసత్యం, అధర్మం, అపకారాల మాడు బద్దలైపోతుంది. ఆఖరికి అది పరాభవంతో తొలగిపోతుంది. **'దమ్‌గున్'** ( دَمْغ) అంటే మెదడు కంపించేలా తలకు దెబ్బ తగలటం. **'జహఖ'** ( زَهَقَ ) అంటే అంతమవటం, నాశనమవటం అని అర్థం.

24. నిజప్రభువు విషయంలో మీరు కల్పించే అసత్యాలన్నీ (ఉదాహరణకు : ఈ ప్రపంచం ఒక ఆటవస్తువు అనీ, ఏదో ఆషామాషీగా ఇదంతా పుట్టించబడిందనీ, మరణానంతర జీవితంగానీ, తీర్పుదినంగానీ లేవు. అంతా ఉత్తిదే అని చెప్పటం) మీ వినాశానికి హేతువుగా పరిణమిస్తాయి. ఎందుకంటే మీరు కల్పించే ఈ మాటలే మిమ్మల్ని అసత్యం, అధర్మం వైపుకు గొనిపోతున్నాయి. తప్పు చేస్తూ కూడా మీరు ఎవరికీ భయపడటం లేదు. పర్యవసానంగా మీరు నెమ్మదిగా పతనం వైపుకు పయనిస్తూ పోతున్నారు.

25. అంతా ఆయన సొత్తే. అందరూ ఆయన బానిసలే.

26. **'ఆయన వద్ద ఉన్నవారు'** అంటే దైవదూతలన్నమాట. వారు కూడా అల్లాహ్ దాసులే, బానిసలే. ఈ వాక్యం ద్వారా దైవదూతల గౌరవం మరింత పెరుగుతుంది. వారు దేవుని సన్నిహితులు (అల్లాహ్ వద్ద ఉన్నవారు) అని చెప్పటం జరుగుతోంది. "దైవ దూతలు దేవుని కుమార్తెలు" అన్న ముష్రిక్కుల అపవాదు కూడా దీనిద్వారా ఖండించబడుతోంది. అల్లాహ్‌కు కొడుకుల అవసరంగానీ, కుమార్తెల అవసరంగానీ లేదు. జగతిలోని సమస్తమూ ఆయన సొత్తు అయినప్పుడు,

23 ఆయన తాను చేసే పనులకు (ఎవరికీ) జవాబుదారు కాదు. అయితే అందరూ (ఆయన ముందు) జవాబుదారులే.

لَا يُسْـَٔلُ عَمَّا يَفْعَلُ وَهُمْ يُسْـَٔلُوْنَ ﴿٢٣﴾

24 ఏమిటీ, వారు అల్లాహ్‌ను కాకుండా ఇతర దేవుళ్ళను కూడా కల్పించుకున్నారా? ఒకవేళ వారలాచేస్తే, "మీరు మీ ప్రమాణాన్ని సమర్పించండి. ఇది నా సహచరుల గ్రంథం. నా పూర్వీకుల నిదర్శనం"[29] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. అసలు విషయం ఏమిటంటే వారిలో చాలామందికి యదార్థం తెలియదు. అందుకే వారు విముఖులై ఉన్నారు.

اَمِ اتَّخَذُوْا مِنْ دُوْنِهٖۤ اٰلِهَةً ؕ قُلْ هَاتُوْا بُرْهَانَكُمْ ۚ هٰذَا ذِكْرُ مَنْ مَّعِيَ وَذِكْرُ مَنْ قَبْلِيْ ؕ بَلْ اَكْثَرُهُمْ لَا يَعْلَمُوْنَ ۙ الْحَقَّ فَهُمْ مُّعْرِضُوْنَ ﴿٢٤﴾

25 నీకు పూర్వం మేము ఏ ప్రవక్తను పంపినా, "నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు, కనుక మీరు నన్నే ఆరాధించండి"[30] అనే సందేశాన్ని (వహీని) అతనికి పంపాము.

وَمَاۤ اَرْسَلْنَا مِنْ قَبْلِكَ مِنْ رَّسُوْلٍ اِلَّا نُوْحِيْۤ اِلَيْهِ اَنَّهٗ لَاۤ اِلٰهَ اِلَّاۤ اَنَا فَاعْبُدُوْنِ ﴿٢٥﴾

26 కరుణామయునికి సంతానం ఉందని వారు (ముష్రిక్కులు) చెబుతున్నారు. (ఇది నిజం కాదు) ఆయన పవిత్రుడు. పైగా వారంతా (దైవదూతలంతా) గౌరవించబడిన ఆయన దాసులు.

وَقَالُوا اتَّخَذَ الرَّحْمٰنُ وَلَدًا سُبْحٰنَهٗ ؕ بَلْ عِبَادٌ مُّكْرَمُوْنَ ﴿٢٦﴾

దైవదూతలు అహోరాత్రులు ఆయన్ని స్తుతిస్తూ ఉన్నప్పుడు ఆయన ఎవరినయినా బిడ్డలుగా చేసుకోవలసిన పనేముంటుందీ?

27. 'నిలబెట్టలేరు' అన్న భావంలో ఇది చెప్పబడింది. మరి ఆ బూటకపు దేవుళ్లకు ఏ శక్తీ, ఏ అధికారమూ లేనపుడు వారిని అల్లాహ్‌కు సహవర్తులుగా ఎందుకు నిలబెడుతున్నట్టు? వారిని ఎందుకు పూజిస్తున్నట్లు??

28. ఒకవేళ భూమ్యాకాశాల సువిశాల వ్యవస్థలో ఇద్దరు దేవుళ్లు ఉండి ఉంటే ఇద్దరి పెత్తనం నడిచేది. ఇరువురూ తమ తమ సంకల్పాల కనుగుణంగా ఈ విశ్వవ్యవస్థను నడిపించేవారు. ఒకవేళ అదే గనక జరిగి ఉంటే ప్రస్తుతం సాఫీగా నడుస్తున్నట్లుగా ఈ వ్యవస్థ నడిచేది కాదు. అడుగడుగునా అవరోధాలు ఎదురయ్యేవి. సంఘర్షణ మొదలయ్యేది. ఒకరు మరొకరికి వ్యతిరేకంగా తమ అధికారాన్ని చెలాయించేవారు. పర్యవసానంగా అధికార దుర్వినియోగం జరిగేది. సర్వత్రా అరాచకం, అశాంతి, అలజడులు నెలకొనేవి.

కాని నేడు విశ్వమండలంలో ఎక్కడా, ఎలాంటి అస్తవ్యస్తతగానీ, అవరోధంగానీ లేదు. ప్రతిదీ తన పనిని తాను చేసుకుపోతోంది. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే బ్రహ్మాండమైన ఈ విశ్వవ్యవస్థ వెనుక ఒకే దేవుడున్నాడు. అతని ప్రణాళికననుసరించే ఈ గొప్ప కర్మాగారం సజావుగా నడుస్తోంది. ఏది జరిగినా ఆయన ఆదేశాల ప్రకారమే జరుగుతోంది. ఆయన ఎవరికయినా ఏదైనా ప్రసాదించదలిస్తే దాన్ని అడ్డుకునే వారెవరూ లేరు. ఒకవేళ ఆయన ఎవరికైనా ఇవ్వకపోతే ఆయన నుంచి ఇప్పించేవారు ఎవరూ లేరు.

29. **'జిక్రు మన్ మ్మయియ'** (ذِكْرُ مَنْ مَّعِيَ) అంటే ఖుర్‌ఆన్ అని అర్థం. 'పూర్వీకుల నిదర్శనం' అంటే గతంలోని ఆకాశ గ్రంథాలన్నమాట. అంటే ఖుర్‌ఆన్‌లోనూ, దానికి మునుపు వచ్చిన గ్రంథాలలోనూ ఒకే ఆరాధ్య దేవుని దైవత్వం, పోషకత్వం గురించి ప్రస్తావించబడింది. కాని ముష్రిక్కులు ఈ వాస్తవాన్ని ఒప్పుకోవడానికి సిద్ధంగా లేరు. 'ఏకదైవారాధన' పట్ల వారి వైముఖ్యం కొనసాగుతూనే ఉంది.

30. అంటే దైవప్రవక్తలంతా మౌలికంగా తెచ్చిన సందేశం ఒక్కటే – అదే ఏకదైవారాధన (తౌహీద్).

27 ఏ విషయంలోనూ వారు ఆయనకంటే ముందు మాట్లాడరు. పైగా ఆయన ఆజ్ఞను ఖచ్చితంగా పాటిస్తారు.[31]

لَا يَسْبِقُوْنَهٗ بِالْقَوْلِ وَهُمْ بِاَمْرِهٖ يَعْمَلُوْنَ (27)

28 వారికి ముందున్నవాటి గురించి, వెనుక ఉన్న వాటి గురించి కూడా ఆయనకు తెలుసు. సిఫారసు వినటానికి అల్లాహ్ ఇష్ట పడిన వారి[32] విషయంలో తప్ప వారు ఎవరి గురించి కూడా సిఫారసు చేయజాలరు. వారు స్వయంగా అల్లాహ్ రౌద్రానికి భీతిల్లుతూ ఉంటారు.

يَعْلَمُ مَا بَيْنَ اَيْدِيْهِمْ وَمَا خَلْفَهُمْ وَلَا يَشْفَعُوْنَ ۙ اِلَّا لِمَنِ ارْتَضٰى وَهُمْ مِّنْ خَشْيَتِهٖ مُشْفِقُوْنَ (28)

29 వారిలో ఎవరయినా "అల్లాహ్‌తో పాటు నేనూ పూజ్యుడినే" అని అంటే మేమతన్ని నరకయాతనకు గురి చేస్తాము.[33] మేము దుర్మార్గులకు వొసగే ప్రతిఫలం ఇదే.

وَمَنْ يَّقُلْ مِنْهُمْ اِنِّيْٓ اِلٰهٌ مِّنْ دُوْنِهٖ فَذٰلِكَ نَجْزِيْهِ جَهَنَّمَ ؕ كَذٰلِكَ نَجْزِى الظّٰلِمِيْنَ (29)

30 భూమ్యాకాశాలు కలిసి వుండగా, మేము వాటిని విడదీసిన[34] వైనాన్ని తిరస్కారులు చూడలేదా?[35] ఇంకా, ప్రాణమున్న ప్రతి దానినీ మేము నీటితోనే చేశాము.[36] అయినప్పటికీ వీళ్లు విశ్వ సించరా?

اَوَلَمْ يَرَ الَّذِيْنَ كَفَرُوْٓا اَنَّ السَّمٰوٰتِ وَالْاَرْضَ كَانَتَا رَتْقًا فَفَتَقْنٰهُمَا ؕ وَجَعَلْنَا مِنَ الْمَآءِ كُلَّ شَيْءٍ حَيٍّ ؕ اَفَلَا يُؤْمِنُوْنَ (30)

31. **'దైవదూతలు అల్లాహ్ కుమార్తెలు'** అని చెప్పే ముష్రిక్కుల మాటలు ఈ వాక్యం ద్వారా నిర్ద్వంద్వంగా ఖండించబడ్డాయి. వారు కుమార్తెలు కారనీ, వారు సామీప్యం పొందిన దాసులనీ, దైవాజ్ఞాపాలనలో నిమగ్నులై ఉన్నవారని చెప్పబడింది. దైవానికి కొడుకుల అవసరంగానీ, కూతుళ్ల అవసరంగానీ లేదు. ఎవరికయినా కొడుకుల, కూతుళ్ల అవసరం ఎప్పుడు ఏర్పడుతుంది? కార్యనిర్వహణలో అలసిపోయినప్పుడు, నీరసించినప్పుడు, వృద్ధాప్యం వచ్చినప్పుడు! అంతేకదా! ఆ సమయంలో సంతానం తమ తండ్రికి ఆసరాగా నిలబడుతుంది. అయితే వృద్ధాప్యం, బలహీనత, నీరసం వంటివి మానవ సహజమైనవి. ఇవి అల్లాహ్‌కు వర్తించవు. ఇలాంటి బలహీనతలన్నింటికీ అల్లాహ్ అతీతుడు, పవిత్రుడు. అందువల్ల ఆయనకు బిడ్డల అవసరంగానీ, చేయూతనిచ్చే వారి అక్కరగానీ లేదు. అందుకే దివ్య ఖుర్ఆన్‌లో పదే పదే 'అల్లాహ్‌కు సంతానం లేదు' అనే మాట పునరావృతం అవుతూ ఉంటుంది.

32. దైవప్రవక్తలు, సజ్జనులతోపాటు, దైవదూతలు కూడా సిఫారసు చేస్తారని ఈ ఆయతు ద్వారా విదితమవుతోంది. ప్రామాణిక హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. అయితే అల్లాహ్ ఇష్టపడిన వారి విషయంలో మటుకే వారు సిఫారసు చెయ్యగలుగుతారు. అవిధేయుల, తలబిరుసుల కోసం సిఫారసు చేయటానికి ఆయన ఎట్టి పరిస్థితిలోనూ ఇష్టపడడు అన్నది సుస్పష్టం. విధేయులై, ఏకదైవారాధకులై ఉండి తప్పులు జరిగిన వారి విషయంలో సిఫారసు చేయడానికి మాత్రమే దేవుడు సుముఖత వ్యక్తం చేస్తాడు.

33. ఈ దైవదూతలలో కూడా ఏ ఒక్కరైనా తమను తాము ఆరాధ్య దైవంగా ప్రకటిస్తే అతన్ని కూడా మేము నరకానికి ఆహుతి చేస్తాము. ఇదొక నిబంధన మాత్రమే. ఇలా జరిగితీరాలని లేదు. ఎందుకంటే దైవదూతలు దైవాజ్ఞను జవదాటరు. కాకపోతే షిర్క్ (బహుదైవారాధన)ను ఖండించి, ఏకదైవారాధన (తౌహీద్)ను రుజువు చేయడానికి ఈ విధంగా అనబడింది. ఉదాహరణకు దివ్య ఖుర్ఆన్‌లో ఈ విధంగా కూడా సెలవీయబడింది : 1. వారికి ఇలా చెప్పు: "ఒకవేళ కరుణామయునికే గనక సంతానం ఉండి ఉంటే, అందరికన్నా ముందు నేనే వారిని ఆరాధించి ఉండేవాణ్ణి." (జుఖ్‌రుఫ్ – 81) 2. "ఓ ప్రవక్తా! ఒకవేళ నువ్వు షిర్కుకు ఒడిగట్టినా, నీ సత్కార్యాలు కూడా నాశన మైపోతాయి." (జుమర్–65) ఈ వాక్యాలన్నీ అటువంటివే. ఇవన్నీ నిబంధనాపూరిత వాక్యాలు. నిజంగా అలా జరుగుతుందని మనం అనుకోవాల్సిన అవసరం లేదు.

31 భూమి వారిని కుదిపివేయకుండా ఉండటానికని[37] మేము అందులో పర్వతాలను చేశాము. వారు తమ మార్గాలను పొందటానికి[38] అందులో సువిశాలమైన రహదార్లను ఏర్పరచాము.

وَجَعَلْنَا فِي الْاَرْضِ رَوَاسِيَ اَنْ تَمِيْدَ بِهِمْ ۠ وَجَعَلْنَا فِيْهَا فِجَاجًا سُبُلًا لَّعَلَّهُمْ يَهْتَدُوْنَ ﴿31﴾

32 మరి ఆకాశాన్ని సురక్షితమైన కప్పుగా[39] చేసినది కూడా మేమే. కాని ప్రజలు దాని సూచనలపై (పనితనంపై, సృష్టి ప్రక్రియపై) బొత్తిగా ధ్యాస కనబరచరు.

وَجَعَلْنَا السَّمَآءَ سَقْفًا مَّحْفُوْظًا ۚۖ وَّهُمْ عَنْ اٰيٰتِهَا مُعْرِضُوْنَ ﴿32﴾

33 రేయింబవళ్లనూ, సూర్యచంద్రులనూ సృష్టించినవాడు కూడా ఆయనే.[40] వాటిలో ప్రతిదీ తన తన కక్ష్యలో తేలియాడుతూ ఉంది.[41]

وَهُوَ الَّذِيْ خَلَقَ الَّيْلَ وَالنَّهَارَ وَالشَّمْسَ وَالْقَمَرَ ۭ كُلٌّ فِيْ فَلَكٍ يَّسْبَحُوْنَ ﴿33﴾

34. **'రత్‌ఖున్'** (رَتْقٌ) అంటే మూయబడి ఉండటం అని అసలు అర్థం. **'ఫత్‌ఖున్'** (فَتْقٌ) అంటే తెరవటం, వేరుపరచటం అని అర్థం. ఆదిలో భూమ్యాకాశాలు పరస్పరం కలిసి ఉండేవి. మేము వాటిని వేరుపరచాము. ఆకాశాలను పైకిలేపాము. భూమిని మాత్రం యథాస్థానంలో ఉంచాము. పైనుంచి కురిసే వర్షపు నీరును పీల్చి అది పంటల ఉత్పత్తికి అనువైనదిగా రూపొందింది.

35. ఇక్కడ 'చూడటం' అంటే కళ్లతో చూడటం అని అర్థం కాదు. మనోనేత్రంతో చూడటం అని భావం. వారు అద్భుతమైన ఈ సృష్టిని గమనించటం లేదా? ఆయన పనితనంపై యోచన చేయటంలేదా? ఈ వాస్తవాన్ని ఇంతవరకు వారు తెలుసుకోలేదా? అని భావం.

36. ఇక్కడ **'నీటితో'** అనే పదాన్ని వర్షపు నీరుగా, కాలువల నీరుగా భావించినట్లయితే అప్పటికీ – దానిద్వారా ప్రతి వస్తువుకూ నవజీవనం లభిస్తుంది. ఒకవేళ ఈ పదాన్ని 'వీర్యబిందువు' అన్న అర్థంలో తీసుకుంటే – ప్రతి ప్రాణీ దాంతోనే ఉనికిలోకి వస్తుందన్నది జగమెరిగిన సత్యం. మగజీవి వెన్నులో నుంచి వెలువడే ఈ అల్ప పదార్థం ఆడజీవి గర్భసంచిలో ప్రవేశించి, తిష్ఠవేసి, పిండంగా మారి, ప్రాణిగా రూపాంతరం చెందుతుంది.

37. బ్రహ్మాండమైన ఈ పర్వతాలే గనక భూమిలో మేకుల మాదిరిగా పాతిపెట్టబడకపోతే భూమి ప్రకంపిస్తూ, దొర్లిపోతూ ఉండేది. అదే గనక జరిగితే భూమిపై మనుషుల, జంతువుల మనుగడ దుర్లభమైపోయేది. అందుకే మేము దానిపై పర్వతాల బరువును మోపి అది అతలాకుతలం కాకుండా ఉండేలా చేశాము.

38. భూమిలో సువిశాలమైన రహదార్లను ఏర్పరచటమంటే భావం ఎత్తయిన పర్వత శ్రేణులు ఉన్నప్పటికీ వాటి మధ్య కనుమలను, లోయలను కూడా ఉంచాము. వాటిద్వారా మీరు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిపోవటానికి వీలు కలుగుతుంది. **"యహ్‌తదూన్"** (يَهْتَدُوْنَ) అన్న పదానికి వారు తమ బ్రతుకుతెరువుకోసం దారి చూసుకోవటానికి తగిన త్రోవలను ఏర్పరచాము అన్న భావం కూడా వస్తుంది.

39. **"సఖ్‌ఫమ్ మహ్‌ఫూజా"** (سَقْفًا مَّحْفُوْظًا) అంటే భూమి కొరకు ఓ భద్రతాయుతమైన పైకప్పు. ఏ విధంగానయితే ఒక పందిరి, గుడారు, చావిడి కప్పుగా ఉంటాయో అదే విధంగా ఆకాశాన్ని సువిశాలమైన కప్పుగా చేశాము. పైగా దాన్ని అత్యంత పటిష్టమైనదిగా, సురక్షితమైనదిగా చేశాము. మిన్నువిరిగి మీద పడుతుందన్న భయంలేకుండా చేశాము.

40. అంటే రాత్రిని విశ్రాంతి సమయంగా, పగటిని ఉపాధి సముపార్జనా సమయంగా చేశాము. సూర్యుణ్ణి పగటి సూచనగా, చంద్రుణ్ణి రేయి నిదర్శనంగా చేశాము. మీరు నెలలను, సంవత్సరాలను లెక్కించటానికి కూడా ఇవి తోడ్పడతాయి.

41. నీటిలో తేలియాడే వస్తువుల మాదిరిగానే సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాలు తమ తమ కక్ష్యల్లో తేలియాడుతూ– అంటే తిరుగాడుతూ – ఉంటాయి.

34 (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం కూడా మేము ఏ మానవుణ్ణీ శాశ్వతంగా జీవించి ఉండేట్లుగా చేయలేదు. ఒకవేళ నువ్వు చనిపోతే, వాళ్లు మాత్రం శాశ్వతంగా బ్రతికి ఉంటారా ఏమిటీ?[42]

وَمَا جَعَلْنَا لِبَشَرٍ مِّن قَبْلِكَ الْخُلْدَ ۖ أَفَإِين مِّتَّ فَهُمُ الْخَالِدُونَ ﴿٣٤﴾

35 ప్రతి ప్రాణీ మృత్యువును చవి చూడవలసిందే. మేము మిమ్మల్ని పరీక్షించే నిమిత్తం కష్టసుఖాలకు (కలిమి లేములకు) గురిచేస్తూ ఉంటాము.[43] ఎట్టకేలకు మీరు మా వద్దకే మరలించ బడతారు.[44]

كُلُّ نَفْسٍ ذَائِقَةُ الْمَوْتِ ۗ وَنَبْلُوكُم بِالشَّرِّ وَالْخَيْرِ فِتْنَةً ۖ وَإِلَيْنَا تُرْجَعُونَ ﴿٣٥﴾

36 ఈ అవిశ్వాసులు నిన్ను చూసినప్పుడల్లా నిన్ను ఎగతాళి చేయటం తప్ప వారికి వేరే పనీపాటాలేదు. "మీ దేవుళ్లను గురించి (చెడుగా) ప్రస్తావించేది ఈయన గారేనా!?" అని (వెటకారంగా) వారంటారు. మరి (చూడబోతే) కరుణామయుని ప్రస్తావన రాగానే తిరస్కారానికి పాల్పడుతున్నది వారే.[45]

وَإِذَا رَآكَ الَّذِينَ كَفَرُوا إِن يَتَّخِذُونَكَ إِلَّا هُزُوًا أَهَٰذَا الَّذِي يَذْكُرُ آلِهَتَكُمْ وَهُم بِذِكْرِ الرَّحْمَٰنِ هُمْ كَافِرُونَ ﴿٣٦﴾

37 మానవుడు మహా తొందరపాటు స్వభావిగా పుట్టించబడ్డాడు. మీకు నా సూచనలను ఇప్పుడే చూపిస్తాను–కనుక నన్ను తొందర పెట్టకండి.[46]

خُلِقَ الْإِنسَانُ مِنْ عَجَلٍ ۚ سَأُرِيكُمْ آيَاتِي فَلَا تَسْتَعْجِلُونِ ﴿٣٧﴾

42. అవిశ్వాసుల ప్రేలాపనలకు సమాధానంగా ఇలా అనబడింది. ఏదో ఒక రోజు ఇతడు చావవలసినవాడే అని వారు మహాప్రవక్త (స) గురించి వెటకారంగా అనేవారు. దానికి సమాధానంగా అల్లాహ్ ఇలా అన్నాడు : అందరూ కాలం చేయవలసిన వారే. మృత్యువు ప్రతి ఒక్కరినీ కబళించటం ఖాయం. ముహమ్మద్ (సఅసం) కూడా దీనికి అతీతులు కారు. ఎందుకంటే ఆయన (స) కూడా మానవమాత్రులే. ఏ మనిషినీ మేము మృత్యుంజయునిగా చేయలేదు. ఏ ఒక్కరూ నిత్యులు కారు. ఈ విధంగా ప్రేలేవారు మాత్రం చావకుండా ఉంటారా? ఈ ఆయతు ద్వారా ప్రవక్తలకు, సజ్జనులకు చావులేదనీ, వారు ఎల్లప్పుడూ బ్రతికే ఉంటారన్న విగ్రహారాధకుల మిథ్యా భావనలు నిర్ద్వంద్వంగా ఖండించబడ్డాయి.

43. అంటే ఒక్కోసారి కష్టాలకు, కడగండ్లకు, ఆర్థిక ఒడిదుడుకులకు లోనుచేసి పరీక్షిస్తే, ఒక్కోసారి సిరిసంపదలను, సుఖసౌఖ్యాలను ప్రసాదించి పరీక్షిస్తాము. కొన్నిసార్లు అస్వస్థతకు గురిచేస్తే కొన్నిసార్లు ఆరోగ్య భాగ్యాన్ని అనుగ్రహిస్తాము. సర్వకాల సర్వావస్థల్లో ఎవరు కృతజ్ఞులుగా మెలగుతారో, మరెవరు కృతఘ్నులుగా వ్యవహరిస్తారో మేము బాగా పరికిస్తాము. ఎవరు ఓరిమిని కనబరుస్తారో, మరెవరు అసహనంతో చిందులు వేస్తారో చూస్తాము. ఓర్పు, కృతజ్ఞతా భావం దైవప్రసన్నతను చూరగొనగా, అసహనం, కృతఘ్నతా ధోరణి దైవాగ్రహానికి కారణభూతమవుతాయి.

44. మీ కర్మలనుబట్టి అక్కడ మీకు బహుమానం ఇవ్వటమో, శిక్షించటమో జరుగుతుంది. సత్కర్మలు చేసిన వారికి బహుమానం, దుష్కర్మలు చేసిన వారికి శిక్ష.

45. వారు స్వయంగా కరుణామయుడైన అల్లాహ్‌ను ధిక్కరిస్తున్నది గాకుండా ఆ నిజ ప్రభువును విశ్వసించేవారిని పరిహసించటం, ఏకంగా దైవప్రవక్తనే ఎగతాళి చేయటం వారి తలబిరుసుతనానికి ప్రతీక. "ఓ ప్రవక్తా! ఈ (మక్కా) అవిశ్వాసులు నిన్ను చూసినప్పుడు ఎగతాళికి దిగుతారు. దేవుడు తన ప్రవక్తగా చేసి పంపినది ఈయన్నేనా?! అని అంటారు." (అల్ ఫుర్ఖాన్ – 41)

46. అవిశ్వాసుల తొందరపాటు డిమాండ్లకు సమాధానంగా ఇలా అనబడింది. మనిషి స్వభావంలో తొందరపాటు,

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا الْوَعْدُ إِن كُنتُمْ صَادِقِينَ ﴿٣٨﴾

38 "మీరు సత్యవంతులే అయితే ఆ వాగ్దానం ఎప్పుడు సంభవిస్తుందో చెప్పండి?" అని వారు అంటున్నారు.

لَوْ يَعْلَمُ الَّذِينَ كَفَرُوا حِينَ لَا يَكُفُّونَ عَن وُجُوهِهِمُ النَّارَ وَلَا عَن ظُهُورِهِمْ وَلَا هُمْ يُنصَرُونَ ﴿٣٩﴾

39 ఆ సమయంలో తాము ఈ నరకాగ్నిని తమ ముఖాల నుంచి గానీ, తమ వీపుల నుంచి గానీ తొలగించజాలరనీ, తమకు సహాయం కూడా అందజాలదనీ అవిశ్వాసులు తెలుసుకుంటే ఎంత బావుంటుంది![47]

بَلْ تَأْتِيهِم بَغْتَةً فَتَبْهَتُهُمْ فَلَا يَسْتَطِيعُونَ رَدَّهَا وَلَا هُمْ يُنظَرُونَ ﴿٤٠﴾

40 (అవును!) ఆ ఘడియ అకస్మాత్తుగా వారిపై వచ్చిపడుతుంది. అది వారిని ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంది.[48] మరి వారు దాన్ని దాట వేయనూ లేరు, కొద్దిపాటి గడువు కూడా వారికి ఇవ్వబడదు.[49]

وَلَقَدِ اسْتُهْزِئَ بِرُسُلٍ مِّن قَبْلِكَ فَحَاقَ بِالَّذِينَ سَخِرُوا مِنْهُم مَّا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ﴿٤١﴾

41 (ఓ ముహమ్మద్ – సఅసం!) నీకు పూర్వం వచ్చిన ప్రవక్తలను కూడా పరిహసించటం జరిగింది. అయితే చివరికి పరిహసిస్తూ ఉన్నవారికే, తాము పరిహసించినది చుట్టుకున్నది.[50]

قُلْ مَن يَكْلَؤُكُم بِاللَّيْلِ وَالنَّهَارِ مِنَ الرَّحْمَٰنِ ۗ بَلْ هُمْ عَن ذِكْرِ رَبِّهِم مُّعْرِضُونَ ﴿٤٢﴾

42 "(ఓ ప్రవక్తా!) కరుణామయుని (ఆగ్రహం) నుంచి రేయీ పగలూ మిమ్మల్ని రక్షించగల వాడెవడు?"[51] అని వారిని అడుగు. అసలు విషయమేమిటంటే వాళ్లు తమ ప్రభువు ధ్యానం పట్ల విముఖులై ఉన్నారు.

---

ఆత్రం ఉండటం వల్ల అతను ప్రవక్తను కూడా తొందర పెట్టేస్తాడు. నువ్వు చెప్పేదే నిజమైతే మాపై ఆ శిక్షను ఎందుకు తీసుకురావు?! అని సవాలు విసురుతాడు. దానికి జవాబుగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : మరీ అంత తొందరపెట్టకండి. త్వరలోనే నా సూచనలను మీకు చూపిస్తాను. 'సూచనలు' అంటే అది శిక్షా కావచ్చు లేదా దైవప్రవక్త (స) ద్వారా చూపించబడే మహిమలూ కావచ్చు.

47. ఆ శిక్ష ఎంత భయంకరంగా ఉంటుందో వారికి తెలిస్తే బహుశా దానికోసం వారు ఎన్నడూ ఇంత ఆత్రం చేసేవారు కారు. పైగా ఆ శిక్ష నుంచి దేవుని శరణు కోరుకుంటూ విశ్వసించేవారు.

48. ఏం చేయాలో తెలీక మతి చలించిపోతుంది. దిక్కుతోచక దిక్కులు చూస్తూ ఉండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

49. పశ్చాత్తాపం చెందటానికిగానీ, తప్పులను సరిదిద్దుకుని మంచిపనులు చేయడానికిగానీ వారికి మరో అవకాశం ఇవ్వబడదు.

50. ఈ ఆయతులో దేవుడు తన అంతిమ ప్రవక్త (సఅసం)ను ఓదారుస్తున్నాడు. ఓ ప్రవక్తా (స)! ఈ బహుదైవారాధకుల పరిహాసపు మాటలు విని కృంగిపోకు. నిరుత్సాహం చెందకు. ఇదేమీ కొత్త విషయం కాదు. వీళ్లు ఎప్పుడూ ఇంతే. నీకు పూర్వం వచ్చిన ప్రవక్తలను కూడా అవిశ్వాసులు, ముష్రిక్కులు ఇలాగే వేళాకోళం చేశారు. ఆట పట్టించారు. ఎట్టకేలకు వారు చేసిన వేళాకోళమే వారి కొంప ముంచింది. ఏ శిక్షను వారు ఆషామాషీగా తీసుకున్నారో అదే వారిపై అమాంతం విరుచుకుపడింది. ఆ మాటే దివ్య ఖుర్ఆన్‌లో మరోచోట ఈ విధంగా చెప్పబడింది : "(ఓ ముహమ్మద్!) నీకు పూర్వం కూడా ప్రవక్తలు ధిక్కరించబడ్డారు. వారు ఈ ధిక్కార వైఖరిపట్ల, తమకు పెట్టిన బాధల పట్ల ఓర్పు వహించారు. చివరకు మా సహాయం వారికి అందింది" (అల్ అన్ఆమ్ – 34). ఒకవైపు ఈ ఆయతు ద్వారా దైవప్రవక్త (స)ను ఓదారుస్తూనే మరోవైపు అవిశ్వాసులను దేవుడు పరోక్షంగా హెచ్చరించాడు.

**43** ఏమిటీ, మేము తప్ప వారిని ఆపదల నుంచి కాపాడే వేరే దేవుళ్లు కూడా ఎవరయినా ఉన్నారా? వారు స్వయంగా తమకు సహాయం చేసుకునే శక్తిని కలిగిలేరు. మా తరఫున కూడా వారికెలాంటి అండదండలూ లేవు.[52]

أَمْ لَهُمْ آلِهَةٌ تَمْنَعُهُم مِّن دُونِنَا ۚ لَا يَسْتَطِيعُونَ
نَصْرَ أَنفُسِهِمْ وَلَا هُم مِّنَّا يُصْحَبُونَ ﴿٤٣﴾

**44** పైగా మేము వారికీ, వారి తాత ముత్తాతలకూ జీవన సామగ్రిని ఇచ్చాము. చివరికి (దాన్ని అనుభవిస్తూనే) వారి ఆయుష్షు గడచిపోయింది.[53] మేము భూమిని దాని అంచుల నుంచి కుదించుకుంటూ రావటాన్ని[54] వారు చూడటం లేదా? ఏమిటి, ఇప్పటికీ వీళ్ళే ప్రాబల్యం వహిస్తారటనా?[55]

بَلْ مَتَّعْنَا هَٰؤُلَاءِ وَآبَاءَهُمْ حَتَّىٰ طَالَ عَلَيْهِمُ
الْعُمُرُ ۗ أَفَلَا يَرَوْنَ أَنَّا نَأْتِي الْأَرْضَ نَنقُصُهَا
مِنْ أَطْرَافِهَا ۚ أَفَهُمُ الْغَالِبُونَ ﴿٤٤﴾

**45** (ఓ ప్రవక్తా!) "నేను మిమ్మల్ని కేవలం దైవసందేశం (వహీ) ఆధారంగా హెచ్చరిస్తున్నాను" అని వారికి చెప్పు. అయితే తమను హెచ్చరించినప్పుడు, చెవిటివారు ఆ పిలుపును వినరు.[56]

قُلْ إِنَّمَا أُنذِرُكُم بِالْوَحْيِ ۚ وَلَا يَسْمَعُ
الصُّمُّ الدُّعَاءَ إِذَا مَا يُنذَرُونَ ﴿٤٥﴾

51. అంటే – మీరు చేసే పాపిష్టి పనులు అన్నీ ఇన్నీ కావు. వాటికి శిక్షగా – రాత్రి పూటగానీ, పట్టపగలుగానీ – ఏ క్షణంలోనయినా దేవుడు మీపై తన కొరడాను ఝుళిపించవచ్చు. అదే గనక జరిగితే దేవుని పట్టునుంచి మిమ్మల్ని కాపాడేవాడెవడు? మీ నిజదైవం దయామయుడు గనక, ఆయన మీకు గడువు ఇస్తూ పోతున్నాడు గనక మీరు బతికిపోతున్నారు. ఈ సత్యాన్ని మీరు ఎంత తొందరగా తెలుసుకుంటే అంత మంచిది.

52. వాళ్లు ఖుద్దుగా మా పట్టునుంచి తప్పించుకునే స్థితిలో లేరు. మరలాంటప్పుడు వారు ఇతరులను శిక్షనుంచి ఎలా కాపాడగలుగుతారు?

53. వారి తాతముత్తాతలు భోగభాగ్యాలను అనుభవించినంత మాత్రాన, జీవితకాలంలో వారికి సుఖసౌఖ్యాలు లభించినంత మాత్రాన తాము సన్మార్గాన ఉన్నారని ఊహా లోకంలో విహరిస్తున్నారా వీరు? ఇకమీదట కూడా తాము, తమ భావితరాలు ఇలాగే హాయిగా ఉండగలమని అనుకుంటున్నారా? ముమ్మాటికీ అలా జరగదు. అది మూన్నాళ్ల ముచ్చట మాత్రమే. అది మా నిర్ధారిత గడువులో అంతర్భాగం మాత్రమే. తాత్కాలికమైన ఈ సుఖసౌఖ్యాలను, భోగ భాగ్యాలను చూసుకుని వారు మురిసిపోరాదు. మోసపోకూడదు.

54. అంటే నేల నాలుగు వైపులా విస్తరిల్లి ఉన్న అవిశ్వాసం (కుఫ్ర్) క్రమక్రమంగా క్షీణిస్తోంది, కుంచించుకుపోతోంది. అదే సమయంలో ఇస్లాం దిన దిన ప్రవర్ధమానమవుతోంది. అవిశ్వాసుల కాళ్ల క్రింద నేల కదులుతోంది. ఇస్లాం కాంతి రేఖలు నలుదిక్కులా ప్రసరిస్తున్నాయి. ముస్లింలు తమ జైత్రయాత్రను కొనసాగిస్తూ ఉన్నారు.

55. ఇదంతా కళ్లారా చూస్తూ కూడా అవిశ్వాసులు, 'మాదే పైచేయి అవుతుంద'ని భావించటం అవివేకం. వారు గెలవటం లేదు, ఓడిపోతున్నారు. వారి గౌరవోన్నతులు పెరగటం లేదు, క్షీణిస్తున్నాయి. పరాభవం నలువైపుల నుంచీ వారిని క్రమ్ముకుంటూ వస్తోంది.

56. అంటే – ఖుర్ఆన్ ద్వారా వారికి బోధపరుస్తున్నాను. సజ్జనులకు శుభవార్తను వినిపించటం, దుష్టులను హెచ్చరించటమే నా ప్రధాన కర్తవ్యం అన్నది ప్రవక్త (స) పలుకుల్లోని ఆంతర్యం. కాని అల్లాహ్ ఎవరి చెవులకు చెవుడును ఇచ్చాడో వారి కర్ణపుటాలకు సత్యం వినబడదు. వారి హృదయాలపై తెరలు పడిపోయాయి. ఖుర్ఆన్‌ను వినిపించినా, భయబోధ చేసినా వారి మనసులు మారవు.

46 ఒకవేళ నీ ప్రభువు శిక్షా తాకిడి వారికి ఏ కాస్త తగిలినా "అయ్యో! మా పాడుగాను! ముమ్మాటికీ మేమే దుర్మార్గులం"[57] అని హాహాకారాలు చేస్తారు.

وَلَئِن مَّسَّتْهُمْ نَفْحَةٌ مِّنْ عَذَابِ رَبِّكَ لَيَقُولُنَّ يَٰوَيْلَنَآ إِنَّا كُنَّا ظَٰلِمِينَ ﴿٤٦﴾

47 మేము ప్రళయ దినాన న్యాయంగా తూచే త్రాసులను నెలకొల్పుతాము. మరి ఏ ప్రాణికీ రవంత అన్యాయం కూడా జరగదు. ఒకవేళ ఆవగింజంత ఆచరణ ఉన్నా మేము దానిని హాజరు పరుస్తాము. లెక్క తీసుకోవటానికి మేము చాలు.[58]

وَنَضَعُ ٱلْمَوَٰزِينَ ٱلْقِسْطَ لِيَوْمِ ٱلْقِيَٰمَةِ فَلَا تُظْلَمُ نَفْسٌ شَيْـًٔا ۖ وَإِن كَانَ مِثْقَالَ حَبَّةٍ مِّنْ خَرْدَلٍ أَتَيْنَا بِهَا ۗ وَكَفَىٰ بِنَا حَٰسِبِينَ ﴿٤٧﴾

48 మేము మూసా, హారూనులకు తీర్పులు చేసే గీటురాయిని, జ్యోతినీ, భయభక్తులు గలవారికి హితోపదేశంతో కూడిన గ్రంథాన్నీ ఇచ్చాము.[59]

وَلَقَدْ ءَاتَيْنَا مُوسَىٰ وَهَٰرُونَ ٱلْفُرْقَانَ وَضِيَآءً وَذِكْرًا لِّلْمُتَّقِينَ ﴿٤٨﴾

49 తమ ప్రభువును చూడకుండానే భయపడే భక్తులు వారు. ప్రళయ ఘడియపట్ల (గల తలంపుతోనే) వారు వణికిపోతారు.[60]

ٱلَّذِينَ يَخْشَوْنَ رَبَّهُم بِٱلْغَيْبِ وَهُم مِّنَ ٱلسَّاعَةِ مُشْفِقُونَ ﴿٤٩﴾

57. దేవుని దెబ్బ సాధారణమయింది కాదు. దాని తాకిడి ఏకాస్త తగిలినా వారికి దిమ్మ తిరిగిపోతుంది. హాహాకారాలు చేస్తూ తమ తప్పులను ఒప్పుకుంటారు. తామే తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నామని అంగీకరిస్తారు.

58. **'మవాజీన్'** (مَوَازِيْن) అంటే త్రాసులు అని అర్థం. కర్మల బరువును తూయటానికి తీర్పుదినాన అనేక త్రాసులుగానీ లేక ఒకే త్రాసుగానీ నెలకొల్పబడవచ్చు. మనిషి చేసే కర్మలకు ఒక రూపుగానీ, ఉనికిగానీ లేదు. మరలాంటప్పుడు బరువులను తూచేదెలా? ఒకప్పుడైతే ఇది అర్థమయ్యేది కాదు. కాని ప్రస్తుతం జరిగిన శాస్త్రీయ పరిశోధనల, కొంగ్రొత్త ఆవిష్కరణల వెలుగులో రూపురేఖలు లేని వస్తువుల బరువు కూడా తూయబడుతోంది. మానవుడే తన మేధాశక్తితో ఇలాంటి పనులు చేయగలుగుతున్నప్పుడు మనిషిని సృష్టించిన సృష్టికర్తకు మానవ కర్మల లెక్క తేల్చటం ఓ లెక్కా? ఆయన తలిస్తే కానిదంటూ ఏదీ ఉండదు. ఆయన గనక తలచుకుంటే మనుషులకు వారి కర్మల్ని చూపేందుకు వాటికి ఆకారాన్ని ప్రసాదించినా ఆశ్చర్యం లేదు. కొన్ని కర్మలు రూపుధరిస్తాయని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది. ఉదాహరణకు: ఖుర్‌ఆన్‌ను పారాయణం చేసే వ్యక్తి కోసం ఖుర్‌ఆన్ అందమైన ఒక యువకుని రూపంలో ముందుకు వస్తుంది. నువ్వెవరివి? అని అతను అడిగితే,"నేను ఖుర్‌ఆన్‌ను. నువ్వు నన్ను రాత్రిపూట మేల్కొని పారాయణం చేసేవాడివి. పగటి పూట దాహంతో బాధపడుతూనే పఠించేవాడివి" అని అంటుంది (ముస్నదె అహ్మద్- 5/348, 352; ఇబ్నెమాజ-కితాబుల్ అదబ్). అలాగే విశ్వాసి సమాధిలో అతని సదాచరణ ఒక ఆకర్షణీయమైన రంగులో, పరిమళం గుభాళించే యువకుని రూపంలో ముందుకు వస్తుంది. అయితే అవిశ్వాసి, కపటి వద్దకు దీనికి భిన్నమైన రూపంలో వస్తుంది (ముస్నదె అహ్మద్-5/287). దీనికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అల్ ఆరాఫ్ సూరా 9వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి. మూలంలో **'ఖిస్త్'** (قِسْط) అని ఉంది. వాక్యంలో ఇది 'మవాజీన్'కు విశేషణంగా ప్రయోగించబడింది. న్యాయం చేసేటటువంటి త్రాసు లేక త్రాసులు అని దాని భావం.

59. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు ఇవ్వబడిన తౌరాత్ గ్రంథం విశిష్టతలు ఇందులో వర్ణించబడ్డాయి. ఆ గ్రంథం కూడా ఖుర్‌ఆన్ లాగానే భయభక్తులు గల వారికే హితబోధినిగా పంపబడింది. ఎవరి హృదయాలలో అల్లాహ్‌పట్ల భక్తి, భయం లేదో వారు దైవగ్రంథాన్ని అసలు పట్టించుకోరు. అలాంటప్పుడు ఆ గ్రంథం వారికి ఎలా మార్గదర్శకం కాగలుగుతుంది? మార్గదర్శకత్వం పొందాలనుకుంటే ముందు ఆ గ్రంథాన్ని శ్రద్ధాభక్తులతో అధ్యయనం చేయాలి. ఆపైన అందలి విషయాల గురించి చింతన చేయాలి.

| | |
|---|---|
| **50** ఇది శుభప్రదమైన ఉపదేశం. దీనిని అవతరింపజేసినది కూడా మేమే. అయినా మీరు దీనిని త్రోసిపుచ్చుతున్నారా?[61] | وَهٰذَا ذِكْرٌ مُّبٰرَكٌ اَنْزَلْنٰهُ ؕ اَفَاَنْتُمْ لَهٗ مُنْكِرُوْنَ ﴿50﴾ |
| **51** అంతకుముందే మేము ఇబ్రాహీముకు అతని మార్గదర్శకత్వాన్ని (ప్రజ్ఞను) ప్రసాదించాము.[62] అతని (యోగ్యత) గురించి మాకు ముందు నుంచే బాగా తెలుసు.[63] | وَلَقَدْ اٰتَيْنَآ اِبْرٰهِيْمَ رُشْدَهٗ مِنْ قَبْلُ وَكُنَّا بِهٖ عٰلِمِيْنَ ﴿51﴾ |
| **52** అతను తన తండ్రితో, తన జాతి వారితో, "ఇంతకీ మీరు ఇంతటి శ్రద్ధాభక్తులతో పూజిస్తూ కూర్చున్న ఈ విగ్రహాల సంగతేమిటీ?"[64] అని అడిగినప్పుడు, | اِذْ قَالَ لِاَبِيْهِ وَقَوْمِهٖ مَا هٰذِهِ التَّمَاثِيْلُ الَّتِيْٓ اَنْتُمْ لَهَا عٰكِفُوْنَ ﴿52﴾ |
| **53** "మా తాతముత్తాతలు వీటిని పూజిస్తూ ఉండగా మేము చూసి ఉన్నాము"[65] అని వారంతా సమాధానమిచ్చారు. | قَالُوْا وَجَدْنَآ اٰبَآءَنَا لَهَا عٰبِدِيْنَ ﴿53﴾ |

60. ఇవి దైవభీతి, దైవభక్తి గలవారి లక్షణాలు. అల్ బఖరా సూరా ఆరంభంలోనూ, ఇతరచోట్ల కూడా అలాంటి భక్తిపరాయణుల చిహ్నాలు అభివర్ణించబడ్డాయి.

61. హితబోధను గ్రహించదలిచే వారికొరకు ఈ గ్రంథం (ఖుర్ఆన్) శుభాల సరోవరం వంటిది. శ్రేయోదాయకమైనది. ఈ గ్రంథాన్ని కూడా మేమే అవతరింపజేశాము. తౌరాత్ గ్రంథం దైవగ్రంథం అని మీకు దృఢనమ్మకం ఉన్నప్పుడు "ఖుర్ఆన్ దేవుని తరఫున అవతరింపజేయబడింది " అన్న విషయాన్ని మీరెందుకు నిరాకరిస్తున్నట్టు?

62. హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు తౌరాతు గ్రంథాన్ని వొసగక ముందే మేము ఇబ్రాహీమునకు సన్మార్గాన్ని, బుద్ధికుశలతను ప్రసాదించాము అని ఒక అర్థం వస్తుంది. ఇబ్రాహీమునకు ప్రవక్త పదవిని ఇవ్వకముందే అతని చుట్టూ ప్రబలి ఉన్న విగ్రహారాధన పట్ల ఆలోచనను రగుల్గొల్పాము అని మరొక అర్థం వస్తుంది.

63. అంటే మేము ప్రసాదించే తెలివితేటలకు, ప్రజ్ఞాపాటవాలకు అతను పూర్తిగా అర్హుడనీ, వాటిని అతను దుర్వినియోగం చేయడని మాకు తెలుసు.

64. **'తమాసీల్'** ( تَمَاثِيْلُ ) అంటే యథాతథంగా అనుకరించబడినవి అని అర్థం. రాతితో చెక్కిన శిల్పాలు, కాగితం లేక గోడలపై గీసిన బొమ్మలన్నీ ఇందులోకి వస్తాయి. ఇబ్రాహీమ్ జాతి ప్రజలు తమ పూర్వీకుల్లోని పుణ్యపురుషుల విగ్రహాలను, రాళ్ళతో చెక్కిన వారి ఆకారాలను పూజిస్తూ వాటి ముందు తలవంచుతూ ఉండేవారు. **'ఆకిఫూన్'** ( عٰكِفُوْنَ) అంటే పట్టుకు కూర్చోవటం, అక్కడే తిష్ఠవేయటం అని భావం. 'ఏతెకాఫ్' అనే పదం కూడా దీన్నుంచే వచ్చింది. దాసుడు ఏకాగ్రతతో దైవధ్యానం చేసేందుకు, దైవసామీప్యం పొందేందుకు ఏతెకాఫ్ వ్రతం పాటిస్తాడు. అయితే ఈ ఆయతులో మాత్రం 'ఆకిఫూన్' అంటే విగ్రహాల, దేవీదేవతల పట్ల భక్తీ పారవశ్యంతో, పూజారులై కూర్చోవటం అని అర్థం. ఎక్కడో, ఎవరో ఎందుకు? నేడు మన నాట ముస్లిం సమాజంలో సయితం ఈ జాడ్యం తిష్ఠవేసింది. సమాధి పూజారులు, పీర్ల పూజారులు ఆస్థానములను నిర్మించుకుని అమితమైన భక్తితో అక్కడే తిష్ఠవేసి కూర్చోవటం, దుకాణాలలో 'శుభం' కోసం గోడలకు పంజాల ఫోటోలు వ్రేలాడదీయటం–ఇదంతా ఏమిటీ? షిర్క్ కాదా? అల్లాహ్ వారికి సద్బుద్ధిని వొసగుగాక!

65. అంతెందుకు, అజ్ఞానం వల్ల దురాచారాల ఊబిలో కూరుకుపోయిన నేటి ముస్లింలను వారి పనుల నుండి ఆపి చూడండి. మా తాతముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ పనులను మేము ఎలా వదలిపెట్టేది? అంటారు. దైవగ్రంథాన్ని, దైవప్రవక్త విధానాన్ని కాకుండా పండితుల, మతాచార్యుల అభిప్రాయాలపై నడిచే ముస్లింలది కూడా ఇదే వరస!

قَالَ لَقَدْ كُنتُمْ أَنتُمْ وَآبَاؤُكُمْ فِي ضَلَالٍ
مُّبِينٍ ﴿٥٤﴾

54 “అలాగయితే మీరూ, మీ తాత ముత్తాతలంతా స్పష్టమైన
అపమార్గానికి లోనై ఉన్నారు” అని అతను అన్నాడు.

قَالُوا أَجِئْتَنَا بِالْحَقِّ أَمْ أَنتَ مِنَ اللَّاعِبِينَ ﴿٥٥﴾

55 “ఏమిటీ? నువ్వు మా వద్దకు నిజంగానే సత్యం తీసుకుని
వచ్చావా? లేక ఇట్టే ఆటపట్టిస్తున్నావా?”[66] అని అడిగారు వారు.

قَالَ بَل رَّبُّكُمْ رَبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ الَّذِي
فَطَرَهُنَّ وَأَنَا عَلَىٰ ذَٰلِكُم مِّنَ الشَّاهِدِينَ ﴿٥٦﴾

56 అతను ఇలా చెప్పాడు : “కాదు, వాస్తవానికి భూమ్యాకాశాల
ప్రభువే మీ ప్రభువు. ఆయనే వాటిని సృష్టించాడు. ఈ విషయానికి
సాక్ష్యమిచ్చే వారిలో నేనూ ఒకణ్ణి.[67]

وَتَاللَّهِ لَأَكِيدَنَّ أَصْنَامَكُم بَعْدَ أَن تُوَلُّوا
مُدْبِرِينَ ﴿٥٧﴾

57 “అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. మీరు వెనుతిరిగి వెళ్ళి
పోయిన తరువాత నేను మీ విగ్రహాల అంతు చూస్తాను.”[68]

فَجَعَلَهُمْ جُذَاذًا إِلَّا كَبِيرًا لَّهُمْ لَعَلَّهُمْ إِلَيْهِ
يَرْجِعُونَ ﴿٥٨﴾

58 ఆ తరువాత అతను వాటన్నింటినీ ముక్కలు ముక్కలుగా
పగులగొట్టాడు. అయితే పెద్ద విగ్రహాన్ని మాత్రం విడిచి పెట్టాడు.
వారంతా దానివైపు మరలటానికే[69] (అలా చేశాడు).

قَالُوا مَن فَعَلَ هَٰذَا بِآلِهَتِنَا إِنَّهُ
لَمِنَ الظَّالِمِينَ ﴿٥٩﴾

59 “మా దేవుళ్ళకు ఈ దుర్గతిని పట్టించిందెవరు? వాడెవడో
నిజంగా పెద్ద దుర్మార్గుడే”[70] అని వారు అనసాగారు.

قَالُوا سَمِعْنَا فَتًى يَذْكُرُهُمْ يُقَالُ لَهُ إِبْرَاهِيمُ ﴿٦٠﴾

60 “ఒక యువకుడు మా విగ్రహాలను గురించి (చెడుగా)
ప్రస్తావించటం మేము విన్నాము. అతను ఇబ్రాహీంగా పిలువ
బడతాడు”[71] అని కొందరు చెప్పారు.

66. వారలా అనటానికి కారణం, అంతకుముందు వారెన్నడూ దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి వినకపోవటమే. బహుశా ఇబ్రాహీం తమను ఆట పట్టిస్తున్నాడేమోనని వారంతా అనుకున్నారు.

67. నేనేదో నవ్వులాటకు ఈ మాటలనటం లేదు. నాకు తెలిసిన సత్యాన్నే మీకు వివరిస్తున్నాను. ఈ విగ్రహాలలో మీ దేవుడు లేడు. యదార్థానికి భూమ్యాకాశాల వ్యవస్థను సృష్టించిన గొప్పవాడే మీ నిజదైవం అని ఇబ్రాహీం చెప్పారు.

68. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) మనసులో చేసుకున్న సంకల్పం ఇది. 'మనసులో కాదు, నెమ్మదిగా చెప్పాడు' అని మరికొందరు భావిస్తున్నారు. ఎందుకంటే ఆ విషయాన్ని కొందరికి వినిపించాలన్నది ఆయన లక్ష్యం. వాస్తవం అల్లాహ్‌కే ఎరుక. మూలంలో **'కైద్'** అన్న పదం వాడబడింది. నోటితో హితబోధ చేసిన తర్వాత చెడును నిర్మూలించేందుకుగాను పన్నే యుక్తి అని దాని భావం.

69. వారంతా పండుగ జరుపుకోవటానికి ఊరు విడిచి బయటికి వెళ్ళిన రోజున, హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) అందివచ్చిన అవకాశాన్ని దొరకబుచ్చుకుని, వారి విగ్రహాలన్నింటినీ విరగ్గొట్టారు. అక్కడున్న పెద్ద విగ్రహం జోలికి మాత్రం పోలేదు. గొడ్డలిని ఆ విగ్రహం చేతిలో పెట్టారని ఒక కథనం ఉంది. ఎవరయినా వచ్చి అడిగితే, 'ఏమో ఆ పెద్ద విగ్రహాన్నే అడగండి' అని చెప్పడానికే అలా చేశారు.

70. వారు జాతర నుండి తిరిగి వచ్చేసరికి విగ్రహాలన్నీ తునాతునకలై పడి ఉన్నాయి. ఎవడో పెద్ద దుర్మార్గుడే ఈ అపచారానికి పాల్పడి ఉంటాడని వారంతా అనుకున్నారు.

61 "అయితే అతన్ని ప్రజలందరి సమక్షంలోకి తీసుకురండి, అందరూ అతనికి ప్రత్యక్ష సాక్ష్యంగా ఉంటార"ని అన్నారు.[72]

قَالُوْا فَأْتُوْا بِهٖ عَلٰٓى اَعْيُنِ النَّاسِ لَعَلَّهُمْ يَشْهَدُوْنَ ﴿61﴾

62 "ఓ ఇబ్రాహీం! మా విగ్రహాలకు ఈ (దు)స్థితిని కలిగించింది నువ్వేనా?" అని అతన్ని అడిగారు.

قَالُوْٓا ءَاَنْتَ فَعَلْتَ هٰذَا بِاٰلِهَتِنَا يٰٓاِبْرٰهِيْمُ ﴿62﴾

63 "ఆహా! ఆ పనిని వీళ్ళ పెద్దాయనే చేశాడు. ఒకవేళ వాళ్లు చెప్పగలిగితే వాళ్లనే అడిగి తెలుసుకోండి"[73] అన్నాడు ఇబ్రాహీం.

قَالَ بَلْ فَعَلَهٗ ۖ كَبِيْرُهُمْ هٰذَا فَسْـَٔلُوْهُمْ اِنْ كَانُوْا يَنْطِقُوْنَ ﴿63﴾

71. బహుశా ఇబ్రాహీమే ఈ పని చేసి ఉంటాడు. ఇంతకు ముందు అతను మా విగ్రహాల గురించి అభ్యంతరం తెలుపటం మేము విన్నాము అని కొంతమంది అనుమానం వ్యక్తం చేశారు.

72. అంటే, అతనికి మేము విధించే శిక్షను అందరూ చూడాలి. అలా చేస్తే వేరెవ్వరూ మళ్ళీ ఇటువంటి అపచారం చేయటానికి సాహసించరు అని ఒక అర్థం. లేదా అతనే ఈ పని చేసినట్లు జనులు సాక్ష్యం ఇవ్వటానికి అతన్ని అందరి ముందూ హాజరుపరచండి అన్నది వేరొక అర్థం కావచ్చు.

73. ఆ విధంగా హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ప్రజలందరి సమక్షంలో పిలువబడ్డారు. ఆయన చేసిన నిర్వాకం గురించి ప్రశ్నించబడ్డారు. 'ఆ పనిని వీళ్ల పెద్దాయనే చేశాడు.' ఒకవేళ వీళ్ళు (పగులగొట్టబడిన ఈ విగ్రహాలు) మాట్లాడగలిగితే వీళ్ళనే అడిగి తెలుసుకోండి అని ఇబ్రాహీం సంజాయిషీ ఇచ్చారు. ఆ విగ్రహాల నిస్సహాయస్థితిని ప్రజలకు తెలియజెప్పేందుకే ఆయన అలా మాట్లాడారు. కదలలేని, మెదలలేని, పెదవి విప్పి పలకలేని ఈ రాతిబొమ్మలు దైవాలెలా అవుతాయి? మీరు ఇలాంటి నిస్సహాయులైన విగ్రహాలను పూజించటం ఎంతవరకు సహేతుకం? అని ఆయన ప్రశ్నించి వాళ్ళలో ఆలోచనను రగుల్గొల్పాలని భావించారు. ఒక ప్రామాణిక హదీసులో దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ మాట (ఈ పనిని ఆ పెద్దాయనే చేశాడు)ను అబద్ధం చెప్పటంగా అభివర్ణించటం జరిగింది. హజ్రత్ ఇబ్రాహీం మూడు సందర్భాలలో మూడు అబద్ధాలు చెప్పారు. వాటిలో రెండు అల్లాహ్ కోసం చెప్పారు. (1. "ఈ పెద్దాయనే చేశాడు." 2. "నేను సంబరానికి రాలేను. వ్యాధిగ్రస్తుడనై ఉన్నాను"). 3. మూడో అబద్ధం తన భార్య విషయంలో చెప్పారు – చక్రవర్తి సమక్షంలో ఆమెను తన సోదరిగా ప్రకటించారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా).

అయితే వర్తమాన కాలపు కొందరు ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఈ ప్రామాణిక హదీసును ఖుర్ఆన్‌తో వ్యాఘాతం చెందే హదీసుగా అభివర్ణించి, అది ప్రామాణిక హదీసు అని నొక్కి చెప్పేవారిని విమర్శించారు. కాని ఈ వ్యాఖ్యాతల విమర్శ సహేతుకమైనది కాదు. విషయంలోని వాస్తవికత రీత్యా వాటిని 'అబద్ధాలు' అని ఎవరూ అనలేరు. కాని బాహ్య స్వరూపం దృష్ట్యా మాత్రం వాటిని 'అబద్ధాల' జాబితా నుంచి తొలగించలేరు. ఆ మాటకొస్తే ఈ 'అబద్ధాలు' దైవసమక్షంలో నిలదీయదగిన అబద్ధాలు కూడా కావు. ఎందుకంటే అవి అల్లాహ్ కొరకే చెప్పబడ్డాయి. అయితే దైవప్రసన్నత కోసం ఏ పాపకార్యమూ జరుపబడదు. పైకి అబద్ధంగా కనిపిస్తున్నప్పటికీ వాస్తవికత రీత్యా అది అబద్ధం కానిపక్షంలో మాత్రమే – గత్యంతరం లేని స్థితిలో – అలా చెప్పవచ్చు. ఉదాహరణకు : ఆదం (అలైహిస్సలాం) నిషిద్ధ వృక్షాన్ని సమీపించి, దాని ఫలాన్ని తిన్న సంఘటననే తీసుకోండి. ఆయన ఆ చర్యకు పాల్పడి అవిధేయతకు ఒడిగట్టారనీ, దారితప్పారనీ అంటూనే మరుపువల్ల, సంకల్పబలం లోపించటం వల్ల ఆయనకు ఆ పరిస్థితి దాపురించిందని కూడా ఖుర్ఆన్ అంటోంది. మంచీ చెడుల కోణాలు రెండూ అందులో అంతర్లీనమై ఉన్నాయి.

హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి మాట పైకి అబద్ధంగానే అగుపిస్తుంది. ఎందుకంటే ఆయన చెప్పింది ఒకటైతే, చేసింది ఇంకొకటి. విగ్రహాలను విరగ్గొట్టింది ఆయనే. కాని ఆ పని చేసింది పెద్ద విగ్రహం అని చెప్పారు. అయితే ఈ సందర్భంగా ఆయన ఉద్దేశం అది కాదు. విగ్రహాల నిస్సహాయస్థితిని అందరికీ అర్థమయ్యేలా చెప్పి,

64 దాంతో వారు మనసుల్లోనే (వాస్తవాన్ని ఒప్పుకుని,) "అసలు దుర్మార్గులు మీరే కదా!"[74] అని (పరస్పరం) గొణుక్కున్నారు.

فَرَجَعُوٓا۟ إِلَىٰٓ أَنفُسِهِمْ فَقَالُوٓا۟ إِنَّكُمْ أَنتُمُ ٱلظَّٰلِمُونَ ﴿٦٤﴾

65 కాని తరువాత వారి బుద్ధి తలక్రిందులైంది; "ఇవి మాట్లాడ లేవన్న సంగతి నీకూ తెలుసు కదా!"[75] అన్నారు వారు.

ثُمَّ نُكِسُوا۟ عَلَىٰ رُءُوسِهِمْ لَقَدْ عَلِمْتَ مَا هَٰٓؤُلَآءِ يَنطِقُونَ ﴿٦٥﴾

66 (ఇబ్రాహీమ్ అప్పటికప్పుడే) అడిగేశాడు : "(మీ పరిస్థితి కడు శోచనీయం!) మీరు అల్లాహ్‌ను వదలి మీకు ఏమాత్రం లాభం గానీ, నష్టంగానీ కలిగించలేని వాటిని పూజిస్తున్నారా?"

قَالَ أَفَتَعْبُدُونَ مِن دُونِ ٱللَّهِ مَا لَا يَنفَعُكُمْ شَيْـًٔا وَلَا يَضُرُّكُمْ ﴿٦٦﴾

67 "ధూత్కారం, మీపైనా, అల్లాహ్‌ను కాదని మీరు పూజించే దేవుళ్ళపైనా. మీకు ఈపాటి ఇంగిత జ్ఞానం కూడా లేదా?"[76]

أُفٍّ لَّكُمْ وَلِمَا تَعْبُدُونَ مِن دُونِ ٱللَّهِ ۖ أَفَلَا تَعْقِلُونَ ﴿٦٧﴾

68 (దానికి వారి అహం దెబ్బతిన్నది) "మీరేదన్నా చేయాలనే అనుకుంటే ఇతన్ని అగ్నికి ఆహుతి చేయండి. మీ దేవుళ్ళకు సహాయంగా నిలబడండి"[77] అని వారన్నారు.

قَالُوا۟ حَرِّقُوهُ وَٱنصُرُوٓا۟ ءَالِهَتَكُمْ إِن كُنتُمْ فَٰعِلِينَ ﴿٦٨﴾

దేవుని ఏకత్వాన్ని చాటి చెప్పటం ఆయన ఆశయం. కాబట్టి వాస్తవికత రీత్యా ఆయన చెప్పిన మాటను మనం 'అబద్ధం' అని అనే బదులు, తన వాదనను రుజువు చేయడానికి అవలంబించిన ఒకానొక పద్ధతి అని అనటం సమంజసం. ఇదిలా ఉండగా హదీసులో ఈ 'అబద్ధాల' ప్రస్తావన ఏ సందర్భంగా వచ్చింది? హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) మాటల్లోని అంతరార్థం ఏమిటి? అన్న విషయాన్ని గురించి కూడా ఆలోచించటం అవసరం. మహ్షర్ మైదానంలో (తీర్పుదినాన) రాజాధిరాజు అయిన అల్లాహ్ సమక్షంలోకి వెళ్ళి ప్రజల కొరకు సిఫారసు చేయడానికి ఇబ్రాహీం (అలైహిస్సలాం) వెనుకంజ వేస్తారు. ప్రపంచంలో మూడు సంక్లిష్ట పరిస్థితుల్లో మూడు తప్పులు తన వల్ల జరిగాయనీ, ఆ కారణంగా తాను తన ప్రభువు ఎదుట వచ్చి సిఫారసు చేయలేనని ఆయన అంటారు. యదార్థానికి అవి తప్పులు కానే కావు. అంటే – వాస్తవికత దృష్ట్యా, సదాశయం రీత్యా అవి అబద్ధాలు కావు. కాకపోతే దేవుని ఔన్నత్యం, వైభవం కారణంగా ఆయన భీతిచెందుతారు. తాను చెప్పిన మూడు మాటలు అబద్ధాలను పోలి ఉన్నందున అల్లాహ్ వాటిపై తనను నిలదీస్తాడేమోనని ఆయన కుమిలిపోతారు. ఒకవిధంగా చూస్తే ఇది ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి అణకువనీ, రుజువర్తనని చాటిచెబుతోంది. కనుక ఈ హదీసు ఉద్దేశం హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారిని అసత్యవంతులుగా నిరూపించటం ఎంతమాత్రం కాదు. తీర్పుదినాన దైవభీతితో ఆయన ఎలా కంపిస్తూ ఉంటారో తెలియజెప్పటమే ఈ హదీసు ప్రధాన ఉద్దేశం.

74. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) సమాధానం వారిని ఆలోచనలో పడవేసింది. తక్షణం ఏమీ చెప్పలేకపోయారు. ఇతను చెప్పేది నిజమేకదా! నిజానికి దుర్మార్గానికి ఒడిగడుతున్నది మీరే కదరా! అని ఒండొకరు గుసగుసలాడుకున్నారు. సాటి విగ్రహాలను విరగ్గొడుతుంటే అడ్డుకోలేని విగ్రహాలు పూజకు అర్హులెట్లా అవుతాయి? అన్న ప్రశ్న వారి మెదడును తొలచివేసింది. తమ విగ్రహాలపై కాపలాగా ఎవరినీ నియమించకుండా సంబరానికి వెళ్ళినందుకు వాళ్లు పరస్పరం నిందించుకున్నారని మరికొందరు వివరించారు.

75. ఆ తరువాత వారు ఆ షాక్‌నుంచి తేరుకుని, ఇబ్రాహీం (అలైహి) వైపుకు మరలారు. "ఈ విగ్రహాలు పలకలేవన్న సంగతి నీకూ తెలుసుకదా! మరి వీళ్ళనే అడగండి అని ఎందుకంటున్నావు?" అన్నారు.

76. వారి ప్రశ్నలోనే వారికి సమాధానం ఉంది. ఆ సంగతి తెలిసి కూడా వారు పసలేని ప్రశ్న వేసినందుకు హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు వారి పరిస్థితిపై కించిత్ జాలి, విచారం కూడా కలిగింది. అందుకే మీకు 'బొత్తిగా

قُلْنَا يٰنَارُ كُوْنِيْ بَرْدًا وَّسَلٰمًا عَلٰٓى اِبْرٰهِيْمَ ﴿69﴾

**69** "ఓ అగ్నీ, నువ్వు ఇబ్రాహీమ్ కొరకు చల్లగానూ, సురక్షితం గానూ మారిపో" అని మేము ఆదేశించాము.

وَاَرَادُوْا بِهٖ كَيْدًا فَجَعَلْنٰهُمُ الْاَخْسَرِيْنَ ﴿70﴾

**70** వారు ఇబ్రాహీముకు కీడు చేయాలనుకున్నారు. కాని మేము వాళ్ళనే ఎక్కువగా నష్టానికి గురిచేశాము.

وَنَجَّيْنٰهُ وَلُوْطًا اِلَى الْاَرْضِ الَّتِيْ بٰرَكْنَا فِيْهَا
لِلْعٰلَمِيْنَ ﴿71﴾

**71** మేము అతనినీ, లూతునూ కాపాడి, లోకవాసుల కోసం శుభాలను పొందుపరచిన భూభాగం వైపుకు తీసుకువెళ్ళాము.[78]

وَوَهَبْنَا لَهٗٓ اِسْحٰقَ ؕ وَيَعْقُوْبَ نَافِلَةً ؕ
وَكُلًّا جَعَلْنَا صٰلِحِيْنَ ﴿72﴾

**72** ఇంకా మేము అతనికి (ఇబ్రాహీమునకు) ఇస్హాఖును ప్రసాదించాము. ఆపైన అదనంగా (మనవడిగా) యాఖూబును కూడా అనుగ్రహించాము.[79] వారందరినీ సద్వర్తనులుగా చేశాము.

وَجَعَلْنٰهُمْ اَئِمَّةً يَّهْدُوْنَ بِاَمْرِنَا وَاَوْحَيْنَآ
اِلَيْهِمْ فِعْلَ الْخَيْرٰتِ وَاِقَامَ الصَّلٰوةِ وَاِيْتَآءَ
الزَّكٰوةِ ۚ وَكَانُوْا لَنَا عٰبِدِيْنَ ﴿73﴾

**73** ఇంకా – మా ఆదేశానుసారం ప్రజలకు మార్గదర్శకత్వం వహించటానికి మేము వారిని ఇమాములు (నాయకులు)గా తీర్చిదిద్దాము. పుణ్యకార్యాలు చేస్తూ ఉండాలనీ, నమాజులను నెలకొల్పుతూ ఉండాలనీ, జకాత్ (దానాన్ని) చెల్లిస్తూ ఉండాలనీ మేము వారికి సూచించాము (వారి వైపుకు వహీ పంపాము). వారంతా మమ్మల్నే ఆరాధించేవారు.

---

బుద్ధిలేదా?' అని సూటిగా అడిగేశారు. మీరు పూజించే ఈ విగ్రహాలు అత్యంత దయనీయస్థితిలో ఉన్నాయని తెలిసి కూడా వాటి ముందే ఎందుకు తలవంచుతున్నారు? అని తన ఆవేదనను వ్యక్తపరిచారు.

77. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) హేతుబద్ధంగా ఇచ్చిన సమాధానం వాళ్ళను ఆలోచనలో పడవేసినప్పటికీ, సత్యాన్ని బాహాటంగా ఒప్పుకోవటానికి అహం అడ్డు తగిలింది. వారి నరనరాన జీర్ణించుకుపోయిన అవిశ్వాసం, బహుదైవారాధన వారి మనోనేత్రాన్ని కాంతిహీనం చేసేసింది. అందువల్ల వారు పశ్చాత్తాపభావంతో కుంచించుకు పోవలసింది పోయి – కుహనా ప్రతిష్ఠల కోసం – హజ్రత్ ఇబ్రాహీంపై తిరగబడ్డారు. ఆయన్ని సజీవంగా దహనం చేసే సన్నాహాలు మొదలెట్టారు. ఆ విధంగా వారు తమ దేముళ్ళకు 'సహాయం' చేయాలనుకున్నారు. పెద్ద అగ్ని గుండం తయారుచేయబడింది. వారు ఆ ఏకదైవారాధకుణ్ణి అగ్నికి ఆహుతి చేసే దుస్సాహసానికి ఒడిగట్టారు. అయితే తన ప్రియతముని కోసం చల్లారిపొమ్మని అల్లాహ్ అగ్నిని ఆదేశించాడు. ఆయనకు రక్షణ కల్పించమని కూడా ఆజ్ఞాపించాడు. 'చల్లారిపో' అని అనటంతోపాటు 'రక్షణ కల్పించు' అని కూడా చెప్పటం గమనార్హం. 'రక్షణ కల్పించు' అని చెప్పకుండా ఉంటే ఆ అగ్ని పూర్తిగా చల్లబడి మంచుగడ్డలా అయిపోయి ఉండేదనీ, అదేగనక జరిగితే హజ్రత్ ఇబ్రాహీం తట్టుకోలేకపోయేవారని పండితులు వ్యాఖ్యానించారు. మొత్తానికి ఇదొక గొప్ప అద్భుతం! దహించివేసే అగ్నిగుండాన్ని అల్లాహ్ తన ప్రియతమ దాసునికోసం పూలవనంగా మార్చివేశాడు. ఈ విధంగా కరుణామయుడైన అల్లాహ్ కర్కశుల బారి నుంచి తన ప్రవక్తను కాపాడాడు.

78. ఇంతకీ 'ఆ భూభాగం' ఏది? అత్యధికమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం అది సిరియా భూభాగం. అది సస్యశ్యామల దేశం. సారవంతమైన భూములు, కాలువలతో పాటు ఆ ప్రదేశంలో చాలామంది ప్రవక్తలు నివాసమేర్పరచుకోవటం వల్ల అది శుభప్రదమైన ప్రదేశంగా ఖ్యాతి గడించింది.

79. **'నాఫిలతన్' (نَافِلَةً)** అంటే అదనంగా, పైపెచ్చు అన్న అర్థాలు వస్తాయి. ఇబ్రాహీం కేవలం కొడుకు కోసమే దుఆ చేశాడు. మేమతనికి కొడుకుతోపాటు మనవణ్ణి కూడా ప్రసాదించాము.

74 మేము లూతు (అలైహిస్సలాం)కు నిర్ణయం గైకొనే శక్తినీ, జ్ఞానాన్నీ ప్రసాదించాము. నీతిమాలిన పనులకు లోనై ఉన్న జనవాసం బారి నుంచి అతనికి విముక్తిని కల్పించాము. ఆ జాతి వారు పరమ నీచులు, అవిధేయులు.

وَلُوطًا آتَيْنَاهُ حُكْمًا وَعِلْمًا وَنَجَّيْنَاهُ مِنَ
الْقَرْيَةِ الَّتِي كَانَتْ تَعْمَلُ الْخَبَائِثَ ۗ إِنَّهُمْ
كَانُوا قَوْمَ سَوْءٍ فَاسِقِينَ ﴿٧٤﴾

75 మేము లూతును మా కారుణ్యంలో చేర్చుకున్నాము. నిశ్చయంగా అతను సజ్జనుల కోవకు చెందినవాడు.[80]

وَأَدْخَلْنَاهُ فِي رَحْمَتِنَا ۖ إِنَّهُ مِنَ الصَّالِحِينَ ﴿٧٥﴾

76 అంతకుముందు నూహ్ మొరపెట్టుకున్నప్పటి సమయాన్ని కూడా గుర్తు చేసుకోండి. మేము అతని మొరను ఆలకించి ఆమోదించాము. అతన్నీ, అతని ఇంటి వారినీ తీవ్రమైన వ్యధ నుంచి కాపాడాము.

وَنُوحًا إِذْ نَادَىٰ مِن قَبْلُ فَاسْتَجَبْنَا لَهُ فَنَجَّيْنَاهُ
وَأَهْلَهُ مِنَ الْكَرْبِ الْعَظِيمِ ﴿٧٦﴾

77 మా ఆయతులను ధిక్కరిస్తూ వచ్చిన జాతికి వ్యతిరేకంగా మేము అతనికి సహాయం చేశాము. నిశ్చయంగా ఆ జాతి వారు పాపాత్ములు. అందుకే మేము వారందరినీ ముంచివేశాము.

وَنَصَرْنَاهُ مِنَ الْقَوْمِ الَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا ۚ
إِنَّهُمْ كَانُوا قَوْمَ سَوْءٍ فَأَغْرَقْنَاهُمْ أَجْمَعِينَ ﴿٧٧﴾

78 దావూదు, సులైమానులను కూడా (జ్ఞప్తికి తెచ్చుకోండి). కొందరి మేకలు రాత్రి పూట పొలంలో పడి మేయగా, ఆ పొలం విషయంలో వారిద్దరూ తీర్పు చేస్తున్నప్పుడు, ఆ తీర్పునంతటినీ మేము గమనిస్తూనే ఉన్నాము.

وَدَاوُودَ وَسُلَيْمَانَ إِذْ يَحْكُمَانِ فِي الْحَرْثِ
إِذْ نَفَشَتْ فِيهِ غَنَمُ الْقَوْمِ وَكُنَّا لِحُكْمِهِمْ
شَاهِدِينَ ﴿٧٨﴾

79 మరి (ఆ సమయంలో ఆ వివాదంపై) మేము సులైమానుకు సరైన అవగాహనను కలుగజేశాము.[81] ఆ మాటకొస్తే వారిలో ప్రతి ఒక్కరికీ మేము నిర్ణయం తీసుకునే శక్తినీ, జ్ఞానాన్నీ ఇచ్చి

فَفَهَّمْنَاهَا سُلَيْمَانَ ۚ وَكُلًّا آتَيْنَا حُكْمًا وَعِلْمًا ۚ
وَسَخَّرْنَا مَعَ دَاوُودَ الْجِبَالَ يُسَبِّحْنَ وَالطَّيْرَ ۚ

80. హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు భాతృజుడు అవుతారు. ఇబ్రాహీమ్ ప్రవక్తను విశ్వసించి, ఆయనతోపాటు ఇరాక్ ప్రాంతం నుంచి సిరియాకు వలసవెళ్ళినవారిలో ఈయన కూడా ఉన్నారు. అల్లాహ్ ఈయనగారికి కూడా యుక్తినీ, వివేకాన్నీ వొసగాడు. ఆయన్ని తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. ఆయన ప్రవక్తగా పంపబడిన ప్రాంతం అమూరాగా, సదూమ్‌గా పిలువబడుతోంది. అది పాలస్తీనాలోని మృత సముద్రానికి ఆనుకుని, జోర్డాన్ వైపుకు విస్తరించి ఉన్న సారవంతమైన, పచ్చని ప్రదేశం. ప్రస్తుతం ఆ ప్రాంతంలో చాలా భూభాగం మృతసముద్రంలో అంతర్భాగంగా ఉంది. ఆయన జాతివారు స్వలింగ సంపర్కం (హోమో సెక్సువాలిటీ) జాడ్యానికి లోనయ్యారు. వచ్చేపోయే జనులను వేధించటం, వెటకారంగా మాట్లాడటం వారి దినచర్యగా మారిపోయింది. వారి చేష్టను అల్లాహ్ ఇక్కడ అత్యంత నీతిమాలిన చేష్టగా, పాపిష్టి పనిగా అభివర్ణించాడు. ఎట్టకేలకు అల్లాహ్ హజ్రత్ లూత్‌ను, ఆయన అనుయాయులను తన కారుణ్యపరిధిలోకి తీసుకుని చెండాలమైన పనికి అలవాటుపడిన వారందరినీ నాశనం చేశాడు.

81. ఆ కేసు గురించి ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఈ విధంగా వివరించారు: ఒకవ్యక్తి మేకలు రాత్రి సమయంలో మరోవ్యక్తి

وَكُنَّا فٰعِلِيْنَ ﴿79﴾

ఉన్నాము. మేము దావూదుతోపాటు పర్వతాలు,[82] పక్షులు[83] అతనికి లోబడి (దైవ) స్తోత్రం చేసేవిగా చేశాము. ఇదంతా చేసినది మేమే.[84]

وَعَلَّمْنٰهُ صَنْعَةَ لَبُوْسٍ لَّكُمْ لِتُحْصِنَكُمْ مِّنْۢ بَأْسِكُمْۚ فَهَلْ اَنْتُمْ شٰكِرُوْنَ ﴿80﴾

**80** మీ కోసం ఒక (ప్రత్యేక) వస్త్రాన్ని అల్లే కళను మేమతనికి నేర్పాము – తద్వారా మీరు యుద్ధంలో (వేటు పడకుండా) రక్షణ పొందటానికి![85] మరి మీరు కృతజ్ఞులుగా మసలుకుంటున్నారా?

చేనులో పడి అడ్డదిడ్డంగా మేశాయి. చేనంతా తొక్కేశాయి. ఆ కాలంలో హ్రజత్ దావూద్ (అలైహిస్సలాం) ప్రవక్తతోపాటు రాజ్యాధికారి కూడాను. ఆయన ఆ కేసును గురించి విచారించి మేకల యజమాని తన మేకలన్నింటినీ పొలం యజమానికి ఇచ్చివేయాలని తీర్పు ఇచ్చారు. ఆ విధంగా పంటకు జరిగిన నష్టం భర్తీ అవుతుందని ఆయన తలపోశారు. కాని హ్రజత్ సులైమాన్ (అలైహిస్సలాం) ఈ తీర్పుతో విభేదించారు. మేకలను పొలం యజమానికి శాశ్వతంగా కాకుండా కొంతకాలం పాటు మాత్రమే స్వాధీనం చేయాలనీ, ఆ మేకల (పాలు) ద్వారా పొలం యజమాని లబ్ధిపొందవచ్చునీ, ఈ మధ్య కాలంలో మేకల యజమాని ఆ పొలానికి కాపలాగా ఉంటూ, దానికి నీరు సరఫరా చేస్తుండాలనీ, మేకలు పడి మేయక ముందు పొలం ఎలా ఉండేదో అలా తయారైన తరువాత వస్తుమార్పిడి చేసుకొని ఇద్దరూ పూర్వస్థితికి రావాలని, తద్వారా ఎవరికీ అన్యాయం జరగదని ఆయన తీర్పు ఇచ్చారు. మొదటి తీర్పుకంటే ఈ తీర్పు మెరుగైనది. ఎందుకంటే ఈ రెండవ తీర్పు ప్రకారం మేకల యజమాని కొంతకాలం పాటు శ్రమదానం చేసి రైతుకు జరిగిన నష్టాన్ని పూరించాడు. అటు రైతు కూడా ఈలోగా ఖాళీగా కూర్చోకుండా మేకల ద్వారా ప్రయోజనం పొందాడు. ఈ తీర్పు సులైమాన్ (అలైహిస్సలాం)కు ప్రసాదించబడిన విషయావగాహనకు, బుద్ధికుశలతకు ప్రబల నిదర్శనం. అయితే అల్లాహ్ వారిద్దరినీ మెచ్చుకున్నాడు. వారుభయులకు తాను బుద్ధివివేచనలను ప్రసాదించానని చెప్పాడు.

ఈ కేసును ఉదాహరిస్తూ కొందరు ఏమంటారంటే; సమకాలీన సమస్యలను (సవాళ్లను) షరీయతు సూత్రాలకు అన్వయింపజేసే ప్రతి ధర్మశాస్త్ర నిపుణుడూ (ముజ్తహిద్) సరైన తీర్పరిగానే పరిగణించబడతాడు. అయితే ఈ వాదన సరైనది కాదని ఇమామ్ షౌకానీ అంటున్నారు. ఏదేని ఒక వ్యవహారంపై రెండు వేర్వేరు (పరస్పర విరుద్ధమైన) తీర్పులు ఇచ్చే న్యాయమూర్తులు ఏకకాలంలో ఇద్దరూ 'కరెక్ట్' ఎలా అవుతారు? ఎన్నటికీ కాలేరు. వారిలో ఎవరో ఒక్కరు మాత్రమే సరైన తీర్పు ఇచ్చినవారై ఉంటారు. రెండవ వ్యక్తి ఇచ్చిన తీర్పు న్యాయానికి, వాస్తవికతకు దూరంగా ఉంటుంది. అయితే తప్పుడు తీర్పు ఇచ్చిన వ్యక్తి మాత్రం దైవసమక్షంలో పాపాత్ముడుగా పరిగణించబడడు. పైగా అతనికి – అతను చేసిన కృషికిగాను – ఒకింత పుణ్యఫలమే లభిస్తుంది. హదీసు ద్వారా అవగతమయ్యేది కూడా ఇదే (ఫత్హుల్ ఖదీర్).

82. దావూద్ ప్రవక్త చేసిన దైవస్తోత్రం మూలంగా పర్వతాలు ప్రతిధ్వనించేవి అన్నది దీని భావం ఎంతమాత్రం కాదు. దావూదు (అలైహిస్సలాం) దైవస్తోత్రం చేసినట్లుగా, అతనితోపాటు పర్వతాలు కూడా ఆ స్తోత్రంలో పాల్గొనేవి అని దాని భావం.

83. పక్షులు కూడా దావూదు (అలైహిస్సలాం) గారి మధురమైన స్తోత్రగానం విని ఆయనతో కలిసి వంతపాడేవి. పక్షులు దైవప్రవక్త దావూద్ (అలైహిస్సలాం) ఆజ్ఞలకు కట్టుబడి ఉండేటట్లుగా చేశాడు దేవుడు (ఫత్హుల్ ఖదీర్).

84. పర్వతాలు, పక్షులు దావూదుతో కలిసి దైవస్తోత్రం చేసినా, ఎగిరే పక్షులు దావూదు ఆజ్ఞలను తు.చ. తప్పకుండా అమలుచేసినా – ఇదంతా మా ప్రణాళికేనన్న సంగతిని విస్మరించకండి. అందువల్ల 'ఇది సంభవమేనా?!' అని ఆశ్చర్యపడాల్సిన అవసరంగానీ, త్రోసిపుచ్చవలసిన అగత్యం గానీ లేదు. ఎందుకంటే మేము తలచినది చేసి తీరుతాము అని అల్లాహ్ అంటున్నాడు.

85. మేము ఇనుమును దావూదు (అలైహిస్సలాం) కొరకు మెత్తబరచాము. దాంతో అతను యుద్ధ సమయాలలో ధరించే

**81** ఇంకా మేము ప్రచండ వేగంతో వీచే గాలిని సులైమానుకు లోబరచాము.[86] అది అతని ఆజ్ఞలననుసరించి, మేము శుభాలను ప్రోదిచేసిన భూభాగం వైపుకు నడిచేది. అన్ని విషయాలూ మా జ్ఞాన పరిధిలో ఉన్నాయి.

وَلِسُلَيْمٰنَ الرِّيْحَ عَاصِفَةً تَجْرِيْ بِاَمْرِهٖٓ اِلَى الْاَرْضِ الَّتِيْ بٰرَكْنَا فِيْهَا ۭ وَكُنَّا بِكُلِّ شَيْءٍ عٰلِمِيْنَ ﴿81﴾

**82** అలాగే ఎన్నో షైతానులను కూడా మేము అతని అదుపాజ్ఞలలో ఉంచాము. అతని కోసం అవి (సముద్రంలో) మునకలు వేసేవి. ఇది గాకుండా ఇంకా ఇతరత్రా ఎన్నో పనులు కూడా చేసి పెట్టేవి.[87] వాటన్నింటినీ మేమే పర్యవేక్షిస్తూ ఉండేవారం.[88]

وَمِنَ الشَّيٰطِيْنِ مَنْ يَّغُوْصُوْنَ لَهٗ وَيَعْمَلُوْنَ عَمَلًا دُوْنَ ذٰلِكَ ۚ وَكُنَّا لَهُمْ حٰفِظِيْنَ ﴿82﴾

**83** మరి అయ్యూబు (స్థితిని గురించి కూడా ఓసారి మననం చేసుకోండి). అతను "నాకు ఈ వ్యాధి సోకింది. నువ్వు కరుణించే వారందరిలోకీ అపారంగా కరుణించేవాడవు" అని తన ప్రభువును మొరపెట్టుకున్నప్పుడు,

وَاَيُّوْبَ اِذْ نَادٰى رَبَّهٗٓ اَنِّيْ مَسَّنِيَ الضُّرُّ وَاَنْتَ اَرْحَمُ الرّٰحِمِيْنَ ﴿83﴾

**84** మేము అతని ప్రార్థనను ఆలకించి, ఆమోదించాము. అతని బాధను దూరం చేశాము. అతనికి అతని ఇంటివారలను ప్రసాదించాము. పైగా వారితోపాటు వారిని పోలిన మరి అంతే మందిని మా ప్రత్యేక కటాక్షంతో[89] అతనికి వొసగాము - నికార్సయిన దాసుల కొరకు ఇదొక గుణపాఠం కావాలని!

فَاسْتَجَبْنَا لَهٗ فَكَشَفْنَا مَا بِهٖ مِنْ ضُرٍّ وَّاٰتَيْنٰهُ اَهْلَهٗ وَمِثْلَهُمْ مَّعَهُمْ رَحْمَةً مِّنْ عِنْدِنَا وَذِكْرٰى لِلْعٰبِدِيْنَ ﴿84﴾

ప్రత్యేక వస్త్రాలను, ఇనుప కవచాలను తయారు చేసేవాడు. ఆ వస్త్రాలు మీకు యుద్ధాలలో ఎంతగానో ఉపయోగపడేవి అని అల్లాహ్ చెబుతున్నాడు. హజ్రత్ ఖతాదా (రజి) కథనం ప్రకారం హజ్రత్ దావూద్ (అలైహి స్సలాం)కు పూర్వం కూడా సిపాయిల డ్రస్సులు తయారయ్యేవి. అయితే అవి చాలా సాదాసీదాగా ఉండేవి. వాటిలో వలయాలు ఉండేవి కావు. వలయాలతో కూడిన కవచాలను తయారు చేసిన తొలి వ్యక్తి దావూద్ ప్రవక్తే. (ఇబ్నె కసీర్).

86. పర్వతాలను, పక్షులు గువ్వలను దేవుడు దావూదుకు వశపరచినట్లే 'వాయువు'ను సులైమాన్‌కు స్వాధీనం చేశాడు. ఆయన తన సలహాదారుల సమేతంగా రాజ్యపీఠంపై కూర్చొని, తాను కోరిన ప్రదేశానికి గాలిలో ఎగిరిపోయేవారు. కొన్ని నెలల తరబడి చేయాల్సిన సుదీర్ఘ ప్రయాణం కొన్ని నిమిషాలలో, కొన్ని గంటలలో చేసేవారు. శుభాలు ప్రోదిచేయబడిన భూభాగం అంటే సిరియా ప్రాంతం అని భావం.

87. జిన్నాతులు అనే సృష్టితాలు కూడా హజ్రత్ సులైమాన్ అదుపులో ఉండేవి. ఆయన ఆజ్ఞాపించినప్పుడల్లా అవి సముద్రంలో మునకలు వేసి విలువైన ముత్యాలు, పగడాలు వెలికితెచ్చేవి. అంతేకాదు, ఎన్నో బ్రహ్మాండమైన కట్టడాలు, బహుళార్థ సాధక ప్రాజెక్టుల పనిని కూడా ఆయన వాటిచేత చేయించేవారు.

88. దీని అర్థం ఏమిటంటే జిన్నులలో సాధారణంగా తలబిరుసుతనం ఎక్కువగా ఉంటుంది. అదను చూసి అరాచకాన్ని, అశాంతిని కూడా జిన్నులు సృష్టిస్తాయి. అయితే వాటిలో ఉన్న ఈ చెడుగు ద్వారా సులైమానుకు ఎలాంటి కీడు, అపకారం జరగకుండా మేము వాటిని పర్యవేక్షిస్తూ ఉండేవాళ్ళం అని అల్లాహ్ చెబుతున్నాడు.

89. దివ్య ఖుర్ఆన్‌లో హజ్రత్ అయ్యూబ్ అలైహిస్సలాం సహనమూర్తిగా పేర్కొనబడ్డారు (సాద్ సూరా-44). ఆయన

85 ఇంకా ఇస్మాయీలు, ఇద్రీసు, జుల్‌కిఫ్ల్[90] (లను కూడా జ్ఞప్తికి తెచ్చుకోండి). వారంతా సహనశీలుర కోవకు చెందినవారు.

وَإِسْمَٰعِيلَ وَإِدْرِيسَ وَذَا ٱلْكِفْلِ ۖ كُلٌّ مِّنَ ٱلصَّٰبِرِينَ ﴿85﴾

86 మేము వారందరినీ మా కారుణ్యం లోనికి చేర్చుకున్నాము. ఎందుకంటే వారందరూ సజ్జనుల కోవకు చెందినవారు.

وَأَدْخَلْنَٰهُمْ فِى رَحْمَتِنَآ ۖ إِنَّهُم مِّنَ ٱلصَّٰلِحِينَ ﴿86﴾

87 చేపవాడు (యూనుస్ అలైహిస్సలాం)[91] కోపగించుకుని వెళ్ళిపోయినప్పటి స్థితి(ని కూడా జ్ఞప్తికి తెచ్చుకోండి.) మేము తనను పట్టుకోలేమని అతడు భావించాడు. ఆఖరికి అతను చీకట్లలో నుంచి,[92] "అల్లాహ్! నీవు తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. నీవు పవిత్రుడవు. నిజానికి నేనే దోషులలో చేరిన వాణ్ణి" అని మొరపెట్టుకున్నాడు.

وَذَا ٱلنُّونِ إِذ ذَّهَبَ مُغَٰضِبًا فَظَنَّ أَن لَّن نَّقْدِرَ عَلَيْهِ فَنَادَىٰ فِى ٱلظُّلُمَٰتِ أَن لَّآ إِلَٰهَ إِلَّآ أَنتَ سُبْحَٰنَكَ إِنِّى كُنتُ مِنَ ٱلظَّٰلِمِينَ ﴿87﴾

కఠిన పరీక్షలకు గురిచేయబడ్డారు. కాని ఆయన మాత్రం ఎన్నడూ సహనాన్ని వీడలేదు. దేవునిపట్ల ఎన్నడూ కృతఘ్నతా ధోరణిని వ్యక్తపరచలేదు. ఇంతకీ ఆ బాధలు, పరీక్షలు ఏమిటో ప్రామాణిక ఆధారాల ద్వారా తెలియరావటం లేదు గాని దివ్య ఖుర్‌ఆన్ వివరిస్తున్న దానినిబట్టి దేవుడు మొదట ఆయనకు అపారమైన సిరిసంపదలను, కొడుకులను ప్రసాదించాడు. అయితే ఆ తరువాత ఆయన్ని పరీక్షించే నిమిత్తం వాటన్నింటినీ లాక్కున్నాడు. ఆఖరికి ఆయన తీవ్రమైన అస్వస్థతకు కూడా లోనయ్యారు. కడకు 18 ఏండ్ల తరువాత ఆయన తన ప్రభువు సన్నిధిలో ఆర్ద్రతతో వేడుకున్నారనీ – దేవుడు ఆయన ఫిర్యాదును విన్నాడనీ, ఆయనకు తిరిగి ఆయురారోగ్యాలతో పాటు, మునుపటికన్నా రెట్టింపు సంపదను ఆలుబిడ్డలను ప్రసాదించాడనీ చెబుతారు (ఈ వృత్తాంతం గురించిన కొన్ని వివరాలు సహీహ్ ఇబ్నె హిబ్బాన్‌లోని ఒక ఉల్లేఖనంలో లభిస్తాయి – సంపుటి : 4, పేజీ – 244; మజ్మఅ జవాయిద్ – 8/208). అసహనం, కృతఘ్నతా ధోరణి, నిందారోపణ లాంటివన్నీ సహనశీలానికి విరుద్ధమైనవి. హజ్రత్ అయ్యూబ్ (అలైహిస్సలాం) ఈ కష్టాలను ఓపికతో భరించారే తప్ప ఎవరి ముందూ ఎలాంటి ఫిర్యాదూ చేయలేదు. విసుగును, నిరాశను కూడా వ్యక్తపరచలేదు. అయితే దుఆ చేయటం ఓర్పు, సహనానికి విరుద్ధాంశం కాదు. అందుకే "మేము ఆయన మొరను ఆలకించాము, ఆమోదించాము" అని అల్లాహ్ అంటున్నాడు.

90. జుల్‌కిఫ్ల్ కూడా ప్రవక్తేనా? కాదా? అన్న విషయంలో భేదాభిప్రాయం ఉంది. ఆయన ప్రవక్త అని కొందరు అభిప్రాయపడుతుండగా, బహుశా ఆయన దేవుని ప్రియతమ భక్తుడు (వలీ) అయి ఉంటారని మరికొందరు అంటున్నారు. ఇమామ్ ఇబ్నె జరీర్ ఈ విషయంలో మౌనం వహించారు. అయితే దివ్య ఖుర్‌ఆన్‌లో జుల్‌కిఫ్ల్ ప్రస్తావన ప్రవక్తల ప్రస్తావనతో కలసి ఉన్నందున ఆయన కూడా దైవప్రవక్త అయి ఉండే అవకాశం ఉందని ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయపడ్డారు. వాస్తవం అల్లాహ్‌కే ఎరుక.

91. **'చేపవాడు'** అంటే హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) అని భావం. ఆయన తన జాతి ప్రజల తిరస్కార వైఖరికి విసుగుచెంది, అసంతృప్తితో, వారిపై దైవాగ్రహం విరుచుకుపడుతుందని హెచ్చరించి, దేవుని అనుమతి పొందకుండానే అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆయనగారి ఈ ధోరణి అల్లాహ్‌కు నచ్చలేదు. ఆయన్ని చేప మింగేసింది. ఈ వివరాలు యూనుస్ సూరాలో ఇంతకు ముందు – స్థూలంగా – వచ్చాయి. మిగిలిన వివరాలు సాఫ్ఫాత్ సూరాలో రానున్నాయి.

92. ఆయన (అలైహిస్సలాం) రకరకాల చీకట్లలో చిక్కుకున్నారు – రాత్రి చీకటి, సముద్రపు చీకటి, చేప కడుపులోని చీకటి మొదలగునవి. 'జులుమాత్' అంటే అంధకారాలు, చీకట్లు అని అర్థం.

فَاسْتَجَبْنَا لَهُ ۙ وَنَجَّيْنٰهُ مِنَ الْغَمِّ ؕ وَكَذٰلِكَ نُـْۨجِي الْمُؤْمِنِيْنَ ﴿88﴾

**88** అందువల్ల మేము అతని మొరను ఆలకించాము. దుఃఖం నుంచి అతనికి విముక్తిని కల్పించాము. విశ్వాసులను మేము ఇలాగే కాపాడుతాము.[93]

وَزَكَرِيَّاۤ اِذْ نَادٰى رَبَّهٗ رَبِّ لَا تَذَرْنِيْ فَرْدًا وَّاَنْتَ خَيْرُ الْوٰرِثِيْنَ ﴿89﴾

**89** జకరియ్యా (వృత్తాంతాన్ని కూడా స్మరించుకోండి). అతను తన ప్రభువుతో, "నా ప్రభూ! నన్ను ఒంటరివానిగా వదలకు. నీవు అందరికన్నా అత్యుత్తమ వారసుడవు" అని మొరపెట్టుకున్నాడు.

فَاسْتَجَبْنَا لَهٗ ۫ وَوَهَبْنَا لَهٗ يَحْيٰى وَاَصْلَحْنَا لَهٗ زَوْجَهٗ ؕ اِنَّهُمْ كَانُوْا يُسٰرِعُوْنَ فِي الْخَيْرٰتِ وَيَدْعُوْنَنَا رَغَبًا وَّرَهَبًا ؕ وَكَانُوْا لَنَا خٰشِعِيْنَ ﴿90﴾

**90** మేము అతని ప్రార్థనను స్వీకరించి, అతనికి యహ్యాను ప్రసాదించాము.[94] అతని భార్యను అతని కోసం బాగు చేశాము.[95] ఈ సద్వర్తనులు సత్కార్యాల కోసం త్వరపడేవారు. ఆశతోనూ, భయంతోనూ మమ్మల్ని వేడుకునేవారు. మా ముందు అశక్తతను, అణకువను కనబరచేవారు.[96]

وَالَّتِيْۤ اَحْصَنَتْ فَرْجَهَا فَنَفَخْنَا فِيْهَا مِنْ رُّوْحِنَا وَجَعَلْنٰهَا وَابْنَهَاۤ اٰيَةً لِّلْعٰلَمِيْنَ ﴿91﴾

**91** ఇక తన శీలాన్ని కాపాడుకున్న ఆ శీలవతి గురించి; ఆమె (చొక్కా చేతి)యందు మేము మా ఆత్మ (జిబ్రీల్) ద్వారా ఊదాము. స్వయంగా ఆమెనూ, ఆమె కుమారుణ్ణీ లోకవాసుల కోసం నిదర్శనంగా చేశాము.[97]

93. ఎట్టకేలకు మేము యూనుస్ (అలైహిస్సలాం) ప్రార్థనను ఆలకించాము. అతనికి చేప కడుపు నుంచి విముక్తిని వొసగాము. బాధల నుంచి విముక్తికై మమ్మల్ని మొరపెట్టుకునే విశ్వాసుల్ని మేము ఇలాగే రక్షిస్తాము. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: ఈ దుఆ ఆధారంగా ఏ ముస్లిం తన గోడును నివేదించుకున్నా అల్లాహ్ దానిని ఆమోదిస్తాడు" (జామె తిర్మిజీ – హ.నెం. 3505, అల్బానీ గారు ఈ హదీసుని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

94. హజ్రత్ జకరియ్యా (అలైహిస్సలాం) ముసలితనంలో సంతానం కోసం దైవాన్ని వేడుకోవటం, దేవుడు ఆయన వేడుకోలును స్వీకరించటం – ఈ వివరాలు ఆలి ఇమ్రాన్ సూరాలో, మర్యమ్ సూరాలో సవివరంగా వచ్చాయి. ఈ ఆయతుల్లో సంక్షిప్తంగా విషయం పునరావృతం అయింది.

95. అంటే ఆమె గొడ్రాలిగా ఉండేది. మేము ఆమెలోని ఆ లోపాన్ని దూరం చేసి ఆమెను గర్భధారణకు యోగ్యురాలుగా చేశాము. ఆమెకు సజ్జన సంతానం ప్రసాదించాము.

96. ఈ వాక్యాలను బట్టి అర్థమయ్యేదేమిటంటే దైవసన్నిధిలో దుఆ ఆమోదయోగ్యం కావటానికి ఈ విషయాలన్నింటికీ దాసుడు కట్టుబడి ఉండాలి. అంటే అతను సజ్జనుడై ఉండాలి. మంచిపనుల వైపుకు మొగ్గుచూపాలి. దైవసన్నిధిలో తన అశక్తతని, దీనావస్థను వెలిబుచ్చుకోవాలి. దేవుడు తన మొరను తప్పకుండా ఆలకిస్తాడన్న ఆశాభావం అతనిలో దృఢంగా ఉండాలి. అదే సమయంలో తన ప్రభువు పట్ల భయభక్తులు కూడా కలిగి ఉండాలి.

97. హజ్రత్ మర్యమ్, హజ్రత్ ఈసా (అలైహిస్సలాం)ల ప్రస్తావన ఇది. ఇంతకుముందు ఈ విషయం విపులంగా చర్చించబడింది.

92 మీ ఈ సమాజం (లేక మతధర్మం) వాస్తవానికి ఒకే సమాజం[98] (ఒకే మత ధర్మం). నేను మీ అందరి ప్రభువును. కనుక మీరు నన్నే ఆరాధించండి.

إِنَّ هَٰذِهِۦٓ أُمَّتُكُمْ أُمَّةً وَٰحِدَةً وَأَنَا۠ رَبُّكُمْ فَٱعْبُدُونِ ﴿٩٢﴾

93 కాని ప్రజలు పరస్పరం (విభేదించుకుని) తమ ధర్మంలో ముఠాలు సృష్టించుకున్నారు. అయితే అందరూ మా వద్దకు మరలి రావలసిన వారే.[99]

وَتَقَطَّعُوٓا۟ أَمْرَهُم بَيْنَهُمْ ۖ كُلٌّ إِلَيْنَا رَٰجِعُونَ ﴿٩٣﴾

94 మరెవరయితే సత్కార్యాలు చేస్తూ ఉంటాడో అతను విశ్వాసి (కూడా) అయి వుంటే, అతని కృషికి గుర్తింపు లభించకపోవటం అంటూ జరగదు. మేము దాన్ని వ్రాసి ఉంచుతాము.

فَمَن يَعْمَلْ مِنَ ٱلصَّٰلِحَٰتِ وَهُوَ مُؤْمِنٌ فَلَا كُفْرَانَ لِسَعْيِهِۦ وَإِنَّا لَهُۥ كَٰتِبُونَ ﴿٩٤﴾

95 ఏ పట్టణాన్ని మేము నాశనం చేశామో అక్కడి ప్రజలు మళ్లీ తిరిగి రావటం అన్నది అసంభవం.[100]

وَحَرَٰمٌ عَلَىٰ قَرْيَةٍ أَهْلَكْنَٰهَآ أَنَّهُمْ لَا يَرْجِعُونَ ﴿٩٥﴾

96 చివరికి యాజూజ్ మాజూజ్‌లు వదలి పెట్టబడతారు. వారు ఎత్తయిన ప్రదేశాలన్నింటి నుంచీ ఎగబడి వస్తారు.[101]

حَتَّىٰٓ إِذَا فُتِحَتْ يَأْجُوجُ وَمَأْجُوجُ وَهُم مِّن كُلِّ حَدَبٍ يَنسِلُونَ ﴿٩٦﴾

98. ఈ ఆయతులో **'ఉమ్మత్'** అంటే మతధర్మం అని అర్థం. అంటే మీ సమాజం ఒకే సమాజం లేదా మీ ధర్మం ఒకే ధర్మం అని భావం. ఈ ధర్మంవైపుకే దైవప్రవక్తలంతా జనులను ఆహ్వానించారు. సమాజం (మిల్లత్) అంటే ఇస్లామీయ సమాజం అన్నమాట. మరి దైవప్రవక్తలందరి సమాజం ఇస్లామీయ సమాజమే. అందుకే అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "దైవప్రవక్తలమయిన మేము సవతి సోదరుల్లాంటి వారం. (సవతి సోదరుల తల్లులు వేర్వేరు అయినా తండ్రి మాత్రం ఒక్కడే అయి ఉంటాడు; అలాగే) మా ధర్మం కూడా ఒక్కటే." (ఇబ్నె కసీర్)

99. అంటే వారు ఏకదైవారాధన (తౌహీద్)ను ప్రబోధించే ధర్మాన్ని, నిజదేవుని దాస్యాన్ని వదలి వివిధ వర్గాలుగా, తెగలుగా, ముఠాలుగా చీలిపోయారు. ముష్రిక్కుల, తిరస్కారుల వర్గం ఎలాగూ ధర్మం నుండి చీలిపోయిందనుకుంటే, దైవప్రవక్తల అనుయాయుల్లో కూడా చీలికలు వచ్చాయి. వారిలో కొందరు యూదులుగా, మరికొందరు క్రైస్తవులుగా, ఇంకొందరు ఇంకో వర్గంగా విడిపోయారు. ఆఖరికి ఈ ముఠాలు అంతిమ దైవప్రవక్త (సఅసం) అనుయాయులైన ముస్లింలను కూడా వెంటాడటం మానుకోలేదు. ముస్లింలు సయితం డజన్లకొద్దీ ముఠాలుగా, వర్గాలుగా వేర్వేరు కుంపట్లు పెట్టుకున్నారు. వీరిలో ఎవరి విశ్వాసం నికార్సయినదో, ఎవరి ఆచరణ ఆమోదయోగ్యమైనదో, ఎవరు దైవప్రీతికి, క్షమాభిక్షకు అర్హులో తీర్పుదినాన అల్లాహ్ సమక్షంలో హాజరైనప్పుడే తేలుతుంది.

100. ఈ ఆయతులోని **'హరామ్'** (حَرَام) అనే పదం అసంభవం అన్న భావంలో ఉంది. అంటే ఏ పట్టణాన్ని మేము నాశనం చేశామో, అది మళ్లీ తిరిగి రాజాలదు.

101. యాజూజ్ మాజూజ్‌లకు సంబంధించిన కొన్ని వివరాలు కహఫ్ సూరా చివర్లో వచ్చినాయి. ప్రళయదినం సమీపించి నపుడు – దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) సమక్షంలో వీళ్లు ఆవిర్భవిస్తారు. వీళ్లు అమితమైన వేగంతో నలువైపులా విస్తరిస్తారు. ప్రతి మెరక ప్రాంతం నుంచి వారు దండెత్తి వస్తున్నట్లే అనిపిస్తుంది. వారి దుశ్చేష్టలతో, వేధింపులతో 'విశ్వాసులు' విసుగెత్తిపోతారు. ఈ ఆగడాలను భరించలేక, ఆఖరికి హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) విశ్వాసులను తన వెంటబెట్టుకుని తూర్ పర్వతంపై తలదాచుకోవలసి వస్తుంది. అప్పుడు హజ్రత్ ఈసా గారి అభిశాపంతో ఆ దుర్మార్గులంతా అంతమవుతారు. వారి శవాల కంపు సర్వత్రా వ్యాపిస్తుంది. కడకు దైవాజ్ఞతో

وَاقْتَرَبَ الْوَعْدُ الْحَقُّ فَإِذَا هِيَ شَاخِصَةٌ أَبْصَارُ
الَّذِينَ كَفَرُوا ۖ يَا وَيْلَنَا قَدْ كُنَّا فِي غَفْلَةٍ مِّنْ
هَٰذَا بَلْ كُنَّا ظَالِمِينَ ﴿97﴾

**97** మరి సత్యమైన వాగ్దానం సంభవించే సమయం ఆసన్నమవుతుంది. ఆ సమయంలో అవిశ్వాసుల కనుగుడ్లు విచ్చుకున్నవి విచ్చుకున్నట్లుగానే ఉండిపోతాయి.[102] "అయ్యో! మా పాడుగాను! మేము ఈ పరిస్థితి పట్ల పరధ్యానానికి గురయ్యాము. అసలు మేమే దుర్మార్గులం" (అని వారు ఒప్పుకుంటారు).

إِنَّكُمْ وَمَا تَعْبُدُونَ مِن دُونِ اللَّهِ حَصَبُ
جَهَنَّمَ أَنتُمْ لَهَا وَارِدُونَ ﴿98﴾

**98** (ఓ అవిశ్వాసులారా!) మీరూ, అల్లాహ్‌ను వదలి మీరు పూజించే మీ దైవాలు – అందరూ నరకానికి ఇంధనం అవుతారు. మీరంతా దానికి ఆహుతి కావలసినవారే.[103]

لَوْ كَانَ هَٰؤُلَاءِ آلِهَةً مَّا وَرَدُوهَا ۖ
وَكُلٌّ فِيهَا خَالِدُونَ ﴿99﴾

**99** వీళ్ళే గనక (నిజమైన) దైవాలు అయివుంటే నరకానికి ఆహుతి[104] అయ్యేవారే కారు. ఇక వారంతా శాశ్వతంగా అందులో పడి ఉండాల్సినవారే.

لَهُمْ فِيهَا زَفِيرٌ وَهُمْ فِيهَا لَا يَسْمَعُونَ ﴿100﴾

**100** అందులో వారు పెడబొబ్బలు పెడుతూ ఉంటారు. అయితే అందులో వారేమీ వినలేరు.[105]

إِنَّ الَّذِينَ سَبَقَتْ لَهُم مِّنَّا الْحُسْنَىٰ
أُولَٰئِكَ عَنْهَا مُبْعَدُونَ ﴿101﴾

**101** అయితే ముందు నుంచే మా వద్ద ఎవరి కొరకు మేలు ఖరారై ఉందో వారంతా నరకానికి దూరంగానే ఉంచబడతారు.[106]

---

వచ్చిన పక్షులు ఆ శవాలను సముద్రంలో పడవేస్తాయి. ఆ తరువాత దేవుడు ఓ భారీ వర్షం కురిపిస్తాడు. దాంతో నేలంతా పరిశుభ్రమైపోతుంది (ఈ వివరాలన్నీ ప్రామాణిక హదీసులలో విశదీకరించబడ్డాయి. వీటికోసం ఇబ్నె కసీర్ వ్యాఖ్యానం పరిశీలించగలరు).

102. ప్రళయదినపు వాగ్దానం సత్యబద్ధమైనది. అది నెరవేరటం తథ్యం. యాజూజు మాజూజులు పుట్టిన తరువాత ఇది సంభవిస్తుంది. అప్పుడు సత్యతిరస్కారుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. వారి కనుగుడ్లు పైకి తేలిపోతూ ఉంటాయి. ఆ కలకలానికి వారంతా బిత్తరపోతారు. దిక్కుతోచని ఆ స్థితిలో గతాన్ని నెమరువేసుకోవటం మొదలెడతారు.

103. ఈ ఆయతు లాతు, మనాతు, ఉజ్జా, హుబల్ వంటి దేవతలను పూజించే మక్కా అవిశ్వాసుల నేపథ్యంలో అవతరించింది. అవన్నీ రాతి విగ్రహాలే. అవన్నీ రాళ్లు అవటంవల్ల వాటిలో గ్రాహ్యశక్తి లేదు. అందుకే ఈ ఆయతులో **"మా తాబుదూన్"** (مَا تَعْبُدُونَ) అనే పదం వాడబడింది. భావాలు, ఆలోచనలు, బుద్ధివివేకాలు, పంచేంద్రియాలు లేని వాటికోసం అరబీలో **"మా"** (مَا) పదం ప్రయోగించబడుతుంది. దీని భావం ఏమిటంటే మీరూ, మీతోపాటు మీరు ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న ఈ రాతిబొమ్మలు – అన్నీ (అందరూ) నరకానికి ఇంధనం కావలసినవారే. మరి చూడబోతే ఆ రాతి బొమ్మల తప్పేమీ లేదు. వాటిలో చలనంగానీ, స్పృహగానీ లేదు. కాని ఈ ముష్రిక్కులు, అవిశ్వాసులు వాటిని పూజించి ఎంత ఘోరమైన తప్పిదం చేశారో తెలియజెప్పడానికే వారి విగ్రహాల సమేతంగా వారిని నరకానికి ఆహుతి చేయటం జరుగుతుంది.

104. అవే గనక సిసలైన దైవాలై ఉంటే వాటికి వివేచన ఉండేది. వాటికి అధికారాలు ఉండేవి. మీరు నరకానికి ఆహుతి అవుతూ ఉంటే అవి చూస్తూ ఊరుకునేవి కావు. కాని అవి నిస్సహాయంగా ఉండిపోతాయి. ఆ విగ్రహాలు సయితం తమ పూజారులతో కలసి నరకంలో పడతాయి. పూజించేవారు, పూజించబడేవారు – అందరూ నరకంలో సహవాసులే.

105. నరక యాతనకు తాళలేక అందరూ ఒకేసారి అరుస్తూ ఉండటంవల్ల ఎవరేమంటున్నారో ఏ ఒక్కరికీ వినిపించదు.

**102** వారు నరకం సవ్వడి అయినా వినరు. తమ మనసు మెచ్చిన సుఖవిలాసాల మధ్య వారు శాశ్వతంగా ఉంటారు.

لَا يَسْمَعُونَ حَسِيسَهَا ۖ وَهُمْ فِي مَا اشْتَهَتْ
أَنفُسُهُمْ خَالِدُونَ ﴿١٠٢﴾

**103** ఆ మహా కలవరం[107] (కూడా) వారిని వ్యాకుల పరచదు. దైవదూతలు వారిని తీసుకోవటానికి వచ్చి, "మీకు వాగ్దానం చేయబడుతూ ఉన్న రోజు ఇదే" అని అంటారు.

لَا يَحْزُنُهُمُ الْفَزَعُ الْأَكْبَرُ وَتَتَلَقَّاهُمُ
الْمَلَائِكَةُ هَٰذَا يَوْمُكُمُ الَّذِي كُنتُمْ تُوعَدُونَ ﴿١٠٣﴾

**104** ఆ రోజున మేము వ్రాత ప్రతులను చుట్టిపెట్టినట్లుగా ఆకాశాన్ని చుట్టివేస్తాము.[108] ఏ విధంగా మేము మొదటిసారి సృష్టించామో అదేవిధంగా మలిసారి కూడా చేస్తాము. ఈ వాగ్దానాన్ని నెరవేర్చే బాధ్యత మాపైన ఉంది. దాన్ని మేము తప్పకుండా నెరవేరుస్తాము.

يَوْمَ نَطْوِي السَّمَاءَ كَطَيِّ السِّجِلِّ لِلْكُتُبِ ۚ
كَمَا بَدَأْنَا أَوَّلَ خَلْقٍ نُّعِيدُهُ ۚ وَعْدًا عَلَيْنَا ۚ
إِنَّا كُنَّا فَاعِلِينَ ﴿١٠٤﴾

**105** సజ్జనులైన నా దాసులే భూమికి వారసులవుతారని మేము జబూర్ (గ్రంథం)లో హితబోధ అనంతరం వ్రాసిపెట్టాము.[109]

وَلَقَدْ كَتَبْنَا فِي الزَّبُورِ مِن بَعْدِ الذِّكْرِ أَنَّ
الْأَرْضَ يَرِثُهَا عِبَادِيَ الصَّالِحُونَ ﴿١٠٥﴾

106. ఈ సందర్భంగా జనించే కొన్ని సందేహాలకు ఈ ఆయతులో సూటిగా సమాధానం ఇవ్వబడింది. దైవప్రవక్తలైన హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు), ఉజైర్‌లు కూడా పూజించబడ్డారు. దైవదూతలు, పుణ్యపురుషులు కూడా పూజించబడ్డారు. మరి వారంతా తమ భక్తులతో సహా నరకంలో పడవేయబడతారా? అన్న ప్రశ్న కూడా ఉత్పన్నం కావచ్చు. ఇలాంటి ప్రశ్నలన్నింటికీ ఈ ఆయతులో జవాబివ్వబడింది – వారంతా దేవుని ప్రియతమ దాసులు. వారి సద్వర్తన, పుణ్యకార్యాల మూలంగా దేవుడు వారికోసం పరలోకంలో స్వర్గాన్ని రాసిపెట్టాడు. కాబట్టి అలాంటి వారంతా నరకానికి దూరంగానే ఉంచబడతారు. ఈ మాటల ద్వారా ఇంకో విషయం కూడా బోధపడుతోంది – అదేమంటే; తాము చనిపోయిన తరువాత తమ సమాధులపై గుమ్మటాలు కట్టాలని, వాటిని దీపాలతో అలంకరించాలనీ, ప్రజలు తమ సమాధుల వద్దకు తమ అక్కరలు తీర్చమని వేడుకోవాలని గనక ఎవరయినా మనసులో అనుకుంటే అట్టి పరిస్థితిలో వారు దోషులవుతారు. వీళ్లు కూడా రాతి విగ్రహాల మాదిరిగానే తమ భక్తులతో కలసి నరకానికి ఇంధనంగా మారతారు.

107. **'మహా కలవరం'** అంటే అది మృత్యువూ కావచ్చు లేదా ఇస్రాఫీలు ద్వారా పూరించబడే శంఖారావం కూడా కావచ్చు. లేక స్వర్గం – నరకాల మధ్య 'మృత్యువు'ను శాశ్వతంగా అంతమొందించే భీకర సమయమూ కావచ్చు. ఇస్రాఫీలు ప్రళయ సందర్భంగా పూరించే శంఖారావం అన్నదే ఈ సందర్భానికి చాలా దగ్గరగా ఉందని అనిపిస్తోంది.

108. అంటే – ఒక లేఖకుడు లిఖించిన తరువాత పత్రాలను ఎలా చుట్టిపెడతాడో, లేక చిట్టా పద్దులను వ్రాసిన మీదట ఎలా రిజిష్టర్లను మూసిపెడతాడో అలాగే మేము ఆకాశాన్ని చుట్టేస్తాము. ఖుర్‌ఆన్‌లో వేరొక విధంగా సెలవిచ్చినట్లు, "ఆకాశాలు ఆయన కుడిచేతిలో చుట్టబడి ఉంటాయి" (జుమర్ – 67). ఈ పని మహోన్నతుడైన అల్లాహ్ కోసం ఏమాత్రం కష్టతరం కాదు. 'సిజిల్లున్' అంటే పత్రాలు లేక రిజిష్టర్లు అని అర్థం.

109. **'జబూర్'** అంటే జబూర్ గ్రంథమూ కావచ్చు లేదా పూర్వపు ఆకాశగ్రంథాలలో మరేదైనా గ్రంథం కూడా కావచ్చు. ఈ వాక్యంలో జిక్ర్ (హితబోధ) అనే పదం కూడా వచ్చింది. లౌహె మహ్‌ఫూజ్‌లో ఈ విషయాన్ని పొందుపరచి ఉన్నాము అన్నది కూడా దాని భావం కావచ్చు. సజ్జనులైన దేవుని దాసులు భూమికి వారసులవుతారని ఆకాశ (దైవ) గ్రంథాలలో చెప్పబడింది. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు ఈ ఆయతులో 'భూమి' అంటే 'స్వర్గం'

106 అల్లాహ్‌ను ఆరాధించే దాసుల కోసం ఇందులో (ఈ ఖుర్ఆనులో) ఓ గొప్ప సందేశం ఉంది.[110]

إِنَّ فِي هَٰذَا لَبَلَٰغًا لِّقَوْمٍ عَٰبِدِينَ ﴿١٠٦﴾

107 (ఓ ముహమ్మద్!) మేము నిన్ను సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా చేసి పంపాము.[111]

وَمَآ أَرْسَلْنَٰكَ إِلَّا رَحْمَةً لِّلْعَٰلَمِينَ ﴿١٠٧﴾

108 వారికి చెప్పు : "మీరందరి ఆరాధ్య దైవం ఒక్కడే అని మాత్రమే నా వద్దకు సందేశం (వహీ) పంపబడుతోంది. మరి మీరు కూడా విధేయులవుతారా?"[112]

قُلْ إِنَّمَا يُوحَىٰٓ إِلَيَّ أَنَّمَآ إِلَٰهُكُمْ إِلَٰهٌ وَٰحِدٌ ۖ فَهَلْ أَنتُم مُّسْلِمُونَ ﴿١٠٨﴾

కావచ్చునని అభిప్రాయపడ్డారు. మరికొంతమంది దీన్ని 'అవిశ్వాసుల భూమి'గా పరిగణించారు. అంటే దైవవిధేయులైన దాసులు ప్రపంచంలో కూడా గౌరవోన్నతుల్ని పొందుతారు. దైవశాసనాల కనుగుణంగా వారు రాజ్యాన్ని స్థాపిస్తారు. వారు సద్వర్తనులుగా, నీతిమంతులుగా ఉన్నంతకాలం అధికారం వారి చేతుల్లో ఉంటుంది. యోగ్యతను కోల్పోయిన నాడు అధికారం చేజారిపోతుంది. మళ్లీ భవిష్యత్తులో ఎప్పుడైనా వారు యోగ్యతను సంపాదిస్తే దేవుని వాగ్దానం ప్రకారం రాజ్యాధికారం మళ్లీ వారి చేతుల్లోకి వస్తుంది. కాబట్టి ఈనాడు ఎక్కడైనా ముస్లింలు రాజ్యాధికారానికి దూరమై అవమానాల పాలవుతున్నారంటే అది వారి అసమర్థత, అనర్హత, చేతకానితనమే తప్ప మరొకటి కాదు. ఎందుకంటే ప్రపంచంలో వారికి లభించే గౌరవోన్నతులు షరతుతో కూడుకున్నవి. అవి వారి మంచితనంతో, యోగ్యతతో, నీతితో, సద్వర్తనతో ముడిపడి ఉన్నాయి. ఈ సుగుణాలు ముస్లింలలో ఉన్నంతకాలం వారు ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించేవారుగా వర్ధిల్లారు. దేవుని వాగ్దానం నేటికీ ఉంది. కాకపోతే వారిలో ఈ సుగుణాల 'పునరుజ్జీవనం' జరగాలి.

110. ఫీ హాజా (ఇందులో) అంటే 'ఈ ఖుర్ఆన్ గ్రంథంలో' అని ఒక అర్థం. ఈ సూరాలో అని మరో అర్థం. **'బలాఘ్'** (بَلَٰغ) అంటే "చాలినంత", "శ్రేయోదాయకం" అని అర్థం. ఈ ఖుర్ఆన్‌లోని అంశాలు లేక ఈ సూరాలో పలు విధాలుగా చేయబడిన హితబోధ భక్తుల కొరకు ఎంతో లాభదాయకమైనది అని భావం. వినయవినమ్రతలతో దైవారాధన చేసేవారిని, మనోవాంఛలను అదుపులో పెట్టుకుని, షైతాన్ దుష్ప్రేరణల నుంచి అల్లాహ్ శరణు కోరుతూ ఉండేవారిని **"ఆబిదీన్"** (عٰبِدِيْنَ) అని అంటారు.

111. దీని భావం ఏమిటంటే మహాప్రవక్త (సఅసం) సందేశాన్ని విశ్వసించినవాడు ఆ కారుణ్యాన్ని ఆస్వాదించాడు, ఈ దైవానుగ్రహానికిగాను కృతజ్ఞుడయ్యాడు. తత్ఫలితంగా అతను ఇహపరాల భాగ్యాలను పొందాడు. ఆయన (సఅసం) సందేశం సమస్త జగతికి ఉద్దేశించిన సందేశం. అందువల్ల ఆయన (స) యావత్తు ప్రపంచం కోసం మూర్తీభవించిన కారుణ్యంగా – తన ప్రబోధనల ద్వారా ధార్మిక ప్రాపంచిక శుభాలను అందించటానికి విచ్చేశారు.

ఆయన (స) కారుణ్యంగా ప్రభవింపజేయబడ్డారని చెప్పడానికి మరో ముఖ్య కారణమేమిటంటే, ఆయన (స) మూలంగా ఈ సమాజం నామరూపాల్లేకుండా తుడముట్టించబడే శిక్షనుంచి రక్షించబడింది. వెనుకటి జాతులు నామరూపాల్లేకుండా అంతమొందించబడినట్లు ముస్లిం సమాజం – ముహమ్మద్ అనుచర సమాజం (సమస్త మానవాళికీ దైవసందేశం అందజేయాల్సిన బాధ్యత ముస్లిం సమాజంపై ఉండటం వల్ల ఈ సమాజం పరిధి సమస్త మానవ జాతినీ ఆవరించి ఉంది) – ఎన్నడూ పూర్తిగా అంతమొందించబడదు. బహుదైవారాధకులను శపించకుండా ఉండటం కూడా ఆయన (స) కారుణ్యంలో అంతర్భాగమేనని హదీసుల ద్వారా అవగతం అవుతోంది. "నేను శపించేవానిగా చేసి పంపబడలేదు. నేను కారుణ్యంగా చేసి పంపబడ్డాను" అని ఆయన అంటుండేవారు. (సహీహ్ ముస్లిం – హ.నెం. 2006). అలాగే ఆగ్రహావేశంలో ఏ ముస్లింకయినా శాపనార్థాలు పెడితే, అది ప్రళయదినాన కారుణ్యప్రదంగా ఖరారు చేయబడటం కూడా ఆయన (స) కారుణ్యంలో భాగమే. (ముస్నదె అహ్మద్–5/437; అబూ దావూద్ – హ.నెం. 4659;

**109** ఒకవేళ వారు గనక ముఖం త్రిప్పుకుంటే వారికీవిధంగా చెప్పెయ్యి: “నేను మిమ్మల్ని సమానంగా హెచ్చరించాను.[113] మీకు వాగ్దానం చేయబడుతున్న విషయం సమీపంలో ఉందో, దూరాన ఉందో నాకైతే తెలియదు.”[114]

فَإِن تَوَلَّوْا فَقُلْ آذَنتُكُمْ عَلَىٰ سَوَاءٍ ۖ وَإِنْ أَدْرِي أَقَرِيبٌ أَم بَعِيدٌ مَّا تُوعَدُونَ ﴿١٠٩﴾

**110** అయితే మీరు బిగ్గరగా పలికేదీ ఆ ప్రభువుకు తెలుసు. మీరు దాచిపెట్టేది కూడా ఆయనకు తెలుసు.

إِنَّهُ يَعْلَمُ الْجَهْرَ مِنَ الْقَوْلِ وَيَعْلَمُ مَا تَكْتُمُونَ ﴿١١٠﴾

**111** బహుశా ఇది మీకొక పరీక్ష కాబోలు! ఒక నిర్ణీత గడువు వరకు లబ్ది (చేకూర్చటం) దీని ఉద్దేశం కాబోలు! ఇది కూడా నాకు తెలియదు.

وَإِنْ أَدْرِي لَعَلَّهُ فِتْنَةٌ لَّكُمْ وَمَتَاعٌ إِلَىٰ حِينٍ ﴿١١١﴾

**112** “ఓ ప్రభూ! న్యాయంగా తీర్పు చెయ్యి. మా ప్రభువు అపార కరుణామయుడు. మీరు కల్పించేవిషయాలపై ఆయన సహాయమే కోరబడుతోంది” అని (ప్రవక్త) స్వయంగా పలికాడు.[115]

قَٰلَ رَبِّ احْكُم بِالْحَقِّ ۗ وَرَبُّنَا الرَّحْمَٰنُ الْمُسْتَعَانُ عَلَىٰ مَا تَصِفُونَ ﴿١١٢﴾

---

అహాదీసుస్సహీహతు లిల్ అల్‌బానీ – హ.నెం.1758). అందుకే ఒక హదీసులో మహాప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: “నేను మూర్తీభవించిన కారుణ్యంగా వచ్చాను. అది అల్లాహ్ తరఫున లోకవాసుల కోసం ఒక కానుక” (సహీహ్ అల్ జామెవుస్సగీర్ – నెం.2345).

112. అసలు సిసలు కారుణ్యం ఏకదైవారాధనను అలవరచుకుని, షిర్క్‌ను విడనాడటమేనని ఈ ఆయతులో స్పష్టం చేయబడింది.

113. అంటే – నేను ప్రబోధించే దేవుని ఏకత్వపు సందేశం – ఇస్లాం పట్ల – మీరు విముఖత చూపి నాకు విరోధులుగా మారారని నాకు అర్థమైపోయింది. అయితే మీరు కూడా బాగా తెలుసుకోండి – ఈనాటి నుంచీ నేనూ మీకు విరోధినే. మీకూ – నాకూ మధ్య పోరాటం మొదలైనట్లే.

114. **‘వాగ్దానం’** అంటే ప్రళయదినం అన్నమాట. లేదా ఇస్లాం మరియు ముస్లింలకు లభించబోయే విజయం లేదా మీకు (అవిశ్వాసులకు) వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు దేవుని తరఫున నాకు అనుమతి లభించే రోజు.

115. దేవుని వాగ్దానం సంభవించటంలో తాత్సారం జరిగిందంటే బహుశా మిమ్మల్ని పరీక్షించే నిమిత్తం అలా జరిగి ఉండొచ్చు లేదా ఒక నిర్ణీత గడువు వరకు మీకు వెసులుబాటు కల్పించే ఉద్దేశంతో దేవుడు ఇలా చేసి ఉండొచ్చు. నాకు మాత్రం ఖచ్చితంగా తెలీదు. కాని ఈ విడుపును చూసి మీరు విర్రవీగకండి. ఆ వాగ్దానం నెరవేరటం తథ్యం. మీరు కల్పించే మాటలు అర్థం పర్థం లేనివి. మీరు ఎప్పుడు ఏం చెబుతారో అర్థం అవదు. కొన్నిసార్లు మీరు అల్లాహ్‌కు సంతానాన్ని కూడా ఆపాదిస్తుంటారు. నా ప్రభువు అపార కరుణామయుడు. మీరు కల్పించే అసత్యాలకు ఆయన అతీతుడు. కనుక మీ అసత్యాలపై ఆయన సహాయాన్ని కోరటమే శ్రేయస్కరం.

22వ సూరా

# అల్ హజ్

## కాబా యాత్ర

అవతరణ మదీనాలో

ఆయతులు 78

### పరిచయం

*ఈ సూరా ప్రారంభ ఆయత్‌లో తీర్పుదినం నాటి భయానక స్థితిగతుల వర్ణన ఉంది. ఆ రోజున ప్రతి ఒక్కరు భయంతో గజగజలాడుతుంటారు. చివరకు కన్న తల్లి తన పాలు త్రాపే శిశువును కూడా మరిచిపోతుంది. ఆ రోజున గర్భంతో ఉన్న స్త్రీలు గర్భస్రావానికి గురవుతారు. ప్రజలు తాగి మత్తులో ఉన్నవారి మాదిరిగా నడుస్తుంటారు. ఈ వివరాలు తెలుపుతూ, మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి ఈ సూరా హెచ్చరిస్తుంది. ఈ విషయమై సందేహాలున్న వారికి కావలసిన రుజువులు చూపుతుంది.*

*ఈ సూరాలో తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని వర్ణించడం జరిగింది. అందులో అవిశ్వాసులు అగ్నితో తయారైన దుస్తులు ధరించి ఉంటారు. మరుగుతున్న నీరు వారిపై గుమ్మరించడం జరుగుతుంది. వారిని శిక్షించడానికి లోహపు ముళ్ళ గదలు ఉంటాయి. అయితే సదాచరణలకు కట్టుబడిన విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయి. వారికి బంగారంతో, ముత్యాలతో చేసిన ఆభరణాలు లభిస్తాయి. వారు సిల్కు వస్త్రాలు ధరిస్తారు.*

*సత్యంపై దాడి జరిగినపుడు, ఇస్లామ్ అణచివేతకు గురయినపుడు అల్లాహ్ కోసం పోరాడటం న్యాయబద్ధమని ఈ సూరా విస్పష్టం చేస్తుంది. అల్లాహ్ కోసం పోరాడటమన్నది రక్తపాతం సృష్టించే ఉద్దేశ్యంతో కాకుండా చెడును, అణచివేతను ఎదుర్కోవడానికే జరుగుతుందని ఈ సూరా తెలుపుతుంది. అల్లాహ్ ఆగ్రహానికి గురయి నాశనమైన గత జాతుల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. తమ చెడుల కారణంగా, ప్రవక్తలను వ్యతిరేకించిన కారణంగా ఆయా జాతులు వినాశాన్ని చవిచూశాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి ప్రజల తిరస్కారాన్ని ఎదుర్కున్నది ఆయన ఒక్కరే కాదని, గత ప్రవక్తలు కూడా ప్రజల తిరస్కారాన్ని ఎదుర్కున్నారని, నూహ్ ప్రవక్త (అస), సాలిహ్ (అస), షుఐబ్ (అస), ఇబ్రాహీమ్ (అస), లూత్ (అస), మూసా(అస)లను కూడా వారి వారి జాతుల ప్రజలు తిరస్కరించారని చెప్పడం జరిగింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 26, 43-45 | 30, 14 21, 25 50, 81 | 'దైవప్రవక్త ఇబ్రాహీమ్' 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవప్రవక్త సాలిహ్' 'దైవప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారావాహికంగా ఇక్కడ లభ్యమవుతాయి. |

## سُورَةُ الحَجِّ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

يٰٓاَيُّهَا النَّاسُ اتَّقُوْا رَبَّكُمْ ۚ اِنَّ زَلْزَلَةَ
السَّاعَةِ شَيْءٌ عَظِيْمٌ ①

يَوْمَ تَرَوْنَهَا تَذْهَلُ كُلُّ مُرْضِعَةٍ عَمَّآ اَرْضَعَتْ
وَتَضَعُ كُلُّ ذَاتِ حَمْلٍ حَمْلَهَا وَتَرَى النَّاسَ
سُكٰرٰى وَمَا هُمْ بِسُكٰرٰى وَلٰكِنَّ عَذَابَ اللّٰهِ
شَدِيْدٌ ②

## అల్ హజ్ [1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** ఓ ప్రజలారా! మీ ప్రభువుకు భయపడండి. నిశ్చయంగా ప్రళయ సమయాన జరిగే ప్రకంపనం మహా (భీకర) విషయం.

**2** ఆనాడు మీరు దాన్ని చూస్తారు... పాలుపట్టే ప్రతి తల్లీ పాలు త్రాగే తన పసికందును మరచిపోతుంది. గర్భవతుల గర్భాలూ పడిపోతాయి. ప్రజలు మైకంలో తూలుతున్నట్లు నీకు కనిపిస్తారు. వాస్తవానికి వారు మైకంలో ఉండరు. అయితే అల్లాహ్ (తరఫున వచ్చిపడిన) విపత్తు అత్యంత తీవ్రంగా ఉంటుంది. [2]

---

1. ఈ సూరా మక్కాలో అవతరించిందా? లేక మదీనాలో అవతరించిందా? అన్న విషయంలో ద్వంద్వాభిప్రాయాలున్నాయి. నిజానికి ఈ సూరాలోని అంశాలనుబట్టి కొంతభాగం మక్కాలో అవతరించినా, మరికొంత భాగం మదీనాలో అవతరించింది. ఖుర్తుబీ కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరిచారు (ఫత్‌హుల్ ఖదీర్). దివ్య ఖుర్ఆన్‌లోని **'రెండు సజ్దాలు'** గల ఏకైక సూరా కూడా ఇదే.

2. ప్రళయదినం ఎంత భయంకరంగా ఉంటుందో ఈ ఆయతులో చెప్పబడింది. ఆనాడు ఎవరి గొడవ వారిదే. అందరూ తీవ్రమైన కలవరానికి లోనవుతారు. భయంతో బెంబేలెత్తిపోతారు. కడుపు చించుకుపుట్టిన పసిబిడ్డల్ని సయితం తల్లి మరచిపోతుంది. గర్భిణీలకు గర్భస్రావం అయిపోతుంది. ఇది ప్రళయానికి ముందు పరిస్థితి. దాంతోనే ప్రపంచమంతా నాశనమైపోతుంది. లేదా ప్రళయం తరువాత – సమాధుల నుంచి లేచి మహ్షర్ మైదానంలో సమావేశమవుతున్నప్పుడు ఈ పరిస్థితి ఏర్పడవచ్చు. చాలామంది వ్యాఖ్యాతలు మొదటి అభిప్రాయాన్నే సమర్థించారు. కొద్దిమంది మాత్రం రెండవ అభిప్రాయం వైపుకు మొగ్గారు. దీనికి అనుకూలంగా వారు హదీసులను కూడా ఉదాహరించారు. ఉదాహరణకు : అల్లాహ్ ఆదం (అలైహిస్సలాం) నుద్దేశించి, నీ సంతతిలో వెయ్యికి 999 మంది చొప్పున నరకవాసులను వేరు చెయ్యి అనంటాడు. ఈ మాట వినగానే గర్భవతుల గర్భాలు పడిపోతాయి. పసిపిల్లలు సయితం బాధతో ముసలివారైపోతారు. ప్రజలంతా మత్తులో మునిగి ఉన్నట్లు కానవస్తారు. నిజానికి వారు తప్పతాగి ఉండరు. ఆ విపత్తుకు వారి పరిస్థితి ఆ విధంగా తయారవుతుంది.

   మహాప్రవక్త (స) ద్వారా ఈ సంగతి తెలుసుకున్న ప్రియసహచరులు (రజి) నిర్ఘాంత పోయారు. వారి ముఖకవళికలు మారిపోయాయి. అప్పుడు మహాప్రవక్త (స) వారినుద్దేశించి "(కలవరపడకండి) ఆ 999 మంది యాజూజు మాజూజుల వర్గానికి చెందినవారై ఉంటారు. మీలోని ఒక్కడు మాత్రమే ఆ కోవకు చెందినవాడై ఉంటాడు. మీరు (సంఖ్యాపరంగా) జనులలో తెల్లని ఎద్దు దేహంపై నల్లటి వెంట్రుకలు ఎలా ఉంటాయో లేక నల్లరంగు ఎద్దు దేహంలో తెల్లటి వెంట్రుకలు ఎలా ఉంటాయో అలా ఉంటారు. స్వర్గవాసులలో మీరు నాల్గోవంతో, మూడో వంతో ఉంటారు లేక సగానికి సగం ఉంటారని నేను ఆశిస్తున్నాను." ఈ మాట వినగానే ప్రియసహచరులు (రజి) సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అని నినదించారు (సహీహ్ బుఖారీ – అల్ హజ్ సూరా వ్యాఖ్యానం).

   మొదటి అభిప్రాయం కూడా తేలిగ్గా కొట్టివేయదగినది కాదు. కొన్ని బలహీన హదీసులు ఈ అభిప్రాయాన్ని కూడా సమర్థిస్తున్నాయి. రెండు అభిప్రాయాలు కూడా సరైనవే కావచ్చు. ఎందుకంటే ప్రళయ ఘడియకు ముందూ, ఆ తరువాత కూడా ప్రజల పరిస్థితి ఇంచుమించు ఒకేవిధంగా ఉంటుంది.

**3** జ్ఞానం లేకపోయినా అల్లాహ్ విషయంలో వాదించేవారు కూడా జనులలో కొందరున్నారు. వారు తలబిరుసు అయిన ప్రతి షైతానును అనుసరిస్తారు.[3]

وَمِنَ النَّاسِ مَنْ يُّجَادِلُ فِي اللّٰهِ بِغَيْرِ عِلْمٍ
وَّيَتَّبِعُ كُلَّ شَيْطٰنٍ مَّرِيْدٍ ﴿3﴾

**4** అతని సహవాసం చేసిన వారినల్లా అతను అపమార్గం పట్టించి, అతన్ని అగ్ని శిక్ష వైపుకు తీసుకుపోతాడని అతని గురించి (విధివ్రాతలో) రాయబడి ఉంది.[4]

كُتِبَ عَلَيْهِ اَنَّهٗ مَنْ تَوَلَّاهُ فَاَنَّهٗ يُضِلُّهٗ
وَيَهْدِيْهِ اِلٰى عَذَابِ السَّعِيْرِ ﴿4﴾

**5** ఓ ప్రజలారా! ఒకవేళ మరణానంతర జీవితం గురించి మీకేదన్నా సందేహం ఉంటే కాస్త ఆలోచించండి... మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, ఆ తరువాత వీర్యపు బొట్టుతో, ఆపైన గడ్డకట్టిన రక్తంతో, అటు పిమ్మట మాంసపు ముద్దతో చేశాము–అప్పటికి అది రూపం కలదిగానూ, రూపరహితం గానూ ఉన్నది.[5] మేము మీకు స్పష్టంగా తెలియజెప్పేందుకు (ఇదంతా చేస్తున్నాము).[6] మరి మేము కోరిన దానిని నిర్ధారిత సమయం వరకు మాతృగర్భాలలో ఉంచుతున్నాము.[7] ఆ తరువాత మిమ్మల్ని శైశవ దశలో బయటికి తెస్తాము – మరి మీరు నిండు యౌవనానికి చేరుకోవటానికి! మీలో కొందరు (యుక్త వయస్సుకు చేరక ముందే) మృత్యువుకు గురిచేయ

يٰۤاَيُّهَا النَّاسُ اِنْ كُنْتُمْ فِيْ رَيْبٍ مِّنَ الْبَعْثِ
فَاِنَّا خَلَقْنٰكُمْ مِّنْ تُرَابٍ ثُمَّ مِنْ نُّطْفَةٍ ثُمَّ
مِنْ عَلَقَةٍ ثُمَّ مِنْ مُّضْغَةٍ مُّخَلَّقَةٍ وَّغَيْرِ
مُخَلَّقَةٍ لِّنُبَيِّنَ لَكُمْ ؕ وَنُقِرُّ فِي الْاَرْحَامِ
مَا نَشَآءُ اِلٰۤى اَجَلٍ مُّسَمًّى ثُمَّ نُخْرِجُكُمْ طِفْلًا
ثُمَّ لِتَبْلُغُوْۤا اَشُدَّكُمْ ۚ وَمِنْكُمْ مَّنْ يُّتَوَفّٰى
وَمِنْكُمْ مَّنْ يُّرَدُّ اِلٰۤى اَرْذَلِ الْعُمُرِ لِكَيْلَا

3. అంటే – మరణించిన వారిని అల్లాహ్ మళ్లీ బ్రతికించడనీ, అల్లాహ్‌కు సంతానం ఉందని వారు పిడివాదనకు దిగి తమను షైతాన్ అనుయాయులుగా నిరూపించుకున్నారు.

4. షైతాన్ విషయంలో దేవుడు రాసిపెట్టినది ఇదే. తన వెనుక వచ్చిన వారందరినీ వాడు దారి తప్పించి, నరకాగ్నికి ఆహుతి చేస్తాడు.

5. గర్భాశయంలోకి వెళ్ళిన వీర్యకణం నలభై రోజుల తరువాత **అలఖ(عَلَقَة)** (నెత్తుటి గడ్డ)గా మారుతుంది. ఆ తరువాత అది **ముజ్‌గ (مُضْغَة)** (మాంసపు ముద్ద)గా రూపాంతరం చెందుతుంది. ఆ తరువాత **ముఖల్లఖ(مُخَلَّقَة)** గా తయారవుతుంది. అంటే పరిపూర్ణమైన శిశువు ఆకారాన్ని సంతరించుకుంటుంది. ఆ తరువాత అందులో ప్రాణం పోయబడుతుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయిన పిమ్మట ఆ శిశువును మాతృ గర్భం నుంచి బయటపడవెయ్యటం జరుగుతుంది. ఒక్కోసారి – దీనికి భిన్నంగా – సంపూర్ణ శిశువు ఆకారం సంతరించుకోకముందే గర్భస్రావం జరిగిపోతుంది. సహీహ్ హదీసులలో కూడా మాతృగర్భాలలోని – గర్భస్థ – శిశువుల స్థితిగతులు వివరించబడ్డాయి. ఉదాహరణకు: ఒక ప్రామాణిక హదీసు ప్రకారం వీర్యబిందువు 40 రోజుల తరువాత ఘనీభవించిన రక్తంగా మారుతుంది. ఆ తరువాత నలభై రోజులకు మాంసపు కండగా తయారవుతుంది. ఆ తరువాత దేవుని తరఫున ఒక దైవదూత వచ్చి ప్రాణం పోస్తాడు. అంటే నాలుగు మాసాల తరువాత కడుపులోని నలుసు ప్రాణం పోసుకుంటుంది. దాంతో అది సంపూర్ణ ఆకారం గల శిశువు అవుతుంది (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా వ కితాబుల్ ఖద్ర్; ముస్లిం – కితాబుల్ ఖద్ర్....)

6. ఈ విధంగా మేము మీకు మా శక్తియుక్తులను, కార్యదక్షతను విడమరచి చెబుతున్నాము.

7. అంటే – గర్భస్రావం కాకూడదని వాటిని మేము మాతృగర్భాలలో నిలిపి ఉంచాము.

يَعۡلَمَ مِنۢ بَعۡدِ عِلۡمٖ شَيۡـٔٗاۚ وَتَرَى ٱلۡأَرۡضَ هَامِدَةٗ فَإِذَآ أَنزَلۡنَا عَلَيۡهَا ٱلۡمَآءَ ٱهۡتَزَّتۡ وَرَبَتۡ وَأَنۢبَتَتۡ مِن كُلِّ زَوۡجِۭ بَهِيجٖ ⑤

బడతారు.[8] మరి కొందరు అన్నీ తెలిసి ఉండి కూడా ఏమీ గ్రహించలేనంత నికృష్టమైన వయస్సుకు చేర్చబడతారు.[9] నేల ఎండిపోయి (బీడుగా మారి) ఉండటం నువ్వు చూస్తావు. ఆ తరువాత మేము దానిపై వర్షం కురిపించగానే అది పులకిస్తుంది, ఉబికి వస్తుంది, అన్ని రకాల మనోహరమైన మొక్కలను మొలకెత్తిస్తుంది.[10]

ذَٰلِكَ بِأَنَّ ٱللَّهَ هُوَ ٱلۡحَقُّ وَأَنَّهُۥ يُحۡيِ ٱلۡمَوۡتَىٰ وَأَنَّهُۥ عَلَىٰ كُلِّ شَيۡءٖ قَدِيرٞ ⑥

**6** అల్లాహ్‌యే సత్యం గనక, మృతులను తిరిగి బ్రతికించేవాడు ఆయనే గనక, అన్నింటిపై ఆయనే అధికారం కలవాడు గనక ఇదంతా జరుగుతోంది సుమా!

وَأَنَّ ٱلسَّاعَةَ ءَاتِيَةٞ لَّا رَيۡبَ فِيهَا وَأَنَّ ٱللَّهَ يَبۡعَثُ مَن فِي ٱلۡقُبُورِ ⑦

**7** (దీంతోపాటు) ప్రళయం రావటం తథ్యం. అందులో సందేహానికి ఆస్కారమే లేదు. నిశ్చయంగా అల్లాహ్ సమాధులలో ఉన్నవారిని తిరిగి లేపుతాడు.

8. నిండు యౌవనం అంటే మనిషి దేహదారుఢ్యం ఉచ్ఛస్థితికి చేరటంతో పాటు అతని బుద్ధిజ్ఞానాలు, తెలివితేటలు పరిపక్వం కావటం అని భావం. సాధారణంగా 30 నుంచి 40 ఏళ్ల ప్రాయంలో మనిషి ఈ స్థితికి చేరుకుంటాడు. కాని ఈ స్థితికి చేరకముందే కొందరు మృత్యువాతన పడతారు.

9. నికృష్టమైన వయస్సు అంటే మనిషికి తన పంచేంద్రియాలపై పట్టులేకుండా పోయే హీనాతి హీనస్థితి. ఆ వార్ధక్యదశలో అతని జ్ఞాపకశక్తి క్షీణించిపోతుంది. బుద్ధి మందగిస్తుంది. మతి చలిస్తుంది. మనుషుల్ని గుర్తుపట్టగలిగినా సరిగ్గా వ్యక్తం చేయలేని దయనీయ స్థితి ఏర్పడుతుంది. దీన్నే అత్తీన్ సూరాలో **సుమ్మ రదద్‌నాహు అస్ఫల సాఫిలీన్** (మరి మేమతన్ని అతి నికృష్టజీవిగా మార్చివేశాము) అని చెప్పటం జరిగింది.

10. మరణానంతర జీవితం ఎలా సంభవమో విశదీకరించటానికి అల్లాహ్ చూపే రెండవ నిదర్శనం ఇది. మొదటి నిదర్శనంలో దేవుడు అత్యంత అల్పమైన వీర్యపు బిందువు ద్వారా ఒక సంపూర్ణ ఆకారంగల, అందమైన మానవుణ్ణి మలచి ఆవిష్కరించాడు. మరి అతన్ని జీవితంలో వివిధ దశల గుండా సాగిపోయేలా చేసి అత్యంత నికృష్టమైన ముసలితనానికి చేర్చాడు. అప్పటికి అతని మేధ ముకుళించుకుపోతుంది. శరీరంలో నిస్సత్తువ ఆవరిస్తుంది. పండు ముసలిగా మారిన మనిషి పసిపిల్లాడులా ప్రవర్తిస్తాడు. నిత్య జీవితంలో ఇలాంటి ఎన్నో ఉపమానాలను మనకు చూపిస్తున్న సృష్టికర్తకు చనిపోయిన వారిని మళ్లీ బ్రతికించటం కష్టతరమా? ఏమాత్రం కాదు. ఇప్పటికీ మీకు ఇంకా సందేహం ఉంటే మృతభూమిగా మారిన బంజరు నేలను చూడండి. ఆకాశం నుంచి వర్షం కురవగానే అది ఒక్కసారిగా పునరుజ్జీవనం పొందుతుంది. బీటలు వారిన నేల పచ్చగా మారి నవనవలాడుతుంది. రకరకాల పండ్లను, ఆహారధాన్యాలను పండిస్తుంది. పాడుబడిన భూమి నుంచి మొక్కల్ని మొలకెత్తించినట్లే అల్లాహ్ ప్రళయదినాన సమాధులలోని మృతులను బ్రతికించి లేపుతాడు.

ఒకసారి ప్రవక్త ప్రియ సహచరులొకరు దైవప్రవక్త (స)తో, 'అల్లాహ్ మనుషులను మళ్లీ ఎలా బ్రతికిస్తాడో ఉదాహరణ ద్వారా తెలియజేస్తారా?!' అని కోరగా, "నువ్వు ఎప్పుడైనా బంజరు ప్రదేశం గుండా సాగిపోవటం, ఆ తరువాత కొంతకాలానికి అది పచ్చగా కళకళలాడుతూ ఉండటం చూశావా?" అని ఆయన (స) ప్రశ్నించారు. దానికాయన 'అవును, చూశాను' అన్నారు. "సరిగ్గా అలాగే మనుషులు తిరిగిలేస్తార"ని మహాప్రవక్త (సఅసం) వివరించారు. (ముస్నదె అహ్మద్ – సంపుటి : 4, పేజీ – 11; ఇబ్ను మాజ – పీఠిక, హదీసు నెంబరు – 180)

وَمِنَ النَّاسِ مَنْ يُّجَادِلُ فِي اللّٰهِ بِغَيْرِ عِلْمٍ وَّلَا هُدًى وَّلَا كِتٰبٍ مُّنِيْرٍ ﴿٨﴾

**8** మరి కొంతమంది (కూడా ఉన్నారు. వారు) జ్ఞానంగానీ, మార్గదర్శకత్వంగానీ, జ్యోతిర్మయమైన గ్రంథంగానీ లేకుండానే అల్లాహ్ విషయంలో పిడివాదన చేస్తారు.

ثَانِيَ عِطْفِهٖ لِيُضِلَّ عَنْ سَبِيْلِ اللّٰهِ ؕ لَهٗ فِي الدُّنْيَا خِزْيٌ وَّنُذِيْقُهٗ يَوْمَ الْقِيٰمَةِ عَذَابَ الْحَرِيْقِ ﴿٩﴾

**9** గర్వంతో ప్రక్కకు తిరిగిపోయేవాడై![11] అల్లాహ్ మార్గం నుంచి (ప్రజలను) తప్పించాలన్నది వాడి ఉద్దేశం. వాడికి ప్రపంచం లోనూ పరాభవం ఉంది, ప్రళయదినాన కూడా మేమతన్ని నరకంలో దహించివేసే యాతనను చవిచూపిస్తాము.

ذٰلِكَ بِمَا قَدَّمَتْ يَدٰكَ وَاَنَّ اللّٰهَ لَيْسَ بِظَلَّامٍ لِّلْعَبِيْدِ ﴿١٠﴾

**10** నీ చేతులు ముందుగా చేసి పంపుకున్న కర్మల మూలంగా నీకీ ఖర్మ పట్టింది. అల్లాహ్ తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడన్న సంగతిని తెలుసుకోండి.

وَمِنَ النَّاسِ مَنْ يَّعْبُدُ اللّٰهَ عَلٰى حَرْفٍ ۚ فَاِنْ اَصَابَهٗ خَيْرُ ٱطْمَاَنَّ بِهٖ ۚ وَاِنْ اَصَابَتْهُ فِتْنَةُ انْقَلَبَ عَلٰى وَجْهِهٖ ۚ خَسِرَ الدُّنْيَا وَالْاٰخِرَةَ ؕ ذٰلِكَ هُوَ الْخُسْرَانُ الْمُبِيْنُ ﴿١١﴾

**11** ప్రజలలో మరికొంతమంది (కూడా ఉన్నారు. వారు) ఎలాంటి వారంటే, వారు ఒక అంచున (నిలబడి) అల్లాహ్‌ను ఆరాధి స్తుంటారు. తమకేదన్నా లాభం కలిగితే ఆరాధన పట్ల సంతృప్తి చెందుతారు. ఏదన్నా ఆపద వచ్చిపడితే మాత్రం అప్పటికప్పుడే ముఖం తిప్పుకునిపోతారు.[12] అలాంటి వారు ప్రాపంచికంగానూ, పారలౌకికంగానూ నష్టపోయారు. స్పష్టంగా నష్టపోవటం అంటే ఇదే.

11. ఏ ఆధారమూ లేకుండా మొండిగా వాదించేవాడు సాధారణంగా సంస్కారవంతుడై ఉండడు. అలాంటివాడు గర్విష్టి అయి ఉంటాడు. సత్యానికి, ధర్మానికి విరోధి అయివుంటాడు. అందుకే వాడు నోటికొచ్చినట్లు మాట్లాడేసి భుజాలు ఎగురవేసుకుంటూ వెనుతిరిగి పోతాడు. అటువంటి తలబిరుసుల గురించి దివ్య ఖుర్ఆన్ ఇతరచోట్ల ఇలా ప్రస్తావిం చింది– (1). "తన చెవులలో చెవుడు ఉన్నట్లుగా వాడు గర్వంతో ముఖాన్ని తిప్పుకుంటాడు." (లుఖ్మాన్ – 7). (2). "వారు తల విదిలిస్తారు" (మునాఫిఖూన్ – 5). (3). "వాడు విర్రవీగుతాడు, వెనక్కి మరలిపోతాడు" (బనీ ఇస్రాయీల్ – 83).

12. **'హర్ఫున్'** (حَرْف) అంటే అంచు, ఒడ్డు అని అర్థం. ఈ అంచులపై నిలబడి ఉండేవాడు నిలకడలేనివాడై ఉంటాడు. మతధర్మం విషయంలో సంశయానికి, సందిగ్ధానికి లోనై ఉన్న వ్యక్తి కూడా ఇంతే. ధర్మావలంబనలో అతనికి నిలకడ ప్రాప్తించదు. ఎందుకంటే పొద్దస్తమానం ప్రాపంచిక ప్రయోజనాలు పొందటం అతని ముఖ్యోద్దేశం అయి ఉంటుంది. ప్రయోజనాలు చేకూరినంతసేపూ ధర్మాన్ని అంటిపెట్టుకుని ఉంటాడు. అన్యథా తన పూర్వీకుల మతం వైపుకు మరలిపోతాడు. తద్భిన్నంగా నిజమైన, నికార్సయిన ముస్లింలు దృఢవిశ్వాసం కలిగి ఉంటారు. వారు కలిమి లేములను, ఎత్తుపల్లాలను చూడకుండానే ధర్మంలోకి వస్తారు. సర్వకాల, సర్వావస్థల్లో ధర్మంపై స్థయిర్యాన్ని కనబరుస్తారు. దైవానుగ్రహాలు ప్రాప్తించినప్పుడు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటారు. కష్టాలెదురైనపుడు ఓర్పు వహిస్తారు. ఈ ఆయతు అవతరణా నేపథ్యంలో ఒక వ్యక్తి వృత్తాంతం ఉంది. అతను మదీనా నగరానికి వస్తాడు. తనకు సంతానం కలిగితే, పశువులలో సమృద్ధి జరిగితే ఈ ధర్మం (ఇస్లాం) చాలా మంచి ధర్మం అని అంటాడు. తాననుకున్నట్లుగా జరగకపోతే ఈ ధర్మం ముదనష్టపు ధర్మం అంటాడు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆనాడు కొత్తగా ఇస్లాం స్వీకరించిన అరబ్బు పల్లెవాసుల్లో ఈ అవలక్షణం ఉండేది. (ఫత్‌హుల్ బారీ)

**12** మరి వారు అల్లాహ్‌ను వదలి తమకు నష్టంగానీ, లాభంగానీ కలిగించలేని వారిని మొరపెట్టుకోసాగుతారు. చాలా దూరపు అపమార్గం అంటే ఇదే.

يَدْعُوْا مِنْ دُوْنِ اللّٰهِ مَا لَا يَضُرُّهٗ وَمَا
لَا يَنْفَعُهٗ ۭ ذٰلِكَ هُوَ الضَّلٰلُ الْبَعِيْدُ ۚ ⑫

**13** ఎవరి నష్టం (కీడు) అతని లాభం కన్నా చేరువలో ఉన్నదో అలాంటి వానిని వారు వేడుకుంటున్నారు. ముమ్మాటికీ అలాంటి వాడు మహా చెడ్డ సహాయకుడు, మహాచెడ్డ స్నేహితుడు.[13]

يَدْعُوْا لَمَنْ ضَرُّهٗٓ اَقْرَبُ مِنْ نَّفْعِهٖ ۭ لَبِئْسَ
الْمَوْلٰى وَلَبِئْسَ الْعَشِيْرُ ⑬

**14** విశ్వసించి, మంచి పనులు చేసిన వారిని అల్లాహ్ సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అల్లాహ్ అనుకున్న దాన్ని చేసి తీరుతాడు.

اِنَّ اللّٰهَ يُدْخِلُ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ
جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ ۭ اِنَّ اللّٰهَ
يَفْعَلُ مَا يُرِيْدُ ⑭

**15** అల్లాహ్ ప్రపంచంలోనూ, పరలోకంలోనూ తన ప్రవక్తకు సహాయం చేయడని తలపోసేవాడు పైనుంచి ఒక త్రాడును కట్టి తన మెడకు ఉరేసుకొని వేలాడాలి. ఆ తరువాత తన ఈ ఉపాయం వల్ల తన కసి తీరిందేమో చూసుకోవాలి.[14]

مَنْ كَانَ يَظُنُّ اَنْ لَّنْ يَّنْصُرَهُ اللّٰهُ فِي الدُّنْيَا
وَالْاٰخِرَةِ فَلْيَمْدُدْ بِسَبَبٍ اِلَى السَّمَاۗءِ ثُمَّ لْيَقْطَعْ
فَلْيَنْظُرْ هَلْ يُذْهِبَنَّ كَيْدُهٗ مَا يَغِيْظُ ⑮

13. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం **'వేడుకుంటున్నారు'** (యద్‌వూ) అనే పదం 'పలుకుతున్నారు' (యఖూల్) అన్న భావంలో వాడబడింది. దైవేతరులను పూజించే భక్తులు తీర్పుదినాన తమ మిథ్యా దైవాలను గురించి, 'వాడు చాలా చెడ్డ సంరక్షకుడు, చెడ్డ స్నేహితుడు' అని పలుకుతారు. అంటే తమ ఆశా సౌధం ఆనాడు కుప్పకూలిపోయిన తరువాత వారి నోట అప్రయత్నంగా ఈ మాటలు వెలువడతాయి. వారు దైవాగ్రహం నుంచి తమను కాపాడతారనీ, తమ కొరకు సిఫారసు చేస్తారని ఇప్పటి వరకూ నమ్మేవారు. కాని తీరా ఆ కీలక సమయం వచ్చినప్పుడు ఆ బూటకపు దేవుళ్ళు నిస్సహాయులుగా ఉండిపోయారు. పైగా తమ భక్తులతోపాటు వాళ్లు కూడా నరకానికి ఇంధనంగా మారారు. కష్టకాలంలో ఆదుకునే వాడే నమ్మదగ్గ నేస్తం అవుతాడు. కాని స్వయంగా దైవాగ్రహానికి పాత్రులయ్యేవారు ఇంకా ఇతరులకు ఏం సహాయం చేస్తారు? అందుకే వారు చాలా చెడ్డ సంరక్షకులుగా, చెడ్డ స్నేహితులుగా అభివర్ణించబడ్డారు. వారికి చేసే పూజలు ప్రయోజనం చేకూర్చటం అటుంచి, ఆసాంతం హానికరంగానే పరిణమించాయి. అలాంటి వారినుద్దేశించి ఇంకోచోట ఇలా అనబడింది: "నిశ్చయంగా ఇప్పుడు మేమో (అల్లాహ్‌ను విశ్వసించేవారో) లేక మీరో (తిరస్కారులో) – ఎవరో ఒకరు మాత్రమే సన్మార్గంలో ఉన్నాము లేదా స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నాము" (సబా-24). వాస్తవానికి అల్లాహ్‌ను విశ్వసించేవారు మాత్రమే సన్మార్గంలో ఉంటారు. కాని ఈమాట సూటిగా చెప్పే బదులు ఆలోచింపజేసే విధంగా "ఎవరి నష్టం (కీడు) అతని లాభం కన్నా చేరువలో ఉన్నదో" అని చెప్పబడింది. శ్రోతల మనోమస్తిష్కాలకు పదును పెట్టడం దీని అసలు ఉద్దేశం.

14. విద్వాంసులు ఈ ఆయతుకు రెండు అర్థాలు చెప్పారు : 1. దేవుడు తన ప్రవక్త (సఅసం)కు అండగా నిలువరాదని కోరుకునేవాడు కూడా ఉన్నాడు. ఎందుకంటే దైవప్రవక్త (స) ప్రాబల్యం పెరిగితే అతను ఓర్వలేడు. అలాంటివాడు తన ఇంటి దూలానికి త్రాడును కట్టి తన మెడకు ఉరేసుకోమనండి. అలా చేయటం వల్ల అతనిలోని అక్కసు, ఓర్వలేనితనం దూరమవుతాయేమో చూసుకోమనండి. 2. రెండవ అర్థం : దైవప్రవక్త (సఅసం)కు అనుదినం పెరుగుతున్న ఆదరణను చూసి అసూయతో రగిలిపోయేవాడు చేతనైతే ఒక త్రాడు సహాయంతో ఆకాశానికి ఎక్కమనండి. ఆకాశం నుంచి మహాప్రవక్త (స)కు 'వహీ' రూపంలో అందే సహాయాన్ని ఇకమీదట అందకుండా చేయమనండి. కనీసం ఆ విధంగానయినా అతని గుండె మంట చల్లారుతుందేమో ప్రయత్నించి చూడమనండి.

16 ఈ విధంగా మేము ఈ ఖుర్ఆన్‌ను సుస్పష్టమైన సూచనలతో అవతరింపజేశాము. అల్లాహ్ తాను కోరిన వారికి (మాత్రమే) సన్మార్గ భాగ్యం ప్రసాదిస్తాడు.

وَكَذٰلِكَ اَنْزَلْنٰهُ اٰيٰتٍۭ بَيِّنٰتٍ ۙ وَّاَنَّ اللّٰهَ يَهْدِيْ مَنْ يُّرِيْدُ ﴿16﴾

17 విశ్వాసులు, యూదులు, సాబియీలు, క్రైస్తవులు, మజూసీలు,[15] బహుదైవారాధకులు[16] – వీరందరి మధ్యా అల్లాహ్ ప్రళయదినాన తప్పకుండా తీర్పుచేస్తాడు.[17] నిశ్చయంగా అల్లాహ్ అన్నింటికీ సాక్షిగా ఉన్నాడు.[18]

اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَالَّذِيْنَ هَادُوْا وَالصّٰبِـِٕيْنَ وَالنَّصٰرٰى وَالْمَجُوْسَ وَالَّذِيْنَ اَشْرَكُوْٓا ۖ اِنَّ اللّٰهَ يَفْصِلُ بَيْنَهُمْ يَوْمَ الْقِيٰمَةِ ۭ اِنَّ اللّٰهَ عَلٰي كُلِّ شَيْءٍ شَهِيْدٌ ﴿17﴾

18 ఆకాశాలలో ఉన్నవారూ, భూలోకవాసులు, సూర్య చంద్రులూ, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు,[19] చాలా మంది మనుషులు[20] కూడా అల్లాహ్ ముందు మోకరిల్లడాన్ని

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ يَسْجُدُ لَهٗ مَنْ فِي السَّمٰوٰتِ وَمَنْ فِي الْاَرْضِ وَالشَّمْسُ وَالْقَمَرُ وَالنُّجُوْمُ وَالْجِبَالُ

ఇమామ్ ఇబ్నె కసీర్ మొదటి భావార్థానికి ప్రాధాన్యతనివ్వగా ఇమామ్ షౌకానీ రెండవ భావార్థం వైపుకు మొగ్గారు. నేపథ్యం దృష్ట్యా రెండవ అభిప్రాయమే చాలా వరకు అతుకుతుంది.

15. మజూసీలు అంటే అగ్ని పూజారులు. వారు ఈరాన్ ప్రాంతంలో అధికంగా ఉండేవారు. వారు మౌలికంగా ఇద్దరు దేవుళ్ళను నమ్ముతారు. వారిలో ఒకరు చీకటికి కర్త అనీ, మరొకరు వెలుగుకు అధిపతి అని వాళ్లు భావించేవారు. ఒక దేవుణ్ణి 'అహర్‌మన్'గా, ఇంకొక దేవుణ్ణి 'యజ్దా'గా వ్యవహరిస్తారు.

16. అపమార్గానికి గురైన వివిధ తెగలతోపాటు, అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టేవారంతా ఈ కోవలోకి వచ్చేస్తారు.

17. అంటే ఎవరు సత్యవంతులు? ఎవరు మిథ్యావాదులు? అన్న విషయాన్ని అల్లాహ్ తన అంతిమ గ్రంథమైన ఖుర్ఆన్‌లో స్పష్టంగా తెలియజేశాడు. అంతిమ దైవప్రవక్త (సఅసం) కూడా ఈ విషయాన్ని విడమరచి చెప్పడానికే పంపబడ్డారు. సత్యధర్మం (ఇస్లాం) ఇతర ధర్మాలన్నింటిపై ఆధిక్యతను కలిగి ఉండాలన్నది అసలు దీని ఉద్దేశం (అల్ ఫతహ్– 28). కాని ఈ ఆయతులో పేర్కొనబడిన 'తీర్పు' అంటే మిథ్యావాదులకు తీర్పుదినాన అల్లాహ్ వినిపించే శిక్ష అన్నమాట! ఈ శిక్షను బట్టి కూడా సన్మార్గగాములెవరో, దుర్మార్గులెవరో స్పష్టమైపోతుంది.

18. ఈ తీర్పు కూడా కేవలం దేవుని తిరుగులేని అధికారాల ఆధారంగా జరగదు. న్యాయం ప్రాతిపదికపైనే తీర్పు జరుగుతుంది. ఎందుకంటే అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు. ఆయన తన దాసుల పోకడలను కనిపెట్టుకుని ఉన్నాడు.

19. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఏమంటారంటే; భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువులూ – తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా – దైవవిధేయతకు కట్టుబడి ఉన్నాయి. దైవాజ్ఞలను ఎదిరించే ధైర్యం వేటికీ లేదు. ఇక్కడ 'సజ్దా' (సాష్టాంగ ప్రణామం) అంటే భావం ఇదే! అంతేగాని సాధారణంగా మనుషులు ఆరాధన నిమిత్తం చేసే సజ్దా కాదు.

మరికొంతమంది వ్యాఖ్యాతలు 'సజ్దా' అన్న పదాన్ని పై అర్థంలో కాకుండా వాస్తవిక అర్థంలోనే తీసుకున్నారు అంటే సృష్టిలోని ప్రతి వస్తువూ తనదైన రీతిలో విశ్వ ప్రభువుకు సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేస్తోందని వారు వివరించారు. ఉదాహరణకు: 'ఆకాశాలలో ఉన్నవారు' అంటే దైవదూతలు అనీ, 'భూమిలో ఉన్నవారు' అంటే అన్నిరకాల వృక్షజాలు, జంతుజీవులు, మానవులు, జిన్నులు తదితర వస్తువులు అని భావం. వారంతా (అవన్నీ) తమ తమ రీతిలో సాష్టాంగపడి, తమ సృష్టికర్తను కీర్తిస్తున్నాయి. "ఆయన పవిత్రతను కొనియాడని, ఆయన స్తోత్రం చేయని వస్తువంటూ లేదు" (బనీ ఇస్రాయీల్– 44). సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనించదగిన విషయం. ఎందుకంటే ఆ కాలంలో ముష్రిక్కులు వాటిని పూజించే వారు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమంటున్నాడో

నువ్వు గమనించటం లేదా? (దైవ) శిక్షకు అర్హులైన వారు కూడా చాలా మంది ఉన్నారు.[21] అల్లాహ్ పరాభవం పాల్జేసిన వానిని ఎవరూ ఆదరించరు.[22] అల్లాహ్ తాను కోరినదాన్ని చేస్తాడు.

وَالشَّجَرُ وَالدَّوَآبُّ وَكَثِيْرٌ مِّنَ النَّاسِ ؕ وَكَثِيْرٌ حَقَّ عَلَيْهِ الْعَذَابُ ؕ وَمَنْ يُّهِنِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ مُّكْرِمٍ ؕ اِنَّ اللّٰهَ يَفْعَلُ مَا يَشَآءُ ﴿18﴾ السجدة

**19** ఆ ఇరువర్గాల వారు తమ ప్రభువు విషయంలో గొడవపడతారు.[23] అయితే అవిశ్వాసుల కోసం అగ్ని వస్త్రాలు కత్తిరించబడతాయి. సలసల కాగే నీరు వారి తలలపై నుంచి కుమ్మరించబడుతుంది.

هٰذٰنِ خَصْمٰنِ اخْتَصَمُوْا فِىْ رَبِّهِمْ ز فَالَّذِيْنَ كَفَرُوْا قُطِّعَتْ لَهُمْ ثِيَابٌ مِّنْ نَّارٍ ؕ يُصَبُّ مِنْ فَوْقِ رُءُوْسِهِمُ الْحَمِيْمُ ﴿19﴾ ع

**20** దాని మూలంగా వారి చర్మాలే కాకుండా వారి కడుపుల్లో ఉన్నవి కూడా కరిగిపోతాయి.

يُصْهَرُ بِهٖ مَا فِىْ بُطُوْنِهِمْ وَالْجُلُوْدُ ﴿20﴾ ط

**21** ఇంకా, వారి కొరకు (వారిని చితక బాదటానికి) ఇనుప సుత్తులు కూడా ఉన్నాయి.

وَلَهُمْ مَّقَامِعُ مِنْ حَدِيْدٍ ﴿21﴾

**22** ఆ బాధకు తట్టుకోలేక వారు అక్కణ్ణుంచి పారిపోవాలని అనుకున్నప్పుడల్లా తిరిగి అందులోనికే నెట్టివేయబడతారు. "దహనయాతన రుచి చూడండి"[24] (అని వారితో అనబడుతుంది).

كُلَّمَآ اَرَادُوْٓا اَنْ يَّخْرُجُوْا مِنْهَا مِنْ غَمٍّ اُعِيْدُوْا فِيْهَا ق وَذُوْقُوْا عَذَابَ الْحَرِيْقِ ﴿22﴾ ع

చూడండి : సూర్యచంద్రులు, నక్షత్రాదులు మాకు సాష్టాంగపడుతుండగా మీరు వాటి ముందు మోకరిల్లుతున్నారా? మీరు ఎట్టి పరిస్థితిలోనూ వాటి ముందు మోకరిల్లకండి. మిమ్మల్నీ, మీతోపాటు సూర్యచంద్రుల్ని కూడా పుట్టించిన సర్వసృష్టికర్త ముందే సాష్టాంగపడండి. (హామీమ్ సజ్దా : 37)

సహీహ్ హదీసులో హజ్రత్ అబూజర్ (రజి) ఇలా అంటున్నారు : "సూర్యుడు ఎక్కడికెళతాడో తెలుసా?" అని మహాప్రవక్త (సఅసం) వారు నన్నడిగారు. 'దైవానికి, దైవప్రవక్త (స)కే బాగా తెలుసు' అని నేనన్నాను. "సూర్యుడు (పొద్దు గూకగానే) దైవసింహాసనం క్రిందికి వెళ్ళి సాష్టాంగ ప్రణామం చేస్తాడు. అప్పుడతనికి మళ్లీ (ఉదయించమని) ఆజ్ఞాపించబడుతుంది. చివరకు ఒక సమయం ఆసన్నమవుతుంది – అప్పుడతనికి, "వచ్చిన చోటికే వెళ్ళిపో" అని ఆదేశించబడుతుంది. (సహీహ్ బుఖారీ – బద్వుల్ ఖల్ఖ్; ముస్లిం – కితాబుల్ ఈమాన్). అలాగే ప్రవక్త సహచరుడొకరు, తనతోపాటు ఒక చెట్టు కూడా దైవసన్నిధిలో సాష్టాంగపడుతున్నట్లు కలగన్నారు (తిర్మిజీ). అదేవిధంగా పర్వతాల, వృక్షాల నీడలను చూడండి–అవి కుడివైపు ఎడమ వైపు వాలటం కూడా వాటి సాష్టాంగ ప్రణామాన్ని సూచిస్తోంది. అర్రాద్ (15), అన్ నహ్ల్ (48, 49) సూరాలలోనూ వీటి ప్రస్తావన వచ్చింది.

20. ఇక్కడ 'సజ్దా' (సాష్టాంగ ప్రణామం) అన్న పదం వాస్తవ అర్థంలోనే ఉపయోగించబడింది. మానవుల్లో ఓ పెద్ద వర్గం దాస్యభావంతో దైవానికి సాష్టాంగ ప్రణామం చేస్తుంది. తద్వారా అది దైవప్రసన్నతకు నోచుకుంటుంది.

21. విధేయతాపూర్వకంగా సజ్దా చేయకుండా తిరస్కార వైఖరికి ఒడిగట్టేవారు వీరు. ఇకపోతే విశ్వప్రభువు సృష్టికై నిర్బంధం చేసిన ఆదేశాలకు లొంగిపోకుండా వైముఖ్యాన్ని ప్రదర్శించటం ఎవరి తరమూ కాదు సుమా!

22. దైవాదేశాలను ఎదిరించి, తిరస్కార వైఖరిని అవలంబించినవారు పరాభవానికి, పరలోక యాతనకు గురికాక తప్పదు. ఈ అవమానం నుంచి అవిశ్వాసులను రక్షించి, మర్యాద చేసే వాడెవడూ ఉండడు.

23. ఇరువర్గాలలో ఒకటి మార్గభ్రష్టతకు గురైన వర్గం. ఇంకొకటి ముస్లిం వర్గం. వారుభయులూ తమ ప్రభువు వ్యవహారంలో

**23** విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి క్రింద సెలయేరులు పారే (స్వర్గ) వనాలలో అల్లాహ్ ప్రవేశం కల్పిస్తాడు. అక్కడ వారు బంగారు కంకణాలు తొడిగించబడతారు–స్వచ్ఛమైన ముత్యాలు కూడా! వారు ధరించే వస్త్రాలు కూడా పట్టు వస్త్రాలై ఉంటాయి.[25]

إِنَّ اللَّهَ يُدْخِلُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ
جَنَّاتٍ تَجْرِي مِنْ تَحْتِهَا الْأَنْهَارُ يُحَلَّوْنَ فِيهَا
مِنْ أَسَاوِرَ مِنْ ذَهَبٍ وَلُؤْلُؤًا ۖ وَلِبَاسُهُمْ
فِيهَا حَرِيرٌ ﴿٢٣﴾

**24** పవిత్రమైన మాటలు పలికే బుద్ధి వారికి వొసగబడుతుంది.[26] స్తుతించదగిన వాని మార్గం కూడా వారికి నిర్దేశించబడింది.[27]

وَهُدُوا إِلَى الطَّيِّبِ مِنَ الْقَوْلِ وَهُدُوا إِلَىٰ
صِرَاطِ الْحَمِيدِ ﴿٢٤﴾

**25** నిశ్చయంగా ఎవరయితే అవిశ్వాసానికి ఒడిగట్టి, అల్లాహ్ మార్గం నుండి, మస్జిదె హరామ్ నుండి (జనులను) అడ్డుకుంటున్నారో,[28] ఇంకా అక్కడ అన్యాయంగా అడ్డదారులు తొక్కాలని ప్రయత్నిస్తున్నారో[29] వారికి మేము బాధాకరమైన శిక్ష రుచి

إِنَّ الَّذِينَ كَفَرُوا وَيَصُدُّونَ عَنْ سَبِيلِ
اللَّهِ وَالْمَسْجِدِ الْحَرَامِ الَّذِي جَعَلْنَاهُ لِلنَّاسِ
سَوَاءً الْعَاكِفُ فِيهِ وَالْبَادِ ۚ وَمَنْ يُرِدْ فِيهِ

తగవులాడుతున్నారు. దేవుడు ఒక్కడే అనీ, ఆయన చనిపోయినవారిని బతికించగల శక్తిశాలి అని ముస్లింలు చెబుతుండగా ఇతరులు పలు అపమార్గాలకు లోనై ఉన్నారు.

బద్ర్ యుద్ధంలో ముఖాముఖీ అయిన ముస్లింల – అవిశ్వాసుల నేపథ్యంలో కూడా ఈ విధంగా అనబడి ఉండవచ్చు. ఆ యుద్ధం ఆరంభంలో ముస్లింల తరఫున హజ్రత్ హమ్జా, హజ్రత్ అలీ, హజ్రత్ ఉబైదా (రజి)లు ఒకవైపు నిలబడగా – మరోవైపు అవిశ్వాసుల తరఫున ఉత్బా, షైబా, వలీద్ బిన్ ఉత్బాలు నిలిచారు (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ హజ్).

ఈ రెండు భావాలు కూడా సరైనవేనని, ఆయతుకు అనుగుణంగా ఉన్నవేనని ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయపడ్డారు.

24. నరకవాసులు నరకంలో అనుభవించే యాతనలలో కొన్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావించబడ్డాయి.

25. నరకవాసులకు ప్రతిగా స్వర్గవాసులకు లభించే అనుగ్రహాలు ఇవి. అయితే విశ్వసించిన వారికి మాత్రమే ఈ భాగ్యాలు ప్రాప్తిస్తాయని మరువరాదు.

26. స్వర్గం అతి పవిత్రమైన స్థలం. అక్కడ స్వర్గవాసులు మాట్లాడుకునే మాటలు కూడా పవిత్రమైనవే. వ్యర్థ ప్రేలాపనలకు, నీతిమాలిన పలుకులకు అక్కడ ఏమాత్రం ఆస్కారం ఉండదు.

27. వారు నివసించే స్థలంలో ఎటుచూసినా దైవస్తోత్రం జరుగుతూ ఉంటుంది. అందరి అధరాలు అల్లాహ్ పవిత్రతను ఆలాపిస్తూ ఉంటాయి. ఆయన ప్రసాదించిన స్వర్గ భాగ్యాలకుగాను స్వర్గవాసులు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉంటారు. ఒకవేళ ఈ ఆయతు ప్రాపంచిక జీవితాన్ని ఉద్దేశించి చెప్పబడిందనుకుంటే అప్పుడు దీని భావం ఖుర్ఆన్ మరియు ఇస్లాం వైపు దర్శకత్వం వహించబడటం అవుతుంది. విశ్వాసులకు మాత్రమే ఆ భాగ్యం లభిస్తుంది.

28. పవిత్ర మస్జిదును సందర్శించకుండా అడ్డుకుంటున్నవారు మక్కా తిరస్కారులు. హిజ్రీ 6వ సంవత్సరంలో ముస్లింలు మక్కాలో ప్రవేశించి, కాబా గృహ దర్శనం చేసుకోకుండా వాళ్లు అవరోధం కల్పించారు. పర్యవసానంగా ముస్లింలు హుదైబియా నుంచే మదీనాకు వెనుదిరగవలసి వచ్చింది.

29. అరబీలో **'ఇల్హాద్'** (إلحاد) అని ఉంది. ఇల్హాద్ అంటే అసలు వక్రవైఖరి అని అర్థం. అయితే దీని భావం చాలా విస్తృతమైనది. అవిశ్వాసం, తిరస్కారం, బహు దైవారాధన, నాస్తికత్వం, అవిధేయత, దుర్మార్గం, పాపకార్యాలు వంటివన్నీ ఇందులోకి వచ్చేస్తాయి. ఖుర్ఆన్లో ప్రయోగించబడిన పదాలను దృష్టిలో పెట్టుకొని కొంతమంది పండితులు ఏమంటారంటే; హరమ్ (ప్రాంతంలో (పవిత్ర క్షేత్రంలో) ఎవరైనా చెడు పని గురించి సంకల్పించుకుంటే (వారు ఆ చెడుకు పాల్పడకపోయినప్పటికీ) వారికి కూడా పై ఆయతులోని హెచ్చరిక వర్తిస్తుంది. అయితే 'సంకల్పించుకున్నంత'

చూపిస్తాం.[30] వాస్తవానికి మేము దానిని సర్వమానవుల కోసం సమానంగా చేసి ఉన్నాము. స్థానికులకు, బయటి నుంచి వచ్చే వారికి కూడా[31] (ఆ హక్కు సమానంగా వర్తిస్తుంది.)

بِإِلْحَادٍۭ بِظُلْمٍ نُّذِقْهُ مِنْ عَذَابٍ أَلِيمٍ ﴿٢٥﴾

**26** మేము ఇబ్రాహీమునకు కాబా గృహ స్థలాన్ని నిర్ధారించినపుడు[32] పెట్టిన షరతు ఇది: నాకు భాగస్వామ్యంగా దేనినీ కల్పించకూడదు.[33] నా గృహాన్ని ప్రదక్షిణ చేసేవారి కోసం, నిలబడేవారి కోసం, తల వంచేవారి కోసం, సాష్టాంగపడే వారి కోసం పవిత్రంగా ఉంచాలి.[34]

وَإِذْ بَوَّأْنَا لِإِبْرَٰهِيمَ مَكَانَ ٱلْبَيْتِ أَن لَّا تُشْرِكْ بِى شَيْـًٔا وَطَهِّرْ بَيْتِىَ لِلطَّآئِفِينَ وَٱلْقَآئِمِينَ وَٱلرُّكَّعِ ٱلسُّجُودِ ﴿٢٦﴾

మాత్రాన ఎవరూ శిక్షార్హులు కాజాలరని, సంకల్పానికి కార్యరూపం ఇవ్వాలని గట్టిగా నిశ్చయించుకుంటే మాత్రం శిక్షార్హులవుతారని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు (ఫత్హుల్ ఖదీర్).

30. పైన పేర్కొనబడిన దుర్మార్గాలకు ఒడిగట్టిన వారికి ఈ యాతన తప్పదు.

31. మస్జిదె హరామ్ అంటే ఒక్క కాబా గృహమేనా? లేక పూర్తి పవిత్ర (హరమ్) క్షేత్రమా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఎందుకంటే ఖుర్ఆన్‌లో కొన్నిచోట్ల మొత్తం హరమ్ ప్రాంతం కోసం కూడా 'మస్జిదె హరామ్' అన్న పదం వాడబడింది. ప్రత్యేక కాబా గృహం విషయానికి వస్తే దానిపై సమస్త ముస్లింలకు – వారు స్థానికులైనా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారైనా – సమానంగా హక్కు ఉంది. ఈ విషయంలో ద్వంద్వాభిప్రాయానికి తావులేదు. అంటే జాతి, వర్ణ, ప్రాంతీయ భేదం లేకుండా విశ్వసించిన వారందరూ రేయింబవళ్లలో ఎప్పుడైనా వెళ్ళి కాబాగృహ ప్రదక్షిణ చేయవచ్చు. ఆ పుణ్యక్షేత్రంలో ఒక ముస్లింను దైవారాధన చేయకుండా అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు.

అయితే ఇక్కడ మస్జిదె హరామ్ అంటే యావత్తు హరమ్ పరిధి అని భావించే ఉలమాలలో కొందరేమంటారంటే 'మక్కా హరమ్ ప్రాంతమంతా సమస్త ముస్లింలకు సమానంగా వర్తిస్తుంది. అక్కడి నివాస గృహాలకు, భూములకు ఎవరూ యజమానులు కాలేరు.' అందుకే అక్కడి ఇండ్లను, హోటళ్లను అమ్మటం, కొనటం, అద్దెకు ఇవ్వటం వారి దృష్టిలో ధర్మసమ్మతం కాదు. హజ్ మరియు ఉమ్రాల కోసం మక్కా నగరానికి విచ్చేసే ప్రతి యాత్రికుడు తనకిష్టం వచ్చినచోట బస చేయవచ్చు. స్థానికులు ఎవరూ ఈ అతిథులకు అడ్డు తగల కూడదు.

రెండవ అభిప్రాయం: దీని ప్రకారం స్థానికులు అక్కడి ఇళ్లపై, భూములపై యాజమాన్యం కలిగి ఉండటంలో తప్పు లేదు. వాటి క్రయవిక్రయాలు కూడా ధర్మసమ్మతమే. అయితే హజ్ క్రియల పరిధిలోకి వచ్చే నిర్ణీత స్థలాలు మాత్రం–ఉదాహరణకు: మినా, ముజ్దలిఫా, అరఫాత్ వంటి స్థలాలు మాత్రం హజ్ యాత్రికుల కోసం ఉద్దేశించినవి. అవి వక్ఫ్ విభాగం క్రిందికి వస్తాయి. ఆ స్థలాలు ఏ ఒక్కరికీ చెందిన ఆస్తి కానేరవు.

ఈ వ్యవహారంపై సనాతన ఫుకహాల (ధర్మవేత్తల) మధ్య అభిప్రాయభేదం ఉండేది. అయితే ఇప్పుడది దాదాపు సమసిపోయినట్లే. దాదాపు పండితులంతా వ్యక్తిగత ఆస్తిని అంగీకరిస్తున్నారు. మౌలానా ముఫ్తీ షఫీ (రహ్మ.లై) గారు కూడా ఇమామ్ అబూ హనీఫా సహా అనేకమంది ఫుకహాల అభిమతాన్ని ఉటంకిస్తూ స్థానికులు అక్కడి ఆస్తిపాస్తులకు యజమానులై ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. (వివరాలకు చూడండి: మారిఫుల్ ఖుర్ఆన్, సంపుటి–6, పేజీ– 253).

32. అంటే కాబా గృహం కట్టవలసిన స్థలం ఇబ్రాహీంకు చూపబడింది. అక్కడ మేము ఇబ్రాహీం (అలైహిస్సలాం) సంతతిని వసింపజేశాము. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) కాలంలో వచ్చిన జలప్రళయం తరువాత – కాబా గృహ నిర్మాణం ప్రప్రథమంగా ఇబ్రాహీం చేతుల మీదుగా జరిగింది. సహీహ్ హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది – "మొట్టమొదటి సారిగా భూ మండలంపై నిర్మించ

**27** హజ్ (యాత్ర)కై ప్రజలలో ప్రకటన గావించు.[35] ప్రజలు నీ వద్దకు అన్ని సుదూర మార్గాల నుంచి కాలినడకన కూడా వస్తారు, బక్కచిక్కిన ఒంటెలపై[36] కూడా స్వారీ అయి వస్తారు.

وَاَذِّنْ فِى النَّاسِ بِالْحَجِّ يَاْتُوْكَ رِجَالًا وَّعَلٰى كُلِّ ضَامِرٍ يَّاْتِيْنَ مِنْ كُلِّ فَجٍّ عَمِيْقٍ ﴿27﴾

**28** వారు తమ ప్రయోజనాలు పొందటానికి రావాలి.[37] అల్లాహ్ తమకు ప్రసాదించిన తమ పెంపుడు పశువుల మీద[38] ఆ నిర్ణీత దినాలలో అల్లాహ్ నామాన్ని స్మరించాలి (ఉచ్చరించాలి). ఆ తరువాత వాటిని మీరూ తినండి, దుర్భర స్థితిలో ఉన్న అగత్య పరులకు కూడా తినిపించండి.

لِّيَشْهَدُوْا مَنَافِعَ لَهُمْ وَيَذْكُرُوا اسْمَ اللّٰهِ فِىْٓ اَيَّامٍ مَّعْلُوْمٰتٍ عَلٰى مَا رَزَقَهُمْ مِّنْۢ بَهِيْمَةِ الْاَنْعَامِ ۚ فَكُلُوْا مِنْهَا وَاَطْعِمُوا الْبَآئِسَ الْفَقِيْرَ ﴿28﴾

బడిన మస్జిద్ 'మస్జిదె హరాం' (మక్కాలోని పవిత్ర కాబా మస్జిదు). ఈ గృహం నిర్మించబడిన 40 సంవత్సరాల తరువాత 'మస్జిదె అక్సా' నిర్మించబడింది." (ముస్నదె అహ్మద్ – 5/150 (166, 167 పేజీలు); ముస్లిం – కితాబుల్ మసాజిద్).

33. కాబా గృహ నిర్మాణం అసలు ఉద్దేశం ఏమిటో ఇక్కడ చెప్పబడింది. అక్కడ కేవలం తన ఆరాధన మాత్రమే జరగాలని అల్లాహ్ స్పష్టంగా నిర్దేశించాడు. ఈ వాక్యం ద్వారా చెప్పదలచిందేమిటంటే ముష్రిక్కులు అక్కడ విగ్రహాలను ప్రతిష్ఠించి ఘోరమైన అపచారానికి పాల్పడ్డారు. కాబా గృహానికి ఉన్న పవిత్రతను, విశిష్ఠతను మంటగలిపారు. ఇది చాలా దారుణమైన విషయం. కాబట్టి కాబా గృహంలోని ఈ షిర్క్ కాలుష్యాన్ని తొలగించి, దాని పవిత్రతను కాపాడవలసి ఉంది. అక్కడ కేవలం ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి.

34. అంటే కుఫ్ర్ (అవిశ్వాసం), విగ్రహారాధన తదితర కాలుష్యాల నుంచి, అపసవ్యమైన పోకడల నుంచి ఆ స్థలాన్ని పవిత్రంగా ఉంచాలి. ఎందుకంటే అది ఏకదైవారాధన కోసం ఆమోదించబడిన గృహం. ఇక్కడ కేవలం నమాజు చేసేవారిని, ప్రదక్షిణ చేసేవారిని మాత్రమే ప్రస్తావించటం జరిగింది. ఇవి రెండూ (నమాజు, కాబా ప్రదక్షిణ) కాబా గృహంతో ముడిపడి ఉన్న ప్రధానాంశాలు. నమాజు చేసే ప్రతి వ్యక్తీ కాబా వైపుకు తిరిగి చేస్తాడు. ప్రదక్షిణ కూడా కేవలం కాబాకు మాత్రమే పరిమితం, ప్రత్యేకం. ఇతర ప్రార్థనాలయాల వద్ద ప్రదక్షిణ చేయడానికి వీల్లేదు. కాని శోచనీయమైన విషయం ఏమిటంటే ముస్లిం సమాజంలో కొత్తపుంతలపై మోజుపడే మహానుభావులు (బిద్అతీలు) ఈనాడు సమాధులను, దర్గాలను కూడా ప్రదక్షిణా స్థలాలుగా మార్చుకున్నారు. ఈ అపమార్గం క్షంతవ్యం కానిది.

35. మక్కా పర్వత శిఖరాల నుంచి పుట్టిన ఈ ప్రకటన ప్రపంచం నలుమూలలా ప్రతిధ్వనించింది. నేల నాలుగు దిక్కుల నుంచి ఏకదైవారాధకులు హజ్ ఉమ్రాల కోసం ఈ కేంద్ర కాబా గృహం వైపుకు తరలివస్తున్నారు.

36. ఈ ఒంటెలు సుదీర్ఘ ప్రయాణాలవల్ల గానీ, తగినంత గ్రాసం లేకపోవటంవల్ల గానీ, అలసట వల్లగానీ బక్కచిక్కిపోతాయి.

37. ఈ ప్రయోజనాలు ప్రాపంచికమైనవీ, ధార్మికమైనవి కూడాను. నమాజ్, ప్రదక్షిణ (తవాఫ్), హజ్ క్రియలు – అంటే సయీ, అరఫాత్‌లో విడిది, జమరాత్, ఖుర్బానీ తదితర అంశాల ద్వారా హాజీలకు అపారమైన ధార్మిక శుభాలు కలుగుతాయి. దేవుని క్షమాభిక్ష ప్రాప్తమవుతుంది. మరోవైపు వ్యాపారం, క్రయవిక్రయాల ద్వారా ప్రాపంచిక లాభాలు కూడా ఒనగూరుతాయి.

38. పెంపుడు పశువులు (బహీమతుల్ అన్ఆమ్) అంటే ఒంటెలు, ఆవులు, మేకలు, గొర్రెలు అని భావం. వాటిపై అల్లాహ్ పేరును స్మరించటమంటే 'ఖుర్బానీ' చేయటమన్నమాట! నిర్ణీత దినాలంటే 'అయ్యామె తష్రీఖ్.' ఇవి జిల్‌హజ్ 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉంటాయి. ఈ రోజులలో ఎప్పుడైనా ఖుర్బానీ ఇవ్వవచ్చు. సాధారణంగా 'అయ్యామె మాలూమాత్' (నిర్ణీత దినాలు) అంటే జిల్‌హిజ్జా మాసపు మొదటి పదిరోజులనీ, 'అయ్యామె మాదూదాత్' (కొన్ని దినాలు) అంటే 'అయ్యామె తష్రీఖ్' అని భావం తీసుకుంటారు. అయితే సందర్భాన్నిబట్టి ఇక్కడ 'మాలూమాత్'

29 ఆ తరువాత వారు తమ మురికిని దూరం చేసుకోవాలి,[39] తమ మొక్కుబడులను చెల్లించాలి.[40] (అనంతరం దేవుని) ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణ చేయాలి.[41]

ثُمَّ لْيَقْضُوا تَفَثَهُمْ وَلْيُوفُوا نُذُورَهُمْ وَلْيَطَّوَّفُوا بِالْبَيْتِ الْعَتِيقِ ﴿٢٩﴾

30 ఇది (హజ్ కొరకు నిర్దేశించబడిన పద్ధతి). ఎవడయితే అల్లాహ్ విధించిన కట్టుబాట్లను[42] గౌరవిస్తాడో అతనికోసం అతని ప్రభువు వద్ద మేలుంది. మీకు తెలియజేయబడిన(హరాం) జంతువులు[43] తప్ప మిగిలిన పశువులు మీకోసం ధర్మ సమ్మతం (హలాల్) చేయబడ్డాయి. కాబట్టి మీరు విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండాలి,[44] సత్యవిరుద్ధమైన మాటలకు కూడా దూరంగా ఉండాలి.[45]

ذَٰلِكَ وَمَن يُعَظِّمْ حُرُمَاتِ اللَّهِ فَهُوَ خَيْرٌ لَّهُ عِندَ رَبِّهِ ۗ وَأُحِلَّتْ لَكُمُ الْأَنْعَامُ إِلَّا مَا يُتْلَىٰ عَلَيْكُمْ ۖ فَاجْتَنِبُوا الرِّجْسَ مِنَ الْأَوْثَانِ وَاجْتَنِبُوا قَوْلَ الزُّورِ ﴿٣٠﴾

(నిర్ణీతమైన) అన్న పదం 'తష్రీఖ్' దినాల కోసమే ఉపయోగించబడి ఉంటుందని అర్థమవుతోంది. వాస్తవం అల్లాహ్‌కే బాగా తెలుసు.

39. జిల్ హజ్ 10వ తేదీన పెద్ద జమ్రా (లేక అఖబా స్తంభం)పై కంకర రాళ్లు రువ్విన తరువాత హాజీపైనుంచి తొలి దశ ఇహ్రాం ఆంక్షలు సడలించబడతాయి. ఇప్పుడు అతను ఇహ్రాం దుస్తులను విడుస్తాడు. భార్యతో సంభోగించటం తప్ప – ఇహ్రాం స్థితిలో నిషేధించబడిన పనులన్నీ అతని కోసం ధర్మసమ్మతం అయిపోతాయి. 'మురికి'ని దూరం చేసుకోవటమంటే క్షవరం చేసుకోవటం, గోళ్లు కత్తిరించటం, తైలసంస్కారం చేసుకోవటం, సుగంధద్రవ్యాలు పూసుకోవటం, కుట్టిన దుస్తులు ధరించటం మొదలగునవి.

40. ఒకవేళ ఏదన్నా మొక్కుకుని ఉంటేనే ఈ ఆదేశం వర్తిస్తుంది. ఉదాహరణకు : పవిత్ర కాబా గృహాన్ని దర్శించే భాగ్యం దేవుడు ప్రసాదిస్తే ఫలానా సత్కార్యం చేస్తానని సంకల్పించుకుని ఉంటే దాన్ని నెరవేర్చాలి.

41. **'ప్రాచీన గృహం'** (బైతున్ అతీఖ్) అంటే పవిత్ర కాబా గృహం. శిరోముండనం లేక క్షవరం తరువాత కాబా గృహప్రదక్షిణ చేయాలి. దీన్నే 'తవాఫె ఇఫాజా' లేక 'తవాఫె జియారత్' అని కూడా అంటారు. ఇది కూడా హజ్ క్రియలలో ఒక అతి ముఖ్య అంశం. అరఫాత్‌లో విడిది చేసిన తరువాత, 'రమీ' చేసిన తరువాత ఈ ప్రదక్షిణ చేయబడుతుంది. కాగా; 'తవాఫె ఖుదూమ్'ను కొందరు తప్పనిసరి (వాజిబ్) గానూ, కొందరు సంప్రదాయం (సున్నత్) గానూ భావిస్తున్నారు. తవాఫె విదాను మాత్రం 'సున్నతె ముఅక్కద' (లేక వాజిబ్)గా పరిగణిస్తున్నారు. అయితే అత్యధికమంది పండితుల అభిప్రాయం ప్రకారం షరీయతుపరమైన తగు కారణం ఏదన్నా ఉంటే ఈ క్రియను నెరవేర్చకపోయినా ఫరవాలేదు. ఉదాహరణకు : బహిష్టు అయిన స్త్రీ ఈ ప్రదక్షిణ చేయనవసరం లేదు (ఐసరుత్తఫాసీర్).

42. 'అల్లాహ్ విధించిన కట్టుబాట్లు' అంటే ఇంతకుముందు పేర్కొనబడిన హజ్ క్రియలు అని భావం. 'గౌరవించటం' అంటే సూచించబడిన రీతిలోనే హజ్‌ను నెరవేర్చటం అని అర్థం. వాటికి విరుద్ధంగా ప్రవర్తించి దైవనియమాలను కాలరాయకూడదు.

43. అంటే ఏ ఏ జంతువులు మీ కోసం నిషేధించబడ్డాయో ఇంతకు ముందే సవివరంగా చెప్పటం జరిగింది. ఉదాహరణకు: **హుర్రిమత్ అలైకుముల్ మైతతు, వద్దము....** అనే ఆయతులో ఈ వివరాలు వచ్చాయి. (అల్ బఖర – 173, మాయిద – 3)

44. **'రిజ్స్'** (رِجْس) అంటే మాలిన్యం, అశుద్ధత అని అసలు అర్థం. కాని ఈ ఆయతులో 'రిజ్స్' అంటే కొయ్యతోనూ, లోహంతోనూ, మరేదైనా వస్తువుతోనూ చేయబడిన విగ్రహాలని భావం. అల్లాహ్‌ను వదలి ఇతరత్రా వాటిని పూజించటం

**31** ఏకాగ్రతతో దేవుని ఏకత్వాన్ని అనుసరిస్తూ,[46] ఆయనకు సాటి కల్పించకుండా ఉండాలి. వినండి! అల్లాహ్‌కు సాటి కల్పించేవాడు ఆకాశం నుంచి క్రిందపడి పోయిన వానితో సమానం. ఇప్పు డతన్ని పక్షులైనా తన్నుకుపోతాయి లేదా పెనుగాలి అయినా ఎత్తి దూరప్రదేశంలో విసిరేస్తుంది.[47]

حُنَفَآءَ لِلّٰهِ غَيْرَ مُشْرِكِيْنَ بِهٖ ؕ وَمَنْ يُّشْرِكْ بِاللّٰهِ فَكَاَنَّمَا خَرَّ مِنَ السَّمَآءِ فَتَخْطَفُهُ الطَّيْرُ اَوْ تَهْوِىْ بِهِ الرِّيْحُ فِىْ مَكَانٍ سَحِيْقٍ ﴿31﴾

**32** ఇది (తెలుసుకున్నారు కదా! ఇది కూడా తెలుసుకోండి!). అల్లాహ్ చిహ్నాలను ఎవరయినా గౌరవిస్తున్నారంటే అది వారి హృదయాలలోని భక్తిభావన వల్లనే సుమా![48]

ذٰلِكَ ۗ وَمَنْ يُّعَظِّمْ شَعَآئِرَ اللّٰهِ فَاِنَّهَا مِنْ تَقْوَى الْقُلُوْبِ ﴿32﴾

అశుద్ధతను, అపసవ్యతను అవలంబించటమే. ఇది ఒకవిధంగా దైవాగ్రహాన్ని కొనితెచ్చుకోవటం వంటిదే. కాబట్టి ఈ బహుదైవారాధనకు దూరంగా ఉండండి.

45. అసత్యమైన పలుకులో అబద్ధ ప్రమాణం కూడా ఉంది. (హదీసు ప్రకారం ఇది షిర్క్, తల్లిదండ్రుల అవిధేయత తరువాత మూడో పెద్ద పాపకార్యం). అల్లాహ్ ఏ ఏ విషయాలకు అతీతుడో వాటిని అల్లాహ్‌కు అంటగట్టడం అన్నిటికన్నా పెద్ద అసత్యం. ఉదాహరణకు : అల్లాహ్‌కు సంతానం ఉందని అనటం, ఫలానా పుణ్యపురుషుడు అల్లాహ్ అధికారాలలో భాగస్థుడు అని బుకాయించటం, ఫలానా పనిని అల్లాహ్ ఎలా చేయగలడు?! అని సందేహాన్ని వ్యక్తపరచటం – ఇవన్నీ అసత్య ప్రేలాపనలుగానే పరిగణించబడతాయి. మరణానంతర జీవితం అసలెలా సాధ్యం అని అవిశ్వాసులు అనేవారు. ఇప్పటికీ అంటున్నారు. అల్లాహ్ ధర్మసమ్మతం గావించిన వస్తువులను అధర్మంగా చేసుకోవటం, అధర్మమైన వస్తువులను ధర్మసమ్మతమని తమంతట తాముగా ఖరారు చేసుకోవటం కూడా అసత్యం క్రిందికే వస్తుంది. అలాంటి వాటికి ఆమడదూరాన ఉండాలి.

46. మనిషి దేవుని ఏకత్వం విషయంలో స్థిరంగా ఉండాలి. ఒకేమాటపై ఉండాలి, ఒకే బాటపై నడవాలి. ఒకే దిక్కుకు తిరిగి దైవారాధన చేయాలి. మనసును ఒక్కడైన అల్లాహ్‌పైనే లగ్నం చేయాలి. అంటే షిర్క్ నుంచి తౌహీద్ వైపుకు మరలాలి. అసత్యం నుంచి సత్యధర్మమైన ఇస్లాం వైపుకు ప్రస్థానం చేయాలి. మూలంలో **'హునఫా'** (حُنَفَاءَ) అని వచ్చింది. ఇది 'హనీఫ్'కు బహువచనం. ఒక వైపుకు తిరగటం, ఏకోన్ముఖులవటం, ఒకే వైపుకు మళ్ళటం అని దాని భావం.

47. ఏ విధంగానయితే గ్రద్దలు, డేగలు పైనుంచి వచ్చి చిన్న చిన్న జంతువులను తన్నుకు పోతాయో లేదా పొడిచి తింటాయో లేక ఉధృతమైన గాలులు నేలపైని వస్తువులను ఎగరేసుకు పోతాయో, నిజదైవాన్ని వదలి షిర్క్‌కు ఒడిగట్టిన వాని పరిస్థితి కూడా అదే అవుతుంది.

దేవుని ఏకత్వంపై దృఢ విశ్వాసం కలిగి ఉండి, ఆయన్ని ఆరాధించే వ్యక్తి శాంతి, సుస్థిరత, ఆత్మతృప్తి, ఆత్మశుద్ధి రీత్యా అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తాడు. దీనికి భిన్నంగా షిర్క్‌కు ఒడిగట్టినవాడు (బహుదైవోపాసనకు లోనైనవాడు) ఉన్నత శిఖరాల నుంచి పాతాళానికి పడిపోతాడు.

48. **'షఆయిర్'** (شَعَائِر) అంటే గుర్తులు, చిహ్నాలు అని అర్థం. 'సంకేతం' అని కూడా ఒక అర్థం వస్తుంది. యుద్ధాల, సైనిక చర్యల కోసం కూడా కొన్ని సంకేత పదాలను ఉపయోగిస్తారు. ఆ 'కోడ్'ను సంబంధిత వ్యక్తులు మాత్రమే గ్రహించగలుగుతారు. అలాగే 'దేవుని చిహ్నాలు' అంటే ఇస్లాం ధర్మవైశిష్ట్యాన్ని, ప్రత్యేకతను చాటిచెప్పే ఆదేశాలు అన్నమాట. వాటిద్వారా ఒక ముస్లిం ప్రపంచంలో తన వ్యక్తిత్వాన్ని, వైశిష్ట్యాన్ని చాటిచెబుతాడు. ఇతర మతాల నుండి ఆ 'చిహ్నాలు' అతన్ని స్పష్టంగా వేరుపరుస్తాయి. మక్కాలోని సఫా–మర్వా పర్వతాలు కూడా దేవుని చిహ్నాలుగా ఖరారు చేయబడ్డాయి. ఎందుకంటే ముస్లింలు హజ్, ఉమ్రాల సందర్భంగా ఈ రెండు కొండల మధ్య 'సయీ' చేస్తారు. ఈ ఆయతులో హజ్‌లోని ఇతర క్రియలు కూడా దైవచిహ్నాలుగా, ముఖ్యంగా ఖుర్బానీ పశువులు

33 ఒక నిర్ధారిత గడువు వరకు వాటిలో (ఖుర్బానీ పశువులలో) మీ కోసం కొన్ని లాభాలు ఉన్నాయి.[49] ఆ తరువాత అవి జిబహ్ చేయబడే చోటు ప్రాచీన గృహం (వద్దనే ఉంది).[50]

لَكُمْ فِيهَا مَنَافِعُ إِلَىٰٓ أَجَلٍ مُّسَمًّى ثُمَّ مَحِلُّهَآ إِلَى ٱلْبَيْتِ ٱلْعَتِيقِ ﴿٣٣﴾

34 తమకు అల్లాహ్ ప్రసాదించివున్న పశువులపై అల్లాహ్ పేరును స్మరించటానికిగాను మేము ప్రతి అనుచర సమాజం కోసం ఖుర్బానీ ఆచారాన్ని నిర్ధారించాము.[51] కనుక మీ ఆరాధ్య దేవుడు ఒకే ఆరాధ్యదేవుడని తెలుసుకోండి. కాబట్టి మీరు ఆయన ఆజ్ఞలనే శిరసావహించండి. (కనుక ఓ ముహమ్మద్) వినమ్రులైన వారికి శుభవార్తను వినిపించు.

وَلِكُلِّ أُمَّةٍ جَعَلْنَا مَنسَكًا لِّيَذْكُرُوا۟ ٱسْمَ ٱللَّهِ عَلَىٰ مَا رَزَقَهُم مِّنۢ بَهِيمَةِ ٱلْأَنْعَٰمِ ۗ فَإِلَٰهُكُمْ إِلَٰهٌ وَٰحِدٌ فَلَهُۥٓ أَسْلِمُوا۟ ۗ وَبَشِّرِ ٱلْمُخْبِتِينَ ﴿٣٤﴾

35 (వారిలోని సుగుణం ఏమిటంటే) అల్లాహ్ నామం స్మరించినప్పుడు వారి హృదయాలు వణుకుతాయి. తమపై ఏ ఆపద వచ్చిపడినా వారు ఓర్పు వహిస్తారు, నమాజులను నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చు చేస్తూ ఉంటారు.

ٱلَّذِينَ إِذَا ذُكِرَ ٱللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَٱلصَّٰبِرِينَ عَلَىٰ مَآ أَصَابَهُمْ وَٱلْمُقِيمِى ٱلصَّلَوٰةِ وَمِمَّا رَزَقْنَٰهُمْ يُنفِقُونَ ﴿٣٥﴾

'దైవచిహ్నాలు'గా అభివర్ణించబడ్డాయి. వాటిని గౌరవించటమంటే అర్థం ఏమిటీ? బలిష్ఠమైన, ఏ లోపమూ లేని పశువులను ఖుర్బానీ ఇవ్వటం. ఈ త్యాగం (ఖుర్బానీ) భయభక్తులకు ఆనవాలుగా చెప్పబడింది. భయము, భక్తి (తఖ్వా) అన్నది ఆంతర్యంతో ముడిపడిన విషయం. అది పైకి కనిపించదు. ఆంతర్యం ఎంత నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉంటుందో ఆరాధన కూడా అంతే స్వచ్ఛంగా, గొప్పగా ఉంటుంది.

49. **'లాభాలు'** అంటే ఖుర్బానీ కోసం సమకూర్చుకున్న పశువుల ద్వారా కలిగే లాభాలు అన్నమాట. అవి వాహనాలుగా ఉపయోగపడతాయి. వాటిద్వారా పాలు లభ్యమవుతుంది. వాటి ఉన్ని లాభాలను ఆర్జించిపెడుతుంది. ఆ పశువులు 'జిబహ్' అయ్యేవరకూ వాటి ద్వారా లబ్ధిపొందటంలో తప్పులేదు. ప్రామాణిక హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది. ఒకసారి ఒక వ్యక్తి ఖుర్బానీ పశువు (మీద కూర్చోకుండా)ను తోలుకుపోతుండగా, దానిపై కూర్చోమని మహాప్రవక్త (సఅసం) అతనికి సూచించారు. అది హజ్ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వవలసిన పశువు అని ఆ వ్యక్తి చెప్పాడు. "ఫరవాలేదు. దానిపై కూర్చో" అని మహనీయ ముహమ్మద్ (సఅసం) ఉద్బోధించారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ హజ్).

50. **"మహిల్లు"** (مَحِلُّ) అంటే ఖుర్బానీ (జిబహ్) కావలసిన ప్రదేశం అని భావం. హజ్ యాత్రికుడు హజ్ క్రియలను నెరవేర్చిన పిదప ఈ ఖుర్బానీ పశువులు పుణ్యక్షేత్రం పరిధిలోని ఖుర్బానీ ఇచ్చే స్థలంలోకి చేర్చబడతాయి. పుణ్యక్షేత్రం పరిధిలోనికి వచ్చినప్పటి నుంచి ఆ 'హదీ' పశువుల ద్వారా ఎలాంటి 'లబ్ధి' పొందకూడదు.

51. అరబీ మూలంలో **'మన్‌సకన్'** (مَنسَكًا) అని వుంది. దైవసామీప్యం కోసం పశువును బలి ఇవ్వటాన్ని మన్‌సకున్‌గా వ్యవహరిస్తారు. అయితే దైవవిధేయత, ఉపాసనా రీతుల కోసం కూడా ఈ పదం వాడబడుతుంది. దైవప్రసన్నతను బడయటానికి పశువును ఖుర్బానీ ఇవ్వటం కూడా ఆరాధనలో అంతర్భాగం అవటం వల్ల దైవేతరుల మెప్పుకోసం దైవేతరుల పేర పశువును జిబహ్ చేస్తే అది దైవేతరుల పూజగా పరిగణించబడుతుంది. హజ్ విధి నిర్వహణలో ప్రధానాంశాలైన అరఫాత్ మైదానంలో విడిది, ముజ్దలిఫాలో ప్రార్థన, కాబా ప్రదక్షిణ, సయీ, మినాలోని క్రియలు కూడా ఈ **'మనాసిక్'** పరిధిలోకి వస్తాయి. మొత్తమ్మీద ఈ ఆయతు సారాంశం ఏమిటంటే; మేము లోగడ కూడా

وَالْبُدْنَ جَعَلْنٰهَا لَكُمْ مِّنْ شَعَآئِرِ اللّٰهِ لَكُمْ فِيْهَا خَيْرٌ ۖ فَاذْكُرُوا اسْمَ اللّٰهِ عَلَيْهَا صَوَآفَّ ۚ فَاِذَا وَجَبَتْ جُنُوْبُهَا فَكُلُوْا مِنْهَا وَاَطْعِمُوا الْقَانِعَ وَالْمُعْتَرَّ ۚ كَذٰلِكَ سَخَّرْنٰهَا لَكُمْ لَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿٣٦﴾

**36** ఖుర్బానీ ఒంటెలను[52] (కూడా) మేము మీకోసం అల్లాహ్ చిహ్నాలుగా నిర్ధారించాము. వాటిలో మీకు మేలున్నది. కాబట్టి వాటిని వరుసగా నిలబెట్టి, వాటిపై అల్లాహ్ పేరును ఉచ్చరించండి.[53] మరి వాటి ప్రక్కలు నేలకొరిగిన తరువాత,[54] వాటిని (మీరూ) తినండి,[55] అడగని అభాగ్యులకు, అడిగే అగత్యపరులకు కూడా తినిపించండి.[56] ఈ విధంగా మీరు కృతజ్ఞతాపూర్వకంగా మసలుకునేందుకుగాను మేము ఈ పశువులను మీకు స్వాధీన పరిచాము.

వివిధ సమాజాల వారికి పశువులను జిబహ్ చేసే పద్ధతిని, హజ్ యాత్రను నిర్వహించే రీతినీ చూపుతూ వచ్చాము. ఈ ఉపాసనల ద్వారా అల్లాహ్ సామీప్యం పొందటం దీని అసలు ఉద్దేశం. అందుకే పశువులను జిబహ్ చేసేటప్పుడు మా పేరును ఉచ్చరించాలి. అంటే 'బిస్మిల్లాహి వల్లాహు అక్బర్' అని పలికి పశువులను కోయాలి అని దేవుడు ఉపదేశిస్తున్నాడు.

52. **'బుద్న్'** (بُدْن) అంటే అసలు బలిసిన జంతువులు అని అర్థం. అయితే అరబ్బు నిఘంటుకర్తలు ఈ పదాన్ని ఒంటెల కోసం ప్రత్యేకించారు. హదీసు ప్రకారం చూస్తే ఈ పదం ఆవులకు కూడా వర్తిస్తుంది. చెప్పవచ్చిందేమిటంటే ఖుర్బానీ కోసం కాబా గృహానికి తరలించబడే పశువులు – ఒంటెలైనా, ఆవులైనా – కూడా దేవుని చిహ్నాలలోనివే.

53. ఆ పశువులు (ఒంటెలు) వరుసగా నిలబెట్టబడి ఉండాలి. నిలబడిన స్థితిలోనే వాటి గొంతుపై బల్లెంతో పొడవాలి. దీన్నే 'నహర్' గా వ్యవహరిస్తారు. ఎడమ (ముందు) పాదం కట్టబడి ఉంటుంది. మూడు కాళ్లపై మాత్రమే అది నిలబడి ఉంటుంది.

54. శరీరంలోని రక్తమంతా ప్రవహించి, ప్రాణం విడిచి క్రిందపడిపోయిన తరువాత మాంసం కోయాలి. ఎందుకంటే బ్రతికివున్న జంతువు మాంసం తినటం నిషిద్ధం. ఏ జంతువును అయినా సజీవంగా ఉన్న స్థితిలో దాని మాంసాన్ని కోస్తే, అలా కోసిన మాంసం మృత మాంసం అవుతుంది. (అబూదావూద్ – కితాబుస్సైద్; తిర్మిజీ – అబ్వాబుస్సైద్; ఇబ్నుమాజ).

55. కొంతమంది పండితులు ఈ ఆదేశాన్ని ఆధారంగా తీసుకుని ఖుర్బానీ ఇచ్చిన వ్యక్తి, ఆ ఖుర్బానీ మాంసాన్ని స్వయంగా భుజించటాన్ని తప్పనిసరి (వాజిబ్) గా ఖరారు చేశారు. అయితే అత్యధికమంది పండితులు మాత్రం దీనిని అభిలషణీయంగా పరిగణించారు (తప్పనిసరి అని చెప్పలేదు). అంటే, కొంత తింటే మంచిదే. కాని ఏ కారణంగానయినా తినలేక మొత్తం పంచిపెట్టేస్తే వచ్చిన చిక్కేమీ లేదు.

56. పేదలలో కొందరు అడిగేవారు (యాచకులు) ఉంటారు, మరి కొందరు ఆత్మాభిమానం వల్ల కోర్కెలను లోలోపలే అణచిపెట్టుకుంటారు. ఇవ్వమని అడగరు. ఈ ఆయతు ఆధారంగా కొంతమంది పండితులు ఖుర్బానీ మాంసాన్ని మూడు భాగాలుగా విభజించాలని చెబుతారు – ఒక భాగం: ఖుర్బానీ ఇచ్చిన వారిది, రెండవభాగం: తమను కలుసుకునే బంధుమిత్రులకు, మూడవభాగం: యాచకులకు, సమాజంలోని నిరుపేదలకు, అగత్యపరులకు ఇవ్వాలి. తమ విభజనను సమర్థిస్తూ ఈ క్రింది హదీసును పేర్కొంటారు. మహనీయ ముహమ్మదు (సఅసం) వారు ఈ విధంగా ప్రవచించారు: "మూడు రోజులకన్నా ఎక్కువగా ఖుర్బానీ మాంసాన్ని నిలువచేసి ఉంచరాదని (లోగడ) నేను మీకు చెప్పి ఉన్నాను. అయితే ఇప్పుడు మీకు ఈ మేరకు అనుమతి ఇవ్వబడుతోంది. మీరు తినగలిగినంత తినండి, సమంజసమైన రీతిలో నిలువ చేసుకోండి." వేరొక ఉల్లేఖనంలో ఈ పదాలు ఉన్నాయి–"కాబట్టి మీరూ తినండి, నిలువ కూడా చేసుకోండి, దానం కూడా చేయండి." ఇంకొక ఉల్లేఖనం ఇలా వుంది: "తినండి, తినిపించండి, దానం చేయండి." (బుఖారీ – కితాబుల్ అజాహీ; ముస్లిం – కితాబుల్ అజాహీ).

ఖుర్బానీ మాంసాన్ని రెండు వాటాలుగా విభజించి, ఒక వాటాను తాముంచుకుని మరో వాటాను దానం చేస్తే

لَنْ يَّنَالَ اللّٰهَ لُحُوْمُهَا وَلَا دِمَآؤُهَا وَلٰكِنْ يَّنَالُهُ التَّقْوٰى مِنْكُمْ ۭ كَذٰلِكَ سَخَّرَهَا لَكُمْ لِتُكَبِّرُوا اللّٰهَ عَلٰى مَا هَدٰىكُمْ ۭ وَبَشِّرِ الْمُحْسِنِيْنَ ﴿37﴾

**37** వాటి మాంసంగానీ, రక్తంగానీ అల్లాహ్‌కు చేరవు. అయితే మీలోని భక్తి పరాయణత (తఖ్వా) మాత్రం ఆయనకు చేరుతుంది. ఈ విధంగా అల్లాహ్ ఈ పశువులను మీకు లోబరిచాడు– ఆయన మార్గదర్శకత్వానికి కృతజ్ఞతగా మీరు ఆయన గొప్పదనాన్ని కొనియాడటానికి! (ఓ ముహమ్మద్!) సదాచార సంపన్నులకు సంతోషవార్త వినిపించు.

సరిపోతుందని కొంతమంది పండితులు భావిస్తున్నారు. వారు తమ ఈ వాదనకు అనుకూలంగా “మీరూ తినండి, దుర్భరస్థితిలో ఉన్న పేదవారికీ తినిపించండి” అని ఇంతకుముందు వచ్చిన ఆయతును ఉదాహరిస్తున్నారు.

అయితే ఒకటి మాత్రం నిజం : రెండు లేక మూడు వాటాలు చెయ్యాలన్న ఆజ్ఞ ఏ ఆయతులోనూ, ఏ హదీసులోనూ ఖచ్చితంగా లేదు. ‘తినండి, తినిపించండి’ అన్న ఆదేశం మాత్రం ఇవ్వబడింది. కాబట్టి ఈ వాటాల విషయంలో మరీ అంత ‘ఇది’గా వ్యవహరించకూడదు. అవసరమున్నచోట ఉదారంగానూ ప్రవర్తించాలి. అవసరం లేదనుకున్నచోట కాస్త అటూ ఇటూగా కూడా వ్యవహరించవచ్చు. ఈ విషయంలో లేనిపోని పట్టింపులకు పోయి, మరీ చాదస్తంగా మసలుకోవలసిన అవసరం లేదు.

అయితే ఖుర్బానీ పశువుల చర్మం విషయంలో మటుకు ఏకాభిప్రాయం ఉంది. దాన్ని తమ అవసరాలకైనా ఉపయోగించాలి లేదా దానమైనా చేయాలి. అంతేగాని చర్మాన్ని అమ్మి సొమ్ముచేసుకోకూడదు (ముస్నదె అహ్మద్ – 4/15). కాని ఖుర్బానీ చర్మాన్ని స్వయంగా అమ్మి, అలా అమ్మగా వచ్చిన పైకాన్ని నిరుపేదలకు ఇచ్చేందుకు కొంతమంది పండితులు అనుమతించారు (ఇబ్నె కసీర్).

**గమనార్హ విషయం :** దివ్య ఖుర్‌ఆన్‌లో ఖుర్బానీ ప్రస్తావన హజ్ విధుల సందర్భంగా వచ్చినందున ఖుర్బానీ కేవలం హజ్ యాత్రికులకు మాత్రమే తప్పనిసరిగా చేయబడిందని కొందరు ప్రబుద్ధులు – ముఖ్యంగా హదీసులను నిరాకరించే వారు– వాదిస్తున్నారు. కాని ఇది వాస్తవం కాదు. ఖుర్బానీ ఇవ్వాలన్న ఆజ్ఞ వేరితర చోట్ల కూడా ఉంది. ఉదాహరణకు: “నీ ప్రభువు కొరకు నమాజు చెయ్యి, ఖుర్బానీ కూడా ఇవ్వు” (కౌసర్ – 2). అంతిమ దైవ ప్రవక్త (సఅసం) వారు ఈ ఆయతుకు భావార్థాన్ని క్రియాత్మకంగా చాటి చెప్పారు. ఆయన (స) స్వయంగా ఏటేటా మదీనాలో జిల్‌హజ్ 10వ తేదీన ఖుర్బానీ ఇచ్చేవారు. ఈ మేరకు సాటి ముస్లింలకు కూడా తాకీదు చేసేవారు. ప్రవక్త ప్రత్యక్ష సహచరులు (రజి) కూడా దీన్ని పాటించేవారు. ఖుర్బానీ ఆచారానికి సంబంధించి అనేక ఉపదేశాలు చేసిన దైవప్రవక్త (స) ఈ ఉపదేశం కూడా చేశారు: “ఈదుల్ అజ్‌హా (బక్రీద్ పండుగ – జిల్ హజ్ 10వ తేదీన) నాడు మనం అన్నిటికన్నా ముందు పండుగ నమాజ్ చేయాలి. ఆ తరువాత వెళ్ళి పశువును జిబహ్ చేయాలి.” ఇంకా ఇలా అన్నారు : “ఎవరయితే (పండుగ) నమాజుకు ముందే ఖుర్బానీ ఇచ్చాడో అతను మాంసం తినటానికి తొందరపడ్డాడు. అతని ఖుర్బానీ స్వీకారయోగ్యం కాదు” (బుఖారీ – కితాబుల్ ఈదైన్; ముస్లిం – కితాబుల్ అజాహీ). దీన్నిబట్టి కూడా స్పష్టంగా అవగతమయ్యేదేమిటంటే ముస్లిం అనేవాడు ఎక్కడున్నా ఖుర్బానీ ఆజ్ఞ అతనికి వర్తిస్తుంది. ఎందుకంటే హజ్ యాత్రికులు, జిల్‌హజ్ 10వ తేదీన పండుగ నమాజు అసలు చేయరు. కాబట్టి ‘పండుగ నమాజు అనంతరం ఖుర్బానీ ఇవ్వాలి’ అన్న ప్రవక్త (స) ప్రబోధనను బట్టి ఇది సాధారణ ముస్లింలందరికీ వర్తిస్తుందని తెలిపోయింది. అయితే ఖుర్బానీ ఇవ్వటం వాజిబ్ (తప్పనిసరి) కాదు. ఇది ‘సున్నతె ముఅక్కద’ గా పరిగణించబడుతుంది– ఎందుకంటే ప్రవక్త (స)వారు సాలీనా దీన్ని పాటించేవారు. అలాగే ప్రదర్శనా మనస్తత్వంతో ఒకే ఇంటివారు అనేక పశువులను ఖుర్బానీ ఇవ్వటం కూడా అంతగా అభిలషణీయం కాదు. పైగా అది సున్నత్‌కు విరుద్ధం. హదీసు ప్రకారం ఇంటి సభ్యులందరి తరపున ఒక పశువును ఖుర్బానీ ఇచ్చినా సరిపోతుంది. ప్రవక్త ప్రియసహచరులు (రజి) కూడా ఇలాగే చేసేవారు (తిర్మిజీ – జిబహ్ అధ్యాయాలు; ఇబ్నుమాజ).

اِنَّ اللّٰهَ يُدٰفِعُ عَنِ الَّذِيْنَ اٰمَنُوْا ؕ اِنَّ اللّٰهَ
لَا يُحِبُّ كُلَّ خَوَّانٍ كَفُوْرٍ ﴿٣٨﴾

**38** నిశ్చయంగా అల్లాహ్ నికార్సయిన విశ్వాసుల నుండి శత్రువులను పారద్రోలుతాడు.[57] విశ్వాస ఘాతకులైన కృతఘ్నులను అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు.

اُذِنَ لِلَّذِيْنَ يُقٰتَلُوْنَ بِاَنَّهُمْ ظُلِمُوْا ؕ
وَاِنَّ اللّٰهَ عَلٰى نَصْرِهِمْ لَقَدِيْرُ ﴿٣٩﴾

**39** ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయబడుతుందో, వారికి (కూడా ప్రతిఘటనకు) అనుమతి ఇవ్వబడుతోంది. ఎందుకంటే వారు (ముస్లిములు) పీడితులు.[58] నిశ్చయంగా అల్లాహ్ వారిని ఆదుకోగల శక్తి గలవాడు.

اۨلَّذِيْنَ اُخْرِجُوْا مِنْ دِيَارِهِمْ بِغَيْرِ حَقٍّ اِلَّاۤ
اَنْ يَّقُوْلُوْا رَبُّنَا اللّٰهُ ؕ وَلَوْلَا دَفْعُ اللّٰهِ النَّاسَ
بَعْضَهُمْ بِبَعْضٍ لَّهُدِّمَتْ صَوَامِعُ وَبِيَعٌ
وَّصَلَوٰتٌ وَّمَسٰجِدُ يُذْكَرُ فِيْهَا اسْمُ اللّٰهِ
كَثِيْرًا ؕ وَلَيَنْصُرَنَّ اللّٰهُ مَنْ يَّنْصُرُهٗ ؕ
اِنَّ اللّٰهَ لَقَوِيٌّ عَزِيْزٌ ﴿٤٠﴾

**40** వారు అన్యాయంగా తమ ఇళ్ల నుంచి వెళ్ళగొట్టబడ్డారు. (ఇంతకీ వారు చేసిన నేరం) ఏమిటంటే, "మా ప్రభువు అల్లాహ్" అని పలకటమే. అల్లాహ్‌యే గనక జనులలో కొందరిని మరి కొందరి ద్వారా అడ్డుకోకపోతే మఠాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు, అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడే మస్జిదులు ధ్వంసం చేయబడేవి. అల్లాహ్‌కు సహాయ పడేందుకు సమాయత్తం అయిన వారికి అల్లాహ్ కూడా తప్పకుండా సహాయ పడతాడు. నిశ్చయంగా అల్లాహ్ మహా బలుడు, సర్వాధిక్యుడు.

اَلَّذِيْنَ اِنْ مَّكَّنّٰهُمْ فِى الْاَرْضِ اَقَامُوا
الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ وَاَمَرُوْا بِالْمَعْرُوْفِ وَنَهَوْا

**41** (ఈ విశ్వాసులు ఎలాంటివారంటే) మేము గనక వారికి భూమిపై అధికారాన్ని ప్రసాదిస్తే వారు ఖచ్చితంగా నమాజును నెలకొల్పుతారు. జకాతు (అనే విధ్యుక్త దానధర్మాన్ని) చెల్లిస్తారు.

57. హిజ్రీ 6వ సంవత్సరంలో మక్కాకు చెందిన అవిశ్వాసులు తమ ప్రాబల్యాన్ని చూసుకుని కాబా గృహాన్ని సందర్శించకుండా ముస్లింలను అడ్డుకున్నారు. అయితే మరో రెండేళ్ల తరువాత అల్లాహ్ అవిశ్వాసుల ఈ ఆధిక్యతను అణగదొక్కి, ముస్లింల ద్వారా వారిని తొలగించాడు. మక్కా విజయం రూపంలో ముస్లింలు తమ ఆధిక్యతను చాటుకున్నారు. ఆ విధంగా పీడన తొలగిపోయింది.

58. ప్రప్రథమంగా జిహాద్ (ధర్మయుద్ధం) కొరకు అనుమతించబడింది ఈ ఆయతులోనేనని చాలామంది సలఫ్ (తొలికాలం) పండితులు అభిప్రాయపడ్డారు. ఈ ధర్మయుద్ధం లక్ష్యాలు రెండు. ఒకటి : పీడనను రూపుమాపటం. రెండు : దైవవాక్కు వర్థిల్లేలా చేయటం. పీడితులకు గనక సహాయం చేసి, చేయూతనివ్వకపోతే బలవంతులు వారిని బ్రతకనివ్వరు. అధికార మదాంధులు నిర్వాసితులను నేలపై నిలువనీడ లేకుండా చేసేస్తారు. తత్కారణంగా సర్వత్రా అరాచకం, అల్లకల్లోలం మొదలవుతుంది. జీవితం దుర్భరమైపోతుంది. రాజ్యం నరకతుల్యమైపోతుంది.

అలాగే దైవవాక్కు ఉన్నతికోసం పాటుపడుతూ ముష్కరుల మెడలు వంచకపోతే నీతికి నిలువ నీడలేకుండా పోతుంది. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణిస్తాయి. దైవనామాన్ని స్మరించే వారికోసం భూమిపై ప్రార్థనా స్థలం లేకుండా పోతుంది. (మరిన్ని వివరాల కోసం అల్ బఖరా సూరా 251వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి). **"సవామివు"** (صَوَامِعُ) అనేది "సౌమఅతున్"కు బహువచనం. చిన్న చిన్న చర్చీలని దాని అర్థం. **"బియవున్"** (بِيَعٌ) అంటే పెద్ద చర్చీలు, **"సలవాత్"** అనేవి యూదుల ఆరాధనాలయాలు. ఇకపోతే "మసాజిద్"లు ముస్లింల ప్రార్థనా స్థలాలు.

عَنِ الْمُنْكَرِ ۗ وَلِلّٰهِ عَاقِبَةُ الْاُمُوْرِ ﴿41﴾

మంచి పనులు చేయమని ఆజ్ఞాపిస్తారు. చెడు పనుల నుంచి ఆపుతారు.[59] సమస్త వ్యవహారాల ఫలితం అల్లాహ్ అధీనంలోనే ఉంది.[60]

وَاِنْ يُّكَذِّبُوْكَ فَقَدْ كَذَّبَتْ قَبْلَهُمْ قَوْمُ نُوْحٍ وَّعَادٌ وَّثَمُوْدُ ﴿42﴾

**42** (ఓ ప్రవక్తా!) ఒకవేళ వీళ్లు నిన్ను ధిక్కరిస్తే (ఆశ్చర్యపోనవసరం లేదు), వీరికి పూర్వం నూహ్, ఆద్, సమూద్ జాతుల వారు ధిక్కరించి ఉన్నారు.

وَقَوْمُ اِبْرٰهِيْمَ وَقَوْمُ لُوْطٍ ﴿43﴾

**43** అలాగే ఇబ్రాహీమ్ జాతివారు, లూతు జాతి వారు,

وَّاَصْحٰبُ مَدْيَنَ ۚ وَكُذِّبَ مُوْسٰى فَاَمْلَيْتُ لِلْكٰفِرِيْنَ ثُمَّ اَخَذْتُهُمْ ۚ فَكَيْفَ كَانَ نَكِيْرِ ﴿44﴾

**44** మద్యన్ వారు కూడా (తమ తమ ప్రవక్తలను ధిక్కరించారు). మూసా కూడా ధిక్కరించబడ్డాడు. నేను అవిశ్వాసులకు కాస్త విడుపు ఇచ్చాను. ఆ తరువాత వారిని పట్టుకున్నాను.[61] మరి నా శిక్ష (వారిపై) ఎలా పడిందో! (చూశావుగా!)[62]

59. ఈ ఆయతులో ఇస్లామీయ ప్రభుత్వ మౌలిక ఉద్దేశాలు, ఆశయాలు, లక్ష్యాలు విశదీకరించబడ్డాయి. మార్గదర్శక ఖలీఫాలు ఏలిన తొలికాలంలో ఈ అంశాలన్నీ అమల్లోకి వచ్చాయి. పరిపాలకులు తమ ప్రాథమ్యాల్లో వీటిని (నమాజు, జకాతు, మంచిని పెంచటం, చెడులను నిర్మూలించటం) చేర్చి ప్రణాళికాబద్ధంగా అమలు పరిచారు. తత్ఫలితంగా ఆ ప్రభుత్వాల ద్వారా శాంతి భద్రతలు నెలకొల్పబడ్డాయి. ప్రజలు సుఖజీవితం గడిపారు. వారికి ప్రపంచంలో గౌరవోన్నతులు లభించాయి. నేటికీ సవూదీ అరేబియాలాంటి దేశాలలో ఈ విషయాలు ప్రభుత్వ స్థాయిలో అమలు పరచబడుతున్నాయి. దీనిమూలంగా ఆ రాజ్యాలు శాంతి భద్రతల రీత్యా, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రపంచంలో మంచి రాజ్యాలుగా పరిగణించబడుతున్నాయి. అదే సమయంలో మరికొన్ని ముస్లిం రాజ్యాలలో సంక్షేమ రాజ్యస్థాపనకు సంబంధించి గొంతు బొంగురుపోయేలా కొందరు అరుస్తూ ఉన్నారు. ఆకర్షణీయమైన నినాదాలను కూడా ఆవిష్కరిస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రతి పరిపాలకుడూ – వచ్చిన కొత్తలో – శ్రేయోరాజ్యం గురించి తియ్యని కబుర్లు చెబుతాడు. కాని వాస్తవాల్ని తరచిచూస్తే ప్రతి ముస్లిం రాజ్యంలోనూ అరాచకం, అవ్యవస్థ, అశాంతి, అసంతృప్తి, అధోగతి, హత్యలు, దోపిడీలు, దొమ్మీలు, కుమ్ములాటలు అనుదినం ఎక్కువైపోతున్నాయి. కారణం సుస్పష్టమే – వారిలో ప్రతి ఒక్కరూ దేవుడు చూపిన మార్గాన్ని అవలంబించే బదులు పాశ్చాత్య ప్రజాస్వామిక పంథాను, ధర్మరాహిత్య, నీతిరాహిత్య విధానాలను అనుసరిస్తూ తమ లక్ష్యాలను ఛేదించాలనుకుంటున్నారు. ఇది ఆకాశానికి నిచ్చెన వేయటం లాంటిది మాత్రమే. ముస్లిం రాజ్యాలు ఖుర్ఆన్ చూపే మార్గదర్శక నియమాలను అనుసరించి నమాజు జకాతు వ్యవస్థల్ని స్థాపించనంతవరకూ, సత్సమాజస్థాపన కోసం నడుం బిగించనంతవరకూ, తమ ప్రణాళికలలో ఈ అంశాలను అగ్రస్థానంలో ఉంచనంతవరకూ అవి సిసలయిన శ్రేయో రాజ్యాన్ని స్థాపించలేవు. అప్పటివరకూ అది కుందేటి కొమ్ములాగా, కాల్పనిక వ్యవస్థ (Utopia) లాగానే ఉంటాయి.

60. ప్రపంచంలో ఏం జరిగినా, ఎక్కడ ఏ మార్పు వచ్చినా అల్లాహ్ ఆజ్ఞతోనే వస్తుంది. ప్రతి చర్యలోనూ ఆయన యుక్తి, పరమార్థం దాగి ఉంటుంది. ఆయన ఆజ్ఞ అవకుండా ఒక్క ఆకు కూడా కదలదు. అలాంటప్పుడు ఎవరయినా అల్లాహ్ ఆజ్ఞల్ని, నియమాల్ని కాదని సిసలైన సాఫల్యాన్ని పొందగలం అని అనుకుంటే అది వారి అవివేకం అనాలి.

61. ఇవి అంతిమ దైవప్రవక్త (సఅసం)ను ఓదార్చటానికి దేవుడు పలికిన మాటలు. ఈ మక్కా తిరస్కారులు నీ సందేశాన్ని ధిక్కరించటం కొత్త విషయమేమీ కాదు. వెనుకటి జాతులు కూడా తమ ప్రవక్తల మాటలను ధిక్కరించేవి. నేను

45 ఎన్నో పట్టణాలను మేము తుడిచిపెట్టేశాము. ఎందుకంటే అవి దుర్మార్గానికి ఒడిగట్టాయి. అవి తమ కప్పులపై తల క్రిందులుగా పడి ఉన్నాయి. ఎన్నో బావులు పాడుపడి ఉన్నాయి. మరెన్నో పటిష్టమైన, ఎత్తైన మేడలు నిర్మానుష్యంగా ఉన్నాయి.

فَكَأَيِّن مِّن قَرْيَةٍ أَهْلَكْنَاهَا وَهِيَ ظَالِمَةٌ فَهِيَ خَاوِيَةٌ عَلَىٰ عُرُوشِهَا وَبِئْرٍ مُّعَطَّلَةٍ وَقَصْرٍ مَّشِيدٍ ﴿٤٥﴾

46 ఏమిటీ, వారు భూమిలో సంచరించలేదా? (ఒకవేళ తిరిగి చూచినట్లయితే) వారి హృదయాలు ఆ విషయాలను గ్రహించగలిగేవి, లేదా వారి చెవులు (ఆ సంఘటనలను గురించి) విని ఉండేవి. అసలు విషయం ఏమిటంటే కళ్లు మాత్రమే గుడ్డివై ఉండవు, రొమ్ములలో ఉన్న హృదయాలు గుడ్డివి అవుతాయి.[63]

أَفَلَمْ يَسِيرُوا فِي الْأَرْضِ فَتَكُونَ لَهُمْ قُلُوبٌ يَعْقِلُونَ بِهَا أَوْ آذَانٌ يَسْمَعُونَ بِهَا ۖ فَإِنَّهَا لَا تَعْمَى الْأَبْصَارُ وَلَٰكِن تَعْمَى الْقُلُوبُ الَّتِي فِي الصُّدُورِ ﴿٤٦﴾

47 (దైవ) శిక్షకోసం వారు నిన్ను తొందరపెడుతున్నారు. అల్లాహ్ ఎట్టిపరిస్థితిలోనూ తన వాగ్దానానికి విరుద్ధంగా చేయడు. కాకపోతే నీ ప్రభువు దగ్గర ఒకరోజు (అంటే) మీరు లెక్కించే వెయ్యేండ్లకు సమానం.[64]

وَيَسْتَعْجِلُونَكَ بِالْعَذَابِ وَلَن يُخْلِفَ اللَّهُ وَعْدَهُ ۚ وَإِنَّ يَوْمًا عِندَ رَبِّكَ كَأَلْفِ سَنَةٍ مِّمَّا تَعُدُّونَ ﴿٤٧﴾

కూడా వారికి అవకాశం ఇస్తూపోయాను. మరి వారికివ్వబడిన గడువు ముగియగానే అకస్మాత్తుగా వారి భరతం పట్టాను. వారి పట్టణాలను, వారి సాంస్కృతిక చిహ్నాలను, వారి అపురూపమైన కళాఖండాలను నేలమట్టం చేసేశాను– ఈ మాటల ద్వారా అల్లాహ్ మక్కాలోని అవిశ్వాసులను పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు. ఓ మక్కా అవిశ్వాసులారా! ఈనాడు మీరు మీ అంతిమ దైవప్రవక్త (స)ను ధిక్కరించిన మీదట కూడా బతికిపోతున్నారంటే నేను కనికరిస్తున్నానని సంబరపడకండి. కొంతకాలం అవకాశం ఇవ్వటం నా సంప్రదాయం. మీ పూర్వీకులకు కూడా ఇలాగే కొంత వ్యవధి ఇచ్చాము. ఈలోగా వారు పశ్చాత్తాపం చెంది, క్షమాపణ కోరుకుని రుజువర్తనులైతే సరి. లేకపోతే అమాంతం మా శిక్షా కొరడాను ఝుళిపిస్తాము. ముస్లింల ద్వారా ఓడించి, పరాభవానికి లోను చేస్తాము అని దేవుడు సంకేతప్రాయంగా చెబుతున్నాడు.

62. వారి తలబిరుసుతనం మితిమీరినపుడు మేము ఏవిధంగా పట్టుకున్నామో, దాని పరిణామం ఏమయిందో చూసి గుణపాఠం నేర్చుకోండి అన్నది దీని భావం.

63. ఏ జాతి అయినా మార్గవిహీనత యొక్క ఆఖరి అంచులకు వెళ్ళిపోయినప్పుడు గుణపాఠం గ్రహించే దక్షతను అది కోల్పోతుంది. తత్కారణంగా గతించిన దుర్మార్గ జాతులలాగా ఈ జాతి కూడా వినాశానికి ఆహుతి అవుతుంది.

మనిషి ఆలోచనలకు, మనోభావాలకు హృదయం కేంద్ర బిందువు వంటిది. మెదడు కేంద్ర బిందువు అని మరికొందరంటారు. ఇవి రెండూ కీలకపాత్ర వహిస్తాయని ఇంకా కొందరు చెబుతున్నారు (ఫత్హుల్ ఖదీర్, ఐసరుత్తఫాసీర్).

64. వాళ్లు తమ లెక్కల ప్రకారం ఆత్రం చేస్తున్నారు. కాని అల్లాహ్ దృష్టిలో ఒకరోజు ప్రపంచవాసుల వెయ్యేండ్లకు సమానం. ఆ లెక్కన ఆయన గనక ఏ జాతివారికయినా 24 గంటలు గడువు ఇస్తే వెయ్యేండ్ల గడువు ఇచ్చినట్లే. 12 గంటల అవకాశం ఇస్తే 500 సంవత్సరాలు, 6 గంటల విడుపు ఇస్తే 250 సంవత్సరాల గడువు ఇచ్చినట్లు లెక్క. అలాగే అల్లాహ్ ఏ సముదాయానికైనా ఒక గంట సమయం ఇచ్చాడంటే ఇంచుమించు 40 సంవత్సరాల కాలం వరకు వదలిపెట్టాడని అనుకోవాలి (ఐసరుత్తఫాసీర్).

**48** ఎన్నో పట్టణాలకు, అవి దారుణంగా చెలరేగిపోయినప్పటికీ నేను ఒకింత విడుపు ఇచ్చాను. తర్వాత వారిని పట్టుకున్నాను. వారు తిరిగి రావలసింది నా దగ్గరకే కదా![65]

وَكَأَيِّن مِّن قَرْيَةٍ أَمْلَيْتُ لَهَا وَهِيَ ظَالِمَةٌ ثُمَّ أَخَذْتُهَا وَإِلَيَّ الْمَصِيرُ ﴿٤٨﴾

**49** (ఓ ప్రవక్తా!) ఇలా ప్రకటించు: "ఓ మానవులారా! నేను మిమ్మల్ని స్పష్టంగా సావధానపరచేవాడిని మాత్రమే."[66]

قُلْ يَا أَيُّهَا النَّاسُ إِنَّمَا أَنَا لَكُمْ نَذِيرٌ مُّبِينٌ ﴿٤٩﴾

**50** కనుక విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికే మన్నింపు, గౌరవప్రదమైన ఉపాధి లభిస్తాయి.

فَالَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ لَهُم مَّغْفِرَةٌ وَرِزْقٌ كَرِيمٌ ﴿٥٠﴾

**51** మరి మా ఆయతులను లొంగదీసుకోవటానికి ప్రయత్నిం చేవారు[67] – వారే నరక వాసులవుతారు.

وَالَّذِينَ سَعَوْا فِي آيَاتِنَا مُعَاجِزِينَ أُولَٰئِكَ أَصْحَابُ الْجَحِيمِ ﴿٥١﴾

**52** (ఓ ప్రవక్తా!) మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను, లేదా ఏ సందేశహరుణ్ణి పంపినా – అతను తన మనసులో ఏదైనా సంకల్పం చేసుకున్నప్పుడల్లా షైతాను అతని సంకల్పంలో ఏదో

وَمَا أَرْسَلْنَا مِن قَبْلِكَ مِن رَّسُولٍ وَلَا نَبِيٍّ إِلَّا إِذَا تَمَنَّىٰ أَلْقَى الشَّيْطَانُ فِي أُمْنِيَّتِهِ

దీనికి మరో అర్థం ఇది : అల్లాహ్ శక్తిముందు ఒకరోజు అయినా – వెయ్యేండ్లయినా ఒక్కటే. వీళ్లు తొందరపెడుతున్నారు. ఆయనేమో ఆలస్యం చేస్తున్నాడు. అయితే ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చటం మాత్రం ఖాయం.

మరికొంతమంది దీన్ని పరలోక విషయంగా పరిగణించారు. అత్యంత భయంకరమైన తీర్పుదినం–అది ఒక్క రోజే అయినా–వెయ్యేండ్లుగా, మరికొందరికి 50 వేల సంవత్సరాలుగా అనిపిస్తుందని వ్యాఖ్యానించారు. కాగా; అంతిమదినం నిజంగానే వెయ్యి సంవత్సరాలకు సమానంగా ఉంటుందని ఇంకా కొంతమంది అభిప్రాయపడ్డారు.

65. అందుకే దేవుడు ఆ విషయాన్ని ఇక్కడ మరోసారి జ్ఞాపకం చేశాడు. వారెన్ని పిచ్చివేషాలు వేసినా, ఎంతగా బరితెగించి ప్రవర్తించినా నాకు పట్టుబడకుండా ఎక్కడికీ పోలేరు. ఆఖరికి వారు రావలసింది నావద్దకే. వేరొక చోటికి పారిపోలేరు.

66. అవిశ్వాసులు, ముష్రిక్కులు దైవశిక్షకోసం పెడుతున్న తొందరకు సమాధానంగా దైవప్రవక్త చెప్పిన మాటలివి : "మిమ్మల్ని మేల్కొల్పటం వరకే నా బాధ్యత. శిక్షను అవతరింపజేసే బాధ్యత అల్లాహ్‌పై ఉంది. శీఘ్రంగా శిక్షించినా, ఆలస్యంగా శిక్షించినా – అది ఆయన ఇష్టం. ఆయన తన యుక్తికీ, ప్రణాళికకు కట్టుబడి ఈ పని చేస్తాడు. అది ఎప్పుడు సంభవిస్తుందో ఆయనకే ఎరుక. ఆయనకు తప్ప ఇతరులకు దాని గురించి ఏమాత్రం తెలీదు.

ఈ ఉపదేశం మక్కావాసులకు చేయబడుతున్నప్పటికీ, మహాప్రవక్త (సఅసం) సమస్త మానవాళికీ మార్గదర్శకునిగా, సందేశహరునిగా పంపబడటం వల్ల "ఓ మానవులారా!" అని సంబోధించారు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే ఈ వాక్యం మక్కా అవిశ్వాసుల మాదిరిగా ప్రవర్తించే ప్రపంచ ముష్రిక్కులకు, అవిశ్వాసులందరికీ ప్రళయదినం వరకూ వర్తిస్తుంది.

67. **"ముఆజిజీన" (مُعٰجِزِيْنَ)** అంటే దైవనిదర్శనాలను లొంగదీసుకోగలమనీ, అణచివేయగలమని వారు అనుకుంటున్నారు. ఎన్ని వెర్రి వేషాలు వేసినా మేము వారిని పట్టుకోలేమని బహుశా వారు తలపోస్తున్నారు. మరణానంతర జీవితంపై, తీర్పుదినంపై నమ్మకం లేనందునే వారిలో ఇంతటి ధీమా వచ్చింది. మితిమీరిన ఈ ధీమాయే వారి కొంప ముంచ బోతుంది. వారు నరకానికి ఆహుతి కావలసినవారే.

فَيَنْسَخُ اللّٰهُ مَا يُلْقِي الشَّيْطٰنُ ثُمَّ يُحْكِمُ اللّٰهُ اٰيٰتِهٖ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ﴿52﴾

ఒకటి కలుషితం చేసేవాడు. మరయితే అల్లాహ్ షైతాన్ కల్తీని పారద్రోలి, తన వచనాలను స్థిరపరుస్తాడు.[68] అల్లాహ్ సర్వం తెలిసినవాడు, వివేక సంపన్నుడు.

لِّيَجْعَلَ مَا يُلْقِي الشَّيْطٰنُ فِتْنَةً لِّلَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ وَّالْقَاسِيَةِ قُلُوْبُهُمْ ؕ وَاِنَّ الظّٰلِمِيْنَ لَفِيْ شِقَاقٍۢ بَعِيْدٍ ﴿53﴾

**53** ఎవరి హృదయాలలో రోగం ఉందో, మరెవరి గుండెలు కరకు గుండెలుగా మారిపోయాయో వారిని ఈ షైతాను కలిపే దాని ద్వారా పరీక్షించటానికి[69] అల్లాహ్ (ఇదంతా చేశాడు). నిశ్చయంగా దుర్మార్గులు వ్యతిరేకతలో చాలా దూరం వెళ్ళిపోయారు.

وَّلِيَعْلَمَ الَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ اَنَّهُ الْحَقُّ مِنْ رَّبِّكَ فَيُؤْمِنُوْا بِهٖ فَتُخْبِتَ لَهٗ قُلُوْبُهُمْ ؕ وَاِنَّ اللّٰهَ لَهَادِ الَّذِيْنَ اٰمَنُوْۤا اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿54﴾

**54** జ్ఞాన మొసగబడినవారు, ఇది నీ ప్రభువు తరఫునుంచి వచ్చిన సత్యం అని తెలుసుకుని, దాన్ని విశ్వసించటానికి, ఇంకా వారి హృదయాలు ఆయన వైపుకు మొగ్గటానికి (కూడా ఈ విధంగా చేయబడింది).[70] నిశ్చయంగా అల్లాహ్ విశ్వసించిన వారికి రుజుమార్గం వైపునకు దర్శకత్వం వహిస్తాడు.[71]

68. **'తమన్నా'** (تَمَنّٰی) అంటే అభిలాష, ఆకాంక్ష అని అర్థం. పఠనం అని కూడా ఒక అర్థం వస్తుంది. **'ఉమ్నియ్యతున్'** అనే పదం అందులో నుంచి పుట్టినదే. కనుక దీనికి ఆకాంక్ష, కోరిక, సంకల్పం, తలంపు లేక పఠనం అన్న అర్థాలు వస్తాయి.

మొదటి అర్థాన్ని తీసుకుంటే ఆయతు భావం ఇలా ఉంటుంది : వారి సంకల్పంలో షైతాన్ అవరోధం కల్పించి, ఆ పని జరగకుండా చూడాలని ప్రయత్నిస్తాడు. వీలైనంత మంది ప్రజలు విశ్వసించి, సాఫల్యం పొందాలన్నది దైవప్రవక్తల ఆకాంక్ష అయి ఉంటుంది. కాగా; షైతాన్ ఇందులో అవరోధాలు సృష్టించి వీలైనంతమందిని సన్మార్గంలోకి రాకుండా చూడాలనుకుంటాడు.

రెండవ అర్థం తీసుకుంటే ఆయతు భావం ఇదవుతుంది: దైవప్రవక్త లేక నబీ ఎప్పుడు తన వద్దకు వచ్చిన దైవసందేశాన్ని పఠించి జ్ఞాపకం చేసుకోగోరినా షైతాను అతని పారాయణంలో చెడు ప్రేరణలు కల్పించి దైవవాక్కులను కలగాపులగం చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తాడు లేదా దివ్య వచనాల గురించి ప్రజలలో లేనిపోని సందేహాలను, అనుమానాలను నూరిపోస్తాడు. అయితే ఎట్టకేలకు అల్లాహ్ షైతాను కుయుక్తులన్నింటినీ వమ్ముచేసి తన వచనాలను పటిష్టం చేస్తాడు.

ఈ ఆయతు ద్వారా దేవుడు తన అంతిమ ప్రవక్త (స)కు చెప్పదలచిన అసలు విషయం ఇది : షైతాను ఆగడాలు ఒక్క నీ విషయంలోనే జరగలేదు. నీకు మునుపు వచ్చిన ప్రవక్తలందరిపట్లా ఆ ధూర్తారి ఇలాగే ప్రవర్తించాడు. అయితే (ఓ ముహమ్మద్!) నువ్వు ఆందోళన చెందనవసరం లేదు. షైతాను కుట్రలు, కుతంత్రాల నుంచి మేము పూర్వపు ప్రవక్తలను కాపాడినట్లే నిన్ను కూడా కాపాడుతాము. షైతానుకు ప్రతిగా అల్లాహ్ తన వాక్కును స్థిరపరుస్తాడు.

69. ప్రజలను అపమార్గానికి లోను చేయటం షైతాన్ లక్ష్యం. అయితే ప్రజలంతా వాడి మాయమాటల్లో పడరు. హృదయాలలో కాపట్య రోగం ఉన్నవారు, వక్ర మనస్కులు, నిరంతరం పాపకార్యాలు చేసి హృదయాలలో కాఠిన్యం ఏర్పడిన వారు మాత్రమే వాడి ఎత్తులకు చిత్తవుతారు.

70. షైతాన్ దుష్ప్రేరణలు కాపట్యరోగానికి, హృదయ కాఠిన్యానికి, కుఫ్ర్‌కు గురై ఉన్నవారిలో మరింత సందిగ్ధాన్ని

55 తమపై అకస్మాత్తుగా ప్రళయ ఘడియ వచ్చిపడేవరకూ లేదా తమ వద్దకు అశుభ దినపు శిక్ష[72] వచ్చేవరకూ అవిశ్వాసులు దైవ సందేశం (వహీ) గురించి సంశయంలోనే పడి ఉంటారు.

وَلَا يَزَالُ الَّذِينَ كَفَرُوا فِي مِرْيَةٍ مِّنْهُ حَتَّىٰ تَأْتِيَهُمُ السَّاعَةُ بَغْتَةً أَوْ يَأْتِيَهُمْ عَذَابُ يَوْمٍ عَقِيمٍ ﴿٥٥﴾

56 ఆ రోజు సర్వసత్తాధికారం అల్లాహ్‌దే.[73] ఆయనే వారి మధ్య తీర్పులు చేస్తాడు. మరి విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు వరాలు నిండిన స్వర్గవనాలలో ఉంటారు.

الْمُلْكُ يَوْمَئِذٍ لِّلَّهِ يَحْكُمُ بَيْنَهُمْ ۚ فَالَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ فِي جَنَّاتِ النَّعِيمِ ﴿٥٦﴾

57 విశ్వసించకుండా, మా ఆయతులను ధిక్కరించినవారి కోసం అవమానభరితమైన శిక్ష ఉంది.

وَالَّذِينَ كَفَرُوا وَكَذَّبُوا بِآيَاتِنَا فَأُولَٰئِكَ لَهُمْ عَذَابٌ مُّهِينٌ ﴿٥٧﴾

58 ఎవరయితే అల్లాహ్ మార్గంలో (స్వస్థలాన్ని వదలి) వలస పోయారో, తరువాత చంపబడ్డారో లేదా చనిపోయారో,[74] వారికి అల్లాహ్ అత్యుత్తమమైన ఉపాధిని ప్రసాదిస్తాడు.[75] నిస్సందేహంగా అల్లాహ్ మాత్రమే ఉపాధి ప్రదాతలలోకెల్లా శ్రేష్ఠుడు.[76]

وَالَّذِينَ هَاجَرُوا فِي سَبِيلِ اللَّهِ ثُمَّ قُتِلُوا أَوْ مَاتُوا لَيَرْزُقَنَّهُمُ اللَّهُ رِزْقًا حَسَنًا ۚ وَإِنَّ اللَّهَ لَهُوَ خَيْرُ الرَّازِقِينَ ﴿٥٨﴾

---

సృష్టించగా మరోవైపు జ్ఞానామృతాన్ని ఆస్వాదించిన వారి విశ్వాసం, నమ్మకం దీనివల్ల మరింత దృఢమవుతుంది. దేవుని తరఫున అవతరింప జేయబడిన ఖుర్‌ఆన్ సత్యబద్ధమైన గ్రంథం అని వారు గట్టిగా నమ్ముతారు. అందువల్ల వారి హృదయాలు దైవసన్నిధిలో కరిగిపోతాయి.

71. ఇహంలోనూ, పరంలోనూ ఆయన వారికి మార్గదర్శకత్వం వహిస్తాడు. ఇహలోకంలో సత్యాన్ని ఆస్వాదించి, అనుసరించే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు. అసత్యాన్ని పసిగట్టే తెలివితేటల్ని వారికి ఇస్తాడు. అంతేకాదు, అసత్యం నుండి, అధర్మం నుండి వారిని కాపాడుతాడు కూడాను. ఇక పరలోకంలో ఆయన వహించే మార్గదర్శకత్వం ఏమిటంటే వారిని వ్యధాభరితమైన నరకయాతన నుండి కాపాడి స్వర్గంలో ప్రవేశం కల్పిస్తాడు. అక్కడ వారి మనసు మెచ్చిన భోగభాగ్యాలను వారికి అనుగ్రహిస్తాడు. తన దర్శన భాగ్యాన్ని కూడా వారికి కల్పిస్తాడు. అల్లాహ్ ఆ భాగ్యాన్ని మనక్కూడా ప్రసాదించుగాక!

72. ఆయతులో **"యౌమిన్ అఖీమ్"** (يَوْمٍ عَقِيمٍ) అని వుంది. అంటే వంధ్యదినం (గొడ్రాలు అయిన దినం) అని అసలు అర్థం. ఆ రోజు తరువాత ఇక రోజులనేవి ఉండవు గనక ఆ విధంగా అనబడింది. దీనికి మరో అర్థం ఏమిటంటే ఆ రోజు అవిశ్వాసులపై ఎలాంటి జాలి, దయ కనబరచబడదు. ఆ రోజు వారికెలాంటి శుభం కలుగదు – అంతా అశుభమే. ఒకప్పుడు ఇహలోకంలో శిక్షగా వస్తూ ఉండే ఫలరహితమైన గాలి ఎటువంటిదో ఇదీ అంతే. "అప్పుడు మేము వారిపై నిష్ఫలమైన గాలిని పంపాము" అన్న ఆయతు గమనార్హం (అజ్జారియాత్–41). అంటే ఆ గాలి ఫలవంతమైనది కాదు, దానివల్ల వర్షం కురవదు, పైరుకు ఎలాంటి బలం కూడా చేకూరదు. జనుల ఆరోగ్యానికి కూడా అది మేలు చేకూర్చదు.

73. ప్రపంచంలో కొంతమందికి తాత్కాలికంగానో, కానుక రూపంలోనో, లేక పరీక్షగానో రాజ్యాధికారం ఇవ్వబడుతుంది. పదవోన్నతి జరుగుతుంది. కాని పరలోక సార్వభౌమత్వం మాత్రం ఎవరికీ లభించదు. ఈ సర్వాధిపత్యం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంటుంది. "ఆ రోజున నిజమైన రాజ్యాధికారం కేవలం కరుణామయుని చేతుల్లో ఉంటుంది. అది అవిశ్వాసులకు ఎంతో కఠినమైన రోజు అయి ఉంటుంది." (అల్ ఫుర్ఖాన్ – 26).
"ఈ రోజు సార్వభౌమత్వం ఎవరిది? (అని అల్లాహ్ ప్రశ్నిస్తాడు). "తిరుగులేని ఒక్కడైన అల్లాహ్‌దే" (అని ఆయన స్వయంగా చెబుతాడు). (మోమిన్ – 16)

| | |
|---|---|
| **59** వారు ఇష్టపడే చోటికి[77] ఆయన వారిని చేరుస్తాడు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, ఓరిమి కలవాడు.[78] | لَيُدْخِلَنَّهُمْ مُّدْخَلًا يَّرْضَوْنَهٗ ؕ وَاِنَّ اللّٰهَ لَعَلِيْمٌ حَلِيْمٌ ﴿59﴾ |
| **60** ఇదీ (వారికి లభించే పుణ్యఫలం).[79] తనకు బాధపెట్టబడిన మేరకే ప్రతీకారం తీర్చుకున్న వ్యక్తిపై తిరిగి దౌర్జన్యం జరిపితే, అప్పుడు అల్లాహ్ స్వయంగా అతనికి తోడ్పడతాడు.[80] నిశ్చయంగా అల్లాహ్ మన్నించి వదలిపెట్టేవాడు, క్షమాభిక్షపెట్టే వాడూను.[81] | ذٰلِكَ ۚ وَمَنْ عَاقَبَ بِمِثْلِ مَا عُوْقِبَ بِهٖ ثُمَّ بُغِيَ عَلَيْهِ لَيَنْصُرَنَّهُ اللّٰهُ ؕ اِنَّ اللّٰهَ لَعَفُوٌّ غَفُوْرٌ ﴿60﴾ |
| **61** అల్లాహ్ రాత్రిని పగటిలోనూ, పగటిని రాత్రిలోనూ ప్రవేశింపజేస్తూ ఉండటం వల్లనూ,[82] నిశ్చయంగా అల్లాహ్ వినేవాడు, చూచే వాడవటం వల్లనూ ఈ విధంగా జరుగుతోంది. | ذٰلِكَ بِاَنَّ اللّٰهَ يُوْلِجُ الَّيْلَ فِى النَّهَارِ وَيُوْلِجُ النَّهَارَ فِى الَّيْلِ وَاَنَّ اللّٰهَ سَمِيْعٌۢ بَصِيْرٌ ﴿61﴾ |

74. అంటే వారు తమ ఇల్లూవాకిలిని వదలి – దైవమార్గంలో – వేరొకచోటికి తరలి పోతున్నప్పుడు వారు మరణించినా లేక ఎవరయినా వారిని వధించినా....

75. అంటే అల్లాహ్ ప్రసాదించే స్వర్గలోక భాగ్యాలు. అవి ఎన్నటికీ తరగనివి, కరగనివి.

76. ఎందుకంటే దేవుడు లెక్కలేనంతగా ప్రసాదించేవాడు. ప్రతిభను బట్టి ప్రసాదించటం, అడిగితేనే ఇవ్వటం అనేవి ఉండవు. ప్రపంచంలో మనుషులు ఒకరు ఇంకొకరికి ఏదన్నా ఇచ్చినా వాస్తవానికి వారు దైవప్రసాదితమైన దాన్నే ఇస్తారు. ఈ విషయంలో కూడా సిసలైన ఉపాధిప్రదాత అల్లాహ్ మాత్రమే.

77. స్వర్గలోక అనుగ్రహాలు అద్భుతమైనవి. వాటిని ఈనాటివరకూ ఏ కన్నూ కానలేదు. వాటిని గురించి ఏ చెవీ వినలేదు. చూడటం, వినటం సంగతి అటుంచండి, ఏ మానవ హృదయమూ వాటిని గురించి ఊహించనైనా లేదు. మరి అటువంటి అద్భుతమైన – అనుగ్రహభరితమైన – స్థలాన్ని చూచిన మీదట ఎవరయినా సంతోషించకుండా ఎలా ఉంటారు!?

78. **'అలీమ్'** (عَلِيْم) (అన్నీ తెలిసినవాడు). సత్కార్యాలు చేసిన వారికి ఏ ఏ అంతస్తులు కేటాయించాలో, ఎవరు ఏ కోవకు చెందినవారో అల్లాహ్‌కు అంతా తెలుసు. అదే సమయంలో ఆయన మృదుస్వభావి, సహనశీలి కూడాను. ఎందుకంటే బహుదైవోపాసకుల, సత్యతిరస్కారుల వెకిలిచేష్టలను గమనిస్తూ కూడా ఆయన తక్షణం వారిపై తన కొరడాను ఝుళిపించటం లేదు. వారికి గడువు ఇస్తూ పోతున్నాడు.

79. అంటే దైవమార్గంలో వలసపోయినవారు సహజ మరణం చెందినా లేక ఇతరులచేత చంపబడినా – వారికి అనుగ్రహాలు ప్రసాదిస్తామని మేము చేసిన వాగ్దానం తప్పక నెరవేరుతుంది.

80. అంటే ఎవరయినా ఎవరికయినా అన్యాయంగా బాధపెడితే, బాధితునికి తనకు కలిగిన బాధకు సమానంగా ప్రతీకారం తీర్చుకునే హక్కు ఉంది. ప్రతీకారం తీర్చుకున్న పిదప – బాధించినవాడూ, పీడితుడు ఇద్దరికీ చెల్లు అయిపోయిన తరువాత–బాధితునిపై మరోసారి దౌర్జన్యం చేస్తే అట్టి పరిస్థితిలో అల్లాహ్ బాధిత వ్యక్తికి తప్పక సహాయం చేస్తాడు. బాధితుడు న్యాయసమ్మతంగా తీర్చుకున్న ప్రతీకారాన్ని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఆ మేరకు అల్లాహ్ అనుమతించటం వల్లనే అతను ప్రతీకారం తీర్చుకున్నాడు. కాబట్టి భవిష్యత్తులో కూడా అల్లాహ్ అతనికి అండగా ఉంటాడు.

81. అయితే క్షమాభిక్ష మరింత మంచి విషయమని మళ్లీ వెంటనే చెప్పబడింది. అల్లాహ్ మన్నించి, మేలుచేసి వదిలిపెట్టేవాడు గనక మీరు కూడా ఆ మన్నింపుల వైఖరిని అలవరచుకోవటం ఉత్తమం అని భావం.

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ هُوَ الْحَقُّ وَاَنَّ مَا يَدْعُوْنَ مِنْ دُوْنِهٖ هُوَ الْبَاطِلُ وَاَنَّ اللّٰهَ هُوَ الْعَلِيُّ الْكَبِيْرُ ﴿٦٢﴾

**62** ఇంకా అల్లాహ్‌యే సత్యం అవటం మూలంగా,[83] అల్లాహ్‌ను వదలి వారు మొర పెట్టుకునే వారంతా అసత్యం అవటం మూలంగా, ముమ్మాటికీ అల్లాహ్‌యే సర్వోన్నతుడు, గొప్పవాడు అవటం మూలంగా ఇలా జరుగుతోంది.

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ اَنْزَلَ مِنَ السَّمَآءِ مَآءً فَتُصْبِحُ الْاَرْضُ مُخْضَرَّةً ۭ اِنَّ اللّٰهَ لَطِيْفٌ خَبِيْرٌ ﴿٦٣﴾

**63** ఏమిటీ, అల్లాహ్ ఆకాశం నుంచి వర్షపు నీరును కురిపించటాన్ని, ఆపైన భూమి పచ్చగా కళకళలాడటాన్ని నువ్వు చూడటం లేదా? నిస్సందేహంగా అల్లాహ్ దయాశీలి. సర్వాన్నీ ఎరిగిన వాడు.[84]

لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۭ وَاِنَّ اللّٰهَ لَهُوَ الْغَنِيُّ الْحَمِيْدُ ﴿٦٤﴾

**64** భూమ్యాకాశాలలో వున్న సమస్తం ఆయనదే. నిశ్చయంగా అల్లాహ్‌యే అక్కర లేనివాడు, ప్రశంసనీయుడు.[85]

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ سَخَّرَ لَكُمْ مَّا فِي الْاَرْضِ وَالْفُلْكَ تَجْرِيْ فِي الْبَحْرِ بِاَمْرِهٖ ۭ وَيُمْسِكُ السَّمَآءَ اَنْ تَقَعَ عَلَى الْاَرْضِ اِلَّا بِاِذْنِهٖ ۭ اِنَّ اللّٰهَ بِالنَّاسِ لَرَءُوْفٌ رَّحِيْمٌ ﴿٦٥﴾

**65** ఏమిటీ, అల్లాహ్ భూమండలంలో ఉన్న సమస్తాన్నీ, ఆయన ఆదేశానుసారమే సముద్రంలో నడిచే ఓడలను మీకు వశ పరచటాన్ని మీరు చూడటం లేదా?[86] తన అనుజ్ఞ కానంతవరకూ భూమిపై విరుచుకుపడకుండా ఉండేలా ఆయనే ఆకాశాన్ని నిలిపి ఉంచాడు.[87] నిశ్చయంగా అల్లాహ్ మనుషులపై దయార్ద్రత కలవాడు, జాలి చూపేవాడు.[88]

---

మరో అర్థం: జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకునే అనుమతి ధర్మంలో ఇవ్వబడినందున బదులు తీర్చుకోవటంలో తప్పులేదు. పైగా ఇది మన్నించదగిన విషయమే. దీనిపై పీడిత వ్యక్తిని నిలదీసి అడగటం జరగదు.

82. అంటే రేయి నుంచి పగటినీ, పగటి నుంచి రేయినీ తీసేంతటి శక్తిగల దేవునికి బలమదాంధులను శిక్షించటం ఏమాత్రం కష్టంకాదు. ఆయన దుర్మార్గులను తప్పకుండా దండిస్తాడు.

83. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే ఆయన ధర్మం సత్యం గనక, ఆయన ఆరాధన సత్యం గనక, ఆయన వాగ్దానాలు సత్యమైనవి గనక, తనను నమ్ముకున్న సజ్జనులకు ఆయన సహాయపడటం సత్యం గనక!
అల్లాహ్ తన ఉనికి విషయంలోనూ, తన గుణగణాల విషయంలోనూ, తన కార్యాచరణ విషయంలోనూ ఆసాంతం సత్యం.

84. **'లతీఫ్' (لَطِيْف)** అంటే సూక్ష్మాతిసూక్ష్మమైన విషయాన్ని సయితం గమనించేవాడు, పసిగట్టేవాడు, నిఘావేసి ఉంచేవాడు అని భావం. ఆయన జ్ఞానపరిధి బహు విస్తృతమైనది. అది ప్రతి చిన్న విషయాన్ని కూడా ఆవరించి ఉంది. ఈ పదానికి మృదుస్వభావి అన్న అర్థం కూడా ఉంది. తన దాసులకు ఉపాధిని సమకూర్చే విషయంలో ఆయన సూక్ష్మద్రష్ట. జాలి కలవాడు. అదే సమయంలో తన దాసుల అక్కరలేమిటో కూడా ఆయనకు తెలుసు.

85. సృష్టించటం రీత్యానూ, యాజమాన్యం దృష్ట్యానూ, ఏలటం దృష్ట్యా కూడా ఆయనే సర్వాధిపతి. అందువల్ల సృష్టితాలన్నీ ఆయనపై ఆధారపడి ఉన్నాయి. ఆయన మాత్రం ఎవరిపైనా ఆధారపడి లేదు. ఆయన అక్కరలేనివాడు. సకల ప్రవీణతలకు, సర్వాధికారాలకు మూలం అయిన అస్తిత్వం ఎట్టి పరిస్థితిలోనూ స్తుతించదగినదై ఉంటుంది.

86. ఉదాహరణకు భూమిలో సంచరించే జంతువులు, ప్రవహించే కాలువలు, భూమిలో నిక్షిప్తమై ఉన్న ఖనిజాలు, చమురు నిల్వలు, సహజ వాయువులు, ఇంకా ఎన్నో ప్రయోజనాలతో కూడుకున్న వస్తువులు – ఇవన్నీ మానవునికి అధీనం చేయబడ్డాయి. అతను వాటిని అనుభవిస్తూ ప్రగతిని సాధిస్తున్నాడు.

| | |
|---|---|
| **66** మీకు జీవనం ప్రసాదించినవాడు ఆయనే. మరి ఆయనే మీకు మరణం వొసగుతాడు. మళ్లీ ఆయనే మిమ్మల్ని తిరిగి బ్రతికిస్తాడు. అయినా మానవుడు మేలును మరిచేవాడే.[89] | وَهُوَ الَّذِيْٓ اَحْيَاكُمْ ۡ ثُمَّ يُمِيْتُكُمْ ثُمَّ يُحْيِيْكُمْ ۭ اِنَّ الْاِنْسَانَ لَكَفُوْرٌ ﴿66﴾ |
| **67** ప్రతి అనుచర సమాజానికీ మేము ఒక ఆరాధనా పద్ధతిని నిర్ధారించి ఉన్నాము. దాన్ని వారు పాటిస్తున్నారు.[90] కాబట్టి వారు ఈ విషయంలో నీతో గొడవ పడకూడదు.[91] నువ్వు మాత్రం ప్రజలను నీ ప్రభువు వైపు పిలువు. నిశ్చయంగా నువ్వు సన్మార్గాన ఉన్నావు.[92] | لِكُلِّ اُمَّةٍ جَعَلْنَا مَنْسَكًا هُمْ نَاسِكُوْهُ فَلَا يُنَازِعُنَّكَ فِي الْاَمْرِ وَادْعُ اِلٰى رَبِّكَ ۭ اِنَّكَ لَعَلٰى هُدًى مُّسْتَقِيْمٍ ﴿67﴾ |
| **68** ఒకవేళ అప్పటికీ వాళ్లు నీతో వాదులాటకు దిగితే వారికి ఇలా చెప్పెయ్యి: "మీ కర్మల సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు లెండి. | وَاِنْ جٰدَلُوْكَ فَقُلِ اللّٰهُ اَعْلَمُ بِمَا تَعْمَلُوْنَ ﴿68﴾ |
| **69** "మీరు విభేదించుకుంటున్న విషయాల గురించి అల్లాహ్ ప్రళయదినాన మీ మధ్య తప్పకుండా తీర్పు చేస్తాడు."[93] | اَللّٰهُ يَحْكُمُ بَيْنَكُمْ يَوْمَ الْقِيٰمَةِ فِيْمَا كُنْتُمْ فِيْهِ تَخْتَلِفُوْنَ ﴿69﴾ |

87. ఆయన గనక తలిస్తే ఆకాశం విరుచుకుపడి భూమియందలి వస్తువులు, జీవులు సర్వనాశనం కావచ్చు. కాని అలా జరగకుండా ఆయన ఆకాశాన్ని పైన నిలిపి ఉంచాడు. అయితే ప్రళయదినాన దేవుని పథకం ప్రకారం ఆకాశం కూడా బ్రద్దలై పోతుంది.

88. అందుకే ఆయన భూమండలంలోని సమస్త వస్తువులను మానవుల స్వాధీనంలో ఉంచటంతోపాటు, ఆకాశాన్ని క్రిందపడకుండా నిలిపి ఉంచాడు.

89. మానవ స్వభావం ఎటువంటిదో ఇక్కడ చెప్పబడింది. ఇన్ని మేళ్లను పొందిన తరువాత కూడా అతడు తన సృష్టికర్తను విస్మరిస్తాడు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపే బదులు ఇతరుల ముందు మోకరిల్లుతాడు. అయితే మానవుల్లో అందరూ అలాంటివారై ఉండరు.

90. అంటే మేము ప్రతి కాలంలోనూ, ఆయా ప్రజల కోసం ఒక్కో షరీయతును (ధర్మ శాస్త్రాన్ని) నిర్ణయించాము. జీవన ధర్మం అందరిదీ మౌలికంగా ఒక్కటే అయినప్పటికీ కొన్ని కొన్ని విషయాలలో వైవిధ్యం ఉంటుంది. ఉదాహరణకు: దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) కోసం తౌరాతు గ్రంథాన్ననుసరించి షరీయతును ఆమోదించటం జరిగింది. ఇంజీలు హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు) విధానంగా ఉండేది. కాగా; ఇప్పుడు ముహమ్మదు (స) అనుచర సమాజం కోసం ఖుర్ఆన్‌ను జీవన సంవిధానంగా ఖరారు చేయటం జరిగింది.

91. అంటే (ఓ ముహమ్మద్ – స!) దేవుడు నీకు ప్రసాదించిన జీవన సంవిధానం (షరీయతు) కూడా లోగడ ప్రసాదించబడిన ధర్మశాస్త్రాల సూత్రాల కనుగుణంగానే ఉంది. కాబట్టి పూర్వపు ధర్మశాస్త్రాల అవలంబీకులు ఇప్పుడు నీ షరీయతును విశ్వసించాలి. అంతేగాని వారు అనవసరంగా పేచీ పెట్టకూడదు.

92. (ఓ ముహమ్మద్!) నువ్వు వారి ఆక్షేపణలను లెక్కచేయకు. వారిని నీ ప్రభువు మార్గంవైపు పిలుస్తూ ఉండు. ఎందుకంటే ఇప్పుడు రుజుమార్గంపై ఉన్నది నువ్వు మాత్రమే. వెనుకటి షరీయతులు (ధర్మశాస్త్రాలు, ఆరాధనా నియమాలు) రద్దు చేయబడ్డాయి.

93. బోధపరిచిన తరువాత కూడా వారు తమ పిడివాదాన్ని విడనాడకపోతే వాళ్ల వ్యవహారాన్ని దైవాధీనం చేసెయ్యి. మీ

اَلَمْ تَعْلَمْ اَنَّ اللّٰهَ يَعْلَمُ مَا فِي السَّمَآءِ وَالْاَرْضِ ؕ اِنَّ ذٰلِكَ فِيْ كِتٰبٍ ؕ اِنَّ ذٰلِكَ عَلَى اللّٰهِ يَسِيْرٌ ﴿70﴾

**70** భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువు గురించీ అల్లాహ్‌కు తెలుసన్న సంగతి నీకు తెలియదా? అంతా ఒక గ్రంథంలో వ్రాయ బడి ఉంది. నిస్సందేహంగా ఈ విషయం అల్లాహ్‌కు చాలా సులువైనది.[94]

وَيَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ مَا لَمْ يُنَزِّلْ بِهٖ سُلْطٰنًا وَّمَا لَيْسَ لَهُمْ بِهٖ عِلْمٌ ؕ وَمَا لِلظّٰلِمِيْنَ مِنْ نَّصِيْرٍ ﴿71﴾

**71** వారు అల్లాహ్‌ను వదలి ఆయన ఏ ప్రమాణాన్నీ అవతరింప జెయ్యనటువంటి వాటిని పూజిస్తున్నారు. పోనీ వారికైనా తత్సం బంధిత జ్ఞానం ఏదైనా ఉందా అంటే అదీ లేదు.[95] దుర్మార్గులను ఆదుకునే వాడెవడూ లేడు.

وَاِذَا تُتْلٰى عَلَيْهِمْ اٰيٰتُنَا بَيِّنٰتٍ تَعْرِفُ فِيْ وُجُوْهِ الَّذِيْنَ كَفَرُوا الْمُنْكَرَ ؕ يَكَادُوْنَ يَسْطُوْنَ بِالَّذِيْنَ يَتْلُوْنَ عَلَيْهِمْ اٰيٰتِنَا ؕ قُلْ اَفَاُنَبِّئُكُمْ بِشَرٍّ مِّنْ ذٰلِكُمْ ؕ اَلنَّارُ ؕ وَعَدَهَا اللّٰهُ الَّذِيْنَ كَفَرُوْا ؕ وَبِئْسَ الْمَصِيْرُ ﴿72﴾

**72** వారి ముందు స్పష్టమైన మా ఆయతులను చదివి వినిపించి నప్పుడు అవిశ్వాసుల ముఖాలపై తిరస్కార (అసహన) భావం తొంగిచూడటాన్ని నువ్వు గ్రహిస్తావు. మా ఆయతులను చదివి వినిపించే వారిపై విరుచుకుపడతారేమో అన్నట్లు వారు కనిపిస్తారు.[96] (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "దీనికన్నా దారుణమైన సమాచారాన్ని నేను మీకు తెలుపనా?! అదే నరకాగ్ని. దాని గురించి అల్లాహ్ అవిశ్వాసులకు వాగ్దానం చేసి ఉన్నాడు.[97] అది బహుచెడ్డ గమ్యస్థానం."

---

మధ్య గల అభిప్రాయభేదాలకు సంబంధించి అల్లాహ్ మాత్రమే అంతిమ నిర్ణయం చేస్తాడు. ఏది సత్యమో, ఏది అసత్యమో తీర్పుదినాన తేలిపోతుంది. దాని ప్రకారమే బహుమానం వొసగటమో, శిక్ష విధించటమో జరుగుతుంది.

94. ఈ వాక్యంలో అల్లాహ్ తన అసాధారణ ప్రజ్ఞాపాటవాలను గురించి ప్రస్తావించాడు. తన సృష్టితాలు – భావిలో – ఏమేమి చేయనున్నాయో, వారి గతి ఏం కానున్నదో ఆయనకు ముందు నుంచే తెలుసు. అందుకే ఆయన తన జ్ఞానంతో ఆ విషయాలను ముందుగానే గ్రంథస్థం చేశాడు. ఈ సంగతి మానవులకు ఎంతగా కష్టతరం అనిపించినా ఆ విధాతకు మాత్రం ఇది చాలా తేలిక. ఈ 'విధివ్రాత'పై విశ్వాసం కలిగి ఉండటం కూడా అవసరమే. ఆ విషయమే హదీసులో ఇలా అనబడింది : "అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించక యాభైవేల సంవత్సరాల క్రితమే– ఆయన సింహాసనం (అర్ష్) నీటిపై ఉండగానే– ఆయన తన సృష్టితాల విధివ్రాతను లిఖించాడు." (సహీహ్ ముస్లిం– కితాబుల్ ఖద్ర్). సునన్‌లోని ఉల్లేఖనంలో ఇలా ఉంది: "అల్లాహ్ అన్నిటికన్నా ముందు 'కలం' సృష్టించాడు. తరువాత దానికి 'వ్రాయి' అని ఆజ్ఞాపించాడు. 'ఏం వ్రాయను?' అంది అది. 'జరగబోయేదంతా వ్రాయి' అని ఆయన ఆజ్ఞాపించాడు. అందువల్ల అది ప్రళయదినం వరకూ జరగబోయేదంతా వ్రాసేసింది" అని మహాప్రవక్త (సఅసం) తెలియజేశారు (అబూదావూద్ – కితాబుస్సున్న; తిర్మిజీ – అబ్వాబుల్ ఖద్ర్ వ తఫ్సీర్ సూరతు నూన్; ముస్నదె అహ్మద్ – 5/317).

95. అంటే వారు చేస్తున్న షిర్కుకు ఆధారంగా ఆకాశ గ్రంథాలలో ఏదైనా ఆధారం ఉందా అంటే అదీలేదు. పోనీ, దైవేతర దాస్యానికి సంబంధించి తమ బుద్ధీ జ్ఞానాల ఆధారంగానయినా వారు ఏదన్నా నిదర్శనం చూపగలుగుతున్నారా? అంటే అదీ లేదు.

96. ఒక్కోసారి వారు దూషిస్తారు. ఒక్కోసారి సందేశ ప్రదాతపై చెయ్యిచేసుకోవటానికి కూడా వెనుకాడరు. దేవుని ఏకత్వం (తౌహీద్) గురించిన మాటలు ముష్రిక్కులకు, మార్గభ్రష్టులకు ఎన్నటికీ సహించవు. ఆ అసహనం, ఆగ్రహం,

**73** ఓ ప్రజలారా! ఒక ఉపమానం వివరించబడుతోంది – శ్రద్ధగా వినండి. అల్లాహ్‌ను వదలి మీరు ఎవరెవరినయితే మొర పెట్టుకుంటున్నారో, వారంతా ఏకమైనా[98]– ఒక్క ఈగను కూడా సృష్టించలేరు. పైగా ఈగ వారి నుంచి ఏదైనా వస్తువును ఎగరేసుకుపోతే వారు దాన్ని కూడా దాని నుండి విడిపించుకోలేరు.[99] అర్థించేవాడూ,[100] అర్థించబడేవాడూ – ఇరువురూ బలహీనులే.

يَا أَيُّهَا النَّاسُ ضُرِبَ مَثَلٌ فَاسْتَمِعُوا لَهُ ۚ إِنَّ الَّذِينَ تَدْعُونَ مِن دُونِ اللَّهِ لَن يَخْلُقُوا ذُبَابًا وَلَوِ اجْتَمَعُوا لَهُ ۖ وَإِن يَسْلُبْهُمُ الذُّبَابُ شَيْئًا لَّا يَسْتَنقِذُوهُ مِنْهُ ۚ ضَعُفَ الطَّالِبُ وَالْمَطْلُوبُ (73)

**74** వీళ్లు అల్లాహ్ స్థాయికి అనుగుణంగా ఆయన గొప్పదనాన్ని గుర్తించనే లేదు.[101] అల్లాహ్ మహా శక్తిశాలి, ప్రాబల్యం కలవాడు.

مَا قَدَرُوا اللَّهَ حَقَّ قَدْرِهِ ۗ إِنَّ اللَّهَ لَقَوِيٌّ عَزِيزٌ (74)

**75** అల్లాహ్‌యే దైవదూతలలో నుంచి, మానవులలో నుంచి తన సందేశహరులను ఎంపిక చేసుకుంటాడు.[102] నిశ్చయంగా అల్లాహ్ అంతా వింటాడు, అన్నీ చూస్తాడు.[103]

اللَّهُ يَصْطَفِي مِنَ الْمَلَائِكَةِ رُسُلًا وَمِنَ النَّاسِ ۚ إِنَّ اللَّهَ سَمِيعٌ بَصِيرٌ (75)

---

ఆవేశం వారి ముఖాలపై కొట్టొచ్చినట్టే కనిపిస్తుంది. దాన్ని వారు అదుపు చేసుకోలేక ఒక్కోసారి మాటల ద్వారా, చేతల ద్వారా కూడా వ్యక్తపరుస్తుంటారు.

అంతెందుకు, నేటి 'బిద్అతీలనే' చూడండి–ఖుర్ఆన్ హదీసుల ఆధారంగా వారి అపమార్గాన్ని నిరూపించే ప్రయత్నం ఎవరు చేసినా వారు ఓర్చుకోలేరు. ఆగ్రహంతో చిందులేస్తారు. సన్మార్గగాముల్ని హింసించటానికి కూడా సంసిద్ధులవుతారు (ఫత్‌హుల్ ఖదీర్).

97. దైవవాక్యాలు విన్నంతనే మీ ముఖాలు రంగులు మారిపోతున్నాయే! ఒకానొక ఘడియ రానున్నది. మీరు గనక మీ వైఖరిని మార్చుకుని, పశ్చాత్తాపం చెందకపోతే ఇంతకన్నా ఘోరమైన స్థితికి లోనవవలసి ఉంటుంది. మీరు నరకాగ్నికి ఆహుతి కాకతప్పదు. దాని గురించి అల్లాహ్ అవిశ్వాసులకు, బహుదైవోపాసకులకు వాగ్దానం చేసి ఉన్నాడు.

98. బూటకపు దైవాల శక్తి ఏపాటిదో ఇక్కడ తెలుపటం జరిగింది. వారంతా కలసి ఒక ఈగను సృష్టించాలనుకున్నా, ఆ పని చేయలేరు. అయినప్పటికీ మీరు వారినే పూజిస్తున్నారా? వారు మీ అక్కరలు తీర్చగలరని నమ్ముతున్నారా? మీ ఆలోచనను ఏమనాలి? ఈ ఆయతును బట్టి అర్థమయ్యేదేమిటంటే ఆ కాలంలో జనులు కేవలం రాతి విగ్రహాలను మాత్రమేగాక బుద్ధీ వివేచనలుగల మానవులను కూడా ఆరాధ్య దేవుళ్లుగా చేసుకున్నారు. అంటే దేవుని ఆ సజ్జనులు చనిపోయిన తరువాత వారిని దైవానికి భాగస్వాములుగా చేసుకున్నారు. వారు కేవలం రాతి బొమ్మలను పూజించి ఉన్నట్లయితే, 'ఒక్క ఈగనయినా సృష్టించలేరు'న్న సవాలు చేయబడేది కాదు.

99. ఇది వారి అశక్తతను, నిస్సహాయ స్థితిని వ్యక్తపరుస్తోంది. ఈగను సృష్టించటం సుదూర విషయం, ఈగ వారి నుంచి తన్నుకుపోయిన వస్తువును సయితం దాని నోటిలో నుంచి లాక్కోలేరు.

100. అర్థించేవారు అంటే బూటకపు దైవాలను పూజించేవారు. అర్థించబడేవారంటే వారు పూజించే బూటకపు దేవుళ్లు. ఒక హదీసె ఖుద్సీలో బూటకపు దైవాల నిస్సహాయస్థితి ఈ విధంగా తెలుపబడింది – అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "నా మాదిరిగా సృష్టించదలిచే వాడికన్నా దుర్మార్గుడు ఎవడుంటాడు? నిజంగానే వాడిలో అంతటి శక్తి ఉంటే వాడు ఒక రేణువును లేక గోధుమ గింజనే సృష్టించి చూపాలి." (సహీహ్ బుఖారీ – కితాబుల్లిబాస్).

101. అందుకే వారు నిస్సహాయులైన ఆయన దాసులను ఆయనకు సహవర్తులుగా, భాగస్వాములుగా నిలబెడుతున్నారు. అల్లాహ్ శక్తియుక్తులను, ఆయన ఆగ్రహానుగ్రహాలను, ఆయన అసాధారణ ప్రజ్ఞాపాటవాలను వారు సరిగ్గా గ్రహించ గలిగితే వారెన్నటికీ దైవత్వంలో భాగస్వామ్యం కల్పించరు.

76 వారికి ముందున్నదీ, వారికి వెనుక ఉన్నదీ–అంతా ఆయనకు తెలుసు. సమస్త వ్యవహారాలు అల్లాహ్ వైపుకే మరలించ బడతాయి.[104]

يَعْلَمُ مَا بَيْنَ أَيْدِيهِمْ وَمَا خَلْفَهُمْ ۗ وَإِلَى اللَّهِ تُرْجَعُ الْأُمُورُ ﴿٧٦﴾

77 ఓ విశ్వాసులారా! రుకూ, సజ్దాలు చేస్తూ ఉండండి.[105] మీ ప్రభువును ఆరాధిస్తూ ఉండండి. మంచి పనులు చేస్తూ ఉండండి–తద్వారా మీరు సఫలీకృతులవుతారు.[106]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا ارْكَعُوا وَاسْجُدُوا وَاعْبُدُوا رَبَّكُمْ وَافْعَلُوا الْخَيْرَ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿٧٧﴾

78 అల్లాహ్ (ప్రసన్నత) కోసం పాటుపడవలసిన విధంగా పాటు పడండి.[107] ఆయన మిమ్మల్ని ఎన్నుకున్నాడు. ధర్మం విషయంలో ఆయన మీపై ఎలాంటి ఇబ్బందినీ ఉంచలేదు.[108] మీ

وَجَاهِدُوا فِي اللَّهِ حَقَّ جِهَادِهِ ۚ هُوَ اجْتَبَاكُمْ وَمَا جَعَلَ عَلَيْكُمْ فِي الدِّينِ مِنْ حَرَجٍ ۚ

102. అల్లాహ్ మానవుల్లో నుంచి తాను కోరిన వారిని ప్రవక్తలుగా, సందేశహరులుగా ఎన్నుకున్నాడంటే విషయం సులభంగానే అర్థమవుతోంది. కాని దైవదూతలను సందేశహరులుగా ఎందుకు ఎన్నుకుంటాడు? వారి ద్వారా తన సందేశాన్ని ఎలా విధిస్తాడు? అన్న సందేహం కలగవచ్చు. కాని దేవుడు తన సందేశాన్ని మానవత వరకు చేరవేయటానికీ, తన ప్రణాళికను వివిధ జాతులపై అమలుపరచటానికి తన దూతలను (ఫరిష్తాలను) కూడా నియుక్తుల్ని చేస్తాడు. ఉదాహరణకు : ఆయన హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం)కు ప్రవక్తల వరకు సందేశాన్ని చేరవేసే బాధ్యతను అప్పగించాడు. అలాగే దైవాజ్ఞలను ధిక్కరించిన కొన్ని మానవజాతులను శిక్షించటానికి కొంతమంది దైవదూతలను ప్రత్యేకంగా నియమించాడు.

మొత్తానికి దేవుని సందేశహరులుగా తమ బాధ్యతను నిర్వర్తించిన ఆ ప్రవక్తలు, దైవ దూతలు కూడా దేవుని దాసులే. దేవుడు వారిని తన కార్యం కోసం ఎన్నుకున్నాడంటే ఎందుకు ఎన్నుకున్నట్టు? మానవజాతిని సంస్కరించి, వారిని దైవవిధేయులుగా తీర్చిదిద్దడానికే ఈ మహత్తర ఏర్పాటు చేశాడు. అంతేగాని ఆ సందేశవాహకులను తన భాగస్వాములుగా పరిగణించి, పూజించమని మాత్రం కాదు. **'రుసుల్'** (رُسُل) అనేది 'రసూల్'కు బహువచనం. సందేశహరుడు అని దాని అర్థం.

103. ఆయన తన దాసుల గోడును వింటాడు. వారి అక్కరలను ఆయన గమనిస్తూ ఉన్నాడు. వారిలో ఎవరు ప్రవక్త పదవికి అర్హులో ఆయనకు తెలుసు. "తన సందేశాన్ని ఎవరి ద్వారా అందజేయాలో, ఎలా అందజేయాలో అల్లాహ్‌కు బాగా తెలుసు" (అల్ అన్ఆమ్–124) అన్న ఆయతు కూడా ఈ సందర్భంగా గమనించదగినది.

104. సమస్త కార్యాలకు కేంద్రబిందువు అల్లాహ్‌యే అయినప్పుడు మనిషి ఆయన ఆదేశాలను ధిక్కరించి ఎక్కడికెళ్తాడు? ఆయన శిక్షనుంచి ఎలా తప్పించుకుంటాడు? అలాంటప్పుడు అతను ఈ పలాయన వాదాన్ని అనుసరించేబదులు దైవవిధేయతా విధానాన్ని అవలంబించి ఆయన ప్రసన్నతను చూరగొనటం శ్రేయస్కరం కాదా? ఆ మాటే దీని తరువాతి ఆయతులో చెప్పబడింది.

105. అంటే షరీయతులో నిర్ధారించబడిన నమాజును చేస్తూ ఉండండి. తరువాతి వాక్యంలో ఆరాధన గురించి కూడా ప్రస్తావించబడింది. ఆరాధనలో నమాజు కూడా అంతర్భాగమే. అయితే నమాజుకు గల ప్రాముఖ్యత దృష్ట్యా దాని గురించి ప్రత్యేకంగా ఆజ్ఞాపించటం జరిగింది.

106. అంటే దైవారాధన మరియు సత్కార్యాలలోనే సాఫల్యం ఇమిడి ఉందన్నమాట! దైవారాధన, దైవవిధేయతల నుండి ముఖం త్రిప్పుకుని, ప్రజోపయోగపనులను విస్మరించి అభివృద్ధిపేరిట పొద్దస్తమానం పదార్థపూజలో తలమునకలై ఉన్నవారు కృతార్థులు కాలేరు.

107. అరబీలో **'జిహాద్' (جِهَاد)** అనే పదం ఉంది. ఇక్కడ జిహాద్ అంటే అర్థం దైవధర్మ ఉన్నతికోసం అవిశ్వాసులతో,

مِلَّةَ اَبِيْكُمْ اِبْرٰهِيْمَ ؕ هُوَ سَمّٰىكُمُ الْمُسْلِمِيْنَ ۙ مِنْ قَبْلُ وَفِيْ هٰذَا لِيَكُوْنَ الرَّسُوْلُ شَهِيْدًا عَلَيْكُمْ وَتَكُوْنُوْا شُهَدَآءَ عَلَى النَّاسِ ۖۚ فَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ وَاعْتَصِمُوْا بِاللّٰهِ ؕ هُوَ مَوْلٰىكُمْ ۚ فَنِعْمَ الْمَوْلٰى وَنِعْمَ النَّصِيْرُ ﴿78﴾

పితామహుడైన ఇబ్రాహీము (అలైహిస్సలాం)[109] ధర్మానికి కట్టుబడి ఉండండి. ఈ ఖుర్‌ఆన్‌కు పూర్వం కూడా ఆయన (అల్లాహ్)[110] మిమ్మల్ని 'ముస్లింలు'గానే నామకరణం చేశాడు. మరి ఇందులో కూడా (మీ పేరు అదే). దైవప్రవక్త మీపై సాక్షిగా, మీరు మానవాళిపై సాక్షులుగా ఉండటానికి[111] (ఈ విధంగా చేయబడింది). కనుక మీరు నమాజును నెలకొల్పండి, జకాతును చెల్లించండి, అల్లాహ్‌ను స్థిరంగా ఆశ్రయించండి. ఆయనే మీ సంరక్షకుడు! (ఆయన) ఎంత చక్కని సంరక్షకుడు! మరెంత చక్కని సహాయకుడు!

ముష్రిక్కులతో చేసే ధర్మయుద్ధం అని కొందరు భావించారు. అయితే ఇక్కడ ఈ పదం యుద్ధానికి వర్తించదనీ, దేవుడు చేయమని చెప్పిన వాటిని చేయటం, నిషేధించిన వాటికి దూరంగా ఉండటం అన్న భావంలోనే ఇలా అనబడిందనీ, చెడుల వైపుకు ప్రేరేపించే మనసు (నఫ్సె అమ్మారా)ను, షైతానును ప్రతిఘటించటం కూడా ఇందులో చేరి ఉందని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. కాగా; సత్యానికి ఉన్నతిని కల్పించటానికి, అసత్యం మెడలు వంచటానికి జరిగే ప్రయత్నాలన్నీ ఈ జిహాద్ పరిధిలోకి వస్తాయని ఇంకా కొంతమంది వ్యాఖ్యాతలు తలపోస్తున్నారు.

108. అంటే మానవ మాత్రులు భరించలేనంతటి క్లిష్టతరమైన బాధ్యతలను దేవుడు మీపై మోపలేదు (కాకపోతే కాస్తో కూస్తో కష్టం అన్ని చోట్లా ఉంటుంది). పైగా వెనుకటి షరీయతులలో ఉండే ఎన్నో కఠినమైన విధులను దేవుడు రద్దుపరిచాడు. ముహమ్మద్ (సఅసం) అనుచర సమాజం కోసం ఎన్నో సౌలభ్యాలను కూడా కల్పించాడు. ఆ సౌలభ్యాలు పూర్వం గతించిన సమాజాల వారికి ఉండేవి కావు.

109. హజ్రత్ ఇబ్రాహీం తన భార్య అయిన హాజిరాను, కుమారుడు ఇస్మాయీల్‌ను మక్కాలో వసింపజేశారు. తద్వారా అక్కడ ఒక నవతరం ఉనికిలోకి వచ్చింది. అరబ్బులు హజ్రత్ ఇస్మాయీల్(అ) సంతతి నుండి వచ్చినవారు. ఆ రకంగా ఇస్మాయీల్ తండ్రి అయిన ఇబ్రాహీం అరబ్బులకు పితామహుడుగా పరిగణించబడేవారు. అదే సమయంలో అరబ్బేతరులు కూడా ఇబ్రాహీం అసాధారణ త్యాగాల కారణంగా ఆయన్ని ఎంతగానో గౌరవించేవారు. ఆ విధంగా ఆయన అందరికీ తండ్రిలాంటివారే. అయితే అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (స) అరబ్బు అయినందున ఆయన (స)కు హజ్రత్ ఇబ్రాహీం (అ) 'పితామహుడు' అవుతారు. కాబట్టి ముహమ్మద్ (స) అనుచర సమాజం కోసం కూడా ఆయన పితామహుడే. కనుక, అల్లాహ్ మీకోసం సమ్మతించి, ఆమోదించిన ఇస్లాం ధర్మం మీ పితామహుడైన ఇబ్రాహీం అవలంబించిన జీవన ధర్మమేనని, మీరు కూడా ఈ ధర్మాన్నే అనుసరించండని యిక్కడ ఉపదేశించబడింది.

110. ఇక్కడ **'హువ' (هُوَ)** (ఆయన) అనే పదం అల్లాహ్‌కు వర్తిస్తుందా లేక ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు వర్తిస్తుందా? అన్నది ఒక ప్రశ్న. కొంతమంది 'ఇబ్రాహీం' అని అభిప్రాయపడ్డారు. అంటే ఈ ఖుర్‌ఆన్ గ్రంథం అవతరించకపూర్వం ఇబ్రాహీంగారే మీకు 'ముస్లిం' అనే పేరు పెట్టారని వారు భావిస్తున్నారు. రెండవ వర్గం వారు 'హువ' (ఆయన) అనే పదాన్ని అల్లాహ్ అన్న భావంలో తీసుకున్నారు.

111. ఈ సాక్ష్యం తీర్పుదినాన తీసుకోబడుతుంది. హదీసులోనూ ఇలాగే ఉంది. వివరాలకు అల్ బఖర సూరా 143వ ఆయతుకు ఇవ్వబడిన సారాంశాన్ని చూడండి.

23వ సూరా

# అల్ మూ'మినూన్

## విశ్వాసులు

అవతరణ మక్కాలో

ఆయతులు 118

### పరిచయం

*ధార్మిక విశ్వాసానికి సంబంధించిన ముఖ్య సూత్రాలను ఈ సూరాలో నొక్కి చెప్పడం జరిగింది. తౌహీద్ (ఏకదైవారాధన), ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ లేపబడడం వంటి విశ్వాసాలను ఇందులో ప్రభావవంతంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరా ప్రారంభంలో విశ్వాసుల గురించి, వారి గుణగణాల గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది.*

*ఈ సూరాలో ప్రస్తావించబడిన విశ్వాసుల గుణగణాలు :*

1. *వారు తమ నమాజుల్లో అణకువగా ఉంటారు.*
2. *వ్యర్ధ ప్రసంగాలకు దూరంగా ఉంటారు.*
3. *జకాత్ చెల్లిస్తారు.*
4. *అక్రమ సంబంధాలకు పాల్పడరు.*
5. *తమకు అప్పగించబడిన వాటి విషయంలో నిజాయితీగా ఉంటారు.*
6. *తమ వాగ్దానాలకు కట్టుబడి ఉంటారు.*
7. *తమ నమాజులను ఖచ్చితంగా పాటిస్తారు.*

*ఈ సూరా అవిశ్వాసుల గుణగణాలను వర్ణించింది. వారు పరిధులు అతిక్రమించేవారు, జ్ఞానం లేనివారు, అహంభావులు, అయోమయానికి గురయినవారు, వారు అల్లాహ్‌ను విశ్వసించడానికి నిరాకరించినవారు, దేవుని చిహ్నాలపై ఆలోచించడానికి సిద్ధపడనివారు, సత్యాన్ని అసహ్యించుకుంటారు, రుజుమార్గం నుంచి తప్పుకుంటారు, వారు దేవుడు పంపిన ప్రవక్తలను తిరస్కరిస్తారు, ప్రవక్తలు పిచ్చివారని, మంత్రగాళ్ళని ఆరోపిస్తారు.*

## అల్ మూ'మినూన్ సూరా

## سُورَةُ الْمُؤْمِنُونَ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 నిశ్చయంగా విశ్వాసులు సాఫల్యం పొందారు.[1]

قَدْ اَفْلَحَ الْمُؤْمِنُوْنَ ﴿1﴾

2 వారు ఎలాంటివారంటే తమ నమాజులో వారు అణకువ కలిగి ఉంటారు.[2]

الَّذِيْنَ هُمْ فِيْ صَلَاتِهِمْ خٰشِعُوْنَ ﴿2﴾

3 వారు పనికిమాలిన వాటిని పట్టించుకోరు.[3]

وَالَّذِيْنَ هُمْ عَنِ اللَّغْوِ مُعْرِضُوْنَ ﴿3﴾

4 వారు (తమపై విధించబడిన) జకాతు విధానాన్ని పాటిస్తారు.[4]

وَالَّذِيْنَ هُمْ لِلزَّكٰوةِ فٰعِلُوْنَ ﴿4﴾

5 వారు తమ మర్మస్థానాలను కాపాడుకుంటారు.

وَالَّذِيْنَ هُمْ لِفُرُوْجِهِمْ حٰفِظُوْنَ ﴿5﴾

---

1. **'ఫలాహ్'** అంటే చీల్చటం, నరకటం, కోయటం అని అర్థం. వ్యవసాయం చేసే వానిని కూడా **ఫల్లాహ్** అని అంటారు. ఎందుకంటే రైతు నేలను దుక్కి లేదా త్రవ్వి విత్తనం నాటుతాడు. బంధనాలను త్రెంచుకుంటూ, అవరోధాలను అధిగమిస్తూ పోయి తన లక్ష్యాన్ని ఛేదించిన వ్యక్తిని **ముఫ్లిహూన్** (విజేత)గా వ్యవహరిస్తారు.

   అయితే షరీయతు పరిభాషలో విజేత ఎవరంటే అతడు ప్రాపంచిక జీవితం గడుపుతూ తన ప్రభువును ప్రసన్నుణ్ణి చేసేవాడు. తద్వారా అతను పరలోకంలో తన నిజప్రభువు క్షమాభిక్షకు అర్హుడుగా ఖరారు చేయబడతాడు. దాంతోపాటు ప్రాపంచిక అనుగ్రహాలు కూడా అతనికి లభిస్తే ఇక చెప్పాల్సిందేముంది!? సుబ్హానల్లాహ్! అయితే సిసలైన సాఫల్యం మాత్రం పరలోక సాఫల్యమే. కాని ప్రజలు ప్రాపంచిక జీవితంలో ఆస్తి పాస్తులు, అధికారాలు, పదవులు లభించిన వారినే భాగ్యవంతులుగా, విజేతలుగా భావిస్తుంటారు. సిసలైన విజేతలు ఎవరో, వారి గుణగణాలు ఎలా ఉంటాయో ఇక్కడ చెప్పటం జరిగింది. ఉదాహరణకు తరువాతి ఆయతులో చూడండి.

2. **"ఖాషివూన్"** (خَاشِعُوْنَ) అని అనబడింది. **'ఖుషూ'** అంటే మానసిక ఏకాగ్రత, మనసును లగ్నం చేయటం, భక్తిభావంతో అణగారి పోవటం అని అర్థం. నమాజులో ఏకాగ్రత పొందటమంటే ఆలోచనలను ఇతరత్రా వ్యాపకాలపైకి పోనివ్వకుండా ఉంచాలి. మనసులో దేవుని ఔన్నత్యం, భయం పాదుకునేలా చేయాలి. అశ్రద్ధ, పరధ్యానం, చిరాకువంటి వాటిని దరికి చేరనివ్వరాదు. నమాజులో అటూ ఇటూ చూడటం, కదలటం, మాటిమాటికీ జుత్తును, దుస్తులను సరిచేసుకోవటం లాంటివన్నీ అణకువకు విరుద్ధమైనవి. ఒక సాధారణ వ్యక్తి రాజ్యాధికారి సమక్షంలోకి వెళ్ళినప్పుడు ఎంతో వినమ్రుడై నిలబడతాడు. అలాంటిది సర్వలోక ప్రభువు సమక్షంలో ప్రార్థనకు నిలబడినపుడు ఇంకెంత వినయం, మరెంత వినమ్రత ఉట్టిపడాలో ఆలోచించండి!?

3. **'లఘ్వున్'** (لَغْو) అంటే నిరర్థకమైన పనులు, పనికిరాని మాటలు, వ్యర్థ విషయాలు అని అర్థం. లేదా ప్రాపంచికంగా గానీ, ధార్మికంగాగానీ నష్టం చేకూర్చే విషయాలు అని భావం. వాటిని పట్టించుకోకపోవటం అంటే వాటికి పాల్పడకపోవటం అటుంచి కనీసం వాటి వైపు కన్నెత్తి కూడా చూడకూడదు. పైగా అలాంటి వాటికి ఆమడ దూరాన ఉండాలి.

4. అంటే అల్లాహ్ విధిగా చేసిన జకాత్‌ను చెల్లిస్తారని భావం. (జకాత్‌కి సంబంధించిన పరిమాణం, నిష్పత్తి తదితర తప్పీళ్లు – మదీనాలో అవతరించినప్పటికీ మౌలిక ఆదేశం మాత్రం మక్కాలోనే అవతరించినదని పండితులు అంటున్నారు). ఆత్మ శుద్ధికి దోహదపడే, నడవడికను తీర్చిదిద్దే పనులను చేయాలన్నది ఈ ఆయతు భావమని మరి కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు.

**6** అయితే తమ భార్యల, (షరీయతు ప్రకారం) తమ యాజమాన్యంలోకి వచ్చిన బానిసరాళ్ళ విషయంలో మటుకు వారిపై ఎలాంటి నింద లేదు.

إِلَّا عَلَىٰٓ أَزْوَٰجِهِمْ أَوْ مَا مَلَكَتْ أَيْمَٰنُهُمْ فَإِنَّهُمْ غَيْرُ مَلُومِينَ ﴿6﴾

**7** కాని ఎవరయినా దీనికి మించి మరేదైనా కోరితే వారు హద్దు మీరిన వారవుతారు.[5]

فَمَنِ ٱبْتَغَىٰ وَرَآءَ ذَٰلِكَ فَأُو۟لَٰٓئِكَ هُمُ ٱلْعَادُونَ ﴿7﴾

**8** వారు తమ అప్పగింతల, వాగ్దానాల పట్ల కడు అప్రమత్తంగా ఉంటారు.[6]

وَٱلَّذِينَ هُمْ لِأَمَٰنَٰتِهِمْ وَعَهْدِهِمْ رَٰعُونَ ﴿8﴾

**9** వారు తమ నమాజులను పరిరక్షిస్తూ ఉంటారు.[7]

وَٱلَّذِينَ هُمْ عَلَىٰ صَلَوَٰتِهِمْ يُحَافِظُونَ ﴿9﴾

**10** ఇలాంటి వారే వారసులు.

أُو۟لَٰٓئِكَ هُمُ ٱلْوَٰرِثُونَ ﴿10﴾

**11** (స్వర్గంలోని) ఫిర్‌దౌసు ప్రదేశానికి వారు వారసులవుతారు. వారక్కడ కలకాలం ఉంటారు.[8]

ٱلَّذِينَ يَرِثُونَ ٱلْفِرْدَوْسَ هُمْ فِيهَا خَٰلِدُونَ ﴿11﴾

**12** నిశ్చయంగా మేము మనిషి (ఆదం)ని మట్టిసారముతో సృజించాము.[9]

وَلَقَدْ خَلَقْنَا ٱلْإِنسَٰنَ مِن سُلَٰلَةٍ مِّن طِينٍ ﴿12﴾

5. దీనిప్రకారం ఇస్లాంలో 'ముత్‌ఆ' పద్ధతికి ఇప్పుడు ఏమాత్రం అనుమతి లేదని విదితమవుతోంది. లైంగిక వాంఛల పరిపూర్తికి ధర్మసమ్మతమైన పద్ధతులు రెండే రెండున్నాయి. 1. ఇల్లాలితో సమాగమం జరపటం. 2. యాజమాన్యంలోకి వచ్చిన బానిసరాలితో సంభోగించటం. అయితే ప్రస్తుతం అలాంటి బానిసరాళ్ల ఉనికి ఎక్కడా లేదు. 14 వందల సంవత్సరాల క్రితం జరిగిన ధర్మయుద్ధాల వంటివి జరిగే పరిస్థితి గనక ఏర్పడి, తద్వారా షరీయతు బద్ధంగా స్త్రీలు యాజమాన్యంలోకి వస్తే అట్టి పరిస్థితిలో అలాంటి బానిసరాళ్లతో సమాగమం జరపటం ధర్మసమ్మతం అవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో 'నికాహ్' ద్వారా దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టిన స్త్రీతో తప్ప మరొకరితో లైంగిక కోర్కె తీర్చుకోవటం నిషిద్ధం (హరామ్).

6. అరబీలో **'అమానాత్'** అంటే అప్పగించబడిన బాధ్యతలను సజావుగా నిర్వర్తించటం, ఇతరులకు చెల్లించవలసిన పైకాన్ని యధాతథంగా చెల్లించటం, రహస్య విషయాలను రహస్యంగానే ఉంచటం, అల్లాహ్‌తో చేసిన బాసలకు కట్టుబడి ఉండటం, ఎవరి సొమ్ములను వారికి ఇవ్వటం – ఇవన్నీ అమానతులుగా పరిగణించబడతాయి.

7. ఆఖరిలో మళ్లీ 'నమాజుల పరిరక్షణ'ను సాఫల్యానికి సోపానంగా అభివర్ణించటం గమనార్హం. నమాజుల ప్రస్తావనతో మొదలైన విశ్వాసుల సుగుణాలు (ఆయత్ నెం.2) నమాజుల ప్రస్తావనతోనే (ఆయత్ నెం.9) ముగియటాన్ని బట్టి దేవుని దృష్టిలో నమాజుకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో అవగతమవుతోంది. అయితే నేటి ముస్లిములు ఇతరత్రా సదాచరణలను విస్మరించినట్లే నమాజును కూడా విస్మరిస్తున్నారు. ఒకవేళ నమాజులు చేసినా లాంఛనప్రాయంగా చేస్తున్నారు. నమాజులలో ఏ అణకువ, మరే భక్తీ పారవశ్యం ఉండాలో అవి ఉండటం లేదు.

8. పై ఆయతులలో ప్రస్తావించబడిన సుగుణాలు కల విశ్వాసులు మాత్రమే స్వర్గానికి వారసులవుతారు. అదీ దేనికి?! స్వర్గంలోని అత్యున్నత ప్రదేశమైన జన్నతుల్ ఫిర్‌దౌస్‌కి! స్వర్గంలోని సెలయేళ్లు ఆ స్థలం నుంచే వెలువడతాయి (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్, కితాబుత్ తౌహీద్).

9. మట్టితో సృజించటమంటే భావం ఆదిమానవుడైన ఆదము (అలైహిస్సలాం)ను మట్టితో చేయటం అని. లేదా మనిషి

ثُمَّ جَعَلْنٰهُ نُطْفَةً فِىْ قَرَارٍ مَّكِيْنٍ ﴿13﴾

13 తరువాత అతన్ని వీర్య బిందువుగా చేసి ఓ సురక్షిత చోటులో నిలిపి ఉంచాము.[10]

ثُمَّ خَلَقْنَا النُّطْفَةَ عَلَقَةً فَخَلَقْنَا الْعَلَقَةَ مُضْغَةً فَخَلَقْنَا الْمُضْغَةَ عِظٰمًا فَكَسَوْنَا الْعِظٰمَ لَحْمًا ثُمَّ اَنْشَاْنٰهُ خَلْقًا اٰخَرَ فَتَبٰرَكَ اللّٰهُ اَحْسَنُ الْخٰلِقِيْنَ ﴿14﴾

14 మరి ఆ వీర్య బిందువును ఘనీభవించిన రక్తంగా చేశాము. మరి ఆ రక్తపు ముద్దను మాంసపు పిండంగా మార్చాము. దరిమిలా ఆ పిండాన్ని ఎముకలుగా చేశాము. పిదప ఆ ఎముకలకు మాంసం తొడిగించాము.[11] అటుపిమ్మట దాన్ని భిన్నమైన సృష్టిగా ప్రభవింపజేశాము.[12] అందరికన్నా ఉత్తమ సృష్టికర్త అయిన అల్లాహ్ శుభకరుడు.[13]

ثُمَّ اِنَّكُمْ بَعْدَ ذٰلِكَ لَمَيِّتُوْنَ ﴿15﴾

15 మరి ఆ తరువాత మీరంతా తప్పకుండా మరణిస్తారు.

ثُمَّ اِنَّكُمْ يَوْمَ الْقِيٰمَةِ تُبْعَثُوْنَ ﴿16﴾

16 మరి ప్రళయ దినాన మీరంతా నిశ్చయంగా లేపబడతారు.

وَلَقَدْ خَلَقْنَا فَوْقَكُمْ سَبْعَ طَرَآئِقَ ۖ وَمَا كُنَّا عَنِ الْخَلْقِ غٰفِلِيْنَ ﴿17﴾

17 మేము మీపై సప్తాకాశాలను నిర్మించాము.[14] మేము సృష్టి విషయంలో అజాగ్రత్తగా లేము.[15]

---

తినే ఆహారం సారవంతమైన నేలలో పండినదే. మట్టిలో పండిన ఆహారాన్ని భుజించిన మనిషిలో వీర్యం ఉత్పత్తి అవుతుంది. అంటే వీర్యోత్పత్తికి మూలకారకం మట్టి మాత్రమే.

10. **'సురక్షితమైన చోటు'** అంటే మాతృగర్భం అని భావం. అక్కడ తొమ్మిది మాసాల పాటు శిశువు సురక్షితంగా ఉంటుంది. మాతృగర్భంలోనే పోషించబడుతూ ఉంటుంది.

11. ఈ వివరాలు చాలా వరకు హజ్ సూరా ప్రారంభంలో కూడా వచ్చాయి. ఇక్కడ మళ్లీ పునరావృతం అయ్యాయి. పిండాన్ని ఎముకలుగా మార్చటం, ఆ ఎముకలపై మాంసం ఎక్కించటం ఈ వివరాల ప్రత్యేకత. మాంసపు ముద్దకు ఎముకలు కూర్చటం అంటే మానవ శరీరాకృతికి బలం చేకూర్చటం ముఖ్యోద్దేశం. కేవలం మాంసపు ముద్ద ఉంటే దేహదారుధ్యం ఉండదు. శరీరావయవాలు పొందికగా ఉండవు. ఎముకలు లేకుండా అసలు మానవుడు ప్రస్తుతమున్న అందమైన ఆకారంలో తయారుకాలేడు. ఒకవేళ అతన్ని కేవలం ఎముకలున్నవాడుగా వదిలేస్తే అత్యంత అసహ్యకరంగా, జడుసుకునే విధంగా ఉంటాడు. అందుకే దేవుడు తగు నిష్పత్తిలో రక్తమాంసాలను, ఎముకలను కూర్చి అత్యుత్తమమైన ఆకారంలో మనిషిని ఆవిష్కరించాడు. ఆ విధంగా మానవుడు దేవుని సృష్టి ప్రక్రియకే తలమానికంగా తయారయ్యాడు. ఆ విషయాన్నే దివ్య ఖుర్ఆన్ వేరొకచోట ఇలా ప్రస్తావించింది : "మేము మానవుణ్ణి అందమైన – అత్యుత్తమమైన– ఆకృతిలో సృజించాము." (అత్తీన్ – 4)

12. అంటే నవ మాసాల అనంతరం – పరిపక్వ స్థితికి చేరిన మానవ శిశువుగా – తల్లి కడుపు చించుకుని పుడమిపై పాదం మోపే జీవి అని భావం.

13. మానవ సృజన అపురూపమైనది. ఇలాంటి సృజన అల్లాహ్‌కే సాధ్యం. ప్రపంచంలోని వస్తు నిర్మాతలెవరూ ఇలాంటి సృష్టి ప్రక్రియను సాగించలేరు. ఇలాంటి అద్భుతాన్ని చేసిన అల్లాహ్ శుభకరుడు, మహిమాన్వితుడు.

14. **'తరాయిఖ్'** (طَرَائِق) అంటే అసలు మార్గాలు అని అర్థం. 'తరీఖ' దీని ఏకవచనం. అంటే ఆకాశాలు అన్నమాట. అరబ్బులు పైన ఉన్న వస్తువును 'తరీఖ'గా వ్యవహరిస్తారు. ఆకాశాలు కూడా పైనే ఉంటాయి గనక వాటిని 'తరాయిఖ్' అన్నారు. ఆకాశాలు దైవదూతలు రాకపోకలు సాగించే రహదారులు కావటం వల్ల, నక్షత్రాలు సాగిపోయే మార్గం కావటం వల్ల కూడా వారు ఆకాశాలను మార్గాలు (తరాయిఖ్)గా వ్యవహరించి ఉండవచ్చు.

18 మేము తగు మోతాదులో ఆకాశం నుంచి వర్షపు నీరును
కురిపిస్తున్నాము.[16] మరి దానిని భూమిలో నిలువచేస్తున్నాము.[17]
మేము దాన్ని తిరిగి తీసేసుకోగలము కూడా.[18]

وَأَنْزَلْنَا مِنَ السَّمَاءِ مَاءً بِقَدَرٍ فَأَسْكَنَّاهُ فِي
الْأَرْضِ ۖ وَإِنَّا عَلَىٰ ذَهَابٍ بِهِ لَقَادِرُونَ ﴿18﴾

19 మరి ఆ నీటి ద్వారా మేము మీకోసం ఖర్జూరపు తోటలను,
ద్రాక్షతోటలను ఉత్పన్నం చేశాము. మీ కొరకు వాటిలో ఎన్నో
పండ్లు ఫలాలు ఉన్నాయి. వాటిని మీరు ఆరగిస్తారు కూడా.[19]

فَأَنْشَأْنَا لَكُمْ بِهِ جَنَّاتٍ مِنْ نَخِيلٍ وَأَعْنَابٍ
لَكُمْ فِيهَا فَوَاكِهُ كَثِيرَةٌ وَمِنْهَا تَأْكُلُونَ ﴿19﴾

20 ఇంకా – సినాయ్ పర్వత ప్రాంతంలో మొలకెత్తే వృక్షాన్ని
కూడా మీకు సమకూర్చాము. అది నూనెను ఇస్తుంది. తినేవారి
కోసం కూరగా కూడా ఉపయోగపడుతుంది.[20]

وَشَجَرَةً تَخْرُجُ مِنْ طُورِ سَيْنَاءَ تَنْبُتُ بِالدُّهْنِ
وَصِبْغٍ لِلْآكِلِينَ ﴿20﴾

15. **'ఖల్ఖున్'** (خَلْق) అంటే సృష్టితాలు అని అర్థం. అంటే మేము ఆకాశాలను సృష్టించిన తరువాత భూమండలంలోని సృష్టితాలను విస్మరించలేదు. పైగా మేము ఆకాశాలను భూమిపై విరిగి పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశాము. ఇంకా మేము ప్రాణుల జీవనావసరాల విషయంలో అశ్రద్ధ వహించలేదు. వారి జీవితావసరాలన్నింటినీ పుష్కలంగా సమకూర్చాము (ఫత్హుల్ ఖదీర్).

    మరో అభిప్రాయం ఇలా ఉంది : "భూమి నుంచి వెలువడే, భూమిలో చేరే వాటిని మేము గమనిస్తున్నాము. అలాగే ఆకాశం నుంచి దిగే, ఆకాశానికి ఎక్కివచ్చే వాటిని కూడా మేము కనిపెట్టుకుని ఉన్నాము. దేవుడు తన జ్ఞాన విశేషాన్ని బట్టి సర్వత్రా మీ వెంట ఉన్నాడు." (ఇబ్నె కసీర్)

16. లెక్కకు మించిన నీరును కురిపిస్తే జల ప్రళయం వచ్చేస్తుంది. సర్వనాశనం సంభవిస్తుంది. అలాగే మోతాదుకన్నా తక్కువ నీరు కురిపిస్తే పంటలు పండవు. త్రాగునీరు కూడా లభ్యం కాదు. దుర్భిక్షం తాండవిస్తుంది.

17. కురిసిన వాన నీరు అంతా ప్రవహించి సముద్రం పాలవకుండా మేము ఎన్నో జలనిధులను భూమిలో పొందుపరిచాము. నదుల, బావుల, కాలువల, చెరువుల, జలాశయాల, సెలయేళ్ళ రూపంలో ఎన్నో జల ఒనరులను కల్పించి నీటిని ఆదా చేస్తున్నాము. ఈ జల సంపద అంతటికీ మూలం ఆకాశం నుంచి కురిసే వర్షమే అన్న సంగతిని మరువరాదు. వర్షం కురవని సీజన్‌లోనూ, నీరు తక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలలోనూ ఈ జలనిధులను తరలించి ప్రాణుల అవసరాలను తీర్చవచ్చు. అనావృష్టి సంభవించినపుడు ఈ జలసంపదను తగు రీతిలో వినియోగించి, సమస్యను చాలా వరకు పరిష్కరించవచ్చు.

18. మీకు పుష్కలంగా నీటి ఒనరులను సమకూర్చటం మా దయాదాక్షిణ్యాలకు నిదర్శనం అని మరువకండి. ఇందుకుగాను మీరు కృతజ్ఞులు కావాలి. ఒకవేళ మీరు గనక మేము చేసిన మేలును మరచిపోయి దౌర్జన్యపరులుగా ప్రవర్తిస్తే నీటి మట్టాన్ని బాగా తగ్గించివేస్తాము. మంచినీటి కోసం కటకట ఏర్పడుతుంది. కాబట్టి మా శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనా వేయకండి.

19. ఆ తోటలలో ఖర్జూర పండ్లు, ద్రాక్షపండ్లతోపాటు ఇతర ఎన్నో రకాల పండ్లు కూడా పండుతాయి. వాటిని చూసి మీరు ఆనందిస్తారు, వాటిలో కొన్నింటిని తనివితీరా ఆస్వాదిస్తారు.

20. ఇది జైతూన్ వృక్షం. దీని రసం నూనెగానూ, కాయలు కూరగానూ ఉపయోగపడతాయి. పైన అరబీలో కూరను **'సిబ్గున్'** (صِبْغ) అని చెప్పబడింది. నిజానికి సిబ్గున్ అంటే రంగు అని అర్థం. అయితే రొట్టెను కూరలో ముంచి, కూరతో దాన్ని రంగరించటం జరుగుతుంది కాబట్టి 'సిబ్గున్' అని పిలుస్తారు. సినాయ్ పర్వత ప్రాంతం, దాని పరిసర ప్రదేశాల్లో మేలు జాతి జైతూన్ వృక్షాలు మొలుస్తాయి.

21 మీకు పశువుల్లో కూడా పెద్ద గుణ పాఠం ఉంది. వాటి కడుపులలో నుంచి మేము మీకు ఒక పదార్థాన్ని (పాలను) త్రాపుతున్నాము. ఇంకా, వాటిలో మీకు ఇతరత్రా ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఆ పశువుల్లో కొన్నింటిని మీరు తింటు న్నారు కూడాను.

وَإِنَّ لَكُمْ فِي الْأَنْعَامِ لَعِبْرَةً ۖ نُسْقِيكُمْ مِمَّا فِي بُطُونِهَا
وَلَكُمْ فِيهَا مَنَافِعُ كَثِيرَةٌ وَمِنْهَا تَأْكُلُونَ ﴿21﴾

22 మీరు వాటిపైనా, ఓడలపైనా ఎక్కి పోతుంటారు.[21]

وَعَلَيْهَا وَعَلَى الْفُلْكِ تُحْمَلُونَ ﴿22﴾

23 మేము నూహు (అలైహిస్సలాం)ను అతని జాతి వారి వద్దకు ప్రవక్తగా చేసి పంపాము. అతను, "ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు. మరి మీరు (ఆయనకు) భయపడరా?" అని అన్నాడు.

وَلَقَدْ أَرْسَلْنَا نُوحًا إِلَىٰ قَوْمِهِ فَقَالَ يَا قَوْمِ اعْبُدُوا
اللَّهَ مَا لَكُمْ مِنْ إِلَٰهٍ غَيْرُهُ ۖ أَفَلَا تَتَّقُونَ ﴿23﴾

24 దానికి అవిశ్వాసులైన అతని జాతి సర్దారులు ఇలా అన్నారు: "ఇతను కూడా మీలాంటి ఒక మానవమాత్రుడే. అయితే ఇతను మీపై పెద్దరికాన్ని కోరుకుంటున్నాడు.[22] దేవుడే గనక తలిస్తే (తన ప్రవక్తగా) ఏ దైవదూతనో పంపి ఉండేవాడు.[23] ఇతను చెప్పే దానిని మేము ఇదివరకెన్నడూ, మా తాత ముత్తాతల కాలంలో వినలేదు.[24]

فَقَالَ الْمَلَأُ الَّذِينَ كَفَرُوا مِنْ قَوْمِهِ مَا هَٰذَا إِلَّا بَشَرٌ
مِثْلُكُمْ يُرِيدُ أَنْ يَتَفَضَّلَ عَلَيْكُمْ وَلَوْ شَاءَ اللَّهُ
لَأَنْزَلَ مَلَائِكَةً مَا سَمِعْنَا بِهَٰذَا فِي آبَائِنَا
الْأَوَّلِينَ ﴿24﴾

25 "నిజంగానే ఇతనికి పిచ్చిపట్టినట్లుంది. కాబట్టి ఇతని విషయంలో మరి కొంత కాలం వేచి ఉండండి."[25]

إِنْ هُوَ إِلَّا رَجُلٌ بِهِ جِنَّةٌ فَتَرَبَّصُوا بِهِ
حَتَّىٰ حِينٍ ﴿25﴾

---

21. మీరు మీ ప్రభువు అనుగ్రహాల ద్వారా రేయింబవళ్లు ప్రయోజనం పొందుతున్నారు కదా! మరి వాటికి కృతజ్ఞతగా మీరు ఆయన్ని ఆరాధించటం ధర్మం కాదా?

22. చూడబోతే ఇతను కూడా మీలాంటి మనిషి లాగానే ఉన్నాడు. మరలాంటప్పుడు దైవప్రవక్త అంటే ఎలా నమ్మేది? ఉన్నట్టుండి అతను ప్రవక్తగా ఎందుకు ప్రకటించుకున్నట్టు? బహుశా మీపై పెత్తనం చెలాయించాలన్నది అతని ఉద్దేశమేమో! అని నూహ్ జాతిలోని పెద్ద మనుషులు పలికారు.

23. సకల ఆరాధనలకు, సమస్త ఉపాసనా రీతులకు అర్హుడు తానొక్కడేనన్న సంగతి అల్లాహ్ తన దాసులకు తెలియపరచదలిస్తే ఆ పనికోసం అతనికి ఈయనగారే దొరికాడా? ఆయన ఏ దైవదూతనో పంపి ఉండేవాడు. దైవదూత వచ్చి మనకు ధర్మబోధన చేసి ఉండేవాడు.

24. ఈయనగారు ప్రబోధించే ఏకదైవారాధన (తౌహీద్) సందేశం వింతగా ఉంది. ఇంతకు ముందెన్నడూ మనం ఇలాంటి మాటలు వినలేదాయె! మా తాతముత్తాత లెవరూ ఇలాంటి విషయాల్ని మాకు చెప్పలేదు. అలాంటప్పుడు ఇతని మాటల్ని ఎలా నమ్మాలి? అన్నది వారి ఉద్దేశం.

25. విగ్రహారాధన చేస్తున్న మమ్మల్ని, మా తాతముత్తాతలను ఇతను మూర్ఖుల కింద జమ కడుతున్నాడు. బహుశా మతి చలించటం మూలంగానే ఇతను ఈ మాటలంటున్నాడు. కనుక కొంత కాలం అతన్ని పట్టించుకోకండి. పోయే కాలం వచ్చినప్పుడు అతనూ పోతాడు, అతనితోపాటు అతని సిద్ధాంతమూ పోతుంది అని జాతి సర్దారులు తమ జనులకు సలహా యిచ్చారు.

**26** "ఓ ప్రభూ! వీళ్ల ధిక్కార వైఖరికి ప్రతిగా నాకు సహాయం చెయ్యి" అని నూహ్ అర్థించాడు.[26]

قَالَ رَبِّ انْصُرْنِي بِمَا كَذَّبُونِ ﴿26﴾

**27** అప్పుడు మేమతనికి ఈ సందేశం పంపాము: "మా కళ్ల ఎదుటే, మేము పంపే సందేశాన్ని (వహీని) అనుసరించి ఒక ఓడను నిర్మించు. మా ఆజ్ఞ వచ్చి,[27] నేలలో నీటి ఊటలు పెల్లుబికినపుడు[28] అన్ని రకాలకు చెందిన ఒక్కొక్క జతను (ఒక ఆడ, ఒక మగ చొప్పున) అందులోకి ఎక్కించుకో.[29] నీ ఇంటి వారిని కూడా తీసుకో. అయితే వారిలో ఎవరి గురించి ముందు గానే మా మాట ఖరారయిందో[30] వారిని వెంట బెట్టుకోకు. జాగ్రత్త! అన్యాయానికి ఒడిగట్టినవారి గురించి నాతో మాట్లాడ వద్దు. వారంతా ముంపుకు గురయ్యేవారే.[31]

فَأَوْحَيْنَا إِلَيْهِ أَنِ اصْنَعِ الْفُلْكَ بِأَعْيُنِنَا
وَوَحْيِنَا فَإِذَا جَاءَ أَمْرُنَا وَفَارَ التَّنُّورُ ۙ فَاسْلُكْ
فِيهَا مِنْ كُلٍّ زَوْجَيْنِ اثْنَيْنِ وَأَهْلَكَ إِلَّا
مَنْ سَبَقَ عَلَيْهِ الْقَوْلُ مِنْهُمْ ۖ وَلَا تُخَاطِبْنِي
فِي الَّذِينَ ظَلَمُوا ۖ إِنَّهُمْ مُغْرَقُونَ ﴿27﴾

**28** మరి నువ్వూ, నీ వెంటవచ్చిన వారూ ఓడలో పయన మయ్యాక, "దుర్మార్గుల బారి నుంచి మమ్మల్ని రక్షించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు" అని పలుకు.

فَإِذَا اسْتَوَيْتَ أَنْتَ وَمَنْ مَعَكَ عَلَى الْفُلْكِ فَقُلِ
الْحَمْدُ لِلَّهِ الَّذِي نَجَّانَا مِنَ الْقَوْمِ الظَّالِمِينَ ﴿28﴾

**29** ఇంకా ఈ విధంగా వేడుకో: "నా ప్రభూ! నన్ను శుభప్రదమైన చోట దించు.[32] నీవు ఎంతో సురక్షితంగా (క్షేమంగా) దించే వాడవు."[33]

وَقُلْ رَبِّ أَنْزِلْنِي مُنْزَلًا مُبَارَكًا وَأَنْتَ خَيْرُ
الْمُنْزِلِينَ ﴿29﴾

26. 950 సంవత్సరాలు ధర్మప్రచారం చేసిన తరువాత హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) తన జాతివారితో విసుగెత్తిపోయి, తన ప్రభువును కడు దీనంగా ప్రార్థించారు: "ప్రభూ! నేను ఓడిపోయాను (అలసిపోయాను), ఇక నువ్వే ఆదుకోవాలి" అని విన్నవించుకున్నారు (అల్ ఖమర్–10). అల్లాహ్ ఆయన మొరను ఆలకించాడు. తన పర్యవేక్షణలో – తన దర్శకత్వంలో – ఓడను నిర్మించుకోమని ఆదేశించాడు.

27. అంటే మేము వారి 'పని' పట్టబోయినప్పుడు...

28. మూలంలో **'తన్నూర్'** (تنور) అనే పదం వచ్చింది. దీని గురించి ఇంతకుముందు హూద్ సూరాలో వివరించి ఉన్నాం. తన్నూర్ అంటే రొట్టెలు కాల్చే పొయ్యి అని అసలు అర్థం. కాని ఇక్కడ దాని భావం అదికాదు. ఇక్కడ తన్నూర్ అంటే భూ ఉపరితల భాగం అని అర్థం. ఆ సమయంలో సర్వత్రా నేలలో నీరు పెల్లుబికింది. భూభాగంలో జల ప్రళయం వచ్చినప్పుడు ఓడలోకి ఎక్కటం వినా మార్గాంతరం లేదు.

29. అంటే వృక్షాలు, జంతువులు మొదలగు అన్ని జాతులకు చెందిన జంటలను నీవెంట ఉంచుకో. ఎందుకంటే వారి సంతతి మిగిలి ఉండటం అవసరం.

30. తలబిరుసుతనంతో చెలరేగిపోయే అవిశ్వాసులను శిక్షించటానికే మేము కట్టుదిట్టమైన ఈ చర్యను గైకొంటున్నాము. కాబట్టి ఆ దుర్మార్గుల గురించి మాట్లాడకు. వారికోసం సిఫారసు చేయకు అని అల్లాహ్ తన ప్రవక్త నూహుకు ముందుగానే నిర్దేశిస్తున్నాడు. ముఖ్యంగా నూహు (అలైహిస్సలాం) భార్యను, కొడుకును దృష్టిలో పెట్టుకుని ఈ మాటలనబడ్డాయి.

31. దుర్మార్గులపై శిక్ష వచ్చిపడినప్పుడు వారిపై జాలి చూపనవసరం లేదు. వారిలో ఏ ఒక్కరికోసం కూడా సిఫారసు

30 నిశ్చయంగా ఇందులో గొప్ప సూచనలున్నాయి.[34] మేము తప్పక పరీక్షిస్తాము.[35]

إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ وَإِن كُنَّا لَمُبْتَلِينَ ﴿٣٠﴾

31 వారి తరువాత మేము మరో తరాన్ని ప్రభవింపజేశాము.[36]

ثُمَّ أَنشَأْنَا مِن بَعْدِهِمْ قَرْنًا آخَرِينَ ﴿٣١﴾

32 మరి వారివద్దకు వారి జాతికే చెందిన ప్రవక్తను పంపాము.[37] (అతనిలా పిలుపు ఇచ్చాడు:) "మీరంతా అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు.[38] మీరెందుకు భయపడరు?"

فَأَرْسَلْنَا فِيهِمْ رَسُولًا مِّنْهُمْ أَنِ اعْبُدُوا اللَّهَ مَا لَكُم مِّنْ إِلَٰهٍ غَيْرُهُ ۖ أَفَلَا تَتَّقُونَ ﴿٣٢﴾

33 సత్యాన్ని తిరస్కరించిన, పరలోకంలో కలవటాన్ని ధిక్కరించిన, ప్రాపంచిక జీవితంలో మేము భోగభాగ్యాలను ఇచ్చిన[39] అతని జాతి నాయకులు[40] ఇలా అన్నారు: "ఇతను కూడా మీలాంటి సామాన్య మానవుడే. మీరు తినేదే ఇతనూ తింటున్నాడు. మీరు త్రాగేదే ఇతనూ త్రాగుతున్నాడు."[41]

وَقَالَ الْمَلَأُ مِن قَوْمِهِ الَّذِينَ كَفَرُوا وَكَذَّبُوا بِلِقَاءِ الْآخِرَةِ وَأَتْرَفْنَاهُمْ فِي الْحَيَاةِ الدُّنْيَا مَا هَٰذَا إِلَّا بَشَرٌ مِّثْلُكُمْ يَأْكُلُ مِمَّا تَأْكُلُونَ مِنْهُ وَيَشْرَبُ مِمَّا تَشْرَبُونَ ﴿٣٣﴾

---

చేయనక్కరలేదు. ఎందుకంటే ముంపుకు గురయ్యే శిక్ష వారికోసం రాసిపెట్టి ఉంది. మా నిర్ణయానికి తిరుగు ఉండదు.

32. దైవవిధేయులందరినీ ఓడలోకి ఎక్కించుకున్న తరువాత నీ ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుకో. దుష్టులను శిక్షించి, వారి చెరనుంచి మీకు విముక్తి కల్పించేవాడు ఆయనే. అందుకే సురక్షితమైన చోట ఓడను చేర్చమని నీ ప్రభువును ప్రార్థించు.

33. ఈ దుఆతోపాటు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వాహనం ఎక్కినప్పుడు పఠించే దుఆను కూడా మనమందరం పఠించటం మంచిది. అల్లాహు అక్బర్ .... అల్లాహు అక్బర్ .... అల్లాహు అక్బర్. **"సుబ్‌హానల్లజీ సఖ్ఖరలనా హాజా వమాకున్నా లహూ ముఖ్‌రినీన్. వ ఇన్నా ఇలా రబ్బినా లమున్‌ఖలిబూన్."** (జుఖ్‌రుఫ్ –13,14)

34. ఆలోచించే వారి కొరకు ఈ వృత్తాంతంలో పలు నిదర్శనాలున్నాయి. సర్వోన్నతుడైన అల్లాహ్ హ(జత్ నూహ్ (అలైహిస్సలాం)ను, ఆయన అనుయాయులను కాపాడి, అవిధేయులను నాశనం చేశాడు. దైవప్రవక్తలు చెప్పేది సత్యం అయి ఉంటుంది. వారికి దేవుని తోడ్పాటు లభిస్తుంది. అల్లాహ్ తాను తలచుకున్నదాన్ని చేసి తీరుతాడు. సత్యాసత్యాల, ధర్మాధర్మాల మధ్య తరం తరం... నిరంతరం జరిగే సంఘర్షణను ఆయన గమనిస్తూ ఉంటాడు. అధర్మం అవధులు మీరినప్పుడు ఆయన తన శిక్షా కొరడాను ఝుళిపిస్తాడు. ఆయన ఆగ్రహానికి గురైన వారు ఇక బ్రతికి బయటపడటం కష్టం.

35. అంటే మా ప్రవక్తల ద్వారా మేము ప్రజలను పరీక్షిస్తూ ఉండేవారము.

36. చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం నూహు (అలైహిస్సలాం) తరువాత అల్లాహ్ ఉనికిలోకి తీసుకువచ్చిన జాతి ఆద్ జాతి. మరి కొంతమంది సమూద్ జాతిని కూడా ప్రస్తావించారు. ఎందుకంటే భయంకరమైన శబ్దం ద్వారా తుదముట్టించబడినది సమూద్ జాతివారే. ఇంకా కొంతమంది అభిప్రాయం ప్రకారం ఈ జాతివారు హ(జత్ షుఐబ్ (అలైహిస్సలాం) కాలంనాటి మద్‌యన్ జనులు. వారు కూడా భయంకరమైన కేక ద్వారానే తుదముట్టించబడ్డారు.

37. ఆ ప్రవక్తను మేము వేరొక చోటి నుంచి పంపలేదు, స్వయంగా వారిలో నుంచే ప్రభవింపజేశాము. ఆ ప్రవక్త చిన్ననాటి నుంచి వారి మధ్య పెరిగినవాడే. వారతన్ని బాగా ఎరుగుదురు. అతని వంశపరంపర గురించి, జననం గురించి, నడవడిక గురించి వారికి క్షుణ్ణంగా తెలుసు.

**34** "మీరు గనక మీలాంటి ఒక మానవమాత్రుణ్ణి అనుసరిం చారంటే తప్పక నష్టపోతారు."[42]

وَلَئِنْ أَطَعْتُمْ بَشَرًا مِثْلَكُمْ إِنَّكُمْ إِذًا لَخَاسِرُونَ ﴿٣٤﴾

**35** "ఏమిటీ, మీరు చచ్చి, మట్టిగా, ఎముకలుగా మారిపోయిన తరువాత కూడా మీరు మళ్లీ లేపబడతారని ఇతను వాగ్దానం చేస్తున్నాడా?"

أَيَعِدُكُمْ أَنَّكُمْ إِذَا مِتُّمْ وَكُنْتُمْ تُرَابًا وَعِظَامًا أَنَّكُمْ مُخْرَجُونَ ﴿٣٥﴾

**36** "అసంభవం, మీకు చేయబడే ఈ వాగ్దానం అసంభవం".[43]

هَيْهَاتَ هَيْهَاتَ لِمَا تُوعَدُونَ ﴿٣٦﴾

**37** "జీవితం అంటే అసలు ప్రాపంచిక జీవితమే. మనం ఇక్కడే చస్తూ, బతుకుతూ ఉంటాం. మళ్లీ మనం (సజీవులుగా) లేప బడటం అనేది ఉండదు."

إِنْ هِيَ إِلَّا حَيَاتُنَا الدُّنْيَا نَمُوتُ وَنَحْيَا وَمَا نَحْنُ بِمَبْعُوثِينَ ﴿٣٧﴾

**38** "ఇతనూ మనిషే. (అయినా కూడా ఇతను) అల్లాహ్‌కు అబద్ధాలు అంటగడ్తున్నాడు.[44] మేము ఇతన్ని నమ్మేది లేదు."

إِنْ هُوَ إِلَّا رَجُلٌ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا وَمَا نَحْنُ لَهُ بِمُؤْمِنِينَ ﴿٣٨﴾

---

38. అంతకు మునుపు వచ్చిన ప్రవక్తలు తమ జనులకు అందజేసిన ఏకదైవారాధనా సందేశాన్నే ఆ ప్రవక్త కూడా అందజేశాడు.

39. వారు దైవప్రవక్తను ధిక్కరించటానికి, పరిహాసమాడటానికి ప్రధాన కారణాలు రెండు: 1. అంతిమ దినంపై వారికి విశ్వాసం లేకపోవటం. 2. ప్రాపంచిక సిరిసంపదల మూలంగా కలిగిన అహంకారం. ఈనాడు కూడా పరిస్థితి ఇంచుమించు ఇంతే. ఆస్తిపాస్తులను, అధికారాన్ని చూసుకుని చాలామంది దైవభక్తులను వేళాకోళం చేస్తుంటారు. దైవమార్గం వైపుకు పిలిచేవారిని చిన్నచూపు చూస్తుంటారు.

40. అన్ని కాలాల్లోనూ, అన్ని జాతుల్లోనూ ఆయా జాతుల సర్దారులు, అయ్యవార్లే దైవ ప్రవక్తలను ధిక్కరించటంలో ముందంజ వేశారు. ఈ కారణంగా జాతి జనులలో అత్యధికులు విశ్వాసభాగ్యానికి దూరంగా ఉండిపోయేవారు. ఎందుకంటే సమాజంపై ఈ పెత్తందార్ల ప్రభావం అధికంగా ఉండేది. సామాన్య ప్రజానీకం ఈ బడాబాబుల వెనకాలే నడిచేది.

41. మన లాగే తినేవాడు, త్రాగేవాడు 'దైవప్రవక్త' ఎలా కాగలుగుతాడు? ఇతనిలో ప్రత్యేకతలేమీ లేవుకదా! అని చెప్పి వారు విశ్వసించేందుకు నిరాకరించారు. ఈనాటికీ మనలో కొందరు మహానుభావులున్నారు. దైవప్రవక్త కూడా అందరిలాంటి మానవుడే అంటే వారు ససేమిరా అంటారు.

42. మీలాంటి ఒక సామాన్య మనిషిని మీరు దైవప్రవక్తగా ఒప్పుకుని, మీ చేజేతులా అతనికి పెద్దరికాన్ని, వైశిష్ట్యాన్ని కల్పించకండి. అలా చేశారంటే మీకు ఇబ్బందులు ఎదురవుతాయి అని ఆ జాతి నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించారు. దైవ ప్రవక్తను మానవ మాత్రునిగా ఒప్పుకోని వర్తమాన ప్రబుద్ధులు కూడా ఇలాంటి సంశయాలలోనే ఊగిసలాడుతున్నారు. వాస్తవమేమిటంటే దేవుడు మనుజ జాతిలోనుంచే తన ప్రవక్తను ఎన్నుకుంటాడు. దైవ సందేశం (వహీ) అందటం వల్ల ఆ ప్రవక్త సామాన్య మానవులకన్నా విశిష్టమైన వ్యక్తిగా, ఉన్నతునిగా పరిగణించ బడతాడు. అంతమాత్రాన అతను మానవాతీతుడు అయిపోడు.

43. **'హైహాత'** (هَيْهَاتَ) అంటే బహుదూరం అని అర్థం. విషయాన్ని నొక్కి చెప్పటం కోసం ఈ పదం వరుసగా రెండుసార్లు ఉపయోగించబడింది.

44. మరణించిన తరువాత మళ్లీ బ్రతికించబడటం అనేది బూటకం. ఈ వ్యక్తి ఉత్తుత్తి మాటల్ని సృష్టించి, వాటిని అల్లాహ్‌కు ఆపాదిస్తున్నాడు.

39 "ప్రభూ! వీళ్ల ధిక్కార వైఖరికి ప్రతిగా నాకు సహాయపడు" అని దైవప్రవక్త ప్రార్థించాడు.[45]

قَالَ رَبِّ انْصُرْنِي بِمَا كَذَّبُونِ ﴿٣٩﴾

40 అప్పుడు, "వీళ్ళు (తమ స్వయం కృతంపై సిగ్గుతో) కుమిలి పోయే సమయం దగ్గరలోనే ఉంది"[46] అని సమాధానం లభించింది.

قَالَ عَمَّا قَلِيلٍ لَّيُصْبِحُنَّ نَادِمِينَ ﴿٤٠﴾

41 ఎట్టకేలకు న్యాయం వాంఛించే దాని ప్రకారం ఒక పెద్ద అరుపు (అమాంతం) వారిని కబళించింది.[47] అంతే! మేము వారిని చెత్తాచెదారంలా చేసేశాము.[48] దుర్మార్గులు దూరమవుగాక!

فَأَخَذَتْهُمُ الصَّيْحَةُ بِالْحَقِّ فَجَعَلْنَاهُمْ غُثَاءً ۚ فَبُعْدًا لِّلْقَوْمِ الظَّالِمِينَ ﴿٤١﴾

42 మేము వారి తరువాత మరెన్నో తరాలను ప్రభవింపజేశాము.[49]

ثُمَّ أَنشَأْنَا مِن بَعْدِهِمْ قُرُونًا آخَرِينَ ﴿٤٢﴾

43 వాటిలో ఏ సమాజం కూడా నిర్ధారిత గడువుకు ముందు పోవటంగానీ, వెనుక ఉండిపోవటంగానీ జరగలేదు.[50]

مَا تَسْبِقُ مِنْ أُمَّةٍ أَجَلَهَا وَمَا يَسْتَأْخِرُونَ ﴿٤٣﴾

44 తరువాత మేము మా ప్రవక్తలను ఎడతెగకుండా పంపాము.[51] ఎప్పుడు ఏ జాతి వద్దకు వారి ప్రవక్త వచ్చినా ఆ జాతి అతనిని ధిక్కరిస్తూనే వచ్చింది. అందువల్ల మేము ఒకరి తరువాత ఒకరిని తుద ముట్టించి,[52] వారిని జరిగిన కథలుగా[53] చేసేశాము. విశ్వసించని జాతులు దూరమవుదురు గాక!

ثُمَّ أَرْسَلْنَا رُسُلَنَا تَتْرَا ۖ كُلَّ مَا جَاءَ أُمَّةً رَّسُولُهَا كَذَّبُوهُ ۚ فَأَتْبَعْنَا بَعْضَهُم بَعْضًا وَجَعَلْنَاهُمْ أَحَادِيثَ ۚ فَبُعْدًا لِّقَوْمٍ لَّا يُؤْمِنُونَ ﴿٤٤﴾

45. తుదకు నూహు మాదిరిగానే ఈ ప్రవక్త కూడా సహాయం కొరకు దైవసన్నిధిలో దీనంగా వేడుకున్నాడు.

46. అంటే, మా శిక్ష ఎంతో దూరంలో లేదు. త్వరలో అది వారిపై వచ్చిపడుతుంది. వాళ్లు ఆ సమయంలో పశ్చాత్తాపం చెందుతారు. కాని శిక్షను చవిచూసిన తరువాత చెందే పశ్చాత్తాపం ఎలాంటి లాభాన్నీ చేకూర్చదు.

47. ఈ కేక లేక అరుపు హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) దని ఒక అభిప్రాయం ఉంది. అది ప్రకృతి ప్రకోపం అని మరో అభిప్రాయం. ఏమైనా ఆ కేకకు పెనుగాలి కూడా తోడైంది. రెండూ కలసి ఆ జాతి వారిని ఎత్తి పడేశాయి. వారి పరిస్థితి చెత్తా చెదారంలా అయిపోయింది.

48. **"ఘుసాఅన్"** (غُثَاء) అంటే అసలు వరద నీటిలో కొట్టుకువచ్చిన చెత్త అని అర్థం. అందులో వృక్షాల కుళ్ళిన ఆకులు, మండలు, రెమ్మలు ఉంటాయి. గడ్డిపరకలు ఉంటాయి. నీటి తాకిడి తగ్గిపోగానే అవి కూడా ఒక చోట పేరుకుని, ఎండి, పనికిరాని చెత్తకుప్పలా పడి ఉంటాయి. మా సందేశాన్ని నిర్లక్ష్యం చేసిన ఈ గర్విష్ఠుల పరిస్థితి కూడా అలాగే తయారయ్యింది.

49. అంటే హజ్రత్ సాలెహ్, హజ్రత్ లూత్, హజ్రత్ షుఐబ్ (అలైహిముస్సలాం)ల జాతులన్న మాట. ఆరాఫ్, హూద్ సూరాలలో కూడా ఈ క్రమంలోనే ఈ సంఘటనలు వివరించబడ్డాయి. మరి కొంతమంది బనీ ఇస్రాయీల్ అని భావించారు. **ఖురూన్**: ఈ పదం ఖర్నున్‌కు బహువచనం. సమాజం (ఉమ్మత్) అన్న అర్థంలో ఈ పదం ఇక్కడ ఉపయోగించబడింది.

50. ఈ సమాజాల వారు కూడా నూహు, ఆద్ జాతి వారి లాగానే శిక్షించే సమయం ఆసన్నం కాగానే సర్వనాశనం

**45** ఆ తరువాత మేము మూసాకు, అతని సోదరుడు హారూనుకు మా సూచనలను, స్పష్టమైన ప్రమాణాన్ని ఇచ్చి పంపాము[54]–

ثُمَّ اَرْسَلْنَا مُوْسٰى وَاَخَاهُ هٰرُوْنَ ۙ بِاٰيٰتِنَا وَسُلْطٰنٍ مُّبِيْنٍ ﴿45﴾

**46** – ఫిరౌను వద్దకు, అతని సర్దారుల వద్దకు. కాని వారు అహంకారం ప్రదర్శించారు. అసలే వారు తలబిరుసు మనుషులు.[55]

اِلٰى فِرْعَوْنَ وَمَلَا۟ئِهٖ فَاسْتَكْبَرُوْا وَكَانُوْا قَوْمًا عَالِيْنَ ﴿46﴾

**47** "ఏమిటీ, మనలాంటి ఇద్దరు మానవ మాత్రులను మనం విశ్వసించాలా? చూడబోతే వీళ్ల జాతి వారు స్వయంగా మనకు బానిసలుగా ఉన్నారు"[56] అని వారన్నారు.

فَقَالُوْٓا اَنُؤْمِنُ لِبَشَرَيْنِ مِثْلِنَا وَقَوْمُهُمَا لَنَا عٰبِدُوْنَ ﴿47﴾

**48** ఆ విధంగా వారిద్దరినీ ధిక్కరించి వాళ్లు కూడా నాశనమయ్యే వారిలో చేరిపోయారు.

فَكَذَّبُوْهُمَا فَكَانُوْا مِنَ الْمُهْلَكِيْنَ ﴿48﴾

**49** ప్రజలు సన్మార్గం పొందటానికి మేము మూసాకు గ్రంథం ప్రసాదించాము.[57]

وَلَقَدْ اٰتَيْنَا مُوْسَى الْكِتٰبَ لَعَلَّهُمْ يَهْتَدُوْنَ ﴿49﴾

---

చేయబడ్డాయి. ఒక్క క్షణం అటూ ఇటూ కాలేదు. "ఈ గడువు పూర్తయినప్పుడు ఒక్క గడియకాలం కూడా ముందూ వెనుకా కావటం జరగదు." (యూనుస్ – 49)

51. **'తత్‌రా'** (تَتْرَا) అంటే నిరాఘాటంగా, నిరంతరాయంగా, ఎడతెగకుండా, ఒకరి తరువాత ఒకరు చొప్పున అన్న అర్థాలు వస్తాయి.

52. మేము ఎంతమంది ప్రవక్తలను పంపినా ఆ జాతుల వారు దారికి రాలేదు. ఒక జాతి తరువాత మరో జాతి వారు తమ ప్రవక్తలను–వరుసగా–ధిక్కరిస్తూ పోయారు. అందువల్ల మేము కూడా ఆ ధిక్కారులను వరుసగా శిక్షిస్తూ పోయాము.

53. వినేవారికి ఆ జాతుల గాథ ఆసక్తికరమైనదిగా చేశాము. ఎందుకంటే ఒక్కో జాతి ముగింపు ఒక్కో విధంగా జరిగింది. వారికి అలాంటి దుర్గతి పడుతుందని ఎవరూ ఊహించి ఉండరు.

54. **'సూచనలు'** అంటే దేవుడు మూసాకు ప్రసాదించిన 9 సూచనలు. ఆరాఫ్ సూరాలో అవి వివరించబడ్డాయి. 'స్పష్టమైన ప్రమాణం' అంటే ఫిరౌన్ దర్బారులో మూసా దేవుని ఏకత్వానికి, శక్తికి సంబంధించి చేసిన వాదన మరియు ప్రదర్శించిన మహిమలు. కాని ఫిరౌన్ నుంచి గానీ, అతని అధికారుల నుంచి గాని దానికి సమాధానం లభించలేదు.

55. ఫిరౌనీయులు మొదటినుంచీ జాత్యహంకారంతో విర్రవీగుతున్న మనుషులే. దానికి మూలకారణం వారికి మరణానంతర జీవితంపై నమ్మకం లేకపోవటం. ఇహలోకంలో లభించిన అధికారం, సైనికబలంతో వారు మరింత గర్విష్టులైపోయారు.

56. వారి ధిక్కరణకు ప్రధాన కారణం ఇక్కడ కూడా వారు 'మానవ మాత్రులు' కావటమే. పైగా ఒక బానిస జాతికి చెందిన ఇద్దరు పురుషులు నేరుగా చక్రవర్తి దగ్గరకు వచ్చేసి బోధపరచటం కూడా వారికి నచ్చలేదు. ఇది వారి గర్వాహంకారానికి, జాత్యహంకారానికి ఒక మచ్చుతునక.

57. ఫిరౌను జనులను సముద్రంలో ముంచివేసిన తరువాతే దైవప్రవక్త మూసాకు తౌరాతు గ్రంథం వొసగబడిందని ఇమామ్ ఇబ్నె కసీర్ తెలిపారు. తౌరాతు గ్రంథం అవతరించిన మీదట అల్లాహ్ ఏ జాతిని కూడా ఇలాంటి పెద్ద ఆపదకు గురిచేయలేదు. కాకపోతే అవిశ్వాసులతో ధర్మయుద్ధం (జిహాద్) చేయమని విశ్వాసులకు ఉపదేశించటం జరిగింది.

وَجَعَلْنَا ابْنَ مَرْيَمَ وَأُمَّهُ آيَةً وَآوَيْنَاهُمَا إِلَىٰ رَبْوَةٍ ذَاتِ قَرَارٍ وَمَعِينٍ ﴿٥٠﴾

**50** మేము మర్యమ్ కుమారుణ్ణి, అతని తల్లిని ఒక సూచనగా చేశాము.[58] వారిద్దరికీ ఎత్తయిన ప్రదేశంలో[59] ఆశ్రయం కల్పించాము. అది ప్రశాంతమైన స్థలం, నీటి కాలువగల ప్రదేశం.

يَا أَيُّهَا الرُّسُلُ كُلُوا مِنَ الطَّيِّبَاتِ وَاعْمَلُوا صَالِحًا ۖ إِنِّي بِمَا تَعْمَلُونَ عَلِيمٌ ﴿٥١﴾

**51** ఓ ప్రవక్తలారా! పరిశుద్ధ వస్తువులు తినండి, సదాచరణ చేయండి.[60] మీరు చేసేదంతా నాకు తెలుసు.

58. ఎందుకంటే మర్యమ్ కుమారుడైన ఈసా (ఏసుక్రీస్తు–అలైహిస్సలాం) తండ్రి లేకుండానే జన్మించారు. ఇది ప్రభువు తరఫున లోకానికి ఒక సూచన. ఆది మానవుడైన హజ్రత్ ఆదం (అ)ను తల్లి, తండ్రి–ఇద్దరూ లేకుండానే పుట్టించిన అల్లాహ్, హవ్వాను ఆదం ప్రక్కటెముక నుంచి సృష్టించిన అల్లాహ్‌యే మర్యమ్ పుత్రుణ్ణి ఈ విధంగా సృష్టించాడు. ఇవన్నీ అల్లాహ్ సూచనలే. ఆయన తలచుకుంటే ఏదీ అసాధ్యం కాదు.

59. ఎత్తయిన ప్రదేశం (రబ్‌వా) అంటే బైతుల్ మఖ్దిస్ క్షేత్రం అని భావం. నీటి కాలువ గల ప్రదేశం అంటే హజ్రత్ ఈసా జన్మించినప్పుడు హజ్రత్ మర్యమ్ పాదాల క్రింద నుంచి అల్లాహ్ నీటి ఊటను వెలువరించిన స్థలం అన్నమాట. ఇంతకుముందు మర్యమ్ సూరాలో ఈ వివరాలు వచ్చాయి.

60. **'తయ్యిబాత్'** (طَيِّبٰت) అంటే పరిశుద్ధమైన, ధర్మసమ్మతమైన, స్వాదిష్టమైన, రుచికరమైన వస్తువులు అని భావం. కొందరు దీన్ని 'ధర్మసమ్మతమైన' అని అనువదించారు. రెండు అర్థాలూ సరైనవే. ఎందుకంటే పరిశుద్ధమైన ప్రతి వస్తువునూ అల్లాహ్ ధర్మ సమ్మతం (హలాల్) గావించాడు. కాగా; ధర్మసమ్మతమైన ప్రతి ఆహార వస్తువూ పరిశుభ్రమైనదే, రుచికరమైనదే అయి ఉంటుంది. అశుద్ధమైన పదార్థాలను అల్లాహ్ అధర్మంగా (హరామ్)గా ఖరారు చేయటానికి ప్రధాన కారణం అవి పర్యవసానం రీత్యా మంచివి కాకపోవటమే. పైగా అవి హానికరమైనవై ఉంటాయి. అశుద్ధమైన, నిషిద్ధమైన వస్తువులను తినే జాతుల వారికి, వారి ఆహార అలవాట్ల మూలంగా అవి వారికి ఒకింత తృప్తిని ఇచ్చినా వాటి ఫలితం మాత్రం బావుండదు.

ఇక సదాచరణ గురించి. ఖుర్ఆన్ హదీసులకు అనుగుణంగా, షరీయత్‌కు బద్ధంగా ఉన్నదే సదాచరణ. అంతేగాని ప్రజలకు మంచివిగా అనిపించినవన్నీ మంచిపనులు కాలేవు. చాలామంది ప్రజలు పాల్పడే బిద్అతులు (ధర్మంలో కల్పించుకోబడిన పలు సరికొత్త అంశాలు) కూడా చూడటానికి ఎంతో అందంగా, పుణ్యప్రదమైనవిగా అగుపిస్తాయి. కాని ఇస్లాం ధర్మంతో వాటికి ఏమాత్రం సంబంధం ఉండదు. పైగా అవి అపమార్గానికి దారితీస్తాయి. ధర్మంలో కొత్త బాణీని మొదలెట్టిన వారికి ఆ పనులు ఎంతో ఇంపుగా ఉంటాయి. తాము నిర్వర్తించవలసిన విద్యుక్త ధర్మాలకన్నా, సున్నతులకన్నా, పుణ్యప్రదమైన అంశాల (ముస్తహబ్బాత్)కన్నా ఈ బిద్అతులకే వారు ప్రాముఖ్యం ఇస్తారు. కాని ప్రయోజనం శూన్యం.

పరిశుద్ధమైన ఆహారపదార్థాలతోపాటు సదాచరణను ప్రస్తావించటం గమనించదగిన విషయం. పరిశుద్ధమైన (ధర్మసమ్మతమైన) వస్తువులకు – సదాచరణ (అమలె సాలెహ్)కు అవినాభావ సంబంధం ఉంది. ఇవి ఒకదానికొకటి సహాయకారి వంటివి. హలాల్ సంపాదనను తినేవాడికి సదాచరణ సులభమవుతుంది. మరోవైపు సదాచరణ మనిషిని హలాల్ సంపాదన కోసం పురికొల్పుతూ ఉంటుంది. ధర్మబద్ధంగా లభించిన దాంతోనే తృప్తి చెందే మంచిప్రేరణ కూడా ఇస్తుంది. అందుకే అల్లాహ్ తన ప్రవక్తలందరినీ ఈ రెండు విషయాలను ఖచ్చితంగా పాటించవలసిందిగా ఆదేశించాడు. అందుకే దైవప్రవక్తలు కూడా స్వయంగా చెమటోడ్చి, సంపాదించిన దానిలో జీవనావసరాలు తీర్చుకునేవారు. దైవప్రవక్త హజ్రత్ దావూదు (అలైహిస్సలాం) గురించి ఈ విధంగా అనబడింది : **"కాన యాకులు మిన్ కస్బి యదిహీ"** (ఆయన తన చేతులతో సంపాదించిన దానిని భుజించేవారు). (సహీహ్ బుఖారీ: అల్ బుయూ). మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఇలా ప్రవచించారు : "ప్రతి ప్రవక్తా గొర్రెల కాపరిగా పనిచేశారు.

وَإِنَّ هَٰذِهِۦٓ أُمَّتُكُمْ أُمَّةً وَٰحِدَةً وَأَنَا۠ رَبُّكُمْ فَٱتَّقُونِ ﴿52﴾

52 నిశ్చయంగా మీ ఈ ధర్మం ఒకే ధర్మం.[61] నేనే మీ అందరి ప్రభువును. కాబట్టి మీరు నాకు భయపడండి.

فَتَقَطَّعُوٓا۟ أَمْرَهُم بَيْنَهُمْ زُبُرًا ۖ كُلُّ حِزْبٍۭ بِمَا لَدَيْهِمْ فَرِحُونَ ﴿53﴾

53 అయితే వారంతట వారే (విభేదించుకుని), తమ ధర్మాన్ని ముక్కచెక్కలుగా చేసుకున్నారు. ప్రతి (మత) వర్గం తన వద్దనున్న దాంతోనే సంబరపడిపోసాగింది.

فَذَرْهُمْ فِى غَمْرَتِهِمْ حَتَّىٰ حِينٍ ﴿54﴾

54 కనుక నువ్వు (కూడా) వాళ్ళను వాళ్ళ ఏమరుపాటులో కొంత కాలం మునిగి ఉండేలా విడిచిపెట్టు.[62]

أَيَحْسَبُونَ أَنَّمَا نُمِدُّهُم بِهِۦ مِن مَّالٍ وَبَنِينَ ﴿55﴾

55 సంతానం మరియు సంపదల ద్వారా మేము వారికి ప్రసాదిస్తున్న సమృద్ధిని చూసి వారేమనుకుంటున్నారు?

نُسَارِعُ لَهُمْ فِى ٱلْخَيْرَٰتِ ۚ بَل لَّا يَشْعُرُونَ ﴿56﴾

56 తమకు మేళ్లు చేయటంలో మేము వేగిరపడ్తున్నామని వారు తలపోస్తున్నారా?! (లేదు లేదు) వారసలు (యదార్థాన్ని) గ్రహించటం లేదు.

إِنَّ ٱلَّذِينَ هُم مِّنْ خَشْيَةِ رَبِّهِم مُّشْفِقُونَ ﴿57﴾

57 నిశ్చయంగా ఎవరు తమ ప్రభువు పట్ల భీతితో భయపడుతున్నారో,

وَٱلَّذِينَ هُم بِـَٔايَٰتِ رَبِّهِمْ يُؤْمِنُونَ ﴿58﴾

58 మరెవరు తమ ప్రభువు ఆయతులను విశ్వసిస్తున్నారో,

---

నేను సయితం మక్కా వాసుల గొర్రెల్ని కొద్దిపాటి కూలిపై మేపాను." (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇజార)
కాని ఈనాటి బూర్జువాలు, బ్లాక్‌మెయిలర్లు, స్మగ్లర్లు, వడ్డీవ్యాపారులు, అవినీతిపరులు కష్టపడి, చెమటోడ్చి సంపాదించి తినే వారిని అల్పులుగా, బడుగుజీవులుగా, అమాయకులుగా చిత్రీకరిస్తున్నారు. మరి చూడబోతే షరీయతు దృష్టిలో ఆదరణీయులు ఈ కష్టజీవులే! హలాల్ సంపాదనను తినేవారే!! ఒక ఇస్లామీయ సమాజంలో అధర్మసంపాదకులకు ఎలాంటి విలువా, ఆదరణా లేదు – వారు 'ఖారూన్ ఖజానాలకు' యజమానులైనాసరే! అయితే పగలల్లా శ్రమించి, ధర్మసమ్మతంగా సంపాదించిన కొద్దిపాటి వేతనంతో కడుపునింపుకునేవారే ఇస్లాం దృష్టిలో – అల్లాహ్ దృష్టిలో – ఎంతో గౌరవనీయులు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారు కూడా ఈ విషయాన్ని గురించి చాలా గట్టిగా తాకీదు చేశారు: "అధర్మ సంపాదనను ఆర్జించేవాని దానధర్మాలనుగానీ, ప్రార్థననుగాని అల్లాహ్ ఆమోదించదు" అని ఆయన (స) వక్కాణించారు (సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్)

61. ఇక్కడ **'ఉమ్మతున్' (أُمَّةٌ)** అంటే ధర్మం (దీన్) అని అర్థం. ఒకే ధర్మం అంటే దైవప్రవక్తలంతా ఒకే దేవుని ఆరాధన వైపుకు పిలుపు ఇచ్చారని భావం. కాని ప్రజలు ఏకదైవారాధనా ధర్మాన్ని విడనాడి వేర్వేరు వర్గాలుగా, సమూహాలుగా విడిపోయారు. ప్రతి వర్గం తాను అవలంబించే మతధర్మం మాత్రమే సరైనదని తలంచి సంతృప్తి చెందింది. వాస్తవానికి అది సత్యానికి బహుదూరాన ఉన్నప్పటికీ తన అభిమతం విషయంలో మటుకు రాజీపడలేదు.

62. అపమార్గపు అంధకారం కూడా ఎంతో భయంకరమైనది. ఈ గాఢాంధకారంలో చిక్కుకున్న మనిషి దృష్టికి సత్యం కానరాదు. ఈ ఆయతులో **'ఘమ్‌రతిన్' (غَمْرَة)** అనే పదం వచ్చింది. అధిక పరిమాణంలో ఉండి నేలను కప్పిఉండే నీరు అని దాని అసలు అర్థం. అయితే ఇక్కడ దానికి భ్రాంతి, ఏమరుపాటు, అపమార్గం అన్న అర్థాలు వస్తాయి.

**59** ఎవరు తమ ప్రభువుకు సహవర్తులను కల్పించకుండా ఉంటారో,

وَالَّذِيْنَ هُمْ بِرَبِّهِمْ لَا يُشْرِكُوْنَ ﴿59﴾

**60** ఇంకా (దైవమార్గంలో) ఇవ్వవలసిన దాన్ని ఇస్తూ కూడా, తమ ప్రభువు వద్దకు మరలిపోవలసి ఉందనే భావనతో ఎవరి హృదయాలు వణుకుతూ ఉంటాయో,[63]

وَالَّذِيْنَ يُؤْتُوْنَ مَآ اٰتَوْا وَّقُلُوْبُهُمْ وَجِلَةٌ اَنَّهُمْ اِلٰى رَبِّهِمْ رٰجِعُوْنَ ﴿60﴾

**61** వారే త్వరత్వరగా మంచి పనులు చేసుకుంటూ పోతున్న వారు. వాటికోసం వారు పోటీపడతారు.

اُولٰٓئِكَ يُسٰرِعُوْنَ فِي الْخَيْرٰتِ وَهُمْ لَهَا سٰبِقُوْنَ ﴿61﴾

**62** మేము ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం వేయము.[64] మా వద్ద సత్యం పలికే గ్రంథం ఉంది. వారికెలాంటి అన్యాయం జరగదు.

وَلَا نُكَلِّفُ نَفْسًا اِلَّا وُسْعَهَا وَلَدَيْنَا كِتٰبٌ يَّنْطِقُ بِالْحَقِّ وَهُمْ لَا يُظْلَمُوْنَ ﴿62﴾

**63** పైగా వారి హృదయాలే దీని విషయంలో అశ్రద్ధకు గురై ఉన్నాయి. ఇవి గాకుండా వారు చేసే మరెన్నో (చెడు) చేష్టలు[65] కూడా ఉన్నాయి.

بَلْ قُلُوْبُهُمْ فِيْ غَمْرَةٍ مِّنْ هٰذَا وَلَهُمْ اَعْمَالٌ مِّنْ دُوْنِ ذٰلِكَ هُمْ لَهَا عٰمِلُوْنَ ﴿63﴾

**64** ఆఖరికి మేము వారిలోని భోగలాలసులను శిక్షగా పట్టుకున్నప్పుడు,[66] వారు ఆర్తనాదాలు చేయసాగారు.

حَتّٰٓى اِذَآ اَخَذْنَا مُتْرَفِيْهِمْ بِالْعَذَابِ اِذَا هُمْ يَجْـَٔرُوْنَ ﴿64﴾

63. వారు అల్లాహ్ మార్గంలో ఖర్చుచేస్తారు. అయినాసరే అల్లాహ్‌కు భయపడుతూ ఉంటారు. తమ దానధర్మాలలో, సత్కార్యాలలో ఎక్కడ ఏ లోపం ఏర్పడిందో, దాని మూలంగా అల్లాహ్ తమను ఎక్కడ నిలదీసి అడుగుతాడోనన్న భావనే అందుకు కారణం. హదీసులో ఈ విధంగా ఉంది: "భయపడుతూ ఉండేది ఎవరు? త్రాగు బోతులా? వ్యభిచారులా? దొంగలా?" అని హజ్రత్ ఆయిషా(ర.అన్హా) సందేహపడగా, "కాదు. నమాజు చేసేవారు, ఉపవాసాలు పాటించేవారు, దానధర్మాలు చేసేవారు అల్లాహ్‌కు భయపడుతూ ఉంటారు. (తమవల్ల జరిగిన ఏ తప్పిదం మూలంగా) తమ సత్కార్యాలు స్వీకారయోగ్యం కాకుండాపోతాయో నన్న భయం వారిని పీడిస్తూ ఉంటుంది" అని దైవప్రవక్త (స) వివరించారు. (తిర్మిజీ – మోమినూన్ సూరా; ముస్నదె అహ్మద్ – 6/160,195)

64. అల్ బఖరా సూరా చివర్లో కూడా ఇలాంటి ఆయతు (286) ఉంది.

65. అంటే షిర్కుతోపాటు వారు పాల్పడిన ఇతర పెద్ద పెద్ద పాపకార్యాలు కూడా చాలా ఉన్నాయి. అవన్నీ విశ్వాసుల గుణగణాలకు విరుద్ధమైనవి.

66. దైవాగ్రహం విరుచుకుపడినప్పుడు కలవారిని, లేనివారిని – అందరినీ అది కబళిస్తుంది. అయితే శ్రీమంతుల గురించి ప్రత్యేకంగా నొక్కి చెప్పటంలోని ఉద్దేశం ఏమిటంటే జాతి జనుల నాయకత్వ పగ్గాలు సాధారణంగా వారి చేతుల్లోనే ఉంటాయి. వారు కోరిన దిశలో జాతి ప్రజలను తీసుకుపోయేవారు. వారు గనక దేవుని అవిధేయతపై మొండికేస్తే జాతి ప్రజలు కూడా ఈ వైఖరిపై పాతుకుపోయేవారు. వారికి తమ స్వయంకృతాలపై సిగ్గుపడి, పశ్చాత్తాపం చెందే ఆలోచన ఉండదు. పూర్వం దేవుడు అనేక జాతులకు చెందిన ధనవంతులకు అవకాశం ఇచ్చాడు. వారి సిరిసంతానాదులలో, పాడిపంటల్లో వృద్ధిని వొసగాడు. ఏదో ఒక రోజు వారు దారికి వస్తారని ఆశించటం జరిగింది. కాని వారి పెడసరి పోకడలు మారలేదు. అందువల్ల దైవసంప్రదాయం అమలుపరచవలసిన ఆవశ్యకత

لَا تَجْـَٔرُوا الْيَوْمَ إِنَّكُمْ مِّنَّا لَا تُنْصَرُونَ ﴿٦٥﴾

**65** ఈ రోజు అరవవలసిన అవసరం లేదు. మాకు వ్యతిరేకంగా మీరు ఎవరి సహాయమూ పొందలేరు.[67]

قَدْ كَانَتْ اٰيٰتِيْ تُتْلٰى عَلَيْكُمْ فَكُنْتُمْ عَلٰٓى اَعْقَابِكُمْ تَنْكِصُوْنَ ﴿٦٦﴾

**66** (ఒకప్పుడు) నా ఆయతులు మీకు చదివి వినిపించబడేవి.[68] అయినా మీరు కాలి మడమలపైన వెనుతిరిగి పోయేవారు (కదా)![69]

مُسْتَكْبِرِيْنَ ۖ بِهٖ سٰمِرًا تَهْجُرُوْنَ ﴿٦٧﴾

**67** గర్విష్ఠుల్లా ప్రవర్తించేవారు.[70] కల్లబొల్లి కబుర్లు చెప్పుకుని, దాన్ని (ఖుర్ఆన్‌ను) వదిలిపోయేవారు[71] (అని వారితో అనబడు తుంది).

اَفَلَمْ يَدَّبَّرُوا الْقَوْلَ اَمْ جَآءَهُمْ مَّا لَمْ يَاْتِ اٰبَآءَهُمُ الْاَوَّلِيْنَ ﴿٦٨﴾

**68** ఏమిటీ, వారు ఈ వాక్కు గురించి ఎన్నడూ చింతన చేయ లేదా?[72] లేక పూర్వం తమ తాతముత్తాతల వద్దకు రాని విషయం వారి వద్దకు వచ్చినందుకా?[73] (ఈ మంకుతనం?)

---

ఏర్పడింది. ఆనాడు మక్కా అవిశ్వాసుల్లోని ఆస్తిపరులను, నాయకమన్యులను దృష్టిలో పెట్టుకుని ఈ హెచ్చరిక చేయబడింది. ఈనాటి కుబేరులకు, అగ్రకులాల వారికి కూడా ఇది వర్తిస్తుంది. బద్ర్ యుద్ధంలో హేమాహేమీలనబడే మక్కా అవిశ్వాస నాయకులు మట్టి కరిచారు. అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు మనసు నొచ్చుకుని చేసిన ప్రార్థన ఫలితంగా మక్కాలోని కర్కశులు కరువు కాటకాల వాతన పడ్డారు. ఇవి ఇహలోకంలో సంభవించే సాధారణ శిక్షలు. పరలోక శిక్ష ఉండనే ఉంది.

**"ముత్‌రఫీన్"** (مُتْرَفِيْنَ) అంటే 'కలిమిలో సుఖంగా బతుకుతున్నవారు' అని అర్థం.

67. అంటే మీరు మూల్గినా, అరిచినా, గగ్గోలుపెట్టినా మిమ్మల్ని ఆదుకునే వారెవరూ లేరు. అలాగే పరలోక శిక్ష నుంచి కూడా వారిని కాపాడే వాడెవడూ ఉండడు.

68. అంటే ఖుర్ఆన్ చదివి వినిపించబడేది లేక అల్లాహ్ ఆదేశాలు వారి ముందు వినిపించబడేవి. దైవప్రవక్త ప్రవచనాలు కూడా ఇందులోకి వస్తాయి.

69. విముఖతతో, విరక్తితో వారు ఆ విధంగా ప్రవర్తించేవారు.

70. ఈ వాక్యానికి విద్వాంసులు రెండు రకాల భావార్థాలు చెప్పారు : 1. తాము కాబా గృహ ధర్మకర్తలం అన్న గర్వం వారిలో ఎక్కువగా ఉండేది. ఆ కారణంగా వారు దైవవాక్యాల పట్ల దురుసుగా ప్రవర్తించేవారు. 2. ఖుర్ఆన్ వాక్యాలను వినగానే వారిలో పౌరుషం వచ్చేది. అహంకారం కట్టలు త్రెంచుకునేది. అదే విశ్వాస మార్గంలో వారికి ప్రధాన అడ్డంకిగా నిలిచేది.

71. **'సమరున్'** అంటే రాత్రిపూట జరిపే మంతనాలు అని అసలు అర్థం. అయితే పూర్వరంగం ప్రకారం మక్కా అవిశ్వాసులు రాత్రిపూట సమావేశమై దివ్య ఖుర్ఆన్ గురించి, మహాప్రవక్త ముహమ్మద్ (స) గురించి చెప్పుకునే మాటలు అని భావం. ఈ మాటల్లో వ్యతిరేకత, వేళాకోళం, వ్యంగ్యం – అన్నీ కలగలసి ఉండేవి. ఒక్కోసారి అర్థంపర్థం లేకుండా నోటికొచ్చినట్లు ప్రేలేవారు. కట్టుకథలు అల్లేవారు. వాటివల్ల వారికి చేకూరే ప్రయోజనం ఏమీ లేకపోయినా తమ గుండె మంటలను ఆ విధంగా చల్లార్చుకున్నామని వారు భావించేవారు (ఫత్‌హుల్ ఖదీర్, ఐసరుత్తఫాసీర్).

72. **'వాక్కు'** అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం. వారే గనక దానిపై నిజాయితీగా యోచన చేసి ఉంటే దాన్ని తప్పకుండా విశ్వసించి ఉండేవాళ్ళు.

73. అజ్ఞానకాలంలో వారి తాతలు, తండ్రులు ఏ ధర్మానికి, ఏ షరీయతుకు నోచుకోకుండా పోయారో అది ఇప్పుడు

**69** లేక తమ సందేశహరుణ్ణి ఎరుగకపోవటం వల్ల వారు అతన్ని నిరాకరిస్తున్నారా?[74]

أَمْ لَمْ يَعْرِفُوا رَسُولَهُمْ فَهُمْ لَهُ مُنكِرُونَ ﴿٦٩﴾

**70** లేక అతనికి పిచ్చిపట్టిందని వారంటున్నారా?[75] అసలు విషయం ఏమిటంటే అతను వారి వద్దకు సత్యాన్ని తీసుకు వచ్చాడు. అయితే వారిలో చాలా మందికి సత్యమంటే అసలే పడదు.[76]

أَمْ يَقُولُونَ بِهِ جِنَّةٌ ۚ بَلْ جَاءَهُم بِالْحَقِّ وَأَكْثَرُهُمْ لِلْحَقِّ كَارِهُونَ ﴿٧٠﴾

**71** సత్యమే గనక వారి కోర్కెల వెనుక పరుగెత్తినట్లయితే భూమ్యాకాశాలు, అందులో వున్న సమస్తం చిందరవందర అయిపోయేవి.[77] యదార్థమేమిటంటే మేము వారికి వారి ఉపదేశాన్ని చేరవేశాము. కాని వారు మాత్రం తమ ఉపదేశం పట్ల విముఖత చూపుతున్నారు.

وَلَوِ اتَّبَعَ الْحَقُّ أَهْوَاءَهُمْ لَفَسَدَتِ السَّمَاوَاتُ وَالْأَرْضُ وَمَن فِيهِنَّ ۚ بَلْ أَتَيْنَاهُم بِذِكْرِهِمْ فَهُمْ عَن ذِكْرِهِم مُّعْرِضُونَ ﴿٧١﴾

**72** పోనీ, నువ్వు వారినుంచి వేతనం ఏదన్నా అడుగుతున్నావా? నీ ప్రభువు ఇచ్చే ప్రతిఫలం చాలా మేలైనదని తెలుసుకో. ఆయన ఉపాధి ప్రదాతలలో కెల్లా శ్రేష్ఠుడు.

أَمْ تَسْأَلُهُمْ خَرْجًا فَخَرَاجُ رَبِّكَ خَيْرٌ ۖ وَهُوَ خَيْرُ الرَّازِقِينَ ﴿٧٢﴾

**73** (ఓ ప్రవక్తా!) నిశ్చయంగా నువ్వు వారిని రుజుమార్గం వైపునకు పిలుస్తున్నావు.

وَإِنَّكَ لَتَدْعُوهُمْ إِلَىٰ صِرَاطٍ مُّسْتَقِيمٍ ﴿٧٣﴾

వారివద్దకు వచ్చింది. అందుకుగాను వారు సంతోషంగా ఆ ధర్మాన్ని స్వీకరించాల్సింది. దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాల్సింది. కాని వీళ్ళుమాత్రం ఈ అమోఘమైన జీవన ధర్మాన్ని తృణీకరిస్తున్నారు. ఇది చాలా విచారకరం.

74. నిజానికి ఆ సందేశహరుని గురించి వారికి చాలా బాగా తెలుసు. అతని వంశం గురించి, పుట్టుపూర్వోత్తరాలను గురించి వారికి తెలియనిదంటూ లేదు. పైగా అతని నిజాయితీ తత్పరతను, సత్యసంధతను వారు స్వయంగా కొనియాడేవారు.

75. ఈ వాక్యం వారిని హెచ్చరించే ధోరణిలోనే వచ్చింది. ఆ ప్రవక్త (ముహమ్మదు) అందజేసిన ఖుర్ఆన్ అపురూపమైన గ్రంథం. అందలి విషయాలు కనీవిని ఎరుగనివి. అలాగే అందలి ప్రబోధనలు లోకశాంతిని ఆశించేవి. మానవత పాలిట కారుణ్యప్రదం వంటివి. మరి అటువంటి మహత్తరమైన సందేశాన్ని, అద్భుతమైన ఖుర్ఆన్ గ్రంథాన్ని మతి చలించిన వ్యక్తి అందజేయగలడా?

76. వారి నిరాకరణకు, అహంభావానికి అసలు కారణం సత్యమంటే గిట్టకపోవటమే. తరతరాలుగా, యుగయుగాలుగా వారి అణువణువునూ పెనవేసుకుపోయిన అజ్ఞానం, అసత్యం మూలంగా వారిలో ఈ వైఖరి పొడసూపింది.

77. ఇక్కడ **'సత్యం'** అంటే ధర్మం (దీన్) మరియు షరీయతు (ధర్మశాస్త్రం) అని భావం. అంతా తమ మనోవాంఛల కనుగుణంగా ఉండాలన్నది ఈ అవిశ్వాసుల మనోభిరామం. మరి ఈ సత్యధర్మమే గనక వారి కోర్కెలకు బానిసగా మారిపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి. భూమ్యాకాశాల వ్యవస్థ అంతా అతలా కుతలం అయిపోతుంది. సర్వత్రా అరాచకం, అశాంతి అలజడులు రేకెత్తుతాయి. ఉదాహరణకు : ఒకే దేవుని బదులు ఎంతోమంది దేవుళ్ళు ఉండాలని వారు కోరుకుంటారు. మరి వారు కోరుకున్నట్లే జరిగితే ఈ విశ్వవ్యవస్థ సజావుగా నడుస్తుందా?

وَإِنَّ الَّذِينَ لَا يُؤْمِنُونَ بِالْآخِرَةِ عَنِ الصِّرَاطِ لَنَاكِبُونَ ﴿٧٤﴾

74 అయితే పరలోకంపై నమ్మకం లేనివారు నిశ్చయంగా సన్మార్గం నుంచి తప్పిపోతారు.[78]

وَلَوْ رَحِمْنَاهُمْ وَكَشَفْنَا مَا بِهِم مِّن ضُرٍّ لَّلَجُّوا فِي طُغْيَانِهِمْ يَعْمَهُونَ ﴿٧٥﴾

75 ఒకవేళ మేము వారిపై దయదలచి, వారి కష్టాలను దూరం చేస్తే వారు తమ తలబిరుసుతనంలో మరింతగా మొండికేసి, అంధులుగా ప్రవర్తిస్తారు.[79]

وَلَقَدْ أَخَذْنَاهُم بِالْعَذَابِ فَمَا اسْتَكَانُوا لِرَبِّهِمْ وَمَا يَتَضَرَّعُونَ ﴿٧٦﴾

76 మేము వారిని శిక్షలో (భాగంగా) కూడా పట్టుకున్నాము. కాని వారు తమ ప్రభువు సమక్షంలో లొంగనూ లేదు, వినమ్రతను వ్యక్తపరచనూ లేదు.[80]

حَتَّىٰ إِذَا فَتَحْنَا عَلَيْهِم بَابًا ذَا عَذَابٍ شَدِيدٍ إِذَا هُمْ فِيهِ مُبْلِسُونَ ﴿٧٧﴾

77 ఆఖరికి మేము వారిపై కఠినమైన శిక్షా ద్వారాన్ని తెరచివేసి నప్పుడు, వారు వెంటనే నిరాశానిస్పృహలకు లోనయ్యారు.[81]

وَهُوَ الَّذِي أَنشَأَ لَكُمُ السَّمْعَ وَالْأَبْصَارَ وَالْأَفْئِدَةَ قَلِيلًا مَّا تَشْكُرُونَ ﴿٧٨﴾

78 ఆయనే (అల్లాహ్‌యే) మీకు చెవులను, కళ్లను, హృదయాలను చేశాడు. కాని మీరు కృతజ్ఞతలు తెలిపేది బహుతక్కువ.[82]

وَهُوَ الَّذِي ذَرَأَكُمْ فِي الْأَرْضِ وَإِلَيْهِ تُحْشَرُونَ ﴿٧٩﴾

79 మిమ్మల్ని భూమిపై వ్యాపింపజేసినవాడు కూడా ఆయనే. ఎట్టకేలకు ఆయన వద్దకే మీరు సమీకరించబడతారు.[83]

78. అంటే రుజుమార్గం పట్ల వారి వైముఖ్యానికి ప్రధాన కారణం పరలోకంపై నమ్మకం లేకపోవటమే.

79. ఇస్లాం పట్ల వారి నరనరాల్లో జీర్ణించుకుపోయిన వైరభావానికి, అక్కసుకు, షిర్కు ఊబిలో వారు కూరుకుపోయిన వైనానికి ఇది ఒక నిదర్శనం.

80. ఈ ఆయతులో ప్రస్తావించబడిన 'శిక్ష' అంటే బద్ర్ యుద్ధంలో మక్కా అవిశ్వాసులకు ఎదురైన ఘోర పరాభవం అన్నమాట. ఈ యుద్ధంలో వారి వర్గానికి చెందిన 70 మంది వధించబడ్డారు. లేదా మహాప్రవక్త (సఅసం) గారి మనసు నొప్పించినందుకు వారిపై వచ్చిపడిన కరువుకాటకాలు కూడా కావచ్చు. "ఓ అల్లాహ్! హజ్రత్ యూసుఫ్ కాలంలో ఏడు సంవత్సరాలు కరువు ఏర్పడినట్లే, వీళ్ళను కూడా కరువు కాటకాలకు లోనుచేసి వీరికి వ్యతిరేకంగా నాకు సహాయపడు" అని మహాప్రవక్త (సఅసం) ప్రార్థించారు (బుఖారీ – కితాబుద్దావాత్; ముస్లిం – కితాబుల్ మసాజిద్). దానివల్ల మక్కా తిరస్కారులు తీవ్రమైన కరువుకాటకాలకు గురయ్యారు. ఆ సందర్భంగా అబూ సుఫ్యాన్ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి తమ పరిస్థితి జంతువుల చర్మాలు తినేవరకూ వచ్చిందనీ, తమకోసం అల్లాహ్‌ను ప్రార్థించమనీ – అల్లాహ్ కారుణ్యాన్ని, దైవప్రవక్తకు తనతో ఉన్న సంబంధాన్ని ప్రస్తావించి మరీ వినతి చేసుకున్నారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది (ఇబ్నె కసీర్).

81. ఈ కఠిన శిక్ష ప్రాపంచికమైనదీ కావచ్చు లేక పారలౌకికమైనదీ కావచ్చు. ఆ శిక్షకు గురైనప్పుడు వారు అన్ని రకాల ఆశలకు, అవకాశాలకు దూరమైపోతారు.

82. అంటే, దేవుడు మీకు వినేశక్తినీ, చూసేశక్తినీ, ఆలోచించే శక్తినీ ప్రసాదించాడు. తద్వారా మీరు సత్యాన్ని పరికించవచ్చు. మంచీ–చెడుల మధ్య గల తేడాను తెలుసుకోవచ్చు. లాభదాయకమైన దానిని స్వీకరించవచ్చు. కాని మీరు ధన్యజీవులుగా రాణించటం లేదు. అంటే దైవప్రసాదితమైన ఈ శక్తి సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవటం లేదు.

**80** జీవన్మరణాలను ఇచ్చేవాడు కూడా ఆయనే. రేయింబవళ్ళ మార్పిడి[84] కూడా ఆయన అధీనంలోనే ఉంది. మరి మీరు ఆ మాత్రం గ్రహించలేరా?[85]

وَهُوَ الَّذِي يُحْيِي وَيُمِيتُ وَلَهُ اخْتِلَافُ الَّيْلِ وَالنَّهَارِ ۚ أَفَلَا تَعْقِلُونَ (80)

**81** అసలు అది కాదు. తమ పూర్వీకులు చెబుతూ వచ్చిన దానినే వీళ్ళూ చెబుతున్నారు –

بَلْ قَالُوا مِثْلَ مَا قَالَ الْأَوَّلُونَ (81)

**82** "మేము మరణించి, మట్టిగా, ఎముకలుగా మారిపోయిన తరువాత కూడా మళ్లీ సజీవులుగా లేపబడతామా?" అనంటారు.

قَالُوا أَإِذَا مِتْنَا وَكُنَّا تُرَابًا وَعِظَامًا أَإِنَّا لَمَبْعُوثُونَ (82)

**83** "మాకూ, మా తాతముత్తాతలకు మునుపటి నుంచే ఇలాంటి వాగ్దానం చేయబడుతూ వస్తోంది. ఇవి పూర్వీకుల కట్టుకథలు తప్ప మరేమీ కావు"[86] (అని చెబుతారు).

لَقَدْ وُعِدْنَا نَحْنُ وَآبَاؤُنَا هَٰذَا مِنْ قَبْلُ إِنْ هَٰذَا إِلَّا أَسَاطِيرُ الْأَوَّلِينَ (83)

**84** "భూమి మరియు అందులో ఉన్న సమస్త వస్తువులు ఎవరివో మీకే గనక తెలిసి ఉంటే చెప్పండి?" అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు.

قُلْ لِمَنِ الْأَرْضُ وَمَنْ فِيهَا إِنْ كُنْتُمْ تَعْلَمُونَ (84)

**85** "అల్లాహ్‌వే" అని వారు వెంటనే సమాధానం ఇస్తారు. "మరయితే మీరు హితబోధను ఎందుకు గ్రహించటం లేదు?" అని అడుగు.

سَيَقُولُونَ لِلَّهِ ۚ قُلْ أَفَلَا تَذَكَّرُونَ (85)

**86** "సప్తాకాశాలకు, మహోన్నతమైన (అర్ష్) పీఠానికి అధిపతి ఎవరు?" అని వారిని ప్రశ్నించు.

قُلْ مَنْ رَبُّ السَّمَاوَاتِ السَّبْعِ وَرَبُّ الْعَرْشِ الْعَظِيمِ (86)

83. ఇందులోనూ దైవ నిదర్శనం ఉంది. ఆయన మిమ్మల్ని పుట్టించి ఒకేచోట ఉంచకుండా నేల నాలుగు చెరగులా విస్తరింపజేశాడు. మీ రంగు, రూపు కూడా ఇతరులకన్నా భిన్నంగా ఉంది. మీ అలవాట్లు, అభిరుచులు వేర్వేరుగా ఉన్నాయి. మీ భాషలు వేరు, ప్రాంతాలు వేరు, రీతులు వేరు. కాని ఒకానొక ఘడియ రానున్నది. అప్పుడు మీరంతా ఒకే చోటికి సమీకరించబడతారు. ప్రభువు సమక్షంలో మీ లెక్క తేల్చబడుతుంది.

84. పగలు తరువాత రేయి, రేయి తరువాత పగలు రావటం, కొంతకాలం పగలు చిన్నదిగానూ రేయి పెద్దదిగానూ ఉండటం, మరి కొంతకాలం పగలు పెద్దదిగానూ రేయి చిన్నదిగానూ ఉండటం – ఇదంతా దైవప్రమేయం. దేవునికి తప్ప మరొకరికి ఇందులో ఎలాంటి ప్రమేయం లేదు.

85. ఇదంతా ఆ సర్వశక్తుడయిన అల్లాహ్ అధీనంలో ఉందనీ, సృష్టితాలన్నీ ఆయన ఆజ్ఞలను తు.చ. తప్పకుండా పాటిస్తున్నాయన్న సంగతి మీ బుద్ధికి తట్టడం లేదా?

86. **'అసాతీరు'** (اَسَاطِيْر) అంటే కల్పించబడినవి, నకలు చేయబడినవి అని అర్థం. 'ఉస్‌తూరతున్' దీని ఏకవచనం. ఈ జీవితం శాశ్వితం కాదనీ, మరణానంతరం మరో జీవితం ఉందని చెప్పటం కొత్త విషయం ఏమీ కాదు. మా తాతముత్తాతలకు కూడా ఇదే చెప్పబడింది. ఇప్పుడు మాకూ అదే చెప్పబడుతోంది. ఇంకెంత కాలం ఇలా మభ్యపెడుతూ ఉంటారు? అదేదో ఎందుకు సంభవించటం లేదు? అసలు మీరు చెప్పేదంతా ఉత్తుత్తిదే. మా పూర్వీకులు ఎవరో పుస్తకాల్లో లిఖించిన విషయాలను మీరు నకలు చేస్తూ వస్తున్నారు. కాబట్టి ఈ కాల్పనిక గాథలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు అన్నది అవిశ్వాసుల మాటల్లోని ఆంతర్యం.

**87** "అల్లాహ్‌యే" అని వారు జవాబిస్తారు. "మరలాంటప్పుడు మీరెందుకు భయపడరు?"[87] అని వారిని (నిలదీసి) అడుగు.

سَيَقُولُونَ لِلَّهِ ۚ قُلْ أَفَلَا تَتَّقُونَ ﴿٨٧﴾

**88** సమస్త విషయాల సార్వభౌమత్వం ఎవరి చేతుల్లో ఉందో, శరణు ఇచ్చేవాడెవడో,[88] ఎవరికి వ్యతిరేకంగా ఏ శరణూ లభించదో[89] – ఆయనెవరో మీకు తెలిసి ఉంటే చెప్పండి? అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు.

قُلْ مَنْ بِيَدِهِ مَلَكُوتُ كُلِّ شَيْءٍ وَهُوَ يُجِيرُ وَلَا يُجَارُ عَلَيْهِ إِنْ كُنْتُمْ تَعْلَمُونَ ﴿٨٨﴾

**89** "అల్లాహ్ మాత్రమే" అని వారు చెబుతారు. "మరైతే మీరు ఎలా మోసపోతున్నారు?"[90] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

سَيَقُولُونَ لِلَّهِ ۚ قُلْ فَأَنَّىٰ تُسْحَرُونَ ﴿٨٩﴾

**90** నిజానికి మేము వారికి సత్యాన్ని అందజేశాము. వారే ముమ్మాటికీ అబద్ధాల కోరులు.

بَلْ أَتَيْنَاهُمْ بِالْحَقِّ وَإِنَّهُمْ لَكَاذِبُونَ ﴿٩٠﴾

**91** అల్లాహ్ ఎవరినీ కొడుకుగా చేసుకోలేదు. ఆయనతోపాటు ఇంకొక ఆరాధ్య దేవుడు కూడా (భాగస్వామిగా) లేడు. ఒకవేళ అలాంటిదేదైనా ఉంటే ప్రతి దేవుడూ తాను సృష్టించిన సృష్టితాలను వేరుగా తీసుకుని వేరయిపోయేవాడు. ఒకడు ఇంకొకనిపై దండయాత్ర చేసేవాడు. వారు అల్లాహ్‌కు ఏ లక్షణాలను ఆపాదిస్తున్నారో వాటికి ఆయన అతీతుడు, పవిత్రుడు.

مَا اتَّخَذَ اللَّهُ مِنْ وَلَدٍ وَمَا كَانَ مَعَهُ مِنْ إِلَٰهٍ ۚ إِذًا لَذَهَبَ كُلُّ إِلَٰهٍ بِمَا خَلَقَ وَلَعَلَا بَعْضُهُمْ عَلَىٰ بَعْضٍ ۚ سُبْحَانَ اللَّهِ عَمَّا يَصِفُونَ ﴿٩١﴾

---

87. భూమిని, భూమండలంలో ఉన్న సమస్త వస్తువులను సృష్టించినవాడు అల్లాహ్‌యేనని మీరు స్వయంగా ఒప్పుకుంటున్నప్పుడు, ఆకాశాలకు, అర్ష్ (సింహాసనాని)కి అధిపతి కూడా అల్లాహ్‌యేనని మీరు అంగీకరిస్తున్నప్పుడు ఆరాధనలకు అర్హుడు కూడా ఆయనేనని అంగీకరించటంలో తాత్సారం, తటపటాయింపు ఎందుకు జరుగుతోంది? మీరు అల్లాహ్ ఏకత్వాన్ని ఒప్పుకుని, ఆయన ఆగ్రహం నుంచి మిమ్మల్ని మీరు ఎందుకు కాపాడుకోరు?

88. తాను రక్షించదలచిన వారిని ఆయన తన ఆశ్రయంలోనికి తీసుకుంటాడు. ఆయన ఆశ్రయం కల్పించిన వారికి ఎవరయినా, ఏదైనా కీడు కలిగించగలరా?

89. అల్లాహ్ గనక ఎవరినయినా శిక్షించదలచినా, నష్టం చేకూర్చదలచినా ఆయన బారినుంచి వారిని కాపాడే నాథుడెవడైనా ఉన్నాడా?

90. మరి మీకేమైపోయింది. మీకు మతిపోయిందా? సర్వాధిపతి అల్లాహ్‌యే అని ఒకవైపు ఒప్పుకుంటూనే మరోవైపు ఆరాధన (ఇబాదత్)లో ఆయనకు భాగస్వామ్యం (షిర్క్) కల్పిస్తున్నారే?! దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ 'విపులీకరణ'ను బట్టి బోధపడేదేమిటంటే మక్కాలోని ముష్రిక్కులు అల్లాహ్ ప్రభుత్వాన్ని (రుబూబియత్‌ను), సృష్టి ప్రక్రియను, ఆయన ఆధిపత్యాన్ని, దాతృత్వాన్నీ త్రోసిపుచ్చలేదు. పైగా ఈ విషయాలన్నింటినీ వాళ్లు అంగీకరించారు. వారు త్రోసిపుచ్చినది ఏకదైవారాధనను (తౌహీదె ఉలూహియత్‌ని) మాత్రమే. వారు ఒక్క అల్లాహ్‌ను మాత్రమే పూజించేవారు కారు. అల్లాహ్‌ను కూడా పూజించేవారు, అల్లాహ్‌తో పాటు మరికొంతమంది బూటకపు దేముళ్ళను కూడా పూజించేవారు. భూమ్యాకాశాల నిర్మాణంలో, విశ్వవ్యవస్థను నడపటంలో ఆ 'దేముళ్లు' అల్లాహ్‌కు భాగస్వాములన్న ఉద్దేశంతో వారు ఈ షిర్క్ చేసేవారా?! అంటే అది కాదు. మరైతే ఈ షిర్క్ ఎందుకు చేసేవారు? అంటే తాము కొలిచే ఈ చిల్లర దేవుళ్లు కూడా దేవుని సజ్జన దాసులేనని, వారు సజ్జనులైన కారణంగా దేవుడు వారికి కూడా

| | |
|---|---|
| **92** గోప్యంగా ఉన్నదానినీ, బహిర్గతంగా ఉన్నదానినీ ఆయన ఎరిగినవాడు. వారు కల్పించే భాగస్వామ్యానికి (షిర్కుకు) ఆయన అతీతుడు, ఉన్నతుడు. | عٰلِمِ الْغَيْبِ وَالشَّهَادَةِ فَتَعٰلٰى عَمَّا يُشْرِكُوْنَ ﴿٩٢﴾ |
| **93** (ఓ ముహమ్మద్‌- (స) !) ఈ విధంగా ప్రార్థించు : "నా ప్రభూ! అవిశ్వాసులకు చేయబడుతున్న వాగ్దానాన్ని (శిక్షను) గనక నీవు నాకు చూపదలిస్తే, | قُلْ رَّبِّ اِمَّا تُرِيَنِّيْ مَا يُوْعَدُوْنَ ﴿٩٣﴾ |
| **94** "ప్రభూ! నీవు నన్ను ఈ దుర్మార్గుల సమూహంలో మటుకు ఉంచకు."[91] | رَبِّ فَلَا تَجْعَلْنِيْ فِي الْقَوْمِ الظّٰلِمِيْنَ ﴿٩٤﴾ |
| **95** మేము వారికి వాగ్దానం చేస్తున్నదంతా నీకు చూపగలం. | وَاِنَّا عَلٰٓى اَنْ نُّرِيَكَ مَا نَعِدُهُمْ لَقٰدِرُوْنَ ﴿٩٥﴾ |
| **96** (ఓ ముహమ్మద్‌!) ఏదయితే మంచిదో దాని ద్వారానే చెడును తొలగించు.[92] వారు కల్పించేవన్నీ మాకు బాగా తెలుసు. | اِدْفَعْ بِالَّتِيْ هِيَ اَحْسَنُ السَّيِّئَةَ ؕ نَحْنُ اَعْلَمُ بِمَا يَصِفُوْنَ ﴿٩٦﴾ |

కొన్ని అధికారాలు ఇచ్చి ఉంటాడని, తాము వారిని కాకా పట్టడం ద్వారా దైవసామీప్యాన్ని పొందవచ్చునని వారు భ్రమపడ్డారు. ఈ 'భ్రమ'లో పడటం వల్లనే నేటి బిద్‌అతీలు, సమాధి పూజారులు కూడా సహాయం కోసం కాలధర్మం చెందిన పుణ్యపురుషులను మొరపెట్టుకుంటున్నారు. వారి పేరు మీద మొక్కుకుంటున్నారు. అల్లాహ్‌ ఆరాధనలో వారికి కూడా 'షేర్‌' కల్పిస్తున్నారు.

అయితే ఈ మేరకు అల్లాహ్‌ ఎవరికీ, ఎన్నడూ హామీ ఇవ్వలేదు. తాను మృతిచెందిన ఫలానా సత్పురుషునికో లేక ఫలానా ప్రవక్తకో కొన్ని ప్రత్యేక అధికారాలు ఇచ్చి ఉన్నాననిగానీ, మీరు అతని ద్వారా తన సామీప్యం పొందండని గానీ, సహాయం కోసం వాళ్ళను మొరపెట్టుకోండనిగానీ, వారి పేరుమీద మొక్కుబడులు చెల్లించండనిగానీ అల్లాహ్‌ ఎంతమాత్రం చెప్పలేదు. పైగా "మేము వారికి సత్యాన్ని అందజేసేశాము" అని అల్లాహ్‌ చాలా స్పష్టంగా చెప్పేశాడు. అంటే అల్లాహ్‌ తప్ప ఇంకొక ఆరాధ్యదేవుడు లేనేలేడని నిర్ద్వంద్వంగా చెప్పేయటం జరిగింది. పోనీ వారు అల్లాహ్‌ ఆరాధనలో వేరితరులకు భాగస్వామ్యం కల్పించటానికి వారి వద్ద ఏదన్నా ఆధారం, ప్రమాణం ఉందా అంటే అలాంటిది కూడా ఏమీ లేదు. 'నలుగురితో నారాయణ' అన్న ధోరణిలో సాగుతుంది వారి ఈ షిర్క్‌. వారు తమ తాతముత్తాతలను ఆ పని చేస్తూ ఉండగా చూసి ఉన్నారు. పరిసరాలవారు చేస్తూ ఉండటాన్ని చూస్తున్నారు. కాబట్టి వాళ్ళూ అదే చేస్తున్నారు. యదార్థానికి వాళ్ళు అసత్యవాదులు. వారు చెబుతున్నట్లుగా అల్లాహ్‌కు సంతానంగానీ, పార్ట్‌నర్లుగానీ లేరు. ఒకవేళ ఉంటే ఆ పార్ట్‌నర్లు తమ తరఫున సృష్టించబడిన వారి కోసం వేరుగా జీవన సామగ్రిని సమకూర్చి ఉండేవారు. ప్రతి భాగస్వామీ ఇతర భాగస్వాములను డామినేట్‌ చేసి, సింహభాగం పొందేందుకు ప్రయత్నించేవాడు. మరి అలాంటి 'పోరు' మొదలైతే విశ్వవ్యవస్థ అంతా అల్లకల్లోలంగా ఉండేది. కాని అలాంటిదేమీ జరగటం లేదు. అంతా సజావుగా, సక్రమంగా ఈ లోకం సాగుతోంది. కాబట్టి బోధపడేదేమిటంటే ఈ అసత్యవాదులు కల్పించే అభూతకల్పనలకు అల్లాహ్‌ అతీతుడు, పవిత్రుడు.

91. అందుకే మహనీయ ముహమ్మద్‌ (సఅసం) వారు ఈ విధంగా తరచూ దుఆ చేస్తూ ఉండేవారు: "ఓ అల్లాహ్‌! నీవు ఎప్పుడు, ఏ జాతి వారిపై నీ ఆపదను పంపాలని నిశ్చయించుకున్నా దాన్ని అమలుపరచక ముందే నన్ను ఈ లోకం నుంచి లేపుకో." (తిర్మిజీ–సాద్‌ సూరా వ్యాఖ్యానం; ముస్నదె అహ్మద్‌ – సంపుటి : 5, పేజీ – 243)

92. "చెడును అత్యుత్తమమైన మంచి ద్వారా నిర్మూలించు. ఫలితంగా నీ శత్రువు కూడా నీ ప్రగాఢ మిత్రునిగా మారిపోతాడు" అని వేరొకచోట అనబడింది. (హామీమ్‌ సజ్దా – 24, 25)

**97** ఇంకా ఇలా ప్రార్థిస్తూ ఉండు: "ఓ నా ప్రభూ! షైతానులు కలిగించే ప్రేరణల నుంచి నేను నీ శరణుకోరుతున్నాను.[93]

وَقُلْ رَّبِّ اَعُوْذُ بِكَ مِنْ هَمَزٰتِ الشَّيٰطِيْنِ ﴿٩٧﴾

**98** ప్రభూ! వారు నా వద్దకు రావటం నుంచి నీ శరణు వేడు తున్నాను."[94]

وَاَعُوْذُ بِكَ رَبِّ اَنْ يَّحْضُرُوْنِ ﴿٩٨﴾

**99** చివరికి వారిలో ఎవరికైనా చావు వచ్చినప్పుడు, "ఓ ప్రభూ! నన్ను తిరిగి వెనక్కి పంపించు.

حَتّٰٓى اِذَا جَآءَ اَحَدَهُمُ الْمَوْتُ قَالَ رَبِّ ارْجِعُوْنِ ﴿٩٩﴾

**100** "నేను వదలి వచ్చిన లోకంలోకే వెళ్ళి సత్కార్యం చేస్తాను"[95] అని అంటాడు. ముమ్మాటికీ అలా జరగదు.[96] అది అతను అంటున్న ఒక మాట మాత్రమే.[97] వారు మళ్ళీ సజీవులై లేచే రోజు వరకూ వారి వెనుక ఒక అడ్డుతెర ఉంటుంది.[98]

لَعَلِّيْٓ اَعْمَلُ صَالِحًا فِيْمَا تَرَكْتُ كَلَّا ۭ اِنَّهَا كَلِمَةٌ هُوَ قَاۗىِٕلُهَا ۭ وَمِنْ وَّرَاۗىِٕهِمْ بَرْزَخٌ اِلٰى يَوْمِ يُبْعَثُوْنَ ﴿١٠٠﴾

93. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారు షైతాన్ బారి నుంచి ఈ విధంగా శరణు వేడేవారు: **"అవూజు బిల్లాహిస్సమీయిల్ అలీమ్. మినష్షయితా నిర్రజీమ్. మిన్ హమ్జిహి, వ నఫ్ఖిహి, వ నఫ్సిహి."** (అబూ దావూద్ – కితాబుస్సలాత్; తిర్మిజీ – బాబు మా యఖూలు ఇన్ద ఇఫ్తెతాహిస్సలాత్).

94. అందుకే ప్రతి ముఖ్యమైన పనినీ అల్లాహ్ పేరుతో మొదలెట్టాలనీ – అంటే బిస్మిల్లాహ్ అని పలకాలనీ – మహాప్రవక్త (స) తాకీదు చేశారు. ఎందుకంటే అల్లాహ్ నామస్మరణ ద్వారా పైశాచిక శక్తులు పలాయనం చిత్తగిస్తాయి. అందుకే ఆయన (స) ఈ దుఆ చేసేవారు : **"అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ హరమి వ అవూజుబిక మినల్ హద్మి, వ మినల్ ఘరఖి, వ అవూజుబిక ఐయ్యత ఖబ్బతని యష్షయితాను ఇందల్ మౌతి."** (అబూ దావూద్ – కితాబుల్ విత్ర్). రాత్రిపూట కలత చెందినపుడు ఆయన (సఅసం) ఈ విధంగా ప్రార్థించేవారు: **"బిస్మిల్లాహి. అవూజు బికలిమా తిల్లాహిత్తామ్మతి మిన్ ఘజబిహీ, వ ఇఖాబిహీ, వ మిన్షర్రి ఇబాదిహీ, వ మిన్ హమజాతిష్షయాతీని వ ఐం యహ్జురూన్."** (ముస్నదె అహ్మద్ – 2/181; అబూ దావూద్ – కితాబుత్తిబ్; తిర్మిజీ – అబ్వాబుద్దావాత్)

95. మృత్యువు ఒడిలోకి చేరుతున్నప్పుడు, మరణానంతరం తిరిగి లేపబడుతున్నప్పుడూ, ప్రభువు న్యాయస్థానంలో హాజరు పరచబడుతున్నప్పుడు, నరకంలోకి త్రోయబడుతున్నప్పుడు ప్రతి అవిశ్వాసి ఈ విధంగానే విజ్ఞప్తి చేసుకుంటాడు. కాని దానివల్ల అతనికి కలిగే ప్రయోజనం శూన్యం. దివ్య ఖుర్ఆన్‌లో ఈ విషయం పదే పదే పునరావృతం అయింది. (ఉదాహరణకు: మునాఫిఖూన్ సూరా (10, 11), ఇబ్రాహీం – 44, ఆరాఫ్ – 53, సజ్దా – 12, అల్ అన్ఆమ్ – 27, 28, షూరా – 24, మోమిన్ – 11, 12, ఫాతిర్ – 37)

96. అంటే వారిని తిరిగి ప్రపంచంలోకి పంపటం అనేది జరగని పని.

97. మృత్యువు దరిచేరి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ప్రతి అవిశ్వాసి ఇదేమాట అంటాడని ఒక భావం. మరొక భావం ఏమిటంటే, అతను ఊరకే అలా అంటున్నాడు. అతను కోరినట్లుగా ఒకవేళ అతనికి (అవిశ్వాసికి) మరో అవకాశం ఇచ్చినా సదాచరణ చేస్తాడన్న నమ్మకం ఏమీ లేదు. "ఒకవేళ వారిని గత జీవితం వైపుకు తిరిగి పంపిస్తే వారు నిషేధించబడిన పనులన్నీ మళ్లీ చేస్తారు" (అల్ అన్ఆమ్ – 28). హజ్రత్ ఖతాదా (రజి) ఇలా అంటున్నారు : "అవిశ్వాసిలోని ఈ ఆకాంక్ష మనకు గొప్ప గుణపాఠం లాంటిది. అవిశ్వాసి ఈ ప్రపంచంలోకి రాగోరేది తన ఆలుబిడ్డల వద్దకో, తన తెగవారి వద్దకో పోవటానికి కాదు, సత్కార్యాలు చేసేందుకే అతను తిరిగి రావాలనుకుంటాడు (కాని అతని కోర్కె తీర్చబడదు). అందుకే దొరికిన జీవిత క్షణాలను మహాభాగ్యంగా భావించి వీలైనంత అధికంగా సదాచరణ చేసుకోండి. రేపు తీర్పుదినాన ఈ విధంగా కోరే అగత్యం ఏర్పడకుండా జాగ్రత్తపడండి." (ఇబ్నె కసీర్)

98. రెండు వస్తువులకు మధ్యనున్న అడ్డును లేక తెరను **'బర్జఖ్'** (بَرْزَخ) అని అంటారు. ఇది ఇహలోక జీవితానికీ –

**101** మరి శంఖం పూరించబడినప్పుడు వారి మధ్యన బంధు
త్వాలుగానీ, ఒండొకరిని అడిగి చూడటంగానీ ఆనాడు
ఉండదు.[99]

فَإِذَا نُفِخَ فِي الصُّورِ فَلَا أَنسَابَ بَيْنَهُمْ
يَوْمَئِذٍ وَلَا يَتَسَاءَلُونَ (101)

**102** ఎవరి త్రాసు పళ్ళెం బరువుగా ఉంటుందో వారు సాఫల్యం
పొందినవారవుతారు.

فَمَن ثَقُلَتْ مَوَازِينُهُ فَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ (102)

**103** మరెవరి త్రాసుపళ్ళెం తేలికగా ఉంటుందో వారే తమకు
తాము నష్టం చేకూర్చుకున్నవారు. వారు సదా నరకంలో
ఉంటారు.

وَمَنْ خَفَّتْ مَوَازِينُهُ فَأُولَٰئِكَ الَّذِينَ خَسِرُوا
أَنفُسَهُمْ فِي جَهَنَّمَ خَالِدُونَ (103)

**104** వారి ముఖాలను అగ్ని మాడ్చివేస్తూ ఉంటుంది.[100] అందు
వల్ల వారు కడు అంద వికారంగా మారిపోతారు.[101]

تَلْفَحُ وُجُوهَهُمُ النَّارُ وَهُمْ فِيهَا كَالِحُونَ (104)

**105** "నా ఆయతులు మీకు చదివి వినిపించబడలేదా? అయి
నప్పటికీ మీరు వాటిని ధిక్కరించేవారు" (అని వారితో చెప్పిన
ప్పుడు),

أَلَمْ تَكُنْ آيَاتِي تُتْلَىٰ عَلَيْكُمْ فَكُنتُم
بِهَا تُكَذِّبُونَ (105)

**106** "ప్రభూ! మా దౌర్భాగ్యం మమ్మల్ని శాసించింది.[10]
(నిజంగా) మేము మార్గభ్రష్టులం" అని వారు అంటారు.

قَالُوا رَبَّنَا غَلَبَتْ عَلَيْنَا شِقْوَتُنَا
وَكُنَّا قَوْمًا ضَالِّينَ (106)

**107** "మా ప్రభూ! మాకు ఇక్కణ్ణుంచి విముక్తిని ప్రసాదించు.
మేము గనక మళ్ళీ ఇలాగే చేస్తే అప్పుడు నిశ్చయంగా మేము
దుర్మార్గులమవుతాము" (అని విజ్ఞప్తి చేసుకుంటారు).

رَبَّنَا أَخْرِجْنَا مِنْهَا فَإِنْ عُدْنَا فَإِنَّا ظَالِمُونَ (107)

---

పరలోక జీవితానికి మధ్య 'విరామంగా' ఉంటుంది. మరణించిన క్షణం నుంచీ ప్రపంచంతో మనిషి సంబంధం తెగిపోతుంది. పరలోక జీవనం కూడా తక్షణం మొదలవదు. మానవులంతా తిరిగి బ్రతికించబడిన నాటి నుంచే ఈ 'మరో లోకం' మొదలవుతుంది. ఈ రెండు లోకాలకు మధ్యనున్న 'అవస్థ'ను బర్జఖ్ అవస్థ అంటారు. మృతుడు సమాధిలో ఉన్నా, కాకులకు గద్దలకు ఆహారంగా మారినా, కాల్చివేయబడి మట్టిలో కలసిపోయినా, మరేమైనా – అది బర్జఖ్ అవస్థగానే పరిగణించబడుతుంది. తుదకు అల్లాహ్ మానవులందరికీ ఓ కొత్త ఉనికిని ఇచ్చి – అందరినీ మహ్షర్ మైదానంలో సమావేశపరుస్తాడు.

99. ఆ రోజు అత్యంత భయంకరంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమను తాము కాపాడుకునే యత్నంలో ఉంటారే తప్ప తమ వారిని పట్టించుకోవాలన్న ధ్యాసే ఉండదు. ప్రారంభంలో ఈ స్థితి ఉంటుంది. భయాందోళనలు కొంచెం తగ్గిన తరువాత వారు ఒకరినొకరు గుర్తుపడతారు. పరస్పరం మాట్లాడుకుంటారు కూడా.

100. ప్రత్యేకంగా ముఖం గురించి చెప్పబడటానికి కారణమేమిటంటే మానవ ఉనికిని చాటిచెప్పే అత్యంత ముఖ్యమైన, శ్రేష్ఠమైన శరీర భాగం ముఖం. ఆ మాటకొస్తే అగ్ని ఒక్క ముఖాన్నే కాదు, శరీరమంతటినీ మాడ్చివేస్తుంది.

101. వారి పెదవులు దహించుకుపోయి లోపలి దంతాలు బయటపడతాయి. పెదవులు ఒక విధంగా దంతాలకు వస్త్రధారణ

قَالَ اخْسَـُٔوْا فِيْهَا وَلَا تُكَلِّمُوْنِ ﴿١٠٨﴾

**108** "ధూర్తులై ఇందులోనే పడి ఉండండి. నాతో మాట్లాడకండి" అని అల్లాహ్ అంటాడు.

اِنَّهٗ كَانَ فَرِيْقٌ مِّنْ عِبَادِيْ يَقُوْلُوْنَ رَبَّنَآ اٰمَنَّا فَاغْفِرْ لَنَا وَارْحَمْنَا وَاَنْتَ خَيْرُ الرّٰحِمِيْنَ ﴿١٠٩﴾

**109** నా దాసులలోని ఒక వర్గంవారు, "ఓ మా ప్రభూ! మేము విశ్వసించాము. కనుక మమ్మల్ని క్షమించు, మాపై దయజూపు. నువ్వు దయచూపే వారందరిలోకెల్లా శ్రేష్ఠుడవు" అని వేడుకునే వారు.

فَاتَّخَذْتُمُوْهُمْ سِخْرِيًّا حَتّٰۤى اَنْسَوْكُمْ ذِكْرِيْ وَكُنْتُمْ مِّنْهُمْ تَضْحَكُوْنَ ﴿١١٠﴾

**110** కాని మీరేమో వారిని నవ్వులాటగా తీసుకున్నారు. ఆఖరికి మీ ఈ పరాచికాలు మిమ్మల్ని నా ధ్యానం కూడా మరిపింపజేశాయి. అయినా మీరు వారిని పరిహసిస్తూనే ఉన్నారు.

اِنِّيْ جَزَيْتُهُمُ الْيَوْمَ بِمَا صَبَرُوْۤا ۙ اَنَّهُمْ هُمُ الْفَآئِزُوْنَ ﴿١١١﴾

**111** నేను ఈ రోజు వారికి వారి సహనానికి తగిన ప్రతిఫలం ఇచ్చాను. వాస్తవానికి వారు (ఆశించిన మేరకు) సఫలీకృతులయ్యారు[103] (అని అల్లాహ్ సెలవిస్తాడు).

قٰلَ كَمْ لَبِثْتُمْ فِي الْاَرْضِ عَدَدَ سِنِيْنَ ﴿١١٢﴾

**112** "మీరు ఎన్ని సంవత్సరాల పాటు భూలోకంలో ఉండి ఉంటారు?" అని (అల్లాహ్) వారిని అడుగుతాడు.

قَالُوْا لَبِثْنَا يَوْمًا اَوْ بَعْضَ يَوْمٍ فَسْـَٔلِ الْعَآدِّيْنَ ﴿١١٣﴾

**113** "ఒక రోజో లేక ఒక రోజుకన్నా తక్కువ సమయమో ఉండి ఉంటాము. కావాలంటే లెక్కించేవారిని అడగండి"[104] అని వారంటారు.

వంటివి. ఈ వస్త్రాలు నరకాగ్నికి ఆహుతి అయి, మాడి మసైపోయినప్పుడు పళ్లన్నీ బయటపడి మనిషి ముఖం కడు అసహ్యంగా – భయంకరంగా – కనబడుతుంది.

102. మనిషిని ఆవహించి ఉండే కోర్కెలు, భోగవిలాసాలను ఇక్కడ 'దౌర్భాగ్యం'గా అభివర్ణించటం జరిగింది. విషయలోలుడైన మనిషి పరలోకాన్ని, సత్యాన్ని ధిక్కరించి శాశ్విత దౌర్భాగ్యాన్ని కొనితెచ్చుకున్నాడు.

103. ప్రాపంచిక జీవితంలో విశ్వాసులు అడుగడుగునా పరీక్షించబడతారు. ధర్మపథంలో ముందుకు సాగుతున్న వారి జీవన రథానికి అవిశ్వాసుల తరఫున ఎన్నో అవరోధాలు కల్పించబడతాయి. అటకాయింపులు జరుగుతాయి. ధర్మంపట్ల, పరలోకం పట్ల అవగాహనలేని వారు వారిని ఆట పట్టిస్తారు. చులకనగా మాట్లాడతారు. ఈ పరీక్షలో నెగ్గుకువచ్చేవారే ధన్యులు. కొంతమంది బలహీన విశ్వాసం కలవారు ఈ నిందారోపణలకు, వ్యతిరేకతలకు తట్టుకోలేక కొన్ని విషయాల్లో రాజీపడిపోతారు. ఉదాహరణకు : గడ్డం పెంచటం, పరదాను పాటించటం, ఇస్లామేతర ఆచారాలను పరిత్యజించటం మొదలగు విషయాల్లో వారు 'జారి'పోతుంటారు. అయితే ఒకరి పరిహాసాలను, అభ్యంతరాలను ఏమాత్రం లెక్కచేయకుండా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త విధేయతకు కట్టుబడుతూ, ధర్మావలంబన విషయంలో ఖచ్చితంగా వ్యవహరించేవారు ధన్యజీవులు. అలాంటి ధన్య జీవులకు అల్లాహ్ ప్రళయదినాన గొప్ప పుణ్యఫలం ప్రసాదిస్తాడు. అంతిమ విజయం సాధించటంలో వారికి తోడ్పడుతాడు. అల్లాహ్ మనల్ని కూడా ఆ ధన్య జీవుల కోవలో చేర్చుగాక!

104. అంటే మనుషుల కర్మలను, వారి వయసులను గురించి లిఖించే దైవదూతలన్నమాట. లేక గణాంక వివరాలలో

114 అల్లాహ్ అంటాడు: "నిజంగానే మీరు చాలా కొద్ది సమయమే అక్కడ ఉన్నారు. ఈ సంగతిని మీరు ముందే గ్రహిస్తే ఎంత బావుండేది![105]

قٰلَ اِنْ لَّبِثْتُمْ اِلَّا قَلِيْلًا لَّوْ اَنَّكُمْ كُنْتُمْ تَعْلَمُوْنَ ﴿١١٤﴾

115 "మేము మిమ్మల్ని ఏదో ఆషామాషీగా (అర్థరహితంగా) పుట్టించామనీ, మీరు మా దగ్గరకు మరలిరావటం అనేది జరగని పని అని అనుకున్నారా?"

اَفَحَسِبْتُمْ اَنَّمَا خَلَقْنٰكُمْ عَبَثًا وَّاَنَّكُمْ اِلَيْنَا لَا تُرْجَعُوْنَ ﴿١١٥﴾

116 అల్లాహ్‌యే నిజమైన సార్వభౌముడు. ఆయన మహోన్న తుడు.[106] ఆయన తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడు. మహోన్నత పీఠానికి ఆయనే అధిపతి.[107]

فَتَعٰلَى اللّٰهُ الْمَلِكُ الْحَقُّ ۚ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ ۚ رَبُّ الْعَرْشِ الْكَرِيْمِ ﴿١١٦﴾

117 ఎవడైనా, తన దగ్గర ఏ ప్రమాణమూ లేకపోయినప్పటికీ- అల్లాహ్‌తో పాటు వేరొక దేవుణ్ణి మొరపెట్టుకుంటే, అటువంటి వ్యక్తి లెక్క అతని ప్రభువు వద్ద ఉన్నది. నిశ్చయంగా అవిశ్వాసులు సఫలురు కాలేరు.[108]

وَمَنْ يَّدْعُ مَعَ اللّٰهِ اِلٰهًا اٰخَرَ ۙ لَا بُرْهَانَ لَهٗ بِهٖ ۙ فَاِنَّمَا حِسَابُهٗ عِنْدَ رَبِّهٖ ؕ اِنَّهٗ لَا يُفْلِحُ الْكٰفِرُوْنَ ﴿١١٧﴾

118 (ఓ ప్రవక్తా!) ఇలా ప్రార్థించు: "నా ప్రభూ! క్షమించు. కనికరించు. కనికరించే వారందరిలోకెల్లా నీవు ఉత్తముడవు."

وَقُلْ رَّبِّ اغْفِرْ وَارْحَمْ وَاَنْتَ خَيْرُ الرّٰحِمِيْنَ ﴿١١٨﴾

వారు ఆరితేరినవారు. ప్రళయదినం నాటి భయంకర స్థితి చూశాక ప్రాపంచిక జీవితం వారికి బుద్బుధప్రాయం అనిపిస్తుంది. మహా అయితే ఒక దినమో లేక అందులో సగభాగమో ప్రపంచంలో ఉండి ఉంటామని వారు తలపోస్తారు. తాము చెప్పేది ఒకవేళ నిజం కాకపోతే సరిగ్గా లెక్క వేసిన దైవదూతలను అడిగి తెలుసుకోమని అంటారు.

105. పరలోక శాశ్వత జీవితంతో పోల్చుకుంటే ఇహలోక జీవితం బహు స్వల్ప సమయమే మరి. కాని ఈ వాస్తవాన్ని మీరు ఇహలోక జీవితంలో తెలుసుకోలేదు. మీరు గనక ముందే ఈ సత్యాన్ని తెలుసుకుని ఉంటే ఈ రోజు మీరు కూడా విశ్వాసులైన నా దాసుల సరసన ఉండేవారు అని అల్లాహ్ అవిశ్వాసులకు చురక అంటిస్తాడు.

106. మిమ్మల్ని నిరర్థకంగా, అల్లాటప్పాగా ఆయన పుట్టించలేదు. కాబట్టి మీరు ఇష్టారాజ్యం చేసినా మిమ్మల్ని నిలదీసి అడిగేవాడు ఎవడూ లేడని అనుకోకండి. ఆయన ఒక లక్ష్యంతో మీకు జీవితం ప్రసాదించాడు. అదే దైవారాధన. అందుకే ఆయనే ఆరాధ్య దైవమనీ, ఆయన తప్ప మరో పూజనీయుడు లేడని చెప్పటం జరిగింది.

107. **'అర్ష్'** (عَرْش) సింహాసన సుగుణం ఇక్కడ ప్రస్తావించబడింది. అక్కణ్ణుంచే కారుణ్యం, శుభాలు అవతరిస్తాయి.

108. పరలోకంలో ప్రభువు ఆగ్రహానికి గురికాకుండా ఉండటమే సిసలైన మోక్షం అని దీన్నిబట్టి విదితమవుతోంది. కేవలం ప్రాపంచిక భోగభాగ్యాలు, ప్రాపంచిక పదవులు సాఫల్యానికి, మోక్షానికి ప్రతీకలు కావు. ఈ భాగ్యాలు ప్రపంచంలో అవిశ్వాసులకు కూడా పుష్కలంగా లభ్యమైనాయి. 'కాని వారు మోక్షం పొందరు' అని అల్లాహ్ స్పష్టంగా చెప్పేయటాన్నిబట్టి ప్రాపంచిక ఆస్తులు అంతస్థులు మోక్ష సాధనాలు కావని తేలిపోయింది. పరలోక సాఫల్యానికి ప్రధాన సాధనాలు విశ్వాసం మరియు సదాచరణలే.

24 వ సూరా

# అన్ నూర్

## కాంతి

అవతరణ మదీనాలో

ఆయతులు 64

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ఇస్లామీయ ఆదేశాలను, ఇస్లామీయ నడవడికను నొక్కి చెప్పింది. ఈ బోధనలు వ్యక్తిగతంగాను, సాముదాయికంగాను ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఎంతయినా అవసరమైనవి. ఇందులో మనిషి నడవడిక, వ్యవహారశైలి ఎలా ఉండాలన్నది సుబోధకం చేయబడింది. కుటుంబం సమాజానికి పునాదిగా పేర్కొనబడింది. ఆరోగ్యవంతమైన సమాజానికి అత్యవసరమైన నైతిక ప్రమాణాలను ఈ సూరా మానవాళికి అందించింది. ఈ నైతికప్రమాణాలు సమాజంలోని రుగ్మతలను, చెడులను తొలగించి ఒక ఉత్తమ సమాజ స్థాపనకు తోడ్పడే సూత్రాలు. నైతిక పతనాన్ని, విచ్చలవిడి వ్యవహారశైలిని, అరాచకాన్ని ఈ సూత్రాలు నిర్మూలిస్తాయి. ఈ సూత్రాలలో ముఖ్యమైనవి లైంగికపరమైన నేరాలకు పాల్పడేవారికి, అపవాదులు సృష్టించేవారికి సంబంధించినవి. ఇలాంటి వారిని తీవ్రంగా శిక్షించాలని ఈ సూరాలో చెప్పడం జరిగింది.

ఈ సూరాలో అల్లాహ్ సృజనాత్మక శక్తిసామర్థ్యాల గురించి క్లుప్తమైన వివరణ, అల్లాహ్ ఒకే ఒక్కడని నిరూపించే వివరణ కూడా లభిస్తుంది. అల్లాహ్ మేఘాలను నెమ్మదిగా కదిలేలా చేస్తాడు. ఆ పిదప వాటిని ఒకచోట గుమిగూడేలా, వర్షించేలా చేస్తాడు. భారీ మేఘాలను, ఉరుములు పిడుగులతో కూడిన మేఘాలను ఆయన పంపగలడు. ఆయన రాత్రింబవలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చేలా చేస్తాడు. అల్లాహ్ ప్రతి ప్రాణిని నీటి నుంచి సృష్టించాడు. తమ పొట్టలతో పాకే జంతువులను, రెండుకాళ్ళతో నడిచే జంతువులను, నాలుగు కాళ్ళతో నడిచే జంతువులను అన్నింటిని సృష్టించింది ఆయనే.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 11-17 | 337 | 'విశ్వాసుల మాతపై కపటుల నీలాప నిందలు' | నిత్యం దైవప్రవక్త ముహమ్మద్ (స)ను బాధించేందుకు అవకాశాల కోసం ఎదురుచూసే కపటులు ఒకానొక సందర్భంలో కేవలం దురనుమానంతో ఆయన సతీమణి ఆయిషా (ర)పై నీలాపనిందలకు పాల్పడ్డారు. అయితే అల్లాహ్ ఆకాశ లోకాల నుంచి ఆయిషా(ర) గారి నిర్దోషిత్వాన్ని ప్రకటించాడు. ఈ సంఘటన కపట విశ్వాసులకు తగిన గుణపాఠం నేర్పింది. |

## అన్ నూర్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** ఇది మేము అవతరింపజేసిన (ఒక) సూరా.[2] మరి మేమే దానిని విధించాము. మీరు జ్ఞాపకముంచుకునేందుకు, అందులో మేము స్పష్టమైన ఆయతులను (ఆజ్ఞలను) అవతరింపజేశాము.

**2** వ్యభిచారం చేసే స్త్రీ, వ్యభిచారం చేసే పురుషుడు–వారిద్దరిలో ఒక్కొక్కరికి నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి.[3] మీరు అల్లాహ్‌పై, అంతిమదినంపై విశ్వాసం గలవారే అయితే వారిపై దైవాజ్ఞను (షరీయతు ప్రకారం శిక్షను) విధించేటప్పుడు మీకు ఎంతమాత్రం

## سُورَةُ النُّورِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

سُورَةٌ أَنزَلْنَاهَا وَفَرَضْنَاهَا وَأَنزَلْنَا فِيهَا آيَاتٍ بَيِّنَاتٍ لَّعَلَّكُمْ تَذَكَّرُونَ ①

الزَّانِيَةُ وَالزَّانِي فَاجْلِدُوا كُلَّ وَاحِدٍ مِّنْهُمَا مِائَةَ جَلْدَةٍ ۖ وَلَا تَأْخُذْكُم بِهِمَا رَأْفَةٌ فِي دِينِ اللَّهِ إِن كُنتُمْ تُؤْمِنُونَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۖ وَلْيَشْهَدْ

---

1. నూర్ సూరా, నిసా సూరా, అహ్‌జాబ్ సూరా – ఈ మూడు సూరాలలో స్త్రీలకు సంబంధించిన చాలా ముఖ్యమైన విషయాలు, సామాజిక నియమాలు, కట్టుబాట్లు వివరించబడ్డాయి.

2. ఆ మాటకొస్తే దివ్య ఖుర్‌ఆన్‌లోని సూరాలన్నీ అల్లాహ్ అవతరింపజేసినవే. కాని ఈ సూరా గురించి ఆయన ప్రత్యేకంగా ఇలా అన్నాడంటే ఇందులో వివరించబడిన ఆదేశాలను గురించి ముస్లింలకు మరింత గట్టిగా నొక్కిచెప్పాలన్నది ఆయన అభిమతం అన్నమాట.

3. సిగ్గుమాలిన పనికి పాల్పడిన వారికి విధించబడే శిక్ష గురించి ఇంతకుముందు నిసా సూరా (15వ ఆయతు)లో స్థూలంగా చెప్పటం జరిగింది. దేవుని తరఫున స్పష్టమైన నిర్ణయం జరిగే వరకూ వారిని ఇళ్లలో నిర్బంధించి ఉంచండి అని అక్కడ చెప్పబడింది. కాని నూర్ సూరాలోని ఈ ఆయతు అవతరించగానే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రకటించారు : "అల్లాహ్ తాను చేసిన వాగ్దానం ప్రకారం వ్యభిచారానికి పాల్పడిన స్త్రీ పురుషులకు ప్రత్యేకమైన శిక్షను నిర్ధారించాడు. దాన్ని ఎలా అమలు పరచాలో మీరు నా దగ్గర నేర్చుకోండి. అదేమంటే, వ్యభిచారం చేసినవారు అవివాహిత స్త్రీ పురుషులైతే వారికి నూరేసి కొరడా దెబ్బల చొప్పున కొట్టండి. ఆ పని చేసినవారు వివాహిత స్త్రీ పురుషులైతే నూరేసి కొరడా దెబ్బలతోపాటు రాళ్లు రువ్వే శిక్షను కూడా అమలుపరచండి" (సహీహ్ ముస్లిం – కితాబుల్ హుదూద్. వస్సునన్). ఆ తరువాత ఆయన (స) వివాహితులైన వ్యభిచారులకు రాళ్లు రువ్వే (రజమ్) శిక్షను అమలు పరిచారు. నూరు కొరడా దెబ్బల (స్వల్ప) శిక్ష కూడా అందులో వచ్చేసింది. కాబట్టి ఇప్పుడెవరయినా వివాహం తరువాత కూడా వ్యభిచారానికి పాల్పడితే కేవలం శిలాశిక్ష (రజమ్) మాత్రమే ఉంటుంది. మహాప్రవక్త (సఅసం) తదనంతరం మార్గదర్శక ఖలీఫాల కాలంలోనూ, సహాబీల (రజి) కాలంలోనూ ఈ శిక్షే అమలుపరచబడింది. ఆ తరువాత ఇస్లామీయ విద్వాంసులు, ధర్మవేత్తలంతా ఈ శాసనంతో ఏకీభవించారు. ఇప్పటికీ ఈ విషయంలో వారందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. ఒక్క ఖవారిజ్ వర్గం మాత్రం దీన్ని నిరాకరించింది. భారత ఉపఖండంలో ఇప్పటికీ ఈ చట్టంతో విభేదించేవారు కొందరున్నారు. ఈ శిక్షను నిరాకరించటమంటే మౌలికంగా హదీసులను నిరాకరించటమే. ఎందుకంటే ప్రామాణికమైన (సహీహ్), దృఢమైన (ఖవీ) హదీసుల ద్వారా రాళ్లు రువ్వే శిక్ష రూఢీ అవుతోంది. ఈ హదీసులను ఉల్లేఖించిన వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారు. అందువల్ల ధర్మం (దీన్)లో హదీసుకు గల ప్రాముఖ్యాన్ని, షరీయతు మూలాలను గురించి తెలిసిన వ్యక్తి ఎవరూ రాళ్లు రువ్వే శిక్షను త్రోసిపుచ్చడు.

عَذَابَهُمَا طَآئِفَةٌ مِّنَ الْمُؤْمِنِينَ ②

జాలి కలగకూడదు.[4] పైగా వారిని శిక్షించే సమయంలో ముస్లిం లలో కొంతమంది అక్కడ ఉండాలి.[5]

اَلزَّانِىۡ لَا يَنۡكِحُ اِلَّا زَانِيَةً اَوۡ مُشۡرِكَةً  وَّالزَّانِيَةُ لَا يَنۡكِحُهَاۤ اِلَّا زَانٍ اَوۡ مُشۡرِكٌ‌ ۚ وَحُرِّمَ ذٰ لِكَ عَلَى الۡمُؤۡمِنِيۡنَ ③

**3** వ్యభిచారి అయిన పురుషుడు వ్యభిచారం చేసే స్త్రీని లేక ముష్రిక్కు స్త్రీని తప్ప మరెవరినీ వివాహమాడలేడు. అలాగే వ్యభిచారానికి పాల్పడే స్త్రీ కూడా వ్యభిచారం చేసే పురుషుడిని లేక ముష్రిక్కు మగాణ్ణి తప్ప వేరితరులను మనువాడజాలదు. విశ్వాసుల కొరకు ఇది నిషేధించబడింది.[6]

وَالَّذِيۡنَ يَرۡمُوۡنَ الۡمُحۡصَنٰتِ ثُمَّ لَمۡ يَاۡتُوۡا بِاَرۡبَعَةِ شُهَدَآءَ فَاجۡلِدُوۡهُمۡ ثَمٰنِيۡنَ جَلۡدَةً وَّلَا تَقۡبَلُوۡا لَهُمۡ شَهَادَةً اَبَدًا‌ ۚ وَاُولٰۤـئِكَ هُمُ الۡفٰسِقُوۡنَ ④

**4** శీలవతులైన స్త్రీలపై అపనిందను మోపి, దానికి సంబంధించిన నలుగురు సాక్షుల్ని తీసుకురాలేని వారికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి. ఇక మీదట ఎన్నడూ వారి సాక్ష్యాన్ని ఆమోదించకండి. వారు అవిధేయులు.[7]

4. అంటే దుర్మార్గులపై జాలితో శిక్షను ఉపసంహరించుకోవటంగానీ, సడలించటంగానీ చేయకండి. స్వాభావికంగా ఇక్కడ దయాదాక్షిణ్యాలను కనబరచటమంటే అది విశ్వాస (ఈమాన్) బలహీనతే.

5. బహిరంగంగా శిక్షను అమలుపరచటంలోని ప్రధాన ఉద్దేశం ఆ సంఘటన ద్వారా ప్రజాబాహుళ్యం గుణపాఠం గ్రహించాలన్నదే! సమాజంలో పరివర్తన రావాలన్నదే!! కాని దురదృష్టవశాత్తు నేడు ఇలాంటి బహిరంగ శిక్షలను క్రూరత్వానికి, రాక్షసత్వానికి ప్రతీకగా చిత్రీకరించటం జరుగుతోంది. ఈ ఆలోచన పసలేనిది. అజ్ఞానంతో కూడుకున్నది. పైగా ఇది దైవాదేశాలపై తిరుగుబాటుకు ఆనవాలు వంటిది. ఈ చట్టాన్ని ఆటవిక చట్టంగా అభివర్ణించేవారు, తాము మానవత పాలిట దేవునికన్నా గొప్ప దయార్ద్ర హృదయులుగా నిరూపించుకోగోరుతున్నారన్నమాట! వాస్తవానికి దేవునికన్నా గొప్ప క్షమాశీలి, దయాశీలి ఎవరుంటారు?

6. ఈ వాక్యంలోని భావార్థంపై విద్వాంసుల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ఒక వర్గం అభిప్రాయం ఇది –

"ఇక్కడ వివాహం అంటే షరీయతు ప్రకారం జరిగే వివాహం (నికాహ్) కాదు. కేవలం లైంగిక సంబంధం మాత్రమే. వ్యభిచారం యొక్క నైచ్యాన్ని వివరించటం అసలు ఇక్కడ ముఖ్యోద్దేశం. దీనిభావం ఏమిటంటే దుర్నడత గల మగాడు తన లైంగిక వాంఛలను అక్రమ పద్ధతిలో తీర్చుకోవడానికి చెడిపోయిన ఆడదాని వద్దకు పోతాడు. అలాగే చెడిపోయిన ఆడది చెడిపోయిన మగాడి వైపుకు అర్రులు చాస్తుంది. అయితే విశ్వాసులకు మాత్రం ఇలా చేయటం ముమ్మాటికీ నిషిద్ధం. ఇక్కడ ముష్రిక్కు స్త్రీ, ముష్రిక్కు పురుషుడు అని ప్రత్యేకంగా ప్రస్తావించటాన్నిబట్టి విదితమయ్యే దేమిటంటే 'షిర్క్' కూడా వ్యభిచారాన్ని పోలినదే. ఒక ముష్రిక్కు ఏవిధంగా అల్లాహ్‌ను వదలి అన్యుల వైపుకు మొగ్గుతాడో అదే విధంగా పరాయి స్త్రీల రుచి మరిగిన ఒక వ్యభిచారి (మగవాడు) తన అర్థాంగిని విడిచి పరాయి స్త్రీల కోసం పరుగులు తీస్తాడు. అలాగే వ్యభిచారిణి అయిన స్త్రీ తన భర్తను కాదని పరాయి మగాళ్ళతో కులుకుతుంది. ఈ విధంగా ముష్రిక్కులకు – వ్యభిచారులకు మధ్య ఒక విచిత్రమైన పోలిక ఉంది.

రెండవ వర్గం అభిప్రాయం ఇలా వుంది :

"ఈ వాక్యం యొక్క భావం ఏమిటంటే అడ్డదారులు తొక్కే వారు సాధారణంగా తమలాంటి జీవిత భాగస్వాములనే ఇష్టపడతారు. అలాగే ఇస్లాం ఈ సందర్భంగా ముస్లింలను అప్రమత్తం చేయదలచింది. వ్యభిచారం పరమ నీచమైన చేష్ట, పాపకార్యం అయినట్లే వ్యభిచారులతో వైవాహిక సంబంధాలు ఖాయం చేసుకోవటం కూడా నిషిద్ధమే. ఇమామ్ షౌకానీ ఈ అభిప్రాయం వైపు మొగ్గుచూపారు. హదీసుల ద్వారా కూడా ఈ అభిప్రాయానికి సమర్థన లభిస్తోంది. వ్యభిచారిణులైన స్త్రీలను వివాహమాడటానికి కొంతమంది ప్రవక్త సహచరులు (రజి) అనుమతి కోరగా ఈ ఆయతు అవతరించింది. అంటే అలా చేయరాదని వారికి తాకీదు చేయబడింది. దీని ఆధారంగా పండితులేమన్నారంటే

5 అయితే ఆ తరువాత ఎవరు పశ్చాత్తాపం చెంది, తమ ప్రవర్త నను సరిదిద్దుకుంటారో[8] (అలాంటి వారిని) అల్లాహ్ క్షమిస్తాడు, కరుణిస్తాడు.

إِلَّا الَّذِينَ تَابُوا مِنۢ بَعْدِ ذَٰلِكَ وَأَصْلَحُوا
فَإِنَّ اللَّهَ غَفُورٌ رَّحِيمٌ ⑤

6 ఎవరయినా తమ భార్యలపై (అక్రమ సంబంధపు) నిందమోపి, దానికి స్వయంగా తాము తప్ప మరెవరూ సాక్షులు లేని పక్షంలో వారిలో ప్రతి ఒక్కరూ నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, తాను చెప్పేది నిజం అని పలకాలి (అదే వారి సాక్ష్యం).

وَالَّذِينَ يَرْمُونَ أَزْوَاجَهُمْ وَلَمْ يَكُن لَّهُمْ شُهَدَاءُ
إِلَّا أَنفُسُهُمْ فَشَهَادَةُ أَحَدِهِمْ أَرْبَعُ شَهَادَاتٍۭ بِاللَّهِ ۙ
إِنَّهُ لَمِنَ الصَّادِقِينَ ⑥

7 అయిదవసారి – 'ఒకవేళ తాను చెప్పేది అబద్ధమైతే తనపై అల్లాహ్ శాపం పడుగాక!'[9] అని చెప్పాలి.

وَالْخَامِسَةُ أَنَّ لَعْنَتَ اللَّهِ عَلَيْهِ إِن كَانَ
مِنَ الْكَاذِبِينَ ⑦

8 ఇక ఆ స్త్రీ శిక్ష నుంచి బయటపడే మార్గం ఏమిటంటే, ఆమె నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, 'తన భర్త చెప్పేది అబద్ధం' అని పలకాలి.

وَيَدْرَؤُا عَنْهَا الْعَذَابَ أَن تَشْهَدَ أَرْبَعَ شَهَادَاتٍۭ
بِاللَّهِ ۙ إِنَّهُ لَمِنَ الْكَاذِبِينَ ⑧

ఒక మగాడు ఒక ఆడదానితో అక్రమ సంబంధం పెట్టుకున్నా లేక ఒక ఆడది ఒక మగాడితో వ్యభిచరించినా – వారిద్దరూ పరస్పరం నికాహ్ చేసుకోవటం సమ్మతం కాదు. అయితే వారిద్దరూ బాహాటంగా, చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో పవిత్ర జీవితం గడపదలిస్తే అట్టి పరిస్థితిలో వారి మధ్య నికాహ్ (వివాహం) ధర్మసమ్మతం అవుతుంది (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

7. ఈ ఆయతులో అపనిందకు విధించవలసిన శిక్ష తెలుపబడింది. సౌశీల్యవతులైన స్త్రీలపై నీలాపనిందలు మోపటం ఎంతపెద్ద పాపమో దీనిద్వారా తెలుస్తోంది. అలాగే ఏ పాపం ఎరుగని పురుషులకు అక్రమ సంబంధాన్ని అంటగట్టడం కూడా మహా పాపమే. ఈ అపనిందను మోపేవారు పురుషులైనా, స్త్రీలైనా సరే–వారు గనక తమ నిందారోపణకు ఆధారంగా నలుగురు సాక్షుల్ని హాజరుపరచలేని పక్షంలో వారు మూడు విధాలుగా శిక్షార్హులు: 1. వారికి 80 కొరడా దెబ్బలు వడ్డించాలి. 2. ఇక మీదట ఎన్నడూ వాళ్ల సాక్ష్యాల్ని పరిగణనలోకి తీసుకోకూడదు. 3. వారు దేవుని సన్నిధిలోనూ, ప్రజల దృష్టిలోనూ దుష్టులుగా పరిగణించబడతారు.

8. పశ్చాత్తాపం చెందినంతమాత్రాన కొరడా దెబ్బల శిక్షనుంచి వారు తప్పించుకోలేరు. ఆ శిక్ష ఎలాగూ పడుతుంది. మిగిలిన రెండు శిక్షల విషయం (అంటే వారి సాక్ష్యాల్ని ఆమోదించకూడదు. 2. వారు అవిధేయులుగా పరిగణించ బడతారు)లో ద్వంద్వాభిప్రాయం ఉంది. పశ్చాత్తాపంచెందిన తరువాత వారు 'అవిధేయులు' కారు అని కొంత మంది విద్వాంసులు అంటున్నారు. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం వారి సాక్ష్యాలు కూడా పశ్చాత్తాపం తరువాత ఆమోదించబడతాయి. ఇమామ్ షౌకానీ ఈ రెండవ అభిప్రాయాన్నే సమర్థించారు. మూలంలోని 'ఎన్నడూ' (అబదన్) అనే పదానికి ఆయన "అపనిందలు మోపుతూ ఉన్నంత కాలం వరకు" అని భాష్యం చెప్పారు.

9. ఈ ఆయతుల్లో **'లిఆన్'** పద్ధతి తెలుపబడింది. భర్త తన భార్యను పరాయి మగాడితో తప్పుడు పనిచేస్తుండగా తన కళ్లారా చూశాడనుకోండి – అక్రమ లైంగిక సంబంధం ఏర్పరచుకున్నందుకు శిక్ష విధించాలంటే ప్రత్యక్షంగా చూసినట్లు నలుగురు సాక్షుల్ని తీసుకురావాలి. తాను గాకుండా మరో ముగ్గురు సాక్షుల్ని సమర్పించనంతవరకూ, తన భార్యను శిక్షించటానికి వీలుపడదు.

అయితే స్వాభిమాని అయిన ఏ భర్తకూడా తన భార్యను పరాయి పురుషునితో కులుకుతుండగా చూసి, ఆ చెడిపోయిన ఆడదానితో కాపురం చేయలేదు. అందుకే ఇస్లామీయ షరీయతు ఈ సమస్యకు 'లిఆన్' రూపంలో పరిష్కారం

وَالْخَامِسَةَ أَنَّ غَضَبَ اللَّهِ عَلَيْهَا إِن كَانَ
مِنَ الصَّادِقِينَ ﴿٩﴾

9 అయిదవసారి – 'ఒకవేళ అతను (తన భర్త) చెప్పేదే నిజమైతే, తనపై అల్లాహ్ ఆగ్రహం పడుగాక!'[9 (అ)] అని చెప్పాలి.

وَلَوْلَا فَضْلُ اللَّهِ عَلَيْكُمْ وَرَحْمَتُهُ وَأَنَّ اللَّهَ
تَوَّابٌ حَكِيمٌ ﴿١٠﴾

10 అల్లాహ్ అనుగ్రహము, ఆయన దయాదాక్షిణ్యాలే గనక మీపైన లేకుండాపోతే[10] (మీరు కష్టాల పాలయ్యేవారు). అల్లాహ్ పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు, వివేకవంతుడు.

إِنَّ الَّذِينَ جَاءُوا بِالْإِفْكِ عُصْبَةٌ مِّنكُمْ ۚ لَا تَحْسَبُوهُ
شَرًّا لَّكُم ۖ بَلْ هُوَ خَيْرٌ لَّكُمْ ۚ لِكُلِّ امْرِئٍ مِّنْهُم
مَّا اكْتَسَبَ مِنَ الْإِثْمِ ۚ وَالَّذِي تَوَلَّىٰ كِبْرَهُ مِنْهُمْ لَهُ
عَذَابٌ عَظِيمٌ ﴿١١﴾

11 ఈ పెద్ద అపనిందను కల్పించి తెచ్చినది[11] కూడా మీలోని ఒక వర్గమే.[12] మీరు దీనిని మీ పాలిట కీడుగా భావించకండి. పైగా ఇది మీ కొరకు మేలైనదే.[13] కాకపోతే (ఈ వ్యవహారంలో), వారిలో ప్రతి ఒక్కరికీ వారు సంపాదించిన దాన్నిబట్టి పాపం లభిస్తుంది. మరి వారిలో చాలా పెద్ద పాత్రను పోషించిన వాడికి మాత్రం మహా శిక్ష పడుతుంది.[14]

చూపింది. అట్టి పరిస్థితిలో ఆ వ్యక్తి న్యాయమూర్తి సమక్షంలోనో లేదా రాజ్యాధికారి సమక్షంలోనో నాలుగుసార్లు దేవునిపై ప్రమాణంచేసి, తన భార్య అక్రమ సంబంధం ఏర్పరచుకుని ఉండగా తాను చూశానని, తాను చెప్పేది పూర్తిగా సత్యం అని చెప్పాలి. ఒకవేళ తాను చెప్పేది అబద్ధమైన పక్షంలో తనపై అల్లాహ్ శాపం పడుగాక! అని పలకాలి.

9.(అ) భర్త పలికిన సాక్ష్యానికి సమాధానంగా భార్య నాలుగుసార్లు దేవునిపై ప్రమాణం చేసి, అతను చెప్పేది అబద్ధమని అనాలి. అయిదవసారి – ఒకవేళ తన భర్త నిందారోపణలో సత్యవంతుడైతే (నేను చెప్పేది అబద్ధమైతే), నాపై దైవాగ్రహం విరుచుకుపడుగాక! అని పలకాలి. ఇట్టి పరిస్థితిలో ఆమె వ్యభిచార శిక్షనుంచి బయట పడగలదు. ఆ తరువాత వారిద్దరి మధ్య–శాశ్వితంగా–వేర్పాటు జరిగిపోతుంది. ఈ పద్ధతిని 'లిఆన్' అని ఎందుకన్నారంటే– ఇందులో ఇరువురు వ్యక్తులూ (భార్యాభర్తలు) తాము చెప్పేది అబద్ధమైన పక్షంలో తాము దేవుని శాపానికి పాత్రులం అని ఖరారు చేస్తారు. అంతిమ దైవప్రవక్త(స) కాలంలో ఇలాంటి సంఘటనలు కొన్ని ఎదురయ్యాయి. హదీసులలో అవి వివరంగా వచ్చాయి. ఆ సంఘటనలే ఈ దైవాదేశాల అవతరణకు కారణభూతమయ్యాయి.

10. దీని భావం ఏమిటంటే అల్లాహ్ అపార కరుణామయుడు గనకనే ఈ లోకం ముందుకు సాగుతోంది. ఆయనే గనక తలచుకుంటే అబద్ధం చెప్పిన వ్యక్తిపై అప్పటికప్పుడే ఆగ్రహం చెందేవాడు. కాని ఆయన అత్యంత దయామయుడు. పశ్చాత్తాపం చెందేందుకు అవకాశం ఇచ్చాడు. నిష్కల్మషమైన మనసుతో చెందే పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తానని హామీ ఇచ్చాడు. ఆయన తన దాసుల తప్పులను మరుగుపరుస్తాడు. చేసిన తప్పుకు సిగ్గుతో కుంచించుకుపోయి, క్షమాభిక్ష వేడుకునే వారిని ఆయన తన కారుణ్యంతో కప్పేస్తాడు. అదే సమయంలో ఆయన వివేచనాపరుడు కూడా. ఈ 'లిఆన్' పద్ధతి ద్వారా ఆయన పౌరుషం గల మగవాళ్ల కోసం అత్యుత్తమమైన పరిష్కార మార్గాన్ని ప్రతిపాదించాడు.

11. ఇది **'ఇఫ్క్ సంఘటన'**గా ప్రసిద్ధికెక్కింది. ఆ కాలంలోని కపటులు మహాప్రవక్త (సఅసం) ధర్మపత్ని అయిన హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పై అపనిందను మోపి, ఆమెను కళంకితురాలిగా చిత్రించటానికి కుట్రపన్నారు. అయితే అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో హజ్రత్ ఆయిషా (ర.అన్హా)ను నిర్దోషిగా ప్రకటించి, ఆమె సౌశీల్యాన్ని స్వయంగా ధృవీకరించాడు.

**ఈ సంఘటన పూర్వాపరాలివి** : పరదా ఆజ్ఞలు అవతరించిన తరువాత జరిగిన సంఘటన అది. మహాప్రవక్త (స) బనీ ముస్తలిఖ్ వారితో యుద్ధంచేసి, తన సైనిక సమూహంతో సహా మదీనాకు తిరిగి వస్తున్నారు. మదీనా నగరం

| | |
|---|---|
| **12** దాన్ని గురించి వినగానే విశ్వాసులైన స్త్రీ పురుషులు తమ వారిపట్ల మంచి తలంపుతో, "ఇది పచ్చి అభాండం"[15] అని ఎందుకనలేదు? | لَوْلَآ إِذْ سَمِعْتُمُوهُ ظَنَّ ٱلْمُؤْمِنُونَ وَٱلْمُؤْمِنَٰتُ بِأَنفُسِهِمْ خَيْرًا وَقَالُوا۟ هَٰذَآ إِفْكٌ مُّبِينٌ ﴿12﴾ |

మరికొంత దూరంలో ఉండగా సాయంత్రం ఒకచోట విడిది చేశారు. ఈ ప్రయాణంలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కూడా మహాప్రవక్త (స) వెంట ఉన్నారు. తెల తెల వారుతుండగా పయనబృందం బయలుదేరింది. హజ్రత్ ఆయిషా (ర.అ)గారి అంబారీని బిడారులోని కొందరు ఒంటెపై పెట్టారు. కాని ఆమెగారు ఆ అంబారీలో లేరు. కాలకృత్యాల కోసం వెళ్ళినప్పుడు తాను పోగొట్టుకున్న కంఠహారాన్ని వెతకటంలో ఆమె నిమగ్నమై ఉన్నారు. ఈ లోగా ప్రయాణబృందం ముందుకు సాగిపోయింది. తీరా ఆమెగారు తిరిగి వచ్చిచూస్తే అక్కడ ఎవరూ లేరు. తాను అంబారీలో లేనన్న సంగతిని తెలుసుకున్నప్పుడు వాళ్ళే తనను వెతుక్కుంటూ తిరిగివస్తారని బీబీ ఆయిషా (ర.అ) తలపోసి, అక్కడే దుప్పటి కప్పుకుని నిద్రపోయారు. కాస్సేపటికి సఫ్వాన్ బిన్ ముఅత్తల్ సులమీ (రజి) అక్కడికి వచ్చారు. ప్రయాణీకులు వెనుక మరచిపోయిన వస్తువులను సేకరించుకుని వచ్చే బాధ్యత ఆయనగారికి అప్పగించబడింది. ఆయనగారు పరదా ఆజ్ఞలు రాకముందు బీబీ ఆయిషా (ర.అన్హా)ను చూసి ఉన్నారు. అందువల్ల ఆయన ఆమెను గుర్తుపట్టి "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్" అని పలకగానే ఆమె వచ్చి ఒంటెపై కూర్చున్నారు. సఫ్వాన్ మాత్రం ఒంటె ముకుతాడు పట్టుకుని నడవసాగారు. మధ్యాహ్నానికల్లా వారు బిడారులోకి వచ్చి చేరగలిగారు.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) సఫ్వాను ఒంటెపై కూర్చొని రావటం చూసిన కపటులు దీన్ని అదనుగా తీసుకుని విజృంభించారు. కపటుల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబై పరమ దుర్మార్గుడు. ఈ సంఘటనను సాకుగా తీసుకుని దుష్ప్రచారం మొదలెట్టాడు. ఈ ఏకాంతం, ఈ వేర్పాటు కాకతాళీయంగా జరిగింది కాదని చెప్పి, దాన్ని చిలవలు పలువలు చేసి కథలల్లాడు. వాస్తవానికి హజ్రత్ ఆయిషా గానీ, సఫ్వాన్ గానీ ఏ పాపం ఎరుగరు. కొంతమంది విధేయులైన ముస్లింలు కూడా కపటులు సాగించిన ఈ దుష్ప్రచార ప్రభావానికి లోనయ్యారు. హజ్రత్ హస్సాన్, మిస్తహ్ బిన్ అసాస, హమ్నా బిన్తె జహష్ వారిలో కొందరు. (ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సహీహ్ హదీసులలో ఉన్నాయి.) వదంతులు దావానలంలా వ్యాపింపజేయబడ్డాయి. మహాప్రవక్త (స) వారి మనసు నొచ్చుకుంది. అల్లాహ్ ఈ అపనిందలోని నిజానిజాలను తెలిపే వరకూ – సుమారు ఒక నెల రోజుల వరకూ – మహాప్రవక్త (స) తీవ్రమైన మనస్తాపానికి గురయ్యారు. మరోవైపు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఏడ్చి ఏడ్చి అస్వస్థతకు లోనయ్యారు. ఎట్టకేలకు అల్లాహ్ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) సౌశీల్యాన్ని గురించి స్పష్టమైన వాక్యాలను పంపి, కపటుల కపట చేష్టలను బయట పెట్టాడు. కపటుల మాయాజాలంలో పడి, సాక్షాత్తూ దైవప్రవక్త సతీమణి శీలాన్నే శంకించిన కొంతమంది ముస్లింలను మందలించాడు.

**'ఇఫ్క్'** అంటే వాస్తవాన్ని వక్రీకరించటం, తలక్రిందులుగా చేసివేయటం అని అర్థం. కపటులు ఈ సంఘటనలోని నిజాలకు మసిపూసి కలుషితం చేయటం వల్ల ఇది 'ఇఫ్క్ సంఘటన'గా ప్రసిద్ధి చెందింది.

12. ఒక వర్గాన్ని, ఒక జట్టును **'ఉస్బతున్' (عُصْبَة)** గా పేర్కొంటారు. ఉస్బతున్ అనే పదంలో బలం, శక్తి అనే అర్థాలు ఉన్నాయి. జట్టులో ఒకరికి మరొకరి ద్వారా బలం చేకూరుతుంది. కాబట్టి దాన్ని 'ఉస్బతున్' అన్నారు.

13. ఈ సంఘటన మూడు విధాలుగా మేలైనది. 1. దీనివల్ల బాధితులకు కలిగిన బాధకుగాను పుణ్యం లభిస్తుంది. 2. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పాతివ్రత్యాన్ని గురించి ఆకాశం నుంచి ప్రకటన గావించబడింది. దానివల్ల ఆమె వంశప్రాశస్త్యం, మర్యాద మరింతగా ఇనుమడించింది. మరోవైపు కపటుల బండారం బయటపడింది. 3. విశ్వాసులకు ఈ సంఘటన గుణపాఠంగా మిగిలింది. నిరాధారమైన ఆరోపణలను తేలిగ్గా నమ్మరాదని, మర్యాదస్తుల, శీలవతుల విషయంలో మరింత బాధ్యతగా మెలగాలని ఇది సూచిస్తోంది.

14. అంటే కపటుల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబైకి అని భావం.

15. ఇక్కణ్ణుంచి విశ్వాసుల శిక్షణ, సంస్కరణకు సంబంధించిన ఉపదేశాలు రాబోతున్నాయి. ముస్లింలు అందరూ ఒకే మార్గంపై నడవవలసినవారు. ఒకే ధర్మాన్ని అవలంబించేవారు. వారంతా ఒకే ప్రాణం వంటివారు. అటువంటి

**13** దీనిపై వారు నలుగురు సాక్షుల్ని ఎందుకు తీసుకురాలేదు? సాక్షుల్ని తీసుకురానందున ఈ నీలాపనిందను మోపినవారు అల్లాహ్ సన్నిధిలో అబద్ధాల కోరులయ్యారు.

لَوْلَا جَاءُوا عَلَيْهِ بِأَرْبَعَةِ شُهَدَاءَ ۚ فَإِذْ لَمْ يَأْتُوا
بِالشُّهَدَاءِ فَأُولَٰئِكَ عِندَ اللَّهِ هُمُ الْكَاذِبُونَ ﴿13﴾

**14** ఇహపరలోకాలలో మీపై అల్లాహ్ అనుగ్రహం, ఆయన దయ గనక ఉండకపోతే ఏ మాటల్లోనయితే మీరు పడిపోయారో, దానికి పర్యవసానంగా, ఓ పెద్ద శిక్ష మిమ్మల్ని చుట్టుకునేదే.

وَلَوْلَا فَضْلُ اللَّهِ عَلَيْكُمْ وَرَحْمَتُهُ فِي الدُّنْيَا
وَالْآخِرَةِ لَمَسَّكُمْ فِي مَا أَفَضْتُمْ فِيهِ عَذَابٌ
عَظِيمٌ ﴿14﴾

**15** (ఎందుకంటే) అప్పుడు మీరు ఆ విషయాన్ని ఆ నోటా ఈ నోటా అందుకుని (వ్యాపింపజేశారు.) మీకు ఏమాత్రం తెలియని విషయాన్ని మీ నోటితో పేలటం మొదలెట్టారు. మీరు దాన్ని చిన్న విషయంగా భావించారు. కాని అల్లాహ్ దృష్టిలో మాత్రం అది చాలా పెద్ద విషయం.

إِذْ تَلَقَّوْنَهُ بِأَلْسِنَتِكُمْ وَتَقُولُونَ بِأَفْوَاهِكُم مَّا لَيْسَ
لَكُم بِهِ عِلْمٌ وَتَحْسَبُونَهُ هَيِّنًا وَهُوَ عِندَ اللَّهِ
عَظِيمٌ ﴿15﴾

**16** అసలు మీరు ఆ మాట వినగానే, "ఇలాంటి మాట చెప్పటం మనకు ఎంత మాత్రం తగదు. ఓ అల్లాహ్! నీవు పరమ పవిత్రుడవు. ఇది మాత్రం పెద్ద అభాండమే" అని ఎందుకు అనలేదు?[16]

وَلَوْلَا إِذْ سَمِعْتُمُوهُ قُلْتُم مَّا يَكُونُ لَنَا أَن نَّتَكَلَّمَ
بِهَٰذَا سُبْحَانَكَ هَٰذَا بُهْتَانٌ عَظِيمٌ ﴿16﴾

శ్రేష్ఠ సమాజ సభ్యులు ఏం చేయాల్సింది? ఇలాంటి వదంతులు పుట్టినప్పుడు తక్షణం ఖండించాల్సింది. అది పచ్చి అబద్ధం అని చెప్పాల్సింది.

16. అపనింద మోపినవారు తమ నిందారోపణకు ఆధారంగా నలుగురు సాక్షుల్ని తీసుకురావలసి ఉండగా ఒక్క సాక్ష్యాన్ని కూడా తేలేదు. అయినప్పటికీ మీరు ఆ నీలాపనిందను మోపిన వారిని అసత్యవాదులుగా ఖరారు చేయలేదు. అందుకే ఈ ఆయతులు అవతరించిన తరువాత హజ్రత్ హస్సాన్, మిస్తహ్, హమ్న బిన్తె జహష్ (రజి అల్లాహు అన్హుం) లకు కొరడా దెబ్బల శిక్ష విధించబడింది (ముస్నదె అహ్మద్- 6, పేజీ - 30; తిర్మిజీ - నెం.3181; అబూ దావూద్ - నెం. 4474; ఇబ్నుమాజా- నెం.2567). కపటుల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబైకి మాత్రం శిక్ష విధించలేదు. ఎందుకంటే వాడికోసం పరలోకంలో విధించబడే శిక్ష తగిన శిక్ష అని భావించబడింది. అదీగాక, ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న విశ్వాసులకు శిక్ష ఇహలోకంలోనే విధించి వారిని పవిత్రుల్ని చేయటం ముఖ్యం. మరోవైపు కపటులందరినీ శిక్షిస్తూ పోతే ముస్లిం సమాజంలో చీలిక వచ్చే అవకాశం ఉంది. ఆ జటిల పరిస్థితులను ఎదుర్కోవటం చాలా కష్టం. అందువల్ల కపటుల సంగతిని అల్లాహ్‌కు అప్పగించి, సంయమనంతో వ్యవహరించటం జరిగింది (ఫత్‌హుల్ ఖదీర్).

ఈ వాక్యాలలో చెప్పబడిన మరో ముఖ్య విషయం ఏమిటంటే దైవానుగ్రహం మీపై ఉండబట్టి సరిపోయింది. లేనిపక్షంలో - నిరాధారమైన ఒక విషయాన్ని మీరు చిలువలు పలువలు చేసిన తీరుకుగాను మీపై దైవాగ్రహం విరుచుకుపడేది. మీరు దిక్కుతోచని స్థితికి లోనుకావలసి వచ్చేది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే వదంతులను గుడ్డిగా నమ్మటం, వాటిని వ్యాపింపజేయటం మహాపరాధం. దీనికిగాను మనిషి తీవ్రమయిన శిక్షకు గురికావలసి ఉంటుంది.

అదీగాక ఈ వ్యవహారం దైవప్రవక్త (సఅసం) పరువు ప్రతిష్ఠలతో, మానమర్యాదలతో ముడిపడినది. ఇంతటి ముఖ్యమైన వ్యవహారాన్ని మీరు చాలా తేలిగ్గా తీసుకున్నారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే ఒకరిపై బలాత్కారం చేయటం, శీలాపహరణం చేయటం మాత్రమే నేరం కాదు, ఒకరి పరువు ప్రతిష్ఠల్ని మంటగలిపేందుకు ప్రయత్నం

يَعِظُكُمُ اللّٰهُ اَنْ تَعُوْدُوْا لِمِثْلِهٖۤ اَبَدًا اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ (17)

17 మీరు నిజమైన విశ్వాసులే అయితే ఇక మీదట ఎన్నడూ ఇలాంటి చేష్టకు పాల్పడరాదని అల్లాహ్ మీకు బోధపరుస్తున్నాడు.

وَيُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ (18)

18 అల్లాహ్ మీకు తన ఆయతులను విశదపరుస్తున్నాడు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేకవంతుడు.

اِنَّ الَّذِيْنَ يُحِبُّوْنَ اَنْ تَشِيْعَ الْفَاحِشَةُ فِى الَّذِيْنَ اٰمَنُوْا لَهُمْ عَذَابٌ اَلِيْمٌ ۙ فِى الدُّنْيَا وَالْاٰخِرَةِ ؕ وَاللّٰهُ يَعْلَمُ وَاَنْتُمْ لَا تَعْلَمُوْنَ (19)

19 ముస్లింలలో అశ్లీలతవ్యాపించాలని కోరుకునేవారికి ప్రపంచం లోనూ, పరలోకంలోనూ వ్యధాభరితమైన యాతన ఉంది.[17] అల్లాహ్‌కు అంతా తెలుసు. కాని మీకు తెలియదు.

وَلَوْلَا فَضْلُ اللّٰهِ عَلَيْكُمْ وَرَحْمَتُهٗ وَاَنَّ اللّٰهَ رَءُوْفٌ رَّحِيْمٌ (20)

20 అల్లాహ్ దయానుగ్రహాలే గనక మీపై లేకపోయినట్లయితే (మీ నిర్వాకానికిగాను ఇప్పటికే శిక్ష అవతరించేది). అల్లాహ్ ప్రేమ మయుడు, కనికరం కలవాడు[18] (కాబట్టి సరిపోయింది).

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَتَّبِعُوْا خُطُوٰتِ الشَّيْطٰنِ ؕ وَمَنْ يَّتَّبِعْ خُطُوٰتِ الشَّيْطٰنِ فَاِنَّهٗ يَاْمُرُ بِالْفَحْشَآءِ

21 ఓ విశ్వాసులారా! షైతాను అడుగు జాడల్లో నడవకండి. షైతాను అడుగు జాడలలో నడిచే వారికి వాడు అశ్లీలతను, చెడు పనులను గురించి మాత్రమే ఆదేశిస్తాడు. అల్లాహ్ చలువ, ఆయన

చేయటం, గౌరవంగా బ్రతికే వారిని రచ్చకీడ్చి బురద చల్లడం, వారి ఇమేజ్‌ని పాడు చేయడానికి కుట్రలు పన్నటం– ఇత్యాదివన్నీ అల్లాహ్ దృష్టిలో మహాపరాధంగా, మహా పాపంగా పరిగణించబడతాయి. కాబట్టి (ఓ ముస్లిములారా!) ఇలాంటి విషయాల్ని చిన్న విషయాలుగా భావించకండి.

అందుకే ఆయతులో ఈ విధంగా అనబడింది –

మహాప్రవక్త ధర్మపత్ని అయిన బీబీ ఆయిషా (ర.అన్హా)పై నిందమోపబడినపుడు, "అసలలాంటి మాటను నోటితో పలకటం కూడా శోభాయమానం కాదు" అని మీరు ఎందుకు చెప్పలేదు. అందుకే ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఇలా వ్యాఖ్యానించారు: సోకాల్డ్ ముస్లింలు ఎవరయినాసరే–ఎప్పుడైనా–బీబీ ఆయిషా (ర.అన్హా) విషయంలో నోరుజారి మాట్లాడితే వారు అవిశ్వాసులు (కాఫిర్లు)గా ఖరారు చేయబడతారు. ఎందుకంటే ఆ శీలవతిని గురించి చెడుగా మాట్లాడటమంటే అల్లాహ్‌ను, ఖుర్‌ఆన్‌ను ధిక్కరించటమే. (ఐసరుత్తఫాసీర్)

17. **'ఫాహిషతున్'** (فَاحِشَة) అంటే నీతిబాహ్యత, అశ్లీలత, సిగ్గుమాలినతనం అన్న అర్థాలు వస్తాయి. దివ్యఖుర్‌ఆన్ వ్యభిచారాన్ని కూడా 'ఫాహిషతున్'గానే పేర్కొంది (బనీ ఇస్రాయీల్). అక్రమ సంబంధాన్ని అంటగట్టే వదంతులను కూడా ఇక్కడ 'నీతిబాహ్యత'గానే అల్లాహ్ అభివర్ణించాడు. పైగా ఇలాంటి చెడుగును వ్యాపింపజేయటం ఇహపర లోకాలలో బాధాకరమైన శిక్షను కొనితెచ్చుకోవటంగా ఖరారు చేశాడు. నీతిబాహ్యతకు సంబంధించిన ఒక అబద్ధాన్ని సమాజంలో వ్యాపింపజేయటమే దైవసన్నిధిలో ఇంత ఘోరమైన నేరమైనప్పుడు, ఒక ముస్లిం సమాజంలో అహోరాత్రులు అశ్లీలాన్ని, చెడును వ్యాపింపజేసే ప్రచార ప్రసార సాధనాలను ఇంటింటికీ చేరవేయటం, ఇంటిల్లిపాదీ అశ్లీల సాహిత్యాన్ని చదవటం, బూతు సినిమాలను, సీరియళ్లను సపరివార సమేతంగా చూచి తరించటం ఇంకెంత ఘోరమైన పాపమో కాస్త ఆలోచించాలి. ఇలాంటి చెడును వ్యాపింపజేసే ఆఫీసులలో, కంపెనీలలో పని చేసేవారు ఈ పాప బాధ్యత నుంచి ఎలా తప్పించుకోగలుగుతారు?

18. మీ వల్ల జరిగిన ఘోరమైన తప్పిదాన్ని అల్లాహ్ క్షమించటం వల్ల మీరు బ్రతికిపోయారు. ఆయనే గనక మీ చేష్టపై ఆగ్రహించి ఉంటే ఈపాటికి మీరేమై ఉండేవారో ఆలోచించండి!?

దాక్షిణ్యం గనక మీపై లేకపోతే మీలో ఎవడూ, ఎన్నటికీ పరిశుద్ధుడు అయ్యేవాడు కాదు. అయితే అల్లాహ్ తాను కోరిన వారిని పరిశుద్ధులుగా చేస్తాడు.[19] అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

وَالْمُنْكَرِ ۗ وَلَوْلَا فَضْلُ اللّٰهِ عَلَيْكُمْ وَرَحْمَتُهٗ
مَا زَكٰى مِنْكُمْ مِّنْ اَحَدٍ اَبَدًا ۙ وَّلٰكِنَّ اللّٰهَ يُزَكِّيْ
مَنْ يَّشَآءُ ۗ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ﴿21﴾

**22** మీలోని ఐశ్వర్యవంతులు, స్థితిమంతులు తమ బంధువులకు, నిరుపేదలకు, అల్లాహ్ మార్గంలో స్వస్థలం వదలి వచ్చిన వారికి 'ఇవ్వబోము' అని ఒట్టేసుకోరాదు. పైగా వారిని క్షమించాలి. (వారి పట్ల) మన్నింపుల వైఖరిని అవలంబించాలి. ఏమిటీ, అల్లాహ్ మిమ్మల్ని క్షమించాలని మీరు అభిలషించరా?[20] అల్లాహ్ మాత్రం (తప్పులను) క్షమించేవాడు, కరుణామయుడు.

وَلَا يَأْتَلِ اُولُوا الْفَضْلِ مِنْكُمْ وَالسَّعَةِ اَنْ يُّؤْتُوْٓا
اُولِي الْقُرْبٰى وَالْمَسٰكِيْنَ وَالْمُهٰجِرِيْنَ فِيْ سَبِيْلِ اللّٰهِ ۖ
وَلْيَعْفُوْا وَلْيَصْفَحُوْا ۗ اَلَا تُحِبُّوْنَ اَنْ يَّغْفِرَ اللّٰهُ لَكُمْ ۗ
وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿22﴾

**23** సౌశీల్యవతులుగా ఉన్న, ఏ పాపం ఎరుగని విశ్వసించిన స్త్రీలపై అపనింద మోపేవారు ఇహపరాలలో శపించబడ్డారు. వారి కోసం చాలా పెద్ద శిక్ష ఉంది.[21]

اِنَّ الَّذِيْنَ يَرْمُوْنَ الْمُحْصَنٰتِ الْغٰفِلٰتِ الْمُؤْمِنٰتِ
لُعِنُوْا فِي الدُّنْيَا وَالْاٰخِرَةِ ۪ وَلَهُمْ عَذَابٌ عَظِيْمٌ ﴿23﴾

19. షైతాన్ పాదచిహ్నాలలో నడవరాదని తాకీదుచేసిన తరువాత, 'దైవకటాక్షమే గనక లేకపోయినట్లయితే మీలోఎవరూ పవిత్రులుగా ఉండేవారు కాదు' అని చెప్పటం గమనార్హం. అంటే కొద్దిమంది తప్ప ముస్లింలలోని మిగిలిన వారంతా ఈ భావ కాలుష్యానికి దూరంగా ఉండటం ముమ్మాటికీ దైవకృపే. లేకుంటే వారు కూడా ఆ పాపపు వెల్లువలో కొట్టుకు పోయేవారే. కాబట్టి అనుక్షణం ముస్లింలు షైతాన్ మోసపూరిత ప్రయత్నాల పట్ల కడు అప్రమత్తంగా ఉండాలి. ఆ శాపగ్రస్తుని బారినుంచి రక్షణకోసం నిరంతరం అల్లాహ్ శరణు వేడుతూ ఉండాలి. అలాగే; తమ మానసిక దౌర్బల్యం వల్ల షైతాన్ ఎత్తుగడలకు చిత్తయి పోయిన మీ సోదరులను పొద్దస్తమానం కించపరచకుండా, వారి దిద్దుబాటు కోసం కృషిచేయండి.

20. ఈ అపనిందలో పాల్గొన్న మిస్తహ్ పేదవారు. దైవమార్గంలో వలస వచ్చినవారు (ముహాజిర్). పైగా ఆయన హజ్రత్ అబూబక్ర్ (రజి) గారికి పిన్నికొడుకు అవుతారు. అందువల్ల ఆయన పోషణా బాధ్యతను హజ్రత్ అబూబక్ర్ (రజి) స్వీకరించారు. కాని ఈ సంఘటన కారణంగా ఆ తండ్రి మనస్సు చివుక్కుమంది. ఇలా జరగటం సహజం కూడాను. ఇకమీదట ఎన్నడూ మిస్తహ్‌కు ఆర్థిక సహాయం అందజేయనని హజ్రత్ అబూబక్ర్ (రజి) కోపంతో ఒట్టేసుకున్నారు. ఈ విధంగా ప్రతిన బూనటం అల్లాహ్‌కు నచ్చలేదు. హజ్రత్ అబూబక్ర్ (రజి) మామూలు వ్యక్తి కారు. సాధారణ వ్యక్తి వల్ల ఇలాంటి చిన్న పొరపాటు జరిగితే అది తీవ్రంగా పరిగణించబడేది కాదేమో! కాని ఆ తండ్రి మనసు ఎంతగా తల్లడిల్లినప్పటికీ – ప్రతీకార వాంఛతో – ధనసహాయాన్ని నిలిపివేస్తాననటం ఆయన సత్యసంధతకు, ఔదార్యానికి శోభాయమానం కాదుకదా! అందుకే అల్లాహ్ చాలా సుతిమెత్తగా అబూబక్ర్ (రజి) మానవ సహజ దౌర్బల్యాన్ని ఎత్తిచూపిస్తూ, మన్నింపుల వైఖరిని అవలంబించవలసిందిగా ఉపదేశించాడు. అల్లాహ్ మీ తప్పుల్ని మన్నించాలన్నది మీ అభిమతం కాదా?! అంటూ క్షమాగుణాన్ని, ప్రేమసాగరాన్ని చిలికించాడు. ఈ ఆదేశాన్ని విన్నంతనే హజ్రత్ అబూబక్ర్ (రజి) లోని గుండె ద్రవించింది. ఔదార్యం వర్షించసాగింది. "ఓ ప్రభూ! నీ క్షమాభిక్షను ఎందుకు అభిలషించము? నీవు మమ్మల్ని క్షమించాలని మనసారా కోరుకుంటున్నాము" అని ప్రతిస్పందించారు. తరువాత ఆయన తన ప్రమాణ భంగానికి పరిహారం (కఫ్ఫారా) చెల్లించి, మిస్తహ్ పోషణాభారాన్ని మునుపటి మాదిరిగానే స్వీకరించారు. (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్)

21. ఈ ఆయతు హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) గారిని, మహాప్రవక్త (స) గారి ఇతర సతీమణులను దృష్టిలో ఉంచుకుని

24 ఆ రోజు వారి నోళ్లూ, వారి కాళ్లూ చేతులు స్వయంగా వారి చేష్టలను గురించి సాక్ష్యమిస్తాయి.[22]

يَوْمَ تَشْهَدُ عَلَيْهِمْ أَلْسِنَتُهُمْ وَأَيْدِيهِمْ وَأَرْجُلُهُم بِمَا كَانُوا يَعْمَلُونَ ﴿٢٤﴾

25 ఆ రోజు అల్లాహ్ వారికి న్యాయబద్ధంగా పూర్తి ప్రతిఫలాన్ని (శిక్షను) ఇస్తాడు. అప్పుడు అల్లాహ్‌యే సత్యమనీ, (ఆయనే సత్యాన్ని) స్పష్టపరచేవాడనీ వారు తెలుసుకుంటారు.

يَوْمَئِذٍ يُوَفِّيهِمُ اللَّهُ دِينَهُمُ الْحَقَّ وَيَعْلَمُونَ أَنَّ اللَّهَ هُوَ الْحَقُّ الْمُبِينُ ﴿٢٥﴾

26 అపవిత్ర స్త్రీలు అపవిత్ర పురుషులకు తగినవారు. అపవిత్ర పురుషులు అపవిత్ర స్త్రీలకు తగినవారు. (అలాగే) పవిత్ర స్త్రీలు పవిత్ర పురుషులకు తగినవారు. పవిత్ర పురుషులు పవిత్ర స్త్రీలకు తగినవారు.[23] అలాంటి పవిత్రుల గురించి వారు (కపటులు) బొంకే మాటలతో వారికెలాంటి సంబంధం లేదు. వారి కొరకు మన్నింపుతో పాటు గౌరవప్రదమైన ఉపాధి ఉంది.[24]

الْخَبِيثَاتُ لِلْخَبِيثِينَ وَالْخَبِيثُونَ لِلْخَبِيثَاتِ ۖ وَالطَّيِّبَاتُ لِلطَّيِّبِينَ وَالطَّيِّبُونَ لِلطَّيِّبَاتِ ۚ أُولَٰئِكَ مُبَرَّءُونَ مِمَّا يَقُولُونَ ۖ لَهُم مَّغْفِرَةٌ وَرِزْقٌ كَرِيمٌ ﴿٢٦﴾

27 ఓ విశ్వాసులారా! మీరు మీ ఇళ్లల్లోకి తప్ప ఇతరుల ఇళ్లల్లోకి– వారి అనుమతి పొందనంతవరకూ, అక్కడున్న వారికి 'సలామ్' చేయనంతవరకూ – ప్రవేశించకండి.[25] ఇదే మీ కొరకు మేలైన పద్ధతి. మీరు గుర్తుంచుకునేందుకుగాను (ఈ విధంగా బోధపరచ బడింది).[26]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَدْخُلُوا بُيُوتًا غَيْرَ بُيُوتِكُمْ حَتَّىٰ تَسْتَأْنِسُوا وَتُسَلِّمُوا عَلَىٰ أَهْلِهَا ۚ ذَٰلِكُمْ خَيْرٌ لَّكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُونَ ﴿٢٧﴾

అవతరించిందని, అందువల్ల దీనిని ప్రవక్త సతీమణులకే ప్రత్యేకించాలని, ఇందులో వారిపై అభాండాలు మోపేవారికి విధించబడే శిక్ష గురించి వివరించబడిందని, అలాంటి నీచులకు పశ్చాత్తాపం చెందే అవకాశం కూడా ఉండదని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

మరి కొంతమంది వ్యాఖ్యాతలు దీన్ని 'సర్వసామాన్యం'గా భావించారు. అంటే ఇలాంటి అపనింద మోపినవారు ముస్లింలై ఉండి, వారు గనక సాక్షుల్ని తేలేకపోతే షరీయతు సూచించినట్లుగా వారికి (80 కొరడా దెబ్బల) శిక్ష విధించాలి. ఈ శిక్షే వారికి శాపం. ఒకవేళ ఈ అపనిందను మోపినవారు అవిశ్వాసులు అయితే విషయం సుస్పష్టం. అలాంటివారు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ శపించబడినవారు. దైవకారుణ్యానికి దూరమైపోయినవారు.

22. దివ్యఖుర్‌ఆన్‌లో ఇతరచోట్ల కూడా ఈ ప్రస్తావన వచ్చింది. హదీసులలో దీని గురించి మరింత వివరంగా వచ్చింది.

23. 'ఒక వ్యభిచారి వ్యభిచారిణిని తప్ప ఇతరులను వివాహమాడరాద'న్న ఆయతు లాంటిదే ఇది కూడా. చెడిన ఆడది చెడిన మగాడికే తగును. సౌశీల్యవతులైన స్త్రీలు నిష్కళంకితులైన పురుషులకు తగినవారు. అశుద్ధులైన స్త్రీ పురుషులు మాత్రమే అశుద్ధాన్ని వెదజల్లుతారు. పరిశుద్ధతను అవలంబించే స్త్రీ పురుషులు నిత్యం సవ్యమైన భావాలను, సవ్యమైన ఆలోచనలనే కలిగి ఉంటారు. అశుద్ధత, అశ్లీలం, అపసవ్యతలకు వారు ఆమడ దూరాన ఉంటారు. మహాప్రవక్త సతీమణి అయిన హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పవిత్రురాలనీ, చెడుభావాలు గల స్త్రీ పురుషులు మాత్రమే ఆమెపై బురదజల్లే ప్రయత్నం చేశారనీ, వారి దుష్ప్రచారంతో ఆమెకు ఎట్టి సంబంధం లేదని ఈ ఆయతు భావం.

24. గౌరవప్రదమైన ఉపాధి అంటే స్వర్గంలోని మధుర భక్ష్యాలన్నమాట. అవి విశ్వాసులకు స్వర్గంలో లభిస్తాయి.

25. వెనుకటి ఆయతులలో వ్యభిచారం, అపనింద,శిక్షల గురించి వచ్చింది. ఇక్కడ అల్లాహ్, ఇండ్లలో ప్రవేశించే పద్ధతిని విశదీకరిస్తున్నాడు. విచ్చలవిడిగా స్త్రీ పురుషులు కలసిపోరాదన్నది దీని ముఖ్యోద్దేశం. ఈ కలివిడితనమే నీతిబాహ్యతకు

فَإِن لَّمْ تَجِدُوا فِيهَا أَحَدًا فَلَا تَدْخُلُوهَا حَتَّىٰ
يُؤْذَنَ لَكُمْ ۖ وَإِن قِيلَ لَكُمُ ارْجِعُوا فَارْجِعُوا
هُوَ أَزْكَىٰ لَكُمْ ۚ وَاللَّهُ بِمَا تَعْمَلُونَ عَلِيمٌ ﴿28﴾

**28** మరి మీకు అక్కడ ఎవరూ కనిపించకపోతే (అప్పటికీ) అనుమతి లేకుండా లోనికి ప్రవేశించకండి. తిరిగి వెళ్ళిపొమ్మని ఒకవేళ మీతో అనబడితే, మీరు (సంస్కారవంతుల్లా) తిరిగి వెళ్ళి పోండి. అదే మీ కొరకు ఎంతో పవిత్రమైనది. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు సుమా!

لَّيْسَ عَلَيْكُمْ جُنَاحٌ أَن تَدْخُلُوا بُيُوتًا غَيْرَ
مَسْكُونَةٍ فِيهَا مَتَاعٌ لَّكُمْ ۚ وَاللَّهُ يَعْلَمُ
مَا تُبْدُونَ وَمَا تَكْتُمُونَ ﴿29﴾

**29** అయితే ఎవరూ నివసించని ఇండ్లలో, మీకు చెందిన ప్రయోజనకరమైన వస్తు సామగ్రి ఏదన్నా ఉన్నప్పుడు మీరు వాటిలోకి ప్రవేశిస్తే అందులో తప్పులేదు.[27] మీరు బహిర్గతం చేసేదీ, గోప్యంగా ఉంచేదీ – అంతా అల్లాహ్‌కు తెలుసు.[28]

قُل لِّلْمُؤْمِنِينَ يَغُضُّوا مِنْ أَبْصَارِهِمْ وَيَحْفَظُوا
فُرُوجَهُمْ ۚ ذَٰلِكَ أَزْكَىٰ لَهُمْ ۗ إِنَّ اللَّهَ خَبِيرٌ
بِمَا يَصْنَعُونَ ﴿30﴾

**30** (ఓ ప్రవక్తా!) ముస్లిం పురుషులు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ,[29] వారు తమ మర్మస్థానాలను కాపాడుకోవాలనీ,[30] అది వారి కొరకు పవిత్రమైనదని వారితో చెప్పు. వారు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

---

సోపానం అవుతుంది. ఇంట్లో ఉన్నవారెవరో మీకు తెలియనంతవరకూ, లోపల ఉన్నవారు మీకు అనుమతి ఇవ్వనంత వరకూ మీరు లోపలికి వెళ్ళకూడదు. ఈ ఆయతులో మొదట అనుమతి పొందాలనీ, తరువాత 'సలామ్' చేసి లోనికి వెళ్ళాలని ఉంది. అయితే హదీసు ప్రకారం మహాప్రవక్త(స) మొదట సలామ్ చేసేవారు. తరువాత 'ఇంట్లోకి రావచ్చునా?' అంటూ అనుమతి కోరేవారు. అలాగే ఆయన (స) ఎవరి ఇంటికైనా వెళ్ళినప్పుడు మూడుసార్లు అనుమతి కోరేవారు. లోపలి నుంచి సమాధానం రాకపోతే తిరిగి వెళ్ళిపోయేవారు. అనుమతి కోరే సమయంలో గుమ్మానికి ఎదురుగా కాకుండా కాస్త పక్కకు జరిగి నిలబడేవారు. తలుపు తెరచినప్పుడు ముఖాముఖీ కారాదన్నదే దీని ఉద్దేశం (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇస్తీజాన్; ముస్నదె అహ్మద్ – 3/138; అబూ దావూద్ – కితాబుల్ ఆదాబ్). అలాగే గుమ్మం దగ్గర నిలబడి ఇంటిలోపలికి తొంగి చూడటాన్ని కూడా ఆయన (స) గట్టిగా వారించారు. ఒకవేళ ఎవరయినా గాని అలా తొంగిచూస్తుంటే వారి కన్ను పగుల గొట్టినా పాపం కాదని ఆయన (స) తెలిపారు (బుఖారీ – కితాబుద్దియాత్; ముస్లిం – కితాబుల్ ఆదాబ్). ఇంటిలోపల ఉన్నవారు, "ఎవరూ?" అని ప్రశ్నించినప్పుడు "నేను. నేనే" అని సమాధానమివ్వటం కూడా వాంఛనీయం కాదని మహాప్రవక్త (స) చెప్పారు. నేను ఫలానా వ్యక్తిని అంటూ పేరు, తదితర వివరాలు చెప్పాలి (సహీహ్ బుఖారీ–కితాబుల్ ఇస్తీజాన్; ముస్లిం–కితాబుల్ ఆదాబ్; అబూ దావూద్–కితాబుల్ అదబ్).

26. అంటే ఇకమీదట మీరు ఈ మర్యాదలను పాటించాలి. అనుమతి పొంది, సలామ్ చేసి మరీ ఇండ్లలోకి వెళ్ళాలి. ఇదే సంస్కారం.

27. ఇంతకీ అనుమతి పొందకుండా ప్రవేశించవలసిన ఆ ఇళ్ళు ఏవి? కేవలం అతిథుల కోసం ప్రత్యేకంగా కేటాయించబడిన విశ్రాంతి గదులు, ఔట్ హౌస్‌లు అని కొందరు అభిప్రాయపడ్డారు. అలాంటి అతిథి గృహాలలో ప్రవేశానికి తొలిసారి ఇంటి యజమాని అనుమతి పొందితే చాలు. మరి కొంతమంది అభిప్రాయం ప్రకారం బాటసారుల కోసం నిర్మించే సత్రాలు, విశ్రాంతి నిలయాలు ఈ కోవలోకి వస్తాయి. **'మతావున్'** (مَتَاع) అంటే లాభం, ప్రయోజనం అని అర్థం. మీ ప్రయోజనం కోసం ఉద్దేశించిన గృహాలు అని పై ఆయతుకు భావం.

28. ఇతరుల ఇండ్లలోనికి ప్రవేశించే సమయంలో ప్రస్తావిత మర్యాదలను, నియమ నిబంధనలను పాటించని వారికి ఇందులో హెచ్చరిక ఉంది.

**31** (ఓ ప్రవక్తా!) ముస్లిం స్త్రీలు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, తమ మర్మస్థానాలను రక్షించుకోవాలనీ,[31] బహిర్గతమై ఉండేది తప్ప[32] – తమ అలంకరణను బహిర్గతం చేయరాదనీ,[33] తమ వక్షస్థలాలపై ఓణీలు వేసుకోవాలనీ,[34] తమ భర్త[35] లేక

وَقُلْ لِّلْمُؤْمِنٰتِ يَغْضُضْنَ مِنْ اَبْصَارِهِنَّ
وَيَحْفَظْنَ فُرُوْجَهُنَّ وَلَا يُبْدِيْنَ زِيْنَتَهُنَّ اِلَّا
مَا ظَهَرَ مِنْهَا وَلْيَضْرِبْنَ بِخُمُرِهِنَّ عَلٰى جُيُوْبِهِنَّ

29. ఇతరుల ఇండ్లలోనికి వెళ్ళడానికి అనుమతి పొందమని ఆదేశించటంతోపాటే చూపులను క్రిందికి ఉంచాలనీ (లేక చూపులను మరల్చుకోవాలని) కూడా ఆజ్ఞాపించబడింది. ఎందుకంటే దురుద్దేశంతో కూడిన చూపులే నీతిబాహ్యతకు ద్వారం తెరుస్తాయి.

30. మర్మస్థానాలను కాపాడుకోవటమంటే వాటిని ధర్మసమ్మతమైన మార్గంలో మాత్రమే ఉపయోగించాలి. లైంగిక వాంఛలు సహజమైనవి. వాటి పరిపూర్తి కోసం ఇస్లామీయ షరీయతు కొన్ని నియమాలను, కట్టుబాట్లను నిర్దేశించింది. వైవాహిక వ్యవస్థను ప్రతిపాదించింది. కాబట్టి ఇస్లాం సూచించిన రీతిలోనే లైంగిక కోర్కెలు తీర్చుకోవాలి. అలాగే మర్మాంగాలు ఎవరికీ కనబడకుండా ఉండేలా సంస్కారవంతమైన రీతిలో దుస్తులు ధరించాలి. అర్ధ నగ్న దుస్తులు ధరించరాదు.

31. చూపుల్ని క్రిందికి దించటం, శీలాన్ని కాపాడుకోవటం గురించి మగవారికి, ఆడవారికి వేర్వేరుగా ఆదేశించటాన్ని బట్టి ఈ విషయం ఎంత ముఖ్యమైనదో అర్థమవుతోంది. సమాజంలో సౌశీల్యం, పారిశుద్ధ్యాలు వర్థిల్లాలంటే ఈ రెండు విషయాల పట్ల సభ్యసమాజ సభ్యులు చాలా శ్రద్ధ వహించవలసి ఉంటుంది. చెడు చూపు వ్యభిచారానికి తొలి మెట్టు వంటిది. చంచలంగా చూపు కలిపే దురలవాటుకు మగవాళ్ళు దూరంగా ఉండటం ఎంత అవసరమో, ఆడవాళ్లు దూరంగా ఉండటం కూడా అంతే అవసరం. అయితే దురుద్దేశం లేకుండా స్త్రీలు షరీయతు పరిధిలో ఉంటూ ఏవైనా పురుషుల ప్రత్యేక సామూహిక విన్యాసాలను చూస్తే తప్పులేదు. ఈ సందర్భంగా కొంతమంది విద్వాంసులు, హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పండుగ రోజున నీగ్రో యువకుల విన్యాసాలను దైవప్రవక్త (స)తో కలసి తిలకించిన సంఘటనను ఉదాహరించారు (సహీహ్ బుఖారీ – కితాబుస్సలాత్).

32. **'బహిర్గతమయ్యేది'** అంటే – శరీరంలోని ఏ భాగాలను దాయటం, కప్పటం అసంభవమో ఆ భాగాలని అర్థం. ఉదాహరణకు : అరచేతులు, కళ్లు. ఎవరికయినా ఏదైనా వస్తువును ఇచ్చేటప్పుడు అరచేతులు కనబడతాయి. చేతికి ఉంగరం ఉంటే అదీ కనబడుతుంది. గోరింటాకు పూసుకుని ఉంటే అది కూడా కనబడుతుంది. అలాగే గోషాలో ఉండి స్త్రీలు బయట తిరిగినా, సంభాషించినా కళ్లు ఎలాగూ కనిపిస్తాయి. కళ్లలో పెట్టుకునే కాటుక కూడా కాన వస్తుంది. ఆ మాటకొస్తే స్త్రీ శరీరాచ్ఛాదన కోసం ఆపాదమస్తకం ధరించే 'బురఖా' కూడా ఒక 'అలంకారమే.' ఇలాంటి అలంకరణ వ్యక్తమవక తప్పదు. కాబట్టి ఇవి ఆక్షేపణీయంగా పరిగణించబడవు.

33. ఇక్కడ **'అలంకరణ'** అంటే దుస్తులు, ఆభరణాలు, తదితర అలంకార వస్తువులు. ఈ అలంకార వస్తువులు స్త్రీ అందాన్ని మరింత పెంచుతాయి. అయితే ఆమె తన భర్తకోసం అందంగా ముస్తాబు కావాలని తాకీదు చేయబడింది. ఆమె అందచందాలు ఆమె జీవిత భాగస్వామి అయిన భర్త కోసమేగాని అన్యుల కోసం కాదు. ఆభరణాలు, అలంకరణలు సయితం ఇతరుల ముందు ప్రదర్శించరాదని చెప్పిన ఇస్లాం స్త్రీ విచ్చలవిడిగా తన అంగాంగాలను, వంపు సొంపులను ప్రదర్శించడానికి ఎలా అంగీకరిస్తుంది? ఈ రకమయిన ప్రదర్శన నిషిద్ధం (హరామ్)గా పరిగణించబడుతుంది.

34. ఓణీలు, పైటల ద్వారా స్త్రీలు తమ తలభాగాన్ని, మెడభాగాన్ని, వక్షోజాలను కప్పిఉంచాలి. ఈ శరీర భాగాలు కూడా పైకి కనబడకూడదు.

35. అయితే కొంతమంది ముందు ఆమె పరదా పాటించనవసరం లేదు. వారిలో అందరి కన్నా ముందు భర్త పేరు ప్రస్తావించబడింది. ఎందుకంటే స్త్రీ సింగారం, అలంకరణలన్నీ అసలు భర్త కోసమే. ఆమె భర్త కోసం ఆమె శరీరమంతా ధర్మసమ్మతమే. భర్త తరువాత తండ్రి, భర్త తండ్రి (మామగారు), కొడుకులు, సవతి కొడుకులు, సహోదరులు, సోదరుల కుమారులు, అక్కాచెల్లెళ్ళ కొడుకులు – వీరంతా 'మహ్రమ్' బంధువులు. అంటే వీళ్లతో స్త్రీ వివాహం శాశ్వితంగా నిషేధించబడింది. ఈ కోవకు చెందిన మగవారి ముందుకు ఆమె రావటంలో తప్పులేదు.

وَلَا يُبْدِيْنَ زِيْنَتَهُنَّ اِلَّا لِبُعُوْلَتِهِنَّ اَوْ اٰبَآئِهِنَّ
اَوْ اٰبَآءِ بُعُوْلَتِهِنَّ اَوْ اَبْنَآئِهِنَّ اَوْ اَبْنَآءِ بُعُوْلَتِهِنَّ
اَوْ اِخْوَانِهِنَّ اَوْ بَنِيْٓ اِخْوَانِهِنَّ اَوْ بَنِيْٓ اَخَوٰتِهِنَّ
اَوْ نِسَآئِهِنَّ اَوْ مَا مَلَكَتْ اَيْمَانُهُنَّ اَوِ التّٰبِعِيْنَ غَيْرِ

తమ తండ్రి[36] లేక తమ మామగారు లేక తమ కొడుకులు లేక తమ భర్త కొడుకులు లేక తమ సోదరులు లేక తమ సోదరుల కుమారులు లేక తమ అక్కాచెల్లెళ్ల కొడుకులు లేక తమతో కలిసిమెలిసి ఉండే స్త్రీలు,[37] లేక తమ బానిసలు[38] లేక ఇతరత్రా ఉద్దేశాలు లేకుండా తమకు లోబడి ఉన్న పురుష సేవకులు[39] లేక

దానివల్ల చెడు జనించే ఆస్కారం కూడా లేదు. ఈ సందర్భంగా మేనమామ, పినతండ్రి ప్రస్తావన రాలేదు. అయితే అత్యధిక మంది విద్వాంసుల దృష్టిలో వీరు కూడా మహ్రమ్ బంధువుల క్రిందికే వస్తారు. స్త్రీలు వీరి ముందు అలంకరణను ప్రదర్శించటంలోనూ ఎలాంటి తప్పులేదు. అయితే మరికొంతమంది దృష్టిలో వీరు మహ్రమ్ బంధువుల క్రిందికి రారు (ఫత్హుల్ ఖదీర్).

36. **'తండ్రి'** అంటే కేవలం కన్నతండ్రి మాత్రమే కాదు; తాత, ముత్తాతలు, కన్నతల్లి తరఫు తాత, ముత్తాత కూడా ఈ నిషిద్ధ (మహ్రమ్) జాబితాలో ఉన్నారు. అలాగే భర్త తండ్రి (మామగారు)తో పాటు, అతని తండ్రి, తాత ముత్తాత కూడా ఈ కోవలోకి వస్తారు. అలాగే కొడుకులు అంటే ఒక్క కన్నకొడుకులే గాక మనవళ్ళు, మునిమనవళ్ళు కూడా ఈ జాబితాలో చేరి ఉన్నారు. అలాగే సోదరుల, కుమారుల విషయంలో, సోదరీమణుల సంతానం విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది – ఇలాంటి పురుషుల ముందు స్త్రీలు పరదా పాటించనవసరం లేదు.

సోదర సోదరీమణుల్లో మూడు రకాల వారుంటారన్న విషయం గమనార్హం.

(1) సొంత సోదరసోదరీమణులు. వీరిని 'ఐనీ' అంటారు. అంటే ఒకే తల్లిదండ్రుల కడుపున పుట్టిన పిల్లలు.

(2) తల్లి తరఫు సోదరసోదరీమణులు. వీరిని 'అఖ్యాఫీ' అంటారు. అంటే తల్లి ఒక్కతేగాని వేర్వేరు తండ్రులకు పుట్టిన బిడ్డలు.

(3) తండ్రి తరఫు సోదర సోదరీమణులు. వీరిని 'అల్లాతీ' అంటారు. తండ్రి ఒక్కడే అయి ఉండి వేర్వేరు తల్లులకు పుట్టిన బిడ్డలు.

వీరందరికి కూడా పై ఆయతులోని సూత్రం వర్తిస్తుంది.

37. **'తమతో కలిసిమెలసి ఉండే స్త్రీలు'** అంటే ముస్లిం స్త్రీలు అని భావం. ముస్లిం స్త్రీలు ఒకరిముందు మరొకరు తమ అలంకరణను బహిర్గతం చేయవచ్చు. అయితే ఆ స్త్రీలు తమ భర్తల ముందు పరాయి స్త్రీ అందచందాలను, రూపు రేఖలను, శారీరక స్వభావాన్ని గురించి ఎంత మాత్రం ప్రస్తావించరాదని గట్టిగా తాకీదు చేయబడింది.

అవిశ్వాస స్త్రీల ముందు కూడా ముస్లిం స్త్రీలు తమ సింగారాన్ని, అందచందాలను ప్రదర్శించకూడదు. హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి), ముజాహిద్, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్‌ల అభిప్రాయం కూడా ఇదే.

మరికొంతమంది విద్వాంసుల అభిప్రాయంలో 'కలసి మెలసి ఉండే స్త్రీలు' అంటే పొద్దస్తమానం వెంట ఉండే స్త్రీలు. ముఖ్యంగా పరిచారికలు, దాసీలు (బానిసరాళ్లు).

38. **'బానిసలు'** అంటే కేవలం బానిస స్త్రీలు అని కొందరు భావించారు. కేవలం బానిస పురుషులు అని మరికొందరు అభిప్రాయపడ్డారు. మరికొందరు 'ఇరువురూను' అని భావించారు. అయితే బానిస ముందు పరదా పాటించనవసరం లేదని హదీసులో స్పష్టంగా చెప్పబడింది (అబూ దావూద్–కితాబుల్లిబాస్). ఈ 'బానిసలు' అన్న పదంలో ముస్లిం బానిసలు, ముస్లిమేతర బానిసలు కూడా చేరి ఉన్నారని మరికొంత మంది వ్యాఖ్యానించారు.

39. అంటే కామవాంఛలేని, ఎలాంటి దురుద్దేశాలు లేని పురుష సేవకులు అన్నమాట. మతి స్థిమితం లేని వారు, మరీ అమాయకులు, నపుంసకులు, పండు ముదుసలులు కూడా ఈ కోవలోకి వస్తారని కొంతమంది పండితులు

أُولِي الْإِرْبَةِ مِنَ الرِّجَالِ أَوِ الطِّفْلِ الَّذِينَ لَمْ يَظْهَرُوا
عَلَىٰ عَوْرَاتِ النِّسَاءِ ۖ وَلَا يَضْرِبْنَ بِأَرْجُلِهِنَّ لِيُعْلَمَ
مَا يُخْفِينَ مِنْ زِينَتِهِنَّ ۚ وَتُوبُوا إِلَى اللَّهِ جَمِيعًا
أَيُّهَ الْمُؤْمِنُونَ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿٣١﴾

స్త్రీల గుప్త విషయాల గురించి ఇంకా తెలియని బాలురు[40] – వీళ్ల ఎదుట తప్ప ఇతరుల ఎదుట తమ అలంకరణలను (అంద చందాలను) కనబడనివ్వకూడదనీ,[41] దాగివున్న తమ అలంకరణ ఇతరులకు తెలిసిపోయేలా తమ కాళ్ళను నేలపై కొడుతూ నడవ రాదని[42] వారితో చెప్పు. ముస్లింలారా! మీరంతా కలసి అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి. తద్వారా మీరు సాఫల్యం పొంద వచ్చు.[43]

وَأَنْكِحُوا الْأَيَامَىٰ مِنْكُمْ وَالصَّالِحِينَ مِنْ عِبَادِكُمْ
وَإِمَائِكُمْ ۚ إِنْ يَكُونُوا فُقَرَاءَ يُغْنِهِمُ اللَّهُ

**32** మీలో వివాహం కాకుండా ఉన్న స్త్రీ పురుషుల వివాహం చేయండి.[44] అలాగే మంచి నడవడికగల మీ బానిసల, బానిస స్త్రీల వివాహం కూడా జరిపించండి.[45] ఒకవేళ వారు పేదవారై

అభిప్రాయపడ్డారు. "దివ్య ఖుర్ఆన్ పేర్కొన్న గుణం ఏ ఏ పురుషుల్లో ఉందో వారంతా ఈ కోవలోకి వస్తారని, మిగిలిన వారికి ఇది వర్తించదని" ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) వ్యాఖ్యానించారు.

40. అయితే ప్రాజ్ఞ వయస్సుకు చేరిన మగపిల్లలు, స్త్రీల అందచందాల గురించి ఆలోచించే స్థాయికి ఎదిగిన మగపిల్లలు ఈ పరిధిలోకి రారు. అలాంటి మగపిల్లలతో కూడా స్త్రీలు పరదా పాటించాల్సిందే.

41. **'అలంకరణలు'** అంటే దుస్తులు, ఆభరణాలు, ఇతర అలంకరణ వస్తువులు అని భావం. పైన పేర్కొనబడిన 'మహ్రమ్ బంధువుల' ముందు స్త్రీ తన అలంకారాన్ని బహిర్గతం చేయవచ్చు. ఇతరుల ముందు మాత్రం బహిర్గతం చేయకూడదు.

42. అంటే కాళ్లకు తొడిగివున్న అందియలు, మువ్వలు ఘల్లున మోగేలా, అందరి దృష్టిని ఆకట్టుకునేలా స్త్రీలు నడవరాదు. ఎత్తయిన శాండిల్స్ కూడా ఇందులోకి వస్తాయి. ఎందుకంటే వాటి ద్వారా కూడా టక్ టక్ అనే శబ్దం వస్తుంది. ఈ శబ్దం కాలి మువ్వల సవ్వడి కన్నా తక్కువేమీ ఉండదు. స్త్రీలు సుగంధద్రవ్యాలు పూసుకుని ఇంటి బయటకు వెళ్ళటం కూడా ధర్మసమ్మతం కాదు. ఈ విధంగా చేసే స్త్రీ చెడు నడతగల స్త్రీగా పరిగణించబడుతుంది. (తిర్మిజీ – ఇస్తీజాన్ అధ్యాయాలు; అబూ దావూద్ – కితాబుత్తరజ్జుల్).

43. 'పరదా' ఆజ్ఞల సందర్భంగా 'పశ్చాత్తాపం' గురించి ప్రస్తావించటం గమనించదగిన విషయం. ఇక్కడ అల్లాహ్ ఏం చెప్పదలచాడంటే, అజ్ఞాన కాలంలో జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు మీ వద్దకు 'జ్ఞానం' వచ్చేసింది. కాబట్టి పూర్వం జరిగిన దానిపై సంకల్పశుద్ధితో మీరు క్షమాపణ కోరుకుంటే మీరు క్షమించబడతారు. ఇక మీదట మాత్రం మీరు మా ఆదేశాలను ఖచ్చితంగా పాటించవలసి ఉంటుంది. మా ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లయితే మీకు సాఫల్యం, మోక్షం సిద్ధిస్తాయి.

44. మూలంలో **'అయామా'** (أيامى) అన్న పదం వచ్చింది. ఇది "అయ్యిమ్"కు బహువచనం. భర్తలేని స్త్రీని అయ్యిమ్ అని అంటారు. పెళ్లికాని స్త్రీలు, వితంతువులు, విడాకులు పొందిన స్త్రీలు అందరూ కూడా "అయామా" భావపరిధిలోకి వస్తారు. అంతేకాదు, భార్యలేని పురుషునికి కూడా ఈ పదం వర్తిస్తుంది. సంరక్షకులను ఉద్దేశించి ఇలా ఆజ్ఞాపించ బడింది. 'వివాహం చేయండి' అని చెప్పబడింది– 'చేసుకోండి' అని కాదు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే స్త్రీ తన సంరక్షకుని (వలీ) అనుమతి లేకుండా తనంతట తాను నికాహ్ చేసుకోజాలదు. హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది.

అలాగే, పై ఆయతులోని 'ఆజ్ఞ'ను దృష్టిలో పెట్టుకొని వివాహం (నికాహ్) చేసుకోవటం తప్పనిసరి (వాజిబ్) అని కొందరు ఈ ఆయతు ఆధారంగా వ్యాఖ్యానించారు. వివాహం చేసుకోవటం మంచిది (ముస్తహబ్) అని కొందరు పేర్కొన్నారు. అయితే పరిస్థితుల స్వరూపాన్ని బట్టి ఇది ఆయా వ్యక్తులకు వర్తిస్తుంది. కొందరి విషయంలో వివాహం సంప్రదాయం (సున్నతె ముఅక్కద) అయితే, మరికొందరి విషయంలో వివాహం తప్పనిసరి (వాజిబ్)గా పరిణమిస్తుంది.

مِنْ فَضْلِهٖ ؕ وَاللّٰهُ وَاسِعٌ عَلِيْمٌ ﴿32﴾

ఉంటే అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని ధనవంతులుగా చేస్తాడు.[46] అల్లాహ్ విశాల సంపన్నుడు, సమస్తమూ తెలిసిన వాడు.

وَلْيَسْتَعْفِفِ الَّذِيْنَ لَا يَجِدُوْنَ نِكَاحًا حَتّٰى يُغْنِيَهُمُ اللّٰهُ مِنْ فَضْلِهٖ ؕ وَالَّذِيْنَ يَبْتَغُوْنَ الْكِتٰبَ مِمَّا مَلَكَتْ اَيْمَانُكُمْ فَكَاتِبُوْهُمْ اِنْ عَلِمْتُمْ فِيْهِمْ خَيْرًا ۖ وَّاٰتُوْهُمْ مِّنْ مَّالِ اللّٰهِ الَّذِيْۤ اٰتٰىكُمْ ؕ

**33** వివాహం చేసుకునే ఆర్థిక స్థోమత లేనివారు, అల్లాహ్ తన అనుగ్రహంతో తమకు స్థోమతను ప్రసాదించేవరకూ శీల శుద్ధతను పాటించాలి.[47] మీ బానిసలలో ఎవరయినా మీకేదైనా (సొమ్మును) ఇచ్చి, విడుదలకు సంబంధించిన లిఖిత పూర్వక ఒప్పందం (ముకాతబత్) మీతో చేసుకోదలిస్తే – వారిలో మీకు మంచితనం కానవచ్చిన పక్షంలో[48] – వారికి వ్రాతపత్రం వ్రాసి ఇవ్వండి. అల్లాహ్ మీకు ప్రసాదించిన ధనంలో నుంచి వారికీ

వివాహానికి పరిస్థితులు అనుకూలించని వారు వివాహం చేసుకోలేక పోయినంత మాత్రాన, అసలు పెళ్లీ గిళ్లీ అంతా అనవసరం అని కొట్టిపారేయటం మాత్రం సబబుకాదు. పైగా వివాహం అనే ఈ కట్టుబాటును తృణీకరించటం గర్హనీయం. ఎందుకంటే "నా సంప్రదాయం పట్ల వైముఖ్యం ప్రదర్శించేవాడు నా వాడు కాదు" అని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచించారు. (బుఖారీ – నెం.5063; ముస్లిం – నెం.1020)

45. ఇక్కడ 'మంచి నడవడిక' అంటే విశ్వాసం (ఈమాన్) అని భావం. వివాహం చేసుకొమ్మని యజమానులు తమ బానిసలపై, బానిసరాళ్ళపై ఒత్తిడి తీసుకురాగలరా? ఈ విషయంలో ద్వంద్వాభిప్రాయం ఉంది. 'ఒత్తిడి' సమంజసం కాదని కొంతమంది భావిస్తున్నారు. కాని వివాహం చేసుకోకపోవటం వల్ల పరిస్థితి విషమించే అవకాశం ఉందని అనిపించినప్పుడు ఒత్తిడి తీసుకురావటం ధర్మసమ్మతమే. అన్యథా సమ్మతం కాదు (ఐసరుత్తఫాసీర్).

46. దీని భావం ఏమిటంటే కేవలం పేదరికం, ఆర్థిక ఇబ్బంది వివాహ మార్గంలో ప్రధాన అడ్డంకి కారాదు. బహుశా పెళ్ళయ్యాక అల్లాహ్ వారి ఆర్థిక ఇబ్బందుల్ని దూరం చేస్తాడేమో! బహుశా వివాహానంతరం వారు సంపన్నులు అవుతారేమో!! ముగ్గురు వ్యక్తులకు అల్లాహ్ తప్పకుండా సహాయపడతాడని హదీసు ద్వారా తెలుస్తోంది. 1. సౌశీల్యాన్ని పొందే ఉద్దేశంతో వివాహమాడినవాడు. 2. తన యజమానితో స్వేచ్ఛకు సంబంధించిన లిఖిత పూర్వకమైన ఒప్పందం (ముకాతబత్) చేసుకుని, దాన్ని నెరవేర్చటానికి చిత్తశుద్ధితో ప్రయత్నించేవాడు. 3. దైవమార్గంలో పోరాడేవాడు (తిర్మిజీ – జిహాద్ మహిమల అధ్యాయాలు).

47. వివాహం చేసుకునేందుకు పరిస్థితులు అనుకూలించేంత వరకూ ఆత్మ నిగ్రహం కోసం నఫిల్ ఉపవాసాలు పాటించాలని హదీసులో చెప్పబడింది. "ఓ నవయువకుల్లారా! మీలో పెళ్ళి చేసుకునే శక్తి (స్థోమత) గలవారు పెళ్లి చేసుకోవాలి. ఎందుకంటే చూపుల్ని, మర్మాంగాలను కాపాడుకోవటానికి ఇది ఉత్తమం. ఒకవేళ నికాహ్ (పెళ్లి) చేసుకునే స్థోమత లేని వారు (తరచూ) నఫిల్ ఉపవాసాలు పాటిస్తూ ఉండాలి. ఈ ఉపవాసాలు వారి లైంగిక కోర్కెల్ని అదుపులో ఉంచుతాయి" (బుఖారీ – కితాబుస్సౌమ్; ముస్లిం – కితాబున్నికాహ్).

48. స్వేచ్ఛకోసం తన యజమానితో వ్రాతపూర్వక ఒప్పందం చేసుకున్న బానిసను 'ముకాతబ్'గా వ్యవహరిస్తారు. అంటే "ఇంత పైకం చెల్లించి విడుదల పొందుతాను" అన్న షరతు ఆ ఒప్పందంలో లిఖించబడి ఉంటుంది. బానిస ఈ రకమయిన ప్రతిపాదనను తెచ్చినప్పుడు యజమాని అతని ప్రవర్తనను పరికించాలి. అతను తన ప్రతిపాదనలో చిత్తశుద్ధి గలవాడుగా కనిపిస్తే అతన్ని ప్రోత్సహించాలి. ఆ పైకాన్ని అతను కష్టపడి సంపాదించి, వాయిదాల పద్ధతిపై చెల్లించటంలో పూర్తి సహకారాన్ని అందజేయాలి. ఎందుకంటే ఇస్లాం సాధ్యమైనంతవరకు బానిసత్వ వ్యవస్థను నిర్మూలించగోరుతుంది. బానిసను విడుదల చేయటాన్ని చాలా గొప్ప పుణ్యకార్యంగా పేర్కొంది. కాకపోతే బానిస తన మాటకు కట్టుబడి ఉంటాడా? లేదా? అన్నది యజమాని అంచనా వేసుకోవాలి. యజమానులు తమ

وَلَا تُكْرِهُوا فَتَيٰتِكُمْ عَلَى الْبِغَاءِ إِنْ أَرَدْنَ تَحَصُّنًا
لِتَبْتَغُوا عَرَضَ الْحَيٰوةِ الدُّنْيَا ۚ وَمَنْ يُكْرِهْهُنَّ فَإِنَّ
اللّٰهَ مِنْ بَعْدِ إِكْرَاهِهِنَّ غَفُورٌ رَحِيمٌ ﴿33﴾

కొంత ఇవ్వండి.[49] మీ బానిస స్త్రీలు శీలవతులుగా ఉండగోరినప్పుడు, మీరు మీ ప్రాపంచిక జీవితపు స్వలాభాల కోసం వాళ్ళను వేశ్యావృత్తికై బలవంతపెట్టకండి.[50] ఒకవేళ ఎవరయినా వారిని (ఆ నీచమైన పని కోసం) బలవంతం చేస్తే, ఆ బలాత్కారం తరువాత అల్లాహ్ (ఆ అభాగినులను) క్షమించేవాడు, కనికరించేవాడు.[51]

وَلَقَدْ أَنْزَلْنَا إِلَيْكُمْ آيٰتٍ مُبَيِّنٰتٍ وَمَثَلًا مِنَ الَّذِينَ
خَلَوْا مِنْ قَبْلِكُمْ وَمَوْعِظَةً لِلْمُتَّقِينَ ﴿34﴾

**34** మేము మీ వద్దకు స్పష్టమైన ఆయతులను, మీకు పూర్వం గతించిన వారి ఉదాహరణలను, భయభక్తులు గల వారి కొరకు ఉపదేశాన్నీ పంపాము.

اللّٰهُ نُورُ السَّمٰوٰتِ وَالْأَرْضِ ۚ مَثَلُ نُورِهِ كَمِشْكٰوةٍ
فِيهَا مِصْبَاحٌ ۖ الْمِصْبَاحُ فِي زُجَاجَةٍ ۖ الزُّجَاجَةُ كَأَنَّهَا

**35** అల్లాహ్ ఆకాశాలకూ, భూమికి కాంతి.[52] ఆయన కాంతి ఒక గూటిని పోలి వున్నది. ఆ గూటిలో ఒక దీపం ఉంది. ఆ దీపం ఒక గాజు చిమ్నీలో ఉంది. ఆ గాజు చిమ్నీ మెరిసే నక్షత్రం మాదిరిగా ఉంది. ఆ దీపం శుభప్రదమైన ఒక జైతూను వృక్షం

---

ముకాతబ్ బానిసల విడుదలను ప్రోత్సహించటాన్ని కొంతమంది పండితులు వాజిబ్ (తప్పనిసరి)గా భావించారు. మరికొందరు ఆ విధానాన్ని (వాజిబ్‌గా కాకుండా, ముస్తహబ్‌గా) అభిలషణీయమైనదిగా పరిగణించారు.

49. బానిసలపై ఇస్లాం చూపిన ఔదార్యానికి ఈ వాక్యం ఒక ప్రబల నిదర్శనం. బానిస తన యజమానితో ఒప్పందం (ముకాతబత్) చేసుకుని వాయిదాల పద్ధతిలో ఆ సొమ్మును చెల్లించటానికి తీవ్రంగా కృషిచేస్తున్నప్పుడు, యజమాని వేడుక చూస్తూ కూర్చోరాదు. బానిస శ్రమను చూసి వికటాట్టహాసం చేయకూడదు. పైగా ఆ ముకాతబ్ బానిస పట్ల కొంత సడలింపుల వైఖరిని అవలంబించాలి. చేతనైతే, దేవుడు తమకు ప్రసాదించిన సొమ్ములో కొంతభాగం బానిసకు ఆర్థిక సహాయంగా అందజేసి అతను, ఆ పైకాన్ని చెల్లించటంలో చేయూతనివ్వాలి. దేవుడు మీకు సిరిసంపదల్ని ప్రసాదించి మీపై కనికరించాడు. కనుక మీరు కూడా ఈ దయనీయవర్గంపై జాలిచూపి వారి హృదయాలను జయించండి అని అల్లాహ్ ఉపదేశిస్తున్నాడు. అందుకే ఆ పరమప్రభువు తౌబా సూరా (60వ ఆయతు)లో జకాత్‌కు సంబంధించిన 8 పద్దుల్లో మెడలను విడిపించటాన్ని కూడా చేర్చాడు. “మెడలను విడిపించటం” అంటే బానిసలను కట్టుబానిసత్వం నుంచి విముక్తిని కల్పించటం అని అర్థం. ఈ బృహత్తర కార్యం కోసం కూడా జకాత్ సొమ్మును చెల్లించవచ్చు.

50. అజ్ఞాన కాలంలో (ఇస్లాంకు పూర్వం) ప్రజలు తమ అధీనంలో వున్న బానిస యువతులను వేశ్యావృత్తికై పురమాయించి, డబ్బు సంపాయించేవారు. పాపం ఆ అబలలకు ఈ పాడుపని ఇష్టం లేకపోయినా చచ్చినట్టు చేసి ఆ కళంకాన్ని, అవమానాన్ని మోయవలసి వచ్చేది. అయితే పవిత్ర జీవితం గడపగోరే బానిసరాళ్లపై ఈ మేరకు ఒత్తిడి తీసుకురాకూడదని ఇస్లాం హెచ్చరించింది. అంటే వారు ఇష్టపూర్వకంగా వ్యభిచారం చేయదలిస్తే అట్టి పరిస్థితిలో చేయించవచ్చని దీని భావం ఎంతమాత్రం కాదు. పైగా చెడు అలవాట్లు ఉన్న బానిసరాళ్ల దిద్దుబాటు కోసం ప్రయత్నించాలని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. అసలు వ్యభిచారం అనేదే పరమ నీచకార్యం. ఆ నీచకార్యం ద్వారా సొమ్ము చేసుకోవటం మరింత పాపం. అందులోనూ బలవంతంగా బానిసరాళ్లతో ఆ పాడు పని చేయించటం మరింత నికృష్టమైన, పరమ జుగుప్సాకరమైన చేష్టగా పరిగణించబడుతుంది.

51. ఏ యజమాని అయినా తన దగ్గరవున్న బానిసరాళ్ళతో ఈ నీతిమాలిన పనిని చేయిస్తే ఆ పాపమంతా యజమాని నెత్తిన పడుతుంది. ఎందుకంటే ఇక్కడ బలాత్కారానికి ఒడిగట్టినవాడు యజమానే. మహనీయ ముహమ్మదు (సఅసం)

كَوْكَبٌ دُرِّيٌّ يُوقَدُ مِن شَجَرَةٍ مُّبَارَكَةٍ زَيْتُونَةٍ
لَّا شَرْقِيَّةٍ وَلَا غَرْبِيَّةٍ يَكَادُ زَيْتُهَا يُضِيءُ وَلَوْ
لَمْ تَمْسَسْهُ نَارٌ ۚ نُّورٌ عَلَىٰ نُورٍ ۗ يَهْدِي اللَّهُ لِنُورِهِ
مَن يَشَاءُ ۚ وَيَضْرِبُ اللَّهُ الْأَمْثَالَ لِلنَّاسِ ۗ
وَاللَّهُ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ (35)

(నుండి తీసిన) నూనెతో వెలిగించబడుతోంది. ఆ వృక్షం తూర్పుకూ చెందదు, పడమరకూ చెందదు; దాని నూనె – అగ్ని తగలకపోయినా–దానంతట అదే జ్వలిస్తున్నట్లు ఉంది. కాంతిపై కాంతి వుంది.[53] అల్లాహ్ తాను కోరిన వారికి తన కాంతి వైపు మార్గదర్శకత్వం వహిస్తాడు.[54] ప్రజలకు (విషయం అర్థం అవటానికి) ఈ ఉపమానాలను అల్లాహ్ విశదపరుస్తున్నాడు.[55] అల్లాహ్‌కు అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలుసు.

فِي بُيُوتٍ أَذِنَ اللَّهُ أَن تُرْفَعَ وَيُذْكَرَ فِيهَا اسْمُهُ
يُسَبِّحُ لَهُ فِيهَا بِالْغُدُوِّ وَالْآصَالِ (36)

**36** ఏ గృహాల గౌరవ ప్రతిపత్తిని పెంచాలని, మరి వేటిలో తన నామస్మరణ చేయాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడో[56] వాటిలో ఉదయం సాయంత్రం అల్లాహ్ పవిత్రతను కొనియాడు తుంటారు,[57]

---

వారు ఇలా ప్రబోధించారు: "నా అనుచర సమాజం వల్ల జరిగే పొరపాట్లు, మరపువల్ల జరిగే తప్పులు, బలవంతంగా చేయించబడే పనులు మన్నించబడతాయి" (ఇబ్నె మాజా – కితాబుత్తలాఖ్).

52. అల్లాహ్‌యే గనక లేనట్లయితే భూమ్యాకాశాలలో వెలుగు ఉండేది కాదు. భూమ్యాకాశాలలో ఎవరికీ మార్గం లభించేది కాదు. భూమినీ, ఆకాశాలనూ జ్యోతిర్మయం చేసేవాడు ఆ అల్లాహ్‌యే. ఆయన గ్రంథం జ్యోతిర్మయం. ఆయన ప్రవక్త (తన గుణగణాల రీత్యా) ఒక జ్యోతి. ఆ రెండింటి ద్వారా అంధకారంలో కాంతిని పొందగలుగుతున్నాము. ఏ విధంగా ఒక దీపం, ఒక కరెంటు బల్బు ద్వారా మనిషి వెలుగును పొందుతున్నాడో అదేవిధంగా చీకటిమయమైన తన జీవితంలో దైవగ్రంథం, దైవప్రవక్త ద్వారా వెలుగును పొందుతున్నాడు. హదీసు ద్వారా కూడా అల్లాహ్ కాంతి అన్న సంగతి విదితమవుతోంది. "సకల స్తోత్రాలు నీకే తగును. భూమ్యాకాశాలకూ, వాటి మధ్యనున్న సమస్తానికీ నీవే కాంతివి" (బుఖారీ – బాబుత్తహజ్జుద్ బిల్లైల్; ముస్లిం – కితాబు సలాతిల్ ముసాఫిరీన్....). కాబట్టి అల్లాహ్ అస్థిత్వం కాంతిమంతం. ఆయన అడ్డుతెర కాంతిమంతం. ఆయన ప్రతి గోచర, అగోచరాల కాంతిని సృష్టించిన వాడు. వాటిని ప్రసాదించేవాడు, వాటి వైపుకు దారి చూపేవాడు కేవలం అల్లాహ్ మాత్రమే (ఐసరుత్తఫాసీర్).

53. దైవభక్తి గల విశ్వాసి హృదయం ఎలా జ్యోతిర్మయం అయివుంటుందో చెప్పడానికి ఈ ఉపమానం ఇవ్వబడింది. అతని దేహం ఒక గూటి లాంటిది. అందులో ఉన్న దీపం అంటే అతని హృదయం. దైవంతో గల దృఢ సంబంధం వల్ల ఆ హృదయం దేదీప్యమానంగా ఉంది. స్వతఃస్సిద్ధంగా ఉన్న అతని జ్ఞానానికి దైవగ్రంథజ్ఞానం కూడా తోడవటంతో అది మరింత దేదీప్యమానం అవుతుంది. అయితే ఇదంతా దేవుని అధీనంలో ఉంది. ఆయన తాను కోరిన వారికే ఈ జ్యోతిని ప్రసాదిస్తాడు.

54. **'నూర్'** (కాంతి) అంటే విశ్వాసం (ఈమాన్) మరియు ఇస్లాం అని అర్థం. విశ్వాస కాంతిని పొందటానికి ఆరాటపడేవారికి అల్లాహ్ దాని వైపు మార్గం చూపుతాడు. దానివల్ల వారికోసం ప్రాపంచిక, పారలౌకిక ద్వారాలు తెరచుకుంటాయి.

55. ఈ ఉపమానం ద్వారా అల్లాహ్ సన్మార్గానికి అర్హులు ఎవరో స్పష్టం చేశాడు.

56. ఇంతకుముందు చెప్పినట్లు అల్లాహ్ విశ్వాసి (మోమిన్) హృదయాన్ని, ఆ హృదయంలో ఉన్న విశ్వాసాన్ని, సన్మార్గ భాగ్యాన్ని, జ్ఞానాన్ని గాజు చిమ్నీలో వున్న దీపంగా అభివర్ణించాడు. ఆ దీపం స్వచ్ఛమైన, మేలిమి నూనెతో వెలుగొందు తున్నట్లుగా పేర్కొన్నాడు. ఇప్పుడు ఆ దీపం వెలిగే గృహం (మస్జిద్) గురించి చెప్పబడుతోంది.... ఆ పవిత్ర గృహాల గౌరవ ప్రతిష్ఠలు ఇనుమడించేలా ప్రవర్తించాలనీ, అవి నిత్యం భక్తులతో కళకళలాడుతూ ఉండాలని, ఆ ఆరాధనా లయాలలో అల్లాహ్ నామస్మరణ జరుగుతూ ఉండాలని ఇక్కడ చెప్పబడింది. భూమండలంలో అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవి మస్జిదులు. మస్జిదుల ఉన్నతికి పాటుపడాలి, గౌరవప్రతిపత్తుల్ని కాపాడాలి అంటే అర్థం ఎత్తయిన

37 (కొందరు) పురుషులు.[58] వర్తకంగానీ, క్రయ విక్రయాలుగానీ అల్లాహ్ నామస్మరణ, నమాజుస్థాపన, జకాత్‌చెల్లింపు విషయంలో వారిని పరధ్యానానికి లోను చేయలేవు. ఏ రోజున హృదయాలు తలక్రిందులై, కనుగుడ్లు తేలిపోతాయో[59] దానికి వారు భయ పడుతూ ఉంటారు.

رِجَالٌ لَّا تُلْهِيهِمْ تِجَارَةٌ وَلَا بَيْعٌ عَن ذِكْرِ اللَّهِ وَإِقَامِ الصَّلَاةِ وَإِيتَاءِ الزَّكَاةِ ۙ يَخَافُونَ يَوْمًا تَتَقَلَّبُ فِيهِ الْقُلُوبُ وَالْأَبْصَارُ (37)

38 తమ సత్కార్యాలకు అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలం ఇవ్వటానికి, అల్లాహ్ తన కృపతో మరింత అధికంగా వొసగటానికి (వారు ఈ విధంగా మసలుకుంటారు). అల్లాహ్ తాను తలచిన వారికి లెక్క లేనంత ఉపాధిని ప్రసాదిస్తాడు.[60]

لِيَجْزِيَهُمُ اللَّهُ أَحْسَنَ مَا عَمِلُوا وَيَزِيدَهُم مِّن فَضْلِهِ ۗ وَاللَّهُ يَرْزُقُ مَن يَشَاءُ بِغَيْرِ حِسَابٍ (38)

కట్టడాలను నిర్మించాలనీ, గొప్ప మీనార్లు ప్రతిష్ఠించాలని, విద్యుద్దీపాలతో అలంకరించాలని కాదు. దీని అసలు భావం ఏమిటంటే ఈ దైవ గృహాలను అన్ని రకాల మలినాల నుంచి పవిత్రంగా ఉంచాలి. వ్యర్థ విషయాలు, అనుచితమైన మాటలకు అక్కడ తావు కల్పించరాదు. ప్రాపంచిక స్వలాభాల కోసం, క్రయవిక్రయాల కోసం మస్జిదులను వేదికలుగా మార్చుకోకూడదు. ఎందుకంటే మస్జిదులు దైవారాధన కోసం ఉద్దేశించినవి. అక్కడ దైవారాధన జరగాలి. ధర్మోన్నతికి సంబంధించిన విషయాలు చర్చించాలి. ప్రజలకు ధార్మిక శిక్షణ ఇవ్వాలి. ధార్మిక సమావేశాలు జరపవచ్చు. "మస్జిదులు అల్లాహ్ కొరకు ఉద్దేశించినవి. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు వేరొకరిని మొరపెట్టుకోకండి" (జిన్–18) అన్న ఆదేశం ఈ సందర్భంగా గమనించదగినది.

అలాగే మస్జిదులలో సాధ్యమైనంతవరకు నిరాడంబరతను పాటించాలి. పటిష్టమైన కట్టడాలను నిర్మించటంలో తప్పులేదు గాని ఆర్భాటాలకు, అట్టహాసాలకు మాత్రం ఆస్కారమివ్వకూడదు. మస్జిదులను ఆకాశ హర్మ్యాలుగా, వైభవోపేతమైన ప్రాసాదాలుగా నిర్మించి ఖరీదైన నగిషీలతో ముస్తాబు చేయరాదని తాకీదు చేయబడింది. ఒకవేళ అలాంటి ఆడంబరాలకు పోతే అది ప్రళయదినం సమీపించిందనటానికి ఆనవాలని ఒక హదీసులో ఉంది (అబూ దావూద్ – కితాబుస్సలాత్....)

57. అల్లాహ్ పవిత్రతను కొనియాడటమంటే నమాజ్ చేయటమని భావం. **'ఆసాలున్'** (اصال) అనేది **'అసీల్'** అనే పదానికి బహువచనం. సాయంత్రం అన్న భావంలో ఈ పద ప్రయోగం జరిగింది. విశ్వాసుల హృదయాలు ఈమాన్ మరియు సన్మార్గంతో దేదీప్యమానంగా ఉంటాయి. వారు ఉదయం సాయంత్రం మస్జిదులలో అల్లాహ్ ప్రీతికోసం నమాజులు చేస్తారు. కడుదీనంగా అల్లాహ్‌ను వేడుకుంటారు.

58. స్త్రీలు కూడా మస్జిదులకు వెళ్ళి నమాజు చేయవచ్చు. వారు ఎంతో నిరాడంబరంగా, పరదా నియమాలను పాటిస్తూ మరీ వెళ్ళాలి. మస్జిదులకు వెళ్ళే సమయంలో సుగంధ ద్రవ్యాలు పూసుకోరాదు. మహాప్రవక్త (సఅసం) కాలంలో కూడా మహిళలు మస్జిదులకు వెళ్ళి నమాజు చేసేవారు. అయితే వారు ఇండ్లలో నమాజ్ చేయటం ఉత్తమం. ఈ ఆయతు ద్వారా కూడా ఆ విషయాన్ని రుజువు చేయటం జరిగింది. హదీసులో కూడా ఈ విషయమే చెప్పబడింది. (అబూదావూద్ – కితాబుస్సలాత్; ముస్నదె అహ్మద్ – 6/297, 301)

59. అంటే ఆనాటి పరిస్థితి అంత భయంకరంగా ఉంటుంది. ఖుర్ఆన్‌లో మరో చోట ఇలా అనబడింది : (ఓ ప్రవక్తా!) దగ్గరపడిన ఆ రోజు (ప్రళయదినం)ను గురించి వారిని హెచ్చరించు. అప్పుడు గుండెలు గొంతు దాకా వచ్చేస్తాయి. ప్రజలు దుఃఖంలో మునిగి ఉంటారు" (మోమిన్ – 18). ఆరంభంలో విశ్వాసుల, అవిశ్వాసుల – అందరి పరిస్థితి ఇలాగే ఉంటుంది.

60. తీర్పుదినాన విశ్వాసులకు వారి సదాచరణకుగాను ఎన్నో రెట్ల పుణ్యఫలం ఇవ్వబడుతుంది. మరి కొంతమందైతే అలవోకగా స్వర్గంలో ప్రవేశిస్తారు. ఆ స్వర్గంలో ఉండే భాగ్యాల గురించి వర్ణించటానికి మాటలు చాలవు. అల్లాహ్ ఉపాధి ప్రదాతలలోకెల్లా శ్రేష్ఠుడు.

**39** అవిశ్వాసుల కర్మల ఉపమానం చదునైన ఎడారి ప్రదేశంలో మెరిసే ఎండమావి లాంటిది. దప్పిక గొన్నవాడు దూరం నుంచి చూసి దాన్ని నీరని భ్రమ చెందుతాడు. తీరా దాని దగ్గరకు వెళితే అక్కడ ఏమీ ఉండదు. అయితే అతనక్కడ అల్లాహ్‌ను పొందు తాడు. ఆయన అక్కడికక్కడే అతని లెక్కను తేల్చివేస్తాడు.[61] అల్లాహ్ లెక్క తీసుకోవటంలో మహా శీఘ్రగామి.

وَالَّذِينَ كَفَرُوا أَعْمَالُهُمْ كَسَرَابٍ بِقِيعَةٍ يَحْسَبُهُ
الظَّمْآنُ مَاءً حَتَّىٰ إِذَا جَاءَهُ لَمْ يَجِدْهُ شَيْئًا
وَوَجَدَ اللَّهَ عِندَهُ فَوَفَّاهُ حِسَابَهُ ۗ وَاللَّهُ
سَرِيعُ الْحِسَابِ ﴿٣٩﴾

**40** లేదా (వారికర్మల ఉపమానం) లోతైన సముద్రపు (అట్టడుగున ఉన్న) చీకట్ల వంటిది. దానిపై అల, ఆపైన మరో అల కమ్ముకొని ఉంది. వాటిపై మేఘాలు ఆవరించివున్నాయి. ఆ విధంగా చీకట్లు ఒకదానిపై ఒకటి (దట్టంగా) అలుముకుని ఉన్నాయి. ఎవరయినా తమ చేతిని బయటికి తీస్తే కానరాని పరిస్థితి అది![62] (యదార్థ మేమిటంటే) అల్లాహ్ ఎవరికి కాంతిని వొసగడో అతనికి కాంతి అనేదే లభించదు.[63]

أَوْ كَظُلُمَاتٍ فِي بَحْرٍ لُّجِّيٍّ يَغْشَاهُ مَوْجٌ مِّن فَوْقِهِ
مَوْجٌ مِّن فَوْقِهِ سَحَابٌ ۚ ظُلُمَاتٌ بَعْضُهَا فَوْقَ
بَعْضٍ إِذَا أَخْرَجَ يَدَهُ لَمْ يَكَدْ يَرَاهَا ۗ وَمَن
لَّمْ يَجْعَلِ اللَّهُ لَهُ نُورًا فَمَا لَهُ مِن نُّورٍ ﴿٤٠﴾

**41** భూమ్యాకాశాలలో వున్న సమస్త సృష్టితాలు, రెక్కలు చాచి[64] ఎగురుతున్న పక్షులూ అల్లాహ్ పవిత్రతను కొనియాడటాన్ని నువ్వు చూడటం లేదా? వాటిలో ప్రతిదీ తన నమాజు విధానాన్ని, స్తోత్రాన్ని గురించి ఎరిగి ఉన్నది.[65] వారు (జనులు) చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.[66]

أَلَمْ تَرَ أَنَّ اللَّهَ يُسَبِّحُ لَهُ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ
وَالطَّيْرُ صَافَّاتٍ ۖ كُلٌّ قَدْ عَلِمَ صَلَاتَهُ وَتَسْبِيحَهُ ۗ
وَاللَّهُ عَلِيمٌ بِمَا يَفْعَلُونَ ﴿٤١﴾

61. **'కర్మలు'** అంటే అవిశ్వాసులు, ముష్రిక్కులు మంచిపనులు అని భావించి చేసే సత్కర్మలు. ఉదాహరణకు : దానధర్మాలు, బంధువుల పట్ల సద్వ్యవహారం, కాబా గృహ నిర్మాణం, హజ్ యాత్రీకులకు సేవలు చేయటం – ఇత్యాదివన్నీ ముమ్మాటికీ సత్కార్యాలే. కాని విశ్వాసం లేకపోవటం వల్ల అవన్నీ వృథా అయిపోతాయి. తాము చేసే సత్కార్యాలకు పుణ్యఫలం లభిస్తుందని వారు అనుకుంటారు. కాని అవి వారిపట్ల ఎండమావులుగా పరిణమిస్తాయి. ఎండమావులు ఎడారి ప్రాంతాలలో, చదునైన ఇసుక మైదానాలలో కానవస్తాయి. అవి ఎండలో సూర్యకిరణాలకు నిగనిగా మెరుస్తూ, దూరం నుంచి ప్రవహించే చెరువుల్లా కనిపిస్తాయి. దగ్గరకు వెళితే ఇసుక తప్ప ఏమీ ఉండదు. అవిశ్వాసుల సత్కర్మలు కూడా ఇంతే. విశ్వాసం (ఈమాన్) లోపించటం వల్ల వారి కర్మలు 'బరువు'ను కోల్పోతాయి. కాబట్టి పుణ్యఫలం కూడా లభించదు. **'సరాబున్'** (سَرَاب) అంటే ఎండమావులు. **'ఖీఅతున్'** (قِيعَة) అంటే నీరు నిలిచి ఉండే పల్లపు ప్రాంతం. చదునైన మైదానం.

62. ఇది రెండవ ఉదాహరణ. అవిశ్వాసుల సత్కర్మలు గాఢాంధకారంలో ఎవరికీ కానరాకుండా పడివుంటాయి. అవిశ్వాసపు అంధకారం, అపమార్గపు అంధకారం, దైవధిక్కార అంధకారం, విశ్వాసంలో కల్తీ కారణంగా ఏర్పడిన అంధకారం, పరలోక ధిక్కరణా అంధకారం – ఇలా అంధకారాలన్నీ కలసి వారి మంచిపనులను కనుమరుగు చేసేస్తాయి. అలాగే ఈ అంధకారాలు వారికి సన్మార్గంలో అవరోధంగా నిలుస్తాయి.

63. అంటే, వారికి ప్రపంచంలో ఈమాన్, ఇస్లాం వెలుగు ప్రాప్తించదు. పరలోకంలో కూడా విశ్వాసులకు లభించే జ్యోతికి వారు నోచుకోకుండా పోతారు.

64. భూమ్యాకాశాలలో వున్న సమస్త సృష్టితాలలో పక్షులు కూడా చేరివున్నప్పటికీ, పక్షుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం

**42** భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌దే. (కడకు అంతా) అల్లాహ్ వైపుకే మరలవలసి ఉంది.[67]

وَلِلّٰهِ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ وَاِلَى اللّٰهِ الْمَصِيْرُ ﴿42﴾

**43** అల్లాహ్ మేఘాలను నడిపించటాన్నీ, మరి వాటిని పరస్పరం కలపటాన్ని, ఆ తరువాత వాటిని ఒకదానిపై ఒకటి పొరలు పొరలుగా పేర్చటాన్ని నువ్వు గమనించటం లేదా? మరి వాటి మధ్య నుంచి వర్షం కురవటాన్ని నువ్వు చూస్తావు. మరి ఆయనే ఆకాశంలోని వడగండ్ల పర్వతాల నుంచి వడగండ్లను కురిపిస్తాడు.[68] తాను కోరినవారిపై వాటిని కురిపిస్తాడు, తాను కోరిన వారినుంచి వాటిని తొలగిస్తాడు.[69] మరి ఆ మేఘాల నుంచి వెలువడే మెరుపు తీగ కంటి చూపును పోగొట్టినట్లే ఉంటుంది.[70]

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ يُزْجِيْ سَحَابًا ثُمَّ يُؤَلِّفُ بَيْنَهٗ ثُمَّ يَجْعَلُهٗ رُكَامًا فَتَرَى الْوَدْقَ يَخْرُجُ مِنْ خِلٰلِهٖ ۚ وَيُنَزِّلُ مِنَ السَّمَآءِ مِنْ جِبَالٍ فِيْهَا مِنْ بَرَدٍ فَيُصِيْبُ بِهٖ مَنْ يَّشَآءُ وَيَصْرِفُهٗ عَنْ مَّنْ يَّشَآءُ ؕ يَكَادُ سَنَا بَرْقِهٖ يَذْهَبُ بِالْاَبْصَارِ ﴿43﴾

గమనించదగిన విషయం. జంతువులలో పక్షులకు గల ప్రత్యేకత ఏమిటంటే అవి దైవ ప్రసాదితమైన శక్తితో భూమ్యాకాశాల మధ్య శూన్యంలో ఎగురుతాయి. అలా ఎగురుతూనే అవి దైవస్తోత్రం చేస్తాయి. ఇతర జంతు జాలానికి ఈ శక్తి లేదు. **'సాఫ్ఫాతున్'** (صٰٓفّٰت) అంటే (తమ రెక్కలను) తెరిచిఉన్నవి అని అర్థం.

65. దైవారాధన ఎలా చేయాలో ప్రతి ప్రాణికీ అల్లాహ్ నేర్పాడు. ప్రతిదీ తనదైన పద్ధతిలో తన సృష్టికర్తను స్తుతిస్తూ ఉంది. ఇది కాకతాళీయం కాదు. వాస్తవానికి ఇది కూడా సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ అసమాన శక్తికి ప్రతిరూపమే.

66. భూమండలంలోనూ, ఆకాశాలలోనూ ఉన్న సృష్టితాలలో ఎవరు తనను ఆరాధిస్తున్నారో, ఎవరు ఆరాధించటంలేదో అల్లాహ్‌కు తెలుసు. ఈ వాక్యం మానవులకు, జిన్నులకు ఒక హెచ్చరిక లాంటిది. మానవులకు, జిన్నులకు దేవుడు తెలివితేటల్ని ఇచ్చాడు. స్వేచ్ఛాధికారం ఇచ్చాడు. ఉచితానుచితాలను పరికించే జ్ఞానం ఇచ్చాడు. అలాంటప్పుడు వారు పూర్తి చైతన్యంతో తమ ప్రభువును స్తుతించాల్సింది. కాని వారు ఈ ఆరాధన పట్ల అశ్రద్ధ వహిస్తున్నారు. మరోవైపు తమకంటే అల్పప్రాణులు రేయింబవళ్లు దైవస్తోత్రంలో నిమగ్నులై ఉంటే మనుషులు మాత్రం అహంకారంతో తమ ప్రభువు ఆరాధన పట్ల విముఖత చూపుతున్నారు. తమ ఈ నిర్లక్ష్యవైఖరిపై వారు నిలదీయబడటం ఖాయం.

67. ఆయన అధికారానికి తిరుగులేదు. ఆయనే అందరి ఆరాధ్య దైవం. ఆయన్ని వదలి వేరొకరిని పూజించటం సమ్మతం కాదు. అందరూ ఆయన వద్దకే మరలిపోవలసి ఉంది. అక్కడ ఆయన ప్రతి ఒక్కరి విషయంలో న్యాయసమ్మతంగా తీర్పు చేస్తాడు.

68. ఈ ఆయతుకు ఒక అర్థం ఇది : ఆకాశంలో వడగండ్ల కొండలు ఉన్నాయి. వాటినుంచే అల్లాహ్ వడగండ్లను కురిపిస్తుంటాడు (ఇబ్నె కసీర్). పైన ఆయతులో ఈ అనువాదమే చేయబడింది.

రెండో అర్థం ఇది : ఇక్కడ **'సమా'** (السَّمَآءِ) అంటే ఎత్తు అని భావం. **'జిబాల్'** (جبَال) అంటే కొండల్లాంటి పెద్ద పెద్ద ముక్కలు అని అర్థం. అంటే అల్లాహ్ ఆకాశం నుంచి వర్షాన్ని మాత్రమే కాదు, పెద్ద పెద్ద మంచు గడ్డలను కూడా కురిపిస్తాడు (ఫత్‌హుల్ ఖదీర్). లేక పర్వతాల్లాంటి మేఘాల నుంచి వడగండ్లను కురిపిస్తాడు అన్న భావం కూడా కావచ్చు.

69. ఆకాశం నుంచి దేవుడు కురిపించే వర్షం కొందరి విషయంలో 'కారుణ్యం'గానూ, మరికొందరి పాలిట శిక్షగానూ పరిణమిస్తుంది. ముఖ్యంగా వడగండ్ల వాన ఎవరిపై కురిసినా అది అక్కడి ప్రజలకు, పశువులకు, పంటలకు తీవ్ర మైన నష్టం చేకూరుస్తుంది. అందుకే సదా అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉండాలి–తమ కొరకు ప్రయోజనకరమైన వర్షాన్ని కురిపించమని!

يُقَلِّبُ اللّٰهُ الَّيْلَ وَالنَّهَارَ ۚ اِنَّ فِيْ ذٰلِكَ
لَعِبْرَةً لِّاُولِي الْاَبْصَارِ ﴿٤٤﴾

**44** అల్లాహ్ రేయింబవళ్ళను మారుస్తూ ఉంటాడు.[71] కళ్ళున్న వారికి ఇందులో గొప్ప గుణపాఠం ఉంది.

وَاللّٰهُ خَلَقَ كُلَّ دَآبَّةٍ مِّنْ مَّآءٍ ۚ فَمِنْهُمْ مَّنْ يَّمْشِيْ
عَلٰى بَطْنِهٖ ۚ وَمِنْهُمْ مَّنْ يَّمْشِيْ عَلٰى رِجْلَيْنِ ۚ
وَمِنْهُمْ مَّنْ يَّمْشِيْ عَلٰٓى اَرْبَعٍ ۗ يَخْلُقُ اللّٰهُ
مَا يَشَآءُ ۗ اِنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ﴿٤٥﴾

**45** సంచరించే సమస్త ప్రాణులను అల్లాహ్ నీటితో సృజించాడు. వాటిలో కొన్ని తమ పొట్ట ఆధారంగా ప్రాకుతుండగా,[72] కొన్ని రెండు కాళ్ళపై నడుస్తున్నాయి.[73] మరి కొన్ని నాలుగు కాళ్లపై నడుస్తున్నాయి.[74] అల్లాహ్ తాను కోరిన దాన్ని సృజిస్తాడు.[75] నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

لَقَدْ اَنْزَلْنَآ اٰيٰتٍ مُّبَيِّنٰتٍ ۗ وَاللّٰهُ يَهْدِيْ
مَنْ يَّشَآءُ اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿٤٦﴾

**46** నిస్సందేహంగా మేము స్పష్టంగా విడమరచి చెప్పే సూచనలను అవతరింపజేశాము. అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు.[76]

وَيَقُوْلُوْنَ اٰمَنَّا بِاللّٰهِ وَبِالرَّسُوْلِ وَاَطَعْنَا ثُمَّ
يَتَوَلّٰى فَرِيْقٌ مِّنْهُمْ مِّنْ بَعْدِ ذٰلِكَ ۗ وَمَآ اُولٰٓئِكَ
بِالْمُؤْمِنِيْنَ ﴿٤٧﴾

**47** "మేము అల్లాహ్‌ను, ప్రవక్తను విశ్వసించాము, విధేయులమయ్యాము" అని వారంటారు. మరి ఆ తరువాత వారిలోని ఒక వర్గం వెనుతిరిగిపోతుంది. వారసలు విశ్వసించినవారే కారు.[77]

---

70. చల్లని పవనాలు, చల్లని మేఘాల మధ్య పుట్టే మెరుపుతీగలో ఎంతశక్తి ఉందో చూడండి! దాన్ని చూస్తుంటే కళ్లు పోయేటట్టే ఉంటుంది. ఇది కూడా దేవుని శక్తికి ప్రతీకే.

71. రేయింబవళ్ల పరిభ్రమణంలో కూడా హెచ్చుతగ్గులున్నాయి. కొంతకాలం పాటు రేయి చిన్నదిగా ఉంటే పగలు పెద్దదిగా ఉంటుంది. మరి కొంతకాలం రేయి పెద్దదిగా ఉంటే పగలు చిన్నదిగా ఉంటుంది. ఈ పెరుగుదల, తరుగుదలల వెనుక కూడా ఆ విశ్వప్రభువు ప్రమేయమే ఉంది. అలాగే ఒక్కోసారి ఆయన పట్టపగలే కారు మేఘాలను ఆకాశంలో దట్టంగా ఆవరింపజేసి పగటి వెలుగును తగ్గిస్తాడు. అలాగే రాత్రి పున్నమి వెన్నెల ద్వారా నలువైపులా కాంతిని విరజిమ్ముతాడు.

72. ఉదాహరణకు : పాములు, చేపలు, కీటకాలు మొదలగునవి.

73. మనుషులు, పక్షులు.

74. పశువులు, మృగాలు, తదితర జంతువులు.

75. దేవుడు సృష్టించిన జంతువులలో కొన్ని నాలుగుకన్నా ఎక్కువ పాదాలు కలవికూడా ఉన్నాయి. ఉదాహరణకు:పీతలు, సాలెపురుగులు, ఇంకా నేలపై ప్రాకే ఇతర పురుగులు.

76. **'స్పష్టంగా విడమరచి చెప్పే సూచనలు'** అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం. అది మానవుని భౌతిక, ఆధ్యాత్మిక రంగాలన్నింటిలోనూ మార్గదర్శకత్వం వహిస్తుంది. "మేము గ్రంథంలో ఏ విషయాన్ని వివరించటంలోనూ ఎలాంటి కొరతా చేయలేదు." (అల్ అన్ఆమ్-38). సన్మార్గ భాగ్యం ప్రాప్తించవలసిన వారికి ఆయన నిశిత దృష్టినీ, శుభాత్మను వొసగుతాడు. వాటి ద్వారా వారు సునాయాసంగా సన్మార్గాన్ని పొందుతారు. సన్మార్గం అంటే ఎలాంటి వక్రత, గంద్రగోళం లేని స్పష్టమైన మార్గం. ఈ మార్గం మనిషిని అతని గమ్యస్థానమైన స్వర్గానికి చేరుస్తుంది.

77. వీరు కపటులు, నోటితో మాత్రం తాము విశ్వసించినట్లు ప్రకటించేవారు. కాని వారి ఆంతర్యాలలో తిరస్కారవైఖరి, వైరభావం తిష్ఠవేసి ఉండేది. పైన ఒక విధంగాను, లోపల మరో విధంగానూ ఉండేవారు. అందుకే తమను తాము విశ్వాసులమని వారు చెప్పుకున్నప్పటికీ, వారి విశ్వాసం (ఈమాన్) నమ్మశక్యం కానిదని చెప్పబడింది.

**48** వారి మధ్య గల వివాదాలను పరిష్కరించటానికి అల్లాహ్‌వైపు, ఆయన ప్రవక్త వద్దకు రమ్మని వారిని పిలిచినప్పుడు కూడా వారిలోని ఒక వర్గం విముఖత చూపుతుంది.

وَإِذَا دُعُوٓا إِلَى اللّٰهِ وَرَسُولِهِ لِيَحْكُمَ بَيْنَهُمْ
إِذَا فَرِيقٌ مِّنْهُم مُّعْرِضُونَ ﴿٤٨﴾

**49** అయితే హక్కు తమకే లభిస్తుందనుకున్నప్పుడు మాత్రం ఎంతో వినయంతో అతని వద్దకు వస్తారు.[78]

وَإِن يَكُن لَّهُمُ الْحَقُّ يَأْتُوٓا إِلَيْهِ مُذْعِنِينَ ﴿٤٩﴾

**50** ఏమిటీ, వారి హృదయాలలో రోగం ఉందా? లేక వారు సంశయంలో పడి ఊగిసలాడుతున్నారా? లేక అల్లాహ్, ఆయన ప్రవక్త తమకు అన్యాయం చేస్తారని వారికి భయం పట్టుకున్నదా? యదార్థానికి వారే అన్యాయపరులు.[79]

أَفِي قُلُوبِهِم مَّرَضٌ أَمِ ارْتَابُوٓا أَمْ يَخَافُونَ أَن
يَحِيفَ اللّٰهُ عَلَيْهِمْ وَرَسُولُهُ ۚ بَلْ أُولَٰٓئِكَ
هُمُ الظَّٰلِمُونَ ﴿٥٠﴾

**51** అదే విశ్వసించినవారిని తమ మధ్యగల వివాదాలను పరిష్క రించటానికి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వద్దకు పిలిచి నప్పుడు, "మేము విన్నాము, శిరసావహించాము"[80] అని వారు అంటారు. సాఫల్యం పొందేవారు వారే.

إِنَّمَا كَانَ قَوْلَ الْمُؤْمِنِينَ إِذَا دُعُوٓا إِلَى اللّٰهِ
وَرَسُولِهِ لِيَحْكُمَ بَيْنَهُمْ أَن يَقُولُوا سَمِعْنَا
وَأَطَعْنَا ۚ وَأُولَٰٓئِكَ هُمُ الْمُفْلِحُونَ ﴿٥١﴾

**52** ఎవరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో, అల్లాహ్‌కు భయపడుతూ, ఆయన (శిక్షల) నుండి తమను కాపాడు కుంటారో వారే విజయం సాధించేవారు.[81]

وَمَن يُطِعِ اللّٰهَ وَرَسُولَهُ وَيَخْشَ اللّٰهَ وَيَتَّقْهِ
فَأُولَٰٓئِكَ هُمُ الْفَآئِزُونَ ﴿٥٢﴾

**53** "తమరు ఆజ్ఞాపించగానే బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నాము" అని (కపటులు) అల్లాహ్‌పై గట్టిగా ప్రమాణం చేసి మరీ చెబుతారు.[82] "ప్రమాణాలు చేయకండి. మీ విధేయత (లోని

وَأَقْسَمُوا بِاللّٰهِ جَهْدَ أَيْمَٰنِهِمْ لَئِنْ أَمَرْتَهُمْ
لَيَخْرُجُنَّ ۖ قُل لَّا تُقْسِمُوا ۖ طَاعَةٌ مَّعْرُوفَةٌ ۚ

---

78. దైవప్రవక్త (సఅసం) న్యాయస్థానానికి ఏ కేసు వచ్చినా నిష్పక్షపాతంగా తీర్పు జరుగుతుందన్న సంగతి వారికి తెలుసు. అందుకే తమ మధ్య గల తగాదాలను దైవప్రవక్త (స) వద్దకు తీసుకురావటానికి జంకేవారు. తీర్పు తమకు అనుకూలంగా వస్తుందన్న గట్టినమ్మకం ఉన్నప్పుడు మాత్రం నక్క వినయాన్ని ప్రదర్శిస్తూ వచ్చేవారు.

79. తీర్పు తమ పక్షానవచ్చే అవకాశం లేదని అనుకున్నప్పుడు దైవప్రవక్త (స) వద్దకు వచ్చే వారు కాదు. కపటుల ఈ వైముఖ్య ధోరణికి కారణాలేమై ఉంటాయి? వారి హృదయాలలో గూడుకట్టుకున్న కాపట్య రోగమే ఇందుకు ప్రధాన కారణమా? లేక ముహమ్మద్ (సఅసం) దైవప్రవక్త అన్న విషయంలో వారికేదన్నా సందేహం ఉందా? లేక దేవుడు మరియు దైవప్రవక్త (స) తమ హక్కును కాజేస్తారని వారు భయపడుతున్నారా? నిజానికి అన్యాయస్థులకే ఇలాంటి కుశంకలు ఉంటాయి. వారు స్వయంగా దుర్మార్గులవటం చేత వారి ఆలోచనలు కూడా పెడదారిన పోతున్నాయి. ఈ ఆయతు నేపథ్యంలో ఇమామ్ షౌకానీ ఇలా అంటున్నారు: తీర్పుకోసం న్యాయశీలుడు, ఖుర్ఆన్ హదీసుల జ్ఞానం గల రాజ్యాధికారి వద్దకో లేక న్యాయమూర్తి వద్దకో రమ్మని ఎవరినయినా పిలిచినప్పుడు విధిగా వెళ్ళాలి. ఒకవేళ న్యాయమూర్తి ధర్మావగాహన లేనివాడైతే అతని దగ్గరకు న్యాయం కోసం వెళ్ళనవసరం లేదు.

80. అవిశ్వాసుల, కపటుల వైఖరికి ప్రతిగా విశ్వాసుల నడవడిక ఎలా ఉంటుందో ఈ ఆయతులో చెప్పబడింది.

81. తమ వ్యవహారాలపై అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఇచ్చే తీర్పులను సంతోషంగా స్వీకరించి, వాటిపై సంతృప్తి

إِنَّ اللَّهَ خَبِيرٌۢ بِمَا تَعْمَلُونَ ۝53

చిత్తశుద్ధి) ఏ పాటిదో విదితమే.[83] మీ కార్యకలాపాల గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు"[84] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

قُلْ أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ ۖ فَإِن تَوَلَّوْا فَإِنَّمَا عَلَيْهِ مَا حُمِّلَ وَعَلَيْكُم مَّا حُمِّلْتُمْ ۖ وَإِن تُطِيعُوهُ تَهْتَدُوا ۚ وَمَا عَلَى الرَّسُولِ إِلَّا الْبَلَاغُ الْمُبِينُ ۝54

**54** (ఓ ప్రవక్తా! వారికి ఈ విధంగా) చెప్పు: "అల్లాహ్ ఆదేశాన్ని పాలించండి. దైవప్రవక్తను అనుసరించండి. ఒకవేళ మీరు గనక విముఖత చూపితే దైవప్రవక్తపై మోపబడిన కార్యభారం వరకే అతను బాధ్యుడు,[85] మీపై ఉన్న కర్తవ్య నిర్వహణకు మీరే సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుంది.[86] మీరు దైవప్రవక్త మాటను విన్నప్పుడే మీకు సన్మార్గం లభిస్తుంది.[87] విషయాన్ని స్పష్టంగా చేరవేయటం వరకే ప్రవక్త బాధ్యత (అని తెలుసు కోండి!")[88]

وَعَدَ اللَّهُ الَّذِينَ آمَنُوا مِنكُمْ وَعَمِلُوا الصَّالِحَاتِ لَيَسْتَخْلِفَنَّهُمْ فِي الْأَرْضِ كَمَا اسْتَخْلَفَ الَّذِينَ مِن قَبْلِهِمْ وَلَيُمَكِّنَنَّ لَهُمْ دِينَهُمُ الَّذِي ارْتَضَىٰ

**55** మీలో ఎవరు విశ్వసించి, మంచి పనులు చేశారో వారికి అల్లాహ్, వారి పూర్వీకులను భూమికి ప్రతినిధులుగా చేసినట్లు గానే వారికి కూడా తప్పకుండా ప్రాతినిధ్యం వొసగుతానని, తాను వారి కోసం సమ్మతించి ఆమోదించిన ధర్మాన్ని వారి కొరకు

చెందేవారే వాస్తవానికి సాఫల్యానికి అర్హులు. పైగా వారు దైవాజ్ఞాబద్ధులై జీవితం గడుపుతారు. సతతం దైవానికి భయపడుతూ ఉంటారు. దైవాగ్రహానికి దూరంగా ఉంటూ ధర్మపరాయణతను అలవర్చుకుంటారు.

82. కపటుల ఇంకొక లక్షణం ఇక్కడ ఎత్తిచూపబడింది. వారు మాట్లాడితే అబద్ధం చెబుతారు. కోతలు కోస్తారు. తాము చెప్పేది నిజమని నమ్మబలకటానికి చాలా ఉదారంగా ప్రమాణాలు చేస్తారు. ప్రతినబూనుతారు. కాని తీరా గడ్డుకాలం వచ్చినప్పుడు సాకులు చెప్పి తప్పించుకుంటారు.

83. కపటుల కల్లబొల్లి కబుర్లకు దీటైన సమాధానం ఇది. మీరు పద్దాక ప్రతిజ్ఞలు చేయాల్సిన అవసరం లేదు. మీ విధేయతలోని 'నిజాయితీ' ఎవరికి తెలియదు గనక? మీలో ఏ పాటి చిత్తశుద్ధి ఉన్నా దాన్ని విపత్కర పరిస్థితిలో క్రియాత్మకంగా నిరూపించుకోండి. అంతేగాని ఊకదంపుడు ఉపన్యాసాలతో, వట్టి మాటలతో హోరెత్తించవలసిన అవసరం లేదు. పై వాక్యాన్ని కొందరు ఈ భావంలో అనువదించారు : నికార్సయిన ముస్లింలు ఎలా కల్లాకపటం లేకుండా ఆజ్ఞల్ని శిరసావహిస్తున్నారో చూసి వాళ్ళనుండి స్ఫూర్తి పొందండి (ఇబ్నె కసీర్).

84. మీ లోగుట్టును గురించి అల్లాహ్‌కు తెలియదని అనుకోకండి. ఎవరు నికార్సయిన విధేయులో, ఎవరు నయవంచకులో ఆయనకు పూర్తిగా తెలుసు. మనసులో విరోధభావాన్ని పెట్టుకుని, పైకి ప్రమాణాలు చేసినంత మాత్రాన మీరు రుజువర్తనులై పోరు. మీరు ఎవరికి మోసం చేసినా అల్లాహ్‌కు మాత్రం మోసం చేయలేరు. అల్లాహ్ గుండెల్లో దాగివున్న గుట్టును గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు.

85. అంటే ధర్మ ప్రచారం చేయవలసిన బాధ్యతను మేము మా ప్రవక్తపై మోపాము. దాన్ని అతను సజావుగా నిర్వర్తిస్తున్నాడు.

86. అతని సందేశాన్ని ఆలకించి, దైవాన్ని, దైవప్రవక్తను విశ్వసించవలసిన బాధ్యత ఇక మీ మీద ఉంది. ఈ విషయంలో మీరు నిలదీయబడతారు.

87. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) సన్మార్గాన ఉన్నాడు. సన్మార్గం వైపు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాడు. ఆ మార్గం స్వర్గానికి చేర్చేమార్గం.

88. అతని మాటను ఎవరు విన్నా వినకపోయినా – మా సందేశాన్ని హెచ్చుతగ్గులు లేకుండా మానవాళికి అందజేయటం

పటిష్టం చేసి, దానికి స్థిరత్వాన్ని కల్పిస్తానని, వారికున్న భయాందోళనల స్థానే శాంతిభద్రతల స్థితిని కల్పిస్తానని వాగ్దానం చేసి ఉన్నాడు.[89] వారు నన్నే ఆరాధిస్తారు. నాకు సహవర్తులుగా ఎవరినీ కల్పించరు.[90] ఇంత జరిగిన తరువాత కూడా ఎవరైనా విశ్వాస ఘాతుకానికి పాల్పడితే ముమ్మాటికీ వారు అవిధేయులవుతారు.[91]

لَهُمْ وَلَيُبَدِّلَنَّهُم مِّن بَعْدِ خَوْفِهِمْ أَمْنًا ۚ يَعْبُدُونَنِي لَا يُشْرِكُونَ بِي شَيْئًا ۚ وَمَن كَفَرَ بَعْدَ ذَٰلِكَ فَأُولَٰئِكَ هُمُ الْفَاسِقُونَ ﴿٥٥﴾

**56** నమాజును నెలకొల్పండి. జకాతును ఇవ్వండి. దైవప్రవక్తకు విధేయులుగా మసలుకోండి. తద్వారానే మీరు కరుణించబడతారు.[92]

وَأَقِيمُوا الصَّلَاةَ وَآتُوا الزَّكَاةَ وَأَطِيعُوا الرَّسُولَ لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴿٥٦﴾

వరకే దైవప్రవక్త బాధ్యత. ఈ విషయమే మరోచోట ఇలా అనబడింది : "(ఓ ప్రవక్తా!) మా ఆజ్ఞలను అందజెయ్యటం వరకే నీ కర్తవ్యం (ఎవరు విన్నా వినకపోయినా) ఆ లెక్క తీసుకోవటం మా పని." (అర్రాద్ – 40)

89. **'ఈ వాగ్దానాన్ని'** కొంతమంది వ్యాఖ్యాతలు దైవప్రవక్త సహచరులకు, మార్గదర్శక ఖలీఫాలకు మాత్రమే పరిమితం చేశారు. అయితే ఈ పరిమితికి సంబంధించి ఎలాంటి ఆధారమూ లేదు. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యాలు సర్వసామాన్యమైనవి. కాకపోతే ఇవి విశ్వాసం (ఈమాన్), మంచిపనులు (ఆమాలె సాలెహ్) అనే రెండు షరతులతో కూడుకున్నవి. ఒకటి మాత్రం నిజం – మార్గదర్శక ఖలీఫాల కాలంలో, ఖైరుల్ ఖురూన్ కాలంలో దేవుని ఈ వాగ్దానం నెరవేరింది. ఆ కాలంలో అల్లాహ్ ముస్లింలకు భూమిపై అధికారాన్ని వొసగాడు. తద్వారా వారు దేవుడు సమ్మతించి ఆమోదించిన జీవనధర్మాన్ని (ఇస్లాంను) నెలకొల్పారు. ధర్మోన్నతి కోసం అహరహం కృషిచేశారు. రాజ్యంలో నెలకొనివున్న అస్థిరత, అశాంతి అలజడుల స్థానంలో సుస్థిరతను, శాంతి భద్రతలను స్థాపించారు. మొదట్లో ముస్లింలు అవిశ్వాసులను చూసి భయపడేవారు. కాని అనతికాలంలోనే పరిస్థితి తద్భిన్నంగా తయారయింది. దైవప్రవక్త (సఅసం) పలికిన భవిష్యవాణి కూడా ఈ కాలంలో సంభవించింది. ఉదాహరణకు ప్రవక్త (సఅసం)వారు ఇలా చెప్పారు : "ఒక స్త్రీ 'హైరహ్' నుండి బయలుదేరి ఒంటరిగా ప్రయాణం చేస్తూ బైతుల్లాహ్ (కాబా గృహం)కు వచ్చి ప్రదక్షిణ చేస్తుంది. ఆమెకెలాంటి భీతిగానీ, ఆందోళనగానీ, ప్రాణభయంగానీ ఉండవు. ఈరాన్ సామ్రాజ్యానికి చెందిన ఖజానాలు మీ పాదాక్రాంతం అవుతాయి." (సహీహ్ బుఖారీ – కితాబుల్ మనాఖిబ్). కడకు ప్రవక్త (స) వారు చెప్పినట్లే జరిగింది. మహాప్రవక్త(స) ఇంకా ఈ విధంగా చెప్పారు : "అల్లాహ్ భూమిని నా కోసం కుంచింపజేశాడు. నేను తూర్పు పశ్చిమ భూభాగాలను చూశాను. నా కోసం భూమి కుంచింపజేయబడినంతవరకూ అతి త్వరలోనే నా అనుచర సమాజం రాజ్యవిస్తరణ అక్కడి వరకూ చేరుకుంటుంది." (ముస్లిం – కితాబుల్ ఫితన్....). ఈ మాట కూడా అక్షరాలా సత్యం అయింది. పారసీక, సిరియా, ఈజిప్టు రాజ్యాలు, ఆఫ్రికా రాజ్యాలు, ఇంకా ఇతర సుదూర ప్రాంతాలు జయించబడ్డాయి. బహుదైవారాధన, నాస్తికత్వం ఉన్న ఎన్నో రాజ్యాలలో ఏకదైవారాధనా దివ్వెలు వెలిగించబడ్డాయి. ఇస్లామీయ సంస్కృతీ నాగరికతలు ప్రపంచం నలుమూలలా విస్తరించాయి. అయితే దేవుని ఈ వాగ్దానం షరతులతో కూడుకున్నది.

ముస్లింల విశ్వాసం (ఈమాన్) బలహీనపడి, సదాచరణలో వారు వెనుకంజవేయగానే అల్లాహ్ వారి గౌరవోన్నతుల్ని పరాభవంగా, వారి ప్రాబల్యాన్ని పరాధీనతగా, వారి శాంతీసుస్థిరతల్ని అశాంతి అస్థిరతలుగా మార్చివేశాడు.

90. ఇక్కడ కూడా విశ్వాసం, సదాచరణలతోపాటు మరో మౌలిక షరతు విధించబడింది. అదే తౌహీద్ (ఏకదైవారాధన). ముస్లింలు ఏకదైవారాధన విషయంలో గట్టిగా ఉన్నప్పుడే దైవసహాయానికి అర్హులవుతారు. ఈ సుగుణం గనక వారిలో లేకుండాపోతే చెల్లాచెదురై, నిస్సహాయులుగా జీవితం గడపవలసి వస్తుంది. ఇది ముస్లింలకు ఒక హెచ్చరిక వంటిది.

91. ఇక్కడ **'విశ్వాస ఘాతుకం'** అంటే విశ్వాసానికి, సదాచరణకు, ఏకదైవారాధనకు దూరమవటం అని అర్థం. ఈ

57 ఈ అవిశ్వాసులు రాజ్యంలో (అటూ ఇటూ పరుగులు తీసి) మమ్మల్ని అశక్తుల్ని చేస్తారని[93] ఎన్నడూ తలపోయకు. వారి అసలు నివాసస్థలం నరకమే. అది మహా చెడ్డ గమ్యస్థానం.

لَا تَحْسَبَنَّ الَّذِيْنَ كَفَرُوْا مُعْجِزِيْنَ فِى الْاَرْضِ ۚ
وَمَاْوٰىهُمُ النَّارُ ؕ وَلَبِئْسَ الْمَصِيْرُ ﴿57﴾

58 ఓ విశ్వాసులారా! మీ అధీనంలో వున్న మీ బానిసలుగానీ, ఇంకా ప్రాజ్ఞవయస్సుకు చేరని మీ పిల్లలుగానీ మూడు వేళల్లో మాత్రం మీ అనుమతి పొందిన మీదటే మీ వద్దకు రావాలి– 1. ఫజ్ర్ నమాజుకు పూర్వం, 2. మధ్యాహ్నం (జుహ్ర్) వేళ మీరు మీ బట్టలు విడిచి ఉన్నప్పుడు, 3. ఇషా నమాజు తరువాత.[94] ఈ మూడు వేళలు మీరు ఏకాంతం (పరదా)లో ఉండే వేళలు.[95] ఈ మూడు వేళల్ని మినహాయిస్తే (రాకపోకలు సాగించటంలో) మీపై గానీ, వారిపైగానీ ఎలాంటి దోషం లేదు.[96] (ఎందుకంటే) మీరు తరచూ ఒండొకరి దగ్గరకు వస్తూపోతూ ఉండవలసిన వారే.[97] ఈ విధంగా అల్లాహ్ తన ఆజ్ఞలను మీకు స్పష్టంగా విడమరచి చెబుతున్నాడు. అల్లాహ్ సంపూర్ణ జ్ఞాని, పరిపూర్ణ వివేకవంతుడు.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لِيَسْتَاْذِنْكُمُ الَّذِيْنَ مَلَكَتْ
اَيْمَانُكُمْ وَالَّذِيْنَ لَمْ يَبْلُغُوا الْحُلُمَ مِنْكُمْ ثَلٰثَ
مَرّٰتٍ ؕ مِنْ قَبْلِ صَلٰوةِ الْفَجْرِ وَحِيْنَ تَضَعُوْنَ
ثِيَابَكُمْ مِّنَ الظَّهِيْرَةِ وَمِنْۢ بَعْدِ صَلٰوةِ الْعِشَآءِ ۛؕ
ثَلٰثُ عَوْرٰتٍ لَّكُمْ ؕ لَيْسَ عَلَيْكُمْ وَلَا عَلَيْهِمْ جُنَاحٌۢ
بَعْدَهُنَّ ؕ طَوّٰفُوْنَ عَلَيْكُمْ بَعْضُكُمْ عَلٰى بَعْضٍ ؕ
كَذٰلِكَ يُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ ؕ وَاللّٰهُ عَلِيْمٌ
حَكِيْمٌ ﴿58﴾

మూడింటికి దూరమైనంతనే మనిషి దైవవిధేయతా పరిధికి అవతల విసిరివేయబడతాడు–అవిశ్వాసం, అవిధేయతల ఊబిలో చిక్కుకుపోతాడు.

92. ముస్లింలకు ఇది ముఖ్య హితవు. వారు ఏనాటికయినా దేవుని కరుణానుగ్రహాలకు నోచుకోవాలంటే వారు స్వచ్ఛమైన ఏకదైవారాధనా మార్గాన్ని అవలంబిస్తూ, దైవప్రవక్త (సఅసం) సూచించిన పద్ధతిని అనుసరించాలి. దైవప్రవక్త సహచరులు (సహాబా) ఈ కరుణానుగ్రహాలకు నోచుకున్నారు.

93. (ఓ ముహమ్మద్!) నువ్వు నీ విరోధుల, ధిక్కారుల కరకు వైఖరిని చూసి కలవరం చెందకు. వారు అల్లాహ్‌ను లొంగదీయలేరు సుమా! అల్లాహ్ వారి మెడలు వంచి తీరుతాడు.

94. **'బానిసలు'** అంటే పురుష బానిసలు, స్త్రీ బానిసలు కూడా ఇందులో చేరి వున్నారు. ఈ ఆయతులో ప్రస్తావించబడిన ఆ 'మూడు వేళల్లో' మనిషి తన భార్యతో ఏకాంతంలో గడుపుతుంటాడు. లేదా అన్యులు ఎవరూ చూడదగని వస్త్రధారణలో ఉంటాడు. కనుక ఆ 'మూడు వేళల్లో' ఇంట్లోని చిన్నపిల్లలుగానీ, సేవకులుగానీ అనుమతి లేకుండా వారి గదులలోనికి వెళ్ళకూడదు.

95. మూలంలో **'ఔరాతిన్'** (عَوْرٰتٍ) అని ఉంది. **'ఔరతున్'** అనే పదానికి ఇది బహువచనం. అంతరాయం, లోపం అని ఈ పదానికి అసలు అర్థం. బహిర్గతం చేయటానికి మానవనైజం వాంఛించనిది అని దీని భావం. స్త్రీని 'ఔరత్'గా వ్యవహరించటంలోని మర్మం కూడా ఇదే. అంటే స్త్రీ తన అంగాంగాలను ప్రదర్శించటం, అర్ధనగ్న, ముప్పాతిక నగ్న దుస్తుల్ని ధరించటం వాంఛనీయం కాదని, ఆమె తన అలంకరణను వ్యక్తపరచటం అభిలషణీయం కాదని అందుకే చెప్పబడింది. ఈ 'మూడు వేళలు' (ఫజ్ర్ నమాజుకు పూర్వం, జుహ్ర్ వేళ, ఇషా తరువాత) 'ఔరత్' వేళలు. అంటే ఈ వేళలు మీరు తెరమరుగున – ఏకాంతంలో – ఉండవలసిన వేళలు! ఇతరులు ఎవరూ ఆ స్థితిలో మిమ్మల్ని చూడటానికి మీరు ఇష్టపడని వేళలు!!

96. ఈ మూడు వేళలు తప్పితే మిగిలిన సమయాలలో మీ ఇంటి నౌకర్లు అనుమతి లేకుండా కూడా మీ ఇళ్లల్లోకి రాకపోకలు సాగించవచ్చు.

**59** మరి మీ పిల్లలు (కూడా) ప్రాజ్ఞ వయస్సుకు చేరుకున్న తరువాత, తమ పూర్వీకులు అనుమతి పొందినట్లే వారు కూడా అనుమతి పొంది మరీ రావాలి.[98] అల్లాహ్ ఈ విధంగా తన ఆదేశాలను మీకు విశదపరుస్తున్నాడు. అల్లాహ్‌యే సర్వజ్ఞాని, వివేకసంపన్నుడు.

وَإِذَا بَلَغَ الْأَطْفَالُ مِنكُمُ الْحُلُمَ فَلْيَسْتَأْذِنُوا كَمَا
اسْتَأْذَنَ الَّذِينَ مِن قَبْلِهِمْ ۚ كَذَٰلِكَ يُبَيِّنُ اللَّهُ
لَكُمْ آيَاتِهِ ۗ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿٥٩﴾

**60** పెళ్ళిపై ఆశ (కోరిక) లేని వృద్ధ స్త్రీలు – తమ అందాలంక రణలు ప్రదర్శించే ఉద్దేశం లేకుండా – తమ పై దుప్పట్లను తీసేసినా తప్పులేదు.[99] అయినప్పటికీ వారు జాగ్రత్త వహిస్తే అది వారికే శ్రేయస్కరం.[100] అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

وَالْقَوَاعِدُ مِنَ النِّسَاءِ اللَّاتِي لَا يَرْجُونَ نِكَاحًا
فَلَيْسَ عَلَيْهِنَّ جُنَاحٌ أَن يَضَعْنَ ثِيَابَهُنَّ
غَيْرَ مُتَبَرِّجَاتٍ بِزِينَةٍ ۖ وَأَن يَسْتَعْفِفْنَ
خَيْرٌ لَّهُنَّ ۗ وَاللَّهُ سَمِيعٌ عَلِيمٌ ﴿٦٠﴾

**61** గుడ్డివానిపైగానీ, కుంటివానిపైగానీ, వ్యాధిగ్రస్తునిపైగానీ, స్వయంగా మీపైనగానీ – మీ ఇండ్లలో నుంచి అయినా లేదా మీ తండ్రుల ఇళ్ళ నుంచి అయినా లేదా మీ తల్లుల ఇళ్ల నుంచి అయినా, లేదా మీ అన్నదమ్ముల ఇళ్లనుంచి అయినా లేదా మీ అక్కాచెల్లెళ్ల ఇళ్ల నుంచి అయినా, లేదా మీ పిన తండ్రుల

لَّيْسَ عَلَى الْأَعْمَىٰ حَرَجٌ وَلَا عَلَى الْأَعْرَجِ حَرَجٌ
وَلَا عَلَى الْمَرِيضِ حَرَجٌ وَلَا عَلَىٰ أَنفُسِكُمْ أَن
تَأْكُلُوا مِن بُيُوتِكُمْ أَوْ بُيُوتِ آبَائِكُمْ أَوْ بُيُوتِ
أُمَّهَاتِكُمْ أَوْ بُيُوتِ إِخْوَانِكُمْ أَوْ بُيُوتِ أَخَوَاتِكُمْ

---

97. ఈ కారణంగానే కాబోలు హదీసులో పిల్లి పరిశుద్ధ జంతువుగా పేర్కొనబడింది. "పిల్లి అశుద్ధమైనది కాదు. ఎందుకంటే అది అత్యధికంగా మీ వద్దకు (మీ ఇంట్లోకి) జొరబడుతూ ఉంటుంది" (అబూ దావూద్ – కితాబుత్తహారత్). ఇంటి యజమాని – ఇంటి నౌకరు కూడా ఎల్లవేళలా ఎదురు పడవలసినవారే. ఒకరితో ఇంకొకరికి తరచూ అవసరం పడుతూ ఉంటుంది. ఈ సాధారణ అవసరం దృష్ట్యానే దేవుడు ఈ రాకపోకల అనుమతిని ఇచ్చాడు. ఎందుకంటే దేవుడు సర్వజ్ఞాని. ఉచితానుచితాలను ఎరిగినవాడు. ప్రజల అవసరాలేమిటో, ఇబ్బందులేమిటో ఆయనకు పూర్తిగా తెలుసు. ఆయన జారీ చేసే ప్రతి ఉత్తర్వులో ఎన్నో మానవ ప్రయోజనాలు, పరమార్థాలు దాగి ఉంటాయి.

98. పిల్లలు పిల్లలే. కాని వారు యుక్తవయస్సుకు చేరుకున్న మీదట మాత్రం – వారు కూడా తమ పెద్దల సంప్రదాయాన్ని అనుసరించి – ఇస్లామీయ షరీయతు సూచించిన 'మర్యాదలను' పాటించవలసి ఉంటుంది. వారెప్పుడు, ఎవరి ఇంట్లోకి ప్రవేశించదలచినా ముందుగా అనుమతి తీసుకుని మరీ ప్రవేశించాలి.

99. **'పెండ్లి ఆశలేని వృద్ధ స్త్రీలు'** అంటే బహిష్టు ఆగిపోయి, సంతానం కనలేని స్త్రీలు అని భావం. ఈ వయసులో సాధారణంగా ఒక స్త్రీకి ఉండవలసిన లైంగిక వాంఛలు ఉండవు. ఆ వయసులో వివాహం పట్ల కూడా ఆమెకు ఆసక్తి ఉండదు. పురుషులు కూడా సాధారణంగా అలాంటి స్త్రీలను భార్యలుగా చేసుకోవటానికి సుముఖంగా ఉండరు. అలాంటి స్త్రీలకు పరదా విషయంలో కొంత సడలింపు ఇవ్వబడింది. తమ అందాలను ప్రదర్శించే ఉద్దేశం లేకుండా వారు బురఖా ధరించకపోయినా, ఒంటిపై దుప్పటి వేసుకోకపోయినా అది విపరీతం అనిపించుకోదు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే కొంతమంది స్త్రీలు అందం, ఆకర్షణ లేకపోయినా అందంగా ముస్తాబై, తమ అలంకరణను ఇతరులముందు ప్రదర్శించేందుకు ప్రయత్నించవచ్చు. అలాంటి ప్రదర్శనాబుద్ధి ఉన్న వారు పరదాను పాటించటమే ఉత్తమం.

100. అంటే అలాంటి వృద్ధ మహిళలు కూడా దుప్పటిని కప్పుకుంటూ, సాధ్యమైనంత వరకు పరదా నియమాలను పాటించటం ఉత్తమం.

ఇళ్లనుంచి అయినా,[101] లేదా మీ మేనత్తల ఇళ్లనుంచి అయినా లేదా మీ మేనమామల ఇళ్లనుంచి అయినా లేదా మీ పినతల్లుల ఇళ్లనుంచి అయినా లేదా తాళపు చెవులు మీ అధీనంలో వున్న ఇళ్లనుంచి అయినా లేదా మీ స్నేహితుల ఇళ్లనుంచి అయినా - ఏమైనా (ఆహార వస్తువులు)[102] తీసుకుని తింటే అది అభ్యంతర కరం ఏమీ కాదు. మీరంతా కలిసి భుజించినా, లేక వేర్వేరుగా భుజించినా తప్పులేదు.[103] అయితే మీరు ఇండ్లలో ప్రవేశించే టప్పుడు మాత్రం మీ స్వయానికి సలాం చేసుకోండి.[104] ఇది అల్లాహ్ తరఫు నుంచి అవతరించిన, మేలు కొరకు చేయబడే ప్రార్థన, శుభకరమైనది, పవిత్రమైనది. ఈ విధంగా అల్లాహ్ మీరు గ్రహించగలందులకు తన ఆజ్ఞలను మీకు తేటతెల్లం చేస్తున్నాడు.

اَوْ بُيُوْتِ اَعْمَامِكُمْ اَوْ بُيُوْتِ عَمّٰتِكُمْ اَوْ بُيُوْتِ
اَخْوَالِكُمْ اَوْ بُيُوْتِ خٰلٰتِكُمْ اَوْ مَا مَلَكْتُمْ مَّفَاتِحَهٗۤ اَوْ
صَدِيْقِكُمْ ؕ لَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ اَنْ تَاْكُلُوْا جَمِيْعًا
اَوْ اَشْتَاتًا ؕ فَاِذَا دَخَلْتُمْ بُيُوْتًا فَسَلِّمُوْا عَلٰۤى
اَنْفُسِكُمْ تَحِيَّةً مِّنْ عِنْدِ اللّٰهِ مُبٰرَكَةً طَيِّبَةً ؕ
كَذٰلِكَ يُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ لَعَلَّكُمْ تَعْقِلُوْنَ ﴿61﴾

101. ప్రవక్త సహచరులు (రజి) యుద్ధాలకు వెళ్ళినప్పుడు వికలాంగులకు తమ ఇంటి తాళపు చెవులు ఇచ్చివెళ్ళేవారు. తమ ఇంట్లోని ఆహార పదార్థాలను తీసుకుని తినేందుకు కూడా వారికి అనుమతి ఇచ్చేవారు. అయినప్పటికీ ఈ వికలాంగ సహాబీలు (రజి) ఇంటి యజమానుల పరోక్షంలో, వారి ఇండ్లలోని ఆహార వస్తువులను తీసుకుని తినటం ధర్మసమ్మతం కాదని భావించేవారు. అలాంటి వారిని ఉద్దేశించి అల్లాహ్, వారు తమ ఆత్మీయుల, బంధువుల ఇండ్లనుంచి ఏదైనా తీసుకుని తిన్నా, తాళపు చెవులు తమ అధీనంలో వున్న ఇళ్లలోనుంచి తీసుకుని తిన్నా తప్పులేదని స్పష్టం చేశాడు.

మరికొందరు ఈ ఆయతును ఈ అర్థంలో తీసుకున్నారు : ఆరోగ్యవంతులైన సహాబీలు (రజి) అవిటివారైన సహాబీలతో కలసి భోజనం చేయటానికి తడబడేవారు. కారణం: తాము ఎక్కువగా తిని, అవిటివారు తక్కువగా తిన్నపక్షంలో తాము వారికి అన్యాయం చేసినవారమవుతామేమోనని, దాని గురించి అల్లాహ్ సమక్షంలో ప్రశ్నించబడతామేమోనని భయపడేవారు. మరోవైపు వికలాంగులు (అవిటివారు) కూడా ఆరోగ్య వంతులతో, శ్రీమంతులతో కలసి కూర్చుని తినటానికి మొహమాటపడేవారు. ఎందుకంటే తమవల్ల వారికి అసౌకర్యం కలుగుతుందేమోనని వారు తలపోసేవారు. అయితే ఇందులో ఆక్షేపణీయమైన విషయం ఏమీ లేదని అల్లాహ్ ఇరువర్గాల వారికి కూడా స్పష్టం చేశాడు.

102. **'ఆహార వస్తువులు'** అంటే అతి సామాన్యమైన వస్తువులు అని భావం. ఇంటి యజమానుల పరోక్షంలో దాచిపెట్టిన ఖరీదైన వస్తువులనుగానీ, నిల్వచేసి ఉంచిన ఆహారధాన్యాలనుగానీ తీసుకోకూడదు. అలాంటి వస్తువులను తీసుకోవటం అధర్మం. (ఐసరుత్తఫాసీర్)

ఇకపోతే ఒక తండ్రి పాలిట కొడుకుల ఇల్లు స్వంత ఇల్లు లాంటిదే. ఒక హదీసులో మహాప్రవక్త (సఅసం), "నువ్వూ, నీ ఆస్తి కూడా నీ తండ్రిదే" అని తీర్పు ఇవ్వటం గమనార్హం. (ఇబ్ను మాజ - నెం. 2291; ముస్నదె అహ్మద్-2/179, 204, 214). వేరొక హదీసులో, "మనిషి సంతానం కూడా అతని సంపాదన లోనిదే" అని వుంది (ఇబ్ను మాజ- నెం.2137, అబూ దావూద్ - 3528, అల్బానీ ఈ హదీసుని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

103. ఈ వాక్యం ద్వారా ఇంకొక సంకోచం కూడా దూరం చేయబడింది. కొంతమంది ఒంటరిగా భోజనం చేయటాన్ని ఇష్టపడరు. నలుగురితో కలసి భుజించటం తప్పనిసరి అని భావిస్తారు. అందుకే కలసి భుజించినా, వేర్వేరుగా - ఒంటరిగా - భుజించినా దోషం లేదనీ, రెండూ సమ్మతమేనని అల్లాహ్ స్పష్టం చేశాడు. అయితే కలిసి తినటం ఒంటరిగా తినటం కన్నా మంచి పద్ధతి. హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది (ఇబ్నె కసీర్).

إِنَّمَا الْمُؤْمِنُونَ الَّذِينَ آمَنُوا بِاللَّهِ وَرَسُولِهِ
وَإِذَا كَانُوا مَعَهُ عَلَىٰ أَمْرٍ جَامِعٍ لَّمْ يَذْهَبُوا
حَتَّىٰ يَسْتَأْذِنُوهُ ۚ إِنَّ الَّذِينَ يَسْتَأْذِنُونَكَ
أُولَٰئِكَ الَّذِينَ يُؤْمِنُونَ بِاللَّهِ وَرَسُولِهِ ۚ فَإِذَا
اسْتَأْذَنُوكَ لِبَعْضِ شَأْنِهِمْ فَأْذَن لِّمَن
شِئْتَ مِنْهُمْ وَاسْتَغْفِرْ لَهُمُ اللَّهَ ۚ إِنَّ اللَّهَ
غَفُورٌ رَّحِيمٌ ﴿62﴾

**62** అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను నమ్ముతూ, ఏదైనా సామూహిక వ్యవహారంలో దైవప్రవక్త వెంట ఉన్నప్పుడు ఆయన అనుమతి పొందనంత వరకూ ఎక్కడికీ పోకుండా ఉండేవారే సిసలైన విశ్వాసులు. అలాంటి (కీలక) సమయాలలో నీ నుండి అనుమతి తీసుకునేవారే వాస్తవానికి అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించినవారు.[105] కనుక (ఓ ప్రవక్తా!) అలాంటి వారు ఎప్పుడయినా, ఏదయినా తమ పని మీద నీ నుండి సెలవు కోరితే, వారిలో నువ్వు తలచిన వారికి సెలవు ఇస్తూ ఉండు. ఇంకా వారి మన్నింపు కొరకు అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండు. నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలి, కృపాకరుడు.

لَّا تَجْعَلُوا دُعَاءَ الرَّسُولِ بَيْنَكُمْ كَدُعَاءِ بَعْضِكُم
بَعْضًا ۚ قَدْ يَعْلَمُ اللَّهُ الَّذِينَ يَتَسَلَّلُونَ مِنكُمْ
لِوَاذًا ۚ فَلْيَحْذَرِ الَّذِينَ يُخَالِفُونَ عَنْ أَمْرِهِ أَن
تُصِيبَهُمْ فِتْنَةٌ أَوْ يُصِيبَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿63﴾

**63** మీరు దైవప్రవక్త పిలుపును, మీలో ఒండొకరిని పిలుచుకునే మామూలు పిలుపులా అనుకోకండి.[106] మీలో ఒకరి వెనుక ఒకరు దాక్కుంటూ మెల్లగా జారుకునే వారెవరో అల్లాహ్‌కు తెలుసు.[107] వినండి! ఎవరు ప్రవక్త ఆజ్ఞను ఎదిరిస్తున్నారో వారు, తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చిపడుతుందేమోనని[108] లేదా తమను ఏదయినా బాధాకరమైన శిక్ష చుట్టు ముడుతుందేమోనని భయపడాలి.

104. తమ ఇండ్లలోకి వెళ్ళేటప్పుడు పాటించవలసిన నియమ నిబంధనలు ఇక్కడ తెలియజేయబడ్డాయి. వారు ఇంట్లోని వారికి 'సలాం' చేయాలి. మనిషి తన ఇల్లాలికి, కన్నపిల్లలకు సలాం చేయడానికి ఇబ్బంది పడవచ్చుగాక! కాని మనిషికి తన 'అహం'కన్నా 'దైవాదేశం' ముఖ్యం అని మరువరాదు. అతను దైవాదేశాన్ని పాటించి, తన ఆలుబిడ్డలను దీవించటంలో సిగ్గుపడాల్సిన పనేముంది?

105. శుక్రవారం నమాజు, పండుగ నమాజుల సందర్భంగా ముస్లింలు అందరూ ఒకచోట సమావేశమయ్యేవారు. అలాగే దేశ ఆంతరంగిక వ్యవహారాలపై, విదేశాంగ వ్యవహారాలపై సంప్రతించే నిమిత్తం దైవప్రవక్త (సఅసం) కబురంపగానే ముస్లింలు హాజరయ్యేవారు. ఏదైనా బలమైన కారణంపై రాలేని పక్షంలో వారు దైవప్రవక్త నుండి ఆ మేరకు అనుమతి పొందేవారు. కాని కపటుల పరిస్థితి మాత్రం దీనికి భిన్నంగా ఉండేది. వారు అనుమతి తీసుకోకుండానే గైర్హాజరయ్యేవారు.

106. దీనికి ఒక భావం ఇది : మీరు ఒకరింకొకరిని పేరుపెట్టి పిలిచినట్లుగా దైవప్రవక్త (సఅసం)ను పిలువకండి. ఉదాహరణకు : "ఓ ముహమ్మద్ (సఅసం)!" అని సంబోధించకూడదు. "ఓ దైవప్రవక్తా (సఅసం)!" అని సంబోధించాలి (ఇది ప్రవక్త ప్రత్యక్ష సహచరుల్ని ఉద్దేశించి చేయబడిన సూచన).

రెండవ భావం ఇది : మీరు దైవప్రవక్త (స) శాపాన్ని సాధారణ వ్యక్తుల శాపంలా తలపోయకండి. ఎందుకంటే దైవప్రవక్త (స) ఏమని వేడుకున్నా అది ఆమోదించబడుతుంది. కాబట్టి మీరు దైవప్రవక్త దీవెనలు పొందండి. ఆయన (స) మనసు నొప్పించేలా ప్రవర్తించి, ఆయన అభిశాపానికి గురికాకండి. ఒకవేళ మీరలా చేశారంటే మీ వినాశం తప్పదు.

64 వినండి! భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ అల్లాహ్‌దే.[109] మీ స్థితిగతుల గురించి ఆయనకు బాగా తెలుసు.[110] వారందరూ ఆయన వైపుకు మరలించబడిన రోజున, వారు చేసిన కర్మలన్నింటినీ ఆయన వారికి తెలియపరుస్తాడు. అల్లాహ్ ప్రతిదీ క్షుణ్ణంగా తెలిసినవాడు.

أَلَآ إِنَّ لِلَّهِ مَا فِي ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ ۖ قَدْ يَعْلَمُ مَآ أَنتُمْ عَلَيْهِ وَيَوْمَ يُرْجَعُونَ إِلَيْهِ فَيُنَبِّئُهُم بِمَا عَمِلُوا۟ ۗ وَٱللَّهُ بِكُلِّ شَىْءٍ عَلِيمٌۢ ﴿64﴾

107. ఆనాటి కపటులను ఉద్దేశించి ఈ విధంగా చెప్పబడింది. ఏదైనా ముఖ్య విషయంపై సామూహికంగా సలహా సంప్రతింపులు జరుపుతున్నప్పుడు కపటులు మోహం చాటేసి, నెమ్మదిగా సమావేశం నుంచి బయటపడేవారు.

108. ఇక్కడ **'ఘోర విపత్తు'** అంటే హృదయాల వక్రత అని అర్థం. ఈ వక్రతే మనిషిని విశ్వాస భాగ్యానికి నోచుకోకుండా చేస్తుంది. దైవప్రవక్త (స) ఆజ్ఞల పట్ల నిర్లక్ష్య ధోరణి, వ్యతిరేకత మూలంగా హృదయాలలో ఈ రకమైన 'వక్రత' జనిస్తుంది. ఎవరయితే ఈ రోగానికి లోనై విశ్వసించటానికి నిరాకరిస్తారో వారు శాశ్వితమైన నరకయాతనను కొని తెచ్చుకున్నవారవుతారు. అందుకే అనుదినం, అనుక్షణం దైవప్రవక్త (స) విధానాన్ని, సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుకంటే దైవప్రవక్త (స) విధానానికి అనుగుణంగా ఉండే సత్కర్మలే దైవసన్నిధిలో స్వీకారయోగ్యం అవుతాయి. మిగిలినవన్నీ త్రోసిపుచ్చబడతాయి. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు స్వయంగా ఇలా ప్రవచించారు: "ఎవరయినా మా విధానంతో సంబంధం లేకుండా ఏదన్నా సదాచరణ చేస్తే అది త్రోసిపుచ్చబడుతుంది." (బుఖారీ, ముస్లిం).

109. సృష్టిరీత్యాగానీ, సార్వభౌమత్వం రీత్యాగానీ, అజమాయిషీ దృష్ట్యాగానీ – సర్వవిధాలా ఆయనే తిరుగులేనివాడు. ఆయన కోరిన విధంగా వస్తువుల పంపకం చేయగలడు. తాను కోరిన వారికి కోరినంత ఇవ్వగలడు. కాని అనుయాయులు మాత్రం తమ ప్రవక్త (స) విషయంలో అల్లాహ్‌కు భయపడుతూ ఉండాలి. దైవప్రవక్త (స) మాటను జవదాటకూడదు. ఆయన (స) ఏదైనా విషయం నుండి వారిస్తే దానికి ఖచ్చితంగా కట్టుబడి ఉండాలి. అసలు దైవప్రవక్త (స)ను దేవుడు పంపటంలోని ప్రధాన ఉద్దేశం ఇదే.

110. దైవప్రవక్త (సఅసం) ఆజ్ఞలను ఎదిరించే వారికి ఇది హెచ్చరిక! దైవప్రవక్త (స) అభిమతానికి వ్యతిరేకంగా కార్యకలాపాలను కొనసాగించేవారు నిర్భయంగా, నిశ్చింతగా ఉండరాదు. ఎందుకంటే వారి లోగుట్టును గురించి అల్లాహ్‌కు అంతా తెలుసు. వారి సంకల్పాలను, చేష్టలను బట్టి ఆయన అంతిమ దినాన బహుమతి ఇవ్వటమో, శిక్ష విధించటమో చేస్తాడు.

25వ సూరా

# అల్ ఫుర్‌ఖాన్

## గీటురాయి

అవతరణ మక్కాలో

ఆయతులు 77

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ధార్మిక విశ్వాసానికి సంబంధించిన సూత్రాలను నొక్కి చెప్పింది. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దివ్యవాణి అవతరణ, మరణానంతరం మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాలు వంటి మౌలిక విశ్వాసాలను ఈ సూరా మనస్సుకు హత్తుకునేలా తెలియజేసింది. ఈ సూరా మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన "ఫుర్‌ఖాన్" (గీటురాయి) అన్న పదం ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అరబీలో ఫుర్ఖాన్ అంటే గీటురాయి అని అర్థం. దివ్య ఖుర్‌ఆన్‌కు ఉన్న పేర్లలో ఫుర్ఖాన్ ఒకటి. ధార్మిక విశ్వాసానికి – అవిశ్వాసానికి, మార్గదర్శకత్వానికి – మార్గ విహీనతకి, సత్యానికి – అసత్యానికి, వెలుగుకు– చీకట్లకు మధ్య భేదాన్ని తెలిపేది ఫుర్ఖాన్. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) చూపించిన మహత్తరమైన, శాశ్వతమైన మహత్యంగా ఇక్కడ ఖుర్‌ఆన్‌ను వర్ణించడం జరిగింది. మానవాళికి ఇహలోకంలో సంతోషాన్ని, పరలోకంలో సాఫల్యాన్ని ప్రసాదించే ఈ దైవగ్రంథం దేవుని తరఫున అనుగ్రహంగా ప్రసాదించబడింది. కరుణామయుని దాసులైన విశ్వాసుల ఈ క్రింది లక్షణాలను వివరిస్తూ ఈ సూరా ముగుస్తుంది:*

*1. వారు వినయంగా నడుస్తారు. 2.పలకరిస్తే మృదువుగా మాట్లాడుతారు. 3. రాత్రులు తమ ప్రభువు ఆరాధనల్లో గడుపుతారు. అల్లాహ్‌ను స్మరిస్తుంటారు. 4. నరకశిక్ష నుంచి కాపాడమని దేవుని ప్రార్థిస్తుంటారు. 5. దుబారాగా గాని, పిసినారితనంతో గాని ఖర్చుచేయరు. 6. అల్లాహ్‌ను తప్ప మరే మిథ్యా దేవుణ్ణీ అర్థించరు. 7. తోటి మనిషిని హత్య చేయరు (న్యాయబద్ధంగా తప్ప). 8. వ్యభిచారం, అక్రమ సంబంధాలకు పాల్పడరు. 9. అబద్ధపు సాక్ష్యాలు చెప్పరు. 10. వ్యర్థ ప్రసంగాలు చేయరు. 11. దేవుని సృష్టిసామర్థ్యానికి సంబంధించిన ప్రస్ఫుటమైన చిహ్నాల ద్వారా వారు హితోపదేశాన్ని, ప్రేరణను పొందుతారు. 12. తమ కంటికి చలువగా ఉండే భార్యలను, పిల్లలను ప్రసాదించమని దేవుని వేడుకుంటారు. 13. దైవభీతిపరులకు ఒక ఉదాహరణగా, ఒక నమూనాగా తమను రూపొందించాలని దేవుని ప్రార్థిస్తుంటారు. 14. సహనం వహిస్తారు.*

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 35-40 | 14, 21, 25, 50, 81, 83 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవప్రవక్త సాలిహ్' 'దైవప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారావాహికంగా ఇక్కడ లభ్యమవుతాయి. ఏయే జాతుల వారి వద్దకు అల్లాహ్ ఏయే ప్రవక్తలను పంపించాడు? ఆయా ప్రవక్తలకు తమ జాతి ప్రజల నుంచి ఏం సమాధానం లభించింది? విశ్వాసులను అల్లాహ్ ఏ విధంగా కాపాడాడు? తిరస్కారులను ఎలా శిక్షించాడు? – ప్రతిదీ తెలుసుకోవచ్చు. |

## అల్ ఫుర్ఖాన్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** సమస్త లోకవాసులను[1] హెచ్చరించేవానిగా ఉండటానికిగాను తన దాసునిపై గీటురాయిని[2] అవతరింపజేసిన అల్లాహ్ గొప్ప శుభకరుడు.

**2** భూమ్యాకాశాల సార్వభౌమత్వం ఆయనదే.[3] ఆయన ఎవరినీ సంతానంగా చేసుకోలేదు.[4] ఆయన రాజ్యాధికారంలో ఆయనకు భాగస్వాములు కూడా ఎవరూ లేరు.[5] ఆయన ప్రతి వస్తువునూ సృష్టించి, దానికి తగ్గట్టుగా – దాని లెక్కను నిర్ధారించాడు.[6]

**3** వారు అల్లాహ్‌ను వదలి (బూటకపు) దేవుళ్లను కల్పించు కున్నారు. వారు (అంటే ఆ బూటకపు దేవుళ్లు) ఏ వస్తువునూ సృష్టించలేరు. పైగా వారు స్వయంగా సృష్టించబడినవారు. వారు

## سُوْرَةُ الْفُرْقَانِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

تَبٰرَكَ الَّذِيْ نَزَّلَ الْفُرْقَانَ عَلٰى عَبْدِهٖ
لِيَكُوْنَ لِلْعٰلَمِيْنَ نَذِيْرًا ۝1

الَّذِيْ لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَلَمْ يَتَّخِذْ
وَلَدًا وَّلَمْ يَكُنْ لَّهٗ شَرِيْكٌ فِي الْمُلْكِ وَخَلَقَ
كُلَّ شَيْءٍ فَقَدَّرَهٗ تَقْدِيْرًا ۝2

وَاتَّخَذُوْا مِنْ دُوْنِهٖٓ اٰلِهَةً لَّا يَخْلُقُوْنَ شَيْـًٔا
وَّهُمْ يُخْلَقُوْنَ وَلَا يَمْلِكُوْنَ لِاَنْفُسِهِمْ ضَرًّا

---

1. దీనిద్వారా స్పష్టమయ్యే ముఖ్య విషయం ఏమిటంటే, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సందేశం విశ్వజనీన సందేశం. ఆయన (స) సమస్త లోకవాసుల కోసం ప్రవక్తగా పంపబడ్డారు. మానవులు, జిన్నులు కూడా వారిలో చేరి ఉన్నారు. ఆ మాటే మరోచోట ఈ విధంగా అనబడింది : "ప్రజలారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన దైవప్రవక్తను" (అని ఓ ముహమ్మద్!) వారికి చెప్పు. (ఆరాఫ్ – 158)

   "నేను తెల్లవాని వైపు, నల్లవాని వైపు – అందరి వైపునకూ దైవప్రవక్తగా పంపబడ్డాను" అని ఆయన (స) ఒక హదీసులో ప్రవచించారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ మసాజిద్). ఆయన (స) ఇంకా ఇలా అన్నారు: "పూర్వం ఒక ప్రవక్త ఏదైనా ఒక జాతి వైపుకు పంపబడేవాడు. అయితే నేను సమస్త మానవుల కోసం ప్రవక్తగా పంపబడ్డాను." (సహీహ్ బుఖారీ – కితాబుత్ తయమ్ముమ్; ముస్లిం – కితాబుల్ మసాజిద్).

2. ఇక్కడ గీటురాయి (ఫుర్ఖాన్) అంటే సత్యాసత్యాలు, న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు, ఉచితానుచితాల మధ్య గల తేడాను స్పష్టపరిచే దివ్య ఖుర్ఆన్ అని అర్థం. దివ్య ఖుర్ఆన్ ఈ విషయాలన్నింటినీ స్పష్టంగా వేరుపరచినందు వల్ల దీనిని గీటురాయి అని అనటం జరిగింది.

3. దైవప్రవక్త సందేశం గురించి చెప్పిన తర్వాత ఇప్పుడు తౌహీద్ (దేవుని ఏకత్వం) గురించి చెప్పబడుతోంది. ఇక్కడ దేవుని నాలుగు ప్రధాన గుణాలు (లక్షణాలు) తెలుపబడ్డాయి. వాటిలో మొట్టమొదటిది తిరుగులేని ఆయన సార్వభౌమత్వం. ఈ సార్వభౌమత్వంలో ఆయనకు సహవర్తులు ఎవరూ లేరు.

4. కొంతమంది యూదులు, క్రైస్తవులు, అరబ్బులు కూడా అల్లాహ్‌కు సంతానం ఉందని, ఆయన దైవదూతలను తన కుమార్తెలుగా చేసుకున్నాడని చెప్పేవారు. ఈ ఆయతులో వారి మూఢనమ్మకం ఖండించబడింది.

5. విగ్రహారాధన, బహుదైవారాధన, రెండు దైవాల భావన (మంచీ – చెడు, అంధకారం–కాంతి అనే ద్విత్వం) ఖండించ బడింది.

6. సకల సృష్టికి మూలాధారం అల్లాహ్‌యే. ఆయన తన యుక్తినీ, ప్రణాళికననుసరించి తన సృష్టితాలలో ఎవరికేది అవసరమో తగు మోతాదులో నిర్ధారించాడు. ప్రతి వస్తువు విధివ్రాతను ముందే చేశాడు.

وَّلَا نَفْعًا وَّلَا يَمْلِكُوْنَ مَوْتًا وَّلَا حَيٰوةً وَّلَا نُشُوْرًا ③

తమ స్వయానికి సైతం లాభనష్టాలు చేకూర్చుకునే అధికారం కలిగిలేరు. జీవన్మరణాలు కూడా వారి అధీనంలో లేవు. (మరణానంతరం) తిరిగి లేచే శక్తి కూడా వారివద్ద లేదు.[7]

وَقَالَ الَّذِيْنَ كَفَرُوْٓا اِنْ هٰذَآ اِلَّآ اِفْكُ ۨافْتَرٰىهُ وَاَعَانَهٗ عَلَيْهِ قَوْمٌ اٰخَرُوْنَ ۚ فَقَدْ جَاۗءُوْ ظُلْمًا وَّزُوْرًا ④

4 "ఇది, ఇతను స్వయంగా కల్పించుకున్న అబద్ధం తప్ప మరేమీ కాదు. ఈ విషయంలో ఇతరులు కూడా ఇతనికి సాయపడ్డారు"[8] అని అవిశ్వాసులు చెప్పసాగారు. నిజానికి వారు చాలా అన్యాయానికి, ఆసాంతం అబద్ధానికి ఒడిగట్టారు.

وَقَالُوْٓا اَسَاطِيْرُ الْاَوَّلِيْنَ اكْتَتَبَهَا فَهِيَ تُمْلٰى عَلَيْهِ بُكْرَةً وَّاَصِيْلًا ⑤

5 "ఇవి పూర్వీకుల గాథలు. వాటిని ఇతను వ్రాయించాడు. అవి ఉదయం సాయంత్రం అతని ముందు పఠించబడుతున్నాయి" అని కూడా ఈ అవిశ్వాసులు అన్నారు.

قُلْ اَنْزَلَهُ الَّذِيْ يَعْلَمُ السِّرَّ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ۭ اِنَّهٗ كَانَ غَفُوْرًا رَّحِيْمًا ⑥

6 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "భూమ్యాకాశాలలో వున్న రహస్యాలన్నింటినీ ఎరిగినవాడు దీనిని (ఈ ఖుర్‌ఆనును) అవతరింపజేశాడు.[9] ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించేవాడు."[10]

وَقَالُوْا مَالِ هٰذَا الرَّسُوْلِ يَاْكُلُ الطَّعَامَ وَيَمْشِيْ فِي الْاَسْوَاقِ ۭ لَوْلَآ اُنْزِلَ اِلَيْهِ مَلَكٌ فَيَكُوْنَ مَعَهٗ نَذِيْرًا ⑦

7 అవిశ్వాసులు ఇలా అనసాగారు : "ఏం ప్రవక్తయ్యా ఇతను?! (చూడబోతే అందరిలాగే) ఇతను కూడా అన్నం తింటున్నాడు, బజార్లలో తిరుగుతున్నాడు.[11] ఇతనికి తోడుగా ఉంటూ (ప్రజలను) హెచ్చరించే నిమిత్తం ఒక దైవదూత (అయినా) ఇతని వద్దకు ఎందుకు పంపబడలేదట?[12]

7. కాని ఈ అన్యాయస్థులు సర్వశక్తులు గల తమ నిజప్రభువును కాదని ఏ శక్తీ లేని హీనులను తమ ఆరాధ్య దైవాలుగా నిలబెట్టుకున్నారు. వారు ఇతరులకు ఏదన్నా లాభంగానీ, నష్టంగానీ చేకూర్చలేరు సరికదా స్వయంగా తమ ఆత్మలకు కూడా ఏమీ చేసుకోలేరు. దీని తరువాత ప్రవక్త తిరస్కారుల సందేహాలు పటాపంచలు చేయబడ్డాయి.

8. ఈ గ్రంథాన్ని కల్పించటంలో యూదులు, వారి బానిసలు (అబూ ఫకీహ్ యసార్, అద్దాస్, జబర్) తదితరులు ముహమ్మద్ (స)కు తోడ్పడి ఉంటారని ముష్రిక్కులు చెప్పేవారు. అన్ నహ్ల్ సూరా 103వ ఆయతులో దీనికి సంబంధించిన కొన్ని వివరాలు వచ్చాయి. ఈ ఆరోపణను ఖుర్‌ఆన్ ఒక అన్యాయంగా, ఆసాంతం అబద్ధంగా అభివర్ణించింది. ఒక నిరక్షరాసి (ముహమ్మద్) ఇతరుల సహాయ సహకారాలతో ఇంతటి స్వచ్ఛమైన, అపురూపమైన అరబీ భాషలో ఉద్గ్రంథాన్ని సమర్పించగలడా? ఒకవేళ సమర్పించినా సత్యాలను ఇంత ప్రస్ఫుటంగా విశదీకరించే, చారిత్రక గాథలను వివరించే, మానవ జీవితంతో ముడిపడిన మార్గదర్శక సూత్రాలన్నింటినీ తెలిపే సాటిలేని జీవన సంవిధానాన్ని నిరక్షరాసి అయిన ఒక వ్యక్తి పరిచయం చేయగలడా?? వీళ్ళకేమై పోయిందీ? ఇలాంటి పసలేని ఆరోపణలను వారు ఎందుకు చేస్తున్నారు?

9. అవిశ్వాసుల ఆరోపణలకు సమాధానంగా ఈ మాటలనబడ్డాయి – కాస్త ఖుర్‌ఆన్‌పై యోచన చేయండి. అందులోని ఏ వాక్యమైనా వాస్తవానికి విరుద్ధంగా ఉందా? ముమ్మాటికీ లేదుకదా! అందులోని ప్రతి విషయం సత్యబద్ధమైనదే. ఎందుకంటే దానిని అవతరింపజేసినవాడు భూమ్యాకాశాలలోని ప్రతి గోప్యమైన విషయాన్ని ఎరిగినవాడు.

8 “పోనీ ఇతని వద్దకు ఏదైనా ఖజానా ఎందుకు వచ్చిపడలేదు?[13] పోనీ, ఇతను (హాయిగా) తింటూ ఉండటానికి ఇతనికి ఒక తోటన్నా లేదేమిటీ?”[14] “మీరు చేతబడి చేయబడిన ఒక వ్యక్తి వెనుక నడుస్తున్నారు”[15] అని కూడా ఆ దుర్మార్గులు అన్నారు.

أَوْ يُلْقَىٰ إِلَيْهِ كَنزٌ أَوْ تَكُونُ لَهُ جَنَّةٌ يَأْكُلُ مِنْهَا ۚ وَقَالَ الظَّالِمُونَ إِن تَتَّبِعُونَ إِلَّا رَجُلًا مَّسْحُورًا ﴿8﴾

9 (ఓ ముహమ్మద్!) చూశావా! వాళ్లు నీ గురించి ఎలాంటి ఉదాహరణల్ని ఇస్తున్నారో! (అది కాదులే), నిజానికి వాళ్లు అసలు మార్గం తప్పారు. ఇక వాళ్లు మార్గానికి రావటం అనేది జరగదు.[16]

انظُرْ كَيْفَ ضَرَبُوا لَكَ الْأَمْثَالَ فَضَلُّوا فَلَا يَسْتَطِيعُونَ سَبِيلًا ﴿9﴾

10 అల్లాహ్ శుభకరుడు. ఆయన గనక తలచుకుంటే వాళ్ళు ఉదాహరించిన తోటకన్నా మేలైన ఎన్నో తోటల్ని – క్రింద కాలువలు ప్రవహించే తోటల్ని – నీ కోసం సమకూర్చగలడు. ఇంకా నీ కోసం ఎన్నో (బ్రహ్మాండమైన) మేడల్ని కూడా చేయ గలడు.[17]

تَبَارَكَ الَّذِي إِن شَاءَ جَعَلَ لَكَ خَيْرًا مِّن ذَٰلِكَ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ وَيَجْعَل لَّكَ قُصُورًا ﴿10﴾

10. ఆయన క్షమాశీలి గనక సరిపోయింది. ఒకవేళ ఆయనే గనక ఈ అవిశ్వాసులు మోపే ఒక్కో నిందారోపణకు పట్టుకోవటం మొదలెడితే, వీళ్ళు ఏనాడో దైవాగ్రహానికి గురై నాశనమై ఉండేవారు. కాని దేవుడు కృపాకరుడు. ఆయన తన ప్రణాళిక ననుసరించి వ్యక్తులకు, జాతులకు ఒక నిర్ణీత సమయం వరకు విడుపును ఇస్తాడు.

11. దివ్య ఖుర్ఆన్ను ఎగతాళి చేసిన తరువాత వారిప్పుడు దైవప్రవక్త (స)ను ఎగతాళి చేయటం మొదలెట్టారు. ఎందుకంటే వారి దృష్టిలో ఒక మానవమాత్రుడు దైవప్రవక్త పదవికి తగడు. అందుకే – భోజనం చేసేవాడు, అందరిలాగే వీధుల్లో సంచరిస్తూ మనుషులతో సహజీవనం చేసేవాడు ప్రవక్తగా ఎంపిక కావటంపై వారు ఆశ్చర్యానికి లోనయ్యారు.

12. ఇప్పుడు ఒక మెట్టు దిగివచ్చి, ఇంకొక అభ్యంతరం లేవనెత్తారు. అదేమంటే, ఒక సాధారణ మనిషి దైవప్రవక్తగా నియుక్తుడైనప్పటికీ అతనికి సహాయకుడుగా కనీసం ఒక దైవదూత (ఫరిష్తా) అన్నా లేకపోతే ఎలా? దైవదూత అయినా తోడుగా లేని వ్యక్తిని మేము దైవప్రవక్తగా ఎలా నమ్మాలి?

13. కనీసం అతని వద్దకు ఏదన్నా ఖజానా అన్నా పంపబడితే అతనికి ఉపాధిని సమకూర్చుకునే ఇబ్బంది ఉండేది కాదు కదా!

14. అదీ కాకపోయినా కనీసం ఒక తోటన్నా అతనికి ఉంటే అతను ఆర్థికంగా మాకంటే కాస్త మంచిస్థితిలో ఉండేవాడు కదా! మరీ ఇంతటి సామాన్యుణ్ణి దేవుడు తన ప్రవక్తగా ఎన్నుకున్నాడేమిటీ?

15. అంటే ఈ వ్యక్తి (ముహమ్మద్)ని ఎవరో చేతబడి చేశారు. తత్కారణంగా ఇతని మతి చలించింది. ఇతని మాటలు మతి ఉన్నవాని మాటల్లా లేవు. కాబట్టి ప్రజలారా! మీరు ఇతని వెనుక నడవకండి.

16. దేవుడు తన ప్రవక్తనుద్దేశించి చెప్పిన మాటలివి : “ఓ ముహమ్మద్! చూశావా? వీళ్లు నీపై నీలాపనిందలు మోపుతున్నారు. నిరాధారంగా నిన్ను తూలనాడుతున్నారు. ఒక్కోసారి నిన్ను చేతబడికి గురైనవాడని అంటున్నారు. ఒక్కోసారి నిన్ను ఉన్మాదిగా చిత్రీకరిస్తున్నారు. నిన్ను అసత్యవాది అని కూడా అంటున్నారు. కవి పుంగవుడవని కూస్తున్నారు. వాస్తవానికి వాళ్లు చెప్పేదంతా మిథ్య. వారి ఆరోపణల వెనుక అణుమాత్రం ఆధారం కూడా లేదు. తాము బొంకేదంతా అబద్ధం అన్న సంగతి స్వయంగా వాళ్ళక్కూడా తెలుసు. ఇలాంటి పైలాపచ్చీసు మాటల్ని పలికి వాళ్లంతట వాళ్లే మార్గవిహీనతకు లోనవుతున్నారు. అలాంటప్పుడు వారికి సన్మార్గం ఎలా ప్రాప్తిస్తుంది?

17. ఓ ముహమ్మద్ (సఅసం) ! నీకు సిరిసంపదలు, తోటలు లేకపోవటంపై వాళ్లు మొసలి కన్నీరు కారుస్తున్నారు కదూ!

بَلْ كَذَّبُوْا بِالسَّاعَةِ وَاَعْتَدْنَا لِمَنْ كَذَّبَ بِالسَّاعَةِ سَعِيْرًا ﴿11﴾

11 (అది కాదు). వారసలు ఆ ఘడియ (తీర్పుదినము)ను ధిక్కరిస్తున్నారు.[18] అయితే ఆ ఘడియను ధిక్కరించేవారి కోసం మేము మండే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము.

اِذَا رَاَتْهُمْ مِّنْ مَّكَانٍۢ بَعِيْدٍ سَمِعُوْا لَهَا تَغَيُّظًا وَّ زَفِيْرًا ﴿12﴾

12 దూరం నుంచే అది వారిని చూసినప్పుడు, ఆగ్రహంతో అది ఉడికిపోతూ, గర్జిస్తూ ఉండటాన్ని వారు వింటారు.[19]

وَاِذَآ اُلْقُوْا مِنْهَا مَكَانًا ضَيِّقًا مُّقَرَّنِيْنَ دَعَوْا هُنَالِكَ ثُبُوْرًا ﴿13﴾

13 నరకంలోని ఒక ఇరుకైన స్థలంలో వారిని కాళ్ళూ, చేతులూ బంధింపబడిన స్థితిలో పడవేయబడినప్పుడు వారు చావు కోసం అరుస్తారు.

لَا تَدْعُوا الْيَوْمَ ثُبُوْرًا وَّاحِدًا وَّ ادْعُوْا ثُبُوْرًا كَثِيْرًا ﴿14﴾

14 "ఈ రోజు ఒక్క చావు కోసం అరవకండి, అనేక చావుల కోసం అరుస్తూ ఉండండి"[20] (అని వారితో అనబడుతుంది).

قُلْ اَذٰلِكَ خَيْرٌ اَمْ جَنَّةُ الْخُلْدِ الَّتِيْ وُعِدَ الْمُتَّقُوْنَ ؕ كَانَتْ لَهُمْ جَزَآءً وَّ مَصِيْرًا ﴿15﴾

15 వారికి చెప్పు:"ఇది మేలా?[21] లేక భయభక్తులు గలవారికి వాగ్దానం చేయబడిన శాశ్వతమైన స్వర్గం మేలా? అది వారి ప్రతిఫలం. వారు చేరుకోవలసిన (చివరి) గమ్యస్థానం."

---

మేము గనక కోరుకుంటే వాళ్లు ప్రస్తావించే తోటలకన్నా విలువైన తోటల్ని నీకు ప్రసాదించగలం. అపురూపమైన మేడలు మిద్దెల్ని నీకు సమకూర్చగలం. కాని వాటివల్ల ఆ సత్యతిరస్కారులకు ఒరిగేదేమిటంట? వాళ్ళెలాగూ సన్మార్గ భాగ్యం పొందరు. మరలాంటప్పుడు నీపై అక్కరకు రాని సానుభూతిని ఎందుకు కురిపించాలి?

18. పరలోకం పట్ల వారికి నమ్మకం లేకపోవటం మూలంగానే వారు దైవప్రవక్త (స)ను ధిక్కరించారు.

19. అంటే అవిశ్వాసులు మహ్షర్ మైదానంలో సమావేశమై ఉన్నప్పుడే నరకం దూరం నుంచి చూచి క్రోధావేశంతో ఊగిపోతుంది. వాళ్లను ఎప్పుడు అమాంతం కబళించాలా?! అని ఆవురావుమంటూ ఉంటుంది. ఈ విషయమే ఇంకొక చోట ఇలా వర్ణించబడింది: "నరకవాసుల గుంపు నరకంలో పడవేయబడినప్పుడల్లా వారు దాని గర్జనను వింటారు. అది ఆవేశంతో ఎగిసిపడుతూ, ఆగ్రహంతో బద్దలయ్యేటట్లు ఉంటుంది." (అల్ ముల్క్ – 7, 8). నరకం నరకవాసుల్ని చూడటం, గర్జించటం ఒక యదార్థం. ఇది వర్ణన కాదు. అందులో గ్రాహ్యశక్తిని, స్పందనను సృజించటం దైవానికి ఎంతమాత్రం కష్టం కాదు. ఆయన తలచుకున్నదల్లా చేయగలడు. తుదకు నరకానికి మాట్లాడే శక్తిని సయితం అల్లాహ్ ప్రసాదిస్తాడు. "నువ్వు నిండిపోయావా?" అని దాన్ని అడిగినప్పుడు, "ఏం? ఇంకా ఏమన్నా మిగిలి ఉందా?" (హామ్ మీమ్ మజీద్) అని అది ప్రతిస్పందిస్తుంది. (ఖాఫ్ – 30)

20. నరకవాసులు నరకయాతనకు తాళలేక తమకు చావైనా వచ్చి ఉంటే బావుండునే అని కాంక్షిస్తారు. "ఇప్పుడు మీరు ఒక చావును కాదు, ఎన్నో చావులను పిలవండి" అని వారితో అనబడుతుంది. అంటే ఈనాటి నుంచి మీరు ఒక రకం శిక్ష కాదు, రకరకాల శిక్షను రుచిచూడవలసి ఉంటుంది. అనుదినం మీకు మరణమే. ఇక మీకు మనసైన 'జీవనం' అన్నదే లేదు. దుర్భరమైన బ్రతుకును వెళ్ళదీస్తూ ఉండండి.

21. **"ఇది"** అంటే నరకయాతన అన్నమాట! నరకవాసులు చేసుకున్న దుష్కర్మలకు ప్రతిఫలంగా వారికి పెట్టబడే నానా రకాల యాతనలు మేలా? లేక భక్తిపరాయణులు చేసుకునే సత్కర్మలకు బదులుగా వారికి వొసగబడే శాశ్వతమైన స్వర్గసుఖాలు మేలా? ఈ ప్రశ్న నరకంలో నరకవాసుల్ని ఉద్దేశించి వేయబడుతుంది. అయితే ఈ ప్రశ్నను గురించి జనులు తెలుసుకుని, సన్మార్గాన్ని అవలంబిస్తారన్న ఉద్దేశంతో ముందుగానే తెలియపరచటం జరిగింది.

لَهُمْ فِيهَا مَا يَشَاءُونَ خَالِدِينَ ۚ كَانَ
عَلَىٰ رَبِّكَ وَعْدًا مَسْئُولًا ⑯

**16** వారు (స్వర్గవాసులు) కోరుకున్నదల్లా అందులో వారికి లభిస్తుంది. వారందులో శాశ్వతంగా ఉంటారు. అర్థించదగిన ఈ వాగ్దానాన్ని నెరవేర్చవలసిన బాధ్యత నీ ప్రభువుపై ఉంది.[22]

وَيَوْمَ يَحْشُرُهُمْ وَمَا يَعْبُدُونَ مِنْ دُونِ
اللَّهِ فَيَقُولُ أَأَنْتُمْ أَضْلَلْتُمْ عِبَادِي هَٰؤُلَاءِ
أَمْ هُمْ ضَلُّوا السَّبِيلَ ⑰

**17** ఆ రోజున అల్లాహ్ వారినీ, అల్లాహ్‌ను వదిలి వారు పూజించే వారినీ సమావేశపరచి, "నా ఈ దాసులను మీరు అపమార్గం పట్టించారా? లేక వీళ్ళంతట వీళ్లే మార్గం తప్పారా?"[23] అని అడుగుతాడు.

قَالُوا سُبْحَانَكَ مَا كَانَ يَنْبَغِي لَنَا أَنْ نَتَّخِذَ
مِنْ دُونِكَ مِنْ أَوْلِيَاءَ وَلَٰكِنْ مَتَّعْتَهُمْ
وَآبَاءَهُمْ حَتَّىٰ نَسُوا الذِّكْرَ وَكَانُوا
قَوْمًا بُورًا ⑱

**18** వారు ఇలా విన్నవించుకుంటారు: "(ఓ అల్లాహ్) నీవు పవిత్రుడవు. నిన్ను కాదని, వేరొకరిని మా రక్షకుడిగా చేసుకోవటం మాకు సయితం తగదు.[24] కాని (అసలు విషయం ఏమిటంటే) నీవు వీళ్ళకీ, వీరి తాతముత్తాతలకీ సాధనసంపత్తులను పుష్కలంగా ప్రసాదించావు. తుదకు వీరు హితబోధను విస్మరించారు. ఆ విధంగా వీరు వినాశం పొందేవారయ్యారు."[25]

فَقَدْ كَذَّبُوكُمْ بِمَا تَقُولُونَ فَمَا تَسْتَطِيعُونَ
صَرْفًا وَلَا نَصْرًا ۚ وَمَنْ يَظْلِمْ مِنْكُمْ نُذِقْهُ
عَذَابًا كَبِيرًا ⑲

**19** "(చూశారా!) మీరు చెప్పే మాటలన్నింటినీ వారు కాదన్నారు. కనుక శిక్షలను తొలగించుకునే శక్తిగానీ, సహాయాన్ని పొందే స్థోమతగానీ ఇప్పుడు మీకు లేదు.[26] మీలో దుర్మార్గానికి పాల్పడిన ఒక్కొక్కడికీ[27] మేము పెద్ద శిక్షను చవి చూపిస్తాము" (అని అల్లాహ్ అంటాడు).

22. ఈ వాగ్దానం నెరవేరటం తథ్యం. ఒక రుణదాతకు రుణగ్రస్తుడు రుణాన్ని చెల్లించినట్లుగానే, సజ్జనులకు స్వర్గం ప్రసాదించటాన్ని అల్లాహ్ విధిగా చేసుకున్నాడు. ఆ విధిని ఆయన నెరవేర్చి తీరుతాడు. అందులో ద్వంద్వాభిప్రాయానికి తావేలేదు.

23. ఆ దృశ్యాన్ని కాస్త తలచుకోండి! అల్లాహ్‌ను వదలి జనులు ఇప్పటి వరకూ పూజిస్తూ వచ్చిన వారినీ, పూజించబోయే వారిని ఆయన ప్రళయదినాన ఒకచోట సమీకరిస్తాడు. ఆ 'పూజనీయులలో' రాళ్లు రప్పలు, చెట్టుపుట్టలు, విగ్రహాలు, కొయ్యబొమ్మలు, దేవుని సజ్జన దాసులు – ఉదాహరణకు: హజ్రత్ ఉజైర్, హజ్రత్ ఈసా (అలైహిముస్సలాం)లు, వలీలు, ఇంకా దైవదూతలు, జిన్నాతులు కూడా ఉంటారు. కదలలేని, మెదలలేని రాతి బొమ్మలకు కూడా దేవుడు ఆ రోజు చైతన్యాన్ని, మాట్లాడేశక్తిని ఇస్తాడు. చివరకు వారందరినీ నిలదీసి అడుగుతాడు – "చెప్పండి! మీరు నా దాసులను షిర్క్ చేయమని చెప్పారా? లేక వీళ్లు తమంతట తామే మిమ్ము పూజించారా?" అని అడుగుతాడు.

24. మేము సయితం నిన్ను వదలి ఇంకొకరిని మా కార్య సాధకునిగా చేసుకోవటానికి సాహసించలేదు. అలాంటప్పుడు అంత పెద్ద అపచారం చేయమని ఇతరులకు మాత్రం మేము ఎలా చెబుతాము? అని వారు అంటారు.

25. సాధారణంగా ప్రజలు బహుదైవారాధన (షిర్క్)కు పాల్పడటంలో వారి సిరిసంపదలు కీలకపాత్ర పోషించాయి. భోగలాలసకు లోనై వారు నీ ధ్యానాన్ని విస్మరించారు. నీ ప్రవక్తల పాఠాలను మరచిపోయారు. తత్కారణంగా వినాశం వారి తలరాతగా మారిపోయింది.

26. ముష్రిక్కులను ఉద్దేశించి దేవుడు పలికే మాటలివి: "మీరు ఎవరెవరిని మీ దేముళ్లుగా తలపోసేవారో వాళ్లు సయితం

20 (ఓ ముహమ్మద్ –సఅసం!) మేము నీకు పూర్వం పంపిన ప్రవక్తలందరూ కూడా అన్నంతినేవారు,[28] బజారులలో సంచరించే వారే.[29] మేము మీలో కొందరిని మరికొందరి కోసం పరీక్షా సాధనంగా చేశాము.[30] మరి మీరు ఓపికపట్టగలరా? నీ ప్రభువు సర్వాన్నీ చూస్తున్నాడు.[31]

وَمَآ أَرْسَلْنَا قَبْلَكَ مِنَ ٱلْمُرْسَلِينَ إِلَّآ إِنَّهُمْ لَيَأْكُلُونَ ٱلطَّعَامَ وَيَمْشُونَ فِى ٱلْأَسْوَاقِ ۗ وَجَعَلْنَا بَعْضَكُمْ لِبَعْضٍ فِتْنَةً أَتَصْبِرُونَ ۗ وَكَانَ رَبُّكَ بَصِيرًا ﴿٢٠﴾

21 మమ్మల్ని కలుసుకునే (విషయంపై) ఆశలేని వారు, "దైవ దూతలు మా వద్దకు ఎందుకు పంపబడటం లేదు?[32] పోనీ, మేమైనా మా కళ్లతో మా ప్రభువును ఎందుకు చూడలేక పోతున్నాము?"[33] అని అంటారు. వారు, తమలో తామే చాలా గొప్ప వారుగా ఊహించుకుంటున్నారు. అహంకారంతో మరీ బరితెగించి పోతున్నారు.[34]

وَقَالَ ٱلَّذِينَ لَا يَرْجُونَ لِقَآءَنَا لَوْلَآ أُنزِلَ عَلَيْنَا ٱلْمَلَٰٓئِكَةُ أَوْ نَرَىٰ رَبَّنَا ۗ لَقَدِ ٱسْتَكْبَرُوا۟ فِىٓ أَنفُسِهِمْ وَعَتَوْ عُتُوًّا كَبِيرًا ﴿٢١﴾

మీ పూజాపునస్కారాలను కొట్టి పారేశారు. మీరు చెప్పేది బూటకమని కూడా సాక్ష్యమిచ్చారు. మీ కాల్పనిక విశ్వాసాలతో తమకే సంబంధమూ లేదని వారు మీ ముందరే చెప్పేశారు. ఎవరి అండదండలను మీరు ఆశించారో వారు చేతు లెత్తేశారు. చెప్పండి! ఈనాడు మీకు పడే శిక్ష నుంచి తప్పించుకునే దమ్ము మీకుందా? మీ ఆత్మలకు మీరు ఏదన్నా సాయం చేసుకోగలరా?"

27. ఇక్కడ దుర్మార్గం (జుల్మ్) అంటే బహుదైవోపాసన (షిర్క్) అని భావం. దివ్య ఖుర్‌ఆన్‌లో మరోచోట షిర్క్ మహా పరాధంగా, పరమ దుర్మార్గంగా, పెద్ద అన్యాయంగా అభివర్ణించబడింది. (లుఖ్మాన్-13)

28. అంటే మునుపు వచ్చిన ప్రవక్తలంతా మానవమాత్రులే. మానవమాత్రులుగా వారు అన్న పానీయాలు పుచ్చుకునేవారు. వారి దినచర్య కూడా మానవాతీతమైనది కాదు.

29. అంటే ఉపాధి సముపార్జన కోసం వారు అంగడికి వెళ్ళేవారు. వ్యాపారం కూడా చేసేవారు. చేతి పనులు కూడా చేసేవారు. కష్టపడి సంపాదించటం, కనీస జీవితావసరాలను పొందటం ప్రవక్త పదవికి విరుద్ధమైన అంశం ఏమీ కాదు.

30. అంటే, మేము ప్రవక్తలను పరీక్షించాము. ప్రవక్తలను విశ్వసించిన ప్రజలను కూడా పరీక్షించాము. ఈ పరీక్ష ద్వారా కల్తీ సరకు ఏదో, మేలిమి సరకు ఏదో తేల్చాము. ఈ పరీక్షల్లో సహన స్థైర్యాలను కనబరచి, దైవసహాయాన్ని అర్థించిన వారు సాఫల్యం పొందారు. అన్యులు పరాభవం పాలయ్యారు. అందుకే మరి నువ్వు "సహనం వహిస్తావా?" అని కూడా ప్రశ్నించాడు.

31. దైవదౌత్యానికి ఎవరు అర్హులో? ఎవరు అర్హులు కారో అల్లాహ్‌కు తెలుసు (అల్ అన్‌ఆమ్ – 124). ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: "రాజ వైభవంతో కూడుకున్న ప్రవక్తగా ఉంటావో, నిరాడంబరత నిండిన ప్రవక్తగా ఉంటావో కోరుకో అని అల్లాహ్ నాకు స్వేచ్ఛాధికారం ఇచ్చాడు. నేను మాత్రం నిరాడంబర ప్రవక్తగా ఉండటానికే ఇష్టపడ్డాను." (ఇబ్నె కసీర్)

32. అంటే, ఒక మానవమాత్రుణ్ణి దైవప్రవక్తగా చేసి పంపించే బదులు ఒక దైవదూతను ప్రవక్తగా పంపించవచ్చుకదా! అదీ కాకపోతే కనీసం దైవప్రవక్తకు సహాయకునిగా ఒక దైవదూతనయినా ఆకాశం నుంచి దించాల్సింది కదా! అతన్ని మేము కూడా చూసి తరించేవారం. దైవప్రవక్త చెప్పేదంతా నిజమని నమ్మేవారం కదా! అన్నది వారి ఉద్దేశం.

| | |
|---|---|
| **22** వారు ఏ రోజున దైవదూతలను చూస్తారో ఆ రోజు ఆ అపరాధులకు ఎంత మాత్రం సంతోషం కలగదు.[35] "(శుభవార్త లన్నీ) సంతోషదాయక వార్తలన్నీ మీకు పూర్తిగా నిషిద్ధం" అని (దైవదూతలు) అంటారు.[36] | يَوْمَ يَرَوْنَ الْمَلَٰٓئِكَةَ لَا بُشْرَىٰ يَوْمَئِذٍ لِّلْمُجْرِمِينَ وَيَقُولُونَ حِجْرًا مَّحْجُورًا ﴿22﴾ |

33. "ఈ ముహమ్మద్ (స) నా ప్రవక్తయ్యా బాబు! మీరంతా అతన్ని నమ్మి నడవండి" అని దేవుడే దిగివచ్చి మాకు చెప్పడే! అన్నది వారి మాటల్లోని అంతరార్థం.

34. తలబిరుసుతనం వల్లనే వాళ్లు ఇలాంటి తలా తోకాలేని డిమాండ్లు చేస్తున్నారు. వారు కోరేవన్నీ దైవప్రణాళికకు, ప్రకృతికి విరుద్ధమైనవి. అగోచర విషయాల ద్వారా అల్లాహ్ తన దాసులను పరీక్షించదలుస్తున్నాడు. ఒకవేళ వారు కోరుతున్నట్లుగా దైవదూతలే దివినుంచి భువికి దిగివస్తే, దేవుడు స్వయంగా వచ్చి వారి కళ్ల ముందర నిలబడితే ఇక వారు విశ్వసించటంలో గొప్పేముంది? 'పరీక్ష' అన్న దానికి అర్థమే ఉండదు కదా!

35. **'ఆ రోజు'** అంటే చావు వచ్చేరోజు. ఈ రోజు అవిశ్వాసులు దైవదూతలను చూడాలని ఆరాటపడుతున్నారు. అయితే మృత్యువు వచ్చిన రోజున వారు దైవదూతలను కళ్లారా చూస్తారు. కాని ఆ దర్శనం వారికి సంతోషాన్ని ఇవ్వదు. ఆ క్షణాన దైవదూతలు వారికి నరక యాతన గురించి వినిపిస్తారు. "ఓ దురాత్మా! నీ దుష్టదేహం నుంచి బయటికి రా" అని అంటారు. దాంతో అతని ఆత్మ బయటపడి పారిపోబోతుంది. అప్పుడు దైవదూతలు దాన్ని చితకబాదుతారు. అన్‌ఫాల్ సూరా (50)లోనూ, అల్ అన్‌ఆమ్ సూరా (93)లోనూ ఈ సంగతి చర్చించబడింది. విశ్వాసి వ్యవహారం తద్భిన్నంగా ఉంటుంది. విశ్వాసి ప్రాణం పోయేటప్పుడు దైవదూతలు దానికి స్వర్గలోక శుభవార్తను వినిపిస్తారు. హామీమ్ సజ్దా (30-32) సూరాలో ఈ విషయం ఉంది. హదీసు ప్రకారం "ఓ పవిత్రాత్మా! పవిత్రదేహంలో ఉన్న ఓ శుభాత్మా!! బయటికి రా! దైవానుగ్రహాలు ఉన్నచోటికి పద! నీ ప్రభువు నీపట్ల ప్రసన్నుడై ఉన్నాడు" అని దైవదూతలు విశ్వాసి ఆత్మనుద్దేశించి అంటారు (వివరాల కోసం చూడండి: ముస్నదె అహ్మద్ - 2/364-365. ఇబ్నుమాజ - కితాబుజ్జుహ్ద్). మరి కొంతమంది "ఆ రోజు" అనే పదాన్ని ప్రళయదినం నేపథ్యంలో తీసుకున్నారు. ఇమామ్ ఇబ్నె కసీర్ ఏమంటున్నారో చూడండి: "రెండు అభిప్రాయాలు కూడా సరైనవే. ఎందుకంటే ఈ రెండు సందర్భాలలోనూ దైవదూతలు విశ్వాసులకు, అవిశ్వాసులకు ఎదురవుతారు. విశ్వాసులకు దైవకారుణ్యం, దైవప్రసన్నత గురించిన సంతోషవార్త వినిపిస్తారు. అవిశ్వాసులకు వినాశం, నష్టం గురించిన సమాచారం అందజేస్తారు.

36. **'హిజ్రున్' (حِجْر)** అంటే వారించటం, అడ్డుకోవటం అని అసలు అర్థం. ఉదాహరణకు ఎవరయినా తన అవివేకం వల్ల లేక నిర్లక్ష్యం వల్ల అధికార దుర్వినియోగం చేస్తూ ఉంటే, తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేవరకూ ఫలానా ఫలానా నిర్ణయాలు గైకొనరాదని న్యాయమూర్తి ఆదేశిస్తాడు. (దాన్నే అరబీలో 'హజరల్ ఖాజీ అలా ఫులానిన్' అంటారు. అంటే న్యాయమూర్తి ఫలానా అతనికి ఆంక్ష విధించాడని భావం.) మక్కా ఖురైషులు 'కాబా'లో విలీనం చేయకుండా ఉంచిన 'హతీమ్' భాగాన్ని కూడా పై భావంలోనే 'హిజ్ర్'గా పిలువటం జరిగింది. నిజానికి హతీమ్ లేక హిజ్ర్ కూడా కాబాలో అంతర్భాగమే. అందుకే కాబా గృహ ప్రదక్షిణ చేసేవారు ఆ స్థలం (హతీమ్) లోపలి నుంచి రావటాన్ని వారించటం జరిగింది. తవాఫ్ (ప్రదక్షిణ) చేసే సమయంలో ఆ స్థలం బయటినుంచి ప్రదక్షిణ పూర్తి చేయాలి. లోపలిగుండా చేసే తవాఫ్ నెరవేరదు. అందుకే ఆ స్థలాన్ని ఒక పిట్టగోడ ద్వారా సూచించటం జరిగింది.

అలాగే బుద్ధివివేకాలను కూడా 'హిజ్రున్' గా వ్యవహరిస్తారు. ఎందుకంటే మానవునికి శోభించని విషయాలను బుద్ధి వారిస్తుంది, అడ్డుకుంటుంది. దైవభక్తి పరాయణులకు ఏ శుభవార్త ఇవ్వబడుతున్నదో దానికి మీరు నోచుకోకుండా పోయారు (మీరు అభాగ్యులు). ఈ రోజు జన్నతుల్ ఫిర్‌దౌస్, దాని అనుగ్రహాలు మీకొరకు నిషేధించబడ్డాయి. కేవలం విశ్వసించిన భక్తిపరులు మాత్రమే ఈ అనుగ్రహాలకు యోగ్యులు అన్నది దైవదూతల పలుకుల్లోని అంతరార్థం.

وَقَدِمْنَآ إِلَىٰ مَا عَمِلُوا۟ مِنْ عَمَلٍ فَجَعَلْنَٰهُ
هَبَآءً مَّنثُورًا ﴿23﴾

**23** వారు (ప్రాపంచిక జీవితంలో) చేసి వున్న కర్మల వైపుకు మేము వచ్చి వాటిని ఎగిరిన దుమ్ము ధూళివలే చేసేశాము.[37]

أَصْحَٰبُ ٱلْجَنَّةِ يَوْمَئِذٍ خَيْرٌ مُّسْتَقَرًّا وَأَحْسَنُ
مَقِيلًا ﴿24﴾

**24** అయితే ఆ రోజు స్వర్గవాసుల నివాసం చాలా బావుంటుంది. వారి విశ్రాంతి నిలయం కూడా అత్యుత్తమంగా ఉంటుంది.[38]

وَيَوْمَ تَشَقَّقُ ٱلسَّمَآءُ بِٱلْغَمَٰمِ وَنُزِّلَ ٱلْمَلَٰٓئِكَةُ
تَنزِيلًا ﴿25﴾

**25** ఏ రోజున ఆకాశం మేఘాల సమేతంగా బద్దలైపోతుందో,[39] మరి దైవదూతలు వరుసగా దింపబడతారో,

ٱلْمُلْكُ يَوْمَئِذٍ ٱلْحَقُّ لِلرَّحْمَٰنِ ۚ وَكَانَ يَوْمًا
عَلَى ٱلْكَٰفِرِينَ عَسِيرًا ﴿26﴾

**26** ఆ రోజు అసలు సిసలు అధికారం కరుణామయునిదై ఉంటుంది. ఆ రోజు అవిశ్వాసుల పాలిట గడ్డురోజై ఉంటుంది.

وَيَوْمَ يَعَضُّ ٱلظَّالِمُ عَلَىٰ يَدَيْهِ يَقُولُ يَٰلَيْتَنِى
ٱتَّخَذْتُ مَعَ ٱلرَّسُولِ سَبِيلًا ﴿27﴾

**27** ఆ రోజు దుర్మార్గుడైన వ్యక్తి తన చేతులను కొరుక్కుంటూ ఇలా అంటాడు: "అయ్యో! నేను దైవప్రవక్త (సఅసం) మార్గాన్ని అనుసరించి ఉంటే ఎంత బావుండేది!"

يَٰوَيْلَتَىٰ لَيْتَنِى لَمْ أَتَّخِذْ فُلَانًا خَلِيلًا ﴿28﴾

**28** "అయ్యో! నా పాడుగాను. నేను ఫలానా వ్యక్తిని స్నేహితునిగా చేసుకోకుండా ఉంటే ఎంత బావుండేది![40]

37. అరబీ మూలంలో **'హబాఅన్' (هَبَاءً)** అనే పదం ఉంది. హబాఅన్ అనేది అత్యంత సూక్ష్మమైన రేణువు. ఏదైనా చిన్న రంధ్రంలో నుంచి సూర్య కిరణాలు ప్రసరిస్తున్నప్పుడు ఆ కిరణాల మధ్య ఆ రేణువులు మెరుస్తూ ఉంటాయి. వాటిని పట్టుకోదలిస్తే చేతికి చిక్కవు. అవిశ్వాసుల కర్మలు కూడా తీర్పుదినాన అలాంటి సూక్ష్మాతిసూక్ష్మమైన రేణువుల మాదిరిగా – నిరర్థకం – అయిపోతాయి. ఎందుకంటే వారి కర్మలలో ఈమాన్ (విశ్వాసం), ఇఖ్లాస్ (చిత్తశుద్ధి) అనేవి ఉండవు. అవి ఇస్లామీయ షరీయత్‌కు అనుగుణంగా కూడా ఉండవు. దైవసన్నిధిలో సదాచరణలు స్వీకారయోగ్యం కావాలంటే అవి ఈ రెండు షరతులకు కట్టుబడి ఉండాలి. అంటే విశ్వాసం, చిత్తశుద్ధితోపాటు మంచిపనులు షరీయతుకు అనుగుణంగా ఉండాలి. ఈ ఆయతులో అవిశ్వాసుల ఆచరణలు రేణువులతో పోల్చబడ్డాయి. మరోచోట బూడిదతో, ఇంకోచోట ఎండమావులతో, వేరొకచోట చదునైన నున్నటి రాయితో పోల్చబడ్డాయి. (వివరాల కొరకు చూడండి : అల్ బఖర – 264; ఇబ్రాహీమ్ – 18; నూర్ – 29).

38. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఈ ఆయతులోని భావాన్ని ఈ విధంగా వివరించారు: విశ్వాసులకు ప్రళయదినం చాలా సులువుగా గడిచిపోతుంది. వారి లెక్క చాలా తేలికపాటిదై ఉంటుంది. మధ్యాహ్న భోజనానంతరం విశ్రాంతి తీసుకునే సమయం వరకు వారి లెక్కలు పూర్తయి పోతాయి. ఆ సమయంలో వారు స్వర్గంలో తమ కుటుంబీకులతో, స్వర్గంలోని స్త్రీలతో కలసి విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. హదీసులో ఇలా ఉంది : "విశ్వాసి పాలిట ఆ దినం అత్యంత సులువుగా – ప్రపంచంలో ఒక ఫర్జ్ నమాజు చేసినట్లుగా ఉంటుంది." (ముస్నదె అహ్మద్–4/75).

39. ఆకాశం బద్దలైపోయిన పిమ్మట, పైనుంచి మేఘం నీడలా ఉంటుంది. అల్లాహ్ తన దూతల సమేతంగా మహ్షర్ మైదానంలో తేజరిల్లుతాడు. సమస్త ప్రాణులు అక్కడ సమీకరించబడుతాయి. అల్ బఖర 210వ ఆయతులో మరికొన్ని వివరాలున్నాయి.

40. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే దేవుని అవిధేయులతో, పాపాత్ములతో ఎన్నడూ సావాసం చేయకూడదు. ఎందుకంటే సావాసదోషం అసలుకే చేటు తెస్తుంది. సజ్జనుల సావాసం వల్ల మనిషి సద్గుణాలను అలవరుచుకుంటాడు. దుర్జనుల సహచర్యం వల్ల చెడిపోతాడు. చాలామంది చెడిపోవటం వెనుక చెడు సావాసాల పాత్ర అధికంగా ఉంటుంది.

**29** "నా వద్దకు ఉపదేశం వచ్చిన తరువాత కూడా వాడు నన్ను అపమార్గం పట్టించాడే! ఎంతయినా షైతాను మనిషికి (అదను చూసి) ద్రోహం చేసేవాడే!"

لَقَدْ أَضَلَّنِي عَنِ الذِّكْرِ بَعْدَ إِذْ جَآءَنِي ۗ وَكَانَ
الشَّيْطٰنُ لِلْإِنسَانِ خَذُولًا ﴿29﴾

**30** అప్పుడు దైవప్రవక్త, "నా ప్రభూ! నిశ్చయంగా నా జాతివారు ఈ ఖుర్‌ఆన్‌ను వదలిపెట్టారు"[41] అని పలుకుతాడు.

وَقَالَ الرَّسُولُ يٰرَبِّ إِنَّ قَوْمِي اتَّخَذُوا
هٰذَا الْقُرْاٰنَ مَهْجُورًا ﴿30﴾

**31** ఈ విధంగా మేము ప్రతి ప్రవక్తకూ కొందరు పాపాత్ములను శత్రువులుగా చేశాము.[42] మార్గదర్శకత్వం వహించడానికి, సహాయం చేయడానికి నీ ప్రభువు (ఒక్కడే) సరిపోతాడు.[43]

وَكَذٰلِكَ جَعَلْنَا لِكُلِّ نَبِيٍّ عَدُوًّا مِّنَ الْمُجْرِمِينَ ۗ
وَكَفٰى بِرَبِّكَ هَادِيًا وَّنَصِيرًا ﴿31﴾

**32** "ఇతనిపై ఖుర్‌ఆన్ సాంతం ఒకేసారి ఎందుకు అవతరింపజేయబడలేదు?"[44] అని అవిశ్వాసులు అంటారు. దీనిద్వారా నీ మనసును దృఢంగా ఉంచడానికి మేము దీనిని ఇలాగే (కొద్ది కొద్దిగా), అంచెలవారీగా పంపాము.[45]

وَقَالَ الَّذِينَ كَفَرُوا لَوْلَا نُزِّلَ عَلَيْهِ الْقُرْاٰنُ جُمْلَةً
وَّاحِدَةً ۚ كَذٰلِكَ ۚ لِنُثَبِّتَ بِهِ فُؤَادَكَ وَرَتَّلْنٰهُ
تَرْتِيلًا ﴿32﴾

---

అందుకే సద్వర్తనుల సావాసం చేయాలని, చెడు సావాసాలకు దూరంగా ఉండాలని హదీసులో తాకీదు చేయబడింది. (ముస్లిం – కితాబుల్ బిర్ర్ వస్సిలహ్).

41. ఆనాడు ముష్రిక్కులు దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేయబడే చోట గలాటా చేసేవారు. ఆ గలాటా ద్వారా జనులు ఖుర్‌ఆన్‌ను వినకుండా చేయాలని అనుకునేవారు. ఇది దుర్మార్గం. అలాగే ఖుర్‌ఆన్‌ను విశ్వసించకపోవటం, దాన్ని పఠించకపోవటం, దాని ప్రకారం ఆచరించకపోవటం దుర్మార్గం. అలాగే దివ్య ఖుర్‌ఆన్‌ను విడనాడి వేరొక గ్రంథాన్ని ఆశ్రయించటం, వేరొక గ్రంథానికి ఖుర్‌ఆన్‌పై ప్రాధాన్యత వొసగటం కూడా దుర్మార్గమే. దివ్య ఖుర్‌ఆన్‌ను పరిత్యజించిన వారికి, దివ్య ఖుర్‌ఆన్‌ను గౌరవించని వారికి విరుద్ధంగా తీర్పుదినాన దైవప్రవక్త దైవసమక్షంలో ఫిర్యాదు చేస్తారు.

42. ఓ ముహమ్మద్ (సఅసం)! నీ జాతి ప్రజలలోని కొందరు దుర్మార్గులు ఖుర్‌ఆన్ వాక్యాలను ధిక్కరించి, నీకు శత్రువులుగా మారినట్లే నీకు పూర్వం ప్రవక్తల పట్ల కూడా జనులు ఇలాగే వ్యవహరించారు. కొందరు అపరాధులు ప్రవక్తకు బద్ధశత్రువులుగా మారటం అన్నది కొత్త విషయం ఏమీ కాదు. ఇది ఆనవాయితీగా వస్తున్నదే. వారు ప్రజలను అపమార్గం వైపు ఆహ్వానించేవారు. అల్ అన్ఆమ్ సూరా 112వ వచనంలో కూడా ఈ విషయం చెప్పబడింది.

43. ఈ అవిశ్వాసులు ప్రజలను దైవమార్గం నుంచి ఎంతగా అడ్డుకున్నప్పటికీ, నీ ప్రభువు సన్మార్గం చూపిన వారిని సన్మార్గాన నడవకుండా ఆపగల శక్తి ఎవరికుందనీ? సిసలైన మార్గదర్శకుడు, సహాయకుడు నీ ప్రభువు మాత్రమే సుమా!

44. అంటే తౌరాతు, ఇంజీలు, జబూర్ గ్రంథాలు ఒకేసారి అవతరించినట్లుగా ఈ ఖుర్‌ఆను గ్రంథం ఒకేసారి ఎందుకు రాలేదు? అన్నది వారి ఉద్దేశం.

45. దీనికి సమాధానంగా అల్లాహ్ ఈ ఆయతులో ఇలా అంటున్నాడు : మేము పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా ఈ ఖుర్‌ఆను గ్రంథాన్ని 23 సంవత్సరాల కాల వ్యవధిలో కొద్దికొద్దిగా అవతరింపజేశాము. ఓ ముహమ్మద్ (స)! నీ మనసు కుదుట పడటానికి, నీ శిష్యుల మనస్సులలో దీన్ని గట్టిగా నాటుకునేలా చేయటానికి మేము ఈ ఏర్పాటు చేశాము. ఈ విషయమే వేరొకచోట ఇలా అనబడింది: "మేము ఈ ఖుర్‌ఆన్‌ను వేర్వేరు భాగాలుగా చేశాము–నువ్వు ఆగి ఆగి ప్రజలను చదివి వినిపించటానికి! మేము దీనిని అంచెల వారీగా అవతరింపజేశాము." (బనీ ఇస్రాయీల్–106). ఈ ఖుర్‌ఆన్ ఆకాశం నుంచి కురిసే వానజల్లు వంటిది. వర్షం కురిసినప్పుడల్లా మృతభూమిలో

وَلَا يَأْتُونَكَ بِمَثَلٍ إِلَّا جِئْنٰكَ بِالْحَقِّ وَ أَحْسَنَ
تَفْسِيرًا ﴿33﴾

**33** వారు నీ వద్దకు ఏ సందేహాన్ని తీసుకువచ్చినా దానికి సత్యంతో కూడిన సమాధానాన్నీ, అత్యుత్తమమైన వివరణను నీకు తెలియజేస్తాము.[46]

اَلَّذِيْنَ يُحْشَرُوْنَ عَلٰى وُجُوْهِهِمْ إِلٰى جَهَنَّمَ
أُولٰٓئِكَ شَرٌّ مَّكَانًا وَّأَضَلُّ سَبِيْلًا ﴿34﴾

**34** ముఖాలను నేలకు రాస్తూ నరకం వైపుకు ఈడ్చబడేవారే నీచ మైన నివాస స్థానం కలవారు, బాగా పెడత్రోవ పట్టిన వారు.

وَلَقَدْ اٰتَيْنَا مُوْسَى الْكِتٰبَ وَجَعَلْنَا مَعَهٗٓ
أَخَاهُ هٰرُوْنَ وَزِيْرًا ﴿35﴾

**35** నిశ్చయంగా (ఇంతకు మునుపు) మేము మూసాకు గ్రంథాన్ని వొసగాము. అతనితోపాటు అతని సోదరుడైన హారూనును అతని సహాయకునిగా నియమించాము.

فَقُلْنَا اذْهَبَآ إِلَى الْقَوْمِ الَّذِيْنَ كَذَّبُوْا بِاٰيٰتِنَا
فَدَمَّرْنٰهُمْ تَدْمِيْرًا ﴿36﴾

**36** "మీరిద్దరూ, మా ఆయతులను ధిక్కరిస్తున్న జనుల వద్దకు వెళ్ళండి" అని మేము వారికి ఆదేశించాము. ఆ తరువాత మేము వారిని (తిరస్కారులను) పూర్తిగా తుదముట్టించాము.

وَقَوْمَ نُوْحٍ لَّمَّا كَذَّبُوا الرُّسُلَ أَغْرَقْنٰهُمْ وَجَعَلْنٰهُمْ
لِلنَّاسِ اٰيَةً ۗ وَّأَعْتَدْنَا لِلظّٰلِمِيْنَ عَذَابًا أَلِيْمًا ﴿37﴾

**37** నూహ్ జాతి వారు కూడా తమ ప్రవక్తలను ధిక్కరించినపుడు మేము వారిని ముంచివేశాము. ప్రజల కొరకు వారిని గుణపాఠ సూచనగా చేశాము. మేము దుర్మార్గుల కోసం వ్యధాభరితమైన శిక్షను సిద్ధంచేసి ఉంచాము.

وَّعَادًا وَّثَمُوْدَا۟ وَأَصْحٰبَ الرَّسِّ وَقُرُوْنًۢا بَيْنَ
ذٰلِكَ كَثِيْرًا ﴿38﴾

**38** ఇంకా ఆదు జాతివారినీ, సమూదు జాతివారినీ, బావి వారినీ,[47] వారి మధ్యన ఉన్న మరెన్నో తరాలను కూడా[48] (తుడిచి పెట్టేశాము).

---

ప్రాణం వస్తుంది. బీటలు వారివున్న నేల ఒక్కసారిగా ఉబుకుతుంది. పులకిస్తుంది. అయితే వర్షం ఒకేసారి కుండపోతగా పడి ఆగిపోవటంకన్నా ఆగి ఆగి తెరలు తెరలుగా వస్తూ ఉంటే అది ఎంతో ప్రయోజన దాయకం అవుతుంది. అందుకే దివ్య ఖుర్ఆన్ కూడా 23 సంవత్సరాల వ్యవధిలో పరిస్థితుల స్వరూపానికనుగుణంగా అవతరించి విశ్వాసుల మనోభూమిని సస్యశ్యామలం చేసింది.

46. దివ్య ఖుర్ఆన్ అంచెలంచెలుగా – అవసరాల కనుగుణంగా – అవతరింపజేయబడటంలోని ఇంకొక మర్మం ఇక్కడ తెలియజేయబడింది. అవిశ్వాసులు, ముష్రిక్కులు ఎప్పుడు ఏ తిరకాసు ప్రశ్నలు వేసినా, ఎప్పుడు పిడివాదానికి దిగినా వారికి దీటైన జవాబు ఇవ్వటానికి దేవుడు తన వచనాలను పంపేవాడు.

47. **'రస్సున్'** (**رَسّ**) అంటే బావి అని అర్థం. 'అస్హాబుర్రస్సి' అంటే 'బావివారు' అన్న అర్థం వస్తుంది. ఎవరీ బావి వారు? ఈ విషయంలో ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. బహుశా అల్ బురూజ్ సూరాలో ప్రస్తావించబడిన కందకాలవారే ఈ బావివారు అయి ఉండవచ్చని ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ పేర్కొన్నారు (ఇబ్నె కసీర్).

48. **'ఖర్న్'** (**قَرْن**) అంటే సమకాలీకుల్లోని ఒక వర్గం అని అసలు అర్థం. ఒక తరానికి చెందినవారు అంతమవుతే రెండవ తరం రెండవ ఖర్న్‌గా వ్యవహరించబడుతుంది (ఇబ్నె కసీర్). ఈ అర్థంలో తీసుకున్నప్పుడు ప్రతి ప్రవక్త అనుచర సమాజం ఒక 'ఖర్న్'గా పరిగణించబడుతుంది.

**39** మేము వారికి ఉదాహరణలతో సహా బోధపరచాము.[49] ఆ తరువాత ప్రతి ఒక్కరినీ సమూలంగా తుడిచిపెట్టాము.[50]

وَكُلًّا ضَرَبْنَا لَهُ الْأَمْثَالَ ۖ وَكُلًّا تَبَّرْنَا تَتْبِيرًا ﴿٣٩﴾

**40** దారుణంగా (రాళ్ళ) వర్షం కురిపించబడిన పట్టణం[51] సమీపం నుంచి వారు (అవిశ్వాసులు) రాకపోకలు సాగిస్తున్నారు. అయినా వారు దానిని చూడటం లేదా? అసలు విషయం ఏమిటంటే వారికి మరణానంతరం తిరిగి లేపబడతామన్న దానిపై ఆశలేదు.[52]

وَلَقَدْ أَتَوْا عَلَى الْقَرْيَةِ الَّتِي أُمْطِرَتْ مَطَرَ السَّوْءِ ۚ أَفَلَمْ يَكُونُوا يَرَوْنَهَا ۚ بَلْ كَانُوا لَا يَرْجُونَ نُشُورًا ﴿٤٠﴾

**41** వారు (అవిశ్వాసులు) నిన్ను చూచినప్పుడల్లా, నీతో పరిహాసానికి దిగుతారు. "దేవుడు ప్రవక్తగా చేసి పంపినది ఈయనగారినేనా?![53]

وَإِذَا رَأَوْكَ إِن يَتَّخِذُونَكَ إِلَّا هُزُوًا أَهَٰذَا الَّذِي بَعَثَ اللَّهُ رَسُولًا ﴿٤١﴾

**42** "మేము మా దేముళ్లపై గట్టిగా నిలబడి ఉండకపోతే, ఇతడు మమ్మల్ని మా దేవుళ్ల నుంచి తప్పించి ఉండేవాడే"[54] అని అంటారు. పూర్తిగా మార్గభ్రష్టతకు గురై ఉన్నదెవరో శిక్షలను చూసినపుడు వారికి స్పష్టంగా తెలిసివస్తుంది.[55]

إِن كَادَ لَيُضِلُّنَا عَنْ آلِهَتِنَا لَوْلَا أَن صَبَرْنَا عَلَيْهَا ۚ وَسَوْفَ يَعْلَمُونَ حِينَ يَرَوْنَ الْعَذَابَ مَنْ أَضَلُّ سَبِيلًا ﴿٤٢﴾

49. అంటే ఆధారాల, నిదర్శనాల ద్వారా మేము చెప్పాల్సిందంతా చెప్పేశాము.

50. చెప్పిన తరువాత కూడా వారు రుజువర్తనులు కాకపోవటం వల్ల మేము వారిపై మా శిక్షా కొరడాను ఝుళిపించాము.

51. భయంకరమైన రాళ్ల వర్షం కురిపించబడిన పట్టణమంటే దైవప్రవక్త హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) జాతి ప్రజలు ఉండే పట్టణాలు సద్దూమ్, అమూరా మొదలగునవి అన్నమాట. ఆ జనవాసాలు తలక్రిందులుగా చేయబడ్డాయి. ఆపైన వారిపై రాళ్ల వర్షం కురిపించబడింది. హూద్ సూరాలోని 82వ వచనంలో ఈ విషయం వివరించబడింది. ఈ పట్టణాలు సిరియా, పాలస్తీనాలకు వెళ్ళే దారిలో ఉన్నాయి. అరబ్బులు (మక్కా వాసులు) తరచూ ఈ పట్టణాల మీదుగా వస్తూ పోతూ ఉంటారు. కళ్లారా వాటిని చూస్తూ కూడా వారు గుణపాఠం నేర్చుకోరా?

52. శిథిలావస్థలో ఉన్న ఆ పట్టణాలను చూసిన తరువాతైనా వారికి జ్ఞానోదయం కావాల్సింది. కాని వారిలో పరివర్తన రాలేదు. పరివర్తన రాకపోవటానికి ఒక ప్రధాన కారణం : మరణానంతర జీవితంపై వారికి నమ్మకం లేకపోవటమే.

53. "మీ ఆరాధ్య దైవాల గురించి ప్రస్తావించేది ఇతగాడేనా?" అని ప్రశ్నిస్తారని వేరొకచోట చెప్పబడింది (అంబియా-36). ఆనాడు వారు పూజించే దేవుళ్ల గురించి ఏం చెప్పినా, దాన్ని వారు దూషణగా, కించపరచటంగా భావించేవారు. నేటి మన ముస్లిం సమాజంలోని కొందరు ప్రబుద్ధులు ఆనాటి ముష్రిక్కులకు ఎందులోనూ తీసిపోరు. సమాధులలో ఖననమై ఉన్న పెద్దలు ఈ లోకంపై అధికారం చెలాయించలేరండీ! అని అంటే మన సమాధి పూజారులు ఏమాత్రం భరించలేరు. ఈ విధంగా చెప్పటం 'ఔలియా అల్లాహ్'ను (దేవుని ప్రియతమ దాసులను) కించపరచటం క్రిందికి వస్తుందని దబాయిస్తారు.

54. అంటే, తాము తమ పూర్వీకుల ఆచారాలను అనుసరిస్తూ, తమ (చిట్టిపొట్టి) దేవతలతో దృఢ సంబంధం ఏర్పరచుకుని ఉండబట్టి సరిపోయింది. లేకుంటే ఈ ప్రవక్త (సఅసం) తమను పెడత్రోవ పట్టించటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించి ఉండేవాడు అని అవిశ్వాసులు అనేవారు. ఆనాటి ముష్రిక్కులలో షిర్క్ (బహుదైవారాధన) ఎలా జీర్ణించుకుపోయిందో చెప్పటానికి దేవుడు ఇచ్చిన ఈ ఉదాహరణ ఒక మచ్చుతునక.

**43** (ఓ ప్రవక్తా!) తన మనోవాంఛలను తన ఆరాధ్య దైవంగా చేసుకున్న వానిని నువ్వు చూశావా? నువ్వు అలాంటి వ్యక్తి(ని రుజుమార్గానికి తెచ్చే) బాధ్యత తీసుకోగలవా?[56]

أَرَءَيْتَ مَنِ ٱتَّخَذَ إِلَٰهَهُۥ هَوَىٰهُ ۚ أَفَأَنتَ تَكُونُ
عَلَيْهِ وَكِيلًا ﴿43﴾

**44** ఏమిటీ, వారిలో అత్యధికమంది వింటారనీ, అర్థం చేసు కుంటారని నువ్వు (ఇప్పటికీ) అనుకుంటున్నావా? వారు వట్టి పశువుల్లాంటి వారు. పైగా వాటికన్నా ఎక్కువగా దారితప్పారు.[57]

أَمْ تَحْسَبُ أَنَّ أَكْثَرَهُمْ يَسْمَعُونَ أَوْ يَعْقِلُونَ ۚ إِنْ هُمْ
إِلَّا كَٱلْأَنْعَٰمِ ۖ بَلْ هُمْ أَضَلُّ سَبِيلًا ﴿44﴾

**45** ఏమిటి, నీ ప్రభువు నీడను ఎలా వ్యాపింపజేశాడో[58] నువ్వు చూడలేదా? ఆయన గనక తలచుకుంటే దాన్ని నిలిచి ఉండేదిగానే చేసేవాడు.[59] మరి మేము సూర్యుణ్ణి దానికి నిదర్శనంగా చేశాము.[60]

أَلَمْ تَرَ إِلَىٰ رَبِّكَ كَيْفَ مَدَّ ٱلظِّلَّ وَلَوْ شَآءَ لَجَعَلَهُۥ
سَاكِنًا ثُمَّ جَعَلْنَا ٱلشَّمْسَ عَلَيْهِ دَلِيلًا ﴿45﴾

55. ఈనాడు ఈ లోకంలో ఈ ముష్రిక్కుల, దైవేతర దాసుల కంటికి ఏకదైవారాధకులు మార్గవిహీనులుగా కనిపిస్తున్నారు. కాని పరలోకంలో దేవుని దర్బారులో అందరూ సమావేశమైనపుడు, తమ షిర్క్ మూలంగా వారు దేవుని శిక్షకు గురైనపుడు, వారికి తెలిసివస్తుంది – మార్గ విహీనులు ఎవరో! రుజుమార్గంపై ఉన్నవారెవరో!

56. అంటే అతడు తనకు నచ్చిన, తన మనసు మెచ్చిన దానిని తన మతంగా, జీవన ధర్మంగా చేసుకున్నాడు. అలాంటి మనోవాంఛల దాసుణ్ణి నువ్వు దారికి తేగలవా? దేవుని పట్టునుండి అతణ్ణి విడిపించగలవా? ఈ విషయమే మరోచోట ఈ విధంగా చెప్పబడింది: "ఏ వ్యక్తికి, అతని దురాచరణ అందంగా కనిపించేలా చేయబడగా, దాన్ని అతను మంచిదిగా భావిస్తాడో (అతని అపమార్గం గురించి ఇంకా చెప్పేదేముంటుంది?) అల్లాహ్ తాను కోరిన వారిని అపమార్గం పట్టిస్తాడు. తాను కోరిన వారికి సన్మార్గం ప్రసాదిస్తాడు. కాబట్టి (ఓ ప్రవక్తా!) నువ్వు వారి గురించి బాధపడకు (ఫాతిర్ – 8). ఈ ఆయతుకు వ్యాఖ్యానంగా హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అంటున్నారు –

"అజ్ఞానకాలంలో మానవుడు ఒక సమయం వరకూ తెల్లరాయిని పూజించేవాడు. దానికంటే మంచి రాయి కనిపించిన తరువాత మొదటిరాయిని వదిలేసి రెండో రాయిని పూజించసాగేవాడు (ఇబ్నె కసీర్). దీనిభావం ఏమిటంటే ప్రజలు ఈ రకంగా తమ బుద్ధీ జ్ఞానాలను ఉపయోగించకుండా కేవలం తమ మనోవాంఛలను అనుసరించేవారు. మనసునే దైవంగా చేసుకునేవారు. అటువంటప్పుడు ఓ ప్రవక్తా! నువ్వు ఇలాంటి జనులను సన్మార్గానికి తేగలవా? అని దేవుడు ప్రశ్నిస్తున్నాడు. 'తేలేవు' అన్నది దీని భావం.

57. తాము ఏ ఉద్దేశం కోసం పుట్టించబడ్డాయో పశువులకు తెలుసు. కాని మానవుడు? అతను కేవలం దైవారాధన కోసమే పుట్టించబడినప్పటికీ, ఆ విషయాన్ని దైవప్రవక్తలు పదే పదే జ్ఞాపకం చేసినప్పటికీ, అతను వారి ఉపదేశాన్ని పెడచెవినపెట్టి షిర్క్ (బహు దైవారాధన)కు ఒడిగడతాడు. అల్లాహ్‌ను కాదని వాడవాడనా తలను వంచుతాడు. ఒక్కడైన అల్లాహ్‌ను వదలి గడప గడపనా బ్రతుకు గడుపుతాడు. ఈ రకంగా చూసినపుడు అతను చతుష్పాదాల కన్నా హీనమైనవాడు.

58. ఇక్కణ్ణుంచి మళ్లీ ఏకదైవారాధన (తౌహీద్)కు సంబంధించిన నిదర్శనాలు మొదలవుతున్నాయి. దేవుడు ఈ జగతిలో నీడను ఎలా విస్తరింపజేశాడో కాస్త దృష్టిని సారించండి. ఉదయం సూర్యోదయం అయినప్పట్నుంచి సాయంత్రం సూర్యాస్తమయం అయ్యేవరకూ మీకు ఈ దృశ్యాలు కానవస్తుంటాయి.

59. ఈ నీడలు పెరగటం, తరగటం కూడా ఆయన అపురూప సృష్టిలో అంతర్భాగమే. ఆయన గనక తలచుకుంటే సూర్యుణ్ణి నడినెత్తి మీదే ఉంచి నీడను విస్తరించకుండా చేసేవాడు. అదే గనక జరిగి ఉంటే మీ బ్రతుకు దుర్భరం

ثُمَّ قَبَضْنٰهُ اِلَيْنَا قَبْضًا يَّسِيْرًا ﴿46﴾

46 మరి మేము దాన్ని క్రమక్రమంగా మా వైపుకు లాక్కు
న్నాము.[61]

وَهُوَ الَّذِيْ جَعَلَ لَكُمُ الَّيْلَ لِبَاسًا وَّالنَّوْمَ
سُبَاتًا وَّجَعَلَ النَّهَارَ نُشُوْرًا ﴿47﴾

47 మరి ఆయనే మీకోసం రాత్రిని తెర (ఆసరా)గానూ,[62] నిద్రను
విశ్రాంతిగానూ చేశాడు.[63] ఇంకా పగటిని లేచి తిరిగే సమయంగా
చేశాడు.[64]

وَهُوَ الَّذِيْٓ اَرْسَلَ الرِّيٰحَ بُشْرًۢا بَيْنَ يَدَيْ
رَحْمَتِهٖ ۚ وَاَنْزَلْنَا مِنَ السَّمَاۗءِ مَاۗءً طَهُوْرًا ﴿48﴾

48 తన కారుణ్యానికి (వర్షానికి) ముందు శుభవార్తను మోసుకు
వచ్చే గాలులను పంపేవాడు ఆయనే. మరి మేము ఆకాశం నుంచి
స్వచ్ఛమైన నీళ్లను కురిపిస్తాము.[65]

అయిపోయేది. కాని ఆయన దయాదాక్షిణ్యాలు కలవాడు. తన దాసులు ఏ కష్టాన్నయినా ఎంతవరకు ఓర్చుకుంటారో ఆయనకు తెలుసు.

60. సూర్యుని ద్వారానే నీడల పెరిగే తరిగే దశలు తెలుస్తాయి. ఒకవేళ సూర్యుడే గనక మార్గదర్శిగా లేకుండా ఉంటే అసలు నీడ అంటే ఏమిటో కూడా ప్రజలకు తెలిసేది కాదు.

61. మరి ఆ నీడలను మేము నెమ్మదినెమ్మదిగా వశపరచుకుంటాము. ఆ నీడల స్థానంలోనే క్రమక్రమంగా దట్టమైన చీకట్లు అలుముకుంటాయి.

62. రాత్రి మీ పాలిట ఒక ఆచ్ఛాదన లాంటిది. ఏ విధంగానయితే దుస్తులు మనిషి శరీరాన్ని మరుగుపరుస్తాయో అదేవిధంగా రాత్రి తన చీకటితో మిమ్మల్ని కప్పి ఉంచుతుంది.

63. **'సుబాతన్'** (سُبَاتًا) అంటే కోయటం, వేరుపరచటం అని అర్థం. నిద్ర మనిషిని అతని దైనందిన కార్యకలాపాల నుంచి పూర్తిగా వేరుపరుస్తుంది. నిద్రవల్ల అతనికి విశ్రాంతి, హాయి లభిస్తాయి. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం 'సుబాత్' అంటే విస్తరించటమని అర్థం. నిద్రలో మనిషి విస్తరించి పడుకుంటాడు. అందుకే 'సుబాత్' అని చెప్పటం జరిగింది (ఇసరుత్తఫాసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

64. నిద్ర ఒక విధంగా మృత్యువు లాంటిది. నిద్రను మృత్యువుకు తోబుట్టువుగా అభివర్ణించటం జరిగింది. రాత్రి నిద్ర అనంతరం మనిషి పగటి పూట కార్యకలాపాల కోసం లేచి నిలబడతాడు. అంటే నిద్రనుంచి మేల్కొనగానే అతని ప్రాణాలు అతని అదుపులోకి వస్తాయి. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఉదయం మెలకువ రాగానే ఈ దుఆ పఠించేవారు: **"అల్‌హమ్దు లిల్లాహిల్లజీ అహ్‌యానా బాద మా అమాతనా వ ఇలైహిన్నుషూర్"** (బుఖారీ – మిష్కాత్ – కితాబుద్దావాత్). అర్థం: "ప్రశంసలు, పొగడ్తలన్నీ అల్లాహ్‌కే చెల్లుతాయి. ఆయన మనల్ని చంపిన పిదప బ్రతికించాడు. కడకు మనం చేరుకోవలసింది ఆయన వద్దకే."

65. మేము కురిపించే ఈ నీటి ద్వారా మీరు పరిశుభ్రత, పరిశుద్ధతలను కూడా పొందుతున్నారు. ఎందుకంటే ఈ వర్షపు నీరు పరిశుభ్రమైనది, పరిశుభ్రపరిచేదీను. వుజూ చేసే నీరును **'వజూ'** (وَضُوْ) గా వ్యవహరిస్తారు. స్వతహాగా పరిశుభ్రమైనదే గాకుండా, పరిశుభ్రపరిచే గుణం కూడా దానికి ఉంది. అందుకే హదీసులో ఇలా ప్రవచించబడింది: "నీరు పరిశుభ్రమైనది. ఏ వస్తువూ దాన్ని అశుద్ధపరచదు" (అబూ దావూద్, తిర్మిజీ – 22; నసాయి, ఇబ్నె మాజ, సహ్హాహూ అల్‌బానీ ఫీ సునన్). అయితే నీటి రంగు, రుచి, వాసన మారిపోతే మాత్రం ఆ నీరు అపరిశుభ్రంగా భావించబడుతుందని హదీసులో ఉంది.

**49** తద్వారా మృత ప్రదేశాన్ని బ్రతికించటానికి, మా సృష్టితాల లోని అనేక జంతువులకు, మనుషులకు (నీరు) త్రాగించటానికి (మేము ఈ ఏర్పాటును చేస్తున్నాము).

لِّنُحْـِۧيَ بِهٖ بَلْدَةً مَّيْتًا وَّنُسْقِيَهٗ مِمَّا خَلَقْنَآ اَنْعَامًا
وَّاَنَاسِيَّ كَثِيْرًا ﴿49﴾

**50** వారు గుణపాఠం నేర్చుకునేందుకు మేము దీనిని వారి మధ్య పలు విధాలుగా విశదీకరించాము.[66] అయినప్పటికీ మానవులలో చాలామంది అవిశ్వాసం, కృతఘ్నుతలు తప్ప మరొక వైఖరిని అవలంబించటానికి తిరస్కరిస్తున్నారు.[67]

وَلَقَدْ صَرَّفْنٰهُ بَيْنَهُمْ لِيَذَّكَّرُوْا ۖ
فَاَبٰٓى اَكْثَرُ النَّاسِ اِلَّا كُفُوْرًا ﴿50﴾

**51** మేము కోరుకుంటే ఒక్కో ఊరిలో ఒక్కో హెచ్చరిక చేసేవాణ్ణి పంపి ఉండేవారం.[68]

وَلَوْ شِئْنَا لَبَعَثْنَا فِيْ كُلِّ قَرْيَةٍ نَّذِيْرًا ﴿51﴾

**52** కాబట్టి నువ్వు తిరస్కారుల మాట వినకు. ఖుర్ఆన్ (బోధన) మూలముగా వారితో గొప్ప పోరాటపటిమను ప్రదర్శిస్తూఉండు.[69]

فَلَا تُطِعِ الْكٰفِرِيْنَ وَجَاهِدْهُمْ بِهٖ جِهَادًا كَبِيْرًا ﴿52﴾

**53** రెండు సముద్రాలను – పరస్పరం – కలిపి ఉంచినవాడు ఆయనే.[70] వాటిలో ఒకటి తియ్యనిది, రుచికరమైనది. మరొ కటి ఉప్పగా, చేదుగా ఉంది. ఆ రెండింటి మధ్య ఒక తెర (అడ్డు గోడగా) ఉంది. అది వాటిని వేరుగా ఉంచుతుంది.[71]

وَهُوَ الَّذِيْ مَرَجَ الْبَحْرَيْنِ هٰذَا عَذْبٌ فُرَاتٌ وَّهٰذَا
مِلْحٌ اُجَاجٌ ۚ وَجَعَلَ بَيْنَهُمَا بَرْزَخًا وَّحِجْرًا
مَّحْجُوْرًا ﴿53﴾

66. వర్షాన్ని మేము సముచిత రీతిలో విభజించి కురిపిస్తూ ఉంటాము. అంటే వేర్వేరు సమయాలలో, వేర్వేరు ప్రాంతాలలో వర్షం కురిపిస్తాము. అయితే కొన్నిసార్లు కొన్ని ప్రదేశాలలో అధిక వర్షపాతం నమోదవుతుంది. మరికొన్ని ప్రదేశాలలో అల్ప వర్షపాతం నమోదవుతుంది. ఒక ఏడాది ఎక్కువ వర్షం పడిన ప్రాంతంలో మరో ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ 'జలాల పంపిణీ'లో కూడా దేవుని యుక్తి దాగివుంది.

67. మానవుడు కృతఘ్నుడు. చేసిన మేలును తొందరగా మరచిపోతాడు. బహుకొద్ది మంది మాత్రమే కృతజ్ఞతాపూర్వకంగా మసలుకుంటారు. దేవుని ప్రణాళికననుసరించి కురిసే ఈ వర్షాన్ని నక్షత్ర పరిభ్రమణ పర్యవసానంగా భావించటం కూడా మనిషి కృతఘ్నతకు ఒక నిదర్శనం అని చెప్పబడింది. అజ్ఞాన కాలంలో జనులు ఈ విధంగా చెప్పేవారు.

68. కాని (ఓ ముహమ్మద్!) మేమలా చెయ్యలేదు. నిన్నొక్కడినే సమస్త మానవాళికోసం ప్రవక్తగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము.

69. 'ఈ ఖుర్ఆన్ ఆధారంగా పోరాడుతూ ఉండు' అన్న ఈ ఆయతు మక్కాలో అవతరించింది. అప్పటికింకా ధర్మయుద్ధం (జిహాద్) గురించిన ఆదేశాలు రాలేదు. కాబట్టి ఈ ఆయతు భావం ఏమిటంటే; ఖుర్ఆన్ ఆదేశాలను, అది నిషేధించిన అంశాలను ప్రజలకు స్పష్టంగా విడమరచి చెప్పు. విశ్వసించడానికి నిరాకరించిన వారికి ఎదురు కాబోయే దుష్పరిణామాల గురించి నిర్దిష్టంగా హెచ్చరించు.

70. తియ్యని నీరును **'ఫురాత్'** (فرات) అంటారు. 'ఫురాత్' అంటే తీర్చటం, త్రెంచటం అని అర్థం. తియ్యని నీరు (మంచి నీరు) దాహం తీరుస్తుంది. చాలా చేదుగా, ఉప్పగా ఉండే నీరును **'ఉజాజ్'** (اجاج)గా వ్యవహరిస్తారు.

71. అది రెండు నీటి ప్రవాహాలను కలవనివ్వదు. తీయని నీరు ఉప్పు నీరుగా మారటం, ఉప్పు నీరు తియ్యని నీరుగా మారటం నిషేధించబడింది అన్న భావంలో కొందరు దీనిని అనువదించారు. మరికొంతమంది వ్యాఖ్యాతలు ఇలా

54 నీటితో మానవుణ్ణి సృష్టించినవాడు ఆయనే. ఆ తరువాత అతనికి వంశపారంపర్యాన్ని, అత్తగారి బంధుత్వాన్ని[72] కల్పించాడు. నిశ్చయంగా నీ ప్రభువు (ప్రతిదీ చేయగల) శక్తి గలవాడు.

وَهُوَ الَّذِي خَلَقَ مِنَ الْمَاءِ بَشَرًا فَجَعَلَهُ نَسَبًا وَصِهْرًا ۗ وَكَانَ رَبُّكَ قَدِيرًا ﴿٥٤﴾

55 వారు అల్లాహ్‌ను వదలి తమకు లాభాన్నిగానీ, నష్టాన్నిగానీ చేకూర్చలేని వాటిని ఆరాధిస్తున్నారు. ఎంతయినా అవిశ్వాసి మటుకు తన ప్రభువుకు వ్యతిరేకంగా (షైతానుకు) తోడ్పడేవాడే.

وَيَعْبُدُونَ مِن دُونِ اللَّهِ مَا لَا يَنفَعُهُمْ وَلَا يَضُرُّهُمْ ۗ وَكَانَ الْكَافِرُ عَلَىٰ رَبِّهِ ظَهِيرًا ﴿٥٥﴾

56 అయితే (ఓ ప్రవక్తా!) మేము మాత్రం నిన్ను శుభవార్తాహరునిగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము.

وَمَا أَرْسَلْنَاكَ إِلَّا مُبَشِّرًا وَنَذِيرًا ﴿٥٦﴾

57 "ఈ ఖుర్‌ఆన్ సందేశాన్ని అందజేసి నేను మీ నుంచి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు. కాని ఎవరయినా తన ప్రభువు వైపు వెళ్ళే మార్గాన్ని (రుజు మార్గాన్ని) అవలంబిస్తే చాలు"[73] అని వారికి చెప్పు.

قُلْ مَا أَسْأَلُكُمْ عَلَيْهِ مِنْ أَجْرٍ إِلَّا مَن شَاءَ أَن يَتَّخِذَ إِلَىٰ رَبِّهِ سَبِيلًا ﴿٥٧﴾

అభిప్రాయపడ్డారు : దేవుడు రెండు రకాల నీళ్ళను సృష్టించాడు. ఒకటి : తియ్యని నీరు. రెండు : ఉప్పు నీరు. తియ్యని నీరు కాలువల, నదుల, సెలయేరుల, తటాకాల రూపంలో జనవాసాల మధ్య ఉంటుంది. వాటి ద్వారా మానవుడు తన అవసరాలు తీర్చుకుంటాడు. ఉప్పు నీరు ప్రాక్పశ్చిమాల వరకు విస్తరించి వున్నా సువిశాల సముద్రాల్లో ఉంటుంది. భూమండలంలో నాల్గింట మూడొంతుల భాగం సముద్ర ప్రాంతం ఉండగా, కేవలం ఒక వంతు భూమిపై మానవుడు మనుగడ సాగిస్తున్నాడని అనబడుతోంది. సముద్రం స్థిరమైనది. అది ప్రవహించదు. కాకపోతే అందులో చలనం ఉంటుంది. అలలు లేచిపడుతుంటాయి. సముద్రపు నీరును దేవుడు ఉప్పునీరుగా మార్చటంలో ఎన్నో పరమార్థాలు ఉన్నాయి. తియ్యని నీరు చాలా కాలం ఒకచోట నిలిచి ఉంటే దాని రంగు మారిపోతుంది. కుళ్ళి కంపుకొడుతుంది. కాని ఉప్పునీరు నిలిచి ఉన్నప్పటికీ దాని రంగు, రుచీ మారవు. అది కుళ్ళిపోదు. అలాకాకుండా–సముద్రపు నీరు కూడా తియ్యగా ఉండే పక్షంలో అందులో దుర్వాసన వచ్చేది. అంటువ్యాధులు ప్రబలేవి. దాని వల్ల భూమండలంలో మనుషుల, జంతువుల మనుగడ ప్రమాదంలో పడేది. కాని చూడండి! వేనవేల సంవత్సరాలుగా సముద్రం ఉంది. మరి ఆ సముద్రంలో లెక్కకు మించిన జలచరాలు ఉన్నాయి. వాటిలో ఎన్నో చరాలు చస్తున్నాయి కూడా. అయితే ఆ నీటిలో ఉన్న లవణాల మూలంగా ఏమాత్రం దుర్వాసన రాదు. నీరు దుర్గంధభరితం కూడా కాదు. ఆ సముద్రంలో నుంచి వచ్చే గాలులు కూడా ఆహ్లాదకరమైనవి, ఆరోగ్యకరమైనవి. ఆ నీరు కూడా పరిశుభ్రమైనదే. ఆఖరికి ఆ నీటిలో చనిపోయే చేపలు తదితర జంతువుల్ని కూడా తినవచ్చునని హదీసులు చెబుతున్నాయి (ముఅత్తా ఇమామ్ మాలిక్, ఇబ్నె మాజ, అబూ దావూద్, తిర్మిజీ – కితాబుత్తహార; నసాయి – కితాబుల్ మియాహ్) – తఫ్సీర్ ఇబ్నె కసీర్.

72. **'వంశం'** (نَسَب) అంటే రక్త సంబంధాలన్నమాట. తల్లి తండ్రి తరఫున ఈ బంధుత్వ సంబంధాలు ఏర్పడతాయి. **'సిహ్ర్'** (صِهْر) అంటే వివాహానంతరం అత్తవారింటి తరఫున ఏర్పడే బంధుత్వాలు, ఆత్మీయతలని భావం. ఈ రెండు బంధుత్వాలకు సంబంధించిన వివరాలు నిసా సూరాలో (22, 23) వచ్చాయి. అలాగే పాల వరస సంబంధాలు వంశవృక్ష సంబంధాన్ని పోలి ఉంటాయని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఉదాహరణకు : **"యహ్‌రుము మినర్రజాయి మా యహ్‌రుము మినన్నసబి"** (అర్థం: వంశం మూలంగా నిషిద్ధమైనవి, పాల సంబంధం మూలంగా కూడా నిషిద్ధమవుతాయి.) (బుఖారీ –నెం.2645, ముస్లిం – 1070)

73. అంటే మీరు ప్రభువు మార్గాన్ని అవలంబిస్తే నాకు ప్రతిఫలం లభించినట్లేనని భావం.

**58** ఎన్నటికీ మరణించనివాడూ, నిత్యుడూ అయిన అల్లాహ్‌ను నమ్ముకో. స్తోత్ర సమేతంగా ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండు. తన దాసుల పాపాలను గురించి తెలుసుకునేందుకు ఆయన ఒక్కడే చాలు.

وَتَوَكَّلْ عَلَى الْحَيِّ الَّذِي لَا يَمُوتُ وَسَبِّحْ بِحَمْدِهِ ۚ وَكَفَىٰ بِهِ بِذُنُوبِ عِبَادِهِ خَبِيرًا ﴿58﴾

**59** ఆయనే ఆకాశాలనూ, భూమినీ, వాటి మధ్యనున్న సమస్త వస్తువులను ఆరు దినాలలో సృష్టించాడు. ఆ తరువాత అధికార పీఠంపై (అర్ష్‌పై) ఆసీనుడయ్యాడు. ఆయన కరుణామయుడు. కావాలంటే (ఆయన వైభవాన్ని గురించి) తెలిసిన వానిని అడుగు.

الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ وَمَا بَيْنَهُمَا فِي سِتَّةِ أَيَّامٍ ثُمَّ اسْتَوَىٰ عَلَى الْعَرْشِ ۚ الرَّحْمَٰنُ فَاسْأَلْ بِهِ خَبِيرًا ﴿59﴾

**60** "కరుణామయునికి సాష్టాంగపడండి" అని వారితో అన్నప్పుడు, 'కరుణామయుడంటే ఏమిటీ? (ఆయనెవడు?) నువ్వు ఆజ్ఞాపించినవానికి మేము సాష్టాంగపడాలా?' అని వారంటారు. ఇది (ఈ ధర్మబోధ) వారి ద్వేషాన్ని మరింత అధికం చేసింది.[74]

وَإِذَا قِيلَ لَهُمُ اسْجُدُوا لِلرَّحْمَٰنِ قَالُوا وَمَا الرَّحْمَٰنُ أَنَسْجُدُ لِمَا تَأْمُرُنَا وَزَادَهُمْ نُفُورًا ﴿60﴾ ۩

**61** ఆకాశంలో బురుజులను నిర్మించి,[75] అందులో ప్రజ్వలమైన దీపాన్ని, కాంతిమంతమైన చంద్రుణ్ణి ఆవిష్కరించినవాడు శుభకరుడు.

تَبَارَكَ الَّذِي جَعَلَ فِي السَّمَاءِ بُرُوجًا وَجَعَلَ فِيهَا سِرَاجًا وَقَمَرًا مُنِيرًا ﴿61﴾

**62** ఆయనే రేయింబవళ్ళను ఒకదాని వెనుక ఒకటి వచ్చేలా చేశాడు.[76] ఇదంతా గుణపాఠం నేర్చుకునే వాని కోసం, లేదా కృతజ్ఞతాపూర్వకంగా మసలుకోదలచిన వాని కోసం చేయబడింది.

وَهُوَ الَّذِي جَعَلَ اللَّيْلَ وَالنَّهَارَ خِلْفَةً لِمَنْ أَرَادَ أَنْ يَذَّكَّرَ أَوْ أَرَادَ شُكُورًا ﴿62﴾

---

74. **రహ్మాన్, రహీమ్** అనేవి అల్లాహ్ గుణాలు. అవి ఆయన శుభ నామాలలోనివి కూడా. అయితే అజ్ఞాన కాలంలో అరబ్బులకు అల్లాహ్‌కు చెందిన ఆ పేర్ల గురించి తెలీదు. ఉదాహరణకు : హుదైబియా ఒడంబడిక సందర్భంగా ఒప్పంద పత్రానికి ఆరంభంలో 'బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్' అని దైవప్రవక్త (స) రాయించినపుడు, 'ఈ రహ్మాన్, రహీమ్ ఎవరో మాకు తెలీదు' అని మక్కా ముష్రిక్కులు తెగేసి చెప్పారు. 'బిస్మికల్లాహుమ్మ' అని వ్రాయమని పట్టుబట్టారు (సీరత్ ఇబ్నె హిషామ్ – 2/317). బనీ ఇస్రాయీల్ సూరా (110), అర్రాద్ సూరా (30)లలో కూడా ఈ 'రహ్మాన్' ప్రస్తావన వచ్చినప్పుడు వారు తడబడేవారని, సజ్దా చేయటానికి వెనుకాడేవారని ఉంది.

75. 'సలఫ్'ల వ్యాఖ్యానం ప్రకారం 'బురుజులు' అంటే ఆకాశంలోని పెద్ద పెద్ద నక్షత్రాలని భావం. ఆ తరువాతి కాలంలోని వ్యాఖ్యాతలు మాత్రం ఖగోళ శాస్త్రజ్ఞులు సూచించిన రాసులే ఈ బురుజులని భావించారు. ఈ బురుజులు మొత్తం 12. అవేమంటే: 1. హమల్ 2. సౌర్ 3.జౌజా 4.సర్తాన్ 5. అసద్ 6. సుంబులా 7. మీజాన్ 8. అఖ్రబ్ 9. ఖౌస్ 10.జదీ 11. దల్వున్ 12. హూత్. (తెలుగులో: 1.మేషం 2.వృషభం 3. మిథునం 4.కర్కాటకం 5. సింహం 6. కన్య 7. తుల 8.వృశ్చికం 9.ధనుస్సు 10. మకరం 11.కుంభం 12. మీనం). ఈ రాసులు 7 పెద్ద గ్రహాలకు మజిలీలు, ఆ గ్రహాల పేర్లు ఇవి: 1. మిర్రీఖ్ 2. జుహ్రా 3. అతారుద్ 4.ఖమర్ 5. షమ్స్ 6.ముష్తరీ 7. జుహల్. ఈ గ్రహాలు ఆ బురుజులను తమ నిలయాలుగా వాడుకుంటాయి (ఐసరుత్తఫాసీర్)

وَعِبَادُ الرَّحْمٰنِ الَّذِيْنَ يَمْشُوْنَ عَلَى الْاَرْضِ هَوْنًا وَّاِذَا خَاطَبَهُمُ الْجٰهِلُوْنَ قَالُوْا سَلٰمًا ﴿63﴾

63 కరుణామయుని (విశ్వాసపాత్రులైన) దాసులెవరంటే, వారు నేలపై వినమ్రులై నడుస్తారు. మూర్ఖులు వారితో మాట్లాడినప్పుడు 'మీకు సలాం' అంటూ సాగిపోతారు.[77]

وَالَّذِيْنَ يَبِيْتُوْنَ لِرَبِّهِمْ سُجَّدًا وَّقِيَامًا ﴿64﴾

64 వారు తమ ప్రభువు సన్నిధిలో సాష్టాంగపడుతూ, నిలబడుతూ రాత్రులు గడుపుతారు.

وَالَّذِيْنَ يَقُوْلُوْنَ رَبَّنَا اصْرِفْ عَنَّا عَذَابَ جَهَنَّمَ ۖ اِنَّ عَذَابَهَا كَانَ غَرَامًا ﴿65﴾

65 వారిలా ప్రార్థిస్తూ ఉంటారు: "మా ప్రభూ! మాపై నుంచి నరకశిక్షను తొలగించు. ఎందుకంటే ఆ శిక్ష ఎన్నటికీ వీడనిది."[78]

اِنَّهَا سَآءَتْ مُسْتَقَرًّا وَّمُقَامًا ﴿66﴾

66 నిశ్చయంగా అది చాలా చెడ్డచోటు. చెడ్డ నివాస స్థలం.

وَالَّذِيْنَ اِذَآ اَنْفَقُوْا لَمْ يُسْرِفُوْا وَلَمْ يَقْتُرُوْا وَكَانَ بَيْنَ ذٰلِكَ قَوَامًا ﴿67﴾

67 వారు – ఖర్చుపెట్టే సమయంలో కూడా అటు మరీ దుబారా ఖర్చు చేయకుండా, ఇటు మరీ పిసినారితనం కూడా చూపకుండా – రెండింటికీ మధ్య – సమతూకాన్ని పాటిస్తారు.[79]

---

76. రాత్రిపోగానే పగలు వస్తుంది. పగలు పోగానే రాత్రి ఏతెంచుతుంది. రెండూ ఒకేసారి రావు. ఒకదాని వెనుక ఒకటి ఇవి రావటంలో గల పరమార్థాలు ఎవరికీ తెలియనివి కావు. కొందరు **'ఖిల్‌ఫతన్'** (خِلْفَةً) అన్న పదాన్ని పరస్పరం వ్యతిరేకం అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే రాత్రి చీకటిగా ఉండి, పగలు వెలుతురుగా ఉంటుందన్నమాట.

77. 'సలాం' చెప్పి ముందుకు సాగిపోవటం అంటే మూర్ఖుల మాటల్ని పట్టించుకోకుండా, పిడివాదానికి దిగకుండా నిష్క్రమిస్తారని భావం. విశ్వాసులు అజ్ఞానులతో తర్కవితర్కాలకు దిగి విలువైన సమయాన్ని వృథా చేయరు. మూర్ఖుల్లాగా మొండికేయరు. పైగా అలాంటి సందర్భాలలో నింపాదిగా, హుందాగా వ్యవహరిస్తూ అక్కడి నుంచి తప్పుకుంటారు.

78. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే కరుణామయుని సిసలైన దాసులు రాత్రిపూట దైవారాధనలో గడపటమే గాకుండా, దైవానికి భయపడుతూ ఉంటారు. నరకయాతన నుంచి నిరంతరం దేవుని శరణు కోరుతూ ఉంటారు. కనుక మనిషి దైవారాధన చేస్తూ, దైవవిధేయత కనబరుస్తూ కూడా దేవుడు తనను నిలదీస్తాడన్న విషయం పట్ల నిర్భయంగా, నిశ్చింతగా ఉండరాదు. తన ఆరాధనలను తలచుకుని అహంకారంతో విర్రవీగరాదు. ఈ మాటే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది : "వారు ఇవ్వగలిగినది ఇస్తూ ఉంటారు. కాని వారి హృదయాలు తమ ప్రభువు వైపునకు మరలి పోవలసి ఉందనే భావన వల్ల వణుకుతూ ఉంటాయి" (మోమినూన్ –6). ఇంతకీ ఆ భయం ఎందుకు? అంటే తమ ఆరాధనలు, దానధర్మాలు దైవసమక్షంలో స్వీకారయోగ్యం అవుతాయో అవవో అని! ఈ ఆయతుకు భావార్థంగా హదీసులో ఇలా వచ్చింది – ఇంతకీ ఈ విధంగా భయపడే కరుణామయుని భక్తులెవరు? వారు సారాయి త్రాగేవారా? లేక దొంగతనం చేసేవారా? అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దైవప్రవక్త(స) వారిని అడగ్గా, "లేదు. ఓ అబూబక్ర్ పుత్రికా! వారు అటువంటి జనం కారు. వారు నమాజ్ చేసేవారు, ఉపవాసాలు పాటించేవారు, దానధర్మాలు చేసేవారై ఉంటారు. అయినప్పటికీ తమ ఆచరణలు స్వీకారయోగ్యమవుతాయో లేదోనని భయపడుతూ ఉంటారు" అని ఆయన (స) వివరించారు (తిర్మిజీ – కితాబుత్తఫ్సీర్, మోమినూన్ సూరా).

79. దైవానికి ఇష్టం లేని పద్దులలో ఖర్చుపెట్టటం దుబారా ఖర్చు క్రిందికి వస్తుంది. అలాగే దైవవిధేయతా మార్గంలో ఖర్చుపెట్టకుండా చేతిని ఆపి ఉంచటం పిసినారితనంగా పరిగణించబడుతుంది. దైవాజ్ఞలకనుగుణంగా ధనాన్ని వెచ్చించటం సరైనది (ఫత్‌హుల్ ఖదీర్). అలాగే ధర్మసమ్మతమైన విషయాలలో అడ్డూ ఆపూ లేకుండా ఖర్చుపెట్టడం

وَالَّذِيْنَ لَا يَدْعُوْنَ مَعَ اللّٰهِ اِلٰهًا اٰخَرَ وَلَا يَقْتُلُوْنَ النَّفْسَ الَّتِىْ حَرَّمَ اللّٰهُ اِلَّا بِالْحَقِّ وَلَا يَزْنُوْنَ ۚ وَمَنْ يَّفْعَلْ ذٰلِكَ يَلْقَ اَثَامًا ﴿68﴾

**68** వారు అల్లాహ్‌తోపాటు మరో దైవాన్ని మొరపెట్టుకోరు. న్యాయబద్ధంగా తప్ప – అల్లాహ్ ఏ ప్రాణిని హత్య చేయటాన్ని నిషేధించాడో దానిని హతమార్చరు.[80] వారు వ్యభిచారానికి పాల్పడరు.[81] ఈ చేష్టలకు ఒడిగట్టినవాడు పాపఫలాన్ని పొంది తీరుతాడు.

يُّضٰعَفْ لَهُ الْعَذَابُ يَوْمَ الْقِيٰمَةِ وَيَخْلُدْ فِيْهٖ مُهَانًا ﴿69﴾

**69** ప్రళయదినాన అతనికి రెట్టింపు శిక్ష వడ్డించబడుతుంది. వాడు పరాభవంపాలై, అత్యంత నికృష్టస్థితిలో కలకాలం అందులో పడి ఉంటాడు.

اِلَّا مَنْ تَابَ وَاٰمَنَ وَعَمِلَ عَمَلًا صَالِحًا فَاُولٰٓئِكَ يُبَدِّلُ اللّٰهُ سَيِّاٰتِهِمْ حَسَنٰتٍ ۭ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا ﴿70﴾

**70** అయితే (ఈ పాప కార్యాల తరువాత) ఎవరు పశ్చాత్తాపం చెంది, విశ్వసిస్తారో, సదాచరణ చేస్తారో[82] అలాంటి వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చి వేస్తాడు.[83] అల్లాహ్ క్షమాభిక్ష పెట్టేవాడు, కరుణాకరుడు.

కూడా 'దుబారా' క్రిందికి వస్తుంది. అందుకే ఎల్లప్పుడూ రెండు అతివాదాలకు నడుమ సమత్వాన్ని, సమతూకాన్ని పాటించటం అవసరం.

80. న్యాయబద్ధంగా ఎవరినయినా చంపటానికి మూడు కారణాల్లో ఏదో ఒకటి ఉండాలి. 1. ఇస్లాం స్వీకరించిన మీదట అతడు ధర్మభ్రష్టుడైతే, 2. వివాహితుడై ఉండి కూడా వ్యభిచారానికి పాల్పడితే. 3. ఎవరినయినా అన్యాయంగా హత్యచేస్తే – ఈ మూడు పరిస్థితుల్లో మరణశిక్ష విధించవచ్చు.

81. హదీసులో ఉంది – "అన్నిటికన్నా పెద్ద పాపం ఏది?" అని ఒకరు దైవప్రవక్త (సఅసం)ను ప్రశ్నించగా, "నిన్ను పుట్టించినవాడు అల్లాహ్‌యే అయినప్పటికీ నువ్వు ఆయనకు సహవర్తునిగా ఇంకొకరిని కల్పించటం (షిర్క్‌కు ఒడిగట్టడం)" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. "ఆ తరువాత పెద్ద పాపం ఏది?" అని అతను అడగ్గా, "నీ సంతానం నీతో కలిసి తినేస్తుందేమోనన్న భయంతో చంపేయటం" అని ఆయన (స) చెప్పారు. "ఆ తరువాత?" అని అతను సందేహపడగా, "నువ్వు నీ పొరుగువాని భార్యతో అక్రమ సంబంధం ఏర్పరచుకోవటం" అని ఆయన (సఅసం) బదులిచ్చారు. ఈ ఆయతు ద్వారా ఈ విషయాలు రూఢీ అవుతున్నాయని చెబుతూ ఆయన (స) ఈ ఆయతును పఠించారు (బుఖారీ – తఫ్సీర్ అల్ బఖర సూరా; ముస్లిం – కితాబుల్ ఈమాన్).

82. దీనిద్వారా అర్థమయ్యేదేమిటంటే నిష్కల్మషమైన, నిజమైన పశ్చాత్తాపం వల్ల అన్ని రకాల పాపాలూ క్షమించబడతాయి. అవి ఎంత పెద్దవైనా సరే.

మరి నిసా సూరా 93వ ఆయతులో విశ్వాసిని హత్యచేసినవాడికి నరకమే గతి అని చెప్పబడిందేమిటి? అన్న సందేహం ఈ సందర్భంగా కలగవచ్చు. అసలు విషయం ఏమిటంటే విశ్వాసిని హత్యచేసిన తర్వాత పశ్చాత్తాపం చెందకుండా అదే స్థితిలో చనిపోయినవాడని అక్కడ దాని భావం. ఇకపోతే నిష్కల్మషమైన మనస్సుతో పశ్చాత్తాపం చెందితే ఆ పాపం కూడా క్షమించబడుతుంది. ఒకడు వందమందిని హత్యచేసిన తర్వాత మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందగా అల్లాహ్ అతన్ని కూడా క్షమించి వదలిపెట్టాడని హదీసులో ఉంది. (సహీహ్ ముస్లిం, తౌబా ప్రకరణం).

83. దీని భావం ఏమిటంటే దేవుడు అతని జీవితంలో పరివర్తనను తీసుకువస్తాడు. ఇస్లాంకు పూర్వం అతను పాపాలు చేసేవాడు. ఇప్పుడతను పుణ్యకార్యాలు చేస్తాడు. పూర్వం బహుదైవారాధన చేసేవాడు. ఇప్పుడు ఏకదైవారాధన చేస్తాడు. పూర్వం అవిశ్వాసులతో కలిసి ముస్లింలను పీడించేవాడు. ఇప్పుడు ముస్లింల తరఫున అవిశ్వాసులను

71 మరెవరయితే పశ్చాత్తాపం చెంది, సదాచరణ చేస్తాడో అతడు (వాస్తవంగా) అల్లాహ్ వైపునకు మరలి వచ్చినవాడవుతాడు.[84]

وَمَنْ تَابَ وَعَمِلَ صَالِحًا فَإِنَّهُ يَتُوبُ إِلَى اللَّهِ مَتَابًا ﴿٧١﴾

72 వారు (కరుణామయుని సిసలైన దాసులు) అసత్యానికి సాక్షులుగా ఉండరు.[85] ఎప్పుడైనా వ్యర్థమైనవాటి గుండా పోవలసి వస్తే, హుందాగా ముందుకు సాగిపోతారు.[86]

وَالَّذِينَ لَا يَشْهَدُونَ الزُّورَ وَإِذَا مَرُّوا بِاللَّغْوِ مَرُّوا كِرَامًا ﴿٧٢﴾

73 వారికి వారి ప్రభువు వాక్యాల ఆధారంగా బోధపరచినపుడు, వారు గుడ్డివారుగా, చెవిటివారుగా వాటి మీద పడిపోరు.[87]

وَالَّذِينَ إِذَا ذُكِّرُوا بِآيَاتِ رَبِّهِمْ لَمْ يَخِرُّوا عَلَيْهَا صُمًّا وَعُمْيَانًا ﴿٧٣﴾

74 వారు ఇలా ప్రార్థిస్తూ ఉంటారు : "ఓ మా ప్రభూ! నువ్వు మా భార్యల ద్వారా, మా సంతానం ద్వారా మా కళ్లకు చలువను ప్రసాదించు.[88] మమ్మల్ని దైవ భక్తిపరుల (ముత్తఖీన్‌ల) నాయకునిగా చేయి."[89]

وَالَّذِينَ يَقُولُونَ رَبَّنَا هَبْ لَنَا مِنْ أَزْوَاجِنَا وَذُرِّيَّاتِنَا قُرَّةَ أَعْيُنٍ وَاجْعَلْنَا لِلْمُتَّقِينَ إِمَامًا ﴿٧٤﴾

ప్రతిఘటిస్తాడు. మరో అర్థం ఏమిటంటే అల్లాహ్ అతని పాపాలను పుణ్యాలుగా మార్చివేస్తాడు. హదీసు ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా చెప్పారు : "అందరికన్నా చివర్లో స్వర్గంలో ప్రవేశించేదెవరో, అందరికన్నా ఆఖరిలో నరకం నుంచి బయటికి తీయబడేవాడెవడో నాకు తెలుసు. ప్రళయదినాన అతని చిన్న చిన్న పాపాలు సమర్పించబడతాయి. అతని పెద్ద పాపాలు ఒక ప్రక్కన పెట్టబడతాయి. నువ్వు ఫలానా రోజుల్లో ఫలానా పాపకార్యాలు చేశావా? అని అతన్ని ప్రశ్నించటం జరుగుతుంది. అతను 'అవున'ని ఒప్పుకుంటాడు. ఎందుకంటే వాటిని త్రోసిపుచ్చే శక్తి అతనికి ఉండదు. అదీగాక, తన పెద్ద పాపాలు కూడా హాజరుపరచబడవచ్చున్న భయం అతన్ని పీడిస్తూ ఉంటుంది. అంతలోనే, "పో. నువ్వు చేసిన ఒక్కో పాపానికి బదులుగా ఒక్కో పుణ్యం ఇవ్వబడింది" అని అతనితో అనబడుతుంది. దేవుని ఈ ఔదార్యాన్ని చూసి, "నేను చేసిన దురాగతాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. అవి నాకిక్కడ కానరావటం లేద"ని అంటాడు. ఇది చెప్పిన తరువాత దైవప్రవక్త (స) పెద్దగా నవ్వేశారు. అప్పుడు ఆయన (స) పల్లు కూడా కనిపించాయి (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

84. మొదటి తౌబా (పశ్చాత్తాపం) అవిశ్వాసం, బహుదైవారాధన (షిర్క్)కు సంబంధించినది. ఈ తౌబా ఇతరత్రా పాపకార్యాలకు, పొరపాట్లకు సంబంధించినది.

85. మూలంలో **'జూర్'** (الزُّوْرَ) అనే పదం ఉంది. 'జూర్' అంటే అసత్యం, బూటకం అని అర్థం. అబద్ధం మొదలుకుని కుఫ్ర్, షిర్క్, దురాచారాలు, వ్యర్థ విషయాలు, వ్యసనాలు, అజ్ఞానకాలపు మూఢనమ్మకాలు అన్నీ ఇందులో చేరి ఉన్నాయి. కాబట్టి కరుణామయుని నికార్సయిన భక్తులెవరూ ఇలాంటి అపసవ్యమైన విషయాలలో, అసత్య సాక్ష్యాలలో తలదూర్చరు. ఈ రకమైన సమావేశాలకు, చర్చలకు కూడా వారు దూరంగా ఉంటారు.

86. **'లఘ్వున్'** (لَغْو) అంటే నిరర్థకమైన, నిష్ప్రయోజనకరమైన విషయం అని అర్థం. ఇలాంటి మాటలు, చేష్టలు వారికి ఎదురుపడినపుడు వారక్కడి నుంచి సంస్కారవంతుల మాదిరిగా తప్పుకుంటారు. ధనాన్ని, మానాన్ని, ప్రాణాన్ని బలిగొనే వ్యర్థ విషయాలకు వారు అల్లంత దూరాన ఉంటారు.

87. అంటే దైవోపదేశం పట్ల వారు నిర్లక్ష్యాన్ని, ఉదాసీనతను కనబరచరు. పైగా వారు తమ ప్రభువు వాక్యాలను శ్రద్ధగా వింటారు. వాటిపై యోచన చేస్తారు. వాటి ప్రకారం ఆచరిస్తారు.

88. అంటే మా ఆలుబిడ్డలను నీ విధేయులుగానూ, మా విధేయులుగానూ చేయి. ఆ విధంగా వారు మాకు కన్నుల పండువ కావాలి.

**75** ఇలాంటి వారికే వారి సహన స్థయిర్యాలకు బదులుగా స్వర్గం లోని అత్యున్నత స్థానాలు వొసగబడతాయి. అక్కడ సలాం, దీవెన లతో వారికి స్వాగత సత్కారాలు లభిస్తాయి.

أُولَٰئِكَ يُجْزَوْنَ الْغُرْفَةَ بِمَا صَبَرُوا وَيُلَقَّوْنَ فِيهَا تَحِيَّةً وَسَلَامًا (75)

**76** వారందులో (స్వర్గవనాలలో) కలకాలం ఉంటారు. అదెంతో రమణీయమైన స్థలం, అత్యుత్తమ నివాసం.

خَالِدِينَ فِيهَا ۚ حَسُنَتْ مُسْتَقَرًّا وَمُقَامًا (76)

**77** "ఒకవేళ మీరు మొర పెట్టుకోకపోతే, నా ప్రభువు మిమ్మల్ని ఏ మాత్రం లక్ష్యపెట్టేవాడే కాదు.[90] మీరెలాగూ ధిక్కరించారు. ఇప్పుడు శీఘ్రంగానే తప్పించనలవికాని శిక్ష మిమ్మల్ని అంటు కుంటుంది"[91] అని (ఓ ప్రవక్తా! తిరస్కార జనులకు) చెప్పు.

قُلْ مَا يَعْبَأُ بِكُمْ رَبِّي لَوْلَا دُعَاؤُكُمْ ۖ فَقَدْ كَذَّبْتُمْ فَسَوْفَ يَكُونُ لِزَامًا (77)

89. అంటే మంచి పనులలో వారు మాకు సహాయసహకారాలందించేలా చెయ్యి.

90. **'మొర'** అంటే దుఆ, ఆరాధన అని భావం. మీరు సృష్టించబడింది దైవారాధన కోసమే. కాని ఈ విషయాన్ని మీరు గ్రహించలేకపోతే మీ ప్రభువుకు కలిగే నష్టం ఏమీలేదు, నష్టపోయేది మీరే అని దీని భావం.

91. అవిశ్వాసులను ఉద్దేశించి చెప్పబడిన మాటలివి : "మీరు ఎలాగూ అల్లాహ్‌ను తిరస్కరించారు. కాబట్టి మీకు శిక్ష పడటం ఖాయం." ఈ మాట ప్రపంచంలోనూ నిజమయింది. బద్ర్ యుద్ధంలో అవిశ్వాసులకు ఘోర పరాజయం ఎదురయింది. ఇక పరలోకంలోనైతే శాశ్వితమైన నరకయాతన వారికి విధించబడుతుంది.

26వ సూరా

# అష్ షుఅరా

## కవులు

అవతరణ మక్కాలో

ఆయతులు 227

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, పరలోకం, మరణానంతరం మళ్ళీ లేపబడడం, దివ్యవాణి అవతరణ, ప్రవక్తల పరంపర గురించి బోధించింది. ఈ సూరాలోని 224 – 226 ఆయతుల్లో కవుల గురించి క్లుప్తమైన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఒక కవి అని ఆరోపించారు. దివ్యఖుర్ఆన్ ఒక కవిత్వమని చెప్పసాగారు. కవిత్వానికి, ఖుర్ఆన్‌కు మధ్య ఉన్న భేదాన్ని ఈ సూరా స్పష్టం చేసింది. దివ్యఖుర్ఆన్ దేవుని చట్టం, మానవ జీవన నియమావళి. ఖుర్ఆన్ మనిషి జీవితాన్ని సంస్కరిస్తుంది. కాగా; కవిత్వం చాలా వరకు వ్యర్థ ప్రసంగం. దివ్యఖుర్ఆన్ స్వచ్ఛమైన సత్యాన్ని, మానవాళికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తుంది. కవిత్వం ఊహాగానం, కవుల కల్పన మాత్రమే.*

*అవిశ్వాసులకు సత్యం ప్రస్ఫుటంగా కనబడుతున్నప్పటికీ వారు తమ తిరస్కారాన్ని, తలబిరుసుతనాన్ని కొనసాగిస్తారని ఈ సూరా తెలుపుతుంది. అకస్మాత్తుగా వచ్చిపడే బాధాకరమైన శిక్ష గురించి అవిశ్వాసులను ఈ సూరా హెచ్చరించింది. దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు అని ఈ సూరా నొక్కి చెప్పింది. దివ్యఖుర్ఆన్‌లోని సారాంశం గత కాలాల్లో అవతరించిన ప్రాచీన దైవగ్రంథాలలోను ఉందనీ, ఇస్రాయీల్ సంతతి ప్రజలకు ఈ విషయం తెలుసుననీ ఈ సూరా స్పష్టం చేసింది. ప్రవక్తలందరూ హెచ్చరిక చేసేవారిగా వచ్చారని, అల్లాహ్ ఎన్నడూ అన్యాయం చేయదని ఈ సూరా తెలిపింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ **కథామాలికలో** చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 10-66<br>105-121<br>123-139<br>141-190 | 14, 21, 25, 50, 81, 83 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవ ప్రవక్త సాలిహ్' 'దైవ ప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' 'దైవప్రవక్త మూసా' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారావాహికంగా ఇక్కడ లభ్యమవుతాయి. ఏయే జాతుల వారి వద్దకు అల్లాహ్ ఏయే ప్రవక్తలను పంపించాడు? ఆయా ప్రవక్తలకు తమ జాతి ప్రజల నుంచి ఏం సమాధానం లభించింది? విశ్వాసులను అల్లాహ్ ఏ విధంగా కాపాడాడు? తిరస్కారులను ఎలా శిక్షించాడు? – ప్రతిదీ తెలుసుకోవచ్చు. |
| 69-103 | 30 | 'దైవప్రవక్త ఇబ్రాహీమ్' | ఇబ్రాహీమ్ ప్రవక్త ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక సమాజం అని అల్లాహ్ స్వయంగా అన్నాడు (సూరె నహ్ల్: 120). ఆయన జీవితం ఏక దైవారాధనకు పెట్టింది పేరు. ఆయన పేరు వింటేనే 'తౌహీద్' (ఏక దైవారాధన) గుర్తుకు వస్తుంది. ఆ సమాచారం మొత్తం చక్కని కథా రూపంలో. |

## అష్ షుఅరా సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** తా – సీన్ – మీమ్.

**2** ఇవి స్పష్టమైన గ్రంథ వచనాలు.

**3** (ఓ ముహమ్మద్-స!) వారు విశ్వసించలేదే! అన్న బెంగతో నువ్వు నీ ప్రాణాలను పోగొట్టుకుంటావు కాబోలు![1]

**4** మేము గనక తలచుకుంటే ఆకాశం నుంచి ఒక (గొప్ప) నిదర్శనాన్ని అవతరింపజేసి, దాని ముందు వారి మెడలు వంగిపోయేలా చేయగలం.[2]

**5** కరుణామయుని (అల్లాహ్) తరఫు నుంచి వారివద్దకు ఏ నూతన ఉపదేశం వచ్చినా వారు దాని పట్ల విముఖత చూప కుండా ఉండలేదు.

**6** వారు ధిక్కరించారు. కాబట్టి వారు అవహేళన చేసిన విషయాల వార్తలు త్వరలోనే వారివద్దకు చేరుతాయి.[3]

**7** ఏమిటీ, వారు భూమిపై దృష్టిని సారించలేదా? అందులో మేము అన్నిరకాల శ్రేష్ఠమైన జంట వస్తువులను[4] ఎలా ఉత్పన్నం చేసి ఉన్నామో! (చూడలేదా?)

## سُورَةُ الشُّعَرَاءِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

طٰسٓمٓ ①

تِلْكَ اٰيٰتُ الْكِتٰبِ الْمُبِيْنِ ②

لَعَلَّكَ بَاخِعٌ نَّفْسَكَ اَلَّا يَكُوْنُوْا مُؤْمِنِيْنَ ③

اِنْ نَّشَاْ نُنَزِّلْ عَلَيْهِمْ مِّنَ السَّمَآءِ اٰيَةً فَظَلَّتْ
اَعْنَاقُهُمْ لَهَا خٰضِعِيْنَ ④

وَمَا يَاْتِيْهِمْ مِّنْ ذِكْرٍ مِّنَ الرَّحْمٰنِ مُحْدَثٍ
اِلَّا كَانُوْا عَنْهُ مُعْرِضِيْنَ ⑤

فَقَدْ كَذَّبُوْا فَسَيَاْتِيْهِمْ اَنْۢبٰٓؤُا مَا كَانُوْا
بِهٖ يَسْتَهْزِءُوْنَ ⑥

اَوَلَمْ يَرَوْا اِلَى الْاَرْضِ كَمْ اَنْۢبَتْنَا فِيْهَا مِنْ كُلِّ
زَوْجٍ كَرِيْمٍ ⑦

---

1. మానవాళి మార్గదర్శకత్వం కోసం అంతిమ దైవప్రవక్త (సఅసం) ఎంత తీవ్రంగా ప్రయత్నించేవారో ఈ వాక్యాన్ని బట్టి ఊహించవచ్చు.

2. మేము అవతరింపజేసే నిదర్శనం అత్యద్భుతంగా ఉండేది. దాని ముందు వారు తలవంచటం తప్ప మార్గాంతరం లేని పరిస్థితి ఏర్పడేది. కాని మేమిలా చేసివుంటే అది బలాత్కారం క్రిందికి వస్తుంది. మేము మనిషి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించ దలచలేదు. అతనికి స్వేచ్ఛను ఇచ్చినప్పుడే మేము పెట్టే పరీక్షకు అర్థం ఉంటుంది. అందుకే మేము అద్భుతాలు చూపించి, చిటికెలో పరిస్థితుల స్వరూపాన్ని మార్చే విధానానికి స్వస్తి చెప్పాము. మా సందేశహరులను పంపి, మా గ్రంథాలను అవతరింపజేయటంతోనే సరిపుచ్చాము.

3. వారి ధిక్కార వైఖరి మూలంగా త్వరలోనే మా ఆగ్రహం వారిని చుట్టుముడ్తుంది. మా శిక్షను వారు 'అసంభవం' అని అంటున్నారు. దాన్ని ఒక వేళాకోళంగా తీసుకున్నారు. నిజానికి ఈ శిక్ష అసంభవం ఏమీ కాదు. ఇహలోకంలో కూడా అది సంభవమే. గతంలో ఎన్నో జాతులు ఈ శిక్షకు గురై వినాశం పొందాయి. ఒకవేళ మేము ఎవరినయినా ప్రపంచంలో విడిచిపెట్టినా పరలోకంలో మాత్రం వారు తప్పించుకోలేరు. ఆయతులో "మా కానూ అన్హు మూరిజీన్" (వారు దానికి విముఖులయ్యారు) అని అనబడలేదు. పైగా **'మా కానూ బిహీ యస్తహ్జివూన్'** (వారు

8 నిస్సందేహంగా అందులో ఓ సూచన ఉంది.[5] అయినప్పటికీ వారిలో చాలా మంది విశ్వసించరు.[6]

إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿٨﴾

9 నిశ్చయంగా నీ ప్రభువు, ఆయనే – సర్వశక్తుడు, దయా శీలుడు.[7]

وَإِنَّ رَبَّكَ لَهُوَ الْعَزِيزُ الرَّحِيمُ ﴿٩﴾

10 నీ ప్రభువు మూసాను పిలిచి, "నువ్వు దుర్మార్గులైన ప్రజల వద్దకు వెళ్ళు[8] (అని చెప్పిన సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకో).

وَإِذْ نَادَىٰ رَبُّكَ مُوسَىٰ أَنِ ائْتِ الْقَوْمَ الظَّالِمِينَ ﴿١٠﴾

11 "అంటే ఫిర్ఔను జనుల వద్దకు! వారు (అల్లాహ్‌కు) భయ పడరా?"

قَوْمَ فِرْعَوْنَ ۚ أَلَا يَتَّقُونَ ﴿١١﴾

12 (మూసా) ఇలా అన్నాడు : "నా ప్రభూ! వారు నన్ను ధిక్కరిస్తారేమోనని నాకు భయంగా ఉంది.

قَالَ رَبِّ إِنِّي أَخَافُ أَن يُكَذِّبُونِ ﴿١٢﴾

13 "నా గుండె కుంచించుకుపోతోంది.[9] నా నోరు సరిగ్గా (స్వేచ్ఛగా) పెగలటం లేదు.[10] అందుకే హారూను వైపుకు కూడా సందేశం (వహీ) పంపించు.[11]

وَيَضِيقُ صَدْرِي وَلَا يَنطَلِقُ لِسَانِي فَأَرْسِلْ إِلَىٰ هَارُونَ ﴿١٣﴾

దాన్ని గేలిచేశారు) అని అనబడింది. పరిహసించటంలో, గేలి చేయటంలో విముఖత, ధిక్కార భావాలు కూడా వస్తాయి. కనుక ఈ పరిహాసం, విముఖత, ధిక్కారం కన్నా ఘోరాతిఘోర నేరం. (ఫత్‌హుల్ ఖదీర్).

4. **'జౌజున్'** (زَوْجٌ) అంటే 'జంట' అని అసలు అర్థం. 'రకము' అన్న అర్థం కూడా వస్తుంది. అంటే మానవ మనుగడకు ఉపయోగపడే ఎన్నో మేలైన వస్తువులను మేము భూమిలో ఉత్పత్తి చేశాము అని భావం. ఉదాహరణకు: ఆహారధాన్యాలు, పండ్లుఫలాలు, పశువులు మొదలగునవి.

5. మృత భూమిలో నుంచి ఇన్ని రకాల వస్తువులను ఉత్పత్తి చేస్తున్న దేవుడు చనిపోయిన మనుషులను తిరిగి బ్రతికించలేడా?!

6. దేవుని ఈ గొప్ప సూచనను చూసిన తరువాత కూడా వారిలో అధికులు విశ్వసించేందుకు నిరాకరిస్తున్నారంటే, ఇక వారు ఎన్నటికీ విశ్వసించరు.

7. ఆయన శక్తిశాలి. తాను తలచుకుంటే తనను ధిక్కరించిన ప్రతి ఒక్కరిపై ప్రతీకారం తీర్చుకోగలడు. కాని ఆయన దయాశీలి. కాబట్టి ఆయన నేరస్తులను తక్షణం నిలదీయడు. వారికి తగినంత గడువును ఇస్తాడు. వారి పాపం పూర్తిగా పండిన తరువాతే తన కొరడాను ఝుళిపిస్తాడు.

8. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) మద్‌యన్ ప్రాంతం నుంచి సతీసమేతంగా స్వదేశానికి తిరిగి వెళుతున్నప్పుడు ప్రభువు పిలిచిన పిలుపు ఇది. మార్గమధ్యంలో వారికి నిప్పు అవసరమైంది. నిప్పుకోసం తూర్ పర్వతం వద్దకు చేరగానే అగోచరవాణి ఆయనకు స్వాగతం పలికింది. దుర్మార్గులైన ఫిరౌను జాతివారికి సన్మార్గం ప్రబోధించే బాధ్యత అక్కడే ఆయనకు అప్పగించబడింది.

9. అసలే ఫిరౌను దుర్మార్గుడు. తలబిరుసు. నా సందేశాన్ని వాడు స్వీకరిస్తాడా!? పైగా వాడు ఏదన్నా కీడు తలపెట్టవచ్చు అన్నది ఆయన మాటల్లోని ఆంతర్యం. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే మానవ సహజమైన భయాందోళనలు దైవప్రవక్తలకు కూడా ఉంటాయి.

**14** "వారి తరఫున నాపై ఒక నేరారోపణ కూడా ఉంది. అందు వల్ల వారు నన్ను చంపేస్తారేమోనని భయపడుతున్నాను."[12]

وَلَهُمْ عَلَيَّ ذَنْبٌ فَأَخَافُ أَن يَقْتُلُونِ ﴿١٤﴾

**15** (అల్లాహ్) ఇలా సెలవిచ్చాడు: "ఎట్టి పరిస్థితిలోనూ అలా జరగదు. మీరిద్దరూ నా నిదర్శనాలను తీసుకుని వెళ్ళండి.[13] మేము స్వయంగా మీ వెంట ఉండి అంతా వింటూ ఉంటాము.[14]

قَالَ كَلَّا ۖ فَاذْهَبَا بِآيَاتِنَا ۖ إِنَّا مَعَكُم مُّسْتَمِعُونَ ﴿١٥﴾

**16** "మీరిద్దరూ ఫిర్ఔను దగ్గరకు వెళ్ళి, 'నిశ్చయంగా మేము సర్వలోక ప్రభువు తరఫున పంపబడ్డాము' అని పలకండి."

فَأْتِيَا فِرْعَوْنَ فَقُولَا إِنَّا رَسُولُ رَبِّ الْعَالَمِينَ ﴿١٦﴾

**17** 'నువ్వు ఇస్రాయీలు సంతతి వారిని మా వెంట పంపించు'[15] అని అనండి.

أَنْ أَرْسِلْ مَعَنَا بَنِي إِسْرَائِيلَ ﴿١٧﴾

**18** (మూసాతో ఫిరౌను) ఇలా అన్నాడు : "ఏమిటీ? మేము నీ పసితనంలో నిన్ను మా దగ్గర పోషించలేదా?[16] నీ జీవితంలోని అనేక సంవత్సరాలు నువ్వు మా వద్ద గడిపావు కూడా![17]

قَالَ أَلَمْ نُرَبِّكَ فِينَا وَلِيدًا وَلَبِثْتَ فِينَا مِنْ عُمُرِكَ سِنِينَ ﴿١٨﴾

10. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ధారాళంగా మాట్లాడలేక పోయేవారన్న దానికి ఇదొక తార్కాణం. లేదా కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల కథనం ప్రకారం బాల్యంలో నాలుకపై నిప్పు పెట్టడం వల్ల ఆయనకు నత్తి వచ్చింది.

11. అంటే హారూనును కూడా దైవప్రవక్తగా నియమించి, అతన్ని నా సహాయకునిగా చేయి.

12. అసంకల్పికంగా మూసా (అలైహిస్సలాం) చేతిలో హతుడైన వ్యక్తి గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. ఆ వ్యక్తి ఖిబ్తీ జాతికి, అనగా ఫిరౌను జాతికి చెందినవాడు. అందువల్ల ఫిరౌను – ప్రతీకారంగా – మూసాను చంపదలిచాడు. ఆ సంగతి తెలియగానే మూసా (అలైహిస్సలాం) ఈజిప్టు నుంచి మద్యన్ ప్రాంతానికి వెళ్ళిపోయారు. ఈ సంఘటన జరిగి ఎన్నో సంవత్సరాలు గడచిపోయినప్పటికీ మూసా సందేహం ఇంకా తొలగిపోలేదు. అదను చూసి ఫిరౌను తనను హతమారుస్తాడన్న అనుమానం ఆయన్ని వెంటాడుతూనే ఉండేది.

13. ఇది అల్లాహ్ తరఫున ఓదార్పు. మీరిరువురూ అతని దగ్గరకు వెళ్ళి, నా సందేశాన్ని అందజేయండి. ఎలాంటి జంకు లేకుండా మాట్లాడండి. అతని కీడు నుంచి మిమ్మల్ని కాపాడే బాధ్యత నాది. "నిదర్శనాలు" అంటే దైవప్రవక్తలకు దేవుని తరఫున లభించే మహిమలు లేక అద్భుతాలు అని భావం. ఉదాహరణకు దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) చేతి కర్ర పాముగా మారటం, ఆయన తన చంకలో చేయిపెట్టగానే దేదీప్యమానంగా ప్రకాశించటం– ఇవి రెండూ దైవనిదర్శనాలే.

14. అంటే మీరు చెప్పేదానినీ, దానికి సమాధానంగా ఫిరౌనీయులు పలికే దానిని కూడా మేము వింటూ ఉంటాము. అందువల్ల మీరు ఆందోళన చెందవలసిన పనిలేదు. మేము మీపై దైవదౌత్య భారాన్ని మోపి మిమ్మల్ని పట్టించుకోకుండా వదిలివేసే వారం కాము. అనుక్షణం మా సహాయం మిమ్మల్ని వెన్నంటి ఉంటుంది సుమా!

15. ఫిరౌన్‌కు ఇంకొక మాట కూడా చెప్పండి : అదేమంటే, మేము మా ప్రభువు ఆజ్ఞపై నీ వద్దకు వచ్చాము. మేము సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ ప్రతినిధులం. ఆయన సందేశహరులుగా వచ్చాము. చూడు! నువ్వు (నాలుగు శతాబ్దాలుగా) ఇస్రాయీల్ వంశీయులను బానిసలుగా చేసుకుని వేధిస్తున్నావు. వారిని విడిచిపెట్టు. దేవుడు వాగ్దానం చేసిన సిరియా భూభాగంలో మేము వారిని వసింపజేసి, వారికి గౌరవోన్నతుల్ని ప్రసాదిస్తాము.

**19** “ఆ తరువాత నువ్వు చేయాల్సింది చేసి వెళ్ళావు. మొత్తానికి చేసిన మేలును మరచిన వారిలో నువ్వూ ఒకడివి.”[18]

وَفَعَلْتَ فَعْلَتَكَ الَّتِي فَعَلْتَ وَأَنتَ
مِنَ الْكَافِرِينَ ﴿19﴾

**20** మూసా ఈ విధంగా సమాధానమిచ్చాడు : “(అవును). నేను దారితప్పి వున్న స్థితిలో ఆ పని చేశాను.[19]

قَالَ فَعَلْتُهَا إِذًا وَأَنَا مِنَ الضَّالِّينَ ﴿20﴾

**21** “ఆ తరువాత నేను మీకు భయపడి మీ నుంచి పారిపోయాను. ఆ తరువాత నా ప్రభువు నాకు వివేకాన్ని, జ్ఞానాన్ని వొసగాడు. నన్ను తన సందేశహరులలో చేర్చుకున్నాడు.[20]

فَفَرَرْتُ مِنكُمْ لَمَّا خِفْتُكُمْ فَوَهَبَ لِي رَبِّي
حُكْمًا وَجَعَلَنِي مِنَ الْمُرْسَلِينَ ﴿21﴾

**22** “ఇక నువ్వు నాకు ఉపకారం చేశావని ఎత్తిపొడుస్తున్న విషయమంటావా? వాస్తవానికి నువ్వు ఇస్రాయీలు సంతతిని బానిసలుగా చేసి పెట్టుకున్నావు.”[21]

وَتِلْكَ نِعْمَةٌ تَمُنُّهَا عَلَيَّ أَنْ عَبَّدتَّ
بَنِي إِسْرَائِيلَ ﴿22﴾

**23** “ఇంతకీ సకల లోకాల ప్రభువు అంటే ఏమిటి?”[22] అని ప్రశ్నించాడు ఫిరౌను.

قَالَ فِرْعَوْنُ وَمَا رَبُّ الْعَالَمِينَ ﴿23﴾

**24** “మీరు నమ్మగలవారే అయితే (వినండి) ఆయన ఆకాశాలకూ, భూమికీ, వాటి మధ్యనున్న సమస్త వస్తువులకు ప్రభువు” అని మూసా జవాబిచ్చాడు.

قَالَ رَبُّ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا
إِن كُنتُم مُّوقِنِينَ ﴿24﴾

---

16. ఫిరౌన్ చక్రవర్తి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) సందేశాన్ని వినలేదు సరికదా, ఆయన్ని చులకన చేయటం మొదలెట్టాడు. మా ఇంట పెరిగి, మా ఒడిలో ఆడుకుని మాకే ఎసరుపెట్టే స్థాయికి ఎదిగావా? ఇస్రాయీల్ సంతతిలో పుట్టే మగపిల్లల్ని హతమారుస్తున్న సమయంలో నువ్వు మా రాజభవనంలో పెరిగిపెద్దవాడవు కాలేదా? అని తన ఉపకారాలను జ్ఞాపకం చేశాడు ఫిరౌన్.

17. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) సుమారు 18 సంవత్సరాలు ఫిరౌన్ రాజభవనంలో ఉన్నారని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం 30 సంవత్సరాలనీ, 40 సంవత్సరాలని కూడా తెలుస్తోంది. అంటే ఇంతకాలం మా దగ్గర ఉన్నావు. కొన్ని సంవత్సరాలు మాత్రమే అటూ ఇటూ సంచరించి నిన్ను నువ్వు దైవప్రవక్తగా ప్రకటించుకుంటావా? అన్నది ఫిరౌన్ మాటల్లోని ఆంతర్యం.

18. మా ఉప్పు తిని, మా జాతికే చెందిన ఒక పౌరుడ్ని చంపి మాకు ద్రోహం చేశావు అన్నది ఫిరౌన్ మాటల అంతరార్థం.

19. అంటే ఆ హత్య పొరపాటున, అనుకోకుండా జరిగిందే తప్ప ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదు. దౌర్జన్యాన్ని అడ్డుకునే ప్రయత్నంలో ఒక గుద్దు గుద్దేసరికి ఆ వ్యక్తి ప్రాణం విడిచాడు. అదీగాక ఆ హత్యోదంతం దైవదౌత్యానికి మునుపు జరిగింది. అప్పటికి నాకు దేవుని తరఫున దివ్యజ్ఞానం లభించలేదు అని హజ్రత్ మూసా వివరించారు.

20. పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. అయితే నేనిప్పుడు దైవప్రవక్తను. దైవాదేశాన్ని తెచ్చాను. ఇప్పుడు నువ్వు గనక నన్ను అనుసరిస్తే రక్షించబడతావు. అన్యథా నీకు వినాశం తప్పదు.

21. ఈనాడు నువ్వు నీ ఉపకారాన్ని ఎత్తిపొడుస్తున్నావా? నీ ఉపకారాన్ని నేను కాదనటం లేదు. కాని మరోవంక నువ్వు మొత్తం ఇస్రాయీలు సంతతినే బానిసలుగా చేసుకుని వారి జీవితాలతో ఆడుకుంటున్నావు. తరతరాల ఈ పీడన ముందు నువ్వు నాకు చేసిన ఉపకారం ఏపాటిది? అన్నది మూసా పలుకుల్లోని ఆంతర్యం.

**25** ఫిరౌను తన చుట్టూ ఉన్న వారినుద్దేశించి, "(ఇతనేమం
టున్నాడో) మీరు వినటంలేదా?"[23] అన్నాడు.

قَالَ لِمَنْ حَوْلَهُ أَلَا تَسْتَمِعُونَ ﴿٢٥﴾

**26** "ఆయన మీకూ ప్రభువే, మీ పూర్వీకులైన మీ తాతముత్తాత
లకు కూడా ప్రభువే" అన్నాడు మూసా.

قَالَ رَبُّكُمْ وَرَبُّ آبَائِكُمُ الْأَوَّلِينَ ﴿٢٦﴾

**27** "(ప్రజలారా!) మీ వద్దకు పంపబడిన ఈ మీ ప్రవక్త
ముమ్మాటికీ పిచ్చివాడే" అని ఫిరౌన్ అన్నాడు.

قَالَ إِنَّ رَسُولَكُمُ الَّذِي أُرْسِلَ إِلَيْكُمْ لَمَجْنُونٌ ﴿٢٧﴾

**28** "మీరు గనక గ్రహించగలిగితే, ప్రాక్పశ్చిమాలకు, వాటి మధ్య
నున్న సమస్తానికీ ఆయనే ప్రభువు"[24] అని మూసా చెప్పుకు
పోతున్నాడు.

قَالَ رَبُّ الْمَشْرِقِ وَالْمَغْرِبِ وَمَا بَيْنَهُمَا ۖ إِنْ كُنْتُمْ تَعْقِلُونَ ﴿٢٨﴾

**29** "(ఇదిగో జాగ్రత్తగా విను!) నువ్వు నన్ను గాక వేరెవరినయినా
ఆరాధ్య దైవంగా చేసుకున్నావంటే నేను నిన్ను కారాగారంలో పడ
వేస్తాను"[25] అని ఫిరౌను హెచ్చరించాడు.

قَالَ لَئِنِ اتَّخَذْتَ إِلَٰهًا غَيْرِي لَأَجْعَلَنَّكَ مِنَ الْمَسْجُونِينَ ﴿٢٩﴾

**30** "ఏమిటీ? నేను స్పష్టమైన వస్తువును నీ వద్దకు తెచ్చినప్పటికీ
(నువ్వు దారికి రావా?)"[26] అని మూసా పలికాడు.

قَالَ أَوَلَوْ جِئْتُكَ بِشَيْءٍ مُبِينٍ ﴿٣٠﴾

**31** "నువ్వు సత్యవంతుడవే అయితే అదేదో చూపు" అని ఫిరౌన్
అన్నాడు.

قَالَ فَأْتِ بِهِ إِنْ كُنْتَ مِنَ الصَّادِقِينَ ﴿٣١﴾

**32** అతను (అప్పటికప్పుడే) తన చేతి కర్రను పడవేయగానే అదొక
స్పష్టమైన పెద్ద సర్పంగా మారిపోయింది.[27]

فَأَلْقَىٰ عَصَاهُ فَإِذَا هِيَ ثُعْبَانٌ مُبِينٌ ﴿٣٢﴾

---

22. ఫిరౌను వేసిన ఈ ప్రశ్నలో తెలుసుకోవాలన్న తపనకన్నా అహంకారం ఎక్కువగా ఉంది. ఎందుకంటే, "నేను గాక మీకు మరో దేవుడు ఎవడైనా ఉన్నాడో లేడో నాకు తెలీదు" (అల్ ఖసస్ – 38) అని ప్రేలిన పొగరుబోతు అతను.
23. చూశారా?! నేను కాక మరో దేవుడు కూడా ఉన్నాడని ఇతగాడు అంటున్నాడు. ఇతని మాటలు మీకు ఆశ్చర్యం కలిగించటం లేదా?! అని ఫిరౌను తన మంది మార్బలానికి చెప్పదలిచాడు.
24. తూర్పుకు, పడమరకూ ఆయనే ప్రభువు. వాటిమధ్య ఉన్న వస్తువులన్నీ ఆయనవే. తూర్పు దిక్కున ఉదయించి, పడమటి దిక్కున అస్తమించేవి కూడా ఆయనవే. వాటన్నింటినీ నిర్వహిస్తున్నవాడు, కనిపెట్టుకుని ఉన్నవాడు కూడా ఆయనే.
25. దైవప్రవక్త హ్రజత్ మూసా (అలైహిస్సలాం) ఏకధాటిగా సర్వలోక ప్రభువు ఔన్నత్యాన్ని, పోషకత్వాన్ని నిరూపించుకుంటూ పోతుంటే ఫిరౌనువద్ద సరైన సమాధానం లేకుండా పోయింది. అందువల్ల అతడు ఆధారాలను విస్మరించి బెదిరింపులకు దిగాడు. మూసాను చెరసాలపాలు చేస్తానని గర్జించాడు.
26. అంటే–నేను దైవప్రవక్తనన్న సంగతిని రుజువు చేసే మహిమను చూపిన తరువాత కూడా నువ్వు నా మాటను తిరస్కరిస్తావా?

**33** అతను తన చేతిని (చంకలో నుంచి) బయటికి లాగగానే, అది చూపరులకు తెల్లగా (మెరిసిపోతూ ఉన్నట్లు) కానవచ్చింది.[28]

وَنَزَعَ يَدَهُ فَإِذَا هِيَ بَيْضَاءُ لِلنَّاظِرِينَ ﴿٣٣﴾

**34** ఫిరౌను తన దగ్గరున్న పెద్దలనుద్దేశించి ఇలా అన్నాడు : “ఇతను ఆరితేరిన మాంత్రికునిలా ఉన్నాడు.[29]

قَالَ لِلْمَلَإِ حَوْلَهُ إِنَّ هَٰذَا لَسَاحِرٌ عَلِيمٌ ﴿٣٤﴾

**35** “తన మాంత్రిక బలంతో మిమ్మల్ని మీ భూమి నుంచి వెళ్ళ గొట్టాలని చూస్తున్నాడు. ఇప్పుడు మీఆదేశం ఏమిటో చెప్పండి.”[30]

يُرِيدُ أَنْ يُخْرِجَكُمْ مِنْ أَرْضِكُمْ بِسِحْرِهِ فَمَاذَا تَأْمُرُونَ ﴿٣٥﴾

**36** “తమరు ఇతనికీ, ఇతని సోదరునికి కొంత గడువు ఇవ్వండి. పట్టణాలన్నింటికీ మీ ప్రకటన కర్తలను పంపించండి –

قَالُوا أَرْجِهْ وَأَخَاهُ وَابْعَثْ فِي الْمَدَائِنِ حَاشِرِينَ ﴿٣٦﴾

**37** మాంత్రిక విద్యలో ప్రవీణులైన వారందరిని వారు మీ వద్దకు తీసుకు వస్తారు”[31] అని వారంతా సలహా ఇచ్చారు.

يَأْتُوكَ بِكُلِّ سَحَّارٍ عَلِيمٍ ﴿٣٧﴾

**38** ఆ తరువాత ఒక నిర్ధారిత దినాన నిర్దేశిత స్థలంలో మాంత్రి కులంతా సమావేశపరచబడ్డారు.[32]

فَجُمِعَ السَّحَرَةُ لِمِيقَاتِ يَوْمٍ مَعْلُومٍ ﴿٣٨﴾

---

27. మూలంలో **‘సోబాన్’** (ثُعْبَانٌ) అని ఉంది. దీన్నే కొన్నిచోట్ల **‘హయ్యతున్’** (حَيَّةٌ) అనీ, మరికొన్ని చోట్ల **‘జాన్నున్’** అని కూడా పేర్కొనటం జరిగింది. ‘సోబాన్’ అంటే పెద్దతరహా సర్పం, కొండచిలువ అని అర్థం. ‘జాన్నున్’ అంటే చిన్న సర్పమన్నమాట. ‘హయ్యతున్’ అనే పదం పెద్ద పాముకు, చిన్న తరహా పాముకు కూడా వర్తిస్తుంది (ఫత్‌హుల్ ఖదీర్). చేతికర్ర మొదట చిన్న పాముగా మారి, ఆ తరువాత చూస్తుండగానే భారీ సర్పంగా మారిపోయి ఉంటుంది బహుశా.

28. అంటే, చంకలో నుంచి చేతిని బయటకు తీయగానే అది తెల్లగా కానరాసాగేది. ఇది మూసా (అలైహిస్సలాం)కు ఇవ్వబడిన మహిమలలో రెండవది.

29. మూసా (అలైహిస్సలాం) ప్రదర్శించిన ఈ మహిమలను చూచిన పిమ్మట ఫిరౌను నిజాయితీగా మూసా దైవదౌత్యాన్ని సత్యమని ధృవీకరించాల్సింది. కాని అతడు ధిక్కరించి, వైరవైఖరిని అవలంబించాడు. పైగా మూసా (అలైహిస్సలాం)ను జాల విద్యలో ఆరితేరిన వ్యక్తిగా అభివర్ణించాడు.

30. అంతటితో ఊరుకోకుండా, మాంత్రికశక్తులతో మిమ్మల్ని దేశం నుంచి తరిమికొట్టేందుకు కుట్రలు పన్నుతున్నాడని తన జాతివారిని రెచ్చగొట్టాడు. అలాంటి వ్యక్తిని ఏం చేయాలో మీరే చెప్పండి అని సలహాదారుల సలహా కోరాడు.

31. ప్రస్తుతానికి వాళ్ళిద్దరినీ వారి మానాన వదలిపెట్టండి. దేశం నుంచి తాంత్రికవేత్తలందరినీ సమావేశపరచి పోటీ పెడదాం. ఆ పోటీలో మనం గెలిస్తే ప్రజల మద్దతు ఎలాగూ మనకు లభిస్తుంది అని అతని దర్బారు వాసులు సలహా యిచ్చారు. నిజానికి ఇదంతా దైవం తరఫున జరిగిన ఏర్పాటు. ఫిరౌను సలహాదారులు ఒకటి తలిస్తే దేవుడు ఇంకొకటి తలిచాడు. ప్రజలందరి సమక్షంలో సత్యాసత్యాలు ప్రస్ఫుటం కావాలన్నది దేవుని అభిమతం.

32. మొత్తానికి ఈజిప్టు, దాని పరిసర ప్రాంతాల నుంచి మాంత్రికులు భారీ ఎత్తున సమీకరించబడ్డారు. వివిధ కథనాల ప్రకారం ఆ మాంత్రికుల సంఖ్య 12 వేలనీ, 17 వేలనీ, 19 వేలనీ, 30 వేలని, 80 వేలని రకరకాలుగా

39 ప్రజలతో, “మీరు కూడా సమావేశానికి హాజరవుతారా?!”[33] అని అనబడింది.

وَّقِيْلَ لِلنَّاسِ هَلْ اَنْتُمْ مُّجْتَمِعُوْنَ ﴿٣٩﴾

40 “ఒకవేళ (మన) మాంత్రికులు గనక గెలిస్తే మనమంతా వాళ్ళ (మతము)నే అనుసరిద్దాం” (అని చెప్పటం జరిగింది).

لَعَلَّنَا نَتَّبِعُ السَّحَرَةَ اِنْ كَانُوْا هُمُ الْغٰلِبِيْنَ ﴿٤٠﴾

41 మంత్రగాళ్ళు వచ్చాక, ఫిర్‌ఔనుతో, “మేము గెలిస్తే మాకేదన్నా పారితోషికం ఉంటుందా?” అని అడిగారు.

فَلَمَّا جَآءَ السَّحَرَةُ قَالُوْا لِفِرْعَوْنَ اَئِنَّ لَنَا لَاَجْرًا اِنْ كُنَّا نَحْنُ الْغٰلِبِيْنَ ﴿٤١﴾

42 “అవును. మీరు నా సన్నిహితులుగా ఉంటారు” అని చెప్పాడు ఫిరౌన్ (సంబరపడుతూ).

قَالَ نَعَمْ وَاِنَّكُمْ اِذًا لَّمِنَ الْمُقَرَّبِيْنَ ﴿٤٢﴾

43 మూసా మాంత్రికులనుద్దేశించి, “మీరు పడవేయదలచు కున్న వాటిని పడవెయ్యండి”[34] అన్నాడు.

قَالَ لَهُمْ مُّوْسٰۤى اَلْقُوْا مَاۤ اَنْتُمْ مُّلْقُوْنَ ﴿٤٣﴾

44 వాళ్లు తమ త్రాళ్లను, కర్రలను పడవేసి, “ఫిరౌను గౌరవ మర్యాదల సాక్షిగా! ముమ్మాటికీ మేమే గెలుస్తాము”[35] అని పలికారు.

فَاَلْقَوْا حِبَالَهُمْ وَعِصِيَّهُمْ وَقَالُوْا بِعِزَّةِ فِرْعَوْنَ اِنَّا لَنَحْنُ الْغٰلِبُوْنَ ﴿٤٤﴾

చెప్పబడింది. సరైన సంఖ్య ఎంతో అల్లాహ్‌కే ఎరుక. ఎందుకంటే ప్రామాణిక ఆధారాల్లో ఎక్కడా ఈ సంఖ్య ఖచ్చితంగా తెలియజేయబడలేదు. ఇంతకుముందు అల్ ఆరాఫ్ సూరా, తాహా సూరాలలో కూడా ఈ వివరాలు వచ్చాయి. మొత్తానికి ఫిరౌను జాతీయులైన ఖిబ్‌తీలు దేవుని జ్యోతిని తమ నోటితో ఊది ఆర్పివేయాలని భావించారు. కాని అదే సమయంలో తన జ్యోతిని పరిపూర్ణం గావించాలన్నది దేవుని అభిమతం. సత్యంపై అసత్యం ఎప్పుడు కాలుదువ్వినా ఆ పోటీలో దేవుడు సత్యవంతులకు అండగా నిలిచి వారికి జయమొసగాడు. ఆ విషయమే దివ్య ఖుర్ఆన్‌లో ఈ విధంగా చెప్పబడింది: “ఈ విధంగా మేము సత్యాన్ని అసత్యంపై విసరికొడతాము. అది దాని మాడు బద్దలగొడుతుంది. దాంతో అసత్యం సమసిపోతుంది.” (అల్ అంబియా–18)

33. అంటే ఈ పోటీని తిలకించటానికి మీరంతా తప్పకుండా రండి అని రాజుగారి తరఫున ప్రకటన చేయబడింది.

34. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ముందుగా మాంత్రికులకు సవాలు విసరటంలో ఒక మర్మం ఉంది. తనను ఎదుర్కోవటానికి దేశం నుంచి పెద్ద ఎత్తున మాంత్రికులు సమీకరించబడ్డారు. అయినాసరే తను ఈ భారీ సమూహాన్ని చూసి భయపడలేదు. పైగా వారికి సవాలు విసిరి తన ఆత్మ బలాన్ని చాటిచెప్పారు. ఆ విధంగా తొలిపలుకుల ద్వారానే మాంత్రికులను నైతికంగా దెబ్బతీశారు. దైవాజ్ఞతో వారి కనికట్టు క్రీడలన్నీ ఒక్క క్షణంలో అంతరిస్తాయన్న సంగతి ఆయనకు తెలుసు. ఈ దృశ్యాన్ని తిలకించే ప్రజలపై మంచి ప్రభావం పడుతుంది. తద్వారా చాలామంది విశ్వసించవచ్చు – మూసా (అలైహిస్సలాం) ఊహించినట్లుగానే జరిగింది. అందరికన్నా ముందు స్వయంగా మంత్రగాళ్ళే తమ నిజ ప్రభువును విశ్వసించారు.

35. తాము ప్రదర్శించే జాలవిద్య తిరుగులేనిదని మంత్రగాళ్లు భావించారు (ఆరాఫ్ : 116). వాళ్ల కనికట్టు మాయాజాలాన్ని చూసి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) సయితం లోలోపల భయపడ్డారు (తాహా – 67). అందుకే తమ విజయంపై మాంత్రికులకు ఎనలేని విశ్వాసం ఉండింది. అయితే అల్లాహ్ మూసాను ఓదార్చాడు. భయపడాల్సిన పనిలేదని ధైర్యం చెబుతూ, అతని చేతిలో వున్న కర్రను పడవేయమని సూచించాడు. చేతికర్రను క్రిందపడవేయగానే అది మహాసర్పమై మంత్రగాళ్ల క్రీడా విన్యాసాలను ఇట్టే మ్రింగేసింది. క్షణాల్లోనే కథ అడ్డం తిరిగింది.

45 మరి మూసా కూడా తన చేతికర్రను పడవేశాడు. అమాంతం అది వారి బూటకపు విన్యాసాలను మ్రింగటం మొదలెట్టింది.

فَأَلْقَىٰ مُوسَىٰ عَصَاهُ فَإِذَا هِيَ تَلْقَفُ مَا يَأْفِكُونَ ﴿45﴾

46 అంతే! మాంత్రికులంతా (అనూహ్యంగా) సాష్టాంగపడి పోయారు.

فَأُلْقِيَ السَّحَرَةُ سَاجِدِينَ ﴿46﴾

47 వారు (స్పష్టంగా) ఇలా అన్నారు: "మేము సర్వలోక ప్రభువైన అల్లాహ్‌ను విశ్వసించాము –

قَالُوا آمَنَّا بِرَبِّ الْعَالَمِينَ ﴿47﴾

48 – అంటే మూసా, హారూనుల ప్రభువును (విశ్వసించాము)."

رَبِّ مُوسَىٰ وَهَارُونَ ﴿48﴾

49 "ఏమిటీ? నేను అనుమతి ఇవ్వక ముందే మీరతన్ని విశ్వసించారా? నిశ్చయంగా ఇతడు మీకందరికీ మంత్ర విద్యను నేర్పిన పెద్ద (గురువు)లా ఉన్నాడు.[36] సరే, ఇప్పుడే మీకు తెలుస్తుంది.... నేనిప్పుడే మీ కాళ్లు చేతుల్ని వ్యతిరేక దిశలో నరికి, మీ అందరికీ శిలువవేస్తాను"[37] అని ఫిరౌన్ గర్జించాడు.

قَالَ آمَنتُمْ لَهُ قَبْلَ أَنْ آذَنَ لَكُمْ ۖ إِنَّهُ لَكَبِيرُكُمُ الَّذِي عَلَّمَكُمُ السِّحْرَ فَلَسَوْفَ تَعْلَمُونَ ۚ لَأُقَطِّعَنَّ أَيْدِيَكُمْ وَأَرْجُلَكُم مِّنْ خِلَافٍ وَلَأُصَلِّبَنَّكُمْ أَجْمَعِينَ ﴿49﴾

50 దానికి వారు ఇలా అన్నారు : "మరేమీ ఫరవాలేదు.[38] మేమెలాగూ మా ప్రభువు వద్దకు మరలి వెళ్ళవలసిన వారమే.

قَالُوا لَا ضَيْرَ ۖ إِنَّا إِلَىٰ رَبِّنَا مُنقَلِبُونَ ﴿50﴾

51 "అందరికంటే ముందు మేము విశ్వసించాము.[39] కనుక మా ప్రభువు మా పాపాలన్నింటినీ క్షమిస్తాడన్న ఆశ మాకుంది."

إِنَّا نَطْمَعُ أَن يَغْفِرَ لَنَا رَبُّنَا خَطَايَانَا أَن كُنَّا أَوَّلَ الْمُؤْمِنِينَ ﴿51﴾

36. ఈ ఓటమిని ఫిరౌన్ ఊహించనైనా లేదు. అందుకే ఈ అవమానాన్ని అతను జీర్ణించుకోలేకపోయాడు. తన మాంత్రికులు ఎలాగైనా తనకు విజయాన్ని సాధించిపెడతారని అతడు ఆశించాడు. కాని వాళ్ళు ఓడిపోయినది గాక మూసా, హారూన్‌లను దైవ సందేశహరులుగా పంపిన ప్రభువును విశ్వసించారు. ఫిరౌన్‌లో ఏకాస్త విజ్ఞత, వివేచన ఉన్నా ఈ పరిణామంపై ఆలోచించేవాడు. తను కూడా నిజ ప్రభువును విశ్వసించి, మోకరిల్లేవాడు. కాని వాడు అహంకారంతో వైరవైఖరిని ఎంచుకున్నాడు. మంత్ర గాళ్ళను బెదిరించటం మొదలెట్టాడు. మీరందరూ మూసా శిష్యుల్లా ఉన్నారనీ, అందరూ కలసి తన అధికారానికి ఎసరు పెట్టేందుకు కుట్ర పన్నారని చిందులు వేశాడు. (అల్ ఆరాఫ్ – 123 ఆధారంగా)

37. వ్యతిరేక దిశలో కాళ్లు చేతులు నరకటమంటే–కుడిచేయి తీసేస్తే ఎడమకాలు తీసేయటం, ఎడమ చేయిని నరికితే కుడి కాలును నరకటం అని భావం. ఆ తరువాత శిలువ వేయటం. అంటే కాళ్లు చేతులు నరకటంతో కూడా అతని కోపాగ్ని చల్లారలేదు. పైగా చిత్రవధ చేసి శిలువపైకి ఎక్కిస్తానని బెదిరించాడు.

38. కాని ఆ త్యాగధనులు ఫిరౌన్ బెదిరింపులకు ఏమాత్రం లొంగలేదు. అశాశ్వితమైన ఈ లోకపు శిక్షలకన్నా వారు పరలోక సాఫల్యానికే ప్రాధాన్యతనిచ్చారు. **'లా జైర్'**(لَا ضَيْرَ) అంటే 'ఏం ఫర్వాలేదు', 'మరేం భయంలేదు'అని అర్థం.

39. "అందరికంటే ముందు మేము విశ్వసించాము" అన్న వారి మాటలోని అర్థం ఏమిటంటే, అంతకుముందు ఫిరౌన్ జాతీయులు ఎవరూ ముస్లింలు కాలేదు. ఆ విధంగా 'తొలి ముస్లింలు' అనిపించుకునే ఘనత వారికే దక్కింది.

**52** "రాత్రికి రాత్రే నా దాసులను తీసుకుని వెళ్ళిపో. మీరంతా వెంబడించబడతారు"[40] అని మేము మూసాకు వహీ పంపాము.

وَأَوْحَيْنَآ إِلَىٰ مُوسَىٰٓ أَنْ أَسْرِ بِعِبَادِىٓ إِنَّكُم مُّتَّبَعُونَ ﴿٥٢﴾

**53** ఫిరౌన్ అన్ని పట్టణాలకూ తన వార్తాహరులను పంపించాడు.

فَأَرْسَلَ فِرْعَوْنُ فِى ٱلْمَدَآئِنِ حَٰشِرِينَ ﴿٥٣﴾

**54** "చూడబోతే వాళ్లు (ఇస్రాయీలు సంతతివారు) అతికొద్ది మంది మాత్రమే.[41]

إِنَّ هَٰٓؤُلَآءِ لَشِرْذِمَةٌ قَلِيلُونَ ﴿٥٤﴾

**55** "కాని వాళ్లు మమ్మల్ని ఆగ్రహోదగ్రుల్ని చేస్తున్నారు.[42]

وَإِنَّهُمْ لَنَا لَغَآئِظُونَ ﴿٥٥﴾

**56** "యదార్థానికి మా సమూహం (చాలా పెద్దది) సదా అప్రమత్తంగా ఉండేది"[43] (అంటూ ఫిరౌను జాతి ప్రజలను రెచ్చ గొట్టటం జరిగింది)."

وَإِنَّا لَجَمِيعٌ حَٰذِرُونَ ﴿٥٦﴾

**57** ఎట్టకేలకు మేము వాళ్ళను (వారి) తోటల నుండి, చెలమల నుండి బైటికి లాగాము.

فَأَخْرَجْنَٰهُم مِّن جَنَّٰتٍ وَعُيُونٍ ﴿٥٧﴾

**58** ధనాగారాల నుండి, గౌరవప్రదమైన స్థానాల నుండి (బయటికి ఈడ్చాము).[44]

وَكُنُوزٍ وَمَقَامٍ كَرِيمٍ ﴿٥٨﴾

**59** ఈ విధంగా జరిగింది. మరి మేము ఈ వస్తువులకు ఇస్రాయీలు సంతతివారిని వారసులుగా చేశాము.[45]

كَذَٰلِكَ وَأَوْرَثْنَٰهَا بَنِىٓ إِسْرَٰٓءِيلَ ﴿٥٩﴾

---

40. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఈజిప్టు పట్టణాలలో సుదీర్ఘ కాలం ఉండి ధర్మబోధ చేసినా ఫిరౌను జనులలో మార్పు రాలేదు. మూసా (అలైహి) మాత్రం తన కర్తవ్యాన్ని నెరవేర్చారు. అందువల్ల దుర్మార్గ జనులను శిక్షించటం వినా మరో మార్గం లేకపోయింది. అందుకే రాత్రికి రాత్రే ఇస్రాయీలు వంశీయులను వెంటబెట్టుకుని అక్కణ్ణుంచి వెడలిపోవాలనీ, ఫిరౌను సైన్యం వెంబడించినా ఆందోళన చెందకూడదని దేవుడు తన ప్రవక్తకు సూచించాడు.

41. మూసా అనుయాయులను కించపరిచే ఉద్దేశంతో ఫిరౌను ఆ విధంగా చెప్పాడు. నిజానికి వారు మరీ అంత అల్పసంఖ్యలో ఏమీ లేరు. వారు సుమారు 6 లక్షల మంది వరకూ ఉన్నారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

42. అంటే మా అనుమతి పొందకుండానే వారు ఇక్కడి నుంచి పరారవటం మాకు కోపాన్ని తెప్పించింది అన్నది ఫిరౌను మాటల్లోని భావం.

43. కనుక ఇస్రాయీలు జనుల కుట్రను భగ్నం చేయటానికి ఇప్పుడు మనమంతా సమాయత్తం కావలసిన అవసరం ఉంది.

44. ఇస్రాయీలీయులను వెంబడించటానికి ఫిరౌన్ సైన్యం తమ పట్టణాల నుంచి బయలు దేరిందేగాని, తిరిగి రాలేక పోయింది. ఈ విధంగా అల్లాహ్ తన ప్రణాళిక ననుసరించి ఆ ముష్కర మూకలను ప్రాపంచిక భోగభాగ్యాలకు దూరం చేశాడు. ఆ తరువాత మరోజాతిని ఆ అనుగ్రహాలకు వారసులుగా చేశాడు. ఇదంతా దైవలీల.

45. అంటే ఫిరౌన్ చక్రవర్తుల చెప్పుచేతుల్లో ఉన్న రాజ్యాధికారాన్నీ, అనువంశిక శాసన పర్వాన్నీ మేము వారినుంచి

فَأَتْبَعُوهُم مُّشْرِقِينَ ﴿60﴾

60 సూర్యోదయమవగానే వారు (ఫిరౌనీయులు) ఇస్రాయీల్ జాతిని వెంబడించసాగారు.[46]

فَلَمَّا تَرَاءَا الْجَمْعَانِ قَالَ أَصْحَابُ مُوسَىٰ إِنَّا لَمُدْرَكُونَ ﴿61﴾

61 ఇరు పక్షాలవారు ఒండొకరిని చూడగానే, "ఇక మనం పట్టుబడిపోయినట్లే"[47] అని మూసా సహచరులు (ఆందోళనతో) పలికారు.

قَالَ كَلَّا ۖ إِنَّ مَعِيَ رَبِّي سَيَهْدِينِ ﴿62﴾

62 "అలా ఎంతమాత్రం జరగదు. నిశ్చయంగా నా ప్రభువు నాకు తోడుగా ఉన్నాడు. ఆయన నాకు తప్పకుండా దారి చూపు తాడు"[48] అని మూసా అన్నాడు.

فَأَوْحَيْنَا إِلَىٰ مُوسَىٰ أَنِ اضْرِب بِّعَصَاكَ الْبَحْرَ ۖ فَانفَلَقَ فَكَانَ كُلُّ فِرْقٍ كَالطَّوْدِ الْعَظِيمِ ﴿63﴾

63 "నీ చేతి కర్రతో సముద్రాన్ని కొట్టు"[49] అని మేము మూసాకు వహీ పంపాము. అంతే! అప్పటికప్పుడే సముద్రం చీలిపోయింది. ప్రతి చీలిక భాగం పెద్ద పర్వతంలా అయిపోయింది.[50]

---

లాక్కుని ఇస్రాయీల్ సంతతికి అప్పగించాము. కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యానికి భాష్యం చెబుతూ ఇలా అన్నారు – "ఈజిప్టులో ఫిరౌను జనులకు ఉన్నట్టి అధికారాన్ని, ప్రాపంచిక వైభవాన్ని, అట్టహాసాలను మేము బనీ ఇస్రాయీల్‌కు కూడా వొసగాము. ఎందుకంటే బనీ ఇస్రాయీల్ ఈజిప్టు నుంచి వెడలిన తరువాత మళ్లీ ఆ రాజ్యంలోకి తిరిగి రాలేదు." దుఖాన్ సూరాలో "మేము దాని వారసత్వాన్ని మరో జాతికి ఇచ్చాము" అన్న ఆయతు కూడా ఈ సందర్భంగా గమనించదగినది (ఐసరుత్తఫాసీర్). కాని షుఅరా సూరాలో ఇస్రాయీలు సంతతిని వారసులుగా చేసే ప్రస్తావన రావటం చేత, ఆ వారసులు ఇస్రాయీలు సంతతివారే కావచ్చుకదా! అన్న వాదనకు కూడా గట్టి తావు ఏర్పడుతుంది. అయితే ఖుద్దుగా ఖుర్‌ఆన్ వివరణ ప్రకారం, ఈజిప్టు దేశం నుంచి వెడలిన పిమ్మట 'పవిత్ర భూమి'లో ప్రవేశించమని ఇస్రాయీల్ సంతతిని ఆదేశించటం జరిగింది. కాని వారు ఆ స్థలంలో ప్రవేశించటానికి నిరాకరించటంతో నలభై ఏండ్లపాటు ఆ ప్రదేశం వాయిదా వేయబడింది. ఈ నలభై ఏండ్లకాలం కూడా వారు 'తీహ్' మైదానంలో తచ్చాడుతూ ఉండవలసి వచ్చింది. ఆ తరువాత పవిత్ర భూమిలో ప్రవేశించారు. అందువల్ల దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) సమాధి కూడా – 'ఇస్రా' హదీసు ప్రకారం – జెరూసలేంలోని బైతుల్ మఖ్దిస్‌కు సమీపంలోనే ఉంది.

కాబట్టి ఈ ఆయతు ప్రకారం అవగతమయ్యేదేమంటే ఫిరౌను జనులకు లభించే ప్రాపంచిక భాగ్యాలనే దేవుడు ఇస్రాయీలు సంతతికి కూడా ప్రసాదించాడు. కాని ఈజిప్టు ప్రదేశంలో కాదు, పాలస్తీనా భూభాగంలో! నిజము దేవుడెరుగు.

46. రాత్రికి రాత్రే ఇస్రాయీలీయులు వెళ్ళిపోయారన్న సంగతి తెల్లవారాక ఫిరౌన్‌కు తెలిసింది. దాంతో అతని అహం దెబ్బతింది. సూర్యోదయం కాగానే వారిని వెంబడించటానికి బయలుదేరాడు.

47. ఫిరౌన్ సైన్యాన్ని చూడగానే మూసా సహచరులు భీతిల్లారు. ఎందుకంటే వారికి ముందు సముద్రం ఉంది, వెనుక సైనిక దళం ఉంది. ఇక తాము తప్పించుకునే దారేది? పట్టుబడటం ఖాయం. బానిస బ్రతుకు మళ్లీ తప్పదు అని వారు బాధపడ్డారు. ఆ మాటే మూసాతో అనేశారు కూడా.

48. ఆ గడ్డు సమయంలో దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) తన అనుయాయులను ఓదార్చారు. మీరు భీతి చెందవలసిన అవసరం లేదు. మీరు ఎట్టి పరిస్థితిలోనూ ఫిరౌన్‌కు పట్టుబడరు. నా ప్రభువు తప్పకుండా మిమ్మల్ని కాపాడే మార్గం చూపిస్తాడు అని వారికి ధైర్యం చెప్పారు.

49. దైవ సహాయం రానే వచ్చింది. 'నీ చేతికర్రతో సముద్రాన్ని కొట్టు' అన్న సందేశం (వహీ) మూసాకు అందింది.

64 మేము ఆ స్థలానికి దగ్గరగా రెండో సమూహాన్ని చేర్చాము.[51]

وَأَزْلَفْنَا ثَمَّ الْآخَرِينَ ﴿٦٤﴾

65 మూసాను, అతని వెంటవున్న సహచరులందరినీ కాపాడాము.

وَأَنجَيْنَا مُوسَىٰ وَمَن مَّعَهُ أَجْمَعِينَ ﴿٦٥﴾

66 మరి మిగతా వారందరినీ ముంచి వేశాము.[52]

ثُمَّ أَغْرَقْنَا الْآخَرِينَ ﴿٦٦﴾

67 నిశ్చయంగా ఇందులో గొప్ప సూచన ఉంది. (అయినప్పటికీ) వారిలో అత్యధికులు విశ్వసించేవారు కారు.[53]

إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿٦٧﴾

68 నిస్సందేహంగా నీ ప్రభువు శక్తిశాలి, దయాశీలి.

وَإِنَّ رَبَّكَ لَهُوَ الْعَزِيزُ الرَّحِيمُ ﴿٦٨﴾

69 వారికి ఇబ్రాహీమ్ సమాచారాన్ని కూడా చదివి వినిపించు.

وَاتْلُ عَلَيْهِمْ نَبَأَ إِبْرَاهِيمَ ﴿٦٩﴾

70 "మీరెవరిని పూజిస్తున్నారు?" అని అతను తన తండ్రిని, తన జాతి వారిని అడిగినప్పుడు,

إِذْ قَالَ لِأَبِيهِ وَقَوْمِهِ مَا تَعْبُدُونَ ﴿٧٠﴾

71 "మేము విగ్రహాలను పూజిస్తున్నాము. (ఎల్లప్పుడూ) వాటి సేవకే అంకితమై ఉన్నాము"[54] అని వారు సమాధానమిచ్చారు.

قَالُوا نَعْبُدُ أَصْنَامًا فَنَظَلُّ لَهَا عَاكِفِينَ ﴿٧١﴾

72 ఆయన వారిని ఇలా అడిగారు: "మీరు వాటిని పిలిచినప్పుడు అవి మీ పిలుపును వింటాయా?

قَالَ هَلْ يَسْمَعُونَكُمْ إِذْ تَدْعُونَ ﴿٧٢﴾

---

మూసా తన చేతిలోని లాఠీని సముద్రంపై కొట్టగానే హఠాత్తుగా సముద్రం చీలిపోయింది. కుడివైపు నీరు కుడివైపున, ఎడమ వైపు నీరు ఎడమ వైపున నిలిచిపోయింది. ఆ రెంటికీ మధ్య సముద్రంలో స్పష్టంగా దారి ఏర్పడింది. ఇస్రాయీలీయులలో పన్నెండు తెగలుండేవి. పన్నెండు తెగల కోసం పన్నెండు త్రోవలు ఏర్పడ్డాయని కూడా అనబడుతోంది. నిజము దేవుడెరుగు.

50. చీలిన ప్రతి నీటి భాగం మహా పర్వతంలా నిలబడిపోయింది. ఇది దేవుని తరఫున సంభవించిన ఒక అద్భుతం. మూసాను, అతని జాతి వారిని కాపాడటానికి దేవుడు ఈ అద్భుతాన్ని చేశాడు. ఆ క్లిష్ట తరుణంలో ఫిరౌన్ చెరనుండి వారికి విముక్తిని కల్పించటానికి 'అద్భుతం' చేయటం వినా మార్గాంతరం లేకపోయింది. **'ఫిర్ఖిన్'** (فِرْقٍ) అంటే నీటి భాగం, సముద్రంలోని కొంతభాగం అని అర్థం. **'తౌద్'** (طَوْدِ) అంటే కొండ.

51. రెండవ సమూహం అంటే ఫిరౌను మరియు అతని సైనికులు అని భావం. వారు మూసా వర్గాన్ని వెంబడిస్తూ అక్కడికి చేరుకున్నారు.

52. మూసాను, విశ్వసించిన వారిని మేము సముద్రం దాటించాము. ఫిరౌను జనులు ఆ సముద్ర మార్గం గుండానే సాగిపోతుండగా మేము సముద్రాన్ని కలిపేశాము. దాంతో ఫిరౌను తన సైనికులతో సహా మునిగిపోయాడు.

53. దైవసహాయం ఏ విధంగా అందుతుందో చూడదలచిన వారికి ఈ సంఘటన ఓ నిదర్శనం. గుణపాఠం. అయినాసరే చాలామంది విశ్వసించరు.

54. అంటే, మేము అహోరాత్రులు ఈ విగ్రహాలనే సేవిస్తున్నాము.

55. ఒకవేళ మీరు ఈ విగ్రహాలను పూజించటం మానేస్తే అవి మీకేమైనా నష్టం కలిగిస్తాయా?

73 లేదా మీకు లాభంగానీ, నష్టంగానీ కలిగిస్తాయా?”[55]

أَوْ يَنفَعُونَكُمْ أَوْ يَضُرُّونَ ﴿٧٣﴾

74 “(అదంతా మాకు అనవసరం) మా తాతముత్తాతలు ఈ విధంగా చేస్తుండగా మేము చూశాము”[56] అని వారు బదులిచ్చారు.

قَالُوا بَلْ وَجَدْنَا آبَاءَنَا كَذَٰلِكَ يَفْعَلُونَ ﴿٧٤﴾

75 అతను (ఇబ్రాహీం) ఇలా అన్నాడు : “మీరు పూజిస్తున్న వాటిని (కాస్తయినా) గమనించారా?[57] –

قَالَ أَفَرَأَيْتُم مَّا كُنتُمْ تَعْبُدُونَ ﴿٧٥﴾

76 “మీరుగానీ, మీ పూర్వీకులైన మీ తాతముత్తాతలు గానీ!

أَنتُمْ وَآبَاؤُكُمُ الْأَقْدَمُونَ ﴿٧٦﴾

77 “వారంతా నా శత్రువులు.[58] ఒక్క సకలలోక ప్రభువు తప్ప.[59]

فَإِنَّهُمْ عَدُوٌّ لِّي إِلَّا رَبَّ الْعَالَمِينَ ﴿٧٧﴾

78 “ఆయనే నన్ను సృష్టించాడు, మరి ఆయనే నాకు మార్గదర్శకత్వం వహిస్తున్నాడు.[60]

الَّذِي خَلَقَنِي فَهُوَ يَهْدِينِ ﴿٧٨﴾

79 “ఆయనే నన్ను తినిపిస్తున్నాడు, త్రాగిస్తున్నాడు.[61]

وَالَّذِي هُوَ يُطْعِمُنِي وَيَسْقِينِ ﴿٧٩﴾

80 “నేను జబ్బు పడినప్పుడు, ఆయనే నన్ను నయం చేస్తున్నాడు.[62]

وَإِذَا مَرِضْتُ فَهُوَ يَشْفِينِ ﴿٨٠﴾

81 “ఆయనే నన్ను చంపుతాడు, మళ్లీ తిరిగి బ్రతికిస్తాడు.[63]

وَالَّذِي يُمِيتُنِي ثُمَّ يُحْيِينِ ﴿٨١﴾

56. హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) గారి ప్రశ్నకు వారివద్ద సమాధానం లేకపోయింది. ఇది మా తాతముత్తాతల సంప్రదాయం అని చెప్పి విషయాన్ని దాటవేశారు. ఈ పరిస్థితి నేటికీ ఇలాగే ఉంది. ఖుర్ఆన్ హదీసుల ఆధారంగా జనులకు విషయాన్ని బోధపరచినప్పుడు, దయచేసి ఈ విషయంలో మాకేమీ చెప్పకండి. ఇది మా కుటుంబంలో ఆనవాయితీగా వస్తూవుంది. దీన్ని మేము వదులుకోలేము అని చెప్పే ప్రబుద్ధులు ఇప్పటికీ చాలామంది ఉన్నారు.

57. **‘అఫ రఅయ్తుమ్’** (أَفَرَءَيْتُم) అంటే చూశారా! అని అర్థం వస్తుంది. అంటే ‘ఆలోచించారా?!’ అన్నది దాని భావం.

58. ఎందుకంటే మీరంతా నిజప్రభువు అయిన అల్లాహ్‌ను వదలి అన్యులను ఆరాధించే వారలు. మీరూ, మీ పూర్వీకులు వేటిని పూజిస్తూ వస్తున్నారో అవన్నీ నాకు శత్రువులు. అంటే వాటన్నింటితో నేను విసుగెత్తిపోయాను. వాటితో తెగత్రెంపులు చేసుకున్నాను.

59. ఆయన నా శత్రువు కాదు. పైగా ఇహపరలోకాలలో ఆయన నాకు స్నేహితుడు. నా సంరక్షకుడు.

60. అంటే ప్రాపంచిక, పారలౌకిక ప్రయోజనాల, పరమార్థాల వైపు ఆయన నాకు దారి చూపిస్తున్నాడు.

61. అంటే రకరకాల ఆహారపదార్థాలను సమకూర్చేవాడు, మనం త్రాగే పానీయాలను ప్రసాదించేవాడు అల్లాహ్‌యే.

62. వ్యాధిని నయం చేసేవాడు ఆయనే. అంటే మనం తినే మందులలో రోగ నివారణా గుణాన్ని సృజించేవాడు అల్లాహ్‌యే. ఆయన ఆజ్ఞతోనే మందులు పనిచేస్తాయి.

63. ప్రళయదినాన ఆయన సమస్త మానవాళిని బ్రతికించినప్పుడు, నన్ను కూడా బ్రతికిస్తాడు.

82 "ప్రతిఫల దినాన ఆయన నా తప్పులను మన్నిస్తాడన్న ఆశ కూడా నాకుంది."[64]

وَ الَّذِيْٓ اَطْمَعُ اَنْ يَّغْفِرَ لِيْ خَطِيْٓـَٔتِيْ يَوْمَ الدِّيْنِ ﴿82﴾

83 (తరువాత ఇబ్రాహీమ్ ఇలా ప్రార్థించాడు): "నా ప్రభూ! నాకు 'ప్రజ్ఞ'ను[65] ప్రసాదించు. నన్ను సద్వర్తనులలో కలుపు.

رَبِّ هَبْ لِيْ حُكْمًا وَّ اَلْحِقْنِيْ بِالصّٰلِحِيْنَ ﴿83﴾

84 "భావితరాల వారి (నోటి)లో నన్ను కీర్తిశేషునిగా ఉంచు.[66]

وَ اجْعَلْ لِّيْ لِسَانَ صِدْقٍ فِي الْاٰخِرِيْنَ ﴿84﴾

85 "అనుగ్రహభరితమైన స్వర్గానికి వారసులయ్యే వారిలో నన్ను (కూడా ఒకడిగా) చెయ్యి.

وَ اجْعَلْنِيْ مِنْ وَّرَثَةِ جَنَّةِ النَّعِيْمِ ﴿85﴾

86 "నా తండ్రిని క్షమించు. నిశ్చయంగా ఆయన మార్గభ్రష్టుల లోనివాడు.[67]

وَ اغْفِرْ لِاَبِيْٓ اِنَّهٗ كَانَ مِنَ الضَّآلِّيْنَ ﴿86﴾

87 "ప్రజలు మళ్లీ తిరిగి లేపబడే రోజున నన్ను అవమాన పరచకు."[68]

وَ لَا تُخْزِنِيْ يَوْمَ يُبْعَثُوْنَ ﴿87﴾

64. ఇక్కడ **'ఆశ'** (طَمَعٌ) అనే పదాన్ని 'నిశ్చయం', 'తథ్యం' అన్న భావంలో తీసుకోవాలి. ఎందుకంటే ఒక శక్తిమంతుని గురించి చెప్పేటప్పుడు 'ఆశాభావం' అన్న పదం 'నిశ్చయం' అన్న అర్థంలోనే తీసుకోబడుతుంది. అల్లాహ్ ఈ జగతిలో తిరుగులేనివాడు. మహాశక్తిశాలి. మరి అలాంటప్పుడు ఆయన పట్ల గల ఆశ నిశ్చయంగా నెరవేరుతుం దనటంలో సందేహమేముంది? అందుకే ఖుర్ఆన్ వ్యాఖ్యాతలేమంటారంటే, దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ విషయంలో ఎక్కడ 'ఆశ' అన్న పదం వచ్చినా అది 'ఖచ్చితంగా జరుగుతుంది' అన్న భావంలోనే ఉంటుంది. తన వల్ల జరిగే తప్పులను అల్లాహ్ మన్నిస్తాడని హజ్రత్ ఇబ్రాహీమ్ చెప్పటం గమనార్హం. సాధారణంగా దైవప్రవక్తలు నిర్దోషులు అయి ఉంటారు. వారివల్ల పెద్ద పాపాలు, పెద్ద తప్పులు జరగవు. అయితే తమవల్ల జరిగే తేలికపాటి పొరపాట్లనే తప్పులుగా భావించి పశ్చాత్తాప భావంతో అల్లాహ్ సన్నిధిలో క్షమాభిక్షను వేడుకుంటారు ఆ మహానుభావులు.

65. **'హుక్మ్'** (حُكْمٌ) అంటే జ్ఞానం, యుక్తి, వివేకం, ప్రజ్ఞ, విషయావగాహన, నిర్ణయం గైకొనేశక్తి అన్న అర్థాలు వస్తాయి. దైవదౌత్యం, దైవాజ్ఞలలోని పరమార్థాలను గ్రహించే తెలివితేటలు అన్న అర్థాలు కూడా వస్తాయి.

66. అంటే, నా తరువాత ప్రపంచంలో ఉనికిలోకి వచ్చే తరాలవారు నా గురించి మంచి ప్రస్తావన తీసుకువచ్చేలా చేయి అని ఇబ్రాహీం ప్రార్థించారు. దీన్నిబట్టి తెలిసేదేమంటే అల్లాహ్ సజ్జనుల పుణ్యకార్యాలను వృధాపరచడు. ఇహలోకంలో సయితం వారి సత్కార్యాలను గురించి భావితరాలు కొనియాడేలా చేసి, వారి కీర్తిని ఉన్నతం చేస్తాడు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)నే తీసుకోండి – ప్రపంచంలోని గ్రంథవహులందరూ ఆ మహనీయుని త్యాగనిరతిని కొనియాడతారు.

67. ముష్రిక్కుల కోసం ప్రార్థించటం ధర్మసమ్మతం కాదన్న ఆజ్ఞ రాకముందు హజ్రత్ ఇబ్రాహీం తన తండ్రి కోసం చేసిన ప్రార్థన ఇది. కాని దైవాజ్ఞ వచ్చిన తరువాత, ఆయన తన తండ్రితో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నారు (తౌబా – 114 ఆధారంగా).

68. అంటే అందరి సమక్షంలో నా లెక్క తీసుకుని నన్ను పరాభవానికి లోను చేయకు అన్నది దీని భావం కావచ్చు. ఒక హదీసులో ఇలా ఉంది : ప్రళయదినాన హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన తండ్రి దురవస్థను చూసి, మరోసారి తన తండ్రి మన్నింపు కోసం అల్లాహ్‌ను అర్థిస్తారు. "ఓ అల్లాహ్! నాకు ఇంతకన్నా అవమానం ఇంకేముంటుంది?"

| | |
|---|---|
| 88 ఆ రోజు సిరిసంపదలుగానీ, సంతానంగానీ దేనికీ పనికిరావు. | يَوْمَ لَا يَنْفَعُ مَالٌ وَّلَا بَنُوْنَ ﴿٨٨﴾ |
| 89 నిష్కల్మషమైన మనసుతో అల్లాహ్ సన్నిధిలోకి వచ్చినవాడు మాత్రమే (ఆనాడు మోక్షం పొందుతాడు).[69] | اِلَّا مَنْ اَتَى اللّٰهَ بِقَلْبٍ سَلِيْمٍ ﴿٨٩﴾ |
| 90 (ఆ రోజు) దైవభక్తిపరుల కోసం స్వర్గం దగ్గరకు తేబడుతుంది. | وَاُزْلِفَتِ الْجَنَّةُ لِلْمُتَّقِيْنَ ﴿٩٠﴾ |
| 91 నరకం మార్గభ్రష్టుల ముందు ప్రత్యక్ష పరచబడుతుంది.[70] | وَبُرِّزَتِ الْجَحِيْمُ لِلْغٰوِيْنَ ﴿٩١﴾ |
| 92 - 93 "అల్లాహ్‌ను వదలి మీరు ఎవరెవరినయితే పూజించే వారో వారేరి? వారు మీకేదన్నా సాయం చేస్తున్నారా? పోనీ, వారు తమకు తామైనా సహాయం చేసుకోగలుగుతున్నారా?"[71] అని వారితో అనటం జరుగుతుంది. | وَقِيْلَ لَهُمْ اَيْنَمَا كُنْتُمْ تَعْبُدُوْنَ ﴿٩٢﴾ مِنْ دُوْنِ اللّٰهِ ؕ هَلْ يَنْصُرُوْنَكُمْ اَوْ يَنْتَصِرُوْنَ ﴿٩٣﴾ |
| 94 మరి వారూ, మార్గభ్రష్టులైన వారందరూ నరకంలో బోర్ల పడవేయబడతారు.[72] | فَكُبْكِبُوْا فِيْهَا هُمْ وَالْغَاوٗنَ ﴿٩٤﴾ |
| 95 ఇబ్లీసు సైనికులంతా కూడా[73] (నరకం లోనికే నెట్టబడతారు). | وَجُنُوْدُ اِبْلِيْسَ اَجْمَعُوْنَ ﴿٩٥﴾ |

అని అంటారు. అప్పుడు అల్లాహ్ సమాధానంగా ఇలా అంటాడు– "నేను అవిశ్వాసుల కొరకు స్వర్గాన్ని నిషేధించాను." ఆ తరువాత ఆయన తండ్రిని 'ముళ్ళపంది' రూపంలో మలినంలో ఈడ్చుతూ నరకంలోకి నెట్టడం జరుగుతుంది (సహీహ్ బుఖారీ – సూరతుష్షుఅరా; కితాబుల్ అంబియా....)

69. నిష్కల్మషమైన మనస్సు లేక నిర్మలమైన హృదయం అంటే షిర్క్‌కు దూరంగా ఉండే మనసు అని అర్థం. మరో మాటలో చెప్పాలంటే నిజమైన మోమిన్ (విశ్వాసి) హృదయం అన్నమాట! అవిశ్వాసి ఆంతర్యం, ముష్రిక్కు మనసు, కపటి హృదయం వ్యాధిగ్రస్తమై ఉంటాయి.

'నిర్మలమైన మనసు' అంటే బిద్అత్‌లకు దూరంగా ఉంటూ స్వచ్ఛమైన సున్నతును అనుసరించే మనసు అని కొందరు అభిప్రాయపడ్డారు. ప్రాపంచిక భోగభాగ్యాలు, పదవీ వ్యామోహాలకు దూరంగా – ఎంతో నిరాడంబరంగా ఉండే మనసు అని మరి కొందరు నిర్వచించారు. అజ్ఞానానికి, నైతిక రుగ్మతలకు దూరంగా ఉండే శుభాత్మలని మరికొందరు సూత్రీకరించారు. ఈ అభిప్రాయాలన్నీ కూడా సరైనవే కావచ్చు. ఎందుకంటే విశ్వాసి హృదయం ఈ అవగుణాలన్నింటి నుంచి పవిత్రంగా ఉంటుంది.

70. స్వర్గ నరకాలలో ప్రవేశానికి ముందే అవి వారి ముందుకు తేబడతాయి. నరకాన్ని చూడగానే అవిశ్వాసుల ఆందోళన ఎక్కువవుతుంది. మరోవైపు విశ్వాసులు స్వర్గాన్ని చూసి ఆనందంతో పరవశిస్తూ ఉంటారు.

71. అంటే – ఈ రోజు మీకు పడే శిక్షను వారు తప్పించగలరా? లేక కనీసం తమకు పడే శిక్షనయినా వారు వాయిదా వేయించగలరా?

72. బూటకపు దేముళ్ళను పూజించేవారు, పూజలందుకునేవారు – అందరూ కట్టకట్టి నరకంలో త్రోయబడతారు. వారిలో ఎవరిపట్ల కూడా ఎలాంటి రాయితీ కనబరచబడదు.

73. అంటే ప్రజలను అపమార్గం పట్టించేందుకు ప్రయత్నించేవారు అని భావం.

قَالُوا وَهُمْ فِيهَا يَخْتَصِمُونَ ﴿96﴾

**96** వారు పరస్పరం గొడవపడుతూ ఇలా అంటారు –

تَاللَّهِ إِن كُنَّا لَفِي ضَلَالٍ مُّبِينٍ ﴿97﴾

**97** "అల్లాహ్ సాక్షి! మేము స్పష్టమైన అపమార్గానికి పాల్ప డ్డాము,[74]

إِذْ نُسَوِّيكُم بِرَبِّ الْعَالَمِينَ ﴿98﴾

**98** మిమ్మల్ని సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కు సమానులుగా భావించినపుడు.

وَمَا أَضَلَّنَا إِلَّا الْمُجْرِمُونَ ﴿99﴾

**99** "మమ్మల్ని పెడదారి పట్టించింది ఈ పాపాత్ములే (వేరెవరూ కాదు.)[75]

فَمَا لَنَا مِن شَافِعِينَ ﴿100﴾

**100** "కనుక ఇప్పుడు మా కోసం సిఫారసు చేసేవారెవరూ లేకుండా పోయారు.

وَلَا صَدِيقٍ حَمِيمٍ ﴿101﴾

**101** "(మా బాధను అర్థం చేసుకునే) ఆప్తమిత్రుడు కూడా లేకుండా పోయాడు.[76]

فَلَوْ أَنَّ لَنَا كَرَّةً فَنَكُونَ مِنَ الْمُؤْمِنِينَ ﴿102﴾

**102** "ఒకవేళ మమ్మల్నే గనక మరోసారి తిరిగి పంపటం జరిగితే (నిజమైన) విశ్వాసులమవుతాము!"[77]

إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿103﴾

**103** నిశ్చయంగా ఈ వృత్తాంతంలో గొప్ప గుణపాఠ సూచన ఉంది.[78] అయితే వారిలో అనేకులు విశ్వసించేవారు కారు.[79]

---

74. ప్రపంచంలో అందంగా చెక్కబడిన ప్రతి రాతి విగ్రహం, సమాధిపై నిర్మించబడిన ప్రతి అందమైన కట్టడం ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ప్రజలు వాటికి దైవత్వాన్ని ఆపాదిస్తారు. దేవుని అధికారాలలో వాటికి కూడా ఎంతో కొంత వాటా ఉందని నమ్ముతారు. అయితే ఈ తలంపు ఒక దుర్మార్గం తప్ప మరేమీ కాదన్న వాస్తవం ప్రళయదినాన బహిర్గతమవుతుంది.

75. మీరు చేసేది అపచారమనీ, షిర్కు అనీ, దుర్మార్గమని ప్రపంచంలో వారికి ఎంతగా బోధపరచినా తలకెక్కదు. కాని పరలోకంలో కళ్లు తెరుస్తారు. తమను పెడత్రోవ పట్టించిన నేరస్తులను నిందిస్తారు. తాము వారి మాటను నమ్మినందుకు బాధపడతారు.

76. తప్పులు చేసిన విశ్వాసుల మన్నింపు కోసం దేవుని అనుమతితో దైవప్రవక్తలు, సజ్జనులు సిఫారసు చేస్తారు. ముఖ్యంగా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) విస్తృత ప్రాతిపదికపై ఈ సిఫారసు చేస్తారు. కాని అవిశ్వాసుల కోసం, ముష్రిక్కుల కోసం సిఫారసు చేయడానికి దేవుని అనుమతి లభించదు. అలాంటివారి కోసం అక్కడ ఏ బంధుత్వమూ, మరే స్నేహ బంధమూ పనికిరాదు.

77. తీర్పు దినాన అవిశ్వాసులు, ముష్రిక్కులు తమ దురవస్థపై తెగ బాధపడతారు. మళ్లీ ప్రపంచంలోకి వెళ్ళి సదాచరణ చేసే అవకాశం తమకు ఇస్తే బావుండునే! అని కోరుకుంటారు. కాని వారి ఆశ నిరాశే అవుతుంది.

78. అంటే – హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన జాతి వారితో విగ్రహారాధనపై వాదించటం, ఏకదైవారాధన గురించి నొక్కి వక్కాణించటం – ఇదంతా ఒక గుణపాఠ సూచన. అల్లాహ్ తప్ప మరో నిజదైవం లేదని ఈ సంఘటన నిరూపిస్తోంది.

**104** నిశ్చయంగా నీ ప్రభువు మాత్రమే శక్తిశాలి, దయాశీలి.

وَإِنَّ رَبَّكَ لَهُوَ الْعَزِيزُ الرَّحِيمُ (104)

**105** నూహు జాతి వారు (కూడా) దైవ ప్రవక్తలను ధిక్క రించారు.[80]

كَذَّبَتْ قَوْمُ نُوحٍ الْمُرْسَلِينَ (105)

**106** అప్పుడు వారి సోదరుడైన[81] నూహు వారినుద్దేశించి ఇలా అన్నాడు : "ఏమిటి, మీరు అల్లాహ్‌కు భయపడరా?

إِذْ قَالَ لَهُمْ أَخُوهُمْ نُوحٌ أَلَا تَتَّقُونَ (106)

**107** "వినండి! నేను మీ వైపుకు పంపబడిన నమ్మకస్తుణ్ణి అయిన దైవప్రవక్తను.[82]

إِنِّي لَكُمْ رَسُولٌ أَمِينٌ (107)

**108** "కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి, నేను చెప్పినట్లు వినండి.[83]

فَاتَّقُوا اللَّهَ وَأَطِيعُونِ (108)

**109** "దీనికిగాను నేను మీనుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత సర్వలోకాల ప్రభువుది.[84]

وَمَا أَسْأَلُكُمْ عَلَيْهِ مِنْ أَجْرٍ إِنْ أَجْرِيَ إِلَّا عَلَىٰ رَبِّ الْعَالَمِينَ (109)

**110** "కాబట్టి మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి."[85]

فَاتَّقُوا اللَّهَ وَأَطِيعُونِ (110)

**111** (దానికి అతని) జాతివారు, "ఏమిటీ? మేము నిన్ను విశ్వసించాలా? చూడబోతే అధములు మాత్రమే నిన్ను అనుస రిస్తున్నారు"[86] అని సమాధానమిచ్చారు.

قَالُوا أَنُؤْمِنُ لَكَ وَاتَّبَعَكَ الْأَرْذَلُونَ (111)

79. విశ్వసించని ఈ 'అనేకులు' ఎవరు? వారు మక్కాకు చెందిన ముష్రిక్కులని కొందరు అభిప్రాయపడ్డారు.

80. నూహు జాతి ప్రజలు ధిక్కరించింది తమ ప్రవక్త నూహు ఒక్కరినే. అయినప్పటికీ ఒక జాతి వారు ఒక ప్రవక్తను తిరస్కరిస్తే ప్రవక్తలందరినీ తిరస్కరించినట్లే లెక్క. అందుకే 'నూహు జాతి వారు దైవప్రవక్తలను ధిక్కరించారు' అని చెప్పబడింది.

81. **'వారి సోదరుడు'** అని చెప్పటం గమనార్హం. దైవప్రవక్త నూహు ఆ జాతి వారికి చెందిన ఒక సభ్యుడు కావటం వల్ల ఆయన్ని వారి సహోదరునిగా అభివర్ణించటం జరిగింది.

82. అంటే – దేవుడు నాకు ఇచ్చి పంపిన సందేశాన్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా – యథాతథంగా – అందజేసేవాణ్ణి. ఆ సందేశంలో నా తరఫున ఎలాంటి మార్పులు చేర్పులు చేయకుండా నిజాయితీగా కర్తవ్యాన్ని నెరవేర్చే ప్రవక్తను.

83. ఒకే దైవాన్ని ఆరాధించాలనీ, దైవానికి సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టరాదని నేను చేసే ఉపదేశాన్ని ఖచ్చితంగా పాటించండి. ఈ మార్గాన్ని కాదని పెడదారి పట్టకండి.

84. నేను ఈ సందేశాన్ని అందజేసినందుకు మీనుంచి వేతనం కోరటం లేదు. నాకు ప్రతిఫలం ప్రసాదించే బాధ్యత సర్వలోక ప్రభువుపై ఉంది. తీర్పుదినాన ఆయన నాకు ఈ ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

85. ఒకే మాటను సందర్భోచితంగా పునరావృతం చేయటం ఖుర్‌ఆన్ ప్రత్యేకత. అల్లాహ్‌కు భయపడటం, దైవప్రవక్తను అనుసరించటం ఆయా జాతి ప్రజలకు ఎంత అవసరమో దీన్నిబట్టి అవగతం అవుతుంది.

112 (దానికి నూహ్) ఇలా అన్నాడు: "లోగడ వారేం చేసేవారో నాకేం తెలుసు?[87]

قَالَ وَمَا عِلۡمِي بِمَا كَانُواْ يَعۡمَلُونَ ١١٢

113 "మీరు గనక అర్థం చేసుకోగలిగితే, వారి లెక్క తీసుకునే బాధ్యత నా ప్రభువుది.[88]

إِنۡ حِسَابُهُمۡ إِلَّا عَلَىٰ رَبِّيۖ لَوۡ تَشۡعُرُونَ ١١٣

114 "నేను మాత్రం విశ్వాసులను గెంటివేసే వాణ్ణికాను.[89]

وَمَآ أَنَا۠ بِطَارِدِ ٱلۡمُؤۡمِنِينَ ١١٤

115 "నేను (ప్రజలను) స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి మాత్రమే."[90]

إِنۡ أَنَا۠ إِلَّا نَذِيرٞ مُّبِينٞ ١١٥

116 వారిలా పలికారు: "ఓ నూహు! నువ్వు గనక (ఈ పనిని) మానుకోకపోతే, నిన్ను రాళ్లతో కొట్టడం (చంపటం) ఖాయం."

قَالُواْ لَئِن لَّمۡ تَنتَهِ يَٰنُوحُ لَتَكُونَنَّ مِنَ ٱلۡمَرۡجُومِينَ ١١٦

117 అప్పుడు అతనిలా ప్రార్థించాడు: "నా ప్రభూ! నా జాతి వారు నన్ను ధిక్కరించారు.

قَالَ رَبِّ إِنَّ قَوۡمِي كَذَّبُونِ ١١٧

118 "కాబట్టి నీవు నాకూ – వారికీ మధ్య ఏదైనా అంతిమ నిర్ణయం చెయ్యి. నన్నూ, నాతో ఉన్న విశ్వాసులనూ కాపాడు."

فَٱفۡتَحۡ بَيۡنِي وَبَيۡنَهُمۡ فَتۡحٗا وَنَجِّنِي وَمَن مَّعِيَ مِنَ ٱلۡمُؤۡمِنِينَ ١١٨

119 తుదకు మేము అతన్నీ, అతని సహచరులను నిండు నౌకలో (ఎక్కించి) కాపాడాము.

فَأَنجَيۡنَٰهُ وَمَن مَّعَهُۥ فِي ٱلۡفُلۡكِ ٱلۡمَشۡحُونِ ١١٩

120 ఆ తరువాత మిగిలివున్న వారందరినీ మేము ముంచి వేశాము.[91]

ثُمَّ أَغۡرَقۡنَا بَعۡدُ ٱلۡبَاقِينَ ١٢٠

86. **అర్‌జలూన్** (أَرْذَلُونَ) అంటే–సమాజంలో ఆస్తిపాస్తులు, పదవులు, కీర్తి ప్రతిష్ఠలు లేని అతి సామాన్య జనులు– అధములు– అల్పమైన వృత్తిపనులు చేసుకునేవారు నీ అడుగు జాడలలో నడుస్తున్నారు. ప్రముఖులెవరూ నీ వెనుక లేరు. అలాంటప్పుడు మేము నీ సందేశాన్ని ఎలా విశ్వసించాలి? అన్నది వారి మాటల్లోని ఉద్దేశం.

87. అంటే, నేను ప్రవక్తగా పంపబడింది దైవసందేశం ఆధారంగా ప్రజల జీవితాలను తీర్చిదిద్దటానికేగాని వారి కులగోత్రాలను గురించి, వారి వృత్తులను గురించి ఆరాతీసి వాళ్లను వర్గీకరించటానికి కాదు. వంశపారంపర్యాలు, ధనిక–బీద తారతమ్యాలు ఈ సంస్కరణా సరణిలో ఏ మాత్రం పనికిరావు. నా సందేశాన్ని స్వీకరించి తదనుగుణంగా ఆచరించినవారు మాత్రమే నా వారు. అలాంటివారినే నేను నా సమూహంలో చేర్చుకుంటాను అన్నది హజ్రత్ నూహు పలుకుల్లోని ఆంతర్యం.

88. వాళ్ల అంతస్తులను, ఆచరణలలోని చిత్తశుద్ధిని తేల్చేవాడు అల్లాహ్ మాత్రమే.

89. సమాజంలోని దళిత వర్గాలవారు నీ వెంట ఉన్నారు. నువ్వు వాళ్ళను గనక నీ చెంతనుంచి తరిమివేస్తే అప్పుడు మేము నీ సమూహంలోకి వచ్చిచేర్తాము అని నూహు జాతి వారిలోని అగ్రవర్ణాలవారు, కులీనులు షరతు పెట్టారు మరి.

90. అల్లాహ్‌కు భయపడి, నా మార్గాన్ని అనుసరించేవారే నా వారు. లోకుల దృష్టిలో వారు అధికులైనా, అధములైనా – దానితో నాకు ఎలాంటి నిమిత్తం లేదు. 'భయభక్తుల' ఆధారంగా ప్రజా జీవితాలను తీర్చిదిద్దటమే నా కర్తవ్యం.

91. హజ్రత్ నూహు (అలైహిస్సలాం)కి చెందిన ఈ వివరాలు ఇంతకుముందు కూడా కొన్నిచోట్ల వచ్చాయి. ముందు

**121** నిశ్చయంగా ఇందులో (చాలా పెద్ద) సూచన ఉంది. కాని వారిలో పెక్కుమంది విశ్వసించే రకం కాదు.

إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿121﴾

**122** నిస్సందేహంగా నీ ప్రభువు సర్వాధిక్యుడు, దయాశీలి.

وَإِنَّ رَبَّكَ لَهُوَ الْعَزِيزُ الرَّحِيمُ ﴿122﴾

**123** ఆద్ జాతి వారు (కూడా) దైవ ప్రవక్తలను ధిక్కరించారు.[92]

كَذَّبَتْ عَادٌ الْمُرْسَلِينَ ﴿123﴾

**124** అప్పుడు వారి సోదరుడైన హూద్,[93] (వారినుద్దేశించి) ఇలా అన్నాడు : "మీరు బొత్తిగా భయపడరా?

إِذْ قَالَ لَهُمْ أَخُوهُمْ هُودٌ أَلَا تَتَّقُونَ ﴿124﴾

**125** "నేను మీ వద్దకు పంపబడిన నమ్మకస్థుణ్ణి అయిన ప్రవక్తను.

إِنِّي لَكُمْ رَسُولٌ أَمِينٌ ﴿125﴾

**126** "కనుక అల్లాహ్‌కు భయపడండి. నా విధానాన్ని అనుసరించండి.

فَاتَّقُوا اللَّهَ وَأَطِيعُونِ ﴿126﴾

**127** "ఈ పనికిగాను నేను మీనుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు. నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత సర్వ లోకాల ప్రభువుపై ఉంది.

وَمَا أَسْأَلُكُمْ عَلَيْهِ مِنْ أَجْرٍ ۖ إِنْ أَجْرِيَ إِلَّا عَلَىٰ رَبِّ الْعَالَمِينَ ﴿127﴾

**128** "ఏమిటీ, మీరు ఎత్తయిన ప్రతి స్థలంలోనూ ఏమీ ప్రయోజనం లేని ఒక స్మారక కట్టడాన్ని నిర్మిస్తారా?[94]

أَتَبْنُونَ بِكُلِّ رِيعٍ آيَةً تَعْبَثُونَ ﴿128﴾

---

ముందు కూడా రానున్నాయి. ఆయన (అలైహిస్సలాం) 950 సంవత్సరాలు దైవధర్మాన్ని ప్రచారం చేశారు. అయినప్పటికీ ఆయన జాతివారు మంకుతనాన్ని మానుకోలేదు. పైగా అడుగడుగునా ఆయన్ని కించపరచటం మొదలెట్టారు. నూహు (అలైహిస్సలాం) సుదీర్ఘకాలం తరువాత తన జాతిలోని దుర్మార్గులను శపించారు. ఒక ఓడను నిర్మించి విశ్వసించిన సహచరులను, జంతువులను, కనీసావసరాలను అందులోకి ఎక్కించుకోమని అల్లాహ్ ఆయనకు ఆజ్ఞాపించాడు. అనంతరం భయంకరమైన పెనుతుఫాను ద్వారా అవిశ్వాస జనులను ముంచివేశాడు. తుదకు అల్లాహ్‌పట్ల తిరస్కారవైఖరిని అవలంబించిన నూహు భార్యను, కొడుకును కూడా వదలిపెట్టలేదు.

92. **'ఆద్'** అనేది ఆ జాతి మూలపురుషుని పేరు. అతని పేరు మీదే అది ఆద్ జాతిగా పిలువబడింది.

93. దైవప్రవక్త హూద్ (అలైహిస్సలాం) కూడా ఆద్ జాతి వారి సోదరుడుగా వ్యవహరించబడ్డారు. ప్రతి ప్రవక్తా ఆ జాతి ప్రజలవాడై ఉంటాడు. ఆ జాతిలోనుంచే దేవుడు తన ప్రవక్తను ఎన్నుకుంటాడు. ఆ విధంగా అతను ఆ జాతి సహోదరుడే అవుతాడు. అయితే తమ మధ్యన నివసించే ఒక సాధారణ మనిషి ఉన్నట్టుండి దైవప్రవక్తగా మాట్లాడటం ఆయా జాతి ప్రజలను విస్మయానికి గురిచేసింది. తమలాంటి ఒక మానవమాత్రుడు దైవప్రవక్త అవటమేమిటి? మానవాతీతుడు దైవప్రవక్తగా రావాలి కదా! అని వారు సందేహపడేవారు. ఆనాటి వారే కాదు, నేటి ప్రబుద్ధులు (ముస్లింలు) కూడా కొందరు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను మానవమాత్రునిగా ఒప్పుకోరు. పైగా ఆయన్ని ఒక మానవాతీతునిగా నమ్మబలుకుతుంటారు. మరి చూడబోతే ఆయన (స) కూడా కురైషు వంశానికి చెందిన ఒక వ్యక్తే. తరువాత ఆయన (స) ప్రవక్తగా ఎన్నుకోబడ్డారు.

94. అరబీలో **'రీయిన్'** (رِيعٍ) అని ఉంది. రీయిన్ అంటే ఎత్తయిన ప్రదేశం, కొండ, గుట్ట, కనుమ అన్న అర్థాలు

129 "మీరు ఇక్కడే శాశ్వతంగా ఉంటామన్నట్లు అపురూపమైన (పటిష్టమైన) భవనాలను నిర్మిస్తున్నారే![95]

وَتَتَّخِذُونَ مَصَانِعَ لَعَلَّكُمْ تَخْلُدُونَ ﴿129﴾

130 "మీరు ఎప్పుడు, ఎవరిని పట్టుకున్నా చాలా దౌర్జన్య పూరితంగా పంజా విసురుతున్నారే!?[96]

وَإِذَا بَطَشْتُم بَطَشْتُمْ جَبَّارِينَ ﴿130﴾

131 "కనుక, మీరు అల్లాహ్‌కు భయపడండి. నా విధానాన్ని అనుసరించండి.[97]

فَاتَّقُوا اللَّهَ وَأَطِيعُونِ ﴿131﴾

132 "మీకు తెలిసివున్న సమస్త (మంచి) వస్తువులను మీకు వొసగి, మిమ్మల్ని ఆదుకున్న వానికి భయపడండి.

وَاتَّقُوا الَّذِي أَمَدَّكُم بِمَا تَعْلَمُونَ ﴿132﴾

133 "ఆయన మీకు పశువుల ద్వారా, సంతానం ద్వారా తోడ్పడ్డాడు.

أَمَدَّكُم بِأَنْعَامٍ وَبَنِينَ ﴿133﴾

134 "తోటల ద్వారా, చెలమల ద్వారా (సహాయపడ్డాడు).

وَجَنَّاتٍ وَعُيُونٍ ﴿134﴾

135 "నేను మీ విషయంలో ఒక మహా దినపు శిక్ష గురించి భయపడుతున్నాను."[98]

إِنِّي أَخَافُ عَلَيْكُمْ عَذَابَ يَوْمٍ عَظِيمٍ ﴿135﴾

136 వారిలా అన్నారు : "నువ్వు మాకు బోధించినా, బోధించే వారిలో ఒకడవు కాకపోయినా మాకు ఒకటే.

قَالُوا سَوَاءٌ عَلَيْنَا أَوَعَظْتَ أَمْ لَمْ تَكُن مِّنَ الْوَاعِظِينَ ﴿136﴾

---

వస్తాయి. అలాంటి చోట్ల ఆద్‌జాతివారు – అవసరం లేకపోయినా–కేవలం తమ వాస్తుకళను చాటి చెప్పే మోజుతో కట్టడాలు నిర్మించేవారు. ఆ కట్టడాల్లో ఎవరూ నివసించేవారు కాదు. ఆ విషయాన్నే దైవప్రవక్త హూద్ (అలైహిస్సలాం) ఎత్తిచూపుతూ దైవప్రసాదితమైన తెలివితేటలను, సాధన సంపత్తులను వృధాగా వ్యయపరచరాదని నచ్చజెప్పారు. దీన్నిబట్టి బోధపడేదేమంటే వ్యక్తుల, జాతుల, రాజ్యాల సంపద సదా ప్రయోజనకరమైన లక్ష్యాల కోసం ఖర్చుకావాలి. నిరుపయోగమైన, నిరర్థకమైన వాటికోసం శక్తినీ, సమయాన్నీ, సంపదనీ వెచ్చించకూడదు.

95. ప్రతి చోటా వారు పటిష్టమైన ఆకాశహర్మ్యాలను, నివాసభవనాలను నిర్మించటాన్ని హాబీగా చేసుకున్నారు. వారెన్ని మేడలు మిద్దెలు నిర్మించినా వారి ఆయుష్షు పెరిగేది కాదు. వారు శాశ్వతంగా ఈ లోకంలో ఉండేవారు కూడా కాదు. ఆ విషయాన్నే హజ్రత్ హూద్ (అలైహిస్సలాం) వారికి గుర్తుచేస్తూ, మానవ ఒనరులను ఈ విధంగా వృధా చేయకండని హితవు పలికారు.

96. ఈ వాక్యం ఆద్ జాతి పరాక్రమాన్ని, దౌర్జన్యాన్ని, హింసా ప్రవృత్తిని సూచిస్తోంది.

97. ప్రపంచంలో వారు చెలరేగిపోతున్న వైనాన్ని ఎత్తిచూపిన తరువాత హజ్రత్ హూద్ దైవభీతి వైపుకు వారిని పిలవటం గమనార్హం. ఇది దైవప్రవక్తల విధానం. తమ జాతి ప్రజలలో తిష్ఠవేసివున్న చెడుగును ఎత్తిచూపిన తరువాత ప్రవక్తలు దానికి విరుగుడును, చికిత్సను కూడా చెబుతారు.

98. దేవుడు మీకు ప్రసాదించిన ఈ నైపుణ్యానికిగాను మీరు కృతజ్ఞులుగా మసలుకుంటే సరి, లేకపోతే మీ ధిక్కార వైఖరి మీకు అనర్థదాయకం అవుతుంది. మీరు దైవాగ్రహానికి పాత్రులవుతారు. దైవాగ్రహం ప్రాపంచిక జీవితంలో కూడా మీపై విరుచుకుపడవచ్చు. ఒకవేళ ఈ లోకంలో మీరు ఉపేక్షించబడినా పరలోకంలో మాత్రం మీరు దైవశిక్ష నుంచి తప్పించుకోలేరు.

**137** “ఇది పూర్వీకుల పాత అలవాటు తప్ప మరేమీ కాదు.[99]

إِنْ هَٰذَا إِلَّا خُلُقُ الْأَوَّلِينَ ﴿١٣٧﴾

**138** “ఎట్టి పరిస్థితిలోనూ మేము శిక్షించబడము.”[100]

وَمَا نَحْنُ بِمُعَذَّبِينَ ﴿١٣٨﴾

**139** ఆద్ (జాతి) వారు అతనిని (హూదును) ధిక్కరించిన కారణంగా మేము వారిని అంతమొందించాము.[101] నిశ్చయంగా ఇందులో సూచన ఉంది. కాని వారిలో అనేకులు విశ్వాసులు కాలేదు.

فَكَذَّبُوهُ فَأَهْلَكْنَاهُمْ ۗ إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿١٣٩﴾

**140** మరి నిస్సందేహంగా నీ ప్రభువు అపార శక్తిసంపన్నుడు, పరమ కృపాశీలుడు.

وَإِنَّ رَبَّكَ لَهُوَ الْعَزِيزُ الرَّحِيمُ ﴿١٤٠﴾

**141** సమూదు (జాతి) వారు కూడా దైవసందేశహరులను ధిక్కరించారు.[102]

كَذَّبَتْ ثَمُودُ الْمُرْسَلِينَ ﴿١٤١﴾

**142** అప్పుడు వారి సోదరుడైన సాలెహ్ వారినుద్దేశించి ఇలా అన్నాడు: “ఏమిటీ? మీరు (అల్లాహ్‌కు) భయపడరా?

إِذْ قَالَ لَهُمْ أَخُوهُمْ صَالِحٌ أَلَا تَتَّقُونَ ﴿١٤٢﴾

---

99. ఇలాంటి మాటలే మన పూర్వీకులు కూడా చెప్పేవారు. కాబట్టి మనం ఈయన గారు చెబుతున్న దానిని వినాల్సిన పనిలేదు. మన సనాతన మతాన్ని అవలంబిస్తూ, మన తాతముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను పాటిస్తూ ఉంటే చాలు అన్నది ఆదు జాతివారి ఉద్దేశం.

100 తమ పూర్వీకుల మతాన్ని వదలిపెట్టబోమని ఆద్ జాతి వారు ప్రకటించి, పరలోక జీవితాన్ని తిరస్కరించారు. అందుకే తమకు ఏ శిక్షా పడదన్న ధీమా వారిలో ఉండేది. ఎందుకంటే అల్లాహ్‌ను, మరణానంతర జీవితాన్ని విశ్వసించేవారు మాత్రమే దేవుడు విధించబోయే శిక్షకు భయపడతారు.

101. ప్రపంచ జాతులన్నింటిలోకీ అత్యంత బలోపేతమైన, సాహసోపేతమైన జాతి ఆద్ జాతి. “అలాంటి జాతి ఏదీ (భువిపై) ప్రభవింపజేయబడలేద”ని అల్లాహ్ సెలవిచ్చాడు (అల్ ఫజ్ర్ సూరా). శక్తి సామర్థ్యాల రీత్యాను, శరీర దారుఢ్యం దృష్ట్యాను అది సాటిలేనిది. అందుకే “బలంలో మమ్మల్ని మించిన వారెవరున్నారు?” **(మన్ అషద్దు మిన్నా ఖువ్వహ్)** అని ఆ జాతివారు గర్వపడేవారు (హామీమ్ సజ్దా - 15). కాని ఈ బలిష్టులు కూడా దైవధిక్కార వైఖరిని మాని భయభక్తుల వైఖరిని అవలంబించక పోవటంతో అల్లాహ్ వారిపై ఆగ్రహించాడు. ప్రచండ గాలుల రూపంలో వారిపై శిక్షను అవతరింపజేశాడు. అవి మొత్తం ఏడు రాత్రులు, ఎనిమిది దినాలు ఏకధాటిగా వీచాయి. ఒక్కో సుడిగాలి వచ్చి మనుషుల్ని పైకి తీసుకుపోయి, అక్కణ్ణుంచి అమాంతం నేలకేసి కొట్టేది. దాంతో వారి తలలు బద్దలై మెదడు బయటికి వచ్చేది. కడకు వారి శరీరాలు ఖర్జూరపు బొద్దుల వలె నేలపై పడి ఉండటం కనిపించింది. వారు పర్వతాలపై, గుట్టలపై, గుహలలో పటిష్టమైన భవనాలను నిర్మించారు. త్రాగునీటి కోసం లోతైన బావులు త్రవ్వారు. వారికున్న తోటలు అసంఖ్యాకం. కాని దైవశిక్ష వచ్చిపడినపుడు ఈ వస్తువులేవీ వారికి పనికిరాలేదు. వారు నామరూపాల్లేకుండా తుదముట్టించబడ్డారు.

102. సమూద్ జాతివారి పట్టణం హిజ్ర్. అది హిజాజ్‌కు ఉత్తర దిక్కున ఉంది. ప్రస్తుతం అది ‘మదాయనె సాలెహ్’ పేరుతో పిలువబడుతున్నది (ఐసరుత్తఫాసీర్). వారు అరబ్బులే. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తబూక్‌కు వెళ్ళే సమయంలో ఈ పట్టణాల మీదుగానే సాగిపోయారు.

**143** “నేను మీ వైపునకు పంపబడిన విశ్వసనీయుడనైన ప్రవక్తను.

إِنِّي لَكُمْ رَسُولٌ أَمِينٌ ﴿143﴾

**144** “అందుకే మీరు అల్లాహ్‌కు భయపడండి. నా విధానాన్ని అనుసరించండి.

فَاتَّقُوا اللَّهَ وَأَطِيعُونِ ﴿144﴾

**145** “ఈ పనికిగాను నేను మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు. నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత సర్వలోక ప్రభువుపై ఉంది.

وَمَا أَسْأَلُكُمْ عَلَيْهِ مِنْ أَجْرٍ إِنْ أَجْرِيَ إِلَّا عَلَىٰ رَبِّ الْعَالَمِينَ ﴿145﴾

**146** “ఏమిటీ, ఇక్కడున్న ఈ వస్తువుల మధ్య మీరు ప్రశాంతంగా (ఉండగలిగేలా) వదలివేయబడతారా?[103]

أَتُتْرَكُونَ فِي مَا هَاهُنَا آمِنِينَ ﴿146﴾

**147** “అంటే – ఈ తోటలలో, ఈ చెలమలలో...

فِي جَنَّاتٍ وَعُيُونٍ ﴿147﴾

**148** “ఈ పొలాల్లో, సుతిమెత్తని, కోమలమైన పండ్ల గెలలు గల ఈ ఖర్జూర తోటలలో (కలకాలం ఉంటామని అనుకుంటున్నారా?)[104]

وَزُرُوعٍ وَنَخْلٍ طَلْعُهَا هَضِيمٌ ﴿148﴾

**149** “మీరు పర్వతాలను చెక్కి ఆడంబరమైన ఇండ్లను తయారు చేస్తున్నారు.[105]

وَتَنْحِتُونَ مِنَ الْجِبَالِ بُيُوتًا فَارِهِينَ ﴿149﴾

---

103. మీకు సొంతమై ఉన్న ఈ అనుగ్రహాలు సదా మీ దగ్గరుంటాయని మీరు భావిస్తున్నారా? మీకు మరణంగానీ, ఆపదగానీ రాదా? జాగ్రత్త! మృత్యువు రూపంలోనయినా, శిక్షరూపంలోనయినా అల్లాహ్ తాను కోరినప్పుడు వీటినుంచి మిమ్మల్ని వేరుపరచటం ఖాయం. అందుకే మీరు ఈ వరప్రసాదాలకుగాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపండి. ఆయన్ని విశ్వసించండి. చేసిన మేలును మరచి విర్రవీగారంటే వినాశం తప్పదు అని హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) సమూద్ జాతి వారిని హెచ్చరించారు.

104. వారు అనుభవించే అనుగ్రహాలను (తోటలను), పండ్లను గురించి హజ్రత్ సాలెహ్ ఇక్కడ ప్రస్తావించారు. ఖర్జూరపు గెలలు మొదట్లో అతి కోమలంగా, మెత్తగా ఉంటాయి. ఆ తరువాత దోరకాయలుగా తయారవుతాయి. తరువాత మాగుతాయి. ఆ తరువాత తేనెలూరే పండ్లలా రూపొందుతాయి. పిందెలతో కూడిన ఖర్జూర గెలను **‘తలా’** అంటారు. తర్వాత ఆ పిందెలు కొద్దిగా పెరిగి పెద్దవై **‘బలఖ్’**గా రూపు చెందుతాయి. తర్వాత **‘బిసర్’**గా మారుతాయి. ఆ తర్వాత ‘రతబ్’ రూపు ధరిస్తాయి. చివరకు పూర్తిగా పండిన ఖర్జూరాలు **‘తమర్’**గా పిలువబడతాయి. (ఐసరుత్తఫాసీర్). అరబ్బులకు ఖర్జూర పంట ఎంతో ముఖ్యమైనది. అందువల్ల ఈ ఆయతులో ఖర్జూరాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది.

105. **‘ఫారిహీన్’** (فٰرِهِيْنَ) అంటే మోతాదుకు మించిన కృత్రిమతను జొప్పించటం, కళాత్మక నైపుణ్యాన్ని అతిగా చాటిచెప్పే విధంగా చేయటం అని అర్థం. గర్వం, మిడిసిపాటు, బడాయి గుణం ఉన్నవారు మాత్రమే ఇలా చేస్తారు. ఈ ప్రదర్శనాబుద్ధి నేడూ ప్రజలలో పుష్కలంగా ఉంది. ఇంటి నిర్మాణం కన్నా డెకరేషన్ కోసం ఎక్కువ డబ్బును తగలపెడుతున్నారు. డెకరేషన్ కోసం ఎంత ఎక్కువ డబ్బును ఖర్చుపెడితే తమ అంతస్థు అంతే పెరుగుతుందని భావిస్తున్నారు.

**150** “కనుక, మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి.

فَاتَّقُوا اللّٰهَ وَاَطِيْعُوْنِ ﴿150﴾

**151** “హద్దుమీరి పోయేవారికి[106] విధేయత చూపటం మానండి–

وَلَا تُطِيْعُوْٓا اَمْرَ الْمُسْرِفِيْنَ ﴿151﴾

**152** “వారు భువిలో కల్లోలాన్ని రేకెత్తిస్తున్నారు. ఎలాంటి సంస్కరణా కార్యాలు చేయరు.”

الَّذِيْنَ يُفْسِدُوْنَ فِي الْاَرْضِ وَلَا يُصْلِحُوْنَ ﴿152﴾

**153** దానికి వారు ఇచ్చిన జవాబు ఇది : “నువ్వు చేతబడికి గురయిన వానిలా ఉన్నావు.

قَالُوْٓا اِنَّمَآ اَنْتَ مِنَ الْمُسَحَّرِيْنَ ﴿153﴾

**154** “నువ్వూ మాలాంటి ఒక మామూలు మనిషివే. ఒకవేళ నువ్వు నిజంగా సత్యవంతుడవే అయితే ఏదైనా నిదర్శనాన్ని తీసుకురా.”

مَآ اَنْتَ اِلَّا بَشَرٌ مِّثْلُنَا ۚ فَاْتِ بِاٰيَةٍ اِنْ كُنْتَ مِنَ الصّٰدِقِيْنَ ﴿154﴾

**155** అతను ఇలా అన్నాడు : “ఇదిగో ఆడ ఒంటె! నీరు త్రాగటానికి ఒక వంతు దీనిది. ఒక నిర్ధారిత దినం మీది.[107]

قَالَ هٰذِهٖ نَاقَةٌ لَّهَا شِرْبٌ وَّلَكُمْ شِرْبُ يَوْمٍ مَّعْلُوْمٍ ﴿155﴾

**156** “(జాగ్రత్త!) దీన్ని దురుద్దేశంతో తాకకండి. (ఒకవేళ మీరు అలా చేశారంటే) పర్యవసానంగా ఒక మహాదినపు విపత్తు మిమ్మల్ని చుట్టుముట్టుతుంది.”[108]

وَلَا تَمَسُّوْهَا بِسُوْٓءٍ فَيَاْخُذَكُمْ عَذَابُ يَوْمٍ عَظِيْمٍ ﴿156﴾

**157** అయినాసరే వాళ్లు దాని కాలి గిట్టెలను నరికేశారు.[109] ఆ తరువాత వారు బాధపడసాగారు.[110]

فَعَقَرُوْهَا فَاَصْبَحُوْا نٰدِمِيْنَ ﴿157﴾

---

106. **‘ముస్రిఫీన్’** (مُسْرِفِيْن) అంటే సత్యధర్మాన్ని అడ్డుకోవటంలో ప్రధాన పాత్రను పోషించే అవిశ్వాస ధనవంతులు, ముష్రిక్కు సర్దారులు అని భావం.

107. తమకేదైనా ‘చమత్కారం’ చూపించమని సమూద్ జాతి వారు హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం)ను కోరారు. వారి కోర్కెపై ఒక రాతి బండ నుంచి మహిమగా ఒక ఆడ ఒంటెను అల్లాహ్ వెలికితీశాడు. ఒక రోజు ఒంటె కోసం, ఒక రోజు సమూద్ జాతి వారికోసం త్రాగు నీరు సరఫరా చేయాలని ముందుగా నిర్ధారించబడింది. మీరు నీరు తోడుకునే రోజు ఒంటె రాదు. ఒంటె నీరు త్రాగే రోజు మీరు దాని జోలికి పోవద్దు అని సాలెహ్ తన జాతి ప్రజలను గట్టిగా తాకీదు చేశారు.

108. దురుద్దేశ్యంతో ఆ ఆడ ఒంటెను తాకటంగానీ, దానికి కీడు తలపెట్టడం గానీ చేయరాదని కూడా హజ్రత్ సాలెహ్ తన జాతి వారికి ముందే హెచ్చరించారు. కొంత కాలంపాటు ఆ ఒంటె అక్కడే ఉండేది. రెండు రోజులకొకసారి – తన వంతు ప్రకారం – నీరు త్రాగేది. పరిసర ప్రాంతాలలో గడ్డిమేస్తూ ఉండేది. సమూద్ జాతి వారు ఆ ఒంటె పాలు పితికి, ఆ పాలను ఉపయోగించేవారు. కాని కొంత కాలం తరువాత ఆ జాతి ప్రజల ఉద్దేశం మారిపోయింది. ఆ ఒంటెను చిత్రహింసలు పెట్టి దారుణంగా చంపాలని పథకం వేశారు.

109. ఆ ఒంటె దేవుని తరఫున ఒక సూచనగా వచ్చినా, అది దైవప్రవక్త సత్యసంధతకు ప్రతీకగా ఉన్నా సమూద్ జాతివారు తమ ప్రవక్తను విశ్వసించలేదు సరికదా అవిశ్వాస వైఖరిపై పాతుకుపోయారు. ఆఖరికి వారి ఉన్మాదం

158 అంతే! శిక్ష వారిని కబళించింది.[111] నిశ్చయంగా ఇందులో గుణపాఠ సూచన ఉంది. కాని వారిలో చాలామంది విశ్వసించ లేదు.

فَأَخَذَهُمُ الْعَذَابُ ۗ إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿١٥٨﴾

159 నిశ్చయంగా నీ ప్రభువు సర్వాధిక్యుడు, కరుణామయుడు.

وَإِنَّ رَبَّكَ لَهُوَ الْعَزِيزُ الرَّحِيمُ ﴿١٥٩﴾

160 లూత్ జాతివారు (కూడా)[112] ప్రవక్తలను ధిక్కరించారు.

كَذَّبَتْ قَوْمُ لُوطٍ الْمُرْسَلِينَ ﴿١٦٠﴾

161 వారి సోదరుడైన లూత్ వారినుద్దేశ్యించి ఇలా అన్నాడు: "మీరు (అల్లాహ్‌కు) భయపడరా?

إِذْ قَالَ لَهُمْ أَخُوهُمْ لُوطٌ أَلَا تَتَّقُونَ ﴿١٦١﴾

162 "నేను మీ వద్దకు పంపబడిన నమ్మకస్థుడనైన ప్రవక్తను.

إِنِّي لَكُمْ رَسُولٌ أَمِينٌ ﴿١٦٢﴾

163 "కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. నా విధానాన్ని అనుసరించండి.

فَاتَّقُوا اللَّهَ وَأَطِيعُونِ ﴿١٦٣﴾

164 "దీనికిగాను నేను మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు. నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత సర్వలోకాల ప్రభువైన అల్లాహ్‌పై ఉంది.

وَمَا أَسْأَلُكُمْ عَلَيْهِ مِنْ أَجْرٍ ۖ إِنْ أَجْرِيَ إِلَّا عَلَىٰ رَبِّ الْعَالَمِينَ ﴿١٦٤﴾

165 "మీరు లోకంలో(ని) పురుషుల వద్దకు పోతున్నారేమిటీ?

أَتَأْتُونَ الذُّكْرَانَ مِنَ الْعَالَمِينَ ﴿١٦٥﴾

166 "అల్లాహ్ మీ కొరకు జతగా సృష్టించిన మీ భార్యలను విడిచిపెడుతున్నారే![113] మీరు బొత్తిగా హద్దుమీరిపోయే జనంలా ఉన్నారు."[114]

وَتَذَرُونَ مَا خَلَقَ لَكُمْ رَبُّكُم مِّنْ أَزْوَاجِكُم ۚ بَلْ أَنتُمْ قَوْمٌ عَادُونَ ﴿١٦٦﴾

పరాకాష్ఠకు చేరగా దైవ సూచనగా ఉన్న ఆ ఒంటెను సయితం వారు నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ముందు ఆ ఒంటె కాళ్ళను తీవ్రంగా గాయపరిచారు. దాంతో అది నేలకొరిగింది. తరువాత దాన్ని వధించారు.

110. ఒంటెను చంపిన తరువాత హ(జత్ సాలెహ్ తన జాతి వారినుద్దేశించి, "ఇప్పుడు మీకు మూడు రోజుల గడువు మాత్రమే ఉంది. నాల్గవరోజు మీకు వినాశం తప్పదు" అని చెప్పేశారు. గడువు ముగిసి, ఆపద విరుచుకుపడే సూచనలు పొడసూపటంతోనే వారు తమ అపచారంపై సిగ్గుతో కుమిలిపోసాగారు. కాని ఆపదను చూసినపుడు చెందే పశ్చాత్తాపం ప్రయోజనకరం కాజాలదు కదా!

111. వారిపై ప్రకృతి ప్రకోపించింది. భూమి ప్రకంపించింది. ఆకాశం గర్జించింది. దాంతో ఆ దైవధిక్కారులంతా మృత్యువు ఒడిలోకి వెళ్ళిపోయారు.

112. హ(జత్ లూత్ (అలైహిస్సలాం) హ(జత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) సోదరుడైన హారాన్ బిన్ ఆజర్ కుమారులు. హ(జత్ ఇబ్రాహీంకు సమకాలికులు. ఈయన జాతివారు 'సదూమ్' 'అమూరియా' లలో ఉండేవారు. ఈ ప్రదేశాలు సిరియాలో ఉన్నాయి.

113. లూత్ జాతి వారిలోవున్న మహా చెడ్డరోగం ఇది. వారు స్త్రీలను విడిచిపెట్టేసి పురుషులతో తమ లైంగిక కోర్కెలు తీర్చుకునేవారు. ఈ స్వలింగ సంపర్క జాడ్యం అసలు లూత్ జాతి వారితోనే మొదలవటం వల్ల దీనికి 'లవాతత్' అనే

167 దానికి వారు "ఓ లూత్! నువ్వు (నీ ధోరణిని) మానుకోక పోతే, ఇక్కణ్ణుంచి వెళ్ళగొట్టబడతావు (జాగ్రత్త!)"[115] అని చెప్పారు.

قَالُوا لَئِن لَّمْ تَنتَهِ يَا لُوطُ لَتَكُونَنَّ مِنَ الْمُخْرَجِينَ ﴿١٦٧﴾

168 "మీ చేష్టలను నేను తీవ్రంగా అసహ్యించుకుంటున్నాను"[116] అన్నాడు లూత్.

قَالَ إِنِّي لِعَمَلِكُم مِّنَ الْقَالِينَ ﴿١٦٨﴾

169 (తరువాత అతను ఇలా ప్రార్థించాడు): "ప్రభూ! వీళ్లు చేసే నీతిమాలిన పని (దుష్ఫలితం) నుంచి నన్నూ, నా ఇంటివారినీ కాపాడు."

رَبِّ نَجِّنِي وَأَهْلِي مِمَّا يَعْمَلُونَ ﴿١٦٩﴾

170 అందువల్ల మేము అతన్నీ, అతని సంబంధీకులందరినీ రక్షించాము.

فَنَجَّيْنَاهُ وَأَهْلَهُ أَجْمَعِينَ ﴿١٧٠﴾

171 ఒక ముసలావిడను తప్ప! - ఆమె (మాత్రం) వెనుక ఉండిపోయేవారిలో చేరిపోయింది.[117]

إِلَّا عَجُوزًا فِي الْغَابِرِينَ ﴿١٧١﴾

పేరుపడింది. నేడు ఈ పాడు పని యావత్ప్రపంచంలో ప్రబలిపోయింది. ఐరోపా దేశాల్లో ఇది చట్ట సమ్మతమైన పనిగా ఆమోదించబడుతోంది. ఇరువురు వ్యక్తులు స్వలింగ సంపర్కానికి మనస్ఫూర్తిగా సిద్ధమైనపుడు వారి కోర్కెను కాదనే అధికారం ఎవరికైనా ఎలా ఉంటుంది? అని ఆ దేశాల్లోని న్యాయవాదులు, ప్రజాస్వామిక వాదులు పాయింటు తీశారు. వారి ఆలోచనలు ఏ దిశలో పయనిస్తున్నాయో దీన్నిబట్టి ఊహించుకోవచ్చు. ఇండియా లాంటి ప్రాచ్య దేశాలలో సయితం ఇప్పుడు ఈ ముదనష్టపు చేష్ట చాలా వేగంగా వ్రేళ్లూనుకుంటోంది. ఢిల్లీ లాంటి మహా నగరాల్లో ఈ హోమోసెక్సువల్స్ వీధుల్లోకి వచ్చి, తమకు చట్ట పరంగా రక్షణ కల్పించాలని డిమాండు చేయటం మొదలెట్టారు.

114. అరబీలో **'ఆదూన్'** (عَادُونَ) అని వుంది. ఇది 'ఆద్' అనే పదానికి బహువచనం. ఆద్ అంటే బరితెగించిపోయేది అని అర్థం. అంటే సత్యాన్ని వదలి అసత్యాన్ని, ధర్మాన్ని వదలి అధర్మాన్ని అవలంబించటమని భావం. లైంగిక కోర్కె సహజమైనది. ఈ కోరికను తీర్చుకోవటానికి స్త్రీ మానాన్ని 'నికాహ్' అనే ఒప్పందం ద్వారా అల్లాహ్ ధర్మసమ్మతం గావించాడు. అయితే లూత్ జాతి పురుషులు తమ కామ వాంఛను తీర్చుకోవటానికి స్త్రీ మానాన్ని విడిచిపెట్టి పురుషుల మల విసర్జనా మార్గాన్ని వాడుకోవటం మొదలెట్టారు. ఆ విధంగా సహజమైన కోర్కెల పరిపూర్తికి అసహజమైన పద్ధతిని అవలంబించే ముదనష్టపు బుద్ధి మొట్టమొదట లూత్ జాతి వారి పుర్రెలోనే పుట్టింది.

115. దైవప్రవక్త హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) చేసిన ఉపదేశానికి ఆ జాతి వారిలో వెల్లడైన ప్రతిస్పందన ఇది: "లూత్! నువ్వు మరీ సాధువుగా మాట్లాడకు. మాకు నీతులు చెప్పటం మానుకుంటే మంచిది. లేకపోతే మా బస్తీల నుంచి నిన్ను బహిష్కరిస్తాం."

సమాజంలో నీతిబాహ్యతను, అశుద్ధతను వ్యాపింపజేసే వ్యక్తుల, సంస్థల తీరు నేటికీ ఇంచుమించు ఇలాగే ఉంది. మంచి గురించి, నీతి గురించి చెప్పేవారిని పాతకాలపు మనుషుల్లా, ఛాందసవాదుల్లా చూస్తున్నారు.

116. అంటే, మీరు చేస్తున్న పని పరమ జుగుప్సాకరమైనది. నేను మీ నీతిమాలిన చేష్టను అసహ్యించుకుంటున్నాను.

117. ఆ ముసలావిడ ఎవరో కాదు, స్వయంగా దైవప్రవక్త లూత్ భార్యే. ఆమె ఇస్లాం స్వీకరించలేదు సరికదా, ఆ పాడుపని చేస్తున్న వారికి లోపాయికారిగా సహాయపడేది. అందువల్ల అవిశ్వాసులతో ఆమె కూడా అంతమొందించ బడింది.

**172** మరి మేము మిగిలిన వారందరినీ నాశనం చేశాము.

ثُمَّ دَمَّرْنَا الْآخَرِينَ ﴿172﴾

**173** మేము వారిపై ఒక ప్రత్యేకమైన (రాళ్ల) వర్షం కురిపించాము. హెచ్చరించబడిన వారిపై కురిసిన ఆ వర్షం చాలా చెడ్డది.[118]

وَأَمْطَرْنَا عَلَيْهِم مَّطَرًا ۖ فَسَاءَ مَطَرُ الْمُنذَرِينَ ﴿173﴾

**174** ఈ వృత్తాంతం కూడా ఆసాంతం గుణపాఠంతో కూడుకున్నది. కాని వారిలో అధికులు విశ్వాసులు కారు.

إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿174﴾

**175** నిశ్చయంగా నీ ప్రభువు ఆధిపత్యం కలవాడు, జాలిచూపేవాడూను.

وَإِنَّ رَبَّكَ لَهُوَ الْعَزِيزُ الرَّحِيمُ ﴿175﴾

**176** 'అయికా' జనులు కూడా దైవ ప్రవక్తలను ధిక్కరించారు.[119]

كَذَّبَ أَصْحَابُ لْئَيْكَةِ الْمُرْسَلِينَ ﴿176﴾

**177** అప్పుడు షుఐబ్ (అలైహిస్సలాం) వాళ్ళనుద్దేశించి ఇలా ప్రబోధించాడు: "మీరు (బొత్తిగా) భయపడరా?

إِذْ قَالَ لَهُمْ شُعَيْبٌ أَلَا تَتَّقُونَ ﴿177﴾

**178** "నేను మీ వద్దకు పంపబడిన నమ్మదగ్గ ప్రవక్తను.

إِنِّي لَكُمْ رَسُولٌ أَمِينٌ ﴿178﴾

**179** "కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయులై ఉండండి.

فَاتَّقُوا اللَّهَ وَأَطِيعُونِ ﴿179﴾

**180** "దీనికిగాను నేను మీనుంచి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటం లేదు. నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్‌పై ఉంది.

وَمَا أَسْأَلُكُمْ عَلَيْهِ مِنْ أَجْرٍ ۖ إِنْ أَجْرِيَ إِلَّا عَلَىٰ رَبِّ الْعَالَمِينَ ﴿180﴾

118. అంటే గుర్తులు వేయబడిన కంకర రాళ్ల వాన ద్వారా మేము వారిని నాశనం చేశాము. వారి బస్తీలను తలక్రిందులుగా చేసివేశాము. హూద్ సూరా 82, 83 ఆయతులలో ఈ వివరాలు ఉన్నాయి.

119. **'అయ్‌క'** (أَيْكَة) అంటే అడవి అని అర్థం. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) పంపబడిన 'మద్‌యన్' ప్రదేశానికి చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఉండే ప్రజలన్నమాట! దట్టమైన వృక్షాన్ని 'అయ్‌కహ్' అని అంటారనీ, మద్‌యన్ శివారుల్లో ఒక వృక్షం ఉండేదనీ, అక్కడి ప్రజలు ఆ వృక్షాన్ని పూజించేవారని, అందుకే వారు "అస్‌హాబుల్ అయ్‌క"గా పిలువబడ్డారని అనబడుతోంది. ఆ విధంగా అయ్‌కా ప్రజల వైపుకు, మద్‌యన్ ప్రజల వైపుకు పంపబడిన ప్రవక్త ఒక్కరే. ఆయనే షుఐబ్. అయ్‌కా అనేది ఒక జాతి కాదు. అదొక చెట్టుపేరు. కాని మద్‌యన్ మాత్రం ఒక జాతి పేరు. అందుకే ఖుర్‌ఆన్‌లో "మేము అయ్‌కావాసుల వద్దకు వారి సోదరుడైన షుఐబ్‌ను పంపాము" అని చెప్పకుండా, "మేము మద్‌యన్ జాతి వారివద్దకు వారి సోదరుడైన షుఐబును పంపాము" (ఆరాఫ్ – 85) అని చెప్పబడింది.

కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు మద్‌యన్ వాసులు వేరనీ, అయికావారు వేరని అభిప్రాయపడ్డారు. అయితే ఈ రెండు జాతుల వద్దకు కూడా హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) ఒక్కరే ప్రవక్తగా పంపబడ్డారని వారు పేర్కొన్నారు. కాని ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ అభిప్రాయంతో విభేదిస్తూ ఇలా అన్నారు : "నిజానికి ఇది ఒకే ఉమ్మత్ (సమాజం). కొలతలు, తూనికల్లో ఖచ్చితంగా వ్యవహరించమని మద్‌యన్ వాసులకు చేసిన ఉపదేశమే అయికా వారికి (అరణ్యవాసులకు) కూడా చేయబడింది. దీన్నిబట్టి ఇవి వేర్వేరు జాతులు కావనీ, ఒకేజాతి అని విదితమవుతోంది."

**181** “మీరు (కొలచి ఇస్తున్నప్పుడు) పూర్తిగా ఇవ్వండి. తగ్గించి ఇవ్వకండి.[120]

أَوْفُوا الْكَيْلَ وَلَا تَكُونُوا مِنَ الْمُخْسِرِينَ (181)

**182** “తూచి ఇస్తే సరైన త్రాసుతో తూకం వేసి ఇవ్వండి.[121]

وَزِنُوا بِالْقِسْطَاسِ الْمُسْتَقِيمِ (182)

**183** “ప్రజలకు వారి వస్తువులను తగ్గించి ఇవ్వకండి.[122] భువిలో విచ్చలవిడిగా కల్లోలాన్ని రేకెత్తిస్తూ తిరగకండి.[123]

وَلَا تَبْخَسُوا النَّاسَ أَشْيَاءَهُمْ وَلَا تَعْثَوْا فِي الْأَرْضِ مُفْسِدِينَ (183)

**184** “మిమ్మల్నీ, మీ పూర్వీకుల్ని సృష్టించిన వానికి భయ పడండి.”[124]

وَاتَّقُوا الَّذِي خَلَقَكُمْ وَالْجِبِلَّةَ الْأَوَّلِينَ (184)

**185** దానికి వారు ఇచ్చిన సమాధానం ఇది: “అసలు నువ్వు చేతబడికి గురైన వాడివి.

قَالُوا إِنَّمَا أَنتَ مِنَ الْمُسَحَّرِينَ (185)

**186** “నువ్వూ మాలాంటి ఒక మనిషివే. నువ్వు అబద్ధం చెప్పే వారిలో ఒకడివని మేము భావిస్తున్నాము.[125]

وَمَا أَنتَ إِلَّا بَشَرٌ مِّثْلُنَا وَإِن نَّظُنُّكَ لَمِنَ الْكَاذِبِينَ (186)

**187** “ఒకవేళ నువ్వు సత్యవంతులలో ఒకడివైతే ఆకాశం నుంచి ఏదైనా తునకను మాపై పడవెయ్యి.”[126]

فَأَسْقِطْ عَلَيْنَا كِسَفًا مِّنَ السَّمَاءِ إِن كُنتَ مِنَ الصَّادِقِينَ (187)

120. మీరు కొలపాత్రతో కొలిచి ఇస్తున్నప్పుడు మోసం చేయకండి. వస్తువులను పుచ్చుకునేటప్పుడు ఎలా పూర్తిగా కొలిచి తీసుకుంటారో అలాగే ఇచ్చేటప్పుడు కూడా న్యాయసమ్మతంగా కొలిచి ఇవ్వండి. పుచ్చుకునేటప్పుడు ఒక కొలమాన మూను, ఇచ్చేటప్పుడు మరో కొలమానం ఉండకూడదు.

121. అలాగే తూనికల్లో కూడా మోసానికి పాల్పడకండి. సరైన తక్కెడతో – సరిగ్గా – తూయండి.

122. అంటే ప్రజల వస్తువులను వారికి ఇచ్చే సమయంలో కోత విధించకండి. కొలపాత్రలను, తూనికరాళ్ళను ఉపయోగించే సమయంలో న్యాయంగా వ్యవహరించండి.

123. దైవం నిర్ణయించిన హద్దులను అతిక్రమించి, ఆయనకు అవిధేయత చూపకండి. అవిధేయత మూలంగా భువిలో అశాంతి, అరాచకం ఏర్పడతాయి. కొంతమంది వ్యాఖ్యాతలు దీనికి చెప్పిన భావార్థం ఇలా ఉంది : ప్రజలను మార్గ మధ్యంలో అటకాయించటం, దోచుకోవటం కూడా ఈ ‘కల్లోలం’లో అంతర్భాగమే. అల్ ఆరాఫ్ సూరాలో కల్లోలాన్ని రేకెత్తించరాదని హితబోధ చేసిన వెంటనే దారి దోపిడీల ప్రస్తావన వచ్చింది – “ప్రజలను భయపెట్టడానికి దారులలో బందిపోటుల్లా పొంచి కూర్చోకండి” (86). (ఇబ్నె కసీర్)

124. అల్లాహ్‌కు భయపడండి. షైతాన్ అడుగుజాడల్లో నడిచి మీ సృష్టికర్తను విస్మరించకండి. మిమ్మల్నీ, మీ పూర్వీకులైన మీ తాతముత్తాతలను కూడా పుట్టించినవాడు ఆ అల్లాహ్‌యే.

125. దైవప్రవక్తవని, దైవసందేశం నీ దగ్గరకు వస్తుందని నువ్వు చెప్పేదంతా బూటకమే. ఎందుకంటే నువ్వు కూడా మాలాంటి ఒక సాధారణ మనిషిలాగే ఉన్నావు. అలాంటప్పుడు ప్రత్యేకంగా నీ దగ్గరే దైవసందేశం రావటమేమిటీ?! అని వారు అభిప్రాయపడ్డారు.

126. హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) హెచ్చరికలకు జవాబుగా అయికా (అడవి) జనులు చెప్పిన మాటలివి: “నువ్వు చెప్పేదే నిజమైతే మాపై ఆకాశం నుంచి ఏదైనా తునకను పడవెయ్యి చూద్దాం.”

188 "మీరు చేసేదంతా నా ప్రభువుకు బాగా తెలుసు"[127] అని అతను (షుఐబ్) చెప్పాడు.

قَالَ رَبِّيٓ أَعْلَمُ بِمَا تَعْمَلُونَ ﴿١٨٨﴾

189 మొత్తానికి వారు అతన్ని ధిక్కరించిన కారణంగా (కారు మబ్బుతో కూడిన) ఛాయావృత దినపు విపత్తు వారిని కబళించింది.[128] నిజంగానే అది మహా దినపు శిక్ష!

فَكَذَّبُوهُ فَأَخَذَهُمْ عَذَابُ يَوْمِ ٱلظُّلَّةِ ۚ إِنَّهُۥ كَانَ عَذَابَ يَوْمٍ عَظِيمٍ ﴿١٨٩﴾

190 నిశ్చయంగా ఇందులో గొప్ప నిదర్శనం ఉంది. మరైతే వారిలో చాలా మంది విశ్వాసులు కారు.

إِنَّ فِى ذَٰلِكَ لَءَايَةً ۖ وَمَا كَانَ أَكْثَرُهُم مُّؤْمِنِينَ ﴿١٩٠﴾

191 నిస్సందేహంగా నీ ప్రభువు మహా శక్తిమంతుడు, పరమ కృపాశీలుడు.

وَإِنَّ رَبَّكَ لَهُوَ ٱلْعَزِيزُ ٱلرَّحِيمُ ﴿١٩١﴾

192 నిశ్చయంగా ఇది (ఈ ఖుర్ఆన్) సకల లోకాల ప్రభువు అవతరింపజేసినది.

وَإِنَّهُۥ لَتَنزِيلُ رَبِّ ٱلْعَٰلَمِينَ ﴿١٩٢﴾

193 విశ్వసనీయుడైన దైవదూత దీన్ని తీసుకువచ్చాడు.[129]

نَزَلَ بِهِ ٱلرُّوحُ ٱلْأَمِينُ ﴿١٩٣﴾

127. అంటే, మీ ముష్రిక్కు చేష్టలన్నింటినీ దేవుడు చూస్తూనే ఉన్నాడు. దానికి ప్రతిఫలం మీకు ఇచ్చి తీర్తాడు. ఆయన గనక తలచుకుంటే ప్రపంచంలోనే మీకు ఆ శిక్ష విధిస్తాడు. ఇలా చేయటం ఆయనకు ఏమాత్రం క్లిష్టతరం కాదు.

128. అయికా ప్రజలు కూడా మక్కా అవిశ్వాసుల మాదిరిగానే ఆకాశ విపత్తును కోరారు. వారి కోరిక ప్రకారమే అల్లాహ్ వారిపై ఆకాశం నుంచి శిక్షను అవతరింపజేశాడు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఏడు రోజుల వరకూ వారిపై తీవ్రమైన ఎండ కాచింది. ఆ తరువాత ఆకాశంలో ఒక మబ్బు తునక వచ్చింది. వారంతా ఎండవేడి నుంచి కాపాడుకోవటానికి ఆ మబ్బు తునక క్రిందికి వచ్చి చేరారు. కొన్ని నిమిషాలు చల్లదనాన్ని ఆస్వాదించారు. కాని మరికొద్దిసేపటికే ఆ మబ్బు తునక నిప్పుల వర్షం కురిపించసాగింది. మరో వైపు నుంచి భూమి ప్రకంపించింది. ఒక భయంకరమైన అరుపు వారిని శాశ్వితంగా మృత్యు ఒడిలోకి చేర్చేసింది. ఆ విధంగా ఆకాశంలో మేఘం నీడగా వచ్చిన రోజున వారిని ముక్కోణపు విపత్తు చుట్టుముట్టింది. అందుకే "ఛాయావృత దినపు శిక్ష వారిని కబళించింది" అని చెప్పటం జరిగింది.

**గమనిక:** ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అన్నారు : "అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో మూడు చోట్ల షుఐబ్ జాతి ప్రజల వినాశం గురించి ప్రస్తావించాడు. మూడు చోట్ల కూడా – సందర్భాన్నిబట్టి – వేర్వేరు శిక్షల ప్రస్తావన ఉంది. ఆరాఫ్ (88) సూరాలో భూకంపం ప్రస్తావన వచ్చింది. హూద్ (94) సూరాలో 'అరుపు' గురించి చెప్పబడింది. ఈ సూరా (షుఅరా)లో ఆకాశం నుంచి నిప్పులు కురవటం గురించి చెప్పబడింది. ఈ విధంగా మూడు రకాల శిక్ష – ఏకకాలంలో – ఈ జాతి వారిపై వచ్చిపడింది.

129. దివ్య ఖుర్ఆన్ అల్లాహ్ తరఫున అవతరింపజేయబడిన సందేశం అన్న విషయాన్ని మక్కా అవిశ్వాసులు ఒప్పుకోలేదు. అందుకే వారు ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని త్రోసిపుచ్చారు. అందువల్ల అల్లాహ్ వివిధ ప్రవక్తల, వారి కాలం నాటి జాతుల గాథలను స్థూలంగా ప్రస్తావించి దివ్య ఖుర్ఆన్ ముమ్మాటికీ దైవ సందేశమనీ, ముహమ్మద్ (సఅసం) దేవుని సత్యప్రవక్త అని స్పష్టం చేశాడు. ఒకవేళ ఆయన సత్యవంతుడు కానిపక్షంలో–ఒక నిరక్షరాసి అయివుండి – గ్రంథాన్ని ఎలా పారాయణం చేయగలుగుతాడు? గత ప్రవక్తల వాస్తవిక గాథలను ఎలా విశదీకరిస్తాడు? కాబట్టి

| | |
|---|---|
| **194** (ఓ ముహమ్మద్ – సఅసం!) నువ్వు హెచ్చరించే వారిలోని వాడవు కావటానికి[130] ఇది నీ హృదయంపై అవతరించింది.[131] | عَلٰى قَلْبِكَ لِتَكُوْنَ مِنَ الْمُنْذِرِيْنَ ﴿194﴾ |
| **195** (ఇది) సుస్పష్టమైన అరబీ భాషలో ఉంది. | بِلِسَانٍ عَرَبِيٍّ مُّبِيْنٍ ﴿195﴾ |
| **196** పూర్వీకుల గ్రంథాలలో కూడా దీని (ఖుర్ఆన్) ప్రస్తావన ఉంది.[132] | وَاِنَّهٗ لَفِيْ زُبُرِ الْاَوَّلِيْنَ ﴿196﴾ |
| **197** ఈ సంగతి (ఖుర్ఆన్ వాస్తవికత) ఇస్రాయీలు సంతతికి చెందిన విద్వాంసులకు సయితం తెలిసి ఉండటం వారికొక నిదర్శనం కాదా?[133] | اَوَلَمْ يَكُنْ لَّهُمْ اٰيَةً اَنْ يَّعْلَمَهٗ عُلَمٰٓؤُا بَنِيْٓ اِسْرَاۗءِيْلَ ﴿197﴾ |
| **198** ఒకవేళ మేము దీన్ని ఏ అరబ్బేతరునిపైనో అవతరింపజేసి వుంటే, | وَلَوْ نَزَّلْنٰهُ عَلٰى بَعْضِ الْاَعْجَمِيْنَ ﴿198﴾ |
| **199** మరి అతడు దానిని వారి ముందు చదివి వినిపించి వున్నట్లయితే, వారు దాన్ని విశ్వసించేవారు కాదు.[134] | فَقَرَاَهٗ عَلَيْهِمْ مَّا كَانُوْا بِهٖ مُؤْمِنِيْنَ ﴿199﴾ |
| **200** మేము పాపాత్ముల హృదయాలలో ఇలాగే ఈ తిరస్కార భావాన్ని జొప్పించాము.[135] | كَذٰلِكَ سَلَكْنٰهُ فِيْ قُلُوْبِ الْمُجْرِمِيْنَ ﴿200﴾ |

దివ్య ఖుర్ఆన్ ముమ్మాటికీ సర్వలోక ప్రభువైన అల్లాహ్ తరఫున పంపబడిన గ్రంథమే. ఈ గ్రంథాన్ని విశ్వసనీయుడైన దైవదూత – జిబ్రయీల్ అలైహిస్సలాం – తీసుకువచ్చారు.

130. అంటే ఖుర్ఆన్ ఆధారంగా నువ్వు ప్రజలను హెచ్చరించటానికి.

131. **'హృదయం'** గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పటం విశేషం. మనిషి లోపలి అవయవాలలో హృదయం అత్యంత సున్నితమైంది. విషయావగాహనకు, గ్రాహ్యశక్తికి కేంద్రం అది.

132. అంటే – ముహమ్మద్ (స) రాక గురించి, ఆయన (స) గుణగణాల గురించి వెనుకటి ఆకాశ గ్రంథాలలో ప్రస్తావించబడినట్లే దివ్య ఖుర్ఆన్ అవతరణ గురించిన శుభవార్త కూడా ఆ గ్రంథాలలో ఇవ్వబడింది.

దీనికి మరో అర్థం ఇది: ప్రపంచంలో నేటివరకు అమలైన షరీఅతులన్నిటిలోనూ ఉమ్మడిగా ఉన్న ఆదేశాల దృష్ట్యా చూస్తే, ఈ ఖుర్ఆన్ గ్రంథం పురాతన దైవగ్రంథాల్లోనూ ఉన్నట్లే కదా అర్థం!

133. ఎందుకంటే ఈ పూర్వపు గ్రంథాలలో ముహమ్మద్ (స) గురించి, ఖుర్ఆన్ గురించి ప్రస్తావన వచ్చి ఉంది. అదీగాక మక్కాలోని అవిశ్వాసులు మత వ్యవహారాలలో యూద పండితులను సంప్రతిస్తూ ఉండేవారు. యూద పండితులు కూడా వారికి చెప్పేవారు – ముహమ్మద్ (స) అనే ఒక దైవప్రవక్త రానున్నాడనీ, ఖుర్ఆన్ అనే గ్రంథం దేవుని తరఫున అవతరింపజేయబడుతుందని! మరి అలాంటప్పుడు వారు యూద పండితుల మాటల్ని నమ్ముతూనే దైవప్రవక్త (స)ను ఎందుకు విశ్వసించటం లేదు?

134. ఒకవేళ మేము మా సందేశాన్ని ఏదైనా అరబ్బేతర భాషలో అవతరింపజేసి ఉంటే, ఇదేమిటో మాకర్థం కావటం లేదని అనేవారు. హామీమ్ సజ్దా (44)లో వారు ఇలాగే అన్నారు కూడా.

135. **'సలక్నాహు'** (سَلَكْنٰهُ) అనే పదంలోని **'హు'** (هٗ) సర్వనామం ధిక్కారాన్ని, తిరస్కారాన్ని, శత్రుత్వాన్ని సూచిస్తుంది.

لا يؤمنون به حتى يروا العذاب الأليم (201)

**201** వ్యధాభరితమైన శిక్షను చూచేవరకూ వారు దాన్ని విశ్వసించరు.

فيأتيهم بغتة وهم لا يشعرون (202)

**202** మరి ఆ శిక్ష అకస్మాత్తుగా వారిపై వచ్చిపడుతుంది. దాని గురించిన ధ్యాస కూడా వారికుండదు.

فيقولوا هل نحن منظرون (203)

**203** అప్పుడు వారు, "మాకేమన్నా కాస్త గడువు ఇవ్వబడు తుందా?"[136] అంటారు.

أفبعذابنا يستعجلون (204)

**204** ఇంతకీ వారు మా శిక్ష కోసం ఆత్రం చేస్తున్నారా?[137]

أفرأيت إن متعناهم سنين (205)

**205** దీనిని గురించి నీవేమైనా ఆలోచించావా? ఒకవేళ మేము కొన్ని సంవత్సరాల పాటు వారికి లబ్ధిపొందే అవకాశం కల్పించినా....

ثم جاءهم ما كانوا يوعدون (206)

**206** తరువాత వారికి హెచ్చరించబడే ఆ శిక్ష వచ్చిపడినప్పుడు,

ما أغنى عنهم ما كانوا يمتعون (207)

**207** వారు అనుభవిస్తూ వచ్చిన సుఖసౌఖ్యాలు, సాధన సంపత్తులు వారికెలాంటి ప్రయోజనాన్నీ చేకూర్చలేవు.[138]

وما أهلكنا من قرية إلا لها منذرون (208)

**208** హెచ్చరిక చేసేవారు రాకుండా మేము ఎన్నడూ ఏ జన వాసాన్నీ అంతమొందించలేదు.

ذكرى وما كنا ظالمين (209)

**209** (వారు) హితబోధ (చేసిన పిమ్మటే మేము జోక్యం చేసు కున్నాము). మేము అన్యాయం చేసేవారంకాము.[139]

136. శిక్షను కళ్ళారా చూసిన తరువాత గడువు ఇవ్వబడదు. ఆ సమయంలో చెందే పశ్చాత్తాపం కూడా పనికిరాదు. (అల్ మోమిన్ - 85)

137. ఒకవేళ నువ్వు సత్యవంతుడవే అయితే నువ్వు మాకు భయపెడుతున్న ఆ శిక్షను తీసుకురా? అని వారు తమ ప్రవక్తను పదే పదే ప్రశ్నించటాన్ని ఇక్కడ ఎత్తి చూపటం జరిగింది.

138. ఒకవేళ మేము వారికి – వారు కోరుతున్నట్లుగా – కొంత గడువు ఇచ్చినా, తరువాత వారిపై రావలసిన శిక్ష వచ్చి పడినప్పుడు వారి సాధనసంపత్తులు, భోగభాగ్యాలు వారికేవిధంగానూ లాభం కలిగించలేవు. (అల్ బఖర : 96; లైల్ సూరా : 11వ ఆయతులు చూడండి).

139. ఏ ప్రజా సమూహం వద్దకయినా మేము మా ప్రవక్తను, హెచ్చరిక చేసేవాణ్ణి పంపకుండా వారిపై శిక్షను అవతరింపజేస్తే అది 'అన్యాయం' అవుతుంది. మేము ఎవరికీ ఇలాంటి అన్యాయం చేయలేదు. పైగా మేము మా సంప్రదాయం ప్రకారం తొలుత ప్రతి బస్తీలోనూ మా ప్రవక్తలను పంపించాము. అక్కడి ప్రజలను వారు మా శిక్ష గురించి భయపెట్టారు. మరి వారు ప్రవక్తల మాటను పెడచెవిన పెట్టిన కారణంగా మేము వారిని అంతమొందించాము. ఈ విషయమే బనీ ఇస్రాయీల్ సూరా (15) లోనూ, ఖసస్ సూరా (59) లోనూ వివరించబడింది.

| | |
|---|---|
| 210 దీనిని (ఈ ఖుర్‌ఆను గ్రంథాన్ని) షైతానులు తీసుకుని దిగలేదు. | وَمَا تَنَزَّلَتْ بِهِ الشَّيٰطِيْنُ ﴿210﴾ |
| 211 దానికి వారు యోగ్యులూ కారు, దాన్ని తెచ్చే స్థోమత కూడా వారికి లేదు. | وَمَا يَنْۢبَغِيْ لَهُمْ وَمَا يَسْتَطِيْعُوْنَ ﴿211﴾ |
| 212 పైగా వారు దానిని (కనీసం) వినకుండా – దూరం – చేయబడ్డారు.[140] | اِنَّهُمْ عَنِ السَّمْعِ لَمَعْزُوْلُوْنَ ﴿212﴾ |
| 213 కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు అల్లాహ్‌తోపాటు మరే ఇతర దైవాన్నీ మొరపెట్టుకోకు. నువ్వుగాని అలా చేశావంటే శిక్షించ బడేవారిలో చేరిపోతావు సుమా! | فَلَا تَدْعُ مَعَ اللّٰهِ اِلٰهًا اٰخَرَ فَتَكُوْنَ مِنَ الْمُعَذَّبِيْنَ ﴿213﴾ |
| 214 నీ సమీప బంధువులను హెచ్చరించు.[141] | وَاَنْذِرْ عَشِيْرَتَكَ الْاَقْرَبِيْنَ ﴿214﴾ |

140. దివ్య ఖుర్‌ఆన్ ఏవిధంగా పైశాచిక శక్తుల బారినుంచి రక్షించబడిందో ఈ ఆయతులలో వివరించబడింది. ఒకటి : దివ్య ఖుర్‌ఆన్ లాంటి పవిత్ర గ్రంథాన్ని తీసుకుని దిగటం షైతానులకు అసలు ఎంతమాత్రం తగదు. వారికి ఆ అర్హత లేదు. ఎందుకంటే పొద్దస్తమానం కీడును, దౌష్ట్యాన్ని వ్యాపింపజేయటం పైశాచిక శక్తులపనై ఉంటుంది. కాగా; దివ్య ఖుర్‌ఆన్ మంచిని పెంపొందించి, చెడును నిర్మూలించగోరుతుంది. మరో మాటలో చెప్పాలంటే షైతానుల లక్ష్యాలు – ఖుర్‌ఆన్ లక్ష్యాలు పరస్పర విరుద్ధమైనవి. రెండు : దివ్య ఖుర్‌ఆన్ వంటి గ్రంథ రాజాన్ని తెచ్చే శక్తి, స్థోమత కూడా షైతానులకు లేదు. మూడు : దివ్య ఖుర్‌ఆన్ అవతరణ సమయంలో షైతానులు దాన్ని వినకుండా దూరం చేయబడ్డారు. అల్లాహ్ ఆకాశాలపై నక్షత్రాలను కాపలాగా పెట్టాడు. ఏ షైతాను సమూహమైనా చాటుమాటుగా– ఏదన్నా వినే ఉద్దేశంతో అక్కడికి వెళ్ళే ప్రయత్నం చేస్తే నక్షత్రాలు అగ్నిజ్వాలల మాదిరిగా తయారై వాటిని వెంటాడతాయి. వాటిని కాల్చి భస్మీపటలం చేసేస్తాయి. ఈ విధంగా అల్లాహ్ తన గ్రంథమైన ఖుర్‌ఆన్‌ను పైశాచిక శక్తుల నుంచి రక్షించే కట్టుదిట్టమైన బందోబస్తు చేశాడు.

141. దైవప్రవక్త సందేశం కేవలం సమీప బంధువులకే పరిమితం అయి ఉండదు, అది యావత్తు జాతినుద్దేశించినదై ఉంటుంది. ఇక అంతిమ దైవప్రవక్త (సఅసం) గారైతే సమస్త మానవాళి కోసం మార్గదర్శకునిగా, కారుణ్యమూర్తిగా చేసి పంపబడ్డారు. అయితే దగ్గరి బంధువులను హెచ్చరించమని చెప్పటం విశ్వజనీన, సార్వజనీన భావాలకు విరుద్ధాంశం కూడా కాదు. పైగా సార్వజనీన సందేశ కార్యంలో ఇదొక భాగం మాత్రమే. ఇతరులను సన్మార్గం వైపుకు పిలిచేముందు దగ్గరి బంధువులను ఆ మార్గంలోకి తేవాలన్న భావం అందులో అంతర్లీనమై ఉంది. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కూడా ప్రజాసామాన్యాన్ని ఏకదైవారాధన వైపు పిలిచే ముందు, తన తండ్రి ఆజర్‌ను దేవుని ఏకత్వం వైపు ఆహ్వానించారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మదు (సఅసం) కూడా ఈ ఆజ్ఞను పురస్కరించుకుని 'సఫా' పర్వతం పైకెక్కి "యా సబాహా!" అని నినదించారు. శత్రు సైన్యం దండెత్తి వచ్చిన క్లిష్టసమయాల్లో మాత్రమే ఈ విధమైన పిలుపు ఇవ్వబడుతుంది. ఈ పిలుపు వినగానే స్థానికులంతా పరుగెత్తుకుని వచ్చారు. ఆయన (స) కురైషులకు చెందిన ఒక్కొక్క తెగనూ పేరు పెట్టి పిలుస్తూ ఇలా అన్నారు: "మీపై దండెత్తటానికి వచ్చిన ఒక శత్రుసైన్యం పర్వతానికి అవతలివైపు మోహరించి ఉందని నేనంటే మీరు నమ్ముతారా?" "తప్పకుండా నమ్ముతాం" అన్నారు వారంతా ముక్తకంఠంతో. అప్పుడు, "అల్లాహ్ నన్ను హెచ్చరించే ప్రవక్తగా చేసి పంపాడు. ఒక తీవ్రమైన శిక్ష గురించి నేను మీకు భయపెడుతున్నాను" అని ఆయన (స) చెప్పారు. దానికి అబూలహబ్, "నీ పాడుగాను! ఇది చెప్పటానికేనా నువ్వు మమ్మల్ని పిలిచినది!?" అని మండిపడ్డాడు. దీనికి జవాబుగా "తబ్బత్ యదా...." సూరా

**215** విశ్వసించి, నిన్ను అనుసరించేవారి పట్ల మృదువుగా మసలుకో.

وَاخْفِضْ جَنَاحَكَ لِمَنِ اتَّبَعَكَ مِنَ الْمُؤْمِنِينَ ﴿215﴾

**216** ఒకవేళ వారు గనక నీకు అవిధేయత చూపితే, “మీ పోకడలతో నాకు ఎటువంటి సంబంధం లేదు” అని చెప్పు.

فَإِنْ عَصَوْكَ فَقُلْ إِنِّي بَرِيءٌ مِّمَّا تَعْمَلُونَ ﴿216﴾

**217** సర్వాధిక్యుడు, కరుణామయుడు అయిన అల్లాహ్‌నే నమ్ముకో.

وَتَوَكَّلْ عَلَى الْعَزِيزِ الرَّحِيمِ ﴿217﴾

**218** నువ్వు (ఒంటరిగా ఆరాధనలో) నిలబడి ఉన్నప్పుడు ఆయన నిన్ను చూస్తూ ఉంటాడు.

الَّذِي يَرَاكَ حِينَ تَقُومُ ﴿218﴾

**219** సాష్టాంగపడేవారి మధ్య (కూడా) నీ కదలికలను[142] (కనిపెట్టుకుని ఉంటాడు).

وَتَقَلُّبَكَ فِي السَّاجِدِينَ ﴿219﴾

**220** నిశ్చయంగా ఆయన అన్నీ వినేవాడు, అంతా తెలిసినవాడు.

إِنَّهُ هُوَ السَّمِيعُ الْعَلِيمُ ﴿220﴾

**221** (ప్రజలారా!) షైతానులు ఎవడిపైన దిగుతారో నేను మీకు తెలుపనా?

هَلْ أُنَبِّئُكُمْ عَلَىٰ مَن تَنَزَّلُ الشَّيَاطِينُ ﴿221﴾

**222** అబద్ధాలకోరు, పాపాత్ముడు అయిన ప్రతి ఒక్కరిపై వారు దిగుతారు.[143]

تَنَزَّلُ عَلَىٰ كُلِّ أَفَّاكٍ أَثِيمٍ ﴿222﴾

**223** వినీవినని కొన్ని మాటల్ని చెవుల్లో వేస్తారు. వారిలో అనేకులు అబద్ధాలు చెప్పేవారే.[144]

يُلْقُونَ السَّمْعَ وَأَكْثَرُهُمْ كَاذِبُونَ ﴿223﴾

---

అవతరించింది (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుమ్ మసద్). ఆయన (సఅసం) తన పుత్రిక ఫాతిమా (ర.అన్హా)ను, తన అత్త సఫియా (ర.అన్హా) నుద్దేశించి, “మీరు దైవసన్నిధిలో మిమ్మల్ని మీరు రక్షించుకునే బందోబస్తు చేసుకోండి. అక్కడ నేను మీకు ఏవిధంగానూ ఉపయోగపడలేను” అని తాకీదు చేశారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

142. అంటే – (ఓ ప్రవక్తా!) నువ్వు ఏకాంతంలో ఉన్నప్పుడు, జనుల మధ్య ఉన్నప్పుడు – సర్వకాల, సర్వావస్థల్లో – ఆయన నిన్ను గమనిస్తూ ఉంటాడు.

143. అంటే, ఈ ఖుర్‌ఆన్ అవతరణలో షైతాను జోక్యానికి తావులేదు. ఎందుకంటే షైతానులు అసత్యవాదుల, పాపాత్ముల (అంటే జ్యోతిష్కుల, సోదె చెప్పేవాళ్ళ, మంత్రగాళ్ల) వద్దకు వస్తారు. దైవప్రవక్తలపై వారి ప్రభావం ఏమాత్రం ఉండదు.

144. ఒకటీ అరా విషయం ఎలాగో విని, దాన్ని జ్యోతిష్కులకు చేరవేస్తారు. జ్యోతిష్కులు ఒకటికి నాలుగు అబద్ధాలు జోడించి, మిర్చిమసాలా తగిలించి తమ పబ్బం గడుపుకుంటారు (సహీహ్ బుఖారీ –కితాబుత్తౌహీద్. సహీహ్ ముస్లిం – కితాబుస్సలామ్).

وَالشُّعَرَآءُ يَتَّبِعُهُمُ الْغَاوٗنَ ﴿224﴾

224 ఇకపోతే కవులు – దారి తప్పినవారే వారి వెనుక నడుస్తారు.

اَلَمْ تَرَ اَنَّهُمْ فِيْ كُلِّ وَادٍ يَّهِيْمُوْنَ ﴿225﴾

225 ఏమిటీ, వారు ప్రతి లోయలోనూ ఎలా తచ్చాడుతూ తిరుగుతున్నారో నీవు చూడలేదా?

وَاَنَّهُمْ يَقُوْلُوْنَ مَا لَا يَفْعَلُوْنَ ﴿226﴾

226 చెయ్యని దాన్ని గురించి (తమ కవనంలో) ఎలా గొప్పలు చెబుతున్నారో (నీవు గమనించలేదా?)[145]

اِلَّا الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ وَذَكَرُوا اللّٰهَ كَثِيْرًا وَّانْتَصَرُوْا مِنْۢ بَعْدِ مَا ظُلِمُوْا ؕ وَسَيَعْلَمُ الَّذِيْنَ ظَلَمُوْۤا اَيَّ مُنْقَلَبٍ يَّنْقَلِبُوْنَ ﴿227﴾

227 అయితే విశ్వసించి, మంచి పనులు చేసేవారు,[146] అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించేవారు, తమకు అన్యాయం జరిగినప్పుడు కేవలం ప్రతిగా చర్య తీసుకునేవారు అలాంటి వారు కారు.[147] ఇక అన్యాయానికి ఒడిగట్టేవారు తమకు ఏ గతి పడుతుందో శీఘ్రంగానే తెలుసుకుంటారు.[148]

145. కవులలో అత్యధికులు సంశయాలలో, సందేహాలలో ఊగిసలాడుతూ ఉంటారు. వారు నియమబద్ధమైన జీవితం గడపరు సరికదా, మనోవాంఛల కనుగుణమైన అభిప్రాయాలను ప్రకటిస్తూ తిరుగుతుంటారు. వారి మాటల్లో అతిశయోక్తులు అధికంగా ఉంటాయి. వారు సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి భావప్రకటనలో కుడిఎడమల అపవాదాలకు లోనవుతూ ఉంటారు. అందుకే వారి వెనుకపడే వారు కూడా మార్గభ్రష్టులే. అలా శృతిమించి రాగాన పడే కవితల విషయంలో హదీసులో ఇలా అనబడింది : "కడుపును ఇలాంటి కల్లబొల్లి కవితలతో నింపటం కన్నా దాన్ని పాడుచేసే చీమునెత్తురుతో నింపటం మేలు" (తిర్మిజీ – అబ్వాబుల్ ఆదాబ్, ముస్లిం). ఇక్కడ ఈ విషయాన్ని దేవుడు నొక్కి వక్కాణించటంలోని ప్రధాన ఉద్దేశం ఏమిటంటే మా ప్రవక్త (స) జోస్యం చెప్పేవాడుగానీ, కవనం చెప్పేవాడుగానీ కాదు. ఎందుకంటే వారిరువురూ అబద్ధాలకోరులే. అందుకే ఖుర్‌ఆన్‌లో వేరితరచోట్ల కూడా ఆయన (స) కవి కాదని నొక్కి వక్కాణించబడింది. (ఉదా: యాసీన్ సూరా–69; అల్ హాఖ్ఖ సూరా : 40 – 43).

146. అయితే సత్యంతో కూడుకున్న కవిత్వానికి, యదార్థ గాథలను విశదీకరించే కవితలకు దీనినుండి మినహాయింపు ఉంది. దేవుణ్ణి విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు, అల్లాహ్‌ను అత్యధికంగా ధ్యానించేవారు తమ కవనంలో హద్దు మీరరు. అబద్ధాలను జొప్పించరు. అటువంటి సద్గుణాలు గలవారు చెప్పే సరైన కవిత్వాన్ని వినవచ్చు.

147. అంటే, అలాంటి నిజాయితీపరులైన కవులు అవిశ్వాస కవులు వెదజల్లే దుష్ప్రచారాన్ని అడ్డుకుంటారు. వారికి దీటుగా జవాబిస్తారు. ఉదాహరణకు : హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ (రజి) అవిశ్వాసుల దుష్ప్రచారాన్ని తన కవితల ద్వారా తిప్పికొట్టేవారు. దైవప్రవక్త (సఅసం) ఆయన కవితలను ప్రశంసించేవారు. "వాళ్ల ఆరోపణలను తిప్పికొట్టు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) కూడా నీకు అండగా ఉన్నారు" అని ప్రోత్సహించారు (సహీహ్ బుఖారీ–కితాబ్ బదవుల్ ఖల్ఖ్; ముస్లిం – ఫజాయిలుస్సహాబ). దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే అబద్ధాలు, అతిశయోక్తులు లేని కవిత్వం చెప్పటం, వినటం ధర్మసమ్మతమే. అలాగే అవిశ్వాసులు, ముష్రిక్కులు వ్యాపింపజేసే మిథ్యావాదాన్ని ప్రతిఘటించే, సత్యాన్ని ఎలుగెత్తిచాటే, ఏక దైవారాధనను ప్రకటించే కవిత్వం చెప్పటం కూడా సమ్మతమే.

148. మితిమీరి ప్రవర్తించేవారికి, దౌర్జన్యానికి ఒడిగట్టే వారికి ఇది హెచ్చరిక! హదీసులో కూడా అన్యాయం గురించి ఈ విధంగా చెప్పబడింది : "అన్యాయం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. ఎందుకంటే అన్యాయం ప్రళయదినాన అంధకారంగా పరిణమిస్తుంది." (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్)

27వ సూరా

# అన్ నమ్ల్

## చీమలు

అవతరణ మక్కాలో

ఆయతులు 93

### పరిచయం

*ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ లేపబడడం వంటి మౌలిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 18వ ఆయత్‌లో ప్రస్తావనకు వచ్చిన చీమల వల్ల దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా దివ్యఖుర్‌ఆన్‌ను ఒక మార్గదర్శక గ్రంథంగా, మానవాళికి కారుణ్యంగా, హెచ్చరిక చేసే గ్రంథంగా వర్ణించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన సందేశహరుడనీ, ఆయన హెచ్చరిక చేసేవానిగా వచ్చారని తెలిపింది. మరణానంతర జీవితాన్ని, పరలోకాన్ని తిరస్కరించే అవిశ్వాసుల గురించిన ప్రస్తావనలు కూడా ఇందులో ఉన్నాయి.*

*ఈ సూరాలో మానవాళికి హితబోధ గరపడానికిగాను గతకాలాలకు చెందిన ప్రవక్తల కథలను ప్రస్తావించడం జరిగింది. మూసా (అస) గురించి, ఆయన తన కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు సినాయ్‌లో ఆయన చూసిన అగ్ని గురించి ఇందులో తెలుపడం జరిగింది. వెలుగుకు, మార్గదర్శనానికి చిహ్నం ఆ అగ్ని. అల్లాహ్ మూసా(అస)తో సంభాషించాడు. ఆయన చేతికర్రను క్రిందికి విసిరేయమన్నాడు. ఆ కర్ర ఒక పాముగా మారిపోయింది. మూసా(అస) చేతిని తన చొక్కా లోపల పెట్టుకోమన్నాడు. ఆ చెయ్యి మెరిసిపోసాగింది. ఈ సూరాలో సులైమాన్(అస) గాథ కూడా ప్రస్తావించడం జరిగింది. ముఖ్యంగా షీబా (సబా) రాణితో సమావేశం గురించి ప్రస్తావన ఉంది.*

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 7-14<br>45-53<br>54-58 | 14, 21, 25, 50, 81, 83 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవ ప్రవక్త సాలిహ్' 'దైవ ప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' 'దైవప్రవక్త మూసా' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారా వాహికంగా ఇక్కడ లభ్యమవుతాయి. ఏయే జాతుల వారి వద్దకు అల్లాహ్ ఏయే ప్రవక్తలను పంపించాడు? ఆయా ప్రవక్తలకు తమ జాతి ప్రజల నుంచి ఏం సమాధానం లభించింది? విశ్వాసులను అల్లాహ్ ఏ విధంగా కాపాడాడు? తిరస్కారులను ఎలా శిక్షించాడు? – ప్రతిదీ తెలుసుకోవచ్చు. |
| 15-44 | 127 | 'ప్రవక్త దావూద్ – జాలూత్' 'మధుర స్వరం కలిగిన పాలకుడు' | దావూద్, సులైమాన్ ప్రవక్తల సంపూర్ణ గాథలు |

## అన్ నమ్ల్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** తా – సీన్. ఇవి ఖుర్ఆన్ ఆయతులు – స్పష్టమైన గ్రంథానికి చెందినవి.

**2** విశ్వసించిన వారికి మార్గదర్శకం, శుభవార్త.

**3** వారు (విశ్వాసులు) నమాజును నెలకొల్పుతారు, జకాతును ఇస్తారు, పరలోకాన్ని నమ్ముతారు.[2]

**4** ఎవరయితే పరలోకాన్ని విశ్వసించరో వారికి మేము, వారి పనులు ఎంతో అందమైనవిగా అనిపించేటట్లు చేశాము.[3] అందు చేత వారు దారితప్పి తిరుగుతుంటారు.[4]

**5** చెడ్డ శిక్షను పొందేవారు వీరే. పరలోకంలో కూడా వారు తీవ్ర మైన నష్టాన్ని పొందుతారు.

**6** (ఓ ప్రవక్తా!) వివేచనాపరుడు, జ్ఞానసంపన్నుడైన అల్లాహ్ తరపు నుంచి నీకు ఖుర్ఆన్ బోధించబడుతున్నది.

**7** మూసా తన ఇంటివారితో, "నేను అగ్నిని చూశాను. నేను అక్కణ్ణుంచి ఏదైనా సమాచారంగానీ లేదా మీరు (చలి) కాచుకోవ టానికి[5] నిప్పు కొరివినిగానీ తెస్తాను" అని చెప్పినప్పటి విషయం (జ్ఞాపకమేనా?!)

## سُوْرَةُ النَّمْلِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِیْمِ

طٰسٓ ۚ تِلْكَ اٰیٰتُ الْقُرْاٰنِ وَكِتَابٍ مُّبِیْنٍ ﴿1﴾

هُدًى وَّ بُشْرٰى لِلْمُؤْمِنِیْنَ ﴿2﴾

الَّذِیْنَ یُقِیْمُوْنَ الصَّلٰوةَ وَیُؤْتُوْنَ الزَّكٰوةَ وَهُمْ بِالْاٰخِرَةِ هُمْ یُوْقِنُوْنَ ﴿3﴾

اِنَّ الَّذِیْنَ لَا یُؤْمِنُوْنَ بِالْاٰخِرَةِ زَیَّنَّا لَهُمْ اَعْمَالَهُمْ فَهُمْ یَعْمَهُوْنَ ﴿4﴾

اُولٰٓىِٕكَ الَّذِیْنَ لَهُمْ سُوْٓءُ الْعَذَابِ وَهُمْ فِی الْاٰخِرَةِ هُمُ الْاَخْسَرُوْنَ ﴿5﴾

وَاِنَّكَ لَتُلَقَّى الْقُرْاٰنَ مِنْ لَّدُنْ حَكِیْمٍ عَلِیْمٍ ﴿6﴾

اِذْ قَالَ مُوْسٰى لِاَهْلِهٖٓ اِنِّیْٓ اٰنَسْتُ نَارًا ؕ سَاٰتِیْكُمْ مِّنْهَا بِخَبَرٍ اَوْ اٰتِیْكُمْ بِشِهَابٍ قَبَسٍ لَّعَلَّكُمْ تَصْطَلُوْنَ ﴿7﴾

---

1. 'నమ్ల్' (نَمْل) అంటే చీమలు అని అర్థం. ఈ సూరాలో చీమల సంఘటన రావటం వల్ల దీనికి నమ్ల్ అనే పేరు వచ్చింది.
2. ఈ విషయం ఖుర్ఆన్‌లో అనేకచోట్ల వచ్చింది. దివ్య ఖుర్ఆన్ వాస్తవానికి సమస్త మానవుల మార్గదర్శకత్వం కోసం అవతరించింది. అయితే నిజంగా మార్గదర్శకత్వాన్ని ఆశించేవారే ఈ గ్రంథం ద్వారా సన్మార్గం పొందుతారు. తమ హృదయ కవాటాలను మూసివేసి, అంధకారంలో తచ్చాడగోరిన వారికి దివ్య ఖుర్ఆన్ ఎలా మార్గం చూపుతుంది? వారి ఉపమానం సూర్యుని వెలుగుతో లబ్ది పొందజాలని అంధుల వంటిది. సూర్యుడు మాత్రం యావత్తు ప్రపంచాన్ని ప్రకాశవంతం చేయదలుస్తున్నాడు.
3. వారి నిరంతర పాపాల కారణంగా వారికీ దుస్థితి ఏర్పడుతుంది. వారు చేసే ప్రతి దుష్కార్యం వారి కంటికి అపురూపంగా కనిపిస్తుంది. పరలోకంపై వారికి గల అపనమ్మకమే వారి ఈ దురవస్థకు మూలకారణం. ఈ వ్యవహారంలో కూడా దైవప్రణాళిక ఒక్కటే – దుర్మార్గులకు దుర్మార్గంలో, సన్మార్గులకు సన్మార్గంలో మార్గాన్ని సుగమం చేయటం ఆయన విధానం. రెండు మార్గాలు తన ముందున్నప్పుడు వాటిలో ఏ మార్గాన్ని ఎంచుకోవాలనేది మనిషి స్వేచ్ఛాధికారానికి వదిలిపెట్టబడింది.

8 తీరా అతను అక్కడకు చేరుకోగానే పిలుపు (విన)వచ్చింది: "ఈ అగ్నిలో ఉన్నవాడు శుభవంతుడు,[6] దాని చుట్టు ప్రక్కల ఉన్న వారికి శుభము వొసగబడింది. సర్వలోకాల పోషకుడైన అల్లాహ్ పవిత్రుడు.[7]

فَلَمَّا جَآءَهَا نُودِيَ أَنۢ بُورِكَ مَن فِي ٱلنَّارِ وَمَنْ حَوْلَهَا وَسُبْحَٰنَ ٱللَّهِ رَبِّ ٱلْعَٰلَمِينَ ﴿٨﴾

9 "ఓ మూసా! విను. సర్వశక్తుణ్ణి, వివేకవంతుణ్ణి అయిన అల్లాహ్‌ను నేనే.[8]

يَٰمُوسَىٰٓ إِنَّهُۥٓ أَنَا ٱللَّهُ ٱلْعَزِيزُ ٱلْحَكِيمُ ﴿٩﴾

10 "నీ చేతి కర్రను పడవెయ్యి." ఆ తరువాత అదొక పాము మాదిరిగా ప్రాకుతూ ఉండటం చూచి మూసా వెన్ను చూపి పారి పోయాడు. వెనక్కి తిరిగి చూడనయినా లేదు. "ఓ మూసా! భయ పడకు. నా ముందర ప్రవక్తలు భీతి చెందరు.[9]

وَأَلْقِ عَصَاكَ ۚ فَلَمَّا رَءَاهَا تَهْتَزُّ كَأَنَّهَا جَآنٌّ وَلَّىٰ مُدْبِرًا وَلَمْ يُعَقِّبْ ۚ يَٰمُوسَىٰ لَا تَخَفْ إِنِّي لَا يَخَافُ لَدَيَّ ٱلْمُرْسَلُونَ ﴿١٠﴾

4. అంటే–వారు పయనించే అపమార్గంలోని వాస్తవికత వారికి తెలిసిరాదు. అందువల్ల వారు అపమార్గం నుంచి సన్మార్గం వైపుకు రాలేకపోతారు.

5. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన ధర్మపత్నిని మద్యన్ ప్రదేశం నుంచి వెంటబెట్టుకుని తన స్వదేశానికి తిరిగి వస్తున్నప్పుడు ఎదురైన సంఘటన ఇది! రాత్రి సమయం. అంతా చీకటి. దారి తెలీదు. మరో వైపు చలి తీవ్రంగా ఉంది. ఆ సమయంలో వారికి చలిమంటలు అవసరమయ్యాయి.

6. బహుదూరాన అగ్ని జ్వాలల్లాంటివి కనిపించాయి. ఆయన అక్కడికి–అంటే తూరు పర్వతంపైకి చేరుకున్నారు. అక్కడ ఒక ఆకుపచ్చని వృక్షం నుండి అగ్నిజ్వాలలు పైకి లేవటం ఆయనకు కానవచ్చింది. నిజానికి అది అగ్ని కాదు– అల్లాహ్ జ్యోతి. దాని తేజస్సు అగ్ని మాదిరిగా దేదీప్యమానంగా ఉంది. **'మన్ ఫిన్నారి"** (مَنْ فِي النَّارِ) అని అరబీలో ఉంది. 'మన్' అంటే అల్లాహ్, 'నార్' అంటే అల్లాహ్ జ్యోతి అని భావం. **"వ మన్ హౌలహా"** అంటే 'దాని పరిసరాలలో' అని అర్థం. పరిసరాలలో ఉన్నవారెవరు? అంటే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) మరియు దైవదూతలు. హదీసులో అల్లాహ్ అస్థిత్వ తెరను 'జ్యోతి'గా పేర్కొనటం జరిగింది. వేరొక ఉల్లేఖనంలో అది 'అగ్ని'గా అభివర్ణించబడింది. "ఒకవేళ ఆయన (అల్లాహ్) గనక తనపై ఉన్న తెరను తొలగిస్తే ఆయనలోని తేజస్సు సమస్త సృష్టితాలను కాల్చి భస్మీపటలం చేసేస్తుంది" అని చెప్పబడింది (సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్. వివరాల కోసం చూడండి: ఫతావా ఇబ్నె తైమియ – సంపుటి : 5; పేజీ – 459 – 464).

7. ఈ అగోచర పిలుపును ఆధారంగా చేసుకుని ఈ అగ్ని లేక వృక్షంలో అల్లాహ్ ప్రవేశించాడని భావించరాదు సుమా! చాలామంది ముష్రిక్కులు ఇలాంటి విషయాల్లోనే పొరబడుతుంటారు. అందుకే ఇలాంటి మాటలకు అల్లాహ్ పవిత్రుడని చెప్పబడింది. నిజానికి ఈ సంఘటన ఓ సత్య స్వరూపం. సాధారణంగా దైవప్రవక్తలకు దేవుడు ఇలాంటి అవకాశాలను కల్పిస్తుంటాడు. ఒక్కోసారి దైవదూత ద్వారా ఇలాంటి భాగ్యం కల్పిస్తాడు. ఒక్కోసారి స్వయంగా దేవుడే తన తేజస్సు ద్వారా, తన సంభాషణ ద్వారా తన ప్రవక్తలకు సువర్ణావకాశం కల్పిస్తాడు. మూసా(అలైహిస్సలాం)కు ఎదురైన ఈ సంఘటనే ఇందుకు ప్రబల తార్కాణం.

8. ఒక వృక్షం నుంచి పిలుపు రావటం హజ్రత్ మూసా (అలైహిస్సలాం) కొరకు వింత విషయమే. "మూసా! ఆశ్చర్యపడకు. నేను అల్లాహ్‌ను" అని ఆయన సెలవిచ్చాడు.

9. దీన్నిబట్టి దైవప్రవక్తలకు రహస్య విషయాల జ్ఞానం ఉండదని అర్థమవుతోంది. ఒకవేళ ఆ జ్ఞానం ఉండి ఉంటే హజ్రత్ మూసా తన చేతి కర్రకు భయపడేవారు కారు. మరో విషయం – భయపడటం అనేది మానవ సహజం. ప్రవక్తలు కూడా మానవ మాత్రులే.

**11** "కాని తప్పు చేసిన వారు (మాత్రం భయపడతారు.)[10] మరి ఆ తరువాత ఆ దుష్కార్యానికి బదులుగా సత్కార్యం చేస్తే నేను క్షమించేవాడను, కనికరించేవాడను.[11]

إِلَّا مَن ظَلَمَ ثُمَّ بَدَّلَ حُسْنًا بَعْدَ سُوٓءٍ فَإِنِّي غَفُورٌ رَّحِيمٌ ﴿١١﴾

**12** "నీ చేతిని నీ చొక్కా లోపల పెట్టుకో– అది ఎలాంటి లోపం లేకుండా ప్రకాశిస్తూ బయటికి వస్తుంది.[12] నువ్వు తొమ్మిది నిదర్శనాలను తీసుకుని ఫిర్ఔన్ మరియు అతని జాతివారి వద్దకు వెళ్ళు.[13] నిశ్చయంగా వారు పరమ అవిధేయులు."

وَأَدْخِلْ يَدَكَ فِي جَيْبِكَ تَخْرُجْ بَيْضَآءَ مِنْ غَيْرِ سُوٓءٍ فِي تِسْعِ ءَايَٰتٍ إِلَىٰ فِرْعَوْنَ وَقَوْمِهِۦٓ إِنَّهُمْ كَانُوا۟ قَوْمًا فَٰسِقِينَ ﴿١٢﴾

**13** మరి కళ్లు తెరిపించే[14] మా సూచనలు వారి వద్దకు చేరిన తరువాత కూడా "ఇది స్పష్టమైన ఇంద్రజాలం" అని వారు తేలిగ్గా కొట్టేశారు.

فَلَمَّا جَآءَتْهُمْ ءَايَٰتُنَا مُبْصِرَةً قَالُوا۟ هَٰذَا سِحْرٌ مُّبِينٌ ﴿١٣﴾

**14** నిజానికి వారి మనసులు (సత్యాన్ని) నమ్మినప్పటికీ అన్యాయం, అహంకారంతో వారు దాన్ని త్రోసిపుచ్చారు.[15] కాబట్టి ఆ కల్లోల జనకులకు ఏ గతి పట్టిందో చూడు!

وَجَحَدُوا۟ بِهَا وَٱسْتَيْقَنَتْهَآ أَنفُسُهُمْ ظُلْمًا وَعُلُوًّا ۚ فَٱنظُرْ كَيْفَ كَانَ عَٰقِبَةُ ٱلْمُفْسِدِينَ ﴿١٤﴾

**15** నిశ్చయంగా మేము దావూదు, సులైమానులకు జ్ఞానాన్ని వొసగాము.[16] "విశ్వాసులైన తన దాసులెందరిపైనో మాకు ప్రాధాన్యతను వొసగిన అల్లాహ్‌కు సర్వస్తోత్రాలు" అని వారిద్దరూ పలికారు.

وَلَقَدْ ءَاتَيْنَا دَاوُۥدَ وَسُلَيْمَٰنَ عِلْمًا ۖ وَقَالَا ٱلْحَمْدُ لِلَّهِ ٱلَّذِى فَضَّلَنَا عَلَىٰ كَثِيرٍ مِّنْ عِبَادِهِ ٱلْمُؤْمِنِينَ ﴿١٥﴾

10. అన్యాయం, అక్రమాలకు పాల్పడినవారు అల్లాహ్‌కు భయపడాల్సిందే. ఎందుకంటే అన్యాయపరులను అల్లాహ్ పట్టుకుని తీరుతాడు.

11. అయితే అన్యాయానికి ఒడిగట్టినవాడు పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ అటువంటి పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు కూడా.

12. 'ఎలాంటి లోపం లేకుండా' అంటే అర్థం చేతికి బొల్లి, తెల్లమచ్చల వ్యాధిలాంటివి ఏమీ లేకుండానే అది తెల్లగా కనిపిస్తుంది. చేతి కర్రతో పాటు ఇది రెండవ మహిమ.

13. ఈ రెండు మహిమలతో కలుపుకుని మొత్తం 9 మహిమలు నీకు ఇవ్వబడ్డాయి. వీటిని తీసుకుని ఫిరౌన్ వద్దకు, అతని జనుల వద్దకు వెళ్ళు. (ఈ తొమ్మిది సూచనల వివరాల కోసం బనీ ఇస్రాయీల్ సూరా 101వ ఆయతు క్రింద ఇవ్వబడిన వివరణను చూడండి).

14. **'ముబ్సిరతన్'** (مُبْصِرَةً) అంటే కళ్లు తెరిపించే, సుస్పష్టమైన అనే అర్థాలు వస్తాయి.

15. యదార్థం ముందుకు వచ్చేసిన తరువాత కూడా వారు సత్యాన్ని తృణీకరించారంటే దానికి ప్రధాన కారణం వారిలో తిష్ఠవేసివున్న అన్యాయం, అహంకారాలే. ఈ రెండు చెడుగులే సదా జాతుల పతనానికి మూల కారణంగా నిలిచాయి.

16. ఈ ఖుర్ఆన్ అల్లాహ్ తరఫున నేర్పబడుతుందని సూరా ఆరంభంలో చెప్పబడింది. దీనికి ఒక నిదర్శనంగా మొదట హజ్రత్ మూసా (అలైహిస్సలాం) గాథ సంక్షిప్తంగా వివరించబడింది. మరో నిదర్శనంగా హజ్రత్ దావూదు, హజ్రత్ సులైమాను (అలైహిముస్సలాం)ల వృత్తాంతం ప్రస్తావించబడింది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) చెప్పేది అంతా అక్షర సత్యం అనటానికి దైవప్రవక్తల ఈ గాథలే ప్రబల సాక్ష్యాలు. 'జ్ఞానం' వొసగటం అంటే

16 సులైమాను దావూదుకు వారసుడయ్యాడు.[17] అతను ఇలా అన్నాడు : "ఓ ప్రజలారా! మాకు పక్షుల భాష నేర్పబడింది.[18] ఇంకా మాకు ప్రతిదీ ప్రసాదించబడింది.[19] ముమ్మాటికీ ఇది స్పష్టమైన దైవానుగ్రహమే."

وَوَرِثَ سُلَيْمٰنُ دَاوٗدَ وَقَالَ يٰۤاَيُّهَا النَّاسُ
عُلِّمْنَا مَنْطِقَ الطَّيْرِ وَاُوْتِيْنَا مِنْ كُلِّ شَيْءٍؕ
اِنَّ هٰذَا لَهُوَ الْفَضْلُ الْمُبِيْنُ ﴿16﴾

17 సులైమాను ఎదుట అతని జిన్నాతుల దళం, మనుషుల సైన్యం, పక్షుల గుంపు సమీకరించబడింది.[20] అవన్నీ (వేర్వేరుగా) వివిధ జట్లుగా మోహరించబడ్డాయి.[21]

وَحُشِرَ لِسُلَيْمٰنَ جُنُوْدُهٗ مِنَ الْجِنِّ وَالْاِنْسِ
وَالطَّيْرِ فَهُمْ يُوْزَعُوْنَ ﴿17﴾

దైవదౌత్య జ్ఞానంతో పాటు హజ్రత్ దావూద్ మరియు సులైమాన్ ప్రవక్తలకు ప్రసాదించబడిన ప్రత్యేక జ్ఞానం అని అర్థం. ఉదా : దావూద్ ప్రవక్తకు ఇనుముతో వస్తువులను తయారుచేసే తెలివితేటలు ప్రసాదించబడ్డాయి. సులైమాన్ ప్రవక్త పశుపక్ష్యాదుల భాషల్ని అర్థం చేసుకోగలిగేవారు. ఈ తండ్రీ కొడుకులిరువురికీ – ఎన్నో విషయాలలో– ఇతరులెవరికీ ఇవ్వబడనివి ఇవ్వబడ్డాయి. అయినప్పటికీ ఇక్కడ ఇల్మ్ (జ్ఞానం) గురించి ప్రత్యేకంగా నొక్కి చెప్పటాన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే దైవప్రసాదిత వస్తువులలో 'ఇల్మ్' చాలా శ్రేష్ఠమైనది.

17. వారసత్వం అంటే ప్రవక్త పదవితోపాటు, రాజరికం కూడా వస్తుంది. హజ్రత్ సులైమాను హజ్రత్ దావూదు కుమారుడు. దావూదు గారికి ఇతర కొడుకులున్నప్పటికీ ఈ వారసత్వం వారికి దక్కలేదు. కేవలం సులైమానుకు మాత్రమే ఈ విశిష్టస్థానం ప్రాప్తించింది. అల్లాహ్ తాను కోరిన వారికి మాత్రమే ఈ అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. అదలావుంచితే దైవప్రవక్తలు వదలివెళ్ళే వారసత్వం ఏమై ఉంటుంది? అంటే 'జ్ఞాన సంపదే'. వారు వదలివెళ్ళే సాధనసంపత్తులు 'సదఖా' గా పరిగణించబడతాయి అని మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు చెప్పారు. (బుఖారీ – కితాబుల్ ఫరాయెజ్; ముస్లిం – కితాబుల్ జిహాద్).

18. ఆ మాటకొస్తే జంతువులన్నింటి భాష ఆయనకు నేర్పబడింది. అయితే పక్షుల భాష గురించి ప్రత్యేకంగా ఎందుకు ప్రస్తావించబడిందంటే పక్షులు – బయటకు వెడలినప్పుడల్లా – ఆకాశంలో గుంపులుగా ఎగురుతూ ఆయనకు నీడ కల్పించేవి. అయితే సులైమాన్ ప్రవక్తకు కేవలం పక్షుల భాష మాత్రమే నేర్పించబడిందని, చీమలు కూడా వాటిలోకి వచ్చేస్తాయని మరికొంతమంది అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

19. అంటే వారికి అవసరమైనవల్లా ప్రసాదించబడ్డాయి. ఉదాహరణకు : జ్ఞానం, వివేకం, దైవదౌత్యం, అధికారం, సిరిసంపదలు, మనుషుల, జిన్నాతుల, పక్షుల సైన్యాలు ఇత్యాదివి.

20. దైవప్రవక్త హజ్రత్ సులైమాను (అలైహిస్సలాం)గారి వ్యక్తిత్వం, వైశిష్ట్యం ఇక్కడ చెప్పబడింది. మానవ జాతి చరిత్రలో ఎవరికీ ఇవ్వబడని అధికారం ఆయనకు ఇవ్వబడింది. ఆయన అధికారం మానవులపైనే గాక జిన్నాతులపై, పశుపక్ష్యాదులపై కూడా సాగింది. తుదకు వాయువు కూడా ఆయనకు లోబరచబడి ఉండేది. హజ్రత్ సులైమాన్ ఆదేశంపై మనుషుల, జిన్నాతుల, పక్షుల సైన్యాలు ఆయన సమక్షంలో హాజరుపరచబడ్డాయి. ఎక్కడికో వెళ్ళటానికి ఆయన ఈ దళాలన్నిటిని సమీకరించి ఉంటారు.

21. అంటే మానవసైన్యాలను, జిన్నాతుల సైన్యాలను, పక్షుల సైన్యాలను వేర్వేరుగా వర్గీకరించి వాటికి నిర్ణీత కార్యక్రమం అప్పగించబడేది. క్రమశిక్షణ గురించి నిర్దేశించబడేది. ఎందుకంటే సైన్యం చాలా పెద్ద సంఖ్యలో ఉండేది. వాటిని వివిధ పంక్తులుగా విభజించకపోతే పరిస్థితి అస్తవ్యస్తంగా తయారవుతుంది. అసలు మూలంలో **'యూజఊన్'** (**يُوْزَعُوْنَ**) అన్న పదం వాడబడింది. దీనికి రెండు అర్థాలు కావచ్చు. ఒకటి వర్గీకరణ: అంటే సైన్యంలోని దళాలన్నిటిని వేర్వేరుగా వర్గీకరించటం జరిగేదన్న మాట. దీనికి మరో అర్థం 'ఆపబడటం' అని కూడా వస్తుంది. సులైమాన్ సైన్యం చాలా పెద్దది. అది అస్తవ్యస్తం కాకుండా ఉండటం కోసం మార్గమధ్యంలో సైన్యాన్ని ఆపి సరిచేయటం జరిగేదని దీని భావం.

**18** చివరకు వారంతా ఒక చీమల లోయకు చేరుకున్నప్పుడు ఒక చీమ ఇలా ప్రకటించింది: "ఓ చీమల్లారా! సులైమాను, అతని సైన్యాలు తెలీకుండా మిమ్మల్ని నలిపివేసే స్థితి ఏర్పడకుండా ఉండేందుకు, మీరు మీ మీ పుట్టలలోనికి దూరిపోండి."[22]

حَتَّىٰٓ إِذَآ أَتَوۡاْ عَلَىٰ وَادِ ٱلنَّمۡلِ قَالَتۡ نَمۡلَةٞ
يَٰٓأَيُّهَا ٱلنَّمۡلُ ٱدۡخُلُواْ مَسَٰكِنَكُمۡ لَا يَحۡطِمَنَّكُمۡ
سُلَيۡمَٰنُ وَجُنُودُهُۥ وَهُمۡ لَا يَشۡعُرُونَ ﴿١٨﴾

**19** దాని మాటపై సులైమాను చిరునవ్వును చిందించాడు. అతనిలా ప్రార్థించసాగాడు : "నా ప్రభూ! నువ్వు నాకూ, నా తల్లి దండ్రులకూ ప్రసాదించిన అనుగ్రహాలకుగాను నిత్యం నీకు కృతజ్ఞతలు తెలుపుకునే సద్బుద్ధిని నాకు ఇవ్వు.[23] నేను, నీ మెప్పును పొందే మంచిపనులు చేసేలా చూడు. నీ దయతో నన్ను నీ సజ్జన దాసులలో చేర్చుకో."[24]

فَتَبَسَّمَ ضَاحِكٗا مِّن قَوۡلِهَا وَقَالَ رَبِّ أَوۡزِعۡنِيٓ
أَنۡ أَشۡكُرَ نِعۡمَتَكَ ٱلَّتِيٓ أَنۡعَمۡتَ عَلَيَّ وَعَلَىٰ
وَٰلِدَيَّ وَأَنۡ أَعۡمَلَ صَٰلِحٗا تَرۡضَىٰهُ وَأَدۡخِلۡنِي
بِرَحۡمَتِكَ فِي عِبَادِكَ ٱلصَّٰلِحِينَ ﴿١٩﴾

**20** అతను పక్షులను తనిఖీ చేసి, "హుద్ హుద్ పక్షి (వడ్రంగి పిట్ట!) నాకు కనిపించటం లేదేమిటి? అది నిజంగానే హాజరు కాలేదా?"[25] అని అన్నాడు.

وَتَفَقَّدَ ٱلطَّيۡرَ فَقَالَ مَا لِيَ لَآ أَرَى ٱلۡهُدۡهُدَ
أَمۡ كَانَ مِنَ ٱلۡغَآئِبِينَ ﴿٢٠﴾

**21** "నేను దానిని కఠినంగా శిక్షిస్తాను లేదా దాన్ని కోసివేస్తాను లేదా అది నాకు సరైన సంజాయిషీ అన్నా ఇవ్వాలి" (అని చెప్పాడు).

لَأُعَذِّبَنَّهُۥ عَذَابٗا شَدِيدًا أَوۡ لَأَاْذۡبَحَنَّهُۥٓ
أَوۡ لَيَأۡتِيَنِّي بِسُلۡطَٰنٖ مُّبِينٖ ﴿٢١﴾

22. జంతువులలో కూడా దూరదృష్టి, ప్రమాదాన్ని పసిగట్టే చైతన్యం ఉంటుందనటానికి ఈ వాక్యం ఒక మచ్చుతునక. అయితే ఈ చైతన్యం మనిషితో పోల్చుకుంటే చాలా తక్కువ. మరో ముఖ్య విషయం ఏమిటంటే, హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం)కు ఎంత ఘనత ప్రసాదించబడినప్పటికీ ఆయన అగోచర జ్ఞాని మాత్రం కారు. అందుకే– 'తెలీకుండా' సులైమాను సైన్యం నలిపివేస్తుందేమో! నన్న కీడును ఆ చీమ శంకించింది. ఇంకొక విషయం: అల్లాహ్ తప్ప మరొక రెవరికీ అగోచర జ్ఞానం లేదన్న విశ్వాసం జంతువులకు కూడా ఉంది. ముమ్ముందు రాబోయే 'హుద్ హుద్' పక్షి సంఘటన ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తుంది. నాల్గు: హజ్రత్ సులైమానుకు పక్షులతో పాటు ఇతర జంతువుల భాష కూడా తెలుసు. జిన్నాతు తదితర ప్రాణులను అల్లాహ్ ఆయనకు లోబరచి ఉంచినట్లే, వివిధ జంతువుల, పక్షుల భాషను కూడా ఆయనకు నేర్పాడు.

23. 'చీమ' లాంటి చిన్న జంతువు మాటలను సయితం అర్థం చేసుకునే శక్తి తనలో ఉందని తెలియగానే హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) గారిలో దేవునిపట్ల కృతజ్ఞతా భావం ఉప్పొంగింది. అందుకే ఆయన ఈ సందర్భంగా అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, తనను ఎల్లప్పుడూ అదుపు ఆజ్ఞల్లో ఉండేట్లు చూడమని కోరారు.

24. **'నీ దయతో'** నన్ను నీ సజ్జనులైన దాసులలో చేర్చుకో అన్న అభ్యర్థన గమనించదగినది. స్వర్గం విశ్వాసుల నిలయం. అయితే దేవుని దయలేకుండా ఎవరూ అందులో ప్రవేశించలేరు. అందుకే హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ఈ విధంగా ప్రవచించారు : "తిన్నగా ఉండండి. సత్యానికి సమీపంలో ఉండండి. ఏ వ్యక్తి కూడా కేవలం తన కర్మల ఆధారంగా స్వర్గంలోకి పోలేడన్న విషయాన్ని బాగా తెలుసుకోండి." 'ఓ దైవప్రవక్తా (స)! మీరు కూడా అంతేనా?!' అని ఆయన (స) సహచరులు అడగ్గా, "అవును. అల్లాహ్ నన్ను తన కారుణ్య ఒడిలోకి తీసుకోనంతవరకూ నేను కూడా స్వర్గంలోకి వెళ్ళలేను" అని మహాప్రవక్త (స) స్పష్టం చేశారు. (సహీహ్ బుఖారీ – హ.నెం. 6467; ముస్లిం – నెం.217)

**22** కొద్ది సేపట్లోనే అది వచ్చి ఇలా విన్న వించుకోసాగింది : "మీకు తెలియని ఒక సమాచారాన్ని నేను సేకరించాను.[26] నేను 'సబా' (జాతి)కి చెందిన[27] ఒక నిజవార్తను మోసుకువచ్చాను.

فَمَكَثَ غَيْرَ بَعِيدٍ فَقَالَ أَحَطتُ بِمَا لَمْ تُحِطْ بِهِۦ
وَجِئْتُكَ مِن سَبَإٍۭ بِنَبَإٍ يَقِينٍ ﴿٢٢﴾

**23** "(ఆ జాతి) వారిని ఒక స్త్రీ పరిపాలిస్తుండటం నేను కనుగొన్నాను.[28] ఆమెకు అన్ని వస్తువులలో నుంచి (అంతో ఇంతో) ప్రసాదించబడింది. ఆమె సింహాసనం కూడా వైభవో పేతమైనదే.[29]

إِنِّى وَجَدتُّ ٱمْرَأَةً تَمْلِكُهُمْ وَأُوتِيَتْ مِن
كُلِّ شَىْءٍ وَلَهَا عَرْشٌ عَظِيمٌ ﴿٢٣﴾

**24** "అయితే ఆమె, ఆమె ప్రజలు కూడా అల్లాహ్‌ను వదలి సూర్యునికి ప్రణమిల్లటం నేను గమనించాను. షైతాను వారి కర్మలను వారికి మంచివిగా కనిపించేటట్లు చేసి, వాళ్లను సన్మార్గం పొందకుండా అడ్డుకున్నాడు.[30] అందువల్ల వారు సన్మార్గ భాగ్యం పొందలేకపోతున్నారు."

وَجَدتُّهَا وَقَوْمَهَا يَسْجُدُونَ لِلشَّمْسِ مِن دُونِ ٱللَّهِ
وَزَيَّنَ لَهُمُ ٱلشَّيْطَٰنُ أَعْمَٰلَهُمْ فَصَدَّهُمْ عَنِ
ٱلسَّبِيلِ فَهُمْ لَا يَهْتَدُونَ ﴿٢٤﴾

**25** ఆకాశాలలోనూ, భూమిలోను నిక్షిప్తమై ఉన్న వస్తువులను[31] వెలికితీసేవాడు, మీరు గోప్యంగా ఉంచే, బహిర్గతం చేసే విషయాలన్నీ తెలిసినవాడైన అల్లాహ్‌కు వారు సాష్టాంగపడాల్సింది (కాని వారలా చేయటం లేదు).[32]

أَلَّا يَسْجُدُوا۟ لِلَّهِ ٱلَّذِى يُخْرِجُ ٱلْخَبْءَ فِى ٱلسَّمَٰوَٰتِ
وَٱلْأَرْضِ وَيَعْلَمُ مَا تُخْفُونَ وَمَا تُعْلِنُونَ ﴿٢٥﴾

25. అంటే అది ఎక్కడికో వెళ్ళిందన్నమాట!

26. అంటే ఆ విషయానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాను.

27. **'సబా'** అనేది అసలు ఒక వ్యక్తి పేరు. ఈ పేరు మీదే ఒక జాతి ఉండేది. ఒక పట్టణం కూడా ఉండేది. ఇక్కడ దీన్ని పట్టణం అన్న భావంలో తీసుకోవాలి. ఇది సనా (యమన్)కు మూడు రోజుల ప్రయాణానికి దూరాన ఉంది. ఆ ప్రాంతం మారబ్ యమన్‌గా ప్రసిద్ధిచెందింది. (ఫత్‌హుల్ ఖదీర్)

28. ఒక స్త్రీ ఒక జాతిని పరిపాలించటం హుద్ హుద్ పక్షిని సయితం ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ కాలంలో స్త్రీలు అన్ని విషయాలలోనూ పురుషులకు సమానంగా పరిగణించబడుతున్నారు. ఒక పురుషుడు రాజ్యాధికారి అయినప్పుడు స్త్రీ ఎందుకు కాకూడదు? అని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ సిద్ధాంతం ఇస్లామీయ ప్రబోధనలకు విరుద్ధమైనది. కొంతమంది మేధావులు సబా రాణి (బిల్ఖీస్)ని ఉదాహరిస్తూ స్త్రీ రాజ్యాన్ని పరిపాలించటం ధర్మసమ్మతమేనని వాదిస్తున్నారు. మరి చూడబోతే ఖుర్ఆన్ ఒకానొక సంఘటనను ఇక్కడ ప్రస్తావించిందే తప్ప ఆ పరిపాలనను సమర్థించలేదు. వివరాల్లోకి పోతే ఖుర్ఆన్ హదీసులు స్త్రీ పరిపాలనకు సుముఖంగా లేవని తెలుస్తుంది.

29. ఆ సింహాసనం పొడవు 80 గజాలని, వెడల్పు 40 గజాలని, ఎత్తు 30 గజాలని అనబడుతోంది. ఆ సింహాసనం ముత్యాలతో, పగడాలతో, వజ్రవైఢూర్యాలతో పొదగబడి వుండేది. నిజము దేవుడెరుగు (ఫత్‌హుల్ ఖదీర్). అయితే ఈ కథనంలో అతిశయోక్తి మాత్రం కనిపిస్తోంది. ఎందుకంటే యమన్ దేశంలో శిథిలావస్థలో ఉన్న ఆ స్త్రీ (బిల్ఖీస్) రాజ ప్రాసాదంలో అంత ఎత్తయిన సింహాసనం ఉండే అవకాశం లేదు.

30. ఆ పక్షి వ్యక్తపరచిన మనోభావాల్ని బట్టి రెండు విషయాలు ఇక్కడ విదితమవుతున్నాయి. ఒకటి : మీకు సయితం తెలియని ఒక విషయాన్ని నేడు నేను కనుగొన్నానని ఆ పక్షి చెప్పిందంటే దైవప్రవక్త (అలైహిముస్సలాం)లకు

26 అల్లాహ్–ఆయన తప్ప వేరొక ఆరాధ్య దైవం లేదు. ఆయనే మహోన్నతమైన సింహాసనానికి అధిపతి.[33]

اَللّٰهُ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ رَبُّ الْعَرْشِ الْعَظِيْمِ ﴿26﴾

27 సులైమాను ఇలా అన్నాడు: "సరే, నువ్వు నిజం చెబుతు న్నావో లేక అబద్ధం చెబుతున్నావో మేము చూస్తాము.

قَالَ سَنَنْظُرُ اَصَدَقْتَ اَمْ كُنْتَ مِنَ الْكٰذِبِيْنَ ﴿27﴾

28 "నా ఈ ఉత్తరాన్ని తీసుకుపోయి వారివద్ద పడవెయ్యి. వారి దగ్గరి నుంచి తొలగిపోయి, వారేవిధంగా స్పందిస్తారో చూడు."[34]

اِذْهَبْ بِّكِتٰبِيْ هٰذَا فَاَلْقِهْ اِلَيْهِمْ ثُمَّ تَوَلَّ عَنْهُمْ فَانْظُرْ مَاذَا يَرْجِعُوْنَ ﴿28﴾

29 ఆమె (రాణి) ఇలా చెప్పింది : "సభా సదులారా! నా వద్ద గౌరవప్రదమైన ఒక ఉత్తరం వెయ్యబడింది.

قَالَتْ يٰۤاَيُّهَا الْمَلَؤُا اِنِّيْۤ اُلْقِيَ اِلَيَّ كِتٰبٌ كَرِيْمٌ ﴿29﴾

30 "ఇది సులైమాను దగ్గరి నుంచి వచ్చింది. – ఇది అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం" (అయింది అంటూ చదువసాగింది).

اِنَّهٗ مِنْ سُلَيْمٰنَ وَاِنَّهٗ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ﴿30﴾

31 "మీరు నాకు వ్యతిరేకంగా ఏమాత్రం తలబిరుసుతనం చూపకుండా, విధేయులై (ముస్లింలై) నా దగ్గరకు వచ్చేయండి (అని ఇందులో లిఖించబడివుంది)."[35]

اَلَّا تَعْلُوْا عَلَيَّ وَاْتُوْنِيْ مُسْلِمِيْنَ ﴿31﴾

రహస్య విషయాల జ్ఞానం ఉండదు. రెండు: పక్షులకు దేవుని ఏకత్వం (తౌహీద్) గురించిన స్పృహ ఉంటుంది. అందుకే బిల్ఖీస్ జాతివారు, అల్లాహ్‌ను వదలి సూర్యునికి ప్రణమిల్లటం పట్ల ఆ వడ్రంగి పిట్ట ఆశ్చర్యపడింది. పైగా షైతాన్ సూర్యపూజను మంచిపనిగా వారికి చూపిస్తున్నట్లు అభిప్రాయపడింది.

31. మరి నిజానికి ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి మొక్కల్ని మొలకెత్తించేవాడు, ఖనిజ సంపదలను, చమురు నిల్వలను మానవజాతి కోసం సమకూర్చేవాడు అల్లాహ్‌యే. **'ఖబ్ఉన్'** అంటే నిక్షిప్తమై ఉన్నది అని అర్థం.

32. అల్లాహ్‌కు సాష్టాంగపడకుండా ఉండటాన్ని కూడా షైతాన్ వారికి సముచితమైన పనిగా చేసి చూపించాడు. సాష్టాంగప్రణామం కేవలం అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తుంది అన్న సంగతి వారికి అర్థం కాలేదు. (ఫత్‌హుల్ ఖదీర్)

33. వాస్తవానికి అల్లాహ్ సృష్టిలోని ప్రతి వస్తువుకూ అధిపతి. కాని పైఆయతులో మహోన్నతమైన సింహాసనానికి అధిపతి అని మాత్రమే చెప్పటంలోని ఔచిత్యం ఏమిటంటే ఆయన సింహాసనం విశ్వంలోని వస్తువులన్నిటికంటే పెద్దది. దాని గురించి చెబితే ఇక సృష్టిలోని ఇతర వస్తువులన్నిటి గురించి చెప్పినట్లుగానే భావింపబడుతుంది. మరో కారణం ఏమిటంటే సబారాణి సింహాసనం ఎంతో గొప్పదైనప్పటికీ విశ్వప్రభువు సింహాసనం ముందు దానికి పూచిక పుల్లంత కూడా విలువ లేదు. అది తెలియజేయటమే పై వాక్యం ఉద్దేశం. హుద్ హుద్ పక్షి ఒక వైపు బిల్ఖీస్ వైభవాన్ని చాటి చెబుతూనే ఆమె తన జనులతో సహా సూర్యుణ్ణి పూజించటంపట్ల ఆశ్చర్యాన్ని ప్రకటించింది. దేవుని ఏకత్వాన్ని, ఆయన ఉపకారాలను స్మరించింది. అందుకే హదీసులో ఇలా చెప్పబడింది : "నాలుగు జంతువులను చంపకండి– చీమను, తేనెటీగను, హుద్ హుద్ (వడ్రంగి పిట్ట)ను, సుర్ద్‌ను." (ముస్నదె అహ్మద్–1/332; అబూ దావూద్–కితాబుల్ అదబ్). సుర్ద్ అనే జంతువు తలపెద్దగా, పొట్ట తెల్లగా, వీపు పచ్చగా ఉంటుంది. అది చిన్న చిన్న పక్షులను వేటాడి తింటుంది. (ఇబ్నె కసీర్ వివరణలు).

34. అంటే–నువ్వు ఆ ఉత్తరాన్ని ఆమె ఉండే ఏకాంత ప్రదేశంలో పడవేసి, వెంటనే ఆమెకు దూరంగా జరుగు. ఆ తరువాత ఏం జరుగుతుందో, జాగ్రత్తగా గమనించు.

**32** "ఓ ప్రముఖులారా! ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి. ఏ విషయాన్నయినా మీ దృష్టికి తేకుండా, (మిమ్మల్ని సంప్రతించకుండా) నేను ఏ నిర్ణయమూ తీసుకోను కదా!" అని రాణి చెప్పింది.

قَالَتْ يَا أَيُّهَا الْمَلَأُ أَفْتُونِي فِي أَمْرِي مَا كُنتُ قَاطِعَةً أَمْرًا حَتَّىٰ تَشْهَدُونِ ﴿32﴾

**33** దానికి వారంతా, "(అమ్మా!) మనం బలవంతులం. గొప్ప పోరాటపటిమ గలవారం.[36] ఇకమీదట ఏం చేయాలన్నది మీపైనే ఆధారపడి ఉంది. మాకే ఆదేశం ఇవ్వాలో స్వయంగా మీరే ఆలోచించుకోండి"[37] అన్నారు.

قَالُوا نَحْنُ أُولُو قُوَّةٍ وَأُولُو بَأْسٍ شَدِيدٍ وَالْأَمْرُ إِلَيْكِ فَانظُرِي مَاذَا تَأْمُرِينَ ﴿33﴾

**34** ఆమె (రాణి) గారు ఇలా అభిప్రాయపడ్డారు : "సాధారణంగా రాజులు ఏ నగరంలో జొరబడినా[38] దాన్ని ధ్వంసం చేస్తారు. అక్కడి మర్యాదస్తులను అవమానాలపాలు చేస్తారు.[39] (బహుశా) వీళ్లూ అదే చేయవచ్చు.[40]

قَالَتْ إِنَّ الْمُلُوكَ إِذَا دَخَلُوا قَرْيَةً أَفْسَدُوهَا وَجَعَلُوا أَعِزَّةَ أَهْلِهَا أَذِلَّةً ۖ وَكَذَٰلِكَ يَفْعَلُونَ ﴿34﴾

**35** "నేను వాళ్ళకు ఒక కానుక పంపిస్తాను. ఆ తరువాత దౌత్య కారులు ఏం జవాబు తీసుకువస్తారో చూస్తాను."[41]

وَإِنِّي مُرْسِلَةٌ إِلَيْهِم بِهَدِيَّةٍ فَنَاظِرَةٌ بِمَ يَرْجِعُ الْمُرْسَلُونَ ﴿35﴾

---

35. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా ఇలాగే చక్రవర్తులకు ఉత్తరాలు వ్రాసేవారు. ఆ ఉత్తరాల్లో ఇస్లాం ధర్మపరిచయం చేసేవారు. అలాగే పూర్వం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) కూడా తన ఉత్తరం ద్వారా సబా రాణి గార్కి ఇస్లాం సందేశం అందజేశారు. నేటి ఉత్తరాల్లో ఉత్తరం రాసేవారి పేరు లేఖ చివర్లో ఉంటోంది. కాని మన పూర్వీకుల (సలఫ్ల) విధానం మాత్రం పై వాక్యాల్లో వివరించబడిన సులైమాన్ ప్రవక్త విధానాన్ని అనుసరించి ఉండేది. అంటే ఉత్తరం రాసేవారి పేరు ముందుగా ప్రస్తావించబడుతుందన్నమాట!

36. అంటే, మన దగ్గర సైనిక బలమూ ఉంది. ఆయుధాలు కూడా ఉన్నాయి. యుద్ధ సమయాల్లో వెన్నుచూపకుండా కడదాకా పోరాడే యోధులూ ఉన్నారు. కాబట్టి మనం ఒకరికి లొంగవలసిన అవసరం లేదు.

37. (అమ్మా!) మేము సలహాలను ఇచ్చేవారం మాత్రమే. తుది నిర్ణయం మీదే. మీరు ఏ ఆజ్ఞను జారీ చేసినా మేము దాన్ని శిరసావహిస్తాము.

38. అంటే, వారు తమ సైనిక శక్తితో జైత్రయాత్రను సాగించినపుడు, ప్రతిఘటన ఎదురైన చోటల్లా విధ్వంసం తప్పదు.

39. వారు యుద్ధ సమయంలో రక్తపాతం సృష్టిస్తారు. ఆస్తులను దోచుకుంటారు. గౌరవనీయులను బందీలుగా పట్టుకుంటారు. వారి స్థాయికి తగని విధంగా వారిపట్ల ప్రవర్తిస్తారు.

40. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ పలుకులు అల్లాహ్వి. ఆయన సబా రాణికి అనుకూలంగా ఈ మాటల్ని పలికాడు. మరి కొంతమంది ప్రకారం ఇవి సబారాణి బిల్ఖీస్ పలుకులే. సందర్భం దృష్ట్యా చూస్తే రెండవ అభిప్రాయమే సరైనదనిపిస్తుంది.

41. సులైమాన్ ప్రాపంచిక కీర్తి ప్రతిష్ఠల్ని ఆశించే రాజో లేక దేవుని తరఫున నియుక్తమైన ప్రవక్తో ఇప్పుడు తెలిసిపోతుంది. అతను గనక నా కానుకను స్వీకరించకపోతే, అతను ధర్మసంస్థాపన కోసం ప్రయత్నించే ప్రవక్త అని అనుకుంటాను. అట్టి పరిస్థితిలో మనమంతా ఆయనకు విధేయత చూపక తప్పదు.

**36** (రాణిగారి) దూత సులైమాను వద్దకు చేరుకున్నప్పుడు, “ఏమిటీ, మీరు నాకు ధనరూపేణా సహాయం చేయాలనుకుంటు న్నారా?[42] నా ప్రభువు నాకు, మీకిచ్చిన దానికన్నా మేలైనది ప్రసాదించాడు. కాబట్టి మీ కానుకతో మీరే సంతోషపడండి” అని సులైమాను అన్నాడు.[43]

فَلَمَّا جَآءَ سُلَيۡمَٰنَ قَالَ أَتُمِدُّونَنِ بِمَالٖ فَمَآ
ءَاتَىٰنِۦَ ٱللَّهُ خَيۡرٞ مِّمَّآ ءَاتَىٰكُمۚ بَلۡ أَنتُم بِهَدِيَّتِكُمۡ
تَفۡرَحُونَ ٣٦

**37** “నువ్వు వారి వద్దకే తిరిగి వెళ్ళు.[44] మేము వారిపైకి వారు నిలువరించలేని సైన్యాలను తీసుకువస్తాము. వారిని పరాభవం పాల్జేసి అక్కణ్ణుంచి వెళ్ళగొడతాము. తుదకు వారు కడు నిస్సహా యులుగా ఉండిపోతారు”[45] (అని చెప్పాడు).

ٱرۡجِعۡ إِلَيۡهِمۡ فَلَنَأۡتِيَنَّهُم بِجُنُودٖ لَّا قِبَلَ
لَهُم بِهَا وَلَنُخۡرِجَنَّهُم مِّنۡهَآ أَذِلَّةٗ وَهُمۡ
صَٰغِرُونَ ٣٧

**38** “ఓ ప్రముఖులారా! వారు విధేయులై ఇక్కడకు చేరుకొనక ముందే, ఆమె సింహాసనాన్ని నా దగ్గరకు తేగలవారు మీలో ఎవరయినా ఉన్నారా?”[46] అని అతను అడిగాడు.

قَالَ يَٰٓأَيُّهَا ٱلۡمَلَؤُاْ أَيُّكُمۡ يَأۡتِينِي بِعَرۡشِهَا قَبۡلَ
أَن يَأۡتُونِي مُسۡلِمِينَ ٣٨

**39** జిన్నులలో బలిష్టుడైన ఒకతను, “మీరు మీ స్థానం నుంచి లేచే లోపలే[47] నేను దానిని మీ ముందు సమర్పిస్తాను.[48] అంతటి శక్తి నాకుంది. నేను విశ్వసనీయుణ్ణి కూడాను”[49] అని చెప్పాడు.

قَالَ عِفۡرِيتٞ مِّنَ ٱلۡجِنِّ أَنَا۠ ءَاتِيكَ بِهِۦ قَبۡلَ
أَن تَقُومَ مِن مَّقَامِكَۖ وَإِنِّي عَلَيۡهِ لَقَوِيٌّ
أَمِينٞ ٣٩

42. అల్లాహ్ నాకు ప్రసాదించిన భాగ్యాలను మీరు చూడటం లేదా? మీ రాణి గారు పంపిన పారితోషికం వల్ల నాకు ఒరిగేదేమీ లేదు. ఈ పారితోషికాన్ని మీరు మీ దగ్గరే ఉంచుకోండి అంటూ సులైమాన్ బిల్ఖీస్ కానుకను గ్రహించటానికి నిరాకరించారు.

43. మీ కానుకను మీరే అనుభవించండి. ప్రాపంచిక ప్రయోజనాలను, పారితోషికాలను పొందటం నా లక్ష్యం కానేకాదు. అలా అనుకుంటే ప్రపంచంలో వేరెవరికీ ఇవ్వని భోగభాగ్యాలను నా ప్రభువు నాకిచ్చాడు. వీటన్నింటితోపాటు నన్ను దైవప్రవక్తగా కూడా నియమించాడు.

44. ఇంతకుముందు హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) రాయబారిని బహువచనంలో సంబోధించారు. ఇప్పుడేమో ఏకవచనంలో సంబోధిస్తున్నారు. ఎందుకంటే ప్రసంగంలో ఒక్కోసారి మొత్తం జాతినుద్దేశించి విషయం చెప్పాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం సూటిగా రాయబారి ఒక్కణ్ణే ఉద్దేశించి మాట్లాడారు.

45. హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) కేవలం రాజు కారు, ఆయన ఒక ప్రవక్త కూడా. అందువల్ల ఆయన తరఫున ప్రజలు పరాభవంపాలు కావటం అన్నది జరగని పని. కాని సాధారణంగా యుద్ధంవల్ల రక్తపాతం జరుగుతుంది. ధనప్రాణ నష్టం జరుగుతుంది. ఓడినవారు అశక్తులవుతారు – ఇదే ఆయన మాటల్లోని ఆంతర్యం. అంతకుమించి దైవప్రవక్తలు ఏ జాతి ప్రజలను కూడా కించపరచే విధంగా ప్రవర్తించరు. అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు యుద్ధ సమయాలలో అవలంబించే విధానం ఈ సందర్భంగా స్మరించుకోదగినది.

46. అంతకుముందు సులైమాన్ (అలైహిస్సలాం) ఇచ్చిన జవాబును బట్టి, తాను ఆయన్ని ప్రతిఘటించలేనన్న సంగతి ఆమెకు అర్థమైపోయింది. అందువల్ల ఆమె విధేయురాలై సులైమాను వద్దకు వచ్చేందుకు ప్రయాణ సన్నాహాలు మొదలెట్టింది. ఆమె రాబోతుందని సులైమాన్‌కు ముందుగానే తెలిసిపోయింది. తన రాజవైభవాన్ని, శక్తిసామర్థ్యాలను

قَالَ الَّذِيْ عِنْدَهٗ عِلْمٌ مِّنَ الْكِتٰبِ اَنَا اٰتِيْكَ بِهٖ
قَبْلَ اَنْ يَّرْتَدَّ اِلَيْكَ طَرْفُكَ ؕ فَلَمَّا رَاٰهُ مُسْتَقِرًّا
عِنْدَهٗ قَالَ هٰذَا مِنْ فَضْلِ رَبِّيْ ۖ لِيَبْلُوَنِيْٓ
ءَاَشْكُرُ اَمْ اَكْفُرُ ؕ وَمَنْ شَكَرَ فَاِنَّمَا يَشْكُرُ لِنَفْسِهٖ ۚ
وَمَنْ كَفَرَ فَاِنَّ رَبِّيْ غَنِيٌّ كَرِيْمٌ ﴿40﴾

**40** (అప్పుడు వారిలో) గ్రంథజ్ఞానం గల ఒకతను, "మీరు కళ్లుమూసి తెరిచే లోగానే నేను దాన్ని మీ ముందు తెచ్చిపెట్ట గలను"[50] అన్నాడు. తన కళ్ళముందర ఆ సింహాసనం ఉండటం చూసి సులైమాను, "ఇది నా ప్రభువు అనుగ్రహం. నేను కృతజ్ఞుణ్ణి అవుతానో లేక (ప్రభువు) చేసిన మేలును మరచిపోతానో పరీక్షిం చటానికే (ఆయన ఇదంతా చేశాడు). ఎవడైనా కృతజ్ఞతా పూర్వ కంగా వ్యవహరిస్తే అతని కృతజ్ఞతాభావం అతనికే ప్రయోజన కరం అవుతుంది. మరెవరయినా మేలును మరచి ప్రవర్తిస్తే నా ప్రభువు లక్ష్యపెట్టనివాడు, గొప్ప ఉదాత్తుడు" అని పలికాడు.

---

చూపాలన్న ఆలోచన ఆయనకు కలిగింది. వెంటనే ఆయన తన సహాయకులను సమావేశపరచి, బిల్ఖీస్ సింహాసనాన్ని ఆమె రాకకు ముందే తెచ్చిపెట్టే విషయంపై సమాలోచన జరిపారు.

47. హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) వివిధ వ్యాజ్యాలను విని తీర్పు ఇవ్వటానికి ప్రతి రోజూ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొలువు తీరేవారు. ఆయన ఆ సభనుంచి లేచి వెళ్ళకముందే ఆ సింహాసనాన్ని ఆయన ముందుంచగలనని ఒక జిన్ను చెప్పాడు.

48. ఆ జిన్ను పలికిన మాటల్ని బట్టి అతను ముమ్మాటికీ జిన్ను జాతికి చెందినవాడై ఉంటాడు. జిన్ను వల్లనే ఇలాంటి సాహసకార్యాలు సాధ్యమవుతాయి. ఒక మానవ మాత్రుడు – అతడెంత శక్తిమంతుడైనా – ఈ పని చేయలేడు. ఎందుకంటే సబా (నేటి యమన్) నుంచి బైతుల్ మఖ్దిస్ (జెరూసలేం) వరకు కొన్ని నిమిషాలలో ఒక రాణి సింహాసనాన్ని తరలించటం అనేది మానవ ప్రయత్నాలకు అతీతమైనది. ఎందుకంటే అక్కణ్ణుంచి ఇక్కడికి రానుపోను మొత్తం మూడువేల మైళ్ల దూరం ఉంది. ఈ సుదీర్ఘ ప్రయాణం మూడు లేక నాలుగు గంటల్లో అయ్యేది కాదు. అదీగాక ఒక సాధారణ మనిషి అంతపెద్ద సింహాసనాన్ని ఎత్తనూ లేడు. ఒకవేళ కొంతమంది సహాయాన్ని తీసుకుని ఎత్తగలిగినా మెరుపువేగంతో తెచ్చి రాజుగారి సమక్షంలో పెట్టలేడు. కాబట్టి తేలిందేమిటంటే ఒక మానవాతీత శక్తి ద్వారా మాత్రమే ఈ పని సాధ్యమవుతుంది.

49. అంటే – నేను ఆ సింహాసనాన్ని తేవటమే కాదు, దాని విలువైన వస్తువులన్నింటినీ యధాతథంగా ఉంచుతాను. అందులో ఎలాంటి హెచ్చుతగ్గులుగానీ, మోసంగానీ చేయను అన్నది ఆ జిన్ను మాటల్లోని ఉద్దేశం.

50. ఇంతకీ ఈ మాటలన్న ఆ వ్యక్తి ఎవరు? ఆ గ్రంథం ఏది? అతని దగ్గరున్న ఆ విద్య ఏమిటి? అన్న విషయంలో వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ మూడింటి వాస్తవం దేవుడెరుగు. అయితే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వాక్యాలనుబట్టి, అతను మనిషే అయి ఉంటాడని తెలుస్తోంది. అతనివద్ద గ్రంథ జ్ఞానం ఉంది. రెప్పపాటు సమయంలో సింహాసనాన్ని ఒక రాజ్యం నుంచి మరో రాజ్యానికి తరలించే శక్తిని దేవుడు – ఒక మహిమ రూపంలో – అతనికి ప్రసాదించి ఉండవచ్చు. బాహ్యంలో ఇది సహజత్వానికి, భౌతికతకు విరుద్ధంగా కనిపిస్తున్నప్పటికీ, దైవప్రణాళిక ననుసరించి అసాధారణమైన రీతిలో ఇలాంటి వింతలు విశేషాలు జరగటం అసంభవం కూడా కాదు. అందుచేత ఇక్కడ ఆ వ్యక్తి శక్తియుక్తులపై ఆశ్చర్యం చెందాల్సిన అవసరంగానీ, అతనికి అబ్బిన ఆ విద్య గురించి కూపీలు లాగాల్సిన ఆవశ్యకతగానీ లేదు. ఒక అసాధారణ విషయాన్ని ఆవిష్కరించటానికి ఇక్కడ ఒక వ్యక్తి పరిచయం చేయ బడ్డాడంతే. నిజానికి ఆ ఆవిష్కరణ వెనుక దైవప్రేరణ, దైవప్రణాళిక ఉన్నాయి. ఆయన తాను తలచింది ఉనికిలోకి తెస్తాడు. ఈ వాస్తవం హజ్రత్ సులైమాను (అలైహిస్సలాం)కు కూడా తెలుసు. అందుకే ఆయన తన కళ్లముందర ఉన్న ఆ సింహాసనాన్ని చూడగానే, అప్రయత్నంగా, "ఇది నా ప్రభువు అనుగ్రహం" అన్నారు.

قَالَ نَكِّرُوا لَهَا عَرْشَهَا نَنظُرْ أَتَهْتَدِيٓ أَمْ تَكُونُ
مِنَ الَّذِينَ لَا يَهْتَدُونَ ﴿٤١﴾

41 "ఆ సింహాసనం రూపురేఖలను (స్వల్పంగా) మార్చేయండి.[51] ఆమె తన సింహాసనాన్ని గుర్తించే విషయంలో మార్గం పొందుతుందో లేక మార్గం తప్పిన వారిలో చేరుతుందో చూద్దాం"[52] అని సులైమాను ఆదేశించాడు.

فَلَمَّا جَآءَتْ قِيلَ أَهَٰكَذَا عَرْشُكِ ۖ
قَالَتْ كَأَنَّهُۥ هُوَ ۚ وَأُوتِينَا ٱلْعِلْمَ مِن
قَبْلِهَا وَكُنَّا مُسْلِمِينَ ﴿٤٢﴾

42 ఆమె రాగానే, "నీ సింహాసనం కూడా ఇలాంటిదేనా?!" అని అనబడింది. దానికామె, "ఇది అచ్చం అలాగే ఉంది.[53] మాకు ముందుగానే (విషయం) తెలిసి వచ్చింది. మేము అప్పుడే విధేయులం (ముస్లింలం) అయ్యాము"[54] అని సమాధానమిచ్చింది.

وَصَدَّهَا مَا كَانَت تَّعْبُدُ مِن دُونِ ٱللَّهِ ۖ إِنَّهَا
كَانَتْ مِن قَوْمٍ كَٰفِرِينَ ﴿٤٣﴾

43 అల్లాహ్‌ను వదలి ఆమె ఎవరెవరినయితే పూజించేదో వారు ఆమెను (సన్మార్గం నుంచి) ఆపి ఉంచేవారు. నిశ్చయంగా (లోగడ) ఆమె అవిశ్వాస జనులకు చెందినది.[55]

---

51. అంటే – దాని రంగు మార్చండి. రూపురేఖలలో కూడా కొన్ని మార్పులు చేర్పులు చేయండి.

52. అంటే – ఆమె తన సింహాసనాన్ని గుర్తుపడుతుందో లేదో చూద్దాం అన్నది ఒక అర్థం కావచ్చు. ఆమె సన్మార్గానికి వస్తుందో, మార్గవిహీనురాలవుతుందో పరీక్షిద్దాం అన్నది మరో అర్థం కావచ్చు. ఇంతపెద్ద అద్భుతం చూసిన తరువాత కూడా దైవమార్గం బోధపడుతుందో లేదో చూడాలి అని భావించి హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) ఆమెకు ఈ పరీక్ష పెట్టారు.

53. సింహాసనం రూపురేఖలలో కొన్ని మార్పులు చేర్పులు చేయటం మూలంగా ఆమె దాన్ని గుర్తుపట్టడంలో కించిత్ తడబాటుకు లోనయింది. అందుకే ఇది 'నాదే' అని అనే బదులు 'నా సింహాసనం అచ్చం ఇలాగే ఉంటుంది' అని చెప్పింది. తన వస్తువు రూపురేఖల్లో మార్పులు జరిగినప్పటికీ మనిషి దాన్ని గుర్తుపట్టకపోడు. అందుకే ఆమె ఆ సింహాసనం తనది కాదని కూడా చెప్పలేదు. మొత్తానికి "అది అచ్చం ఇలాగే ఉంటుంది" అని చెప్పి ఎంతో విజ్ఞతను ప్రదర్శించింది. అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేదు.

54. అంటే మేము ఇక్కడికి విచ్చేయకముందే, మీరొక సాధారణ రాజు కారనీ, నిశ్చయంగా మీరు దైవప్రవక్త అయి ఉంటారని ఊహించాము. అందుకే మేము ఇస్లాం స్వీకరించాము. మీకు విధేయులమై ఇక్కడికి వచ్చాము అని రాణిగారు చెప్పారు.

అయితే ఇమామ్ ఇబ్నె కసీర్, ఇమామ్ షౌకానీ తదితరులు ఈ వాక్యాన్ని మరో విధంగా తీసుకున్నారు. వారు చెప్పిన భాష్యం ఇది : "ఈ పలుకులు నిజానికి హజ్రత్ సులైమాన్ గారివి. 'సబా రాణి విధేయురాలై మా దగ్గరకు వస్తుందన్న సంగతి మాకు ముందుగానే తెలుపబడింది' అని హజ్రత్ సులైమాన్ చెప్పారు."

55. ఇవి దేవుని పలుకులు. ఆమెను నిజదైవం వైపుకు రాకుండా అడ్డుకున్నది ఆమె చేసే బహుదైవారాధనే. అప్పటివరకూ ఆమె ఒక అవిశ్వాస జాతికి చెందినది. అందువల్ల 'ఏకదైవారాధన' గురించి ఆమెకు బొత్తిగా తెలీదు.

అయితే అరబీలోని **'వ సద్దహా మా కానత్తాబుదు'** అన్న వాక్యాన్ని గురించి వివరిస్తూ కొంతమంది పండితులు ఈ వాక్యానికి అసలు అర్థం 'సులైమాన్ ప్రవక్త ఆమెను బహుదైవారాధన చేయకుండా ఆపారు' అని అభిప్రాయపడగా, 'అల్లాహ్ ఆమెను బహుదైవారాధన చేయకుండా అడ్డుకున్నాడు' అన్న అర్థం పైవాక్యానికి సరిపోతుందని మరికొంత మంది అభిప్రాయపడ్డారు. నిజం చెప్పాలంటే ఈ వాక్యానికి మొదటగా చెప్పబడిన అర్థమే సరైనదని తోస్తోంది. అనగా అంతకుమునుపు ఆమె చేస్తూ ఉండిన బహుదైవారాధనే ఆమెను నిజదైవం వైపు రాకుండా అడ్డుకుంది. (ఫత్‌హుల్ ఖదీర్).

**44** "మేడలోనికి పదండి" అని ఆమెతో అనబడింది. దాన్ని చూడ గానే, 'ఇది నీటి కొలను కాబోలు' అని అనుకుని ఆమె తన పిక్కల పైని వస్త్రాన్ని ఎత్తిపట్టుకుంది.[56] అప్పుడతను, "ఇది గాజుతో చేయబడిన నున్నని నిర్మాణం మాత్రమే" అన్నాడు. "ప్రభూ! నేను (ఇప్పటివరకూ) నా ఆత్మకు అన్యాయం చేసుకున్నాను. ఇప్పుడు నేను సులైమానుతో పాటు సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్‌కు విధేయత చూపుతున్నాను"[57] అని ఆమె ప్రకటించింది.

قِيلَ لَهَا ادْخُلِي الصَّرْحَ ۖ فَلَمَّا رَأَتْهُ حَسِبَتْهُ لُجَّةً وَكَشَفَتْ عَن سَاقَيْهَا ۚ قَالَ إِنَّهُ صَرْحٌ مُّمَرَّدٌ مِّن قَوَارِيرَ ۗ قَالَتْ رَبِّ إِنِّي ظَلَمْتُ نَفْسِي وَأَسْلَمْتُ مَعَ سُلَيْمَانَ لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ﴿44﴾

**45** మేము సమూద్ జాతివారి వైపు వారి సోదరుడైన సాలెహ్‌ను, "మీరంతా అల్లాహ్‌ను ఆరాధించండి" అని సందేశం ఇచ్చి పంపాము. కాని వారు మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం పోట్లాడుకోసాగారు.[58]

وَلَقَدْ أَرْسَلْنَا إِلَىٰ ثَمُودَ أَخَاهُمْ صَالِحًا أَنِ اعْبُدُوا اللَّهَ فَإِذَا هُمْ فَرِيقَانِ يَخْتَصِمُونَ ﴿45﴾

**46** అతను (సాలెహ్) ఇలా అన్నాడు : "ఓ నా జాతివారలారా! మీరు మంచి పనికి ముందు చెడుకోసం ఎందుకింత ఆత్రం చేస్తున్నారు?[59] మీరు క్షమాపణ కొరకు అల్లాహ్‌ను ఎందుకు వేడుకోరు? తద్వారా మీరు కరుణించబడవచ్చు కదా!"

قَالَ يَا قَوْمِ لِمَ تَسْتَعْجِلُونَ بِالسَّيِّئَةِ قَبْلَ الْحَسَنَةِ ۖ لَوْلَا تَسْتَغْفِرُونَ اللَّهَ لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴿46﴾

56. ఆ మేడ అద్దాలతో నిర్మించబడింది. దాని ముంగిట కూడా అద్దాలే అమర్చబడ్డాయి. దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) తన దైవదౌత్యపు నిదర్శనాలను చూపిన తరువాత, తన ప్రాపంచిక వైభవాన్ని కూడా ఆమెకు చూపాలనుకున్నారు. దేవుడు ఆయనకు కనీ వినీ ఎరుగని రాజ వైభవాన్ని ప్రసాదించాడు. ఆ అద్దాల మేడలోనికి ప్రవేశించమని ఆమెకు చెప్పగానే, ఆమె అందులోనికి వెళ్ళబోయింది. అక్కడ పరచబడివున్న రాళ్లు కూడా గాజుతో చేయబడినవే. దాన్ని ఆమె అపురూప సరస్సుగా తలపోసి, తన వస్త్రాలు తడిసిపోకుండా ఉండటానికి పిక్కల వరకూ ఎత్తిపట్టుకున్నది.

57. తీరా అడుగుపెట్టిన తరువాత ఆమెకు తెలిసింది – అది కోనేరు కాదనీ, స్వచ్ఛమైన గాజుపలకలని! ఆమె అంచనాలన్నీ తారుమారైనాయి. తన తప్పును ఒప్పుకుంటూ, తాను ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది.

నున్నగా చేయబడిన రాతి పలకల్ని **'ముమర్రద్' (مُمَرَّدْ)** అంటారు. 'అమ్‌రద్' అన్న పదం కూడా దీని నుంచి వచ్చినదే. మొహంపై వెంట్రుకలు మొలవని చిన్న పిల్లవాడిని అరబీలో 'అమ్‌రద్' అంటారు. అలాగే ఆకులు రాలిన చెట్టుని 'షజరతున్ మర్‌దా' అని అనటం కద్దు. (ఫత్‌హుల్ ఖదీర్).

**గమనిక :** సబా రాణి (బిల్ఖీస్) ఇస్లాం స్వీకరించిన మీదట ఏం జరిగింది? ఖుర్‌ఆన్ లోగానీ, ప్రామాణిక హదీసులలో గానీ దీని వివరాలు ఎక్కడా లేవు. వారిరువురి (సులైమాన్ – బిల్ఖీస్) వివాహం జరిగిందని కొన్ని వ్యాఖ్యాన కథనాల ఆధారంగా తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఖుర్‌ఆన్ హదీసులు ఏమీ చెప్పకపోవటం వల్ల దానిపై మౌనం వహించటమే ఉత్తమం.

58. అంటే – ఒక వర్గం విశ్వాసులది. ఇంకొకటి అవిశ్వాసులది. ఇరు వర్గాలలో ప్రతిదీ తానే సత్యంపై ఉన్నానని వాదించేది.

59. మీరు సత్యాన్ని విశ్వసించి, సదాచరణ చేసేబదులు, అసత్యాన్నే పట్టుకు వ్రేలాడుతున్నారెందుకు? అసత్యం ఎన్నటికైనా

47 దానికి వారు, "నీ మూలంగా, నీ వెంటవున్న వారి మూలం గానే మాకు ఈ దరిద్రం చుట్టుకుందని మేము భావిస్తున్నాము"[60] అన్నారు. "మీ దరిద్రం ఏదో అల్లాహ్ వద్దనే ఉంది.[61] నిజానికి మీరు పరీక్షించబడుతున్నారు"[62] అని సాలెహ్ చెప్పాడు.

قَالُوا اطَّيَّرْنَا بِكَ وَبِمَن مَّعَكَ ۚ قَالَ طَائِرُكُمْ عِندَ اللَّهِ ۖ بَلْ أَنتُمْ قَوْمٌ تُفْتَنُونَ ﴿٤٧﴾

48 ఆ నగరంలో తొమ్మిది మందితో కూడిన (దుష్ట) మూక ఒకటి ఉండేది. వారు భువిలో అరాచకాన్ని సృష్టించేవారు. సంస్కరణ కోసం ఏమాత్రం ప్రయత్నించేవారు కారు.

وَكَانَ فِي الْمَدِينَةِ تِسْعَةُ رَهْطٍ يُفْسِدُونَ فِي الْأَرْضِ وَلَا يُصْلِحُونَ ﴿٤٨﴾

49 వారిలా కూడబలుక్కున్నారు : "రాత్రికి రాత్రే సాలెహ్పై, అతని ఇంటివారిపై దాడి జరుపుదాం.[63] అతని ఇంటివారు హతమార్చ బడినప్పుడు మేమక్కడ లేమని, మేము చెప్పేది సత్యమని అతని వారసులతో చెబుదాము.[64] ఈ మేరకు అల్లాహ్పై ప్రమాణం చేసి మరీ శపథం చేయండి."

قَالُوا تَقَاسَمُوا بِاللَّهِ لَنُبَيِّتَنَّهُ وَأَهْلَهُ ثُمَّ لَنَقُولَنَّ لِوَلِيِّهِ مَا شَهِدْنَا مَهْلِكَ أَهْلِهِ وَإِنَّا لَصَادِقُونَ ﴿٤٩﴾

శిక్షకే హేతువుగా పరిణమిస్తుంది. అసత్యాన్ని అంటిపెట్టుకుని ఉండటమంటే దేవుని శిక్ష కోసం ఎదురుచూడటమే. అదీగాక సమూద్ జాతికి చెందిన సత్యతిరస్కారులు దేవుని శిక్ష గురించి చెబితే గేలిచేసేవారు. ఆ శిక్ష ఏదో ఇప్పుడే ఎందుకు తీసుకురావు? అని తమ ప్రవక్తను తొందర పెట్టేవారు. వారి ఈ హడావిడికి సమాధానంగా దైవప్రవక్త హజ్రత్ సాలెహ్ (అ) పలికిన మాటలివి.

60. **'అత్తయ్యర్నా'** (اَطَّيَّرْنَا) అని ఆయతులో ఉంది. ఇది 'తైర్' నుంచి వచ్చింది. తైర్ అంటే ఎగరటం అని అర్థం. పూర్వం అరేబియాలో ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు, ఎక్కడికైనా ప్రయాణం చేయాలనుకున్నప్పుడు శకునాలు చూసేవారు. దానికోసం వారు పక్షులను ఎగురవేసేవారు. పక్షి కుడివైపుకు ఎగిరిపోతే మంచి శకునంగా భావించి తమ పని మొదలెట్టేవారు. ఒకవేళ పక్షి ఎడమ వైపుకు ఎగిరిపోతే దుశ్శకునంగా తలపోసి, తాము తలపెట్టిన కార్యాన్ని వాయిదా వేసేవారు (ఫత్హుల్ ఖదీర్). ఇస్లాంలో మాత్రం ఇలాంటి మంచి శకునాలకు, చెడ్డ శకునాలకు ఏమాత్రం తావులేదు. ఈ విధంగా శకునాలు (ముహూర్తాలు) చూడటం అధర్మం. అయితే ఏదేని విషయంలో మంచి జరుగుతుందని లేక జరగాలని ఆశించటంలో మాత్రం తప్పులేదు.

61. సాలెహ్ తన జాతి వారినుద్దేశ్యించి ఇలా అన్నారు : మీరు అనుకుంటున్నట్లుగా విశ్వాసులు దరిద్రులు కారు. ఇదంతా మీ భ్రమ. వాస్తవానికి అదృష్ట దురదృష్టాలన్నీ దైవాధీనమై ఉన్నాయి. మీకు ఏ దరిద్రం (కరువు కాటకాల రూపంలో) చుట్టుకుందని అనుకుంటున్నారో అది యదార్థానికి ఒక పరీక్ష. మీ తిరస్కారవైఖరి మూలంగానే దేవుడు మిమ్మల్ని పరీక్షకు లోను చేశాడు (ఫత్హుల్ ఖదీర్).

62. లేదా మీరు అపమార్గాన పయనిస్తున్నప్పటికీ మీకు కొంత విడుపును ఇచ్చి దేవుడు మిమ్మల్ని పరీక్షిస్తున్నాడు.

63. సమూద్ జాతివారు ముందు ఒంటెను చంపేశారు. అందువల్ల మూడు రోజుల అనంతరం మీపై దైవశిక్ష విరుచుకు పడుతుందని హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) ఆ దుర్మార్గులను హెచ్చరించారు. ఆ శిక్ష ఏదో రాకముందే సాలెహ్ను, అతని సహచరులను లేపేద్దామని ఆ జాతికి చెందిన తొమ్మిదిమంది ముఠా నాయకులు పథకం వేశారు.

64. అంటే, ఈ ఊచకోతకు పాల్పడింది ఎవరో మాకు తెలీదు, ఆ సమయంలో మేము అక్కడ లేమని చెప్పి తప్పించుకుందాం అని ప్లాను వేశారు.

**50** ఈ విధంగా వారు (రహస్యంగా) కుట్రపన్నారు.[65] మరి మేము కూడా మా వ్యూహాన్ని రచించాము.[66] కాని దాని గురించి వారికి తెలీదు.[67]

وَمَكَرُوا مَكْرًا وَّمَكَرْنَا مَكْرًا وَّهُمْ لَا يَشْعُرُونَ ﴿50﴾

**51** మరి వారికుట్ర ఎలా పరిణమించిందో చూడండి! మేము వారినీ, వారి జాతి జనులందరినీ మట్టుపెట్టాము.[68]

فَانْظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ مَكْرِهِمْ ۙ أَنَّا دَمَّرْنٰهُمْ
وَقَوْمَهُمْ أَجْمَعِيْنَ ﴿51﴾

**52** అవిగో, అవే వారి ఇండ్లు! వారి దౌర్జన్యం మూలంగా పాడుబడి ఉన్నాయి. జ్ఞానమున్న వారి కోసం ఇందులో గొప్ప సూచన ఉంది.

فَتِلْكَ بُيُوْتُهُمْ خَاوِيَةً ۢ بِمَا ظَلَمُوْا ؕ إِنَّ فِيْ ذٰلِكَ
لَاٰيَةً لِّقَوْمٍ يَّعْلَمُوْنَ ﴿52﴾

**53** అయితే విశ్వసించి, భయభక్తులతో మెలిగేవారిని మేము కాపాడాము.

وَأَنْجَيْنَا الَّذِيْنَ اٰمَنُوْا وَكَانُوْا يَتَّقُوْنَ ﴿53﴾

**54** ఇంకా లూతు (ను పంపినప్పటి సంగతిని జ్ఞాపకం తెచ్చుకో)[69] – అతను తన జాతివారితో, "మీరు అంతా తెలిసి కూడా సిగ్గుమాలిన పని చేస్తున్నారే?!"[70] అని చెప్పాడు.

وَلُوْطًا إِذْ قَالَ لِقَوْمِهٖٓ أَتَأْتُوْنَ الْفَاحِشَةَ
وَأَنْتُمْ تُبْصِرُوْنَ ﴿54﴾

**55** "మీరు ఆడవారిని వదిలేసి, మగవారి వద్దకు కామవాంఛతో ఎగబడి వస్తారేమిటి?[71] నిజానికి మీరు వట్టి మూర్ఖులుగా ప్రవర్తిస్తున్నారు"[72] (అని చెప్పాడు).

أَئِنَّكُمْ لَتَأْتُوْنَ الرِّجَالَ شَهْوَةً مِّنْ دُوْنِ
النِّسَآءِ ؕ بَلْ أَنْتُمْ قَوْمٌ تَجْهَلُوْنَ ﴿55﴾

65. రాత్రిపూట, రహస్యంగా దాడి జరిపి దైవప్రవక్తను, ప్రవక్త అనుచరులను చంపితే పీడ విరగడవుతుందని వారు అనుకున్నారు.

66. వారొకటి తలిస్తే అల్లాహ్ ఇంకొకటి తలచాడు. వారు తమ పథకాన్ని అమలు పరచకముందే అల్లాహ్ వారిని తుదముట్టించాడు. అల్లాహ్ తన ఎత్తుగడల్లో శీఘ్రగామి.

67. అల్లాహ్ ఎత్తుగడలను, అందలి పరమార్థాలను గ్రహించే శక్తి వారికి లేనేలేదు.

68. మేము ఆ తొమ్మిది మంది దుష్ట నాయకులనే గాకుండా, ఆ జాతినంతటినీ తుదముట్టించాము. ఎందుకంటే గుప్పెడు మంది తప్ప మిగిలిన వారంతా తమ అవిశ్వాసంపై మొండికేసినవారే. తమ తొమ్మిది మంది ముఠా నాయకులు పన్నిన కుట్రకు వారంతా వత్తాసు పలికారు. అందువల్ల వారంతా దైవాగ్రహానికి పాత్రులుగా ఖరారయ్యారు.

69. లూత్ జాతి ప్రజలు అమూరియా, సదూమ్ పట్టణాలలో నివసించేవారు.

70. అంటే అది మనోనేత్రంతో ముడిపడి ఉన్న విషయం. తాము చేసే పని మంచిది కాదన్న సంగతి వారికి తెలుసు. వారి మనస్సాక్షి సయితం ఆ పనికి ఒప్పుకోదు.

ఒకవేళ **'తుబ్సిరూన్'** (تُبْصِرُوْنَ) అన్న పదానికి "చూస్తూ చూస్తూనే ఈ పాడు పని చేస్తున్నారేమిటి?" అన్న అర్థం తీసుకుంటే, మీరు మరీ సిగ్గూ ఎగ్గూ లేకుండా, పశువుల్లా ప్రవర్తిస్తున్నారు. మీ పాడు రోగం ఎంతగా ముదిరి పోయిందంటే, జనులు చూస్తున్నారన్న భయం, లజ్జ కూడా మీకు లేకుండా పోయింది అని భావం.

71. అసహజమైన ఈ లైంగిక క్రీడ అసలు లూతు జాతి ప్రజలతోనే మొదలైంది. అందుచేత ఈ స్వలింగ సంపర్క రుగ్మతను **'లవాతత్'**గా వ్యవహరిస్తారు.

**56** "లూతు పరివారాన్ని మీ నగరం నుంచి వెళ్ళగొట్టండి. వారు మహా పవిత్రులుగా చెలామణీ కాగోరుతున్నారు" అనటం తప్ప అతని జాతి వద్ద మరో సమాధానం లేకపోయింది.[73]

فَمَا كَانَ جَوَابَ قَوْمِهٖٓ اِلَّآ اَنْ قَالُوْٓا اَخْرِجُوْٓا
اٰلَ لُوْطٍ مِّنْ قَرْيَتِكُمْ ۚ اِنَّهُمْ اُنَاسٌ
يَّتَطَهَّرُوْنَ ﴿٥٦﴾

**57** అందుచేత మేము అతని భార్య మినహా అతన్నీ, అతని పరివారాన్నీ కాపాడాము. ఆమె వెనుక ఉండిపోయేవారిలో చేరు తుందని మేము ముందే నిర్ధారించాము.[74]

فَاَنْجَيْنٰهُ وَاَهْلَهٗٓ اِلَّا امْرَاَتَهٗ ۫
قَدَّرْنٰهَا مِنَ الْغٰبِرِيْنَ ﴿٥٧﴾

**58** వారిపై ఒక (ప్రత్యేకమైన రాళ్ల) వాన కురిపించాము.[75] హెచ్చరించబడిన ఆ జనులపై చాలా చెడ్డ వాన కురిసింది.[76]

وَاَمْطَرْنَا عَلَيْهِمْ مَّطَرًا ۚ فَسَآءَ مَطَرُ
الْمُنْذَرِيْنَ ﴿٥٨﴾

**59** (ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు : "ప్రశంసలన్నీ అల్లాహ్‌కే శోభి స్తాయి. ఆయన ఎన్నుకున్న దాసులపై శాంతి కురియుగాక![77] ఏమిటీ, అల్లాహ్ మేలా? లేక వారు భాగస్వాములుగా కల్పిం చుకున్న బూటకపు దేముళ్ళు మేలా?"[78]

قُلِ الْحَمْدُ لِلّٰهِ وَسَلٰمٌ عَلٰى عِبَادِهِ الَّذِيْنَ
اصْطَفٰى ؕ ءٰٓاللّٰهُ خَيْرٌ اَمَّا يُشْرِكُوْنَ ﴿٥٩﴾

**60** కాస్త చెప్పండి, ఆకాశాలనూ, భూమిని సృష్టించిన వారెవరు? ఆకాశం నుంచి మీ కొరకు వర్షాన్ని కురిపించిందెవరు? మరి దాని ద్వారా అందాలు జాలువారే తోటలను ఉత్పత్తి చేసింది ఎవరు? ఆ తోటల చెట్లను మొలకెత్తించటం అనేది మీ వల్ల కాని పని.[79]

اَمَّنْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَاَنْزَلَ لَكُمْ
مِّنَ السَّمَآءِ مَآءً ۚ فَاَنْۢبَتْنَا بِهٖ حَدَآئِقَ ذَاتَ بَهْجَةٍ ۚ
مَا كَانَ لَكُمْ اَنْ تُنْۢبِتُوْا شَجَرَهَا ؕ ءَاِلٰهٌ مَّعَ اللّٰهِ ؕ

---

72. అంటే–మీరు పాల్పడుతున్న ఈ ముదనష్టపు పని ఎలాంటి విపత్కర పరిణామాలకు దారితీస్తుందో మీకు తెలియ దల్లేవుంది. తెలిస్తే మీరు ఈ నీతిబాహ్యమైన చేష్ట జోలికి పోరు.

73. లూతు జాతి వారు ఇచ్చిన ఈ సమాధానంలో వ్యంగ్య ధోరణి ఉంది. మంచిని ప్రబోధించే ప్రవక్తను వారు పరిహసించారు.

74. లూతు భార్య సాగిస్తున్న వెన్నుపోటు కార్యకలాపాల గురించి అల్లాహ్‌కు ముందు నుంచే తెలుసు. ఆమె పశ్చాత్తాపం చెంది దారికి వచ్చే అవకాశాలు లేకపోవటంతో దేవుడు ఆమెను కూడా దుష్టుల జాబితాలో చేర్చాడు.

75. లూత్ జాతి వారిపై కురిపించబడిన రాళ్ల వర్షం గురించి ఇంతకుముందు వివరంగా వచ్చింది. ఒకవైపు నుంచి వారి బస్తీలు తలక్రిందులుగా చేయబడ్డాయి. మరోవైపు నుంచి వారిపై రాళ్ల వర్షం కురిసింది.

76. అంటే – దేవుడు వారిని అకారణంగా శిక్షించలేదు. వారివద్దకు తన సందేశహరులను పంపించాడు. వారి ద్వారా తన ధర్మాన్ని ప్రబోధించాడు. వారిలో ప్రబలివున్న నైతిక రుగ్మతను దూరం చేసేందుకు దైవప్రవక్త శాయశక్తులా కృషిచేశాడు. కాని అసహజమైన లైంగిక వ్యసనానికి బానిస అయిపోయిన ఆ జాతివారు ఎంత చెప్పినా దారికి రాకపోవటంతో దేవుడు తన శిక్షా కొరడాను ఝుళిపించాడు.

77. దేవుడు **'ఎన్నుకున్న దాసులు'** అంటే దైవప్రవక్తలని భావం. వారి ద్వారా ప్రజలు సన్మార్గం పొందారు. వారు ఏకదైవారాధన వైపుకు ప్రజలను పిలిచారు. ప్రజల జీవితాలను తీర్చిదిద్దారు. దేవుని ఆ ప్రియతమ దాసులపై శాంతి కురియుగాక!

78. నిస్సందేహంగా అల్లాహ్‌యే (అంటే ఆయన దాస్యమే) మేలు. ఉపాధి ప్రదాత, సృష్టికర్త ఆయన మాత్రమే. మరి

మరైతే అల్లాహ్‌తోపాటు మరో ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా?[80] (లేనే లేదు) కాని ఈ జనులు సమతౌల్యం నుంచి తొలగి పోతున్నారు.[81]

بَلْ هُمْ قَوْمٌ يَعْدِلُونَ ﴿60﴾

**61** భూమిని నివాసయోగ్యంగా చేసినదెవరు?[82] దాని మధ్య నదీ నదాలను ప్రవహింపజేసింది, దాని నిలకడ కోసం పర్వతాలను పాతిపెట్టింది ఎవరు? రెండు సముద్రాల మధ్య అడ్డుతెరను ఏర్పరచినదెవరు?[83] (ఈ ఏర్పాట్లలో) అల్లాహ్‌తో పాటు ఇంకొక ఆరాధ్య దేవుడు కూడా (సహాయకుడుగా) ఉన్నాడా? (ముమ్మాటికీ లేదు). అయితే వారిలో అనేకులకు అసలేమీ తెలీదు.

أَمَّنْ جَعَلَ الْأَرْضَ قَرَارًا وَجَعَلَ خِلَالَهَا أَنْهَارًا
وَجَعَلَ لَهَا رَوَاسِيَ وَجَعَلَ بَيْنَ الْبَحْرَيْنِ
حَاجِزًا ۗ أَإِلَٰهٌ مَعَ اللَّهِ ۚ بَلْ أَكْثَرُهُمْ لَا يَعْلَمُونَ ﴿61﴾

**62** కలత చెందినవాడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి, అతని వ్యాకులతను దూరం చేసేవాడెవడు?[84] మిమ్మల్ని భూమికి ప్రతినిధులుగా చేసేవాడెవడు?[85] ఏమిటీ, అల్లాహ్‌తో పాటు మరో ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా? మీరు మాత్రం గుణపాఠం గ్రహించేది బహు తక్కువ.

أَمَّنْ يُجِيبُ الْمُضْطَرَّ إِذَا دَعَاهُ وَيَكْشِفُ السُّوءَ
وَيَجْعَلُكُمْ خُلَفَاءَ الْأَرْضِ ۗ أَإِلَٰهٌ مَعَ اللَّهِ ۚ
قَلِيلًا مَا تَذَكَّرُونَ ﴿62﴾

---

అటువంటప్పుడు ఆరాధనకు ఆయన కాకుండా వేరొకరు అర్హులెలా అవుతారు? అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్య దైవాలెవరూ తమ దాసుల అక్కరలు తీర్చలేరు.

79. 59వ ఆయతులో వేయబడిన ప్రశ్నకు వివరణగా ఈ ఆయతులో మరిన్ని విషయాలు లేవనెత్తబడ్డాయి. సృష్టి ప్రక్రియలోనూ, ఆహారాన్ని వొసగటంలోనూ, ప్రణాళికా రచనలోనూ అల్లాహ్ సాటిలేనివాడు. ఆకాశాలను అంత ఎత్తున అపురూపంగా నిర్మించింది, అందులో అందమైన నక్షత్రాలను, గ్రహాలను ఏర్పరచింది ఆయనే. అలాగే భూమిలో పర్వతాలను మేకులుగా పాతిపెట్టినవాడు, భూమిలో నదులను, కాలవలను, సెలయేళ్లను ప్రవహింపజేసేవాడు, రకరకాల వృక్షాలను మొలకెత్తించేవాడు, పంటల్ని పండించేవాడు, వివిధ రకాల జంతువులను సృష్టించినవాడు కూడా ఆయనే. ఆకాశం నుంచి వర్షపు నీటిని కురిపించి తద్వారా అందమైన తోటలను ఉత్పన్నం చేసేవాడు కూడా ఆయనే కదా! ఏమిటీ, మీలో ఎవరయినా ఈ భూమండలంలో దైవప్రమేయం లేకుండా ఒక్క తోటనయినా సృజించగలరా? ఈ విషయాలను ఆనాటి ముష్రిక్కులు కూడా ఒప్పుకునేవారు (ఉదాహరణకు : అన్‌కబూత్ : 63).

80. ఇన్ని వాస్తవాలు తెలిసిన తరువాత కూడా అల్లాహ్‌తోపాటు మరొక దేవుడున్నాడని మీరు అనుకుంటున్నారా? లేక మీరు పూజిస్తున్న ఆ చిల్లర దేవుళ్లు ఈ వస్తువులలో ఏ ఒక్క దానినైనా సృష్టించారా? లేదుకదా! మరలాంటప్పుడు మీరు వారిని పూజలకు అర్హులుగా ఎలా నిలబెట్టుకున్నారు?

81. వారు రుజుమార్గం నుంచి తొలగిపోయి, చిల్లర దేవుళ్ళను అల్లాహ్‌కు భాగస్థులుగా కల్పిస్తున్నారని కూడా అర్థం వస్తుంది.

82. భూమిని నివాసయోగ్యంగా చేయటమంటే అర్థం – మనుగడకు, జీవితానికి అనుకూలంగా మలచటం అన్నమాట! భూమిని చూడండి, అది స్థిరంగా ఉంది. అందులో చలనంగానీ, ప్రకంపనంగానీ లేదు. అందులో పెద్ద పెద్ద పర్వతాలను ప్రతిష్ఠించటంలో కూడ ఎన్నో పరమార్థాలున్నాయి. భూమిలో చలనం, అస్థిరత్వం ఏర్పడకుండా పర్వతాలు ఆపి ఉంచాయి. అందులో ప్రవహించే నదీనదాలు, కాలువలు ప్రజల జీవితావసరాలను తీరుస్తున్నాయి. ఇన్ని అద్భుతమైన ఏర్పాట్లను చేసిన అల్లాహ్‌ను కాదని వేరితర దైవాలను పూజించటం అజ్ఞానమే కదా!

**63** భూమిపైన, సముద్రంపైన – అలుముకున్న చీకట్లలో మీకు దారి చూపేవాడెవడు?[86] తన కారుణ్యానికి (వర్షానికి) ముందే శుభవార్తల్ని అందజేసే గాలులను పంపేవాడెవడు?[87] ఏమిటీ, అల్లాహ్‌తో పాటు వేరొక ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా? వారు కల్పించే భాగస్వామ్యాలకు అల్లాహ్ అతీతుడు, ఉన్నతుడు.

أَمَّنْ يَهْدِيكُمْ فِي ظُلُمَاتِ الْبَرِّ وَالْبَحْرِ وَمَنْ يُرْسِلُ
الرِّيَاحَ بُشْرًا بَيْنَ يَدَيْ رَحْمَتِهِ ۗ أَإِلَٰهٌ مَعَ اللَّهِ ۚ
تَعَالَى اللَّهُ عَمَّا يُشْرِكُونَ (63)

**64** చెప్పండి, తొలిసారి సృష్టిని చేసినదెవరు? మళ్ళీ దాన్ని పునరావృతం చేయగలవాడెవడు?[88] భూమ్యాకాశాల నుంచి మీకు ఉపాధిని (ఆహార వనరులను) సమకూర్చేవాడెవడు?[89] ఏమిటీ, అల్లాహ్‌తోపాటు (ఈ కార్యనిర్వహణలో) ఇంకొక ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా? మీరు సత్యవంతులే అయితే ఆ మేరకు మీ ప్రమాణం ఏదన్నా తీసుకురండి అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

أَمَّنْ يَبْدَأُ الْخَلْقَ ثُمَّ يُعِيدُهُ وَمَنْ يَرْزُقُكُمْ مِنَ
السَّمَاءِ وَالْأَرْضِ ۗ أَإِلَٰهٌ مَعَ اللَّهِ ۚ قُلْ هَاتُوا
بُرْهَانَكُمْ إِنْ كُنْتُمْ صَادِقِينَ (64)

**65** “అల్లాహ్‌కు తప్ప ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న వారెవరికీ అగోచర జ్ఞానం లేదు.[90] తాము ఎప్పుడు తిరిగి లేపబడతామో కూడా వారికి తెలియదు” అని ఓ ప్రవక్తా (స) వారికి చెప్పు.

قُلْ لَا يَعْلَمُ مَنْ فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ الْغَيْبَ
إِلَّا اللَّهُ ۚ وَمَا يَشْعُرُونَ أَيَّانَ يُبْعَثُونَ (65)

83. దీని వివరణ కోసం అల్ ఫుర్ఖాన్ సూరాలోని 53వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి.

84. మానవుడు పైకి ఎన్ని ‘కబుర్లు’ చెప్పినా కష్టాలలో చిక్కుకున్నప్పుడు, దిక్కుతోచని దుస్థితి ఏర్పడినప్పుడు మటుకు తాను నమ్ముకునే మిథ్యా దైవాలన్నింటినీ వదలిపెట్టి నిజదైవం వైపుకు మరలుతాడు. తన ఆరాధనలన్నింటినీ ఆయన కొరకే ప్రత్యేకించుకుని మరీ అభ్యర్థించుకుంటాడు. మరిన్ని వివరాల కోసం ఇస్రా సూరా 67వ వచనాన్ని, అన్ నమ్ల్ సూరా 53వ వచనాన్ని చూడండి.

85. అల్లాహ్‌యే కదా! ఆయన ఒక అనుచర సమాజం తరువాత మరో అనుచర సమాజాన్ని, ఒక జాతి తరువాత మరో జాతిని, ఒక తరం తరువాత మరో తరాన్ని ఉనికిలోకి తెస్తుంటాడు. అలాగాకుండా ఆయన అందరినీ ఒకేసారి ప్రభవింపజేస్తే భూమి తట్టుకోజాలదు. ఆర్థిక సంక్షోభం తలెత్తుతుంది. ఒనరులు చాలక ప్రజలు ఇక్కట్ల పాలవుతారు. తమ మనుగడ కోసం భువిలో అరాచకం సృష్టిస్తారు. ఇలాంటి అస్తవ్యస్త స్థితి నెలకొనరాదన్న ఉద్దేశంతోనే దేవుడు తన ప్రణాళిక ననుసరించి ఒక జాతి తరువాత మరోజాతిని ఉనికిలోకి తెస్తుంటాడు.

86. అంటే రాత్రి చీకట్లలో మీకు మార్గదర్శకత్వం వహించేవాడు అల్లాహ్‌యే. ఆయన ఆకాశంలో మెరిసే నక్షత్రాలను సృజించి, మీరు మీ గమ్యస్థానాలకు చేరుకునేలా చేస్తున్నాడు. అలాగే కొండలను, పర్వతాలను, పర్వత కనుమలను పుట్టించింది కూడా ఆయనే. అవి సరిహద్దు రేఖలుగా, వేర్వేరు ప్రదేశాల మధ్య ప్రకృతిసిద్ధ మార్గాలుగా కూడా ఉపయోగపడుతున్నాయి.

87. వర్షానికి ముందు చల్లని గాలులు శుభవార్తను మోసుకువస్తాయి. అప్పటి వరకూ మండుటెండలకు మాడిన మనుషులు, పశువులు, పక్షులు – అందరూ ఆ చల్లని గాలులను తనివితీరా ఆస్వాదిస్తాయి. ఆహ్లాదాన్ని పొందుతాయి.

88. అంటే, ప్రళయదినాన ఆయన మీకు మలిసారి జీవితాన్ని ప్రసాదిస్తాడు.

89. ఆకాశం నుంచి వర్షం కురిపించి, నేలలో నిక్షిప్తమైవున్న ఖజానాలను (నవ ధాన్యాలను, పండ్లు ఫలాలను) ఉత్పన్నం చేసేవాడు అల్లాహ్‌యే. ఆయన తాను కోరినవారిపై, కోరినంతగా భూమ్యాకాశాల శుభాల ద్వారాలను తెరుస్తాడు.

بَلِ ادّٰرَكَ عِلْمُهُمْ فِى الْاٰخِرَةِ بَلْ هُمْ فِىْ شَكٍّ مِّنْهَا بَلْ هُمْ مِّنْهَا عَمُوْنَ ﴿٦٦﴾

66 అసలు పరలోకానికి సంబంధించి వారి జ్ఞానం స్థంభించి పోయింది.[91] పైగా దాని గురించి వారు సంశయంలో పడి ఉన్నారు. కాదు, దానిపట్ల వారు అంధులైపోయారు.[92]

وَقَالَ الَّذِيْنَ كَفَرُوْۤا ءَاِذَا كُنَّا تُرٰبًا وَّ اٰبَآؤُنَاۤ اَىِٕنَّا لَمُخْرَجُوْنَ ﴿٦٧﴾

67 అవిశ్వాసులు ఇలా అన్నారు: "ఏమిటీ, మేమును, మా తాత ముత్తాతలూను మట్టిగా మారిపోయిన తరువాత కూడా మమ్మల్ని మళ్లీ బయటికి తీయటం జరుగుతుందా?

90. ఏ విధంగానయితే అల్లాహ్ తన సృష్టి ప్రక్రియలో, పోషకత్వంలో, కరుణానుగ్రహాలలో సాటిలేనివాడో అదేవిధంగా రహస్య జ్ఞానం విషయంలో కూడా సాటిలేనివాడు. దేవుడు తన ప్రవక్తలకైనా, దైవదూతలకైనాసరే ఏ మేరకు జ్ఞాన సంపదను ఇస్తాడో ఆ మేరకే వారికి తెలిసి ఉంటుంది. అంతకుమించిన రహస్య జ్ఞానం వారికి సయితం తెలిసి ఉండదు. ఆలిముల్ గైబ్ (రహస్య విషయాల జ్ఞాని) అల్లాహ్ మాత్రమే. ప్రతి విషయం గురించి తెలిసినవానిని, అతి గోప్యమైన విషయం గురించి కూడా తెలిసివున్నవానిని మాత్రమే 'అగోచర జ్ఞాని' అంటారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా అన్నారు : "రేపు ఏం జరగబోతుందో కూడా మహాప్రవక్త ముహమ్మద్ (స)కు తెలుసని ఎవడంటాడో అతను అల్లాహ్‌కు అతి పెద్ద అబద్ధాన్ని అంటగట్టాడు. ఎందుకంటే అల్లాహ్ స్వయంగా ఈ విధంగా అంటున్నాడు– 'భూమ్యాకాశాలలో అగోచర విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్‌కే ఉంది' (సహీహ్ బుఖారీ – హ.నెం.4855; సహీహ్ ముస్లిం – హ.నెం.287; తిర్మిజీ – హ.నెం.3068)

హజ్రత్ ఖతాదా (రజి) ఇలా అంటున్నారు : నక్షత్రాలు మూడు లక్ష్యాల కోసం నిర్మించబడ్డాయి – 1. ఆకాశానికి శోభాయమానంగా. 2. మార్గదర్శక సాధనాలుగా. 3. షైతానులను తరిమికొట్టేవిగా. అయితే దైవాదేశాల గురించి తెలియని స్వార్థపరులు కొందరు ఈ నక్షత్రాల ద్వారా అగోచరజ్ఞానాన్ని ఆర్జించే (జోస్యం చెప్పే) పనిని మొదలెట్టారు. ఉదాహరణకు : ఫలానా నక్షత్ర సమయాన వివాహం జరిగితే ఫలానా నష్టం జరుగుతుందనీ, ఫలానా ముహూర్తాన ప్రయాణానికి బయలుదేరితే కీడు జరుగుతుందనీ, ఫలానా సమయంలో పుడితే అశుభ సూచకమని ఏదేదో చెబుతుంటారు. అవన్నీ ఉత్తుత్తి మాటలే. వారు చెప్పేవి తరచూ అబద్ధాలుగా కూడా తేలుతుంటాయి. భూమ్యాకాశాలలో అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ అగోచర జ్ఞానం లేదని అల్లాహ్ స్వయంగా చెబుతుండగా చిలకల ద్వారా, నక్షత్రాల ద్వారా, పాచికల ద్వారా ఈ జ్ఞానం ఎలా ఆర్జించబడుతుంది? (ఇబ్నె కసీర్).

91. అంటే పరలోకం ఎప్పుడు సంభవిస్తుంది? అన్న విషయం ఎవరికీ తెలియదు. హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) ప్రళయం సంభవించే విషయమై మహా ప్రవక్త (సఅసం)ను అడిగితే, "దీని గురించి చెప్పేవానికి అడిగేవానికన్నా ఎక్కువేమీ తెలీదు" అని అన్నారు. లేక దీనికి మరో అర్థం ఇది : వారి జ్ఞానం అక్కడితో ఆగిపోయింది. ఎందుకంటే ప్రళయం గురించి చేయబడిన వాగ్దానాలను వారు తమ కళ్లారా చూసుకున్నారు. అందువల్ల పరలోకం గురించిన జ్ఞానం ఇప్పుడు వారికి ఏవిధంగానూ ప్రయోజనకారి కాజాలదు. ఎందుకంటే ప్రపంచంలో వారు నిరంతరం దాన్ని ధిక్కరిస్తూ ఉండేవారు. "వారు మా ముందు హాజరయ్యే రోజున వారి చెవులు కూడా బాగానే వింటాయి. వారి కళ్లు కూడా బాగానే చూస్తాయి. కాని ఈనాడు దుర్మార్గులు మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు." (మర్యమ్ – 38)

92. ప్రాపంచిక వ్యామోహంలో దారుణంగా చిక్కుకుని ఉన్న వీళ్ళకు పరలోకం గురించి చెబితే అర్థం కావటం లేదు. పైగా పరలోకం అనేసరికి రకరకాల సందేహాలను లేవనెత్తుతారు. ఇక్కడికొచ్చేసరికి వారి బుద్ధిజ్ఞానాలు స్థంభించి పోతున్నాయి. వారి మనోనేత్రం మూసుకుపోతుంది.

68 "చాలా కాలంగా మాకు, మా తాత ముత్తాతలకు కూడా ఇలాంటి వాగ్దానాలే చేయబడుతూ వచ్చాయి. ఇవి పూర్వీకుల కట్టుకథలు తప్ప మరేమీ కావు."[93]

لَقَدْ وُعِدْنَا هَٰذَا نَحْنُ وَآبَاؤُنَا مِن قَبْلُ إِنْ هَٰذَا إِلَّا أَسَاطِيرُ الْأَوَّلِينَ (68)

69 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "అపరాధులకు పట్టిన గతేమిటో కాస్త భూమిలో సంచరించి చూడండి!"[94]

قُلْ سِيرُوا فِي الْأَرْضِ فَانظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُجْرِمِينَ (69)

70 నువ్వు వాళ్ల గురించి దుఃఖించకు. వాళ్లు పన్నే కుట్రలకు కూడా నీకు మనస్తాపం కలగకూడదు.

وَلَا تَحْزَنْ عَلَيْهِمْ وَلَا تَكُن فِي ضَيْقٍ مِّمَّا يَمْكُرُونَ (70)

71 "మీరు చెప్పేదే నిజమైతే ఆ వాగ్దానం ఎప్పుడు నెరవేరుతుందో?" అని వారు (వెటకారంగా) అంటున్నారు కదూ!

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا الْوَعْدُ إِن كُنتُمْ صَادِقِينَ (71)

72 "మీరు వేటిని గురించి తొందర పెడుతున్నారో వాటిలో కొన్ని విషయాలు బహుశా మీకు అత్యంత సమీపంలోనే ఉన్నాయేమో!"[95] అని వారికి సమాధానం ఇవ్వు.

قُلْ عَسَىٰ أَن يَكُونَ رَدِفَ لَكُم بَعْضُ الَّذِي تَسْتَعْجِلُونَ (72)

73 వాస్తవానికి నీ ప్రభువు మానవులపై ఎంతో దయగలవాడు. కాని వారిలో చాలా మంది కృతజ్ఞులుగా మెలగరు.[96]

وَإِنَّ رَبَّكَ لَذُو فَضْلٍ عَلَى النَّاسِ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَشْكُرُونَ (73)

74 నిశ్చయంగా నీ ప్రభువుకు వారి ఆంతర్యాలు దాచి ఉంచేవీ తెలుసు, బహిర్గతం చేసేవి కూడా తెలుసు.

وَإِنَّ رَبَّكَ لَيَعْلَمُ مَا تُكِنُّ صُدُورُهُمْ وَمَا يُعْلِنُونَ (74)

75 భూమ్యాకాశాలలో దాగివున్న ఏ వస్తువు కూడా స్పష్టమైన ఒక గ్రంథంలో నమోదవకుండా లేదు.[97]

وَمَا مِنْ غَائِبَةٍ فِي السَّمَاءِ وَالْأَرْضِ إِلَّا فِي كِتَابٍ مُّبِينٍ (75)

93. ఇందులో వాస్తవం ఏమీ లేదు. ఈ కథలను ఒకరినుంచి ఇంకొకరు విని జనులకు చెబుతూ వస్తున్నారంతే!

94. అవిశ్వాసుల మాటలకు ఈ వాక్యంలో సమాధానం ఇవ్వబడింది. ఏమిటీ, ధిక్కార వైఖరిని అవలంబించిన వారికి ఏ గతిపట్టిందో మీరు భూమిలో తిరిగి చూడరా?! వినాశాన్ని చవిచూసిన జాతుల గాథలు మీకు గుణపాఠం కావటంలేదా? దైవ ప్రవక్తలు సత్యవంతులని చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలవా? గతించిన జాతుల గురించి మా ప్రవక్తలు చెప్పేది నిజమైనట్లే పరలోకం గురించి, మరణానంతర జీవితం గురించి చెప్పేది కూడా నిజమే.

95. బహుశా బద్ర్ యుద్ధంలో అవిశ్వాసులకు ఎదురుకానున్న పరాభవాన్ని గురించి ఇందులో సంకేతం ఇవ్వబడి ఉండవచ్చు. లేదా సమాధి యాతనను దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా అనబడి ఉంటుంది. **'రదిఫ'** (رَدِفَ) అంటే దగ్గరవటం అని అర్థం. వాహనంపై చోదకుని వెనుక కూర్చునే వ్యక్తిని 'రదీఫ్' అని పిలుస్తారు.

96. మనుషులు తలబిరుసులుగా ప్రవర్తించినా, వారిని తక్షణమే పట్టుకోకుండా వారికి కొంత గడువు ఇవ్వటం కూడా దేవుని గొప్ప అనుగ్రహమే. కాని జనులు ఈ 'విడుపు'ను, ఈ ఉపేక్షను దుర్వినియోగం చేసుకోవటం కదు శోచనీయం.

97. **'స్పష్టమైన గ్రంథం'** అంటే 'లౌహె మహ్‌ఫూజ్' అన్నమాట! గోప్యమైన ఎన్నో వస్తువుల గురించి అందులో పొందుపరచబడి ఉంది. దేవుడు దుర్మార్గులకు విధించే యాతన గురించి కూడా అందులో వ్రాయబడి ఉంది. అయితే ఆ

إِنَّ هَٰذَا الْقُرْآنَ يَقُصُّ عَلَىٰ بَنِي إِسْرَائِيلَ أَكْثَرَ
الَّذِي هُمْ فِيهِ يَخْتَلِفُونَ ﴿76﴾

**76** నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ ఇస్రాయీలు వంశీయులకు వారు విభేదించుకునే ఎన్నో విషయాల (లోని వాస్తవికత)ను విడమరచి చెబుతున్నది.[98]

وَإِنَّهُ لَهُدًى وَرَحْمَةٌ لِّلْمُؤْمِنِينَ ﴿77﴾

**77** ఇంకా నిస్సందేహంగా ఈ ఖుర్ఆన్ విశ్వాసుల కొరకు మార్గదర్శిగానూ, కారుణ్యంగానూ ఉన్నది.[99]

إِنَّ رَبَّكَ يَقْضِي بَيْنَهُم بِحُكْمِهِ ۚ
وَهُوَ الْعَزِيزُ الْعَلِيمُ ﴿78﴾

**78** నీ ప్రభువు వీరి మధ్య తన ఆజ్ఞానుసారం తీర్పు చేస్తాడు.[100] ఆయన అత్యంత శక్తిసంపన్నుడు, అన్నీ తెలిసినవాడు.

فَتَوَكَّلْ عَلَى اللَّهِ ۖ إِنَّكَ عَلَى الْحَقِّ الْمُبِينِ ﴿79﴾

**79** కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు అల్లాహ్‌పైనే భారం మోపు. ముమ్మాటికీ నువ్వు స్పష్టమైన సత్యపథాన ఉన్నావు.[101]

إِنَّكَ لَا تُسْمِعُ الْمَوْتَىٰ وَلَا تُسْمِعُ الصُّمَّ الدُّعَاءَ
إِذَا وَلَّوْا مُدْبِرِينَ ﴿80﴾

**80** నువ్వు మృతులకు వినిపించలేవు.[102] అలాగే వీపు తిప్పుకుని, విముఖతను ప్రదర్శిస్తూ పోయే చెవిటి వారికి కూడా నువ్వు నీ పిలుపును వినిపించలేవు.[103]

---

ఘడియ ఎప్పుడు వస్తుంది? అది కూడా అల్లాహ్‌కే తెలుసు. ఏ జాతినయినా శిక్షించవలసిన సమయాన్ని ఆయన అందులో ఒకసారి నిర్ధారించిన తరువాత, ఇక అది వాయిదా వెయ్యబడటం అనేది జరగదు. అలాంటప్పుడు ఆ నిర్ణీత ఘడియ గురించి అవిశ్వాసులు హడావిడి చేయాల్సిన అవసరం లేదు. సంభవించవలసిన క్షణాన అది తప్పకుండా సంభవిస్తుంది.

98. గ్రంథం కల ప్రజలైన యూదులు, క్రైస్తవులు వివిధ వర్గాలుగా, తెగలుగా చీలిపోయారు. వారి విశ్వాసాలు కూడా ఒండొకరికి భిన్నంగా ఉండేవి. ఇటు యూదులు ఈసా (అలైహిస్సలాం)ను తెగనాడుతుంటే, అటు క్రైస్తవులు ఈసా (ఏసుక్రీస్తు)ను పొగడటంలో అతిశయిల్లేవారు. తుదకు ఏసుక్రీస్తును దేవునిగా, దేవుని కుమారునిగా ఖరారు చేశారు. అట్టి పరిస్థితిలో దివ్య ఖుర్ఆన్ ఆ విషయాలలోని నిజానిజాలను విడమరచి చెప్పింది. దివ్య ఖుర్ఆన్ వివరించిన ఆ నిజాలను గనక వారు ఒప్పుకుంటే, వారి మధ్య గల సైద్ధాంతిక విభేదాలన్నీ సమసిపోతాయి.

99. **'విశ్వాసుల కొరకు'** అని ప్రత్యేకంగా ఎందుకు చెప్పబడిందంటే, విశ్వసించిన వారే నిజభావంలో ఖుర్ఆన్ మాధుర్యాన్ని ఆస్వాదించగలుగుతారు. ఈ మాధుర్యాన్ని ఆస్వాదించే వారిలో ఇస్రాయీల్ సంతతిలోని విశ్వసించినవారు కూడా ఉన్నారు.

100. అంటే తీర్పుదినాన అల్లాహ్ వారి మధ్య గల విభేదాలపై, వివాదాలపై అంతిమ నిర్ణయం గైకొని సత్యాన్ని అసత్యం నుంచి వేరుపరుస్తాడు. ఆ నిర్ణయం ప్రకారమే ఆయన శిక్షా బహుమానాలను నిర్ధారిస్తాడు. లేదా వారు తమ గ్రంథాలలో చేసిన ప్రక్షిప్తాల బండారాన్ని ప్రపంచంలో బట్టబయలు చేసి, వాళ్ళ నిజస్వరూపాన్ని బయటపెడతాడు.

101. అంటే నీ వ్యవహారాన్ని నీ ప్రభువుకే అప్పగించు. ఆయన్ని నమ్ముకో. సర్వదా నీకు సహాయపడేవాడు ఆయనే. ఎందుకంటే నువ్వు సత్యమార్గంపై ఉన్నావు. అందువల్ల నువ్వు జంకవలసిన పని లేదు.

102. ఈ అవిశ్వాసుల పెడసరి పోకడలను లక్ష్యపెట్టకుండా కేవలం అల్లాహ్‌పై భారం మోపు. ఎందుకంటే వాళ్లు మృత కళేబరాల్లాంటివారు. వారు ఎవరి మాటనయినా విని ప్రయోజనం పొందలేరు. లేదా వారు చెవిటివారు. వినలేరు, అర్థం చేసుకోలేరు. ఈ ఆయతులో అవిశ్వాసులు మృతులతో పోల్చబడ్డారు. మృతులలో స్పందనగానీ, వివేచనగానీ ఉండదు. అలాగే వారు చెవిటివారుగా అభివర్ణించబడ్డారు. చెవిటివారు ఉపదేశాన్ని విననూలేరు, అర్థం చేసుకోనూలేరు.

وَمَآ اَنۡتَ بِهٰدِى الۡعُمۡىِ عَنۡ ضَلٰلَتِهِمۡ‌ؕ اِنۡ تُسۡمِعُ اِلَّا مَنۡ يُّؤۡمِنُ بِاٰيٰتِنَا فَهُمۡ مُّسۡلِمُوۡنَ ﴿81﴾

**81** గుడ్డివారిని కూడా నువ్వు వారి అపమార్గం నుంచి మళ్ళించి, సన్మార్గానికి తేలేవు.[104] మా ఆయతులను విశ్వసించి, విధేయత చూపేవారికి మాత్రమే నువ్వు (నీ వాణిని) వినిపించ గలవు.

وَاِذَا وَقَعَ الۡقَوۡلُ عَلَيۡهِمۡ اَخۡرَجۡنَا لَهُمۡ دَآبَّةً مِّنَ الۡاَرۡضِ تُكَلِّمُهُمۡ ۙ اَنَّ النَّاسَ كَانُوۡا بِاٰيٰتِنَا لَا يُوۡقِنُوۡنَ ﴿82﴾

**82** వారిని శిక్షించే మాట ఖరారు అయినప్పుడు,[105] మేము వారి కోసం భూమి నుండి ఒక జంతువును వెలికి తీస్తాము. అది వారితో మాట్లాడుతుంది:[106] ఎందుకంటే ప్రజలు మా ఆయతులను నమ్మేవారు కారు.[107]

103. వారు సత్యం పట్ల ద్వేషాన్ని వెళ్లగ్రక్కుతున్నారు. చెవిటివారు అసలే మాటను వినలేరు. పైగా ఆ చెవిటివారిలో వైముఖ్యధోరణి, తలబిరుసుతనం కూడా ఉంటే పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహించండి! ఖుర్ఆన్‌లోని ఈ ఆయతు ద్వారా తెలిసే మరో ముఖ్య విషయం ఏమంటే మృతులు వింటాయి అనే నమ్మకం ఖుర్ఆన్‌కు విరుద్ధమైనది. మృతులు ఎవరి మాటనూ వినలేవు. కాకపోతే కొన్ని ప్రత్యేక సందర్భాలలో దీనికి మినహాయింపు ఉంది. ప్రామాణిక ఆధారాల ద్వారా నిరూపితమై ఉన్న ఆ ప్రత్యేక సందర్భాలను మినహాయిస్తే–సాధారణంగా – మృతులకు వినేశక్తి ఉండదు. ఉదాహరణకు హదీసు ప్రకారం, మరణించిన వ్యక్తిని జనులు ఖననం చేసి తిరిగివస్తున్నప్పుడు, ఆ మృతుడు వారి చెప్పుల సవ్వడిని వింటాడు. (సహీహ్ బుఖారీ–హ.నెం. 338; సహీహ్ ముస్లిం–2201). అలాగే బద్ర్ యుద్ధ సందర్భంగా వధించబడిన అవిశ్వాసులను ఉద్దేశించి మహాప్రవక్త (సఅసం) కొన్ని మాటలు పలికారు. అప్పుడు ఆయన ప్రియసహచరులు (రజి), "తమరు నిర్జీవమైన భౌతికకాయాలతో సంభాషిస్తు న్నారా?" అని అన్నారు. "వారు మీకన్నా ఎక్కువగా నా మాటను వింటున్నారు" అని మహాప్రవక్త (స) సెలవిచ్చారు. అంటే ఆ సమయంలో అల్లాహ్ అద్భుతమైన రీతిలో ఆయన (స) మాటలను అవిశ్వాసులైన మృతులకు వినిపించాడు (సహీహ్ బుఖారీ – 1307).

104. అంటే అల్లాహ్ ఎవరినయితే సత్యం పట్ల అంధునిగా చేసివేశాడో, వారిని నువ్వు సన్మార్గానికి తేలేవు. వారు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించలేరు.

105. అప్పుడు మంచిని ప్రబోధించేవారు, చెడుల నుంచి ఆపేవారు ఎవరూ ఉండరు.

106. ప్రళయదినం సమీపించిందని తెలిపే సూచనలలో ఆ జంతువు ఒకటి. హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. "మీరు పది సూచనలను చూడనంతవరకూ ప్రళయం సంభవించదు. వాటిలో ఒకటి: జంతువు వెలికి రావటం" అని అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు ప్రవచించారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఫితన్). వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది – "అన్నిటికన్నా మొట్టమొదటి సూచన ఏమిటంటే సూర్యుడు తూర్పుదిక్కు నుంచి కాకుండా పడమటి దిక్కున ఉదయిస్తాడు. 'చాష్త్' సమయాన జంతువు వెలికివస్తుంది. ఈ రెంటిలో ఏ సూచన మొదట ప్రస్ఫుటమైనా, రెండవ సూచన కూడా వెనువెంటనే ప్రస్ఫుటం అవుతుంది" (సహీహ్ ముస్లిం – బాబున్ ఫీ ఖురూజిద్దజ్జాల్).

107. జంతువు వెలికి రావటానికి గల కారణం ఇక్కడ తెలుపబడింది. ఎందుకంటే ప్రజలు దేవుని సూచనలను లేదా నిదర్శనాలను నమ్మేవారు కారు. మరి కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఆ జంతువు స్వయంగా "ప్రజలు మా ఆయతులను నమ్మేవారు కారు" అని అంటుంది. ఖుర్ఆన్‌లో స్వయంగా ఈ మాటలుండటం వల్ల ప్రజలు దీనిపట్ల సందేహానికి లోను కావలసిన అవసరమే ఉండదు.

**83** ఆ రోజు మేము ప్రతి మానవ సమాజం నుంచి, మా ఆయతులను ధిక్కరించే ఒక్కొక్క సమూహాన్ని చుట్టుముట్టి మరీ తెస్తాము. ఆ తరువాత వారంతా వర్గీకరించబడతారు.[108]

ويوم نحشر من كل أمة فوجا ممن يكذب
بآياتنا فهم يوزعون ﴿٨٣﴾

**84** వారంతా ఒకచోట చేరిన తరువాత (అల్లాహ్ ఇలా) అడుగుతాడు: "మీరు నా ఆయతులను గురించి పూర్తిగా తెలియక పోయినప్పటికీ ఎందుకు ఖండించారు?[109] ఇంతకీ మీరేం చేస్తూ ఉండేవారో చెప్పండి?"[110]

حتى إذا جاءوا قال أكذبتم بآياتي ولم تحيطوا بها
علما أماذا كنتم تعملون ﴿٨٤﴾

**85** వారు చేసిన దురాగతాల మూలంగా శిక్షకు సంబంధించిన మాట వారి విషయంలో నెరవేరుతుంది. అందువల్ల వారేమీ మాట్లాడలేరు.[111]

ووقع القول عليهم بما ظلموا فهم
لا ينطقون ﴿٨٥﴾

**86** వారు విశ్రాంతి తీసుకునేందుకుగాను మేము రాత్రిని చేశాము. ఇంకా పగటిని చూపగలిగేదిగా చేశాము.[112] దీనిని వారు గమనించటం లేదా? నిశ్చయంగా విశ్వసించే వారి కోసం ఇందులో నిదర్శనాలున్నాయి.

ألم يروا أنا جعلنا الليل ليسكنوا فيه والنهار
مبصرا ۚ إن في ذلك لآيات لقوم يؤمنون ﴿٨٦﴾

**87** శంఖం ఊదబడే రోజున ఆకాశాలలో ఉన్నవారు, భూమిపై ఉన్న వారంతా భీతావహులైపోతారు[113] – కాని అల్లాహ్ తలచిన వారికి మాత్రం ఆ స్థితి ఏర్పడదు.[114] అందరూ (అశక్తులై), కదు వినమ్రులై ఆయన ముందు హాజరవుతారు.

ويوم ينفخ في الصور ففزع من في السماوات ومن
في الأرض إلا من شاء الله ۚ وكل أتوه داخرين ﴿٨٧﴾

108. అపరాధులు, వారు చేసిన అపరాధాలనుబట్టి విభజించబడతారు. ఉదా: మద్యపాన ప్రియుల జట్టు, హంతకుల జట్టు, వ్యభిచారుల జట్టు – ఇలా వేర్వేరు జట్లుగా వర్గీకరించబడతారు. లేదా వారు ఒకే చోట మంద వేయబడతారు. ముందు వైపుకుగానీ, వెనుక వైపుకు గానీ, కుడి వైపుకుగానీ, ఎడమ వైపుకు గానీ వెళ్ళకుండా ఆపబడతారు. ఆ విధంగా వారిలోని ఒక్కొక్క గుంపూ వరుసగా నరకానికి ఆహుతి చేయబడుతుంది.

109. అంటే – మీరు నా అభిమతాన్ని, ఏకత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఏ విధంగా ప్రయత్నించాలో ఆ విధంగా ప్రయత్నించలేదు. ప్రయత్నించకుండానే – స్థూల దృష్టితో – నా ఆయతులను త్రోసిపుచ్చారు. అందువల్ల నా సందేశంలోని మాధుర్యాన్ని ఆస్వాదించే భాగ్యం మీకు లభించలేదని దేవుడంటాడు.

110. మీరు నా సందేశాన్ని గురించి చిత్తశుద్ధితో ఎందుకు ఆలోచించలేదు? మీరు ఏ ముఖ్యమైన పనుల్లో తలమునకలై ఉండటం వల్ల దీన్ని విస్మరించారో చెప్పండి?!

111. వారి దగ్గర సరైన సంజాయిషీ ఏదీ లేకుండా పోతుంది. లేదా ప్రళయదినం నాటి భయంకర సన్నివేశాల మూలంగా వారికి ఎటూ పాలుపోదు. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఆనాడు అపరాధుల నోళ్ళకు సీలు వేయబడుతుంది. తత్కారణంగా వారు ఏమీ చెప్పలేకపోతారు.

112. ప్రజలు ఉపాధి మార్గాలను అన్వేషించేందుకుగాను మేము పగలును ప్రకాశవంతంగా చేశాము.

113. శంఖం అంటే దైవాజ్ఞపై హజ్రత్ ఇస్రాఫీల్ (అలైహిస్సలాం) ఊదే కొమ్ము అని భావం. ఈ శంఖారావం రెండు లేక

**88** నీవు పర్వతాలను చూచి, అవి ఉన్న చోటే స్థిరంగా ఉంటాయని అనుకుంటున్నావు. కాని అవి కూడా మేఘ మాలికల్లా తేలిపోతుంటాయి.[115] ఇది అల్లాహ్ పనితనం, ఆయన ప్రతి వస్తువును చాలా గట్టిగా చేశాడు.[116] మీరు చేసేదంతా ఆయనకు తెలుసు.

وَتَرَى الْجِبَالَ تَحْسَبُهَا جَامِدَةً وَهِيَ تَمُرُّ مَرَّ
السَّحَابِ ۚ صُنْعَ اللَّهِ الَّذِي أَتْقَنَ كُلَّ شَيْءٍ ۚ
إِنَّهُ خَبِيرٌ بِمَا تَفْعَلُونَ ﴿٨٨﴾

**89** ఎవరయితే మంచిని తీసుకువస్తారో వారికి దానికంటే ఉత్తమమైన ప్రతిఫలం లభిస్తుంది. వారు ఆనాటి భయోత్పాతం నుండి సురక్షితంగా ఉంటారు.[117]

مَن جَاءَ بِالْحَسَنَةِ فَلَهُ خَيْرٌ مِّنْهَا وَهُم مِّن
فَزَعٍ يَوْمَئِذٍ آمِنُونَ ﴿٨٩﴾

**90** మరెవరయితే చెడును తీసుకువస్తారో వారు బోర్లాగా అగ్నిలో పడవేయబడతారు. మీరు చేసుకున్న కర్మలకు తగిన ప్రతిఫలమే మీకు ఇవ్వబడుతుంది (అని వారితో అనబడుతుంది).

وَمَن جَاءَ بِالسَّيِّئَةِ فَكُبَّتْ وُجُوهُهُمْ فِي النَّارِ
هَلْ تُجْزَوْنَ إِلَّا مَا كُنتُمْ تَعْمَلُونَ ﴿٩٠﴾

**91** నేను ఈ నగరం (మక్కా) ప్రభువును మాత్రమే ఆరాధిస్తూ ఉండాలని నాకు ఆదేశించబడింది. ఆయన దీన్ని పవిత్రమైనదిగా చేశాడు.[118] అన్నింటికీ ఆయనే యజమాని. నేను విధేయులలో ఒకడిగా ఉండాలని కూడా నాకు ఆజ్ఞాపించబడింది.

إِنَّمَا أُمِرْتُ أَنْ أَعْبُدَ رَبَّ هَٰذِهِ الْبَلْدَةِ الَّذِي
حَرَّمَهَا وَلَهُ كُلُّ شَيْءٍ ۖ وَأُمِرْتُ أَنْ أَكُونَ
مِنَ الْمُسْلِمِينَ ﴿٩١﴾

---

రెండుసార్లకన్నా ఎక్కువే ఉంటుంది. మొదటిసారి శంఖారావానికి యావత్ప్రపంచం భీతిల్లి స్పృహ కోల్పోతుంది. రెండవసారి శంఖం ఊదగానే అందరూ మృత్యువు ఒడిలోకి జారుకుంటారు. మూడవసారి శంఖారావానికి అందరూ సమాధులలో నుంచి లేచి నిలబడతారు. మరికొంతమంది ప్రకారం నాల్గవసారి శంఖం ఊదగానే అందరూ మహ్షర్ మైదానంలో చేరతారు. ఈ ఆయతులో పేర్కొనబడిన శంఖారావం ఎన్నోది? ఇమామ్ ఇబ్నె కసీర్ దృష్టిలో ఇది మొదటిది. ఇమామ్ షౌకానీ దృష్టిలో ఇది మూడవది. ఈ మూడవసారి శంఖారావంతో అందరూ సమాధులలో నుంచి లేచివస్తారు.

114. భీతావహస్థితి నుంచి సురక్షితంగా ఉండేవారు ఎవరు? వారు దైవప్రవక్తలు, అమరగతులు అని కొందరు అభిప్రాయపడగా, దైవదూతలు అని మరికొందరు అభిప్రాయపడ్డారు. విశ్వాసులంతా ఆ కళవళ స్థితినుంచి సురక్షితంగా ఉంటారని ఇంకొందరు భావిస్తున్నారు. పైన పేర్కొనబడిన వారంతా ఈ ప్రత్యేక జాబితాలో ఉంటారని ఇమామ్ షౌకానీ వ్యాఖ్యానించారు. ఎందుకంటే విశ్వసించిన పుణ్యాత్ములకు భీతి ఉండదన్న విషయం ముమ్ముందు రాబోతోంది.

115. ఇది ప్రళయదినం నాటి పరిస్థితి. ఆనాడు పెద్ద పెద్ద పర్వతాలు సయితం మేఘాల్లా, దూదిపింజాల్లా ఎగిరి గాలిలో తేలిపోతుంటాయి.

116. ప్రతి వస్తువును ఎంతో పకడ్బందీగా – గట్టిగా – నిర్మించటం అనేది దేవుని అద్భుత సృష్టికి ప్రబల తార్కాణం. అయితే ఎంతో గట్టిగా, స్థిరంగా ఉండే పెద్ద పెద్ద వస్తువులను సయితం అవసరమైనపుడు దూదిపింజాల్లా ఎగురవేయటం కూడా ఆయన సృష్టి మహిమలో అంతర్భాగమే.

117. అంటే వారు ఆ భయాందోళన నుంచి సురక్షితంగా ఉంటారు. "ఆ పెద్ద భయాందోళన కూడా వారిని దుఃఖానికి లోను చేయదు." (అంబియా – 103)

118. అది మక్కా నగరం. ఈ నగరాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనార్హం. ఈ నగరంలో పవిత్ర కాబా

وَاَنْ اَتْلُوَا الْقُرْاٰنَ ۚ فَمَنِ اهْتَدٰى فَاِنَّمَا يَهْتَدِيْ لِنَفْسِهٖ ۚ وَمَنْ ضَلَّ فَقُلْ اِنَّمَآ اَنَا مِنَ الْمُنْذِرِيْنَ ﴿٩٢﴾

**92** ఇంకా, నేను ఖుర్ఆన్‌ను పారాయణం చేస్తూ ఉండాలి (అని కూడా నాకు ఆజ్ఞాపించబడింది). సన్మార్గానికి వచ్చినవాడు తన స్వయానికి మేలు చేసుకోవటానికే సన్మార్గానికి వచ్చాడు. మరెవరయినా అపమార్గానపోతే, "నేను హెచ్చరించేవాణ్ణి మాత్రమే"[119] అని (ఓ ప్రవక్తా!) చెప్పు.

وَقُلِ الْحَمْدُ لِلّٰهِ سَيُرِيْكُمْ اٰيٰتِهٖ فَتَعْرِفُوْنَهَا ؕ وَمَا رَبُّكَ بِغَافِلٍ عَمَّا تَعْمَلُوْنَ ﴿٩٣﴾

**93** ఇంకా ఈ విధంగా చెప్పు : "సర్వ స్తోత్రములు అల్లాహ్‌కే శోభిస్తాయి.[120] ఆయన త్వరలోనే తన సూచనలను మీకు చూపిస్తాడు. వాటిని మీరు స్వయంగా తెలుసుకుంటారు.[121] మీరు చేసే పనుల విషయంలో అల్లాహ్ ఏమాత్రం అజాగ్రత్తగా లేదు.[122]

గృహం ఉంది. అంతిమ దైవప్రవక్త (సఅసం)కు ఈ నగరం ఎంతో ప్రియమైనది. 'పవిత్రంగా' చేయటమంటే అర్థం ఈ నగరంలో రక్తపాతం సృష్టించటం, వేటాడటం, అన్యాయానికి పాల్పడటం వంటివి నిషేధించబడ్డాయి. తుదకు ఇక్కడి చెట్లు నరకటం కూడా నిషిద్ధమే (బుఖారీ – కితాబుల్ జనాయెజ్; ముస్లిం – కితాబుల్ హజ్).

119. అంటే – సందేశాన్ని అందజేయటం వరకే నా పని. నా సందేశాన్ని ఆలకించి ఎవరయినా సన్మార్గం పొందితే అది అతనికే ప్రయోజనకరం. అలాంటి వ్యక్తిని దేవుడు నరకయాతన నుండి రక్షిస్తాడు. ఎవరైనా నా మాట వినకపోతే నాకు కలిగే నష్టం ఏమీలేదు. అతని లెక్క తీసుకోవడానికి అల్లాహ్ ఒక్కడే చాలు. అలాంటి మార్గభ్రష్టుల గమ్యం నరకమే.

120. ప్రశంసలు పొగడ్తలన్నీ ఆ సర్వలోక ప్రభువుకే తగును. ఎందుకంటే ఆయన గొప్ప ఉదాత్తుడు. శిక్షించటంలో ఆయన తొందరపడడు. తన దాసులకు ఆయన ఆఖరిక్షణాల వరకూ పశ్చాత్తాపం చెందే అవకాశమిస్తాడు. అప్పటికీ వారు రుజువర్తనులు కాకపోతేనే శిక్షిస్తాడు.

121. ఆ మాటే మరోచోట ఈ విధంగా చెప్పబడింది: "మేము శీఘ్రంగానే వారికి మా సూచనలను వారి పరిసరాలలో ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము. స్వయంగా వారిలోనూ చూపిస్తాము – తద్వారా సత్యం వారి ముందు విస్పష్టమవుతుంది" (హామీమ్ సజ్దా–53). ఒకవేళ వారు జీవిత కాలంలో ఈ సూచనలను చూసి విశ్వసించక పోయినా మరణ ఘడియల్లోనయినా ఆ సూచనలను చూసి తప్పకుండా విశ్వసిస్తారు. కాని ఆ సమయంలో అయ్యే జ్ఞానోదయం వారికేవిధంగానూ లబ్ధిని చేకూర్చదు. ఎందుకంటే గుండెలోని ప్రాణం గొంతు దాకా వచ్చేసినప్పుడు ప్రకటించే విశ్వాసం స్వీకృతి పొందదు.

122. పైగా ఆయన ఎంతో అప్రమత్తంగా ఉన్నాడు. అన్నింటినీ కనిపెట్టుకుని ఉన్నాడు. ఈ వాక్యంలో అవిశ్వాసులకు తీవ్రమైన హెచ్చరిక ఉంది.

28వ సూరా

# అల్ ఖసస్

## గాధలు

అవతరణ మక్కాలో

ఆయతులు 88

### పరిచయం

*ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాలు వంటి మౌలిక ధార్మిక విశ్వాసాలను ఈ సూరా నొక్కి చెప్పింది. మూసా(అస) గాధకు సంబంధించిన వివరాలు ప్రస్తావించినందువల్ల ఈ సూరాకు ఈ పేరు వచ్చింది. ఇరవయ్యవ సూరాలోకన్నా ఎక్కువగా ఇందులో వివరంగా మూసా(అస) గురించిన ప్రస్తావన ఉంది. ఈ వివరాలు విశ్వాసులకు – అవిశ్వాసులకు మధ్య, సత్యానికి – అసత్యానికి మధ్య ఘర్షణను గురించి తెలుపుతున్నాయి. ఫిర్‌ఔన్‌పై మూసా(అస) సాధించిన విజయం గురించిన వివరాలు ఇందులో ఉన్నాయి. అవిశ్వాసుల పరిస్థితి ఇందులో తెలియజేయడం జరిగింది. విశ్వాసులు పొందే సాఫల్యం, వారికి లభించే బహుమానం గురించి చెప్పడం జరిగింది.*

*అల్లాహ్ అపార కరుణామయుడనీ, జాతులు తప్పులకు పాల్పడనంతవరకూ ఆయన ఎవ్వరినీ నాశనం చేయలేదని, ఆయన ప్రజల వద్దకు తన సందేశహరులను పంపి వారికి దైవాగ్రహం గురించిన హెచ్చరికలు ముందుగానే చేసాడని వివరిస్తూ ఈ సూరా ఏకదైవారాధనా సూత్రాలతో ముగుస్తుంది.*

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 3-40 | 83-117 | 'దైవప్రవక్త మూసా, ఇస్రాయీల్ జాతివారి విమోచన కర్త' | దివ్యఖుర్‌ఆన్ గ్రంథంలో ఎన్నో విభాగాలుగా, ఎన్నో చోట్ల ప్రస్తావించబడింది మూసా (అ) చరిత్ర. అలా అని చెప్పిన మాటే మళ్ళీ మళ్ళీ చెప్పబడలేదు. ప్రతిసారి ఏదో ఒక కొత్త విషయం! ఏదో ఒక సరికొత్త కోణం!! మరి ఆ వింత సంగతులన్నింటినీ మాలగా కూర్చుకొని చదువుకుంటే ఇంకెంత బాగుంటుంది! |
| 76-83 | 115 | 'మహా సంపన్నుడు ఖారూన్' | నడమంత్రపు సిరిని పొంది, తమ పాత రోజులను, అప్పటి కష్టాలను మరచిపోయి, తమ దగ్గరున్నదంతా తమ తెలివి తేటలతో సంపాదించుకున్నదే అని విర్రవీగితే...అందులో అల్లాహ్ కారుణ్యం ఏమీ లేదని భావిస్తే... పిల్లికి బిచ్చమెత్తని ధోరణి ప్రదర్శిస్తే.... ఏమవుతుంది!? ఏమవుతుందో ఇతగాడి చరిత్ర చదివి తెలుసుకోండి! |

## سُوْرَةُ الْقَصَصِ

## అల్ ఖసస్ సూరా

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

طسٓمٓ ﴿١﴾

**1** తా - సీన్ - మీమ్.

تِلۡكَ ءَايَٰتُ ٱلۡكِتَٰبِ ٱلۡمُبِينِ ﴿٢﴾

**2** ఇవి తేటతెల్లమైన గ్రంథానికి చెందిన ఆయతులు.

نَتۡلُواْ عَلَيۡكَ مِن نَّبَإِ مُوسَىٰ وَفِرۡعَوۡنَ بِٱلۡحَقِّ لِقَوۡمٖ يُؤۡمِنُونَ ﴿٣﴾

**3** విశ్వసించిన జనుల కోసం మేము నీకు మూసా, ఫిరౌనుల వృత్తాంతం (లోని కొంత భాగాన్ని) ఉన్నదున్నట్లుగా వినిపిస్తున్నాము.[1]

إِنَّ فِرۡعَوۡنَ عَلَا فِي ٱلۡأَرۡضِ وَجَعَلَ أَهۡلَهَا شِيَعٗا يَسۡتَضۡعِفُ طَآئِفَةٗ مِّنۡهُمۡ يُذَبِّحُ أَبۡنَآءَهُمۡ وَيَسۡتَحۡيِۦ نِسَآءَهُمۡۚ إِنَّهُۥ كَانَ مِنَ ٱلۡمُفۡسِدِينَ ﴿٤﴾

**4** నిజంగానే ఫిరౌను భువిలో (ఈజిప్టు రాజ్యంలో) చెలరేగిపోయాడు.[2] అక్కడి ప్రజలను విభిన్న వర్గాలుగా విభజించాడు.[3] వారిలో ఒక వర్గం వారిని మరీ బలహీనుల్ని చేసేశాడు.[4] వారి మగ పిల్లలను చంపేసి,[5] వారి ఆడపిల్లల్ని మాత్రం బ్రతకనిచ్చేవాడు. నిశ్చయంగా వాడు కల్లోలాన్ని రేకెత్తించినవారి కోవకు చెందినవాడు.

1. ముహమ్మద్ (సఅసం) దేవుని ప్రవక్త అనీ, సత్యవంతుడైన ప్రవక్త అని చెప్పడానికి ఈ వృత్తాంతమే తార్కాణం. లేకపోతే వేల సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనను చదువురాని ఒక సాధారణ వ్యక్తి యధాతథంగా ప్రజలకు వినిపించటం సాధ్యమయ్యే పనికాదు. అయితే ఆయన (సఅసం) వినిపించే ఈ వృత్తాంతం ద్వారా ప్రయోజనం చేకూరేది మటుకు విశ్వాసులకే. ఎందుకంటే విశ్వసించిన వారు మాత్రమే తమ ప్రవక్త చెప్పే విషయాలను విని, వాటిని సత్యమని ధృవపరుస్తారు. వాటి నుండి గుణపాఠం నేర్చుకుంటారు.

2. వాడి దారుణాలకు, దురాగతాలకు అంతులేకుండా పోయింది. అధికార మదాంధుడై తన ప్రజలకు తనే దేముణ్ణి అని ప్రకటించుకున్నాడు ఫిరౌన్.

3. సమాజాన్ని వర్గాలుగా, తెగలుగా చీల్చి ఒక్కో వర్గానికి ఒక్కో బాధ్యతను అప్పగించాడు. కొన్ని వర్గాలను పీల్చి పిప్పిచేశాడు.

4. తరాతరాలుగా ఫిరౌను చక్రవర్తుల చేత అణచివేతకు గురవుతూ వచ్చిన ఈ వర్గం పేరు బనీ ఇస్రాయీల్. అది ఆ కాలంనాటి గొప్ప జాతులలో ఒక జాతి అయినప్పటికీ నిరంతరం అనువంశిక చక్రవర్తుల అణచివేత చర్యల మూలంగా అణగారిపోయింది. వారు ఫిరౌను చక్రవర్తికి బానిసలుగా ఉండవలసి వచ్చింది.

5. ఫిరౌను చక్రవర్తి బనీ ఇస్రాయీల్ వారిపై పగబట్టడానికి కారణం లేకపోలేదు. ఇస్రాయీల్ సంతతిలో జన్మించే ఒక పిల్లవాని చేతిలో ఫిరౌన్ అంతమవుతాడని, అతని రాజ్యాధికారం కూడా పరిసమాప్తమవుతుందని జ్యోతిష్కులు జోస్యం చెప్పారు. ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవటానికి ఫిరౌన్ చేసిన ఉపాయం ఏమిటో తెలుసా! ఇస్రాయీల్ వంశీయులలో పుట్టే ప్రతి మగ పిల్లవాణ్ణి చంపేయాలి. ఆడపిల్లల్ని మాత్రం బ్రతకనివ్వాలి. వారిచేత వెట్టి చాకిరీ చేయించుకోవచ్చు.
కాని జ్యోతిష్కుడు చెప్పింది ఒకవేళ నిజం అయ్యేపక్షంలో ఆ సంఘటన నుంచి తాను తప్పించుకోలేనన్న జ్ఞానం ఆ

**5** భువిలో మరీ బలహీనుల్ని చేసి అణచివేయబడిన ఆ జనులను అనుగ్రహించాలనీ, వారికి సారథ్య బాధ్యతలు అప్పగించాలనీ, వారిని (భూమికి) వారసులుగా చేయాలనీ[6] మేము కోరుకున్నాం.

وَنُرِيدُ أَن نَّمُنَّ عَلَى الَّذِينَ اسْتُضْعِفُوا فِي الْأَرْضِ
وَنَجْعَلَهُمْ أَئِمَّةً وَنَجْعَلَهُمُ الْوَارِثِينَ ﴿٥﴾

**6** భువిలో వారికి ప్రాబల్యాన్ని, స్థిరత్వాన్ని ప్రసాదించాలనీ,[7] ఫిరౌను, హామాను మరియు వారి సైన్యాలకు వారు దేనికి భయ పడుతూ ఉండేవారో దాన్నే చూపాలని (మేము అభిలషించాము).[8]

وَنُمَكِّنَ لَهُمْ فِي الْأَرْضِ وَنُرِيَ فِرْعَوْنَ وَهَامَانَ
وَجُنُودَهُمَا مِنْهُم مَّا كَانُوا يَحْذَرُونَ ﴿٦﴾

**7** మేము మూసా (అలైహిస్సలాం) తల్లికి ఇలా సూచించాము[9]: "నువ్వతనికి పాలిస్తూ ఉండు. అతని విషయంలో నువ్వు ఎప్పుడు ప్రమాదాన్ని పసిగట్టినా అతన్ని నదిలో విడిచిపెట్టు. భయపడకు.[10] దుఃఖించకు. నిశ్చయంగా మేమతన్ని నీ వైపుకే మరలిస్తాము.[11] ఇంకా, మేమతన్ని మా ప్రవక్తలలో ఒకడుగా చేసుకుంటాము."

وَأَوْحَيْنَا إِلَىٰ أُمِّ مُوسَىٰ أَنْ أَرْضِعِيهِ ۖ فَإِذَا خِفْتِ عَلَيْهِ
فَأَلْقِيهِ فِي الْيَمِّ وَلَا تَخَافِي وَلَا تَحْزَنِي ۖ إِنَّا رَادُّوهُ
إِلَيْكِ وَجَاعِلُوهُ مِنَ الْمُرْسَلِينَ ﴿٧﴾

---

మూర్ఖుడికి లేకపోయింది. ఒకవేళ జ్యోతిష్కుడు చెప్పేది అబద్ధమైతే మగపిల్లల్ని చంపించటంలో అర్థమే లేదు (ఫత్‌హుల్ ఖదీర్).

మరి కొంతమంది కథనం ప్రకారం : హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కాలం నుంచి ఈ 'శుభవార్త' ఒక తరం నుంచి ఇంకొక తరానికి అందుతూ వస్తోంది.... ఇస్రాయీలు సంతతిలో ఒక అబ్బాయి పుడతాడు. అతడు ఈజిప్టులోని నిరంకుశ రాజరికానికి చరమగీతం పాడుతాడు... బనీ ఇస్రాయీలు వంశస్థులు ఈ విషయాన్ని చెప్పుకుంటూ ఉండగా ఫిరౌన్ జాతివారు విని, ఆ విషయాన్ని ఫిరౌనుకు చెప్పారు. దాంతో ఫిరౌను ఇస్రాయీల్ సంతతివారిపై కన్నెర్ర జేశాడు. వారి సంతతిలో పుట్టే ప్రతి మగపిల్లవాణ్ణీ నిర్దాక్షిణ్యంగా చంపించేవాడు. (ఇబ్నె కసీర్)

6. కాని అల్లాహ్ తలచింది ఇంకొకటి. తరతరాలుగా పీడించబడుతున్న ఈ జాతిపై కారుణ్య ప్రభువు జాలిచూపాడు. అత్యంత బలహీనులుగా పరిగణించబడుతున్న ఇస్రాయీలీయులనే ప్రాక్ పశ్చిమాలకు నాయకుల్ని చేశాడు (అల్ ఆరాఫ్ – 137). అంతేకాదు, ధార్మికంగా కూడా వారికి సారథ్య బాధ్యతల్ని అప్పగించాడు.

7. 'దేశం' లేక 'భూమి' అంటే సిరియా ప్రాంతమని భావం. వారు కనానీయుల భూభాగానికి వారసులయ్యారు. ఎందుకంటే ఈజిప్టు నుంచి వెళ్ళిన తరువాత ఇస్రాయీలు సంతతివారు ఈజిప్టుకు తిరిగి రాలేదు. (నిజము దేవుడెరుగు).

8. ఇస్రాయీలు సంతతికి చెందిన ఒకానొక వ్యక్తి చేతిలో ఫిరౌను, అతని సైన్యం అంతమవుతుందని వారు తరచూ భయపడుతూనే ఉండేవారు. చివరకు అనుకున్నంత పనీ అయింది. వారు ఏ కీడును శంకిస్తూ ఉండేవారో దాన్ని అల్లాహ్ అక్షర సత్యం చేసి చూపాడు.

9. **'సూచించాము'** అంటే ఆమె మదిలో ఈ ఆలోచనను కలిగించాము అని భావం. అంతేగాని దీన్ని దైవప్రవక్తలకు అందజేయబడే 'వహీ' (దైవసందేశం)గా భావించకూడదు. ఒకవేళ ఈ సూచన దైవదూత ద్వారా ఆమెకు అందివున్నా, ఆమెను – అంటే మూసా (అలైహిస్సలాం) తల్లిని – దైవప్రవక్తగా పరిగణించవలసిన అవసరం లేదు. ఎందుకంటే దైవదూతలు ఒక్కోసారి సామాన్య మనుషుల వద్దకు కూడా వస్తుంటారు. ఉదాహరణకు : బట్టతలవాడు, కుష్ఠురోగి, గుడ్డివాడి దగ్గరకు దైవదూత వచ్చినట్లు హదీసు ద్వారా రూఢీ అవుతోంది (ముత్తఫఖున్ అలైహ్; బుఖారీ – కితాబు అహాదీసిల్ అంబియా).

10. అంటే, నీ అబ్బాయి నదిలో మునిగిపోతాడనో, కనబడకుండా పోతాడనో భయపడకు.

11. అంటే-నీ అబ్బాయిని సురక్షితంగా నీ వద్దకు చేరుస్తాము. ఆ రోజుల్లో సంభవించిన కొన్ని పరిణామాలను గురించి

8 చివరకు ఫిరౌను కుటుంబీకులు ఆ పసికందును ఎత్తుకున్నారు[12] – ఎట్టకేలకు ఈ పసివాడే వారికి శత్రువుగా తయారై, వారి విషాదానికి కారకుడయ్యేందుకు.[13] మొత్తానికి ఫిరౌను, హామాను, వారి సేనలు – వారందరూ పాపాత్ములనటంలో సందేహమే లేదు.[14]

فَالْتَقَطَهٗۤ اٰلُ فِرْعَوْنَ لِيَكُوْنَ لَهُمْ عَدُوًّا وَّحَزَنًا ؕ اِنَّ فِرْعَوْنَ وَهَامٰنَ وَجُنُوْدَهُمَا كَانُوْا خٰطِـِٕيْنَ ⑧

9 ఫిరౌను భార్య (తన భర్తతో), “(ఏవండీ!) ఈ అబ్బాయి మీకూ, నాకూ కన్నుల పండువగా ఉన్నాడండీ! ఇతన్ని మాత్రం చంపకండీ![15] బహుశా ఇతను మనకు ఉపయోగపడవచ్చండీ! లేదంటే మనం ఇతన్ని మన పుత్రునిగానైనా దత్తత తీసుకోవచ్చండి!”[16] అని ప్రాధేయపడింది. కాని (దాని పర్యవసానం గురించి) వారికి తెలీదు.[17]

وَقَالَتِ امْرَاَتُ فِرْعَوْنَ قُرَّتُ عَيْنٍ لِّيْ وَلَكَ ؕ لَا تَقْتُلُوْهُ ۖۗ عَسٰۤى اَنْ يَّنْفَعَنَاۤ اَوْ نَتَّخِذَهٗ وَلَدًا وَّهُمْ لَا يَشْعُرُوْنَ ⑨

ఈ విధంగా చెప్పటం జరిగింది – ఇస్రాయీల్ సంతతికి చెందిన మగపిల్లల్ని వరుసపెట్టి చంపుతూ పోతే ఈ జాతి అంతరించిపోతుందేమోనని ఫిరౌను సలహాదారులు తమ చక్రవర్తి ముందు ఆందోళన చెందారు. ఒకవేళ అదేగనక జరిగితే వెట్టిచాకిరీ చేయించుకోవటానికి మనుషులు దొరకరు. అందుచేత సలహా మండలి ప్రతిపాదన మేరకు కొంతకాలం గడిచాక ఫిరౌను తన ఆర్డినెన్సులో కాస్తంత సడలింపును పాటించాడు. అదేమిటంటే ఒక సంవత్సరకాలం పాటు ఈ శిశుహత్యా కాండను ఆపి, మరో సంవత్సరంలో ఉత్తర్వును ఖచ్చితంగా అమలు జరిపించేవాడు. ఆ విధంగా శిశు హత్యాకాండ జరగని సంవత్సరమే మూసా అన్నయ్య హారూన్ పుట్టారు. అయితే మూసా (అలైహిస్సలాం) మాత్రం హత్యలు జరిగే సంవత్సరంలోనే పుట్టారు. కాని అల్లాహ్ ఆయన్ని రక్షించటానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. వాటిలో ఒకటేమంటే ఫిరౌన్ తరఫున నియుక్తులైన మంత్రసానుల దృష్టికి రాకుండా ఉండటానికి మూసా తల్లి గర్భవతి అయినట్లే కనబడకుండా చేశాడు. అందువల్ల ఆమె గుట్టుచప్పుడు కాకుండా (మగబిడ్డను) ప్రసవించింది. కాని ఏ క్షణంలోనయినా ఆ విషయం పరిపాలకుల దృష్టికి రావచ్చన్న భయం ఉండేది. ఆ సమస్యకు పరిష్కారం కూడా అల్లాహ్ సూచించాడు. దాని ప్రకారం ఆమె ఆ బాలుణ్ణి ఒక పేటికలో పెట్టి నైలు నదిలో వదలిపెట్టింది (ఇబ్నె కసీర్).

12. ఆ పేటిక నదిలో అలా అలా ప్రవహిస్తూ ఫిరౌను నివాస భవనానికే వచ్చి తాకింది. ఆ రాజ ప్రాసాదం నదీ ఒడ్డునే ఉండేది. ఫిరౌను సేవకులు ఆ పెట్టెను తెరచిచూస్తే అందమైన బాలుడు కనిపించాడు.

13. ఆ బాలుణ్ణి వారు తమ కంటి చలువగా భావించి అల్లారుముద్దుగా పెంచారు. కాని వారికేం తెలుసు – అతను తమ పాలిట శత్రువుగా తయారు కానున్నాడని!?

14. ఇంతకీ హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఫిరౌనీయుల పాలిట శత్రువుగా ఎందుకు పరిణమించారు? ఎందుకంటే ఫిరౌనీయులు దేవుని అవిధేయులుగా మారిపోయారు. అధికార మదాంధులై ప్రజలను వేధించేవారు. అందువల్ల దేవుడు వారి చేతుల్లో పెంచబడిన అబ్బాయి చేతనే వారికి శిక్ష విధించాడు.

15. పేటికలోని అందమైన బాలుణ్ణి చూసినపుడు రాణిగారు చెప్పిన మాటలివి. మరికొంతమంది ప్రకారం: మూసా (అలైహిస్సలాం) ఫిరౌన్ ఇంట్లో పెరుగుతున్నప్పుడు ఒకసారి ఫిరౌన్ గడ్డం పట్టుకున్నారు. దానికి ఫిరౌను ఆగ్రహించి తక్షణం అతన్ని చంపమని ఆదేశించాడు. అప్పుడు తన భర్తను శాంతపరుస్తూ ఫిరౌను భార్య ఈ మాటలన్నది (ఐసరుత్తఫాసీర్). ఫిరౌన్ భార్య ఇక్కడ బహువచన పదంతో సంబోధించటం గమనార్హం. బహుశా ఆమె భర్తను ఆ విధంగా వేడుకొని ఉండవచ్చు లేక అతన్ని, అతని వెంటవున్న జాతి ప్రముఖులందర్నీ ఉద్దేశించి ఆమె ఈ విజ్ఞాపన చేసి ఉండవచ్చు.

وَأَصْبَحَ فُؤَادُ أُمِّ مُوسَىٰ فَارِغًا ۖ إِن كَادَتْ لَتُبْدِي
بِهِ لَوْلَا أَن رَّبَطْنَا عَلَىٰ قَلْبِهَا لِتَكُونَ مِنَ
الْمُؤْمِنِينَ ⑩

**10** మూసా తల్లి మనసు తల్లడిల్లి పోయింది.[18] ఆమె విశ్వాసుల లోనే స్థిరంగా ఉండడానికి మేము ఆమె మనసును కుదుటపరచి ఉండకపోతే, ఆ విషయాన్ని ఆమె బయటపెట్టి ఉండేదే![19]

وَقَالَتْ لِأُخْتِهِ قُصِّيهِ ۖ فَبَصُرَتْ بِهِ عَن جُنُبٍ
وَهُمْ لَا يَشْعُرُونَ ⑪

**11** మూసా తల్లి, అతని అక్కతో,[20] "నువ్వు ఇతని వెనకాలే వెళ్ళు" అని చెప్పింది. అందువల్ల ఆమె దూరం నుంచే గమనిస్తూ పోయింది.[21] కాని ఆ సంగతి వారికి (ఫిరౌనీయులకు) తెలియదు.

وَحَرَّمْنَا عَلَيْهِ الْمَرَاضِعَ مِن قَبْلُ فَقَالَتْ هَلْ
أَدُلُّكُمْ عَلَىٰ أَهْلِ بَيْتٍ يَكْفُلُونَهُ لَكُمْ وَهُمْ لَهُ
نَاصِحُونَ ⑫

**12** అంతకుముందే మేము మూసా కొరకు దాదుల పాలను నిషేధించాము.[22] (పరిస్థితుల స్వరూపాన్ని గమనించిన) ఆ బాలిక వారితో, "మీ కోసం ఈ బాలుణ్ణి పోషించే, ఇతని బాగోగులను కోరే ఇంటి వారిని గురించి నేను మీకు తెలుపనా?!"[23] అని చెప్పింది.

---

16. ఆ సమయంలో ఫిరౌనుకు సంతాన భాగ్యం ప్రాప్తం కాలేదు. అంచేత ఈ అబ్బాయిని దత్తత తీసుకోవచ్చేమో ఆలోచించమని అతని భార్య సలహా యిచ్చింది.

17. ఏ పిల్లవాడి భయంతో వారు వందలకొలదీ పసిపిల్లల్ని ఊచకోత కోసారో, ఆ పిల్లవాడు తమ కళ్లముందరే, తమ ఒడిలోనే, తమ నివాస భవనంలోనే పెరిగి పెద్ద వాడవుతున్నాడన్న సంగతి వారికి తెలీదు. అదే దైవలీల! దేవుని అపురూపమైన ఏర్పాటు ఇది!

18. అంటే ఆమె హృదయంలో ఒకలాంటి శూన్యం ఏర్పడింది. పొద్దస్తమానం ఆమెకు తన కన్నకొడుకు (మూసా) గురించిన చింతనే తప్ప మరో ధ్యాస లేదు. కొడుకు కోసం కలవరించసాగింది. మాతృ హృదయం అటువంటిది మరి!

19. తాను నదిలో విడిచిపెట్టిన ఆ పిల్లవాడు తన పిల్లవాడేనని చెప్పేసేదే. కాని అల్లాహ్ ఆమెకు గుండె నిబ్బరం ప్రసాదించాడు. ఆ తరువాత కూడా ఓపికపట్టింది. దేవుడు తనకు చేసిన వాగ్దానం ప్రకారం తన శిశువును ఎలాగయినా తన వద్దకు చేరుస్తాడని ఆమె గట్టిగా నమ్మసాగింది. ఆ నమ్మకమే గనక సడలిపోయినట్లయితే ఆమె తన గుట్టును రట్టుచేసి ఉండేదే!

20. మూసా అక్క పేరు మర్యమ్ బిన్తె ఇమ్రాన్. దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) తల్లి పేరు కూడా ఇదే కావటం యాదృచ్ఛికం.

21. చిన్నారి మూసా ఉన్న పేటిక నైలునదిలో కొట్టుకుపోతుంటే, ఆ అమ్మాయి తన తమ్ముణ్ణి అల్లంత దూరం నుంచే గమనిస్తూ నదీ తీరాన నడిచిపోయింది. ఆఖరికి ఆ పేటిక ఫిరౌన్ రాజ భవనాన్ని తాకటం, ఆ పిల్లవాణ్ణి ఫిరౌను సేవకులు తీసుకుని లోపలికి పోవటం అంతా ఆమె చూస్తూనే ఉంది.

22. అంటే, మేము మా ఆదేశానుసారం మూసా (అలైహిస్సలాం) కన్న తల్లిపాలు తప్ప మరెవరి పాలు కూడా త్రాగకుండా చేశాము. అందుకే శతవిధాలా ప్రయత్నించినప్పటికీ దాదులు ఆ బాలునికి పాలుపట్టలేకపోయారు. మరోవైపు ఆ పసిపిల్లవాడు ఏడుస్తూ ఉండిపోయాడు.

23. ఆ దృశ్యాన్ని మూసా అక్క దూరం నుంచే శ్రద్ధగా గమనించసాగింది. ఎంతకీ ఆ పిల్లవాడు ఏడ్పు మానకపోవటంతో, అదను చూసి వారి దగ్గరకు వెళ్ళింది. వారు గనక అనుమతిస్తే ఈ పిల్లవాని ఆలనాపాలనా చూసే ఒక మంచి మహిళను చూపిస్తానని అంది.

فَرَدَدْنٰهُ اِلٰٓى اُمِّهٖ كَىْ تَقَرَّ عَيْنُهَا وَلَا تَحْزَنَ وَلِتَعْلَمَ اَنَّ وَعْدَ اللّٰهِ حَقٌّ وَّلٰكِنَّ اَكْثَرَهُمْ لَا يَعْلَمُوْنَ ﴿13﴾

13 ఆ విధంగా మేము అతన్ని తిరిగి అతని తల్లి దగ్గరకు చేర్చాము[24] – తద్వారా ఆమె కన్నులు చల్లబడాలనీ, ఆమె దుఃఖితురాలు కాకుండా ఉండాలనీ, అల్లాహ్ వాగ్దానం సత్యమని ఆమె తెలుసుకోవాలని (మేమిలా చేశాము).[25] కాని చాలా మందికి (ఇందలి పరమార్థం) తెలియదు.[26]

وَلَمَّا بَلَغَ اَشُدَّهٗ وَاسْتَوٰٓى اٰتَيْنٰهُ حُكْمًا وَّعِلْمًا ؕ وَكَذٰلِكَ نَجْزِى الْمُحْسِنِيْنَ ﴿14﴾

14 మూసా తన యుక్త వయస్సుకు చేరుకుని, పరిపక్వతను పొందిన మీదట మేమతనికి వివేకాన్నీ, (ధర్మ) జ్ఞానాన్నీ ప్రసాదించాము.[27] సద్వర్తనులకు మేము ఇలాగే (ఉత్తమ) ప్రతిఫలాన్ని ఇస్తుంటాము.

وَدَخَلَ الْمَدِيْنَةَ عَلٰى حِيْنِ غَفْلَةٍ مِّنْ اَهْلِهَا فَوَجَدَ فِيْهَا رَجُلَيْنِ يَقْتَتِلٰنِ ۫ هٰذَا مِنْ شِيْعَتِهٖ وَهٰذَا

15 (ఒకసారి) నగరవాసులు ఏమరుపాటులో ఉన్న సమయంలో అతను నగరంలోకి వచ్చాడు.[28] అక్కడ ఇద్దరు వ్యక్తులు దెబ్బలాడు కోవటం చూశాడు. వారిలో ఒకతను తన వర్గానికి చెందిన

24. అంతకన్నా వారికి ఏం కావాలి? వెంటనే ఒప్పుకున్నారు. అందువల్ల మూసా (అలైహిస్సలాం) అక్క పరుగెత్తుకుంటూ వెళ్ళి, తన తల్లిని పిలుచుకుని వచ్చింది.

25. మూసా (అలైహిస్సలాం) తల్లిపాలు తృప్తిగా త్రాగారు. అందరూ సంతోషించారు. ఆ పసిపిల్లాడికి రోజూ పాలుపట్టే నిమిత్తం తన ఇంట్లోనే ఉండిపోవాల్సిందిగా ఫిర్ఔన్ కోరాడు. అయితే తాను తన భర్తను, పిల్లలను వదలి ఉండలేనని ఆమె తెగేసి చెప్పింది. ఎట్టకేలకు ఆ పిల్లవాణ్ణి ఎత్తుకుని వెళ్ళి అక్కడే పాలుపట్టవచ్చునీ, అందు నిమిత్తం ఆమెకు తగిన జీతం ప్రభుత్వ ధనాగారం నుంచి ఇవ్వబడుతుందని నిర్ణయించబడింది. సుబ్హానల్లాహ్! దైవలీల ఎలా ఉంటుందో చూడండి! ఒకవైపు తన కన్న కొడుక్కు పాలు పట్టే ఆనందం, మరోవైపున ప్రభుత్వ ఖజానా నుంచి జీతం! ఆమె కొడుకును ఆమె వద్దకే చేరుస్తానన్న వాగ్దానాన్ని దేవుడు ఎంత ఉత్తమ రీతిలో నెరవేర్చాడో చూడండి! ఒక ముర్సల్ కథనం ఇలా వుంది : "తాను నిర్మించిన వస్తువు ద్వారా శుభాన్ని, పుణ్యాన్ని కూడా ఆశించే నిర్మాత ఉపమానం మూసా (అలైహిస్సలాం) తల్లిలాంటిది. ఆమె తన కన్న కుమారునికే పాలుపడుతూ, దానికి జీతం కూడా పొందుతుంది." (అబూ దావూద్‌లోని ముర్సల్ కథనం).

26. తాము చేపట్టే ఎన్నో కార్యాల అసలు పరిణామం చాలా మందికి తెలిసి ఉండదు. అయితే అల్లాహ్‌కు దాని పరిణామం గురించి పూర్తిగా తెలిసి ఉంటుంది. అందుకే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "మీకు గిట్టని వస్తువే మీకు ప్రయోజనకరం కావచ్చు. మీకు ఎంతో ప్రియమైన వస్తువే మీకు నష్టకరంగా పరిణమించవచ్చు. ఈ విషయం అల్లాహ్‌కు తెలుసు. మీకు తెలియదు" (అల్ బఖర – 216). వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: "ఒకవేళ వారు మీకు నచ్చకపోతే, బహుశా మీకు (వారిలోని) ఒక వస్తువు నచ్చకపోవచ్చు. అయితే అల్లాహ్ అందులోనే మీకోసం ఎంతో మేలును పొందుపరచి ఉండవచ్చు" (అన్ నిసా – 19). అందుకే మనిషి తన ఇష్టాయిష్టాలను అలా పక్కనపెట్టి, ప్రతి విషయంలోనూ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఆదేశాలను పాటించే ప్రయత్నం చేయాలి. అందులోనే అతనికి మేలుంది. పర్యవసానం దృష్ట్యా కూడా అదే ఉత్తమమైనది.

27. వివేకం, జ్ఞానం అంటే ప్రవక్త పదవి, దైవదౌత్యం అని అర్థం. ఆయన ఈ స్థితికి ఎలా ఎదిగారు? దీని వివరణ తరువాతి ఆయతులో వస్తుంది.

మరికొంతమంది వ్యాఖ్యాతల దృష్టిలో ఇక్కడ వివేకం అంటే ప్రవక్త పదవి కాదు – వివేచన, తెలివితేటలు అని భావం.

مِنْ عَدُوِّهِ ۚ فَاسْتَغَاثَهُ الَّذِي مِنْ شِيعَتِهِ عَلَى الَّذِي مِنْ عَدُوِّهِ فَوَكَزَهُ مُوسَىٰ فَقَضَىٰ عَلَيْهِ ۖ قَالَ هَٰذَا مِنْ عَمَلِ الشَّيْطَانِ ۖ إِنَّهُ عَدُوٌّ مُضِلٌّ مُبِينٌ (15)

వాడు, ఇంకొకతను వైరి వర్గానికి చెందినవాడు.[29] తన వర్గానికి చెందిన వ్యక్తి, శత్రువర్గానికి చెందినవానికి వ్యతిరేకంగా తనకు సహాయపడమని మూసాను పిలిచాడు. మూసా అతనికి ఒకే ఒక గుద్దు గుద్దాడు. అంతే, అది అతన్ని కడతేర్చింది. (అప్పుడు) మూసా "ఇది షైతాను పని.[30] నిశ్చయంగా షైతాన్ బద్ధ విరోధి. స్పష్టంగా పెడదారి పట్టించేవాడు"[31] అని పలికాడు.

قَالَ رَبِّ إِنِّي ظَلَمْتُ نَفْسِي فَاغْفِرْ لِي فَغَفَرَ لَهُ ۚ إِنَّهُ هُوَ الْغَفُورُ الرَّحِيمُ (16)

**16** ఆ తరువాత అతను "నా ప్రభూ! నాకు నేనే అన్యాయం చేసుకున్నాను. నన్ను క్షమించు"[32] అని మొరపెట్టుకున్నాడు. అప్పుడు అల్లాహ్ అతన్ని క్షమించాడు. నిశ్చయంగా ఆయన క్షమా శీలుడు, దయామయుడు.

قَالَ رَبِّ بِمَا أَنْعَمْتَ عَلَيَّ فَلَنْ أَكُونَ ظَهِيرًا لِلْمُجْرِمِينَ (17)

**17** "నా ప్రభూ! నీవు నన్ను అనుగ్రహించినట్లే నేను కూడా ఇకమీదట ఏ నేరస్థునికీ సహాయపడను"[33] అని మూసా విన్న వించుకున్నాడు.

فَأَصْبَحَ فِي الْمَدِينَةِ خَائِفًا يَتَرَقَّبُ فَإِذَا الَّذِي اسْتَنْصَرَهُ بِالْأَمْسِ يَسْتَصْرِخُهُ ۚ قَالَ لَهُ مُوسَىٰ

**18** (మరునాడు) తెల్లవారుతుండగా మూసా భయపడుతూనే[34]– నలువైపులా పరికిస్తూ – నగరంలోకి వెళ్ళాడు. అంతలోనే నిన్న సహాయం కోసం తనను అభ్యర్థించిన వ్యక్తే మళ్లీ తనకు ఫిర్యాదు

28. అది రాత్రి మగ్రిబ్–ఇషాల మధ్య సమయమని కొందరు, మధ్యాహ్న సమయం అని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో అందరూ విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు.

29. శత్రువర్గానికి చెందినవాడు అంటే ఫిరౌనీయుడు అన్నమాట!

30. మానవ హత్య చాలా పెద్ద నేరం. అతన్ని చంపాలన్నది హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఉద్దేశం ఎంతమాత్రం కాదు. అతన్ని దండించాలన్న ఉద్దేశంతో ఒక గుద్దు గుద్దేసరికి అతను చచ్చి ఊరుకున్నాడు. అందుకే హజ్రత్ మూసా (అలైహి) ఆ చర్యను దుష్టచర్యగా, షైతాన్ పనిగా అభివర్ణించారు. జరిగిన దానిపై బాధపడ్డారు.

31. షైతాను మనిషికి బహిరంగ శత్రువు అన్నది విదితమే. మనిషిని పెడత్రోవ పట్టించడానికి వాడు చేయవలసినదంతా గప్‌చిప్‌గా చేసేస్తాడు.

32. కాకతాళీయంగా – అసంకల్పికంగా – జరిగిపోయిన ఆ హత్యా ఉదంతం ఏమంత దారుణమైనది కాదు. ఆ మాటకొస్తే పెద్ద పెద్ద నేరాల నుంచి, అమానుష కృత్యాల నుంచి అల్లాహ్ తన ప్రవక్తలను కాపాడుతూ ఉంటాడు. అయినప్పటికీ తన వల్ల జరిగిపోయిన ఆ సంఘటనకు హజ్రత్ మూసా (అలైహిస్సలాం) సిగ్గుతో కుంచించుకు పోయారు. క్షమాభిక్ష కోసం అల్లాహ్‌ను వేడుకోవటం అవసరమని భావించారు. ఆ సంగతి ఫిరౌన్‌కు తెలిస్తే పరిహారంగా తనను చంపేస్తాడన్న భయం కూడా ఆయన్ని వెంటాడసాగింది.

33. దేవుడు తనకు క్షమాభిక్ష పెట్టడంతో హజ్రత్ మూసా (అలైహి) ఆంతర్యం కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. ఇకమీదట తాను సంయమనంతో వ్యవహరిస్తానని, దైవప్రసాదితమయిన శక్తి సామర్థ్యాలను నేరస్థులకు సహాయపడటం లాంటి పనుల కోసం దుర్వినియోగ పరచబోనని దైవానికి ప్రమాణం చేశారు.

34. నిన్న జరిగిన సంఘటనపై నగరంలో ఎవరేమనుకుంటున్నారో, పరిస్థితుల వాస్తవిక స్వరూపం ఎలా వుందో

إِنَّكَ لَغَوِيٌّ مُّبِينٌ ⑱

చేశాడు. అప్పుడు మూసా అతన్నుద్దేశించి, "నువ్వు పూర్తిగా మార్గం తప్పినవాడిలా ఉన్నావు"[35] అన్నాడు.

فَلَمَّآ أَنْ أَرَادَ أَن يَبْطِشَ بِالَّذِي هُوَ عَدُوٌّ لَّهُمَا قَالَ يَٰمُوسَىٰٓ أَتُرِيدُ أَن تَقْتُلَنِي كَمَا قَتَلْتَ نَفْسًۢا بِالْأَمْسِ ۖ إِن تُرِيدُ إِلَّآ أَن تَكُونَ جَبَّارًا فِي الْأَرْضِ وَمَا تُرِيدُ أَن تَكُونَ مِنَ الْمُصْلِحِينَ ⑲

**19** ఆ తరువాత మూసా, తామిద్దరికీ శత్రువు అయిన వ్యక్తిని పట్టుకోబోతుండగా,[36] "మూసా! ఏమిటీ, నువ్వు నిన్న ఒక వ్యక్తిని చంపేసినట్లే నన్ను కూడా చంపేయాలనుకుంటున్నావా? నువ్వు రాజ్యంలో దౌర్జన్యపరునిలా ప్రవర్తిస్తున్నావు. దిద్దుబాటు కోసం ప్రయత్నించాలన్న ధ్యాస నీలో ఏ కోశానా లేదే?!" అని ఆ వ్యక్తి అన్నాడు.[37]

وَجَآءَ رَجُلٌ مِّنْ أَقْصَا الْمَدِينَةِ يَسْعَىٰ قَالَ يَٰمُوسَىٰٓ إِنَّ الْمَلَأَ يَأْتَمِرُونَ بِكَ لِيَقْتُلُوكَ فَاخْرُجْ إِنِّي لَكَ مِنَ النَّٰصِحِينَ ⑳

**20** నగరం అటు చివరి నుంచి ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి,[38] "మూసా! ఇక్కడి పెద్దలు నిన్ను తుదముట్టించేందుకు సంప్రతింపులు జరుపుతున్నారు. అందుకే నువ్వు తక్షణం ఇక్కడి నుంచి వెళ్ళిపో (నా మాట నమ్ము). నీ మంచిని కోరే వారిలో నేనూ ఒకణ్ణి" అన్నాడు.

فَخَرَجَ مِنْهَا خَآئِفًا يَتَرَقَّبُ قَالَ رَبِّ نَجِّنِي مِنَ الْقَوْمِ الظَّٰلِمِينَ ㉑

**21** అప్పుడు మూసా, భయపడుతూనే, (అటూ ఇటూ) చూసు కుంటూ అక్కణ్ణుంచి బయటపడ్డాడు.[39] "ప్రభూ! నన్ను దుర్మార్గ జనుల చెర నుండి కాపాడు"[40] అని వేడుకోసాగాడు.

---

తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఆయన (అలైహిస్సలాం) భయపడుతూనే నగరంలోనికి వచ్చారు. **'ఖాయిఫన్'** (خَآئِفًا) అంటే భయపడుతూ, **'యతరఖ్ఖబు'** (يَتَرَقَّبُ) అంటే నలువైపులా గమనిస్తూ అని అర్థం.

35. అంటే–నువ్వు నిన్న ఒక వ్యక్తితో ఘర్షణపడ్డావు. ఈ రోజు మళ్లీ ఇంకొక వ్యక్తితో గొడవ పడ్డావు. నీ పరిస్థితిని చూస్తుంటే నువ్వు జగడాలమారిలా ఉన్నావు. నీలో బొత్తిగా భయభక్తులు లేవు అని మూసా తన జాతికి చెందిన వ్యక్తిని మందలించారు.

36. తనకూ, తన వర్గానికి చెందిన వ్యక్తికీ శత్రువు అయినవాణ్ణి పట్టుకుని తగాదాను పరిష్కరించాలని హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అనుకున్నారు.

37. శత్రువు (ఖిబ్తీ)ని పట్టుకుని వారిమధ్య రాజీ కుదుర్చాలన్నది మూసా (అలైహిస్సలాం) అభిమతం. కాని ఫిర్యాదు చేసిన ఇస్రాయీలు వ్యక్తి, మూసా తనను చంపడానికి వస్తున్నారేమోనని శంకించి, 'నిన్న ఒక వ్యక్తిని చంపేసినట్లే ఈ రోజు నన్ను చంపేస్తావా?' అని అన్నాడు. దాంతో, నిన్న జరిగిన హత్య వెనుక ఉన్నదెవరో ఖిబ్తీ (శత్రువు)కి అర్థమై పోయింది. అతడు గబగబా వెళ్ళి ఈ హత్యోదంతాన్ని గురించి ఫిరౌనుకు తెలియపరచాడు. దాంతో ఫిరౌను దర్బారులోని పెద్దలు – పరిహారంగా– మూసాను కడతేర్చాలని తీర్మానించారు.

38. సమాచారాన్ని మోసుకువచ్చిన ఆ వ్యక్తి ఎవరు? ఆ వ్యక్తి ఫిరౌన్ వర్గానికి చెందినవాడనీ, కాని లోపలినుంచి మాత్రం మూసా (అలైహిస్సలాం) మేలును కోరుకునే వాడని కొంతమంది భావించారు. అతను ఫిరౌన్ వర్గీయుడవటం వల్లనే రాజభవనంలో జరిగే సంప్రతింపుల గురించి అంత తొందరగా తెలుసుకోగలిగాడు. వేరితర వ్యక్తి అయివుంటే కీలక సమాచారాన్ని అప్పటికప్పుడే తెలుసుకోజాలడు. మరికొంత మంది ఉద్దేశ్యంలో, ఆ వ్యక్తి ఇస్రాయీలీయుడు. మూసా (అలైహిస్సలాం)కి దగ్గరి బంధువు. నగరం చివరి నుంచి పరుగెత్తుకుంటూ రావటానికి కారణమేమంటే ఫిరౌను అంతఃపురం, శాసనసభ నగరం చివరి అంచున ఉండేవి.

22 అతను (మూసా) మద్‌యన్ దిక్కుకు ప్రయాణమైనప్పుడు, "నా ప్రభువు నన్ను సరైన మార్గంలోనే తీసుకుపోతాడని ఆశిస్తు న్నాను"[41] అన్నాడు.

وَلَمَّا تَوَجَّهَ تِلْقَآءَ مَدْيَنَ قَالَ عَسٰى رَبِّيْٓ اَنْ يَّهْدِيَنِيْ سَوَآءَ السَّبِيْلِ ﴿22﴾

23 అతను మద్‌యన్ నీటి (బావి) వద్దకు చేరుకున్నప్పుడు, అక్కడ ఓ ప్రజా సమూహం (తమ పశువులకు) నీరు త్రాగిస్తున్నట్లు చూశాడు.[42] మరో వైపు ఇద్దరు స్త్రీలు వేరుగా నిలబడి తమ (పశువుల)ను ఆపుతూ ఉండటం కనిపించింది. "ఇంతకీ మీ సమస్య ఏమిటీ?"[43] అని మూసా దర్యాప్తు చేయగా, "ఈ పశువుల కాపరులు తిరిగిపోనంతవరకూ మేము (మా పశువులకు) నీరు త్రాగించలేము.[44] మా నాన్నగారేమో మరీ ముసలివారు"[45] అని ఆ పడతులు చెప్పారు.

وَلَمَّا وَرَدَ مَآءَ مَدْيَنَ وَجَدَ عَلَيْهِ اُمَّةً مِّنَ النَّاسِ يَسْقُوْنَ ۬ وَوَجَدَ مِنْ دُوْنِهِمُ امْرَاَتَيْنِ تَذُوْدٰنِ ۚ قَالَ مَا خَطْبُكُمَا ۭ قَالَتَا لَا نَسْقِيْ حَتّٰى يُصْدِرَ الرِّعَاۗءُ ٚ وَاَبُوْنَا شَيْخٌ كَبِيْرٌ ﴿23﴾

24 అందువల్ల అతను (స్వయంగా ముందుకు వచ్చి) వారి పశువులకు నీరు త్రాగించాడు. ఆ తరువాత నీడ వున్న చోటికి తిరిగి వచ్చి, "ప్రభూ! నువ్వు నా వద్దకు ఏ మేలును పంపినా నాకు దాని అవసరం ఎంతైనా వుంది"[46] అని చెప్పుకున్నాడు.

فَسَقٰى لَهُمَا ثُمَّ تَوَلّٰٓى اِلَى الظِّلِّ فَقَالَ رَبِّ اِنِّيْ لِمَآ اَنْزَلْتَ اِلَيَّ مِنْ خَيْرٍ فَقِيْرٌ ﴿24﴾

39. హ్జ్రత్ మూసా (అలైహిస్సలాం)కు ఈ సంగతి తెలియగానే, ఫిరౌన్ చెర నుంచి బయటపడే ఉద్దేశంతో ఆయన ఈజిప్టు నుంచి వెళ్ళిపోయారు.

40. అకస్మాత్తుగా ఈజిప్టును వదలవలసిన పరిస్థితి హ్జ్రత్ మూసా (అలైహిస్సలాం)కు ఏర్పడింది. అందువల్ల ఎక్కడికెళ్ళాలో ముందుగా నిర్ణయించుకోలేదు. మరోవైపు శత్రువు భయం వెంటాడుతోంది. అందుచేత ఆయన, ఫిరౌనీయుల బారినుంచి కాపాడు అని అల్లాహ్‌ను ప్రార్థించారు. అందువల్ల అల్లాహ్ తన దూతను గుఱ్ఱంపై పంపించాడు. అతను మూసాకు మార్గదర్శకత్వం వహించాడు. వాస్తవం అల్లాహ్‌కు తెలుసు (ఇబ్నె కసీర్).

41. అల్లాహ్ మూసా మొరను ఆలకించాడు. ప్రాపంచికంగానూ, పారలౌకికంగానూ సాఫల్యం పొందే మార్గం వైపుకు ఆయనకు దర్శకత్వం వహించాడు. మూసా (అలైహిస్సలాం) మార్గం పొందడమే గాక, మార్గదర్శకులుగా కూడా తీర్చిదిద్దబడ్డారు.

42. మద్‌యన్ పొలిమేరల్లోకి చేరుకోగానే, అక్కడ ఒక బావి వద్ద జనులు గుమిగూడి, తమ తమ పశువులకు నీరు త్రాగించుకుంటున్నారు. మద్‌యన్ అనేది ఒక తెగ పేరు. ఈ తెగ హ్జ్రత్ ఇబ్రాహీం (అలైహి) సంతతికి చెందినది. కాగా; హ్జ్రత్ మూసా (అలైహిస్సలాం) యాఖూబు సంతతికి చెందినవారు. యాఖూబ్ (అలైహి) కూడా ఇబ్రాహీం (అలైహి)కి మనుమలే. ఈ విధంగా మద్‌యన్ తెగవారికి– మూసా (అలైహిస్సలాం)కి మధ్య వంశపారంపర్య సంబంధం ఉండనే ఉంది (ఐసరుత్తఫాసీర్). హ్జ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) ప్రవక్తగా పంపబడింది మద్‌యన్ వాసుల వద్దకే.

43. ఇద్దరు అబలలు తమ పశువులను ఆపి, నిస్సహాయులుగా నిలబడి ఉండటాన్ని చూసి హ్జ్రత్ మూసా (అలైహిస్సలాం)కి జాలి కలిగింది. "మీరిద్దరెందుకు ఇలా నిలబడ్డారు? మీరు మీ పశువులకు నీళ్ళెందుకు త్రాగించటం లేదు?" అని ఆయన అడిగారు.

فَجَآءَتْهُ إِحْدٰىهُمَا تَمْشِىْ عَلَى اسْتِحْيَآءٍ ۡ قَالَتْ إِنَّ
أَبِىْ يَدْعُوْكَ لِيَجْزِيَكَ أَجْرَ مَا سَقَيْتَ لَنَا ۚ فَلَمَّا
جَآءَهٗ وَقَصَّ عَلَيْهِ الْقَصَصَ ۙ قَالَ لَا تَخَفْ ۫
نَجَوْتَ مِنَ الْقَوْمِ الظّٰلِمِيْنَ ﴿25﴾

**25** అంతలోనే ఆ ఇద్దరు యువతులలో ఒకామె బిడియంతో అతని దగ్గరకు నడుచుకుంటూ వచ్చి,[47] "మీరు మా (పశువుల)కు నీరు త్రాగించిన దానికి ప్రతిఫలం ఇవ్వటానికి, మా నాన్నగారు మిమ్మల్ని పిలుస్తున్నారు"[48] అని చెప్పింది. మూసా ఆయన వద్దకు వచ్చినప్పుడు, తన వృత్తాంతమంతా వివరించాడు. "భయపడకు. నువ్వు దుర్మార్గ జనుల బారి నుంచి విముక్తి పొందావు"[49] అని ఆయన ఓదార్చాడు.

قَالَتْ إِحْدٰىهُمَا يٰٓأَبَتِ اسْتَأْجِرْهُ ۡ إِنَّ خَيْرَ
مَنِ اسْتَأْجَرْتَ الْقَوِىُّ الْأَمِيْنُ ﴿26﴾

**26** ఆ ఇద్దరు అమ్మాయిలలో ఒకామె, "ఓ నాన్నా! ఈయన్ని జీతంపై పెట్టుకోండి. ఎందుకంటే, మీరు జీతంపై నియమించు కునే వారిలో బలవంతునిగా, నమ్మకస్థునిగా ఉండేవాడే ఉత్తముడు"[50] అని అన్నది.

44. ఎందుకంటే మేము ఆడవాళ్ళం. మగవారిలోకి చొచ్చుకుపోయి మేము మా పశువులకు నీరు త్రాగించలేం కదా! అని ఆ యువతులు చెప్పారు. **'రిఆవు' (الرِّعَاءُ)** అంటే కాపరులు.

45. మా నాన్నగారేమో చాలా వృద్ధులు. అందువల్ల ఆయనగారు ఈ జన సందోహంలోకి వచ్చి, తన పని చేసుకోలేరు.

46. హ|జ్రత్ మూసా (అలైహిస్సలాం) సుదీర్ఘ ప్రయాణం చేసివచ్చారు. తిండి తిప్పలు లేక బాగా నీరసించి పోయారు. పైగా ప్రయాణ బడలిక కూడా ఉంది. అయినప్పటికీ ఆ స్త్రీల పరిస్థితిని చూసి ఓర్చుకోలేకపోయారు. పశువులకు నీరు త్రాపిన మీదట నీడ ఉన్న చోటికి వచ్చి కూలబడ్డారు. ఇప్పుడు ఆయన పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. దైవసహాయం కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. ఏ కాస్త తోడ్పాటు లభించినా అదే పదివేలని భావించసాగారు. అందుకోసం అల్లాహ్‌ను ప్రార్థించారు. 'మేలు' పలు రకాలు. అది అన్నపానీయాలకూ, ఆర్థిక విషయాలకు, ఆరాధనలకు, శక్తి అధికారాలకు, అందదండలకు కూడా వర్తిస్తుంది (ఐసరుత్తఫాసీర్). ప్రస్తుతం హ|జ్రత్ మూసా (అలైహిస్సలాం) ఆశించింది అన్నపానీయాలు, తలదాచుకోవటానికి ఆసరా.

47. అల్లాహ్ మూసా (అలైహిస్సలాం) ప్రార్థనను ఆమోదించాడు. ఆ ఇద్దరు అమ్మాయిలలో ఒక అమ్మాయి బిడియంతో వచ్చి ఆయన్ని ఇంటికి రమ్మని పిలిచింది. ఈ సందర్భంగా ఖుర్ఆన్ ఆ అమ్మాయి లజ్జాప్రీడలను గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనార్హం. ప్రీడ ఆడదానికి అత్యంత ముఖ్యమైన ఆభరణం. మగవారిలాగా ఆమె అడ్డూ ఆపూ లేకుండా – స్వేచ్ఛగా – విహరించటం షరీయతు పరంగా సమ్మతం కాదు.

48. ఇంతకీ ఆ ఇద్దరు ఆడపిల్లల తండ్రి ఎవరు? దివ్య ఖుర్ఆన్‌లో మాత్రం ఎక్కడా తండ్రి పేరు పేర్కొనలేదు. కాని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలలో అత్యధికులు ఆయన హ|జ్రత్ షుఐబు (అలైహిస్సలాం) అని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే మద్‌యన్ వాసుల వద్దకు ప్రవక్తగా పంపబడినది హ|జ్రత్ షుఐబ్ గారే. ఇమామ్ షౌకానీ అభిప్రాయం కూడా ఇదే. అయితే ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయం మరోవిధంగా ఉంది. ఆయన ఇలా అన్నారు : హ|జ్రత్ షుఐబ్ (అలైహి) కాలం హ|జ్రత్ మూసా (అలైహి) కంటే ముందు ఉంది. అందువల్ల ఇక్కడ ప్రస్తావనకు వచ్చిన ఆ యువతుల తండ్రి షుఐబ్‌గారి సోదర కుమారుడెవరైనా కావచ్చు లేక మరో వ్యక్తి అయినా కావచ్చు. నిజము దేవుడెరుగు.

మొత్తానికి హ|జ్రత్ మూసా (అలైహిస్సలాం) ఆ అబలలకు చేసిన సహాయం గురించి, వారిద్దరూ తమ పితామహునికి తెలియజేశారు. ఉపకారానికి బదులు ఉపకారం తప్ప మరేం కాగలదు? అందుకే ఆ యువకునిపట్ల సద్వ్యవహారం చేయాలన్న ఆలోచన ఆ వృద్ధునికి కలిగింది. ఆ విధంగా హ|జ్రత్ మూసా (అలైహిస్సలాం)కు ఆ పెద్ద మనిషిని కలుసుకునే అవకాశం దొరికింది.

قَالَ إِنِّىٓ أُرِيدُ أَنْ أُنكِحَكَ إِحْدَى ٱبْنَتَىَّ هَٰتَيْنِ
عَلَىٰٓ أَن تَأْجُرَنِى ثَمَٰنِىَ حِجَجٍ ۖ فَإِنْ أَتْمَمْتَ عَشْرًا
فَمِنْ عِندِكَ ۖ وَمَآ أُرِيدُ أَنْ أَشُقَّ عَلَيْكَ ۚ
سَتَجِدُنِىٓ إِن شَآءَ ٱللَّهُ مِنَ ٱلصَّٰلِحِينَ ﴿٢٧﴾

**27** (ఆ పెద్ద మనిషి) ఇలా అన్నాడు: "నా ఇద్దరు కుమార్తెలలో ఒకామెను నీకిచ్చి వివాహం చేయాలనుకుంటున్నాను.[51] అయితే– నువ్వు (మహరుగా) ఎనిమిది సంవత్సరాలు నా దగ్గర సేవకునిగా ఉండాలి.[52] ఒకవేళ నువ్వు పది సంవత్సరాలు పూర్తి చేయగలిగితే, అది నీ తరుఫు నుంచి (నాకు చేసిన మేలు అవుతుంది.) నిన్ను ఇబ్బందులపాలు చేయాలన్నది నా అభిమతం ఎంతమాత్రం కాదు.[53] దైవచిత్తమయితే ముమ్ముందు నువ్వు నన్ను మంచివానిగా పొందుతావు."[54]

قَالَ ذَٰلِكَ بَيْنِى وَبَيْنَكَ ۖ أَيَّمَا ٱلْأَجَلَيْنِ قَضَيْتُ
فَلَا عُدْوَٰنَ عَلَىَّ ۖ وَٱللَّهُ عَلَىٰ مَا نَقُولُ وَكِيلٌ ﴿٢٨﴾

**28** "మీకూ – నాకూ మధ్య ఇది (ఈ ఒప్పందం) కుదిరినట్లే. నేను ఈ రెండు గడువులలో ఏ ఒక్కటి పూర్తిచేసినా– ఆ తరువాత నాపై ఎలాంటి ఒత్తిడీ రాకూడదు.[55] మనం చెప్పుకునే మాటలకు అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు"[56] అని మూసా పలికాడు.

---

49. అంటే – ఈజిప్టులో తన పుట్టుపూర్వోత్తరాలను, అక్కడ ఫిరౌన్ చక్రవర్తి ప్రజలపై చేస్తున్న దౌర్జన్యాలను గురించి ఆయన క్షుణ్ణంగా తెలియజేశారు. అంతా విని, ఈ ప్రాంతం ఫిరౌన్ సామ్రాజ్యపరిధిలోనికి రాదనీ, అందుచేత ఆందోళన చెందాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని ఆయన మూసాకు ధైర్యం చెప్పారు.

50. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం తండ్రి తన కుమార్తెల నుద్దేశించి, "ఇతను బలవంతుడు, నమ్మకస్థుడు అని మీకెలా తెలుసు?" అని అడిగాడు. దానికి సమాధానంగా వారు ఇలా అన్నారు: "నాన్నా! మేము పశువులకు నీరు త్రాగించే బావి దగ్గర ఒక పెద్దరాయి ఉంటుంది. కనీసం పదిమంది పడితేగాని ఆ రాయిని లేపలేరు. కాని ఈయన గారు ఒక్కరే ఆ రాయిని లేపి, మరి ఒక్కరే తెచ్చి అక్కడ పెట్టేశారు. ఈయన చాలా బలిష్ఠుడు అనడానికి ఇదొక నిదర్శనం. ఇక ఈయన గారి విశ్వసనీయత గురించి చెప్పమంటారా! మీ సూచనపై నేను ఈయనగారిని ఇంటికి పిలుచుకు వస్తున్నప్పుడు నేను ముందు ఉన్నాను. ఈయన వెనుక నడుస్తున్నారు. కాని గాలికి నా పైట కొంగు పదే పదే ఎగిరిపోతుండేది. అప్పుడు ఈయన నన్నుద్దేశించి, నువ్వు వెనుక ఉండు. నేను ముందు ఉంటాను. నీ శరీరంపై నా చూపు పడకుండా ఉండటానికి ఇదే ఉత్తమ పద్ధతి. అయితే దారిని సూచిస్తూ వెనుక నుంచి కంకర రాళ్ళు విసురుతూ ఉండు. దాని ప్రకారం నేను ముందుకు సాగిపోతాను అని చెప్పారు. నాన్నా! ఈయన నమ్మకస్థుడు అని చెప్పడానికి ఇదొక తార్కాణం." నిజం దేవుడెరుగు (ఇబ్నె కసీర్).

51. మన నాట ఈ విధంగా ఆడపిల్ల తండ్రి ఎవరినయినా, "నీకు నా కూతుర్ని ఇచ్చి పెండ్లి చేయదలుస్తున్నాను" అని అంటే అది చాలా తీవ్రమైన విషయంగా పరిగణించబడుతోంది. కాని దైవ సమ్మతమైన షరీయతు ప్రకారం ఇలా చెప్పటంలో తప్పేమీ లేదు. గుణవంతుడైన అబ్బాయి లభించినప్పుడు, ఆ అబ్బాయితోగానీ, అబ్బాయి తల్లిదండ్రులతోగానీ పెండ్లి సంబంధం గురించి మాట్లాడటం సమ్మతమే. పైగా ఇలా నేరుగా మాట్లాడటం ఉత్తమం కూడా. అంతిమ దైవప్రవక్త (సఅసం) కాలంలోనూ, ఆయన ప్రియసహచరుల కాలంలో కూడా ఈ పద్ధతే కొనసాగేది.

52. ఈ ఆయతు ఆధారంగా, కూలిపై లేదా కాంట్రాక్టుపై పురుషుణ్ణి నౌకరుగా కుదుర్చు కోవడాన్ని పండితులు ధర్మసమ్మతంగా ఖరారు చేశారు.

53. అంటే – ఎనిమిది సంవత్సరాల గడువు ముగిసేసరికి నీకు కష్టంగా తోస్తే ఆ రెండేళ్ళ గడువు పూర్తి చేయకుండానే నువ్వు నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు.

54. అంటే – మాట తప్పటంగానీ, నిన్ను వేధించటం గానీ, మోయలేనంత భారాన్ని నీపై వేయటంగానీ చేయను. నీ యెడల ప్రేమభావంతో మెలగుతాను.

**29** మరి మూసా ఆ గడువును పూర్తి చేసి,[57] తన ఇంటివారిని తీసుకుని వెళుతుండగా[58] తూరు (పర్వతం) వైపు అగ్ని కనిపించింది. ఆయన తన ఇంటామెతో, "ఇక్కడే ఉండండి. నేను అగ్నిని చూశాను. బహుశా అక్కణ్ణుంచి నేను ఏదైనా సమాచారాన్నిగానీ, లేదా మీరు చలి కాచుకోవటానికి నిప్పు రవ్వనుగానీ తెస్తాను" అన్నాడు.

**30** తీరా అక్కడకు చేరుకోగానే, ఆ లోయకు కుడి అంచున గల శుభప్రదమైన స్థలంలోని ఒక వృక్షం నుంచి,[59] "మూసా! నేను సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌ను"[60] అని పిలుపు వినవచ్చింది.

**31** "నీ చేతికర్రను పడవెయ్యి" (అన్న వాణి కూడా వినిపించింది). మరి ఆ కర్ర పాము మాదిరిగా మెలికలు తిరగటం చూసి, అతను వెనుతిరిగి పారిపోసాగాడు. కనీసం తిరిగి (దాని వంక) చూడనైనా లేదు. "ఓ మూసా! ముందుకు రా! భయపడకు. నిశ్చయంగా నువ్వు అన్ని విధాలా సురక్షితంగా ఉన్నావు."[61]

فَلَمَّا قَضٰى مُوْسَى الْاَجَلَ وَسَارَ بِاَهْلِهٖۤ اٰنَسَ مِنْ
جَانِبِ الطُّوْرِ نَارًا ۚ قَالَ لِاَهْلِهِ امْكُثُوْۤا اِنِّیْۤ
اٰنَسْتُ نَارًا لَّعَلِّیْۤ اٰتِیْكُمْ مِّنْهَا بِخَبَرٍ اَوْ جَذْوَةٍ
مِّنَ النَّارِ لَعَلَّكُمْ تَصْطَلُوْنَ ﴿٢٩﴾

فَلَمَّاۤ اَتٰىهَا نُوْدِیَ مِنْ شَاطِئِ الْوَادِ الْاَیْمَنِ
فِی الْبُقْعَةِ الْمُبٰرَكَةِ مِنَ الشَّجَرَةِ اَنْ یّٰمُوْسٰۤى
اِنِّیْۤ اَنَا اللّٰهُ رَبُّ الْعٰلَمِیْنَ ﴿٣٠﴾

وَ اَنْ اَلْقِ عَصَاكَ ؕ فَلَمَّا رَاٰهَا تَهْتَزُّ كَاَنَّهَا
جَآنٌّ وَّلّٰى مُدْبِرًا وَّلَمْ یُعَقِّبْ ؕ یٰمُوْسٰۤى
اَقْبِلْ وَلَا تَخَفْ ۫ اِنَّكَ مِنَ الْاٰمِنِیْنَ ﴿٣١﴾

55. అంటే – మీతో జరిగిన ఒప్పందం ప్రకారం ఎనిమిది లేక పదేండ్లు పనిచేస్తాను. ఆ తరువాత వెళ్ళదలిస్తే మీకు అభ్యంతరం ఉండకూడదు. నాపై ఎలాంటి ఒత్తిడీ తీసుకురాకూడదు.

56. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ పలుకులు హజ్రత్ షుఐబ్ (అలైహి) గారివి. మరికొంతమంది ప్రకారం హజ్రత్ మూసా (అలైహి) గారివి. ఎందుకంటే వాక్యం ఉభయులకు వర్తించేలా–బహువచనంలో–సాగింది. బహుశా ఇద్దరి తరఫున కూడా ఈ మాట చెప్పబడి ఉండవచ్చు. ఈ ఒప్పందం ప్రకారమే ఆయన కుమార్తెతో హజ్రత్ మూసా (అలైహిస్సలాం) పెండ్లి సంబంధం ఖాయమై పోయింది. మిగిలిన వివరాలను అల్లాహ్ ఖుర్ఆన్‌లో ప్రస్తావించలేదు.

57. ఇంతకీ హజ్రత్ మూసా (అలైహిస్సలాం) పూర్తిచేసిన గడువు ఎంత? ఎనిమిదేండ్లా? పదేండ్లా? ఆయన పదేండ్ల గడువును పూర్తిచేశారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఇదే పరిపూర్ణమైన గడువు (మూసా మామగారు కోరుకున్న గడువు). ముసలివారైన తన మామగారి మనసు నొప్పించటం హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు ఎంతమాత్రం ఇష్టం లేదు. (ఫత్‌హుల్ బారీ–కితాబుష్షహాదాత్).

58. దీన్నిబట్టి తెలిసేదేమంటే భర్త తన భార్యను ఎక్కడికయినా తీసుకెళ్ళగలడు.

59. పిలుపు ఆ లోయ అంచు నుంచి వినిపించింది. అది పశ్చిమ దిక్కున, పర్వతానికి కుడివైపున ఉంది. అక్కడ ఒక చెట్టుంది. ఆ చెట్టు నుంచి అగ్ని జ్వాలలు ప్రజ్వలిస్తూ ఉన్నాయి. వాస్తవానికి అది పరమ ప్రభువు తేజరిల్లినందున ప్రసరించిన కాంతిరేఖలు.

60. "ఓ మూసా! ఇప్పుడు నీతో మాట్లాడుతున్నది ఎవరో కాదు, నేనే! సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్‌ను."

61. తూరు పర్వతంపై ప్రవక్త పదవి లభించిన పిదప హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు ప్రసాదించబడిన మహిమ ఇది. 'మహిమ' (మోజిజా) అంటే సాధారణంగా జరిగే వాటికి భిన్నంగా – అసాధారణంగా అనూహ్యంగా–ఉంటుంది. ఇలాంటి అద్భుతాలు దైవాజ్ఞతో, దైవ ప్రణాళిక ననుసరించి సంభవిస్తుంటాయి. అంతేగాని ఇలాంటి విషయాలలో మానవ ప్రయత్నంగానీ, ప్రమేయంగానీ ఏమీ ఉండదు. ఎంతగొప్ప ప్రవక్త అయినా, దేవుని ప్రియతముడైన దాసుడైనా తన స్వయంకృషితో ఇలాంటి మెరుపులు మెరిపించలేడు. హజ్రత్ మూసా (అలైహి) గారినే చూడండి! తన చేతి కర్ర

**32** “నీ చేతిని నీ చొక్కా లోపల పెట్టుకో. అది ఎలాంటి లోపం లేకుండానే – తెల్లగా మెరిసిపోతూ[62] – బయటికి వస్తుంది. భీతావహ స్థితి నుంచి (సురక్షితంగా ఉండటానికి) నీ చేతిని (మడచి) నీ పార్శ్వానికి ఆనించిపెట్టు.[63] నువ్వు ఫిరౌను మరియు అతని అధికారుల వద్ద సమర్పించటానికి నీ ప్రభువు తరఫు నుంచి నీకు ఇవ్వబడిన రెండు మహిమలు ఇవి! నిశ్చయంగా వారంతా అవిధేయులుగా తయారయ్యారు”[64] (అని మేమన్నాము).

اُسْلُكْ يَدَكَ فِيْ جَيْبِكَ تَخْرُجْ بَيْضَآءَ مِنْ غَيْرِ
سُوْٓءٍ ۫ وَّاضْمُمْ اِلَيْكَ جَنَاحَكَ مِنَ الرَّهْبِ فَذٰنِكَ
بُرْهَانٰنِ مِنْ رَّبِّكَ اِلٰى فِرْعَوْنَ وَ مَلَا۟ىِٕهٖ ؕ
اِنَّهُمْ كَانُوْا قَوْمًا فٰسِقِيْنَ ﴿32﴾

**33** మూసా ఇలా విన్నవించుకున్నాడు: “ప్రభూ! నేను వాళ్ల మనిషి నొకతన్ని చంపి ఉన్నాను. కాబట్టివాళ్ళిప్పుడు నన్ను హతమారుస్తారేమోనని నాకు భయంగా ఉంది.”[65]

قَالَ رَبِّ اِنِّيْ قَتَلْتُ مِنْهُمْ نَفْسًا فَاَخَافُ
اَنْ يَّقْتُلُوْنِ ﴿33﴾

**34** “నా సోదరుడైన హారూను నా కంటే మంచి వాక్పటిమ కలవాడు. అందువల్ల నన్ను ధృవీకరించే నిమిత్తం అతన్ని నా సహాయకునిగా చేసి పంపు.[66] వాళ్ళు నన్ను ధిక్కరిస్తారేమోనని నాకు భయంగా ఉంది.”

وَاَخِيْ هٰرُوْنُ هُوَ اَفْصَحُ مِنِّيْ لِسَانًا فَاَرْسِلْهُ مَعِيَ
رِدْاً يُّصَدِّقُنِيْٓ ۫ اِنِّيْٓ اَخَافُ اَنْ يُّكَذِّبُوْنِ ﴿34﴾

---

పాము మాదిరిగా మెలికలు తిరుగుతూ అటూ ఇటూ పరుగెత్తే సరికి, ఆయన సహజంగానే భయకంపితులై పోయారు. అల్లాహ్ ఓదార్చిన తరువాతగాని ఆయన మనసు కుదుటపడలేదు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే, మూసా ఒక సత్య వంతుడైన ప్రవక్త అని ప్రజలు ధృవీకరించేటందుకు అల్లాహ్ ఆయనకు మహిమలను ప్రసాదించాడు.

62. చెయ్యి తెల్లగా మెరిసిపోతున్నట్లు కనిపించటం – ఇది ఆయనకు ప్రసాదించబడిన రెండవ మహిమ.

63. మూసా తన చేతికర్రను క్రిందపడవేసినప్పుడు అది పాములా కదిలేది. దాన్ని చూసినప్పుడు మూసా (అలైహి)కు సహజంగానే భయం కలిగేది. ఆ భయం నుంచి సురక్షితంగా ఉండేందుకు దేవుడాయనకు ఒక ఉపాయం సూచించాడు. అలాంటి సందర్భాలలో తన భుజాన్ని ముడుచుకోమని – అంటే చేతిని చంకలో దూర్చుకో. దానివల్ల నీ భయం తొలగిపోతుంది అని చెప్పాడు. ఈ నేపథ్యంలో ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు : హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అనుసరణలో ఎవరయినాసరే భయకంపితులైన తరుణంలో తన గుండెపై చేయిపెట్టుకుంటే, అతని గుండె దడ క్రమంగా క్షీణిస్తుంది లేదా అతని గుండె తేలికపడుతుంది–ఇన్‌షా అల్లాహ్!

64. కాబట్టి ఆ దుర్మార్గుల ముందు ఈ రెండు మహిమలను ప్రదర్శించు. కనీసం వీటిని చూసిన తరువాతైనా వారు నిన్ను ప్రవక్తగా ధృవీకరిస్తారేమో.

65. హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కి చాలా కాలంగా ఈ భయం పీడిస్తూ ఉంది. ఎందుకంటే ఇంతకుముందు చెప్పినట్టు ఆయన చేతుల్లో ఫిరౌన్ వర్గానికి చెందిన ఒక వ్యక్తి వధించబడ్డాడు.

66. ఇస్రాయీలీయుల కథనం ప్రకారం హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు కొద్దిగా నత్తి ఉండేది. ఎప్పుడో ఆయన ముందు నిప్పు రవ్వ, ఖర్జూరపండు (లేక ముత్యం) ఉంచబడగా ఆయన నిప్పు రవ్వను నోట్లో వేసుకున్నారని, తత్కారణంగా ఆయన నాలుక కాలిందని ఒక కథనం ఉంది. అది ఎంతవరకు నిజమోగాని, దివ్య ఖుర్‌ఆన్ లోని ఆయతు ద్వారా ఒక విషయం మాత్రం స్పష్టమవుతోంది. అదేమిటంటే హజ్రత్ మూసా (అలైహి) కంటే, ఆయన సోదరుడైన హజ్రత్ హారూన్ ధారాళంగా మాట్లాడగలిగేవారు. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) మాటల్లో కొంచెం

**35** "మేము నీ సోదరునిచే నీ బాహువులను బలపరుస్తాము.[67] మీరిద్దరికీ ప్రాబల్యాన్ని ఇస్తాము. వాళ్లు అసలు మీ దాకా రాలేరు.[68] మా సూచనల ఆధారంగా మీరు, మీ అనుయాయులు విజయం సాధిస్తారు"[69] అని అల్లాహ్ సెలవిచ్చాడు.

قَالَ سَنَشُدُّ عَضُدَكَ بِأَخِيكَ وَنَجْعَلُ لَكُمَا
سُلْطَٰنًا فَلَا يَصِلُونَ إِلَيْكُمَا ۚ بِـَٔايَٰتِنَآ أَنتُمَا وَمَنِ
ٱتَّبَعَكُمَا ٱلْغَٰلِبُونَ ﴿٣٥﴾

**36** ఆ తరువాత మూసా, మేము ప్రసాదించిన స్పష్టమైన మహిమలను తీసుకుని వారి వద్దకు వచ్చినప్పుడు, "ఇది కాల్పనిక మాంత్రిక విద్యలా ఉంది. మేము మా పూర్వీకులైన మా తాత ముత్తాతల కాలంలో కూడా దీన్ని గురించి ఎన్నడూ వినలేదు"[70] అని వారన్నారు.

فَلَمَّا جَآءَهُم مُّوسَىٰ بِـَٔايَٰتِنَا بَيِّنَٰتٍ قَالُوا۟
مَا هَٰذَآ إِلَّا سِحْرٌ مُّفْتَرًى وَمَا سَمِعْنَا بِهَٰذَا
فِىٓ ءَابَآئِنَا ٱلْأَوَّلِينَ ﴿٣٦﴾

**37** మూసా ఇలా చెప్పాడు: "తన వద్ద నుంచి మార్గదర్శకత్వాన్ని తెచ్చే వ్యక్తి గురించి,[71] పరలోక పరిణామం రీత్యా కృతార్థులయ్యే వారి గురించి[72] నా ప్రభువుకు బాగా తెలుసు. దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందరు."[73]

وَقَالَ مُوسَىٰ رَبِّىٓ أَعْلَمُ بِمَن جَآءَ بِٱلْهُدَىٰ
مِنْ عِندِهِۦ وَمَن تَكُونُ لَهُۥ عَٰقِبَةُ ٱلدَّارِ ۖ
إِنَّهُۥ لَا يُفْلِحُ ٱلظَّٰلِمُونَ ﴿٣٧﴾

---

అస్పష్టత ఉండేది. అందుకే ఆయన తనకు ప్రవక్త పదవి లభించినపుడు, తన నాలుక ముడిని విప్ప మంటూ అల్లాహ్‌ను ప్రార్థించారు. హజ్రత్ హారూన్ తన వాగ్ధాటిచే తనకు అండగా ఉంటాడని కూడా ఆయన ఆశించారు. **'రిద్అన్'** (رِدْاً) అంటే సహాయకుడు, పనిలో సహకరించేవాడు అని అర్థం.

67. హజ్రత్ మూసా (అలైహి) ప్రార్థన ఆమోదించబడింది. ఆయన కోరిక మేరకు ఆయన సోదరుడైన హారూను (అలైహి)ను కూడా ప్రవక్తగా నియమించి, ఆయనకు సహాయకునిగా పంపటం జరిగింది.

68. అంటే – మీరు భయపడవలసిన పనిలేదు. మిమ్మల్ని రక్షించే బాధ్యత మాది. ఫిరౌన్‌గానీ, అతని మందీమార్బలం గానీ, మంత్రి పుంగవులుగానీ మీకెలాంటి కీడు కలిగించలేరు అని అల్లాహ్ అభయమిచ్చాడు.

69. అంతిమ విజయం మూసాకు, మూసా అనుయాయులకే లభిస్తుందన్న శుభవార్త ఖుర్‌ఆన్‌లో పలుచోట్ల అందజేయ బడింది. మాయిద (67), అహ్జాబ్ (39), ముజాదలా (21), మూమిన్ (51, 52).

70. ఏమిటీ? జగతిలో ఒకే దేవుడా?! అందరినీ సృష్టించినవాడు ఆయనేనా! ఆరాధనలకు ఆయన ఒక్కడే అర్హుడా?! వింతగా ఉందే. ఈ మాట ఇంతకుముందు మేమెన్నడూ వినలేదే! ఇదంతా నీ కట్టుకథ తప్ప మరేమీ కాదు. మాకుగానీ, మా తాతముత్తాతలకుగానీ ఈ ఏకదైవారాధన (తౌహీద్) గురించి ఏమీ తెలీదు. తెలుసుకోవాల్సిన అవసరం కూడా మాకు లేదు అని వారంతా అన్నారు. మక్కాలోని ముష్రిక్కులు కూడా దేవుని అంతిమ ప్రవక్త (సఅసం)కు ఈ రకమయిన సమాధానమే యిచ్చారు. "ఈయనగారు దేవుళ్ళందరినీ (రూపుమాపి) ఒకే ఆరాధ్య దైవాన్ని చేశాడే? ఇది మరీ విడ్డూరంగా ఉందికదూ!" అని అన్నారు వారు (సాద్ – 5).

71. అంటే – 'సన్మార్గం' గురించి మీకన్నా, నాకన్నా ఎక్కువగా దైవానికి తెలుసు. అందువల్ల మీ తాతముత్తాతల నుండి మీకు అందిన విషయాలకన్నా దేవుని తరఫున అందే విషయం నిజమైనదై ఉంటుంది. కాబట్టి మీరు ఈ సత్యాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి.

72. పరలోక పరిణామం మంచిది కావటమంటే అర్థం మనిషి ప్రవర్తన దైవప్రసన్నతను చూరగొనేదిగా ఉండటం. అతను దేవుని దయాదాక్షిణ్యాలకు, క్షమాభిక్షకు నోచుకోగలగటం. ఏకదైవారాధకులు మాత్రమే వీటికి నోచుకో గలుగుతారు.

**38** అప్పుడు ఫిరౌన్ ఇలా అన్నాడు: "ఓ ప్రముఖులారా! నేను తప్ప మీకు మరో దేవుడున్నాడన్న సంగతి నాకు తెలీదు. హామాన్! విను. నువ్వు నా కోసం మట్టిని కాల్చు (ఇటుకలు తయారు చేయి).[74] నా కోసం ఓ ఎత్తయిన ఆకాశహర్మ్యం నిర్మించు. (దాని పైకెక్కి) మూసా దేవుణ్ణి (అసలున్నాడో లేడో) తొంగి చూస్తాను.[75] ఇతను మాత్రం అసత్యవాదుల్లో ఒకడని నా అనుమానం."[76]

وَقَالَ فِرْعَوْنُ يَٰٓأَيُّهَا الْمَلَأُ مَا عَلِمْتُ لَكُمْ مِّنْ إِلَٰهٍ غَيْرِى ۚ فَأَوْقِدْ لِى يَٰهَٰمَٰنُ عَلَى الطِّينِ فَاجْعَل لِّى صَرْحًا لَّعَلِّىٓ أَطَّلِعُ إِلَىٰٓ إِلَٰهِ مُوسَىٰ وَإِنِّى لَأَظُنُّهُۥ مِنَ الْكَٰذِبِينَ ﴿38﴾

**39** వాడూ, వాడి సైనికులూ అకారణంగా రాజ్యంలో అహంకారం ప్రదర్శించారు.[77] మా వద్దకు మరలి రావటం అనేది జరగదని వారు తలపోశారు.

وَاسْتَكْبَرَ هُوَ وَجُنُودُهُۥ فِى الْأَرْضِ بِغَيْرِ الْحَقِّ وَظَنُّوٓا۟ أَنَّهُمْ إِلَيْنَا لَا يُرْجَعُونَ ﴿39﴾

**40** ఎట్టకేలకు మేము వాణ్ణి, వాడి సైన్యాలను పట్టుకున్నాము. మరి వాళ్ళను సముద్రంలో పారేశాము.[78] మరి చూడు, ఆ దుర్మార్గులకు ఏ గతిపట్టిందో!

فَأَخَذْنَٰهُ وَجُنُودَهُۥ فَنَبَذْنَٰهُمْ فِى الْيَمِّ ۖ فَانظُرْ كَيْفَ كَانَ عَٰقِبَةُ الظَّٰلِمِينَ ﴿40﴾

73. ఇక్కడ **'దుర్మార్గులు'** లేక 'అన్యాయపరులు' అంటే అవిశ్వాసులు, ముష్రిక్కులు అని భావం. దుర్మార్గం లేక అన్యాయం (జుల్మ్) అంటే ఒక వస్తువును అది ఉండవలసిన చోటునుంచి తొలగించి, వేరొకచోట పెట్టడం అని అర్థం. ముష్రిక్కులు (బహు దైవారాధకులు) కూడా ఈ పనే చేస్తారు. వాళ్లు దైవత్వపు స్థానంలో దానికి అర్హులుకాని వారిని తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. అలాగే దైవతిరస్కారులు (కాఫిర్లు) కూడా దేవునికి ఇవ్వవలసిన గౌరవాన్ని ఇవ్వరు. దేవుని ఔన్నత్యాన్ని గురించి తెలుసుకునేందుకు ప్రయత్నించరు. అందువల్ల వీళ్లంతా 'అన్యాయస్థులు'గా పరిగణించబడ్డారు. వీళ్లు పరలోకంలో దైవకారుణ్యానికి, క్షమాభిక్షకు నోచుకోరు. ఈ ఆయతు ద్వారా తెలిసే ముఖ్య విషయం ఏమంటే సిసలైన సాఫల్యం అంటే పరలోక సాఫల్యమే. అంతేగాని ప్రాపంచిక సిరిసంపదలు, పదవులు సాఫల్యానికి ప్రతీకలు ఎంతమాత్రం కావు. ఎందుకంటే ఈ తాత్కాలిక సిరులు ప్రపంచంలో అవిశ్వాసులకు, బహు దైవోపాసకులకు, నాస్తికులకు కూడా ప్రాప్తిస్తాయి. కాని ఈ దుర్మార్గులు సాఫల్యం పొందజాలరని అల్లాహ్ స్పష్టంగా చెప్పేశాడు. దీన్నిబట్టి నిజమైన సాఫల్యం (మోక్షం) పరలోకంలో లభించేదే అని స్పష్టంగా అర్థమవుతోంది.

74. అంటే మట్టిని అగ్నిలో కాల్చి ఇటుక రాళ్ళను తయారుచేయి అని ఫిరౌను ఆదేశించాడు. అతను హామాన్‌ను ఎందుకు ఆదేశించాడంటే హామాన్ అతని దగ్గర మంత్రిగా ఉండేవాడు. అతని ఆంతరంగిక సలహాదారుగా, కార్యదర్శిగా కూడా వ్యవహరించేవాడు.

75. నేనుగాక మరో దేవుడు కూడా అసలున్నాడా? ఉంటే ఎక్కడున్నాడు? ఆకాశంలో ఉన్నాడా? అలాగయితే ఓ ఎత్తయిన భవనం నిర్మించు. నేను దానిపైకెక్కి ఆ దేవుణ్ణి చూస్తాను అని ఫిరౌన్ అన్నాడు. అతని ఈ మాటల్లో వ్యంగ్యం, వెటకారం, తృణీకరణ అంతర్లీనమై ఉన్నాయి.

76. అంటే, సర్వలోకాల ప్రభువు అల్లాహ్‌యే అని మూసా చెప్పే మాటల్లో ఏ మాత్రం నిజంలేదు. నా అభిప్రాయం ప్రకారం అతను చెప్పేది పచ్చి అబద్ధం అని ఫిరౌన్ చెప్పాడు.

77. రాజ్యం అంటే ఈజిప్టు భూభాగం అన్నమాట. ఫిరౌన్ రాజ్యమేలింది ఈజిప్టులోనే. అకారణంగా అహంకారం ప్రదర్శించటమంటే అర్థం – వారు తమను తాము చాలా గొప్పవారుగా ఊహించుకున్నారు. రాజ్యంలో చెలరేగిపోయారు. న్యాయాన్ని తుంగలో తొక్కేసి బలహీన వర్గాలను వేధించారు. సత్యాన్ని తృణీకరించారు. నిజ దైవాన్ని కాదని తమను తాము దేవుళ్లుగా, దైవాంశ సంభూతులుగా ప్రకటించుకున్నారు.

**41** మేము వాళ్ళను నరకం వైపునకు పిలిచే నాయకులుగా చేశాము.[79] ప్రళయ దినాన వారు ఏ సహాయానికీ నోచుకోరు.

وَجَعَلْنٰهُمْ اَىِٕمَّةً يَّدْعُوْنَ اِلَى النَّارِ ۚ وَيَوْمَ الْقِيٰمَةِ لَا يُنْصَرُوْنَ ﴿41﴾

**42** మేము ఈ ప్రపంచంలో కూడా వారి వెనుక శాపాన్ని తగిలించాము. ప్రళయ దినాన కూడా వారు దౌర్భాగ్యుల జాబితాలో చేర్తారు.[80]

وَاَتْبَعْنٰهُمْ فِيْ هٰذِهِ الدُّنْيَا لَعْنَةً ۚ وَيَوْمَ الْقِيٰمَةِ هُمْ مِّنَ الْمَقْبُوْحِيْنَ ﴿42﴾

**43** ఈ పాత తరాన్ని అంతమొందించిన తరువాత మేము మానవులకు వెలుగుగా, మార్గదర్శనంగా, కారుణ్యంగా[81] ఉండే గ్రంథాన్ని మూసాకు ప్రసాదించాము[82] – తద్వారా వారు గుణపాఠం గ్రహిస్తారని![83]

وَلَقَدْ اٰتَيْنَا مُوْسَى الْكِتٰبَ مِنْۢ بَعْدِ مَاۤ اَهْلَكْنَا الْقُرُوْنَ الْاُوْلٰى بَصَاۤىِٕرَ لِلنَّاسِ وَهُدًى وَّرَحْمَةً لَّعَلَّهُمْ يَتَذَكَّرُوْنَ ﴿43﴾

**44** (ఓ ముహమ్మద్–స!) మేము మూసాకు ఆజ్ఞను అందజేసినప్పుడు నువ్వు (తూరు పర్వతం) పశ్చిమం వైపున లేవు. దానికి నువ్వు సాక్షివి కూడా కావు.[84]

وَمَا كُنْتَ بِجَانِبِ الْغَرْبِيِّ اِذْ قَضَيْنَاۤ اِلٰى مُوْسَى الْاَمْرَ وَمَا كُنْتَ مِنَ الشّٰهِدِيْنَ ﴿44﴾

---

78. వారి తిరస్కార వైఖరి, తలబిరుసుతనం మితిమీరి పోయింది. ఎంతగా బోధపరచినా వారు మా మాట వినకపోవటంతో, ఆఖరికి ఒకనాడు ఉదయం వాళ్ళను సముద్రంలో ముంచివేశాము (ఈ ముంపుకు సంబంధించిన వివరాలు షుఅరా సూరాలో వచ్చాయి).

79. అంటే వీళ్ళ తరువాత ఎవరు ఏకదైవారాధనను త్రోసిపుచ్చినా వారు ఫిరౌను అనుయాయులుగా పరిగణించబడతారు. అలాంటి వారందరికీ ఫిరౌనీయులు నాయకులు అనిపించుకుంటారు. ఎందుకంటే వారు జనులను నరకం వైపుకు పిలిచారు.

80. ఇహలోకంలో కూడా వారు పరాభవానికి గురయ్యారు. పరలోకంలో కూడా వారు దుర్భర స్థితిలో ఉంటారు. అక్కడ వారి ముఖాలపై నలుపు ఆవరించి ఉంటుంది.

81. అంటే వారు సత్యాన్ని కనుగొనడానికి, సత్యం ప్రకారం ఆచరించటానికి, దైవ కారుణ్యాన్ని పొందడానికి ఈ ఏర్పాటు చేశాము.

82. **'పాత తరం'** అంటే ఫిరౌనీయులు, లేక నూహ్ జాతివారు, ఆద్, సమూద్ జాతివారంతా ఇందులోకి వస్తారు. వీళ్ళందరి తరువాత మేము మూసాకు 'తౌరాత్' గ్రంథాన్ని నొసగాము.

83. వారు దైవానుగ్రహాలకు గాను కృతజ్ఞతలు తెలుపుకుని, విశ్వాసమార్గాన్ని అవలంబించి, దైవప్రవక్తలకు విధేయత చూపి, తద్వారా సాఫల్యాన్ని పొందుతారని మేము వారికి ఈ మేలు చేశాము.

84. (ఓ ముహమ్మద్ – సఅసం!) తూరు పర్వతంపైకి మేము మూసా (అలైహిస్సలాం)ను పిలిచి అతనితో సంభాషించినప్పుడు, అతన్ని మా సందేశహరునిగా నియుక్తం చేసినప్పుడు నువ్వక్కడ లేవు. ఆ దృశ్యాన్ని నువ్వు తిలకించనూ లేదు. ఇవన్నీ నీకు తెలియని విషయాలు. కాని వాటిని మేము నీకు తెలియపరుస్తున్నాము. నువ్వు సత్యవంతుడవైన ప్రవక్త అనడానికి ఈ విషయాలే నిదర్శనం. ఎందుకంటే నీకు ఈ విషయాలను ఇంతకు ముందు ఎవరూ చెప్పలేదు. పోనీ, ఆ దృశ్యాన్ని ఎక్కడైనా చూశావా అంటే అదీ లేదు. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో ఇతర చోట్ల కూడా వచ్చింది. ఉదాహరణకు : ఆలి ఇమ్రాన్ – 44, హూద్ – 49, 100, యూసుఫ్ – 102, తాహా – 99.

وَلٰكِنَّآ اَنْشَاْنَا قُرُوْنًا فَتَطَاوَلَ عَلَيْهِمُ الْعُمُرُ ۚ
وَمَا كُنْتَ ثَاوِيًا فِيْٓ اَهْلِ مَدْيَنَ تَتْلُوْا عَلَيْهِمْ
اٰيٰتِنَا ۙ وَلٰكِنَّا كُنَّا مُرْسِلِيْنَ ﴿45﴾

45 కాని మేము ఎన్నో తరాల వారిని ప్రభవింపజేశాము.[85] వారిపై సుదీర్ఘకాలం గడచిపోయింది.[86] అయితే నువ్వు మద్'యన్ వాసుల మధ్య కూడా – మా ఆయతులను చదివి విని పించడానికి అక్కడ నివసించి ఉండలేదు.[87] కాని మేము మాత్రం ప్రవక్తలను పంపిస్తూనే ఉండేవారము.[88]

وَمَا كُنْتَ بِجَانِبِ الطُّوْرِ اِذْ نَادَيْنَا وَلٰكِنْ رَّحْمَةً
مِّنْ رَّبِّكَ لِتُنْذِرَ قَوْمًا مَّآ اَتٰىهُمْ مِّنْ نَّذِيْرٍ مِّنْ
قَبْلِكَ لَعَلَّهُمْ يَتَذَكَّرُوْنَ ﴿46﴾

46 మేము (మూసాను) పిలిచినప్పుడు కూడా నువ్వు తూర్ (పర్వతం) వైపున లేవు.[89] నిజానికి నీకు పూర్వం అప్రమత్తం చేసే వాడెవడూ రాని[90] జాతిని నువ్వు అప్రమత్తం చేయడానికి; నీ ప్రభువు తరఫున (నీకు వొసగబడిన) కారుణ్యం ఇది.[91] దీనిద్వారా వారు బహుశా గుణపాఠం నేర్చుకుంటారేమో!

85. **'ఖురూన్'** అంటే అసలు 'కాలాలు' అని అర్థం. కాని ఈ ఆయతులో మాత్రం ఈ పదం సమాజాలు, తరాలు, సంఘాలు అన్న భావంలో ప్రయోగించబడింది. ఓ ముహమ్మద్(స) ! నీకూ – మూసాకు మధ్య గడచిన కాలంలో మేము ఎన్నో జాతులను, మరెన్నో తరాలను లేపాము అని దీని భావం.

86. అంటే, ఈ కాల ప్రవాహంలో ఎన్నో షరీయతు ఆదేశాలు మార్పులకు లోనయ్యాయి. ప్రజలు కూడా తమ ప్రవక్తల పాఠాలు మరచిపోయారు. తత్కారణంగా వారు దైవాజ్ఞలను ఉపేక్షించారు. వాటిపట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబించారు. అందువల్ల మరో నూతన ప్రవక్తను పంపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. లేదా వారివద్దకు దైవప్రవక్త వచ్చి కొన్ని యుగాలు గడచిపోవటం మూలంగా (ఓ ముహమ్మద్!) వారు నీ దైవదౌత్యం పట్ల ఆశ్చర్యానికి గురవుతున్నారు. అందుకే వాళ్లు నీ యెడల తిరస్కార వైఖరిని అవలంబిస్తున్నారు.

87. నువ్వు గనక వారి మధ్య ఉండి ఉంటే ఆ వివరాలన్నీ నీకు తెలిసి ఉండేవి.

88. ఆ ఆనవాయితీ ప్రకారమే ఇప్పుడు నిన్ను కూడా ప్రవక్తగా చేసి పంపాము. వెనుకటి ప్రవక్తల యదార్థ గాథలను కూడా నీకు – అవసరం మేరకు – ఎరుకపరచాము.

89. అంటే ఓ ముహమ్మద్ (సఅసం)! నువ్వు గనక సత్యవంతుడవైన ప్రవక్త కాని పక్షంలో మూసా (అలైహిస్సలాం) వృత్తాంతం గురించి నీకు తెలిసి ఉండేది కాదు.

90. ఇంతకీ ఆ జాతి ఏది అంటే అది అరబ్బు జాతే. వారు మక్కావారే. మహాప్రవక్త ముహమ్మద్ (స)కు మునుపు వారివద్దకు ఏ ప్రవక్తా రాలేదు. ఎందుకంటే దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తదనంతరం దైవదౌత్య పరంపర ఆయన కుమారుడగు ఇస్హాఖ్ సంతతిలోనే కొనసాగింది. ఇస్రాయీలు వంశీయులలోనే ప్రవక్తలు రాసాగారు. మరి బనీ ఇస్మాయీల్ వారైన అరబ్బులలో ఇస్మాయీల్ తరువాత ప్రవక్తల పరంపర ఆగిపోయింది. వారివద్దకు ప్రత్యేకంగా ప్రవక్త పంపబడకపోవడానికి కారణమేమంటే వారి ఇరుగు పొరుగు రాజ్యాలలో వస్తూ ఉండే ప్రవక్తల సందేశం వారి వరకూ బహుశా చేరుతూ ఉండేదేమో! అయితే రేపటి రోజున (తీర్పుదినాన) వారు సాకులు చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించరాదన్న ఉద్దేశంతో విశ్వప్రభువు ముహమ్మద్ (స) రూపంలో ఆఖరి ప్రవక్తను అరబ్బుల వద్దకు పంపాడు.

91. అంటే ఈనాడు నువ్వు జనవాహినిలో నిలబడి ప్రకటిస్తున్న అసాధారణ విషయాలన్నీ నీ ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం కావు. నిజానికి ఇదంతా నీ ప్రభువు కటాక్షం మాత్రమే. ఆయన తన సందేశం (వహీ) ద్వారా ఈ అద్భుత విషయాలను నీకు తెలియపరుస్తున్నాడు.

وَلَوْلَآ أَن تُصِيبَهُم مُّصِيبَةٌۢ بِمَا قَدَّمَتْ أَيْدِيهِمْ فَيَقُولُوا۟ رَبَّنَا لَوْلَآ أَرْسَلْتَ إِلَيْنَا رَسُولًا فَنَتَّبِعَ ءَايَٰتِكَ وَنَكُونَ مِنَ ٱلْمُؤْمِنِينَ ﴿٤٧﴾

**47** వారు తమ చేతులారా ముందుగా చేసి పంపుకున్న (చెడు) కర్మల కారణంగా వారిపై ఏదన్నా ఆపద వచ్చిపడిన పక్షంలో, "మా ప్రభూ! నువ్వు మా వద్దకు ఏ ప్రవక్తనయినా ఎందుకు పంపలేదు? (పంపి ఉంటే) మేము నీ ఆయతులను అనుసరించి, విశ్వాసులలో చేరి ఉండేవారము కదా!"[92] అని అనేవారు. వారలా అనకుండా ఉండేపక్షంలో (మేము వారి వద్దకు ప్రవక్తను పంపి ఉండేవారమే కాదు).

فَلَمَّا جَآءَهُمُ ٱلْحَقُّ مِنْ عِندِنَا قَالُوا۟ لَوْلَآ أُوتِىَ مِثْلَ مَآ أُوتِىَ مُوسَىٰٓ ۚ أَوَلَمْ يَكْفُرُوا۟ بِمَآ أُوتِىَ مُوسَىٰ مِن قَبْلُ ۖ قَالُوا۟ سِحْرَانِ تَظَٰهَرَا وَقَالُوٓا۟ إِنَّا بِكُلٍّ كَٰفِرُونَ ﴿٤٨﴾

**48** మరి వారి వద్దకు మా తరఫు నుంచి సత్యం వచ్చినప్పుడు, "మూసాకు ఇవ్వబడినదే ఈయనకు ఎందుకు ఇవ్వబడలేదు?"[93] అని అనసాగారు. మరైతే ఇంతకు మునుపు మూసాకు ఇవ్వబడిన దానిపట్ల జనులు తిరస్కార వైఖరిని అవలంబించలేదా ఏమిటి?[94] "వీరిద్దరూ (ఆరితేరిన) మాంత్రికులే. ఒండొకరికి చేదోడు వాదోడుగా ఉన్నారు" అని తేల్చి చెప్పేశారు. "మేము వీళ్ళందరినీ త్రోసి పుచ్చుతున్నాము"[95] అని కూడా అన్నారు.

قُلْ فَأْتُوا۟ بِكِتَٰبٍ مِّنْ عِندِ ٱللَّهِ هُوَ أَهْدَىٰ مِنْهُمَآ أَتَّبِعْهُ إِن كُنتُمْ صَٰدِقِينَ ﴿٤٩﴾

**49** "ఒకవేళ మీరు సత్యవంతులే అయితే ఈ రెండింటికన్నా ఎక్కువగా సన్మార్గం చూపే గ్రంథాన్ని అల్లాహ్ వద్దనుంచి తీసుకు రండి. నేను దానిని అనుసరిస్తాను"[96] అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

92. ఇదీ అసలు సంగతి! ఒక ప్రవక్తకు – మరో ప్రవక్తకు మధ్య అనేక యుగాలు గడచిపోవటం వల్ల గత ప్రవక్తల షరీయతులు ప్రక్షిప్తం అయ్యాయి. ప్రవక్తల సందేశాన్ని ప్రజలు మరచిపోయారు. వారి మధ్య మరో ప్రవక్త రావలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగానే అల్లాహ్ తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రబోధనలను (ఖుర్‌ఆన్ హదీసులను) మార్పులు చేర్పులకు, ప్రక్షిప్తాలకు లోనుకాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. ఇంకా ఆయన చేసిన దైవిక ఏర్పాట్ల ద్వారా ప్రపంచం మారుమూలల్లోకి ఆయన (స) సందేశం చేరింది. రోజు రోజుకూ అది విస్తరిస్తూనే ఉంది. ఎందుకంటే మరో ప్రవక్త రావలసిన అవసరం లేకుండా అల్లాహ్ దైవదౌత్యాన్ని పరిసమాప్తం చేశాడు. ఇప్పుడు ఎవరయినా తనను దైవప్రవక్తగా ప్రకటించుకుంటే అతను అబద్ధాగ్రేసరుడు అవుతాడు.

93. అంటే, మూసాకు ఇవ్వబడిన మహిమలు. ఉదాహరణకు : చేతి కర్ర పాముగా మారిపోవటం, చెయ్యి ప్రకాశించటం వంటి మహిమలు – ముహమ్మద్ (సఅసం)కు ఎందుకు ఇవ్వబడలేదు? అన్నది వారి ఉద్దేశం.

94. ఒకవేళ వారు కోరుతున్న మహిమలు వారికి చూపినా ప్రయోజనం ఏముంది? విశ్వసించేందుకు నిరాకరించేవారికి ఎన్ని నిదర్శనాలు చూపినా నిష్ప్రయోజనమే. మూసా (అలైహిస్సలాం) చూపిన మహిమలను చూసి ఫిరౌను జనులు విశ్వసించారా? వాళ్లు తిరస్కార వైఖరికి ఒడిగట్టలేదా? వీళ్ళూ అదే పని చెయ్యవచ్చు.

95. **'వీళ్ళిద్దరూ'** అంటే మూసా, హారూనులని ఒక అర్థం. 'ఇవి రెండునూ' అన్న అర్థంలో తీసుకుంటే ఖుర్‌ఆను–తౌరాతులు అని అనుకోవలసి ఉంటుంది. అంటే ఈ రెండు గ్రంథాలు కూడా తాంత్రికమైనవే. మాయాజాలమే. ఈ రెండు

**50** మరి వారు గనక నీ సవాలును స్వీకరించకపోతే,[97] వారు తమ మనోవాంఛలను అనుసరించే జనులని తెలుసుకో. అల్లాహ్ మార్గ దర్శకత్వాన్ని కాకుండా తన మనోవాంఛల వెనుక నడిచేవాని కన్నా ఎక్కువ మార్గభ్రష్టుడెవడుంటాడు?[98] అల్లాహ్ దుర్మార్గులకు ఎట్టి పరిస్థితిలోనూ సన్మార్గం చూపడు.[99]

فَإِن لَّمْ يَسْتَجِيبُوا لَكَ فَاعْلَمْ أَنَّمَا يَتَّبِعُونَ
أَهْوَاءَهُمْ ۚ وَمَنْ أَضَلُّ مِمَّنِ اتَّبَعَ هَوَاهُ بِغَيْرِ
هُدًى مِّنَ اللَّهِ ۚ إِنَّ اللَّهَ لَا يَهْدِي الْقَوْمَ
الظَّالِمِينَ ﴿٥٠﴾

**51** ప్రజలు హితబోధను గ్రహించగలందులకు[100] మేము మాత్రం వారికి మా వాక్కును నిరంతరం పంపించాము.[101]

وَلَقَدْ وَصَّلْنَا لَهُمُ الْقَوْلَ لَعَلَّهُمْ
يَتَذَكَّرُونَ ﴿٥١﴾

**52** మేము లోగడ ఎవరికయితే గ్రంథం వొసగామో వారు దీనిని (ఖుర్ఆన్‌ను) కూడా విశ్వసిస్తారు.[102]

الَّذِينَ آتَيْنَاهُمُ الْكِتَابَ مِن قَبْلِهِ هُم بِهِ
يُؤْمِنُونَ ﴿٥٢﴾

**53** వారికి, దానిని (ఖుర్ఆన్‌ను) చదివి వినిపించినప్పుడు, "ఇది మా ప్రభువు తరఫు నుంచి వచ్చిన సత్యం అని మేము విశ్వసిస్తున్నాము. అసలు మేము దీనికి ముందు నుంచే ముస్లిములుగా ఉన్నాము"[103] అని వారు చెబుతారు.

وَإِذَا يُتْلَىٰ عَلَيْهِمْ قَالُوا آمَنَّا بِهِ إِنَّهُ الْحَقُّ
مِن رَّبِّنَا إِنَّا كُنَّا مِن قَبْلِهِ مُسْلِمِينَ ﴿٥٣﴾

---

గ్రంథాలు ఒకదాన్నొకటి సమర్థించేవిగా ఉన్నాయి. కాగా; మేము వీళ్ళెవరినీ నమ్మము. అంటే మేము మూసాను గానీ, ముహమ్మద్ (స)నుగానీ నమ్మబోము అని వారన్నారు. (ఫత్‌హుల్ ఖదీర్)

96. అంటే ఈ ఖుర్ఆన్, తౌరాతు గ్రంథాలు ఒట్టి మాయ అన్నదే మీ వాదన అయితే, మీరు మీ వాదనకు అనుకూలంగా ఏదన్నా దైవగ్రంథాన్ని తీసుకురండి. ఆ గ్రంథం ఈ రెండు గ్రంథాలకన్నా గొప్పగా సన్మార్గం చూపేదై ఉండాలి. అప్పుడు నేను కూడా దాన్ని నమ్ముతాను. నాక్కావాల్సింది సన్మార్గమే. సన్మార్గం తప్ప మరో వాదాన్ని నేను ఒప్పుకోను గాక ఒప్పుకోను.

97. వారు గనక ఖుర్ఆన్, తౌరాతులకన్నా ఎక్కువ సన్మార్గం చూపే గ్రంథాన్ని తీసుకురాలేని పక్షంలో వారి దగ్గర సత్యం అన్నది లేనే లేదని భావించు.

98. అంటే అల్లాహ్ తరఫున వచ్చిన మార్గదర్శకత్వాన్ని వదలి మనోవాంఛల అడుగు జాడల్లో నడవటం దుర్మార్గం. ఈ రకంగా చూస్తే మక్కాకు చెందిన ఈ ఖురైషులు పరమ దుర్మార్గులు.

99. దుర్మార్గుల పట్ల అల్లాహ్ అవలంబించే విధానం ఏమిటో ఇక్కడ తెలియజేయటం జరిగింది. అలాంటివారు ఎన్నటికీ సన్మార్గానికి నోచుకోరు. ఎందుకంటే నిరంతరం దైవప్రవక్తలను ధిక్కరిస్తూ, దైవ వచనాల పట్ల విముఖత చూపుతూ, వైరవైఖరిని అవలంబించే వారిలో సత్యాన్ని స్వీకరించే గుణం క్రమంగా క్షీణించిపోతుంది. అటు పిమ్మట మనిషి పాపాల ఊబిలో చిక్కుకుపోతాడు. అంధకారంలో తచ్చాడుతూ ఉంటాడు. అలాంటి వారికి విశ్వాసజ్యోతి ప్రాప్తించదు.

100. అంటే – ప్రజలు తమ పూర్వీకులకు పట్టిన దుర్గతిని చూసి గుణపాఠం నేర్చుకుంటారని, నిజ దైవాన్ని విశ్వసిస్తారని దీని ద్వారా ఆశించబడుతోంది.

101. అంటే – ఒక ప్రవక్త తరువాత మరో ప్రవక్తను, ఒక గ్రంథం తరువాత మరో గ్రంథాన్ని మేము పంపిస్తూ ఉండేవారము. ఈ విధంగా మేము ఎడతెగకుండా మా వాణిని ప్రజలకు చేరవేశాము.

102. వీరు ఒకప్పుడు యూదులుగా ఉండి ఇస్లాం స్వీకరించినవారు. ఉదాహరణకు : అబ్దుల్లా బిన్ సలాం (రజి) తదితరులు. లేదా అబిసీనియా నుంచి దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన క్రైస్తవులు. దైవప్రవక్త(స) నోట దివ్యఖుర్ఆన్ వాక్యాలను వినగానే వారు ఇస్లాం స్వీకరించారు (ఇబ్నె కసీర్).

**54** తాము చూపిన నిలకడ (సహన స్థయిర్యాల)కు గాను వారు రెండింతల ప్రతిఫలం ప్రసాదించబడతారు.[104] వారు మంచి ద్వారా చెడును పారద్రోలుతారు.[105] మేము ప్రసాదించిన దానిలో నుంచి (దానధర్మాల రూపేణా) ఖర్చు పెడతారు.

أُولَٰئِكَ يُؤْتَوْنَ أَجْرَهُم مَّرَّتَيْنِ بِمَا صَبَرُوا وَيَدْرَءُونَ بِالْحَسَنَةِ السَّيِّئَةَ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ﴿54﴾

**55** వారు ఏదైనా పనికిమాలిన విషయం[106] విన్నప్పుడు, వినీవిన నట్లుగా తరలిపోతారు. "మా కర్మలు మావి. మీ కర్మలు మీవి. అయ్యా! మీకో సలాం.[107] అజ్ఞానులతో వాదించదలచుకోలేదు" అని చెప్పేస్తారు.

وَإِذَا سَمِعُوا اللَّغْوَ أَعْرَضُوا عَنْهُ وَقَالُوا لَنَا أَعْمَالُنَا وَلَكُمْ أَعْمَالُكُمْ سَلَامٌ عَلَيْكُمْ لَا نَبْتَغِي الْجَاهِلِينَ ﴿55﴾

**56** (ఓ ప్రవక్తా!) నువ్వు కోరిన వారినల్లా సన్మార్గానికి తేలేవు. అయితే అల్లాహ్ తాను కోరిన వారిని సన్మార్గానికి తీసుకువస్తాడు. సన్మార్గానికి రాగలిగేవారెవరో ఆయనకు బాగా తెలుసు.[108]

إِنَّكَ لَا تَهْدِي مَنْ أَحْبَبْتَ وَلَٰكِنَّ اللَّهَ يَهْدِي مَن يَشَاءُ وَهُوَ أَعْلَمُ بِالْمُهْتَدِينَ ﴿56﴾

103. దివ్య ఖుర్ఆన్‌లో పదే పదే నొక్కి వక్కాణించబడిన విషయమే ఇది. దేవుడు అన్ని కాలాలలో, అన్ని ప్రాంతాలలో తన సందేశహరుల ద్వారా మానవాళికి అందజేసిన ధర్మం ఇస్లాం ధర్మమే. వారంతా ఆయా ప్రవక్తల సందేశం విని విశ్వసించిన ముస్లింలే అనబడతారు. యూదులు, క్రైస్తవులు అనే ఈ ప్రత్యేక పరిభాష ప్రజలు తమంతట తాముగా కల్పించుకున్నది మాత్రమే. ప్రవక్తల తదనంతరం ఈ 'పరిభాష' పుట్టుకు వచ్చేది. నిజానికి ఆ ప్రవక్తల అనుయాయులు ముస్లింలే. అందుకే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను విశ్వసించిన గ్రంథవహులు (యూదులు, క్రైస్తవులు) ఇలా అన్నారు : "మేము ముందు నుంచే ముస్లింలముగా ఉన్నాము." అంటే మేము పూర్వపు ప్రవక్తలను విశ్వసించి, వారు చూపిన విధానాన్ని అవలంబిస్తూ ఉన్నాము.

104. ఇక్కడ **'సబ్ర్'** (సహనం) అంటే స్థయిర్యం, నిలకడ అని అర్థం. అంటే సర్వకాల సర్వావస్థల్లో దైవప్రవక్తల మార్గంపై, దైవగ్రంథంలోని ఆజ్ఞలపై స్థిరత్వం కలిగి ఉండటం అన్నమాట. పూర్వం వారు దైవగ్రంథంపై విశ్వాసం కలిగి ఉండేవారు. ఆ తరువాత ఖుర్ఆన్ గ్రంథం అవతరించగా దాన్ని విశ్వసించారు. పూర్వం వారు తమ ప్రవక్తపై విశ్వాసం కలిగి ఉండేవారు. ఆ తరువాత మరోప్రవక్త (స) రాగా ఆయన్ని కూడా విశ్వసించారు. ఇలాంటి వారికి రెండింతల పుణ్యఫలం వొసగబడుతుంది. హదీసులో కూడా ఇలాంటి సజ్జనుల గొప్పతనం గురించి ప్రత్యేకంగా చెప్పబడింది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రకటించారు: "మూడు రకాల మనుషులకు రెండింతల పుణ్యఫలం ప్రసాదించబడుతుంది. వారిలో ఒకరెవరంటే గ్రంథవహులు. ఇంతకు ముందు వారు తమ ప్రవక్తను విశ్వసించేవారు. ఆ తరువాత వారు నన్ను విశ్వసించారు." (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇల్మ్; ముస్లిం–కితాబుల్ ఈమాన్)

105. వారు దుర్మార్గాన్ని దుర్మార్గం ద్వారా ఎదుర్కొనరు. అపకారానికి బదులుగా అపకారం తలపెట్టరు. పైగా తమకు కీడు తలపెట్టిన వారిని ఉపేక్షిస్తారు. వారిని మన్నించి వదలిపెడతారు. చేతనైతే వారికి మేలు కూడా చేస్తారు. ఇది మహోపకారుల లక్షణం.

106. ఇక్కడ పనికిమాలిన విషయం అంటే అర్థం సత్యధర్మానికి వ్యతిరేకంగా అలనాడు ముష్రిక్కులు వ్యంగ్య ధోరణిలో చెప్పే మాటలన్నమాట. వీలు చిక్కినప్పుడల్లా వారు ఇస్లాంను, ముస్లింలను తమ ఎత్తిపొడుపు మాటలతో అవమానపరచ జూసేవారు. అలాంటి సమయాలలో ఈ త్యాగధనులు హుందాగా నిష్క్రమించేవారు.

107. **'మీకో సలాం'** అంటే ఇక్కడ ఆశీర్వాదం లేక దీవెన అని అర్థం కాదు. 'ఇక చాలించండి మీ అధిక ప్రసంగాన్ని. మీతో మేము వాదులాడదలచుకోలేదు' అన్న భావం ఇందులో ఇమిడి ఉంది.

وَقَالُوٓا اِنْ نَّتَّبِعِ الْهُدٰى مَعَكَ نُتَخَطَّفْ مِنْ
اَرْضِنَا ؕ اَوَلَمْ نُمَكِّنْ لَّهُمْ حَرَمًا اٰمِنًا يُّجْبٰٓى
اِلَيْهِ ثَمَرٰتُ كُلِّ شَيْءٍ رِّزْقًا مِّنْ لَّدُنَّا
وَلٰكِنَّ اَكْثَرَهُمْ لَا يَعْلَمُوْنَ ﴿57﴾

**57** “మేమే గనక నీతో చేరి సన్మార్గాన్ని అనుసరిస్తే మా భూభాగం నుంచి మేము తరిమివేయబడటం ఖాయం”[109] అని వారు గగ్గోలు చెందసాగారు. ఏమిటి? మేము వారికి సురక్షితమైన, పవిత్రమైన చోట స్థిరనివాసం కల్పించలేదా?[110] అక్కడ వారికి అన్ని రకాల పండ్లు ఫలాలు ఉపాధి రూపంలో మావద్ద నుంచి సరఫరా చేయ బడలేదా?[111] కాని వారిలోని చాలా మంది (ఈ యదార్థాన్ని) తెలుసుకోరు.

وَكَمْ اَهْلَكْنَا مِنْ قَرْيَةٍۭ بَطِرَتْ مَعِيْشَتَهَا ۚ فَتِلْكَ
مَسٰكِنُهُمْ لَمْ تُسْكَنْ مِّنْۢ بَعْدِهِمْ اِلَّا قَلِيْلًا ؕ
وَكُنَّا نَحْنُ الْوٰرِثِيْنَ ﴿58﴾

**58** ఇంకా మేము, భోగభాగ్యాల మూలంగా మిడిసిపడే ఎన్నో జనవాసాలను తుదముట్టించాము. అవిగో, అవే వారి నివాస స్థలాలు! వారి తదనంతరం చాలా కొద్దిమంది మాత్రమే అక్కడ ఉండగలిగారు.[112] ఆఖరికి అన్నింటికీ వారసులం అయ్యేది మేమే సుమా![113]

108. జీవితాంతం మహాప్రవక్త (సఅసం)కు అండగా నిలిచిన బాబాయి హజ్రత్ అబూ తాలిబ్‌కు మరణ ఘడియలు ఆసన్నమైనపుడు అవతరించిన ఆయతు ఇది. మరణానికి ముందు తన పినతండ్రి కనీసం **‘లా ఇలాహ ఇల్లల్లాహ్’** (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదేవుడు లేడు) అన్న వచనాన్ని నోటితో ఖరారు చేస్తే తీర్పుదినాన ఆయన మన్నింపు కోసం తాను సిఫారసు చేయవచ్చని ఆయన (స) ఆశించారు. ఆ మాటే తన బాబాయితో చెప్పారు కూడా. కాని కురైష్ శ్రీమంతుల ఒత్తిడి మూలంగా అబూతాలిబ్ ‘కలిమా’ పఠించకుండానే–అవిశ్వాసిగానే – తనువు చాలించారు. ఈ పరిణామానికి మహాప్రవక్త (స) అమితంగా దుఃఖించారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి, “ఓ ప్రవక్తా! సందేశాన్ని జనులకు చేరవేయటం వరకే నీ పని. సన్మార్గాన నడిపింపజేయటం నా పని. మేము సన్మార్గం చూపదలచిన వారికే సన్మార్గ భాగ్యం లభిస్తుంది. అంతేగాని నువ్వు కోరిన వారందరికీ ఆ భాగ్యం లభించదు” అని స్పష్టం చేశాడు (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ ఖసస్; ముస్లిం – కితాబుల్ ఈమాన్).

109. అంటే ఈ నగరంలో మమ్మల్ని ప్రశాంతంగా ఉండనివ్వరు. మాపై వేధింపులు మొదలవుతాయి. మేము యుద్ధాలను ఎదుర్కోవలసి రావచ్చు – కొంతమంది అవిశ్వాసులు తాము విశ్వసించకపోవటానికి గల కారణాలను వివరిస్తూ చెప్పిన మాటలివి. వారి భయాందోళనలకు సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు....

110. వారు ఇచ్చే సంజాయిషీలో ఏమాత్రం పసలేదు. ఎందుకంటే వారు ప్రస్తుతం నివసించే నగరాన్ని అల్లాహ్ శాంతియుతమైన, అత్యంత సురక్షితమైన నగరంగా చేశాడు. వారు అవిశ్వాస స్థితిలో ఉన్నప్పటికీ వారు ఇంత సురక్షితంగా ఉండగలుగుతున్నపుడు, ఇస్లాం స్వీకరించిన తరువాత సురక్షితంగా ఉండలేరా? కాబట్టి వారు చెప్పేవన్నీ కుంటిసాకులు మాత్రమే.

111. ఇదీ మక్కా నగరం విశిష్టత! ఏటేటా అక్కడకు వెళ్ళే లక్షలాది హజ్, ఉమ్రా యాత్రికులు ఆ నగరంలో లభ్యమయ్యే రకరకాల పండ్లను చూసి విస్తుపోతారు. ప్రపంచంలో పండ్ల కొరత ఉన్నప్పటికీ మక్కా నగరానికి మాత్రం అవి పుష్కలంగా సరఫరా అవుతూ ఉండటం గమనార్హ విషయం.

112. ఈ వాక్యం మక్కా వాసులకు హెచ్చరిక లాంటిది. దైవానుగ్రహాలను పొందిన తరువాత కృతఘ్నుతా వైఖరిని అవలంబించి, తలబిరుసులుగా మారిన వారికి ఏ గతి పట్టిందో మీరు చూడటం లేదా? ఆ జాతులు నివసించిన పట్టణాలు శిథిలాల రూపంలో మీ ముందున్నాయి. లేదా చరిత్ర పుటలలో మాత్రమే మీకు వారి జాడ లభిస్తుంది. రాకపోకలు సాగించే బాటసారులు మాత్రమే ప్రస్తుతం ఆ పాడుబడిన భవంతులలో కాస్సేపు విశ్రమిస్తున్నారు. వారికి పట్టిన దుర్గతి కారణంగా ఆ ఇండ్లలో స్థిరపడటానికి ఎవరూ ఇష్టపడలేదు కూడా.

**59** జనవాసాల ముఖ్య పట్టణంలో తన ఆయతులను చదివి వినిపించే ప్రవక్తను పంపనంతవరకూ నీ ప్రభువు ఏ జనవాసాన్నీ (ఊరకే) నాశనం చేయడు.[114] జనవాసాలలోని వారు దౌర్జన్య కాండకు ఒడిగట్టినప్పుడు మాత్రమే మేము వాటిని అంత మొందిస్తాము.[115]

وَمَا كَانَ رَبُّكَ مُهْلِكَ الْقُرَىٰ حَتَّىٰ يَبْعَثَ
فِي أُمِّهَا رَسُولًا يَتْلُو عَلَيْهِمْ آيَاتِنَا ۚ وَمَا كُنَّا
مُهْلِكِي الْقُرَىٰ إِلَّا وَأَهْلُهَا ظَالِمُونَ ﴿59﴾

**60** మీకు ఏదైతే ఇవ్వబడిందో అది (అశాశ్వితమైన) ప్రాపంచిక జీవిత సామగ్రి, దాని పైపూత (అలంకరణ) మాత్రమే. అయితే అల్లాహ్ వద్ద ఉన్నది అత్యుత్తమమైనది, శాశ్వితమైనదీను. ఏమిటి, మీరు ఆ మాత్రం గ్రహించరా?[116]

وَمَا أُوتِيتُمْ مِنْ شَيْءٍ فَمَتَاعُ الْحَيَاةِ الدُّنْيَا
وَزِينَتُهَا ۚ وَمَا عِنْدَ اللَّهِ خَيْرٌ وَأَبْقَىٰ ۚ أَفَلَا
تَعْقِلُونَ ﴿60﴾

**61** మేము తనకు చేసిన మంచి వాగ్దానాన్ని పొందిన వ్యక్తీను, మేము ప్రాపంచిక జీవితపు కొన్ని లాభాలను ప్రసాదించిన తరువాత ప్రళయదినాన (శిక్షకై) బంధించి తేబడిన వ్యక్తీను – ఇద్దరూ ఒక్కటవుతారా?[117]

أَفَمَنْ وَعَدْنَاهُ وَعْدًا حَسَنًا فَهُوَ لَاقِيهِ كَمَنْ
مَتَّعْنَاهُ مَتَاعَ الْحَيَاةِ الدُّنْيَا ثُمَّ هُوَ يَوْمَ الْقِيَامَةِ
مِنَ الْمُحْضَرِينَ ﴿61﴾

**62** ఆ రోజు ఆయన వారిని పిలిచి, "మీరు నాకు భాగస్వాములుగా తలపోసినవారెక్కడ?"[118] అని అడుగుతాడు.

وَيَوْمَ يُنَادِيهِمْ فَيَقُولُ أَيْنَ شُرَكَائِيَ الَّذِينَ
كُنْتُمْ تَزْعُمُونَ ﴿62﴾

113. అంటే తమ సిరిసంపదలను చూసుకుని మురిసిపోయిన వారుగానీ, భోగవిలాసాలలో మునిగి ఉన్నవారుగానీ ఎల్లకాలం వాటికి వారసులు కాలేకపోయారు.

114. మానవ జాతులకు సందేశం అందజేయనంతవరకూ దేవుడు ఆ జాతుల జోలికి పోడు. అకారణంగా జాతులను శిక్షించటం దైవసంప్రదాయం కానేకాదు. **'ఉమ్మిహా'** (أُمِّهَا) అంటే పెద్ద పట్టణం లేక అనేక పట్టణాలకు కేంద్రస్థానం అని భావం. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే ప్రతి చిన్న ప్రదేశంలో, ప్రతి చిన్న సముదాయంలో దైవప్రవక్త ప్రభవించలేదు. వివిధ ప్రాంతాలలోని ముఖ్యపట్టణాలలోనే దైవప్రవక్తలు వచ్చారు. ఆ పట్టణాలకు దరిదాపుల్లో ఉండే జనపదాలు, పల్లెసీమలన్నీ ఆ ప్రవక్తకు వర్తిస్తాయి.

115. అంటే – దైవప్రవక్తను పంపిన తరువాత కూడా వారు సన్మార్గానికి రాకుండా మొండికేసి, అత్యాచారాలకు సిద్ధమైనప్పుడు మేము వారిపై మా శిక్షా కొరడాను ఝుళిపించాము. ఈ విషయమే హూద్ సూరా 117వ ఆయతులో కూడా స్పష్టం చేయబడింది.

116. ఈ ప్రాపంచిక వైభవాలు, జిలుగు వెలుగులు తాత్కాలికమనీ, అల్పమైనవని మీరు ఇప్పటికీ తెలుసుకోలేదా? దీనికి ప్రతిగా అల్లాహ్ విశ్వాసుల కోసం తన వద్ద సిద్ధంచేసి ఉంచిన అనుగ్రహాలు, వసతులు ఉత్తమమైనవి, శాశ్వితమైనవి. హదీసులో ఇలా ఉంది : "దైవసాక్షి! పరలోకం ముందు ఇహలోకం ఎంతో అల్పమైనది. ఎవరయినా సముద్రంలో తన వ్రేలిని ముంచి తీస్తే, అతని వ్రేలికి తగిలే నీరెంతో ఇదీ అంతే." (సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్)

117. విశ్వసించిన వారు దేవుని వాగ్దానం ప్రకారం పరలోకంలో బహుమతిని పొందగా అవిధేయులు దేవుని శిక్షకు పాత్రులవుతారు. అలాంటప్పుడు ఈ ఇరువర్గాల వారు సమానులెలా అవుతారు?

118. అంటే నా దైవత్వంలో ఎవరినైతే మీరు భాగస్థులుగా నిలబెట్టేవారో, ఏ రాళ్ల రప్పలనైతే కొలిచేవారో, ఎవరిపేర మొక్కుకునేవారో వారంతా ఇప్పుడెక్కడున్నారు? వారు ఈనాడు మీకేమన్నా సహాయం చేయగలుగుతారా? నా

**63** ఎవరెవరికి ఈ మాట వర్తిస్తుందో వారిలా జవాబిస్తారు[119]: "మా ప్రభూ! మేము దారి తప్పించింది ఇదిగో వీళ్ళనే.[120] మేము దారి తప్పినట్లుగానే వీళ్ళను కూడా దారి తప్పించాము.[121]ఇక వాళ్ళతో మాకెలాంటి సంబంధం లేదని నీ సమక్షంలో ప్రకటిస్తు న్నాము.[122] వీళ్లు మమ్మల్ని పూజించేవారు కారు."[123]

قَالَ الَّذِينَ حَقَّ عَلَيْهِمُ الْقَوْلُ رَبَّنَا هَٰؤُلَاءِ
الَّذِينَ أَغْوَيْنَا ۚ أَغْوَيْنَاهُمْ كَمَا غَوَيْنَا ۚ تَبَرَّأْنَا
إِلَيْكَ ۖ مَا كَانُوا إِيَّانَا يَعْبُدُونَ ﴿٦٣﴾

**64** "మీరు మీ 'భాగస్వాములను' పిలుచుకోండి"[124] అని వారితో అనబడుతుంది. వారు వారిని (తమ భాగస్వాములను) పిలుస్తారు. కాని వారు కనీసం వారికి సమాధానం కూడా ఇవ్వరు. మరి వారంతా శిక్షను చూస్తారు.[125] వారు సన్మార్గం పొంది ఉంటే ఎంత బావుండేది![126]

وَقِيلَ ادْعُوا شُرَكَاءَكُمْ فَدَعَوْهُمْ فَلَمْ يَسْتَجِيبُوا
لَهُمْ وَرَأَوُا الْعَذَابَ ۚ لَوْ أَنَّهُمْ كَانُوا يَهْتَدُونَ ﴿٦٤﴾

**65** ఆ రోజు (అల్లాహ్) వారిని పిలిచి, "ఇంతకీ మీరు ప్రవక్తలకు ఏం సమాధానమిచ్చారు?"[127] అని అడుగుతాడు.

وَيَوْمَ يُنَادِيهِمْ فَيَقُولُ مَاذَا أَجَبْتُمُ
الْمُرْسَلِينَ ﴿٦٥﴾

---

పట్టు నుంచి మిమ్మల్ని కాపాడుతారా? అని అల్లాహ్ తీర్పుదినాన గట్టిగా అడుగుతాడు. ఈ విషయం ఇంతకు ముందు అల్ అన్ఆమ్ సూరా 94వ ఆయతులో కూడా వచ్చింది. ఇంకా ఇతర చోట్ల కూడా ఈ విషయం చర్చించబడింది.

119. అంటే – దైవాగ్రహానికి పాత్రులైన వారని భావం. అంటే తలబిరుసులైన షైతానులు, సత్యతిరస్కారులు, ముష్రిక్కులు అన్నమాట!

120. అంటే ఈ దుర్మార్గుల మాటలు విని మోసపోయిన మూర్ఖజనులు అన్నమాట!

121. మేమెలాగూ మార్గభ్రష్టులమే. అయితే మాతో పాటు మరి కొంతమందిని కూడా భ్రష్టు పట్టించాము. అయితే మేము వీళ్ళను బలాత్కరించలేదు. మా దారిలో నడవమని నిర్బంధించనూ లేదు. మేము సంకేతప్రాయంగా చెప్పిన మాటలకే వీళ్లు మా బుట్టలో పడిపోయారు. మేము ఆడించినట్లుగా ఆడారు. పాడించినట్లుగా పాడారు.

122. ఈనాడు మేము వీళ్లతో తెగత్రెంపులు చేసుకుంటున్నాము. వీళ్లతో మాకెట్టి సంబంధం లేదు. అంటే ప్రపంచంలో పరస్పరం స్నేహితులుగా ఉండే వీరంతా అక్కడ ఒండొకరికి బద్ధ విరోధులైపోతారు.

123. అసలు వాళ్లు పూజించింది మమ్మల్ని కాదు, వాళ్లు తమ మనోవాంఛలను అనుసరించారు అంటూ చేతులెత్తేస్తారు. అంటే ప్రపంచంలో ప్రజలు తమ దైవాలుగా తలపోసి చేసిన పూజలు పునస్కారాలన్నీ వృథా అయిపోయాయి. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల వచ్చింది. ఉదాహరణకు : అల్ అన్ఆమ్ సూరా–49, మర్యమ్–81, 82; అల్ అహ్ఖాఫ్ – 5, 6; అన్కబూత్ – 25, అల్ బఖర – 166, 167.

124. అంటే, చేతనైతే మీరు వారి సహాయం పొందండి. వారు మీకు సాయపడతారేమో ప్రయత్నించి చూడండి అని అనబడుతుంది. వారెంతో ఆశగా పిలుస్తారు. కాని వారు బదులు పలకరు. అయినా ఆ రోజు దైవసమక్షంలో 'నేను మీకు సహాయపడ గలను' అని చెప్పే ధైర్యం ఎవరికి ఉంటుందనీ?

125. తామంతా నరకానికి ఇంధనం కాబోతున్నామని వారికి తెలిసిపోతుంది.

126. తాము సన్మార్గాన్ని అవలంబించి ఉంటే ఈ రోజు ఈ దురవస్థకు లోనయ్యే వారం కాముకదా! అన్న సంగతి వారికి శిక్షను చవిచూసిన తరువాత తెలిసివస్తుంది. అల్ కహఫ్ సూరా 52, 53 ఆయతులలో కూడా ఈ విషయం చర్చించబడింది.

**66** మరి ఆ రోజు వారి నిదర్శనాలన్నీ మాయమయిపోతాయి. వారు పరస్పరం ఏమీ అడగనూ లేరు.[128]

فَعَمِيَتْ عَلَيْهِمُ الْاَنْۢبَآءُ يَوْمَئِذٍ فَهُمْ
لَا يَتَسَآءَلُوْنَ ﴿66﴾

**67** అయితే ఎవరు పశ్చాత్తాపం చెంది, విశ్వసించి, సదాచరణ చేస్తారో వారు సాఫల్యం పొందేవారిలో చేరే అవకాశం ఎంతైనా ఉందని ఆశించవచ్చు.

فَاَمَّا مَنْ تَابَ وَاٰمَنَ وَعَمِلَ صَالِحًا فَعَسٰٓى
اَنْ يَّكُوْنَ مِنَ الْمُفْلِحِيْنَ ﴿67﴾

**68** నీ ప్రభువు తాను కోరిన దాన్ని సృష్టిస్తాడు, తాను కోరిన వారిని ఎంపిక చేసుకుంటాడు. వారిలో ఎవరికీ ఎటువంటి అధికారం లేదు.[129] అల్లాహ్ పరమ పవిత్రుడు. వారు కల్పించే భాగస్వామ్యాలన్నింటికీ ఆయన అతీతుడు, ఉన్నతుడు.

وَرَبُّكَ يَخْلُقُ مَا يَشَآءُ وَيَخْتَارُ ؕ مَا كَانَ لَهُمُ
الْخِيَرَةُ ؕ سُبْحٰنَ اللّٰهِ وَتَعٰلٰى عَمَّا يُشْرِكُوْنَ ﴿68﴾

**69** వారి హృదయాలలో దాగి ఉండేదీ, వారు బయటపెట్టేది – అంతా నీ ప్రభువుకు తెలుసు.

وَرَبُّكَ يَعْلَمُ مَا تُكِنُّ صُدُوْرُهُمْ وَمَا
يُعْلِنُوْنَ ﴿69﴾

**70** ఆయనే అల్లాహ్. ఆయన తప్ప వేరొకరెవరూ ఆరాధనకు అర్హులు కారు. ఆదిలోనూ, అంతంలోనూ ఆయనే స్తుతింపదగిన వాడు. శాసించే అధికారం కూడా ఆయనకే చెల్లుతుంది. (ఎట్టకేలకు) మీరంతా ఆయన వైపుకే మరలించబడతారు.

وَهُوَ اللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ ؕ لَهُ الْحَمْدُ فِى الْاُوْلٰى
وَالْاٰخِرَةِ ز وَلَهُ الْحُكْمُ وَاِلَيْهِ تُرْجَعُوْنَ ﴿70﴾

**71** (ఓ ప్రవక్తా!) వారిని అడుగు : "చూడండి! ఒకవేళ అల్లాహ్ ప్రళయదినం వరకూ మీపై రాత్రిని – శాశ్వతంగా – ఆవరింప జేస్తే, అట్టి పరిస్థితిలో అల్లాహ్ తప్ప మీ వద్దకు (పగటి) వెలుతురును తెచ్చే దేముడు ఎవడున్నాడు? మరి మీరు వినరేమిటి?"

قُلْ اَرَءَيْتُمْ اِنْ جَعَلَ اللّٰهُ عَلَيْكُمُ الَّيْلَ سَرْمَدًا
اِلٰى يَوْمِ الْقِيٰمَةِ مَنْ اِلٰهٌ غَيْرُ اللّٰهِ يَاْتِيْكُمْ
بِضِيَآءٍ ؕ اَفَلَا تَسْمَعُوْنَ ﴿71﴾

127. ఇంతకు ముందు ఆయతులో తౌహీద్ (ఏకదైవారాధన)కు సంబంధించి ప్రశ్నించబడింది. ఈ ఆయతులో రిసాలత్ (దైవదౌత్యం)కు సంబంధించి నిలదీయటం జరిగింది– మేము మీ వద్దకు మా ప్రవక్తలను పంపాము కదా! వారిపట్ల మీరు ఎలా వ్యవహరించారు? వారి సందేశాన్ని స్వీకరించారా? నీ ప్రవక్త ఎవరు? నీ ధర్మం ఏది? అన్న ప్రశ్నలు సమాధిలో వేయబడినట్లే తీర్పుదినాన కూడా వేయబడతాయి. విశ్వాసి (మోమిన్) వాటికి సరైన సమాధానం ఇస్తాడు. కాని అవిశ్వాసి (కాఫిర్) మాత్రం తనకేమీ తెలియదంటాడు. తీర్పుదినమున కూడా అవిశ్వాసుల జ్ఞాపకశక్తి వశపరచుకోబడుతుంది. వారికేమీ పాలుపోదు. వారివద్ద ఏ ఆధారమూ ఉండదు. ఎందుకంటే వారి విశ్వాసాలు మిథ్యా విశ్వాసాలు. వాటిని బలపరచే ఏ నిదర్శనం కూడా వాస్తవానికి లేదు. కేవలం కతలు మాత్రమే వారివద్ద ఉన్నాయి. నేడు మన నాట సమాధి పూజారుల దగ్గర ఉన్నవి కూడా ఇలాంటి కథలే కదా!

128. ఆ సమయంలో వారి నోరు పెగలదు. ప్రత్యామ్నాయ మార్గం ఏదీ ఉండదు. తాము నరకాగ్నికి ఆహుతి కాబోతున్నామన్న సంగతి అప్పటికే వారికి అర్థమైపోతుంది.

129. సార్వభౌమాధికారి అల్లాహ్ మాత్రమే. ఆయన ముందు ఎవరి అధికారమూ చెల్లనేరదు.

قُلْ أَرَءَيْتُمْ إِن جَعَلَ ٱللَّهُ عَلَيْكُمُ ٱلنَّهَارَ سَرْمَدًا إِلَىٰ يَوْمِ ٱلْقِيَٰمَةِ مَنْ إِلَٰهٌ غَيْرُ ٱللَّهِ يَأْتِيكُم بِلَيْلٍ تَسْكُنُونَ فِيهِ ۖ أَفَلَا تُبْصِرُونَ ﴿٧٢﴾

**72** (ఓ ప్రవక్తా!) వారిని అడుగు: "చూడండి! ఒకవేళ అల్లాహ్ ప్రళయదినం వరకూ మీపై పగలును – శాశ్వతంగా – విధించి నట్లయితే అప్పుడైనా అల్లాహ్ తప్ప మీ వద్దకు–మీరు విశ్రాంతిని పొందేందుకు రాత్రిని తేగల దేవుడెవడు? మరి మీరు గమనించ రేమిటి?"

وَمِن رَّحْمَتِهِۦ جَعَلَ لَكُمُ ٱلَّيْلَ وَٱلنَّهَارَ لِتَسْكُنُوا۟ فِيهِ وَلِتَبْتَغُوا۟ مِن فَضْلِهِۦ وَلَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿٧٣﴾

**73** ఆయనే తన కృపతో మీకోసం రేయింబవళ్ళను చేశాడు – మీరు రాత్రిపూట విశ్రాంతిని పొందటానికి, పగటి పూట ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికీను![130] మీరు కృతజ్ఞులుగా వ్యవహరిస్తారనే ఇదంతా చేయబడింది.[131]

130. రేయి, పగలు – ఇవి రెండూ దేవుని గొప్ప అనుగ్రహాలు. ఆయన రాత్రిని చీకటిమయంగా చేశాడు. ఎందుకంటే ప్రాణులు నిదురించటానికి, విశ్రాంతి నొందటానికి ఈ చీకటి అవసరం. నిద్రపోవటానికి ఆయన ఈ ప్రత్యేక సమయాన్ని నిర్ధారించకుండా ఉంటే ఎవరికి ఇష్టం వచ్చినప్పుడు వారు నిద్రపోయేవారు. తత్కారణంగా వ్యవస్థ అంతా తలక్రిందులైపోయేది.

మనిషి పగటిపూట జీవనావసరాల కోసం పరిశ్రమించిన తరువాత కొన్ని గంటలపాటు నిదురించటం తప్పనిసరి. లేకపోతే అతను శక్తిని, ఉల్లాసాన్ని పొందలేడు. అలాగే కొందరు నిద్రపోతూ, మరికొందరు పనిచేస్తూ ఉంటే విశ్రాంతిలో అంతరాయం ఏర్పడుతుంది. ప్రజలు ఒండొకరి సహాయసహకారాలను పొందలేకపోతారు. కాగా; ప్రపంచంలో ఒకరు మరొకరిపై ఆధారపడి ఉన్నారు. పరస్పర సహకారంతో మనుగడ సాగిస్తున్నారు. అందుకే అల్లాహ్ రాత్రివేళ చీకటి తెరలు కప్పి, ప్రాణులంతా ఒకే సమయంలో నిదురించేలా చేశాడు.

అలాగే ఆ సృష్టికర్త పగటిని వెలుగుమయంగా చేశాడు. ఎందుకంటే మానవుడు జీవనోపాధిని అన్వేషించటానికి, పరిశ్రమించటానికి వెలుతురు ఎంతైనా అవసరం. పగటిపూటే గనక వెలుతురు లేకపోతే మనిషి నానా అవస్థలు పడాల్సి వచ్చేది.

దేవుడు తన అనుగ్రహాలను ఉదాహరిస్తూ, సృష్టిలో తన ఏకత్వాన్ని గురించి నొక్కి చెబుతున్నాడు. ఆయన తన సందేశహరుని ద్వారా ఈ విధంగా ప్రశ్నిస్తున్నాడు : కాస్త ఆలోచించండి! అల్లాహ్ రేయింబవళ్ళ ఈ వ్యవస్థను రూపుమాపి శాశ్వతంగా రాత్రిని విధిస్తే మీకోసం పగటి వెలుతురును తేగల దేవుడెవడైనా ఉన్నాడా? పోనీ ఒకవేళ ఆయన గనక నిత్యం మీపై పగటిని ప్రవేశపెట్టినట్లయితే, మీ విశ్రామం కోసం రాత్రి చీకటిని తీసుకురాగల దైవం ఎవడయినా ఉన్నాడా? లేడు. ముమ్మాటికీ ఈ అద్భుతం చేయగల వాడెవడూ లేడు. ఇది కేవలం అల్లాహ్ దయా దాక్షిణ్యాలకు ప్రతిరూపం. ఆయనే తగు పరిమాణంలో రేయింబవళ్ళ వ్యవస్థను నిర్ధారించాడు. పగటి వెలుతురు రాగానే అది రాత్రి చీకట్లను మటుమాయం చేసేస్తుంది. మనిషి ఈ సమయంలో తన తెలివి తేటల ద్వారా, శారీరక శ్రమ ద్వారా దైవకృపను అన్వేషించటంలో నిమగ్నుడైపోతాడు. అలాగే రాత్రి ఏతెంచగానే అది పగటి వెలుతురును క్రమంగా కబళిస్తుంది. నలువైపులా చీకటి అలుముకుంటుంది. ఈ సమయంలో మనుషులు హాయిగా నిద్రపోయి, నూతన శక్తిని పుంజుకుంటారు.

131. అంటే అల్లాహ్‌ను స్తుతిస్తూ ఉండండి. ఆయన పవిత్రతను కొనియాడండి. ఇది నోటిపరమైన కృతజ్ఞత. దీంతో పాటు అల్లాహ్ ప్రసాదించిన సిరిసంపదలను, శక్తి సామర్థ్యాలను, ప్రతిభాపాటవాలను ఆయన ఆజ్ఞలకు, ఆదేశాలకు అనుగుణంగా వెచ్చించండి. ఇలా చేస్తే ఇది క్రియాత్మకంగా తెలుపుకున్న కృతజ్ఞతగా భావింపబడుతుంది.

**74** ఆ రోజు ఆయన వారిని పిలిచి, "మీరు ఎవరెవరిని నా భాగస్వాములుగా తలపోసేవారో వారెక్కడ?" అని అడుగుతాడు.

وَيَوۡمَ يُنَادِيهِمۡ فَيَقُولُ أَيۡنَ شُرَكَآءِيَ ٱلَّذِينَ كُنتُمۡ تَزۡعُمُونَ ﴿٧٤﴾

**75** ఇంకా, మేము ప్రతి మానవ సముదాయం నుంచి ఒక్కో సాక్షిని తీసుకుంటాము.[132] ఆ తరువాత, "ఏదీ, మీ ప్రమాణాన్ని తీసుకురండి"[133] అని అంటాము. అప్పుడు వారు, సత్యం అల్లాహ్ పక్షానే ఉందని తెలుసుకుంటారు.[134] వారు అల్లే కట్టుకథలన్నీ వారి నుండి మటుమాయమవుతాయి.[135]

وَنَزَعۡنَا مِن كُلِّ أُمَّةٖ شَهِيدٗا فَقُلۡنَا هَاتُواْ بُرۡهَٰنَكُمۡ فَعَلِمُوٓاْ أَنَّ ٱلۡحَقَّ لِلَّهِ وَضَلَّ عَنۡهُم مَّا كَانُواْ يَفۡتَرُونَ ﴿٧٥﴾

**76** చూడబోతే, ఖారూన్ కూడా మూసా జాతికి చెందినవాడే. కాని వాడు తన వారిపైనే దురాగతాలకు పాల్పడసాగాడు.[136] మేము వాడికి ఎంత ఖజానాను ప్రసాదించామంటే దాని తాళపుచెవులను అనేక మంది బలాఢ్యులు కలసి కూడా అతి కష్టమ్మీద ఎత్తగలిగేవారు.[137] ఒకసారి అతని జాతివారు అతన్నుద్దేశించి ఇలా అన్నారు: "మిడిసిపడకు.[138] మిడిసిపడే వారిని అల్లాహ్ ఇష్టపడడు.[139]

۞إِنَّ قَٰرُونَ كَانَ مِن قَوۡمِ مُوسَىٰ فَبَغَىٰ عَلَيۡهِمۡۖ وَءَاتَيۡنَٰهُ مِنَ ٱلۡكُنُوزِ مَآ إِنَّ مَفَاتِحَهُۥ لَتَنُوٓأُ بِٱلۡعُصۡبَةِ أُوْلِي ٱلۡقُوَّةِ إِذۡ قَالَ لَهُۥ قَوۡمُهُۥ لَا تَفۡرَحۡۖ إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلۡفَرِحِينَ ﴿٧٦﴾

---

132. **'సాక్షి'** అంటే దైవప్రవక్త అని భావం. అంటే ఒక్కొక్క అనుచర సంఘం నుంచీ, ఆ సంఘానికి చెందిన ప్రవక్తను పిలిచి వేరుగా నిలబెట్టడం జరుగుతుంది.

133. మా ప్రవక్తలు మీకు సత్య సందేశాన్ని ఇచ్చినప్పటికీ, ఏకదైవారాధన వైపుకు మిమ్మల్ని పిలిచినప్పటికీ మీరు పట్టించుకోకుండా బహుదైవారాధనలో లీనమై పోయారు. ఒకవైపు మీరు నన్ను నమ్ముతూనే మరోవైపు షిర్కుకు ఒడిగట్టేవారు. మీరు చేసే షిర్కుకు సంబంధించిన ఆధారం మీ దగ్గర ఏముందో సమర్పించండి? అని దేవుడు ఆనాడు నిలదీస్తాడు.

134. అప్పుడు వారు ఆశ్చర్యచకితులై, తెల్లమొహాలు వేసుకుని నిలబడతారు. వారి దగ్గర ఏ ఆధారమూ, మరే నిదర్శనమూ ఉండదు.

135. అంటే వారు కల్పించుకున్న అసత్యాలు వారికేమాత్రం పనికిరావు.

136. తన వద్ద ఉన్న సిరిసంపదలను, మందీమార్బలాన్ని చూసుకుని ఖారూన్ తన వర్గస్థులైన బనీ ఇస్రాయీల్‌పై పెత్తనం చెలాయించేవాడు. సాటి సోదరులను కించపరచేవాడు. మరి కొంతమంది కథనం ప్రకారం వాడు ఫిరౌన్ చక్రవర్తి తరఫున అధికారిగా ఇస్రాయీలీయులపై నియమితుడై, తన వర్గం వారిపై జులుం చేసేవాడు.

137. **"తనూవు"** (تَنُوٓأُ) అంటే బరువుతో వంగటం, కృంగిపోవటం అనే అర్థాలు వస్తాయి. ఖారూన్ వద్ద ఉన్న ధనాగారాల తాళపు చెవులు ఎంత బరువుగా ఉండేవంటే, వాటిని ఎత్తేటప్పుడు బలిష్ఠుల ఒక సమూహం కూడా వాటి బరువుకు వంగిపోతూ ఉండేది.

138. అంటే నీ సిరిసంపదలను చూసుకుని గర్వపడకు. విర్రవీగకు. కొంతమంది వ్యాఖ్యాతలు దీనిని 'పిసినారితనం' అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే లోభత్వం ప్రదర్శించకు అని భావం.

139. అంటే అహంకారంతో విర్రవీగేవారిని, లేక పిసినారితనం చూపేవారిని అల్లాహ్ ప్రేమించడు. పైగా అలాంటివారిని అల్లాహ్ అసహ్యించుకుంటాడు.

وَابْتَغِ فِيمَآ اٰتٰكَ اللّٰهُ الدَّارَ الْاٰخِرَةَ وَلَا تَنْسَ نَصِيبَكَ مِنَ الدُّنْيَا وَاَحْسِنْ كَمَآ اَحْسَنَ اللّٰهُ اِلَيْكَ وَلَا تَبْغِ الْفَسَادَ فِي الْاَرْضِ ؕ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْمُفْسِدِيْنَ ﴿77﴾

**77** "అల్లాహ్ నీకు ప్రసాదించిన దానితో పరలోక స్థానాన్ని కూడా అన్వేషించు.[140] మరి నీ ప్రాపంచిక భాగాన్ని కూడా మరువ బోకు.[141] అల్లాహ్ నీకు ఏ విధంగా మేలు చేశాడో అదేవిధంగా నువ్వు కూడా (ప్రజల పట్ల) సద్వ్యవహారం చెయ్యి.[142] భువిలో అరాచకం కోసం ఆరాటపడకు.[143] అరాచకం సృష్టించగోరే వారిని అల్లాహ్ ఎంతమాత్రం ఇష్టపడడు."

قَالَ اِنَّمَآ اُوْتِيْتُهٗ عَلٰى عِلْمٍ عِنْدِيْ ؕ اَوَلَمْ يَعْلَمْ اَنَّ اللّٰهَ قَدْ اَهْلَكَ مِنْ قَبْلِهٖ مِنَ

**78** "ఇదంతా నాకున్న ప్రజ్ఞాపాటవాల మూలంగానే నాకు వొసగబడింద"ని[144] వాడు (ఖారూన్) చెప్పాడు. ఏమిటి, ఇతనికి మునుపు ఇతనికన్నా ఎక్కువ బలవంతులను, మూల ధనాన్ని

140. అంటే అల్లాహ్ ప్రసన్నతను చూరగొనే విధంగా మసలుకో. అల్లాహ్ ఇష్టపడే పద్దుల్లో నీ ధనాన్ని వెచ్చించు. తద్వారా నీ పరలోక జీవితం బాగుపడుతుంది. నీకు పుణ్యఫలం లభిస్తుంది.

141. ప్రపంచంలో ధర్మసమ్మతమైన రీతిలో ఖర్చుపెట్టడం కూడా మరచిపోకు. అంటే అన్న వస్త్రాల కోసం, వివాహం కోసం తగు రీతిలో డబ్బు ఖర్చుపెట్టడం వాంఛనీయం. కాబట్టి ఈ విషయంలో పిసినారితనం పనికి రాదు. అలాగే దుబారా ఖర్చుచేయటం కూడా వాంఛనీయం కాదు. నీపై నీ ప్రభువుకు హక్కు ఉన్నట్లే నీ ఆత్మకు కూడా హక్కు ఉంది. నీపై నీ ఆలుబిడ్డలకు, నీ ఆత్మీయులకు కూడా హక్కు ఉంది. వారి హక్కును సముచితమైన పద్ధతిలో చెల్లించు అని దీని భావం.

142. అల్లాహ్ నీకు అపారమైన ధనరాసుల్ని ఇచ్చి నీకు ఉపకారం చేశాడు. కాబట్టి ఆ ధనాన్ని నువ్వు దేవుని దాసులపై ఖర్చుపెట్టి వారికి ఉపకారం చేయి.

143. రాజ్యంలో అశాంతి అలజడులను సృష్టించటం, కల్లోలాన్ని రేకెత్తించటం నీ అభిమతం కారాదు. ప్రజల పట్ల దుర్వ్యవహారం గనక చేశావంటే సమాజంలో అశాంతి అలజడులు మొదలవుతాయి. అలజడిని సృష్టించే వారంటే అల్లాహ్‌కు ఎంతమాత్రం గిట్టదు. కాబట్టి అణకువను అలవరచుకో. సాటి మానవుల పట్ల ప్రేమతో వ్యవహ రించు.

144. ఈ హితోపదేశానికి జవాబుగా ఖారూన్ ఏమన్నాడో తెలుసా?! ఈనాడు నా దగ్గరున్న సిరిసంపదలన్నీ నా తెలివితేటల మూలంగా సిద్ధించాయి. వాణిజ్య రంగంలో ఈనాడు నేను ఈ స్థాయికి చేరుకున్నానంటే అది నా ప్రతిభే సుమా! ఇందులో దైవకటాక్షానికి ప్రమేయం ఏముంది?

ఈ మాటలకు మరో అర్థం ఇలా చెప్పబడింది: దేవుడు నాకు అపారంగా అనుగ్రహించాడంటే ఇట్టే అనుగ్రహించలేదు. ఆయన నా బుద్ధికుశలతను, ప్రావీణ్యాన్ని చూసి దానికి తగ్గట్టుగా అనుగ్రహించాడు. ఖారూన్ చెప్పిన ఈ మాటలు మనిషి బుద్ధిని చాటి చెబుతోంది. మనుషుల ఈ ధోరణిని గురించి అల్లాహ్ మరోచోట ఇలా సెలవిచ్చాడు : "మానవునికి బాధ కలిగినప్పుడు మమ్మల్ని మొరపెట్టుకుంటాడు. మరి మేమతనికి మా అనుగ్రహాన్ని వొసగినపుడు ఇదంతా నా తెలివితేటల మూలంగా వొసగబడింద"ని అంటాడు (ఖసస్ : 78). అంటే, తాను ఆ కటాక్షానికి హక్కుదారుణ్ణి అని దేవుడు గ్రహించాడు గనకనే తనను కటాక్షించాడు అన్నది అతని అంతరంగం. "కష్టకాలం తీరిపోయిన తరువాత మేము మనిషిపై దయచూపినప్పుడు నేను దానికి అర్హుణ్ణే" అని అతనంటాడు. (హామీమ్ సజ్దా – 50) (ఇబ్నె కసీర్)

మరికొంతమంది ప్రకారం ఖారూన్ రసాయనిక ప్రక్రియ ద్వారా బంగారాన్ని తయారు చేయటంలో ఆరితేరినవాడు. తన దగ్గరున్న ఈ 'విద్య' మూలంగానే అతను కుబేరుడయ్యాడు. కాని ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. పైగా దీన్ని ఒక అబద్ధం, మోసపూరితమైన కథనంగా ఖరారు చేశారాయన. ఎందుకంటే ఒక

ద్రోగు చేసిన వారినెంతో మందిని అల్లాహ్ అంతమొందించా దన్న సంగతి ఇతనికి తెలియదా?[145] అట్టి పరిస్థితిలో పాపాత్ము లను వారి పాపాల గురించి అడగటం జరగదు.[146]

الْقُرُونِ مَنْ هُوَ أَشَدُّ مِنْهُ قُوَّةً وَأَكْثَرُ جَمْعًا ۚ
وَلَا يُسْأَلُ عَنْ ذُنُوبِهِمُ الْمُجْرِمُونَ ﴿78﴾

**79** మరి వాడు అంగరంగ వైభవంతో తన జాతి జనులలోకి కదలి వచ్చాడు.[147] అప్పుడు ప్రాపంచిక జీవితాన్ని కోరుకునే వారు,[148] "ఖారూనుకు ప్రసాదించబడినదే మాకు కూడా లభిస్తే ఎంత బాగుండును! నిజంగా ఇతను గొప్ప భాగ్యవంతుడు" అన్నారు.

فَخَرَجَ عَلَىٰ قَوْمِهِ فِي زِينَتِهِ ۖ قَالَ الَّذِينَ
يُرِيدُونَ الْحَيَاةَ الدُّنْيَا يَا لَيْتَ لَنَا مِثْلَ مَا
أُوتِيَ قَارُونُ إِنَّهُ لَذُو حَظٍّ عَظِيمٍ ﴿79﴾

**80** అప్పుడు (ధర్మ) జ్ఞానం వొసగబడిన వారు వారిని బోధ పరుస్తూ ఇలా అన్నారు: (మీ పరిస్థితి) కడు శోచనీయం! పుణ్యం రూపంలో అల్లాహ్ ఇచ్చేదే విశ్వసించి, సదాచరణ చేసే వారి కొరకు మేలైనది సుమా![149] అయితే ఈ విషయం (భాగ్యం)[150] సహనశీలురైన వారికే ప్రాప్తిస్తుంది."

وَقَالَ الَّذِينَ أُوتُوا الْعِلْمَ وَيْلَكُمْ ثَوَابُ اللَّهِ
خَيْرٌ لِمَنْ آمَنَ وَعَمِلَ صَالِحًا ۚ وَلَا يُلَقَّاهَا إِلَّا
الصَّابِرُونَ ﴿80﴾

**81** (ఎట్టకేలకు) మేమతన్ని, అతని నిలయాన్ని నేలలో కూర్చి వేశాము.[151] అప్పుడు అల్లాహ్ బారి నుంచి అతన్ని ఆదుకోవ టానికి ఏ సమూహమూ లేకపోయింది. మరి వాడు సయితం తనకు ఏ సాయమూ చేసుకోలేకపోయాడు.

فَخَسَفْنَا بِهِ وَبِدَارِهِ الْأَرْضَ فَمَا كَانَ لَهُ
مِنْ فِئَةٍ يَنْصُرُونَهُ مِنْ دُونِ اللَّهِ وَمَا
كَانَ مِنَ الْمُنْتَصِرِينَ ﴿81﴾

వస్తువు యొక్క సహజగుణాన్ని మార్చే శక్తి ఏ వ్యక్తికీ లేదు. కాకపోతే ముడి సరుకుగా ఉన్న వస్తువును రసాయనిక ప్రక్రియ ద్వారా మెరుగులు దిద్ది, దాన్ని నాణ్యమైనదిగా తయారుచేయటం సాధ్యమే. కాబట్టి ఇతర ధాతువులను ఖారూన్ బంగారంగా మార్చగలిగే వాడన్నది మాత్రం వాస్తవం కాదు.

145. శారీరక బలంగానీ, సిరిసంపదలుగానీ గౌరవోన్నతులకు గీటురాయి కాదు. ఒకవేళ నిజంగానే ఇవి గౌరవోన్నతులకు, ఆదరణకు ప్రమాణాలైతే వెనుకటి జాతుల వారు వినాశానికి గురయ్యేవారు కారు. కనుక తన సిరిసంపదలను, మందీ మార్బలాన్ని చూసుకుని ఖారూన్ విర్రవీగటంలో అర్థం లేదు.

146. మనిషి పాపాల పుట్టగా మారిపోయి, లోకానికి హానికరంగా పరిణమించినపుడు గడువు ఇవ్వబడదు. అకస్మాత్తుగా అతడు పట్టుకోబడతాడు.

147. అంటే అంగరంగ వైభవంతో ప్రజలలోకి వచ్చి తన ఆడంబరాన్ని చాటుకోసాగాడు.

148. ఖారూన్ వైభవాన్ని చూసి అసూయ చెందిన ఈ జనులు ఎవరు? కొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం వారు కూడా ముస్లిములే. మరి కొంతమంది ప్రకారం వారు ముస్లిమేతరులు.

149. ధర్మజ్ఞానం కలవారు చెప్పిన మాటలివి: "ఈ ప్రాపంచిక జీవితం క్షణభంగురం. విశ్వసించి మంచిపనులు చేసిన వారికి అల్లాహ్ ప్రసాదించే పుణ్యఫలం ముందు ఖారూన్ సిరిసంపదలు ఎందుకూ పనికిరావు." హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "నేను సజ్జనులైన నా దాసుల కోసం ఏ కన్నూ చూడని, ఏ చెవీ వినని, ఏ హృదయమూ ఊహించనైనా లేని వస్తువులను తయారుచేసి ఉంచాను" (బుఖారీ – కితాబుత్తౌహీద్; ముస్లిం – కితాబుల్ ఈమాన్).

82 నిన్నటి రోజున అతని స్థాయికి చేరుకోవాలని[152] కాంక్షించిన వారంతా నేటి ఉదయం ఇలా చెప్పుకున్నారు : "ఆహ్! అల్లాహ్ తన దాసులలో తాను కోరినవారి ఉపాధిని విస్తృతపరుస్తాడు. మరి తాను కోరిన వారికి కుంచింపజేస్తాడు. అల్లాహ్ కృపయే గనక మాపై లేకుండాపోతే ఆయన మమ్మల్ని కూడా నేలలో కూర్చివేసి ఉండేవాడే.[153] దేవుని మేళ్లను మరచినవారెన్నటికీ సాఫల్యం పొందలేరన్న సంగతిని మీరు గమనించటం లేదా?"[154]

وَاَصْبَحَ الَّذِيْنَ تَمَنَّوْا مَكَانَهٗ بِالْاَمْسِ يَقُوْلُوْنَ وَيْكَاَنَّ اللّٰهَ يَبْسُطُ الرِّزْقَ لِمَنْ يَّشَآءُ مِنْ عِبَادِهٖ وَيَقْدِرُ ۚ لَوْلَاۤ اَنْ مَّنَّ اللّٰهُ عَلَيْنَا لَخَسَفَ بِنَا ؕ وَيْكَاَنَّهٗ لَا يُفْلِحُ الْكٰفِرُوْنَ ﴿82﴾

83 ఎవరు భువిలో బడాయిని ప్రదర్శించకుండా, కల్లోలాన్ని రేకెత్తించకుండా ఉంటారో వారి కోసమే మేము ఈ పరలోక నెలవును ప్రత్యేకించాము. సత్ఫలితం భయభక్తులు గల వారి కొరకే సుమా![155]

تِلْكَ الدَّارُ الْاٰخِرَةُ نَجْعَلُهَا لِلَّذِيْنَ لَا يُرِيْدُوْنَ عُلُوًّا فِى الْاَرْضِ وَلَا فَسَادًا ؕ وَالْعَاقِبَةُ لِلْمُتَّقِيْنَ ﴿83﴾

150. మరి ఈ అనుగ్రహాల భాగ్యం ఎవరికి లభిస్తుంది? ప్రాపంచిక వ్యామోహంలో పడకుండా, పరలోక సాఫల్యంపై దృష్టిని కేంద్రీకరించి, దానికోసం కృషిచేసిన వారికే ఆ భాగ్యం ప్రాప్తమవుతుంది.

151. ఖారూన్ పొగరును అల్లాహ్ అణచివేశాడు. అతనితో సహా అతని సిరిసంపదలను, అతని నివాస భవనమును భూమిలో కూర్చేశాడు. ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా సెలవిచ్చారు: "ఒక వ్యక్తి తన **'ఇజారు'** (లుంగీ)ను నేలకు రాసుకునేలా నడవసాగాడు (అతని ఈ గర్వం అల్లాహ్‌కు నచ్చలేదు). అతను నేలలో దిగబెట్టబడ్డాడు. ప్రళయదినం వరకూ అతను నేలలో కూరుకుపోతూనే ఉంటాడు." (బుఖారీ – కితాబుల్లిబాస్).

152. ఈ ఆయతులో **'మకాన్'** (مَكَان) అంటే హోదా, అంతస్తు, స్థాయి అన్న అర్థాలు వస్తాయి. ఇవన్నీ ప్రాపంచికమైనవి, తాత్కాలికమైనవి మాత్రమే. అవి ఖారూన్‌కు లభించాయి. **'అమ్స్'** (اَمْس) అంటే 'నిన్న' అని అర్థం. **'వయ్‌కఅన్న'** (وَيْكَاَنَّ) అంటే ఆశ్చర్యార్థకం. అయ్యో! దౌర్భాగ్యం అని కూడా అనవచ్చు. 'ఈ సంగతి నీకు బాగా తెలిసిరావాలి' అన్న భావంలో కూడా తీసుకోబడుతుంది. మరి కొంతమంది విద్వాంసులు దీనికి "మీరు గమనించటం లేదా?" అన్న అర్థంలో కూడా తీసుకున్నారు (ఇబ్నె కసీర్). ఇక్కడ తెలుగు అనువాదం కూడా చివరి అర్థంలోనే తీసుకోవటం జరిగింది.

మొత్తమ్మీద దీని భావం ఏమిటంటే, ఒకప్పుడు ఖారూన్ సిరిసంపదలను, అంతస్తును చూసి అది తమక్కూడా ఉంటే బావుండునని ఆశపడినవారు ఖారూన్ దుర్గతిని చూశాక కళ్లు తెరచారు. మనిషి గౌరవోన్నతులు ఆస్తీ అంతస్తులతోనే ముడిపడి లేవని వారు తెలుసుకున్నారు. ఏమిటి? మీరు గమనించటం లేదా? అల్లాహ్ కొందరికి పుష్కలంగా సిరిసంపదల్ని ఇచ్చి, మరికొందరికి తగ్గించి ఇస్తాడు. వాటి వెనుక ఉన్న పరమార్థం అల్లాహ్‌కే బాగా తెలుసు. కనుక అల్లాహ్ ఎవరికయినా సిరిసంపదలు పరిమితంగా ఇచ్చినంత మాత్రాన వారిపట్ల ఆయన అప్రసన్నుడై ఉన్నాడని భావం ఎంతమాత్రం కాదు. డబ్బు, హోదా, ప్రాపంచిక పలుకుబడి మనిషి గౌరవాదరణలకు అసలు ప్రమాణం కానేకాదు.

153. అంటే; దైవకృపే గనక మాపై లేనిపక్షంలో ఖారూన్‌కు పట్టిన గతే మాకూ పట్టేది. ఆ కృపాకరుడు మాపైన దయదలచబట్టి సరిపోయింది.

154. అంటే – సిరిసంపదల్ని పొందిన తరువాత ఖారూన్ దైవానికి కృతజ్ఞతలు తెలుపు కోవలసిందిపోయి, దేవుని మేళ్లను విస్మరించాడు. తన తెలివితేటలతోనే ఇదంతా కూడబెట్టానని బీరాలు పోయాడు. తత్కారణంగా అతని పొగరు అణచివేయబడింది. కాబట్టి భావితరాలవారు ఖారూన్ పరిణామాన్ని చూసి గుణపాఠం నేర్చుకోవాలి.

مَنْ جَآءَ بِالْحَسَنَةِ فَلَهٗ خَيْرٌ مِّنْهَا ۚ وَمَنْ
جَآءَ بِالسَّيِّئَةِ فَلَا يُجْزَى الَّذِيْنَ عَمِلُوا
السَّيِّاٰتِ اِلَّا مَا كَانُوْا يَعْمَلُوْنَ ﴿84﴾

**84** (తీర్పుదినాన) మంచిని తెచ్చిన వానికి, దానికన్నా మేలైనది లభిస్తుంది.[156] ఇక చెడును తెచ్చినవారికి; వారి చెడు కర్మ మేరకే ప్రతిఫలం ఇవ్వబడుతుంది.[157]

اِنَّ الَّذِيْ فَرَضَ عَلَيْكَ الْقُرْاٰنَ لَرَآدُّكَ اِلٰى
مَعَادٍ ۗ قُلْ رَّبِّيْٓ اَعْلَمُ مَنْ جَآءَ بِالْهُدٰى
وَمَنْ هُوَ فِيْ ضَلٰلٍ مُّبِيْنٍ ﴿85﴾

**85** (ఓ ప్రవక్తా!) నీపై ఖుర్‌ఆన్‌ను అవతరింపజేసినవాడు[158] నిన్ను తిరిగి పూర్వస్థలానికి చేర్చనున్నాడు.[159] ఈ విధంగా చెప్పు: సన్మార్గాన్ని తీసుకువచ్చిన వారెవరో నా ప్రభువుకు బాగా తెలుసు. స్పష్టమైన అపమార్గంలో పడిఉన్నదెవరో కూడా ఆయనకు తెలుసు."[160]

وَمَا كُنْتَ تَرْجُوْٓا اَنْ يُّلْقٰٓى اِلَيْكَ الْكِتٰبُ
اِلَّا رَحْمَةً مِّنْ رَّبِّكَ فَلَا تَكُوْنَنَّ ظَهِيْرًا
لِّلْكٰفِرِيْنَ ﴿86﴾

**86** నీ వద్దకు గ్రంథం పంపబడుతుందని నువ్వు కనీసం ఊహించనైనా లేదు.[161] అయితే నీ ప్రభువు దయవల్ల (ఇది నీ వద్దకు పంపబడింది).[162] కాబట్టి ఇక నువ్వు అవిశ్వాసులకు సహాయకుడవు కారాదు.[163]

155. సాటి మనుషులందరికన్నా తనే గొప్పవాడినని తలపోయటం, తన బడాయిని నలుగురిలో చాటుకోవటం, గర్వాహంకారాన్ని ప్రదర్శించటం – ఇదంతా 'విపరీత పోకడ'గా భావించబడుతుంది. అలాగే అన్యాయంగా ఇతరుల హక్కులను కాజేయడం వలన, ఆజ్ఞోల్లంఘనకు పాల్పడటం వల్ల రాజ్యంలో అరాచకం, అవ్యవస్థ, ఉపద్రవం వ్యాపిస్తాయి. అయితే దేవుని పట్ల భయభక్తులు గల వారి ఆచరణ తద్భిన్నంగా ఉంటుంది. వారు అహంకారానికి బదులు వినమ్రతను, అణకువను అలవరచుకుంటారు. ఆజ్ఞోల్లంఘనకు బదులు వారు విధేయతా వైఖరిని అవలంబిస్తారు. పరలోకంలో శాశ్వత అనుగ్రహాలు గల నెలవు లభించేది ఈ శుభాత్మలకే.

156. కనీసం ఒక్కో సత్కర్మకు పదింతల పుణ్యఫలం ఎలాగూ లభిస్తుంది. ఎవరి కోసమయినా అల్లాహ్ తలిస్తే అంతకన్నా ఎక్కువ పుణ్యఫలం కూడా లభిస్తుంది.

157. సత్కర్మలకు పుణ్యఫలం మాత్రం అనేక రెట్లు పెంచి వొసగబడుతుంది. అయితే దుష్కర్మలకు పాపఫలం మాత్రం వారి పాపానికి సమానంగా మాత్రమే ఇవ్వబడుతుంది. వేరేమాటల్లో చెప్పాలంటే మంచిపనులను చూడగానే దైవకారుణ్యం పొంగి పొరలుతుంది. పాపకార్యాలను చూసినపుడు దేవునిలోని న్యాయశీలత రంగప్రవేశం చేస్తుంది.

158. లేదా దీని పారాయణం మరియు దీని ప్రచారం నీపై విధిగా చేసినవాడు.

159. (ఓ ముహమ్మద్!) నీ స్వస్థలమైన మక్కాను నువ్వు విడిచిపోక తప్పని పరిస్థితిని వారు నీ కోసం సృష్టించారు. సహీహ్ బుఖారీలో ఈ ఆయతుకు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ద్వారా ఈ వివరణే ఇవ్వబడింది. మొత్తానికి మహాప్రవక్త (స) మక్కా నుంచి మదీనాకు వలసపోయిన 8 సంవత్సరాల తరువాత ఈ వాగ్దానం నెరవేరింది. ఆయన ఒక విజేతగా పవిత్ర మక్కా లోయలో తిరిగి అడుగుపెట్టారు.

మరి కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు **"మఆద్"** (**مَعَاد**) అన్న పదాన్ని ప్రళయదినం, పరలోకం అన్న భావంలో తీసుకున్నారు. దీనిప్రకారం ప్రళయదినాన అల్లాహ్ తన వద్దకు పిలుచుకుని దైవదౌత్య బాధ్యతల గురించి అడుగుతాడు అన్న అర్థం వస్తుంది.

160. మక్కాలోని ముష్రిక్కుల ఆరోపణలకు ఈ వాక్యంలో సమాధానం ఇవ్వబడింది. తమ తాతముత్తాతల మతాన్ని వదలిన మహాప్రవక్త (స) అపమార్గానికి లోనయ్యారని ముష్రిక్కులు తూలనాడేవారు. దానికి జవాబుగా, "దేవుని తరఫున సన్మార్గాన్ని తీసుకువచ్చిన నేను అపమార్గానికి లోనయ్యానో లేక దేవుని మార్గదర్శకత్వాన్ని ధిక్కరించిన మీరు అపమార్గానికి లోనయ్యారో నా ప్రభువుకు బాగా తెలుసు" అని మహాప్రవక్త (స) చెప్పారు.

87 అల్లాహ్ ఆయతులు నీవద్దకు పంపబడిన తరువాత వారు (ఈ అవిశ్వాసులు) నిన్ను దైవాదేశాల (ప్రచారం) నుండి ఆపరాదు సుమా![164] కనుక నువ్వు నీ ప్రభువు వైపునకు పిలుస్తూ ఉండు. షిర్క్ చేసేవారిలో చేరిపోకు.

وَلَا يَصُدُّنَّكَ عَنْ اٰيٰتِ اللّٰهِ بَعْدَ اِذْ اُنْزِلَتْ اِلَيْكَ وَادْعُ اِلٰى رَبِّكَ وَلَا تَكُوْنَنَّ مِنَ الْمُشْرِكِيْنَ ﴿٨٧﴾

88 అల్లాహ్‌తోపాటు మరే దేవుణ్ణీ మొరపెట్టుకోకు.[165] ఆయన తప్ప మరే ఆరాధ్యుడూ లేడు. ఆయన ముఖం[166] తప్ప ప్రతిదీ నశించిపోయేదే. ఆజ్ఞాపించే అధికారం ఆయనకే చెల్లు.[167] మీరంతా ఆయన వద్దకే మరలించబడతారు.[168]

وَلَا تَدْعُ مَعَ اللّٰهِ اِلٰهًا اٰخَرَ ۘ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۚ كُلُّ شَيْءٍ هَالِكٌ اِلَّا وَجْهَهٗ ۚ لَهُ الْحُكْمُ وَاِلَيْهِ تُرْجَعُوْنَ ﴿٨٨﴾

161. దైవదౌత్యం అందక ముందు నీకు ప్రవక్త పదవి లభించనున్నదనీ, నీపై గ్రంథం అవతరించనున్నదని (ఓ ముహమ్మద్!) నువ్వు ఎన్నడూ ఊహించనైనా లేదు.

162. ప్రవక్త పదవి లభించటంతోపాటు దైవగ్రంథమైన దివ్య ఖుర్ఆన్ నీపై అవతరించిందంటే అది కేవలం దైవ కృప మాత్రమే. దీన్నిబట్టి విదితమయ్యే దేమిటంటే ప్రవక్త పదవి సాధన ద్వారా, పరిశ్రమ ద్వారా, తపోనిష్ఠ ద్వారా ప్రాప్తించే వస్తువు కాదు. పైగా అదొక అపురూప వరం. దేవుడు తన దాసులలో తాను కోరిన వారికి దాన్ని ప్రసాదిస్తూ వచ్చాడు. ఈ బంగారు పరంపరలో ముహమ్మద్ ప్రవక్త (సఅసం)ను చిట్టచివరి ప్రవక్తగా ఖరారు చేశాడు.

163. ఈ దైవానుగ్రహానికి గాను (ఓ ముహమ్మద్!) నువ్వు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అంటే ఇకమీదట నువ్వు అవిశ్వాసుల పోకడలకు వత్తాసు పలకకూడదు.

164. అంటే అవిశ్వాసుల ఆగడాలు, కరకు మాటలు, వారు సృష్టించే అవరోధాలకు నువ్వు వెరవకూడదు. నిరాశ చెందకూడదు. నువ్వు యధావిధిగా దైవగ్రంథాన్ని పారాయణం చేస్తూ ఉండు. దాన్ని ప్రచారం చేస్తూ ఉండు. పూర్తి ఏకాగ్రతతో నీ లక్ష్యం వైపుకు పురోగమిస్తూ ఉండు.

165. అంటే దైవేతరులను పూజించకు. ప్రార్థన రూపంలోగానీ, మొక్కుబడుల రూపంలోగానీ, బలిదానం రూపంలో గానీ– ఏ రూపంలో దాస్యం చేసినా అది కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకమై ఉండాలి. దివ్య ఖుర్ఆన్‌లో దైవేతరుల పూజ గురించి ప్రస్తావించబడినప్పుడల్లా దాన్ని 'మొరపెట్టుకోవటం, పిలవటం'గా అభివర్ణించటం జరిగింది. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే దైవేతర శక్తులను అవి తమ అక్కరలు తీర్చేవిగా భావించి పిలవటం, వాటి సహాయం కోరటం, వాటిని అర్థించటం, విజ్ఞాపనలు చేసుకోవటం – ఇదంతా దైవేతరుల పూజ క్రిందికే వస్తుంది. ఈ పనుల వల్ల మనిషి బహు దైవారాధకుడైపోతాడు.

166. **'వజ్‌హహు'** ('وَجْهَهٗ') అంటే 'ఆయన ముఖం' అని అసలు అర్థం. అంటే దేవుని అస్తిత్వం అన్నమాట. అది ఈ ఆయతులో ముఖారవిందంగా చెప్పబడింది. ఈ ఆయతు భావం ఏమిటంటే ఒక్క అల్లాహ్ తప్ప ప్రతి వస్తువూ నశించిపోతుంది. "ఈ పుడమిపై ప్రతి వస్తువూ నాశనమైపోయేదే. కేవలం మహోన్నతుడూ, గౌరవనీయుడు అయిన నీ ప్రభువు మాత్రమే మిగిలి ఉండేవాడు." (అర్రహ్మాన్–26, 27)

167. ఆయన చేసిన నిర్ణయమే విధించబడుతుంది. ఆయన కోరిన ఆదేశమే నడుస్తుంది.

168. అక్కడ ఆయన సజ్జనులకు వారి సదాచరణల బహుమానం వొసగుతాడు. దుర్జనులకు వారి దురాచరణల శిక్ష విధిస్తాడు.

29 వ సూరా

# అల్ అన్కబూత్

## సాలీడు

అవతరణ
మక్కాలో

ఆయతులు
69

## పరిచయం

ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ లేపబడడం, ప్రవక్తలందరినీ విశ్వసించడం, వారు తీసుకు వచ్చిన దైవగ్రంథాలన్నింటినీ విశ్వసించడం మొదలైన మౌలిక ధార్మిక విశ్వాసాలను ఇందులో నొక్కి చెప్పడం జరిగింది.

ఈ సూరాలో సాలీడు గురించి, దాని సాలెగూటి గురించి ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అవిశ్వాసులకు – సాలీడుకు మధ్య పోలికలు చెప్పడం జరిగింది. సాలీడు ఒక బలహీనమైన ప్రాణి, అది తన బలహీనమైన సాలెగూటిలో రక్షణ పొందాలని చూస్తుంది. కాని ఈ సాలెగూడు దానిని బయటి ప్రమాదాల నుంచి కాపాడలేదు. అదేవిధంగా అవిశ్వాసులు కూడా బలహీనమైనవారు, తాము ఆరాధించే బలహీనమైన, సామర్థ్యం లేని విగ్రహాల ద్వారా రక్షణ పొందాలని చూస్తున్నారు. ఈ కుహనా దేవుళ్ళుకాని, మానవులుకాని, కలపతో లేదా రాళ్ళతో చేయబడిన దేవుళ్ళు కాని అవిశ్వాసులకు రక్షణ ఇవ్వలేరు. వారి ప్రయోజనాలు కాపాడలేరు. వారికి హాని కూడా కలిగించలేరు. కాగా విశ్వాసులు విశ్వప్రభువు, సర్వశక్తిసంపన్నుడైన అల్లాహ్‌ను రక్షణ కోరుతారు. అల్లాహ్ వారికి బహుమానాలు ప్రసాదించే శక్తి కలిగినవాడు, అహంభావులకు, దేవునికి భాగస్వాములను కల్పించిన వారికి శిక్ష విధించే సామర్థ్యం కలిగినవాడు.

అల్లాహ్‌కే గల ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని ఈ సూరా క్లుప్తంగా తెలియజేసింది. ఆయనకున్న శక్తిసామర్థ్యాలను స్పష్టం చేసింది. అల్లాహ్ ఈ సృష్టిని ప్రారంభించాడు. ఆయనే దీనిని మళ్ళీ పునరావృతం చేస్తాడు. ఆయన స్వర్గాన్ని, భూమిని ఒక ఉద్దేశ్యంతో సృష్టించాడు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తం ఆయనకు తెలుసు.

# సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 14, 15 | 14-20 | 'దైవప్రవక్త నూహ్' | నూహ్ ప్రవక్తను 'మరొక ఆదం' అని పిలుస్తారెందుకని? ఆయన తన జాతి ప్రజలకు ఎంతకాలంపాటు ఇస్లాం సందేశం అందజేశారు? తలబిరుసులైన ఆయన జాతి ప్రజలు ఏ విధంగా శిక్షించబడ్డారు? |
| 16-25 | 30-49 | 'దైవప్రవక్త ఇబ్రాహీమ్' | ఇబ్రాహీమ్ ప్రవక్త ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక సమాజం అని అల్లాహ్ స్వయంగా అన్నాడు (సూరె నహ్ల్: 120). ఆయన జీవితం ఏక దైవారాధనకు పెట్టింది పేరు. ఆయన పేరు వింటేనే 'తౌహీద్' (ఏక దైవారాధన) గుర్తుకు వస్తుంది. ఆ సమాచారం మొత్తం చక్కని కథా రూపంలో. |
| 26-35 | 50-54 | 'దైవప్రవక్త లూత్' | ప్రపంచంలో అత్యంత నీచమైన ఒక కార్యానికి లూత్ జాతి శ్రీకారం చుట్టింది? ఏమిటి ఆ నీచకార్యం? దైవప్రవక్త హిత బోధ విని వారు ఆ పనిని మానుకున్నారా? లేక అంధులుగానే వ్యవహరించారా? |
| 36, 37 | 81 | 'దైవప్రవక్త షుఐబ్' | షుఐబ్ ప్రవక్త పంపబడిన జాతివారిని 'అయికా జనులు' అంటారు, ఎందుకని? వారిలోని ఏ దురలవాటుని సంస్క రించటానికి షుఐబ్ ప్రవక్త కృషి చేశారు? |
| 38 | 21-29 | 'దైవప్రవక్త సాలిహ్' 'దైవప్రవక్త హూద్' | హూద్ ప్రవక్త ఏ జాతివారి వైపు పంపబడ్డారు? జాతి ప్రజల నుంచి ఆయనకు ఏం సమాధానం లభించింది? తిరస్కారు లను అల్లాహ్ ఏ విధంగా శిక్షించాడు? సాలిహ్ ప్రవక్త పంపబడిన జాతి పేరేమిటి? వారు ఏ కళల్లో నిష్ణాతులు? అల్లాహ్ వారికి ఏ మహిమను చూపించాడు? చివరికి వారి కథ ఎలా ముగిసింది? |
| 39 | 83-114 | 'దైవప్రవక్త మూసా' | ఖుర్ఆన్‌లో అత్యధిక సార్లు ప్రస్తావనకు వచ్చిన గాథ ఇది. ఆ గాథ మొత్తం ఒకే చోట ధారావాహికంగా.... |
| 39 | 115-117 | 'మహా సంపన్నుడు ఖారూన్' | నడమంత్రపు సిరిని పొంది, తమ పాత రోజులను, అప్పటి కష్టాలను మరచిపోయి, తమ దగ్గరున్నదంతా తమ తెలివి తేటలతో సంపాదించుకున్నదే అని విర్రవీగితే...అందులో అల్లాహ్ కారుణ్యం ఏమీ లేదని భావిస్తే... పిల్లికి బిచ్చమెత్తని ధోరణి ప్రదర్శిస్తే.... ఏమవుతుంది!? ఏమవుతుందో ఇతగాడి చరిత్ర చదివి తెలుసుకోండి! |

## سُوْرَةُ الْعَنْكَبُوْتِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

الٓمّٓ ① اَحَسِبَ النَّاسُ اَنْ يُّتْرَكُوْٓا اَنْ يَّقُوْلُوْٓا اٰمَنَّا وَهُمْ لَا يُفْتَنُوْنَ ②

وَلَقَدْ فَتَنَّا الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ فَلَيَعْلَمَنَّ اللّٰهُ الَّذِيْنَ صَدَقُوْا وَلَيَعْلَمَنَّ الْكٰذِبِيْنَ ③

اَمْ حَسِبَ الَّذِيْنَ يَعْمَلُوْنَ السَّيِّاٰتِ اَنْ يَّسْبِقُوْنَا ؕ سَآءَ مَا يَحْكُمُوْنَ ④

## అల్ అన్‌కబూత్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1 – 2** అలిఫ్ – లామ్ – మీమ్. "మేము విశ్వసించాము" అని చెప్పినంత మాత్రాన తాము ఇట్టే వదలి వేయబడతామనీ, తాము పరీక్షింపబడమని ప్రజలు అనుకుంటున్నారా?[1]

**3** వారి పూర్వీకులను కూడా మేము బాగా పరీక్షించాము. వీరిలో సత్యవంతులెవరో, అసత్యవాదులెవరో నిశ్చయంగా అల్లాహ్ తెలుసుకుంటాడు.[2]

**4** దుష్కార్యాలకు పాల్పడేవారు, మా అదుపు నుండి తప్పించుకుని పోగలమని భావిస్తున్నారా ఏమిటీ?[3] ఎటువంటి చెడ్డ తీర్మానాలు చేసుకుంటున్నారు వారు![4]

---

1. **"మేము విశ్వసించాము"** అని నోటితో చెప్పినంతమాత్రాన, తమను పరికించకుండానే వదలివేయబడటం జరుగుతుందని భావించటం సరైనది కాదు. వారు ధన ప్రాణాల ద్వారా పరీక్షించబడతారు. కష్టాల ద్వారా పరీక్షించబడతారు. ఆకలిబాధ ద్వారా పరీక్షించబడతారు. ఈ పరీక్షల ద్వారా కల్తీ సరుకు ఏదో–మేలిమి సరుకు ఏదో, నిజాయితీపరులెవరో–నయవంచకులెవరో నిగ్గుదేల్చటం జరుగుతుంది.

2. ఇది తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న దైవ సంప్రదాయం. అందుకే ఆయన గతించిన సమాజాల వారిని పరీక్షించినట్లుగానే ఈ సమాజాన్ని (ముహమ్మద్ అనుచర సమాజాన్ని) కూడా పరీక్షిస్తాడు. మక్కాలోని అవిశ్వాసుల వేధింపులు నానాటికీ పెరిగిపోతుండటంతో ముస్లిములు దైవప్రవక్త (స)కు ఫిర్యాదు చేసుకున్నారు. దైవసహాయం కోసం ప్రార్థించమని ఆయన్ని (స) విన్నవించుకున్నారు. అప్పుడు ఆయన (స) తన బాధిత సహచరులనుద్దేశించి ఇలా అన్నారు : "ఈ దౌర్జన్యకాండ విశ్వాసుల చరిత్రలో ఆనవాయితీగా వస్తున్నదే. మీకు పూర్వం గతించిన విశ్వాసులు ఇంతకన్నా దారుణంగా వేధించబడ్డారు. గొయ్యి తవ్వి, వారిని ఆ గోతిలో నిలబెట్టి, తలపై రంపపు కోతకోస్తే, వారి శరీరాలు రెండు భాగాలుగా చీలిపోయేవి. అలాగే ఇనుప దువ్వెనలతో వారి శరీరాలను దువ్వగా, మాంసం ఊడివచ్చేది. అయినాసరే ఈ అమానుష కృత్యాలు వారిని వారి సత్యధర్మం నుంచి మరల్చటంలో సఫలీకృతం కాలేకపోయాయి." (సహీహ్ బుఖారీ – కితాబ్ అహాదీసుల్ అంబియా). హజ్రత్ అమ్మార్, ఆయన తల్లిగారైన హజ్రత్ సుమయ్యా, తండ్రి హజ్రత్ యాసిర్, హజ్రత్ సుహైబ్, హజ్రత్ బిలాల్, మిఖ్దాద్ తదితర సహచరులపై తొలి కాలంలో జరిగిన వేధింపులకు చరిత్ర పుటలే సాక్షి. ఈ సంఘటనల నేపథ్యంలోనే ఈ ఆయతులు అవతరించాయి. అయితే ప్రళయదినం వరకూ సాధారణ ముస్లింలందరికీ ఇవి వర్తిస్తాయి.

3. అంటే మాకు చిక్కకుండా పారిపోగలమని అనుకుంటున్నారా?

4. అంటే – అల్లాహ్ విషయంలో వారు ఏ దురాలోచనలో ఉన్నారు? చూడబోతే ప్రతిదీ ఆయన అధీనంలో ఉంది. ప్రతి విషయం ఆయన దృష్టిలో ఉంది. మరలాంటప్పుడు వారు ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించి ఆయన పట్టునుంచి ఎలా తప్పించుకోగలుగుతారు?

5 అల్లాహ్‌ను కలుసుకోవాలని ఆశిస్తున్న వారెవరయినాసరే అల్లాహ్ నిర్ధారించిన ఆ ఘడియ తప్పక రానున్నది[5] (అని వారు గ్రహించాలి). ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.[6]

مَنْ كَانَ يَرْجُوْا لِقَآءَ اللّٰهِ فَاِنَّ اَجَلَ اللّٰهِ لَاٰتٍ ؕ وَهُوَ السَّمِيْعُ الْعَلِيْمُ ۝5

6 సాధన చేసే ప్రతి ఒక్కడూ తన (స్వయం) కోసమే సాధన చేస్తు న్నాడు. నిశ్చయంగా అల్లాహ్ లోకవాసుల అక్కర లేనివాడు.[7]

وَمَنْ جَاهَدَ فَاِنَّمَا يُجَاهِدُ لِنَفْسِهٖ ؕ اِنَّ اللّٰهَ لَغَنِيٌّ عَنِ الْعٰلَمِيْنَ ۝6

7 ఎవరయితే విశ్వసించి, (సున్నత్ ప్రకారం) మంచి పనులు చేస్తారో వారి నుంచి మేము వారి పాపాలను దూరం చేస్తాము. వారు చేసిన సత్కర్మలకుగాను వారికి అత్యుత్తమ ప్రతిఫలం ఇస్తాము.[8]

وَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ لَنُكَفِّرَنَّ عَنْهُمْ سَيِّاٰتِهِمْ وَلَنَجْزِيَنَّهُمْ اَحْسَنَ الَّذِيْ كَانُوْا يَعْمَلُوْنَ ۝7

8 తన తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా మెలగాలని మేము మానవునికి తాకీదుచేశాము.[9] అయితే వారు గనక నీకు తెలియని వాటిని, నాకు సాటిగా కల్పించమని నీపై ఒత్తిడి తీసుకువస్తే మటుకు, వారి మాట వినకు.[10] మీరంతా నా వద్దకే మరలి రావలసి ఉంది. అప్పుడు నేను మీరు చేసే పనుల (వాస్తవికత)ను మీకు తెలియజేస్తాను.

وَوَصَّيْنَا الْاِنْسَانَ بِوَالِدَيْهِ حُسْنًا ؕ وَاِنْ جَاهَدٰكَ لِتُشْرِكَ بِيْ مَا لَيْسَ لَكَ بِهٖ عِلْمٌ فَلَا تُطِعْهُمَا ؕ اِلَيَّ مَرْجِعُكُمْ فَاُنَبِّئُكُمْ بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ۝8

5. పరలోకంపై నమ్మకం గల వ్యక్తి పుణ్యఫలాన్ని ఆపేక్షించి సత్కార్యాలు చేస్తాడు. దేవుడు అతని ఆశల్ని వమ్ము చేయడు. అతని సత్కర్మలకుగాను పూర్తి పుణ్యఫలం అతనికి ప్రసాదిస్తాడు. ఎందుకంటే ప్రళయం రావటం సత్యం. అల్లాహ్ న్యాయ స్థానంలో విచారణ జరగటం తథ్యం.

6. ఆయన తన దాసుల మాటలను, వారి ప్రార్థనలను వినేవాడు. వారి అంతర్బాహ్య ఆచరణలను ఎరిగినవాడు. వారి ఆచరణలను బట్టే ఆయన పుణ్యఫలం వొసగుతాడు.

7. "సత్కార్యం చేసేవాడు దాన్ని తన ఆత్మ కొరకే చేసుకుంటాడు" (అల్ జాసియ-15) అన్న వచనం లాంటిదే ఇది కూడా. ఎవరి కర్మల్ని వారే అనుభవిస్తారు. దాసులు సత్కర్మలు చేసినా, చేయకపోయినా అల్లాహ్‌కు కలిగే లాభంగానీ, నష్టంగానీ ఏమీ ఉండదు. అల్లాహ్ అక్కరలేనివాడు. లోకవాసులంతా ధర్మ నిష్ఠాపరులుగా మారినంత మాత్రాన ఆయన సార్వభౌమత్వంలో వచ్చే పెరుగుదల ఏమీ ఉండదు. అలాగే లోకవాసులంతా అవిధేయులుగా మారిపోయినా ఆయన సార్వభౌమాధికారంలో తరుగుదల ఏమీ ఏర్పడదు.

8. అల్లాహ్ నిరపేక్షాపరుడు. అయినాసరే ఆయన తన ప్రత్యేక కృపతో విశ్వాసులకు – వారి సత్కర్మలకు బదులుగా – ఉత్తమ పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు. ఒక్కో సత్కార్యానికి అనేక రెట్ల ప్రతిఫలం ఇస్తాడు.

9. దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల దేవుడు తన ఏకత్వాన్ని, తన దాస్యాన్ని గురించి నొక్కి చెప్పిన వెంటనే తల్లిదండ్రుల యెడల సద్భావంతో మెలగాలని ఉపదేశించాడు. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే తల్లిదండ్రుల విధేయతను, వారి సేవను సరిగ్గా అర్థం చేసుకున్న వ్యక్తి మాత్రమే దేవుని ఏకత్వాన్ని కూడా ఆకళింపు చేసుకుని, దైవదాస్యాన్ని సరైన రీతిలో చేయగలుగుతాడు. తన తల్లిదండ్రుల ప్రేమానురాగాల మూలంగానే తానింతటివాణ్ణి అయ్యానన్న వాస్తవాన్ని గ్రహించి, వారి సేవలు చేయలేని వ్యక్తి, సృష్టికర్త ఔన్నత్యాన్ని కూడా అర్థం చేసుకోలేడు. అల్లాహ్‌ను ఆరాధించటంలోని మాధుర్యాన్ని కూడా అతను ఆస్వాదించలేడు. తల్లిదండ్రుల ప్రసన్నతలోనే దైవప్రసన్నత ఇమిడి ఉందని, తల్లిదండ్రుల అప్రసన్నతే దేవుని అప్రసన్నతకు మూలమని ఒక హదీసులో చెప్పబడింది.

**9** మరెవరయితే విశ్వసించి, సత్కార్యాలు చేశారో వారిని మేము సజ్జను(లైన మా దాసు)లలో చేర్చుకుంటాము.[11]

**10** జనులలో కొందరు, "మేము అల్లాహ్‌ను విశ్వసించాము" అని (పైకి) మాత్రం చెబుతారు. కాని అల్లాహ్ మార్గంలో ఏదైనా బాధ కలిగినప్పుడు, ప్రజల తరపున పెట్టబడిన బాధను 'దైవ శిక్ష'గా తలపోస్తారు.[12] మరి నీ ప్రభువు తరఫున తోడ్పాటు అందితే మాత్రం,[13] "మేమూ మీతోనే ఉన్నామండీ!"[14] అని అంటారు. లోకవాసుల ఆంతర్యాలలో ఏముందో అల్లాహ్‌కు తెలియదా ఏమిటి?[15]

**11** సిసలైన విశ్వాసులెవరో అల్లాహ్ తేల్చుతాడు, ఇంకా కపటులెవరో కూడా ఆయన తప్పకుండా తెలుసుకుంటాడు.[16]

وَالَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ لَنُدْخِلَنَّهُمْ
فِي الصَّالِحِينَ ﴿٩﴾
وَمِنَ النَّاسِ مَن يَقُولُ آمَنَّا بِاللَّهِ فَإِذَا أُوذِيَ
فِي اللَّهِ جَعَلَ فِتْنَةَ النَّاسِ كَعَذَابِ اللَّهِ ۖ وَلَئِن
جَاءَ نَصْرٌ مِّن رَّبِّكَ لَيَقُولُنَّ إِنَّا كُنَّا مَعَكُمْ ۚ
أَوَلَيْسَ اللَّهُ بِأَعْلَمَ بِمَا فِي صُدُورِ الْعَالَمِينَ ﴿١٠﴾

وَلَيَعْلَمَنَّ اللَّهُ الَّذِينَ آمَنُوا وَلَيَعْلَمَنَّ
الْمُنَافِقِينَ ﴿١١﴾

10. అంటే, ఒకవేళ తల్లిదండ్రులు బహుదైవారాధనతో కూడిన పనులను చేయమని బలవంతం చేస్తే, ఈ విషయంలో వారి మాట విననవసరం లేదు. ఎందుకంటే "అల్లాహ్ అవిధేయత విషయంలో ఎవరికీ లోబడవలసిన పనిలేదు" (ముస్నదె అహ్మద్ – 5/66; వస్సహీహతు లిల్ అల్‌బానీ – 179).

ఈ ఆయతు అవతరణా నేపథ్యంలో హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) వృత్తాంతం వస్తుంది. ఆయన గారు ముస్లింగా మారటం ఆయన తల్లికి ఏమాత్రం ఇష్టం లేదు. "నువ్వు ముహమ్మద్ (సఅసం) దైవదౌత్యాన్ని తిరస్కరించు. లేకపోతే నేను అన్నం ముట్టుకోను. పచ్చి మంచినీళ్లు కూడా త్రాగను. – నాకు చావు వచ్చినాసరే!" అని మొండికేసిందామె. ఆఖరికి ఆయన బలవంతంగా తన తల్లి నోరు తెరచి అన్నం తినిపించారు. ఆ సందర్భంలో ఈ ఆయతు అవతరించింది. (సహీహ్ ముస్లిం, తిర్మిజీ, అల్ అన్‌కబూత్ సూరా వ్యాఖ్యానం).

11. ఒక వ్యక్తి ముస్లిం అయివుండి, అతని తల్లిదండ్రులు ముష్రిక్కులై ఉంటే అట్టి పరిస్థితిలో అల్లాహ్ తీర్పుదినాన ఆ ముస్లిం వ్యక్తిని అతని తల్లిదండ్రుల సరసన గాకుండా, అతన్ని సజ్జనులైన తన దాసుల సరసన నిలబెడతాడు. ప్రాపంచిక జీవితంలో తల్లిదండ్రులు తమ కుమారుణ్ణి ఎంతగా ప్రేమించినప్పటికీ, అతన్ని తమ వాడుగా చెప్పుకున్నప్పటికీ పరలోకంలో వారి మధ్య విశ్వాసం (ఈమాన్) అడ్డుగోడగా మారుతుంది.

12. ఈ ఆయతులో కపటుల, బలహీన విశ్వాసుల పరిస్థితి విశదీకరించబడింది. విశ్వాస మార్గంలో వారికేదన్నా కష్టం కలిగితే దాన్ని దేవుని శిక్షగా భావించి హాహాకారాలు చేస్తారు. విశ్వసించటం మూలంగానే తమకు ఈ ఆపదలు వస్తున్నాయని తెగ బాధపడిపోతారు. పర్యవసానంగా వారు కొంతకాలానికి సత్యధర్మం నుంచి విముఖులై, మెజారిటీ ప్రజల అభిమతాన్ని అనుసరిస్తారు.

13. అంటే – ముస్లింలకు గనక దైవసహాయం వల్ల విజయం వరిస్తే అప్పుడు వెంటనే ప్లేటు ఫిరాయిస్తారు.

14. అంటే – మేము మీ ధార్మిక సోదరులం. పరాయి వారం కాదండీ! అని చంకలు గుద్దుకుంటూ చెబుతారు. ఈ విషయమే దివ్య ఖుర్‌ఆన్‌లో మరోచోట ఈ విధంగా చెప్పబడింది : "వారు మీ పరిస్థితిని గమనిస్తూ ఉంటారు. మీకు గనక దేవుని తరఫున విజయం లభిస్తే, "ఏమిటీ, మేము మీతో లేమా?!" అని సమర్థించుకుంటారు. ఒకవేళ పరిస్థితులు అవిశ్వాసులకు సానుకూలంగా ఉంటే మాత్రం, అవిశ్వాసుల దగ్గరకు వెళ్ళి, 'ఏమిటీ, మేము మిమ్మల్ని దిగ్బంధం చేసి, ముస్లిముల బారినుంచి మిమ్మల్ని కాపాడలేదా?' అని అంటారు." (అన్ నిసా – 141)

15. ఏమిటి, వారి గుండెల్లోని గుట్టు అల్లాహ్‌కు తెలియదని వారనుకుంటున్నారా? "మేము ముస్లింలం" అని వారు పైకి ఎన్ని డాంబికాలు పలికినప్పటికీ, వారి ఆంతర్యంలో ఏముందో అల్లాహ్‌కు తెలియకుండా లేదు.

12 అవిశ్వాసులు విశ్వసించినవారితో, "మీరు మా మార్గాన్ని అనుసరించండి. మీ పాపాలను మేము మోస్తాం"[17] అని అన్నారు. వాస్తవానికి వీళ్ళ పాపాలలో దేన్నీ వారు మోయరు. వారు పచ్చి అబద్ధాలకోరులు.[18]

وَقَالَ الَّذِينَ كَفَرُوا لِلَّذِينَ آمَنُوا اتَّبِعُوا سَبِيلَنَا وَلْنَحْمِلْ خَطَايَاكُمْ وَمَا هُم بِحَامِلِينَ مِنْ خَطَايَاهُم مِّن شَيْءٍ ۖ إِنَّهُمْ لَكَاذِبُونَ ⑫

13 కాకపోతే, వారు తమ (పాపాల) బరువును మాత్రం మోస్తారు. తమ బరువులతో పాటు మరిన్ని బరువులు కూడా మోస్తారు.[19] ఇంకా – వారు కల్పించే అభూత కల్పనలను గురించి ప్రళయ దినాన వారిని తప్పకుండా ప్రశ్నించటం జరుగుతుంది.

وَلَيَحْمِلُنَّ أَثْقَالَهُمْ وَأَثْقَالًا مَّعَ أَثْقَالِهِمْ ۖ وَلَيُسْأَلُنَّ يَوْمَ الْقِيَامَةِ عَمَّا كَانُوا يَفْتَرُونَ ⑬

16. దేవుడు సుఖదుఃఖాలు రెండింటినీ ఇచ్చి కల్తీ సరకు ఏదో – మేలిమి సరకు ఏదో పరీక్షిస్తాడు. సర్వకాల సర్వావస్థల్లో దైవానికి విధేయత చూపేవారు నికార్సయిన విశ్వాసులుగా నెగ్గుకువస్తారు. కేవలం సుఖసంతోషాలలో విధేయత చూపి, కష్టాల్లో విముఖత చూపేవాడు మనోవాంఛల దాసుడే తప్ప దేవుని సిసలైన దాసుడు కాలేడు. ఈ విషయమే ఖుర్ఆన్‌లో మరోచోట ఇలా చెప్పబడింది :

"మీలో సిసలైన యోధులెవరో, స్థిరచిత్తం గలవారెవరో, మీ స్థితిగతులేమిటో తెలుసుకునే నిమిత్తం మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము." (ముహమ్మద్ – 31).

ఉహుద్ యుద్ధంలో ముస్లిములు కఠిన పరీక్షలకు గురయ్యారు. ఆ తర్వాత ముస్లింలనుద్దేశించి దేవుడు ఇలా సెలవిచ్చాడు : "ప్రస్తుతం మీరు ఎదుర్కొంటున్నటువంటి (దయనీయ) స్థితిలోనే అల్లాహ్ మిమ్మల్ని వదలివేయడు. ఆయన పవిత్రులను అపవిత్రుల నుంచి వేరుపరుస్తాడు." (ఆలి ఇమ్రాన్ – 179)

17. మీరు ఈ కొత్త ధర్మమైన ఇస్లాంను వదలి మన పూర్వీకుల మతం వైపుకు మరలిరండి. ఎందుకంటే మన పెద్దల మతమే సరైన మతం. ఒకవేళ ఈ సనాతన మతాన్ని అవలంబించటం వల్ల మీరు దోషులుగా ఖరారైనట్లయితే, ఆ భారాన్నంతా మేము మా నెత్తిన వేసుకుంటాం కదా! మీకెందుకు దిగులు? అని అవిశ్వాసులు విశ్వాసులను దువ్వటం మొదలెట్టారు.

18. వారు చెప్పేదంతా అబద్ధమనీ, మోసమని అల్లాహ్ స్పష్టం చేశాడు. యదార్థానికి తీర్పుదినాన బరువును మోసేవాడెవడూ ఇతరుల బరువును మోయడు. ఒక స్నేహితుడు తన ప్రాణస్నేహితుణ్ణి కూడా అడిగి చూడడు (అల్ మఆరిజ్ – 10). చివరికి బంధువులు కూడా ఒండొకరి బరువును మోయడానికి సిద్ధమవరు. బరువును మోసే ఆత్మ ఏదైనా తన బరువును మోయమని ఇతరులను పిలిచినప్పుడు, దాని బరువులో రవంత భాగాన్ని కూడా ఎత్తుకోవటానికి ఎవరూ ముందుకు రారు. (ఫాతిర్ – 18)

19. అవిశ్వాసుల సర్దారులు, అపమార్గం వైపు దర్శకత్వం వహించిన పెద్దలు తమ పాపాల బరువును మాత్రమే మోయరు. వారి ద్వారా అపమార్గం పట్టిన వారి పాపాల భారం కూడా ఈ పెద్దలకు వడ్డించబడుతుంది. ఈ విషయం అన్ నహ్ల్ సూరా 25వ ఆయతులో కూడా వచ్చింది. హదీసులో ఉంది –

"ఎవరయితే సన్మార్గం వైపుకు పిలుస్తాడో అతనికి అతని సత్కర్మల పుణ్యఫలం లభించటంతోపాటు, అతని ద్వారా సన్మార్గం పొందిన వారి పుణ్యఫలం కూడా లభిస్తుంది. ఈ పరంపర ప్రళయదినం వరకూ సాగుతుంది. మరి ఆ సన్మార్గగాముల పుణ్యఫలంలో ఎలాంటి కోతా విధించబడదు. (అలాగే) ఎవరయితే మార్గభ్రష్టత వైపుకు పిలుపు ఇస్తాడో అతనిపై అతని పాపాలతో పాటు, అతని ద్వారా మార్గభ్రష్టులైన వారి పాపాల బరువు కూడా వేయబడుతుంది. ఈ పాప పరంపర ప్రళయదినం వరకూ సాగుతుంది. మరోవైపు ఆ మార్గభ్రష్ట అనుయాయుల పాపాలు కూడా తగ్గించబడవు (అబూ దావూద్ – కితాబుస్సున్న; ఇబ్నె మాజ – అల్ ముఖద్దమ). ఈ సూత్రాన్ననుసరించే ప్రళయదినం

14 మేము నూహు (అలైహిస్సలాం)ను అతని జాతి వైపునకు పంపాము. అతను వారిమధ్య యాభై తక్కువ వెయ్యి సంవత్సరాలు ఉన్నాడు.[20] ఆ తరువాత వారిని తుఫాను ముట్టడించింది. (ఎందు కంటే) వారు దుర్మార్గులుగా ఉన్నారు.

وَلَقَدْ اَرْسَلْنَا نُوْحًا اِلٰى قَوْمِهٖ فَلَبِثَ فِيْهِمْ اَلْفَ سَنَةٍ اِلَّا خَمْسِيْنَ عَامًا ؕ فَاَخَذَهُمُ الطُّوْفَانُ وَهُمْ ظٰلِمُوْنَ ⑭

15 మరి మేము అతన్ని, ఓడలోని వారినీ కాపాడాము. ఇంకా ఆ సంఘటనను మేము సమస్త లోకవాసులకు (గుణపాఠం గరిపే) సూచనగా చేశాము.

فَاَنْجَيْنٰهُ وَ اَصْحٰبَ السَّفِيْنَةِ وَجَعَلْنٰهَاۤ اٰيَةً لِّلْعٰلَمِيْنَ ⑮

16 మరి ఇబ్రాహీం (అలైహిస్సలాం) కూడా తన జాతి వారి నుద్దేశించి ఇలా అన్నాడు : "అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు భయపడుతూ ఉండండి. మీరు గనక గ్రహించగలిగితే ఇదే మీ కొరకు మేలైనది.

وَ اِبْرٰهِيْمَ اِذْ قَالَ لِقَوْمِهِ اعْبُدُوا اللّٰهَ وَاتَّقُوْهُ ؕ ذٰلِكُمْ خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ⑯

17 "మీరు అల్లాహ్‌ను వదలి ఈ విగ్రహాలను పూజిస్తున్నారే! మీ అంతట మీరు అసత్యాలను అల్లుతున్నారు.[21] వినండి! అల్లాహ్‌ను కాదని మీరు వేటినయితే పూజిస్తున్నారో, మీకు ఉపాధిని సమకూర్చే అధికారం వాటికి లేదు. కాబట్టి జీవనోపాధి కోసం మీరు దైవసమక్షంలోనే అర్థించండి. ఆయన్ని మాత్రమే ఆరాధించండి, ఆయనకే కృతజ్ఞతలు చెల్లించండి.[22] ఎట్టకేలకు మీరు ఆయన వద్దకే మరలించబడతారు.[23]

اِنَّمَا تَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ اَوْثَانًا وَّتَخْلُقُوْنَ اِفْكًا ؕ اِنَّ الَّذِيْنَ تَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ لَا يَمْلِكُوْنَ لَكُمْ رِزْقًا فَابْتَغُوْا عِنْدَ اللّٰهِ الرِّزْقَ وَاعْبُدُوْهُ وَاشْكُرُوْا لَهٗ ؕ اِلَيْهِ تُرْجَعُوْنَ ⑰

వరకూ – అన్యాయంగా హత్యచేయబడిన వారి రక్తపు పాపం ఆదం (అలైహిస్సలాం) జేష్ఠ పుత్రుడైన ఖాబీల్‌పై పడుతుంది. ఎందుకంటే అకారణంగా ఒక ప్రాణిని హతమార్చిన పాపాన్ని మొట్టమొదటిసారిగా మూటగట్టుకున్నది అతనే (ముస్నదె అహ్మద్).

20. దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) తన జాతి వారిమధ్య ఉండి, సత్యధర్మ ప్రచారం చేసినకాలం 950 సంవత్సరాలు అని దివ్య ఖుర్‌ఆన్ ద్వారా రూఢీ అవుతోంది. మరైతే ఆయన ఎంతకాలం జీవించారు? దీనికి సంబంధించిన ఖచ్చితమైన ఆధారం లేదు. అయితే ప్రవక్త పదవి లభించక మునుపు నలభై సంవత్సరాలు, తుఫాను అనంతరం అరవై సంవత్సరాలు ఆయన తన జాతి ప్రజల మధ్య ఉన్నట్లు కొందరు చెబుతారు. ఈ నూరేళ్ళను కూడా కలుపుకుంటే 1050 సంవత్సరాలు అవుతాయి. ఈ విషయానికి సంబంధించి ఇంకా మరికొన్ని కథనాలు కూడా ఉన్నాయి. నిజము దేవుడెరుగు.

21. అరబీ మూలంలో **'అవ్‌సానున్'** (اوثان) అని ఉంది. **అవ్‌సానున్** అన్నా, **అస్‌నామున్** (اصنام) అన్నా విగ్రహాలనే అర్థం వస్తుంది. కొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం బంగారం, వెండి, ఇత్తడి, రాగి, రాతితో చేయబడిన విగ్రహాలు **అస్‌నామున్** (اصنام) గా పరిగణించబడతాయి. **అవ్‌సానున్** (اوثان) అనే పదం మాత్రం చేత్తో చేయబడిన విగ్రహాలతోపాటు, ఇటుకలతో, సున్నంతో నిర్మించబడిన దైవేతర ఆస్థానాలకు కూడా వర్తిస్తుంది. **తఖ్‌లుఖూన ఇఫ్కన్** అంటే 'అబద్ధాలను సృష్టించటం' అని అర్థం. దురుద్దేశంతో లేనిపోని వాటిని కల్పించి చెప్పటం అనే అర్థం కూడా వస్తుంది. సందర్భం రీత్యా ఈ రెండు అర్థాలు కూడా సరైనవే. అంటే అల్లాహ్‌ను వదలి మీరు పూజించే

18 “ఒకవేళ మీరు ధిక్కరించే పక్షంలో మీకు పూర్వం గతించిన సమాజాలు కూడా ధిక్కరించాయి (అన్న సంగతిని మరువ కండి).[24] విషయాన్ని స్పష్టంగా అందజేయటం వరకే ప్రవక్త బాధ్యత.”[25]

وَإِن تُكَذِّبُوا فَقَدْ كَذَّبَ أُمَمٌ مِّن قَبْلِكُمْ ۖ
وَمَا عَلَى الرَّسُولِ إِلَّا الْبَلَاغُ الْمُبِينُ ﴿١٨﴾

19 అల్లాహ్ ఏ విధంగా సృష్టిని మొదలెడుతున్నాడో వారు చూడటం లేదా? మరి ఆయనే దాన్ని పునరావృతం చేస్తాడు.[26] ఇలా చేయటం అల్లాహ్‌కు చాలా తేలిక.[27]

أَوَلَمْ يَرَوْا كَيْفَ يُبْدِئُ اللَّهُ الْخَلْقَ ثُمَّ يُعِيدُهُ ۚ
إِنَّ ذَٰلِكَ عَلَى اللَّهِ يَسِيرٌ ﴿١٩﴾

---

విగ్రహాలు రాతి బొమ్మలు, మట్టి బొమ్మలు మాత్రమే. అవి చూడలేవు, వినలేవు, పలకలేవు. మీకు లాభంగానీ, నష్టంగానీ కలిగించే శక్తి కూడా వాటికి లేదు. నిజానికి ఇదంతా మీ అంతట మీరుగా కల్పించుకున్న కల్పనే తప్ప ఇందులో ఎలాంటి సత్యమూ, ఆధారమూ లేదు. మీరు మొక్కుకుంటున్న ఈ విగ్రహాల గురించి కాస్త ఆలోచించండి! వాటిని మీరు మీ చేతులతో తయారు చేశారు. మీకు నచ్చిన ఆకారంలో వాటిని మలిచారు. మరి ఆ రాతి బొమ్మలు ఒక ప్రత్యేక రూపును, ఆకారాన్ని సంతరించుకున్న మీదట, వాటికేదో దైవత్వపు ప్రత్యేకత లభించినట్లు తలపోసి, వాటిముందు మోకరిల్లుతున్నారు. వాటిపై ఎక్కడ లేని ఆశలు పెంచుకుని వాటినే మొరపెట్టుకుంటున్నారు.

22. మీరు పూజించే ఈ విగ్రహాలు మీకు ఏవిధమైన ఉపాధినీ సమకూర్చలేవని తెలిసిన తరువాత, అవి వర్షాన్ని కురిపించలేవనీ, మొక్కల్ని మొలకెత్తించలేవని బోధపడిన తరువాత మీరు మళ్ళీ వాటి ముందరే తలవంచటం ధర్మం కాదు. కాబట్టి ఇప్పుడు మీరు ఉపాధి కోసం అల్లాహ్‌నే అర్థించాలి. ఆయన్నే ఆరాధించాలి. ఆయనకే కృతజ్ఞులై ఉండాలి.

23. అంటే–మరణానంతరం మీరు మీ ప్రభువు సన్నిధికే రావలసి ఉంది. ఆయన ఎదుట నిలబడి సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంది. మరలాంటప్పుడు మీరు ఆయన్ని కాదని ఇతరులను ఎందుకు మొక్కుకుంటారు? ఆయన్ని వదలి చిల్లరదేముళ్ళను ఎందుకు పూజిస్తారు? ఇతరుల ముందు దీనంగా ఎందుకు చేయి చాపుతారు?

24. ఇవి, తన జాతినుద్దేశించి హ్రజత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) పలికిన మాటలూ కావచ్చు లేక మక్కావాసులను ఉద్దేశించి దేవుడు పలికిన పలుకులూ కావచ్చు. ఈ పలుకుల ద్వారా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఓదార్చటం జరిగింది. మక్కాలోని కురైషులు నిన్ను ధిక్కరించినంత మాత్రాన దిగులు చెందవలసిన అవసరం లేదు. పూర్వపు ప్రవక్తల పట్ల కూడా ఇదే వ్యవహారం జరిగింది. వెనుకటి సమాజాలు కూడా ప్రవక్తల్ని అవమానపరచి వినాశాన్ని చవిచూశాయి. అందువల్ల ఓ ముహమ్మద్ (సఅసం)! నువ్వు ఆందోళన చెందకుండా నీ కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తూ ఉండు అన్నది ఈ ఉపదేశంలోని సారాంశం.

25. ఓ ముహమ్మద్ (స)! సందేశాన్ని అందజేస్తూ ఉండు. దాన్ని ఎవరు స్వీకరించినా, స్వీకరించకపోయినా వెనక్కి తిరిగిచూడవలసిన పనిలేదు. సందేశాన్ని అందజేయటం వరకే నీ బాధ్యత. సన్మార్గ భాగ్యం ప్రసాదించటం, ప్రసాదించక పోవటం – ఇదంతా దేవుని చేతుల్లో ఉంది. దీని గురించి నిన్ను ప్రశ్నించటం జరగదు. ఎవరిలో ఏకాస్త సత్యాన్వేషణా తపన వున్నా అల్లాహ్ వారికి తప్పకుండా సహాయపడతాడు. వారి హృదయాన్ని విశ్వాసజ్యోతితో నింపుతాడు. ఈ జిజ్ఞాస ఏమాత్రం లేని వారిని మార్గభ్రష్టత్వపు అంధకారంలో వదిలివేస్తాడు.

26. దేవుని ఏకత్వం, దైవదౌత్య నిరూపణల తరువాత, ఇక్కడి నుంచి పరలోక నిరూపణ గురించి వక్కాణించటం జరిగింది. మీకంటూ ఒక ఉనికి లేని పరిస్థితిలో మిమ్మల్ని సృష్టించినవాడు అల్లాహ్‌యే. మీకు కనే, వినే, మాట్లాడే, ఆలోచించే శక్తినిచ్చాడు. మరి మీరు మరణించి మట్టిలో కలిసిపోయాక ఈ లోకంలో మీ ఆనవాళ్లు కూడా ఉండవు. అయితే అల్లాహ్ మిమ్మల్ని మళ్లీ బ్రతికిస్తాడు అని చెప్పబడింది.

27. ఈ పునరుజ్జీవన ప్రక్రియ మీకు ఎంత క్లిష్టంగా అనిపించినా అల్లాహ్‌కు మాత్రం ఇది చాలా తేలిక.

**20** వారికి చెప్పు : "భువిలో సంచరించండి. అల్లాహ్ ఏ విధంగా సృష్టిని మొదలెట్టాడో కాస్త చూడండి![28] మరి అల్లాహ్‌యే మలిసారి పునరుజ్జీవనం కూడా ప్రసాదిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నింటిపై అధికారం గలవాడు."

قُلْ سِيرُوا فِي الْأَرْضِ فَانْظُرُوا كَيْفَ بَدَأَ الْخَلْقَ
ثُمَّ اللَّهُ يُنْشِئُ النَّشْأَةَ الْآخِرَةَ ۚ إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ
شَيْءٍ قَدِيرٌ ﴿٢٠﴾

**21** తాను కోరిన వారిని ఆయన శిక్షిస్తాడు, తాను కోరినవారిని కనికరిస్తాడు. అందరూ ఆయన వైపునకే మరలించబడతారు.[29]

يُعَذِّبُ مَنْ يَشَاءُ وَيَرْحَمُ مَنْ يَشَاءُ ۖ
وَإِلَيْهِ تُقْلَبُونَ ﴿٢١﴾

**22** మీరు భూమిలోగానీ, ఆకాశంలోగానీ అల్లాహ్‌ను అశక్తుణ్ణి చేయలేరు సుమా! అల్లాహ్ తప్ప మీకు మరో సంరక్షకుడు గానీ, సహాయకుడుగానీ లేడు.

وَمَا أَنْتُمْ بِمُعْجِزِينَ فِي الْأَرْضِ وَلَا فِي السَّمَاءِ ۖ
وَمَا لَكُمْ مِنْ دُونِ اللَّهِ مِنْ وَلِيٍّ وَلَا نَصِيرٍ ﴿٢٢﴾

**23** ఎవరయితే అల్లాహ్ ఆయతులను, ఆయనను కలవటాన్ని త్రోసిపుచ్చుతారో వారే నా కారుణ్యం పట్ల ఆశ వదులుకున్న వారు.[30] వారికోసం బాధాకరమైన శిక్ష ఉంది.

وَالَّذِينَ كَفَرُوا بِآيَاتِ اللَّهِ وَلِقَائِهِ أُولَٰئِكَ يَئِسُوا
مِنْ رَحْمَتِي وَأُولَٰئِكَ لَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿٢٣﴾

28. అంటే నేలపై నలువైపులా విస్తరించివున్న దేవుని సూచనలను గమనించండి. ఆయన భూమిని ఎలా పాన్పుగా పరచాడో, పర్వతాలను ఎలా మేకులుగా పాతిపెట్టాడో, నదీనదాలను, కాలువలను ఎలా ప్రవహింపజేస్తున్నాడో, మీ కోసం రకరకాల పండ్లు ఫలాదులను ఎలా ఉత్పన్నం చేస్తున్నాడో కాస్త ఆలోచించండి! ఇవన్నీ సృష్టించబడ్డాయనీ, వీటి వెనుక ఒక సృష్టికర్త, ఒక గొప్ప నిర్మాత ఉన్నాడన్న సంగతి మీకు స్ఫురించటం లేదా?

29. ఎందుకంటే ఆయనే సిసలైన పాలకుడు, సార్వభౌముడు, తన అధికారాన్ని తిరుగులేని రీతిలో చెలాయించగలవాడు. ఆయన్ని 'ఎవరూ?' 'ఏమిటి' 'ఎందుకు' అని ప్రశ్నించలేరు. అయితే ఆయన ఎవరిని శిక్షించినా, క్షమించినా – నిర్ణీత నియమ నిబంధనలతోనే చేస్తాడు. అన్యాయంగా ఎవరినీ శిక్షించడు. ఆయన పరమ న్యాయశీలుడు.

30. దైవకారుణ్యం సర్వసాధారణమయింది. లోకంలో విశ్వాసులు – అవిశ్వాసులు, నిజాయితీపరులు – కపటులు, మంచివారు – చెడ్డవారు అన్న తేడా లేకుండా అందరూ దైవకారుణ్యం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అల్లాహ్ లోకంలోని వారందరికీ జీవన సదుపాయాలను, సిరిసంపదలను అనుగ్రహిస్తున్నాడు. "నా కారుణ్యం అన్ని వస్తువులనూ ఆవరించి ఉంది" (అల్ ఆరాఫ్ – 156) అన్న దివ్య వచనానికి ఇది ప్రబల తార్కాణం.

అయితే పరలోకం మాత్రం ప్రతిఫలం పొందే స్థలం. ప్రపంచంలో మనిషి తాను నాటిన విత్తనాన్నిబట్టే పరలోకంలో ప్రతిఫలాన్ని పొందుతాడు. అతను చేసుకున్న కర్మల ప్రకారమే అతనికి ప్రతిఫలం ప్రసాదించబడుతుంది. దేవుని న్యాయస్థానంలో నిష్పక్షపాతంగా న్యాయనిర్ణయం జరుగుతుంది. ప్రపంచంలో మాదిరిగానే పరలోకంలో కూడా దుర్మార్గులను మంచివారి సరసన నిలబెట్టటం జరిగితే, విశ్వాసులతో పాటు అవిశ్వాసులు కూడా దైవకారుణ్యానికి పాత్రులుగా ఖరారు చేయబడితే అది న్యాయం అనిపించుకోదు. అల్లాహ్ న్యాయశీలతకు అది శోభాయమానం కాజాలదు. ఒకవేళ అదే గనక జరిగితే తీర్పుదినం నెలకొనటంలో అర్థమే లేదు. తీర్పుదినాన్ని అల్లాహ్ నెలకొల్పటంలోని ఉద్దేశం ఏమిటి? సజ్జనులకు వారి సదాచరణకు ప్రతిఫలంగా స్వర్గాన్ని ప్రసాదించటానికి, దుష్టులను వారి దురాచరణలకు బదులుగా నరకాగ్నికి ఆహుతి చేయటానికీ ఆయన తీర్పుదినాన్ని ఉంచాడు. అందువల్ల ప్రళయదినాన– తీర్పుదినాన – అల్లాహ్ కారుణ్యం విశ్వాసులకు మాత్రమే ప్రత్యేకించబడుతుంది. ఆ విషయమే ఈ ఆయతులో చెప్పబడింది. అల్లాహ్‌ను కలుసుకునే విషయాన్ని, పరలోకాన్ని తిరస్కరించినవారు తన కారుణ్యం పట్ల ఆశలు

فَمَا كَانَ جَوَابَ قَوْمِهٖٓ اِلَّآ اَنْ قَالُوا اقْتُلُوْهُ اَوْ حَرِّقُوْهُ فَاَنْجٰىهُ اللّٰهُ مِنَ النَّارِ ؕ اِنَّ فِیْ ذٰلِكَ لَاٰیٰتٍ لِّقَوْمٍ یُّؤْمِنُوْنَ ﴿24﴾

**24** మరి అతని (ఇబ్రాహీము) జాతివారు, "ఇతన్ని చంపేయండి లేదా ఇతన్ని కాల్చేయండి"[31] అని అన్నారు. అంతకుమించి వారి దగ్గర ఏ సమాధానమూ లేకపోయింది. ఎట్టకేలకు అల్లాహ్ అతన్ని అగ్ని నుంచి కాపాడాడు.[32] విశ్వసించే జనుల కోసం ఇందులో ఎన్నో సూచనలున్నాయి.

وَقَالَ اِنَّمَا اتَّخَذْتُمْ مِّنْ دُوْنِ اللّٰهِ اَوْثَانًا ۙ مَّوَدَّةَ بَیْنِكُمْ فِی الْحَیٰوةِ الدُّنْیَا ۚ ثُمَّ یَوْمَ الْقِیٰمَةِ یَكْفُرُ بَعْضُكُمْ بِبَعْضٍ وَّیَلْعَنُ بَعْضُكُمْ بَعْضًا ۫ وَّمَاْوٰىكُمُ النَّارُ وَمَا لَكُمْ مِّنْ نّٰصِرِیْنَ ﴿25﴾

**25** (ఇబ్రాహీము వారితో) ఇలా అన్నాడు: "మీరు అల్లాహ్‌ను వదలి విగ్రహాలను ఆశ్రయించారు. మీ పరస్పర ప్రాపంచిక స్నేహసంబంధాల ప్రాతిపదికపైన్నే మీరు (ఇదంతా) కల్పించు కున్నారు.[33] కాని ప్రళయదినాన మీరంతా ఒండొకరిని తిరస్క రిస్తారు. ఒకరినొకరు శపించుకుంటారు.[34] నరకాగ్ని మీ నివాస మవుతుంది. (అక్కడ) మిమ్మల్ని ఆదుకునే వాడెవడూ ఉండడు."

فَاٰمَنَ لَهٗ لُوْطٌ ۘ وَقَالَ اِنِّیْ مُهَاجِرٌ اِلٰی رَبِّیْ ؕ اِنَّهٗ هُوَ الْعَزِیْزُ الْحَكِیْمُ ﴿26﴾

**26** అప్పుడు లూతు (అలైహిస్సలాం) మటుకు అతన్ని విశ్వసిం చాడు.[35] అతనిలా అన్నాడు: "నేను నా స్వస్థలం నుంచి నా ప్రభువు వైపునకు ప్రస్థానం చేస్తాను.[36] ఆయన గొప్ప శక్తిమంతుడు, వివేకవంతుడు."

---

వదులుకున్నట్లేనని స్పష్టంగా చెప్పేశాడు. ఈ మాటే అల్ ఆరాఫ్ సూరాలో మరింత సూటిగా సెలవీయబడింది: "నేను ఈ కారుణ్యాన్ని (పరలోకంలో) భయభక్తులు కలిగి ఉండి, జకాత్ సొమ్మును ఇచ్చి, మా వాక్యాలను విశ్వసించిన వారి కొరకే వ్రాసిపెడతాను" (అల్ ఆరాఫ్ – 156).

31. ఈ ఆయతులకు ముందు హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) వృత్తాంతం మొదలయింది. మధ్యలో దేవుని ఏకత్వాన్ని, శక్తిసామర్థ్యాలను చాటిచెప్పే వాక్యం వచ్చింది. ఆ తరువాత ఇప్పుడు ఆ వృత్తాంతంలోని తతిమ్మా భాగం మొదలయింది. కాగా; ఇదంతా హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఉపదేశంలో అంతర్భాగమనీ, ఆయన ఏకదైవారాధనకు, పరలోకానికి సంబంధించిన నిదర్శనాలను ఆయన తన జాతివారికి సమర్పించారనీ, కాని జాతి జనులకు సమాధానం ఏమీ తోచక హింసా దౌర్జన్యాలకు దిగివచ్చారని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇతన్ని హతమార్చండి లేదా కాల్చివేయండి అని అన్నారు. చివరకు అగ్నికి ఆహుతి చేయాలని నిశ్చయించుకున్నారు. దానికోసం ఓ పెద్ద అగ్ని గుండాన్ని సిద్ధం చేసి, ఇబ్రాహీం (అలైహిస్సలాం)ని అందులో పడవేశారు.

32. అయితే అల్లాహ్ ఆ అగ్నిగుండాన్ని పుష్పరాశిగా మార్చి, తన దాసుణ్ణి రక్షించాడు. అంబియా సూరాలో దీని వివరాలు ఉన్నాయి.

33. అంటే ఇవన్నీ మీ జాతీయ చిహ్నాలుగా ఉన్న విగ్రహాలు మాత్రమే. మీ సామూహిక ప్రయోజనాల ప్రాతిపదికపై మీరు వీటిని కల్పించుకుని ఉన్నారు. ఈ విగ్రహాలను విడిచిపెడితే మీ జాతీయత ఎక్కడ బలహీనపడుతుందో, మీ స్నేహబంధం ఎక్కడ తెగిపోతుందోనన్న ఆందోళన వల్ల మీరు వీటిని అంటిపెట్టుకుని ఉన్నారు. అంతకు మించి మీరు చేసే ఈ విగ్రహారాధన వెనుక మరో బలమైన ఆధారమేదీ లేదు.

34. కాని పరలోకంలో కథ అడ్డం తిరుగుతుంది. మీరు పరస్పరం ఖండించుకుంటారు. స్నేహ బంధాన్ని మరచిపోయి ఒండొకరికి శాపనార్థాలు పెడతారు. మీరు పూజించేవారు మిమ్మల్ని దూషిస్తే, మీరేమో మీ దేవతలను దూషిస్తారు.

35. హజ్రత్ లూత్ (అలైహిస్సలాం), హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు భాతృజుడు (సోదర కుమారుడు) అవుతారు. ఈయన హజ్రత్ ఇబ్రాహీమును విశ్వసించారు. ఆ తరువాత ఈయన 'సదూమ్' ప్రాంతానికి ప్రవక్తగా చేసి పంపబడ్డారు.

27 మరి మేము అతనికి (ఇబ్రాహీముకు) ఇస్‌హాఖ్, యాఖూబు (అలైహిముస్సలాం) లను ప్రసాదించాము. అతని సంతతిలో మేము ప్రవక్త పదవిని, గ్రంథాన్ని ఉంచాము.[37] మరి మేము అతనికి ప్రపంచంలో కూడా అతని మంచి ప్రతిఫలాన్ని వొసగాము.[38] పరలోకంలో కూడా అతడు సజ్జనులతో చేరి ఉంటాడు.[39]

وَوَهَبْنَا لَهُ إِسْحٰقَ وَيَعْقُوبَ وَجَعَلْنَا فِي ذُرِّيَّتِهِ النُّبُوَّةَ وَالْكِتٰبَ وَاٰتَيْنٰهُ أَجْرَهُ فِي الدُّنْيَا ۚ وَإِنَّهُ فِي الْاٰخِرَةِ لَمِنَ الصّٰلِحِينَ ﴿27﴾

28 లూత్ (అలైహిస్సలాం)ను కూడా జ్ఞప్తికి తెచ్చుకోండి. అతను తన జాతి వారినుద్దేశించి ఇలా అన్నాడు : "మీకు పూర్వం లోక వాసులెవరూ చేయని నీతిమాలిన పనికి మీరు పాల్పడు తున్నారే?![40]

وَلُوطًا إِذْ قَالَ لِقَوْمِهِ إِنَّكُمْ لَتَأْتُونَ الْفَاحِشَةَ ۫ مَا سَبَقَكُمْ بِهَا مِنْ أَحَدٍ مِّنَ الْعٰلَمِينَ ﴿28﴾

29 "ఏమిటి? మీరు పురుషుల వద్దకు పోయి పాడుపని చేస్తారా?[41] దారిని మూసేస్తారా?[42] మీరు మీ సమావేశాల్లోనే (నిస్సిగ్గుగా) నీతిబాహ్యమైన పనులకు ఒడిగడతారా?"[43] దీనికి

أَئِنَّكُمْ لَتَأْتُونَ الرِّجَالَ وَتَقْطَعُونَ السَّبِيلَ ۙ وَتَأْتُونَ فِي نَادِيكُمُ الْمُنْكَرَ ۖ فَمَا كَانَ جَوَابَ

36. ఈ మాటలన్నదెవరు? ఇబ్రాహీం (అలైహి) అని కొంతమంది అభిప్రాయపడగా లూత్ (అలైహి) అని మరికొంతమంది అన్నారు. వారిద్దరూ దైవమార్గంలో వలస పోయినవారేనని ఇంకొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అంటే, తన స్వస్థలమైన 'కోసి'లో అల్లాహ్‌ను ఆరాధించటం కష్టమైనప్పుడు తనను విశ్వసించిన హజ్రత్ లూత్ (అలైహిస్సలాం)తో కలిసి హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) సిరియా ప్రాంతం వైపుకు వలసపోయారు. ఈ ప్రయాణంలో ఆయన వెంట ఆయన సతీమణి అయిన సారా కూడా ఉన్నారు.

37. హజ్రత్ ఇస్‌హాఖ్ (అలైహి)కు యాఖూబ్ (అలైహి) అనే బిడ్డ కలిగాడు. ఆయన ద్వారానే ఇస్రాయీల్ వంశ పరంపర మొదలయింది. ఈ వంశంలో ఎంతోమంది ప్రవక్తలు పుట్టారు. దేవుడు తన గ్రంథాన్ని ఈ సంతతిలో అవతరింపజేస్తూ వచ్చాడు. హజ్రత్ ఇబ్రాహీం(అ) ద్వితీయ కుమారుడగు హజ్రత్ ఇస్మాయీల్ (అ) సంతతిలో నుంచి వచ్చిన చిట్టచివరి ప్రవక్తే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం). అంతిమ దైవగ్రంథమైన ఖుర్ఆన్‌ను అల్లాహ్ ఆయన (స) పై అవతరింపజేశాడు.

38. **'ప్రాపంచిక ప్రతిఫలం'** అన్న పదంలో ఆహారంతో పాటు ఘనకీర్తి కూడా చేరి ఉంది. దేవుడు ప్రపంచంలో ఇబ్రాహీం కీర్తి ప్రతిష్ఠల్ని పెంచాడు. ప్రళయదినం వరకూ ప్రజలు ప్రపంచంలో ఆయన సేవల్ని కొనియాడేలా చేశాడు. నేడు ప్రపంచంలో యూదులు, క్రైస్తవులు, ముష్రిక్కులు కూడా దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అ)ను గౌరవిస్తారు. మరలాంటప్పుడు తమ పితామహుడైన ఇబ్రాహీం మిల్లత్‌కు అనుయాయులమని చెప్పుకునే ముస్లింలు ఆయన యెడల గౌరవాదరణలు లేకుండా ఎలా ఉంటారు?

39. అంటే – శాశ్వితమైన పరలోక జీవితంలో కూడా ఆయన (అలైహిస్సలాం) ఉన్నత స్థానాలను అలంకరిస్తారు. దేవుని పుణ్యదాసుల కోవలో చేర్చబడతారు. ఈ విషయమే దివ్య ఖుర్ఆన్‌లో వేరొక చోట ఇలా చెప్పబడింది: "(అల్లాహ్) ప్రపంచంలోనే అతనికి మేలును ప్రసాదించాడు. పరలోకంలో అతను నిశ్చయంగా సజ్జనులలో చేరి ఉంటాడు" (అన్ నహ్ల్ – 122).

40. **'నీతిమాలిన పని'** అంటే స్వలింగ సంపర్కం అన్నమాట! ఈ అసహజ లైంగిక చేష్టకు ప్రపంచంలో తొట్టతొలి సారిగా శ్రీకారం చుట్టినవారు లూత్‌జాతి వారే అని దివ్య ఖుర్ఆన్ ద్వారా అవగతమవుతోంది.

41. కామంతో మీ కళ్లు ఎంతగా మూసుకుపోయాయంటే, దానికోసం ఉద్దేశించిన సహజపద్ధతి కూడా మీకు తృప్తినీయటం

قَوْمِهٖٓ اِلَّآ اَنْ قَالُوا ائْتِنَا بِعَذَابِ اللّٰهِ اِنْ كُنْتَ مِنَ الصّٰدِقِيْنَ ﴿29﴾

సమాధానంగా అతని జాతి వారు, "సరే! నువ్వు సత్యవంతుడవే అయితే మాపైకి దైవశిక్షను తీసుకురా!" అని అనటం తప్ప మరేమీ చెప్పలేకపోయారు.[44]

قَالَ رَبِّ انْصُرْنِيْ عَلَى الْقَوْمِ الْمُفْسِدِيْنَ ﴿30﴾

**30** అప్పుడు లూత్, "ప్రభూ! ఈ అల్లరి మూకకు వ్యతిరేకంగా నాకు సహాయపడు" అని అభ్యర్థించాడు.[45]

وَلَمَّا جَآءَتْ رُسُلُنَآ اِبْرٰهِيْمَ بِالْبُشْرٰى قَالُوْٓا اِنَّا مُهْلِكُوْٓا اَهْلِ هٰذِهِ الْقَرْيَةِ اِنَّ اَهْلَهَا كَانُوْا ظٰلِمِيْنَ ﴿31﴾

**31** మేము పంపిన దూతలు శుభవార్తను తీసుకుని ఇబ్రాహీము (అలైహిస్సలాం) వద్దకు చేరుకున్నప్పుడు, "ఈ పట్టణ వాసులను మేము నాశనం చేయనున్నాము.[46] నిశ్చయంగా ఇక్కడి వాళ్ళు పరమ దుర్మార్గులుగా తయారయ్యారు" అని చెప్పారు.

---

లేదు. మీరు మరీ బరితెగించి అసహజమైన పద్ధతి ద్వారా మీ కామతాపం చల్లార్చుకుంటున్నారు. దేవుడు మీ కోసం భార్యలను ఉంచగా, మీరు వారిని వదిలేసి పురుషుల వెంటపడ్డారు. మీరు మొదలెట్టిన ఈ ముదనష్టపు పని జోలికి ఇంతకుముందు ప్రపంచంలో ఎవరూ పోలేదు.

42. **'దారిని మూసేయటం'** అంటే ఒక అర్థం ఇది: వారు తమ రహదారి గుండా వచ్చే పోయే బాటసారులను, నవ యువకులను ఆపి బలవంతంగా వారిమీద అత్యాచారానికి పాల్పడేవారు. అందువల్ల జనులు ఆ దారిగుండా నడవటానికి భయపడి, ఇంటిపట్టునే ఉండిపోయేవారు. రెండవ అర్థం : వచ్చేపోయే జనులను వారు దోచుకునేవారు. హత్యలు చేసేవారు. జనులను కవ్విస్తూ వారిపై కంకర రాళ్లు రువ్వేవారు. ఈ కారణంగా ప్రజల బ్రతుకు దుర్భరంగా మారిపోయింది. మూడవ అర్థం : పట్టపగలే, జనుల సమక్షంలోనే, సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా నీతిబాహ్యమైన పనులకు పాల్పడటం.

పైన పేర్కొన్న మూడు పనుల్లో ఏది ప్రబలినా రహదారులు నిర్మానుష్యంగా మారటం సహజమే. ఈ నేపథ్యంలో ఇమామ్ షౌకానీ ఇలా అంటున్నారు : ఏ కారణం చేత రహదారులు మూసుకుపోయేవి? అనేది నిర్ధారించటం కష్టమే. అయితే మొత్తానికి లూత్ జాతి వారు పాల్పడే వెకిలిచేష్టల మూలంగా జనులు దారుల్లో నడవటం గగనమైపోయేదన్నది మాత్రం వాస్తవం. 'దారిని మూసివేయటం' అంటే 'వంశ పరంపరను త్రెంచివేయటం' అన్న అర్థం కూడా వస్తుంది. అంటే వాళ్లు తమ లైంగిక వాంఛల నిమిత్తం స్త్రీల మర్మాంగాన్ని ఉపయోగించే బదులు పురుషుల మలవిసర్జనా స్థానాన్ని ఉపయోగించటం మూలంగా వారి వంశపరంపర ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది (ఫత్‌హుల్ ఖదీర్).

43. ఇంతకీ ఈ 'నీతిబాహ్యమైన పని' ఏమిటి? దీనిపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. ఉదాహరణకు : జనులపై కంకర రాళ్లు రువ్వటం, అపరిచిత బాటసారులను ఆటపట్టించటం, సమావేశాలలో ఉద్దేశపూర్వకంగా పిత్తి ఇకిలించటం మొదలైనవి. "బహుశా వారు ఈ అసభ్యకరమైన పనులన్నీ చేసి ఉంటారని చెప్పినా ఆశ్చర్య పడనవసరం లేదు" అని ఇమామ్ షౌకానీ తెలిపారు.

44. ఈ పాడు పనులకు పాల్పడరాదని హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) ఉపదేశించినప్పుడు సమాధానంగా వారు చెప్పిన మాట ఇది.

45. తన జాతిని సంస్కరించటానికి చేసిన ప్రయత్నమేదీ ఫలించకపోవటంతో హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) కడు దీనంగా చేసిన ప్రార్థన ఇది.

46. హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) మొర ఆలకించబడింది. దుర్మార్గానికి ఒడిగట్టిన వారిని శిక్షించేందుకు దేవుడు తన దూతలను పంపించాడు. ఆ దూతలు మొదట ఇబ్రాహీం (అలైహిస్సలాం) దగ్గరకు వెళ్ళారు. ఆయనకు ఇస్‌హాఖ్,

**32** "కాని అక్కడ లూత్ ఉన్నాడు కదా!" అని (ఇబ్రాహీము) సందేహపడ్డాడు. "అక్కడ ఉన్న వారెవరో మాకు బాగా తెలుసు.[47] మేము అతని భార్యను తప్ప– అతన్ని, అతని ఇంటివారిని కాపాడుతాము. ఆ స్త్రీ మాత్రం వెనుక ఉండిపోయే వారితో చేరుతుంది"[48] అని దైవదూతలు చెప్పారు.

قَالَ إِنَّ فِيهَا لُوطًا ۚ قَالُوا نَحْنُ أَعْلَمُ بِمَن
فِيهَا ۖ لَنُنَجِّيَنَّهُ وَأَهْلَهُ إِلَّا امْرَأَتَهُ كَانَتْ
مِنَ الْغَابِرِينَ ﴿٣٢﴾

**33** మరి మా దూతలు లూత్ (అలైహిస్సలాం) వద్దకు చేరుకున్నప్పుడు, అతను వారిని చూసి ఆందోళన చెందాడు. లోలోపలే కుమిలిపోయాడు.[49] అప్పుడు వారిలా అన్నారు : "నువ్వు భయపడకు. కలత చెందకు. మేము నీ భార్యను తప్ప[50] – నిన్నూ, నీ పరివారాన్నీ కాపాడుతాము. ఎందుకంటే ఆమె (శిక్షను అనుభవించటానికి) వెనుక ఉండిపోయే వారితో చేరుతుంది."

وَلَمَّا أَن جَاءَتْ رُسُلُنَا لُوطًا سِيءَ بِهِمْ
وَضَاقَ بِهِمْ ذَرْعًا وَقَالُوا لَا تَخَفْ وَلَا تَحْزَنْ ۖ
إِنَّا مُنَجُّوكَ وَأَهْلَكَ إِلَّا امْرَأَتَكَ كَانَتْ مِنَ
الْغَابِرِينَ ﴿٣٣﴾

**34** "మేము ఈ పట్టణవాసులపై, వారి తిరుగుబాటు ధోరణి కారణంగా ఆకాశం నుంచి శిక్షను అవతరింపజేయనున్నాము."[51]

إِنَّا مُنزِلُونَ عَلَىٰ أَهْلِ هَٰذِهِ الْقَرْيَةِ رِجْزًا
مِّنَ السَّمَاءِ بِمَا كَانُوا يَفْسُقُونَ ﴿٣٤﴾

---

యాఖూబ్ వంటి సంతతి కలగనున్నదని శుభవార్త వినిపించారు. అదే సమయంలో లూత్ జాతి వారికి పట్టే దుర్గతి గురించి కూడా ఎరుకపరచారు.

47. అంటే – విధేయులెవరో, అవిధేయులెవరో, సజ్జనులెవరో – దుష్టులెవరో మాకు బాగా తెలుసు. సజ్జనులను శిక్షించటం మా పనికాదు అని దీని భావం.

48. అంటే – మేము నాశనం చేయదలచిన దుర్మార్గులతో ఆమె చేతులు కలిపింది. ఆమె విశ్వాసురాలు కాదు. అందువల్ల ఆ దుష్ట జనులతో పాటు ఆ స్త్రీని కూడా మేము శిక్షిస్తాము.

49. **'సీఅ బిహిమ్'** (سِيءَ بِهِمْ) 'తమను కలవరపరచే, తమను తీవ్ర అసంతృప్తికి లోను చేసే విషయం దాపురించటం' అని అర్థం. తన జాతి ప్రజలు బరితెగించి వ్యవహరిస్తున్న పరిస్థితిలో తన ఇంటికి వచ్చిన అతిథులను చూడగానే హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) మనస్సు చివుక్కుమంది. ఎందుకంటే దైవదూతలు మానవాకారంలో రావటం వల్ల వారిని అపరిచిత వ్యక్తులుగా భావించారాయన. పైగా ఈ అతిథులు ఎంతో అందంగా ఉన్నారు. వారి రాక గురించి తన వారికి తెలిస్తే ఆ లజ్జావిహీనులు ఎగబడివస్తారు. వారిని బలవంతంగా లాక్కుపోయి నీతిబాహ్యమైన క్రీడకు పాల్పడతారు. ఒకవేళ అదే గనక జరిగితే తనకు అంతకన్నా తలవంపు ఇంకొకటి ఉండదు. ఆ సమయంలో ఆయనకు ఏమీ పాలుపోలేదు. తన బాధను ఎవరికి చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కాక అంతర్మథనం చెందారు.

50. హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) పరిస్థితిని అర్థం చేసుకున్న దైవదూతలు భీతి చెందరాదని, దుఃఖించరాదని ఆయన్ని ఓదార్చారు. తాము దుష్టులను శిక్షించటానికి పంపబడిన దైవదూతలం అని తెలిపారు. అయితే దగాకోరుగా వ్యవహరించిన ఆయన భార్యకు సయితం శిక్షపడటం ఖాయమని ఆ సందర్భంగా దైవదూతలు స్పష్టం చేశారు.

51. ఆకాశం నుంచి అవతరించిన ఆ శిక్ష ఎటువంటిదో ఇంతకు ముందు కూడా వివరించబడింది. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) వారి నివాసస్థలాలను భూమినుంచి పెళ్ళగించి, ఆకాశం దాకా ఎత్తుకెళ్ళి అమాంతం క్రింద పడవేశారు. ఆ తరువాత వారిపై కంకర రాళ్ళ వర్షం కురిపించబడింది. ఆ స్థలాన్ని దుర్వాసన వచ్చే జలసంధి (మృత సముద్రం)గా మార్చివేయటం జరిగింది (ఇబ్నె కసీర్).

**35** (ఆ విధంగా) మేము ఆ పట్టణాన్ని బుద్ధిజీవుల కోసం[52] స్పష్టమైన గుణపాఠ సూచనగా[53] చేశాము.

وَلَقَد تَّرَكْنَا مِنْهَا آيَةً بَيِّنَةً لِّقَوْمٍ يَعْقِلُونَ ﴿35﴾

**36** ఇంకా మద్‌యన్ వైపునకు[54] మేము వారి సోదరుడైన షుఐబు (అలైహిస్సలాం)ను పంపాము. అతనిలా అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి.[55] అంతిమ దినాన్ని ఆశించండి. భువిలో అలజడిని సృష్టిస్తూ తిరగకండి."[56]

وَإِلَىٰ مَدْيَنَ أَخَاهُمْ شُعَيْبًا فَقَالَ يَا قَوْمِ اعْبُدُوا اللَّهَ وَارْجُوا الْيَوْمَ الْآخِرَ وَلَا تَعْثَوْا فِي الْأَرْضِ مُفْسِدِينَ ﴿36﴾

**37** అయినా వారు ఆయన్ని ధిక్కరించారు. ఎట్టకేలకు భూకంపం వారిని కబళించింది. వాళ్లు తమ ఇండ్లలో – కూర్చున్న వారు కూర్చున్నట్లే (చచ్చి) ఉండిపోయారు.[57]

فَكَذَّبُوهُ فَأَخَذَتْهُمُ الرَّجْفَةُ فَأَصْبَحُوا فِي دَارِهِمْ جَاثِمِينَ ﴿37﴾

**38** ఆద్, సమూద్ వారిని కూడా మేము తుదముట్టించాము. వారి నివాస స్థలాల గురించి మీకు తెలిసిందే.[58] షైతాను వారికి వారి దురాగతాలను అందమైనవిగా చేసి చూపాడు. వారు నిశిత దృష్టి గల వారైనప్పటికీ[59] (షైతాను) వారిని సన్మార్గం నుంచి అడ్డు కున్నాడు.

وَعَادًا وَثَمُودَ وَقَد تَّبَيَّنَ لَكُم مِّن مَّسَاكِنِهِمْ ۖ وَزَيَّنَ لَهُمُ الشَّيْطَانُ أَعْمَالَهُمْ فَصَدَّهُمْ عَنِ السَّبِيلِ وَكَانُوا مُسْتَبْصِرِينَ ﴿38﴾

---

52. ఎందుకంటే పరిస్థితులను బేరీజు వేసేవారు, కారణాలను ఫలితాలను గురించి విశ్లేషించేవారు బుద్ధిజీవులు, మేధావులే. బుద్ధివివేచనలు లేనివారు, భావదారిద్ర్యానికి లోనైనవారు ఇలాంటి సంఘటనలపై ఆలోచించరు. వారి పరిస్థితి గొర్రెదాటు వంటిదే. ఈ ఆయతులో మక్కా ముష్రిక్కులకు చురకపెట్టడం జరిగింది. ఎందుకంటే అత్యంత స్పష్టమైన ఖుర్‌ఆన్ వాక్యాలు వారి ముందుకు వస్తున్నప్పటికీ, వారు వినీ విననట్లుగా, తెలిసీ తెలియనట్లుగా ప్రవర్తిస్తున్నారు.

53. ఒక వైపునుంచి రాళ్ళ వర్షం, మరో వైపునుంచి ఇళ్ళు తలక్రిందులవటం, ఆ తరువాత ఆ ప్రదేశం అంతా దుర్వాసనతో కంపుకొట్టటం – ఇదంతా ఒక గుణపాఠ సూచనే. ఆ ప్రదేశం ప్రస్తుతం మృత సముద్రంగా వ్యవహరించబడుతోంది. కాని విజ్ఞులు మాత్రమే ఇలాంటి ఘటనల నుండి గుణపాఠం గ్రహిస్తారు.

54. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కుమారుని పేరు మద్‌యన్. మరి కొంతమంది అభిప్రాయం ప్రకారం ఆయన కుమారుని పేరు మిద్‌యాన్. మద్‌యన్ వాస్తవానికి మనుమడి పేరు. ఈయన పేరుమీదే ఆ తెగవారు మద్‌యన్ ప్రజలుగా పిలువబడ్డారు. ఈ ప్రజల వైపుకే హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) దైవప్రవక్తగా పంపబడ్డారు.

మరికొంతమంది ప్రకారం 'మద్‌యన్' అనేది ఒక పట్టణం పేరు. ఈ తెగ లేక పట్టణం హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) గారి ప్రదేశానికి సమీపంలోనే ఉండేది.

55. అల్లాహ్ ఆరాధన తరువాత వారి ముందు పరలోకాన్ని గురించి ప్రస్తావించటం విశేషం. ఎందుకంటే వారు పరలోక జీవితాన్ని నమ్మేవారు కాదు. తత్కారణంగా వారు చెడుపనులు చేసే సమయంలో ఏమాత్రం భయపడేవారు కారు. పరలోకాన్ని విస్మరించిన జనులు ఎవరయినాసరే చెడు పనులకు పాల్పడేటప్పుడు సంకోచించరు. ఏం చేసినా ఫరవాలేదన్న మొండి ధైర్యం వారిలో ఉంటుంది.

56. మద్‌యన్ ప్రజలలో తిష్టవేసివున్న అతిపెద్ద రుగ్మత కొలతలు తూనికలలో మోసానికి పాల్పడటం. ఈ దగుల్బాజీ పనికి పాల్పడేటప్పుడు వారు ఏమాత్రం వెనుకా ముందూ ఆలోచించేవారు కారు. వారి ఈ చెడుగు మూలంగా రాజ్యంలో అశాంతి అలజడులు చెలరేగేవి.

وَقَارُوْنَ وَفِرْعَوْنَ وَهَامٰنَ ۖ وَلَقَدْ جَآءَهُمْ مُّوْسٰى بِالْبَيِّنٰتِ فَاسْتَكْبَرُوْا فِى الْاَرْضِ وَمَا كَانُوْا سٰبِقِيْنَ ۚ ﴿39﴾

39 ఖారూన్, ఫిరౌన్, హామానులను కూడా (మేము నాశనం చేశాము). వారి వద్దకు మూసా స్పష్టమైన సూచనలను తీసుకు వచ్చాడు.[60] అయినాసరే వారు భువిలో అహంకారంతో విర్ర వీగారు. కాని (ఎంత విర్రవీగినా) మమ్మల్ని మించిపోలేక పోయారు.[61]

فَكُلًّا اَخَذْنَا بِذَنْۢبِهٖ ۚ فَمِنْهُمْ مَّنْ اَرْسَلْنَا عَلَيْهِ حَاصِبًا ۚ وَمِنْهُمْ مَّنْ اَخَذَتْهُ الصَّيْحَةُ ۚ وَمِنْهُمْ مَّنْ خَسَفْنَا بِهِ الْاَرْضَ ۚ وَمِنْهُمْ مَّنْ اَغْرَقْنَا ۚ

40 మరి వారిలో ప్రతి ఒక్కడినీ మేము అతని పాపాలకుగాను పట్టుకున్నాము.[62] వారిలో కొందరిపై మేము రాళ్ళ వాన కురి పించాము.[63] వారిలో మరి కొందరిని భయంకరమైన శబ్దం ద్వారా మట్టు పెట్టాము.[64] వారిలో ఇంకా కొందరిని మేము

57. దైవప్రవక్త హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం) వారికి పలు విధాలుగా నచ్చజెప్పినా లాభం లేకపోయింది. తుదకు మేఘాలు ఆవరించిన ఒకానొక రోజున దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) వేసిన ఒక పెద్ద కేక వల్ల భూమి ప్రకంపించింది. దాంతో వారి పైప్రాణాలు పైకే లేచిపోయాయి. మోకాళ్ల ఆనించి కూర్చున్న స్థితిలోనే వారు చచ్చిపోయారు.

58. ఆద్ జాతి వారి పట్టణాలు అహ్‌ఖాఫ్, హజర్‌మోత్ (యమన్)లలో ఉన్నాయి. సమూద్ జాతి నివాస స్థలమైన 'హిజ్ర్' నేడు మద్‌యన్ సాలెహ్‌గా వ్యవహరించబడుతోంది. ఈ పట్టణం హిజాజ్ ప్రాంతానికి ఉత్తరాన వుంది. ఈ ప్రదేశాల మీదుగా అరబ్బులు వర్తకం నిమిత్తం ప్రయాణిస్తారు. అందువల్ల ఇవి వారికి తెలియకుండా లేవు.

59. చూడబోతే వారు తెలివి తక్కువ వారేమీ కాదు. అన్నీ తెలిసినవారే. మేధా సంపన్నులే. కాని ధర్మావలంబన విషయంలో మటుకు వారు దూరదృష్టితో వ్యవహరించలేదు. అందువల్ల వారి తెలివితేటలు వారికి పనికి రాకుండా పోయాయి.

60. ఎన్ని నిదర్శనాలను చూపినా, ఎన్ని మహిమలను ప్రదర్శించినా వారు ప్రభావితులు కాలేదు సరికదా గర్వంతో చెలరేగిపోయారు. అణకువను, వినయ వినమ్రతలను అలవరచుకోలేదు. దైవాన్ని విశ్వసించి, భయభక్తుల వైఖరిని అవలంబించలేదు.

61. ఎన్ని వీరంగాలు వేసినా, ఎంతగా మిడిసిపడినా వారు మా శిక్షా పరిధిని దాటి పోలేకపోయారు. ఎట్టకేలకు వారు మా చేతికి చిక్కారు. దీనికి మరో అర్థం ఇది : "వారు తిరస్కార వైఖరిలో ముందంజ వేసేవారు కానేకాదు." వారికి పూర్వం ఎన్నో జాతులు తిరస్కార వైఖరిని ప్రదర్శించాయి. కాని వారందరికీ దుర్గతి పట్టింది.

62. వారిలో ఏ ఒక్కరినీ వదలకుండా – అందరినీ – వారి అత్యాచారాల కారణంగా మేము ముట్టడించాము.

63. ఇది ఆద్ జాతి విషయం. ఈ జాతివారిపై ప్రచండవేగంతో సుడిగాలి వచ్చింది. ఆ గాలి నేలలోని కంకర రాళ్లను పైకి ఎత్తి వారిపై పడవేసేది. వారిని ఆకాశంపైకి తీసుకెళ్ళి క్రిందపడేసేది. దాంతో వారి మాడు బద్దలయ్యేది. ఆ దెబ్బకు వారు ఖర్జూరపు దుంగల్లా తల మొండెం వేర్వేరై నేలకొరిగారు (ఇబ్నె కసీర్).

కొంతమంది పండితులు ఈ ఆయతుల్లో ప్రస్తావించబడిన శిక్ష లూత్ జాతికి విధించబడినదని అభిప్రాయపడ్డారు. దీనికోసం వారు ఇబ్నె అబ్బాస్ (రజి) గారి ఒక ఉల్లేఖనాన్ని కూడా ఉల్లేఖించారు. అయితే ఈ మాట వాస్తవ విరుద్ధమనీ, ఇబ్నె అబ్బాస్ (రజి) గారు చెప్పినట్టుగా భావిస్తున్న ఉల్లేఖనం పరంపర మధ్యలో ఒకచోట లింకు తెగిందని ఇమామ్ ఇబ్నె కసీర్ తేల్చి చెప్పారు.

64. ఇది సమూద్ జాతి. దైవప్రవక్త హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) ఈ జాతి వద్దకు పంపబడ్డారు. వారి కోరికపై ఒక చట్టుబండ నుంచి దేవుని సూచనగా ఆడ ఒంటెను తీసి చూపించటం జరిగింది. కాని ఆ దుర్మార్గులు దైవాన్ని విశ్వసించలేదు సరికదా ఆ ఒంటెను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఒంటెను చంపిన మూడు రోజుల తరువాత ఒక భయంకరమైన శబ్దం ద్వారా వారు అంతమొందించబడ్డారు.

భూమిలో కూర్చివేశాము.[65] వారిలో కొందరిని మేము ముంపుకు గురిచేశాము.[66] (అకారణంగా) అల్లాహ్ వారికి అన్యాయం చేసేవాడు కాదు. (నిజానికి) వాళ్ళే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.[67]

وَمَا كَانَ اللّٰهُ لِيَظْلِمَهُمْ وَلٰكِنْ كَانُوْٓا اَنْفُسَهُمْ يَظْلِمُوْنَ (40)

**41** అల్లాహ్‌ను వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్న వారి ఉదాహరణ సాలెపురుగు లాంటిది. అది (సాలెపురుగు) కూడా తన కోసం ఓ ఇల్లు కట్టుకుంటుంది. మరి వాస్తవానికి ఇండ్లన్నింటికంటే అత్యంత బలహీనమైనది సాలె పురుగు ఇల్లే.[68] ఈ సంగతిని వారు తెలుసుకోగలిగితే ఎంత బావుండు!

مَثَلُ الَّذِيْنَ اتَّخَذُوْا مِنْ دُوْنِ اللّٰهِ اَوْلِيَآءَ كَمَثَلِ الْعَنْكَبُوْتِ ۚ اِتَّخَذَتْ بَيْتًا ۗ وَاِنَّ اَوْهَنَ الْبُيُوْتِ لَبَيْتُ الْعَنْكَبُوْتِ ۘ لَوْ كَانُوْا يَعْلَمُوْنَ (41)

**42** వారు ఆయన్ని కాదని ఎవరెవరిని పిలుస్తున్నారో వాటిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు. ఆయన అపార శక్తిమంతుడు, వివేచనాపరుడు.

اِنَّ اللّٰهَ يَعْلَمُ مَا يَدْعُوْنَ مِنْ دُوْنِهٖ مِنْ شَيْءٍ ۗ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ (42)

**43** ప్రజలకు బోధపరచడానికి మేము ఈ ఉపమానాలను ఇస్తున్నాము.[69] అయితే జ్ఞానం కలవారు మాత్రమే వీటిని అర్థం చేసుకోగలుగుతారు.[70]

وَتِلْكَ الْاَمْثَالُ نَضْرِبُهَا لِلنَّاسِ ۚ وَمَا يَعْقِلُهَآ اِلَّا الْعٰلِمُوْنَ (43)

65. ఇది ఖారూన్ విషయం. అతనికి అపారమైన సిరిసంపదలు, ఖజానాలు పోసగ బడ్డాయి. తన తెలివితేటల మూలంగా దేవుడు తనను మెచ్చుకుని ఈ ధనరాసుల్ని తనకు ప్రసాదించాడని ఖారూన్ ప్రకటించాడు. తన అంతస్తును చూసుకుని మిడిసిపడ్డాడు. తాను దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) ఉపదేశాన్ని ఖాతరు చేయవలసిన అవసరం లేదనీ, షరీయతు పరిమితులకు తాను అతీతుణ్ణి అని భావించాడు. అందువల్ల దేవుడు అతని పొగరును అణచాలనుకున్నాడు. అతన్ని అతని ధనరాసులతో, నివాస భవనంతో సహా నేలలో కూర్చివేశాడు.

66. ఇది ఫిరౌను వృత్తాంతం. వాడు ఈజిప్టు చక్రవర్తి. కాని దైవాజ్ఞల్ని ఉల్లంఘించాడు. తనను దైవాంశ సంభూతునిగా తలపోశాడు. ఒక దశలో తనే అందరి ప్రభువునని ప్రకటించేసుకున్నాడు. మూసా (అలైహిస్సలాం) సందేశాన్ని విశ్వసించిన ఇస్రాయీల్ వంశీయులకు స్వేచ్ఛనొసగటానికి నిరాకరించి వారిపై అత్యాచారాలు సాగించాడు. ఎట్టకేలకు అల్లాహ్ ఒకనాడు ఉదయం అతన్ని, అతని సేనల సమేతంగా సముద్రంలో ముంచివేశాడు.

67. అల్లాహ్ అనవసరంగా ఎవరికీ అన్యాయం చేయడు. ఆయన పరమ న్యాయశీలుడు. పూర్వపు జాతులలో ఎవరిపై ఏ శిక్ష వచ్చిపడినా అది వారి స్వయంకృతం వల్లనే వచ్చిపడింది. దైవతిరస్కారానికి, బహుదైవారాధనకు, పెద్ద పెద్ద పాపాలకు ఒడిగట్టి వారు దైవాగ్రహానికి పాత్రులయ్యారు.

68. సాలెగూడు ఎంత బలహీనంగా, పేలవంగా ఉంటుందో తెలిసిందే. చేత్తో తాకితేనే తెగిపోతుంది. అల్లాహ్‌ను కాదని ఇతర దేముళ్ళను ఆశ్రయించటం, వారు తమ అక్కరలను తీరుస్తారని తలపోయటం కూడా అటువంటిదే. అది నిష్ప్రయోజనం తప్ప మరేమీ కాదు. వారు ఎవరినీ ఏ విధంగా కూడా ఆదుకోలేరు. కాబట్టి దైవేతరుల ఆశ్రయాన్ని పొందటం, సాలెగూడుపై ఆధారపడటం వంటిదే. ఒకవేళ వారు బలవంతులు, ప్రయోజకులై ఉంటే తమను పూజించే వారికి తప్పక సహాయపడేవారు. కాని వారెవరికీ ఎన్నడూ సహాయపడలేదన్నది జగద్విదితం.

69. అంటే అలసత్వం నుంచి వారిని అప్రమత్తం చేయటానికి, షిర్క్ (బహుదైవారాధన) వాస్తవికతను తేటతెల్లం చేయటానికి, సన్మార్గాన్ని వివరించటానికిగాను మేము ఈ దృష్టాంతాలను ఇస్తున్నాము.

44 అల్లాహ్ ఆకాశాలనూ, భూమినీ సత్య బద్ధంగా (పరమార్ధం దృష్ట్యా) సృష్టించాడు.[71] విశ్వసించే వారి కోసం ఇందులో గొప్ప నిదర్శనం ఉంది.[72]

خَلَقَ اللّٰهُ السَّمٰوٰتِ وَالْاَرْضَ بِالْحَقِّ ؕ اِنَّ فِىْ ذٰلِكَ لَاٰيَةً لِّلْمُؤْمِنِيْنَ ﴿44﴾

45 (ఓ ప్రవక్తా!) నీ వైపుకు పంపబడిన (వహీ చేయబడిన) గ్రంథాన్ని పారాయణం చేస్తూ ఉండు.[73] నమాజును నెలకొల్పు.[74] నిశ్చయంగా నమాజ్ సిగ్గుమాలినతనం నుంచి, చెడు విషయాల నుంచి ఆపుతుంది.[75] నిశ్చయంగా అల్లాహ్ స్మరణ చాలా గొప్ప విషయం (అన్న సంగతిని మరువరాదు).[76] మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

اُتْلُ مَاۤ اُوْحِىَ اِلَيْكَ مِنَ الْكِتٰبِ وَاَقِمِ الصَّلٰوةَ ؕ اِنَّ الصَّلٰوةَ تَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ ؕ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ؕ وَاللّٰهُ يَعْلَمُ مَا تَصْنَعُوْنَ ﴿45﴾

70. ఇక్కడ **'జ్ఞానం'** అంటే దైవజ్ఞానం, ధర్మ (షరీయతు) జ్ఞానం, నిదర్శనాల జ్ఞానం అని అర్థం. వీటిపై యోచన చేసే వారికి సత్యమార్గం బోధపడుతుంది. సన్మార్గం కోసం వారి హృదయ కవాటాలు తెరచుకుంటాయి.

71. అంటే ఆయన ఈ విశ్వవ్యవస్థను ఉత్తుత్తిగా, నిరర్థకంగా సృష్టించలేదు. దీని వెనుక ఓ గొప్ప పరమార్థం ఉంది.

72. అంటే దేవుని ఉనికికి, ఆయన శక్తికి, వివేచనకు సంబంధించిన గొప్ప నిదర్శనం అన్నమాట! ఈ నిదర్శనాల ఆధారంగానే వారు నిజదైవం ఒక్కడే అని, ఆయన తప్ప మరో ఆరాధ్యదైవం లేదని గ్రహిస్తారు.

73. దివ్య ఖుర్ఆన్ ఉత్త పుణ్యానికి చదివే గ్రంథం కాదు. దాని పారాయణం వెనుక గొప్ప ఆశయాలు ఉన్నాయి. దాన్ని పారాయణం చేయటంతో పాటు అర్థం చేసుకునేందుకు యత్నించాలి. అందలి వచనాలపై చింతన చేయాలి. వాటి లోతుల్లోకి పోవాలి. వాటిని ఎల్లరికీ ప్రబోధించాలి. వాటిని స్వయంగా ఆచరించటమే గాకుండా, వాటి ద్వారా ప్రజల జీవితాలను తీర్చిదిద్దాలి – ఖుర్ఆన్ పారాయణంలో ఈ భావాలన్నీ ఇమిడి ఉన్నాయి.

74. ఎందుకంటే నమాజును చిత్తశుద్ధితో చేసినట్లయితే దాని ద్వారా అల్లాహ్‌తో మనిషి సంబంధం పటిష్టమవుతుంది. మనిషికి నమాజు మూలంగా దైవసహాయం అందుతుంది. జీవితంలో అడుగడుగునా దాని ద్వారా మనిషికి సహనస్థైర్యాలు ఒనగూడుతాయి. మనిషి సంకల్పం దృఢతరం అవుతుంది. అతనికి సన్మార్గం లభిస్తుంది. అందుకే దివ్య ఖుర్ఆన్‌లో "ఓ విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా (దైవ) సహాయం అర్థించండి" (అల్ బఖర-153) అని ఉపదేశించటం జరిగింది.

మరి ఈ నమాజుగానీ, సహనంగానీ కంటికి కనిపించే వస్తువులు కావు. కంటికి కనిపించే వస్తువులైతే మనిషి వాటిని పట్టుకుని సహాయం అర్థించేవాడేమో! కాని అవి కంటికి కానరాని వస్తువులు. వాటి ద్వారా మరి దైవసహాయం అర్థించాలంటే వీలైనంత ఎక్కువగా నమాజులో నిమగ్నం కావాలి. ఏకాగ్రతతో నమాజు చేయాలి. దేవుడు విధిగా చేసిన నమాజులతో పాటు అదనపు (నఫిల్) నమాజులు కూడా చేయాలి. ఈ నమాజు ద్వారా దాసునికి ప్రభువు సామీప్యం లభిస్తుంది. అడుగడుగునా దేవుని తోడ్పాటు, మార్గదర్శకత్వం ప్రాప్తమవుతూ ఉంటాయి. అందుకే రాత్రిపూట– ఏకాంతంలో – తహజ్జుద్ నమాజును చేస్తూ ఉండమని అంతిమ దైవప్రవక్త (సఅసం)కు తాకీదు చేయబడింది. ఎందుకంటే ఆయన (సఅసం)కు దేవుని తరపున ఓ మహత్కార్యం అప్పగించబడింది. ఆ కార్యం నెరవేరాలంటే ఆయన (స)కు దేవుని తోడ్పాటు ఎంతైనా అవసరం. అందుకే మహాప్రవక్త (సఅసం) ఎప్పుడు, ఏ సంకట పరిస్థితి ఎదురైనా నమాజు ద్వారా దైవసహాయం అర్థించేవారు (ముస్నదె అహ్మద్; అబూ దావూద్).

75. అంటే – నీతిబాహ్యమైన పనుల నుండి, చెడు చేష్టలనుంచి మనిషిని ఆపటంలో నమాజు కీలక పాత్ర పోషిస్తుంది. మందులు రోగ నివారణకై ఎలా పనిచేస్తాయో అలాగే నమాజు కూడా. అయితే ఇదంతా ఎప్పుడు సాధ్యమవుతుంది? రెండు నియమాలకు కట్టుబడినప్పుడే. ఒకటి : మందులను క్రమం తప్పకుండా తినాలి. వైద్యుడు సూచించిన వేళల్లో మందు తీసుకోవాలి. తగు మోతాదులో తీసుకోవాలి. రెండు: వైద్యుడు సూచించిన జాగ్రత్తల్ని ఖచ్చితంగా

46 ఉత్తమ పద్ధతిలో తప్ప గ్రంథవహులతో వాదించకండి.[77] అయితే వారిలోని దుర్మార్గులతో (వాదులాడటం సమంజసమే).[78] "మేము మా వద్దకు పంపబడిన గ్రంథాన్నీ, మీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని కూడా విశ్వసిస్తున్నాం.[79] మా ఆరాధ్య దేవుడూ, మీ ఆరాధ్య దేవుడూ ఒక్కడే. మేము ఆయన ఆజ్ఞలకే కట్టుబడి ఉన్నాము" అని స్పష్టంగా చెప్పేయండి.

وَلَا تُجَادِلُوٓا أَهْلَ ٱلْكِتَٰبِ إِلَّا بِٱلَّتِى هِىَ أَحْسَنُ إِلَّا ٱلَّذِينَ ظَلَمُوا۟ مِنْهُمْ ۖ وَقُولُوٓا۟ ءَامَنَّا بِٱلَّذِىٓ أُنزِلَ إِلَيْنَا وَأُنزِلَ إِلَيْكُمْ وَإِلَٰهُنَا وَإِلَٰهُكُمْ وَٰحِدٌ وَنَحْنُ لَهُۥ مُسْلِمُونَ ﴿٤٦﴾

పాటించాలి. అంటే పత్యం చేయాలి. మందులు చూపే గుణాన్ని పోగొట్టే ఆహారపదార్థాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలి. అప్పుడే వ్యాధి నయమవుతుంది. నమాజు కూడా అంతే. అల్లాహ్ నమాజులో చాలా గొప్ప ఆధ్యాత్మిక శక్తిని, రోగనివారణా గుణాన్ని పొందుపరచాడు. నిస్సందేహంగా అది మనిషిని నీతిమాలినతనం నుంచి, అక్రమాల నుంచి నిరోధిస్తుంది. కాని నమాజును మహాప్రవక్త (స) పద్ధతి ననుసరించి చేయాలి. దాని నియమ నిబంధనల్ని ఖచ్చితంగా దృష్టిలో పెట్టుకుని మరీ చేయాలి. ఉదాహరణకు : 1. చిత్తశుద్ధితో, దైవప్రసన్నతను చూరగొనే ఉద్దేశంతో నమాజు చేయాలి. 2. బాహ్య పరిశుద్ధతతో పాటు ఆత్మశుద్ధికి కట్టుబడి ఉండాలి. నమాజు చేస్తున్నప్పుడు మనసులో అల్లాహ్ తప్ప ఇతరత్రా ఆరాధ్య దైవాలకు చోటు కల్పించకూడదు. 3. నమాజును నిర్ణీత వేళల్లో చేయాలి. సామూహికంగా (ఫర్జ్) నమాజు చేయాలి. 4. నమాజులోని మౌలికాంశాలను (అంటే ఖిరాత్, రుకూ, ఖౌమా, సజ్దాలు మొదలగునవి) చక్కగా నిర్వర్తించాలి. 5. నమాజులో భయము, భక్తి, అణకువ, అశక్తత ఉట్టిపడుతూ ఉండాలి. 6. నమాజులను స్థిరంగా చేస్తూ ఉండాలి. అంటే నాగాలేకుండా నమాజులు చేయాలి. 7. ధర్మసమ్మతమైన ఉపాధి ద్వారా జీవనావసరాలను తీర్చుకోవాలి.

ఈనాడు మనం నమాజులైతే చేస్తున్నాం. కాని ఈ షరతులను మాత్రం విస్మరిస్తున్నాం. అందుకే దివ్య ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడిన మార్పు మన జీవితాలలో కనిపించటం లేదు. "నమాజు చెడుల నుంచి ఆపుతుంది" అన్న వాక్యాన్ని కొంతమంది పండితులు 'ఆజ్ఞ'గా భావించారు. అంటే నమాజు చేసేవారు చెడు విషయాలకు దూరంగా ఉండాలన్నది ఖుర్‌ఆన్ ఆదేశం.

76. మనిషిని నీతిబాహ్యత నుంచి, చెడుల నుంచి ఆపటంలో దైవనామస్మరణ నమాజు కన్నా ఎక్కువ ప్రభావవంతం అవుతుంది. ఎందుకంటే మనిషి నమాజులో లీనమై ఉన్నంతసేపూ, అతనెలాగూ చెడులకు దూరంగా ఉంటాడు. కాని నమాజును ముగించుకుని బయటకు వచ్చిన తరువాత నలువైపులా చెడులు ప్రబలి ఉంటాయి. ఆ సమయంలో అతను గనక దైవనామ స్మరణ చేస్తూ ఉన్నట్లయితే, ఆ చెడుల నుంచి అతను సురక్షితంగా ఉండగలుగుతాడు.

77. ఎందుకంటే వారు జ్ఞానులు. అన్నీ తెలిసినవారు. విషయాన్ని అర్థం చేసుకునే శక్తి వారిలో ఉంది. అందువల్ల వారితో ఎంతో సౌమ్యంగా మాట్లాడాలి. హేతుబద్ధంగా చర్చించాలి. మాటల మధ్య అవాంఛనీయ ఘటన ఏదీ జరగకుండా జాగ్రత్తపడాలి. మృదు సంభాషణ, హుందాతనం వారిని ఆకట్టుకోవచ్చు.

78. సంవాదన సందర్భంగా ఎవరైనా బరి తెగించి వ్యవహరిస్తే, విషయాన్ని వక్రీకరించ జూస్తే అట్టి పరిస్థితిలో మీరు కూడా గట్టిగా మాట్లాడవచ్చు. ఈ ఆయతులోని మొదటి ఆదేశం ఇస్లాం స్వీకరించిన గ్రంథవహులను సూచిస్తోందనీ, రెండవ ఆదేశం మాత్రం ఇస్లాం స్వీకరించకుండా, యూద లేక క్రైస్తవ మతంపైనే పాతుకుపోయిన వారికి వర్తిస్తుందని కొంతమంది అభిప్రాయపడ్డారు. **'దుర్మార్గులు'** (అల్లజీన జలమూ) అంటే ముస్లింలపై దాడికి ప్రయత్నాలు చేసే గ్రంథవహులనీ, ఇటువంటివారు ముస్లింలతో యుద్ధం చేసే పరిస్థితుల కోసం ఎదురుచూస్తుంటారనీ, అందుకని ఇటువంటివారి దాడుల్ని తిప్పికొట్టవచ్చనీ మరికొంతమంది అభిప్రాయపడ్డారు.

79. అంటే – దివ్య ఖుర్‌ఆన్‌కు పూర్వం అవతరించిన తౌరాతు, ఇంజీలు గ్రంథాలను కూడా మేము నమ్ముతున్నాము. అవి కూడా దైవగ్రంథాలే. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రభవించే వరకూ ఈ గ్రంథాలే దేవుని శాసనాంగాలుగా ఉండేవి.

**47** మరి ఇదేవిధంగా మేము నీ వైపునకు మా గ్రంథాన్ని అవతరింపజేశాము. అందువల్ల (పూర్వం) మేము గ్రంథం వొసగబడినవారు దీనిని విశ్వసిస్తారు.[80] వీరిలో (మక్కా ముష్రిక్కులలో) కూడా కొందరు దీనిని విశ్వసిస్తారు.[81] అవిశ్వాసులు మాత్రమే మా ఆయతులను త్రోసి పుచ్చుతారు.

وَكَذٰلِكَ اَنْزَلْنَاۤ اِلَيْكَ الْكِتٰبَ ؕ فَالَّذِيْنَ اٰتَيْنٰهُمُ
الْكِتٰبَ يُؤْمِنُوْنَ بِهٖ ۚ وَمِنْ هٰۤؤُلَاۤءِ مَنْ يُّؤْمِنُ بِهٖ ؕ
وَمَا يَجْحَدُ بِاٰيٰتِنَاۤ اِلَّا الْكٰفِرُوْنَ (47)

**48** (ఓ ప్రవక్తా!) ఇంతకు ముందు నువ్వు ఏ గ్రంథాన్నీ చదివినవాడవు కావు,[82] ఏ గ్రంథాన్నీ నీ కుడిచేత్తో వ్రాసిన వాడవూ కావు.[83] ఒకవేళ అదేగనక జరిగివుంటే ఈ మిథ్యావాదులు (నీ విషయంలో) సందేహానికి లోనయ్యేవారే.[84]

وَمَا كُنْتَ تَتْلُوْا مِنْ قَبْلِهٖ مِنْ كِتٰبٍ وَّلَا تَخُطُّهٗ
بِيَمِيْنِكَ اِذًا لَّارْتَابَ الْمُبْطِلُوْنَ (48)

**49** అసలు ఇవి (ఈ ఖుర్ఆన్ వచనాలు) జ్ఞానం వొసగబడినవారి హృదయాలలో (పదిలమై) ఉన్న స్పష్టమైన ఆయతులు.[85] మా ఆయతులను దుర్మార్గులు తప్ప మరెవరూ త్రోసిపుచ్చరు.

بَلْ هُوَ اٰيٰتٌۢ بَيِّنٰتٌ فِيْ صُدُوْرِ الَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ ؕ
وَمَا يَجْحَدُ بِاٰيٰتِنَاۤ اِلَّا الظّٰلِمُوْنَ (49)

**50** "ఇతని ప్రభువు తరఫున ఇతనిపై కొన్ని నిదర్శనాలు (మహిమలు) ఎందుకు అవతరింపజేయబడలేదు?" అని వారు అన్నారు. "నిదర్శనాలన్నీ అల్లాహ్ వద్ద ఉన్నాయి. నేను స్పష్టంగా హెచ్చరించే వాణ్ణి మాత్రమే"[86] అని వారికి చెప్పు.

وَقَالُوْا لَوْلَاۤ اُنْزِلَ عَلَيْهِ اٰيٰتٌ مِّنْ رَّبِّهٖ ؕ قُلْ اِنَّمَا
الْاٰيٰتُ عِنْدَ اللّٰهِ ؕ وَاِنَّمَاۤ اَنَا نَذِيْرٌ مُّبِيْنٌ (50)

**51** మేము నీపై గ్రంథాన్ని అవతరింపజేశాము. అది వారికి చదివి వినిపించబడుతోంది. విశ్వసించేవారి కొరకు ఇందులో కారుణ్యమూ ఉంది, హితబోధ కూడా ఉంది.[87] ఏమిటి? ఇది వారికి సరిపోదా?[88]

اَوَلَمْ يَكْفِهِمْ اَنَّاۤ اَنْزَلْنَا عَلَيْكَ الْكِتٰبَ يُتْلٰى
عَلَيْهِمْ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَرَحْمَةً وَّذِكْرٰى لِقَوْمٍ
يُّؤْمِنُوْنَ (51)

80. అంటే – అబ్దుల్లా బిన్ సలాం (రజిఅన్) ప్రభృతులన్నమాట! వారు పూర్వం తమ గ్రంథాలను అనుసరించేవారు. ఖుర్ఆన్ అవతరించిన పిదప వారు దానిని అనుసరించసాగారు. **'గ్రంథం ఇవ్వబడినవారు'** అంటే దాన్ని ఆచరించినవారు అని అర్థం. ఎవరయితే గ్రంథాన్ని ఆచరించలేదో వారసలు "గ్రంథం ఇవ్వబడినవారే" కాదు.

81. 'వీరిలో కొందరు' అంటే మక్కావాసులు అని భావం.

82. ఎందుకంటే మహాప్రవక్త (సఅసం) చదువురాని వారు, నిరక్షరాస్యులు.

83. ఏదన్నా వ్రాయాలన్నా అక్షరజ్ఞానం అవసరమే. అంతకు ముందు ఆయన (స) ఎవరి దగ్గరా విద్యాభ్యాసం చేయలేదు.

84. ఓ ముహమ్మద్ (సఅసం)! నువ్వేగనక చదువుకున్నవాడవై, వ్రాయగలిగేవాడవై ఉంటే ఏ గురువు దగ్గరో ఇదంతా నేర్చుకుని వచ్చి ప్రజలకు వినిపిస్తున్నావని వారు ఆరోపించి ఉండేవారు.

85. అంటే ఈ గ్రంథం (దివ్య ఖుర్ఆన్) ను కంఠస్థం చేసిన 'హాఫిజుల' మనోఫలకాలపై అది చెక్కుచెదరకుండా – సురక్షితంగా – ఉంది.

86. ఏ సూచనలను ఎవరికి ఇవ్వాలో, ఏది ఎక్కడ ఉపయోగకరంగా ఉంటుందో అల్లాహ్‌కే బాగా తెలుసు. ఈ విషయంలో అల్లాహ్‌యే సర్వాధికారి. నా బాధ్యత కేవలం విషయాన్ని చేరవేయటం వరకే అని దీని భావం.

قُلْ كَفَىٰ بِاللَّهِ بَيْنِي وَبَيْنَكُمْ شَهِيدًا ۖ يَعْلَمُ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ ۗ وَالَّذِينَ آمَنُوا بِالْبَاطِلِ وَكَفَرُوا بِاللَّهِ أُولَٰئِكَ هُمُ الْخَاسِرُونَ ﴿52﴾

**52** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీకూ – నాకూ మధ్య సాక్షిగా అల్లాహ్ చాలు.[89] భూమ్యాకాశాలలో వున్న ప్రతిదీ ఆయనకు తెలుసు. అసత్యాన్ని నమ్మి, అల్లాహ్‌ను తిరస్కరించినవారే[90] తీవ్రంగా నష్టపోయేవారు."[91]

وَيَسْتَعْجِلُونَكَ بِالْعَذَابِ ۚ وَلَوْلَا أَجَلٌ مُسَمًّى لَجَاءَهُمُ الْعَذَابُ وَلَيَأْتِيَنَّهُمْ بَغْتَةً وَهُمْ لَا يَشْعُرُونَ ﴿53﴾

**53** వాళ్లు శిక్ష కోసం నిన్ను తొందరపెడుతున్నారు.[92] (నా తరపునే గనక) ఒక సమయం నిర్ధారించబడకుండా ఉన్నట్లయితే ఈ పాటికి శిక్ష వీళ్ళ వద్దకు వచ్చి ఉండేదే.[93] వారికి తెలియని స్థితిలో అది వారిపై అమాంతం వచ్చిపడటం ఖాయం.[94]

يَسْتَعْجِلُونَكَ بِالْعَذَابِ وَإِنَّ جَهَنَّمَ لَمُحِيطَةٌ بِالْكَافِرِينَ ﴿54﴾

**54** వారు శిక్ష కోసం హడావిడి చేస్తున్నారు కదూ! ఎట్టి పరిస్థితి లోనూ నరకం అవిశ్వాసులను ముట్టడించనున్నది.[95]

---

87. అంటే – ఈ గ్రంథం దైవగ్రంథమని, దేవుడు దీనిని మానవ మార్గదర్శకత్వం నిమిత్తం పంపాడనీ నమ్మేవారి కొరకు ఇది ఎంతో శ్రేయోదాయకంగా ఉంటుంది. ఈ నమ్మకం గలవారే ఈ గ్రంథం ద్వారా ప్రయోజనం పొందగలుగుతారు.

88. వారు పదే పదే నిదర్శనాల (మహిమల) గురించి ప్రశ్నిస్తున్నారు కదూ! ఖుర్‌ఆన్ కన్నా పెద్ద మహిమ ఇంకేముంటుందట!? ఏమిటీ, ఈ ఖుర్‌ఆన్ వారికి చాలదా? ఈ ఖుర్‌ఆన్ లాంటి గ్రంథాన్ని రచించి తీసుకురమ్మని లేదా కనీసం ఒక సూరానైనా తెమ్మని లోగడ వారికి సవాలు చేయటం జరిగింది. కాని వారు ఈ సవాలును ఎలాగూ స్వీకరించలేకపోయారు. ఎంతో అద్భుతమైన, అమోఘమైన ఖుర్‌ఆన్ వాణి ద్వారా కూడా వారు ప్రభావితులు కానపుడు మూసా, ఈసాలకు ఇవ్వబడిన మహిమల్లాంటి మహిమల ద్వారా కూడా ప్రభావితులవుతారన్న గ్యారంటీ ఏమిటి?

89. నేను దైవప్రవక్తనని, నాపై అవతరించిన గ్రంథం దైవగ్రంథం అని నేను మీకు చెబుతున్నా మీరు వినటం లేదుకదూ! సరే ఈ విషయంలో మీకూ – నాకూ మధ్య అల్లాహ్‌యే సాక్షిగా ఉన్నాడు.

90. అంటే ఆరాధనలకు అర్హుడైన నిజ దైవం (అల్లాహ్) ఉండగా, ఆయన్ని కాదని వారు దైవేతరులను ఆశ్రయిస్తున్నారు. అందువల్ల వారు అసత్యవాదులు.

91. ఎందుకంటే వారి ఆలోచనలు దురాలోచనలు. వారి భావాలు మిథ్యాభావాలు. అందుకే వారు విశ్వాసం బదులు అవిశ్వాసం వైపుకు మొగ్గుతారు. సన్మార్గం బదులు అపమార్గాన్ని అవలంబిస్తారు. తత్కారణంగా వారు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది.

92. వారు ప్రవక్త సందేశాన్ని విని, విధేయత చూపాల్సింది పోయి "నువ్వు నీ వాదనలో సత్యవంతుడవే అయితే, ఆ శిక్షను మాపై తీసుకు రా?!" అని కోరుతున్నారు.

93. వారు అవలంబిస్తున్న వైఖరిని బట్టి చూస్తే ఏనాడో వాళ్ళను శిక్ష కబళించి ఉండాల్సింది. అయితే ప్రతి జాతికి కొంత గడువు ఇవ్వటం మా సంప్రదాయం. ఆ గడువు పూర్తికాగానే మా శిక్ష వారిని ముట్టడిస్తుంది.

94. ఆ గడువు పూర్తి కాగానే అకస్మాత్తుగా శిక్ష వారిపై వచ్చిపడ్తుంది. అయితే ఏ క్షణాన ఆ గడువు నిర్ధారించబడిందో వారికి ఏమీ తెలీదు. మక్కాలోని అవిశ్వాసుల కోసం దేవుడు ఆ క్షణాన్ని రాసి పెట్టాడు. బద్ర్ యుద్ధంలో ఎదురైన ఘోరపరాజయం కూడా ఇందులో భాగమే. ప్రళయ ఘడియ కూడా ఇందులో ఒక భాగమే. ఆ ఘడియ సంభవించిన నాటినుంచీ అవిశ్వాసులు శాశ్వతంగా యాతనను అనుభవిస్తూ ఉండాల్సిందే.

**55** ఆ రోజు శిక్ష వారి పైనుంచి, వారి పాదాల క్రింద నుంచి వారిని ఆక్రమించుకుంటూ ఉంటుంది. అప్పుడు (అల్లాహ్)[96] వారితో "మీరు చేసుకున్న కర్మల రుచి చూడండి" అని అంటాడు.

يَوْمَ يَغْشٰهُمُ الْعَذَابُ مِنْ فَوْقِهِمْ وَمِنْ تَحْتِ
أَرْجُلِهِمْ وَيَقُولُ ذُوقُوا مَا كُنْتُمْ تَعْمَلُونَ ﴿55﴾

**56** విశ్వసించిన ఓ నా దాసులారా! నా భూమి ఎంతో విశాల మైనది. కనుక మీరు నన్నే ఆరాధించండి.[97]

يٰعِبَادِيَ الَّذِينَ اٰمَنُوْٓا إِنَّ أَرْضِي وَاسِعَةٌ
فَإِيَّايَ فَاعْبُدُونِ ﴿56﴾

**57** ప్రతి ప్రాణీ మరణం రుచి చూడవలసిందే. మరి మీరంతా నా వైపునకే మరలించబడతారు.[98]

كُلُّ نَفْسٍ ذَآئِقَةُ الْمَوْتِ ثُمَّ إِلَيْنَا تُرْجَعُونَ ﴿57﴾

**58** ఎవరు విశ్వసించి మంచి పనులు చేశారో వారికి మేము స్వర్గంలోని ఎత్తయిన మేడలలో చోటు కల్పిస్తాము. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి.[99] వారక్కడ శాశ్వతంగా ఉంటారు.[100] సదాచరణ చేసిన వారికి లభించిన ఈ ప్రతిఫలం ఎంత మంచిది!

وَالَّذِينَ اٰمَنُوا وَعَمِلُوا الصّٰلِحٰتِ لَنُبَوِّئَنَّهُمْ
مِّنَ الْجَنَّةِ غُرَفًا تَجْرِي مِنْ تَحْتِهَا الْأَنْهٰرُ
خٰلِدِينَ فِيهَا ۚ نِعْمَ أَجْرُ الْعٰمِلِينَ ﴿58﴾

95. **"యస్తాజిలూనక"** (يَسْتَعْجِلُونَكَ) అనే పదం రెండుసార్లు ప్రయోగించబడింది. తొలిసారి పదం సమాచారాన్ని తెలియజేస్తుంది. రెండవసారి ఆశ్చర్యార్థకంగా ఉంది. నిజానికి నరకం వారిని క్రమ్ముకుంటూ వస్తోంది. అయినా వాళ్లు నరకయాతన కోసం తొందరపెడ్తున్నారే?! రానున్న ప్రతి విపత్తూ దరిదాపుల్లోనే ఉంటుంది. అది దూరాన ఉందని ఎందుకనుకుంటున్నారు?

96. ఈ మాటలను చెప్పేవాడు అల్లాహ్ కావచ్చు లేక దైవదూత కూడా కావచ్చు. నలువైపుల నుంచీ నరకయాతన వారిని చుట్టుముడుతున్నప్పుడు వారినుద్దేశించి ఈ మాటలనబడతాయి.

97. ఈ సువిశాలమైన భూమిలో ఎక్కడైనా అల్లాహ్‌ను ఆరాధించటం కష్టమైనట్లయితే ఒక చోటి నుంచి మరో చోటికి వలసపోండి. మీరెక్కడ ఉన్నా మీ ప్రభువును ఆరాధిస్తూ ఉండాలి. ఆయన సమ్మతించిన జీవన విధానాన్ని అవలంబించాలి. మక్కాకు చెందిన ముస్లింలు మొదట అబిసీనియా దేశానికి, ఆ తరువాత మదీనా నగరానికి వలస పోయిన సంఘటన మనకు ఆదర్శప్రాయంగా ఉండాలి.

98. మృత్యువు ప్రతి ఒక్కరినీ వెంటాడుతూనే ఉంది. ప్రతి ఒక్కరూ దాన్ని చవిచూడాల్సిందే. మీరు దైవమార్గంలో వలసపోయినా, వలసపోకుండా ఇంటిపట్టునే ఉండిపోయినా – చావు రాకుండా ఉండదు. అందువల్ల మీరు మీ ఇల్లూ వాకిలిని, బంధుమిత్రులను, స్వస్థలాన్ని వదలిపోవటానికి ఊగిసలాడకూడదు. మృత్యువుకు భయపడకూడదు. అది రావలసిన సమయంలో వచ్చి తీరుతుంది. అయితే మీరు దైవారాధన చేస్తున్న స్థితిలో, దైవవిధేయులుగా ఉన్న స్థితిలో మరణిస్తే శాశ్వతమైన పరలోక సౌఖ్యాలను పొందుతారు. మరణించిన తరువాత అందరూ మరలించబడేది మీ ప్రభువు వైపుకే కదా!

99. స్వర్గవాసుల నివాస భవనాలు చాలా ఎత్తుగా ఉంటాయి. వాటి క్రింద పిల్ల కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. ఆ కాలువలు నీటి కాలువలు, పాల కాలువలు, తేనె కాలువలు, మధువు కాలువలు అయి ఉంటాయి. ఆ కాలువలను వారు ఏ వైపుకు తీసుకుపోదలిస్తే ఆ వైపుకే ప్రవహిస్తాయి.

100. ఆ స్వర్గ వనాలలో వారు కలకాలం ఉంటారు. వారికి వృద్ధాప్య భయంగానీ, మరణ భయంగానీ ఉండదు. ఆ స్థలం నుంచి వేరొక చోటికి తరలించబడతామేమోనన్న చింత కూడా ఉండదు.

**59** వారు సహనం వహించినవారు,[101] తమ ప్రభువునే నమ్ము కున్నవారు.[102]

الَّذِيْنَ صَبَرُوْا وَعَلٰى رَبِّهِمْ يَتَوَكَّلُوْنَ ﴿59﴾

**60** ఎన్నో జంతువులు[103] తమ ఆహారాన్ని మోసుకుంటూ తిరగవు.[104] వాటికీ, మీకు కూడా అల్లాహ్‌యే ఉపాధిని ఇస్తున్నాడు.[105] ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.[106]

وَكَاَيِّنْ مِّنْ دَآبَّةٍ لَّا تَحْمِلُ رِزْقَهَا ۖ اَللّٰهُ يَرْزُقُهَا وَاِيَّاكُمْ ۖ وَهُوَ السَّمِيْعُ الْعَلِيْمُ ﴿60﴾

**61** భూమ్యాకాశాలను సృష్టించినవాడెవడు? సూర్యచంద్రులను పనిలో నిమగ్నుల్ని చేసినవాడెవడు? అని నువ్వు వారిని అడిగితే 'అల్లాహ్‌యే' అని వారు చెబుతారు.[107] మరలాంటప్పుడు వారు (సత్యం నుంచి) ఎలా తిరిగిపోతున్నారు?[108]

وَلَئِنْ سَاَلْتَهُمْ مَّنْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَسَخَّرَ الشَّمْسَ وَالْقَمَرَ لَيَقُوْلُنَّ اللّٰهُ ۚ فَاَنّٰى يُؤْفَكُوْنَ ﴿61﴾

101. ఎందుకంటే వారు ఇహలోక జీవితంలో – ధర్మమార్గంలో – నిలకడ కలిగి ఉన్నారు. ఇల్లూ వాకిలిని వదలి వలసపోయారు. దైవప్రసన్నత కోసం తమ కుటుంబీకుల, ఆలుబిడ్డల ఎడబాటును భరించారు.

102. ధార్మిక విషయాల్లోనూ, ప్రాపంచిక వ్యవహారాల్లోనూ వారు అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకున్నారు. ఆయనపైనే భరోసా చేశారు. కష్టకాలంలో కూడా నిజదైవంపైనే భారం మోపారు.

103. 'ఎన్నో జంతువులు' అంటే లెక్కలేనన్ని జంతువులు.

104. ఎందుకంటే తమ ఆహారాన్ని మోసుకుంటూ తిరిగే శక్తి వాటికి లేదు. అలాగే అవి తమ ఆహారపదార్థాలను నిలువ చేసి ఉంచలేవు. దీనిభావం ఏమిటంటే ఆహారం లేక ఉపాధి ఏదో ఒక ప్రత్యేక స్థలానికి, ప్రత్యేక జీవులకు ప్రత్యేకం కాదు. దైవప్రసాదితమైన ఆహారం సర్వసాధారణమయినది. ఎవరు ఎక్కడ ఉన్నా వారిపేర రాసిపెట్టిన ఆహారం తప్పక లభిస్తుంది. కనుక దైవమార్గంలో వలసపోవలసి వచ్చినప్పుడు ప్రజలు తమ జీవనోపాధి గురించి అదేపనిగా చింతించాల్సిన అవసరం లేదు. మహాప్రవక్త ప్రియసహచరుల (రజి) ఉదాహరణ మనముందు ఉంది. వారు దైవమార్గంలో వలసపోయిన మీదట మునుపటికంటే శ్రేష్ఠమయిన జీవనోపాధిని దేవుడు వారికి ప్రసాదించాడు. అంతేకాదు, అచిరకాలంలోనే అరేబియాలోని పెక్కు ప్రాంతాలకు వారిని అధికారులుగా చేశాడు.

105. మీలో కొందరు బలవంతులుగా ఉండగా, మరి కొందరు బలహీనులుగా ఉన్నారు. కొందరి దగ్గర ఒనరులు పుష్కలంగా ఉంటే, మరికొందరి దగ్గర ఒనరులే లేవు. కొందరు స్వస్థలంలో ఉంటే, మరి కొందరు ఆస్తిపాస్తులను వదలుకుని పరదేశాలకు వలసపోయి జీవిస్తున్నారు. కాని వారందరికీ జీవనోపాధి సక్రమంగా లభిస్తోంది. భూమిలోపల తలదాచుకుంటున్న చీమలు మొదలుకుని, గాలిలో ఎగిరే పక్షులు, నీటిలో నివసించే చేపలు, నీటి జంతువుల వరకు అన్నింటికీ అల్లాహ్‌యే ఆహారాన్ని సమకూరుస్తున్నాడు. కనుక అల్లాహ్‌ను విశ్వసించేవారు పేదరికానికి, ఆకలిబాధకు భయపడి దైవమార్గంలో హిజ్రత్ చేయడానికి వెనుకాడరాదు. ఎందుకంటే మీకూ, సమస్త జీవరాసులకు ఆహారాన్ని సమకూర్చేవాడు ఆ నిజదైవమే.

106. మీ కర్మల గురించి ఆయనకు బాగా తెలుసు. మీరు వ్యక్తపరిచేదీ, హృదయాలలో దాచి ఉంచేది కూడా ఆయనకు తెలుసు. కాబట్టి మీరు కేవలం ఆయనకే భయపడాలి. ఆయన తప్ప వేరితరులకు భయపడకూడదు. ఆయన విధేయతలోనే మీ సాఫల్యం ఇమిడి ఉంది. ఆయన అవిధేయతే మీ పతనానికి హేతువు అని తెలుసుకోండి.

107. ఈ ముష్రిక్కులు కేవలం దేవుని ఏకత్వం (తౌహీద్) మూలంగా ముస్లింలను బాధిస్తున్నారు. మరి చూడబోతే వారి ఆంతర్యంలోనే దేవుని ఏకత్వపు భావన దాగివుంది. భూమ్యాకాశాలను – ఏమీ లేని స్థితిలో నుంచి – సృష్టించినదెవరు? అని వారిని అడిగితే 'అల్లాహ్' అని వారు స్వయంగా ఒప్పుకుంటారు. సూర్యచంద్రులను వాటి కక్ష్యలో నడిపించేదెవరు?

62 అల్లాహ్ తన దాసులలో తాను తలచిన వారికి విస్తృతంగా ఉపాధిని ఇస్తాడు. తాను తలచిన వారికి పరిమితంగా ఇస్తాడు.[109] నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు.[110]

اَللّٰهُ يَبْسُطُ الرِّزْقَ لِمَنْ يَّشَآءُ مِنْ عِبَادِهٖ وَيَقْدِرُ لَهٗ ؕ اِنَّ اللّٰهَ بِكُلِّ شَیْءٍ عَلِيْمٌ ﴿62﴾

63 ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, తద్వారా భూమిని, అది చచ్చిన తరువాత బ్రతికించినదెవరు? అని నువ్వు వారిని ప్రశ్నించినట్లయితే 'అల్లాహ్‌యే' అని వారి నుంచి సమాధానం వస్తుంది. సకల స్తోత్రాలు అల్లాహ్‌కే శోభిస్తాయి అని నువ్వు చెప్పు. కాని వారిలో అనేకులు ఇంగిత జ్ఞానం లేనివారు.[111]

وَلَئِنْ سَاَلْتَهُمْ مَّنْ نَّزَّلَ مِنَ السَّمَآءِ مَآءً فَاَحْيَا بِهِ الْاَرْضَ مِنْۢ بَعْدِ مَوْتِهَا لَيَقُوْلُنَّ اللّٰهُ ؕ قُلِ الْحَمْدُ لِلّٰهِ ؕ بَلْ اَكْثَرُهُمْ لَا يَعْقِلُوْنَ ﴿63﴾

64 ఈ ప్రాపంచిక జీవితం కేవలం ఒక సయ్యాట, వినోదం తప్ప మరేమీ కాదు.[112] అయితే పరలోక నిలయపు జీవితమే అసలు సిసలైన జీవితం.[113] ఈ విషయాన్ని వీళ్ళు తెలుసుకోగలిగితే ఎంత బావుండు![114]

وَمَا هٰذِهِ الْحَيٰوةُ الدُّنْيَاۤ اِلَّا لَهْوٌ وَّلَعِبٌ ؕ وَاِنَّ الدَّارَ الْاٰخِرَةَ لَهِیَ الْحَيَوَانُ ۘ لَوْ كَانُوْا يَعْلَمُوْنَ ﴿64﴾

అని ప్రశ్నిస్తే 'అల్లాహ్' అని వారు అంగీకరిస్తారు. అంగీకరించటం తప్ప వారికి వేరే మార్గాంతరం లేదు కూడా. కాని సత్యస్వీకరణ దగ్గరికి వచ్చేసరికి వారు పలాయనవాదాన్ని అనుసరిస్తున్నారు.

108. ఆధారాలు, నిదర్శనాలన్నీ తేటతెల్లమైనాక కూడా వారు సత్యంపట్ల వైముఖ్య ధోరణిని కనబరచటం ఆశ్చర్యకరం, విచారకరం కూడా.

109. "ఒకవేళ మీరు అవలంబించే మార్గం సత్యమార్గమే అయితే మీరు పేదరికంలో ఎందుకు మ్రగ్గుతున్నారు?" అని మక్కాలోని ముష్రిక్కులు ముస్లింలను ప్రశ్నించేవారు. దానికి సమాధానం ఈ ఆయతులో ఇవ్వబడింది – ఉపాధిని విస్తృతపరచటమైనా, కుదించటమైనా–అది అల్లాహ్ అధీనంలో ఉంది. ఆయన తన యుక్తినీ, ప్రణాళికను అనుసరించి ఎవరికెంతగా ఇవ్వాలో అంతగానే ఇస్తాడు. అంతేగానీ ఉపాధి ప్రదానం అనేది ఆయన ప్రసన్నతతోనో, అప్రసన్నతతోనో ముడిపడి లేదు. ఆ మాటకొస్తే ఆయన దైవధిక్కారులకు కూడా పుష్కలంగా ఆహారాన్ని వొసగుతాడు.

110. విస్తృతమైన ఉపాధి ఎవరికి శ్రేయోదాయకంగా ఉంటుందో, ఎవరికి హానికరంగా పరిణమిస్తుందో ఆయనకు తెలుసు.

111. వారికే గనక ఇంగిత జ్ఞానం ఉన్నట్లయితే వారు అల్లాహ్‌తోపాటు రాళ్ళ రప్పలను, సమాధులను పూజించరు. వారు ఒక వైపున అల్లాహ్‌ను సృష్టికర్తగా, పోషకునిగా ఒప్పుకుంటూనే మరోవైపు బహుదైవారాధన చేస్తున్నారంటే, నిశ్చయంగా వారు గ్రాహ్యశక్తి లేనివారే.

112. ప్రాపంచిక వ్యామోహంలో పడి వారు పరలోక జీవితాన్ని విస్మరిస్తున్నారు. పరలోకంలో పనికివచ్చే సామగ్రిని సమకూర్చుకోవటానికి ప్రయత్నించటం లేదు. అయితే ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, వినోద వస్తువు తప్ప మరేమీ కాదన్న యదార్థాన్ని వారు తెలుసుకోవాలి. దైవతిరస్కారి ప్రాపంచిక వ్యవహారంలో మునిగి ఉంటాడు. ప్రపంచం కోసం అహోరాత్రులు శ్రమిస్తాడు. కాని మరణించినప్పుడు అతని వెంట వచ్చేదేమీ ఉండదు. చిన్నపిల్లలు పగలల్లా ఆటవస్తువులతో ఆడుకుని సాయంత్రం వట్టిచేతులతో ఇంటికి వెళ్ళినట్లే ఈ ప్రాపంచిక పూజారి మరణానంతరం రిక్తహస్తాలతో పరలోకం వైపుకు సాగిపోతాడు.

113. కాబట్టి మనిషి తన పరలోక ఇల్లును చక్కదిద్దుకునే ప్రయత్నం చేయాలి. దానికోసం సత్కార్యాలు చేయాలి.

**65** మరి వారు ఓడలో ప్రయాణమైనప్పుడు, తమ ఆరాధనను అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని – కేవలం ఆయన్నే మొరపెట్టు కుంటారు. తరువాత ఆయన వారిని సురక్షితంగా తీరానికి చేర్చగానే, అప్పటికప్పుడే వారు దైవానికి సహవర్తుల్ని కల్పించటం మొదలెడతారు.[115]

فَإِذَا رَكِبُوا فِي الْفُلْكِ دَعَوُا اللَّهَ مُخْلِصِينَ لَهُ الدِّينَ فَلَمَّا نَجَّاهُمْ إِلَى الْبَرِّ إِذَا هُمْ يُشْرِكُونَ ﴿٦٥﴾

**66** మా అనుగ్రహాల పట్ల తిరస్కార వైఖరిని అవలంబిస్తూ, సుఖసౌఖ్యాలను జుర్రుకోవటానికి[116] (వారిలా ప్రవర్తిస్తున్నారు). మరి వారు అతి త్వరలోనే (దీని పర్యవసానం) తెలుసుకుంటారు.

لِيَكْفُرُوا بِمَا آتَيْنَاهُمْ وَلِيَتَمَتَّعُوا فَسَوْفَ يَعْلَمُونَ ﴿٦٦﴾

**67** ఏమిటీ, మేము హరమ్‌ను (మక్కా పుణ్యక్షేత్రాన్ని) సురక్షితమైన క్షేత్రంగా చేయటాన్ని వారు చూడటం లేదా? మరి (చూడబోతే) వారి చుట్టుప్రక్కల ఉన్న ప్రజలు ఎగరేసుకుపోబడుతున్నారు.[117] ఏమిటీ, (ఇప్పటికీ) వారు అసత్యాన్నే నమ్మి, దైవానుగ్రహాల పట్ల తిరస్కార వైఖరిని అవలంబిస్తారా?[118]

أَوَلَمْ يَرَوْا أَنَّا جَعَلْنَا حَرَمًا آمِنًا وَيُتَخَطَّفُ النَّاسُ مِنْ حَوْلِهِمْ أَفَبِالْبَاطِلِ يُؤْمِنُونَ وَبِنِعْمَةِ اللَّهِ يَكْفُرُونَ ﴿٦٧﴾

114. ఈ సత్యాన్నే గనక వారు తెలుసుకుంటే పరలోక జీవితాన్ని నిర్లక్ష్యం చేసి ప్రాపంచిక భోగభాగ్యాలలో తలమునకలై ఉండరు. దీనికి చికిత్స ఒక్కటే – అదే ధర్మజ్ఞానార్జన, షరీయతు జ్ఞానార్జన!

115. ముష్రిక్కుల (బహుదైవారాధకుల) ఈ చపల చిత్తాన్ని గురించి ఖుర్‌ఆన్ పలుచోట్ల, పలు విధాలుగా విశదీకరించింది. అవిశ్వాసుల ఈ చంచల స్వభావాన్ని హజ్రత్ ఇక్రిమా (రజిఅన్) బాగా అర్థం చేసుకున్నారు. అందువల్ల ఆయనకు ఇస్లాం స్వీకార భాగ్యం లభించింది. మక్కా విజయం వరకూ ఆయన అవిశ్వాసిగానే ఉన్నారు. మక్కా విజయం తరువాత ఈయన మక్కా నుండి పరారయ్యారు. అబిసీనియా దేశానికి వలసపోయే ఉద్దేశంతో నావ ఎక్కారు. కాని ఆ నావ సుడిగాలిలో చిక్కుకుంది. చిత్తశుద్ధితో మీ ప్రభువును ప్రార్థించండని నావలోని ప్రయాణీకులంతా పరస్పరం చెప్పుకున్నారు. ఈ గండం నుంచి అల్లాహ్ తప్ప గట్టెక్కించే వాడెవడూ లేడని కూడా వారు చెప్పుకున్నారు. ఆ సమయంలో హజ్రత్ ఇక్రిమా (రజి) ఆలోచనలో పడిపోయారు. సముద్రంలో గండం నుంచి గట్టెక్కించేవాడు అల్లాహ్ అయినప్పుడు నేలపైన కూడా ఆపదల నుంచి కాపాడేవాడు అల్లాహ్‌యే కావాలి కదా! ఈ యదార్థం బోధపడగానే ఆయన మనసులోనే సంకల్పం చేసుకున్నారు – క్షేమంగా తీరం దాటితే ముహమ్మద్ (సఅసం) చేతిపై ప్రమాణం చేసి ముస్లింగా మారతానని! అనుకున్నట్లుగానే ఆయన స్వయంగా ముహమ్మద్ (స) దగ్గరకు వచ్చి ఇస్లాం స్వీకరించారు (ఇబ్నె కసీర్, సీరత్ ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ ఆధారంగా).

116. వారి జాడ్యానికి మూలకారణం ఏమిటో ఈ ఆయతులో చెప్పబడింది. గండం నుంచి గట్టెక్కగానే వారు ఏకైక దేవుడైన అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించారు. అంటే దేవుడు చేసిన మేళ్ళను మరచిపోయి ప్రాపంచిక భోగభాగ్యాలలో మునిగిపోయారు. ఏకదైవారాధకులుగా జీవిస్తే దేవుని ఆంక్షలు ఉంటాయి. ఇష్టారాజ్యం చేసేందుకు వీలుండదు. అందుకే వారు బహుదైవారాధన వైపు మొగ్గారు. ఫలితంగా వారు అవిశ్వాసుల కోవలో చేరిపోయారు.

117. దేవుడు మక్కావాసులకు చేసిన మహోపకారాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఆయన ఇలా అన్నాడు : మేము మక్కా నగరాన్ని శాంతి నగరంగా చేశాము. ఇక్కడ రక్తపాతం, హత్యలు, లూటీలు, దహనాలు లేకుండా ప్రజలు సురక్షితంగా నివసిస్తున్నారు. అదే సమయంలో అరేబియాలోని ఇతర ప్రదేశాలలో అశాంతి అలజడులు ఉన్నాయి. మారణకాండ జరుగుతోంది. ప్రజల ధనమాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది.

**68** అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టేవానికన్నా[119] లేదా తన వద్దకు సత్యం వచ్చినప్పుడు[120] దాన్ని ధిక్కరించేవానికన్నా పరమ దుర్మార్గుడెవడుంటాడు? ఏమిటీ, అటువంటి తిరస్కారుల నివాస స్థలం నరకంలో ఉండదా?!

وَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا أَوْ كَذَّبَ بِالْحَقِّ لَمَّا جَاءَهُ ۚ أَلَيْسَ فِي جَهَنَّمَ مَثْوًى لِلْكَافِرِينَ ﴿٦٨﴾

**69** ఎవరయితే మా మార్గంలో బాధలు భరిస్తారో,[121] వారికి మేము తప్పకుండా మా 'మార్గాలు' చూపుతాము.[122] నిశ్చయంగా అల్లాహ్ సద్వర్తనులకు తోడుగా ఉంటాడు.[123]

وَالَّذِينَ جَاهَدُوا فِينَا لَنَهْدِيَنَّهُمْ سُبُلَنَا ۚ وَإِنَّ اللَّهَ لَمَعَ الْمُحْسِنِينَ ﴿٦٩﴾

118. మేము చేసిన మహోపకారానికి ఈ నగరవాసులు ఇచ్చేబదులు ఇదేనా?! వారు అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పిస్తారా? ఇప్పటికీ వారు బూటకపు దేముళ్లను కొలుస్తారా? నిజానికి మా ఉపకారానికి బదులుగా వారు ఏకదైవారాధకులుగా మారాల్సింది. మా అంతిమ ప్రవక్త (సఅసం)ను ధృవీకరించాల్సింది. కాని వారు విశ్వాస ఘాతకులుగా తయారయ్యారు.

119. అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదించటమంటే అర్థం : ఎవరయినా తన వద్దకు దైవవాణి రాకపోయినప్పటికీ, వచ్చిందని జనులముందు చెప్పటం, అల్లాహ్ అవతరింపజేసిన సందేశం లాంటిదే తాను కూడా దించుతానని దావా చేయటం- ఇలాంటివన్నీ దైవానికి అంటగట్టే అబద్ధాలే అనిపించుకుంటాయి.

120. తన ముందు సత్యం తేటతెల్లమైపోయిన తరువాత కూడా దాన్ని తృణీకరించటం, త్రోసిపుచ్చటం ధిక్కరణ క్రిందికి వస్తుంది. ఈ ధిక్కారానికి పాల్పడేవాడు దైవధిక్కారి అనిపించుకుంటాడు. అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టడం, ధిక్కారవైఖరికి పాల్పడటం – ఇవి రెండూ అవిశ్వాసంగానే పరిగణించబడతాయి. దీనికి శిక్ష నరకమే.

121. అంటే ధర్మావలంబనలో ఎదురయ్యే అవరోధాలు, కష్టనష్టాలు, పరీక్షలు, వేధింపులు మొదలగునవి.

122. ఈ **"మార్గాలు"** ప్రాపంచికమైనవి, పారలౌకికమైనవి కూడా. వాటిపై నడచి మనిషి ఇహలోకంలో కూడా గౌరవోన్నతుల్ని పొందుతాడు. పరలోకంలో కూడా దైవప్రసన్నతను చూరగొంటాడు.

123. ఇక్కడ **'ముహ్సినీన్'** (مُحْسِنِيْنَ) అనే పదం ప్రయోగించబడింది. ఇది ఇహ్సాన్ నుండి వచ్చింది. ఇహ్సాన్ అంటే- అల్లాహ్ మన ముందర ఉన్నాడనీ, ఆయన మనల్ని గమనిస్తున్నాడని భావించి ప్రతి మంచి పనినీ చిత్తశుద్ధితో, ఉత్తమ రీతిలో చేయటం అని అర్థం. ఇంకా ఆ మంచిపని దైవప్రవక్త (సఅసం) విధానానికి అనుగుణంగా ఉండాలి. కీడు తలపెట్టేవారికి మేలు చేకూర్చాలి. అపకారికి ఉపకారం చేయాలి. తమకు దక్కవలసిన హక్కు పూర్తిగా దక్కక పోయినా తమపై ఎదుటి వారికి ప్రాధాన్యతనివ్వాలి. – ఇవన్నీ ఇహ్సాన్ (ఉపకారం, సదమరవర్తన) క్రిందికి వస్తాయి.

30 వ సూరా

# అర్ రూమ్

## రోమన్ సామ్రాజ్యం

అవతరణ మక్కాలో

ఆయతులు 60

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, మరణానంతరం మళ్ళీ లేపబడడం, ప్రవక్తలందరినీ విశ్వసించడం, వారిపై అవతరించిన దివ్యగ్రంథాలను అన్నింటిని విశ్వసించడం, శిక్షా బహుమానాలు వంటి మౌలిక విశ్వాసాలను చర్చించింది. ఈ సూరాలో ప్రస్తావించబడిన భవిష్యవాణి – క్రయిస్తవ బైజాంటైన్ సామ్రాజ్యం, బహుదైవారాధక పర్షియన్ సామ్రాజ్యాన్ని ఓడిస్తుందన్న భవిష్యవాణి – తర్వాత నిజమయ్యింది. ఈ ప్రస్తావన 2-5 ఆయతుల్లో ఉంది. చారిత్రకంగా పర్షియన్ సామ్రాజ్యం అగ్నిని ఆరాధించే ప్రజల సామ్రాజ్యం. పర్షియన్లకు అరబ్బుతెగలతో మైత్రి సంబంధాలు ఉండేవి. కాగా బైజాంటైన్ సామ్రాజ్యం క్రయిస్తవ సామ్రాజ్యం. అంటే గ్రంథప్రజల సామ్రాజ్యం. పర్షియన్ సామ్రాజ్యం ఏడవ శతాబ్దం ప్రారంభ సంవత్సరాల్లో బైజాంటైన్ సామ్రాజ్యాన్ని ఓడించింది. ఈ వార్త అరబ్బుతెగల్లో పర్షియన్ సామ్రాజ్యంతో మైత్రి సంబంధాలు కల ఖురైష్ తదితర తెగలకు సంతోష కారణమయ్యింది. కాని బైజాంటైన్ సామ్రాజ్య పరాజయం ముస్లిములకు విచారాన్ని కలిగించింది. ప్రవక్త ఈసా(అస) తీసుకొచ్చిన దైవసందేశానికి కొనసాగింపే ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తీసుకు వచ్చిన దైవసందేశం. అందువల్ల గ్రంథ ప్రజలకు చెందిన బైజాంటైన్ సామ్రాజ్యం పరాజయం పాలు కావడం, బహుదైవారాధక పర్షియన్ సామ్రాజ్యం విజయం సాధించడం వారికి విచారాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో ఈ సూరా అవతరించింది. ఈ సూరాను అరబ్బు తెగలు అపహాస్యం చేసాయి. ఈ సందర్భంగా బైజాంటైన్ సామ్రాజ్యం విజయం సాధిస్తుందన్న భవిష్యవాణిని వినిపించింది. ఈ భవిష్యవాణి తర్వాత నిజమయ్యింది. బైజాంటైన్ సామ్రాజ్యం పర్షియన్ సామ్రాజ్యాన్ని ఓడించింది. ఈ సూరాలో ఉన్న మరొక భవిష్యవాణి, ప్రపంచవ్యాప్త ఉపద్రవం గురించినది. ఈ భవిష్యవాణి పర్యావరణ కాలుష్యానికి కూడా వర్తించే భవిష్యవాణి. నేలపై, సముద్రాలలో మనిషి సృష్టించిన ఉపద్రవం వ్యాపిస్తోంది.*

## అర్ రూమ్ సూరా

## سُوْرَةُ الرُّوْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1 – 2** అలిఫ్ – లామ్ – మీమ్. రోమనులు ఓడిపోయారు–

الٓمّٓ ① غُلِبَتِ الرُّوْمُ ②

**3** సమీప భూభాగంలో. అయితే (ఈ) అపజయం తరువాత త్వరలోనే వారు విజేతలవుతారు.

فِيْٓ اَدْنَى الْاَرْضِ وَهُمْ مِّنْۢ بَعْدِ غَلَبِهِمْ سَيَغْلِبُوْنَ ③

**4** కొన్నేండ్లలోనే (తొమ్మిదేండ్లలోపే!). దానికి ముందైనా, తరువాతైనా నిర్ణయాధికారం అల్లాహ్‌దే. ఆ రోజు ముస్లింలు సంతోషిస్తారు–

فِيْ بِضْعِ سِنِيْنَ ۬ؕ لِلّٰهِ الْاَمْرُ مِنْ قَبْلُ وَمِنْۢ بَعْدُ ؕ وَيَوْمَئِذٍ يَّفْرَحُ الْمُؤْمِنُوْنَ ④

**5** అల్లాహ్ అండదండల వల్ల.[1] ఆయన తాను కోరిన వారికి సహాయం చేస్తాడు. ఆయన మాత్రమే సర్వాధికుడు,దయాశీలి.

بِنَصْرِ اللّٰهِ ؕ يَنْصُرُ مَنْ يَّشَآءُ ؕ وَهُوَ الْعَزِيْزُ الرَّحِيْمُ ⑤

1. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాలంలో అరేబియా సమీపంలో రెండు పెద్ద సామ్రాజ్యాలుండేవి. వాటిలో ఒకటి : పారసీక (ఈరాన్) సామ్రాజ్యం. రెండవది : రోము సామ్రాజ్యం. పారసీకులు అగ్ని పూజారులు. రోమనులు క్రైస్తవ మతస్తులు. అంటే గ్రంథం కల ప్రజలు. ఆ కాలంలో అరబ్బు ముష్రిక్కులు పారసీకులను అభిమానించేవారు. వారికి తమ నైతిక మద్దతును కూడా ప్రకటించేవారు. ఎందుకంటే ఉభయులూ బహుదైవారాధకులే గనక. అదే సమయంలో ముస్లింల నైతిక మద్దతు, సానుభూతి రోమనుల వైపు ఉండేది. ఎందుకంటే క్రైస్తవులు కూడా ముస్లింల మాదిరిగానే దైవగ్రంథాన్ని నమ్ముతారు. దైవప్రవక్తను అనుసరిస్తారు. ముహమ్మద్ (సఅసం) గారికి దైవదౌత్యం అందిన కొన్ని సంవత్సరాలలోనే పారసీకులు రోమనులను ఓడించారు. ఈ పరిణామానికి మక్కాలోని ముష్రిక్కులు సంబరపడిపోగా, ముస్లింల శిబిరాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సందర్భంగానే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులు అవతరించాయి. "కొన్ని సంవత్సరాలలోనే" రోమనులు తిరిగి విజయం సాధిస్తారని, విజేతలు పరాజితులవుతారని, పరాజితులు విజేతలవుతారని శుభవార్త ఇవ్వబడింది. ఆనాటి స్థితిగతుల దృష్ట్యా ఈ భవిష్యవాణి అసంభవం అనిపించేది. కాని దైవవాక్కుపై ముస్లింలకు గల అపారమైన నమ్మకం వల్ల వారు ఈ విజయంపై ఆశలుపెట్టుకున్నారు. అందుకే హజ్రత్ అబూబకర్ (రజి) ఈ భవిష్యవాణి ఆధారంగా అబూజహల్‌పై పందెం కాశారు. ఐదేండ్లలోగానే రోమనులు పారసీకులను ఓడిస్తారనేది ఆ పందెంలోని ముఖ్యాంశం. ఈ సంగతి దైవప్రవక్త (స)కు తెలిసింది. ఆయతులోని **'బిజ్వున్' (بِضْع)** అనే పదం 3 నుంచి 10 వరకూ వర్తిస్తుందనీ, ఆ లెక్కన 5 ఏండ్ల వ్యవధి మరీ స్వల్ప వ్యవధిలా ఉందనీ, ఆ గడువును మరికాస్త పెంచమని ఆయన(స) అబూబక్ర్‌కు సలహా యిచ్చారు. అప్పుడు హజ్రత్ అబూబక్ర్ (రజి) దైవప్రవక్త (స) సూచనానుసారం గడువును పెంచారు. అనుకున్నట్లే జరిగింది. రోమనులు తొమ్మిదేండ్ల వ్యవధిలోపలే – 7వ సంవత్సరంలోనే – పారసీకులను ఓడించి, తమ పూర్వ వైభవాన్ని తిరిగి పొందారు. ఈ పరిణామానికి ముస్లింలు సహజంగానే సంతోషించారు (తిర్మిజీ, రూమ్ సూరా వ్యాఖ్యానం).

కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం – బద్ర్ యుద్ధంలో ముస్లింలకు అవిశ్వాసులపై విజయం చేకూరిన కాలంలోనే రోమనులకు కూడా విజయం వరించింది. ముస్లింలు తమకు లభించిన విజయంపై అమితంగా సంతోషించారు. మొత్తానికి రోమనులకు లభించిన మలిసారి విజయం దివ్య ఖుర్ఆన్ సత్యతకు ఓ ప్రబల తార్కాణం వంటిది.

وَعْدَ اللّٰهِ ؕ لَا يُخْلِفُ اللّٰهُ وَعْدَهٗ وَلٰكِنَّ
اَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُوْنَ ⑥

6 (ఇది) అల్లాహ్ వాగ్దానం.[2] అల్లాహ్ తన వాగ్దానానికి విరుద్ధంగా చేయడు. కాని చాలామంది (ఈ సంగతిని) తెలుసుకోరు.

يَعْلَمُوْنَ ظَاهِرًا مِّنَ الْحَيٰوةِ الدُّنْيَا ۖۚ
وَهُمْ عَنِ الْاٰخِرَةِ هُمْ غٰفِلُوْنَ ⑦

7 వారికి ప్రాపంచిక జీవితపు పై పై విషయాలు (మాత్రమే) తెలుసు. పరలోకం గురించి వారికి బొత్తిగా తెలీదు.[3]

اَوَلَمْ يَتَفَكَّرُوْا فِيْٓ اَنْفُسِهِمْ ۫ مَا خَلَقَ اللّٰهُ السَّمٰوٰتِ
وَالْاَرْضَ وَمَا بَيْنَهُمَآ اِلَّا بِالْحَقِّ وَاَجَلٍ مُّسَمًّى ؕ وَ
اِنَّ كَثِيْرًا مِّنَ النَّاسِ بِلِقَآئِ رَبِّهِمْ لَكٰفِرُوْنَ ⑧

8 ఏమిటీ, వారు తమ (పుట్టుక) గురించి (లోతుగా) ఆలోచించటం లేదా? అల్లాహ్ భూమ్యాకాశాలనూ, వాటి మధ్య నున్న సమస్తాన్నీ అత్యుత్తమ రీతిలో,[4] నిర్ణీత కాలం కొరకు మాత్రమే సృష్టించాడు. అయితే చాలా మంది తమ ప్రభువును కలుసుకోవలసి ఉందనే విషయాన్ని తిరస్కరిస్తారు.[5]

اَوَلَمْ يَسِيْرُوْا فِى الْاَرْضِ فَيَنْظُرُوْا كَيْفَ كَانَ
عَاقِبَةُ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ؕ كَانُوْٓا اَشَدَّ مِنْهُمْ

9 ఏమిటీ, వారు భువిలో సంచరించి,[6] తమ పూర్వీకులకు పట్టిన గతేమిటో చూడలేదా?[7] వారు బలపరాక్రమాలలో వీళ్ళ కన్నా మరింత గట్టివారే.[8] వారు (కూడా) భూమిని బాగా దున్నారు.[9]

---

'సమీప భూభాగం' (اَدْنٰی) అంటే అరేబియాకు దగ్గరగా ఉన్న ప్రదేశం అన్నమాట. అంటే సిరియా, పాలస్తీనా మొదలగు భూభాగాలు. ఆ రోజుల్లో అక్కడ క్రైస్తవ ప్రభుత్వం ఉండేది.

2. అంటే – రోమనులు తిరిగి పారసీకులను ఓడించనున్నారని అల్లాహ్ తన అంతిమ సందేశహరునికి (స) చేసిన వాగ్దానం తప్పక నెరవేరుతుంది.

3. చాలామందికి ప్రాపంచిక జీవన వ్యవహారాల గురించి బాగా తెలుసు. అందువల్ల వారు తెలివితేటలన్నింటినీ క్షణభంగుర మైన, తాత్కాలికమైన ప్రాపంచిక ప్రయోజనాల కోసం వెచ్చిస్తున్నారు. మరోవంక వారు పరలోక వ్యవహారాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. మరి చూడబోతే శాశ్వతమైనవి, శ్రేయోదాయకమైనవి పరలోక వ్యవహారాలే. సారాంశమేమిటంటే వీళ్లు ప్రాపంచిక వ్యవహారాల కోసమైతే తమ ప్రావీణ్యాన్నంతటినీ ధారబోస్తున్నారు. కాని అదే సమయంలో ధర్మం పట్ల ఎక్కడ లేని బద్ధకాన్ని, అశ్రద్ధను కనబరుస్తున్నారు.

4. లేదా ఒక ఆశయం కోసం, సత్యబద్ధంగా పుట్టించాడు. వృధాగా, నిరర్ధకంగా పుట్టించలేదు. సజ్జనులకు పుణ్యఫలం, దుష్టులకు పాపఫలం ఇవ్వటమే ఆ ఆశయం. ఏమీలేని స్థితిలో నుంచి వారికెలా ఉనికి ప్రసాదించబడిందో వారు చూడటం లేదా? అత్యంత అల్పమైన వీర్యపు బిందువుతో వారు సృష్టించబడ్డారు. మరి భూమ్యాకాశాల ఓ సువిశాలమైన వ్యవస్థ వారి కొరకు నెలకొల్పబడింది. వీటన్నింటికోసం ఒక నిర్ణీత సమయం – అంటే ప్రళయదినం – నిర్ధారించ బడింది. అది సంభవించినప్పుడు ఈ ప్రపంచంలో ఉన్నవన్నీ నశించిపోతాయి. ఈ విషయాలన్నింటిపై వాళ్లు ప్రశాంతంగా ఆలోచించినట్లయితే తప్పకుండా అల్లాహ్ అస్తిత్వం, ఆయన సార్వభౌమత్వం, పోషకత్వం, నిరంకుశ అధికారం గురించి వారికి బోధపడి ఉండేది. వారు దైవాన్ని విశ్వసించి ఉండేవారు.

5. విశ్వం గురించి చింతనా ధ్యాస సన్నగిల్లడమే దానికి కారణం. లేకుంటే ప్రళయదినపు, పరలోక జీవితపు ధిక్కారవైఖరి వెనుక తగిన కారణమే లేదు.

6. అంటే – భూమిలో తిరిగి వెనుకటి జాతుల శిథిలాలను, అవశేషాలను, గుణపాఠం గరిపే ఘటనలను చూసినట్లయితే జ్ఞానోదయం అవుతుందని చెప్పబడింది.

7. అల్లాహ్ను, అంతిమదినాన్నీ, సత్యాన్ని, దైవప్రవక్తలను ధిక్కరించి పొగరుబోతులుగా విహరించిన వారి గతి ఏమాయెనో, దేవుడు ఏ విధంగా వారిని అంతమొందించాడో వారు చూడాలి.

వీళ్ళకన్నా బాగా సేద్యం చేశారు (వసింపజేశారు).[10] వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చారు.[11] అల్లాహ్ వారికి అన్యాయం చేయలేదు.[12] కాని (యదార్థానికి) వారు తమకు తామే అన్యాయం చేసుకునేవారు.[13]

قُوَّةً وَّاَثَارُوا الْاَرْضَ وَعَمَرُوْهَآ اَكْثَرَ مِمَّا عَمَرُوْهَا وَجَآءَتْهُمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ ۭ فَمَا كَانَ اللّٰهُ لِيَظْلِمَهُمْ وَلٰكِنْ كَانُوْٓا اَنْفُسَهُمْ يَظْلِمُوْنَ ۝ 9

**10** మరి ఎట్టకేలకు – దుర్మార్గాలకు ఒడిగట్టిన వారికి దుర్గతే పట్టింది.[14] ఎందుకంటే వారు అల్లాహ్ ఆయతులను ధిక్కరించే వారు. వాటిని పరిహసించేవారు.

ثُمَّ كَانَ عَاقِبَةَ الَّذِيْنَ اَسَاۗءُوا السُّوْۗآٰى اَنْ كَذَّبُوْا بِاٰيٰتِ اللّٰهِ وَكَانُوْا بِهَا يَسْتَهْزِءُوْنَ ۝ 10

**11** సృష్టి (ప్రక్రియ)ని మొదలెట్టేవాడు అల్లాహ్‌యే. మరి ఆయనే దాన్ని పునరావృతం చేస్తాడు.[15] మరి మీరంతా ఆయన వైపునకే మరలించబడతారు.[16]

اَللّٰهُ يَبْدَؤُا الْخَلْقَ ثُمَّ يُعِيْدُهٗ ثُمَّ اِلَيْهِ تُرْجَعُوْنَ ۝ 11

**12** ప్రళయం నెలకొన్ననాడు అపరాధులు దిగ్భ్రాంతి చెందు తారు.[17]

وَيَوْمَ تَقُوْمُ السَّاعَةُ يُبْلِسُ الْمُجْرِمُوْنَ ۝ 12

---

8. అంటే మక్కావాసులకన్నా, ఖురైషులకన్నా గట్టివారు.
9. మక్కావాసులకు వ్యవసాయం కూడా తెలీదు. కాని వెనుకటి జాతులవారు వ్యవసాయంలో కూడా ఆరితేరినవారే.
10. ఎందుకంటే వెనుకటి జాతుల వారికి దీర్ఘాయుష్షు ఉండేది. దేహదారుఢ్యంలో కూడా వారు మక్కావాసులను మించినవారే. ఆర్థికంగా కూడా బలోపేతంగా ఉండేవారు. అందువల్ల వ్యవసాయ రంగంలోనూ ముందంజ వేశారు. భవన నిర్మాణంలో కూడా ప్రగతిని సాధించారు.
11. కాని వారు తమ ప్రవక్తలను విశ్వసించలేదు. అందువల్ల వారి ప్రగతీ వికాసాలు, సిరిసంపదలు, తెలివితేటలు వారికే మాత్రం పనికిరాకుండా పోయాయి. (పైగా తెలివితేటల మూలంగా వారిలో తొంగిచూసిన గర్వం వారి వినాశానికి హేతువయింది.)
12. అకారణంగా అల్లాహ్ ఎవరినీ శిక్షించడు. అల్లాహ్ న్యాయశీలుడు.
13. అంటే – వారు అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ, అల్లాహ్ సందేశహరులను త్రోసిపుచ్చి కష్టాన్ని కొనితెచ్చుకున్నారు.
14. చెడులకు పాల్పడేవారి ముగింపు కూడా చెడ్డగానే ఉంటుంది. జీవితాంతం వారు దైవోపదేశాలతో చెలగాటమాడారు. కాబట్టి వారికి దుర్గతి పట్టింది.
15. అంటే, అల్లాహ్ ఏ విధంగానయితే వారిని తొలిసారి సృష్టించే శక్తిని కలిగి ఉన్నాడో, అదేవిధంగా మలిసారి సృష్టించే శక్తిని కూడా కలిగి ఉన్నాడు. మరణానంతరం ఆయన వారిని తిరిగి లేపుతాడు. మలిసారి సృష్టి తొలిసారి సృష్టి ప్రక్రియకన్నా కష్టమేమీ కాదు.
16. అంటే లెక్కల నిమిత్తం వారు హష్ర్ మైదానం వద్దకు తరలించబడతారు. అక్కడ న్యాయసమ్మతంగా ఎవరికి ఏది లభించాలో అది లభిస్తుంది.
17. **యుబ్లిసు (ఇబ్లాసున్)** అంటే ఆత్మరక్షణ కోసం ఎలాంటి ఆధారాన్ని సమర్పించలేని స్థితికి లోనవటం అని అసలు అర్థం. దిక్కులు చూస్తూ నిలబడిపోవటం అని భావం. దీన్నే నిరాశానిస్పృహల స్థితిగా కూడా అభివర్ణిస్తారు. అంటే ప్రళయదినాన అవిశ్వాసులు, బహుదైవారాధకులు శిక్షను కళ్లారా చూసిన తర్వాత తమపై మోపబడిన అభియోగాన్ని నిరాకరించే ఆధారం ఏదీ చూపలేక, నిస్పృహకు లోనై, దిక్కుతోచని పరిస్థితిలో పడిపోతారు. ఈ ఆయతులో **'ముజ్రిమూన్'** (مُجرِمُوْنَ) అంటే అవిశ్వాసులు, ముష్రికులు అని భావం. దీని తర్వాతి వాక్యం ఆ అర్థాన్నే సూచిస్తున్నది.

**13** వారు కల్పించే భాగస్వాములలో ఏ ఒక్కరూ వారికోసం సిఫారసు చేయరు.[18] మరి (వీళ్లు సైతం) తమ భాగస్వాములను త్రోసిపుచ్చుతారు.[19]

وَلَمْ يَكُن لَّهُم مِّن شُرَكَائِهِمْ شُفَعَاءُ وَكَانُوا
بِشُرَكَائِهِمْ كَافِرِينَ ﴿١٣﴾

**14** ఏ రోజున ప్రళయ ఘడియ నెలకొంటుందో ఆ రోజు (మానవులు) విభిన్న వర్గాలుగా విడిపోతారు.[20]

وَيَوْمَ تَقُومُ السَّاعَةُ يَوْمَئِذٍ يَتَفَرَّقُونَ ﴿١٤﴾

**15** మరి విశ్వసించి, మంచి పనులు చేసిన వారు స్వర్గంలో ఆనందంతో పరవశించిపోతూ ఉంటారు.[21]

فَأَمَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ فَهُمْ
فِي رَوْضَةٍ يُحْبَرُونَ ﴿١٥﴾

**16** మరెవరయితే తిరస్కార వైఖరిని అనుసరిస్తూ, మా ఆయతులను, పరలోక సమావేశాన్ని ధిక్కరిస్తారో వారందరూ శిక్షలో నిర్బంధించబడి ఉంటారు.[22]

وَأَمَّا الَّذِينَ كَفَرُوا وَكَذَّبُوا بِآيَاتِنَا وَلِقَاءِ
الْآخِرَةِ فَأُولَٰئِكَ فِي الْعَذَابِ مُحْضَرُونَ ﴿١٦﴾

**17** కనుక మీరు పొద్దుగూకినప్పుడు, తెల్లవారినప్పుడు అల్లాహ్ పవిత్రతను కొనియాడండి.

فَسُبْحَانَ اللَّهِ حِينَ تُمْسُونَ وَحِينَ
تُصْبِحُونَ ﴿١٧﴾

**18** భూమ్యాకాశాలలో సమస్త స్తోత్రాలకు అర్హుడు ఆయన మాత్రమే. సాయం సమయాన, మధ్యాహ్న సమయాన కూడా (అల్లాహ్ పవిత్రతను కొనియాడండి).[23]

وَلَهُ الْحَمْدُ فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ وَعَشِيًّا
وَحِينَ تُظْهِرُونَ ﴿١٨﴾

18. **'భాగస్వాములు'** అంటే బూటకపు దేవుళ్ళు అని అర్థం. బహుదైవారాధకులు వారిని దైవానికి భాగస్వాములుగా నిలబెట్టి పూజించేవారు. వారు తమ అక్కరలు తీరుస్తారని నమ్మేవారు. దైవశిక్ష నుంచి ఈ చిల్లర దేముళ్లు తమను రక్షిస్తారని కూడా ఆశలు పెట్టుకున్నారు. కాని దైవానికి భాగస్వాముల్ని కల్పించిన వారి విషయంలో ఎలాంటి సిఫారసూ స్వీకరించబడదని ఇక్కడ తేటతెల్లం అయిపోయింది.

19. నిన్నటి వరకూ ప్రపంచంలో తాము ఎంతో భక్తితో సేవించిన దేవతలనే వారు ప్రళయదినాన త్రోసిపుచ్చుతారు. ఎందుకంటే తమను ఆదుకునే శక్తి వారికి ఏమాత్రం లేదని అర్థమైపోయింది (ఫత్హుల్ ఖదీర్). రెండవ అర్థం : ఆ బూటకపు దేముళ్లు తమ భక్తుల ఆరాధనలను త్రోసిపుచ్చుతారు. అసలు వారు తమను దైవానికి సాటిగా నిలబెట్టిన సంగతి తమకు తెలియదని అంటారు.

20. అంటే విశ్వాసం – అవిశ్వాసం ప్రాతిపదికపై ఆనాడు మానవ సమాజాలు విభజించబడతాయి. విశ్వసించినవారు స్వర్గం వైపుకు కొనిపోబడతారు. తిరస్కారులు, ముష్రిక్కులు నరకంవైపుకు తీసుకుపోబడతారు. ఆ విధంగా వారి మధ్య శాశ్వతంగా ఎడబాటు జరుగుతుంది. ఇక వారెన్నడూ ఏకం కాలేరు. లెక్కల అనంతరం ఈ తీర్పు జరుగుతుంది. రాబోయే ఆయతులో ఈ వేర్పాటు గురించి మరింతగా వివరించబడింది.

21. స్వర్గంలో వారికి అపూర్వ స్వాగత సత్కారాలు లభిస్తాయి. దాంతో వారి ఆనందానికి అంతులేకుండా పోతుంది.

22. అంటే – వారు ఎల్లకాలం దైవశిక్షను చవిచూస్తూ, శిక్షలోనే మ్రగ్గుతూ ఉంటారు. అందులో నుంచి వారు బయటపడలేరు.

23. దివ్య ఖుర్ఆన్‌లో సూచించబడిన ఈ వేళలు కూడా దేవుని నిదర్శనాలలోనివే. ఈ వివిధ వేళల ద్వారా దేవుడు తన దాసులకు మార్గదర్శకత్వం వహిస్తున్నాడు. ఈ వేళలు ఒండొకదాన్ని వెంటాడుతూ వస్తాయి. దేని ప్రయోజనాలు దానివి. వాటిని దైవదాసులు తనివితీరా ఆస్వాదిస్తున్నారు. కాబట్టి ఆయా వేళల్లో వారు దైవాన్ని స్మరించాలి. ఆయన

19 ఆయనే సజీవిని నిర్జీవి నుంచి, నిర్జీవిని సజీవి నుంచి వెలికి తీస్తాడు.[24] ఆయనే భూమిని అది చచ్చిన తరువాత బ్రతికిస్తాడు. మీరు (కూడా) అలాగే తీయబడతారు.[25]

يُخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَيُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَيُحْيِ الْأَرْضَ بَعْدَ مَوْتِهَا ۚ وَكَذَٰلِكَ تُخْرَجُونَ ﴿١٩﴾

20 ఆయన సూచనలలో ఒకటేమంటే; ఆయన మిమ్మల్ని మట్టితో పుట్టించాడు. ఆ తరువాత మీరు మానవులుగా మారి వ్యాపిస్తున్నారు.[26]

وَمِنْ آيَاتِهِ أَنْ خَلَقَكُم مِّن تُرَابٍ ثُمَّ إِذَا أَنتُم بَشَرٌ تَنتَشِرُونَ ﴿٢٠﴾

21 మరి ఆయన సూచనలలోనే ఒకటేమంటే; ఆయన మీ కోసం స్వయంగా మీలో నుంచే భార్యలను సృజించాడు[27] – మీరు వారి వద్ద ప్రశాంతత పొందటానికి![28] ఆయన మీ మధ్య ప్రేమనూ, దయాభావాన్నీ పొందుపరచాడు.[29] నిశ్చయంగా ఆలోచించే వారి కోసం ఇందులో ఎన్నో సూచనలున్నాయి.

وَمِنْ آيَاتِهِ أَنْ خَلَقَ لَكُم مِّنْ أَنفُسِكُمْ أَزْوَاجًا لِّتَسْكُنُوا إِلَيْهَا وَجَعَلَ بَيْنَكُم مَّوَدَّةً وَرَحْمَةً ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ لِّقَوْمٍ يَتَفَكَّرُونَ ﴿٢١﴾

పవిత్రతను కొనియాడాలి. మగ్రిబ్ (సూర్యాస్తమయం) రాత్రి చీకటిని సూచిస్తుంది. రాత్రి చీకటి నుంచి చీల్చుకు వచ్చే ధవళరేఖలు (ఫజ్ర్) ఉదయానికి సంకేతం వంటివి. ఇషా సమయం దట్టమైన చీకటికి ఆనవాలు. జుహ్ర్ సమయం పగటి వెలుగుకు పరాకాష్ఠ వంటిది. కాబట్టి ఈ వేళల్లో దైవాన్ని స్మరించి, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఈ రెండు ఆయతులలోనూ, రోజూ ఐదు పూటల నమాజుల ప్రస్తావన ఉందని కొంతమంది వివరించారు. **'తుమ్సూన'** (تُمْسُونَ) అనే అరబీ పదంలో మగ్రిబ్, ఇషా నమాజులు ఉన్నాయి. **'తుస్బిహూన'** (تُصْبِحُونَ) అనే పదంలో ఫజ్ర్ నమాజ్ వచ్చేసింది. **'అషియ్యన్' (عَشِيًّا)** లో అస్ర్ నమాజు, **'తుజ్హిరూన' (تُظْهِرُونَ)** లో జుహ్ర్ నమాజూ ఉన్నాయి (ఫత్‌హుల్ ఖదీర్). దివ్య ఖుర్ఆన్‌లోని ఈ రెండు ఆయతులను ఉదయం, సాయంత్రం పఠించటంవల్ల అహోరాత్రుల పొరపాట్లన్నీ మన్నించబడతాయని ఒక బలహీన హదీసులో ఉంది (అబూదావూద్ – కితాబుల్ అదబ్).

24. ఉదాహరణకు : గ్రుడ్డునుండి పక్షిని, పక్షి నుంచి గ్రుడ్డును తీస్తాడు. అలాగే మనిషి నుంచి వీర్యాన్ని తీస్తాడు, వీర్యం నుంచి మనిషిని తీస్తాడు. విశ్వాసి నుంచి అవిశ్వాసిని, అవిశ్వాసి నుంచి విశ్వాసినీ తీస్తాడు.

25. అంటే సమాధుల నుంచి బ్రతికించి లేపబడతారు.

26. అంటే వివిధ దశలను అధిగమించిన తరువాత సంపూర్ణ మానవాకారాన్ని సంతరించుకుంటారు. ఈ వివిధ దశలు ఎలా ఉంటాయో, దివ్య ఖుర్ఆన్‌లో ఇతరచోట్ల ప్రస్తావించటం జరిగింది. **తన్‌తషిరూన** (تَنتَشِرُونَ) అంటే విస్తరించటం. అంటే మనిషి దైవ కృపను (జీవనోపాధిని) వెతుక్కుంటూ భూమిలో నలువైపులా వ్యాపిస్తాడు. దేశదేశాలు సంచరిస్తాడు.

27. అంటే మీ కోవలో నుంచే ఆడవారిని సృష్టించాడు. వారు మీకు జత కావటానికి! మీరు వారి ద్వారా, వారు మీ ద్వారా సుఖప్రాప్తిని పొందటానికి!! అరబీలో **జవ్‌జున్ (زَوْج)** అంటే జంట లేక జత అని అర్థం. ఆడది మగవానికి, మగవాడు ఆడదానికి జత (జౌజ్) అన్నమాట! దేవుడు లోకంలో తొలి స్త్రీ – హవ్వాను– సృజించేటప్పుడు ఆది మానవుడైన ఆదం ఎడమ వైపు ప్రక్కటెముక నుంచే ఆమెను సృష్టించాడు. ఆ తరువాత ఆ మానవ జంట ద్వారా అవనిలో మానవ జాతిని వ్యాపింపజేశాడు.

28. స్త్రీ పురుషులిద్దరూ – ఒకే జాతికి చెందినవారై ఉండి, వారిద్దరూ జంటగా ఏర్పడటం వల్ల సహజమైన ప్రశాంతత, హాయి వారిద్దరికీ లభిస్తోంది. అలాగాకుండా వారిద్దరిలో ఒకరు మనుజ జాతికి చెందినవారు, మరొకరు జిన్నాతుల కోవకు చెందినవారై ఉంటే ఇరువురూ ఎన్నడూ ప్రశాంతంగా ఉండలేరు. పైగా వారిమధ్య అసహ్యభావం పెంపొంది,

22 భూమ్యాకాశాల సృష్టి, మీ భాషల్లో, రంగుల్లో ఉన్న వైవిధ్యం కూడా ఆయన (శక్తి) సూచనలలోనివే.[30] జ్ఞాన సంపన్నుల కోసం ఇందులో పలు సూచనలున్నాయి.

وَمِنْ اٰيٰتِهٖ خَلْقُ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَاخْتِلَافُ اَلْسِنَتِكُمْ وَاَلْوَانِكُمْ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّلْعٰلِمِيْنَ ﴿٢٢﴾

23 (ఇంకా) ఆయన (శక్తి) సూచనలలో రాత్రివేళ, పగటిపూట మీరు నిద్రపోవటం, మీరు ఆయన కృపను (జీవనోపాధిని) అన్వేషించటం కూడా ఉన్నాయి.[31] (జాగ్రత్తగా) వినేవారికి ఇందులో అనేక సూచనలున్నాయి.

وَمِنْ اٰيٰتِهٖ مَنَامُكُمْ بِالَّيْلِ وَالنَّهَارِ وَابْتِغَآؤُكُمْ مِّنْ فَضْلِهٖ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يَّسْمَعُوْنَ ﴿٢٣﴾

---

దాంపత్య జీవితం దుర్భరమవుతుంది. అందుకే అల్లాహ్ మానవ జంటలను మానవుల్లో నుంచే సృజించి వారికి మహోపకారం చేశాడు.

29. **'మవద్దతున్' (مَوَدَّة)** అంటే ప్రేమ అని అర్థం. భర్త భార్యను అమితంగా ప్రేమిస్తాడు. అలాగే భార్య భర్తను అమితంగా ప్రేమిస్తుంది. ఈ విషయం జగద్విదితమే. ఆలుమగల మధ్య కనిపించే ఈ అపురూపమైన ప్రేమానురాగాలు ప్రపంచంలో మరే ఇద్దరు వ్యక్తుల మధ్య కూడా కనిపించవు. ఇక 'దయాభావం' గురించి చెప్పాలంటే భర్త భార్యకోసం అష్టకష్టాలూ పడి ఆమెను సుఖపెట్టేందుకు ప్రయత్నిస్తాడు. ఉన్నంతలోనే ఆమె కొరకు మంచి మంచి సౌలభ్యాలను సమకూరుస్తాడు. అలాగే భార్య తన భర్తకోసం సర్వస్వాన్నీ అర్పిస్తుంది. అతని యోగక్షేమాల కోసం చేయగలిగినంతా చేస్తుంది.

అయితే ఈ దంపతులకు ప్రశాంతత, నిజమైన ప్రేమానురాగాలు లభించేది ఎప్పుడు? వారు కట్టుకున్న అనురాగ గోపురం పటిష్టంగా ఉండగలిగేది ఎప్పుడు?? అంటే షరీయతు ఆమోదించిన పద్ధతి ప్రకారం – 'నికాహ్' ద్వారా – భార్యాభర్తలైనపుడే. వీరినే ఇస్లాం దంపతులుగా ఖరారు చేసింది. వారి హక్కులు – బాధ్యతలను నిర్దేశించింది. చట్ట విరుద్ధమైన దంపతులను (అక్రమంగా జతకట్టిన వారిని) అది భార్యాభర్తలుగా అంగీకరించదు. పైగా అలాంటివారిని వ్యభిచారులుగా, దుర్మార్గులుగా ప్రకటిస్తుంది. వారికోసం శిక్షల్ని ప్రతిపాదిస్తుంది. అయితే పాశ్చాత్య నాగరికతా ధ్వజవాహకులు ఈ మధ్య పైశాచిక ఆలోచనలతో ముందుకు వచ్చి పాశ్చాత్య తరహా అక్రమ జంటలకు ముస్లిం దేశాల్లో కూడా ఫ్రీగా లైసెన్సులు ఇచ్చి, 'నికాహ్' అనే వైవాహిక వ్యవస్థను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అక్రమ సంబంధం పెట్టుకుని జీవిస్తున్న వారిని కూడా దంపతులుగా గుర్తించమని ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఆలోచనలు పవిత్ర జీవితానికి గొడ్డలిపెట్టు వంటివనటంలో సందేహం లేదు.

30. ప్రపంచంలో ప్రజలు మాట్లాడే భాషలు అసంఖ్యాకం. ఇది కూడా దైవసూచనలకు ప్రతిబింబమే. అరబీ, ఆంగ్లం, ఫ్రెంచి, ఉర్దూ, హిందీ, పారసీకం వంటి అంతర్జాతీయ స్థాయి భాషలే గాక ప్రతి దేశంలో వేర్వేరు భాషలున్నాయి. ఒక్క భారతదేశంలోనే ఒక డజనుకు పైగా గుర్తింపు పొందిన భాషలున్నాయి. గుర్తింపు పొందని భాషలు ఇంకా అనేకం. మరి ఒకే భాషలో అనేక మాండలికాలు, యాసలు ఉంటాయి. ప్రతి వ్యక్తీ తాను మాట్లాడే యాసనుబట్టి ఏ ప్రాంతంవాడో ఇట్టే గుర్తించబడతాడు. ఈ విధంగా మనిషి మాట్లాడే భాష లేక అతని యాస అతన్ని పరిచయం చేసేసుకుంటుంది. అలాగే కోట్లాది మంది మానవులు ఒకే తల్లిదండ్రులైన ఆదం – హవ్వాల నుంచి వచ్చినవారైనప్పటికీ వారి రంగులు వేరు, రూపురేఖలు వేరు. ప్రతి ఒక్కరూ ఇతరులకన్నా భిన్నంగా, విలక్షణంగా కనిపిస్తారు. వారిలో కొందరు తెల్లవారు, కొందరు నల్లవారు, కొందరు చామనచాయ, కొందరు గోధుమ రంగు గలవారున్నారు. అలాగే కొందరు పొట్టివారు, కొందరు పొడుగరులు. ప్రతి దేశం, ప్రతి ఖండంవారు తమ శరీరాకృతిని బట్టి ఇట్టే తెలుసుకోబడతారు. అంతేకాదు, ఒకే తల్లి బిడ్డలైన ఇద్దరు అన్నదమ్ములు కూడా భిన్నంగా కనిపిస్తారు. ఇదంతా ఆ సృష్టికర్త అపురూప సృష్టికి ప్రబల తార్కాణం.

31. నిద్ర ద్వారా మనిషి అలసటను దూరం చేసుకుంటాడు. హాయిని పొందుతాడు. రాత్రి నిద్ర ఎలాగూ ఉంది. కాని

**24** ఇంకా ఆయన సూచనలలో (ఇంకొకటి) ఏమిటంటే; ఆయన మిమ్మల్ని భయపెట్టటానికి, ఆశపెట్టటానికి మెరుపును చూపిస్తున్నాడు.[32] ఆకాశం నుంచి వర్షం కురిపిస్తున్నాడు. మరి దాని ద్వారా మృతభూమికి జీవం పోస్తున్నాడు. ఇందులో కూడా బుద్ధిజీవుల కోసం ఎన్నో నిదర్శనాలున్నాయి.

وَمِنْ اٰيٰتِهٖ يُرِيْكُمُ الْبَرْقَ خَوْفًا وَّطَمَعًا وَّيُنَزِّلُ
مِنَ السَّمَآءِ مَآءً فَيُحْيٖ بِهِ الْاَرْضَ بَعْدَ مَوْتِهَا ؕ
اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يَّعْقِلُوْنَ ﴿24﴾

**25** ఆయన సూచనలలో (వేరొకటి) ఇది కూడా ఉంది : భూమ్యాకాశాలు ఆయన ఆదేశంతోనే నెలకొని ఉన్నాయి. మరి ఆయన మిమ్మల్ని పిలువగానే, ఒక్క పిలుపుపైనే మీరంతా భూమిలో నుంచి బయటికి వస్తారు.[33]

وَمِنْ اٰيٰتِهٖۤ اَنْ تَقُوْمَ السَّمَآءُ وَالْاَرْضُ بِاَمْرِهٖ ؕ
ثُمَّ اِذَا دَعَاكُمْ دَعْوَةً ۖۗ مِّنَ الْاَرْضِ ۖۗ اِذَاۤ اَنْتُمْ
تَخْرُجُوْنَ ﴿25﴾

**26** ఆకాశాలలో, భూమిలో ఉన్న ప్రతి వస్తువూ ఆయనదే. అన్నీ ఆయన ఆజ్ఞకే లోబడి ఉన్నాయి.[34]

وَلَهٗ مَنْ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ
كُلٌّ لَّهٗ قٰنِتُوْنَ ﴿26﴾

**27** ఆయనే సృష్టి (ప్రక్రియ)ని ప్రారంభిస్తున్నాడు. మరి ఆయనే దాన్ని పునరావృతం చేస్తాడు. ఇది ఆయనకు చాలా తేలిక. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఆయన గుణగణాల దర్పమే సర్వోన్నతమైనది.[35] ఆయన సర్వాధిక్యుడు, వివేకవంతుడు.

وَهُوَ الَّذِيْ يَبْدَؤُا الْخَلْقَ ثُمَّ يُعِيْدُهٗ وَهُوَ اَهْوَنُ
عَلَيْهِ ؕ وَلَهُ الْمَثَلُ الْاَعْلٰى فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ
وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿27﴾

**28** అల్లాహ్ మీ కోసం స్వయంగా మీకు సంబంధించిన ఉదాహరణనే ఇస్తున్నాడు – మేము మీకు ప్రసాదించిన సంపదలో మీతో సమంగా పంచుకునే మీ బానిసలు ఎవరయినా ఉన్నారా?[36]

ضَرَبَ لَكُمْ مَّثَلًا مِّنْ اَنْفُسِكُمْ ؕ هَلْ لَّكُمْ مِّنْ مَّا
مَلَكَتْ اَيْمَانُكُمْ مِّنْ شُرَكَآءَ فِيْ مَا رَزَقْنٰكُمْ فَاَنْتُمْ

---

పగటి పూట కూడా–ముఖ్యంగా మధ్యాహ్నం పూట కాస్సేపు నిద్రపోయి నూతనోత్తేజాన్ని సంతరించుకుంటాడు. అలాగే సంపాదన కోసం వ్యాపారం చేస్తాడు, ప్రయాణం చేస్తాడు. వ్యవసాయం చేస్తాడు. కార్యాలయాల వైపుకు, కార్ఖానాల వైపుకు, కర్మాగారాల వైపుకు పరుగులు తీస్తాడు. ఇదంతా దైవానుగ్రహాన్ని అన్వేషించటం క్రిందికి వస్తుంది.

32. ఆకాశంలో మేఘాలు దట్టంగా క్రమ్ముకుని మెరుపులు మెరిసినప్పుడు, ఆకాశ గర్జన మొదలైనపుడు మీరు కించిత్ భయానికి గురవుతారు – మీపై పిడుగు ఎక్కడ పడుతుందోనని! అదే సమయంలో పడబోయే వర్షపు నీరు వల్ల మొక్కలు మొలకెత్తుతాయనీ, పంటలు పండుతాయని కొండంత ఆశ కూడా పెట్టుకుంటారు.

33. నేడు దైవాజ్ఞానుసారం స్థిరంగా నిలబడి వున్న ఈ భూమ్యాకాశాలు ప్రళయఘడియ వచ్చినప్పుడు ఛిన్నాభిన్నమవుతాయి. మొత్తం విశ్వవ్యవస్థ అంతా అతలాకుతలమై పోతుంది. సమాధుల్లో ఉన్న మనుషులంతా లేచివస్తారు.

34. తిరుగులేని దైవాజ్ఞకు అన్నీ బద్ధులై ఉన్నాయి. ఉదాహరణకు : జీవన్మరణాలు, ఆరోగ్యం – అనారోగ్యం, జయాపజయాలు మొదలగునవి.

35. అంటే ఇన్ని గొప్ప శక్తులు గలవాడు, మంచి గుణాలుగలవాడు లోకంలో ఎవ్వడూ లేడు. ఎవరినీ ఆయనతో సరిపోల్చటం సంభవం కాదు. ఆయన అద్వితీయుడు, సర్వోన్నతుడు.

36. మీలాంటి మనుషులే అయిన మీ బానిసలు, నౌకర్లు, ఉద్యోగులు మీ ఆస్తిపాస్తుల్లో మీకు సమాన భాగస్థులు కావటాన్ని మీరు స్వయంగా ఇష్టపడరు. మరలాంటప్పుడు దేవునిచేత సృష్టించబడిన దైవదాసులు, దైవదూతలు,

మీరు మీ తోటి వారికి భయపడినట్లు వారికి భయపడు తున్నారా?[37] బుద్ధీ వివేచనలున్న వారి కోసం మేము ఈ విధంగా సూచనలను విడమరచి చెబుతుంటాము.[38]

فِيهِ سَوَآءٌ تَخَافُونَهُمْ كَخِيفَتِكُمْ أَنفُسَكُمْ ۚ
كَذَٰلِكَ نُفَصِّلُ ٱلْءَايَٰتِ لِقَوْمٍ يَعْقِلُونَ ﴿28﴾

**29** అసలు విషయం ఏమిటంటే ఈ దుర్మార్గులు జ్ఞానంతో నిమిత్తం లేకుండానే[39] తమ కోర్కెలను అనుసరిస్తున్నారు. అల్లాహ్ అపమార్గం పట్టించినవాణ్ణి ఎవడు సన్మార్గానికి తేగలడనీ?[40] అలాంటి వారికి తోడ్పడేవాడు ఎవడూ లేడు.[41]

بَلِ ٱتَّبَعَ ٱلَّذِينَ ظَلَمُوٓا۟ أَهْوَآءَهُم بِغَيْرِ عِلْمٍ ۖ
فَمَن يَهْدِى مَنْ أَضَلَّ ٱللَّهُ ۖ وَمَا لَهُم
مِّن نَّٰصِرِينَ ﴿29﴾

**30** కనుక నీవు ఏకాగ్రతతో నీ ముఖాన్ని (అల్లాహ్) ధర్మంపై నిలుపు.[42] అల్లాహ్ మానవులను ఏ స్వభావంపై పుట్టించాడో ఆ స్వభావంపైన్నే (ఉండండి).[43] అల్లాహ్ సృష్టిని మార్చకూడదు సుమా![44] ఇదే సరైన ధర్మం.[45] కాని చాలామంది తెలుసుకోరు.[46]

فَأَقِمْ وَجْهَكَ لِلدِّينِ حَنِيفًا ۚ فِطْرَتَ ٱللَّهِ ٱلَّتِى فَطَرَ
ٱلنَّاسَ عَلَيْهَا ۚ لَا تَبْدِيلَ لِخَلْقِ ٱللَّهِ ۚ ذَٰلِكَ ٱلدِّينُ
ٱلْقَيِّمُ وَلَٰكِنَّ أَكْثَرَ ٱلنَّاسِ لَا يَعْلَمُونَ ﴿30﴾

దైవసందేశహరులు, పుణ్య పురుషులు, చెట్టుపుట్టలు, రాళ్ళు రప్పలు, విగ్రహాలు అల్లాహ్‌కు భాగస్వాములు కావటం ఎలా సాధ్యమవుతుంది? ఈ భాగస్వామ్యాన్ని దేవుడు మాత్రం ఎలా సమ్మతిస్తాడు?? మీ ఆస్తిపాస్తుల్లో మీ ఇంటి నౌకర్లు భాగస్థులు కావటాన్ని మీరు ఇష్టపడనట్లే దేవుడు కూడా తన దైవత్వంలో వేరొకరిని నిలబెట్టడాన్ని ఇష్టపడడు. అందుకే అల్లాహ్‌తో పాటు వేరొకరిని ఆరాధ్యులుగా కల్పించటం, సహాయం కొరకు వారిని అర్థించటం అన్యాయం, అక్రమం, దారుణం!

37. మీరే చెప్పండి! మీరు వారసత్వ పంపకం లాంటి విషయాల్లోగానీ, ఉమ్మడి వాణిజ్యంలో గానీ మీ ఆత్మీయులకు, పార్ట్‌నర్‌లకు భయపడినట్లుగానే మీ నౌకర్లకు కూడా భయపడుతున్నారా?! ముమ్మాటికీ భయపడరు. ఎందుకంటే వారు మీ పెట్టుబడుల్లోనూ, ఆస్తుల్లోనూ భాగస్వాములు కారు కాబట్టి.

38. ఎందుకంటే బుద్ధీ వివేచనలు గలవారు తమ బుర్రకు పదును పెడతారు. సంబంధిత ఆయతులపై యోచన చేస్తారు. తత్ఫలితంగా వారి మార్గం సుగమం అవుతుంది. కాని మూర్ఖులు అలా కాదు. ఎంతో స్పష్టమైన "ఏకదైవోపాసన" (తౌహీద్) సయితం వారికి మింగుడుపడదు.

39. ఎందుకంటే వారికి యదార్థం బోధపడదు. యదార్థాన్ని గ్రహించే ప్రయత్నం కూడా వారు చేయరు. అర్థంపర్థం లేకుండా ఆచరించి మార్గవిహీనతకు లోనవుతుంటారు. వారి మార్గవిహీనతకు మూలకారణం వారు తమ వివేచనను విడనాడటమే. పైగా వారు తమ మనోవాంఛల వెనుక పరుగులు తీసి కష్టాలను కోరి తెచ్చుకుంటారు.

40. ఎందుకంటే సన్మార్గాన్ని పొందాలన్న ఆరాటం, తపన ఉన్నవారికే దేవుని మార్గదర్శకత్వం లభిస్తుంది. ఈ అభిలాషలేని వారిని దేవుడు అపమార్గాన వదలిపెట్టేస్తాడు.

41. అంటే అపమార్గాన దూసుకుపోయే వారికి ఎవరూ సన్మార్గం ప్రసాదించటంగానీ, లేదా వారికి శిక్షపడకుండా చేయటంగానీ ఎవరూ చేయలేరు.

42. అంటే దేవుని ఏకత్వం (తౌహీద్)పై, ఆయన ఆరాధనపై స్థిరంగా ఉండండి. మిథ్యా ధర్మాల వైపుకు వెళ్ళకండి.

43. **'స్వభావం' (فِطْرَة)** అంటే ఇక్కడ అసలు అర్థం సహజత్వం లేక నైజం. వేరేమాటల్లో చెప్పాలంటే దేవుడు మానవుణ్ణి సహజధర్మంపై – దేవుని ఏకత్వపు భావనపై – పుట్టించాడు. కాబట్టి మానవ నైజంలో దేవుని ఏకత్వం (తౌహీద్) అంతర్లీనమైవుంది. పుట్టుకరీత్యా ప్రతి మనిషీ దైవవిధేయునిగానే ఉంటాడు. అతనిపై 'అలస్తు ప్రమాణ' ప్రభావం ఉంటుంది. కాకపోతే మనిషి పుట్టిన తరువాత పరిసరాల ప్రభావానికి గురవుతాడు. అతను కళ్ళు తెరచిన సమాజం

**31** (ప్రజలారా!) అల్లాహ్ వైపునకే మరలి, ఆయనకు భయ పడుతూ ఉండండి. నమాజును నెలకొల్పండి. ముష్రికులలో చేరకండి.[47]

مُنِيبِينَ إِلَيْهِ وَاتَّقُوهُ وَأَقِيمُوا الصَّلَاةَ وَلَا تَكُونُوا مِنَ الْمُشْرِكِينَ ﴿31﴾

**32** వారు తమ ధర్మాన్ని ముక్కచెక్కలు చేసేశారు. వారు సయితం విభిన్న ముఠాలుగా చీలిపోయారు.[48] ప్రతి ముఠా తన దగ్గర ఉన్న దానితోనే తెగ సంబరపడిపోతోంది.[49]

مِنَ الَّذِينَ فَرَّقُوا دِينَهُمْ وَكَانُوا شِيَعًا ۖ كُلُّ حِزْبٍ بِمَا لَدَيْهِمْ فَرِحُونَ ﴿32﴾

**33** ప్రజల (పరిస్థితి ఎలాంటిదంటే; వారి) పై ఎప్పుడైనా, ఏదైనా ఆపద వచ్చిపడితే తమ ప్రభువు వైపునకు (పూర్తిగా) మరలి ప్రార్థనలు చేస్తారు. మరి ఆయన తన తరఫు నుంచి కారుణ్య రుచిని చూపించగానే, వారిలోని ఒక వర్గం తమ ప్రభువుకు సహవర్తుల్ని కల్పించసాగుతుంది–

وَإِذَا مَسَّ النَّاسَ ضُرٌّ دَعَوْا رَبَّهُم مُّنِيبِينَ إِلَيْهِ ثُمَّ إِذَا أَذَاقَهُم مِّنْهُ رَحْمَةً إِذَا فَرِيقٌ مِّنْهُم بِرَبِّهِمْ يُشْرِكُونَ ﴿33﴾

అతన్ని సహజ ధర్మం వైపుకు పోనివ్వదు. అందువల్ల అతడు అవిశ్వాస స్థితిపైనే ఉండిపోతుంటాడు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) హదీసు ఈ సందర్భంగా గమనించదగినది : "ప్రతి పిల్లవాడూ తన సహజ ధర్మంపైనే పుడతాడు. కాని అతని తల్లిదండ్రులు అతన్ని యూదునిగానో, క్రైస్తవునిగానో, జోరాష్ట్రియన్‌గానో మార్చివేస్తారు." (సహీహ్ బుఖారీ – అర్రూమ్ సూరా వ్యాఖ్యానం)

44. అంటే దేవుని ఈ నిర్మాణాన్ని (సహజత్వాన్ని) మార్చివేయకండి. పైగా మంచి విద్యా శిక్షణలతో పిల్లలను పెంచండి. బాల్యం నుంచే పిల్లల మనోక్షేత్రాలలో దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ను) నాటండి. అరబీలో **"లా తబ్‌దీల లి ఖల్‌ఖిల్లాహ్"** అని ఉంది. దీనికి శాబ్దిక అర్థం "అల్లాహ్ సృష్టిలో మార్పు లేదు" అని వస్తుంది. అయినప్పటికీ భావం రీత్యా మాత్రం అల్లాహ్ సృష్టిలో మార్పు చేయరాదనే దాని అర్థం. అంటే వాక్యం సందేశాత్మకం, భావం మాత్రం ఆదేశాత్మకం అన్నమాట!

45. ఎట్టి పరిస్థితిలోనూ ఈ సరైన ధర్మంపై నిలకడగా ఉండాలి. మానవ నైజం వాంఛించేది కూడా ఇదే.

46. అందుకే ఇస్లాం గురించి, ఏకదైవోపాసన (తౌహీద్) గురించి వారికి బొత్తిగా తెలీదు.

47. అంటే విశ్వాసాన్నీ, భయభక్తుల మార్గాన్ని విడనాడి, నమాజులను పరిత్యజించి సావాస దోషానికి లోనుకాకండి. ఈ సావాస దోషం లేక భావదారిద్ర్యమే మీ 'వ్యక్తిత్వాన్ని' చెరిపేసి, మిమ్మల్ని బహుదైవోపాసనా వాతావరణం ద్వారా కలుషితం చేసివేస్తుంది.

48. అంటే నిజధర్మం ఇస్లాంను వదలిపెట్టి లేదా అందులో ఇష్టమొచ్చినట్లు మార్పులు చేర్పులు చేసి విభిన్న ముఠాలుగా, తెగలుగా చీలిపోవటం. యూదులు, క్రైస్తవులు, మజూసీలు పూర్వం ఇలాగే చేశారు.

49. అంటే ప్రతి ముఠా వారూ తమ అభిమతాన్నే సరైనదిగా భావించి, ఇతరుల దృక్పథాన్ని దోషపూరితమైనదిగా తలపోస్తారు. తమ అభిమతానికనుగుణంగా తాము కనుగొన్న కొన్ని ఆధారాలను పదే పదే ఉదాహరిస్తూ అదే సర్వస్వం అనుకుంటుంటారు. దురదృష్టవశాత్తు నేడు ముస్లిం జగతిలో ఈ ధోరణి బాగా ప్రబలిపోయింది. ప్రతి ముఠా వారు తామెన్నుకున్న పద్ధతే సత్యబద్ధమైనదనే అపోహకు లోనై ఉన్నారు. మరి వాస్తవానికి సత్యంపై ఉండేది ఒక్కగానొక్క వర్గమే. తన సంప్రదాయాన్నీ, తన ప్రియ సహచరుల పద్ధతిని అనుసరించేవారే సన్మార్గగాములు అని మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు చెప్పారు.

لِيَكْفُرُوا بِمَآ اٰتَيْنٰهُمْ ؕ فَتَمَتَّعُوْا ٝ فَسَوْفَ
تَعْلَمُوْنَ ﴿34﴾

**34** మేము వారికి అనుగ్రహించిన దానిపై కృతఘ్నత చూపటానికి?![50] సరే. లబ్ధి పొందండి! అతి త్వరలోనే (పరిణామం) మీకు తెలిసిపోతుంది.

اَمْ اَنْزَلْنَا عَلَيْهِمْ سُلْطٰنًا فَهُوَ يَتَكَلَّمُ
بِمَا كَانُوْا بِهٖ يُشْرِكُوْنَ ﴿35﴾

**35** ఏమిటీ; వారు పాల్పడే షిర్కును సమర్థిస్తూ మాట్లాడే ప్రమాణాన్ని దేన్నయినా మేము వారిపై దించామా?[51]

وَاِذَآ اَذَقْنَا النَّاسَ رَحْمَةً فَرِحُوْا بِهَا ؕ وَاِنْ
تُصِبْهُمْ سَيِّئَةٌ ۢ بِمَا قَدَّمَتْ اَيْدِيْهِمْ اِذَا هُمْ
يَقْنَطُوْنَ ﴿36﴾

**36** మరి మేము ప్రజలకు కారుణ్యం రుచిని చూపించినపుడు వారు ఆనందంతో ఉబ్బిపోతారు. మరి ఒకవేళ తమ చేజేతులా చేసుకున్న చేష్టల మూలంగా వారికి ఏదైనా కీడు కలిగితే మాత్రం పూర్తిగా నిరాశచెందుతారు.[52]

اَوَلَمْ يَرَوْا اَنَّ اللّٰهَ يَبْسُطُ الرِّزْقَ لِمَنْ يَّشَآءُ
وَيَقْدِرُ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ ﴿37﴾

**37** ఏమిటీ, అల్లాహ్ తాను కోరిన వారికి విస్తృతంగా జీవనోపాధిని ఇచ్చి, తాను కోరిన వారికి కుదించి ఇవ్వటాన్ని వారు చూడలేదా?[53] నిశ్చయంగా ఇందులో కూడా విశ్వసించేవారికి సూచనలు ఉన్నాయి.

فَاٰتِ ذَا الْقُرْبٰى حَقَّهٗ وَالْمِسْكِيْنَ وَابْنَ السَّبِيْلِ ؕ
ذٰلِكَ خَيْرٌ لِّلَّذِيْنَ يُرِيْدُوْنَ وَجْهَ اللّٰهِ ۫
وَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ﴿38﴾

**38** కనుక సమీప బంధువుకు అతని హక్కును ఇవ్వు. అగత్యపరునికి, బాటసారికి కూడా(వారి హక్కులను ఇవ్వాలి).[54] అల్లాహ్ సమ్ముఖ దర్శన భాగ్యం పొందగోరేవారికి[55] ఈ పద్ధతి ఉత్తమమైనది. సాఫల్యం పొందేవారంటే వీరే.

50. ఇదే విషయం అన్కబూత్ సూరా చివరి భాగంలో కూడా ప్రస్తావనకు వచ్చింది.

51. ముమ్మాటికీ అలాంటి ప్రమాణం ఏదీ వారివద్దకు పంపబడలేదు. అల్లాహ్కు వారు కల్పించే భాగస్వామ్యాలన్నీ నిరాధారమైనవి. షిర్క్ను ఖండించి, ఏక దైవారాధనను నిరూపించడానికి దేవుడు తన సందేశహరులను పంపించి ఉండగా షిర్క్ను సమర్థించే ప్రమాణపత్రాలను ఆయన ఎలా పంపిస్తాడు? దైవప్రవక్తలంతా అన్నిటికంటే ముందు మానవాళికి ఇచ్చిన సందేశం ఒక్కటే – మీ ఆరాధ్య దైవం అయిన అల్లాహ్ను ఆరాధించండని, ఆయన తప్ప ఇంకొక దేవుడు లేనేలేడని! దురదృష్టకరమైన విషయం ఏమిటంటే నేడు ముస్లిముల మధ్య నిలబడి వారికి ఏకదైవారాధన (తౌహీద్) గురించి అన్యులకు బోధపరచినట్లు బోధించాల్సి వస్తోంది. ఎందుకంటే ముస్లింలలో మెజారిటీ జనులు బహుదైవోపాసనా పోకడలకు లోనై పోయారు. దైవప్రవక్త (స) సంప్రదాయాన్ని వదిలేసి కొత్తపుంతలు తొక్కుతున్నారు. అల్లాహ్ వారికి సన్మార్గం చూపుగాక!

52. హూద్ సూరాలో కూడా ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. ప్రజలలో చాలామంది పరిస్థితి ఇంతే. సుఖసౌఖ్యాలు ప్రాప్తించగానే గర్విష్టులైపోతారు. కష్టకాలం రాగానే కంగారెత్తిపోతారు. అయితే విశ్వాసులకు ఇది వర్తించదు. వారు కష్టాల్లో ఉన్నప్పుడు ఓర్పువహిస్తారు. కలిమిలో దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటారు. అంటే సత్కార్యాలు చేస్తారు. ఆ విధంగా సర్వకాల సర్వావస్థలు వారి పాలిట శ్రేయోదాయకంగా, పుణ్యప్రదంగా పరిణమిస్తాయి.

53. దేవుడు తన యుక్తిని, పరమార్థాన్ని బట్టి కొందరికి పుష్కలంగా ఉపాధిని ఇచ్చి, మరికొందరికి పరిమితంగా ఇస్తాడు. ఇరువురు వ్యక్తులు తెలివితేటల రీత్యా, ఒనరుల దృష్ట్యా సమ ఉజ్జీలుగా కనిపిస్తారు. వారు చేసే వ్యాపారం ఒక్కటే. అయితే వారిద్దరిలో ఒకడు వర్తకంలో గణనీయంగా వృద్ధి చెందుతాడు. రెండో వ్యక్తి మాత్రం ఎలాంటి ఎదుగూ

39 ప్రజల సొమ్ములలో చేరి వృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో ఎంతమాత్రం వృద్ధి చెందదు.[56] అయితే అల్లాహ్ ముఖాన్ని చూచేందుకు (ప్రసన్నతను చూరగొనేందుకు) మీరు జకాతు దానం ఇచ్చినట్లయితే – అలాంటి వారే (తమ సంపదలను) ఎన్నోరెట్లు వృద్ధిపరచుకున్న వారవుతారు.[57]

وَمَآ اٰتَيۡتُمۡ مِّنۡ رِّبًا لِّيَرۡبُوَا۟ فِىۡۤ اَمۡوَالِ النَّاسِ فَلَا يَرۡبُوۡا عِنۡدَ اللّٰهِ‌ۚ وَمَآ اٰتَيۡتُمۡ مِّنۡ زَكٰوةٍ تُرِيۡدُوۡنَ وَجۡهَ اللّٰهِ فَاُولٰٓـئِكَ هُمُ الۡمُضۡعِفُوۡنَ ﴿39﴾

40 ఆ అల్లాహ్‌యే మిమ్మల్ని సృష్టించాడు, తర్వాత మీకు ఉపాధిని సమకూర్చాడు, మరి ఆయనే మిమ్మల్ని చంపుతాడు, ఆ తరువాత మిమ్మల్ని బ్రతికిస్తాడు. చెప్పండి! ఈ పనులలో దేన్నయినా చేయగలవాడు మీరు కల్పించే భాగస్వాములలో ఎవడయినా ఉన్నాడా? వారు కల్పించే భాగస్వామ్యాల నుండి అల్లాహ్ ఎంతో పవిత్రుడు, ఉన్నతుడు.

اَللّٰهُ الَّذِىۡ خَلَقَكُمۡ ثُمَّ رَزَقَكُمۡ ثُمَّ يُمِيۡتُكُمۡ ثُمَّ يُحۡيِيۡكُمۡ‌ؕ هَلۡ مِنۡ شُرَكَآٮِٕكُمۡ مَّنۡ يَّفۡعَلُ مِنۡ ذٰ لِكُمۡ مِّنۡ شَىۡءٍ‌ؕ سُبۡحٰنَهٗ وَتَعٰلٰى عَمَّا يُشۡرِكُوۡنَ ﴿40﴾

బొదుగూ లేకుండా ఉంటాడు. ఎందుకిలా జరుగుతోంది! ఈ విధమైన వ్యత్యాసాల వెనుక ఉన్న పరమార్థం ఏమిటి? ఒక్కోసారి గొప్ప ధనవంతుడే అమాంతం దివాలా తీసి, అగత్యపరునిగా మారిపోతాడు. అలాగే నిన్నటివరకూ దరిద్రుడుగా ఉన్నవాడు నేడు ధనవంతుడైపోతాడు–ఇదంతా సాటిలేని అల్లాహ్ చేతుల్లోనే ఉంది.

54. ఈ విధంగా అల్లాహ్ తన కృపతో మీకు పుష్కలంగా ఉపాధిని ప్రసాదించి, మిమ్మల్ని శ్రీమంతులుగా చేసినప్పుడు మీరు దైవప్రసాదితమైన సంపదలో నుంచి హక్కుదారుల హక్కును తీసి ఇవ్వాలి. బంధువులకు, బాటసారులకు, నిరుపేదలకు మీ సొమ్ములో హక్కు ఉంది. బంధువుల హక్కు అందరికన్నా ముందువస్తుంది. నిరుపేదలైన బంధువుల పట్ల సద్వ్యవహారం చేయటం వల్ల రెట్టింపు పుణ్యం లభిస్తుంది. దానం ఇచ్చినందుకు ఒక పుణ్యఫలం, బంధుత్వ హక్కు చెల్లించినందుకు ఇంకొక పుణ్యఫలం! పైగా దీన్ని 'హక్కు' అని ప్రత్యేకంగా చెప్పటం జరిగింది. దానం చేసి గ్రహీత మనస్సును నొప్పించకుండా ఉండాలన్న ఉద్దేశంతో దాన్ని వారి హక్కుగా పేర్కొనటం జరిగింది.

55. అంటే స్వర్గంలో దైవదర్శన భాగ్యం పొందగోరే వారికి అని భావం.

56. వడ్డీ సొమ్మువల్ల ధనం పెరిగినట్లు పైకి కనిపించినా వాస్తవానికి అందులో పెరుగుదల ఉండదు. పైగా ఆ పాపిష్టి సొమ్ము ఇహపరాలలో దారిద్ర్యానికి, వినాశానికి హేతువు అవుతుంది. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), తదితర సహాబీలు (రజి), వారి శిష్యుల్లో చాలామంది ఈ ఆయతులోని **'రిబా'** అనే పదాన్ని 'వడ్డీ' భావంలో తీసుకోలేదు. దాన్ని వారు "అధిక లాభాన్ని ఆశించి ఇచ్చే కానుక"గా తలపోశారు. ఉదాహరణకు: ఒక పేదవాడు ఒక ధనవంతునికి, లేదా ఒక సామాన్య పౌరుడు ఒక పరిపాలకునికి ఏదన్నా ఒక కానుకను ఇచ్చి, దానికి ప్రతిగా గ్రహీత నుంచి ప్రాపంచిక స్వప్రయోజనాన్ని పెద్దమొత్తంలో ఆశిస్తాడు. తాను ఇచ్చిన దానికి అనేకరెట్లు లాభం తనకు చేకూరాలన్నది అతని ఉద్దేశం. ఇలాంటి కానుక ధర్మవిరుద్ధం కాకపోయినప్పటికీ, సంకల్పంలో ఉన్న కల్మషత్వం మూలంగా దైవ సన్నిధిలో దానికి పుణ్యఫలం లభించదు. ఈ నేపథ్యంలో ఆలోచించినప్పుడు ఈ వాక్యానికి తర్జుమా ఇలా ఉంటుంది: "మీరు ఏదన్నా కానుకను ఇచ్చి, దానికి బదులుగా (గ్రహీత నుంచి) మరింత ఎక్కువ లభించగలదని ఆశిస్తే, అలాంటి కానుకకు దైవసన్నిధిలో పుణ్యఫలం లభించదు." (ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్).

57. జకాతు, సదఖాత్ వంటి దానధర్మాల ద్వారా సంపదలో శుభం ఒనగూడుతుంది. దేవుని తరఫున ఆ సంపదలో సమృద్ధి (బరకత్) పొందుపరచబడుతుంది. అలాగే ప్రళయదినాన దాని పుణ్యఫలం ఎన్నో రెట్లు పెరిగి ఉంటుంది. ధర్మ సమ్మతంగా ఆర్జించిన సంపాదన నుండి చేసే దానం ఒక ఖర్జూరానికి సమానంగా ఉన్నాసరే అది పెరిగి పెరిగి ఉహుద్ పర్వతమంత అవుతుందని హదీసులో ఉంది. (సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్).

41 ప్రజలు చేజేతులా చేసుకున్న (పాప) కార్యాల మూలంగానే భూమిలోనూ, సముద్రంలోనూ కల్లోలం వ్యాపించింది. వారు చేసుకున్న కొన్ని చేష్టల ప్రతిఫలం అల్లాహ్ వారికి చవి చూపించ టానికి (ఇలా జరిగింది). బహుశా వారు (దీనివల్ల) దారికి తిరిగి రావచ్చేమోనని (కూడా ఈ విధంగా జరిగింది).[58]

ظَهَرَ الْفَسَادُ فِي الْبَرِّ وَالْبَحْرِ بِمَا كَسَبَتْ أَيْدِي النَّاسِ لِيُذِيقَهُم بَعْضَ الَّذِي عَمِلُوا لَعَلَّهُمْ يَرْجِعُونَ ﴿٤١﴾

42 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "భూమిలో సంచరించి, (మీ) పూర్వీకులకు ఏ గతి పట్టిందో కాస్త చూడండి! వారిలో అనేకులు ముష్రికులే."[59]

قُلْ سِيرُوا فِي الْأَرْضِ فَانظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الَّذِينَ مِن قَبْلُ ۚ كَانَ أَكْثَرُهُم مُّشْرِكِينَ ﴿٤٢﴾

58. **'భూమిలో'** అంటే జనులు నివసించే భూప్రదేశంలో అని అర్థం. **'సముద్రంలో'** అంటే సముద్ర మార్గాలలో, తీర ప్రదేశాలలో అని అర్థం. 'కల్లోలం' అంటే మానవ సమాజాలలోని ప్రశాంతతను హరించి, ప్రజా జీవితాన్ని స్థంభింపజేసే భయోత్పాత వాతావరణం అన్నమాట! అందువల్ల ఈ పదం చెడుపనులు, ధర్మోల్లంఘనా కార్యాలకు కూడా వర్తిస్తుంది. మనుషులు ఒండొకరిపై దౌర్జన్యం చేస్తున్నారు. దేవుడు విధించిన హద్దులను అతిక్రమిస్తున్నారు. నైతిక నియమాలను కాలరాస్తున్నారు. హత్యలు, దహనాలు సర్వసామాన్యమవుతున్నాయి. ఈ విధంగా మానవుల అపరాధాల కారణంగా నేలపైనా, నీటిలోనూ అరాచకం ఏర్పడింది. అంతేకాదు, వారి దురాగతాల మూలంగా ఆకాశం ఘోషించింది. భూమి ప్రకోపించింది. దేవుడు వారిపై శిక్షలు అవతరింపజేయ సాగాడు. ఉదాహరణకు: కరువు కాటకాలు వచ్చాయి. అంటువ్యాధుల ద్వారా మరణాల రేటు పెరిగింది. వరదలు, భూకంపాలు వచ్చాయి. సర్వత్రా భీతావహ పరిస్థితి నెలకొన్నది. బ్రతుకు దుర్భరం అయిపోయింది.

మానవులు దైవాజ్ఞల్ని ఉల్లంఘించటాన్ని హాబీగా చేసుకున్నప్పుడు క్రమక్రమంగా వారి ఆలోచనలు పెడదారి పడతాయి. ప్రతి చెడ్డకార్యం వారి కంటికి మంచిదిగా కనిపిస్తుంది. ఆ విధంగా నీతిబాహ్యత పెరిగిపోతుంది. అప్పుడు ధరణి చెడుగుతో నిండిపోతుంది. శాంతీ సుస్థిరతల స్థానే అశాంతి అలజడులు తాండవమాడుతాయి. హత్యలు లూటీలు రాజ్యమేలుతాయి. దాంతోపాటు ఒక్కోసారి ప్రకృతి వైపరీత్యాలు కూడా వెంటాడతాయి. కనీసం ఈ ఆపదల ద్వారానయినా ప్రజలు గుణపాఠం నేర్చుకుని, దారికి వస్తారేమోనని, పశ్చాత్తాపం చెందుతారేమోనని ఆశించబడుతుంది.

దీనికి భిన్నంగా ఏ సామాజిక వ్యవస్థ దైవవిధేయత ఆధారంగా ఏర్పడిందో, ఎక్కడైతే దైవశాసనాలు అమల్లో ఉన్నాయో, మరెక్కడైతే అన్యాయం స్థానే న్యాయం, ధర్మం వర్ధిల్లుతున్నదో అక్కడ సర్వత్రా శాంతీసుస్థిరతలు స్థాపితమవుతుంటాయి. దేవుని తరఫున శుభాలు అవతరిస్తాయి. అందుకే ఒక హదీసులో ఇలా అనబడింది: "భువిలో దేవుని ఒక హద్దును (చట్టాన్ని, శిక్షను) నెలకొల్పటం, అక్కడి మనుషుల పాలిట నలభై రోజుల వర్షంకన్నా మేలైనది" (నసాయి, ఇబ్ను మాజ). అలాగే మరొక హదీసును కూడా చూడండి : "ఒక పాపాత్ముడు మరణించినప్పుడు అక్కడి మనుషులే కాదు, ఆ పట్టణం, అక్కడి వృక్షాలు, జంతువులు కూడా హాయిగా విశ్రమిస్తాయి" (సహీహ్ బుఖారీ – కితాబుర్రిఖాఖ్; ముస్లిం – కితాబుల్ జనాయెజ్).

59. ఇక్కడ ముష్రిక్కుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది. ఎందుకంటే షిర్క్ చాలా పెద్ద పాపం. ఇతర పాపకార్యాలు కూడా ఇందులో మిళితమై ఉన్నాయి. మనిషి ఏ పాపం చేసినా తన మనోవాంఛల దాస్యానికి లొంగిపోయి చేస్తాడు.

43 కనుక (ఓ ప్రవక్తా!) ఏ రోజు అల్లాహ్ తరఫునుంచి తొలగి పోయే అవకాశం ఎంతమాత్రం లేదో[60] ఆ రోజు రాకముందే నీ ముఖాన్ని సత్యమైన, స్థిరమైన ధర్మం వైపు మరల్చుకో. ఆ రోజు అందరూ (రెండు వర్గాలుగా) వేర్వేరు అయిపోతారు.[61]

فَاَقِمْ وَجْهَكَ لِلدِّيْنِ الْقَيِّمِ مِنْ قَبْلِ اَنْ يَّاْتِيَ يَوْمٌ لَّا مَرَدَّ لَهٗ مِنَ اللّٰهِ يَوْمَئِذٍ يَّصَّدَّعُوْنَ ﴿43﴾

44 తిరస్కారానికి పాల్పడిన వారిపై వారి తిరస్కారపు పాపఫలం పడుతుంది. ఇక సత్కార్యాలు చేసేవారు తమ సౌఖ్యం కోసం (స్వర్గ) మార్గం సుగమం చేసుకుంటున్నారు.[62]

مَنْ كَفَرَ فَعَلَيْهِ كُفْرُهٗ ۚ وَمَنْ عَمِلَ صَالِحًا فَلِاَنْفُسِهِمْ يَمْهَدُوْنَ ﴿44﴾

45 -విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి అల్లాహ్ తన కృపతో (మంచి) ప్రతిఫలం వొసగటానికి![63] ఎట్టి పరిస్థితిలోనూ ఆయన అవిశ్వాసులను ఇష్టపడడు.

لِيَجْزِيَ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ مِنْ فَضْلِهٖ ۗ اِنَّهٗ لَا يُحِبُّ الْكٰفِرِيْنَ ﴿45﴾

46 శుభవార్తలను అందజేసే గాలులను[64] పంపటం కూడా ఆయన శక్తి సూచనలలోనిదే. ఎందుకంటే మీకు తన కనికారపు రుచి చూపించటానికి,[65] తన ఆజ్ఞతో నావలు నడవటానికీ,[66] తన కృపను (ఉపాధిని) మీరు అన్వేషించటానికి,[67] మీరు కృతజ్ఞతా పూర్వకంగా మసలుకోవటానికిగాను[68] (ఆయన ఇదంతా చేస్తున్నాడు).

وَمِنْ اٰيٰتِهٖۤ اَنْ يُّرْسِلَ الرِّيَاحَ مُبَشِّرٰتٍ وَّلِيُذِيْقَكُمْ مِّنْ رَّحْمَتِهٖ وَلِتَجْرِيَ الْفُلْكُ بِاَمْرِهٖ وَلِتَبْتَغُوْا مِنْ فَضْلِهٖ وَلَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿46﴾

60. అంటే ఆ రోజు రావటం తథ్యం. అది రాకుండా ఎవరూ అడ్డుకోలేరు. కాబట్టి ఆ రోజు (ప్రళయదినం) రాకమునుపే దైవవిధేయతా మార్గాన్ని అవలంబించాలి. సత్కార్యాలతో తమ ఒడిని నింపుకోవాలి.

61. ఆ రోజు మానవులు రెండు వర్గాలుగా విడిపోతారు. వారిలో ఒకటి విశ్వాసుల వర్గం, మరొకటి అవిశ్వాసుల వర్గం అయి ఉంటుంది.

62. **'మహ్‌దున్'** అంటే మార్గాన్ని సుగమం చేసుకోవటం, తివాచీలు పరచటం అని అసలు అర్థం. సత్కార్యాలు చేసే వ్యక్తి స్వర్గంలో తన విశ్రాంతి స్థలం కోసం తన దారిని సుగమం చేసుకుంటూ ఉంటాడని ఇక్కడ భావం.

63. అంటే స్వర్గ ప్రవేశం కొరకు కేవలం సత్కార్యాలుంటే సరిపోదు. దానికి తోడు దైవకృప కూడా అనివార్యమే. ఆయన కటాక్షం లేకుండా ఎవరూ స్వర్గంలో కాలు మోపలేరు. ఆయన ఒక్కో సత్కర్మకు పది నుంచి ఏడు వందల రెట్ల వరకు పుణ్యఫలాన్ని పెంచుతాడు. అంతకన్నా ఎక్కువ కూడా ఇస్తాడు.

64. అంటే ఈ చల్లని గాలులు వర్ష సూచనగా ఉంటాయి.

65. వర్షం పడినప్పుడు మనుషులు చెప్పలేని హాయిని ఆస్వాదిస్తారు. అంతేగాక ఈ బీటలు వారిన నేల వర్షపు నీటికి పులకిస్తుంది. నలువైపులా పచ్చిక మొలుస్తుంది.

66. ఈ గాలుల ఆధారంగా నావలు కూడా నీటిలో నడుస్తాయి. అయితే మానవుడు ప్రస్తుతం తన తెలివితేటలను ఉపయోగించి యంత్రం ద్వారా నడిచే నావలను, ఓడలను తయారుచేశాడు. కాని ఆ ఓడలకు సయితం వాతావరణం సానుకూలంగా ఉండటం అవసరం. దేవుడే గనక తలచుకుంటే తుఫాను, వాయుగుండాల ద్వారా ఈ పెద్ద పెద్ద ఓడలను సయితం ముంచివేయగలడు.

67. అంటే ఈ నౌకాయానం ద్వారా మీరు దేశదేశాలు పర్యటించి, వర్తకం చేసి మీ జీవనోపాధిని సమకూర్చుకుంటున్నారు. అలాగే ఈ వర్షపు నీటి ద్వారా మీరు వ్యవసాయం చేసి పంటలు పండిస్తున్నారు.

**47** మేము నీకు పూర్వం కూడా ప్రవక్తలను వారి జనుల వద్దకు పంపాము. వారు వారి వద్దకు నిదర్శనాలను తీసుకుని వెళ్ళారు. ఆ తరువాత మేము అపరాధులకు ప్రతీకారం చేశాము. (ఎందుకంటే) విశ్వాసులకు సహాయపడటం మా బాధ్యత.[69]

وَلَقَدْ اَرْسَلْنَا مِنْ قَبْلِكَ رُسُلًا اِلٰى قَوْمِهِمْ
فَجَآءُوْهُمْ بِالْبَيِّنٰتِ فَانْتَقَمْنَا مِنَ الَّذِيْنَ
اَجْرَمُوْا ۭ وَكَانَ حَقًّا عَلَيْنَا نَصْرُ الْمُؤْمِنِيْنَ ﴿47﴾

**48** అల్లాహ్‌యే గాలులను పంపిస్తున్నాడు. అవి మేఘాలను ఎత్తుతాయి.[70] ఆ తరువాత అల్లాహ్ తన అభీష్టానికనుగుణంగా వాటిని ఆకాశంలో విస్తరింపజేస్తాడు.[71] మరి వాటిని తునాతునకలుగా చేస్తాడు.[72] ఆ తరువాత వాటి మధ్యలో నుంచి వర్షపు నీటి బిందువులు వెలువడటాన్ని నువ్వు చూస్తావు.[73] ఆ తరువాత అల్లాహ్ ఆ వర్షపు నీటిని తన దాసులలో తాను కోరిన వారిపై కురిపించినపుడు వారు ఆనందంతో పులకించిపోతారు.

اَللّٰهُ الَّذِيْ يُرْسِلُ الرِّيْحَ فَتُثِيْرُ سَحَابًا فَيَبْسُطُهٗ
فِي السَّمَآءِ كَيْفَ يَشَآءُ وَيَجْعَلُهٗ كِسَفًا فَتَرَى
الْوَدْقَ يَخْرُجُ مِنْ خِلٰلِهٖ ۚ فَاِذَآ اَصَابَ بِهٖ مَنْ
يَّشَآءُ مِنْ عِبَادِهٖٓ اِذَا هُمْ يَسْتَبْشِرُوْنَ ﴿48﴾

**49** మరి నిజానికి ఆ వర్షం తమపై కురవకముందు వారు నిరాశా నిస్పృహలకు లోనై ఉండేవారు.

وَاِنْ كَانُوْا مِنْ قَبْلِ اَنْ يُّنَزَّلَ عَلَيْهِمْ مِّنْ قَبْلِهٖ
لَمُبْلِسِيْنَ ﴿49﴾

**50** మరి నువ్వు అల్లాహ్ కారుణ్య చిహ్నాలను చూడు– భూమిని, చచ్చిన తరువాత ఏ విధంగా ఆయన బ్రతికిస్తున్నాడో!? ఆయన మృతులను బ్రతికిస్తాడన్న విషయంలో కూడా ఎలాంటి సందేహానికి తావులేదు.[74] ఆయనకు ప్రతిదీ చేయగల శక్తి ఉంది.

فَانْظُرْ اِلٰٓى اٰثٰرِ رَحْمَتِ اللّٰهِ كَيْفَ يُحْيِ الْاَرْضَ
بَعْدَ مَوْتِهَا ۭ اِنَّ ذٰلِكَ لَمُحْيِ الْمَوْتٰى ۚ وَهُوَ عَلٰى
كُلِّ شَيْءٍ قَدِيْرٌ ﴿50﴾

68. అనంతమైన ఈ అనుగ్రహాలను దేవుడు మీపై ఎందుకు కురిపిస్తున్నట్టు? జీవితంలో మీరు వాటి ద్వారా లబ్ధిని పొంది, దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటారనే కదా!

69. ఓ ముహమ్మద్ (సఅసం)! మేము నిన్ను నీ జాతి వారివద్దకు ప్రవక్తగా చేసిపంపినట్లే, గతంలో ఎన్నో జాతుల వద్దకు ఎంతోమంది ప్రవక్తలను పంపి ఉన్నాము. వారు నిదర్శనాలు, మహిమలతో సహా వారి వద్దకు వెళ్ళారు. అయినప్పటికీ ఆయా జాతుల వారు తమ ప్రవక్తలను విశ్వసించలేదు సరికదా వారిని త్రోసిపుచ్చారు. ఎట్టకేలకు మేము వారి నేరాల, పాపాల కారణంగా వారిని శిక్షించి, విశ్వసించిన వారిని మాత్రం రక్షించాము. ఎందుకంటే మాకు విధేయత చూపినవారిని ఆదుకోవటం మా బాధ్యత – ఈ విధంగా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను, ఆయన అనుయాయులను ఈ ఆయతులో దేవుడు ఓదార్చాడు. అవిశ్వాసుల ఆగడాలకు, ముష్రిక్కుల ధిక్కార వైఖరికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, ఇదేదో కొత్త విషయం కాదనీ, పూర్వం దైవప్రవక్తలందరికీ ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయని చెప్పటం జరిగింది. ఈ ఆయతులో అవిశ్వాసులకు కూడా హెచ్చరిక ఉంది. ఒకవేళ వారు గనక తమ తిరస్కార ధోరణిని మానుకుని దారికి రాకపోతే వెనుకటి జాతులకు పట్టిన గతే వారికీ పడుతుందని చెప్పబడింది. చివరకు దైవసహాయం లభించేది విశ్వాసులకే.

70. అంటే – ఆకాశంలో మేఘమాలికలు ఎక్కడ ఉన్నా గాలులు వాటిని వెంటబెట్టుకు పోతాయి.

71. ఒక్కోసారి మేఘాలు దట్టంగా ఆవరించేలా చేస్తాడు. ఒక్కోసారి వాటిని చాలా వేగంగా గగన వీధుల్లో నడిపిస్తాడు. ఒక్కోసారి ఈ మబ్బు తునకలను ఒకదానిపై ఒకటి – పొరలు పొరలుగా – ఏర్పరుస్తాడు. కొన్నిసార్లు వాటిని ఆకాశమంతా ఆవరించేలా చేస్తాడు. జాగ్రత్తగా గమనిస్తే మేఘాల ఈ పరిస్థితి అర్థం అవుతుంది.

72. కారు మబ్బులు ఆకాశాన్ని క్రమ్ముకున్న తరువాత, వాటిని ఖండఖండాలుగా విభజిస్తాడు.

**51** ఒకవేళ మేము తీవ్రమైన (చెడు) గాలిని పంపినట్లయితే, తమ పంట పొలాలు పసుపుపచ్చగా వాడిపోవటం చూసి, అటు పిమ్మట వారు కృతఘ్నులుగా తయారవుతారు.[75]

وَلَئِنْ أَرْسَلْنَا رِيحًا فَرَأَوْهُ مُصْفَرًّا لَظَلُّوا مِنْ بَعْدِهِ يَكْفُرُونَ ﴿51﴾

**52** (ఓ ప్రవక్తా!) నువ్వు ఎట్టి పరిస్థితిలోనూ మృతులకు వినిపించ లేవు.[76] నీవు పిలిచినప్పుడు వెన్నుచూపి వెళ్ళిపోయే[77] చెవిటి వారికి కూడా[78] (నీ వాణిని) వినిపించలేవు.

فَإِنَّكَ لَا تُسْمِعُ الْمَوْتَىٰ وَلَا تُسْمِعُ الصُّمَّ الدُّعَاءَ إِذَا وَلَّوْا مُدْبِرِينَ ﴿52﴾

**53** నువ్వు గుడ్డివారిని కూడా వారు పయనిస్తున్న పెడత్రోవ నుంచి సన్మార్గానికి తేలేవు.[79] మా ఆయతులను విశ్వసించే వారికి మాత్రమే నువ్వు (నీ సందేశాన్ని) వినిపించగలవు.[80] వారు మాత్రమే విధేయత చూపుతారు.[81]

وَمَا أَنْتَ بِهَادِ الْعُمْيِ عَنْ ضَلَالَتِهِمْ ۖ إِنْ تُسْمِعُ إِلَّا مَنْ يُؤْمِنُ بِآيَاتِنَا فَهُمْ مُسْلِمُونَ ﴿53﴾

---

73. ఆ మబ్బు తునకల నుంచి అల్లాహ్ తాను తలచినవారిపై ధారాపాతంగా వర్షం కురిపిస్తాడు. అప్పటి వరకూ వర్షం కోసం ఆశగా ఎదురు చూసినవారు ఆ వర్షానికి ఆనందంతో పరవశించిపోతారు.

74. **'ఆసారు రహ్మతిల్లాహ్'** అంటే వర్షం మూలంగా ఉత్పత్తి అయ్యే పండ్లు ఆహారధాన్యాలు అని భావం. వీటిద్వారా ప్రజలు సిరిసంపదలతో తులతూగుతారు. 'చూడు' అంటే గుణపాఠం గ్రహించే ఉద్దేశంతో చూడమని భావం. ఈనాడు దేవుడు మృతభూమి నుంచి మొక్కల్ని ఎలా మొలకెత్తిస్తున్నాడో అలాగే ప్రళయదినాన ఆయన సమాధుల నుంచి మృతులను బ్రతికించి లేపుతాడు. ఇలా చేయటం ఆయనకు ఎంతమాత్రం కష్టం కాదు.

75. ఈ ఆయతులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "ఏ విధంగా మేము వర్షపు నీరు ద్వారా నేలను పచ్చగా – కళకళలాడేలా– చేశామో అదేవిధంగా మేము వడగాడ్పుల ద్వారా లేదా చెడు గాలుల ద్వారా ఈ పచ్చికను పసుపు పచ్చగా మార్చి వేయగలము. చేతికి వస్తుందనుకున్న పంట తెగులు పట్టిపోతే – నిన్న సంతోషంతో కేరింతలు కొడుతున్న వారే ఇప్పుడు కృతఘ్నులుగా మారిపోతారు. మాపై నిందలు, నిష్ఠూరాలు మొదలెడతారు. అంటే దైవాన్ని నమ్మని వారిలో సహనమూ ఉండదు, ధైర్యమూ ఉండదు. పైగా వారు అల్పసంతోషులై ఉంటారు. కాస్తంత లాభం చేకూరగానే ఆనందంతో ఎగిరి గంతేస్తారు. కాస్త ఎదురుదెబ్బ తగలగానే ఠారెత్తిపోతారు. అయితే విశ్వసించిన వారు అలాంటివారు కారు. వారు రెండు అవస్థలలోనూ మధ్యేమార్గాన్ని అవలంబిస్తారు.

76. అంటే వారి పరిస్థితి మరణించిన వారిలా ఉంది. మృతులలో చలనం ఉండదు. గ్రాహ్యశక్తి ఉండదు. వీళ్లు కూడా అంతే. వీళ్ల ముందు నువ్వు ఎంత వినిపించినా ఏమీ లాభం లేదు.

77. ఇది వారి వైముఖ్య ధోరణికి ఒక తార్కాణం అన్నమాట. అసలే వారు నిర్జీవులు, చెవిటి వారంటే, ఆపైన వెనుతిరిగిపోయే వారు కూడా. కాబట్టి సత్యవాక్కు వారి కర్ణపుటాలను తాకదు.

78. బధిరుల ముందు బాకా ఊదితే ఎంతో వీళ్లముందు దైవవాణిని వినిపించటం కూడా అంతే.

79. కళ్లున్నవారు తమ కంటిచూపు ద్వారా ప్రయోజనం పొందుతారు. కాని వారు ఆ విధంగా ప్రయోజనం పొందకుండా గుడ్డిగా ప్రవర్తిస్తున్నారు. అలాగే వారికి మనోనేత్రం కూడా లేదు. అలాంటప్పుడు వారు మార్గవిహీనత యొక్క ఊబిలో నుంచి బయటికి ఎలా రాగలుగుతారు?

80. ఎందుకంటే వారు దైవభక్తిపరులు. నీవు వినిపించే విషయాలను కడు సావధానంగా వింటారు. వాటిపై చింతన చేస్తారు. దైవసూచనల లోతుల్లోకి పోయి, వాటి మర్మం గ్రహిస్తారు.

81. వారి ముందు సత్యం గనక వస్తే వెంటనే తలవంచుతారు. దాన్ని చిత్తశుద్ధితో అనుసరిస్తారు.

**54** అల్లాహ్ – ఆయనే మిమ్మల్ని బలహీన స్థితిలో పుట్టించాడు.[82] మరి ఈ బలహీనత తరువాత (మీకు) బలాన్ని ఇచ్చాడు.[83] మరి ఈ బలం తరువాత మళ్లీ (మీకు) బలహీనతను ఇచ్చాడు, వృద్ధాప్యానికి చేర్చాడు.[84] ఆయన తాను తలచినది సృష్టిస్తాడు.[85] ఆయన అన్నీ తెలిసినవాడు, అన్నింటిపై అధికారం కలవాడు.

اللَّهُ الَّذِي خَلَقَكُم مِّن ضَعْفٍ ثُمَّ جَعَلَ مِن بَعْدِ
ضَعْفٍ قُوَّةً ثُمَّ جَعَلَ مِن بَعْدِ قُوَّةٍ ضَعْفًا
وَشَيْبَةً ۚ يَخْلُقُ مَا يَشَاءُ ۖ وَهُوَ الْعَلِيمُ الْقَدِيرُ ﴿٥٤﴾

**55** ప్రళయ ఘడియ సంభవించిననాడు[86] అపరాధులు, తాము (ప్రపంచంలో) ఒక్క గడియకాలం కన్నా ఎక్కువగా ఉండలేదని ప్రమాణాలు చేస్తారు.[87] (ఇహలోకంలో కూడా) వారు ఇలాగే తిరిగిపోతూ ఉండేవారు.[88]

وَيَوْمَ تَقُومُ السَّاعَةُ يُقْسِمُ الْمُجْرِمُونَ
مَا لَبِثُوا غَيْرَ سَاعَةٍ ۚ كَذَٰلِكَ كَانُوا يُؤْفَكُونَ ﴿٥٥﴾

---

82. ఇక్కడి నుంచి సృష్టికర్త అయిన అల్లాహ్ తన శక్తి సూచనలకు సంబంధించిన మరో అద్భుత విషయాన్ని ప్రస్తావిస్తున్నాడు. అది మనిషి సృష్టి ప్రక్రియలోని వివిధ దశలను విశదీకరిస్తోంది. మనిషిని బలహీన స్థితిలో పుట్టించటమంటే అత్యంత అల్పమైన వీర్యపు బిందువుతో సృష్టించటం అన్నమాట! లేదా శైశవ దశ అనే అర్థమయినా కావచ్చు.

83. అంటే ఇది యవ్వన దశ. ఈ దశలో మానవుడు శారీరకంగా, మానసికంగా పరిపక్వ స్థితికి చేరుకుంటాడు.

84. మళ్లీ బలహీనస్థితి అంటే శరీరంలోని జవసత్వాల క్షీణదశ మొదలవటం అన్నమాట. ఈ దశలో మనిషి అలసిపోతూ ఉంటాడు. వృద్ధాప్యం అంటే ముసలితనం అన్నమాట. ఈ వార్ధక్య స్థితిలో మనిషి జవసత్వాలు ఉడిగిపోతాయి. ధైర్యం కోల్పోతాడు. ఏం చేయాలనుకున్నా శరీరావయవాలు సహకరించవు. జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. జుత్తు నెరిసిపోతుంది. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ మనిషి జీవితానికి సంబంధించిన ఈ నాలుగు దశలను పేర్కొన్నాడు. కొంతమంది పండితులు ఈ నాలుగు దశలకు మరిన్ని దశలను కూడా చేర్చి మరింత వివరంగా విశ్లేషించారు. ఉదాహరణకు: ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు : మనిషి వరుసగా ఈ ఒక్కొక్క దశనూ అధిగమిస్తాడు. అతని పుట్టుకకు అసలు మూలం మట్టి. అంటే అతని పితామహుడైన ఆదం (అలైహిస్సలాం) మట్టితో సృజించబడ్డారు. లేదా మట్టిలో నుంచి ఉత్పన్నమైన ఆహారాన్ని తిని మనిషిలో వీర్యం ఉత్పత్తి అవుతుంది. ఆ వీర్యం మాతృగర్భంలోకి వెళ్ళి మనిషి ఉనికికి శ్రీకారం చుడుతుంది. ఆ విధంగా 'మట్టి' మానవ సృష్టిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆ వీర్యం మిశ్రమ బిందువు (నుత్ఫా)గా తయారవుతుంది. తర్వాత అది నెత్తుటి గడ్డ (అలఖా) గా మారుతుంది. తరువాత అది మాంసపుముద్ద (ముజ్‌గా) అవుతుంది. ఆపై ఎముకలు కూర్చబడతాయి. వాటిపై మాంసం ఎక్కించబడుతుంది. అటుపిమ్మట ప్రాణం పోయబడుతుంది. ఆ తరువాత తల్లి కడుపును చించుకు పుట్టినప్పుడు కూడా అతను కడు నిస్సహాయ స్థితిలో కోమలంగా ఉంటాడు. ఆ తరువాత క్రమక్రమంగా పెరుగుతాడు. బాల్య దశనుంచి ప్రాజ్ఞదశకు చేరుకుంటాడు. ఆ తరువాత యుక్తవయస్సుకు చేరుకుంటాడు. ఆ తరువాత నెమ్మదిగా యౌవనం క్షీణించటం మొదలవుతుంది. వృద్ధాప్య ఛాయలు తొంగిచూస్తాయి. కడకు పండు ముసలివాడవుతాడు. అంతే! మృత్యువు అతన్ని తన ఒడిలోకి తీసేసుకుంటుంది.

85. ఇందులోనే పెక్కు దశలు చేరి ఉన్నాయి.

86. **'సాఅహ్'** (السَّاعَةُ) అంటే ప్రళయం. అసలు నిఘంటువులో 'సాఅహ్'కు ఘడియ కాలం, క్షణకాలం అనే అర్థాలున్నాయి. ప్రళయాన్ని సాఅహ్ అని ఎందుకంటారంటే, అల్లాహ్ ప్రళయాన్ని సంభవింపజేయాలని అనుకున్నప్పుడు క్షణంలో దాన్ని సంభవింపజేస్తాడు. లేక ప్రళయం ప్రాపంచిక జీవితపు అంతిమ ఘడియ కావటం మూలంగా దానిని ఆ పేరుతో పిలిచి ఉండవచ్చు.

87. ఈ ప్రమాణాలు వారు ప్రపంచ జీవితంలోగాని లేక సమాధుల్లో ఉన్నప్పుడుగాని చేస్తారు. ప్రపంచ జీవితంలోనే

**56** అయితే జ్ఞానమూ, విశ్వాసమూ వొసగబడినవారు ఇలా సమాధానమిస్తారు[89]: "మీరు దైవగ్రంథంలో (లిఖించబడి) ఉన్నట్లే[90] ప్రళయదినం వరకూ ఆగి ఉన్నారు.[91] నేటి ఈ దినం ప్రళయదినమే. కాని మీరు మాత్రం నమ్మేవారే కాదు."[92]

وَقَالَ الَّذِينَ أُوتُوا الْعِلْمَ وَالْإِيمَانَ لَقَدْ لَبِثْتُمْ فِي كِتَابِ اللَّهِ إِلَىٰ يَوْمِ الْبَعْثِ ۖ فَهَٰذَا يَوْمُ الْبَعْثِ وَلَٰكِنَّكُمْ كُنتُمْ لَا تَعْلَمُونَ ﴿٥٦﴾

**57** కాబట్టి ఆ రోజు దుర్మార్గులకు, వారు చెప్పుకునే క్షమాపణలు (సంజాయిషీలు) వారికి ఎలాంటి లాభాన్నీ చేకూర్చవు. "క్షమాపణలు కోరుకోండి" అని వారితో అనటం కూడా జరగదు.[93]

فَيَوْمَئِذٍ لَّا يَنفَعُ الَّذِينَ ظَلَمُوا مَعْذِرَتُهُمْ وَلَا هُمْ يُسْتَعْتَبُونَ ﴿٥٧﴾

**58** నిశ్చయంగా మేము ఈ ఖుర్‌ఆన్‌లో జనుల కోసం అన్నిరకాల దృష్టాంతాలనూ వివరించాము.[94] నువ్వు వారి దగ్గరకు ఏ సూచనను తెచ్చినా,[95] "మీరంతా మిథ్యావాదులే" అని[96] ఈ అవిశ్వాసులు చెబుతారు.

وَلَقَدْ ضَرَبْنَا لِلنَّاسِ فِي هَٰذَا الْقُرْآنِ مِن كُلِّ مَثَلٍ ۚ وَلَئِن جِئْتَهُم بِآيَةٍ لَّيَقُولَنَّ الَّذِينَ كَفَرُوا إِنْ أَنتُمْ إِلَّا مُبْطِلُونَ ﴿٥٨﴾

**59** ఈ విధంగా అల్లాహ్ అజ్ఞానుల హృదయాలకు సీలు వేసేస్తాడు.

كَذَٰلِكَ يَطْبَعُ اللَّهُ عَلَىٰ قُلُوبِ الَّذِينَ لَا يَعْلَمُونَ ﴿٥٩﴾

---

చేస్తారనుకుంటే – ప్రపంచంలో తాము ఎంతకాలం ఉన్నారో తెలియక కాదు, వారికి తెలిసే ఉంటుంది. అయినప్పటికీ వారు తమ పాత అలవాటు ప్రకారం అబద్ధపు ప్రమాణాలు చేస్తారు. ఒకవేళ సమాధుల్లో ఇలాంటి ప్రమాణాలు చేస్తారనుకుంటే – తమ అజ్ఞానం మూలంగా వారు అలా చేస్తారు. తాము సమాధుల్లో ఎంతకాలం గడిపారో వారికి తెలిసి ఉండదు. మరికొంతమంది విద్వాంసుల అభిప్రాయంలో పరలోకంలోని తీవ్రత ముందు ప్రాపంచిక జీవితం వారికి ఒక గడియ కాలం లాగా తోస్తుంది.

88. మూలంలో **'యూఫకూన్'** (يُؤْفَكُونَ) అని వచ్చింది. అరబీలో 'అఫకర్రజులు' అని అంటే అతను సత్యం నుంచి తప్పాడు అని అర్థం.
89. ఈ జ్ఞానులు ప్రపంచంలో కూడా ఇలాగే బోధిస్తూ ఉండేవారు.
90. ఇక్కడ 'దైవగ్రంథంలో (లిఖించబడి) ఉన్నట్లు' అంటే అల్లాహ్ జ్ఞానం, ఆయన నిర్ణయం అని భావం. అంటే లౌహె మహ్‌ఫూజ్ అన్నమాట.
91. అంటే – పుట్టిననాటి నుంచీ ప్రళయదినం వరకూ.
92. ఆ రోజు రావటం తథ్యం అంటే మీరు నమ్మేవారు కాదు. పైగా మీరు ఈ మాటలను ఎగతాళి చేసేవారు. 'ఏదీ, ఆ దినాన్ని తీసుకు రా చూద్దాం' అని వేళాకోళం చేసేవారు.
93. వారిని ప్రపంచంలోకి పంపించి, పశ్చాత్తాపం చెంది, దైవవిధేయతా మార్గాన్ని అవలంబించే మరో అవకాశం ఏదీ ఇవ్వబడదు.
94. ఈ దృష్టాంతాల ద్వారా షిర్క్ ఖండించబడింది. దేవుని ఏకత్వం రూఢీ చేయబడింది. ప్రవక్తల సత్యసంధతను రుజువు చేయటం జరిగింది.
95. దివ్య ఖుర్‌ఆన్‌లో పొందుపరచబడిన నిదర్శనాన్ని వారికి వినిపించినా, లేక వారి కోరిక మేరకు ఏదన్నా చమత్కారాన్ని వారి ముందు ప్రదర్శించినాసరే వారు నమ్మరు గాక నమ్మరు.
96. పైగా వారు, మిమ్మల్ని మాంత్రికులుగానో, అసత్యవాదులుగానో అభివర్ణించి తిరిగి పోతారు. ఎందుకంటే దేవుడు

| | |
|---|---|
| **60** కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు సహనం వహించు.[97] నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానం సత్యమైంది. నమ్మకం లేనివారు నిన్ను తడబాటుకు లోనుచేసే స్థితి రాకూడదు సుమా![98] | فَاصْبِرْ إِنَّ وَعْدَ اللَّهِ حَقٌّ وَلَا يَسْتَخِفَّنَّكَ الَّذِينَ لَا يُوقِنُونَ ﴿٦٠﴾ |

వారి హృదయ కవాటాలను మూసివేశాడు. వారు మార్గభ్రష్టత యొక్క ఆఖరి అంచులకు చేరుకున్నారు. ఇక వారు సన్మార్గానికి వచ్చే అవకాశాలు ఏమాత్రం లేవు.

97. అందువల్ల వారి ప్రేలాపనలకు, శత్రుత్వ వైఖరికి నువ్వు చలించిపోకు. పైగా నువ్వు ఉత్తమరీతిలో ఓపికపట్టు. ఎందుకంటే దేవుడు నీకు తోడ్పడతానని వాగ్దానం చేశాడు. ఈ వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది.

98. వారు నిన్ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. నువ్వు మాత్రం రెచ్చిపోవద్దు. పైగా నువ్వు నీ వాదంపై స్థిరంగా ఉండు. నిగ్రహం పాటించు. వారి బెదిరింపులకు జడుసుకుని ఆత్మరక్షణలో పడిపోకు. నీ వైఖరిని మార్చుకోకు. నువ్వు ఏమాత్రం బెసికినా వారు నిన్ను ఆటపట్టించే ప్రయత్నం చేస్తారు.

31వ సూరా

# లుఖ్మాన్

## (మహా వివేకి) లుఖ్మాన్

అవతరణ మక్కాలో

ఆయతులు 34

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చిన జ్ఞాని, దైవభక్తిపరాయణుడు అయిన హజ్రత్ లుఖ్మాన్ వల్ల ఈ సూరాకు ఈ పేరు వచ్చింది. లుఖ్మాన్ తన కుమారుడికి ఇచ్చిన సలహా మనకు నైతిక చట్టాన్ని, వివేకవివేచనలను తెలుపుతుంది. హజ్రత్ లుఖ్మాన్ భావాలు ఒకే ఒక్క దేవుడిని సూచిస్తున్నాయి. దివ్యఖుర్ఆన్ వివేకవివేచనల గ్రంథం అని వర్ణిస్తూ ఈ సూరా ప్రారంభం అవుతుంది. మంచిపనులు చేసేవారికి ఈ గ్రంథం మార్గదర్శనమనీ, కారుణ్యమనీ పేర్కొంది. ఈ సందర్భంగా మంచిపనులు చేసేవారి లక్షణాలను అభివర్ణించడం జరిగింది.*

*అల్లాహ్‌కుగల ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యం గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ఆయన ఆకాశాలను ఎలాంటి స్తంభాలు లేకుండా నిలబెట్టాడు. ఆయన దృఢమైన పర్వతాలను భూమిపై నిలబెట్టాడు. ఆయన భూమిపై రకరకాల జంతువులను వ్యాపింపజేశాడు. ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తాడు. ఆకాశాలలోను, భూమిపై ఉన్న సమస్తాన్ని ఆయన మానవాళి ప్రయోజనం కోసం సృష్టించాడు. ఆయన ప్రజలకు లెక్కలేనన్ని అనుగ్రహాలు ప్రసాదించాడు. ఆయన రాత్రిని పగటిలోకి ఐక్యం చేస్తాడు. పగటిని రాత్రిలో ఐక్యం చేస్తాడు. ఆయన సూర్యచంద్రులను అదుపు చేస్తాడు. గర్భాలలో ఉన్నది కూడా ఆయనకు తెలుసు.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 13-19 | 130 | 'మహా వివేకి లుఖ్మాన్' | ఆయన దృష్టిలో ఏక దైవారాధన కంటే గొప్ప విషయం ఈ ప్రపంచంలో మరొకటేదీ లేదు. బహుదైవారాధనను ఆయన అమితంగా అసహ్యించుకునేవారు. తన కుమారుడు కూడా తన మార్గంలో నడిచి అల్లాహ్‌కు ప్రీతిపాత్రుడైన దాసుడు కావాలని ఎంతగానో ఆకాంక్షించారు. ఎన్నో ఉదాహరణలతో అతనికి హితబోధ చేశారు. ఎవరాయన? తన కుమారునికి ఆయన ఏమి బోధించారు? |

## لُقْمَٰن سُورَة

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

الٓمّٓ ① تِلْكَ اٰيٰتُ الْكِتٰبِ الْحَكِيْمِ ②

هُدًى وَّرَحْمَةً لِّلْمُحْسِنِيْنَ ③

الَّذِيْنَ يُقِيْمُوْنَ الصَّلٰوةَ وَيُؤْتُوْنَ الزَّكٰوةَ وَهُمْ بِالْاٰخِرَةِ هُمْ يُوْقِنُوْنَ ④

اُولٰٓئِكَ عَلٰى هُدًى مِّنْ رَّبِّهِمْ وَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ⑤

## లుఖ్మాన్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1 – 2** అలిఫ్ – లామ్ – మీమ్.[1] ఇవి వివేకంతో కూడిన గ్రంథ వాక్యాలు.

**3** సద్వర్తనుల కొరకు[2] మార్గదర్శకం, (నిలువెల్లా) కారుణ్యం.

**4** వారు (ఆ సద్వర్తనులు) నమాజులను నెలకొల్పుతారు. జకాతు ఇస్తూ ఉంటారు. పరలోకంపై (పూర్తి) విశ్వాసం కలిగి ఉంటారు.[3]

**5** వారే తమ ప్రభువు తరఫు నుంచి సన్మార్గంపై ఉన్నవారు. వారే సాఫల్యం పొందేవారు.[4]

1. ఈ దివ్య గ్రంథం ప్రారంభంలో కూడా ఈ పొడి అక్షరాలు (హురూఫె ముఖత్తఆత్) వచ్చాయి. వీటికి ఖచ్చితమైన అర్థం ఏమిటో కేవలం అల్లాహ్‌కే తెలుసు. అయితే కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు విలక్షణమైన ఈ అక్షరాల గురించి చెబుతూ, అవి ఖుర్ఆన్ ప్రత్యేకతను చాటి చెబుతున్నాయని అన్నారు. ఒకటి: ఈ ప్రత్యేకత మూలంగానే అరబ్బు విమర్శకులు దివ్య ఖుర్ఆన్ వాక్యాలను పోలిన వాక్యాలను రచించి తీసుకురావటంలో విఫలురయ్యారని వక్కాణించారు. ఖుర్ఆన్ దైవగ్రంథం అనటానికి, ఎవరిపైనయితే అది అవతరించిందో ఆ ప్రవక్త సత్యవంతుడైన ప్రవక్త (స) అనటానికి, అది ప్రతిపాదించిన షరీయతు మానవాళికి శ్రేయోదాయకమనటానికి ఈ వాక్యాలు సాక్షీభూతంగా నిలుస్తాయి. రెండు : అప్పట్లో ముష్రిక్కులు ఖుర్ఆన్‌ను వినకుండా తమ స్నేహితులను అడ్డుకునేవారు. విన్నవారు దానికి ప్రభావితులై ఇస్లాం స్వీకరిస్తారేమోనన్నది వారి భయం. అల్లాహ్ ఈ గ్రంథంలోని పలు సూరాలను ఈ అక్షరాల (అలిఫ్ – లామ్ – మీమ్) తోనే ప్రారంభించాడు. ఖుర్ఆన్ యొక్క ఈ అనితర సాధ్యమైన శైలి మూలంగా శ్రోతలు అమితంగా ప్రభావితులై వినేవారు (ఐసరుత్తఫాసీర్).
2. **'ముహ్సినీన్'** (مُحْسِنِيْنَ) అన్న పదాన్ని 'సద్వర్తనులు' అన్న భావంలో తీసుకోవటం జరిగింది. ఈ పదం **'ముహ్సిన్'** అన్న పదానికి బహువచనం. ఉత్తమంగా మెలగేవానిని ముహ్సిన్‌గా వ్యవహరిస్తారు. తల్లిదండ్రుల యెడల, బంధువుల పట్ల, హక్కుదారుల పట్ల, అగత్యపరుల పట్ల సద్వ్యవహారం చేసేవాడని అర్థం. 'ముహ్సిన్'కు మరో అర్థం సత్కార్యాలు చేసేవాడు, చెడులకు దూరంగా ఉండేవాడు. ఇంకొక అర్థం: చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో భక్తిప్రపత్తులతో దైవారాధన చేసేవాడు. ప్రార్థన సందర్భంగా అణకువను, అశక్తతను కనబరచేవాడు. "దైవారాధన చేస్తున్నప్పుడు నువ్వు దైవాన్ని చూస్తున్నట్లు భావించు....." అన్న జిబ్రయీల్ (అలైహిస్సలాం) హదీసు ఈ సందర్భంగా గమనించ దగినది. దివ్య ఖుర్ఆన్ సమస్త మానవుల కోసం అవతరించిన దైవగ్రంథం అనటంలో సందేహం లేదు. అయితే సద్వర్తనులు, దైవభీతిపరులు మాత్రమే ఈ గ్రంథం ద్వారా సిసలైన ప్రయోజనం పొందుతారు. ఆ విషయమే ఇక్కడ చెప్పబడింది.
3. నమాజ్‌ను స్థాపించటం, జకాతును చెల్లించటం, అంతిమదినంపై దృఢవిశ్వాసం కలిగి ఉండటం – ఈ మూడింటికీ ఇస్లాం ధర్మంలో ఎనలేని ప్రాముఖ్యం ఉంది. అందుకే ఈ మూడు అంశాలు ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించబడ్డాయి. సదాచార సంపన్నులు, దైవభక్తిపరులు ఈ మూడు అంశాలను ఎలాగూ పాటిస్తారు. వీటితోపాటు విధ్యుక్త ధర్మాలను (అంటే ఫర్జులన్నింటిని), సాంప్రదాయక ఆరాధనలను (సున్నత్‌లను), అభిలషణీయ (ముస్తహబ్) కార్యాలను, స్వచ్ఛంద ఆరాధనలను కూడా వారు చేస్తూ ఉంటారు.

6 జ్ఞానంతో నిమిత్తం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి తప్పించటానికి, దాన్ని వేళాకోళం చేయడానికి మనసును వశీక రించే విషయాలను[5] కొనుగోలు చేసేవాడు కూడా మనుషుల్లో ఉన్నాడు. పరాభవం పాల్జేసే శిక్ష ఉన్నది ఇలాంటి వారికోసమే.[6]

وَمِنَ النَّاسِ مَنْ يَشْتَرِي لَهْوَ الْحَدِيثِ لِيُضِلَّ عَنْ سَبِيلِ اللَّهِ بِغَيْرِ عِلْمٍ ۖ وَيَتَّخِذَهَا هُزُوًا ۚ أُولَٰئِكَ لَهُمْ عَذَابٌ مُهِينٌ ⑥

7 వాడి ముందు మా వాక్యాలను చదివి వినిపించినప్పుడు వాడు అహంకారంతో, తాను వాటిని అసలు వినసే లేదన్నట్లుగా, తన రెండు చెవులలోనూ చెవుడు ఉన్నట్లుగా ముఖం త్రిప్పుకుని పోతాడు.[7] కాబట్టి నువ్వు వాడికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను వినిపించు.

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِ آيَاتُنَا وَلَّىٰ مُسْتَكْبِرًا كَأَنْ لَمْ يَسْمَعْهَا كَأَنَّ فِي أُذُنَيْهِ وَقْرًا ۖ فَبَشِّرْهُ بِعَذَابٍ أَلِيمٍ ⑦

8 నిశ్చయంగా ఎవరు విశ్వసించి, (ప్రవక్త సంప్రదాయం ప్రకారం) సత్కార్యాలు కూడా చేశారో వారి కోసం అనుగ్రహ భరిత మైన స్వర్గవనాలున్నాయి.

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ لَهُمْ جَنَّاتُ النَّعِيمِ ⑧

4. సాఫల్యం అన్న పదానికి వివరణ కోసం అల్ బఖరా సూరా, మోమినూన్ సూరా ఆరంభాన్ని చూడండి.

5. సన్మార్గాన్ని అన్వేషించేవారు, సత్యం కోసం తహతహలాడేవారు దివ్యవాణిని విన్నప్పుడు తప్పకుండా సన్మార్గం పొందుతారు. అలాంటి సన్మార్గగాముల ప్రస్తావన తరువాత మరో పాత్ర (క్యారెక్టర్) కూడా ఇక్కడ ప్రస్తావించబడింది. వాడి పరిస్థితి ఎలాంటిదంటే, వాడెలాగూ ఖుర్ఆన్ వాక్యాలను వినడు. దానికితోడు ఖుర్ఆన్‌ను వినేవారిని ఎలాగైనాసరే అడ్డుకోవాలన్న ఉద్దేశంతో మనసును వశీకరించి, ఆధ్యాత్మికతను హరించే ఆటవస్తువులను, సంగీత వాయిద్యాలను, గాయకులను, నృత్య ప్రదర్శకులను కొనుక్కొని తెస్తాడు. వాటిని తన ఇంట్లో పెట్టుకుని ఓలలాడటమేగాక, ఊరివారి కోసం, పేట వారికోసం కూడా ప్రదర్శిస్తాడు. దీని వెనుక ఉన్న వారి ప్రధాన ఉద్దేశం ఒక్కటే–ప్రజలు ఆటపాటల్లో, వ్యర్థ విషయాలలో మునిగి తేలుతూ ఉండాలి. సత్యవాణి గురించి ఆలోచించే తీరిక వారికి దొరకకూడదు. ఖుర్ఆన్‌లోని సత్యవాక్కుకు వారు ఆకర్షితులు కాకూడదు!

ఈ వ్యర్థ విషయాల (లహ్వల్ హదీసు)లో ఆటపాటలతోపాటు కట్టుకథలు, పుక్కిటి పురాణాలు, నాటకాలు, నవలలు, అశ్లీల సాహిత్యం, బూతు సినిమాలు, నీతిబాహ్యతను పెంచిపోషించే సరసమైన కథలు, మనసులను పాడుచేసే ధారావాహిక టెలీఫిల్మ్‌లు, ఎల్లో జర్నలిజం, గాసిప్స్ – ఇత్యాదివన్నీ చేరి ఉన్నాయి. మహాప్రవక్త (సఅసం) కాలంలో మక్కాలో కొందరు అవిశ్వాసులు ఆడువారిని, పాడువారిని కొనుక్కుతెచ్చి దివ్య ఖుర్ఆన్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ విధంగా చూసినప్పుడు నేటి సభ్యసమాజంలో 'కళాపోషణ' పేరిట జరిగే షోలు, లలిత కళల ముసుగులో ప్రదర్శించబడే కార్యక్రమాలు, సాంస్కృతిక ఉత్సవాల పేరిట సాగే ఆటపాటలు ఏ కోవలోకి వస్తాయో ఊహించుకోవచ్చు. ఇలాంటి విషయలాలసకు లోనైన వారు దైవధర్మాన్ని విస్మరించటమే గాకుండా, ధార్మిక విషయాలను పరిహసించే దుస్సాహసానికి కూడా ఒడిగడతారు.

6. ఈ వ్యర్థ విషయాలను ప్రోత్సహించే పరిపాలకులు, సంస్థలవారు, పత్రికా యజమానులు, రచయితలు, సినీ నిర్మాతలు కూడా ఈ శిక్షాపరిధిలోకి వస్తారు.

7. ఈ ఆటపాటలలో మునిగితేలుతూ ఉండే వ్యక్తి గురించి ఇక్కడ చెప్పబడింది. దైవగ్రంథ వాక్యాలను, దైవప్రవక్త ఉపదేశాలను విన్నప్పుడు వాడు చెవిటివానిలా ప్రవర్తిస్తాడు. నిజానికి అతనికి చెవుడు లేదు. కాని వినీ విననట్లుగా

**9** వాటిలో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వాగ్దానం నిజమవుతుంది.[8] ఆయన గౌరవము, ప్రాబల్యము కలవాడు, పరిపూర్ణ వివేచనాపరుడు.

خٰلِدِيْنَ فِيْهَا ؕ وَعْدَ اللّٰهِ حَقًّا ؕ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ⑨

**10** ఆయన ఆకాశాలను ఎలాంటి స్థంభాలు లేకుండానే సృష్టించాడు. మీరు దాన్ని చూస్తూనే ఉన్నారు.[9] ఇంకా ఆయన భూమిలో పర్వతాలను నెలకొల్పాడు – అది (భూమి) మీతో పాటు ఒరిగి పోకుండా ఉండేటందుకు![10] ఇంకా అన్నిరకాల జంతువులను భూమిలో వ్యాపింపజేశాడు.[11] ఇంకా మేము ఆకాశం నుంచి వర్షపు నీటిని కురిపించి భూమిలో అన్ని రకాల మేలు జాతి జంటలను (మొలకలను) ఉత్పన్నం చేశాము.[12]

خَلَقَ السَّمٰوٰتِ بِغَيْرِ عَمَدٍ تَرَوْنَهَا وَاَلْقٰى فِى الْاَرْضِ رَوَاسِىَ اَنْ تَمِيْدَ بِكُمْ وَبَثَّ فِيْهَا مِنْ كُلِّ دَآبَّةٍ ؕ وَاَنْزَلْنَا مِنَ السَّمَآءِ مَآءً فَاَنْۢبَتْنَا فِيْهَا مِنْ كُلِّ زَوْجٍ كَرِيْمٍ ⑩

**11** ఇదీ అల్లాహ్ సృష్టి![13] ఇప్పుడు ఆయన తప్ప వేరితరులు ఏం సృష్టించారో మీరు నాకు చూపించండి?[14] (ఏమీ సృష్టించ లేదు) నిజానికి ఈ దుర్మార్గులు స్పష్టమైన మార్గభ్రష్టత్వానికి లోనై ఉన్నారు.

هٰذَا خَلْقُ اللّٰهِ فَاَرُوْنِىْ مَاذَا خَلَقَ الَّذِيْنَ مِنْ دُوْنِهٖ ؕ بَلِ الظّٰلِمُوْنَ فِىْ ضَلٰلٍ مُّبِيْنٍ ⑪

నటిస్తాడు. ముఖం త్రిప్పు కుంటాడు. ఎందుకంటే వింటే ఆ మాటలు అతనికి కర్ణకఠోరంగా ఉంటాయి. **'వఖ్రున్'** అంటే భారం అని అర్థం.

8. అంటే దేవుని వాగ్దానం తప్పక నెరవేరుతుంది. ఎందుకంటే అది దేవుని తరఫున చేయబడింది. దేవుడు వాగ్దాన భంగం చేసేవాడు కాదు.

9. వాక్యంలోని **'తరౌనహా'** (تَرَوْنَهَا) అనే పదం **'అమదిన్'** యొక్క విశేషణంగా భావించినట్లయితే అర్థం ఇలా వస్తుంది: "మీరు చూడగలిగే స్థంభాలు లేకుండానే ఆకాశాలను సృష్టించాడు" అంటే – ఆకాశానికి స్థంభాలున్నాయి. కాని మీరు వాటిని కానలేరు అని భావం.

10. **రవాసియ (رَوَاسِىَ)** – ఇది రాసియతున్ అనే పదానికి బహువచనం. దీనికి **'సాబితతున్'** అనే అర్థం వస్తుంది. అంటే స్థిరమైనదని భావం. అంటే, ఆయన నేలపై అత్యంత బరువుగల పర్వతాలను ప్రతిష్ఠించాడు. అందువల్ల నేల చలించకుండా, ఒక ప్రక్కకు వంగిపోకుండా స్థిరంగా ఉంది. తీరానికి చేరిన ఓడ అటూఇటూ కొట్టుకు పోకుండా ఉండేందుకు ఎలా లంగరు వేయబడుతుందో అలాగే భూమిలో పర్వతాలు పాతివేయబడ్డాయి. అరబీ మూలంలో **'అన్ తమీద బికుమ్'** (اَنْ تَمِيْدَ بِكُمْ) అని ఉంది. శాబ్దిక అర్థం తీసుకుంటే దానికి "దొర్లిపోవటం కోసమే మేము పర్వతాలను నెలకొల్పాము" అన్న అర్థం వస్తుంది. కాని అరబీ వ్యాకరణం ప్రకారం అక్కడ అన్‌కు ముందు **'కరాహత్'** గాని లేక అన్ తర్వాత **'లా'** (لَا) గాని ఉంటుంది. అంటే 'అన్ తమీద బికుమ్' అని చెప్పినప్పుడు 'కరాహత అన్ తమీద బికుమ్' (మీతోపాటు దొర్లిపోవడం సముచితం కాదని భావించి) లేక 'అన్‌లా తమీద బికుమ్' (మీతోపాటు దొర్లిపోకూడదని పర్వతాలనుపాతాము)–అన్న భావంలో అర్థంచేసుకోవలసి ఉంటుంది.

11. ఆయన భూమిలో రకరకాల జంతువులను విస్తరింపజేశాడు. వాటిలో కొన్నింటి మాంసాన్ని మానవుడు భక్షిస్తాడు. కొన్నింటిని వాహనాలుగా ఉపయోగించుకుంటాడు. వాటి వీపులపై బరువును మోపుతాడు. ఇంకా వాటిని అందం, వైభవం కోసం కూడా పెంచుతాడు.

12. ఇక్కడ **'జంట'** (జౌజ్) అనే పదం 'రకం' (సిన్ఫ్) అన్న అర్థంలో ఉపయోగించబడింది. అంటే రకరకాల ఆహారధాన్యాలు,

وَلَقَدْ اٰتَيْنَا لُقْمٰنَ الْحِكْمَةَ اَنِ اشْكُرْ لِلّٰهِ ؕ وَمَنْ
يَّشْكُرْ فَاِنَّمَا يَشْكُرُ لِنَفْسِهٖ ۚ وَمَنْ كَفَرَ فَاِنَّ اللّٰهَ
غَنِيٌّ حَمِيْدٌ ⑫

12 నిశ్చయంగా మేము లుఖ్మానుకు వివేచనను ప్రసాదించి,[15] "నువ్వు అల్లాహ్‌కు కృతజ్ఞుడవై ఉండు"[16] అని చెప్పాము. కృతజ్ఞతా పూర్వకంగా మసలుకునే ప్రతి ఒక్కడూ తన (మేలు) కొరకే కృతజ్ఞుడవుతాడు. మరెవరయినా కృతఘ్నతకు పాల్పడితే, అల్లాహ్ అక్కరలు లేనివాడు, ప్రశంసనీయుడు (అన్న సంగతిని అతను తెలుసుకోవాలి).

وَاِذْ قَالَ لُقْمٰنُ لِابْنِهٖ وَهُوَ يَعِظُهٗ يٰبُنَيَّ
لَا تُشْرِكْ بِاللّٰهِ ؕ اِنَّ الشِّرْكَ لَظُلْمٌ عَظِيْمٌ ⑬

13 లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేస్తూ ఇలా అన్నాడు: "ఓ నా ముద్దుల పుత్రుడా! అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించకు.[17] నిస్సందేహంగా అల్లాహ్‌కు భాగస్వామ్ముల్ని కల్పించటం (షిర్క్ చేయటం) ఘోరమైన అన్యాయం."[18]

పండ్లు ఫలాదులు పుట్టించాడని భావం. కరీమ్ (మేలిమి) అనేది జౌజున్ యొక్క విశేషణం. అది వాటి అందాన్ని, నాణ్యతను, ప్రయోజకత్వాన్ని సూచిస్తోంది.

13. **'ఇదీ'** (هٰذَا) అన్న పదం దేవుని రకరకాల సృష్టితాలను సూచిస్తోంది. వెనుకటి ఆయతులలో వీటి గురించి వచ్చింది.

14. అంటే – అల్లాహ్‌ను వదలి మీరు పూజించే చిల్లరదేవుళ్లు, మీరు సహాయం కోసం వేడుకునే దేవతలు భూమ్యాకాశాలలో చేసిన సృష్టి ఏమిటో కాస్త చెప్పండి?! ఒక్క వస్తువునన్నా చూపెట్టండి! (సృష్టించలేదు కదా!) మరి సమస్త వస్తువులను, సకల ప్రాణులను సృష్టించినవాడు అల్లాహ్‌యే అయినప్పుడు ఆరాధనలకు కూడా ఆయనే అర్హుడవుతాడు. ఆయన తప్ప ఈ లోకంలో పూజలను, ఉపాసనలను అందుకోగల దైవం ఏదీ, ఎక్కడా లేదు.

15. హజ్రత్ లుఖ్మాన్ సజ్జనులైన దైవదాసులు. దేవుడాయనకు విజ్ఞతా వివేచనలను పుష్కలంగా ప్రసాదించాడు. విషయావగాహనలో, ధార్మిక దృష్టిలో ఆయన సాటిలేని మేటిగా పేరుగాంచారు. మీకు ఇంతటి విజ్ఞత ఎలా అబ్బింది? అని ఎవరో అడిగితే, "రుజువర్తన వల్ల, నిజాయితీ తత్పరత వల్ల, నిరర్థకమైన విషయాలకు దూరంగా ఉండటం వల్ల" అని ఆయన చెప్పారు. ఆయన బుద్ధీ వివేకాలకు సంబంధించిన ఒక సంఘటన సుప్రసిద్ధం – ఆయన ఒకరి వద్ద బానిసగా ఉండేవారు. మేకను కోసి ఆ మేకలోని అత్యుత్తమమైన రెండు భాగాలను తెమ్మని ఒకసారి ఆయన యజమాని ఆయన్ని ఆజ్ఞాపించాడు. యజమాని ఆజ్ఞానుసారం ఆయన మేకను జిబహ్ చేసి హృదయాన్ని, నాలుకను తీసుకువచ్చారు. మరో సందర్భంలో యజమాని, మేకను కోసి అత్యంత హీనమైన రెండు భాగాలను తెమ్మని ఆదేశించగా ఆయన ఆ రెండు భాగాలనే (హృదయం, నాలుకనే) తెచ్చిపెట్టారు. అదేమని అడిగితే ఆయన ఇలా అన్నారు: "నోరు, హృదయం సజావుగా ఉన్నంతకాలం అవే అన్నిటికన్నా ఉత్తమమైనవి. ఒకవేళ అవి గనక చెడిపోతే ఆ రెండింటికన్నా హీనమైన వస్తువు మరొకటి ఉండదు." (ఇబ్నె కసీర్)

16. దైవానికి కృతజ్ఞులై ఉండటమంటే దైవానుగ్రహాలను సదా స్మరించుకుంటూ, ఆయన స్తోత్రం చేయటం, ఆయన ఆజ్ఞలకు బద్ధులై ఉండటం అని అర్థం.

17. హజ్రత్ లుఖ్మాన్ తన కుమారునికి చేసిన మొట్టమొదటి ఉపదేశం 'షిర్క్ నుంచి వారించటం'. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎప్పుడు హితోపదేశం చేసినా షిర్క్ నుంచి వారించే మాటలు తప్పకుండా చెప్పాలి. తమ పిల్లలలో దేవుని ఏకత్వాన్ని నూరిపోయాలి.

18. ఈ ప్రబోధనను కొందరు లుఖ్మాన్ ప్రోక్తంగా పేర్కొనగా, మరికొందరు దైవప్రోక్తంగా అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయానికి అనుకూలంగా వారు **"అల్లజీన ఆమనూ వలమ్ యల్బిసూ ఈమానహుమ్ బిజుల్మిన్"** అనే హదీసును ప్రస్తావించి, దీని అవతరణకు సంబంధించి మహాప్రవక్త(స),"ఇక్కడ జులుం అంటే చాలా పెద్ద జులుం" అని చెప్పిన

14 మరి మేము మానవునికి అతని తల్లిదండ్రుల విషయంలో గట్టిగా తాకీదు చేశాము[19]– అతని తల్లి అతన్ని ప్రయాసపై ప్రయాసకు ఓర్చుకుంటూ[20] తన గర్భంలో మోసింది. మరి అతని పాలను విడిపించటానికి రెండు సంవత్సరాలు పట్టింది.[21] (కనుక ఓ మానవుడా!) నువ్వు నాకూ, నీ తల్లిదండ్రులకూ కృతజ్ఞుడవై ఉండు. (ఎట్టకేలకు మీరంతా) మరలి రావలసింది నా వద్దకే.

وَوَصَّيْنَا الْإِنسَانَ بِوَالِدَيْهِ حَمَلَتْهُ أُمُّهُ وَهْنًا عَلَىٰ وَهْنٍ وَفِصَالُهُ فِي عَامَيْنِ أَنِ اشْكُرْ لِي وَلِوَالِدَيْكَ إِلَيَّ الْمَصِيرُ ﴿١٤﴾

15 ఒకవేళ నీకు తెలియని వారినెవరినైనా నాకు భాగస్వాములుగా నిలబెట్టమని వారిద్దరూ నీపై ఒత్తిడి తీసుకువస్తే మటుకు నువ్వు వారి మాట వినకు. ప్రపంచంలో మాత్రం వారి యెడల ఉత్తమరీతిలో మసలుకో. అయితే (మార్గానుసరణ విషయంలో మాత్రం) నా వైపు మరలి ఉన్న వానినే ఆదర్శంగా తీసుకో.[22] ఆ తరువాత మీరంతా నా వైపుకే మరలి రావలసి ఉంటుంది. అప్పుడు నేను మీకు, మీరు చేస్తూ ఉండిన కర్మలన్నింటినీ తెలియ పరుస్తాను."[23]

وَإِن جَاهَدَاكَ عَلَىٰ أَن تُشْرِكَ بِي مَا لَيْسَ لَكَ بِهِ عِلْمٌ فَلَا تُطِعْهُمَا وَصَاحِبْهُمَا فِي الدُّنْيَا مَعْرُوفًا وَاتَّبِعْ سَبِيلَ مَنْ أَنَابَ إِلَيَّ ثُمَّ إِلَيَّ مَرْجِعُكُمْ فَأُنَبِّئُكُم بِمَا كُنتُمْ تَعْمَلُونَ ﴿١٥﴾

విషయాన్ని గుర్తుచేశారు (సహీహ్ బుఖారీ. హ.నెం.4776). ఇంతకీ ఈ హదీసు, అది దైవప్రోక్తమని సమర్థించినట్లుగానీ, ఖండించినట్లుగానీ లేదు.

19. దేవుని ఏకత్వం, దైవారాధన గురించి చెప్పిన వెంటనే తల్లిదండ్రుల యెడల సద్భావంతో మెలగాలని ఉపదేశించటాన్ని బట్టి తల్లిదండ్రుల సేవకు గల ప్రాధాన్యత ఎంత గొప్పదో బోధపడుతున్నది.

20. దీని భావం ఏమిటంటే మాతృగర్భంలో శిశువు పెరుగుతున్నకొద్దీ తల్లి భారం పెరుగుతుంది. తత్కారణంగా ఆమె బలహీనురాలైపోతుంది. తల్లి భరించే ఇన్ని కష్టాలను గురించి ప్రస్తావించి తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా మెలగినప్పుడు తల్లికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఈ ఆయతు చూచాయగా పేర్కొంటున్నది. హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది.

21. ఈ ఆయతును బట్టి బోధపడేదేమంటే పాల గడువు రెండేండ్లు. అంతకన్నా ఎక్కువ కాలం పాలు త్రాగించనవసరం లేదు.

22. అంటే విశ్వసించిన వారి మార్గాన్ని అనుసరించు.

23. నా వైపు మరలివున్న వారి మార్గాన్నే మీరు అనుసరించాలి. ఎందుకంటే మీరంతా ఆఖరికి రావలసింది నా దగ్గరకే. ప్రతి ఒక్కరికీ వారి కర్మల (మంచి కర్మల లేక చెడు కర్మల) ప్రతిఫలం లభించేది నా దగ్గరే. మరి మీరు గనక నా మార్గాన్ని అనుసరించి, సదా నన్ను స్మరిస్తూ జీవితం గడిపినట్లయితే ప్రళయదినాన మీరు నా న్యాయస్థానంలో ఆదరించబడే అవకాశముంటుంది. అన్యథా మీరు ఆపదలో పడతారు.

దీని తరువాత మళ్లీ లుఖ్మాన్ ఉపదేశం మొదలవుతుంది. లుఖ్మాన్ తన కుమారునికి చేసే హితోపదేశం మధ్యలోనే దేవుడు రెండు ఆయతులలో (14, 15) తల్లిదండ్రుల పట్ల సద్వ్యవహారం గురించి మానవులకు తాకీదు చేశాడు. ఇక్కడ మూడు విషయాలు గమనార్హమైనవి :1. హజ్రత్ లుఖ్మాన్ తన కుమారునికి చేసిన హితబోధలో ఆయన సొంత లాభమూ ఇమిడి ఉంది. 2. దైవారాధన తరువాత అత్యంత ముఖ్యమైన విషయం మాతాపితల సేవ.

16 (లుఖ్మాన్ తన కుమారునికి ఇలా బోధపరిచాడు) "నాయనా! ఏదైనా వస్తువు ఆవగింజంత ఉన్నా,[24] అది ఏదైనా రాతి బండలో ఉన్నా, లేక అది ఆకాశాలలో ఉన్నా లేదా భూమిలో ఉన్నా దాన్ని అల్లాహ్ తప్పకుండా తీసుకువస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ సూక్ష్మ విషయాలను ఎరిగినవాడు, అన్నీ తెలిసినవాడు.

يٰبُنَيَّ اِنَّهَآ اِنْ تَكُ مِثْقَالَ حَبَّةٍ مِّنْ خَرْدَلٍ
فَتَكُنْ فِيْ صَخْرَةٍ اَوْ فِي السَّمٰوٰتِ اَوْ فِي الْاَرْضِ
يَاْتِ بِهَا اللّٰهُ ؕ اِنَّ اللّٰهَ لَطِيْفٌ خَبِيْرٌ ﴿16﴾

17 "ఓ (ప్రియమైన) కుమారా! నువ్వు నమాజును నెలకొల్పుతూ ఉండు. సత్కార్యాల గురించి ఆజ్ఞాపిస్తూ ఉండు. చెడు పనుల నుంచి వారిస్తూ ఉండు. ఏ ఆపద వచ్చిపడినా సహనం పాటించు.[25] నిశ్చయంగా ఇవి ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన పనులు.[26]

يٰبُنَيَّ اَقِمِ الصَّلٰوةَ وَاْمُرْ بِالْمَعْرُوْفِ وَانْهَ عَنِ
الْمُنْكَرِ وَاصْبِرْ عَلٰى مَآ اَصَابَكَ ؕ اِنَّ ذٰلِكَ مِنْ
عَزْمِ الْاُمُوْرِ ﴿17﴾

18 "జనుల ముందు (గర్వంతో) మొహం తిప్పుకొని మాట్లాడకు.[27] భూమిపై నిక్కుతూ నడవకు.[28] ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్ డాబులు చెప్పుకునే గర్విష్టిని ఇష్టపడడు.

وَلَا تُصَعِّرْ خَدَّكَ لِلنَّاسِ وَلَا تَمْشِ فِي الْاَرْضِ
مَرَحًا ؕ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ كُلَّ مُخْتَالٍ فَخُوْرٍ ﴿18﴾

3. షిర్క్ చాలా పెద్ద అపరాధం. ఒకవేళ షిర్క్ వైపు పురికొల్పినవారు తల్లిదండ్రులే అయినప్పటికీ వారి మాటను వినవలసిన అవసరం లేదు. అయితే వారిపట్ల మంచిగా మాత్రం మెలగాలి.

24. మనిషి చేసే పని – అది మంచిపనైనా, చెడు పనైనా – దాన్ని అతను ఎంత రహస్యంగా చేసినా అల్లాహ్ దాన్ని వదలిపెట్టడు. ప్రళయదినాన అల్లాహ్ దాన్ని ప్రత్యక్ష పరుస్తాడు. దాని ప్రతిఫలం ఇస్తాడు. ఆ పని మంచిపని అయివుంటే పుణ్యఫలం ఇస్తాడు. అది చెడు పని అయివుంటే పాపఫలం వడ్డిస్తాడు. ఆవగింజ ఉపమానం ఇవ్వటం గమనార్హం. ఆవగింజ చాలా చిన్నపరిమాణంలో ఉంటుంది. దాని బరువు నామమాత్రం. అలాగే బండరాయి ఎక్కడో పడి ఉంటుంది. ఈ విషయమే హదీసులో కూడా చెప్పబడింది : "మీలో ఎవరైనా రంధ్రంలేని, తలుపు కిటికీలు లేని రాతి బండలోపల కూర్చుని ఆచరణచేసినా – అది ఎటువంటి ఆచరణ అయినాసరే అల్లాహ్ దాన్ని జనుల ముందు బహిర్గతం చేస్తాడు." (ముస్నదె అహ్మద్ – 3/28). ఎందుకంటే ఆయన సూక్ష్మద్రష్ట. సూక్ష్మాతిసూక్ష్మ విషయాలను సయితం ఆయన జ్ఞానపరిధి ఆవరించి ఉంది. రాత్రి కటిక చీకటిలో నడిచే చీమ చప్పుళ్ళను సయితం ఆయన తెలుసుకుంటాడు.

25. నమాజు స్థాపన, మంచిని ప్రబోధించటం చెడుల నుంచి వారించటం, కష్టాలపై ఓర్పు వహించటం – ఇవి మూడూ అత్యంత ముఖ్యమైన ఆరాధనలు.

26. అంటే పైన పేర్కొనబడిన పనులు చేయదగ్గవి. దైవదాసులపై అవి విధిగా చేయబడ్డాయి. లేదా వారిలో ధైర్యసాహసాలను నూరిపోసేందుకు ప్రోత్సహించబడ్డాయి. ఎందుకంటే ధైర్యసాహసాలు లేనంతవరకూ ఈ ధర్మాలను బహిరంగంగా పాటించటం సాధ్యంకాదు. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయంలో **జాలిక** (ذٰلِكَ) అనే పదం ఓర్పు, సంయమనానికి వర్తిస్తుంది. అంతకుముందు మంచిని పెంచటం, చెడులను ఆపటం గురించి తాకీదు చేయబడింది. ఈ మార్గంలో కష్టాలు రావటం, విమర్శలు ఎదురవటం తప్పనిసరి. అందుకే వెంటనే ఓర్పు, సహనం గురించి నొక్కి చెప్పటం జరిగింది. ఎట్టి పరిస్థితిలోనూ నిగ్రహంతో, సంయమనంతో మెలగాలనీ, ఇది సాహసోపేతమైన పనులలోనిదని ప్రబోధించబడింది. మొక్కవోని వీరులు ఎప్పుడూ గుండె నిబ్బరాన్ని కలిగి ఉంటారు. నిబ్బరం లేనంతవరకూ ధర్మప్రచార కార్యక్రమం ముందుకు సాగదు.

27. ప్రజల ముందు అహంకారం ప్రదర్శించకు. ప్రజలతో సంభాషించే సమయంలో అసహనాన్ని, విసుగును ప్రదర్శించటం,

19 “నీ నడకలో మధ్యేమార్గం అవలంబించు.[29] నీ కంఠ స్వరాన్ని కాస్త తగ్గించు.[30] నిశ్చయంగా స్వరాలన్నింటిలోకీ అత్యంత కఠోర మైనది గాడిదల స్వరం.”

وَاقْصِدْ فِي مَشْيِكَ وَاغْضُضْ مِنْ صَوْتِكَ ۚ
إِنَّ أَنْكَرَ الْأَصْوَاتِ لَصَوْتُ الْحَمِيرِ ﴿19﴾

20 అల్లాహ్ భూమ్యాకాశాల్లో ఉన్న వస్తువులన్నింటినీ మీ పనిలో తగిలించి,[31] తన గోచర అగోచర వరాలను పుష్కలంగా మీకు ప్రసాదించిన విషయాన్ని[32] మీరు చూడటం లేదా? కొంతమంది జ్ఞానం లేకుండా, మార్గదర్శకత్వం లేకుండా, ప్రకాశవంతమైన గ్రంథం లేకుండానే అల్లాహ్ గురించి వాదులాడుతున్నారు.[33]

أَلَمْ تَرَوْا أَنَّ اللَّهَ سَخَّرَ لَكُمْ مَا فِي السَّمَاوَاتِ
وَمَا فِي الْأَرْضِ وَأَسْبَغَ عَلَيْكُمْ نِعَمَهُ ظَاهِرَةً
وَبَاطِنَةً ۗ وَمِنَ النَّاسِ مَنْ يُجَادِلُ فِي اللَّهِ
بِغَيْرِ عِلْمٍ وَلَا هُدًى وَلَا كِتَابٍ مُنِيرٍ ﴿20﴾

ముఖం త్రిప్పుకోవటం, నిర్లక్ష్యంగా మాట్లాడటం వంటివి అన్నీ ఇందులోకి వస్తాయి. వాస్తవానికి **'సయ్యిర్'** (صَعِر) అనేది ఒక (వాపు) రోగం. అది ఒంటె తలలోగానీ, మెడలో గాని పుడుతుంది. దానివల్ల ఒంటె మెడ తిరిగిపోతుంది. మానవుడు ప్రదర్శించే గర్వాహంకారం కోసం ఆ పదం ఉపయోగించటం గమనార్హం (ఇబ్నె కసీర్).

28. అంటే మనిషి నడక ద్వారా అతని ధన మదాంధతగానీ, అధికార దాబుగానీ, గర్వంగానీ వ్యక్తమవటం మంచిది కాదు. ఇలాంటి గర్విష్ఠులను అల్లాహ్ ప్రేమించడు. ఎందుకంటే మానవుడు ఎంతో అశక్తుడైన, నిస్సహాయుడైన దాసుడు. కాబట్టి అతడు తన పరిమితులను తెలుసుకుని అణకువను అలవరచుకోవటంలోనే అందం ఉంది. అతడు అవధులు మీరి బడాయిని చాటకూడదు. బడాయి కేవలం అల్లాహ్‌కే శోభిస్తుంది. ఎందుకంటే ఆయనే సర్వాధికారి, సకల స్తోత్రాలకు అర్హుడు. సకల శుభాలకు మూల సరోవరం ఆయనే. అందుకే హదీసులో ఇలా అనబడింది : “ఏ వ్యక్తిలోనయినా ఆవగింజంత అహంకారం ఉన్నా అతడు స్వర్గానికి పోలేడు” (ముస్నదె అహ్మద్– 1/412; తిర్మిజీ – అబ్వాబుల్ బిర్). “ఎవరయితే గర్వాహంకారంతో తన అంగవస్త్రాన్ని నేలకు ఈడ్చుకుంటూ నడుస్తాడో అతని వంక అల్లాహ్ (తీర్పుదినాన) చూడనే చూడడు” (ముస్నదె అహ్మద్ – 5/9, 10; బుఖారీ – కితాబుల్లిబాస్). అయితే అహంకార భావం లేకుండా ఖరీదైన దుస్తులు ధరించవచ్చు. మంచి ఆహారపదార్థాలు కూడా భుజించవచ్చు.

29. మనిషి నడక సభ్యతా సంస్కారాలకు అద్దం పట్టేలా ఉండాలి. నడకలో నింపాది అంటే మరీ రోగిష్టిలా నడవమని భావం కాదు. అలాగే మరీ వేగంగా నడచి హుందాతనాన్ని కోల్పోరాదు. నడక రెండు అతివాదాలకు నడుమ – సమతూకంతో కూడినదై – ఉండాలి. నడక ద్వారా మంచి నడవడిక వ్యక్తం కావాలి. ఈ విషయాన్నే మరోచోట, “కరుణామయుని దాసులు భూమిపై వినమ్రుల్లా, సంస్కారవంతుల్లా నడుస్తారు” (ఫుర్ఖాన్ – 63) అని చెప్పటం జరిగింది.

30. అంటే మృదువుగా మాట్లాడు. అతి బిగ్గరగా, గొంతు చించుకుంటూ మాట్లాడకు. ఎందుకంటే అతి బిగ్గరగా మాట్లాడటమే వాంఛనీయం అయివుంటే గాడిదల స్వరం అన్నింటికంటే మంచి స్వరంగా పేర్కొనబడి ఉండేది. కాని గాడిదల కంఠస్వరం అత్యంత చెడ్డదిగా, కర్ణ కఠోరమైనదిగా చెప్పబడింది. అందుకే “గాడిద గాండ్రింపును విన్నప్పుడు షైతాను బారినుంచి శరణు వేడుకోండి” అని హదీసులో చెప్పబడింది (బుఖారీ, ముస్లిం).

31. అరబీలో **'సఖ్ఖర లకుమ్'** (سَخَّرَ لَكُمْ) అని ఉంది. అంటే వశపరచటం, ఉపయోగంలోకి తీసుకురావటం అన్న అర్థాలు వస్తాయి. సందర్భం రీత్యా ఇక్కడ “మీ పనిలో తగిలించి” అని అర్థం వస్తుంది. ఉదాహరణకు : ఆకాశంలో ఉన్న దైవ సృష్టితాలైన సూర్య చంద్రులను, నక్షత్రాలను దేవుడు మీ సేవలో నిమగ్నుల్ని చేశాడు. దేవుడు వాటిపై విధించిన ఆంక్షలకు కట్టుబడి అవి మానవసేవలో తలమునకలై ఉన్నాయి. మానవులు వాటిద్వారా పూర్తి ప్రయోజనాన్ని పొందుతున్నారు.

అలాగే భూమిపై నివసించే ఎన్నో ప్రాణులను దేవుడు మానవులకు లోబరచి ఉంచాడు. మానవుడు తన

**21** అల్లాహ్ అవతరింపజేసిన దానిని (వహీని) అనుసరించండి అని వారితో అన్నప్పుడు, "లేదు. మా తాత ముత్తాతలు అవలంబిస్తూ ఉండగా చూసిన విధానాన్నే[34] మేము అనుసరిస్తాము" అని వారంటారు. ఒకవేళ షైతాను వారి పెద్దలను నరకయాతన వైపుకు పిలుస్తూ ఉన్నప్పటికీ (వారు దాన్నే అనుసరిస్తారా?)

وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللَّهُ قَالُوا بَلْ
نَتَّبِعُ مَا وَجَدْنَا عَلَيْهِ آبَاءَنَا ۚ أَوَلَوْ كَانَ
الشَّيْطَانُ يَدْعُوهُمْ إِلَىٰ عَذَابِ السَّعِيرِ ﴿٢١﴾

**22** ఎవరయితే సద్వర్తనుడయి ఉండి–[35] తన్ను తాను అల్లాహ్‌కు సమర్పించుకున్నాడో,[36] అతను నిశ్చయంగా గట్టి కడియాన్ని పట్టుకున్నాడు.[37] సమస్త వ్యవహారాల తుది నిర్ణయం అల్లాహ్ అధీనంలోనే ఉంటుంది.

وَمَن يُسْلِمْ وَجْهَهُ إِلَى اللَّهِ وَهُوَ مُحْسِنٌ
فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ ۗ وَإِلَى اللَّهِ
عَاقِبَةُ الْأُمُورِ ﴿٢٢﴾

**23** (ఓ ముహమ్మద్–స!) అవిశ్వాసుల అవిశ్వాస వైఖరిపై నువ్వు కుమిలిపోకూడదు.[38] చివరకు వారంతా మరలి రావలసింది మా వైపుకే. అప్పుడు మేము వారు చేసుకున్నదాన్ని వారికి తెలియ పరుస్తాము.[39] నిశ్చయంగా అల్లాహ్ గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు.[40]

وَمَن كَفَرَ فَلَا يَحْزُنكَ كُفْرُهُ ۚ إِلَيْنَا مَرْجِعُهُمْ
فَنُنَبِّئُهُم بِمَا عَمِلُوا ۚ إِنَّ اللَّهَ عَلِيمٌ بِذَاتِ
الصُّدُورِ ﴿٢٣﴾

---

అభీష్టానికనుగుణంగా వాటిని ఉపయోగిస్తున్నాడు. ఉదాహరణకు: భూమి, పక్షులు, పశువులు. ఈ విధంగా భూమ్యాకాశాల్లో ఉన్న ఎన్నో వస్తువులు అవి మనిషి అధీనంలో ఉన్నా, లేక పోయినా, మానవ సేవలో నిమగ్నమై ఉన్నాయి. (ఫత్‌హుల్ ఖదీర్)

32. గోచర వరాలంటే మనిషి తన తెలివి తేటల ద్వారా, పంచేంద్రియాల ద్వారా తెలుసుకోగలిగేవి, చూడగలిగేవి. అగోచర వరాలంటే మనిషి ఊహలకు అందనివి, అతని జ్ఞానపరిధిలోనికి రానివి. ఈ రెండు రకాల వరాలు అసంఖ్యాకమైనవి. మానవుడు ఎన్నటికీ వాటిని లెక్కించలేడు.

33. అయినాసరే జనులు అల్లాహ్ విషయంలో తలాతోకా లేకుండా వాదోపవాదాలు చేస్తుంటారు. కొందరు దేవుని ఉనికి గురించి ప్రశ్నల్ని లేవనెత్తితే, మరికొందరు షిర్క్‌ను సమర్థిస్తూ తర్జనభర్జన చేస్తుంటారు. ఇంకా కొందరు దైవాజ్ఞల్ని గురించి సందేహాలు వ్యక్తపరుస్తుంటారు. దైనందిన జీవితంలో ఇది అనుభవైక విషయమే.

34. మరి చూడబోతే వారి దగ్గర ఏ ప్రమాణంగానీ, ఆకాశ గ్రంథం గానీ, మార్గదర్శకుని ఉపదేశాలుగానీ లేవు. అయినా వారు ఆయుధం లేకుండానే పోరాడుతున్నారు.

35. అంటే చేయవలసిన వాటిని చేసేవాడు, చేయరాని పనులను విడనాడేవాడు అన్నమాట!

36. అంటే ఎవడు దైవాజ్ఞల ముందు తలవంచుతాడో, దైవ ప్రసన్నతను బడసే ఉద్దేశంతో దేవుని షరీయతును అవలంబిస్తాడో...

37. అంటే అతను అల్లాహ్ నుంచి అభయం పొందాడు.

38. ఎందుకంటే విశ్వాసభాగ్యం వారికి రాసిపెట్టిలేదు. నీ బాధ్యతను నువ్వు నిర్వర్తించావు. వారి శ్రేయాన్ని అభిలషించావు. కాని దేవుని అభిమతం మరోవిధంగా ఉంది. కాబట్టి (ఓ ప్రవక్తా!) వారి దైర్భాగ్యస్థితిపై నువ్వు విలపించనవసరం లేదు.

39. వాటి ఆధారంగానే వారికి బహుమానం ఇవ్వటమో, శిక్ష విధించటమో జరుగుతుంది.

40. ఏదీ ఆయన నుండి దాగిలేదు.

نُمَتِّعُهُمْ قَلِيلًا ثُمَّ نَضْطَرُّهُمْ إِلَىٰ عَذَابٍ غَلِيظٍ ﴿٢٤﴾

**24** మేము వారికి (ఇక్కడ) కొన్ని ప్రయోజనాలను ఇచ్చినప్పటికీ, (తుదకు) వారిని కడు నిస్సహాయ స్థితిలో కఠినమైన శిక్ష వైపుకు తరుముకుంటూ పోతాము.[41]

وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ لَيَقُولُنَّ
اللَّهُ ۚ قُلِ الْحَمْدُ لِلَّهِ ۚ بَلْ أَكْثَرُهُمْ لَا يَعْلَمُونَ ﴿٢٥﴾

**25** ఆకాశాలను, భూమిని సృష్టించిన వారెవరు? అని నువ్వు వారిని అడిగితే "అల్లాహ్"[42] అని వారు తప్పకుండా చెబుతారు. "సమస్త స్తోత్రాలు అల్లాహ్‌కే శోభిస్తాయి"[43] అని నువ్వు వారికి చెప్పు, కాని వారిలో చాలామంది (సత్యాన్ని) తెలుసుకోరు.

لِلَّهِ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ إِنَّ اللَّهَ هُوَ الْغَنِيُّ
الْحَمِيدُ ﴿٢٦﴾

**26** ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే.[44] నిశ్చయంగా అల్లాహ్ ఏ అక్కరా లేనివాడు,[45] స్తుతింపదగినవాడు.[46]

وَلَوْ أَنَّمَا فِي الْأَرْضِ مِن شَجَرَةٍ أَقْلَامٌ وَالْبَحْرُ
يَمُدُّهُ مِن بَعْدِهِ سَبْعَةُ أَبْحُرٍ مَّا نَفِدَتْ
كَلِمَاتُ اللَّهِ ۗ إِنَّ اللَّهَ عَزِيزٌ حَكِيمٌ ﴿٢٧﴾

**27** భూమండలంలో ఉన్న వృక్షాలన్నీ కలములుగా, సముద్రాలన్నీ సిరాగా మారినా, ఆపైన మరో సప్త సముద్రాలు (సిరాగా) చేరినా అల్లాహ్ మాటలు (రాయటానికి) పూర్తికావు.[47] నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేకవంతుడు.

مَّا خَلْقُكُمْ وَلَا بَعْثُكُمْ إِلَّا كَنَفْسٍ وَاحِدَةٍ ۗ
إِنَّ اللَّهَ سَمِيعٌ بَصِيرٌ ﴿٢٨﴾

**28** మీ అందరినీ సృష్టించటం, మరణానంతరం తిరిగిలేపటం ఒక్క ప్రాణిని (సృష్టించి, బ్రతికించి లేపటం) వంటిదే.[48] నిశ్చయంగా అల్లాహ్ అంతా వినేవాడు, చూసేవాడు.

41. అంటే వీళ్లు పొందే ప్రాపంచిక ప్రయోజనాలు బహుస్వల్పమైనవి. ప్రపంచంలో వారు ఉండే గడువు కూడా చాలా పరిమితమైనది. ఆ తరువాత వారు సుదీర్ఘమైన, శాశ్వతమైన యాతనకు లోనుకావలసి ఉంటుంది.

42. అంటే, భూమ్యాకాశాలను సృష్టించినవాడు అల్లాహ్‌యేననీ, తాము పూజించే చిల్లర దేవుళ్ళకు అంతటి శక్తిలేదని వారికి సయితం తెలుసు.

43. అంటే – ఇక చెప్పాల్సిందేమీ లేదు. భూమ్యాకాశాల నిర్మాత అల్లాహ్ అని మీరే ఒప్పుకున్నారు. ఈ ఒప్పుకోలుతో మా బాధ్యత పూర్తయింది.

44. అంటే – సృష్టించినవాడు, పోషిస్తున్నవాడు, లోకాన్ని కనిపెట్టుకుని ఉన్నవాడు, సర్వాధిపత్యం కలిగి ఉన్నవాడు అల్లాహ్‌యే.

45. అందరికీ ఆయన అవసరం ఉందిగాని ఆయనకు ఎవరి అవసరమూ లేదు. ఆయన నిరపేక్షాపరుడు.

46. సృష్టి ప్రక్రియలో ఆయన ఎవరిపైనా ఆధారపడలేదు. ఆయన దేన్ని సృష్టించినా, మరి ఏ ఆజ్ఞలు జారీచేసినా తన స్వయం నిర్ణయాధికారంతోనే చేశాడు. కాబట్టి జగతిలో ప్రశంసనీయుడు, స్తోత్రాలకు అర్హుడు ఆయన మాత్రమే.

47. ఈ ఆయతులో అల్లాహ్ ఔన్నత్యం, ఆయన నామాలు, ఆయన గుణగణాల దర్పం, ఆయన మహిమలను అభివర్ణించే విషయాలు అన్నీ వచ్చేశాయి. వాటన్నింటినీ గురించి వ్రాయటం ఎవరి తరమూ కాదు. వాటి లోతుల్లోకి ఎవరూ పోలేరు. ఒకవేళ ఎవరయినా వాటన్నింటిని గురించి వ్రాయాలనుకున్నా, అతనికి సహాయంగా ప్రపంచంలోని చెట్లన్నీ కలములుగా మారినా, సముద్రపు నీటితో చేయబడిన సిరా అంతా అయిపోయినా అల్లాహ్ ఔన్నత్యాన్ని, ఆయన సృష్టి అద్భుతాలను గురించి వ్రాయలేదు. ఉన్న సముద్రాలు కాకుండా మరో ఏడు సముద్రాలు సిరాగా

**29** అల్లాహ్ ఏ విధంగా రాత్రిని పగటి లోనికి, పగటిని రాత్రి లోనికి చొప్పిస్తున్నాడో[49] నువ్వు గమనించటం లేదా? ఆయనే సూర్యచంద్రులను కూడా నియమబద్ధంగా చేశాడు. ప్రతి ఒక్కటి నిర్ణీత సమయం వరకు సాగిపోతున్నాయి.[50] మీరు చేసేదంతా కూడా అల్లాహ్‌కు తెలుసు.

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ يُوْلِجُ الَّيْلَ فِى النَّهَارِ وَيُوْلِجُ النَّهَارَ فِى الَّيْلِ وَسَخَّرَ الشَّمْسَ وَالْقَمَرَ كُلٌّ يَّجْرِىْٓ اِلٰٓى اَجَلٍ مُّسَمًّى وَّاَنَّ اللّٰهَ بِمَا تَعْمَلُوْنَ خَبِيْرٌ ﴿29﴾

**30** అల్లాహ్‌యే సత్యం గనక, ఆయన్ని వదలి ప్రజలు మొర పెట్టుకునేవన్నీ అసత్యం గనక,[51] అల్లాహ్‌యే మహోన్నతుడూ గొప్పవాడు[52] గనక ఇదంతా (ఈ విధంగా) సజావుగా సాగుతోంది.

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ هُوَ الْحَقُّ وَاَنَّ مَا يَدْعُوْنَ مِنْ دُوْنِهِ الْبَاطِلُ ۙ وَاَنَّ اللّٰهَ هُوَ الْعَلِىُّ الْكَبِيْرُ ﴿30﴾

మారినాసరే దేవుని విషయాలు తరగవు (ఇబ్నె కసీర్). అల్ కహఫ్ సూరా ఆఖరిలో కూడా ఈ భావం గల ఆయతు వచ్చింది.

48. దేవుని సృష్టి ఎంత అద్భుతమైనదో ఇది తెలియజేస్తోంది. ఒక్కగానొక్క ప్రాణిని సృష్టించటం లేక తిరిగిలేపటం ఎంతో మీ అందరినీ సృష్టించటం మరియు మరణానంతరం తిరిగిలేపటం కూడా అంతే. ఎందుకంటే ఆయన ఏది చేయాలనుకున్నా 'అయిపో' అని చెప్పగానే రెప్పపాటు సమయంలో అయిపోతుంది.

49. అంటే రాత్రిలోని కొంతభాగాన్ని పగలులో కలుపుతాడు. దానివల్ల పగలు పెద్దదై రాత్రి చిన్నదవుతుంది. వేసవి కాలంలో ఇది మనకు అనుభవైక విషయమే. అలాగే పగటిలోని కొంతభాగాన్ని రాత్రిలో అంతర్లీనం చేస్తాడు. దానివల్ల రాత్రి పెద్దదై పగలు చిన్నదవుతుంది. చలికాలంలో ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

50. **"నిర్ణీత సమయం వరకు"** అంటే ప్రళయదినం వరకు అని భావం. అంటే సూర్య చంద్రులు ఉదయించే, అస్తమించే వేళలను అల్లాహ్ ప్రళయ ఘడియ వరకూ నిర్ధారించి ఉన్నాడు.

రెండవ అర్థం : 'నిర్ణీత గమ్యం వరకు' అని కూడా వస్తుంది. అంటే సూర్యచంద్రుల భ్రమణం కోసం దేవుడు ఒక నిర్ణీత పరిధిని నిర్ధారించాడు. ఆ పరిధిలోనే అవి ఉదయించి అస్తమిస్తాయి. ఒక రోజు అది గమ్యానికి చేరుకోగానే, తన ప్రయాణాన్ని అక్కడితో చాలించి మరునాడు తన మొదటి స్థానానికి వచ్చేస్తుంది. ఒక హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. మహాప్రవక్త (సఅసం) వారు హజ్రత్ అబూజర్ (రజి) నుద్దేశించి, "ఈ సూర్యుడు ఎక్కడి వరకు వెళతాడో (ఎక్కడ అస్తమిస్తాడో) తెలుసా?" అని అడిగారు. "అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త (స)కే ఈ సంగతి బాగా తెలుసు" అని తాను అన్నానని అబూజర్ (రజి) చెప్పారు. అప్పుడు మహాప్రవక్త (స) ఇలా అన్నారు: "అతని చివరి గమ్యం దైవసింహాసనం (అర్ష్). అతను అక్కడికి చేరుకుని, సింహాసనం క్రింద సాష్టాంగపడతాడు. ఆ తరువాత (అక్కడి నుంచి బయలు దేరేందుకు) సెలవు కోర్తాడు. ఒకానొక సమయంలో అతనితో, "నువ్వు వచ్చిన చోటికే తిరిగి వెళ్ళిపో" అని అనబడుతుంది. అప్పుడతను తూర్పున ఉదయించేబదులు పశ్చిమాన ఉదయిస్తాడు. ప్రళయఘడియ సమీపించిందనటానికి అది ఆనవాలు." (సహీహ్ బుఖారీ – కితాబుత్తౌహీద్; ముస్లిం – కితాబుల్ ఈమాన్). హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా తెలిపారు: "సూర్యుడు గానుగ లాంటివాడు. పగటిపూట ఆకాశంలో తన కక్ష్యలో తిరుగుతాడు. అస్తమించిన తరువాత – రాత్రిపూట – భూమి క్రింద తన పరిధిలో పయనిస్తాడు. కడకు తూర్పుకు వచ్చి ఉదయిస్తాడు. చంద్రుని పరిస్థితి కూడా ఇంతే." (ఇబ్నె కసీర్)

51. అంటే, ఈ విశ్వవ్యవస్థను నడిపేవాడు కేవలం అల్లాహ్‌యే. ఆయన ఆజ్ఞానుసారమే ఇదంతా నడుస్తోంది. ఆయన తప్ప మిగిలినదంతా మిథ్య. ఆయన తప్ప వేరెవరికీ ఎలాంటి అధికారమూ లేదు. అందరూ ఆయనపైనే ఆధారపడి ఉన్నారు. ఎందుకంటే అందరూ ఆయనచేత సృష్టించబడినవారే. అందరూ ఆయనకు లోబడి ఉన్నారు – ఈ విషయం అందరికీ బాగా అర్థమయ్యేలా చేయడానికే అల్లాహ్ ఈ ఏర్పాట్లన్నీ చేస్తున్నాడు.

أَلَمْ تَرَ أَنَّ الْفُلْكَ تَجْرِي فِي الْبَحْرِ بِنِعْمَتِ اللّٰهِ
لِيُرِيَكُمْ مِّنْ اٰيٰتِهٖ ؕ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّكُلِّ
صَبَّارٍ شَكُوْرٍ ﴿31﴾

**31** అల్లాహ్ అనుగ్రహంతో ఓడలు సముద్రంలో నడవటాన్ని నువ్వు గమనించటం లేదా? ఆయన తన సూచనలను మీకు చూపించటానికి[53] (ఇదంతా చేస్తున్నాడు). నిశ్చయంగా ఇందులో సహనం వహించే, కృతజ్ఞతా భావం కలిగి ఉండే[54] ప్రతి ఒక్కరికీ ఎన్నో సూచనలున్నాయి.

وَاِذَا غَشِيَهُمْ مَّوْجٌ كَالظُّلَلِ دَعَوُا اللّٰهَ
مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ ۚ فَلَمَّا نَجّٰىهُمْ اِلَى الْبَرِّ
فَمِنْهُمْ مُّقْتَصِدٌ ؕ وَمَا يَجْحَدُ بِاٰيٰتِنَآ اِلَّا كُلُّ
خَتَّارٍ كَفُوْرٍ ﴿32﴾

**32** మరి వారిపై (సముద్ర) కెరటాలు నీడల మాదిరిగా క్రమ్ము కున్నప్పుడు, వారు తమ నమ్మకాన్ని పూర్తిగా అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని, ఆయన్ని మొరపెట్టుకుంటారు.[55] మరి ఆయన వారిని రక్షించి నేలమీదకు చేర్చిన తరువాత వారిలో కొందరు (విశ్వాసానికీ – అవిశ్వాసానికి) మధ్యలో ఊగిసలాడతారు.[56] నమ్మక ద్రోహి, చేసినమేలును మరచినవాడు తప్ప వేరెవరూ మా ఆయతులను త్రోసిపుచ్చరు.[57]

52. అల్లాహ్‌కన్నా ఉన్నతుడు, మహిమాన్వితుడు ఎవడూ లేడు. ఆయన గొప్పదనం, ఔన్నత్యం ముందు లోకంలోని వస్తువులన్నీ అత్యంత అల్పమైనవి.

53. సముద్రంలో నౌకలు నడవటం కూడా దేవుని దయాదాక్షిణ్యాలకు ఒక తార్కాణమే. నౌకలు సముద్రంలో పయనించ గలగటానికి వీలుగా ఆయన గాలినీ, నీరునూ సమపాళ్ళలో ఉంచాడు. లేకుంటే ప్రచండమైన ఈదురు గాలుల మధ్య, ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్ర కెరటాల మధ్య పడవ ప్రయాణం అసాధ్యం అయిపోయేది.

54. అంటే కష్టకాలంలో ఓపికపట్టేవారు, సుఖసౌఖ్యాలలో దైవానికి కృతజ్ఞతలు తెలుపుకునేవారు అని భావం.

55. వారి నౌకలు గాలివానలో సుడిగుండంలో చిక్కుకుని, సముద్రం అల్లకల్లోలంగా తయారైనపుడు వారికి బ్రతికి బయటపడే అవకాశం ఏదీ కానరాదు. తాము మృత్యువు ఒడిలోకి వెళ్ళిపోయామని అనుకుంటారు. ఆ సమయంలో వారు తమ భక్తీ విశ్వాసాలను, ఆరాధనలన్నింటినీ ఒక్కడైన అల్లాహ్‌కే ప్రత్యేకించి, ఈ గండం నుంచి గట్టెక్కించమని దీనాతి దీనంగా ప్రార్థిస్తారు.

56. **'ముఖ్తసిదున్'** (مُقْتَصِد) అనే పదం గురించి రెండు రకాల వ్యాఖ్యానాలు చేయబడ్డాయి. మొదటిది : ముఖ్తసిదున్ అంటే వాగ్దానాన్ని నిలబెట్టుకునేవాడు. అంటే ఆపద సమయంలో చేసిన వాగ్దానం ప్రకారం కొందరు విశ్వాసంపై, దేవుని ఏకత్వంపై, దైవవిధేయతా విధానంపై గట్టిగా నిలబడతారు. దీనిప్రకారం చూస్తే ఈ వాక్యానికి, "వారిలో కొందరు విశ్వాసులుగా ఉంటే మరికొందరు తిరస్కారులుగా ఉంటారు" అనే భావం వస్తుంది. (ఫత్‌హుల్ ఖదీర్). రెండవ వ్యాఖ్యానం : దీనికి సమతూకం పాటించేవాడు, మధ్యేమార్గం అవలంబించేవాడు అని అర్థం. ఈ నేపథ్యంలో దీనిభావం ఇలా ఉంటుంది – అత్యంత భయంకరమైన గండం నుంచి బయటపడిన తరువాత, దేవుని గొప్ప శక్తి సూచనలను కళ్లారా చూసిన తరువాత, దేవుడు వారిని కాపాడిన తరువాత కూడా ఈ మానవుడు పూర్తిగా విధేయత చూపకుండా అటూ ఇటూ ఊగిసలాడతాడా? వాస్తవానికి అతను ఎదుర్కొన్న సంక్లిష్ట పరిస్థితుల దృష్ట్యా చూస్తే మనో వాక్కాయకర్మల చేత అతను పూర్తిగా దైవవిధేయతలో నిమగ్నుడు కావలసింది. కాని కష్టాలు తొలగిపోయిన తరువాత అతను మారిపోయాడు (ఇబ్నె కసీర్). ఈ రెండు వ్యాఖ్యానాలలో మొదటి వ్యాఖ్యానమే సందర్భానికి దగ్గరగా ఉంది.

57. **'ఖత్తార్'** (خَتَّار) అంటే మాటనిలబెట్టుకోనివాడు, ద్రోహానికి పాల్పడినవాడు అని అర్థం. **'కఫూర్'** అంటే చేసిన మేలును మరచేవాడు, కృతఘ్నుడు అని అర్థం.

يَٰٓأَيُّهَا ٱلنَّاسُ ٱتَّقُوا۟ رَبَّكُمْ وَٱخْشَوْا۟ يَوْمًا لَّا يَجْزِى وَالِدٌ عَن وَلَدِهِۦ وَلَا مَوْلُودٌ هُوَ جَازٍ عَن وَالِدِهِۦ شَيْـًٔا ۚ إِنَّ وَعْدَ ٱللَّهِ حَقٌّ ۖ فَلَا تَغُرَّنَّكُمُ ٱلْحَيَوٰةُ ٱلدُّنْيَا وَلَا يَغُرَّنَّكُم بِٱللَّهِ ٱلْغَرُورُ ﴿٣٣﴾

**33** ప్రజలారా! మీ ప్రభువుకు భయపడండి. ఏ తండ్రీ తన కుమారునికి ఉపయోగపడని, ఏ కుమారుడూ తన తండ్రికి ఏ విధంగానూ ఉపయోగపడని దినానికి భయపడండి.[58] అల్లాహ్ వాగ్దానం సత్యమైనది (అని తెలుసుకోండి). ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోస పుచ్చటంగానీ, మోసగాడు (షైతాను) మిమ్మల్ని మోసగించటం గానీ జరగరాదు సుమా!

إِنَّ ٱللَّهَ عِندَهُۥ عِلْمُ ٱلسَّاعَةِ وَيُنَزِّلُ ٱلْغَيْثَ وَيَعْلَمُ مَا فِى ٱلْأَرْحَامِ ۖ وَمَا تَدْرِى نَفْسٌ مَّاذَا تَكْسِبُ غَدًا ۖ وَمَا تَدْرِى نَفْسٌۢ بِأَىِّ أَرْضٍ تَمُوتُ ۚ إِنَّ ٱللَّهَ عَلِيمٌ خَبِيرٌۢ ﴿٣٤﴾

**34** నిస్సందేహంగా ప్రళయానికి సంబంధించిన జ్ఞానం అల్లాహ్ వద్ద మాత్రమే ఉంది. ఆయనే వర్షాన్ని కురిపిస్తున్నాడు. మాతృ గర్భాలలో ఏముందో ఆయనకు తెలుసు. తాను రేపు ఏం చేయ నున్నదో ఏ ప్రాణీ ఎరుగదు. తాను ఏ గడ్డపై మరణిస్తాడో కూడా ఎవరికీ తెలీదు.[59] అల్లాహ్‌యే సర్వజ్ఞాని, అన్నీ తెలిసినవాడు (అని తెలుసుకోండి).

58. **'యజ్‌జీ'** (يَجْزِى) అంటే అసలు బదులు ఇవ్వటం అని అర్థం. దీనిభావం ఏమిటంటే తండ్రి తన కన్న కొడుకును కాపాడే ఉద్దేశంతో తన ప్రాణాన్ని బదులుగా ఇవ్వదలచినా లేక కొడుకు తన తండ్రికి బదులుగా తనను తాను సమర్పించుకోగోరినా అక్కడ స్వీకారయోగ్యం కాజాలదు. ప్రతి ఒక్కరూ తాము చేసుకున్న దాన్ని తామే అనుభవించ వలసి ఉంటుంది. తండ్రీ కొడుకులే ఒండొకరిని ఆదుకోలేనపుడు బంధుమిత్రుల సహాయం మాత్రం ఎలా స్వీకరించబడుతుంది?

59. ఐదు విషయాలు అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ తెలియవని హదీసు ద్వారా కూడా తెలుస్తోంది (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరె లుఖ్మాన్). 1. ప్రళయదినం సమీపించిందనడానికి కొన్ని సంకేతాలనైతే దైవప్రవక్త (సఅసం) సూచించారు. కాని ప్రళయ ఘడియ ఖచ్చితంగా ఎప్పుడు సంభవిస్తుందనేది అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ తెలియదు. ఆఖరికి దైవదూతలకు, దైవప్రవక్తలకు కూడా తెలీదు. 2. వర్షం విషయం కూడా అంతే. ఏ ప్రాంతాలలో, ఏ మోతాదులో వర్షం కురియనున్నదో అంచనా వేయటం నిజమేగాని ఆ అంచనాలు ఒక్కోసారి తప్పుగా తేల్తాయి. ఆఖరికి ప్రభుత్వ ఆధ్వర్యంలోని వాతావరణ పరిశోధన కేంద్రాల అంచనాలు కూడా తారుమారవుతుంటాయి. దీన్నిబట్టి రూఢీ అయ్యేదేమిటంటే వర్షానికి సంబంధించిన ఖచ్చితమైన సమాచారం అల్లాహ్‌కు తప్ప ఇతరులెవరికీ తెలీదు. 3. మాతృగర్భాలలో ఉన్న శిశువు లింగనిర్ధారణ స్కానింగ్ ద్వారా జరుగుతోంది. కాని మాతృగర్భాలలో పెరుగుతున్న ఆ శిశువు ఎలాంటిది, మంచిదా చెడ్డదా? అందంగా ఉంటుందా? అందవికారంగా ఉంటుందా? నల్లగా ఉంటుందా? తెల్లగా ఉంటుందా? – ఇత్యాది విషయాలు అల్లాహ్‌కు తప్ప ఎవరికీ తెలీదు. 4. మనిషి తాను రేపు ఏం చేయనున్నాడు? అది ప్రాపంచిక వ్యవహారమైనా, ధార్మిక వ్యవహారమైనా – రేపు తనకు లభించేదేమిటో ఏ మనిషికీ తెలియదు. 5. అలాగే మరణం ఎప్పుడు వస్తుంది? ఇంట్లో వస్తుందా? ఇంటిబయట వస్తుందా? స్వస్థలంలో వస్తుందా? విదేశీ గడ్డపై వస్తుందా? యుక్తవయస్సులోనే మృత్యువు కాటేస్తుందా? వృద్ధాప్యం వరకూ ఆగుతుందా? తన మనోవాంఛలన్నీ ఈడేరిన తరువాత మృత్యువు కబళిస్తుందా? లేక అంతకు ముందే వస్తుందా? – ఈ సంగతి ఎవరికీ తెలియదు.

32వ సూరా

# అస్ సజ్దహ్

## సాష్టాంగ ప్రణామం

అవతరణ మక్కాలో

ఆయతులు 30

### పరిచయం

*మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి, పరలోక జీవితం గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. అవిశ్వాసులు మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి అనుమానాలు వ్యక్తం చేసారు. పరలోక జీవితాన్ని వాళ్ళు విశ్వసించలేదు. దైవప్రవక్త ముహమ్మద్(సఅసం)తో ఈ విషయమై వాళ్ళు వివాదానికి దిగేవారు. ఈ ప్రశ్నలతో ఆయన సందేశాన్ని తిరస్కరించడానికి ప్రయత్నించేవారు. ఈ సూరా అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడే ఆయత్‌తో ప్రారంభమవుతుంది. అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయనకే ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని నిరూపించే వాక్యాలతో ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తుంది. సమస్తాన్ని సృష్టించింది అల్లాహ్. ఒకసారి సృష్టించిన ఆయనకు మరోసారి సృష్టించడం చాలా తేలిక. మరణించిన వారిని మళ్ళీ సృష్టించి నిలబెట్టడం ఆయనకు సులభసాధ్యం. ఈ సందర్భంగా దేవుని సృష్టి సామర్థ్యం గురించిన వివరాలను కూడా ఈ సూరా ఇక్కడ పొందుపరిచింది. దివ్యఖుర్‌ఆన్‌ను సత్యంగా పేర్కొంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదని, ఇదొక హెచ్చరిక అని తెలియజేసింది. ఈ సూరాలోని 15వ ఆయతులో వచ్చిన 'సజ్దహ్' (సాష్టాంగ ప్రణామం) ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ ఆయత్‌లో విశ్వాసుల గుణగణాలను వర్ణించడం జరిగింది. విశ్వాసులు దేవుని చిహ్నాలను విశ్వసిస్తారు. దేవుని చిహ్నాల గురించి వారికి గుర్తుచేసినప్పుడు వారు భక్తితో సాష్టాంగపడతారు. తమ ప్రభువైన అల్లాహ్‌ను స్తుతిస్తారు. గతకాలాల్లో అవిశ్వాసానికి పాల్పడిన జాతులకు ఎలాంటి గతి పట్టిందో ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఈ సూరా అవిశ్వాసులను హెచ్చరించింది. గతంలో అనేక జాతులు నాశనం చేయబడ్డాయని, ఈ వాస్తవాన్ని అల్లాహ్ చిహ్నాల్లో ఒకటిగా గుర్తించాలని చెప్పడం జరిగింది.*

*ఈ సూరాలో దేవుని శక్తిసామర్థ్యాలను వివరించడం జరిగింది. అల్లాహ్ ఆకాశాలను, భూమిని సృష్టించాడు. భూమ్యాకాశాల మధ్య ఉన్న సమస్తాన్ని సృష్టించాడు. ఈ సృష్టిని ఆయన ఆరురోజుల్లో పూర్తిచేసాడు. ఆయన ఆకాశాలను, భూమిపై జరిగే అన్ని వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నాడు. ఆయన కంటికి కనిపించని సమస్త విషయాలు తెలిసినవాడు. ఈ అగోచరాలు మన ఇంద్రియజ్ఞానంతో గ్రహించడానికి వీలు కానివి. ఆయన మనిషిని మట్టి నుంచి సృష్టించాడు. ఆయన మనిషికి వినే, చూసే శక్తిని ఇచ్చాడు. ముఖ్యమైన అవయవాలు ప్రసాదించాడు. ఆయన పొడి నేలపై వర్షాన్ని కురిపించి పంటలు పండేలా చేస్తున్నాడు. ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాడు. వారి పశువులకు ఆహారం లభించేలా చేస్తున్నాడు.*

## అస్ సజ్‌దహ్[1] సూరా

## سُورَةُ السَّجْدَةِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

الٓمّٓ ① تَنْزِيْلُ الْكِتٰبِ لَا رَيْبَ فِيْهِ مِنْ رَّبِّ الْعٰلَمِيْنَ ②

**1 - 2** అలిఫ్ - లామ్ - మీమ్. (ఇది) సర్వలోకాల ప్రభువు తరఫున అవతరింపజేయబడిన గ్రంథం. ఇందులో ఎలాంటి సందేహమే లేదు.[2]

اَمْ يَقُوْلُوْنَ افْتَرٰىهُ ۚ بَلْ هُوَ الْحَقُّ مِنْ رَّبِّكَ لِتُنْذِرَ قَوْمًا مَّاۤ اَتٰىهُمْ مِّنْ نَّذِيْرٍ مِّنْ قَبْلِكَ لَعَلَّهُمْ يَهْتَدُوْنَ ③

**3** ఏమిటీ, ఇతను (ప్రవక్త) స్వయంగా దీనిని కల్పించుకున్నాడని వారంటున్నారా?[3] (ముమ్మాటికీ కాదు) వాస్తవానికి ఇది నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం – నీకు పూర్వం హెచ్చరించే వాడెవడూ రాని వారిని నువ్వు హెచ్చరించటానికి,[4] తద్వారా వారు సన్మార్గానికి రావటానికిగాను (ఇది పంపబడినది).

اَللّٰهُ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَمَا بَيْنَهُمَا فِيْ سِتَّةِ اَيَّامٍ ثُمَّ اسْتَوٰى عَلَى الْعَرْشِ ۭ مَا لَكُمْ مِّنْ دُوْنِهٖ مِنْ وَّلِيٍّ وَّلَا شَفِيْعٍ ۭ اَفَلَا تَتَذَكَّرُوْنَ ④

**4** అల్లాహ్‌యే ఆకాశాలనూ, భూమినీ, వాటి మధ్యనున్న సమస్తాన్నీ ఆరు రోజులలో సృష్టించాడు. ఆ తరువాత సింహాసనాన్ని (అర్ష్‌ను) అధిష్ఠించాడు.[5] ఆయన తప్ప మీకు ఏ సహాయకుడూ, మరే సిఫారసు చేసేవాడూ లేడు.[6] అయినా మీరు హితబోధను గ్రహించరేమిటీ?[7]

1. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) శుక్రవారం నాడు ఉదయం (ఫజ్ర్) నమాజులోని మొదటి రకాతులో సజ్దా సూరాను పారాయణం చేసేవారనీ, రెండవ రకాతులో సూరె దహర్ (హల్ అతాక అలల్ ఇన్సాని) పఠించేవారని హదీసు ద్వారా తెలుస్తోంది. (సహీహ్ బుఖారీ, ముస్లిం - కితాబుల్ జుముఅ). అలాగే మహాప్రవక్త (స) రాత్రిపూట నిద్రపోయే ముందు సూరె సజ్దాను, సూరె ముల్క్‌ను పారాయణం చేసేవారని ప్రామాణిక ఆధారాల ద్వారా తెలుస్తోంది (తిర్మిజీ - నెం.892; ముస్నదె అహ్మద్ - 3/340).
2. అంటే ఇదేదో కట్టుకథల సంకలనంగానీ, జోతిష్యంగానీ, పుక్కిటి పురాణంగానీ, అసత్యంగానీ ఎంతమాత్రం కాదు. పైగా ఇది సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్ నుండి పంపబడిన మార్గదర్శక గ్రంథం.
3. ఈ ఆయతులో సత్యతిరస్కారులకు హెచ్చరిక ఉంది. అనితర సాధ్యమైన ఈ గ్రంథరాజం విషయంలో వారు ఇలాంటి తప్పుడు ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు. ముహమ్మద్ (సఅసం) స్వయంగా దీన్ని కల్పించాడని అనటానికి వారి దగ్గర ఉన్న ఆధారం ఏమిటి?
4. ఖుర్‌ఆన్ అవతరణ వెనుక గల ప్రధాన ఉద్దేశం ఇక్కడ తెలియజేయబడింది. అరబ్బుల దిద్దుబాటు కోసం మహాప్రవక్త (స)కు మునుపు ఏ ప్రవక్తా రాలేదని కూడా ఈ ఆయతు ద్వారా అవగతమవుతోంది. అయితే హజ్రత్ షుఐబ్ (అలైహిస్సలాం)ను కొంతమంది అరబ్బుల ప్రవక్తగా ఖరారు చేస్తారు. మరి ఆ లెక్కన పూర్వం హెచ్చరించబడని జాతివారు అంటే బహుశా ఖురైషులు అయి ఉంటారు. బహుశా ఖురైషుల వద్దకు పంపబడిన ఏకైక ప్రవక్త ముహమ్మద్ (స) అన్నది దీని అంతరార్థం అయి ఉండవచ్చు.
5. దీనికి సంబంధించిన వివరాల కోసం ఆరాఫ్ సూరా 54వ ఆయతు క్రింద ఇవ్వబడిన పాదసూచికను చూడండి.

5 ఆయనే ఆకాశాలు మొదలుకుని భూమి వరకు (ప్రతి) పనిని నడుపుతున్నాడు.[8] మరి అది (ఆ పని) మీరు లెక్కించే వెయ్యి సంవత్సరాలంతటి[9] ఒకానొక రోజున పైకి ఆయన వద్దకు చేరి పోతుంది.

يُدَبِّرُ الْأَمْرَ مِنَ السَّمَاءِ إِلَى الْأَرْضِ ثُمَّ يَعْرُجُ إِلَيْهِ فِي يَوْمٍ كَانَ مِقْدَارُهُ أَلْفَ سَنَةٍ مِّمَّا تَعُدُّونَ ⑤

6 ఆయనే గోప్యంగా, బహిర్గతంగా ఉన్న వాటిని ఎరిగినవాడు– అపార శక్తిసంపన్నుడు, అనంత కరుణామయుడు.

ذَٰلِكَ عَالِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ الْعَزِيزُ الرَّحِيمُ ⑥

7 ఆయన ఏ వస్తువును చేసినా చాలా చక్కగా చేశాడు.[10] మానవ సృష్టిని మట్టితో మొదలుపెట్టాడు.[11]

الَّذِي أَحْسَنَ كُلَّ شَيْءٍ خَلَقَهُ وَبَدَأَ خَلْقَ الْإِنسَانِ مِن طِينٍ ⑦

6. అంటే దైవసమక్షంలో మీకు తోడ్పడగల స్నేహితుడెవడూ ఉండడు. మీకోసం సిఫారసు చేసేవాడు కూడా అక్కడ ఎవడూ ఉండడు.

7. ఓ దైవేతర పూజారులారా! అల్లాహ్‌ను వదలి ఇతరులను నమ్ముకునేవారలారా! ఇంతగా విడమరచి చెప్పినా మీకు విషయం బోధపడటం లేదా? మీరు గుణపాఠం గ్రహించరా?

8. ఆకాశాన, తాను అధిష్టించి వున్న అర్ష్ (సింహాసనం) వద్ద నుంచి అల్లాహ్ భూమిపైకి తన ఆదేశాలను జారీ చేస్తున్నాడు. ఏది ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరగాలో పకడ్బందీగా వ్యూహ రచన చేస్తున్నాడు. వాటిని ప్రవేశపెడుతున్నాడు. ఉదాహరణకు: జీవన్మరణాలు, స్వస్థత, అస్వస్థత, కలిమిలేములు, జయాపజయాలు, యుద్ధాలు సంధులు మొదలగునవి. అల్లాహ్ అర్ష్ అనే తన అధికార పీఠంపై నుంచే, తన నిర్ణయానుసారం ఈ ప్రణాళికను రచించి, నడుపుతాడు.

9. కడకు ఆయనకు సంబంధించిన ఈ కార్యం లేక ఉపాయం ఏదో ఒక రోజున ఆయన వద్దకే తిరిగి వెళ్ళిపోతుంది. దాన్ని దైవదూతలు ఊర్ధ్వలోకాల్లోకి తీసుకుపోతారు. అలా గొనిపోయే ఈ అంతరం చాలా పెద్దది. దైవదూత కాని వ్యక్తి గనక దాన్ని తీసుకుపోదలిస్తే వెయ్యి సంవత్సరాలు పడుతుంది. లేదా ప్రళయదినాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలా అనబడి ఉండవచ్చు. ఆనాడు మానవుల కర్మలన్నీ దైవ సమక్షంలో సమర్పించబడతాయి. ఆ “రోజు” నిర్ధారణకు సంబంధించి ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల మధ్య తీవ్రమయిన భేదాభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇమామ్ షౌకానీ, 15, 16 కథనాలను పొందుపరచారు. ఈ వ్యవహారంపై అంతిమ నిర్ణయానికి రావటం కన్నా, దీన్ని దైవాధీనం చేయటమే ఉత్తమమని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు. 'ఐసరుత్తఫాసీర్' వ్యాఖ్యాత ఇలా అన్నారు : దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విషయం మూడు చోట్ల ప్రస్తావనకు వచ్చింది. ఈ మూడు చోట్లా మూడు వేర్వేరు దినాలు సూచించబడ్డాయి. అల్ హజ్ సూరా (47వ ఆయతు)లో 'ఆ రోజు' గురించి వచ్చింది. అల్ మఆరిజ్ సూరాలో 'ఆ రోజు' 50 వేల యేండ్లకు సమానంగా పేర్కొనబడింది. ఇక్కడ ఈ సూరాలో 'ఆ రోజు' అంటే ప్రాపంచిక జీవితపు ఆఖరి రోజు. ఆ రోజు ప్రాపంచిక వ్యవహారాలన్నీ నాశనమై అల్లాహ్ వైపుకు మరలించబడతాయి.

10. అల్లాహ్ ఏ వస్తువును సృష్టించినా ఏదో ఒక ఆశయంతో, పరమార్థంతో సృష్టించినదై ఉంటుంది. ఆ వస్తువులో దానికంటూ ఓ ప్రత్యేకత, అందం ఉంటాయి. ఆ మాటకొస్తే దేవుడు చేసిన ప్రతి వస్తువూ అందమైనదే. కొంతమంది వ్యాఖ్యాతలు **'అహ్‌సన'** (أَحْسَنَ) (ఉత్తమంగా) అన్నపదాన్ని ఇక్కడ 'పటిష్టమైన' అన్న అర్థంలో తీసుకున్నారు. అల్లాహ్ ప్రాణులన్నిటినీ అవి తమ అవసరాలు తెలుసుకునేలా సృష్టించాడని మరి కొందరు భాష్యం చెప్పారు.

11. అంటే – మొట్టమొదటిసారిగా అల్లాహ్ ఆదం (అలైహిస్సలాం)ను మట్టితో చేశాడు. అక్కడి నుంచి మనుజ జాతి సృష్టి ప్రక్రియ ఆరంభమైనది. ఆదం భార్యను ఆదం ఎడమవైపు ప్రక్కటెముకతో సృష్టించాడని హదీసుల ద్వారా అవగతమవుతోంది.

**8** ఆ తరువాత అతని సంతతిని అత్యంత అల్పమైన నీటి సారం (వీర్యం)తో కొనసాగించాడు.[12]

ثُمَّ جَعَلَ نَسْلَهُ مِن سُلَالَةٍ مِّن مَّاءٍ
مَّهِينٍ ﴿٨﴾

**9** ఆ తరువాత తగు రీతిలో దానిని మలచి, అందులో తన వద్ద నుండి ఆత్మను ఊదాడు.[13] మరి ఆయనే మీ చెవులను, కళ్లను, హృదయాలను చేశాడు.[14] (ఈ ఉపకారాలకు కూడా) మీరు కృతజ్ఞతలు తెలుపుకునేది చాలా తక్కువే.[15]

ثُمَّ سَوَّاهُ وَنَفَخَ فِيهِ مِن رُّوحِهِ ۖ وَجَعَلَ
لَكُمُ السَّمْعَ وَالْأَبْصَارَ وَالْأَفْئِدَةَ ۚ قَلِيلًا
مَّا تَشْكُرُونَ ﴿٩﴾

**10** “ఏమిటీ, మేము మట్టిలో కలసి, మాయమయిపోయిన[16] తరువాత కూడా మళ్లీ సరికొత్తగా సృష్టించబడతామా?” అని అంటారు. అసలు విషయం ఏమిటంటే వారు తమ ప్రభువును కలుసుకోవటాన్ని త్రోసిపుచ్చుతున్నారు.

وَقَالُوا أَإِذَا ضَلَلْنَا فِي الْأَرْضِ أَإِنَّا لَفِي خَلْقٍ
جَدِيدٍ ۚ بَلْ هُم بِلِقَاءِ رَبِّهِمْ كَافِرُونَ ﴿١٠﴾

**11** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : “మీపై నియమించబడివున్న మృత్యుదూత మీ ప్రాణాలను వశపరచుకుంటాడు.[17] ఆ తరువాత మీరంతా మీ ప్రభువు వైపునకు మరలించబడతారు.”

قُلْ يَتَوَفَّاكُم مَّلَكُ الْمَوْتِ الَّذِي وُكِّلَ بِكُمْ
ثُمَّ إِلَىٰ رَبِّكُمْ تُرْجَعُونَ ﴿١١﴾

**12** అపరాధులు తమ ప్రభువు సమక్షంలో తలలు వంచుకుని ఉండటాన్ని నువ్వు చూస్తే ఎంత బావుంటుంది![18] (వారిలా అంటారు): “మా ప్రభూ! మేమంతా చూసుకున్నాము. (అంతా) విన్నాము.[19] ఇక మమ్మల్ని తిరిగి పంపించు. (ఇక నుంచి) మేము సత్కార్యాలు చేస్తాము. మాకిక పూర్తి నమ్మకం కలిగింది.”[20]

وَلَوْ تَرَىٰ إِذِ الْمُجْرِمُونَ نَاكِسُو رُءُوسِهِمْ
عِندَ رَبِّهِمْ رَبَّنَا أَبْصَرْنَا وَسَمِعْنَا فَارْجِعْنَا
نَعْمَلْ صَالِحًا إِنَّا مُوقِنُونَ ﴿١٢﴾

12. అంటే, రేతస్సు (వీర్యపు బిందువు)తో. అంటే ఒక మానవ జంటను సృష్టించిన పిదప మానవజాతి పరంపరను ముందుకు నడపటానికి ఆయన స్త్రీ పురుషుల వైవాహిక వ్యవస్థను ఏర్పరచాడు. భార్యాభర్తల సంభోగం సందర్భంగా పురుషుని నుంచి వెలువడే వీర్య బిందువు స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశిస్తుంది. ఆ వీర్యకణం ద్వారా దేవుడు ఓ సంపూర్ణ మనిషిని సృజిస్తాడు.

13. అంటే మాతృగర్భంలో ఆ శిశువును వివిధ దశల్లో పెంచుతాడు. అతనికి శరీరావయవాలు సమకూరుస్తాడు. నఖశిఖ పర్యంతం దాని రూపు రేఖలు తీర్చిదిద్దుతాడు. ఆ తరువాత అందులో ఆత్మను ఊదుతాడు.

14. ఆయన తన సృష్టికి పరిపూర్ణతను చేకూర్చడానికి వీటన్నింటినీ సమకూర్చాడు. వినవలసిన ప్రతి దానినీ మీరు వినగలిగేలా, చూడవలసిన ప్రతి వస్తువును మీరు చూడగలిగేలా, బుద్ధికి అందే ప్రతి విషయంపై మీరు ఆలోచించగలిగేలా దేవుడు మిమ్మల్ని మలిచాడు.

15. ఇన్ని మహోపకారాలు చేసిన తరువాత కూడా ఈ మనిషి కృతఘ్నుడుగానే ఉంటున్నాడు. దేవునికి ధన్యవాదాలు తెలుపుకోవలసిన విధంగా తెలుపుకోవటం లేదు.

16. ఏదైనా ఒక వస్తువుపై మరో వస్తువు పూర్తిగా ప్రాబల్యం వహించినపుడు మొదటి వస్తువు తన గుణాన్ని క్రమక్రమంగా కోల్పోతుంది. దాన్నే అరబీలో **జలాలత్**గా పేర్కొంటారు. అంటే కనుమరుగు అవటం అన్నమాట. **‘జలల్‌నా ఫిల్ అర్జి’** అంటే “మట్టిలో కలసి మేము మా ఉనికిని కోల్పోయిన పిదప” అని అర్థం వస్తుంది.

**13** మేము గనక తలచుకుంటే, ప్రతి ఒక్కరికీ సన్మార్గం[21] ప్రసాదించి ఉండేవాళ్ళం. అయితే, “నేను నరకాన్ని జిన్నులతోనూ, మనుషులతోనూ తప్పకుండా నింపుతాను” అన్న నా మాట నిజమయింది.[22]

وَلَوْ شِئْنَا لَاٰتَيْنَا كُلَّ نَفْسٍ هُدٰىهَا وَلٰكِنْ
حَقَّ الْقَوْلُ مِنِّيْ لَاَمْلَئَنَّ جَهَنَّمَ مِنَ الْجِنَّةِ
وَالنَّاسِ اَجْمَعِيْنَ ⑬

**14** ఇక మీరు, మీకు చెందిన ఈనాటి సమావేశాన్ని విస్మరించి నందుకు (శిక్ష) రుచిని చూడండి. మేము కూడా మిమ్మల్ని విస్మరించాము.[23] ఇక మీరు చేసుకున్న చేష్టలకు (పర్యవసానంగా) శాశ్వతమైన శిక్ష రుచిచూడండి.

فَذُوْقُوْا بِمَا نَسِيْتُمْ لِقَآءَ يَوْمِكُمْ هٰذَا ۚ اِنَّا نَسِيْنٰكُمْ
وَذُوْقُوْا عَذَابَ الْخُلْدِ بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ⑭

**15** మా ఆయతులు బోధించబడినప్పుడు సజ్దాలో పడిపోయే వారు,[24] తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పవిత్రతను కొనియాడే వారు,[25] గర్వపడనివారు[26] మాత్రమే మా సూక్తులను నమ్ముతారు.[27]

اِنَّمَا يُؤْمِنُ بِاٰيٰتِنَا الَّذِيْنَ اِذَا ذُكِّرُوْا بِهَا
خَرُّوْا سُجَّدًا وَّسَبَّحُوْا بِحَمْدِ رَبِّهِمْ وَهُمْ
لَا يَسْتَكْبِرُوْنَ ۩ ⑮

17. అది మృత్యు దూత డ్యూటీ. మీ మరణ ఘడియ ఆసన్నమైనపుడు ఒక్క క్షణం కూడా తాత్సారం చేయకుండా ఆ దూత మీ ఆత్మను స్వాధీనం చేసుకుంటాడు.
18. అంటే తాము చేసిన పాపకార్యాలకు, తిరస్కార వైఖరికి, బహు దైవారాధనకు సిగ్గుతో కుమిలిపోతూ, తలలు వంచుకుని నిలబడి ఉంటారు.
19. “ఒకప్పుడు మేము త్రోసిపుచ్చే విషయాన్ని ఇప్పుడు కళ్ళారా చూశాము. ఒకప్పుడు పరిహసించిన దానిని గురించి ఇప్పుడు మా చెవులతో విన్నాము. నీ హెచ్చరికలోని వాస్తవికత మాకు బోధపడింది. ప్రవక్తల సందేశం సత్యమని తెలుసుకున్నాము” అని అంటారు. కాని ఆనాడు వారు గ్రహించిన సత్యం వారికేవిధంగానూ పనికిరాదు.
20. కాని ఏం లాభం? వారి గడువు తీరిపోయింది. ఇప్పుడు వారి కొరకు మిగిలిందల్లా పరాభవంతో కూడిన శిక్షే. దాన్ని వారు చవిచూడక తప్పదు.
21. అంటే ప్రాపంచిక జీవితంలో వారికి మా మార్గం చూపించి ఉండేవాళ్ళం. కాని బలవంతంగా జనులను దారికి తేవటం మా విధానం కాదు. బలవంతంగా మనుషుల మెడలు వంచి దారికితెస్తే, వారికి పెట్టిన పరీక్షకు అర్థమే ఉండదు.
22. అంటే మానవుల్లోని రెండు వర్గాలలో ఒక వర్గం జనుల చేత నరకాన్ని నింపుతానన్న నా వాగ్దానం అక్షరసత్యం అయింది.
23. మీరు ప్రాపంచిక జీవితంలో నన్ను విస్మరించారు. కాబట్టి ఇప్పుడు నేను మిమ్మల్ని విస్మరిస్తున్నాను. వాస్తవానికి అల్లాహ్‌కు మరుపు ఉండదు. కాని వారిని శిక్షించే ఉద్దేశంతో ఆయన వారిని కావాలని ఉపేక్షిస్తాడు.
24. దైవ వచనాలు విన్నంతనే భక్తిపారవశ్యంతో, భయంతో వారు దైవానికి ప్రణమిల్లుతారు (సజ్దాలో పడిపోతారు).
25. ఏ ఏ విషయాలు అల్లాహ్ ఔన్నత్యానికి శోభించవో వాటినుంచి తెగత్రెంపులు చేసుకుంటారు. ఆయన ప్రసాదించిన అపార అనుగ్రహాలకు గాను కృతజ్ఞతలు చెల్లిస్తారు. ఆయన ప్రసాదించిన అతి పెద్ద వరం సన్మార్గం. అందుకుగాను వారు దైవసమక్షంలో సాష్టాంగ ప్రణామం చేసి ఆయన పవిత్రతను కొనియాడతారు. **‘సుబ్‌హానల్లాహి వబిహమ్దిహీ’** లేదా **‘సుబ్‌హాన రబ్బియల్ ఆలా వ బిహమ్దిహీ’** లాంటి వచనాలను సజ్దాలో తరచూ పలుకుతూ ఉంటారు.

16 వారి ప్రక్కలు వారి పడకల నుంచి వేరుగా ఉంటాయి.[28] వారు తమ ప్రభువును భయంతోనూ, ఆశతోనూ ప్రార్థిస్తారు.[29] మేము వారికి ప్రసాదించిన దానినుండి ఖర్చుపెడతారు.[30]

تَتَجَافَىٰ جُنُوبُهُمْ عَنِ الْمَضَاجِعِ يَدْعُونَ رَبَّهُمْ خَوْفًا وَطَمَعًا وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ⑯

17 వారు చేసిన కర్మలకు ప్రతిఫలంగా,[31] వారి కళ్లకు చలువనిచ్చే ఎలాంటి సామగ్రిని మేము దాచిపెట్టామో (దాని గురించి) ఏ ప్రాణికీ తెలియదు.[32]

فَلَا تَعْلَمُ نَفْسٌ مَّا أُخْفِيَ لَهُم مِّن قُرَّةِ أَعْيُنٍ جَزَاءً بِمَا كَانُوا يَعْمَلُونَ ⑰

18 ఏమిటి? విశ్వసించిన వ్యక్తిని అవిధేయునితో సరిపోల్చటం తగునా? వారిద్దరు ఎన్నటికీ సమానులు కాజాలరు.[33]

أَفَمَن كَانَ مُؤْمِنًا كَمَن كَانَ فَاسِقًا لَّا يَسْتَوُونَ ⑱

19 ఎవరు విశ్వసించి, సత్కార్యాలు కూడా చేశారో వారు చేసుకున్న కర్మలకు బదులుగా వారికి శాశ్వతమైన స్వర్గనివాసం ఆతిథ్యంగా లభిస్తుంది.

أَمَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ فَلَهُمْ جَنَّاتُ الْمَأْوَىٰ نُزُلًا بِمَا كَانُوا يَعْمَلُونَ ⑲

26. అంటే దైవవిధేయతా మార్గాన్ని అవలంబిస్తారు. వారి మాటల్లో, చేతల్లో అహంకారం లేశమైనా ఉండదు. పైగా అణకువ, వినయవినమ్రతలు ఉట్టిపడుతూ ఉంటాయి. అజ్ఞానుల మాదిరిగా, అవిశ్వాసుల మాదిరిగా వారు బడాయిని చాటుకోరు. ఎందుకంటే దైవారాధన పట్ల గర్వాహంకారం ప్రదర్శించటం నరకానికి ద్వారం తెరవటం వంటిదే. "నా ఆరాధన పట్ల గర్వాహంకారం ప్రదర్శించేవారు అతి త్వరలోనే పరాభవంపాలై నరకంలో ప్రవేశిస్తారని తెలుసుకోండి" (మోమిన్ – 60). అందువల్ల విశ్వసించినవారి పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. వారు దైవసమక్షంలో ఎల్లప్పుడూ తమ దీనావస్థను, అశక్తతను, వినమ్రతను వ్యక్తపరుస్తూ ఉంటారు.

27. అంటే మా ఆయతులు సత్యమైనవని ధృవీకరిస్తారు. వాటి ద్వారా పూర్తిగా ప్రయోజనం పొందుతారు.

28. అంటే రాత్రిపూట తియ్యటి నిద్రను వదలి కొంతసేపు స్వచ్ఛంద ఆరాధనలు (తహజ్జుద్ నమాజు) చేస్తారు. క్షమాపణ కొరకు అల్లాహ్‌ను వేడుకుంటూ ఉంటారు. దైవానికి తమ శ్రద్ధాభక్తుల నివాళిని ఘటిస్తారు.

29. అంటే దైవకారుణ్యంపై, ఆయన కృపపై ఆశలుపెట్టుకుంటారు. అలాగే దైవాగ్రహం పట్ల, ఆయన వేసే ప్రశ్నల పట్ల భీతిల్లుతూ ఉంటారు. ఈ భయభక్తులే గనక లేకుండాపోతే ఆరాధనల్లో అశక్తత, అణకువ ఉండవు. అదేవిధంగా భక్తులలో దైవకారుణ్యం పట్ల ఆశాభావం కూడా మెండుగా ఉండాలి. లేకపోతే వారు నిరాశా నిస్పృహలకు లోనైపోతారు. నిరాశ మార్గవిహీనత వైపుకు, తిరస్కారం వైపుకు తీసుకుపోతుంది.

30. ఈ **'ఖర్చు'**లో విధిగా చెల్లించవలసిన దానాల (జకాత్)తో పాటు, స్వచ్ఛంద దానధర్మాలు కూడా చేరి ఉన్నాయి. విశ్వాసులు ఈ రెండు రకాల దానాలు కూడా ఇస్తారు.

31. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే దైవకారుణ్యానికి పాత్రులు కాగలగటానికి సదాచరణ చేయటం అనివార్యం.

32. విశ్వాసుల కొరకు అల్లాహ్ దాచిపెట్టిన అనుగ్రహాల గురించి అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ తెలీదు. అవి విశ్వాసుల కొరకు కన్నుల పండువగా ఉంటాయి. ఈ దైవానుగ్రహాల గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) హదీసె ఖుద్‌సీలో ఇలా వివరించారు : అల్లాహ్ సెలవిచ్చాడు – "నేను సజ్జనులైన నా దాసుల కోసం ఏ కన్నూ కానని, ఏ చెవీ వినని, ఏ మనిషీ ఊహించనైనాలేని వస్తువులను సిద్ధం చేసి ఉంచాను" (సహీహ్ బుఖారీ – సజ్దహ్ సూరా వ్యాఖ్యానం)

33. అల్లాహ్ దృష్టిలో విశ్వాసి – అవిశ్వాసి ఎట్టి పరిస్థితిలోనూ సమానులు కాలేరు. వారిద్దరి మధ్య అసాధారణమైన

20 మరెవరు అవిధేయతకు ఒడిగట్టారో వారి నివాసస్థలం నరకం అవుతుంది. దాన్నుంచి బయటపడేందుకు వారు ప్రయత్నించినప్పుడల్లా అందులోనికే నెట్టివేయబడతారు.[34] "మీరు తిరస్కరిస్తూ ఉండిన అగ్ని శిక్షను చవిచూడండి"[35] అని వారితో అనబడుతుంది.

وَأَمَّا الَّذِينَ فَسَقُوا فَمَأْوَاهُمُ النَّارُ ۖ كُلَّمَا أَرَادُوا
أَن يَخْرُجُوا مِنْهَا أُعِيدُوا فِيهَا وَقِيلَ لَهُمْ ذُوقُوا
عَذَابَ النَّارِ الَّذِي كُنتُم بِهِ تُكَذِّبُونَ ⑳

21 ఆ పెద్ద శిక్షకు ముందు మేము వారికి సమీపంలోని కొన్ని (చిన్నపాటి) శిక్షల[36] రుచి తప్పకుండా చూపిస్తూ ఉంటాము-(ఆ విధంగానయినా) వారు దారికి వస్తారని![37]

وَلَنُذِيقَنَّهُم مِّنَ الْعَذَابِ الْأَدْنَىٰ دُونَ الْعَذَابِ
الْأَكْبَرِ لَعَلَّهُمْ يَرْجِعُونَ ㉑

22 తన ప్రభువు ఆయతుల ఆధారంగా బోధపరచినప్పటికీ వాటి నుండి ముఖం త్రిప్పుకుపోయిన వాని కంటే దుర్మార్గుడెవడుంటాడు?[38] మేము కూడా (అలాంటి) పాపాత్ములకు తప్పకుండా ప్రతీకారం చేస్తాము.

وَمَنْ أَظْلَمُ مِمَّن ذُكِّرَ بِآيَاتِ رَبِّهِ ثُمَّ أَعْرَضَ
عَنْهَا ۚ إِنَّا مِنَ الْمُجْرِمِينَ مُنتَقِمُونَ ㉒

23 నిశ్చయంగా మేము మూసాకు గ్రంథం వొసగి ఉన్నాము. కాబట్టి అతన్ని కలుసుకునే విషయంలో నువ్వు ఏమాత్రం సంశయంలో పడకూడదు.[39] మేము దానిని[40] ఇస్రాయీల్ సంతతి వారికోసం మార్గదర్శక సాధనంగా చేశాము.

وَلَقَدْ آتَيْنَا مُوسَى الْكِتَابَ فَلَا تَكُن فِي مِرْيَةٍ
مِّن لِّقَائِهِ ۖ وَجَعَلْنَاهُ هُدًى لِّبَنِي إِسْرَائِيلَ ㉓

వ్యత్యాసం ఉంది. విశ్వాసులు దేవుని అతిథులుగా ఉంటారు. వారు అన్ని విధాలా గౌరవమర్యాదలకు అర్హులవుతారు. మరోవైపు అవిశ్వాసులు సంకెళ్ళలో బంధించబడి ఉంటారు. నరకాగ్నిలో మాడుతూ ఉంటారు. ఈ విషయం ఇతర చోట్ల కూడా వివరించబడింది. ఉదాహరణకు: అల్ జాసియా సూరా - 21, సాద్‌సూరా-28, హష్ర్ సూరా - 20.

34. నరక యాతనకు తట్టుకోలేక వారు దాన్నుంచి బయటపడేందుకు పదే పదే ప్రయత్నిస్తారు. కాని వారలా ప్రయత్నించిన ప్రతిసారీ నరక దూతలు వారిని లోపలికి తోస్తూ ఉంటారు.

35. ఇవి నరక దూతల పలుకులు. లేదా అల్లాహ్ తరఫునే ఈ విధంగా అనబడవచ్చు. మొత్తానికి ఈ మాటలు ఎవరు పలికినా అవి దైవధిక్కారుల పాలిట అత్యంత అవమానకరమైనవి.

36. **'చిన్నపాటి శిక్షలు'** (అజాబున్ అద్‌నా) అంటే ప్రాపంచిక జీవితంలో ఎదురయ్యే కష్టాలు, ఆపదలు, రోగాలు మొదలైనవి. బద్ర్ యుద్ధంలో అవిశ్వాసులకు ఎదురైన ఘోర పరాజయం లేదా మక్కాలో సంభవించిన కరువు కాటకాల నేపథ్యంలో ఈ విధంగా అనబడిందని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అయితే ఇక్కడ ప్రస్తావించబడిన ఆపదలన్నీ ఇందులోకి వస్తాయని ఇమామ్ షౌకానీ భావిస్తున్నారు.

37. పరలోకంలో విధించబడే పెద్ద శిక్షకు ముందు - హెచ్చరికగా - ఈ చిన్న చిన్న శిక్షలను వారిపై పంపటంలోని ముఖ్యోద్దేశం ఇక్కడ సూచించబడింది - వారు పాపాలను పరిత్యజించి, షిర్క్‌ను మానుకుని, కుఫ్ర్‌ను వదలుకుని రుజుమార్గంపైకి వస్తారేమోనని!

38. విశ్వాసం, విధేయత వైపుకు పిలుపు ఇచ్చే దివ్య వచనాలను విన్న తరువాత కూడా వాటిని లక్ష్యపెట్టకుండా తిరిగి వెళ్ళిపోయేవాడు అందరికన్నా పరమ దుర్మార్గుడు.

39. మేరాజ్ యాత్ర సందర్భంగా హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కలిసిన

**24** మరి వారు సహన స్థయిర్యాలను కనబరచినప్పుడు, మా
ఆదేశానుసారం జనులకు మార్గదర్శకత్వం వహించే నాయకులను
మేము వారిలో చేశాము. వారు మా ఆయతులపై దృఢ విశ్వాసం
కలిగి ఉండేవారు.[41]

وَجَعَلْنَا مِنْهُمْ أَئِمَّةً يَهْدُونَ بِأَمْرِنَا لَمَّا
صَبَرُوا ۖ وَكَانُوا بِآيَاتِنَا يُوقِنُونَ ﴿٢٤﴾

**25** వారు పరస్పరం విభేదించుకుంటున్న విషయాలపై ప్రళయ
దినాన నీ ప్రభువు వారి మధ్య (తప్పకుండా) తీర్పు చేస్తాడు.[42]

إِنَّ رَبَّكَ هُوَ يَفْصِلُ بَيْنَهُمْ يَوْمَ الْقِيَامَةِ
فِيمَا كَانُوا فِيهِ يَخْتَلِفُونَ ﴿٢٥﴾

**26** ఏమిటీ, మేము వారికి పూర్వం ఎన్నో సమాజాలను తుద
ముట్టించిన సంగతి కూడా వారికి సన్మార్గం చూపలేదా? మరి
(చూడబోతే) వాళ్ళు నివసించిన స్థలాలలోకి వారు వస్తూ పోతూనే
ఉన్నారు.[43] నిశ్చయంగా ఇందులో (గొప్ప) సూచనలున్నాయి.
అయినప్పటికీ వారు వినరా?

أَوَلَمْ يَهْدِ لَهُمْ كَمْ أَهْلَكْنَا مِن قَبْلِهِم مِّنَ
الْقُرُونِ يَمْشُونَ فِي مَسَاكِنِهِمْ ۚ إِنَّ فِي ذَٰلِكَ
لَآيَاتٍ ۖ أَفَلَا يَسْمَعُونَ ﴿٢٦﴾

**27** ఏమిటీ, వీళ్లు గమనించటం లేదా? – మేము నీళ్ళను
బంజరు భూమి వైపుకు ప్రవహింపజేస్తూ తీసుకుపోతున్నాము,
మరి దాని ద్వారా పంటలను వెలికి తీస్తున్నాము. వాటిని వారి
పశువులూ తింటున్నాయి. స్వయంగా వారు కూడా (తింటు
న్నారు).[44] అయినా వాళ్ళు దృష్టిని సారించరా?

أَوَلَمْ يَرَوْا أَنَّا نَسُوقُ الْمَاءَ إِلَى الْأَرْضِ الْجُرُزِ
فَنُخْرِجُ بِهِ زَرْعًا تَأْكُلُ مِنْهُ أَنْعَامُهُمْ وَأَنفُسُهُمْ ۖ
أَفَلَا يُبْصِرُونَ ﴿٢٧﴾

విషయం ఇందులో సూచించబడిందని అనబడుతోంది. ఈ సందర్భంగానే నమాజుల సంఖ్యను తగ్గించుకోమని మూసా (అలైహి) అంతిమ దైవప్రవక్త (స)కు సలహా ఇచ్చారు.

40. **'దానిని'** అంటే 'తౌరాత్ గ్రంథాన్ని' అని భావించాలి. ఒకవేళ 'అతన్ని' అని అనువదించుకుంటే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అని అనుకోవలసి ఉంటుంది.

41. ఈ ఆయతులో సహనస్థయిర్యాల మహత్త్వం గురించి చెప్పబడింది. సహన స్థయిర్యాలంటే అసలు అర్థం – దైవాజ్ఞల్ని పాటించటంలో, దైవప్రవక్తలను నమ్మి, వారిని అనుసరించటంలో ఎదురయ్యే కష్టాలను ఉత్తమ రీతిలో సహించటం, ప్రతికూల పవనాలకు ఎదురీదటం. వారు సహనం వహించి, దైవ వచనాలను దృఢంగా విశ్వసించినందున తాను వారికి ధార్మిక నేతృత్వాన్ని ప్రసాదించానని అల్లాహ్ అంటున్నాడు. కాని ఆ తరువాత వారు దైవధర్మంలో మార్పులు చేర్పులు చేసి, మనోవాంఛలను అనుసరించగానే వారి నుంచి నాయకత్వ హోదాను లాక్కున్నాడు. అటుపిమ్మట వారి హృదయాలలో కాఠిన్యం వచ్చేసింది. సదాచరణ క్షీణించింది. ఫలితంగా వారి విశ్వాసం గాడి తప్పింది.

42 గ్రంథం కల ప్రజల మధ్య ఎన్నో విభేదాలు ఉండేవి. వాటికి తోడు విశ్వాసులకు – అవిశ్వాసులకు మధ్య గల అభిప్రాయభేదాలు కూడా ఇందులోకి వస్తాయి. ఏక దైవారాధకులకు, మిథ్యావాదులకు మధ్య గల భేదాభిప్రాయాలు కూడా ఈ సందర్భంగా చర్చకు వస్తాయి. వాస్తవమేమిటంటే లోకంలోని ప్రతివర్గం తన అభిమతమే సత్యమైనదని వాదిస్తుంది. తన సిద్ధాంతంపైనే అది స్థిరంగా ఉంటుంది. అందువల్ల ఈ విభేదాలపై తీర్పుదినాన అల్లాహ్‌యే తీర్పు చేస్తాడు. అంటే సత్యవాదులను స్వర్గంలో చేర్చి, అసత్యవాదులను నరకాగ్నికి ఆహుతి చేస్తాడు.

43. ధిక్కార వైఖరి మూలంగా వెనుకటి మానవ సమాజాలు ఎన్నో నామరూపాలు లేకుండా తుడిచిపెట్టబడ్డాయి. కాకపోతే వాళ్ల నివాస స్థలాలు, పాడుబడిన ఇళ్లు ఉన్నాయి. అవి వీళ్ల అధీనంలోనే ఉన్నాయి. ఇదంతా వీళ్లు గమనించటం

28 “ఇంతకీ ఈ తీర్పు ఎప్పుడు జరుగుతుంది? మీరు సత్య వంతులే అయితే (చెప్పండి)”[45] అని వారంటున్నారు.

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا الْفَتْحُ إِن كُنتُمْ صَادِقِينَ ﴿٢٨﴾

29 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: “తీర్పు జరిగే దినాన విశ్వసించటం అవిశ్వాసులకు ఏ విధంగానూ ఉపకరించదు. వారికి గడువు కూడా ఇవ్వబడదు.”[46]

قُلْ يَوْمَ الْفَتْحِ لَا يَنفَعُ الَّذِينَ كَفَرُوا إِيمَانُهُمْ وَلَا هُمْ يُنظَرُونَ ﴿٢٩﴾

30 కనుక (ఓ ముహమ్మద్ – స!) వాళ్ళ సంగతిని వదలిపెట్టు.[47] నిరీక్షించు.[48] వాళ్ళు కూడా నిరీక్షిస్తున్నారు.[49]

فَأَعْرِضْ عَنْهُمْ وَانتَظِرْ إِنَّهُم مُّنتَظِرُونَ ﴿٣٠﴾

లేదా? – మక్కాకు చెందిన సత్యతిరస్కారులకు హెచ్చరికగా ఈ మాటలనబడ్డాయి. ఒకవేళ మీరు గనక సత్యధర్మాన్ని విశ్వసించకపోతే మీకూ అదే గతి పడుతుందని వార్నింగ్ ఇవ్వటం జరిగింది.

44. **‘నీళ్లు’** (الماء) అంటే వర్షపు నీరు, నదీనదాల, కాలువల నీరు అన్నమాట! ఈ నీటిని దేవుడు బంజరు భూముల వైపుకు ప్రవహింపజేసి పంటలు పండిస్తాడు. వాటిని మనుషులు తినటంతో పాటు పశువులు కూడా మేస్తాయి. బంజరు భూమి అంటే అది ప్రత్యేకంగా ఏదో ఒక ప్రాంతానికి చెందినది కాదు. అన్ని ప్రాంతాలకు వర్తిస్తుంది.

45. ఇక్కడ **తీర్పు** (ఫత్‌హు) అంటే భావం మక్కా అవిశ్వాసులు మహాప్రవక్త (సఅసం)ను డిమాండు చేసిన దైవశిక్ష. వారు ఇలా డిమాండు చేసేవారు: “ఓ ముహమ్మద్ (సఅసం)! నీకు నీ దేవుని తోడ్పాటు ఎప్పుడు అందుతుంది? నిన్ను ప్రవక్తగా నమ్మిన వారంతా భయపడి, దాక్కుంటున్నారు. నువ్వేమో దైవసహాయం రానున్నదని అంటున్నావు.”

46. ఈ ఆయతులో తీర్పు అంటే పరలోకంలో జరిగే తీర్పు అని భావం. అక్కడ ఎవరయినా తాము ‘విశ్వసించాము’ అని ప్రకటిస్తే, వారి విశ్వాసం స్వీకారయోగ్యం అవదు. వారికి గడువు కూడా ఇవ్వబడదు. కొంతమంది ఈ ఆయతులోని ‘తీర్పు’ను ‘మక్కా విజయం’గా తలపోశారు. కాని ఇది సరైంది కాదు. ఎందుకంటే మక్కా విజయం నాడు శత్రువుల (అవిశ్వాసుల) ఇస్లాం స్వీకరణ దైవసన్నిధిలో స్వీకృతి పొందింది. అలా ఇస్లాం స్వీకరించిన వారి సంఖ్య రెండు వేల దాకా ఉంది (ఇబ్నె కసీర్). మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రకటించిన సర్వసాధారణమైన మన్నింపుల ప్రకటనకు ప్రభావితులై ఆ శత్రువులు ఇస్లాం స్వీకరించారు. మక్కా విజయం నాడు మహాప్రవక్త(స) తన బద్ధ విరోధులనుద్దేశించి ఇలా అన్నారు: “ఈ రోజు మీపై ఎలాంటి ఫిర్యాదూ లేదు. మీ వెనుకటి దురాగతాలకు ప్రతీకారం ఈనాడు తీర్చుకోబడదు, పొండి.”

47. కనుక ఓ ముహమ్మద్(స)! ఈ ముష్రిక్కుల గురించి అదేపనిగా ఆలోచించకు. వాళ్ళను వాళ్ళ మానాన వదలిపెట్టి, నీ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించు. నీపై అవతరింపజేయబడిన సందేశాన్ని (వహీని) అనుసరించు అని దీని భావం. ఆ మాటే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: “(ఓ ముహమ్మద్–సఅసం!) నువ్వు మాత్రం నీ ప్రభువు తరఫు నుంచి నీపై అవతరించిన సందేశాన్ని (వహీని) అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తప్ప వేరెవరూ ఆరాధనకు అర్హులు కారు. బహు దైవారాధకుల్ని పట్టించుకోకు.” (అల్ అన్ఆమ్ – 106).

48. అల్లాహ్ వాగ్దానం కోసం, ఆయన నీకు చేసే సహాయం కోసం ఎదురు చూస్తూ ఉండు. అల్లాహ్ వాగ్దానం నెరవేరటం తథ్యం.

49. ఈ ప్రవక్త (స) కష్టాల్లో చిక్కుకుంటాడనీ, అతని సందేశ కార్యక్రమం అర్థాంతరంగా ఆగిపోతుందని ఈ అవిశ్వాసులు కాకిలెక్కలు వేసేవారు. కాని అచిరకాలంలోనే దేవుడు తన ప్రవక్త (స)కు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చటం, ప్రజలు తండోపతండాలుగా వచ్చి సత్యధర్మాన్ని స్వీకరించటం లోకం చూసింది. ఆయన (స) కష్టాల్లో చిక్కుకుంటారని ఊహించిన వారంతా ఘోర అవమానానికి గురయ్యారు.

33వ సూరా

# అల్ అహ్జాబ్

## సైన్యాలు

అవతరణ మదీనాలో

ఆయతులు 73

### పరిచయం

ఈ సూరా అనేక ఇస్లామీయ చట్టాలను తెలిపింది. ముఖ్యంగా కుటుంబానికి సంబంధించిన చట్టాలు ఇందులో వచ్చాయి. ఈ సూరాలోని 20వ ఆయతులో సైన్యాల గురించిన ప్రస్తావన ఉంది. ఈ ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. క్రీ.శ 626-27లో మక్కా నగరానికి చెందిన అవిశ్వాసులు, యూదులు, కపటవిశ్వాసులు ఒక కూటమిగా ఏర్పడ్డారు. మదీనాలో కొత్తగా ఏర్పడిన ఇస్లామీయ సమాజాన్ని తుడిచివేయాలని భావించారు. 10,000 మంది సైనికులతో మదీనాను మూడువారాల పాటు చుట్టుముట్టారు. ఈ ముట్టడి సైనికపరమైనదే కాదు, ఆర్థికమైనది కూడా. ఈ ముట్టడి వల్ల ముస్లిములు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ముస్లిములు మదీనా చుట్టూ శత్రువులు ప్రవేశించకుండా ఒక కందకాన్ని తవ్వారు. ఈ కందకం శత్రువులను లోనికి ప్రవేశించకుండా అడ్డుపడింది. ఒక బలమైన గాలివాన శత్రు శిబిరాలను కకావికలు చేసింది. మూడురోజుల పాటు వీచిన ఈ గాలివానకు శత్రు కూటమి సైన్యాలు పలాయనం చిత్తగించాయి.

ఈ సూరాలో కుటుంబపరమైన మర్యాదల ప్రస్తావన ఉంది. ఈ మర్యాదలను అందరూ గౌరవించాలి. పరుల ఇంటిలోకి వారి అనుమతి లేనిదే ప్రవేశించరాదు. ఎవరైనా భోజనానికి పిలిస్తే, సమయానికి చాలా ముందే అక్కడికి వెళ్ళి ఇబ్బంది కలిగించరాదు. భోజనం ముగిసిన తర్వాత వ్యర్థప్రసంగాలతో అక్కడే కాలం వెళ్ళబుస్తూ కూర్చోరాదు. ఈ సూరాలో తీర్పుదినం నాటి భయంకర పరిస్థితుల ప్రస్తావన వచ్చింది. అవిశ్వాసుల కొరకు భయానకమైన అగ్ని సిద్ధంగా ఉందని ఇందులో హెచ్చరించబడింది.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 4-5<br>36-40 | 368 | 'జహష్ కుమార్తె జైనబ్' | ఇస్లాంలో దత్తతకు గల శాస్త్రీయ స్థానాన్ని వివరించిన సంఘటన |
| 9-27 | 285 | 'శత్రు మూకలు' | కందక యుద్ధ పూర్వాపరాలు. కపటుల నమ్మకద్రోహం. దైవ ప్రవక్త సహచరుల ఆత్మబలం. |

## అల్ అహ్‌జాబ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** ఓ ప్రవక్తా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండు.[1] అవిశ్వాసులకు, కపటులకు విధేయత చూపకు. నిశ్చయంగా అల్లాహ్‌యే మహా జ్ఞాని, మహావివేకి.[2]

**2** నీ ప్రభువు తరఫు నుంచి నీవద్దకు వచ్చే వహీని[3] అనుసరిస్తూ ఉండు. మీరు చేసే ప్రతి పనీ అల్లాహ్‌కు బాగా తెలుసు.[4]

**3** నువ్వు అల్లాహ్‌ను మాత్రమే నమ్ముకో.[5] కార్యసిద్ధికి అల్లాహ్ ఒక్కడే చాలు.[6]

**4** ఏ మనిషి శరీరంలోనూ అల్లాహ్ రెండు హృదయాలను ఉంచ లేదు.[7] మీరు మీ భార్యల్లో ఎవరినయినా మీ తల్లులుగా ప్రకటించినంతమాత్రాన అల్లాహ్ వారిని (నిజంగానే) మీ తల్లులుగా చేయ లేదు.[8] మీ దత్తపుత్రులను కూడా మీ (కన్న) కొడుకులుగా

## سُورَةُ الأَحْزَابِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

يٰٓاَيُّهَا النَّبِيُّ اتَّقِ اللّٰهَ وَلَا تُطِعِ الْكٰفِرِيْنَ
وَالْمُنٰفِقِيْنَ ۗ اِنَّ اللّٰهَ كَانَ عَلِيْمًا حَكِيْمًا ①

وَّاتَّبِعْ مَا يُوْحٰٓى اِلَيْكَ مِنْ رَّبِّكَ ۗ اِنَّ اللّٰهَ كَانَ
بِمَا تَعْمَلُوْنَ خَبِيْرًا ②

وَّتَوَكَّلْ عَلَى اللّٰهِ ۗ وَكَفٰى بِاللّٰهِ وَكِيْلًا ③

مَا جَعَلَ اللّٰهُ لِرَجُلٍ مِّنْ قَلْبَيْنِ فِيْ جَوْفِهٖ ۚ وَمَا
جَعَلَ اَزْوَاجَكُمُ الّٰٓـِٔيْ تُظٰهِرُوْنَ مِنْهُنَّ اُمَّهٰتِكُمْ ۚ
وَمَا جَعَلَ اَدْعِيَآءَكُمْ اَبْنَآءَكُمْ ۗ ذٰلِكُمْ قَوْلُكُمْ

1. ఈ ఆయతులో దైవప్రవక్త (స)కు దేవుని తరఫున హితబోధ చేయబడింది. ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్‌కు భయపడుతూ, ధర్మవ్యాప్తికి పాటుపడాలని ఉపదేశించబడింది. దేవుడు సూచించినట్లుగా దైవానికి విధేయత చూపుతూ, ఆయన నుంచి పుణ్యఫలాన్ని ఆశిస్తూ, దేవుడు వారించిన విషయాలను పరిత్యజిస్తూ, దేవుని ఆగ్రహానికి, శిక్షకు భయపడుతూ జీవితం గడపటమే భయభక్తులు (తఖ్వా) అని తలఖ్ బిన్ హబీబ్ వక్కాణించారు (ఇబ్నె కసీర్).
2. కాబట్టి భయభక్తులతో మెలగటానికి, విధేయత చూపటానికి అల్లాహ్ మాత్రమే అర్హుడు. ఎందుకంటే పరిణామం గురించి తెలిసినవాడు ఆయన మాత్రమే. ఆయన వచనాలు, ఆయన పనులు అన్నీ యుక్తితో, పరమార్థంతో కూడుకున్నవి.
3. అంటే దివ్య ఖుర్‌ఆన్‌తో పాటు, హదీసులను కూడా అనుసరించాల్సిందే. హదీసులు మహాప్రవక్త (సఅసం) నోట వెలువడినవే అయినప్పటికీ వాస్తవానికి అవి భావం రీత్యా అల్లాహ్ తరఫునుండి జారీ అయినవే. అందుకనే వాటిని **'వహీ ఖఫీ'** లేక 'వహీయె గైర్ మత్‌లూ'గా పిలవటం జరిగింది.
4. ఆయన నుండి ఏ మాటా, ఏ చేష్టా దాగిలేదు. కనుక మాటల్లోగానీ, చేతల్లోగానీ అడుగడుగునా అల్లాహ్ మిమ్మల్ని గమనిస్తున్నాడన్న విషయాన్ని తెలుసుకుని మరీ మసలుకోండి.
5. నీ సమస్త వ్యవహారాలలో, సర్వకాల సర్వావస్థలలో అల్లాహ్‌పైనే భరోసా చేయాలి.
6. తనను నమ్ముకున్నవారి, తన వైపుకు రుజువర్తనులైనవారి కార్యాలను ఆయన చక్కదిద్దుతాడు.
7. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆ కాలంలో ఒక నయవంచకుడు (మునాఫిఖ్) తనకు రెండు హృదయాలున్నాయని, ఒక హృదయం ముస్లిముల వెంట ఉంటే, మరో హృదయం అవిశ్వాసుల వెంట ఉంటుందని చెప్పుకునేవాడు (ముస్నదె అహ్మద్ – 1/267). అతని బూటకపు ప్రకటనను ఖండిస్తూ ఈ ఆయతు అవతరించింది. దీనిభావం ఏమిటంటే

بِاَفْوَاهِكُمْ ؕ وَاللّٰهُ يَقُوْلُ الْحَقَّ وَهُوَ يَهْدِى السَّبِيْلَ ④

చేయలేదు.[9] ఇవన్నీ మీ నోటిమాటలే.[10] అల్లాహ్ సత్యం పలుకుతున్నాడు.[11] ఆయన (రుజు)మార్గం చూపుతున్నాడు.

اُدْعُوْهُمْ لِاٰبَآئِهِمْ هُوَ اَقْسَطُ عِنْدَ اللّٰهِ ۚ فَاِنْ لَّمْ تَعْلَمُوْٓا اٰبَآءَهُمْ فَاِخْوَانُكُمْ فِى الدِّيْنِ وَمَوَالِيْكُمْ ؕ وَلَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ فِيْمَآ اَخْطَاْتُمْ بِهٖ وَلٰكِنْ مَّا تَعَمَّدَتْ قُلُوْبُكُمْ ؕ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا ⑤

**5** దత్తపుత్రులను వారి (కన్న) తండ్రుల సంబంధంతోనే పిలవండి. అల్లాహ్ దృష్టిలో ఇదే న్యాయం.[12] ఒకవేళ వారి (కన్న) తండ్రులెవరో మీకు తెలీకపోతే, అట్టి పరిస్థితిలో వారు మీ ధార్మిక సోదరులు, స్నేహితులు[13] అవుతారు. మరుపు వల్ల మీచేత ఏదన్నా (తప్పు) జరిగిపోతే దాని పాపం మీపై ఉండదు.[14] అయితే హృదయపూర్వకంగా చేసిన పక్షంలో అది పాపమే.[15] అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కనికరించేవాడు.

---

ఒక వ్యక్తి లోపల రెండు హృదయాలు ఉండటం, ఆ రెండింటిలో ఒకదానిలో దైవప్రేమ, మరో దానిలో దైవవిరోధుల పట్ల విధేయతా భావం ఉండటం అసంభవం.

మరి కొంతమంది కథనం ప్రకారం మక్కాలోని బహుదైవారాధకులలో జమీల్ బిన్ మామూర్ ఫిహ్రీ అనే వ్యక్తి ఒకడుండేవాడు. ఆ మాయలమారి తన మాటలతో జనులను ఇట్టే బోల్తా కొట్టించేవాడు. తాను ఒకే సమయంలో రెండు హృదయాలతో ఆలోచిస్తానని, ముహమ్మద్ (స)కు ఒక హృదయం మాత్రమే ఉన్నదని బుకాయించేవాడు. అతని ధోరణిని ఖండిస్తూ ఈ ఆయతు అవతరించింది (ఐసరుత్తఫాసీర్).

ఇంకా కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఇలా అభిప్రాయపడ్డారు: రాబోయే రెండు ధర్మసందేహాల నివృత్తికి ఉపోద్ఘాతం వంటిది ఈ వాక్యం. అంటే – ఏ విధంగానయితే ఒక వ్యక్తి శరీరంలో రెండు హృదయాలుండవో అదేవిధంగా ఎవరైనా తన భార్యను తల్లిగా ప్రకటించినంతమాత్రాన ఆమె అతని కన్నతల్లి అయిపోదు. ఆ విధంగా అతనికి ఇద్దరు తల్లులు ఉండబోరు. అలాగే ఒక వ్యక్తి ఎవరినయినా దత్తపుత్రునిగా చేసుకున్నంత మాత్రాన ఆ అబ్బాయి అతని కన్న కొడుకు అయిపోడు. నిజానికి అతను అతన్ని కన్న తండ్రికే చెందుతాడు." (ఇబ్నె కసీర్)

8. దీనినే **'జిహార్'** (ظِهَار) అంటారు. దీనికి సంబంధించిన వివరాలు ముజాదలా సూరాలో రానున్నాయి.

9. దత్తపుత్రునికి సంబంధించిన ధర్మసందేహాల నివృత్తి ఈ సూరాలో మున్ముందు రాబోతోంది.

మూలంలో **'అద్‌యియా'** (اَدْعِيَاءُ) అని ఉంది. అది 'దయియ్యున్'కు బహువచనం. దత్తపుత్రులు అని దీని అర్థం.

10. ఏ స్త్రీనయినా (భార్యనయినా) 'నువ్వు నా తల్లివి' అని భర్త నోరు జారినంత మాత్రాన ఆమె అతని కన్నతల్లి అయిపోదు. అలాగే దారినపోయే ఏ దానయ్యనయినా పట్టుకుని దత్తపుత్రునిగా (పెంపుడు కొడుకుగా) చేసుకున్నంత మాత్రాన అతను సొంత కొడుకు కాజాలడు. తల్లికి, కన్న కుమారునికి సంబంధించిన షరీఅత్‌పరమైన వ్యవహారాలు వారికి వర్తించవు.

11. కాబట్టి మీరు దైవాదేశాలను మాత్రమే పాటించాలి. మీకిష్టం వచ్చిన వారిని తల్లులుగా ప్రకటించుకోవటంగానీ, కొడుకులుగా చేసుకోవటంగానీ చెల్లనేరదు. ఎవరినయినా ప్రేమతో 'కుమారుడా!' అని పిలవటం వేరు. కన్నకొడుకులా ప్రకటించటం వేరు. మొదటిది సమ్మతమే. రెండవది మాత్రం ధర్మసమ్మతం కాదు.

12. ఈ ఆజ్ఞ ద్వారా అజ్ఞాన కాలం నుంచి కొనసాగుతూ వస్తున్న, ఇస్లాం తొలికాలంలో కూడా ఉన్న, పెంపుడు కొడుకును కన్నకొడుకుగా భావించే ఆచారం నిషేధించబడింది. మహాప్రవక్త ప్రియసహచరులు (రజి) ఇలా అంటున్నారు: "మేము జైద్ బిన్ హారిసను (దైవప్రవక్త ఈయనగారిని బానిసత్వం నుంచి విముక్తిని కలిగించి తన కొడుకుగా చేసుకోవటంచేత) జైద్ బిన్ ముహమ్మద్ (ముహమ్మద్ కుమారుడైన జైద్) అని పిలిచేవాళ్ళం. ఖుర్ఆన్‌లోని ఈ

6 దైవ ప్రవక్తకు విశ్వాసులపై స్వయంగా వారి ఆత్మల కన్నా ఎక్కువ హక్కు ఉంది.[16] అతని భార్యలు విశ్వాసుల కొరకు తల్లులు.[17] మరి దైవగ్రంథం ప్రకారం రక్తసంబంధీకులు ఇతర విశ్వాసుల, ముహాజిర్ల కన్నా పరస్పరం ఎక్కువ హక్కుదారులు.[18] ఒకవేళ మీరు మీ స్నేహితుల యెడల సద్వ్యవహారం (ఏదన్నా) చేయదలిస్తే అది వేరే విషయం.[19] ఈ ఉత్తర్వు (దైవ) గ్రంథంలో లిఖితమై[20] ఉంది.

اَلنَّبِیُّ اَوْلٰی بِالْمُؤْمِنِیْنَ مِنْ اَنْفُسِهِمْ وَاَزْوَاجُهٗۤ اُمَّهٰتُهُمْ ؕ وَاُولُوا الْاَرْحَامِ بَعْضُهُمْ اَوْلٰی بِبَعْضٍ فِیْ كِتٰبِ اللّٰهِ مِنَ الْمُؤْمِنِیْنَ وَالْمُهٰجِرِیْنَ اِلَّاۤ اَنْ تَفْعَلُوْۤا اِلٰۤی اَوْلِیٰٓىِٕكُمْ مَّعْرُوْفًا ؕ كَانَ ذٰلِكَ فِی الْكِتٰبِ مَسْطُوْرًا ۝۶

ఆయతు అవతరించే వరకూ ఇలాగే పిలిచేవారం" (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ అహ్జాబ్). ఈ ఆయతు అవతరించిన తరువాత హజ్రత్ హుజైఫా (రజి) ఇంట్లో కూడా ఒక సమస్య ఎదురయింది. ఆయనగారు అప్పటికే హజ్రత్ సాలిమ్‌ను తన కొడుకుగా చేసుకుని ఉన్నారు. పెంపుడు కొడుకు కన్నకొడుకు కాజాలడని చెప్పబడిన తరువాత అతనితో ఆ ఇంటి ఆడవారు పరదా పాటించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అప్పుడు దైవప్రవక్త (సఅసం) హుజైఫా భార్యనుద్దేశించి, "అతనికి (సాలిమ్‌కు) పాలు త్రాగించి, అతన్ని పాలవరుస కొడుకుగా చేసుకో" అని సూచించారు. ఆ విధంగా సాలిమ్ ఆమె కొరకు పాల వరస కొడుకు అయ్యారు (సహీహ్ ముస్లిం – కితాబుర్రజా, అబూదావూద్ – కితాబున్నికాహ్).

13. అంటే పెంపుడు కొడుకుల కన్న తండ్రులెవరో మీకు తెలిసివుంటే సమస్యే లేదు. కాని వారి తండ్రులెవరో మీకు తెలియనిపక్షంలో వారిని మీ ధార్మిక సోదరులుగా, మిత్రులుగా తలపోయండి. అంతేగాని, వారిని కుమారులుగా భావించరాదు.

14. ఎందుకంటే – హదీసులో కూడా తెలుపబడినట్లు – మరుపు వల్ల జరిగిన పొరబాట్లపై నిలదీయటం జరగదు. అవి క్షంతవ్యమే.

15. కాని ఎవరయినా బుద్ధిపూర్వకంగా పెంపుడు కొడుకుల్ని కన్నకొడుకుగా పిలిస్తే మటుకు అది ముమ్మాటికీ తప్పే. పాపమే. హదీసులో ఇలా ఉంది – "ఎవరయితే ఉద్దేశ్యపూర్వకంగా తండ్రికాని వారిని తన తండ్రిగా పేర్కొన్నారో వారు ధిక్కారానికి (కుఫ్రుకు) ఒడిగట్టారు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ మనాఖిబ్).

16. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజం శ్రేయాన్ని ఎంతగా అభిలషించేవారో, వారిపై ఆయన ఎంతటి వాత్సల్యాన్ని కురిపించేవారో జగద్విదితమే. ఆయన (సఅసం) గారి ఈ శ్రేయోభిలాషను, ప్రేమానురాగాలను చూస్తూ దేవుడు ఈ ఆయతులో దైవప్రవక్త (స)కు విశ్వాసులపై గల హక్కును నొక్కి చెప్పాడు. విశ్వాసులు లోకంలో అందరికన్నా ఎక్కువగా దైవప్రవక్త (స)ను ప్రేమించాలి. తమ కోర్కెలన్నింటిపై వారు దైవప్రవక్తకు ప్రాధాన్యతనివ్వాలి. దైవప్రవక్త (స) వారినుంచి దైవ మార్గంలో ఎప్పుడు ఏది ఆశించినా వారు సంతోషంగా సమర్పించు కోవాలి. వారు తమ జీవనావసరాల గురించి అదేపనిగా ఆలోచించాల్సిన అవసరం లేదు. వారు తమ ప్రాణాలకన్నా ఎక్కువగా దైవప్రవక్త (స)ను ప్రేమించాలి. ఆయన (స) ఆజ్ఞను ప్రప్రథమంగా నిర్వర్తించాలి. ఆయన (స) విధేయతను అన్నింటికన్నా ముఖ్యమైన విధిగా భావించాలి. "వారు తమ పరస్పర విభేదాల విషయంలో ఆయన్ని (స) న్యాయనిర్ణేతగా స్వీకరించనంతవరకూ, ఆయన ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో లేశమైనా సంకోచం ఏర్పడకుండా దానిని యథాతథంగా శిరసావహించనంతవరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు" (అన్ నిసా – 65 వచనం ఆధారంగా). అలాగే వారు తమ తల్లిదండ్రులకన్నా, తమ కన్నపిల్లలకన్నా ఎక్కువగా ఆయన్ని (స) ప్రేమించనంతవరకూ వారు సిసలైన విశ్వాసులు కాజాలరు. అలాగే దైవప్రవక్త (స) విధేయతలో వారి వల్ల జరిగే అలసత్వం కూడా వారి విశ్వాసాన్ని ప్రమాదంలో పడవేస్తుంది.

17. అంటే గౌరవాదరణల రీత్యా ప్రవక్త సతీమణులు విశ్వాసుల పాలిట తల్లుల వంటివారు. అలాగే విశ్వాసులు ప్రవక్త (స) సతీమణులను వివాహమాడజాలరు.

وَاِذْ اَخَذْنَا مِنَ النَّبِيّٖنَ مِيْثَاقَهُمْ وَمِنْكَ وَمِنْ نُّوْحٍ وَّاِبْرٰهِيْمَ وَمُوْسٰى وَعِيْسَى ابْنِ مَرْيَمَ ۠ وَاَخَذْنَا مِنْهُمْ مِّيْثَاقًا غَلِيْظًا ⑦

**7** (ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేసుకో) మేము ప్రవక్తలందరి నుండి వాగ్దానం తీసుకున్నాము– (ముఖ్యంగా) నీ నుండి, నూహ్ నుండి, ఇబ్రాహీం నుండి, మూసా నుండి, మర్యమ్ కుమారుడైన ఈసా నుండి. మేము వారందరి నుండి గట్టి వాగ్దానం తీసుకున్నాము[21]–

لِّيَسْـَٔلَ الصّٰدِقِيْنَ عَنْ صِدْقِهِمْ ۚ وَاَعَدَّ لِلْكٰفِرِيْنَ عَذَابًا اَلِيْمًا ⑧

**8** – అల్లాహ్ సత్యవంతులను వారి సత్యత గురించి ప్రశ్నించ టానికి.[22] అవిశ్వాసుల కొరకు ఆయన బాధాకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాడు.

18. ఈ ఆయతు అవతరించిన తరువాత హిజ్రత్ (దైవమార్గంలో వలసపోవటం) ఆధారంగా, ధార్మిక సోదరబంధం ఆధారంగా, స్నేహబంధం ప్రాతిపదికగా వారసత్వ హక్కులు సంక్రమించవు. ఇకమీదట నిర్ణీత సమీప బంధువులు మాత్రమే ఆస్తికి వారసులవుతారు.

19. అయితే మీరు మీ స్నేహితులకు ఏదన్నా మేలు చేయదలిస్తే నిస్సంకోచంగా చేయవచ్చు. మీ ఆస్తిలో మూడోవంతు భాగాన్ని వీలు వ్రాసే అనుమతి మీకు ఉండనే ఉంది. దాన్ని ఉపయోగించుకుంటూ మీరు వారితో సద్వ్యవహారం చేయవచ్చు.

20. 'గ్రంథం' (الكِتٰب) అంటే ఇక్కడ 'లౌహె మహ్ఫూజ్' అన్నమాట. ప్రారంభంలో అనేక పరమార్థాల రీత్యా – ధార్మిక సంబంధాల ప్రాతిపదికపై – వారసత్వ హక్కులు తాత్కాలికంగా ఇవ్వబడ్డాయి. ఇది తాత్కాలిక ఏర్పాటు అన్న సంగతి అల్లాహ్‌కు కూడా తెలుసు. ధర్మసంస్థాపన జరిగిన తరువాత ఈ తాత్కాలిక స్థితిని రద్దుపరచి 'లౌహె మహ్ఫూజ్'లో వ్రాయబడివున్న శాశ్వత చట్టం ప్రవేశపెట్టబడింది.

21. ఇంతకీ అది ఏ వాగ్దానం? కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం అది ఆలి ఇమ్రాన్ సూరాలోని 81వ ఆయతులో చెప్పబడినట్లు ప్రవక్తలు పరస్పరం ధృవీకరించుకోవాలి, సహకరించుకోవాలి. వారి తరువాత వచ్చే ప్రవక్తలను వారు విశ్వసించాలి.

మరి కొంతమంది అభిప్రాయం ప్రకారం ఇక్కడ వాగ్దానం అంటే షూరా సూరాలోని 13వ ఆయతులో చెప్పబడినట్లు ధర్మాన్ని నెలకొల్పాలి. ధర్మం విషయంలో చీలిక తీసుకురావద్దు. ఈ వాగ్దానం ప్రవక్తలందరి చేత తీసుకోబడినప్పటికీ ఐదుగురు ప్రవక్తల పేర్లు మాత్రం ప్రత్యేకంగా ప్రస్తావించబడ్డాయి. దీనిద్వారా వారి ప్రాముఖ్యత, ఔన్నత్యం తెలిసివస్తోంది. వారిలో కూడా మహాప్రవక్త (సఅసం) వారి పేరు అందరికన్నా ముందు వచ్చింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) వారు అందరికన్నా చివరివారైనప్పటికీ ఆయన పేరు అందరికన్నా ముందు రావటాన్నిబట్టి ఆయన గొప్పతనం విదితమవుతోంది.

22. ఈ ఆయతుకు రెండు అర్థాలున్నాయి: 1. దైవ సందేశాన్ని తమ జాతి ప్రజలకు ఖచ్చితంగా అందజేశారో లేదో తన సత్యప్రవక్తలను దేవుడు ప్రశ్నించటానికి ముందుగానే ఈ వాగ్దానం తీసుకున్నాడు. లేదా 2. మీ సందేశానికి మీ జాతివారు ఎలా స్పందించారు? వారు అవునన్నారా? కాదన్నారా? అని ఆయన తన ప్రవక్తలను అడగటానికి. ఈ మాటే వేరొకచోట ఇలా చెప్పబడింది: "మేము ఎవరివద్దకు ప్రవక్తలను పంపామో వారిని లెక్క అడుగుతాము. ప్రవక్తలను కూడా అడుగుతాము" (అల్ ఆరాఫ్–6). ఈ ఆయతులో సత్యసందేశ ప్రచారకులకు కూడా హెచ్చరిక ఉంది. వారు ఈ సందేశ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నెరవేర్చాలి. తద్వారా వారు దైవసన్నిధిలో సమాధానం ఇవ్వగలిగే స్థితిలో ఉంటారు. అలాగే ఈ సందేశాన్ని అందజేసినప్పటికీ దాన్ని లక్ష్యపెట్టకుండా త్రోసిపుచ్చిన వారికి ఇందులో వార్నింగ్ ఉంది. వారు దైవ సన్నిధిలో అపరాధులుగా నిలబడతారు. శిక్షార్హులౌతారు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اذْكُرُوا نِعْمَةَ اللَّهِ عَلَيْكُمْ إِذْ جَاءَتْكُمْ جُنُودٌ فَأَرْسَلْنَا عَلَيْهِمْ رِيحًا وَجُنُودًا لَّمْ تَرَوْهَا ۚ وَكَانَ اللَّهُ بِمَا تَعْمَلُونَ بَصِيرًا ⑨

**9** ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని కాస్త జ్ఞప్తికి తెచ్చుకోండి. మీపై సైనిక దళాలు దండెత్తి వచ్చినప్పుడు మేము వాటిపై ప్రచండమైన పెనుగాలిని, మీకు కానరాని సైన్యాలను పంపాము.[23] మీరు చేస్తున్నదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.

23. ఈ ఆయతుల ద్వారా హిజ్రీ 5వ సంవత్సరంలో జరిగిన అహ్జాబ్ యుద్ధానికి సంబంధించిన కొంత సమాచారం ఇవ్వబడింది. ఇస్లాం మరియు ముస్లింలకు బద్ధశత్రువులైన సైనిక దళాలన్నీ ఏకమై ముస్లింల కేంద్ర స్థానమైన 'మదీనా' పైకి దండెత్తి రావటం వల్ల దీనికి 'అహ్జాబ్' అనే పేరువచ్చింది. అహ్జాబ్ అనేది 'హిజ్బ్' (వర్గం లేక కూటమి) అనే పదానికి బహువచనం. ఈ యుద్ధాన్ని కందక యుద్ధంగా కూడా వ్యవహరిస్తారు. ఎందుకంటే ముస్లింలు ఈ యుద్ధ సందర్భంగా తమ ఆత్మరక్షణ కోసం మదీనా చుట్టూ కందకం త్రవ్వుకున్నారు.

సంక్షిప్తంగా దీని పూర్వాపరాలు ఇవి –

యూదుల తెగలలో ఒకటైన బనూ నజీర్ మహాప్రవక్త (స)తో చేసుకున్న మైత్రీ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘించి, వెన్నుపోటు చర్యలకు పాల్పడుతూ ఉండటం వల్ల ఆయన (స) గారు బనూ నజీర్‌ను మదీనా నుంచి బహిష్కరించారు. దాంతో ఈ యూద తెగవారు ఖైబర్‌లో స్థిరపడ్డారు. అయితే వారు ముస్లింలపై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ, మక్కాకు చెందిన అవిశ్వాసులను ముస్లింలపై ఉసిగొల్పారు. అలాగే నజద్ ప్రాంతానికి చెందిన గిత్ఫాన్ తదితర తెగలకు కూడా సహాయం అందజేస్తామని హామీ యిచ్చి సమరానికి సిద్ధం చేశారు. ఆ విధంగా యూదులు, ఆనాడు ముస్లింలకు విరోధులుగా ఉన్న అరబ్బు తెగలన్నింటినీ ఏకంచేసి, ఒకే సమయంలో మదీనాపై దండెత్తి వచ్చేలా తెరవెనుక పాత్రను పోషించారు.

ఆ రోజుల్లో మక్కా ముష్రిక్కులకు నాయకుడుగా ఉన్న అబూ సుఫ్యాన్ ఉహుద్ పర్వత సమీపంలో భారీ సైన్యంతో మోహరించి మదీనా నగరాన్ని దాదాపు ముట్టడించాడు. అతని దగ్గర 10 వేల మంది సైనికులున్నారు. ముస్లింల సైన్యమంతా కలిపితే 3 వేలు దాటదు. ఇదిలావుండగా మదీనాకు దక్షిణాన బనూ ఖురైజా అనే మరో యూద తెగ ఉండేది. ఈ తెగవారు అప్పటి వరకూ ముస్లింలతో చేసుకున్న ఒడంబడికకు కట్టుబడి ఉండేవారు. కాని బనూ నజీర్ తెగ నాయకుడైన హుయ్ బిన్ అఖ్తబ్ బనూ ఖురైజాను కూడా రెచ్చగొట్టి తమ పక్షాన తిప్పుకున్నాడు. ఆ విధంగా ముస్లింలు నలు దిశల నుంచీ శత్రువులచే ముట్టడించబడ్డారు.

ఆ సంక్లిష్ట పరిస్థితిలో హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) సలహాపై కందకం త్రవ్వబడింది. దాంతో శత్రు సైన్యాన్ని కందకానికి అవతలే నిలువరించటంలో ముస్లింలు కృతకృత్యులయ్యారు. అయితే ఈ దిగ్బంధం వల్ల ముస్లింలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముస్లింలకు దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. ఆ గడ్డు సమయంలో ఊహించని మార్గాల నుంచి అకస్మాత్తుగా అల్లాహ్ వారికి తోడ్పడ్డాడు. ఈ ఆయతులో అల్లాహ్ ఒక వైపు ముస్లింల దీనావస్థను, మరోవైపు తన అగోచర సహాయాన్ని ప్రస్తావించాడు. ఆయతులోని అరబీ పదం **'జునూదున్'** (جُنُود) అంటే సైనిక వర్గాలు అని అర్థం. వివిధ తెగలకు చెందిన సైనికులంతా కలసి ఈ యుద్ధ సందర్భంగా మదీనాపై విరుచుకుపడ్డారు. **'రీహన్'** (رِيح) అంటే తీవ్రమైన పెనుగాలులు, ఇసుక తుఫాను. అది శత్రు సైనికుల గుడారాలను పెళ్ళగించింది. పశువులు త్రాళ్లు తెంచుకుని అటూ ఇటూ పరుగులు తీశాయి. వారి వస్తుసామగ్రి అంతా తలక్రిందులైంది. దాంతో శత్రువులు హడలెత్తిపోయి తోక ముడిచారు. ఆ పెనుగాలిని గురించే హదీసులో ఈ విధంగా అనబడింది: "తూర్పు గాలి ద్వారా నాకు సహాయం చేయబడింది. ఆద్ జాతి వారు పశ్చిమ గాలి ద్వారా అంతమొందించబడ్డారు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇస్తిస్ఖా; ముస్లిం – బాబు ఫీ రీహిస్సబా వద్దుబూర్). **'మీకు కానరాని సైన్యాలు'** అంటే ముస్లింల సహాయార్థం పంపబడిన దైవదూతలు అని భావం. దైవదూతలు శత్రువుల గుండెల్లో దడ పుట్టించి, అక్కణ్ణుంచి పారిపోవటంలోనే మేలుందని తలపోసేలా చేశారు.

إِذْ جَآءُوكُم مِّن فَوْقِكُمْ وَمِنْ أَسْفَلَ مِنكُمْ
وَإِذْ زَاغَتِ ٱلْأَبْصَٰرُ وَبَلَغَتِ ٱلْقُلُوبُ ٱلْحَنَاجِرَ
وَتَظُنُّونَ بِٱللَّهِ ٱلظُّنُونَا۠ (10)

**10** (శత్రువులు) మీపైకి పైతట్టునుంచీ, లోతట్టునుంచీ దండెత్తి వచ్చినప్పుడు[24] (మీరు) కళ్ళు తేలవేసినప్పుడు, (మీ) గుండెలు గొంతుల దాకా వచ్చేసినప్పుడు, మీరు అల్లాహ్ విషయంలో రకరకాల అనుమానాలకు లోనయ్యారు.[25]

هُنَالِكَ ٱبْتُلِىَ ٱلْمُؤْمِنُونَ وَزُلْزِلُوا۟ زِلْزَالًا
شَدِيدًا (11)

**11** అప్పుడు విశ్వాసులు పరీక్షించబడ్డారు. తీవ్రంగా కుదిపివేయ బడ్డారు.[26]

وَإِذْ يَقُولُ ٱلْمُنَٰفِقُونَ وَٱلَّذِينَ فِى قُلُوبِهِم
مَّرَضٌ مَّا وَعَدَنَا ٱللَّهُ وَرَسُولُهُۥٓ إِلَّا غُرُورًا (12)

**12** ఆ సమయంలో కపటులు, హృదయాలలో (అనుమానపు) రోగం ఉన్నవారు, "అల్లాహ్, ఆయన ప్రవక్త మాతో చేసిన వాగ్దానం మోసం తప్ప మరేమీ కాదు"[27] అని చెప్పసాగారు.

وَإِذْ قَالَت طَّآئِفَةٌ مِّنْهُمْ يَٰٓأَهْلَ يَثْرِبَ
لَا مُقَامَ لَكُمْ فَٱرْجِعُوا۟ ۚ وَيَسْتَـْٔذِنُ فَرِيقٌ مِّنْهُمُ
ٱلنَّبِىَّ يَقُولُونَ إِنَّ بُيُوتَنَا عَوْرَةٌ وَمَا هِىَ بِعَوْرَةٍ ۖ
إِن يُرِيدُونَ إِلَّا فِرَارًا (13)

**13** అప్పుడు వారిలోని ఒక వర్గం ఈ విధంగా గగ్గోలు చెందింది: "ఓ యస్రిబ్ (మదీనా) వాసులారా![28] ఇక మీరిక్కడ ఉండటానికి అవకాశమే లేదు. తిరుగు ముఖం పట్టండి."[29] మరి వారిలోని ఒక బృందం, "మా ఇండ్లు సురక్షితంగా లేవు"[30] అని చెప్పి దైవప్రవక్త (స) నుంచి అనుమతి కోరసాగింది. మరి (చూడబోతే) అవి అభద్రంగా ఏమీలేవు. (అసలు) వారి ఉద్దేశం పలాయనం చిత్తగించాలన్నదే.[31]

24. అంటే, శత్రువులు నలువైపుల నుంచీ కదలివచ్చారు అని భావం. లేదా ఎగువ ప్రాంతం నుంచి గిత్ఫాన్, హవాజిన్, నజద్‌కు చెందిన ముష్రిక్కులు దండెత్తి రాగా; దిగువ ప్రాంతం నుంచి ఖురైషులు, వారి మిత్రవర్గాలు దండెత్తి వచ్చాయి అన్న అర్థం వస్తుంది.

25. ఆ సమయంలో ముస్లింల మానసిక పరిస్థితి ఎలా ఉందో ఈ ఆయతు ద్వారా బహిర్గతమవుతోంది.

26. అంటే ముస్లింలను భయాందోళనలకు, ఆకలిబాధకు, ప్రాణభీతికి లోనుచేసి వారిలో కల్తీ సరకు ఎంత ఉందో–మేలిమి సరకు ఎంత ఉందో పరికించటం జరిగింది. అమ్ముడుపోయే సరకును (కపటులను) వేరుపరచటం దీని ముఖ్యోద్దేశం.

27. అంటే, తమకు సహాయం చేస్తామని దేవుడు, దైవప్రవక్త మోసపూరితమైన వాగ్దానాలు చేశారంటూ ఈ సందర్భంగా 70 మంది కపటులు తమ నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నారు. అప్పటి వరకూ వారి మనసులలో ఉన్న అక్కసు కాస్తా కష్టకాలం రాగానే ఒక్కసారిగా బయటపడిపోయింది.

28. **'యస్రిబ్'** (يَثْرِب) అనేది ఆ ప్రాంతానికంతటికీ ఉన్న మొదటి పేరు. మదీనా నగరం ఆ ప్రాంతంలో ఒక భాగం మాత్రమే. ఒకానొకప్పుడు 'అమాలిఖా' ప్రాంతానికి చెందిన యస్రిబ్ బిన్ ఉమైల్ అనే వ్యక్తి ఇక్కడ విడిది చేశాడు. అతని పేరుమీదే ఆ క్షేత్రం 'యస్రిబ్' అని పిలువబడింది (ఫత్‌హుల్ ఖదీర్).

29. అంటే ముస్లింల తరపున పోరాడటం చాలా కష్టం. కాబట్టి ఇక ఇంటికి పదండి అని పురికొల్పారు.

30. అంటే బనూ ఖురైజా వారు నగరంలోకి జొరబడే ప్రమాదం పొంచి ఉంది. అదేగనక జరిగితే తమ ఆడవాళ్ళ మానమర్యాదలు మంట గలుస్తాయి. తమ ఆస్తిపాస్తులు దోచుకోబడతాయి అన్నది వారి మాటల్లోని ఆంతర్యం.

31. నిజానికి వారి భయాలన్నీ ఉత్తుత్తివే. అసలు వారు పారిపోవటానికి ఈ వంకలు పెడుతున్నారు. **'ఔరతున్'** (عَوْرَة)

وَلَوۡ دُخِلَتۡ عَلَيۡهِم مِّنۡ أَقۡطَارِهَا ثُمَّ سُئِلُواْ ٱلۡفِتۡنَةَ لَأٓتَوۡهَا وَمَا تَلَبَّثُواْ بِهَآ إِلَّا يَسِيرٗا ﴿١٤﴾

**14** ఒకవేళ (మదీనా) నగరం నలువైపుల నుంచీ (శత్రువులు) చొచ్చుకు వచ్చి, అరాచకం సృష్టించమని వారిని కోరితే దానికి వారు తప్పకుండా అలా చేస్తారు. చాలా కొద్దిగా తప్ప ఆలస్యం చేయరు.[32]

وَلَقَدۡ كَانُواْ عَٰهَدُواْ ٱللَّهَ مِن قَبۡلُ لَا يُوَلُّونَ ٱلۡأَدۡبَٰرَۚ وَكَانَ عَهۡدُ ٱللَّهِ مَسۡـُٔولٗا ﴿١٥﴾

**15** ఇదివరకు వారు, తాము వెన్ను చూపము అని అల్లాహ్‌కు మాటిచ్చి ఉన్నారు.[33] అల్లాహ్‌తో చేసిన బాస గురించి తప్పకుండా ప్రశ్నించటం జరుగుతుంది.[34]

قُل لَّن يَنفَعَكُمُ ٱلۡفِرَارُ إِن فَرَرۡتُم مِّنَ ٱلۡمَوۡتِ أَوِ ٱلۡقَتۡلِ وَإِذٗا لَّا تُمَتَّعُونَ إِلَّا قَلِيلٗا ﴿١٦﴾

**16** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "మీరు చావు నుండి లేదా వధ బారి నుండి భయపడి పారిపోతే ఈ పారిపోవటం మీకేమాత్రం ప్రయోజనం కలిగించదు. అట్టి పరిస్థితిలో మీరు కొద్దిపాటి ప్రయోజనాన్ని మాత్రమే పొందుతారు.[35]

قُلۡ مَن ذَا ٱلَّذِي يَعۡصِمُكُم مِّنَ ٱللَّهِ إِنۡ أَرَادَ بِكُمۡ سُوٓءًا أَوۡ أَرَادَ بِكُمۡ رَحۡمَةٗۚ وَلَا يَجِدُونَ لَهُم مِّن دُونِ ٱللَّهِ وَلِيّٗا وَلَا نَصِيرٗا ﴿١٧﴾

**17** వారిని అడుగు: "ఒకవేళ అల్లాహ్ మీకు ఏదన్నా కీడు కలుగ జేయాలనుకున్నా లేక మీపై దయజూపాలనుకున్నా ఆయన నుండి మిమ్మల్ని కాపాడగలవాడెవడు? (లేక అడ్డుకోగల వాడెవడు?)[36] వారు తమ కోసం అల్లాహ్ తప్ప ఏ సంరక్షకుణ్ణీ, ఏ సహాయకుణ్ణీ పొందలేరు.

---

అనే పదానికి శాబ్దిక వ్యావహారిక అర్థాల వివరణ కోసం నూర్ సూరా 58వ ఆయతుకు రాసిన వ్యాఖ్యానం చూడండి.

32. అంటే మదీనా నగరం లోపలికి నలువైపుల నుంచీ శత్రువులు జొరబడి, ఇస్లాంను విడనాడి పాత మతం వైపుకు తిరిగి రమ్మని పురమాయిస్తే, వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెళ్ళిపోతారు. ఆ సమయంలో వారికి తమ ఇండ్లు సురక్షితంగా లేవన్న ఆలోచన కూడా ఉండదు. ముష్రిక్కుల ఉత్తర్వులకు తలవంచేస్తారు.

33. ఇంతకీ ఈ వర్గం వారెవరంటే బద్ర్ యుద్ధం జరిగే వరకూ వారు ఇస్లాం స్వీకరించలేదు. కాని ముస్లింలు బద్ర్ యుద్ధంలో గెలిచి, విజయధనాన్ని తీసుకుని వస్తున్నప్పుడు ఆదరాబాదరాగా వచ్చి ఇస్లాంలో చేరారు. భవిష్యత్తులో ఎప్పుడైనా ఇలాంటి యుద్ధ పరిస్థితి ఎదురైతే తాము అవిశ్వాసులతో శక్తివంచన లేకుండా పోరాడతామని శపథం కూడా చేశారు. ఆ మాటే ఈ సందర్భంగా జ్ఞాపకం చేయబడింది.

34. ఇచ్చిన మాటను ఎందుకు నిలుపుకోలేదని వారిని నిలదీసి అడగటం జరుగుతుంది. వారు చేసిన విశ్వాస ఘాతుకానికిగాను వారు శిక్షార్హులుగా నిలుస్తారు.

35. మృత్యువు నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఒకవేళ మీరు యుద్ధ మైదానం నుంచి పారిపోయినా లాభమేముందీ? కొన్నాళ్ళ తరువాతైనా మృత్యువు రుచిని చవిచూడక తప్పదు.

36. ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని అంతమొందించదలచినా, వ్యాధికి లోనుచేసినా, మీ సిరిసంపదలలో నష్టం కలుగజేసినా లేదా మిమ్మల్ని కరువు కాటకాలకు లోను చేయదలచినా ఆయన పట్టు నుంచి మిమ్మల్ని కాపాడగలవాడెవడు? ఒకవేళ ఆయన మీపై దయదలచాలనుకుంటే దయదలచకుండా అడ్డుకోగల మొనగాడెవడు?

قَدْ يَعْلَمُ اللّٰهُ الْمُعَوِّقِيْنَ مِنْكُمْ وَالْقَآئِلِيْنَ لِاِخْوَانِهِمْ هَلُمَّ اِلَيْنَا ۚ وَلَا يَاْتُوْنَ الْبَاْسَ اِلَّا قَلِيْلًا ۙ ﴿18﴾

**18** మీలో ఇతరులను అడ్డుకునేవారెవరో, తమ సోదరుల నుద్దేశించి, "మా దగ్గరకు వచ్చేయండి"[37] అని చెప్పేవారెవరో అల్లాహ్‌కు (బాగా) తెలుసు. వారు ఎప్పుడో గాని యుద్ధానికి రారు.[38]

اَشِحَّةً عَلَيْكُمْ ۖۚ فَاِذَا جَآءَ الْخَوْفُ رَاَيْتَهُمْ يَنْظُرُوْنَ اِلَيْكَ تَدُوْرُ اَعْيُنُهُمْ كَالَّذِيْ يُغْشٰى عَلَيْهِ مِنَ الْمَوْتِ ۚ فَاِذَا ذَهَبَ الْخَوْفُ سَلَقُوْكُمْ بِاَلْسِنَةٍ حِدَادٍ اَشِحَّةً عَلَى الْخَيْرِ ؕ اُولٰٓئِكَ لَمْ يُؤْمِنُوْا فَاَحْبَطَ اللّٰهُ اَعْمَالَهُمْ ؕ وَكَانَ ذٰلِكَ عَلَى اللّٰهِ يَسِيْرًا ﴿19﴾

**19** వారు మీకు తోడ్పడే విషయంలో (పరమ) పీనాసులు.[39] మరి భయాందోళనల పరిస్థితి ఎదురైనప్పుడు, చచ్చిపోయేవాడు కను గుడ్లు తేలవేసినట్లు,[40] వారు నీ వైపు అదేపనిగా చూడటాన్ని నువ్వు గమనిస్తావు. ఆ తరువాత భయోత్పాతం వీడిపోతున్నప్పుడు, తమ పదునైన నాలుకలతో కోతలు కోస్తూ, నీ దగ్గరకు వస్తారు.[41] విపరీతమైన ధనవ్యామోహం ఉన్నవారు.[42] వారసలు విశ్వసించనే లేదు.[43] అల్లాహ్ వారి కర్మలన్నింటినీ వృధా గావించాడు.[44] అలా చేయటం అల్లాహ్‌కు చాలా తేలిక.[45]

37. ఈ విధంగా చెప్పినవారు కపటులు. తామెలాగూ యుద్ధంలో పాల్గొనరు. అయితే యుద్ధం కోసం వెళుతున్న నికార్సయిన ముస్లింలను కూడా అడ్డుకునేందుకు యత్నించేవారు.
38. ఎందుకంటే వారికి వారి ప్రాణాలు ఎంతో ముఖ్యం.
39. అంటే ముస్లింలతో కలసి కందకం త్రవ్వటంలో గానీ, దైవమార్గంలో ధనాన్ని వ్యయపరచటంలోగానీ, మీతో కలసి యుద్ధం చేయటంలోగానీ మనస్ఫూర్తిగా ముందుకు రాలేదు. ప్రతి పనీ అన్య మనస్కంగానే చేశారు.
40. అది వారి పిరికితనాన్నీ, ప్రాపంచిక వ్యామోహాన్నీ వ్యక్తపరుస్తోంది.
41. అంటే–వారు తమ శౌర్యాన్ని, వీరోచిత పోరాటాన్ని గురించి అదేపనిగా కోతలు కోస్తారు. వాస్తవానికి అదంతా అబద్ధమే. 'విజయప్రాప్తి'ని పంపిణీ చేసే సమయంలో తమ పోరాట పటిమ గురించి గొప్పలు చెప్పుకుని అందరినీ ప్రభావితుల్ని చేసి ఎక్కువ సొమ్మును పుచ్చుకోవాలన్నది వారి ఉద్దేశమై ఉంటుంది. ఈ ఆయతుకు తాత్పర్యంగా హజ్రత్ ఖతాద (రజి) ఇలా అంటున్నారు: "వీరు విజయ ప్రాప్తి పంపకం సందర్భంగా పరమ లోభులుగా ఉంటారు. అందరికన్నా చెడ్డవాటాను పొందుతారు. యుద్ధసమయంలో వట్టి పిరికిపందలుగా వ్యవహరిస్తారు. తమను నమ్ముకున్న స్నేహితులను నిస్సహాయులుగా వదలి పారిపోతారు."
42. దీనికి మరొక అర్థం ఏమిటంటే, వారిలో మంచి అన్నది ఏ కోశానా ఉండదు. అంటే ఇన్ని దుర్గుణాలకు తోడు వారిలో ఒక సద్గుణం కూడా ఉండదు.
43. అంటే విశ్వాసం (ఈమాన్) అనే విత్తనం వారి మనోక్షేత్రంలో నాటుకోలేదు. ఎందుకంటే వారి మనసులు అవిశ్వాసం, వైరభావంతో నిండి ఉన్నాయి.
44. ఎందుకంటే వారు ఇప్పటివరకూ ముష్రిక్కులుగా, కాఫిర్లుగా ఉన్నారు. ముష్రిక్కుల, కాఫిర్ల ఆచరణలు మిథ్యగానే మిగిలిపోతాయి. వాటికి సత్ఫలితమేదీ లభించదు. లేదా ఇక్కడ **'అహ్‌బత'** (اَحْبَطَ) అన్న పదం **'అజ్‌హర'** (اَظْهَرَ) అన్న అర్థంలో వాడబడి ఉంటుంది. అంటే వారి నిష్ఫల కర్మల బండారాన్ని దేవుడు బయటపెట్టేశాడు. ఎందుకంటే వారి కర్మలు పుణ్యఫలానికి నోచుకోదగ్గవిగా లేనేలేవు.(ఫత్‌హుల్ ఖదీర్)
45. అంటే వారి ఆచరణలను నిరర్థకంగా చేయటం లేక వారి కాపట్య రోగాన్ని బహిర్గతం చేయటం అల్లాహ్‌కు ఏ మాత్రం కష్టంకాదు.

20 (దండెత్తి వచ్చిన) సైన్యాలు ఇంతవరకూ తిరిగి వెళ్ళలేదనే వారు భావిస్తున్నారు.[46] ఒకవేళ సైన్యాలు(మళ్లీ) వచ్చిపడినట్లయితే, తాము ఎడారుల్లో పల్లెవాసులతోనే ఉండి, మీ సమాచారాలు తెలుసుకుంటూ ఉంటే బావుండేదే'[47] అని కోరుకుంటారు. ఒకవేళ వారు మీ మధ్యలో వున్నా (ఒరిగేదేమీ లేదు. వారు) అంతంత మాత్రంగానే పోరాడతారు.[48]

يَحْسَبُونَ الْأَحْزَابَ لَمْ يَذْهَبُوا ۖ وَإِن يَأْتِ الْأَحْزَابُ يَوَدُّوا لَوْ أَنَّهُم بَادُونَ فِي الْأَعْرَابِ يَسْأَلُونَ عَنْ أَنبَائِكُمْ ۖ وَلَوْ كَانُوا فِيكُم مَّا قَاتَلُوا إِلَّا قَلِيلًا ﴿٢٠﴾

21 నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది[49]– అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు.[50]

لَّقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ يَرْجُو اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللَّهَ كَثِيرًا ﴿٢١﴾

46. కపటుల పిరికితనానికి ఇది మరో మచ్చుతునక. అవిశ్వాసుల సైనిక దళాలు ఆశలు వదలుకుని ఏనాడో తిరుగుముఖం పట్టినప్పటికీ ఈ కపటుల భయాలు మాత్రం ఇంకా తొలగిపోలేదు. ఇప్పటికీ శత్రుసైన్యాలు తమ స్థావరాల వద్ద మోహరించి ఉన్నాయని వారు కాకిలెక్కలు వేస్తున్నారు.

47. దీనిద్వారా కపటుల ద్రోహబుద్ధి తెలిసివస్తోంది. ఒకవేళ అవిశ్వాసుల సైనికదళాలు మళ్లీ మదీనా నగరంపైకి దండెత్తి వస్తే మాత్రం ఈ నయవంచకులు ప్రతిఘటనకు సిద్ధం అవరు. పైగా వీళ్లు ఏదన్నా పల్లెటూరుకు పోయి, అక్కడి ప్రజలతో కాలక్షేపం చేస్తూ యుద్ధసమాచారం తెలుసుకుంటూ ఉండాలని కోరుకుంటారు. ముహమ్మద్ (సఅసం) మరియు అతని సహచరులు అంతమొందించబడ్డారా? లేదా? అవిశ్వాసుల సైన్యం విజయపతాకం ఎగురవేసిందా? లేదా? అన్నది వారి మనోగతం అయి ఉంటుంది.

48. పరువు దక్కదేమోనన్న ఉద్దేశంతో వారు కదన రంగానికి వస్తారు. కాని మనస్ఫూర్తిగా పోరాడరు. ఈ ఆయతులో కపటుల వైఖరి తీవ్రంగా ఖండించబడింది.

49. ఓ ముస్లింలారా! ఓ కపటులారా!! మీరందరి కోసం దైవప్రవక్త (సఅసం) జీవితంలో గొప్ప ఉదాహరణ ఉంది. కనుక మీరు సహనస్థైర్యాల విషయంలోనూ, పోరాట పటిమలోనూ మీ ప్రవక్తనే ఆదర్శంగా తీసుకోండి. మా ప్రవక్త సర్వవిధాలా మీకు ఆదర్శప్రాయుడు. ఎందుకంటే అతను ధర్మయుద్ధ సందర్భంగా ఆకలితో గడిపాడు. తన బాధను సహచరులకు తెలియనివ్వకుండా ఉండటానికి కడుపుకు రాళ్లు కట్టుకున్నాడు. యుద్ధంలో అతని ముఖారవిందం గాయపడింది. అతని పన్ను సయితం (ఒకటి) ఊడిపోయింది. అతను తన స్వహస్తాలతో కందకం త్రవ్వాడు. సుమారు నెల రోజుల పాటు శత్రువులకు ఎదురొడ్డి నిలబడ్డాడు.

ఈ ఆయతు అహ్జాబ్ యుద్ధం నేపథ్యంలో అవతరించినప్పటికీ, యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (స)ను ఆదర్శంగా తీసుకోవాలని ఇందులో ప్రత్యేకంగా చెప్పబడినప్పటికీ, ఇందలి ఆజ్ఞ సర్వసాధారణం. అంటే ఆయన ప్రవచనాలు, ఆచరణలు, వ్యవహారాలన్నీ ముస్లింల కొరకు ఆదర్శప్రాయం. అవి ఆరాధనలకు సంబంధించినవైనా, సామాజిక నియమాలకు సంబంధించినవైనా, ఆర్థికమైనవైనా, రాజకీయ సంబంధమైనవైనా వాటిని ముస్లింలు అనుసరించటం అవశ్యం. జీవితపు అన్ని రంగాలలోనూ ప్రవక్త(స) వారి సూచనలు అనుసరణీయమైనవి. "దైవప్రవక్త మీకు ఇచ్చిన దాన్ని పుచ్చుకోండి. ఆయన నిషేధించిన వాటి జోలికి పోకండి" (అల్ హష్ర్ – 7) అన్న దివ్య వచనం సారాంశం ఇదే. "మీకు నిజంగానే అల్లాహ్‌పట్ల ప్రేమ ఉంటే, మీరు నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు" (ఆలి ఇమ్రాన్ – 31) అన్న ఆయతులోని నిగూఢార్థం కూడా ఇదే.

50. ఈ వాక్యం ద్వారా స్పష్టంగా అవగతమయ్యేదేమిటంటే పరలోకంలో అల్లాహ్‌ను కలుసుకునే విషయమై దృఢనమ్మకం ఉన్నవాడు, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించేవాడు మాత్రమే దైవప్రవక్త (స) జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటాడు. కాని దురదృష్టవశాత్తు నేటి ముస్లింలలో ఈ రెండు సుగుణాలు సన్నగిల్లుతున్నాయి. అందువల్ల దైవప్రవక్త (స)

وَلَمَّا رَاَ الْمُؤْمِنُوْنَ الْاَحْزَابَ ۙ قَالُوْا هٰذَا مَا وَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗ وَ صَدَقَ اللّٰهُ وَ رَسُوْلُهٗ ؗ وَمَا زَادَهُمْ اِلَّاۤ اِيْمَانًا وَّ تَسْلِيْمًا ﴿22﴾ؕ

**22** విశ్వాసులు (అవిశ్వాసుల) సేనలను చూడగానే (అప్రయత్నంగా) ఇలా అన్నారు: "అల్లాహ్, ఆయన ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే. అల్లాహ్, ఆయన ప్రవక్త చెప్పింది నిజమే."[51] ఆ సంఘటన వారి విశ్వాసాన్ని, ఆత్మ సమర్పణా భావాన్ని మరింత అధికం చేసింది.[52]

مِنَ الْمُؤْمِنِيْنَ رِجَالٌ صَدَقُوْا مَا عَاهَدُوا اللّٰهَ عَلَيْهِ ۚ فَمِنْهُمْ مَّنْ قَضٰى نَحْبَهٗ وَمِنْهُمْ مَّنْ يَّنْتَظِرُ ۖ وَمَا بَدَّلُوْا تَبْدِيْلًا ﴿23﴾ۙ

**23** విశ్వాసులలో కొందరు అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన వారున్నారు.[53] కొందరు తమ వాగ్దానాన్ని నెరవేర్చుకోగా,[54] మరి కొందరు (అవకాశం కోసం) ఎదురు చూస్తున్నారు. వారు (తమ పోరాట స్ఫూర్తిలో) ఎలాంటి మార్పు రానివ్వలేదు.[55]

لِّيَجْزِيَ اللّٰهُ الصّٰدِقِيْنَ بِصِدْقِهِمْ وَيُعَذِّبَ الْمُنٰفِقِيْنَ اِنْ شَآءَ اَوْ يَتُوْبَ عَلَيْهِمْ ؕ اِنَّ اللّٰهَ كَانَ غَفُوْرًا رَّحِيْمًا ﴿24﴾ۚ

**24** (ఎందుకంటే) అల్లాహ్ సత్యవంతులకు వారి సత్యత యొక్క ప్రతిఫలం వొసగటానికి, ఇంకా (అల్లాహ్) తాను కోరితే కపటులను శిక్షించటానికి లేదా వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించటానికి[56] (ఇదంతా జరిగింది). అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు.

జీవితాన్ని ఆదర్శప్రాయంగా తీసుకోవటానికి వారు తగినంత ప్రాధాన్యత ఇవ్వటం లేదు. వారి మతనాయకులు, విద్వాంసులు, ఆధ్యాత్మిక గురువులు, రాజకీయవేత్తలు – అందరూ దైవప్రవక్త (సఅసం) పట్ల గల గౌరవ ప్రపత్తులను గురించి అనర్గళంగా ఉపన్యసిస్తారు. కాని క్రియాత్మకంగా ఆయన్ని (స) మార్గదర్శకునిగా ఒప్పుకుని, ఆయన అడుగుజాడలలో నడవటానికి ఏ ఒక్కరూ ముందుకు రారు. ఇది కడు శోచనీయం.

51. పరిస్థితుల సంక్లిష్ట స్వరూపాన్ని, శత్రు సైనికుల భారీ సమూహాన్ని చూడగానే కపటుల గుట్టు రట్టయింది. దేవుడు, దైవప్రవక్త (స) తమకు ఇంతకాలంగా చేస్తూ వచ్చిన వాగ్దానం ఉత్తుత్తిదే అని వారు చెప్పనే చెప్పేశారు. కాని అదే సమయంలో విశ్వాసుల ఆలోచనా తీరు ఎలా ఉందో చూడండి! కఠినంగా పరీక్షించబడిన తరువాత మీకు విజయం వరిస్తుంది అని దేవుడు, దైవప్రవక్త(స) చేసిన వాగ్దానం ముమ్మాటికీ నిజమే అని వారు అన్నారు.

52. అంటే – పరిస్థితుల భయంకర స్వరూపానికి వారు బెదిరిపోలేదు. వారి అడుగులు తడబడలేదు. వారి విశ్వాసం క్షీణించలేదు. పైగా వారి విధేయతా భావం, అంకితభావం ద్విగుణీకృతం అయ్యింది. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా ప్రజల విశ్వాసం (ఈమాన్) తరుగుతూ – పెరుగుతూ ఉంటుందనటానికి ఇదొక తార్కాణం. హదీసువేత్తల దృక్పథం కూడా ఇదే.

53. ఈ సందర్భంగా అసాధారణమైన త్యాగనిరతిని ప్రదర్శించిన కొంతమంది ప్రవక్త ప్రియసహచరుల గురించి ఈ ఆయతు అవతరించింది. బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయిన కారణంగా, భవిష్యత్తులో జరిగే యుద్ధంలో వీరోచితంగా పోరాడతామని ప్రతినబూనిన సహాబీల గురించి కూడా ఇందులో చెప్పటం జరిగింది. ఉదాహరణకు: నజర్ బిన్ అనస్ (రజి) తదితరులు. కాని వారు ఉహుద్ యుద్ధ సందర్భంగా వీర మరణం పొందారు. ఆయన శరీరంపై 80కి పైగా గాయాలు కనిపించాయి. అమరగతి నొందిన తరువాత ఆయన తోబుట్టువు ఆయన్ని వ్రేలి కణుపు ఆధారంగా గుర్తు పట్టగలిగింది. (ముస్నదె అహ్మద్–సంపుటి: 4, పేజీ–193).

54. అంటే, ఆ సత్యవంతులలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకుంటూ అమరగతి నొందారు. **'నహ్‌బున్'** (نَحْب) అన్న పదానికి వాగ్దానం, మొక్కుబడి, మృత్యువు అనే అర్థాలు చెప్పబడ్డాయి.

وَرَدَّ اللَّهُ الَّذِينَ كَفَرُوا بِغَيْظِهِمْ لَمْ يَنَالُوا خَيْرًا ۚ وَكَفَى اللَّهُ الْمُؤْمِنِينَ الْقِتَالَ ۚ وَكَانَ اللَّهُ قَوِيًّا عَزِيزًا ﴿٢٥﴾

**25** అల్లాహ్ అవిశ్వాసులను వారి కోపం (రగులుతున్న) స్థితిలోనే వెనక్కి తరిమాడు. (అక్కడ) వారు ఏ లాభాన్నీ పొందలేదు.[57] విశ్వాసుల పక్షాన యుద్ధం చేయటానికి అల్లాహ్‌యే సరిపోయాడు.[58] అల్లాహ్ మహాబలుడు, ప్రాబల్యం కలవాడు.

وَأَنزَلَ الَّذِينَ ظَاهَرُوهُم مِّنْ أَهْلِ الْكِتَابِ مِن صَيَاصِيهِمْ وَقَذَفَ فِي قُلُوبِهِمُ الرُّعْبَ فَرِيقًا تَقْتُلُونَ وَتَأْسِرُونَ فَرِيقًا ﴿٢٦﴾

**26** వారికి (అంటే అవిశ్వాసులకు) తోడ్పడిన గ్రంథవహులను కూడా అల్లాహ్ వారి కోటల నుంచి దించేశాడు. (మీపట్ల) వారి గుండెలలో గుబులును నింపేశాడు. (దాంతో) మీరు వారిలోని ఒక వర్గాన్ని వధించసాగారు, మరో వర్గాన్ని బందీలుగా పట్టుకోసాగారు.

وَأَوْرَثَكُمْ أَرْضَهُمْ وَدِيَارَهُمْ وَأَمْوَالَهُمْ وَأَرْضًا لَّمْ تَطَئُوهَا ۚ وَكَانَ اللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرًا ﴿٢٧﴾

**27** ఇంకా ఆయన వారి భూములకు, వారి ఇండ్లకు, వారి సిరిసంపదలకు మిమ్మల్ని వారసులుగా చేశాడు.[59] మీరు కాలు మోపని భూమిని కూడా[60] (ఆయన మీ పాదాక్రాంతం చేశాడు). అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు సుమా!

55. వారిలో మరికొందరున్నారు. వారు కోరుకున్నట్లు ఇప్పటి వరకూ వారికి వీరమరణం పొందే భాగ్యం లభించలేదు. కాని వీరమరణం పొందాలన్న వారి ఆరాటం కొనియాడదగినది. వారు తమ వాగ్దానానికి ఖచ్చితంగా కట్టుబడి ఉన్నారు. వారి వైఖరిలో లేశమైనా మార్పు రాలేదు.

56. అంటే ఇస్లాం వైపుకు చిత్తశుద్ధితో మరలే అవకాశం దేవుడు వారికి ఇవ్వటానికి.

57. ముస్లింలను నామరూపాల్లేకుండా చేయాలని అరబ్బు నలుమూలల నుంచి కట్టకట్టుకు వచ్చిన ముష్రిక్కు మూకలకు కలిగిన లాభం ఏమీలేదు. పైపెచ్చు వారు ఘోర పరాభవంతో ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. అలా తిరిగి వెళుతున్నప్పుడు వారు ఆవేశంతో ఊగిపోయారు. అసూయతో లోలోపలే ఉడికిపోయారు. అంత ఆర్భాటంతో వచ్చినందుకు ప్రాపంచిక ప్రయోజనం కూడా ఏమీ కలగలేదు. పోనీ పరలోకంలో ఏదన్నా లభిస్తుందా అంటే అదీ లేదు. సర్వవిధాలా వారు నష్టపోయారు. వారి తలబిరుసుతనం వారినే బెడిసికొట్టింది.

58. అసలు ముస్లింలకు శత్రు సైన్యాలను మార్కొనవలసిన అగత్యమే ఏర్పడలేదు. ఆ వ్యవహారాన్ని అల్లాహ్‌యే చూసుకున్నాడు. ఆయన తన దూతల ద్వారా – అనూహ్యమైన రీతిలో – ముస్లింలను ఆదుకున్నాడు. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఇలా ప్రవచించారు : **“లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు, సదఖ వాదహు, వ నసర అబ్దహు, వ అఅజ్జ జున్దహు, వ హజమల్ అహ్‌జాబ వహ్‌దహు. ఫలా షయ్‌అ బాదహు.”** (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఉమ్ర ; ముస్లిం – బాబు మా యఖూలు....)

(అర్థం : ఒక్కడైన అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు ఎవడూ లేడు. ఆయన తన వాగ్దానాన్ని నిజం చేసి చూపాడు. ఆయన తన దాసునికి తోడ్పడ్డాడు. తన సైన్యాన్ని గెలిపించాడు. (శత్రు) వర్గాలన్నింటినీ ఆయన ఒక్కడే ఓడించాడు. ఆయన తరువాత మరే వస్తువూ లేదు). ఈ దుఆను, హజ్, ఉమ్రా, జిహాద్ సమయాలలోనూ, ప్రయాణం నుంచి తిరిగి వచ్చిన సమయంలోనూ చేయవచ్చు.

59. ఈ ఆయతులో బనూ ఖురైజాతో జరిగిన యుద్ధ ప్రస్తావన ఉంది. బనూ ఖురైజా వారు మహాప్రవక్త (స)తో చేసుకున్న స్నేహ ఒప్పందాన్ని ఉల్లంఘించి – అహ్జాబ్ యుద్ధ సందర్భంగా– అవిశ్వాసులకు, ఇతర యూదులకు సహాయం అందించారని ఇంతకు ముందు కూడా చెప్పటం జరిగింది.

**28** ఓ ప్రవక్తా! నీ భార్యలకు ఇలా చెప్పు: "మీరు గనక ప్రాపంచిక జీవితాన్ని, దాని తళుకు బెళుకులను కోరుకుంటూ ఉన్నట్లయితే, రండి, నేను మీకు ఎంతో కొంత ఇచ్చి, మిమ్మల్ని ఉత్తమరీతిలో సాగనంపుతాను –

يَٰٓأَيُّهَا ٱلنَّبِيُّ قُل لِّأَزْوَٰجِكَ إِن كُنتُنَّ تُرِدْنَ ٱلْحَيَوٰةَ
ٱلدُّنْيَا وَزِينَتَهَا فَتَعَالَيْنَ أُمَتِّعْكُنَّ وَأُسَرِّحْكُنَّ
سَرَاحًا جَمِيلًا ﴿٢٨﴾

**29** "కాని ఒకవేళ అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, పరలోక నిలయాన్ని పొందాలన్నదే మీ లక్ష్యమైతే, మీలోని సద్వర్తనుల కోసం అల్లాహ్ గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు."[61]

وَإِن كُنتُنَّ تُرِدْنَ ٱللَّهَ وَرَسُولَهُۥ وَٱلدَّارَ ٱلْـَٔاخِرَةَ
فَإِنَّ ٱللَّهَ أَعَدَّ لِلْمُحْسِنَٰتِ مِنكُنَّ أَجْرًا عَظِيمًا ﴿٢٩﴾

అహ్జాబ్ యుద్ధం నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తరువాత మహాప్రవక్త (స) స్నానాదులు ముగించుకుంటుండగానే దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఏతెంచారు. "ఏమిటి? తమరు అప్పుడే ఆయుధాలు విడిచేశారా? మేము (దైవదూతలం) ఇంకా ఆయుధాలను చేబూని ఉన్నాం. పదండి. బనూ ఖురైజా సంగతి తేల్చవలసి ఉంది. ఈ పని కోసమే అల్లాహ్ నన్ను మీ దగ్గరకు పంపించాడు" అని చెప్పారు. దాంతో మహాప్రవక్త (స) యుద్ధప్రకటన చేయించారు. అంతేకాదు, అస్ర్ నమాజు అక్కడికెళ్ళి చేయాలని కూడా గట్టిగా తాకీదు చేశారు. ఖురైజా తెగవారు మదీనా నగరానికి కొన్ని మైళ్ల దూరంలో నివసించేవారు. ముస్లిం ల రాకను పసిగట్టిన ఆ తెగవారు తమ కోటల్లోకి వెళ్ళి, ద్వారాలన్నీ మూసేసారు. ముస్లింలు వారి కోటలను నలువైపుల నుంచీ ముట్టడించారు. ఈ ముట్టడి సుమారు 25 రోజుల దాకా సాగింది. ఎట్టకేలకు బనూ ఖురైజా వారు సాద్ బిన్ ముఆజ్ (రజి)ను తమ తీర్పరి (మధ్యవర్తి)గా అంగీకరించారు. ఆయన చేసిన తీర్పును శిరసావహిస్తామని కూడా మాటిచ్చారు. బనూ ఖురైజాలో యుద్ధం చేయగల శక్తి ఉన్న వారందరినీ వధించాలనీ, చిన్న పిల్లలను, స్త్రీలను ఖైదీలుగా పట్టుకోవాలని, వారి ఆస్తిపాస్తులను ముస్లింలకు పంచిపెట్టాలని సాద్ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును వినగానే, "ఆకాశాలలో అల్లాహ్ చేసిన తీర్పు కూడా ఇదే" అని దైవప్రవక్త (స) చెప్పారు. తీర్పుననుసరించి పోరాడే వారందరికీ శిరచ్ఛేదన శిక్ష విధించబడింది. ఆ విధంగా మదీనా నగరానికి విద్రోహుల బెడద తప్పింది. (వివరాల కోసం సహీహ్ బుఖారీ – కందక పోరాట అధ్యాయం చూడండి). **'అన్‌జల'** (اَنْزَلَ) అంటే కోటల నుంచి క్రిందికి దింపాడనీ, **'జాహరూహుమ్'** (ظَاهَرُوْهُمْ) అంటే వారు అవిశ్వాసులకు సహాయపడ్డారని అర్థం.

60. ఇంతకీ ముస్లింలు కాలుమోపని ఆ 'భూమి' ఏది? అది ఖైబర్ భూమి అని కొందరు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఈ ముట్టడి తరువాతనే ముస్లింలు హిజ్రీ 6వ ఏట – హుదైబియా సంధి అనంతరం – ఖైబర్‌ను జయించారు. మరి కొంతమంది 'అది మక్కా నేల' అని భావించారు. ఇంకా కొంతమంది దాన్ని రోము, పారసీక భూ భాగాలుగా పేర్కొన్నారు. కొంతమంది విద్వాంసుల దృష్టిలో, ప్రళయదినం వరకు ముస్లింలు జయించే భూభాగాలన్నీ ఆ 'భూమి' క్రిందికి వస్తాయి (ఫత్‌హుల్ ఖదీర్).

61. విజయాల తరువాత ముస్లిం ల ఆర్థిక పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి. అన్సార్ల, ముహాజిర్ల మహిళల జీవన ప్రమాణాలను చూసిన తరువాత దైవప్రవక్త (స) సతీమణులలో కూడా సహజంగానే కోరికలు జనించాయి. తమకు ఇవ్వబడుతున్న జీవన భృతిని పెంచవలసిందిగా వారంతా కలసి ప్రవక్తను డిమాండు చేశారు. కాని నిరాడంబర జీవి అయిన దైవప్రవక్త (స)కు తన భార్యల ధోరణి నచ్చలేదు. ఆయనకు మనస్తాపం కలిగింది. ఆయన తన భార్యల నుంచి నెల రోజులదాకా వేరైపోయారు. చివరకు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) అందరికన్నా ముందు హజ్రత్ ఆయిషా (ర.అన్హా)కు ఈ ఆయతును వినిపించి 'స్వయం నిర్ణయాధికారం' ఇచ్చారు. అయితే నిర్ణయం గైకొనే ముందు ఒకసారి తల్లిదండ్రులను కూడా సంప్రతించమని సూచించారు. దానికి హజ్రత్ ఆయిషా (ర.అ) "ఏమిటీ, మీ విషయంలో నేను నా తల్లిదండ్రులను సంప్రతించాలా?! ఇదెలా సాధ్యం? నాకు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తే కావాలి" అన్నారు. సతీమణులంతా ఇదే అభిప్రాయాన్ని

**30** ఓ ప్రవక్త సతీమణులారా! మీలో ఎవరయినాసరే స్పష్టంగా అసభ్యకరమైన చేష్టకి పాల్పడినట్లయితే ఆమెకు రెండింతల శిక్ష విధించబడుతుంది.[62] ఇది అల్లాహ్‌కు చాలా తేలిక.

يٰنِسَآءَ النَّبِيِّ مَنْ يَّاْتِ مِنْكُنَّ بِفَاحِشَةٍ مُّبَيِّنَةٍ يُّضٰعَفْ لَهَا الْعَذَابُ ضِعْفَيْنِ ؕ وَكَانَ ذٰلِكَ عَلَى اللّٰهِ يَسِيْرًا (30)

**31** మరి మీలో ఎవరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత కనబరుస్తారో, సదాచరణ చేస్తారో ఆమెకు మేము రెండింతల పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాము.[63] ఆమె కోసం మేము గౌరవప్రదమైన ఉపాధిని సిద్ధం చేసి ఉంచాము.

وَمَنْ يَّقْنُتْ مِنْكُنَّ لِلّٰهِ وَرَسُوْلِهٖ وَتَعْمَلْ صَالِحًا نُّؤْتِهَاۤ اَجْرَهَا مَرَّتَيْنِ ۙ وَاَعْتَدْنَا لَهَا رِزْقًا كَرِيْمًا (31)

**32** ఓ ప్రవక్త సతీమణులారా! మీరు సాధారణ స్త్రీల వంటివారు కారు.[64] మీరు (అల్లాహ్‌కు) భయపడేవారే అయితే సుతిమెత్తని శైలిలో మాట్లాడకండి. దాని వల్ల హృదయంలో (దురాలోచనా) రోగం ఉన్నవాడు అత్యాశకు పోవచ్చు.[65] కనుక మాట్లాడితే ఉత్తమ రీతిలోనే మాట్లాడండి.[66]

يٰنِسَآءَ النَّبِيِّ لَسْتُنَّ كَاَحَدٍ مِّنَ النِّسَآءِ اِنِ اتَّقَيْتُنَّ فَلَا تَخْضَعْنَ بِالْقَوْلِ فَيَطْمَعَ الَّذِيْ فِيْ قَلْبِهٖ مَرَضٌ وَّقُلْنَ قَوْلًا مَّعْرُوْفًا (32)

---

వ్యక్తపరిచారు. వారిలో ఏ ఒక్కరు కూడా దైవప్రవక్త (స)ను వదలి ప్రాపంచిక వైభవాల వైపుకు మొగ్గు చూపలేదు. (సహీహ్ బుఖారీ – అహ్జాబ్ సూరా వ్యాఖ్యానం).

ఈ సంఘటన జరిగేనాటికి దైవప్రవక్త (స) దాంపత్యంలో తొమ్మండుగురు భార్యలున్నారు. వారిలో ఐదుగురు ఖురైషు మహిళలు (ఆయిషా, హఫ్స, ఉమ్మె హబీబా, సౌదా, ఉమ్మె సల్మా). నలుగురు ఖురైషేతర మహిళలు (సఫియా, మైమూన, జైనబ్, జువేరియా). పురుషుని తరఫున గైకొనబడే నిర్ణయాధికారాన్ని కొంతమంది 'తలాఖ్'గా పరిగణిస్తారు. ఇది సరైనది కాదు. స్వయం నిర్ణయాధికారం (వేర్పడే అధికారం) ఇవ్వబడిన పిదప, స్త్రీ వేర్పడాలని నిర్ణయించుకుంటేనే విడాకుల ప్రసక్తి వస్తుంది. (అది కూడా 'తలాఖె రజయీ'గా పరిగణించబడుతుందే తప్ప, కొంతమంది భావిస్తున్నట్లు అది 'తలాఖె బాయిన్' క్రిందికి రాదు). స్త్రీ గనక వేర్పాటుకు సుముఖంగా లేనిపక్షంలో విడాకుల ప్రసక్తిరాదు. ఉదాహరణకు : హజ్రత్ ఆయిషా (ర.అన్హా) నే చూడండి. ఆమెగారు విడియాకులు పుచ్చుకునేబదులు దైవప్రవక్త(స) సహధర్మచారిణిగా ఉండటానికే ఇష్టపడ్డారు. అప్పుడు ఈ 'నిర్ణయాధికారం' తలాఖ్‌గా పరిగణించబడలేదు. (సహీహ్ బుఖారీ – కితాబుత్తలాఖ్; ముస్లిం).

62. దివ్య ఖుర్‌ఆన్‌లో **'అల్ ఫాహిషతు'** (الفاحشة) అనే పదం 'వ్యభిచారం' అన్న భావంలో ప్రయోగించబడింది. కాని ఇక్కడ మాత్రం **'ఫాహిషతిన్'** (فاحشة) అని సాధారణ నామం ఉంది. అవాంఛనీయమైన, అమర్యాదకరమైన, దురుసైన అన్న భావంలో ఈ పదం ఉపయోగించబడింది. దైవప్రవక్త (స) యెడల దురుసుగా ప్రవర్తించటం, ఆయన మనసును నొప్పించటం కూడా చాలా తీవ్రమైన విషయమే. ఇది 'కుఫ్ర్' (అవిశ్వాసం) క్రిందికి వస్తుంది. అదీగాక దైవప్రవక్త (స) సతీమణులంటే ఉన్నత శ్రేణికి చెందినవారు. ఉన్నత శ్రేణికి చెందినవారు చేసే చిన్న చిన్న పొరపాట్లు కూడా పెద్ద పొరబాట్లుగానే ఎంచబడతాయి. అందువల్ల ప్రవక్త భార్యల వల్ల జరిగే మామూలు తప్పుకు కూడా రెట్టింపు శిక్ష విధించబడుతుందని హెచ్చరించబడింది.

63. వారు చేసిన తప్పుకు రెట్టింపు శిక్ష విధించినట్లే, వారు చేసిన సత్కార్యాలకు పుణ్యఫలం కూడా రెట్టింపుగా ఇవ్వబడుతుందని చెప్పబడింది. దివ్య ఖుర్‌ఆన్‌లో వేరొకచోట దేవుడు తన ప్రవక్త (స)ను సయితం ఈ మేరకు హెచ్చరించాడు: "(ఓ ప్రవక్తా!) ఒకవేళ నువ్వు (వారివైపుకు) మొగ్గివుంటే మేము నీకు ప్రపంచంలో కూడా రెండింతల శిక్ష విధించేవారం. పరలోకంలో కూడా రెట్టింపు శిక్ష ఉంటుంది" (బనీ ఇస్రాయీల్ – 75).

64. అంటే, మీ స్థాయి, స్థానం వేరితర స్త్రీల స్థాయివంటిది కాదు. దేవుడు మీకు దైవప్రవక్త (సఅసం) భార్యలుగా ఉండే

33 మీరు మీ ఇండ్లల్లోనే ఆగి ఉండండి.[67] పూర్వపు అజ్ఞాన కాలంలో మాదిరిగా మీ సింగారాన్ని చూపిస్తూ తిరగకండి.[68] నమాజు చేస్తూ ఉండండి. జకాతు ఇస్తూ ఉండండి. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతూ ఉండండి.[69] ఓ ప్రవక్త ఇంటివారలారా![70] మీ నుండి (అన్ని రకాల) మాలిన్యాన్ని దూరం చేయాలన్నది, మిమ్మల్ని పూర్తిగా పరిశుద్ధపరచాలన్నది అల్లాహ్ అభిలాష.

وَقَرْنَ فِي بُيُوتِكُنَّ وَلَا تَبَرَّجْنَ تَبَرُّجَ الْجَاهِلِيَّةِ الْأُولَىٰ وَأَقِمْنَ الصَّلَاةَ وَآتِينَ الزَّكَاةَ وَأَطِعْنَ اللَّهَ وَرَسُولَهُ ۚ إِنَّمَا يُرِيدُ اللَّهُ لِيُذْهِبَ عَنكُمُ الرِّجْسَ أَهْلَ الْبَيْتِ وَيُطَهِّرَكُمْ تَطْهِيرًا ﴿٣٣﴾

సౌభాగ్యాన్ని ప్రసాదించాడు. ఆ కారణంగా ముస్లిం సమాజంలో మీకొక విశిష్టస్థానం లభించింది. కాబట్టి దైవప్రవక్త (సఅసం) మాదిరిగా మీరు కూడా ముస్లిం సమాజానికి ఓ ఉదాహరణగా ఉండాలి అన్నది దీని భావం. ఆ విధంగా వారికి వారి స్థానాన్ని గుర్తుచేసి, కొన్ని మార్గదర్శక నియమాలు సూచించబడ్డాయి. ప్రత్యక్షంగా ప్రవక్త సతీమణులనుద్దేశించి ఈ ఉపదేశం చేయబడినప్పటికీ, బోధనాతీరును బట్టి అది సమస్త ముస్లిం మహిళావనికి వర్తిస్తుంది. కాబట్టి ముస్లిం మహిళలంతా ఈ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాల్సిందే.

65. ఏ విధంగానయితే దేవుడు స్త్రీ అస్తిత్వంలో పురుషుని కోసం లైంగిక ఆకర్షణను ఉంచాడో, అదేవిధంగా స్త్రీ కంఠస్వరంలో కూడా ఒకలాంటి లావణ్యాన్ని, లాలిత్యాన్ని, సౌకుమార్యాన్ని ప్రకృతిపరంగా పొందుపరచాడు. అది మగాణ్ణి ఇట్టే ఆకట్టుకుంటుంది. అందుకే పర పురుషులతో మాట్లాడవలసి వచ్చినప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా ఎలాంటి మెతకదనాన్ని, వయ్యారాన్ని ఒలకపోయకుండా జాగ్రత్తపడాలనీ, సూటిగా, నిర్ద్వంద్వంగా మాట్లాడాలని ఉపదేశించబడింది.

66. కేవలం సూటిగా మాట్లాడితేనే సరిపోదు. మాట సరైన రీతిలో మాట్లాడాలి. మాట నైతిక పరిధిని దాటకూడదు. మాటల్లో ద్వంద్వార్థాలకు తావుండకూడదు. దైవానికి భయపడి, పరలోక చింతన కలిగి ఉండే సౌశీల్యవతులు దీని ప్రాముఖ్యాన్ని ఇట్టే గ్రహిస్తారు. ఈ నిర్దేశిక నియమాలను ఖచ్చితంగా పాటిస్తారు. కాని ఏ స్త్రీల ఆంతర్యాలలో దైవభక్తి, పరలోక భీతిలేదో వారు ఈ మార్గదర్శక సూత్రాలను ఖాతరు చెయ్యరు.

67. అంటే అవసరం లేకుండానే ఇల్లు వదలి బయటకు రాకండి. గృహపరిధిలోనే స్త్రీకి రక్షణ ఉందనీ, రాజకీయ వ్యవహారాల్లో, ఆర్థిక విషయాల్లో స్త్రీలు అనవసరంగా తలదూర్చరాదని ఈ ఆయతు ద్వారా సంకేతం లభిస్తోంది.

68. ఒకవేళ ఏదేని కారణంపై ఇల్లు వదలి బయటకు రావలసివస్తే ఏవిధంగా మసలు కోవాలో ఇక్కడ తెలియజేయబడింది. అట్టి పరిస్థితిలో సింగారించుకుని వెళ్ళరాదు. తమ అలంకరణ అందరికీ కనిపించేలా తిరగకూడదు. పైగా వారు పరదాను పాటించాలి. షరీయతు సూచించిన శరీర భాగాలను కప్పి ఉంచాలి. బయట తిరుగుతున్నప్పుడు సువాసన పూసుకోరాదు. సాదా సీదా దుస్తులు ధరించి, బురఖాలో నిరాడంబరంగా తిరగాలి. అలంకరణను, సింగారాన్ని ప్రదర్శించుకుంటూ తిరగటం అజ్ఞాన కాలంనాటి పోకడ అని ఖుర్‌ఆన్ స్పష్టపరచింది. ఇస్లాంకు పూర్వం ఈ విధమైన ప్రదర్శన జరిగేది. ఇస్లాం దీనిని నిషేధించింది. కాబట్టి ఇకమీదట ఎవరు, ఎప్పుడు ఈ అజ్ఞాన పోకడకు పాల్పడినా దానికి ఇస్లాంతో ఎలాంటి సంబంధం లేదని తెలుసుకోవాలి.

69. ఇంతకుముందు వచ్చిన ఆదేశాలలో చెడులను విడనాడమని చెప్పబడింది. ఈ ఆదేశాలలో మంచిని చేయమని చెప్పబడింది.

70. **'ప్రవక్త ఇంటివారలు'** అంటే ఎవరెవరు? దీని నిర్ధారణ విషయంలో కాస్త భేదాభిప్రాయం ఉంది. ఖుర్‌ఆన్ నేపథ్యంలో కొందరు 'ప్రవక్త సతీమణులు' అని భావించారు. ఈ ఆయతు ద్వారా ఇదే అర్థం వస్తుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో వేరితర చోట్ల కూడా సతీమణిని ఇంటివారుగా పేర్కొనటం జరిగింది. ఉదాహరణకు హూద్ సూరాలోని 73వ ఆయతు. కాబట్టి "ఇంటివారలు" అన్న పదంలో "ప్రవక్త సతీమణులు" ఇమిడి ఉన్నారన్న దానికి ఖుర్‌ఆన్ వచనమే ప్రబల నిదర్శనం.

وَاذْكُرْنَ مَا يُتْلَىٰ فِي بُيُوتِكُنَّ مِنْ آيَاتِ اللَّهِ
وَالْحِكْمَةِ ۚ إِنَّ اللَّهَ كَانَ لَطِيفًا خَبِيرًا ﴿٣٤﴾

**34** మీ ఇండ్లలో పారాయణం చేయబడే అల్లాహ్‌ ఆయతులను, ప్రవక్త ప్రవచనాలను స్మరించుకుంటూ ఉండండి.[71] నిశ్చయంగా అల్లాహ్‌ మృదుస్వభావి, అన్నీ తెలిసినవాడు.

إِنَّ الْمُسْلِمِينَ وَالْمُسْلِمَاتِ وَالْمُؤْمِنِينَ
وَالْمُؤْمِنَاتِ وَالْقَانِتِينَ وَالْقَانِتَاتِ وَالصَّادِقِينَ
وَالصَّادِقَاتِ وَالصَّابِرِينَ وَالصَّابِرَاتِ وَالْخَاشِعِينَ
وَالْخَاشِعَاتِ وَالْمُتَصَدِّقِينَ وَالْمُتَصَدِّقَاتِ وَالصَّائِمِينَ
وَالصَّائِمَاتِ وَالْحَافِظِينَ فُرُوجَهُمْ وَالْحَافِظَاتِ
وَالذَّاكِرِينَ اللَّهَ كَثِيرًا وَالذَّاكِرَاتِ أَعَدَّ اللَّهُ لَهُمْ
مَغْفِرَةً وَأَجْرًا عَظِيمًا ﴿٣٥﴾

**35** నిశ్చయంగా ముస్లిం పురుషులు – ముస్లిం స్త్రీలు,[72] విశ్వాసులైన పురుషులు – విశ్వాసులైన స్త్రీలు, విధేయులైన పురుషులు– విధేయులైన స్త్రీలు, సత్య సంధులైన పురుషులు – సత్యసంధులైన స్త్రీలు, సహనశీలురైన పురుషులు – సహనవతులైన స్త్రీలు, అణకువ గల పురుషులు – అణకువ గల స్త్రీలు, దాన ధర్మాలు చేసే పురుషులు – దానధర్మాలు చేసే స్త్రీలు, ఉపవాసం ఉండే పురుషులు – ఉపవాసం ఉండే స్త్రీలు, తమ మర్మాంగాలను కాపాడుకునే పురుషులు – కాపాడుకునే స్త్రీలు, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే పురుషులు – స్మరించే స్త్రీలు – వీరందరి కోసం అల్లాహ్‌ (విస్తృతమైన) మన్నింపును, గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు.

అయితే మరికొంతమంది ఇంటివారలు (అహ్లెబైత్‌) అనే పదం హజ్రత్‌ ఫాతిమా, హజ్రత్‌ అలీ, హజ్రత్‌ హసన్‌, హుసైన్‌లకు మాత్రమే వర్తిస్తుందని అంటారు. ప్రవక్త సతీమణులను వారు ఈ పరిధినుంచి తీసేస్తారు. ఈ రెండు అభిప్రాయాలకు నడుమ మధ్యేమార్గం అవలంబించినట్లయితే 'ఇంటివారలు' అన్న పదంలో ఈ ఉభయులూ వచ్చేస్తారు. ఎందుకంటే ప్రవక్త సతీమణులు అహ్లెబైత్‌ పరిధిలోకి వస్తారని ఖుర్‌ఆన్‌ ద్వారా రూఢీ అవుతుండగా, అల్లుడూ, మనవళ్లు అహ్లెబైత్‌కి చెందినవారని ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా నిరూపితమవుతోంది. ఒకసారి దైవప్రవక్త (స) వారిని తన దుప్పటిలోకి తీసుకుని "ఓ అల్లాహ్‌! వీళ్లు నా ఇంటివారలు (కుటుంబీకులు)" అని పలికారు. దీనిభావమేమిటి? వీళ్లు కూడా నా ఇంటివారే అని ఆయన (స) చెప్పదలిచి ఉంటారు లేదా నా సతీమణులను నా ఇంటివారి జాబితాలో చేర్చినట్లు వీళ్ళను కూడా చేర్చు అని ఆయన (స) ప్రార్థించి ఉంటారు. ఈ విధంగా ఈ అంశానికి సంబంధించిన పలు ఆధారాల మధ్య విడదీయరాని బంధం ఏర్పడుతుంది. (మరిన్ని వివరాల కోసం అల్లామా షౌకానీచే విరచితమైన 'ఫత్‌హుల్‌ ఖదీర్‌'ని చూడండి).

71. అంటే – వాటి ప్రకారం ఆచరించండి. అరబీలో **'హిక్మత్‌'** (الحِكْمَة) అని వుంది. హిక్మత్‌ అంటే హదీసులన్నమాట. ఈ ఆయతు ఆధారంగా కొంతమంది విద్వాంసులు ఏమంటారంటే, హదీసు కూడా ఖుర్‌ఆన్‌ మాదిరిగా పుణ్యార్జన సంకల్పంతో చదువవచ్చు. ప్రవక్త సతీమణులు కూడా 'ప్రవక్త ఇంటివారలు' పరిధిలోకి వస్తారన్న దానికి ఈ ఆయతు ప్రబల సాక్ష్యం. ఎందుకంటే దివ్య వాణి ప్రవక్త సతీమణుల ఇండ్లలో అవతరించేది. ముఖ్యంగా ఆయిషా (ర.అన్హా) కుటీరంలో అవతరించేదని హదీసుల ద్వారా తెలుస్తోంది.

72. హజ్రత్‌ ఉమ్మె సలమా (ర.అన్హా) తదితర మహిళలకు ఒక ధర్మసందేహం కలిగింది– అల్లాహ్‌ ప్రతిసారీ పురుషులను సంబోధిస్తూనే ఆదేశాలిస్తాడేమిటీ? మహిళల్ని ఉద్దేశించి ఏమీ సెలవీయడేమిటి? అని. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. (ముస్నదె అహ్మద్‌– 6/301; తిర్మిజీ – నెం.3211). ఈ ఆయతులో మహిళలను ఓదార్చటం జరిగింది. వాస్తవానికి దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆదేశాలన్నీ పురుషులతోపాటు స్త్రీలకు కూడా వర్తిస్తాయి. కొన్నిచోట్ల ప్రత్యేకంగా స్త్రీలకు మాత్రమే వర్తించే ఆదేశాలు కూడా ఉన్నాయి. ఈ ఆయతు ద్వారా విదితమయ్యేదేమిటంటే దైవారాధన విషయంలోగానీ, దైవవిధేయతలోగానీ, పరలోక అంతస్థుల దృష్ట్యాగానీ స్త్రీ–పురుషులలో ఎలాంటి

وَمَا كَانَ لِمُؤْمِنٍ وَّلَا مُؤْمِنَةٍ إِذَا قَضَى اللّٰهُ وَرَسُوْلُهٗٓ
اَمْرًا اَنْ يَّكُوْنَ لَهُمُ الْخِيَرَةُ مِنْ اَمْرِهِمْ ؕ وَمَنْ يَّعْصِ
اللّٰهَ وَرَسُوْلَهٗ فَقَدْ ضَلَّ ضَلٰلًا مُّبِيْنًا ﴿٣٦﴾

**36** (చూడండి) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఏ వ్యవహారం లోనయినా ఒక నిర్ణయం చేసిన తరువాత విశ్వాసులైన ఏ పురుషునికిగానీ, స్త్రీకి గానీ తమకు వర్తించే ఆ వ్యవహారంలో ఎలాంటి స్వయం నిర్ణయాధికారం మిగిలి ఉండదు.[73] ఒకవేళ ఎవరైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే అతను స్పష్టమైన అపమార్గానికి లోనైనట్లే (జాగ్రత్త!).

وَاِذْ تَقُوْلُ لِلَّذِيْٓ اَنْعَمَ اللّٰهُ عَلَيْهِ وَاَنْعَمْتَ
عَلَيْهِ اَمْسِكْ عَلَيْكَ زَوْجَكَ وَاتَّقِ اللّٰهَ وَتُخْفِيْ فِيْ
نَفْسِكَ مَا اللّٰهُ مُبْدِيْهِ وَتَخْشَى النَّاسَ ۚ وَاللّٰهُ
اَحَقُّ اَنْ تَخْشٰىهُ ؕ فَلَمَّا قَضٰى زَيْدٌ مِّنْهَا وَطَرًا

**37** (ఓ ప్రవక్తా! ఆ సందర్భాన్ని కాస్త జ్ఞాపకం చేసుకో) అల్లాహ్ అనుగ్రహించిన వ్యక్తితో, నువ్వు సయితం ఉపకారం చేసినవానితో "నువ్వు నీ భార్యను నీ దగ్గరే ఉండనివ్వు, అల్లాహ్‌కు భయపడు" అని చెప్పేవాడివి. కాని అల్లాహ్ బయటపెట్టాలని ఉన్న ఒక విషయాన్ని నువ్వు నీ మనసులోనే దాచిపెట్టావు. నువ్వు జనులకు భయపడేవాడివి. నిజానికి నువ్వు భయపడటానికి అల్లాహ్‌యే ఎక్కువ హక్కుదారుడు.[74] మరి జైద్ ఆ స్త్రీతో తన లాంఛనాలన్నీ

వ్యత్యాసాలు లేవు. ఇరువురి కోసం ఈ క్షేత్రం సమానంగా తెరువబడివుంది. ఇరువర్గాల వారిలో ఎవరయినాసరే తాము కోరినన్ని సత్కార్యాలు చేసి పుణ్యఫలాన్ని సంపాదించుకోవచ్చు. లింగ ప్రాతిపదికపై ఇక్కడ ఎలాంటి హెచ్చుతగ్గులు చేయబడవు. ముస్లింలను, విశ్వాసులను వేర్వేరుగా ప్రస్తావించటం కూడా గమనించదగిన అంశమే. వారిద్దరిలో కూడా కొంత వ్యత్యాసం ఉంది. విశ్వాస (ఈమాన్) స్థాయి ఇస్లాం స్థాయికన్నా ఉన్నతమైనదని ఖుర్ఆన్ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది.

73. హజ్రత్ జైనబ్ (ర.అన్హా) వివాహం విషయంలో ఈ ఆయతు అవతరించింది. హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి) అరబ్బు జాతీయులే అయినప్పటికీ బాల్యంలో ఎవరో ఆయన్ని పట్టుకుని బలవంతంగా బానిసగా అమ్మేశారు. మహాప్రవక్త (సఅసం) వివాహం హజ్రత్ ఖదీజా (ర.అన్హా)తో జరిగినప్పుడు, ఆమెగారు జైద్‌ను మహాప్రవక్త (స)కు కానుకగా ఇచ్చారు. అప్పుడు మహాప్రవక్త (స) జైద్‌కు బానిసత్వం నుంచి విముక్తిని ఇచ్చి, ఆయన్ని తన పెంపుడు కొడుకుగా చేసుకున్నారు. అంతేకాదు, తన మేనత్త కూతురైన హజ్రత్ జైనబ్ (ర.అన్హా)ను ఆయనకిచ్చి వివాహం జరిపించాలనుకున్నారు. జైనబ్ ఇంటికి వివాహ సందేశం పంపారు. కాని స్వేచ్ఛపొందిన ఒక బానిసతో వివాహం అనేసరికి జైనబ్‌గారు, ఆమె సోదరుడు ఆలోచనలో పడిపోయారు. జైనబ్‌గారు ఉన్నత వంశీయురాలు. ఆ సందర్భంగా ఈ ఆయతు అవతరించింది. దీనిభావం ఏమిటంటే అల్లాహ్, ఆయన ప్రవక్త నిర్ణయం గైకొన్న తరువాత తమ అభిమతాన్ని చెలాయించాలనుకోవటం ఏ ముస్లిం పురుషునికిగానీ, స్త్రీకిగానీ ఎంతమాత్రం తగదు. పైగా వారు దేవుడు, దైవప్రవక్త ఆజ్ఞల ముందు తలవంచాలి. మనస్ఫూర్తిగా వాటిని పాలించాలి. ఈ ఆయతును విన్న తరువాత హజ్రత్ జైనబ్ (ర.అన్హా) తన నిర్ణయాన్ని మార్చుకొని, హజ్రత్ జైద్ (రజి)తో వివాహానికి సుముఖత వ్యక్తం చేశారు. అప్పుడు వారిద్దరి నికాహ్ జరిగింది.

74. ఆ దంపతుల (జైద్ – జైనబ్‌ల) మనసులు కలవలేదు. తాను ఉన్నత వంశస్థురాలన్న భావం ఆమె మదిలో మెదలుతూ ఉండేది. జైద్ (రజి)పై బానిసత్వపు మచ్చ ఉండేది. తత్కారణంగా ఆ కాపురంలో కలతలు రేగాయి. ఆ మాటే తరచూ దైవప్రవక్త (స)కు చెబుతూ ఉండేవారు జైద్. తానామెకు విడాకులివ్వదలచినట్లు కూడా చెప్పేశారు. కాని దైవప్రవక్త (స) ఆయన్ని వారించారు. సర్దుకుపొమ్మని నచ్చజెప్పారు. అయితే అదే సమయంలో ఆ కాపురం ఎంతోకాలం నిలువదనీ, విడాకులు అనివార్యమని, విడాకుల అనంతరం జైనబ్‌తో దైవప్రవక్త (స)కు వివాహం జరిపించనున్నానని దేవుడు 'వహీ' పంపాడు. ఆ విధంగా ముస్లిం సమాజంలో కొనసాగుతూ వస్తున్న ఒక దురాచారాన్ని దేవుడు

زَوَّجْنٰكَهَا لِكَيْ لَا يَكُوْنَ عَلَى الْمُؤْمِنِيْنَ حَرَجٌ فِيْٓ اَزْوَاجِ اَدْعِيَآئِهِمْ اِذَا قَضَوْا مِنْهُنَّ وَطَرًا ؕ وَكَانَ اَمْرُ اللّٰهِ مَفْعُوْلًا ﴿37﴾

పూర్తి చేసిన తరువాత,[75] మేము ఆమె వివాహం నీతో జరిపించాము.[76] దత్తపుత్రులు తమ భార్యల లాంఛనాలన్నీ పూర్తిచేసిన తరువాత[77] (వారికి విడాకులిచ్చిన పిమ్మట) వారి భార్యల (ను వివాహమాడే) విషయంలో ముస్లింలు ఎలాంటి సంకోచానికీ లోనుకాకుండా ఉండేటందుకు మేమిలా చేశాము. అల్లాహ్ ఆజ్ఞ అమలు జరిగి తీరవలసిందే.[78]

مَا كَانَ عَلَى النَّبِيِّ مِنْ حَرَجٍ فِيْمَا فَرَضَ اللّٰهُ لَهٗ ؕ سُنَّةَ اللّٰهِ فِي الَّذِيْنَ خَلَوْا مِنْ قَبْلُ ؕ وَكَانَ اَمْرُ اللّٰهِ قَدَرًا مَّقْدُوْرَا ﴿38﴾

**38** అల్లాహ్ తన ప్రవక్త కోసం నిర్ధారించిన దానిని ప్రవక్త అవలంబించటం ఏ విధంగానూ ఆక్షేపణీయం కాదు.[79] పూర్వం గతించిన వారిలో కూడా దేవుని ఈ సంప్రదాయమే ఉండేది.[80] అల్లాహ్ ఆజ్ఞ నిర్ణీత లక్ష్యాలతో కూడుకున్నదై ఉంటుంది.[81]

నిర్మూలించదలిచాడు. అదేమంటే దత్తపుత్రులను అరబ్బులు కన్నకొడుకులుగా తలపోసేవారు. కాని షరీయతు ప్రకారం దత్తపుత్రులు ఎట్టి పరిస్థితిలోనూ కన్నకొడుకులు కాజాలరు. దత్తపుత్రుల భార్యలు కోడళ్లు కాజాలరు. దత్తపుత్రులు విడాకులు ఇచ్చిన స్త్రీలను వివాహమాడటంలో సంకోచించాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని ముస్లిం సమాజం ముందు తేటతెల్లం చేసే ఉద్దేశంతో అల్లాహ్ ఈ పరిణామాలను ఉత్పన్నం చేశాడు. దైవసంకేతం అందిన కొన్నాళ్ళకే హజ్రత్ జైద్ (రజి) తన భార్యకు విడాకులిచ్చేశారు.

హజ్రత్ జైద్ (రజి)పై అల్లాహ్ దయదలిచాడనటంలోని మర్మం ఏమిటంటే ఆయనకు ఇస్లాం స్వీకారభాగ్యాన్ని ప్రసాదించాడు. బానిస చెరనుంచి విముక్తిని వొసగాడు. ఇక దైవప్రవక్త (స) ఆయనకు చేసిన ఉపకారం ఏమిటంటే, ఆయనకు బానిసత్వం నుంచి స్వేచ్ఛను ప్రసాదించి, తన పెంపుడు కొడుకుగా చేసుకున్నారు. ఆయనకు ధార్మిక శిక్షణనిచ్చి, ఆయన జీవితాన్ని తీర్చిదిద్దారు. అంతేకాదు, స్వయాన తన మేనత్త ఉమైమాగారి పుత్రికతో ఆయన పెండ్లి జరిపించారు. కాని అనుకోని పరిణామాలు చోటు చేసుకున్నాయి. విడాకులు అనివార్యమయ్యాయి. అయితే ఈ పరిణామాల వెనుక దైవప్రణాళిక మరో విధంగా ఉంది.

విడాకుల అనంతరం జైనబ్‌తో దైవప్రవక్త (స) వివాహం జరిపించినట్లు దేవుడు సూచించాడు. కాని ఈ విషయాన్ని వ్యక్తపరచటానికి దైవప్రవక్త (స) తాత్సారం చేశారు. తాను తన కోడలిని వివాహమాడారని జనులు ఎక్కడ నిందిస్తారోనని ఆయన భయపడేవారు. (కాని దేవుడు తలచినది ఇంకొకటి. ఈ సంఘటన ద్వారా దేవుడు పాత ఆచారాన్ని శాశ్వతంగా రూపుమాప దలిచాడు). అలా భయపడటం సహజమే. కాని జనులకు భయపడి దైవనిర్ణయాన్ని దాచి ఉంచటం సరికాదని అల్లాహ్ తన ప్రవక్తను సున్నితంగా మందలించాడు.

75. అంటే హజ్రత్ జైద్ తన భార్యకు విడాకులిచ్చిన తరువాత, ఆమె ఇద్దత్ కాలం పూర్తిచేసిన మీదట....

76. అంటే సుప్రసిద్ధ నికాహ్ పద్ధతికి భిన్నంగా దైవాదేశంపై వారిరువురి (దైవప్రవక్త – జైనబ్‌ల) నికాహ్ జరిగిపోయింది. అంటే నికాహ్ సదనం, సాక్షులు, సంరక్షకులు, మహర్ చెల్లింపు లాంటివి ఏమీ లేకుండానే వివాహం జరిగిపోయింది.

77. ఈ వివాహం తరువాత ముస్లిం సమాజంలో ఎవరూ తమ దత్తపుత్రులు విడాకులిచ్చిన స్త్రీలను వివాహమాడటంలో సందిగ్ధానికి లోనుకావలసిన అవసరం లేదు. ఈ వివాహం ధర్మసమ్మతమే అని అల్లాహ్ తేటతెల్లం చేయదలిచాడు.

78. అంటే దేవుడు ఈ మేరకు రాసిపెట్టాడు. అది అమల్లోకి రాకుండా ఎవరూ అడ్డుకోలేరు.

79. జైనబ్ (ర.అన్హా)తో దైవప్రవక్తకు జరిగిన వివాహాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ ఆయతు అవతరించింది. ఈ వివాహం ధర్మబద్ధంగా జరిగింది. అందువల్ల దైవప్రవక్త (స) ఇందులో సంకోచానికి, తడబాటుకు లోనుకావలసిన అవసరం ఎంతమాత్రం లేదు.

**39** వారంతా (దైవప్రవక్తలంతా) అల్లాహ్ సందేశాలను అందజేసే వారు. అల్లాహ్‌కు మాత్రమే భయపడేవారు. అల్లాహ్‌కు తప్ప వేరొకరికి భయపడేవారు కారు.[82] లెక్క తేల్చటానికి అల్లాహ్ ఒక్కడే చాలు.[83]

الَّذِينَ يُبَلِّغُونَ رِسٰلٰتِ اللّٰهِ وَيَخْشَوْنَهٗ وَلَا
يَخْشَوْنَ اَحَدًا اِلَّا اللّٰهَ ۗ وَكَفٰى بِاللّٰهِ حَسِيْبًا ﴿39﴾

**40** (ప్రజలారా!) ముహమ్మద్ (సఅసం) మీ మగవారిలో ఎవరికీ తండ్రికాదు.[84] అయితే ఆయన అల్లాహ్ యొక్క సందేశహరుడు. ప్రవక్తల పరంపరను పరిసమాప్తం చేసే (చివరి) వాడు.[85] అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు.

مَا كَانَ مُحَمَّدٌ اَبَآ اَحَدٍ مِّنْ رِّجَالِكُمْ وَلٰكِنْ
رَّسُوْلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ ۗ وَكَانَ اللّٰهُ بِكُلِّ شَيْءٍ
عَلِيْمًا ﴿40﴾

80. గత కాలపు ప్రవక్తలు కూడా ఇలాంటి విషయాలలో సందిగ్ధానికి లోనయ్యేవారు కాదు. అల్లాహ్ తరపున విధించబడిన పనిని వారు నిస్సంకోచంగా చేసేవారు. ఒకవేళ ఆ పని ఆనాటి ఆచార సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నా వారు జనులకు భయపడేవారు కారు.

81. దైవాదేశాలు యుక్తితో, పరమార్థంతో కూడుకుని ఉంటాయి. ప్రాపంచిక చక్రవర్తుల ఆదేశాల మాదిరిగా అవి తాత్కాలిక ప్రయోజనాల్ని ఆశించేవై ఉండవు.

82. అందుకే వారు దైవసందేశాన్ని అందించే సమయంలో ఒకరి ఆక్షేపణలకు వెరవకుండా, నిందలను లెక్క చేయకుండా సూటిగా వ్యవహరిస్తారు. పరిస్థితుల ప్రభావానికి లోనై ఒకరితో రాజీపడటం ప్రవక్తల విధానం కాదు.

83. దేవుడు తన శక్తియుక్తుల రీత్యా, జ్ఞానం రీత్యా సర్వత్రా ఉన్నాడు. అందువల్ల తన దాసులకు సహాయపడటానికి ఆయన ఒక్కడే చాలు. దైవసందేశ ప్రచార కార్యక్రమంలో ఎదురయ్యే అవరోధాలను ఆయన తొలగిస్తాడు. శత్రువుల కుటిల పన్నాగాల నుంచి, దుష్ట సంకల్పాల బారి నుంచి ఆయన వారిని కాపాడుతాడు.

84. కాబట్టి ఆయన (సఅసం) జైద్ బిన్ హారిసాకు కూడా తండ్రి కారు. ఒక్క జైద్ (రజి)కే కాదు, ఏ మగవానికి కూడా ఆయన తండ్రి కారు. వాస్తవానికి జైద్ (రజి) హారిసా కుమారులు. కాకపోతే దైవప్రవక్త (స) ఆయన్ని తన దత్తపుత్రునిగా చేసుకున్నారు. అందువల్ల అజ్ఞానకాలపు ఆచారం ప్రకారం ప్రజలు ఆయన్ని జైద్ బిన్ ముహమ్మద్ (స) అని పిలిచేవారు. అంతమాత్రం చేత ఆయన ప్రవక్తకు కన్న కొడుకు కాలేరు కదా! "దత్తపుత్రులను వారి తండ్రుల సంబంధంతోనే పిలవండి" అన్న ఆయతు అవతరించిన తరువాత ప్రజలు ఆయన్ని మళ్లీ జైద్ బిన్ హారిసా అనే పిలువసాగారు. అదలా వుంచితే దైవప్రవక్త (స)కు హజ్రత్ ఖదీజా (ర.అన్‌హా) ద్వారా ఖాసిమ్, తాహిర్, తయ్యిబ్ అనే ముగ్గురు మగపిల్లలు పుట్టారు. మారియా ఖిబ్తియా (ర.అన్‌హా) ద్వారా ఇబ్రాహీం అనే అబ్బాయి పుట్టాడు. కాని వీళ్ళంతా బాల్యంలోనే మరణించారు. వారిలో ఎవరూ యుక్తవయస్సుకు చేరలేదు. చెప్పవచ్చిందేమంటే ఆయన పిల్లల్లో ఎవరూ అబ్బాయిలు లేరు – ఆయన్ని తండ్రీ అని పిలవటానికి (ఇబ్నె కసీర్).

85. **'ఖాతమున్'** (خاتم) అంటే అసలు 'ముద్ర' అని అర్థం. ముద్ర అనేది ఒకానొక ప్రక్రియ పూర్తయ్యాక పడుతుంది. ముద్రపడిన తరువాత ఆ పని అన్ని విధాలా పూర్తయినట్లే లెక్క. అంటే ఆయన (సఅసం) రాకతో దైవదౌత్యపరంపరకు సీలు పడిపోయింది. కనుక మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తరువాత ఎవరయినా తనను దైవప్రవక్తగా ప్రకటించుకుంటే అతను చాలా పెద్ద అబద్ధం చెప్పినట్లు లెక్క. హదీసులలో ఈ విషయం సవివరంగా చర్చించబడింది. యావత్తు ముస్లిం సమాజం ఈ విషయంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రళయదినానికి ముందు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) దిగివస్తారని ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. అయితే ఆయన ఒక ప్రవక్తగా కాకుండా, మహాప్రవక్త ముహమ్మద్ (స) అనుచర సమాజ సభ్యునిగా మాత్రమే వస్తారు. కాబట్టి ఈసా (అలైహిస్సలాం) రాక దైవదౌత్య పరిసమాప్తి సిద్ధాంతానికి విరుద్ధమైనది కాదు.

**41** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اذْكُرُوا اللّٰهَ ذِكْرًا كَثِيْرًا ﴿41﴾

**42** ఉదయం, సాయంకాలం ఆయన పవిత్రతను కొనియాడండి.

وَّسَبِّحُوْهُ بُكْرَةً وَّاَصِيْلًا ﴿42﴾

**43** మీపై తన కరుణానుగ్రహాలను పంపేవాడు ఆయనే. ఇంకా ఆయన దూతలు కూడా(మీపై కారుణ్యం కురవాలని ప్రార్థిస్తారు)– ఆయన మిమ్మల్ని చీకట్ల నుంచి వెలికితీసి వెలుగు వైపుకు తీసుకు వచ్చేటందుకు! అల్లాహ్ విశ్వాసుల పాలిట అపార కరుణా మయుడు.

هُوَ الَّذِيْ يُصَلِّيْ عَلَيْكُمْ وَمَلٰٓئِكَتُهٗ لِيُخْرِجَكُمْ
مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوْرِ ۭ وَكَانَ بِالْمُؤْمِنِيْنَ
رَحِيْمًا ﴿43﴾

**44** వారు ఆయన్ని (అల్లాహ్‌ను) కలుసుకున్న రోజున, వారికి 'సలాం'తో స్వాగత సత్కారాలు లభిస్తాయి.[86] వారి కోసం అల్లాహ్ గౌరవప్రదమైన పుణ్యఫలాన్ని సిద్ధం చేసి ఉంచాడు.

تَحِيَّتُهُمْ يَوْمَ يَلْقَوْنَهٗ سَلٰمٌ ښ وَاَعَدَّ لَهُمْ اَجْرًا
كَرِيْمًا ﴿44﴾

**45** ఓ ప్రవక్తా! నిశ్చయంగా మేమే నిన్ను (ప్రవక్తగా ఎన్నుకుని) సాక్ష్యమిచ్చేవానిగా,[87] శుభవార్తలు వినిపించేవానిగా, హెచ్చరించే వానిగా చేసి పంపాము.

يٰٓاَيُّهَا النَّبِيُّ اِنَّآ اَرْسَلْنٰكَ شَاهِدًا وَّمُبَشِّرًا
وَّنَذِيْرًا ﴿45﴾

**46** ఇంకా – అల్లాహ్ ఆజ్ఞచే ఆయన వైపుకు పిలిచేవానిగా, వెలుగును విరజిమ్మే దీపంగా[88] (చేసి పంపాము).

وَّدَاعِيًا اِلَى اللّٰهِ بِاِذْنِهٖ وَسِرَاجًا مُّنِيْرًا ﴿46﴾

**47** విశ్వసించిన వారికి అల్లాహ్ తరఫున గొప్ప అనుగ్రహం ఉందన్న శుభవార్తను నువ్వు వారికి వినిపించు.

وَبَشِّرِ الْمُؤْمِنِيْنَ بِاَنَّ لَهُمْ مِّنَ اللّٰهِ فَضْلًا
كَبِيْرًا ﴿47﴾

**48** అవిశ్వాసుల, వంచకుల మాట వినకు. (వారి తరఫున జరిగే) వేధింపులను లెక్కచేయకు. అల్లాహ్‌నే నమ్ముకో. కార్య సాధకునిగా అల్లాహ్ (ఒక్కడే) చాలు.

وَلَا تُطِعِ الْكٰفِرِيْنَ وَالْمُنٰفِقِيْنَ وَدَعْ اَذٰىهُمْ
وَتَوَكَّلْ عَلَى اللّٰهِ ۭ وَكَفٰى بِاللّٰهِ وَكِيْلًا ﴿48﴾

86. అంటే, స్వర్గంలో దైవదూతలు విశ్వాసులకు సలాం చేసి స్వాగతం పలుకుతారు. లేదా విశ్వాసులు పరస్పరం సలాం చెప్పుకుంటారు.

87. కొంతమంది **'సాక్షి'** (షాహిద్) అనే పదాన్ని ప్రత్యక్షమై ఉండేవాడు, చూస్తూ ఉండేవాడు అన్న అర్థాల్లో తీసుకున్నారు. ఇది సరైనది కాదు. (అసలు అర్థం ఏమిటంటే) దైవప్రవక్త (స) తన అనుచర సమాజం కొరకు సాక్షిగా ఉంటారు. తనను విశ్వసించిన వారికోసం, తనను ధిక్కరించిన వారి కోసం కూడా సాక్షిగానే ఉంటారు. ప్రళయదినాన ఆయన (సఅసం) విశ్వాసులను, 'వుజూ'తో తడిసిన వారి శరీర భాగాల ఆధారంగా గుర్తుపడతారు. అదేవిధంగా ఆయన ఇతర ప్రవక్తల కర్తవ్య నిర్వహణను గురించి సాక్ష్యమిస్తూ, వారు తమ బాధ్యతను సజావుగా నిర్వర్తించారని చెబుతారు. అల్లాహ్ వొసగిన వాస్తవిక పరిజ్ఞానం ఆధారంగా ఆయన (స) ఈ సాక్ష్యం ఇస్తారు. అంతేగాని ఆ ప్రవక్తలందరినీ తన కళ్ళతో చూసినందున కాదు.

88. దీపపు వెలుగు ద్వారా చీకట్లు ఎలా దూరమవుతాయో అలాగే ఆయన (సఅసం) కృషి ద్వారా అవిశ్వాసం,

**49** ఓ విశ్వాసులారా! మీరు విశ్వాసులైన స్త్రీలను వివాహమాడినపుడు, వారిని తాకకముందే మీరు వారికి విడాకులిస్తే, అట్టి పరిస్థితిలో మీరు లెక్కించే గడువు కాలం (ఇద్దత్) పూర్తిచేయమని వారిని కోరే అధికారం మీకు లేదు.[89] కాబట్టి వారికి ఎంతో కొంత ముట్టజెప్పి[90] ఉత్తమ రీతిలో సాగనంపండి.[91]

يَآأَيُّهَا الَّذِينَ آمَنُوٓا إِذَا نَكَحْتُمُ الْمُؤْمِنَاتِ ثُمَّ طَلَّقْتُمُوهُنَّ مِنْ قَبْلِ أَنْ تَمَسُّوهُنَّ فَمَا لَكُمْ عَلَيْهِنَّ مِنْ عِدَّةٍ تَعْتَدُّونَهَا ۖ فَمَتِّعُوهُنَّ وَسَرِّحُوهُنَّ سَرَاحًا جَمِيلًا ﴿٤٩﴾

**50** ఓ ప్రవక్తా! నువ్వు మహర్ సొమ్మును చెల్లించిన నీ భార్యలను నీ కోసం ధర్మ సమ్మతం చేశాము.[92] ఇంకా – విజయ ప్రాప్తిగా అల్లాహ్ నీకు ప్రసాదించిన బానిస స్త్రీలను,[93] నీతోపాటు వలస

يَآأَيُّهَا النَّبِيُّ إِنَّآ أَحْلَلْنَا لَكَ أَزْوَاجَكَ الّٰتِيٓ آتَيْتَ أُجُورَهُنَّ وَمَا مَلَكَتْ يَمِينُكَ مِمَّآ أَفَآءَ اللَّهُ عَلَيْكَ

బహుదైవోపాసనా చీకట్లు తొలగిపోయాయి. ఈ దీపం ప్రళయదినం వరకూ తన వెలుగును విరజిమ్ముతూ ఉంటుంది. దీన్నుంచి ఎవరెంత జ్యోతిని పొందదలచుకుంటే అంతగా పొందవచ్చు.

89. వివాహమాడిన స్త్రీలతో సమాగమం జరిపిన తరువాత విడాకులిస్తే, విడాకులిచ్చే సమయానికి వారు పడచువారుగానే ఉంటే – అట్టి పరిస్థితిలో – వారి గడువు (ఇద్దత్) కాలం మూడు రుతువులు (అల్ బఖర – 228). అయితే ఈ ఆయతులో వివాహమాడిన తరువాత భర్తతో సంభోగం జరపని స్త్రీల గురించి చెప్పబడింది. అలాంటి స్త్రీలకు గనక విడాకులిస్తే వారిపై ఇద్దత్ ఆంక్షలు ఉండవు. ఆ స్థితిలో విడాకులు పొందిన స్త్రీలు ఎలాంటి నిరీక్షణ చేయకుండా వెంటనే వివాహం చేసుకోవచ్చు. అయితే సమాగమం జరపకముందే భర్త మరణించిన పక్షంలో ఆమె పూర్తిగా నాలుగు మాసాల పదిరోజులు ఇద్దత్ (గడువు) పూర్తిచేయాల్సి ఉంటుంది (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్). ముట్టుకోవటం అన్నా, చేత్తో తాకటం అన్నా – ఇవన్నీ సంభోగం నేపథ్యంలో చెప్పబడినవే. **'నికాహ్'** అనే పదం ఇక్కడ వివాహ ఒప్పందం అనే భావంలో ఉంది. అందుకే నికాహ్‌కు ముందు తలాఖ్ ప్రసక్తే రాదని ఈ ఆయతు ద్వారా స్పష్టంగా విదితమవుతోంది. ఎట్టి పరిస్థితిలోనూ వివాహం జరిగిన తరువాతే విడాకుల ప్రసక్తి వస్తుంది. కనుక ఎవరయినా 'నేను ఫలానా స్త్రీని వివాహమాడిన తరువాత ఆమెకు తలాఖ్ ఇచ్చినట్లే' అని నోటితో ప్రకటిస్తే, అది తలాఖ్ ఇచ్చినట్లు కాదు. అలాగే ఎవరయినా 'నేను ఏ స్త్రీని వివాహమాడినాసరే, వివాహమాడిన పిదప ఆమెకు విడాకులిచ్చినట్లే'నని అర్థంలేని ప్రకటన చేసినంత మాత్రాన విడాకులు కావు. కొంతమంది ధర్మవేత్తలు (ఫుకహా) ఈ మాట మూలంగా కూడా "విడాకులు అయిపోతాయి" అని తమదైన భాష్యం చెప్పుకు వచ్చారు. కాని ఇది సరైనది కాదు. దైవవాక్యాలతో, దేవుని షరీయతుతో చెలగాటమాడే ప్రయత్నం చేయరాదని గట్టిగా తాకీదు చేయబడింది. హదీసులో ఇలా ఉంది: "నికాహ్‌కు ముందు తలాఖ్ (విడాకుల) ప్రసక్తే లేదు" (ఇబ్ను మాజ). మరో హదీసులో ఇలా అనబడింది: ఆదం పుత్రుడు ఏ వస్తువుకు యజమాని కాడో దానిపై అతనికి తలాఖ్ అధికారం లేదు (అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్నెమాజ, ముస్నదె అహ్మద్ – 2/189). నికాహ్‌కు పూర్వం తలాఖ్ అనేది ఒక వెకిలిచేష్ట అనీ, షరీయతులో దానికెలాంటి స్థానమూ లేదని ఈ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది.

90. దీన్ని ముత్అ అంటారు. మహర్ ముందుగానే నిర్ణయించబడి వున్న పక్షంలో సగం మహర్ ఇవ్వవలసి ఉంటుంది. ఒకవేళ మహర్ నిర్ణయించబడని పక్షంలోనైతే తమ స్థోమతను బట్టి ఎంతో కొంత ఇచ్చి సాగనంపాలి.

91. అంటే వారిని భయపెట్టడంగానీ, వేధించటంగానీ చేయకుండా, వారిని నలుగురిలో నవ్వులపాలు చేసే ప్రయత్నం చేయకుండా సగౌరవంగా సెలవు ఇవ్వాలి. వీలైతే వారికి కొంత ఆర్థిక సహాయంగానీ, లేదా కానుకల రూపేణా ఏదైనా ఇచ్చిగానీ వదలిపెట్టాలి.

92. కొన్ని షరీయతు ఆదేశాలలో దైవప్రవక్త (స)కు ప్రత్యేకత వొసగబడింది. ఉదాహరణకు: తహజ్జుద్ నమాజు ఆయన (స) కొరకు విధి (ఫర్జ్)గా చేయబడిందని పండితుల్లో ఒక వర్గం అభిప్రాయపడుతోంది. అలాగే దానధర్మాలు పుచ్చుకోవటం ఆయన (స) కొరకు నిషేధించబడింది. అలాగే ఆయన (స)కు మాత్రమే వర్తించే మరికొన్ని ప్రత్యేక

వచ్చిన[94] నీ పినతండ్రి, పెత్తండ్రి కుమార్తెలను, నీ మేనత్తల పుత్రిక
లను, నీ మేనమామ కూతుళ్ళను, నీ పిన్నమ్మ, పెద్దమ్మల కుమార్తె
లను కూడా నీకు ధర్మసమ్మతం చేశాము. మరి విశ్వసించిన ఒక
స్త్రీ తనను తాను దైవప్రవక్తకు అర్పించుకోదలిస్తే– అట్టి పరిస్థితిలో
దైవ ప్రవక్త కూడా ఆమెను పెండ్లాడదలిస్తే[95]– పెండ్లాడవచ్చు.
(ఓ ప్రవక్తా!) ఈ మినహాయింపు విశ్వాసులందరికీ కాకుండా
నీకొక్కనికే ప్రత్యేకం.[96] సాధారణ ముస్లింలకు వారి భార్యల, వారి
బానిస స్త్రీల విషయంలో ఏ ఏ ఆదేశాలను నిర్ధారించి ఉన్నామో
మాకు బాగా తెలుసు.[97] నీకెలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండే
టందుకే[98] (మేము నీకు ప్రత్యేక రాయితీలు ప్రకటించాము).
అల్లాహ్ ఎంతగానో క్షమించేవాడు, మరెంతగానో కరుణించే
వాడు.

وَبَنٰتِ عَمِّكَ وَبَنٰتِ عَمّٰتِكَ وَبَنٰتِ خَالِكَ وَبَنٰتِ
خٰلٰتِكَ الّٰتِيْ هَاجَرْنَ مَعَكَ ؗ وَامْرَاَةً مُّؤْمِنَةً اِنْ
وَّهَبَتْ نَفْسَهَا لِلنَّبِيِّ اِنْ اَرَادَ النَّبِيُّ اَنْ يَّسْتَنْكِحَهَا ۗ
خَالِصَةً لَّكَ مِنْ دُوْنِ الْمُؤْمِنِيْنَ ؕ قَدْ عَلِمْنَا
مَا فَرَضْنَا عَلَيْهِمْ فِيْۤ اَزْوَاجِهِمْ وَمَا مَلَكَتْ
اَيْمَانُهُمْ لِكَيْلَا يَكُوْنَ عَلَيْكَ حَرَجٌ ؕ وَكَانَ اللّٰهُ
غَفُوْرًا رَّحِيْمًا ﴿50﴾

ఆజ్ఞలను దివ్య ఖుర్‌ఆన్ పేర్కొంది. వాటిలో నికాహ్ విషయం కూడా ఉంది. ఆయన (స) 'మహర్' సొమ్మును చెల్లించిన స్త్రీలు – వారెందరయినాసరే – ఆయన కొరకు ధర్మసమ్మతమే. యుద్ధ ఖైదీలుగా వచ్చిన హజ్రత్ సఫియా (ర.అ), హజ్రత్ జువైరియా (ర.అ)లను ఆయన విడుదల చేసి దాన్నే 'మహర్'గా ఖరారు చేశారు. మిగిలిన భార్యలందరికీ నగదు రూపంలో మహర్ చెల్లించారు. ఒక్క ఉమ్మె హబీబా (ర.అన్‌హా) మహర్‌ను మాత్రం నజాషీ చక్రవర్తి తన తరఫున చెల్లించాడు.

93. హజ్రత్ సఫియా, హజ్రత్ జువేరియా విజయ ప్రాప్తిగా ఆయన (స) వాటాలోకి రాగా, ఆయన (స) వారిద్దరికీ స్వేచ్ఛను ప్రసాదించి, నికాహ్ చేసుకున్నారు. రైహానా (ర.అన్‌హా), మారియా ఖిబ్తియా (ర.అన్‌హా)లు బానిస స్త్రీలుగా ఆయన స్వాధీనంలోకి వచ్చారు.

94. 'నీతోపాటు వలస వచ్చిన స్త్రీలు' అంటే మక్కా నుంచి మదీనాకు దైవమార్గంలో హిజ్రత్ చేసినవారని భావం. నిజానికి దైవప్రవక్త (స) వెంట వారెవరూ హిజ్రత్ చేయలేదు. వారంతా తరువాత వచ్చినవారే.

95. తనను తాను దైవప్రవక్తకు 'హిబా' చేసుకోవటానికి (తనను సమర్పించుకోవటానికి) ఏ ముస్లిం స్త్రీ అయినా ముందుకు వస్తే, దైవప్రవక్త (స) కూడా ఆమెను వివాహ మాడటానికి సుముఖంగా ఉన్నపక్షంలో – మహర్ చెల్లించకుండానే – ఆమెను వివాహమాడటానికి దైవప్రవక్త (స)కు అనుమతి ఇవ్వబడింది.

96. ఈ రకమయిన అనుమతి ఒక్క దైవప్రవక్త (స)కు మాత్రమే పరిమితం, ప్రత్యేకం. ఈ ఆదేశం సాధారణ ముస్లింలకు వర్తించదు. సాధారణ ముస్లింలు ఏ స్త్రీని వివాహమాడదలచినా మహర్‌ను విధిగా చెల్లించాల్సిందే.

97. అంటే – నికాహ్ విషయంలో మేము సాధారణ ముస్లింలపై కొన్ని ఆంక్షలను నిర్ధారించాము. ఉదాహరణకు: ముస్లిం పురుషులు ఏకకాలంలో నలుగురు మహిళలకు మించి తమ వివాహబంధంలో ఉంచలేరు. అలాగే వారు ఎవరిని వివాహమాడినా దానికోసం మహిళ తరఫు నుంచి ఒక వ్యక్తి వలీ (సంరక్షకుడు)గా ఉండాలి. ఇద్దరు సాక్షులుండాలి. అయితే ధర్మబద్ధంగా స్వాధీనంలోకి వచ్చిన బానిస స్త్రీల సంఖ్యపై మాత్రం ఎలాంటి పరిమితి లేదు. కాని ప్రస్తుతం బానిస స్త్రీల సమస్యే లేదు.

98. ప్రవక్త (స) పట్ల అవలంబించబడిన సడలింపుల వైఖరికి కారణం ఇక్కడ తెలుపబడింది. ఆనాటి పరిస్థితుల దృష్ట్యా, ఉమ్మత్‌కు (ముస్లిం సమాజానికి) ఒనగూడ వలసివున్న ఇతోధిక ప్రయోజనాల దృష్ట్యా దేవుడు తన ప్రవక్తకు ఈ వెసులుబాటును కల్పించాడు.

تُرْجِىْ مَنْ تَشَآءُ مِنْهُنَّ وَتُـْٔوِىْۤ اِلَيْكَ مَنْ تَشَآءُ ؕ
وَمَنِ ابْتَغَيْتَ مِمَّنْ عَزَلْتَ فَلَا جُنَاحَ عَلَيْكَ ؕ ذٰلِكَ
اَدْنٰۤى اَنْ تَقَرَّ اَعْيُنُهُنَّ وَلَا يَحْزَنَّ وَيَرْضَيْنَ
بِمَاۤ اٰتَيْتَهُنَّ كُلُّهُنَّ ؕ وَاللّٰهُ يَعْلَمُ مَا فِىْ قُلُوْبِكُمْ ؕ
وَكَانَ اللّٰهُ عَلِيْمًا حَلِيْمًا ﴿51﴾

**51** (ఓ ముహమ్మద్‌-స! వంతుల విషయంలో) వారిలో నువ్వు కోరినవారిని దూరంగా ఉంచవచ్చు. నువ్వు కోరినవారిని నీ దగ్గర ఉంచుకోవచ్చు.[99] ఒకవేళ నువ్వు దూరంగా ఉంచిన వారిలో కూడా ఎవరినయినా నువ్వు నీ దగ్గరకు పిలుచుకుంటే నీపై ఏ దోషమూ లేదు.[100] దీనిద్వారా వారి కళ్లు చల్లబడతాయనీ, వారు ఆవేదన చెందకుండా ఉంటారనీ, నువ్వు వారికి ఏది ఇచ్చినా దానిపై వారంతా సంతృప్తి చెందుతారని ఎక్కువగా ఆశించ వచ్చు.[101] మీ హృదయాలలో ఏముందో అల్లాహ్‌కు (బాగా) తెలుసు.[102] అల్లాహ్‌ అన్నీ తెలిసినవాడు, సహనశీలుడు.

99. ఆయన (సఅసం) గారి ఇంకొక ప్రత్యేకత కూడా ఈ ఆయతులో తెలుపబడింది. అదేమిటంటే భార్యల మధ్య వంతులను నిర్థారించటంలో ఆయన (స)కు స్వేచ్ఛాధికారం వొసగబడింది. ఏ భార్య వంతునైనా ఆయన (స) కొంతకాలం పాటు వాయిదా వేయదలిస్తే వేయవచ్చు. అంటే ఆమెను తన వివాహబంధంలోనే ఉంచి, ఆమెతో సమాగమం జరపకుండా ఉండవచ్చు. అలాగే తాను కోరిన భార్యతో సమాగమం జరపవచ్చు.

100. అంటే, ఆయన (స) తాత్కాలికంగా దూరంగా ఉంచిన భార్యలలో ఎవరినయినాసరే తానిష్టపడ్డప్పుడు తన దగ్గరకు పిలుచుకుని ఆమెతో సమాగమం జరపవచ్చు.

101. వంతుల నిర్ధారణలో ఆయన (స)కు పూర్తి స్వేచ్ఛ వొసగబడినప్పటికీ ఆయన భార్యలు సంతోషంగానే ఉంటారనీ, దుఃఖితులు అవరనీ, దైవప్రవక్త (స) వారికి ఇచ్చే దానిపై వారు సంతోషిస్తారని ఆశించబడింది. ఎందుకు? ఎందుచేతనంటే దైవప్రవక్త (స) ఏం చేసినా తన మనోవాంఛలతో నిమిత్తం లేకుండా దైవేచ్ఛ ప్రకారమే చేస్తారన్న సంగతి వారికి తెలుసు. దైవేచ్ఛపై వారంతా సంతుష్టులై ఉన్నారు.

ఈ వాక్యం నేపథ్యంలో మరికొంతమంది వ్యాఖ్యాతలు ఇలా అభిప్రాయపడ్డారు : "దేవుని తరఫున ఈ నిర్ణయాధికారం లభించినప్పటికీ దైవప్రవక్త (స) దాన్ని ఉపయోగించుకోలేదు – ఒక్క సౌదా (ర.అన్‌హా) విషయంలో తప్ప! హజ్రత్‌ సౌదా (ర.అన్‌హా) గారైనా ఇష్టపూర్వకంగా తన వంతును హజ్రత్‌ ఆయిషా (ర.అన్‌హా)కు కానుకగా ఇచ్చుకున్నారు. ఆయన (స) మాత్రం తన సతీమణుల వంతులను ఖచ్చితంగా నిర్ధారించి, శాయశక్తులా దానికి కట్టుబడి ఉండేవారు. అయితే మరణానికి కొన్ని రోజుల ముందు తీవ్రంగా వ్యాధిగ్రస్తులైనపుడు మాత్రం భార్యలందరి సమ్మతిపై ఆయిషా (ర.అన్‌హా) దగ్గరే ఉండిపోయారు. ఆయన (స) గారి ఈ న్యాయశీలతపై ఆయన సతీమణులు సంతోషపడ్డారు. వంతుల నిర్ధారణలో ఆయన (స)కు దేవుడు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ దాన్ని ఆయన అవలంబించలేదు. సతతం ఆయన (స) భార్యల మనసులను జయించి, వారందరినీ సుఖపెట్టడానికే ప్రయత్నించారు.

102. భార్యలందరిపట్ల సమానమైన ప్రేమ మనసులో ఉండదన్న సంగతి దైవానికి తెలుసు. మనిషి భౌతికంగా భార్యలందరికీ వారి హక్కులను సమానంగా ఇచ్చినప్పటికీ మానసికంగా కొందరి వైపు అధికంగా మొగ్గుతాడు. ఉదాహరణకు : అన్న వస్త్రాలను సమకూర్చటంలో, వసతి సౌకర్యం కల్పించటంలో, వారి ఇతర జీవనావసరాలను సరఫరా చేయటంలో సమానంగా వ్యవహరించటం సంభవమే. కాని మనసుపై అదుపు అతని వల్ల సాధ్యం కాదు. అందుకే దేవుడు ఈ మానసిక దౌర్బల్యాన్ని తీవ్రంగా పరిగణించటం లేదు. అందుకే మహనీయ ముహమ్మద్‌ (సఅసం) వారు తరచూ ఇలా వేడుకునేవారు : "అల్లాహ్‌! నా అధీనంలో వున్న విషయాన్ని నేను (న్యాయంగానే) విభజించాను. మరి దేనిపై నీకు అదుపు అధికారం ఉన్నాయో దానిపై నాకు అదుపు లేదు. ఈ విషయంలో నన్ను నిందార్హునిగా చేయకు" (అబూ దావూద్‌, తిర్మిజీ, నసాయి, ఇబ్ను మాజ, ముస్నదె అహ్మద్‌ – 6/144).

**52** ఇక దీని తరువాత, వేరితర స్త్రీలు నీ కొరకు ధర్మసమ్మతం కారు. వీరికి బదులుగా ఇతర స్త్రీలను భార్యలుగా చేసుకోవటం కూడా నీకు సమ్మతం కాదు – వారి అందచందాలు నీకు ఎంత నచ్చినాసరే![103] అయితే (విజయ ప్రాప్తిగా) నీ స్వాధీనంలోకి వచ్చినవారైతే అది వేరేవిషయం.[104] అల్లాహ్ అన్నింటినీ కనిపెట్టు కుని ఉన్నాడు సుమా!

لَا يَحِلُّ لَكَ النِّسَآءُ مِنۢ بَعْدُ وَلَآ اَنْ تَبَدَّلَ بِهِنَّ مِنْ اَزْوَاجٍ وَّلَوْ اَعْجَبَكَ حُسْنُهُنَّ اِلَّا مَا مَلَكَتْ يَمِيْنُكَ ؕ وَكَانَ اللّٰهُ عَلٰى كُلِّ شَىْءٍ رَّقِيْبًا ﴿52﴾

**53** ఓ విశ్వాసులారా! మీకు అనుమతి లేనిదే మీరు ప్రవక్త ఇండ్ల లోకి వెళ్ళకండి. భోజనార్థం మీకు పిలుపు అందినపుడు మాత్రం వెళ్ళండి. అయితే భోజనం తయారయ్యేవరకు వేచి ఉండే విధంగా కాదు. మరి భోజనం చేసిన వెంటనే బయలుదేరండి. కబుర్లు చెప్పుకుంటూ అక్కడే ఉండిపోకండి. ఈ రకమయిన మీ ప్రవర్తన వల్ల ప్రవక్తకు బాధ కలుగుతుంది. మొహమాటం కొద్దీ అతను మీకేమీ చెప్పడు. అయితే అల్లాహ్ మాత్రం నిజం చెప్పటానికి మొహమాటపడడు.[105] మీరు ప్రవక్త సతీమణులను ఏదైనా అడగవలసి వచ్చినప్పుడు తెర వెనుక నుంచి అడగండి.[106] మీ

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَدْخُلُوْا بُيُوْتَ النَّبِىِّ اِلَّآ اَنْ يُّؤْذَنَ لَكُمْ اِلٰى طَعَامٍ غَيْرَ نٰظِرِيْنَ اِنٰىهُ وَلٰكِنْ اِذَا دُعِيْتُمْ فَادْخُلُوْا فَاِذَا طَعِمْتُمْ فَانْتَشِرُوْا وَلَا مُسْتَاْنِسِيْنَ لِحَدِيْثٍ ؕ اِنَّ ذٰلِكُمْ كَانَ يُؤْذِى النَّبِىَّ فَيَسْتَحْىٖ مِنْكُمْ ۫ وَاللّٰهُ لَا يَسْتَحْىٖ مِنَ الْحَقِّ ؕ وَاِذَا سَاَلْتُمُوْهُنَّ مَتَاعًا فَسْـَٔلُوْهُنَّ مِنْ وَّرَآءِ حِجَابٍ ؕ ذٰلِكُمْ اَطْهَرُ لِقُلُوْبِكُمْ وَقُلُوْبِهِنَّ ؕ وَمَا كَانَ

103. తమకు ఎట్టి పరిస్థితిలోనూ దైవం మరియు దైవప్రవక్తే కావాలని, ప్రవక్తతో నిరాడంబర జీవితం గడపటానికే తాము నిర్ణయించుకున్నామని ప్రవక్త సతీమణులంతా స్పష్టంగా చెప్పటాన్ని దేవుడు మెచ్చాడు. దానికి బదులుగా ఇకమీదట దైవప్రవక్త (ఈ తొమ్మండుగురు భార్యలు కాకుండా) వేరితర స్త్రీలను వివాహమాడటాన్ని నిషేధించాడు. ఆ భార్యలలో ఏ ఒక్కరికయినా విడాకులిచ్చి ఆమె స్థానంలో వేరొకామెను చేసుకోవటాన్ని కూడా వారించాడు. ఆయన (స)కు ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడినా ఆయన (స) మాత్రం ఎవరినీ నికాహ్ చేసుకోలేదని మరికొందరు భావిస్తు న్నారు (ఇబ్నె కసీర్).

104. అంటే ధర్మబద్ధంగా తన వాటాలోనికి వచ్చిన బానిస స్త్రీలను ఎంతమందినయినా చేసుకోవచ్చు. అవిశ్వాస బానిస స్త్రీలు కూడా ఈ పరిధిలోనికి వస్తారని కొంత మంది అభిప్రాయపడ్డారు. అయితే అల్ ముమ్తహినా సూరా 10వ ఆయతు దృష్ట్యా ఆయన (స) కొరకు ఇది సమ్మతం కాదని మరికొంతమంది వ్యాఖ్యానించారు (ఫత్‌హుల్ ఖదీర్).

105. ఈ ఆయతు అవతరణ వెనుక ఉన్న ముఖ్యకారణం ఇది : దైవప్రవక్త (సఅసం) హజ్రత్ జైనబ్ (ర.అన్హా)ను వివాహమాడినపుడు తన ప్రియ సహచరులను వలీమా విందుకు ఆహ్వానించారు. ఆ సందర్భంగా ప్రవక్త సహచరుల్లో కొందరు భోజనాలయ్యాక కూడా అక్కడే కూర్చుని మాటల్లో నిమగ్నులైపోయారు. ఈ ధోరణి వల్ల దైవప్రవక్త (స)కు ఇబ్బంది కలిగింది. అయినాసరే బిడియం వల్ల, తనలోని సద్గుణం వల్ల ఆయన తన సహచరులను వెళ్ళమని చెప్పలేకపోయారు (సహీహ్ బుఖారీ – అల్ అహ్జాబ్ సూరా వ్యాఖ్యానం). అందువల్ల ఈ ఆయతులో సహచరులకు విందు 'మర్యాదలు' తెలుపబడ్డాయి: 1. భోజనం సిద్ధమైన తర్వాతే వెళ్ళాలి. అంతేగాని భోజన సమయానికి ముందే వెళ్ళి తిష్ఠవేయటం వాంఛనీయం కాదు. 2. భోజనం చేయగానే తమ తమ ఇండ్లకు తిరిగి రావాలి. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ అక్కడే చాలాసేపు కూర్చోకూడదు. విందు భోజనం నేపథ్యంలో ఈ ఆయతు అవతరించినప్పటికీ ఇతరత్రా ఆహ్వానాలకు, సమావేశాలకు కూడా ఈ 'మర్యాదలు' వర్తిస్తాయి. విందు నిమిత్తం మిమ్మల్ని ఆహ్వానించినా, వేరితర పనుల నిమిత్తం ఆహ్వానం అందినా ఆ ఇంటివారి అనుమతి పొందకుండా ఇంటిలోపలికి జొరబడకూడదు.

لَكُمْ أَن تُؤْذُوا رَسُولَ اللَّهِ وَلَا أَن تَنكِحُوا أَزْوَاجَهُ
مِن بَعْدِهِ أَبَدًا ۚ إِنَّ ذَٰلِكُمْ كَانَ عِندَ اللَّهِ عَظِيمًا ﴿53﴾

ఆంతర్యాల, వారి హృదయాల పరిశుద్ధత కోసం ఇదే సముచిత మైన పద్ధతి.[107] దైవప్రవక్తకు మనస్తాపం కలిగించటంగానీ,[108] అతని తదనంతరం అతని భార్యలను వివాహమాడటంగానీ ఎన్నటికీ మీకు ధర్మ సమ్మతం కాదు. అల్లాహ్ దృష్టిలో ఇది మహా పాతకం (అని తెలుసుకోండి).[109]

إِن تُبْدُوا شَيْئًا أَوْ تُخْفُوهُ فَإِنَّ اللَّهَ كَانَ بِكُلِّ
شَيْءٍ عَلِيمًا ﴿54﴾

**54** మీరేదన్నా విషయాన్ని బాహాటం చేసినా లేక గోప్యంగా ఉంచినా – అల్లాహ్ మాత్రం ప్రతిదీ తెలిసినవాడు.

لَّا جُنَاحَ عَلَيْهِنَّ فِي آبَائِهِنَّ وَلَا أَبْنَائِهِنَّ
وَلَا إِخْوَانِهِنَّ وَلَا أَبْنَاءِ إِخْوَانِهِنَّ وَلَا أَبْنَاءِ
أَخَوَاتِهِنَّ وَلَا نِسَائِهِنَّ وَلَا مَا مَلَكَتْ أَيْمَانُهُنَّ
وَاتَّقِينَ اللَّهَ ۚ إِنَّ اللَّهَ كَانَ عَلَىٰ كُلِّ شَيْءٍ
شَهِيدًا ﴿55﴾

**55** ఆ స్త్రీలు (ప్రవక్త సతీమణులు) తమ తండ్రుల, తమ కుమారుల, తమ సోదరుల ఎదుట, తమ సహోదరుల పుత్రుల ఎదుట, తమ అక్కాచెల్లెళ్ళ కొడుకుల ఎదుట, తమతో కలసి మెలసి ఉండే స్త్రీల ఎదుట, తమ యాజమాన్యంలో వున్నవారి (బానిసల, బానిస స్త్రీల) ఎదుట రావటం పాపం కాదు.[110] (మహిళా మణులారా!) అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదానికీ సాక్షిగా ఉన్నాడు.[111]

106. హజ్రత్ ఉమర్ (రజి) మనోరథంపై ఈ ఆదేశం అవతరించింది. ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) వచ్చి, "ఓ దైవప్రవక్తా (సఅసం)! మీ దగ్గరకు రకరకాల మనుషులు వస్తుంటారు. వారిలో మంచివాళ్లూ ఉంటారు. చెడ్డవాళ్ళూ ఉంటారు. అలాంటప్పుడు మీరు పరదాను పాటించమని మా మాతల (ఉమ్మహాతుల్ మోమినీన్)కు ఆజ్ఞాపిస్తే బావుంటుందేమో కదా!" అన్నారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు (సహీహ్ బుఖారీ – కితాబుస్సలాత్; ముస్లిం – బాబు ఫజాయెల్ ఉమర్ బిన్ ఖత్తాబ్).

107. **'పరదా'** ఉత్తర్వు వెనుక ఉన్న పరమార్థం ఇందులో చెప్పబడింది. దీనివల్ల అటు పురుషుల మనసులు గానీ, ఇటు స్త్రీల మనసులు గానీ కల్మషానికి, సంశయానికి లోనవకుండా ఉంటాయి. ఆంతర్యాలలో దురాలోచనలు జనించకుండా ఉంటాయి.

108. మనస్తాపం ఏ రకంగా కలిగించినా మనస్తాపమే. ఉదాహరణకు : అనుమతి పొందకుండా ఆయన (స) ఇండ్లలోనికి వెళ్ళినా, ఆయన (స)కు ఇష్టంలేకపోయినా చాలా సేపటి వరకు ఆయన ఇంట్లో బైఠాయించినా, పరదా ఆదేశాలను ఉల్లంఘించి ఆయన (స) సతీమణులతో మాట్లాడినా – ఇవన్నీ బాధాకరమే. వీటి మూలంగా ప్రవక్త (స) మనసు నొచ్చుకుంటుంది. కాబట్టి ఇలాంటి చేష్టలను మానుకోవాలి.

109. దైవప్రవక్త (స) మరణించేనాటికి ఆయన దాంపత్య జీవితంలో ఉన్న సతీమణులందరి విషయంలోనూ ఈ ఆజ్ఞ వర్తిస్తుంది. అయితే ప్రవక్త (స)తో నికాహ్ జరిగిన తరువాత, ప్రవక్త (స) సమాగమం జరిపిన తరువాత విడాకులు ఇచ్చేసిన మహిళలతో వివాహమాడవచ్చునా? అన్నది ఒక సందేహం. కాని ప్రవక్త(స) సమాగమం జరిపిన పిదప ఏ మహిళకూ అసలు విడాకులు ఇవ్వలేదు. కాబట్టి ఇలాంటి సందేహాలకు ఆస్కారమే లేదు. కాని ఒకవేళ ప్రవక్త (స) ఏ స్త్రీనయినా నికాహ్ చేసుకున్న తరువాత, ఆమెతో సమాగమం జరపకుండానే ఆమెకు విడాకులిచ్చేసి ఉంటే, ఆమెను ఇతర పురుషులెవరయినా వివాహమాడటం తప్పు అన్నట్లు ఎక్కడా రుజువు లేదు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

110. మహిళలపై పరదా ఆజ్ఞలు అవతరించినపుడు ఇండ్లల్లో పదే పదే తారసపడే రక్త సంబంధీకుల, ఆత్మీయుల విషయం ఏమిటీ? అన్న సందేహం ఉత్పన్నం అయింది. అందువల్ల ఈ ఆయతులో ఎవరెవరి ఎదుట రావటం అభ్యంతరకరం

56 నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు కూడా దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దరూద్ పంపండి. అత్యధికంగా అతనికి 'సలాములు' పంపుతూ ఉండండి.[112]

إِنَّ ٱللَّهَ وَمَلَٰٓئِكَتَهُۥ يُصَلُّونَ عَلَى ٱلنَّبِيِّ ۚ يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ صَلُّوا۟ عَلَيْهِ وَسَلِّمُوا۟ تَسْلِيمًا ﴿٥٦﴾

కాదో స్పష్టపరచబడింది. ఈ వివరాలు మరింత స్పష్టంగా నూర్ సూరా 31వ వచనంలో ఇంతకు ముందే వచ్చాయి.

111. ఈ సందర్భంగా దైవభీతిని గురించి ప్రస్తావించటం గమనార్హం. పరదా ఆజ్ఞను అవతరింపజేసింది ఎందుకు? మనసులు నిర్మలంగా ఉండేందుకు, సౌశీల్యం, పారిశుద్ధ్యం వర్ధిల్లేందుకు! మనసులో దైవభక్తి, దైవభీతి గనక ఉంటే ఈ పరదా ఆజ్ఞ ద్వారా దేవుడు ఆశిస్తున్న ఈ పవిత్ర వాతావరణం తప్పకుండా ఏర్పడుతుంది. మనసులో దైవభీతి లేనంతవరకూ ఈ సామాజిక ఆంక్షల, కట్టుబాట్ల ద్వారా పరివర్తన రాదు.

112. ఊర్ధ్వలోకాలలో అంతిమ దైవప్రవక్త (స)కు ఎంతటి గౌరవాదరణ ఉందో ఈ ఆయతు ద్వారా అవగతమవుతోంది. కారుణ్య ప్రభువు తన దూతల సమక్షంలో ఆయన (సఅసం)పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నాడు. దైవదూతలు కూడా ఆయన (సఅసం) ఉన్నత సోపానాల కోసం ప్రార్థిస్తున్నారు. కాబట్టి భూవాసులు కూడా ఆయన (స) కోసం ప్రార్థిస్తూ ఉండాలనీ, ఆయనకు 'సలాం' సమర్పణ చేస్తూ ఉండాలని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు. ఈ విధంగా ముహమ్మద్ (స)ను కొనియాడటంలో గగన వాసులతో పాటు, భూలోకవాసులు కూడా ఏకం కావాలన్నది దైవాభిమతం. హదీసులో ఇలా ఉంది : "దైవప్రవక్తా (స)! 'సలాం' పంపే పద్ధతి మాత్రం మాకు తెలిసిందే (అంటే అత్తహియ్యాత్ పఠించే సమయంలో 'అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు....' అని చదువుతాము). కాని మేము 'దురూద్' ఎలా పంపేది?" అని ప్రియసహచరులు (రజి) సందేహపడగా, ఆయన(స) నమాజులో పఠించే 'దురూదె ఇబ్రాహీం'ను నేర్పారు (సహీహ్ బుఖారీ – అల్ అహ్జాబ్ సూరా వ్యాఖ్యానం). ఇదిగాకుండా హదీసులలో దురూద్‌కు సంబంధించిన ఇతర పదాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా పఠించవచ్చు. క్లుప్తంగా **సల్లల్లాహు అలా రసూలిల్లాహి వ సల్లం** అని కూడా పఠించవచ్చు. కాని **అస్సలాతు వస్సలాము అలైక యా రసూలల్లాహ్!** అని చెప్పటం మాత్రం సరైనది కాదు. ఎందుకంటే ఈ పలుకు నేరుగా దైవప్రవక్త(స)తో సంభాషించటం లాంటిది. అత్తహియ్యాత్ సందర్భంగా **'అస్సలాము అలైక అయ్యు హన్నబియ్యు!'** అని పలకటం మాత్రం సమంజసమే. ఎందుకంటే ఈ మేరకు ప్రవక్త (స) వారే ప్రవచించి ఉన్నారు. కాని ఈ పలుకులను దైవప్రవక్త (స) వింటున్నారన్న మూఢ నమ్మకంతో ఎవరయినా పలికితే మాత్రం అలాంటి మూఢనమ్మకం ఖుర్ఆన్ హదీసులకు విరుద్ధమైనది. అలాంటి మూఢనమ్మకంతో నిర్ణీత దురూద్ పఠించటం కూడా సరైనది కాదు. అలాగే 'అజాన్ పిలుపు' ఇవ్వడానికి ముందు దాన్ని పఠించటం కూడా బిద్అత్‌గా పరిగణించబడుతుంది. దానివల్ల పుణ్యం ఎలాగూ ప్రాప్తించదు సరికదా అది పాపకరంగా పరిణమిస్తుంది.

హదీసులలో 'దురూద్' మహత్మ్యం గురించి నొక్కి వక్కాణించబడింది. నమాజులో దురూద్ పఠించటం అనివార్యమా (వాజిబా)? లేక సంప్రదాయమా (సున్నతా)? మెజారిటీ విద్వాంసులు దీన్ని సంప్రదాయంగా భావిస్తున్నారు. ఇమామ్ షాఫయితో పాటు మరికొంతమంది విద్వాంసులు మాత్రం దీనిని తప్పనిసరి (వాజిబ్)గా తలపోస్తున్నారు. హదీసుల ఆధారంగా చూస్తే అది వాజిబ్ (తప్పనిసరి) అని భావించటానికి ఎక్కువ ఆస్కారం ఉంది. చివరి తషహ్హుద్‌లో దురూద్ పఠించటం ఏ విధంగా తప్పనిసరియో మొదటి తషహ్హుద్‌లో దురూద్ పఠించటం కూడా అటువంటిదేనని కూడా హదీసుల ద్వారా అవగతమవుతోంది. అందువల్ల నమాజులోని రెండు తషహ్హుద్‌లలోనూ దురూద్ పఠించటం అనివార్యం.

దీని ఆధారాలు సంక్షిప్తంగా ఇలా ఉన్నాయి–1.ముస్నదె అహ్మద్‌లోని ఒక ప్రామాణిక ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నాడు : "ఓ దైవప్రవక్తా (సఅసం)! మీ పేరున సలాం ఎలా చదవాలో మాకు తెలుసు (మేము తషహ్హుద్‌లో అస్సలాము అలైక అని చదువుతూ ఉంటాము). కాని మేము నమాజులో

57 అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను బాధించేవారిపై ప్రపంచం లోనూ, పరలోకంలోనూ అల్లాహ్ శాపం పడుతుంది. ఇంకా వారి కోసం అత్యంత అవమానకరమైన శిక్ష సిద్ధంగా ఉంది.[113]

إِنَّ ٱلَّذِينَ يُؤۡذُونَ ٱللَّهَ وَرَسُولَهُۥ لَعَنَهُمُ ٱللَّهُ فِي ٱلدُّنۡيَا وَٱلۡأٓخِرَةِ وَأَعَدَّ لَهُمۡ عَذَابٗا مُّهِينٗا ٥٧

వున్నప్పుడు మీపై దురూద్‌ను ఎలా పంపాలి?" అప్పుడు దైవప్రవక్త (స) దురూద్ పద్ధతిని నేర్పారు (అల్ ఫతహుర్రబ్బానీ-సంపుటి:4, పేజీ-20, 21). ముస్నదె అహ్మద్‌తో పాటు ఈ ఉల్లేఖనం సహీహ్ ఇబ్నె హిబ్బాన్, సుననె కుబ్రా బైహఖీ, ముస్తద్రక్ హాకిమ్, ఇబ్నె ఖుజైమాలలో కూడా ఉంది. ఏ విధంగా నమాజులో (అంటే తషహ్హుద్‌లో) 'సలాం' పఠించబడుతుందో అదేవిధంగా నమాజులో దురూద్ కూడా పఠించబడుతుందా? అన్న ప్రశ్నకు అందులో వివరంగా సమాధానం ఇవ్వబడింది. 'దురూదె ఇబ్రాహీమ్'ని పఠించమని దైవప్రవక్త (సఅసం) ఆదేశించారు. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే నమాజులో 'సలాం'తో పాటు 'దురూద్' కూడా పఠించాలి. అది తషహ్హుద్ (ఖాయిదా) సందర్భంగా పఠించాలి. హదీసులో ఇది సర్వసాధారణమైన ఆజ్ఞగా ఉంది. అది మొదటి తషహ్హుద్ కొరకుగానీ, చివరి తషహ్హుద్ కొరకు గానీ ప్రత్యేకించబడలేదు. అందుచేత రెండు తషహ్హుద్ (మొదటిది, రెండవది)లలో కూడా సలామ్‌తో పాటు దురూద్ పఠించాలని చెప్పటానికి తగు ఆధారం లభ్యమవుతోంది. ఏ ఉల్లేఖనాలలోనయితే మొదటి తషహ్హుద్ దురూద్ లేకుండానే ప్రస్తావించబడిందో అది అహ్జాబ్ సూరాలోని **"సల్లూ అలైహి వ సల్లిమూ తస్లీమా"** ఆయతు అవతరణకు పూర్వం ఉండేదని భావించాలి. కాని ఈ ఆయతు అవతరణ తర్వాత - అంటే హిజ్రీ 5వ సంవత్సరం తరువాత-ప్రియసహచరుల అభ్యర్థనపై దైవప్రవక్త (స) దురూద్ వాక్యాలు కూడా వివరించారు. అందుచేత ఇప్పుడు నమాజులో - అది మొదటి తషహ్హుద్ అయినా లేక రెండవ తషహ్హుద్ అయినా-సలామ్‌తో పాటు దురూదె షరీఫ్ కూడా పఠించటం తప్పనిసరి అయిపోయింది.

2. రెండవ ఆధారం : హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (స) కొన్ని కొన్ని సార్లు రాత్రిపూట తొమ్మిది రకాతుల నమాజు చేసేవారు. అప్పుడు ఎనిమిదవ రకాతు అనంతరం తషహ్హుద్ (ఖాయిదా)లో కూర్చుని తన ప్రభువును వేడుకునేవారు, దైవప్రవక్త (స)పై 'దురూద్' పంపేవారు. పిమ్మట నమాజు ముగించకుండానే లేచి నిలుచునేవారు. తొమ్మిదవ రకాతు పూర్తిచేసిన తరువాత తషహ్హుద్‌లో కూర్చుని తన ప్రభువును వేడుకునేవారు. దైవప్రవక్తపై దురూద్ చదివేవారు, ఆ తరువాత మళ్లీ దుఆ చేసేవారు. ఆ తరువాత నమాజును ముగించేవారు (అల్ సుననుల్ కుబ్రా, లిల్ బైహఖీ - సంపుటి:2, పేజీ-704; సుననె నసాయి (నూతన ప్రచురణ), మఅత్తాలీఖాతుస్ సలఫియ, కితాబ్ ఖియాముల్లైల్ - సంపుటి: 1, పేజీ - 202). మరిన్ని వివరాల కోసం చూడండి : సిఫతు సలాతిన్నబీ(సఅసం) లిల్ అల్‌బానీ- పేజీ-145. దైవప్రవక్త(స) తన రాత్రిపూట నమాజులో మొదటి మరియు చివరి తషహ్హుద్‌లు రెండింటిలోనూ, దురూద్ వాక్యాలు పఠించినట్లు స్పష్టంగా ఉంది. ఇది నఫిల్ (స్వచ్ఛంద) నమాజు సంగతే అయినప్పటికీ పైన ప్రస్తావించబడిన ఆధారాలకు ఆయన (స) గారి ఈ 'ఆచరణ' ద్వారా సమర్థన లభిస్తోంది. అందువల్ల దీనిని కేవలం స్వచ్ఛంద (నఫిల్) నమాజులకే పరిమితం చేయటం భావ్యం కాదు.

113. అల్లాహ్‌ను బాధించటం అంటే అల్లాహ్‌కు అయిష్టకరమైన చేష్టలకు ఒడిగట్టడమని అర్థం. వాస్తవానికి ప్రత్యక్షంగా అల్లాహ్‌ను బాధించే శక్తి ఎవరికీ లేదు. కాకపోతే దాసులలో కొందరు అల్లాహ్‌కు ఆపాదించే అబద్ధాలు, వారు పాల్పడే చేష్టలు అత్యంత అయిష్టకరంగా ఉంటాయి. ఉదాహరణకు : ముష్రిక్కులు, యూదులు, క్రైస్తవులు మొదలగువారు అల్లాహ్‌కు సంతానం ఉందని వాదిస్తున్నారు. ఇది అల్లాహ్‌కు అత్యంత అయిష్టకరమైన విషయం. అలాగే ఒక హదీసె ఖుద్సీ ద్వారా కూడా ఈ విషయం అవగతమవుతోంది - "ఆదం పుత్రుడు నాకు బాధ కలిగిస్తున్నాడు. అతను కాలాన్ని తిట్టిపోస్తున్నాడు. వాస్తవానికి కాలాన్ని నేనే. దాని రేయింబవళ్ళ భ్రమణం నా ఆదేశానుసారమే జరుగుతోంది" అని అల్లాహ్ సెలవిస్తున్నాడు. (సహీహ్ బుఖారీ- సూరతుల్ జాసియా వ్యాఖ్యానం; ముస్లిం - కితాబుల్ అల్‌ఫాజ్ మినల్ అదబ్). అంటే కాలచక్రం లేదా ఖగోళ గమనంలోని తేడాపాడాల మూలంగా తనకీ గతి పట్టిందని అనటం సరికాదు. ఎందుకంటే జరిగిన ఘటనలు అల్లాహ్‌వేగాని కాలానివి కావు.

وَالَّذِيْنَ يُؤْذُوْنَ الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ بِغَيْرِ مَا اكْتَسَبُوْا فَقَدِ احْتَمَلُوْا بُهْتَانًا وَّاِثْمًا مُّبِيْنًا ﴿58﴾

58 తప్పు చేయని విశ్వాసులైన పురుషులను, విశ్వాసులైన స్త్రీలను వేధించేవారు (చాలా పెద్ద) అభాండాన్ని, స్పష్టమైన పాపభారాన్ని మోసినవారవుతారు.[114]

يٰٓاَيُّهَا النَّبِيُّ قُلْ لِّاَزْوَاجِكَ وَبَنٰتِكَ وَنِسَآءِ الْمُؤْمِنِيْنَ يُدْنِيْنَ عَلَيْهِنَّ مِنْ جَلَابِيْبِهِنَّ ؕ ذٰلِكَ اَدْنٰٓى اَنْ يُّعْرَفْنَ فَلَا يُؤْذَيْنَ ؕ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا ﴿59﴾

59 ఓ ప్రవక్తా! తమపై నుంచి తమ దుప్పట్లను (క్రిందికి) వ్రేలాడేలా కప్పుకోమని[115] నీ భార్యలకు, నీ కుమార్తెలకు, విశ్వాసులైన స్త్రీలకు చెప్పు. తద్వారా వారు చాలా తొందరగా (మర్యాదస్తులుగా) గుర్తించబడి, వేధింపుకు గురికాకుండా ఉంటారు.[116] అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు.

దైవప్రవక్త (స)కు బాధ కలిగించటమంటే ఆయన్ని త్రోసిపుచ్చటం, కవిపుంగవుడని ఆయన్ని నిందించటం, ఆయన అసత్యవాది అని అభాండం మోపటం, మాంత్రికుడని ఆరోపించటం అన్నమాట! అంతేకాదు, ప్రవక్త ప్రియ సహచరులను దూషించటం, వారిపట్ల అమర్యాదకరంగా మాట్లాడటం కూడా ఈ బాధలోకి వస్తుందని ఆయన (స) చెప్పినట్లు కొన్ని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. అల్లాహ్ శాపం పడటం అంటే దైవకారుణ్యానికి నోచుకోకుండా పోవటం అని భావం.

114. అంటే వారిని పరాభవం పాలుచేసే ఉద్దేశంతో వారిపై నీలాపనిందలు మోపటం, అన్యాయంగా వారిపై వేలెత్తటం అని భావం. ఉదాహరణకు రవాఫిజీలు (ఇది ఒక వర్గం) ప్రవక్త ప్రియ సహచరులను రేయింబవళ్ళు తూలనాడుతూ ఉండేవారు. వారు చేయని పనులను వారికి అంటగట్టేవారు. ఈ పూర్వరంగంలో ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: "రవాఫిజీలు వక్ర మనస్కులు. వారు ప్రశంసనీయులైన వ్యక్తులను నిందిస్తారు. నిందార్హులను ప్రశంసిస్తారు."

115. **'జలాబీబ్'** (جَلَابِيْبُ) అంటే శరీరాన్నంతటినీ కప్పివేసే పెద్ద దుప్పటి లేక పెద్ద వస్త్రం అని అర్థం. తమపైన తమ దుప్పట్లను వ్రేలాడదీయటమంటే తలభాగం నుంచి ముఖంపై- ముఖంలో అధికాంశభాగం కప్పబడే విధంగా - వస్త్రాన్ని వేయటం అన్నమాట. నేడు భారత దేశంలోగానీ, ఇతర దేశాలలో గాని ముస్లిం స్త్రీలు ధరించే బురఖాలు పలు పలు రకాలుగా ఉంటున్నాయి. దైవప్రవక్త (సఅసం) కాలంలో ఇలాంటి బురఖాలు ఉండేవికావు. ఆనాటి బురఖాలు చాలా సాదాసీదాగా, నిరాడంబరంగా ఉండేవి. వారు ధరించే దుస్తులు కూడా మరీ నిరాడంబరంగా ఉండేవి. వాటి ద్వారా స్త్రీలు తమ అందచందాలనుగానీ, అలంకరణనుగానీ ప్రదర్శించే ఉద్దేశం ఏ కోశానా కనబడేది కాదు. అందువల్ల వారు కప్పుకునే ఒక్క పెద్ద దుప్పటి ద్వారా కూడా 'పరదా' ఉద్దేశం నెరవేరేది. కాని రానురాను ఈ నిరాడంబరత మిగిలి ఉండలేదు. వారు ధరించే బురఖా కూడా ఆడంబరానికి ప్రతీకగా మారసాగింది. తాము ధరించే దుస్తుల ద్వారా, ఆభరణాల ద్వారా తమ అంతస్థును, అందచందాలను వ్యక్తపరచాలన్న మోజు మహిళల్లో పెరిగిపోయింది. ఈ కారణంగా నిరాడంబరతకు చిహ్నంగా ఉన్న పెద్ద దుప్పటి కనుమరుగైపోయి, దాని స్థానంలో రంగురంగుల బురఖాలు, డిజైన్ల బురఖాలు మార్కెట్టులో చోటుచేసుకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరయినా పాత సంప్రదాయం ప్రకారం దుప్పటి కప్పుకుంటే జనం దాన్నొక వింతగా భావించేటట్టున్నారు. కాని పరదా పాటించే ఉద్దేశంతో ఇలాంటి దుప్పటిని వేసుకుని, ముఖంపై కూడా వస్త్రాన్ని కప్పి ఉంచే స్త్రీ ఖచ్చితంగా పరదా ఆజ్ఞను పాటించినట్లే. ఎందుకంటే నేడు మహిళలు ధరించే 'బురఖా' పరదా కోసం షరీయతు నిర్ధారించిన ప్రత్యేక వస్తువు కాదు. శరీరాన్ని, ముఖాన్ని కప్పి ఉంచే ప్రతిదీ పరదా పాటింపులో అంతర్భాగమే.

అయితే నేటి మహిళలు కొందరు ఈ 'దుప్పటి'ని కూడా ఓ ఫ్యాషన్‌గా తీసుకుంటున్నారు. పరదా ఆచారం నుంచి బయటపడే ఉద్దేశంతో వారు మెదట్లో ఓ చిన్న దుప్పటిని తలపైనో, భుజాలపైనో వేసుకుంటారు. ఆ దుప్పటి సైతం శరీరాచ్ఛాదనకు ఉద్దేశించినదిగా కాకుండా అలంకారానికి, ఆడంబరానికి చిహ్నంగా ఉంటుంది. క్రమక్రమంగా

**60** ఈ కపటులు, హృదయాలలో రోగమున్నవారు, మదీనాలో తప్పుడు వదంతులను వ్యాపింపజేస్తున్నవారు[117] (ఇప్పటికైనా తమ దుష్ట వైఖరిని) మానుకోకపోతే, (వారికి వ్యతిరేకంగా చర్య తీసుకోవటానికి) మేము నిన్ను వారిపై నియమిస్తాము. ఆ తరువాత వారు కొన్నాళ్ళు మాత్రమే నీతోపాటు ఇక్కడ (ఈ నగరంలో) ఉండగలుగుతారు.

لَئِن لَّمْ يَنتَهِ الْمُنَافِقُونَ وَالَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ
وَالْمُرْجِفُونَ فِي الْمَدِينَةِ لَنُغْرِيَنَّكَ بِهِمْ ثُمَّ
لَا يُجَاوِرُونَكَ فِيهَا إِلَّا قَلِيلًا ﴿٦٠﴾

**61** వారు శాపగ్రస్తులయ్యారు – ఎక్కడ దొరికితే అక్కడే పట్టుకోబడతారు. దారుణంగా చంపబడతారు.[118]

مَّلْعُونِينَ ۖ أَيْنَمَا ثُقِفُوا أُخِذُوا وَقُتِّلُوا
تَقْتِيلًا ﴿٦١﴾

**62** వీరి పూర్వీకుల విషయంలో కూడా అల్లాహ్ యొక్క ఈ సంప్రదాయమే ఉండేది. అల్లాహ్ సంప్రదాయంలో నువ్వు ఎలాంటి మార్పునూ కానలేవు.

سُنَّةَ اللَّهِ فِي الَّذِينَ خَلَوْا مِن قَبْلُ ۖ وَلَن تَجِدَ لِسُنَّةِ
اللَّهِ تَبْدِيلًا ﴿٦٢﴾

**63** ప్రళయ ఘడియ గురించి జనులు నిన్ను ప్రశ్నిస్తున్నారు కదూ! 'ఆ సంగతి అల్లాహ్‌కే తెలుసు' అని వారికి చెప్పు. నీకేం తెలుసు? బహుశా ప్రళయం అతి సమీపంలోనే ఉందేమో!

يَسْأَلُكَ النَّاسُ عَنِ السَّاعَةِ ۖ قُلْ إِنَّمَا عِلْمُهَا عِندَ
اللَّهِ ۚ وَمَا يُدْرِيكَ لَعَلَّ السَّاعَةَ تَكُونُ قَرِيبًا ﴿٦٣﴾

---

ఆ చిన్న దుప్పటి కూడా మటుమాయమై, తలపై ఓ చిన్న స్కార్ఫ్ ఉండిపోతుంది. పరిస్థితుల ఈ స్వరూపాన్ని చూస్తూ ఉంటే, వీటన్నింటికన్నా బురఖాయే నయం అనిపిస్తోంది. ఎందుకంటే బురఖాలకు ప్రత్యామ్నాయంగా దుప్పట్లను వేసుకోవటం మొదలెట్టిన మహిళామణులు రాను రాను కొత్తపుంతలు తొక్కి పరదా ఉద్దేశ్యాన్నే ధ్వంసం చేస్తున్నారు.

మొత్తమ్మీద ఈ ఆయతులో ఇంటి గడపదాటి బయటకు వచ్చినప్పుడు పరదా ఆజ్ఞలను ఖచ్చితంగా పాటించవలసిందిగా దైవప్రవక్త (స) సతీమణులకు, కుమార్తెలకు, సాధారణ ముస్లిం మహిళలకు ఆదేశించబడింది. దీన్నిబట్టి స్పష్టంగా బోధపడేదేమిటంటే నేడు కొంతమంది ఎద్దేవా చేస్తున్నట్లు పరదా ఆజ్ఞ పండితులు సృష్టించినది కాదు. ఇది ముమ్మాటికీ దైవాజ్ఞ అని ఖుర్‌ఆన్ ద్వారా రూఢీ అవుతోంది. దీనిపట్ల విముఖతను చూపటం, దీన్ని ఉల్లంఘించి విచ్చలవిడితనాన్ని ప్రోత్సహించటం 'కుఫ్ర్' (ధైవతిరస్కారం) క్రిందికి వస్తుంది.

116. **'పరదా'** వల్ల మహిళలకు చేకూరే ప్రయోజనం ఏమిటో ఇక్కడ చెప్పటం జరిగింది. పరదాను పాటించే మహిళ మర్యాదస్తుల కుటుంబానికి చెందిన మహిళ అనీ, లజ్జ, బిడియం ఆమె ఆస్తి అనీ, ఆమె ధార్మికురాలని జనులు గ్రహిస్తారు. ఆమెను వేధించరు సరికదా, ఆమెను గౌరవిస్తారు. అదే సమయంలో సిగ్గువిడిచి, బరితెగించి బజారుల్లో తిరిగే స్త్రీని జనులు గౌరవించరు సరికదా, ఆమెను వేధించటం మొదలెడతారు.

117. ముస్లింల ఆత్మ విశ్వాసాన్ని నీరు గార్చడానికి, వారి శిబిరాలలో కలవరాన్ని రేకెత్తించటానికి ఆనాడు కపటులు రకరకాల పుకార్లను పుట్టించేవారు. ఉదాహరణకు: ఫలానా ప్రదేశంలో ముస్లింలు ఘోర పరాజయం పొందారనో, ఫలానా ప్రాంతానికి చెందిన శత్రుసేనలు దండెత్తి రావటానికి సిద్ధంగా ఉన్నాయనో ప్రకటించి అలజడిని సృష్టించేవారు.

118. వారు ఎక్కడ కనిపిస్తే అక్కడే పట్టుకొని చంపేయండి అని అనబడలేదు. వాస్తవానికి ఇదొక అభిశాపం. వారు తమ కపట చేష్టలను మానుకోకపోతే దాని పర్యవసానం అత్యంత దారుణంగా ఉంటుందని హెచ్చరించబడింది. ఇది 'ఆజ్ఞ' అని కొందరు అభిప్రాయపడ్డారు. కాని ఈ ఆయతు అవతరించిన తరువాత ఈ కపటులు తమ కపట చేష్టలను మానుకున్నారు. అందువల్ల ఈ ఆయతులో పేర్కొనబడిన కఠినచర్యలు వారిపై గైకొనబడలేదు (ఫత్‌హుల్ ఖదీర్).

**64** అల్లాహ్ అవిశ్వాసులను శపించాడు. ఇంకా వారి కోసం మండే అగ్నిని సిద్ధం చేసి ఉంచాడు.

إِنَّ اللَّهَ لَعَنَ الْكَافِرِينَ وَأَعَدَّ لَهُمْ سَعِيرًا (64)

**65** అందులో వారు ఎల్లకాలం పడి ఉంటారు. వారు ఏ సంరక్ష కుణ్ణీ, సహాయకుణ్ణీ పొందలేరు.

خَالِدِينَ فِيهَا أَبَدًا ۖ لَا يَجِدُونَ وَلِيًّا وَلَا نَصِيرًا (65)

**66** ఆ రోజు వారి ముఖాలు అగ్నిలో అటూ ఇటూ పొర్లింప బడతాయి. అప్పుడు వారు, "అయ్యో! మేము అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయత చూపి ఉంటే ఎంత బావుండేది?" అని అంటారు.

يَوْمَ تُقَلَّبُ وُجُوهُهُمْ فِي النَّارِ يَقُولُونَ يَا لَيْتَنَا أَطَعْنَا اللَّهَ وَأَطَعْنَا الرَّسُولَا (66)

**67** ఇంకా ఇలా అంటారు : "ప్రభూ! మేము మా సర్దారులు, పెద్దలు చెప్పినట్లు విన్నాము. వారు మమ్మల్ని పెడత్రోవ పట్టించారు.[119]

وَقَالُوا رَبَّنَا إِنَّا أَطَعْنَا سَادَتَنَا وَكُبَرَاءَنَا فَأَضَلُّونَا السَّبِيلَا (67)

**68** "ప్రభూ! నీవు వారికి రెండింతల శిక్షను విధించు. వారిపై పెద్ద శాపాన్ని అవతరింపజెయ్యి."

رَبَّنَا آتِهِمْ ضِعْفَيْنِ مِنَ الْعَذَابِ وَالْعَنْهُمْ لَعْنًا كَبِيرًا (68)

**69** విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు మూసాను కష్టపెట్టిన వారి మాదిరిగా తయారవకండి. మరి వారు అన్న మాట నుంచి అల్లాహ్ అతన్ని–మచ్చలేని వానిగా – నిగ్గుతేల్చాడు.[120] అతను అల్లాహ్ దృష్టిలో ఎంతో ఆదరణీయుడుగా ఉండేవాడు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَكُونُوا كَالَّذِينَ آذَوْا مُوسَىٰ فَبَرَّأَهُ اللَّهُ مِمَّا قَالُوا ۚ وَكَانَ عِنْدَ اللَّهِ وَجِيهًا (69)

119. అంటే, మేము నీ ప్రవక్తల, ధర్మ సందేశ ప్రదాతల మాట వినకుండా మా కులపెద్దల అడుగుజాడల్లో నడిచాము. కాని వీళ్లు మమ్మల్ని ప్రవక్తల మార్గానికి దూరంగా ఉంచారనీ, సన్మార్గం నుంచి మమ్మల్ని తప్పించారని ఇప్పుడు మాకు అర్థమయింది అని ఒప్పుకుంటారు.
సత్యాన్ని కాదని పూర్వీకుల, కులపెద్దల అడుగులకు మడుగులొత్తే పోకడ నేటికీ జనులను అపమార్గానికి లోనుచేస్తూనే ఉంది. ముస్లింలు ఈ దైవవచనాన్ని లోతుగా అధ్యయనం చేసి ఈ అపవాదాల నుంచి బయటపడితే, ఖుర్ఆన్ హదీసుల (రుజు) మార్గాన్ని అవలంబిస్తే ఎంత బావుంటుంది! ఎందుకంటే మోక్షం అన్నది దైవం మరియు దైవప్రవక్త మార్గానుసరణలోనే ఉందిగాని తాతముత్తాతల, కులపెద్దల కాల్పనిక పద్ధతుల్లో లేదు.

120. దీని పూర్వరంగం హదీసులో ఈ విధంగా ఉంది : దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఎంతో బిడియం కలవారు. ఆయన ఎన్నడూ ప్రజల ముందు నగ్నంగాగానీ, అర్ధనగ్నంగాగానీ ఉండలేదు. అందువల్ల – బహుశా ఆయన ఒంటిపై బొల్లిగానీ, మరేదైనా వ్యాధిమచ్చలుగానీ ఉండి ఉంటాయని, అందుకే పొద్దస్తమానం ఆయన తన ఒంటిని కప్పుకుని ఉంటున్నారని ఇస్రాయీలీయులు గుసగుసలాడుకునేవారు.
మూసా అనుయాయుల ఈ మీమాంసను అల్లాహ్ పటాపంచలు చేయదలిచాడు. ఒకసారి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఒంటరిగా ఉన్నప్పుడు చెరువులో స్నానం చేయదలచి, బట్టలు విడిచి రాతిబండపై పెట్టారు. అప్పుడు (దైవాజ్ఞానుసారం) ఆ రాతిబండ దుస్తుల సమేతంగా ఎగిరిపోసాగింది. మూసా (అలైహిస్సలాం) ఆ రాతిబండను వెంబడించారు. అలా ఆ రాతిబండను వెంబడిస్తూ ఇస్రాయీలీయులు ఆసీనులై ఉన్న ఒక సమావేశస్థలికి చేరుకున్నారు. ఆ సందర్భంలో వారంతా మూసాను నగ్న స్థితిలో చూశారు. మూసా (అలైహి) వారికి ఎంతో అందమైన శరీరఛాయ

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اتَّقُوا اللّٰهَ وَقُوْلُوْا قَوْلًا سَدِيْدًا ﴿٧٠﴾

70 ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. మాట్లాడితే సూటిగా మాట్లాడండి[121] (సత్యమే పలకండి).

يُّصْلِحْ لَكُمْ اَعْمَالَكُمْ وَيَغْفِرْ لَكُمْ ذُنُوْبَكُمْ ۗ وَمَنْ يُّطِعِ اللّٰهَ وَرَسُوْلَهٗ فَقَدْ فَازَ فَوْزًا عَظِيْمًا ﴿٧١﴾

71 తద్వారా అల్లాహ్ మీ ఆచరణలను చక్కదిద్దుతాడు. మీ పాపాలను మన్నిస్తాడు.[122] ఎవరయితే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత కనబరచాడో అతను గొప్ప విజయం సాధించాడు.

اِنَّا عَرَضْنَا الْاَمَانَةَ عَلَى السَّمٰوٰتِ وَالْاَرْضِ وَالْجِبَالِ فَاَبَيْنَ اَنْ يَّحْمِلْنَهَا وَاَشْفَقْنَ مِنْهَا وَحَمَلَهَا الْاِنْسَانُ ۗ اِنَّهٗ كَانَ ظَلُوْمًا جَهُوْلًا ﴿٧٢﴾

72 మేము మా అప్పగింత(అమానతు)ను ఆకాశాల ముందూ, భూమి ముందూ, పర్వతాల ముందూ ఉంచాము. కాని అవన్నీ దాన్ని మోయటానికి నిరాకరించాయి. దానికి భయపడి పోయాయి. (అయితే) మానవుడు మాత్రం దాన్ని ఎత్తుకున్నాడు.[123] అవును, వాడు అక్రమానికి ఒడిగట్టేవాడు, మూర్ఖుడు.[124]

---

కలవానిగా, మచ్చలేని వ్యక్తిగా కనిపించారు. ఈ విధంగా అల్లాహ్ ఒక రాతిబండ ద్వారా – అద్భుతంగా – ప్రజలు మూసాకు ఆపాదించిన కళంకాన్ని తుడిచిపెట్టాడు (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా).

హజ్రత్ మూసా (అలైహిస్సలాం) దృష్టాంతం ద్వారా ఈ ఆయతులో ముహమ్మద్ (సఅసం) అనుచరులకు చేయబడిన తాకీదు ఏమిటంటే; మీరు కూడా ఇస్రాయీలీయుల లాగా మీ ప్రవక్త (సఅసం)కు మనస్తాపం కలిగించకండి. ఆయన్ని(స) వ్యాకులతకు లోనుచేసే మాటలు చెప్పకండి. ఉదాహరణకు : ఒకానొక సందర్భంలో విజయ ధనం (మాలె గనీమత్) పంపిణీ చేస్తుండగా ఒక వ్యక్తి, "న్యాయసమ్మతంగా పంపకం జరగలేద"ని ఆరోపించాడు. ఫలానా వ్యక్తి ఈ విధంగా అంటున్నాడని దైవప్రవక్త (స)కు తెలిసినప్పుడు ఆయన ముఖారవిందం ఆగ్రహంతో కందిపోయింది. అప్పుడాయన (స) "మూసా (అలైహిస్సలాం)పై దేవుడు కరుణించుగాక! ఆయన ఇంతకన్నా ఎక్కువే బాధించబడ్డారు. అయినప్పటికీ ఆయన ఓర్పు వహించారు" అని పలికారు (బుఖారీ – కితాబుల్ అంబియా; ముస్లిం – కితాబుజ్జకాత్....)

121. సూటిగా, సరిగ్గా మాట్లాడటమంటే అర్థం మాటలో తిరకాసు ఉండకుండా జాగ్రత్త పడటం. మాటలో ద్వంద్వార్థాలకు తావుండకూడదు. మాటలో మోసం ఉండకూడదు. ఎంతో ఖచ్చితంగా, స్పష్టంగా, నిర్దిష్టంగా మాట్లాడాలి. ఏది చెప్పినా అది సత్యంతో కూడినదై ఉండాలి. **'సదీద్'** (**سَدِيد**) అంటే సూటిగా, తిన్నగా, బాణంలా వెలువడేది అని అర్థం. మీ నోట వెలువడే మాట మీ మంచినడవడికకు, రుజువర్తనకు, నీతీ నిజాయితీలకు ప్రతిబింబంగా ఉండాలి.

122. మీరు భయభక్తుల వైఖరిని అవలంబించి, నిజాయితీగా మాట్లాడిన దాని ఫలితంగా మీ పనులు చక్కబడతాయి. అల్లాహ్ మిమ్మల్ని అపారంగా అనుగ్రహిస్తాడు. మీ వల్ల జరిగే చిన్న చిన్న పొరపాట్లను మన్నిస్తాడు.

123. విధేయత చూపిన వారికి ఇచ్చే బహుమానాన్ని, అవిధేయులైన వారికి విధించే శిక్షను గురించి వివరించిన తరువాత అల్లాహ్ ఇప్పుడు తన షరీయతు ఆదేశాలను గురించి ప్రస్తావిస్తున్నాడు. ఇక్కడ **'అమానతు'** అంటే షరీయతు ఆదేశాలు, విధ్యుక్తధర్మాలు అని భావం. వాటిని పాటించిన వారికి పుణ్యఫలం లభిస్తుంది. త్రోసిపుచ్చిన వారు శిక్షార్హులవుతారు. ఈ సాధకబాధకాలతో కూడుకున్న అమానతును (బాధ్యతతో కూడుకున్న అప్పగింతను) భూమ్యాకాశాల ముందు, పర్వతాల ముందు పెట్టినప్పుడు అవి భయంతో వణికిపోయాయి. దాన్ని మోయటానికి ఏ

**73** అల్లాహ్ కపటులైన పురుషులను, కపటులైన స్త్రీలను, ముష్రిక్కులైన పురుషులను, ముష్రిక్కులైన స్త్రీలను శిక్షించటానికి, విశ్వాసులైన పురుషుల, విశ్వాసులైన స్త్రీల పశ్చాత్తాపాన్ని స్వీకరించటానికి[125] (ఇదంతా జరిగింది). అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు.

لِّيُعَذِّبَ اللّٰهُ الْمُنٰفِقِيْنَ وَالْمُنٰفِقٰتِ وَالْمُشْرِكِيْنَ وَالْمُشْرِكٰتِ وَيَتُوْبَ اللّٰهُ عَلَى الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ ؕ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا ﴿٧٣﴾

ఒక్కటీ సంసిద్ధతను వ్యక్తపరచలేదు. కాని దానిని మానవుని ఎదుట ఉంచినపుడు అతడు, దైవాజ్ఞను శిరసావహించి నందులకు ప్రాప్తించే పుణ్యఫలానికి ఆశపడి ఆ కీలక బరువును మోయటానికి ఒప్పేసుకున్నాడు. ఈ ఆయతులో షరీయతు ఆదేశాలను 'అమానతు'గా అభివర్ణించటం గమనించదగ్గ విషయం. తమవద్దనున్న ఒక అమానతు (అప్పగింత)ను కోరినప్పుడు ఇవ్వటం ఎంత అవసరమో షరీయతు ఆదేశాలను నిర్వర్తించటం కూడా అంతే అవసరం.

అమానతును భూమ్యాకాశాల, పర్వతాల ఎదుట ఉంచటం అంటే ఏమిటి? దానికి అవి ఏ రీతిలో స్పందించాయి? మానవుడు ఈ అప్పగింత భారాన్ని ఏ సమయంలో, ఎలా ఎత్తుకున్నాడు? అన్నది అనిర్వచనీయం. ఆ స్థితిని మనం వివరించలేము. అయితే అల్లాహ్ ప్రతి సృష్టిరాశిలోనూ ఒక విధమైన చైతన్యాన్ని, స్పందనను పొందుపరచాడన్నది మాత్రం వాస్తవం. దీన్ని మనమంతా నమ్మాలి. అందలి వాస్తవికత మనకు బోధపడకపోవచ్చు. కాని అల్లాహ్‌కు ప్రతిదీ తెలుస్తుంది. ఆయన తప్పకుండా ఆ అమానతును వాటి ముందు పెట్టి ఉంటాడు. అవన్నీ దాన్ని మోయటానికి వెనుకాడి ఉంటాయి. తిరుగుబాటు చేసే ఉద్దేశంతోనో, అహంకారంతోనో అవి ఆ బాధ్యతకు వెరవలేదు. భయం మూలంగానే అవి నిరాకరించాయి. ఒకసారి బాధ్యతను స్వీకరించిన తరువాత దాన్ని సజావుగా నిర్వర్తించకపోతే లేనిపోని కష్టాలు ఎక్కడ వచ్చిపడతాయోనని అవి వెనుకంజ వేశాయి. కాని మానవుడు తొందరపడేవాడు. అతను ఆ సందర్భంలో కీడెంచి వెనక్కి తగ్గేబదులు మేలును పొందే తాపత్రయంలో బాధ్యతను నెత్తిమీద వేసుకున్నాడు.

124. అంటే అతను ఈ బరువును తనపై మోపుకుని, తన ఆత్మకు అన్యాయం చేసుకున్నాడు. ఈ బరువు బాధ్యత మూలంగా తనపై పడే అదనపు భారాన్ని, జాగ్రత్తలను విస్మరించి తన మూర్ఖత్వాన్ని చాటుకున్నాడు.

125. ఈ అమానతును మానవునికి అప్పజెప్పటం వెనుక ఓ ఉద్దేశం ఉంది. దీనిద్వారా కపటుల కపటాచారాన్ని, ముష్రిక్కుల షిర్కును దేవుడు బట్టబయలు చేయదలిచాడు. అలాగే విశ్వాసులలోని విశ్వాసాన్ని కూడా నిగ్గుతేల్చి తదనుగుణంగా పుణ్యఫలం ప్రసాదించదలిచాడు.

34వ సూరా

# సబా

## సబా రాజ్యం

అవతరణ మక్కాలో

ఆయతులు 54

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం వంటి మౌలిక విశ్వాసాల గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలో 15-18 ఆయతుల్లో సబా రాజ్యం గురించిన కథ ఉంది. ఈ కథ ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. సబాజాతి ప్రజలు సుఖభోగాలతో విలాసవంతంగా జీవించేవారు. అల్లాహ్ పట్ల విశ్వాసం లేని జాతి. బహుదైవారాధక జాతి. సబా పట్టణం ఎమన్‌లో ఉంది. సబా ప్రజలకు చాలా భోగభాగ్యాలు లభించాయి. వారు భవననిర్మాణంలో మంచి ప్రావీణ్యం కలిగినవారు. వారికి అపరిమితమైన వనరులు ఉండేవి. సారవంతమైన భూభాగాలు, అనుకూలమైన వాతావరణం వారికి లభించాయి. రెండు మైళ్ళ పొడవు, 120 అడుగుల వెడల్పు కలిగిన ఒక గొప్ప డ్యామును వారు నిర్మించారు. వారు భోగభాగ్యాలతో, అహంభావంతో బ్రతికేవారు. వారి సమాజం ధనికబీద వర్గాలుగా చీలిపోయింది. వారు దుర్మార్గాలకు పాల్పడేవారు. తమ ఆరాధనల్లో దేవునికి భాగస్వాములను కల్పించేవారు. బహుదైవారాధనకు పాల్పడేవారు. చివరకు అల్లాహ్ ఆగ్రహం వారిని చుట్టుముట్టింది. ఒక భారీ వరద వారిని ముంచేసింది. (120 క్రీ.శ). ఆ వరద తర్వాత సబా రాజ్య పతనం ప్రారంభమయ్యింది. వారి సారవంతమైన నేలలు బంజరు భూములయ్యాయి. వారి పండ్లతోటలు ముళ్ళపొదలుగా మారాయి.*

*ఈ సూరాలో దేవుని ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అందజేస్తున్న సందేశం గురించి ప్రస్తావిస్తూ అవిశ్వాసులు దివ్యఖుర్ఆన్‌ను తిరస్కరించినప్పటికీ, ప్రవక్త ముహమ్మద్(సఅసం) సహనంతో, దృఢచిత్తంతో వ్యతిరేకతలను, అపవాదులను, ఆరోపణలను ఎదుర్కోవాలని బోధించింది. గత కాలాల్లో తమ ప్రవక్తలను తిరస్కరించిన జాతులకు ఎదురైన వినాశాన్ని ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు తెలియజేసి ఆయనకు ఊరట కలిగించడం జరిగింది. సూరా చివరి భాగంలో అల్లాహ్‌ను విశ్వసించాలని, దేవునికి భాగస్వాములను కల్పించే మహాపరాధాన్ని మానుకోవాలని అవిశ్వాసులకు బోధించబడింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 10-14 | 127-129 | 'ప్రవక్త దావూద్ - జాలూత్' 'మధుర స్వరం కలిగిన పాలకుడు' | దావూద్, సులైమాన్ ప్రవక్తల సంపూర్ణ గాథలు |
| 15-20 | 218 | 'సబా రాజ్యం' | సబా రాజ్యం సంగతులు |

## సబా సూరా

## سُوْرَةُ سَبَاٍ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్తానికి యజమాని[1] అయిన అల్లాహ్‌యే సకల స్తోత్రాలకు అర్హుడు. పరలోకంలో కూడా ప్రశంసలు ఆయనకే తగును.[2] ఆయన వివేక సంపన్నుడు, (ప్రతిదీ) తెలిసినవాడు.

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِيْ لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ وَلَهُ الْحَمْدُ فِي الْاٰخِرَةِ ؕ وَهُوَ الْحَكِيْمُ الْخَبِيْرُ ①

2 భూమిలోనికి వెళ్ళేదీ,[3] దానినుండి వెలువడేదీ, ఆకాశం నుంచి దిగేదీ,[4] అందులోకి ఎక్కిపోయేదీ[5] – అంతా ఆయనకు తెలుసు. ఆయన పరమ కృపాశీలుడు, క్షమాగుణం కలవాడు.

يَعْلَمُ مَا يَلِجُ فِي الْاَرْضِ وَمَا يَخْرُجُ مِنْهَا وَمَا يَنْزِلُ مِنَ السَّمَآءِ وَمَا يَعْرُجُ فِيْهَا ؕ وَهُوَ الرَّحِيْمُ الْغَفُوْرُ ②

3 "మాపై ప్రళయం వచ్చిపడదు" అని అవిశ్వాసులు అంటు న్నారు. "ఎందుకు రాదు? అగోచరాల జ్ఞాని అయిన నా ప్రభువు సాక్షిగా! అది మీపై తప్పకుండా వస్తుంది.[6] రవ్వంత వస్తువు కూడా – అది ఆకాశాలలో ఉన్నా, భూమిలో ఉన్నా – ఆయన

وَقَالَ الَّذِيْنَ كَفَرُوْا لَا تَاْتِيْنَا السَّاعَةُ ؕ قُلْ بَلٰى وَرَبِّيْ لَتَاْتِيَنَّكُمْ عٰلِمِ الْغَيْبِ ۚ لَا يَعْزُبُ عَنْهُ مِثْقَالُ ذَرَّةٍ فِي السَّمٰوٰتِ وَلَا فِي الْاَرْضِ وَلَاۤ اَصْغَرُ

1. అంటే భూమ్యాకాశాలలో ఆయన అధికారం మాత్రమే నడుస్తుంది. ఆయన నిర్ణయాలే అమలవుతాయి. మనిషికి లభించే అనుగ్రహాలన్నీ ఆ దేవుడు సృష్టించినవే. అంతా ఆయన చలువ వల్లనే ఈ వ్యవస్థ నడుస్తోంది. అందువల్ల భూమ్యాకాశాలలో ప్రశంసలకు, పొగడ్తలకు ఆయన మాత్రమే అర్హుడు. ఆయన చేసిన మహోపకారాలకుగాను ప్రాణులు ఆయన్ని ఎంతగా స్తుతించినా తక్కువే.

2. **'పరలోకంలో'** అంటే తీర్పుదినాన విశ్వాసులు ఈ స్తోత్రం చేస్తారు. ఉదాహరణకు :

   (1) "మాకు చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన, మమ్మల్ని భూమికి వారసులుగా చేసిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు" అని వారంటారు. (అజ్జుమర్–74).

   (2) "మాకు ఈ మార్గం చూపిన అల్లాహ్‌కు స్తోత్రాలు" అని వారంటారు. (అల్ ఆరాఫ్–43). (3) "మా దుఃఖాన్ని దూరం చేసిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు" అని అంటారు. (ఫాతిర్ – 34)

   ఇక ప్రపంచంలో చేసే దైవస్తోత్రం దైవారాధనగా ఉంటుంది. ఈ ఆరాధనకు మనిషి కట్టుబడి ఉండాలి. అయితే పరలోకంలో విశ్వాసులు చేసే దైవస్తోత్రం వారి హృదయాంతరాళాలకు ఆహారంగా పనిచేస్తూ ఉంటుంది. ఈ స్తోత్రం ద్వారా వారు అనిర్వచనీయమైన మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు (ఫత్‌హుల్ ఖదీర్).

3. ఉదాహరణకు వర్షపు నీరు, భూగర్భజలాలు, ఖనిజాలు, లోహాలు, చమురు నిల్వలు మొదలగునవి.

4. వర్షపు నీరు, వడగళ్లు, పిడుగులు, దేవుని తరఫున అవతరించే శుభాలు, దైవగ్రంథాల అవతరణ, దైవదూతలు దివినుంచి భువికి దిగిరావటం – ఇత్యాదివన్నీ ఇందులోకి వస్తాయి.

5. అంటే దైవదూతలు, మానవ కర్మలు అని భావం.

6. ఎట్టి పరిస్థితిలోనూ ప్రళయం వస్తుందని ప్రమాణం చేసి మరీ చెప్పటం గమనార్హం.

مِنْ ذٰلِكَ وَلَآ اَكْبَرُ اِلَّا فِيْ كِتٰبٍ مُّبِيْنٍ ③

నుండి గోప్యంగా లేదు.[7] దాని కన్నా చిన్న వస్తువైనా, పెద్ద వస్తువైనా, ప్రతిదీ ఒక స్పష్టమైన గ్రంథంలో (లిఖిత పూర్వకంగా) ఉంది"[8] అని వారికి చెప్పు.

لِّيَجْزِيَ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ ۭ اُولٰۗىِٕكَ لَهُمْ مَّغْفِرَةٌ وَّرِزْقٌ كَرِيْمٌ ④

**4** విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి మంచి ప్రతిఫలం ఇవ్వటానికి[9] (ప్రళయం వస్తుంది). ఇలాంటి వారి కోసమే మన్నింపు, గౌరవప్రదమైన ఉపాధి ఉన్నాయి.

وَالَّذِيْنَ سَعَوْ فِيْٓ اٰيٰتِنَا مُعٰجِزِيْنَ اُولٰۗىِٕكَ لَهُمْ عَذَابٌ مِّنْ رِّجْزٍ اَلِيْمٌ ⑤

**5** మరెవరయితే మా ఆయతులను లొంగ దీసుకునేందుకు ప్రయత్నాలు చేశారో[10] వారి కొరకు అత్యంత దుర్భరమైన, బాధాకరమైన శిక్ష ఉంది.

وَيَرَى الَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ الَّذِيْٓ اُنْزِلَ اِلَيْكَ مِنْ رَّبِّكَ هُوَ الْحَقَّ ۙ وَيَهْدِيْٓ اِلٰى صِرَاطِ الْعَزِيْزِ الْحَمِيْدِ ⑥

**6** (ఓ ముహమ్మద్‌-స!) నీ ప్రభువు తరఫున నీపై అవతరించినది (ఆసాంతం) సత్యమని, అది సర్వాధిపతి, స్తోత్రనీయుడైన అల్లాహ్‌ మార్గం వైపుకు దర్శకత్వం వహిస్తుందన్న[11] సంగతిని జ్ఞానం వొసగబడిన వారు చూస్తారు.[12]

7. భూమ్యాకాశాలలో ఉన్న అణువంత వస్తువు కూడా పరమప్రభువు నుంచి దాగిలేనపుడు మీరు మరణించి మట్టిలో కలిసిపోయినంతమాత్రాన ఆయనకు కనబడకుండా పోతామని ఎలా అనుకుంటున్నారు? మీ శరీరావయవాలు కుళ్ళి, కృశించి, చెల్లాచెదురై పోయినా మిమ్మల్ని తిరిగి సజీవులుగా నిలబెట్టడం ఆయనకు ఏమాత్రం కష్టసాధ్యం కాదు.

8. అంటే అది "లౌహె మహ్‌ఫూజ్‌"లో పొందుపరచబడి ఉంది.

9. ప్రళయదినం అనివార్యం. ఎందుకంటే ఇహలోకంలో నిజదైవాన్ని విశ్వసించి, ఆయన అభిమతానికనుగుణంగా జీవితం గడిపిన వారికి ప్రభువు తరఫున బహుమానం లభించటం న్యాయం. దాని కోసమే అల్లాహ్‌ ప్రళయదినాన్ని అనివార్యం చేశాడు.

10. అంటే మేము మా ప్రవక్తలపై అవతరింపజేసిన మా వాక్యాలను కించపరచి, ప్రజాబాహుళ్యంలో నుంచి వాటిని చెరిపివేయటానికి దుష్టపన్నాగాలు పన్నిన వారి సంగతిని మేము చూసుకుంటాము. మరణానంతర జీవితంపై నమ్మకం లేకపోవటం మూలంగానే వారు మరీ ఇంతగా బరితెగించిపోయారు. తాము ఒకసారి మరణించి, మట్టిలో కలిసిపోయిన పిదప, మళ్లీ బ్రతికించబడి దేవుని సమక్షంలో హాజరుపరచబడటం అన్నది ఎలా సాధ్యం? అని వారు అనేవారు. అంటే తమ దురాగతాల గురించి నిలదీసి అడిగే శక్తి దైవానికి లేదని వాళ్లు తలపోసేవారు. అందువల్ల ప్రళయం లేదు, గిళయం లేదు అని తేలిగ్గా కొట్టిపారేసేవారు.

11. అంటే, దివ్య ఖుర్‌ఆన్‌ సర్వలోక ప్రభువైన అల్లాహ్‌ మార్గం చూపుతుందనీ, ఆ ప్రభువు ప్రశంసనీయుడనీ, సర్వశక్తుడని వారు గ్రహిస్తారు.

12. **'చూస్తారు'** అంటే కేవలం కళ్లతో చూస్తారని భావం కాదు. ఆ సత్యాన్ని వారు తమ మనోనేత్రంతో చూస్తారు. సత్యాన్ని సత్యంగా గ్రహిస్తారు. 'జ్ఞానం వొసగబడినవారు' అంటే వారు ప్రవక్త ప్రియసహచరులూ కావచ్చు లేదా గ్రంథజ్ఞానం ఉన్న విశ్వాసులూ కావచ్చు లేదా విశ్వాసులందరూ కావచ్చు. విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించిన వారు ఈ విషయాన్ని తొందరగా గ్రహించి, దాన్ని దృఢంగా నమ్ముతారు.

7 అవిశ్వాసులు[13] ఇలా అనసాగారు: "మీరు పగిలి తునాతునకలై పోయిన తరువాత, మీరు మళ్లీ సరికొత్త సృష్టిలోనికి వస్తారని[14] మీకు సమాచారం అందజేసే[15] వ్యక్తిని మీకు చూపమంటారా?![16]

وَقَالَ الَّذِينَ كَفَرُوا هَلْ نَدُلُّكُمْ عَلَىٰ رَجُلٍ يُنَبِّئُكُمْ إِذَا مُزِّقْتُمْ كُلَّ مُمَزَّقٍ إِنَّكُمْ لَفِي خَلْقٍ جَدِيدٍ ﴿٧﴾

8 "అతను (స్వయంగానే) అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదిస్తున్నాడో లేక అతనికి పిచ్చిపట్టిందో (మాకు తెలియదు)!"[17] కాదు, (యదార్థమేమిటంటే) పరలోకంపై నమ్మకం లేనివారు మాత్రమే శిక్షకు, బహుదూరపు అపమార్గానికి లోనై ఉన్నారు.[18]

أَفْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا أَم بِهِ جِنَّةٌ ۗ بَلِ الَّذِينَ لَا يُؤْمِنُونَ بِالْآخِرَةِ فِي الْعَذَابِ وَالضَّلَالِ الْبَعِيدِ ﴿٨﴾

9 ఏమిటీ, వారు తమకు ముందూ, వెనుకా ఉన్న ఆకాశాన్ని, భూమిని చూడటం లేదా?[19] మేము గనక తలచుకుంటే వారిని భూమిలో కూరుకుపోయేలా చేయగలము లేదా వారిపై ఆకాశపు తునకను పడవేయగలము.[20] (మనస్ఫూర్తిగా) మరలే ప్రతి దాసునికి ఇందులో సూచన ఉంది.

أَفَلَمْ يَرَوْا إِلَىٰ مَا بَيْنَ أَيْدِيهِمْ وَمَا خَلْفَهُم مِّنَ السَّمَاءِ وَالْأَرْضِ ۚ إِن نَّشَأْ نَخْسِفْ بِهِمُ الْأَرْضَ أَوْ نُسْقِطْ عَلَيْهِمْ كِسَفًا مِّنَ السَّمَاءِ ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً لِّكُلِّ عَبْدٍ مُّنِيبٍ ﴿٩﴾

13. అంటే పరలోకంపై నమ్మకంలేని వారు పరస్పరం ఈ విధంగా చెప్పుకున్నారు.

14. అంటే మరణించిన తరువాత మీరు మట్టిలో కలసి అణువణువూ వేరైపోయినాక మీ బాహ్య ఉనికి మటుమాయమై పోతుంది కదా! అయినాసరే మీరు మళ్ళీ బ్రతికించబడతారట! మీ శరీరావయవాలు, రూపురేఖలు యథాతథంగా ఉంటాయని ముహమ్మద్ (సఅసం) చెబుతున్నారు!! అని వారు పరస్పరం వెటకారంగా, వేళాకోళంగా చెప్పుకున్నారు.

15. ఈ సమాచారం వింతగా, నమ్మశక్యం కానిదిగా ఉంది కదూ! అతగాడు చెప్పినంత మాత్రాన మనం నమ్మేస్తామని ఎలా అనుకున్నాడు? అన్నది వారి మాటలోని ఉద్దేశం.

16. **'ఆ వ్యక్తి'** అంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) అని భావం.

17. అంటే రెండింటిలో ఏదో ఒకటి ఖచ్చితంగా నిజమై ఉండాలి. 1. అతను చెప్పేది పచ్చి అబద్ధమైనా అయి ఉండాలి 2. లేదా అతనికి మతి చలించి అయినా ఉండాలి. లేకపోతే అతనినోట ఇలాంటి అసంబద్ధమైన మాటలు వెలువడవు అని వాళ్లు చెప్పదలిచారు.

18. అవిశ్వాసుల ప్రేలాపనకు సమాధానంగా అల్లాహ్ ఇలా అంటున్నాడు : "వారి ఊహాగానాలు వాస్తవాలు కావు. వాస్తవం ఏమిటంటే వారు బుద్ధీ వివేచనలకు నోచుకోకుండా పోయారు. వాస్తవాన్ని ఆకళింపు చేసుకునే ఇంగిత జ్ఞానం కూడా వారికి లేదు. తత్కారణంగా వారు పరలోకాన్ని విశ్వసించేబదులు దాన్ని తృణీకరిస్తున్నారు. పర్యవసానంగా వారు శాశ్వతమైన పరలోక శిక్షకు పాత్రులయ్యారు. అపమార్గంలో వారు ఎన్నటికీ తిరిగిరాలేనంత దూరం వెళ్ళి పోయారు."

19. అవిశ్వాసులకు హెచ్చరికగా అవతరించిన ఆయతు ఇది. ఈ ఆయతులో అల్లాహ్ ఏమంటున్నాడంటే, భూమ్యాకాశాల నిర్మాణంపై చింతన చేయకపోవటం వల్లనే వారికి పరలోకంపై నమ్మకం కలగటం లేదు. లేకపోతే ఏమిటీ? సువిశాలమైన, ఊహలకు అందనంత ఎత్తైన ఆకాశాన్ని నిర్మించగలిగినవాడు, పొడవులోనూ వెడల్పులోనూ అద్భుతమైన భూమిని పరచినవాడు తాను సృష్టించిన వస్తువునే మళ్లీ సృష్టించలేడా? శూన్యంలో నుంచి అస్థిత్వాన్ని వెలికితీసే సమర్థుడు, మునుపు ఉన్న వస్తువునే మళ్లీ వెలికితీయలేడా? ఇది ఆయనకు ఏమీ క్లిష్టతరం కాదు.

20. ఇందులో రెండు విషయాలు ఇమిడిఉన్నాయి. 1. దేవుని పరిపూర్ణ సృష్టిని ఈ వాక్యం వ్యక్తపరుస్తోంది. 2. అవిశ్వాసులకు

10 ఇంకా మేము దావూదుకు మా తరఫునుండి గొప్ప అనుగ్రహాన్ని ప్రసాదించాము.[21] "ఓ పర్వతాల్లారా! అతనితో కలసి స్తోత్రగానం చేయండి" (అని ఆజ్ఞాపించాము). పక్షులకు కూడా (ఇదే విధంగా ఆదేశించాము).[22] ఇంకా అతని కొరకు మేము ఇనుమును మెత్తబరచాము.[23]

وَلَقَدْ اٰتَيْنَا دَاوٗدَ مِنَّا فَضْلًا ۗ يٰجِبَالُ اَوِّبِيْ مَعَهٗ وَالطَّيْرَ ۚ وَاَلَنَّا لَهُ الْحَدِيْدَ ﴿10﴾

11 "పరిపూర్ణమైన కవచాలను నిర్మించు.[24] కడియాలను సరిగ్గా–సమతూకంతో – అమర్చు.[25] ఇంకా, మీరంతా సదాచరణ చేయండి.[26] నేను మీరు చేసేదంతా చూస్తున్నాను (అని నమ్మండి)" అని ఆదేశించాము.

اَنِ اعْمَلْ سٰبِغٰتٍ وَّقَدِّرْ فِي السَّرْدِ وَاعْمَلُوْا صَالِحًا ۗ اِنِّيْ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ﴿11﴾

12 ఇంకా – మేము సులైమాను కోసం గాలిని అదుపులో ఉంచాము. దాని ప్రొద్దుటి (ప్రయాణ) గమ్యం ఒక మాసానికి, సాయంత్రపు గమ్యంకూడా ఒక మాసానికి సమానంగా ఉండేది.[27]

وَلِسُلَيْمٰنَ الرِّيْحَ غُدُوُّهَا شَهْرٌ وَّرَوَاحُهَا شَهْرٌ ۚ وَاَسَلْنَا لَهٗ عَيْنَ الْقِطْرِ ۗ وَمِنَ الْجِنِّ مَنْ يَّعْمَلُ

---

ఇందులో హెచ్చరిక ఉంది. భూమ్యాకాశాల నిర్వహణపై తిరుగులేని అధికారం ఉన్న దేవుడు తాను గనక కోరితే తనను ధిక్కరించే వారికి తగిన శాస్తి చేసే నిమిత్తం – ఖారూన్‌ను నేలలో కూర్చివేసినట్లు – వారిని నేలలో అణగదొక్కగలడు. లేదా అయికా ప్రజలను అంతమొందించినట్లుగా ఆకాశం నుంచి తునకలను పడవేసి అంతమొందించగలడు.

21. అంటే; దావూదు (అలైహిస్సలాం)కి దైవదౌత్యం అందజేయటంతో పాటు అతనికి రాజ్యాధికారం కూడా ఇచ్చాము. ఇంకా అనేక సృష్టితాలను అతనికి లోబరచాము.

22. మేము దావూదుకు ప్రసాదించిన అనుగ్రహాలలో అందమైన, మృదుమధురమైన గాత్రం కూడా ఒకటి. ఆయన దైవస్తోత్రం చేయసాగినపుడు పర్వతాల్లాంటి నిశ్చలమైన వస్తువులు కూడా ముగ్ధులై ఆయనతో స్తోత్రగానం చేయటానికి కలిసేవి. ఆకాశంలో ఎగిరే పక్షులు కూడా వంతపాడటానికి ఆగిపోయేవి. మా ఆదేశానుసారం పర్వతాలు, పక్షులు ఈ విధంగా చేసేవి. అంటే పర్వతాలను, పక్షులను మేము ఆయన చెప్పుచేతుల్లో ఉంచాము (ఫత్‌హుల్ ఖదీర్).

23. అంటే ఇనుము (ఉక్కు)ను కాల్చి, సుత్తితో కొట్టి మలిచే ప్రయాస లేకుండానే మెత్తటి మైనంలా, నానబెట్టిన పిండిలా, తొక్కిన అడుసులా అతని కొరకు మార్చివేశాము. అందువల్ల అతను ఎలాంటి ప్రయాస లేకుండానే ఆ లోహంతో సునాయాసంగా ఇనుప కవచాలను తయారు చేయించేవాడు.

24. **"సాబిఘాత్"** (سٰبِغٰتٍ) అంటే పొడవాటి, సంపూర్ణమైన కవచాలు అని అర్థం. యుద్ధంలో పోరాడే యోధులు తమ అవసరాల కనుగుణంగా వాటిని ధరించటానికి అనువుగా ఉండేవి. ఆ విధంగా శత్రువు వేటు నుంచి తమను కాపాడుకోవటానికి ఈ ఇనుప కవచాలు ఎంతగానో దోహదపడేవి.

25. అంటే వాటిని జోడించే లింకులు సరైనవిగా ఉండాలి. అవి మరీ సన్నగా ఉంటే తెగిపోవచ్చు. మరీ గట్టిగా, లావుగా ఉంటే ధరించటానికి ఇబ్బందికరంగా ఉండవచ్చు. అందుకే కవచాల తయారీ పరిశ్రమలో హజ్రత్ దావూద్ (అలైహిస్సలాం)కు ముందుగానే తగు సూచనలు చేయబడ్డాయి.

26. అంటే దేవుని ఈ అపారమైన వరాలకు ప్రతిగా సత్కార్యాలు చేసి దైవానికి కృతజ్ఞతలు చెల్లించాలని దావూద్ జాతి జనులకు హితోపదేశం చేయబడింది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే దేవుడు ఏ జాతివారిపైనయినా ప్రాపంచికంగా కురిపించిన అనుగ్రహాలనుబట్టి వారు ఆ లెక్కన కృతజ్ఞతలు కూడా తెలుపుకోవాలి. కృతజ్ఞతలు తెలుపుకునే పద్ధతుల్లో అత్యుత్తమమైనది అనుగ్రహాల ప్రదాతకు విధేయత చూపటం; ఆయన అవిధేయతకు దూరంగా ఉండటం.

بَيْنَ يَدَيْهِ بِإِذْنِ رَبِّهٖ ؕ وَمَنْ يَّزِغْ مِنْهُمْ عَنْ
أَمْرِنَا نُذِقْهُ مِنْ عَذَابِ السَّعِيْرِ ⑫

ఇంకా మేము అతని కోసం కరిగిన రాగి ఊటను ప్రవహింప జేశాము.[28] ఇంకా – అతని ప్రభువు ఆజ్ఞపై జిన్నులు అతని చెప్పుచేతల్లో ఉండి, అతని ముందర పనిచేసేవి. వారిలో ఎవరు మా ఆజ్ఞలను ఉల్లంఘించినా మేము వాడికి జ్వలించే అగ్ని శిక్షను చవి చూపిస్తాము.[29]

يَعْمَلُوْنَ لَهٗ مَا يَشَآءُ مِنْ مَّحَارِيْبَ وَتَمَاثِيْلَ وَجِفَانٍ
كَالْجَوَابِ وَقُدُوْرٍ رّٰسِيٰتٍ ؕ اِعْمَلُوْٓا اٰلَ دَاوٗدَ شُكْرًا ؕ
وَقَلِيْلٌ مِّنْ عِبَادِيَ الشَّكُوْرُ ⑬

**13** వారు (ఆ జిన్నులు) అతని కోసం అతను కోరినదల్లా చేసి పెట్టేవారు – (ఉదాహరణకు :) ఎత్తయిన కట్టడాలు, ప్రతిమలు, కోనేరుల్లాంటి గంగాళాలు, పొయ్యిలపైనే స్థిరంగా ఉండే దేగిశాలు.[30] "ఓ దావూదు కుటుంబీకులారా! ఇందుకు కృతజ్ఞతగా సదాచరణ చెయ్యండి." నా దాసులలో కృతజ్ఞతాపూర్వకంగా మసలుకునేవారు బహుకొద్దిమంది మాత్రమే.

27. హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) తన రాజ్య సలహాదారులతో, సైన్యంతో సహా రాజ్యపీఠంపై కూర్చుని గాలిని ఆజ్ఞాపించేవారు. ఆయన కోరిన దిశలో గాలి వీచేది. దాని వేగం ఎంత ఉధృతమైనదంటే నెల రోజుల పాటు ప్రయాణం చేసి చేరుకోవలసిన గమ్యాన్ని ఉదయం నుంచి మధ్యాహ్నానికే చేరుకునేలా ఉండేది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రయాణిస్తే మరో నెలరోజుల ప్రయాణానికి సమానంగా ఉండేది. ఈ విధంగా ఒక రోజులో రెండు మాసాల ప్రయాణం అయ్యేది.

28. అంటే దావూద్ (అలైహిస్సలాం) కొరకు లోహాన్ని మెత్తబరచినట్లే దేవుడు సులైమాను (అలైహిస్సలాం) కోసం రాగిని కరిగించి సెలయేరులా ప్రవహింపజేశాడు. రాగి ధాతువుతో అతను కోరిన వస్తువును తయారుచేసుకోవటానికి వీలుగా ఈ సౌకర్యం కల్పించాడు.

29. ఇంతకీ ఈ శిక్ష ఎక్కడ ఉంటుంది? చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయంలో ఈ శిక్ష ప్రళయదినాన విధించబడుతుంది. కాని కొంతమంది విద్వాంసులు దీన్ని ప్రాపంచిక శిక్షగా భావించారు. అల్లాహ్ ఒకానొక దూతను ప్రత్యేకంగా ఇందు నిమిత్తం నియమించాడనీ, ఏ జిన్ను సులైమాను మాటను జవదాటినా, ఆ దైవదూత అగ్ని కొరడాతో అతన్ని వాయించేవాడని, దాంతో ఆ జిన్ను కాలి భస్మీపటలం అయిపోయేవాడని వారు వ్యాఖ్యానించారు (ఫత్హుల్ ఖదీర్).

30. అరబీలో **'మహారీబ్'** (مَحَارِيْب) అని వుంది. ఇది 'మిహ్రాబ్' అనే పదానికి బహువచనం. ఎత్తయిన చోటు లేదా బ్రహ్మాండమైన కట్టడం అని దీని అర్థం. అంటే ఎత్తయిన మేడలు, అద్భుతమైన ఆకాశహర్మ్యాలు, లేదా మస్జిదులు అన్నమాట! ప్రతిమలు కూడా నిర్మించబడేవి. ప్రవక్తల, సంస్కర్తల ప్రతిమలు లేదా చిత్రాలు వేసి మస్జిదులలో ప్రతిష్ఠించబడేవని, ప్రజలు వాటిని చూసి ఆరాధన చేసేవారని కొంతమంది అభిప్రాయపడ్డారు. హజ్రత్ సులైమాన్ గారి షరీయతులో చిత్రాల, ఆకారాల రూపకల్పనకు అనుమతి ఇవ్వబడిందన్న విషయాన్ని సూత్రప్రాయంగా ఒప్పుకున్నప్పుడే ఈ భావం స్వీకారయోగ్యం కాగలుగుతుంది. కాని ఇది సరైనది కాదు. ఇస్లాంలో విగ్రహాల, ప్రతిమల ప్రతిష్ఠాపన చాలా గట్టిగా వారించబడింది.

హజ్రత్ సులైమాన్ (అలైహి) హయాంలో సరస్సులు, తటాకాలంతటి గంగాళాలు, కంచాలు కూడా తయారుచేయబడేవి. ఇక దేగిశాల సంగతి సరేసరి. కొండలను తొలచి వాటినే దేగిశాలుగా చేసేవారు. వాటిని ఒక చోటినుంచి వేరొకచోటికి తరలించటం సంభవం కాదు. అందుచేత అవి ఒకేచోట స్థిరంగా ఉండేవి. ఆ దేగిశాలలో వేలాది మంది జనులకు సరిపోయే భోజనం ఒకేసారి తయారు చేయబడేది. అసాధారణమైన ఈ పనులన్నీ జిన్నుల సమూహం చేసిపెట్టేది.

14 మరి మేము అతనిపై మరణ శాసనాన్ని అమలు పరచి నప్పుడు, అతని చేతికర్రను తింటూవున్న చీడ పురుగు తప్ప వేరెవరూ అతని చావు కబురును వారికి (జిన్నులకు) తెలియ పరచలేదు. మరి అతను (సులైమాను) పడిపోయినప్పుడు, తమకే గనక రహస్య విషయాల జ్ఞానం ఉండి ఉంటే ఇంతటి అవమాన కరమైన యాతనకు లోనయ్యేవారం కాము అని జిన్నులు తెలుసు కున్నారు.[31]

فَلَمَّا قَضَيْنَا عَلَيْهِ الْمَوْتَ مَا دَلَّهُمْ عَلَىٰ مَوْتِهِ إِلَّا
دَابَّةُ الْأَرْضِ تَأْكُلُ مِنسَأَتَهُ ۖ فَلَمَّا خَرَّ تَبَيَّنَتِ
الْجِنُّ أَن لَّوْ كَانُوا يَعْلَمُونَ الْغَيْبَ مَا لَبِثُوا فِي
الْعَذَابِ الْمُهِينِ ﴿١٤﴾

15 సబా జాతి వారి కొరకు వారి నివాస స్థలంలోనే (దైవ శక్తికి సంబంధించిన) ఒక సూచన ఉండేది.[32] వారికి కుడి వైపునా, ఎడమ వైపునా రెండు తోటలుండేవి.[33] "మీ ప్రభువు ప్రసాదిం చిన ఉపాధిని తినండి,[34] ఆయనకు కృతజ్ఞులై ఉండండి"[35] (అని మేము వారికి సూచించి ఉన్నాము). పట్నమేమో ఉత్తమమైనది,[36] ప్రభువేమో మన్నించేవాడు.[37]

لَقَدْ كَانَ لِسَبَإٍ فِي مَسْكَنِهِمْ آيَةٌ ۖ جَنَّتَانِ
عَن يَمِينٍ وَشِمَالٍ ۖ كُلُوا مِن رِّزْقِ رَبِّكُمْ
وَاشْكُرُوا لَهُ ۚ بَلْدَةٌ طَيِّبَةٌ وَرَبٌّ غَفُورٌ ﴿١٥﴾

31. జిన్నులకు రహస్య విషయాల (అగోచరాల) జ్ఞానం ఉంటుందన్న విషయం హ|జ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) కాలంలో నలువైపులా వ్యాపించింది. ఇదొక వదంతి, మూఢనమ్మకం తప్ప మరేమీ కాదని అల్లాహ్ సులైమాన్ (అలైహిస్సలాం) మరణం ద్వారా తేటతెల్లం చేశాడు.

32. **'సబా'** అనేది ఒక జాతి పేరు. ఈ జాతి ప్రజలకు రాణిగా ఉన్న మహిళ(బిల్ఖీస్) హ|జ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) కాలంలోనే ఇస్లాం స్వీకరించింది. ఆ దేశం పేరు కూడా 'సబా'గానే ఉండేది. ప్రస్తుతం ఆ ప్రదేశం 'యమన్'గా పిలువబడుతోంది. అప్పట్లో ఆ దేశం సస్యశ్యామలంగా ఉండి, సిరిసంపదలతో తులతూగేది. వర్తకంలో ఎంతో ముందంజ వేసింది. వ్యవసాయ రంగంలో, తోటల పెంపకంలో ఆ దేశం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఈ సిరిసంపదలనే దైవకటాక్షంగా పేర్కొనటం జరిగింది.

33. ఆ నగరానికి ఇరువైపులా పర్వతశ్రేణులుండేవి. తత్కారణంగా పర్వత కనుమల నుండి, కాలువల నుండి వర్షపు నీరు పరవళ్ళు తొక్కుతూ నగరం వైపుకు వచ్చేది. ఆ నగర పాలకులు పర్వతాల దగ్గర ఆనకట్టలు నిర్మించి, ఎత్తిపోతల పథకాలను అమలుపరచి జల వనరులను సద్వినియోగం చేసుకునేవారు. తమ అవసరాల కనుగుణంగా తోటలను పెంచారు. ఆ విధంగా నీటి సరఫరా పథకం విజయవంతమైంది. పంటలు పుష్కలంగా పండేవి. వారు పెంచిన ఆ తోటల సముదాయాన్నే కుడి ఎడమల తోటలుగా వ్యవహరించేవారు (నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఉన్న కుడి కాలువ, ఎడమ కాలువ మాదిరిగా).

**'జన్నతాన్'** (جَنَّتٰنِ) అంటే రెండు తోటలని అర్థం కాదనీ, వాస్తవానికి అవి అసంఖ్యాకమైన తోటల రెండు సముదాయా లనీ, ఎంతవరకు దృష్టిని సారించినా పచ్చని తోటలతో, పచ్చికలతో ఆ ప్రాంతం కళకళలాడుతున్నట్లు కనిపించేదని మరికొంత మంది పేర్కొన్నారు (ఫత్హుల్ ఖదీర్).

34. దేవుడు తన ప్రవక్తల ద్వారా ఆ జాతి వారికి అందజేసిన మాటలివి. అంటే వారికి వొసగబడిన అపారమైన అనుగ్రహాలను జ్ఞాపకం చేసి, వారు ఏవిధంగా మసలుకోవాలో తాకీదు చేయటం జరిగింది.

35. ఉపకారానికి బదులు ఉపకారమే కాగలదు. కాబట్టి మహోపకారం చేసిన వానికి కృతజ్ఞులై ఉండటం న్యాయం. ఆయన అవిధేయతకు దూరంగా ఉండటం ధర్మం.

36. అంటే అక్కడి తోటల మూలంగా, అక్కడ పండే పండ్లు ఫలాల కారణంగా ఆ నగరం ఎంతో అందమైన నగరంగా

**16** కాని వారు వైముఖ్య ధోరణిని అవలంబించారు. మేము వారిపై ఉధృతమైన వరద (నీరు)ను పంపాము. ఇంకా మేము వారి (నవనవలాడే) తోటలను రెండు (నాసిరకపు) తోటలుగా మార్చివేశాము. వాటి పండ్లు వగరుగా ఉండేవి. (అందులో ఎక్కువగా) ఝూవుక వృక్షాలు, కొన్ని రేగి చెట్లు ఉండేవి.[38]

فَأَعْرَضُوا فَأَرْسَلْنَا عَلَيْهِمْ سَيْلَ الْعَرِمِ وَبَدَّلْنَاهُم بِجَنَّتَيْهِمْ جَنَّتَيْنِ ذَوَاتَيْ أُكُلٍ خَمْطٍ وَأَثْلٍ وَشَيْءٍ مِّن سِدْرٍ قَلِيلٍ ﴿16﴾

**17** వారి కృతఘ్నుతా వైఖరికి బదులుగా మేము ఇచ్చిన ప్రతిఫలం (శిక్ష) ఇది! మా మేళ్ళను మరచిన వారికి మేము ఇలాంటి (కఠిన) శిక్షనే విధిస్తాము.

ذَٰلِكَ جَزَيْنَاهُم بِمَا كَفَرُوا ۖ وَهَلْ نُجَازِي إِلَّا الْكَفُورَ ﴿17﴾

**18** మరి మేము వారికీ – మేము శుభాలు ప్రోదిచేసి ఉంచిన పట్టణాలకూ మధ్య దారిలో కానవచ్చే మరికొన్ని జనపదాలను కూడా ఉంచాము.[39] వాటి మధ్య ప్రయాణ మజిలీలను కూడా మేము తగురీతిలో నిర్ధారించాము.[40] "రేయింబవళ్ళు సురక్షితంగా వాటిలో సంచరిస్తూ ఉండండి" (అని వారికి సూచించాము).[41]

وَجَعَلْنَا بَيْنَهُمْ وَبَيْنَ الْقُرَى الَّتِي بَارَكْنَا فِيهَا قُرًى ظَاهِرَةً وَقَدَّرْنَا فِيهَا السَّيْرَ ۖ سِيرُوا فِيهَا لَيَالِيَ وَأَيَّامًا آمِنِينَ ﴿18﴾

విలసిల్లేది. అక్కడ వీచే ఆరోగ్యవంతమైన గాలులవల్ల ఆ నగరంలో క్రిమికీటకాలు, దోమలు, విషపురుగులు కూడా ఉండేవి కావని అనబడుతోంది. నిజము దేవుడెరుగు.

37. అంటే మీరు గనక కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరిస్తే మీ అనుగ్రహాలు మరింతగా వికసిస్తాయి. మీ తప్పులను దేవుడు మన్నిస్తాడు.

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే మానవుడు నిత్యం ప్రభువు సన్నిధిలో పశ్చాత్తాపం చెందుతూ, క్షమాభిక్ష కోసం వేడుకుంటూ ఉండాలి. దీనివల్ల అతడు ప్రకృతి వైపరీత్యాలకు గురికాకుండా ఉంటాడు, అతనికి ప్రాప్తమై ఉన్న దైవానుగ్రహాలు సురక్షితంగా ఉంటాయి. ఎందుకంటే దేవుడు క్షమించటాన్ని ఎంతగానో ఇష్టపడతాడు.

38. అంటే జల ఒనరులను సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతో వారు రెండు పర్వత శ్రేణులకు మధ్య నిర్మించుకున్న ఆనకట్టను, చప్టాలను కూలదోసే ఉధృతమైన వరదను మేము వారిపైకి పంపాము. తత్ఫలితంగా వారి మేలు జాతి వృక్షాలు, తీగలన్నీ ముంపుకు గురయ్యాయి. వాటి స్థానంలో కలుపు మొక్కలు పుట్టుకువచ్చాయి. ముళ్ల వృక్షాలు దట్టంగా పెరిగాయి. వాటికి పండ్లు కాచేవికావు. ఒకవేళ అక్కడక్కడా పండ్లు ఫలాలు కాచినా అవి చేదుగా, వగరుగా ఉండేవి. కాకపోతే అక్కడక్కడా కొన్ని రేగిచెట్లు కూడా మొలిచాయి. ఆ చెట్లకు కూడా ముళ్లు అధికంగా ఉండేవి. పండ్లు మాత్రం తక్కువగా ఉండేవి. ఇకపోతే మేము పంపిన ఆ వరదనీరు గండ్లను త్రెంచి నగరంలో కూడా చొచ్చుకువచ్చింది. దాంతో వారి కడగండ్లు పెరిగిపోయాయి. వారి నివాసగృహాలు మునిగిపోయాయి. ఇండ్ల ముందున్న పెరట్లు, వనాలన్నీ కొట్టుకుపోయాయి. ఇది దేవుని తరఫున పంపబడిన ఆపదగా సుప్రసిద్ధమైంది. **'అరిమున్'** అంటే 'ఆనకట్ట' అని అర్థం.

39. శుభాలతో కూడుకున్న పట్టణాలంటే సిరియా పట్టణాలని భావం. అంటే – మేము సబా దేశానికి – సిరియాకు మధ్య రహదారి గుండా అనేక పల్లెసీమలను వసింపజేశాము. ఈ పల్లెటూళ్ళ సంఖ్య నాలుగువేల ఏడు వందల వరకూ ఉంటుందని కొంతమంది వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. అది వాణిజ్య మార్గం అయినందువల్ల జనుల రాకపోకలతో నిత్యం కళకళలాడుతూ ఉండేది. అందుచేత వారు అన్నపానీయాల కోసం ప్రయాణ సందర్భంగా అంతగా బాధపడాల్సి

**19** కాని వారు, "మా ప్రభూ! మా ప్రయాణ మజిలీల దూరా
లను పెంచు"[42] అని అన్నారు. వారు తమకు తామే అన్యాయం
చేసుకున్నందువల్ల మేము వారిని (పూర్వ) గాథలుగా మార్చి
వేశాము.[43] వారిని పూర్తిగా చిందరవందర చేసి వేశాము.[44]
నిశ్చయంగా సహనం వహించి కృతజ్ఞతలర్పించే ప్రతి ఒక్కరికీ
ఇందులో (ఈ వృత్తాంతంలో) ఎన్నో సూచనలున్నాయి.

فَقَالُوا رَبَّنَا بٰعِدْ بَيْنَ أَسْفَارِنَا وَظَلَمُوا أَنْفُسَهُمْ فَجَعَلْنٰهُمْ أَحَادِيثَ وَمَزَّقْنٰهُمْ كُلَّ مُمَزَّقٍ ۚ إِنَّ فِي ذٰلِكَ لَآيٰتٍ لِكُلِّ صَبَّارٍ شَكُورٍ ﴿19﴾

**20** వారి విషయంలో తాను ఊహించినది నిజమని షైతాను
నిరూపించాడు. విశ్వాసులకు చెందిన ఒక సమూహం తప్ప
మిగిలిన జనులంతా వాడిని అనుసరించారు.

وَلَقَدْ صَدَّقَ عَلَيْهِمْ إِبْلِيسُ ظَنَّهُ فَاتَّبَعُوهُ إِلَّا فَرِيقًا مِنَ الْمُؤْمِنِينَ ﴿20﴾

**21** నిజానికి షైతానుకు వారిపై ఎలాంటి అధికారం లేకుండింది.
కాని పరలోకాన్ని విశ్వసించేవారిని మేము పరలోకంపట్ల
సంశయానికి గురైన వారినుంచి వేరుపరచటానికి ఇలా చేశాము.
నీ ప్రభువు ప్రతి విషయాన్నీ కనిపెట్టుకుని ఉన్నాడు.

وَمَا كَانَ لَهُ عَلَيْهِمْ مِنْ سُلْطٰنٍ إِلَّا لِنَعْلَمَ مَنْ يُؤْمِنُ بِالْآخِرَةِ مِمَّنْ هُوَ مِنْهَا فِي شَكٍّ ۗ وَرَبُّكَ عَلَىٰ كُلِّ شَيْءٍ حَفِيظٌ ﴿21﴾

---

వచ్చేది కాదు. రహదారి నిర్మానుష్యంగా ఉన్నప్పుడు దారి దోపిడీలు, హత్యలు జరిగే ప్రమాదం ఉంటుంది. కాని వీళ్ళకు అలాంటి భయంగానీ, బెడదగానీ ఉండేది కాదు.

40. అంటే ఒక జనవాసానికీ – మరో జనవాసానికీ మధ్య ఎన్ని మైళ్ళ అంతరం ఉందో వారికి తెలిసి ఉండేది. దాని కనుగుణంగా వారు తమ ప్రయాణవేళలను ముందుగా నిర్ధారించేవారు. తమ ప్రయాణ సామగ్రిని సమకూర్చుకునేవారు. ఉదాహరణకు: ఉదయం ఒక చోటినుంచి బయలుదేరుతున్నప్పుడు మధ్యాహ్నానికల్లా ఫలానా పల్లెసీమ వరకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ మజిలీకి చేరుకునేవారు. అక్కడ మధ్యాహ్న భోజనం చేసి, కాస్సేపు మేను వాల్చి, మళ్లీ బయలుదేరేవారు. రాత్రిపూట మరో చోట బస చేసేవారు.

41. రేయింబవళ్ళలో ఏ సమయంలో మీరు ప్రయాణం చేసినా మీ ప్రాణాలకు, మీ వర్తక సామగ్రికి ఎలాంటి హాని కలుగదని అభయమివ్వబడింది.

42. కాని వారు సాహసకృత్యాలకు పూనుకున్నారు. తమకు సుదీర్ఘ ప్రయాణాలు కావాలని, దారిలో పొంచి ఉన్న ప్రమాదాలను ఎదుర్కోవటానికి తమకెలాంటి అభ్యంతరం లేదని వారు దైవాన్ని వేడుకున్నారు. జనసమృద్ధి గల రహదారి గుండా సాగిపోవటం కన్నా జన సంచారం లేని కటిక ఎడారుల, అరణ్యాల గుండా పయనించటమే తమ కిష్టమని వారు విన్నవించుకున్నారు. ఏ ప్రయాసా లేకుండా హాయిగా ప్రయాణించటం కన్నా వేసవి తాపానికి, చలి తీవ్రతకు తట్టుకుంటూ, ఆకలి దప్పులను సహిస్తూ ప్రయాణం చేయటంలోనే తమకు హాయి ఉందని కోరారు. వారి ఈ ప్రార్థన బనీ ఇస్రాయీల్ ప్రార్థన లాంటిది. ఎంచక్కా హాయిగా మన్–సల్వా ఆహార పదార్థాలను తిని కృతజ్ఞతలు తెలుపమని దేవుడు ఇస్రాయీల్ సంతతి వారితో చెప్పగా తమకు కూరగాయలు, వెల్లుల్లి తదితర వస్తువులు కావాలని డిమాండు చేసి ఇరకాటంలో పడినట్లుగా వీళ్లు కూడా సౌఖ్యాలకు బదులు కష్టాలను కోరారు.

43. అంటే వారిని గురించి భావితరాల వారు కథలు కథలుగా చెప్పుకునే విధంగా దేవుడు వారిని దారుణంగా తుడిచిపెట్టేశాడు.

44. అంటే వారిని చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురు చేసేశాడు. ఈ కారణంగా సబా ప్రాంతానికి చెందిన

22 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : అల్లాహ్‌ను వదలి మీరు ఎవరెవరినయితే ఊహించుకుంటున్నారో వారందరినీ పిలిచి చూడండి.[45] భూమ్యాకాశాలలో వారికి రవంత అధికారంగానీ,[46] వాటిలో వారికి ఎలాంటి వాటాగానీ లేదు.[47] వారిలో ఏ ఒక్కడూ అల్లాహ్‌కు సహాయకుడు కూడా కాడు.[48]

قُلِ ادْعُوا الَّذِينَ زَعَمْتُم مِّن دُونِ اللَّهِ ۖ لَا يَمْلِكُونَ مِثْقَالَ ذَرَّةٍ فِي السَّمَاوَاتِ وَلَا فِي الْأَرْضِ وَمَا لَهُمْ فِيهِمَا مِن شِرْكٍ وَمَا لَهُ مِنْهُم مِّن ظَهِيرٍ ﴿٢٢﴾

23 ఆయన వద్ద–ఆయన అనుమతించిన వారి కొరకు తప్ప[49]–(ఒకరి) సిఫారసు (ఇంకొకరికి) ఏమాత్రం ఉపకరించదు. తుదకు వారి హృదయాలలోని ఆందోళన తొలగించబడిన తరువాత, "ఇంతకీ మీ ప్రభువు సెలవిచ్చినదేమిటి?" అని అడుగుతారు. "సత్యమే పలికాడు.[50] ఆయన మహోన్నతుడు, ఘనాఘనుడు" అని వారు చెబుతారు.

وَلَا تَنفَعُ الشَّفَاعَةُ عِندَهُ إِلَّا لِمَنْ أَذِنَ لَهُ ۚ حَتَّىٰ إِذَا فُزِّعَ عَن قُلُوبِهِمْ قَالُوا مَاذَا قَالَ رَبُّكُمْ ۖ قَالُوا الْحَقَّ ۖ وَهُوَ الْعَلِيُّ الْكَبِيرُ ﴿٢٣﴾

---

సుప్రసిద్ధ తెగలు వివిధ ప్రదేశాలకు వెళ్ళి స్థిరపడ్డాయి. కొన్ని తెగలు యస్రిబ్, మక్కాలకు తరలివెళ్ళగా, మరికొన్ని తెగలు సిరియా క్షేత్రానికి వలసపోయాయి. ఇంకొన్ని తెగలు ఇతర దేశాలకు వెళ్ళిపోయాయి.

45. ఊహించుకోవటమంటే దైవాలుగా తలపోయటమని భావం. అంటే అల్లాహ్‌ను కాదని మీరు ఆరాధ్య దైవాలుగా భావిస్తున్న వాటిని పిలిచి చూడండి. మీ పిలుపు విని మీ అక్కరలను తీర్చే శక్తి ఎవరికీ లేదు.

46. వారికి లాభం చేకూర్చటంపైగానీ, నష్టం చేకూర్చటంపైగానీ ఎలాంటి అధికారం లేదు. భూమ్యాకాశాల మధ్య నున్న వ్యవస్థలో వారికెలాంటి భాగస్వామ్యం లేదు.

47. సృష్టి ప్రక్రియలోగానీ, యాజమాన్యంలోగానీ, అధికారాల వినియోగంలోగానీ ఈ బూటకపు దేముళ్ళకు ఎలాంటి వాటా లేదు.

48. ఈ విశ్వవ్యవస్థను నడపటంలో ఏ ఒక్కడూ అల్లాహ్‌కు తోడ్పడటం లేదు. ఆయనకు ఎవరి తోడ్పాటూ అక్కర లేదు. ఆయన తిరుగులేని ఏకైక సార్వభౌముడు. ఒకరి సహాయ సహకారాలతో నిమిత్తం లేకుండానే ఆయన ఈ జగతిని నడుపుతున్నాడు.

49. **"ఆయన అనుమతించినవారు"** అంటే దైవసందేశహరులు, దైవదూతలు అన్నమాట! వారు మాత్రమే దేవుని అనుమతితో ఎవరికోసమైనా సిఫారసు చేయగలరు. వేరెవరికీ సిఫారసు చేసే అనుమతి ఉండదు. ఎందుకంటే వేరితరుల సిఫారసు ఇతరుల కొరకు ప్రయోజనకరం కాజాలదు. ఈ వాక్యానికి రెండవ అర్థం ఇది : సిఫారసుకు హక్కుదారులైన వారికి మాత్రమే సిఫారసు వర్తిస్తుంది. అంటే దైవప్రవక్తలు, దైవదూతలు, సజ్జనులు అయినవారు సిఫారసుకు పాత్రులైన (అనుమతించబడిన) వారి కొరకే సిఫారసు చేయగలుగుతారు గాని అందరికోసం కాదు (ఫత్‌హుల్ ఖదీర్). అంటే దైవప్రవక్తలు, దైవదూతలు, సత్పురుషులు మినహా అక్కడ ఎవరి సిఫారసు కూడా ఆమోదించబడదు. ఒకవేళ వారు సిఫారసు చేసినా విశ్వాసుల్లోని పాపాత్ముల మన్నింపు కోసం సిఫారసు చేయగలరే తప్ప అవిశ్వాసుల కోసం, అవిధేయుల కోసం, బహుదైవారాధకుల కోసం చేయలేరు. ఈ విషయాన్నే దివ్య ఖుర్‌ఆన్ వేరొక చోట ఈ రెండు అంశాలను కూడా ప్రస్తావించింది: 1."ఆయన సమక్షంలో ఆయన అనుమతి లేకుండా సిఫారసు చెయ్యగల వాడెవడు?" (అల్ బఖర – 255). 2. "సిఫారసు వినటానికి అల్లాహ్ ఇష్టపడిన వాని విషయంలో తప్ప వారు ఎవరి గురించీ సిఫారసు చేయలేరు" (అల్ అంబియా – 28).

50. ఈ వాక్యానికి పలువురు పలురకాల వ్యాఖ్యానాలు చేశారు. ఇబ్నె జరీర్, ఇబ్నె కసీర్ ప్రభృతులు హదీసు వెలుగులో ఈ ఆయతుకు చెప్పిన భాష్యం ఇలా ఉంది– "అల్లాహ్ ఏదేని విషయంపై మాట్లాడినప్పుడు ఆకాశంలో ఉన్న

24 “ఆకాశాల నుంచి, భూమినుంచీ మీకు ఉపాధిని సమకూర్చే వాడెవడు?” అని వారిని అడుగు. ‘అల్లాహ్‌యే’ అని వారికి చెప్పు. “మరయితే (వినండి) మేమో లేక మీరో నిశ్చయంగా సన్మార్గం లోనయినా ఉన్నాము లేదా స్పష్టమైన మార్గభ్రష్టతకైనా లోనై ఉన్నాము”[51] (అని చెప్పండి).

قُلْ مَنْ يَرْزُقُكُمْ مِنَ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۭ قُلِ اللّٰهُ ۙ وَاِنَّآ اَوْ اِيَّاكُمْ لَعَلٰى هُدًى اَوْ فِيْ ضَلٰلٍ مُّبِيْنٍ ﴿24﴾

25 “మేము చేసిన తప్పులను గురించి మిమ్మల్ని ప్రశ్నించటం గానీ, మీ కర్మలను గురించి మమ్మల్ని ప్రశ్నించటంగానీ జరగదు” అని వారికి చెప్పు.

قُلْ لَّا تُسْـَٔلُوْنَ عَمَّآ اَجْرَمْنَا وَلَا نُسْـَٔلُ عَمَّا تَعْمَلُوْنَ ﴿25﴾

26 “మన ప్రభువు మనందరినీ సమావేశపరచి ఆ తరువాత మన మధ్య సత్యబద్ధంగా తీర్పుచేస్తాడు.[52] ఆయన తీర్పులు చేసేవాడు, సర్వం తెలిసినవాడు” అని చెప్పు.

قُلْ يَجْمَعُ بَيْنَنَا رَبُّنَا ثُمَّ يَفْتَحُ بَيْنَنَا بِالْحَقِّ ۭ وَهُوَ الْفَتَّاحُ الْعَلِيْمُ ﴿26﴾

27 “సరే, మీరు అల్లాహ్‌కు భాగస్వాములుగా ఖరారు చేసి, ఆయనతో కలుపుతున్నటువంటి వారిని కాస్త నాక్కూడా చూపించండి! అలాంటి వారెవరూ లేరు.[53] వాస్తవానికి ఆయనే అల్లాహ్–సర్వాధిక్యుడు, వివేక సంపన్నుడు” అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

قُلْ اَرُوْنِيَ الَّذِيْنَ اَلْحَقْتُمْ بِهٖ شُرَكَاۗءَ كَلَّا ۭ بَلْ هُوَ اللّٰهُ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿27﴾

28 (ఓ ముహమ్మద్!) మేము నిన్ను సమస్త జనులకు శుభవార్తను అందజేసే వానిగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము. అయితే జనులలో అధికులకు ఈ విషయం తెలియదు.[54]

وَمَآ اَرْسَلْنٰكَ اِلَّا كَاۗفَّةً لِّلنَّاسِ بَشِيْرًا وَّنَذِيْرًا وَّلٰكِنَّ اَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُوْنَ ﴿28﴾

---

దైవదూతలు భయంతో వణికిపోతారు. ఒక్కోసారి వారు స్పృహ కోల్పోతారు. స్పృహలోకి వచ్చిన తరువాత, ‘ప్రభువు చెప్పినదేమిటీ?’ అని అడుగుతారు. ప్రభువు చెప్పినదేమిటో అర్ష్ (సింహాసనం) వద్ద ఉన్న దైవదూతలు వారికి వివరిస్తారు. వారేమో తమ క్రిందనున్న వారికి ఈ సంగతి తెలియజేస్తారు. ఈ విధంగా ఈ సంగతి మొదటి (క్రింద) ఆకాశంలో ఉండే దైవదూతల వరకూ చేరుతుంది. (ఇబ్నె కసీర్).

51. భూమ్యాకాశాల నుంచి ఉపాధిని సమకూర్చలేకపోయే వారిని దేముళ్ళుగా నమ్మేవారే వాస్తవానికి దుర్మార్గంలో పడి ఉన్నారు. ఎందుకంటే వారు కొలిచే దైవాలు వర్షాన్ని కురిపించటంగానీ, పంటల్ని పండించటంగానీ చేయలేవు. అందువల్ల ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధించేవారే ముమ్మాటికీ సన్మార్గాన ఉన్నారు.

52. అంటే వారి కర్మలనుబట్టి ప్రతిఫలం వొసగుతాడు. సత్కార్యాలు చేసిన వారికి బహుమానంగా స్వర్గంలో ప్రవేశం కల్పిస్తాడు. దుష్కార్యాలు చేసిన వారికి శిక్షగా నరకానికి ఆహుతి చేస్తాడు.

53. అంటే ఆ నిజదైవాన్ని పోలినవాడుగానీ, ఆయనతో సరితూగేవాడు గానీ జగతిలో ఎవడూ లేడు. ఆ అల్లాహ్ మాత్రమే సర్వోన్నతుడు, శక్తిమంతుడు. ఆయన చేసే ప్రతి పనీ, ఆయన సెలవిచ్చిన ప్రతి వాక్కూ వివేచనతో నిండి ఉంది.

54. ఈ ఆయతులో అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (సఅసం) ప్రభవనంలోని విశ్వజనీన, సార్వజనీన కోణాన్ని విశదీకరించాడు.

29 “నువ్వు సత్యవంతుడవే అయితే ఆ వాగ్దానం ఎప్పుడు సంభవిస్తుందో చెప్పు?”[55] అని వారంటున్నారు.

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا الْوَعْدُ إِن كُنتُمْ صَادِقِينَ ﴿٢٩﴾

30 “వాగ్దాన దినం ఖచ్చితంగా నిర్ధారితమై ఉంది. దానికన్నా ఒక ఘడియ కూడా మీరు వెనక్కి జరగలేరు, ముందుకు పోలేరు”[56] అని వారికి చెప్పు.

قُل لَّكُم مِّيعَادُ يَوْمٍ لَّا تَسْتَأْخِرُونَ عَنْهُ سَاعَةً وَلَا تَسْتَقْدِمُونَ ﴿٣٠﴾

1. ఆయన (స) సమస్త మానవజాతి కోసం మార్గదర్శకునిగా, ఉపదేశకునిగా చేసి పంపబడ్డారు. 2. దైవప్రవక్త (సఅసం) ఎంతగా అభిలషించినా, మరెంతగా కృషిచేసినా జనులందరూ విశ్వాస భాగ్యానికి నోచుకోరు. ఈ రెండు విషయాలను విడమరచి చెప్పే మరెన్నో ఆయతులు దివ్య ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. ఉదాహరణకు :

1. ఆయన (స) దైవదౌత్యాన్ని గురించి వివరిస్తూ ఇలా అనబడింది : “(ఓ ముహమ్మద్!) ఈ విధంగా చెప్పు : “నేను మీ అందరి వైపునకు వచ్చిన దైవప్రవక్తను....” (అల్ ఆరాఫ్ – 158)

2. “సమస్త లోకవాసులను హెచ్చరించే నిమిత్తం గీటురాయి (ఖుర్‌ఆన్)ని తన దాసునిపై అవతరింపజేసినవాడు ఎంతో శుభకరుడు.” (ఫుర్ఖాన్ – 1)

ఒక హదీసులో మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఈ విధంగా ప్రవచించారు: నాకు పూర్వం ఏ ప్రవక్తకూ ఇవ్వబడని ఐదు విషయాలు నాకు మాత్రమే ఇవ్వబడ్డాయి – 1. నెల రోజుల (ప్రయాణం చేస్తే తరిగే) దూరంపై శత్రువు గుండెలో నా పట్ల దడ పుట్టించబడింది. 2. భూభాగమంతా నా కొరకు మస్జిద్‌గా, పవిత్రంగా చేయబడింది. ఎక్కడ నమాజ్ వేళ అయితే అక్కడే నా అనుచర సమాజం వారు నమాజు చేసుకోవాలి. 3. విజయప్రాప్తి (మాలె గనీమత్) నా కొరకు ధర్మసమ్మతం చేయబడింది. నాకు పూర్వం ఎవరి కోసం కూడా అది హలాల్‌గా ఉండేది కాదు. 4. నాకు (ప్రళయదినాన) సిఫారసు చేసే హక్కు ఇవ్వబడింది. 5. పూర్వం ఏ ప్రవక్త అయినా తన జాతి ప్రజల వద్దకు మాత్రమే పంపబడేవాడు. కాని నేను మాత్రం ప్రపంచంలోని సమస్త జనుల కోసం ప్రవక్తగా పంపబడ్డాను (సహీహ్ బుఖారీ – కితాబుత్ తయమ్ముమ్; సహీహ్ ముస్లిం – కితాబుల్ మసాజిద్). మరో హదీసులో “నేను తెల్లవారికోసం, నల్లవారికోసం కూడా ప్రభవింపజేయబడ్డాను” అని ఆయన (స) చెప్పారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ మసాజిద్). తెల్లవారు– నల్లవారు అంటే ‘జిన్నులు – మానవులు’ అని కొందరు అభిప్రాయపడగా, ‘అరబ్బులు – అరబ్బేతరులు’ అని మరికొందరు వ్యాఖ్యానించారు. రెండు అభిప్రాయాలు కూడా సరైనవేనని ఇమామ్ ఇబ్నె కసీర్ అన్నారు.

“జనులలో అత్యధికులు దీన్ని అర్థం చేసుకోరు” అనే వాక్యాన్ని పోలిన మరికొన్ని ఆయతులు ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. ఉదాహరణకు : 1. “(ఓ ముహమ్మద్ – సఅసం!) నువ్వు ఎంత కోరుకున్నా వారిలో చాలామంది విశ్వసించరు.” (యూసుఫ్ – 103). 2. “ఓ ముహమ్మద్ (సఅసం)! నువ్వు భూవాసుల్లోని అత్యధికులను అనుసరించావంటే వారు నిన్ను అల్లాహ్ మార్గం నుంచి తప్పిస్తారు సుమా!” (అల్ అన్ఆమ్ – 116).

పై వాక్యాల ద్వారా అవగతమయ్యేదేమిటంటే ప్రపంచ జనులలో అత్యధికులు అపమార్గానికి లోనై ఉంటారు.

55. సత్యతిరస్కారులు ప్రళయదినాన్ని నమ్మేవారు కారు. పైగా అలాంటి ఒక ఘడియ అసంభవం అని వారు తెగేసి చెప్పేవారు. అందుకే ఈ వాక్యంలో వారు ఎగతాళి చేస్తూ ప్రశ్నించారు.

56. అంటే ప్రళయదినం రావటం అనేది తథ్యం. ఆ సమయాన్ని అల్లాహ్ నిర్ధారించి ఉన్నాడు. నిర్ధారిత సమయానికి ఆ వాగ్దానం నెరవేరి తీరుతుంది. ఆ ఘడియ వచ్చేసినపుడు మీరు ఎంతగా గింజుకున్నా ఒక్క క్షణం అటూ ఇటూ జరగదు. “నిశ్చయంగా అల్లాహ్ వాగ్దాన సమయం వచ్చేసినపుడు, అది తొలగటం అనేది ఉండదు” (నూహ్ – 4).

**31** “మేము ఈ ఖుర్‌ఆన్‌నుగానీ, దీనికి పూర్వం వచ్చిన గ్రంథాలనుగానీ ఎట్టి పరిస్థితిలోనూ నమ్మము”[57] అని అవిశ్వాసులు అంటున్నారు. ఈ దుర్మార్గులు తమ ప్రభువు ఎదుట నిలబెట్టబడి, వారు ఒండొకరిని నిందించుకుంటున్నప్పుడు[58] నువ్వు చూస్తే ఎంత బాగుంటుంది! బలహీనులు పెద్దలమనుకున్న వారినుద్దేశించి,[59] “మీరే గనక లేకుండా ఉంటే మేము విశ్వాసులమై ఉండేవారం”[60] అని అంటారు.

وَقَالَ الَّذِينَ كَفَرُوا لَن نُّؤْمِنَ بِهَٰذَا الْقُرْآنِ وَلَا
بِالَّذِي بَيْنَ يَدَيْهِ ۗ وَلَوْ تَرَىٰ إِذِ الظَّالِمُونَ مَوْقُوفُونَ
عِندَ رَبِّهِمْ يَرْجِعُ بَعْضُهُمْ إِلَىٰ بَعْضٍ الْقَوْلَ
يَقُولُ الَّذِينَ اسْتُضْعِفُوا لِلَّذِينَ اسْتَكْبَرُوا لَوْلَا
أَنتُمْ لَكُنَّا مُؤْمِنِينَ (31)

**32** “ఏమిటీ, మీ వద్దకు మార్గదర్శకత్వం వచ్చిన తరువాత దాన్ని అవలంబించకుండా మేము మిమ్మల్ని ఆపామా? (లేదు కదా!) పైగా మీరంతట మీరే అపరాధానికి ఒడిగట్టారు[61]” అని పెద్దలు బలహీన జనులకు సమాధానమిస్తారు.

قَالَ الَّذِينَ اسْتَكْبَرُوا لِلَّذِينَ اسْتُضْعِفُوا أَنَحْنُ
صَدَدْنَاكُمْ عَنِ الْهُدَىٰ بَعْدَ إِذْ جَاءَكُم ۖ بَلْ كُنتُم
مُّجْرِمِينَ (32)

**33** మరి (దానికి బదులుగా) ఈ బలహీన ప్రజలు పెద్దలతో ఇలా అంటారు: “(లేదు లేదు) రేయింబవళ్ళు మీరు పన్నిన కుట్ర ఇది! అల్లాహ్‌ను తిరస్కరించమనీ, ఆయనకు సహవర్తులుగా ఇతరులను కల్పించమని మీరు జారీ చేసే ఆజ్ఞలే మా అవిశ్వాసానికి కారణభూతం అయ్యాయి.”[62] శిక్షను చూడగానే లోలోపలే

وَقَالَ الَّذِينَ اسْتُضْعِفُوا لِلَّذِينَ اسْتَكْبَرُوا بَلْ
مَكْرُ اللَّيْلِ وَالنَّهَارِ إِذْ تَأْمُرُونَنَا أَن نَّكْفُرَ بِاللَّهِ
وَنَجْعَلَ لَهُ أَندَادًا ۚ وَأَسَرُّوا النَّدَامَةَ لَمَّا رَأَوُا
الْعَذَابَ ۚ وَجَعَلْنَا الْأَغْلَالَ فِي أَعْنَاقِ الَّذِينَ

57. పూర్వగ్రంథాలంటే తౌరాత్, జబూర్, ఇంజీల్ గ్రంథాలన్నమాట! అరబీలో **‘బైన యదైహి’** (بَيْنَ يَدَيْهِ) అని వుంది. దీన్ని కొంతమంది విద్వాంసులు పరలోక నిలయంగా భావించారు. ఈ ఆయతులో అవిశ్వాసుల వైరవైఖరి, పెడసరితనం ఎటువంటిదో వివరించబడింది. అన్ని ఆధారాలు, నిదర్శనాలు సమర్పించిన తరువాత కూడా వారు దివ్య ఖుర్‌ఆన్‌ను, పరలోకాన్ని విశ్వసించేందుకు నిరాకరించారు.

58. వారు ఇహలోకంలో చెట్టాపట్టాలేసుకుని తిరిగేవారు. సత్యతిరస్కారంలోనూ, బహు దైవారాధనలోనూ వారిది ఒకేమాట, ఒకేబాట. కాని పరలోకంలో ప్రభువు నిలదీసి అడిగేసరికి వారు పరస్పరం శత్రువులుగా మారిపోయారు. ‘త్వం’ అంటే ‘త్వం’ అని నిందించుకోవటం మొదలెట్టారు.

59. ప్రపంచంలో మాత్రం వారు అర్థంపర్థం లేకుండా, ముందూ వెనుక ఆలోచించకుండా గొర్రెదాటుగా వ్యవహరించారు. సమాజంలోని పెద్ద మనుషులు, బడా ఆసాములు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా తలూపారు. కాని పరలోకంలో (వాస్తవం తెలిసి వచ్చాక) ఆ పెద్దవాళ్ళను తప్పు పట్టసాగారు.

60. అంటే ప్రాపంచిక జీవితంలో మీరు మమ్మల్ని దైవప్రవక్తల, సన్మార్గగాముల అడుగు జాడలలో నడవకుండా అడ్డుకున్నారు. మీరే గనక అడ్డుపడకుండా ఉంటే మేము సన్మార్గాన్ని అవలంబించి ఉండేవారం అని చెబుతారు.

61. అనవసరంగా మమ్మల్ని నిందించకండి. మీరు సన్మార్గాన పయనించకుండా ఆపేశక్తి మా దగ్గర లేకుండింది. మీరు స్వయంగా ఈ సన్మార్గం గురించి చింతన చేయకుండా, మీ మనోవాంఛలకు దాసోహమన్నారు. మీరు చేసిన తప్పులకు మేమెలా బాధ్యులం అవుతాము? మీ కర్మలను మీరే అనుభవించండి. మమ్మల్ని నిందించాల్సిన పని లేదు అని ఆ ‘అయ్యవార్లు’ చెబుతారు.

62. అది ముమ్మాటికీ మా స్వయంకృతం కాదు. అసలు విషయం ఏమిటంటే మేము మీ మాయమాటలకు మోసపోయాం.

كَفَرُوْا ؕ هَلْ يُجْزَوْنَ اِلَّا مَا كَانُوْا يَعْمَلُوْنَ ﴿33﴾

వారంతా పశ్చాత్తాపపడతారు.[63] మేము అవిశ్వాసుల మెడలలో ఇనుప పట్టాలు వేస్తాము.[64] వారు చేసుకున్న కర్మల ఫలితమే వారికి ఇవ్వబడుతుంది.[65]

وَمَاۤ اَرْسَلْنَا فِيْ قَرْيَةٍ مِّنْ نَّذِيْرٍ اِلَّا قَالَ مُتْرَفُوْهَاۤ ۙ اِنَّا بِمَاۤ اُرْسِلْتُمْ بِهٖ كٰفِرُوْنَ ﴿34﴾

**34** మరి మేము ఏ పట్టణంలో, హెచ్చరించేవాణ్ణి పంపినా అక్కడి సంపన్న వర్గాలవారు, "నీకిచ్చి పంపబడిన దానిని మేము త్రోసి పుచ్చుతున్నాం"[66] అని చెప్పేశారు.

وَقَالُوْا نَحْنُ اَكْثَرُ اَمْوَالًا وَّاَوْلَادًا ۙ وَّمَا نَحْنُ بِمُعَذَّبِيْنَ ﴿35﴾

**35** "మేము సిరిసంపదలలో, సంతాన భాగ్యంలో ఎంతో అధికులము. మేము శిక్షించబడటమనేది జరగని పని"[67] అని వారన్నారు.

అహోరాత్రులు మీరు దుష్టపన్నాగాలు పన్ని మాచేత షిర్క్ చేయించారు. సత్యాన్ని తిరస్కరించమని మమ్మల్ని పురమాయించారు. చివరికి మేము మీ పాదచిహ్నాలలోనే నడిచి విశ్వాస భాగ్యానికి దూరమైపోయాము అని ఆ బలహీన వర్గం వారు వివరణ ఇస్తారు.

63. వారు పైకి ఒండొకరిని నిందించుకున్నప్పటికీ, వారి మనస్సాక్షి మాత్రం వారిని ప్రశ్నిస్తూనే ఉంటుంది. తాము చేసిన ఘోరమైన తప్పిదంపై వారంతా కుమిలిపోతూనే ఉంటారు. కాకపోతే అహం అడ్డొచ్చి దాన్ని వ్యక్తపరచటానికి వెనుకంజ వేస్తారు.

64. అంటే మెడలలో సంకెళ్ళను వేసి, వాటిని వారి చేతులకు బిగువుగా కట్టివేయటం జరుగుతుంది.

65. ఆ ఇరువర్గాల వారికి కూడా వారి దుష్కర్మల శిక్ష లభిస్తుంది. నాయకులకు వారి చేష్టలకు తగ్గ శిక్ష లభించగా, అనుయాయులకు కూడా వారు చేసుకున్న కర్మల ఫలితం ఇవ్వబడుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో వేరొకచోట చెప్పబడినట్లు వారిలో "ప్రతి ఒక్కరికీ రెండింతల శిక్ష ఉంటుంది" (అల్ ఆరాఫ్ – 38).

66. దేవుడు తన అంతిమ ప్రవక్త (స)ను ఓదార్చటానికి ఈ గతాన్ని ఉదాహరించాడు. ఏ కాలంలో, ఏ జాతిలో దైవప్రవక్త పంపబడినా అక్కడి శ్రీమంతులు, నాయకులు ఆ ప్రవక్తను ధిక్కరించారు. సాధారణంగా నిరుపేదలు, బడుగు వర్గాల వారు మాత్రమే మొదట్లో ప్రవక్తలను విశ్వసించారు. వారిని చూసి ధనికులు ఎగతాళి చేసేవారు. ఉదాహరణకు హజ్రత్ నూహ్ (అలైహి) జాతివారు తమ ప్రవక్తనుద్దేశించి, "ఏమిటి, మేము నిన్ను విశ్వసించాలా? నీచులైనవారే కదా నిన్ను అనుసరించేదీ?!" అని అన్నారు (షుఅరా – 111). ఇంకా ఇలా అన్నారు : "మా దృష్టిలో నువ్వు మాలాంటి సామాన్య మనిషివి తప్ప మరేమీ కావు. అదీగాక మా జాతిలోని అధములు మాత్రమే ఆలోచించకుండా, అర్థం చేసుకోకుండా నిన్ను అనుసరించటాన్ని మేము చూస్తున్నాము" (హూద్ – 27). ఇంకా ఆరాఫ్ సూరా – 75, అల్ అన్‌ఆమ్ సూరా – 53, 133, బనీ ఇస్రాయీల్ సూరా – 16 లను చూడండి. **'ముత్‌రఫూన్'** (مُتْرَفُوْنَ) అంటే శ్రీమంతులు, నాయకులు అని అర్థం.

67. ఇహలోక జీవితంలో దేవుడు మాకు సిరిసంపదలిచ్చాడు. పిల్లాజల్లా ఇచ్చాడు. మాకిక్కడ ఏ లోటూ లేదు. దేవుడు ఇక్కడ మమ్మల్ని కటాక్షించినట్లే – ఒకవేళ పరలోకం అనేది ఉంటే అక్కడ కూడా తప్పకుండా కటాక్షిస్తాడు. మాకు శిక్షా గిక్షా ఏమీ ఉండదు అని చెప్పేవారు. ప్రాపంచిక జీవితంలో విశ్వాసులకు – అవిశ్వాసులకు దైవానుగ్రహాలన్నీ ప్రాప్తమైనట్లే పారలౌకిక జీవితంలో కూడా ప్రాప్తమవుతాయన్నది వారి ధీమా. కాని యదార్థానికి పరలోకం ఫలితం పొందే స్థలం. ప్రపంచంలో చేసుకున్న కర్మలఫలం అక్కడ లభిస్తుంది. సత్కర్మలకు సత్ఫలితం, దుష్కర్మలకు దుష్ఫలితం! ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలం. ఈ ప్రపంచంలో దేవుడు మనిషిని పరీక్షించే నిమిత్తం ప్రాపంచిక అనుగ్రహాలన్నీ

قُلْ إِنَّ رَبِّي يَبْسُطُ الرِّزْقَ لِمَن يَشَاءُ وَيَقْدِرُ
وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ ﴿36﴾

**36** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "నా ప్రభువు తాను కోరిన వారి ఉపాధిని విస్తృతం చేస్తాడు. (తాను కోరిన వారికి) కుంచింప జేస్తాడు.[68] కాని చాలామంది (ఈ యదార్థాన్ని) గ్రహించరు.

وَمَا أَمْوَالُكُمْ وَلَا أَوْلَادُكُم بِالَّتِي تُقَرِّبُكُمْ عِندَنَا زُلْفَىٰ
إِلَّا مَنْ آمَنَ وَعَمِلَ صَالِحًا فَأُولَٰئِكَ لَهُمْ جَزَاءُ الضِّعْفِ
بِمَا عَمِلُوا وَهُمْ فِي الْغُرُفَاتِ آمِنُونَ ﴿37﴾

**37** మీ సిరిసంపదలుగానీ, మీ సంతానం గానీ మా సన్నిధిలో (అంతస్తుల రీత్యా) మిమ్మల్ని ఏమాత్రం దగ్గరకు చేర్చలేవు.[69] అయితే ఎవరైనా విశ్వసించి, సదాచరణ చేస్తే, అటువంటి వారికి వారి ఆచరణకు బదులుగా[70] రెండింతల ప్రతిఫలం ఉంటుంది.[71] వారు ఎత్తయిన మేడలలో సురక్షితంగా ఉంటారు.

وَالَّذِينَ يَسْعَوْنَ فِي آيَاتِنَا مُعَاجِزِينَ أُولَٰئِكَ
فِي الْعَذَابِ مُحْضَرُونَ ﴿38﴾

**38** మరెవరయితే మా ఆయతులను లొంగ దీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తారో వారు శిక్షకు హాజరుపరచబడతారు.

قُلْ إِنَّ رَبِّي يَبْسُطُ الرِّزْقَ لِمَن يَشَاءُ مِنْ عِبَادِهِ
وَيَقْدِرُ لَهُ ۚ وَمَا أَنفَقْتُم مِّن شَيْءٍ فَهُوَ يُخْلِفُهُ ۖ
وَهُوَ خَيْرُ الرَّازِقِينَ ﴿39﴾

**39** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "నా ప్రభువు తన దాసులలో తాను తలచిన వారి ఉపాధిని విస్తృతపరుస్తాడు. మరి తాను తలచిన వారికి కుదిస్తాడు.[72] (అల్లాహ్ మార్గంలో) మీరు ఏది ఖర్చు చేసినా ఆయన దానికి (సంపూర్ణ) ప్రతిఫలం ఇస్తాడు.[73] ఆయన అందరి కన్నా ఉత్తమ ఉపాధి ప్రదాత.[74]

---

ఇస్తాడు. అయితే అవిశ్వాసులు ఈ అనుగ్రహాలను చూసి పొరబడ్డారు. ఈ సిరిసంపదలు, సంతానభాగ్యం దైవప్రసన్నతకు తార్కాణమని తలపోశారు. కాని ఇది నిజం కాదు. ఒకవేళ ఇదే గనక నిజమైతే తనను విశ్వసించి, తనకు విధేయత చూపే మనుషులకు దేవుడు మరిన్ని సిరిసంపదలను ఇచ్చేవాడు. వారి ఆలుబిడ్డలలో మరింత వృద్ధిని వొసగేవాడు.

68. ఈ ఆయతులో అవిశ్వాసుల ఊహలు తప్పని స్పష్టం చేయటం జరిగింది. కలిమి లేములను దైవానుగ్రహంతోనో లేక దైవాగ్రహంతోనో ముడిపెట్టరాదనీ, కలిమి అయినా లేమి అయినా దైవప్రణాళికను బట్టి ఉంటుందని చెప్పబడింది. ఒక్కోసారి దేవుడు తాను ఇష్టపడే వారికి కూడా కలిమిని ఇస్తాడు. తాను ఇష్టపడని వారికి కూడా అపారంగా ఇస్తాడు. ఇదంతా వాస్తవానికి ఒక పరీక్ష. కలిమిలోనూ, లేమిలోనూ తన దాసుడు ఎలా నెగ్గుకు వస్తాడో ఆయన చూడదలుస్తున్నాడు.

69. మీ దగ్గరున్న సంపదలను, సంతానాన్ని చూసుకుని మురిసిపోకండి. అవి నా ప్రసన్నతకు తార్కాణం కావు. మా దర్బారులో అవి మిమ్మల్ని ఏ విధంగానూ ఆదుకోలేవు.

70. మా ప్రేమను చూరగొనాలన్నా, మా సామీప్యం పొందాలన్నా విశ్వసించి, సదాచరణ చేయటం తప్పనిసరి. హదీసులో చెప్పబడినట్లు, "అల్లాహ్ మీ రూపురేఖలను, మీ సంపదలను చూడడు. ఆయన మీ ఆంతర్యాలను, ఆచరణలను చూస్తాడు" (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

71. వీరైతే అంతకన్నా ఎక్కువ పుణ్యఫలం కూడా లభించగలదు. ఒక్కో సత్కార్యానికి పది నుంచి ఏడు వందల రెట్ల వరకు, దైవచిత్తమయితే అంతకన్నా అధికంగా కూడా వొసగబడుతుంది.

72. తనను ధిక్కరించేవారికి కూడా ఆయన ఒక్కోసారి పుష్కలంగా సంపదను వొసగుతాడు. ఎందుకని? అంటే ఆయన వారిని పరీక్షించదలిచాడు. ఒక్కోసారి ఆయన తన విశ్వాసపాత్రులను కూడా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తాడు.

40 ఆ రోజు అల్లాహ్ వారందరినీ సమీకరించి, "ఏమిటి, వీళ్లు మిమ్మల్ని పూజించేవారా?" అని దూతలను అడుగుతాడు.[75]

وَيَوْمَ يَحْشُرُهُمْ جَمِيعًا ثُمَّ يَقُولُ لِلْمَلَٰٓئِكَةِ أَهَٰٓؤُلَآءِ
إِيَّاكُمْ كَانُوا۟ يَعْبُدُونَ ﴿٤٠﴾

41 "(ఓ అల్లాహ్!) నీవు పవిత్రుడవు. మా రక్షకుడవు నువ్వు మాత్రమే గాని వీళ్లు కాదు.[76] అసలు వీళ్లు జిన్నులను పూజించే వాళ్ళు.[77] వీరిలో చాలా మంది వాళ్ళనే (జిన్నులనే) నమ్ము కున్నారు" అని వారు సమాధానమిస్తారు.

قَالُوا۟ سُبْحَٰنَكَ أَنتَ وَلِيُّنَا مِن دُونِهِم ۖ بَلْ كَانُوا۟
يَعْبُدُونَ ٱلْجِنَّ ۖ أَكْثَرُهُم بِهِم مُّؤْمِنُونَ ﴿٤١﴾

ఎందుకు? వారి పుణ్యఫలాన్ని ఆయన పెంచదలిచాడు. కాబట్టి పొంగిపొరలే సిరిసంపదలు ఆయన ప్రసన్నతకుగానీ, ఆర్థిక ఇబ్బందులు ఆయన అప్రసన్నతకు గానీ ప్రతీకలు కానేకావు. ఈ విషయాన్ని దాసులు బాగా గ్రహించాలన్న ఉద్దేశ్యంతో మాటిమాటికీ నొక్కి చెప్పటం జరిగింది.

73. **'ఇఖ్‌లాఫున్'** అంటే బదులు, ప్రతిఫలం ఇవ్వటం అని అర్థం. ఈ ప్రతిఫలం ఇహలోకంలో కూడా సంభవమే. పరలోకంలోనయితే అవశ్యం. హదీసె ఖుద్‌సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "నువ్వు ఖర్చు పెట్టు. నేను నీపై ఖర్చుపెడతాను" (అంటే మంచి ప్రతిఫలం ప్రసాదిస్తాను) (సహీహ్ బుఖారీ-హూద్ సూరా). ఇరువురు దైవదూతలు అనుదినం ఈ విధంగా ప్రకటన చేస్తూ ఉంటారు-మొదటివాడు: "ఓ అల్లాహ్! ఖర్చుపెట్టనివాడి సంపదను వృథా చేసెయ్యి" అని కోరుతుండగా, రెండవవాడు: "ఓ అల్లాహ్! ఖర్చుపెట్టేవాడికి మంచి ప్రతిఫలం ప్రసాదించు" అని అభ్యర్థిస్తూ ఉంటాడు (అల్ బుఖారీ - కితాబుజ్జకాత్).

74. ఎందుకంటే ఏ దాసుడైనా, ఎవరికయినా, ఏదైనా ఇచ్చాడంటే ఆ ఇవ్వటం అనేది దేవుడు ఇచ్చిన సద్బుద్ధివల్లనే సాధ్యమైంది. యదార్థానికి ఆ వస్తువును ఇచ్చినవాడు అతను కాదు. ఒక తండ్రి తన పిల్లల పోషకునిగా, ఒక రాజు తన సైనికుల పోషకునిగా పరిగణించబడతారు. కాని సిసలైన పోషకులు వారు కారు. అల్లాహ్‌యే అందరి పాలకుడు, పోషకుడు. అందువల్ల ఎవరయినా దైవప్రసాదితమైన దానిలో నుంచి ఏదైనా భాగాన్ని ఎవరికైనా ఇస్తే దేవుని సొత్తునే ఇస్తున్నాడు గాని తన సొత్తునేమీ ఇవ్వటం లేదు. కాకపోతే దేవుడు అతని చేతుల మీదుగా ఖర్చుపెట్టించి, ఆ ఘనతను అతనికి కట్టబెట్టాడు. పైగా అలా ఖర్చుపెట్టినందుకు పుణ్యఫలం కూడా అతని పేర రాసిపెడ్తాడు.

75. ముష్రిక్కులను ఘోర పరాభవానికి గురిచేసేందుకు అల్లాహ్ తన దూతలను ఆ విధంగా ప్రశ్నిస్తాడన్నమాట! ఇంతకు ముందు తన ప్రవక్త అయిన హజ్రత్ ఈసా (ఏసు క్రీస్తు)ను కూడా ఇలాగే ప్రశ్నిస్తాడని చెప్పబడింది : "అల్లాహ్‌ను కాదని నన్నూ, నా తల్లిని దేవుళ్ళుగా చేసుకోండి అని నువ్వు మానవులతో అన్నావా?" (అల్ మాయిదా - 116) అని నిలదీసి అడిగినప్పుడు, "ఓ అల్లాహ్! నీవు పరిశుద్ధుడవు. ఏ మాటను అనే హక్కు నాకు లేదో దాన్ని నేనెలా అంటాను?" అని ఆయన విన్నవించుకుంటారు. అదేవిధంగా అల్లాహ్ దైవదూతలను కూడా ఉద్దేశించి, 'ఏమిటీ, వీరు మీ ప్రోద్బలంపై మిమ్మల్ని పూజించారా?' అని ప్రశ్నిస్తాడు (ఫుర్ఖాన్ - 17).

76. దైవదూతలు కూడా ఈ ప్రశ్నకు చలించిపోతారు. వారు కూడా హజ్రత్ ఈసా (ఏసు క్రీస్తు) మాదిరిగా దేవుని పవిత్రతను కొనియాడి, తామేపాపం ఎరుగమని సంజాయిషీ ఇస్తారు. 'అల్లాహ్! మేము నీ దాసులం. నీవే మా రక్షకుడవు. వీళ్లతో మాకెట్టి సంబంధం లేద'ని స్పష్టంగా ప్రకటిస్తారు.

77. ఇక్కడ **'జిన్నులు'** అంటే షైతానులు అని భావం. వీళ్లు పైశాచిక శక్తులకు దాసోహమన్నారు. అందువల్ల షైతానులు వీళ్ళను మిథ్యా మార్గం వైపుకు తీసుకుపోయారు. ఆ విషయమే వేరొకచోట ఈ విధంగా అనబడింది - "వారు అల్లాహ్‌ను వదలి స్త్రీ దేవతలను తమ ఆరాధ్యులుగా చేసుకుంటారు. ఇంకా అల్లాహ్‌చే శపించబడిన ఆ తిరుగుబాటుదారు షైతాన్‌ను తమ ఆరాధ్యునిగా చేసుకుంటారు" (అన్ నిసా-117).

**42** కనుక ఈ రోజు మీలో పరస్పరం ఎవరికీ ఎటువంటి లాభాన్ని గానీ, నష్టాన్నిగానీ చేకూర్చే అధికారం లేదు.[78] "మీరు త్రోసి పుచ్చుతూ వచ్చిన అగ్నిశిక్ష రుచి చూడండి" అని మేము దుర్మార్గులతో[79] అంటాము.

فَالْيَوْمَ لَا يَمْلِكُ بَعْضُكُمْ لِبَعْضٍ نَّفْعًا وَلَا ضَرًّا ۖ
وَنَقُولُ لِلَّذِينَ ظَلَمُوا ذُوقُوا عَذَابَ النَّارِ الَّتِي
كُنتُم بِهَا تُكَذِّبُونَ ﴿٤٢﴾

**43** వారి ముందు స్పష్టమైన మా ఆయతులు పఠించబడినప్పుడు, "ఈ వ్యక్తి[80] మిమ్మల్ని మీ తాతముత్తాతల ఆరాధ్య దైవాల నుంచి ఆపదలుస్తున్నాడు (అంతకుమించి మరేమీ లేదు)" అని అంటారు. "ఇదొక కల్పిత అబద్ధం"[81] అని కూడా అంటారు. వాస్తవానికి సత్యం వారివద్దకు వచ్చేసినప్పటికీ "ఇది స్పష్టమైన ఇంద్రజాలం తప్ప మరేమీ కాదు"[82] అని అవిశ్వాసులు అంటారు.

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ آيَاتُنَا بَيِّنَاتٍ قَالُوا مَا هَٰذَا إِلَّا رَجُلٌ
يُرِيدُ أَن يَصُدَّكُمْ عَمَّا كَانَ يَعْبُدُ آبَاؤُكُمْ وَقَالُوا
مَا هَٰذَا إِلَّا إِفْكٌ مُّفْتَرًى ۚ وَقَالَ الَّذِينَ كَفَرُوا لِلْحَقِّ
لَمَّا جَاءَهُمْ إِنْ هَٰذَا إِلَّا سِحْرٌ مُّبِينٌ ﴿٤٣﴾

**44** మరి మేము వారికి (మక్కావాసులకు), వారు చదివేందుకు (లోగడ) గ్రంథాలు ఇచ్చి ఉండటంగానీ, నీకు మునుపు వారి వద్దకు హెచ్చరించేవాణ్ణి[83] పంపటం గానీ జరగలేదు.

وَمَا آتَيْنَاهُم مِّن كُتُبٍ يَدْرُسُونَهَا ۖ وَمَا أَرْسَلْنَا
إِلَيْهِمْ قَبْلَكَ مِن نَّذِيرٍ ﴿٤٤﴾

**45** వారి పూర్వీకులు కూడా మా బోధనలను త్రోసిపుచ్చారు. మేము వారికి ప్రసాదించిన దానిలో పదో వంతుకు కూడా వీరు చేరుకోలేదు. మొత్తానికి వారు నా ప్రవక్తలను ధిక్కరించారు. మరి నా శిక్ష ఎంత (కఠినంగా ఉండిందో చూడు!)[84]

وَكَذَّبَ الَّذِينَ مِن قَبْلِهِمْ وَمَا بَلَغُوا مِعْشَارَ
مَا آتَيْنَاهُمْ فَكَذَّبُوا رُسُلِي ۖ فَكَيْفَ كَانَ نَكِيرِ ﴿٤٥﴾

---

78. వారు మీకు లాభం కలిగిస్తారని, మీ కొరకు సిఫారసు చేస్తారని దేవుని పట్టునుంచి విడిపిస్తారని తలపోసి మీరు ప్రపంచంలో వారిని పూజించేవారు. నేటికీ పుణ్య పురుషులను, సమాధులను పూజించే మనవాళ్ళ పరిస్థితి ఇంచుమించు ఇలాగే వుందికదూ! ఆలోచించండి!

79. **'దుర్మార్గులు'** (అల్లజీన జలమూ) అంటే ఇక్కడ దైవేతరులను పూజించేవారు అని భావం. ఎందుకంటే దైవేతరుల పూజ (షిర్క్) చాలా పెద్ద దుర్మార్గం. మహాపరాధం. ఈ పనికి పాల్పడేవారు పరమ దుర్మార్గులు, మహాపరాధులు.

80. ఇక్కడ **'వ్యక్తి'** అంటే దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) అన్నమాట! వారి దృష్టిలో తాతముత్తాతల ధర్మం సరైన ధర్మంగా ఉండేది. అందుచేత ముహమ్మద్ (స) ప్రవక్త నూతన ధర్మం పరిచయం చేయటం వారికి చాలా పెద్దనేరం అనిపించింది. అతడు తమ తాతముత్తాతల ధర్మం నుంచి ప్రజలను ఆపుతున్నాడని వారు గగ్గోలు చెందారు.

81. దివ్య ఖుర్ఆన్‌ను వారు కట్టుకథగా, కాల్పనిక అసత్యంగా ఖరారు చేశారు.

82. మొదటేమో మీ ఖురాన్‌ను 'కల్పిత అబద్ధం' అన్నారు. ఇప్పుడేమో 'ఇంద్రజాలం' అంటున్నారు. మొదటిది ఖుర్ఆన్ భావానికి సంబంధించినది కాగా రెండవది దాని శైలికి సంబంధించినది (ఫత్‌హుల్ ఖదీర్).

83. అందువల్ల తమ వద్దకు కూడా ఒక ప్రవక్త రావాలని, తమకూ ఆకాశ గ్రంథం ప్రసాదించబడాలని వారు కలలుగనేవారు. తీరా అది వచ్చిన తర్వాత దాన్ని తిరస్కరించారు.

84. ఇది అవిశ్వాసులకు చేయబడిన హెచ్చరిక – జాగ్రత్త! మీరు అవలంబిస్తున్న ధిక్కార వైఖరి మీ పాలిట వినాశకరమైనది.

**46** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "నేను మీకు చేసే ఉపదేశం ఒక్కటే – మీరు అల్లాహ్ కోసం (మంకుతనం మాని) ఇద్దరిద్దరు చొప్పున లేదా ఒక్కొక్కరు చొప్పున సంసిద్ధులై ఆలోచించండి – మీ ఈ సహచరునికి ఎలాంటి ఉన్మాదంలేదు,[85] తీవ్రమైన శిక్ష రాకముందే అతడు కేవలం మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు"[86] (అన్న సంగతి మీకిట్టే బోధపడుతుంది)."

قُلْ إِنَّمَا أَعِظُكُم بِوَاحِدَةٍ ۖ أَن تَقُومُوا لِلَّهِ مَثْنَىٰ
وَفُرَادَىٰ ثُمَّ تَتَفَكَّرُوا ۚ مَا بِصَاحِبِكُم مِّن جِنَّةٍ ۚ
إِنْ هُوَ إِلَّا نَذِيرٌ لَّكُم بَيْنَ يَدَيْ عَذَابٍ شَدِيدٍ (46)

**47** (ఇంకా ఈ విధంగా) చెప్పు: "ఒకవేళ నేను మీ నుండి ఏదన్నా ప్రతిఫలాన్ని ఆపేక్షించి ఉంటే, దాన్ని మీరే ఉంచుకోండి.[87] నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది. ఆయన ప్రతిదానికీ సాక్షిగా ఉన్నాడు."

قُلْ مَا سَأَلْتُكُم مِّنْ أَجْرٍ فَهُوَ لَكُمْ ۖ إِنْ أَجْرِيَ إِلَّا
عَلَى اللَّهِ ۖ وَهُوَ عَلَىٰ كُلِّ شَيْءٍ شَهِيدٌ (47)

**48** (ఈ విధంగా కూడా) చెప్పు: "నా ప్రభువు సత్యాన్ని పంపిస్తున్నాడు.[88] ఆయన అగోచర విషయాలన్నీ తెలిసినవాడు."

قُلْ إِنَّ رَبِّي يَقْذِفُ بِالْحَقِّ عَلَّامُ الْغُيُوبِ (48)

---

మీకు పూర్వం గతించిన సమాజాలు కూడా ఈ వైఖరిని అవలంబించి నాశనమయ్యాయి. సిరిసంపదలలో, శక్తియుక్తులలో, ఆయురారోగ్యాలలో వారు మీకన్నా ముందంజలో ఉండేవారు. వారితో పోల్చుకుంటే మీరు పదోవంతు కూడా లేరు. అలాంటి మహామహులే మట్టికరిచారు. అహ్‌ఖాఫ్ సూరాలోని 26వ వచనంలో కూడా ఈ అంశం చర్చించబడింది.

85. అంటే ప్రస్తుతం మీరు అవలంబిస్తున్న వైఖరి సమంజసమైంది కాదు. మీరు హఠం చేయటం మానుకోవాలి. అహంకారాన్ని వీడి ఇద్దరేసి చొప్పున లేక ఒక్కొక్కరు చొప్పున నా సందేశం గురించి గంభీరంగా యోచించండి. చూడండి! ఇన్ని సంవత్సరాలుగా నేను మీ మధ్యన ఉన్నాను. నేనెలాంటివాణ్ణో మీకు బాగా తెలుసు. కాని ఇప్పుడు మీరు నన్ను పిచ్చివాడి క్రింద జమకడుతున్నారు. నేనిచ్చే సందేశంలో అలాంటి విషయం ఏదైనా ఉందా? మీరు మీ మనోవాంఛల దాస్యం నుంచి బయటపడి, నిష్పాక్షిక దృష్టితో ఆలోచిస్తే నేను పిచ్చివాణ్ణి కానన్న యదార్థం మీకే తెలుస్తుంది అని ముహమ్మద్ (సఅసం) నచ్చజెప్పారు.

86. ఆయన మీ శ్రేయాన్ని అభిలషించే ప్రవక్త. మీరు కష్టనష్టాల్లో పడటాన్ని ఆయన భరించలేదు. సన్మార్గాన్ని త్రోసిపుచ్చిన కారణంగా రేపు మీరు ఎదుర్కొనబోయే దుష్పరిణామం గురించి ఆయన మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు.

హదీసులో వచ్చిన వివరాల ప్రకారం ఆయన (సఅసం) ఒక రోజు సఫా కొండపైకెక్కి, "యా సబాహా!" అని పిలుపు ఇచ్చారు. ఆ పిలుపుపై అందరూ అక్కడ గుమిగూడారు. "రేపో మాపో శత్రువు మీపై దండెత్తడానికి సిద్ధంగా ఉన్నాడని నేను మీకు చెబితే, మీరు నా మాటను నమ్ముతారా?" అని ఆయన (స) తన జాతి వారిని ప్రశ్నించారు. "ఎందుకు నమ్మము? (తప్పకుండా నమ్ముతాం)" అని వారంతా ముక్తకంఠంతో బదులిచ్చారు. "అయితే వినండి! భయంకరమైన శిక్ష రాకముందే నేను దాని గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను" అని ఆయన (స) చెప్పారు. దానికి అబూలహబ్, "నీ పాడుగాను! ఇందుకేనా నువ్వు మమ్మల్ని (హడావిడిగా) సమావేశపరచిందీ?" అని అన్నాడు. అప్పుడు అల్లాహ్ "తబ్బత్ యదా అబీ లహబిన్....." సూరా అవతరింప జేశాడు (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరె సబా).

87. ఈ ఆయతులో దైవప్రవక్త (సఅసం) నిస్స్వార్థసేవాభావం, ప్రాపంచిక సిరిసంపదల పట్ల ఆయనకున్న అనాసక్తత స్పష్టపరచబడ్డాయి. ప్రవక్త పదవి ద్వారా ముహమ్మద్ (స) ఆస్తిపాస్తుల్ని, పేరు ప్రతిష్ఠల్ని సంపాదించగోర్తున్నాడని ఎవరయినా తలపోస్తున్నట్లయితే వారి ఈ అనుమానం దూరం కావాలన్నది దీని ఉద్దేశం.

**49** (ఇంకా ఇలా) చెప్పు : "సత్యం వచ్చేసింది. అసత్యం ఇంతకు ముందు కూడా ఏమీ చెయ్యలేకపోయింది. ఇక మీదట కూడా ఏమీ చెయ్యజాలదు."[89]

قُلْ جَاءَ الْحَقُّ وَمَا يُبْدِئُ الْبَاطِلُ وَمَا يُعِيدُ ﴿49﴾

**50** (ఇంకా ఈ విధంగా కూడా) చెప్పెయ్యి: "ఒకవేళ నేను గనక పెడదోవ పడితే, నా పెడదోవ (పాపం) నాపైనే పడుతుంది. ఒకవేళ నేను సన్మార్గాన ఉంటే, అది నా ప్రభువు నాకు పంపిన వహీ మూలంగానే.[90] నిశ్చయంగా ఆయన అంతా వినేవాడు, అతి చేరువలో ఉన్నవాడు."[91]

قُلْ إِن ضَلَلْتُ فَإِنَّمَا أَضِلُّ عَلَىٰ نَفْسِي ۖ وَإِنِ اهْتَدَيْتُ فَبِمَا يُوحِي إِلَيَّ رَبِّي ۚ إِنَّهُ سَمِيعٌ قَرِيبٌ ﴿50﴾

**51** వారు (అవిశ్వాసులు) భయకంపితులై, తప్పించుకుని పారిపోయేదిక్కు తోచక,[92] చాలా దగ్గరి స్థలం నుంచే పట్టుబడి నప్పుడు నువ్వు చూస్తే (ఎంత బావుండు!)

وَلَوْ تَرَىٰ إِذْ فَزِعُوا فَلَا فَوْتَ وَأُخِذُوا مِن مَّكَانٍ قَرِيبٍ ﴿51﴾

---

88. దేవుడు ఏది చర్చించినా సత్యబద్ధంగానే చర్చిస్తాడు. తన ప్రవక్తల ద్వారా సత్యాన్ని పంపించి, ప్రజలకు దాన్ని స్పష్టంగా విడమరచి చెప్పే ఏర్పాటు చేస్తాడు. వేరొకచోట సెలవీయబడినట్లు "ఆయన తన దాసులలో తాను కోరిన వారికి దైవదూత ద్వారా తన సందేశాన్ని అనుగ్రహిస్తాడు" (మోమిన్ – 15).

89. ఇక్కడ సత్యం అంటే దివ్య ఖుర్ఆన్ అనీ, అసత్యం అంటే కుఫ్ర్, షిర్క్ (అవిశ్వాసం, బహుదైవారాధన) అని భావం. అల్లాహ్ తరఫున అల్లాహ్ ధర్మం, ఖుర్ఆన్ గ్రంథం వచ్చేసింది. వీటిద్వారా అసత్యం నిర్వీర్యం అయిపోయింది. ఇప్పుడది తిరుగుబాటు శక్తిని కోల్పోయింది (సూరె అంబియా – 18 ఆధారంగా).

హదీసులో తెలిపిన దాని ప్రకారం మక్కా జయించబడిన రోజు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాబా గృహం లోపల ప్రవేశించారు. అందులో నలువైపులా విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉన్నాయి. దైవప్రవక్త (స) తన విల్లు కొనతో ఆ విగ్రహాలను కొడుతూ 'సత్యం వచ్చేసింది, అసత్యం నిష్క్రమించింది....' అంటూ బనీ ఇస్రాయీల్ సూరా ఆయతును పఠించారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్).

90. అంటే, ఏ మేలు జరిగినా అది అల్లాహ్ తరఫునుంచే జరుగుతుంది. ఆయన పంపిన వహీ (సందేశం) ఒక మార్గదర్శిని. ప్రజలందరికీ దాని ద్వారానే సన్మార్గం లభిస్తుంది. ఇక ఇప్పటికీ ఎవరయినా మార్గభ్రష్టతకు లోనవుతే అది మనిషి దౌర్బల్యమే తప్ప మరొకటి కాదు. మనిషి తన మనోవాంఛలకు బానిసగా మారి సన్మార్గాన్ని త్యజిస్తు న్నాడు. కాబట్టి ఆ పాపభారం కూడా అతని మీదే పడుతుంది. అందుకే హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి) పృచ్ఛకుని ప్రశ్నకు జవాబు ఇచ్చినప్పుడల్లా ఈ మాట కూడా తప్పకుండా పలికేవారు: **"అఖూలు ఫీహా బిరాయీ, ఫయిన్ యకున్ సవాబన్ ఫ మినల్లాహి, వ ఇన్‌య్యకున్ ఖతఅన్ ఫమిన్నీ వ మినష్షయితాన్ వల్లాహు వ రసూలుహు బరీఆని మిన్‌హు"** (ఇది కేవలం నా అభిప్రాయం మాత్రమే. ఒకవేళ ఇది సరైనదైతే అల్లాహ్ తరఫునుంచి అనుకోండి. ఒకవేళ ఇది తప్పైతే నా తరఫున, షైతాన్ తరఫున ప్రేరేపితమైందని భావించండి. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై దీని బాధ్యత లేదు) (ఇబ్నె కసీర్).

91. హదీసులో ప్రవచించబడినట్లు, "మీరు చెవిటివానినీ, మాయమైన వానిని పిలువటం లేదు – పైగా మీరు వినేవానినీ, సమీపంలోనున్న వానినీ, (మొరలను) ఆమోదించే వానిని పిలుస్తున్నారు (సహీహ్ బుఖారీ – కితాబుద్దుఆ).

92. వారెక్కడికీ పారిపోలేరు. ఎందుకంటే వారు హష్ర్ మైదానంలో అల్లాహ్‌కు పట్టుబడి ఉంటారు.

52 అప్పుడు వారు, "మేము దీనిని (ఖుర్‌ఆన్‌ను) విశ్వసిం చాము" అనంటారు. కాని అంత దూరస్థలం నుంచి వారు (ఆశించిన వస్తువును) ఎలా అందుకుంటారు?[93]

وَّقَالُوْٓا اٰمَنَّا بِهٖ ۚ وَاَنّٰى لَهُمُ التَّنَاوُشُ مِنْ مَّكَانٍۭ بَعِيْدٍ ۚ ﴿52﴾

53 అంతకు ముందైతే వాళ్ళు దాన్ని త్రోసిపుచ్చారు. బహు దూరం నుంచి, చూడకుండానే కోతలు కోసేవారు.[94]

وَّقَدْ كَفَرُوْا بِهٖ مِنْ قَبْلُ ۚ وَيَقْذِفُوْنَ بِالْغَيْبِ مِنْ مَّكَانٍۭ بَعِيْدٍ ﴿53﴾

54 మరి (ఇప్పుడు) వారికీ – వారి ఆకాంక్షలకు మధ్య అడ్డు తెరవేయబడింది.[95] లోగడ వీళ్ళలాంటి వీరి పూర్వీకుల పట్ల కూడా ఈ వ్యవహారమే జరిగింది.[96] వారు కూడా (వీళ్ళ మాదిరి గానే) వ్యాకులపరిచే సంశయంలో పడిఉండేవారు.[97]

وَحِيْلَ بَيْنَهُمْ وَبَيْنَ مَا يَشْتَهُوْنَ كَمَا فُعِلَ بِاَشْيَاعِهِمْ مِّنْ قَبْلُ ۭ اِنَّهُمْ كَانُوْا فِيْ شَكٍّ مُّرِيْبٍ ۧ ﴿54﴾

93. **'తనావుష్' (اَلتَّنَاوُشُ)** అంటే పట్టుకోవటం అని అర్థం. వారు ఇహలోకంలో జీవితాంతం ఈమాన్ (విశ్వాసం) పట్ల విముఖత చూపుతూ ఉండేవారు. ఇప్పుడు పరలోకం నుంచి వారు దాన్ని ఎలా అందుకుంటారు. ఇహలోకంలోని విశ్వాసానికి ఇప్పుడు వారు బహుదూరాన ఉన్నారాయె. చాలా దూరాన ఉండి ఒక వస్తువును పట్టుకోవటం ఎలా సాధ్యంకాదో అలాగే పరలోకంలో ఉండి విశ్వసించటం సాధ్యపడదు.

94. కేవలం తమ ఊహల, అంచనాల ఆధారంగా పరలోకం, గిరలోకం లేదనీ, లెక్కాగిక్కా లేదని వారు కొట్టిపారేసేవారు. లేదా ఖుర్‌ఆన్ ఒక ఇంద్రజాలమనీ, కల్పిత అబద్ధమనీ, పూర్వీకుల గాథ అనీ అనేవారు. లేదా ముహమ్మద్ (స) ఒక మాంత్రికుడనీ, జోతిష్యుడనీ, కవిపుంగవుడనీ లేదా పిచ్చివాడని ఆరోపించేవారు. వాస్తవానికి వారి ఆరోపణల వెనుక ఏ ఆధారమూ లేదు.

95. పరలోకంలో తమ ఈమాన్ (విశ్వాసం) స్వీకృతి పొందాలని, నరక యాతన నుంచి తాము విముక్తినొందాలని వారు కోరుకుంటారు. కాని వారికీ – వారి కోర్కెలకు మధ్య ఒక తెర అడ్డుపడుతుంది. అంటే వారి కోరిక త్రోసిపుచ్చబడుతుంది.

96. వారి పూర్వీకుల 'విశ్వాసం' కూడా ఆమోదించబడలేదు. ఎందుకంటే వారు కూడా వీళ్ళ మాదిరిగానే శిక్షను కళ్ళారా చూసిన పిదప విశ్వసించారు.

97. ఫలితం ప్రకటించబడిన తరువాత రుజువర్తన చెందితే లాభం ఏమిటీ? అందుకే హజ్రత్ ఖతాద ఇలా అంటున్నారు: "సందేహాలకు, సంశయాలకు దూరంగా ఉండండి. సందేహాస్పద స్థితిలో మరణించినవాడు ఆ స్థితిలోనే లేపబడతాడు. విశ్వాస స్థితిలో మరణించినవాడు ప్రళయదినాన విశ్వాసిగానే లేస్తాడు." (ఇబ్నె కసీర్)

35 వ సూరా

# ఫాతిర్

## సృష్టికర్త

అవతరణ మక్కాలో

ఆయతులు 45

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏక దైవారాధన గురించి, దైవదూతలు, ప్రవక్తలు, దైవగ్రంథాలు, తీర్పుదినం తదితర మౌలిక ధార్మిక విశ్వాసాల గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో సృష్టికర్త గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు పేరు పెట్టడం జరిగింది. ఈ సూరాలోని మొదటి వాక్యాలు దైవదూతల సృష్టికి సంబంధించి నవి. దైవదూతలను భిన్న సంఖ్య కలిగిన రెక్కలతో సృష్టించడం జరిగింది. ఈ రెక్కలతో వారు తమకు ఆదేశించబడిన ప్రదేశానికి చేరుకుంటారు. వారు ప్రయాణించే వేగం, ప్రయాణ పద్ధతి మానవ అవగాహనకు అందనిది. దేవుని శక్తిసామర్థ్యా లను, అల్లాహ్‌కే ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యాన్ని ఈ ఆయతులు స్పష్టం చేస్తున్నాయి. అల్లాహ్ మరణించిన వారిని మళ్ళీ లేపినిలబెడతాడన్న వాస్తవాన్ని రుజువు చేసే వాక్యాలివి. ఆయన భూమ్యాకాశాలను సృష్టించాడు. ఆయన మేఘాలను తీసుకువచ్చే గాలులను పంపిస్తాడు. ఆయన మనిషిని మట్టినుంచి సృష్టించాడు, తర్వాత వీర్యం బిందువు నుంచి సృష్టించాడు. స్త్రీపురుష జంటలుగా చేసాడు. ప్రతి స్త్రీ గర్భంలో ఏముందో ఆయనకు తెలుసు. (అంటే గర్భంలోని శిశువు ఆడా లేక మగ అన్నదే కాదు, శిశువు ఆయుష్షు, విధిరాత వగైరా అన్నీ ఆయనకు తెలుసు). ఆమెకు జన్మించేదెవరో కూడా ఆయనకు తెలుసు.*

*ఈ సూరాలో విగ్రహాలను విమర్శించడం జరిగింది. అవి నిష్ప్రయోజనకరమైనవనీ, అవి వినలేవనీ, తమను ఆరాధిస్తున్న అజ్ఞాన ప్రజలకు ఎలాంటి సహాయం చేయలేవని చెప్పడం జరిగింది. ఈ సూరాలో విశ్వాసులకు, అవిశ్వాసులకు మధ్య భేదాన్ని కూడా చెప్పడం జరిగింది. అవిశ్వాసులు గ్రుడ్డివారు, చెవిటివారు, మృత సమానులు, అహంభావులు, కుట్రలు పన్నుతారు, చీకటి వంటి వారు. కాగా, విశ్వాసులు వాస్తవాన్ని చూడగలరు, వినగలరు, సజీవంగా వ్యవహరించగలరు, వారు వెలుగువంటి వారు. ఈ రెండు వర్గాల ప్రజల (విశ్వాసులు, అవిశ్వాసులు) గమ్యం గురించి కూడా తెలియజేయడం జరిగింది. అల్లాహ్‌ను తిరస్కరించిన వారు శాశ్వత నరకాగ్నికి గురవుతారు. అందులోనే వారు నివసిస్తారు, ఎల్లప్పుడు రోదిస్తుంటారు. విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయి. వారు అందమైన ఆభరణాలు ధరిస్తారు. సిల్కు వస్త్రాలు ఉంటాయి. వారికి అక్కడ ఎలాంటి దుఃఖం, కష్టం ఉండదు.*

## ఫాతిర్ సూరా

## سُورَةُ فَاطِرٍ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** సర్వస్తోత్రాలు (శూన్యంలో నుంచి) ఆకాశాలను, భూమిని సృష్టించిన[1] అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన రెండేసి, మూడేసి, నాలుగేసి రెక్కలు గల దూతలను తన సందేశ వాహకులుగా చేసుకుంటాడు.[2] సృష్టిలో తాను కోరిన దాన్ని పెంచుతాడు.[3] అల్లాహ్ అన్నింటిపై అధికారం కలవాడు.

الْحَمْدُ لِلَّهِ فَاطِرِ السَّمَاوَاتِ وَالْأَرْضِ جَاعِلِ الْمَلَائِكَةِ
رُسُلًا أُولِي أَجْنِحَةٍ مَثْنَىٰ وَثُلَاثَ وَرُبَاعَ ۚ يَزِيدُ
فِي الْخَلْقِ مَا يَشَاءُ ۚ إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ⓵

**2** అల్లాహ్ తన దాసుల కోసం తెరిచే కారుణ్యాన్ని నిలిపివేసే వాడెవడూ లేడు. మరి ఆయన దేన్నయినా నిలిపివేస్తే, ఆ తరువాత దాన్ని పంపేవాడు కూడా ఎవడూ లేడు.[4] ఆయన సర్వాధిక్యుడు, వివేక సంపన్నుడు.

مَا يَفْتَحِ اللَّهُ لِلنَّاسِ مِنْ رَحْمَةٍ فَلَا مُمْسِكَ لَهَا ۖ
وَمَا يُمْسِكْ فَلَا مُرْسِلَ لَهُ مِنْ بَعْدِهِ ۚ
وَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ ⓶

**3** ఓ ప్రజలారా! మీపైవున్న అల్లాహ్ అనుగ్రహాన్ని కాస్త జ్ఞాపకం చేసుకోండి. ఏమిటి, అల్లాహ్ గాకుండా ఆకాశం నుంచి, భూమి నుంచి మీకు ఉపాధిని సమకూర్చే వేరే సృష్టికర్త కూడా ఎవడైనా ఉన్నాడా? ఆయన తప్ప మరో ఆరాధ్యుడెవడూలేడు. మరి మీరు (ఆయన వైపు నుండి) ఎటు తిరిగిపోతున్నారు?[5]

يَا أَيُّهَا النَّاسُ اذْكُرُوا نِعْمَتَ اللَّهِ عَلَيْكُمْ ۚ هَلْ
مِنْ خَالِقٍ غَيْرُ اللَّهِ يَرْزُقُكُمْ مِنَ السَّمَاءِ وَالْأَرْضِ ۚ
لَا إِلَٰهَ إِلَّا هُوَ ۖ فَأَنَّىٰ تُؤْفَكُونَ ⓷

---

1. **'ఫాతిర్'** (فَاطِر) అంటే తొలిసారి సృష్టించేవాడు లేక సృష్టికి శ్రీకారం చుట్టేవాడు అని అర్థం. ఈ వాక్యం అల్లాహ్ సృష్టి ప్రక్రియ వైపుకు మన ధ్యాసను మళ్ళిస్తుంది. ఆయన ప్రప్రథమంగా భూమ్యాకాశాలను ఎలాంటి 'నమూనా' లేకుండానే చేశాడు. అంతటి అసాధారణ ప్రజ్ఞాశాలికి మలిసారి మానవులను సృష్టించటం కష్టమా? ఏమాత్రం కష్టసాధ్యం కాదు.
2. అంటే జిబ్రయీల్, మీకాయీల్, ఇస్రాఫీల్, ఇజ్రాయీల్ మొదలగు దైవదూతలన్నమాట! వారిలో కొందరిని దేవుడు తన ప్రవక్తల దగ్గరకు సందేశవాహకులుగా పంపాడు. మరి కొందరిని అనేక ఇతరత్రా విధులపై నియమించాడు. ఆ దూతలలో కొందరికి రెండేసి, కొందరికి మూడేసి, కొందరికి నాలుగేసి రెక్కలు ఉన్నాయి. వాటి ఆధారంగా వారు అమితమైన వేగంతో దివినుంచి భువికి దిగివస్తారు. భువి నుంచి గగనం వైపుకు దూసుకుపోతుంటారు.
3. అంటే తన దూతలలో కొందరికి ఇంకా ఎక్కువ రెక్కలు కూడా ఉన్నాయి. మేరాజ్ రాత్రి తాను జిబ్రయీల్ అలైహిస్సలాంను నిజస్వరూపంలో చూశానని, ఆయనకు ఆరువందల రెక్కలున్నాయని మహాప్రవక్త (స) చెప్పారు (సహీహ్ బుఖారీ – నజమ్ సూరా వ్యాఖ్యానం). కొందరు దీన్ని సర్వసాధారణమైనదిగానే ఉంచారు. దాని ప్రకారం, మొహం, కళ్లు, ముక్కు – ప్రతిదానికి సంబంధించిన అందం అందులోకి వచ్చేస్తుంది.
4. దేవుని ఈ కరుణానుగ్రహాలలో దైవప్రవక్తల పరంపర, దైవగ్రంథాల అవతరణ కూడా చేరి ఉన్నాయి. అంటే ప్రతి వస్తువును ప్రసాదించేవాడు, తిరిగి కైవసం చేసుకునేవాడు, నిలిపివేసేవాడు కూడా ఆయనే. ఆయన తప్ప మరో ప్రదాతగానీ, అవరోధకర్తగానీ లేదు. అందుకే అంతిమ దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా చెబుతూ ఉండేవారు:

4 (ఓ ప్రవక్తా!) ఒకవేళ వీళ్ళు నిన్ను ధిక్కరించినట్లయితే నీకు పూర్వం గతించిన ప్రవక్తలంతా ధిక్కరించబడినవారే. సమస్త వ్యవహారాలు (ఎట్టకేలకు) అల్లాహ్ వైపునకే మరలించ బడతాయి.[6]

وَاِنۡ يُّكَذِّبُوۡكَ فَقَدۡ كُذِّبَتۡ رُسُلٌ مِّنۡ قَبۡلِكَ ؕ وَاِلَى اللّٰهِ تُرۡجَعُ الۡاُمُوۡرُ ④

5 ఓ ప్రజలారా! నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది.[7] కాబట్టి ప్రాపంచిక జీవితం ఎట్టి పరిస్థితుల్లోనూ మిమ్మల్ని మోసంలో పడవేయకూడదు.[8] ఆ మాయలమారి (షైతాను) కూడా మిమ్మల్ని మోసగించకూడదు సుమా![9]

يٰۤاَيُّهَا النَّاسُ اِنَّ وَعۡدَ اللّٰهِ حَقٌّ فَلَا تَغُرَّنَّكُمُ الۡحَيٰوةُ الدُّنۡيَا ٝ وَلَا يَغُرَّنَّكُمۡ بِاللّٰهِ الۡغَرُوۡرُ ⑤

6 నిశ్చయంగా షైతాను మీ శత్రువు. కనుక మీరు కూడా వాణ్ణి శత్రువుగానే పరిగణించండి.[10] వాడు తన సమూహాన్ని, వారంతా నరకవాసులలో చేరిపోవటానికే పిలుస్తున్నాడు.

اِنَّ الشَّيۡطٰنَ لَـكُمۡ عَدُوٌّ فَاتَّخِذُوۡهُ عَدُوًّا ؕ اِنَّمَا يَدۡعُوۡا حِزۡبَهٗ لِيَكُوۡنُوۡا مِنۡ اَصۡحٰبِ السَّعِيۡرِ ؕ ⑥

---

**"అల్లాహుమ్మ! లా మానిఅ లిమా ఆతైత. వలా మూతియ లిమా మనాత"** (ఓ అల్లాహ్! నీవు ఎవరికైనా ప్రసాదించగోరితే ఎవరూ ఆపలేరు. నీవు ఎవరికైనా ఇవ్వక పోతే ఎవరూ ఇవ్వలేరు)

5. అంటే ఇంత స్పష్టంగా విడమరచి చెప్పిన తరువాత కూడా మీరు దైవేతరుల్ని పూజిస్తున్నారా? **'తూఫకూన్'** (**تُؤۡفَكُوۡنَ**) అనేది **'అఫక'** నుంచి వచ్చినదైతే తిరిగి పోవటం, మరలి పోవటం అని అర్థం వస్తుంది. అంటే మీరు ఎక్కడికి తిరిగిపోతున్నారు? అని అర్థం వస్తుంది. ఒకవేళ ఈ పదం **'ఇఫ్క్'** నుండి వచ్చి ఉంటే అబద్ధం అనీ, సత్యం నుంచి తిరిగిపోవటం అని అర్థం. ఈ అర్థంలో తీసుకుంటే, ఏక దైవారాధనను, పరలోక భావనను తిరస్కరించే తత్వం మీలో ఎక్కడి నుంచి వచ్చింది? మీరు ఒక వైపున అల్లాహ్‌ను మీ సృష్టికర్తగా, ఉపాధి ప్రదాతగా అంగీకరిస్తూనే మరోవైపున దేవుని ఏకత్వాన్ని ఎందుకు తృణీకరిస్తున్నారు? అన్న భావం వస్తుంది (ఫత్‌హుల్ ఖదీర్).

6. ఈ వాక్యం ద్వారా అంతిమ దైవప్రవక్త (సఅసం) ఓదార్చబడ్డారు. ఓ ప్రవక్తా (సఅసం)! వీళ్ళు నిన్ను ధిక్కరించి ఎక్కడికి పోతారు? చివరికి సమస్త వ్యవహారాల తీర్పు మేమే చేయవలసి ఉంటుంది. వెనుకటి ప్రవక్తలను ధిక్కరించిన జాతులకు వినాశం తప్ప ప్రాప్తించిందేమిటి? కాబట్టి వీళ్ళు ఇకనయినా గుణపాఠం నేర్చుకుని దారికి రాకపోతే వీళ్లకు కూడా అదే గతి పడుతుంది.

7. అంటే – ప్రళయం రావటం తథ్యం, సజ్జనులకు వారి సత్కర్మల బహుమానం, దుర్జనులకు వారి దుష్కర్మల శిక్ష లభించటం ఖాయం అన్న దేవుని వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది.

8. అంటే – అల్లాహ్ తన సజ్జన దాసుల కోసం, దైవప్రవక్తల అనుయాయుల కోసం పరలోకంలో సిద్ధపరచి ఉంచిన గొప్ప అనుగ్రహాల నుంచి ఈ ప్రాపంచిక జీవితం ఏమార్చకూడదు. కాబట్టి తాత్కాలికమైన ఈ ఐహిక సుఖాలలో మునిగి శాశ్వితమైన పారలౌకిక సుఖసౌఖ్యాలను విస్మరించకండి.

9. అంటే, ఆ మాయలోడి మాయోపాయాల పట్ల, కుతంత్రాల పట్ల అప్రమత్తంగా ఉండండి. ఎందుకంటే వాడు మహా మోసగాడు. మిమ్మల్ని మోసగించటం, దగా చేయటమే వాడి ప్రధాన లక్ష్యం. ఆ విధంగా వాడు మిమ్మల్ని స్వర్గానికి దూరం చేయదలుస్తున్నాడు. లుఖ్మాన్ సూరా 33వ వచనంలో కూడా ఆ దగుల్బాజీ కోసం ఇలాంటి పదాలే ప్రయోగించబడ్డాయి.

10. అంటే ఎట్టిపరిస్థితిలోనూ వాడు మీ శ్రేయోభిలాషి కాజాలడన్న సంగతిని బాగా తెలుసుకోండి. ఒక దుర్మార్గుని బారి నుంచి తనను రక్షించుకోవటానికి మనిషి ఎలా జాగ్రత్తలు తీసుకుంటాడో అలాగే ఆ విద్రోహి దుష్ప్రేరణల నుండి, కుయుక్తుల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోండి. ఈ విషయమే మరో చోట ఈ

7 అవిశ్వాస వైఖరిని అవలంబించినవారి కోసం తీవ్రమైన శిక్ష ఉంది. విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారి కోసం మన్నింపు ఉంది. గొప్ప పుణ్యఫలం ఉంది.[11]

اَلَّذِيْنَ كَفَرُوْا لَهُمْ عَذَابٌ شَدِيْدٌ ۖ وَالَّذِيْنَ اٰمَنُوْا
وَعَمِلُوا الصّٰلِحٰتِ لَهُمْ مَّغْفِرَةٌ وَّاَجْرٌ كَبِيْرٌ ﴿٧﴾

8 మరి ఏ వ్యక్తికయినా అతని దుష్కర్మలు అందమైనవిగా చేయ బడగా, అతను వాటిని మంచి పనులుగా భావిస్తున్నట్లయితే[12] (అతను సన్మార్గం పొందిన వానితో సరితూగుతాడా?)! అల్లాహ్ తాను తలచిన వారిని మార్గవిహీనతకు లోనుచేస్తున్నాడు, తాను తలచిన వారికి సన్మార్గం చూపుతున్నాడు.[13] కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు వాళ్ల గురించి అదేపనిగా బెంగ పెట్టుకుని నీ ప్రాణానికి ముప్పు తెచ్చి పెట్టుకోకూడదు.[14] వారు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు.[15]

اَفَمَنْ زُيِّنَ لَهٗ سُوْٓءُ عَمَلِهٖ فَرَاٰهُ حَسَنًا ۖ
فَاِنَّ اللّٰهَ يُضِلُّ مَنْ يَّشَاۤءُ وَيَهْدِيْ مَنْ يَّشَاۤءُ ۖ
فَلَا تَذْهَبْ نَفْسُكَ عَلَيْهِمْ حَسَرٰتٍ ۗ اِنَّ اللّٰهَ عَلِيْمٌ
بِمَا يَصْنَعُوْنَ ﴿٨﴾

విధంగా చెప్పబడింది: "అలాంటప్పుడు మీరు నన్నువదలి ఆ షైతానును, వాడి సంతతిని సంరక్షకులుగా ఎలా చేసు కుంటారు? వాస్తవానికి వారు మీకు శత్రువులు. దుర్మార్గుల కోసం చాలా చెడ్డ ఫలితముంది" (అల్ కహ్ఫ్ – 50).

11. ఇక్కడ కూడా అల్లాహ్ ఇతరచోట్ల మాదిరిగానే విశ్వాసం (ఈమాన్)తో పాటు సదాచరణ (అమలె సాలెహ్)ను గురించి నొక్కి వక్కాణించాడు. ఎట్టి పరిస్థితిలోనూ విశ్వాసులు మంచి పనులను మరువరాదన్నదే దేవుని అభిమతం. విశ్వసించటంతో పాటు మంచిపనులు చేసినవారికి మాత్రమే క్షమాభిక్ష మరియు గొప్ప పుణ్యఫలం లభిస్తాయని స్పష్టంగా చెప్పటం జరిగింది.

12. అవిశ్వాసుల, పాపాత్ముల పరిస్థితి ఇలాగే ఉంటుంది. వారు సత్య తిరస్కారానికి, బహు దైవారాధనకు పాల్పడుతూ, పాపకార్యాలు చేస్తూ కూడా తాము చేసేదంతా సజావుగా ఉందని తలపోస్తారు. దేవుడు అపమార్గానికి గురిచేసిన అటువంటి వ్యక్తి దయనీయ స్థితి గురించి ఇక చెప్పాల్సిందేముంటుంది? అలాంటి వ్యక్తిని కాపాడే మార్గం మీ దగ్గర ఏదైనా ఉందా? పోనీ ఆ వ్యక్తి దేవుని తరఫున సన్మార్గం పొందిన వానితో సమానం కాగలడా?? 'కాలేదు' అనే సమాధానం వస్తుంది కదా!

13. దేవుడు తన న్యాయశాసనాన్ని, తన సంప్రదాయాన్ని అనుసరించి నిరంతరం దుర్మార్గానికి ఒడిగట్టి, తనను శిక్షార్హునిగా నిలబెట్టుకున్న వానిని మాత్రమే అపమార్గానికి లోను చేస్తాడు. అకారణంగా ఆయన ఎవరినీ అపమార్గం పట్టించడు. అదే సమయంలో ఆయన మనిషిలో సన్మార్గం పొందాలన్న చింతన ఏ కాస్త ఉన్నాసరే, ఆ మార్గంలో అతనికి ఇతోధికంగా తోడ్పడతాడు.

14. ఎందుకంటే చేసే ప్రతి పనీ పరమార్థంతో కూడుకున్నదై ఉంటుంది. అంతా ఆయన ప్రణాళిక ననుసరించి జరుగుతుంది. కనుక నీవు ఆ దుర్మార్గుల మార్గభ్రష్టతపై బాధతో కృంగిపోయి, ప్రాణాలు విడువనవసరం లేదు.

15. అంటే వారు చెప్పే ఏ మాటా, వారు పాల్పడే ఏ చేష్టకూడా ఆయన జ్ఞానపరిధిలో లేకుండా లేదు. అల్లాహ్ వారి మాటల్ని, పనుల్ని, వ్యవహారాలను, ఒప్పందాలను – అన్నింటినీ జాగ్రత్తగా గమనిస్తున్నాడు. కాకపోతే దుర్మార్గులు చేసిన ప్రతి చేష్టపై కొరడా ఝుళిపించటం, వారు ఆడిన ప్రతి మాటపై కన్నెర్రజేయటం ఆయన విధానం కాదు. ప్రపంచంలోని రాజ్యాధికారులైతే తమ పాలితుల ప్రతి అవాంఛనీయ చేష్టపై కినుక వహిస్తారు. వారు వినయంగా 'సలాం' చేయకపోయినా వారికి కోపం వస్తుంది. కాని అల్లాహ్ మాత్రం అలా చేయడు. ఆయన ప్రతి వ్యక్తికీ, ప్రతి మానవ సముదాయానికి తగినంత గడువు ఇస్తాడు.

9 అల్లాహ్‌యే గాలులను పంపిస్తున్నాడు. తరువాత అవి మేఘాలను లేపుతాయి. మరి ఆ మేఘాలను మేము ఒక మృత ప్రదేశం (భూమి) వైపుకు తీసుకుపోతాము. తద్వారా ఆ భూమిని- మృతిచెందిన మీదట - బ్రతికిస్తున్నాము. మళ్ళీ తిరిగి లేపటం అనేది (కూడా) ఇలాగే జరుగుతుంది.[16]

وَاللّٰهُ الَّذِيْٓ اَرْسَلَ الرِّيٰحَ فَتُثِيْرُ سَحَابًا فَسُقْنٰهُ اِلٰى بَلَدٍ مَّيِّتٍ فَاَحْيَيْنَا بِهِ الْاَرْضَ بَعْدَ مَوْتِهَا ۭ كَذٰلِكَ النُّشُوْرُ ⑨

10 గౌరవాన్ని ఆశించే వారెవరయినాసరే సకల గౌరవోన్నతులు అల్లాహ్‌వే[17] (నని తెలుసుకోవాలి). సద్వచనాలన్నీ ఆయన వైపుకే ఎగబ్రాకుతాయి.[18] సదాచరణ వాటికి (మరింత) ఉన్నతి నిస్తుంది.[19] మరెవరయితే కుతంత్రాలలో నిమగ్నులై ఉంటారో[20] వారి కొరకు ఘోరాతి ఘోరమైన శిక్ష ఉంది. కడకు వారి ఈ కుతంత్రం కకావికలమైపోతుంది.[21]

مَنْ كَانَ يُرِيْدُ الْعِزَّةَ فَلِلّٰهِ الْعِزَّةُ جَمِيْعًا ۭ اِلَيْهِ يَصْعَدُ الْكَلِمُ الطَّيِّبُ وَالْعَمَلُ الصَّالِحُ يَرْفَعُهٗ ۭ وَالَّذِيْنَ يَمْكُرُوْنَ السَّيِّاٰتِ لَهُمْ عَذَابٌ شَدِيْدٌ ۭ وَمَكْرُ اُولٰۗىِٕكَ هُوَ يَبُوْرُ ⑩

16. అంటే - ఏ విధంగానయితే మేము మేఘాల ద్వారా వర్షాన్ని కురిపించి నెర్రలు కొట్టిన నేలను (మృతభూమిని) పైరు పచ్చగా, సస్యశ్యామలంగా మారుస్తున్నామో అదే విధంగా ప్రళయదినాన మేము చనిపోయిన మానవులందరినీ తిరిగి బ్రతికిస్తాము. హదీసులో ఇలా చెప్పబడింది : "మానవుని శరీరమంతా కుళ్ళి, కృశించిపోయి, కేవలం అతని వెన్నెముకకు సంబంధించిన ఓ చిన్న భాగం మాత్రం మిగిలివుంటుంది. దాని ద్వారా అతని మలి సృష్టి జరుగుతుంది" (బుఖారీ - తఫ్సీర్ సూరె అమ్మ; ముస్లిం - కితాబుల్ ఫితన్).

17. తనకు ప్రపంచంలోనూ, పరలోకంలోనూ గౌరవమర్యాదలు, పేరు ప్రతిష్ఠలు ప్రాప్తించాలన్న అభిలాష ఎవరికయినా ఉంటే అతను అల్లాహ్‌కు విధేయత కనబరచాలి. తద్వారా అతని మనోరథం ఈడేరుతుంది. ఎందుకంటే ఇహపరాల సర్వాధిపతి అల్లాహ్ మాత్రమే. సకల గౌరవోన్నతులు ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన ఎవరికి గౌరవం ప్రసాదిస్తాడో అతను మాత్రమే గౌరవనీయుడవుతాడు. ఆయన ఎవరినయినా పరాభవానికి లోను చేస్తే ప్రపంచంలోని ఏ శక్తీ అతనికి గౌరవమర్యాదల్ని ఇవ్వజాలదు. దివ్య ఖుర్‌ఆన్‌లోనే మరోచోట ఇలా అనబడింది : "వారు విశ్వాసులను వదలి అవిశ్వాసులను తమ స్నేహితులుగా చేసుకుంటున్నారు. ఏమిటీ? అవిశ్వాసుల వద్ద వారు గౌరవాన్ని ఆశిస్తున్నారా? వాస్తవానికి సమస్త గౌరవం అల్లాహ్ అధీనంలో ఉంది" (నిసా - 139).

18. **'అల్ కలిము'** (اَلْكَلِمُ) అనేది **'కలిమతున్'** అనే పదానికి బహువచనం. అందువల్ల మేము 'సద్వచనాలు' అని అనువదించటం జరిగింది. సద్వచనాలు లేక పవిత్ర వచనాలు అంటే అల్లాహ్ స్తోత్రం, అల్లాహ్ పవిత్రత, దైవగ్రంథ పారాయణం, మంచిని ప్రబోధించే పలుకులు, చెడుల నుంచి వారించే మాటలు అన్నమాట! ఎగబ్రాకుతాయి (లేక అధిరోహిస్తాయి) అంటే దేవుని ఆమోదం పొందుతాయి అని భావం. లేదా దేవుని ప్రతిఫలం నిమిత్తం దైవదూతలు వాటిని ఆకాశాల వైపుకు తీసుకుపోతారు.

19. సదాచరణ (అమలె సాలెహ్) సద్వచనాలకు ఉన్నతిని ప్రసాదించటమంటే, అది వాటికి సార్థకతను చేకూరుస్తుంది, చేయూతనిస్తుంది, సద్వచనాలకు వన్నె తెస్తుంది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే కేవలం నోటితో దైవనామస్మరణ (దైవస్తోత్రం, దేవుని పవిత్రతను కొనియాడటం) చేసినంతమాత్రాన సరిపోదు. దాంతోపాటు దైవాదేశాలను పాటించాలి. దేవుడు వారించిన విషయాలను విడనాడాలి. అప్పుడే మనం చేసే 'దైవనామస్మరణ' స్వీకృతిని పొందుతుంది. సదాచరణ ద్వారానే మన సద్వచనాలు ఊర్ధ్వలోకాల్లో ఉన్నత స్థానాలు పొందుతాయి. సత్కార్యాలు చేసే దాసుడు మాత్రమే నోటితో దేవుని పవిత్రతను కొనియాడే విషయంలో (జిక్ర్ మరియు తస్బీహ్‌లో) చిత్తశుద్ధి కలవాడు (ఫత్‌హుల్ ఖదీర్). అంటే క్రియాశూన్యమైన పలుకులకు దైవసన్నిధిలో ఎలాంటి స్థాయి, స్థానం లేదు.

**11** (ప్రజలారా!) అల్లాహ్ మిమ్మల్ని మట్టితో, ఆ తరువాత వీర్య బిందువుతో సృష్టించాడు.[22] ఆ పైన మిమ్మల్ని జతలు (స్త్రీలు, పురుషులు)గా చేశాడు. ఆయనకు తెలియకుండా ఏ స్త్రీ కూడా గర్భవతి కావటంగానీ, బిడ్డను కనటంగానీ జరగదు.[23]దీర్ఘాయుష్షు పొందినవాని ఆయుష్షు పెరగటమైనా, మరొకతని ఆయుష్షు తరగటమైనా – అంతా గ్రంథంలో లిఖితమై ఉంది.[24] ఇదంతా అల్లాహ్‌కు చాలా తేలిక.

وَاللّٰهُ خَلَقَكُمْ مِّنْ تُرَابٍ ثُمَّ مِنْ نُّطْفَةٍ ثُمَّ جَعَلَكُمْ اَزْوَاجًا ؕ وَمَا تَحْمِلُ مِنْ اُنْثٰى وَلَا تَضَعُ اِلَّا بِعِلْمِهٖ ؕ وَمَا يُعَمَّرُ مِنْ مُّعَمَّرٍ وَّلَا يُنْقَصُ مِنْ عُمُرِهٖۤ اِلَّا فِیْ كِتٰبٍ ؕ اِنَّ ذٰلِكَ عَلَى اللّٰهِ يَسِيْرٌ ⑪

**12** రెండు జలధులూ సమానం కావు – వాటిలో (ఒకటి)ఇదేమో తియ్యనిది, దాహం తీర్చేది, త్రాగటానికి హాయిగా ఉండేది. మరి (రెండవది) అదేమో ఉప్పగా, చేదుగా ఉంది. అయితే మీరు ఆ రెండింటిలో నుంచీ తాజామాంసాన్ని తింటున్నారు. మీరు ధరించే నగలను వెలికి తీస్తున్నారు. జల ప్రవాహాలను చీల్చుకుంటూ పోయే పెద్దపెద్ద ఓడలను[25] నువ్వు చూస్తున్నావు – మీరు ఆయన కృపను అన్వేషించడానికి, మీరు ఆయనకు కృతజ్ఞులై ఉండటానికి గాను (ఈ వ్యవస్థ ఏర్పరచబడింది).

وَمَا يَسْتَوِی الْبَحْرٰنِ ۖۗ هٰذَا عَذْبٌ فُرَاتٌ سَآئِغٌ شَرَابُهٗ وَهٰذَا مِلْحٌ اُجَاجٌ ؕ وَمِنْ كُلٍّ تَاْكُلُوْنَ لَحْمًا طَرِيًّا وَّتَسْتَخْرِجُوْنَ حِلْيَةً تَلْبَسُوْنَهَا ۚ وَتَرَى الْفُلْكَ فِيْهِ مَوَاخِرَ لِتَبْتَغُوْا مِنْ فَضْلِهٖ وَلَعَلَّكُمْ تَشْكُرُوْنَ ⑫

20. రహస్యంగా ఒకరికి వెన్నుపోటు పొడిచే ఉపాయాలను, హాని కలిగించే వ్యూహ రచనలను చెడు కుట్రలు, కుతంత్రాలు అనంటారు. కుఫ్ర్, షిర్క్‌లు కూడా కుతంత్రాల క్రిందికే వస్తాయి. ఎందుకంటే అవిశ్వాసులు వీటిద్వారా దైవమార్గంలో అవరోధాలు సృష్టించదలుస్తారు. అంతిమ దైవప్రవక్త (సఅసం)ను హతమార్చడానికి మక్కా అవిశ్వాసులు సాగించిన మంతనాలు, పన్నిన పన్నాగాలు కూడా వీటిలో అంతర్భాగమే. ప్రదర్శనాబుద్ధి కూడా ఒక రకమైన కుతంత్రమే. ఇలాంటి చర్యలన్నీ ఆఖరికి నిర్వీర్యమవుతాయి. నిరర్థకమవుతాయి. వాటి ద్వారా ఎన్నటికీ సత్ఫలితం వెలువడదు.

21. వారి కుతంత్రం భగ్నమవటంతోపాటు, దానికి పాల్పడినందుకు దాని పాపఫలం కూడా వారి నెత్తిన పడుతుంది. "వారి కుతంత్రాల మూలంగా, ఆ కుతంత్రాల కీడు, వాటికి పాల్పడిన వారిపైనే పడుతుంది." (ఫాతిర్ – 43).

22. అంటే ఆయన మీ మూలపురుషుడైన ఆదం (అలైహిస్సలాం)ను మట్టితో చేశాడు. ఆ తరువాత మానవజాతి పరంపరను కొనసాగించటానికి (మానవ సృష్టిని) వీర్యంతో పెన వేశాడు. అది పురుషుని వెన్నులో నుంచి వెలువడి, స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశించి మానవ సృష్టి ప్రక్రియను చేసుకుంటూ పోతుంది.

23. జగతిలోని ఏ వస్తువూ ఆయన నుంచి దాగిలేదు. నేలపై రాలిపడే ఆకు గురించి, భూమిలోని చీకటి పొరలలో (మొలకెత్తటానికి) వేచివున్న విత్తనం గురించి కూడా ఆయనకు పూర్తిగా తెలుసు (అల్ అన్‌ఆమ్ – 59).

24. దీనిద్వారా స్పష్టమయ్యేదేమిటంటే మనిషి వయస్సు పెరగటం లేక తరగటం అనేది దేవుని విధివ్రాతతో ముడిపడి ఉంది. ఈ తరుగుదల–పెరుగుదల వెనుక కొన్ని కారణాలు కూడా ఉన్నాయి. బంధుత్వ హక్కులను నెరవేర్చటం వల్ల దీర్ఘాయుష్షు లభిస్తుందని, మితిమీరిన పాపాల వల్ల ఆయుష్షు తరుగుతుందని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. ఉదాహరణకు: ఒక వ్యక్తికి 70 ఏండ్లు ఉన్నాయి. అయితే తగు కారణాలవల్ల అల్లాహ్ అతని ఆయుష్షులో వృద్ధినొసగుతాడు. అలాగే కారకాల దుర్వినియోగం మూలంగా అల్లాహ్ ఆయుష్షును తగ్గిస్తాడు కూడా. అదంతా

**13** ఆయన రాత్రిని పగటిలోనికి జొప్పిస్తున్నాడు, పగటిని రాత్రి లోనికి జొప్పిస్తున్నాడు. మరి ఆయన సూర్యచంద్రులను (తన శాసన) నిబద్ధుల్ని చేశాడు – ప్రతిదీ ఒక నిర్ధారిత కాలం ప్రకారం నడుస్తోంది. ఈ అల్లాహ్‌యే మీ ప్రభువు.[26] విశ్వసామ్రాజ్యాధికారం ఆయనదే. ఆయన్ని వదలి మీరు ఎవరెవరిని పిలుస్తున్నారో వారు ఖర్జూరపు టెంకపై ఉండే పొరకు కూడా యజమానులు కారు.[27]

يُوْلِجُ الَّيْلَ فِي النَّهَارِ وَيُوْلِجُ النَّهَارَ فِي الَّيْلِ ۙ وَ
سَخَّرَ الشَّمْسَ وَالْقَمَرَ ۖ كُلٌّ يَّجْرِيْ لِاَجَلٍ مُّسَمًّى ۗ
ذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمْ لَهُ الْمُلْكُ ۗ وَالَّذِيْنَ تَدْعُوْنَ
مِنْ دُوْنِهٖ مَا يَمْلِكُوْنَ مِنْ قِطْمِيْرٍ ۗ ﴿13﴾

**14** ఒకవేళ మీరు వారిని మొర పెట్టుకున్నా, వారు మీ మొరను ఆలకించరు.[28] ఒకవేళ ఆలకించినా, మీ అక్కరను తీర్చలేరు.[29] పైపెచ్చు ప్రళయదినాన మీరు కల్పించే భాగస్వామ్యాన్ని (షిర్క్‌ను) వారు (సూటిగా) త్రోసిపుచ్చుతారు.[30] అన్నీ తెలిసిన దేవుని మాదిరిగా (సావధానపరిచే సమాచారాన్ని) నీకు తెలిపే వాడెవడూ ఉండడు సుమా![31]

اِنْ تَدْعُوْهُمْ لَا يَسْمَعُوْا دُعَآءَكُمْ ۚ وَلَوْ سَمِعُوْا
مَا اسْتَجَابُوْا لَكُمْ ۗ وَيَوْمَ الْقِيٰمَةِ يَكْفُرُوْنَ
بِشِرْكِكُمْ ۗ وَلَا يُنَبِّئُكَ مِثْلُ خَبِيْرٍ ﴿14﴾

ఆయన లౌహె మహ్‌ఫూజ్‌లో నమోదు చేసిపెట్టాడు. అందుకని ఆయుషులోని ఈ హెచ్చు తగ్గులు "వారి నిర్ధారిత సమయం వచ్చినప్పుడు వారు ఒక ఘడియ ముందుకుగాని లేక వెనక్కిగాని జరగలేరు" అన్న దివ్య ఖుర్‌ఆన్ ప్రబోధనానికి విరుద్ధం కావు. దేవుని ఈ వాక్కు ద్వారా కూడా ఈ సిద్ధాంతానికి సమర్థన లభిస్తోంది: "అల్లాహ్ తాను రద్దు చేయదలచుకున్న దాన్ని రద్దుచేస్తాడు. తాను ఉంచదలచుకున్న దానిని స్థిరంగా ఉంచుతాడు. అసలు గ్రంథం (లౌహె మహ్‌ఫూజ్) ఆయన దగ్గరే ఉన్నది" (అర్రాద్ – 39) (ఫత్‌హుల్ ఖదీర్).

25. **'మవాఖిర్'** (مَوَاخِرَ) అంటే వచ్చేపోయే జల ప్రవాహాలను, జల తరంగాలను చీల్చుతూ పయనించే ఓడలని అర్థం. ఈ ఆయతులో ప్రస్తావించబడిన ఇతర విషయాల వివరణ ఫుర్ఖాన్ సూరాలో ఇంతకుముందు వచ్చింది.

26. అంటే ఈ సమస్త కార్యాలను నడుపుతున్నవాడు.

27. అంటే – ఇంతటి అల్పమైన వస్తువుకు కూడా వారు యజమానులు కారు. దాన్ని సృష్టించే అధికారం కూడా వారికి లేదు. ఖర్జూర పండుకు – దాని టెంకకు మధ్య ఉండే పలుచటి పొరను **'ఖిత్‌మీర్'** (قِطْمِيْر) అంటారు. ఈ సన్నని పొర ఒక కవరు మాదిరిగా టెంకను చుట్టుకుని ఉంటుంది.

28. ఆపద సమయంలో మీరు వారిని ఎంత ఆర్ద్రతతో పిలిచినా వారు మీ పిలుపును వినరు. ఎందుకంటే వాళ్లు రాళ్లు రప్పలు లేదా మట్టిలో ఖననమై ఉన్నవారాయె.

29. ఒకవేళ వారు విన్నా నిరర్థకమే. ఎందుకంటే మీ ఫిర్యాదులను విని, మీ అక్కరలను తీర్చే, మీ పనులను చక్కబెట్టే శక్తి వారికి లేదు.

30. పైగా, "మీరసలు మమ్మల్ని పూజించనే లేదు" (యూనుస్–28) అనీ, "మీరు మమ్మల్ని ఆరాధించిన సంగతి మాకు తెలియదే!" అని చెప్పేస్తారు (యూనుస్–29). ఈ ఆయతు ద్వారా తేటతెల్లమయ్యే ఇంకొక విషయమేమిటంటే అల్లాహ్ తప్ప పూజించబడే ఆ చిల్లర దైవాలు కేవలం విగ్రహాలు, ప్రతిమలు, చిత్రపటాలు మాత్రమే కావు. బుద్ధిజ్ఞానాలు గల జీవులు (దైవదూతలు, జిన్నులు, షైతానులు, సత్పురుషులు) కూడా పూజించబడేవారు. అందుకే వారు ఈ మిథ్యాపూజను తిరస్కరిస్తారు. అక్కరలు తీర్చమని వారిని వేడుకోవటం కూడా 'షిర్క్' క్రిందికి వస్తుందని ఈ ఆయతు ద్వారా విదితమవుతోంది.

**15** ఓ ప్రజలారా! మీరంతా అల్లాహ్ అవసరం కలిగినవారు.[32] అల్లాహ్ మాత్రం అక్కరలేనివాడు.[33] (సర్వ విధాలా) స్తుతించదగిన వాడు.[34]

يٰۤاَيُّهَا النَّاسُ اَنۡتُمُ الۡفُقَرَآءُ اِلَى اللّٰهِ ۚ وَاللّٰهُ
هُوَ الۡغَنِىُّ الۡحَمِيۡدُ ﴿15﴾

**16** ఆయన గనక తలిస్తే మిమ్మల్ని తుదముట్టించి, (మీ స్థానంలో) మరో నూతన సృష్టిని చేయగలడు.[35]

اِنۡ يَّشَاۡ يُذۡهِبۡكُمۡ وَيَاۡتِ بِخَلۡقٍ جَدِيۡدٍ ﴿16﴾ ۚ

**17** ఇలా చేయటం అల్లాహ్‌కు ఏమాత్రం కష్టతరం కాదు.

وَمَا ذٰلِكَ عَلَى اللّٰهِ بِعَزِيۡزٍ ﴿17﴾

**18** బరువును మోసేవాడెవడూ మరొకరి బరువును మోయడు.[36] బరువు మోసేవాడు ఒకవేళ తన బరువును మోపే నిమిత్తం వేరొకరిని పిలిచినా, అతడు – సమీప బంధువు అయినాసరే – కొద్దిగా కూడా ఎత్తుకోడు.[37] (ఓ ప్రవక్తా!) చూడకపోయినా తమ ప్రభువుకు భయపడేవారిని, నమాజులను నెలకొల్పేవారిని మాత్రమే నువ్వు సావధానపరచగలవు.[38] ఎవడు పరిశుద్ధుడైనా తన స్వయం కోసమే పరిశుద్ధుడవుతాడు.[39] (కడకు అందరూ) అల్లాహ్ వైపునకే మరలిపోవలసి ఉంది.

وَلَا تَزِرُ وَازِرَةٌ وِّزۡرَ اُخۡرٰى ؕ وَاِنۡ تَدۡعُ مُثۡقَلَةٌ
اِلٰى حِمۡلِهَا لَا يُحۡمَلۡ مِنۡهُ شَىۡءٌ وَّلَوۡ كَانَ ذَا قُرۡبٰى ؕ
اِنَّمَا تُنۡذِرُ الَّذِيۡنَ يَخۡشَوۡنَ رَبَّهُمۡ بِالۡغَيۡبِ وَاَقَامُوا
الصَّلٰوةَ ؕ وَمَنۡ تَزَكّٰى فَاِنَّمَا يَتَزَكّٰى لِنَفۡسِهٖ ؕ
وَاِلَى اللّٰهِ الۡمَصِيۡرُ ﴿18﴾

31. ఎందుకంటే ఆయన లాంటి పరిపూర్ణ జ్ఞాని, సర్వజ్ఞుడు ఎవడూ లేడు. సమస్త విషయాల వాస్తవికత, వాటి పరిణామం ఆయన ఒక్కడికే తెలుసు. మొరపెట్టుకోబడే వారి నిస్సహాయ స్థితి, తీర్పుదినాన వారు తప్పుకునే తీరు గురించి ఆయనకు తెలిసినట్లుగా మరెవరికి తెలుసు గనక?

32. **'నాస్'** (اَلنَّاس) అన్న పదం సర్వసాధారణమైనది. అందులో సామాన్య జనులు, ముఖ్యమైన వ్యక్తులు, దైవప్రవక్తలు కూడా చేరి ఉన్నారు. అందరూ అల్లాహ్‌పై ఆధార పడినవారే. కాని అల్లాహ్ మాత్రం ఎవరిపైనా ఆధారపడడు.

33. ఆయన నిరపేక్షాపరుడు, అక్కర లేనివాడు. లోకంలోని జనులంతా ఆయన విధేయతను నిరాకరించినా ఆయన సామ్రాజ్యంలో ఏ లోటూ రాదు. ఒకవేళ అందరూ ఆయన ఆజ్ఞల ముందు తలవంచినా ఆయన శక్తియుక్తులలో కలిగే వృద్ధి అంటూ ఏదీ లేదు. అవిధేయతకు ఒడిగట్టినవారు తమ ఆత్మలకే అన్యాయం చేసుకుంటారు. విధేయత చూపి, ఆయన దాస్యం చేసినవారు తమ స్వయానికే మేలు చేకూర్చుకున్నవారవుతారు.

34. ఆయన తన దాసులకు ప్రసాదించిన అనంత అనుగ్రహాల, వరాల మూలంగా దాసుల తరఫున ఆయన స్తుతిస్తోత్రాలకు, కృతజ్ఞతలకు అర్హుడయ్యాడు.

35. ఇది కూడా ఆయన నిరపేక్షా స్వభావానికి ఓ మచ్చుతునకే. ఆయన గనక తలచుకుంటే మిమ్మల్ని ఇట్టే తుడిచిపెట్టేసి, మీకు బదులుగా అనూహ్యంగా ఓ నవలోకాన్ని ఉనికిలోనికి తీసుకురాగలడు. వారు ఆయనకు విధేయులై ఉంటారు. ఆయన ఆజ్ఞలను జవదాటని వారై ఉంటారు.

36. ఇతరులను అపమార్గానికి లోను చేసినవాడు తన పాపాల భారాన్ని మోయటంతోపాటు అపమార్గం పాలైనవారి పాపాల బరువును కూడా మోస్తాడు. అన్‌కబూత్ సూరాలోని 13వ ఆయతు కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తున్నది. **మన్ సన్న సున్నతన్ సయ్యి అతన్ కాన అలైహి విజ్‌రుహా వ విజ్‌రు మన్ అమిల బిహా మిన్ బాదిహి** (ఎవరయినా ఒక చెడు పనికి శ్రీకారం చుడితే దాని పాపం అతనిమీద పడుతుంది. ఇంకా అతని తర్వాత దాన్ని అమలుచేసినవారి పాపం కూడా అతని నెత్తినపడుతుంది) (సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్) అనే హదీసును బట్టి అవగతమయ్యేది

| | |
|---|---|
| 19 గుడ్డివాడు – చూసేవాడూ సమానులు కారు. | وَمَا يَسْتَوِى الْأَعْمٰى وَالْبَصِيْرُ ⑲ |
| 20 చీకట్లు – వెలుతురు ఒకటి కావు.[40] | وَلَا الظُّلُمٰتُ وَلَا النُّوْرُ ⑳ |
| 21 నీడా – ఎండా సమం కావు.[41] | وَلَا الظِّلُّ وَلَا الْحَرُوْرُ ㉑ |
| 22 బ్రతికి ఉన్నవారూ చచ్చినవారు (ఎన్నటికీ) సమానులు కాలేరు.[42] అల్లాహ్ తాను కోరిన వారికి వినిపిస్తాడు.[43] సమాధుల్లో ఉన్నవారికి నువ్వు వినిపించలేవు.[44] | وَمَا يَسْتَوِى الْأَحْيَآءُ وَلَا الْأَمْوَاتُ ۭ اِنَّ اللّٰهَ يُسْمِعُ مَنْ يَّشَآءُ ۚ وَمَآ اَنْتَ بِمُسْمِعٍ مَّنْ فِى الْقُبُوْرِ ㉒ |
| 23 నువ్వు హెచ్చరించేవాడవు మాత్రమే.[45] | اِنْ اَنْتَ اِلَّا نَذِيْرٌ ㉓ |

కూడా ఇదే – ఇతరుల బరువు కూడా వాస్తవానికి వారి బరువే. ఎందుకంటే ఇతరులను మార్గభ్రష్టుల్ని చేసింది వారే గనక.

37. పాపాల బరువును మోసేవాణ్ణి ఆనాడు ఎవరూ పట్టించుకోరు. ఆఖరికి అతని ఆత్మీయులు, రక్త సంబంధీకులు కూడా అతని బరువును ఏ కాస్త తగ్గించటానికి కూడా ముందుకు రారు.

38. నీ హెచ్చరికలు, ఉపదేశాల వల్ల ప్రయోజనం చేకూరేది ఈ సజ్జనులకు మాత్రమే. కాబట్టి నువ్వు వాళ్ళను మాత్రమే సావధానపరుస్తూ ఉండు. తలబిరుసుల ముందు ఎన్ని హెచ్చరికలు చేసినా లాభం లేదు – చెవిటివారి ముందు శంఖం ఊదటం వంటిదే. ఈ విషయమే దివ్య ఖుర్ఆన్‌లో ఇతరచోట్ల ఇలా చెప్పబడింది :

1. "ఆయనకు భయపడేవారిని మాత్రమే నువ్వు హెచ్చరించేవాడివి." (అన్నాజియాత్ – 45)

2. "హితబోధను అనుసరించి, చూడకుండానే కరుణామయునికి భయపడే వ్యక్తిని మాత్రమే నీవు సావధానపరచగలవు." (యాసీన్ – 11)

39. 'తతహ్హుర్' మరియు 'తజక్కీ' అంటే షిర్క్, అశ్లీలత వంటి మాలిన్యాల నుండి పరిశుద్ధమవడం.

40. ఇక్కడ అంధుడు అంటే తిరస్కారి అనీ, చూసేవాడు అంటే విశ్వాసి అనీ భావం. చీకటి అంటే మిథ్య (అసత్యం), వెలుతురు అంటే సత్యం అని అర్థం. మిథ్య కూడా ఎన్నో రకాలు. అందుకే మిథ్య కోసం వాడబడిన పదం (జులుమాత్) బహువచనంలో ఉంది. సత్యం (హఖ్) ఒక్కటే గనక దానికోసం ఏకవచనం ప్రయోగించబడింది.

41. పుణ్యము పాపముల లేదా స్వర్గనరకాల వ్యత్యాసాన్ని తెలియజెప్పటానికి ఈ ఉపమానం ఇవ్వబడింది.

42. బ్రతికి ఉన్నవారు (అహ్యా) అంటే సత్యాన్ని నమ్మేవారు, చచ్చినవారు (అమ్వాత్) అంటే సత్యాన్ని తృణీకరించినవారని భావం. లేక జ్ఞానులు – అజ్ఞానులనీ, బుద్ధిజీవులు – మూర్ఖులనీ అర్థం.

43. అంటే – అల్లాహ్ ఎవరికి సన్మార్గ భాగ్యం ప్రసాదించనున్నాడో, ఎవరికి స్వర్గంలో ప్రవేశ భాగ్యం లభించనున్నదో వారికి ప్రమాణబద్ధమైన విషయాన్ని విని స్వీకరించే సద్బుద్ధిని ఇస్తాడు.

44. సమాధులలో ఉన్న మృతులు విషయాన్ని ఎలా వినలేవో అలాగే అవిశ్వాసం చేత తమ అంతరాత్మలను చంపుకున్న వారికి ఓ ముహమ్మద్ (సఅసం)! నీవు సత్యాన్ని వినిపించలేవు. దీని భావం ఏమిటంటే, చనిపోయిన తరువాత సమాధులలో ఖననమై ఉన్న మృతులు ఏవిధంగా భౌతిక ప్రయోజనాలను పొందలేవో అదేవిధంగా దౌర్భాగ్యం రాసిపెట్టబడిన అవిశ్వాసులు, ముష్రిక్కులు కూడా సత్యసందేశ ప్రచారం ద్వారా లాభం పొందలేరు.

45. అంటే – ఓ ముహమ్మద్ (స)! సందేశాన్ని యథాతథంగా అందజేయటం వరకే నీ పని. సన్మార్గం చూపటంగానీ, మార్గవిహీనతకు గురిచేయటంగానీ దేవుని పని.

**24** మేము నీకు సత్యాన్ని ఇచ్చి, శుభవార్తను అందజేసేవానిగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము. హెచ్చరించేవాడు గడచి ఉండని సమాజం అంటూ ఏదీ లేదు.

إِنَّا أَرْسَلْنَاكَ بِالْحَقِّ بَشِيرًا وَنَذِيرًا ۚ وَإِن مِّنْ أُمَّةٍ
إِلَّا خَلَا فِيهَا نَذِيرٌ ﴿٢٤﴾

**25** ఒకవేళ వీళ్ళు నిన్ను ధిక్కరించినట్లయితే, వీరికి మునుపు గతించిన వారు కూడా ధిక్కరించినవారే. వారి దగ్గరకు కూడా వారి ప్రవక్తలు మహిమలను, ప్రతుల (సహీఫాల)ను, ప్రకాశమానమైన గ్రంథాలను తీసుకువచ్చారు.[46]

وَإِن يُكَذِّبُوكَ فَقَدْ كَذَّبَ الَّذِينَ مِن قَبْلِهِمْ
جَاءَتْهُمْ رُسُلُهُم بِالْبَيِّنَاتِ وَبِالزُّبُرِ وَبِالْكِتَابِ
الْمُنِيرِ ﴿٢٥﴾

**26** ఆ తరువాత నేను అవిశ్వాసులను పట్టుకున్నాను. మరి నా ఝుళిపింపు ఎలా ఉందో[47] (చూశారుగా)!

ثُمَّ أَخَذْتُ الَّذِينَ كَفَرُوا ۖ فَكَيْفَ كَانَ نَكِيرِ ﴿٢٦﴾

**27** అల్లాహ్ ఆకాశం నుంచి వర్షం కురిపించటాన్ని నువ్వు చూడలేదా? మరి దాని ద్వారా మేము పలు రంగుల పండ్లను ఉత్పన్నం చేశాము.[48] మరి పర్వతాలలో కూడా పలు భాగాలు ఉన్నాయి– తెల్లనివి, ఎర్రనివి. వాటి రంగులు కూడా వేర్వేరుగా ఉన్నాయి. చాలా నల్లనివి కూడా ఉన్నాయి.[49]

أَلَمْ تَرَ أَنَّ اللَّهَ أَنزَلَ مِنَ السَّمَاءِ مَاءً فَأَخْرَجْنَا
بِهِ ثَمَرَاتٍ مُّخْتَلِفًا أَلْوَانُهَا ۚ وَمِنَ الْجِبَالِ جُدَدٌ
بِيضٌ وَحُمْرٌ مُّخْتَلِفٌ أَلْوَانُهَا وَغَرَابِيبُ سُودٌ ﴿٢٧﴾

**28** అలాగే మనుషులలో, జంతువులలో, పశువులలో కూడా పలు రంగులు గలవి ఉన్నాయి.[50] అల్లాహ్ దాసులలో జ్ఞాన సంపన్నులు మాత్రమే ఆయనకు భయపడతారు.[51] నిశ్చయంగా అల్లాహ్ సర్వాధిక్యుడు, క్షమాశీలి.[52]

وَمِنَ النَّاسِ وَالدَّوَابِّ وَالْأَنْعَامِ مُخْتَلِفٌ أَلْوَانُهُ
كَذَٰلِكَ ۗ إِنَّمَا يَخْشَى اللَّهَ مِنْ عِبَادِهِ الْعُلَمَاءُ ۗ
إِنَّ اللَّهَ عَزِيزٌ غَفُورٌ ﴿٢٨﴾

46. ఈమాన్ అంటే ఏమిటో, కుఫ్ర్ అంటే ఏమిటో మాకేం తెలుసు? ఈ విషయాలను తెలియజేసే సందేశహరుడు ఎవరూ మా వద్దకు రాలేదుకదా! అని సాకులు చెప్పే ఆస్కారం ఉండకూడదని అల్లాహ్ ప్రతి మానవ సముదాయంలోనూ తన ప్రవక్తలను ప్రభవింపజేశాడు. ఉదాహరణకు:
    1. "ప్రతి జాతి కొరకూ ఒక మార్గదర్శకుడు ఉన్నాడు." (అర్రాద్–7)
    2. "మేము ప్రతి సమాజంలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము."(అన్ నహ్ల్–36)

47. అంటే ఎలాంటి కఠినమైన ఆపదను వారిపైకి పంపానో, ఏ విధంగా వారిని తుడిచిపెట్టేశానో అధ్యయనం చేయండి! అని భావం.

48. మనుషులలో సన్మార్గులు–దుర్మార్గులు, విశ్వాసులు–అవిశ్వాసులు లాంటి అనేక రకాల వారున్నట్లే ఇతర జీవరాసులలో కూడా ఈ అంతరాలు, వ్యత్యాసాలు ఉన్నాయి. ఉదాహరణకు: పండ్లు ఫలాలనే తీసుకోండి – వాటిలో ఎన్నో రంగులున్నాయి. రుచిలో, సువాసనలో కూడా భిన్నంగా ఉంటాయి. ఒకే రకపు పండులో కూడా రంగు వేరుగా, రుచి వేరుగా ఉంటుంది. ఖర్జూరం, యాపిల్, ద్రాక్షపండ్లలో మనం ఈ తేడాలను స్పష్టంగా చూడగలం.

49. అలాగే పర్వతాలను చూడండి. పర్వతశ్రేణులలో, పర్వత కనుమలలో కొన్ని తెల్లగానూ, మరికొన్ని ఎర్రగానూ కనిపిస్తాయి. మరికొన్ని పర్వత భాగాలయితే బొగ్గులా మరీ నల్లగా కనిపిస్తాయి.

**29** దైవగ్రంథాన్ని పఠిస్తూ[53] నమాజును నెలకొల్పేవారు,[54] మేము ప్రసాదించిన దానిలో నుంచి గోప్యంగానూ, బహిరంగంగానూ ఖర్చు చేసేవారు[55] ఎన్నటికీ నష్టం కలుగని[56] వర్తకాన్ని ఆశిస్తున్నారు.

اِنَّ الَّذِیْنَ یَتْلُوْنَ كِتٰبَ اللّٰهِ وَ اَقَامُوا الصَّلٰوةَ
وَ اَنْفَقُوْا مِمَّا رَزَقْنٰهُمْ سِرًّا وَّ عَلَانِیَةً یَّرْجُوْنَ
تِجَارَةً لَّنْ تَبُوْرَ (29)

**30** వారికి వారి ప్రతిఫలాలు (అల్లాహ్) పూర్తిగా ఇవ్వటానికి, తన కృపతో ఆయన వారికి మరింతగా ప్రసాదించటానికిగాను[57] (వారు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు). నిశ్చయంగా ఆయన అమితంగా క్షమించేవాడు, సన్మానించేవాడు.[58]

لِیُوَفِّیَهُمْ اُجُوْرَهُمْ وَ یَزِیْدَهُمْ مِّنْ فَضْلِهٖ ؕ اِنَّهٗ
غَفُوْرٌ شَكُوْرٌ (30)

50. అంటే మానవులలో, పశువులలో కూడా విభిన్న రంగులు ఉంటాయి. కొందరు తెల్లగా, మరికొందరు నల్లగా, ఇంకొందరు చామనచాయగా, ఇంకా కొందరు గోధుమ వర్ణం గలవారై ఉంటారు.

51. అంటే దేవుని ఈ అసాధారణమైన ప్రజ్ఞాపాటవాలను, శక్తియుక్తులను జ్ఞానులు మాత్రమే అర్థం చేసుకోగలుగుతారు. ఇక్కడ జ్ఞానం (ఇల్మ్) అంటే దైవగ్రంథజ్ఞానం, హదీసు పరిజ్ఞానం, దివ్యజ్ఞానం అని భావం. దైవం గురించి వారు ఎంతగా తెలుసుకుంటే అంతగానే ఆయనకు భయపడతారు. కాబట్టి జ్ఞానుల కోవకు చెందిన వారిలో– ఎవరిలోనయినా దైవభీతి లేనట్లయితే వారసలు జ్ఞానాన్ని ఆర్జించలేదనాలి. సుఫియాన్ సౌరీ ఇలా అంటున్నారు : "పండితులలో మూడు రకాల వారుంటారు. మొదటిరకం: వారు అల్లాహ్‌కు భయపడతారు. అల్లాహ్ విధించిన హద్దులను, విధ్యుక్త ధర్మాలను గురించి తెలిసినవారై ఉంటారు. రెండవరకం: వారు అల్లాహ్‌కు భయపడతారు. కాని ఆయన విధించిన హద్దులేవో, విధ్యుక్త ధర్మాలేవో వారికి తెలియదు. మూడవ రకం: వారికి అల్లాహ్ నిర్ణయించిన హద్దుల గురించి, విధ్యుక్త ధర్మాల గురించి తెలుసు. కాని వారిలో దైవభీతి మాత్రం ఉండదు." (ఇబ్నె కసీర్).

52. ప్రభువుకు ఎందుకు భయపడాలి అన్న ప్రశ్నకు ఇది సమాధానం. అవిధేయుల పాలిట ఆయన కఠినుడు, శక్తిమంతుడు. పశ్చాత్తాపం చెందిన వారి యెడల క్షమాగుణం కలవాడు.

53. **'దైవగ్రంథ పఠనం'** అంటే దివ్య ఖుర్ఆన్ పారాయణం అని భావం. వారు దివ్య ఖుర్ఆన్‌ను అధికంగా పఠిస్తూ ఉంటారు.

54. **'నమాజును నెలకొల్పటం'** లో క్రమం తప్పకుండా నమాజు చేయటం, నిర్ణీత వేళల్లో నమాజు చేయటం, నమాజును నియమబద్ధంగా చేయటం, నమాజులో ఏకాగ్రతను, అణకువను, భక్తిని కలిగి ఉండటం – ఇత్యాది అర్థాలు ఇమిడి ఉన్నాయి.

55. అంటే రేయింబవళ్లు దైవమార్గంలో ఖర్చుపెడతారు. దానధర్మాలు చేస్తారు. అడిగేవారికి మాత్రమే గాక, అడగని వారికి (అభిమానధనులకు) కూడా, వారి నిజస్థితిని గుర్తించి ఇస్తారు. వారు ఖర్చుచేసే దానిలో తప్పనిసరిగా చెల్లించవలసిన దానాల (సదఖయె వాజిబా)తో పాటు, స్వచ్ఛంద దానాలు (సదఖయె నాఫిలా) కూడా చేరివుంటాయి. కొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం గోప్యంగా ఖర్చుపెట్టేవాటిలో స్వచ్ఛంద దానాలు, బహిరంగంగా ఖర్చుపెట్టే వాటిలో తప్పనిసరిగా చెల్లించవలసిన దానాలు ఉంటాయి.

56. అలాంటి వారికి దేవుడు సంపూర్ణ పుణ్యఫలం ప్రసాదిస్తాడు. అందులో ఎలాంటి కోత విధించటంగానీ, తగ్గించటం గానీ జరగదు.

57. వారి వర్తకం నష్టం లేనిదని ఎందుకనబడిందంటే, వారి సదాచరణలకు పుణ్యఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌పై ఉంది. లేదా వారికి పుణ్యఫలం ప్రసాదించేందుకే అల్లాహ్ వారికి మంచిపనులు చేసే సద్బుద్ధిని వొసగాడు.

58. క్షమాభిక్షకై, దైవానుగ్రహాల వృద్ధికై ఇక్కడ షరతు విధించబడింది. అదేమిటంటే దాసులు నిష్కల్మషమైన మనసుతో

31 (ఓ ప్రవక్తా!) మేము 'వహీ' రూపంలో నీ వద్దకు పంపిన ఈ గ్రంథం సత్యమైంది,[59] తనకు పూర్వం వచ్చిన గ్రంథాలను ధృవ పరిచేది.[60] నిస్సందేహంగా అల్లాహ్ తన దాసుల స్థితిగతులన్నీ తెలిసినవాడు, అన్నీ చూసేవాడు.[61]

وَالَّذِيٓ اَوْحَيْنَآ اِلَيْكَ مِنَ الْكِتٰبِ هُوَ الْحَقُّ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ ۭ اِنَّ اللّٰهَ بِعِبَادِهٖ لَخَبِيْرٌۢ بَصِيْرٌ (31)

32 తరువాత మా దాసులలో మేము ఎన్నుకున్న వారిని (ఈ) గ్రంథానికి[62] వారసులుగా చేశాము. మరి వారిలో కొందరు తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగడుతున్నారు.[63] వారిలో మరి కొందరు మధ్య రకానికి చెందినవారు.[64] వారిలో ఇంకొందరు అల్లాహ్ అనుమతితో సత్కార్యాలలో ముందంజ వేస్తున్నారు.[65] ఇది మహదనుగ్రహం.[66]

ثُمَّ اَوْرَثْنَا الْكِتٰبَ الَّذِيْنَ اصْطَفَيْنَا مِنْ عِبَادِنَا ۚ فَمِنْهُمْ ظَالِمٌ لِّنَفْسِهٖ ۚ وَمِنْهُمْ مُّقْتَصِدٌ ۚ وَمِنْهُمْ سَابِقٌۢ بِالْخَيْرٰتِ بِاِذْنِ اللّٰهِ ۭ ذٰلِكَ هُوَ الْفَضْلُ الْكَبِيْرُ (32)

పశ్చాత్తాపం చెందాలి. వినమ్రతా భావంతో సత్కర్మలు చేయాలి. అలాంటి సదాచార సంపన్నులను అల్లాహ్ గుర్తించి, సత్కరిస్తాడు. ఆయన కేవలం సదాచరణల ప్రతిఫలం మాత్రమే గాకుండా తన దయతో మరింతగా అనుగ్రహిస్తాడు. ఆయన ఇచ్చే పురస్కారాలకు, బహుమానాలకు లెక్కే లేదు.

59. కనుక (ఓ ముహమ్మద్!) నువ్వూ, నీ అనుచర సమాజం దానికనుగుణంగా ఆచరించటం తప్పనిసరి.

60. అంటే తౌరాతు, ఇంజీల్ తదితర గ్రంథాలను దైవగ్రంథాలని ఖుర్ఆన్ ధృవీకరిస్తుంది. పూర్వపు గ్రంథాలను అవతరింప జేసిన దేవుడే దివ్య ఖుర్ఆన్ని కూడా అవతరింపజేశాడన్న దానికి ఇది ప్రబల తార్కాణం. ఈ కారణంగానే కదా ఈ గ్రంథాలు ఒండొక దానిని సత్యమని ధృవపరుస్తున్నాయి!

61. ఈ కారణంగానే ఆయన తన దాసులకు మరో దివ్యగ్రంథం ఆవశ్యకతను గుర్తించాడు. ఎందుకంటే పూర్వగ్రంథాలు మార్పులు చేర్పులకు గురై, మానవాళికి మార్గదర్శకత్వం వహించే సత్తాను కోల్పోయాయన్న సంగతి ఆయనకు తెలుసు.

62. ఇక్కడ **'గ్రంథం'** అంటే దివ్య ఖుర్ఆన్ అనీ, **'ఎన్నుకోబడినవారు'** అంటే ముహమ్మద్ అనుచరులు అని భావం. అంటే ముహమ్మద్ అనుచర సమాజాన్ని మేము ఈ ఖుర్ఆన్ గ్రంథానికి వారసులుగా చేశాము. ఇంకా ఈ సమాజాన్ని మేము శ్రేష్ఠసమాజం (ఖైరె ఉమ్మత్)గా ఖరారు చేశాము. ఇది దాదాపు అల్ బఖర సూరాలోని 143 వ ఆయతు సారాంశాన్ని పోలినది.

63. ముహమ్మద్ అనుచర సమాజంలోని మూడు రకాల ప్రజలలో వీరు మొదటి రకానికి చెందినవారు. కొన్ని విధుల నిర్వహణలో వీరు అలసత్వం ప్రదర్శిస్తారు. వీరివల్ల కొన్ని తప్పులు జరుగుతాయి. కొంతమంది విద్వాంసుల ప్రకారం వీరు చిన్న చిన్న పాపాలకు ఒడిగడుతూ ఉంటారు. 'వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటారు' అని ఎందుకు అనబడిందంటే, తమ వల్ల జరిగిన ఈ తప్పుల కారణంగా వారు అల్లాహ్ (ఇతరులకు) ప్రసాదించే ఉన్నత శ్రేణులకు నోచుకోకుండా పోతారు.

64. వీరు రెండో కోవకు చెందినవారు. వీరి ఆచరణ మిశ్రమంగా ఉంటుంది. కొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం వారు విధ్యుక్త ధర్మాలను పాటిస్తారు. నిషిద్ధాంశాలను త్యజిస్తారు. కాని ఒక్కోసారి కొన్ని పుణ్యకార్యాల నిర్వహణలో లోటు చేస్తారు. అవాంఛనీయమైన పనులకు పాల్పడుతూ ఉంటారు. లేదా వారు స్వతహాగా మంచివారే గాని మంచిపనుల పట్ల తగినంత శ్రద్ధ కనబరచరు.

65. ఈ మూడవ రకం ప్రజలు మొదటి రెండు రకాలకన్నా ఉత్తములు. సత్కార్యాలలో వారు సదా ముందుకు దూసుకు పోతారు.

جَنّٰتُ عَدۡنٍ يَّدۡخُلُوۡنَهَا يُحَلَّوۡنَ فِيۡهَا مِنۡ اَسَاوِرَ
مِنۡ ذَهَبٍ وَّلُـؤۡلُـؤًا ۚ وَلِبَاسُهُمۡ فِيۡهَا حَرِيۡرٌ ﴿33﴾

**33** (వారి కోసం) కలకాలం నిలిచే స్వర్గ వనాలున్నాయి. వాటిలో వారు ప్రవేశిస్తారు.[67] అక్కడ వారు స్వర్ణకంకణాలతో, ముత్యాలతో ముస్తాబు అవుతారు. వారు ధరించే వస్త్రాలు పట్టు వస్త్రాలై ఉంటాయి.[68]

وَقَالُوا الۡحَمۡدُ لِلّٰهِ الَّذِىۡۤ اَذۡهَبَ عَنَّا الۡحَزَنَ ؕ
اِنَّ رَبَّنَا لَـغَفُوۡرٌ شَكُوۡرُ ﴿34﴾

**34** వారిలా అంటారు: 'మా నుంచి దుఃఖాన్ని దూరం చేసిన అల్లాహ్‌కు (శతకోటి) కృతజ్ఞతలు. నిశ్చయంగా మా ప్రభువు అమితంగా క్షమించేవాడు, సత్కార స్వభావుడు.

الَّذِىۡۤ اَحَلَّنَا دَارَ الۡمُقَامَةِ مِنۡ فَضۡلِهٖ ۚ لَا يَمَسُّنَا
فِيۡهَا نَصَبٌ وَّلَا يَمَسُّنَا فِيۡهَا لُـغُوۡبٌ ﴿35﴾

**35** "ఆయన తన కృపతో నిత్యం ఉండే నెలవులో మమ్మల్ని దించాడు. అందులో మాకు బాధగానీ, అలసటగానీ ఉండట్లేదు."

وَالَّذِيۡنَ كَفَرُوۡا لَهُمۡ نَارُ جَهَنَّمَ ۚ لَا يُقۡضٰى عَلَيۡهِمۡ
فَيَمُوۡتُوۡا وَلَا يُخَفَّفُ عَنۡهُمۡ مِّنۡ عَذَابِهَا ؕ كَذٰلِكَ
نَجۡزِىۡ كُلَّ كَفُوۡرٍ ﴿36﴾

**36** మరి తిరస్కార వైఖరికి పాల్పడిన వారికోసం నరకాగ్ని ఉన్నది. వారు చావటానికి తీర్మానించటంగానీ, వారి నరక శిక్షను తగ్గించటంగాని జరగదు. మేలును మరచిన వారం దరికీ మేము ఇలాంటి ప్రతిఫలమే ఇస్తాము.

وَهُمۡ يَصۡطَرِخُوۡنَ فِيۡهَا ۚ رَبَّنَاۤ اَخۡرِجۡنَا نَـعۡمَلۡ
صَالِحًا غَيۡرَ الَّذِىۡ كُنَّا نَـعۡمَلُ ؕ اَوَلَمۡ نُعَمِّرۡكُمۡ
مَّا يَتَذَكَّرُ فِيۡهِ مَنۡ تَذَكَّرَ وَجَآءَكُمُ النَّذِيۡرُ ؕ
فَذُوۡقُوۡا فَمَا لِلظّٰلِمِيۡنَ مِنۡ نَّصِيۡرٍ ﴿37﴾

**37** అందులో వారిలా ఘోషిస్తారు: "ప్రభూ! మమ్మల్ని బయటికి తియ్యి. మేము ఇప్పటిదాకా చేసిన పనులకు భిన్నంగా మంచి పనులు చేస్తాము."[69] (సమాధానంగా అల్లాహ్ ఇలా అంటాడు): "అర్థం చేసుకునేవానికి అర్థం చేసుకోగలిగేంత వయస్సును మేము మీకు ఇవ్వలేదా?[70] హెచ్చరించేవాడు సయితం మీ వద్దకు వచ్చాడు[71] – కనుక (శిక్షను) చవిచూడండి. (ఇలాంటి) దుర్మార్గులను ఆదుకునే వాడెవడూ లేడు."

66. అంటే, అంతిమ దివ్య గ్రంథానికి వారసులుగా చేయటం, గత సమాజాల కన్నా ఎన్నో విషయాలలో సౌలభ్యాలు ప్రసాదించటం నిజంగా గొప్ప కటాక్షమే.

67. సత్కార్యాలలో ముందంజ వేసేవారు మాత్రమే స్వర్గానికి పోతారని కొందరు వ్యాఖ్యానించారు. కాని ఈ అభిప్రాయం సరైనది కాదు. ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడిన ఈ మూడు రకాల వారు కూడా స్వర్గానికి అర్హులే. కాకపోతే అత్యున్నత శ్రేణికి చెందిన (మూడవ కోవ) వారు లెక్క తీసుకోకుండానే స్వర్గంలో ప్రవేశిస్తారు. మధ్య రకానికి చెందినవారు తేలికపాటి లెక్క తీసుకున్న తర్వాత స్వర్గంలో ప్రవేశం కల్పించబడతారు. ఇక ఆత్మలకు అన్యాయం చేసుకున్నవారు సిఫారసు మీదనో లేక శిక్ష అనుభవించిన మీదటనో స్వర్గానికి కొనిపోబడతారు. హదీసుల ద్వారా రూఢీ అయ్యేది కూడా ఇదే. ముహమ్మద్ బిన్ హనఫియ ఇలా అంటున్నారు : "ఇది దయజూపబడిన సమాజం. అన్యాయస్థులు– అంటే పాపాత్ములు – క్షమించబడతారు. మధ్య రకం ప్రజలు దైవసన్నిధిలో స్వర్గవాసులుగా ఖరారవుతారు. ఇక సత్కార్యాలకై పోటీపడేవారు స్వర్గంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారు." (ఇబ్నె కసీర్).

68. "ప్రపంచంలో పట్టు వస్త్రాలను ధరించకండి. ప్రపంచంలో వాటిని ధరించిన వాడు పరలోకంలో ధరించడు" అని హదీసులో ఉంది. (సహీహ్ బుఖారీ; సహీహ్ ముస్లిం – కితాబుల్లిబాస్).

38 నిశ్చయంగా అల్లాహ్ ఆకాశాలలో, భూమిలో ఉన్న రహస్యాలను ఎరిగినవాడు.[72] నిశ్చయంగా గుండెల్లోని గుట్టును సయితం ఆయన ఎరిగినవాడు.[73]

إِنَّ اللَّهَ عَالِمُ غَيْبِ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ إِنَّهُ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ﴿٣٨﴾

39 మిమ్మల్ని భూమిలో ప్రతినిధులుగా చేసినవాడు ఆయనే. కాబట్టి ఇక ఎవరయినా తిరస్కార వైఖరికి పాల్పడితే అతని తిరస్కార పాపం అతని మీదే పడుతుంది. తిరస్కారుల తిరస్కార వైఖరి వారి ప్రభువు సన్నిధిలో అయిష్టతను (ఆగ్రహాన్ని) మాత్రమే పెంచుతుంది. ఇంకా తిరస్కారుల కొరకు వారి తిరస్కార వైఖరి నష్టాన్ని మాత్రమే వృద్ధిచేస్తుంది.[74]

هُوَ الَّذِي جَعَلَكُمْ خَلَائِفَ فِي الْأَرْضِ ۚ فَمَنْ كَفَرَ فَعَلَيْهِ كُفْرُهُ ۖ وَلَا يَزِيدُ الْكَافِرِينَ كُفْرُهُمْ عِنْدَ رَبِّهِمْ إِلَّا مَقْتًا ۖ وَلَا يَزِيدُ الْكَافِرِينَ كُفْرُهُمْ إِلَّا خَسَارًا ﴿٣٩﴾

69. అంటే దైవేతరుల పూజను మాని నిన్ను ఆరాధిస్తాము. పాపకార్యాలను త్యజించి, నీవు ఆదేశించిన సత్కార్యాలను మాత్రమే చేస్తాము.

70. అంటే ఇంతకీ ఎంత వయసు? ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు పలువురు పలు రకాల వ్యాఖ్యలు చేశారు. హదీసులను ఉటంకిస్తూ కొందరు '60 ఏండ్లు' అని అన్నారు (ఇబ్నె కసీర్). మా అభిప్రాయంలో వయస్సును నిర్ధారించి చెప్పటం సరైనది కాదు. ఎందుకంటే వయస్సులు విభిన్నంగా ఉంటాయి. కొందరు యౌవనంలో, కొందరు నడి వయసులో, కొందరు వృద్ధాప్యంలో మరణిస్తుంటారు. వాటిలో ఏ ఒక్కటీ చిన్నది కాదు. ఉదాహరణకు : మనిషి యౌవనంలో మరణించినా, వృద్ధాప్యంలో మరణించినా అది అతని పాలిట సుదీర్ఘకాలమే. తన ముందుకు వచ్చిన ఒక విషయాన్ని గురించి ఆలోచించటానికి, పరికించటానికి, దానికి ప్రభావితుడు కావటానికి కొన్నేండ్లు చాలు. ఈపాటి సమయం అత్యధికమందికి లభిస్తుంది. కాబట్టి; "మేము నీకు ఇంత ఆయుష్షు ఇచ్చాము కదా! నువ్వు సత్యాన్ని గురించి ఏ కాస్త యోచించినా అది నీకు బోధపడి ఉండేది. మరలాంటప్పుడు నువ్వు సత్యాన్ని గ్రహించి, దాన్ని అవలంబించే ప్రయత్నం ఎందుకు చేయలేదు?" అన్న భావంలో దీన్ని తీసుకోవటం సమంజసంగా ఉంటుంది.

71. **'హెచ్చరించేవాడు'** (نَّذِيرُ) అంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) అన్నమాట. అంటే నీకు బోధపరచటానికి, నువ్వు మరచిపోయిన పాఠాన్ని జ్ఞాపకం చేయటానికి నీ వద్దకు మా ప్రవక్త (సఅసం) వచ్చాడు, అతని అనుచరులు వచ్చారు. అతని ఆధ్యాత్మిక వారసులైన విద్వాంసులు (ఉలమా), సందేశ ప్రదాతలు వచ్చారు. కాని నువ్వు మాత్రం బొత్తిగా ఆలోచించలేదు. సత్యసందేశకుల మాటల్ని పెడచెవిన పెట్టావు.

72. ఈ వాక్యం ద్వారా అల్లాహ్ చెప్పదలచుకున్న విషయం ఇది కావచ్చు : మీరు మళ్లీ ఇహలోకంలోకి వెళ్ళాలని అభిలషిస్తున్నారు. అవిధేయతను వీడి విధేయతా వైఖరిని అవలంబిస్తామని, షిర్క్‌ను మాని ఏకదైవారాధన చేస్తామని అదే పనిగా చెబుతున్నారు. కాని మీరలా చేయరన్న సంగతి మాకు బాగా తెలుసు. ఒకవేళ మీ కోరికను మన్నించి మిమ్మల్ని మరోసారి ప్రపంచంలోకి పంపినా మీ వ్యవహారం మళ్లీ మొదటికే వస్తుంది. దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట చెప్పబడినట్లు – "ఒకవేళ వారిని ఇహలోకానికి తిరిగి పంపించినా, చేయవద్దన్న పనులే మళ్లీ చేస్తారు. వారు పచ్చి అబద్ధాలకోరులు" (అల్ అన్ఆమ్ – 28)

73. ఇంతకు ముందు వచ్చిన వాక్యానికి ఇది మరింత బలం చేకూరుస్తుంది. మనుషుల ఆంతర్యాలలో అత్యంత గోప్యంగా ఉండే విషయాలను ఎరిగిన దైవానికి భూమ్యాకాశాలలోని నిగూఢ విషయాలు తెలియకుండా ఎలా ఉంటాయి?

74. దైవసన్నిధిలో అవిశ్వాసుల అవిశ్వాస వైఖరి ఎలాంటి లాభాన్నీ చేకూర్చదు. పైగా వారి అవిశ్వాస పోకడలకు దేవుడు ఆగ్రహోదగ్రుడవుతాడు. దానివల్ల తిరస్కారి అయిన మనిషే నష్టపోతాడు.

**40** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : అల్లాహ్‌ను వదలి మీరు మొర పెట్టుకుంటున్న మీ కల్పిత భాగస్వాముల సంగతిని కాస్త తెలియ జేస్తారా?! వారు భూమిలో సృష్టించిందేమిటో నాకు చూపండి.లేక ఆకాశాలలో వారికేదైనా భాగస్వామ్యం ఉన్నదా? పోనీ వారికి మేమేదైనా పుస్తకం ఇచ్చామా, దాని ప్రమాణానికి వారు కట్టుబడి ఉన్నారనటానికి!?[75] లేదు. వాస్తవానికి ఈ దుర్మార్గులు ఒండొక రికి మోసపూరితమైన వాగ్దానాలు చేస్తూ వస్తున్నారు.[76]

قُلْ أَرَءَيْتُمْ شُرَكَآءَكُمُ ٱلَّذِينَ تَدْعُونَ مِن دُونِ
ٱللَّهِ أَرُونِى مَاذَا خَلَقُوا۟ مِنَ ٱلْأَرْضِ أَمْ لَهُمْ شِرْكٌ
فِى ٱلسَّمَٰوَٰتِ ج أَمْ ءَاتَيْنَٰهُمْ كِتَٰبًا فَهُمْ عَلَىٰ بَيِّنَتٍ
مِّنْهُ ج بَلْ إِن يَعِدُ ٱلظَّٰلِمُونَ بَعْضُهُم بَعْضًا
إِلَّا غُرُورًا (40)

**41** యదార్థానికి అల్లాహ్ ఆకాశాలను, భూమిని వాటి స్థానాల నుంచి తొలగిపోకుండా నిలిపి ఉంచాడు.[77] అవి గనక తమ స్థానాల నుంచి తొలగిపోతే అల్లాహ్ తప్ప వాటిని నిలిపి ఉంచే వాడు కూడా ఎవడూ లేడు.[78] నిశ్చయంగా ఆయన సహనశీలి, క్షమాశీలి.[79]

إِنَّ ٱللَّهَ يُمْسِكُ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضَ أَن تَزُولَا ۚ
وَلَئِن زَالَتَآ إِنْ أَمْسَكَهُمَا مِنْ أَحَدٍ مِّنۢ بَعْدِهِۦٓ ط
إِنَّهُۥ كَانَ حَلِيمًا غَفُورًا (41)

75. నిజానికి మేము మాకు సహవర్తులున్నారని, భూమ్యాకాశాల నిర్మాణంలో వారికి కూడా ప్రమేయం ఉందని తెలియజెప్పే గ్రంథం ఏదీ వారిపై అవతరింపజేయలేదు.

76. వాటిలో ఏ ఒక్కటీ నిజం కాదు. కల్లబొల్లి మాటలతో వారు ఒకరినొకరు మోసగించుకుంటున్నారు. వారు మొక్కుకునే చిల్లరదేముళ్లు వారికి ఏదో ఒరగబెడతారని, అల్లాహ్ సామీప్యాన్ని సంపాదించి పెడతారని, అల్లాహ్ సన్నిధిలో సిఫారసు చేస్తారని వారి సోకాల్డ్ గురువులు, పీర్లు హామీలు ఇస్తున్నారు. లేదా ఇలాంటి హామీలు షైతానులు ముష్రిక్కులకు ఇస్తున్నారు. లేదా తాము అనతికాలంలోనే ముస్లింలను చిత్తుచిత్తుగా ఓడించి, తాము కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సంపాదించుకుంటామని వారు పరస్పరం చెప్పుకునేవారు. ఈ వట్టిమాటల ద్వారా వారికి ఎంతో కొంత ఊరట లభించేది.

77. ఇది అల్లాహ్ పనితనానికి, అపార శక్తి సామర్థ్యాలకు ప్రతీక. మరికొంతమంది విద్వాంసులు ఇలా అభిప్రాయపడ్డారు: వారు చేస్తున్న షిర్క్ ఎంత ఘోరమైందంటే, ఆ దురాగతానికి భూమ్యాకాశాలు సయితం తట్టుకోలేక చలించిపోతాయి. అంతేకాదు, అవి బ్రద్దలైపోతాయి. దివ్య ఖుర్ఆన్‌లోని ఒక ఆయతు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది– "కరుణామయునికి (అల్లాహ్‌కు) సంతానం ఉందని వారు చేసే వాదన మూలంగా ఆకాశం పగిలిపోయేందుకు, భూమి బ్రద్దలైపోయేందుకు, పర్వతాలు తునాతునకలైపోయేందుకు ఆస్కారం ఏర్పడింది" (మర్యమ్ – 90, 91).

78. భూమ్యాకాశాల నిర్మాణంలో అల్లాహ్ అసాధారణమైన, అనితర సాధ్యమైన ప్రజ్ఞా పాటవాలను కనబరచటమే గాకుండా, అవి అటూ ఇటూ ఒరిగిపోకుండా స్థిరపరచి తన ప్రాణులపై మహోపకారం కూడా చేశాడు. ఇది నిస్సందేహంగా ఆయన దయాగుణానికి ఓ మచ్చుతునక. ఆయన గనక ఈ విషయంలో దయదలచకపోతే రెప్పపాటు సమయంలో విశ్వవ్యవస్థ అంతా అతలాకుతలమైపోతుంది. అల్లాహ్ తన ఈ కరుణానుగ్రహాన్ని ఇతరచోట్ల కూడా ప్రస్తావించాడు. ఉదాహరణకు:

1. "ఆయనే నింగిని నిలిపి ఉంచాడు. ఆయన అనుమతి లేనంతవరకూ అది నేలపై పడజాలదు." (అల్ హజ్– 65).
2. "ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే, భూమ్యాకాశాలు ఆయన ఆజ్ఞతోనే స్థిరంగా ఉన్నాయి." (అర్రూమ్ – 25).

**42** తమ వద్దకే గనక హెచ్చరించేవాడెవడయినా వస్తే, వేరితర సమాజాల కన్నా ఎక్కువగా తామే సన్మార్గాన్ని అవలంబిస్తామని ఈ అవిశ్వాసులు పెద్ద పెద్ద ప్రమాణాలు చేసి మరీ చెప్పేవారు.[80] కాని తీరా హెచ్చరించేవాడు (ప్రవక్త) వారి వద్దకు వచ్చాక,[81] వారిలో విద్వేషం మాత్రమే మరింత పెచ్చరిల్లింది.

**43** లోకంలో తమంతటి వారు లేరనే గర్వాహంకారం మూలం గానూ,[82] వారి దుష్టపన్నాగాల కారణంగానూ[83] (వారిలో ఈ నకారాత్మక భావం జనించింది). అయితే దుష్ట పన్నాగాల కీడు ఆ పన్నాగాలను పన్నేవారి మీదే పడుతుంది.[84] తమ పూర్వీకుల పట్ల అవలంబించబడుతూ వచ్చిన విధానమే తమపట్ల కూడా అవలంబించబడాలని వారు ఎదురు చూస్తున్నారా?[85] మరయితే నువ్వు అల్లాహ్ విధానంలో ఎలాంటి మార్పునూ చూడలేవు.[86] అల్లాహ్ విధానం (తన దిశ నుంచి) మరలి పోవటాన్ని కూడా నువ్వు చూడలేవు.[87]

وَاَقْسَمُوْا بِاللّٰهِ جَهْدَ اَيْمَانِهِمْ لَئِنْ جَآءَهُمْ
نَذِيْرٌ لَّيَكُوْنُنَّ اَهْدٰى مِنْ اِحْدَى الْاُمَمِ ۚ فَلَمَّا
جَآءَهُمْ نَذِيْرٌ مَّا زَادَهُمْ اِلَّا نُفُوْرَا ۙ (42)

اِسْتِكْبَارًا فِي الْاَرْضِ وَمَكْرَ السَّيِّئِ ۭ وَلَا يَحِيْقُ
الْمَكْرُ السَّيِّئُ اِلَّا بِاَهْلِهٖ ۭ فَهَلْ يَنْظُرُوْنَ اِلَّا سُنَّتَ
الْاَوَّلِيْنَ ۚ فَلَنْ تَجِدَ لِسُنَّتِ اللّٰهِ تَبْدِيْلًا ۥ وَلَنْ تَجِدَ
لِسُنَّتِ اللّٰهِ تَحْوِيْلًا (43)

79. ఒకవైపు ఆయన అసాధారణ శక్తిశాలి అయి ఉండి కూడా మరోవైపున సహనశీలిగా ఉన్నాడు. తన దాసుల అన్యాయాలను ఆయన ఉత్తమ రీతిలో సహిస్తూ పోతున్నాడు. దాసులు నిరంతరం కుఫ్రుకు, షిర్క్‌కు ఒడిగడుతున్నా వారి మెడలు వంచటంలో ఆయన ఏమాత్రం దూకుడును ప్రదర్శించకుండా విడుపును ఇస్తూ పోతున్నాడు. అంతేకాదు, ఆయన క్షమాశీలి కూడాను. ఎవరయినా తన సన్నిధిలో పశ్చాత్తాపం చెంది, చేసిన తప్పులపై సిగ్గుతో కుమిలిపోతే వారిని మన్నిస్తున్నాడు.

80. ఈ ఆయతులో అల్లాహ్ అరబ్బు అవిశ్వాసుల వాగ్దాన భంగాన్ని ఎత్తి చూపాడు. మహనీయ ముహమ్మద్ (సఅసం) ప్రభవించక మునుపు వారు, 'ఒకవేళ మా వద్దకే గనక సావధానపరిచే ప్రవక్త వస్తే మేమతనికి స్వాగతం పలుకుతాము. అతన్ని విశ్వసిస్తాము' అని ఒట్టేసి మరీ చెప్పేవారు. ఈ విషయం ఖుర్‌ఆన్‌లో ఇతరచోట్ల కూడా ప్రస్తావించబడింది. ఉదాహరణకు : అల్ అన్‌ఆమ్ సూరా – 156, 157; సాఫ్ఫాత్ సూరా : 167 – 170).

81. అంటే వారు నిరీక్షించిన ప్రవక్త – అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) – వారివద్దకు రానే వచ్చారు.

82. కాని వారు ఆ ప్రవక్త (స)ను విశ్వసించవలసిందిపోయి అతన్ని త్రోసిపుచ్చారు. అతని పట్ల వైరవైఖరిని అవలంబించారు. వారి అహంభావమే విశ్వాస మార్గంలో వారికి ప్రధాన అడ్డంకిగా నిలిచింది. వారిలోని తలబిరుసుతనం వారిని సన్మార్గానికి మరింత దూరం చేసింది.

83. దుష్ట పన్నాగాలు అంటే, వారు చూపే కుంటిసాకులు, సత్యానికి నష్టం చేకూర్చే పథకాలు, పాపకార్యాలు అన్నమాట!

84. కుట్రలు పన్నటానికైతే వారు ఒంటి కాలుమీద లేచి వచ్చేవారు. కాని ఆ కుట్రల దుష్పరిణామం గురించి బొత్తిగా లెక్కచేసేవారు కారు. అయితే ఆ దుష్పరిణామం ఎట్టకేలకు ఆ కుట్రదారులపైన్నే పడుతుంది.

85. ఏమిటీ? వారు సత్యాన్ని తృణీకరించి, దైవప్రవక్త (స) మాటను ధిక్కరించి, విశ్వాసులను అడుగడుగునా ఆటంకపరచి తమ పూర్వీకులకు పట్టిన దుర్గతిని తాము కూడా కొనితెచ్చుకోవాలన్నదే వారి అభిమతమా?!

86. అలా అయితే వారు ఒక కఠోర సత్యాన్ని తెలుసుకోవాలి. అల్లాహ్ సంప్రదాయం ఎప్పుడూ ఒకేవిధంగా ఉంటుంది.

44 ఏమిటీ, వారు భువిలో సంచరించి, తమకు పూర్వం గడచిన వారికి పట్టిన గతేమిటో చూడలేదా? మరి చూడబోతే వారు బలపరాక్రమంలో వీరికన్నా గట్టివారే. ఆకాశాలలోగానీ, భూమిలో గానీ ఉన్న ఏ వస్తువూ అల్లాహ్‌ను లొంగదీసుకోజాలదు. ఆయన ప్రతిదీ తెలిసినవాడు, ప్రతిదీ చేయగలవాడు.

أَوَلَمْ يَسِيرُوا فِي الْأَرْضِ فَيَنظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الَّذِينَ مِن قَبْلِهِمْ وَكَانُوا أَشَدَّ مِنْهُمْ قُوَّةً ۚ وَمَا كَانَ اللَّهُ لِيُعْجِزَهُ مِن شَيْءٍ فِي السَّمَاوَاتِ وَلَا فِي الْأَرْضِ ۚ إِنَّهُ كَانَ عَلِيمًا قَدِيرًا ﴿44﴾

45 అల్లాహ్‌యే గనక జనుల చేష్టల ఆధారంగా వారిని పట్టు కోవటం మొదలెడితే భూమండలంపైన ఏ జీవినీ వదలిపెట్టడు.[88] అయితే అల్లాహ్ వారికి ఒక నిర్ణీత గడువు వరకు విడుపును ఇస్తున్నాడు.[89] మరి ఆ గడువు ముగియగానే అల్లాహ్ స్వయంగా తన దాసుల (సంగతి)ని చూసుకుంటాడు.[90]

وَلَوْ يُؤَاخِذُ اللَّهُ النَّاسَ بِمَا كَسَبُوا مَا تَرَكَ عَلَىٰ ظَهْرِهَا مِن دَابَّةٍ وَلَٰكِن يُؤَخِّرُهُمْ إِلَىٰ أَجَلٍ مُّسَمًّى ۖ فَإِذَا جَاءَ أَجَلُهُمْ فَإِنَّ اللَّهَ كَانَ بِعِبَادِهِ بَصِيرًا ﴿45﴾

అది మారదు. ఏరికోరి వినాశాన్ని చవిచూడాలన్నదే ఈ ధిక్కారుల కోరికైతే వారి కోరిక తప్పక నెరవేరుతుంది. ఎందుకంటే అల్లాహ్ ఆగ్రహాన్ని అనుగ్రహంగా మార్చేశక్తి ఏ మొనగాడికీ లేదు.

87. దైవాగ్రహం తమపై విరుచుకుపడకుండా అడ్డుకునే, దాని దిశను మరల్చే శక్తి కూడా ఎవరికీ లేదు. ఆయన ఆగ్రహం గురి తప్పదు. ఏ జాతిని, మరే దుష్ట మూకను ఆయన తుదముట్టించదలుస్తాడో దానిపైనే విపత్తు వచ్చిపడు తుంది. ఈ వాక్యం ద్వారా అల్లాహ్ అరబ్బు ముష్రిక్కులకు చేసే హెచ్చరిక ఏమిటంటే; వారు గనక తమ మిథ్యా భావాలను పరిత్యజిస్తే ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. వారు రక్షించబడతారు. అన్యథా వారు దైవసంప్రదాయాల నుంచి తమను కాపాడుకోలేరు. ఆలస్యంగానయినా సరే వారిపై ఉచ్చు బిగుసుకుంటుంది. దైవశాసనాన్ని సవరించే అధికారంగానీ, దైవాగ్రహాన్ని మరల్చే ఉపాయం గానీ ఎవరికీ లేవు.

88. మనుషులను వారి పాపిష్టిపనుల మూలంగా, జంతువులను మనుషుల దరిద్రం మూలంగా తుడిచిపెడతాడు అని ఒక అర్థం. లేదా భూమండలంలోని సకల జనులను తుదముట్టించటంతో పాటు వారి పాడిపంటలను, పశువులను కూడా తుడిచిపెడతాడని మరో అర్థం. లేదా ఆకాశం నుంచి ధారాపాతంగా కురిసే వర్షాన్ని ఆపివేస్తాడు, తత్కారణంగా భువిపై సంచరించే ప్రాణులన్నీ అంతరిస్తాయి అని ఇంకొక అర్థం.

89. ఈ నిర్ణీత గడువు ఇహలోకం లోనిది కూడా కావచ్చు. ప్రళయ దినాన అది ఎలాగూ ఉంటుంది.

90. అంటే; ఆ రోజు ఆయన తన దాసుల లెక్కలు తేలుస్తాడు. ప్రతి ఒక్కరికీ వారు చేసుకున్న కర్మలను బట్టి సంపూర్ణ ప్రతిఫలం ఇస్తాడు. విశ్వాసులకు, విధేయులకు పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు. అవిశ్వాసులను, అవిధేయులను కఠినంగా శిక్షిస్తాడు. ఈ వాక్యంలో విశ్వాసులకు ఓదార్పు ఉంది. అవిశ్వాసులకు హెచ్చరిక ఉంది.

36వ సూరా

# యా సీన్

## యా సీన్

అవతరణ మక్కాలో

ఆయతులు 83

### పరిచయం

ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం వంటి మౌలిక ధార్మిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరా ప్రారంభ పదాన్ని దీనికి పేరుగా పెట్టడం జరిగింది. దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు అని ప్రమాణపూర్వకంగా చెబుతూ ఈ సూరా ప్రారంభమయ్యింది. అల్లాహ్ ప్రతి విషయాన్ని స్పష్టంగా తెలుపుతున్నాడని, హిత బోధ అందిస్తున్నాడనీ, ముహమ్మద్ (సఅసం) దేవుని తరఫున వచ్చిన దైవసందేశహరుడనీ, మానవాళికి ఆయన కారుణ్యం వంటివారని తెలిపింది. దివ్యఖుర్ఆన్‌ను బాహాటంగా వ్యతిరేకిస్తూ, విశ్వాసాన్ని పూర్తిగా తిరస్కరిస్తున్న అవిశ్వాసుల గురించి ప్రస్తావిస్తూ పరలోకంలో తీవ్రమైన శిక్ష వారికోసం వేచి ఉందని తెలిపింది. అల్లాహ్ మరణించిన వారికి మళ్ళీ జీవితం ఇస్తాడనీ, మనిషి చేసిన కర్మలన్నీ నమోదై ఉన్నాయనీ, వాటి లెక్క తీసుకోవడం జరుగుతుందనీ, తీర్పుదినాన ప్రతి ఒక్కరు తాము చేసిన పనికి జవాబు చెప్పుకోవలసి ఉంటుందనీ హెచ్చరించింది. మరణించిన తర్వాత మళ్ళీ జీవితం అన్నది లేనే లేదని వాదించే అవిశ్వాసులు, మరణించిన తర్వాత శరీరం కుళ్ళి కృశించి ఎముకలు కూడా మిగలవు కాబట్టి ఇక మళ్ళీ జీవితం అన్న ప్రశ్నే ఉండదని వాదించే అవిశ్వాసుల వాదనకు జవాబిస్తూ, మనిషిని ఒకసారి సృష్టించిన దేవుడు మళ్ళీ కుళ్ళి కృశించిపోయిన శరీరాన్ని కూడా లేపి నిలబెట్టే సామర్థ్యం కలవాడనీ, ఆయనకు సృష్టిలోని ప్రతిదీ తెలుసనీ, అల్లాహ్ ఏదైనా చేయాలనుకుంటే, కేవలం 'అయిపో' అని ఆదేశిస్తే చాలు అయిపోతుందని ఈ సూరా తెలియజేసింది. దైవదూత ఇస్రాఫీల్ శంఖం పూరించిన రోజున మరణించినవారు తమ సమాధుల్లోంచి లేచి విశ్వప్రభువు ముందు హాజరవుతారని తెలియజేసింది. అప్పుడు అవిశ్వాసులకు తాము చేసిన తప్పు తెలిసి వస్తుందనీ, అల్లాహ్ చేసిన వాగ్దానం నిజమైనదనీ, ఆయన తన ప్రవక్తల ద్వారా పంపిన సందేశం యదార్థమైనదనీ గుర్తిస్తారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపి నిలబెట్టడం సత్యమని గ్రహిస్తారు.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 13-29 | 181 | 'నగర ప్రజలు - నలిపివేయబడిన వారు' | ఇద్దరు వ్యక్తులు ఒక జాతి వారిని సంస్కరించాలని ప్రయత్నిం చారు. కాని జాతివారు వారిరువురినీ తిరస్కరించారు. రాళ్ళతో కొట్టి చంపుతామని బెదిరించారు. అంతలో ఇంకో వ్యక్తి వారిరువురిని సమర్థిస్తూ అక్కడికి వచ్చాడు. తను ఆ జాతివాడే. కాని జాతివారు ఆయన్ని దేశం నుంచి వెళ్లగొట్టేశారు. ఎవరా మహానుభావుడు? ఆ సత్య ధర్మ ప్రబోధకునికి ఎదురయిన కష్టాలేమిటి? అల్లాహ్ ఆయన్ని ఎలా అనుగ్రహించాడు? |

## యా సీన్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1 – 2** యా–సీన్.[2] వివేకంతో నిండిన[3] ఖుర్ఆన్ సాక్షిగా!

**3** (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా నువ్వు సందేశహరులలోని వాడవు.[4]

**4** రుజుమార్గాన ఉన్నవాడవు.[5]

**5** సర్వాధిక్యుడు, కృపాకరుడు (అయిన అల్లాహ్) తరపున ఇది (ఈ ఖుర్ఆన్ గ్రంథం) అవతరింపజేయబడింది.[6]

**6** ఎవరి తాతముత్తాతలు మునుపు హెచ్చరించబడలేదో ఆ జనులను నువ్వు హెచ్చరించటానికి (ప్రవక్తగా పంపబడ్డావు) – అందువల్లనే వారు పరధ్యానానికి లోనై ఉన్నారు.[7]

## سُورَةُ يسٓ

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

يسٓ ١ وَٱلۡقُرۡءَانِ ٱلۡحَكِيمِ ٢

إِنَّكَ لَمِنَ ٱلۡمُرۡسَلِينَ ٣

عَلَىٰ صِرَٰطٖ مُّسۡتَقِيمٖ ٤

تَنزِيلَ ٱلۡعَزِيزِ ٱلرَّحِيمِ ٥

لِتُنذِرَ قَوۡمٗا مَّآ أُنذِرَ ءَابَآؤُهُمۡ فَهُمۡ غَٰفِلُونَ ٦

---

1. యాసీన్ సూరా మహత్తును చాటిచెప్పే కథనాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు : 'ఈ సూరా దివ్య ఖుర్ఆన్ హృదయం లాంటిది'. 'మరణ ఘడియలు సమీపించిన వ్యక్తిపై ఈ సూరాను పఠించండి' మొదలైనవి. అయితే ఆధారం రీత్యా ఈ కథనాలలో ఏదీ ప్రామాణికమైనది కాదు. వాటిలో కొన్ని అసలు కల్పితమైనవనే చెప్పాలి, మరికొన్ని బలహీనమైనవి. 'ఇది దివ్య ఖుర్ఆన్ హృదయం లాంటిది' అన్న కథనాన్ని ప్రఖ్యాత హదీసువేత్త షేఖ్ అల్బానీ 'కల్పితమైనది'గా ఖరారు చేశారు (అజ్జయీఫ – హదీసు నెంబరు – 169).
2. కొంతమంది విద్వాంసులు దీన్ని ఓ వ్యక్తి! లేదా ఓ మనిషి! అన్న అర్థంలో తీసుకున్నారు. మరికొందరు దీన్ని అంతిమ దైవప్రవక్త (స) నామాంతరంగా భావించారు. ఇంకొంతమంది దీన్ని దేవుని పేర్లలో ఒకటిగా తలపోశారు. కాని ఈ వ్యాఖ్యలన్నీ ప్రమాణబద్ధమైనవి కావు. దీని అర్థం దైవానికే ఎరుక!
3. లేదా 'తిరుగులేని ఖుర్ఆన్ సాక్షిగా!' అని కూడా అనవచ్చు. ఎందుకంటే భావార్థం దృష్ట్యా, కూర్పు రీత్యా ఈ గ్రంథం దృఢమైనది, స్థిరమైనది.
4. బహుదైవారాధకులు ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని శంకిస్తున్నారు. అందుకే వారు ఆయన (స) దైవదౌత్యాన్ని త్రోసిపుచ్చుతూ "నువ్వు ప్రవక్తగా పంపబడినవాడవు కావు" (అర్రాద్ – 43) అని చెబుతున్నారు. అల్లాహ్ వారి ఈ అనుమానాలను పటాపంచలు చేస్తూ, 'ఓ ముహమ్మద్ (స)! నిస్సందేహంగా నువ్వు మా ప్రవక్తవే' అని స్పష్టంచేశాడు. ఈ వాక్యం ద్వారా దేవుడు ఆయన(స) గౌరవాదరణలను చాటాడు. ఎందుకంటే మరే ఇతర ప్రవక్త పదవి విషయంలో కూడా దేవుడు ప్రమాణం చేయలేదు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) దైవదౌత్యం విషయంలోనే ఈ విధంగా ప్రమాణం చేసి చెప్పాడు.
5. అంటే పూర్వపు ప్రవక్తలు నడచిన మార్గంలో నువ్వు నడుస్తున్నావు. లేదా నువ్వు పయనించే మార్గం సరళమార్గం, నిర్ణీత గమ్యానికి (స్వర్గానికి) చేర్చేమార్గం.
6. ఈ గ్రంథాన్ని అవతరింపజేసినవాడు సామాన్యుడు కాదు, అపారశక్తి సంపన్నుడు. తనను నిరాకరించిన, లేక తన

7 వారిలో చాలా మందికి వ్యతిరేకంగా (శిక్ష విధించాలన్న) మాట ఖరారై పోయింది. ఇక వారు విశ్వసించేవారు కారు.[8]

لَقَدْ حَقَّ الْقَوْلُ عَلٰٓى اَكْثَرِهِمْ فَهُمْ لَا يُؤْمِنُوْنَ ⑦

8 మేము వారి మెడలలో (ఇనుప) పట్టాలు వేసేశాము. అవి వారి చుబుకముల వరకూ (ఆక్రమించి) ఉన్నాయి. అందుచేత వారి తలలు పై వైపుకే తిరిగిపోయాయి.[9]

اِنَّا جَعَلْنَا فِيْٓ اَعْنَاقِهِمْ اَغْلٰلًا فَهِيَ اِلَى الْاَذْقَانِ فَهُمْ مُّقْمَحُوْنَ ⑧

9 మేము వారి ముందు ఒక అడ్డును, వారి వెనుక మరో అడ్డును పెట్టాము.[10] ఆ విధంగా మేము వారిని కప్పివేశాము.[11] తత్కారణంగా వారు చూడలేరు.

وَجَعَلْنَا مِنْۢ بَيْنِ اَيْدِيْهِمْ سَدًّا وَّمِنْ خَلْفِهِمْ سَدًّا فَاَغْشَيْنٰهُمْ فَهُمْ لَا يُبْصِرُوْنَ ⑨

ప్రవక్తలను ధిక్కరించిన వారిని శిక్షించే అధికారం గలవాడు. అలాగే తనను నమ్మి నడుచుకునే వారిని, తన ప్రవక్త మార్గాన్ని అనుసరించిన వారిని కనికరించేవాడు.

7. ఓ ముహమ్మద్ (సఅసం)! నీకు మునుపు శతాబ్దాల తరబడి భయపెట్టేవాడెవడూ రాని ఒక జాతి ప్రజలను నువ్వు భయపెట్టే నిమిత్తం నీ ప్రభువు నిన్ను ప్రవక్తగా నియమించాడు, నీపై గ్రంథాన్ని అవతరింపజేశాడు. సుదీర్ఘకాలంగా– తరతరాలుగా– వారివద్దకు హెచ్చరిక చేసేవాడొకడు రాకపోవటం మూలంగా వారు సత్యధర్మానికి చాలా దూరమై పోయారు. ఈ విషయం ఇంతకుముందు కూడా చాలాచోట్ల ప్రస్తావనకు వచ్చింది. దైవప్రవక్త హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం)కి – మహాప్రవక్త ముహమ్మద్ (స)కి మధ్య అరబ్బుల కొరకు ఏ ప్రవక్తా రాలేదు.

8. ఉదాహరణకు : అబూజహల్, ఉతబా, షైబా తదితరులు. మాట ఖరారైపోయింది అంటే భావం ఇది : "నేను నరకాన్ని జిన్నులతో, మనుషులతో నింపుతాను" అని (అలిఫ్–లామ్–మీమ్ అస్సజ్దా–13లో) అల్లాహ్ సెలవిచ్చాడు. షైతానును ఉద్దేశించి, "నేను నరకాన్ని నీతో, నీ ప్రియ అనుయాయులతో నింపుతాను" అని (సాద్ – 84లో) అన్నాడు. అంటే వారు షైతాన్ పాదచిహ్నాలలో నడచి తమను తాము నరకానికి పాత్రులుగా నిలబెట్టుకున్నారు. ఎందుకంటే అల్లాహ్ వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను హరించలేదు. తమకు నచ్చిన జీవన విధానాన్ని అవలంబించే ఎంపిక స్వేచ్ఛను ప్రసాదించాడు. అయితే వారు ఈ స్వేచ్ఛను దుర్వినియోగం చేశారు. తత్కారణంగా వారు నరకానికి ఇంధనంగా మారారు. అంతేగాని అల్లాహ్ వాళ్ళను బలవంతంగా ఈమాన్ భాగ్యానికి దూరం చేయలేదు. ఒకవేళ వారిపై బలవంతమే గనక జరిగి ఉంటే వారు నరకానికి పాత్రులుగా ఖరారయ్యేవారే కాదు.

9. ఆ కారణంగా వారు అటూ ఇటూ చూడటంగానీ, తలను క్రిందికి వంచటంగానీ చేయలేరు. అందువల్ల వారు తలను మాత్రం పైకెత్తి చూపులను క్రిందికి దించి ఉన్నారు. వారి సత్యతిరస్కారానికి, పిసినారితనానికి గాను ఇవ్వబడిన ఉపమానం ఇది. అది వారి నరక యాతనను వివరించే ఉపమానం కూడా కావచ్చు (ఐసరుత్తఫాసీర్).

10. అంటే ప్రాపంచిక జీవితం వారికొరకు మనోహరంగా చేయబడింది. అది వారి ముందర నిలబెట్టబడిన అడ్డుగోడ. తత్కారణంగా వారు ప్రాపంచిక భోగభాగ్యాలను తప్ప దేనినీ చూడలేదు. ఈ విషయమే వారికీ – వారి విశ్వాసానికీ మధ్య అడ్డంకిగా నిలిచింది. పరలోక భావన వారి మనోమస్తిష్కాలలో నిలవటం అసంభవం అయిపోయింది. ఇది వారి వెనుక ఉన్న అడ్డుగోడ. దీనిమూలంగా వారు పశ్చాత్తాపమూ చెందరు. హితబోధనూ గ్రహించరు. ఎందుకంటే పరలోక భీతి అన్నది వారి హృదయాలలో బొత్తిగా లేదు.

11. లేదా వారి కళ్లు బైర్లు క్రమ్మాయి. దైవప్రవక్త (సఅసం)తో వైరవైఖరి మూలంగా, సత్యసందేశం పట్ల ద్వేషభావం కారణంగా వారి కళ్ళకు గంతలు కట్టబడ్డాయి లేదా వారు గుడ్డివారు అయిపోయారు. అందుకే వారు చూడలేరు. ఇది వారి దయనీయ స్థితిని వివరించే రెండవ ఉపమానం.

10 కాబట్టి నువ్వు వారిని హెచ్చరించినా, హెచ్చరించకపోయినా ఒక్కటే. వారు విశ్వసించరు.[12]

وَسَوَآءٌ عَلَيْهِمْ ءَأَنذَرْتَهُمْ أَمْ لَمْ تُنذِرْهُمْ لَا يُؤْمِنُونَ ⑩

11 హితబోధను అనుసరిస్తూ, చూడకపోయినా కరుణామయునికి (అల్లాహ్‌కు) భయపడే వ్యక్తిని మాత్రమే నువ్వు హెచ్చరించగలవు.[13] కాబట్టి అలాంటి వ్యక్తికి నువ్వు క్షమాభిక్ష, గౌరవప్రదమైన ప్రతిఫలం గురించిన శుభవార్తను వినిపించు.

إِنَّمَا تُنذِرُ مَنِ اتَّبَعَ الذِّكْرَ وَخَشِيَ الرَّحْمَٰنَ بِالْغَيْبِ ۖ فَبَشِّرْهُ بِمَغْفِرَةٍ وَأَجْرٍ كَرِيمٍ ⑪

12 నిశ్చయంగా మేము మృతులను బ్రతికిస్తాము.[14] జనులు ముందుగా చేసి పంపుకున్న దానినీ,[15] వారు వెనుక వదలివెళ్ళిన కర్మలను కూడా మేము వ్రాస్తూ పోతున్నాము. ఇంకా మేము ప్రతి విషయాన్నీ స్పష్టమైన ఒక గ్రంథంలో నమోదు చేసి పెట్టాము.[16]

إِنَّا نَحْنُ نُحْيِ الْمَوْتَىٰ وَنَكْتُبُ مَا قَدَّمُوا وَآثَارَهُمْ ۚ وَكُلَّ شَيْءٍ أَحْصَيْنَاهُ فِي إِمَامٍ مُّبِينٍ ⑫

12. అంటే – తమ ఘోరకృత్యాల కారణంగా మార్గవిహీనత యొక్క ఆఖరి అంచులకు చేరుకున్న వారిని హెచ్చరించినా, భయబోధ చేసినా నిష్ప్రయోజనమే.

13. అలాంటి వినయశీలికి మాత్రమే భయబోధ ప్రయోజనం కలిగించగలదు.

14. అంటే ప్రళయదినాన బ్రతికిస్తాడన్నమాట! మృతులను బ్రతికించే విషయాన్ని ప్రస్తావించి దేవుడు సూచనాప్రాయంగా తెలిపేదేమిటంటే, ఆయన అవిశ్వాసులలో తాను కోరినవారి హృదయాలలో చైతన్యాన్ని మేల్కొల్పుతాడు. సద్బుద్ధిని ప్రసాదిస్తాడు. ఎందుకంటే అవిశ్వాసం, మార్గభ్రష్టతల కారణంగా వారి మస్తిష్కాలు బండబారి పోయాయి. వారి మనసులలో స్తబ్ధత ఆవరించి ఉన్నది. దేవుడిచ్చిన సద్బుద్ధివల్ల వారు సన్మార్గగాములవుతారు.

15. **'మా ఖద్దమూ'** (مَا قَدَّمُوا) అంటే మనిషి తను బ్రతికి ఉండగా చేసుకున్న సత్కర్మలు. **'ఆసారహుమ్'** (آثَارَهُمْ) అంటే మనిషి చనిపోయిన తరువాత కూడా లోకంపై ప్రభావం చూపుతూ ఉండే పనులన్న మాట! ఆ మాటే హదీసులో ఈ విధంగా ఉంది: "ఎవరయినా ఇస్లాంలో తాను జీవించి ఉండగా ఏదైనా సత్కార్యానికి ఒరవడిని ప్రసాదిస్తే దాని పుణ్యఫలం అతనికి ప్రాప్తించటంతోపాటు, అతని తదనంతరం ఆ సత్కార్యాన్ని అవలంబించిన పుణ్యఫలం కూడా అతనికి లభిస్తూ ఉంటుంది. అయితే ఆ సత్కార్యాన్ని అవలంబించిన వారి పుణ్యంలో ఎలాంటి తగ్గుదలా చేయబడదు. మరెవరయినా దుష్కార్య పరంపరను మొదలెడితే దాని పాపఫలం అతని మీద పడటంతోపాటు, ఆ దుష్కార్యాన్ని అవలంబించిన పాపమంతా అతని నెత్తిమీద వేయబడుతుంది. అదే సమయంలో ఆ దుష్కార్యాన్ని అవలంబించిన వారి పాపం కూడా ఏమాత్రం తగ్గించబడదు" (సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్).

అలాగే మరో హదీసులో ఈ విధంగా ఉంది : "మానవుడు చనిపోగానే అతని కర్మల పరంపర నిలిచిపోతుంది. కాని మూడు సత్కర్మలు మాత్రం ఎడతెగకుండా అతనికి చేరుతూ ఉంటాయి. 1. జనులకు లాభం చేకూర్చే అతని విద్య. 2. మృతుని కోసం ప్రార్థించే అతని సజ్జన సంతానం. 3. మృతుని తరువాత కూడా ప్రజలకు ఉపయోగపడుతూ ఉండే అతని దానధర్మాలు." (సహీహ్ ముస్లిం – కితాబుల్ వసీయత్). **'ఆసారహుమ్'** అంటే అడుగుజాడలు లేక పాదచిహ్నాలు అని ఇంకొక అర్థం. అంటే మనిషి పుణ్యకార్యం కోసమో లేక పాపకార్యం కోసమో నడచిపోతే ఒక చోటి నుంచి మరోచోటి వరకు వెళ్ళే అతని అడుగుజాడలు కూడా రికార్డు చేయబడతాయి. ఉదాహరణకు: మహాప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో మస్జిదె నబవీకి చేరువలో కొంత ఖాళీస్థలం ఉండేది. ఆ ఖాళీ స్థలంలోకి వచ్చి నివాసం ఏర్పరచుకోవాలని బనూ సలిమా (తెగవారు) సంకల్పించుకున్నారు. ఈ సంగతిని తెలుసుకున్న దైవప్రవక్త (స) వాళ్లను వారించారు. ఆ సందర్భంగా దైవప్రవక్త (స) రెండుమార్లు ఇలా అన్నారు : "మీ ఇండ్లు మస్జిదుకు దూరంగా

**13** ఉదాహరణగా (నీవు) వారికి ఒక పట్టణవాసుల వద్దకు (అనేక మంది) ప్రవక్తలు వచ్చినప్పుడు జరిగిన దానిని వివరించు.[17]

وَاضْرِبْ لَهُم مَّثَلًا أَصْحَابَ الْقَرْيَةِ إِذْ جَاءَهَا الْمُرْسَلُونَ ﴿١٣﴾

**14** మేము వారి వద్దకు ఇద్దరిని (అంటే ఇద్దరు ప్రవక్తలను) పంపగా (మొదట) ఆ ఇద్దరినీ వారు ధిక్కరించారు. మరి వారికి (ఆ ఇద్దరికి) అండగా మేము మూడవ వానిని పంపగా, "మేము మీ దగ్గరకు ప్రవక్తలుగా పంపబడ్డాము"[18] అని వారు (ఆ పట్టణ ప్రజలతో) అన్నారు.

إِذْ أَرْسَلْنَا إِلَيْهِمُ اثْنَيْنِ فَكَذَّبُوهُمَا فَعَزَّزْنَا بِثَالِثٍ فَقَالُوا إِنَّا إِلَيْكُم مُّرْسَلُونَ ﴿١٤﴾

**15** దానికి వారు "మీరు కూడా మాలాంటి మానవమాత్రులే. కరుణామయుడు అసలు దేనినీ అవతరింపజేయలేదు. మీరు చెప్పేదంతా పచ్చి అబద్ధం" అని సమాధానమిచ్చారు.

قَالُوا مَا أَنتُمْ إِلَّا بَشَرٌ مِّثْلُنَا وَمَا أَنزَلَ الرَّحْمَٰنُ مِن شَيْءٍ إِنْ أَنتُمْ إِلَّا تَكْذِبُونَ ﴿١٥﴾

**16** ప్రవక్తలు ఇలా అన్నారు : "మేము నిశ్చయంగా మీ వద్దకు ప్రవక్తలుగా పంపబడ్డామన్న సంగతి మా ప్రభువుకు తెలుసు.

قَالُوا رَبُّنَا يَعْلَمُ إِنَّا إِلَيْكُمْ لَمُرْسَلُونَ ﴿١٦﴾

**17** "స్పష్టంగా విషయాన్ని అందజేయటం వరకే మా కర్తవ్యం."

وَمَا عَلَيْنَا إِلَّا الْبَلَاغُ الْمُبِينُ ﴿١٧﴾

**18** దానికి వారు, "మేము మిమ్మల్ని దరిద్ర సూచకంగా భావిస్తు న్నాము.[19] మీరు గనక (ఈ పనిని) మానుకోకపోతే, మేము మిమ్మల్ని రాళ్లతో కొట్టి చంపేస్తాము. మా తరఫున మీకు బాధాకర మైన శిక్ష అంటుకుంటుంది" అని చెప్పారు.

قَالُوا إِنَّا تَطَيَّرْنَا بِكُمْ ۖ لَئِن لَّمْ تَنتَهُوا لَنَرْجُمَنَّكُمْ وَلَيَمَسَّنَّكُم مِّنَّا عَذَابٌ أَلِيمٌ ﴿١٨﴾

---

ఉన్నప్పటికీ అక్కడే ఉండండి. మీరు ఎన్ని అడుగులు నడచి వస్తారో అవి లిఖించబడతాయి" (సహీహ్ ముస్లిం – కితాబుల్ మసాజిద్).

ఈ నేపథ్యంలో ఇమామ్ ఇబ్నె కసీర్ ఏమంటున్నారో చూడండి : "రెండు అభిప్రాయాల భావార్థమూ సరైనదే. వాటి మధ్య వైరుధ్యం లేదు. పైగా ఈ రెండవ అర్థంలో కఠిన హెచ్చరిక కూడా ఉంది. ఎందుకంటే మనిషి అడుగుజాడలు సయితం లిఖించబడుతున్నప్పుడు, మానవుడు తన వెనుక వదలివెళ్ళే మంచి ఆదర్శమైనా, చెడు ఆదర్శమైనా జనులు అవలంబించినప్పుడు అవి తప్పకుండా ప్రప్రథమంగా లిఖించబడతాయి."

16. స్పష్టమైన గ్రంథం అంటే 'లౌహె మహ్ఫూజ్' అని కొందరు, 'కర్మల పత్రం' అని మరికొందరు అభిప్రాయపడ్డారు.

17. ఎందుకంటే నువ్వు (ఓ ముహమ్మద్!) వారి కోసం పంపబడిన సరికొత్త ప్రవక్తవు కాదనీ, ప్రవక్తల పరంపర యుగయుగాలుగా వస్తోందని ఈ మక్కా వాసులకు తెలిసిరావాలి.

18. ఇంతకీ ఆ ముగ్గురు ప్రవక్తలు ఎవరు? ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు పలువురు పలు పేర్లను సూచించారు. కాని వాటి వెనుక ప్రామాణికమైన ఆధారాలను సమర్పించలేకపోయారు. ఆ ప్రవక్తలు దైవాజ్ఞపై ఒకానొక పట్టణ ప్రజలకు దైవసందేశాన్ని అందజేయటానికి పంపబడిన హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) సమకాలికులనీ, ఆ పట్టణం పేరు అంతాకియ (Antioch) అనీ కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

**19** అప్పుడు ప్రవక్తలు ఇలా అన్నారు : "మీ దరిద్రమంతా మీ వెంటే ఉంది,[20] ఏమిటీ, మీకు చేసే ఉపదేశాన్ని మీరు దరిద్రంగా తలపోస్తున్నారా? అసలు విషయం అదికాదు. మీరసలు బరితెగించి పోయారు."

قَالُوا طَائِرُكُم مَّعَكُمْ ۚ أَئِن ذُكِّرْتُم ۚ بَلْ أَنتُمْ قَوْمٌ مُّسْرِفُونَ ﴿١٩﴾

**20** (అంతలోనే ఆ) నగరం చివరి వైపు నుంచి ఒక వ్యక్తి పరుగెత్తు కుంటూ వచ్చి ఇలా అన్నాడు : "ఓ నా జాతివారలారా! మీరు ప్రవక్తలను అనుసరించండి.[21]

وَجَاءَ مِنْ أَقْصَى الْمَدِينَةِ رَجُلٌ يَسْعَىٰ قَالَ يَا قَوْمِ اتَّبِعُوا الْمُرْسَلِينَ ﴿٢٠﴾

**21** "మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగని వారి, సన్మార్గాన ఉన్న వారి వెనుక నడవండి."

اتَّبِعُوا مَن لَّا يَسْأَلُكُمْ أَجْرًا وَهُم مُّهْتَدُونَ ﴿٢١﴾

**22** "నన్ను పుట్టించిన వానిని నేను ఆరాధించకుండా ఉండటం ఎంతవరకు సమంజసం? మరి (నిజానికి) మీరంతా ఆయన వైపు మరలించబడేవారే.[22]

وَمَا لِيَ لَا أَعْبُدُ الَّذِي فَطَرَنِي وَإِلَيْهِ تُرْجَعُونَ ﴿٢٢﴾

**23** "అట్టి (నిజ) దైవాన్ని వదిలేసి నేను ఇతరులను ఆరాధ్యులుగా ఆశ్రయించాలా? ఒకవేళ కరుణామయుడు (అయిన అల్లాహ్) నాకేదైనా నష్టం కలిగించదలిస్తే వారి సిఫారసు నాకెలాంటి లాభమూ చేకూర్చదు. వారు నన్ను కాపాడనూ లేరు.[23]

أَأَتَّخِذُ مِن دُونِهِ آلِهَةً إِن يُرِدْنِ الرَّحْمَٰنُ بِضُرٍّ لَّا تُغْنِ عَنِّي شَفَاعَتُهُمْ شَيْئًا وَلَا يُنقِذُونِ ﴿٢٣﴾

19. బహుశా వారికాలంలో కొద్దిమంది మాత్రమే దైవప్రవక్తల సందేశాన్ని స్వీకరించి ఉంటారు. ఆ విధంగా ఆ జాతి రెండు వర్గాలుగా చీలిపోయి ఉండవచ్చు. సత్యతిరస్కారులు గుప్పెడు మంది విశ్వాసులను అవమానపరిచే ఉద్దేశంతో అనరాని మాటలు అని ఉండవచ్చు. బహుశా ఆ కాలంలో వర్షాభావ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చు. దాని మూలంగానే వారు, దైవప్రవక్తల రాకవల్లనే తమకు ఈ దరిద్రం చుట్టుకుందని (దైవం మన్నించుగాక!) చెప్పి ఉండవచ్చు. ధర్మపరాయణులను చూసి ఈనాడు కూడా కొంతమంది ఇలాంటి 'అధిక ప్రసంగాలు' చేసే వారున్నారు.

20. మీ ఘోర అపరాధాల కారణంగా ఆ దరిద్రం మీకే తగులుకుని ఉంది. ఆ విషయాన్ని తెలుసుకోకుండా మమ్మల్నెందుకు తప్పు పడతారు?

21. ఆ వ్యక్తి అప్పటికే ముస్లిం అయ్యాడు. తన జాతివారు దైవప్రవక్తల సందేశాన్ని ధిక్కరిస్తున్నారని అతను ఊరి చివరి నుంచి పరుగెత్తుకుని వచ్చాడు. దైవప్రవక్తలను సమర్థించాడు. ప్రవక్తల మార్గాన్ని అనుసరించమని తన వారికి తాకీదు చేశాడు.

22. ఆ వ్యక్తి ఈ మాటల ద్వారా దేవుని ఏకత్వాన్ని ఎంతో చాకచక్యంగా స్పష్టపరిచాడు. తన జాతి ప్రజలపట్ల గల శ్రేయోభిలాషే అతనిచేత ఈ మాటల్ని పలికించింది. లేదా అతని జాతివారు అతన్ని నిలదీసి అడిగి ఉంటారు–నువ్వు కూడా ఈ ప్రవక్తల విధానాన్ని అనుసరిస్తున్నావా? మా దేవతలను నువ్వు కూడా వదలిపెట్టేశావా?? అని. వారి ప్రశ్నలకు సమాధానంగా ఆ వ్యక్తి అలా అని ఉంటాడు. ఆ వ్యక్తి పేరు హబీబ్ నజ్జార్ అని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు చెప్పారు. నిజము దేవుడెరుగు.

23. ఆ జాతి వారు పూజించే మిథ్యా దైవాల నిస్సహాయ స్థితి ఇక్కడ అభివర్ణించబడింది. ఆ షిర్క్ ఊబి నుంచి వారిని

24 "మరి నేను స్పష్టమైన దుర్మార్గంలో పడిపోతాను.[24]

إِنِّيٓ إِذًا لَّفِي ضَلَٰلٖ مُّبِينٍ ﴿24﴾

25 "అందుకే నేను చెప్పేది వినండి! నేను మటుకు మీరందరి (ఏకైక) ప్రభువును విశ్వసించాను."[25]

إِنِّيٓ ءَامَنتُ بِرَبِّكُمۡ فَٱسۡمَعُونِ ﴿25﴾

26 "స్వర్గంలో చేరిపో" అని (అతనితో) అనబడింది. "నా జాతి వారికి ఇది తెలిస్తే ఎంత బావుండేది!" అని అతనన్నాడు.

قِيلَ ٱدۡخُلِ ٱلۡجَنَّةَۖ قَالَ يَٰلَيۡتَ قَوۡمِي يَعۡلَمُونَ ﴿26﴾

27 "నా ప్రభువు నన్ను క్షమించి, ఆదరణీయులలో నన్ను చేర్చిన సంగతి."[26]

بِمَا غَفَرَ لِي رَبِّي وَجَعَلَنِي مِنَ ٱلۡمُكۡرَمِينَ ﴿27﴾

28 అతని తరువాత మేము అతని జాతి వారిపై ఆకాశం నుంచి ఏ సైనిక దళాన్నీ దింపలేదు.[27] దాని అవసరం మాకు లేదు కూడా.[28]

وَمَآ أَنزَلۡنَا عَلَىٰ قَوۡمِهِۦ مِنۢ بَعۡدِهِۦ مِن جُندٖ مِّنَ ٱلسَّمَآءِ وَمَا كُنَّا مُنزِلِينَ ﴿28﴾

---

బయటికి తీసేందుకే వారి వద్దకు దైవప్రవక్తలు పంపబడ్డారు. "వారు నన్ను కాపాడనూ లేరు" అంటే అల్లాహ్ గనక నాకేదైనా నష్టాన్ని కలిగించినా, నన్ను ఏదైనా ఆపదకు లోనుచేసినా వారు నన్ను ఆ గండం నుంచి గట్టెక్కించలేరని అర్థం.

24. ఒకవేళ నేను కూడా మీ లాగానే అల్లాహ్‌ను వదలి ఇలాంటి నిస్సహాయ దేవతలను పూజించటం మొదలెడితే, నేను కూడా మార్గభ్రష్టతకు గురవుతాను. లేదా నేను ఘోరంగా నష్టపోతాను. మొత్తానికి ఇది టోకుగా నష్టపోయే వర్తకం.

25. ఆ వ్యక్తి ఇచ్చిన ఏకదైవారాధనా పిలుపుకు అతని జాతివారు మండిపడ్డారు. అతన్ని హతమార్చాలని నిశ్చయించు కున్నారు. అప్పుడా వ్యక్తి ఆ వ్యవహారానికి ప్రవక్తలను సాక్షిగా ఉంచాలనుకున్నాడు. లేదా అతను తనజాతి జనులను ఉద్దేశించి ఈ విధంగా పలికాడు. తాను నమ్మిన ఏకదైవారాధనా సిద్ధాంతంపై తనకు గల అచంచల భక్తీ విశ్వాసాన్ని, స్థయిర్యాన్ని చాటిచెప్పటం అతని ముఖ్యోద్దేశం కావచ్చు. 'బాగా వినండి. మీకూ, నాకూ, మనందరికీ ప్రభువు అయిన ఆ దైవాన్నే నేను విశ్వసిస్తున్నాను' అని నిర్థిష్టంగా ప్రకటించాడు. ఆ వ్యక్తిని వారు నిర్దాక్షిణ్యంగా చంపేశారని, జాతి ప్రజలలో ఎవరూ ఆ దారుణాన్ని అడ్డుకోలేదని అనబడుతోంది. అల్లాహ్ ఆ త్యాగధనుణ్ణి కరుణించుగాక!

26. ఏ విశ్వాసం (ఈమాన్) మూలంగా, ఏ ఏకదైవారాధన (తౌహీద్) కారణంగా నా ప్రభువు నన్ను మన్నించి బహుమానం వొసగాడో నా జాతి జనులకు తెలిస్తే బహుశా వారు కూడా ఏకదైవారాధకులుగా మారి, దైవానుగ్రహానికి నోచుకునేవారు అని ఆ వ్యక్తి ఆశపడ్డాడు. ఆ విధంగా అతను మరణించిన పిదప కూడా తన జాతి ప్రజల శ్రేయాన్ని అభిలషించాడు. సత్యవంతుడైన ఒక విశ్వాసి ఆలోచనా తీరు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలి. అతను పరుల నష్టాన్ని కాంక్షించకూడదు. సతతం వారి మార్గదర్శనం చేస్తూ ఉండాలి. అపమార్గాన పోతున్న వారిని చూసి తెలిసీ తెలియనట్లుగా వ్యవహ రించకూడదు. జనులు తన గురించి ఏమనుకున్నాసరే, ఆఖరికి తనకు అపకారం తలపెట్టినాసరే అతను మాత్రం జనులను నరకాగ్ని నుంచి కాపాడే యత్నం కడదాకా చేస్తూ ఉండాల్సిందే.

27. అంటే, వారు హబీబ్ నజ్జార్‌ను హతమార్చిన తర్వాత మేము వారిని నాశనం చేయడానికి ఆకాశం నుంచి దైవ దూతల సైనిక పటాలాన్ని పంపాల్సిన ఆవశ్యకత కూడా ఏర్పడలేదు అని అల్లాహ్ అంటున్నాడు. ఆ జాతి ప్రజల చేతకానితనాన్ని తెలియజెప్పటానికి అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు.

28. ఏదైనా ఒక జాతిని వేరే విధంగా తుడిచిపెట్టాలని మేము రాసిపెట్టి ఉండగా, వారిపై మేము మా దూతల గుంపును పంపబోము.

**29** అది (ఆ శిక్ష) ఒకే ఒక్క కేక మాత్రమే! అంతే. వారంతా (ఆ దెబ్బకు) ఆరిపోయారు.[29]

إِن كَانَتْ إِلَّا صَيْحَةً وَاحِدَةً فَإِذَا هُمْ
خَامِدُونَ ﴿٢٩﴾

**30** (అలాంటి) దాసుల పరిస్థితి కడు శోచనీయం![30] తమ వద్దకు ఎప్పుడు, ఏ ప్రవక్త వచ్చినా వారతన్ని పరిహసించకుండా ఉండ లేదు.

يَا حَسْرَةً عَلَى الْعِبَادِ ۚ مَا يَأْتِيهِم مِّن رَّسُولٍ
إِلَّا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ﴿٣٠﴾

**31** వారికి పూర్వం ఎన్నో సముదాయాలను మేము తుదముట్టించటాన్ని వారు చూడలేదా?[31] వారెన్నటికీ వారిదగ్గరకు తిరిగిరారు.

أَلَمْ يَرَوْا كَمْ أَهْلَكْنَا قَبْلَهُم مِّنَ الْقُرُونِ أَنَّهُمْ إِلَيْهِمْ
لَا يَرْجِعُونَ ﴿٣١﴾

**32** అయితే ఎట్టకేలకు వారంతా సమీకరించబడి (తీర్పు నిమిత్తం) మా ముందు హాజరు పరచబడతారు.[32]

وَإِن كُلٌّ لَّمَّا جَمِيعٌ لَّدَيْنَا مُحْضَرُونَ ﴿٣٢﴾

**33** మరి వారి కోసం మృతభూమి కూడా ఒక సూచనే.[33] దాన్ని మేము బ్రతికించాము. దాన్నుంచి ఆహార ధాన్యాన్ని ఉత్పత్తి చేశాము. దాన్నుంచి వారు భుజిస్తున్నారు.

وَآيَةٌ لَّهُمُ الْأَرْضُ الْمَيْتَةُ أَحْيَيْنَاهَا وَأَخْرَجْنَا
مِنْهَا حَبًّا فَمِنْهُ يَأْكُلُونَ ﴿٣٣﴾

**34** ఇంకా మేము అందులో ఖర్జూరం, ద్రాక్షతోటలను (ఉత్పన్నం) చేశాము.[34] వాటిలో ఊటలను ప్రవహింపజేశాము.

وَجَعَلْنَا فِيهَا جَنَّاتٍ مِّن نَّخِيلٍ وَأَعْنَابٍ وَفَجَّرْنَا
فِيهَا مِنَ الْعُيُونِ ﴿٣٤﴾

29. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఒక్క కేకపెట్టగానే వారి పైప్రాణాలు పైకే లేచిపోయాయి. వారంతా చల్లారిన అగ్ని మాదిరిగా అయిపోయారు. అవును, జీవితం అగ్నికణం లాంటిది. మరణం చల్లారిపోయిన బూడిద కుప్పలాంటిది.

30. ప్రళయదినాన ఈ అపరాధులంతా తమ స్థితిని చూసుకుని సిగ్గుతో కుంచించుకుపోతారు. అల్లాహ్ విషయంలో తాము అశ్రద్ధ చూపకుండా ఉంటే బావుండేదికదా! అని బాధపడతారు. అలాంటి దాసుల పరిస్థితిపై దేవుడు విచారం వ్యక్తం చేస్తాడని కూడా ఒక అర్థం కావచ్చు. ఎందుకంటే వారి దగ్గరకు ఏ ప్రవక్త వచ్చినా వారు అతని పట్ల వెకిలిచేష్టలకు పాల్పడ్డారు. వేళాకోళం చేశారు. నలుగురి ముందూ నవ్వుల పాలు చేసేందుకు ప్రయత్నించారు.

31. ఈ వాక్యం మక్కా అవిశ్వాసులకు హెచ్చరిక వంటిది. ఒకవేళ వీరు కూడా అంతిమ దైవప్రవక్త (సఅసం) సందేశాన్ని తిరస్కరిస్తే, ఆ తిరస్కార వైఖరి మూలంగా వీరు కూడా వెనుకటి జాతుల మాదిరిగా నాశనం చేయబడతారు.

32. అంటే లోగడ చనిపోయినవారు, భవిష్యత్తులో చనిపోయేవారు – అందరూ ఒకానొక రోజు అల్లాహ్ సమక్షంలో హాజరుపరచబడతారు. అక్కడ వారి లెక్కలు తేల్చబడతాయి.

33. అంటే – ఇందులో దేవుని అస్తిత్వానికి, ఆయన సంపూర్ణ కార్యదక్షతకు, మరణానంతర జీవితానికి సంబంధించిన నిదర్శనం ఉంది.

34. మృత భూమిని వర్షం ద్వారా బ్రతికించిన మీదట మేము వారి ఆకలి మంటను ఆర్పడానికి కేవలం ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు మాత్రమే పండించటం లేదు. వారి రుచుల, అభిరుచుల దృష్ట్యా రకరకాల పండ్లు ఫలాలను, కూరగాయలను కూడా ఉత్పన్నం చేస్తున్నాము. ఇక్కడ కేవలం రెండు రకాల పండ్లపేర్లు మాత్రమే ప్రస్తావించబడ్డాయి. ఎందుకంటే ఈ రెండు రకాల పండ్లు (ఖర్జూరం, ద్రాక్ష) అధిక లాభాలను ఆర్జించిపెట్టేవి. అరబ్బులకు ఎంతో ఇష్టమైనవి. అరేబియా గడ్డపై ఎక్కువగా పండేవి కూడా ఈ రెండు రకాల పండ్లే. వీటిలో ఆహారధాన్యాల ప్రస్తావన

**35** దాని ఫలాలను (ప్రజలు) తినేందుకు![35] వారి చేతులైతే దాన్ని నిర్మించలేదు.[36] మరలాంటప్పుడు వారు కృతజ్ఞులుగా ఎందుకు వ్యవహరించరు?

لِيَأْكُلُوا مِنْ ثَمَرِهِ وَمَا عَمِلَتْهُ أَيْدِيهِمْ ۖ
أَفَلَا يَشْكُرُونَ (35)

**36** భూమి నుండి ఉత్పన్నం అయిన వస్తువులలోనైనా, మరి స్వయంగా వారిలోనే (మనుషులలోనే) అయినా, వారికి తెలియని వాటిలోనైనా – వాటన్నింటి జతలను సృష్టించినవాడు పరమ పవిత్రుడు.[37]

سُبْحَانَ الَّذِي خَلَقَ الْأَزْوَاجَ كُلَّهَا مِمَّا تُنْبِتُ الْأَرْضُ
وَمِنْ أَنْفُسِهِمْ وَمِمَّا لَا يَعْلَمُونَ (36)

**37** వారి కొరకు రాత్రి కూడా ఒక సూచనే. దాన్నుంచి మేము పగటిని లాగివేస్తాము. దాంతో వారు చీకటిలో ఉండిపోతారు.[38]

وَآيَةٌ لَهُمُ اللَّيْلُ ۚ نَسْلَخُ مِنْهُ النَّهَارَ فَإِذَا
هُمْ مُظْلِمُونَ (37)

**38** సూర్యుడు తన కోసం నిర్ధారించబడిన కక్ష్యలోనే పయనిస్తున్నాడు.[39] ఇది సర్వాధిక్యుడు,సర్వజ్ఞుడు అయిన అల్లాహ్ నిర్ధారించిన విధానం.

وَالشَّمْسُ تَجْرِي لِمُسْتَقَرٍّ لَهَا ۚ ذَٰلِكَ تَقْدِيرُ
الْعَزِيزِ الْعَلِيمِ (38)

---

కూడా ఇంతకు ముందు వచ్చింది. ఎందుకంటే వీటి ఉత్పత్తులు కూడా ప్రపంచంలో ఎక్కువే. సామాన్య ప్రజల ఆకలి బాధను తీర్చేవి కూడా ఇవే. మానవుని ఆకలి తీరాలంటే రొట్టె వరి లాంటి అన్నం కావాల్సిందే. కేవలం పండ్లు ఫలాలతో ఆకలి తీరదు.

35. కొన్ని ప్రదేశాలలో మేము నీటి ఊటలను కూడా ప్రవహింపజేస్తాము. ఆ నీటితో ఉత్పన్నమయ్యే పండ్లను ప్రజలు తింటారు.

36. ఇమామ్ ఇబ్నె జరీర్ వ్యాఖ్యానం ప్రకారం ఈ ఆహార ధాన్యాలు గానీ, పండ్లు ఫలాల ఉత్పత్తులుగానీ కేవలం దైవకటాక్షమే. ఆయన తన దాసులపై చూపే అపార కృపకు ఇవి నిదర్శనాలు. ఈ వ్యవసాయోత్పత్తులలో మానవ తెలివితేటలకు, మానవ కృషికి గల ప్రమేయం అతి స్వల్పం. అయినా వీళ్లు దైవానుగ్రహాలకుగాను తగు రీతిలో కృతజ్ఞతాంజలి ఘటించరేమిటి?

మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం "వారి చేతులు తయారుచేసిన వస్తువులను" అన్న అర్థం వస్తుంది. ఇక్కడ వారి చేతులకు గల ప్రమేయాన్ని వివరిస్తూ ఈ వ్యాఖ్యాతలు ఇలా అన్నారు: భూమిని దున్ని, విత్తనాలు చల్లటం (నాటటం), నీరు సరఫరా చేయటం, కోత కోయటం, పండ్లను వివిధ పద్ధతుల్లో తినటం – ఉదాహరణకు పండ్ల రసాన్ని తీయటం, వివిధ రకాల పండ్లను కలిపి తీపి పదార్థాలు తయారు చేయటం – వీటన్నింటిలోనూ మనిషి చేతులు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

37. మానవ జంటల మాదిరిగా మేము నేల నుండి ఉత్పత్తి అయిన అన్ని రకాల వస్తువులలో కూడా ఆడ – మగలను సృజించాము. అంతేకాదు, భూమ్యాకాశాల లోతులలో దాగివున్న, మీకు తెలియని ఎన్నో వస్తువుల జతలను కూడా మేము చేశాము. ఈ విధంగా ప్రాణులలో జంటలున్నాయి. వృక్షజాలలో కూడా ఆడ – మగలున్నాయి. ఆఖరికి పరలోకం కూడా ఇహలోకానికి జంటలాంటిది. ఒక్క అల్లాహ్ మాత్రమే సృష్టితాల ఈ గుణానికి, సమస్త లోపాలకు అతీతుడు, పవిత్రుడు. ఆయన ఒక్కడే – బేసి సంఖ్యలో ఉన్నవాడు. జంటగా లేడు – సరి సంఖ్యలో లేడు.

38. దేవుని శక్తి సూచనలలో ఒకటేమంటే ఆయన పగటిని రాత్రి నుంచి వేరుపరుస్తాడు. దాంతో అకస్మాత్తుగా అంధకారం అలుముకుంటుంది. ఆయతులో (అరబీలో) 'సల్ఖ్' అనే పదప్రయోగం జరిగింది. 'సల్ఖ్' అంటే పశువు చర్మాన్ని దాని శరీరం నుంచి వలచటం అని అర్థం. తత్కారణంగా ఆ పశువు మాంసం బయటపడుతుంది. అదేవిధంగా అల్లాహ్

**39** మరి చంద్రుని మజిలీలను కూడా మేము నిర్ధారించాము.[40] తుదకు అది (వాడిపోయిన ఖర్జూరపు) పాత మండలా తయారవుతుంది.[41]

وَالْقَمَرَ قَدَّرْنٰهُ مَنَازِلَ حَتّٰى عَادَ كَالْعُرْجُوْنِ الْقَدِيْمِ ﴿٣٩﴾

**40** చంద్రుణ్ణి పట్టుకోవటం సూర్యుని తరంకాదు.[42] పగటిని మించిపోవటం రాత్రి వల్ల కాదు.[43] అవన్నీ (తమ తమ నిర్ధారిత) కక్ష్యల్లో తేలియాడుతున్నాయి.[44]

لَا الشَّمْسُ يَنْۢبَغِيْ لَهَآ اَنْ تُدْرِكَ الْقَمَرَ وَلَا الَّيْلُ سَابِقُ النَّهَارِ ۗ وَكُلٌّ فِيْ فَلَكٍ يَّسْبَحُوْنَ ﴿٤٠﴾

**41** మరి మేము వారి సంతతిని నిండు నౌకలో ఎక్కించటం కూడా వారి కొరకు ఒక సూచనే.[45]

وَاٰيَةٌ لَّهُمْ اَنَّا حَمَلْنَا ذُرِّيَّتَهُمْ فِي الْفُلْكِ الْمَشْحُوْنِ ﴿٤١﴾

---

పగటిని రాత్రి నుంచి విడదీస్తాడు. దాంతో నలువైపులా చీకటి ఆవరిస్తుంది. 'అజ్‌లమ' అంటే చీకటిలో ప్రవేశించటం అని అర్థం.

39. అంటే – అల్లాహ్ తనకోసం నిర్ధారించిన దిశలో పయనిస్తాడు. నిర్ధారించబడిన చోటినుంచే ప్రయాణం మొదలెట్టి నిర్ధారించబడిన చోటే అస్తమిస్తాడు. నిర్ణీత కక్ష్యను దాటి అటూ ఇటూ జరగడు. ఒకవేళ సూర్యుడు తన హద్దులు దాటిపోతే వేరితర గ్రహంతో ఢీకొనవలసివస్తుంది.

మరొక అర్థం: "సూర్యుడు తను నిలిచే చోటు వరకూ పయనిస్తున్నాడు" అని వస్తుంది. సూర్యుడు నిలిచే ఆ చోటు దేవుని సింహాసనం (అర్ష్) క్రింద ఉన్నది. ఇంతకు ముందు అల్ హజ్ సూరా 18వ వచనానికి వివరణగా వచ్చిన ఒక హదీసులో చెప్పబడినట్లు, సూర్యుడు ప్రతి రోజూ అస్తమించిన తరువాత దేవుని సింహాసనం క్రిందికి వెళ్ళి సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేస్తాడు. మరి అక్కణ్ణుంచి ఉదయించేందుకు అనుమతి కోర్తాడు (సహీహ్ బుఖారీ – యాసీన్ సూరా వ్యాఖ్యానం). సూర్యుని ఈ పయనం ప్రళయదినం వరకూ కొనసాగుతుంది. ప్రళయదినాన దీని చలనం ఆగిపోతుంది.

40. చంద్రుని మజిలీలు మొత్తం 28. చంద్రుడు రోజుకొక మజిలీని అధిగమిస్తాడు. తరువాత రెండు రాత్రులు కనుమరుగై మూడవ రాత్రి దర్శనమిస్తాడు.

41. తుది మజిలీకి చేరుకునే సరికి చంద్రుడు తరిగి తరిగి వాడిపోయిన – సన్నని – ఖర్జూరపు మండలా మారిపోతాడు. చంద్రుని ఈ పెరిగే తరిగే దశల ద్వారానే భూగోళంలో దినాలను, వారాలను, నెలలను, సంవత్సరాలను లెక్కించటం జరుగుతుంది. దీని ద్వారానే ఆరాధనల వేళలు నిర్ధారించబడతాయి.

42. చంద్రుణ్ణి వెంబడించి పట్టుకోవటం సూర్యునికి సాధ్యపడదు. సూర్యుడు ఈ దుస్సాహసానికి ఎన్నడూ పాల్పడడు. ఒకవేళ అదేగనక జరిగితే దాని వెలుగు అంతరించిపోతుంది. వాటిలో ప్రతిదీ తన తన హద్దుల్లో ఉండి తమ పనిని సజావుగా చేసుకుపోతున్నాయి. సూర్యుడు ప్రొద్దున ఉదయించగా, చంద్రుడు సాయంత్రం (లేక రాత్రి) ఉదయించటం జరుగుతుంది. తద్భిన్నంగా ఎన్నడూ జరగలేదు, జరగదు కూడా. దీని వెనుక ఓ గొప్ప సూత్రధారి, ప్రణాళికా రచయిత ఉన్నాడన్న దానికి ఇదొక ప్రబల తార్కాణం.

43. రేయింబవళ్ళు కూడా ఒక నిర్ణీత కార్యక్రమానికి కట్టుబడి, ఒకదాని తరువాత ఒకటి వస్తున్నాయి.

44. **'అవన్నీ'** అంటే సూర్యచంద్రులు, నక్షత్రాలు అని భావం. వాటిలో ప్రతిదీ తన నిర్ణీత కక్ష్యలో తన పనిని చేసుకుపోతోంది. ఎన్నడూ అవి ఒండొకదానితో ఘర్షణపడటం లేదు.

45. ఈ ఆయతులో అల్లాహ్ తన దాసులకు చేసిన ఉపకారాన్ని జ్ఞాపకం చేస్తున్నాడు. (అదేమంటే) ఆయన మీ కోసం సముద్రంలో నౌకలు నడవటాన్ని సులభతరం చేశాడు. మీరు మాత్రమే గాకుండా మీ సంతానం సయితం ఆ నిండు నావలలో ప్రయాణం సాగిస్తున్నారు. దీనికి వేరొక అర్థం ఇది : 'జుర్రియ్యతున్' అంటే సంతానం యొక్క పెద్దలు,

42 ఇంకా వారి కోసం దాని (నౌక) లాంటివే మరికొన్ని వస్తువు
లను కూడా సృష్టించాము.వాటిపై వారు ప్రయాణం చేస్తున్నారు.[46]

وَخَلَقْنَا لَهُم مِّن مِّثْلِهِ مَا يَرْكَبُونَ ﴿٤٢﴾

43 మరి మేము గనక తలచుకుంటే వాటిని ముంచివేయగలం.
అప్పుడు వారి ఫిర్యాదును వినేవారుగానీ, వారిని రక్షించేవారు
గానీ ఎవరూ ఉండరు.

وَإِن نَّشَأْ نُغْرِقْهُمْ فَلَا صَرِيخَ لَهُمْ وَلَا هُمْ يُنقَذُونَ ﴿٤٣﴾

44 కాని మేము మా తరఫున దయదలచి, ఓ నిర్ణీత కాలం
వరకు వారికి లబ్ధిని చేకూరుస్తున్నాము.

إِلَّا رَحْمَةً مِّنَّا وَمَتَاعًا إِلَىٰ حِينٍ ﴿٤٤﴾

45 "మీరు ముందు ఎదుర్కోబోతున్న పరిణామానికి, మీరు మీ
వెనుక వదలిపోయే వాటికి (పాపకార్యాలకు) భయపడండి,-
మీరు కరుణించబడతారు" అని వారికి ఎప్పుడు నచ్చచెప్పినా
(వారు లక్ష్యపెట్టరు).

وَإِذَا قِيلَ لَهُمُ اتَّقُوا مَا بَيْنَ أَيْدِيكُمْ وَمَا خَلْفَكُمْ لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴿٤٥﴾

46 తమ వద్దకు వచ్చిన ప్రభువు సూచనలలో, వారు విముఖత
చూపకుండా ఉన్న సూచన అంటూ ఏదీ లేదు.[47]

وَمَا تَأْتِيهِم مِّنْ آيَةٍ مِّنْ آيَاتِ رَبِّهِمْ إِلَّا كَانُوا عَنْهَا مُعْرِضِينَ ﴿٤٦﴾

47 "అల్లాహ్ ప్రసాదించిన దానిలో నుంచి కొంత ఖర్చు
చేయండి"[48] అని వారితో అన్నప్పుడల్లా, ఈ తిరస్కారులు విశ్వాసు
లతో, "మేము వారికి ఎందుకు తినిపించాలి? అల్లాహ్ తలిస్తే
ఆయన స్వయంగా వారికి అన్నం పెట్టేవాడు.[49] ఎటొచ్చీ మీరే
స్పష్టమైన అపమార్గంలో పడి ఉన్నారు"[50] అని సమాధానమిస్తారు.

وَإِذَا قِيلَ لَهُمْ أَنفِقُوا مِمَّا رَزَقَكُمُ اللَّهُ قَالَ الَّذِينَ كَفَرُوا لِلَّذِينَ آمَنُوا أَنُطْعِمُ مَن لَّوْ يَشَاءُ اللَّهُ أَطْعَمَهُ إِنْ أَنتُمْ إِلَّا فِي ضَلَالٍ مُّبِينٍ ﴿٤٧﴾

---

పూర్వీకులు. 'నౌక' అంటే దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) గారి నౌక. అంటే భవిష్యత్తులో మానవజాతి పరంపర ముందుకు సాగటానికి మూలకారకులైన వారిని ఆయన నూహు నావలో ఎక్కించాడు. ఆ విధంగా మానవజాతి పితామహులు ఆ నావలో ఉన్నారు.

46. **"దాని లాంటివే మరికొన్ని..."** అంటే మానవులను, వర్తకసామగ్రిని ఒకచోటి నుంచి మరో చోటికి చేర్చే వాహనాలని అర్థం. ప్రళయదినం వరకూ కనుగొనబడే భారీ వాహనాలన్నీ ఇందులోకి వచ్చేస్తాయి. ఉదాహరణకు: విమానాలు, నౌకలు, రైలుబండ్లు, బస్సులు, కార్లు మొదలగునవి.

47. అంటే దేవుని ఏకత్వానికి, దైవప్రవక్త సత్యబద్ధతకు సంబంధించిన ఏ సూచన వారి వద్దకు వచ్చినా వారు దాని గురించి గంభీరంగా ఆలోచించే వారు కాదు. ఆలోచిస్తే అది వారి కొరకు శ్రేయోదాయకం అయ్యేదే. పైగా వారు దైవసూచనలపట్ల నిర్లక్ష్యధోరణిని అవలంబించేవారు.

48. అంటే అగత్యపరులకు, అనాథలకు, నిరాధార జీవులకు అన్నం పెట్టండి అని వారితో అన్నప్పుడు....

49. అల్లాహ్ గనక తలిస్తే వారిని దరిద్రులుగా ఉంచేవాడే కాదు. అలాంటప్పుడు మేము ఈ దరిద్రులకు సహాయపడి దైవాభిమతానికి వ్యతిరేకంగా ఎందుకు ప్రవర్తించాలి?! అని వారు పెడసరిగా జవాబిచ్చారు.

**48** "మీరు సత్యవంతులే అయితే ఆ (ప్రళయ) వాగ్దానం ఎప్పుడు నెరవేరుతుందో చెప్పండి" అని వారంటున్నారు.

وَيَقُولُونَ مَتَىٰ هَٰذَا الْوَعْدُ إِن كُنتُمْ صَادِقِينَ ﴿48﴾

**49** వారు దేనికోసం ఎదురు చూస్తున్నారో అది ఒకే ఒక (భయం కరమైన) కేక మాత్రమే. అది వారిని అమాంతం కబళిస్తుంది. అప్పుడు వారేమో పరస్పరం విభేదించుకుంటూ ఉంటారు.[51]

مَا يَنظُرُونَ إِلَّا صَيْحَةً وَاحِدَةً تَأْخُذُهُمْ وَهُمْ
يَخِصِّمُونَ ﴿49﴾

**50** ఆ ఘడియలో వారు వీలునామా వ్రాయటంగానీ, తమ ఇంటివారి వద్దకు మరలిరావటంగానీ చేయలేరు.

فَلَا يَسْتَطِيعُونَ تَوْصِيَةً وَلَا إِلَىٰ أَهْلِهِمْ
يَرْجِعُونَ ﴿50﴾

**51** మరి శంఖం పూరించబడగానే[52] అందరూ తమ తమ గోరీల నుంచి లేచి, తమ ప్రభువు వైపునకు వడివడిగా వస్తారు.

وَنُفِخَ فِي الصُّورِ فَإِذَا هُم مِّنَ الْأَجْدَاثِ إِلَىٰ رَبِّهِمْ
يَنسِلُونَ ﴿51﴾

**52** "అయ్యో మా దౌర్భాగ్యం! మమ్మల్ని మా శయనాగారాల నుంచి లేపినదెవరు?"[53] అని వారు వాపోతారు. "కరుణామయుడు (అయిన అల్లాహ్) చేసిన వాగ్దానమిదే. ప్రవక్తలు చెప్పింది నిజం" (అని వారితో అనబడుతుంది).

قَالُوا يَا وَيْلَنَا مَن بَعَثَنَا مِن مَّرْقَدِنَا ۜ هَٰذَا مَا
وَعَدَ الرَّحْمَٰنُ وَصَدَقَ الْمُرْسَلُونَ ﴿52﴾

**53** అది ఒకే ఒక (భయంకర) అరుపు తప్ప మరేమీ కాదు. అంతే! వారంతా మా ముందు హాజరుపరచబడతారు.

إِن كَانَتْ إِلَّا صَيْحَةً وَاحِدَةً فَإِذَا هُمْ جَمِيعٌ
لَّدَيْنَا مُحْضَرُونَ ﴿53﴾

50. "పేదలను ఆదుకోండి. ఆకలి గొన్నవారికి అన్నం పెట్టండి అని చెప్పి మీరు ఘోరంగా ప్రవర్తిస్తున్నారు" అన్నది వారి మాటల్లోని ఉద్దేశం. పేదరికం దైవప్రణాళిక కనుగుణంగా ఉన్నది అన్న వారి మాటలో తప్పులేదు. కాని దైవాదేశాలపట్ల వైముఖ్య ధోరణి కనబరచటం మాత్రం ముమ్మాటికీ తప్పే. పేదలకు దానధర్మాలు చేయమని ఆదేశించినవాడు కూడా అల్లాహ్యే కదా! కాబట్టి ఆయన ప్రసన్నతను చూరగొనటానికి పేదలకు, అగత్యపరులకు సాయపడటం అవసరం. ఎందుకంటే దైవప్రణాళిక వేరు. దైవప్రసన్నత వేరు. దైవప్రణాళిక దైవేచ్ఛతో, దైవిక వ్యవహారాలతో ముడిపడి ఉంది. అందలి పరమార్థాలు అల్లాహ్కు తప్ప ఎవరికీ తెలీవు. దైవప్రసన్నత మాత్రం మానవుల కర్మలతో ముడిపడి ఉంది. దైవాదేశానుసారం ఆచరించిన వారు ఆయన ప్రసన్నతను చూరగొంటారు.

51. ఆ సమయంలో ప్రజలు మార్కెట్లలో క్రయవిక్రయాలు జరుపుతూ, అలవాటు ప్రకారం బేరసారాలు చేస్తూ, వాదోపవాదాలు చేస్తూ ఉంటారు. అకస్మాత్తుగా శంఖం ఊదబడుతుంది. మరుక్షణం ప్రళయం సంభవిస్తుంది. అది తొలిసారి పూరించబడిన శంఖారావం. దరిమిలా మరోసారి శంఖం ఊదబడుతుంది. అప్పుడు – ఒక్క అల్లాహ్ మినహా – అందరూ మృత్యుఒడిలోకి జారుకుంటారు.

52. మొదటి ఉవాచ ప్రకారం ఇది ద్వితీయ శంఖారావం. రెండవ ఉవాచ ప్రకారం ఇది తృతీయ శంఖారావం. దీన్ని **'నఫఖతుల్ బాసి వన్నుషూర్'** అంటారు. ఈ శంఖం ఊదబడగానే జనులు తమ గోరీల నుంచి లేచి నిలబడతారు (ఇబ్నె కసీర్).

53. సమాధిని శయనాగారంగా అభివర్ణించినంత మాత్రాన సమాధి యాతన ఉండదని దీని భావం కాదు. వారు భయంకరమైన అక్కడి స్థితిని, కఠిన శిక్షను చవిచూసిన తరువాత సమాధి యాతనే నయమని భావిస్తారు. సమాధి జీవితం వారికి ఒక స్వప్నంలా అనిపిస్తుంది.

فَالْيَوْمَ لَا تُظْلَمُ نَفْسٌ شَيْـًٔا وَلَا تُجْزَوْنَ
إِلَّا مَا كُنتُمْ تَعْمَلُونَ ﴿٥٤﴾

**54** మరి ఈనాడు ఎవరికీ ఎటువంటి అన్యాయమూ జరగదు. మీరు చేసుకున్న కర్మల ప్రతిఫలం తప్ప మరొకటి ఏదీ మీకు ఇవ్వబడదు.

إِنَّ أَصْحَٰبَ ٱلْجَنَّةِ ٱلْيَوْمَ فِى شُغُلٍ فَٰكِهُونَ ﴿٥٥﴾

**55** స్వర్గవాసులు ఈ రోజు తమ (ఆహ్లాదకర) వ్యాపకాలలో నిమగ్నులై ఆనందిస్తూ ఉన్నారు.[54]

هُمْ وَأَزْوَٰجُهُمْ فِى ظِلَٰلٍ عَلَى ٱلْأَرَآئِكِ مُتَّكِـُٔونَ ﴿٥٦﴾

**56** వారూ, వారి సతీమణులు (చల్లని) నీడలలో పీఠాలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు.

لَهُمْ فِيهَا فَٰكِهَةٌ وَلَهُم مَّا يَدَّعُونَ ﴿٥٧﴾

**57** అందులో వారి కోసం అన్ని రకాల పండ్లు ఉంటాయి. ఇంకా వారు కోరినదల్లా ఉంటుంది.

سَلَٰمٌ قَوْلًا مِّن رَّبٍّ رَّحِيمٍ ﴿٥٨﴾

**58** కృపాశీలుడైన ప్రభువు తరఫున వారికి 'సలామ్' చెప్పబడుతుంది.[55]

وَٱمْتَٰزُوا۟ ٱلْيَوْمَ أَيُّهَا ٱلْمُجْرِمُونَ ﴿٥٩﴾

**59** "ఓ పాపాత్ములారా! ఈ రోజు మీరు వేరైపోండి."[56]

أَلَمْ أَعْهَدْ إِلَيْكُمْ يَٰبَنِىٓ ءَادَمَ أَن لَّا تَعْبُدُوا۟
ٱلشَّيْطَٰنَ ۖ إِنَّهُۥ لَكُمْ عَدُوٌّ مُّبِينٌ ﴿٦٠﴾

**60** "ఓ ఆదం సంతతివారలారా! మీరు షైతాన్‌ను పూజించకండి, వాడు మీ బహిరంగ శత్రువు"[57] అని నేను మీ నుండి వాగ్దానం తీసుకోలేదా?[58]

---

54. **'ఫాకిహూన'** (فَٰكِهُونَ) అంటే **'ఫరిహూన'** అని అర్థం. అంటే సంతోషాతిశయం, పరమానందం కలిగిన వారన్నమాట!

55. అల్లాహ్ యొక్క ఈ 'సలామ్'ను దైవదూతలు స్వర్గవాసులకు అందజేస్తారు. అల్లాహ్ స్వయంగా వారికి సలామ్ చేస్తాడని మరికొందరు అభిప్రాయపడ్డారు.

56. అంటే – మీరు స్వర్గవాసుల పంక్తి నుంచి వేరై నిలబడండి. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే హష్ర్ మైదానంలో విశ్వాసులు, విధేయులు ఒక వైపున – అవిశ్వాసులు, అవిధేయులు మరోవైపున వేరుపరచబడతారు. దివ్య ఖుర్‌ఆన్‌లో వేరితర చోట్ల చెప్పబడినట్లు, "ప్రళయదినం సంభవించిన నాడు వారు వేర్వేరు వర్గాలుగా నిలబెట్టబడతారు" (అర్రూమ్ – 14).

    "ఆ రోజు ప్రజలు చెల్లాచెదురై వేర్వేరు వర్గాలుగా విడిపోతారు" (అర్రూమ్ – 43). అపరాధులే వేర్వేరు గుంపులుగా, జట్టులుగా విడిపోతారన్న అర్థం కూడా వస్తుంది. ఉదాహరణకు: యూదుల వర్గం, క్రైస్తవుల వర్గం, సాబియీల వర్గం, మజూసీల వర్గం, వ్యభిచారుల వర్గం, త్రాగుబోతుల వర్గం, తిరుగుబోతుల వర్గం ఇత్యాదివి.

57. షైతాన్ మీ బద్ధవిరోధి కావటం వల్లనూ, మిమ్మల్ని మార్గభ్రష్టుల్ని చేస్తానని శపథం చేసి ఉండటం వల్లనూ మీరు ఎట్టి పరిస్థితిలోనూ వాడి దాస్యం చేయరాదని మీకు తాకీదు చేయటం జరిగింది.

58. ఇక్కడ వాగ్దానం అంటే, మానవ సంతతిని హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) వెన్ను నుంచి తీసినపుడు తీసుకోబడిన ఖరారు (అహదె అలస్త్) అన్నమాట! లేదా దైవప్రవక్తల ద్వారా నిరంతరం మానవాళికి చేయబడుతూ వచ్చిన తాకీదు కూడా కావచ్చు. మరికొంత మంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ ఆయతులోని 'వాగ్దానం' అంటే భూమ్యాకాశాలలో అల్లాహ్ నెలకొల్పిన సహేతుక నిదర్శనాలు అని అర్థం (ఫత్‌హుల్ ఖదీర్).

وَّاَنِ اعْبُدُوْنِيْ ؕ هٰذَا صِرَاطٌ مُّسْتَقِيْمٌ (61)

**61** "మీరు నన్నే ఆరాధించండి.[59] ఇదే రుజుమార్గం"[60] అని కూడా.

وَلَقَدْ اَضَلَّ مِنْكُمْ جِبِلًّا كَثِيْرًا ؕ اَفَلَمْ تَكُوْنُوْا تَعْقِلُوْنَ (62)

**62** షైతాను మీలో ఎంతోమంది సృష్టిని పెడదారి పట్టించాడు. మరి మీకు ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేకపోయిందా?[61]

هٰذِهٖ جَهَنَّمُ الَّتِيْ كُنْتُمْ تُوْعَدُوْنَ (63)

**63** మీకు వాగ్దానం చేయబడుతూ ఉన్న నరకం ఇదే.

اِصْلَوْهَا الْيَوْمَ بِمَا كُنْتُمْ تَكْفُرُوْنَ (64)

**64** "మీ తిరస్కార వైఖరికి బదులుగా ఈరోజు దీనిలోకి ప్రవేశించండి"[62] (అని వారితో అనబడుతుంది).

اَلْيَوْمَ نَخْتِمُ عَلٰۤى اَفْوَاهِهِمْ وَتُكَلِّمُنَاۤ اَيْدِيْهِمْ وَتَشْهَدُ اَرْجُلُهُمْ بِمَا كَانُوْا يَكْسِبُوْنَ (65)

**65** ఈ రోజు మేము వారి నోళ్ళకు సీలు వేస్తాము. వారి చేతులు మాతో మాట్లాడతాయి. వారు చేసిన పనుల గురించి వారి కాళ్లు సాక్ష్యమిస్తాయి.[63]

وَلَوْ نَشَآءُ لَطَمَسْنَا عَلٰۤى اَعْيُنِهِمْ فَاسْتَبَقُوا الصِّرَاطَ فَاَنّٰى يُبْصِرُوْنَ (66)

**66** మేము గనక తలచుకుంటే వారి కళ్లను కాంతిహీనం చేసే వారము. మరి వారేమో దారి వైపుకు పరుగులు తీసి దేవులాడే వారు. కాని వారికి (దారి) ఎలా కనిపిస్తుంది?[64]

---

59. కేవలం నన్నే ఆరాధించాలనీ, నా ఆరాధనలో వేరొకరిని భాగస్థుల్ని చేయరాదని కూడా మీచేత ప్రమాణం చేయించటం జరిగింది.

60. అంటే ఏకదైవారాధనే రుజుమార్గం. ఈ మార్గం వైపుకే దైవప్రవక్తలంతా మానవాళిని ఆహ్వానించారు. ఇదే సరళమార్గం. ఇదే మానవతను గమ్యస్థానానికి – అంటే స్వర్గానికి చేర్చుతుంది.

61. షైతాన్ మీకు బద్ధ విరోధి అనీ, అతని అడుగుజాడల్లో నడవటం వినాశానికి హేతువన్న సంగతిని ఎంత మొత్తుకున్నా మీరు వినలేదెందుకు? ఆ మాత్రం మీకు బుద్ధి లేకపోయిందా? నేనే మీ ప్రభువుననీ, ఉపాధిని ప్రసాదించేవాణ్ణి నేనేనని, రేయింబవళ్ళు మిమ్మల్ని కనిపెట్టుకుని ఉండేది నేనేనని, కనుక మీరు నాకే విధేయులై ఉండాలని కూడా నేను మీకు చెప్పాను కదా! మీరు షైతాన్ శత్రుత్వాన్ని, నా ఆరాధనలోని సత్యతను గ్రహించకుండా మూర్ఖంగా ప్రవర్తించారు.

62. కనుక ఇప్పుడు మీ అవివేకపు పర్యవసానాన్ని అనుభవించండి. మీరు అవలంబించిన తిరస్కార వైఖరికిగాను నరక బాధను భరిస్తూ ఉండండి.

63. నోళ్లకు తాళం వేయాల్సిన అవసరం ఎందుకు వస్తుందంటే, ప్రళయదినాన ఈ ముష్రిక్కులు అబద్ధాలు చెప్పటం మొదలెడతారు. "మా ప్రభువైన అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాము. మేము ముష్రిక్కులం కాము" (అన్ఆమ్ – 23) అనంటారు. అందుచేత అల్లాహ్ వారి నోళ్లు మూయిస్తాడు. అయితే అల్లాహ్ వారి శరీరావయవాలకు మాట్లాడేశక్తిని ప్రసాదిస్తాడు. 'ఈయన గారు మాచేత ఈ ఈ పనులు చేయించాడు' అని చేతులు చెబుతాయి. దానికి కాళ్లు సాక్ష్యంగా నిలుస్తాయి. ఈ విధంగా తప్పును ఒప్పుకోవటం, దాన్ని ధృవీకరించటం– రెండూ జరిగిపోతాయి. అదీగాక– మాట్లాడే అవయవం కాకుండా మాట్లాడలేని అవయవాలు మాట్లాడటం వల్ల, సాక్ష్యం ఇవ్వటం వల్ల ఆ సంఘటనకు ఎనలేని ప్రాముఖ్యం ఏర్పడుతుంది (ఫత్హుల్ ఖదీర్). ఈ అంశం హదీసులలో కూడా వచ్చింది. (వివరాల కోసం సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్ చూడండి).

**67** మరి మేము తలిస్తే వారున్న చోటే వారి రూపురేఖలను మార్చి వేస్తాము. తత్కారణంగా వారు ముందుకు పోనూ లేరు, వెనక్కి తిరిగి రానూ లేరు.[65]

وَلَوْ نَشَاءُ لَمَسَخْنَاهُمْ عَلَىٰ مَكَانَتِهِمْ فَمَا اسْتَطَاعُوا مُضِيًّا وَلَا يَرْجِعُونَ ﴿67﴾

**68** మేము వృద్ధాప్యానికి చేర్చిన వానిని (మళ్లీ) జనన స్థితికి తిప్పి తీసుకుపోతాము.[66] అయినా వాళ్ళు అర్థం చేసుకో రేమిటి?[67]

وَمَنْ نُعَمِّرْهُ نُنَكِّسْهُ فِي الْخَلْقِ ۖ أَفَلَا يَعْقِلُونَ ﴿68﴾

**69** మేమతనికి (ముహమ్మద్‌కు) కవిత్వం నేర్పలేదు. అది అతనికి తగదు కూడా. అది హితోపదేశం మరియు స్పష్టమైన ఖుర్ఆన్ మాత్రమే.[68]

وَمَا عَلَّمْنَاهُ الشِّعْرَ وَمَا يَنْبَغِي لَهُ ۚ إِنْ هُوَ إِلَّا ذِكْرٌ وَقُرْآنٌ مُبِينٌ ﴿69﴾

---

64. కళ్లు పోయిన తరువాత మార్గం కనిపించదు కదా! అయితే మేమలా చేయలేదు. అది మా దయార్ద్రతకు, సహనశీలానికి ప్రతీక.

65. వారు ముందుకు సాగిపోలేక, వెనక్కి మరలి రాలేక రాయిలా ఉన్న చోటే పడి ఉంటారు. 'మస్ఖ్' అంటే సహజత్వంలో మార్పు అని అర్థం. అంటే మనిషిని రాయిగానో, పశువుగానో మార్చివేయటం అన్నమాట.

66. ముసలితనం కూడా ఒక లాంటి పసితనమే. మానవుడు బాల్యస్థితిలో ఉన్నప్పుడు బలహీనుడుగా ఉంటాడు. తరువాత క్రమక్రమంగా పెరిగి పెద్దవాడవుతాడు. శారీరకంగా పెరగటంతో పాటు మానసికంగా కూడా ఎదుగుతాడు. కడకు యుక్త వయస్సుకు చేరుకుని పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటాడు. దరిమిలా అతని శక్తియుక్తులు క్షీణించటం మొదలెడతాయి. నెమ్మదిగా వృద్ధాప్యపు ఛాయలు తొంగి చూస్తాయి. క్రమంగా వయసు మీదపడుతుంది. జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. విచక్షణా జ్ఞానం దాదాపు అంతరించిపోతుంది. తుదకు అతను అన్నీ తెలిసి ఉండి కూడా ఏమీ తెలియని పసివాడిలా తయారవుతాడు.

67. మరి మనిషిని ఇన్ని దశలకు చేర్చిన అల్లాహ్ మరణానంతరం అతన్ని తిరిగి బ్రతికించలేడా?

68. అంతిమ దైవప్రవక్త (సఅసం)ను త్రోసిపుచ్చటానికి మక్కాకు చెందిన ముష్రిక్కులు రకరకాల సాకులు చెప్పేవారు. వాటిలో ఒకటి: ఆయన (స) ఒక కవి పుంగవుడు అనేది! ఈ ఖుర్ఆన్ గ్రంథం ఒక కవితా సంపుటి అనీ, ఆ కవిత్వాన్ని ముహమ్మద్ (స) అల్లుకుని వస్తున్నాడని వారు ఆరోపించేవారు. ఈ ఆరోపణను అల్లాహ్ ఖండించాడు. ఆయన (స) కవి కారనీ, దివ్యఖుర్ఆన్ కవితా సంకలనం అంతకన్నా కాదనీ, వాస్తవానికి అదొక హితబోధ, మార్గదర్శిని అని అల్లాహ్ స్పష్టపరిచాడు.

సాధారణంగా కవనంలో అతిశయోక్తి ఉంటుంది. అవసరమైతే ఆకాశానికి ఎత్తటం, లేకుంటే పాతాళానికి తొక్కివేయటం కవిత్వంలో సహజం. ఎందుకంటే కవిత్వం భావాలు, భావనల విలక్షణ రూపకల్పన అయి ఉంటుంది. దానికోసం అసత్యాన్ని ఆశ్రయించటం కూడా జరుగుతుంది. అదీగాక కవుల మాటలు కోటలు దాటుతాయి. కాని వారి చేతలు మాత్రం గడప దాటవు. అందుకే అల్లాహ్ ఇలా అన్నాడు: "మేము మా ప్రవక్తకు కవిత్వం నేర్పటంగానీ, అతనిపై కవిత్వాన్ని అవతరింపజేయటం గానీ చేయలేదు. పైగా అతని స్వభావాన్ని కవిత్వంతో పొసగకుండా చేశాము."

అందుకేనేమో ఆయన (సఅసం) ఎప్పుడన్నా, ఏదైనా కవితా చరణాలను చెప్పటానికి ప్రయత్నిస్తే- ఎప్పుడో గాని-ఖచ్చితంగా చెప్పలేకపోయేవారు. ఒకవేళ ఆయన (స) కవిత్వం చెప్పినా అది ఛందోబద్ధంగా ఉండేది కాదు. హదీసుల ద్వారా మనకీ సంగతి తెలుస్తోంది. సత్యతిరస్కారుల కుంటిసాకులను, సందేహాలను పటాపంచలు చేయటానికే అల్లాహ్ తన ప్రవక్త (స)ను ఈ విధంగా చేశాడు.

కాకపోతే అప్పుడప్పుడూ-చాలా అరుదుగా - ఆయన (స) నోట వెలువడే కొన్ని వచనాలు కవితా శైలిలో ఉండేవి.

70 బ్రతికి ఉన్న ప్రతి వ్యక్తినీ హెచ్చరించటానికి,[69] అవిశ్వాసులపై మాట రూఢీ అవటానికి[70] (ఈ దైవ దౌత్య ఏర్పాటు జరిగింది).

لِّيُنذِرَ مَن كَانَ حَيًّا وَيَحِقَّ الْقَوْلُ عَلَى الْكَافِرِينَ ﴿٧٠﴾

71 మేము మా స్వహస్తాలతో చేసిన వాటిలో[71] వారి కొరకు చతుష్పాదాలు[72] (కూడా) సృజించబడి ఉండటాన్ని వారు గమనించటం లేదా? మరి (చూస్తే) వాటికి వారు యజమానులుగా ఉన్నారు.[73]

أَوَلَمْ يَرَوْا أَنَّا خَلَقْنَا لَهُم مِّمَّا عَمِلَتْ أَيْدِينَا أَنْعَامًا فَهُمْ لَهَا مَالِكُونَ ﴿٧١﴾

72 మరి మేము ఆ పశువులను వారికి లోబడి ఉండేటట్లు చేశాము.[74] వాటిలో కొన్నేమో వారి వాహనాలుగా ఉన్నాయి. మరికొన్నింటి మాంసాన్ని వారు భుజిస్తున్నారు.

وَذَلَّلْنَاهَا لَهُمْ فَمِنْهَا رَكُوبُهُمْ وَمِنْهَا يَأْكُلُونَ ﴿٧٢﴾

అంతమాత్రంచేత ఆయన (స) ఒక కవి అని చెప్పడానికి ఆస్కారం కలగదు. అవి కాకతాళీయంగా- అసంకల్పికంగా–వెలువడే చరణాలు మాత్రమే. ఉదాహరణకు హునైన్ యుద్ధసందర్భంగా వెన్నుచూపి పారిపోతున్న తన సహచరులను చూసినప్పుడు ఆయన నోట (స) వెలువడిన పలుకులు ఇలా ఉన్నాయి –

**"అనన్నబియ్యు లా కజిబ్**
**అనబ్ను అబ్దిల్ ముత్తలిబ్"**

"నేను దైవప్రవక్తనే గాని అసత్యవాదిని కాను.
నేను అబ్దుల్ ముత్తలిబ్ పుత్రరత్నాన్ని (మనవడిని)."

వేరొక సందర్భంలో తన చేతివ్రేలికి గాయమైనపుడు ఆయన (స) ఇలా అన్నట్లు సహీహ్ ముస్లిం గ్రంథంలోని జిహాద్ అధ్యాయంలో ప్రస్తావించబడింది:

**"హల్ అంతి ఇల్లా ఇస్బవున్ దమీతీ**
**వ ఫీ సబీలిల్లాహి మా లఖీతీ"**

"నీవు రక్తసిక్తమై ఉన్న వ్రేలివి తప్ప మరేమీ కావు.
దైవమార్గంలో అర్పితమైన దానివి."

69. తద్వారా సహృదయత గలవారు సత్యాన్ని స్వీకరిస్తారు. అసత్యాన్ని తృణీకరిస్తారు.
70. అంటే – ఎంత నచ్చజెప్పినా అసత్యాన్నే అంటిపెట్టుకుని ఉన్న వారిపై తీర్పుదినాన అభియోగం మోపటానికి తావు కలుగుతుంది.
71. ఈ వాక్యం ద్వారా 'సృష్టి ప్రక్రియ'లో దైవేతరుల భాగస్వామ్యం లేదని చెప్పటం జరిగింది. "వాటిని మేము మా చేతులతో చేశాము – వాటి నిర్మాణంలో వేరొకరి ప్రమేయం లేదు" అని అల్లాహ్ అంటున్నాడు.
72. **'అన్ఆమ్'** అంటే చతుష్పాదాలు – అంటే పశువులు – అని అర్థం. ఉదాహరణకు ఒంటెలు, ఆవులు, మేకలు, గొర్రెలు మొదలగునవి.
73. అంటే ఆ పశువులను మీరు మీ అవసరాల కనుగుణంగా ఉపయోగించుకుంటున్నారు. ఒకవేళ మేమే గనక ఈ పశువులలో క్రూరమృగాల స్వభావాన్ని పెట్టి ఉంటే అవి మీ అదుపులో ఉండేవే కావు. మీరు సయితం వాటి పెంపకానికి భయపడేవారు.

وَلَهُمْ فِيهَا مَنَافِعُ وَمَشَارِبُ ۖ أَفَلَا يَشْكُرُونَ ﴿73﴾

**73** ఇంకా వాటి ద్వారా వారికి మరెన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయి.[75] త్రాగే (పాల) పదార్థాలు లభ్యమవుతున్నాయి. అయినా వారు కృతజ్ఞులుగా మసలుకోరా?

وَاتَّخَذُوا مِن دُونِ اللَّهِ آلِهَةً لَّعَلَّهُمْ يُنصَرُونَ ﴿74﴾

**74** తమను ఆదుకుంటారనే ఆశతో వారు అల్లాహ్‌ను వదలి ఇతరత్రా దైవాలను ఆశ్రయిస్తున్నారు.[76]

لَا يَسْتَطِيعُونَ نَصْرَهُمْ وَهُمْ لَهُمْ جُندٌ مُّحْضَرُونَ ﴿75﴾

**75** (యదార్థానికి) వారిని ఆదుకునే శక్తిస్థోమత వారికి ఎంత మాత్రం లేదు. అయినప్పటికీ వారు (ముష్రిక్కులు) వారిని అంటిపెట్టుకుని ఉండే సైనికులుగా ఉన్నారు.[77]

فَلَا يَحْزُنكَ قَوْلُهُمْ ۘ إِنَّا نَعْلَمُ مَا يُسِرُّونَ وَمَا يُعْلِنُونَ ﴿76﴾

**76** అయినాసరే (ఓ ముహమ్మద్ – స!) వారి మాటలకు నువ్వు దుఃఖించకు. వారు దాచిపెట్టేవి, వ్యక్తపరిచేవి అన్నీ మాకు తెలుసు.

أَوَلَمْ يَرَ الْإِنسَانُ أَنَّا خَلَقْنَاهُ مِن نُّطْفَةٍ فَإِذَا هُوَ خَصِيمٌ مُّبِينٌ ﴿77﴾

**77** మేము మనిషిని పుట్టించింది (ఎంతో అల్పమైన) వీర్యపు బిందువుతోనన్న సంగతిని (కూడా) అతను గమనించటం లేదా? మరి ఉన్నట్టుండి అతను – బహిరంగంగానే – తగవులమారిగా తయారయ్యాడు.

وَضَرَبَ لَنَا مَثَلًا وَنَسِيَ خَلْقَهُ ۖ قَالَ مَن يُحْيِي الْعِظَامَ وَهِيَ رَمِيمٌ ﴿78﴾

**78** వాడు మమ్మల్ని (ఇతరులతో) పోల్చాడు. కాని (మరోవైపు) తన అసలు పుట్టుకనే మరచిపోయాడు. "కుళ్ళి కృశించిపోయిన ఎముకలను ఎవడు బ్రతికిస్తాడు?" అని వాడు సవాలు విసురుతున్నాడు.

74. ఆ పశువుల ద్వారా మీరు రకరకాల లాభాలను పొందుతున్నారు. మీరు వాటిని ఎలా ఉపయోగించుకున్నా ఆ పశువులు మీకు ఎదురు తిరగటం లేదు. పైగా అవి మీకు లోబడి ఉంటున్నాయి. అవసరమైతే మీరు వాటిని కోసి, వాటి మాంసాన్ని కూడా తింటున్నారు. మీ ఇంట్లోని పిల్లలు సయితం వాటి పగ్గాలు పట్టుకుని తిరుగుతుంటారు.

75. మీరు ఈ పశువులను వాహనాలుగా వాడుకోవటం, వాటి మాంసాన్ని భుజించటంతో పాటు మరెన్నో రకాల లాభాలను కూడా పొందుతున్నారు. ఉదాహరణకు: వాటి వెంట్రుకల ద్వారా ఎన్నో వస్తువులు తయారవుతున్నాయి. వాటి క్రొవ్వుతో నూనె తయారవుతోంది. వాటి చర్మాలతో ఖరీదైన వస్తువులు చేయబడుతున్నాయి. వాటి పేడ ఎరువుగా ఉపయోగపడుతోంది.

76. దైవానుగ్రహాల పట్ల వారి కృతఘ్నతా భావానికి వారి ఈ వైఖరి ఒక మచ్చుతునక. వారు లబ్ది పొందుతున్న ఈ అనుగ్రహాలన్నీ వాస్తవానికి దైవప్రసాదితాలే. దానికి ప్రతిగా వారు నిజ దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాల్సింది. అంటే ఆయన్నే పూజించి, ఆయనకే విధేయులై ఉండాల్సింది. కాని వాళ్లు చేస్తున్నదేమిటీ? దైవేతరులపై ఆశలు పెంచుకుని, వారిని ఆశ్రయిస్తున్నారు.

77. **'జుందున్'** (جُندٌ) అంటే ఇక్కడ దైవేతరుల (విగ్రహాల)కు అండగా నిలిచి, వారి తరఫున వకాల్తా పుచ్చుకోవటం అని భావం. **'ముహ్‌జరూన్'** (مُّحْضَرُونَ) అంటే ఇహలోకంలో వారిని వెన్నంటి ఉండేవారు అన్నమాట! వారు పూజిస్తున్న

**79** (వారికి) సమాధానం ఇవ్వు : "వాటిని తొలిసారి సృష్టించిన వాడే (మలిసారి కూడా) బ్రతికిస్తాడు.[78] ఆయన అన్ని రకాల సృష్టి ప్రక్రియను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు."

قُلْ يُحْيِيهَا الَّذِي أَنْشَأَهَا أَوَّلَ مَرَّةٍ ۖ وَهُوَ بِكُلِّ خَلْقٍ عَلِيمٌ ﴿٧٩﴾

**80** ఆయనే మీ కోసం పచ్చని చెట్టు నుంచి అగ్నిని సృష్టించాడు. మరి మీరిప్పుడు దాంతో నిప్పును రాజేస్తున్నారు.[79]

الَّذِي جَعَلَ لَكُمْ مِنَ الشَّجَرِ الْأَخْضَرِ نَارًا فَإِذَا أَنْتُمْ مِنْهُ تُوقِدُونَ ﴿٨٠﴾

**81** భూమ్యాకాశాలనే పుట్టించినవాడు వీరిలాంటివారిని (తిరిగి) పుట్టించలేడా?[80] ఎందుకు పుట్టించలేడు? ఆయనే అన్నీ తెలిసిన సృష్టికర్త.

أَوَلَيْسَ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ بِقَادِرٍ عَلَىٰ أَنْ يَخْلُقَ مِثْلَهُمْ ۚ بَلَىٰ وَهُوَ الْخَلَّاقُ الْعَلِيمُ ﴿٨١﴾

**82** ఆయన ఎప్పుడైనా, ఏదైనా వస్తువును చేయ సంకల్పించుకుని 'అయిపో' అని ఆదేశించగానే అది అయిపోతుంది.[81]

إِنَّمَا أَمْرُهُ إِذَا أَرَادَ شَيْئًا أَنْ يَقُولَ لَهُ كُنْ فَيَكُونُ ﴿٨٢﴾

**83** కనుక – ఎవరి చేతుల్లోనయితే సమస్త వస్తువుల సర్వాధికార ముందో[82] ఆ అల్లాహ్ పరమ పవిత్రుడు. మీరంతా ఆయన వద్దకే మరలిపోవలసి ఉంది సుమా![83]

فَسُبْحَانَ الَّذِي بِيَدِهِ مَلَكُوتُ كُلِّ شَيْءٍ وَإِلَيْهِ تُرْجَعُونَ ﴿٨٣﴾

---

విగ్రహాలు వారికెలాగూ సహాయపడటం లేదు. తమ స్వయానికి సయితం సహాయం చేసుకోలేని నిస్సహాయులు తమ భక్తులకు ఎలా సహాయం చేయగలరు? దారినపోయే దానయ్య లెవరయినా వాటిని దూషించినా, ఖండించినా అవి సమాధానం కూడా ఇవ్వలేవు. అయితే వాటిని అంటిపెట్టుకుని ఉండే ఈ పూజారులు మాత్రం తమ చిల్లర దేముళ్ళ తరఫున వకాల్తా పుచ్చుకుని 'సమాధానం' ఇస్తారన్నమాట!

78. ఎంతో అల్పమైన వీర్యబిందువుతో మనిషిని పుట్టించిన దేవుడు మళ్లీ అతన్ని బ్రతికించి నిలబెట్టలేడా? మరణించిన వానిని తిరిగి బ్రతికించే అతని శక్తి సామర్థ్యాలకు సంబంధించిన ఒక సంఘటన హదీసులో వచ్చింది. దాని ప్రకారం ఒక వ్యక్తి మరణించే సమయంలో తన వారిని పిలిచి, తాను మరణించిన తరువాత తనను కాల్చి సగం బూడిదను సముద్రంలో కలపాలనీ, మిగిలిన సగం బూడిదను గాలి వేగంగా వీచిన రోజున గాల్లో ఎగురవేయాలని గట్టిగా తాకీదు చేశాడు (అతని వారసులు అతను చెప్పినట్లే చేశారు). కాని అల్లాహ్ ఆ బూడిదనంతటినీ ఒకచోట చేర్చి అతన్ని బ్రతికించిన పిదప "నువ్వు ఎందుకిలా చేశావు?" అని అడిగాడు. "నీకు భయపడి ఇలా చేశాన"ని అతను బదులిచ్చాడు. అంతే! అల్లాహ్ అతని తప్పుల్ని క్షమించివేశాడు (సహీహ్ బుఖారీ – అల్ అంబియా వ(రి)ఖాఫ్).

79. అరేబియాలో **'మర్ఖ్', 'అఫార్'** అనే రెండు వృక్షాలున్నాయని, ఆ రెండు వృక్షాల కర్రలను పరస్పరం రాజేస్తే నిప్పు పుడుతుందని ప్రతీతి. ఆ నేపథ్యంలోనే ఈ ఆయతు వచ్చిందని కూడా అనబడుతోంది.

80. **"వీరిలాంటి వారు"** అంటే మనుషులన్నమాట! భూమ్యాకాశాల సృజన మామూలు విషయం కాదు. అంతటి గొప్ప సృష్టిని చేసినవానికి చనిపోయిన మనుషులను తిరిగి బ్రతికించటం ఏమాత్రం కష్టతరం కాదు. అలవోకగా ఆయన ఈ పనిచేస్తాడు. ఆ మాటే మరోచోట ఈ విధంగా అనబడింది : "మానవులను సృష్టించటం కంటే భూమ్యాకాశాలను సృష్టించటం ఎంతో గొప్ప విషయం" (అల్ మోమిన్ – 57). అహ్ఖాఫ్ సూరా 33వ వచనంలో కూడా ఈ విషయమే చెప్పబడింది.

81. అంతటి ప్రతిభావంతుడాయన! అటువంటి ఘనాఘనుడికి మానవులందరినీ తిరిగి బ్రతికించటం ఏపాటి?

82. అరబీలో **'మలకూత్' (مَلَكُوتُ)** అనే పదం ఉంది. 'ముల్క్' అన్నా, మలకూత్ అన్నా దాదాపు ఒకే అర్థం వస్తుంది. ఆధిక్యతాభావం కోసం ఇలా (మలకూత్) అనబడిందని మరికొందరు వ్యాఖ్యానించారు (ఫతహుల్ ఖదీర్).

83. మీరు భూమిలో పాతిపెట్టబడి, మీ శరీరం మట్టిలో కలసిపోయినంత మాత్రాన మీ ఉనికి శాశ్వతంగా సమసిపోదు. పైగా మీ శరీరానికి మళ్లీ ఒక ఉనికి ప్రసాదించబడుతుంది. మీరు ఎక్కడికో పారిపోయి, ఎవరినో ఆశ్రయించవచ్చని అనుకుంటున్నారేమో! ఎటుపోయినా, ఏ స్వామిని ఆశ్రయించినా కడకు రావలసింది ఆ నిజ దేవుని సన్నిధికే. అక్కడ వారి కర్మలను బట్టి పుణ్యఫలమో, పాపఫలమో ఇవ్వబడుతుంది.

37 వ సూరా

# అస్ సాఫ్ఫాత్

## పంక్తులు

అవతరణ మక్కాలో

ఆయతులు 182

## పరిచయం

ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, మరణించిన వారిని మళ్ళీ లేపి నిలబెట్టడం, శిక్ష బహుమానాలు వంటి మౌలిక ధార్మిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో ఉన్న పంక్తులు తీరినవారు అన్న ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. పంక్తులు తీరిన దైవదూతలను గురించి ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. దేవుడొక్కడే అని ఇక్కడ ప్రమాణపూర్వకంగా నొక్కి చెప్పడం జరిగింది. దైవదూతలు హోదా రీత్యా మానవుల కన్నా ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ, వారు అల్లాహ్ పట్ల విధేయత చూపుతూ వినమ్రంగా అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆయన ఔన్నత్యాన్ని స్తుతిస్తూ, ఆయన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారని చెప్పడం జరిగింది. ఈ సూరాలో కంటికి కనబడని ప్రాణులైన జిన్నుల గురించి కూడా చెప్పడం జరిగింది. (వారిలో కొందరు ముస్లిములు అంటే దేవునికి స్వయంసమర్పణ చేసుకున్నవారు, దైవం పట్ల విధేయత చూపేవారు, ఏకైక దేవుణ్ణి విశ్వసించేవారు, జిన్నులంటే అగ్నితో సృష్టించబడిన కంటికి కానరాని జీవులు). కాని కొన్ని సూరాల్లో జిన్నులలో కొందరు తిరస్కారవైఖరి అవలంబిస్తున్నవారని, బహిష్కృతులనీ, శాశ్వత శిక్షకు గురయ్యేవారని చెప్పడం జరిగింది. జిన్నుల గురించి అవిశ్వాసుల అభూతకల్పనలను ఈ వాక్యాలు ఖండించాయి. జిన్నులు అల్లాహ్‌కు సంబంధించిన వారని, ఆయన మాదిరిగానే సమస్తం తెలిసినవారని అవిశ్వాసులు చెప్పే మాటలను ఈ వాక్యాలు స్పష్టంగా ఖండించాయి. అవిశ్వాసులు చెప్పే ఈ మాటలేవి అల్లాహ్‌కు వర్తించేవి కావని విశదంగా చెప్పడం జరిగింది.

ఈ సూరాలో క్లుప్తంగా గతకాలాలకు చెందిన ప్రవక్తల గాధలను ప్రస్తావించడం జరిగింది. దృఢచిత్తం, దైవవిధేయత, అల్లాహ్ కోసం త్యాగాలు చేసే వైఖరి, కష్టాలను సహించే ఓరిమి గురించిన హితబోధ చేయడానికి ఈ ప్రవక్తల గాధలను తెలియజేయడం జరిగింది. ఏకదైవారాధన సత్యాన్ని ప్రచారం చేయడానికి వారు అనుభవించిన కష్టాలు, వారి సంఘర్షణ గురించి ప్రస్తావించడం జరిగింది. దుర్మార్గులకు, చెడులకు వ్యతిరేకంగా వారు జరిపిన పోరాటాన్ని ఈ సూరా తెలిపింది. నూహ్ (అస), ఇబ్రాహీమ్ (అస), మూసా (అస) ఆయన సోదరుడు హారూన్ (అస), ఎలిజా (అస), లూత్ (అస), యూనుస్ (అస)ల గాధలు ఇందులో ప్రస్తావనకు వచ్చాయి.

## అస్ సాఫ్ఫాత్ సూరా

## سُوْرَةُ الصّٰفّٰتِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 వరుస తీరి నిలబడేవారి (దైవ దూతల) తోడు!

وَالصّٰٓفّٰتِ صَفًّا ۝١

2 మరి తీవ్రంగా మందలించేవారి తోడు!

فَالزّٰجِرٰتِ زَجْرًا ۝٢

3 మరి (అల్లాహ్) ఉపదేశాన్ని పఠించేవారి తోడు!

فَالتّٰلِيٰتِ ذِكْرًا ۝٣

4 నిస్సందేహంగా మీరందరి ఆరాధ్య దైవం ఒక్కడే.[1]

اِنَّ اِلٰهَكُمْ لَوَاحِدٌ ۝٤

5 (ఆయన) ఆకాశాలకు, భూమికి, వాటి మధ్యనున్న సమస్త వస్తువులకు ప్రభువు, సూర్యోదయ బిందువులకు ప్రభువు.[2]

رَبُّ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَمَا بَيْنَهُمَا وَرَبُّ الْمَشَارِقِ ۝٥

6 మేము సమీప ఆకాశాన్ని నక్షత్రాల (అందం)తో ముస్తాబు చేశాము.

اِنَّا زَيَّنَّا السَّمَآءَ الدُّنْيَا بِزِيْنَةِ ِۨالْكَوَاكِبِ ۝٦

7 తలబిరుసు అయిన ప్రతి షైతాను బారి నుంచి దాన్ని కాపాడాము.[3]

وَحِفْظًا مِّنْ كُلِّ شَيْطٰنٍ مَّارِدٍ ۝٧

1. **సాఫ్ఫాత్, జాజిరాత్ (الزّٰجِرٰتِ), తాలియాత్** – ఈ మూడు పదాలు కూడా దైవదూతల్ని ఉద్దేశించి చెప్పబడినవే. వీరు దైవారాధన కోసం ఆకాశాలలో వరుసలు తీరి నిలబడతారు లేదా దైవాజ్ఞ కోసం వరుసలు తీరి నిరీక్షిస్తూ ఉంటారు. దైవోపదేశం ఆధారంగా ప్రజలను హెచ్చరిస్తూ ఉంటారు లేదా దైవాజ్ఞలపై మేఘాలను నిర్ణీత ప్రదేశాలకు తరుముకుని పోతుంటారు. దైవగ్రంథాన్ని పారాయణం చేస్తుంటారు. ఇటువంటి దైవదూతలను సాక్ష్యంగా పెట్టి అల్లాహ్ చెప్పదలచిన ఒక ముఖ్య విషయం ఏమిటంటే మానవులందరి ఆరాధ్య దేవుడు ఒక్కడే – బహుదైవారాధకులు కల్పించుకున్నట్టుగా వారు అనేకమంది కానేకారు. ఏదన్నా ఒక విషయాన్ని నొక్కి వక్కాణించటానికి, ఆ విషయంలో ఎటువంటి సందేహానికి ఆస్కారం లేకుండా చేయడానికి 'ప్రమాణం' చేయటం జరుగుతుంది. 'దేవుని ఏకత్వం' విషయంలో ముష్రిక్కులు ఎన్నో వంకలు పెట్టేవారు. అందువల్ల అల్లాహ్ తన ఏకత్వాన్ని నొక్కి చెప్పటానికి అహోరాత్రులు తన ఆజ్ఞాపాలన కోసం సిద్ధంగా ఉండే దైవదూతలపై ప్రమాణం చేశాడు. భూమ్యాకాశాలలోని ప్రతి వస్తువూ అల్లాహ్‌దే. కాబట్టి ఆయన తనచేత సృష్టించబడిన ఏ వస్తువునయినా సాక్ష్యంగా పెట్టగలడు. ఆయన ఏం చేసినా చెల్లుతుంది. అయితే మానవులు మాత్రం అల్లాహ్‌పైగాక మరొకరి మీద ప్రమాణం చేయటం ధర్మసమ్మతం కాదు. పైగా అది హరామ్ (నిషిద్ధం). ఎవరిపైనయినా ప్రమాణం చేయటమంటే అతన్ని సాక్షిగా పెట్టడమే. అల్లాహ్ సాక్షిగా ఉండటమే శోభాయమానం. ఎందుకంటే రహస్య విషయాల జ్ఞాని అల్లాహ్ మాత్రమే.
2. సూర్యుడు ఉదయించే, అస్తమించే బిందువులను సూచించటానికి ఇలా అనబడి ఉండవచ్చు. తూర్పున సూర్యుడు అనుదినం ఒక సరికొత్త స్థలం నుంచి ఉదయించి, పశ్చిమాన ఓ కొత్త స్థలం వద్ద అస్తమిస్తాడని కొందరు వ్యాఖ్యానించారు. అర్– రహ్మాన్ సూరాలోని ఒక ఆయతును బట్టి రెండు తూర్పులు – రెండు పడమరలు ఉన్నాయని విదితమవుతోంది. శీతాకాలంలో సూర్యుడు ఉదయించి అస్తమించే తూర్పు పడమరల బిందువులు వేరు. వేసవి కాలంలో ఉదయించి అస్తమించే బిందువులు వేరు (ఫత్‌హుల్ ఖదీర్).
3. దిగువ ఆకాశాన్ని నక్షత్రాలతో అలంకరించటంలోని ఉద్దేశం కేవలం 'అందం' మాత్రమే కాదు. తలబిరుసులైన

8 పైలోకాల్లోని దైవదూతల (మాటల)ను వారు (షైతానులు) చెవియొగ్గి కూడా వినలేరు. (ఒకవేళ వారలా చేస్తే) అన్ని వైపుల నుంచీ విసరివేయబడతారు.

لَا يَسَّمَّعُونَ إِلَى الْمَلَإِ الْأَعْلَىٰ وَيُقْذَفُونَ مِن كُلِّ جَانِبٍ ⑧

9 తరిమివేయబడుతూ, మరియు వారి కొరకు శాశ్వతమైన శిక్ష కలదు.

دُحُورًا ۖ وَلَهُمْ عَذَابٌ وَاصِبٌ ⑨

10 ఒకవేళ వారిలో ఎవడయినా ఏదైనా ఒకటీ అరా మాటను ఎగరేసుకుపోయినట్లయితే తక్షణమే మండే ఒక అగ్నిజ్వాల అతన్ని వెంబడిస్తుంది.

إِلَّا مَنْ خَطِفَ الْخَطْفَةَ فَأَتْبَعَهُ شِهَابٌ ثَاقِبٌ ⑩

11 కాస్త వారిని అడిగి చూడు: వారిని సృష్టించటం కష్టతరమా? లేక (వారు గాకుండా) మేము చేసిన ఇతర సృష్టి కష్టతరమా?[4] మేము వారిని (మనుషులను) బంకమన్నుతో సృష్టించాము.[5]

فَاسْتَفْتِهِمْ أَهُمْ أَشَدُّ خَلْقًا أَم مَّنْ خَلَقْنَا ۚ إِنَّا خَلَقْنَاهُم مِّن طِينٍ لَّازِبٍ ⑪

12 కాదు, నువ్వేమో (వారి తిరస్కార వైఖరిపై) ఆశ్చర్యపోతుంటే, వారేమో ఎగతాళి చేస్తున్నారు.[6]

بَلْ عَجِبْتَ وَيَسْخَرُونَ ⑫

13 వారికి నచ్చజెప్పినపుడు ఏమాత్రం పట్టించుకోరు.

وَإِذَا ذُكِّرُوا لَا يَذْكُرُونَ ⑬

14 ఏదైనా మహిమను చూసినప్పుడు, దాన్ని వేళాకోళంగా తీసు కుంటారు.

وَإِذَا رَأَوْا آيَةً يَسْتَسْخِرُونَ ⑭

---

షైతానుల నుంచి దాన్ని రక్షించటం కూడా ఒక ముఖ్యోద్దేశమే. ఊర్ధ్వలోకాల్లోని ఏదైనా విషయాన్ని చాటుమాటుగా వినడానికి పైశాచికశక్తులు ప్రయత్నించినప్పుడు నక్షత్రాలు వాటిపై విరుచుకుపడతాయి. అలాంటి పరిస్థితుల్లో సాధారణంగా షైతానులు మాడి మసైపోతుంటారు. రానున్న ఆయతుల ద్వారానూ, హదీసుల ద్వారాను మనకు తెలిసేది అదే. రాత్రి చీకట్లలో ప్రజలకు మార్గదర్శకత్వం వహించే పనిని కూడా నక్షత్రాలు చేస్తుంటాయి. ఈ మూడు ఉద్దేశాలు తప్ప నక్షత్రాల వేరితర లక్ష్యాలను ఖుర్ఆన్ పేర్కొనలేదు.

4. మేము చేసిన ఆకాశాలు, భూమి తమ నిర్మాణం దృష్ట్యా ఎంతో గొప్పవి. సువిశాలమైనవి. వాటి గొప్పతనం, వాటి పనితనం ముందు వీళ్ల పుట్టుక ఏమాత్రం కష్టతరం కాదు. వీళ్లను తిరిగి బ్రతికించటం కూడా ఏమాత్రం కష్టమైన పనికాదు.

5. చూడబోతే మేము వీళ్ళ పితామహుడైన ఆదం (అలైహిస్సలాం)ను మట్టితో నిర్మించాము. మరలాంటప్పుడు ఈ మానవులు పరలోక జీవితం పట్ల ఎందుకింత విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు? కాస్త ఆలోచిస్తే వీళ్ల పుట్టుక అత్యంత అల్పమైన, బలహీనమైన వస్తువుతో జరిగిందన్న సంగతి ఇట్టే బోధపడుతుంది. అదే సమయంలో ఈ భువన భాండవాల నిర్మాణం వెనుక వారికన్నా ఎక్కువ దృఢమైన, గొప్పవైన వస్తువులు ఉపయోగించబడ్డాయి. ఈ యదార్థాన్ని వాళ్లు కూడా కాదనలేరు (ఫత్హుల్ ఖదీర్).

6. (ఓ ముహమ్మద్!) పరలోక జీవితాన్ని వారు త్రోసిపుచ్చుటంపై నువ్వు ఆశ్చర్యపోతుంటే, వారేమో గేలిచేస్తున్నారు. పరలోకం అసలెలా సంభవం? అని కొట్టిపారేస్తున్నారు.

**15** ఇంకా వారిలా అంటారు : "ఇది స్పష్టమైన మాయాజాలం తప్పు మరేమీ కాదు.[7]

وَقَالُوٓا۟ إِنْ هَٰذَآ إِلَّا سِحْرٌ مُّبِينٌ ﴿15﴾

**16** "ఏమిటీ, మేము మరణించి, మట్టిలో కలిసి, ఎముకలుగా మారిన తరువాత కూడా (మేము నిజంగానే) లేపబడతామా?

أَءِذَا مِتْنَا وَكُنَّا تُرَابًا وَعِظَٰمًا أَءِنَّا لَمَبْعُوثُونَ ﴿16﴾

**17** "మా పూర్వీకులైన మా తాతముత్తాతలు కూడానా? (వారు కూడా బ్రతికించబడతారా?)"

أَوَءَابَآؤُنَا ٱلْأَوَّلُونَ ﴿17﴾

**18** "అవును (లేపబడతారు). మీరు పరాభవంపాలు (కూడా) అవుతారు" అని నువ్వు వారికి చెప్పు.[8]

قُلْ نَعَمْ وَأَنتُمْ دَٰخِرُونَ ﴿18﴾

**19** అది ఒకే ఒక్క గద్దింపు మాత్రమే.[9] అంతే! వారు (బిక్క బోయి) దిక్కులు చూడటం మొదలెడతారు.[10]

فَإِنَّمَا هِىَ زَجْرَةٌ وَٰحِدَةٌ فَإِذَا هُمْ يَنظُرُونَ ﴿19﴾

**20** "అయ్యో! మా పాడుగాను! ఇదే ప్రతిఫలపు దినము (లాగుందే!)" అని అంటారు.

وَقَالُوا۟ يَٰوَيْلَنَا هَٰذَا يَوْمُ ٱلدِّينِ ﴿20﴾

**21** "మీరు ధిక్కరిస్తూ వచ్చిన తీర్పుదినం ఇదే"[11] (అని వారితో అనబడుతుంది).

هَٰذَا يَوْمُ ٱلْفَصْلِ ٱلَّذِى كُنتُم بِهِۦ تُكَذِّبُونَ ﴿21﴾

---

7. హితబోధను ఏకంగా త్రోసిపుచ్చటం వాళ్ళకు హాబీగా మారిపోయింది. విషయాన్ని ఆధారాలతో వివరిస్తే లేదా మహిమలను ప్రదర్శిస్తే దాన్ని ఇంద్రజాలం అని చెప్పి దాటవేస్తారు.

8. దివ్య ఖుర్ఆన్‌లో ఇతర చోట్ల చెప్పబడినట్లు : 1. "వారందరూ ఆయన దర్బారులో నిస్సహాయ స్థితిలో హాజరవుతారు" (నమల్ – 87). 2. "నా ఆరాధన పట్ల అహంకారం ప్రదర్శించిన వారు త్వరలోనే అవమానంపాలై నరకంలో ప్రవేశిస్తారు." (మోమిన్ – 60).

9. అంటే వారు అల్లాహ్ తరఫున అయిన ఒక్క ఆదేశం మేరకు ఇస్రాఫీల్ (అలైహిస్సలాం) అనే దైవదూత (రెండవసారి) శంఖం ఊదగానే వారంతా సమాధుల నుంచి సజీవులై లేచివస్తారు.

10. అంటే వారి ముందు ప్రళయదినపు భీకర దృశ్యాలు, మహ్షర్ మైదానపు ఉగ్రస్థితి కదలాడుతూ ఉంటుంది. అందువల్ల వారు దిక్కుతోచని స్థితికి లోనవుతారు.

    శంఖారావాన్ని లేక అరుపుని 'జజ్‌రా' (గద్దింపు)గా పేర్కొనటం గమనార్హం. శంఖారావం ఉద్దేశం అదే గనుక ఆ విధంగా పేర్కొనటం జరిగింది.

11. **'వైల్'** అన్న పదం వినాశనం జరిగే సందర్భంలో ఉపయోగించబడుతుంది. తమ పరిణామం ఎలా ఉండబోతుందో అప్పటికే వారికి చాలా వరకు అర్థమైపోతుంది. అందుకే వారు "అయ్యో! మా దౌర్భాగ్యం!' అని అంటారు. ఆ మాటలో ఒకింత పశ్చాత్తాప భావన ఉంది. ఒప్పుకోలు కూడా ఉంది. కాని ఆ క్షణంలో బాధపడి ఏం లాభం? అందుకే వారికి సమాధానంగా దైవదూతలు లేక విశ్వాసులు చెబుతారు – "మీరు పదే పదే త్రోసి పుచ్చుతూ వచ్చిన తీర్పుదినం ఇదే" అని! బహుశా ఈ మాటను వారు పరస్పరం చెప్పుకుని ఉండవచ్చు.

**22** "దుర్మార్గులనూ,[12] వారితో జతకట్టినవారినీ,[13] వారు ఎవరెవరి
నయితే పూజించేవారో వారందరినీ[14] ప్రోగుచేయండి.

احْشُرُوا الَّذِينَ ظَلَمُوا وَأَزْوَاجَهُمْ وَمَا كَانُوا يَعْبُدُونَ ﴿22﴾

**23** అల్లాహ్‌ను వదలిపెట్టి (సుమా)! మరి వారందరికీ జ్వలించే
అగ్ని (నరకం) దారి చూపండి.

مِن دُونِ اللَّهِ فَاهْدُوهُمْ إِلَىٰ صِرَاطِ الْجَحِيمِ ﴿23﴾

**24** "అయితే కాస్త వాళ్ళను ఆపండి.[15] వారికి (కొన్ని ముఖ్యమైన)
ప్రశ్నలు వేయాల్సివుంది.

وَقِفُوهُمْ إِنَّهُم مَّسْئُولُونَ ﴿24﴾

**25** "అవును, మీకేమైపోయిందీ? (ఇప్పుడు) మీరు ఒండొకరికి
సహాయం చేసుకోవటం లేదేమిటి?" (అని వారు ప్రశ్నించబడ
తారు).

مَا لَكُمْ لَا تَنَاصَرُونَ ﴿25﴾

**26** అది కాదు. ఈ రోజు (వారందరూ) ఆత్మసమర్పణ చేసు
కున్నారు.

بَلْ هُمُ الْيَوْمَ مُسْتَسْلِمُونَ ﴿26﴾

**27** వారు ఒకరింకొకరి వైపు తిరిగి ('త్వం' అంటే 'త్వం' అని)
ప్రశ్నించుకోసాగారు.

وَأَقْبَلَ بَعْضُهُمْ عَلَىٰ بَعْضٍ يَتَسَاءَلُونَ ﴿27﴾

**28** "మీరు మా దగ్గరకు కుడి వైపు నుంచి వచ్చేవారు కదా![16]
(ఇప్పుడేమంటారు?)" అని అడుగుతారు.

قَالُوا إِنَّكُمْ كُنتُمْ تَأْتُونَنَا عَنِ الْيَمِينِ ﴿28﴾

**29** వారిలా సమాధానమిస్తారు : "అదేం కాదు. అసలు విశ్వాసం
అనేది మీలోనే లేకపోయింది.[17]

قَالُوا بَل لَّمْ تَكُونُوا مُؤْمِنِينَ ﴿29﴾

---

12. అంటే షిర్క్‌కు, కుఫ్ర్‌కు, పెద్ద పెద్ద పాపాలకు పాల్పడిన వారిని సమీకరించమని దేవుని తరఫున ఆజ్ఞాపించబడుతుంది.

13. **"వారితో జత కట్టినవారు"** అంటే తిరస్కారంలో, బహుదైవోపాసనలో, ప్రవక్తలను ధిక్కరించటంలో వారితో కలిసి పనిచేసిన వారు అని ఒక అర్థం కావచ్చు. వారు జిన్నాతులు, షైతానులు అని మరికొందరు అభిప్రాయపడ్డారు. దుర్మార్గంలో వారితో సహకరించిన వారి భార్యలని మరికొంతమంది భావించారు. ఎందుకంటే ఆయతులో **"అజ్‌వాజహుమ్"** (أَزْوَاجَهُمْ) అనే పదం వచ్చింది.

14. వారు పూజించే ఇతరత్రా దేముళ్లు – వారు మనుషులైనా, విగ్రహాలైనా సరే – వారందరినీ వీళ్లను అవమానపరిచేందుకు సమీకరించటం జరుగుతుంది. అయితే వారు పూజించిన సజ్జనులను మాత్రం అల్లాహ్ వేరుపరుస్తాడు. ఇతరత్రా మిథ్యా దైవాలను మాత్రం ఆ దుర్మార్గులతో పాటే నరకానికి ఆహుతి చేస్తాడు.

15. నరకానికి ఆహుతి చేయకముందే వారి గురించి ఈ విధంగా ఆజ్ఞాపించబడుతుంది. ఎందుకంటే లెక్కలు తేలిన మీదటే వారు నరకానికి పోతారు.

16. అంటే – మేము చెప్పేదే ధర్మం, మేము సన్మార్గాన ఉన్నామని చెప్పేవారు కదా! ఇప్పుడేమంటారు?! అని ఒక అర్థం. అన్ని వైపుల నుంచీ మావద్దకు వచ్చారు కదా! అని మరొక అర్థం. "నేను వారి ముందు వైపు నుంచీ, వెనుక

**30** “మేమెలాంటి పెత్తనమూ మీపై చెలాయించలేదు. నిజానికి మీరే తిరుగుబాటు జనంగా వ్యవహరించారు.[18]

وَمَا كَانَ لَنَا عَلَيْكُم مِّن سُلْطَانٍ ۖ بَلْ كُنتُمْ قَوْمًا طَاغِينَ ﴿٣٠﴾

**31** “కనుక మన ప్రభువు వాక్కు ఇప్పుడు మనందరిపై రూఢీ అయిపోయింది. మనమంతా (శిక్షను) రుచి చూడవలసి ఉంది.

فَحَقَّ عَلَيْنَا قَوْلُ رَبِّنَا ۖ إِنَّا لَذَائِقُونَ ﴿٣١﴾

**32** “సరే, మేము మిమ్మల్ని దారి తప్పించాము. మేము సయితం స్వయంగా దారి తప్పినవారము”[19] (అని వారు జవాబు ఇస్తారు).

فَأَغْوَيْنَاكُمْ إِنَّا كُنَّا غَاوِينَ ﴿٣٢﴾

**33** కాబట్టి ఆ రోజు వారంతా శిక్షలో భాగస్తులవుతారు.[20]

فَإِنَّهُمْ يَوْمَئِذٍ فِي الْعَذَابِ مُشْتَرِكُونَ ﴿٣٣﴾

**34** మేము అపరాధుల పట్ల ఈ విధంగానే వ్యవహరిస్తాము.[21]

إِنَّا كَذَٰلِكَ نَفْعَلُ بِالْمُجْرِمِينَ ﴿٣٤﴾

**35** “అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడ”ని వారితో అన్నప్పుడు వారు అహంకారంతో విర్రవీగేవారు.[22]

إِنَّهُمْ كَانُوا إِذَا قِيلَ لَهُمْ لَا إِلَٰهَ إِلَّا اللَّهُ يَسْتَكْبِرُونَ ﴿٣٥﴾

---

వైపునుంచీ, కుడి వైపునుంచీ, ఎడమ వైపునుంచీ – అన్ని వైపుల నుంచీ వారి వద్దకు వచ్చి, వారిని మార్గభ్రష్టుల్ని చేస్తాను” (అల్ ఆరాఫ్ – 17) అని షైతాను చెప్పి ఉండటం గమనార్హం.

17. “ఆనాడు మీరు మీ ఇష్టప్రకారం విశ్వసించేందుకు నిరాకరించారు కదా! దానికి మమ్మల్ని తప్పు పడతారేమిటి?” అని వారి నాయకులు చెబుతారు.

18. నాయకులకు – వారి అనుయాయులకు మధ్య జరిగే ఈ సంవాదన దివ్య ఖుర్ఆన్‌లో పెక్కుచోట్ల పునరావృతం అవుతూ ఉంటుంది. ప్రళయదినాన–దైవసమక్షంలోనూ– నరకంలోనికి వెళ్ళిన తరువాత కూడా వారు పరస్పరం నిందించుకుంటారు. (వివరాలకు చూడండి: మోమిన్–47, 48; సబా – 31, 32; అల్ అహ్‌జాబ్ – 67, 68; ఆరాఫ్ – 38, 39).

19. మొదటేమో వారు అపమార్గం పట్టించలేదని దబాయించారు. అసలు మీ మీద మాకు ఏం అధికారముందని మేము మిమ్మల్ని పెడదారి పట్టించటానికి? అని కూడా అన్నారు. కాని ఇప్పుడేమో, తాము అపమార్గం పట్టించినమాట వాస్తవమేనని ఒప్పుకున్నారు. అయితే అపమార్గం పట్టించినందుకు మమ్మల్ని నిందించకండి. ఎందుకంటే మేము సయితం సన్మార్గాన లేము. మిమ్మల్ని కూడా మా సమూహంలో చేర్చుకున్నాము. మీరేమో సునాయాసంగా మా బుట్టలో పడిపోయారు అని అంటారు. షైతాన్ చెప్పినట్లే వారూ చెప్పారు. షైతాన్ ఏమన్నాడో చూడండి : “అసలు మీచేత బలవంతంగా ఏదైనా చేయించటానికి నాకు మీ మీద ఏదన్నా అధికారం ఉంటేకదా! నేనేమో నా దారివైపుకు మిమ్మల్ని పిలిచాను. అంతకు మించి మరేమీ చేయలేదు. మీరే నా పిలుపుకు స్పందించి వచ్చారు. కనుక ఇప్పుడు అనవసరంగా నన్ను నిందించకండి. మిమ్మల్ని మీరే నిందించుకోండి” (ఇబ్రాహీమ్ – 22వ వచనం ఆధారంగా).

20. ఎందుకంటే వారందరి నేరం కూడా ఒకే విధమైనది. షిర్క్ (బహుదైవారాధన), అరాచకం, చెడుగుల వ్యాప్తిలో వారంతా కలసికట్టుగా ఉండేవారు.

21. అంటే, అన్ని రకాల నేరస్తుల పట్ల కూడా మా వ్యవహారం కఠినంగానే ఉంటుంది. అందరూ మా శిక్షను అనుభవించాల్సిందే.

22. అంటే – ఇహలోకంలో! ‘ముస్లింల మాదిరిగానే మీరు కూడా కలిమా పఠించి గతంలో మీ ద్వారా జరిగిన

36 "పిచ్చిపట్టిన ఒక కవి చెప్పినంత మాత్రాన మేము మా పూజ్య దైవాలను వదులుకోవాలా?"[23] అని అనేవారు.

وَيَقُولُونَ أَئِنَّا لَتَارِكُوٓا۟ ءَالِهَتِنَا لِشَاعِرٍ مَّجْنُونٍۭ ﴿٣٦﴾

37 (కాదు కాదు) వాస్తవానికి అతను (ప్రవక్త) సత్యాన్నే తీసుకుని వచ్చాడు. దైవప్రవక్తలందరినీ (సత్యవంతులుగా) ధృవీకరిస్తు న్నాడు.[24]

بَلْ جَآءَ بِٱلْحَقِّ وَصَدَّقَ ٱلْمُرْسَلِينَ ﴿٣٧﴾

38 మీరు మాత్రం బాధాకరమైన శిక్షను చవిచూడటం ఖాయం.

إِنَّكُمْ لَذَآئِقُوا۟ ٱلْعَذَابِ ٱلْأَلِيمِ ﴿٣٨﴾

39 మీరు చేసుకున్న (పాపిష్టి) పనుల ప్రతిఫలమే మీకు ఇవ్వ బడుతుంది.[25]

وَمَا تُجْزَوْنَ إِلَّا مَا كُنتُمْ تَعْمَلُونَ ﴿٣٩﴾

40 అయితే అల్లాహ్ ఎన్నుకున్న దాసులు మాత్రం[26] (ఆ శిక్ష నుంచి సురక్షితంగా ఉంటారు).

إِلَّا عِبَادَ ٱللَّهِ ٱلْمُخْلَصِينَ ﴿٤٠﴾

41 నిర్ధారిత ఆహారం వారికి ప్రత్యేకం.

أُو۟لَٰٓئِكَ لَهُمْ رِزْقٌ مَّعْلُومٌ ﴿٤١﴾

42 (అందులో రకరకాల) పండ్లు, ఫలాలు ఉంటాయి. వారు అపూర్వంగా సత్కరించబడతారు –

فَوَٰكِهُ ۖ وَهُم مُّكْرَمُونَ ﴿٤٢﴾

---

పాపాలపై పశ్చాత్తాపపడండి. తద్వారా మీరు ఇహపర లోకాలలో దైవాగ్రహం నుంచి రక్షించబడతారు' అని వారికి బోధపరచినప్పుడు ఆ మాటలను ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా అహంకారంతో పెట్రేగిపోయేవారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "జనులు 'లా ఇలాహ ఇల్లల్లాహ్'ను ఒప్పుకోనంతవరకూ వారితో యుద్ధం చేయమని నాకు ఆజ్ఞాపించబడింది. ఎవరయితే దీనిని ఒప్పుకున్నాడో అతను తన ధన ప్రాణాలను రక్షించు కున్నాడు." (ముత్తఫఖున్ అలైహి, మిష్కాత్ – కితాబుల్ ఈమాన్ – ఇబ్నె కసీర్ ఆధారంగా).

23. వాళ్లు అప్పటికే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారిని కవిగా, ఉన్మాదిగా అభివర్ణించి ఉన్నారు. ఆయన (స) పై అవతరించిన దివ్య ఖుర్ఆన్‌ను కవితా సంపుటిగా పేర్కొన్నారు. ఇప్పుడేమో, ఒక ఉన్మత్తుని ఉన్మాద పోకడలపై మేము మా పూజ్యదైవాలను వదులుకోవాలా? ఇదెలా సాధ్యం? అని అనసాగారు. వాస్తవానికి ఆయన (స)ది ఉన్మాదం కాదు, అది ఆయన తపన. ఆయన చెప్పేది కవిత్వం కాదు, అదొక వాస్తవం. ఆయన పిలుపును అనుసరించటంలో వారి వినాశం లేదు, వారి జీవనం ఉంది, మోక్షం ఉంది.

24. ఏమిటీ? మీరు మా ప్రవక్తను పిచ్చివాని క్రింద జమకడుతున్నారా? యదార్థానికి అతను మీకు వినిపించేది సత్యం. ఇంతకుముందు మా ప్రవక్తలందరూ తెచ్చిన సత్యసందేశాన్నే ఇతనూ తెచ్చాడు. మతి స్థిమితం లేని ఒక పిచ్చివాడుగానీ, ఊహాలోకాల్లో విహరించే ఒక కవి పుంగవుడుగానీ ఇంతటి ఖచ్చితమైన సత్య సమాచారాన్ని అందజేయగలడా?

25. నరకవాసులు నిలబడి, తమకు విధించబడిన శిక్ష చాలా అన్యాయమని పరస్పరం చెప్పుకుంటున్నప్పుడు ఈ మాట అనబడుతుంది – "ఇది అన్యాయం కాదు. నిష్పాక్షికమైన న్యాయం. ఎందుకంటే ఇది మీరు చేసుకున్న కర్మల ఫలమే."

26. వారు దైవకటాక్షం పొందినవారై ఉంటారు. వారివల్ల ఏదైనా చిన్నపాటి తప్పులు జరిగివుంటే అవి కూడా మన్నించ బడతాయి. వారు చేసిన ఒక్కో సత్కార్యానికి ఎన్నో రెట్ల పుణ్యఫలం ప్రసాదించబడుతుంది.

43 అను(గ్రహభరితమైన స్వర్గవనాలలో!

فِي جَنَّاتِ النَّعِيمِ ﴿43﴾

44 ఆసనాలపై ఎదురెదురుగా (ఆసీనులై) ఉంటారు.

عَلَىٰ سُرُرٍ مُّتَقَابِلِينَ ﴿44﴾

45 (ప్రవహించే మధువులా మధుపాత్రలు వారి ముందు పదే పదే సమర్పించబడుతూ ఉంటాయి.[27]

يُطَافُ عَلَيْهِم بِكَأْسٍ مِّن مَّعِينٍ ﴿45﴾

46 అదెంతో స్వచ్ఛంగా, సేవించేవారికి కమ్మగా ఉంటుంది.[28]

بَيْضَاءَ لَذَّةٍ لِّلشَّارِبِينَ ﴿46﴾

47 దానివల్ల (తల) నొప్పి రాదు, మతి చలించటం జరగదు.[29]

لَا فِيهَا غَوْلٌ وَلَا هُمْ عَنْهَا يُنزَفُونَ ﴿47﴾

48 వారి దగ్గర చూపులు క్రిందికి వాలి ఉండే పెద్ద పెద్ద కన్నులు గల మగువలు ఉంటారు.[30]

وَعِندَهُمْ قَاصِرَاتُ الطَّرْفِ عِينٌ ﴿48﴾

49 వారు చాలా జాగ్రత్తగా భద్రపరచబడిన గ్రుడ్డుల మాదిరిగా (కోమలంగా, స్వచ్ఛంగా) ఉంటారు.[31]

كَأَنَّهُنَّ بَيْضٌ مَّكْنُونٌ ﴿49﴾

50 మరి వారు (స్వర్గవాసులు) ఒండొకరి వైపుకు తిరిగి ప్రశ్నలు వేసుకుంటారు.[32]

فَأَقْبَلَ بَعْضُهُمْ عَلَىٰ بَعْضٍ يَتَسَاءَلُونَ ﴿50﴾

51 వారిలో ఒకతను ఇలా అంటాడు: "నాకొక స్నేహితుడుండే వాడు.

قَالَ قَائِلٌ مِّنْهُمْ إِنِّي كَانَ لِي قَرِينٌ ﴿51﴾

52 "అతను నాతో, 'ఏమిటీ? (ప్రళయ దినం వస్తుందని) ధృవీకరించే వారిలో నువ్వూ చేరిపోయావా?'[33] అని అనేవాడు.

يَقُولُ أَإِنَّكَ لَمِنَ الْمُصَدِّقِينَ ﴿52﴾

27. **'కాసున్'** (كَأس) అంటే నింపబడిన మధువు గిన్నెలు అని అర్థం. ఖాళీ గిన్నెను 'ఖిద్‌హున్' అంటారు. **'మయీన్'** (مَعِين) అంటే ప్రవహించే చెలమ అన్నమాట. అంటే ఎప్పుడూ ఎడతెగకుండా పారే మధువు ఏరులాగా నిత్యం వారి ముందు మధుపాత్రలు తేబడుతూ ఉంటాయి.

28. సాధారణంగా ప్రపంచంలోని మద్యం హానికరమైనదై ఉంటుంది. అది విభిన్న రంగుల్లో ఉంటుంది. వగరుగా, చేదుగా ఉంటుంది. శరీరానికి మత్తునిస్తుంది. ప్రమాదాలకు, అవాంఛనీయమైన ఘటనలకు కారణభూతంగా నిలుస్తుంది. కాని స్వర్గంలో ఇవ్వబడే మద్యంలో ఇలాంటి దుర్గుణాలేమీ ఉండవు.

29. ఇదీ స్వర్గంలోని మధువు ప్రత్యేకత!

30. వాలు కనులు, చారడేసి కళ్ళు స్త్రీ అందానికి నిదర్శనం. అంటే ఆ స్త్రీలు చాలా అందగత్తెలై ఉంటారు.

31. అంటే అన్నిరకాల కాలుష్యాల నుండి, చెడు వాతావరణం నుండి రక్షించబడిన స్త్రీలు, బిడియంతో చూపులు క్రిందికి వాలిన సౌందర్యవతులు అని భావం. నిప్పుకోడి తన గుడ్లను తన రెక్కలతో కప్పి ఉంచుతుంది. నిప్పుకోడి గుడ్లు ఎంతో అందంగా, తెల్లదనంలో అపురూపంగా ఉంటాయని ప్రతీతి. అందుకేనేమో స్వర్గంలోని స్త్రీలను సురక్షితంగా ఉంచబడిన గుడ్లతో పోల్చటం జరిగింది.

32. స్వర్గవాసులు స్వర్గంలో కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకుంటారు. వారు ఈ సందర్భంగా ప్రపంచంలో తమకు ఎదురైన అనుభవాలను కూడా నెమరువేసుకుంటారు.

**53** “ఏమిటి, మనం మరణించి, మట్టిలో కలిసి, ఎముకలుగా మారిపోయిన మీదట మాకు ప్రతిఫలం ఇవ్వబడుతుందా?” (అని అనేవాడు).[34]

ءَاِذَا مِتْنَا وَكُنَّا تُرَابًا وَّعِظَامًا ءَاِنَّا لَمَدِيْنُوْنَ ﴿53﴾

**54** “ఏం? మీరతన్ని తొంగిచూస్తారా?”[35] అంటాడు.

قَالَ هَلْ اَنْتُمْ مُّطَّلِعُوْنَ ﴿54﴾

**55** తొంగి చూడగానే అతను నరకం మధ్యలో (కాలుతూ) కనిపిస్తాడు.

فَاطَّلَعَ فَرَاٰهُ فِيْ سَوَآءِ الْجَحِيْمِ ﴿55﴾

**56** అతను (స్వర్గవాసి) ఇలా అంటాడు : “అల్లాహ్ సాక్షి! నువ్వు నన్ను కూడా నాశనం చేసి ఉండేవాడివే.

قَالَ تَاللّٰهِ اِنْ كِدْتَّ لَتُرْدِيْنِ ﴿56﴾

**57** “నా ప్రభువు అనుగ్రహమే గనక లేకుండా ఉంటే నేను కూడా (నేరస్తులుగా నరకానికి) పట్టి తేబడిన వారిలో ఉండే వాణ్ణి.[36]

وَلَوْلَا نِعْمَةُ رَبِّيْ لَكُنْتُ مِنَ الْمُحْضَرِيْنَ ﴿57﴾

**58 - 59** ఆ మొదటి చావే[37] తప్ప మనకిక చావులేదు[38] (అన్నది నిజమేనా?) మనకిక శిక్ష కూడా పడదట కదా! (ఇదీ నిజమేనా? అని స్వర్గవాసి తన తోటి సావాసులతో అంటాడు).”

اَفَمَا نَحْنُ بِمَيِّتِيْنَ ﴿58﴾
اِلَّا مَوْتَتَنَا الْاُوْلٰى وَمَا نَحْنُ بِمُعَذَّبِيْنَ ﴿59﴾

**60** నిస్సందేహంగా ఇదే గొప్ప సాఫల్యం.[39]

اِنَّ هٰذَا لَهُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿60﴾

---

33. తోటి మిత్రుణ్ణి ఎగతాళి చేస్తూ అతను అలా అనేవాడు. అసంభవం అయిన విషయాన్ని సంభవం అని ఎలా అనుకుంటున్నావ్? అన్నది అతని ఉద్దేశం.

34. అంటే–అంత జరిగిన తరువాత కూడా మమ్మల్ని తిరిగి లేపి, లెక్క తీసుకోబడుతుందా? ప్రతిఫలం కూడా ఇవ్వబడు తుందా? నీకు పిచ్చిగాని పట్టుకోలేదు కదా!? అన్న ధోరణి అతని మాటల్లో వ్యక్తమయ్యేది.

35. ఆ స్వర్గవాసి తన సాటి స్వర్గసహచరులతో అనే మాటలివి! మీరు కోరితే నేనతన్ని నరకంలోకి తొంగి చూస్తాను. అతను గనక కనిపిస్తే అతన్ని మీకు చూపిస్తాను అని అతనంటాడు.

36. తొంగిచూడగానే ఆ వ్యక్తి నరకం నడిబొడ్డులో కనిపిస్తాడు. అతన్నుద్దేశ్యించి స్వర్గవాసి, “ఇంకాస్త ఉంటే నన్ను కూడా పాడుచేసేసేవాడివి కదా! దేవుడు దయదలచబట్టి సరిపోయింది. లేకుంటే ఈ రోజు నేను కూడా నీతోపాటే దుర్భరస్థితిలో ఉండేవాణ్ణి” అని అంటాడు.

37. అది (ఆ మరణం) ప్రపంచంలోనే వచ్చింది. ఇక మనకు మరణంగానీ, శిక్షగానీ ఉండదు కదా!

38. నరకవాసుల స్థితిని చూసిన తరువాత ఆ స్వర్గవాసిలో భావుకత ఉప్పొంగుతుంది. ఒకింత ఈర్ష్యానందం కూడా కలుగుతుందతనిలో. మనకు లభించిన ఈ స్వర్గలోక అనుగ్రహాలు శాశ్వతమైనవి కావా? మనకు చావు అనేది ఉందా? అంటే ఇక మనకు చావు అన్నదే లేదు, ఈ స్వర్గలోక సుఖాలు శాశ్వితమైనవి. స్వర్గవాసులు కలకాలం స్వర్గంలో ఉంటారు, నరకవాసులు కలకాలం నరకంలో మ్రగ్గుతూ ఉంటారన్నది అతని మాటల్లోని మర్మం. మరణాన్ని ఒక పొట్టేలు రూపంలో స్వర్గ – నరకాల మధ్య తీసుకువచ్చి దాన్ని ‘జిబహ్’ చేయటం జరుగుతుందనీ, ఆ తరువాత ఇక మరణం అన్నదే ఉండదని హదీసు ద్వారా కూడా రూఢీ అవుతోంది.

61 ఇటువంటి దాని (సాఫల్యం) కోసం పని చేసేవారు పని చేయాలి.[40]
لِمِثْلِ هٰذَا فَلْيَعْمَلِ الْعٰمِلُوْنَ ﴿٦١﴾

62 ఈ ఆతిథ్యం మంచిదా? లేక జఖ్ఖూమ్ (నరకంలోని జెముడు) వృక్షం (మంచిదా?)[41]
اَذٰلِكَ خَيْرٌ نُّزُلًا اَمْ شَجَرَةُ الزَّقُّوْمِ ﴿٦٢﴾

63 దానిని మేము దుర్మార్గుల కోసం పరీక్షగా చేసి ఉంచాము.[42]
اِنَّا جَعَلْنٰهَا فِتْنَةً لِّلظّٰلِمِيْنَ ﴿٦٣﴾

64 నిశ్చయంగా ఆ వృక్షం వేరు నరకం వేరు (అట్టడుగు భాగం) నుంచి మొలకెత్తుతుంది.[43]
اِنَّهَا شَجَرَةٌ تَخْرُجُ فِيْۤ اَصْلِ الْجَحِيْمِ ﴿٦٤﴾

65 దాని పండ్ల గుత్తులు షైతానుల తలల మాదిరిగా ఉంటాయి.[44]
طَلْعُهَا كَاَنَّهٗ رُءُوْسُ الشَّيٰطِيْنِ ﴿٦٥﴾

66 మరి (నరకవాసులు) దాన్నుంచే తింటారు. దాంతోనే తమ పొట్టలు నింపుకుంటారు.[45]
فَاِنَّهُمْ لَاٰكِلُوْنَ مِنْهَا فَمَالِـُٔوْنَ مِنْهَا الْبُطُوْنَ ﴿٦٦﴾

67 మరి దానిపైన సలసలా కాగే నీళ్లు త్రాగేందుకు ఇవ్వబడ తాయి.[46]
ثُمَّ اِنَّ لَهُمْ عَلَيْهَا لَشَوْبًا مِّنْ حَمِيْمٍ ﴿٦٧﴾

39. ఎందుకంటే నరకాగ్ని నుంచి కాపాడబడటం, స్వర్గంలోని భోగభాగ్యాలకు అర్హులుగా ఖరారు కావటం కంటే గొప్ప సాఫల్యం ఏదీ లేదు.

40. ఇలాంటి గొప్ప అనుగ్రహం కోసం పాటుబడదలచిన వారు నిర్విరామంగా పాటు పడాలి. ఎందుకంటే ఈ వర్తకం లాభదాయకమైనది. ప్రాపంచిక వర్తకాల మాదిరిగా ఇది తాత్కాలికమైనదిగానీ, నష్టకరమైనదిగానీ కాదు.

41. **'జఖ్ఖూమ్'** (الزَّقُّوْمِ) అంటే దుర్వాసనగలది, మ్రింగటానికి భరించరానిదిగా ఉండేది అని అర్థం. ఆ చెట్టు కాయలు తినాలంటే నరకవాసులకు ప్రాణం మీదికి వస్తుంది. ఎందుకంటే అవి అత్యంత దుర్భరంగానూ, చేదుగానూ, కంపుకొడుతూ ఉంటాయి. అది ప్రపంచంలోని చెట్టేనని, అరబ్బువాసులకు ఆ చెట్టు గురించి తెలుసునని, అది తహామాలో లభ్యమయ్యే ఖుత్‌రబ్ చెట్టు అని కొందరు వ్యాఖ్యానించారు. అయితే ఈ చెట్టు ప్రపంచంలో ఎక్కడా లేదని, ప్రపంచవాసులకు దీని గురించి బొత్తిగా తెలీదని మరికొందరు అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్). ఈ రెండింటిలో మొదటి మాటే ఎక్కువ సరైనది. ఆ వృక్షాన్ని తెలుగులో జెముడు వృక్షంగా వ్యవహరిస్తారు.

42. **'పరీక్ష'** అని ఎందుకనబడిందంటే ఆ ఫలాన్ని తినటమే ఓ పెద్ద పరీక్ష. నరకంలో నలువైపులా అగ్ని ఉండగా, అక్కడ ఏ చెట్టు ఫలమైనా ఎలా ఉంటుంది? అని సందేహపడేవారి కోసం అల్లాహ్ దీన్ని 'పరీక్ష'గా పెట్టి ఉండవచ్చని ఒక అభిప్రాయం ఉంది. ఈ వాక్యంలో **'దుర్మార్గులు'** అంటే తప్పనిసరిగా నరకానికి ఆహుతి అయ్యేవారని భావం.

43. అంటే ఆ చెట్టు వేరు నరకంలోని అట్టడుగు భాగాన ఉంటుంది. అయితే దాని కొమ్మలు, రెమ్మలు నరకంలో నలువైపులా విస్తరించి ఉంటాయి.

44. అంటే ఆ చెట్టు అంత అసహ్యంగా, భయంకరంగా ఉంటుందని భావం. అందుకే దాన్ని షైతానుల తలలతో పోల్చటం జరిగింది.

45. దాన్ని వారు గత్యంతరం లేక మ్రింగుతారు. ఎందుకంటే ఆకలి తీర్చుకోవటానికి వారికి వేరే మార్గాంతరం ఉండదు. అది తిన్న తర్వాత వారి కడుపులు బరువుగా అనిపిస్తాయి.

| | |
|---|---|
| 68 మరి వారంతా తరలించబడేది మండే (నరక) అగ్ని వైపునకే.[47] | ثُمَّ إِنَّ مَرْجِعَهُمْ لَإِلَى الْجَحِيمِ ﴿٦٨﴾ |
| 69 తమ తాతముత్తాతలను వీరు భ్రష్టమార్గంలో నడుస్తుండగా చూశారు. | إِنَّهُمْ أَلْفَوْا آبَاءَهُمْ ضَالِّينَ ﴿٦٩﴾ |
| 70 అయినప్పటికీ వారి పాద చిహ్నాలలోనే పరుగులు తీశారు.[48] | فَهُمْ عَلَىٰ آثَارِهِمْ يُهْرَعُونَ ﴿٧٠﴾ |
| 71 వీరికి మునుపు కూడా ఎందరో పూర్వీకులు పెడదారి పట్టి ఉన్నారు.[49] | وَلَقَدْ ضَلَّ قَبْلَهُمْ أَكْثَرُ الْأَوَّلِينَ ﴿٧١﴾ |
| 72 వాళ్ల మధ్య కూడా మేము హెచ్చరించే వారిని పంపి ఉన్నాము.[50] | وَلَقَدْ أَرْسَلْنَا فِيهِم مُّنذِرِينَ ﴿٧٢﴾ |
| 73 మరి హెచ్చరించబడిన వారికి పట్టిన గతేమిటో నువ్వే చూడు! | فَانظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُنذَرِينَ ﴿٧٣﴾ |
| 74 అల్లాహ్ ఎన్నుకున్న దాసులు తప్ప.[51] (వారు మాత్రం ఆ దుష్పరిణామం నుంచి రక్షించబడ్డారు). | إِلَّا عِبَادَ اللَّهِ الْمُخْلَصِينَ ﴿٧٤﴾ |

46. చేదు ఫలాలను మ్రింగిన తరువాత వారికి నీరు త్రాగాలనిపిస్తుంది. అప్పుడు వారికి సలసలా కాగే నీరు ఇవ్వబడుతుంది. దాన్ని త్రాగగానే వారి ప్రేగులు తెగిపోతాయి (ముహమ్మద్ – 15 ఆధారంగా).

47. జఖ్ఖూమ్ చెట్టు కాయలు తిని, వేడి నీరు త్రాగిన తరువాత వాళ్ళను మళ్లీ నరకంలోకి నెట్టివేయటం జరుగుతుంది.

48. ఇంతకీ వారిని నరకానికి ఎందుకు ఆహుతి చేయటం జరిగిందో చెప్పబడింది – తమ తాతముత్తాతలు దుర్మార్గంపై ఉన్నారన్న విషయాన్ని వారు తెలుసుకుని కూడా, వాళ్ల అడుగుజాడల్లోనే నడిచారు. ప్రమాణబద్ధమైన విషయం ముందుకు వచ్చేసిన మీదట కూడా పూర్వీకుల మాటపైనే గుడ్డిగా నడిచారు.

**'ఇహ్రా'** అంటే పరుగెత్తటం, ఆబగా ఎగబడి మరీ పట్టుకోవటం, ఒక పద్ధతిని అవలంబించటం అనే అర్థాలు వస్తాయి.

49. వీళ్లు మాత్రమే మార్గభ్రష్టులు కారు. వీరికి మునుపు గతించిన వీళ్ళ పూర్వీకుల్లో కూడా చాలామంది మార్గవిహీనతకు లోనై ఉండేవారు.

50. అంటే వీరి పూర్వీకుల్లో అన్నమాట! మా ప్రవక్తలు వారికి కూడా సత్యవాక్కును అందజేశారు. వారి మాటను త్రోసిపుచ్చినప్పుడు దైవశిక్ష గురించి పదే పదే హెచ్చరించారు. కాని ఆ దుర్మార్గులు మా ప్రవక్తల మాటను ఖాతరు చేయలేదు. తత్ఫలితంగా మేము వారిపై మా కొరడాను ఝుళిపించక తప్పలేదు. వారికి పట్టిన దుర్గతి గురించి తరువాయి ఆయతులో వివరించబడింది.

51. అల్లాహ్ తరపున విశ్వాస భాగ్యాన్ని, సదాచరణ సద్బుద్ధిని పొందిన సజ్జనులు మాత్రమే ఆ విపత్తు నుండి సురక్షితంగా ఉండగలిగారు. అలాంటి సజ్జన దాసులను ఇక్కడ **'ముఖ్లసీన్' (مُخْلَصِين)**గా వ్యవహరించటం జరిగింది. నాశనం చేయబడిన వారిని **'మున్జరీన్'** (مُنذَرِين) (హెచ్చరించబడినవారు) అనటం జరిగింది. ఇక **'మున్జిరీన్'** (హెచ్చరించే వారు – దైవప్రవక్తలు) గురించి సంక్షిప్తంగా ముందు రాబోతోంది.

وَلَقَدْ نَادٰىنَا نُوحٌ فَلَنِعْمَ الْمُجِيبُونَ ﴿75﴾

**75** నూహ్ మమ్మల్ని పిలిచాడు. మరి మేము (పిలుపుకు) ఎంత చక్కగా బదులు పలుకుతామో[52] (చూడండి!)

وَنَجَّيْنٰهُ وَأَهْلَهُۥ مِنَ الْكَرْبِ الْعَظِيمِ ﴿76﴾

**76** మేము అతన్నీ, అతని ఇంటివారిని[53] ఆ ఘోరమైన ఆపద నుంచి కాపాడాము.

وَجَعَلْنَا ذُرِّيَّتَهُۥ هُمُ الْبٰقِينَ ﴿77﴾

**77** అతని సంతానాన్ని మాత్రమే మేము మిగిలి ఉండేలా చేశాము.[54]

وَتَرَكْنَا عَلَيْهِ فِى الْءَاخِرِينَ ﴿78﴾

**78** రాబోయే తరాల వారిలో అతని సత్కీర్తిని మిగిల్చి ఉంచాము.[55]

سَلٰمٌ عَلٰى نُوحٍ فِى الْعٰلَمِينَ ﴿79﴾

**79** సమస్త లోకాలలో నూహుపై శాంతి కలుగుగాక!

إِنَّا كَذٰلِكَ نَجْزِى الْمُحْسِنِينَ ﴿80﴾

**80** సద్వర్తనులకు మేము ఇలాగే ప్రతిఫలం ప్రసాదిస్తాము.[56]

52. 950 సంవత్సరాల సుదీర్ఘ కాలం ధర్మ సందేశ ప్రచారం చేసినప్పటికీ ఆ జాతి వారిలో అత్యధికులు నూహ్ (అలైహిస్సలాం) మాటను ధిక్కరించారు. ఇక వారు దారికి వస్తారన్న ఆశలన్నీ అడుగంటిపోయిన తరువాత దైవప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) తన ప్రభువును విన్నవించుకున్నారు – "ప్రభూ! నేను నిస్సహాయస్థితిలో ఉన్నాను. నాకు సహాయపడు!" అని (అల్ ఖమర్ – 10). అప్పుడు మేము నూహు ప్రార్థనను ఆలకించి, అతని జాతి వారిని జలప్రళయంలో ముంచివేశాము.

53. అరబీలో **'అహ్లహు'** (أَهْلَهُ) అని వచ్చింది. దానికి అతని కుటుంబీకులు అని అసలు అర్థం. అయితే ఈ ఆయతులో మాత్రం అతని సందేశాన్ని స్వీకరించి, అతని పరివారంలో చేరిన విశ్వాసులు అని అర్థం. ఈ ధన్యజీవులు మొత్తం 80 మంది అనీ, వారిలో ఆయన భార్య, ఆయన కుమారుడు మాత్రం లేరనీ, వారిద్దరూ విశ్వసించలేదని, వారిద్దరూ ముంపుకు గురయ్యారని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. **'కర్బున్ అజీమ్'** అంటే మహా విపత్తు, ఘోరకలి అన్న అర్థాలు వస్తాయి. నూహు కాలంలో వచ్చిన జలప్రళయం నేపథ్యంలో ఈ పదం వాడబడింది.

54. ఖుర్ఆన్ వ్యాఖ్యాతలలో అత్యధికుల అభిప్రాయం ప్రకారం నూహ్ (అలైహిస్సలాం)కు ముగ్గురు కొడుకులు. వారిపేర్లు 1. హామ్ 2. సామ్ 3. యాఫిస్. ఈ ముగ్గురు అన్నదమ్ములతోనే మానవజాతి పరంపర ముందుకు సాగింది. అందుకే హజ్రత్ నూహు (అలైహిస్సలాం)ను ద్వితీయ ఆదం (అలైహిస్సలాం)గా కూడా వ్యవహరిస్తారు. అంటే ఆదం తదనంతరం నూహ్ కూడా మానవుల పితామహుడుగా పిలువబడ్డారు. సామ్ ద్వారా అరబ్బులు, పారసీకులు, రోమనులు, యూదులు, నస్రానీలు పుట్టుకు వచ్చారు. హామ్ ద్వారా సూడానీలు (తూర్పు నుంచి పడమర వరకు) – అంటే ద్రావిడులు, అబిసీనియన్లు, ఖిబ్తీలు మొదలగువారు జన్మించారు. యాఫిస్ వంశం నుంచి తుర్కీలు, ఖజారులు, యాజూజ్ మాజూజ్‌లు (ఫత్‌హుల్ ఖదీర్). నిజము దేవుడెరుగు.

55. అంటే ప్రళయదినం వరకు వచ్చే విశ్వాసులలో నూహు కీర్తి ప్రతిష్ఠలను మిగిల్చి ఉంచాము. వారంతా నూహు (అలైహిస్సలాం)పై శాంతి కలుగాలని ప్రార్థిస్తున్నారు. ప్రార్థిస్తూ ఉంటారు.

56. ఏ విధంగానయితే మేము నూహ్ (అలైహిస్సలాం) వేడుకోలును ఆమోదించి అతని సంతతిని మిగిల్చి ఉంచామో, మరేవిధంగానయితే భావితరాల వారిలో అతని కీర్తి ప్రతిష్ఠలు నిలిచిపోయేలా చేశామో అదేవిధంగా సజ్జనులైన మా భక్తుల సచ్చరిత్రను కూడా మిగిల్చి ఉంచుతాము. మేము వారి కృషిని వృథా పోనివ్వము.

81 నిశ్చయంగా అతను విశ్వసించిన మా దాసులలోని వాడు.
إِنَّهُۥ مِنْ عِبَادِنَا ٱلْمُؤْمِنِينَ (81)

82 అటుపిమ్మట మేము ఇతరులను ముంచివేశాము.
ثُمَّ أَغْرَقْنَا ٱلْآخَرِينَ (82)

83 అతని (నూహ్) మార్గాన్ని అవలంబించిన వారిలో ఇబ్రాహీమ్ (కూడా) ఉన్నాడు.[57]
وَإِنَّ مِن شِيعَتِهِۦ لَإِبْرَٰهِيمَ (83)

84 అతను నిర్మల హృదయంతో తన ప్రభువు వద్దకు వచ్చి నప్పుడు...
إِذْ جَآءَ رَبَّهُۥ بِقَلْبٍ سَلِيمٍ (84)

85 (అతను) తన తండ్రితో, తన జాతి వారితో ఇలా అన్నాడు: "మీరు వేటిని పూజిస్తున్నారు?
إِذْ قَالَ لِأَبِيهِ وَقَوْمِهِۦ مَاذَا تَعْبُدُونَ (85)

86 "అల్లాహ్‌ను వదలి స్వయం కల్పిత ఆరాధ్యదైవాలను కోరు కుంటున్నారా?[58]
أَئِفْكًا ءَالِهَةً دُونَ ٱللَّهِ تُرِيدُونَ (86)

87 "ఇంతకీ సకల లోకాల ప్రభువు గురించి మీరేమనుకుంటు న్నారు?"[59]
فَمَا ظَنُّكُم بِرَبِّ ٱلْعَٰلَمِينَ (87)

88 తర్వాత అతను నక్షత్రాల వైపు ఒకసారి దృష్టిని సారించాడు.
فَنَظَرَ نَظْرَةً فِى ٱلنُّجُومِ (88)

89 "నేను రోగగ్రస్తుణ్ణి అయ్యాను" అన్నాడు.[60]
فَقَالَ إِنِّى سَقِيمٌ (89)

57. **'షీఅతున్'** అంటే వర్గం, అనుయాయి అన్న అర్థాలు వస్తాయి. అంటే ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) బోధించిన జీవన విధానం కూడా నూహ్ (అలైహిస్సలాం) గారి విధానమే. అదే ఏకదైవారాధన విధానం. నూహు (అలైహి) లాగానే, ఇబ్రాహీం (అలైహి)కు కూడా దేవుని వైపు మరలే సౌభాగ్యం లభించింది.

58. చూడబోతే ఈ విగ్రహాలు మీరు మీ స్వహస్తాలతో నిర్మించుకున్నవి. అంటే మీరు కల్పించుకున్నవి. అవి దైవాలు కావన్న సంగతి మీకూ తెలుసు. అయినప్పటికీ మీరు మీ నిజదైవాన్ని వదిలేసి, ఈ కాల్పనిక దేముళ్ళను ఆశ్రయించారేమిటి? ఈ రాతి విగ్రహాలు మీకు ఒరగబెట్టేదేమిటి?

59. ఇంతటి దారుణానికి పాల్పడిన తరువాత కూడా మీరు ఆ సర్వోన్నత ప్రభువు పట్టు నుంచి విముక్తి పొందగలమని అనుకుంటున్నారా?

60. ఆకాశం గురించి యోచనచేసే ఉద్దేశంతో అలా చూసి ఉంటాడు. లేదా తన జాతివారిని ఏమార్చే ఉద్దేశంతో ఆకాశం వంక చూసి ఉంటాడు. ఆ జాతి ప్రజలు ఊరి బయటికి వెళ్ళి జాతరలో పాల్గొనే రోజు జరిగిన సంఘటన ఇది! వారు ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను కూడా సంబరాలకు రమ్మని పిలిచారు. కాని ఇబ్రాహీం మాత్రం చాలా రోజులుగా అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తూ ఉన్నారు. వచ్చిన ఈ అవకాశాన్ని ఆయన వదలదలచుకోలేదు. రేపు తన జాతివారంతా జాతరకు వెళ్ళగానే తాను ముందుగా వేసుకున్న పథకాన్ని అమలుపరచాలని అనుకున్నారు. తనకు జబ్బు చేసిందనో లేక తనకు జబ్బు రానున్నదనో తన జాతి వారికి తెలియజెప్పేందుకు నక్షత్రాల వంక చూశారు. ఆ కాలంలో జనులు నక్షత్రాలను చూసి తమ అదృష్ట దురదృష్టాలను అంచనా వేసుకునేవారు.

'ఇబ్రాహీం అబద్ధం పలికారే!?' అన్న సందేహం ఎవరికయినా కలగవచ్చు. కాని అతను చెప్పింది అబద్ధం కూడా

| | |
|---|---|
| **90** అందువల్ల వారంతా ముఖం త్రిప్పుకుని, వెళ్ళిపోయారు. | فَتَوَلَّوْا عَنْهُ مُدْبِرِينَ ﴿٩٠﴾ |
| **91** అప్పుడతను (మెల్లగా) వారి దేవుళ్ళ వద్దకు వెళ్ళి, 'మీరు తినరేమిటి?'[61] అన్నాడు. | فَرَاغَ إِلَىٰ آلِهَتِهِمْ فَقَالَ أَلَا تَأْكُلُونَ ﴿٩١﴾ |
| **92** "అసలు మీకేమైపోయింది? మీరు కనీసం మాట్లాడరే?!" (అని అన్నాడు). | مَا لَكُمْ لَا تَنطِقُونَ ﴿٩٢﴾ |
| **93** ఆ తరువాత కుడిచేత్తో వాటిని (ఎడాపెడా) వాయించ సాగాడు.[62] | فَرَاغَ عَلَيْهِمْ ضَرْبًا بِالْيَمِينِ ﴿٩٣﴾ |
| **94** వారు (ఆ విగ్రహారాధకులు) అతని దగ్గరకు పరుగులు తీస్తూ వచ్చారు.[63] | فَأَقْبَلُوا إِلَيْهِ يَزِفُّونَ ﴿٩٤﴾ |
| **95** వారితో అతనిలా అన్నాడు: "ఏమిటి? మీరు (మీ స్వహస్తాలతో) చెక్కిన శిలలను పూజిస్తారా?" | قَالَ أَتَعْبُدُونَ مَا تَنْحِتُونَ ﴿٩٥﴾ |
| **96** "మరి (చూడబోతే) మిమ్మల్నీ, మీరు చేసిన వాటినీ సృష్టించిన వాడు అల్లాహ్‌యే కదా!"[64] | وَاللَّهُ خَلَقَكُمْ وَمَا تَعْمَلُونَ ﴿٩٦﴾ |

కాదు. ప్రతి మనిషీ అంతో ఇంతో అస్వస్థతకు లోనుకావటం సహజమే. అదలా ఉంచితే, తన జాతి ప్రజలు బహుదైవారాధనకు లోనై ఉండటాన్ని చూసి ఇబ్రాహీం (అలైహిస్సలాం) లోలోపలే కుమిలిపోయేవారు. ఆ మానసిక ఒత్తిడి ఆయనపై అనుదినం ఉండేది. ఆ కారణంగా హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తనకు ఒంట్లో బాగాలేదని చెప్పి, తనకు ఏకాంతం అవసరం అనే భావనను తన వారిలో కలిగించారు. ఆ విధంగా అది అబద్ధం అనిపించదు. కాని ఈ విషయాన్ని విన్నవారెవరయినా దీన్ని అబద్ధం అని అనుకునేందుకే ఎక్కువ ఆస్కారం ఉంది. అందుకే హదీసులో ఇబ్రాహీం (అలైహిస్సలాం) చెప్పిన మూడు అబద్ధాలలో దీన్ని కూడా అబద్ధంగానే అభివర్ణించటం జరిగింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అంబియా సూరాలోని 63వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడగలరు.

61. అంటే – ఆ విగ్రహాల ముందు భక్తులు సమర్పించుకున్న పండ్లు ఫలహారాలు, మిఠాయిలు యధాతథంగా పడి ఉండటం చూసి "మీరు ఏమీ తినరేమిటి? ఇవన్నీ మీ కోసమేకదా మీ భక్తులు సమర్పించినది!?" అని ఇబ్రాహీం ప్రశ్నించారు. కాని అవి తినలేవు. వినలేవు. పెదవి విప్పి పలకలేవు. కదలలేవు, మెదలలేవు. అందుకే ఇబ్రాహీం వేసిన ప్రశ్నలలో దేనికీ వాటి నుంచి సమాధానం రాలేదు.

62. అంటే తన శక్తినంతటినీ కూడదీసుకుని వాటిని పగులగొట్టడం మొదలెట్టాడు.

63. మూలంలో **'యజిఫ్ఫూన్'** (يَزِفُّونَ) అని ఉంది. 'యుస్‌రివూన' అన్న అర్థంలో ఈ పదం వాడబడింది. పరుగెత్తుకొచ్చారు అని దాని అర్థం. వారు జాతర నుంచి తిరిగి రాగానే తమ ఆలయంలోని విగ్రహాలు తునాతునకలై ఉండటం చూసి ఆందోళన చెందారు. తక్షణం వారికి ఇబ్రాహీంపై అనుమానం వచ్చింది. అందరూ అతన్ని చుట్టుముట్టి ప్రజాకోర్టులో హాజరుపరిచారు. వారి తెలివితక్కువతనాన్ని, వారు పూజించే దైవాల అశక్తతను అవగతం చేయటానికి ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు చక్కని అవకాశం దొరికింది.

97 వారిలా అన్నారు : "ఇతని కోసం ఓ కట్టడం (భారీ కొలిమి) నిర్మించండి. ఆ తరువాత ఇతన్ని మండే అగ్ని (గుండం)లో పడ వేయండి."

قَالُوا ابْنُوا لَهُ بُنْيَانًا فَأَلْقُوهُ فِي الْجَحِيمِ ﴿٩٧﴾

98 వారు అతనికి వ్యతిరేకంగా కుట్ర పన్నదలిచారు. అయితే మేము వారినే బోల్తా కొట్టించాము.[65]

فَأَرَادُوا بِهِ كَيْدًا فَجَعَلْنَاهُمُ الْأَسْفَلِينَ ﴿٩٨﴾

99 అతను (ఇబ్రాహీమ్) ఇలా అన్నాడు : "నేను నా ప్రభువు వైపుకే పోతాను.[66] ఆయన తప్పకుండా నాకు మార్గం చూపు తాడు.

وَقَالَ إِنِّي ذَاهِبٌ إِلَىٰ رَبِّي سَيَهْدِينِ ﴿٩٩﴾

100 "నా ప్రభూ! నాకు గుణవంతుడైన కుమారుణ్ణి ప్రసాదించు" (అని ప్రార్థించాడు).

رَبِّ هَبْ لِي مِنَ الصَّالِحِينَ ﴿١٠٠﴾

101 అందువల్ల మేమతనికి, సహనశీలుడైన ఒక అబ్బాయి గురించిన శుభవార్తను అందజేశాము.[67]

فَبَشَّرْنَاهُ بِغُلَامٍ حَلِيمٍ ﴿١٠١﴾

102 మరి ఆ కుర్రాడు అతని వెంట పరుగెత్తే ఈడుకు చేరుకున్నప్పుడు,[68] "ఒరేయ్ చంటీ! నేను నిన్ను 'జిబహ్' చేస్తున్నట్లు కల చూస్తున్నాను! మరి నీ అభిప్రాయమేమిటో చెప్పు"[69] అని అతను (ఇబ్రాహీం) అన్నాడు. "నాన్న గారూ! మీకు ఆజ్ఞాపించబడిన దానిని (నిస్సంకోచంగా) నెరవేర్చండి. అల్లాహ్ తలిస్తే మీరు నన్ను సహనశీలిగా పొందుతారు" అని ఆ బాలుడు అన్నాడు.

فَلَمَّا بَلَغَ مَعَهُ السَّعْيَ قَالَ يَا بُنَيَّ إِنِّي أَرَىٰ فِي الْمَنَامِ أَنِّي أَذْبَحُكَ فَانظُرْ مَاذَا تَرَىٰ ۚ قَالَ يَا أَبَتِ افْعَلْ مَا تُؤْمَرُ ۖ سَتَجِدُنِي إِن شَاءَ اللَّهُ مِنَ الصَّابِرِينَ ﴿١٠٢﴾

64. మీరు మీ స్వహస్తాలతో చేసిన విగ్రహాలను 'దేవుళ్ళు'గా నమ్మి, వాటి ముందరే తలవంచుతారా? వాస్తవానికి వీటన్నింటి సృష్టికర్త అల్లాహ్‌యే కదా!
దాసులందరి కర్మల సృష్టికర్త అల్లాహ్‌యేనన్న విషయం కూడా దీనిద్వారా బోధపడుతోంది. అహ్లెసున్నత్‌వారి విశ్వాసం కూడా అదే.

65. అంటే అగ్ని గుండాన్ని పూలవనంగా మార్చి వారి కుట్రను భగ్నం చేశాడు అల్లాహ్. తనను నమ్ముకున్న దాసులను ఆదుకునే, కీడును మేలుగా మార్చివేసే ఆ దేవుడు పరమ పవిత్రుడు.

66. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ సంఘటన బాబిలోనియా (ఇరాఖ్)లో సంభవించింది. ఎట్టకేలకు ఆయన అక్కడి నుంచి సిరియాకు ప్రస్థానం చేశారు. సజ్జన సంతానం కోసం ఆయన ప్రార్థించింది అక్కడే (ఫత్‌హుల్ ఖదీర్).

67. **'సహనశీలుడు'** (حَلِيم) అని చెప్పటం ద్వారా ఆ బాలుడు భవిష్యత్తులో త్యాగశీలిగా, సహనశీలిగా రాణించనున్నాడని సంకేతప్రాయంగా తెలియపరచటం జరిగింది.

68. అంటే ప్రాజ్ఞవయస్సుకు చేరుకున్నాడు. అప్పటికి ఆ బాలునికి 13 ఏండ్లు ఉన్నాయని అనబడుతోంది.

103 మరి వారిరువురూ (దైవాజ్ఞను) శిరసావహించినప్పుడు అతను తన కుమారుణ్ణి ఒక పక్కకు తిప్పి పడుకోబెట్టాడు.[70]

فَلَمَّآ أَسْلَمَا وَتَلَّهُۥ لِلْجَبِينِ ﴿١٠٣﴾

104 అప్పుడు మేమతన్ని పిలిచాము – "ఓ ఇబ్రాహీం!

وَنَٰدَيْنَٰهُ أَن يَٰٓإِبْرَٰهِيمُ ﴿١٠٤﴾

105 "నువ్వు కలను నిజంచేసి చూపావు."[71] నిశ్చయంగా మేము సదాచార సంపన్నులకు ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము.

قَدْ صَدَّقْتَ ٱلرُّءْيَآ ۚ إِنَّا كَذَٰلِكَ نَجْزِى ٱلْمُحْسِنِينَ ﴿١٠٥﴾

106 యదార్థానికి అదొక బహిరంగ పరీక్ష![72]

إِنَّ هَٰذَا لَهُوَ ٱلْبَلَٰٓؤُا۟ ٱلْمُبِينُ ﴿١٠٦﴾

107 మేము ఒక పెద్ద బలిపశువుని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించాము.[73]

وَفَدَيْنَٰهُ بِذِبْحٍ عَظِيمٍ ﴿١٠٧﴾

108 ఇంకా భావి తరాల వారిలో అతని సచ్చరిత్రను మిగిల్చి ఉంచాము.

وَتَرَكْنَا عَلَيْهِ فِى ٱلْءَاخِرِينَ ﴿١٠٨﴾

109 ఇబ్రాహీంకు శాంతి కలుగుగాక!

سَلَٰمٌ عَلَىٰٓ إِبْرَٰهِيمَ ﴿١٠٩﴾

69. దైవప్రవక్తకు కల వచ్చిందంటే అది ఒక విధంగా దైవాదేశం లేక దైవ సంకేతం అయి ఉంటుంది. దాన్ని అతను అమలు పరచవలసి ఉంటుంది. అయితే దైవాజ్ఞను నెరవేర్చటానికి కుమారుడు సంతోషంగా అంగీకరిస్తాడో లేదోనని చూడటానికే ఆయన అతన్ని సంప్రతించారు.

70. ప్రతి మనిషి ముఖానికి రెండు దిక్కులుంటాయి. కుడివైపు, ఎడమవైపు. మధ్యలో నుదురు ఉంటుంది. కనుక **'లిల్‌జబీన్'** (لِلْجَبِينِ) అన్న పదానికి 'ఒక పక్కకు తిప్పి పరుండబెట్టటం' అన్న అనువాదం అన్ని విధాలా సరైనది. అంటే ఇబ్రాహీమ్ ఇస్మాయీల్‌ను, పశువును బలి ఇచ్చినప్పుడు కాబా వైపు తిప్పి పరుండబెట్టినట్లు పడుకోబెట్టారన్న మాట. ఇకపోతే 'బోర్లా పడవేశాడు' అన్న విధంగా ఎందుకు అనువదిస్తారంటే, తనను పరుండబెట్టినప్పుడు తన ముఖం తన తండ్రికి కనిపించేలా ఉండరాదని, తద్వారా పుత్రవాత్సల్యం దైవాజ్ఞా పాలనలో అవరోధంగా నిలిచే అవకాశం ఉందని కుమారుడు ఇస్మాయీల్, తన తండ్రితో చెప్పినట్టు ప్రతీతి. దాన్ని దృష్టిలో పెట్టుకొని అనువాదకులు 'బోర్లా' అని తర్జుమా చేస్తున్నారు.

71. అంటే కలలో చూసిన విషయాన్ని ఆచరణలో పెట్టడానికి నువ్వు నీ కన్నకొడుకును బహిరంగ స్థలానికి తెచ్చి, జిబహ్ చేయటానికి పరుండబెట్టావు. ఇది నీ చిత్తశుద్ధికి, త్యాగనిరతికి ప్రబల తార్కాణం. దైవాజ్ఞ ముందు ప్రపంచంలోని ఏ వస్తువు కూడా నీ దృష్టిలో ప్రియతమం కాదని నువ్వు రుజువు చేశావు. ఆఖరికి లేకలేక కలిగిన ముద్దుల కొడుకును సయితం అర్పించటానికి సిద్ధం అయ్యావు.

72. కన్నకొడుకును దైవమార్గంలో అర్పించటం అనేది మామూలు పరీక్ష కాదు. కాని ఈ కఠిన పరీక్షలో సయితం ఆ త్యాగధనుడు నికార్సుగా నెగ్గుకువచ్చాడు.

73. ఆ పెద్ద బలిపశువు ఒక పొట్టేలు. దాన్ని అల్లాహ్ స్వర్గం నుంచి హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) ద్వారా పంపించాడు (ఇబ్నె కసీర్). హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి) స్థానంలో ఆ పొట్టేలు బలి ఇవ్వబడింది. దైవప్రవక్త ఇబ్రాహీము (అలైహిస్సలాం) గారి ఈ సంప్రదాయాన్ని దేవుడు ప్రళయదినం వరకూ సజీవంగా ఉంచదలిచాడు. ఈ 'ఖుర్బానీ'ని దైవప్రసన్నత బడసే సాధనంగా చేశాడు. 'ఈదుల్ అజ్హా' సందర్భంగా దాసులు చేసే కర్మలలో ఈ 'ఖుర్బానీ' అత్యంత ప్రియమైన కర్మగా ఖరారు చేయబడింది.

كَذٰلِكَ نَجْزِي الْمُحْسِنِيْنَ ﴿١١٠﴾

**110** సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ప్రసాదిస్తాము.

اِنَّهٗ مِنْ عِبَادِنَا الْمُؤْمِنِيْنَ ﴿١١١﴾

**111** నిస్సందేహంగా అతను విశ్వాసులైన మా దాసులలోని వాడు.

وَبَشَّرْنٰهُ بِاِسْحٰقَ نَبِيًّا مِّنَ الصّٰلِحِيْنَ ﴿١١٢﴾

**112** మరి మేమతనికి, సద్వర్తనులలో ఒకడైన ఇస్‌హాఖ్[74] ప్రవక్త గురించిన శుభవార్తను ఇచ్చాము.

وَبٰرَكْنَا عَلَيْهِ وَعَلٰٓى اِسْحٰقَ ۭ وَمِنْ ذُرِّيَّتِهِمَا مُحْسِنٌ وَّظَالِمٌ لِّنَفْسِهٖ مُبِيْنٌ ﴿١١٣﴾

**113** ఇంకా మేము అతని (ఇబ్రాహీము)పైనా, ఇస్‌హాఖ్‌పైనా శుభాలను కురిపించాము.[75] వారిద్దరి సంతతిలో కొందరు సజ్జనులైతే, మరికొందరు తమ ఆత్మలకు తీరని అన్యాయం చేసు కున్నారు.[76]

وَلَقَدْ مَنَنَّا عَلٰي مُوْسٰى وَهٰرُوْنَ ﴿١١٤﴾

**114** మరి మేము మూసా, హారూనులకు కూడా ఉపకారం చేశాము.[77]

---

74. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ ఖుర్బానీ సంఘటన తరువాత, ఆయన కుమారుడగు ఇస్‌హాఖ్ ప్రవక్త ప్రస్తావన వచ్చింది. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే, ఇంతకు ముందు జిబహ్ చేయమని దేవుని తరఫున అయిన ఆజ్ఞ హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) గురించే. అప్పటికి ఈయన ఇబ్రాహీంకు ఏకైక పుత్రుడు. ఆ తరువాతే ఇస్‌హాఖ్ పుట్టారు. కనుక ఇస్‌హాఖ్ ద్వితీయపుత్రుడు. ఖుర్బానీ (జిబహ్)కి సంబంధించిన సంఘటనపై కూడా ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. జిబహ్ కోసం పరుండబెట్టినది హజ్రత్ ఇస్‌హాఖ్‌నేనని ఇమామ్ ఇబ్నె జరీర్ అభిప్రాయపడ్డారు. కాగా; ఇబ్నె కసీర్ సహా అత్యధికమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) అని నొక్కి వక్కాణించారు. ఈ రెండవ అభిప్రాయమే సరైనది, ప్రమాణబద్ధమైనది. ఇమామ్ షౌకానీ మాత్రం ఈ విషయంలో తటస్థంగా ఉండిపోయారు (వివరాల కోసం ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్ వ్యాఖ్యానాలను చూడండి).

75. అంటే ఆ ప్రవక్తలిద్దరి సంతానాన్ని ప్రపంచంలో బాగా విస్తరిల్లజేశాము. దైవప్రవక్తలలో చాలామంది వీరి సంతతికి చెందినవారే. హజ్రత్ ఇస్‌హాఖ్ (అలైహిస్సలాం)కు హజ్రత్ యాఖూబ్ (అలైహి) కలిగారు. ఆయనగారి 12మంది కుమారుల ద్వారా ఇస్రాయీల్ సంతతికి చెందిన 12 తెగలు ఉనికిలోకి వచ్చాయి. వారి ద్వారా ఇస్రాయీలీయులు ప్రపంచంలో దినదిన ప్రవర్థమానం అయ్యారు. అనేకమంది దైవప్రవక్తలు వీళ్ళమధ్యనే ప్రభవించారు. ఇకపోతే ఇబ్రాహీం గారి మరో పుత్రుడు ఇస్మాయీల్ ద్వారా అరబ్బు సంతతి ముందుకు సాగింది. అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (సఅసం) ఈ అరబ్బు జాతిలోనే జన్మించారు.

76. అంటే వారిలో కొందరు షిర్క్‌కు, పాపకార్యాలకు, మారణహోమానికి, అరాచకానికి ఒడిగట్టారు. ఇబ్రాహీం సంతతిలో శుభం, సమృద్ధి కలిగినప్పటికీ మంచివారితో పాటు చెడ్డవారిని గురించి కూడా ప్రస్తావించటం గమనించదగిన విషయం. దైవసన్నిధిలో కులగోత్రాలకు, తాతముత్తాతల ఆధారంగా బడాయి పోవటాలకు ఎలాంటి ప్రాధాన్యం లేదని, సత్కార్యాలు మాత్రమే దైవసన్నిధిలో పరిగణనలోకి వస్తాయని దీనిద్వారా విదితమవుతోంది. యూదులు, క్రైస్తవులు హజ్రత్ ఇస్‌హాఖ్ (అలైహిస్సలాం) సంతతి నుండి వచ్చినవారు. అలాగే అరబ్బు ముష్రిక్కులు హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతతికి చెందినవారు. కాని వారి ఆచరణలు మాత్రం స్పష్టమైన మార్గభ్రష్టతకు లేదా షిర్కుకు, పాపాలకు ప్రతిబింబంగా ఉన్నాయి. అందువల్ల వారి కులగోత్రాలు గొప్పవైనంత మాత్రాన వారి దుష్కర్మలు మారబోవు.

115 వారినీ, వారి జాతివారినీ పెద్ద పీడన నుండి రక్షించాము.[78]
وَنَجَّيْنَاهُمَا وَقَوْمَهُمَا مِنَ الْكَرْبِ الْعَظِيمِ ﴿١١٥﴾

116 మేము వారికి సహాయపడగా, వారే విజయం సాధించారు.
وَنَصَرْنَاهُمْ فَكَانُوا هُمُ الْغَالِبِينَ ﴿١١٦﴾

117 మరి వారిద్దరికి మేము సవివరమైన (తేటతెల్లమైన) గ్రంథం ప్రసాదించాము.
وَآتَيْنَاهُمَا الْكِتَابَ الْمُسْتَبِينَ ﴿١١٧﴾

118 ఇంకా వారికి రుజుమార్గం వైపు దర్శకత్వం వహించాము.
وَهَدَيْنَاهُمَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ﴿١١٨﴾

119 రాబోయే తరాలలో వారి కీర్తి మిగిలి ఉండేలా చేశాము.
وَتَرَكْنَا عَلَيْهِمَا فِي الْآخِرِينَ ﴿١١٩﴾

120 మూసా, హారూనులపై శాంతి కలుగుగాక!
سَلَامٌ عَلَىٰ مُوسَىٰ وَهَارُونَ ﴿١٢٠﴾

121 నిశ్చయంగా మేము సజ్జనులకు ఇలాగే ప్రతిఫలం ఇస్తూ ఉంటాము.
إِنَّا كَذَٰلِكَ نَجْزِي الْمُحْسِنِينَ ﴿١٢١﴾

122 నిస్సందేహంగా వారిద్దరూ విశ్వాసులైన మా దాసుల్లో చేరిన వారు.
إِنَّهُمَا مِنْ عِبَادِنَا الْمُؤْمِنِينَ ﴿١٢٢﴾

123 మరి నిశ్చయంగా ఇలియాస్ కూడా ప్రవక్తలలోని వాడే.[79]
وَإِنَّ إِلْيَاسَ لَمِنَ الْمُرْسَلِينَ ﴿١٢٣﴾

124 అతను తన జాతి వారితో ఇలా అన్నాడు: “మీరు అల్లాహ్‌కు భయపడరా?[80]
إِذْ قَالَ لِقَوْمِهِ أَلَا تَتَّقُونَ ﴿١٢٤﴾

125 “మీరు బాల్ (అనే విగ్రహము)ను ప్రార్థిస్తూ, సర్వోత్తమ సృష్టికర్త (అయిన అల్లాహ్)ను వదలిపెడుతున్నారేమిటి?
أَتَدْعُونَ بَعْلًا وَتَذَرُونَ أَحْسَنَ الْخَالِقِينَ ﴿١٢٥﴾

126 అంటే మీ ప్రభువు, మీ తాతముత్తాతల ప్రభువైన అల్లాహ్‌ను”[81]
اللَّهَ رَبَّكُمْ وَرَبَّ آبَائِكُمُ الْأَوَّلِينَ ﴿١٢٦﴾

---

77. అంటే వారిని దైవప్రవక్తలుగా ఎన్నుకోవటంతో పాటు, వారికి ఎన్నో వరాలను కూడా ప్రసాదించాము.

78. అంటే – ఫిరౌనీయుల పీడన నుంచి, బానిసత్వం నుంచి విముక్తి నొసగాము.

79. ఈయన హజ్రత్ హారూన్ (అలైహిస్సలాం) సంతతిలోని వారు. ఇస్రాయీలు వంశానికి చెందిన ప్రవక్త. ఆయన బాలబక్క్ ప్రదేశం వైపుకు పంపబడ్డారు. ఆ స్థలం పేరు అసలు ‘సామిరా’ అనీ, అది పాలస్తీనాకు పశ్చిమ భాగాన ఉందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. అక్కడి ప్రజలు ‘బాల్’ అనే విగ్రహాన్ని పూజించేవారు. (అదొక స్త్రీ దేవత పేరని కొంతమంది చెబుతారు).

80. అల్లాహ్‌ను వదలి మీరు ఇతరత్రా దైవాలను పూజిస్తూ కూడా ఇంత నిర్భయంగా ఎలా ఉంటున్నారు? ఆయనకు పట్టుబడతామన్న భయం మీకు లేదా?

81. మీకూ, మీ పూర్వీకులకు కూడా ప్రభువు అయిన అల్లాహ్‌ను కాదని మీరు రాతి విగ్రహాన్ని పూజిస్తారా? దాని పేర మొక్కుకుంటారా?

| | |
|---|---|
| **127** కాని వారతన్ని ధిక్కరించారు. కనుక వారు తప్పనిసరిగా (శిక్ష నిమిత్తం) హాజరు పరచబడతారు.[82] | فَكَذَّبُوهُ فَإِنَّهُمْ لَمُحْضَرُونَ ﴿١٢٧﴾ |
| **128** అల్లాహ్ ఎన్నుకున్న దాసులు తప్ప! (వారు మాత్రమే రక్షించబడతారు). | إِلَّا عِبَادَ اللَّهِ الْمُخْلَصِينَ ﴿١٢٨﴾ |
| **129** మేమతని మంచి ప్రస్తావనను భావితరాల వారిలో మిగిల్చి ఉంచాము. | وَتَرَكْنَا عَلَيْهِ فِي الْآخِرِينَ ﴿١٢٩﴾ |
| **130** ఇలియాస్‌పై శాంతి కలుగుగాక![83] | سَلَامٌ عَلَىٰ إِلْ يَاسِينَ ﴿١٣٠﴾ |
| **131** సదాచార సంపన్నులకు మేము ఇలాగే ప్రతిఫలం ఇస్తుంటాము. | إِنَّا كَذَٰلِكَ نَجْزِي الْمُحْسِنِينَ ﴿١٣١﴾ |
| **132** నిశ్చయంగా అతను విశ్వాసులైన మా దాసులలోని వాడు.[84] | إِنَّهُ مِنْ عِبَادِنَا الْمُؤْمِنِينَ ﴿١٣٢﴾ |
| **133** మరి లూత్ కూడా ప్రవక్తలలోని వాడే. | وَإِنَّ لُوطًا لَمِنَ الْمُرْسَلِينَ ﴿١٣٣﴾ |
| **134** మేము అతన్నీ, అతని కుటుంబీకులందరినీ కాపాడాము– | إِذْ نَجَّيْنَاهُ وَأَهْلَهُ أَجْمَعِينَ ﴿١٣٤﴾ |
| **135** వెనుక ఉండిపోయిన వారితో చేరిన ఆ ముసలావిడను తప్ప![85] | إِلَّا عَجُوزًا فِي الْغَابِرِينَ ﴿١٣٥﴾ |

82. అంటే – దేవుని ఏకత్వాన్ని త్రోసిపుచ్చిన నేరానికిగాను వారు నరకాగ్నికి ఆహుతి అవుతారు.

83. **'ఇల్‌యాసీన్'** (إِلْ يَاسِينَ) అని అరబీలో ఉంది. అంతమాత్రాన అది బహువచనం గానీ, మరే యితర అర్థం వచ్చే పదంగానీ కాదు. 'ఇల్‌యాస్' అని మాత్రమే అర్థం. 'సైనా' పర్వతాన్ని 'సీనీన్' అని అన్నట్లే ఇక్కడ 'ఇల్‌యాసీన్' అని అనటం జరిగింది. హజ్రత్ ఇల్యాస్ (అలైహి) ఇతర గ్రంథాలలో 'ఏలియా'గా కూడా పిలువబడ్డారు.

84. దివ్య ఖుర్‌ఆన్‌లో చాలాచోట్ల దైవప్రవక్తల ప్రస్తావన వచ్చినప్పుడు, వారు 'మా విశ్వాసులైన దాసులలో చేరినవారు' అని చెప్పటం గమనార్హం. ఇలా చెప్పబడటంలో రెండు ఉద్దేశాలున్నాయి –1. ఈమాన్ (విశ్వాసం) వాంఛించే ప్రత్యేక నైతిక నడవడి వారిలో మెండుగా ఉందన్న విషయాన్ని ఎత్తిచూపటం. జనులలో కొందరు దైవప్రవక్తలలోని నైతిక బలహీనతలను ఎత్తిచూపేందుకు యత్నిస్తూ ఉంటారు. ఉదాహరణకు : తౌరాత్, ఇంజీలులోని ప్రస్తుత ప్రతులలో ఎంతోమంది ప్రవక్తల గురించి కట్టుకథలున్నాయి. దాన్ని ఖండించటం ఖుర్‌ఆన్ ఉద్దేశం. 2. దైవప్రవక్తల అభిమానంలో అతిశయిల్లిపోయే ప్రజల ధోరణులను ఖండించటం. కొంతమంది ప్రవక్తలకు దైవత్వాన్ని ఆపాదిస్తుంటారు. దైవిక గుణాలు, అధికారాలు వారిలో బదిలీ అవుతాయని చెబుతుంటారు. ఇలాంటి అతివాదాలను దివ్య ఖుర్‌ఆన్ పదే పదే ఖండిస్తుంది. దైవప్రవక్తలు కూడా దైవదాసులేననీ, వారు దైవాంశ సంభూతులు గానీ, దైవత్వంలో భాగస్వాములుగానీ కారని స్పష్టం చేస్తుంది.

85. **'ముసలావిడ'** (عَجُوز) అంటే హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) భార్య అన్నమాట! ఆమె విశ్వాసురాలు కాదు. అందువల్ల ఆమె విశ్వాసులతో కలసి పట్టణం విడిచిపోలేదు. ఎందుకంటే దేవుడు వినాశాన్ని ఆమె నొసట రాసిపెట్టాడు. మొదటినుంచి ఆమె అవిశ్వాసులతో చేతులు కలిపి, ముస్లింలకు వ్యతిరేకంగా వ్యూహరచనలు చేసేది.

| | |
|---|---|
| 136 ఆ తరువాత మేము ఇతరులందరినీ నాశనం చేసివేశాము. | ثُمَّ دَمَّرْنَا الْاٰخَرِيْنَ ﴿136﴾ |
| 137 మీరు ప్రభాత సమయాలలో, ఆ ప్రదేశాల మీదుగా సాగి పోతూ ఉంటారు. | وَاِنَّكُمْ لَتَمُرُّوْنَ عَلَيْهِمْ مُّصْبِحِيْنَ ﴿137﴾ |
| 138 ఇంకా రాత్రివేళల్లో కూడా. అయినా మీరు అర్థం చేసుకోరా?[86] | وَبِالَّيْلِ ؕ اَفَلَا تَعْقِلُوْنَ ﴿138﴾ |
| 139 నిస్సందేహంగా యూనుస్ (కూడా) మా ప్రవక్తలలోని వాడే. | وَاِنَّ يُوْنُسَ لَمِنَ الْمُرْسَلِيْنَ ﴿139﴾ |
| 140 అతను (తన జనుల నుండి) పలాయనం చిత్తగించి నిండు నౌక వద్దకు చేరుకున్నప్పుడు, | اِذْ اَبَقَ اِلَى الْفُلْكِ الْمَشْحُوْنِ ﴿140﴾ |
| 141 చీటీలు వేయటం జరిగింది. చివరకు అతనే ఓడిపోయాడు. | فَسَاهَمَ فَكَانَ مِنَ الْمُدْحَضِيْنَ ﴿141﴾ |
| 142 తరువాత అతన్ని చేప మ్రింగేసింది. అప్పుడు అతను తన్ను తానే నిందించుకోసాగాడు.[87] | فَالْتَقَمَهُ الْحُوْتُ وَهُوَ مُلِيْمٌ ﴿142﴾ |

ముస్లింల రహస్య సమాచారాన్ని అవిశ్వాసులకు చేరవేసేది. కడకు ఆమె అంతం కూడా అవిశ్వాసులతోనే జరిగింది.

86. శిథిలాలుగా ఉన్న ఆ ప్రాచీన నగరాల మీదుగా వాణిజ్య ప్రయాణాలు చేసే మక్కా వాసులను ఉద్దేశించి అల్లాహ్ చెప్పిన మాటలివి! మీరు ఉదయం పూట, రాత్రిపూట కూడా ఆ బస్తీల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఆ ప్రదేశం మృత సముద్రతీరాన ఉంది. చూడ్డానికి ఎంతో అసహ్యకరంగా, కంపుకొడుతూ ఉంటుంది. దైవప్రవక్తను ధిక్కరించిన కారణంగా వారికేగతి పట్టిందో – ఇది చూసిన మీదట కూడా – మీకు జ్ఞానోదయం కలగటం లేదా? ఒకవేళ మీరు గనక మీ దురుసువైఖరిని మానుకోకపోతే మీ పరిణామం కూడా తద్భిన్నంగా ఉండదు (జాగ్రత్త!). ఎందుకంటే వినాశాన్ని చవిచూసిన ఆ జాతులు ఎలా వ్యవహరించారో మీరు కూడా దాదాపు అలాగే – కర్కశంగా– వ్యవహరిస్తున్నారు.

87. హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) ఇరాక్ ప్రాంతంలోని 'నైనవా' పట్టణానికి ప్రవక్తగా పంపబడ్డారు. అప్పట్లో అది ఆషూరియనులకు రాజధాని నగరంగా ఉండేది. వారు దాదాపు లక్షమంది ఇస్రాయీలీయులను ఖైదీలుగా పట్టుకుని ఉన్నారు. అందువల్ల వారికి సన్మార్గాన్ని ఉపదేశించటానికి దేవుడు హజ్రత్ యూనుస్ (అలైహి)ని పంపించాడు. కాని ఆ జాతి వారు యూనుస్ మాటలను వినలేదు సరికదా, ఆయన్ని త్రోసిపుచ్చారు. దైవవిధేయులు కానిపక్షంలో దైవశిక్ష విరుచుకుపడుతుందని ఆయన హెచ్చరించారు. కాని దైవశిక్ష నిర్ణీత సమయానికి రాలేదు. కాస్త ఆలస్యమయ్యే సరికి ఆయన దేవుని అనుమతి లేకుండానే ఆ పట్టణాన్ని విడిచి, సముద్రతీరానికి పోయి, నావలో కూర్చున్నారు.

ఆయన తన ప్రాంతాన్ని విడిచి మరో ప్రాంతం వైపుకు పోవటాన్ని ఇక్కడ 'పలాయనం (అబక్)'గా అభివర్ణించటం జరిగింది. ఒక బానిస తన యజమానికి చెప్పాపెట్టకుండా పారిపోవటం ఎలాంటిదో ఇంచుమించు ఇది కూడా అలాంటిదేనని అనటం గమనార్హం. ఎందుకంటే హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) దైవాజ్ఞ కాకముందే ఊరు విడిచారు. ఆ నావ ప్రయాణీకులతో, సామానుతో నిండి ఉంది. అది సాఫీగా సాగిపోతూనే మధ్యలో గాలివానలో చిక్కుకుంది. అలల తాకిడి ఉధృతమయింది. బరువు మూలంగా ముందుకు పోలేకపోతోంది. బరువును తగ్గించటానికి

فَلَوْلَآ أَنَّهُۥ كَانَ مِنَ ٱلْمُسَبِّحِينَ ﴿١٤٣﴾

143 ఒకవేళ అతను గనక (అల్లాహ్) పవిత్రతను కొనియాడ టంలో నిమగ్నుడై ఉండకపోతే...

لَلَبِثَ فِى بَطْنِهِۦٓ إِلَىٰ يَوْمِ يُبْعَثُونَ ﴿١٤٤﴾

144 పునరుత్థానదినం వరకు చేప కడుపులోనే ఉండి పోయే వాడు.[88]

فَنَبَذْنَٰهُ بِٱلْعَرَآءِ وَهُوَ سَقِيمٌ ﴿١٤٥﴾

145 తరువాత మేమతన్ని (సముద్ర తీర) మైదానంలో పడ వేశాము. అప్పుడతను అస్వస్థతకు గురై ఉన్నాడు.[89]

وَأَنۢبَتْنَا عَلَيْهِ شَجَرَةً مِّن يَقْطِينٍ ﴿١٤٦﴾

146 అతనికి నీడనిచ్చే ఒక తీగచెట్టును అతనిపై మొలకెత్తిం చాము.[90]

وَأَرْسَلْنَٰهُ إِلَىٰ مِائَةِ أَلْفٍ أَوْ يَزِيدُونَ ﴿١٤٧﴾

147 మరి మేమతన్ని ఒక లక్షమంది, అంతకన్నా ఎక్కువ మంది వైపుకే (ప్రవక్తగా) పంపాము.

فَـَٔامَنُوا۟ فَمَتَّعْنَٰهُمْ إِلَىٰ حِينٍ ﴿١٤٨﴾

148 వారు విశ్వసించారు.[91] అందువల్ల మేము వారిని కొంత కాలంపాటు సుఖ సౌఖ్యాలతో వర్ధిల్లజేశాము.

فَٱسْتَفْتِهِمْ أَلِرَبِّكَ ٱلْبَنَاتُ وَلَهُمُ ٱلْبَنُونَ ﴿١٤٩﴾

149 వారిని అడుగు: నీ ప్రభువుకు (కేవలం) కుమార్తెలూను, వారికేమో కుమారులా?

أَمْ خَلَقْنَا ٱلْمَلَٰٓئِكَةَ إِنَٰثًا وَهُمْ شَٰهِدُونَ ﴿١٥٠﴾

150 పోనీ, మేము దైవదూతలను ఆడవారుగా సృష్టించినప్పుడు వారు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారా ఏమి?[92]

---

ఒకరిద్దరిని పడవలో నుంచి దించక తప్పని పరిస్థితి ఏర్పడింది. కాని ఎవరి ప్రాణం వారికి తీపి. ఎవరయినా ప్రాణ త్యాగం చేయడానికి స్వయంగా ముందుకు రారుకదా! అందుకే పేర్లు రాసి చీటీలు వేయబడ్డాయి. హ|జత్ యూనుస్ (అలైహి) పేరు వచ్చింది. ఆ విధంగా హ|జత్ యూనుస్ ఓడిపోయారు. పలాయన వాదాన్ని అనుసరించిన ఈ ప్రవక్తను – ఇష్టం లేకపోయినా – సముద్రంలో పడవేయక తప్పలేదు. అయితే అదే సమయంలో యూనుస్‌ను కేవలం మింగాలని, జీర్ణం చేసుకోరాదని దేవుడు చేపను ఆదేశించాడు. ఆ విధంగా హ|జత్ యూనుస్ (అలైహిస్సలాం) దైవాజ్ఞపై చేప కడుపులోకి వెళ్ళిపోయారు.

88. మరి ఆయన గనక పశ్చాత్తాపం చెందకుండా, అల్లాహ్ పవిత్రతను కొనియాడకుండా ఉండకపోతే ప్రళయ దినం వరకూ చేప కడుపులోనే ఉండిపోవాల్సి వచ్చేది. తన పశ్చాత్తాపాన్ని వ్యక్తపరుస్తూ ఆయన చేసిన దుఆ ఇది: “ఓ అల్లాహ్! నీవు తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. నీవు పవిత్రుడవు. నిశ్చయంగా నేనే అన్యాయానికి ఒడిగట్టినవాడను” (అల్ అంబియా – 87).

89. జన్మించినపుడు ఒక శిశువు ఎలా బలహీనంగా, నిస్సహాయ స్థితిలో ఉంటాడో ఆయన కూడా అప్పుడు అలాగే ఉన్నారు.

90. **‘యఖ్తీన్’** (**يَقْطِين**) అంటే తన కాండంపై పూర్తిగా నిలదొక్కుకోలేని స్థితిలో ఉన్న మొక్క లేక తీగ అని అర్థం. ఉదాహరణకు సొరకాయ తీగ. ఆ తీర మైదానంలో వృక్షాలుగానీ, ఇండ్లుగానీ లేవు. అందువల్ల మేము నీడనిచ్చే ఒక తీగచెట్టును అక్కడ మొలకెత్తించి అతనికి రక్షణ కల్పించాము.

**151** నిశ్చయంగా వీరు తమ కల్పిత మాటలు చెబుతున్నారు సుమా!

أَلَآ إِنَّهُم مِّنْ إِفْكِهِمْ لَيَقُولُونَ ﴿151﴾

**152** అల్లాహ్‌కు సంతానముంది (అంటున్నారు). వాస్తవానికి వారు అబద్ధమాడుతున్నారు.

وَلَدَ اللَّهُ وَإِنَّهُمْ لَكَاذِبُونَ ﴿152﴾

**153** ఏమిటి? అల్లాహ్ (తన కోసం) కొడుకులకు బదులుగా కూతుళ్ళను ఎంపిక చేసుకున్నాడా?[93]

أَصْطَفَى الْبَنَاتِ عَلَى الْبَنِينَ ﴿153﴾

**154** అసలేమైపోయింది మీకు? ఈ మేరకు ఎలా నిర్ణయిస్తున్నారు?

مَا لَكُمْ كَيْفَ تَحْكُمُونَ ﴿154﴾

**155** మీరు ఆ మాత్రం కూడా గ్రహించలేరా?[94]

أَفَلَا تَذَكَّرُونَ ﴿155﴾

**156** పోనీ, మీ దగ్గర దానికి సంబంధించిన స్పష్టమైన ప్రమాణం ఏదైనా ఉందా?

أَمْ لَكُمْ سُلْطَانٌ مُّبِينٌ ﴿156﴾

**157** మరి మీరు సత్యవంతులే అయితే మీ పుస్తకాన్నే తీసుకుని రండి![95]

فَأْتُوا بِكِتَابِكُمْ إِن كُنتُمْ صَادِقِينَ ﴿157﴾

**158** ఆఖరికి వారు అల్లాహ్‌కు – జిన్నాతులకు మధ్య కూడా బంధుత్వ సంబంధాన్ని[96] కల్పించారు. వాస్తవానికి తాము (ఇలాంటి మిథ్యా విశ్వాసం గలవారు శిక్ష నిమిత్తం) హాజరు పరచబడతామన్న సంగతి స్వయంగా జిన్నాతులకు కూడా తెలుసు.[97]

وَجَعَلُوا بَيْنَهُ وَبَيْنَ الْجِنَّةِ نَسَبًا ۚ وَلَقَدْ عَلِمَتِ الْجِنَّةُ إِنَّهُمْ لَمُحْضَرُونَ ﴿158﴾

---

91. వారెలా విశ్వసించారు? దీనికి సమాధానం కోసం యూనుస్ సూరా – 98వ ఆయతుకు వివరణను చూడండి.

92. 'దైవదూతలు దేవుని కుమార్తెలు' అని వారు ఏ ఆధారంగా మాట్లాడుతున్నారు? మేము దైవదూతలను సృష్టించినప్పుడు వారక్కడ ఉన్నారా? దైవదూతలలో ఆడతనానికి సంబంధించిన గుణాలనుగాని వారు చూశారా?

93. తామైతే ఆడపిల్లలకు బదులు మగ పిల్లలనే కోరుకుంటున్నారు? మరైతే అల్లాహ్‌కు ఆడ సంతానాన్ని ఎందుకు ఆపాదిస్తున్నారు?

94. ఒకవేళ అల్లాహ్‌కు సంతానమే గనక ఉండి ఉంటే మగ సంతానమే ఉండేదేమో! ఏం, మీరు మాత్రం మగ సంతానాన్ని ఇష్టపడటం లేదా? మీరు మగపిల్లల్ని కోరుకుంటున్నప్పుడు దైవానికి మీ దృష్టిలో ప్రాధాన్యం లేని ఆడ సంతానాన్ని ఎందుకు అంటగడుతున్నారు? ఈ 'పంపకం' అపసవ్యమైనది కాదా?! అసలు విషయం ఏమిటంటే అల్లాహ్‌కు సంతానం ఉందన్న వారి మాటే అసత్యమైనది. అదొక అభాండం తప్ప మరేమీ కాదు. వారు ఆపాదించే అసత్యాలకు అల్లాహ్ అతీతుడు, పరమ పవిత్రుడు.

95. 'అల్లాహ్‌కు సంతానం ఉంది' అనే నమ్మకంలోని ప్రామాణికతను బుద్ధిజ్ఞానాలు అంగీకరించవు. పోనీ, వాటిని అంగీకరించాలన్నా ఏదన్నా ఆధారం కావాలి కదా! అల్లాహ్‌కు సంతానం ఉందనే విషయాన్ని ధృవీకరించే ఏదైనా పుస్తకం ఉంటే తీసుకురండి!?

| | |
|---|---|
| **159** (అల్లాహ్ విషయంలో) వారు చెప్పే విషయాలకు అల్లాహ్ పవిత్రుడు. | سُبْحٰنَ اللّٰهِ عَمَّا يَصِفُوْنَ ﴿159﴾ |
| **160** చిత్తశుద్ధిగల అల్లాహ్ దాసులు తప్ప (వారు మాత్రమే ఇలాంటి అభూత కల్పనలకు దూరంగా ఉంటారు)![98] | اِلَّا عِبَادَ اللّٰهِ الْمُخْلَصِيْنَ ﴿160﴾ |
| **161** నిశ్చయంగా మీరూ, మీ (బూటకపు) దైవాలు (అందరూ ఏకమైనా సరే) | فَاِنَّكُمْ وَمَا تَعْبُدُوْنَ ﴿161﴾ |
| **162** ఏ ఒక్కరినీ (అల్లాహ్ వైపునుంచి) దారి తప్పించలేరు – | مَآ اَنْتُمْ عَلَيْهِ بِفٰتِنِيْنَ ﴿162﴾ |
| **163** నరకాగ్నికి ఆహుతి అయ్యేవానిని తప్ప![99] | اِلَّا مَنْ هُوَ صَالِ الْجَحِيْمِ ﴿163﴾ |
| **164** "మాలో ప్రతి ఒక్కరి స్థానం (శ్రేణి) నిర్ధారితమై ఉంది.[100] | وَمَا مِنَّآ اِلَّا لَهٗ مَقَامٌ مَّعْلُوْمٌ ﴿164﴾ |
| **165** "ఇంకా, మేము (దైవారాధన నిమిత్తం) వరుస తీరి నిలబడ్డాము. | وَّاِنَّا لَنَحْنُ الصَّآفُّوْنَ ﴿165﴾ |
| **166** "ఆయన (అల్లాహ్) పవిత్రతను కొనియాడుతున్నాము" (అని దైవదూతలు పలుకుతారు).[101] | وَاِنَّا لَنَحْنُ الْمُسَبِّحُوْنَ ﴿166﴾ |

96. ఈ ఆయతులో బహుదైవారాధకుల మరో అపనిందను ఖండించటం జరిగింది. అల్లాహ్‌కు జిన్నుల వర్గంతో దాంపత్య సంబంధముందని, తద్వారా అల్లాహ్‌కు ఆడపిల్లలు పుట్టారనీ, వారే దైవదూతలని ముష్రిక్కులు కల్పించారు. ఆ విధంగా వారు దైవానికి జిన్నుల వర్గంతో బంధుత్వ సంబంధాన్ని అంటగట్టారు.

97. అదెలా నిజమవుతుంది? ఒకవేళ అదేగనక నిజమై ఉంటే అల్లాహ్ జిన్నులను యాతనకు ఎందుకు గురిచేస్తాడు? ఒకవేళ జిన్నులతో ఆయనకు బంధుత్వ సంబంధముంటే ఆయనకు ఆ మాత్రం బంధుప్రీతి ఉండదా? అసలు విషయం ఏమిటంటే తాము నేరస్తులుగా హాజరుపరచబడతామన్న సంగతి స్వయంగా జిన్నులకు కూడా తెలుసు. అటువంటి శిక్షార్హులతో అల్లాహ్‌కు బంధుత్వ సంబంధం ఉంటుందా? ఎలాంటి ఘోరమైన మాటలివి!?

98. సజ్జనులు అల్లాహ్ విషయంలో నోటికొచ్చినట్లుగా వాగరు. అల్లాహ్‌కు శోభాయమానమైన మాటలే చెబుతారు. దైవవిరోధులు, ముష్రిక్కులు మాత్రమే ఇలాంటి తలాతోకా లేని మాటలు చెబుతారు. ఈ ఆయతుకు మరొక అర్థం ఇది : జిన్నాతులు, ముష్రిక్కులు మాత్రమే బందీలుగా (నరకంలో) హాజరుపరచబడతారు. దేవుని ప్రియతమ దాసులు బంధించబడరు. వారికోసం అల్లాహ్ స్వర్గాన్ని సిద్ధం చేసి ఉంచుతాడు.

99. అంటే, మీరు, మీ మిథ్యాదైవాలు – అందరూ కలిసినా – ఒక్క వ్యక్తిని కూడా మార్గభ్రష్టుణ్ణి చేయలేరు. అయితే అల్లాహ్ ఎవరికయితే మొదటినుంచే నరకాన్ని రాసిపెట్టి ఉంచాడో అటువంటి వారిని మాత్రమే వారు పెడదారి పట్టించగలుగుతారు.

100. అంటే – దైవారాధనగా తమలో ఎవరెవరు ఏ పనుల్లో నిమగ్నులై ఉండాలో ముందే నిర్ణయించబడి ఉంది. ఇవి దైవదూతల పలుకులు.

101. దీని అర్థం ఏమిటంటే దైవదూతలు కూడా దేవుని చేత సృష్టించబడినవారే. వారు దేవుని ప్రత్యేక సృష్టితాలుగా పరిగణించబడతారు. ఎల్లవేళలా వారు దైవారాధనలో లీనమై ఉంటారు. దేవుని స్తుతిస్తోత్రాలు చేస్తుంటారు. అంతేగాని ఈ ముష్రిక్కులు వాగుతున్నట్లు వారు అల్లాహ్ కుమార్తెలు ఎంతమాత్రం కారు.

**167** వారు (అవిశ్వాసులు) ఇలా అనేవారు –

وان كانوا ليقولون ﴿167﴾

**168** "మా వద్దనే గనక పూర్వీకుల మాదిరి ఉపదేశం ఉండి ఉంటే...

لو ان عندنا ذكرا من الاولين ﴿168﴾

**169** "మేము కూడా ఎంపిక చేయబడిన అల్లాహ్ దాసులై ఉండే వారము."[102]

لكنا عباد الله المخلصين ﴿169﴾

**170** కాని (తీరా ఖుర్ఆన్ వచ్చాక) వారు దానిని తిరస్కరించారు.[103] సరే. తొందరగానే వారు తెలుసుకుంటారు.[104]

فكفروا به فسوف يعلمون ﴿170﴾

**171** మా ప్రియతమ దాసులైన ప్రవక్తలకు మేమిచ్చిన మాట ఇంతకుముందే నెరవేరింది.

ولقد سبقت كلمتنا لعبادنا المرسلين ﴿171﴾

**172** నిశ్చయంగా వారు మాత్రమే విజయం సాధిస్తారు.

انهم لهم المنصورون ﴿172﴾

**173** మరి నిశ్చయంగా మా సైన్యాలే గెలుపొందుతాయి.[105]

وان جندنا لهم الغالبون ﴿173﴾

**174** కనుక (ఓ ప్రవక్తా!) కొంతకాలం పాటు వాళ్ళను పట్టించుకోకు.[106]

فتول عنهم حتى حين ﴿174﴾

**175** మరి వాళ్ళను గమనిస్తూ ఉండు.[107] మున్ముందు (తమకు పట్టే దుర్గతిని) వాళ్ళూ చూసుకుంటారు.

وابصرهم فسوف يبصرون ﴿175﴾

**176** ఏమిటి? వాళ్లు మా శిక్ష కోసం ఆత్రం చేస్తున్నారా?

افبعذابنا يستعجلون ﴿176﴾

**177** మరి (వినండి!) మా శిక్ష వారి మైదానంలో వచ్చి వాలినప్పుడు, హెచ్చరించబడిన వారి పాలిట[108] ఆ ఉదయం దారుణంగా ఉంటుంది.

فاذا نزل بساحتهم فساء صباح المنذرين ﴿177﴾

---

102. "ఉపదేశం ఉండి ఉంటే...." అంటే, తమ వద్ద ఏదైనా దైవగ్రంథం ఉండివుంటే లేదా తమ వద్దకు దైవప్రవక్త వచ్చివుంటే తాము అల్లాహ్‌ను విశ్వసించి ఉండేవారమని, సజ్జనులైన దైవదాసులుగా రాణించేవారమని ఈ అవిశ్వాసులు లోగడ గొప్పలు చెప్పుకునేవారు.

103. కాని తీరా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం), వారి ఆకాంక్షలకు ప్రతీకగా నియుక్తులై వచ్చిన తరువాత వారు మాట మార్చేశారు. వారివద్దకు వచ్చిన ఖుర్ఆన్ గ్రంథాన్ని కూడా తిరస్కరించారు.

104. ఇది వారికి ఒక హెచ్చరిక లాంటిది. తొందరగానే వాళ్లు తమ పర్యవసానాన్ని కళ్లారా చూస్తారు.

105. "నేనూ, నా ప్రవక్త మాత్రమే ప్రాబల్యం వహిస్తాము అని అల్లాహ్ రాసిపెట్టాడు" (ముజాదలహ్ – 21).

106. అంటే – వాళ్ల చవుకబారు మాటలను గురించి తీవ్రంగా ఆలోచించకు. వాళ్ల ఆగడాలపై కాస్త ఓపికపట్టు అని భావం.

107. వాళ్లపై దైవాగ్రహం ఎప్పుడు విరుచుకుపడుతుందో చూస్తూ ఉండు అని అర్థం.

178 కనుక (ఓ ప్రవక్తా!) కొన్నాళ్ళపాటు వాళ్ళను గురించి ఆలోచించకు.

وَتَوَلَّ عَنْهُمْ حَتّٰى حِيْنٍ ﴿178﴾

179 కాకపోతే వాళ్ళను చూస్తూ ఉండు. వాళ్ళు కూడా (త్వరలోనే) చూసుకుంటారు.[109]

وَّاَبْصِرْ فَسَوْفَ يُبْصِرُوْنَ ﴿179﴾

180 గౌరవనీయుడగు నీ ప్రభువు, వారు (ముష్రిక్కులు) కల్పించి చెప్పే విషయాలకు అతీతుడు, పరమ పవిత్రుడు.[110]

سُبْحٰنَ رَبِّكَ رَبِّ الْعِزَّةِ عَمَّا يَصِفُوْنَ ﴿180﴾

181 ప్రవక్తలపై శాంతి కురియుగాక![111]

وَسَلٰمٌ عَلَى الْمُرْسَلِيْنَ ﴿181﴾

182 సమస్త స్తోత్రాలు సకల లోక ప్రభువైన అల్లాహ్‌కే చెందుతాయి.[112]

وَالْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿182﴾

108. ఖైబర్‌ను ముట్టడించడానికి మహాప్రవక్త (సఅసం) తన సైన్యాన్ని తీసుకుపోయినప్పుడు ఆ దృశ్యాన్ని చూసి యూదులు అదిరిపోయారు. వాళ్ల కలవరాన్ని పసిగట్టిన మహనీయ ముహమ్మద్ (సఅసం), "అల్లాహు అక్బర్" అని పలికి, ఆ తరువాత ఇలా అన్నారు– "ఖైబర్‌కు మూడింది. నిశ్చయంగా మేము హెచ్చరించబడిన వారి మైదానంలో దిగినప్పుడు, అది వారి కొరకు దుర్దినమే అవుతుంది" (సహీహ్ బుఖారీ–కితాబుస్సలాత్; ముస్లిం–కితాబుల్ జిహాద్).

109. ఈ హెచ్చరిక పునరావృతమయింది. మొదటిసారి (175వ ఆయతులో) వచ్చిన హెచ్చరిక ఇహలోకానికి సంబంధించినదై ఉండవచ్చు. బద్ర్ సంగ్రామంలో తమకు పట్టిన దుర్గతిని వాళ్లు కళ్లారా చూసుకున్నారు. రెండవసారి హెచ్చరిక (179వ ఆయతు) పరలోకం నేపథ్యంలో చేయబడింది. ఈ అవిశ్వాసులు, బహుదైవోపాసకులు పరలోకంలో తమకు ఎదురయ్యే పరాభవాన్ని తప్పకుండా చూస్తారు.

110. అల్లాహ్‌లో ఏ ఏ బలహీనతలు, లోపాలున్నాయని ముష్రిక్కులు దుష్ప్రచారం చేస్తున్నారో వాటన్నింటికీ అల్లాహ్ అతీతుడనీ, ఆయన పునీతుడని ఈ ఆయతులో ప్రకటించబడింది. ఉదాహరణకు వారు ఆపాదించిన అపనిందలలో ఒకటి, ఆయనకు సంతానం ఉంది అని! లేదా ఆయనకు భాగస్వాములున్నారని! ఇలాంటి బలహీనతలు మానవుల్లో ఉంటాయి గాని దేవునిలో ఉండవు. సంతానంగానీ, సహాయకులుగానీ, జీవిత భాగస్వాములుగానీ కావలసింది వారికే. ఇలాంటి దౌర్బల్యాలకు అల్లాహ్ అతీతుడు, ఉన్నతుడు. ఎందుకంటే ఆయన నిరపేక్షాపరుడు. ఎవరిపైనా ఆధారపడనివాడు. ఆయనకు పిల్లల అవసరంగానీ, పార్ట్‌నర్ల అవసరంగానీ లేదు.

111. ఎందుకంటే వారు మానవ మహోపకారులు. తత్కారణంగా వారు శాంతీ శుభాలకు అర్హులు.

112. ఈ ఆయతులో సర్వోన్నత ప్రభువైన అల్లాహ్ తన దాసులకు చేసిన మేళ్లను గురించి బోధించటం జరిగింది. ఆయన తన దాసులపై భౌతికంగా దయదలచటంతోపాటు ఆధ్యాత్మికంగా వారికి మహోపకారం చేశాడు. వారి మార్గదర్శకత్వం కొరకు ప్రవక్తలను పంపాడు. గ్రంథాలను అవతరింపజేశాడు. అందువల్ల మీరు అల్లాహ్‌కు కృతజ్ఞులై ఉండండి. ఆయన్నే స్తుతించండి. ఆయన పవిత్రతను కొనియాడండి.

ఈ ఆయతుకు మరి కొంతమంది చెప్పే వ్యాఖ్యానం ఇది : దేవుడు అవిశ్వాసులను అంతమొందించి విశ్వాసులను, ప్రవక్తలను రక్షించాడు. కాబట్టి (ఓ విశ్వాసులారా!) అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోండి.

**'హమ్ద్'** (الحَمْدُ) అంటే అల్లాహ్‌ను గౌరవించే ఉద్దేశంతో ఉత్తమమైన రీతిలో ఆయన్ని స్తుతించటం, అల్లాహ్‌ను గురించి గొప్పగా ప్రస్తావించటం, ఆయన మహిమౌన్నత్యాన్ని వివరించటం.

38వ సూరా

# సాద్

## సాద్

అవతరణ మక్కాలో

ఆయతులు 88

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం వంటి మౌలిక విశ్వాసాల గురించి నొక్కి చెప్పింది. ఈ సూరా మొదటి ఆయతులోని 'సాద్' అనే అక్షరాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. ఈ పొడి అక్షరానికి సంబంధించిన అర్థం అల్లాహ్‌కే తెలుసు. అయితే ఈ పొడి అక్షరాన్ని వాడడాన్ని గురించి ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు భిన్న విధాలుగా వ్యాఖ్యానించారు. అవిశ్వాసులు ఒకే ఒక్క దేవుడిని విశ్వసించేలా నచ్చచెప్పడానికి, వారు ఆరాధించే కుహనా దేవుళ్ళను విడిచి పెట్టేలా చేయడానికి, దివ్యఖుర్‌ఆన్ దేవుని వచనమనీ, దేవుని తరఫున అవతరించిన హితబోధ అని వారు తెలుసుకునేలా చేయడానికి, ముహమ్మద్ (సఅసం) దేవుని ప్రవక్త అనీ వారు గ్రహించేలా చేయడానికి ఈ సూరా ప్రయత్నిస్తూ, ఏకదైవారాధనా సూత్రాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది.

ఈ సూరాలో దేవుని ఏకత్వం గురించి నొక్కి చెప్పడం జరిగింది. ఆయనే సమస్తాన్ని సృష్టించాడు, అందరి పోషకుడు ఆయనే. విశ్వప్రభువు అయిన ఆయన్నే ఆరాధించాలని ఈ సూరా గట్టిగా ప్రబోధించింది. మానవాళి పట్ల షైతాన్ శత్రుత్వం గురించి ఈ సూరాలో గుర్తుచేయడం జరిగింది. షైతాన్ నిరంతరం ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తుంటాడు. రుజుమార్గం వదిలి దారితప్పేలా చేయాలని చూస్తుంటాడు. అల్లాహ్ పట్ల అవిశ్వాసం ప్రదర్శించేలా ప్రోత్సహిస్తుంటాడు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కేవలం హెచ్చరిక చేసేవారు మాత్రమేననీ ఈ సూరా తెలియజేసింది. స్వర్గవనాలలోని సంతోషం గురించి, నరకాగ్ని కీలల బీభత్సం గురించి ఇందులో ప్రస్తావించడం జరిగింది. ఏకదైవారాధనకు కట్టుబడి మంచి పనులు చేసిన వారికి శాశ్వతమైన స్వర్గవనాలు లభిస్తాయని ఇందులో చెప్పడం జరిగింది. స్వర్గం దైవానుగ్రహం వల్ల లభించే సుందర ప్రదేశం. అన్ని విధాల ఫలాలు, అన్ని రకాల పానీయాలు పుష్కలంగా లభించే ప్రదేశం. శీలవతులైన భార్యలు, విశ్రమించడానికి సౌకర్యవంతమైన ఆసనాలు వారికి అక్కడ లభిస్తాయి. కాని అహంభావులైన అవిశ్వాసులకు నరకాగ్ని లభిస్తుంది. అది అత్యంత చెడ్డనివాసం. అక్కడ వారు దగ్ధమవుతూ ఉంటారు. ఆ నరకాగ్నే వారికి పడక అవుతుంది. వారు సలసలమరిగే నీటిని తాగుతారు. వారికి దుఃఖం తప్ప మరేది ఉండదు. తమ స్థితికి కారణం నువ్వంటే నువ్వని ఒండొకరిని తూలనాడుతుంటారు.

## సాద్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** సాద్. హితబోధతో నిండిన ఖుర్ఆన్ సాక్షిగా![1]

**2** అసలు (ఈ) తిరస్కారులు అహంకారానికి, మొండితనానికి లోనై ఉన్నారు.[2]

**3** మేము వారికి మునుపు కూడా ఎన్నో సముదాయాలను సర్వనాశనం చేశాము.[3] మరి వారు (ఆఖరి క్షణాలలో) కేకలు పెట్టారు. కాని అది వారు తప్పించుకునే సమయం కాదుకదా![4]

**4** తమ వద్దకు హెచ్చరించేవాడొకడు స్వయంగా తమలో నుంచే వచ్చాడే![5] అని వారు ఆశ్చర్యపోయారు. "ఇతడొక మాంత్రికుడు, అబద్ధాలకోరు" అని అవిశ్వాసులు అన్నారు.

## سُوْرَةُ صٓ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

صٓ وَالْقُرْاٰنِ ذِی الذِّكْرِ ﴿1﴾

بَلِ الَّذِيْنَ كَفَرُوْا فِیْ عِزَّةٍ وَّشِقَاقٍ ﴿2﴾

كَمْ اَهْلَكْنَا مِنْ قَبْلِهِمْ مِّنْ قَرْنٍ فَنَادَوْا وَّلَاتَ حِيْنَ مَنَاصٍ ﴿3﴾

وَعَجِبُوْٓا اَنْ جَآءَهُمْ مُّنْذِرٌ مِّنْهُمْ وَقَالَ الْكٰفِرُوْنَ هٰذَا سٰحِرٌ كَذَّابٌ ﴿4﴾

---

1. ఈ గ్రంథంలో మీ కొరకు అన్నిరకాల హితబోధ ఉంది. ప్రాపంచికంగా, పారలౌకికంగా మీకు సాఫల్యాన్ని ప్రసాదించే మార్గదర్శక నియమాలు ఇందులో ఉన్నాయి. కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యానికి 'వైభవోపేతమైన ఖుర్ఆన్ సాక్షిగా!' అని అనువాదం చేశారు. ఈ రెండు రకాల అనువాదాలను జోడిస్తూ ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: "రెండు అర్థాలు కూడా సరైనవే. ఎందుకంటే ఖుర్ఆన్ ఘనతగలది. మహత్పూర్వకమైనది. దాంతోపాటు అది విశ్వసించిన వారికొరకు హితబోధిని కూడాను. దైవానికి భయపడేదాసుల పాలిట గుణపాఠ సూచకం కూడాను." మక్కా అవిశ్వాసులు మహాప్రవక్త ముహమ్మద్ (స)ను మాంత్రికుడనీ, కవిపుంగవుడనీ, అసత్యవాది అని నిందించేవారు. వారు ప్రేలేవన్నీ అసత్యాలనీ, వాస్తవానికి ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త అన్నది సత్యమనీ, ఆయన (స)పై అవతరించిన దివ్య ఖుర్ఆన్ బ్రహ్మాండమైనదని ఈ ఆయతులో చెప్పటం జరిగింది.
2. ముమ్మాటికీ ఈ ఖుర్ఆన్ గ్రంథం సంశయాలకు, సందేహాలకు అతీతమైనది. పరిశుద్ధమైనది. గుణపాఠం నేర్చుకోదలచిన వారికోసం హితబోధిని. సత్యతిరస్కారులకు అది ఎందుకు ప్రయోజనకారి కావటంలేదంటే వారి ఆలోచనలు పొద్దస్తమానం వంకరగానే ఉంటున్నాయి. వారి గుండెల్లో దురహంకారం గూడుకట్టుకుని ఉంది. వారి అణువణువునూ విరోధభావం పెనవేసుకుని ఉంది. అందుకే వారు సత్యానికి వ్యతిరేకంగా పెట్రేగిపోతున్నారు.
3. వీరికి పూర్వం తుదముట్టించబడిన జాతులు బలపరాక్రమాలలో, ప్రజ్ఞాపాటవాలలో వీళ్ళకన్నా ముందంజలో ఉండేవారు. కాని సత్యతిరస్కారం మూలంగా, అవిధేయతా వైఖరి కారణంగా వారు తీవ్ర పర్యవసానానికి గురయ్యారు.
4. అంటే – వారికి దైవాగ్రహం విరుచుకుపడిన పిదప జ్ఞానోదయం అయింది. పుట్టి మునుగుతున్నప్పుడు వారు సిగ్గుతో పశ్చాత్తాపం చెంది, దైవసహాయం కోసం హాహాకారాలు చేశారు. కాని అది పశ్చాత్తాపం చెందే సమయం కాదు. సమయం అప్పటికి మించిపోయింది. శిక్షను కళ్లజూసిన తరువాత వారు నేర్చుకున్న గుణపాఠం వారికేమాత్రం ప్రయోజనం కలిగించలేకపోయింది. వారు ఆ విపత్తునుంచి పారిపోయి తమను కాపాడుకోలేకపోయారు.

   **'మనాస్'** (مَنَاصٍ) అంటే పారిపోవటం, వెనక్కి తగ్గటం అని అర్థం.
5. అంటే – తమలాంటి ఒక సాధారణ మనిషి దైవప్రవక్త ఎలా అయ్యాడన్న విషయం వారిని ఆశ్చర్యంలో పడవేసింది.

5 (వారింకా ఇలా అన్నారు) "ఏమిటి? ఇతగాడు ఇంతమంది దేముళ్ళను ఒకే ఆరాధ్య దైవంగా చేసేశాడా? నిజంగా ఇది వింతగా ఉందే!"[6]

أَجَعَلَ الْآلِهَةَ إِلَٰهًا وَاحِدًا ۖ إِنَّ هَٰذَا لَشَيْءٌ عُجَابٌ ⑤

6 వారి నాయకమన్యులు ఈ విధంగా చెబుతూ వెళ్ళిపోయారు: "పదండ్రా. మీరు మీ దేముళ్ళ (పూజాపునస్కారాల) పైనే గట్టిగా నిలబడండి.[7] నిశ్చయంగా ఈ మాటలో (మీకు వ్యతిరేకంగా) ఏదో మర్మం[8] ఉంది.

وَانطَلَقَ الْمَلَأُ مِنْهُمْ أَنِ امْشُوا وَاصْبِرُوا عَلَىٰ آلِهَتِكُمْ ۖ إِنَّ هَٰذَا لَشَيْءٌ يُرَادُ ⑥

7 "ఈ విషయాన్ని మేము వెనుకటి మతధర్మంలో కూడా విన లేదు.[9] ఇదొక కల్పిత విషయం తప్ప మరేమీ కాదు.[10]

مَا سَمِعْنَا بِهَٰذَا فِي الْمِلَّةِ الْآخِرَةِ إِنْ هَٰذَا إِلَّا اخْتِلَاقٌ ⑦

8 "ఏమిటీ, మనందరిలో కేవలం అతనొక్కడిపైనే దైవవాణి అవత రించిందా!?"[11] అసలు విషయమేమిటంటే వారు నా సందేశం (వహీ) విషయంలో సంశయానికి లోనయ్యారు.[12] అదికాదు, ఇంతవరకు వారసలు నా శిక్ష రుచి చూడలేదు.[13]

أَأُنزِلَ عَلَيْهِ الذِّكْرُ مِن بَيْنِنَا ۚ بَلْ هُمْ فِي شَكٍّ مِّن ذِكْرِي ۖ بَل لَّمَّا يَذُوقُوا عَذَابِ ⑧

6. అంటే – ఒకే ఒక్క దేవుడు ఈ జగతినంతటినీ నడుపుతాడా? ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరా? వింతగా ఉందే!? అలాగే ఆరాధనలకు, అర్చనలకు, మొక్కుబడులకు కూడా ఆయన ఒక్కడే అర్హుడా? ఇలాంటి కొత్తమాటను మేమెప్పుడూ వినలేదే!! అన్నది ఆ అవిశ్వాసుల ఉద్దేశం.

7. అంటే – మీరు మీ తాతముత్తాతల మతంపైనే ఉండండి. విగ్రహారాధనను మానవద్దు. ముహమ్మద్ (స) మాటను వినకండి అన్నది వారి అభిప్రాయం.

8. అంటే ఇతడు మా చేత విగ్రహారాధనను మాన్పించి, ఒక్కసారిగా మాకు నాయకుడై పోవాలనుకుంటున్నాడు.

9. వెనుకటి మతధర్మం అంటే కురైషుపెద్దలు నడిచే మార్గమూ కావచ్చు లేక క్రైస్తవ మతధర్మం కూడా కావచ్చు. అంటే తాము ఇంతవరకూ కనీ వినీ ఎరుగని 'ఏకదైవారాధన' (తౌహీద్) వైపుకు ఈయనగారు పిలుస్తున్నాడేమిటి? బహుశా ఈ కొత్త సిద్ధాంతం ఇతని మనోమస్తిష్కాలలో పుట్టి ఉండవచ్చు.

10. క్రైస్తవ మతంలో సయితం లేని దేవుని ఏకత్వాన్ని ఈయనగారు ప్రబోధిస్తున్నాడంటే ముమ్మాటికీ అది అతని కట్టుకథే అయి ఉంటుంది.

11. మక్కా నగరంలో శ్రీమంతులు, గొప్ప గొప్ప సర్దారులు ఉన్నారు. దైవప్రవక్తగా ఎన్నుకోవలసి ఉంటే అల్లాహ్ వాళ్ళలో ఎవరినో ఒకరిని ఎన్నుకునేవాడు. ఈ సాధారణ మనిషే అల్లాహ్‌కు ప్రవక్తగా దొరికాడా? ఈ విధంగా వారు దేవుని ఎంపికలోనే తప్పు పట్టారు. మరోచోట కూడా ఈ విషయం వచ్చింది. (ఉదాహరణకు : జుఖ్రుఫ్ సూరా – 31, 32).

12. వారి తిరస్కార వైఖరికి ప్రధాన కారణం ముహమ్మద్ (స) సత్యసంధతపై వారికి నమ్మకం లేకపోవటమో లేక ముహమ్మద్ (స) నిజాయితీపై శంక ఉండటమో కానేకాదు. వారికసలు దైవసందేశం (వహీ)పైనే సందేహం కలిగింది. అందులోనూ దేవుని ఏకత్వం (తౌహీద్) అనేసరికి వారి గొంతుల్లో పచ్చి వెలక్కాయ ఇరుక్కొంది.

13. మా శిక్షను వారు ఎంతో కొంత రుచి చూసివుంటే ఇంత బాహాటంగా ధిక్కరించేవారు కారు. సరే. శిక్షను రుచి చూసిననాడు వారికి తెలిసివస్తుంది. అప్పుడు వారు సత్యాన్ని సత్యమని ఒప్పుకున్నా ఒరిగేదేమీ ఉండదు.

9 పోనీ వాళ్ళ దగ్గర శక్తిమంతుడు, పరమదాత అయిన నీ ప్రభువు కారుణ్య నిధులుగానీ ఉన్నాయా?[14]

أَمْ عِندَهُمْ خَزَآئِنُ رَحْمَةِ رَبِّكَ ٱلْعَزِيزِ ٱلْوَهَّابِ ﴿٩﴾

10 లేదా భూమ్యాకాశాల, వాటి మధ్యనున్న సమస్త వస్తువులపై అధికారం గానీ వారి సొంతమయిందా? ఒకవేళ అయి వుంటే ఇంకేం? త్రాళ్ళు వేసి (ఆకాశానికి) ఎక్కిపోవాలి?[15]

أَمْ لَهُم مُّلْكُ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ وَمَا بَيْنَهُمَا ۖ فَلْيَرْتَقُوا۟ فِى ٱلْأَسْبَٰبِ ﴿١٠﴾

11 ఇది కూడా (పెద్ద పెద్ద) సైనిక కూటములలో ఓడిపోయిన ఒక (చిన్న) సైనిక దళమే సుమా![16]

جُندٌ مَّا هُنَالِكَ مَهْزُومٌ مِّنَ ٱلْأَحْزَابِ ﴿١١﴾

12 వీరికి మునుపు నూహ్ జాతివారు, ఆద్ వారు, మేకులు గల ఫిరౌను[17] వారు కూడా ధిక్కరించారు.

كَذَّبَتْ قَبْلَهُمْ قَوْمُ نُوحٍ وَعَادٌ وَفِرْعَوْنُ ذُو ٱلْأَوْتَادِ ﴿١٢﴾

13 సమూదువారు, లూత్ జాతివారు, అయికావారు[18] (కూడా ధిక్కరించినవారే). వారే (పెద్ద పెద్ద) సైనిక పటాలాల వారు.

وَثَمُودُ وَقَوْمُ لُوطٍ وَأَصْحَٰبُ لْـَٔيْكَةِ ۚ أُو۟لَٰٓئِكَ ٱلْأَحْزَابُ ﴿١٣﴾

---

14. వాస్తవానికి ఆ ఖజానాలకు యజమాని అల్లాహ్ మాత్రమే. వాటిలో నుంచి ఆయన తాను కోరిన వారికి ఇస్తాడు, తాను కోరని వారికి ఇవ్వడు. ఆయన పరమదాత. మరలాంటప్పుడు వారు ముహమ్మద్ (సఅసం) దైవదౌత్యాన్ని నిరాకరించటంలోని ఔచిత్యం ఏమిటి? వాస్తవానికి ముహమ్మద్ (సఅసం)ను ప్రవక్తగా నియుక్తం చేసినవాడు ఆ ప్రభువే కదా!

15. అంటే – వాళ్ళకు చేతనవుతే ఆకాశానికి ఎక్కి ముహమ్మద్ ప్రవక్త (సఅసం)కు అందుతున్న దైవదౌత్య పరంపరను తెంపివేయమనండి! ఆయతులో **'అస్‌బాబ్'** అనే పదం ప్రయోగించబడింది. అస్‌బాబ్ అంటే సాధనాలు, కారకాలు, ఒనరులు అన్న అర్థాలు వస్తాయి. సందర్భం దృష్ట్యా కొందరు ఈ పదానికి నిచ్చెనలు అనీ, మరికొందరు తాళ్లు అని తర్జుమా చేశారు. 'ద్వారాలు' అని ఇంకొంతమంది అనువదించారు. అంటే నిచ్చనల ద్వారా ఆకాశద్వారాల వరకూ చేరుకుని దైవదౌత్యాన్ని అడ్డుకోమనండి అన్నది దాని భావం (ఫత్‌హుల్ ఖదీర్).

16. అంతిమ విజయం దైవప్రవక్త (స)దేననీ, సత్యతిరస్కారులు ఘోరపరాజయం పొందనున్నారని ఈ ఆయతులో వాగ్దానం చేయబడింది. అంటే తిరస్కారుల ఈ సైనికగుంపు మిథ్యా (అసత్య)వాదుల సైనిక కూటమికి చెందినది. అది చాలా పెద్దదే కావచ్చు లేక అత్యల్పమైనదే కావచ్చు. ఏమైనాసరే దాన్ని ఖాతరు చేయనవసరం లేదు. దాన్ని చూసి భయపడకూడదు. ఎందుకంటే చివరకు పరాజయమే దాని గతి. బద్ర్ సంగ్రామం లేక మక్కా విజయం నేపథ్యంలో కూడా ఈ విధంగా అని ఉండవచ్చు. ఎందుకంటే ఈ రెండు చోట్ల కూడా అవిశ్వాసులకు ఘోరపరాజయం ఎదురయింది.

17. ఫిరౌన్ చక్రవర్తి మేకులు గలవాడని ఎందుకనబడిందంటే ఆ కిరాతకుడు, ఎవరిపైనయినా ఆగ్రహించినప్పుడల్లా వారి చేతులపై, తలపై, పాదాలపై మేకులు దిగబెట్టే వాడు. లేదా అతని సామ్రాజ్య విస్తీర్ణాన్ని, అతని అనుశాసన పర్వంలోని స్థిరత్వాన్ని, అట్టహాసాన్ని తెలియజెప్పటానికి మేకుల ఉపమానం ఇచ్చి ఉండవచ్చు. ఎందుకంటే ఏదన్నా వస్తువుకు ఎక్కడన్నా గట్టిగా దిగబెట్టడానికి మేకులు ఉపయోగిస్తారు. ఫిరౌన్ సైనికులు చాలా బలవంతులు. అతని అనుంగు అనుచరులు కూడా అతని ప్రభుత్వ సుస్థిరత కోసం అహోరాత్రులు పాటుపడేవారు.

18. అయికా వారి గురించి ఇంతకుముందు కూడా వచ్చింది. ఉదాహరణకు : షుఅరా సూరా 176 ఆయతుకు వివరణ చూడండి.

14 వారిలో దైవప్రవక్తలను ధిక్కరించని వారంటూ ఎవరూ లేరు.
అందువల్ల నా శిక్ష వారిపై ఖరారు అయ్యింది.

إِن كُلٌّ إِلَّا كَذَّبَ الرُّسُلَ فَحَقَّ عِقَابِ ﴿١٤﴾

15 వారు ఒకే ఒక్క కేక కోసం నిరీక్షిస్తున్నారు.[19] అందులో
ఎలాంటి తెరిపి కూడా ఉండదు.[20]

وَمَا يَنظُرُ هَٰؤُلَاءِ إِلَّا صَيْحَةً وَاحِدَةً مَّا لَهَا مِن فَوَاقٍ ﴿١٥﴾

16 "ప్రభూ! మా (మంచీచెడుల) భాగమేదో లెక్కల దినానికి
ముందే[21] మాకు ఇచ్చేయకూడదా?!" అని వారంటున్నారు.

وَقَالُوا رَبَّنَا عَجِّل لَّنَا قِطَّنَا قَبْلَ يَوْمِ الْحِسَابِ ﴿١٦﴾

17 (ఓ ప్రవక్తా!) వారు చెప్పే మాటలపై ఓపిక పట్టు. మా
దాసుడైన దావూదు (అలైహిస్సలాం)ను జ్ఞాపకం చేసుకో! అతడు
మహాశక్తిమంతుడు.[22] నిశ్చయంగా అతను (అల్లాహ్ వైపునకు)
అధికంగా మరలేవాడు.

اصْبِرْ عَلَىٰ مَا يَقُولُونَ وَاذْكُرْ عَبْدَنَا دَاوُودَ ذَا الْأَيْدِ ۖ إِنَّهُ أَوَّابٌ ﴿١٧﴾

18 మేము పర్వతాలను అతని అదుపులోపెట్టాము. అవి అతనితో
పాటే సాయంత్రం పూట, ఉదయం పూట (మా) పవిత్రతను
కొనియాడేవి.

إِنَّا سَخَّرْنَا الْجِبَالَ مَعَهُ يُسَبِّحْنَ بِالْعَشِيِّ وَالْإِشْرَاقِ ﴿١٨﴾

19 అలాగే, పక్షులను కూడా గుమిగూడిన స్థితిలో. అవన్నీ కలసి
అతనితో పాటే (దైవం వైపుకు) మరలేవి.[23]

وَالطَّيْرَ مَحْشُورَةً ۖ كُلٌّ لَّهُ أَوَّابٌ ﴿١٩﴾

---

19. అంటే – శంఖం ఊదబడగానే ప్రళయం సంభవిస్తుంది.

20. **'ఫవాఖ్'** (فَوَاق) అంటే పాలు పితక దలచిన వ్యక్తి దూడను ఆవు లేక గేదెవద్దకు వదులుతాడు. దూడ పాలు పీల్చగానే అది చేపుతుంది. చేపగానే అతను ఆ దూడను బలవంతంగా వెనక్కిలాగి పాలు పితకటం మొదలెడతాడు. పశువు చేపటానికి – దూడను కట్టివేసి పాలుపితకటానికి మధ్య ఉండే కొద్దిపాటి సమయమే **'ఫవాఖ్'** అనబడుతుంది. అంటే శంఖం ఊదినమీదట ప్రళయం రావటానికి ఆ పాటి తెరిపి కూడా ఉండదు. ఆ లోపే భూప్రకంపన మొదలవుతుంది.

21. **'ఖిత్తున్'** (قِطّ) అంటే భాగం, వాటా అని అసలు అర్థం. కాని ఈ ఆయతులో మాత్రం కర్మల పత్రం లేక చేసు కున్న పనులు అన్న అర్థం వస్తుంది. అంటే మా కర్మల ప్రకారం మాకు దక్కవలసిన బహుమానమో, శిక్షయో ఆ లెక్కల రోజు రాకముందే ఇచ్చేయి ప్రభూ! అని వారు అన్నారు. ప్రళయదినం అసంభవం అని చెప్పటానికి వారు ఈ విధంగా ఎగతాళి చేశారు.

22. **'అయ్‌దిన్'** (اَيْد) అనేది ఇక్కడ **'యద్'** (చేయి) అనే పదానికి బహువచనం కాదు. బలం, శక్తి అన్న భావంలో ఇది వాడబడింది. ఉర్దూలోని 'తాయీద్' (సమర్థింపు) అన్న పదం దీని నుంచి వచ్చినదే. ఇక్కడ బలం అంటే ధార్మిక శక్తి అని తీసుకోవాలి. హదీసులో చెప్పబడినట్లు – "అల్లాహ్‌కు అన్నిటికన్నా ప్రియమైనది నమాజు. అందులోనూ దావూదు (అలైహిస్సలాం) గారి నమాజు మరీ ప్రియమైనది. అల్లాహ్‌కు అన్నింటికన్నా ఇష్టకరమైనవి ఉపవాసాలు. అందునా దావూదు (అలైహిస్సలాం) ఉపవాసాలు అంటే ఆయనకు మరీ ఇష్టం. ఆయన అర్ధరాత్రి వరకు నిద్ర పోయేవారు. తర్వాత మేల్కొని మూడువంతుల భాగం నమాజు చేసేవారు. ఆ తర్వాత రాత్రిలో ఆరోవంతు భాగం పడుకునేవారు. ఒకరోజు ఉపవాసం ఉండేవారు. ఒకరోజు ఉపవాసం ఉండరు. రణరంగంలో వెన్నుచూపి పారిపోయే వారు కారు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా; ముస్లిం – కితాబుస్సియామ్).

**20** మేమతని రాజ్యవ్యవస్థను పటిష్ఠ పరిచాము.[24] అతనికి వివేకాన్ని ప్రసాదించాము.[25] (వివాదాస్పద) విషయాలపై తీర్పు చేయటం (కూడా నేర్పాము).[26]

وَشَدَدْنَا مُلْكَهُ وَآتَيْنَاهُ الْحِكْمَةَ وَفَصْلَ الْخِطَابِ ﴿٢٠﴾

**21** మరి తగవుపడిన వారి సమాచారంగాని నీకు అందిందా? అప్పుడు వారు గోడదూకి (అతని) ప్రార్థనా గదిలోకి వచ్చేశారు.[27]

وَهَلْ أَتَاكَ نَبَأُ الْخَصْمِ إِذْ تَسَوَّرُوا الْمِحْرَابَ ﴿٢١﴾

**22** వారు దావూదు (అలైహిస్సలాం)ను సమీపించగానే అతను వారి పట్ల భీతి చెందాడు.[28] వారు ఇలా విన్నవించుకున్నారు : "భయపడకండి. మేమిద్దరం తగాదా పడ్డాము. మాలో ఒకరిం కొకరిపై అన్యాయానికి పాల్పడ్డారు. కాబట్టి తమరు మా ఇద్దరి మధ్య న్యాయసమ్మతంగా తీర్పుచేయండి. అన్యాయం మాత్రం చేయకండి. మాకు సరైన దారి చూపండి.[29]

إِذْ دَخَلُوا عَلَىٰ دَاوُودَ فَفَزِعَ مِنْهُمْ ۖ قَالُوا لَا تَخَفْ ۖ خَصْمَانِ بَغَىٰ بَعْضُنَا عَلَىٰ بَعْضٍ فَاحْكُم بَيْنَنَا بِالْحَقِّ وَلَا تُشْطِطْ وَاهْدِنَا إِلَىٰ سَوَاءِ الصِّرَاطِ ﴿٢٢﴾

**23** "ఇతను నా సోదరుడు.[30] ఇతని దగ్గర తొంభై తొమ్మిది గొర్రెలున్నాయి. నా దగ్గర మాత్రం ఒకే ఒక్క గొర్రె ఉన్నది. అయినా ఈ ఒక్కదానిని కూడా తనకే ఇచ్చేయమని ఇతనంటున్నాడు.[31] వాదనలో నాతో చాలా పరుషంగా వ్యవహరిస్తున్నాడు."[32]

إِنَّ هَٰذَا أَخِي لَهُ تِسْعٌ وَتِسْعُونَ نَعْجَةً وَلِيَ نَعْجَةٌ وَاحِدَةٌ فَقَالَ أَكْفِلْنِيهَا وَعَزَّنِي فِي الْخِطَابِ ﴿٢٣﴾

---

23. అంటే ఉదయం, సాయం సమయాలలో పర్వతాలు కూడా దావూద్ (అలైహిస్సలాం)తో కలిసి దైవకీర్తన చేసేవి. గుంపుగా ఎగిరే గువ్వలు, పక్షులు కూడా జబూర్ గ్రంథ పారాయణం వినగానే వచ్చి వాలేవి. ఆయనతో కలిసి అవి కూడా దైవస్తోత్రం చేసేవి. **'మహ్షూరతన్'** (مَحْشُورَة) అంటే అందరూ కలిసి అని అర్థం.

24. అంటే భౌతికంగా, ఆధ్యాత్మికంగా, రాజకీయపరంగా కూడా అతని రాజ్యానికి సుస్థిరతను చేకూర్చాము.

25. అంటే అతనికి దైవదౌత్యాన్ని ప్రసాదించాము. సరైన అభిప్రాయాన్ని కలిగివుండే జ్ఞానాన్ని వొసగాము. స్పష్టంగా, సూటిగా మాట్లాడే స్వభావాన్ని అలవర్చాము. సదాచరణ చేసే సద్బుద్ధిని కూడా అతనికి అనుగ్రహించాము.

26. తగాదాలను పరిష్కరించే నేర్పునూ, విషయావగాహనను, వాక్పటిమను ప్రసాదించాము.

27. అరబీ ఆయతులో **'మిహ్రాబ్'** (الْمِحْرَابُ) అని ఉంది. మిహ్రాబ్ అంటే మనిషి అన్ని విషయాల నుండి అల్లాహ్ వైపుకు ఏకోన్ముఖుడై దైవారాధన చేసే ఏకాంత వాసం లేక ప్రైవేటు గది అని అర్థం. చక్రవర్తి అలాంటి ఏకాంత మందిరంలో ఉన్నప్పుడు సాధారణంగా ద్వారంపై సిపాయిలు, అంగరక్షకులు పహరా కాస్తుంటారు. కాని ఈ తగవుపడిన వ్యక్తులు వెనుక వైపు నుంచి గోడ ఎక్కి గదిలో ప్రవేశించారు.

28. హజ్రత్ దావూదు (అలైహిస్సలాం)కు ఆ క్షణంలో భయమేయటం ఆశ్చర్యకరం కాదు. ఎందుకంటే ఆ అపరిచిత వ్యక్తులు ద్వారం గుండా రాకుండా వెనుక వైపునుంచి గోడ దూకి వచ్చారు. వారు ఆ దుస్సాహసానికి ఒడిగట్టినదిగాక, చక్రవర్తితో నేరుగా మాట్లాడుతున్నారు. నిస్సంకోచంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

భీతిగొలిపే సంఘటనకు భయపడటం మానవ సహజం. ఈ 'భయపడటం' అనేది ప్రవక్తా పదవికి గానీ, ఏకదైవారాధనా దృక్పథానికిగాని విరుద్ధమైన విషయం కాదు. దైవేతరులను ఆశ్రయించి, వారికి భయపడటమే ఏకదైవారాధన (తౌహీద్)కు విరుద్ధాంశం.

قَالَ لَقَدْ ظَلَمَكَ بِسُؤَالِ نَعْجَتِكَ إِلَىٰ نِعَاجِهِ ۖ وَإِنَّ كَثِيرًا مِّنَ الْخُلَطَاءِ لَيَبْغِي بَعْضُهُمْ عَلَىٰ بَعْضٍ إِلَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ وَقَلِيلٌ مَّا هُمْ ۗ وَظَنَّ دَاوُودُ أَنَّمَا فَتَنَّاهُ فَاسْتَغْفَرَ رَبَّهُ وَخَرَّ رَاكِعًا وَأَنَابَ ۩ (24)

**24** అతను (దావూదు) ఇలా అన్నాడు: "ఇతను తన గొర్రెలతో పాటు నీ గొర్రెనొక్క దానిని కూడా కలుపుకుంటానని అడిగి నీపై అన్యాయానికి ఒడిగడుతున్నాడు. భాగస్వాములలో చాలామంది (ఇలాంటి వారే అయి ఉంటారు. వారు) ఒండొకరిపై అన్యాయానికి పాల్పడుతూ ఉంటారు.[33] అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు మాత్రం అలా చేయరు. కాని అలాంటి వారు చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారు."[34] (అంతే!) మేము అతన్ని పరీక్షిస్తున్నామన్న సంగతిని దావూదు గ్రహించాడు. మరి తన ప్రభువును క్షమాభిక్ష కోరసాగాడు. కడుదీనంగా మోకరిల్లాడు.[35] (ఏకాగ్రతతో తన ప్రభువు వైపునకు) మరలాడు.

فَغَفَرْنَا لَهُ ذَٰلِكَ ۖ وَإِنَّ لَهُ عِندَنَا لَزُلْفَىٰ وَحُسْنَ مَآبٍ (25)

**25** మేము కూడా అతని (ఆ తప్పు)ని మన్నించాము.[36] నిశ్చయంగా అతను మా వద్ద సామీప్యం పొందినవాడు, మంచి స్థానం పొందినవాడు.

29. ఆ వచ్చినవారే 'భయపడవలసిన అవసరం లేద'ని అభయమిచ్చారు. తాము ఒకానొక విషయంలో తగాదా పడ్డామనీ, తమ తగాదాను న్యాయసమ్మతంగా పరిష్కరించాలని, తమకు మంచి దోవ చూపాలని వారు అభ్యర్థించారు.

30. **'సోదరుడు'** అంటే భావం ధార్మిక సోదరుడైనా కావచ్చు. లేక వ్యాపార భాగస్వామి అయినా కావచ్చు. 'సోదరుడు' అనే పదం బహు విస్తృతమైనది.

31. తన దగ్గర వున్న ఆ ఒక్క గొర్రెను కూడా ఆ తొంభైతొమ్మిది గొర్రెల్లో కలిపేయమని వాదిస్తున్నాడు. అన్నింటి ఆలనాపాలనా తనే చూసుకుంటాడట!

32. "వాదోపవాదాల్లో ఇతను నాపై ఆధిపత్యం వహించాడు" అని కూడా ఈ వాక్యానికి తర్జుమా చేయవచ్చు. ఇతనికి సిరిసంపదలతో పాటు వాగ్ధాటి కూడా ఉన్నది. మాటలతో ఎదుటివారిని ఇట్టే బోల్తా కొట్టించి తన పంతం నెగ్గించుకుంటాడు.

33. అంటే మానవ సముదాయాలలో ఈ బలహీనత సర్వసాధారణం. ఒక పార్ట్‌నర్ మరో పార్ట్‌నర్‌కు అన్యాయం చేసే ప్రయత్నంలో ఉంటాడు. రెండవ వాని వాటాను కూడా తనే స్వాహా చేయాలనుకుంటాడు.

34. అయితే విశ్వాసులు (మోమిన్లు) మాత్రం ఈ నైతిక బలహీనతకు దూరంగా ఉంటారు. ఎందుకంటే వారి ఆంతర్యాలలో దైవభీతి ఉంటుంది. వారు సదాచరణకు కట్టుబడి ఉంటారు. అందువల్ల ఇతరులపై జులుం చేసే, ఇతరుల సొమ్మును కబళించే ప్రవృత్తి వారిలో ఉండదు. వారు ఇచ్చే వారై ఉంటారేగాని పుచ్చుకునేవారు కారు. అయితే ఇలాంటి ఉత్తమ సుగుణాలు కలవారు లోకంలో అరుదుగానే ఉంటారు.

35. ఇది దావూదులోని రుజువర్తనకు ఒక తార్కాణం.

36. ఇంతకీ హజ్రత్ దావూద్ (అలైహిస్సలాం) వల్ల జరిగిన ఆ పొరపాటు ఏమిటి? ఏ కారణం చేత ఆయన పశ్చాత్తాపం చెందారు? ఎందుకని తన ప్రభువు సన్నిధిలో సాష్టాంగపడ్డారు? ఈ ప్రశ్నలకు దివ్య ఖుర్ఆన్‌లో సవివరమైన సమాధానం లేదు. ప్రామాణిక హదీసులలో కూడా ఈ వివరాలు రాలేదు. అందువల్ల కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఇస్రాయీలీ ఉల్లేఖనాలనే ఆధారంగా తీసుకుని ఒక ప్రవక్త స్థాయికి శోభించని రీతిలో వ్యాఖ్యానాలు చేశారు. మరికొంతమంది వ్యాఖ్యాతలు – ఉదాహరణకు ఇబ్నె కసీర్ లాంటివారు – ఈ విషయంపై ఖుర్ఆన్ హదీసులే

26 ఓ దావూద్! మేము నిన్ను భువిలో వారసుడి (ఖలీఫా)గా చేశాము. కనుక నువ్వు ప్రజల మధ్య సత్య (న్యాయ) బద్ధంగా తీర్పులు ఇస్తూ ఉండు. నీ మనోవాంఛలను అనుసరించకు. అన్యథా అవి నిన్ను అల్లాహ్ మార్గం నుంచి తప్పిస్తాయి. అల్లాహ్ మార్గం నుంచి తప్పిపోయిన వారికి కఠిన శిక్ష పడటం ఖాయం. ఎందుకంటే వారు లెక్కల దినాన్ని విస్మరించారు.

يَٰدَاوُۥدُ إِنَّا جَعَلْنَٰكَ خَلِيفَةً فِى ٱلْأَرْضِ فَٱحْكُم بَيْنَ ٱلنَّاسِ بِٱلْحَقِّ وَلَا تَتَّبِعِ ٱلْهَوَىٰ فَيُضِلَّكَ عَن سَبِيلِ ٱللَّهِ ۚ إِنَّ ٱلَّذِينَ يَضِلُّونَ عَن سَبِيلِ ٱللَّهِ لَهُمْ عَذَابٌ شَدِيدٌۢ بِمَا نَسُوا۟ يَوْمَ ٱلْحِسَابِ ﴿٢٦﴾

27 మేము భూమ్యాకాశాలను, వాటి మధ్యనున్న వాటిని లక్ష్య రహితంగా పుట్టించలేదు.[37] ఇది అవిశ్వాసుల ఆలోచన మాత్రమే. కాబట్టి అవిశ్వాసులకు (నరక) అగ్ని నుండి వినాశం తప్పదు.

وَمَا خَلَقْنَا ٱلسَّمَآءَ وَٱلْأَرْضَ وَمَا بَيْنَهُمَا بَٰطِلًا ۚ ذَٰلِكَ ظَنُّ ٱلَّذِينَ كَفَرُوا۟ ۚ فَوَيْلٌ لِّلَّذِينَ كَفَرُوا۟ مِنَ ٱلنَّارِ ﴿٢٧﴾

మౌనం వహించినప్పుడు దానికి సంబంధించి కూపీలు లాగటం భావ్యం కాదని అన్నారు. ఇక ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలలోని మూడవ వర్గం ఈ సంఘటనకు సంబంధించిన కొన్ని పాక్షిక, సాపేక్షిక విషయాలను పాఠకుల ముందుకు తెచ్చే ప్రయత్నం చేసింది. దివ్య ఖుర్‌ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన ఈ సంక్షిప్త సమాచారానికి ఎంతోకొంత వివరణ అవసరం అన్నది వారి ఉద్దేశం. అయితే ఈ వ్యాఖ్యాతలు కూడా ఏ ఒక్క వివరణపై కూడా ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.

వారిలో కొందరి కథనం ప్రకారం : హజ్రత్ దావూద్ (అలైహిస్సలాం) తన రాజ్యంలోని ఒక సిపాయిని అతని భార్యకు విడాకులివ్వమని ఆదేశించారు. ఆ కాలంలో ఇలాంటి ఉత్తర్వులు చెడుగా భావించబడేవి కావు. ఆయన అలా ఆదేశించటానికి కారణమేమిటంటే ఆ స్త్రీ తెలివితేటల గురించి, గుణగణాల గురించి హజ్రత్ దావూద్ (అలైహి)కి తెలిసింది. అటువంటి ఉత్తమురాలు ఒక సాధారణ సైనికోద్యోగికి భార్యగా ఉండటం కన్నా ఒక మహారాణిగా, రాజ్యంలో ప్రథమ మహిళగా ఉండటం మంచిదన్న కోరిక ఆయనలో కలిగింది. ఆమె ప్రజ్ఞాపాటవాలు, బుద్ధికుశలత రాజ్య ప్రజలకు ఉపయోగపడాలన్నది ఆయన ఉద్దేశం. ఆయన సంకల్పం మంచిదైనప్పటికీ అనేకమంది భార్యలుండగా ఉత్తమురాలన్న నెపంతో ఒక సగటు పౌరుని అర్ధాంగిని పొందాలనుకోవటం సముచితం కాబోదు. అదీగాక ఒక చక్రవర్తి ఈ విధంగా కోరటం వెనుక తిరుగులేని అధికారం, జబర్దస్తీ కూడా అంతర్లీనమై ఉంటాయి. అందువల్ల ఈ ఉపమానపు సంఘటన ద్వారా హజ్రత్ దావూదు (అలైహిస్సలాం)కు ఆయన పొరపాటును ఎత్తిచూపే ప్రయత్నం జరిగింది.

మరికొంతమంది కథనం ప్రకారం ఆయన గదిలోనికి జొరబడిన ఆ ఇద్దరు వ్యక్తులు మనుషులు కారు – దైవదూతలు. వారు ఒక స్వయం కల్పిత వ్యాజ్యాన్ని తీసుకుని ఆయన వద్దకు వచ్చారు. హజ్రత్ దావూద్ (అలైహి) వల్ల జరిగిన పొరపాటు ఏమిటంటే, ఆయన ఒక వ్యక్తి వాదనను వినగానే తన తీర్పును వినిపించారు. అవతలి వ్యక్తి చెప్పేది వినలేదు. అల్లాహ్ ఆయన అంతస్తుల్ని పెంచడానికి ఆయన్ని పరికించాడు. ఆయనకు తన తప్పు తెలిసిరాగానే ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా దైవాన్ని క్షమాపణ కోరుకున్నారు. దైవసన్నిధిలో మోకరిల్లారు.

ఇంకా కొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం ఇలా వుంది : ఆ వచ్చిన వారు దైవ దూతలు కారు, మానవులే. అది కల్పిత వ్యాజ్యం కాదు, నిజంగా వచ్చిన తగవులాటే. చక్రవర్తి తీర్పు కోసమే వారు వచ్చారు. ఆ విధంగా ఆయన నిగ్రహం, సంయమనం పరీక్షించబడింది. ఎందుకంటే ఈ సంఘటనలో ఒక రాజ్యాధికారిని ఉడికించే, రెచ్చగొట్టే కోణాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి : వారిద్దరూ అనుమతి పొందకుండానే, వెనుకవైపు నుంచి గోడదూకి వచ్చారు. రెండు : ఆరాధనా సమయంలో గదిలోకి జొరబడి అంతరాయం కలిగించారు. మూడు : వారి సంభాషణా తీరు కూడా ఒక రాజ్యాధికారితో సంభాషించవలసిన విధంగా లేదు (ఉదా : మాకు అన్యాయం చేయకండి అని అనటం). అయితే దైవానుగ్రహం వల్ల ఆయన రెచ్చిపోలేదు సరికదా ఎంతో నిగ్రహంగా వ్యవహరించారు. కాని మనసులో

28 ఏమిటి? మేము విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారిని
భూమిలో (నిత్యం) కల్లోలం రేకెత్తించే వారితో సమానులుగా చేసే
స్తామా? లేక భయభక్తులు గలవారిని పాపాత్ములతో సమానంగా
చేస్తామా?

أَمْ نَجْعَلُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ كَالْمُفْسِدِينَ فِي الْأَرْضِ أَمْ نَجْعَلُ الْمُتَّقِينَ كَالْفُجَّارِ ﴿٢٨﴾

29 ఇదొక శుభప్రదమైన గ్రంథం. ప్రజలు దీని వాక్యాలపై చింతన
చేసేటందుకు, బుద్ధిజీవులు దీని ద్వారా గుణపాఠం నేర్చుకునేం
దుకు మేము దీనిని నీ వైపుకు పంపాము.

كِتَابٌ أَنزَلْنَاهُ إِلَيْكَ مُبَارَكٌ لِّيَدَّبَّرُوا آيَاتِهِ وَلِيَتَذَكَّرَ أُولُو الْأَلْبَابِ ﴿٢٩﴾

30 మేము దావూదుకు సులైమాను (అనే కొడుకు)ను ప్రసాదిం
చాము. అతను ఎంతో మంచి దాసుడు, (నిత్యం మా వైపుకు)
మరలేవాడు.

وَوَهَبْنَا لِدَاوُودَ سُلَيْمَانَ ۚ نِعْمَ الْعَبْدُ ۖ إِنَّهُ أَوَّابٌ ﴿٣٠﴾

31 అతని ముందు (ఒకనాడు) సాయం సమయాన అతివేగంగా
పరుగెత్తే మేలు జాతి అశ్వాలు తేబడినప్పుడు[38]...

إِذْ عُرِضَ عَلَيْهِ بِالْعَشِيِّ الصَّافِنَاتُ الْجِيَادُ ﴿٣١﴾

32 అతనిలా అన్నాడు : "నేను నా ప్రభువు ధ్యానంపై ఈ (మేలు
జాతి అశ్వ) సంపద పట్లగల మోజుకు ప్రాధాన్యతనిచ్చాను.
ఈలోగా (సూర్యుడు) తెరచాటుకు వెళ్ళి పోయాడు.

فَقَالَ إِنِّي أَحْبَبْتُ حُبَّ الْخَيْرِ عَن ذِكْرِ رَبِّي حَتَّىٰ تَوَارَتْ بِالْحِجَابِ ﴿٣٢﴾

33 "వాటిని మళ్లీ నా దగ్గరకు తీసుకురండి." తరువాత (అతను)
వాటి పిక్కలను, మెడలను నిమరసాగాడు.[39]

رُدُّوهَا عَلَيَّ ۖ فَطَفِقَ مَسْحًا بِالسُّوقِ وَالْأَعْنَاقِ ﴿٣٣﴾

---

కించిత్ అసహనం కూడా కలిగింది. ఆపాటి పొరబాటు కూడా ఒక ప్రవక్తకు శోభించదు. ఆ ఆలోచన రాగానే ఆయన దైవసన్నిధిలో మోకరిల్లి, క్షమాభిక్ష కోరారు. వాస్తవం ఏమిటో అల్లాహ్‌కే బాగా తెలుసు.

37. పైగా ఒకానొక ప్రత్యేక ఉద్దేశంతో పుట్టించాడు. తన దాసులు తనను ఆరాధించాలన్నదే ఆ ఉద్దేశం. తనను ఆరాధించిన వారికి ఉత్తమమైన బహుమానం వొసగుతానని, తన ఆరాధన పట్ల గర్వంతో విముఖత చూపిన వారిని నరకానికి ఆహుతి చేస్తానని దేవుడు ప్రకటించాడు.

38. **'సాఫినాత్'** (**الصّٰفِنٰتُ**) అంటే మూడు కాళ్ళపై నిలబడిన గుర్రాలని భావం. అంటే వేగంగా పరుగెత్తడానికి అవి సదా సిద్ధంగా ఉంటాయి. యుద్ధాల కోసం హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) మేలుజాతి గుర్రాలను పెంచేవారు. అప్పుడప్పుడూ ఈ అశ్వసంపదను తనిఖీ కూడా చేసేవారు. ఒక రోజు సాయంత్రం పూట ఆయన సమక్షంలో వేగంగా పరుగెత్తే కొన్ని గుర్రాలు హాజరుపరచబడ్డాయి. **'జియాద్'** (**جِيَاد**) అంటే వేగంగా పరుగెత్తే గుర్రాలు. 'అషియ్యున్' అంటే జుహ్ర్ లేక అస్ర్ నుంచి సూర్యాస్తమయం మధ్య సమయం. దాన్నే మనం సాయంకాలమని వ్యవహరిస్తాం.

39. గుర్రాలను తనిఖీ చేసే కార్యక్రమంలో లీనమైపోవటం చేత అస్ర్ నమాజ్ లేక సాయంత్రం పూట ఆయన చేసే దైవధ్యాన సమయం దాటిపోయింది. దానికి ఆయన అమితంగా బాధపడ్డారు. అశ్వసంపద మీద ఉన్న మోజులో పడి సమయాన్ని విస్మరించారు. ఈలోగా పొద్దస్తమించింది. ఈ రోజు చేయవలసిన దైవారాధన సంగతినే

34 మేము సులైమానును పరీక్షించాము. అతని సింహాసనంపై ఒక దేహాన్ని పడవేశాము.[40] తరువాత అతను (మా వైపు) మరలాడు.

وَلَقَدْ فَتَنَّا سُلَيْمٰنَ وَاَلْقَيْنَا عَلٰى كُرْسِيِّهٖ جَسَدًا ثُمَّ اَنَابَ ﴿34﴾

35 "ప్రభూ! నన్ను మన్నించు. నాకు తప్ప ఇతరులెవరివల్లా కాని సామ్రాజ్యాన్ని నాకు ప్రసాదించు.[41] నిశ్చయంగా నీవు గొప్ప ప్రదాతవు" అని వేడుకున్నాడు.

قَالَ رَبِّ اغْفِرْ لِيْ وَهَبْ لِيْ مُلْكًا لَّا يَنْۢبَغِيْ لِاَحَدٍ مِّنْۢ بَعْدِيْ ۚ اِنَّكَ اَنْتَ الْوَهَّابُ ﴿35﴾

36 అందుచేత మేము గాలిని అతని అదుపాజ్ఞలలో ఉంచాము. అది అతని ఆదేశానుసారం మలయమారుతంలా (వీస్తూ) అతను కోరినచోటికల్లా చేర్చేది.[42]

فَسَخَّرْنَا لَهُ الرِّيْحَ تَجْرِيْ بِاَمْرِهٖ رُخَآءً حَيْثُ اَصَابَ ﴿36﴾

మరచిపోయానే! అని బాధపడ్డారు. తరువాత ఆయన ఆ గుర్రాలను తెప్పించి వాటిని చంపేశారు – ఇమామ్ షౌకానీ, ఇమామ్ ఇబ్నె కసీర్ వంటి ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఈ వ్యాఖ్యానానికే ప్రాముఖ్యం ఇచ్చారు.

అయితే మరికొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం తద్భిన్నంగా ఉంది. వారి ప్రకారం ఈ భావం వస్తుంది –

ప్రభువు నామస్మరణ మూలంగానే నాకు ఈ గుర్రాలపై మోజు పెరిగింది. వీటి మూలంగా దైవమార్గంలో ధర్మయుద్ధం చేయటం సులభతరమవుతుంది. దరిమిలా ఆయన ఆ గుర్రాలను దౌడు తీయించారు. అవి కంటికి కనిపించనంత దూరం పరుగెత్తాయి. ఆ తరువాత వాటిని మళ్లీ రప్పించారు. ఆ గుర్రాల పిక్కలను, మెడలను ఆప్యాయంగా నిమిరారు. ఇమామ్ ఇబ్నె జరీర్ ఈ రెండవ వ్యాఖ్యానం వైపుకే మొగ్గారు. ఎన్నో కారణాల దృష్ట్యా ఈ రెండవ వ్యాఖ్యానమే సరైనదని అనిపిస్తోంది. నిజము దేవుడెరుగు. **'ఖైరున్'** అన్న పదం ఖుర్ఆన్‌లో ధనం అనే అర్థంలో ఉపయోగించబడింది. అయితే ఇక్కడ ఈ పదానికి గుర్రాలు అని అర్థం.

40. ఇంతకీ ఆ పరీక్ష ఏమిటి? సింహాసనంపై పడవేయబడిన ఆ దేహం ఎవరిది? అలా చేయటంలోని మర్మం ఏమిటి? – వీటికి సంబంధించిన వివరాలు కూడా ఖుర్ఆన్, హదీసులలో లేవు. అయితే ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఒక ప్రామాణిక హదీసులో ఉన్న సంఘటనను తెచ్చి, ఈ సంఘటనకు అన్వయింపజేశారు. దాని ప్రకారం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) ఒకసారి, 'ఈ రోజు రాత్రి నేను నా భార్యలందరి వద్దకూ పోతాను (వారు 70 లేక 90 మంది ఉన్నారు). తద్వారా గుర్రపు స్వారీ చేసే యోధులు జన్మిస్తారు. వారు దైవమార్గంలో పోరాడుతారు' అని అన్నారు. కాని ఆయనగారు 'ఇన్‌షా అల్లాహ్' అనలేదు. తన ప్రణాళికపైనే ఆధారపడ్డారు. తత్ఫలితంగా ఒక్కగా నొక్క భార్య తప్ప ఎవరూ పురుడు పోసుకోలేదు. గర్భవతి అయిన ఆ ఒక్కావిడ కూడా అసంపూర్ణ శిశువునే కన్నది. ఆ శిశువుకు సగం దేహం మాత్రమే ఉన్నది. ఒకవేళ సులైమానే గనక ఇన్‌షా అల్లాహ్ (దైవచిత్తమయితే) అని పలికివుంటే ఆయన భార్యలందరికీ యోధులు జన్మించి ఉండేవారని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) చెప్పారు. (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా). సులైమాన్‌గారు 'ఇన్‌షా అల్లాహ్' అనకపోవటమే బహుశా ఆయన పాలిట ఒక పరీక్ష అయిందని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. సింహాసనం మీద పడవేయబడిన ఆ అర్ధ శరీరం కూడా బహుశా ఆ అసంపూర్ణ శిశువే అయి ఉండవచ్చు. (నిజము దేవుడెరుగు).

41. అంటే, అశ్వ వీరులను పొందాలన్న నా వాంఛ ఎలాగూ నీ ప్రణాళికననుసరించి నెరవేరలేదు. అయితే 'ఇతరులెవరికీ లభించని గొప్ప సామ్రాజ్యాన్ని నాకు ప్రసాదించు. సంతానం లేకపోయినా ఫరవాలేదు' అని ఆయన ప్రార్థించారు. ఆయన ఆ విధంగా ప్రార్థించటంలోని ప్రధాన ఉద్దేశం కూడా దైవధర్మోన్నతే.

42. అంటే, మేము సులైమాన్ (అలైహిస్సలాం) ప్రార్థనను ఆమోదించాము. అతనికి అపూర్వమైన రాజ్యాధికారాన్ని ప్రసాదించాము. ఆఖరికి వాయువు కూడా అతని చెప్పుచేతల్లో ఉండేది.

**37** (బలాఢ్యులైన) జిన్నాతులను కూడా (అతని స్వాధీనంలో ఉంచాము), అన్ని రకాల కట్టడాలు కట్టేవారిని, గజ ఈతగాళ్ళను,

وَالشَّيٰطِيْنَ كُلَّ بَنَّاۤءٍ وَّغَوَّاصٍ ﴿٣٧﴾

**38** సంకెళ్ళలో బంధించబడి ఉండే[43] ఇతర జిన్నాతులను కూడా (వశపరచాము).

وَّاٰخَرِيْنَ مُقَرَّنِيْنَ فِى الْاَصْفَادِ ﴿٣٨﴾

**39** ఇదీ మా అనుగ్రహం! ఇక నువ్వు (ఎవరికైనా) ఉపకారం చేసినా, ఆపి ఉంచినా నీ నుండి లెక్క తీసుకోబడదు.[44]

هٰذَا عَطَاۤؤُنَا فَامْنُنْ اَوْ اَمْسِكْ بِغَيْرِ حِسَابٍ ﴿٣٩﴾

**40** అతనికి మా దగ్గర మంచి సామీప్యం ఉంది. చాలా మంచి గమ్యస్థానం కూడా.[45]

وَاِنَّ لَهٗ عِنْدَنَا لَزُلْفٰى وَحُسْنَ مَاٰبٍ ﴿٤٠﴾

**41** మా దాసుడైన అయ్యూబ్ (అలైహిస్సలాం)ను జ్ఞప్తికి తెచ్చుకో. "షైతాను నన్ను దుఃఖానికి, బాధకు లోను చేశాడు"[46] అని అతను తన ప్రభువుకు మొరపెట్టుకున్నప్పుడు,

وَاذْكُرْ عَبْدَنَاۤ اَيُّوْبَ ۘ اِذْ نَادٰى رَبَّهٗۤ اَنِّىْ مَسَّنِىَ الشَّيْطٰنُ بِنُصْبٍ وَّعَذَابٍ ﴿٤١﴾

---

ఈ ఆయతులో వాయువును సుతిమెత్తగా నడిచేది అని చెప్పటం జరిగింది. కాని మరోచోట చాలా ఉధృతంగా నడిచేది (అల్ అంబియా – 81) అని చెప్పబడింది. దీని భావం ఏమిటంటే ఆ వాయువు స్వతహాగా ఉధృతమైనదే. కాని సులైమాన్ పాలిట మాత్రం మలయమారుతంలా చేయబడింది. హజ్రత్ సులైమాన్ కోరిన విధంగా, కోరిన దిశలో తీసుకుపోయేది (ఫత్‌హుల్ ఖదీర్).

43. జిన్నాతులలో పెడసరిగా ప్రవర్తించేవాటిని, ధిక్కారుల్ని సంకెళ్ళతో బంధించటం జరిగేది. వాటి పొగరు మూలంగా కీడు జరగరాదన్నది దీని ఉద్దేశం.

44. అంటే – నీవు చేసిన ప్రార్థన ప్రకారం మేము నీకు మహా సామ్రాజ్యాన్ని ఇచ్చాము. కాబట్టి నువ్వు ప్రజలలో నీవు కోరిన వారికి దానం చేస్తూ ఉండు. నీవు తలచిన వారికి ఇవ్వకు. ఈ విషయంలో నీకు స్వేచ్ఛ ఇవ్వబడింది. ఈ పంపకం గురించి నిన్ను నిలదీసి అడగటం జరగదు.

45. ఇహలోకంలో సులైమానుకు తిరుగులేని రాజ్యాధికారాన్ని, శక్తియుక్తులను ప్రసాదించాము. దాంతోపాటు పరలోకంలో కూడా అతన్ని మా సన్నిహితునిగా చేసుకుంటాము. అతని అంతిమ పరిణామం కూడా చాలా బావుంటుంది.

46. హజ్రత్ అయ్యూబ్ (అలైహిస్సలాం) గారి వ్యాధి, వ్యాధిగ్రస్త స్థితిలో ఆయన ప్రదర్శించిన సహనస్థయిర్యాలు జగద్విదితమే. దేవుడు ఆయన సిరిసంపదలను లాక్కుని, ఆయన్ని రోగిష్టిగా చేసి కఠినాతికఠినమైన పరీక్షకు గురిచేశాడు. ఎన్నో ఏండ్లు ఆయన ఆ బాధను భరించారు. నా అనుకున్న వారంతా ఆయనకు దూరమయ్యారు. కేవలం ఒక అర్థాంగి మాత్రం రేయింబవళ్లూ సేవలు చేస్తూ ఉండేది. కాయకష్టం చేసి తిండి గింజలు సంపాయించేది.

ఈ నేపథ్యంలో ఎన్నో కథనాలు మన ముందుకు వస్తాయి. వాటిలో ఏది ఎంతవరకు నిజం? అనేదాన్ని ధృవీకరించుకునే ఆధారాలేమీ లేవు. హజ్రత్ అయ్యూబ్ (అలైహి) తనకు కలిగిన దుఃఖానికి, బాధకు షైతాన్‌ను కారకునిగా పేర్కొనటం గమనార్హం. నిజానికి కష్టనష్టాలైనా, సుఖశాంతులైనా అల్లాహ్ తరఫునుంచే కలుగుతాయి కదా! మరి షైతాన్‌ను ఎందుకు కారకునిగా నిలబెట్టినట్లు? అన్న ప్రశ్న జనించటం సహజం. బహుశా షైతాను దుష్ప్రేరణ వల్లనే ఆయన ద్వారా ఏదైనా అవాంఛనీయమైన పని జరిగి ఉండవచ్చు. అది ఆయన్ని ఈ కఠిన పరీక్షకు గురిచేసి ఉండవచ్చు. లేదా అల్లాహ్‌తో జరపవలసిన సంభాషణా మర్యాదలను దృష్టిలో పెట్టుకుని ఆయనగారు మేలును అల్లాహ్ వైపుకు,

42 "నీ కాలిని (నేలకేసి) కొట్టు. ఇది స్నానం చేయటానికి, త్రాగ టానికి చల్లని నీరు"[47] (అని మేము సూచించాము).

ارْكُضْ بِرِجْلِكَ ۚ هَٰذَا مُغْتَسَلٌ بَارِدٌ وَشَرَابٌ ﴿٤٢﴾

43 మరి మేమతనికి, అతని పరివారాన్నంతటినీ (తిరిగి) ప్రసాదించాము. వారితో పాటు మరి అంతమందిని కూడా మా (ప్రత్యేక) కృపతో[48] అనుగ్రహించాము – విజ్ఞులకు గుణపాఠం కాగలిగేందుకు![49]

وَوَهَبْنَا لَهُ أَهْلَهُ وَمِثْلَهُم مَّعَهُمْ رَحْمَةً مِّنَّا وَذِكْرَىٰ لِأُولِي الْأَلْبَابِ ﴿٤٣﴾

44 "గడ్డిపరకల కట్టను చేత్తో పట్టుకుని కొట్టు. ప్రమాణ భంగానికి పాల్పడకు" (అని మేమతనికి సెలవిచ్చాము).[50] వాస్తవానికి మేమతన్ని సహనశీలునిగా పొందాము. నిశ్చయంగా అతను మంచి దాసుడు, (ప్రభువు వైపు) అమితంగా మరలేవాడు.

وَخُذْ بِيَدِكَ ضِغْثًا فَاضْرِب بِّهِ وَلَا تَحْنَثْ ۗ إِنَّا وَجَدْنَاهُ صَابِرًا ۚ نِّعْمَ الْعَبْدُ ۖ إِنَّهُ أَوَّابٌ ﴿٤٤﴾

కీడును షైతాను వైపుకు మళ్ళించి ఉండవచ్చు. **'నుస్బ్'** అంటే శారీరక బాధలు, **'అజాబ్'** అంటే ధనం లేకుండా చేసి పరీక్షించటం.

47. అల్లాహ్ అయ్యూబ్ (అలైహిస్సలాం) మొరను ఆలకించాడు. కాలిని నేలకేసి కొట్టమని సూచించాడు. ఆయన అలా చేయగానే ఒక నీటి ఊట చిమ్మింది. ఆ నీరును త్రాగగానే శరీరంలోపలి వ్యాధులన్నీ నయమైనాయి. ఆ నీటితో స్నానం చేయగానే శరీరం పైని పుండ్లన్నీ మటుమాయమై సంపూర్ణ స్వస్థత చేకూరింది. మరికొంతమంది ప్రకారం రెండు నీటి ఊటలు చిమ్మాయి. వాటిలో ఒకటి త్రాగునీరు. ఇంకొకటి స్నానం చేయటానికి ఉద్దేశించిన నీరు. కాని ఖుర్ఆన్ బోధనా శైలినిబట్టి మొదటిదే సరైనదనిపిస్తుంది – అంటే అది ఒక నీటి ఊట మాత్రమే.

48. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం పరీక్షార్థం తుదముట్టించబడిన మొదటి పరివారం మళ్ళీ బ్రతికించబడింది. దాని వంటి మరో పరివారం కూడా ప్రసాదించబడింది. కాని ఈ విషయం ప్రామాణిక ఆధారాల ద్వారా రుజువు కాలేదు. ప్రామాణిక విషయం ఏమిటంటే అల్లాహ్ ఆయనకు మునుపటికన్నా ఎక్కువగా (రెట్టింపు) సిరిసంతానాదుల్ని అనుగ్రహించాడు.

49. అంటే – మేము ఈ విధంగా హజ్రత్ అయ్యూబ్ (అలైహిస్సలాం)కు ఇదంతా తిరిగి అనుగ్రహించి మా ప్రత్యేక అనుగ్రహాన్ని వ్యక్తపరచటంతోపాటు, ఈ సంఘటనను విజ్ఞతావివేచనలు గల వారికోసం ఒక గుణపాఠ సూచనగా చేశాము. ఎందుకంటే వారు కూడా గడ్డుకాలంలో అయ్యూబ్ మాదిరిగానే ఉత్తమ సహనాన్ని ప్రదర్శించాలి.

50. అస్వస్థతకు లోనై ఉన్నకాలంలో ఆయన (అలైహిస్సలాం) అహోరాత్రులు సేవలందిస్తున్న అర్ధాంగిని – ఏదో విషయంపై– నూరు కొరడా దెబ్బలు కొడతానని ప్రతినబూనారు. అయితే ఆయనకు సంపూర్ణ ఆరోగ్య సంపద ప్రాప్తించిన మీదట, "నూరు గడ్డిపరకల (లేక ఈనెల) చీపురు కట్టను చేత్తో పట్టుకుని ఒక్క దెబ్బ కొట్టు, చాలు. నీ శపథం నెరవేరుతుంది" అని దేవుడు ఆయనకు సూచించాడు. అంటే ఈ ఆదేశం కేవలం హజ్రత్ అయ్యూబ్ (అలైహిస్సలాం) వరకే పరిమితమా? లేక ఈ వెసులుబాటు ఇతరులకూ వర్తిస్తుందా? అన్న విషయంలో విద్వాంసుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు మొదటి అభిప్రాయాన్ని సమర్థించారు. మరికొంతమంది ఏమంటారంటే సంకల్పంలో తీవ్రత లేని పక్షంలో ఈ సూత్రాన్ని అనుసరించవచ్చు (ఫత్హుల్ ఖదీర్). అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సయితం బలహీనుడు, అంగవికలుడైన ఒక వ్యభిచారికి నూరు కొరడా దెబ్బలు కొట్టేబదులు ఈ విధంగా నూరు ఈనెల కట్టతో ఒకే దెబ్బ కొట్టినట్లు ఒక హదీసు ద్వారా రూఢీ అవుతోంది. (ముస్నదె అహ్మద్ – 5/222; ఇబ్ను మాజ – కితాబుల్ హుదూద్). కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇలా చేయటం సబబేనని దీనిద్వారా రుజువు లభిస్తోంది.

**45** ఇంకా మా దాసులైన ఇబ్రాహీము, ఇస్‌హాఖు, యాఖూబు (అలైహిముస్సలాం) లను కూడా జ్ఞాపకం చేసుకో. వారు చేతులు గలవారు, కళ్లుగలవారు.[51]

وَاذْكُرْ عِبٰدَنَآ اِبْرٰهِيْمَ وَاِسْحٰقَ وَيَعْقُوْبَ اُولِي
الْاَيْدِيْ وَالْاَبْصَارِ ﴿45﴾

**46** మేము వారిని ఒకానొక ప్రత్యేక విషయానికై – అంటే పరలోక స్మరణ నిమిత్తం – ప్రత్యేకించాము.[52]

اِنَّآ اَخْلَصْنٰهُمْ بِخَالِصَةٍ ذِكْرَى الدَّارِ ﴿46﴾

**47** వారంతా మా వద్ద ఎన్నుకోబడినవారు, ఉత్తములు.

وَاِنَّهُمْ عِنْدَنَا لَمِنَ الْمُصْطَفَيْنَ الْاَخْيَارِ ﴿47﴾

**48** ఇస్మాయీల్, యసా, జుల్ కిఫ్ల్ (అలైహిముస్సలాం) లను కూడా జ్ఞాపకం చేసుకో. వారంతా ఉత్తముల సమూహానికి చెందినవారు.[53]

وَاذْكُرْ اِسْمٰعِيْلَ وَالْيَسَعَ وَذَا الْكِفْلِ
وَكُلٌّ مِّنَ الْاَخْيَارِ ﴿48﴾

**49** ఇదొక ఉపదేశం. నిశ్చయంగా భక్తి పరాయణుల కోసం చాలా మంచి నివాసముంటుంది.

هٰذَا ذِكْرٌ وَاِنَّ لِلْمُتَّقِيْنَ لَحُسْنَ مَاٰبٍ ﴿49﴾

**50** శాశ్వితమైన స్వర్గవనాలున్నాయి. వాటి ద్వారాలు వారికోసం తెరువబడి ఉన్నాయి.

جَنّٰتِ عَدْنٍ مُّفَتَّحَةً لَّهُمُ الْاَبْوَابُ ﴿50﴾

**51** వాటిలో వారు నిక్షేపంగా దిండ్లకు ఆనుకుని, బోలెడు పండ్లను, పానీయాలను తెప్పించుకుంటూ ఉంటారు.

مُتَّكِـِٕيْنَ فِيْهَا يَدْعُوْنَ فِيْهَا بِفَاكِهَةٍ
كَثِيْرَةٍ وَّشَرَابٍ ﴿51﴾

**52** వారి దగ్గర చూపులు క్రిందికి వాలి ఉండే సమవయస్కులైన సుందరీమణులుంటారు.[54]

وَعِنْدَهُمْ قٰصِرٰتُ الطَّرْفِ اَتْرَابٌ ﴿52﴾

**53** ఇదీ లెక్కల దినానికి సంబంధించి మీతో చేయబడిన వాగ్దానం.

هٰذَا مَا تُوْعَدُوْنَ لِيَوْمِ الْحِسَابِ ﴿53﴾

51. అంటే దైవారాధనలోనూ, దైవధర్మానికి సహాయపడటంలోనూ బలవంతులు, ధర్మావగాహన కలవారు. దూరదృష్టితో ఆలోచించేవారు. ఈ ఆయతులో 'అయ్‌దీ' (చేతులు) అనే పదం దైవానుగ్రహం అన్న భావంలో తీసుకోబడిందనీ, దేవుడు వాళ్ళను ప్రత్యేకంగా అనుగ్రహించాడని, వారు సయితం ప్రజలకు విస్తృతంగా తమ చేతులతో దానధర్మాలు చేసేవారని కొందరు వ్యాఖ్యానించారు.

52. పరలోక చింతన కోసం మేము వారిని ఎన్నుకున్నాము. ఎల్లవేళలా వారి దృష్టిలో పరలోకం ఉండేది. (ఎల్లప్పుడూ పరలోకాన్ని స్మరించుకోవటం అనేది కూడా దేవుని గొప్ప అనుగ్రహమే. ఇది కూడా సాత్వికతకు, భయభక్తులకు ప్రబల నిదర్శనమే) లేదా వారు పరలోకం వైపుకు, దైవమార్గం వైపుకు ప్రజలను పిలిచే పనిలో నిమగ్నులై ఉండేవారు.

53. యసా (అలైహిస్సలాం) హజ్రత్ ఇల్‌యాస్ (అలైహిస్సలాం) తర్వాత ఆయన స్థానంలో వచ్చినవారని అనబడుతోంది. జుల్ కిఫ్ల్ గురించిన వివరాల కోసం అల్ అంబియా సూరా 85వ ఆయతును చూడండి. **'అఖ్‌యార్'** అన్న పదం 'ఖైరున్'కు బహువచనం. శ్రేష్ఠులు అని దాని అర్థం.

54. అంటే, వారి చూపులు తమ భర్తలను దాటిపోవు. వారు మరీ బిడియం కలవారై ఉంటారు. 'అత్‌రాబ్' అన్న పదం

**54** ఇదీ మా ప్రసాదిత ఉపాధి! దీనికి అంతం అంటూ ఉండదు.[55]

إِنَّ هَٰذَا لَرِزْقُنَا مَا لَهُۥ مِن نَّفَادٍ ﴿54﴾

**55** ఇదీ (పుణ్యఫలం)[56] సంగతి. మరి తలబిరుసుల కొరకు[57] చాలా చెడ్డ నివాసం ఉంది.

هَٰذَا ۚ وَإِنَّ لِلطَّٰغِينَ لَشَرَّ مَـَٔابٍ ﴿55﴾

**56** (అది) నరకం – దానికి వారు ఆహుతి అవుతారు. (ఆహ్!) ఎంతచెడ్డ పాన్పు అది!

جَهَنَّمَ يَصْلَوْنَهَا فَبِئْسَ ٱلْمِهَادُ ﴿56﴾

**57** ఇదీ (వారి గతి)! దాన్ని వారు రుచి చూడాలి. మరిగే నీళ్ళు, చీము నెత్తురు,[58]

هَٰذَا فَلْيَذُوقُوهُ حَمِيمٌ وَغَسَّاقٌ ﴿57﴾

**58** అదిగాకుండా, అలాంటివే రకరకాల శిక్షలు ఉంటాయి.[59]

وَءَاخَرُ مِن شَكْلِهِۦٓ أَزْوَٰجٌ ﴿58﴾

**59** ఇదిగో! మీతోపాటే (నరకానికి) ఆహుతి అయ్యే మరో జట్టు వచ్చింది.[60] వారి కొరకు ఎలాంటి స్వాగత సన్నాహాలు లేవు.[61] వారు అగ్నికి ఆహుతి కానున్నారు.[62]

هَٰذَا فَوْجٌ مُّقْتَحِمٌ مَّعَكُمْ ۖ لَا مَرْحَبًۢا بِهِمْ ۚ إِنَّهُمْ صَالُوا۟ ٱلنَّارِ ﴿59﴾

---

'తిర్బున్'కు బహువచనం. అంటే వారు స్వర్గవాసుల సమవయస్కులై ఉంటారు. లేక వారి అందం ఎన్నటికీ క్షీణించదు (ఫత్‌హుల్ ఖదీర్).

55. ఇక్కడ ఉపాధి (ఆహారం) దైవప్రసాదితంగా పేర్కొనబడింది. పైగా అది ఎంతో గౌరవప్రదమైన ఉపాధి అయి ఉంటుంది. అది ఎడతెగనిది, అనంతమైనది. అనశ్వరమైనది. అక్కడ లభించే సత్కారం కూడా శాశ్వతమైనది.

56. అంటే ఇప్పటివరకూ మేలు పొందే వారి గురించి ప్రస్తావించబడింది. ఇక్కడి నుంచి తలబిరుసులకు పట్టే పర్యవసానం వివరించబడుతుంది.

57. **'తాఘీన్'** (طَٰغِينَ) అంటే దైవాజ్ఞలను లక్ష్యపెట్టనివారు, దైవప్రవక్తలను ధిక్కరించటమే గాకుండా వారిని ఎగతాళి చేసేవారు అని భావం. **'యస్‌లౌన'** (يَصْلَوْنَ)అంటే ప్రవేశిస్తారు, ఆహుతి అవుతారు అని అర్థం.

58. సలసలా కాగే నీరును **హమీమ్** అనంటారు. అది వారి ప్రేగులను కోసివేస్తుంది. **ఘస్సాఖ్** (**غَسَّاق**) అంటే నరకవాసుల శరీరాలనుంచి స్రవించే చీము లేక చెడు రక్తం అన్నమాట! అతి శీతలమైన పానీయాన్ని కూడా ఘస్సాఖ్‌గా వ్యవహరిస్తారు. దాన్ని త్రాగటం గగనమవుతుంది.

59. అంటే చీమునెత్తురు, సలసలా కాగే నీరు త్రాపటం లాంటి శిక్షలు ఇంకా ఎన్నో ఉంటాయి.

60. నరకద్వారాల వద్ద నిలబడివున్న దైవదూతలు అవిశ్వాసుల సర్దారులను ఉద్దేశించి చెప్పే మాటలివి! లేక అవిశ్వాసుల, మార్గభ్రష్టుల నాయకులు తమ అనుయాయులకు సైగచేసి పరస్పరం ఈ విధంగా చెప్పుకుంటారు.

61. ఈ మాటలు కూడా అవిశ్వాసుల లీడర్లు తమ అనుయాయులను చూచి చెప్పుకునేవే. లేదా దైవదూతల వ్యాఖ్యలకు సమాధానంగా వారు ఇలా అంటారు.

**"మర్‌హబా"** అంటే సుస్వాగతం అని అర్థం. **'లా మర్‌హబన్'** (لَا مَرْحَبًا) అనేది దీనికి వ్యతిరేకం.

62. తమ నాయకులకు ఎలాంటి మర్యాదలు లభించకపోవటంపై వారు ఇలా చెబుతారు. అంటే వారికీ – మాకూ మధ్య వ్యత్యాసమే లేదు. మాలాగే వారు కూడా నరకం వైపుకు తరుముకుపోబడుతున్నారు. మేము నరకయాతనకు పాత్రులుగా నిలిచినట్లే ఈ పెద్ద మనుషులు కూడా శిక్షార్హులుగా ఖరారయ్యారు అని చురక అంటిస్తారు.

60 వారు (తమను పెడత్రోవ పట్టించిన నాయకులను ఉద్దేశించి) ఇలా అంటారు: "కాదు. అసలు స్వాగతానికి నోచుకోనిది మీరే.[63] దీనిని మా ముందు తెచ్చి పెట్టింది కూడా మీరే కదా! కాబట్టి ఉండటానికి బహుచెడ్డ స్థలమే ఉంది."

قَالُوا بَلْ أَنتُمْ لَا مَرْحَبًا بِكُمْ ۖ أَنتُمْ قَدَّمْتُمُوهُ لَنَا ۖ فَبِئْسَ الْقَرَارُ ﴿٦٠﴾

61 వారు (అనుచరులు ఇంకా) ఇలా అంటారు : "మా ప్రభూ! మా కొరకు ముందు నుంచే (అవిశ్వాస పోకడను) తీసినవారికి[64] నరకయాతనను రెండింతలు చేయి."[65]

قَالُوا رَبَّنَا مَن قَدَّمَ لَنَا هَٰذَا فَزِدْهُ عَذَابًا ضِعْفًا فِي النَّارِ ﴿٦١﴾

62 వారు (ఇంకా) ఇలా అంటారు : "మనం దుష్టజనులుగా జమ కట్టినవారు మనకిక్కడ కనిపించటం లేదేమిటి?[66]

وَقَالُوا مَا لَنَا لَا نَرَىٰ رِجَالًا كُنَّا نَعُدُّهُم مِّنَ الْأَشْرَارِ ﴿٦٢﴾

63 "ఏమిటీ, మనమే వాళ్లను ఆట పట్టించామా?[67] లేక మన చూపులు వారి నుంచి తొలగిపోయాయా?"[68]

أَتَّخَذْنَاهُمْ سِخْرِيًّا أَمْ زَاغَتْ عَنْهُمُ الْأَبْصَارُ ﴿٦٣﴾

64 నరకవాసుల మధ్య ఈ రకమయిన ఘర్షణ తప్పకుండా జరిగి తీరుతుంది.[69]

إِنَّ ذَٰلِكَ لَحَقٌّ تَخَاصُمُ أَهْلِ النَّارِ ﴿٦٤﴾

65 (ఓ ప్రవక్తా!) వారికిలా చెప్పు : "నేనైతే హెచ్చరించేవాణ్ణి మాత్రమే.[70] ఒక్కడు, తిరుగులేనివాడు అయిన అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు.

قُلْ إِنَّمَا أَنَا مُنذِرٌ ۖ وَمَا مِنْ إِلَٰهٍ إِلَّا اللَّهُ الْوَاحِدُ الْقَهَّارُ ﴿٦٥﴾

63. అసలు దీనంతటికీ మీరే కారకులు. మీరు అవిశ్వాసాన్ని, అపమార్గాన్ని ఎంతో అందమైనదిగా చిత్రీకరించి మమ్మల్ని ఆకట్టుకునేవారు అని అనుయాయులు తమ పీష్వాలను తప్పుపడతారు.

64. వారు దుర్మార్గాన్ని సన్మార్గంగా అభివర్ణించారు. దుష్కార్యాన్ని పుణ్యకార్యంగా చిత్రీకరించారు. లేదా వారు అవిశ్వాసం (కుఫ్ర్) వైపుకు మమ్మల్ని పిలిచి, మాకీ దుర్గతిని పట్టించారు.

65. ఈ విధంగా తమ దుష్టనాయకులపై కక్షతీర్చుకునే ఉద్దేశంతో చెప్పిన మాటలు ఇతరచోట్ల కూడా ఉన్నాయి. ఉదాహరణకు : అల్ ఆరాఫ్ సూరా – 38వ వచనాన్ని, అల్ అహ్జాబ్ సూరా – 68వ వచనాన్ని చూడండి.

66. అంటే వారు ఒకప్పుడు – ప్రపంచంలో – విశ్వాసులను, పేద ముస్లింలను దుష్ట జనులుగా, అధములుగా జమకట్టేవారు. ఉదాహరణకు : అమ్మార్ బిన్ యాసిర్, సుహైబ్, బిలాల్, సల్మాన్ లాంటి సత్యామృతాన్ని ఆస్వాదించిన ధన్యజీవులను గేలి చేసేవారు. అనరాని మాటలనేవారు. అలాంటి పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయి. సత్యధర్మమైన ఇస్లాంను ఖచ్చితంగా అవలంబించే ముస్లింలను ఈనాడు ప్రపంచం ఛాందసవాదులు, ఫండమెంటలిస్టులు, ఉగ్రవాదులు వంటి బిరుదులతో సత్కరిస్తోంది.

67. అంటే, అలనాడు (ఇహలోకంలో) మనం వాళ్ళను ఎగతాళి చేసి ఘోరమైన తప్పు చేశామా?!

68. లేక వారు కూడా మనతోపాటే ఇక్కడే ఎక్కడైనా ఉన్నారా?? మనకు కానరాని చోట ఎక్కడైనా దాక్కున్నారా? అని సంశయంలో పడిపోతారు.

69. నరకవాసులు పరస్పరం గొడవపడటం, ఒండొకరిని నిందించుకోవటం ఒక వాస్తవిక విషయం.

**66** "ఆయన భూమ్యాకాశాలకు, వాటి మధ్యనున్న సమస్తానికీ ప్రభువు. ఆయన శక్తిశాలి, క్షమాశీలి."

رَبُّ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَمَا بَيْنَهُمَا الْعَزِيْزُ الْغَفَّارُ (66)

**67** (ఇంకా ఇలా) చెప్పు: "అది చాలా గొప్ప విషయం.[71]

قُلْ هُوَ نَبَؤٌا عَظِيْمٌ (67)

**68** "కాని మీరు దాన్ని లక్ష్యపెట్టడం లేదు.

اَنْتُمْ عَنْهُ مُعْرِضُوْنَ (68)

**69** "ఊర్ధ్వలోక సదస్సులో తలెత్తిన వివాదం గురించి నాకేమీ తెలీదు.[72]

مَا كَانَ لِيَ مِنْ عِلْمٍۢ بِالْمَلَاِ الْاَعْلٰٓى اِذْ يَخْتَصِمُوْنَ (69)

**70** "నేను స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి మాత్రమే అన్న సందేశమే నా వద్దకు వస్తుంది."[73]

اِنْ يُّوْحٰٓى اِلَيَّ اِلَّآ اَنَّمَآ اَنَا نَذِيْرٌ مُّبِيْنٌ (70)

**71** నీ ప్రభువు దైవదూతలతో,[74] "నేను మట్టితో ఒక మనిషిని సృష్టించబోతున్నాను" అని అన్నాడు.[75]

اِذْ قَالَ رَبُّكَ لِلْمَلٰٓئِكَةِ اِنِّيْ خَالِقٌۢ بَشَرًا مِّنْ طِيْنٍ (71)

**72** "నేనతన్ని (సంపూర్ణంగా) తీర్చిదిద్ది,[76] అతనిలో నా ఆత్మను ఊదినప్పుడు,[77] మీరంతా అతనికి సాష్టాంగ ప్రణామం చేయాలి"[78] (అన్నాడు).

فَاِذَا سَوَّيْتُهٗ وَنَفَخْتُ فِيْهِ مِنْ رُّوْحِيْ فَقَعُوْا لَهٗ سٰجِدِيْنَ (72)

---

70. అంటే మీరనుకుంటున్నట్లుగా నేను మరో వ్యక్తిని కాను. నేను దైవశిక్ష గురించి మిమ్మల్ని భయపెట్టే ప్రవక్తను. నన్ను నమ్మండి.

71. ఇదేదో ఆషామాషీ సంగతి కాదు. చాలా గంభీరంగా ఆలోచించదగ్గ విషయం. ఎందుకంటే ఇది ఏక దైవారాధనా సందేశం. మీరు దీనిపట్ల అలసత్వం ప్రదర్శించకండి. దీన్ని చాలా సీరియస్‌గా తీసుకోండి.

72. ఉన్నత స్థాయికి చెందినవారంటే దైవదూతలని భావం. వారు ఏ విషయం గురించి వాదించుకున్నారో నాకు తెలియదు. బహుశా ఆదం (అలైహిస్సలాం) సృష్టి సందర్భంగా వారు ఈ విధంగా వాదించుకుని ఉండవచ్చు. ఆ విషయమే మున్ముందు రానున్నది.

73. అంటే మిమ్మల్ని దైవశిక్షనుంచి – నరకాగ్ని బారి నుంచి రక్షించే సందేశం మాత్రమే మీకిస్తాను. మీరు దైవప్రసన్నతను చూరగొని స్వర్గానికి అర్హత సంపాదించే ఆదేశాలు మాత్రమే మీకు వివరించి చెబుతాను. దైవాగ్రహం నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవటానికి ఏ ఏ పాపకార్యాల జోలికి పోకూడదో వాటిని విశదీకరిస్తాను. ఈ పని కోసమే నేను దైవప్రవక్తగా పంపబడ్డాను.

74. ఈ వృత్తాంతం ఇంతకుముందు అల్ బఖర, అల్ ఆరాఫ్, అల్ హిజ్ర్, బనీ ఇస్రాయీల్ సూరాలలో, అల్ కహఫ్ సూరాలో కూడా వచ్చింది. ఈ సూరాలోనూ క్లుప్తంగా వివరించబడుతున్నది.

75. అంటే ఒక మానవ దేహాన్ని నిర్మించబోతున్నాను. మనిషికి మట్టితో అవినాభావ సంబంధం ఉంది. అతను మట్టితోనే చేయబడ్డాడు. మట్టి మీదే బ్రతుకుతాడు. మట్టిలో నుంచి పుట్టిన ఆహారమే తింటాడు. చివరకు మట్టిలోనే కలుస్తాడు. అందుకే అతడు మట్టి మనిషి (బషర్) అనబడతాడు.

76. అంటే అతనికి సంపూర్ణ మానవాకారం ఇచ్చి, అతని శరీరావయవాలన్నింటినీ సరిగ్గా సరిదిద్దిన పిదప....

77. అంటే అతనికి ప్రాణం పోసినపుడు–ఆ మట్టి విగ్రహంలో చలనం వస్తుంది. అల్లాహ్ ఇక్కడ ప్రాణాన్ని 'తన ఆత్మ'గా

73 అప్పుడు దైవదూతలంతా (ఆదంకు) సాష్టాంగపడ్డారు.[79]

فَسَجَدَ الْمَلٰٓئِكَةُ كُلُّهُمْ اَجْمَعُوْنَ ﴿٧٣﴾

74 ఇబ్లీసు తప్ప! (అతను మాత్రం సాష్టాంగపడలేదు) వాడు గర్వం ప్రదర్శించి,[80] తిరస్కారుల కోవలో చేరాడు.[81]

اِلَّآ اِبْلِيْسَ ؕ اِسْتَكْبَرَ وَكَانَ مِنَ الْكٰفِرِيْنَ ﴿٧٤﴾

75 "ఓ ఇబ్లీస్! నేను నా స్వహస్తాలతో సృష్టించిన వానిముందు[82] సాష్టాంగపడకుండా ఏ విషయం నిన్ను ఆపింది? నువ్వు గర్వపడు తున్నావా? లేక నువ్వు ఉన్నత శ్రేణికి చెందినవాడివా?" అని (అల్లాహ్) అడిగితే,

قَالَ يٰٓاِبْلِيْسُ مَا مَنَعَكَ اَنْ تَسْجُدَ لِمَا خَلَقْتُ بِيَدَيَّ ؕ اَسْتَكْبَرْتَ اَمْ كُنْتَ مِنَ الْعَالِيْنَ ﴿٧٥﴾

76 "నేను అతనికంటే ఘనుడను. (ఎందుకంటే) నీవు నన్ను అగ్నితో సృష్టించావు. అతన్నేమో మట్టితో సృష్టించావు"[83] అని వాడు సమాధానమిచ్చాడు.

قَالَ اَنَا خَيْرٌ مِّنْهُ ؕ خَلَقْتَنِيْ مِنْ نَّارٍ وَّ خَلَقْتَهٗ مِنْ طِيْنٍ ﴿٧٦﴾

---

చెప్పుకోవటాన్నిబట్టి సృష్టిలో మనిషి అనేవాడికి లభించిన గౌరవ పురస్కారం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. ఆ ఆత్మకు అల్లాహ్ ఒక్కడే యజమాని. ఆయనకు తప్ప ఇతరులెవరికీ దాని మీద అధికారం ఉండదు.

78. ఈ సాష్టాంగప్రణామం (సజ్దా) గౌరవార్థం చేయబడిందేగాని ప్రార్థనార్థం చేయబడలేదు. గౌరవార్థం ఈ విధంగా సాష్టాంగపడటం పూర్వం ధర్మసమ్మతంగా భావించబడేది. అందుకే అల్లాహ్ ఆదంకు 'సజ్దా' చేయమని నేరుగా తన దూతలనే ఆజ్ఞాపించాడు. అయితే ప్రస్తుతం గౌరవార్థం చేసే సాష్టాంగ ప్రణామానికి సయితం ఇస్లాంలో అనుమతి లేదు. మానవులకు చేసే సాష్టాంగ ప్రణామం గురించి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఈ విధంగా వక్కాణించారు: "ఒకవేళ ఈ సజ్దా (సాష్టాంగ ప్రణామం) ధర్మ సమ్మతమై ఉంటే తన భర్తకు సాష్టాంగపడమని స్త్రీమూర్తికి ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి." (మిష్కాత్ – కితాబున్నికాహ్).

79. ఇది మనిషికి లభించిన గౌరవోన్నతులకు మరో చిహ్నం. దైవదూతలంతటివారే అతనికి సాష్టాంగపడ్డారు. **'కుల్లుహుమ్'** (كُلُّهُمْ) అని అనటాన్నిబట్టి దైవదూతలందరూ అతని ముందు – గౌరవార్థం – తలవంచాయని స్పష్టమవుతోంది. ఒక్క దైవదూత కూడా దేవుని ఈ ఆజ్ఞను శిరసావహించటంలో తాత్సారం చేయలేదు. తర్వాత **'అజ్మవూన్'** (اَجْمَعُوْنَ) అని అనటాన్నిబట్టి అందరూ వెంటనే – ఒక్కుమ్మడిగా – సజ్దాలో పడిపోయారని కూడా అర్థమవుతోంది (ఫత్హుల్ ఖదీర్).

80. ఇబ్లీసు కూడా దైవదూతల కోవకు చెందినవాడేనని అనుకున్నపక్షంలో ఇబ్లీసు కూడా ఈ ఆజ్ఞా పరిధిలోకి వస్తాడు. లేనిపక్షంలో వాడు ఈ ఆజ్ఞాపరిధిలో లేడని భావించాలి. అయితే ఊర్ధ్వలోకాలలో ఉన్న కారణంగా వాడికి కూడా సాష్టాంగపడమని ఆదేశించటం జరిగింది. కాని వాడు అహంకారం మూలంగా త్రోసిపుచ్చాడు.

81. అంటే దైవాజ్ఞను ఖాతరు చేయని కారణంగా, గర్వాహంకారాన్ని ప్రదర్శించిన కారణంగా వాడు 'కాఫిర్' (తిరస్కారి)గా ఖరారు చేయబడ్డాడు. లేక దేవుని జ్ఞానం ప్రకారం అతను ముందు నుంచే కాఫిర్ అయి ఉండవచ్చు.

82. మనిషి శ్రేష్ఠతను, ఔన్నత్యాన్ని నొక్కి చెప్పటానికి దేవుడు ఈ విధంగా అన్నాడు. వాస్తవానికి ప్రతి వస్తువునూ సృష్టించినవాడు ఆ దేవుడే.

83. ఇదే షైతాను చేసిన ఘోరమైన తప్పిదం. మట్టికన్నా అగ్ని గొప్పదని వాడు తలపోశాడు. అర్థంపర్థం లేని అహంకారమే వాడిలో అలాంటి ఆలోచనను రేకెత్తించింది. ఆ వస్తువులలో దేనికైనా వేరొకదానిపై ఏదేని విషయంలో కొద్దిపాటి ఆధిక్యత ఉన్నా దాని వెనుక కూడా ఏదైనా బలమైన కారణం తప్పక ఉంటుంది. అల్లాహ్ ఆదంను మట్టితో స్వహస్తాలతో చేయటమే గాకుండా అతనిలో తన ఆత్మను ఊదాడు. మరి ఈ కోణం నుంచి ఆలోచిస్తే అగ్నికన్నా

77 (అప్పుడు అల్లాహ్ ఈ విధంగా) సెలవిచ్చాడు : "నువ్విక్క ణ్ణుంచి వెళ్ళిపో. నువ్వు ధూత్కరించబడ్డావు.

قَالَ فَاخْرُجْ مِنْهَا فَإِنَّكَ رَجِيمٌ ﴿٧٧﴾

78 "తీర్పుదినం వరకూ నీపై నా శాపం ఉంటుంది."

وَإِنَّ عَلَيْكَ لَعْنَتِي إِلَىٰ يَوْمِ الدِّينِ ﴿٧٨﴾

79 "ప్రభూ! అలాగయితే వారు తిరిగి లేపబడే రోజు వరకూ నాకు గడువు ఇవ్వు" అని (ఇబ్లీసు) విన్నవించుకోగా,

قَالَ رَبِّ فَأَنظِرْنِي إِلَىٰ يَوْمِ يُبْعَثُونَ ﴿٧٩﴾

80 "నీకు గడువు ఇవ్వబడింది" అని (అల్లాహ్) సెలవిచ్చాడు.

قَالَ فَإِنَّكَ مِنَ الْمُنظَرِينَ ﴿٨٠﴾

81 "సమయం నిర్ధారించబడివున్న రోజు వరకే" (అన్నాడు).

إِلَىٰ يَوْمِ الْوَقْتِ الْمَعْلُومِ ﴿٨١﴾

82 ఇబ్లీసు పలికాడు: "మరయితే నీ గౌరవమర్యాదల సాక్షిగా (చెబుతున్నాను) – అందరినీ నేను పెడదారి పట్టిస్తాను."

قَالَ فَبِعِزَّتِكَ لَأُغْوِيَنَّهُمْ أَجْمَعِينَ ﴿٨٢﴾

83 "ఎంపిక కాబడిన కొంతమంది నీ దాసులను తప్ప!" (అని అన్నాడు).

إِلَّا عِبَادَكَ مِنْهُمُ الْمُخْلَصِينَ ﴿٨٣﴾

84 "సరే! సత్యం మాత్రం ఇదే! నేను సత్యమే పలుకుతాను" అని అల్లాహ్ అన్నాడు.

قَالَ فَالْحَقُّ وَالْحَقَّ أَقُولُ ﴿٨٤﴾

85 "(అదేమిటంటే) నీతోనూ, నిన్ను అనుసరించే వారందరి తోనూ నేను నరకాన్ని నింపుతాను" (అని చెప్పాడు).

لَأَمْلَأَنَّ جَهَنَّمَ مِنكَ وَمِمَّن تَبِعَكَ مِنْهُمْ أَجْمَعِينَ ﴿٨٥﴾

86 (ఓ ముహమ్మద్!) వారికి చెప్పు : "నేను ఈ పనికిగాను మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటంలేదు.[84] ఇంకా – నేను మభ్యపెట్టేవాడిని కూడా కాను.[85]

قُلْ مَا أَسْأَلُكُمْ عَلَيْهِ مِنْ أَجْرٍ وَمَا أَنَا مِنَ الْمُتَكَلِّفِينَ ﴿٨٦﴾

మట్టే గొప్పదయింది. అదీగాక, కాల్చటం అగ్ని గుణం. ప్రతి వస్తువునూ అది కాల్చి భస్మీపటలం చేసేస్తుంది. కాగా; మట్టి మొక్కల్ని మొలకెత్తిస్తుంది. రకరకాల వస్తువుల ఉత్పత్తికి దోహదపడుతుంది.

84. దైవాజ్ఞాపాలనలో భాగంగానే నేను ధర్మ ప్రచారం చేస్తున్నాను. జీతం పుచ్చుకోవటం గానీ, ప్రాపంచిక సిరిసంపదలను ప్రోగుచేయటం గానీ నా ఆశయం కానేకాదు.

85. అంటే – దేవుడు చెప్పని విషయాన్ని నా తరఫున కల్పించి, దైవానికి అంటగట్టే వాడినికాను. నాకు ఆజ్ఞాపించబడని విషయాన్ని మీపై రుద్దేవాడిని కూడా కాను. పైగా దైవాజ్ఞలను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా మీ వరకు చేరవేస్తు న్నాను. ఈ నేపథ్యంలో ఇబ్నె మస్ఊద్ (రజి) ఇలా అనేవారు: "ఎవరికయినా ఏదైనా విషయం తెలీకపోతే 'అల్లాహ్‌కే ఎరుక' అని చెప్పాలి. ఇలా చెప్పటం కూడా జ్ఞానానికి ప్రతిబింబమే. ఎందుకంటే 'నేను తప్పుడు సృష్టిచేసే వాడిని కానని చెప్పు' అని దేవుడు తన ప్రవక్తతో చెప్పాడు" (ఇబ్నె కసీర్). ఈ ఆయతు ద్వారా తెలిసే మరో విషయం ఏమి టంటే దైనందిన జీవితంలో కూడా మనుషులు కుహనా ప్రతిష్ఠలకు, ఉత్తుత్తి ఆడంబరాలకు పోకూడదు. "కృత్రిమ మొహమాటాలకు, ఆర్భాటాలకు పోకూడదని మనకు ప్రబోధించబడింది" అని మహాప్రవక్త (స) ప్రవచించారు.

| | |
|---|---|
| **87** “ఇది లోకవాసులందరి కోసం ఆసాంతం ఒక జ్ఞాపిక (హిత బోధ).[86] | إِنْ هُوَ إِلَّا ذِكْرٌ لِّلْعَٰلَمِينَ ﴿٨٧﴾ |
| **88** “దీని వాస్తవికతను మీరు అనతికాలంలోనే (క్షుణ్ణంగా) తెలుసుకుంటారు.”[87] | وَلَتَعْلَمُنَّ نَبَأَهُۥ بَعْدَ حِينٍۭ ﴿٨٨﴾ |

(సహీహ్ బుఖారీ – హదీసు నెం. 7293). అతిథికి మర్యాద చేసే సమయంలో కూడా డాబుసరిగా వ్యవహరించరాదని దైవప్రవక్త (స) మనకు బోధించారని హజ్రత్ సులైమాన్ (రజి) చెప్పారు (సహీహ్ అల్ జామె అస్సఘీర్, లిల్ అల్‌బానీ – 9871). దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే జీవన ప్రమాణాల పేరిట అన్నపానీయాలలో, నివాసంలో, ఇతర జీవన వ్యవహారాలలో లేనిపోని ఆడంబరాలకు, కుహనా ప్రతిష్ఠలకుపోయి కష్టాలను కొనితెచ్చుకోవటం ఇస్లామీయ ప్రబోధనలకు విరుద్ధం. నిరాడంబరంగా, నిర్మోహమాటంగా ఉండాలని ఇస్లాం మనకు ప్రబోధిస్తోంది.

86. అంటే నేను మీకు చదివి వినిపించే ఖుర్‌ఆన్ లేదా దైవవాణి లేదా నేను మీకు పరిచయం చేసే జీవనధర్మం సమస్త మానవుల కోసం, జిన్నుల కోసం హితోపదేశం. కాకపోతే దీనిద్వారా ప్రయోజనం పొందాలన్న ఆకాంక్ష మీలో ఉండాలి. ఉంటే అది మీ కొరకు ప్రయోజనకారి అవుతుంది.

87. అంటే – దివ్య ఖుర్‌ఆన్ ఏ విషయాలనైతే మీకు విడమరచి చెప్పిందో, మరే వాగ్దానాలు చేసిందో, ఇంకా ఏ హెచ్చరికలు చేసిందో వాటి వాస్తవాన్ని మీరు అతి త్వరలోనే ప్రత్యక్షంగా తిలకిస్తారు. అవన్నీ మీ ముందు హాజరుపరచబడే రోజు తప్పక వస్తుంది. కొన్ని వాస్తవాలు బద్ర్ యుద్ధదినాన ప్రత్యక్షపరచబడ్డాయి. మరికొన్ని వాస్తవాలు మక్కా విజయం నాడు కళ్లముందు కదలాడాయి. ఇంకా ఎన్నో వాస్తవాలు మరణ ఘడియలోనూ, మరణానంతర జీవితంలోనూ బహిర్గతం అవుతాయి.

39 వ సూరా

# అజ్ జుమర్

## గుంపులు

అవతరణ మక్కాలో

ఆయతులు 75

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 71, 73 ఆయతులో ప్రస్తావనకు వచ్చిన 'జుమర్' (గుంపులు) అన్న పదం ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అల్లాహ్ దైవత్వంలో ఇతరులను భాగస్వాములుగా చేసే తీవ్రమైన చెడును ఈ సూరాలో గట్టిగా ఖండించడం జరిగింది. కేవలం ఒకే ఒక్క దేవుడైన అల్లాహ్‌ను ఆరాధించడాన్ని ప్రోత్సహించడం జరిగింది. ఈ సూరాలో దేవుని ఏకత్వం, ఆయన ఔన్నత్యం ప్రముఖంగా ప్రస్తావిస్తూ మానవ బలహీనతల గురించి వివరించడం జరిగింది. కష్టాల్లో ఉన్నప్పుడు మానవులు సహాయం కోసం మొరపెట్టుకుంటారు. కాని దేవుని అనుగ్రహం వారిపై వర్షించిన తర్వాత అదంతా తమ గొప్పదనంగా భావిస్తారు. తమ తెలివితేటలతో, తమ పథక రచనతో అదంతా సాధించామని గర్విస్తారు. దేవుని అనుగ్రహాలు నిజానికి పరీక్షలని చాలా మంది గుర్తించరు. వారి చెడుచేష్టల ఫలితాలు వారు అనుభవించక తప్పదని తెలుసుకోరు.*

*ఈ సూరాలో మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని కూడా ప్రస్తావిస్తూ, తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని వర్ణించడం జరిగింది. ఒక శంఖం పూరించబడుతుంది. ఆకాశాల్లో, భూమిపై ఉన్నవారంతా ఒక్కసారిగా నిర్ఘాంతపోతారు. ప్రపంచంలో ఎవరు ఏం చేసారో దానికి తగిన ప్రతిఫలం ఆ రోజు లభిస్తుంది. ఆ రోజున మానవులు రెండు వర్గాలుగా విభజించ బడతారు. ఒక వర్గం రక్షణ పొందుతుంది. మరో వర్గం శిక్షకు గురవుతుంది. మొదటి వర్గం విశ్వాసులది. వారు దైవభీతితో వ్యవహరించారు. వారు బృందాలు, బృందాలుగా గౌరవ మర్యాదలతో స్వర్గవనాల వైపునకు తీసుకువెళ్ళబడతారు. అక్కడ శాశ్వతమైన దైవానుగ్రహం వారికి లభిస్తుంది. స్వర్గవనాల ద్వారాలు వారికోసం తెరుచుకుంటాయి. అక్కడి ద్వారపాలకులు వారికి స్వాగతం పలుకుతారు. రెండవ వర్గం అవిశ్వాసులది. వారు సత్యాన్ని తిరస్కరించారు. దుర్మార్గాన్ని అవలంబించారు. వారిని హీనంగా నరకాగ్ని వైపునకు గుంపులు గుంపులుగా తోలుకుపోవడం జరుగుతుంది. వారి చెడ్డ నివాసం కోసం నరకద్వారాలు తెరుచుకోబడతాయి. వారి మూర్ఖపు అవిశ్వాసానికి, దుర్మార్గానికి ప్రతిఫలం ఇది.*

## అజ్ జుమర్[1] సూరా

سُوْرَةُ الزُّمَرِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

1 ఈ గ్రంథావతరణ సర్వాధిక్యుడైన, వివేకవంతుడైన అల్లాహ్ తరఫున జరిగింది.

تَنۡزِيۡلُ الۡكِتٰبِ مِنَ اللّٰهِ الۡعَزِيۡزِ الۡحَكِيۡمِ ①

2 (ఓ ముహమ్మద్ – సఅసం!) మేమీ గ్రంథాన్ని సత్యబద్ధంగా[2] నీ వైపుకు పంపాము. కాబట్టి నువ్వు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు – ధర్మాన్ని ఆయనకు మాత్రమే ప్రత్యేకిస్తూ![3]

اِنَّاۤ اَنۡزَلۡنَاۤ اِلَيۡكَ الۡكِتٰبَ بِالۡحَقِّ فَاعۡبُدِ اللّٰهَ مُخۡلِصًا لَّهُ الدِّيۡنَ ②

3 జాగ్రత్త! నిష్కల్మషమైన ఆరాధన మాత్రమే అల్లాహ్‌కు చెందుతుంది.[4] ఎవరయితే అల్లాహ్‌ను గాకుండా ఇతరులను సంరక్షకులుగా ఆశ్రయించారో వారు, "ఈ పెద్దలు మమ్మల్ని అల్లాహ్ సాన్నిధ్యానికి చేర్చటంలో తోడ్పడతారని భావించి[5] మాత్రమే

اَلَا لِلّٰهِ الدِّيۡنُ الۡخَالِصُ ؕ وَالَّذِيۡنَ اتَّخَذُوۡا مِنۡ دُوۡنِهٖۤ اَوۡلِيَآءَ ۘ مَا نَعۡبُدُهُمۡ اِلَّا لِيُقَرِّبُوۡنَاۤ اِلَى اللّٰهِ زُلۡفٰى ؕ

1. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి రోజూ రాత్రి బనీ ఇస్రాయీల్ సూరాను, అజ్జుమర్ సూరాను పారాయణం చేసేవారని హదీసులో వుంది (సహీహ్ తిర్మిజీలో అల్‌బానీ దీనిని ప్రామాణిక హదీసుగా పేర్కొన్నారు).

2. అంటే ఇందులో దేవుని ఏకత్వం గురించి, దైవదౌత్యం గురించి, పరలోకం గురించి, దైవాజ్ఞలు, విధుల గురించి చెప్పబడినవన్నీ సత్యంతో కూడుకున్నవి. వాటిని నమ్మి నడుచుకోవటంలోనే మానవ మోక్షం వుంది.

3. ఇక్కడ **'దీన్'** అంటే దైవారాధన, దైవవిధేయత అని భావం. 'ఇఖ్లాస్' అంటే కేవలం దైవప్రసన్నతను చూరగొనే సంకల్పంతో సత్కార్యం చేయటం. ఈ ఆయతు సంకల్ప ఆవశ్యకతను, చిత్తశుద్ధిని నొక్కిచెబుతోంది. "ఆచరణలు సంకల్పంపై ఆధారపడి ఉంటాయి" అన్న హదీసు ద్వారా కూడా సంకల్పశుద్ధి ఆవశ్యకత ఎటువంటిదో విదితమవుతోంది. అంటే అల్లాహ్ మెప్పును పొందే ఉద్దేశంతో చేయబడే సదాచరణ (అది గనక దైవప్రవక్త విధానానికి అనుగుణంగా ఉంటే) స్వీకరించబడుతుంది. అందులో గనక ఇతరత్రా ఉద్దేశాలు కలగలసి ఉంటే స్వీకారయోగ్యమవదు.

4. చిత్తశుద్ధితో కూడిన ఆరాధనలకు, నిర్మలమైన విధేయతకు అల్లాహ్ మాత్రమే అర్హుడు. ఇలాంటి కల్మషం లేని ఆరాధనలు అల్లాహ్ హక్కుగా పరిగణించబడతాయి. ఆయన ఆరాధన లేక దాస్యంలో వేరొకరిని కల్పించటం అధర్మం. విధేయత విషయంలో కూడా వేరొకరిని సహవర్తులుగా నిలబెట్టకూడదు. అయితే దైవప్రవక్త (సఅసం)కు చూపే విధేయతకు మాత్రం దీనినుండి మినహాయింపు ఉంది. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం)కు కనబరిచే విధేయత కూడా దైవవిధేయతేనని ఖుద్దుగా అల్లాహ్‌యే ఖరారు చేశాడు. కాని ఇతరుల విధేయతకు మాత్రం అనుమతి లేదు. ఇక ఆరాధన (లేక దాస్యం) విషయానికి వస్తే ఒక్క అల్లాహ్ మినహా లోకంలో మరెవరికీ అందులో భాగస్వామ్యం కల్పించరాదు. ఆఖరికి ప్రవక్తలను కూడా ఆరాధించకూడదు.

5. ఈ ఆయతును బట్టి అవగతమయ్యేదేమిటంటే మక్కాలోని బహు దైవారాధకులు అల్లాహ్‌నే సృష్టికర్తగా, ఉపాధిప్రదాతగా, విశ్వనిర్వాహకునిగా నమ్మేవారు. మరలాంటప్పుడు వారు దైవేతరులను ఎందుకు పూజించేవారు? బహుశా వారిద్వారా తమకు దైవసామీప్యం లభిస్తుందేమోనన్న పిచ్చి ఆశ వారిచేత ఆ పని చేయించేది. లేదా వారు దైవసన్నిధిలో తమ

మేము వీళ్లను ఆరాధిస్తున్నామ"ని అంటారు. ఏ విషయం గురించి వారు భేదాభిప్రాయానికి లోనై ఉన్నారో దానికి సంబంధించిన (అసలు) తీర్పు అల్లాహ్ (స్వయంగా) చేస్తాడు.[6] అబద్ధాలకోరులకు, కృతఘ్నులకు అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ సన్మార్గం చూపడు.[7]

إِنَّ ٱللَّهَ يَحْكُمُ بَيْنَهُمْ فِى مَا هُمْ فِيهِ يَخْتَلِفُونَ ۗ إِنَّ ٱللَّهَ لَا يَهْدِى مَنْ هُوَ كَٰذِبٌ كَفَّارٌ ③

4 అల్లాహ్ (ఎవరినయినా) సంతానంగా చేసుకోదలచుకుంటే, తన సృష్టితాలలో తాను కోరిన వారిని ఎన్నుకుని ఉండేవాడు. (కాని) ఆయన పరమ పవిత్రుడు.[8] ఆ అల్లాహ్ ఒకే ఒక్కడు, తిరుగులేనివాడు.

لَّوْ أَرَادَ ٱللَّهُ أَن يَتَّخِذَ وَلَدًا لَّٱصْطَفَىٰ مِمَّا يَخْلُقُ مَا يَشَآءُ ۚ سُبْحَٰنَهُۥ ۖ هُوَ ٱللَّهُ ٱلْوَٰحِدُ ٱلْقَهَّارُ ④

5 ఆయన ఆకాశాలను, భూమిని సత్యబద్ధంగా నిర్మించాడు. ఆయన రాత్రిని పగటిపై, పగటిని రాత్రిపై చుట్టివేస్తున్నాడు.[9] సూర్యచంద్రులను కార్యబద్ధుల్ని చేశాడు. (వాటిలో) ప్రతిదీ నిర్ణీత సమయం వరకు సంచరిస్తూ ఉంది. ఆయనే అపార శక్తిమంతుడు, పాపాలను క్షమించేవాడు అని తెలుసుకోండి!

خَلَقَ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضَ بِٱلْحَقِّ ۖ يُكَوِّرُ ٱلَّيْلَ عَلَى ٱلنَّهَارِ وَيُكَوِّرُ ٱلنَّهَارَ عَلَى ٱلَّيْلِ ۖ وَسَخَّرَ ٱلشَّمْسَ وَٱلْقَمَرَ ۖ كُلٌّ يَجْرِى لِأَجَلٍ مُّسَمًّى ۗ أَلَا هُوَ ٱلْعَزِيزُ ٱلْغَفَّٰرُ ⑤

6 ఆయన మిమ్మల్నందరినీ ఒకే ప్రాణి నుండి పుట్టించాడు.[10] మరి దాంతోనే దాని జతను కూడా చేశాడు.[11] ఇంకా మీ కోసం పశువులలో ఎనిమిది (రకాల) పెంటి – పోతులను అవతరింప

خَلَقَكُم مِّن نَّفْسٍ وَٰحِدَةٍ ثُمَّ جَعَلَ مِنْهَا زَوْجَهَا وَأَنزَلَ لَكُم مِّنَ ٱلْأَنْعَٰمِ ثَمَٰنِيَةَ أَزْوَٰجٍ ۚ يَخْلُقُكُمْ

కోసం సిఫారసు చేస్తారని తలపోసేవారు. "వారు అల్లాహ్ వద్ద మా కొరకు సిఫారసు చేస్తారు" (యూనుస్ – 18) అన్న దివ్య వచనం కూడా ఇందుకు ప్రబల సాక్ష్యమే.

6. ఎందుకంటే తాను సత్యమార్గంపై లేనని, తాను చేసేది షిర్క్ అని వారిలో ఎవరూ ప్రపంచంలో ఒప్పుకోరు. కాబట్టి ప్రళయదినాన అల్లాహ్యే ఆ విషయంపై తన తీర్పును వినిపించి, దాని ప్రకారం బహుమానం ఇవ్వటమో లేక శిక్ష విధించటమో చేస్తాడు.

7. ఈ బూటకపు దేవుళ్ళ ద్వారా తాము అల్లాహ్ సామీప్యం పొందగలమన్న వారి వాదన ఒక భ్రమ మాత్రమే. వారు సిఫారసు చేస్తారన్నది కూడా మిథ్యే. అల్లాహ్ను వదలి ఏ అధికారమూ లేని వారిని దేముళ్లుగా కొలవటం కూడా నమ్మక ద్రోహమే. ఇలాంటి అసత్యవాదులకు, మేలును మరిచే వారికి సన్మార్గ భాగ్యం ఎలా ప్రాప్తిస్తుంది?

8. ఒకవేళ అల్లాహ్కు సంతానమనేదే ఉంటే ఈ ముష్రిక్కులు నమ్ముతున్నట్లు ఆడ సంతానం ఎందుకుండాలట?! ఆయన తన సృష్టితాలలో తాను కోరిన వారిని కొడుకుగా చేసుకోలేడా? వారు అంటగట్టే ఈ అబద్ధాలకు అల్లాహ్ అతీతుడు, పరిశుద్ధుడు. (ఇబ్నె కసీర్)

9. **'తక్వీర్'** అంటే అసలు ఒక వస్తువును మరో వస్తువుతో చుట్టివేయటం అని అర్థం. రాత్రిని పగటిపై చుట్టివేయటం అంటే పగటిని కప్పటం, ఆవరించటం అని భావం. దానివల్ల పగటి వెలుతురు కాస్తా మటుమాయమవుతుంది. అలాగే పగలుతో రాత్రిని కప్పివేసినప్పుడు రాత్రిచీకట్లు పటాపంచలై వెలుగు కిరణాలు ప్రసరిస్తాయి. (ఆరాఫ్: 54 ఆయతు చూడండి).

10. అంటే మొట్టమొదట దేవుడు ఆదం (అలైహిస్సలాం)ను మట్టితో చేశాడు. పిదప ఆ మట్టి బొమ్మలో తన తరఫు నుండి ప్రాణం ఊదాడు.

فِىۡ بُطُوۡنِ اُمَّهٰتِكُمۡ خَلۡقًا مِّنۡۢ بَعۡدِ خَلۡقٍ فِىۡ ظُلُمٰتٍ ثَلٰثٍ‌ؕ ذٰ لِكُمُ اللّٰهُ رَبُّكُمۡ لَهُ الۡمُلۡكُ‌ؕ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ‌ۚ فَاَنّٰى تُصۡرَفُوۡنَ ⑥

జేశాడు.[12] ఆయన మిమ్మల్ని, మీ మాతృగర్భాలలో – మూడేసి చీకట్లలో[13] – ఒకదాని తరువాత ఒకటిగా రూపకల్పన చేస్తున్నాడు.[14] ఈ అల్లాహ్‌యే మీ ప్రభువు. రాజ్యాధికారం ఆయనదే. ఆయన తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడు. మరలాంటప్పుడు మీరు ఎటు తిరిగిపోతున్నారు?[15]

اِنۡ تَكۡفُرُوۡا فَاِنَّ اللّٰهَ غَنِىٌّ عَنۡكُمۡ‌ وَلَا يَرۡضٰى لِعِبَادِهِ الۡكُفۡرَ‌ۚ وَاِنۡ تَشۡكُرُوۡا يَرۡضَهُ لَـكُمۡ‌ؕ وَلَا تَزِرُ وَازِرَةٌ وِّزۡرَ اُخۡرٰى‌ؕ ثُمَّ اِلٰى رَبِّكُمۡ مَّرۡجِعُكُمۡ فَيُنَبِّئُكُمۡ بِمَا كُنۡتُمۡ تَعۡمَلُوۡنَ‌ؕ اِنَّهٗ عَلِيۡمٌۢ بِذَاتِ الصُّدُوۡرِ ⑦

**7** ఒకవేళ మీరు తిరస్కార వైఖరిని అవలంబించినట్లయితే అల్లాహ్‌కు మీ అవసరం ఎంతమాత్రం లేదు (అన్న విషయాన్ని తెలుసుకోండి).[16] తన దాసుల కృతఘ్నతా ధోరణిని ఆయన ఇష్టపడడు. మీరు గనక కృతజ్ఞతాపూర్వకంగా మసలుకుంటే, దాన్ని ఆయన మీ కోసం ఇష్టపడతాడు.[17] బరువును మోసే వాడెవడూ ఇంకొకరి బరువును మోయడు. మరి మీరంతా మరలి పోవలసింది మీ ప్రభువు వైపునకే. మీరు చేస్తూ ఉన్న కర్మలను ఆయన మీకు తెలియపరుస్తాడు. ఆయన అంతర్యాల్లోని విషయాన్ని సయితం ఎరిగినవాడు.

11. అంటే – ఆయన హజ్రత్ హవ్వాను ఆదం (అలైహిస్సలాం) ఎడమ ప్రక్కటెముకచే సృజించాడు. ఇది కూడా ఆయన అపురూపమైన సృష్టికి ప్రతిబింబమే. ఎందుకంటే హవ్వా తరువాత మరే స్త్రీ సృజన కూడా పురుషుని ప్రక్కటెముకచే జరగలేదు. ఈ విధంగా సహజత్వానికి విరుద్ధంగా ఉన్న ఈమె సృష్టి ప్రక్రియ కూడా దేవుని అపారమైన శక్తికి ఒక నిదర్శనమే.

12. ఇక్కడ నాలుగు రకాల పశువులు ప్రస్తావనకు వచ్చాయి. గొర్రెలు, మేకలు, ఆవులు (మరియు బర్రెలు), ఒంటెలు, వాటి ఆడ మగలను కలిపితే ఎనిమిది అవుతాయి. వీటి వివరాలు అల్ అన్ఆమ్ సూరా (143, 144) లో వచ్చాయి. **'అవతరింపజేశాడు'** అనే పదం 'సృష్టించాడు' అన్న అర్థంలో ఉంది. లేక ఒక కథనం ప్రకారం దేవుడు ఈ పశువులను మొదట స్వర్గంలో సృష్టించి, ఆ తరువాత భువిపైకి దించాడు. లేదా దీనికి ఇంకొక అర్థం ఇది: ఈ పశువులు గ్రాసం లేకుండా ఉండలేవు. గ్రాసం మొలిచేది నీళ్లతోనే. మరి ఈ నీరు ఎక్కడి నుంచి వస్తుంది? ఆకాశం నుంచే కదా! ఈ విధంగా చూస్తే ఆకాశం నుంచి నీరు అవతరించనిదే భూమిపై పశుజాతికి మనుగడ ఉండదు (ఫత్‌హుల్ ఖదీర్).

13. **'మూడేసి చీకట్లు'** అంటే 1. తల్లి కడుపులోని చీకటి 2. గర్భకోశంలోని చీకటి 3. గర్భస్త శిశువుపై ఉండే పలుచటి పొర (లేక తొడుగు) మరొక చీకటి. ఈ మూడు తెరల చాటున సురక్షిత స్థానంలో మనిషి నిర్మాణదశ మొదలవుతుంది.

14. అంటే అతను తల్లి కడుపులో వివిధ దశలను అధిగమించి సంపూర్ణ మానవాకారం పొందుతాడు. ఉదాహరణకు : మొదట వీర్యకణం గర్భాశయంలో ప్రవేశించి ఫలదీకరణ చెందుతుంది. తరువాత అది నెత్తుటి గడ్డగా తయారవుతుంది. ఆ తరువాత పిండంగా రూపాంతరం చెందుతుంది. దరిమిలా ఆకృతిని సంతరించుకోవటం మొదలెడుతుంది. అటుపిమ్మట ఎముకలు తయారవుతాయి. ఆపైన ప్రాణం పోసుకుని ఒక శిశువు అవుతుంది.

15. (లేదా) మీరు సత్యం నుంచి అసత్యం వైపుకు, సన్మార్గం నుంచి దుర్మార్గం వైపుకు ఎందుకు తరలిపోతున్నారు?

16. దీని వివరణ కోసం ఇబ్రాహీం సూరా 8వ ఆయతుకు ఇవ్వబడిన పాదసూచికను చూడండి.

17. మనిషి అవలంబించే తిరస్కార వైఖరి దైవప్రణాళిక ననుసరించే జరిగినప్పటికీ తిరస్కార వైఖరిని అల్లాహ్ మాత్రం

وَاِذَا مَسَّ الْاِنْسَانَ ضُرٌّ دَعَا رَبَّهٗ مُنِيْبًا اِلَيْهِ ثُمَّ اِذَا خَوَّلَهٗ نِعْمَةً مِّنْهُ نَسِيَ مَا كَانَ يَدْعُوْٓا اِلَيْهِ مِنْ قَبْلُ وَجَعَلَ لِلّٰهِ اَنْدَادًا لِّيُضِلَّ عَنْ سَبِيْلِهٖ ۭ قُلْ تَمَتَّعْ بِكُفْرِكَ قَلِيْلًا ڰ اِنَّكَ مِنْ اَصْحٰبِ النَّارِ ⑧

**8** మనిషికి ఎప్పుడైనా, ఏదైనా ఆపద వచ్చిపడితే తన ప్రభువు వైపుకు మరలి ఆయన్ని(అదేపనిగా) మొరపెట్టుకుంటాడు. మరి అల్లాహ్ అతనికి తన వద్ద నుంచి అనుగ్రహాన్ని ప్రసాదిస్తే అంతకు మునుపు అతను దేనికోసం (కడుదీనంగా) మొర పెట్టుకున్నాడో దాన్ని మరచిపోతాడు.[18] అల్లాహ్ మార్గం నుంచి (ఇతరుల్ని కూడా) పెడత్రోవ పట్టించడానికి అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించటం మొదలెడతాడు. (ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు : "నీ తిరస్కార వైఖరి లాభాలను కొన్నాళ్ళపాటు అనుభవించు. తుదకు నువ్వు నరక వాసులలో చేరేవాడివే."

اَمَّنْ هُوَ قَانِتٌ اٰنَاۗءَ الَّيْلِ سَاجِدًا وَّقَاۗىِٕمًا يَّحْذَرُ الْاٰخِرَةَ وَيَرْجُوْا رَحْمَةَ رَبِّهٖ ۭ قُلْ هَلْ يَسْتَوِي الَّذِيْنَ يَعْلَمُوْنَ وَالَّذِيْنَ لَا يَعْلَمُوْنَ ۭ اِنَّمَا يَتَذَكَّرُ اُولُوا الْاَلْبَابِ ⑨

**9** ఏమిటి, ఏ వ్యక్తి అయితే రాత్రి వేళల్లో సాష్టాంగప్రణామం చేస్తూ, దైవారాధనలో నిలబడుతున్నాడో, పరలోకానికి భయ పడుతూ, తన ప్రభువు కారుణ్యాన్ని ఆశిస్తున్నాడో అతను[19] (మరియు దానికి విరుద్ధంగా ప్రవర్తించేవాడు – ఇద్దరూ సమా నులు కాగలరా?). చెప్పండి – తెలిసినవారు, తెలియనివారు ఒక్కటేనా?[20] బుద్ధిమంతులు మాత్రమే ఉపదేశాన్ని గ్రహిస్తారు.[21]

ఇష్టపడడు. ఆయన ప్రసన్నతను బడసే మార్గం కృతజ్ఞతా మార్గమే గాని తిరస్కారమార్గం కాదు. అంటే దైవప్రణాళిక వేరు – దైవప్రసన్నత వేరు. ఇంతకు ముందు కూడా ఈ దృక్పథం గురించి కొన్నిచోట్ల చర్చించటం జరిగింది. ఉదాహరణకు : అల్ బఖరా సూరాలోని 253వ ఆయతుకు ఇవ్వబడిన పాదసూచికను చూడగలరు.

18. లేదా ఆ ఆపదను మరచిపోతాడు. ఒకప్పుడు ఆ గండం నుంచి బయటపడటానికి ఇతర దేముళ్ళందరినీ వదిలేసి కేవలం అల్లాహ్‌ను వేడుకునేవాడు. కాని అల్లాహ్ తన కృపతో అతన్ని గండం నుంచి గట్టెక్కించిన తరువాత అల్లాహ్‌ను మరచిపోయి నకిలీదేవుళ్ల వెనుక పరుగులు తీయసాగాడు.

19. ఒక వైపేమో చేసిన మేలును మరచి వాడవాడనా తిరిగే వ్యక్తి ఒకడున్నాడు – మరోవైపు కష్టసుఖాలలో ఏక దైవారాధన చేస్తూ రాత్రి సమయాల్లో దీనాతిదీనంగా నిజప్రభువును వేడుకుంటూ, నమాజులో రుకూ సజ్దాలు చేస్తూ ఆయన కటాక్షంపై ఆశలుపెట్టుకున్న విశ్వాసి ఉన్నాడు. వీళ్ళిద్దరూ సరిసమానులవుతారా? కారు. ముమ్మాటికీ కాలేరు. దైవభీతి పట్ల, దైవకారుణ్యం పట్ల ఆశాభావం గురించి ఒక హదీసులో ఇలా ఉంది :

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఒక వ్యక్తి దగ్గరకు వెళ్ళారు. అప్పుడు ఆ వ్యక్తికి మరణ ఘడియలు ఆసన్నమై వున్నాయి. "ప్రస్తుతం నువ్వు ఏ స్థితిలో ఉన్నావ్?" అని దైవప్రవక్త (సఅసం) అతన్ని ప్రశ్నించగా, "నేను దైవకారుణ్యంపై ఆశలు పెట్టుకుని ఉన్నాను. (అదే సమయంలో) నా పాపాల కారణంగా దైవానికి భయపడు తున్నాను" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు – "ఇలాంటి క్షణాల్లో ఏ భక్తుని హృదయంలో ఈ రెండు విషయాలు కూడా ఉంటాయో అతనికి అల్లాహ్ అతను ఆశించిన దానిని ప్రసాదిస్తాడు. అతను భయపడేదాని నుంచి రక్షిస్తాడు." (తిర్మిజీ, ఇబ్ను మాజ – కితాబుజ్జుహ్ద్...)

20. అల్లాహ్ చేసిన వాగ్దానం సత్యమని, అది ఖచ్చితంగా నెరవేరుతుందని తెలిసిన వారు కొందరున్నారు. ఈ సత్యాన్ని తెలుసుకోలేనివారు కొందరున్నారు. మరి వారంతా సమానులవుతారా? ఒకడేమో మహాజ్ఞాని. ఇంకొకడేమో అజ్ఞాని. వీళ్ళిద్దరూ సమానులేనా? జ్ఞానం – అజ్ఞానంలో వ్యత్యాసమున్నట్లే జ్ఞాన సంపన్నునిలో – మూర్ఖునిలో వ్యత్యాసం

10 (ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు : "విశ్వసించిన ఓ నా దాసులారా! మీ ప్రభువుకు భయపడుతూ ఉండండి.[22] ఈ లోకంలో సత్కర్మలు చేసినవారికి మేలు[23] జరుగుతుంది. అల్లాహ్ భూమి ఎంతో విశాలమైనది.[24] సహనం వహించేవారికి లెక్కలేనంత పుణ్యఫలం ప్రసాదించబడుతుంది."[25]

قُلْ يٰعِبَادِ الَّذِيْنَ اٰمَنُوا اتَّقُوْا رَبَّكُمْ ؕ لِلَّذِيْنَ اَحْسَنُوْا فِىْ هٰذِهِ الدُّنْيَا حَسَنَةٌ ؕ وَاَرْضُ اللّٰهِ وَاسِعَةٌ ؕ اِنَّمَا يُوَفَّى الصّٰبِرُوْنَ اَجْرَهُمْ بِغَيْرِ حِسَابٍ ﴿10﴾

11 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఆరాధనను అల్లాహ్‌కే ప్రత్యేకించి ఆయన్ని మాత్రమే ఆరాధించాలని నాకు ఆజ్ఞాపించబడింది."

قُلْ اِنِّىْۤ اُمِرْتُ اَنْ اَعْبُدَ اللّٰهَ مُخْلِصًا لَّهُ الدِّيْنَ ﴿11﴾

12 "ఆజ్ఞను శిరసావహించే వారిలో నేను తొలివాణ్ణి కావాలని కూడా నాకు ఆజ్ఞాపించబడింది."[26]

وَاُمِرْتُ لِاَنْ اَكُوْنَ اَوَّلَ الْمُسْلِمِيْنَ ﴿12﴾

---

ఉంది. అలాగే దైవవిధేయత – దేవుని పట్ల అవిధేయత రెండూ సమానం కాజాలవు. మరికొంతమంది విద్వాంసుల ప్రకారం తెలుసుకున్న దానికి అనుగుణంగా ఆచరించేవాడే సిసలైన జ్ఞాని. ఎందుకంటే ఇటువంటి వ్యక్తి మాత్రమే తన జ్ఞానం ద్వారా ప్రయోజనం పొందుతాడు. ఆచరణ లోపించిన జ్ఞాని అసలు జ్ఞానియే కాదు. దీని ప్రకారం ఒక ఆచరణాశీలి మరో ఆచరణాహీనుడు ఎన్నటికీ సమానులు కాజాలరని ఖుర్‌ఆన్ ప్రబోధిస్తున్నట్లు మనకు అర్థమవుతోంది.

21. ఆ **'బుద్ధిమంతులు'** విశ్వాసులేగాని అవిశ్వాసుల్లోని వారు కారు. వారు (అవిశ్వాసులు) కూడా తమను తాము బుద్ధిజీవులుగా, వివేచనగల వారుగా భావిస్తారుగాని తమ బుద్ధికుశలతను ఉపయోగించి సత్యాసత్యాలను పరికించరు. హితబోధను గ్రహించరు. అలాంటప్పుడు వారి తెలివితేటల వల్ల వారికి ఒరిగేదేమిటి?

22. అంటే – ఆయనకే విధేయత చూపండి. పాపకార్యాలకు దూరంగా ఉండండి. నిర్మలమైన మనస్సుతో దైవాన్ని ఆరాధించండి. ఆరాధనలోగానీ, విధేయతలో గానీ ఇంకొకరికి సాటి కల్పించకండి.

23. దైవభీతి వల్ల కలిగే మేలు ఇది. ఇక్కడ 'మేలు జరగటం' అంటే స్వర్గం లభించటం, స్వర్గంలోని శాశ్విత అనుగ్రహాలు ప్రాప్తించటం అని భావం.

24. ఈ వాక్యంలో **'హిజ్రత్'** గురించిన సంకేతం ఉంది. స్వస్థలంలో విశ్వాసంపై నిలకడ కలిగి ఉండటం, భయభక్తుల వైఖరిని అవలంబించటం కష్టమనుకుంటే జీవితాంతం అక్కడే మగ్గుతూ ఉండటం వాంఛనీయం కాదు. ఆ ప్రాంతాన్ని వదలి మరో ప్రాంతానికి – దైవాదేశాల కనుగుణంగా జీవితం గడిపేందుకు సానుకూలంగా ఉండే ప్రాంతానికి – వలసపోవాలి.

25. అదేవిధంగా విశ్వాస మార్గంలో కష్టనష్టాలు కూడా అనివార్యమే. ఈ మార్గంలో విషయలాలసను, మనోవాంఛలను త్యాగం చేయవలసి ఉంటుంది. ఇది సహనంతో, సాహసంతో కూడుకున్న పని. అందుకే ఇలాంటి సహనమూర్తులకు లభించే స్థానాలు కూడా ఉన్నతమైనవే. వారి సదాచరణలకు గాను పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. అది లెక్కలేనంతగా ఉంటుంది.

సహనానికిగాను లభించే ఈ ఉన్నత స్థానాన్ని ఆర్జించటానికి ప్రతి ముస్లిం పాటుపడాలి. ఎందుకంటే తొందరపాటు వల్ల, క్రియాశూన్యత వల్ల వచ్చిపడిన విపత్తులు తొలిగిపోవు. జరిగిన నష్టం ఎలాగూ జరిగిపోయినప్పుడు నిందారోపణల్తో కాలక్షేపం చేసి లాభం లేదు. అలాంటి పరిస్థితుల్లో మనిషి నిగ్రహం పాటిస్తే, దైవేచ్ఛతో రాజీపడిపోతే అందుకుగాను అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలాన్ని ఇస్తాడు.

26. అంటే తాతముత్తాతల జీవన విధానాన్ని పరిత్యజించి ఏకదైవారాధనను అవలంబించటంలో నేను అందరికన్నా ముందు ఉండాలని నా ప్రభువు ఆదేశించాడు.

**13** "నేను గనక నా ప్రభువుకు అవిధేయత చూపినట్లయితే, ఆ మహాదినాన పడే శిక్షను గురించి భయపడుతున్నాను" అని కూడా చెప్పు.

قُلْ إِنِّىٓ أَخَافُ إِنْ عَصَيْتُ رَبِّى عَذَابَ يَوْمٍ
عَظِيمٍ ﴿13﴾

**14** ఇలా చెప్పు :"నేను మాత్రం నా దాస్యాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించి, ఆయన్నే ఆరాధిస్తాను.

قُلِ ٱللَّهَ أَعْبُدُ مُخْلِصًا لَّهُۥ دِينِى ﴿14﴾

**15** "మీరు ఆయన్ని వదలి ఎవరెవరిని పూజించదలుస్తున్నారో పూజించుకోండి." ఇంకా ఇలా చెప్పు: "ప్రళయదినాన తాము నష్టపోయినదిగాక, తమ పరివారానికి కూడా నష్టం చేకూర్చిన వారే పూర్తిగా నష్టపోయినవారు. బాగా వినండి! ఘోరమైన నష్టం ఇదే."

فَٱعْبُدُوا۟ مَا شِئْتُم مِّن دُونِهِۦ ۗ قُلْ إِنَّ ٱلْخَٰسِرِينَ
ٱلَّذِينَ خَسِرُوٓا۟ أَنفُسَهُمْ وَأَهْلِيهِمْ يَوْمَ ٱلْقِيَٰمَةِ ۗ
أَلَا ذَٰلِكَ هُوَ ٱلْخُسْرَانُ ٱلْمُبِينُ ﴿15﴾

**16** వారిని పైనుంచీ, క్రిందినుంచీ అగ్ని మేఘాలు (జ్వాలలు) ఆవరిస్తూ ఉంటాయి.[27] వాటి (యాతన) గురించి అల్లాహ్ తన దాసులను భయపెడుతున్నాడు.[28] "ఓ నా దాసులారా! అందుకే నాకు భయపడండి."

لَهُم مِّن فَوْقِهِمْ ظُلَلٌ مِّنَ ٱلنَّارِ وَمِن تَحْتِهِمْ
ظُلَلٌ ۚ ذَٰلِكَ يُخَوِّفُ ٱللَّهُ بِهِۦ عِبَادَهُۥ ۚ يَٰعِبَادِ
فَٱتَّقُونِ ﴿16﴾

**17** మరెవరయితే తాగూత్ (షైతాన్) దాస్యానికి దూరంగా ఉన్నారో, (సంపూర్తిగా) అల్లాహ్ వైపునకు మరలారో, వారు శుభవార్తకు అర్హులు. కనుక (అటువంటి) నా దాసులకు (ఓ ముహమ్మద్!) శుభవార్తను వినిపించు.

وَٱلَّذِينَ ٱجْتَنَبُوا۟ ٱلطَّٰغُوتَ أَن يَعْبُدُوهَا وَأَنَابُوٓا۟
إِلَى ٱللَّهِ لَهُمُ ٱلْبُشْرَىٰ ۚ فَبَشِّرْ عِبَادِ ﴿17﴾

**18** వారు మాటను శ్రద్ధగా వింటారు. అందులోని మంచి విషయాన్ని[29] ఖచ్చితంగా అనుసరిస్తారు. అల్లాహ్ సన్మార్గం చూపినది వారికే. బుద్ధికలవారు కూడా వారే.[30]

ٱلَّذِينَ يَسْتَمِعُونَ ٱلْقَوْلَ فَيَتَّبِعُونَ أَحْسَنَهُۥٓ ۚ
أُو۟لَٰٓئِكَ ٱلَّذِينَ هَدَىٰهُمُ ٱللَّهُ ۖ وَأُو۟لَٰٓئِكَ هُمْ
أُو۟لُوا۟ ٱلْأَلْبَٰبِ ﴿18﴾

---

27. **'జులల్'** అంటే అసలు నీడ అని అర్థం. ఇది బహువచనం. కాని ఈ ఆయతులో నీడ అంటే అగ్ని పొరలు అని అర్థం. అంటే వారిని క్రింది నుంచీ, పైనుంచీ అగ్ని కీలలు క్రమ్ముకుంటూ ఉంటాయి (ఫత్‌హుల్ ఖదీర్).
28. అటువంటి భయంకరమైన శిక్షకు తన దాసులు గురికావటం అల్లాహ్‌కు అస్సలు ఇష్టం ఉండదు. అందుకే ఆయన దాని గురించి తన భక్తులను హెచ్చరిస్తున్నాడు. తన విధేయతా విధానాన్ని అవలంబించి ఆ దుర్భర యాతన నుంచి రక్షణ పొందమని కోరుతున్నాడు.
29. ఈ ఆయతులో **'అహ్సను'** అంటే పటిష్ఠమైన విషయం, గట్టి మాట అన్న అర్థాలు వస్తాయి. లేదా చేయవలసిన వాటిలో అన్నిటికన్నా మంచివి అన్న భావం కూడా అందులో ఇమిడి ఉంది. ఏ వ్యవహారంలోనైనా గట్టి విషయాన్ని ఎంపిక చేసుకుంటారు అన్న అర్థం కూడా వస్తుంది. కఠినత్వానికి బదులు మన్నింపుల వైఖరిని అనుసరిస్తారన్న అర్థం కూడా వస్తుంది.
30. ఎందుకంటే వారు తమ బుద్ధివివేకాల ద్వారా లబ్ది పొందారు. ఇతరుల లాగా వారు వృథాగా కాలక్షేపం చేస్తూ కూర్చోలేదు.

**19** ఏ వ్యక్తికి వ్యతిరేకంగా శిక్షా వాక్కు ఖరారైపోయిందో,[31] అగ్నికి ఆహుతి అయిపోయిన (అటువంటి) వాణ్ణి నువ్వు బయటికి తీయగలవా?[32]

أَفَمَنْ حَقَّ عَلَيْهِ كَلِمَةُ الْعَذَابِ ۖ أَفَأَنتَ تُنقِذُ
مَن فِي النَّارِ ﴿١٩﴾

**20** అయితే తమ ప్రభువుకు భయపడుతూ ఉండేవారికోసం (అంతస్తులుగా కట్టబడిన) మేడలున్నాయి. వాటిపై (మరిన్ని) అంతస్తులు నిర్మించబడి ఉన్నాయి.[33] మరి వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉన్నాయి. అల్లాహ్ వాగ్దానం ఇది.[34] అల్లాహ్ తన వాగ్దానానికి విరుద్ధంగా చేయడు.

لَٰكِنِ الَّذِينَ اتَّقَوْا رَبَّهُمْ لَهُمْ غُرَفٌ مِّن فَوْقِهَا
غُرَفٌ مَّبْنِيَّةٌ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ ۖ
وَعْدَ اللَّهِ ۖ لَا يُخْلِفُ اللَّهُ الْمِيعَادَ ﴿٢٠﴾

**21** ఏమిటి, నువ్వు చూడలేదా? – అల్లాహ్ ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, దాన్ని భూగర్భంలోని ఊటలలోనికి చేరుస్తున్నాడు.[35] మరి దాని ద్వారా రకరకాల పంటల్ని ఉత్పన్నం చేస్తున్నాడు.[36] మరి అవి ఎండిపోతాయి. అప్పుడు నువ్వు వాటిని పసుపు రంగులో చూస్తావు. తరువాత వాటిని పొట్టుపొట్టుగా చేసేస్తాడు.[37] విజ్ఞుల కోసం ఇందులో మహోపదేశం ఉంది.[38]

أَلَمْ تَرَ أَنَّ اللَّهَ أَنزَلَ مِنَ السَّمَاءِ مَاءً فَسَلَكَهُ
يَنَابِيعَ فِي الْأَرْضِ ثُمَّ يُخْرِجُ بِهِ زَرْعًا مُّخْتَلِفًا
أَلْوَانُهُ ثُمَّ يَهِيجُ فَتَرَاهُ مُصْفَرًّا ثُمَّ يَجْعَلُهُ
حُطَامًا ۚ إِنَّ فِي ذَٰلِكَ لَذِكْرَىٰ لِأُولِي الْأَلْبَابِ ﴿٢١﴾

31. అంటే అతని తలరాత ప్రకారం, అతని స్వయంకృతాల ప్రకారం అతను శిక్షార్హుడని తేలిపోయింది. అవిశ్వాసం, అన్యాయం, అపరాధాలలో అతను చివరి హద్దులవరకూ చేరుకున్నాడు. అక్కణ్ణుంచి అతను తిరిగి రావటమనేది అసంభవం. ఉదాహరణకు: అబూజహల్, ఆస్ బిన్ వాయల్ తదితరులు. తమ పాపాల కారణంగా వారు నలువైపుల నుంచీ ముట్టడించబడి, నరకాగ్నికి ఆహుతి అయ్యారు.

32. తన జాతి ప్రజలు నరకాగ్నికి ఆహుతి కావటం మహాప్రవక్త (స)కు ఎంతమాత్రం ఇష్టం లేదు. వారంతా 'విశ్వసించి' నరకయాతన నుంచి విముక్తి పొందాలన్నదే ఆయన కోరిక. ఈ ఆయతులో అల్లాహ్ తన ప్రవక్తను ఓదారుస్తున్నాడు– "ఓ ముహమ్మద్ (స)! నీవు ఆ విధంగా కోరుకోవటంలో తప్పు లేదు. పైగా అది మంచి కోరికే. కాని నరకానికి ఆహుతి కావటం ఖాయమని తేలిపోయిన వ్యక్తిని మాత్రం నువ్వు నరకాగ్ని నుంచి రక్షించలేవు."

33. దీని అర్థం ఏమిటంటే స్వర్గంలో ఎన్నో అంతస్థులు ఉంటాయి. పలు అంతస్థుల పెద్ద పెద్ద భవనాలు అత్యధికంగా ఉంటాయి. స్వర్గవాసులలోని వివిధ శ్రేణులనుబట్టి వారికి ఆయా స్థానాలు (అంతస్థులు) కేటాయించబడతాయి. ఆ భవనాల వద్ద స్వర్గవాసుల అభిరుచికి అనుగుణంగా మద్యం, పాలు, త్రాగు నీరు, తేనెల పిల్లకాలువలు ప్రవహిస్తూ ఉంటాయి.

34. అల్లాహ్ విశ్వాసులైన తన దాసులకు స్వర్గం గురించి వాగ్దానం చేసి ఉన్నాడు. దేవుడు చేసిన వాగ్దానం తప్పక నెరవేరుతుంది. ఆయన వాగ్దానానికి వ్యతిరేకంగా చేసేవాడు కాడు.

35. **'యనాబీఅ'** అంటే నీటి ఊటలు, చలమలు, భూగర్భ జలనిధులు అని అర్థం. అంటే ఆకాశం నుంచి వర్షం రూపంలో కురిసే నీరు భూమిలో ఇంకిపోతుంది. ఆ తరువాత అది నీటి ఊటలుగా పెల్లుబుకుతుంది లేదా జలాశయాలలో, నదీనదాలలో చేరుతుంది.

36. చూడబోతే ఆ నీరంతా ఒక్కటే. కాని దానిద్వారా రకరకాల పంటలు, పండ్లు పండుతున్నాయి. వాటి రంగు వేరు, రుచివేరు, సువాసన కూడా ఒండొక దానికన్నా భిన్నంగా ఉంటుంది.

22 ఏ వ్యక్తి హృదయాన్ని అల్లాహ్ ఇస్లాం కోసం విప్పాడో, (అతను గుణపాఠం నేర్చుకోని వ్యక్తిలాంటివాడు కాగలడా?) అతడు తన ప్రభువు తరఫు నుంచి వచ్చిన కాంతిపై ఉన్నాడు.[39] అల్లాహ్ స్మరణ పట్ల ఎవరి హృదయాలు (మెత్తబడకుండా) కరకుగా మారాయో వారికి వినాశం తప్పదు. వారు స్పష్టమైన మార్గభ్రష్టతకు గురై ఉన్నారు.

أَفَمَن شَرَحَ اللَّهُ صَدْرَهُ لِلْإِسْلَامِ فَهُوَ عَلَىٰ نُورٍ مِّن رَّبِّهِ ۚ فَوَيْلٌ لِّلْقَاسِيَةِ قُلُوبُهُم مِّن ذِكْرِ اللَّهِ ۚ أُولَٰئِكَ فِي ضَلَالٍ مُّبِينٍ ﴿٢٢﴾

23 అల్లాహ్ అత్యుత్తమమైన విషయాన్ని అవతరింపజేశాడు. అది పరస్పరం పోలిక కలిగిఉండే, పదేపదే పునరావృతం అవుతూ ఉండే ఆయతులతో కూడిన గ్రంథం రూపంలో ఉంది.[40] దాని వల్ల తమ ప్రభువుకు భయపడేవారి శరీరాలపై రోమాలు నిక్కబొడుచుకుంటాయి.[41] ఆ తరువాత వారి శరీరాలు, హృదయాలు అల్లాహ్ స్మరణపట్ల మెత్తబడి పోతాయి.[42] ఇదీ అల్లాహ్ మార్గదర్శకత్వం. దాని ద్వారా ఆయన తాను కోరిన వారిని సన్మార్గానికి తెస్తాడు. మరి అల్లాహ్ ఎవరిని మార్గం నుండి తప్పిస్తాడో అతనికి మార్గం చూపే వాడెవడూ ఉండడు.

اللَّهُ نَزَّلَ أَحْسَنَ الْحَدِيثِ كِتَابًا مُّتَشَابِهًا مَّثَانِيَ تَقْشَعِرُّ مِنْهُ جُلُودُ الَّذِينَ يَخْشَوْنَ رَبَّهُمْ ثُمَّ تَلِينُ جُلُودُهُمْ وَقُلُوبُهُمْ إِلَىٰ ذِكْرِ اللَّهِ ۚ ذَٰلِكَ هُدَى اللَّهِ يَهْدِي بِهِ مَن يَشَاءُ ۚ وَمَن يُضْلِلِ اللَّهُ فَمَا لَهُ مِنْ هَادٍ ﴿٢٣﴾

37. పచ్చగా కళకళలాడుతూ ఉండే ఆ పంటలు ఒక దశకు చేరుకున్నాక ఎండిపోయి, పసుపు వర్ణాన్ని సంతరించుకుంటాయి. ఆ తరువాత అవి తొక్కుగా మారిపోతాయి. చెట్లకొమ్మలు, రెమ్మలు సయితం ఎండిపోయి, చీకిపోతాయి.

38. ఈ ప్రపంచం గతి కూడా ఇంతేనన్న సంగతిని బుద్ధిజీవులు ఈ ఉపమానం ద్వారా గ్రహిస్తారు. ఈ ప్రపంచం నశించే రోజు తప్పకుండా వస్తుంది. దీని తళుకు బెళుకులు, అందాలు తాత్కాలికమైనవి. కనుక మనిషి పొద్దస్తమానం ఈ లోకంపైనే మనసును లగ్నం చేయకూడదు. మరణానంతర జీవితం కొరకు అతడు సన్నాహాలు మొదలెట్టాలి. ఎందుకంటే మరణానంతర జీవితం శాశ్వితమైనది, అనశ్వరమైనది.

మరికొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యానికి చెప్పిన భావం ఇలా ఉంది : నిజానికి ఈ ఆయతులో దివ్య ఖుర్ఆన్, విశ్వాసుల మనోక్షేత్రాల ఉపమానం ఇవ్వబడింది. అల్లాహ్ ఆకాశం నుంచి దివ్య ఖుర్ఆన్ను అవతరింపజేశాడు. దాన్ని ఆయన విశ్వాసుల హృదయాంతరాళాల్లోకి చేరవేస్తాడు. దానిద్వారా వారిలోని ధార్మిక సుగుణాలు అభివ్యక్తమవుతాయి. ఆ విధంగా విశ్వాసుల విశ్వాసం మరింతగా పెరుగుతుంది. అయితే ఎవరి హృదయాలలో రోగం ఉందో అవి బంజరు భూమిలా ఎండిపోతాయి (ఫత్హుల్ ఖదీర్).

39. అంటే – ఏ వ్యక్తికయితే సత్యాన్ని స్వీకరించి, సన్మార్గాన్ని అవలంబించే సద్బుద్ధి దేవుని తరఫున లభించిందో ఆ వ్యక్తి తన ప్రభువు తరఫున వెలుగును పొందినట్లే. ఇటువంటి ధన్యజీవిని సంకుచిత మనస్కుడు, కఠినుడు, అంధకారంలో మగ్గుతున్న దౌర్భాగ్యునితో పోల్చటం సమంజసమేనా?

40. **'అహ్సనుల్ హదీస్'** అంటే దివ్య ఖుర్ఆన్. 'పోలిక కలిగి ఉంటాయి' అనంటే ఈ గ్రంథంలోని భాగాలన్నీ ఉత్తమ బోధనలోనూ, భావం రీత్యాను, ప్రామాణికత దృష్ట్యా కూడా ఒకటి మరొకదానిని పోలి ఉంటాయి. లేదా అది వెనుకటి ఆకాశ గ్రంథాల బోధనా శైలిని పోలి ఉంటుంది. అలాగే ఈ గ్రంథం 'మసానీ' కూడాను. అంటే ఇందులోని సంఘటనలు, వృత్తాంతాలు, బోధనలు, ఆదేశాలు మాటిమాటికీ పునరావృతం అవుతూ ఉంటాయి.

41. ఎందుకంటే అవిధేయులకు చేయబడిన హెచ్చరికలను వారు అర్థం చేసుకునేవారై ఉంటారు.

أَفَمَن يَتَّقِي بِوَجْهِهِ سُوٓءَ ٱلْعَذَابِ يَوْمَ ٱلْقِيَٰمَةِ ۚ وَقِيلَ لِلظَّٰلِمِينَ ذُوقُوا۟ مَا كُنتُمْ تَكْسِبُونَ ﴿24﴾

**24** ఎవరయితే ప్రళయదినాన దుర్భరమైన శిక్ష పడకుండా తన ముఖాన్ని డాలుగా పెట్టుకుంటాడో (అతను ప్రళయదినాన నిశ్చింతగా ఉండేవానితో సమానం కాగలడా?) "మీరు సంపాదించుకున్న దాని రుచిని చూడండి"[43] అని ఆ దుర్మార్గులతో అనబడుతుంది.

كَذَّبَ ٱلَّذِينَ مِن قَبْلِهِمْ فَأَتَىٰهُمُ ٱلْعَذَابُ مِنْ حَيْثُ لَا يَشْعُرُونَ ﴿25﴾

**25** వారి పూర్వీకులు (కూడా) ధిక్కరించారు. మరి వారిపై వారు ఊహించనైనా లేని చోటునుంచి శిక్ష వచ్చిపడింది.[44]

فَأَذَاقَهُمُ ٱللَّهُ ٱلْخِزْىَ فِى ٱلْحَيَوٰةِ ٱلدُّنْيَا ۖ وَلَعَذَابُ ٱلْـَٔاخِرَةِ أَكْبَرُ ۚ لَوْ كَانُوا۟ يَعْلَمُونَ ﴿26﴾

**26** అల్లాహ్ ప్రాపంచిక జీవితంలోనే వారికి అవమానం రుచి చూపించాడు.[45] పరలోక యాతనైతే ఇంతకన్నా ఎంతో పెద్దది. ఈ సంగతిని వారు గ్రహిస్తే ఎంత బావుండు!

وَلَقَدْ ضَرَبْنَا لِلنَّاسِ فِى هَٰذَا ٱلْقُرْءَانِ مِن كُلِّ مَثَلٍ لَّعَلَّهُمْ يَتَذَكَّرُونَ ﴿27﴾

**27** నిశ్చయంగా మేము ఈ ఖుర్ఆనులో ప్రజల కొరకు అన్ని రకాల ఉపమానాలను వివరించాము – బహుశా వారు హిత బోధను గ్రహిస్తారేమోనని![46]

42. దైవకారుణ్యం పట్ల వారి హృదయాలలో ఆశలు జనించగానే వారిలో విధేయతా భావం పెరుగుతుంది. అణకువ పెంపొందుతుంది. వెంటనే వారు దైవధ్యానం వైపుకు మరలుతారు. దీని గురించి హజ్రత్ ఖతాదా (రజి) ఇలా అంటున్నారు : ఈ ఆయత్‌లో దేవుని పుణ్యపురుషుల (ఔలియాల) సద్గుణాలు వివరించబడ్డాయి. వారి హృదయాలు దైవభీతితో కంపిస్తాయి. వారి కళ్లనుంచి కన్నీళ్లు ప్రవహిస్తాయి. తుదకు దైవనామస్మరణ ద్వారా వారి హృదయాలు నెమ్మదిస్తాయి. వారు మత్తులో మునిగి ఉండటం గానీ, వారి బుద్ధివివేకాలు పని చేయకపోవటంగానీ జరగదు. ఎందుకంటే ధర్మంలో కొత్తపుంతలు తొక్కేవారు (బిద్అతీలు) మాత్రమే ఇలా నిక్షేపంగా ఉంటారు. ఈ పరిస్థితిలో షైతాన్ ప్రమేయం ఉంటుంది" (ఇబ్నె కసీర్). నేడు బిద్అతీలు పెట్టుకునే ఖవ్వాలీ ప్రోగ్రాములలో జరిగేవి ఇలాంటి షైతాన్ పోకడలే కదా! అదేమంటే అది ఆధ్యాత్మికతలో అంతర్భాగం అని వారు సమర్థించుకుంటారు.

ఈ నేపథ్యంలో ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: "ఈ విషయంలో విశ్వాసుల వైఖరి అవిశ్వాసులకు విరుద్ధమైనది. 1. అవిశ్వాసులు నీతిబాహ్యమైన పాటలను వింటే విశ్వాసులు మాత్రం ఖుర్ఆన్ పారాయణం వింటారు. 2. విశ్వాసులు ఖుర్ఆన్ విన్నప్పుడు దైవభీతి మూలంగా, దేవుని కారుణ్యం పట్ల ఆశ కారణంగా, దైవప్రేమ మూలంగా, తమకు అర్థమైన విషయం మూలంగా వారి శరీరాలు కంపిస్తాయి. వారి గుండెలు కరిగి కన్నీళ్ళై ప్రవహిస్తాయి. వారు దైవసన్నిధిలో సాష్టాంగపడతారు. కాని అదే సమయంలో అవిశ్వాసులు, అవిధేయులు ఆటపాటల్లో మునిగి ఉంటారు. 3. ఖుర్ఆన్ పఠన సమయంలో విశ్వాసులు ఎంతో వినయంగా, సంస్కారవంతుల్లా కూర్చుంటారు. మహాప్రవక్త ప్రియసహచరుల పద్ధతి ఇందుకు ప్రబల నిదర్శనం. తత్కారణంగా వారు తాదాత్మ్యం చెందుతారు. వారి రోమాలు నిక్కబొడుచుకుంటాయి. దైవనామస్మరణ వైపుకు వారి హృదయాలు మొగ్గుతాయి (ఇబ్నె కసీర్).

43. మరి ఈ వ్యక్తి ప్రళయదినాన నిశ్చింతగా, హాయిగా ఉండే వ్యక్తితో సరిసమానుడవుతాడా? కాలేదు కదా!

44. మరి వారిని ఆ అవమానాల నుంచి ఎవరూ కాపాడలేదు.

45. ఈ వాక్యంలో మక్కా అవిశ్వాసులకు తీవ్రమైన హెచ్చరిక ఉంది. తమ ప్రవక్తలను ధిక్కరించిన పూర్వపు జాతులకు

28 (ఈ) ఖుర్ఆన్ అరబీలో ఉంది. ఇందులో ఎలాంటి వక్రతా లేదు. (దీని ద్వారా) వారు బహుశా భయభక్తుల వైఖరిని అవలంబించవచ్చు.[47]

قُرْاٰنًا عَرَبِيًّا غَيْرَ ذِيْ عِوَجٍ لَّعَلَّهُمْ يَتَّقُوْنَ ﴿28﴾

29 అల్లాహ్ ఒక ఉదాహరణ ఇస్తున్నాడు: ఒక (బానిస) వ్యక్తి ఉన్నాడు. అతను విరుద్ధ భావాలు గల అనేకమంది భాగస్వాముల క్రింద ఉన్నాడు. రెండవ వ్యక్తి ఒక్కనికే చెందినవాడు (ఒక యజమానికి చెందిన బానిస). వారిద్దరూ సమానులవుతారా?[48] ప్రశంసలన్నీ అల్లాహ్ కొరకే.[49] కాని వారిలో చాలా మంది తెలియనివారు.[50]

ضَرَبَ اللّٰهُ مَثَلًا رَّجُلًا فِيْهِ شُرَكَآءُ مُتَشٰكِسُوْنَ وَرَجُلًا سَلَمًا لِّرَجُلٍ ۭ هَلْ يَسْتَوِيٰنِ مَثَلًا ۭ اَلْحَمْدُ لِلّٰهِ ۭ بَلْ اَكْثَرُهُمْ لَا يَعْلَمُوْنَ ﴿29﴾

30 నిశ్చయంగా (ఏదో ఒకనాడు) నీకూ చావు వస్తుంది. వారికీ చావు వస్తుంది.

اِنَّكَ مَيِّتٌ وَّاِنَّهُمْ مَّيِّتُوْنَ ﴿30﴾

31 తర్వాత మీరంతా ప్రళయదినాన మీ ప్రభువు ఎదుట గొడవ పడతారు.[51]

ثُمَّ اِنَّكُمْ يَوْمَ الْقِيٰمَةِ عِنْدَ رَبِّكُمْ تَخْتَصِمُوْنَ ﴿31﴾

ప్రపంచంలో ఘోర పరాభవం ఎదురయింది. మీరేమో మీ మధ్య వున్న పురుషోత్తముణ్ణి (ముహమ్మద్ – (స) ను), అత్యంత శ్రేష్ఠుడైన ప్రవక్తను తిరస్కరిస్తున్నారు. మరి మీకు పట్టే దుర్గతిని గురించి ఎప్పుడైనా ఆలోచించారా?

46. అంటే ప్రజలు ఆలోచించి, విషయాన్ని అర్థం చేసుకుంటారని వారి ముందు రకరకాల ఉదాహరణలు విశదీకరించ బడ్డాయి.

47. ఈ గ్రంథం సుస్పష్టమైన అరబీ భాషలో ఉంది. ఇందులో ఎలాంటి అస్పష్టతగానీ, డొంకతిరుగుడు మాటగానీ లేదు. ప్రతి విషయం చాలా సూటిగా చెప్పబడింది. ఇందులో వివరించబడిన విషయాలకు, చేయబడిన హెచ్చరికలకు ప్రజలు భయపడి రుజువర్తనులవుతారేమోనని ఆశించబడుతోంది.

48. ఈ వాక్యంలో ముష్రిక్ (బహుదైవారాధకుని), ముఖ్లిస్ (ఏకదైవారాధకుని) ఉదాహరణ ఇవ్వబడింది. ఒకవ్యక్తి అనేకమంది (భాగస్వామ్య) యజమానులకు బానిసగా ఉన్నాడు. మరి ఆ యజమానుల మధ్య కూడా భావసారూప్యం లేదు. వారు ప్రతి చిన్న విషయంపై విభేదించుకుని ఆ బానిస జీవితంతో ఆడుకుంటున్నారు. కాగా; మరోవ్యక్తి ఒకే యజమానికి బానిసగా ఉన్నాడు. ఆ యజమానికి వేరితర భాగస్వాములు లేరు. మరి ఈ ఇద్దరు బానిసలు ఒక్కటవుతారా? ముమ్మాటికీ ఒకటి కాలేరు. అలాగే అనేకమంది దేవీదేవతలను పూజించే బహుదైవారాధకుడూను, ఒకే అల్లాహ్‌ను ఆరాధించే విశ్వాసి సమానులు కాలేరు.

49. ఎందుకంటే ఆయన సత్యాన్ని సోదాహరణగా వివరించి, మనం సాకులు చెప్పకుండా ఉండేలా చేశాడు.

50. అందువల్లనే వారు అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పిస్తున్నారు.

51. అంటే ఓ ప్రవక్తా (సఅసం)! మీరూ, మీ విరోధులు అందరూ వస్తారు. అందరూ మృత్యువాతన పడిన తరువాత ఇహలోకం నుంచి పరలోకానికి – మా వద్దకు – తరలివస్తారు. ఇహలోకంలో మీ మధ్య గల తౌహీద్ – షిర్క్‌ల వివాదం ఎలాగూ పరిష్కారం కాలేదు. జీవితాంతం వారు దెబ్బలాడుతూనే ఉన్నారు. అయితే ఆ వివాదాన్ని ఇక్కడ నేను పరిష్కరిస్తాను. ఏకదైవారాధకులను స్వర్గంలో చేర్చి, ముష్రిక్కులను, అసత్యవాదులను, తగవులమారులను నరకానికి ఆహుతి చేస్తాను. ఆలి ఇమ్రాన్‌లోని 144వ ఆయతులో లాగానే ఈ ఆయతులో కూడా మహాప్రవక్త

| | |
|---|---|
| **32** అల్లాహ్‌పై అబద్ధాలు చెప్పే వాడి కంటే,[52] తన వద్దకు సత్య ధర్మం వచ్చినప్పుడు దాన్ని అసత్యమని ధిక్కరించేవాడి కంటే పరమదుర్మార్గుడు ఎవడుంటాడు?[53] అటువంటి తిరస్కారుల నివాస స్థలం నరకం కాక మరేమవుతుందీ?? | فَمَنْ أَظْلَمُ مِمَّن كَذَبَ عَلَى اللَّهِ وَكَذَّبَ بِالصِّدْقِ إِذْ جَاءَهُ ۚ أَلَيْسَ فِي جَهَنَّمَ مَثْوًى لِّلْكَافِرِينَ ﴿٣٢﴾ |
| **33** ఎవరయితే సత్యధర్మాన్ని తీసుకువచ్చాడో,[54] మరెవరయితే దాన్ని సత్యమని ధృవీకరించాడో[55] అటువంటివారే భయభక్తులు గలవారు. | وَالَّذِي جَاءَ بِالصِّدْقِ وَصَدَّقَ بِهِ ۙ أُولَٰئِكَ هُمُ الْمُتَّقُونَ ﴿٣٣﴾ |
| **34** వారికోసం వారి ప్రభువు దగ్గర వారు కోరినదల్లా ఉంది.[56] సదాచార సంపన్నులకు లభించే ప్రతిఫలం ఇదే.[57] | لَهُم مَّا يَشَاءُونَ عِندَ رَبِّهِمْ ۚ ذَٰلِكَ جَزَاءُ الْمُحْسِنِينَ ﴿٣٤﴾ |

(స)కు చావు వస్తుందని తెలుపబడింది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) పరమపదించినప్పుడు కొంతమంది ప్రియసహచరులు ఈ చేదు సంఘటనను జీర్ణం చేసుకోలేకపోయారు. అప్పుడు హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఈ ఆయతులను ఉదాహరించి మరణం ప్రవక్తకు సయితం తథ్యమని బోధపరచారు. అందువల్ల మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బర్జఖ్ స్థితిలో – ప్రపంచంలో మాదిరిగానే – బ్రతికి ఉన్నారని నమ్మటం ఖుర్ఆన్ ఉపదేశాలకు విరుద్ధం. అందరిలాగానే ఆయన (సఅసం)కు కూడా మరణం వచ్చింది. అందుకే ఆయన (స) అంత్యక్రియలు చేయబడ్డాయి. సమాధిలో ఆయన (స)కు, 'బర్జఖ్ జీవితం' నిశ్చయంగా ప్రాప్తమయింది. ఆ బర్జఖ్ అవస్థ ఎలా ఉంటుందన్న విషయం మనలో ఎవరికీ తెలియదు. ఆయన (స)కు సమాధిలో మళ్లీ ప్రాపంచిక జీవితం ప్రసాదించబడిందన్నది మాత్రం సరైనది కాదు – సల్లల్లాహు అలైహి వ సల్లం.

52. అంటే అల్లాహ్‌కు ఆలుబిడ్డలున్నారని, ఆయనకు భాగస్వాములున్నారని ఎవరయినా చెబితే అది పచ్చి అబద్ధం. పరమ దుర్మార్గం. ఇలాంటి అపవాదాల నుంచి అల్లాహ్ పరమపవిత్రుడు.

53. ప్రజలకు ఏక దైవారాధనను నొక్కిచెప్పే ధర్మాన్ని, మనిషి విధ్యుక్త ధర్మాలను విడమరచి చెప్పే జీవన విధానాన్ని, అధర్మాల నుంచి వారించే నియమావళిని, మరణానంతర జీవితాన్ని గురించి చెప్పే సిద్ధాంతాన్ని, విశ్వాసులకు శుభవార్తను వినిపించి, అవిశ్వాసులకు నరకాగ్ని గురించి హెచ్చరించే సంవిధానాన్ని, అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తీసుకువచ్చిన షరీయతును అసత్యంగా ప్రకటించే వ్యక్తికన్నా పరమ దుర్మార్గుడు ఎవడుంటాడు?

54. సత్యధర్మాన్ని తీసుకుని వచ్చినవాడు అంటే – ఆయన మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఈ ఆదేశం సర్వ సాధారణమయిందనీ, దేవుని ఏకత్వం వైపుకు పిలిచే, దైవాజ్ఞలను వివరించే ప్రతి వ్యక్తికీ ఇది వర్తిస్తుందని మరికొంతమంది విద్వాంసులు సూత్రీకరించారు.

55. సత్యమని ధృవీకరించిన ఆ వ్యక్తి హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) అని, ఆయన దైవప్రవక్త (స)ను అందరికన్నా ముందు ధృవపరచి, విశ్వాసిగా మారారని కొందరు వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. అయితే ఈ వాక్యం సర్వ సామాన్యమనీ, విశ్వాసులందరూ ఇందులోకి వస్తారని మరి కొంతమంది పండితులు భావించారు.

56. అంటే అల్లాహ్ వారి తప్పులను మన్నించటమేగాకుండా, వారి అంతస్థులను కూడా పెంచుతాడు. ఎందుకంటే అల్లాహ్‌ను విశ్వసించే ప్రతి ముస్లిం కోరుకునేది ఇదే. ఇక స్వర్గంలో ప్రవేశించిన మీదట అక్కడ లభించవలసినవన్నీ లభిస్తాయి.

57. అరబీలో **'ముహ్సినీన్'** (مُحْسِنِينَ) అనే పదం వచ్చింది. 1 దీనికి 'సత్కార్యాలు చేసేవారు' అని ఒక అర్థం వస్తుంది. 2. నిర్మల మనసుతో, ఏకాగ్రతతో దైవారాధన చేసేవారు అని మరో అర్థం వస్తుంది. "మీరు దైవారాధన చేస్తున్నప్పుడు మీరు దైవాన్ని చూస్తున్నట్లు భావించండి. ఒకవేళ ఇది సాధ్యం కాకపోతే దేవుడు మిమ్మల్ని చూస్తున్నట్లు భావించండి"

**35** అల్లాహ్ వారి దురాచరణలను వారి నుండి దూరం చేయటానికి, వారు చేసిన సదాచరణలకుగాను ఉత్తమ పుణ్యఫలం ఇవ్వటానికి (ఈ వ్యవస్థను నెలకొల్పుతాడు).

لِيُكَفِّرَ اللّٰهُ عَنْهُمْ اَسْوَاَ الَّذِيْ عَمِلُوْا وَيَجْزِيَهُمْ اَجْرَهُمْ
بِاَحْسَنِ الَّذِيْ كَانُوْا يَعْمَلُوْنَ ﴿35﴾

**36** ఏమిటి, తన దాసునికి అల్లాహ్ సరిపోడా?[58] వీళ్లు నిన్ను అల్లాహ్ తప్ప ఇతరుల గురించి భయపెడుతున్నారు. అల్లాహ్ అపమార్గం పట్టించిన వానికి మార్గం చూపించగల వాడెవడూ లేడు.

اَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهٗ ؕ وَيُخَوِّفُوْنَكَ بِالَّذِيْنَ مِنْ
دُوْنِهٖ ؕ وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ هَادٍ ﴿36﴾

**37** అల్లాహ్ మార్గం చూపినవానిని ఎవడూ అపమార్గం పట్టించ లేడు.[59] ఏమిటి, అల్లాహ్ ప్రాబల్యం కలవాడు, ప్రతీకారం చేసే వాడు కాడా?[60]

وَمَنْ يَّهْدِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ مُّضِلٍّ ؕ اَلَيْسَ اللّٰهُ
بِعَزِيْزٍ ذِي انْتِقَامٍ ﴿37﴾

**38** ఆకాశాలను, భూమిని సృష్టించిన వాడెవడు? అని నువ్వు గనక వారిని అడిగితే, "అల్లాహ్" అని వారు తప్పకుండా చెబుతారు. వారితో చెప్పు : "సరే! చూడండి. మీరు అల్లాహ్‌ను వదలి ఎవరెవరిని పిలుస్తున్నారో వారు, అల్లాహ్ నాకేదన్నా కీడు చేయదలిస్తే, ఆ కీడును తొలగించగలరా? పోనీ, అల్లాహ్ నన్ను కటాక్షించదలిస్తే, వారు ఆయన కృపను అడ్డుకోగలరా?" ఇలా అను: "నాకు అల్లాహ్ చాలు.[61] నమ్మేవారు ఆయన్నే నమ్ము కుంటారు."[62]

وَلَئِنْ سَاَلْتَهُمْ مَّنْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ لَيَقُوْلُنَّ
اللّٰهُ ؕ قُلْ اَفَرَءَيْتُمْ مَّا تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ اِنْ
اَرَادَنِيَ اللّٰهُ بِضُرٍّ هَلْ هُنَّ كٰشِفٰتُ ضُرِّهٖۤ اَوْ اَرَادَنِيْ
بِرَحْمَةٍ هَلْ هُنَّ مُمْسِكٰتُ رَحْمَتِهٖ ؕ قُلْ حَسْبِيَ اللّٰهُ ؕ
عَلَيْهِ يَتَوَكَّلُ الْمُتَوَكِّلُوْنَ ﴿38﴾

---

అని ఒక హదీసులో 'ఇహ్సాన్' గురించి వివరించటం జరిగింది. 3. ప్రజల పట్ల మంచిగా మెలిగేవారిని కూడా 'ముహ్సినీన్' అంటారు. 4. ప్రతి మంచి పనిని ఉత్తమరీతిలో, వినమ్రతతో, దైవప్రవక్త (స) విధానానికనుగుణంగా చేసేవారిని కూడా 'ముహ్సినీన్'గా వ్యవహరిస్తారు – ఇవన్నీ 'ఇహ్సాన్' (పరోపకారం, మేలు, సద్వ్యవహారం) క్రిందికి వస్తాయి.

58. **'తన దాసుడు'** అంటే మహాప్రవక్త ముహమ్మద్ (స) అని భావం. మరికొందరి దృష్టిలో దైవప్రవక్తలందరూ, విశ్వాసులందరూ ఇందులోకి వస్తారు.
వారు దైవేతరుల ద్వారా నిన్ను భయపెడుతున్నారు. అయితే అల్లాహ్ నీకు అండగా ఉన్నప్పుడు వారెవరూ నీకెలాంటి కీడు కలిగించలేరు. వాళ్ళందరి పని పట్టడానికి ఆయన ఒక్కడే చాలు. అటువంటి దౌర్భాగ్యులను పట్టి ఎవరూ సన్మార్గంపైకి తేలేరు.

59. అంటే అటువంటి సన్మార్గగాములను ఎవరూ అపమార్గపు అధోగతికి నెట్టలేరు. అంటే సన్మార్గం చూపటమైనా, మార్గవిహీనతకు లోనుచేయటమైనా దేవుని చేతిలో ఉంది. ఆయన తాను కోరిన వారిని దారి తప్పిస్తాడు. తాను కోరిన వారిని దారికి తెస్తాడు.

60. ఎందుకు తీర్చుకోడు? ముమ్మాటికీ తీర్చుకుంటాడు. వారు గనక అవిశ్వాస వైఖరిని, వైరభావాన్ని మానుకోకపోతే, ఆయన తన ప్రియతమ భక్తులకు తోడ్పాటును అందించి, విరోధులకు ప్రతీకారం చేస్తాడు. వారికి తగిన గుణపాఠం నేర్పుతాడు.

39 ఇలా చెప్పు : “నా జాతి ప్రజలారా! మీరున్న స్థితిలో మీరు ఆచరిస్తూ ఉండండి. నేను కూడా ఆచరిస్తున్నాను.[63] త్వరలోనే మీరు తెలుసుకుంటారు –

قُلْ يٰقَوْمِ اعْمَلُوْا عَلٰى مَكَانَتِكُمْ اِنِّيْ عَامِلٌ فَسَوْفَ
تَعْلَمُوْنَ (39)

40 “పరాభవానికి గురిచేసే శిక్ష ఎవరిపై రానున్నదో,[64] శాశ్వతంగా ఉండే శిక్ష ఎవరిపై పడుతుందో![65] (మీకే తెలుస్తుంది).”

مَنْ يَّاْتِيْهِ عَذَابٌ يُّخْزِيْهِ وَيَحِلُّ عَلَيْهِ
عَذَابٌ مُّقِيْمٌ (40)

41 (ఓ ముహమ్మద్ – సఅసం!) జనుల కోసం మేము ఈ గ్రంథాన్ని సత్యబద్ధంగా నీ వద్దకు పంపాము. కాబట్టి ఎవడయినా దారికి వస్తే అతను తన స్వయానికే మేలు చేసుకున్నాడు. మరెవరయినా దారితప్పితే ఆ పెడదారి (పాపం) అతని మీదే పడుతుంది. నీవు వారికి బాధ్యుడవు కావు.[66]

اِنَّآ اَنْزَلْنَا عَلَيْكَ الْكِتٰبَ لِلنَّاسِ بِالْحَقِّ فَمَنِ اهْتَدٰى
فَلِنَفْسِهٖ وَمَنْ ضَلَّ فَاِنَّمَا يَضِلُّ عَلَيْهَا وَمَآ اَنْتَ
عَلَيْهِمْ بِوَكِيْلٍ (41)

42 అల్లాహ్‌యే ఆత్మలను వాటి మరణ సమయంలో స్వాధీనం చేసుకుంటాడు.[67] మరణం రాని వారి ఆత్మలను కూడా వాటి నిద్రావస్థలో ఆయన వశపరచుకుంటున్నాడు.[68] మరి మరణ

اَللّٰهُ يَتَوَفَّى الْاَنْفُسَ حِيْنَ مَوْتِهَا وَالَّتِيْ لَمْ تَمُتْ فِيْ
مَنَامِهَا فَيُمْسِكُ الَّتِيْ قَضٰى عَلَيْهَا الْمَوْتَ وَيُرْسِلُ

61. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం : దైవప్రవక్త (సఅసం) ఈ ప్రశ్నల వర్షాన్ని వారిపై కురిపించినప్పుడు, తాము ఆరాధిస్తున్న దేవుళ్లు దైవవిధిని తప్పించలేరని వారు సమాధానమిచ్చారు. అయితే వారు తమ కొరకు పరమప్రభువు దగ్గర సిఫారసు మాత్రం చేస్తారని చెప్పుకొచ్చారు. అప్పుడు “నాకు అల్లాహ్ చాలు...” అనే వాక్యం అవతరించింది.

62. మరి అన్నీ ఆ ఏకైక విశ్వప్రభువు చెప్పుచేతల్లో ఉన్నప్పుడు ఇతరులపై ఆధారపడి ప్రయోజనమేమిటి? అందువల్ల విశ్వాసులు కేవలం ఆయన్నే నమ్ముకుంటారు. ఆయన మినహా ఇతరులను నమ్ముకోరు.

63. అంటే దేవుడు నాకిచ్చి పంపిన ఏకదైవారాధనా సిద్ధాంతాన్ని మీరు స్వీకరించకపోతే పోనివ్వండి, మీరున్నచోట మీరుండండి. అల్లాహ్ నాకు చూపిన విధానాన్ని నేను పాటిస్తాను.

64. సత్యాన్ని అవలంబించేదెవరో, అసత్యం వెనుక పరుగులు తీసేదెవరో అప్పుడు మీకు తెలిసివస్తుంది. ఆ దుష్పరిణామాన్ని అల్లాహ్ ఇహలోకంలోనే, అచిరకాలంలోనే చూపించాడు. బద్ర్ సంగ్రామం జరిగినప్పుడు 70 మంది అవిశ్వాసులు హతులయ్యారు. దాదాపు అంతేమంది ఖైదీలుగా పట్టుబడ్డారు. ఆఖరికి మక్కావిజయం తరువాత ముస్లిములు అరేబియా అంతటిపై ప్రాబల్యం వహించారు. అవిశ్వాసులకు పరాభవమే మిగిలింది.

65. శాశ్వతంగా ఉండే దెబ్బ అంటే పరలోకంలో విధించబడే నరక శిక్ష అన్నమాట!

66. మక్కావాసులు అవిశ్వాసంపై మొండికేయటంతో మహాప్రవక్త (స) తీవ్ర వ్యాకులతకు లోనయ్యారు. అప్పుడు దేవుడు తన ప్రియతమ ప్రవక్త (స)ను ఓదార్చాడు – ఓ ముహమ్మద్ (స)! గ్రంథాన్ని బోధపరచటం వరకే నీ పని. వారి సన్మార్గానికి సంబంధించిన బాధ్యత నీపై లేదు. వారు గనక సన్మార్గాన్ని అవలంబిస్తే వారికే మేలు కలుగుతుంది. ఒకవేళ వారు పెడసరిగా ప్రవర్తిస్తే వారే నష్టపోతారు. వారికి కలిగే నష్టానికిగాను నిన్ను నిలదీసి అడగటం జరగదు.

తదుపరి ఆయతులో అల్లాహ్ తన విచిత్ర శక్తిని గురించి ప్రస్తావిస్తున్నాడు. మనిషి అనుదినం దాన్ని చూస్తూనే ఉంటాడు. అతను నిద్రపోయినప్పుడు దైవాజ్ఞపై – ఒక విధంగా – అతని ప్రాణం పోతుంది. ఎందుకంటే ఆ సమయంలో అతనిలో గ్రహణశక్తి ఉండదు. మరి అతను మేల్కొగానే అతని ప్రాణం అతనిలోనికి పంపబడుతుంది. దాంతో అతని పంచేంద్రియాలు పనిచేయనారంభిస్తాయి. అయితే ఎవరి జీవితకాలం సమాప్తమవుతుందో అతని

الْأُخْرَىٰ إِلَىٰ أَجَلٍ مُسَمًّى ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ لِقَوْمٍ يَتَفَكَّرُونَ ﴿42﴾

ఉత్తర్వు ఖరారైన వారి ఆత్మలను ఆపుకుంటున్నాడు.[69]ఇతర ఆత్మలను ఒక నిర్ణీత గడువు వరకు వదలిపెడుతున్నాడు.[70] చింతన చేసే వారి కోసం ఇందులో ఎన్నో సూచనలున్నాయి.[71]

أَمِ اتَّخَذُوا مِنْ دُونِ اللَّهِ شُفَعَاءَ ۚ قُلْ أَوَلَوْ كَانُوا لَا يَمْلِكُونَ شَيْئًا وَلَا يَعْقِلُونَ ﴿43﴾

**43** ఏమిటి, వారు అల్లాహ్‌ను వదలి (వేరితరులను) సిఫార్సు చేసేవారుగా చేసుకుంటున్నారా? "వారికి ఏ అధికారం లేకున్నా, తెలివి లేకపోయినా[72] (మీరు వారిని సిఫార్సు కోసం నిలబెడతారా?)?" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

قُلْ لِلَّهِ الشَّفَاعَةُ جَمِيعًا ۖ لَهُ مُلْكُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۖ ثُمَّ إِلَيْهِ تُرْجَعُونَ ﴿44﴾

**44** "సిఫారసు అంతా అల్లాహ్ అధీనంలోనే ఉంది.[73] భూమ్యాకాశాల సామ్రాజ్యం ఆయనదే. కడకు మీరంతా ఆయన వైపునకే మరలించబడతారు" అని చెప్పు.

وَإِذَا ذُكِرَ اللَّهُ وَحْدَهُ اشْمَأَزَّتْ قُلُوبُ الَّذِينَ لَا يُؤْمِنُونَ بِالْآخِرَةِ ۖ وَإِذَا ذُكِرَ الَّذِينَ مِنْ دُونِهِ إِذَا هُمْ يَسْتَبْشِرُونَ ﴿45﴾

**45** అల్లాహ్ ఒక్కని గురించి ప్రస్తావించినప్పుడు పరలోకాన్ని నమ్మని వారి గుండెలు అక్కసుతో ఉడికిపోతాయి.[74] మరి అల్లాహ్ తప్ప ఇతరుల గురించి చెప్పినప్పుడు మాత్రం అవి ఆనందంతో విప్పారుతాయి.[75]

---

ప్రాణం (ఆత్మ) తిరిగి పంపబడదు. అతను మృత్యు ఒడిలోకి జారుకుంటాడు. దీన్ని కొంతమంది చిన్న మరణం – పెద్ద మరణంగా అభివర్ణించారు.

67. ఇది 'పెద్ద మరణం' అన్నమాట! వీరి ఆత్మలు వాపసు చేయబడవు.

68. ఇంకా మరణ సమయం ఆసన్నం కాని వారి ఆత్మలను కూడా నిద్రావస్థలో వశపరచుకుని, వారిని 'చిన్న మరణానికి' గురిచేయటం జరుగుతుంది.

69. ఎవరి ఆత్మలైనా తిరిగి రాలేదంటే వారు పెద్ద మరణం వాతన పడ్డారని అనుకోవాలి.

70. అంటే – నిర్ధారిత మరణ ఘడియలు రాకుండా ఉండేవరకూ వారి ఆత్మలు వాపసు చేయబడుతూనే ఉంటాయి. కాబట్టి నిద్ర స్థితిలో ఉన్న మనిషి చిన్న మరణం పొంది మళ్లీ బ్రతుకుతాడు (మేల్కొంటాడు). ఈ అంశం అల్ అన్‌ఆమ్ సూరా 60, 61 ఆయతులలో కూడా వచ్చింది. అయితే అక్కడ చిన్న మరణం గురించి ముందు, పెద్ద మరణం గురించి తరువాత ప్రస్తావించటం జరిగింది.

71. అంటే – ఆత్మలను తిరిగి పంపటంలో, ఆపుకోవటంలో, జీవన్మరణాల విషయంలో అల్లాహ్ తిరుగులేని అధికారం కలవాడన్న సూచన ఉంది. ప్రళయదినాన మృతులను తిరిగిలేపటం ఆయనకు ఏ మాత్రం కష్టతరం కాదని కూడా దీనిద్వారా అవగతమవుతోంది.

72. సిఫార్సు అధికారం సంగతి అలా ఉంచితే, వాటికి అసలు సిఫార్సు భావం కూడా తెలీదాయె. ఎందుకంటే అవి రాతి విగ్రహాలు లేదా వీళ్ళ పూజాపునస్కారాల గురించి ఏమీ తెలియనివి.

73. అంటే – అన్నిరకాల సిఫారసులకు అధిపతి అల్లాహ్‌యే. ఆయన అనుమతి లభించనంతవరకూ ఎవరూ–ఎవరి గురించీ–సిఫారసు చేయనేలేరు. మరలాంటప్పుడు ఒక్కడైన ఆ అల్లాహ్‌ను ఎందుకు ఆరాధించకూడదు? ఆయన ఆశ్రయం పొందిన వారిని ఆయన ఆదుకుంటాడు? ఆయన్ని నమ్ముకున్నవారు ఇతరుల ఆశ్రయం కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు.

**46** (ఓ ప్రవక్తా! నువ్వు ఇలా) అను: "ఓ అల్లాహ్! భూమ్యాకాశాల సృష్టికర్తా! గోచర అగోచరాలను గురించి తెలిసినవాడా! నీ దాసులు విభేదించుకుంటున్న విషయాలపై నీవు మాత్రమే తీర్పు చేస్తావు."[76]

قُلِ اللّٰهُمَّ فَاطِرَ السَّمٰوٰتِ وَالْاَرْضِ عٰلِمَ الْغَيْبِ وَالشَّهَادَةِ اَنْتَ تَحْكُمُ بَيْنَ عِبَادِكَ فِيْ مَا كَانُوْا فِيْهِ يَخْتَلِفُوْنَ ﴿46﴾

**47** దుర్మార్గానికి ఒడిగట్టే వారి వద్ద భూమి యందలి సమస్తమూ ఉన్నా, దాంతోపాటు మరి అంతటి సంపద ఉన్నా ఘోర శిక్ష నుండి తప్పించుకోవటానికి ప్రళయ దినాన వారు దాన్నంతటినీ కూడా – పరిహారంగా – ఇచ్చివేస్తారు.[77] వారు ఊహించి కూడా ఉండనిది అల్లాహ్ తరఫున వారి ముందు ప్రస్ఫుటమవుతుంది.[78]

وَلَوْ اَنَّ لِلَّذِيْنَ ظَلَمُوْا مَا فِي الْاَرْضِ جَمِيْعًا وَّمِثْلَهٗ مَعَهٗ لَافْتَدَوْا بِهٖ مِنْ سُوْٓءِ الْعَذَابِ يَوْمَ الْقِيٰمَةِ ۭ وَبَدَا لَهُمْ مِّنَ اللّٰهِ مَا لَمْ يَكُوْنُوْا يَحْتَسِبُوْنَ ﴿47﴾

**48** వారు చేసుకున్న దురాగతాల దుష్ఫలితాలన్నీ వారికి ఎదురవు తాయి.[79] దేని గురించి వారు వేళాకోళం చేసేవారో అదే వారిని చుట్టుముట్టుతుంది.[80]

وَبَدَا لَهُمْ سَيِّاٰتُ مَا كَسَبُوْا وَحَاقَ بِهِمْ مَّا كَانُوْا بِهٖ يَسْتَهْزِءُوْنَ ﴿48﴾

74. అహంకారం, తిరస్కారభావం మూలంగా వారు ఇలా స్పందిస్తారు. **'దేవుడు ఒక్కడే'** అని అంటే వారి మనసులు ఎంతకీ దాన్ని అంగీకరించవు. పైగా వారిలోని నకారాత్మక ధోరణి బహిర్గతం అవుతుంది.

75. అల్లాహ్‌తోపాటు ఫలానా దేవతలు కూడా ఉన్నారనో లేక వారు కూడా దేవుని ప్రియతమ దాసులనో, వారికీ దైవత్వంలో ఎంతో కొంత భాగస్వామ్యం ఉందనో, వారు కూడా మన అక్కరలు ఎంతో కొంత తీరుస్తారనో అన్నారనుకోండి – వారి హృదయ మొగ్గలు ఒక్కసారిగా విచ్చుకుంటాయి. వారు సంతోషంతో చంకలు గుద్దుకుంటారు. ఇలాంటి ప్రబుద్ధులు ఎక్కడో కాదు, ఖుద్దుగా ముస్లిం సమాజంలోనే ఉన్నారు. **"యా అల్లాహ్! మదద్"** అని వారి ముందు అని చూడండి, వారి ముఖాలు మాడిపోతాయి. అదే వారి ముందు **"యా అలీ! మదద్"** అనిగానీ, "యా రసూలల్లాహ్! మదద్" అని గానీ, **"యా గౌస్! మదద్"** అనిగానీ అని చూడండి. వారి ముఖాలు ఆనందంతో విప్పారుతాయి. వీళ్ల మనసులూ – వాళ్ల మనసులూ ఒకటిలా లేవూ?! అల్లాహ్ వారి ఆంతర్యాలలో దేవుని ఏకత్వ భావనను సృజించుగాక!

76. అంతిమ దైవప్రవక్త (సఅసం) రాత్రిపూట తహజ్జుద్ నమాజ్ ఆరంభంలో ఈ దుఆ చేసేవారని హదీసులో తెలుపబడింది: **"అల్లాహుమ్మ! రబ్బ జిబ్రీల వ మీకాయీల వ ఇస్రాఫీల ఫాతిరస్సమావాతి వల్ అర్జి, ఆలిమల్ గైబి వష్షహాదతి, అన్త తహ్కుము బైన ఇబాదిక ఫీమా కానూ ఫీహి యఖ్తలిఫూన్ అహ్దినీ లిమఖ్తులిఫ ఫీహి మినల్ హఖ్ఖి బి ఇజ్నిక, ఇన్నక తహ్దీ మన్‌తషావు ఇలా సిరాతిమ్ ముస్తఖీమ్'** (అనువాదం: ఓ అల్లాహ్! జిబ్రయీల్, మీకాయీల్, ఇస్రాఫీల్ దూతలకు ప్రభువా! భూమ్యాకాశాల నిర్మాతా! గోచరాగోచరాల జ్ఞానీ! నీ దాసులు విభేదించుకుంటూ ఉన్న విషయాల్లో నీవు సరైన తీర్పు చేస్తావు. విభేదించుకున్న విషయాల్లో నీవు నీ అనుజ్ఞతో నాకు సత్యం వైపు మార్గదర్శనం చేయి. నీవు కోరిన వారిని నీవు సన్మార్గం వైపు నడిపిస్తావు). (సహీహ్ ముస్లిం – కితాబు సలాతిల్ ముసాఫిరీన్).

77. అయినా వారి పరిహారం స్వీకరించబడదు. మరోచోట సెలవీయబడినట్లు, "వారు పరిహారంగా భూమి నిండా బంగారం ఇచ్చినా లేక దాన్ని పరిహారంగా సమర్పించుకున్నా అది స్వీకరించబడదు" (ఆలి ఇమ్రాన్ – 91). ఎందుకంటే "అక్కడ పరిహారం తీసుకుని విడుదల చేసే ప్రసక్తే ఉండదు" (అల్ బఖర – 48).

78. అటువంటి దారుణమైన శిక్షను గురించి వారెన్నడూ ఊహించి కూడా ఉండరు.

**49** మనిషికి ఏదన్నా ఆపద వచ్చిపడినప్పుడు అతడు మమ్మల్ని (సహాయం కోసం) మొరపెట్టుకోసాగుతాడు.[81] మరి మేమతనికి మా తరఫునుండి ఏదైనా అనుగ్రహాన్ని ప్రసాదిస్తే "ఇది నా ప్రజ్ఞా పాటవాల మూలంగా నాకు ఇవ్వబడింది"ని[82] అంటాడు. కాదు, వాస్తవానికి అదొక పరీక్ష.[83] కాని వారిలో చాలా మంది ఈ విషయాన్ని గ్రహించరు.[84]

فَإِذَا مَسَّ الْإِنسَانَ ضُرٌّ دَعَانَا ثُمَّ إِذَا خَوَّلْنَاهُ
نِعْمَةً مِّنَّا قَالَ إِنَّمَا أُوتِيتُهُ عَلَىٰ عِلْمٍ ۚ بَلْ هِيَ
فِتْنَةٌ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ ﴿٤٩﴾

**50** వారి పూర్వీకులు కూడా అదే మాటన్నారు. కాని వారు ఆర్జించినదేదీ వారికి ఎంతమాత్రం ఉపయోగపడలేదు.[85]

قَدْ قَالَهَا الَّذِينَ مِن قَبْلِهِمْ فَمَا أَغْنَىٰ عَنْهُم
مَّا كَانُوا يَكْسِبُونَ ﴿٥٠﴾

**51** మరి వారి దురాగతాల దుష్ఫలితాలన్నీ[86] వారిపైనే పడ్డాయి. ఇక వీరిలోని పాపాత్ములు చేసిన పాపకార్యాల దుష్ఫలితాలు కూడా వీరిపై వచ్చిపడతాయి. వీరు మమ్మల్ని (ఎట్టి పరిస్థితి లోనూ) అశక్తుల్ని చేయలేరు.[87]

فَأَصَابَهُمْ سَيِّئَاتُ مَا كَسَبُوا ۚ وَالَّذِينَ ظَلَمُوا مِنْ هَٰؤُلَاءِ
سَيُصِيبُهُمْ سَيِّئَاتُ مَا كَسَبُوا وَمَا هُم بِمُعْجِزِينَ ﴿٥١﴾

---

79. అంటే ప్రాపంచిక జీవితంలో వారు ఏ అధర్మమైన కార్యాలకు, మరే పాపిష్టి పనులకు పాల్పడేవారో వాటి దుష్పరిణామం వారిముందు ప్రత్యక్షమవుతుంది.

80. అలాంటి శిక్ష తమను ముట్టడించటం అసంభవమని వారు అనుకునేవారు. అందుకే దాన్ని గురించి ఎగతాళి చేసేవారు.

81. మనిషి చపలచిత్త స్వభావం గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. మనుషుల్లో అత్యధికులు ఇలాంటి వారే. వారు రోగగ్రస్తులైనపుడు, లేమికి గురైనప్పుడు, ఆపదలో చిక్కుకున్నప్పుడు అదేపనిగా అల్లాహ్‌ను మొరపెట్టుకుంటారు. బాధల నుంచి విముక్తి నొసగమని దీనాతిదీనంగా ప్రార్థిస్తారు.

82. అంటే – దైవానుగ్రహం లభించగానే మనిషి మారిపోతాడు. అణకువగా ఉండేబదులు అహంకారం మొదలెడతాడు. నిక్కుతూ నడుస్తాడు. "ఇందులో దేవుని ఉపకారం ఏముంది? ఇదంతా నా ప్రతిభకు ప్రతీక. నా దగ్గరున్న విద్య మూలంగా నాకిదంతా ప్రాప్తించింది. లోకంలో నాకీ గౌరవమర్యాదలు లభిస్తాయని నేను ముందు నుంచే అనుకునే వాణ్ణి. ఎందుకంటే దైవసన్నిధిలో నేను ఆమోదముద్ర పడిన దాసుడను" అని బీరాలు పలుకుతాడు.

83. ఓ మనిషీ! నువ్వు తలపోసేది నిజం కాదు. పైగా ఈ దైవానుగ్రహం నీ పాలిట ఒక పరీక్ష. నువ్వు కృతజ్ఞతాపూర్వకంగా మసలుకుంటావో లేక చేసిన మేలును మరచి వీరంగాలు వేస్తావో చూసేందుకే దేవుడు నీకు ఈ సిరిసంపదల్ని అనుగ్రహించాడు.

84. అంటే – ఇదంతా అల్లాహ్ తరఫున జరిగే పరీక్ష అన్న యదార్థాన్ని అధిక సంఖ్యాకులు తెలుసుకోరు.

85. పూర్వం ఖారూన్ కూడా అదేవిధంగా తన బడాయిని చాటుకున్నాడు. కాని ఎట్టకేలకు వాడు తన ఖజానాల సమేతంగా భూమిలోకి కూర్చివేయబడ్డాడు.

86. దురాగతాలు అంటే వారి చెడుల దుష్ఫలితం అన్నమాట!

87. మక్కాలోని సత్యతిరస్కారులకు ఇది హెచ్చరిక వంటిది. వీరు కూడా గతంలోని జాతుల మాదిరిగా ఇహలోకంలోనే కరువు కాటకాలకు, మారణహోమానికి, యుద్ధంలో పరాజయానికి, పరాధీనతకు గురయ్యారు. దేవుని తరఫున వచ్చిపడిన ఈ ఆపదలను వారు అడ్డుకోలేకపోయారు.

52 ఏమిటి, అల్లాహ్ తాను కోరిన వారి ఉపాధిని విస్తృతపరు స్తాడనీ, పరిమితం కూడా చేయగలడని వారికి తెలియదా? విశ్వసించే జనుల కోసం ఇందులో (గొప్ప) సూచనలున్నాయి.[88]

اَوَلَمْ يَعْلَمُوْٓا اَنَّ اللّٰهَ يَبْسُطُ الرِّزْقَ لِمَنْ يَّشَآءُ وَيَقْدِرُ ۭ اِنَّ فِيْ ذٰلِكَ لَاٰيٰتٍ لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ ﴿52﴾

53 (ఓ ప్రవక్తా! నా తరఫున వారికి ఇలా) చెప్పు: "తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టిన ఓ నా దాసులారా! మీరు అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ పాపా లన్నింటినీ క్షమిస్తాడు. నిజంగా ఆయన అమితంగా క్షమించే వాడు, అపారంగా కరుణించేవాడు.[89]

قُلْ يٰعِبَادِيَ الَّذِيْنَ اَسْرَفُوْا عَلٰٓي اَنْفُسِهِمْ لَا تَقْنَطُوْا مِنْ رَّحْمَةِ اللّٰهِ ۭ اِنَّ اللّٰهَ يَغْفِرُ الذُّنُوْبَ جَمِيْعًا ۭ اِنَّهٗ هُوَ الْغَفُوْرُ الرَّحِيْمُ ﴿53﴾

54 "మీపై విపత్తు వచ్చిపడకముందే మీరు మీ ప్రభువు వైపునకు మరలండి. ఆయనకు విధేయత చూపండి. ఆ తరువాత మీ కెలాంటి సహాయమూ లభించదు.

وَاَنِيْبُوْٓا اِلٰى رَبِّكُمْ وَاَسْلِمُوْا لَهٗ مِنْ قَبْلِ اَنْ يَّاْتِيَكُمُ الْعَذَابُ ثُمَّ لَا تُنْصَرُوْنَ ﴿54﴾

88. అంటే కలిమి లేముల్లో కూడా దేవుని ఏకత్వపు సూచనలు ఇమిడి ఉన్నాయి. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే విశ్వవ్యవస్థలో ఆయన పంపిణీ విధానం తిరుగులేనిది. ఆయన తాను కోరినవారి ఉపాధిని వికసింపజేస్తాడు. తాను కోరినవారికి కుదిస్తాడు. తాను కోరిన వారిని దుర్భర దారిద్ర్యానికి, లేమికి గురిచేస్తాడు. ఆయన నిర్ణయాలన్నీ యుక్తితో, విజ్ఞతతో కూడుకున్నవై వుంటాయి. ఆయన ప్రణాళికా విధానంలో ఎవరూ, ఎలాంటి జోక్యం చేసుకోవటం గానీ, దాన్ని మార్చటంగానీ చేయలేరు. అయితే ఈ సూచనలు విశ్వసించేవారికి మాత్రమే లాభదాయకం కాగలుగు తాయి. ఎందుకంటే వారు మాత్రమే దైవసూచనలపై యోచన చేస్తారు. సతతం మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థిస్తూ ఉంటారు.

89. ఈ ఆయతులో అల్లాహ్ క్షమాగుణం ఎంత విశాలమైనదో తెలుపబడింది. ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టడం అంటే అత్యధికంగా పాపాలు చేయటం అని అర్థం. **'అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి'** అంటే విశ్వసించక మునుపు, పశ్చాత్తాప భావం జనించకముందు ఎన్ని పాపిష్టిపనులు చేసివున్నా సరే దైవకారుణ్యం పట్ల నిస్పృహకు గురికారాదని భావం. తాను ఇన్ని పాపాలు చేసినాక దేవుడు తనను ఎలా క్షమిస్తాడు? అని అనుకోరాదు. చిత్తశుద్ధితో విశ్వసిస్తే, నిజమైన పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ అతని పాపాలన్నింటినీ ప్రక్షాళనం చేసేస్తాడు.

ఈ ఆయతు అవతరణా నేపథ్యం ద్వారా కూడా ఇదే విషయం తెలుస్తోంది. ఈ ఆయతు అవతరించక ముందు కొంతమంది అవిశ్వాసులు, ముష్రిక్కులకు ఈ సందేహమే కలిగింది. వారు ఎన్నో హత్యలకు పాల్పడ్డారు. వ్యభిచారం కూడా చేశారు. వారు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "మీరు చెప్పేదంతా బాగానే ఉంది గాని మేము ఇప్పటికే పాపిష్టిపనులు చాలా చేశాం కదా! మరి మేము గనక విశ్వసిస్తే మా పాపాలన్నీ క్షమించబడతాయా?!" అని ప్రశ్నించగా, దానిపై ఈ ఆయతు అవతరించింది. (సహీహ్ బుఖారీ – అజ్జుమర్ సూరా వ్యాఖ్యానం).

అంతమాత్రాన దేవుని క్షమాభిక్ష పట్ల, దయాదాక్షిణ్యాల పట్ల మితిమీరిన ఆశతో విచ్చలవిడిగా పాపాలు చేస్తూ ఉండమని, దైవాదేశాలను ఖాతరు చేయనవసరం లేదని, దేవుని హద్దులను, నియమనిబంధనలను నిర్దాక్షిణ్యంగా నలిపివేయమని దీని అర్థం ఎంతమాత్రం కాదు. ఈ విధంగా దైవాగ్రహాన్ని కొనితెచ్చుకుని, ఆయన కారుణ్యం పట్ల ఆశలు పెంచుకోవటం అవివేకం మాత్రమే. చేదు విత్తనం నాటి తీపి ఫలాలను ఆశించటం వంటిదే ఇది కూడా. దేవుడు క్షమాశీలి, కృపాకరుడైనట్లే ఆయన శక్తిమంతుడు, ప్రతీకారం తీర్చుకునేవాడన్న సంగతిని కూడా జనులు మరచిపోకూడదు. దివ్య ఖుర్ఆన్‌లో ఎన్నో చోట్ల దేవుని ఈ రెండు పార్శ్వాలు ఒకే సమయంలో ప్రస్తావించబడ్డాయి. ఉదాహరణకు: "ప్రవక్తా! నేను క్షమించేవాణ్ణి, కరుణించేవాణ్ణి. దాంతోపాటు నా శిక్ష కూడా బాధాకరమైన శిక్షే అని

55 "మీకు తెలియకుండానే మీపై అకస్మాత్తుగా ఆపద వచ్చి పడకముందే, మీ ప్రభువు తరఫు నుండి మీకు పంపబడిన ఉత్తమ విషయాన్ని అనుసరించండి."[90]

وَاتَّبِعُوٓا اَحْسَنَ مَآ اُنْزِلَ اِلَيْكُمْ مِّنْ رَّبِّكُمْ مِّنْ قَبْلِ اَنْ يَّاْتِيَكُمُ الْعَذَابُ بَغْتَةً وَّاَنْتُمْ لَا تَشْعُرُوْنَ ﴿55﴾

56 "అప్పుడు ఏ ప్రాణి అయినా, 'అయ్యో! ఏమి దురవస్థ నాది! నేను అల్లాహ్ విషయంలో లోటు చేశానే![91] నేను గేలి చేసే వారిలో ఉండిపోయానే!?' అని చెబుతుందేమో! (ఆ పరిస్థితి రాకూడదు సుమా!)

اَنْ تَقُوْلَ نَفْسٌ يّٰحَسْرَتٰى عَلٰى مَا فَرَّطْتُّ فِيْ جَنْۢبِ اللّٰهِ وَاِنْ كُنْتُ لَمِنَ السّٰخِرِيْنَ ﴿56﴾

57 "లేదా 'అల్లాహ్ గనక నాకు సన్మార్గం చూపి ఉంటే నేను కూడా భయభక్తులు గలవారిలో చేరి ఉండేదాన్నేమో!' అని చెబుతుందేమో![92]

اَوْ تَقُوْلَ لَوْ اَنَّ اللّٰهَ هَدٰىنِيْ لَكُنْتُ مِنَ الْمُتَّقِيْنَ ﴿57﴾

58 "లేదా శిక్షను చూసిన తరువాత, 'ఎలాగయినాసరే నేను తిరిగి (ప్రపంచానికి) పంపబడితే నేను సజ్జనులలో చేరుతాను' అని పలుకుతుందేమో! (మీకు ఆ దురవస్థ రాకూడదనే ఈ విషయాలన్నీ విడమరచి చెప్పబడ్డాయి)."

اَوْ تَقُوْلَ حِيْنَ تَرَى الْعَذَابَ لَوْ اَنَّ لِيْ كَرَّةً فَاَكُوْنَ مِنَ الْمُحْسِنِيْنَ ﴿58﴾

59 "అదికాదు, నిశ్చయంగా నా సూచనలు నీ వద్దకు వచ్చాయి. కాని నువ్వు వాటిని ధిక్కరించావు. గర్వాతిశయంతో విర్రవీగావు. అసలు నువ్వు అవిశ్వాసులలో ఒకడవు" (అని అనబడుతుంది).[93]

بَلٰى قَدْ جَآءَتْكَ اٰيٰتِيْ فَكَذَّبْتَ بِهَا وَاسْتَكْبَرْتَ وَكُنْتَ مِنَ الْكٰفِرِيْنَ ﴿59﴾

---

నా దాసులకు తెలియజెయ్యి" అని అనటం జరిగింది (అల్ హిజ్ర్ : 49, 50). ఈ ఆయతు "యా ఇబాదీ!" (నా దాసులారా!) అంటూ మొదలయింది. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే విశ్వసించి, లేదా నిజంగా పశ్చాత్తాపం చెంది, దేవుని నికార్సయిన దాసుడుగా మెలిగే వ్యక్తి పాపాలు సముద్రపు బుడగలకు సమానంగా ఉన్నాసరే – వాటిని దేవుడు క్షమిస్తాడు. నిశ్చయంగా ఆయన తన దాసులపాలిట క్షమాశీలి, దయా స్వభావి. వందమందిని హత మార్చిన వ్యక్తి పశ్చాత్తాపం చెందిన సంఘటన కూడా హదీసులో వచ్చింది (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా; ముస్లిం – కితాబుత్తౌబా).

90. అంటే శిక్ష వచ్చిపడకముందే పశ్చాత్తాపం చెంది, మంచి పనులు చేసుకోండి. ఎందుకంటే శిక్ష వచ్చిపడినప్పుడు మీరు దిక్కుతోచని స్థితికి గురవుతారు. ఇక్కడ 'ఆపద' అంటే ప్రాపంచిక విపత్తు అని భావం.

91. **'ఫీ జంబిల్లాహి' (فِيْ جَنْۢبِ اللّٰهِ)** అంటే దైవవిధేయతలో, ఖుర్‌ఆన్ ఆదేశాలను అనుసరించటంలో కొరత చేశానేమో! అని భావం. లేక 'జంబున్' సమీపం అని భావించినట్లయితే దైవ సామీప్యాన్ని, స్వర్గాన్ని కోరటంలో ఏమన్నా వెలితి చేశానేమో! అన్న అర్థం కూడా వస్తుంది.

92. అంటే నాకు దేవుని సద్బుద్ధి లభించి ఉంటే బహుదైవారాధనకు, దుర్మార్గాలకు దూరంగా ఉండి ఉండేవాణ్ణి. ఉదాహరణకు: "అల్లాహ్ గనక తలచి ఉంటే మేము షిర్క్ చేసేవాళ్ళం కాము" (అల్ అన్ఆమ్ – 148). ముష్రిక్కులు పలికే మాటలాంటిదే ఇది కూడా.

93. వారి ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిగా అల్లాహ్ ఇచ్చే సమాధానం ఇది.

**60** ఎవరయితే అల్లాహ్‌పై అబద్ధాలు చెప్పారో, ప్రళయదినాన వారి ముఖాలు నల్లగా మారిపోవటాన్ని నీవు చూస్తావు.[94] ఏమిటి, గర్వంతో విర్రవీగే వారి నివాస స్థలం నరకం కాదా?[95]

وَيَوْمَ الْقِيَامَةِ تَرَى الَّذِينَ كَذَبُوا عَلَى اللَّهِ وُجُوهُهُم مُّسْوَدَّةٌ ۚ أَلَيْسَ فِي جَهَنَّمَ مَثْوًى لِّلْمُتَكَبِّرِينَ ﴿٦٠﴾

**61** మరెవరయితే భయభక్తులతో మెలిగారో వారిని అల్లాహ్, వారి సాఫల్యంతో సహా కాపాడుతాడు.[96] వారిని ఏ బాధ కూడా తాకదు. వారికి ఏ దుఃఖం ఉండదు.[97]

وَيُنَجِّي اللَّهُ الَّذِينَ اتَّقَوْا بِمَفَازَتِهِمْ لَا يَمَسُّهُمُ السُّوءُ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٦١﴾

**62** అన్ని వస్తువులనూ సృష్టించినవాడు అల్లాహ్‌యే. అన్ని వస్తువులకూ సంరక్షకుడు కూడా ఆయనే.[98]

اللَّهُ خَالِقُ كُلِّ شَيْءٍ ۖ وَهُوَ عَلَىٰ كُلِّ شَيْءٍ وَكِيلٌ ﴿٦٢﴾

**63** భూమ్యాకాశాల తాళం చెవులకు యజమాని ఆయనే.[99] అల్లాహ్ సూచనలను తిరస్కరించినవారే (చివరకు) నష్ట పోయే వారు.[100]

لَّهُ مَقَالِيدُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۗ وَالَّذِينَ كَفَرُوا بِآيَاتِ اللَّهِ أُولَٰئِكَ هُمُ الْخَاسِرُونَ ﴿٦٣﴾

**64** "ఓ అజ్ఞానులారా! అల్లాహ్‌ను వదలి ఇతరులను పూజించమని మీరు నాకు చెబుతారా?"[101] అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు.

قُلْ أَفَغَيْرَ اللَّهِ تَأْمُرُونِّي أَعْبُدُ أَيُّهَا الْجَاهِلُونَ ﴿٦٤﴾

---

94. అల్లాహ్ వారిపై ఆగ్రహోదగ్రుడైన కారణంగా, వారు చూసిన శిక్షల కారణంగా వారి పరిస్థితి ఆ విధంగా తయారవుతుంది.

95. "సత్యాన్ని త్రోసిపుచ్చటం, ప్రజలను అల్పులుగా భావించటం గర్వాతిశయం" అని హదీసులో ఉంది. గర్వం వహించేవారు ముమ్మాటికీ నరకానికి ఆహుతి అవుతారని నొక్కి చెప్పటం ఈ వాక్యంలోని అంతరార్థం.

96. **'మఫాజతున్'** అంటే సాఫల్యం, విజయం, మోక్షం అని అర్థం. అంటే దుష్పరిణామం నుంచి తప్పించుకోవటం, దైవానుగ్రహ భాగ్యాన్ని పొందటం అని భావం. అల్లాహ్ మొదటి నుంచీ సజ్జనులకు వాగ్దానం చేసి ఉండటం వల్ల ఈ భాగ్యాన్ని ప్రసాదించాడు.

97. వారు ప్రపంచంలో వదలివచ్చిన ఆస్తిపాస్తుల్ని, సిరిసంపదలను తలచుకుని బాధపడటం అనేది ఏమీ ఉండదు. ఎందుకంటే వారు ప్రళయదినపు ప్రకోపాల నుంచి సురక్షితంగా బయటపడ్డారు. అందువల్ల వారు హాయిగా, నిశ్చింతగా ఉంటారు.

98. అంటే అన్నింటినీ సృష్టించినవాడు, అన్నింటికీ యజమాని కూడా ఆయనే. ఆయన కోరిన విధంగా వాటిని వినిమయం చేస్తాడు. కోరిన రీతిలో పథకాన్ని వేస్తాడు. ప్రతిదీ ఆయన చెప్పుచేతల్లో ఉంది. ఆయన ఆజ్ఞల్ని ధిక్కరించి, ఇష్టానుసారం వ్యవహరించే సాహసం దేనికీలేదు. ఆయన ఎవరి భాగస్వామ్యం లేకుండా తానొక్కడే వీటన్నింటినీ కాపాడుతున్నాడు. ఇక్కడ 'వకీల్' అంటే రక్షకుడు, వ్యూహకర్త అని భావం.

99. **'మఖాలీద్'** (مَقَالِيد) అనే పదానికి కొంతమంది తాళం చెవులని అనువదించగా, మరికొంత మంది ఖజానాలు అని తర్జుమా చేశారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ రెండింటి భావం ఒక్కటే – సమస్త వ్యవహారాల కళ్ళెం ఆయన చేతుల్లో ఉంది.

100. అంటే ఇది టోకు నష్టం అన్నమాట! ఎందుకంటే వారి కుఫ్ర్ (తిరస్కార ధోరణి) వారిని నరకానికి ఆహుతి చేస్తుంది.

65 నిశ్చయంగా నీ వద్దకు, నీ పూర్వీకులైన ప్రవక్తల వద్దకు పంప బడిన సందేశం (వహీ) ఇది : "ఒకవేళ నువ్వు గనక బహు దైవా రాధనకు పాల్పడితే నువ్వు చేసుకున్నదంతా వృధా అయిపోతుంది. మరి నిశ్చయంగా నువ్వు నష్టపోయినవారిలో చేర్తావు."[102]

وَلَقَدْ أُوحِيَ إِلَيْكَ وَإِلَى الَّذِينَ مِن قَبْلِكَ لَئِنْ أَشْرَكْتَ لَيَحْبَطَنَّ عَمَلُكَ وَلَتَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ ﴿٦٥﴾

66 కాదు, నువ్వు మాత్రం (ఒక్కడైన) అల్లాహ్‌నే ఆరాధించు.[103] కృతజ్ఞతలు తెలుపుకునే వారిలో చేరిపో.

بَلِ اللَّهَ فَاعْبُدْ وَكُن مِّنَ الشَّاكِرِينَ ﴿٦٦﴾

67 వారసలు అల్లాహ్‌ను గౌరవించవలసిన విధంగా గౌరవించ లేదు.[104] ప్రళయ దినాన భూమి అంతా ఆయన గుప్పెట్లో ఉంటుంది. ఆకాశాలన్నీ ఆయన కుడిచేతిలో చుట్టబడి ఉంటాయి.[105] ఆయన పవిత్రుడు. వీళ్లు కల్పించే భాగస్వామ్యా లకు అతీతుడు – ఎంతో ఉన్నతుడు.

وَمَا قَدَرُوا اللَّهَ حَقَّ قَدْرِهِ وَالْأَرْضُ جَمِيعًا قَبْضَتُهُ يَوْمَ الْقِيَامَةِ وَالسَّمَاوَاتُ مَطْوِيَّاتٌ بِيَمِينِهِ ۚ سُبْحَانَهُ وَتَعَالَىٰ عَمَّا يُشْرِكُونَ ﴿٦٧﴾

101. అవిశ్వాసులు మహాప్రవక్త (స)కు ఇచ్చిన సలహాకు సమాధానంగా ఈ ఆయతు వచ్చింది. తాతముత్తాతల ధర్మాన్ని అవలంబించమని మక్కా అవిశ్వాసులు దైవప్రవక్త (స)కు సూచించారు. ఆ మతంలో విగ్రహారాధన ఉండేది.

102. అంటే బహుదైవారాధన చేస్తున్న స్థితిలో గనక నీకు మరణం వస్తే లేక నువ్వు పశ్చాత్తాపం చెందకుండానే మరణిస్తే నీ సత్కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఈ మాటలు దైవప్రవక్తను ఉద్దేశించి చెప్పబడినప్పటికీ నిజానికి ఉమ్మత్‌కు (ముస్లిం సమాజానికి) బోధపరచటం దీని అంతరార్థం. ఎందుకంటే దైవప్రవక్త (స) షిర్క్‌కు దూరంగా ఉన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన (స) ద్వారా ఇలాంటి అపచారం జరిగే అవకాశమే లేదు. కాని ముస్లిం సమాజాన్ని సంస్కరించటం దేవుని అసలు అభిమతం.

103. మనిషి ఒక్కడైన అల్లాహ్‌ను నిష్కల్మషమైన హృదయంతో ఆరాధించినపుడే ధన్యజీవిగా రాణిస్తాడు.

104. ఎందుకంటే వారు ఆయన మాటనూ వినలేదు, ఆయన తన ప్రవక్తల ద్వారా అందజేసిన మాటనూ ఖాతరు చేయలేదు. పోనీ దైవారాధన విషయంలోనయినా నిర్మల హృదయం కలిగి ఉన్నారా అంటే అదీ లేదు. ఆరాధనలలో కూడా దైవానికి భాగస్వాముల్ని కల్పించారు.

హదీసు ప్రకారం ఒక యూదపండితుడు దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, "అల్లాహ్ గురించి మాకు తెలిసిన విషయాలలో ఒకటేమంటే, ఆయన (ప్రళయదినాన) ఆకాశాలను ఒక వ్రేలిపై, భూములను ఒక వ్రేలిపై, వృక్షాలను ఒక వ్రేలిపై, నీళ్ళను ఒక వ్రేలిపై, సమస్త సృష్టిరాశులను ఒక వ్రేలిపై పెట్టుకుని 'నేను విశ్వచక్రవర్తిని' అనంటాడు" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) చిరునవ్వును చిందించి, ఆ విషయాన్ని సత్యమని ధృవపరచారు. తరువాత ఆయన (స) **'వమా ఖదరుల్లాహ....'** అనే ఈ ఆయతును పఠించారు (సహీహ్ బుఖారీ – అజ్జుమర్ సూరా వ్యాఖ్యానం). ఖుర్ఆన్‌లోనూ, ప్రామాణిక హదీసులలోనూ అల్లాహ్ గుణగణాలకు సంబంధించి ఏ ఏ విషయాలు ప్రస్తావనకు వచ్చాయో వాటిని (ఉదాహరణకు : ఈ ఆయతులో అల్లాహ్ చేతుల గురించి, హదీసులో చేతివ్రేళ్ళ గురించి ప్రస్తావించబడింది) యథాతథంగా, ఎలాంటి వర్ణనలు చేయకుండా, వక్రీకరించకుండా విశ్వసించటం అవసరం. ఈ విషయంలో హదీసువేత్తల, సలఫ్‌ల అభిమతం కూడా ఇదే. అందువల్ల ఇక్కడ వివరించబడిన యదార్థానికి (అంటే అల్లాహ్ పిడికిలిలో, కుడిచేతిలో ఉంటాయి అనే వాస్తవానికి) తమదైన భాష్యం చెబుతూ దాన్ని దేవుని శక్తి సామర్థ్యాలుగా, తిరుగులేని అధికారంగా అభివర్ణించటం సరైనది కాదు.

وَنُفِخَ فِي الصُّورِ فَصَعِقَ مَنْ فِي السَّمٰوٰتِ وَمَنْ فِي الْأَرْضِ إِلَّا مَنْ شَآءَ اللّٰهُ ۖ ثُمَّ نُفِخَ فِيهِ أُخْرٰى فَإِذَا هُمْ قِيَامٌ يَنْظُرُونَ (68)

**68** మరి శంఖం ఊదబడగానే ఆకాశాలలో, భూమిలో ఉన్న వారంతా స్పృహ తప్పి పడిపోతారు[106] – కాని అల్లాహ్ కోరిన వారు మాత్రం[107] (స్పృహ కోల్పోరు)! మళ్లీ శంఖం పూరించబడ గానే వారంతా ఒక్కసారిగా లేచి చూస్తూ ఉంటారు.[108]

وَأَشْرَقَتِ الْأَرْضُ بِنُورِ رَبِّهَا وَوُضِعَ الْكِتٰبُ وَجِايْٓءَ بِالنَّبِيّٖنَ وَالشُّهَدَآءِ وَقُضِيَ بَيْنَهُمْ بِالْحَقِّ وَهُمْ لَا يُظْلَمُونَ (69)

**69** భూమి తన ప్రభువు జ్యోతితో ధగధగా మెరిసిపోతుంది.[109] కర్మల పత్రాలు హాజరు పరచబడతాయి. ప్రవక్తలు, సాక్షులు రప్పించబడతారు.[110] వారి మధ్య న్యాయసమ్మతంగా తీర్పు చేయబడుతుంది. వారికి అన్యాయం అనేది జరగదు.[111]

105. దీని గురించి కూడా హదీసులో ఉంది – "నేను చక్రవర్తిని. భూమండలంలోని చక్రవర్తులు (ఇప్పుడు) ఎక్కడున్నారు?" అని అల్లాహ్ అంటాడు (సహీహ్ బుఖారీ – అజ్జుమర్ సూరా వ్యాఖ్యానం).

106. కొంతమంది దీన్ని మలిసారి శంఖారావంగా అభిప్రాయపడగా, మరికొంతమంది తొలిసారి శంఖారావమని చెప్పారు. దీన్ని మలిసారి శంఖారావంగా భావించినట్లయితే దాని శబ్దం వినగానే మానవులందరూ చనిపోతారు. మరొకవేళ దీన్ని తొలిసారి శంఖారావంగా భావిస్తున్నట్లయితే ఈ శబ్దానికి ముందుగా అందరూ తీవ్రమైన భయాందోళనకు గురవుతారు. ఆ తరువాత అందరూ చనిపోతారు. ఈ శంఖం ఊదబడటం అనేది అనేక దశలుగా ఉంటుందని, మొదటిసారి శంఖం ఊదబడగానే అందరూ నశిస్తారని, రెండవసారి శంఖం ఊదబడినప్పుడు తిరిగి లేస్తారని, మూడవసారి శంఖం ఊదబడినప్పుడు స్పృహ కోల్పోతారని, నాల్గవసారి సర్వలోక ప్రభువు సమక్షంలో నిలబడతారని మరికొంతమంది వ్యాఖ్యాతలు పేర్కొన్నారు (ఐసరుత్తఫాసీర్). ఇంకా కొంతమంది పండితుల ప్రకారం రెండుసార్లు మాత్రమే శంఖం పూరించబడుతుంది. తొలిసారి పూరించబడినపుడు అందరూ చనిపోతారు. రెండవసారి పూరించబడినపుడు అందరూ తిరిగిలేస్తారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం శంఖం మూడుసార్లు ఊదబడుతుంది. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.

107. అంటే అల్లాహ్ కోరిన కొందరికి మరణం రాదు. ఉదాహరణకు : జిబ్రయీల్, మీకాయీల్, ఇస్రాఫీల్ వంటి దైవదూతలు. అర్ష్‌ను (దైవసింహాసనాన్ని) మోసే దైవ దూతలకు, స్వర్గనరకాల ద్వారపాలకులైన దూతలకు మరణం రాదని మరికొంత మంది వ్యాఖ్యానించారు (ఫత్‌హుల్ ఖదీర్).

108. నాలుగు శంఖారావాలుంటాయని భావించే వారి ప్రకారం ఇది నాల్గవది, మూడు శంఖారావాలుంటాయని చెప్పేవారి ప్రకారం ఇది మూడవది, రెండు శంఖారావాలుంటాయని అభిప్రాయపడేవారి ప్రకారం ఇది రెండవసారి శంఖారావం అన్నమాట. మొత్తానికి ఈ శంఖం పూరించబడగానే అందరూ పునరుజ్జీవనం చెంది మహ్షర్ మైదానంలో – తమ ప్రభువు సమక్షంలో – హాజరవుతారు. అక్కడ అందరి లెక్కలు తేల్చబడతాయి.

109. ఇక్కడ జ్యోతి లేక తేజస్సు అంటే కొందరు 'న్యాయం' అనీ, కొందరు 'ఆజ్ఞ' అని అభిప్రాయపడ్డారు. అయితే దాన్ని దాని నిజ అర్థంలో తీసుకోవటంలో పోయిందేమీ లేదు. ఎందుకంటే అల్లాహ్ ఆకాశాలకు, భూమికి జ్యోతి. (ఫత్‌హుల్ ఖదీర్)

110. మీరు నా సందేశాన్ని మీ మీ జాతుల వారికి చేరవేశారా? లేదా? దానికి మీ జాతి ప్రజలేమన్నారు? మీ మాటను విన్నారా? త్రోసిపుచ్చారా? అని ప్రవక్తలను పిలిచి అడగటం జరుగుతుంది. ముహమ్మద్ (స) అనుచర సమాజాన్ని కూడా సాక్ష్యంగా తీసుకురావటం జరుగుతుంది. అల్లాహ్! నీవు మాకు ఖుర్‌ఆన్ ద్వారా తెలియపరచిన దాని ప్రకారం నీ ప్రవక్తలు, నీ సందేశాన్ని తమ తమ జాతుల వారికి అందజేశారు అని వారు సాక్ష్యమిస్తారు.

111. అంటే ఒకరికి ఇవ్వవలసిన పుణ్యఫలంలో ఎలాంటి కోత విధించబడదు. అలాగే ఒకరికి విధించవలసిన శిక్షలో ఎలాంటి రాయితీ ఇవ్వబడదు. అలా అని నిర్ధారిత శిక్షకంటే ఎక్కువ శిక్ష కూడా వడ్డించబడదు.

70 ప్రతి ప్రాణికీ – అది చేసుకున్న దాన్ని బట్టి పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ప్రజలు చేసేవన్నీ ఆయనకు బాగా తెలుసు.[112]

وَوُفِّيَتْ كُلُّ نَفْسٍ مَّا عَمِلَتْ وَهُوَ أَعْلَمُ بِمَا يَفْعَلُونَ ﴿٧٠﴾

71 అవిశ్వాసులు గుంపులు గుంపులుగా నరకం వైపు తోల బడతారు.[113] వారు అక్కడకు చేరుకోగానే దాని ద్వారాలు తెరువ బడతాయి.[114] "ఏమిటి? మీ ప్రభువు వాక్యాలను చదివి వినిపించే, ఈ దినం రానున్నదని మిమ్మల్ని హెచ్చరించే ప్రవక్తలు – మీలో నుంచి – ఎవరూ రాలేదా?" అని అక్కడి పర్యవేక్షకులు వారిని అడుగుతారు. దానికి వారు "ఎందుకు రాలేదు? (వచ్చారు).[115] కాని అవిశ్వాసులపై శిక్షా ఉత్తర్వు ఖరారై పోయింది"[116] అని చెబుతారు.

وَسِيقَ الَّذِينَ كَفَرُوا إِلَىٰ جَهَنَّمَ زُمَرًا ۖ حَتَّىٰ إِذَا جَاءُوهَا فُتِحَتْ أَبْوَابُهَا وَقَالَ لَهُمْ خَزَنَتُهَا أَلَمْ يَأْتِكُمْ رُسُلٌ مِّنكُمْ يَتْلُونَ عَلَيْكُمْ آيَاتِ رَبِّكُمْ وَيُنذِرُونَكُمْ لِقَاءَ يَوْمِكُمْ هَٰذَا ۚ قَالُوا بَلَىٰ وَلَٰكِنْ حَقَّتْ كَلِمَةُ الْعَذَابِ عَلَى الْكَافِرِينَ ﴿٧١﴾

72 "ఇక నరక ద్వారాలలో ప్రవేశించండి. మీరు శాశ్వతంగా ఉండాల్సింది అక్కడే. తలబిరుసుల నివాస స్థలం చాలా చెడ్డది" అని అనబడుతుంది.

قِيلَ ادْخُلُوا أَبْوَابَ جَهَنَّمَ خَالِدِينَ فِيهَا ۖ فَبِئْسَ مَثْوَى الْمُتَكَبِّرِينَ ﴿٧٢﴾

73 మరెవరయితే తమ ప్రభువుకు భయపడుతూ ఉండేవారో, వారు గుంపులు గుంపులుగా స్వర్గం వైపునకు పంప బడతారు.[117] తుదకు వారు అక్కడకు చేరుకునేటప్పటికే దాని ద్వారాలు తెరువబడి ఉంటాయి.[118] స్వర్గ పర్యవేక్షకులు వారినుద్దేశ్యించి, "మీపై శాంతి కురియుగాక! మీరు హాయిగా ఉండండి. శాశ్వ తంగా ఉండేటందుకు ఇందులో ప్రవేశించండి" అంటారు.

وَسِيقَ الَّذِينَ اتَّقَوْا رَبَّهُمْ إِلَى الْجَنَّةِ زُمَرًا ۖ حَتَّىٰ إِذَا جَاءُوهَا وَفُتِحَتْ أَبْوَابُهَا وَقَالَ لَهُمْ خَزَنَتُهَا سَلَامٌ عَلَيْكُمْ طِبْتُمْ فَادْخُلُوهَا خَالِدِينَ ﴿٧٣﴾

112. అంటే వాస్తవానికి అల్లాహ్‌కు గుమస్తాల అవసరంగానీ, గణాంకవేత్తల అవసరంగానీ లేదు. కాకపోతే దాసుల తృప్తి కోసం – మాట వరసకు – ఆ చిట్టాపద్దులు సమర్పించబడతాయి.

113. **'జుమరున్'** అనేది **జుమ్‌రున్** నుండి వచ్చింది. దీనికి కోలాహలం, రణగొణధ్వని అన్న అర్థం కూడా వస్తుంది. అందుకే ఈ పదం బృందం, గుంపు, మంద అన్న భావంలో కూడా తీసుకోబడుతుంది. దీని మతలబు ఏమిటంటే దైవధర్మాన్ని నిరాకరించిన వారు నరకం వైపుకు గుంపులు గుంపులుగా తోలబడతారు. ఒక సమూహం వెనుక మరో సమూహం ఉంటుంది. దివ్యఖుర్‌ఆన్‌లో మరోచోట చెప్పబడినట్లు, "ఆ రోజు వారు త్రోయబడుతూ, నెట్టబడుతూ నరకాగ్ని వైపు తీసుకురాబడతారు." (అత్ తూర్ : 13)

114. అంటే – వారు నరకం వద్దకు చేరుకోగానే, ఏమాత్రం ఆలస్యం జరగకుండా – నరకపు ఏడు ద్వారాలు కూడా తెరువబడతాయి.

115. ఒకప్పుడు వారు ప్రపంచంలో వితండవాదన చేసేవారు. సాకులు చెప్పేవారు. సత్యాన్ని త్రోసిపుచ్చేందుకు తలాతోకా లేని ఆరోపణలు చేసేవారు. కాని ఇప్పుడు జరిగేదంతా కళ్ళతో చూసేసరికి కుంటిసాకులకు అవకాశం మిగల్లేదు. గత్యంతరం లేక ఒప్పుకుంటారు.

116. అంటే, మేము దైవప్రవక్తల సందేశాన్ని త్రోసిపుచ్చాము. వారికి వ్యతిరేకంగా అనరాని మాటలన్నాము. ఈ కారణంగా

74 "అల్లాహ్‌కే కృతజ్ఞతలు. ఆయన మాకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాడు. మమ్మల్ని ఈ భూమికి వారసులుగా చేశాడు. ఇక స్వర్గంలో మేము కోరిన చోటల్లా ఉంటాము. మొత్తానికి (మంచి) కర్మలు చేసేవారికి లభించే ప్రతిఫలం ఎంత గొప్పది!" అని వారు అంటారు.

وَقَالُوا الْحَمْدُ لِلَّهِ الَّذِي صَدَقَنَا وَعْدَهُ وَأَوْرَثَنَا الْأَرْضَ نَتَبَوَّأُ مِنَ الْجَنَّةِ حَيْثُ نَشَاءُ فَنِعْمَ أَجْرُ الْعَامِلِينَ ﴿٧٤﴾

మాకు శిక్ష తప్పలేదు అని సమాధానమిస్తారు. ఈ అంశం అల్ ముల్క్ సూరా (8 – 10)లో మరింత వివరంగా ప్రస్తావనకు వచ్చింది.

117. స్వర్గవాసులు కూడా వివిధ బృందాల రూపంలో స్వర్గంలోనికి తీసుకుపోబడతారు. అందరికన్నా ముందు దేవుని సామీప్యం పొందినవారు, ఆ తరువాత సజ్జనులు... ఈ విధంగా వారు తమ తమ అంతస్థులను బట్టి వర్గీకరించబడతారు. ప్రతి బృందంలోని సభ్యులు తమ తమ సత్కార్యాల రీత్యా సమానులై ఉంటారు. ఉదాహరణకు: దైవప్రవక్తలతో పాటు దైవప్రవక్తలుంటారు. సిద్దీఖులు, షహీదులు తమ శ్రేణికి చెందిన వారి వెంట ఉంటారు. పండితులు తమ కోవకు చెందినవారితోనే ఉంటారు. ఈ విధంగా వారి వారి యోగ్యతలను బట్టి వారి శ్రేణులు ఉంటాయి (ఇబ్నె కసీర్).

118. స్వర్గానికి మొత్తం 8 ద్వారాలుంటాయనీ, వాటిలో ఒక దాని పేరు 'రయ్యాన్' అనీ, ఉపవాసకులు మాత్రమే ఈ ద్వారం గుండా స్వర్గంలో ప్రవేశిస్తారని హదీసులో చెప్పబడింది (సహీహ్ బుఖారీ – హ.నెం. 2257; ముస్లిం – హ.నెం.808). అలాగే ఇతర ద్వారాలకు కూడా పేర్లు ఉండొచ్చు. ఉదాహరణకు : బాబుస్సలాత్, బాబుస్ సదఖా, బాబుల్ జిహాద్ మొదలగునవి (సహీహ్ బుఖారీ – కితాబుస్సియామ్; సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్). ఒక్కో ద్వారం నలభైయేండ్లు ప్రయాణించినంత వెడల్పు ఉంటుంది. అయినప్పటికీ అవి నిండుగా ఉంటాయి (సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్). అందరికన్నా ముందు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) స్వర్గం తలుపు తడతారు (ముస్లిం – కితాబుల్ ఈమాన్). స్వర్గంలో అందరికన్నా ముందు ప్రవేశించే సమూహంలోని సభ్యుల ముఖారవిందాలు పున్నమి వెన్నెల వలె దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉంటాయి. ఆ తరువాతి బృందంలోని వారి ముఖాలు ఆకాశంలోని నక్షత్రాలలో మెరిసే నక్షత్రాల్లా ఉంటాయి. స్వర్గంలో వారికి మలమూత్ర విసర్జన వంటివి ఉండవు. వారికి ఉమ్మిరాదు. ఛాతీలో కఫం ఏర్పడదు. వారి దువ్వెనలు బంగారపు దువ్వెనలై ఉంటాయి. వారి శరీరాలకు పట్టే చెమట కస్తూరిలా సువాసనను గుభాళిస్తూ ఉంటుంది. వారి ఉంగరాలలో పరిమళాన్ని వెదజల్లే ప్రత్యేక గంధపు చెక్క ఉంటుంది. వారి సతీమణులు అప్సరసలై ఉంటారు. స్వర్గవాసుల ఎత్తు హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) మాదిరిగా 60 చేతుల బారుంటుంది. (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా).

సహీహ్ బుఖారీలోని మరో కథనం ప్రకారం తెలిసేదేమంటే అక్కడ ప్రతి విశ్వాసికీ ఇద్దరు భార్యలుంటారు. వారి అందచందాల గురించి, లలిత లావణ్యాల గురించి చెప్పటం చాలా కష్టం. వారి పిక్కలపైనున్న మాంసంలో నుంచి వారి బొమికల్లోని గుజ్జు సయితం కనిపిస్తుందంటే అవి ఎంత నాజూకుగా ఉంటాయో ఊహించవచ్చు (కితాబ్ బద్‌వుల్ ఖల్ఖ్). మరికొందరి వ్యాఖ్యానం ప్రకారం అప్సరసలతోపాటు ఈ ఇద్దరు భార్యలు అదనంగా ఉంటారు. వారు ప్రాపంచిక స్త్రీలు అయి ఉంటారు. 72 మంది అప్సరసలుంటారన్న కథనం బలహీనమైనందువల్ల ఈ కథనమే ప్రామాణికమని భావించవలసి ఉంది (అంటే ప్రతి స్వర్గవాసికి అప్సరసలతో పాటు కనీసం ఇద్దరు భార్యలుంటారు). అయితే **'వలహుమ్ ఫీహా మా యష్తహూన్'** (వారి కోసం వారు కోరుకున్న ప్రతీది ఉంటుంది) అన్న ఆయతు ప్రకారం ఎక్కువమంది ఉండటానికి కూడా ఆస్కారముంది. నిజము దేవుడెరుగు. (మరిన్ని వివరాల కోసం ఫత్‌హుల్ బారీలో ఇదే అధ్యాయాన్ని చూడండి).

**75** మరి నువ్వు, దైవదూతలు దైవ సింహాసనం చుట్టూ చేరి, తమ ప్రభువు పవిత్రతను కొనియాడటాన్ని, స్తోత్రం చేయటాన్ని చూస్తావు.[119] వారి మధ్య న్యాయబద్ధంగా తీర్పు చేయబడుతుంది. "సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కే సర్వస్తోత్రాలు"[120] అని అనబడుతుంది.

وَتَرَى الْمَلٰٓئِكَةَ حَآفِّيْنَ مِنْ حَوْلِ الْعَرْشِ يُسَبِّحُوْنَ بِحَمْدِ رَبِّهِمْ ۚ وَقُضِيَ بَيْنَهُمْ بِالْحَقِّ وَقِيْلَ الْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿75﴾

119. దేవుని తీర్పు వినిపించబడిన తరువాత స్వర్గవాసులు స్వర్గంలోనికి, నరకవాసులు నరకంలోనికి వెళ్ళిపోతారు. ఆ తరువాత ఏం జరుగుతుందో ఈ ఆయతులో చెప్పబడింది – దైవదూతలు దేవుని పీఠం (అర్ష్) చుట్టూ చేరి ఆయన్ని స్తుతించటంలో నిమగ్నులైపోతారు.

120. ఇంతకీ ఈ స్తోత్రం పలికేవారెవరన్నది ఇక్కడ చెప్పబడలేదు. కాబట్టి ప్రతి వస్తువు దైవకీర్తన చేస్తుందని భావించటానికి ఆస్కారం ఉంది.

40 వ సూరా

# అల్ మూ'మిన్

## విశ్వాసి

అవతరణ మక్కాలో

ఆయతులు 85

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి నొక్కి చెప్పింది. దేవుడు అవతరింపచేస్తున్న దివ్యవాణి గురించిన ప్రస్తావనతో ఈ సూరా ప్రారంభమయ్యింది. అల్లాహ్‌ను తప్పులను క్షమించే క్షమాశీలిగా అభివర్ణించింది. ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. కఠినంగా శిక్షిస్తాడు. అపార దయామయుడు. ఆయన తప్ప మరో దైవం లేదు. కేవలం అవిశ్వాసులు మాత్రమే దేవుని చిహ్నాల గురించి అభ్యంతరాలు వ్యక్తం చేస్తారు. వారు స్పష్టంగా కనబడుతున్న ఈ చిహ్నాలను వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నారు. దేవుని చిహ్నాలు మనలను అల్లుకుని ఉన్నాయి. ఇవి అన్నీ దేవుని ఏకత్వాన్ని చాటిచెబుతున్నాయి. ఆయన శక్తిసామర్థ్యాలను ప్రకటిస్తున్నాయి. గత కాలానికి చెందిన జాతులు కూడా సత్యాన్ని తిరస్కరించాయి. దేవుని చిహ్నాలకు వ్యతిరేకంగా వాదించాయి. ఈ సూరాలో అనేకమంది గత కాలాలకు చెందిన ప్రవక్తలను గురించి ప్రస్తావించడం జరిగింది. వారి ప్రజలు ఆయా ప్రవక్తలను తిరస్కరించారు. ఎగతాళి చేసారు. వారికి వ్యతిరేకంగా కుట్రలు పన్నారు. వారిని మంత్రగాళ్ళుగా పిలిచారు. వారితో పిడివాదాలకు దిగారు. సత్యాన్ని తిరస్కరించడానికి అబద్ధపు వాదనలు చేసారు. నూహ్ (అస), హూద్ (అస), యూసుఫ్(అస), సాలిహ్ (అస)ల గురించి ఈ సూరాలో క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. మూసా(అస) గురించి వివరంగా ప్రస్తావన వచ్చింది. ఫిర్ఔన్‌కు వ్యతిరేకంగా మూసా (అస) పోరాటం గురించి వివరించింది. ఫిర్ఔన్ మూసా (అస) సందేశాన్ని వ్యతిరేకించాడు. ఆయన్ను చంపడానికి కుట్రలు పన్నాడు. అహంకారంతో ఫిర్ఔన్, మూసా(అస)ను ఎగతాళి చేయడానికి తన దర్బారులో ఉన్న హామాన్‌తో ఒక పెద్ద స్థూపం నిర్మించమని చెప్పాడు. ఆ స్థూపాన్నెక్కి మూసా చెప్పే దేవుడిని చూసొస్తానని అపహాస్యం చేసాడు.*

*దేవుని ఔన్నత్యాన్ని కొనియాడే దైవదూతల గురించి ఈ సూరాలో ప్రస్తావించబడింది. దైవదూతలు అల్లాహ్‌ను స్మరిస్తూ, స్తుతిస్తూ, విశ్వాసుల కోసం క్షమాభిక్షను అర్థిస్తూ ఉంటారు. నరకాగ్ని బాధ నుంచి విశ్వాసులను కాపాడమని, వారికి స్వర్గవనాలు ప్రసాదించమని, వారిని వారి తప్పుల నుంచి రక్షించమని దైవదూతలు దేవుణ్ణి ప్రార్థిస్తుంటారు.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 28-45 | 95 | 'పలాయనం' | ఫిర్ఔన్ చక్రవర్తి దైవప్రవక్త మూసా (అ)కు బద్ధవిరోధి. కాని అతని కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి మూసా (అ)ను విశ్వసించాడు. అయితే ఫిర్ఔన్‌కు భయపడి తన విశ్వాసాన్ని రహస్యంగా ఉంచాడు. తరువాత సమయం వచ్చినపుడు తన విశ్వాసాన్ని బయటపెట్టడమే కాకుండా మూసా ప్రవక్తకు కీడు తలపెట్టవద్దని తన జాతి వారికి హితబోధ చేశాడు. |

## అల్ మూ'మిన్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1 – 2** హా మీమ్. ఈ గ్రంథావతరణ[2] అల్లాహ్ తరఫున జరిగింది. ఆయన మహా శక్తిమంతుడు, సర్వం తెలిసినవాడు.[3]

**3** పాపాలను క్షమించేవాడు, పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు,[4] కఠినంగా శిక్షించేవాడు,[5](అనంతంగా) అనుగ్రహించేవాడు[6] – ఆయన తప్ప వేరే ఆరాధ్య దైవం లేడు. ఆయన వద్దకే మరలి పోవలసి ఉన్నది.

**4** సత్యతిరస్కారులు మాత్రమే అల్లాహ్ వాక్యాల విషయంలో వాదులాడుతారు.[7] కాబట్టి పట్టణ ప్రాంతాలలో వారి స్వైర విహారం నిన్ను మోసపుచ్చకూడదు సుమా![8]

سُورَةُ الْمُؤْمِنِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

حٰمٓ ①
تَنْزِيْلُ الْكِتٰبِ مِنَ اللّٰهِ الْعَزِيْزِ الْعَلِيْمِ ②
غَافِرِ الذَّنْۢبِ وَقَابِلِ التَّوْبِ شَدِيْدِ الْعِقَابِ
ذِى الطَّوْلِ ۭ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۭ اِلَيْهِ الْمَصِيْرُ ③

مَا يُجَادِلُ فِيْٓ اٰيٰتِ اللّٰهِ اِلَّا الَّذِيْنَ كَفَرُوْا فَلَا
يَغْرُرْكَ تَقَلُّبُهُمْ فِى الْبِلَادِ ④

1. ఈ సూరానే **ఘాఫిర్** (غَافِر) సూరాగా, **తౌల్** (الطَّوْل) సూరాగా కూడా వ్యవహరిస్తారు.
2. అంటే ఇది అల్లాహ్ తరఫున పంపబడిన గ్రంథం అన్న విషయంలో సందేహానికి ఆస్కారమే లేదు.
3. ఆయన గొప్ప శక్తిశాలి, అన్నింటిపై అదుపు కలిగి ఉన్నవాడు. ఆయన సమక్షంలో, ఆయన అనుజ్ఞ లేకుండా ఎవరూ ఏమీ చేయలేరు. ఆయన మహాజ్ఞాని, అన్నీ తెలిసినవాడు. లోకంలోని ఏ చిన్న వస్తువు కూడా ఆయన నుండి దాగిలేదు. అది ఎన్ని పొరలలో చుట్టబడి ఉన్నాసరే, దాన్ని ఆయన గమనిస్తూనే ఉన్నాడు. ఆయన సూక్ష్మగ్రాహి.
4. ఆయన గతంలో దాసులవల్ల జరిగిన పాపాలను మన్నించేవాడు, భవిష్యత్తులో జరిగే పొరపాట్లపై దాసుల పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు. లేదా తన నేస్తాల పాలిట క్షమాశీలి. తనను తిరస్కరించేవారు గనక పశ్చాత్తాపం చెందితే వారి పశ్చాత్తాపాన్ని దయతో స్వీకరించేవాడు అని భావం.
5. పరలోక జీవితంపై ఇహలోక జీవితానికి ప్రాధాన్యతనిచ్చి, అహంకారంతో విర్రవీగే వారి పాలిట ఆయన చాలా కఠినుడు. “నేను క్షమించేవాణ్ణి, కనికరించేవాణ్ణి. మరి నా శిక్ష కూడా వ్యధాభరితమైనదే అని ఓ ప్రవక్తా! నా దాసులకు తెలియపరచు” (అల్ హిజ్ర్ – 49, 50) అన్న సూక్తులు కూడా గమనించదగినవి. దివ్య ఖుర్ఆన్‌లో చాలాచోట్ల – ఒకే సమయంలో – దేవుని ఈ రెండు గుణాలు వివరించబడ్డాయి. మానవుడు ఒకవైపు దేవుని శిక్షకు భయపడుతూ, మరోవైపు ఆయన కారుణ్యం పట్ల ఆశపెట్టుకుని ఉండాలన్నదే ఇందలి మర్మం. ఎందుకంటే పొద్దస్తమానం భయపెడుతూ ఉంటే మానవుడు దైవకారుణ్యం పట్ల, క్షమాభిక్ష పట్ల నిరాశ చెందుతాడు. మరి అహోరాత్రులు అభయం ఇస్తూనే ఉంటే అతను విచ్చలవిడిగా పాపాలు చేస్తూపోతాడు.
6. **'తౌల్'** అంటే కలిమి అని అసలు అర్థం. అంటే ఆయన అపారంగా కలిమిని ప్రసాదిస్తాడు, కొందరు దీన్ని అనుగ్రహం అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే ఆయన తన దాసులను అనుగ్రహించేవాడన్న మాట.
7. ఇక్కడ **'వాదులాడటం'** అంటే అధర్మంగా వితండవాదన చేయటం అని అర్థం. సత్యాన్ని ఓడించి అసత్యాన్ని చాటే ఉద్దేశంతో చేసే ఈ వాదులాట ఖండించదగినది. సత్యధర్మ ఉన్నతికోసం, అపార్థాల తొలగింపు కోసం వాదిస్తే తప్పు లేదు. పైగా ఇలాంటి వాదన స్వాగతించదగినది, ప్రశంసించదగినది. ఇలాంటి సంవాదనల కోసం సిద్ధంగా

**5** వీరికి పూర్వం నూహ్ జాతి వారు, వారి తరువాత వచ్చిన వర్గాల వారు కూడా ధిక్కార వైఖరికి ఒడిగట్టారు. ప్రతి సముదాయం వారూ తమ ప్రవక్తను పట్టుకో జూశారు.[9] అసత్యంతో సత్యాన్ని దెబ్బ తీసేందుకు పిడివాదనలు చేశారు.[10] అందుకే నేను వాళ్ళను పట్టుకున్నాను. మరి నా తరఫున ఎలా దెబ్బ పడిందో (చూడు)![11]

كَذَّبَتْ قَبْلَهُمْ قَوْمُ نُوحٍ وَالْأَحْزَابُ مِنْ بَعْدِهِمْ ۖ وَهَمَّتْ كُلُّ أُمَّةٍ بِرَسُولِهِمْ لِيَأْخُذُوهُ ۖ وَجَادَلُوا بِالْبَاطِلِ لِيُدْحِضُوا بِهِ الْحَقَّ فَأَخَذْتُهُمْ ۖ فَكَيْفَ كَانَ عِقَابِ ⑤

**6** ఈ విధంగా – సత్యతిరస్కారులు నరక వాసులవుతారన్న నీ ప్రభువు వాక్కు నిజమని రుజువయింది.[12]

وَكَذَٰلِكَ حَقَّتْ كَلِمَتُ رَبِّكَ عَلَى الَّذِينَ كَفَرُوا أَنَّهُمْ أَصْحَابُ النَّارِ ⑥

**7** అర్ష్ (అల్లాహ్ సింహాసనం)ను మోసేవారు, దాని చుట్టూ ఉన్న వారు (దైవ దూతలు) స్తోత్రసమేతంగా తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతున్నారు. వారు ఆయన్ని విశ్వసిస్తున్నారు. విశ్వాసుల మన్నింపు కొరకు ప్రార్థిస్తూ వారు ఇలా అంటారు: "మా ప్రభూ! నీవు ప్రతి వస్తువును నీ దయానుగ్రహంతో, పరిజ్ఞానంతో ఆవరించి ఉన్నావు. కనుక పశ్చాత్తాపం చెంది, నీ మార్గాన్ని అనుసరించినవారిని నీవు క్షమించు. ఇంకా వారిని నరక శిక్ష నుంచి కూడా కాపాడు.[13]

الَّذِينَ يَحْمِلُونَ الْعَرْشَ وَمَنْ حَوْلَهُ يُسَبِّحُونَ بِحَمْدِ رَبِّهِمْ وَيُؤْمِنُونَ بِهِ وَيَسْتَغْفِرُونَ لِلَّذِينَ آمَنُوا رَبَّنَا وَسِعْتَ كُلَّ شَيْءٍ رَحْمَةً وَعِلْمًا فَاغْفِرْ لِلَّذِينَ تَابُوا وَاتَّبَعُوا سَبِيلَكَ وَقِهِمْ عَذَابَ الْجَحِيمِ ⑦

---

ఉండాలని తాకీదు కూడా చేయటం జరిగింది. ఉదాహరణకు : "మీరు వాటిని ప్రజలకు విడమరచి చెప్పండి, మరుగుపరచకండి" (ఆలి ఇమ్రాన్ – 187). అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథంలోని నిదర్శనాలను, ప్రమాణాలను మరుగు పరచటం ఘోరమైన నేరం. అది ఎంతపెద్ద తప్పంటే దానికి ఒడిగట్టేవారిని లోకంలోని ప్రతి వస్తువూ శపిస్తుంది (అల్ బఖర సూరా 159వ ఆయతు ఆధారంగా).

8. అంటే వర్తకం నిమిత్తం ఈ అవిశ్వాసులు దేశదేశాలలో యథేచ్ఛగా సంచరిస్తున్నారు. వివిధ పట్టణాలలో వ్యాపార లావాదేవీలు జరిపి ఇబ్బడిముబ్బడిగా లాభాలను ఆర్జిస్తున్నారు. అంతమాత్రాన మేము వారిని విడిచిపెట్టేశామని అనుకోరాదు. వారికి కొంతగడువు ఇచ్చిన సంగతి వాస్తవమే. అయితే వారు తమ తిరస్కార వైఖరి మూలంగా అనతి కాలంలోనే దేవుని ఉచ్చులో చిక్కుబడిపోతారు.

9. అంటే ప్రవక్తను కారాగారంలో వేయాలనో, లేక చంపేయాలనో వారు పథకం వేసేవారు.

10. అంటే వారు తమ ప్రవక్తలతో అర్థంపర్థం లేకుండా వాదులాడేవారు. సత్యధర్మంలో ఏదో వంకపెట్టి, దాన్ని అపఖ్యాతిపాలు చేయాలన్నదే వారి మనసులోని ఉద్దేశం.

11. అందుకే నేను ఈ అసత్యవాదులపై నా పట్టు బిగించాను. మరి నా పట్టు వారిపై ఎలా బిగిసుకుందో, వారెలా నామరూపాల్లేకుండా పోయారో చూడండి!

12. వెనుకటి జాతులను శిక్షించే విషయంలో నీ ప్రభువు వాక్కు ఎలా రూఢీ అయిందో అలాగే, ఈ మక్కావాసులు గనక తమ మంకుతనాన్ని వీడకపోతే, అర్థంలేని కోతలు కోయటం విడనాడకపోతే వారు కూడా దేవునికి పట్టుబడతారు. అప్పుడు వాళ్ళను ఆదుకునే వాడెవడూ ఉండడు.

13. దైవ సింహాసనాన్ని ఎత్తి పట్టుకున్న దైవదూతల గురించి ఇక్కడ ప్రస్తావించబడింది. వారు దైవసామీప్యం పొందినవారై

**8** "మా ప్రభూ! నువ్వు వారికి వాగ్దానం చేసివున్న శాశ్వతమైన స్వర్గవనాలలో వారికి ప్రవేశం కల్పించు. మరి వారి పితామహుల లోని, సతీమణులలోని, సంతానంలోని సజ్జనులకు కూడా[14] (స్వర్గంలో స్థానం కల్పించు). నిశ్చయంగా నీవు సర్వసత్తాధికారివి, వివేక సంపన్నుడివి.

رَبَّنَا وَاَدْخِلْهُمْ جَنّٰتِ عَدْنِ ۨالَّتِيْ وَعَدْتَّهُمْ وَمَنْ
صَلَحَ مِنْ اٰبَآئِهِمْ وَاَزْوَاجِهِمْ وَذُرِّيّٰتِهِمْ ۭ اِنَّكَ
اَنْتَ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿8﴾

**9** "వారిని చెడుల నుండి కూడా కాపాడు.[15] యదార్థమేమిటంటే ఆనాడు నీవు చెడుల నుంచి కాపాడినవారిపై నీవు (అమితంగా) దయ జూపినట్లే. గొప్ప సాఫల్యం అంటే అదే!"[16]

وَقِهِمُ السَّيِّاٰتِ ۭ وَمَنْ تَقِ السَّيِّاٰتِ يَوْمَىِٕذٍ فَقَدْ
رَحِمْتَهٗ ۭ وَذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿9﴾

**10** తిరస్కార వైఖరిని అవలంబించిన వారిని పిలిచి ఇలా అనబడుతుంది : "మీపై మీకు ఎంత కోపం వస్తుందో, అంతకంటే ఎక్కువగానే అల్లాహ్‌కు మీపై కోపం వచ్చేది – మిమ్మల్ని విశ్వాసం వైపునకు పిలిచినపుడు, మీరేమో అవిశ్వాసానికి ఒడిగట్టేవారు."[17]

اِنَّ الَّذِيْنَ كَفَرُوْا يُنَادَوْنَ لَمَقْتُ اللّٰهِ اَكْبَرُ
مِنْ مَّقْتِكُمْ اَنْفُسَكُمْ اِذْ تُدْعَوْنَ اِلَى الْاِيْمَانِ
فَتَكْفُرُوْنَ ﴿10﴾

---

ఉంటారు. అహోరాత్రులు వారు కడు వినమ్రతతో దైవకీర్తన చేస్తూ, దేవుని పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. వారు ఒకవైపు దేవుని శక్తిసామర్థ్యాలను ప్రశంసిస్తూనే, మరోవైపు దైవాన్ని విశ్వసించే సమస్త దాసుల మన్నింపు కోసం ప్రార్థిస్తూ ఉంటారు. దైవ సింహాసనాన్ని మోసే దూతల సంఖ్య నాలుగు అనీ, అయితే ప్రళయదినాన వారు ఎనిమిది మంది దాకా ఉంటారని అనబడుతోంది (ఇబ్నె కసీర్).

14. వారు ఒకరినొకరు చూసుకుని సంతోషంతో పొంగిపోయేలా వారందరికీ స్వర్గంలో చోటు కల్పించు. ఆ మాటే వేరొక చోట మరోవిధంగా – ఇలా – చెప్పబడింది : "విశ్వాసుల సంతానం గనక – విశ్వాసం విషయంలో – వారిని అనుసరించి ఉంటే వారి సంతానాన్ని కూడా మేము వారితో కలుపుతాము. వారి కర్మలలో మేము ఎలాంటి కోత విధించము" (అత్ తూర్–21). అంటే స్వర్గంలో అందరికీ సమానస్థాయిని ప్రసాదిస్తాము. అయితే దిగువస్థాయి వారితో సమానంగా ఉంచే నెపంతో ఉన్నత శ్రేణికి చెందినవారిని క్రిందికి తీసుకురావటం మాత్రం జరగదు. కాని క్రింది తరగతి వారిని మాత్రం ఉన్నతశ్రేణికి చేర్చటం జరుగుతుంది. అంటే వారి కర్మలలో ఉన్న వెలితిని కూడా మేము మా దయా దాక్షిణ్యాలతో భర్తీ చేసేస్తాము.

15. చెడుల నుంచి కాపాడటం అంటే ఇక్కడ భావం వారి దుష్కర్మల దుష్పరిణామాల నుండి కాపాడటం అని.

16. అంటే పరలోక శిక్ష నుండి కాపాడబడటం, స్వర్గంలో ప్రవేశం కల్పించటం – ఇదే అతి గొప్ప సాఫల్యం! ఎందుకంటే ఇంతకుమించిన విజయంగానీ, మోక్షంగానీ మరేదీ లేదు. ఈ ఆయతులలో విశ్వాసుల కొరకు రెండు గొప్ప శుభవార్తలున్నాయి – 1. వారి పరోక్షంలో వారి మన్నింపు కోసం దైవదూతలు ప్రార్థిస్తారు. (ఈ విధమైన పరోక్ష ప్రార్థన ఎంతో శ్రేష్ఠమైనదని హదీసుల్లో సైతం చెప్పబడింది). 2. విశ్వాసుల కుటుంబీకులు స్వర్గంలో ఏకమవుతారు. అల్లాహుతాలా మనందరికీ ఆ సౌభాగ్యాన్ని ప్రసాదించుగాక!

17. **'మఖ్తున్'** అంటే తీవ్రమైన అయిష్టత, అసహ్యభావం అనే అర్థాలు వస్తాయి. అవిశ్వాసులు అగ్నికి ఆహుతి అయి, మాడి పోతున్నప్పుడు వారికి వారిపైనే అసహ్యం కలుగుతుంది. అప్పుడు వారినుద్దేశించి, ఒకప్పుడు – ఇహలోకంలో– మిమ్మల్ని 'విశ్వాసం' వైపుకు ఆహ్వానించినపుడు మీరు విముఖత చూపేవారే, అప్పుడు అల్లాహ్‌కు మీపై ఇంతకన్నా ఎక్కువ అసహ్యమే కలిగేది. ఆ అయిష్టత మూలంగానే నేడు మీకు ఈ దురవస్థ దాపురించింది.

11 (అప్పుడు వారు) "మా ప్రభూ! నీవు రెండుసార్లు మాకు చావు నిచ్చావు. రెండు సార్లు బ్రతికించావు.[18] ఇప్పుడు మేము మా పాపాలను ఒప్పుకుంటున్నాము.[19] మరి ఇప్పుడు బయటపడే మార్గం ఏదన్నా ఉందా?"[20] అని విన్నవించుకుంటారు.

قَالُوا رَبَّنَآ اَمَتَّنَا اثْنَتَيْنِ وَاَحْيَيْتَنَا اثْنَتَيْنِ فَاعْتَرَفْنَا بِذُنُوبِنَا فَهَلْ اِلٰى خُرُوجٍ مِّنْ سَبِيْلٍ ⑪

12 (సమాధానంగా ఇలా అనబడుతుంది) "మీకు ఈ దుర్గతి ఎందుకు పట్టిందంటే, ఒక్కడైన అల్లాహ్‌ను గురించి ప్రస్తావించ బడినపుడు మీరు త్రోసిపుచ్చేవారు. మరి అదే ఆయనకు ఎవరి నయినా సహవర్తుల్ని కల్పించినపుడు (సంతోషంగా) అంగీక రించేవారు.[21] కాబట్టి ఇప్పుడు (అంతిమ) నిర్ణయాధికారం సర్వోన్నతుడు, గొప్పవాడు అయిన అల్లాహ్‌దే."[22]

ذٰلِكُمْ بِاَنَّهٗٓ اِذَا دُعِيَ اللّٰهُ وَحْدَهٗ كَفَرْتُمْ ۚ وَاِنْ يُّشْرَكْ بِهٖ تُؤْمِنُوْا ۭ فَالْحُكْمُ لِلّٰهِ الْعَلِيِّ الْكَبِيْرِ ⑫

13 ఆయనే తన సూచనలను మీకు చూపిస్తున్నాడు. మీ కోసం ఆకాశం నుంచి ఉపాధిని కురిపిస్తున్నాడు.[23] (అల్లాహ్ వైపునకు) మరలేవారు మాత్రమే దీన్నుండి హితబోధను గ్రహిస్తారు.[24]

هُوَ الَّذِيْ يُرِيْكُمْ اٰيٰتِهٖ وَيُنَزِّلُ لَكُمْ مِّنَ السَّمَاۗءِ رِزْقًا ۭ وَمَا يَتَذَكَّرُ اِلَّا مَنْ يُّنِيْبُ ⑬

18. చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం రెండు మరణాలలో మొదటి మరణావస్థ తండ్రి వెన్నులో వీర్యం రూపంలో ఉంటుంది. అంటే ఆ వీర్యం ఉనికిలోకి రాకపూర్వం ఉన్న స్థితిని మరణావస్థగానే పేర్కొనటం జరిగింది. రెండవసారి మరణం మనిషి జీవించిన తరువాత వస్తుంది. ఆ తరువాత అతను ఖననం చేయబడతాడు. ఇక రెండు జీవితాలలో మొదటి జీవితం ఈ ప్రాపంచిక జీవితం. మనిషి పుట్టుక నాటి నుంచి చనిపోయేవరకు ఈ జీవితం ఉంటుంది. రెండవ జీవితం ప్రళయదినాన సమాధుల నుంచి లేచాక ప్రాప్తిస్తుంది. ఈ రెండు జీవితాల, రెండు మరణాల ప్రస్తావన అల్ బఖర సూరాలో ఈ విధంగా ప్రస్తావించబడింది : "యదార్థానికి ప్రాణంలేని మీకు ఆయన ప్రాణం పోశాడు. మళ్లీ మీ ప్రాణాన్ని తీసేది కూడా ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేది కూడా ఆయనే" (అల్ బఖర : 28).

19. వారు నరకాగ్నికి ఆహుతి అయిన పిదప తమ తప్పును ఒప్పుకుంటారు. కాని అక్కడ తప్పును ఒప్పుకునిగానీ, పశ్చాత్తాపం చెందిగానీ ప్రయోజనం ఏమీ ఉండదు.

20. మరోసారి ప్రపంచంలోకి పంపిస్తే మంచి పనులు చేసివస్తామని వారు ఆశగా అడుగుతారు. వారి కోరిక ఖుర్ఆన్‌లో చాలా చోట్ల ప్రస్తావనకు వచ్చింది. కాని వారి కోరిక తీరదు.

21. నరకం నుంచి వారికి విముక్తి ఎందుకు లభించదో ఇక్కడ తెలుపబడింది. మీరు ప్రపంచంలో దేవుని ఏకత్వాన్ని కొట్టిపారేసి, షిర్క్ (బహుదైవారాధన)ను ఇష్టపడేవారు. కాబట్టి మీ షిర్క్‌కు పర్యవసానంగా శాశ్వితమైన నరకశిక్షను రుచిచూస్తూ ఉండండి.

22. ఇకనుంచి మీరు నరక శిక్షను అనుభవిస్తూ ఉండాలన్న నిర్ణయం ఎవరిదో కాదు, ఒక్కడైన ఆ అల్లాహ్‌దే. ఆనాడు మీరు ఆయన గురించి కల్పిస్తూ ఉండే కల్లబొల్లి కబుర్లకు ఆయన అతీతుడు, సర్వోన్నతుడు, సర్వాధికుడు.

23. మనిషి జీవనావసరాలలో అత్యంత ముఖ్యమైనది నీరు. అల్లాహ్ ఆకాశం నుంచి వర్షపు నీరును కురిపించి, ప్రాణులకు త్రాగునీరును సమకూర్చటమేగాకుండా, ఆ నీటితో రకరకాల ఆహార ధాన్యాలను, పండ్లు ఫలాలను పండిస్తున్నాడు. ఇది దైవసూచనలలో ఒకటి. గుణపాఠం నేర్చుకోదలిచే వారికి ఇందులో గొప్ప గుణపాఠం ఉంది.

ఈ ఆయతులో రెండు విషయాల్ని – సూచనలను చూపించటాన్ని, ఉపాధిని కురిపించటాన్ని – రెండింటి గురించి

**14** కాబట్టి మీరు మీ ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకుని ఆయన్నే వేడుకుంటూ ఉండండి – అవిశ్వాసులకు అది ఎంతగా సహించరానిదైనా సరే![25]

فَادْعُوا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ وَلَوْ كَرِهَ الْكٰفِرُوْنَ ﴿14﴾

**15** ఆయన ఉన్నత శ్రేణులు కలవాడు, అర్ష్‌కు (సింహాసనానికి) అధిపతి. ఆయన తన దాసులలో తాను కోరినవారిపై తన సందేశాన్ని (వహీని) అవతరింపజేస్తాడు[26] – సమావేశం కానున్న ఆ దినం గురించి అతడు (ప్రవక్త) భయపెట్టడానికి!

رَفِيْعُ الدَّرَجٰتِ ذُو الْعَرْشِ ۚ يُلْقِي الرُّوْحَ مِنْ اَمْرِهٖ عَلٰى مَنْ يَّشَآءُ مِنْ عِبَادِهٖ لِيُنْذِرَ يَوْمَ التَّلَاقِ ﴿15﴾

**16** ఆ రోజున అందరూ బయల్పడతారు.[27] అప్పుడు వారి (లోగుట్టు) విషయమేదీ అల్లాహ్ నుండి దాగి ఉండదు. ఈ రోజు విశ్వసార్వభౌమత్వం ఎవరిది?[28] ఒక్కడైన, తిరుగులేనివాడైన అల్లాహ్‌ది మాత్రమే.[29]

يَوْمَ هُمْ بٰرِزُوْنَ ۚ لَا يَخْفٰى عَلَى اللّٰهِ مِنْهُمْ شَيْءٌ ؕ لِمَنِ الْمُلْكُ الْيَوْمَ ؕ لِلّٰهِ الْوَاحِدِ الْقَهَّارِ ﴿16﴾

**17** ఈ రోజు ప్రతి ప్రాణికీ అది సంపాదించిన దాని ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఈ రోజు (ఎవరికీ, ఎలాంటి) అన్యాయం జరగదు. నిశ్చయంగా అల్లాహ్ బహు శీఘ్రంగా లెక్కతేల్చేవాడు.[30]

اَلْيَوْمَ تُجْزٰى كُلُّ نَفْسٍۢ بِمَا كَسَبَتْ ؕ لَا ظُلْمَ الْيَوْمَ ؕ اِنَّ اللّٰهَ سَرِيْعُ الْحِسَابِ ﴿17﴾

---

ఒకే ఆయతులో వివరించటం గమనార్హం. ఆయతులు (సూచనలు) అల్లాహ్ శక్తిసామర్థ్యాలను బహిర్గతం చేస్తాయి. ఈ విధంగా ఆయతులు ధర్మానికి పునాదుల వంటివి. మరోవైపు ఉపాధి దేహాలకు పునాది అవుతుంది. ఇక్కడ ఈ రెండు పునాదులనూ కలిపి చెప్పటం విశేషం (ఫత్‌హుల్ ఖదీర్).

24. మరలేవారు అంటే దైవవిధేయత వైపుకు మరలేవారు అని భావం. ఈ సూచనల ద్వారా వారిలో దైవభీతి, పరలోక భీతి జనిస్తుంది. దాంతో వారు దైవాజ్ఞలకు కట్టుబడి జీవిస్తారు.

25. అన్నీ చక్కబెట్టేవాడు అల్లాహ్‌యే అయినప్పుడు మీరు ఆ ఒక్క దైవాన్నే ప్రార్థించాలి. ఆయన ముందరే తలవంచాలి. మీ ఉపాసనలన్నింటినీ ఆయనకే ప్రత్యేకించాలి. మీ చర్య అవిశ్వాసులకు సహించకపోయినా మీరు లెక్క చేయకూడదు.

26. ఈ ఆయతులో **'రూహున్'** అంటే దైవసందేశం (వహీ) అని అర్థం. దేవుడు తన దాసులలో ఎవరినయినాసరే ఎన్నుకుని, వారికి తన సందేశాన్ని అందజేస్తాడు. దైవసందేశాన్ని 'రూహ్'గా అభివర్ణించటంలోని మర్మం ఏమిటంటే, ఏ విధంగానయితే రూహ్ (ఆత్మ లేక ప్రాణం) ద్వారా మనిషి సజీవంగా, సచేతనంగా ఉంటాడో అదేవిధంగా దైవసందేశం (వహీ) వల్ల మానవ హృదయాలలో జీవం ఉట్టిపడుతూ ఉంటుంది. అంతకు మునుపు అవి కుఫ్ర్, షిర్క్‌ల మూలంగా నిర్జీవంగా ఉండేవి.

27. అంటే వారు బ్రతికి సమాధులలో నుంచి లేచి వచ్చినప్పుడు....

28. అంటే ప్రళయదినాన మనుషులంతా సమాధులలో నుంచి లేచి, మహ్షర్ మైదానంలోకి వచ్చినప్పుడు అల్లాహ్ ఈ విధంగా ప్రశ్నిస్తాడు. ఆయన భూమిని గుప్పెట్లో, ఆకాశాలను తన కుడిచేతిలో చుట్టిపట్టుకుని, "నేనే విశ్వచక్రవర్తిని. భూమండలంలోని చక్రవర్తులు ఎక్కడున్నారు?" అని అడుగుతాడు. (సహీహ్ బుఖారీ, అజ్జుమర్ సూరా వ్యాఖ్యానం).

29. ఎవరూ మాట్లాడలేకపోయేసరికి అల్లాహ్ స్వయంగా ఇలా సమాధానమిస్తాడు. అల్లాహ్ ఆజ్ఞపై ఒక దైవదూత ఇలా ప్రకటిస్తాడని, దాంతో అవిశ్వాసులు, విశ్వాసులు–అందరూ ముక్తకంఠంతో ఇదే సమాధానమిస్తారని మరికొందరు అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

**18** (ఓ ప్రవక్తా!) చాలా దగ్గరలోనే ఉన్న[31] ఆ దినం గురించి వారిని హెచ్చరించు. అప్పుడు వారిగుండెలు గొంతుల దాకా వచ్చేస్తాయి. వారంతా గమ్మున (బాధను) దిగమ్రింగుతూ ఉంటారు.[32] (ఆ రోజు) దుర్మార్గులను ఆదుకునే ఆప్తమిత్రుడు గానీ, మాట చెలామణీ చేసుకోగల సిఫారసు చేసేవాడుగానీ ఎవడూ ఉండడు.

وَأَنذِرْهُمْ يَوْمَ الْآزِفَةِ إِذِ الْقُلُوبُ لَدَى الْحَنَاجِرِ كَاظِمِينَ ۚ مَا لِلظَّالِمِينَ مِنْ حَمِيمٍ وَلَا شَفِيعٍ يُطَاعُ ﴿١٨﴾

**19** ఆయన కళ్లల్లోని మోసాన్ని, గుండెల్లోని గుట్టును సయితం (బాగా) ఎరిగిన వాడు.[33]

يَعْلَمُ خَائِنَةَ الْأَعْيُنِ وَمَا تُخْفِي الصُّدُورُ ﴿١٩﴾

**20** అల్లాహ్ ఖచ్చితంగా న్యాయంగా తీర్పు చేస్తాడు. మరి అల్లాహ్‌ను వదలి వారు ఎవరెవరిని మొరపెట్టుకునేవారో వారు ఏ విషయంలోనూ తీర్పు చేయలేరు.[34] నిశ్చయంగా అల్లాహ్ అంతా వినేవాడు, అంతా చూసేవాడు.

وَاللَّهُ يَقْضِي بِالْحَقِّ ۖ وَالَّذِينَ يَدْعُونَ مِن دُونِهِ لَا يَقْضُونَ بِشَيْءٍ ۗ إِنَّ اللَّهَ هُوَ السَّمِيعُ الْبَصِيرُ ﴿٢٠﴾

**21** ఏమిటి, వారు భూమిపై సంచరించి, తమకు పూర్వం గడచిన వారికి పట్టిన గతేమిటో చూడలేదా? బలపరాక్రమాల రీత్యాగానీ, భూమిపై వదలి వెళ్ళిన చిహ్నాల దృష్ట్యాగానీ వారు వీరికన్నా గట్టివారే. మరి అల్లాహ్ వారి దురాగతాల కారణంగా వారిని పట్టుకున్నాడు. మరి అల్లాహ్‌కు వ్యతిరేకంగా వారిని ఆదుకునేవాడెవడూ లేకపోయాడు.[35]

أَوَلَمْ يَسِيرُوا فِي الْأَرْضِ فَيَنظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الَّذِينَ كَانُوا مِن قَبْلِهِمْ ۚ كَانُوا هُمْ أَشَدَّ مِنْهُمْ قُوَّةً وَآثَارًا فِي الْأَرْضِ فَأَخَذَهُمُ اللَّهُ بِذُنُوبِهِمْ وَمَا كَانَ لَهُم مِّنَ اللَّهِ مِن وَاقٍ ﴿٢١﴾

30. ఎందుకంటే మానవుల మాదిరిగా ఆలోచిస్తూ ఉండవలసిన అవసరం ఆయనకు లేదు.

31. **'ఆజిఫతు'** (آزفة) అంటే సమీపంలోనే వచ్చేది అని అర్థం. ప్రళయదినానికి గల పేర్లలో ఇదొకటి.

32. అంటే, ఆనాడు భయము, కలవరం మూలంగా హృదయాలు ఉన్న చోటినుంచి తొలగిపోతాయి. **'కాజిమీన్'** (كَاظِمِينَ) అంటే దుఃఖంతో నిండినవి, లేక విలపించేవి లేక గమ్మున ఉండిపోయేవి అన్న అర్థాలు వస్తాయి.

33. ఈ ఆయతులో దేవుని సంపూర్ణ జ్ఞానం గురించి చెప్పబడింది. ఆయన ప్రతి వస్తువును – అది బహిర్గతమైనదైనా, గోప్యమైనదైనా, పెద్దదైనా, సూక్ష్మాతిసూక్ష్మమైనదైనా, అల్పమైనదైనా, గొప్పదైనా – గమనిస్తూ ఉన్నాడు. ఆయన జ్ఞానపరిధి అంత విస్తృతమైనదని తెలిసినప్పుడు మానవుడు సర్వకాల సర్వావస్థల్లో ఆయన అవిధేయతకు దూరంగా ఉండాలి. నిజభావంలో ఆయనకు భయపడాలి. కళ్లతో కవ్వించటం, దొంగచూపులు చూడటం, దురాలోచనతో దృష్టిని సారించటం చెడు లక్షణం. చెడు చూపు ఎన్నో చెడులకు దారితీస్తుంది. ఉదాహరణకు: పరాయి స్త్రీని దురుద్దేశంతో చూడటం మనసును కలుషితం చేస్తుంది. ఆంతర్యాన్ని నిర్మలంగా ఉంచుకోవాలి. ఆంతర్యంలో దుష్ప్రేరణలు జనించటం విపరీతం కాదు. ఆ దుష్ప్రేరణలకు మనిషి ప్రభావితుడు కాకుండా ఉన్నంతవరకూ, దురాచరణకు ఒడిగట్టకుండా ఉన్నంతవరకూ అతడు దోషి కాడు. ఒకవేళ అతడు ఆ దురాలోచనలకు కార్యరూపం ఇస్తే మటుకు అతడు దోషిగా పరిగణించబడతాడు, అల్లాహ్ సన్నిధిలో పట్టుబడతాడు.

34. ఎందుకంటే ఆ మిథ్యా దైవాలకు ఏమీ తెలియదు. వాటికి దేనిపైనా అధికారం లేదు. కాగా; ఏదేని విషయంపై తీర్పు చేయాలంటే విషయ జ్ఞానంతోపాటు, అధికారం కూడా కావాలి. ఈ రెండు సుగుణాలు అల్లాహ్‌కు మాత్రమే

**22** వారికీ దుర్గతి పట్టటానికి కారణమేమిటంటే, వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన సూచనలను తీసుకువచ్చేవారు. కాని వారు మాత్రం వాటిని త్రోసిపుచ్చేవారు.[36] అందుకే అల్లాహ్ వారిని పట్టుకున్నాడు. నిస్సందేహంగా ఆయన బలాఢ్యుడు. కఠినంగా శిక్షించేవాడు.

ذٰلِكَ بِاَنَّهُمْ كَانَتْ تَّاْتِيْهِمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ فَكَفَرُوْا فَاَخَذَهُمُ اللّٰهُ ؕ اِنَّهٗ قَوِيٌّ شَدِيْدُ الْعِقَابِ ﴿22﴾

**23** మేము మూసా (అలైహిస్సలాం)కు మా నిదర్శనాలను, తిరుగులేని ప్రమాణాన్ని ఇచ్చి పంపాము[37] –

وَلَقَدْ اَرْسَلْنَا مُوْسٰى بِاٰيٰتِنَا وَ سُلْطٰنٍ مُّبِيْنٍ ۙ ﴿23﴾

**24** ఫిరౌను, హామాను, ఖారూను వద్దకు (పంపాము). కాని వారేమో, "ఇతను మాంత్రికుడు, అబద్ధాలకోరు"[38] అని అన్నారు.

اِلٰى فِرْعَوْنَ وَهَامٰنَ وَقَارُوْنَ فَقَالُوْا سٰحِرٌ كَذَّابٌ ﴿24﴾

---

స్వంతం. అందువల్ల న్యాయనిర్ణయం గైకొనే హక్కు ఆయనకే ఉండాలి. నిశ్చయంగా ఆయన న్యాయబద్ధంగా తీర్పు ఇస్తాడు. ఎందుకంటే ఆయన ఎవరికీ లోబడినవాడు కాదు, ఆయనకు ఎవరి భయమూ లేదు.

35. ఇంతకు ముందు ఆయతులలో పరలోక స్థితిగతులు వివరించబడినాయి. ఈ ఆయతులలో ప్రాపంచిక పరిణామాల ద్వారా వీరిని హెచ్చరించటం జరుగుతోంది. మీ పూర్వీకులకు పట్టిన గతేమిటో, మీరు దేశంలో తిరిగి చూడటం లేదా? తమ తలబిరుసుతనం మూలంగానూ, తిరస్కార వైఖరి కారణంగానూ వారు సమూలంగా పెకలించి వేయ బడ్డారు. మరి చూడబోతే వారు మీకన్నా బలవంతులే. మీకన్నా గొప్ప కట్టడాలను, జాతీయచిహ్నాలను రాజ్యంలో వదలిపోయారు. కాని తీరా దైవశిక్ష వచ్చాక వారిని ఎవరూ ఆదుకోలేకపోయారు. వారి మాదిరిగానే మీక్కూడా అదే దుర్గతి పట్టవచ్చు. ఒకవేళ అదేగనక జరిగితే మీకు అండగా ఎవరూ ఉండరు సుమా!

36. వారిని అంతమొందించటానికి గల అసలు కారణమేమిటంటే వారు దేవుని నిదర్శనాలను లక్ష్యపెట్టేవారు కాదు, మరోవైపు దైవప్రవక్తలను కూడా పరిహసించేవారు. ఇప్పుడు దైవదౌత్య పరంపర ఆగిపోయినప్పటికీ విశ్వమండలంలో అసంఖ్యాకమైన దైవసూచనలు వ్యాపించి ఉన్నాయి. అదీగాక బోధనల ద్వారా, ప్రసంగాల ద్వారా, ఇష్టాగోష్ఠుల ద్వారా సత్యధర్మ సందేశాన్ని అందజేసే పండితులు ఉన్నారు. ప్రచార ప్రసార సాధనాలున్నాయి. అందువల్ల ఈనాడైనాసరే దైవనిదర్శనాల పట్ల విముఖత చూపి, దేవుని శాసనాంగం (షరీయతు) పట్ల అశ్రద్ధను, ఏమరుపాటును ప్రదర్శించిన వారి పరిణామం కూడా ధిక్కారులైన తమ పూర్వీకులకంటే భిన్నంగా ఏమీ ఉండదు.

37. ఇక్కడ **'నిదర్శనాలు'** అంటే ఇంతకుముందు పేర్కొనబడిన తొమ్మిది నిదర్శనాలూ కావచ్చు లేదా చేతికర్ర పాముగా మారటం, చంకలో పెట్టిన చేయి ధగధగా మెరిసి పోవటం కూడా కావచ్చు. 'తిరుగులేని ప్రమాణం' అంటే మూసా చూపించిన నిదర్శనాలకు అవిశ్వాసుల వద్ద సరైన సమాధానం లేకపోవటం అన్నమాట! కాకపోతే వారు నిస్సిగ్గుగా డొంకతిరుగుడు మాటలు చెప్పి, తమ జాతి ప్రజలను ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు.

38. ఫిరౌన్ ఈజిప్టు రాజ్యంలో ఖిబ్తీల పరిపాలకునిగా ఉండేవాడు. పరమదుర్మార్గుడు, కఠినాత్ముడు. తన నిరంకుశ చర్యలతో అమాయక జనుల నోళ్లు మూయించి, తనే అందరికీ సిసలైన ప్రభువునని ప్రకటించుకున్నాడు. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) జాతివారైన ఇస్రాయీలీయులను వాడు బానిసలుగా చేసుకున్నాడు. వారిని శతవిధాలుగా వేధించేవాడు. వాడి ఏలుబడిలో ఇస్రాయీలీయులు పడిన కష్టాలను గురించి దివ్య ఖుర్ఆన్ అనేకచోట్ల వివరించింది. హామాను కూడా దుర్మార్గుడే. వాడు ఫిరౌన్ చక్రవర్తికి ప్రధాన సలహాదారుగా ఉండేవాడు. ఖారూన్ ఆ కాలంలో అతిపెద్ద శ్రీమంతుడు. వారంతా – పూర్వీకుల మాదిరిగానే – హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను ధిక్కరించారు. ధిక్కరించటమే కాదు, అతన్ని ఒక తాంత్రికునిగా, అబద్ధాగ్రేసరునిగా చిత్రీకరించి ప్రజా బాహుళ్యంలో అతనికి చోటులేకుండా చేయాలని పన్నాగాలు పన్నారు. ఈ విషయమే దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట ఇలా చెప్పబడింది:

25 మరి అతను (మూసా) వారివద్దకు మా తరఫు నుంచి సత్యాన్ని తీసుకుని వచ్చినప్పుడు, "అతని పంచనచేరి విశ్వసించిన వారి కొడుకులను చంపేయండి, వారి ఆడవాళ్ళను మాత్రం బ్రతక నివ్వండి"[39] అని వారు పలికారు. కాని అవిశ్వాసుల ఎత్తుగడలన్నీ భ్రష్టమైనవి.[40]

فَلَمَّا جَآءَهُم بِٱلْحَقِّ مِنْ عِندِنَا قَالُوا۟ ٱقْتُلُوٓا۟ أَبْنَآءَ ٱلَّذِينَ ءَامَنُوا۟ مَعَهُۥ وَٱسْتَحْيُوا۟ نِسَآءَهُمْ ۚ وَمَا كَيْدُ ٱلْكَٰفِرِينَ إِلَّا فِى ضَلَٰلٍ ﴿٢٥﴾

26 ఫిరౌన్ ఇలా అన్నాడు: "నన్ను వదలండి. నేను మూసాను చంపేస్తాను.[41] అతడు తన ప్రభువును పిలుచుకోనివ్వండి.[42] ఇతడు మీ మతాన్ని ఎక్కడ మార్చివేస్తాడో లేక రాజ్యంలో (చాలా పెద్ద) అరాచకాన్ని ఎక్కడ సృష్టిస్తాడోనని నేను భయపడు తున్నాను."[43]

وَقَالَ فِرْعَوْنُ ذَرُونِىٓ أَقْتُلْ مُوسَىٰ وَلْيَدْعُ رَبَّهُۥٓ ۖ إِنِّىٓ أَخَافُ أَن يُبَدِّلَ دِينَكُمْ أَوْ أَن يُظْهِرَ فِى ٱلْأَرْضِ ٱلْفَسَادَ ﴿٢٦﴾

27 దానికి మూసా, "లెక్కల దినాన్ని విశ్వసించని ప్రతి దురహం కారి (కీడు) నుంచి రక్షణకై నేను నా ప్రభువును, మీ ప్రభువును వేడుకుంటున్నాను" అన్నాడు.[44]

وَقَالَ مُوسَىٰٓ إِنِّى عُذْتُ بِرَبِّى وَرَبِّكُم مِّن كُلِّ مُتَكَبِّرٍ لَّا يُؤْمِنُ بِيَوْمِ ٱلْحِسَابِ ﴿٢٧﴾

---

"ఇంతకు ముందు గతించిన వారి విషయంలో కూడా ఇలాగే జరిగింది. వారివద్దకు ఏ ప్రవక్త వచ్చినా, 'ఇతను మాంత్రికుడైనా అయి వుండాలి. లేదంటే పిచ్చివాడైనా అయివుండాలి' అని ఎద్దేవా చేసేవారు. ఏమిటి, ఈ విషయం గురించి వారు ఒండొకరికి తాకీదు చేసుకుంటూపోయారా? కాదు, అసలు వారంతా హద్దు మీరినవారు." (అజ్జారియాత్ – 52, 53).

39. ఫిరౌన్ చాలాకాలంగా ఈ అమానుషానికి పాల్పడేవాడు. ఎందుకంటే తన రాజ్యంలో పుట్టబోయే ఒక మగపిల్లవాడు అతని రాజ్యాధికారానికి ముప్పుగా మారనున్నాడని జ్యోతిష్యులు అతన్ని హెచ్చరించి ఉన్నారు. ఇప్పుడు మూసా (అలైహిస్సలాం) నిజదైవం వైపుకు ఆహ్వానించటంతో, రెచ్చిపోయి ఆ కిరాతక శాసనాన్ని మరోసారి అమలు పరిచాడు. ఈ చట్టం ద్వారా ఇస్రాయీల్ సంతతిలోని మగ సంతతిని సమూలంగా తుడిచిపెట్టాలన్నది అతని ఎత్తుగడ. దాంతోపాటు ఇస్రాయీలీయులు మూసాను అసహ్యించుకుని, ప్రజా జీవితాలనుంచి మూసాను వెలివేయాలి. నిరంతరం కష్టాలు వచ్చిపడితే మూసాను అతని జాతివారే ఛీత్కరించుకుంటారు. ఆ మాటే వారు ఒకసారి అన్నారు కూడా – "(ఓ మూసా!) నీవు రాక పూర్వం కూడా మేము వేధించబడేవారం. నీవు వచ్చిన తరువాత కూడా మా పరిస్థితి అలాగే ఉంది" (అల్ ఆరాఫ్ – 129).

40. కాని ఫిరౌన్ పాచికలేవీ పారలేదు. బనీ ఇస్రాయీల్‌ను దారుణంగా అణచివేయాలని, తన అధికారాన్ని తిరుగులేనిదిగా నిరూపించుకోవాలని వాడు తలపోశాడు. కాని వాడి ఆశ అడియాసే అయింది. పైగా అల్లాహ్ ఫిరౌన్ జనులను సముద్రంలో ముంచేసి, ఇస్రాయీల్ సంతతిని శుభప్రదమైన భూభాగానికి వారసులుగా చేశాడు.

41. మూసా (అలైహిస్సలాం)ను హతమార్చాలన్న ప్రతిపాదనతో ఏకీభవించని సలహా దారులను ఉద్దేశించి ఫిరౌన్ బహుశా ఇలా అని ఉంటాడు.

42. ఇది ఫిరౌన్‌లోని దుస్సాహసానికి, పొగరుకు మరో ప్రతీక. ఏ ప్రభువు వచ్చి మూసాను కాపాడుతాడో చూద్దాం అన్న వ్యంగ్య ధోరణి కూడా అతని మాటల్లో వ్యక్తమవుతూ ఉంది. ఎందుకంటే 'నేనే అందరికీ గొప్ప ప్రభువును' అని వాడు అంతకుముందే ప్రకటించుకున్నాడు.

43. అంటే మీకిష్టమైన ఎంతోమంది దేవతల నుంచి మిమ్మల్ని తొలగించి ఒకే దేవుని మార్గంపై మిమ్మల్ని నడిపిస్తాడు.

**28** (అప్పటి వరకూ) తన విశ్వాసాన్ని గోప్యంగా ఉంచిన, ఫిరౌన్ వంశానికి చెందిన విశ్వాసి అయిన ఒక పురుషుడు ఇలా అన్నాడు: "ఏమిటీ, 'అల్లాహ్ నా ప్రభువు' అని అన్నంత మాత్రానికే ఒక వ్యక్తిని మీరు చంపేస్తారా? నిజానికి అతడు మీ ప్రభువు తరపు నుంచి స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చాడు.[45] ఒకవేళ అతను చెప్పేది అబద్ధమైతే అతని అబద్ధం (పాపఫలం) అతని మీదే పడుతుంది. మరి అతను గనక తన వాదనలో సత్యవంతుడైతే, అతను మీకు చేసే వాగ్దానం (శిక్ష)లో ఎంతో కొంత మీపై కూడా వచ్చి పడుతుంది.[46] బరితెగించి పోయేవాడికి, అబద్ధాల కోరుకి అల్లాహ్ సన్మార్గం చూపడు.[47]

وَقَالَ رَجُلٌ مُّؤْمِنٌ مِّنْ اٰلِ فِرْعَوْنَ يَكْتُمُ
اِيْمَانَهٗۤ اَتَقْتُلُوْنَ رَجُلًا اَنْ يَّقُوْلَ رَبِّيَ اللّٰهُ وَقَدْ
جَآءَكُمْ بِالْبَيِّنٰتِ مِنْ رَّبِّكُمْ ؕ وَاِنْ يَّكُ كَاذِبًا
فَعَلَيْهِ كَذِبُهٗ ۚ وَاِنْ يَّكُ صَادِقًا يُّصِبْكُمْ بَعْضُ
الَّذِيْ يَعِدُكُمْ ؕ اِنَّ اللّٰهَ لَا يَهْدِيْ مَنْ هُوَ مُسْرِفٌ
كَذَّابٌ ﴿28﴾

**29** "ఓ నా జాతి ప్రజలారా! ఈ రోజు మీరు అధికారంలో ఉన్నారు. భూమిపై మీ ఆధిక్యత కొనసాగుతోంది.[48] కాని అల్లాహ్ తరపున మనపై ఏదైనా విపత్తు వచ్చిపడితే, మనల్ని ఆదుకునే

يٰقَوْمِ لَكُمُ الْمُلْكُ الْيَوْمَ ظٰهِرِيْنَ فِي الْاَرْضِ ۫
فَمَنْ يَّنْصُرُنَا مِنْ بَاْسِ اللّٰهِ اِنْ جَآءَنَا ؕ قَالَ

లేదా ఇతను దేశంలో కల్లోలాన్ని రేకెత్తిస్తాడు. అంటే తన రాజ్యంలోని కొంతమంది ప్రజలు గనక మూసా మాటను విని అతను ప్రబోధించే మతాన్ని స్వీకరించినట్లయితే, స్వీకరించని వారితో వారు గొడవపడతారు. తత్ఫలితంగా సంఘర్షణ మొదలవుతుంది. సంక్షోభం పుట్టుకొస్తుంది. అంటే ఏకదైవారాధనా సందేశాన్ని ఫిరౌన్ కలహకారకంగా తలపోశాడు. ఏక దైవారాధకులను కల్లోల జనకులుగా ఖరారు చేశాడు. మరి చూడబోతే అందరికన్నా పెద్ద కల్లోల జనకుడుగా అతను స్వయంగా ప్రవర్తించేవాడు. వాస్తవానికి దైవేతరుల దాస్యమే కల్లోలానికి మూలం.

44. ఫిరౌన్ తనను చంపే యత్నంలో ఉన్నాడని పసిగట్టగానే హ'జ్రత్ మూసా (అలైహిస్సలాం) ఆ అధికార మదాంధుని కీడునుంచి అల్లాహ్ శరణు కోరారు. శత్రువు నుంచి ప్రమాదం పొంచి వున్నప్పుడు అంతిమ దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా వేడుకునేవారు : **"అల్లాహుమ్మ! ఇన్నా నజ్అలుక ఫీ నుహూరిహిమ్ వ నవూజుబిక మిన్ షురూరిహిమ్"** (ముస్నదె అహ్మద్ – 4/415). (ఓ అల్లాహ్! మేము నిన్ను వారికి ప్రత్యర్థిగా చేస్తున్నాము. వారి దుష్ట యత్నాల నుంచి నీ శరణు వేడుతున్నాము).

45. అంటే, అతడు అల్లాహ్ సార్వభౌమత్వాన్ని, ఆయన పోషకత్వాన్ని (రుబూబియత్ను) ఇట్టే విశ్వసించటం లేదు, అతని 'విశ్వాసం' వెనుక ప్రబలమైన ఆధారాలున్నాయి. ప్రస్ఫుటమైన నిదర్శనాలున్నాయి.

46. ఒకవేళ అతను చూపే నిదర్శనాలతో మీకు సంతృప్తి కలగకపోతే, అతని సత్యవాదన మీకు మింగుడు పడకపోతే కనీసం అతన్ని అతని మానాన వదలిపెట్టండి. ఇది కనీస మర్యాద. అంతేగాని అన్యాయంగా అతనిపై దాడి జరపకండి. అతనిపై నీలాపనిందలు మోపకండి. ఒకవేళ అతను అసత్యం పలికితే దేవుడు అతన్ని ఇహపరాలలో శిక్షిస్తాడు. ఒకవేళ అతను గనక సత్యవంతుడైతే – మీరతన్ని వేధించినందుకు–అతను హెచ్చరించే శిక్షలలో ఏదో ఒకటి మీపై విరుచుకుపడటం తథ్యం.

47. దీని భావం ఏమిటంటే (మీరు అనుమానిస్తున్నట్లు) అతను గనక అసత్యవాది అయివుంటే దేవుడు అతనికి అసాధారణమైన మహిమలను, సూచనలను ప్రసాదించేవాడే కాదు. కాని మీరు మూసానే చూడండి – అతని దగ్గర శక్తిమంతమైన నిదర్శనాలున్నాయి.

ఈ వాక్యానికి ఇంకొక అర్థం ఏమిటంటే, మూసా చెప్పేది అబద్ధమైతే దేవుడే అతన్ని పరాభవానికి లోనుచేస్తాడు. మీరంతా కలిసి అతనిపై చర్య తీసుకోవాల్సిన అవసరమే లేదు.

فِرْعَوْنُ مَآ أُرِيكُمْ إِلَّا مَآ أَرَىٰ وَمَآ أَهْدِيكُمْ إِلَّا سَبِيلَ ٱلرَّشَادِ ﴿٢٩﴾

వాడెవడు?"[49] దానికి ఫిరౌన్ ఇలా సమాధానమిచ్చాడు: "నేను చూసేదే మీకు చెబుతున్నాను. సక్రమమైన మార్గం వైపుకే మీకు దర్శకత్వం వహిస్తున్నాను."[50]

وَقَالَ ٱلَّذِىٓ ءَامَنَ يَٰقَوْمِ إِنِّىٓ أَخَافُ عَلَيْكُم مِّثْلَ يَوْمِ ٱلْأَحْزَابِ ﴿٣٠﴾

**30** అప్పుడు ఆ విశ్వాసి ఇలా అన్నాడు : "ఓ నా జాతివారలారా! ఇతర సముదాయాలపై వచ్చిన (గడ్డు) దినం మీపై కూడా వస్తుందేమోనని నాకు భయంగా ఉంది.

مِثْلَ دَأْبِ قَوْمِ نُوحٍ وَعَادٍ وَثَمُودَ وَٱلَّذِينَ مِنۢ بَعْدِهِمْ ۚ وَمَا ٱللَّهُ يُرِيدُ ظُلْمًا لِّلْعِبَادِ ﴿٣١﴾

**31** "ఉదాహరణకు నూహ్, ఆద్, సమూద్ జాతుల వారికి, ఆ తరువాత వచ్చిన వారికి[51] (పట్టిన దుర్గతే మీకూ పట్టవచ్చు). తన దాసులకు అన్యాయం చేయాలన్నది అల్లాహ్ అభిమతం ఎంత మాత్రం కాదు.[52]

وَيَٰقَوْمِ إِنِّىٓ أَخَافُ عَلَيْكُمْ يَوْمَ ٱلتَّنَادِ ﴿٣٢﴾

**32** "మరి ఓ నా జాతివారలారా! కేకలేసి పిలిచే రోజు మీకు దాపురిస్తుందన్న భయం కూడా నాకుంది.[53]

48. దేవుడు మీకు భూమండలంపై రాజ్యాధికారాన్ని, ప్రాబల్యాన్ని ప్రసాదించి మీకు మహోపకారం చేశాడు. కాబట్టి మీరు ఆయనకు కృతజ్ఞులై ఉండండి. దైవప్రవక్తను ధిక్కరించి దైవాగ్రహాన్ని చేజేతులా కొనితెచ్చుకోకండి.

49. దేవుని తరఫున ఏదన్నా ఆపద గనక వచ్చిపడితే మీ సైనిక బలగంగానీ, మీ అధికార బలంగానీ ఎందుకూ పనికి రాదు. తన ఆంతర్యంలో విశ్వాసం (ఈమాన్)ను దాచి ఉంచుకున్న విశ్వాసి పలికిన మాటలివి.

50. ఫిరౌన్ తన ప్రాపంచిక హోదా, అధికార బలం ఆధారంగా అబద్ధం చెప్పాడు. తాను చూపే దారే సరైన దారి అనీ, తాను తన కళ్లతో చూస్తున్న దానినే తన జనులకు చెబుతున్నానని అన్నాడు. నిజానికి అది సరైనది కాదు. "వాస్తవానికి ఫిరౌను జారీచేసిన ఏ ఉత్తర్వు కూడా సరైనది కాదు." (హూద్ – 97)

51. విశ్వసించిన 'ఆ వ్యక్తి' మరోసారి తన జనులకు హెచ్చరిక చేయటం మొదలెట్టాడు– చూడండి! మనం గనక దైవప్రవక్త మాటలను త్రోసిపుచ్చామంటే పూర్వం తిరస్కరించిన జాతులకు పట్టిన దుర్గతే మనకూ పట్టవచ్చు....

52. అంటే అల్లాహ్ ఎవరికి శిక్ష విధించినా వారు చేసిన పాపాల కారణంగానే శిక్షించాడు. దైవాజ్ఞలను పెడచెవిన పెట్టి, దైవప్రవక్త మాటలను ఎగతాళి చేసిన వారినే ఆయన అంతమొందించాడు. ఆయన ఊరికే ఎవరి జోలికీ పోడు. ఆయన అమిత దయామయుడు, ప్రేమమయుడు. అకారణంగా ఆయన అన్యాయం చేసేవాడు కాదు. కాకపోతే దుర్మార్గం మితిమీరిపోయినపుడు, పాపాలు పరాకాష్ఠకు చేరుకున్నప్పుడు ఆయన చట్టం ఆయా వ్యక్తులను, సముదాయాలను చుట్టుముట్టుతుంది.

53. **'తనాదీ'** అంటే ఒకరింకొకరిని బిగ్గరగా పిలవటం, కేకవేయటం అని అర్థం. ప్రళయ దినాన్ని **'యౌముత్తనాద్'** అని కూడా అంటారు. ఎందుకంటే ఆనాడు ఒండొకరిని కేకలేసి పిలుస్తుంటారు. స్వర్గవాసులు నరకవాసుల్ని, నరకవాసులు స్వర్గవాసుల్ని పిలుస్తుంటారు (అల్ ఆరాఫ్ – 48, 49). మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం మీజాన్ (త్రాసు) దగ్గర ఒక దైవదూత నిలబడి ఉంటాడు. ఎవరి సత్కర్మల తక్కెడ తేలికగా ఉంటుందో, వారి దౌర్భాగ్యం గురించి ఆ దైవదూత బిగ్గరగా ప్రకటిస్తాడు. మరికొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం ఆనాడు మానవుల కర్మలనుబట్టి వారిని పిలవటం జరుగుతుంది. ఉదాహరణకు : స్వర్గవాసులను 'ఓ స్వర్గవాసులారా!' అనీ, నరకానికి ఆహుతి అయ్యేవారిని 'ఓ నరకవాసులారా!' అని పిలవటం జరుగుతుంది. ఇమామ్ ఇబ్నె కసీర్ ఏమంటున్నారంటే, ఇమామ్

33 “ఆ రోజు మీరు వెన్ను చూపి తిరిగిపోతారు.[54] మిమ్మల్ని అల్లాహ్ (పట్టు) నుండి కాపాడేవాడెవడూ ఉండడు. అల్లాహ్ మార్గ భ్రష్టతకు గురిచేసినవారికి సన్మార్గం చూపేవాడెవడూ ఉండడు.[55]

يَوْمَ تُوَلُّوْنَ مُدْبِرِيْنَ ۚ مَا لَكُمْ مِّنَ اللّٰهِ مِنْ عَاصِمٍ ۚ وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ هَادٍ ﴿33﴾

34 “లోగడ యూసుఫ్ (అలైహిస్సలాం) కూడా మీ వద్దకు స్పష్టమైన ప్రమాణాలను తీసుకువచ్చాడు.[56] అయినప్పటికీ ఆయన తెచ్చిన విషయాలపై మీరు అనుమానంతోనే ఉన్నారు.[57] చివరకు ఆయన మరణించినపుడు,[58] 'ఈయన తరువాత అల్లాహ్ ఇంకా ఏ ప్రవక్తనూ పంపబోడు'[59] అని మీరు చెప్పుకో సాగారు. ఈ విధంగా అల్లాహ్ హద్దుమీరే వారినీ, సందేహాలతో బతికేవారిని అపమార్గానికి లోను చేస్తాడు.[60]

وَلَقَدْ جَآءَكُمْ يُوْسُفُ مِنْ قَبْلُ بِالْبَيِّنٰتِ فَمَا زِلْتُمْ فِيْ شَكٍّ مِّمَّا جَآءَكُمْ بِهٖ ؕ حَتّٰۤى اِذَا هَلَكَ قُلْتُمْ لَنْ يَّبْعَثَ اللّٰهُ مِنْۢ بَعْدِهٖ رَسُوْلًا ؕ كَذٰلِكَ يُضِلُّ اللّٰهُ مَنْ هُوَ مُسْرِفٌ مُّرْتَابُۨ ﴿34﴾

35 “(ఎందుకంటే) వారు తమ వద్దకు వచ్చిన ఏ ప్రమాణమూ లేకుండానే, అల్లాహ్ నిదర్శనాల విషయంలో (మొండిగా) వాదిస్తారు.[61] ఈ పోకడ అల్లాహ్ వద్ద, విశ్వాసుల వద్ద కూడా

الَّذِيْنَ يُجَادِلُوْنَ فِيْۤ اٰيٰتِ اللّٰهِ بِغَيْرِ سُلْطٰنٍ اَتٰىهُمْ ؕ كَبُرَ مَقْتًا عِنْدَ اللّٰهِ وَعِنْدَ الَّذِيْنَ اٰمَنُوْا ؕ

బఘ్వీ గారి ఈ ప్రవచనం చాలా బావుంది. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకునే దీనికి ఈ పేరు పెట్టబడిందని ఆయన అన్నారు.

54. అంటే మహ్షర్ మైదానం నుంచి నరకానికి పోతారు. లేదా లెక్కలు తేల్చబడిన తరువాత అక్కడి నుండి పలాయనం చిత్తగిస్తారు.

55. అంటే అటువంటి దౌర్భాగ్యులకు సన్మార్గం చూపి, వారిని నరకయాతన నుంచి కాపాడటం ఎవరి తరమూ కాదు.

56. ఓ ఈజిప్టు వాసులారా! ఈ విధంగా దైవప్రవక్తలు దైవసందేశాన్ని తీసుకుని రావటం కొత్తదేమీ కాదు. మీకు పూర్వం మీ తాతముత్తాతల వద్దకు హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కూడా దైవనిదర్శనాలను తీసుకువచ్చారు.

57. కాని మీరు ఆయన మాటలను కూడా నమ్మలేదు. పైగా ఆయన (యూసుఫ్) తెచ్చిన సూచనలను తీవ్రంగా అనుమానించారు. సంశయాలకు లోనయ్యారు.

58. అంటే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) చనిపోయినప్పుడు....

59. అంటే దైవప్రవక్తలకు వ్యతిరేకంగా మాట్లాడటం, వారి పిలుపును పరిహసించటం మీకు హాబీగా మారిపోయింది. అందుకే ఆయన చనిపోయినందుకు మీరు లోలోపలే సంతోషించారు. ఇకమీదట ప్రవక్త రాడులే అనుకుని తృప్తిచెందారు. లేక మీ వైఖరి ప్రవక్తలు వచ్చినా రాకపోయినా ఫర్వాలేదు అన్నట్టుగా మారిపోయింది లేక యూసుఫ్ ప్రవక్త చనిపోయాక అంతటి గొప్ప ప్రవక్త మళ్ళెక్కడ పుడతాడూ? అంటూ సానుభూతి వ్యక్తం చేశారు. సాధారణంగా మహాపురుషులు చనిపోయినప్పుడు జనులు స్పందించే తీరు ఇలాగే ఉంటుంది.

60. ఈనాడు మీరు మార్గవిహీనత యొక్క ఆఖరి అంచుల దాకా వెళ్ళిపోయారంటే అందులో ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఎందుకంటే యధేచ్ఛగా పాపాలకు ఒడిగట్టే వారికి, ప్రతి చిన్న విషయాన్ని అనుమానిస్తూ కూర్చునే వారికి దేవుడు సన్మార్గం చూపడు. అందునా 'దేవుని ఏకత్వం' విషయంలో పొద్దస్తమానం శంకకు గురైన వాణ్ణి దేవుడు అసలే మార్గం చూపడు.

61. అల్లాహ్ తరఫున అవతరించిన ప్రమాణబద్ధమైన విషయమేదీ వారివద్ద లేదు. అయినప్పటికీ వారు దేవుని ఏకత్వం

كَذَٰلِكَ يَطْبَعُ اللَّهُ عَلَىٰ كُلِّ قَلْبِ مُتَكَبِّرٍ جَبَّارٍ ﴿35﴾

ఎంతో అయిష్టకరమైనది.[62] ఈ విధంగా గర్విష్టి, క్రూరుడైన ప్రతి వ్యక్తి హృదయంపై అల్లాహ్ ముద్ర వేసేస్తాడు."[63]

وَقَالَ فِرْعَوْنُ يَا هَامَانُ ابْنِ لِي صَرْحًا لَّعَلِّي أَبْلُغُ الْأَسْبَابَ ﴿36﴾

**36** ఫిరౌన్ ఇలా అన్నాడు: "ఓ హామాన్! నా కోసం ఒక ఎత్తయిన కట్టడాన్ని నిర్మించు.[64] బహుశా నేను ఆ మార్గాలపైకి పోతానేమో–

أَسْبَابَ السَّمَاوَاتِ فَأَطَّلِعَ إِلَىٰ إِلَٰهِ مُوسَىٰ وَإِنِّي لَأَظُنُّهُ كَاذِبًا ۚ وَكَذَٰلِكَ زُيِّنَ لِفِرْعَوْنَ سُوءُ عَمَلِهِ وَصُدَّ عَنِ السَّبِيلِ ۚ وَمَا كَيْدُ فِرْعَوْنَ إِلَّا فِي تَبَابٍ ﴿37﴾

**37** "ఆ గగన మార్గాలలోకి పోయి, మూసా ఆరాధిస్తున్న దేవుణ్ణి తొంగి చూస్తాను.[65] ఖచ్చితంగా ఇతను (మూసా) అబద్ధాల కోరని నా అనుమానం."[66] ఈ విధంగా ఫిరౌన్ దురాగతాలు అతనికి అందమైనవిగా చూపబడ్డాయి.[67] అతడు సన్మార్గం నుంచి ఆపి వేయబడ్డాడు.[68] ఫిరౌన్ పన్నిన పన్నాగాలన్నీ (అతని) వినాశానికే దోహదపడ్డాయి.[69]

وَقَالَ الَّذِي آمَنَ يَا قَوْمِ اتَّبِعُونِ أَهْدِكُمْ سَبِيلَ الرَّشَادِ ﴿38﴾

**38** విశ్వసించిన ఆ వ్యక్తే ఇంకా ఇలా అన్నాడు : "ఓ నా జాతి (ప్రజలారా)! మీరు (అందరూ) నన్ను అనుసరించండి. నేను మిమ్మల్ని మంచి మార్గం వైపుకు దర్శకత్వం వహిస్తాను.[70]

(తౌహీద్) విషయంలో, దైవాదేశాల విషయంలో దెబ్బలాడుతున్నారు. ఇలాంటి తలతిక్క మనుషులు అన్ని కాలాల్లోనూ ఉన్నారు, ఉంటారు.

62. వీళ్ళ డొంక తిరుగుడు మాటలను అల్లాహ్ మాత్రమే అసహ్యించుకోడు, విశ్వాసులు కూడా ఏవగించుకుంటారు.

63. దైవ వాక్యాలకు, నిదర్శనాలకు వ్యతిరేకంగా మంకుతనంతో, గర్వంతో వాదించే ఇలాంటి ప్రబుద్ధుల హృదయాలకు దేవుడు సీలు వేసేస్తాడు. ఆ తరువాత వారి కళ్లకు మంచి మంచిగా, చెడు చెడుగా కానరాదు. ఒక్కోసారి వారికి మంచి చెడుగానూ, చెడు మంచిగానూ కనిపిస్తుంది.

64. ఇది ఫిరౌన్ తలబిరుసుతనానికి మరో నిదర్శనం. అతడు తన మంత్రి అయిన హామాను నుద్దేశించి, ఒక ఎత్తయిన మేడను కట్టమని ఆజ్ఞాపించాడు. ఆ మేడ సహాయంతో ఆకాశ ద్వారాల వరకూ పోయి మూసా దేవుణ్ణి చూస్తానన్నాడు. ఆ మాటల్లో వెటకారం, అహంకారం కలగలసి ఉన్నాయి. **'అస్బాబ్'** (اَلْاَسْبَاب) అంటే ద్వారాలు లేక మార్గాలు అని అర్థం. మరిన్ని వివరాలకు ఖసస్ సూరా 28వ ఆయతు చూడండి.

65. అంటే ఆకాశంపైన నిజంగానే అతని దేవుడు ఉన్నాడో లేడో చూస్తాను.

66. అంటే – ఆకాశంలో అల్లాహ్ ఉన్నాడన్న మూసా మాటలపై నాకేమాత్రం నమ్మకం లేదు. తాను అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తనని అతను చెబుతున్నదంతా వట్టిదే.

67. ఈ విధంగా షైతాన్ అతన్ని (ఫిరౌనును) అపమార్గానికి గురిచేశాడు. అతను చేసే దుష్కార్యాలన్నీ అతని కంటికి మంచి పనులుగా కానరాసాగాయి.

68. అంటే అతను సత్యం నుంచి, పుణ్యకార్యాల నుంచి ఆపబడ్డాడు. పైగా అతను అపమార్గాలలో దేవులాడుతూ ఉండిపోయాడు.

69. **'తబాబ్'** (تَبَاب) అంటే వినాశం, నష్టం అనే అర్థాలు వస్తాయి. ఫిరౌన్ ఎప్పుడు, ఏ పన్నాగం పన్నినా అది అతని పాలిట నష్టకరంగానే పరిణమించింది. చివరకు అతను తన సైన్యం సమేతంగా సముద్రంలో ముంచివేయబడ్డాడు.

**39** “ఓ నా జాతి (వారలారా!) ఈ ప్రాపంచిక జీవిత సౌఖ్యాలు తాత్కాలికమైనవి.[71] పరలోకమే శాశ్వతంగా ఉండే నిలయం.[72]

يٰقَوْمِ إِنَّمَا هٰذِهِ الْحَيٰوةُ الدُّنْيَا مَتَاعٌ ز
وَّإِنَّ الْاٰخِرَةَ هِيَ دَارُ الْقَرَارِ ﴿39﴾

**40** “ఎవడయినా పాపానికి పాల్పడితే దానికి సరిసమానమైన (పాప) ఫలమే అతనికి లభిస్తుంది.[73] మరెవడయినా పుణ్యకార్యం చేస్తే – అతడు పురుషుడైనా, స్త్రీ అయినా–అతడు గనక విశ్వాసి అయివుంటే[74] – అలాంటి వారంతా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారక్కడ లెక్క లేనంత ఉపాధిని పొందుతారు.[75]

مَنْ عَمِلَ سَيِّئَةً فَلَا يُجْزٰى إِلَّا مِثْلَهَا ۚ وَمَنْ
عَمِلَ صَالِحًا مِّنْ ذَكَرٍ أَوْ أُنْثٰى وَهُوَ مُؤْمِنٌ
فَأُولٰٓئِكَ يَدْخُلُوْنَ الْجَنَّةَ يُرْزَقُوْنَ فِيْهَا
بِغَيْرِ حِسَابٍ ﴿40﴾

**41** “ఓ నా జాతి (జనులారా)! నేను మిమ్మల్ని మోక్షం వైపునకు పిలుస్తుంటే,[76] మీరు నన్ను నరకాగ్ని వైపునకు పిలుస్తారేమిటి?[77]

وَيٰقَوْمِ مَا لِيْٓ أَدْعُوْكُمْ إِلَى النَّجٰوةِ وَتَدْعُوْنَنِيْٓ
إِلَى النَّارِ ﴿41﴾

**42** “నేను అల్లాహ్‌ను తిరస్కరించాలనీ, నేనెరుగని వాటిని ఆయనకు సహవర్తులుగా నిలబెట్టాలని మీరు నన్ను ఆహ్వానిస్తుంటే, నేను మాత్రం మిమ్మల్ని అసాధారణ శక్తిశాలి, క్షమాశీలి (అయిన అల్లాహ్) వైపునకు ఆహ్వానిస్తున్నాను.[78]

تَدْعُوْنَنِيْ لِأَكْفُرَ بِاللّٰهِ وَأُشْرِكَ بِهٖ مَا لَيْسَ لِيْ
بِهٖ عِلْمٌ ز وَّأَنَا أَدْعُوْكُمْ إِلَى الْعَزِيْزِ الْغَفَّارِ ﴿42﴾

---

70. ఫిరౌన్ వర్గానికి చెందిన ఆ విశ్వాసి మరోసారి ఉపదేశించాడు – తన జాతివారిని సరైన మార్గంలో నడిపిస్తున్నానని ఫిరౌన్ బీరాలు పోతున్నాడు. కాని వాస్తవానికి అతను స్వయంగా దారి తప్పినవాడు. కనుక మీరు ఫిరౌన్ అడుగుజాడల్లో నడవకండి. మీరు నా మార్గాన్ని అనుసరించండి. నేను చూపే మార్గమే రుజుమార్గం. మూసా (అలైహిస్సలాం) మిమ్మల్ని ఆహ్వానించే మార్గమే ఇది.

71. ఈ ప్రాపంచిక జీవితం క్షణభంగురం. ఇదో మూన్నాళ్ళ ముచ్చట! పరలోక జీవితంతో పోల్చుకుంటే ఇది ఒక ఉదయకాలం, లేక సాయంకాలం వంటిది.

72. ఎందుకంటే అది శాశ్వతమైనది, అనశ్వరమైనది. స్వర్గానికి పోయినవారైనా, నరకానికి పోయినవారైనా శాశ్వతంగా అక్కణ్ణే ఉంటారు. అక్కడ ఎవరికీ చావు రాదు. అక్కడి నుంచి ప్రస్థానం అనేది ఉండదు. ఆ పరలోకంలో ఒక రకం జీవితం సుఖసౌఖ్యాలతో కూడుకున్నదైతే మరొకటి యాతనతో కూడుకున్నది.

73. అంటే దుర్మార్గానికి ఒడిగట్టిన వారికి ఆ దుర్మార్గానికి సరిపడా శిక్ష మాత్రమే పడుతుంది. అంతకన్నా ఎక్కువ శిక్ష పడదు. అంటే ఆ శిక్ష పూర్తిగా న్యాయబద్ధంగా ఉంటుంది.

74. అంటే వారు సదాచార సంపన్నులై ఉండటంతో పాటు, విశ్వాసులు కూడా అయి ఉంటారు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే 'విశ్వాసం' లేని సదాచరణ నిష్ఫలం. 'సదాచరణ' లోపించిన విశ్వాసం నిరర్థకం. దైవసన్నిధిలో సాఫల్యం పొందాలంటే విశ్వాసంతో పాటు సదాచరణ, సదాచరణతోపాటు విశ్వాసం ఉండాలి.

75. అంటే స్వర్గంలో దేవుడు వారికి ప్రసాదించే అనుగ్రహాలు అగణ్యమైనవి. అనంతమైనవి. అవి అయిపోతాయి అనే చింత ఎవరికీ ఉండదు.

76. అంటే – నేను మిమ్మల్ని ఏకదైవారాధన వైపుకు ఆహ్వానిస్తున్నాను. సహవర్తులెవరూ లేని ఒకే ఒక్క దైవాన్ని ఆరాధించమని చెబుతున్నాను. ఆయన పంపిన ప్రవక్తను ధృవపరచమని అంటున్నాను. మీకు సన్మార్గం చూపే నిమిత్తం దేవుడు అతన్ని పంపాడు అని బోధపరుస్తున్నాను. కాని మీరేమో....

77. ..... మీరు షిర్క్ (బహుదైవారాధన) వైపుకు నన్ను పిలుస్తున్నారాయె. మీరు పిలిచే మార్గం మనిషిని నరకం వైపుకు గొనిపోతుంది. తదుపరి ఆయతులో ఆ మాటే అనబడింది.

**43** "మీరు నన్ను ఎవరి వైపునకు పిలుస్తున్నారో వారు ఇహ లోకంలోగానీ,[79] పరలోకంలోగానీ[80] పిలువటానికి అసలు యోగ్యులు కారన్న విషయంలో సందేహానికి ఆస్కారమే లేదు.[81] మరి మనమంతా మరలిపోవలసింది అల్లాహ్ వద్దకే (అన్నది కూడా నిర్వివాదాంశమే).[82] మరి బరితెగించి పోయేవారే నరక వాసులవుతారు[83] (అనేది కూడా ముమ్మాటికీ నిజం).

لَا جَرَمَ أَنَّمَا تَدْعُونَنِيٓ إِلَيْهِ لَيْسَ لَهُۥ دَعْوَةٌ فِى ٱلدُّنْيَا وَلَا فِى ٱلْءَاخِرَةِ وَأَنَّ مَرَدَّنَآ إِلَى ٱللَّهِ وَأَنَّ ٱلْمُسْرِفِينَ هُمْ أَصْحَٰبُ ٱلنَّارِ ﴿٤٣﴾

**44** "ముమ్మందు మీరు నేను చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేసుకుంటారు.[84] నేను మటుకు నా వ్యవహారాన్ని అల్లాహ్‌కు అప్పగిస్తున్నాను.[85] నిశ్చయంగా అల్లాహ్ తన దాసులందరినీ చూస్తూనే ఉన్నాడు."[86]

فَسَتَذْكُرُونَ مَآ أَقُولُ لَكُمْ ۚ وَأُفَوِّضُ أَمْرِىٓ إِلَى ٱللَّهِ ۚ إِنَّ ٱللَّهَ بَصِيرٌۢ بِٱلْعِبَادِ ﴿٤٤﴾

---

78. ఇక్కడ **'అజీజు'** (عَزِيز) అంటే అవిశ్వాసులపై పగతీర్చుకోవటంలో, వారిని శిక్షించటంలో సాటిలేని మేటి, అసాధారణ శక్తిశాలి అని భావం. **'గఫ్ఫార్'** (غَفَّار) అంటే తనను నమ్మి నడుచుకునే వారి పొరపాట్లను మన్నించేవాడని, వారి లోపాలను మరుగుపరిచే వాడని భావం. కాని మీరు ఏ చిల్లర దేముళ్ళ వైపుకు పిలుస్తున్నారో వారు దేనికీ అర్హులు కారు. వారు మొరలను ఆలకించలేరు. అక్కరలను తీర్చలేరు. లాభనష్టాలను కలిగించే శక్తి వారికి (వాటికి) లేనేలేదు.

79. అంటే పిలిచేవారి పిలుపును అందుకుని, వారి కష్టాలను దూరంచేసే శక్తి మీ మిథ్యా దైవాలకు లేదు. అసలు దైవం అని పిలిపించుకునే అర్హతే వాటికి లేదు. క్రింద పొందు పరచబడిన ఈ ఆయతులలో కూడా ఇంచుమించు అదే భావం ఉంది –

 1. "అల్లాహ్‌ను వదలి, ప్రళయదినం వరకూ తమ ప్రార్థనలకు స్పందించని వారిని మొరపెట్టుకునే వాడికన్నా మార్గభ్రష్టుడు మరెవడుంటాడు? పైగా మొరపెట్టుకునేవారు, మొరపెట్టుకునేది తమనేనన్న సంగతి కూడా వారికి తెలీదాయె!" (అహ్‌ఖాఫ్ – 5).

 2. "ఒకవేళ మీరు వారిని పిలిచినా వారు మీ పిలుపును వినరు. ఒకవేళ విన్నా వాటిని ఆమోదించలేరు." (ఫాతిర్ –14)

80. పోనీ కనీసం పరలోకంలోనయినా వారు తమ భక్తుల పిలుపును అందుకుని, వారి కోసం ఏమైనా సిఫారసు చేయగలుగుతారా?! అంటే అదీ లేదు. మరి అటువంటి అశక్తులు ఆరాధ్య దైవాలవుతారా? అటువంటి నిస్సహాయులను పూజించటం, వారిపై ఆశలు పెంచుకోవటం సమంజసమా?

81. **'లా జరమ'** (لَا جَرَمَ) అంటే నిశ్చయం, తథ్యం, అందులో సందేహానికి తావేలేదు అన్న అర్థాలు వస్తాయి.

82. అక్కడ అందరి లెక్కలు తేల్చబడతాయనేది, అందరికీ వారి వారి సంపాదననుబట్టి 'ఫలితం' వొసగబడుతుందనేది కూడా సత్యమే.

83. అంటే అవిశ్వాసులు, ముష్రిక్కులు, దేవుని అవిధేయతలో హద్దుమీరి పోయేవారు, ఎలాగూ నరకవాసులే. అలాగే ముస్లిములమని చెప్పుకుంటూనే లెక్కలేనన్ని పాపాలు చేస్తూ పోయేవారు, అవిధేయతలో ఆఖరి అంచుల దాకా వెళ్ళిపోయినవారు కూడా కొంతకాలం పాటు నరకయాతనకు గురికాక తప్పదు. అయితే ఆ తరువాత వారు మహాప్రవక్త ముహమ్మద్ (స) సిఫారసుపైనో లేక అల్లాహ్ ప్రమేయంతోనో నరకం నుంచి తీయబడి స్వర్గానికి పంప బడతారు.

84. ఓ నా జాతి సోదరులారా! ఈనాడు మీరు నా మాటలను ఖాతరు చేయటం లేదు. కాని త్వరలోనే మీరు నా

**45** ఎట్టకేలకు అల్లాహ్ అతన్ని, వారు పన్నిన దుష్టపన్నాగాల కీడు నుంచి రక్షించాడు.[87] కాగా; ఫిరౌనీయులపై బహు చెడ్డ విపత్తు విరుచుకుపడింది.[88]

فَوَقٰىهُ اللّٰهُ سَيِّاٰتِ مَا مَكَرُوْا وَحَاقَ بِاٰلِ فِرْعَوْنَ سُوْٓءُ الْعَذَابِ ﴿45﴾

**46** (ఇదిగో) అగ్ని – దాని ఎదుట వారు ప్రతి ఉదయం, సాయంత్రం రప్పించబడుతుంటారు.[89] మరి ప్రళయం సంభవించిననాడు, "ఫిరౌను జనులను దుర్భరమైన శిక్షలో పడవేయండి"[90] (అని సెలవీయబడుతుంది).

اَلنَّارُ يُعْرَضُوْنَ عَلَيْهَا غُدُوًّا وَّعَشِيًّا ۚ وَيَوْمَ تَقُوْمُ السَّاعَةُ ۫ اَدْخِلُوْٓا اٰلَ فِرْعَوْنَ اَشَدَّ الْعَذَابِ ﴿46﴾

ఉపదేశాన్ని జ్ఞాపకం చేసుకుని బాధపడే సమయం వస్తుంది. కాని అప్పుడు మీరు బాధపడినా, సిగ్గుతో కుంచించుకుపోయినా మీకు ఒరిగేదేమీ ఉండదు.

85. అంటే నేను ఆయన్నే నమ్ముకుంటున్నాను. ఆయనపైనే భారమంతా మోపుతున్నాను. అన్ని వేళలా సహాయం కొరకు ఆయన్నే అర్థిస్తున్నాను. మీతోనూ, మీ బూటకపు దేముళ్ళతోనూ తెగత్రెంపులు చేసుకుంటున్నానని ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను.

86. ఆయన అందరి స్థితిగతులనూ చూస్తూనే ఉన్నాడు. సన్మార్గానికి అర్హులెవరో చూసి అలాంటి వారికి ఆయన ఆ సద్బుద్ధిని ఒసగుతాడు. అపమార్గాన పోదలచిన వారిని అపమార్గానికే లోను చేస్తాడు. ఈ వ్యవహారాల్లో దాగివున్న మర్మాన్ని ఆయన బాగా ఎరుగు.

87. ఆ విశ్వాసి తెగవారైన ఖిబ్తీలు అతన్ని కడతేర్చాలని పథకాలు వేశారు. అయితే అల్లాహ్ వారి పథకాలను, దుష్టవ్యూహాలన్నింటినీ వమ్ము చేసి ఆ వ్యక్తిని హజ్రత్ మూసా (అలైహిస్సలాం)తో పాటు వారి చెర నుంచి విముక్తినిచ్చాడు. పరలోకంలోనయితే ఆ విశ్వాసికి స్వర్గంలో నివాసం కల్పించబడుతుంది.

88. వారు ప్రపంచంలోనేమో ఎర్ర సముద్రంలో ముంచివేయబడ్డారు. పరలోకంలో వారికి వ్యథాభరితమైన నరకయాతన ఖాయం.

89. అంటే బర్జఖ్ అవస్థలో–సమాధిలో–వారు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అగ్ని ముందు హాజరుపరచబడతారు. దీనిద్వారా సమాధి యాతన నిజమని రూఢీ అవుతోంది. కాని కొంతమంది ఈ విషయాన్ని నిరాకరిస్తున్నారు. అయితే హదీసులలో సమాధి యాతన గురించి చాలా స్పష్టంగా చెప్పబడింది. ఉదాహరణకు : హజ్రత్ ఆయిషా (రజి అల్లాహు అన్హా) వేసిన ఒక ప్రశ్నకు సమాధానంగా మహాప్రవక్త (సఅసం) "అవును! సమాధి యాతన సత్యం" అని అన్నారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ జనాయెజ్). అలాగే వేరొక హదీసులో ఈ విధంగా ప్రవచించబడింది: "మీలో ఎవరైనా చనిపోయినపుడు (సమాధిలో) ఉదయం, సాయంత్రం అతని ముందు అతని నివాస స్థలం చూపించబడుతూ ఉంటుంది. అంటే ఆ వ్యక్తి స్వర్గవాసి అయితే స్వర్గం, నరకవాసి అయితే నరకం అతని ఎదుట ప్రత్యక్షపరచబడుతూ ఉంటుంది. 'ఇదీ నీ అసలు స్థలం. తీర్పుదినాన అల్లాహ్ నిన్ను ఇక్కడకు పంపబోతున్నాడు' అని అతనితో అనబడుతుంది" (సహీహ్ బుఖారీ, ముస్లిం – కితాబుల్ జన్నతి). దీన్నిబట్టి తేలిందేమంటే సమాధి యాతన సత్యం. కాని సమాధి యాతనను త్రోసిపుచ్చే ప్రబుద్ధులు ఖుర్ఆన్ హదీసులు చెప్పే విషయాలను ఒప్పుకోవటం లేదన్నమాట!

90. దీన్నిబట్టి స్పష్టంగా బోధపడేదేమిటంటే ఉదయం, సాయంత్రం అగ్ని చూపెట్టబడేది తీర్పుదినానికి ముందే. తీర్పుదినానికి – ప్రళయదినానికి – ముందు ఏముందంటే అది సమాధి జీవితమే. అంటే బర్జఖ్ అవస్థే. తీర్పుదినాన ఈ పాపాత్ములను సమాధుల నుంచి తీసి బాధాకరమైన నరకయాతనకు ఆహుతి చేయటం జరుగుతుంది. **'ఆలె ఫిరౌన్'** అంటే ఫిరౌన్‌తో పాటు అతని రాజవంశస్థులు, అతని జాతిజనులు, అతని వెనుక నడిచిన అనుయాయులు అందరూ ఉన్నారు.

**47** మరి వారు నరకాగ్నిలో (కాలుతూ) పరస్పరం వాదోప వాదాలు మొదలెట్టినప్పుడు బలహీనులు, గర్విష్ఠుల నుద్దేశించి, "మేము మీకు తాబేదార్లుగా ఉన్నాం కదా! మరి మీరిప్పుడు ఈ అగ్నిలో ఏ కొంత భాగాన్నయినా మా నుండి తొలగించగలరా?!" అని అంటారు.

وَ اِذْ يَتَحَآجُّوْنَ فِى النَّارِ فَيَقُوْلُ الضُّعَفٰٓؤُا لِلَّذِيْنَ اسْتَكْبَرُوْٓا اِنَّا كُنَّا لَكُمْ تَبَعًا فَهَلْ اَنْتُمْ مُّغْنُوْنَ عَنَّا نَصِيْبًا مِّنَ النَّارِ ﴿47﴾

**48** దానికి ఆ గర్విష్ఠులు "మనమంతా ఈ అగ్నిలో ఉన్నాం కదా! అల్లాహ్ తన దాసుల మధ్య తీర్పు చేసేశాడు" అని సమాధాన మిస్తారు.

قَالَ الَّذِيْنَ اسْتَكْبَرُوْٓا اِنَّا كُلٌّ فِيْهَآ اِنَّ اللّٰهَ قَدْ حَكَمَ بَيْنَ الْعِبَادِ ﴿48﴾

**49** మరి నరకవాసులంతా కలసి, "(కనీసం) ఒక్కరోజు శిక్షనైనా కాస్త తగ్గించమని మీ ప్రభువును కోరండి" అని నరక పాలకులతో అంటారు.

وَقَالَ الَّذِيْنَ فِى النَّارِ لِخَزَنَةِ جَهَنَّمَ ادْعُوْا رَبَّكُمْ يُخَفِّفْ عَنَّا يَوْمًا مِّنَ الْعَذَابِ ﴿49﴾

**50** దానికి వారు, "ఎందుకు, మీ ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తీసుకుని మీ వద్దకు రాలేదా?!" అని అడుగుతారు. "ఎందుకు రాలేదు? (వచ్చిన సంగతి నిజమే)" అని నరకవాసులు అంటారు. "మరైతే మీరే విజ్ఞప్తి చేసుకోండి"[91] అని నరకపాలకులు చెబుతారు. (కాని) అవిశ్వాసుల విజ్ఞాపనలు నిరర్థకం తప్ప మరేమీ కావు.[92]

قَالُوْٓا اَوَلَمْ تَكُ تَاْتِيْكُمْ رُسُلُكُمْ بِالْبَيِّنٰتِ ۭ قَالُوْا بَلٰى ۭ قَالُوْا فَادْعُوْا ۚ وَمَا دُعٰٓؤُا الْكٰفِرِيْنَ اِلَّا فِىْ ضَلٰلٍ ﴿50﴾

సమాధిలో మృతుడు హాయిగా పడివున్నాడు కదా! మరి అతను శిక్షను చవిచూస్తున్నాడంటే ఎలా నమ్మేది?! అని ఎవరైనా సందేహపడవచ్చు. ఇలా అనటం వ్యర్థప్రేలాపన అనబడుతుంది. ఎందుకంటే సమాధి యాతన మన కంటికి కనబడనవసరం లేదు. అల్లాహ్ అన్ని విధాలా శిక్షించే సామర్థ్యం కలవాడు. నిద్రావస్థలో – కలలుగనే వారిని మనం చూడటం లేదా? కలలో మనిషి వర్ణనాతీతమైన బాధను అనుభవిస్తాడు. కాని అతన్ని చూసేవారికి, అతను బాధపడుతున్నాడని అస్సలు అనిపించదు. ఇలాంటి ఉపమానాలు మనముందు ఉన్నప్పటికీ సమాధి యాతనను త్రోసిపుచ్చటం మంకుతనం, అనుచిత పోకడ తప్ప మరేమీ కాదు. స్వప్నావస్థ సంగతి అలా ఉంచితే, మెలకువతో ఉన్న మనిషికి కలిగే నొప్పి, బాధ కూడా మనకంటికి కానరాదు. మనిషి బాధతో మూల్గటం, మెలికలు తిరిగిపోవటం చూసి అతనికి బాధ కలుగుతుందని అనుకుంటాము. ఆ వ్యక్తి గనక తన బాధను వ్యక్తం చేయకపోతే అది కూడా మనం తెలుసుకోలేము.

91. దైవప్రవక్తలు నిదర్శనాలను తీసుకువచ్చిన పిదప కూడా, వాటిని తిరస్కరించి, దైవాగ్రహానికి గురైన వారికోసం మేమెందుకు ప్రార్థించాలి? ఆ అభ్యర్థన ఏదో మీరే మీ ప్రభువుకు చేసుకోండి అని నరకపాలకులు నిర్ద్వంద్వంగా చెప్పేస్తారు.

92. అప్పుడు వాళ్లు స్వయంగా తమ ప్రభువుకు తమ గోడు వినిపించుకుంటారు. కాని వాళ్ల గోడు ఆలకించబడదు. ఎందుకంటే ప్రాపంచిక జీవితంలో వాళ్లకు చెప్పాల్సిందంతా చెప్పేయటం జరిగింది. పరలోకం విశ్వసించే, పశ్చాత్తాపం చెందే స్థలం కాదు. ఇది ప్రతిఫలం పొందే స్థలం. ప్రపంచంలో చేసుకున్నదానికి ఇక్కడ ఫలితం అనుభవించక తప్పదు.

**51** నిశ్చయంగా మేము మా ప్రవక్తలకు, విశ్వాసులకు ప్రాపంచిక జీవితంలోనూ సహాయపడతాము,[93] సాక్ష్యాలిచ్చేవారు నిలబడే రోజున కూడా[94] (సహాయం చేస్తాము).

إِنَّا لَنَنصُرُ رُسُلَنَا وَالَّذِينَ آمَنُوا فِي الْحَيَاةِ الدُّنْيَا وَيَوْمَ يَقُومُ الْأَشْهَادُ ﴿٥١﴾

**52** ఆ రోజు దుర్మార్గులకు వారి సంజాయిషీ ఎంతమాత్రం ఉపయోగపడదు. వారిపై శాపం పడుతుంది. మరి వారి కోసం బహుచెడ్డ నివాసం ఉంటుంది.[95]

يَوْمَ لَا يَنفَعُ الظَّالِمِينَ مَعْذِرَتُهُمْ وَلَهُمُ اللَّعْنَةُ وَلَهُمْ سُوءُ الدَّارِ ﴿٥٢﴾

---

93. అంటే – మేము వారి శత్రువులను పరాజితుల్ని చేసి, వారికి విజయాన్ని చేకూరుస్తాము. మరి కొంతమంది ప్రవక్తలు వధించబడ్డారు కదా! అన్న సందేహం ఈ సందర్భంగా కొందరికి కలగవచ్చు. ఉదాహరణకు: దైవప్రవక్త హజ్రత్ యహ్యా, హజ్రత్ జకరియ్యా (అలైహిముస్సలాం)లు హత్యకు గురయ్యారు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం), హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) లాంటి ప్రవక్తలు తమ స్వదేశాన్ని వదలి మరో చోటికి వలసపోవలసి వచ్చింది. ప్రవక్తల ప్రియసహచరులు కూడా దైవమార్గంలో ప్రస్థానం చేయవలసి వచ్చింది. దేవుడు సహాయం చేస్తానని వాగ్దానం చేసిన తరువాత కూడా ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అన్న ప్రశ్న కూడా ఉత్పన్నం కావచ్చు.

వాస్తవానికి ఇదొక సుదీర్ఘ ప్రక్రియ. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో సత్యతిరస్కారులకు ఆధిక్యత లభించినంతమాత్రాన, అసత్యం సత్యానికి విరుద్ధంగా ఆర్భాటం చేసినంత మాత్రాన దైవ వాగ్దానం నెరవేరకుండా పోదు. అల్లాహ్ తన ప్రణాళిక ననుసరించి, కొన్నిచోట్ల, కొన్ని అవిశ్వాస వర్గాలకు ఆధిక్యతను ఇవ్వవచ్చు. కాని ఎట్టకేలకు విశ్వాసులే గెలుస్తారు. సత్యమే నిలబడుతుంది. ఆఖరికి యహ్యా, జకరియ్యాల హంతకులపై కూడా దేవుడు శత్రువులను విధించాడు. వారు ఆ జాతుల వారిని దారుణంగా చంపి తమ రక్తదాహాన్ని తీర్చుకున్నారు. దైవప్రవక్త హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు– అలైహిస్సలాం)ను శిలువపై ఎక్కించగోరిన యూదులకు పట్టిన గతేమిటో చూడండి. దేవుడు వారిపై రోమనులకు విజయం నొసగాడు. వాళ్లు యూదులను శతవిధాలా అవమానించారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు, ఆయన ప్రియ శిష్యులకు కూడా మక్కా నుండి వలసపోవటం వినా మార్గాంతరం లేకపోయింది. కాని చివరికి జరిగిందేమిటి? బద్ర్, ఉహద్, ఖైబర్ యుద్ధాల ద్వారా, మక్కా విజయం ద్వారా అల్లాహ్ ముస్లింలకు అపూర్వంగా సహాయపడ్డాడు. దాంతో అసత్యవాదుల నడ్డి విరిగిపోయింది. ఇంత జరిగిన తరువాత కూడా దేవుడు తన ప్రియదాసులకు తోడ్పాటును అందజేస్తాడన్న విషయంలో సంశయం ఏముంది? (ఇబ్నె కసీర్).

94. **'అష్హాద్'** (اَشْهَادُ) అనేది **'షహీద్'** అనే పదానికి బహువచనం. ప్రళయదినాన దైవదూతలు దైవప్రవక్తల కార్యనిర్వహణ గురించి సాక్ష్యమిస్తారు – 'ఓ అల్లాహ్! నీ ప్రవక్తలు నీ సందేశాన్ని యథాతథంగా తమ ప్రజలకు అందజేశారు. కాని ఆయా జాతుల వారు వారిని ధిక్కరించారు' అని చెబుతారు. లేదా దైవప్రవక్తలు మరియు దైవదూతలు కలిసి తమ పని తీరు గురించి సాక్ష్యమిస్తారు. అలాగే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) మరియు ఆయన అనుచర సమాజ సభ్యులు కూడా సాక్ష్యమిస్తారని ఇంతకు ముందు ప్రస్తావనకు వచ్చింది. అందుకే ప్రళయదినాన్ని సాక్షులు నిలబడే రోజుగా పేర్కొనటం జరిగింది. ఆ రోజు విశ్వాసులకు దేవుడు తోడ్పడతాడంటే వారి సత్కర్మల ప్రకారం వారికి మంచి ప్రతిఫలం ఇస్తాడని, వారికి స్వర్గంలో ప్రవేశం కల్పిస్తాడని భావం.

95. అంటే వారు దైవకారుణ్యానికి దూరమైపోతారు. ఆనాడు వారు చెప్పే సాకులు, ఇచ్చుకునే సంజాయిషీలు స్వీకారయోగ్యం కావు. ఎందుకంటే అది సంజాయిషీలు చెప్పుకునే స్థలం కాదు. అందుకే వారి సాకులు, క్షమాపణలు నిష్ఫలం అవుతాయి.

53 మరి మేము మూసాకు మార్గదర్శిని ప్రసాదించాము.[96] ఇస్రాయీల్ సంతతిని ఆ గ్రంథానికి వారసులుగా చేశాము.[97]

وَلَقَدْ اٰتَيْنَا مُوْسَى الْهُدٰى وَاَوْرَثْنَا بَنِيْٓ اِسْرَآءِيْلَ الْكِتٰبَ ﴿53﴾

54 బుద్ధిజీవులకు అది మార్గదర్శినిగా, హితబోధినిగా ఉండేది.[98]

هُدًى وَّذِكْرٰى لِاُولِى الْاَلْبَابِ ﴿54﴾

55 కనుక (ఓ ప్రవక్తా!) సహనం వహించు. నిస్సందేహంగా అల్లాహ్ వాగ్దానం నిజమైనది. నువ్వు నీ పొరపాట్ల క్షమాపణకై[99] వేడుకుంటూ ఉండు. సాయం సమయంలోనూ, ప్రభాత సమయంలోనూ[100] నీ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ, స్తోత్రం చేస్తూ ఉండు.

فَاصْبِرْ اِنَّ وَعْدَ اللّٰهِ حَقٌّ وَّاسْتَغْفِرْ لِذَنْۢبِكَ وَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ بِالْعَشِيِّ وَالْاِبْكَارِ ﴿55﴾

56 ఎవరయితే తమ వద్దకు వచ్చిన ప్రమాణమేదీ లేకుండానే అల్లాహ్ ఆయతుల విషయంలో గొడవపడుతున్నారో, వారి ఆంతర్యాలలో గర్వం తప్ప మరేమీ లేదు. వారు ఎలాగూ దానిని (తమ లక్ష్యాన్ని) చేరుకోలేరు.[101] కనుక నువ్వు మాత్రం అల్లాహ్ శరణువేడుతూ ఉండు. నిశ్చయంగా ఆయన అంతా వినేవాడు, అన్నింటినీ చూసేవాడు.

اِنَّ الَّذِيْنَ يُجَادِلُوْنَ فِيْٓ اٰيٰتِ اللّٰهِ بِغَيْرِ سُلْطٰنٍ اَتٰىهُمْ ۙ اِنْ فِيْ صُدُوْرِهِمْ اِلَّا كِبْرٌ مَّا هُمْ بِبَالِغِيْهِ ۚ فَاسْتَعِذْ بِاللّٰهِ ۭ اِنَّهٗ هُوَ السَّمِيْعُ الْبَصِيْرُ ﴿56﴾

96. అంటే, మేము అతనికి దైవదౌత్యంతో పాటు, తౌరాత్ గ్రంథాన్ని అనుగ్రహించాము. "మేము మార్గదర్శకత్వం, కాంతితో కూడుకున్న తౌరాతు గ్రంథాన్ని అవతరింపజేశాము" (అల్ మాయిద - 44) అన్న ఆయతు ద్వారా బోధపడేది ఇదే!

97. అంటే, హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తదనంతరం కూడా తౌరాతు గ్రంథం మిగిలి ఉంది. బనీ ఇస్రాయీల్‌లో అనేక తరాల వారు - ఒకరి తరువాత మరొకరు - దానికి వారసులుగా చెలామణీ అయ్యారు. లేదా ఇక్కడ 'గ్రంథం' అంటే ఇస్రాయీల్ వంశీయుల్లో ప్రవక్తల ద్వారా అందజేయబడిన అన్ని గ్రంథాలు అని భావం.

98. **'ఉలుల్ అల్‌బాబ్'** అంటే బుద్ధిజీవులు, విజ్ఞులు, మేధా సంపన్నులు, సవ్యమైన భావాలు గలవారు, సదవగాహన గలవారు అన్న అర్థాలు వస్తాయి. మంచి అవగాహన గలవారే ఆకాశ గ్రంథాల ద్వారా ప్రయోజనం పొందగలుగుతారు. హితబోధను గ్రహించగలుగుతారు. ఇతరుల ఉపమానం పుస్తకాలను మోసే గాడిదల వంటిది. వారి వద్ద గ్రంథాలైతే ఉంటాయి. కాని ఆ గ్రంథాలలో ఏముందో వారికి తెలీదు.

99. ఇక్కడ **'పొరపాట్లు'** అంటే మానవ సహజమైన దౌర్బల్యం వల్ల జరిగే చిన్నపాటి పొరపాట్లు, మరుపువల్ల జరిగే లోపాలు అని భావం. అలాంటి తప్పులను సయితం అల్లాహ్ అప్పటికప్పుడే ఎత్తిచూపి, తన ప్రవక్తలను వాటి బారినుంచి రక్షిస్తాడు. అయినప్పటికీ తప్పుల మన్నింపు కోసం అర్థించమని ఉపదేశించటం జరిగింది. ఎందుకంటే మన్నింపు కోసం వేడుకోవటం కూడా ఆరాధనే. పుణ్యఫలాన్ని పెంచేందుకు దేవుడు ఈ విధంగా ఆజ్ఞాపించి ఉంటాడు. లేదా ప్రవక్త అనుచర సమాజంలోని వారు ఇస్తెగ్ఫార్ (మన్నింపు) పట్ల వైముఖ్యాన్ని చూపకుండా ఉండేటందుకు ఈ విధంగా నొక్కి వక్కాణించబడి ఉంటుంది.

100. **'అషియ్యి'** (عَشِيّ) అంటే పగలులోని ఆఖరి సమయం, రాత్రి యొక్క ఆరంభ ఘడియ అని అర్థం. **'ఇబ్‌కార్'** (اِبْكَار) అంటే రాత్రి చివరి భాగం, పగటి ఆరంభ దశ (ప్రభాత సమయం) అని అర్థం.

101. అంటే వారు చేసే వాదనల్లో పసలేదు. వాదించటానికి వారివద్ద సరకు కూడా లేదు. కేవలం తమ పెద్దరికాన్ని

لَخَلْقُ السَّمٰوٰتِ وَالْاَرْضِ اَكْبَرُ مِنْ خَلْقِ النَّاسِ وَلٰكِنَّ
اَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُوْنَ ﴿57﴾

**57** నిశ్చయంగా భూమ్యాకాశాల సృష్టి మానవ సృష్టికన్నా గొప్ప విషయం. కాని చాలామంది దీన్ని తెలుసుకోరు.[102]

وَمَا يَسْتَوِي الْاَعْمٰى وَالْبَصِيْرُ ۙ وَالَّذِيْنَ
اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ وَلَا الْمُسِيْٓءُ ۭ
قَلِيْلًا مَّا تَتَذَكَّرُوْنَ ﴿58﴾

**58** గుడ్డివాడు – చూపున్నవాడు సమానులు కారు. అలాగే విశ్వసించి, మంచి పనులు చేసేవారు – పాపాత్ములు (సమానులు కాజాలరు).[103] కాని మీరు హితబోధను గ్రహించేది (చాలా) తక్కువ.

اِنَّ السَّاعَةَ لَاٰتِيَةٌ لَّا رَيْبَ فِيْهَا وَلٰكِنَّ اَكْثَرَ
النَّاسِ لَا يُؤْمِنُوْنَ ﴿59﴾

**59** ప్రళయం (రావటం) తథ్యం. అందులో సందేహానికి తావే లేదు. కాని చాలామంది దీన్ని విశ్వసించరు (అది వేరే విషయం).

وَقَالَ رَبُّكُمُ ادْعُوْنِيْٓ اَسْتَجِبْ لَكُمْ ۭ
اِنَّ الَّذِيْنَ يَسْتَكْبِرُوْنَ عَنْ عِبَادَتِيْ
سَيَدْخُلُوْنَ جَهَنَّمَ دٰخِرِيْنَ ﴿60﴾

**60** మరి మీ ప్రభువు ఏమంటున్నాడంటే, "మీరు నన్నే ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను ఆమోదిస్తాను.[104] నా దాస్యం పట్ల గర్వాహంకారం ప్రదర్శించేవారు త్వరలోనే అవమానితులై నరకంలో ప్రవేశించటం తథ్యం."[105]

---

నిలుపుకునే తాపత్రయంతో, సత్యాన్ని కించపరచాలన్న దురుద్దేశంతో వారు ఈ పిల్లి మొగ్గలు వేస్తున్నారు. ఎన్ని వాదనలు చేసినా వారు తమ లక్ష్యాన్ని ఛేదించలేరు.

102. మరలాంటప్పుడు, అల్లాహ్ మనుషుల్ని మరోసారి తిరిగి లేపుతాడనే విషయాన్ని వీళ్లు ఎందుకు నమ్మటం లేదు? ఆయన దృష్టిలో ఈ పని భూమ్యాకాశాల నిర్మాణం కన్నా చాలా తేలిక కదా!

103. దీని భావం ఏమిటంటే అంధుడు – కళ్లున్నవాడు సమానులు కానట్లే విశ్వాసి – అవిశ్వాసి సమానులు కాలేరు. మంచివాడు – దుర్మార్గుడు ఎన్నటికీ సరిసమానులు కాలేరు. పైగా తీర్పుదినాన వారి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. ఆ వ్యత్యాసం కొట్టొచ్చినట్లే కనిపిస్తుంటుంది.

104. ఇంతకు ముందు వచ్చిన ఆయతులో దేవుడు ప్రళయం రాక గురించి చెప్పాడు. ఈ ఆయతులో మానవాళికి మార్గదర్శక నియమావళిని ఇస్తున్నాడు. ఈ నియమావళిని అవలంబించినవాడు పరలోకంలో అనుగ్రహ భాగ్యానికి నోచుకుంటాడు. ఈ ఆయతులోని 'దుఆ'ను చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఆరాధన, దైవదాస్యం అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే ఒకే దైవాన్ని ఆరాధించాలని అన్నారు. హదీసుల ద్వారా కూడా ఈ విషయం మనకు అవగతం అవుతోంది. ఉదాహరణకు: **'అద్దుఆవు హువల్ ఇబాదతు.'** (దుఆయే ఆరాధన) ఇంకా **'అద్దుఆవు ముఖ్ఖుల్ ఇబాదతి'** (దుఆ ఆరాధనా సారం) (ముస్నదె అహ్మద్ – 4/271; మిష్కాత్ – అద్దావాత్). "నా దాస్యంపట్ల గర్వాహంకారం ప్రదర్శించేవారు..." అనే వాక్యాన్నిబట్టి కూడా ఇక్కడ 'దుఆ' అంటే దాస్యం లేక దైవారాధనే అని విదితమవుతోంది.

అయితే మరికొంతమంది వ్యాఖ్యాతలు మాత్రం ఈ ఆయతు యందలి దుఆను 'దుఆ' (ప్రార్థన, వేడుకోలు) అన్న భావంలోనే తీసుకున్నారు. అంటే మేలు కొరకు అల్లాహ్‌ను అభ్యర్థించటం, కీడును తొలగించమని కోరటం. షరీయతు ప్రకారం 'దుఆ' అంటే అభ్యర్థించటం, కోరటం అని అర్థం. దీన్ని ఇతరత్రా అర్థాల్లో తీసుకోవటం అంటే అది ఒకవిధమైన అన్వయింపే. అదలా వుంచితే 'దుఆ' కూడా తన భావార్థం రీత్యా, ప్రస్తావిత హదీసుల దృష్ట్యా (ఒకవిధంగా) దైవారాధనే. ఎందుకంటే భౌతిక విధానానికి అతీతంగా ఎవరినయినా ఏదైనా అభ్యర్థిస్తే అది అతని దాస్యంగానే పరిగణించబడుతుంది (ఫత్‌హుల్ ఖదీర్). రెండు విధాలుగా పరిశీలించినా తేలే విషయం ఒక్కటే –

اللَّهُ الَّذِي جَعَلَ لَكُمُ اللَّيْلَ لِتَسْكُنُوا فِيهِ وَالنَّهَارَ مُبْصِرًا ۚ إِنَّ اللَّهَ لَذُو فَضْلٍ عَلَى النَّاسِ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَشْكُرُونَ ﴿٦١﴾

61 అల్లాహ్ మీ కొరకు రాత్రిని చేశాడు – అందులో మీరు విశ్రాంతి పొందటానికి![106] మరి ఆయనే పగటిని (మీరు) చూడ గలిగేదిగా చేశాడు.[107] నిశ్చయంగా అల్లాహ్ ప్రజల పట్ల దయా దాక్షిణ్యాలు గలవాడు. కాని ప్రజలలో చాలామంది కృతజ్ఞత తెలుపరు.[108]

ذَٰلِكُمُ اللَّهُ رَبُّكُمْ خَالِقُ كُلِّ شَيْءٍ لَّا إِلَٰهَ إِلَّا هُوَ ۖ فَأَنَّىٰ تُؤْفَكُونَ ﴿٦٢﴾

62 ఈ అల్లాహ్‌యే మీ (అందరికీ) ప్రభువు, ప్రతి వస్తువునూ సృష్టించినవాడు. ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. మరి మీరు ఎటు తిరిగిపోతున్నారు?[109]

كَذَٰلِكَ يُؤْفَكُ الَّذِينَ كَانُوا بِآيَاتِ اللَّهِ يَجْحَدُونَ ﴿٦٣﴾

63 ఇదే విధంగా (పూర్వం) అల్లాహ్ ఆయతులను తిరస్కరించే వారు కూడా తిరిగిపోయేవారు.

اللَّهُ الَّذِي جَعَلَ لَكُمُ الْأَرْضَ قَرَارًا وَالسَّمَاءَ بِنَاءً وَصَوَّرَكُمْ فَأَحْسَنَ صُوَرَكُمْ وَرَزَقَكُم مِّنَ الطَّيِّبَاتِ ۚ ذَٰلِكُمُ اللَّهُ رَبُّكُمْ ۖ فَتَبَارَكَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ ﴿٦٤﴾

64 అల్లాహ్‌యే[110] మీ కోసం భూమిని నివాసస్థలంగా చేశాడు.[111] ఆకాశాన్ని పందిరిగా నిర్మించాడు.[112] మీ రూపురేఖలను తీర్చి దిద్దాడు. మీకు చాలా అందమైన రూపాన్నిచ్చాడు.[113] తినటానికి పరిశుద్ధమైన ఆహార పదార్థాలను ప్రసాదించాడు.[114] ఈ అల్లాహ్‌యే మీ ప్రభువు. మరి సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ శుభాలు కలవాడు.

---

అదేమంటే తమ అక్కరలు తీర్చమని, తమకు సహాయపడమని అల్లాహ్‌ను తప్ప వేరొకరిని అర్థించటం, ఆరాధించటం వేరొకరిపై నమ్మకం పెట్టుకోవటం అధర్మం.

105. దైవారాధన పట్ల వైముఖ్యం చూపటం వల్ల లేక దైవారాధనలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించటం వల్ల ఎదురయ్యే దుష్ఫలితం ఇది!

106. ఆయన రాత్రిని చీకటిమయంగా చేయటంలోని మర్మం ఏమిటంటే మీ కార్యకలాపాలు, పరుగులు స్థంభించిపోవాలి. అప్పుడే మీరు హాయిగా నిద్రపోయి నూతనోత్తేజాన్ని పొందుతారు.

107. పగటిపూట మీరు కష్టపడి సంపాదించటానికి వీలుగా దానిని ప్రకాశవంతంగా, ప్రతి వస్తువు కానవచ్చేదిగా చేశాడు.

108. దైవానుగ్రహాల పట్ల చాలామందిలో కృతజ్ఞతా భావం ఉండదు. కనీసం దేవుని మేళ్లను కూడా వారు అంగీకరించరు. మేలును మరిచే దుర్గుణం మూలంగా వారీవిధంగా ప్రవర్తిస్తారు. దైవానుగ్రహాల పట్ల ఏమరుపాటు వల్ల కూడా వారిలో ఈ ధోరణి ప్రబలుతుంది. సాధారణంగా సత్యతిరస్కారులు, అజ్ఞానులు ఈ విధంగా ప్రవర్తిస్తారు.

109. మరలాంటప్పుడు ఒక్కడైన అల్లాహ్ ముందు తలవంచకుండా మిమ్మల్ని ఎవరు అడ్డుకుంటున్నారు?

110. ఇక్కడి నుంచి కొన్ని దైవానుగ్రహాలు వివరించబడ్డాయి. అల్లాహ్ గొప్ప శక్తిమంతుడని, అపురూప నిర్మాత అనీ, సహవర్తులెవరూ లేని అద్వితీయుడని చెప్పటానికి ఈ దృష్టాంతాలు ఇవ్వబడుతున్నాయి.

111. మీరు నేలపై నిలకడగా ఉంటున్నారు. దానిపై సంచరిస్తున్నారు. కట్టడాలు నిర్మిస్తున్నారు. దైనందిన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మరణించిన పిదప ఆ మట్టిలోనికే పోయి, ప్రళయదినం వరకూ అందులోపడి ఉంటున్నారు.

112. ఆకాశం ఒక అపురూపమైన కప్పు. స్థిరంగా ఉండే పందిరి. అది గనక విరిగి మీద పడుతుందన్న భయం ఉంటే

هُوَ الْحَيُّ لَآ اِلٰهَ اِلَّا هُوَ فَادْعُوْهُ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ ۭ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿65﴾

**65** ఆయన సజీవుడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి మీరు స్వచ్ఛమైన ఆరాధనను ఆయనకే సమర్పిస్తూ ఆయన్ని వేడుకోండి.[115] ప్రశంసలన్నీ సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కే చెందుతాయి.

قُلْ اِنِّيْ نُهِيْتُ اَنْ اَعْبُدَ الَّذِيْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ لَمَّا جَآءَنِيَ الْبَيِّنٰتُ مِنْ رَّبِّيْ ۡ وَاُمِرْتُ اَنْ اُسْلِمَ لِرَبِّ الْعٰلَمِيْنَ ﴿66﴾

**66** (ఓ ప్రవక్తా!) వారికి ఈ విధంగా చెప్పు: "మీరు అల్లాహ్‌ను వదలి మొరపెట్టుకుంటున్నటువంటి వాటిని నేను పూజించటాన్ని వారించటం జరిగింది.[116] ఆ మేరకు నా వద్దకు నా ప్రభువు తరఫున సూచనలు వచ్చేశాయి. సకల లోకాల ప్రభువుకే నేను విధేయుడనై ఉండాలని (కూడా) నాకు ఆజ్ఞాపించబడింది."[117]

هُوَ الَّذِيْ خَلَقَكُمْ مِّنْ تُرَابٍ ثُمَّ مِنْ نُّطْفَةٍ ثُمَّ مِنْ عَلَقَةٍ ثُمَّ يُخْرِجُكُمْ طِفْلًا ثُمَّ لِتَبْلُغُوْٓا اَشُدَّكُمْ ثُمَّ لِتَكُوْنُوْا شُيُوْخًا ۚ وَمِنْكُمْ مَّنْ يُّتَوَفّٰى

**67** ఆయనే మిమ్మల్ని మట్టితో, పిమ్మట వీర్యపు బిందువుతో,[118] ఆ తరువాత ఘనీభవించిన రక్తంతో సృష్టించాడు. తరువాత మిమ్మల్ని శిశువు రూపంలో (తల్లి గర్భం నుంచి) బయటకు తీస్తున్నాడు. మరి మీరు యుక్తవయస్సుకు చేరేటందుకు మీకు

ఏ మనిషీ నిశ్చింతగా నిద్రపోడు. మిన్ను విరిగి ఎక్కడ మీద పడుతుందోనన్న భయం ఉంటే జనులు స్వేచ్ఛగా, నిర్భయంగా రాకపోకలు సాగించరు.

113. భూమండలంలో ఎన్నో రకాల ప్రాణులున్నప్పటికీ వాటన్నింటికన్నా అందమైన ఆకారాన్ని (మానవులైన) మీకే ఆయన ఇచ్చాడు. మీ శరీరావయవాలను చాలా చక్కగా అమర్చాడు. నఖశిఖ పర్యంతం మిమ్మల్ని తీర్చిదిద్దాడు.

114. ఎన్నో రకాల స్వాదిష్టమైన ఆహారపదార్థాలను, పండ్లను మీకు ప్రసాదించాడు. అవి రుచికరమైనవి మాత్రమే కావు, బలాన్నిచ్చేవి కూడాను.

115. అన్నీ సమకూర్చినవాడు ఆయనే అయినప్పుడు, ఈ ఏర్పాట్లలో ఆయనకు భాగస్వాములు ఎవరూ లేనప్పుడు, మరి ఆరాధనలకు అర్హుడు కూడా ఆ ఒక్క దేవుడే కదా! అందుకే ఆయన్నే ఆరాధించండి. ఆయన్నే అర్థించండి. మన్నింపు కోసం ఆయన్నే వేడుకోండి. ఆయనే అందరి మొరలను ఆలకిస్తాడు. ఆయన తప్ప మరొకరెవరూ మీ గోడును వినిపించుకోలేడు. ఇదంతా మీకు తెలిసినప్పుడు ఆయన్ని కాదని ఇతరులను ఆశ్రయించటం, కష్టాలను తీర్చమని ఇతరులను వేడుకోవటం ఎంతవరకు ధర్మం?

116. అవి రాతి విగ్రహాలైనా, లేక వారు దైవప్రవక్తలైనా, సత్పురుషులైనా, సమాధులలో ఖననమై ఉన్న వారైనా – ఎవరినీ మొరపెట్టుకోరాదు. వారి పేరు మీద మొక్కుకోవటం, మొక్కుబడులు చెల్లించటం చేయకూడదు. వారిపై ఎలాంటి ఆశలూ పెట్టుకోకూడదు. వారికి ఏ విధంగానూ భయపడకూడదు. ఎందుకంటే ఇవన్నీ ఆరాధనల క్రిందికి వస్తాయి. ఇలాంటి ఆరాధనలు అల్లాహ్‌కు మాత్రమే చెందుతాయి.

117. దీని ద్వారా దేవుని ఏకత్వం రూఢీ అవుతోంది. దివ్య ఖుర్‌ఆన్‌లో పదే పదే దేవుని ఏకత్వానికి సంబంధించిన నిదర్శనాలు ఇవ్వబడ్డాయి. ఇస్లాం అంటేనే అసలు విధేయత, ఆజ్ఞాపాలన అని అర్థం. గొప్పవాడు, ఒకే ఒక్కడైన దేవుని ముందు వినయంగా తలవంచటం, దైవాజ్ఞలకు కట్టుబడి ఉండటమే ఇస్లాం ధర్మం. ఆయన ఆజ్ఞల పట్ల తలబిరుసుతనం చూపకూడదు. దీని తర్వాత మరోసారి దేవుని ఏకత్వానికి సంబంధించిన మరికొన్ని నిదర్శనాలు ఇవ్వబడ్డాయి.

118. మీ పితామహుడైన హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)ను ఆయన మట్టితో చేశాడు. అందువల్ల మానవులందరూ

مِنْ قَبْلُ وَلِتَبْلُغُوٓا اَجَلًا مُّسَمًّى وَّلَعَلَّكُمْ تَعْقِلُوْنَ ﴿67﴾

ఎదుగుదలను ఇస్తున్నాడు, ఆపైన వార్ధక్యానికి చేరుకునేందుకు (గడువు ఇస్తున్నాడు).[119] మీలో కొందరు ఆ స్థితికి చేరకముందే చనిపోతున్నారు.[120] మీరు నిర్ణీత గడువుకు చేరుకోవటానికి,[121] మీరు గ్రహించగలగటానికి[122] (వీలుగా ఆయన మీకు అవకాశం ఇస్తూ ఉన్నాడు).

هُوَ الَّذِيْ يُحْيٖ وَيُمِيْتُ ۚ فَاِذَا قَضٰٓى اَمْرًا فَاِنَّمَا يَقُوْلُ لَهٗ كُنْ فَيَكُوْنُ ﴿68﴾

**68** జీవితాన్ని ప్రసాదించేవాడు, మరణాన్ని వొసగేవాడు ఆయనే.[123] మరి ఆయన ఏ పనైనా చేయాలని నిర్ణయించుకున్నప్పుడు, దాన్నుద్దేశించి 'అయిపో' అని మాత్రమే అంటాడు. అంతే, అది అయిపోతుంది.[124]

اَلَمْ تَرَ اِلَى الَّذِيْنَ يُجَادِلُوْنَ فِيْٓ اٰيٰتِ اللّٰهِ ؕ اَنّٰى يُصْرَفُوْنَ ﴿69﴾

**69** అల్లాహ్ వాక్యాల విషయంలో గొడవ చేసే వారిని నువ్వు చూడలేదా?[125] ఇంతకీ వారెక్కడికి మరలించబడుతున్నట్టు?[126]

కూడా మట్టితోనే పుట్టించబడినట్లుగా భావింపబడుతారు. ఆ తరువాత మానవ పరంపరను వీర్యంతో ముడిపెట్టాడు. ఇప్పుడు ప్రతి మనిషీ వీర్యం (రేతస్సు) తోనే పుడుతున్నాడు. అది పురుషుని వెన్నులో నుంచి వెలువడి, స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశించి, మానవ సృజనకు శ్రీకారం చుట్టుతుంది. కాకపోతే ఒక్క హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) మాత్రమే తండ్రి లేకుండా – అద్భుత రీతిలో – సృజించబడ్డారు. దివ్య ఖుర్ఆన్ ద్వారా మనకు తెలిసే సత్యం ఇది. దీనిపై ముస్లిం సమాజమంతా ఏకాభిప్రాయం కలిగి వుంది.

119. మనిషి ఈ దశలన్నింటినీ అధిగమించేలా చేసేవాడు ఒక్క అల్లాహ్‌యే. ఈ వ్యవహారాల్లో ఆయనకు ఎవరూ సహవర్తులు లేరు.

120. అంటే మాతృగర్భంలో వివిధ దశలను దాటిన తరువాత పుట్టకముందే చనిపోయేవారు కొందరైతే, బాల్యదశలోనే తనువు చాలించేవారు మరికొందరు. కొందరు యుక్త వయస్సుకు చేరాక చనిపోతే, ఇంకా కొందరు ముసలితనానికి చేరి కాలం చేస్తారు.

121. ఆయా వ్యక్తులకు రాసిపెట్టి వున్న గడువును వారు అనుభవించటానికి అల్లాహ్ వారికి ఆ అవకాశం ఇస్తున్నాడు.

122. మీరు గనక అపురూపమైన ఈ ప్రక్రియపై నిశిత దృష్టితో ఆలోచిస్తే దీనంతటికీ కారకుడు ఆ మూలవిరాట్టు అయిన అల్లాహ్‌యే అని మీకు తెలిసివస్తుంది. అత్యంత అల్పమైన వీర్యకణం నుంచి మానవ సృజన మొదలవటం, మూడేసి చీకటి తెరల లోపల వివిధ దశలను అధిగమించి సంపూర్ణ మానవాకారాన్ని సంతరించుకోవటం, పుట్టిన పిదప కూడా వివిధ దశలకు చేరుకోవటం – దీన్నంతటినీ గమనిస్తే మీ సృష్టికర్త ఒక్కడేనని, ఆయనకు ఎవరూ సాటిలేరని, ఆయనే మీ ఆరాధ్యదైవమనీ, ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధనలకు అర్హులు కారనే సత్యం బోధపడుతుంది. ఇదంతా చేయగలిగిన ఆ దైవానికి, ప్రళయదినాన చనిపోయిన వారందరినీ తిరిగి బ్రతికించటం ఏమాత్రం క్లిష్టతరం కాదన్న విషయం కూడా మీకు అవగతం అవుతుంది.

123. జీవన్మరణాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన నిర్జీవమైన ఒక వీర్యబిందువుకు – వివిధ దశల ద్వారా – మానవాకారం ఇచ్చి ప్రాణం పోస్తాడు. మరి ఒక నిర్ణీత కాలం తరువాత ఆయన ఆ సజీవ మానవుణ్ణి చంపి మట్టిలోకి చేరుస్తాడు.

124. ఇది ఆయన 'అసాధారణ శక్తి'కి ప్రబల తార్కాణం.

70 వారు గ్రంథాన్ని, మా ప్రవక్తలతోపాటు పంపినదానిని కూడా ధిక్కరించారు. వారు త్వరలోనే (యదార్థం ఏమిటో) తెలుసు కుంటారు.

الَّذِينَ كَذَّبُوا بِالْكِتَٰبِ وَبِمَآ أَرْسَلْنَا بِهِۦ رُسُلَنَا ۖ فَسَوْفَ يَعْلَمُونَ ﴿٧٠﴾

71 అప్పుడు వారి మెడలలో (ఇనుప) పట్టాలు వేయబడి ఉంటాయి, సంకెళ్లు కూడా ఉంటాయి. మరి వారు ఈడ్వ బడతారు.[127]

إِذِ الْأَغْلَٰلُ فِىٓ أَعْنَٰقِهِمْ وَالسَّلَٰسِلُ يُسْحَبُونَ ﴿٧١﴾

72 సలసలా కాగే నీళ్లలోకి. తరువాత నరకాగ్నిలో కాల్చబడ తారు.[128]

فِى الْحَمِيمِ ثُمَّ فِى النَّارِ يُسْجَرُونَ ﴿٧٢﴾

73 "మీరు అల్లాహ్‌ను వదలి సాటి కల్పించిన వారు (చిల్లర దేవుళ్లు) ఎక్కడున్నారు?"[129] అని వారిని అడగటం జరుగుతుంది.

ثُمَّ قِيلَ لَهُمْ أَيْنَ مَا كُنتُمْ تُشْرِكُونَ ﴿٧٣﴾

74 (అంటే) అల్లాహ్‌ను వదలి అన్న మాట. "వారు మా నుండి అదృశ్యమైపోయారు.[130] కాదు, మేమింతకు ముందు అసలు దేనినీ మొరపెట్టుకోనే లేదు"[131] అని వారు (తడబడుతూ) చెబుతారు. ఈ విధంగా అల్లాహ్ అవిశ్వాసులను దారి తప్పిస్తాడు.[132]

مِن دُونِ اللَّهِ ۖ قَالُوا ضَلُّوا عَنَّا بَل لَّمْ نَكُن نَّدْعُوا مِن قَبْلُ شَيْـًٔا ۚ كَذَٰلِكَ يُضِلُّ اللَّهُ الْكَٰفِرِينَ ﴿٧٤﴾

125. అంటే దైవవాక్యాలను త్రోసిపుచ్చే ఉద్దేశ్యంతో, వాటిని పరిహసించే దురాలోచనతో వాదులాటకు దిగేవారు.

126. అంటే స్పష్టమైన నిదర్శనాలు ముందుకు వచ్చేసిన పిదప, సత్యం ప్రస్ఫుటం అయిన తరువాత కూడా వారు విముఖత చూపుతున్నారే?! ఈ వాక్యంలో ఆశ్చర్యం వ్యక్తం చేయబడింది.

127. ఈ తిరస్కారులకు నరకంలో పట్టే దుర్గతి ఇక్కడ కొద్దిగా చిత్రీకరించబడింది.

128. అంటే వాళ్ల ద్వారా నరకం రాజేయబడుతుందనీ, వారు నరకానికి ఇంధనంగా మారుతారని ముజాహిద్, మరియు ముఖాతిల్ పేర్కొన్నారు.

129. ఏమిటి? ఈనాడు వాళ్లు మిమ్మల్ని ఆదుకోగలరా?

130. 'అయ్యో! వాళ్లు మాకు కనబడకుండా పోయారు. ఇంక వాళ్లు మాకు ఏం సాయం చేస్తారు?' అని తలబాదుకుంటారు.

131. అంతలోనే వారి మాటలు తడబడతాయి. అసలు తామెన్నడూ వారిని పూజించనేలేదని ప్లేటు ఫిరాయిస్తారు. "దైవసాక్షి! మేము మా ప్రభువుకు భాగస్వామిగా ఎవరినీ నిలబెట్టలేదు" అని మాట మారుస్తారు (అల్ అన్‌ఆమ్ – 23). వాళ్లు ఈ మిథ్యా దైవాల పూజను తిరస్కరించటం లేదనీ, తాము చేసిన పూజలు అధర్మం అని ఒప్పుకుంటున్నారని కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు. ఎందుకంటే ఆ రోజు సత్యం వారి ముందుకు వచ్చేస్తుంది. తాము పూజించే విగ్రహాలు చూడలేవని, మాట్లాడలేవని, వినలేవని, లాభనష్టాలు చేకూర్చలేవని ఆనాడు వారికి అర్థమైపోతుంది (ఫత్‌హుల్ ఖదీర్). వాళ్లు షిర్క్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తారనేది ఇంకొక అర్థం. ఈ అర్థమే స్పష్టంగా ఉంది.

132. నిరంతరం దైవవాక్యాలను తిరస్కరించటం, దైవప్రవక్తలను ధిక్కరించటం – ఇదెలాంటి రోగమంటే దీనివల్ల

75 "మీరు భూమ్మీద అన్యాయంగా అదిరిపడుతూ, అనుచిత రీతిలో మిడిసి పడినందుకు జరిగిన శాస్తి ఇది.[133]

ذٰلِكُمْ بِمَا كُنْتُمْ تَفْرَحُوْنَ فِي الْاَرْضِ بِغَيْرِ الْحَقِّ وَبِمَا كُنْتُمْ تَمْرَحُوْنَ ﴿٧٥﴾

76 "ఇక నరక ద్వారాలలోనికి ప్రవేశించండి, ఎల్లకాలం అందులోనే పడి ఉందురుగాని; అహంకారులకు లభించిన ఈ చోటు ఎంత చెడ్డది?!"[134] (అని అనబడుతుంది).

اُدْخُلُوْۤا اَبْوَابَ جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَا ۚ فَبِئْسَ مَثْوَى الْمُتَكَبِّرِيْنَ ﴿٧٦﴾

77 కనుక (ఓ ముహమ్మద్ –స!) నువ్వు సహనం వహించు. అల్లాహ్ వాగ్దానం ముమ్మాటికీ సత్యమైనది.[135] మేము వారికి చేసివున్న వాగ్దానాలలో (హెచ్చరికలలో) కొన్నింటిని మేము నీకు చూపించినా[136] లేక (అంతకుముందే) మేము నీకు మరణం వొసగినా (ఎట్టకేలకు) వారంతా మరలిరావలసింది మా వద్దకే కదా![137]

فَاصْبِرْ اِنَّ وَعْدَ اللّٰهِ حَقٌّ ۚ فَاِمَّا نُرِيَنَّكَ بَعْضَ الَّذِيْ نَعِدُهُمْ اَوْ نَتَوَفَّيَنَّكَ فَاِلَيْنَا يُرْجَعُوْنَ ﴿٧٧﴾

78 నిశ్చయంగా నీకు పూర్వం కూడా మేము ఎంతోమంది ప్రవక్తల్ని పంపిఉన్నాము. వారిలో కొందరి సంగతులు మేము నీకు తెలియపర్చాము. మరికొందరి వృత్తాంతాలను అసలు నీకు తెలుపనే లేదు.[138] ఏ ప్రవక్త కూడా అల్లాహ్ అనుజ్ఞ లేకుండా ఏ మహిమనూ తీసుకురాలేకపోయేవాడు.[139] మరి అల్లాహ్

وَلَقَدْ اَرْسَلْنَا رُسُلًا مِّنْ قَبْلِكَ مِنْهُمْ مَّنْ قَصَصْنَا عَلَيْكَ وَمِنْهُمْ مَّنْ لَّمْ نَقْصُصْ عَلَيْكَ ۗ وَمَا كَانَ لِرَسُوْلٍ اَنْ يَّاْتِيَ بِاٰيَةٍ اِلَّا

కొంతకాలానికి వారి హృదయాలు కలుషితమై, తుప్పు పట్టిపోతాయి. ఇక ఆ తరువాత వారు శాశ్వతంగా సత్యాన్ని పొందే సద్బుద్ధికి దూరమైపోతారు.

133. మీరు నేలపై చెలరేగిపోయినందుకు, అహంకారంతో మిడిసిపడుతూ పాపకార్యాలకు ఒడిగట్టినందుకు, పాపాలు చేస్తూ కూడా నిక్షేపంగా ఉన్నందుకు మీకు ఎదురయిన పర్యవసానం ఇది.

134. నరకానికి కావలివారుగా నియమించబడిన దైవదూతలు నరకవాసులను ఉద్దేశించి పలికే మాటలివి.

135. అంటే మా వాగ్దానం ప్రకారం మేము అవిశ్వాసులపై ప్రతీకారం తీర్చుకుని తీర్తాము. ఈ వాగ్దానం తొందరగా – అంటే ఇహలోకంలో కూడా నెరవేరవచ్చు లేక దైవ ప్రణాళికననుసరించి ఆలస్యం కూడా కావచ్చు. ప్రళయదినాన మాత్రం మేమెలాగూ వారి పని పడతాము. వారు మా పట్టునుంచి ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేరు.

136. (ఓ ప్రవక్తా!) నీవు బ్రతికి ఉండగా వారు పరాభవానికి గురైనా ఆశ్చర్యం లేదు. జరిగింది కూడా అదే. అల్లాహ్ అవిశ్వాసులపై కక్ష తీర్చుకుని ముస్లింల కళ్లకు చలువను ప్రసాదించాడు. బద్ర్ సంగ్రామంలో సత్యతిరస్కారులు మట్టి కరచారు. హిజ్రీ 8వ ఏట మక్కా సునాయాసంగా జయించబడింది. మహనీయ ముహమ్మద్ (స) బ్రతికి ఉండగానే యావత్తు అరేబియా ద్వీపం ముస్లింల పాదాక్రాంతమైంది.

137. ఒకవేళ అవిశ్వాసులు ప్రాపంచిక జీవితంలో శిక్షనుంచి తప్పించుకున్నా వారెక్కడికి పోతారు(ట!)? వారెక్కడ చచ్చినా, ఎలా చచ్చినా తుదకు వచ్చేది మా సన్నిధికే. వారికోసం కఠినమైన శిక్ష కాచుకుని ఉంది.

138. కొంతమంది ప్రవక్తల గాథలను మాత్రమే నీకు విశదీకరించటం జరిగింది. చాలా మంది ప్రవక్తల గాథలను వివరించలేదు. దివ్య ఖుర్ఆన్‌లో 25 మంది ప్రవక్తల జీవితగాథలు, వారి జాతుల గాథలు మాత్రమే వివరించబడ్డాయి.

139. ఇక్కడ **'ఆయత్'** అంటే మహిమ లేక అనూహ్యమైన విషయం అని అర్థం. ఈ మహిమ దైవప్రవక్త సత్యబద్ధతను

بِإِذْنِ اللَّهِ ۚ فَإِذَا جَاءَ أَمْرُ اللَّهِ قُضِيَ بِالْحَقِّ وَخَسِرَ هُنَالِكَ الْمُبْطِلُونَ ﴿٧٨﴾

ఆజ్ఞ[140] వచ్చేసినపుడు సత్య (న్యాయ)బద్ధంగా తీర్పు జరిగి తీరుతుంది.[141] మరి అసత్యవాదులు మాత్రం అక్కడ నష్టానికి గురవుతారు.

اللَّهُ الَّذِي جَعَلَ لَكُمُ الْأَنْعَامَ لِتَرْكَبُوا مِنْهَا وَمِنْهَا تَأْكُلُونَ ﴿٧٩﴾

**79** అల్లాహ్ – ఆయనే మీ కొరకు పశువులను చేశాడు.[142] వాటిలో కొన్నింటిపై మీరు స్వారీ చేస్తారు. మరి కొన్నింటిని తింటారు.[143]

وَلَكُمْ فِيهَا مَنَافِعُ وَلِتَبْلُغُوا عَلَيْهَا حَاجَةً فِي صُدُورِكُمْ وَعَلَيْهَا وَعَلَى الْفُلْكِ تُحْمَلُونَ ﴿٨٠﴾

**80** వాటిలో మీ కొరకు మరెన్నో ప్రయోజనాలున్నాయి.[144] మీరు వాటిపై ఎక్కి, మీ ఆంతర్యాల్లో ఉన్న అక్కరలను సాధించటానికి (అవి ఉపయోగపడుతున్నాయి) – మీరు వాటిపైన, ఓడలపైన తరలించబడుతున్నారు.[145]

రూఢీ చేస్తుంది. 'నీవు సత్యవంతుడవే అయితే మాకు ఫలానా మహిమను చూపు' అని ఆయా ప్రజలు తమ ప్రవక్తలను కోరేవారు. మక్కా అవిశ్వాసులు సయితం మహాప్రవక్త ముహమ్మద్ (స)ను అనేక విషయాలు కోరారు. బనీ ఇస్రాయీల్ సూరా (90 – 93)లో ఈ వివరాలు వచ్చాయి. ఇక్కడ దైవవచనంలోని భావం ఏమిటంటే, మా అనుమతి లేకుండా ఏ ప్రవక్త కూడా ఏ మహిమనూ ప్రదర్శించలేకపోయేవాడు. మహిమలు ఇవ్వాలా, ఇవ్వకూడదా అనేది మా అధీనంలో ఉన్న విషయం. కొంతమంది ప్రవక్తలకు ప్రారంభం నుంచే కొన్ని మహిమలు ఇవ్వబడ్డాయి. కొన్ని జాతులకు వారి కోరికననుసరించి మహిమలు చూపబడ్డాయి. మరికొన్ని జాతులకు చూపబడలేదు. అదంతా మా ప్రణాళిక ననుసరించి జరుగుతుంది. అంతేగాని, ఏ ప్రవక్త కూడా, తాను తలచుకున్నప్పుడల్లా, తలచుకున్న అద్భుతాన్ని చేసి చూపలేదు. ఈ ఆయతు ద్వారా మిథ్యా విశ్వాసాలు ఖండించబడ్డాయి. కొంతమంది సత్పురుషులు (ఔలియా), వారు తలచుకున్నప్పుడల్లా కొన్ని అసాధారణ పనులు (అద్భుతాలు) చేయగలరని వాదించేవారి బూటకపు మాటలు కూడా నిర్ద్వంద్వంగా ఖండించబడ్డాయి. షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మ.లై) గురించి ఈ ప్రబుద్ధులు ఆపాదించేవన్నీ బూటకాలని కూడా ఈ ఆయతు ద్వారా స్పష్టమవుతోంది. అల్లాహ్ తన ప్రవక్తలకు (పైగంబరులకు) సయితం ఈ 'స్వయం ప్రతిపత్తి' ఇవ్వనప్పుడు ఒక వలీకి ఈ తిరుగులేని అధికారం ఎలా ఇస్తాడు? మరిచూడబోతే 'వలీ'కి మహిమల అవసరం కూడా లేదాయె. 'మహిమలు చూపిస్తేనే విశ్వసిస్తాము' అని ప్రజలు ఒక్కోసారి ప్రవక్తల ముందు మొరాయిస్తారు. అయినప్పటికీ దేవుడు ఈ విషయమై తన ప్రవక్తలకు తిరుగులేని రీతిలో మహిమల్ని ఇవ్వలేదు. ఎవరికి, ఎంతవరకు ఇవ్వాలో అంతవరకు మాత్రమే ఇచ్చాడు. కొంతమంది ప్రవక్తలకైతే అసలు మహిమలే ఇవ్వలేదు. అదలా వుంచితే 'వలీ'ని విశ్వసించి తీరాల్సిందేనని దేవుడు ఎక్కడా చెప్పలేదు. కాబట్టి వలీలకు మహిమల అవసరం కూడా లేదు. మరలాంటప్పుడు అల్లాహ్ వారికి అవసరం లేకుండానే మహిమల్ని ఎందుకిస్తాడు?

140. అంటే – ఇహలోకంలోగానీ, పరలోకంలోగానీ వారిని శిక్షించే సమయం ఆసన్నమైనపుడు....

141. అప్పుడు వారి మధ్య న్యాయసమ్మతంగా తీర్పు జరుగుతుంది. సత్యవంతులకు బహుమానం వొసగబడుతుంది. అసత్యాన్ని అవలంబించిన వారికి శిక్ష విధించబడుతుంది.

142. అల్లాహ్ తన అసంఖ్యాక అనుగ్రహాలలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఇక్కడ పశువులంటే ఒంటెలు, ఆవులు, గొర్రెలని భావం. ఇవి పెంటి–పోతులన్నీ కలిపి ఎనిమిది అవుతాయి. అల్ అన్ఆమ్ సూరా (143, 144)లో వీటి తఫ్సీళ్లు వచ్చాయి.

143. ఇవి స్వారీ చేయటానికి ఉపయోగపడటమే గాకుండా, వాటి పాలు కూడా మీకు ఆహార పదార్థంగా పనికివస్తుంది.

**81** (ఈ విధంగా) అల్లాహ్ మీకు తన(శక్తి) సూచనలను చూపుతూ పోతున్నాడు.[146] మరి మీరు అల్లాహ్ సూచనల్లో వేటిని తిరస్కరించగలరు?[147]

وَيُرِيكُمْ آيَاتِهِ فَأَيَّ آيَاتِ اللَّهِ تُنكِرُونَ ﴿٨١﴾

**82** వీరు భువిలో సంచారం చేసి, తమకు పూర్వం గడచిన వారికి పట్టిన గతేమిటో చూడలేదా?[148] వారు సంఖ్యాపరంగా వీరి కన్నా అధికులే. బలపరాక్రమాల రీత్యా వీళ్లకన్నా గట్టివారే. భువిలో వారు ఎన్నో చిహ్నాలను (కూడా) వదలిపోయారు.[149] కాని వారి ఘనకార్యాలు వారికి ఏ విధంగానూ ఉపయోగపడలేదు.[150]

أَفَلَمْ يَسِيرُوا فِي الْأَرْضِ فَيَنظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الَّذِينَ مِن قَبْلِهِمْ كَانُوا أَكْثَرَ مِنْهُمْ وَأَشَدَّ قُوَّةً وَآثَارًا فِي الْأَرْضِ فَمَا أَغْنَىٰ عَنْهُم مَّا كَانُوا يَكْسِبُونَ ﴿٨٢﴾

**83** వారివద్దకు వారి ప్రవక్తలు ఎప్పుడు స్పష్టమైన సూచనలను తీసుకువచ్చినా తమవద్ద ఉన్న 'విద్య' ఆధారంగా వారు వికటాట్టహాసం చేసేవారు.[151] వారు దేనిని పరిహసించేవారో ఎట్టకేలకు అదే వారిపై విరుచుకుపడింది.

فَلَمَّا جَاءَتْهُمْ رُسُلُهُم بِالْبَيِّنَاتِ فَرِحُوا بِمَا عِندَهُم مِّنَ الْعِلْمِ وَحَاقَ بِهِم مَّا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ﴿٨٣﴾

వాటి మాంసం మీకు పౌష్టికాహారంగా ఉపయోగపడుతుంది. వాటిలో కొన్ని పశువులు సుదీర్ఘ ప్రయాణాలకు కూడా ఉపయోగపడతాయి.

144. ఉదాహరణకు ఈ పశువుల చర్మాలు మీకు పలువిధాలుగా ఉపయోగపడుతున్నాయి. వాటి పాల ద్వారా వెన్న, నెయ్యి, జున్ను, పెరుగు వంటి ఆహార వస్తువులు తయారవుతున్నాయి. వాటి పేడ, కసువు సయితం మీ పొలాలకు ఎరువుగా ఉపయోగపడుతుంది.

145. మీరేకాదు, మీ కుంటుంబ సభ్యులంతా (ఇంటిల్లిపాదీ) ఈ పశువుల వీపులపై కూర్చుని ప్రయాణాలు చేస్తుంటారు.

146. ఈ సూచనలు దేవుని అసామాన్య ప్రజ్ఞను, అద్భుత శక్తి సామర్థ్యాలను చాటిచెబుతున్నాయి. ఈ సూచనలు విశ్వమండలంలోనే గాకుండా మీ ఉనికిలో సయితం ఇమిడి ఉన్నాయి.

147. దేవుని ఈ సూచనలు అగణ్యమైనవి! స్పష్టమైనవి!! తిరుగులేనివి!!! ఏ ధిక్కారిలో కూడా వీటిని కాదనే నైతిక ధైర్యం లేదు.

148. అంటే – మీరు వర్తకం నిమిత్తం తరచూ రాకపోకలు సాగించే ప్రదేశాలలో ఎన్నో నగరాలు, మరెన్నో నాగరికతలు శిథిలావస్థలో కానవస్తున్నాయి. ఆ జాతుల వారు ఒకప్పుడు దైవాన్ని, దైవప్రవక్తలను ధిక్కరించి దైవాగ్రహాన్ని ఆహ్వానించినవారే. వారి అదిరిపాటు వారిని ఏ స్థితికి చేర్చిందో ప్రత్యేకంగా వివరించి చెప్పనవసరం లేదు – చూస్తేనే తెలిసిపోతుంది.

149. వారి ప్రాచీన కట్టడాలను, కర్మాగారాలను, వ్యవసాయ క్షేత్రాలను చూసినప్పుడు వారి పనితనం ఎటువంటిదో, జీవితపు వివిధ రంగాలలో వారెంతటి ప్రావీణ్యాన్ని సంపాదించారో అవగతమవుతుంది.

150. అంటే వారు ఆర్జించిన విద్యగానీ, వారి కీర్తి ప్రతిష్ఠలు గానీ వారికి ఒరగబెట్టిందేమిటి? వారెన్ని కీర్తి శిఖరాల అంబరాలను చుంబించే ప్రయత్నం చేసినా – ప్రకృతి ధర్మాన్ని కాదన్న కారణంగా – పతనాల లోయల్లోకే నెట్టివేయబడ్డారు.

151. ఇక్కడ వారి 'విద్య' అంటే వారు కల్పించుకున్న మూఢాచారాలు, కాల్పనిక సిద్ధాంతాలు, మిథ్యావాదాలు అని భావం. వాటిని వారి 'విద్య' అని చెప్పటంలో ఒకింత వ్యంగ్య ధోరణి ఉంది. ఎందుకంటే వాటినే వారు మహాగొప్ప

فَلَمَّا رَاَوْا بَاْسَنَا قَالُوْٓا اٰمَنَّا بِاللّٰهِ وَحْدَهٗ وَكَفَرْنَا بِمَا كُنَّا بِهٖ مُشْرِكِيْنَ ﴿84﴾

**84** మరి మా శిక్షను చూశాక – "ఒక్కడైన అల్లాహ్‌ను మేము విశ్వసించాము. ఆయనకు సహవర్తులుగా నిలబెడుతూ వచ్చిన వారందరినీ మేము త్రోసిపుచ్చుతున్నాం" అని చాటి చెప్పారు.

فَلَمْ يَكُ يَنْفَعُهُمْ اِيْمَانُهُمْ لَمَّا رَاَوْا بَاْسَنَا ؕ سُنَّتَ اللّٰهِ الَّتِيْ قَدْ خَلَتْ فِيْ عِبَادِهٖ ۚ وَخَسِرَ هُنَالِكَ الْكٰفِرُوْنَ ﴿85﴾

**85** కాని మా శిక్షను చూసిన తరువాత, వారి 'విశ్వాసం' వారికే విధంగానూ లాభదాయకం కాలేకపోయింది. ఇది అల్లాహ్ సంప్రదాయం! ఇది (తరతరాలుగా) ఆయన దాసుల్లో నెరవేరుతూ వస్తోంది.[152] (దాన్ననుసరించే) అక్కడ అవిశ్వాసులు ఘోరంగా నష్టపోయారు.[153]

విద్యగా, అపూర్వ కళగా తలపోసి మిడిసిపడేవారు. తమ దగ్గరున్న విద్య ముందు మిగిలిన సిద్ధాంతాలన్నీ పనికి మాలినవని భావించేవారు. ఆఖరికి దైవప్రవక్తలు సయితం వారి కంటికి అధములుగా కన్పించేవారు. ప్రవక్తల ప్రబోధనలు వారికి కాలం చెల్లిన మాటలుగా అనిపించేవి. లేదా వారు ధార్మిక విషయాలకు ప్రతిగా ప్రాపంచిక విషయాలకు మాత్రమే ప్రాముఖ్యం ఇచ్చేవారు.

152. అంటే – శిక్షను చవిచూసిన మీదట చెందే పశ్చాత్తాపాన్ని, ప్రకటించే విశ్వాసాన్ని దేవుడు స్వీకరించడు. ఇది ఆయన విధానం. ఆయన విధానం స్థిరమైనది. అది మారబోదు. ఈ విషయం ఖుర్ఆన్‌లో చాలా చోట్ల నిర్ద్వంద్వంగా చెప్పబడింది.

153. అంటే – శిక్షను కళ్లారా చూసిన పిదప, తమ కొరకు నష్టం, వినాశం తప్ప మరొకటి లేదన్న యదార్థం వారికి అర్థమైపోయింది.

41 వ సూరా

# హా మీమ్ అస్సజ్‌దహ్

## హా మీమ్ సాష్టాంగ ప్రణామం

అవతరణ మక్కాలో

ఆయతులు 54

### పరిచయం

*ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. దివ్యఖుర్‌ఆన్‌ను అల్లాహ్ పంపించాడని, ఆయన సర్వం తెలిసినవాడని, మహావివేకవంతుడు, మహాజ్ఞాని, సకలస్తోత్రాలకు అర్హుడనీ, దివ్యఖుర్‌ఆన్ మహోన్నతమైన గ్రంథమనీ, మానవాళికి శుభవార్తను తెలుపుతుందని, హితబోధను అందజేస్తుందనీ, ఎలాంటి అబద్ధాలు దీనిని తాకలేవని తెలియజేసింది. కాని, అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒక సాధారణ మనిషి మాత్రమే అన్న సాకుతో ఆయన్ను తిరస్కరిస్తూనే ఉంటారని చెప్పింది.*

*గత కాలాల్లో అవిశ్వాసానికి, చెడులకు వ్యతిరేకంగా పోరాడిన ప్రవక్తల పోరాటాలను గుర్తుచేసుకోవలసినదిగా ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు బోధించడం జరిగింది. ఆయనకు అందజేయబడుతున్న దివ్య సందేశమే గతకాలాల్లో ప్రవక్తలకు కూడా అందించడం జరిగిందనీ, ప్రవక్తలందరి సందేశం ఒక్కటేననీ, అది : అల్లాహ్‌ను విశ్వసించడం, ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టకుండా ఉండటం, తప్పులకు పశ్చాత్తాపపడుతూ మంచి పనులు చేయడం. ప్రవక్త హూద్(అస), ప్రవక్త సాలిహ్(అస) లను ఆద్, సమూద్ జాతుల వద్దకు పంపించడం జరిగింది. కాని ఆయా జాతులు ఈ ప్రవక్తలను ఎగతాళి చేసాయి. వారి సందేశాన్ని తిరస్కరించాయి. ఫలితంగా ఆద్ జాతి భయంకరమైన తుఫాను గాలికి, సమూద్ జాతి భీకరమైన భూకంపానికి గురయి నాశనమయ్యాయి.*

*ఈ సూరాలో తీర్పుదినం నాటి దృశ్యాన్ని వర్ణించడం కూడా జరిగింది. ఆ రోజు దేవుని శత్రువులను చుట్టుముట్టి అగ్ని వైపునకు తీసుకుపోవడం జరుగుతుంది. వారు నరకాన్ని సమీపించినప్పుడు వారి కళ్ళు, చెవులు, వారి చర్మం వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి. అగ్ని వారి శాశ్వత నివాసమవుతుంది. అయితే విశ్వసించి మంచిపనులు చేసినవారి ఎదుట దైవదూతలు ప్రత్యక్షమవుతారు. వారికి శుభవార్తనిస్తారు. శాశ్వత స్వర్గవనాలు వారికి లభిస్తాయని తెలుపుతారు.*

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 13-16 | 21 | 'దైవప్రవక్త హూద్' | హూద్ ప్రవక్త ఏ జాతివారి వైపు పంపబడ్డారు? జాతి ప్రజల నుంచి ఆయనకు ఏం సమాధానం లభించింది? తిరస్కారులను అల్లాహ్ ఏ విధంగా శిక్షించాడు? |
| 17, 18 | 25 | 'దైవప్రవక్త సాలిహ్' | సాలిహ్ ప్రవక్త పంపబడిన జాతి పేరేమిటి? వారు ఏ కళల్లో నిష్ణాతులు? అల్లాహ్ వారికి చూపించిన మహిమ ఏమిటి? చివరికి వారి కథ ఎలా ముగిసింది? |

## హామీమ్ అస్సజ్‌దహ్[1] సూరా

## سُوۡرَةُ حٰمٓ السَّجۡدَةِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

**1-2** హా మీమ్. (ఇది) అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన వాని తరఫునుంచి అవతరింపజేయబడినది.

حٰمٓ ① تَنۡزِیۡلٌ مِّنَ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ②

1. ఈ సూరాకు గల మరో పేరు 'ఫుస్సిలత్'. ఈ సూరా అవతరణ వెనుక పరిస్థితులను వివరించే ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది –

**పూర్వరంగం :**

ఒకరోజు మక్కాలోని ఖురైష్ నాయకులంతా సమావేశమై రోజు రోజుకూ పెరిగిపోతున్న ముహమ్మద్ (సఅసం) అనుచరుల సంఖ్యను అడ్డుకునేదెలా? అని చర్చించుకోసాగారు. ఈ వెల్లువను గనక అడ్డుకోకపోతే, తమ ప్రాబల్యం ప్రమాదంలో పడుతుందని కొందరు ఆందోళన చెందారు. ఈ తర్జన భర్జన తరువాత వాళ్లు తామందరిలోకీ గొప్ప వాక్చాతుర్యం గల వ్యక్తి అయిన 'ఉతబా బిన్ రబీయా'ను రాయబారిగా ఎన్నుకున్నారు.

**ఉతబా ప్రతిపాదనలు :** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)తో మంతనాలు జరపటానికి ఉతబా వచ్చాడు. మొదట్లో అతను మహాప్రవక్త (స)పై ఆరోపణాస్త్రాలు సంధించాడు. అరబ్బులను అయోమయంలో పడవేసి, సంఘంలో చీలికను తెస్తున్నావని ఆయన్ని విమర్శించాడు. ఈ కొత్త సందేశం ద్వారా నువ్వు సాధించదలచిందేమిటో చెప్పు? నీ కోర్కెలు తీర్చటానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని ప్రలోభపెట్టాడు. అతని ప్రతిపాదనలు ఈ విధంగా ఉన్నాయి :

- ఈ ఉద్యమం ద్వారా సిరిసంపదలను పొందాలన్నదే నీ అభిమతమైతే చెప్పు, మేమంతా కలసి నీకు కావలసినంత ఐశ్వర్యాన్ని పోగుచేసి ఇస్తాం.
- పోనీ, అరేబియాను ఏలాలన్న కోరిక ఉంటే చెప్పు, మేమంతా కలసి నిన్ను మా నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటాము.
- ఒకవేళ అందమైన స్త్రీని మనువాడాలన్న కోరిక ఉంటే చెప్పు, ఒక్కరేం ఖర్మ, పదేసి అందగత్తెలను నీకు కట్టబెట్టడానికి సిద్ధంగా ఉన్నాం.
- ఒకవేళ నీపై చేతబడి ప్రభావం ఏమన్నా ఉంటే నిస్సంకోచంగా చెప్పు, మేము మా స్వంత ఖర్చులపై నీకు వైద్యం చేయిస్తాము.

ఈ ప్రతిపాదనలన్నీ విన్న తరువాత మహాప్రవక్త (సఅసం) ఈ సూరాను అతనికి చదివి వినిపించారు. ఉతబా ఎంతగానో ప్రభావితుడయ్యాడు. తిరిగి వెళ్ళాక అతను కురైష్ సర్దారులనుద్దేశించి ఇలా అన్నాడు : "మీరేమన్నా అనండి. ముహమ్మద్ (స)పై చేతబడి ప్రభావం ఎంతమాత్రం లేదు. అతను చెప్పేది కవిత్వం అంతకన్నా కాదు. అతనొక అద్భుతమైన, అపూర్వమైన వాణిని వినిపిస్తున్నాడు." అంటే ముహమ్మద్ (స) సందేశం విషయంలో ఆవేశపడకుండా ప్రశాంత హృదయంతో ఆలోచించండన్నది అతని మాటల ఆంతర్యం! కాని వాళ్లు ఆలోచించటం అటుంచి, 'నువ్వు కూడా అతని ఇంద్రజాలానికి మోసపోయావులే!' అని ఉతబాను నిందించారు. ఈ ఉల్లేఖనాన్ని పలువురు ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు పలు విధాలుగా విశదీకరించారు. విశదీకరించే శైలి భిన్నంగా ఉన్నప్పటికీ దీని భావం మాత్రం ఒక్కటే. ఈ విషయంలో ఇమామ్ షౌకానీ ఇలా అంటున్నారు : "మొత్తానికి దీనిపై కురైషుల సమావేశం జరిగిన మాట వాస్తవమనీ, వారు ఉతబాను తమ రాయబారిగా మహాప్రవక్త ముహమ్మద్ (స) దగ్గరకు పంపించారని, ఉతబా ప్రతిపాదనలకు సమాధానంగా ఆయన (స) ఈ సూరా మొదటి భాగాన్ని పఠించారని ఈ ఉల్లేఖనం ద్వారా మనకు తెలుస్తోంది."

كِتٰبٌ فُصِّلَتْ اٰيٰتُهٗ قُرْاٰنًا عَرَبِيًّا لِّقَوْمٍ يَّعْلَمُوْنَ ③

3 (ఇది) ఎటువంటి గ్రంథమంటే, దీని వాక్యాలు చాలా విపులంగా వివరించబడ్డాయి.[2] జ్ఞానమున్న జనుల కోసం[3] అరబీలో ఉన్న ఖుర్‌ఆన్ ఇది[4].....

بَشِيْرًا وَّنَذِيْرًا ۚ فَاَعْرَضَ اَكْثَرُهُمْ فَهُمْ لَا يَسْمَعُوْنَ ④

4 శుభవార్తను ఇచ్చేది, హెచ్చరిక చేసేది కూడా.[5] అయినప్పటికీ వారిలోని అధికులు విముఖత చూపారు. అందుకే వారు (కనీసం) విననైనా వినటం లేదు.[6]

وَقَالُوْا قُلُوْبُنَا فِيْۤ اَكِنَّةٍ مِّمَّا تَدْعُوْنَاۤ اِلَيْهِ وَفِيْۤ اٰذَانِنَا وَقْرٌ وَّمِنْۢ بَيْنِنَا وَبَيْنِكَ حِجَابٌ فَاعْمَلْ اِنَّنَا عٰمِلُوْنَ ⑤

5 వారిలా అన్నారు : "నువ్వు దేని వైపుకు మమ్మల్ని పిలుస్తున్నావో దానికి సంబంధించి మా హృదయాలు తెరలలో ఉన్నాయి.[7] మా చెవులలో భారం ఉంది.[8] నీకూ – మాకూ మధ్య ఒక (అడ్డు) తెర ఉంది. కాబట్టి నీ పనేదో నువ్వు చేసుకో. మా పనిని మేము చేసి తీరుతాము."[9]

قُلْ اِنَّمَاۤ اَنَا بَشَرٌ مِّثْلُكُمْ يُوْحٰۤى اِلَيَّ اَنَّمَاۤ اِلٰهُكُمْ اِلٰهٌ وَّاحِدٌ فَاسْتَقِيْمُوْۤا اِلَيْهِ وَاسْتَغْفِرُوْهُ ؕ

6 (ఓ ప్రవక్తా!) వారికీవిధంగా చెప్పు: "నేనూ మీలాంటి మానవమాత్రుణ్ణే. 'మీరందరి ఆరాధ్య దైవం అల్లాహ్ ఒక్కడే'[10] అనే వహీ (వాణి) నా వద్దకు వస్తుంది. కనుక మీరంతా ఆయన

2. అంటే – ఏది ధర్మం? ఏది అధర్మం? ఏది సత్యం? ఏది అసత్యం? అనే విషయాలు ఈ గ్రంథంలో చాలా స్పష్టంగా విడమరచి చెప్పబడ్డాయి. సత్కార్యాలేవో – దుష్కార్యాలేవో, విధేయత ఎలా ఉంటుందో – అవిధేయత ఎలా ఉంటుందో లాంటి ఎన్నో విషయాలు కూలంకషంగా చర్చించబడ్డాయి.

3. అంటే అరబీ భాష వచ్చిన వారికి, ఆ భాషలో మంచి ప్రవేశం ఉన్న వారికి ఈ గ్రంథం సులభగ్రాహ్యంగా ఉంటుంది. వారు ఇందలి విషయాల లోతుల్లోకి పోయి, వాటి పరమార్థాన్ని గ్రహించగలుగుతారు.

4. అరబీ భాషలో ఉన్న ఈ గ్రంథంలోని విషయాలు చాలా సూటిగా ఉన్నాయి. వాటి భావాన్ని ప్రజలు తేలిగ్గా అర్థం చేసుకుంటారు.

5. అంటే – విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి స్వర్గలోక శుభవార్తను అందజేస్తుంది. తిరస్కార వైఖరిని అవలంబించే వారికి, దైవానికి భాగస్వామ్యం కల్పించేవారికి, అవిధేయులుగా వ్యవహరించేవారికి నరకాగ్ని యాతన ఉందని హెచ్చరిస్తుంది.

6. అంటే – వారు ఈ గ్రంథంలోని వాక్యాలపై శ్రద్ధ చూపరు. వాటిపై యోచనచేసి, గుణపాఠం నేర్చుకునేందుకు యత్నించరు. అందుకే వారిలోని అధికులు సన్మార్గానికి నోచుకోకుండా పోతారు.

7. **'అకిన్నతన్'** అనేది **'కినానున్'** అనే పదానికి బహువచనం. కినానున్ అంటే పరదా లేక తెర అనే అర్థం వస్తుంది. అంటే నువ్వు చెప్పే విషయాలు మా హృదయాలకు అందవు. అవి నీ మాటలపట్ల పరదా వహించినాయి. నీ ఏకదైవారాధనా వాదం వాటికి సరిపడదు అని వారు చెప్పదలిచారన్నమాట!

8. **'వఖ్‌రున్' (وَقْرٌ)** అంటే అసలు భారం, బరువు అని అర్థం. కాని సందర్భం రీత్యా దీన్ని చెవుడు, చెవిటితనం అన్న అర్థంలో తీసుకోవచ్చు. అంటే సత్య విషయం దగ్గరికొచ్చేసరికి వారి చెవులు మొరాయిస్తున్నాయన్నమాట!

9. అంటే నీకూ–మాకూ మధ్య ఒక విచిత్రమైన అడ్డు ఉంది. తత్కారణంగా నీ వాణిని మేము వినలేకపోతున్నాం.

వైపునే (నిజాయితీగా) నిలబడండి. మన్నింపు కోసం ఆయన్ని అర్థించండి.” ఈ ముష్రిక్కులకు వినాశం ఉంది.

وَوَيْلٌ لِّلْمُشْرِكِينَ ⑥

**7** వారు జకాత్ ఇవ్వరు.[11] పరలోకాన్ని కూడా తిరస్కరిస్తుంటారు.

الَّذِينَ لَا يُؤْتُونَ الزَّكٰوةَ وَهُم بِالْاٰخِرَةِ هُمْ كٰفِرُونَ ⑦

**8** నిశ్చయంగా విశ్వసించి, సత్కార్యాలు చేసినవారి కొరకు ఎన్నటికీ అంతంకాని పుణ్యఫలమున్నది.[12]

اِنَّ الَّذِينَ اٰمَنُوا وَعَمِلُوا الصّٰلِحٰتِ لَهُمْ اَجْرٌ غَيْرُ مَمْنُونٍ ⑧

**9** (ఓ ప్రవక్తా! వారికి) నువ్వు ఇలా చెప్పు: ఏమిటి, రెండు రోజులలో భూమిని సృష్టించిన వానినే (అల్లాహ్‌ను) మీరు తిరస్కరిస్తారా?[13] ఇతరులను ఆయనకు భాగస్వాములుగా నిలబెడతారా? ఆయనే (వాస్తవానికి) సకల లోకాలకు ప్రభువు సుమా!

قُلْ اَئِنَّكُمْ لَتَكْفُرُونَ بِالَّذِي خَلَقَ الْاَرْضَ فِي يَوْمَيْنِ وَتَجْعَلُونَ لَهٗ اَنْدَادًا ذٰلِكَ رَبُّ الْعٰلَمِينَ ⑨

---

నువ్వు చేసేది మేము చూడలేకపోతున్నాం. అందుకే నువ్వు మమ్మల్ని మా మానాన వదలిపెట్టు. మేము నిన్ను నీ మానాన వదలివేస్తాం. నువ్వెలాగూ మా మతాన్ని అవలంబించవు. మేము కూడా నీ ధర్మాన్ని అవలంబించేది లేదు.

10. అంటే మానవత రీత్యా మీకూ – నాకూ మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదు. కాకపోతే నాపై దైవవాణి (వహీ) అవతరిస్తుంది. మరలాంటప్పుడు ఈ అడ్డుతెరలు ఎందుకు? అంతరాలెందుకు? నేను మీకు అందజేసే సందేశం కూడా మానవ బుద్ధిజ్ఞానాలకు మింగుడుపడనిది కాదు. మానవ నైజం వాంఛించే ధర్మాన్నే నేను మీకు బోధపరుస్తున్నాను. అలాంటప్పుడు మీరెందుకు ముఖం త్రిప్పుకుంటున్నారు?

11. ఈ సూరా మక్కాలో అవతరించింది. అప్పటికి జకాత్ ఆజ్ఞ రాలేదు. మదీనాకు వలసపోయిన మరుసటి సంవత్సరం ‘జకాత్’ ఆదేశం వచ్చింది. అందువల్ల ఈ ఆయతులో చెప్పబడిన ‘జకాత్’ను సాధారణ దానధర్మాల భావంలో తీసుకోవాలి. ఈ దానధర్మాల గురించి మక్కాలో ఉన్నప్పుడు కూడా ముస్లింలకు పదే పదే చెప్పబడేది. ఆ మాటకొస్తే తొల్దొలి రోజుల్లో (మక్కాలో) నమాజ్ కూడా ఉదయం పూట, సాయంత్రం పూట మాత్రమే ఉండేది. ప్రవక్త వారి మేరాజ్ (గగన యాత్ర) సందర్భంగానే రోజుకు ఐదు పూటల నమాజు ఆదేశం అందింది. లేక ఈ ఆయతులో జకాత్ అనే పదం ‘కలిమయె షహాదత్’ (సాక్ష్య వచనం) నేపథ్యంలో కూడా ప్రయోగించబడి ఉండవచ్చు. ఎందుకంటే జకాత్ అన్న పదానికి ‘ప్రక్షాళనం’ అనే అర్థం కూడా ఉంది. ఈ సాక్ష్య వచనం వల్ల మనిషి ఆంతర్యం షిర్క్ కాలుష్యం నుండి ప్రక్షాళనం అయ్యే అవకాశముంటుంది (ఇబ్నె కసీర్).

12. అంటే ఎన్నటికీ క్షీణించని పుణ్యఫలం అన్నమాట! హూద్ సూరాలోని 108వ ఆయతులో కూడా ఎన్నటికీ తరిగిపోని అనుగ్రహాలు ప్రాప్తిస్తాయి అని చెప్పబడింది.

13. “భూమ్యాకాశాలను అల్లాహ్ ఆరు రోజులలో సృష్టించాడ”ని దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల చెప్పబడింది. వాటి వివరాలు ఈ ఆయతులో ఇలా తెలుపబడ్డాయి – భూమిని రెండు రోజులలో చేశానని చెప్పాడు. అంటే ఆదివారం, సోమవారం అన్న మాట! అన్ నాజియాత్ సూరా (30వ ఆయత్)లో **‘వల్ అర్జ బాద జాలిక దహాహా’** అని అనటాన్ని బట్టి ఆకాశ నిర్మాణం తర్వాతే భూమిని ఏర్పరచాడని అవగతం అవుతోంది. కాని ఇక్కడ మాత్రం ఆకాశ నిర్మాణానికి ముందే భూమండలం సృజన గురించి ప్రస్తావించబడింది. దీనిపై హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా వ్యాఖ్యానించారు: ‘సృష్టించటం’ వేరు ‘పరచటం’ (లేక సానుకూలంగా మలచటం) వేరు. **‘దహాహా’** అంటే పరచటం, విస్తరింపజేయటం అనే అర్థాలు వస్తాయి. వాస్తవానికి ఆకాశ నిర్మాణం కన్నా ముందే భూమండలం నిర్మించబడింది. ఈ ఆయతులో కూడా అదే చెప్పబడింది. **‘దహాహా’** అనే పదం ద్వారా భూమిని నివాసయోగ్యంగా చేశాడనే భావం వస్తుంది. అంటే అందులో జల ఒనరులను ఉంచటం, వ్యవసాయానికి అనువైనదిగా చేయటం,

وَجَعَلَ فِيهَا رَوَاسِيَ مِن فَوْقِهَا وَبَٰرَكَ فِيهَا وَقَدَّرَ فِيهَآ أَقْوَٰتَهَا فِىٓ أَرْبَعَةِ أَيَّامٍ سَوَآءً لِّلسَّآئِلِينَ ⑩

10 మరి ఆయనే భూమిలో, దానిపై నుంచి పర్వతాలను పాతిపెట్టాడు.[14] అందులో శుభాన్ని పొందుపరిచాడు.[15] అందులో (నివసించే వారి కొరకు) ఆహార పదార్థాలను కూడా తగు మోతాదులో సమకూర్చాడు.[16] ఇదంతా (కేవలం) నాలుగు రోజుల్లో అయిపోయింది.[17] ఇది అడిగేవారికి తగిన విధంగా ఉంది.[18]

ثُمَّ ٱسْتَوَىٰٓ إِلَى ٱلسَّمَآءِ وَهِىَ دُخَانٌ فَقَالَ لَهَا وَلِلْأَرْضِ ٱئْتِيَا طَوْعًا أَوْ كَرْهًا قَالَتَآ أَتَيْنَا طَآئِعِينَ ⑪

11 తరువాత ఆయన పొగ(మాదిరి)గా ఉన్న ఆకాశం వైపు దృష్టిని మరల్చాడు. మరి దానినీ, భూమినీ ఉద్దేశించి, "మీకు ఇష్టం ఉన్నాసరే, ఇష్టం లేకున్నాసరే (ఉనికిలోకి) వచ్చేయండి"[19] అన్నాడు. "మేము ఇష్టపూర్వకంగా వచ్చేశాము" అని అవి పలికాయి.

ఖనిజ సంపదలను ప్రోదిచేయటం, చమురు నిక్షేపాలను భద్రపరచటం, కొండలు గుట్టల ద్వారా నేలకు స్థిరత్వాన్ని చేకూర్చటం – ఇత్యాదివన్నీ **'దహాహ'** లోకి వస్తాయి. ఈ 'ప్రక్రియ' మాత్రం ఆకాశాల నిర్మాణం తర్వాత, మిగిలిన రెండ్రోజుల్లో పూర్తయింది. ఈ విధంగా భూమండల సృష్టికి రెండ్రోజులు, భూమిలోని సమస్త అవసరాలను సమకూర్చటానికి మరో రెండ్రోజులు – మొత్తం నాలుగు రోజుల సమయం పట్టింది. (సహీహ్ బుఖారీ – హామీమ్ సజ్దహ్ సూరా వ్యాఖ్యానం).

14. అంటే పర్వతాలను భూమి లోపలినుంచే సృజించి, వాటిని భూమిపైన పాతేశాడు. భూమి అటూ ఇటూ ఒరిగిపోకుండా– స్థిరంగా – ఉండేటందుకు ఆయన ఈ వ్యవస్థను ఏర్పరచాడు.

15. ఇక్కడ శుభం (బరకత్) అంటే జల ఒనరులు, రకరకాల ఆహార వస్తువులు, పండ్లు ఫలాదులు, ఖనిజాలు, చమురు నిల్వలు అని భావం. వీటన్నింటినీ కలిపి ఇక్కడ 'శుభం' అని అనటం జరిగింది.

16. అంటే భూమండలంపై నివసించే ప్రాణులన్నింటికీ కావలసిన 'ఆహారం' ఇక్కడ బందోబస్తు చేయబడింది. ఈ 'బందోబస్తు' అపూర్వమైనది. అద్భుతమైనది. దాన్ని మాటల్లో వర్ణించటం ఎవరి తరమూ కాదు. దానికి అక్షరరూపం ఇవ్వటం కూడా అసాధ్యమే. ప్రపంచంలోని ఏ కేలక్యులేటర్ కూడా వాటిని మదించి లెక్కచెప్పజాలదు. మరో విశేషమేమిటంటే ఒక్కో ప్రాంతంలోని నేలలో ఒక్కో రకమైన సంపదలున్నాయి. అవి అక్కడి ప్రజల అవసరాలకు, అక్కడి వాతావరణానికి అనుగుణంగా ఉన్నాయి. ఆయా ప్రజల జీవన ప్రమాణాలు, వారి వ్యాపారాలు, వృత్తులు వాటితోనే ముడిపడి ఉంటాయి. ఇది అమోఘం!

17. అంటే భూమండల 'సృష్టి' కొరకు రెండు రోజులు, 'వ్యవస్థీకరణ' కోసం మరో రెండు రోజులు కలిపి మొత్తం నాలుగు రోజులవుతాయి. ఈ నాలుగు రోజుల్లో ఏది ఎక్కడుండాలో, ఎలా ఉండాలో అంతా సరిదిద్దటం జరిగింది.

18. **'సవాఅన్' (سَوَآءً)** అంటే సరిగ్గా నాల్గురోజులన్న భావం అక్కడ సరిపోతుంది. దీని మతలబు ఏమిటంటే ఎవరయినా ఈ విషయం గురించి అడిగితే సరిగ్గా నాలుగు రోజుల్లో ఇదంతా పూర్తయిందని చెప్పండి. లేక ప్రశ్నించే వారికి తగిన జవాబు అన్న అర్థం కూడా వస్తుంది.

19. ఇది (ఉనికిలోకి) రావటం అసలెలా జరిగింది? అన్నది కూడా వర్ణనాతీతమే. అవి రెండూ కూడా (ఆకాశం, భూమి) దేవుడు ఆజ్ఞాపించిన విధంగానే ఆయన సమక్షంలో హాజరయ్యాయి.

మరికొంతమంది దీనికి చెప్పిన భాష్యం ఇలా వుంది: 'నేను చెప్పినట్లు వినండి' అని దేవుడాదేశించగానే 'చిత్తం' అంటూ అవి వచ్చేశాయి. అప్పుడు అల్లాహ్ ఆకాశాన్ని ఉద్దేశించి 'సూర్యచంద్రులను, నక్షత్రాలను వెలికితియ్యి' అని

12 అంతే! రెండు రోజులలో సప్తాకాశాలను చేసేశాడు. ప్రతి ఆకాశంలోనూ తగిన ఆదేశాలతో కూడుకున్న 'వహీ'ని పంపాడు.[20] ఇంకా మేము సమీప ఆకాశాన్ని (క్రింది ఆకాశాన్ని) దీపాలతో ముస్తాబు చేశాము. (వాటి ద్వారా) దాన్ని సురక్షితమైనదిగా చేశాము.[21] ఇదంతా సర్వాధిక్యుడు, జ్ఞానసంపన్నుడైన అల్లాహ్ నియామకం.

فَقَضٰهُنَّ سَبْعَ سَمٰوٰتٍ فِيْ يَوْمَيْنِ وَاَوْحٰى فِيْ كُلِّ سَمَآءٍ اَمْرَهَا ؕ وَزَيَّنَّا السَّمَآءَ الدُّنْيَا بِمَصَابِيْحَ ۖ وَحِفْظًا ؕ ذٰلِكَ تَقْدِيْرُ الْعَزِيْزِ الْعَلِيْمِ ﴿12﴾

13 అప్పటికీ వాళ్ళు గనక వైముఖ్యాన్ని ప్రదర్శిస్తే వారికీవిధంగా చెప్పేయ్ : "ఆద్ సమూద్ జాతులపై అకస్మాత్తుగా విరుచుకుపడినటువంటి విపత్తు గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను."

فَاِنْ اَعْرَضُوْا فَقُلْ اَنْذَرْتُكُمْ صٰعِقَةً مِّثْلَ صٰعِقَةِ عَادٍ وَّثَمُوْدَ ﴿13﴾

14 ప్రవక్తలు వారి దగ్గరకు వారి ముందు వైపు నుంచీ, వెనుక వైపునుంచీ వచ్చి "మీరు అల్లాహ్‌ను తప్ప మరొకరిని ఆరాధించకండి" అని చెప్పినపుడు, "మా ప్రభువు గనక కోరితే, ఆయన (తన) దూతలనే పంపి ఉండేవాడు. అందుకే మీకు ఇచ్చి పంపబడిన దానిని మేము త్రోసిపుచ్చుతున్నాం" అని చెప్పారు.[22]

اِذْ جَآءَتْهُمُ الرُّسُلُ مِنْۢ بَيْنِ اَيْدِيْهِمْ وَمِنْ خَلْفِهِمْ اَلَّا تَعْبُدُوْٓا اِلَّا اللّٰهَ ؕ قَالُوْا لَوْ شَآءَ رَبُّنَا لَاَنْزَلَ مَلٰٓئِكَةً فَاِنَّا بِمَآ اُرْسِلْتُمْ بِهٖ كٰفِرُوْنَ ﴿14﴾

15 ఆద్ (జాతి వారి) విషయానికి వస్తే, వారు ఏ హక్కూ లేకుండానే భువిలో చెలరేగి పోయారు. "బలపరాక్రమాలలో మాకన్నా మొనగాడెవడున్నాడు?'[23] అని (బీరాలు) పలికారు. ఏమిటి, తమను పుట్టించిన అల్లాహ్ తమకన్నా ఎంతో బలవంతుడన్న సంగతి వారికి స్ఫురించలేదా?[24] (కడ దాకా) వారు మా ఆయతులను తిరస్కరిస్తూనే ఉండేవారు.[25]

فَاَمَّا عَادٌ فَاسْتَكْبَرُوْا فِي الْاَرْضِ بِغَيْرِ الْحَقِّ وَقَالُوْا مَنْ اَشَدُّ مِنَّا قُوَّةً ؕ اَوَلَمْ يَرَوْا اَنَّ اللّٰهَ الَّذِيْ خَلَقَهُمْ هُوَ اَشَدُّ مِنْهُمْ قُوَّةً ؕ وَكَانُوْا بِاٰيٰتِنَا يَجْحَدُوْنَ ﴿15﴾

ఆజ్ఞాపించాడు. భూమితో, 'నదీనదాలను, పండ్లు ఫలాలను వెలికితియ్యి' అని ఆదేశించాడు (ఇబ్నె కసీర్). మీరిరువురూ ఉనికిలోకి రండి అన్న భావం కూడా వస్తుంది.

20. అంటే – స్వయంగా ఆకాశాలకు లేక అక్కడ ఉండే దైవదూతలకు కొన్ని నిర్దేశిక నియమాలను సూచించి, వాటికి కట్టుబడి ఉండాలని శాసించాడు.

21. అంటే – షైతానుల బారినుంచి ఈ ఆకాశాన్ని కాపాడాడు. ఈ దీపాల (నక్షత్రాల) మరో ఉద్దేశం ప్రజలు మార్గాన్ని (దిశను) తెలుసుకోగలగటానికి ఉపయోగపడటం. అన్ నహ్ల్ సూరా 16వ ఆయతు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది.

22. మీరు కూడా మాలాంటి మనుషులే. కాబట్టి మేము మిమ్మల్ని దైవప్రవక్తలుగా అంగీకరించేది లేదు. తన ప్రవక్తగా చేసి పంపాలనుకుంటే దేవుడు దైవదూతలనే ప్రవక్తలుగా ఎంపికచేసి ఉండేవాడు. ఆయన మనలాంటి మనుషులను ప్రవక్తగా ఎందుకు ఎన్నుకుంటాడు? అన్నది వారి మాటల ఆంతర్యం.

23. అలా చెప్పటంలో వారి అంతరంగం ఏమిటంటే, ఒకవేళ తమపై దైవాగ్రహం వచ్చిపడినా, దాన్ని అడ్డుకునే శక్తి తమకుందని, తాము ఆజానుబాహులమని, కండబలం ఉన్నవారమని గర్వపడేవారు. దైవప్రవక్త హజ్రత్ హూద్ (అలైహిస్సలాం) వారివద్దకు వచ్చి, దైవశిక్ష గురించి భయపెట్టినప్పుడు వారు చెప్పిన మాటలివి.

16 ఎట్టకేలకు మేము వారికి, ప్రాపంచిక జీవితంలోనే అవమాన కరమైన శిక్షను రుచి చూపించటానికి – దుర్దినాలలో[26] వారిపై భయంకరమైన ఓ పెనుగాలిని[27] పంపాము. పరలోక శిక్ష ఇంతకన్నా పరాభవంతో కూడుకున్నది సుమా! మరి (అక్కడ) వారికెలాంటి సహాయమూ అందదు.

فَأَرْسَلْنَا عَلَيْهِمْ رِيحًا صَرْصَرًا فِي أَيَّامٍ نَحِسَاتٍ لِنُذِيقَهُمْ عَذَابَ الْخِزْيِ فِي الْحَيَاةِ الدُّنْيَا ۖ وَلَعَذَابُ الْآخِرَةِ أَخْزَىٰ ۖ وَهُمْ لَا يُنْصَرُونَ ﴿16﴾

17 ఇకపోతే సమూద్ (జాతి) వారు; మేము వారికి కూడా సన్మార్గం చూపించాము.[28] అయినప్పటికీ వారు మార్గదర్శనంపై అంధత్వానికే ప్రాధాన్యత ఇచ్చారు.[29] మరి వారి దురాగతాలకు బదులుగా వారిని (నిలువెల్లా) అవమానకరమైన శిక్ష యొక్క గర్జన కబళించింది.[30]

وَأَمَّا ثَمُودُ فَهَدَيْنَاهُمْ فَاسْتَحَبُّوا الْعَمَىٰ عَلَى الْهُدَىٰ فَأَخَذَتْهُمْ صَاعِقَةُ الْعَذَابِ الْهُونِ بِمَا كَانُوا يَكْسِبُونَ ﴿17﴾

18 మరయితే విశ్వాసులను, భక్తిపరాయణులను మాత్రం మేము (ఆ విపత్తు నుంచి) కాపాడాము.

وَنَجَّيْنَا الَّذِينَ آمَنُوا وَكَانُوا يَتَّقُونَ ﴿18﴾

19 ఏ రోజున అల్లాహ్ విరోధులు నరకాగ్ని వైపుకు సమీకరించ బడతారో,[31] అప్పుడు వారంతా (పలు సమూహాలుగా) విడగొట్ట బడతారు.[32]

وَيَوْمَ يُحْشَرُ أَعْدَاءُ اللَّهِ إِلَى النَّارِ فَهُمْ يُوزَعُونَ ﴿19﴾

24. అంటే, వారికి ఉనికిని ప్రసాదించినది గాకుండా, వారికి ఈ శక్తియుక్తులను ప్రదానం చేసిన సృష్టికర్తను కూడా వీళ్లు మించిపోయారా ఏమి? మిమ్మల్ని ప్రభవింపజేసిన పిదప ఆ దేవుడు బలహీనుడై పోయాడనుకున్నారా? ముమ్మాటికీ కాదు.

25. అంటే మేము దైవప్రవక్తలకు ఇచ్చి పంపిన మహిమలను, లేదా దైవప్రవక్తలు తీసుకువచ్చిన స్పష్టమైన నిదర్శనాలను లేదా విశ్వవ్యవస్థలో సర్వవ్యాప్తమై ఉన్న మా సూచనలను వారు త్రోసిపుచ్చేవారు.

26. **'నహిసాతున్'** (نَحِسَاتٌ) అనే పదాన్ని ఇక్కడ దుర్దినాలు, అశుభమైన రోజులు అన్న భావంలో తీసుకోవటం జరిగింది. కొంతమంది 'నిరంతరంగా' అని కూడా అనువదించారు. ఎందుకంటే ఆ గాలి నిరంతరం ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లూ వీస్తూ ఉండింది. మొత్తానికి దీని మతలబు ఏమిటంటే ఆ తుఫాను దినాలు వారి పాలిట దుర్దినాలుగా పరిణమించాయి. వారి విషయంలో గడ్డు రోజులుగా రూఢీ అయినాయి. అంతేగాని యదార్థానికి ఏ దినం కూడా 'దుర్దినం' అయి ఉండదు.

27. **'సర్‌సరన్'** (صَرْصَرًا) అనే పదం **'సుర్రతున్'** (శబ్దం) నుంచి వచ్చింది. అంటే ఆ పెనుగాలిలో భయంకరమైన శబ్దం కూడా ఉంది. గాలి ప్రచండవేగంతో వీచింది. దాంతో ఆ నగరం అతలాకుతలమై పోయింది. అవి తీవ్రమైన శీతల పవనాలని మరి కొందరు అభిప్రాయపడ్డారు. కాదు, అది అగ్నిలా కాల్చివేసే వేడిగాలి అని ఇంకా కొంతమంది భాష్యం చెప్పారు. ఆ గాలిలో ఈ హానికర గుణాలన్నీ ఉండి ఉండవచ్చని ఇమామ్ ఇబ్నె కసీర్ సమన్వయపరిచారు.

28. అంటే వారిని ఏకదైవారాధన వైపుకు పిలిచాము. దేవుని ఏకత్వాన్ని నిరూపించే నిదర్శనాలను చూపాము. వారి వద్దకు ప్రవక్తగా ఏతెంచిన హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) అహర్నిశలూ వారి సంస్కరణ కోసం పాటుపడ్డారు.

29. అంటే అంధులుగా ఉండిపోవటానికి ఇష్టపడ్డారన్నమాట! ఆఖరికి వారు, దైవనిదర్శనంగా సృష్టించబడిన ఒంటెను సయితం దారుణంగా చంపేశారు.

20 ఆ విధంగా వారు నరకాగ్నికి చాలా సమీపంలోకి రాగానే వారి చెవులు, వారి కళ్లు, వారి చర్మాలు సయితం వారు చేస్తూ ఉండిన పనుల గురించి సాక్ష్యమిస్తాయి.[33]

حَتّٰۤى اِذَا مَا جَآءُوْهَا شَهِدَ عَلَيْهِمْ سَمْعُهُمْ وَاَبْصَارُهُمْ وَجُلُوْدُهُمْ بِمَا كَانُوْا يَعْمَلُوْنَ ⑳

21 "మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యమిచ్చారు?"[34] అని వారు తమ చర్మాలనుద్దేశించి అడుగుతారు. "అన్ని వస్తువులకూ మాట్లాడేశక్తిని ఇచ్చిన అల్లాహ్‌యే మాకూ మాట్లాడే శక్తిని ప్రసాదించాడు. ఆయనే మిమ్మల్ని తొలిసారి పుట్టించాడు. మరి ఆయన వైపునకే మీరంతా మరలించబడతారు"[35] అని సమాధానమిస్తాయి.

وَقَالُوْا لِجُلُوْدِهِمْ لِمَ شَهِدْتُّمْ عَلَيْنَا ؕ قَالُوْۤا اَنْطَقَنَا اللّٰهُ الَّذِيْۤ اَنْطَقَ كُلَّ شَيْءٍ وَّهُوَ خَلَقَكُمْ اَوَّلَ مَرَّةٍ وَّاِلَيْهِ تُرْجَعُوْنَ ㉑

22 "మీరు రహస్యంగా (చెడుపనులకు) పాల్పడుతున్నప్పుడు మీ చెవులు, మీ కళ్లు, మీ చర్మాలు మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయన్న ఆలోచన మీకు ఉండేది కాదు.[36] పైగా మీరు చేసే చాలా పనులు అల్లాహ్‌కు కూడా తెలియవని[37] అనుకునేవారు."

وَمَا كُنْتُمْ تَسْتَتِرُوْنَ اَنْ يَّشْهَدَ عَلَيْكُمْ سَمْعُكُمْ وَلَاۤ اَبْصَارُكُمْ وَلَا جُلُوْدُكُمْ وَلٰكِنْ ظَنَنْتُمْ اَنَّ اللّٰهَ لَا يَعْلَمُ كَثِيْرًا مِّمَّا تَعْمَلُوْنَ ㉒

---

30. భయంకరమైన ఆపదను **'సాయిఖతు' (صٰعِقَةٌ)** గా వ్యవహరిస్తారు. ఈ ఆపద వారిపై ఆకాశ గర్జన, భూకంపం రూపంలో వచ్చింది. దాంతో అత్యంత అవమానకరమైన రీతిలో వారి కథ ముగిసింది.

31. అంటే – దైవవిరోధులందరినీ నరకపు దైవదూతలు ఒకచోట సమావేశపరచే ఆనాటి పరిస్థితిని కాస్త ఊహించుకోండి అని దీని భావం. అప్పుడు మొదటి నుంచి ఆఖరివరకు నేరస్తులంతా ఒకచోట చేర్చబడతారు.

32. అంటే అక్కడ వచ్చేవారిని – ఒక్కొక్కరినీ – ఆపి అందరినీ కూడగట్టడం జరుగుతుంది (ఫత్‌హుల్ ఖదీర్). మరిన్ని వివరాల కోసం నమల్ సూరా 17వ ఆయతుకు ఇవ్వబడిన పాద సూచికను చూడండి.

33. తామెన్నడూ 'షిర్క్' చేయలేదని, అవిధేయతకు పాల్పడలేదని వారు అబద్ధం చెప్పినప్పుడు దేవుడు నోళ్లను మూయించి, వారిపై వారి శరీరావయవాలనే సాక్ష్యంగా పెడతాడు. అప్పుడు ఆ అవయవాలు పూసగుచ్చినట్లుగా వారి అకృత్యాలను గురించి వివరిస్తాయి. మనిషి పంచేంద్రియాలలో రెండింటి (చెవులు, కళ్లు) ప్రస్తావన ఇక్కడ వచ్చింది. మూడోది చర్మం. అది కూడా ఆస్వాదనా శక్తి కలిగినదే. మిగతా రెండింటిని ఇక్కడ పేర్కొనలేదు. ఎందుకంటే అవి (వాసన చూసేవి, రుచి చూసేవి) కూడా 'చర్మం'లోకి వచ్చేస్తాయి (ఫత్‌హుల్ ఖదీర్).

34. తమ శరీరావయవాలే తమకు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వటంతో వారు ఆశ్చర్యానికి గురవుతారు. వారికి వాటిపై ఎక్కడలేని కోపం కూడా వస్తుంది. ఆ కోపాన్ని వారు ఈవిధంగా వ్యక్తపరుస్తారన్నమాట!

35. ఈ పలుకు అల్లాహ్‌ది అని కొందరు అభిప్రాయపడగా; "కాదు, ఇది కూడా మానవ చర్మాలు చెప్పేదే" అని మరి కొందరు వ్యాఖ్యానించారు. ప్రళయదినాన మానవ అవయవాలు సాక్ష్యమిస్తాయనే విషయం ఇంతకుముందు నూర్ సూరా 42వ వచనంలో, యాసీన్ సూరా 65వ వచనంలో కూడా వచ్చింది. ప్రామాణిక హదీసులలోనూ దీని ప్రస్తావన వచ్చింది. ఉదాహరణకు : దైవాజ్ఞపై మనిషి శరీరావయవాలు అతనికి వ్యతిరేకంగా ఏకరువు పెట్టినప్పుడు, "మీరు నాశనమవుగాక! నేనింతకాలంగా ప్రాకులాడింది, దెబ్బలాడింది మీ కోసమే కదా! (ఇప్పుడు మీరు నాకే ఎసరు పెడతారా?!) అని మనిషి అంటాడు (సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్). ఈ ఉల్లేఖనంలోనే ఇంకా ఇలా అనబడింది : "నేను నా ఆత్మ ఇచ్చే సాక్ష్యాన్ని తప్ప మరెవరి సాక్ష్యాన్ని కూడా ఒప్పుకోను" అంటాడు మనిషి. అప్పుడు అల్లాహ్, "ఏమిటి? నేను, నా దూతలైన కిరామన్ కాతిబీన్‌లు సాక్ష్యంగా సరిపోమా?" అనంటాడు. ఆ

**23** "మీ ప్రభువు గురించి మీరు చేసిన ఈ దురాలోచనే మిమ్మల్ని సర్వనాశనం చేసింది.[38] చివరకు మీరు ఘోర నష్టానికి గురయ్యారు."

وَذٰلِكُمْ ظَنُّكُمُ الَّذِىْ ظَنَنْتُمْ بِرَبِّكُمْ اَرْدٰىكُمْ فَاَصْبَحْتُمْ مِّنَ الْخٰسِرِيْنَ ﴿23﴾

**24** ఈ స్థితిలో వీరు ఓర్పు వహించినా (వహించకపోయినా), నరకాగ్నే వారి నివాసం. ఒకవేళ వారు క్షమాభిక్ష కోసం అర్థించినా క్షమించబడరు.[39]

فَاِنْ يَّصْبِرُوْا فَالنَّارُ مَثْوًى لَّهُمْ ۚ وَاِنْ يَّسْتَعْتِبُوْا فَمَا هُمْ مِّنَ الْمُعْتَبِيْنَ ﴿24﴾

**25** మేము వారి వెంట కొందరు సహవాసులను నియమించాము. వారేమో వీరికి ముందూ వెనుకా ఉన్న వీరి కర్మలను అందమైనవిగా కనిపించేలా చేశారు.[40] వీరికి పూర్వం గతించిన జిన్నాతుల, మానవ జాతుల విషయంలో ఖరారైన అల్లాహ్ వాక్కే వీరి విషయంలో కూడా జరిగింది. నిశ్చయంగా వీరు నష్ట పోయిన వారయ్యారు.

وَقَيَّضْنَا لَهُمْ قُرَنَآءَ فَزَيَّنُوْا لَهُمْ مَّا بَيْنَ اَيْدِيْهِمْ وَمَا خَلْفَهُمْ وَحَقَّ عَلَيْهِمُ الْقَوْلُ فِىْٓ اُمَمٍ قَدْ خَلَتْ مِنْ قَبْلِهِمْ مِّنَ الْجِنِّ وَالْاِنْسِ ۚ اِنَّهُمْ كَانُوْا خٰسِرِيْنَ ﴿25﴾

---

తరువాత అతని నోటికి తాళం వేయబడుతుంది. ఆ తరువాత అతని శరీరావయవాలకు మాట్లాడే అనుమతి ఇవ్వబడుతుంది.

36. అంటే – మీరు పాపకార్యాలకు పాల్పడుతూ జనుల కంట పడకుండా జాగ్రత్తపడేవారు. కాని మీ శరీరావయవాలు మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయన్న భయమే మీకు బొత్తిగా ఉండేది కాదు. పరలోక దినంపై విశ్వాసం లేని కారణంగానే మీరీ విధంగా బరితెగించిపోయారు.

37. మీ ప్రభువు విషయంలో మీ ఆలోచనలు సవ్యమైన దిశలో సాగి ఉంటే ఈ దురవస్థ దాపురించేదే కాదు.

38. మీ దురాగతాలలో చాలా వాటి గురించి అల్లాహ్‌కు తెలిసి ఉండదన్న మీ తప్పుడు అంచనాలే మీ కొంపముంచాయి. ఈ తప్పుడు అంచనాలే మిమ్మల్ని నిర్భయుల్ని చేశాయి. పెద్ద పెద్ద పాపాలు చేస్తూ కూడా మీరు దైవానికి భయ పడలేదు. ఈ ఆయతుల అవతరణ వెనుక ఒక సంఘటన జరిగింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం కాబా గృహం వద్ద కురైష్, సఖీఫ్ తెగలకు చెందిన ముగ్గురు వ్యక్తులు సమావేశమయ్యారు. వారు భారీ మనుషులే. కాని బుద్ధి తక్కువ. వారిలో ఒకడు "అల్లాహ్ మా మాటల్ని వింటాడంటావా?" అనన్నాడు. "బిగ్గరగా మాట్లాడుకున్నవి వింటాడు. నెమ్మదిగా చెప్పుకున్నవి వినలేడు" అని రెండవ వాడన్నాడు. "అతడు మేము బిగ్గరగా చెప్పుకున్నవి వినగలిగినప్పుడు మెల్లగా చెప్పుకున్నవి కూడా తప్పకుండా వింటాడ"ని ఇంకొకడు అభిప్రాయపడ్డాడు. అప్పుడు ఈ సూరాలోని 22వ ఆయతు అవతరించింది (సహీహ్ బుఖారీ – హామీమ్ సజ్దహ్ సూరా వ్యాఖ్యానం).

39. ఈ ఆయతుకు మరో భావానువాదం ఈ విధంగా చేయబడింది : "వారు దైవానికి ఎలాగో సర్దిచెప్పి స్వర్గానికి పోవటానికి ప్రయత్నించినా వారి ప్రయత్నం ఫలించదు" (ఐసరుత్తఫాసీర్, ఫత్‌హుల్ ఖదీర్). ఇంకొక భావానువాదం ప్రకారం: వారు ప్రపంచానికి మరోసారి పంపించమని ప్రాధేయపడతారు. కాని వారి కోరిక ఆమోదించబడదు (ఇబ్నె జరీర్ తబ్రీ). అంటే, వారు తమ శాశ్వత నివాస స్థలమైన నరకానికి ఆహుతి అవుతారు. ఈ యాతనపై వారు ఓపిక పట్టినా ఫలితం శూన్యమే. (ఇహలోక జీవితంలో ఓర్పు వహించే జనులపై ఒక్కోసారి జాలి కలుగుతుంది. కాని పరలోకంలో దానికి ఆస్కారమే ఉండదు). ఏదో ఒకవిధంగా వారు దాన్నుండి బయటపడే ప్రయత్నం చేసినా సఫలీకృతులు కాలేరు.

40. అంటే **'మిథ్య'** కోసం ఉవ్విళ్ళూరే వారి వెనుక తగిలివుండే షైతానులన్నమాట!వారు జిన్నుల్లోనివారే గాకుండా,

| | |
|---|---|
| **26** అవిశ్వాసులు ఇలా అన్నారు: "ఈ ఖుర్ఆన్‌ను అస్సలు విన కండి.[41] (అది పఠించబడినప్పుడు) గోల (గలాటా) చేయండి.[42] బహుశా (అలాగైనా) మీది పైచేయి కావచ్చు."[43] | وَقَالَ الَّذِيْنَ كَفَرُوْا لَا تَسْمَعُوْا لِهٰذَا الْقُرْاٰنِ وَالْغَوْا فِيْهِ لَعَلَّكُمْ تَغْلِبُوْنَ ﴿26﴾ |
| **27** కాబట్టి మేము తప్పకుండా ఈ అవిశ్వాసులకు చాలా కఠినమైన శిక్ష రుచి చూపిస్తాము. వారు చేస్తూ ఉండిన పరమ దుష్కార్యాలకు తగిన ప్రతిఫలాన్ని తప్పకుండా ఇస్తాము.[44] | فَلَنُذِيْقَنَّ الَّذِيْنَ كَفَرُوْا عَذَابًا شَدِيْدًا وَّلَنَجْزِيَنَّهُمْ اَسْوَاَ الَّذِيْ كَانُوْا يَعْمَلُوْنَ ﴿27﴾ |
| **28** అల్లాహ్ విరోధులకు శిక్ష(గా లభించవలసింది) ఈ నరకాగ్నే. అందులో వారి శాశ్వత నివాస గృహం ఉంటుంది. మా ఆయతు లను త్రోసిపుచ్చినందుకు (వారికి లభించిన) ప్రతిఫలం ఇది.[45] | ذٰلِكَ جَزَآءُ اَعْدَآءِ اللّٰهِ النَّارُ ۚ لَهُمْ فِيْهَا دَارُ الْخُلْدِ ۗ جَزَآءًۢ بِمَا كَانُوْا بِاٰيٰتِنَا يَجْحَدُوْنَ ﴿28﴾ |
| **29** (అప్పుడు) అవిశ్వాసులు, "మా ప్రభూ! మమ్మల్ని పెడదారి పట్టించిన జిన్నులను, మనుషులను కాస్త చూపించు.[46] వాళ్ళను మేము మా పాదాల క్రింద వేసి, (నరకంలో) అట్టడుగు స్థానానికి పోయేలా తొక్కి వేస్తాము"[47] అని విన్నవించుకుంటారు. | وَقَالَ الَّذِيْنَ كَفَرُوْا رَبَّنَآ اَرِنَا الَّذَيْنِ اَضَلّٰنَا مِنَ الْجِنِّ وَالْاِنْسِ نَجْعَلْهُمَا تَحْتَ اَقْدَامِنَا لِيَكُوْنَا مِنَ الْاَسْفَلِيْنَ ﴿29﴾ |

మానవ వర్గాల్లో నుంచి కూడా ఉండేవారు. వారు చేసే ఘోరకృత్యాలను చాలా అందమైనవిగా, సముచితమైనవిగా, మనోహరమైనవిగా చేసి చూపేవారు. ఆ విధంగా వారు మార్గవిహీనత అనే ఊబిలో కూరుకుపోయారు. మృత్యువు ఒడిలోకి జారుకునేదాకా వారు ఆ ఊబిలో నుంచి బయటపడలేకపోయారు. ఆ విధంగా వారు శాశ్విత నష్టానికి గురయ్యారు.

41. అవిశ్వాసులు ఒండొకరితో చెప్పుకున్న మాటలివి. కొంతమంది అనువాదకులు **'లా తస్‌మవూ'** (لَا تَسْمَعُوْا) అనే పదాన్ని, 'అతనికి విధేయత చూపకండి' అన్న భావంలో తీసుకున్నారు.

42. అంటే చాలా బిగ్గరగా మాట్లాడండి. అరవండి. చప్పట్లు చరచండి, ఈలలు వేయండి. అలా చేయటం వల్ల శ్రోతలకు ఖుర్ఆన్ సరిగ్గా వినబడదు. తద్వారా జనులు ఖుర్ఆన్ పట్ల ప్రభావితులు కాకుండా ఉంటారు. ఈ ప్రయత్నం గనక ఫలించిందంటే మీరు గెలిచినట్లే.

43. అంటే – మీరు ప్రతి చోటా ఇలాంటి అడ్డంకులు సృష్టించారంటే, ముహమ్మద్ (స) ప్రజలకు ఖుర్ఆన్‌ను వినిపించే పనిని మానుకోవచ్చు.

44. అంటే – వారి ఆంతర్యాలలో తిష్ఠవేసి ఉన్న అవిశ్వాసం (కుఫ్ర్) కారణంగా వారు చేసే కొన్ని మంచిపనులు కూడా నిష్ఫలం అయిపోతాయి. ఉదాహరణకు : అతిథిమర్యాద, బంధువుల హక్కు ఇవ్వటం, బాటసారుల హక్కు చెల్లించటం లాంటివి నిస్సందేహంగా సత్కార్యాలే. కాని ఈమాన్ భాగ్యానికి దూరమైన కారణంగా వారి సత్కార్యాలు పనికిరాకుండా పోతాయి. కాగా; వారి దుష్కార్యాలకు శిక్ష మాత్రం తప్పకుండా పడుతుంది. దివ్య ఖుర్ఆన్ పఠనాన్ని అడ్డుకునే దుష్కార్యం కూడా వాటిలో ఒకటి.

45. **'ఆయతులు'** (సూచనలు) అంటే దేవుడు తన ప్రవక్తలపై అవతరింపజేసిన కొన్ని స్పష్టమైన నిదర్శనాలు లేక వారికి ప్రసాదించబడిన మహిమలు లేక జగతిలో సర్వవ్యాప్తమైవున్న అసంఖ్యాకమైన సూచనలు అని భావం. కాని అవిశ్వాసులు వాటన్నింటినీ చూసి కూడా పట్టించుకోవటం లేదు. అందువల్ల వారు విశ్వాస భాగ్యానికి నోచుకోలేకపోయారు.

46. దీన్నిబట్టి బోధపడే ఒక ముఖ్య విషయం ఏమిటంటే ప్రజలను పెడదారి పట్టించేవారిలో కేవలం షైతానులు జిన్నులే

30 "మా ప్రభువు అల్లాహ్ మాత్రమే "[48] అని పలికి, దానిపై స్థిరంగా ఉన్న[49] వారి వద్దకు దైవదూతలు దిగివచ్చి,[50] (ఇలా అంటూ ఉంటారు): "మీరు భయపడకండి. దుఃఖించకండి.[51] మీకు వాగ్దానం చేయబడిన స్వర్గలోకపు శుభవార్తను అందు కోండి.[52]

إِنَّ ٱلَّذِينَ قَالُوا۟ رَبُّنَا ٱللَّهُ ثُمَّ ٱسْتَقَٰمُوا۟ تَتَنَزَّلُ عَلَيْهِمُ ٱلْمَلَٰٓئِكَةُ أَلَّا تَخَافُوا۟ وَلَا تَحْزَنُوا۟ وَأَبْشِرُوا۟ بِٱلْجَنَّةِ ٱلَّتِى كُنتُمْ تُوعَدُونَ ﴿٣٠﴾

కారు, మనుషులు కూడా ఉన్నారు. పైశాచిక ఆలోచనలకు ప్రభావితులైన జనులను వారు అపమార్గం పట్టిస్తూ ఉంటారు. మరికొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం ఇక్కడ 'జిన్ను' అంటే ఇబ్లీస్ అని భావం. 'మనిషి' అంటే ఖాబీల్ అని అర్థం. ఎందుకంటే మానవ సముదాయంలో అందరికన్నా ముందు దౌర్జన్యానికి దిగి, తన సోదరుడైన హాబీల్‌ను చంపినది ఇతనే. కాబట్టి హదీసు ప్రకారం ప్రళయదినం వరకూ అన్యాయంగా జరిగే హత్యల పాపంలోని ఒక భాగం ఖాబీల్ ఖాతాలోకి పోతూ ఉంటుంది. ఈ రెండు అభిప్రాయాలలో మేము మటుకు మొదటి అభిప్రాయం వైపునకే మొగ్గుతున్నాము.

47. అంటే, మేము కసితీరా వాళ్లను మా పాదాలతో తొక్కి అవమానపరుస్తాము. నరకవాసులకు తమ నాయకమన్యులపై వచ్చే కోపానికి ఇదొక తార్కాణం మాత్రమే. వాస్తవానికి చూడబోతే ఉభయవర్గాల వారూ నేరస్థులే. ఉభయులూ సమానంగా నరకయాతనను అనుభవించేవారే. ఆ మాటే అల్లాహ్ మరోచోట ఈ విధంగా సెలవిచ్చాడు : "ప్రతి ఒక్కరికీ రెట్టింపు శిక్షే పడుతుంది. కాని అది మీకు తెలియదు." (అల్ ఆరాఫ్ – 38). నరకవాసుల దురవస్థను గురించి చెప్పిన తరువాత అల్లాహ్ ఇక్కణ్ణుంచి స్వర్గవాసుల అనుగ్రహాలను గురించి ప్రస్తావిస్తున్నాడు. సాధారణంగా దివ్య ఖుర్ఆన్‌లో ఇలాగే ఒకరి తరువాత – వారికి భిన్నంగా వ్యవహరించే ఇంకొకరి ప్రస్తావన పునరావృతం అవుతూ ఉంటుంది. పదే పదే హెచ్చరించటంతోపాటు, సంతోష వార్తలు కూడా ప్రజలకు ఇస్తూ ఉండాలన్నదే దీని ఉద్దేశం.

48. అంటే ఆ అల్లాహ్ ఒకే ఒక్క దేవుడు, సాటిలేనివాడు, ఆయన ప్రభువు, పాలకుడు, పోషకుడు. ఆరాధ్యుడు కూడా ఆయనే. ఒక వైపున ఆయన ప్రభుత్వాన్ని ఒప్పుకుంటూ, మరోవైపు ఆయన దైవత్వంలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించటం తగని పని.

49. అంటే గడ్డు పరిస్థితుల్లో కూడా విశ్వాసులు తమ విశ్వాసం (ఈమాన్)పై, ఏకదైవారాధన (తౌహీద్)పై నిలబడి ఉండాలి. ఎట్టి పరిస్థితిలోనూ అటూ ఇటూ మొగ్గకూడదు. విముఖత చూపకూడదు. కొంతమంది ఇక్కడ 'స్థిరత్వం' అనే పదాన్ని చిత్తశుద్ధి, నిజాయితీ అన్న అర్థాల్లో తీసుకున్నారు. అంటే ఒక్కడైన అల్లాహ్ విధేయతకే కట్టుబడి ఉండాలి. ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా (స)! నాకేదైనా సమగ్రమైన విషయం బోధించండి. ఆ తరువాత నేను ఎవరినీ ఏమీ అడిగే అవసరం రాకూడదు' అని అభ్యర్థించాడు. దానికి ఆయన (స) "నేను అల్లాహ్‌ను విశ్వసించాను అని చెప్పు. ఆ తరువాత ఆ మాటపై గట్టిగా నిలబడు" అని ప్రబోధించారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

50. అంటే మరణ సమయంలో దైవదూతలు వారికి ఈ శుభవార్త వినిపిస్తారు. మరి కొంతమంది ప్రకారం మూడు సమయాల్లో దైవదూతలు ఈ శుభవార్తను వినిపిస్తారు – 1. మరణం ఆసన్నమైనపుడు 2. సమాధిలో 3. సమాధి నుంచి తిరిగి లేపబడినపుడు.

51. అంటే పరలోకంలో ఎదురు కానున్న పరిస్థితులను తలచుకొని భయపడండి. ప్రపంచంలో మీరు వదలి వచ్చిన సిరిసంపదలను, సంతానాన్ని గురించి ఖేదపడకండి.

52. ప్రపంచంలో మీకు చేయబడిన స్వర్గం యొక్క శుభవార్తపై ఆనందించండి.

**31** "ప్రాపంచిక జీవితంలో కూడా మేము మీ నేస్తాలుగా ఉంటూ వచ్చాము. పరలోకంలో కూడా ఉంటాము.[53] మీ మనసు కోరినదల్లా, మీరు అడిగినదల్లా అందులో మీకు లభిస్తుంది.

نَحْنُ أَوْلِيَاؤُكُمْ فِي الْحَيَاةِ الدُّنْيَا وَفِي الْآخِرَةِ ۖ
وَلَكُمْ فِيهَا مَا تَشْتَهِي أَنْفُسُكُمْ وَلَكُمْ فِيهَا
مَا تَدَّعُونَ (31)

**32** "క్షమాశీలి, దయాశీలి (అయిన అల్లాహ్) తరఫున లభించే ఆతిథ్యమిది."

نُزُلًا مِنْ غَفُورٍ رَحِيمٍ (32)

**33** అల్లాహ్ వైపు (జనులను) పిలుస్తూ, సత్కార్యాలు చేస్తూ 'నేను విధేయుల (ముస్లింల)లో ఒకడను'[54] అని పలికేవాని మాటకంటే మంచిమాట మరెవరిది కాగలదు?

وَمَنْ أَحْسَنُ قَوْلًا مِمَّنْ دَعَا إِلَى اللَّهِ وَعَمِلَ
صَالِحًا وَقَالَ إِنَّنِي مِنَ الْمُسْلِمِينَ (33)

**34** మంచీ – చెడు (ఎట్టి పరిస్థితిలోనూ) సమానం కాలేవు.[55] (ఓ ప్రవక్తా!) చెడును మంచి ద్వారా తొలగించు. ఆ తరువాత (నువ్వే చూద్దువుగాని), నీకూ– తనకూ మధ్య బద్ధవిరోధం ఉన్న అతను సైతం నీకు ప్రాణస్నేహితుడైపోతాడు.[56]

وَلَا تَسْتَوِي الْحَسَنَةُ وَلَا السَّيِّئَةُ ۚ ادْفَعْ بِالَّتِي
هِيَ أَحْسَنُ فَإِذَا الَّذِي بَيْنَكَ وَبَيْنَهُ عَدَاوَةٌ
كَأَنَّهُ وَلِيٌّ حَمِيمٌ (34)

**35** అయితే ఈ భాగ్యం సహనశీలురకు మాత్రమే ప్రాప్తిస్తుంది.[57] దీన్ని గొప్ప అదృష్టవంతులు మాత్రమే పొందగలుగుతారు.[58]

وَمَا يُلَقَّاهَا إِلَّا الَّذِينَ صَبَرُوا وَمَا يُلَقَّاهَا
إِلَّا ذُو حَظٍّ عَظِيمٍ (35)

**36** ఒకవేళ (ఏ సమయంలోనయినా) షైతాను తరఫున నీకు ఏదయినా దుష్ప్రేరణ కలిగితే అల్లాహ్ శరణు వేడుకో.[59] నిస్సందేహంగా ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.[60]

وَإِمَّا يَنْزَغَنَّكَ مِنَ الشَّيْطَانِ نَزْغٌ فَاسْتَعِذْ
بِاللَّهِ ۖ إِنَّهُ هُوَ السَّمِيعُ الْعَلِيمُ (36)

---

53. ఇది మరొక భరోసా అన్నమాట! ఇవి అల్లాహ్ పలుకులు. మరికొందరి అభిప్రాయం ప్రకారం ఇవి కూడా దైవదూతల పలుకులే. ఎవరు పలికినా మొత్తానికి అవి విశ్వాసుల పాలిట శుభవార్తలే కదా!

54. అంటే జనులను అల్లాహ్ వైపునకు ఆహ్వానించటంతో పాటు తాను స్వయంగా ఆ మార్గాన నడవాలి. ధర్మానికి కట్టుబడి ఉండాలి. దైవాజ్ఞలను పాలించేవాడై ఉండాలి.

55. పైగా ఆ రెంటికీ మధ్య చాలా పెద్ద వ్యత్యాసం ఉంది.

56. దుర్మార్గాన్ని, చెడును మంచితనం ద్వారా ఎదుర్కోవటం అనేది చాలా గొప్ప విషయం. అది ఉత్తమ నైతికతకు ప్రతీక. అంటే – అపకారాన్ని ఉపకారం ద్వారా పారద్రోలటం, కీడును మేలు ద్వారా త్రుంచటం, దౌర్జన్యాన్ని మన్నింపుల వైఖరి ద్వారా నిర్మూలించటం, ఆగ్రహాన్ని నిగ్రహంతో ఆపటం, అసభ్యకరమైన విషయాలను హుందాగా దాటవేయటం, అవాంఛనీయ విషయాలను ఓపికతో ఎదుర్కోవటం – నిస్సందేహంగా సాహసోపేతమైన కార్యాలు. వీటిమూలంగా శత్రువే మిత్రుడవుతాడు. మీపట్ల అంటీఅంటనట్లుగా ఉండేవాడు మీకు చాలా సన్నిహితుడై పోతాడు. ప్రాణాలు తీయ జూసినవాడే ప్రాణస్నేహితుడుగా మారిపోతాడు.

57. చెడును మంచి ద్వారా తొలగించే పని మంచి ఫలితాలనిస్తుందన్నది నిజమే. కాని ఈ పనిని అందరూ చేయలేరు. దానికోసం గుండె దిటవు అవసరం. సహనస్థైర్యాలు అవసరం. కోపాన్ని దిగమ్రింగే గుణం అవసరం. అలాంటి సహనమూర్తులకే ఈ భాగ్యం లభిస్తుంది.

**37** రేయింబవళ్లూ, సూర్యచంద్రులు కూడా ఆయన (శక్తి) సూచనలలోనివే.[61] మీరు సూర్యునికిగానీ, చంద్రునికిగానీ సాష్టాంగప్రణామం (సజ్దా) చేయకండి.[62] నిజంగా మీరు అల్లాహ్ దాస్యం చేసేవారే అయితే వీటన్నింటినీ సృష్టించిన అల్లాహ్ ముందు సాష్టాంగపడండి.[63]

وَمِنْ آيَاتِهِ اللَّيْلُ وَالنَّهَارُ وَالشَّمْسُ وَالْقَمَرُ ۚ
لَا تَسْجُدُوا لِلشَّمْسِ وَلَا لِلْقَمَرِ وَاسْجُدُوا لِلَّهِ
الَّذِي خَلَقَهُنَّ إِن كُنتُمْ إِيَّاهُ تَعْبُدُونَ ﴿37﴾

**38** అయినప్పటికీ వారు గనక అహంకారంతో హఠం చేస్తే (చేయనివ్వు) నీ ప్రభువు దగ్గర ఉన్నవారు (దైవదూతలు) అహో రాత్రులు ఆయన పవిత్రతను కొనియాడుతున్నారు. (ఈ పనిలో ఎన్నటికీ) వారు విసిగిపోరు.

فَإِنِ اسْتَكْبَرُوا فَالَّذِينَ عِندَ رَبِّكَ يُسَبِّحُونَ
لَهُ بِاللَّيْلِ وَالنَّهَارِ وَهُمْ لَا يَسْأَمُونَ ۩ ﴿38﴾

**39** ఆయన శక్తిసూచనలలో మరొకటేమిటంటే నేల అణగి మణగి ఉండటాన్ని నువ్వు చూస్తావు.[64] మరి దానిపై మేము వర్షం కురిపించగానే అది చిగురిస్తూ, ఉబికి వస్తుంది.[65] ఈ నేలను

وَمِنْ آيَاتِهِ أَنَّكَ تَرَى الْأَرْضَ خَاشِعَةً فَإِذَا
أَنزَلْنَا عَلَيْهَا الْمَاءَ اهْتَزَّتْ وَرَبَتْ ۚ إِنَّ الَّذِي

58. **'హజ్జిన్ అజీమ్'** (حَظٍّ عَظِيمٍ) అంటే మహాభాగ్యం, గొప్ప అదృష్టం అని భావం. అంటే 'స్వర్గం' అన్నమాట. పై సుగుణాలు అలవడిన వారు నిజంగానే భాగ్యవంతులు. వారికోసం స్వర్గం రాసిపెట్టి ఉంది.

59. అంటే; షైతాన్ మిమ్మల్ని ధర్మమార్గం నుంచి తప్పించజూసినా, మంచితనంతో దుర్మార్గాన్ని నిర్మూలించే ప్రయత్నంలో అడ్డుతగిలినా మీరు ఆ శాపగ్రస్తుని కీడు నుంచి సురక్షితంగా ఉండేందుకు అల్లాహ్ శరణుకోరాలి.

60. సర్వాన్ని గమనించేవాడు, సర్వం వినేవాడు మాత్రమే తన శరణుకోరే వారికి రక్షణ ఇవ్వగలుగుతాడు. ఇక దీని తరువాత దేవుని ఏకత్వాన్ని, ఆయన పరిపూర్ణ ఆధిపత్యాన్ని చాటిచెప్పే సూచనలు ప్రస్తావించబడ్డాయి.

61. ప్రజలు విశ్రాంతి తీసుకోవటానికి అనువుగా ఉండేలా రాత్రిని చీకటిమయంగా చేయటం, ఉపాధి సముపార్జనలో ఇబ్బంది కలగకుండా ఉండటానికి పగటిని ఉజ్వలంగా చేయటం, మరి ఆ పగలు, రేయి ఒకదాని తరువాత ఒకటి రావటం, కొంతకాలం రేయి పెద్దదిగా ఉంటే, మరికొంత కాలం పగలు పెద్దదిగా ఉండటం, అలాగే సూర్యచంద్రులు తమ తమ కక్ష్యల్లో ఉండి యధావిధిగా పనిచేస్తూ ఉండటం, అవి పరస్పరం ఘర్షణ పడకుండా సాగిపోవటం – ***ఇదంతా సూచించేదేమిటి? వీటి వెనుక ఓ గొప్ప ప్రణాళికా రచయిత ఉన్నాడు.*** ఆయనే ఇదంతా సక్రమంగా – తన వ్యూహరచన ప్రకారం – నడుపుతున్నాడు. ఆయన సాటిలేనివాడు. ఈ విశ్వవ్యవస్థలో ఆయన అధికారమే తిరుగులేనిది. ఈ సార్వభౌమాధికారం ఒక్కడైన ఆయన చేతిలో గాకుండా అనేకమంది చేతుల్లో గనక ఉంటే ఈ వ్యవస్థ ఇంత పకడ్బందీగా, సాఫీగా సాగేదికాదు.

62. ఎందుకంటే అవి కూడా మీలాగే ఒకరిచేత సృష్టించబడినవే. అంతేగాని అవి సృష్టికర్తలు కావు. ఈ సృష్టి ప్రక్రియలో ఎవరూ దైవానికి సహవర్తులు కారు.

63. వీటన్నింటినీ, అంటే ఈ ఆయతులో పేర్కొనబడిన నాలుగింటినీ (రేయి, పగలు, సూర్యుడు, చంద్రుడు) సృష్టించినవాడు అల్లాహ్ యే. కనుక మీరు అల్లాహ్ కే 'సజ్దా' చేయండి.

64. ఇక్కడ **'ఖాషిఅతన్'** (خَاشِعَةً) అంటే ఎండిపోయిన, బీటలు వారిన, దుర్భిక్షానికి నిదర్శనంగా తయారైన నేల అని భావం. ఇలాంటి నేలలో జీవం ఉండదు.

65. అంటే రకరకాల మొక్కల్ని మొలకెత్తిస్తుంది. రుచికరమైన పండ్లు ఫలాలను, కాయగూరలను, ఆహారధాన్యాలను ఉత్పత్తి చేస్తుంది.

اَحْيَاهَا لَمُحْيِ الْمَوْتٰى ۭ اِنَّهٗ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ۝39

బ్రతికించినవాడే నిస్సందేహంగా మృతులను కూడా బ్రతికిస్తాడు.[66] నిశ్చయంగా ఆయన ప్రతిదీ చేయగల అధికారం గలవాడు.

اِنَّ الَّذِيْنَ يُلْحِدُوْنَ فِيْٓ اٰيٰتِنَا لَا يَخْفَوْنَ عَلَيْنَا ۭ اَفَمَنْ يُّلْقٰى فِي النَّارِ خَيْرٌ اَمْ مَّنْ يَّاْتِيْٓ اٰمِنًا يَّوْمَ الْقِيٰمَةِ ۭ اِعْمَلُوْا مَا شِئْتُمْ ۙ اِنَّهٗ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ۝40

**40** మా వాక్యాల విషయంలో వక్ర వైఖరిని అవలంబిస్తున్న[67] వారు మా దృష్టిలో లేకుండా లేరు.[68] (చెప్పండి!) అగ్నిలో పడవేయబడేవాడు మేలా? లేక ప్రళయ దినాన సురక్షితంగా (ప్రశాంత స్థితిలో) వచ్చేవాడు మేలా?[69] మీరు ఇష్టం వచ్చింది చేసుకుంటూ పోండి.[70] ఆయన మీరు చేసే పనులన్నిటినీ చూస్తూనే ఉన్నాడు.

اِنَّ الَّذِيْنَ كَفَرُوْا بِالذِّكْرِ لَمَّا جَاۗءَهُمْ ۚ وَاِنَّهٗ لَكِتٰبٌ عَزِيْزٌ ۝41

**41** తమ వద్దకు హితోపదేశం (ఖుర్‌ఆన్) వచ్చేసినప్పటికీ, దాన్ని త్రోసిపుచ్చిన వారు (కూడా మా నుండి దాగి లేరు).[71] అదొక ప్రతిష్ఠాత్మకమైన గ్రంథం.[72]

لَّا يَاْتِيْهِ الْبَاطِلُ مِنْۢ بَيْنِ يَدَيْهِ وَلَا مِنْ خَلْفِهٖ ۭ تَنْزِيْلٌ مِّنْ حَكِيْمٍ حَمِيْدٍ ۝42

**42** అసత్యం దాని దరిదాపుల్లోకి కూడా–దాని ముందునుండిగానీ, దాని వెనుక నుండిగానీ – రాజాలదు. (ఎందుకంటే) అది మహా వివేకవంతుడు, ప్రశంసనీయుడైన అల్లాహ్ తరఫున అవతరింపజేయబడినది.[73]

66. ఆలోచించే వారికొరకు ఇందులో గొప్ప సూచన ఉంది. తన కారుణ్య జల్లు ద్వారా మృతభూమిని బ్రతికించగలిగిన దేవుడు మృతులను కూడా బ్రతికించి తీర్తాడు.
67. అంటే – వారు మా వాక్యాలను ఒప్పుకోరు సరికదా వాటిపట్ల విముఖత చూపుతారు. వాటిని త్రోసిరాజంటారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) **'ఇల్‌హాద్'** అన్న పదాన్ని వివరిస్తూ, ఇల్‌హాద్ అంటే విషయాన్ని దాని సందర్భం నుంచి తప్పించి వివరించటం అని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే తమ తప్పుడు విశ్వాసాలను, మిథ్యా వాదాలను నిజమైనవిగా రూఢీ చేసుకోవటానికి ఖుర్‌ఆన్ వాక్యాలకు వక్రభాష్యం చెప్పేవారు కూడా ఇందులో చేరి ఉన్నారు.
68. ఈ మిథ్యావాదులు, నాస్తిక వాదులు ఎలాంటివారైనా వారి పాలిట ఈ వాక్యం తీవ్రమైన హెచ్చరిక వంటిది.
69. వీరిద్దరూ సమానులవుతారా? ముమ్మాటికీ కాలేరు. పైగా ఇలాంటి వక్రబుద్ధి గలవారు అగ్నికి ఆహుతి అవుతారని సంకేతప్రాయంగా చెప్పేయబడింది. కాగా; విశ్వాసులు తీర్పుదినాన నిశ్చింతగా హాజరవుతారని కూడా చెప్పబడింది.
70. **'మీకు ఇష్టమొచ్చింది చేసుకుంటూపోండి'** అంటే వాస్తవానికి అలా చేయమని దాని భావం కాదు. అలా చేశారంటే మూడుతుంది జాగ్రత్త! అని హెచ్చరించటం దాని ఉద్దేశం.
71. అంటే, వారికి వారి తిరస్కార వైఖరికిగాను శిక్షపడటం ఖాయం. మేము వాళ్ళను కనిపెట్టుకునే ఉన్నాము అని అర్థం.
72. అంటే – మీరు విముఖత చూపుతున్న, పరిహాసం చేస్తున్న ఈ గ్రంథం మామూలు గ్రంథం కాదు. ఇది ఎంతో ఉన్నతమైనది, శక్తిమంతమైనది, దోషాలన్నింటికీ అతీతమైనది, పవిత్రమైనది.
73. ఈ గ్రంథం అన్ని విధాలుగా సురక్షితంగా ఉన్నది. అందులో ఎలాంటి హెచ్చుతగ్గులు గానీ, వ్యర్థమైన విషయాలుగానీ

**43** (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం గతించిన ప్రవక్తలతో చెప్పబడినదే నీకూ చెప్పబడుతోంది.[74] నిశ్చయంగా నీ ప్రభువు క్షమ కల వాడు,[75] వ్యధాభరితంగా శిక్షించేవాడు కూడా.[76]

مَا يُقَالُ لَكَ إِلَّا مَا قَدْ قِيلَ لِلرُّسُلِ مِن قَبْلِكَ ۚ إِنَّ رَبَّكَ لَذُو مَغْفِرَةٍ وَذُو عِقَابٍ أَلِيمٍ ﴿٤٣﴾

**44** ఒకవేళ మేము ఈ ఖుర్ఆను (గ్రంథము)ను అరబ్బీయేతర ఖుర్ఆన్‌గా చేసివుంటే,[77] "దీని వాక్యాలు స్పష్టంగా ఎందుకు వివరించబడలేదు?[78] (ఇదేమిటయ్యా!) ఇదేమో అరబ్బీయేతర గ్రంథమూను, నువ్వేమో అరబీ ప్రవక్తవా!"[79] అని వారు చెప్పి ఉండేవారు. (ఓ ప్రవక్తా!) నువ్వు వారికి చెప్పేయి: "ఇది విశ్వసించిన వారికోసం మార్గదర్శిని, ఆరోగ్య ప్రదాయిని. కాని విశ్వసించని వారి చెవులలో మాత్రం బరువు (చెవుడు) ఉంది. పైగా ఇది వారి పాలిట అంధత్వంగా పరిణమించింది. వారు బహు దూరపు చోటు నుంచి పిలువబడే జనుల్లా ఉన్నారు."[80]

وَلَوْ جَعَلْنَاهُ قُرْآنًا أَعْجَمِيًّا لَّقَالُوا لَوْلَا فُصِّلَتْ آيَاتُهُ ۖ أَأَعْجَمِيٌّ وَعَرَبِيٌّ ۗ قُلْ هُوَ لِلَّذِينَ آمَنُوا هُدًى وَشِفَاءٌ ۖ وَالَّذِينَ لَا يُؤْمِنُونَ فِي آذَانِهِمْ وَقْرٌ وَهُوَ عَلَيْهِمْ عَمًى ۚ أُولَٰئِكَ يُنَادَوْنَ مِن مَّكَانٍ بَعِيدٍ ﴿٤٤﴾

లేవు. అసత్యం (మిథ్య) అందులోకి జొరబడి, అందులో ప్రక్షిప్తాలు చేయజాలదు. ఎందుకంటే ఈ గ్రంథరాజం మహావివేకి, సర్వస్తోత్రాలకు అర్హుడైన వాని తరఫున పంపబడింది. ఆయన చేయమని ఆజ్ఞాపించే పనులు, చేయరాదని తాకీదు చేసే విషయాలు కుడిఎడమల అపవాదాలకు అతీతమైనవి, ఉత్తమమైనవి (ఇబ్నె కసీర్).

74. పూర్వం గడచిన ప్రవక్తలను ఆయా జాతులవారు మాంత్రికులనీ, పిచ్చివారనీ, అసత్యవాదులని నిందించేవారు. ఇప్పుడు మక్కా అవిశ్వాసులు కూడా నిన్ను (ఓ ముహమ్మద్!) అదేవిధంగా ఆరోపిస్తున్నారు. ఇది కొత్తేమీ కాదు. మా ప్రవక్తలంతా ఇలాంటి నిందలను ఎదుర్కోవలసి వచ్చింది. కనుక నువ్వు వీళ్ల మాటలకు కృంగిపోకు అని ఈ వాక్యంలో పరమ ప్రభువు తన అంతిమ ప్రవక్త (స)ను ఓదార్చాడు. "వీరికి పూర్వం గతించినవారు, తమ వద్దకు ఏ ప్రవక్త వచ్చినా, ఇతగాడు మాంత్రికుడైనా అయి ఉంటాడు లేదంటే పిచ్చివాడైనా అయి ఉంటాడు' అని అన్నారు. ఏమిటి, వీళ్లు ఈ మేరకు ఒండొకరికి తాకీదు చేసుకున్నారా? అది కాదు, వాళ్లసలు బరితెగించి పోయారు" (అజ్జారియాత్ – 52, 53).

ఈ ఆయతుకు మరో భావం ఇది కూడా కావచ్చు : ఓ ముహమ్మద్ (సఅసం)! ఏకదైవారాధనకు సంబంధించి లోగడ మా ప్రవక్తలకు ఏ విషయాలైతే సూచించబడ్డాయో అవే నీకూ ఇవ్వబడుతున్నాయి. ఎందుకంటే ధర్మశాస్త్రాలన్నీ (షరీయతులన్నీ) ఈ విషయాలతో ఏకీభవించినై. అంతేకాదు, వాటన్నింటి సారం ఒక్కటే – అదే ఏకదైవారాధన (ఫత్‌హుల్ ఖదీర్).

75. అంటే ఈ విశ్వాసుల, ఏకదైవారాధకుల పాలిట ఆయన క్షమాగుణం కలవాడు.

76. అవిశ్వాసుల, ప్రవక్తల శత్రువుల పాలిట ఆగ్రహోదగ్రుడు. ఈ ఆయతు కూడా అల్ హిజ్ర్ సూరాలోని 49, 50 ఆయతుల వంటిదే.

77. అంటే – మేము గనక ఈ ఖుర్ఆన్ గ్రంథాన్ని అరబీ భాషలో గాకుండా వేరితర భాషలో అవతరింపజేసివుంటే....

78. అంటే – మా మాతృభాష (అయిన అరబీ)లో ఇది ఎందుకు రాలేదు? మేము అరబ్బులం కదా! అరబ్బేతర (అజమీ) గ్రంథాన్ని తెచ్చి మా మీద రుద్దుతావేమిటి? అని చెప్పి ఉండేవారు.

79. ఇది కూడా ఆ అవిశ్వాసుల నోట వెటకారంగా వెలువడిన మాటే – ఇతనేమో అరబ్బు ప్రవక్తట! ఇతని వద్దకు వచ్చిన గ్రంథమేమో అరబ్బేతర గ్రంథమట! ఇదెక్కడి గొడవండీ బాబు! అని వేళాకోళం చేసి ఉండేవారు. తాము విశ్వసించకపోవటానికి అసలు కారణం ఇదే అని కూడా చెప్పి వుండేవారు.

**45** మేము మూసాకు (కూడా) గ్రంథాన్ని ఇచ్చి ఉన్నాము. మరైతే అందులో కూడా విభేదించుకోవటం జరిగింది. నీ ప్రభువు తరఫున ముందుగానే (ఆ) విషయం నిర్ధారించబడకుండా ఉంటే,[81] వీళ్ళ మధ్య వ్యవహారం ఎప్పుడో తేల్చేయబడి ఉండేది.[82] వీళ్లు ఆ విషయంలో తీవ్రంగా వ్యాకులపరిచే సందేహానికి లోనై ఉన్నారు.[83]

وَلَقَدْ اٰتَيْنَا مُوْسَى الْكِتٰبَ فَاخْتُلِفَ فِيْهِ ۗ وَلَوْلَا
كَلِمَةٌ سَبَقَتْ مِنْ رَّبِّكَ لَقُضِيَ بَيْنَهُمْ ۗ وَاِنَّهُمْ
لَفِيْ شَكٍّ مِّنْهُ مُرِيْبٍ ﴿45﴾

**46** ఎవరయినా సత్కార్యం చేస్తే తన మేలు కోసమే చేసు కుంటాడు. మరెవరయినా దుష్కార్యానికి ఒడిగడితే దాని దుష్ఫలితం అతని మీదే పడుతుంది. నీ ప్రభువు మాత్రం (తన) దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.[84]

مَنْ عَمِلَ صَالِحًا فَلِنَفْسِهٖ ۚ وَمَنْ اَسَآءَ فَعَلَيْهَا ۗ
وَمَا رَبُّكَ بِظَلَّامٍ لِّلْعَبِيْدِ ﴿46﴾

**47** ప్రళయ ఘడియకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్‌కే ఉందని అనటం సమంజసం.[85] ఆయనకు తెలియకుండా ఏ ఫలము కూడా తన గుబురు గలీబు నుంచి బయటకు రావటం గానీ, ఏ ఆడదీ గర్భం దాల్చటంగానీ, ప్రసవించటంగానీ జరగదు.[86] "నా భాగస్వాములు ఎక్కడున్నారు?" అని అల్లాహ్ (ముష్రిక్కులను) పిలిచి వాకబు చేసిననాడు, "మాలో ఎవడూ దానికి (సంబంధించి) సాక్ష్యమిచ్చేవాడు లేడని నీతో విన్నవించు కున్నాము"[87] అని వారంటారు.

اِلَيْهِ يُرَدُّ عِلْمُ السَّاعَةِ ۗ وَمَا تَخْرُجُ مِنْ
ثَمَرٰتٍ مِّنْ اَكْمَامِهَا وَمَا تَحْمِلُ مِنْ اُنْثٰى
وَلَا تَضَعُ اِلَّا بِعِلْمِهٖ ۗ وَيَوْمَ يُنَادِيْهِمْ اَيْنَ
شُرَكَآءِيْ ۙ قَالُوْٓا اٰذَنّٰكَ ۙ مَا مِنَّا مِنْ
شَهِيْدٍ ﴿47﴾

80. చాలా దూరాన ఉన్న మనిషి ఏవిధంగా పిలుపును అందుకోలేడో వీళ్ల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఖుర్‌ఆన్ సందేశాన్ని అవగాహన చేసుకోవటంలో వీళ్ల బుద్ధిజ్ఞానాలు మందగించాయి.

81. ప్రతి ఒక్కరికీ కొంత గడువు ఇవ్వాలని మేము ముందే నిర్ణయించాము. "అల్లాహ్ వారికి ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇస్తున్నాడు" (ఫాతిర్ – 45).

82. అంటే – అప్పటికప్పుడే మా శిక్షను అవతరింపజేసి వారిని నాశనం చేసి ఉండేవారం.

83. తామేదో మేధా సంపన్నులమనో, దూరదృష్టి గలవారమనో భావించి వారు ఈ సత్యాన్ని తృణీకరించటం లేదు. అసలు విషయం ఏమిటంటే వారు పెద్ద సందేహాల స్వాములుగా తయారయ్యారు. వారి అనుమానాలే వాళ్ళను సంకటంలో పడవేశాయి.

84. ఎందుకంటే ఆయన పాపాత్ములను మాత్రమే శిక్షిస్తాడు. అకారణంగా ఎవరినీ యాతనకు గురిచేయడు.

85. ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందనే విషయం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు. అందుకే ప్రళయదినం గురించి దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) ప్రశ్నించినప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) చెప్పారు : "దాని గురించి అడిగే వానికెంత తెలుసో, చెప్పేవానికి కూడా అంతే తెలుసు. (అంతకు మించి నాకేమీ తెలియదు)." ఆ ఘడియకు సంబంధించి ఖుర్‌ఆన్‌లో ఇతరచోట్ల అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : "చివరకు ఆ విషయం

وَضَلَّ عَنْهُمْ مَّا كَانُوْا يَدْعُوْنَ مِنْ قَبْلُ وَظَنُّوْا مَا لَهُمْ مِّنْ مَّحِيْصٍ ﴿48﴾

48 అంతకు మునుపు వారు ఎవరెవరినయితే పూజించేవారో వాళ్ళంతా వారి నుండి అదృశ్యమైపోయారు.[88] ఇక తమకు ఎక్కడా రక్షణ లేదని[89] వారు అర్థం చేసుకుంటారు.

لَا يَسْـَٔمُ الْاِنْسَانُ مِنْ دُعَآءِ الْخَيْرِ ۫ وَاِنْ مَّسَّهُ الشَّرُّ فَيَـُٔوْسٌ قَنُوْطٌ ﴿49﴾

49 మేలును అర్థించటంలో మానవుడు (ఎప్పటికీ) అలసిపోడు.[90] అతనికేదైనా కీడు కలిగితే మాత్రం ఆశలన్నీ వదులుకుని నిస్పృహ చెందుతాడు.[91]

وَلَئِنْ اَذَقْنٰهُ رَحْمَةً مِّنَّا مِنْ بَعْدِ ضَرَّآءَ مَسَّتْهُ لَيَقُوْلَنَّ هٰذَا لِيْ ۙ وَمَآ اَظُنُّ السَّاعَةَ قَآئِمَةً ۙ وَّلَئِنْ رُّجِعْتُ اِلٰى رَبِّيْٓ اِنَّ لِيْ عِنْدَهٗ لَلْحُسْنٰى ۚ

50 కష్టాలు వచ్చిన తర్వాత మేమతనికి మా కారుణ్యం రుచిని చూపినట్లయితే "అదెలాగూ నాకు దక్కవలసిందే (ఆ యోగ్యత నాలో ఉంది గనక).[92] ప్రళయ ఘడియ నెలకొంటుందని నేనైతే అనుకోను. ఒకవేళ నేను నా ప్రభువు వద్దకు మరలించబడినా,

---

కొరకు అల్లాహ్ వైపుకే మరలవలసి ఉంటుంది" (అన్నాజియాత్ – 44). "ఆ ఘడియ వచ్చినప్పుడు దాన్ని అల్లాహ్ తప్ప వేరెవరూ బహిర్గతం చేయరు." (అల్ ఆరాఫ్ – 187)

86. అల్లాహ్ పరిపూర్ణ జ్ఞానసంపద గురించి ఇక్కడ చెప్పటం జరిగింది. ఆయన జ్ఞానంలో ఎవరూ భాగస్వామిగా లేరు. అంటే అలాంటి సంపూర్ణ జ్ఞానం వేరెవరికీ లేదు. ఆఖరికి దైవప్రవక్తలకు కూడా లేదు. దైవప్రవక్తలకైనా అల్లాహ్ ఏ మేరకు తెలియపరుస్తాడో ఆ మేరకే తెలుస్తుంది. 'వహీ' ద్వారా దేవుడు తాను కోరిన సమాచారాన్ని తన ప్రవక్తల వద్దకు పంపిస్తూ ఉంటాడు. కాబట్టి ఏ ప్రవక్తనయినా సమస్తమూ తెలిసినవాడని అనటం సరైంది కాదు. ఈ విషయం అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తుంది. ఇందులో అల్లాహ్ సాటిలేని మేటి.

87. అంటే – ఓ అల్లాహ్! నీకు భాగస్వాములున్నారని చెప్పే ధైర్యం మాలో ఎవరికీ లేదు. అసలా విషయాన్ని మాలో ఎవరూ ఒప్పుకోరు అని వారంటారు.

88. వారు మా ఆపద్బాంధవులని అనుకున్నాం. కాని తీరా ఆదుకోవలసిన సమయంలో వారు తోక ముడిచారు. వారు మాకెలాంటి లాభం చేకూర్చలేదు.

89. అల్లాహ్ పట్టునుంచి తమను కాపాడే నాథుడెవడూ లేడన్న సంగతి వారికి ప్రళయదినాన తెలిసివస్తుంది. వేరొకచోట చెప్పబడినట్లు, "అపరాధులు నరకాగ్నిని చూసి, తాము పడవేయబడేది అందులోనేనని అర్థం చేసుకుంటారు. దాన్నుంచి తప్పించుకునే చోటేదీ వారు కనుగొనలేదు" (అల్ కహ్ఫ్ – 53).

90. అంటే ప్రాపంచిక సిరిసంపదలను, పదవులను, గౌరవోన్నతులను అర్థించటంలో మనిషి ఎన్నటికీ అలుపెరగడు. ఇంకా ఇంకా అర్థిస్తూనే ఉంటాడు. ఇక్కడ **'మనిషి'** అంటే మనుషుల్లో అత్యధికమంది అని భావం.

91. కాని కాస్తంత కష్టం కలగ్గానే కలవరం చెందుతాడు. నిరాశకు లోనవుతాడు. అయితే దేవుని నికార్సయిన దాసుల పరిస్థితి మటుకు తద్భిన్నంగా ఉంటుంది. వారు నిత్యం పరలోకంపై తమ దృష్టిని కేంద్రీకరించి ఉంటారు. ఇతరత్రా బాధలు సోకినప్పుడు కూడా వారు కంగారుపడకుండా, దైవకారుణ్యం పట్ల నిరాశచెందకుండా ఓర్పు వహిస్తారు. పైగా కాలచక్రంలో ఎదురయ్యే ఈ పరీక్షలు తమ పాపాల మన్నింపుకై దోహదపడతాయని నమ్ముతారు. ఒక్కమాటలో చెప్పాలంటే నిరాశా నిస్పృహలు వారి దరిదాపుల్లోకి కూడా రావు.

92. అంటే – అల్లాహ్‌కు నేనంటే చాలా ఇష్టం. అందుకే ఆయన నాపై ఈ వరాలను కురిపిస్తున్నాడని అంటాడు. మరి చూడబోతే ఈ ప్రాపంచిక అనుగ్రహాల హెచ్చుతగ్గులు దేవుని ప్రసన్నతకు, అప్రసన్నతకు సంకేతాలు కావు. మానవులను పరీక్షించేందుకు దేవుడు ఇలా చేస్తుంటాడు. కలిమిలో తన దాసులు ఎలా కృతజ్ఞులై ఉంటారో, లేమిలో ఎలా ఓర్పు వహిస్తారో ఆయన చూడదలుస్తున్నాడు.

فَلَنُنَبِّئَنَّ الَّذِينَ كَفَرُوا بِمَا عَمِلُوا وَلَنُذِيقَنَّهُم مِّنْ عَذَابٍ غَلِيظٍ ﴿٥٠﴾

నిశ్చయంగా ఆయన దగ్గర నాకు మంచి (స్థానమే) లభిస్తుంది"[93] అని బీరాలు పలుకుతాడు. ఇలాంటి తిరస్కారులకు మేము తప్ప కుండా వారు ఏమేమి చేశారో తెలియపరుస్తాము. వారికి దుర్భర మైన యాతనను చవిచూపిస్తాము.

وَإِذَا أَنْعَمْنَا عَلَى الْإِنسَانِ أَعْرَضَ وَنَأَىٰ بِجَانِبِهِ وَإِذَا مَسَّهُ الشَّرُّ فَذُو دُعَاءٍ عَرِيضٍ ﴿٥١﴾

**51** మానవునిపై మేము మా అనుగ్రహాలను కురిపించినప్పుడు, అతడు ముఖం త్రిప్పుకుంటాడు, తన(కు నచ్చిన) ప్రక్కకు తిరిగి పోతాడు.[94] తనపై ఆపద వచ్చిపడి నప్పుడు మాత్రం సుదీర్ఘమైన ప్రార్థనలు చేసేవాడిగా మారిపోతాడు.[95]

قُلْ أَرَأَيْتُمْ إِن كَانَ مِنْ عِندِ اللَّهِ ثُمَّ كَفَرْتُم بِهِ مَنْ أَضَلُّ مِمَّنْ هُوَ فِي شِقَاقٍ بَعِيدٍ ﴿٥٢﴾

**52** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "చూడండి! ఒకవేళ ఈ ఖుర్ఆన్ అల్లాహ్ తరఫునుంచి వచ్చి ఉంటే, మరి మీరు దానిని తిరస్కరిస్తే, (దాన్ని) వ్యతిరేకించటంలో బహుదూరం వెళ్ళిపోయిన[96] వ్యక్తి కన్నా మార్గభ్రష్టుడు ఎవడుంటాడు?"[97]

سَنُرِيهِمْ آيَاتِنَا فِي الْآفَاقِ وَفِي أَنفُسِهِمْ حَتَّىٰ يَتَبَيَّنَ لَهُمْ أَنَّهُ الْحَقُّ ۗ أَوَلَمْ يَكْفِ بِرَبِّكَ أَنَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ شَهِيدٌ ﴿٥٣﴾

**53** త్వరలోనే మేము వారికి మా సూచనలను జగతిలోనూ చూపిస్తాము, స్వయంగా వారి(ఉనికి)లోనూ చూపిస్తాము. తుదకు సత్యమిదే అనే విషయం వారికి తేటతెల్లమవుతుంది.[98] ఏమిటి, నీ ప్రభువు ప్రతిదానికీ సాక్షిగా ఉన్నాడనే విషయం చాలదా?[99]

93. సిసలైన విశ్వాసి ఎన్నడూ ఇలాంటి కోతలు కోయడు. కపటి, అవిశ్వాసి మాత్రమే ఇలా బడాయిని చాటుకుంటాడు.

94. అంటే – సత్యం నుంచి ముఖం తిప్పుకుంటాడు. సత్యానికి విధేయత చూపమంటే ప్రక్కకు తిరిగిపోతాడు. గర్వాన్ని ప్రదర్శిస్తాడు.

95. దైవ సన్నిధిలోకి వచ్చి తన కష్టాలను దూరం చేయమని కడుదీనంగా విన్నవించుకుంటాడు. అంటే కష్టకాలంలో దైవాన్ని జ్ఞాపకం ఉంచుకుంటాడు, కలిమిలో మాత్రం మరచిపోతాడు. వరాల కోసం ఎంతసేపయినా మొరపెట్టు కుంటాడు. వరాలు ప్రాప్తించాక మొరపెట్టుకున్నవాణ్ణే నిర్లక్ష్యం చేస్తాడు.

96. అంటే – అలాంటి పరిస్థితిలో మీకన్నా ఎక్కువ మార్గవిహీనుడు, మీకన్నా పెద్ద శత్రువు ఎవడు కాగలడు?

97. **'షిఖాఖ్'** (**شِقَاق**) అంటే హఠం, మంకుతనం, వైరం, వ్యతిరేకత అన్న అర్థాలు వస్తాయి. దీనికి 'బయీద్' అనే పదం కూడా తోడవటంతో అందులో ఆధిక్యతా భావం వచ్చేస్తుంది. అంటే వ్యతిరేకత, వైరభావం పరాకాష్ఠకు చేరుకోవటం అన్నమాట! ఇలా వ్యతిరేకతలో అతిశయిల్లినవాడు దేవుని తరఫున అవతరించిన గ్రంథాన్ని సయితం త్రోసిరాజంటాడు. ఇలాంటి ధిక్కారికన్నా పెద్ద మార్గభ్రష్టుడు, దరిద్రుడు ఎవడుంటాడు?

98. అంటే – ఈ ఖుర్ఆన్ ఒక సత్యబద్ధమైన గ్రంథమని, ఇది దేవుని తరఫున పంపబడిన ఉపదేశమని వారికి సుబోధకమవుతుంది. మరి కొంతమంది విద్వాంసుల ప్రకారం ఇస్లాం సత్యధర్మమనీ, ముహమ్మద్ (స) సత్యవంతుడని వారు తెలుసుకుంటారు. **'ఆఫాఖ్'** అంటే దిఙ్మండలం అనీ, (ఆకాశపుటంచు, భూమి చివరి అంచు అని) అసలు అర్థం. ఇవి కూడా దైవసూచనల్లోనివే. అలాగే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, రేయింబవళ్లు, గాలి, నీరు, ఉరుములు, మెరుపులు, కొండలు గుట్టలు, నదీనదాలు, వృక్షాలు, ఖనిజాలు – ఇవన్నీ జగతిలోని సూచనలే.

| | |
|---|---|
| **54** (నీకు) తెలుసా! వీళ్లు తమ ప్రభువును కలుసుకునే విషయమై అనుమానానికి గురై ఉన్నారు.[100] గుర్తుంచుకో! ఆయన ప్రతి వస్తువునూ ఆవరించి ఉన్నాడు.[101] | اَلَآ اِنَّهُمْ فِيْ مِرْيَةٍ مِّنْ لِّقَآءِ رَبِّهِمْ ؕ اَلَآ اِنَّهٗ بِكُلِّ شَيْءٍ مُّحِيْطٌ ﴿54﴾ |

చివరికి మనిషి అస్థిత్వంలో కూడా ఎన్నో సూచనలున్నాయి. అతనిలో ఎన్నో పదార్థాలు, స్వభావాలు కలగలసి ఉన్నాయి.

ఈ ఆయతుపై ఇంకా కొంతమంది చేసిన వ్యాఖ్యానం ఈ విధంగా ఉంది : 'ఆఫాఖ్' అంటే ఇక్కడ బహుదూరాన ఉన్న తూర్పు పడమర ప్రాంతాలని భావం. ఆ ప్రాంతాలను జయించటాన్ని అల్లాహ్ ముస్లింల కొరకు సులభతరం చేశాడు. 'అన్ఫుస్' అంటే అరబ్బుల స్వస్థలం (అరేబియా ద్వీపం), ఆ భూభాగంపై ముస్లింల ప్రాబల్యం అని భావం. ఉదాహరణకు: బద్ర్ యుద్ధంతో జైత్రయాత్ర మొదలై, మక్కా విజయం నాటికి దాదాపు అరబ్బు భూభాగమంతా పాదాక్రాంతమైంది. దాంతో ముస్లింల గౌరవోన్నతులు పెరిగాయి.

99. అంటే – తన దాసుల చేష్టల్ని పసిగట్టడానికి, వారి కారుకూతల్ని దృష్టిలో పెట్టుకోవటానికి అల్లాహ్ ఒక్కడే చాలు అని దీని అర్థం. మరి అటువంటి గొప్ప ప్రభువే ఖుర్ఆన్ దైవవాణి అనీ, అది ముహమ్మద్ (స) ప్రవక్తపై అవతరింపజేయబడిందని సాక్ష్యమిస్తున్నాడు.

100. అందువల్లనే వారు పరలోకంపై చింతన చేయటం లేదు. దానికోసం సన్నాహాలు మొదలెట్టడం లేదు. అనుమానమనే రోగం వల్లనే వారు పరలోకానికి కనీసం భయపడటం లేదు.

101. కాబట్టి ప్రళయ ఘడియను తేవటం ఆయనకు ఎంతమాత్రం క్లిష్టతరం కాదు. ఆయన తన సృష్టితాలపై పూర్తి అజమాయిషీ కలిగి ఉన్నాడు. ఆయన కోరినదల్లా చేయగలడు. కాదు, కూడదు అని చెప్పే అధికారం గానీ, అడ్డు తగిలే శక్తిగానీ ఎవరికీ లేదు.

42వ సూరా

# అష్ షూరా

## సంప్రదింపులు

అవతరణ మక్కాలో

ఆయతులు 53

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, దైవదూతల పట్ల విశ్వాసం, ప్రవక్తల పట్ల విశ్వాసం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాలు, దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపర గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 38వ ఆయత్‌లో వచ్చిన సంప్రదింపుల గురించిన ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా దివ్యఖుర్‌ఆన్ ముఖ్య లక్షణాలను వివరించింది. ఈ దివ్యగ్రంథాన్ని అల్లాహ్ అవతరింపచేసాడు. మానవాళికి కారుణ్యంగా, మార్గదర్శకంగా, హెచ్చరికగా దీనిని అవతరింపజేసాడు. దివ్యఖుర్‌ఆన్ మనిషికి రుజుమార్గాన్ని చూపిస్తుంది. అన్ని కాలాల్లోను, అన్ని జాతుల వారికి ఇదే ధర్మాన్ని పంపించడం జరిగిందని ఈ సూరా తెలియజేసింది. ప్రవక్తలందరికీ ఇదే సందేశం ఇచ్చి పంపించడం జరిగింది. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలనీ, ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదని బోధించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి దృఢ చిత్తంతో, స్థిరంగా నిలబడాలనీ, సత్యానికి కట్టుబడాలని, లోకుల మనోవాంఛలను అనుసరించరాదని, ప్రజలను సత్యం వైపునకు ఆహ్వానించాలని బోధించడం జరిగింది. విశ్వాసులకు తీర్పుదినం నాటి గడ్డుపరిస్థితి గురించి స్పృహ ఉందని, లెక్కల ఘడియ గురించి వారు భయపడుతున్నారనీ, ఆ రోజు కోసం ఏర్పాట్లు చేసుకోవడానికి శ్రమిస్తున్నారనీ, పరలోకంలో బాధాకరమైన శిక్షను తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారనీ వ్యాఖ్యానిస్తూ, అవిశ్వాసులు మాత్రం తీర్పు దినాన్ని నిరాకరిస్తున్నారనీ, అత్యంత ముఖ్యమైన ఆ వాస్తవాన్ని ఎగతాళి చేస్తున్నారని నిరసించింది. తీర్పుదినాన్ని అపహసిస్తూ – అది నిజంగా వస్తుందా, అయితే రానివ్వు – అంటూ వ్యాఖ్యానించడాన్ని ఈ సూరా ప్రస్తావించింది.

అల్లాహ్ ఆకాశాలను, భూమిని సృష్టించాడు. ప్రజలు అన్ని ఆశలు వదులుకున్న తర్వాత కూడా ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తున్నాడు. ఆయన జంతువులను సృష్టించి అవి ఎల్లెడలా విస్తరించేలా చేసాడు. సముద్రాలలో తేలియాడే కొండల మాదిరి నౌకలు, వాటిని నడిపే గాలులు అన్నీ ఆయన అనుగ్రహమే. ఆకాశాలు, భూమి అన్నీ ఆయన నియంత్రణలోనే ఉన్నాయి. ఆయన తన అభీష్టం ప్రకారం తల్లిదండ్రులకు కేవలం కుమారులను, లేదా కేవలం కుమార్తెలను లేదా కుమారులు, కుమార్తెలను ప్రసాదిస్తాడు. ఆయన తలచిన వారికి సంతానం లేకుండా చేస్తాడు.

## అష్ షూరా సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1 – 2** హా మీమ్. ఐన్ సీన్ ఖాఫ్.

**3** ఇదే విధంగా అపార శక్తిమంతుడూ, వివేచనాపరుడైన అల్లాహ్ నీకూ, నీకు పూర్వం గతించిన వారికీ వహీ[1] (సందేశము)ని పంపిస్తూ వచ్చాడు.

**4** ఆకాశాలలో, భూమిలో ఉన్నవన్నీ ఆయనవే. ఆయన మహోన్నతుడు, చాలా గొప్పవాడు.

**5** ఆకాశం వారిపై నుంచి పగిలి పడిపోవటానికి సిద్ధంగా ఉన్నట్లే ఉంది.[2] మరి దైవదూతలంతా స్తోత్రసమేతంగా తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతున్నారు. భూవాసుల మన్నింపు కోసం వారు వేడుకుంటున్నారు.[3] విన్నావా! నిస్సందేహంగా అల్లాహ్‌యే క్షమించేవాడు, కృపాకరుడు.[4]

**6** ఆయన్ని వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్న వారిని అల్లాహ్ కనిపెట్టుకునే ఉన్నాడు.[5] వాళ్ల (వ్యవహారాల)కు నువ్వు బాధ్యుడవు కావు.[6]

## سُورَةُ الشُّورَىٰ

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

حمٓ (1) عٓسٓقٓ (2)
كَذَٰلِكَ يُوحِيٓ إِلَيۡكَ وَإِلَى ٱلَّذِينَ مِن
قَبۡلِكَ ٱللَّهُ ٱلۡعَزِيزُ ٱلۡحَكِيمُ (3)

لَهُۥ مَا فِي ٱلسَّمَٰوَٰتِ وَمَا فِي ٱلۡأَرۡضِۖ
وَهُوَ ٱلۡعَلِيُّ ٱلۡعَظِيمُ (4)

تَكَادُ ٱلسَّمَٰوَٰتُ يَتَفَطَّرۡنَ مِن فَوۡقِهِنَّۚ وَٱلۡمَلَٰٓئِكَةُ
يُسَبِّحُونَ بِحَمۡدِ رَبِّهِمۡ وَيَسۡتَغۡفِرُونَ لِمَن فِي
ٱلۡأَرۡضِۗ أَلَآ إِنَّ ٱللَّهَ هُوَ ٱلۡغَفُورُ ٱلرَّحِيمُ (5)

وَٱلَّذِينَ ٱتَّخَذُواْ مِن دُونِهِۦٓ أَوۡلِيَآءَ ٱللَّهُ حَفِيظٌ
عَلَيۡهِمۡ وَمَآ أَنتَ عَلَيۡهِم بِوَكِيلٖ (6)

1. అంటే – (ఓ ముహమ్మద్ – సఅసం!) నీ వద్దకు ఈ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని పంపినట్లే, నీకు పూర్వం గడచిన ప్రవక్తల వద్దకు కూడా మా సహీఫాలను పంపాము. వారిపై మా గ్రంథాలను అవతరింపజేశాము. 'వహీ' అంటే దైవదూత ద్వారా దైవప్రవక్త వద్దకు దేవుడు పంపే 'వాణి' అని అర్థం. 'వహీ' అవతరించినపుడు పరిస్థితి ఎలా ఉంటుంది? అన్న ఒక సహచరుని ప్రశ్నకు సమాధానమిస్తూ మహాప్రవక్త (స) ఇలా అన్నారు : "ఒక్కోసారి గంట మ్రోగినట్లు శబ్దం వస్తుంది. ఈ రకమైన వహీ నా పాలిట చాలా కఠినంగా ఉంటుంది. దైవవాణి ముగిసేసరికే అది నాకు కంఠస్థం అయిపోతుంది. ఒక్కోసారి దైవదూత మానవాకారంలో వస్తాడు. నాతో ముఖాముఖి సంభాషిస్తాడు. అతను చెప్పినదంతా నేను జ్ఞాపకం చేసుకుంటాను." వహీ (దైవవాణి) అవతరించినప్పుడు మహాప్రవక్త (స) చెందే అనుభూతిని వర్ణిస్తూ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా అన్నారు : "దైవవాణి వచ్చినప్పుడు నేను దైవప్రవక్త (స)ను చూసేదాన్ని. తీవ్రమైన చలికాలంలో సయితం ఆయన (స) శరీరానికి చెమట పట్టేది. ఆయన నుదుటిపై నుంచి చెమట బిందువులు రాలుతూ ఉండేవి." (సహీహ్ బుఖారీ).
2. అల్లాహ్ ఔన్నత్యం, ఆయన ప్రతాపం మూలంగా....
3. మోమిన్ సూరా 7వ ఆయతులో కూడా ఈ విషయం వచ్చింది.
4. తన స్నేహితుల, విధేయుల యెడల దయాశీలి. లేక సమస్త మానవుల పాలిట దయాశీలి. ఎందుకంటే అవిధేయులను,

وَكَذَٰلِكَ أَوْحَيْنَآ إِلَيْكَ قُرْءَانًا عَرَبِيًّا لِّتُنذِرَ
أُمَّ ٱلْقُرَىٰ وَمَنْ حَوْلَهَا وَتُنذِرَ يَوْمَ ٱلْجَمْعِ
لَا رَيْبَ فِيهِ ۚ فَرِيقٌ فِى ٱلْجَنَّةِ وَفَرِيقٌ
فِى ٱلسَّعِيرِ ⑦

7 అలాగే నీవు ఉమ్ముల్ ఖురా (మక్కా) వారినీ, దాని పరిసరాల వారిని హెచ్చరించటానికి,[7] సందేహానికి ఆస్కారమేలేని, అందరూ సమావేశమయ్యే రోజు గురించి[8] అప్రమత్తం చేయటానికి మేము నీ వద్దకు అరబీ ఖుర్ఆన్[9]ను వహీ చేశాము. (తీర్పు అనంతరం) ఒక వర్గం స్వర్గంలో ఉండగా, మరో వర్గం నరకాగ్నిలో ఉంటుంది.[10]

وَلَوْ شَآءَ ٱللَّهُ لَجَعَلَهُمْ أُمَّةً وَٰحِدَةً وَلَٰكِن
يُدْخِلُ مَن يَشَآءُ فِى رَحْمَتِهِۦ ۚ وَٱلظَّٰلِمُونَ
مَا لَهُم مِّن وَلِىٍّ وَلَا نَصِيرٍ ⑧

8 అల్లాహ్ యే గనక తలచుకుంటే వారందరినీ ఒకే సముదాయంగా చేసి ఉండేవాడు.[11] అయితే ఆయన తాను తలచిన వారిని తన కారుణ్యంలోకి తీసుకుంటాడు. దుర్మార్గులను కాపాడే వాడు, సహాయపడేవాడెవడూ ఉండడు.

أَمِ ٱتَّخَذُوا۟ مِن دُونِهِۦٓ أَوْلِيَآءَ ۖ فَٱللَّهُ
هُوَ ٱلْوَلِىُّ وَهُوَ يُحْىِ ٱلْمَوْتَىٰ وَهُوَ عَلَىٰ كُلِّ
شَىْءٍ قَدِيرٌ ⑨

9 ఏమిటి, వారు అల్లాహ్‌ను వదలి ఇతరుల్ని తమ కార్యసాధకులుగా చేసుకున్నారా? (యదార్థమేమిటంటే) అల్లాహ్ యే కార్యసాధకుడు, ఆయనే మృతులను బ్రతికిస్తాడు, ఆయన ప్రతిదానిపై అధికారం కలవాడు.[12]

---

అవిశ్వాసులను వారి తప్పులపై వెంటనే పట్టుకోకుండా ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇవ్వటం కూడా ఆయన క్షమాగుణానికి, దయాస్వభావానికి తార్కాణమే కదా!

5. అంటే ఆయన వారి కర్మల చిట్టాలను భద్రపరుస్తున్నాడు. వాటిని బట్టి వారి వ్యవహారాన్ని తేలుస్తాడు.

6. వారికి సద్బుద్ధినిచ్చి, సన్మార్గాన పడవేసే బాధ్యత నీపై లేదు. వారి పాపాల ఆధారంగా వారిపై శిక్షను అవతరింపజేయటం కూడా నీ పని కాదు. ఆ పనులన్నీ మేము చూసుకుంటాము. మా సందేశాన్ని చేరవేయటం వరకే నీ పని అని అల్లాహ్ తన ప్రవక్తకు చెప్పాడు.

7. మక్కా నగరానికి గల మరోపేరు 'ఉమ్ముల్ ఖురా'. అంటే 'పట్టణాల తల్లి' అని అర్థం. ఇది అరబ్బుల ప్రాచీన నగరమవటంచేత దాన్ని ఆ పేరుతో పిలుస్తారు. మక్కా నగరం చుట్టుప్రక్కల నివసించే చిన్న చిన్న బస్తీవాసులకు మక్కాతో విడదీయరాని బంధం ఉంది. ఎందుకంటే వారి పూర్వీకులు ఒకప్పుడు మక్కా నుంచి వచ్చినవారే. **'వమన్ హౌలహా'** (وَمَنْ حَوْلَهَا) అనే పదంలో దానికి (మక్కాకు) తూర్పు పడమరల్లోగల ప్రాంతాలన్నీ వచ్చేస్తాయి. ఆ ప్రాంతాల వారందరినీ జాగరూకపరచాలనీ, ఒకవేళ వారు గనక కుఫ్ర్, షిర్క్‌ల పట్ల పశ్చాత్తాపం చెందకపోతే దైవాగ్రహానికి పాత్రులు కావలసి వస్తుందని హెచ్చరించాలని దేవుడు తన ప్రవక్తకు చెబుతున్నాడు.

8. ప్రళయదినాన్ని **'అందరూ సమావేశమయ్యే రోజు'** అని అనటంలోని మర్మం ఏమిటంటే ఆ రోజు అన్ని తరాలకు, అన్ని కాలాలకు చెందిన మనుషులంతా ఒకచోట చేర్తారు. అలా సమావేశమయ్యేవారిలో దౌర్జన్యపరులు – బాధితులు, విశ్వాసులు – అవిశ్వాసులు కూడా ఉంటారు. అందరికీ వారి వారి కర్మలనుబట్టి ప్రతిఫలం ముడుతుంది.

9. ప్రతి ప్రవక్తను కూడా మేము ఆయా జాతుల వారు మాట్లాడే భాషలోనే సంభాషించేలా చేసి పంపినట్లే నీకు కూడా అరబీ ఖుర్ఆన్‌ను ప్రసాదించాము. ఎందుకంటే నువ్వు అరబ్బుల మధ్య ప్రభవింపజేయబడ్డావు. వారు మాట్లాడేది, అర్థం చేసుకునేది అరబీ భాషే.

10. దైవాజ్ఞలను పాలించి, దేవుడు నిషేధించిన విషయాలకు దూరంగా ఉన్నవారు స్వర్గానికి పోతారు. ఆజ్ఞోల్లంఘనకు

10 ఏ ఏ విషయంలో మీరు విభేదించారో, దానికి సంబంధించిన తీర్పు అల్లాహ్‌కే అప్పగించబడుతుంది.[13] ఈ అల్లాహ్‌యే నా ప్రభువు. ఆయన్నే నేను నమ్ముకున్నాను. ఆయన వైపునకే నేను మరలుతున్నాను (అని ఓ ప్రవక్తా! నువ్వు వారికి చెప్పు).

وَمَا اخْتَلَفْتُمْ فِيهِ مِن شَيْءٍ فَحُكْمُهُ إِلَى اللَّهِ ۚ
ذَٰلِكُمُ اللَّهُ رَبِّي عَلَيْهِ تَوَكَّلْتُ وَإِلَيْهِ أُنِيبُ ⑩

11 భూమ్యాకాశాలను పుట్టించినవాడు ఆయనే. ఆయన మీకోసం మీ నుండే మీ జతలను చేశాడు.[14] పశువుల జతలను కూడా చేశాడు.[15] ఈ విధంగా (ఇలలో) మిమ్మల్ని వ్యాపింపజేస్తున్నాడు.[16] ఆయన్ని పోలిన వస్తువేదీ లేదు.[17] ఆయన వినేవాడు, చూచేవాడు.

فَاطِرُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ جَعَلَ لَكُم مِّنْ أَنفُسِكُمْ
أَزْوَاجًا وَمِنَ الْأَنْعَامِ أَزْوَاجًا ۖ يَذْرَؤُكُمْ فِيهِ ۚ
لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ ۖ وَهُوَ السَّمِيعُ الْبَصِيرُ ⑪

---

పాల్పడి, అధర్మకార్యాలకు ఒడిగట్టిన వారంతా నరకాగ్నికి ఆహుతి అవుతారు. ఆనాడు ఉండేది ఈ రెండు వర్గాలవారే. మూడో వర్గం అనేది ఉండదు.

11. ఒకవేళ అల్లాహ్ గనక అందరినీ ఒకే సముదాయంగా చేసి ఉంటే తీర్పుదినాన అందరూ స్వర్గానికి అర్హులయ్యేవారు. కాని అందరినీ – వారికి ఇష్టమున్నా ఇష్టం లేకపోయినా – బలవంతంగా మెడలు వంచటం దైవాభిమతం కాదు. పైగా ఆయన మానవులను పరీక్షించే నిమిత్తం **'ఎంపిక స్వేచ్ఛ'**ను వొసగాడు. ఈ స్వేచ్ఛాధికారాన్ని సద్వినియోగం చేసుకున్నవాడు దైవకారుణ్యానికి పాత్రుడవుతాడు. మరెవరయితే ఈ స్వేచ్ఛను దుర్వినియోగపరిచాడో అతడు అన్యాయం చేశాడు. దేవుడిచ్చిన స్వేచ్ఛను దేవుని అవిధేయతకై ప్రయోగించాడు. కాబట్టి ఇలాంటి దుర్మార్గులను తీర్పుదినాన ఆదుకునే వాడెవడూ ఉండడు.

12. మరి ఇదంతా మీకు తెలిసినప్పుడు మీరు అల్లాహ్‌ను మాత్రమే మీ కార్యసాధకునిగా ఆశ్రయించాలి. అన్యులకు ఏ శక్తీ లేదు. మొరలను ఆలకించి, ఆమోదించే శక్తిగానీ, లాభనష్టాలను చేకూర్చే శక్తిగానీ దైవేతరులకు లేదు.

13. ఇక్కడ **'విభేదం'** అంటే ధార్మికమైన విభేదం అన్నమాట. యూదుల్లో, క్రైస్తవుల్లో, ముస్లిముల్లో ధర్మసమ్మతమైన విషయాలలో భిన్నాభిప్రాయాలున్నట్లే ప్రతి మతస్థుడూ తన మతమే సరైనదని, సత్యమని వాదిస్తాడు. మరి వాస్తవానికి ఒకే సమయంలో అన్ని మతధర్మాలు సరైనవి కాజాలవు. సరైన, సత్యమైన ధర్మం ఒక్కటే కాగలదు. సత్యధర్మమేదో, సన్మార్గమేదో తెలుసుకోవటానికి దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్ మన మధ్య ఉండనే ఉంది. కాని దాన్ని దైవగ్రంథంగా, మార్గదర్శినిగా మనం అంగీకరిస్తే కదా! మనం గనక ఈ వ్యవహారంపై ఏకాభిప్రాయానికి రాలేకపోతే, ఇక దానికి సంబంధించిన తీర్పు జరగాల్సింది దైవసమక్షంలోనే. ప్రళయదినాన అల్లాహ్ మన మధ్యగల అభిప్రాయభేదాలన్నింటిపై తీర్పు చేస్తాడు. ఆఖరికి సత్యవంతులకు స్వర్గంలో ప్రవేశం కల్పించి, అసత్యవాదులను నరకం వైపుకు దారి చూపిస్తాడు.

14. దేవుని మహోపకారాలలో ఇదొకటి. ఆయన మీ సౌఖ్యం కోసం ఎక్కడినుంచో, ఎవరి నుంచో కాకుండా ఖుద్దుగా మీ నుంచే – మానవజాతి నుండే – మీ జంటలను సృజించాడు. మీ భార్యలు (లేక మీ భర్తలు) మనుషుల్లో నుంచి గాకుండా వేరితర ప్రాణులలో నుంచి చేసి ఉంటే మీకు సుఖసౌఖ్యాలు ప్రాప్తించేవి కావు. అసలు మీ వ్యక్తిత్వమే ప్రశ్నార్థకమైపోయేది.

15. ఈ సూత్రాన్నే దేవుడు పశువుల విషయంలో కూడా అవలంబించాడు. ఇక్కడ పశువులంటే అల్ అన్‌ఆమ్ సూరాలో పేర్కొనబడిన (ఆడ – మగ కలిపి) ఎనిమిది పశువులు.

16. **'యజ్‌రవు'** (ذَرْءٌ) అంటే వ్యాపింపజేయటం, లేక సృజించటం అన్న అర్థం వస్తుంది. అంటే ఆయన మానవ సంతతిని ప్రపంచంలో చాలా ఎక్కువగా వ్యాపింపజేస్తున్నాడు. లేదా ఒక తరం తరువాత మరో తరాన్ని ఉనికిలోనికి తీసుకువస్తున్నాడు. అలాగే మానవజాతితో పాటు పశుసమృద్ధి కూడా జరుగుతూ ఉంది. ఈ సంతానోత్పత్తిలో

لَهٗ مَقَالِيْدُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ يَبْسُطُ الرِّزْقَ لِمَنْ يَّشَآءُ وَيَقْدِرُ ۭ اِنَّهٗ بِكُلِّ شَيْءٍ عَلِيْمٌ ⑫

**12** భూమ్యాకాశాల తాళం చెవులు ఆయనవే.[18] ఆయన తాను కోరిన వారికి ఉపాధిని విస్తృతంగా ఇస్తాడు, (మరి తాను కోరిన వారికి) తగ్గించి ఇస్తాడు. నిశ్చయంగా ఆయన ప్రతిదీ తెలిసిన వాడు.

شَرَعَ لَكُمْ مِّنَ الدِّيْنِ مَا وَصّٰى بِهٖ نُوْحًا وَّالَّذِيْٓ اَوْحَيْنَآ اِلَيْكَ وَمَا وَصَّيْنَا بِهٖٓ اِبْرٰهِيْمَ وَمُوْسٰى وَعِيْسٰٓى اَنْ اَقِيْمُوا الدِّيْنَ وَلَا تَتَفَرَّقُوْا فِيْهِ ۭ كَبُرَ عَلَى الْمُشْرِكِيْنَ مَا تَدْعُوْهُمْ

**13** ఏ ధర్మాన్ని స్థాపించమని అల్లాహ్ నూహ్‌కు ఆజ్ఞాపించాడో ఆ ధర్మాన్నే మీ కొరకూ నిర్ధారించాడు. దానినే (ఓ ముహమ్మద్‌–సఅసం!) మేము నీ వైపుకు (వహీ ద్వారా) పంపాము. దాని గురించే ఇబ్రాహీముకు, మూసాకు, ఈసా (అలైహిముస్సలాం)కు కూడా తాకీదు చేశాము.[19] ఈ ధర్మాన్నే నెలకొల్పాలనీ,[20] అందులో చీలిక తీసుకు రావద్దనీ[21] (వారికి) ఉపదేశించాము. (ఓ ముహమ్మద్ – సఅసం!) నువ్వు ఏ విషయం వైపునకు వారిని

గానీ, ఆడ మగల నిష్పత్తిలోగానీ అసాధారణమైన మార్పువస్తే మీకు జతలు దొరకటం గగనమైపోతుంది. అందుకే తగు నిష్పత్తిలో దేవుడు ఆడ – మగలను సృజిస్తున్నాడు. (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).

17. ఉనికిలోగానీ, గుణగణాల రీత్యాగానీ ఆయన వంటి వారు ఎవరూ లేరు. ఆయన ఒక్కడు. అన్నింటికీ అతీతుడు.

18. **'మఖాలీద్'** (مَقَالِيْدُ) అనేది **'మిఖ్‌లాదున్'** అనే పదానికి బహువచనం. దీనికి నిక్షేపాలు, తాళం చెవులు అనే అర్థాలొస్తాయి.

19. **'షరఅ'** (شَرَعَ) అంటే విశదీకరించాడు, స్పష్టపరిచాడు, నిర్ధారించాడు, ఖాయం చేశాడు అని భావం. 'లకుమ్' అంటే మీకోసం అని అర్థం. 'మీకోసం' అన్న పదంలో ముహమ్మద్ (స) అనుచర సమాజమంతా వచ్చేస్తుంది. ఈ వాక్యం అర్థమేమిటంటే లోగడ ప్రవక్తలందరికీ ఏ ధర్మాన్నయితే నెలకొల్పమని దేవుడు ఆజ్ఞాపించాడో ఆ ధర్మాన్నే మీ కోసం కూడా సమ్మతించి ఆమోదించాడు. ఈ పూర్వరంగంలో కొంతమంది గొప్ప ప్రవక్తల పేర్లను కూడా ప్రస్తావించాడు.

20. **'అద్దీన్'** (الدِّيْنَ) అనే పదంలో అల్లాహ్‌పై విశ్వాసం, ఏకదైవారాధన, దైవప్రవక్త అనుసరణ, దేవుని శాసనాంగాన్ని శిరసావహించటం మొదలగు అంశాలన్నీ ఇమిడి ఉన్నాయి. దైవప్రవక్తలంతా తమ జాతుల వారిని ఆహ్వానించింది ఈ ధర్మం (దీన్) వైపే. "మేము మీలోని ప్రతి ఒక్కరికీ ఒక షరీయతునూ, ఒక జీవన మార్గాన్ని నిర్ణయించామ"న్న (అల్ మాయిద – 48) దైవసూక్తి ననుసరించి వివిధ షరీయతుల మధ్య కొన్ని పాక్షికమయిన, సాపేక్షికమైన విభేదాలున్నప్పటికీ పైన పేర్కొనబడిన మౌలికాంశాల రీత్యా–సూత్రప్రాయంగా–అందరి షరీయతు మాత్రం ఒక్కటే. ఆ విషయాన్ని అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు ఈ విధంగా చెప్పారు: "దైవప్రవక్తల సమూహానికి చెందిన మేము సవతి సోదరులం. మా ధర్మం (జీవన విధానం) మాత్రం ఒక్కటే" (సహీహ్ బుఖారీ). దేవుని ఏకత్వం, దైవప్రవక్త మార్గానుసరణ దృష్ట్యా ఈ జీవన విధానంలో తేడా లేదు. కాకపోతే కొన్ని పాక్షిక విషయాల్లోనే భేదాభిప్రాయాలుంటాయి. ఆ విషయాలలో **'ఇజ్తెహాద్'** (షరీయతు సూత్రాల అన్వయింపు)కు ఆస్కారం మిగిలి ఉంటుంది. అయితే దేవుని ఏకత్వం, దైవప్రవక్త మార్గానుసరణ వంటి విషయాలు పాక్షికమైనవి కావు. ఇవి మౌలికాంశాలు. సైద్ధాంతిక విషయాలు. 'విశ్వాసం' దానిమీదనే ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఇలాంటి మౌలికాంశాల మీద రాజీపడటానికి, ఇతరత్రా దారులు వెతకటానికి అవకాశం మిగిలి ఉండదు.

21. ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించటం, ఆయనకు విధేయత చూపటం (లేక దైవప్రవక్తకు విధేయత చూపటం) ఏకత్వానికి, సంఘటితత్వానికి అసలు ప్రాతిపదిక. ఈ 'ఏకత్వాన్ని' కాదని ఇతరత్రా భాగస్వామ్యాల్ని ఆశ్రయిస్తే

إِلَيْهِ ۚ اللَّهُ يَجْتَبِي إِلَيْهِ مَن يَشَاءُ
وَيَهْدِي إِلَيْهِ مَن يُنِيبُ (13)

పిలుస్తున్నావో అది బహుదైవారాధకులకు చాలా భారంగా తోస్తుంది.[22] అల్లాహ్ తాను కోరిన వారిని (తన కార్యం కొరకు) ఎన్నుకుంటాడు.[23] తన వైపు మరలే వానికి ఆయన సన్మార్గం చూపుతాడు.[24]

وَمَا تَفَرَّقُوا إِلَّا مِن بَعْدِ مَا جَاءَهُمُ الْعِلْمُ
بَغْيًا بَيْنَهُمْ ۚ وَلَوْلَا كَلِمَةٌ سَبَقَتْ مِن رَّبِّكَ
إِلَىٰ أَجَلٍ مُّسَمًّى لَّقُضِيَ بَيْنَهُمْ ۚ وَإِنَّ الَّذِينَ
أُورِثُوا الْكِتَابَ مِن بَعْدِهِمْ لَفِي شَكٍّ مِّنْهُ
مُرِيبٍ (14)

**14** వాళ్లు తమ వద్దకు 'జ్ఞానం' వచ్చిన మీదటే విభేదించుకున్నారు – (అదీ కేవలం) తమ మధ్యగల పంతాల కారణంగానే![25] 'ఒక నిర్ణీత కాలం కోసం' అనే నీ ప్రభువు మాట ముందుగానే ఖరారై ఉండకపోతే వాళ్ల వ్యవహారం (ఎప్పుడో) తేలిపోయి ఉండేది.[26] వాళ్ల తరువాత గ్రంథం ప్రసాదించబడిన వారు కూడా దాని విషయంలో చాలా తొలచి వేసే అనుమానానికి లోనై ఉన్నారు.[27]

فَلِذَٰلِكَ فَادْعُ ۖ وَاسْتَقِمْ كَمَا أُمِرْتَ ۖ وَلَا تَتَّبِعْ
أَهْوَاءَهُمْ ۖ وَقُلْ آمَنتُ بِمَا أَنزَلَ اللَّهُ مِن
كِتَابٍ ۖ وَأُمِرْتُ لِأَعْدِلَ بَيْنَكُمُ ۖ اللَّهُ رَبُّنَا
وَرَبُّكُمْ ۖ لَنَا أَعْمَالُنَا وَلَكُمْ أَعْمَالُكُمْ ۖ

**15** కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు వారిని దాని వైపునకే పిలుస్తూ ఉండు. నీకు ఆదేశించబడిన దానిపై నిలకడగా ఉండు.[28] వాళ్ల మనోవాంఛలకనుగుణంగా మాత్రం నడవకు.[29] వాళ్లకు ఇలా చెప్పేయ్: "అల్లాహ్ అవతరింపజేసిన ప్రతి గ్రంథాన్నీ నేను విశ్వసించాను. మీ మధ్య న్యాయం చేయాలని నాకు ఆజ్ఞాపించ

---

ధర్మంలో చీలిక వస్తుంది. ఎదర బ్రతుకంతా చిందరవందర అవుతుంది. సామాజిక వ్యవస్థ దెబ్బతింటుంది. అందుకే ధర్మంలో చీలిక తీసుకురావద్దని తాకీదు చేయబడింది.

22. అంటే ఒక్క దేవుని విధేయత, దైవప్రవక్త (స) విధేయత వారికి మింగుడు పడకుండా ఉంది.

23. అంటే సన్మార్గాన నడవటానికి తగినవాడు అనుకున్నవారిని ఆయన ఆ మార్గం కోసం ఎన్నుకుంటాడు.

24. అంటే – ఏకాగ్రచిత్తంతో ధర్మమార్గాన నడచి, తన ఆరాధనలన్నింటినీ ఒక్కడైన అల్లాహ్‌కు ప్రత్యేకించుకునే సద్బుద్ధిని దేవుడు అతనికి ప్రసాదిస్తాడు.

25. అంతా తెలిసిన మీదట చీలిక మార్గాన్ని తొక్కటం విచిత్రం! మరి చూడబోతే 'చీలిక'కు అసలెలాంటి ఆస్కారమే లేదు. కాని వారి కుహనా ప్రతిష్ఠలు, ఈర్ష్యాద్వేషాలు, పంతాలు పట్టింపులు వాళ్లచేత ఆ విచ్ఛిన్నకరమైన పని చేయించాయి. కొంతమంది యూదులను గురించి ఇలా చెప్పబడిందని, ఖురైషులను దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా అనబడిందని మరికొందరు అభిప్రాయపడ్డారు.

26. వాళ్లకు కొంత గడువు ఇచ్చిన మీదట–ఆలస్యంగా–వాళ్ల సంగతి తేల్చాలన్న విషయం ముందుగా ఖరారు కాకుండా ఉంటే ఈ పాటికి దేవుడు వారిపై శిక్షను పంపి, వారి పనిపట్టి ఉండేవాడే.

27. అంటే యూదులు, క్రైస్తవులన్నమాట! వారు తమ పూర్వీకులైన యూదులకు, క్రైస్తవులకు వారసులయ్యారు. అంటే తౌరాతు, ఇంజీలు గ్రంథాలను అవలంబించే వారయ్యారు. లేదా ఖుర్ఆన్ గ్రంథం ఇవ్వబడిన అరబ్బుల నుద్దేశించి కూడా ఈ విధంగా అనబడి ఉండవచ్చు. మొదటి అర్థంలో తీసుకుంటే ఇక్కడి 'అల్ కితాబ్' (గ్రంథం) అనే పదం తౌరాతు, ఇంజీలు గ్రంథాలకు వర్తిస్తుంది. రెండవ అర్థంలో తీసుకుంటే అది ఖుర్ఆన్‌కు వర్తిస్తుంది.

لَا حُجَّةَ بَيْنَنَا وَبَيْنَكُمْ ۖ اللَّهُ يَجْمَعُ بَيْنَنَا ۖ وَإِلَيْهِ الْمَصِيرُ ⑮

బడింది.[30] అల్లాహ్‌యే మా ప్రభువు, మీ ప్రభువు కూడాను. మా కర్మలు మావి. మీ కర్మలు మీవి. మాకూ – మీకు మధ్య ఎలాంటి వితండవాదానికి తావు లేదు.[31] అల్లాహ్ మనందరినీ సమావేశపరుస్తాడు. కడకు ఆయన వద్దకే మరలి పోవలసిఉంది."

وَالَّذِينَ يُحَاجُّونَ فِي اللَّهِ مِن بَعْدِ مَا اسْتُجِيبَ لَهُ حُجَّتُهُمْ دَاحِضَةٌ عِندَ رَبِّهِمْ وَعَلَيْهِمْ غَضَبٌ وَلَهُمْ عَذَابٌ شَدِيدٌ ⑯

**16** ఎవరయితే అల్లాహ్ విషయాన్ని (ప్రజలు) ఒప్పుకున్న మీదట, అందులో వివాదాన్ని మొదలెడతారో,[32] వారి పిడివాదం వారి ప్రభువు దృష్టిలో నిరర్థకమైనది.[33] వారిపై (దేవుని) ఆగ్రహం పడుతుంది. వారి కొరకు కఠినమైన శిక్ష ఉంది.

اللَّهُ الَّذِي أَنزَلَ الْكِتَابَ بِالْحَقِّ وَالْمِيزَانَ ۗ وَمَا يُدْرِيكَ لَعَلَّ السَّاعَةَ قَرِيبٌ ⑰

**17** అల్లాహ్‌యే గ్రంథాన్ని సత్యబద్ధంగా అవతరింపజేశాడు. త్రాసును కూడా (అవతరింపజేశాడు).[34] నీకేం తెలుసు? బహుశా ప్రళయం దగ్గరపడిందేమో![35]

---

28. అంటే – ఆ సందేహాల స్వాములను, అనుమానాల అయ్యలను (ఓ ముహమ్మద్ – సఅసం!) నువ్వు ఈ ధర్మం వైపే పిలుస్తూ ఉండు. ఏకదైవారాధన వైపునకు వారిని ఆహ్వానించు. నువ్వు సయితం ఆ బాటపై స్థిరంగా ఉండు.

29. అంటే – వాళ్ల అడుగుజాడల్లో నడవకు. వాళ్లు తమకిష్టమొచ్చిన రీతిలో ధర్మంలో కొత్త పుంతలు తొక్కారు. ఉదాహరణకు: వారు విగ్రహారాధనను మొదలెట్టారు. కాబట్టి నువ్వు వాళ్ల మాట వినకు. వాళ్ల కోరికలను అనుసరించకు.

30. అంటే – మీరు ఎప్పుడు, ఏ తగాదాను నా దగ్గరకు తీసుకువచ్చినా దైవాజ్ఞల్ని అనుసరించే మీ మధ్య పరిష్కారం చేయాలని, మీకెలాంటి అన్యాయం చేయరాదని నాకు ఆజ్ఞాపించబడింది.

31. అంటే–ఎలాంటి గొడవకు, జగడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే సత్యం తేటతెల్లమై పోయింది.

32. అంటే – దైవప్రవక్త (స) మాటను విని, అతని మార్గాన నడిచే ముస్లిములతో ఈ బహుదైవారాధకులు జగడం చేస్తున్నారు. ఎలాగైనా వారిని సన్మార్గం నుంచి తప్పించాలన్నది వారి ఉద్దేశం.

లేదా గ్రంథవహులైన యూదులు, క్రైస్తవులు ముస్లిములతో గొడవపడుతున్నారు. మా ధర్మం మీ ధర్మంకన్నా మెరుగైనదనీ, మా ప్రవక్త మీ ప్రవక్తకన్నా ముందు వచ్చాడనీ, అందువల్ల మీకన్నా మేమే శ్రేష్ఠులం అనీ వారంటున్నారు.

33. **'దాహిజతున్'** (دَاحِضَةٌ) అంటే పేలవమైనది, నిరాధారమైనది, అర్థంలేనిది, పసలేనిది అని అర్థం.

34. అంటే దైవప్రవక్తలందరికీ ప్రసాదించబడిన గ్రంథాలు, సహీఫాలు అన్నీ సత్యంతో కూడుకున్నవి. లేక ప్రత్యేకంగా ఖుర్ఆన్ సత్యతను నొక్కి వక్కాణించటానికి ఈవిధంగా అనబడి ఉండవచ్చు. ఇక్కడ **'మీజాన్'** (الْمِيزَانَ) అంటే న్యాయం, సమత్వం, సమతూకం అని భావం. న్యాయాన్ని త్రాసు (ధర్మకాటా)తో పోల్చటంలోని ఉద్దేశం ఏమిటంటే న్యాయంగా, సమానంగా తూచి ఇచ్చే ఉద్దేశంతో త్రాసును ఉపయోగిస్తారు. ఆ భావంలోనే ఇక్కడ 'మీజాన్' అనే పదం ప్రయోగించబడింది.

"మేము మా ప్రవక్తలకు స్పష్టమైన సూచనలనిచ్చి పంపాము. మరి వారితో పాటు గ్రంథాన్నీ, ధర్మకాటాను కూడా అవతరింపజేశాము – ప్రజలు న్యాయంపై స్థిరంగా ఉంటారని!" (అల్ హదీద్ – 25)

అలాగే – ఆయనే ఆకాశాన్ని బాగా పైకెత్తాడు. ఆయనే త్రాసును స్థాపించాడు – తూకంలో మీరు హెచ్చుతగ్గులు చేయకుండా ఉండేందుకు! న్యాయంగా, బరువును ఖచ్చితంగా తూయటానికి, తూకంలో తగ్గింపుకు పాల్పడకుండా ఉండటానికి" అని ఆజ్ఞాపించబడింది (అర్రహ్మాన్ : 7 – 9).

**18** దాన్ని నమ్మనివారే దాని గురించి ఆత్రం చేస్తున్నారు.[36] దాన్ని నమ్మేవారు మాత్రం దానికి భయపడుతూ ఉన్నారు.[37] అది రావటం సత్యమని (తథ్యమని) వారికి తెలుసు. గుర్తుంచుకోండి! ఆ గడియ విషయంలో గోల చేసేవారు[38] బహుదూరపు అపమార్గంలో పడి ఉన్నారు.[39]

يَسْتَعْجِلُ بِهَا الَّذِينَ لَا يُؤْمِنُونَ بِهَا ۖ وَالَّذِينَ
آمَنُوا مُشْفِقُونَ مِنْهَا وَيَعْلَمُونَ أَنَّهَا الْحَقُّ ۗ
أَلَا إِنَّ الَّذِينَ يُمَارُونَ فِي السَّاعَةِ لَفِي
ضَلَالٍ بَعِيدٍ ﴿١٨﴾

**19** అల్లాహ్ తన దాసుల పట్ల ఎంతో మృదువుగా వ్యవహరిస్తాడు. తాను కోరిన వారికి విస్తృతంగా ఉపాధిని ఇస్తాడు. ఆయన గొప్ప బలశాలి, ప్రాబల్యం కలవాడు.

اللَّهُ لَطِيفٌ بِعِبَادِهِ يَرْزُقُ مَنْ يَشَاءُ ۖ
وَهُوَ الْقَوِيُّ الْعَزِيزُ ﴿١٩﴾

**20** ఎవరయితే పరలోక పంటను ఆశిస్తాడో, మేమతనికి అతని పంటలో సమృద్ధిని ఇస్తాము.[40] మరెవరయితే ఇహలోక పంటను ఆశిస్తాడో అతనికి మేము అందులో నుంచే ఎంతో కొంత ఇస్తాము.[41] ఇలాంటి వ్యక్తికి పరలోకంలో ఏ భాగమూ ఉండదు.[42]

مَنْ كَانَ يُرِيدُ حَرْثَ الْآخِرَةِ نَزِدْ لَهُ فِي حَرْثِهِ ۖ
وَمَنْ كَانَ يُرِيدُ حَرْثَ الدُّنْيَا نُؤْتِهِ مِنْهَا
وَمَا لَهُ فِي الْآخِرَةِ مِنْ نَصِيبٍ ﴿٢٠﴾

35. ఆ ప్రళయ ఘడియ దాపురించకముందే మీ కర్మలను చక్కదిద్దుకోండి.

36. అసలు అదెక్కడ వస్తుందిలే! అనే వ్యంగ్య ధోరణి అందులో అంతర్లీనమై ఉంది. అందుకే వారు ప్రళయం గురించి మహాతొందర పెడ్తున్నారు.

37. ఎందుకంటే ఆ దినం ఏదో ఒకనాడు తప్పకుండా వస్తుందన్న దృఢవిశ్వాసం వారికుంటుంది. ఆ రోజు ఖచ్చితంగా లెక్క తేల్చబడుతుందన్న భయం కూడా ఉంటుంది. తాము దేవునికి ఎక్కడ పట్టుబడతామోనన్న భీతితో వారు వణుకుతూ ఉంటారు. ఉదాహరణకు : "వారు ఇవ్వగలిగినది ఇస్తూ ఉంటారు. అయినప్పటికీ వారి హృదయాలు తమ ప్రభువు వైపునకు మరలవలసి ఉందనే తలంపుతో వణుకుతూ ఉంటాయి." (అల్ మోమినూన్ – 60).

38. **'యుమారూన'** (يُمَارُونَ) అనేది 'ముమారాతున్' అన్న పదం నుంచి వచ్చింది. అంటే తగవు పెట్టుకోవటం, గోలపెట్టడం, తలాతోకా లేకుండా వాదించటం అని అర్థం. సంశయానికి, అనుమానానికి లోనవటం (మిర్యతున్) అనే అర్థంలో కూడా దీన్ని తీసుకుంటారు.

39. ఎందుకంటే వారు దైవసూచనలపై ఎన్నడూ చిత్తశుద్ధితో యోచన చేయరు. ఒకవేళ వారు యోచన చేసి ఉంటే పరిస్థితుల స్వరూపం మరోవిధంగా ఉండేదేమో! మరి చూడబోతే అహోరాత్రులు ఈ నిదర్శనాలు వారి దృష్టికి వస్తూనే ఉంటాయి. కాని గుణపాఠం నేర్చుకునే దృష్టితో చూస్తేగా! అందుకే వారు మార్గభ్రష్టత యొక్క ఆఖరి అంచులకు వెళ్ళిపోయారు.

40. **'హర్సున్'** (حَرث) అంటే అసలు విత్తనం నాటటం అని అర్థం. ఇక్కడ ఈ పదం కర్మల ప్రతిఫలం అన్న అర్థంలో వాడబడింది. ఏ వ్యక్తయినా ప్రాపంచిక జీవిత కాలంలో తన సత్కార్యాల ద్వారా, నిరంతర ప్రయత్నం ద్వారా పరలోక పుణ్యాన్ని ఆశిస్తే అల్లాహ్ అతని పరలోక పుణ్యాన్ని ఎంతగానో పెంచేస్తాడు. అతను చేసే ఒక్కో సత్కార్యానికి పది నుంచి ఏడు వందల రెట్ల వరకు, దానికన్నా ఎక్కువ కూడా పుణ్యఫలం అతనికి ప్రాప్తిస్తుంది.

41. ప్రపంచం వెనకాల పరుగెత్తే వానికి ప్రాపంచిక ప్రయోజనాలైతే సిద్ధిస్తాయిగాని అతను కోరుకున్నన్ని మాత్రం సిద్ధించవు. దైవప్రణాళిక ననుసరించి కొన్ని మాత్రం లభిస్తాయి.

42. బనీ ఇస్రాయీల్ సూరా 18వ వచనంలో చర్చించబడిన అంశమే ఇది. దీని భావమేమిటంటే దేవుడు ప్రతి ఒక్కరికీ ప్రాపంచికంగా అతని కోసం రాసిపెట్టినంతగా ఎలాగూ ఇస్తాడు. ఎందుకంటే ఆయన అందరి ఉపాధి ప్రదాత. ప్రపంచాన్ని ఆశించేవారికైనా, పరలోకాన్ని కోరుకునే వారికైనా – ప్రపంచంలో లభించవలసినంత ఉపాధి

اَمْ لَهُمْ شُرَكٰٓؤُا شَرَعُوْا لَهُمْ مِّنَ الدِّيْنِ مَا لَمْ
يَاْذَنْۢ بِهِ اللّٰهُ ؕ وَلَوْلَا كَلِمَةُ الْفَصْلِ لَقُضِيَ
بَيْنَهُمْ ؕ وَاِنَّ الظّٰلِمِيْنَ لَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿21﴾

**21** ఏమిటి, అల్లాహ్ అనుమతితో నిమిత్తం లేకుండానే తమ కోసం ఏవైనా ధర్మాదేశాలను నిర్ధారించే (అల్లాహ్) భాగస్థులను గాని వారు కలిగి ఉన్నారా?[43] 'తీర్పు'కు సంబంధించిన మాటే గనక ఖరారై ఉండకపోయినట్లయితే వీళ్ల మధ్య (ఇప్పుడే) వ్యవహారం తేల్చివేయబడేది. నిజానికి (ఇలాంటి) దుర్మార్గుల కోసమే వ్యధాభరితమైన శిక్ష ఉన్నది.

تَرَى الظّٰلِمِيْنَ مُشْفِقِيْنَ مِمَّا كَسَبُوْا وَهُوَ
وَاقِعٌۢ بِهِمْ ؕ وَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ
فِيْ رَوْضٰتِ الْجَنّٰتِ ۚ لَهُمْ مَّا يَشَآءُوْنَ عِنْدَ
رَبِّهِمْ ؕ ذٰلِكَ هُوَ الْفَضْلُ الْكَبِيْرُ ﴿22﴾

**22** ఈ దుర్మార్గులు తాము చేసుకున్న దానిపై భయపడటం నువ్వు చూస్తావు.[44] అది (ఆ పాపం) వారిపై పడి తీరుతుంది.[45] మరెవరయితే విశ్వసించి, సత్కార్యాలు చేశారో వారు స్వర్గవనాలలో ఉంటారు. వారు కోరినదల్లా వారికి వారి ప్రభువు వద్ద లభిస్తుంది. అదే అసలు గొప్ప అనుగ్రహం.

ذٰلِكَ الَّذِيْ يُبَشِّرُ اللّٰهُ عِبَادَهُ الَّذِيْنَ اٰمَنُوْا
وَعَمِلُوا الصّٰلِحٰتِ ؕ قُلْ لَّاۤ اَسْـَٔلُكُمْ عَلَيْهِ اَجْرًا
اِلَّا الْمَوَدَّةَ فِي الْقُرْبٰى ؕ وَمَنْ يَّقْتَرِفْ حَسَنَةً
نَّزِدْ لَهٗ فِيْهَا حُسْنًا ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ شَكُوْرٌ ﴿23﴾

**23** విశ్వసించి, ('సున్నత్' ప్రకారం) సత్కార్యాలు చేసిన తన దాసులకు అల్లాహ్ ఇచ్చే శుభవార్త ఇదే! (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "దీనికిగాను నేను మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ అడగటంలేదు. కాని బంధుత్వ ప్రేమను మాత్రం కోరుతున్నాను."[46] ఎవడయినా మంచి చేస్తే మేమతని మంచిలో మరింత వృద్ధినిస్తాము.[47] నిశ్చయంగా అల్లాహ్ అపారంగా మన్నించేవాడు, (సేవలకు తగ్గ) గుర్తింపునిచ్చేవాడూను.[48]

తప్పకుండా లభిస్తుంది. అయితే పరలోకం కోసం సాధన చేసే వ్యక్తికి మాత్రం అల్లాహ్ తీర్పుదినాన ఎన్నోరెట్లు పుణ్యఫలం వొసగుతాడు. కాగా; ప్రపంచం వెనకాల పరుగెత్తిన వ్యక్తికి పరలోకంలో నరకమే గతి. కాబట్టి ప్రపంచాన్ని ఆశించటంలో మేలుందో, పరలోకాన్ని ఆశించటంలో మేలుందో ఇక ఆలోచించాల్సిన బాధ్యత మనిషిది.

43. అంటే అల్లాహ్ ఆజ్ఞాపించని షిర్క్‌ను, పాపకార్యాలను చేసేందుకు వారి భాగస్వాములు వారికి అనుమతి ఇచ్చారా? ఆ మేరకు లైసెన్సులు ఇవ్వటానికి ఏదైనా సరికొత్త విధానాన్ని ఆమోదించారా?

44. అంటే ప్రళయదినాన వారికి పట్టే దుర్గతిని నువ్వే చూద్దువుగాని.

45. ఆనాడు వారు ప్రాయశ్చిత్తం చెందటం వల్ల వారికి ఒరిగేదేమీ ఉండదు. ఎందుకంటే ఎట్టి పరిస్థితిలోనూ శిక్షను అనుభవించవలసిందే.

46. కురైష్ తెగలకు – దైవప్రవక్త (సఅసం)కు మధ్య బంధుత్వ సంబంధముండేది. ఈ ఆయతు భావం సుస్పష్టమే. ప్రవక్త (స) అభ్యర్థనలోని అంతరార్థం ఇది :

"సందేశం ఇస్తున్నందుకు నేను మీ నుండి ఎలాంటి వేతనాన్ని (కూలిని) అడగటం లేదు. అయితే మీకూ – నాకు మధ్య గల బంధుత్వాన్ని దయచేసి దృష్టిలో పెట్టుకోండి. మీరు నా పిలుపును శిరసావహించకపోతే పోనివ్వండి. కాని నాకు అపకారం మాత్రం తలపెట్టకండి. మీరు నాకు చేదోడు వాదోడుగా ఉండకపోతే మీ ఇష్టం. కాని బంధుత్వ సంబంధాల దృష్ట్యా అడుగడుగునా నాకు అడ్డంకులు మాత్రం సృష్టించకండి."

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఈ వాక్యానికి తాత్పర్యంగా ఇలా అన్నారు : "మీకూ – నాకూ మధ్యగల ఆత్మీయత

24 "ఏమిటి, ఇతను (దైవప్రవక్త – స) అల్లాహ్‌కు వ్యతిరేకంగా అబద్ధం కల్పించాడని వారంటున్నారా?" అల్లాహ్‌యే గనక తలిస్తే నీ హృదయానికి సీలు వేస్తాడు.[49] అల్లాహ్ అసత్యాన్ని చెరిపివేసి,[50] సత్యాన్ని తన వచనాల ద్వారా సత్యంగా నిలిపి ఉంచుతాడు. ఆయన ఆంతర్యాల్లో దాగివున్న విషయాలను సైతం ఎరిగినవాడు.

أَمْ يَقُولُونَ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا ۖ فَإِن يَشَإِ اللَّهُ يَخْتِمْ عَلَىٰ قَلْبِكَ ۗ وَيَمْحُ اللَّهُ الْبَاطِلَ وَيُحِقُّ الْحَقَّ بِكَلِمَاتِهِ ۚ إِنَّهُ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ﴿٢٤﴾

25 ఆయనే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు,[51] వారి తప్పులను మన్నిస్తాడు. మీరు చేసేదంతా ఆయనకు తెలుసు.

وَهُوَ الَّذِي يَقْبَلُ التَّوْبَةَ عَنْ عِبَادِهِ وَيَعْفُو عَنِ السَّيِّئَاتِ وَيَعْلَمُ مَا تَفْعَلُونَ ﴿٢٥﴾

26 ఆయన విశ్వసించి, సదాచరణ చేసే వారి (విన్నపాల)ని వింటాడు.[52] తన కృపతో వారికి మరింతగా అనుగ్రహిస్తాడు. మరి అవిశ్వాసులకేమో చాలా కఠిన శిక్ష పడుతుంది.

وَيَسْتَجِيبُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ وَيَزِيدُهُم مِّن فَضْلِهِ ۚ وَالْكَافِرُونَ لَهُمْ عَذَابٌ شَدِيدٌ ﴿٢٦﴾

(బంధుత్వ సంబంధం)ను కనీసం కొనసాగనివ్వండి" (సహీహ్ బుఖారీ – సూరయే షూరా వ్యాఖ్యానం). దైవప్రవక్త (సఅసం) వారి వంశం ముమ్మాటికీ ఉత్తమ వంశమే. ఆ వంశం పట్ల గౌరవాదరణలను కలిగి ఉండటం, ప్రేమాభిమానాలను వ్యక్తపరచటం ఈమాన్ (విశ్వాసం)లో అంతర్భాగమే. ఇందులో సందేహానికి ఆస్కారమే లేదు. ఆ మేరకు దైవప్రవక్త (సఅసం) వారు సయితం తన అనుచర సమాజానికి గట్టిగా తాకీదు చేశారని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. అయితే షియా వర్గీయులు ఈ ఆయతును మహాప్రవక్త (సఅసం) సంతతితో జోడించటం సరైనది కాదు. మరి ఆ సంతతిని కూడా వారు హజ్రత్ అలీ, ఫాతిమా, హసన్ హుసైన్‌లకే పరిమితం చేశారు. అంతేకాదు, ప్రేమాభిమానాల పేరుతో వారు వారిని దైవిక గుణాలను సంతరించుకున్న వారుగా అభివర్ణించారు. అదలా ఉంచితే బంధుత్వ సంబంధాలను ఖాతరు చేయమని మహాప్రవక్త (సఅసం) మక్కాలోని ఖురైష్‌లను కోరినప్పుడు హజ్రత్ అలీ – ఫాతిమాల వివాహమే కాలేదు. మరలాంటప్పుడు ఈ ఆయతును మహాప్రవక్త (స) వారసులకు అన్వయింపజేయటంలో అర్థమే లేదు కదా!

47. అంటే అతని పుణ్యఫలాన్ని ఎన్నోరెట్లు పెంచుతాము. లేదా ఒక సత్కార్యం తర్వాత మరెన్నో సత్కార్యాలు చేసే సద్బుద్ధిని అతనికి వొసగుతాము.

48. అందుకే ఆయన తన దాసుల లోపాలను మరుగుపరుస్తూ, వారిని మన్నిస్తూనే, వారు చేసిన కొద్దిపాటి మంచికి ఎన్నో రెట్ల ప్రతిఫలం ఇచ్చి ప్రోత్సహిస్తాడు.

49. అంటే, (ఓ ప్రవక్తా!) నీపై వారు చేస్తున్న ఆరోపణలో ఏమాత్రం నిజమున్నా మేము నీ హృదయానికి తాళంవేసి ఉండేవారం. ఆ విధంగా నువ్వు శాశ్వితంగా ఖుర్ఆన్ జ్ఞానానికి నోచుకోకుండా పోయేవాడివి. అంటే మేము నిన్ను కఠినంగా శిక్షించేవారము.

50. ఈ అసత్యాగ్రేసరులు నిందిస్తున్నట్లుగా ఈ ఖుర్ఆనే గనక అసత్యమై ఉంటే దేవుడు శాశ్వతంగా దీనిని రూపుమాపి ఉండేవాడు.

51. పశ్చాత్తాపం (తౌబా) అంటే జరిగిన తప్పులపై, పాపకార్యాలపై సిగ్గుతో కుమిలిపోవటం, ఇక మీదట ఎన్నడూ వాటిజోలికి పోనని దృఢంగా సంకల్పించుకోవటం. కేవలం నోటితో పశ్చాత్తాపం ప్రకటించినంత మాత్రాన, రెండు చేతుల్తో లెంపలేసుకున్నంత మాత్రాన అది నిజమైన పశ్చాత్తాపం అయిపోదు. పైగా అదొక ప్రహసనం అవుతుంది. సిసలైన పశ్చాత్తాపాన్ని (**'తౌబతున్నసూహా'**ను) అల్లాహ్ ఎంతగానో ఇష్టపడతాడు.

52. అంటే వారి మొరలను ఆలకిస్తాడు. వారి కోరికలను తీరుస్తాడు. అయితే దుఆ ధర్మసమ్మతమైనదిగా, నియమబద్ధ

**27** మరి అల్లాహ్ గనక తన దాసులందరికీ పుష్కలంగా ఉపాధిని ప్రసాదిస్తే వారు భువిలో చెలరేగిపోతారు.[53] కాని ఆయన మాత్రం ఒక లెక్క ప్రకారం – తాను కోరినదాన్ని అవతరింపజేస్తూ ఉంటాడు. తన దాసుల సంగతిని ఆయన బాగా ఎరిగినవాడు. (ఆయన వారిని) గమనిస్తూ ఉన్నాడు.

وَلَوْ بَسَطَ اللَّهُ الرِّزْقَ لِعِبَادِهِ لَبَغَوْا فِي الْأَرْضِ
وَلَٰكِن يُنَزِّلُ بِقَدَرٍ مَّا يَشَاءُ ۚ إِنَّهُ بِعِبَادِهِ
خَبِيرٌ بَصِيرٌ ﴿27﴾

**28** ప్రజలు ఆశలన్నీ వదులుకున్న మీదట (ఆకాశం నుంచి) వర్షాన్ని కురిపించేవాడు ఆయనే.[54] ఆయనే తన కారుణ్యాన్ని వ్యాపింపజేస్తున్నాడు. ఆయనే కార్యసాధకుడు, ప్రశంస నీయుడు.[55]

وَهُوَ الَّذِي يُنَزِّلُ الْغَيْثَ مِن بَعْدِ مَا قَنَطُوا
وَيَنشُرُ رَحْمَتَهُ ۚ وَهُوَ الْوَلِيُّ الْحَمِيدُ ﴿28﴾

**29** భూమ్యాకాశాల సృష్టి, వాటిలో ప్రాణుల సర్వవ్యాప్తి కూడా ఆయన నిదర్శనాలలోనివే. మరి తాను కోరినప్పుడు వారందరినీ సమీకరించే శక్తి కూడా ఆయనకుంది.[56]

وَمِنْ آيَاتِهِ خَلْقُ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا بَثَّ
فِيهِمَا مِن دَابَّةٍ ۚ وَهُوَ عَلَىٰ جَمْعِهِمْ إِذَا
يَشَاءُ قَدِيرٌ ﴿29﴾

**30** మీపై ఏ ఆపదలొచ్చిపడినా, అవి మీ చేజేతులా చేసుకున్న చేష్టల (పాపాల) ఫలమే. ఆయనైతే (వాటిలో) చాలా విషయా లను మన్నిస్తూ ఉంటాడు.[57]

وَمَا أَصَابَكُم مِّن مُّصِيبَةٍ فَبِمَا كَسَبَتْ
أَيْدِيكُمْ وَيَعْفُو عَن كَثِيرٍ ﴿30﴾

---

మైనదిగా ఉండాలి. హదీసులో ఇలా ఉంది: ఒక వ్యక్తి ఎడారి ప్రదేశంలో తన వాహనాన్ని పోగొట్టుకున్నాడు. అతని అన్న పానీయాలు, ప్రయాణ సామగ్రి కూడా ఆ వాహనంపై ఉన్నాయి. అతను నిరాశతో ఓ చెట్టు క్రింద చతికిల బడ్డాడు. అకస్మాత్తుగా అతని వాహనం (ఒంటె) అతని ముందు వచ్చి నిలబడింది. ఆ క్షణంలో అతను చెందిన ఆనందం అంతా ఇంతా కాదు. సంతోషాతిశయంతో అతను, "ఓ అల్లాహ్! నువ్వు నా దాసుడివి. నేను నీ ప్రభువును" అంటాడు. విపరీతమైన ఆనందంతో అతని మాటలు తడబడతాయి. తప్పుచేసి తన వైపునకు పశ్చాత్తాపభావంతో తిరిగివచ్చే దాసుని పట్ల దేవుడు ఇంతకన్నా ఎక్కువగానే సంతోషిస్తాడు. (సహీహ్ ముస్లిం – కితాబుత్తౌబా).

53. అంటే – దేవుడు ప్రతి ఒక్కరికీ అక్కరకు మించిన సౌలభ్యాలను, అంతస్తులను ప్రసాదిస్తే వ్యవహారం బెడిసికొడుతుంది. ***ఏ ఒక్కరూ ఇంకొకరి అధీనంలో ఉండి పని చేయడానికి అంగీకరించరు.*** ఎవరికి వారే తమను సర్వాధిపతిగా ఊహించుకుంటారు. పర్యవసానంగా అరాచకం ఏర్పడుతుంది.

54. ఒనరులలో అత్యంత ముఖ్యమైనది జల సంపద. ఎందుకంటే రకరకాల పంటలకు, పండ్లకు, వ్యవసాయోత్పత్తులకు మూలాధారం వర్షపు నీరు. తీవ్రమైన నిరీక్షణ తర్వాత, మానవుడు నిరాశానిస్పృహలకు లోనైన పిమ్మట ఈ కారుణ్య జల్లు కురిస్తే దాని విలువ మరింతగా పెరిగిపోతుంది. తన దాసులు దైవానుగ్రహాల విలువను గుర్తించి, కృతజ్ఞతాపూర్వకంగా మసలుకుంటారని దేవుడు ఒక్కోసారి ఈ విధంగా పరీక్షిస్తూ ఉంటాడు.

55. **'కార్యసాధకుడు'** అంటే పనులన్నీ చక్కదిద్దేవాడు, వ్యవహారాలన్నింటినీ చూసుకునేవాడు, వినాశకర పరిణామాల నుంచి రక్షించేవాడు అని భావం. ఇన్ని మేళ్లను చేసేవాడు మరి నిస్సందేహంగా ప్రశంసనీయుడు కదా!

56. **'దాబ్బతున్'** అంటే భూమిపై సంచరించే ప్రాణి అని అర్థం. ఈ పదంలో మానవులు, జిన్నులు, జంతుజాలం అన్నీ వచ్చేస్తాయి. వాటి రంగు వేరు, స్వభావం వేరు, జాతులు వేరు, భాషలు వేరు, జీవన విధానం వేర్వేరుగా ఉంటాయి. అవన్నీ దేవుని ఈ భూమండలంలో విస్తరించి ఉన్నాయి. కాని అల్లాహ్ ప్రళయదినాన అందరినీ – ఒకే మైదానంలో– సమావేశపరుస్తాడు.

**31** మీరు భూమిలో (పారిపోయి) మమ్మల్ని లొంగదీయటం అనేది జరగని పని.[58] మీకు అల్లాహ్ తప్ప మరో కార్య సాధకుడు గానీ, సహాయకుడుగానీ లేడు.

وَمَآ اَنۡتُمۡ بِمُعۡجِزِيۡنَ فِى الۡاَرۡضِ ۖۚ وَمَا لَـكُمۡ
مِّنۡ دُوۡنِ اللّٰهِ مِنۡ وَّلِىٍّ وَّلَا نَصِيۡرٍ ﴿31﴾

**32** సముద్రంలో నడిచే పర్వతాల్లాంటి ఓడలు (కూడా) ఆయన నిదర్శనాలలోనివే.[59]

وَمِنۡ اٰيٰتِهِ الۡجَوَارِ فِى الۡبَحۡرِ كَالۡاَعۡلَامِؕ ﴿32﴾

**33** ఆయన గనక తలచుకుంటే గాలిని స్థంభింపజేయగలడు. అప్పుడు ఆ ఓడలు సముద్రంపైనే నిలిచిపోతాయి. నిశ్చయంగా ఇందులో సహనం వహించే, కృతజ్ఞులై ఉండే ప్రతి ఒక్కరి కొరకు సూచనలున్నాయి.

اِنۡ يَّشَاۡ يُسۡكِنِ الرِّيۡحَ فَيَظۡلَلۡنَ رَوَاكِدَ عَلٰى
ظَهۡرِهٖ ؕ اِنَّ فِىۡ ذٰلِكَ لَاٰيٰتٍ لِّـكُلِّ صَبَّارٍ شَكُوۡرٍۙ ﴿33﴾

**34** లేదా (ఆయన) వారి దురాగతాల మూలంగా వారిని ముంచివేసినా (ఆశ్చర్యం లేదు).[60] ఆయన మటుకు (వారి) తప్పులెన్నింటినో మన్నిస్తూ ఉంటాడు.[61]

اَوۡ يُوۡبِقۡهُنَّ بِمَا كَسَبُوۡا وَيَعۡفُ عَنۡ كَثِيۡرٍ ۙ ﴿34﴾

57. ఈ వాక్యం విశ్వాసులను ఉద్దేశించి చెప్పబడి ఉంటే, దీని అర్థం ఇది : మీపై వచ్చిన కష్టాలు మీరు చేసిన కొన్ని పాపాలకు పరిహారంగా పనిచేస్తాయి. మరికొన్ని పాపాలను అల్లాహ్ ఇట్టే మన్నిస్తాడు. ఎందుకంటే అల్లాహ్ గొప్ప ఉదాత్తుడు. ఆయన ఏ విషయంలోనయినా ఒకసారి మన్నించాడంటే మరి ఆ విషయంపై పరలోకంలో నిలదీసి అడగటమనేది ఉండదు –

"విశ్వాసికి, ఏ బాధ కలిగినా, ఏ దుఃఖం కలిగినా తుదకు అతని కాలికి ముల్లు గుచ్చుకున్నాసరే – తత్కారణంగా అల్లాహ్ అతని పాపాలను మన్నిస్తాడు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ మర్జా; ముస్లిం – కితాబుల్ బిర్ర్)

ఒకవేళ సర్వసాధారణ భావంలో ఈ ఆయతును తీసుకుంటే దీని అర్థం ఇది : ప్రపంచంలో మీపై ఏ కడగండ్లు వచ్చిపడినా అవన్నీ మీ స్వయంకృతాల ఫలితమే. మరి చూడబోతే అల్లాహ్ చాలామటుకు మీ తప్పిదాలను మన్నించి వదలిపెట్టేస్తూ ఉంటాడు. ఆయన గొప్ప క్షమాగుణం కలవాడు. ప్రతి చిన్న విషయానికి ఆయన మిమ్మల్ని పట్టుకోదలిస్తే ఇక మీరు బ్రతికి బట్టకట్టలేరు. ఈ మాటే దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట ఇలా అనబడింది : "అల్లాహ్ గనక ప్రజల అకృత్యాలపై అప్పటికప్పుడే పట్టుకోవటం మొదలెడితే ధరణిపై సంచరించే ఏ ప్రాణీ మిగిలి ఉండదు" (ఫాతిర్ – 45). దాదాపు ఇదే భావం గల మరో ఆయతు అన్ నహ్ల్ సూరా (61)లో ఉంది.

58. అంటే, మీరు ఎక్కడికి పారిపోయి ఆశ్రయం పొందినా మా పట్టునుంచి తప్పించు కోలేరు. మేము మీకు విధించదలచిన శిక్ష మీకు పడి తీరుతుంది.

59. **'జవారి'** (**الْجَوَارِ**) అంటే 'నడిచేవి' అని అసలు అర్థం. సముద్రంలో నడిచే పర్వతాల్లాంటి వాహనాలంటే అవి ఓడలే (నౌకలే). ఇవి దేవుని నిదర్శనాలలోనివే. దైవాజ్ఞతోనే అవి నడుస్తున్నాయి. దైవచిత్తం కానట్లయితే అవి సముద్రంలో నిలిచిపోతాయి. లేక ముంపుకు గురవుతాయి. ఆలోచించే వారి కోసం ఇది కూడా ఓ గొప్ప పాఠమే.

60. దైవాజ్ఞతో సముద్రంలో వాయుగుండం ఏర్పడినా, సముద్ర కెరటాలు కసితీరా విజృంభించినా ఈ పెద్ద పెద్ద ఓడలు దేనికీ పనికిరావు సుమా!

61. దేవుడు మన్నించి వదిలేస్తున్నాడు గనకనే వారు తీరం దాటగలుగుతారు. లేకపోతే వారిలో ఏ ఒక్కరి జాడ కూడా తెలియకుండా పోతుంది.

**35** మా సూచనల విషయంలో జగడం చేసేవారికి,[62] తాము పారి
పోయి ఆశ్రయం పొందే చోటు ఏదీ లేదని తెలిసివచ్చేలా చేయ
టానికి (మేమీ విధంగా చేస్తాము).[63]

وَيَعْلَمَ الَّذِينَ يُجَادِلُونَ فِي آيَاتِنَا مَا لَهُم مِّن مَّحِيصٍ ﴿٣٥﴾

**36** మరి మీకు ఏది ఇవ్వబడినా అది ప్రాపంచిక జీవితపు (తాత్కా
లిక) సంపద మాత్రమే.[64] అల్లాహ్ దగ్గర ఉన్నది ఇంతకన్నా
మేలైనది,[65] శాశ్వితమైనది. విశ్వసించి, కేవలం తమ ప్రభువును
నమ్ముకునేవారికి మాత్రమే అది లభిస్తుంది.

فَمَا أُوتِيتُم مِّن شَيْءٍ فَمَتَاعُ الْحَيَاةِ الدُّنْيَا ۖ وَمَا عِندَ اللَّهِ خَيْرٌ وَأَبْقَىٰ لِلَّذِينَ آمَنُوا وَعَلَىٰ رَبِّهِمْ يَتَوَكَّلُونَ ﴿٣٦﴾

**37** (మరి ఈ భాగ్యవంతుల గుణగణాలు ఎటువంటివంటే) వారు
పెద్ద పెద్ద పాపాలకు, నీతిమాలిన చేష్టలకు దూరంగా ఉంటారు.
కోపం వచ్చినప్పుడు (కూడా) క్షమిస్తారు.[66]

وَالَّذِينَ يَجْتَنِبُونَ كَبَائِرَ الْإِثْمِ وَالْفَوَاحِشَ وَإِذَا مَا غَضِبُوا هُمْ يَغْفِرُونَ ﴿٣٧﴾

**38** ఇంకా, వారు తమ ప్రభువు ఆజ్ఞను శిరసావహిస్తారు.[67]
నమాజును నెలకొల్పుతారు.[68] వారి (ప్రతి) పని పరస్పర సలహా
సంప్రతింపుల ద్వారా జరుగుతుంది.[69] మేము వారికి ప్రసాదిం
చిన దానిలో నుంచి (మా పేరున) ఖర్చుపెడతారు.

وَالَّذِينَ اسْتَجَابُوا لِرَبِّهِمْ وَأَقَامُوا الصَّلَاةَ وَأَمْرُهُمْ شُورَىٰ بَيْنَهُمْ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ﴿٣٨﴾

62. అంటే మా సూచనలను తిరస్కరించే వారికి....

63. పారిపోయి, ఎక్కడైనా తలదాచుకున్నంత మాత్రాన వారు గండం నుంచి గట్టెక్కారని అనుకోరాదు.

64. అంటే అది అత్యల్పమైనది. అది ఖారూన్ ఖజానా అంతగా ఉన్నాసరే దాన్ని చూసి మురిసిపోకూడదు. మోసపోకూడదు. అది తాత్కాలికం. నశ్వరం.

65. అల్లాహ్ సన్నిధిలో లభించే పుణ్యఫలం ఈ ప్రాపంచిక సిరిసంపదలకన్నా ఎన్నో రెట్లు అధికం, ఉత్తమం. శాశ్వితం కూడా. ఎందుకంటే అది ఎన్నడూ అరిగిపోదు, కరిగిపోదు. కాబట్టి మీరు పరలోకంపై ఇహలోకానికి ప్రాముఖ్యత ఇవ్వకండి. పొద్దస్తమానం ప్రపంచం వెనకాలే పరుగెత్తారంటే చివరకు బాధపడాల్సి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త!

66. అంటే సాటి జనుల పట్ల మన్నింపుల వ్యవహారం చేయటం వారి నైజంలో అంతర్భాగం అన్నమాట! వారు ప్రతీకారేచ్ఛను బలవంతంగా దిగమ్రింగేస్తారు. అంతిమ దైవప్రవక్త (స) వారి స్వభావం గురించి హదీసులో ఇలా అనబడింది : "దైవప్రవక్త (సఅసం) తన స్వవిషయంలో ఎవరిపైనా ఎన్నడూ ప్రతీకారం తీర్చుకోలేదు. అయితే ఎవరయినా అల్లాహ్ పవిత్రం గావించిన (నిషేధించిన) వాటిని అతిక్రమిస్తే మాత్రం ఆయన సహించలేక పోయేవారు." (బుఖారీ – కితాబుల్ అదబ్; ముస్లిం – కితాబుల్ ఫజాయెల్).

67. అంటే దైవాదేశాలకు తల ఒగ్గుతారు. వాటిని ఖచ్చితంగా పాటిస్తారు. దైవప్రవక్త(స) మార్గాన్ని అనుసరిస్తారు. దేవుడు నిషేధించిన అంశాలకు దూరంగా ఉంటారు.

68. నిర్ణీత నమాజులను సకాలంలో చేస్తారు. ఇంకా సామూహిక నమాజులో పాల్గొంటారు. నమాజులను స్థాపిస్తారని ఇక్కడ ప్రత్యేకంగా చెప్పటాన్నిబట్టి ఇస్లాం ధర్మంలో నమాజుకు గల ప్రాధాన్యత ఎంతటిదో విదితమవుతోంది.

69. అంటే విశ్వాసులు తమ ముఖ్యమైన వ్యవహారాలలో పరస్పరం సంప్రదించుకుంటారు. తమ అభిప్రాయమే సరైనదని, తమ వాక్కే తుది వాక్కని హఠం చేయరు. ముస్లింలతో సంప్రతించమని అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (స)ను సయితం ఆదేశించాడంటే (ఆలి ఇమ్రాన్ – 159) సామాజిక వ్యవస్థలో ***'సలహామండలి'***కి ఎంతటి ప్రాముఖ్యత

| | |
|---|---|
| **39** తమపై దౌర్జన్యం జరిగినప్పుడు, ప్రతీకారం మటుకు తీర్చు కుంటారు.[70] | وَالَّذِينَ إِذَآ أَصَابَهُمُ الْبَغْيُ هُمْ يَنتَصِرُونَ ﴿٣٩﴾ |

ఉందో స్పష్టమవుతోంది. అందుకే మహాప్రవక్త (స) వారు యుద్ధసమయాలలో, కీలక వ్యవహారాలలో తన అనుచరుల సలహా తీసుకునేవారు. ఈ సలహా సంప్రతింపుల ద్వారా సహచరుల ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. పరస్పర నమ్మకాలు పెరుగుతాయి. ఒక విషయానికి సంబంధించిన ఎన్నో కోణాలు ముందుకు వస్తాయి.

ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) బరిసెపోటుకు గురై చరమ ఘడియల్లో ఉన్నప్పుడు, తన వారసుని (తృతీయ ఖలీఫా) ఎంపిక నిమిత్తం ఆరుగురు సభ్యులతో కూడిన ఒక సలహా మండలిని ఏర్పరచుకోమని సూచించారు. ఆ సలహా మండలిలో ఉస్మాన్, అలీ, తల్హా, జుబైర్, సాద్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి అల్లాహు అన్హు)లు సభ్యులు. వారు పరస్పరం సంప్రతించుకోవటమే గాక, ఉమ్మత్‌లోని పలువురు ప్రముఖులను, మేధావులను కూడా సంప్రతించిన మీదట హజ్రత్ ఉస్మాన్ (రజి)ను తృతీయ ఖలీఫా (రజి)గా ఎంపిక చేశారు.

ఈ 'సలహా సంప్రతింపుల్ని' ప్రాతిపదికగా చేసుకుని కొంతమంది విద్వాంసులు రాజరిక వ్యవస్థను ఖండిస్తూ, ప్రజాస్వామిక వ్యవస్థ ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. అయితే రాజరిక వ్యవస్థలో కూడా 'సలహా సంప్రతింపులు' ఉంటాయి. రాజుకు కూడా ఒక సలహామండలి ఉంటుంది. ప్రతి కీలక వ్యవహారంపై రాజు తన సలహామండలితో సంప్రదిస్తాడు. తీవ్రంగా తర్జనభర్జన జరుగుతుంది. అందువల్ల ఈ ఆయతు ద్వారా రాజరిక వ్యవస్థ త్రోసిపుచ్చబడిందని తేల్చి చెప్పటం సరైంది కాదు. అదలావుంచితే ప్రజాస్వామ్యాన్ని సలహా సంప్రతింపుల భావంలో తీసుకోవటం కూడా పొరపాటే. 'సలహా' అనేది దారినపోయే ప్రతి దానయ్యతోనూ, పైలాపచ్చీసులా ప్రవర్తించే ప్రతి పుల్లయ్యతోనూ తీసుకోబడదు. మరీ అంత అవస్థపడి సలహాలు తీసుకోవలసిన ఆవశ్యకత కూడా లేదు. ఏదేని విషయంలోని ఉచితానుచితాలను ఎరిగిన వారినుంచి, సమకాలీన పరిస్థితులపై, అవసరాలపై నిశితదృష్టిగల విజ్ఞుల నుంచి సలహా తీసుకోవటం సమంజసం. ఉదాహరణకు : ఒక భవనాన్ని నిర్మించాలన్నా, ఒక పెద్ద వంతెనను కట్టాలన్నా ఇంజినీరును సంప్రదిస్తారేగాని ఏ టైలర్‌నో, రిక్షాలాగేవాడినో సంప్రతించరు. రోగనిర్ధారణ కోసం వైద్యుణ్ణి సంప్రతిస్తారే తప్ప ఇతరులను సంప్రతించరు.

కాని ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రాజ్ఞ వయస్సుకు చేరిన ప్రతి వ్యక్తినీ సలహాదారునిగా పరిగణించటం పరిపాటి అయి పోయింది – అతనికి రాజకీయ పరిజ్ఞానం లేకపోయినా, అతడు నిరక్షరకుక్షి అయినా, చైతన్యం లేని వాడైనాసరే! అందుకే నేడు ప్రజాస్వామ్య దేశాలలో సలహా సంప్రతింపులు ఒక ప్రహసనంగా తయారయ్యాయి. ప్రజాస్వామ్యం 'మూకల పాలన' (Rule of Mob) గా మారిపోయింది. ఎలక్షన్ల పేరిట అక్కడ జరిగే బందిపోటులు, కుమ్ములాటలు, రిగ్గింగులు, బేరసారాలు లోకానికి తెలియనివి కావు. ఏవిధంగానయితే 'సోషలిజం' అనే పదానికి ముందు 'ఇస్లాం'ను తగిలించినంత మాత్రాన అది ఇస్లామీయ సోషలిజం కాజాలదో, అదేవిధంగా 'ప్రజాస్వామ్యం'లో 'ఇస్లామీ' అతుకును వేసినంత మాత్రాన ఒక్కసారిగా పాశ్చాత్య ప్రజాస్వామ్యం ఖిలాఫత్ పోకడలను సంతరించుకోజాలదు. పాశ్చాత్య గడ్డపై పుట్టి పెరిగిన ఈ తరహా మొక్క ఇస్లామీయ వ్యవస్థలో కూడా వ్రేళ్లూనుకుంటుందనుకోవటం సరైంది కాదు.

70. అంటే ప్రతీకారం తీర్చుకోవటానికి వారు వెనుకాడనవసరం లేదు. వారు కోరితే ప్రతీకారం తీర్చుకోవచ్చు. అయినాసరే వారు – అదుపు అధికారం ఉండి కూడా – మన్నింపుల వైఖరికి ప్రాధాన్యత ఇస్తారు. మక్కా విజయం సందర్భంగా మహాప్రవక్త ముహమ్మద్ (స) చంపతగిన శత్రువులను సయితం క్షమించి వదలిపెట్టడం దీనికి ఒక మచ్చుతునక. హుదైబియాలో ఆయన (స) తనకు వ్యతిరేకంగా కుట్రపన్నిన 80 మందికి కూడా క్షమాభిక్ష పెట్టారు. తనపై చేతబడి చేసిన లబీద్ బిన్ ఆసిమ్‌ను సయితం ఆయన ఉపేక్షించారు. తనకు విందు భోజనంలో విషం కలిపిపెట్టిన యూద స్త్రీని కూడా ఆయన (స) వదలిపెట్టేశారు. మరి చూడబోతే ఆ విష ప్రభావం జీవితాంతం ఆయనపై కనిపించేది – సల్లల్లాహు అలైహి వ సల్లం. (ఇబ్నె కసీర్).

**40** అపకారానికి బదులు అటువంటి అపకారమే.[71] కాని ఎవరయినా (ప్రత్యర్థిని) క్షమించి, సయోధ్యకు వస్తే అతనికి పుణ్య ఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది. ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్ దుర్మార్గులను ప్రేమించడు.

وَجَزٰٓؤُا سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا ۚ فَمَنْ عَفَا وَاَصْلَحَ
فَاَجْرُهٗ عَلَى اللّٰهِ ؕ اِنَّهٗ لَا يُحِبُّ الظّٰلِمِيْنَ ﴿٤٠﴾

**41** తనకు అన్యాయం జరిగిన మీదట ఎవరైనా (సరిసమానంగా) ప్రతీకారం తీర్చుకుంటే, అలాంటి వారిపై (నిందలు మోపే) మార్గమేదీ లేదు.

وَلَمَنِ انْتَصَرَ بَعْدَ ظُلْمِهٖ فَاُولٰٓئِكَ مَا عَلَيْهِمْ مِّنْ
سَبِيْلٍ ﴿٤١﴾

**42** ఇతరులపై దౌర్జన్యానికి ఒడిగట్టి, అకారణంగా భువిలో అరాచకాన్ని సృష్టించేవారిని మాత్రమే (నిందార్హులుగా నిలబెట్టే) మార్గముంటుంది. అలాంటి వారికోసం బాధాకరమైన శిక్ష ఉంది.

اِنَّمَا السَّبِيْلُ عَلَى الَّذِيْنَ يَظْلِمُوْنَ النَّاسَ وَيَبْغُوْنَ
فِى الْاَرْضِ بِغَيْرِ الْحَقِّ ؕ اُولٰٓئِكَ لَهُمْ عَذَابٌ
اَلِيْمٌ ﴿٤٢﴾

**43** మరెవడయినా సహనం వహించి, క్షమాభిక్షపెడితే, నిస్సందేహంగా అది సాహసోపేతమైన పనులలో (ఒకటిగా) పరిగణించ బడుతుంది.

وَلَمَنْ صَبَرَ وَغَفَرَ اِنَّ ذٰلِكَ لَمِنْ عَزْمِ الْاُمُوْرِ ﴿٤٣﴾

**44** అల్లాహ్ ఎవరినయినా దారితప్పిస్తే, ఇక ఆ తరువాత అతన్ని ఆదుకునే వాడెవడూ ఉండడు. మరి నువ్వే చూద్దువు గాని, దుర్మార్గులు శిక్షను చూచినపుడు, "మేము తిరిగి వెళ్ళే మార్గం ఏదైనా ఉందా?!" అని అంటూ ఉంటారు.

وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ وَّلِيٍّ مِّنْ بَعْدِهٖ ؕ
وَتَرَى الظّٰلِمِيْنَ لَمَّا رَاَوُا الْعَذَابَ يَقُوْلُوْنَ
هَلْ اِلٰى مَرَدٍّ مِّنْ سَبِيْلٍ ﴿٤٤﴾

**45** ఇంకా నువ్వే చూస్తావు–వాళ్లు (నరకం) ఎదుట తేబడినప్పుడు, అవమాన భారంతో కృంగిపోతుంటారు. దొంగ చూపులు చూస్తుంటారు. అప్పుడు విశ్వాసులు ఇలా అంటారు: "ఈ ప్రళయదినాన తమ స్వయాన్ని, తమ ఇంటివారలను నష్టానికి గురిచేసినవారే వాస్తవానికి నష్టం పొందినవారు." నిశ్చయంగా దుర్మార్గులు శాశ్విత యాతనలో[72] పడి ఉన్నారని తెలుసుకోండి.

وَتَرٰىهُمْ يُعْرَضُوْنَ عَلَيْهَا خٰشِعِيْنَ مِنَ الذُّلِّ
يَنْظُرُوْنَ مِنْ طَرْفٍ خَفِيٍّ ؕ وَقَالَ الَّذِيْنَ اٰمَنُوْۤا
اِنَّ الْخٰسِرِيْنَ الَّذِيْنَ خَسِرُوْۤا اَنْفُسَهُمْ وَاَهْلِيْهِمْ
يَوْمَ الْقِيٰمَةِ ؕ اَلَاۤ اِنَّ الظّٰلِمِيْنَ فِيْ عَذَابٍ
مُّقِيْمٍ ﴿٤٥﴾

71. అంటే ఖిసాస్‌కు (ప్రతీకారం తీర్చుకునేందుకు) అనుమతి ఇవ్వబడింది. అపకారికి ప్రతీకారం చేయటం 'అపకారం' కాదుగాని, మాటవరుసకు దాన్ని కూడా ఆయతులో 'అపకారం'గా పేర్కొనటం జరిగిందంతే!

72. ఈ అవిశ్వాసులు మమ్మల్ని చూసి ఇకిలించేవారు. మమ్మల్ని మూర్ఖుల కింద జమకట్టే వారు. ఏరికోరి మేము ప్రాపంచిక నష్టాన్ని కొనితెచ్చుకుంటున్నామని ఎద్దేవా చేసేవారు. కాని మేము ఎన్నడూ అలా చేయలేదు. కాకపోతే ప్రాపంచిక జీవితంపై పారలౌకిక జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేవారం. ప్రాపంచిక కష్టనష్టాలను పెద్దగా లెక్కచేసేవాళ్లం కాము. కాని ఈనాడు అసలు సిసలు నష్టానికి ఎవరు గురయ్యారో చూడండి! ఆనాడు తాత్కాలికమైన ప్రాపంచిక నష్టాలను పట్టించుకోకుండా పరలోకంపై దృష్టిని కేంద్రీకరించిన వారు ఈనాడు హాయిగా స్వర్గసుఖాలను ఆస్వాదిస్తు

**46** అల్లాహ్ తప్ప వారిని ఆదుకునే మిత్రులెవరూ ఉండరు. అల్లాహ్ దారి తప్పించినవారికి మరేమార్గమూ ఉండదు.

وَمَا كَانَ لَهُمْ مِّنْ اَوْلِيَآءَ يَنْصُرُوْنَهُمْ مِّنْ دُوْنِ
اللّٰهِ ؕ وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ سَبِيْلٍ ﴿46﴾

**47** (ప్రజలారా!) తప్పించనలవికాని ఆ రోజు అల్లాహ్ తరఫున రాకమునుపే, మీ ప్రభువు ఆజ్ఞను శిరసావహించండి.[73] ఆ రోజు మీకు ఏ ఆశ్రయమూ లభించదు, దాక్కొని ఆగంతకుల్లా వ్యవహరించేందుకు తగినచోటు కూడా దొరకదు.[74]

اِسْتَجِيْبُوْا لِرَبِّكُمْ مِّنْ قَبْلِ اَنْ يَّاْتِيَ يَوْمٌ
لَّا مَرَدَّ لَهٗ مِنَ اللّٰهِ ؕ مَا لَكُمْ مِّنْ مَّلْجَاٍ
يَّوْمَئِذٍ وَّمَا لَكُمْ مِّنْ نَّكِيْرٍ ﴿47﴾

**48** (ఓ ప్రవక్తా!) ఒకవేళ వారు గనక ముఖం త్రిప్పుకుంటే, మేము నిన్ను వారిపై కావలివానిగా చేసి పంపలేదు సుమా! సందేశాన్ని అందజేయటం వరకే నీ బాధ్యత.[75] మేము మనిషికి మా కారుణ్యం రుచిని చూపించినపుడు[76] అతడు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బైపోతాడు.[77] ఒకవేళ వారిపై వారి స్వయంకృతాల మూలంగా ఏదైనా ఆపద వచ్చిపడితే,[78] మానవుడు మా మేలు నంతా మరచిపోతాడు.[79]

فَاِنْ اَعْرَضُوْا فَمَآ اَرْسَلْنٰكَ عَلَيْهِمْ حَفِيْظًا ؕ
اِنْ عَلَيْكَ اِلَّا الْبَلٰغُ ؕ وَاِنَّآ اِذَآ اَذَقْنَا الْاِنْسَانَ
مِنَّا رَحْمَةً فَرِحَ بِهَا ۚ وَاِنْ تُصِبْهُمْ سَيِّئَةٌ ۢ
بِمَا قَدَّمَتْ اَيْدِيْهِمْ فَاِنَّ الْاِنْسَانَ كَفُوْرٌ ﴿48﴾

న్నారు. మరోవంక – ప్రపంచమే సర్వస్వం అనుకుని, ప్రాపంచిక సుఖాలను జుర్రుకోవటంలో తలమునకలై ఉన్నవారు ఈనాడు యాతనకు గురయ్యారు. ఇక దాన్నుంచి బయటపడే మార్గాంతరమే లేదు.

73. అంటే ఆ రోజును తొలగించే, లేక దాన్నుంచి తప్పించుకునే శక్తి ఎవరికీ లేదు.

74. మీరు తలదాచుకుని, అపరిచిత వ్యక్తుల్లా వ్యవహరించే చోటేదీ మీకు దొరకదు. "ఆనాడు మానవుడు 'పారిపోవటానికి ఏదైనా స్థలం ఉందా?' అనంటాడు. లేదు, పారిపోవటానికి ఏ ఆశ్రయమూ ఉండదు. ఆ రోజు నీ ప్రభువు వద్దకే పోయి ఆగవలసి ఉంటుంది" (అల్ ఖియామ : 10-12). లేక **'నకీర్'** (نكير) అనే పదం నిరాకరణ అన్న భావంలో కూడా ప్రయోగించబడి ఉండవచ్చు. అంటే, ఆనాడు మీరు మీ పాపాలను కాదనలేరు. ఎందుకంటే అవన్నీ లిఖించబడి ఉంటాయి. అదీగాక, మనిషి శరీరావయవాలు స్వయంగా అతనికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి. లేక మీ పాపకార్యాల కారణంగా మీకు విధించబడే శిక్షను మీరు నిరాకరించలేరు. ఆనాడు పాపాలను ఒప్పుకోవటం వినా మార్గాంతరం ఉండదు.

75. దివ్య ఖుర్ఆన్‌లో ప్రవక్త (స) నుద్దేశించి ఈ మాటను దేవుడు పలుచోట్ల పలు విధాలుగా చెప్పాడు. ఉదాహరణకు:

1. "(ఓ ప్రవక్తా!) ప్రజలను సన్మార్గాన నడిపించే బాధ్యత నీపై లేదు. తాను కోరిన వారిని అల్లాహ్‌యే సన్మార్గాన నడిపిస్తాడు." (అల్ బఖర : 272).

2. "సందేశం అందజేయటం మీ బాధ్యత. లెక్క తేల్చటం మా పని." (రాద్ : 40)

3. "కాబట్టి (ఓ ప్రవక్తా!) నువ్వు వారికి బోధపరుస్తూ ఉండు. నువ్వు బోధపరుస్తూ ఉండేవాడివి మాత్రమే. వారిపై బలవంతం చేసేవాడవు కావు" (అల్ ఘాషియ – 21, 22).

పై వాక్యాలన్నింటి భావం ఒక్కటే. వాళ్లు నీ మాటను విన్నా, వినకపోయినా నిన్ను నిలదీసి అడగటం జరగదు. నీ వరకు నీ బాధ్యతను సజావుగా నిర్వర్తించు, చాలు. ఎందుకంటే సన్మార్గాన్ని అనుగ్రహించే అధికారం అల్లాహ్ చేతుల్లో ఉంది.

76. అంటే వారి పాడిపంటలు పొంగిపొర్లినప్పుడు, వారు పిల్లా జల్లా సమేతంగా సుఖసంతోషాలతో ఉన్నప్పుడు, వారికి పదవులు లభించినపుడు....

77. వారి మాటల్లో, చేతల్లో గర్వం తొణికిసలాడుతుంది. దైవానుగ్రహాలపై సంతోషించటం, వాటిని వ్యక్తపరచటం తప్పు

49 భూమ్యాకాశాల సామ్రాజ్యం అల్లాహ్‌దే. (ఆయన) తాను కోరినది సృష్టిస్తాడు. తాను కోరినవారికి ఆడపిల్లల్ని ఇస్తాడు, తాను కోరిన వారికి మగపిల్లల్ని ఇస్తాడు.

لِلّٰهِ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ يَخْلُقُ مَا يَشَآءُ ؕ يَهَبُ لِمَنْ يَّشَآءُ اِنَاثًا وَّيَهَبُ لِمَنْ يَّشَآءُ الذُّكُوْرَ ﴿49﴾

50 లేదా వారికి మగపిల్లలను, ఆడపిల్లలను కలిపి ఇస్తాడు.[80] మరి తాను కోరిన వారిని సంతాన హీనులుగా చేసేస్తాడు. ఆయన మహాజ్ఞాని, సంపూర్ణ అధికారం కలవాడు.

اَوْ يُزَوِّجُهُمْ ذُكْرَانًا وَّاِنَاثًا ۚ وَيَجْعَلُ مَنْ يَّشَآءُ عَقِيْمًا ؕ اِنَّهٗ عَلِيْمٌ قَدِيْرٌ ﴿50﴾

51 ఏ మానవమాత్రునితోనూ, అల్లాహ్ (నేరుగా) సంభాషించటం అనేది జరగదు. అయితే వహీ ద్వారా లేదా తెర వెనుక నుంచీ లేదా ఒక దూతను పంపటం ద్వారా (ఇది సంభవమే). మరి ఆ దూత అల్లాహ్ ఆజ్ఞననుసరించి అల్లాహ్ కోరిన సందేశాన్ని (వహీ రూపంలో) అందజేస్తాడు.[81] నిశ్చయంగా ఆయన మహోన్నతుడు, వివేకవంతుడు.

وَمَا كَانَ لِبَشَرٍ اَنْ يُّكَلِّمَهُ اللّٰهُ اِلَّا وَحْيًا اَوْ مِنْ وَّرَآئِ حِجَابٍ اَوْ يُرْسِلَ رَسُوْلًا فَيُوْحِيَ بِاِذْنِهٖ مَا يَشَآءُ ؕ اِنَّهٗ عَلِيٌّ حَكِيْمٌ ﴿51﴾

కాదు. కాని ఆ 'వ్యక్తీకరణ'లో కూడా అణకువ, కృతజ్ఞతా భావం ఉట్టిపడాలి. ఎదుటివారిని కించపరిచే ఉద్దేశంగానీ, తమ బడాయిని చాటుకునే స్వభావంగానీ ఏ కోశానా ఉండకూడదు.

78. వ్యవసాయోత్పత్తులు తగ్గుముఖం పట్టినా, సంపాదనా మార్గాలు తగ్గినా, సంతానయోగం కలగకపోయినా, నిరంతరం రోగిష్టులుగా మారినా ... మనిషి ఆలోచనా ధోరణే మారిపోతుంది.

79. అప్పటి వరకూ మేము చేసిన మేళ్లన్నింటినీ విస్మరించి 'ప్రదాత' పైనే నిందలు నిష్ఠూరాలు మొదలెడతాడు. ప్రజా బాహుళ్యంలో ఇలాంటి 'బలహీన విశ్వాసం' గలవారే అధిక సంఖ్యలో ఉంటారు. కాని అల్లాహ్‌పై దృఢ విశ్వాసం గలవారు ఎన్నడూ ఈ విధంగా ప్రవర్తించరు. వారు కష్టకాలంలో ఓరిమితో వ్యవహరిస్తారు. కలిమి ప్రాప్తించినపుడు కృతజ్ఞత చూపుతారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచించినట్లు, "వారు సుఖం ప్రాప్తించినపుడు కృతజ్ఞులుగా వ్యవహరిస్తారు. తత్కారణంగా ఆ సుఖం వారి పాలిట శుభప్రదంగా పరిణమిస్తుంది. కష్టకాలం వచ్చినపుడు వారు ఓర్పు వహిస్తారు. ఫలితంగా అది వారి పాలిట శుభదాయకం అవుతుంది. ఈ విధంగా ఒక విశ్వాసి రెండు పరిస్థితులలోనూ మేలును పొందుతాడు. ఒక్క విశ్వాసికి మాత్రమే ఇది సాధ్యమవుతుంది" (సహీహ్ ముస్లిం - కితాబుజ్జుహ్ద్).

80. అంటే తాను తలచిన వారికి మగ సంతానాన్ని, ఆడ సంతానాన్ని కూడా ప్రసాదిస్తాడు. ఇక్కడ అల్లాహ్ నాలుగు వర్గాలవారిని గురించి ప్రస్తావించాడు. మొదటి వర్గానికి కేవలం కూతుళ్ళను, రెండవ వర్గానికి కేవలం కొడుకులను, మూడవ వర్గానికి కూతుళ్లను, కొడుకులను కూడా కలిపి ఇస్తాడు. ఇక నాల్గవ వర్గానికి చెందిన వారిని సంతాన హీనులుగా ఉంచేస్తాడు. వారికి ఆడపిల్లలుగానీ, మగపిల్లలుగానీ కలగరు. ప్రజల మధ్య గల ఈ వ్యత్యాసాలు, అంతరాలు కూడా దేవుని నిదర్శనాలలో ఒక నిదర్శనమే. ఈ వైవిధ్యాన్ని ప్రపంచంలోని ఏ శక్తీ మార్చజాలదు. సంతానానికి సంబంధించిన నాలుగు కోవలివి. ఇక తండ్రుల దృష్ట్యా చూసినా మానవుల్లో నాలుగు వర్గాలున్నాయి: అవేమంటే 1. హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)ను దేవుడు కేవలం మట్టితో సృజించాడు. ఆయనకు తల్లిగానీ, తండ్రిగానీ లేరు. 2. హజ్రత్ హవ్వాను ఆదం నుండి సృజించాడు. అంటే ఆమెకు తల్లిలేదు. 3. హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు - అలైహిస్సలాం)ను కేవలం తల్లి గర్భం నుంచి తీశాడు. ఆమెగారికి తండ్రి లేదు. 4. మిగిలిన మానవు లంతా తమ తల్లి - తండ్రుల కలయిక ద్వారా ఉనికిలోనికి తేబడ్డారు. అంటే వారికి అమ్మా నాన్నలిద్దరూ ఉన్నారు. **ఫ సుబ్‌హానల్లాహిల్ అలీమిల్ ఖదీర్** (ఇబ్నె కసీర్).

**52** అలాగే (ఓ ముహమ్మద్ – సఅసం!) మేము మా ఆజ్ఞతో నీ వద్దకు ఒక 'రూహ్' (ఆత్మ)ను పంపాము.[82] అంతకు ముందు నీకు గ్రంథమంటే ఏమిటో, విశ్వాసమంటే ఏమిటో తెలీదాయె.[83] కాని మేము దాన్ని జ్యోతిగా చేశాము. దాని ద్వారా మా దాసులలో మేము కోరిన వారికి సన్మార్గం చూపుతున్నాము.[84] నిస్సందేహంగా (ఓ ముహమ్మద్–స!) నువ్వు (ప్రజలకు) రుజుమార్గం వైపుకు దర్శకత్వం వహిస్తున్నావు...

وَكَذٰلِكَ اَوْحَيْنَآ اِلَيْكَ رُوْحًا مِّنْ اَمْرِنَا ؕ مَا كُنْتَ تَدْرِىْ مَا الْكِتٰبُ وَلَا الْاِيْمَانُ وَلٰكِنْ جَعَلْنٰهُ نُوْرًا نَّهْدِىْ بِهٖ مَنْ نَّشَآءُ مِنْ عِبَادِنَا ؕ وَاِنَّكَ لَتَهْدِىْٓ اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿52﴾

**53** ....భూమ్యాకాశాల్లోని సమస్తానికీ యజమాని అయిన అల్లాహ్ మార్గం వైపుకు[85] (నడిపిస్తున్నావు). తుదకు సమస్త వ్యవహారాలూ అల్లాహ్ వద్దకే చేరతాయి సుమా![86]

صِرَاطِ اللّٰهِ الَّذِىْ لَهٗ مَا فِى السَّمٰوٰتِ وَمَا فِى الْاَرْضِ ؕ اَلَآ اِلَى اللّٰهِ تَصِيْرُ الْاُمُوْرُ ﴿53﴾

81. ఈ ఆయతులో దైవసందేశాన్ని (వహీని) అందజేసే మూడు విధములు తెలుపబడ్డాయి. 1. ఏదైనా ఒక విషయాన్ని– ఇది అల్లాహ్ తరఫు నుంచే జరుగుతోందన్న గట్టి నమ్మకంతో– మనసులో నాటడం. లేదా కలలో విషయాన్ని తెలియజేయటం. 2. తెరవెనుక నుంచి సంభాషించటం. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఈ విధంగానే తూర్ పర్వతంపై అల్లాహ్‌తో సంభాషించారు. 3. దేవుడు తన దూత ద్వారా ప్రవక్త వద్దకు సందేశం పంపటం. హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఈ సందేశాన్ని ప్రవక్తల వద్దకు తెచ్చేవారు.

82. ఇక్కడ **'రూహ్'** (ఆధ్యాత్మిక శక్తి) అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం. 'ఓ ముహమ్మద్ (సఅసం)! నీకు పూర్వం మేము మా ప్రవక్తల వద్దకు సందేశాన్ని పంపినట్లే నీ వద్దకు ఈ ఖుర్ఆన్ గ్రంథాన్ని పంపాము' అని దేవుడు సెలవిచ్చాడు. దివ్య ఖుర్ఆన్‌ను ఒక ఆధ్యాత్మిక శక్తిగా, ఆత్మగా అభివర్ణించటంలోని మర్మం ఏమిటంటే ఈ గ్రంథం ద్వారా మానవ హృదయాలకు జీవం లభిస్తుంది. శరీరాలకు ఆత్మల వల్ల జీవం లభించినట్లు.

83. **'గ్రంథం'** అంటే 'ఖుర్ఆన్' అన్నమాట! అంటే (ఓ ముహమ్మద్ – సఅసం!) దైవదౌత్యం అందకముందు ఖుర్ఆన్ గ్రంథం గురించి కూడా నీకు తెలీదు. షరీయతులో విశదీకరించబడినట్లుగా ఈమాన్ (విశ్వాసం) భావార్థం నీకు కూడా తెలిసి ఉండేది కాదు.

84. అంటే మేము ఖుర్ఆన్ గ్రంథాన్ని **'జ్యోతి'**గా చేశాము. తద్వారా మేము మా దాసులలో మేము కోరిన వారికి సన్మార్గభాగ్యం ప్రసాదిస్తాము. దీని అర్థం ఏమిటంటే, దివ్య ఖుర్ఆన్ ద్వారా వారికి మార్గదర్శకత్వం లభిస్తుంది. విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించాలన్న తపన గలవారు ఈ గ్రంథాన్ని భక్తి శ్రద్ధలతో పారాయణం చేస్తారు. దానిపై చింతన చేస్తారు. అందువల్ల అడుగడుగునా అల్లాహ్ వారికి తోడ్పడతాడు. సన్మార్గాన్ని వారికోసం సులభతరం చేస్తాడు. వారి అవగాహనా శక్తిని పెంపొందిస్తాడు. వారి మనో నేత్రాన్ని మరింత తేజోవంతం చేస్తాడు. దీనికి భిన్నంగా పొద్దస్తమానం గుడ్డివారుగా వ్యవహరిస్తూ, చెవుల్లో దూదిపెట్టుకుని బుర్రను ఉపయోగించకుండా ఉండే వారికి సన్మార్గం ఎలా ప్రాప్తిస్తుంది? ఉదాహరణకు దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట చెప్పబడినట్లు : "ఈ ఖుర్ఆన్ విశ్వసించే వారికి మార్గదర్శిని, రోగనివారిణి. అయితే విశ్వసించని వారి చెవులకు ఇది భారం. వారి కళ్లకు ఇది గంత. వారి పరిస్థితి చాలా దూరం నుంచి వారిని కేకవేసి పిలిచినట్లుగా ఉంది." (హామీమ్ సజ్దా – 44)

85. ఆ మార్గమే రుజుమార్గం. అదే ఇస్లాం మార్గం. దాన్ని అల్లాహ్ తన మార్గంగా చెప్పుకోవటం వల్ల దాని ఔన్నత్యం మరింతగా పెరిగింది. ఆ మార్గమే శ్రేయస్కరమార్గం, ముక్తిమార్గం.

86. అంటే – ప్రళయదినాన అన్ని విషయాలపై నిర్ణయాధికారం అల్లాహ్ చేతుల్లో ఉంటుంది. ఈ వాక్యంలో తీవ్రమైన హెచ్చరిక అంతర్లీనమై ఉంది.

43వ సూరా

# అజ్ జుఖ్రుఫ్

## బంగారు ఆభరణాలు

అవతరణ మక్కాలో

ఆయతులు 89

### పరిచయం

ఏక దైవారాధన, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఇందులోని 35వ ఆయతులో బంగారు ఆభరణాల గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ప్రాపంచిక జీవితం తాత్కాలికమైనదని, మున్నాళ్ళ ముచ్చటని, ఇక్కడి బంగారు ఆభరణాలు శాశ్వతమైనవి కావని బోధించింది. ప్రాపంచిక జీవితం మంచివారికి, చెడ్డవారికి అందరికీ దక్కుతుందనీ, కాని పరలోక జీవితంలో సంతోషాలు కేవలం మంచివారికి మాత్రమే దక్కుతాయని, అవి శాశ్వతమైనవనీ తెలియజేసింది. దివ్యఖుర్‌ఆన్‌ను ఒక స్పష్టమైన గ్రంథంగా అభివర్ణిస్తూ ఈ సూరా ప్రారంభమయ్యింది. ఈ గ్రంథం పూర్తిగా వివేకంతో నిండి ఉందని, అయినప్పటికీ అవిశ్వాసులు దీనిని తిరస్కరిస్తున్నారనీ, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒక సాధారణ మానవ మాత్రుడైనందున ఆయన్ను దైవసందేశహరునిగా విశ్వసించడానికి నిరాకరిస్తున్నారనీ విమర్శించింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి ఆయన రుజుమార్గంపై ఉన్నారనీ, ఆయన తనకు అందజేయబడుతున్న సందేశానికి స్థిరంగా కట్టుబడాలనీ బోధిస్తూ, గతకాలాల ప్రవక్తలు ఏవిధంగా సత్యధర్మ ప్రచారానికి సంఘర్షించవలసి వచ్చిందో వివరించింది. వారిని కూడా ఆయా జాతుల ప్రజలు తిరస్కరించి, వారిపై దౌర్జన్యాలు చేశారని తెలియజేసింది.

ప్రజలు ఆరాధనల్లో చేస్తున్న ఘోరమైన తప్పిదాన్ని ఈ సూరా ఎత్తిచూపింది. ప్రజలు తమ తాతముత్తాతల విశ్వాసాలను గుడ్డిగా అనుసరిస్తున్నారని, ఆ విధంగా తాము అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే ఘోరమైన తప్పిదం చేస్తున్న విషయాన్ని కనీసం గుర్తించడం లేదని ఈ సూరా విమర్శించింది.

## సందర్భ వివరణలు 'ఖుర్‌ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్‌ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 46-56 | 83-117 | 'దైవప్రవక్త మూసా, ఇస్రాయీల్ జాతివారి విమోచన కర్త' | ఖుర్‌ఆన్‌లో అత్యధిక సార్లు ప్రస్తావనకు వచ్చిన గాథ ఇది. ఆ గాథ మొత్తం ఒకే చోట ధారావాహికంగా.... |
| 57-65 | 184-198 | 'మర్యమ్' 'ప్రవక్త ఈసా జననం' 'నేడు మనకు తెలిసిన క్రైస్తవ విశ్వాసాలు' | యూదులు మర్యమ్ తల్లిపై ఘోర అపనింద మోపారు. ఏమిటి ఆ అపనింద? ఈసా ప్రవక్తకు వారు పెట్టిన కష్టాలేమిటి? ఈసా ప్రవక్త జీవిత వాస్తవ విశేషాలేవి? యేసు ప్రవక్త శిలువ వేయబడ్డారా? లేక ఆకాశాలకు ఎత్తుకోబడ్డారా? |

## అజ్ జుఖ్‌రుఫ్ సూరా

## سُوْرَةُ الزُّخْرُفِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1 - 2** హా మీమ్. సుస్పష్టమైన (ఈ) గ్రంథం సాక్షిగా!

حٰمٓ ① وَالْكِتٰبِ الْمُبِيْنِ ②

**3** మీరు అర్థం చేసుకోవటానికిగాను మేము దీనిని అరబీ ఖురానుగా చేశాము.[1]

اِنَّا جَعَلْنٰهُ قُرْءٰنًا عَرَبِيًّا لَّعَلَّكُمْ تَعْقِلُوْنَ ③

**4** నిశ్చయంగా ఇది మాతృగ్రంథం (లౌహె మహ్‌ఫూజ్)లో ఉన్నది. మా వద్ద అది ఎంతో ఉన్నతమైన, వివేకంతో నిండిన గ్రంథంగా ఉన్నది.[2]

وَاِنَّهٗ فِيْٓ اُمِّ الْكِتٰبِ لَدَيْنَا لَعَلِيٌّ حَكِيْمٌ ④

**5** ఏమిటి? మీరు హద్దు మీరిపోయే జనులైనందున మేము ఈ ఉపదేశాన్ని మీ నుంచి మళ్లించాలా?[3]

اَفَنَضْرِبُ عَنْكُمُ الذِّكْرَ صَفْحًا اَنْ كُنْتُمْ
قَوْمًا مُّسْرِفِيْنَ ⑤

**6** మేము పూర్వీకులలో కూడా ఎంతోమంది ప్రవక్తల్ని పంపించాము.

وَكَمْ اَرْسَلْنَا مِنْ نَّبِيٍّ فِي الْاَوَّلِيْنَ ⑥

**7** తమ వద్దకు ఏ ప్రవక్త వచ్చినా వారు అతన్ని పరిహసించకుండా వదల్లేదు.

وَمَا يَاْتِيْهِمْ مِّنْ نَّبِيٍّ اِلَّا كَانُوْا بِهٖ يَسْتَهْزِءُوْنَ ⑦

---

1. అరబీ భాష ప్రపంచంలోకెల్లా అత్యంత తేటమైన భాష. అదీగాక అది తొలుత అరబ్బు వాతావరణంలో అవతరించింది. అందువల్ల వారికి సులభగ్రాహ్యంగా ఉండేందుకు దాన్ని అరబీలోనే పంపవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉండింది.

2. దివ్య ఖుర్‌ఆన్ యొక్క ఔన్నత్యం, వైశిష్ట్యం గురించి ఇక్కడ చెప్పబడింది. ఊర్ధ్వ లోకాలలోనే – ప్రభువు సన్నిధిలో – దానికి గొప్ప విలువ ఉన్నందున భూవాసులు కూడా సదా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, ఈ ఉద్గ్రంథం పట్ల ఉత్తమ రీతిలో వ్యవహరించాలని, దీనిద్వారా మార్గదర్శకత్వం పొందుతూ ఉండాలని దీని భావం. 'ఉమ్ముల్ కితాబ్' (మాతృ గ్రంథం) అంటే 'లౌహె మహ్‌ఫూజ్' అన్నమాట!

3. ఈ వాక్యంలో పలు భావాలు ఇమిడి ఉన్నాయి : ఉదాహరణకు : 1. మీరు అనునిత్యం పాపాలలో మునిగితేలుతున్నారు. అందుకని మీకు బోధపరచటం మానుకోవాలన్నది మీ అభిమతమా? 2.లేదా మీరెంతగా చెలరేగిపోయినా, తిరస్కారవైఖరిపై మొండికేసినా మేము మిమ్మల్ని చూసీ చూడనట్లుగా వ్యవహరించాలన్నది మీ ఉద్దేశమా? 3. లేదా మిమ్మల్ని చంపేసినా ఫరవాలేదు గాని మీకు ఎలాంటి నిషేధాజ్ఞలు జారీ చేయరాదన్నది మీ మనోగతమా? 4. లేదా మీరెలాగూ ఖుర్‌ఆన్‌ను నమ్మటం లేదు కాబట్టి మేము దీని అవతరణా క్రమాన్ని నిలిపివేయాలన్నది మీ అభిప్రాయమా?– వీటిలో మొదటి భావార్థాన్ని ఇమామ్ తబ్రీ సమర్థించగా, చివరి భావార్థానికి ఇమామ్ ఇబ్నె కసీర్ ప్రాధాన్యమిచ్చారు. ఆయన ఇలా అన్నారు: "నిరంతరం ప్రజలు ఖుర్‌ఆన్ పట్ల విసుగును, విముఖతను ప్రదర్శించినా ఆయన (దేవుడు) వివేచనతో నిండిన ఖుర్‌ఆన్ అవతరణను నిలుపకుండా దాన్ని పరిపూర్తి గావించటం ఆయన దయాదాక్షిణ్యాలకు ప్రతిరూపం. సన్మార్గం రాసిపెట్టిన వారు ఆ భాగ్యాన్ని ఆస్వాదించ గలిగేందుకు, మార్గవిహీనులని రాసిపెట్టి ఉన్నవారిపై బాధ్యత తీర్చుకునేందుకు దేవుడు ఈ ఏర్పాటు చేశాడు."

فَأَهْلَكْنَآ أَشَدَّ مِنْهُم بَطْشًا وَمَضَىٰ مَثَلُ الْأَوَّلِينَ ⑧

8 మేము వీళ్ళకన్నా ఎక్కువ ఘటికులనే పట్టుకొని అంత మొందించాము.[4] పూర్వీకుల దృష్టాంతాలు గడచిఉన్నాయి.[5]

وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَ السَّمَٰوَٰتِ وَالْأَرْضَ لَيَقُولُنَّ خَلَقَهُنَّ الْعَزِيزُ الْعَلِيمُ ⑨

9 "భూమ్యాకాశాలను సృష్టించినదెవరు?" అని నువ్వు గనక వారిని ప్రశ్నిస్తే, "సర్వశక్తుడు, సర్వజ్ఞాని అయినవాడే (అల్లాహ్‌యే) సృష్టించాడ"ని[6] వారు తప్పకుండా సమాధానమిస్తారు.

الَّذِي جَعَلَ لَكُمُ الْأَرْضَ مَهْدًا وَجَعَلَ لَكُمْ فِيهَا سُبُلًا لَّعَلَّكُمْ تَهْتَدُونَ ⑩

10 ఆయనే మీకోసం భూమిని పాన్పుగా చేశాడు.[7] మీరు మార్గం తెలుసుకోగలగటానికి అందులో మీ కోసం దారులను ఏర్పరచాడు.[8]

وَالَّذِي نَزَّلَ مِنَ السَّمَآءِ مَآءًۢ بِقَدَرٍ فَأَنشَرْنَا بِهِۦ بَلْدَةً مَّيْتًا ۚ كَذَٰلِكَ تُخْرَجُونَ ⑪

11 మరి ఆయనే ఒక లెక్క ప్రకారం[9] ఆకాశం నుంచి నీళ్ళను కురిపించాడు. ఆ విధంగా మేము దాంతో (ఆ నీటితో) సచ్చిన సీమను బ్రతికించాము. మీరూ (సమాధుల నుండి) అలాగే వెలికి తీయబడతారు.[10]

وَالَّذِي خَلَقَ الْأَزْوَٰجَ كُلَّهَا وَجَعَلَ لَكُم مِّنَ الْفُلْكِ وَالْأَنْعَٰمِ مَا تَرْكَبُونَ ⑫

12 ఆయన వస్తువులన్నింటికీ జతలను సృష్టించాడు.[11] మరి మీ కోసం ఓడలను, పశువులను (కూడా) చేశాడు. వాటిపై మీరు ఎక్కిపోతుంటారు.

4. అంటే వారు ఈ మక్కావాసులకన్నా గట్టివారు. బలిష్ఠులు. మరోచోట చెప్పబడినట్లు, "వారు సంఖ్యాపరంగానూ, బలపరాక్రమాల రీత్యాను వీళ్లకన్నా ఎక్కువే." (మోమిన్ – 82).

5. అంటే దివ్య ఖుర్‌ఆన్‌లో ఆ జాతుల గాథలు ఎన్నోచోట్ల ఉపమానంగా ప్రస్తావించబడ్డాయి. ఇది మక్కా వారికి వార్నింగ్ అన్నమాట. ప్రవక్తలను ధిక్కరించిన కారణంగా వెనుకటి జాతుల వారు నాశనమయ్యారు. ఒకవేళ వీరు గనక తమ ధిక్కార వైఖరిని మానుకోకపోతే వీళ్లకూ అదే గతి పడుతుంది.

6. మరి ఈ యదార్థాన్ని ఒప్పుకుంటూనే ఈ మూర్ఖులు ఎన్నో సృష్టితాలను సృష్టికర్తకు భాగస్వాములుగా కల్పించారు. ఈ విధంగా తెలిసి తెలిసి వారెటువంటి ఘోర తప్పిదం చేస్తున్నారో, వారి మూర్ఖత్వం ఏపాటిదో ఈ వాక్యం ద్వారా బోధపడుతోంది.

7. ఆ పాన్పు భలే స్థిరమైనది. మీరు దానిపై నిలబడతారు. నడుస్తారు. దానిపై పండుకుంటారు. ప్రయాణాలు చేస్తారు. ఆ నేల (పాన్పు) అటూ ఇటూ దొర్లిపోకుండా ఉండటానికి అందులో ఆయన పర్వతాలను మేకులుగా పాతిపెట్టాడు.

8. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి, ఒక రాజ్యం నుంచి ఇంకో రాజ్యానికి సాగిపోవటానికి అనువుగా అందులో త్రోవలను ఏర్పరచాడు. తద్వారా మీరు వర్తకం చేస్తారు. దైవకృపను అన్వేషిస్తారు. మరెన్నో విధమైన మీ జీవనావసరాలను తీర్చుకుంటారు.

9. మీ అవసరాలకనుగుణంగా ఆయన వర్షం కురిపిస్తున్నాడు. దానికన్నా తక్కువ వర్షం పడితే అది మీ కొరకు ప్రయోజనకరం కాజాలదు. మరీ ఎక్కువ వర్షం కురిపిస్తే మీ పంటలు మునిగిపోతాయి. మీ బ్రతుకు దుర్భరమైపోతుంది.

13 మీరు వాటి వీపులపై ఎక్కి,[12] ఆ తర్వాత వాటి మీద సర్దుకుని కూర్చున్నప్పుడు మీ ప్రభువు అనుగ్రహాన్ని స్మరిస్తారని (ఇదంతా చేశాము). మీరు ఇలా పలకండి: "దీనిని మాకు వశపరచినవాడు పరమ పవిత్రుడు. లేకపోతే దీనిని వశపరచుకోవటం మావల్ల అయ్యేపనికాదు.[13]

لِتَسْتَوٗا عَلٰی ظُهُوْرِهٖ ثُمَّ تَذْكُرُوْا نِعْمَةَ رَبِّكُمْ اِذَا اسْتَوَیْتُمْ عَلَیْهِ وَ تَقُوْلُوْا سُبْحٰنَ الَّذِیْ سَخَّرَ لَنَا هٰذَا وَمَا كُنَّا لَهٗ مُقْرِنِیْنَ ⑬

14 "నిశ్చయంగా మేము (ఎట్టకేలకు) మా ప్రభువు వద్దకు మరలిపోవలసిన వారమే."[14]

وَاِنَّاۤ اِلٰی رَبِّنَا لَمُنْقَلِبُوْنَ ⑭

15 ఇంకా వీళ్లు అల్లాహ్ దాసులలో కొందరిని ఆయన భాగంగా చేశారు.[15] నిజంగా మానవుడు చాలా స్పష్టంగా కృతఘ్నుతకు పాల్పడతాడు.

وَجَعَلُوْا لَهٗ مِنْ عِبَادِهٖ جُزْءًا ؕ اِنَّ الْاِنْسَانَ لَكَفُوْرٌ مُّبِیْنٌ ؕ⑮

16 ఏమిటి, అల్లాహ్ తాను సృష్టించిన వారిలో నుంచి కూతుళ్ళను తన కోసం కేటాయించుకుని, మీకేమో కొడుకులను అనుగ్రహించాడా?[16]

اَمِ اتَّخَذَ مِمَّا یَخْلُقُ بَنٰتٍ وَّ اَصْفٰىكُمْ بِالْبَنِیْنَ ⑯

10. ఏ విధంగానయితే దేవుడు వర్షపు నీటి ద్వారా మృతభూమిని పులకింపజేస్తున్నాడో అదేవిధంగా ఆయన మిమ్మల్ని ప్రళయదినాన సమాధుల నుంచి బ్రతికించి లేపుతాడు.

11. అంటే ప్రతిదానికి ఆడ – మగ అనే జంటను సృష్టించాడు. మనుషులు, జంతువులు, వృక్షాలు మొదలగువాటిలో ఈ ఆడ – మగలున్నాయి.
మరి కొంతమంది విద్వాంసుల ప్రకారం ఇక్కడ జతలంటే పరస్పర వ్యతిరేక వస్తువులు. ఉదాహరణకు : చీకటి – వెలుతురు, ఆరోగ్యం – అనారోగ్యం, న్యాయం – అన్యాయం, మేలు – కీడు, విశ్వాసం – అవిశ్వాసం, సులభం – కఠినం ఇత్యాదివి. మరికొందరి అభిప్రాయం ప్రకారం 'రకాలు' అన్న అర్థంలో ఈ పదం వాడబడింది. ఏది ఏమైనా వీటన్నింటికీ కర్త ఒక్కడే – ఆయనే అల్లాహ్!

12. అంటే ఆ వాహనాలపై ఎక్కినప్పుడు లేక వాటి వీపులపై స్థిరంగా కూర్చున్నప్పుడు...

13. నువ్వే గనక ఈ పశువులను (వాహనాలను) మా అదుపాజ్ఞలలో ఉంచకపోతే మా అంతట మేముగా వీటిని లొంగదీసుకోలేకపోయేవాళ్ళం. మా ఉద్దేశాలకనుగుణంగా వీటిని ఉపయోగించుకోలేక పోయేవాళ్ళం.

14. దైవప్రవక్త (సఅసం) వాహనమెక్కినపుడు మూడుసార్లు 'అల్లాహు అక్బర్' అని పలికి, ఆ తరువాత **"సుబ్హానల్లజీ సఖ్ఖర లనా హాజా వమాకున్నా లహూ ముఖ్రినీన్. వ ఇన్నా ఇలా రబ్బినా లమున్ఖలిబూన్"** అనే ఆయతును పఠించేవారు. తరువాత క్షేమాన్ని కోరుతూ దుఆ చేసేవారు. దుఆ పుస్తకాలలో ఇవి ఉన్నాయి (సహీహ్ ముస్లిం – కితాబుల్ హజ్జ్)

15. ఇక్కడ **'దాసులు'** (ఇబాద్) అంటే దైవదూతలని భావం. 'భాగం' అంటే 'దేవుని కుమార్తెలు'. బహుదైవారాధకులు దైవదూతలను దేవుని కుమార్తెలుగా ఖరారుచేసి, వారిని పూజించేవారు. ఆ విధంగా వాళ్లు దేవునిచే సృష్టించబడిన వారిని 'దేవుని భాగం'గా నమ్మేవారు. యదార్థానికి దేవుడు ఇలాంటి వాటన్నింటికీ అతీతుడు, పవిత్రుడు. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం, ఇక్కడ దేవుని భాగమంటే మొక్కుబడులు చెల్లించుకునేందుకు ముష్రిక్కులు ప్రత్యేకించే బలిపశువులు. వారు ఒక భాగాన్ని అల్లాహ్ పేరుమీద, ఇంకొక భాగాన్ని దేవతల పేరు మీద వేర్వేరుగా కేటాయించేవారు. దీని గురించిన ప్రస్తావన అల్ అన్ఆమ్ సూరా 136వ ఆయతులో ఉంది.

**17** మరి వారిలో ఎవరికయినా, కరుణామయుడైన అల్లాహ్‌కు అతను అంటగట్టిన ఉపమానం అతనికే కలిగిందనే శుభవార్తను అందజేస్తే అతని ముఖంపై చీకటి ఆవరిస్తుంది. ఆపై అతను దుఃఖించసాగుతాడు.

وَإِذَا بُشِّرَ أَحَدُهُم بِمَا ضَرَبَ لِلرَّحْمَٰنِ مَثَلًا ظَلَّ
وَجْهُهُۥ مُسْوَدًّا وَهُوَ كَظِيمٌ ﴿17﴾

**18** ఏమిటీ, ఆభరణాల మధ్య పెరిగి, వాదోపవాదాలలో (తన మాటను) స్పష్టంగా విడమరచి చెప్పలేని (ఆడ సంతానం అల్లాహ్ వాటాలోనికి వస్తుందా?)[17]

أَوَمَن يُنَشَّؤُا۟ فِى ٱلْحِلْيَةِ وَهُوَ فِى ٱلْخِصَامِ
غَيْرُ مُبِينٍ ﴿18﴾

**19** కరుణామయుని (అల్లాహ్) దాసులైన దైవదూతలను వీళ్లు ఆడవారుగా ఖరారు చేశారు. ఏమిటి, వారి పుట్టుక సందర్భంగా వీళ్ళుగాని అక్కడ ఉన్నారా? వీళ్ల ఈ సాక్ష్యం వ్రాసుకోబడుతుంది. (దీని గురించి) వీళ్లు తప్పకుండా నిలదీసి అడగబడతారు.[18]

وَجَعَلُوا۟ ٱلْمَلَٰٓئِكَةَ ٱلَّذِينَ هُمْ عِبَٰدُ ٱلرَّحْمَٰنِ إِنَٰثًا ۚ
أَشَهِدُوا۟ خَلْقَهُمْ ۚ سَتُكْتَبُ شَهَٰدَتُهُمْ
وَيُسْـَٔلُونَ ﴿19﴾

**20** "కరుణామయుడు (అయిన అల్లాహ్) తలచి ఉంటే మేము వాళ్ళను పూజించేవారం కాము" అని (వీళ్లు కబుర్లు) చెబుతున్నారు. దీనికి సంబంధించి వీరికసలు ఏమీ తెలీదు.[19] అవి కేవలం వీళ్ల ఊహాగానాలు మాత్రమే.

وَقَالُوا۟ لَوْ شَآءَ ٱلرَّحْمَٰنُ مَا عَبَدْنَٰهُم ۗ مَّا لَهُم
بِذَٰلِكَ مِنْ عِلْمٍ ۖ إِنْ هُمْ إِلَّا يَخْرُصُونَ ﴿20﴾

16. ముష్రిక్కుల అజ్ఞానానికి, అపసవ్యమైన పంపకానికి ఇదొక మచ్చుతునకగా పేర్కొనబడింది. ఓ ముష్రిక్కులారా! మీరు దైవానికి ఆపాదించినా ఏ సంతానాన్ని ఆపాదించారు? ఆడ సంతానాన్ని ఆపాదిస్తారా? మీరు ఇష్టపడని ఆడపిల్లల్ని దేవుని వాటా క్రింద చేర్చి, మీకోసమేమో మగపిల్లల్ని కోరుకుంటారా? అని దేవుడు ప్రశ్నిస్తున్నాడు.

17. ఈ ఆయతులో స్త్రీల రెండు ముఖ్య గుణాలు ప్రస్తావించబడ్డాయి. 1. వారు ఆభరణాలు, అలంకారాల వాతావరణంలో పుట్టి పెరుగుతారు. అంటే కాస్తంత లోకజ్ఞానం కలిగేసరికే వారు అందచందాల పట్ల, ఆభరణాల పట్ల అమితంగా శ్రద్ధాసక్తులు కనబరుస్తారు. అందువల్ల వారు స్వయంకృషిపై అంతగా దృష్టిని కేంద్రీకరించరు. 2. ఎప్పుడైనా ఎవరితోనయినా సంవాదన జరపవలసి వచ్చినప్పుడు సరిగ్గా – సూటిగా – తమ మనోభావాన్ని వ్యక్తపరచలేరు. ప్రత్యర్థి విమర్శలను సరిగ్గా త్రిప్పికొట్టలేరు. ఇవి స్త్రీల సహజసిద్ధమైన బలహీనతలు. వీటిమూలంగానే పురుషులకు స్త్రీలపై ఒకింత ఆధిక్యత ఉంది. బహుశా ఈ కారణాలవల్లనే ఆనాడు ఆడపిల్లలకన్నా మగపిల్లలను ప్రజలు ఇష్టపడేవారు. ఈ జాడ్యం ఈనాడు కూడా ఉందికదా! ఎవరి కార్యక్షేత్రాలు వారికి అనే వాస్తవాన్ని తెలుసుకుంటే ఈ బాధలు ఉండవు.

18. ఎందుకంటే వాళ్లను శిక్షించటానికి ఈ 'విచారణ' జరపటం అవసరం. దైవదూతలు ఆడవాళ్లు అని చెప్పటానికి కావలసిన ఆధారాలేమీ వాళ్ల దగ్గర ఉండవు.

19. దేవుని అభిమతం గురించి వాళ్ళకేం తెలుసు? వాళ్ళంతట వాళ్లుగా ఈ 'తలంపు'ను దైవానికి ఆపాదించారు. ఎందుకంటే ఈ 'లాజిక్' వాళ్ళకు తేరగా వచ్చింది. దేవుని తలంపు లేకుండా ఏ పనీ జరగదన్నది వాస్తవమే. కాని ఇంతకీ దేవుని తలంపు ఏమిటో వారికి బొత్తిగా తెలీదు. దేవుని తలంపు వేరు, దైవప్రసన్నత వేరు. ప్రతి పనీ దేవుని తలంపుతోనే జరుగుతుంది గాని, దేవుడు తాను ఆదేశించిన పనులతోనే ప్రసన్నుడవుతాడు. మనిషి తన ఇష్టానుసారం చేసుకుపోయే పనులను దేవుడు మెచ్చడు. ఉదాహరణకు : మనిషి దౌర్జన్యం చేస్తాడు, దొంగతనానికి పాల్పడతాడు.

**21** ఏమిటి, దీనికి మునుపు మేము వారికి ఏదైనా (వేరే) గ్రంథం ఇచ్చి ఉన్నామా? దాన్ని గాని వారు గట్టిగా పట్టుకొని ఉన్నారా?[20]

أَمْ آتَيْنَاهُمْ كِتَابًا مِّن قَبْلِهِ فَهُم بِهِ مُسْتَمْسِكُونَ ﴿٢١﴾

**22** అది కాదు, "మా తాతముత్తాతలు ఒకానొక పద్ధతిపై ఉండటం మేము చూశాము. మేము వాళ్ల అడుగుజాడలలోనే నడుచుకుని సన్మార్గం పొందాము" అని వారు బుకాయిస్తారు.

بَلْ قَالُوا إِنَّا وَجَدْنَا آبَاءَنَا عَلَىٰ أُمَّةٍ وَإِنَّا عَلَىٰ آثَارِهِم مُّهْتَدُونَ ﴿٢٢﴾

**23** ఇలాగే నీకు మునుపు మేము ఏ బస్తీలో హెచ్చరించేవాణ్ణి పంపినా అక్కడి శ్రీమంతులు కూడా, "మేము మా తాత ముత్తాతలను ఒక పద్ధతిపై ఉండటం చూశాము. మేము కూడా వారి పాదచిహ్నాలలోనే నడుస్తాము" అని చెప్పేవారు.

وَكَذَٰلِكَ مَا أَرْسَلْنَا مِن قَبْلِكَ فِي قَرْيَةٍ مِّن نَّذِيرٍ إِلَّا قَالَ مُتْرَفُوهَا إِنَّا وَجَدْنَا آبَاءَنَا عَلَىٰ أُمَّةٍ وَإِنَّا عَلَىٰ آثَارِهِم مُّقْتَدُونَ ﴿٢٣﴾

**24** "మీ తాతముత్తాతలు అనుసరిస్తుండగా మీరు చూసిన మార్గం కంటే చాలా మంచి మార్గాన్ని (గమ్యానికి చేర్చే మార్గాన్ని) నేను మీ వద్దకు తీసుకువచ్చాను" అని (దైవప్రవక్త) అన్నప్పుడు, "మీకిచ్చి పంపబడిన పద్ధతిని మేము తిరస్కరిస్తున్నాం" అని వాళ్లు (తెగేసి) చెప్పారు.[21]

قٰلَ أَوَلَوْ جِئْتُكُم بِأَهْدَىٰ مِمَّا وَجَدتُّمْ عَلَيْهِ آبَاءَكُمْ ۖ قَالُوا إِنَّا بِمَا أُرْسِلْتُم بِهِ كَافِرُونَ ﴿٢٤﴾

**25** అందుకే మేము వారిపై ప్రతీకారం తీర్చుకున్నాము. మరి ధిక్కరించిన వారికి పట్టిన గతేమిటో చూడు!

فَانتَقَمْنَا مِنْهُمْ ۖ فَانظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُكَذِّبِينَ ﴿٢٥﴾

నీతి బాహ్యమైన పనులకు ఒడిగడతాడు. ఇతరులను దోచుకుంటాడు. దేవుడే గనక తలిస్తే, ఈ పాపిష్టి పనులు చేసే శక్తి, స్వేచ్ఛ ఏ మనిషికీ ఉండదు. వెంటనే దేవుడు అతని చేతులను కట్టి పడేయగలడు. అతని కాళ్ళకు బంధాలు వేయగలడు. అతని కంటి చూపును జప్తు చేసుకోగలడు. కాని ఇవన్నీ 'బలాత్కారం' క్రిందికి వస్తాయి. కాగా; దేవుడు మనిషికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఇచ్చి ఉన్నాడు. స్వేచ్ఛాధికారాన్ని ప్రసాదించి మరీ పరీక్షిస్తున్నాడు. అందుకే రెండు రకాల పనులను, వాటి పరిణామాలను గురించి ముందుగానే తెలియపరచటం జరిగింది. ఏ పనులను దేవుడు ఇష్టపడతాడో, ఏ పనులను ఇష్టపడడో కూడా ఎరుకపరచటం జరిగింది. ఈ రెండు రకాల పనులలో మనిషి దేన్ని చేసినా దేవుడు – అప్పటికప్పుడే – అతన్ని పట్టుకోడు. కాని మనిషి తప్పుడు పనులను చేస్తుంటే మాత్రం దేవుడు అప్రసన్నుడవుతాడు. ఎందుకంటే మనిషి తనకివ్వబడిన **'ఎంపిక స్వేచ్ఛ'**ను దుర్వినియోగపరిచాడు గనక! అయితే ఆ స్వేచ్ఛాధికారాన్ని మాత్రం దేవుడు ఆ మనిషి నుంచి తిరిగి లాక్కోడు. కాకపోతే అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు – పునరుత్థాన దినాన – అతన్ని శిక్షించి తీర్తాడు.

20. అంటే, దివ్య ఖుర్‌ఆన్‌కు పూర్వం–దైవేతరులను పూజించమని చెప్పే గ్రంథం ఏదైనా మేము వారికి ఇచ్చి ఉన్నామా? (లేదు కదా!) తమ తాతముత్తాతల పోకడలను ఘనకార్యాలుగా తలపోసి వాటిని గుడ్డిగా అనుసరించటం ఒక్కటే వాళ్ళకు తెలుసు. అంతకుమించి వాళ్ల వద్ద ఏ ఆధారమూ లేదు.

21. తమ పూర్వీకుల ఆచార దురాచారాలను అనుసరించటంలో వారు ఆరితేరినవారు. అందుకే దైవప్రవక్తల ప్రబోధనలు కూడా వాళ్ళ బుర్రకెక్కలేదు. 'అంధానుసరణ' ఎంత జటిలంగా రూపుదాలుస్తుందో దీనివల్ల విదితమవుతోంది (దీనిపై మరిన్ని వివరాలకు అల్లామా షౌకానీచే విరచితమైన 'ఫత్‌హుల్ ఖదీర్'ను చూడండి).

**26** ఇబ్రాహీము తన తండ్రితోనూ, తన జాతి వారితోనూ పలికినప్పటి విషయం (స్మరించదగినది. ఆయన ఇలా అన్నాడు): “మీరు పూజించే వాటి నుంచి నేను వేరైపోయాను.

وَإِذْ قَالَ إِبْرَٰهِيمُ لِأَبِيهِ وَقَوْمِهِۦٓ إِنَّنِى بَرَآءٌ مِّمَّا تَعْبُدُونَ ﴿٢٦﴾

**27** “నన్ను పుట్టించిన వానిని మాత్రమే (నేను ఆరాధిస్తాను). ఆయనే నాకు సన్మార్గం చూపుతాడు.”[22]

إِلَّا ٱلَّذِى فَطَرَنِى فَإِنَّهُۥ سَيَهْدِينِ ﴿٢٧﴾

**28** మరి ఇబ్రాహీము ఈ మాటే – తన తదనంతరం – తన సంతానంలో మిగిలి ఉండేట్లుగా చేసి వెళ్ళాడు[23] – ప్రజలు (షిర్క్ నుంచి) మరలిరావటానికి.[24]

وَجَعَلَهَا كَلِمَةًۢ بَاقِيَةً فِى عَقِبِهِۦ لَعَلَّهُمْ يَرْجِعُونَ ﴿٢٨﴾

**29** పైగా నేను వారికీ, వారి పితామహులకు జీవన సామగ్రిని విరివిగా ప్రసాదించాను[25] – చివరికి వారి వద్దకు సత్యం వచ్చే సింది. అన్నింటినీ విడమరచి చెప్పే ప్రవక్త కూడా వచ్చేశాడు.[26]

بَلْ مَتَّعْتُ هَٰٓؤُلَآءِ وَءَابَآءَهُمْ حَتَّىٰ جَآءَهُمُ ٱلْحَقُّ وَرَسُولٌ مُّبِينٌ ﴿٢٩﴾

**30** తీరా సత్యం వచ్చేశాక, “ఇదొక ఇంద్రజాలం. దీన్ని మేము త్రోసిపుచ్చుతున్నాం” అని వారు చెప్పేశారు.[27]

وَلَمَّا جَآءَهُمُ ٱلْحَقُّ قَالُوا۟ هَٰذَا سِحْرٌ وَإِنَّا بِهِۦ كَٰفِرُونَ ﴿٣٠﴾

22. అంటే – నన్ను సృష్టించిన దేవుడే నాకు ధర్మావగాహనను ప్రసాదిస్తాడు. మరి ఆయనే నాకు స్థయిర్యాన్ని కూడా వొసగుతాడు. కాబట్టి నేను ఆయన వైపునకే మరలుతాను. ఆయన్నే ఆరాధిస్తాను.

23. అంటే ఈ కలిమయె తయ్యిబా– ‘లా ఇలాహ ఇల్లల్లాహ్ – ను గురించి తన సంతానానికి తాకీదు చేసి వెళ్ళారు. అల్ బఖర సూరాలోని 132వ వచనంలో చెప్పబడినట్లు ఇబ్రాహీముతో పాటు, యాఖూబు కూడా తన పిల్లలకు ఈ ఉపదేశమే చేశారు.

కొంతమంది ఈ వాక్యంలో ‘అల్లాహ్’ను కర్తగా పేర్కొన్నారు. ‘జఅల’ (చేశాడు) అంటే ఇబ్రాహీమ్ తర్వాత ఆయన సంతానంలో ఈ విషయం ఉండేటట్లు స్వయంగా అల్లాహ్‌యే చేశాడని వారు తలపోశారు.

24. ఇబ్రాహీము సంతతిలో ఏకదైవారాధన వైపుకు పిలుపు ఇచ్చే మహాపురుషులు ఎందరో ప్రభవింపజేయబడ్డారు. ఎందుకంటే ప్రజలు మరచిపోయిన పాఠాలను జ్ఞాపకం చేసి, వారిని మాటిమాటికీ రుజువర్తనుల్ని చేస్తూ ఉండాలి. చివరికి మక్కావాసులను కూడా వారు చేస్తున్న ‘షిర్క్’ నుంచి ఇబ్రాహీము విధానం వైపునకు మరల్చటానికి దేవుడు వారి మధ్య తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స)ను పంపాడు.

25. ఇక్కడి నుంచి దేవుడు మళ్లీ తన వరప్రసాదాలను ప్రస్తావిస్తున్నాడు. తన అనుగ్రహాల తరువాత దేవుడు వారిని వెంటనే శిక్షించలేదు. వారికి తగినంత గడువును ఇచ్చాడు. కాని వారు దారికి రాలేదు సరికదా మాయమాటలకు మోసపోయారు. మనోవాంఛలకు దాసులయ్యారు.

26. ఇక్కడ **‘సత్యం’** అంటే ఖుర్‌ఆన్ అనీ, ‘ప్రవక్త’ అంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) అని భావం. **‘ముబీన్’ (مُّبِينٌ)** అంటే విషయాన్ని స్పష్టంగా వివరించి చెప్పటం. ఇది ప్రవక్త గుణం. ముహమ్మద్ (స) యొక్క దైవదౌత్యం (రిసాలత్) విస్పష్టమైనది, అందులో ఎలాంటి దాపరికాలకు తావు లేదన్నది కూడా దాని భావం కావచ్చు.

27. అంటే–వారు ఖుర్‌ఆన్‌ను జాలవిద్యగా ప్రకటించి, దాన్ని తిరస్కరించారు. రానున్న ఆయతులలో అంతిమ దైవప్రవక్త (స)ను అవమానపరిచే చేష్టల ప్రస్తావన వచ్చింది.

31 "అవునూ, ఈ ఖుర్‌ఆను ఈ రెండు (ప్రసిద్ధ) నగరాలలో ఉండే ఎవరో ఒక ప్రముఖునిపై ఎందుకు అవతరింపజేయ బడలేదు?"[28] అని వారు అనసాగారు.

وَقَالُوا لَوْلَا نُزِّلَ هَٰذَا الْقُرْآنُ عَلَىٰ رَجُلٍ مِّنَ الْقَرْيَتَيْنِ عَظِيمٍ ﴿٣١﴾

32 ఏమిటి, వారు నీ ప్రభువు కారుణ్యాన్ని పంచుతున్నారా?[29] యదార్థానికి మేమే వారి ప్రాపంచిక జీవితంలో వారి ఉపాధిని వారి మధ్య పంచిపెట్టాము. కొందరు మరి కొందరిని లోబరచి ఉంచేందుకుగాను – అంతస్థుల రీత్యా–కొందరికి మరి కొందరిపై ఆధిక్యతను వొసగాము.[30] వారు ప్రోగు చేస్తూపోయే దానికన్నా నీ ప్రభువు కారుణ్యం ఎంతో మేలైనది సుమా![31]

أَهُمْ يَقْسِمُونَ رَحْمَتَ رَبِّكَ ۚ نَحْنُ قَسَمْنَا بَيْنَهُم مَّعِيشَتَهُمْ فِي الْحَيَاةِ الدُّنْيَا ۚ وَرَفَعْنَا بَعْضَهُمْ فَوْقَ بَعْضٍ دَرَجَاتٍ لِّيَتَّخِذَ بَعْضُهُم بَعْضًا سُخْرِيًّا ۗ وَرَحْمَتُ رَبِّكَ خَيْرٌ مِّمَّا يَجْمَعُونَ ﴿٣٢﴾

33 మానవులంతా ఒకే వర్గంగా తయారవుతారనే మాటే గనక లేకుంటే, కరుణామయుని పట్ల తిరస్కార వైఖరిని అవలంబించే వారి ఇళ్ళ పైకప్పులను, వారు ఎక్కే మెట్లను (కూడా) మేము వెండితో చేసి ఉండేవారం.[32]

وَلَوْلَا أَن يَكُونَ النَّاسُ أُمَّةً وَاحِدَةً لَّجَعَلْنَا لِمَن يَكْفُرُ بِالرَّحْمَٰنِ لِبُيُوتِهِمْ سُقُفًا مِّن فِضَّةٍ وَمَعَارِجَ عَلَيْهَا يَظْهَرُونَ ﴿٣٣﴾

28. రెండు ప్రసిద్ధ నగరాలంటే మక్కా, తాయఫ్ నగరాలని వారి ఉద్దేశం. ఇంతకీ ఆ రెండు నగరాలలోని సదరు ప్రముఖులు (పెద్ద మనుషులు) ఎవరు? చాలామంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం మక్కాకు చెందిన వలీద్ బిన్ ముగైరా, తాయఫ్‌కు చెందిన ఉర్వ బిన్ మస్‌వూద్ సఖఫీలే ఆ ఇద్దరు పెద్ద మనుషులు. కొంతమంది వ్యాఖ్యాతలు ఇతర పేర్లు కూడా పేర్కొన్నారు. మొత్తానికి దీని భావమేమిటంటే సమాజంలో పేరుమోసినవారు, శ్రీమంతులు, జాతికి నాయకత్వం వహించగల సత్తా ఉన్నవారికి ఈ ప్రవక్త పదవి లభించాల్సింది. ఖుర్‌ఆన్ గనక అవతరిస్తే ఈ 'గొప్ప వారిపై' అవతరించాల్సింది. సిరిసంపదలుగానీ, రాజ్యాధికారంగానీ లేని ముహమ్మద్ (సఅసం)పై ఖుర్‌ఆన్ అవతరించటమేమిటి? అని వారు మీమాంసలో పడిపోయారు.

29. ఇక్కడ కారుణ్యం (రహ్మత్) అనే పదం 'దైవానుగ్రహం' అన్న భావంలో ఉంది. ఇక్కడ అన్నింటికన్నా మహదానుగ్రహం 'దైవదౌత్యం.' ఆ అనుగ్రహం ఎవరికి లభించాలో నిర్ణయించాల్సింది 'వారు కాదు, మేము' అని దేవుడు చెబుతున్నాడు. ప్రవక్త పదవికి తగినవారెవరో, తగనివారెవరో దైవానికే తెలుసు. ఆయన మానవ కోటిలో అత్యుత్తమ గుణగణాలు కలవారినే ప్రవక్త పదవి కోసం ఎన్నుకుంటాడు. అంతేగాని, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలో ఉంచుకుని ఈ నిర్ణయం గైకొనబడదు.

30. సిరిసంపదలలో, పదవులలో, తెలివితేటలలో మేము మనుషుల మధ్య ఉంచిన తేడాల వెనుక ఓ పరమార్థం ఉంది. ఒకరింకొకరిపై ఆధారపడి ఉండటానికి, ఒకరింకొకరిచేత పని చేయించుకోవటానికి, పరస్పర లావాదేవీలు జరపటానికి ఈ వ్యత్యాసాలు ఉండటం అనివార్యం. దేవుని ఈ 'యుక్తి' మూలంగానే ఈ విశ్వవ్యవస్థ సాఫీగా నడుస్తూ ఉంది. అలాగాకుండా ఆస్తిపాస్తుల రీత్యా, అంతస్తుల దృష్ట్యా, తెలివితేటల రీత్యా అందరూ సరిసమానంగా ఉంటే ఎవడూ ఇంకొకరి మాట వినడు. ఎవడూ ఇతరులు చెప్పిన పని చేయడు. తమ స్థాయికి తగనిపని చేయడానికి అస్సలు అంగీకరించరు. విశ్వప్రభువు ఒక నిర్ణీత పద్ధతి ప్రకారం ఈ వ్యత్యాసాన్ని ఉంచబట్టే మానవ సముదాయాల మధ్య 'అణకువ' అలరారుతున్నది. తమ అక్కరల నిమిత్తం ఒండొకరిపై ఆధారపడుతూ, సహజీవనం సాగిస్తున్నారు. లేకపోతే బ్రతుకు దుర్భరం అయిపోతుంది. ఒక మనిషి కోట్లకు పడగలెత్తినప్పటికీ సమాజంలోని ఇతర వ్యక్తులపై ఆధారపడకుండా బ్రతకలేడు.

**34** వారి ఇళ్ల తలుపులను, వారు దిండ్లకు ఆనుకుని కూర్చునే పీఠాలను కూడా (వెండితో చేసి ఉండేవారము).

وَلِبُيُوتِهِمْ أَبْوَابًا وَسُرُرًا عَلَيْهَا يَتَّكِـُٔونَ ﴿34﴾

**35** బంగారు వస్తువులుగా కూడా చేసి ఉండేవారం.[33] ఇదంతా ఐహిక జీవితపు లాభం మాత్రమే. పరలోకం మాత్రం నీ ప్రభువు దగ్గర కేవలం భయభక్తులు గలవారికే లభిస్తుంది.[34]

وَزُخْرُفًا ۚ وَإِن كُلُّ ذَٰلِكَ لَمَّا مَتَٰعُ ٱلْحَيَوٰةِ
ٱلدُّنْيَا ۚ وَٱلْءَاخِرَةُ عِندَ رَبِّكَ لِلْمُتَّقِينَ ﴿35﴾

**36** కరుణామయుని స్మరణ పట్ల గుడ్డిగా వ్యవహరించే వ్యక్తిపై మేము షైతానును నియమిస్తాము.[35] ఇక వాడే అతనికి సహవాసిగా ఉంటాడు.[36]

وَمَن يَعْشُ عَن ذِكْرِ ٱلرَّحْمَٰنِ نُقَيِّضْ لَهُۥ شَيْطَٰنًا
فَهُوَ لَهُۥ قَرِينٌ ﴿36﴾

**37** వారు (ఆ షైతానులు) వారిని సన్మార్గాన పోకుండా అడ్డుకుంటారు. మరి వారేమో తాము సన్మార్గంపైనే ఉన్నామని భ్రమ పడుతూ ఉంటారు.[37]

وَإِنَّهُمْ لَيَصُدُّونَهُمْ عَنِ ٱلسَّبِيلِ وَيَحْسَبُونَ
أَنَّهُم مُّهْتَدُونَ ﴿37﴾

---

31. అంటే సజ్జనుల కోసం దేవుడు పరలోకంలో సిద్ధపరచిన సుఖసౌఖ్యాలన్నమాట!

32. అంటే – ప్రాపంచిక సిరిసంపదల పట్ల గల మోజుతో వారు అహోరాత్రులు సంపదను సేకరించటంలోనే మునిగిపోతారు. దైవప్రసన్నతను, పరలోకాన్ని బొత్తిగా మరచి పోతారు.

33. అంటే కొన్నింటిని బంగారంగా, మరికొన్నింటిని వెండిగా చేసేవారం. దాంతో ఆ వస్తువుల అందం మరింతగా పెరిగిపోయేది. ఇలా చెప్పటంలోని ఆంతర్యం ఏమిటంటే, వారు ప్రాపంచిక తళుకు బెళుకుల్లోనే మునిగిపోతారనే మాట లేకుంటే వారికి లెక్కలేనంత వెండీ బంగారాల సామగ్రిని ఇచ్చి ఉండేవారం. ఇలా ఇవ్వటం మాకే మాత్రం కష్టం కాదు. మా దృష్టిలో ఈ ప్రాపంచిక సామగ్రికి ఏపాటి విలువా లేదు. ఈ ప్రపంచం ఎంత అల్పమైనదో ఈ హదీసు ద్వారా ఊహించవచ్చు : "అల్లాహ్ దృష్టిలో ఈ ప్రపంచానికి ఒక దోమ రెక్కకున్నంత విలువ ఉన్నా, అల్లాహ్ ఈ ప్రపంచంలో ఏ అవిశ్వాసికీ గుక్కెడు నీరు కూడా త్రాగనిచ్చేవాడు కాడు" (తిర్మిజీ, ఇబ్నె మాజా – కితాబుజ్జుహ్ద్).

34. బహుదైవారాధనకు, పాపకార్యాలకు దూరంగా ఉంటూ, దైవానికి విధేయత చూపే వారికి ఈ పరలోక (స్వర్గం) అనుగ్రహభాగ్యం లభిస్తుంది. అది ఎన్నటికీ తరగనిది, కరగనిది.

35. **'యాషు'** (**يَعْشُ**) అంటే అసలు ఒక రకమైన కంటిజబ్బు. దానివల్ల కంటిచూపు పోతుంది. ఈ ఆయతు భావం ఏమిటంటే వీళ్లు ఉద్దేశ్యపూర్వకంగా దైవస్మరణ పట్ల గుడ్డివారుగా వ్యవహరిస్తున్నారు.

36. ఆ షైతాను దైవధ్యానం పట్ల అలసత్వం ప్రదర్శించేవానికి స్నేహితుడైపోతాడు. అనుదినం అతన్ని మంచి నుండి అడ్డుకుంటూ, చెడు వైపు పురికొల్పుతూ ఉంటాడు. లేదా ఆ మనిషే షైతాను సావాసాన్ని కోరుకుంటాడు. అతన్ని వదిలించుకోకపోగా, తన దైనందిన జీవితంలోని అన్ని వ్యవహారాలలోనూ షైతాన్ సూచనలను అనుసరిస్తాడు.

37. అంటే ఈ షైతానులు సత్యమార్గంలో వారికి అవరోధంగా నిలబడతారు. "మీరు సత్యమార్గంపైనే ఉన్నారు కదా! ఇంకా ఎందుకు ఇటుపోతారు?" అని వారిని ప్రేరేపిస్తూ ఉంటారు. తత్ఫలితంగా వారు ఊహాలోకాల్లో విహరించసాగుతారు. లేదా అవిశ్వాసులు షైతానులను నమ్మదగ్గ నేస్తాలుగా తలపోసి, వారు చెప్పినట్లు వింటుంటారు (ఫత్హుల్ ఖదీర్).

**38** ఆఖరికి అతను మా వద్దకు వచ్చినప్పుడు, "ఆహ్! నీకూ–నాకూ మధ్య తూర్పు – పడమరలకు మధ్య ఉన్నంత దూరం ఉండి ఉంటే ఎంత బావుండేది! నువ్వు మహాచెడ్డ సావాసివి"[38] అని (తన వెంటనున్న షైతానుతో) అంటాడు.

حَتّٰىٓ اِذَا جَآءَنَا قَالَ يٰلَيْتَ بَيْنِىْ وَبَيْنَكَ بُعْدَ
الْمَشْرِقَيْنِ فَبِئْسَ الْقَرِيْنُ ﴿38﴾

**39** మీరు దుర్మార్గులని తేలిపోయినప్పుడు, ఈ రోజు మీరంతా నరక యాతనలో భాగస్థులై ఉండటం మీకెలాంటి లబ్ధినీ చేకూర్చదు.

وَلَنْ يَّنْفَعَكُمُ الْيَوْمَ اِذْ ظَّلَمْتُمْ اَنَّكُمْ فِى الْعَذَابِ
مُشْتَرِكُوْنَ ﴿39﴾

**40** (ఓ ప్రవక్తా!) మరి నువ్వు చెవిటివారికి వినిపించగలవా? అంధులకుగాని, స్పష్టమైన మార్గభ్రష్టతకు లోనై ఉన్నవారికిగాని సన్మార్గం చూపగలవా?[39]

اَفَاَنْتَ تُسْمِعُ الصُّمَّ اَوْ تَهْدِى الْعُمْىَ وَمَنْ كَانَ
فِىْ ضَلٰلٍ مُّبِيْنٍ ﴿40﴾

**41** ఒకవేళ మేము నిన్ను ఇక్కడి నుంచి తీసుకుపోయినా,[40] మేము వారిపై ప్రతీకారం తీర్చుకోవటం మటుకు ఖాయం.[41]

فَاِمَّا نَذْهَبَنَّ بِكَ فَاِنَّا مِنْهُمْ مُّنْتَقِمُوْنَ ﴿41﴾

**42** లేదా మేము వారికి చేసిన వాగ్దానాన్ని[42] నీకు చూపిస్తాము. వారిపై మాకు పూర్తి అదుపు (అధికారం) ఉంది.[43]

اَوْ نُرِيَنَّكَ الَّذِىْ وَعَدْنٰهُمْ فَاِنَّا عَلَيْهِمْ
مُّقْتَدِرُوْنَ ﴿42﴾

**43** కనుక నీకు పంపబడిన సందేశాన్ని (వహీని) నువ్వు గట్టిగా పట్టుకో.[44] నిశ్చయంగా నువ్వు రుజుమార్గంపై ఉన్నావు.[45]

فَاسْتَمْسِكْ بِالَّذِىْٓ اُوْحِىَ اِلَيْكَ ۚ اِنَّكَ عَلٰى صِرَاطٍ
مُّسْتَقِيْمٍ ﴿43﴾

---

38. "ఓ షైతాన్! ఎంత ద్రోహానికి పాల్పడ్డావయ్యా! నువ్వు చాలా చెడ్డ సావాసివనిపించుకున్నావ్" అని తీర్పుదినాన ఆ వ్యక్తి అంటాడు. కాని ఆనాడు తప్పును ఒప్పుకోవటం వల్ల అతనికి ఒరిగేదేమీ ఉండదు. మూలంలో **'మష్‌రిఖైన్'** (రెండు తూర్పులు) అని వచ్చింది. వాస్తవానికి రెండు తూర్పులు అనేవి ఉండవు. తూర్పు పడమరలు అని దాని భావం.

39. శాశ్వితమైన అభాగ్యం వారి కొరకు రాసిపెట్టబడింది. కాబట్టి వారికి ఎంతగా బోధపరచినా లాభంలేదు. వారు బధిరులుగా, అంధులుగానే వ్యవహరిస్తారు. ఇలాంటి మార్గభ్రష్టులను పదే పదే తలచుకుని కుమిలిపోవలసిన పనిలేదని దేవుడు తన చివరి ప్రవక్త (స)ను ఓదార్చాడు.

40. అంటే – వారిపై శిక్ష అవతరించకముందే నీవు మరణించినా లేక నువ్వు మక్కా నుంచి వేరొక చోటికి వలసపోయినా...

41. అంతగా అవసరమైతే ప్రాపంచిక జీవితంలోనే మేము వారి మెడలు వంచుతాము. ఇక పరలోక యాతన ఉండనే ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వారు దాన్నుంచి తప్పించుకోలేరు.

42. అంటే – నీ జీవిత కాలంలోనే లేదా మక్కాలో నీ సమక్షంలోనే వారిని పరాభవానికి లోను చేయటం కూడా సంభవమే.

43. మేము కోరినప్పుడల్లా వారిని దండించగలము. అది మా చెప్పుచేతల్లో ఉన్న పని. జరిగింది కూడా అదే. బద్ర్ సంగ్రామంలో అవిశ్వాసులు – మహాప్రవక్త (స) కళ్ళెదుటే – ఘోర పరాభవం పొందారు. మక్కా విజయం సందర్భంగా వారు బిక్కచచ్చి ప్రవక్త ఎదుట నిలబడ్డారు.

**44** నిస్సందేహంగా ఇది (ఈ గ్రంథం) నీకూ, నీ జాతివారికి హిత బోధిని.[46] త్వరలోనే మీరంతా ప్రశ్నించబడతారు.

وَإِنَّهُۥ لَذِكْرٌ لَّكَ وَلِقَوْمِكَ ۖ وَسَوْفَ تُسْـَٔلُونَ ﴿٤٤﴾

**45** మరి నీకు పూర్వం మేము పంపిన మా ప్రవక్తలను[47] “కరుణామయుడు (అయిన అల్లాహ్)ను వదలి వేరితర పూజించబడుతున్న దైవాలను మేము నిర్ధారించామేమో”[48] అడిగి చూడు.

وَسْـَٔلْ مَنْ أَرْسَلْنَا مِن قَبْلِكَ مِن رُّسُلِنَآ
أَجَعَلْنَا مِن دُونِ ٱلرَّحْمَٰنِ ءَالِهَةً يُعْبَدُونَ ﴿٤٥﴾

**46** మేము మూసాకు మా సూచనలను ఇచ్చి ఫిరౌన్ వద్దకు, అతని నాయకుల వద్దకు పంపించాము. అప్పుడు (మూసా వాళ్ల దగ్గరకు వెళ్ళి) “నేను సకల లోకాల ప్రభువు యొక్క ప్రవక్తను”[49] అన్నాడు.

وَلَقَدْ أَرْسَلْنَا مُوسَىٰ بِـَٔايَٰتِنَآ إِلَىٰ فِرْعَوْنَ وَمَلَإِي۟هِۦ
فَقَالَ إِنِّى رَسُولُ رَبِّ ٱلْعَٰلَمِينَ ﴿٤٦﴾

44. అంటే – దివ్య ఖుర్ఆన్‌ను ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా నువ్వు మాత్రం దీనిని గట్టిగా పట్టుకో. ఈ గ్రంథం ప్రకారం మసలుకో.

45. ఎందుకంటే నీవు అవలంబించే మార్గం సరైనది, సత్యమైనది.

46. అంతమాత్రాన ఈ గ్రంథం వేరితరులకు హితబోధిని కాదని భావం కాదు. కాకపోతే తొలి సంబోధితులు అరబ్బులే కావటం వల్ల వారిపేరు ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించబడింది. వాస్తవానికి ఈ ఖుర్ఆన్ గ్రంథం సకల లోకాల వారికోసం హితోపదేశంగా ఉన్నది (అల్ ఖలమ్–52). ఉదాహరణకు ఒకచోట, “(ఓ ప్రవక్తా!) నువ్వు నీ సమీప బంధువులను హెచ్చరించు” (షుఅరా–214) అని ఉంది. అంటే దైవసందేశాన్ని కేవలం బంధువులకు మాత్రమే అందజేయాలన్నది దీని అంతరార్థం కానేకాదు. కాని బయటి వారికి సత్యాన్ని పరిచయం చేయకముందు ఇంటివారికి, దగ్గరి బంధువులకు దాన్ని పరిచయం చేయటం అవసరం.

ఈ ఆయతులో చెప్పబడిన మరో ముఖ్య విషయం ఏమిటంటే, (ఓ ప్రవక్తా!) ఈ ఖుర్ఆన్ నీకూ, నీ జాతివారికి గౌరవమర్యాదలను ఇస్తుంది. ఎందుకంటే ఇది వారి మాతృభాషలో అవతరించింది. వారు అన్యుల కన్నా అధికంగా దీన్ని అర్థం చేసుకోగలుగుతారు. దీనిద్వారా వారు సమస్త జగతిలోనే గొప్ప ఆధిక్యాన్ని పొందగలరు. అందువల్ల వారు ఈ గ్రంథాన్ని అవలంబించాలి. అది వాంఛించే సుగుణాలను అలవరచుకోవాలి.

47. బహుశా మహాప్రవక్త (స) మేరాజ్ యాత్రకు వెళ్ళినప్పుడు, – బైతుల్ మఖ్దిస్‌లో ఉండగానో లేక ఊర్ధ్వలోకాలకు వెళ్ళినప్పుడో – ఈ విధంగా అడిగి ఉండవచ్చు. ఎందుకంటే దైవప్రవక్తలను మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కలుసుకున్నది ఈ సందర్భంగానే. లేక వారి అనుయాయులను (యూదులను, క్రైస్తవులను) అడగండి అన్నది ఈ ఆయతు భావం కావచ్చు. ఎందుకంటే వీరికి ఆ ప్రవక్తల బోధనలు తెలుసు. ఆ ప్రవక్తలపై అవతరించిన గ్రంథాలు వారి దగ్గర ఉన్నాయి.

48. ముమ్మాటికీ ‘లేదు’ అనేదే దాని సమాధానం. దేవుడు ఏ ప్రవక్తకు కూడా ఈ మేరకు ఆజ్ఞాపించలేదు. పైగా – తద్భిన్నంగా – దేవుని ఏకత్వం గురించి ప్రవక్తలందరికీ ఆదేశించాడు.

49. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఓదార్చటానికి దేవుడు హజ్రత్ మూసా (అలైహిస్సలాం) వృత్తాంతాన్ని పునరుద్ఘాటించాడు. ఎందుకంటే మక్కా ఖురైషులు కూడా ఫిరౌనీయుల మాదిరిగానే ముహమ్మద్ (స)ను పరిహసించారు. మక్కా, తాయఫ్ నగరాలలో పెద్ద మనుషులుండగా ప్రవక్త పదవికై దేవుడికి నువ్వే దొరికావా? అని విసుర్లు విసిరారు. ఈ అసభ్యకరమైన ప్రవర్తనకు నిరాశ చెందరాదని, పూర్వం మూసా ప్రవక్త కూడా ఇలాగే ఫిరౌన్

**47** మరి అతను మా సూచనలను తీసుకుని వారి వద్దకు వచ్చి నపుడు వారు వాటిపై వికటాట్టహాసం చేశారు.[50]

فَلَمَّا جَاءَهُم بِآيَاتِنَا إِذَا هُم مِّنْهَا يَضْحَكُونَ ﴿٤٧﴾

**48** మేము వారికి చూపిస్తూపోయిన ఒక్కో సూచన దానికి ముందు వచ్చిన దానికి మించినదిగా ఉండేది.[51] మరి మేము వాళ్ళను శిక్షగా పట్టుకున్నాము – అలాగైనా దారికి వస్తారేమో నని![52]

وَمَا نُرِيهِم مِّنْ آيَةٍ إِلَّا هِيَ أَكْبَرُ مِنْ أُخْتِهَا ۖ وَأَخَذْنَاهُم بِالْعَذَابِ لَعَلَّهُمْ يَرْجِعُونَ ﴿٤٨﴾

**49** వారిలా అన్నారు: "ఓ మాంత్రికుడా![53] నీ ప్రభువు నీతో వాగ్దానం చేసివున్న[54] దాని గురించి మా కొరకు[55] కాస్త ప్రార్థిం చవోయ్! (ఈ ఆపద గనక తొలగిపోతే) మేము తప్పకుండా సన్మార్గంపైకి వస్తాము."[56]

وَقَالُوا يَا أَيُّهَ السَّاحِرُ ادْعُ لَنَا رَبَّكَ بِمَا عَهِدَ عِندَكَ إِنَّنَا لَمُهْتَدُونَ ﴿٤٩﴾

---

దర్బారులో చాలా క్లిష్టపరిస్థితిని ఎదుర్కొన్నారని దేవుడు గుర్తుచేశాడు. సంయమనంతో పనిచేయాలనీ, ఆనాడు ఫిరౌన్ జనులు పరాభవం పాలైనట్లే మక్కాలోని అవిశ్వాసులు కూడా పరాభవం చెందుతారని ముహమ్మద్ (స)కు ధైర్యం చెప్పాడు.

50. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఫిరౌన్ దర్బారులో ఏకదైవారాధనా సందేశం ఇచ్చినప్పుడు వారంతా ఆయనపై కన్నెర్రజేశారు. ఇంతకీ నిన్ను ప్రవక్తగా నమ్మేదెలా? అని నిలదీశారు. అప్పుడు ఆయన దేవుడు తనకిచ్చిన మహిమలను ప్రదర్శించారు. వాటిని చూసి ఫిరౌను దర్బారు ప్రముఖులంతా పడీ పడీ నవ్వారు. ఈ మాత్రం నిదర్శనాలు ఇంద్రజాలం (కనికట్టు) ద్వారా మా వాళ్ళూ చూపగలరు అని ఎద్దేవా చేశారు.

51. ఇక్కడ **'ఒక దానిని మించిన ఒక సూచన'** అంటే ఫిరౌనీయులను పరీక్షించటానికి దేవుడు పంపిన శిక్షలన్నమాట! ఉదాహరణకు : పెనుగాలి, మిడుతల దండు, పేనులు, కప్పలు, రక్తం మొదలగునవి. అల్ ఆరాఫ్ సూరా (133 – 135)లో ఈ వివరాలు ఇంతకుముందు వచ్చాయి. తరువాత వచ్చే ప్రతి సూచన లోగడ వచ్చిన దానికన్నా తీవ్రంగా ఉండేది. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) నిస్సందేహంగా దైవప్రవక్తే ననడానికి అవి ప్రబల తార్కాణాలుగా ఉండేవి.

52. కనీసం ఈ సూచనలను (ఆపదలను) కళ్లారా చూసిన తరువాతైనా వారు గుణపాఠం నేర్చుకుంటారేమోనని ఆశించటం జరిగింది. కాని అలా జరగలేదు.

53. ఆ రోజుల్లో 'మాంత్రికుడా!' అని ఎవరినయినా పిలిస్తే అది దూషణగాగానీ, అవమానకరంగా గానీ పరిగణించబడేది కాదు. సాధారణంగా జ్ఞాన సంపద గలవారిని వారు 'మాంత్రికుడు'గానే వ్యవహరించేవారు. ఆ కారణంగానే దేవుని మహిమలను మూసా (అలైహిస్సలాం) ప్రదర్శించినపుడు, 'అదంతా జాలవిద్యకు పరాకాష్ఠ!' అని వారు కొట్టిపారేశారు. అందుకే వారు మూసాను ఓ ఇంద్రజాలికుడా! ఓ మాంత్రికుడా! అని సంబోధించారు.

54. అంటే – తాము గనక విశ్వసిస్తే శిక్షను తొలగిస్తాననే వాగ్దానం.

55. **'మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు'** అని కోరటాన్నిబట్టి వారిలో కరడుగట్టిన బహుదైవోపాసన వ్యక్తమవుతోంది. ఆనాడు ముష్రిక్కుల దృష్టిలో అనేకమంది 'ప్రభువులు' ఉండేవారు. అందుకే 'నీ ప్రభువు' ద్వారా ఈ పని చేయించు అని వారు మూసాను కోరారు.

56. ఈసారి ఈ ఆపద గనక మానుండి తొలగిపోతే మేము నిన్ను సత్యవంతుడైన ప్రవక్తగా నమ్ముతాము. నీ ప్రభువే ఉన్నతుడని విశ్వసిస్తాము అని ప్రాధేయపడేవారు. కాని ప్రతిసారీ ఆడిన మాటను తప్పేవారు. ఆరాఫ్ సూరాలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది.

**50** అయితే మేము ఆ శిక్షను వారి నుంచి తొలగించగా, అప్పటి కప్పుడే వారు ఆడిన మాటను తప్పారు.

فَلَمَّا كَشَفْنَا عَنْهُمُ الْعَذَابَ إِذَا هُمْ يَنكُثُونَ ﴿50﴾

**51** మరి ఫిరౌను తన జాతి (జనుల) మధ్య చాటింపు వేయిస్తూ ఇలా అన్నాడు[57] : "ఓ నా జాతి జనులారా! ఈజిప్టు రాజ్యం నాది కాదా? ఈ కాలువలు నా (మేడల) క్రింద ప్రవహిస్తున్నాయి.[58] మీరు చూడటం లేదా?

وَنَادَىٰ فِرْعَوْنُ فِي قَوْمِهِ قَالَ يَٰقَوْمِ أَلَيْسَ لِي
مُلْكُ مِصْرَ وَهَٰذِهِ الْأَنْهَٰرُ تَجْرِي مِن تَحْتِيٓ ۖ
أَفَلَا تُبْصِرُونَ ﴿51﴾

**52** "పైగా తుచ్ఛుడైన అతని కంటే నేను ఉత్తముడను,[59] కనీసం స్పష్టంగా చెప్పటం కూడా అతనికి చేత కాదాయె.[60]

أَمْ أَنَا خَيْرٌ مِّنْ هَٰذَا الَّذِي هُوَ مَهِينٌ
وَلَا يَكَادُ يُبِينُ ﴿52﴾

**53** "సరే, అతనిపై బంగారు కంకణాలు ఎందుకు దించబడ లేదు?[61] పోనీ, అతని వెంట బారులు తీరిన దైవదూతలు ఎందుకు రాలేదు?"[62]

فَلَوْلَآ أُلْقِيَ عَلَيْهِ أَسْوِرَةٌ مِّن ذَهَبٍ أَوْ جَآءَ مَعَهُ
الْمَلَٰٓئِكَةُ مُقْتَرِنِينَ ﴿53﴾

**54** ఆ విధంగా అతను తన ప్రజలను మభ్యపెట్టి, మూర్ఖుల్ని చేశాడు. తుదకు వారు అతని మాటే విన్నారు.[63] నిశ్చయంగా వారంతా అవిధేయ జనులే.

فَاسْتَخَفَّ قَوْمَهُ فَأَطَاعُوهُ ۚ إِنَّهُمْ كَانُوا قَوْمًا
فَٰسِقِينَ ﴿54﴾

57. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఒక దాని తరువాత ఒకటిగా నిరంతరం నిదర్శనాలు చూపెట్టేసరికి ఫిరౌన్ హడలిపోయాడు. తన జాతి ప్రజలు మూసా అడుగుజాడలలో ఎక్కడ నడుస్తారోనని అతని మనసు కీడు శంకించింది. అందుకే అతను తన నిరంకుశ పెత్తనాన్ని నిలుపుకోవటానికి ఆదరాబాదరాగా ప్రజల మధ్యకు వెళ్ళాడు. తన మాయమాటలతో వారిని దువ్వాడు. జోకొట్టాడు. మూసాను చరిత్రహీనుని క్రింద జమకట్టి, రాజవంశాల పట్ల ప్రజలకున్న సెంటిమెంటును సొమ్ము చేసుకున్నాడు.

58. అంటే నైలునది లేక దాని పాయలు అని అర్థం. అవి అతని మేడ క్రింది నుంచి ప్రవహించేవి.

59. ప్రజల సున్నితమైన భావాలను రగుల్గొల్పటానికి ఫిరౌన్ వేసిన ఓ ఎత్తుగడ ఇది.

60. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం)కు ఉన్న 'నత్తి'ని దెప్పిపొడుస్తూ ఫిరౌన్ చెప్పిన మాట ఇది. తాహా సూరాలోనూ ఈ ప్రస్తావన వచ్చింది.

61. ఆ కాలంలో ఫిరౌన్, పారసీక చక్రవర్తులు తమ రాజవైభవాన్ని చాటుకోవటానికి స్వర్ణ కంకణాలు తొడిగేవారు. అలాగే అలనాటి తెగల సర్దారులకు, దొరల చేతులకు కూడా స్వర్ణ కంకణాలు, మెడలలో స్వర్ణ పతకాలుండేవి. ఆ విషయాన్నే ఫిరౌన్ యిక్కడ ఉదాహరిస్తూ, 'మూసా నిజంగానే మాననీయుడైతే, అతని మానమర్యాదలకు ప్రతీకగా అతని చేతిలో స్వర్ణ కంకణమన్నా ఉండాలి కదా!' అని ప్రజలను ఉసిగొల్పాడు.

62. అతని వెంట కనీసం కొంతమంది దైవదూతలన్నా దిగివచ్చి ఉంటే, అతను నిజంగానే దైవప్రవక్త అని నమ్మగలిగే వాళ్ళం. ఏ ఆనవాలూ లేకుండా అతన్ని దైవప్రవక్తగా ఎలా నమ్మగలం? అని ఓ సవాలు విసిరాడు.

63. ఆ విధంగా ఫిరౌన్ తన జాతి ప్రజలను మూర్ఖులుగా భావించాడు. లేదా వారిని మూర్ఖుల్ని చేసేశాడు (ఇబ్నెకసీర్). తరతరాలుగా కొనసాగుతున్న మూఢాచారాలే నిజమని నమ్మబలికాడు. కడకు ఆ మూర్ఖజనులు 'యథా రాజా తథా ప్రజా' అన్నారు. వారు తమ వివేచనను ఏమాత్రం ఉపయోగించలేదు.

**55** ఆ తరువాత వారు మాకు కోపం తెప్పించగా మేము వారిపై ప్రతీకారం తీర్చుకున్నాం. వారందరినీ (సముద్రంలో) ముంచి వేశాము.

فَلَمَّآ ءَاسَفُونَا ٱنتَقَمْنَا مِنْهُمْ فَأَغْرَقْنَٰهُمْ أَجْمَعِينَ (55)

**56** ఆ విధంగా మేము వారిని గతించిన వారుగా, రాబోయే తరాల వారికి ఒక ఉదాహరణగా చేశాము.[64]

فَجَعَلْنَٰهُمْ سَلَفًا وَمَثَلًا لِّلْءَاخِرِينَ (56)

**57** మర్యమ్ కుమారుని ఉదాహరణ ఇవ్వబడినపుడు నీ జాతి జనులు (సంబర పడి) కేకలు వేశారు.

وَلَمَّا ضُرِبَ ٱبْنُ مَرْيَمَ مَثَلًا إِذَا قَوْمُكَ مِنْهُ يَصِدُّونَ (57)

**58** "ఇంతకీ మా దేవుళ్ళు మంచివాళ్ళా లేక అతనా?" అని వారు (తరచి తరచి) అడగటం మొదలెట్టారు. వారు నిన్ను అలా అడగటం వెనుక వారి ఉద్దేశం జగడం తప్ప మరేమీ కాదు. అసలా జనులే జగడాలమారులు.[65]

وَقَالُوٓا۟ ءَأَٰلِهَتُنَا خَيْرٌ أَمْ هُوَ ۚ مَا ضَرَبُوهُ لَكَ إِلَّا جَدَلًۢا ۚ بَلْ هُمْ قَوْمٌ خَصِمُونَ (58)

64. అంటే భావితరాల కోసం ఫిరౌన్ ముగింపును ఒక గుణపాఠ సూచనగా చేశాము. తిరస్కార వైఖరికి, దౌర్జన్యానికి, ఉపద్రవానికి, పీడనకు పాల్పడే వారి పరిణామం ఫిరౌన్ లాగానే ఉంటుందని హెచ్చరించాము. **'సలఫున్'** అంటే ఉనికి రీత్యా ఇతరుల కన్నా ముందు వచ్చినది అని అర్థం.

65. బహుదైవారాధనను ఖండించటానికి, బూటకపు దేవుళ్ల బండారాన్ని బట్టబయలు చేయటానికి "మీతో పాటు మీ దేవుళ్లు కూడా నరకానికి ఆహుతి అవుతార"ని మక్కా ముష్రిక్కులకు చెప్పబడింది. అంటే వారు పూజించే మట్టిబొమ్మలు, రాతి విగ్రహాలు నరకానికి ఆహుతి అవుతాయని భావం. అంతేగాని వారు పూజించే సజ్జనులు, ప్రవక్తలు మాత్రం నరకానికి ఆహుతి అవరు. ఎందుకంటే వారు జీవితాంతం 'దేవుని ఏకత్వం' కోసం పాటుపడ్డారు. వారు మరణించిన తరువాత జనులు వారిని పూజిస్తే అందులో వారి దోషం ఏముంది? జనులు చేసే షిర్క్‌తో వారికెట్టి సంబంధం లేదు. ఆ మాటే దివ్య ఖుర్ఆన్ స్పష్టం చేసింది. "మా తరఫునుంచి మేలు కలుగుతుందని మొదట్లోనే తీర్పు ఇవ్వబడిన ప్రజలు నిశ్చయంగా దానికి (నరకానికి) దూరంగా ఉంచబడతారు" (అల్ అంబియా – 101). అందుకోసమే ఖుర్ఆన్ **'మన్'** (ఎవరిని) అని చెప్పకుండా, **'మా'** (వేటిని) అన్న పదాన్ని ఉపయోగించింది. మీరూ, మీరు అల్లాహ్‌ను వదలి 'వేటినయితే' పూజిస్తున్నారో అవీ నరకానికి ఇంధనంగా మారుతాయి అని పేర్కొంది (అంబియా : 98). ఒకవేళ మూఢ జనులు (తాము పూజించే) ప్రవక్తల, సత్పురుషుల విగ్రహాలను, చిత్రపటాలను తయారు చేసి వాటిని పూజిస్తే ఆ విగ్రహాలను, చిత్రపటాలను దేవుడు నరకానికి ఆహుతి చేయవచ్చేమోగాని ఆ మహాపురుషులను మాత్రం నరకానికి దూరంగానే ఉంచుతాడు. ఎందుకంటే వారు జీవితాంతం పరిశ్రమించినది ఈ 'షిర్క్'కు వ్యతిరేకంగానే.

ఇప్పుడు అసలు విషయానికి వద్దాం – అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) నోట మర్యమ్ కుమారుని ప్రస్తావన రాగానే తగవులమారులైన మక్కా ముష్రిక్కులు ఆనందంతో ఎగిరి గంతేసారు. క్రైస్తవులు తమ ఆరాధ్య దైవంగా చేసుకున్న ఈసా (ఏసుక్రీస్తు) మంచివాడైనపుడు, మరి మా దేవుళ్లు చెడ్డవారెలా అవుతారు? అన్నది వారి వాదన. మా దేవుళ్లు (విగ్రహాలు) నరకానికి ఆహుతి అయినపుడు ఈసా, ఉజైర్‌లు మాత్రం నరకానికి ఎందుకు పోరు? అని వాదించటం మొదలెట్టారు. వారు ఆ విధంగా సంబరపడటంలోని ఉద్దేశం తగవుపెట్టుకోవటం తప్ప మరొకటి కాదు. వితండ వాదన చేసేవాడు, పేచీపెట్టేవాడు పూచిక పుల్లంత ఆధారం దొరికినా దాని ఆసరాతో విషయాన్ని సాగదీస్తాడు. ఈ మక్కా అవిశ్వాసుల పరిస్థితి కూడా అంతేనని దేవుడు చెబుతున్నాడు.

إِنْ هُوَ إِلَّا عَبْدٌ أَنْعَمْنَا عَلَيْهِ وَجَعَلْنَٰهُ مَثَلًا لِّبَنِىٓ إِسْرَٰٓءِيلَ ﴿59﴾

**59** అతను (మర్యమ్ కుమారుడైన ఈసా) కూడా ఒక దాసుడు మాత్రమే. మేమతన్ని అనుగ్రహించాము. ఇస్రాయీలు సంతతి వారికొరకు అతన్ని ఒక ఉదాహరణ (మా శక్తి నిదర్శనం)గా చేశాము.[66]

وَلَوْ نَشَآءُ لَجَعَلْنَا مِنكُم مَّلَٰٓئِكَةً فِى ٱلْأَرْضِ يَخْلُفُونَ ﴿60﴾

**60** మరి మేమే గనక తలచుకుంటే మీకు బదులుగా దైవదూతలనే భూమికి వారసులుగా చేసి ఉండేవారం.[67]

وَإِنَّهُۥ لَعِلْمٌ لِّلسَّاعَةِ فَلَا تَمْتَرُنَّ بِهَا وَٱتَّبِعُونِ ۚ هَٰذَا صِرَٰطٌ مُّسْتَقِيمٌ ﴿61﴾

**61** నిశ్చయంగా అతను (ఈసా – అలైహిస్సలాం) ప్రళయానికి ఒక సూచన.[68] కాబట్టి మీరు దాని (ప్రళయదినం) విషయంలో సందేహపడకండి. మీరు నన్ను అనుసరించండి. ఇదే రుజు మార్గం.

وَلَا يَصُدَّنَّكُمُ ٱلشَّيْطَٰنُ ۖ إِنَّهُۥ لَكُمْ عَدُوٌّ مُّبِينٌ ﴿62﴾

**62** షైతాన్ మిమ్మల్ని అడ్డుకోరాదు సుమా! వాడు మీకు బద్ధ విరోధి.

وَلَمَّا جَآءَ عِيسَىٰ بِٱلْبَيِّنَٰتِ قَالَ قَدْ جِئْتُكُم بِٱلْحِكْمَةِ وَلِأُبَيِّنَ لَكُم بَعْضَ ٱلَّذِى تَخْتَلِفُونَ فِيهِ ۖ فَٱتَّقُوا۟ ٱللَّهَ وَأَطِيعُونِ ﴿63﴾

**63** స్పష్టమైన నిదర్శనాలను తీసుకుని వచ్చినప్పుడు ఈసా (ఏసు – అలైహిస్సలాం) ఇలా అన్నాడు: "నేను మీ దగ్గరకు వివేకాన్ని తెచ్చాను. మీరు విభేదించుకుంటున్న కొన్ని విషయాల వాస్తవికతను విడమరచి చెప్పటానికే వచ్చాను.[69] కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. నాకు విధేయత చూపండి.

66. ఎందుకంటే ఆయన (ఈసా) తండ్రి లేకుండా జన్మించారు. ఆయనకు ఇవ్వబడిన మహిమలు కూడా చాలా శక్తిమంతమైనవి. దైవాజ్ఞతో ఆయన మృతులను సయితం బ్రతికించేవారు.

67. అంటే మిమ్మల్ని రూపుమాపి, మీ స్థానంలో దైవదూతల్ని వసింపజేసి ఉండేవారం. వారు కూడా మీలాగే ఒండొకరికి ప్రాతినిధ్యం వహించేవారు. దైవదూతలు ఆకాశంలో ఉన్నంత మాత్రాన మీరు వారి గురించి ఏవేవో ఊహించుకుని, వారిని పూజించవలసిన అవసరం లేదు. దైవదూతలు కూడా మా సృష్టిలో భాగమే. మేము కోరివుంటే వాళ్ళను కూడా భూమండలంలో వసింపజేసి ఉండేవారం అని దేవుడు సెలవిచ్చాడు.

68. ఇక్కడ **'ఇల్మున్'** (عِلْمٌ) అంటే 'సూచన' అని అర్థం. చాలామంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం దీని భావం ఏమిటంటే, ప్రళయదినానికి ముందు ఈసా (ఏసు) దివినుంచి భువికి దిగివస్తారు. ప్రామాణిక హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ఆయన గనక భువిపైకి వచ్చారంటే ప్రళయదినం దగ్గరపడిందనే అనుకోవాలి. అందుకేనేమో కొంతమంది పండితులు మూలంలోని 'ఇల్మున్' అన్న పదాన్ని 'అలమున్' అని పఠించారు. 'అలమున్' అన్న పదానికి గుర్తు, ఆనవాలు అనే అర్థాలు వస్తాయి.

మరికొంతమంది ప్రకారం దేవుడు ఏసును ప్రళయసూచనగా ఖరారు చేయటంలో ఇంకొక మర్మం దాగి ఉన్నది. దేవుడు ఏసు (ఈసా–అలైహిస్సలాం)ను తండ్రి లేకుండానే పుట్టించాడు. దేవుడు ప్రళయదినాన మానవులందరినీ తిరిగి బ్రతికిస్తాడనే విషయానికి ఇది ఒక సూచనగా ఉంది. కాబట్టి ఒకవైపు దేవుని శక్తిసూచనను కళ్ళారా చూస్తూ కూడా ప్రళయం సంభవిస్తుందనే విషయంపై మానవులు సంశయంలో పడవలసిన అవసరం లేదు.

**64** “నిజానికి నా ప్రభువూ, మీ ప్రభువూ అల్లాహ్ మాత్రమే. కాబట్టి మీరంతా ఆయన్నే ఆరాధించండి. ఇదే రుజుమార్గం.”

إِنَّ اللَّهَ هُوَ رَبِّي وَرَبُّكُمْ فَاعْبُدُوهُ ۚ هَٰذَا صِرَاطٌ مُّسْتَقِيمٌ (64)

**65** అయితే ఆ తర్వాత (ఇస్రాయీల్ సంతతికి చెందిన) పలు కూటములవారు పరస్పరం విభేదించుకున్నారు.[70] కనుక దుర్మార్గులకు బాధాకరమైన దినమునందలి శిక్ష వల్ల వినాశం తప్పదు.

فَاخْتَلَفَ الْأَحْزَابُ مِن بَيْنِهِمْ ۖ فَوَيْلٌ لِّلَّذِينَ ظَلَمُوا مِنْ عَذَابِ يَوْمٍ أَلِيمٍ (65)

**66** తమకు తెలీకుండానే, తమపై అకస్మాత్తుగా ప్రళయం వచ్చి పడాలని వారు ఎదురు చూస్తున్నారా?

هَلْ يَنظُرُونَ إِلَّا السَّاعَةَ أَن تَأْتِيَهُم بَغْتَةً وَهُمْ لَا يَشْعُرُونَ (66)

**67** ఆ రోజు (ప్రాణ) మిత్రులు కూడా ఒకరికొకరు శత్రువులైపోతారు – అయితే దైవభక్తి పరాయణులు మాత్రం అలా ప్రవర్తించరు.[71]

الْأَخِلَّاءُ يَوْمَئِذٍ بَعْضُهُمْ لِبَعْضٍ عَدُوٌّ إِلَّا الْمُتَّقِينَ (67)

**68** ఓ నా దాసులారా! ఈ రోజు మీకెలాంటి భయంగానీ, దుఃఖం గానీ ఉండదు.[72]

يَا عِبَادِ لَا خَوْفٌ عَلَيْكُمُ الْيَوْمَ وَلَا أَنتُمْ تَحْزَنُونَ (68)

**69** మా సూచనలను విశ్వసించి, విధేయులు (ముస్లింలు)గా ఉన్న వారినుద్దేశించి (ఈ విధంగా అనబడుతుంది:)

الَّذِينَ آمَنُوا بِآيَاتِنَا وَكَانُوا مُسْلِمِينَ (69)

---

69. దీనికోసం ఆలి ఇమ్రాన్ సూరా 50వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి.

70. విభేదించుకున్న ఆ వర్గాల వారెవరంటే యూదులు, క్రైస్తవులే. ఈసా (ఏసుక్రీస్తు) అక్రమ సంతానం (దేవుడు మన్నించుగాక!) అని చెప్పి యూదులు ఆయన్ని కించపరిచారు. మరోవైపు క్రైస్తవులు ఏసుక్రీస్తు పట్ల భక్తిశ్రద్ధలలో అతిశయిల్లిపోయి ఆయన్ని ఏకంగా తమ ‘ప్రభువు’ను చేసేసుకున్నారు.

ఈ ఆయతుకు మరో భావం ఇది : క్రైస్తవుల్లోనే విభిన్న వర్గాల వారు ఏసుక్రీస్తు పట్ల రకరకాలుగా ఊహించుకుని సైద్ధాంతికంగా చెల్లాచెదురైపోయారు. ఒకవర్గం వారు ఆయన్ని ‘దేవుని కుమారునిగా’ తలపోయగా, మరోవర్గం వారు ‘ఆయనే దేవుడ’న్నారు. మూడో వర్గం వారు ‘త్రిత్వా’న్ని (Trinity) అంటగట్టారు. క్రైస్తవుల్లోని వేరొక వర్గం మాత్రం ఏసుక్రీస్తును ముస్లింల మాదిరిగానే దేవుని దాసుడుగా, దైవప్రవక్తగా విశ్వసిస్తోంది.

71. ఎందుకంటే అవిశ్వాసుల స్నేహసంబంధాలు నిష్కల్మషంగా ఉండవు. దృఢంగా కూడా ఉండవు. పైగా అందులో స్వార్థం ఉంటుంది. అందుకే వారు శిక్షను చవిచూడగానే పరస్పరం నిందించుకోవటం మొదలెడతారు. ఒండొకరికి విరోధులైపోతారు. కాని విశ్వాసుల స్నేహబంధం అలాంటిది కాదు. వారి స్నేహం మధురమైనది. అది విశ్వాసం, భయభక్తుల ప్రాతిపదికగా ఏర్పడుతుంది. దైవప్రసన్నతను చూరగొనటం వారి ముఖ్యోద్దేశం అయి ఉంటుంది. అందువల్ల వారి స్నేహం దృఢమైనది. విడిపోనిది, కరిగిపోనిది. ఇలాంటి స్నేహమే, ఇటువంటి ధార్మికతే పరలోకంలో పుణ్యఫలం సంపాదించి పెడుతుంది. అది ప్రపంచంలో వర్ధిల్లినట్లే పరలోకంలో కూడా వర్ధిల్లుతుంది.

72. ప్రాపంచిక జీవితంలో కేవలం దైవప్రసన్నతను బడసే ఉద్దేశంతో ఒండొకరిని ప్రేమించే వారిని ఉద్దేశించి చెప్పబడే మాటలివి. హదీసులలో కూడా ఈ విషయం గట్టిగా నొక్కి చెప్పబడింది. కేవలం అల్లాహ్ కోసం ప్రేమించటం, అల్లాహ్ కోసం ద్వేషించటం పరిపూర్ణ విశ్వాసానికి ప్రతీక అని హదీసులు చెబుతున్నాయి.

**70** మీరూ, మీ భార్యలూ సంతోషంగా (సగౌరవంగా) స్వర్గంలో ప్రవేశించండి.[73]

ادْخُلُوا الْجَنَّةَ أَنتُمْ وَأَزْوَاجُكُمْ تُحْبَرُونَ ﴿٧٠﴾

**71** వారి వద్దకు నలువైపుల నుంచి బంగారు పళ్లాలూ, బంగారు గ్లాసులూ తేబడతాయి.[74] మనసు కోరేవీ, కళ్లు ఆస్వాదించేవీ– అన్నీ అక్కడ ఉంటాయి. అందులో మీరు కలకాలం (సుఖంగా) ఉంటారు.[75]

يُطَافُ عَلَيْهِم بِصِحَافٍ مِّن ذَهَبٍ وَأَكْوَابٍ ۖ
وَفِيهَا مَا تَشْتَهِيهِ الْأَنفُسُ وَتَلَذُّ الْأَعْيُنُ ۖ
وَأَنتُمْ فِيهَا خَالِدُونَ ﴿٧١﴾

**72** ఈ స్వర్గం – మీరు చేసుకున్న సత్కర్మలకు బదులుగా మీరు దీనికి వారసులయ్యారు..

وَتِلْكَ الْجَنَّةُ الَّتِي أُورِثْتُمُوهَا بِمَا كُنتُمْ
تَعْمَلُونَ ﴿٧٢﴾

**73** ఇందులో మీరు ఆరగించటానికి ఎన్నో పండ్లు ఫలాలున్నాయి (అని అనబడుతుంది).

لَكُمْ فِيهَا فَاكِهَةٌ كَثِيرَةٌ مِّنْهَا تَأْكُلُونَ ﴿٧٣﴾

**74** (ఇకపోతే) అపరాధులు ఖచ్చితంగా శాశ్వతమైన నరకయాతనకు లోనై ఉంటారు.

إِنَّ الْمُجْرِمِينَ فِي عَذَابِ جَهَنَّمَ خَالِدُونَ ﴿٧٤﴾

**75** ఆ యాతన వారినుంచి ఎన్నటికీ తగ్గించబడదు. ఇక వారు ఆశలన్నీ వదులుకుని, అందులోనే పడి ఉంటారు.[76]

لَا يُفَتَّرُ عَنْهُمْ وَهُمْ فِيهِ مُبْلِسُونَ ﴿٧٥﴾

**76** మేము వారికెలాంటి అన్యాయం చేయలేదు. కాని వారంతట వారే అన్యాయస్థులయ్యారు.

وَمَا ظَلَمْنَاهُمْ وَلَٰكِن كَانُوا هُمُ الظَّالِمِينَ ﴿٧٦﴾

**77** "ఓ మాలిక్![77] నీ ప్రభువు మమ్మల్ని అంతం చేసేస్తే (అంటే పూర్తిగా ఒకేసారి చంపేస్తే) పోతుంది కదయ్యా"[78] అని వారు అరుస్తారు. దానికతను "మీరు (నిత్యం) ఇలా ఉండాల్సిందే"[79] అంటాడు.

وَنَادَوْا يَا مَالِكُ لِيَقْضِ عَلَيْنَا رَبُّكَ ۖ قَالَ إِنَّكُم
مَّاكِثُونَ ﴿٧٧﴾

---

73. ఇక్కడ **'అజ్వాజుకుమ్'** (أَزْوَاجُكُمْ) అనే పదాన్ని కొందరు 'విశ్వాసుల భార్యలు' అన్న అర్థంలో తీసుకుంటే, మరికొందరు 'విశ్వాస సహచరులు' అన్న భావంలో తీసుకున్నారు. విశ్వాసంతో పెనవేయబడిన ఈ భావాలన్నీ సరైనవే. ఎందుకంటే విశ్వాసమే స్వర్గానికి అసలు సోపానం. **'తుహ్బరూన్'** (تُحْبَرُونَ) అంటే స్వర్గంలో లభించే గౌరవమర్యాదల మూలంగా కలిగే ఆనందం, సంతోషం.

74. **'సిహాఫ్'** అంటే మరీ చిన్నదిగానీ, మరీ పెద్దదిగానీ కానటువంటి మధ్యరకం పళ్లెం (ప్లేటు). దీని భావం ఏమిటంటే స్వర్గంలో స్వర్గవాసులకు సరఫరా చేయబడే భోజన పాత్రలు బంగారు పాత్రలై ఉంటాయి (ఫత్హుల్ ఖదీర్).

75. అంటే – ఒక వారసుడు వారసత్వానికి యజమాని అయినట్లే వారు స్వర్గానికి వారసులవుతారు. స్వర్గం వారి స్వంతమవుతుంది. అయితే ప్రాపంచిక జీవితంలో విశ్వసించి, సత్కార్యాలు చేసినవారికి మాత్రమే ఈ స్వర్గం వారసత్వంగా లభిస్తుందన్న విషయాన్ని మరువరాదు.

76. అంటే, తమకు మోక్షం లభించే విషయం పట్ల పూర్తిగా నిరాశ చెందుతారు.

**78** "మేము మీ దగ్గరకు సత్యాన్ని తీసుకువచ్చాము. కాని మీలో చాలా మంది సత్యాన్ని ఏవగించుకున్నారు కదా!"[80]

لَقَدْ جِئْنَٰكُم بِٱلْحَقِّ وَلَٰكِنَّ أَكْثَرَكُمْ لِلْحَقِّ كَٰرِهُونَ ﴿٧٨﴾

**79** ఏమిటి, వీళ్లు (నీకు వ్యతిరేకంగా) ఏదన్నా విషయాన్ని గట్టిగా నిర్ధారించారా? మరైతే మేము కూడా గట్టిగానే నిర్ధారిస్తాము.[81]

أَمْ أَبْرَمُوٓا۟ أَمْرًا فَإِنَّا مُبْرِمُونَ ﴿٧٩﴾

**80** ఏమిటి, వాళ్ల రహస్య విషయాలను, వారి గుసగుసలను మేము వినలేమని వారనుకుంటున్నారా?[82] (తప్పకుండా వింటాము) మేము పంపిన దూతలు వాళ్ల దగ్గరే వ్రాస్తున్నారు.[83]

أَمْ يَحْسَبُونَ أَنَّا لَا نَسْمَعُ سِرَّهُمْ وَنَجْوَىٰهُم ۚ بَلَىٰ وَرُسُلُنَا لَدَيْهِمْ يَكْتُبُونَ ﴿٨٠﴾

**81** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "కరుణామయునికి సంతానమే గనక ఉంటే, అందరికన్నా ముందు నేనే వారిని ఆరాధించి ఉండేవాణ్ణి."[84]

قُلْ إِن كَانَ لِلرَّحْمَٰنِ وَلَدٌ فَأَنَا۠ أَوَّلُ ٱلْعَٰبِدِينَ ﴿٨١﴾

**82** భూమ్యాకాశాల ప్రభువు, అర్ష్ (సింహాసనము) నకు అధిపతి అయిన అల్లాహ్ వీళ్లు బొంకే మాటలన్నింటికీ అతీతుడు, పవిత్రుడు.[85]

سُبْحَٰنَ رَبِّ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ رَبِّ ٱلْعَرْشِ عَمَّا يَصِفُونَ ﴿٨٢﴾

---

77. **'మాలిక్'** అనేది నరకపాలకుని పేరు.
78. మమ్మల్ని శాశ్వతంగా చంపేస్తే ఈ యాతన నుంచి విముక్తి పొందుతాం కదా! అంటారు.
79. అంటే, మీకిక మరణం అన్నదే లేదు. మీరు కలకాలం ఇలా బాధపడుతూ ఉండాల్సిందే.
80. ఇవి దేవుని పలుకులు లేదా దేవుని తరఫున దైవదూతలు చెప్పిన మాటలు. 'మేము' అనే పదంలో ఒకవిధమైన శాసింపు ఉంది. ఉదాహరణకు: ఒక ప్రభుత్వాధికారి మాట్లాడేటప్పుడు, ఏదైనా తీర్పును వినిపించేటప్పుడు 'మేము' అనే పదాన్ని 'ప్రభుత్వం' అన్న భాషలో ఉపయోగిస్తాడు. 'చాలామంది' అంటే నరకంలో ఉన్నవారంతా అని భావం. ఈ ఆయతులోని మొదటి సత్యం (హఖ్) అంటే దైవధర్మం, దైవసందేశం. దైవప్రవక్తల ద్వారా పంపబడిన జీవన విధానం. రెండవసారి వచ్చిన సత్యం ఖుర్ఆన్ మరియు ఇస్లాంను సూచిస్తోంది.
81. **'ఇబ్‌రామ్'** అంటే పటిష్ఠం చేయటం, దృఢపరచటం అని అర్థం. ఈ నరకవాసులు ఒకప్పుడు దైవప్రవక్తకు, దైవ ధర్మానికి వ్యతిరేకంగా పకడ్బందీగా వ్యూహరచన చేశారు. కుట్రలు పన్నారు. మరి మేము కూడా వారి ఎత్తులకు పై ఎత్తులు వేశాము. మా ఎత్తుగడలు ఎంత శీఘ్రంగా, మరెంత బలవంతంగా ఉంటాయో వాటిని చవిచూసిన వారికే తెలుస్తుంది. ఈ భావంలోనే ఖుర్ఆన్‌లో మరో ఆయతు ఇలా వుంది:"ఏమిటి, వారేదైనా ఎత్తు వేయదలచారా? తిరస్కారుల ఎత్తుగడ స్వయంగా వారికే బెడిసి కొడుతుంది." (తూర్-42).
82. అంటే, వారు గుండెల్లో దాచుకునే కొన్ని కీలక విషయాలు, ఏకాంతంలో కూర్చుని నెమ్మదిగా చర్చించుకునే అతి ముఖ్యమైన విషయాలు, గుసగుసలు – ఇవన్నీ మాకు తెలియవని వారు భావిస్తున్నారా? ప్రతిదీ మాకు తెలుసు.
83. అదీగాక మేము వాళ్ళపై నియమించిన మా దూతలు వాళ్ళ కార్యకలాపాలన్నింటినీ, – వాళ్ల దగ్గరే ఉండి – నమోదు చేస్తూ పోతున్నారు.
84. ఎందుకంటే నేను దైవవిధేయుణ్ణి. ఆజ్ఞాపాలనలో మీకన్నా ముందుండేవాడిని. ఒకవేళ నిజంగానే అల్లాహ్‌కు సంతానం ఉండి ఉంటే అందరికన్నా ముందు నేనే వారిని ఆరాధించేవాణ్ణి. అల్లాహ్‌కు సంతానాన్ని అంటగట్టిన ముష్రిక్కుల మూఢ విశ్వాసాన్ని ఈ ఆయతు ఖండిస్తోంది.

فَذَرْهُمْ يَخُوضُوا وَيَلْعَبُوا حَتّٰى يُلٰقُوا يَوْمَهُمُ الَّذِي يُوعَدُونَ (83)

**83** కాబట్టి నువ్వు వాళ్ళను వాళ్ళ వాగుడులోనే, ఆటపాటల్లోనే పడి ఉండనివ్వు.[86] తుదకు వాళ్లకు వాగ్దానం చేయబడుతున్న రోజు వారికి ఎదురవుతుంది.[87]

وَهُوَ الَّذِي فِي السَّمَاءِ إِلٰهٌ وَفِي الْأَرْضِ إِلٰهٌ ۚ وَهُوَ الْحَكِيمُ الْعَلِيمُ (84)

**84** ఆయనే ఆకాశాలలో ఆరాధించదగినవాడు. భూమిలో కూడా ఆయనే ఆరాధ్యుడు.[88] ఆయన అపార వివేక సంపన్నుడు, సంపూర్ణ జ్ఞానం కలవాడు.

وَتَبٰرَكَ الَّذِي لَهُ مُلْكُ السَّمٰوٰتِ وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا ۚ وَعِنْدَهُ عِلْمُ السَّاعَةِ ۚ وَإِلَيْهِ تُرْجَعُونَ (85)

**85** ఇంకా ఆయన గొప్ప శుభకరుడు. భూమ్యాకాశాల్లోనూ, వాటి మధ్య నున్న సమస్త వస్తువుల మీదనూ ఆధిపత్యం ఆయనదే.[89] ప్రళయ ఘడియ గురించిన జ్ఞానం కూడా ఆయన వద్దనే ఉంది.[90] మీరంతా (ఆఖరికి) ఆయన వద్దకే మరలించబడతారు.[91]

وَلَا يَمْلِكُ الَّذِينَ يَدْعُونَ مِنْ دُونِهِ الشَّفَاعَةَ إِلَّا مَنْ شَهِدَ بِالْحَقِّ وَهُمْ يَعْلَمُونَ (86)

**86** అల్లాహ్‌ను వదలి వీళ్లు ఎవరెవరిని మొరపెట్టుకుంటున్నారో వారికి, సిఫారసుకు సంబంధించిన ఏ అధికారమూ లేదు.[92] కాని సత్యం గురించి సాక్ష్యమిచ్చి, దానికి సంబంధించిన జ్ఞానమున్న వారు మాత్రం (సిఫారసుకు యోగ్యులు).[93]

85. ఈ పలుకులు అల్లాహ్‌వీ కావచ్చు లేక దైవప్రవక్తవి కూడా కావచ్చు.

86. వాళ్లు గనక దారికి రానిపక్షంలో వాళ్లను వాళ్ల మానాన వదలిపెట్టు. ఈ పలుకుల్లో తీవ్రమైన హెచ్చరిక ఇమిడి ఉంది.

87. వాళ్ల దుష్టవైఖరి యొక్క దుష్పరిణామం ముందర వచ్చి నిలిచినప్పుడే వాళ్ల కళ్లు తెరచుకుంటాయి. అంతకు ముందు ఎంత చెప్పినా విషయం వారి బుర్రకెక్కదు.

88. అంతేగాని ఆకాశాల్లో ఒక దేవుడూను, భూమండలంలో ఒక దేవుడూ కాదు. భూమినీ, ఆకాశాలనూ సృష్టించిన వాడు ఒక్కడైనపుడు, ఆరాధ్యుడు కూడా ఒక్కడే కాగలడు. దీన్ని పోలిన మరో ఆయతు ఇది : "భూమ్యాకాశాలలో ఆయనే అల్లాహ్. మీరు దాచేదీ, వ్యక్తపరచేదీ అంతా ఆయనకు తెలుసు. మీరు చేసేదంతా ఆయన జ్ఞానపరిధిలో ఉంది." (అల్ అన్ఆమ్ – 3).

89. భూమ్యాకాశాలలో సర్వాధికారాలు గల అధిపతికి ఇంక సంతానం అవసరమేముంది?

90. ఆ సమయం వచ్చినప్పుడు ఆయన దాన్ని బయటపెడతాడు.

91. అక్కడ ఆయన అందరికీ వారి వారి సముపార్జననుబట్టి బహుమానం ఇవ్వటమో, శిక్షించటమో చేస్తాడు.

92. దైవసన్నిధిలో తమను ఆదుకుంటాయన్న గంపెడాశతో వీళ్లు చిల్లరదేముళ్ళను కొలుస్తున్నారు. కాని ఆ దేముళ్ళకు నిజదైవం ఎదుట నోరు తెరిచే అధికారం ఉండదు.

93. సత్యం లేక సత్యవాక్కు అంటే **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** అనే పవిత్ర కలిమా అన్నమాట! ఆ వాక్కును కూడా కేవలం నోటితో లాంఛనంగా చెప్పేస్తే సరిపోదు. ఇతరుల్ని చూసి చెప్పేస్తే సరిపోదు. తాను ఒక్కడైన అల్లాహ్ దాస్యాన్ని మనసారా ప్రకటిస్తూ, ఇతర ఆరాధ్య దైవాలన్నింటినీ తిరస్కరిస్తున్నానన్న వాస్తవం అతనికి క్షుణ్ణంగా తెలియాలి. ఆపైన అతను ఆ మాటకు జీవితాంతం కట్టుబడి ఉండాలి. ఇటువంటి వారికి మాత్రమే సిఫారసు ప్రయోజనం

87 "మిమ్మల్ని పుట్టించినదెవరు"ని నువ్వు గనక వారిని అడిగితే, "అల్లాహ్" అని వారు తప్పకుండా అంటారు. మరలాంటప్పుడు వారు ఎటు తిరిగిపోతున్నారు(ట)?!

وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَهُمْ لَيَقُولُنَّ اللَّهُ فَأَنَّىٰ يُؤْفَكُونَ ﴿٨٧﴾

88 "ఓ నా ప్రభూ! వీళ్లు మాత్రం విశ్వసించే జనులు కారు" అన్న తన ప్రవక్త పలుకు గురించి కూడా ఆయనకు తెలుసు.[94]

وَقِيلِهِ يَا رَبِّ إِنَّ هَٰؤُلَاءِ قَوْمٌ لَّا يُؤْمِنُونَ ﴿٨٨﴾

89 కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు వారి నుంచి ముఖం త్రిప్పుకో. "(నాయనలారా!) మీకో సలాం!" అని చెప్పు.[95] త్వరలో వారికే తెలిసివస్తుంది.

فَاصْفَحْ عَنْهُمْ وَقُلْ سَلَامٌ ۚ فَسَوْفَ يَعْلَمُونَ ﴿٨٩﴾

చేకూర్చుతుంది. లేక సత్యాన్ని ధృవపరచే దైవప్రవక్తలకు, పుణ్య పురుషులకు, దైవదూతలకు మాత్రమే సిఫారసుచేసే హక్కు ఉంటుందని దాని భావం కావచ్చు. అంతేగాని ముష్రిక్కులు కొలిచే మిథ్యా దైవాలకు సిఫారసు చేసే అనుమతి లభించదు.

94. అంటే దైవప్రవక్త చేసిన విన్నపం లేక ఫిర్యాదు గురించి అల్లాహ్‌కు తెలుసు. ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందన్న సంగతి కూడా ఆయనకు తెలుసు అని భావం.

95. ఈ **'సలాం'** వాళ్ళతో తెగత్రెంపులను సూచిస్తోంది. ఉదాహరణకు : "మీకో సలాం! మేము అజ్ఞానుల పద్ధతిని అవలంబించదలచుకోలేదు" (అల్ ఖసస్-55) అన్న ఆయతును పోలినది. అలాగే ఇంకోచోట "మీకు సలాం!" (ఫుర్ఖాన్-61) అని మూర్ఖులనుద్దేశించి చెప్పబడింది. అంటే ధర్మావలంబన విషయంలో మీ దారివేరు, నా దారివేరు. నా మాటను వినని పక్షంలో మీరు మీ పనిచేయండి. నా పని నేను చేస్తాను. ఎవరు సత్యవంతులో, ఎవరు అసత్య వాదులో తొందరగానే తెలిసివస్తుంది అని దీని భావం.

44వ సూరా

# అద్ దుఖాన్

పొగ

అవతరణ మక్కాలో

ఆయతులు 59

## పరిచయం

*ఏక దైవారాధన, దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలోని 10వ ఆయతులో ప్రస్తావించబడిన పొగ అన్న పేరునే దీనికి పెట్టడం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌ని ఒక స్పష్టమైన గ్రంథంగా అభివర్ణిస్తూ ఈ సూరా ప్రారంభమయ్యింది. దివ్యఖుర్ఆన్ శుభప్రదమైన, ఘనమైన రాత్రి (రమజాను మాసంలో) అవతరింపచేయడం జరిగిందని, ఇది అల్లాహ్ తరఫున అవతరించిన కారుణ్యమనీ, మానవాళిని చెడుపట్ల హెచ్చరిస్తుందని తెలియజేసింది. ఈ సూరాలో అల్లాహ్ గురించి వివరణ కూడా లభిస్తుంది. ఆయన ఒక్కడు. ఆయనే నిజమైన దేవుడు, ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఆకాశాలకు, భూమికి, వాటి మధ్య ఉన్న సమస్తానికి ఆయనే ప్రభువు. మన పూర్వీకులకు కూడా ఆయనే ప్రభువు. ఆయన జీవితాన్ని, మృత్యువును ప్రసాదిస్తాడు. ఆయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు.*

*అవిశ్వాసులు అల్లాహ్ గురించి, ఆయన శక్తిసామర్థ్యాల గురించి అనుమానంలో పడి ఉన్నారు. తీర్పుదినం హఠాత్తుగా వారిని పట్టుకునే వరకు తమ అనుమానాలతో ఒక ఆటగా గడుపుతారు. తీర్పుదినం నాటి చిహ్నాల్లో ఒకటి: ఆ రోజు ఆకాశంలో ఒక పొగ ప్రజలను కమ్ముకుంటుంది. అది ప్రళయ ఘడియకు ఒక చిహ్నం. ఇక అప్పుడు అవిశ్వాసులకు పశ్చాత్తాపపడే అవకాశం ఉండదు. తమ శిక్షను తప్పించమని వారు అప్పుడు మొరపెట్టుకున్నా ప్రయోజనం ఉండదు. ఈ సూరాలో గత జాతులకు పట్టిన గతి గురించి కూడా అవిశ్వాసులకు తెలియజేయడం జరిగింది. అల్లాహ్ పట్ల తిరస్కారం, సత్యాన్ని తిరస్కరించడం వల్ల వారు తుడిచిపెట్టుకుపోయారు. ఫిర్ఔన్ గురించి కూడా ఇందులో క్లుప్తమైన ప్రస్తావన ఉంది. ఫిర్ఔన్ అహంభావంతో దుర్మార్గాలకు పాల్పడ్డాడు. అణచివేతలకు పాల్పడ్డాడు. ఫిర్ఔన్, అతడి అనుచరులు చివరకు తుడిచిపెట్టుకుపోయారు. వారి భవనాలు, తోటలు, సెలయేళ్ళు, పొలాలు, వారి సంపద అంతటిని వదిలి వారు నాశనమయ్యారు. మూసా(అస), ఆయన అనుచరులు కాపాడబడ్డారు. ఇస్రాయీల్ సంతతి ప్రజలకు దైవానుగ్రహం లభించింది. కాని తర్వాత వారు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు. అల్లాహ్ అనుగ్రహాలను మరిచిపోయారు. తాము చేసుకున్న ఒప్పందానికి కట్టుబడలేదు. వారికి కూడా యెమన్‌లో నివసించిన ఒక ప్రాచీన జాతి గురించి చెప్పడం జరిగింది. అల్లాహ్‌కు బదులుగా ఖగోళాలను (గ్రహాలను, నక్షత్రాలను) ఆరాధించిన ఆ జాతిని కూడా నాశనం చేయడం జరిగింది.*

## అద్ దుఖాన్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1 – 2** హా మీమ్. స్పష్టమైన ఈ గ్రంథం తోడు!

**3** నిశ్చయంగా మేము దీనిని శుభప్రద మైన రాత్రియందు[1] అవత రింపజేశాము. నిస్సందేహంగా మేము హెచ్చరిక చేసేవాళ్ళము.[2]

**4** ఆ రాత్రియందే కీలకమైన ప్రతి ఉత్తర్వు జారీ చేయబడు తుంది.[3]

## سُورَةُ الدُّخَانِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

حمٓ ⟨1⟩ وَالْكِتَابِ الْمُبِينِ ⟨2⟩

إِنَّا أَنزَلْنَاهُ فِي لَيْلَةٍ مُّبَارَكَةٍ إِنَّا كُنَّا مُنذِرِينَ ⟨3⟩

فِيهَا يُفْرَقُ كُلُّ أَمْرٍ حَكِيمٍ ⟨4⟩

---

1. **'శుభప్రదమైన రాత్రి'** అంటే లైలతుల్ ఖద్ర్ (ఘనమైన రాత్రి) అని భావం. ఈ లైలతుల్ ఖద్ర్ రమజాన్ నెలలో చివరి దశకంలోని బేసిరాత్రుల్లో ఏదో ఒకటి అయి ఉంటుంది. "దివ్య ఖుర్ఆన్ అవతరించిన నెల రమజాన్ నెల" (అల్ బఖర– 185) అని చెప్పబడటం గమనార్హం. అలాగే "మేము ఈ ఖుర్ఆన్‌ను ఘనమైన రాత్రి యందు అవతరింపజేశాము" అని (అల్ ఖద్ర్ సూరాలో) సెలవీయబడటం కూడా గమనార్హమే. ఆ ఘనమైన రేయినే ఈ సూరాలో శుభప్రదమైన రేయిగా పేర్కొనటం జరిగింది. అది శుభప్రదమైన రేయి అనటంలో సందేహానికి తావేలేదు. ఎందుకంటే 1. ఆ రాత్రిన ఖుర్ఆన్ గ్రంథం అవతరించింది. 2. ఆ రాత్రియందు దైవదూతలు దిగివచ్చారు. ముఖ్యంగా రూహుల్ అమీన్ – హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలాం – వచ్చారు. 3. ఒక ఏడాది అంతా జరిగే సంఘటనలకు సంబంధించిన కీలక నిర్ణయాలు ఈ రాత్రియందు గైకొనబడతాయి. 4. ఈ రాత్రి చేసే ఆరాధన వెయ్యి మాసాల (అంటే 83 సంవత్సరాల, నాలుగు నెలల) కంటే కూడా గొప్పది. దివ్య ఖుర్ఆన్ ఘనమైన రాత్రిన లేక శుభకరమైన రాత్రిన అవతరించిందంటే దాని భావం – ఆ రాత్రి నుంచి మహాప్రవక్త (స)పై దాని అవతరణా క్రమం ఆరంభమయింది. అంటే తొట్టతొలిసారి ఈ రాత్రియందే ఈ గ్రంథం అంతిమ దైవప్రవక్త (స)పై అవతరించింది. లేక దీని భావం ఇది : ఈ రాత్రియందే దివ్య ఖుర్ఆన్ 'లౌహె మహ్‌ఫూజ్' నుంచి క్రింది ఆకాశంలో ఉన్న 'బైతుల్ ఇజ్జత్' లోకి దించబడింది. మరి అక్కణ్ణుంచి అవసరాలకనుగుణంగా– కొద్దికొద్దిగా – 23 ఏండ్ల వ్యవధిలో మహనీయ ముహమ్మద్ (స)పై అవతరించింది.

   కొంతమంది 'శుభప్రదమైన రాత్రి'ని షాబాన్ నెలలో వచ్చే 15వ రాత్రిగా తలపోశారు. కాని ఇది సరైనది కాదు. ఈ గ్రంథం రమజాన్ మాసంలోని 'లైలతుల్ ఖద్ర్'లో అవతరించినట్లు ఖుర్ఆన్ ద్వారా స్పష్టంగా రూఢీ అవుతున్నప్పుడు ఇతరత్రా రాత్రుల గురించి ఆలోచించటం ఎంతమాత్రం సరైంది కాదు. అదలా వుంచితే, షాబాన్ నెల 15వ రాత్రి (షబే బరాత్)కి సంబంధించి వచ్చిన ఉల్లేఖనాలన్నీ ప్రామాణికమైనవి కావు, బలహీనమైనవి. ఈ ఉల్లేఖనాలు ఖుర్ఆన్‌లోని ఆయతుల ముందు ఎలా నిలువగలుగుతాయి?

2. దివ్య ఖుర్ఆన్ అవతరణలోని ప్రధాన ఉద్దేశం ఏది మేలైనదో తెలియపరచటం, మరేది కీడుతో కూడుకున్నదో హెచ్చరించటం. పరిణామాన్ని గురించి ముందుగా తెలియజేస్తే బాధ్యత తీరుతుంది.

3. **'యుఫ్‌రఖు' (يُفْرَقُ)** అంటే ఏదేని విషయానికి సంబంధించిన ఉచితానుచితాలను క్షుణ్ణంగా పరిశీలించి, దానిని అమలుపరిచే బాధ్యత తత్సంబంధిత దైవదూతకు అప్పగించటం జరుగుతుంది. **'హకీమ్'** అంటే వివేకంతో నిండినది అని అర్థం. దేవుని ప్రతి పనీ వివేకంతో నిండి ఉంటుంది. లేదా 'హకీమ్' అన్న పదం 'ముహ్‌కమ్' (దృఢమైనది) అన్న అర్థంలో వచ్చి ఉంటుంది. అది దృఢంగా, తిరుగులేనిదిగా కూడా ఉంటుంది. అందులో మార్పులకు, సవరణలకు

5 మా వద్ద నుండి ఆజ్ఞ రూపంలో![4] (ప్రవక్తలను) పంపేది కూడా మేమే.

أَمْرًا مِّنْ عِندِنَا ۚ إِنَّا كُنَّا مُرْسِلِينَ ⑤

6 నీ ప్రభువు దయానుగ్రహం వల్ల.[5] ఆయన సర్వం వినేవాడు, సర్వం తెలిసినవాడు.

رَحْمَةً مِّن رَّبِّكَ ۚ إِنَّهُ هُوَ السَّمِيعُ الْعَلِيمُ ⑥

7 మీరు గనక నమ్మగలిగితే ఆయనే భూమ్యాకాశాలకు, వాటి మధ్యనున్న సమస్తానికీ ప్రభువు.

رَبِّ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا بَيْنَهُمَا ۖ إِن كُنتُم مُّوقِنِينَ ⑦

8 ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ఆయనే బ్రతికిస్తున్నాడు, ఆయనే చంపుతున్నాడు. ఆయనే మీ ప్రభువు, పూర్వీకులైన మీ తాతముత్తాతలకు కూడా (ఆయనే) ప్రభువు.[6]

لَا إِلَٰهَ إِلَّا هُوَ يُحْيِي وَيُمِيتُ ۖ رَبُّكُمْ وَرَبُّ آبَائِكُمُ الْأَوَّلِينَ ⑧

9 అది కాదు, వారు సంశయానికి లోనై, ఆడుకుంటున్నారు.[7]

بَلْ هُمْ فِي شَكٍّ يَلْعَبُونَ ⑨

10 కనుక నువ్వు, ఆకాశం స్పష్టమయిన పొగను తీసుకువచ్చే[8] రోజు కోసం ఎదురు చూడు.

فَارْتَقِبْ يَوْمَ تَأْتِي السَّمَاءُ بِدُخَانٍ مُّبِينٍ ⑩

అవకాశం ఉండదు. ఈ రాత్రియందు, రానున్న సంవత్సరానికి సంబంధించిన జీవన్మరణాలు, జీవిత ఒనరుల కేటాయింపులు, తదితర ముఖ్యాంశాల్ని 'లౌహె మహ్‌ఫూజ్' నుంచి దించి దైవదూతలకు అప్పగించటం జరుగుతుందని మహాప్రవక్త ప్రియసహచరులు, వారి శిష్యులు వ్యాఖ్యానించారు (ఇబ్నె కసీర్).

4. ఈ నిర్ణయాలన్నీ మా అనుమతితోనే మా ఆజ్ఞపైనే జరుగుతాయి. మా ప్రణాళిక ననుసరించి జరుగుతాయి.

5. దైవ గ్రంథాలను అవతరింపజేయటమైనా, దైవప్రవక్తలను పంపటమైనా – ఇదంతా కేవలం మా దయానుగ్రహమే. మా గ్రంథాల జ్ఞానాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించటానికే మేము మా ప్రవక్తలను పంపిస్తాము. ఈ విధంగా మేము మా దాసులను వారి జీవితావసరాల నిమిత్తం భౌతికానుగ్రహాలను ప్రసాదించటమే గాకుండా, ఆధ్యాత్మికంగా కూడా మార్గదర్శకత్వం వహించాము.

6. ఈ ఆయతులు కూడా అల్ ఆరాఫ్ సూరాలోని 158వ ఆయతు వంటివే. ఆ సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "(ఓ ముహమ్మద్ – సఅసం) ఈ విధంగా ప్రకటించు–నేను మీ అందరి వద్దకు పంపబడిన దైవప్రవక్తను. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ఆయనే బ్రతికిస్తున్నాడు, ఆయనే చంపుతున్నాడు..." (అల్ ఆరాఫ్ – 158).

7. అంటే సత్యం వచ్చేసిన పిదప వారు, దాన్ని విశ్వసించవలసిందిపోయి సందిగ్ధంలో పడిపోయారు. అంతేకాదు, ఈ సత్యాన్ని నవ్వులాటగా తీసుకున్నారు.

8. ఇది అవిశ్వాసులకు తీవ్రమైన హెచ్చరిక. ఓ ప్రవక్తా! ఆకాశంలో పొగ ప్రస్ఫుటమయ్యే రోజు కొరకు నువ్వు నిరీక్షించు. ఈ ఆయతు పూర్వరంగం గురించి ఇలా చెప్పబడింది:

మక్కావాసుల కరకు వైఖరికి విసుగెత్తిపోయిన దైవప్రవక్త (సఅసం) వారిపై కరువు కాటకాలు రావాలని శపించారు. తత్ఫలితంగా మక్కాపై దుర్భిక్షం తాండవించింది. ప్రజలు ఆకలిబాధతో అలమటించారు. చివరికి వారు బొమికలను, చర్మాలను, చచ్చిపోయిన జంతువులను సయితం తినసాగారు. తలెత్తి ఆకాశం వంక ఆశతో చూసేవారు. కాని ఆకలిబాధ, తీవ్రమైన బలహీనత వల్ల వారికి ఆకాశం ఒక పొగ మాదిరిగా కనిపించేది. అప్పుడు గత్యంతరంలేక

| | |
|---|---|
| 11 అది మనుషుల్ని ముట్టడిస్తుంది. అదొక వ్యథాభరితమైన శిక్ష. | يَّغْشَى النَّاسَ ۖ هٰذَا عَذَابٌ اَلِيْمٌ ﴿11﴾ |
| 12 (అప్పుడు వారు) "మా ప్రభూ! ఈ విపత్తును మా నుండి దూరం చేయి. మేము నిజంగానే విశ్వసిస్తాము"[9] (అని ప్రాధేయ పడతారు). | رَبَّنَا اكْشِفْ عَنَّا الْعَذَابَ اِنَّا مُؤْمِنُوْنَ ﴿12﴾ |
| 13 ఉపదేశం ఇప్పుడు వారికి ఎలా లాభదాయకం అవు తుంది? – అన్నీ విడమరచి చెప్పే ప్రవక్త వారి వద్దకు (ఎప్పుడో) వచ్చేశాడు. | اَنّٰى لَهُمُ الذِّكْرٰى وَقَدْ جَآءَهُمْ رَسُوْلٌ مُّبِيْنٌ ﴿13﴾ |
| 14 అయినా వాళ్లు అతన్నుండి ముఖం త్రిప్పుకున్నారు. "ఇతను (ఇతరుల చేత మాటలు) నేర్పబడిన పిచ్చివానిలా ఉన్నాడు" అని అన్నారు. | ثُمَّ تَوَلَّوْا عَنْهُ وَ قَالُوْا مُعَلَّمٌ مَّجْنُوْنٌ ﴿14﴾ |
| 15 మేము ఈ విపత్తును కొద్దిగా తొలగిస్తాము. (కాని ఏం లాభం?) మీరు మళ్లీ యథాస్థితి (అవిశ్వాస స్థితి)కి వస్తారు. | اِنَّا كَاشِفُوا الْعَذَابِ قَلِيْلًا اِنَّكُمْ عَآئِدُوْنَ ﴿15﴾ |
| 16 ఏ రోజున మేము మిమ్మల్ని చాలా గట్టిగా పట్టుకుంటామో[10] (ఆ రోజు) మీపై తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటాము. | يَوْمَ نَبْطِشُ الْبَطْشَةَ الْكُبْرٰى ۚ اِنَّا مُنْتَقِمُوْنَ ﴿16﴾ |

దైవప్రవక్త (స) వద్దకు వచ్చి, ఈ విపత్తును తొలగించమని ప్రార్థించండంటూ అభ్యర్థించారు. ఈ దుర్భిక్షస్థితి గనక తొలగిపోతే తామంతా 'విశ్వసిస్తామ'ని వాగ్దానం చేశారు. కాని గడ్డుకాలం తొలగిపోగానే కథ మళ్లీ మొదటికొచ్చింది. వాళ్లు తమ వైరవైఖరిపై నిలిచిపోయారు. అందువల్ల దేవుడు బద్ర్ రణరంగంలో వారిపై గట్టిగా ప్రతీకారం తీర్చుకున్నాడని వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్).

మరికొందరి వ్యాఖ్యానం ఇలా ఉంది : ప్రళయ దినానికి సంబంధించిన 10 పెద్ద పెద్ద చిహ్నాలలో ఈ పొగ ఒకటి: ఈ పొగ ప్రభావం అవిశ్వాసులపై తీవ్రంగా పడుతుంది. విశ్వాసులపై కొద్దిగా పడుతుంది. ఈ ఆయతులో ఆ పొగ గురించే చెప్పబడింది. ఈ వ్యాఖ్యానం ప్రకారం ఈ చిహ్నం ప్రళయ దినానికి ముందు ప్రస్ఫుటం అవుతుంది. మొదటి వ్యాఖ్యానం ప్రకారం చూస్తే ఈ సంఘటన ఇప్పటికే సంభవించింది. ఈ రెండు విషయాలు సరైనవేనని ఇమామ్ షౌకానీ అంటున్నారు. ఆయతు పూర్వరంగం ప్రకారం ఈ సంఘటన జరిగిపోయిందని ప్రామాణిక ఆధారాల ద్వారా రూఢీ అయింది. ఇక ప్రళయ సూచనలంటారా, అక్కడా ఈ విషయం ప్రామాణిక హదీసుల ద్వారా ఉటంకించబడింది. కాబట్టి దాన్ని కొట్టివేయడానికి వీలులేదు. ఆ సమయంలో ఈ పరిస్థితి నెలకొనగలదని మనం నమ్మాలి.

9. మొదటి వ్యాఖ్యానం (తఫ్సీర్) ప్రకారం ఇవి మక్కా అవిశ్వాసుల పలుకులు. రెండవ వ్యాఖ్యానం ప్రకారం ప్రళయదినానికి ముందు అవిశ్వాసులు ఈ విధంగా అంటారు.

10. అంటే బద్ర్ సంగ్రామం జరిగే రోజున! ఆ యుద్ధంలో 70 మంది ప్రముఖ అవిశ్వాసులు హతులయ్యారు. మరో 70 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు.

ఇక రెండవ వ్యాఖ్యానం ప్రకారం (రెండో కోణం నుంచి)చూస్తే ప్రళయదినాన దేవుడు వారిని చాలా గట్టిగా నిలదీస్తాడు.

ఈ నేపథ్యంలో అల్లామా షౌకానీ ఏమంటున్నారో చూడండి: బద్ర్ యుద్ధభూమిలో అవిశ్వాసులకు జరిగే ఘోర

وَلَقَدْ فَتَنَّا قَبْلَهُمْ قَوْمَ فِرْعَوْنَ وَجَاءَهُمْ رَسُولٌ كَرِيمٌ ﴿١٧﴾

17 వీరికి పూర్వం ఫిరౌన్ జాతి వారిని (కూడా) మేము పరీక్షించాము.[11] వాళ్ల దగ్గరకు గౌరవనీయుడైన ప్రవక్త వచ్చాడు.

أَنْ أَدُّوا إِلَيَّ عِبَادَ اللَّهِ ۖ إِنِّي لَكُمْ رَسُولٌ أَمِينٌ ﴿١٨﴾

18 (అతనిలా అన్నాడు): "దైవదాసులను నాకప్పగించండి.[12] నేను మీ వద్దకు పంపబడిన నమ్మకస్థుణ్ణి అయిన ప్రవక్తను.[13]

وَأَنْ لَا تَعْلُوا عَلَى اللَّهِ ۖ إِنِّي آتِيكُمْ بِسُلْطَانٍ مُبِينٍ ﴿١٩﴾

19 "మీరు అల్లాహ్ ముందు తలబిరుసుతనం ప్రదర్శించకండి.[14] నేను మీ వద్దకు స్పష్టమైన ప్రమాణం తీసుకువచ్చాను.[15]

وَإِنِّي عُذْتُ بِرَبِّي وَرَبِّكُمْ أَنْ تَرْجُمُونِ ﴿٢٠﴾

20 "మీరు రాళ్లు రువ్వి నన్ను చంపే ప్రయత్నం నుంచి నా ప్రభువూ, మీ ప్రభువూ అయిన అల్లాహ్‌ను నేను శరణు వేడుతున్నాను.[16]

وَإِنْ لَمْ تُؤْمِنُوا لِي فَاعْتَزِلُونِ ﴿٢١﴾

21 "ఒకవేళ మీకు నాపై నమ్మకం లేకపోతే, నా నుండి వేరైపోండి."[17]

فَدَعَا رَبَّهُ أَنَّ هَٰؤُلَاءِ قَوْمٌ مُجْرِمُونَ ﴿٢٢﴾

22 (కాని ఎంత నచ్చజెప్పినా వారు వినకపోవటంతో) అతను, "(ఓ ప్రభూ!) ఈ జనులు పాపాత్ములు"[18] అంటూ తన ప్రభువును ప్రార్థించాడు.

---

పరాభవాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ ఆయతు అసలు అవతరించింది. ఖురైషుల గురించే ఈ మాట చెప్పబడింది. తీర్పుదినాన కూడా అల్లాహ్ చాలా గట్టిగా పట్టుకుంటాడన్న విషయంలో సందేహానికి తావులేదు. కాని ఆ 'పట్టు' సర్వసాధారణమయింది. ప్రతి అవిధేయునికీ అది వర్తిస్తుంది.

11. **'పరీక్షించాము'** అంటే భావం మేము వారికి ప్రాపంచిక సుఖసౌఖ్యాలను, సిరిసంపదలను పుష్కలంగా ప్రసాదించాము. ఆ తరువాత వారి వద్దకు గౌరవనీయుడగు మా ప్రవక్త (మూసా)ను పంపాము. కాని వారు మాత్రం తమ ప్రభువు అనుగ్రహాల పట్ల కృతజ్ఞతలూ తెలుపుకోలేదు, మా ప్రవక్త చెప్పినట్లూ వినలేదు.

12. **'దైవదాసులను అప్పగించండి'** అంటే మూసా (అలైహిస్సలాం) జాతికి చెందిన బనీ ఇస్రాయీల్ జనులను విముక్తుల్ని చేయండి అని భావం. ఆ జాతివారిని ఫిరౌన్ బానిసలుగా చేసుకుని వేధించేవాడు. అందువల్ల హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తన జాతి ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇవ్వమని డిమాండు చేశారు.

13. అంటే – దైవసందేశాన్ని యథాతథంగా మీకు అందజేసేవాణ్ణి. అందులో హెచ్చుతగ్గులు చేసేవాణ్ణికాను.

14. అంటే – దైవప్రవక్త మాటను తిరస్కరించి దేవుని ముందు మీ బడాయిని చాటుకోకండి. ఈ ధోరణి మీకు శ్రేయస్కరమైనది కాదు.

15. నేను మీ వద్దకు తెచ్చిన బలమైన నిదర్శనాన్ని కళ్ళారా తిలకించిన మీదట ఇక మీరు 'కాదు, కూడదు' అని బుకాయించేందుకు ఆస్కారమే లేదు.

16. ఈ సందేశాన్ని అందజేసిన పిదప ఫిరౌన్ చక్రవర్తి మూసా (అలైహి)ని చంపుతానని బెదిరించాడు. అప్పుడు మూసా తన ప్రభువును శరణువేడుతూ ఈ విధంగా పలికారు.

17. అంటే, మీరు నా సందేశాన్ని స్వీకరించకపోతే పోనివ్వండి. కాని నన్ను చంపుతామని బెదిరించటం, నాపై కక్ష

**23** “సరే! రాత్రికి రాత్రే నువ్వు నా దాసులను తీసుకుని వెళ్ళిపో.[19] ఖచ్చితంగా మీరు వెంబడించబడతారు.

فَأَسْرِ بِعِبَادِي لَيْلًا إِنَّكُم مُّتَّبَعُونَ ﴿٢٣﴾

**24** “నువ్వు సముద్రాన్ని నిలిచి (చీలి) ఉన్న స్థితిలోనే వదలి వెళ్ళిపో.[20] అయితే ఈ సైన్యం మాత్రం ముంచివేయబడుతుంది” (అని మేమతనికి సూచించాము).

وَاتْرُكِ الْبَحْرَ رَهْوًا ۖ إِنَّهُمْ جُندٌ مُّغْرَقُونَ ﴿٢٤﴾

**25** వారు ఎన్నో తోటలను, ఊటలను వదలిపోయారు.[21]

كَمْ تَرَكُوا مِن جَنَّاتٍ وَعُيُونٍ ﴿٢٥﴾

**26** మరెన్నో పచ్చని పొలాలను, చక్కని నిలయాలను,

وَزُرُوعٍ وَمَقَامٍ كَرِيمٍ ﴿٢٦﴾

**27** ఇంకా తాము అనుభవిస్తూ ఉండే విలాసవంతమైన వస్తువులను కూడా (వదలిపోయారు).

وَنَعْمَةٍ كَانُوا فِيهَا فَاكِهِينَ ﴿٢٧﴾

**28** అంతా ఇట్టే అయిపోయింది.[22] మేము మరో జాతి వారిని వాటన్నింటికీ వారసులుగా చేశాము.[23]

كَذَٰلِكَ ۖ وَأَوْرَثْنَاهَا قَوْمًا آخَرِينَ ﴿٢٨﴾

**29** వారి స్థితిపై నింగీ, నేలా రోదించలేదు.[24] వారికి (కనీసం) గడువు కూడా లభించలేదు.

فَمَا بَكَتْ عَلَيْهِمُ السَّمَاءُ وَالْأَرْضُ وَمَا كَانُوا مُنظَرِينَ ﴿٢٩﴾

---

సాధింపు చర్యలు మొదలెట్టటం మాత్రం విపరీతం. కనీసం మీరు నా జోలికి రాకుండా ఉండండి, చాలు అని మూసా చెప్పారు.

18. కాని వారు తన మాటలపై ఆలోచించకపోగా, మరింతగా రెచ్చిపోవటంతో హజ్రత్ మూసా (అలైహిస్సలాం) దైవ సహాయం కోసం చేతులెత్తి అర్థించారు.

19. అల్లాహ్ తన ప్రవక్త మొరను ఆలకించి, ఆమోదించాడు. ఇస్రాయీల్ సంతతి వారిని రాత్రికి రాత్రే తీసుకుని నగరం విడిచిపెట్టమని సంకేతం ఇచ్చాడు. దాంతోపాటు, “చూడు! వాళ్లు నిన్ను వెంటాడతారు, కాని ఆందోళన చెందకు” అని ఓదార్చాడు.

20. **‘రహ్వన్’** అంటే ఆగివున్న లేక ఎండిపోయిన స్థితిలో అని అర్థం. అంటే నువ్వు నీ చేతి కర్రతో సముద్రంపై కొట్టగానే సముద్రం రెండుగా చీలిపోయి, నీ కోసం దారి ఇస్తుంది. నువ్వు నీ సమూహంతోపాటు సముద్రాన్ని దాటగానే, సముద్రాన్ని అదే స్థితిలో వదలి వెళ్ళిపో. అప్పుడు ఫిరౌన్ కూడా తన సైనికుల సమేతంగా సముద్రాన్ని దాటి వచ్చేందుకు దిగుతాడు. అప్పుడు మేమాసేనల్ని ముంచివేస్తాము – జరిగింది కూడా అదే.

21. నైలునదికి ఇరు ప్రక్కల ఎన్నో తోటలు, పంట పొలాలుండేవి. వైభవోపేతమైన భవనాలుండేవి. అవన్నీ వారి సిరిసంపదలకు, భోగభాగ్యాలకు ప్రతీకలుగా అలరారేవి. అవన్నీ ప్రపంచంలోనే ఉండిపోయాయి. వారి ఆస్తిపాస్తులేవీ వారి వెంట రాలేదు. లోకవాసులకు గుణపాఠ సూచనగా ఫిరౌన్, ఫిరౌన్ జాతి పేరు మాత్రం నిలిచి పోయింది.

22. అంటే, ముందుగా చెప్పినట్లే ఫిరౌన్ కథ కంచికి చేరింది.

23. కొందరు వ్యాఖ్యాతల ప్రకారం దేవుడు ఇస్రాయీలు సంతతి వారికి వాటిపై వారసత్వం వొసగాడు. కాని ఇస్రాయీలు సంతతి వారు మళ్లీ ఈజిప్టు ప్రాంతానికి తిరిగివచ్చిన దాఖలాలు చరిత్రలో ఎక్కడా లేవని ఇంకొంతమంది ఎత్తిచూపారు. అందువల్ల ఈజిప్టు రాజ్య వారసత్వం ఇస్రాయీలీయులకు గాకుండా మరొకరికి దక్కిందని చెప్పటం సమంజసం అన్నది వారి అభిప్రాయం.

**30** నిస్సందేహంగా మేమే ఇస్రాయీలు సంతతిని (అత్యంత) అవమానకరమైన శిక్ష (పీడన) నుంచి విడిపించాము.

وَلَقَدْ نَجَّيْنَا بَنِيٓ إِسْرَٰٓءِيلَ مِنَ الْعَذَابِ الْمُهِينِ ﴿٣٠﴾

**31** ఫిరౌన్ తరఫున జరిగే (పీడన నుంచి)! నిశ్చయంగా వాడు మహా తలబిరుసు, బరితెగించిపోయినవాడు.

مِن فِرْعَوْنَ ۚ إِنَّهُۥ كَانَ عَالِيًا مِّنَ الْمُسْرِفِينَ ﴿٣١﴾

**32** మేము జ్ఞానంతోనే వారికి (ఇస్రాయీలీయులకు) లోక వాసులపై ప్రాధాన్యతను వొసగాము.[25]

وَلَقَدِ اخْتَرْنَٰهُمْ عَلَىٰ عِلْمٍ عَلَى الْعَٰلَمِينَ ﴿٣٢﴾

**33** ఇంకా, మేము వారికి స్పష్టమైన పరీక్ష గల సూచనలను ఇచ్చాము.[26]

وَءَاتَيْنَٰهُم مِّنَ الْءَايَٰتِ مَا فِيهِ بَلَٰٓؤٌا۟ مُّبِينٌ ﴿٣٣﴾

**34** వాళ్లు (మక్కా తిరస్కారులు) ఇలా అంటున్నారు[27] –

إِنَّ هَٰٓؤُلَآءِ لَيَقُولُونَ ﴿٣٤﴾

**35** "ఇక్కడ (ఈ ప్రపంచంలో) మాకు వచ్చే మొదటి మరణమే తప్ప మరొకటిలేదు.[28] మళ్లీ మేము తిరిగి లేపబడటమనేది ఉండదు.

إِنْ هِيَ إِلَّا مَوْتَتُنَا الْأُولَىٰ وَمَا نَحْنُ بِمُنشَرِينَ ﴿٣٥﴾

24. ఫిరౌన్ జాతివారిలో ఏ కాస్త మంచి ఉన్నా, వారి సత్కర్మలు ఆకాశం వైపుకు ఎక్కి ఉన్నా బహుశా ఆకాశం ఘోషించి విలపించేదేమో! వారు కనీసం ధరిత్రిపై దైవారాధన చేస్తూ సాష్టాంగపడి ఉంటే, వారి వినాశాన్ని చూసి, భూమి దుఃఖించి ఉండేదేమో! కాని వారి దుర్మార్గాలు, అత్యాచారాలు, ఆగడాలు మితిమీరి పోవటం వల్లనేమో వారి విషాదాంతంపై అటు నింగిగానీ, ఇటు నేలగాని ఏమాత్రం బాధపడలేదు (ఫత్హుల్ ఖదీర్).

25. ఈ లోకవాసులంటే ఇస్రాయీలీయులకు సమకాలీకులైన ప్రపంచ జాతులని భావం. అంతేగాని ఆ ప్రాధాన్యత సర్వకాల, సర్వావస్థలకు వర్తించదు. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్‌లో ముహమ్మద్ అనుచర సమాజం 'శ్రేష్ఠసమాజం'గా అభివర్ణించబడింది. కాబట్టి దీనిద్వారా విదితమయ్యేదేమిటంటే, దేవుడు ఆనాటి ప్రపంచవాసులపై బనీ ఇస్రాయీల్‌కి ఆధిక్యతను, శ్రేష్ఠతను ప్రసాదించాడు. ఏ యోగ్యత మూలంగా దేవుడు వారికి ఆ వైశిష్ట్యాన్ని ప్రసాదించాడో ఆయనకే ఎరుక.

26. ఇక్కడ **'సూచనలు'** అంటే దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం)కు ఇవ్వబడిన మహిమలని భావం. ఆ సూచనలను పొందిన మీదట వారెలా ప్రవర్తిస్తారో దేవుడు పరీక్షించదలిచాడు. లేదా సూచనలంటే దేవుడు ఇస్రాయీలు సంతతి వారికి చేసిన మహోపకారాలు అని అర్థం. ఉదాహరణకు: ఫిరౌనీయుల చెరనుంచి వారిని విడిపించటం, సముద్రాన్ని చీల్చి వారి కోసం మార్గం ఏర్పరచటం, మేఘాలను వారికి నీడగా పంపటం, మన్న్ సల్వాలను ఆహారపదార్థంగా ప్రసాదించటం ఇత్యాదివన్నీ దైవానుగ్రహాలే. ఈ ఉపకారాలను పొందిన మీదట ఇస్రాయీల్ జాతివారు దైవవిధేయతా మార్గాన్ని అవలంబిస్తారో లేక తలబిరుసులుగా ప్రవర్తిస్తారో దేవుడు చూడదలిచాడు.

27. **'వాళ్లు'** అంటే మక్కాకు చెందిన అవిశ్వాసులన్నమాట! ఎందుకంటే ఈ సూరా ఆరంభం నుంచే ఖురైషుల నేపథ్యంలో విషయం చర్చించబడుతోంది. మధ్యలో వారిని హెచ్చరించే ఉద్దేశంతో ఫిరౌన్ గాథను కూడా ఉదాహరించటం జరిగింది. ఫిరౌన్ కూడా వీళ్ల మాదిరిగానే అహంకారం ప్రదర్శించాడు. కాని ఏమయింది? మరి ఈ మక్కా ఖురైషులు గనక దారికి రాకపోతే వీళ్లకూ అదే గతి పడుతుంది.

28. అంటే – ఈ ప్రాపంచిక జీవితమే తొలి జీవితం, తుది జీవితం కూడా. ఆ తరువాత మళ్లీ బ్రతకటం, లెక్కాగిక్కా అనేవి ఏవి ఉండవు అన్నది వారి పలుకుల ఆంతర్యం.

**36** "ఒకవేళ మీరు చెప్పేదే నిజమైతే మా తాతముత్తాతలను (తిరిగి) తీసుకు రండి!"[29]

فَأْتُوا بِآبَائِنَا إِن كُنتُمْ صَادِقِينَ ﴿٣٦﴾

**37** ఏమిటి, వీళ్లు గొప్పవారా లేక 'తుబ్బా' జాతి వారు, వారికి పూర్వం గతించిన వారు గొప్పవారా? మేము వాళ్ళందరినీ అంత మొందించాము. ఎందుకంటే వాళ్లు పాపాత్ములుగా తయా రయ్యారు.[30]

أَهُمْ خَيْرٌ أَمْ قَوْمُ تُبَّعٍ وَالَّذِينَ مِن قَبْلِهِمْ ۚ أَهْلَكْنَاهُمْ ۖ إِنَّهُمْ كَانُوا مُجْرِمِينَ ﴿٣٧﴾

**38** మేము భూమ్యాకాశాలను, వాటి మధ్యనున్న వస్తువులను ఏదో తమాషాగా (ఆషామాషీగా) సృష్టించలేదు.[31]

وَمَا خَلَقْنَا السَّمَاوَاتِ وَالْأَرْضَ وَمَا بَيْنَهُمَا لَاعِبِينَ ﴿٣٨﴾

**39** పైగా మేము వాటిని సత్య (ప్రణాళికా) బద్ధంగానే సృజిం చాము.[32] కాని వారిలో చాలామందికి తెలీదు.[33]

مَا خَلَقْنَاهُمَا إِلَّا بِالْحَقِّ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ ﴿٣٩﴾

**40** నిశ్చయంగా తీర్పుదినం, వారందరి కోసం నిర్ణయించబడిన ఒక (వాగ్దాన) సమయం.[34]

إِنَّ يَوْمَ الْفَصْلِ مِيقَاتُهُمْ أَجْمَعِينَ ﴿٤٠﴾

---

29. దైవప్రవక్త (స)ను, ముస్లింలను ఉద్దేశించి అవిశ్వాసులు విసిరిన సవాలు ఇది – మరణానంతర జీవితం అనేది నిజంగానే ఉంటే, ఏదీ, చనిపోయిన మా పూర్వీకులను మళ్లీ బ్రతికించి తీసుకురండి!? అని వారు డిమాండు చేశారు. ఇది వారి మంకుతనానికి నిదర్శనం. ఎందుకంటే ప్రళయదినం తరువాత – పరలోకంలో – మరణానంతర జీవితం ఉందని చెప్పబడిందేగాని ప్రపంచంలో మరణానంతర జీవితం ఉందని చెప్పలేదే!

30. ఏమిటి, 'తుబ్బా' జాతి వారి గురించిగానీ, వారికి పూర్వం గతించిన ఆద్, సమూద్ జాతి వారిని గురించిగానీ ఈ మక్కా తిరస్కారులకు తెలుసా? వాళ్లు వీళ్లకన్నా ఎక్కువ బలిష్ఠులు, తెలివితేటలు గలవారే. కాని వారి పాపాల కారణంగా మేము వారిని తుడిచిపెట్టేశాము. 'తుబ్బా' అంటే సబా జాతి. సబా జాతిలో 'హమీర్' అనే ఒక తెగ ఉండేది. వారు తమ చక్రవర్తిని 'తుబ్బా' అనే బిరుదుతో పిలిచేవారు. అంటే రోము చక్రవర్తిని 'ఖైసర్'గా, పారసీక రాజ్యాధిపతిని 'కిస్రా'గా, ఈజిప్టు రాజును 'ఫిరౌన్'గా, అబిసీనియా చక్రవర్తిని 'నజాషీ'గా ప్రజలు పిలిచినట్లే 'సబా' జాతి నాయకుణ్ణి 'తుబ్బా'గా వ్యవహరించేవారు. అలాంటి తుబ్బాలలో ఒకతను బలపరాక్రమాలలో, సామ్రాజ్య విస్తరణలో బాగా పేరుమోశాడని చరిత్రకారులు చెబుతారు. అతను తన జైత్రయాత్రను కొనసాగిస్తూ సమర్ఖండ్ వరకూ వచ్చాడని కొంతమంది చరిత్రకారులు పేర్కొన్నారు. ఇలాంటి బలపరాక్రమాలు గల రాజులు ఈ రాజవంశంలో చాలామందే ఉన్నారు. వారి కాలంలో సబా జాతి కీర్తి శిఖరాలు అంబరాన్నంటాయి. కాని ఆ జాతి వారు కూడా తమ ప్రవక్తను ధిక్కరించేసరికి అల్లాహ్ వారిని సమూలంగా తుడిచిపెట్టేశాడు (వివరాలకు 'సబా' సూరాలోని తత్సంబంధిత ఆయతులను అధ్యయనం చేయండి). ఒకానొక తుబ్బా గురించి హదీసులో, అతను ముస్లిం అయ్యాడనీ, అతన్ని తూలనాడ కూడదని చెప్పటం జరిగింది. (సహీహ్ అల్ జామె లిల్ అల్బానీ–1319). అయితే ఆ జాతివారిలో మెజారిటీ జనులు మాత్రం అవిధేయులుగానే ఉండిపోయారు. తత్కారణంగా వినాశం వారి తలరాతగా మారింది.

31. ఈ విషయమే ఇంతకుముందు సూరయే సాద్ (27)లో, సూరతుల్ మోమినూన్ (115, 116)లో, సూరతుల్ హిజ్ర్ (85)లో కూడా వచ్చింది.

32. ప్రజలను పరీక్షించి సజ్జనులకు వారి సత్కర్మల బహుమానం ఇవ్వాలి, దుర్జనులకు వారి దుష్కర్మల శిక్ష విధించాలన్నదే ఆ ప్రణాళిక.

41 ఆ రోజు ఏ స్నేహితుడూ మరో స్నేహితునికి ఏ కాస్త కూడా పనికిరాడు. మరి వారికెలాంటి సహాయం కూడా లభించదు.[35]

يَوْمَ لَا يُغْنِي مَوْلًى عَنْ مَّوْلًى شَيْـًٔا وَّلَا هُمْ يُنْصَرُوْنَ ﴿٤١﴾

42 కాని అల్లాహ్ ఎవరినయినా కనికరిస్తే అది వేరే విషయం. నిశ్చయంగా ఆయన సర్వాధిక్యుడు, దయాశీలి.

اِلَّا مَنْ رَّحِمَ اللّٰهُ ۭ اِنَّهٗ هُوَ الْعَزِيْزُ الرَّحِيْمُ ﴿٤٢﴾

43 నిశ్చయంగా జెముడు వృక్షం (జఖ్ఖూమ్ చెట్టు).

اِنَّ شَجَرَتَ الزَّقُّوْمِ ﴿٤٣﴾

44 పాపాత్ముల ఆహారంగా ఉంటుంది.

طَعَامُ الْاَثِيْمِ ﴿٤٤﴾

45 అది నూనె గసి[36] లాగా ఉంటుంది. కడుపులోకి పోయి ఉడుకుతూ ఉంటుంది.

كَالْمُهْلِ ۚ يَغْلِيْ فِي الْبُطُوْنِ ﴿٤٥﴾

46 సలసలా కాగే నీరు మాదిరిగా ఉడుకుతూ ఉంటుంది![37]

كَغَلْيِ الْحَمِيْمِ ﴿٤٦﴾

47 "వాడ్ని పట్టుకోండి. ఈడ్చుకుంటూ పోయి నరకాగ్ని నడి బొడ్డున పడవెయ్యండి."[38]

خُذُوْهُ فَاعْتِلُوْهُ اِلٰى سَوَاۗءِ الْجَحِيْمِ ﴿٤٧﴾

48 "పిదప అతని నెత్తి మీద సలసలా కాగే నీరును – శిక్షగా– కుమ్మరించండి" (అని కేక వేయబడుతుంది).

ثُمَّ صُبُّوْا فَوْقَ رَاْسِهٖ مِنْ عَذَابِ الْحَمِيْمِ ﴿٤٨﴾

49 రుచిచూడు! నువ్వు గొప్ప శక్తి మంతునిలా, మర్యాదస్తునిలా వుండే వాడివిగా![39]

ذُقْ ڌ اِنَّكَ اَنْتَ الْعَزِيْزُ الْكَرِيْمُ ﴿٤٩﴾

50 దేనిపట్ల మీరు సందిగ్ధంలో పడ్డారో అది ఇదే (అని వారితో అనబడుతుంది).

اِنَّ هٰذَا مَا كُنْتُمْ بِهٖ تَمْتَرُوْنَ ﴿٥٠﴾

---

33. అంటే–వారు ఆ 'ప్రణాళిక' పట్ల అశ్రద్ధ వహించారు. లేదా దాన్ని త్రోసిపుచ్చారు. అందుకే వారు పరలోకం పట్ల నిర్లక్ష్యం వహించి, ప్రాపంచిక ఆకర్షణల్లో తలమునకలై పోయారు.

34. అసలు మనుషులు సృష్టించబడింది, భూమ్యాకాశాలు ఉనికిలోనికి తేబడింది ఈ లక్ష్యం కోసమే.

35. మోమినూన్ సూరాలో కూడా చెప్పబడినట్లు; "మరి శంఖం ఊదబడిననాడు పరస్పర బంధుత్వాలుగానీ, పరస్పర ప్రశ్నోత్తరాలు గానీ ఉండవు" (101). "ఏ స్నేహితుడూ మరో స్నేహితుణ్ణి అడిగి చూడడు." (అల్ మఆరిజ్ – 10).

36. **'ముహ్ల్'** (مُهل) అంటే కరిగిన రాగి, అగ్నిలో కరిగించబడిన ధాతువు, నూనె మడ్డి అన్న అర్థాలు వస్తాయి.

37. ఆ జఖ్ఖూమ్ ఆహారం సలసలా కాగే నీరు మాదిరిగానే కడుపులో కాగుతూ, నానా ఇబ్బంది పెడుతుంది.

38. నరకంపై నియుక్తులై ఉన్న భటులను ఉద్దేశించి, ఈ ఆదేశం ఇవ్వబడుతుంది. మూలంలో **'సవాయి'** (سَوَاۗءِ) అని ఉంది. అంటే 'మధ్యలోకి' అని అర్థం.

39. అంటే ఆనాడు నీకు లభించిన పదవిని, అధికారాన్ని ఆసరాగా చేసుకుని సమాజంలో గొప్పవానిగా వర్ధిల్లేవాడివి. మరోవైపు విశ్వసించిన ప్రజలను కించపరిచేవాడివి కదా!

51 నిశ్చయంగా దైవభీతి పరాయణులు సురక్షిత (ప్రశాంత) స్థలంలో ఉంటారు.

إِنَّ الْمُتَّقِينَ فِي مَقَامٍ أَمِينٍ (51)

52 ఉద్యానవనాల, చెలమల మధ్యన...

فِي جَنَّٰتٍ وَعُيُونٍ (52)

53 పల్చటి సిల్కు వస్త్రాలను, దళసరి పట్టు వస్త్రాలను ధరించి ఎదురెదురుగా ఆసీనులై ఉంటారు.[40]

يَلْبَسُونَ مِن سُندُسٍ وَإِسْتَبْرَقٍ مُّتَقَٰبِلِينَ (53)

54 (భక్తిపరాయణుల పట్ల) ఇలాగే వ్యవహరించబడుతుంది.[41] (అంతేకాదు) పెద్ద పెద్ద కన్నులు గల (హూరు) అందగత్తెలతో మేము వారి వివాహం జరిపిస్తాము.[42]

كَذَٰلِكَ وَزَوَّجْنَٰهُم بِحُورٍ عِينٍ (54)

55 వారక్కడ నిక్షేపంగా (కూర్చొని) అన్ని రకాల పండ్లు ఫలాదులను తెప్పించుకుంటూ ఉంటారు.[43]

يَدْعُونَ فِيهَا بِكُلِّ فَٰكِهَةٍ ءَامِنِينَ (55)

56 మొదటిసారి వచ్చిన మరణం తప్ప, మరింకా వారు అక్కడ మరణం రుచి చూడటమనేదే ఉండదు.[44] నరకాగ్ని శిక్ష నుండి అల్లాహ్ వారిని రక్షించాడు.

لَا يَذُوقُونَ فِيهَا الْمَوْتَ إِلَّا الْمَوْتَةَ الْأُولَىٰ ۖ وَوَقَىٰهُمْ عَذَابَ الْجَحِيمِ (56)

40. పాపాత్ములకు, అవిశ్వాసులకు ప్రతిగా ఇక్కడ విశ్వాసుల, దైవభీతిపరుల స్థానం గురించి చెప్పబడింది. వారు తిరస్కారవైఖరి నుండి, పాపకార్యాల నుండి తమను తాము రక్షించుకున్నవారు. అందుకే వారికి ఏ చీకూ చింతా లేని ప్రశాంత వాతావరణంలో చోటు లభిస్తుంది. **'మకామున్ అమీన్'** అంటే ఎలాంటి భయాందోళనలు, దుఃఖ విచారాలు కలగని స్థలం అని అర్థం.

41. అంటే దైవభీతి పరాయణులు సద్వ్యవహారానికి అర్హులు.

42. అరబీలో **'హూర్'** (حُورٌ) అని ఉంది. కంటిలోని తెల్లగుడ్డు విపరీతమైన తెలుపు రంగులోనూ, నల్లగుడ్డు గాఢ నలుపు రంగులోనూ ఉండటాన్ని హూర్ అని అంటారు. హూర్ అనేది 'హైరాన్' నుంచి వచ్చిందని కూడా చెబుతారు. హైరాన్ అంటే నిర్ఘాంతపోవటం, సంభ్రమాశ్చర్యానికి లోనవటం. స్వర్గ కన్యల సౌందర్యాన్ని చూసిన వారెవరైనా సంభ్రమాశ్చర్యానికి లోనవటం ఖాయం. అందుకే వారిని 'హూర్' అని పిలుస్తారు. కళ్లు చెదిరే అందంగల స్త్రీలు వారు. వారి కళ్లు సువిశాలమైనవి. ప్రతి స్వర్గవాసికి కనీసం ఇద్దరు మగువలు భార్యలుగా లభిస్తారని ఇంతకుముందు చెప్పటం జరిగింది. అయితే తిర్మిజీలోని ఒక ప్రామాణిక ఉల్లేఖనం ప్రకారం అమరగతునికి 72 మంది స్త్రీలు కేటాయించబడతారు. (జిహాద్ మహిమల అధ్యాయాలు)

43. **'ఆమినీన్'** (ءَامِنِينَ) అంటే 'నిక్షేపంగా' అని అర్థం. స్వర్గంలోని ఆహారపదార్థాలు తరిగిపోతాయన్న భయంగానీ, వాటిని తినటం వల్ల అజీర్తి కలుగుతుందన్న ఆందోళన గాని వారికుండదు. లేక మరణం వస్తుందన్న భయంగానీ, అలసిపోతామన్న దిగులు గానీ, షైతాన్ దుష్ప్రేరణలకు లోనవుతామేమోనన్న చీకుగాని వారికి ఉండదు.

44. అంటే – ప్రపంచంలో వచ్చిన ఆ మరణం తప్ప మరో మృత్యు భయం వారికుండదు. హదీసు ప్రకారం : తీర్పు జరిగిపోయిన తరువాత 'మృత్యువు' ఒక పొట్టేలు రూపంలో ప్రత్యక్షపరచబడుతుంది. స్వర్గ – నరకాల మధ్య అది 'జిబహ్' చేయబడుతుంది. అప్పుడు, 'ఓ స్వర్గవాసులారా! స్వర్గ జీవితం మీ కొరకు శాశ్వతమైనది. మీకిక మరణమన్నదే లేదు' అని చెప్పబడుతుంది. అలాగే, 'ఓ నరకవాసులారా! నరక యాతన మీకు శాశ్వతంగా ఉంటుంది. మీకు చావు

| | |
|---|---|
| **57** ఇది కేవలం నీ ప్రభువు కృప మాత్రమే.[45] చాలా గొప్ప విజయ మంటే ఇదే. | فَضْلًا مِّنْ رَّبِّكَ ۚ ذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿57﴾ |
| **58** (ఓ ప్రవక్తా!) వారు ఉపదేశాన్ని గ్రహించేటందుకుగాను మేము దీనిని (ఈ ఖురానును) నీ భాషలో సులభతరం చేశాము. | فَاِنَّمَا يَسَّرْنٰهُ بِلِسَانِكَ لَعَلَّهُمْ يَتَذَكَّرُوْنَ ﴿58﴾ |
| **59** కనుక నువ్వు కూడా నిరీక్షించు, వారు కూడా నిరీక్షిస్తు న్నారు.[46] | فَارْتَقِبْ اِنَّهُمْ مُّرْتَقِبُوْنَ ﴿59﴾ |

అన్నదే రాదు' అని అనబడుతుంది (సహీహ్ బుఖారీ – మర్యమ్ సూరా వ్యాఖ్యానం; ముస్లిం – కితాబుల్ జన్నహ్). మరొక హదీసులో ఇలా అనబడింది : "ఓ స్వర్గవాసులారా! ఆరోగ్యం, బలం మీ సొత్తు అయ్యాయి. మీకిక అనారోగ్యం, అస్వస్థత అన్నదే ఉండదు. మీ జీవితం కలకాలం వర్థిల్లుతుంది. కళకళలాడుతూ ఉంటుంది. మీకు చావులేదు. మీ వరాలు కరిగిపోనివి, తరిగిపోనివి. మీరు నిత్యం పడుచువారుగానే ఉంటారు. వృద్ధాప్యం మీలో తొంగిచూడదు" (సహీహ్ బుఖారీ: కితాబుర్రిఖాఖ్; ముస్లిం – కితాబ్ మజ్కూర్).

45. ఇది ముమ్మాటికీ నిజం. ప్రభువు కటాక్షించనంతవరకూ ఏ వ్యక్తీ స్వర్గ సువాసనను ఆస్వాదించలేడు. హదీసు ద్వారా మనకు తెలిసే సత్యం కూడా ఇదే : "బాగా తెలుసుకోండి! మీలో ఏ వ్యక్తి ఆచరణ కూడా అతన్ని స్వర్గానికి తీసుకుపోదు" అని దైవప్రవక్త (సఅసం) ఉద్ఘాటించారు. 'ఓ దైవప్రవక్తా (స)! తమరి విషయమూ అంతేనా?!' అని ప్రియ సహచరులు సందేహపడగా, "అవును. నేనైనా అంతే. కాకపోతే అల్లాహ్ నన్ను తన కరుణతో, కృపతో ఆవరిస్తాడు" అని ఆయన (స) సమాధానమిచ్చారు (సహీహ్ బుఖారీ – కితాబుర్రిఖాఖ్; ముస్లిం – కితాబున్ మజ్కూర్).

46. ఒకవేళ వారు గనక విశ్వసించకపోతే (ఓ ప్రవక్తా!) నువ్వు దైవశిక్ష కోసం ఎదురుచూడు. కాని వారి ఆలోచనలు మరోవిధంగా ఉన్నాయి. ఇస్లాం తిరుగులేని శక్తిగా రూపుదాల్చక ముందే నువ్వు మరణిస్తావని వాళ్లు ఎదురు చూస్తున్నారు.

45వ సూరా

# అల్ జాసియహ్

## కూలబడటం

అవతరణ మక్కాలో

ఆయతులు 37

## పరిచయం

ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఇందులో ముఖ్యంగా చెప్పడం జరిగింది. ఈ సూరాలోని 28వ ఆయతులో కూలబడడం గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరాలో తీర్పుదినం నాటి భయానక పరిస్థితుల గురించిన ప్రస్తావన ఉంది. ఆ రోజున మానవులు, భయంతో మోకాళ్ళపై కూలబడి ఉంటారు. ప్రతి ఒక్కరు తాము చేసుకున్న కర్మలకు లెక్క చెప్పుకోవలసి వస్తుంది.

ఈ సూరా మొదటి భాగంలో మూర్ఖంగా దుర్మార్గానికి పాల్పడే వారి ప్రస్తావన ఉంది. వారు అల్లాహ్ చిహ్నాలను మొండిగా తిరస్కరిస్తారు. వాటిని నవ్వులాటగా తీసుకుంటారు. వారికి అవమానకరమైన శిక్ష ఉంది. ఈ సూరాలో అల్లాహ్ మానవులకు ప్రసాదించిన అనుగ్రహాల ప్రస్తావన ఉంది. సముద్రాలు మానవుల ప్రయోజనం కొరకు ఉద్దేశించబడ్డాయి. ఆకాశాల లోను, భూమిపై ఉన్న సమస్తం మానవుల ప్రయోజనానికే ఉద్దేశించబడింది.

ఇస్రాయిల్ సంతతి ప్రజలకు ప్రసాదించబడిన అనుగ్రహాల గురించి కూడా ఇందులో చెప్పడం జరిగింది. వారికి దైవ మార్గదర్శకత్వం ప్రసాదించబడింది. వారికి గ్రంథం, వివేకం, ప్రవక్త పదవి, జీవితానికి సంబంధించిన ఉత్తమమైనవి ప్రసాదించబడ్డాయి. ఆ కాలంలోని సమస్త జాతుల కన్నా ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. కాని వారు పరస్పరం ఈర్ష్యాసూయలకు గురయ్యారు. భిన్నాభిప్రాయాలకు, విభేదాలకు గురయ్యారు. చివరికి దేవుని పట్ల తిరుగుబాటుకు పాల్పడ్డారు. వారు దైవగ్రంథాన్ని తిరస్కరించారు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) దైవసందేశహరుడని విశ్వసించడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి దైవవాణిని అనుసరించాలని, వారి మనోవాంఛలను అనుసరించరాదనీ, ఆయన గురించి వారు చెబుతున్న మాటలను పట్టించుకోరాదని బోధించడం జరిగింది.

## అల్ జాసియహ్ సూరా

## سُوْرَةُ الْجَاثِيَةِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1 – 2** హా మీమ్. ఈ గ్రంథావతరణ సర్వాధిక్యుడు, వివేచనా పరుడైన అల్లాహ్ తరఫున జరిగింది.

حٰمٓ ﴿1﴾
تَنْزِيْلُ الْكِتٰبِ مِنَ اللّٰهِ الْعَزِيْزِ الْحَكِيْمِ ﴿2﴾

**3** నిశ్చయంగా ఆకాశాలలో, భూమిలో విశ్వసించిన వారి కోసం ఎన్నో సూచనలున్నాయి.

اِنَّ فِى السَّمٰوٰتِ وَالْاَرْضِ لَاٰيٰتٍ لِّلْمُؤْمِنِيْنَ ﴿3﴾

**4** స్వయంగా మీ పుట్టుకలోనూ, ఆయన సర్వవ్యాప్తం చేసే జంతువుల పుట్టుకలోనూ నమ్మే జనుల కొరకు సూచనలున్నాయి.

وَفِيْ خَلْقِكُمْ وَمَا يَبُثُّ مِنْ دَآبَّةٍ اٰيٰتٌ لِّقَوْمٍ يُّوْقِنُوْنَ ﴿4﴾

**5** రేయింబవళ్ళ రాకపోకలలోనూ, అల్లాహ్ ఆకాశం నుంచి ఉపాధిని (వర్షం రూపంలో) కురిపించి, భూమిని చచ్చిన పిదప బ్రతికించటంలోనూ,[1] వాయువుల మార్పులోనూ బుద్ధిజ్ఞానాలు గలవారికి పలు సూచనలున్నాయి.[2]

وَاخْتِلَافِ الَّيْلِ وَالنَّهَارِ وَمَآ اَنْزَلَ اللّٰهُ مِنَ السَّمَآءِ مِنْ رِّزْقٍ فَاَحْيَا بِهِ الْاَرْضَ بَعْدَ مَوْتِهَا وَتَصْرِيْفِ الرِّيٰحِ اٰيٰتٌ لِّقَوْمٍ يَّعْقِلُوْنَ ﴿5﴾

**6** ఇవి అల్లాహ్ వాక్యాలు. వీటిని మేము నీకు ఉన్నదున్నట్టుగా వినిపిస్తున్నాము. ఇక వారు అల్లాహ్ మరియు ఆయన సూచనల (ను కాదన్న) తరువాత ఇక ఏ విషయాన్ని విశ్వసిస్తారు(ట)!?[3]

تِلْكَ اٰيٰتُ اللّٰهِ نَتْلُوْهَا عَلَيْكَ بِالْحَقِّ ۚ فَبِاَيِّ حَدِيْثٍۢ بَعْدَ اللّٰهِ وَاٰيٰتِهٖ يُؤْمِنُوْنَ ﴿6﴾

---

1. భూమ్యాకాశాల నిర్మాణం, మానవ సృష్టి, జంతువుల పుట్టుక, రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావటం, ఆకాశం నుంచి కురిసే వర్షపు నీటి ద్వారా బీటలు వారిన భూమి పులకించి, పరవశించటం – ఈ విధంగా విశ్వవ్యవస్థలో, మానవుల పుట్టుకలో సైతం దేవుని ఏకత్వాన్ని, ఆయన సర్వాధిపత్యాన్ని చాటిచెప్పే నిదర్శనాలెన్నో ఉన్నాయి.
2. అంటే గాలులు ఒక్కోసారి ఉత్తరం నుంచి దక్షిణం వైపుకు, ఒక్కోసారి తూర్పు నుంచి పడమర వైపుకు వీస్తాయి. కొన్నిసార్లు సముద్రగాలులు బలంగా వీస్తే, కొన్నిసార్లు ఎడారి ప్రదేశాల్లోని గాలులు ఇసుక తుఫానులు రేపుతుంటాయి. కొన్నిసార్లు ఈదురు గాలులు హానికరంగా పరిణమిస్తే మరి కొన్నిసార్లు ఫలవంతమైన గాలులు వీచి కారుణ్య జల్లుకు సంకేతమిస్తాయి. కొన్ని గాలులు తెగులు తీసుకువస్తే, మరికొన్ని గాలులు మలయ మారుతంలా, మృదువుగా తాకి మైమరపిస్తాయి. వాయువులు సృష్టించే ఈ చిత్ర విచిత్రాలన్నీ వీటి వెనుక ఒక శక్తిమంతుడున్నాడనీ, ఆయన సాటిలేని మేటి అనీ, సర్వాధికారాలు ఆయనవేననీ, మరే ఇతరునికీ ఏ అధికారమూ లేదని చాటిచెబుతున్నాయి. అల్ బఖరా సూరాలోని 164వ ఆయతులో కూడా ఇంచుమించు ఇదే భావం గల విషయముంది.
3. దేవుని ఏకత్వానికి సంబంధించిన సమస్త ఆధారాలు, నిదర్శనాలు గల దివ్య ఖుర్ఆన్‌నే వారు విశ్వసించకపోతే మరింక వారు దేన్ని విశ్వసిస్తారు? సిసలైన నిదర్శనాలనే కాదన్న వారు ఇంక ఏ నిదర్శనాలను నమ్ముతారు?
   **'బాదల్లాహ్'** (అల్లాహ్ తర్వాత) అంటే 'బాద హదీసిల్లాహి వ బాద ఆయాతిహీ' (అల్లాహ్ మాట తర్వాత, ఆయన సూచనల తర్వాత) అని అర్థం. ఈ ఆయతులో ఖుర్ఆన్‌ను 'హదీస్'గా పేర్కొనటం జరిగింది. జుమర్ సూరా 23వ ఆయతులోనూ ఈ విధమైన శైలి ఉంది.

7 అబద్ధాలకోరు, పాపాత్ముడైన ప్రతి ఒక్కరికీ మూడుతుంది.[4]

وَيْلٌ لِّكُلِّ أَفَّاكٍ أَثِيمٍ ﴿٧﴾

8 వాడెలాంటివాడంటే, తన ముందు అల్లాహ్ వాక్యాలను చదివి వినిపించినప్పుడు, వాటిని విని, ఆ తర్వాత అసలు వాటిని విననే లేదన్నట్లుగా అహంకారంతో మొండికేస్తాడు.[5] కనుక అలాంటి వారికి బాధాకరమైన శిక్షపడుతుందన్న వార్తను వినిపించు.

يَسْمَعُ آيَاتِ اللَّهِ تُتْلَىٰ عَلَيْهِ ثُمَّ يُصِرُّ مُسْتَكْبِرًا كَأَن لَّمْ يَسْمَعْهَا ۖ فَبَشِّرْهُ بِعَذَابٍ أَلِيمٍ ﴿٨﴾

9 మా వాక్యాలలోని ఏదైనా విషయం అతనికి తెలిసినప్పుడు, దాన్ని ఎగతాళి చేస్తాడు.[6] అవమానకరమైన శిక్ష ఉన్నది ఇలాంటి వారికోసమే.

وَإِذَا عَلِمَ مِنْ آيَاتِنَا شَيْئًا اتَّخَذَهَا هُزُوًا ۚ أُولَٰئِكَ لَهُمْ عَذَابٌ مُّهِينٌ ﴿٩﴾

10 వారికి ముందు నరకం ఉన్నది.[7] వారు సంపాదించుకున్న దేదీ వారికెలాంటి ప్రయోజనం చేకూర్చదు.[8] అల్లాహ్‌ను వదలి వారు ఆశ్రయించిన సంరక్షకులు కూడా వారికి పనికి రారు.[9] వారికోసం చాలా ఘోరమైన యాతన (సిద్ధంగా) ఉంది.

مِّن وَرَائِهِمْ جَهَنَّمُ ۖ وَلَا يُغْنِي عَنْهُم مَّا كَسَبُوا شَيْئًا وَلَا مَا اتَّخَذُوا مِن دُونِ اللَّهِ أَوْلِيَاءَ ۖ وَلَهُمْ عَذَابٌ عَظِيمٌ ﴿١٠﴾

11 ఇదే (అసలు సిసలు) మార్గదర్శిని.[10] మరెవరయితే తమ ప్రభువు సూచనలను త్రోసిపుచ్చారో వారికొరకు అత్యంత బాధా కరమైన – వణుకుపుట్టించే[11]– శిక్ష ఉన్నది.

هَٰذَا هُدًى ۖ وَالَّذِينَ كَفَرُوا بِآيَاتِ رَبِّهِمْ لَهُمْ عَذَابٌ مِّن رِّجْزٍ أَلِيمٌ ﴿١١﴾

4. **'అఫ్ఫాకిన్'** (**أَفَّاكٍ**) అనే పదం పచ్చి అబద్ధాలరాయుడు అన్న భావంలో ప్రయోగించబడింది. 'అసీమ్' అంటే మహా పాపాత్ముడు అని అర్థం. **'వైలున్'** (**وَيْلٌ**) అనేది వినాశాన్ని సూచిస్తుంది. లేదా అది నరకంలోని ఒక అగాథం పేరై ఉండవచ్చు.

5. అంటే వాడు అవిశ్వాస వైఖరిపై పాతుకుపోయి ఉంటాడు. సత్యానికి ప్రతిగా తన్ను తాను చాలా గొప్పవాడిగా ఊహించుకుంటాడు. ఆ గర్వంతోనే విషయాన్ని వినీ విననట్లుగా, తెలిసీ తెలియనట్లుగా, చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తాడు.

6. అసలు వాడు ఖుర్ఆన్‌ను ఎన్నడూ శ్రద్ధగా వినడు. ఒకవేళ ఏదన్నా సత్యవాక్కు అతని చెవిన పడినా లేక ఏదన్నా మంచిమాట అతని బుర్రకెక్కినా దాన్ని తేలిగ్గా తీసుకుంటాడు. ఎగతాళి చేస్తాడు. దీనికి కారణం అవగాహనా లోపం అయినా అయివుండాలి లేదా ఎడతెగని పాపాల మూలంగా అతని హృదయంలో కుళ్ళు పేరుకుపోయి అయినా ఉండాలి.

7. ఇలాంటి వైఖరిని అవలంబించేవారు భవిష్యత్తులో (ప్రళయదినాన) నరకానికి ఆహుతి కావలసి ఉంటుంది.

8. అంటే – వారు ఏ సిరిసంపదలను చూసుకుని మురిసిపోతున్నారో, మరే సంతానాన్ని, మందీమార్బలాన్ని చూసుకుని గర్వపడుతున్నారో, ఇంకా ఏ బ్యాంకు బ్యాలెన్సులను చూసుకుని పొంగిపోతున్నారో అవేవీ వారికి తీర్పుదినాన ఉపయోగపడవు.

9. వారు ప్రపంచంలో ఈ బడా ఆసాములను ఆశ్రయించి 'కాల్మొక్త బాంచను' అనేవారు. పీఠాధిపతులకు ప్రణమిల్లి

12 అల్లాహ్‌యే మీ కోసం సముద్రాన్ని వశపరిచాడు[12] – ఆయన ఆజ్ఞతో అందులో ఓడలు నడవటానికి,[13] మరి మీరు ఆయన కృపను (ఉపాధిని)[14] అన్వేషించటానికి, ఇంకా – మీరు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి.[15]

اَللّٰهُ الَّذِیْ سَخَّرَ لَكُمُ الْبَحْرَ لِتَجْرِیَ الْفُلْكُ فِیْهِ بِاَمْرِهٖ وَلِتَبْتَغُوْا مِنْ فَضْلِهٖ وَلَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿12﴾

13 ఇంకా భూమ్యాకాశాలలో ఉన్న వస్తువులన్నింటినీ ఆయన– తన తరపున – మీ సేవలో ఉండేటట్లుగా చేశాడు.[16] నిశ్చయంగా యోచన చేసేవారికి ఇందులో ఎన్నో సూచనలున్నాయి.

وَسَخَّرَ لَكُمْ مَّا فِی السَّمٰوٰتِ وَمَا فِی الْاَرْضِ جَمِیْعًا مِّنْهُ ؕ اِنَّ فِیْ ذٰلِكَ لَاٰیٰتٍ لِّقَوْمٍ یَّتَفَكَّرُوْنَ ﴿13﴾

పూజించేవారు. మీరు సాహెబుల ఆశీస్సులకోసం పడిగాపులు కాచేవారు. ఇప్పుడు వారంతా ఏరి? ఎక్కడికి పోయారు? కంటికి కానరాకుండా పోయారే?! ఇంక వారు సాయం ఏం చేస్తారు?

10. అంటే ఖుర్ఆన్ గ్రంథం అన్నమాట. ఎందుకంటే మానవాళిని తిరస్కారం బహుదైవారాధన వంటి కారుచీకట్ల నుంచి వెలికితీసి, 'విశ్వాసం' (ఈమాన్) అనే కాంతి రేఖలలోకి తీసుకురావటమే దివ్య ఖుర్ఆన్ అవతరణలోని ముఖ్యోద్దేశం. అయితే మార్గదర్శకత్వం లభించేదెవరికి? అంటే దానికోసం పరితపించే వారికే. అన్యథా ఇది ప్రయోజనకారి కాజాలదు.

11. **'రిజ్‌జిన్' (رِّجْزٍ)** అంటే వణుకు పుట్టించేది, గుండె దడను పెంచేది అని అర్థం. ఆ బాధ ఎంత తీవ్రంగా ఉంటుందంటే దాన్ని తలచుకుంటేనే ఒల్లు జలదరిస్తుంది.

12. చూడబోతే ఆ సముద్రం సువిశాలంగా, భయంకరంగా కనిపిస్తున్నప్పటికీ అది మీ అధీనంలో ఉన్నది. మీరు ఓడల ద్వారా, పడవల ద్వారా అందులో ప్రయాణం చేయగలిగేలా దేవుడు సముద్రాన్ని మీకోసం సుగమం చేశాడు.

13. సముద్రంలో పెద్ద పెద్ద ఓడలు నడుస్తున్నాయంటే, మీరు సుదీర్ఘ సముద్రయానం చేయగలుగుతున్నారంటే అదంతా మీ గొప్పతనం కాదు. మీ తెలివితేటల మూలంగా అది సాధ్యమవటం లేదు. అదంతా దైవాజ్ఞ వల్లనే సాధ్యమవుతోంది. దైవప్రణాళిక ననుసరించే మీరు సముద్రంలో కొంగ్రొత్త ఆవిష్కరణలు చేయగలుగుతారు. ఆయన గనక తలచుకుంటే సముద్రకెరటాల వేగాన్ని పెంచగలడు. ఉవ్వెత్తున ఎగిసిపడే అలల ముందు ఒక్క ఓడ కూడా నిలువజాలని పరిస్థితిని సృష్టించగలడు. (2004 డిశంబరు నెలలో వచ్చిన ఒక్కగా నొక్క సునామి (రాకాసి అల) లక్షలాది మందిని పొట్టన బెట్టుకున్న చేదునిజాన్ని విస్మరించగలమా?) అప్పుడప్పుడు దేవుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ, ఒక చిన్న కుదుపును చవిచూపిస్తూ ఉంటాడు. దానికే మనం తారెత్తిపోతూ ఉంటాం. ఒకవేళ సముద్ర స్థితి గనక తరచూ ఇలాగే – అల్లకల్లోలంగా ఉంటే, మనం సముద్ర ప్రయాణాన్ని మానుకోవలసి ఉంటుంది. సముద్రం ద్వారా దేవుడు ప్రసాదించే ఉపాధిపై ఆశలు వదులుకోవలసి ఉంటుంది.

14. అంటే మీరు సముద్రమార్గం ద్వారా వర్తకం చేయటానికి, సాగర గర్భంలో నుంచి విలువైన ముత్యాలను పగడాలను వెలికితీయటానికి, చేపలు పట్టడానికి, ఇంకా ఇతరత్రా జలచరాలను వేటాడటానికి దేవుడు మార్గాన్ని సుగమం చేశాడు. వీటన్నింటి ద్వారా మీకు ఉపాధి లభిస్తుంది. మీ ఆర్థికవ్యవస్థ మెరుగుపడుతుంది.

15. ఈ సముద్రం ద్వారా మీకు లభ్యమయ్యే వస్తువులను ఉపయోగించుకుని, మీరు దేవునిపట్ల కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరిస్తారని ఆశించబడుతోంది.

16. అంటే అవన్నీ మీ చెప్పుచేతల్లో ఉన్నాయి. మీ ప్రయోజనార్థమే ఉన్నాయి. మీ ఆర్థిక విషయాలు, దైనందిన అవసరాలు వాటితో ముడిపడి ఉన్నాయి. ఉదాహరణకు : సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, వర్షపునీరు, వాయువులు – ఇవన్నీ దేవుని తరపున మీ సేవలో ఉన్నాయి. అవి లేకుంటే మానవ మనుగడే దుర్లభం అయిపోతుంది.

14 (ఓ ప్రవక్తా!) అల్లాహ్ ఒక వర్గం వారికి, వారు చేసుకున్న దానికి తగిన ప్రతిఫలం ఇవ్వాలి కదా;[17] అందుకే అల్లాహ్ తరఫున గడ్డు దినాలు రావని నిక్షేపంగా ఉన్నవారిని క్షమించి వదలి పెట్టమని[18] నువ్వు విశ్వాసులకు చెప్పు.

قُلْ لِّلَّذِيْنَ اٰمَنُوْا يَغْفِرُوْا لِلَّذِيْنَ لَا يَرْجُوْنَ اَيَّامَ اللّٰهِ لِيَجْزِيَ قَوْمًا بِمَا كَانُوْا يَكْسِبُوْنَ ⑭

15 ఎవడయినా సత్కార్యం చేస్తే తన స్వయం కొరకే చేసు కుంటాడు. మరెవడయినా దుష్కార్యానికి ఒడిగడితే దాని పాప ఫలం స్వయంగా అతని మీదే పడుతుంది.[19] తరువాత మీరంతా మీ ప్రభువు వైపునకే మరలించబడతారు.[20]

مَنْ عَمِلَ صَالِحًا فَلِنَفْسِهٖ ۚ وَمَنْ اَسَآءَ فَعَلَيْهَا ۚ ثُمَّ اِلٰى رَبِّكُمْ تُرْجَعُوْنَ ⑮

16 మరి మేము ఇస్రాయీలు సంతతి వారికి గ్రంథాన్నీ, రాజ్యాధి కారాన్ని,[21] ప్రవక్తా పదవిని ప్రసాదించాము. ఇంకా మేము వారికి పవిత్రమైన ఆహారాన్ని (మంచి మంచి వస్తువులను) వొసగాము.[22] అంతేకాదు, లోకవాసులపై వారికి ఆధిక్యతను కూడా అనుగ్రహించాము.[23]

وَلَقَدْ اٰتَيْنَا بَنِيْٓ اِسْرَآءِيْلَ الْكِتٰبَ وَالْحُكْمَ وَالنُّبُوَّةَ وَرَزَقْنٰهُمْ مِّنَ الطَّيِّبٰتِ وَفَضَّلْنٰهُمْ عَلَى الْعٰلَمِيْنَ ⑯

17. వారు పెట్టే బాధలను మీరు ఓపికతో భరిస్తే, వారి ఆగడాలను మన్నించి వదలిపెడితే మీకు పుణ్యఫలం లభిస్తుంది. మరోవైపు ఆ దుర్మార్గుల సంగతిని అల్లాహ్ చూసుకుంటాడు. వారి పాపాల భారమంతా తీర్పుదినాన వాళ్ళ నెత్తిపైనే పడుతుంది.

18. ఇక్కడ **'యగ్ఫిరూ'** (**يَغْفِرُوْا**) అంటే సడలింపుల వైఖరిని అవలంబించమని భావం. అల్లాహ్ విశ్వాసులకు తోడ్పడతాడని, అవిశ్వాసులను కఠినంగా శిక్షించే రోజులు వస్తాయన్న దిగులే వారికి లేదు. ఆ రోజులు ఎంతో దూరంలో కూడా లేవు. కాబట్టి (ఓ ప్రవక్తా!) ఈ అవిశ్వాసుల వెకిలిచేష్టలపై వ్యాకులతకు లోనుకారాదని, వాళ్ళను చూసీచూడనట్లుగా వదలిపెట్టమని ముస్లింలకు చెప్పు అని దేవుడు సెలవిచ్చాడు. ఈ వాక్యంలో దేవుడు ముస్లింలకు ధైర్యం చెప్పాడు. ఇది తొలిదశలో ముస్లింలు నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు ఇవ్వబడిన సూచన. కాని ముస్లింలు నిలదొక్కుకున్న పిదప అవిశ్వాసులను ప్రతిఘటించమని ఆదేశించబడింది. **'అయ్యామల్లాహ్'**(اَيَّامَ اللّٰهِ) అంటే సంఘటనలు అని అర్థం. ఇబ్రాహీమ్ సూరా 5వ ఆయతులో చెప్పబడినట్లు.

19. వ్యక్తి విషయంలోనయినా, వర్గం విషయంలోనయినా సూత్రం ఒక్కటే – ఎవరు చేసిన కర్మల్ని వారు అనుభవించక తప్పదు. ఎవరు ఏ కాస్త మంచి చేసినా దాని సత్ఫలితం వారికి తప్పకుండా లభిస్తుంది. మరెవరు ఏ చెడుకు పాల్పడినా దాని దుష్ఫలితం వారిమీద పడటం ఖాయం. ఒకరి బరువును ఇంకొకరు మోయరు. ఈ ఆయతు ద్వారా సత్కర్మలు చేయమని ప్రోత్సహించటం జరిగింది. దుష్కర్మల దారుణ పరిణామం గురించి హెచ్చరించటం జరిగింది.

20. అప్పుడు ఆయన ప్రతి ఒక్కరికీ వారి కర్మల ప్రకారం ప్రతిఫలం ఇస్తాడు. సజ్జనులకు బహుమానం! దుర్జనులకు శిక్ష!

21. **'గ్రంథం'** (కితాబ్) అంటే తౌరాతు గ్రంథం అని భావం. 'హుక్మ్' అంటే రాజ్యాధికారం లేక అవగాహన, ఇతరుల మధ్య గల తగాదాలను పరిష్కరించే తెలివి అని అర్థం.

22. అంటే ధర్మసమ్మతమైన ఆహార పదార్థాలను ప్రసాదించాము. మన్న్ – సల్వా అనే ఆహారం కూడా ఇందులో అంతర్భాగమే.

23. అంటే ఆ కాలంలో ఉన్న ఇతర జాతులపై ఇస్రాయీలీయులకు సర్వవిధాలా ఆధిక్యతను ప్రసాదించాము.

**17** మరి ధర్మానికి సంబంధించిన స్పష్టమైన నిదర్శనాలను కూడా వారికి ఇచ్చాము.[24] కాని తీరా జ్ఞానం వచ్చేసిన పిమ్మట వారు తమ మధ్య గల ద్వేషం, శత్రుత్వం కారణంగా విభేదించుకున్నారు.[25] వారు ఏ ఏ విషయాలలో విభేదించుకుంటున్నారో, దానికి సంబంధించిన తీర్పును – వారి మధ్య – ప్రళయదినాన నీ ప్రభువు చెబుతాడు.[26]

وَاٰتَيۡنٰهُمۡ بَيِّنٰتٍ مِّنَ الۡاَمۡرِ‌ۚ فَمَا اخۡتَلَفُوۡۤا اِلَّا مِنۡۢ بَعۡدِ مَا جَآءَهُمُ الۡعِلۡمُ ۙ بَغۡيًاۢ بَيۡنَهُمۡ‌ؕ اِنَّ رَبَّكَ يَقۡضِىۡ بَيۡنَهُمۡ يَوۡمَ الۡقِيٰمَةِ فِيۡمَا كَانُوۡا فِيۡهِ يَخۡتَلِفُوۡنَ ﴿17﴾

**18** తర్వాత మేము నిన్ను ధర్మానికి సంబంధించిన (రాచ)బాటపై నిలబెట్టాము.[27] కనుక (ఓ ముహమ్మద్ – స!) నువ్వు దీనినే అనుసరించు. అజ్ఞానుల ఆకాంక్షలను అనుసరించకు.[28]

ثُمَّ جَعَلۡنٰكَ عَلٰى شَرِيۡعَةٍ مِّنَ الۡاَمۡرِ فَاتَّبِعۡهَا وَلَا تَتَّبِعۡ اَهۡوَآءَ الَّذِيۡنَ لَا يَعۡلَمُوۡنَ ﴿18﴾

**19** (బాగా గుర్తుంచుకో!) అల్లాహ్ ముందు వాళ్ళెవరూ ఏ విధంగానూ నీకు ఉపయోగపడరు. ఈ దుర్మార్గులు ఒండొకరికి స్నేహితులుగా ఉంటారు. మరి భయభక్తులు గలవారికి అండగా అల్లాహ్ ఉంటాడు సుమా!

اِنَّهُمۡ لَنۡ يُّغۡنُوۡا عَنۡكَ مِنَ اللّٰهِ شَيۡـئًا‌ ؕ وَاِنَّ الظّٰلِمِيۡنَ بَعۡضُهُمۡ اَوۡلِيَآءُ بَعۡضٍ‌ۚ وَاللّٰهُ وَلِىُّ الۡمُتَّقِيۡنَ ﴿19﴾

**20** ఇది (ఈ ఖుర్ఆన్) ప్రజలకు ముందు చూపును ఇచ్చే సూచనల సమాహారం.[29] నమ్మి నడుచుకునే జనం కోసం మార్గదర్శిని, కారుణ్యప్రదాయిని.[30]

هٰذَا بَصَآئِرُ لِلنَّاسِ وَهُدًى وَّرَحۡمَةٌ لِّقَوۡمٍ يُّوۡقِنُوۡنَ ﴿20﴾

---

24. అంటే ఏది ధర్మమో మరేది అధర్మమో నిర్దేశించే నియమాలను వొసగాము. లేదా అవి కొన్ని ప్రత్యేక మహిమలు కూడా కావచ్చు. లేదా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) రానున్నారనే విషయాన్ని, ఆయనకు సంబంధించిన సూచనలను, ఆయన ప్రస్థానం (హిజ్రత్) చేసే చోటునీ తెలియపరిచాము అనీ కావచ్చు.
25. **'బగ్యన్ బైనహుమ్'** (بَغۡيًاۢ بَيۡنَهُمۡ) అంటే వారిలో ఒకరి పొడ మరొకరికి గిట్టేది కాదు. ఒండొకరిని ద్వేషించుకునేవారు. ఒకరిపై ఇంకొకరు అక్కసును వెళ్ళగక్కేవారు – దీనంతటికీ కారణం స్వార్థమే, పదవీ వ్యామోహమే. అందుకే వారు 'జ్ఞానం' వచ్చేసిన తరువాత కూడా తమ ధర్మంలో విభేదాలను సృష్టించుకుని, అంతిమ దైవప్రవక్త (సఅసం)ను నిరాకరించారు.
26. అంటే సత్యవంతులకు బహుమానం వొసగుతాడు, అసత్యవాదులను శిక్షిస్తాడు.
27. అరబీలో **'షరీయతిన్'** (شَرِيۡعَةٍ) అని ఉంది. షరీయతు అంటే మార్గం, విధానం, సమాజం, పోకడ అనే అర్థాలొస్తాయి. లక్ష్యాన్ని, గమ్యస్థానాన్ని చేర్చే ప్రధాన మార్గం లేక రాచబాటను 'షారీ' అని అనటం గమనార్హం. ధార్మిక పరిభాషలో 'షరీయతు' అంటే దేవుడు తన దాసుల కొరకు నిర్ధారించిన జీవన విధానం. ఈ ఆయతు భావం ఇది: ఓ ప్రవక్తా! మేము నిన్ను ధర్మానికి సంబంధించిన ఓ స్పష్టమైన మార్గంపై నిలబెట్టాము లేక ఒక నిర్దిష్టమైన పద్ధతిని నీకు ప్రసాదించాము. అది నిన్ను సత్యం వరకు చేరుస్తుంది.
28. అంటే దేవుని ఏకత్వం (తౌహీద్) గురించిగానీ, ఇస్లామీయ షరీయతు గురించిగానీ ఏమీ తెలియని మక్కా అవిశ్వాసుల అడుగుజాడల్లో నడవకు.
29. ఇది ఇస్లాం ధర్మాదేశాలను స్పష్టంగా విడమరచి చెప్పే మార్గదర్శక గ్రంథం! మనిషి దైనందిన జీవితంతో ముడిపడి ఉన్న సమస్త విషయాలను విశదీకరించే సంవిధానం!!

أَمْ حَسِبَ الَّذِينَ اجْتَرَحُوا السَّيِّـَٔاتِ أَنْ
نَّجْعَلَهُمْ كَالَّذِينَ اٰمَنُوا وَعَمِلُوا الصّٰلِحٰتِ ۙ
سَوَاۤءً مَّحْيَاهُمْ وَمَمَاتُهُمْ ؕ سَاۤءَ
مَا يَحْكُمُوْنَ ﴿٢١﴾

**21** పాపిష్టి పనులు చేసినవారు, తమనూ, విశ్వసించి మంచి పనులు చేసే వారినీ మేము సమానంగా చేస్తామనీ, వారిరువురి జీవన్మరణాలు ఒకే విధంగా ఉండేలా చేస్తామనీ అనుకుంటు న్నారా?[31] వాళ్ళ తీర్పు చాలా ఘోరమైనది.

وَخَلَقَ اللّٰهُ السَّمٰوٰتِ وَالْاَرْضَ بِالْحَقِّ وَلِتُجْزٰى
كُلُّ نَفْسٍۢ بِمَا كَسَبَتْ وَهُمْ لَا يُظْلَمُوْنَ ﴿٢٢﴾

**22** భూమ్యాకాశాలను అల్లాహ్ ఎంతో సమతూకంతో సృష్టించాడు – ప్రతి ప్రాణికీ తాను సంపాదించుకున్నదాని సంపూర్ణ ప్రతిఫలం ఇవ్వబడటానికి! వారికెలాంటి అన్యాయం జరగదు.[32]

اَفَرَءَيْتَ مَنِ اتَّخَذَ اِلٰهَهٗ هَوٰىهُ وَاَضَلَّهُ
اللّٰهُ عَلٰى عِلْمٍ وَّخَتَمَ عَلٰى سَمْعِهٖ وَ قَلْبِهٖ

**23** తన మనోవాంఛను ఆరాధ్యదైవంగా చేసుకున్న వాడ్ని నువ్వు చూశావా?[33] అంతా తెలిసినప్పటికీ – అల్లాహ్ అతన్ని అప మార్గానికి లోను చేశాడు.[34] అతని చెవులకూ, అతని హృదయా నికి సీలు వేశాడు.[35] అతని కళ్లపై కూడా తెరను వేసేశాడు.[36]

30. అంటే ఇహలోకంలో మానవాళికి మార్గదర్శకత్వం వహించే, పరలోకంలో దైవ కారుణ్యానికి పాత్రుల్ని చేసే గ్రంథ రాజం అన్నమాట!

31. అలా ఎలా సాధ్యం? ఇహలోకంలో వారు సరిసమానులుగా ఉంటే ఉన్నారేమో. కాని పరలోకంలో సమానులుగా ఉండాలంటే అది సంభవం కాదు. పాపాత్మునికి శిక్ష, సద్వర్తనునికి బహుమానం లభించకపోతే ఎట్లా? అందుకే వారు చేసుకున్న ఈ తీర్మానం చాలా చెడ్డదని చెప్పబడింది.

32. అంటే సృష్టి ప్రక్రియలో సర్వత్రా సమత్వం, న్యాయం కనిపిస్తుంది. దాని వెనుక ఒక ధ్యేయం కనిపిస్తుంది. అలాగే తీర్పుదినాన కూడా ఆయన ఖచ్చితంగా న్యాయం చేస్తాడు. ప్రతి వ్యక్తికీ అతని ఆచరణనుబట్టి సత్ఫలితం ఇవ్వటమో, దుష్ఫలితం ఇవ్వటమో తప్పకుండా జరుగుతుంది. సన్మార్గుల పట్ల – దుర్మార్గుల పట్ల కూడా ఒకేవిధమైన వ్యవహారం ఎన్నటికీ జరగదు. అవిశ్వాసులు ఒకవేళ ఈ విధంగా అంచనాలు వేస్తే వేసుకోనివ్వండి. దేవుని వద్ద మాత్రం అలా జరగనే జరగదు. ఇరువర్గాల వారిని ఒకే వరుసలో నిలబెట్టడం అన్యాయం. అది సత్య విరుద్ధం కూడా. ముళ్ల విత్తనాలు నాటి ద్రాక్షపండ్లను ఆస్వాదించాలంటే కుదురుతుందా? అలాగే దుర్మార్గానికి పాల్పడి దేవుడు సజ్జనులకు ప్రసాదించే ఉన్నత స్థానాలను పొందాలనుకుంటే అది సంభవం కాదు.

33. అతని ధోరణి ఎలా ఉంటుందంటే తన మనసు మెచ్చినదాన్నే మంచిదిగా భావిస్తాడు. తన మనసు ఈసడించుకున్న దానినే తాను కూడా అసహ్యించుకుంటాడు. అంటే అతను దైవాజ్ఞలకన్నా, దైవప్రవక్త ఆదేశాలకన్నా తన మనోవాంఛలకు అధిక ప్రాధాన్యత ఇస్తాడు. దేవుని శాసనాంగం (షరీయతు)కన్నా తన బుద్ధివివేకాలకు పెద్ద పీట వేస్తాడు. అతని బుద్ధి వివేకాలు కూడా పరిస్థితుల ప్రభావానికి లోనై, స్వార్థాన్ని కోరి మనోవాంఛల మాదిరిగానే తప్పుడు తీర్మానాలు చేయగలవు. ఈ ఆయతుకు చెప్పబడిన మరోభాష్యం ఇలావుంది: అతను దేవుని తరఫున పంపబడిన మార్గదర్శకత్వాన్ని కాదని తన మనసు మెచ్చిన ధర్మాన్ని అవలంబిస్తాడు. విగ్రహారాధకుణ్ణి దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా అనబడిందని ఇంకా కొంతమంది అభిప్రాయపడ్డారు. అతడు ఒక రాతిబొమ్మను భక్తిశ్రద్ధలతో కొలుస్తూ ఉంటాడు. దానికన్నా అందమైన రాతిబొమ్మ లభిస్తే మొదటి రాయిని విసిరివేసి రెండవ రాయిని పూజించటం మొదలెడతాడు (ఫత్హుల్ ఖదీర్).

34. అంటే – అన్నీ తెలిసిన మీదట, సత్యాన్ని అందజేసిన పిమ్మట కూడా వాడు అపమార్గాన నడుస్తాడు. చాలామంది విద్యావంతులు, మేధా సంపన్నులనబడేవారు మార్గభ్రష్టులై ఉండటం దీనికొక నిదర్శనం. కాని వారు మాత్రం

وَجَعَلَ عَلٰى بَصَرِهٖ غِشٰوَةً ؕ فَمَنْ يَّهْدِيْهِ مِنْۢ بَعْدِ اللّٰهِ ؕ اَفَلَا تَذَكَّرُوْنَ ﴿23﴾

ఇప్పుడలాంటి వ్యక్తిని – అల్లాహ్ తర్వాత – సన్మార్గానికి తెచ్చే వాడెవడుంటాడు?[37] ఏమిటి, ఇప్పటికీ మీరు విషయాన్ని గ్రహించరా?[38]

وَقَالُوْا مَا هِیَ اِلَّا حَيَاتُنَا الدُّنْيَا نَمُوْتُ وَنَحْيَا وَمَا يُهْلِكُنَآ اِلَّا الدَّهْرُ ۚ وَمَا لَهُمْ بِذٰلِكَ مِنْ عِلْمٍ ۚ اِنْ هُمْ اِلَّا يَظُنُّوْنَ ﴿24﴾

**24** "మా జీవితం మటుకు ఈ ప్రాపంచిక జీవితమే. మేము చస్తున్నాము, బ్రతుకుతున్నాము. కాలం తప్ప మరేదీ మమ్మల్ని చంపటం లేదు"[39] అని వారంటారు. (నిజానికి) వారికి దీని గురించి బొత్తిగా తెలియదు. వారు కేవలం ఊహాస్త్రాలను సంధిస్తూ పోతున్నారు.

وَاِذَا تُتْلٰى عَلَيْهِمْ اٰيٰتُنَا بَيِّنٰتٍ مَّا كَانَ حُجَّتَهُمْ اِلَّآ اَنْ قَالُوا ائْتُوْا بِاٰبَآئِنَآ اِنْ كُنْتُمْ صٰدِقِيْنَ ﴿25﴾

**25** మరి వాళ్లముందు స్పష్టమైన మా వాక్యాలను చదివి వినిపించినప్పుడు, "ఒకవేళ మీరు సత్యవంతులే అయితే మా తాత ముత్తాతలను (బ్రతికించి) తీసుకు రండి" అని చెప్పటం వినా వారి దగ్గర మరో ఆధారం ఏమీ ఉండదు.[40]

---

తమను మార్గభ్రష్టులని అంటే ఒప్పుకోరు. పైగా ఎదుటివారినే మూర్ఖుల కింద జమకడతారు. తమ వద్ద ఉన్న నిదర్శనాలను తుది వాక్కుగా పరిగణిస్తారు. ఈ విధంగా వారు చదువుకున్న మార్గభ్రష్టులవటమే గాకుండా, ఇతరులను కూడా మార్గభ్రష్టుల్ని చేస్తుంటారు.

35. అందువల్ల సత్యం అతని కర్ణపుటాలకు తాకదు. సత్యబీజం అతని మనోభూమిలో నాటుకోదు.

36. అందువల్ల అతను సత్యాన్ని చూడలేడు.

37. అల్ ఆరాఫ్ సూరాలో కూడా చెప్పబడినట్లు – "అల్లాహ్ మార్గం తప్పించదలచిన వ్యక్తికి ఎవరూ సన్మార్గం చూపలేరు. అలాంటి వారిని అల్లాహ్ తలబిరుసుతనంలో పడి కొట్టుకుపోయేలా వదలిపెట్టేస్తాడు." (186).

38. అంటే, యోచన చేయరా? యోచన చేస్తే నిజస్థితి ఏమిటో మీకే తెలుస్తుంది.

39. నాస్తికులు, పరలోకంపై విశ్వాసం లేని మక్కా బహుదైవారాధకులు చెప్పిన మాటలివి. ఈ ప్రాపంచిక జీవితమే తొలి జీవితం, తుది జీవితమనీ, దీని తరువాత మరో జీవితం లేనేలేదనీ, కాలచక్రపు భ్రమణం వల్లనే ఈ జీవన్మరణాలు సంభవిస్తున్నాయని వారనేవారు.

తత్వవేత్తల్లో ఒక వర్గం ఇలా అంటోంది : ప్రతి 36 వేల సంవత్సరాల తరువాత ప్రతి వస్తువు మళ్లీ తన సిసలైన స్థితిలోకి తిరిగి వస్తుంది. ఈ ప్రక్రియ వెనుక ఏ సూత్రధారిగానీ, వ్యూహారచయితగానీ లేదు. ఇది దానంతట అదే నడుస్తూ వస్తోంది. దీనికి ఆదిగానీ అంతంగానీ లేదు. ఈ విధమైన భావాలు గలవారిని 'దౌరియా' అని పిలుస్తారు (ఇబ్నె కసీర్).

ఈ సిద్ధాంతం పసలేనిది. మానవుని బుద్ధికి అందని విషయమిది. ఇది అనుసరణీయం అంతకన్నా కాదు. హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఈ విధంగా అంటున్నాడు: "ఆదం పుత్రుడు నాకు బాధ కలిగిస్తున్నాడు. అతను కాలాన్ని దూషిస్తున్నాడు. నిజానికి (కాలం అంటూ ఒక వస్తువు ప్రత్యేకంగా ఏమీ ఉండదు) స్వయంగా నేనే కాలాన్ని. నా చేతిలోనే సర్వాధికారాలున్నాయి. రేయింబవళ్ళను కూడా నేను త్రిప్పుతుంటాను." (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ అల్ జాసియహ్ సూరా; ముస్లిం – కితాబుల్ అల్ఫాజ్ మినల్ అదబ్).

**26** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "అల్లాహ్‌యే మిమ్మల్ని బ్రతికిస్తు న్నాడు. మరి ఆయనే మిమ్మల్ని చంపుతున్నాడు. తరువాత ఆయనే మిమ్మల్ని ప్రళయదినాన సమీకరిస్తాడు. ఇందులో సందేహానికి తావేలేదు." కాని చాలామంది తెలుసుకోరు.

قُلِ اللّٰهُ يُحْيِيْكُمْ ثُمَّ يُمِيْتُكُمْ ثُمَّ يَجْمَعُكُمْ
اِلٰى يَوْمِ الْقِيٰمَةِ لَا رَيْبَ فِيْهِ وَلٰكِنَّ اَكْثَرَ
النَّاسِ لَا يَعْلَمُوْنَ ﴿26﴾

**27** భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌కే చెందుతుంది. ఏ రోజున ప్రళయ ఘడియ నెలకొంటుందో ఆనాడు అసత్య వాదులు తీవ్రంగా నష్టపోతారు.

وَلِلّٰهِ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۭ وَيَوْمَ تَقُوْمُ
السَّاعَةُ يَوْمَىِٕذٍ يَّخْسَرُ الْمُبْطِلُوْنَ ﴿27﴾

**28** ప్రతి మానవ సముదాయం మోకాళ్ళపై పడి ఉండటాన్ని,[41] ప్రతి వర్గం తన కర్మల పత్రం వైపునకు పిలువబడటాన్ని నువ్వు చూస్తావు. "ఈ రోజు మీరు చేసుకున్న కర్మల ప్రతిఫలం మీకు లభిస్తుంది.

وَتَرٰى كُلَّ اُمَّةٍ جَاثِيَةً ۣ كُلُّ اُمَّةٍ تُدْعٰٓى
اِلٰى كِتٰبِهَا ۭ اَلْيَوْمَ تُجْزَوْنَ مَا كُنْتُمْ
تَعْمَلُوْنَ ﴿28﴾

**29** "ఇదిగో, ఇదీ మా రికార్డు. మీ గురించి (ఇది) ఉన్నదున్నట్లుగా చెబుతోంది.[42] మేము మీ కర్మలన్నింటినీ నమోదు చేయించే వాళ్ళం"[43] (అని వారితో అనబడుతుంది).

هٰذَا كِتٰبُنَا يَنْطِقُ عَلَيْكُمْ بِالْحَقِّ ۭ اِنَّا
كُنَّا نَسْتَنْسِخُ مَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿29﴾

**30** కాని విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారిని మాత్రం[44] వారి ప్రభువు తన కారుణ్యంలోకి తీసేసుకుంటాడు.[45] స్పష్టమైన సాఫల్యమంటే ఇదే.

فَاَمَّا الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ
فَيُدْخِلُهُمْ رَبُّهُمْ فِيْ رَحْمَتِهٖ ۭ ذٰلِكَ هُوَ
الْفَوْزُ الْمُبِيْنُ ﴿30﴾

40. వారి ఒంటెత్తు పోకడలకు, వితండవాదాలకు అన్నింటికన్నా పెద్ద తార్కాణం ఇదే.

41. ఆయతును స్థూల దృష్టితో చూస్తే అవగతమయ్యేది ఒక్కటే – ప్రతి మానవ వర్గం (వారు ప్రవక్తల అనుయాయులైనా, వ్యతిరేకులైనా) భయం కొద్దీ మోకాళ్ల ఆధారంగా కూర్చుని ఉంటారు (ఫత్‌హుల్ ఖదీర్). లెక్కల కోసం వారికి పిలుపు వచ్చే వరకూ వారు అలాగే భయకంపితులై ఎదురు చూస్తూ ఉంటారు.

42. **'రికార్డు'** అంటే మనిషి కర్మలన్నీ పొందుపరచబడి వున్న చిట్టా (రిజిస్టరు). "కర్మల రికార్డు హాజరుపరచబడుతుంది. ప్రవక్తలు, సాక్షులు సాక్ష్యం కొరకు ప్రవేశపెట్టబడతారు" (జుమర్ – 69). ఈ కర్మల రికార్డులు సంపూర్ణంగా ఉంటాయి. వాటిలో మనిషి చేసిన పనులన్నీ యధాతథంగా పొందుపరచబడి ఉంటాయి. అందులో ఎలాంటి హెచ్చుతగ్గులుండవు. మనిషి వాటిని చూసినప్పుడు, "ఇదేమి రికార్డండీ బాబో! ఇది ఏ చిన్న, పెద్ద విషయాన్ని కూడా వదలిపెట్టలేదే! మేము చేసిన ప్రతిదీ ఇందులో నమోదై ఉందే!" (అల్ కహఫ్ – 49) అని వాపోతాడు.

43. మీ కర్మలన్నీ మాకు తెలుసు. అయినా ఈ రోజు కోసమని, మా దూతలు మా సూచనానుసారం మీ పనులన్నింటినీ రికార్డులకెక్కించారు.

44. ఇక్కడ కూడా విశ్వాసం (ఈమాన్)తో పాటు సత్కర్మల (అమలె సాలెహ్) ప్రస్తావన రావటం గమనించదగినది. మరి ఈ సత్కర్మలు కూడా దైవప్రవక్త (స) సూచించిన విధంగానే చేయాలి. అంతేగాని మనిషి తాను మంచిదని భావించి చేసిన ప్రతి పనీ 'సత్కర్మ' అనిపించుకోదు. పైగా 'బిద్అత్' (కొత్తపోకడ)గా పరిణమించే ప్రమాదం ఉంది. నేడు ముస్లిం సమాజంలో చాలామంది ఎన్నో పనులను సత్కర్మలన్న తలంపుతో తమ తమ పంథాలో సృష్టించుకుని,

**31** కాని ఎవరయితే తిరస్కరిస్తారో (వారితో నేనిలా అంటాను), "ఏమిటి నా వాక్యాలు మీకు చదివి వినిపించబడలేదా?[46] అయినా మీరు పొగరును ప్రదర్శించారు. అసలు మీరు (ముందు నుంచే) అపరాధ జనులు."[47]

وَأَمَّا الَّذِينَ كَفَرُوا أَفَلَمْ تَكُنْ آيَاتِي تُتْلَىٰ عَلَيْكُمْ فَاسْتَكْبَرْتُمْ وَكُنتُمْ قَوْمًا مُّجْرِمِينَ ﴿٣١﴾

**32** "అల్లాహ్ వాగ్దానం తప్పకుండా నెరవేరుతుందనీ, ప్రళయం సంభవించటంలో సందేహమే లేదని చెప్పబడినప్పుడల్లా, 'ప్రళయం అంటే ఏమిటో మాకు తెలీదు. కాకపోతే దానికి సంబంధించి ఏదో ఊహా మాత్రంగా ఆలోచన వస్తూ ఉంటుంది. అంతేగాని మేము దాన్ని నమ్మబోము' అని మీరు అనేవారు."[48]

وَإِذَا قِيلَ إِنَّ وَعْدَ اللَّهِ حَقٌّ وَالسَّاعَةُ لَا رَيْبَ فِيهَا قُلْتُم مَّا نَدْرِي مَا السَّاعَةُ إِن نَّظُنُّ إِلَّا ظَنًّا وَمَا نَحْنُ بِمُسْتَيْقِنِينَ ﴿٣٢﴾

**33** వారి కర్మల దుష్ఫలితాలు వారి ముందు తేటతెల్లమైనాయి. దేన్ని గురించి వారు పరిహసించేవారో అదే వారిని చుట్టు ముట్టింది.[49]

وَبَدَا لَهُمْ سَيِّئَاتُ مَا عَمِلُوا وَحَاقَ بِهِم مَّا كَانُوا بِهِ يَسْتَهْزِئُونَ ﴿٣٣﴾

**34** వారితో ఇలా అనబడింది : "మీరు ఈనాటి మీ సమావేశాన్ని ఎలా మరచిపోయారో అలాగే మేము కూడా మిమ్మల్ని మరచి పోతాము.[50] మీ నివాసం ఇక నరకమే. ఇక్కడ మిమ్మల్ని ఆదుకునే వాడెవడూ లేడు."

وَقِيلَ الْيَوْمَ نَنسَاكُمْ كَمَا نَسِيتُمْ لِقَاءَ يَوْمِكُمْ هَٰذَا وَمَأْوَاكُمُ النَّارُ وَمَا لَكُم مِّن نَّاصِرِينَ ﴿٣٤﴾

వాటిని వ్యవస్థీకృతం చేస్తున్నారు. వాటికి ఫరాయెజ్, వాజిబాత్ (విధ్యుక్త ధర్మాల, తప్పనిసరి అంశాల) కన్నా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది 'కీడు'కు సంకేతం. ఎందుకంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారు ఈ సరికొత్త పోకడలను చాలా చెడ్డ విషయాలు (షర్రుల్ ఉమూర్)గా ఖరారు చేశారు.

45. **'కారుణ్యం'** అంటే స్వర్గం అని భావం. అంటే దేవుడు వారిని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. హదీసు ప్రకారం అల్లాహ్ స్వర్గాన్నుద్దేశించి ఇలా అంటాడు: "నువ్వు నా కారుణ్యానివి. నీ ద్వారా నేను కోరిన వారిని కరుణిస్తాను (స్వర్గంలో చేర్పిస్తాను)." (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరయె ఖాఫ్).

46. కారణం తెలిసివచ్చేలా చేయడానికి ఇలా అడగటం జరుగుతుంది. వాస్తవానికి వారి దగ్గరకు ప్రవక్తలు వచ్చారు. దైవాదేశాలను వారికి వినిపించారు. కాని వారే నిర్లక్ష్యంగా ప్రవర్తించారు.

47. అంటే సత్యం స్వీకరించమంటే మీరు అహంకారంతో నిరాకరించారు. మీ అంతటి వారు లోకంలో ఎవరూ లేరన్నట్లుగానే వ్యవహరించారు. మీలోని నేర ప్రవృత్తే దీనికి కారణం.

48. అంటే – ప్రళయం సంభవిస్తుందనే విషయం సందేహాస్పదం. మాకు మాత్రం నమ్మకం కుదరటం లేదు.

49. అంటే ప్రళయదినం నాటి యాతన. ఒకప్పుడు వారు దాన్ని ఆషామాషీగా తీసుకునేవారు. కాని ఇప్పుడు ఆ యాతనలోనే చిక్కుకున్నారు.

50. హదీసులో చెప్పబడినట్లుగా అల్లాహ్ తన దాసులనుద్దేశించి ఇలా అడుగుతాడు: "ఏమిటి, నేను నీకు భార్యను వొసగలేదా? నీకు గౌరవోన్నతుల్ని ప్రసాదించలేదా? గుర్రాలు, ఎద్దులు తదితర వాహనాలను నీ అధీనంలో ఉంచలేదా? నువ్వు నాయకత్వాన్నీ వెలగబెట్టావు. (ప్రజల నుంచి) సుంకం కూడా వసూలు చేశావు. (ఇది నిజం

ذٰلِكُمْ بِاَنَّكُمُ اتَّخَذْتُمْ اٰيٰتِ اللّٰهِ هُزُوًا وَّغَرَّتْكُمُ الْحَيٰوةُ الدُّنْيَا ۚ فَالْيَوْمَ لَا يُخْرَجُوْنَ مِنْهَا وَلَا هُمْ يُسْتَعْتَبُوْنَ ﴿35﴾

**35** “ఎందుకంటే మీరు అల్లాహ్ వాక్యాలను వేళాకోళంగా తీసుకున్నారు. ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసంలో పడవేసింది.” కనుక ఈ రోజు వీళ్లు నరకం నుంచి తీయబడటంగానీ, వీళ్ళ సంజాయిషీని ఆమోదించటంగానీ జరగదు.[51]

فَلِلّٰهِ الْحَمْدُ رَبِّ السَّمٰوٰتِ وَرَبِّ الْاَرْضِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿36﴾

**36** కాబట్టి ఆకాశాల ప్రభువు, భూమండల ప్రభువు, సమస్త లోకాల ప్రభువు అయిన అల్లాహ్ మాత్రమే స్తుతించదగినవాడు.

وَلَهُ الْكِبْرِيَآءُ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ۪ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿37﴾

**37** భూమ్యాకాశాలలో పెద్దరికం ఆయనకే చెల్లుతుంది.[52] ఆయనే ఆధిక్యత గలవాడు, వివేచనాపరుడు.

కాదా?)” ‘నిజమే ప్రభూ!’ అంటూ అతను ఒప్పుకుంటాడు. “మరి నన్ను కలుసుకునే విషయంపై నీకు నమ్మకముందేదా?” అని దేవుడు అడగ్గా ‘లేదు’ అంటాడతను. అప్పుడు దేవుడిలా అంటాడు: “నువ్వు నన్ను ఎలా మరచిపోయావో అలాగే ఈ రోజు నేను కూడా (నిన్ను నరకానికి ఆహుతి చేసి) నిన్ను మరచిపోతాను” (సహీహ్ ముస్లిం – కితాబుజ్జుహ్ద్).

51. దైవవాక్యాలను పరిహసించటం, అహంకారం కొద్దీ ప్రాపంచిక మోసానికి గురై ఉండటం – ఇవి రెండూ తీవ్రమైన నేరాలు. ఇవి మనిషిని నరకానికి ఆహుతి చేస్తాయి. ఈ అపరాధాలకు ఒడిగట్టిన మనిషి నరకం నుంచి బయటపడే మార్గం లేదు. ఒకవేళ అతనేదన్నా సంజాయిషీ ఇవ్వదలచినా సూత్రప్రాయంగా అతని మాట స్వీకరించబడదు (ఫత్హుల్ ఖదీర్).

52. హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: “ఘనత నా అంగవస్త్రం. పెద్దరికం నా శాలువా. ఎవరయినా వాటిలో ఏ ఒక్కదానినయినా సరే లాక్కునేందుకు ప్రయత్నిస్తే అలాంటి వారికి నేను నా అగ్నిలో నివాసం ఏర్పాటు చేస్తాను” (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

46వ సూరా

# అల్ అహ్ఖాఫ్

## ఇసుక గుట్టలు

అవతరణ మక్కాలో

ఆయతులు 35

### పరిచయం

*ఏక దైవారాధన, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాల గురించి ఈ సూరా ప్రధానంగా నొక్కి చెప్పింది. ఇందులోని 21వ ఆయతులో ఇసుక గుట్టల గురించిన ప్రస్తావన ఉంది. దక్షిణ అరేబియాలోని ఆద్ జాతి నివసించిన ప్రాంతంలో ఈ ప్రదేశం ఉంది. ఆద్ జాతి ప్రజలు చాలా బలమైనవారు. వారు చాలా పొడవుగా బలిష్టంగా ఉండేవారు. అద్భుతమైన భవనాలు నిర్మించేవారు. వారికి ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండేవి. సారవంతమైన నేలలు ఉండేవి. గొప్ప నీటిపారుదల వ్యవస్థ ఉండేది. ఆ విధంగా వారు ఆధిపత్యాన్ని పొందారు. సంపన్న జాతిగా మారారు. కాని వారి సంపద వారిని సత్యానికి దూరం చేసింది. అణచివేత వారి నిత్యకృత్యమయ్యింది. వారి వద్ద ప్రవక్తగా పంపబడిన హూద్(అస) వారిని హెచ్చరించారు. అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం మహాపరాధమని చెప్పారు. సత్యాన్ని తిరస్కరించడం, అణచివేతకు పాల్పడడం మంచిది కాదని బోధించారు. కాని వారు ఆయన మాటలను పెడచెవిన పెట్టారు. ఫలితంగా వారు నాశనానికి గురయ్యారు. ఒక తీవ్రమైన ఇసుక తుఫాను వారిని చుట్టుముట్టింది. వారి ఇళ్ళ శిథిలాలు మాత్రమే మిగిలాయి. ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించేవారికి, దైవవాణిని నిరాకరించే వారికి ఇది ఒక గుణపాఠంగా మిగిలిపోయింది.*

*ఈ సూరాలో తల్లిదండ్రుల పట్ల దయతో, ప్రేమతో వ్యవహరించే విశ్వాసి గురించి, తల్లిదండ్రుల పట్ల కఠినంగా, నిర్దయగా వ్యవహరించే అవిశ్వాసి గురించి వేర్వేరుగా ప్రస్తావించి వారి మధ్య భేదాన్ని తెలియజేయడం జరిగింది. గర్భధారణ సందర్భంగా, ప్రసవం సందర్భంగా తల్లి పడే వేదనను ఇక్కడ గుర్తుచేయడం జరిగింది. శిశువుకు పాలుపట్టే గరిష్ట కాలం 24 నెలలని కూడా ఇక్కడ తల్లులకు చెప్పడం జరిగింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 21-26 | 21-24 | 'దైవప్రవక్త హూద్' | ఆ జాతిప్రజలు మహా బలవంతులు. ఎత్తయిన స్తంభాల్లా ఉండేవారు. అసలు అలాంటి శక్తిమంతులు ప్రపంచంలో మరెక్కడా సృష్టించబడలేదని అల్లాహ్ స్వయంగా తెలిపాడు (సూరె ఫజ్ర్:8) "ఈ లోకంలో మాకన్నా శక్తివంతులెవ రున్నారు?" అని వారు మిడిసిపడేవారు (హామీమ్ సజ్దా:15) మరి అలాంటి జాతి వైపు అల్లాహ్ ఏ ప్రవక్తను పంపించాడు? జాతి ప్రజల నుంచి ఆయనకు ఏం సమాధానం లభించింది? తిరస్కారులను అల్లాహ్ ఏ విధంగా శిక్షించాడు? |

## سُورَةُ الأَحْقَافِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

حمٓ ①

تَنزِيلُ الْكِتَابِ مِنَ اللَّهِ الْعَزِيزِ الْحَكِيمِ ②

مَا خَلَقْنَا السَّمَاوَاتِ وَالْأَرْضَ وَمَا بَيْنَهُمَا إِلَّا بِالْحَقِّ وَأَجَلٍ مُّسَمًّى ۚ وَالَّذِينَ كَفَرُوا عَمَّا أُنذِرُوا مُعْرِضُونَ ③

قُلْ أَرَأَيْتُم مَّا تَدْعُونَ مِن دُونِ اللَّهِ أَرُونِي مَاذَا خَلَقُوا مِنَ الْأَرْضِ أَمْ لَهُمْ شِرْكٌ فِي السَّمَاوَاتِ ۖ ائْتُونِي بِكِتَابٍ مِّن قَبْلِ هَٰذَا أَوْ أَثَارَةٍ مِّنْ عِلْمٍ إِن كُنتُمْ صَادِقِينَ ④

## అల్ అహ్‌ఖాఫ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** హా - మీమ్.[1]

**2** ఈ గ్రంథావతరణ సర్వాధిక్యుడు, వివేకవంతుడైన అల్లాహ్ తరఫున జరిగింది.

**3** మేము భూమ్యాకాశాలను, వాటి మధ్య నున్న వస్తువులన్నింటినీ సత్య (ప్రణాళికా) బద్ధంగా ఒక నిర్ణీత గడువు కొరకు సృష్టించాము.[2] కాని అవిశ్వాసులు తాము హెచ్చరించబడే విషయం నుండి ముఖం తిప్పుకుంటున్నారు.[3]

**4** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "చూడండి! మీరు అల్లాహ్‌ను వదలి ఎవరెవరిని పూజిస్తున్నారో వారు భూమండలంలో ఏ భాగాన్ని సృష్టించారో కాస్త నాకు చూపుతారా?[4] పోనీ, ఆకాశాలలో అయినా వారికేదన్నా వాటా ఉన్నదా?! మీరు సత్యవంతులే అయితే (ఆ మేరకు) దీనికి మునుపు వచ్చిన ఏదైనా గ్రంథంగానీ, లేక ఉల్లేఖించబడే ఏదయినా జ్ఞానాన్నిగాని నావద్దకు తీసుకు రండి.[5]

1. ఇలాంటి **'ముతషాబిహాత్'** (అస్పష్ట) వాక్యాలు దివ్యఖుర్‌ఆన్‌లో అనేకం ఉన్నాయి. దీని అర్థం అల్లాహ్‌కే తెలుసు. కాబట్టి మనం దీనిపై అదేపనిగా మల్లగుల్లాలు పడవలసిన, కూపీలు లాగవలసిన పనిలేదు. కాకపోతే దీనివల్ల రెండు ప్రయోజనాలున్నాయని కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. వాటిని మేము లుఖ్మాన్ సూరా మొదటి ఆయతు క్రింద ప్రస్తావించటం జరిగింది.
2. అంటే భూమ్యాకాశాల సృష్టి వెనుక ఒక ముఖ్య ఉద్దేశం ఉన్నది. అదే మానవుని పరీక్ష. అదీగాక దీనికి ఒక గడువు కూడా నిర్ధారితమై ఉంది. ఆ ప్రళయ ఘడియ సంభవించినప్పుడు భూమ్యాకాశాల ఈ వ్యవస్థ అంతా అతలాకుతలమై పోతుంది. అప్పుడు భూమి ఈ భూమిగా ఉండదు. ఆకాశం ఈ ఆకాశంగా ఉండదు. "భూమ్యాకాశాల రూపురేఖలు పూర్తిగా మార్చివేయబడే రోజు (గురించి నువ్వు వారికి హెచ్చరించు)" (ఇబ్రాహీమ్ - 48).
3. అంటే - విశ్వాస రాహిత్యం కారణంగా వారు పునరుత్థాన దినం, లెక్కల దినం, తీర్పుదినం లాంటి మాటల్ని పెడచెవిన పెడుతున్నారు. అసలు మాటనే శ్రద్ధగా విననివారు ఇంక ఆ దినానికి ఎలా భయపడతారు?
4. అంటే మీరు అల్లాహ్‌ను కాదని ఏ విగ్రహాలను పూజిస్తున్నారో లేక ఏ స్వాములను సేవిస్తున్నారో వారంతా కలసి భూమ్యాకాశాలలో ఏం సృష్టించారో చెప్పండి?! భూమ్యాకాశాల నిర్మాణంలో వారికేదన్నా పాత్ర ఉందా? ముమ్మాటికీ లేదు. మరలాంటప్పుడు మీరు ఆ మిథ్యా దైవాలను అల్లాహ్‌కు సహవర్తులుగా ఎందుకు నిలబెడుతున్నారు? వారి ముందు ఎందుకు తలలు వంచుతున్నారు?
5. లోగడ ఏ ప్రవక్తపైనయినా అవతరించిన గ్రంథంలోగానీ, లేక ఏదైనా ప్రామాణిక ప్రవచనంలోగానీ దీనికి సంబంధించిన

5 అల్లాహ్‌ను వదలి ప్రళయదినం వరకూ తన మొరను ఆమోదిం చలేనివారిని, పైగా తను మొరపెట్టుకున్న సంగతి కూడా తెలియని వారిని మొర పెట్టుకునేవానికన్నా పెద్ద మార్గభ్రష్టుడు ఎవడుంటాడు?[6]

وَمَنْ اَضَلُّ مِمَّنْ يَّدْعُوْا مِنْ دُوْنِ اللّٰهِ مَنْ لَّا يَسْتَجِيْبُ لَهٗۤ اِلٰى يَوْمِ الْقِيٰمَةِ وَهُمْ عَنْ دُعَآئِهِمْ غٰفِلُوْنَ ﴿5﴾

6 మానవులంతా సమీకరించబడినపుడు వారు వారికి (తమ భక్తులకు) శత్రువులై పోతారు. వీళ్ల పూజాపునస్కారాలను కూడా వాళ్లు త్రోసిపుచ్చుతారు.[7]

وَاِذَا حُشِرَ النَّاسُ كَانُوْا لَهُمْ اَعْدَآءً وَّكَانُوْا بِعِبَادَتِهِمْ كٰفِرِيْنَ ﴿6﴾

7 స్పష్టమైన మా వాక్యాలను వారికి చదివి వినిపించినప్పుడు, తమ వద్దకు వచ్చేసిన సత్యాన్నుద్దేశించి ఈ తిరస్కారులు, "ఇదొక పచ్చి ఇంద్రజాలం" అంటారు.

وَاِذَا تُتْلٰى عَلَيْهِمْ اٰيٰتُنَا بَيِّنٰتٍ قَالَ الَّذِيْنَ كَفَرُوْا لِلْحَقِّ لَمَّا جَآءَهُمْ هٰذَا سِحْرٌ مُّبِيْنٌ ﴿7﴾

8 ఏమిటి, "అతనే (ప్రవక్తే) స్వయంగా దీన్ని కల్పించాడ"ని[8] వారంటున్నారా? (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఒకవేళ నేనే దీన్ని స్వయంగా కల్పించుకుని ఉంటే, మీరు అల్లాహ్ సమక్షంలో నాకు

اَمْ يَقُوْلُوْنَ افْتَرٰىهُ ؕ قُلْ اِنِ افْتَرَيْتُهٗ فَلَا تَمْلِكُوْنَ لِيْ مِنَ اللّٰهِ شَيْـًٔا ؕ هُوَ اَعْلَمُ

ఆధారం ఉంటే తెచ్చి చూపండి. మూలంలో **'అసారతిమ్ మిన్ ఇల్మిన్'** (اَثٰرَةٍ مِّنْ عِلْمٍ) అని ఉంది. అంటే స్పష్టమైన జ్ఞాన సూచన అని అర్థం. ప్రామాణిక పద్ధతిలో ఉల్లేఖించబడిన గత ప్రవక్తల ప్రబోధనా అవశేషం అన్న అర్థం కూడా వస్తుంది.

6. అంటే – వీళ్లే అందరికన్నా పెద్ద మార్గభ్రష్టులు. ఎందుకంటే వీళ్లు రాతి విగ్రహాలను, చనిపోయిన వ్యక్తులను మొరపెట్టుకుంటున్నారు. వారెన్నటికీ వారి మొరలను ఆలకించలేరు. ప్రళయదినం వరకూ వారి మొరలకు సమాధానం ఇవ్వలేరు. తమ భక్తులు తమను మొరపెట్టుకున్నారన్న సంగతి కూడా వారికి తెలీదు.

7. ఈ అంశం దివ్య ఖుర్ఆన్‌లో ఎన్నో చోట్ల వచ్చింది. ఉదాహరణకు : యూనుస్ సూరా (29)లోనూ, మర్యమ్ సూరా (81, 82) లోనూ, అన్‌కబూత్ సూరా (25) లోనూ చూడండి. ఇహలోకంలో ఇలాంటి ఆరాధ్య దైవాలు రెండు రకాలు. మొదటి రకం : చెట్టుపుట్టలు, రాళ్లురప్పలు, సూర్యచంద్రులు, అగ్ని మొదలగునవి. ఆనాడు అల్లాహ్ వారికి మాట్లాడే శక్తిని ప్రసాదిస్తాడు. అప్పుడు వారంతా (ఆ వస్తువులన్నీ) వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి. వాళ్లు తమను పూజించిన సంగతి తమకస్సలు తెలియదని అంటాయి. ఇక వారి ఆరాధ్య దైవాలలోని రెండవ వర్గం దైవప్రవక్తలది, దైవదూతలది, సజ్జనులది. ఉదాహరణకు: హజ్రత్ ఉజైర్, హజ్రత్ ఈసా (అలైహిముస్సలాం) మరియు ఇతర పుణ్య పురుషులన్నమాట. వారంతా దైవసమక్షంలో తమను పూజించిన వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తారు. ఈసా (అలైహిస్సలాం) ఎలా ప్రసంగించారో దివ్య ఖుర్ఆన్‌లో ఒక చోట ఉదాహరించబడింది కూడా. ఆఖరికి షైతానులు కూడా నిరాకరిస్తారు. వారిలా అంటారు : "వారికి సంబంధించిన బాధ్యత మాపై లేదని మేము నీ సమక్షంలో ప్రకటిస్తున్నాము. అసలు వారు మమ్మల్ని పూజించనే లేదు" (అల్ ఖసస్ – 63).

8. వారి వద్దకు వచ్చేసిన ఆ సత్యం ఏది? అంటే అదే ఖుర్ఆన్. ఖుర్ఆన్ మహాత్మ్యాన్ని, దాని బోధనా తీరును చూసి వారు అమితంగా ప్రభావితులయ్యారు. కాని వాస్తవాన్ని ఒప్పుకోవటానికి అహం అడ్డుపడింది. అందుకే దాన్నొక ఇంద్రజాలంగా చిత్రీకరించారు. ఆ పాచిక కూడా పారకపోవటంతో, ఆఖరికి దాన్ని ముహమ్మద్ (సఅసం) అల్లిన కట్టుకథగా అభివర్ణించారు.

بِمَا تُفِيضُونَ فِيهِ ۖ كَفَىٰ بِهِ شَهِيدًا بَيْنِي وَبَيْنَكُمْ ۖ وَهُوَ الْغَفُورُ الرَّحِيمُ ⑧

ఏవిధంగానూ తోడ్పడలేరు.[9] మీరు దీని (ఖుర్‌ఆన్) గురించి చెప్పే లేక వినే విషయాలన్నీ అల్లాహ్‌కు బాగా తెలుసు.[10] మీకూ– నాకూ మధ్య సాక్షిగా ఆయన ఒక్కడే చాలు.[11] ఆయన క్షమించేవాడు, దయ చూపేవాడు.[12]

قُلْ مَا كُنتُ بِدْعًا مِّنَ الرُّسُلِ وَمَا أَدْرِي مَا يُفْعَلُ بِي وَلَا بِكُمْ ۖ إِنْ أَتَّبِعُ إِلَّا مَا يُوحَىٰ إِلَيَّ وَمَا أَنَا إِلَّا نَذِيرٌ مُّبِينٌ ⑨

**9** వారికి చెప్పు : "నేను కొత్తగా వచ్చిన ప్రవక్తనేమీ కాను.[13] (రేపు) నా పట్ల, మీ పట్ల జరిగే వ్యవహారం ఎలాంటిదో కూడా నాకు తెలీదు.[14] నా వద్దకు పంపబడిన సందేశాన్ని (వహీని) మాత్రమే నేను అనుసరిస్తాను. నేను చాలా స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి మాత్రమే."

9. అంటే – నేను దైవప్రవక్తను కాననే, నేను వినిపించే ఈ వాణి నా స్వీయకల్పనే అన్న మీ వాదనే గనక నిజమైతే నేను ముమ్మాటికీ మహాపరాధినే. ఇంతపెద్ద అసత్యాన్ని కల్పించినందుకు అల్లాహ్ నన్ను వదలిపెట్టడు. ఒకవేళ అదేగనక జరిగితే అప్పుడనుకోండి– నేను నిజంగానే అసత్యవాదినని! మీరు నాకు సాయం చేయాల్సిన అవసరం కూడా లేదు. అలాంటి పరిస్థితుల్లో నన్ను అల్లాహ్ పట్టునుంచి కాపాడే శక్తి కూడా మీకు లేదు సుమా! ఈ విషయమే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: "ఒకవేళ అతను మా గురించి తనంతట తానుగా ఏదైనా విషయం కల్పించుకుంటే, మేమతని కుడిచేతిని పట్టుకునేవారము. మరి అతని గొంతునాళం కోసివేసేవాళ్ళం. మరి మీలో ఎవరూ నన్ను అడ్డుకోలేకపోయేవాడు" (అల్ హాఖ్ఖ : 44 – 47).

10. అంటే – మీరెన్ని విధాలుగా ఈ ఖుర్‌ఆన్‌ని ధిక్కరిస్తున్నారో అల్లాహ్‌కు తెలియకుండా లేదు. ఒక్కోసారి మీరు దీన్ని ఇంద్రజాలం అంటారు. ఒక్కోసారి కట్టుకథ అని కొట్టిపారేస్తారు. మీ మాటలన్నింటినీ అల్లాహ్ గమనిస్తూనే ఉన్నాడు. నిందార్హమైన మీ చేష్టలకు తగిన శాస్తి ఆయనే చేస్తాడు.

11. ఈ ఖుర్‌ఆన్ గ్రంథం ఆయన తరఫునే అవతరించిందన్న విషయానికి ఆయన స్వయంగా సాక్షిగా ఉన్నాడు. మీ ధిక్కార వైఖరికి కూడా ఆయనే సాక్షి. ఈ పలుకుల్లో అవిశ్వాసులకు తీవ్రమయిన హెచ్చరిక ఉంది.

12. అంటే పశ్చాత్తాపం చెందిన వారి పాలిట, విశ్వసించిన వారిపట్ల, దివ్య ఖుర్‌ఆన్‌ను సత్యవాక్కుగా అంగీకరించిన వారిపట్ల అల్లాహ్ క్షమాశీలి. దీని భావం ఏమిటంటే ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు, మీరు గనక నిజమైన పశ్చాత్తాపం చెందినట్లయితే ఆయన మిమ్మల్ని మన్నించి, కరుణిస్తాడు.

13. అంటే – నేను తొలిప్రవక్తనూ కాను, నా ప్రవక్తాపదవి ఆశ్చర్యకర విషయమూ కాదు. నాకన్నా ముందు ఎందరో ప్రవక్తలు వచ్చారు, నాలాగే వారు కూడా దైవవాణిని అందజేశారు.

14. అంటే ప్రపంచంలో రేపు ఏం జరగనున్నదో నాకు తెలీదు, నేను మక్కా నగరంలోనే ఉంటానో లేక ఇక్కడినుంచి మరోచోటికి ప్రస్థానం చేస్తానో, నాకు సహజ మరణం వస్తుందో లేక మీ చేతుల్లో చంపబడతానో కూడా నాకు తెలీదు. మీరు తొందరగా శిక్షించబడతారో లేక మీకు సుదీర్ఘగడువు ఇవ్వబడుతుందో నేను చెప్పలేను. ఈ విషయాలన్నీ ఒక్క అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. అయితే పరలోకంలో ఏం జరగనున్నదనే విషయానికి సంబంధించి మాత్రం చెప్పగలను – విశ్వాసులు స్వర్గానికి పోతారనీ, అవిశ్వాసులు నరకానికి ఆహుతి అవుతారనీని.

హదీసు ప్రకారం కొంతమంది సహచరులు మరణించినపుడు వారి గురించి కొందరు మంచి ఊహాగానం చేయగా దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "దైవసాక్షి! నేను దైవప్రవక్త అయినప్పటికీ (తీర్పు దినాన) మీపట్లా – నాపట్లా ఏవిధమైన వ్యవహారం జరుగుతుందో నాకు తెలీదు" (సహీహ్ బుఖారీ – మనాఖిబుల్ అన్సార్). దీన్నిబట్టి అవగతమయ్యే దేమిటంటే ఫలానా వ్యక్తి పర్యవసానం ఖచ్చితంగా ఇలా ఉంటుందన్న సంగతి ఆయన (స)కు సయితం తెలీదు.

قُلْ أَرَءَيْتُمْ إِن كَانَ مِنْ عِندِ اللَّهِ وَكَفَرْتُم بِهِۦ وَشَهِدَ شَاهِدٌ مِّنۢ بَنِىٓ إِسْرَٰٓءِيلَ عَلَىٰ مِثْلِهِۦ فَـَٔامَنَ وَٱسْتَكْبَرْتُمْ ۖ إِنَّ ٱللَّهَ لَا يَهْدِى ٱلْقَوْمَ ٱلظَّٰلِمِينَ ⑩

**10** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "చూడండి! ఒకవేళ ఇది (ఈ ఖుర్ఆన్) అల్లాహ్ తరఫునుంచే వచ్చి ఉండి, మీరు దాన్ని తిరస్కరించినట్లయితే ఇస్రాయీలు సంతతికి చెందిన ఒక సాక్షి ఇలాంటి (ఒక గ్రంథానికి) సాక్ష్యాన్ని కూడా ఇచ్చి, అతను విశ్వసించి ఉండగా మీరు మాత్రం అహంకారం ప్రదర్శిస్తే[15] (మీ గతేమవుతుందో ఆలోచించారా?) నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు."

وَقَالَ ٱلَّذِينَ كَفَرُوا۟ لِلَّذِينَ ءَامَنُوا۟ لَوْ كَانَ خَيْرًا مَّا سَبَقُونَآ إِلَيْهِ ۚ وَإِذْ لَمْ يَهْتَدُوا۟ بِهِۦ فَسَيَقُولُونَ هَٰذَآ إِفْكٌ قَدِيمٌ ⑪

**11** అవిశ్వాసులు విశ్వసించిన వారినుద్దేశించి, "ఒకవేళ ఇది (ఈ ధర్మం) గనక శ్రేయస్కరమైనదై ఉంటే వీళ్లు మాకన్నా ముందు దీని వైపుకు వెళ్ళి ఉండేవారు కారు" అని అంటున్నారు. వారెలాగూ ఈ గ్రంథం ద్వారా సన్మార్గం పొందలేదు. అందువల్ల 'ఇదొక పాత అబద్ధం' అని కొట్టిపారేస్తారు.[16]

కాకపోతే దేవుడు తెలియజేసిన వారి విషయంలో తప్ప! ఉదాహరణకు: పదిమంది సహాబీల గురించి, బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహచరుల గురించి ఆయన (స) ద్వారా స్వర్గలోక శుభవార్త ఇవ్వబడింది.

15. ఇంతకీ ఇస్రాయీల్ సంతతికి చెందిన ఆ సాక్షి ఎవరు? విశ్వసించిన ప్రతి ఇస్రాయీలు వంశీయునికి ఇది వర్తిస్తుందని కొందరు అభిప్రాయపడ్డారు. మక్కాలో నివసించే ఒకానొక ఇస్రాయీలు వ్యక్తినుద్దేశించి ఈ వాక్యం అవతరించిందనీ, ఎందుకంటే ఈ సూరా మక్కాలో అవతరించిన సూరా అనీ మరి కొంతమంది విద్వాంసులు పేర్కొన్నారు. ఇంకా కొంతమంది విద్వాంసులు మాత్రం, అబ్దుల్లా బిన్ సలాం నేపథ్యంలో ఈ ఆయతు అవతరించిందని భావిస్తూ, దీన్ని మదనీ ఆయతుగా ఖరారు చేశారు. బుఖారీ, ముస్లింలలోని ప్రామాణిక హదీసు ద్వారా కూడా ఈ అభిప్రాయానికి సమర్థన లభిస్తోంది. (సహీహ్ బుఖారీ – మనాఖిబుల్ అన్సార్; ముస్లిం – ఫజాయిలుస్సహాబా). అందుకే ఇమామ్ షౌకానీ ఈ అభిప్రాయం వైపుకే మొగ్గారు. **'అలా మిస్లిహీ'** (عَلَىٰ مِثْلِهِۦ) అంటే అటువంటి గ్రంథం గురించిన సాక్ష్యం అని భావం. అంటే తౌరాతు గ్రంథం అన్నమాట. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ కూడా తౌరాతు మాదిరిగానే దైవ గ్రంథం. ప్రజలను ఏకదైవారాధన వైపు పిలిచే గ్రంథం. గ్రంథవహులు అయిన ప్రజలు సయితం దివ్య ఖుర్ఆన్‌ను విశ్వసించిన మీదట, ఇక ఇది దైవగ్రంథం అయివుండే విషయంలో సందేహానికి తావే లేకుండా పోయింది. అందువల్ల– ఇదంతా కళ్లారా చూస్తూ కూడా మీరు నిరాకరించటంలో, పంతాలకు పోవటంలో అర్థమే లేదు. మీ మంకుతనం ఎటువంటి దుష్పరిణామానికి దారితీస్తుందో బాగా ఆలోచించుకోండి.

16. హజ్రత్ బిలాల్, అమ్మార్, సుహైబ్, ఖబ్బాబ్ (ర.అన్హుం) వంటి పేద, బలహీన వర్గాల వ్యక్తులు ఇస్లాం స్వీకరణలో ముందంజవేయటం మక్కా అవిశ్వాసులకు గిట్టలేదు. అందువల్ల వారి దృష్టిలో ఇస్లాం ధర్మానికి ప్రాముఖ్యం తగ్గిపోయింది. ఒకవేళ నిజంగానే ఇస్లాం ధర్మంలో మేలు ఉండివుంటే దాన్ని మాలాంటి ప్రముఖులు, మర్యాదస్తులు ప్రప్రథమంగా దాన్ని అవలంబించాల్సింది. ఈ బడుగువర్గాల వారు దాని వైపుకు మొగ్గారంటే బహుశా అదొక పాత చింతకాయ పులుసు అయి ఉంటుంది – ఇదీ ఈ బడా ఆసాముల ఆలోచనా ధోరణి!

ఈ గర్వాహంకారంతో వారు ఏకంగా దివ్య ఖుర్ఆన్‌నే 'పాత అబద్ధం'గా ఖరారు చేశారు. ఒక్కోసారి ఖుర్ఆన్ అంశాలను 'పూర్వీకుల కట్టుకథలు'గా కూడా అభివర్ణించేవారు. యదార్థానికి ఒక వ్యక్తి ధనవంతుడు, పలుకుబడి కలవాడై ఉన్నంతమాత్రాన అతను దైవసన్నిధిలో ఎంతో ఆదరణీయుడు అని భావం ఎంతమాత్రం కాదు. (వాస్తవం ఏమిటంటే షైతాన్ వారిని అలాంటి భ్రమలకు లోను చేశాడు) అసలు మనిషి దైవసన్నిధిలో గౌరవాదరణలకు

**12** దీనికి పూర్వం మూసా గ్రంథం సారథిగా, కారుణ్యంగా ఉండేది. కాగా; ఈ గ్రంథం దాన్ని ధృవీకరించేదిగా అరబీ భాషలో ఉన్నది. దుర్మార్గులను హెచ్చరించటానికి, సద్వర్తనులకు శుభవార్త ఇవ్వటానికి!

وَمِن قَبْلِهِۦ كِتَـٰبُ مُوسَىٰٓ إِمَامًا وَرَحْمَةً ۚ وَهَـٰذَا
كِتَـٰبٌ مُّصَدِّقٌ لِّسَانًا عَرَبِيًّا لِّيُنذِرَ ٱلَّذِينَ
ظَلَمُوا۟ وَبُشْرَىٰ لِلْمُحْسِنِينَ ﴿١٢﴾

**13** ఎవరయితే 'మా ప్రభువు అల్లాహ్యే' అని పలికి, తర్వాత దానిపై గట్టిగా నిలబడ్డారో వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ లేదు.

إِنَّ ٱلَّذِينَ قَالُوا۟ رَبُّنَا ٱللَّهُ ثُمَّ ٱسْتَقَـٰمُوا۟
فَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿١٣﴾

**14** వారే స్వర్గవాసులు. వారందులో కలకాలం ఉంటారు. వారు చేసుకున్న కర్మలకు ప్రతిఫలం (ఇది).

أُو۟لَـٰٓئِكَ أَصْحَـٰبُ ٱلْجَنَّةِ خَـٰلِدِينَ فِيهَا
جَزَآءًۢ بِمَا كَانُوا۟ يَعْمَلُونَ ﴿١٤﴾

**15** మేము మనిషికి, తన తల్లిదండ్రుల యెడల ఉత్తమరీతిలో వ్యవహరించవలసినదిగా తాకీదు చేశాము. అతని తల్లి బాధను భరిస్తూ గర్భంలో అతన్ని మోసింది. బాధను భరిస్తూనే అతన్ని ప్రసవించింది.[17] అతన్ని గర్భంలో మోయటానికి, అతని పాలు విడిపించటానికి ముప్ఫై మాసాల కాలం పట్టింది.[18] తుదకు అతను పూర్తి పరిపక్వతకు, అంటే నలభై ఏళ్లప్రాయానికి

وَوَصَّيْنَا ٱلْإِنسَـٰنَ بِوَٰلِدَيْهِ إِحْسَـٰنًا ۖ حَمَلَتْهُ
أُمُّهُۥ كُرْهًا وَوَضَعَتْهُ كُرْهًا ۖ وَحَمْلُهُۥ وَفِصَـٰلُهُۥ
ثَلَـٰثُونَ شَهْرًا ۚ حَتَّىٰٓ إِذَا بَلَغَ أَشُدَّهُۥ وَبَلَغَ
أَرْبَعِينَ سَنَةً قَالَ رَبِّ أَوْزِعْنِىٓ أَنْ أَشْكُرَ
نِعْمَتَكَ ٱلَّتِىٓ أَنْعَمْتَ عَلَىَّ وَعَلَىٰ وَٰلِدَىَّ وَأَنْ

నోచుకోవాలంటే అతను దైవాన్ని విశ్వసించాలి, మంచి పనులు చేయాలి. ఈ భాగ్యాన్ని అల్లాహ్ తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. ఇక సిరిసంపదలంటారా, సిరిసంపదలను కలిగి ఉండటం తప్పు కాదు. కాని వాటిని దేవుడు పరీక్షించే నిమిత్తం ప్రసాదించాడని మరువరాదు.

17. తల్లిదండ్రుల యెడల మంచిగా మెలగమని తాకీదు చేసే సందర్భంగా తల్లిపడిన కష్టాలను ప్రత్యేకించి నొక్కిచెప్పటం గమనించదగిన విషయం. దీన్నిబట్టి సద్వ్యవహారం విషయంలో తండ్రికన్నా తల్లిస్థానం మరింత ఉన్నతమైందని తెలుస్తోంది. ఎందుకంటే మనిషిని ఉనికిలోకి తేవటంలో తండ్రి ప్రమేయం కొన్ని క్షణాలది లేక కొన్ని కణాలది మాత్రమే. కాని నవమాసాల పాటు ఆ నలుసును కడుపులో మోసుకుంటూ తిరగటం, పురిటి నొప్పుల్ని భరించటం, పీడనపై పీడనను భరిస్తూ అతన్ని కనటం, ఆ తరువాత శిశువును సాకటం, పాలుపట్టడం – ఇదంతా తల్లికే చెల్లింది! అందుకే తండ్రికన్నా తల్లికి ప్రాథమ్యం ఇవ్వబడింది. తండ్రి స్థానం రెండవది. హదీసు ద్వారా తెలిసేది కూడా ఇదే. "నా సద్వ్యవహారానికి అందరికన్నా ఎక్కువ హక్కుదారులెవర"ని ఒక సహచరుడు ప్రశ్నించినపుడు "నీ తల్లి" అని దైవప్రవక్త (స) సమాధానమిచ్చారు. రెండవసారి ప్రశ్నించినపుడు కూడా ఆయన (స) అదే సమాధానమిచ్చారు. మూడవ సారి కూడా అదే సమాధానం. నాల్గవసారి ప్రశ్నించినపుడు మాత్రం "నీ తండ్రి" అని బదులిచ్చారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

18. **'ఫిసాల్'** అంటే పాలు విడిపించటం అని అర్థం. పాల గడువు రెండేళ్లు (24 మాసాలు). దీని ఆధారంగా ఏ గర్భవతి అయినా ఆరుమాసాల తరువాత బిడ్డను ప్రసవించే అవకాశం ఉంటుందని ధర్మవేత్తలు నిర్ధారించారు. ఏ స్త్రీ అయినా వివాహమైన ఆరు మాసాలలో ప్రసవిస్తే అట్టి సంతానాన్ని అక్రమ సంతానంగా పరిగణించటానికి వీల్లేదు. ఎందుకంటే రెండేళ్లదాకా పాలు పట్టాలని ఖుర్ఆన్ ద్వారా (లుఖ్మాన్ సూరా–14, అల్ బఖర సూరా–233) విదితమవుతున్నది. దీని ప్రకారం గర్భవతి 6 మాసాల తరువాత ఎప్పుడైనా ప్రసవించే అవకాశం ఉంటుంది.

చేరుకున్నప్పుడు[19]ఇలా విన్నవించుకున్నాడు : "నా ప్రభూ! నీవు నాపై, నా తల్లిదండ్రులపై కురిపించిన అనుగ్రహ భాగ్యాలకుగాను కృతజ్ఞతలు తెలుపుకునే, నీ ప్రసన్నతను చూరగొనే విధంగా సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు. ఇంకా నా సంతానాన్ని కూడా సజ్జనులుగా తీర్చిదిద్దు. నేను నీ వైపునకే మరలుతున్నాను. నేను నీ విధేయులలో ఒకణ్ణి."[20]

اَعۡمَلَ صَالِحًا تَرۡضٰىهُ وَاَصۡلِحۡ لِىۡ فِىۡ ذُرِّيَّتِىۡ ؕۚ
اِنِّىۡ تُبۡتُ اِلَيۡكَ وَاِنِّىۡ مِنَ الۡمُسۡلِمِيۡنَ ﴿15﴾

**16** ఇలాంటి వారి సత్కార్యాలనే మేము స్వీకరిస్తాము. వారి తప్పులను క్షమిస్తాము. వారికి చేయబడిన సత్య వాగ్దానం ప్రకారం వారు స్వర్గవాసులలో ఉంటారు.

اُولٰٓـئِكَ الَّذِيۡنَ نَتَقَبَّلُ عَنۡهُمۡ اَحۡسَنَ مَا عَمِلُوۡا
وَنَتَجَاوَزُ عَنۡ سَيِّاٰتِهِمۡ فِىۡۤ اَصۡحٰبِ الۡجَـنَّةِ‌ ؕ وَعۡدَ
الصِّدۡقِ الَّذِىۡ كَانُوۡا يُوۡعَدُوۡنَ ﴿16﴾

**17** మరెవరయితే తన తల్లిదండ్రులతో, "ఛీ, (నేను మీతో విసిగి వేసారి పోయాను).[21] నేను చచ్చాక మళ్లీ లేపబడతాననే మీరు (పద్దాకా) చెబుతూ ఉంటారా ఏమిటి?! నాకు పూర్వం కూడా ఎన్నో తరాలు గతించాయి, తెలుసా?![22]" అని అంటాడో, అతనికి సమాధానంగా వారిద్దరూ (తల్లిదండ్రులు) అల్లాహ్ సహాయం వేడుకుంటూ, "నీ పాడుగాను! ఒరేయ్ నువ్వు విశ్వసించరా! అల్లాహ్ వాగ్దానం తప్పకుండా నిజమవుతుందిరా" అని అంటారు. దానికతను, "ఇవన్నీ పూర్వీకుల పసలేని గాథలు"[23] అంటాడు.

وَالَّذِىۡ قَالَ لِـوَالِدَيۡهِ اُفٍّ لَّـكُمَاۤ اَتَعِدٰنِنِىۡۤ
اَنۡ اُخۡرَجَ وَقَدۡ خَلَتِ الۡقُرُوۡنُ مِنۡ قَبۡلِىۡ‌ۚ وَهُمَا
يَسۡتَغِيۡثٰنِ اللّٰهَ وَيۡلَكَ اٰمِنۡ ‌ۖ اِنَّ وَعۡدَ اللّٰهِ حَقٌّ ‌ۚ
فَيَقُوۡلُ مَا هٰذَاۤ اِلَّاۤ اَسَاطِيۡرُ الۡاَوَّلِيۡنَ ﴿17﴾

19. సాధారణంగా మనిషి 18 ఏళ్లకే యౌవన దశకు చేరుకుంటాడు. అయితే 40 ఏళ్ళప్రాయానికి చేరుకునేసరికి అతను పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటాడు. అతని పంచేంద్రియాలు పరిపక్వత చెందుతాయి. అందుకే ప్రతి ప్రవక్తకు నలభై ఏండ్ల తరువాతే ప్రవక్త పదవి లభించిందని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు (ఫత్హుల్ ఖదీర్).

20. నలభై ఏండ్లకు చేరుకున్న పిదప మనిషి అత్యధికంగా ఈ విధంగా ప్రార్థిస్తూ ఉండాలని విద్వాంసులు – ఈ ఆయతు ఆధారంగా – వ్యాఖ్యానించారు. ఈ ఆయతులో మూడు ముఖ్యాంశాలున్నాయి : 1. తల్లిదండ్రుల (వారు జీవించి ఉంటే) సేవచేసి, దేవుని మెప్పు పొందే సద్బుద్ధిని ప్రసాదించమని కోరటం. 2. సత్కార్యాలు చేసే సద్బుద్ధి నొసగమని కోరటం. 3. తాను నికార్సయిన దైవవిధేయుణ్ణి అన్న విషయాన్ని పదే పదే నెమరు వేసుకోవటం.

21. ఇంతకుముందు ఆయతులలో సజ్జన సంతానం వ్యవహారశైలి ప్రస్తావించబడింది. దానికి భిన్నంగా దౌర్భాగ్యులైన పిల్లలు తమ తల్లిదండ్రుల యెడల ఎలా దురుసుగా వ్యవహరిస్తారో ఇక్కడ చెప్పబడింది. **'ఉఫ్ఫిల్లకుమా'** (**اُفٍّ لَّـكُمَا**) అనే పదం ఈసడించుకోవటం, ఛీత్కరించటం, తీవ్రమైన అసహనాన్ని వ్యక్తపరచటం అన్నభావంలో ఉపయోగించబడుతుంది. అంటే దౌర్భాగ్యులు, దుర్మార్గులు అయిన కొడుకులు తమ మాతా పితలు చెప్పే శ్రేయస్కరమైన ఉపదేశాలను గౌరవించకపోగా, వారిపై కోపాన్ని, విసుగును వ్యక్తపరుస్తారు. అదేమంటే, "మీ చాదస్తాన్ని ఇక చాలించండి" అని దబాయిస్తారు. పిల్లలు ఎట్టి పరిస్థితిలోనూ ఈ విధంగా ప్రవర్తించేందుకు ఇస్లాం ధర్మం అనుమతించదు. ఈ ఆయతు సర్వసాధారణమైనది. అవిధేయులైన సంతానం అందరికీ ఈ ఆదేశం వర్తిస్తుంది.

أُولَٰئِكَ الَّذِينَ حَقَّ عَلَيْهِمُ الْقَوْلُ فِي أُمَمٍ قَدْ خَلَتْ مِن قَبْلِهِم مِّنَ الْجِنِّ وَالْإِنسِ ۖ إِنَّهُمْ كَانُوا خَاسِرِينَ ⑱

18 వీళ్లపైనే (అల్లాహ్‌ శిక్ష అవతరిస్తుందనే) వాక్కు రూఢీ అయింది.[24] వీరికిపూర్వం గతించిన జిన్నాతుల, మానవుల వర్గాల లోనే వీరు కూడా చేరిపోతారు.[25] నిస్సందేహంగా వీళ్లంతా నష్ట పోయేవారే.

وَلِكُلٍّ دَرَجَاتٌ مِّمَّا عَمِلُوا ۖ وَلِيُوَفِّيَهُمْ أَعْمَالَهُمْ وَهُمْ لَا يُظْلَمُونَ ⑲

19 ప్రతి ఒక్కరికీ వారి వారి కర్మలను బట్టి తరగతులు లభిస్తాయి[26]– వారి ఆచరణలకుగాను సంపూర్ణ ప్రతిఫలం లభించ టానికి (ఈ తరగతులు నిర్ధారించబడ్డాయి). వారికి ఏ విధమైన అన్యాయం కూడా జరగదు.[27]

وَيَوْمَ يُعْرَضُ الَّذِينَ كَفَرُوا عَلَى النَّارِ أَذْهَبْتُمْ طَيِّبَاتِكُمْ فِي حَيَاتِكُمُ الدُّنْيَا وَاسْتَمْتَعْتُم بِهَا فَالْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ الْهُونِ بِمَا كُنتُمْ تَسْتَكْبِرُونَ فِي الْأَرْضِ بِغَيْرِ الْحَقِّ وَبِمَا كُنتُمْ تَفْسُقُونَ ⑳

20 అవిశ్వాసులు నరకాగ్ని ముందుకు తీసుకురాబడిన రోజున[28] (వారితో ఇలా అనబడుతుంది:) మీరు మీ మంచి మంచి వస్తువు లను ప్రాపంచిక జీవితంలోనే పొందారు. వాటిని అక్కడే అనుభ వించారు.[29] ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడు తుంది. ఎందుకంటే మీరు భువిలో అకారణంగా అహంకారం ప్రదర్శించేవారు, ఆజ్ఞోల్లంఘనకు పాల్పడేవారు.[30]

22. వారిలో ఎవరూ మళ్లీ బ్రతికి ఈ లోకంలోకి రాలేదు అని వాడు చెప్పదలిచాడు. వాస్తవానికి మరణానంతర జీవితమనేది ప్రళయదినానికి (పరలోకానికి) సంబంధించినదే గాని ఇహలోకానికి సంబంధించినది కాదు.

23. తల్లిదండ్రులు ముస్లింలై ఉండి, వారి పిల్లలేమో అవిశ్వాసులో, నాస్తికులో అయివుంటే ఇలాంటి గొడవలే వస్తాయి. వారి మధ్య అవాంఛనీయమైన సంవాదన జరుగుతుంది. దీనికి ఈ ఆయతు ఒక ప్రబల తార్కాణం.

24. ఇలా జరగనున్నదని అల్లాహ్‌కు ముందు నుంచే తెలుసు. లేదా షైతాన్ సవాలుకు అల్లాహ్‌ ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. ఉదాహరణకు అల్లాహ్‌ ఒకచోట షైతాన్‌ను ఉద్దేశించి, “నిన్ను అనుసరించే వారందరినీ నరకంలో పడేసి దాన్ని నింపేస్తాను” అన్నాడు (సాద్‌– 85).

25. అంటే వీళ్లూ ఆ అవిశ్వాస వర్గాలలో చేరిపోయారు. ప్రళయదినాన వీళ్లు చాలా తీవ్రమైన నష్టానికి గురవుతారు.

26. విశ్వాసులైనా, అవిశ్వాసులైనా – ఇరువురికీ వారి ఆచరణలనుబట్టి దైవసన్నిధిలో ప్రతిఫలం దొరుకుతుంది. విశ్వాసులు ఉన్నత తరగతులను పొందగా, అవిశ్వాసులు నరకంలోని అట్టడుగు స్థానాలకు నెట్టివేయబడతారు.

27. అపరాధికి అతని నేరానికి మించిన శిక్ష విధించబడదు. అలాగే సజ్జనులకు ఇవ్వవలసిన సత్ఫలితంలో ఎలాంటి కోత విధించబడదు. ప్రతి ఒక్కరికీ – మేలైనా, కీడైనా – వారు చేసుకున్న దాని ప్రకారం లభిస్తుంది.

28. అవిశ్వాసుల కళ్లపైనున్న చీకటి పొరలు తొలగించబడే ఆ రోజును కాస్త నెమరువేసుకోండి! వారు నరకాగ్నిని చాలా దగ్గర నుంచి చూస్తూ ఉంటారు. కొంతమంది వ్యాఖ్యాతలు **'యూరజు'** (**يُعْرَضُ**) అనే పదాన్ని **'యుఅజ్జబు'** (వారు శిక్షించబడినప్పుడు) అన్న అర్థంలో తీసుకున్నారు. అయితే మరికొంతమంది అగ్ని వారి ముందుకు తేబడినపుడు అన్న భావంలో తీసుకున్నారు (ఫత్‌హుల్ ఖదీర్).

29. ఇక్కడ **'తయ్యిబాత్'** అంటే మానవులు ఎంతో ఇష్టపడి తినే త్రాగే ఆహార పదార్థాలు, ఎంతో కోరికతో ఉపయోగించుకునే వస్తువులు, వాటివల్ల ఎంతో ఆనందానుభూతిని పొందే దైవానుగ్రహాలు అని భావం. అయితే పరలోక చింతనతో వాటిని ఉపయోగిస్తే ఆ మాటే వేరు. దేవునిపై, పరలోకంపై ప్రగాఢ విశ్వాసం గల ఒక విశ్వాసి దైవానుగ్రహాలను

وَاذْكُرْ اَخَا عَادٍ ؕ اِذْ اَنْذَرَ قَوْمَهٗ بِالْاَحْقَافِ
وَقَدْ خَلَتِ النُّذُرُ مِنْۢ بَيْنِ يَدَيْهِ وَمِنْ
خَلْفِهٖٓ اَلَّا تَعْبُدُوْٓا اِلَّا اللّٰهَ ؕ اِنِّيْٓ اَخَافُ عَلَيْكُمْ
عَذَابَ يَوْمٍ عَظِيْمٍ ﴿21﴾

**21** మరి ఆద్ (జాతి) సోదరుడు తన జాతి వారిని ఇసుక గుట్టల వద్ద[31] హెచ్చరించిన సంగతిని జ్ఞాపకం చేసుకో. అతనికి పూర్వం కూడా హెచ్చరిక చేసేవారు గడిచారు, అతని తరువాత కూడా. "మీరు అల్లాహ్‌ను తప్ప ఇతరులను పూజించకండి. ఒక మహా నాడు మీపై విరుచుకుపడే శిక్ష గురించి నేను భయపడు తున్నాను"[32] (అని అతను హెచ్చరించాడు).

قَالُوْٓا اَجِئْتَنَا لِتَاْفِكَنَا عَنْ اٰلِهَتِنَا ۚ فَاْتِنَا بِمَا
تَعِدُنَآ اِنْ كُنْتَ مِنَ الصّٰدِقِيْنَ ﴿22﴾

**22** దానికి వారు, "ఏమిటి, మమ్మల్ని మా దేవుళ్ళ (పూజ) నుంచి మళ్ళించడానికేనా నువ్వు వచ్చింది?![33] ఒకవేళ నువ్వు సత్యవంతుడవే అయితే, ఏదీ నువ్వు మాతో వాగ్దానం చేసే ఆ ఆపదను మాపైకి తీసుకురా!" అని ఎద్దేవా చేశారు.

---

తనివితీరా ఆస్వాదించే సమయంలో పరలోకాన్ని మరచిపోడు. తత్కారణంగా అతను అనుక్షణం దైవాజ్ఞకు లోబడి ఉంటాడు. అతని మనసు దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది. కాని పరలోకచింతన లేని మనిషి ప్రవర్తన తద్భిన్నంగా ఉంటుంది. అతను తలబిరుసుగా, తిరుగుబాటుదారుగా మారిపోతాడు. ఆ విధంగా అతను దైవానికి కృతఘ్నుడు అవుతాడు. కాబట్టి ప్రాపంచిక జీవితంలో విశ్వాసి కృతజ్ఞతాపూర్వకంగా మసలుకున్నందుకు ప్రతిగా పరలోకంలో అతనికి అంతకన్నా మంచి స్థితి ప్రాప్తిస్తుంది. ఇంతకన్నా ఉత్తమ అనుగ్రహాలు వొసగబడతాయి.

కాగా; అవిశ్వాసుల పట్ల వ్యవహారం అందుకు విరుద్ధంగా ఉంటుంది. "ప్రాపంచిక సుఖభోగాలన్నింటినీ మీరు అనుభవించేశారు. ప్రయోజనమంతా అక్కడే పొందారు" అని వారితో అనబడుతుంది.

30. వారికి విధించబడే శిక్షకు ప్రధాన కారణాలు రెండు. ఒకటి : అకారణంగా అహంకారాన్ని, బడాయిని ప్రదర్శించటం. దీని మూలంగానే మనిషి సత్యం ముందు అణకువతో ఉండటానికి విముఖత చూపుతాడు. రెండు: అతిక్రమణా వైఖరి. తత్కారణంగా మానవుడు నిర్భయంగా, అడ్డూ ఆపూ లేకుండా పాపాలు చేస్తూ పోతాడు. తనను నిలదీసే వారెవరూ లేరన్నట్టుగా స్వైరవిహారం చేస్తాడు. ఈ రెండు విషయాలూ అవిశ్వాసులలో కలగలసి ఉంటాయి. కాబట్టి విశ్వాసులు (మోమిన్లు) తమ ప్రవర్తనలో ఈ రెండు దుర్గుణాలు పొడసూపకుండా తగు జాగ్రత్త వహించాలి.

**గమనిక :** దైవప్రవక్త సహచరులకు శ్రేష్ఠమైన ఆహారపదార్థాలు సమర్పించబడినప్పుడు వారిలో కొందరికి ఠక్కున ఈ ఆయతు జ్ఞాపకం వచ్చేది. వారు భయంతో వణకిపోయేవారు. రేపు ప్రళయదినాన ఈ ఆయతులో అనబడిన మాటే తమతో అనబడుతుందేమోనన్న భయంకొద్దీ ఆ శ్రేష్ఠమైన ఆహారపదార్థాలు పుచ్చుకునేవారు కాదు. ఇది వారి పరిపూర్ణ భక్తివిశ్వాసాలకు నిదర్శనం. అంతేగాని వారు శ్రేష్ఠమైన ఆహారపదార్థాలు తీసుకోవటాన్ని అధర్మంగా మాత్రం భావించేవారు కాదు.

31. **'అహ్ఖాఫ్'** (الْاَحْقَافِ) అంటే ఎత్తయిన ఇసుక గుట్టలని అర్థం. కొంతమంది అనువాదకులు దీన్ని కొండలనీ, పర్వతగుహలనీ అనువదించారు. వీళ్లు దైవప్రవక్త హజ్రత్ హూద్ జాతికి చెందినవారు. వీరిని 'ఆదె ఊలా'గా వ్యవహరిస్తారు. ఇది వారి నివాస ప్రదేశం. అది హజర్‌మోత్ (యమన్ దేశం)కు సమీపంలో ఉన్నది. మక్కా అవిశ్వాసుల ధిక్కార వైఖరిని ఎదుర్కొంటున్న అంతిమ దైవప్రవక్త (స)కు ఓదార్పుగా ఇక్కడ గత ప్రవక్తల గాథలు ప్రస్తావించబడ్డాయి.

32. **'మహానాడు'** (يَوْمٍ عَظِيْمٍ) అంటే ప్రళయదినం అన్నమాట. ఆ దినపు భయానక దృశ్యాల కారణంగా దాన్నొక మహానాడుగా, విపత్కర దినంగా పేర్కొనటం జరిగింది.

23 (హూద్) ఇలా అన్నాడు: "(దాని) జ్ఞానం అల్లాహ్ వద్దనే ఉంది. నేను మట్టుకు నాకిచ్చి పంపబడిన సందేశాన్ని మీకు అందజేస్తున్నాను.[34] కాని మీరు మాత్రం మూర్ఖజనంగా కనబడు తున్నారు."[35]

قَالَ إِنَّمَا الْعِلْمُ عِندَ اللَّهِ وَأُبَلِّغُكُم مَّا أُرْسِلْتُ بِهِ وَلَٰكِنِّي أَرَاكُمْ قَوْمًا تَجْهَلُونَ ﴿٢٣﴾

24 మరి వాళ్లు ఆ విపత్తును కారు మేఘం రూపంలో తమ లోయల వైపునకు రావటం చూసి, "ఇది మాపై వర్షాన్ని కురిపించే మబ్బుతునక"[36] అని చెప్పుకోసాగారు. కాదు, నిజానికది మీరు తొందరపెట్టిన (విపత్కర) మేఘం.[37] అదొక పెనుగాలి. అందులో వ్యధాభరితమైన శిక్ష ఉంది.[38]

فَلَمَّا رَأَوْهُ عَارِضًا مُّسْتَقْبِلَ أَوْدِيَتِهِمْ قَالُوا هَٰذَا عَارِضٌ مُّمْطِرُنَا ۚ بَلْ هُوَ مَا اسْتَعْجَلْتُم بِهِ ۖ رِيحٌ فِيهَا عَذَابٌ أَلِيمٌ ﴿٢٤﴾

33. అంటే మా దేవీదేవతల పూజ నుంచి మమ్మల్ని ఆపటానికి, మాన్పించడానికి వచ్చావా?!

34. **'ఆ శిక్ష ఎప్పుడు?'** అన్నది నాకు తెలీదు. ఆ విషయం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఆయన తన ప్రణాళిక ననుసరించి ఆ వ్యవహారాన్ని నిర్ణయిస్తాడు. నా బాధ్యతల్లా నాకప్పగించబడిన విషయాన్ని మీకు చేరవేయటం వరకే.

35. ఒకవైపున మీరు మీ అవిశ్వాస వైఖరిపై మొండికేయటమే గాకుండా, నా అధీనంలో లేని దానికోసం పదే పదే డిమాండు చేస్తున్నారు.

36. అప్పటికే చాలా కాలం నుంచి అక్కడ వర్షాలు లేవు. అలాంటిది ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు క్రమ్ముకునేసరికి వారంతా ఆనందంతో ఎగిరి గంతేశారు. తమపై తొలకరి జల్లు పడబోతోందని అనుకున్నారు. మేఘాలు ఆకాశంలో విస్తరించి ఉంటాయి కనుక వాటిని **'ఆరిజ్'** (عَارِضٌ) అని అనటం జరిగింది.

37. అప్పుడు దైవప్రవక్త హూద్ (అలైహి) తన జాతివారినుద్దేశించి, "సంబరపడకండి. మీరంతా అనుకుంటున్నట్లుగా అది కారుణ్య మేఘం కానేకాదు. అది ఘోరకలిని సృష్టించే మబ్బుతునక! ఇంతకాలంగా మీరు తెగ హడావిడి చేసిన శిక్షా సంకేతం!!" అని హెచ్చరించారు.

38. ఆ పెనుగాలి ద్వారానే ఆద్ జాతి ఎడాపెడా ఊపివేయబడింది. దైవప్రణాళిక ననుసరించి ఆ భయంకరమైన గాలి సర్వస్వాన్నీ తుడిచిపెట్టేసింది. అందుకే హదీసులో ఇలా అనబడింది – హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దైవప్రవక్త (స)నుద్దేశించి, "జనులేమో మేఘాలను చూసినప్పుడు – వర్షం కురవబోతోందని – ఆనందంతో పరవశించి పోతుంటారాయె. కాని తమరి ముఖారవిందంపై ఆందోళనా ఛాయలు తొంగి చూస్తాయేమిటి?" అని ప్రశ్నించగా, "ఆయిషా! ఆ మేఘాలలో ఆపద లేదన్న గ్యారంటీ ఏముంది?! ఒకానొక జాతి ఈ పెనుగాలి ద్వారానే సర్వనాశనం చేయబడింది. ఆ జాతి వారు కూడా (ఇలాగే) ఆ మేఘాన్ని చూసి, 'ఇది మాపై వర్షించే మేఘం' అని మురిసిపోయారు" అని సమాధానమిచ్చారు (బుఖారీ – అల్ అహ్ఖాఫ్ సూరా వ్యాఖ్యానం; ముస్లిం–కితాబ్ సలాతుల్ ఇస్తిస్ఖా...) వేరొక ఉల్లేఖనం ప్రకారం గాలులు తీవ్రంగా వీస్తున్నప్పుడు మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా వేడుకునేవారు: **"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక ఖైరహా. వ ఖైర మాఫీహా, వ ఖైర మా ఉర్సిలత్ బిహీ, వ అవూజుబిక మిన్ షర్రిహా వ షర్రి మా ఉర్సిలత్ బిహీ."** (ఓ అల్లాహ్! నేను దీని మంచిని, దీనిలో ఉన్న మంచిని కోరుకుంటున్నాను. ఏ మంచితోపాటు ఇది పంపబడిందో దాన్ని కోరుకుంటున్నాను. ఇంకా నేను దాని కీడు నుండి, ఏ కీడుతో పాటు అది పంపబడిందో దాని నుండి నేను నీ శరణు వేడుకుంటున్నాను). ఆకాశంలో కారుమబ్బులు క్రమ్ముకున్నప్పుడు ఆయన (స) ముఖకవళికలు కూడా మారిపోయేవి. ఒకలాంటి భయోత్పాతం ఆయన (స)పై ఆవరించేది. ఆయన వ్యాకులతకు లోనయ్యేవారు. ఒక్కోసారి బయటకు వచ్చేసేవారు. ఒక్కోసారి లోపలికి వెళ్ళేవారు. కొన్నిసార్లు ముందుకు పోయేవారు, కొన్నిసార్లు వెనక్కి తగ్గేవారు. వర్షం తగ్గాక ఆయన (స) మనసు కుదుటపడేది (సహీహ్ ముస్లిం – కితాబ్ సలాతుల్ ఇస్తిస్ఖా).

**25** తన ప్రభువు ఆజ్ఞపై అది సర్వాన్నీ తుడిచిపెట్టేస్తుంది. అంతే! తెల్లవారేసరికి వారి నివాస గృహాలు తప్ప మరేమీ కనిపించ లేదు.[39] అపరాధ జనులను మేము ఇలాగే దండిస్తాము.

تُدَمِّرُ كُلَّ شَيْءٍۭ بِأَمْرِ رَبِّهَا فَأَصْبَحُوا لَا يُرَىٰٓ
إِلَّا مَسَٰكِنُهُمْ ۚ كَذَٰلِكَ نَجْزِى ٱلْقَوْمَ
ٱلْمُجْرِمِينَ ﴿٢٥﴾

**26** నిశ్చయంగా మేము వారికి (ఆదు జాతి వారికి), మీకు సయితం ఇవ్వని ఎన్నో శక్తియుక్తులను ఇచ్చాము. మేము వారికి చెవులను, కళ్లను, హృదయాలను కూడా ప్రసాదించాము. కాని వారు అల్లాహ్ వాక్యాలను త్రోసిపుచ్చినప్పుడు వారి చెవులుగానీ, కళ్లుగానీ, వారి హృదయాలుగానీ వారికేవిధంగానూ ఉపకరించ లేదు.[40] వారు దేన్ని గురించి ఎగతాళి చేసేవారో చివరకు అదే వారిని చుట్టుముట్టింది.[41]

وَلَقَدْ مَكَّنَّٰهُمْ فِيمَآ إِن مَّكَّنَّٰكُمْ فِيهِ وَجَعَلْنَا لَهُمْ
سَمْعًا وَأَبْصَٰرًا وَأَفْـِٔدَةً فَمَآ أَغْنَىٰ عَنْهُمْ
سَمْعُهُمْ وَلَآ أَبْصَٰرُهُمْ وَلَآ أَفْـِٔدَتُهُم مِّن شَيْءٍ
إِذْ كَانُوا يَجْحَدُونَ بِـَٔايَٰتِ ٱللَّهِ وَحَاقَ بِهِم
مَّا كَانُوا بِهِۦ يَسْتَهْزِءُونَ ﴿٢٦﴾

**27** మీ చుట్టుప్రక్కల ఉండే ఎన్నో జనవాసాలను మేము తుడిచి పెట్టేశాము.[42] వారు దారికి వస్తారేమోనన్న ఉద్దేశంతో మేము రకరకాలుగా మా సూచనలను వారికి వివరించాము.[43]

وَلَقَدْ أَهْلَكْنَا مَا حَوْلَكُم مِّنَ ٱلْقُرَىٰ وَصَرَّفْنَا
ٱلْءَايَٰتِ لَعَلَّهُمْ يَرْجِعُونَ ﴿٢٧﴾

**28** దైవ సామీప్యం పొందటానికి వారు – అల్లాహ్ను వదలి– ఆశ్రయించిన దేముళ్లు వారినెందుకు ఆదుకోలేదు? పైగా వారు వీళ్లకు అస్సలు కనబడకుండా పోయారు. (నిజానికి) అది వారి అసత్యం, వారు కల్పించుకున్న అభూతకల్పన మాత్రమే.[44]

فَلَوْلَا نَصَرَهُمُ ٱلَّذِينَ ٱتَّخَذُوا مِن دُونِ ٱللَّهِ
قُرْبَانًا ءَالِهَةًۢ ۖ بَلْ ضَلُّوا عَنْهُمْ ۚ وَذَٰلِكَ إِفْكُهُمْ
وَمَا كَانُوا يَفْتَرُونَ ﴿٢٨﴾

39. అంటే గృహవాసులంతా అంతమైపోయారు. గృహాలు మాత్రం మిగిలాయి – భావి తరాల వారికి గుణపాఠ సూచకంగా!

40. మక్కా వారినుద్దేశించి చెప్పబడిన మాటలివి. మీరేపాటి? మీకు మునుపు మీకన్నా ఘనాపాటిగా ఉన్న జాతినే మేము మట్టుపెట్టేశాము. దైవప్రసాదితమైన శక్తులను (కళ్లు, చెవులు, హృదయాలు) వారు దుర్వినియోగపరచిన కారణంగా మేము వారిపై దంచివేసే ఆపదను తెచ్చాము. అప్పుడు వారి ప్రజ్ఞాపాటవాలుగానీ, వారి శక్తులు, సామర్థ్యాలుగాని వారిని ఆదుకోలేకపోయాయి.

41. ఏ విపత్కర సందర్భాన్ని వారు 'అసంభవం' అనుకుని వేళాకోళం చేసేవారో అది రానే వచ్చింది. వస్తూ వస్తూనే ఘోరకలిని సృష్టించింది. దాన్నుంచి బ్రతికి బట్టకట్టే మార్గాంతరమే వారికి లేకపోయింది.

42. చుట్టుప్రక్కల ఉండే జనవాసాలంటే ఆద్, సమూద్, లూత్ జాతివారి బస్తీలు. అవి హిజాజ్ క్షేత్రానికి ఎంతో దూరంలో లేవు. యమన్, పాలస్తీనా, సిరియా రాజ్యాలకు – వర్తకం నిమిత్తం – వస్తూపోతూ శిథిలావస్థలో ఉన్న ఆ పట్టణాలను వారు చూసేవారు.

43. అంటే – మేము పలు విధాలుగా వారికి మా నిదర్శనాలను చూపించాము. ఆ విధంగానయినా వారు సత్యాన్ని గ్రహించి క్షమాపణ కోరుకుంటారేమోనని ఆశించాము. కాని వారిలో ఎలాంటి పరివర్తనా రాలేదు.

44. ఏ ఏ దేముళ్లను వారు ఆశ్రయించి, కష్టకాలంలో వారు తమను కాపాడతారని, దైవసామీప్యం పొందటానికి దోహద పడతారని తలపోశారో వారెవరూ అవసరానికి వారిని ఆదుకోలేదు. పైగా వారంతా – అక్కరకు రావలసిన క్షణాల్లోనే–

وَاِذْ صَرَفْنَآ اِلَيْكَ نَفَرًا مِّنَ الْجِنِّ يَسْتَمِعُوْنَ الْقُرْاٰنَ ۚ فَلَمَّا حَضَرُوْهُ قَالُوْٓا اَنْصِتُوْا ۚ فَلَمَّا قُضِيَ وَلَّوْا اِلٰى قَوْمِهِمْ مُّنْذِرِيْنَ ﴿٢٩﴾

**29** (ఓ ప్రవక్తా!) జిన్నుల సమూహం ఒకదానిని మేము ఖుర్‌ఆన్ వినేందుకు నీ వైపునకు పంపిన సంగతిని కాస్త మననం చేసుకో. వారు ప్రవక్త దగ్గరకు చేరుకున్నప్పుడు, "నిశ్శబ్దంగా వినండి"[45] అని (పరస్పరం) చెప్పుకున్నారు. మరి ఆ పారాయణం ముగియగానే,[46] తమ వర్గం వారిని హెచ్చరించటానికి వాళ్ల వద్దకు తిరిగి వచ్చారు.

قَالُوْا يٰقَوْمَنَآ اِنَّا سَمِعْنَا كِتٰبًا اُنْزِلَ مِنْۢ بَعْدِ مُوْسٰى مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ يَهْدِيْٓ اِلَى الْحَقِّ وَاِلٰى طَرِيْقٍ مُّسْتَقِيْمٍ ﴿٣٠﴾

**30** వారిలా అన్నారు : "ఓ మా జాతివారలారా! మూసా తరువాత అవతరింపజేయబడిన గ్రంథాన్ని మేము విన్నాము. అది తనకు పూర్వం ఉన్న దైవగ్రంథాలన్నింటినీ ధృవీకరిస్తోంది. ఇంకా – అది సత్యధర్మం వైపునకు, తిన్నని దారి వైపునకూ దర్శకత్వం వహిస్తోంది.

يٰقَوْمَنَآ اَجِيْبُوْا دَاعِيَ اللّٰهِ وَاٰمِنُوْا بِهٖ يَغْفِرْ لَكُمْ مِّنْ ذُنُوْبِكُمْ وَيُجِرْكُمْ مِّنْ عَذَابٍ اَلِيْمٍ ﴿٣١﴾

**31** "ఓ మా జాతివారలారా! అల్లాహ్ వైపునకు పిలిచేవాని మాట వినండి. అతన్ని విశ్వసించండి.[47] అల్లాహ్ మీ పాపాలను మన్నిస్తాడు. బాధాకరమైన శిక్ష నుండి మిమ్మల్ని రక్షిస్తాడు.[48]

కనుమరుగై పోయారు. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే మక్కాకు చెందిన ముష్రిక్కులు ఈ విగ్రహాలను 'దైవం'గా భావించేవారు కాదు. అయితే అవి తమను దైవసామీప్యానికి చేర్చటంలో కీలకపాత్ర పోషిస్తాయని గట్టిగా నమ్మేవారు. ఈ రకమయిన సాధనాన్ని (వసీలాను) అల్లాహ్ ఒక మిథ్యగా, ఒక స్వీయ కల్పనగా ఖరారుచేశాడు. దాన్ని అక్రమంగా, అధర్మంగా కూడా పేర్కొన్నాడు.

45. సహీహ్ ముస్లిం ఉల్లేఖనం ప్రకారం తెలిసేదేమిటంటే ఈ సంఘటన మక్కాకు సమీపంలో ఉన్న **'నఖలా'** లోయవద్ద దైవప్రవక్త (సఅసం) ఫజ్ర్ నమాజ్ చేయిస్తుండగా జరిగింది. అప్పటికే జిన్నుల వర్గాలెన్నో గగనతలంలో ఏర్పడిన అసాధారణ పరిస్థితికి కారణాలేమిటో తెలుసుకునేందుకు తిరుగుతున్నాయి. ఎందుకంటే జిన్నుల వర్గం తరచూ ఆకాశాలలోకి వెళ్ళి ఏదైనా కీలక సమాచారం దొరకబుచ్చుకునేందుకు తిప్పలు పడేది. కాని ఈ మధ్య అవి ఊర్ధ్వలోకాల్లో సంచరించటం గగనమైపోయింది. దాంతో ఏదో అసాధారణ పరిస్థితి ఏర్పడిందని, భువిలో ముఖ్యమైన పరిణామం ఏదో జరిగిందని అనుమానించాయి. అదేమిటో తెలుసుకునే తాపత్రయంతోనే నేల నాలుగు చెరగులా గాలించేవి. ఒకానొక రోజు తెల్లవారుజామున ఒక జిన్నుల సమూహం దైవప్రవక్త (స) నోట ఖుర్‌ఆన్ వాణిని విని అప్పుడర్థం చేసుకొంది – గగనతలంలోని అత్యవసర స్థితికి అసలు కారణం ఏమిటో! దివ్య ఖుర్‌ఆన్‌ను వినగానే జిన్నుల ఆ సమూహం దైవప్రవక్త (స)ను విశ్వసించింది. అది తన జన సమూహంలోకి వెళ్ళి జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించింది. ఇస్లాంను స్వీకరించమని తమ వాళ్ళను కోరింది (ముస్లిం – కితాబుస్సలాత్. సహీహ్ బుఖారీలో కూడా కొన్ని విషయాలు ప్రస్తావనకు వచ్చాయి). మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం జిన్నుల ఆహ్వానంపై దైవప్రవక్త (సఅసం) ఆ వర్గం వద్దకు వెళ్ళి దైవసందేశం అందజేశారు. జిన్నుల బృందం కూడా పలుమార్లు ఆయన (స) దగ్గరకు వచ్చి ధర్మసందేహాలు నివృత్తి చేసుకునేది (ఫత్‌హుల్ బారీ, తఫ్సీర్ ఇబ్నె కసీర్).

46. అంటే, దైవప్రవక్త (సఅసం) తరఫున ఖుర్‌ఆన్ పఠనం పూర్తి కాగానే....

47. అంటే, అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని విశ్వసించమని జిన్నుల ఆ సమూహం తన జాతివారిని కోరింది. అంతకుముందు దివ్య ఖుర్‌ఆన్ గురించి వారు తమ జాతి వారికి పరిచయం చేశారు.

وَمَنْ لَّا يُجِبْ دَاعِيَ اللّٰهِ فَلَيْسَ بِمُعْجِزٍ فِي الْاَرْضِ وَلَيْسَ لَهٗ مِنْ دُوْنِهٖۤ اَوْلِيَآءُ ؕ اُولٰٓئِكَ فِيْ ضَلٰلٍ مُّبِيْنٍ ﴿32﴾

**32** "అల్లాహ్‌వైపు పిలిచేవాని మాట విననివాడు భూమిలో ఎక్కడా (పారిపోయి అల్లాహ్‌ను) అలుపుకు గురిచేయలేడు.[49] అల్లాహ్ తప్ప అతనికి సాయపడేవారు కూడా ఎవరూ ఉండరు.[50] ఇలాంటి వారు స్పష్టమైన మార్గభ్రష్టతకు లోనై ఉన్నారు."

اَوَلَمْ يَرَوْا اَنَّ اللّٰهَ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَلَمْ يَعْيَ بِخَلْقِهِنَّ بِقٰدِرٍ عَلٰۤى اَنْ يُّحْيِۦَ الْمَوْتٰى ؕ بَلٰۤى اِنَّهٗ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ﴿33﴾

**33** ఏమిటి, భూమ్యాకాశాలను సృష్టించిన అల్లాహ్, వాటిని సృష్టించటంలో ఏ విధంగానయితే అలసిపోలేదో అదే విధంగా ఆయన మృతులను తిరిగి బ్రతికించగలడని వారు చూడటం లేదా? అవును, ఆయన ప్రతిదీ చేయగల అధికారం కలవాడు.[51]

وَيَوْمَ يُعْرَضُ الَّذِيْنَ كَفَرُوْا عَلَى النَّارِ ؕ اَلَيْسَ هٰذَا بِالْحَقِّ ؕ قَالُوْا بَلٰى وَرَبِّنَا ؕ قَالَ فَذُوْقُوا الْعَذَابَ بِمَا كُنْتُمْ تَكْفُرُوْنَ ﴿34﴾

**34** అవిశ్వాసులు నరకం వద్దకు తేబడిన రోజున, "ఏమిటి, ఇది సత్యం కాదా?!" (అని వారిని ప్రశ్నించటం జరుగుతుంది). "అవును. మా ప్రభువు సాక్షిగా! (ఇది సత్యమే" అని వారి నుంచి సమాధానం వస్తుంది).[52] "సరే! ఇప్పుడు మీ తిరస్కార వైఖరికి బదులుగా శిక్షను చవిచూడండి"[53] అనంటాడు (అల్లాహ్).

48. 'విశ్వాసం' వల్ల పరలోకంలో కలిగే మేళ్లు ఇక్కడ చెప్పబడ్డాయి. **'మిన్ జునూబికుమ్'** (مِّنْ ذُنُوْبِكُمْ) అంటే దేవుడు కొన్ని పాపాలను మన్నిస్తాడు. అవి దేవుని హక్కులకు సంబంధించినవి. దాసుల హక్కులు మాత్రం క్షమించబడవు. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే ధర్మాధర్మాలు, పాపపుణ్యాల విషయంలో మనుషులకు వర్తించే ఆజ్ఞలే జిన్నులకు కూడా వర్తిస్తాయి.

మరయితే దేవుడు జిన్నుల వర్గంలో కూడా ప్రవక్తలను ప్రభవింపజేశాడా? లేదా? అన్న విషయంలో పండితుల మధ్య అభిప్రాయభేదం ఉంది. దివ్య ఖుర్ఆన్ వచనాల ప్రకారం చూస్తే దైవప్రవక్తలు జిన్నుల నుంచి రాలేదని, మానవ సముదాయాలలో నుంచి మాత్రమే దైవప్రవక్తలు ఎన్నుకోబడ్డారని అర్థమవుతుంది. ఉదాహరణకు :

1. "(ఓ ప్రవక్తా!) నీకు పూర్వం కూడా మేము మానవమాత్రులనే (పురుషులనే) ప్రవక్తలుగా పంపిస్తూ వచ్చాము. వారివద్దకు సందేశాన్ని పంపేవారము" (అన్ నహ్ల్ – 43).

2. "మేము నీకు మునుపు పంపిన ప్రవక్తలంతా భోజనం కూడా చేసేవారు, అంగడులలో కూడా సంచరించేవారు" (ఫుర్ఖాన్ – 20).

పై ఆయతుల ద్వారా బోధపడేదేమిటంటే దేవుని తరఫున పంపబడిన ప్రవక్తలందరూ మానవమాత్రులే. అందుకే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారు మానవకోటి కోసం ఎలా ప్రవక్తగా ఉండేవారో అలాగే జిన్నుల సమూహం కోసం కూడా ప్రవక్తగా ఉండేవారు. జిన్నుల వరకూ దైవసందేశాన్ని అందజేసే బాధ్యత ఆయనపై మోపబడిందని ఖుర్ఆన్ హదీసుల ద్వారా విదితమవుతోంది.

49. అంటే – వారు భూమిలో దూరప్రాంతాలకు పారిపోయినంత మాత్రాన అల్లాహ్‌కు పట్టుబడకుండా ఉండరు.

50. అంటే దేవుడు విధించే శిక్షనుంచి వారతన్ని కాపాడలేరు. వారు స్వయంగానూ దేవుని పట్టునుంచి తప్పించుకోలేరు. ఇతరులను కూడా తప్పించలేరు.

51. ఇక్కడ **'చూడటం'** అంటే మనోనేత్రంతో వీక్షించటం, ఆలోచించటం, ఊహించటం అని భావం. అంటే భూమ్యాకాశాలంతటి సువిశాల సృష్టికి మూలకారకుడైన దేవుడు, ఈ అపూర్వ సృష్టిలో అలుపూ సలుపూ ఎరుగనివాడు

فَاصْبِرْ كَمَا صَبَرَ أُولُوا الْعَزْمِ مِنَ الرُّسُلِ وَلَا تَسْتَعْجِل لَّهُمْ كَأَنَّهُمْ يَوْمَ يَرَوْنَ مَا يُوعَدُونَ لَمْ يَلْبَثُوا إِلَّا سَاعَةً مِّن نَّهَارٍ بَلَاغٌ فَهَلْ يُهْلَكُ إِلَّا الْقَوْمُ الْفَاسِقُونَ ﴿٣٥﴾

**35** కనుక (ఓ ప్రవక్తా!) సాహసమూర్తులైన ప్రవక్తలు ఓపిక పట్టినట్లే నువ్వు కూడా ఓపిక పట్టు. వారి విషయంలో (శిక్ష కోసం) తొందరపెట్టకు.[54] వారికి వాగ్దానం చేయబడుతున్న దానిని (శిక్షను) వారు కళ్ళారా చూసుకున్నప్పుడు, తాము (మహా అంటే) ఒక దినములోని ఒక గడియ మాత్రమే (ప్రపంచంలో) ఉండి ఉంటామని వారికి అనిపిస్తుంది.[55] ఇదీ (నీవు అందజేయవలసిన) సందేశం![56] ఇక అవిధేయులు మాత్రమే సర్వనాశనం చేయబడ తారు.[57]

మృతులను తిరిగి బ్రతికించలేడా? ఈ మాత్రం విషయం వారి బుర్రకు ఎక్కటం లేదా? ముమ్మాటికీ ఆయన బ్రతికించగలడు. ఎందుకంటే ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ లేదు.

52. వారు కేవలం ఒప్పుకోవటమేకాదు, దేవునిపై ప్రమాణంచేసి మరీ దాన్ని సత్యమని ధృవీకరిస్తారు. కాని ఆ సమయంలో వారి 'ఒప్పుకోలు' వారికేవిధంగానూ ఉపకరించదు. ఎందుకంటే ఒక విషయాన్ని కళ్లారా చూసిన మీదట ధృవీకరించటం గొప్పేమీ కాదు. కళ్లతో వీక్షించిన తరువాత ఎవరయినా ఒప్పుకోక ఏం చేస్తారు? కాదంటారా ఏమిటి? చూడకుండానే ఒప్పుకుని ఉంటే ఆ ఒప్పుకోలు వారికి పనికివచ్చేది.

53. ఎందుకంటే మీరు ఒప్పుకోవలసిన క్షణంలో ఒప్పుకోలేదు. ఆనాటి మీ తిరస్కార వైఖరి పర్యవసానమే ఈ నరకయాతన. కాబట్టి అనుభవించండి.

54. మక్కా అవిశ్వాసుల కరకు వైఖరికి ప్రతిగా ఇక్కడ మహనీయ ముహమ్మద్ (సఅసం)ను ఓదార్చటం జరిగింది. ధైర్యం చెప్పటం జరిగింది. సహనంతో వ్యవహరించమని ఉపదేశించటం జరిగింది.

55. ప్రళయదినపు భయంకర దృశ్యాలను చూసినప్పుడు వారికి ఇలా అనిపిస్తుంది.

56. అంటే (ఓ ముహమ్మద్!) ఈ సందేశాన్ని అందజేయటం వరకే నీ బాధ్యత. మిగతాదంతా నాకు వదలిపెట్టు అని దేవుడు తన ప్రవక్తతో అంటున్నాడు.

57. ఈ చివరి వాక్యంలో కూడా విశ్వాసులకు శుభవార్త ఉంది. కాగా; ఈ వాక్యం అవిశ్వాసులకు, అవిధేయులకు, పాపాత్ములకు ఒక హెచ్చరిక అన్నమాట!

47వ సూరా

# ముహమ్మద్

## దైవప్రవక్త ముహమ్మద్ (స)

అవతరణ మదీనాలో

ఆయతులు 38

### పరిచయం

కొత్తగా ఏర్పడిన బలహీనమైన ముస్లింరాజ్యంలో పౌరులకు బలమైన నైతిక, సామాజిక ఆచారాలు నేర్పడం ఈ సూరాలో ప్రధానంగా కనబడుతుంది. ఈ సూరాలోని 2వ ఆయత్‌లో ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రస్తావన వచ్చింది. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) దేవుని చిట్టచివరి ప్రవక్త అనీ, ఆయన సత్యాన్ని తీసుకువచ్చారని, ఆయన సందేశం మానవాళిని రుజుమార్గంపై నడుపుతుందని ఈ సూరా స్పష్టం చేసింది.

విశ్వాసాన్ని, స్వేచ్ఛను కాపాడుకోవడానికి, అల్లాహ్ మార్గంలో పోరాడడం, త్యాగాలు చేయడం, దానధర్మాలు చేయడం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. అల్లాహ్ ధర్మం కోసం అసత్యానికి ఒడిగట్టిన వారితో పోరాడాలని ఈ సూరా చెప్పింది. విశ్వాసులకు దేవుని సహాయం, విజయం లభిస్తాయని ఈ సూరా హామీ ఇచ్చింది. పరలోకంలో విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయన్న హామీ కూడా ఈ సూరాలో ఇవ్వడం జరిగింది. ఆ స్వర్గవనాల్లో సెలయేర్లు ఉంటాయి. ఆ జలాలు ఎన్నడూ కలుషితం కావు. పాలనదులు ఉంటాయి. వాటి రుచి ఎన్నడూ మారదు. తేనె నదులు, మద్యం నదులు ప్రవహిస్తుంటాయి. అక్కడ అన్ని రకాల ఫలాలు లభిస్తాయి. దేవుని క్షమాభిక్ష ప్రాప్తమవుతుంది.

ఇందులో విశ్వాసులకు, అవిశ్వాసులకు సంబంధించిన భేదాన్ని కూడా ఉదాహరణ పూర్వకంగా చెప్పడం జరిగింది. విశ్వాసులు స్వర్గవనాలను, దేవుని కారుణ్యాన్ని పొందడానికి అల్లాహ్‌ను ఆరాధిస్తారు. కాని అవిశ్వాసులు తమ మనోకాంక్షలను మాత్రమే ఆరాధిస్తారు. చివరకు నరకాగ్నికి చేరుకుంటారు. వారు ప్రపంచంలోనే తమ జీవితాన్ని అనుభవిస్తారు. జంతువుల మాదిరిగా తింటారు.

సత్యాన్ని తిరస్కరించి నాశనమైన గత జాతులకు పట్టిన గతిని కూడా అవిశ్వాసులకు గుర్తుచేయడం జరిగింది. అంతేకాదు, ఈ సూరాలో కపట విశ్వాసం కలిగిన వారి గురించిన ప్రస్తావన కూడా వచ్చింది. కపట విశ్వాసులు అన్యమనస్కంగా ఇస్లాంను అనుసరిస్తారు. ఎల్లప్పుడూ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ ఉంటారు. వారు ముస్లిములుగా నటిస్తూ ఉంటారు. ఇస్లామ్‌ను నాశనం చేయడానికి కుట్రలు పన్నుతూ ఉంటారు. వారి హృదయాల్లో చెడు తిష్టవేసుకుని ఉంది. వారి మాట, వారి నడవడి వారిని భ్రష్టు పట్టిస్తుంటాయి.

## ముహమ్మద్◆ సూరా

## سُوْرَةُ مُحَمَّدٍ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** ఎవరయితే తిరస్కార వైఖరిని అవలంబించి, (ప్రజలను) అల్లాహ్ మార్గంలో పోకుండా ఆపారో[1] వారి కర్మలను అల్లాహ్ వృధా చేసేశాడు.[2]

اَلَّذِيْنَ كَفَرُوْا وَصَدُّوْا عَنْ سَبِيْلِ اللّٰهِ اَضَلَّ اَعْمَالَهُمْ ①

**2** మరెవరయితే విశ్వసించి, సత్కార్యాలు చేశారో, ముహమ్మద్ (స)పై అవతరింపజేయబడిన దానిని కూడా విశ్వసించారో[3] – యదార్థానికి తమ ప్రభువు తరఫునుంచి వచ్చిన సత్యం అదేను– అల్లాహ్ వారి పాపాలను వారి నుంచి దూరం చేశాడు.[4] వారి పరిస్థితిని చక్కదిద్దాడు.[5]

وَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ وَاٰمَنُوْا بِمَا نُزِّلَ عَلٰى مُحَمَّدٍ وَّهُوَ الْحَقُّ مِنْ رَّبِّهِمْ ۙ كَفَّرَ عَنْهُمْ سَيِّاٰتِهِمْ وَاَصْلَحَ بَالَهُمْ ②

◆ ఈ సూరాకు గల మరో పేరు 'అల్ ఖితాల్' (యుద్ధం).

1. ఇంతకీ ఈ తిరస్కారులు ఎవరు? వీళ్లు మక్కా అవిశ్వాసులని కొందరు భావించగా, గ్రంథం కల ప్రజలని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. కాని ఈ పదం సర్వ సామాన్యమైనది. అల్లాహ్‌ను కాదన్నవారంతా ఈ కోవలోకి వస్తారు.

2. ఈ వాక్యానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి : దైవప్రవక్త (సఅసం)కు వ్యతిరేకంగా కుట్రలు పన్నిన వారందరి కుట్రలను అల్లాహ్ తిప్పికొట్టాడు. వాటి దుష్ఫలితాలను వాళ్ల నెత్తిమీదే రుద్దాడు. రెండు : ఈ తిరస్కారులలో కొంతమంది మంచివారు, దయార్ద్రహృదయులు కూడా ఉండేవారు. ఉదాహరణకు : బంధువుల హక్కును ఇవ్వటం, ఖైదీల విడుదలకు ప్రయత్నించటం, అతిథి మర్యాద చేయటం, కాబా గృహానికి సేవలందించటం, హజ్ యాత్రకు వచ్చిన వారికి సేవలు చేయటం – ఇవన్నీ చాలా గొప్ప పనులే. కాని ఈ సత్కార్యాలకుగాను వారికి పరలోకంలో ఎలాంటి పుణ్యఫలం ప్రాప్తించదు. ఎందుకంటే విశ్వాసం (ఈమాన్) లేని సత్కర్మలు నిష్ఫలం, నిరర్థకం.

3. ముహమ్మద్ (సఅసం)పై అవతరించిన దైవవాణిని – అంటే దివ్య ఖుర్‌ఆన్‌ను – విశ్వసించటం కూడా ఈమాన్ (విశ్వాసం)లో అంతర్భాగమే అయినప్పటికీ, దీని ప్రాముఖ్యతను మరింత స్పష్టపరిచే ఉద్దేశంతో అది ప్రత్యేకంగా ప్రస్తావించబడింది.

4. అంటే అల్లాహ్‌ను విశ్వసించకముందు చేసిన తప్పిదాలు, పొరపాట్లు క్షమిస్తాడు. "ఇస్లాం తనకు పూర్వమున్న పాపాలన్నింటినీ తుడిచిపెట్టేస్తుంది" అన్న ప్రవక్త (స) వారి ప్రవచనం ఈ సందర్భంగా గుర్తుంచుకోదగినది. (సహీహ్ అల్ జామె అస్ సగీర్ – అల్‌బానీ).

5. అంటే వారిని దుర్మార్గం నుంచి కాపాడి సన్మార్గాన నడిపించాడు. ఒక విశ్వాసి పాలిట అత్యంత గొప్ప సంస్కరణ, దిద్దుబాటు ఇదే. సిరిసంపదల ద్వారా దేవుడు వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాడన్న భావం సరైనది కాదు. ఎందుకంటే ప్రతి విశ్వాసికి 'సిరి' లభించదు. అదలావుంచితే కేవలం ప్రాపంచిక సిరిసంపదలొక్కటే మెరుగైన స్థితికి ప్రతీక కావు. పైగా ఈ సిరిసంపదలు ఒక్కోసారి కలతలకు, కల్మషాలకు కారణభూతమవుతుంటాయి. అందుకే అంతిమ దైవప్రవక్త (స) వారు ఇబ్బడి ముబ్బడిగా వచ్చిపడే 'సిరి'ని ఇష్టపడలేదు.

ذٰلِكَ بِاَنَّ الَّذِيْنَ كَفَرُوا اتَّبَعُوا الْبَاطِلَ وَاَنَّ الَّذِيْنَ
اٰمَنُوا اتَّبَعُوا الْحَقَّ مِنْ رَّبِّهِمْ ؕ كَذٰلِكَ يَضْرِبُ
اللّٰهُ لِلنَّاسِ اَمْثَالَهُمْ ③

3 ఇలా ఎందుకు జరిగిందంటే[6] అల్లాహ్‌ను తిరస్కరించిన వారు అసత్యాన్ని అనుసరించగా, విశ్వాసులేమో తమ ప్రభువు నుండి వచ్చిన సత్యాన్ని అనుసరించారు. ఇలాగే అల్లాహ్ మానవులకు వారి స్థితిగతులను తెలియపరుస్తాడు.[7]

فَاِذَا لَقِيْتُمُ الَّذِيْنَ كَفَرُوْا فَضَرْبَ الرِّقَابِ ؕ حَتّٰۤى
اِذَاۤ اَثْخَنْتُمُوْهُمْ فَشُدُّوا الْوَثَاقَ ۙ فَاِمَّا مَنًّا بَعْدُ
وَاِمَّا فِدَآءً حَتّٰى تَضَعَ الْحَرْبُ اَوْزَارَهَا ۛ ۚ ذٰلِكَ ۛ ؕ
وَلَوْ يَشَآءُ اللّٰهُ لَانْتَصَرَ مِنْهُمْ ۙ وَلٰكِنْ لِّيَبْلُوَا

4 మరి మీరు అవిశ్వాసులను (రణ రంగంలో) ఎదుర్కొన్నప్పుడు వారి మెడలపై వ్రేటు వేయండి.[8] వారిని బాగా అణచిన తరువాత గట్టిగా బంధించండి.[9] పిదప మీరు వారిని (పరిహారం తీసుకోకుండా) వదలిపెట్టి మేలు చేసినా లేక పరిహారం పుచ్చుకుని వదలినా (అది మీ ఇష్టం).[10] యుద్ధం ఆయుధాలను పడవేసే దాకా[11] (ఈ పోరు సాగాలి). (ఆజ్ఞాపించబడినది మాత్రం) ఇదే.[12] అల్లాహ్ గనక తలచుకుంటే (స్వయంగా) తానొక్కడే ప్రతీకారం

6. తిరస్కారులకు పట్టిన దుర్గతికి, విశ్వాసుల పురోగతికి ప్రధాన కారణం ఇక్కడ చెప్పబడింది. అసత్యం ఎంత ఆర్భాటం చేసినా చివరకు సత్యమే జయిస్తుంది.

7. తిరస్కారులకు పట్టిన దుర్గతి నుండి ప్రజలు తమను కాపాడుకోవటానికి, సత్యమార్గాన్ని అవలంబించి గొప్ప సాఫల్యం పొందటానికి అల్లాహ్ ఈ స్థితిగతులను ప్రజల ముందుకు తీసుకువస్తుంటాడు.

8. ఇరు వర్గాల ప్రస్తావన అనంతరం ఇప్పుడు అవిశ్వాసులతోనూ, ఒడంబడిక జరగకుండా ఉన్న గ్రంథవహులతోనూ ధర్మయుద్ధం చేయమని ఆదేశించటం జరిగింది. చంపమని చెప్పేబదులు మెడలపై వ్రేటువేయమని చెప్పటం గమనార్హం. దుష్టశిక్షణ, శిష్టరక్షణ విషయంలో ఎలాంటి తడబాటుకు, మమకారానికి తావీయరాదన్న భావం అందులో ఇమిడి ఉంది. (ఫత్‌హుల్ ఖదీర్).

9. అంటే రణరంగంలో శత్రువులను ఓడించే విషయంలో ఏమాత్రం అజాగ్రత్త పనికిరాదు. వారిని చిత్తుచిత్తుగా ఓడించాలి. లొంగిపోయిన శత్రు సైనికులను మాత్రం వెంటనే అదుపులోకి తీసుకోవాలి. వారిని నిర్బంధించటానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

10. **'మన్నన్' (مَنًّا)** : అంటే వారివద్ద ఎలాంటి నష్టపరిహారం పొందకుండానే వదలి వేయటం. అది మేలు చేయటం క్రిందికి వస్తుంది. ఒకవేళ ఆ యుద్ధఖైదీల నుంచి కొంత పరిహారాన్ని తీసుకున్నా తప్పులేదు. ఆయతులో దీన్ని **'ఫిదాఅన్' (فِدَآءً)** గా పేర్కొనటం జరిగింది. పరిస్థితుల స్వరూపాన్నిబట్టి – ఇస్లాం మరియు ముస్లింల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని – ఖైదీల పట్ల వ్యవహారం చేసే స్వేచ్ఛ మీకు ఇవ్వబడింది.

11. అంటే యుద్ధవిరమణ జరిగే వరకూ లేక శత్రువు పరాజయంపాలై మీతో సంధి చేసుకునేవరకూ లేక పీడన అంతమైపోయేవరకూ లేక ఇస్లాం ఆధిక్యత పొందేవరకూ మీరు వెనుకంజవేయకూడదు – ప్రతిఘటన కొనసాగుతూనే ఉండాలి. అయితే ఈ ఆయతు రద్దు అయిందని, చంపటం వినా మరో పరిస్థితి మిగిలిలేదని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు. కాని నిజానికిది రద్దు కాలేదు. పై నాలుగు విషయాలలో దేనినయినా అవలంబించే అధికారం ఆయా కాలాల నాయకులకు ఉంటుంది. అంటే అవిశ్వాసులను హతమార్చినా లేక నిర్బంధించినా లేక ఖైదీలలో కొందరినిగానీ అందరినిగానీ ఊరకే వదలివేసినా, లేక పరిహారం పుచ్చుకుని వదలినా – అది అతని విజ్ఞతపై ఆధారపడి ఉంటుంది (ఫత్‌హుల్ ఖదీర్).

12. అంటే – మీరు అలాగే చేయండి అని భావం.

| | |
|---|---|
| తీర్చుకునేవాడు.[13] కాని మీలో ఒకరిని ఇంకొకరి ద్వారా పరీక్షించాలన్నది ఆయన అభిమతం.[14] అల్లాహ్ మార్గంలో చంపబడిన వారి కర్మలను ఆయన వృధా కానివ్వడు.[15] | بَعْضَكُمْ بِبَعْضٍ ۗ وَالَّذِينَ قُتِلُوا فِي سَبِيلِ اللَّهِ فَلَن يُضِلَّ أَعْمَالَهُمْ ④ |
| **5** ఆయన వారికి సన్మార్గం చూపుతాడు. వారి పరిస్థితిని చక్క దిద్దుతాడు.[16] | سَيَهْدِيهِمْ وَيُصْلِحُ بَالَهُمْ ⑤ |
| **6** వారికి (ముందుగా) తెలిపివున్న స్వర్గంలో ప్రవేశం కల్పిస్తాడు.[17] | وَيُدْخِلُهُمُ الْجَنَّةَ عَرَّفَهَا لَهُمْ ⑥ |
| **7** విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు గనక అల్లాహ్కు సాయం చేస్తే ఆయన మీకు సాయం చేస్తాడు.[18] మీ పాదాలకు నిలకడను ఇస్తాడు.[19] | يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِن تَنصُرُوا اللَّهَ يَنصُرْكُمْ وَيُثَبِّتْ أَقْدَامَكُمْ ⑦ |

13. అల్లాహ్ అవిశ్వాసులను తుదముట్టించి లేక వారిని ఆపదకు లోనుచేసి ఉండేవాడు. మీరు వారితో తలపడవలసిన పరిస్థితి వచ్చేదే కాదు. కాని దేవుడు మీ నిజాయితీని పరికించదలిచాడు.

14. అంటే తన మార్గంలో పోరాడటానికి సిద్ధంగా ఉన్నవారెవరో ఆయన చూడదలిచాడు. వారికి పుణ్యఫలం ప్రసాదించ దలిచాడు. శత్రువులను మట్టి కరిపించిన ఘనతను వారికి ఇవ్వదలిచాడు.

15. అంటే వారికి లభించవలసిన పుణ్యఫలాన్ని సురక్షితంగా ఉంచుతాడు.

16. స్వర్గానికి గొనిపోయే మార్గాన్ని వారికొరకు సులభతరం చేస్తాడు. సత్కార్యాలను ఇతోధికంగా చేసే సద్బుద్ధిని వారికి వొసగుతాడు.

17. ఆనాడు ఈ పుణ్యాత్ములకు ఎవరూ దారి చూపాల్సిన అవసరం ఉండదు. స్వర్గంలో తమ తమ నివాస స్థలాలకు వారు స్వయంగా చేరుకుంటారు. ఒక హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు: "ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ఒక స్వర్గవాసికి ప్రపంచంలో తన ఇంటిదారి తెలిసిన దానికంటే ఎక్కువగానే స్వర్గంలోని తన నివాసమార్గాలు తెలిసి ఉంటాయి" (సహీహ్ బుఖారీ–కితాబుర్రిఖాఖ్).

18. అల్లాహ్కు సాయం చేయటమంటే దైవధర్మ ఉన్నతికి తోడ్పడటమని భావం. ఎందుకంటే ఆయన ఇక్కడి ఒనరులను బట్టి తన ధర్మసేవను తన దాసుల చేతనే చేయించుకుంటాడు. విశ్వాసులైన దైవదాసులు దైవధర్మాన్ని రక్షిస్తారు. దాని పరివ్యాప్తికై కృషిచేస్తారు. అప్పుడు అల్లాహ్ వారికి సహాయపడతాడు. అవిశ్వాసులపై, అసత్యవాదులపై వారికి విజయాన్ని ప్రసాదిస్తాడు. మహాప్రవక్త (సఅసం) ప్రియ సహచరుల విషయంలో ఈ వాగ్దానం అక్షరాలా నిజమయింది. వారు ధర్మం కోసం అంకితం కాగానే అల్లాహ్ అడుగడుగునా వారికి అండగా నిలిచాడు. వారు ధర్మ సంస్థాపనం చేయటం వల్ల దేవుడు కూడా ప్రపంచాన్ని వారి పాదాక్రాంతం చేశాడు. వేరొక చోట చెప్పబడినట్లు – తనకు తోడ్పడేవారికి అల్లాహ్ తప్పకుండా తోడ్పడతాడు" (అల్ హజ్ – 40).

19. ఇంతకీ **'పాదాలకు నిలకడ'** ఎక్కడ? యుద్ధరంగంలో అని కొందరు అభిప్రాయపడగా ఇస్లాం ధర్మంపై నిలకడ అని మరికొందరు వ్యాఖ్యానించారు. పరలోకంలో – పుల్సిరాత్పై – అడుగులు తడబడకుండా దేవుడు స్థిరత్వాన్ని ప్రసాదిస్తాడని మరికొంత మంది వ్యాఖ్యానించారు. మొత్తానికి ధర్మమార్గంలో దేవుడు వారి పాదాలకు స్థిరత్వాన్ని ఇస్తాడనేది మాత్రం వాస్తవం.

وَالَّذِيْنَ كَفَرُوْا فَتَعْسًا لَّهُمْ وَاَضَلَّ اَعْمَالَهُمْ ⑧

8 మరెవరయితే తిరస్కార వైఖరిని అవలంబించారో వారికి వినాశం తప్పదు. అల్లాహ్ వారి కర్మలను వృధా చేసేస్తాడు.

ذٰلِكَ بِاَنَّهُمْ كَرِهُوْا مَآ اَنْزَلَ اللّٰهُ فَاَحْبَطَ
اَعْمَالَهُمْ ⑨

9 అల్లాహ్ అవతరింపజేసిన వస్తువును వారు ఇష్టపడకపోవటం చేత[20] ఈ విధంగా జరిగింది. అందుకే అల్లాహ్ (కూడా) వారి కర్మలను నిష్ఫలం చేశాడు.[21]

اَفَلَمْ يَسِيْرُوْا فِي الْاَرْضِ فَيَنْظُرُوْا كَيْفَ كَانَ
عَاقِبَةُ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ۭ دَمَّرَ اللّٰهُ عَلَيْهِمْ ۡ
وَلِلْكٰفِرِيْنَ اَمْثَالُهَا ⑩

10 ఏమిటి, వారు భూమిలో సంచరించి, తమకు పూర్వం గడచిన వారికి పట్టిన గతేమిటో గమనించలేదా?[22] అల్లాహ్ వారిని సమూలంగా తుడిచిపెట్టేశాడు. తిరస్కారులకు ఇలాంటి శిక్షలే ఉంటాయి.[23]

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ مَوْلَى الَّذِيْنَ اٰمَنُوْا وَاَنَّ الْكٰفِرِيْنَ
لَا مَوْلٰى لَهُمْ ⑪

11 విశ్వాసులకు అల్లాహ్ కార్యసాధకునిగా ఉండటం వల్లనూ, అవిశ్వాసులను ఆదుకునే వాడెవడూ లేకపోవటం వల్లనూ ఈ విధంగా జరిగింది.[24]

اِنَّ اللّٰهَ يُدْخِلُ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ
جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ ۭ وَالَّذِيْنَ كَفَرُوْا
يَتَمَتَّعُوْنَ وَيَاْكُلُوْنَ كَمَا تَاْكُلُ الْاَنْعَامُ وَالنَّارُ
مَثْوًى لَّهُمْ ⑫

12 నిశ్చయంగా అల్లాహ్ విశ్వసించి, సత్కార్యాలు చేసినవారిని క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలో ప్రవేశింపజేస్తాడు. ఇకపోతే తిరస్కార వైఖరిని అవలంబించినవారు; వారు (అదే పనిగా (ప్రాపంచిక) ప్రయోజనాలను జుర్రుకుంటున్నారు. పశువులు మెక్కినట్లుగా మెక్కుతున్నారు.[25] మరి నరకాగ్ని వారి నివాసమవుతుంది.

20. అంటే దివ్యఖుర్ఆన్‌ను, విశ్వాసాన్ని (ఈమాన్‌ను) వారు సహించలేకపోయారు.

21. వారు చేసిన ఎన్నో పనులు స్వతహాగా మంచిపనులే అయినప్పటికీ 'విశ్వాసం' (ఈమాన్) లోపించినందువల్ల వారికి పుణ్యఫలం దక్కకుండా చేశాడు.

22. ఆయా జాతుల చిహ్నాలెన్నో వారి ప్రాంతాలలో మిగిలి ఉన్నాయి. దివ్య ఖుర్ఆన్ అవతరణా కాలంలో గతించిన కొన్ని జాతుల పట్టణాలు శిథిలావస్థలో ఉండేవి. వారు (అరబ్బులు) ఆ ప్రాంతాల మీదుగా రాకపోకలు జరిపేటప్పుడు ఆ శిథిలాలను చూసి గుణపాఠం నేర్చుకోవాలని ఇందులో సూచించబడింది.

23. మక్కాకు చెందిన అవిశ్వాసులకు హెచ్చరికగా ఇలా అనబడింది. మీరు గనక విశ్వసించకపోతే గతించిన అవిశ్వాసులకు పట్టిన దుర్గతే మీకూ పట్టనున్నదని చెప్పటం దీని ఉద్దేశం.

24. ఉహుద్ యుద్ధ సందర్భంగా అవిశ్వాసుల, ముష్రిక్కుల నినాదాలకు సమాధానంగా ముస్లింలు చేసిన నినాదాలు గమనించదగినవి. ఉదాహరణకు : 'ఉలు హుబల్' (హుబల్ దేవతకు జై) అని వారంటే దానికి జవాబుగా 'అల్లాహు ఆలా వ అజల్లు' (అల్లాహ్‌యే సర్వోన్నతుడు, గౌరవార్హుడు) అని ముస్లింలు నినదించారు. 'లనల్ ఉజ్జా వలా ఉజ్జా లకుమ్' (మా కోసం ఉజ్జా దేవత ఉంది. మీ కోసం ఏ ఉజ్జా లేదు) అని అవిశ్వాసులు నినదించగా, 'అల్లాహు మౌలానా వలా మౌలా లకుమ్' (అల్లాహ్ మా సహాయకుడు, మీ సహాయకుడెవడూ లేడు) అని ముస్లింలు దీటుగా జవాబిచ్చారు (సహీహ్ బుఖారీ – ఉహుద్ యుద్ధం).

**13** (ఓ ప్రవక్తా!) నిన్ను తీసివేసిన నీ నగరంకన్నా బలోపేతమైన నగరాలెన్నో ఉండేవి. (ఆ నగరవాసుల దురాగతాల మూలంగా) మేము వాటిని అంతం చేసేశాము. మరి వారిని ఆదుకునే వాడెవడూ లేకపోయాడు.

وَكَأَيِّن مِّن قَرْيَةٍ هِيَ أَشَدُّ قُوَّةً مِّن قَرْيَتِكَ الَّتِي أَخْرَجَتْكَ أَهْلَكْنَاهُمْ فَلَا نَاصِرَ لَهُمْ ﴿13﴾

**14** ఏమిటి, తన ప్రభువు తరఫున స్పష్టమైన పద్ధతిపై ఉన్న వ్యక్తి, తన దుష్కార్యాలు అందమైనవిగా అనిపించేలా చేయబడి, తన మనోవాంఛల వెనుక పరుగెత్తే వాని మాదిరిగా కాగలడా?[26]

أَفَمَن كَانَ عَلَىٰ بَيِّنَةٍ مِّن رَّبِّهِ كَمَن زُيِّنَ لَهُ سُوءُ عَمَلِهِ وَاتَّبَعُوا أَهْوَاءَهُم ﴿14﴾

**15** భయభక్తులు గలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గ విశిష్టత ఇలా ఉంటుంది: దుర్వాసనకు (కాలుష్యానికి) తావులేని[27] నీటి కాలువలు ఉన్నాయి. రుచిలో మార్పురాని[28] పాల కాలువలు కూడా ఉన్నాయి. త్రాగేవారికి మృదు మధురంగా[29] ఉండే మద్యం

مَّثَلُ الْجَنَّةِ الَّتِي وُعِدَ الْمُتَّقُونَ ۖ فِيهَا أَنْهَارٌ مِّن مَّاءٍ غَيْرِ آسِنٍ وَأَنْهَارٌ مِّن لَّبَنٍ لَّمْ يَتَغَيَّرْ طَعْمُهُ وَأَنْهَارٌ مِّنْ خَمْرٍ لَّذَّةٍ لِّلشَّارِبِينَ وَأَنْهَارٌ مِّنْ عَسَلٍ

25. అంటే – ఏ విధంగానయితే పశువులకు కడుపునిండా మేత మేయటం, లైంగిక వాంఛలు తీర్చుకోవటం వినా మరో పని ఉండదో అదేవిధంగా వీళ్లకు కూడా తిన మరగటం తప్ప మరో లక్ష్యం లేకుండా పోయింది. వారు పరలోకాన్ని బొత్తిగా విస్మరించారు. నిలబడి, కాలక్షేపానికి కబుర్లు చెప్పుకుంటూ అన్నం తినటాన్ని ఈ ఆయతులో చూచాయగా వారించటం జరిగిందని చెప్పవచ్చు. నేడు విందులు, వన భోజనాలలో ఈ పద్ధతి సర్వసామాన్యం అయిపోతోంది. ఈ రకమైన తిండిలో మనసుకు తృప్తి ఉండదు. పైగా అన్యుల నుంచి అరువు తెచ్చుకున్న ఈ పద్ధతి చతుష్పాదాల తిండిని పోలినది. నిలబడి మంచి నీరు త్రాగటాన్ని సయితం హదీసుల్లో గట్టిగా వారించటం జరిగింది. కాబట్టి నిలబడి అన్నపానీయాలను సేవించే పద్ధతిని విడనాడటం ఎంతో అవసరం. (జాదుల్ మఆద్ గ్రంథం చూడండి).

26. **'దుష్కార్యాలు'** అంటే షిర్క్ పనులు, పాపాలన్నమాట. ఈ అంశం ఇంతకుముందు చాలాసార్లు వచ్చింది. విశ్వాసి – అవిశ్వాసి, ఏకదైవోపాసకుడు – బహుదైవోపాసకుడు, సద్వర్తనుడు – దుర్వర్తనుడు ఎట్టి పరిస్థితిలోనూ సమానులు కాజాలరు. వారిద్దరిలో ఒకరు అల్లాహ్ దగ్గర పుణ్యఫలాన్ని, స్వర్గాన్నీ పొందగా, మరొకరు వ్యధాభరితమైన నరకయాతనకు లోను చేయబడతారు. తదుపరి ఆయతులో ఆ ఇద్దరి పర్యవసానం వివరించబడింది. మొదట భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన ఆ స్వర్గ వైభవం గురించి తెలియజేయటం జరిగింది.

27. **'ఆసిన్'** (آسِنٍ) అంటే మారిపోయేది అని అర్థం. **'గైరు ఆసిన్'** అంటే మారనిది, నిత్యం ఒకేవిధంగా ఉండేది అని అర్థం. ప్రపంచంలో నీరు గనక ఎక్కడైనా ఒకచోట కొంత కాలం పాటు నిలిచిపోతే దాని రంగు, రుచి, వాసనలో మార్పు వచ్చేస్తుంది. ఆ నీరు కలుషితం అయిపోతుంది. దాంతో ఆ నీరు ఆరోగ్యానికి హానికరంగా పరిణమిస్తుంది. కాని స్వర్గంలోని నీరు అలా కాదు. అది ఎల్లప్పుడూ ఒకేవిధంగా – మారకుండా – ఉంటుంది. అంటే దాని రంగులోగానీ, రుచిలోగానీ, వాసనలోగాని మార్పు ఉండదు. ఎప్పుడు త్రాగినా స్వచ్ఛంగా, ఆహ్లాదకరంగా, సంతృప్తికరంగా ఉంటుంది. ఆరోగ్య ప్రదాయినిగానే ఉంటుంది. ప్రపంచంలోని నీటిలో మార్పు సహజం. అందుకే నీటి రంగులో, రుచిలో, వాసనలో మార్పు రాకుండా ఉన్నంత వరకూ ఆ నీరు పరిశుభ్రంగా పరిగణించబడుతుందనీ, మార్పు గనకవస్తే అపరిశుభ్రం అయిపోతుందని షరీయతు చెబుతోంది.

28. ప్రపంచంలో – పశువుల పొదుగుల నుండి పితికిన పాలు ఒక్కోసారి పాడై పోతుంటాయి. కాని స్వర్గంలోని పాలు ప్రపంచంలో మాదిరిగా పశువుల నుండి సేకరించబడినది కాదు. పైగా అది ప్రవహించే కాలువ రూపంలో ఉంటుంది. అందువల్ల అది ఎప్పటికీ చెడిపోవటంగానీ, విరిగిపోవటంగానీ జరగదు. త్రాగటానికి కమ్మగా ఉంటుంది.

مُّصَفًّى ؕ وَلَهُمْ فِيهَا مِنْ كُلِّ الثَّمَرٰتِ وَمَغْفِرَةٌ
مِّنْ رَّبِّهِمْ ؕ كَمَنْ هُوَ خَالِدٌ فِي النَّارِ وَسُقُوا مَآءً
حَمِيمًا فَقَطَّعَ اَمْعَآءَهُمْ ⑮

కాలువలు కూడా ఉన్నాయి. స్వచ్ఛమైన తేనె కాలువలు[30] కూడా ఉన్నాయి. ఇంకా వారి కోసం అందులో అన్ని రకాల పండ్లు ఫలాలు కూడా ఉన్నాయి. అంతేకాదు, వారి ప్రభువు తరఫు నుంచి మన్నింపు కూడా ఉంది. ఏమిటి, ఈ అనుగ్రహాలను పొందినవాడు ఎల్లకాలం అగ్నిలో మాడుతూ ఉండేవాని మాదిరిగా, పేగులను సయితం ముక్కలు ముక్కలుగా చేసి వేసేటటువంటి[31] సలసలా కాగే నీరు ఇవ్వబడే వారి మాదిరిగా కాగలడా?

وَمِنْهُمْ مَّنْ يَّسْتَمِعُ اِلَيْكَ ۚ حَتّٰٓى اِذَا خَرَجُوْا
مِنْ عِنْدِكَ قَالُوْا لِلَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ مَاذَا
قَالَ اٰنِفًا ۫ اُولٰٓئِكَ الَّذِيْنَ طَبَعَ اللّٰهُ عَلٰى
قُلُوْبِهِمْ وَاتَّبَعُوْٓا اَهْوَآءَهُمْ ⑯

**16** వారిలో కొందరు (ఉన్నారు. వారు) నీ వైపు చెవియొగ్గి వింటారు. కాని వారు నీ దగ్గరి నుంచి నిష్క్రమించాక, జ్ఞాన సంపన్నులతో, "ఇందాక ఈయనగారు చెప్పిందేమిటి?!"[32] అని అడుగుతారు. అల్లాహ్ సీలు వేసినది ఇలాంటి వారి హృదయాలకే. వారు (ఎంతసేపటికీ) తమ మనో వాంఛలను అనుసరిస్తూ ఉంటారు.

29. ప్రపంచంలో లభ్యమయ్యే మద్యం (సారాయి) పుల్లగా, వగరుగా, కంపుకొడుతూ ఉంటుంది. పైగా ఓ పెగ్గు త్రాగగానే మనిషి అదుపు తప్పిపోతాడు. పిచ్చిపిచ్చి వేషాలు వేస్తాడు. నోటికొచ్చినట్లు వాగుతాడు. కాని స్వర్గంలోని మద్యం అలాంటిది కాదు. అదెంతో పరిశుభ్రంగా, రుచికరంగా ఉంటుంది. సువాసన కలిగి ఉంటుంది. ఎంత త్రాగినా మత్తెక్కటంగానీ, తూలటంగానీ జరగదు. పైగా ఆ మద్యాన్ని సేవించిన మనిషి అనిర్వచనీయమైన మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు. "దానివల్ల మనిషి తూలటం గానీ, వివేచనను కోల్పోవటంగానీ జరగదు" (సాఫ్ఫాత్ – 47). ఇంకా చూడండి : అల్ వాఖియ సూరా – 19వ వచనం).

30. సాధారణంగా ప్రపంచంలో తేనె ఎక్కడ కొనుగోలు చేసినా అందులో కల్తీ ఉండవచ్చునేమోనన్న అనుమానం కొనుగోలుదారుల్లో ఉంటుంది. ఒకవేళ నేరుగా తేనె తుట్టెల నుంచే తేనెను సేకరించినప్పటికీ వాతావరణ కాలుష్య ప్రభావం ఉంటుందేమోనన్నది మరో అనుమానం. కాని స్వర్గంలోని తేనె అలాంటిది కాదు. అది ఎంతో స్వచ్ఛంగా, బాగా వడపోసిన తేటతేనెలా ఉంటుంది. అది ప్రపంచంలోని తేనెటీగల మాదిరిగా సేకరించబడినది కాదు. అక్కడ తేనె కాలువలే ప్రవహిస్తూ ఉంటాయి. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఇలా ప్రబోధించారు: "మీరెప్పుడు అర్థించినా 'జన్నతుల్ ఫిర్దౌస్'ను అర్థించండి. ఎందుకంటే అది స్వర్గంలోని మధ్యస్థానం, ఉన్నత స్థానమూను. అక్కణ్ణుంచే స్వర్గంలోని సరోవరాలన్నీ ఉత్పన్నమవుతాయి. దానిపైనే కరుణామయుని సింహాసనం ఉంది" (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్).

31. స్వర్గంలో ఈ గొప్ప వరాలను పొందినవారునూ, నరకంలో దుర్భరమైన బ్రతుకును వెళ్ళబుచ్చేవారునూ సమానులు అవుతారా? ముమ్మాటికీ కాలేరు. ఒక వర్గం వారు ఉన్నత స్థానాలను పొందగా, మరో వర్గంవారు అట్టడుగు స్థాయికి దిగజారారు. ఈ రెండు వర్గాల వారికి మధ్య నింగికీ – నేలకు మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉంది. వారిలో ఒకరు దేవుని అతిథులైతే ఇంకొకరు దేవుని కారాగారంలో బంధించబడిన వారు. దేవుని అతిథులకు వారు ఇష్టపడినదల్లా సమర్పించబడుతుంది. కాని దేవుని వద్ద దోషులుగా పట్టుబడినవారికి జెముడు వృక్షంలాంటి చేదైన, భరించశక్యంకాని తిండి వడ్డించబడుతుంది. త్రాగటానికి సల సల కాగే నీరు ఇవ్వబడుతుంది. ఎంత తేడా?!

32. వీళ్ల కపట ముస్లింలు. వీళ్ల సంకల్పం మంచిది కాదు. అందువల్ల దైవప్రవక్త (సఅసం) చెప్పే మాటలను వాళ్లు

17 మరెవరయితే సన్మార్గాన్ని పొందారో, వారి సన్మార్గభాగ్యంలో ఆయన (అల్లాహ్) మరింత వృద్ధిని ప్రసాదించాడు. వారికి వారి ధర్మనిష్ఠను ('తఖ్వా'ను) కూడా అనుగ్రహించాడు.[33]

وَالَّذِينَ اهْتَدَوْا زَادَهُمْ هُدًى وَآتَاهُمْ تَقْوَاهُمْ ⑰

18 ఏమిటీ, ప్రళయ ఘడియ హటాత్తుగా తమపైకి రావాలని వారు ఎదురు చూస్తున్నారా? నిస్సందేహంగా దానికి సంబంధించిన సూచనలు (ఇప్పటికే) వచ్చేశాయి.[34] మరి ఆ ఘడియ గనక వచ్చిపడితే హితబోధను గ్రహించే అవకాశం వారికి ఎక్కడ ఉంటుందనీ?[35]

فَهَلْ يَنْظُرُونَ إِلَّا السَّاعَةَ أَنْ تَأْتِيَهُمْ بَغْتَةً ۖ فَقَدْ جَاءَ أَشْرَاطُهَا ۚ فَأَنَّىٰ لَهُمْ إِذَا جَاءَتْهُمْ ذِكْرَاهُمْ ⑱

19 కనుక (ఓ ప్రవక్తా!) అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని[36] నువ్వు బాగా తెలుసుకో. నీ పొరపాట్లకుగాను క్షమాపణ వేడుకుంటూ ఉండు. విశ్వాసులైన పురుషుల, విశ్వాసులైన స్త్రీలందరి (మన్నింపు) కోసం కూడా వేడుకుంటూ ఉండు.[37] మీ రాకపోకలను గురించి, మీ విశ్రాంతి స్థలాల గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు.[38]

فَاعْلَمْ أَنَّهُ لَا إِلَٰهَ إِلَّا اللَّهُ وَاسْتَغْفِرْ لِذَنْبِكَ وَلِلْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ ۗ وَاللَّهُ يَعْلَمُ مُتَقَلَّبَكُمْ وَمَثْوَاكُمْ ⑲

---

చెవులు రిక్కించి విన్నప్పటికీ అవి వారి బుర్రకెక్కేవి కావు. సమావేశాల నుంచి బయటికి వచ్చిన తరువాత, తోటి సహచరులనుద్దేశించి, 'ఆయన (స) గారు చెప్పిందేమిటి?' అంటూ ఆరా తీసేవారు.

33. సన్మార్గాన్ని పొందాలన్న ఉద్దేశం మనసులో ఉంటే గనక అల్లాహ్ తప్పకుండా హృదయ కవాటాలను తెరుస్తాడు. సహన స్థయిర్యాలను కూడా ప్రసాదిస్తాడు.

34. అంతిమ దైవప్రవక్త (సఅసం) వారి ప్రభవనం సయితం ప్రళయం సమీపించిందనటానికి ఒక తార్కాణం. ఒకసారి ఆయన (సఅసం), "నా ప్రభవనమూను, ప్రళయ దినం ఈ రెండు వేళ్లు లాంటివి" అని చెప్పారు (సహీహ్ బుఖారీ– అన్నాజియాత్ సూరావ్యాఖ్యానం). ఏ విధంగానయితే ఈ రెండు చేతివ్రేళ్లు దగ్గరగా ఉన్నాయో అదేవిధంగా నాకూ–ప్రళయదినానికి మధ్య కూడా పెద్దగా అంతరం లేదు. లేక ఏ విధంగానయితే ఈ రెండు వ్రేళ్లలో ఒక వ్రేలు కొంచెం పొడవుగా ఉందో అదేవిధంగా ప్రళయదినం నాకన్నా కొంచెం ఎదర ఉంటుందన్నది ఆయన (స) పలుకుల్లోని ఆంతర్యం.

35. ప్రళయదినం అకస్మాత్తుగా వచ్చిపడినప్పుడు ఈ అవిశ్వాసులు ఉపదేశం ఎలా గ్రహించగల్గుతారు? ఒకవేళ ఆ క్షణంలో వారు పశ్చాత్తాపం చెందినా అది దైవ సన్నిధిలో స్వీకార యోగ్యం కాజాలదు కదా! కాబట్టి పశ్చాత్తాపం చెందదలచుకుంటే ఇదే సరైన సమయం. దాన్ని చేజార్చుకుంటే చివరకు బాధపడాల్సింది వారే.

36. అంటే ఈ **'దేవుని ఏకత్వం'** (తౌహీద్) విశ్వాసంపై నిలకడగా ఉండు. ఎందుకంటే ఒక్కడైన దేవుని విధేయతలోనే మేలుంది. దానిపట్ల విముఖత బహుదైవారాధనకు, పాపాలకు మార్గం తెరుస్తుంది. అది కీడుకు ప్రతిరూపం అని తెలుసుకో.

37. ఈ ఆయతులో – తన పొరపాట్ల మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించటంతోపాటు, సమస్త ముస్లిం స్త్రీ పురుషుల మన్నింపు కోసం కూడా ప్రార్థించవలసిందిగా మహాప్రవక్త (స)కు ఆదేశించబడింది. దీనివల్ల 'పాపాల మన్నింపు'కు గల ప్రాముఖ్యం ఎటువంటిదో అర్థమవుతోంది. హదీసులలో కూడా ఈ అంశం గట్టిగా వక్కాణించబడింది. "ప్రజలారా!

**20** “ఏదైనా సూరా ఎందుకు అవతరించలేదు?” అని విశ్వసించినవారు అంటున్నారు.[39] మరి యుద్ధ ప్రస్తావనతో కూడిన చాలా స్పష్టమైన భావం గల సూరా అవతరించినపుడు,[40] హృదయాలలో రోగమున్నవారు, మరణ సమయంలో స్పృహలో లేనివాడు చూసినట్లుగా నిన్ను చూడటాన్ని నువ్వు గమనిస్తావు.[41] (వారు అల్లాహ్‌కు విధేయత చూపి ఉంటే అది) వారి కొరకు చాలా బావుండేది.

وَيَقُولُ الَّذِينَ آمَنُوا لَوْلَا نُزِّلَتْ سُورَةٌ ۚ
فَإِذَا أُنزِلَتْ سُورَةٌ مُّحْكَمَةٌ وَذُكِرَ فِيهَا
الْقِتَالُ ۙ رَأَيْتَ الَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ
يَنظُرُونَ إِلَيْكَ نَظَرَ الْمَغْشِيِّ عَلَيْهِ مِنَ
الْمَوْتِ ۖ فَأَوْلَىٰ لَهُمْ (20)

**21** (వారు గనక) విధేయత (చూపి ఉంటే), మంచిమాట (పలికి ఉంటే),[42] మరి కార్యాచరణ నిర్ణయించబడినపుడు[43] వారు అల్లాహ్ పక్షాన సత్యవంతులుగా నిలబడి ఉంటే[44] అది వారి కొరకు శ్రేయోదాయకమై ఉండేది.[45]

طَاعَةٌ وَقَوْلٌ مَّعْرُوفٌ ۚ فَإِذَا عَزَمَ الْأَمْرُ
فَلَوْ صَدَقُوا اللَّهَ لَكَانَ خَيْرًا لَّهُمْ (21)

**22** ఒకవేళ మీకు అధికారం లభిస్తే మీరు రాజ్యంలో (భువిలో) అరాచకం సృష్టించటానికి,[46] బంధుత్వ సంబంధాల విచ్ఛిత్తికి పాల్పడటానికి కూడా వెనుకాడరు.

فَهَلْ عَسَيْتُمْ إِن تَوَلَّيْتُمْ أَن تُفْسِدُوا
فِي الْأَرْضِ وَتُقَطِّعُوا أَرْحَامَكُمْ (22)

---

ప్రభువు సమక్షంలో క్షమాభిక్షకై అర్థించండి. నేను కూడా ఆయన సమక్షంలో రోజుకు డెబ్బైసార్లకన్నా ఎక్కువే క్షమాభిక్ష వేడుకుంటూ ఉంటాను” అని ఒక హదీసులో మహాప్రవక్త (స) వక్కాణించటం గమనార్హం (సహీహ్ బుఖారీ – కితాబుద్దావాత్).

38. అంటే–పగలు మీరేమేం చేస్తున్నారో, రాత్రిపూట మీరు ఎక్కడ ఎలా గడుపుతున్నారో కూడా అల్లాహ్‌కు తెలుసు. అంటే మీ దినచర్యలలో ఏదీ అల్లాహ్ నుంచి దాగిలేదు.

39. ధర్మయుద్ధానికి సంబంధించిన ఆజ్ఞలు అవతరించక ముందు నికార్సయిన ముస్లింలు ధర్మయుద్ధం కోసం ఉవ్విళ్ళూరేవారు. ‘ఈ మేరకు ఏదైనా సూరా అవతరిస్తే ఎంత బాగుండును!’ అని చెప్పుకునేవారు.

40. అంటే ఎప్పటికీ రద్దుకాని దైవాదేశం ఒకటి వచ్చేసిన మీదట...

41. వీళ్లు కపట ముస్లింలు. అంటే ముస్లిం వర్గాలలో కూడా కొందరు నయవంచకులు ఉండేవారు. వారికి ఈ ధర్మయుద్ధ (జిహాద్) ఆదేశం చాలా కష్టంగా తోచింది. విశ్వాస బలహీనత గలవారు కూడా కొంతమంది – ఒక్కోసారి–వాళ్ల పక్షాన చేరిపోయేవారు. అన్ నిసా సూరా 77వ వచనంలో కూడా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది.

42. అంటే – వారు ఈ ఆజ్ఞ పట్ల కలవరం చెందే బదులు ఆజ్ఞాపాలన చేసి వుంటే, దైవప్రవక్త (సఅసం) పట్ల పెడసరి వైఖరిని అవలంబించేబదులు మంచిమాటలు చెప్పివుంటే బావుండేది. వారి పిరికితనం, కపటత్వం వారి పాలిట వినాశకరంగా పరిణమించనున్నదని మరికొందరు వివరించారు. (ఫత్‌హుల్ ఖదీర్, ఐసరుత్తఫాసీర్).

43. అంటే సమర సన్నాహాలన్నీ పూర్తయి, సమరానికి అందరూ బయలుదేరుతున్నప్పుడు...

44. అంటే – వారు ఇప్పటికైనా తమ కాపట్య బుద్ధికి స్వస్తిచెప్పి నిష్కల్మషమైన మనసుతో అల్లాహ్ వైపునకు మరలినట్లయితే లేక యుద్ధం చేస్తామని దైవప్రవక్త (స) కు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నిజాయితీగా పోరాడితే...

45. అంటే – కపట చేష్టలకు, వెన్నుపోటు చేష్టలకు బదులుగా వారు తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని వుంటే అది వారికొరకు మేలైనదిగా పరిణమించి ఉండేది.

**23** అల్లాహ్ శాపం పడినది వీళ్ళపైనే. మరి (అల్లాహ్) వారిని చెవిటివారుగా చేశాడు, వారి కంటిచూపును పోగొట్టాడు.[47]

أُولَٰئِكَ الَّذِينَ لَعَنَهُمُ اللَّهُ فَأَصَمَّهُمْ وَأَعْمَىٰ أَبْصَارَهُمْ (23)

**24** ఏమిటి, వారు ఖుర్ఆన్ గురించి లోతుగా ఆలోచించరా? లేక వారి హృదయాలపై తాళాలు పడి ఉన్నాయా?[48]

أَفَلَا يَتَدَبَّرُونَ الْقُرْآنَ أَمْ عَلَىٰ قُلُوبٍ أَقْفَالُهَا (24)

**25** ఎవరయితే తమకు సన్మార్గం తేటతెల్ల మైన తరువాత[49] కూడా వీపు త్రిప్పుకుని మరలిపోయారో వారి కొరకు షైతాను ఒక విషయాన్ని (వారి చేష్టను) అందమైనదిగా చిత్రీకరించాడు. వారికి (మోసపూరితమైన) గడువును ఇచ్చాడు.[50]

إِنَّ الَّذِينَ ارْتَدُّوا عَلَىٰ أَدْبَارِهِم مِّن بَعْدِ مَا تَبَيَّنَ لَهُمُ الْهُدَى ۙ الشَّيْطَانُ سَوَّلَ لَهُمْ وَأَمْلَىٰ لَهُمْ (25)

**26** ఇలా[51] ఎందుకు జరిగిందంటే, వారు అల్లాహ్ అవతరింప జేసిన వాణిని ద్వేషించే వారితో,[52] "మేము కూడా కొన్ని విషయా లలో[53] మీరు చెప్పినట్లు వింటాము" అని అన్నారు. వారి లోపాయికారి వ్యవహారాలన్నీ అల్లాహ్‌కు తెలుసు.[54]

ذَٰلِكَ بِأَنَّهُمْ قَالُوا لِلَّذِينَ كَرِهُوا مَا نَزَّلَ اللَّهُ سَنُطِيعُكُمْ فِي بَعْضِ الْأَمْرِ ۖ وَاللَّهُ يَعْلَمُ إِسْرَارَهُمْ (26)

---

46. అధికారం చేజిక్కగానే రక్తపాతం సృష్టించి అధికార దుర్వినియోగం చేస్తారు. ఇమామ్ ఇబ్నె కసీర్ మాత్రం **'తవల్లైతుమ్'** (**تَوَلَّيْتُمْ**) అనే పదాన్ని "మీరు ధర్మయుద్ధం పట్ల విముఖత చూపితే" అన్న భావంలో తీసుకున్నారు. అంటే మీరు మళ్లీ అజ్ఞానకాలపు దురాచారాల వైపుకు తిరిగిపోయి హత్యలు, లూటీలకు పాల్పడతారు. రక్త సంబంధాలను త్రెంపుతారు. ఈ ఆయతులో రాజ్యంలో అశాంతి అలజడులను సృష్టించరాదని చెప్పబడింది. ముఖ్యంగా బంధుత్వ సంబంధాలను పాడు చేయరాదని నొక్కి వక్కాణించటం జరిగింది. బంధువులను, అయినవారిని ఉద్దేశ్యపూర్వకంగా మనసు నొప్పించకూడదు. పైగా వారిని మాటల ద్వారా, చేతల ద్వారా సంతోషపరచాలి. సద్వ్యవహారం ద్వారా వారి మనసుల్ని జయించాలి. హదీసులలో కూడా దీనికి సంబంధించి చాలా గట్టిగా తాకీదు చేయబడింది. (ఇబ్నె కసీర్).
47. అంటే అల్లాహ్ ఇలాంటి వారి చెవులకు (సత్యం వినలేని) చెవుడును, వారి కళ్లకు (సత్యాన్ని చూడలేని) అంధత్వాన్ని ఇచ్చాడు. తత్ఫలితంగా వారి కర్మలు దారి తప్పాయి.
48. ఈ కారణంగా ఖుర్ఆన్ భావార్థం వారి హృదయ కవాటాల్లోకి చొచ్చుకుపోలేక పోతోంది.
49. వారు కపటులు. ధర్మయుద్ధం (జిహాద్) పట్ల వారు విముఖతను కనబరచి తమలోని కాపట్యరోగాన్ని, అపమార్గాన్ని బయటపెట్టుకున్నారు.
50. ఇది కూడా షైతాను పనే. అప్పుడే యుద్ధం ఎందుకు? దేవుడు మీకు దీర్ఘాయుష్షును ప్రసాదించాడు. అనవసరంగా మీ ప్రాణాలను ఎందుకు పోగొట్టుకుంటారు? అంటూ వాడు వారిలో లేనిపోని ఆశలను రగుల్గొలిపాడు. భ్రమలకు లోను చేశాడు. లేక అల్లాహ్ వాళ్లను వెంటనే పట్టుకోకుండా కొంత గడువును ఇచ్చాడన్నదీ అర్థం కావచ్చు.
51. 'ఇలా' అన్న పదం వారు అనుసరించిన మార్గభ్రష్టతను సూచిస్తోంది.
52. అంటే కపటులు అవిశ్వాసులనుద్దేశ్యించి (లేక యూదులనుద్దేశించి) ఈ విధంగా అన్నారు.
53. అంటే దైవప్రవక్త (స)ను, ఆయన తెచ్చిన జీవన విధానాన్ని వ్యతిరేకించే విషయంలో మేము మీకు తోడుగా ఉన్నామని వారు హామీ ఇస్తున్నారన్నమాట.
54. వేరొకచోట చెప్పబడినట్లు "వారి రహస్య మంతనాలను అల్లాహ్ వ్రాస్తూ పోతున్నాడు." (అన్ నిసా – 81).

**27** మరి దైవదూతలు వారి ఆత్మలను స్వాధీనం చేసుకుంటూ (ఎడాపెడా) వారి చెంపలపై, వారి పిరుదులపై వాయిస్తూ ఉన్నప్పుడు వారి గతేమవుతుందీ!?[55]

فَكَيْفَ إِذَا تَوَفَّتْهُمُ الْمَلَائِكَةُ يَضْرِبُونَ وُجُوهَهُمْ وَأَدْبَارَهُمْ ﴿٢٧﴾

**28** వారి ఈ దుర్గతికి కారణం వారు అవలంబించిన మార్గమే. తద్వారా వారు అల్లాహ్‌ను అప్రసన్నుణ్ణి చేశారు. ఆయన ప్రసన్నతను వారు ఇష్టపడలేదు. అందుకే అల్లాహ్ వారి కర్మలను వృథా గావించాడు.

ذَٰلِكَ بِأَنَّهُمُ اتَّبَعُوا مَا أَسْخَطَ اللَّهَ وَكَرِهُوا رِضْوَانَهُ فَأَحْبَطَ أَعْمَالَهُمْ ﴿٢٨﴾

**29** హృదయాలలో రోగమున్నవారు, అల్లాహ్ తమ (ఆంతర్యాల్లోని) కాపట్యాన్ని బహిర్గతం చేయడని అనుకుంటున్నారా?[56]

أَمْ حَسِبَ الَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ أَن لَّن يُخْرِجَ اللَّهُ أَضْغَانَهُمْ ﴿٢٩﴾

**30** మేము గనక తలచుకుంటే వారందరినీ నీకు చూపి ఉండేవారము. నువ్వు వాళ్ళ ముఖ కవళికలను బట్టి వాళ్లను పసిగట్ట[57] గలిగేవాడివి. అయినప్పటికీ నువ్వు వాళ్లను వాళ్ల మాటల తీరును బట్టి తెలుసుకోగలవు.[58] మీ కార్యకలాపాలన్నీ అల్లాహ్‌కు తెలుసు సుమా!

وَلَوْ نَشَاءُ لَأَرَيْنَاكَهُمْ فَلَعَرَفْتَهُم بِسِيمَاهُمْ ۚ وَلَتَعْرِفَنَّهُمْ فِي لَحْنِ الْقَوْلِ ۚ وَاللَّهُ يَعْلَمُ أَعْمَالَكُمْ ﴿٣٠﴾

**31** మీలో ధర్మయుద్ధం చేసేవారెవరో, సహనమూర్తులెవరో నిగ్గుతేల్చడానికి మేము తప్పకుండా మిమ్మల్ని పరీక్షిస్తాము.[59] మీ స్థితిగతులను కూడా పరికిస్తాము.

وَلَنَبْلُوَنَّكُمْ حَتَّىٰ نَعْلَمَ الْمُجَاهِدِينَ مِنكُمْ وَالصَّابِرِينَ وَنَبْلُوَ أَخْبَارَكُمْ ﴿٣١﴾

---

55. మరణదూతలు ఈ అవిశ్వాసుల ప్రాణాలను తీసుకునే సమయంలో ఏర్పడే పరిస్థితి ఎలా ఉంటుందో ఇక్కడ చెప్పబడింది. మరణదూతల నుండి తప్పించుకునేందుకు ఆ దురాత్మలు శరీరంలోపల దాక్కునేందుకు యత్నిస్తాయి. అటూ ఇటూ పారిపోసాగుతాయి. అప్పుడు దూతలు వాటిని ఒడిసిపట్టుకుంటారు. ఎడాపెడా వాయిస్తారు. ఈ విషయం ఇంతకు ముందు అన్‌ఆమ్ సూరా (93)లో, అన్‌ఫాల్ సూరా (50)లో కూడా వచ్చింది.

56. **'అజ్‌ఘాన్'** (**اَضغان**) అనేది **జిఘ్న్‌**కు బహువచనం. దీనికి అసూయ, ద్వేషం, అక్కసు, కాపట్యం అనే అర్థాలు వస్తాయి. కపట ముస్లింల హృదయాలలో ఇస్లాం మరియు ముస్లిముల పట్ల తీవ్రమైన వ్యతిరేకత, వైరం ఉండేవి. ఆ విషయమే ఈ వాక్యంలో ప్రస్తావించబడింది. తమ ఆంతర్యాల్లోని కుళ్లును అల్లాహ్ బయటపెట్టడని వారు భావిస్తున్నారా? అని ప్రశ్నించబడింది. అల్లాహ్‌కు వారి లోగుట్టు అంతా తెలుసు అన్నది దీని భావం.

57. అంటే–ఒక్కొక్క కపట విశ్వాసిని నువ్వు స్పష్టంగా గుర్తించేలా మేము వాళ్ళను బయటపెట్టి ఉండేవారము. తద్వారా నువ్వు తేలిగ్గా గుర్తుపట్టి వాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండగలిగేవాడివి. కాని అల్లాహ్ కపటుల విషయంలో ఇలా వ్యవహరించలేదు. ఎందుకంటే అల్లాహ్ గనక అలా చేసివుంటే అది దాసుల లోపాలను మరుగుపరిచే ఆయన గుణానికి విరుద్ధాంశం అయివుండేది. దేవుడు సాధారణంగా తన దాసుల తప్పులను మరుగుపరుస్తాడు– ప్రతిదీ బట్టబయలు చేయడు. కంటికి కానవచ్చే వాటిపైనే నిర్ణయం గైకొనాలనీ, కానరాని (అగోచర) విషయాలను తనకు వదలిపెట్టాలని ఆయన ఆదేశిస్తున్నాడు.

58. అయితే వారి మాటలు వారి ఆంతర్యాల్లోని కల్మషానికి అద్దం పడతాయి. వాటిని బట్టి దైవప్రవక్త వారిని

إِنَّ ٱلَّذِينَ كَفَرُواْ وَصَدُّواْ عَن سَبِيلِ ٱللَّهِ وَشَآقُّواْ ٱلرَّسُولَ مِنۢ بَعۡدِ مَا تَبَيَّنَ لَهُمُ ٱلۡهُدَىٰ لَن يَضُرُّواْ ٱللَّهَ شَيۡـٔٗا وَسَيُحۡبِطُ أَعۡمَٰلَهُمۡ ﴿٣٢﴾

**32** తమకు సన్మార్గం స్పష్టమైన తరువాత కూడా తిరస్కార వైఖరిని అవలంబించి, అల్లాహ్ మార్గంనుంచి జనులను ఆపుతూ, దైవప్రవక్తకు విరోధులైన వారు ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్‌కు నష్టం కలిగించలేరు.[60] త్వరలోనే అల్లాహ్ వారి ఆచరణలను వృథా చేస్తాడు.[61]

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓاْ أَطِيعُواْ ٱللَّهَ وَأَطِيعُواْ ٱلرَّسُولَ وَلَا تُبۡطِلُوٓاْ أَعۡمَٰلَكُمۡ ﴿٣٣﴾

**33** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త చెప్పినట్లు వినండి. మీ కర్మలను పాడు చేసుకోకండి.[62]

إِنَّ ٱلَّذِينَ كَفَرُواْ وَصَدُّواْ عَن سَبِيلِ ٱللَّهِ ثُمَّ مَاتُواْ وَهُمۡ كُفَّارٞ فَلَن يَغۡفِرَ ٱللَّهُ لَهُمۡ ﴿٣٤﴾

**34** నిశ్చయంగా–ఎవరయితే తిరస్కార వైఖరిని అవలంబించారో, అల్లాహ్ మార్గం నుంచి ఇతరులను అడ్డుకున్నారో, ఆపై అవిశ్వాస స్థితిలోనే మరణించారో వారిని అల్లాహ్ ఎంతమాత్రం క్షమించడు.

فَلَا تَهِنُواْ وَتَدۡعُوٓاْ إِلَى ٱلسَّلۡمِ وَأَنتُمُ ٱلۡأَعۡلَوۡنَ وَٱللَّهُ مَعَكُمۡ وَلَن يَتِرَكُمۡ أَعۡمَٰلَكُمۡ ﴿٣٥﴾

**35** కాబట్టి మీరు ధైర్యం కోల్పోయి సంధి కోసం వారిని పిలవకండి. నిజానికి మీదే పైచేయి అవుతుంది.[63] అల్లాహ్ మీకు అండగా ఉన్నాడు.[64] ఆయన మీ కర్మలను వృథా చేయటమనేది జరగదు.[65]

---

తెలుసుకోగలుగుతాడు. మనసులో ఉన్నదాన్ని దాచాలని మనిషి ఎంతగా ప్రయత్నించినా అది దాగదు. అతని హావభావాలు, అతని మాటలు, చేష్టలు, కదలికలు అతని ఆంతర్యంలోని రహస్యాన్ని బహిర్గతం చేస్తూ ఉంటాయి.

59. ఆ మాటకొస్తే అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు. ఆయనకు తెలియనిదంటూ ఏదీ లేదు. అయితే కొన్ని సంఘటనల ద్వారా ఆయన నికార్సయిన వారెవరో, అమ్ముడుపోయే వారెవరో తేల్చగోరుతున్నాడు. ఎందుకంటే ఇతరులు కూడా దీన్ని తెలుసుకోగలగాలి. ఇలాంటి భావం గల పదాలొచ్చినప్పుడల్లా హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) 'మేము చూడటానికి' అన్న భావంలో తీసుకునేవారు (ఇబ్నె కసీర్). ఈ భావమే చాలా వరకు సరైనది, స్పష్టమైనది.

60. పైగా వారే తమ స్వయానికి నష్టం చేకూర్చుకున్న వారవుతారు.

61. ఎందుకంటే విశ్వాసం (ఈమాన్) లేని సత్కర్మకు దైవసన్నిధిలో ఎలాంటి విలువా ఉండదు. విశ్వాసం, చిత్తశుద్ధి – ఈ రెండూ ఉన్నప్పుడే ఏ సదాచరణ అయినా పుణ్యఫలానికి నోచుకుంటుంది.

62. అంటే – కపటుల మాదిరిగా, ధర్మభ్రష్టుల మాదిరిగా కాపట్యానికి, ధర్మభ్రష్టతకు లోనై మీరు చేసుకున్న కర్మలను సర్వనాశనం చేసుకోకండి. జీవితాంతం ఇస్లాం ధర్మంపై స్థిరంగా ఉండాలన్న ఆజ్ఞ ఈ వాక్యంలో ఇమిడి ఉంది. పెద్దపెద్ద పాప కార్యాలు, సిగ్గుమాలిన పనులు కూడా సత్కర్మల వినాశానికి కారణభూతం అవుతాయని మరికొందరన్నారు. అందుకే విశ్వాసుల గుణగణాలలో ఒక గుణం ఏమిటంటే వారు పెద్దపెద్ద పాపకార్యాలకు, నీతిబాహ్యమైన పనులకు దూరంగా ఉంటారు (నజ్మ్ సూరా : 32). ఈ విధంగా చెడు పనులకు, నీతిబాహ్యమైన చేష్టలకు దూరంగా ఉండాలని ఇందులో పరోక్షంగా చెప్పబడింది. ఈ ఆయతు ద్వారా అవగతమయ్యే ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే ఒక ఆచరణ పైకి ఎంత ఉత్తమంగా కనిపిస్తున్నప్పటికీ అది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) విధేయతా పరిధికి అవతల ఉంటే అది వృధా అయిపోతుంది.

63. మీరు సంఖ్యాపరంగా, బలపరాక్రమాల రీత్యా శత్రువుపై పైచేయిగా ఉన్నప్పుడు శత్రువుకు జడుసుకుని సంధికోసం

إِنَّمَا الْحَيٰوةُ الدُّنْيَا لَعِبٌ وَّلَهْوٌ ۚ وَإِنْ تُؤْمِنُوْا
وَتَتَّقُوْا يُؤْتِكُمْ أُجُوْرَكُمْ وَلَا يَسْـَٔلْكُمْ أَمْوَالَكُمْ ﴿36﴾

36 నిజానికి ఈ ప్రాపంచిక జీవితం ఓ ఆట, కాలక్షేపం మాత్రమే.[66] మీరు గనక విశ్వసించి, భయభక్తుల వైఖరిని అవలంబించినట్లయితే అల్లాహ్ మీ పుణ్యఫలం మీకిస్తాడు. ఆయన మీ నుండి మీ సొమ్ముల్ని అడగడు.[67]

إِنْ يَّسْـَٔلْكُمُوْهَا فَيُحْفِكُمْ تَبْخَلُوْا وَيُخْرِجْ
أَضْغَانَكُمْ ﴿37﴾

37 ఒకవేళ ఆయన మీనుండి మీ సొమ్మును అడిగితే, ఇవ్వమని మరీ గట్టిగా అడిగితే మీరు పిసినారులుగా ప్రవర్తిస్తారు. మరి ఆయన మీ కాపట్యాన్ని బట్టబయలు చేస్తాడు.[68]

هٰٓأَنْتُمْ هٰٓؤُلَآءِ تُدْعَوْنَ لِتُنْفِقُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ ۚ
فَمِنْكُمْ مَّنْ يَّبْخَلُ ۚ وَمَنْ يَّبْخَلْ فَإِنَّمَا يَبْخَلُ عَنْ
نَّفْسِهٖ ۗ وَاللّٰهُ الْغَنِيُّ وَأَنْتُمُ الْفُقَرَآءُ ۚ وَإِنْ تَتَوَلَّوْا
يَسْتَبْدِلْ قَوْمًا غَيْرَكُمْ ۙ ثُمَّ لَا يَكُوْنُوْٓا
أَمْثَالَكُمْ ﴿38﴾

38 ఇదిగో! అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయండని పిలిచినపుడు[69] మీలో కొందరు పిసినారులుగా వ్యవహరిస్తున్నారు. ఎవడయితే పిసినారితనం వహిస్తున్నాడో అతను తన పట్లనే పిసినారితనం వహిస్తున్నాడు.[70] అల్లాహ్‌సంపన్నుడు (అక్కర లేనివాడు). మీరేమో పేదలు (ఆయనపై ఆధారపడినవారు).[71] ఒకవేళ మీరు గనక మరలిపోతే[72] ఆయన మీ బదులు– మీ స్థానంలో – మరో జాతివారిని తీసుకువస్తాడు. మరి వారు మీలాంటివార్తై ఉండరు.[73]

---

తాపత్రయపడకండి. పైగా దైవధర్మ ఉన్నతి కోసం మీ పరాక్రమాన్ని ప్రదర్శించండి. ఆధిక్యంలో ఉండి కూడా అవిశ్వాసులతో సంధిచేసుకోవటమంటే అధర్మ పరివ్యాప్తికి పరోక్షంగా తోడ్పడటమే. ఇది మహాపరాధం. అంతమాత్రాన అవిశ్వాసులతో సంధికి బొత్తిగా ఆస్కారమే లేదని కూడా దీని భావం కాదు. ఉంది, కాని సర్వావస్థల్లో లేదు. సంఖ్యా పరంగా ముస్లింలు తక్కువగా ఉన్నప్పుడు, ఒనరులు పరిమితంగా ఉన్నప్పుడు యుద్ధంకన్నా సంధి మిన్న. అలాంటి పరిస్థితులను బేరీజు వేసుకుని సమయస్ఫూర్తితో మసలుకోవటం విజ్ఞతకు తార్కాణం. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సయితం మక్కా అవిశ్వాసులతో పదేళ్ళ నిర్యుద్ధసంధి చేసుకోవటం గమనార్హం.

64. దేవుని అండదండలు ముస్లింల పక్షాన ఉన్నాయన్న శుభవార్త ఇందులో అంతర్లీనమై ఉంది. అల్లాహ్ అండదండలు లభించిన వారిని ఓడించటం ఎవరితరం?

65. పైగా ఆయన వారికి సంపూర్ణ ప్రతిఫలం ఒసగుతాడు. అందులో ఏ లోటూ చేయడు.

66. అదొక వెలుగు నీడల సయ్యాట. ఇక్కడ ఏ వస్తువూ స్థిరమైనది కాదు. ఆధారపడదగ్గదీ కాదు.

67. ఆయనకు మీ సిరిసంపదల అవసరం ఎంతమాత్రం లేదు. ఆయన ఖుద్దుగా సంపన్నుడు, నిరపేక్షాపరుడు. అందుకే ఆయన మీ సంపదనంతటినీ మీ నుంచి అడగలేదు. అందులోని అత్యల్ప భాగాన్ని మాత్రమే (రెండున్నర శాతం) జకాత్ రూపేణా కోరుతున్నాడు. అదీ నెల నెలా కాదు. ఏడాదికి ఒకసారి మాత్రమే! అదీ తన కోసం కాదు. మీ ఆత్మీయుల, మీ తోటి సోదరుల అక్కరలు తీర్చటానికే! అంతే గాని ఆయన మీ ధనంతో తన బొక్కసాన్ని నింపుకోవటం లేదు, మీ నుండి వసూలు చేసిన ధనాన్ని విశ్వవ్యవస్థ నడపటానికి ఖర్చుపెట్టడం లేదు.

68. అవసరానికి మించిన సొమ్ము గనక మీనుంచి కోరబడితే – ఎలాగైనా ఇవ్వాల్సిందేనని కాస్తంత గట్టిగా దబాయించి అడిగితే – మీరు లోభత్వం చూపేవారు. ఇస్లాంకు వ్యతిరేకంగా తిరుగుబాటును కూడా చేసి ఉండేవారు. "ఇదేమి జీవన వ్యవస్థ బాబూ, మేము సంపాదించింది కాస్తా లాక్కుంటుంది!" అని చెప్పి వుండేవారు.

69. అంటే – కొంతసొమ్మును జకాత్‌గా చెల్లించి, మరికొంత సొమ్మును దైవమార్గంలో ఖర్చుపెట్టమని కోరినప్పుడు...

70. అంటే – లోభిగా మారి దైవమార్గంలో ఖర్చుపెట్టడం వల్ల లభించే పుణ్యానికి దూరం అవుతున్నాడు.

71. దైవమార్గంలో ఖర్చుపెట్టేందుకు ఆయన మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాడంటే ఆయన దగ్గర ధనం లేక కాదు. ఆయన గొప్ప సంపన్నుడు. ఆయనకు మీ ధనధాన్యాల అవసరం ఏమీ లేదు. కాకపోతే మీ మేలును కోరి ఆయన మీకు ఇలా ఆదేశిస్తున్నాడు. ఎందుకంటే ఈ 'దానం' ద్వారా మీ ఆత్మలు పరిశుద్ధమవుతాయి. దాంతోపాటు సమాజంలోని అగత్యపరుల అవసరాలు తీర్తాయి. సామాజిక సమస్యలు పరిష్కృతం అవుతాయి. తద్వారా మీరు శత్రువును జయించగలుగుతారు. ఎట్టి పరిస్థితిలోనయినా మీరు అల్లాహ్‌ దయపై ఆధారపడి ఉన్నారే తప్ప ఆయన మీపై ఆధారపడిలేడని తెలుసుకోండి.

72. అంటే – మీరు గనక ఇస్లాం పట్ల విముఖులై అవిశ్వాసులై పోయినట్లయితే....

73. అంటే – దైవవిధేయతలోనూ, దైవప్రవక్త మాట వినటంలోనూ వారు మీకన్నా ముందంజలో ఉంటారు. దైవమార్గంలో నిస్సంకోచంగా ఖర్చుపెట్టేవారై ఉంటారు. ఇంతకీ వారెవరు? అని దైవప్రవక్త (స)ను అడగ్గా, ఆయన (స) హజ్రత్‌ సల్మాన్‌ ఫార్సీ (రజి) భుజంపై చెయ్యిపెట్టి, ఇలా అన్నారు : "వారు ఈయన, ఈయన జాతివారు. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షి! ఒకవేళ 'విశ్వాసం' నక్షత్రానికి వ్రేలాడుతున్నాసరే దాన్ని పారసీకుల్లోని కొందరు వ్యక్తులు సాధిస్తారు." (తిర్మిజీ, అల్‌బానీ గారు కూడా ఈ హదీసుని తన 'సహీహ్‌' గ్రంథంలో పేర్కొన్నారు).

48 వ సూరా

# అల్ ఫత్‌హ్

## విజయం

అవతరణ మదీనాలో

ఆయతులు 29

### పరిచయం

అల్లాహ్ మార్గంలో పోరాడడం, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు సహాయపడడం గురించి, కపటవిశ్వాసుల గురించి ఇందులో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరా మొదటి ఆయతులో విజయం గురించిన ప్రస్తావన వచ్చింది. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది.

ఈ సూరాలో మక్కా అవిశ్వాసులకు, ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు మధ్య కుదిరిన చారిత్రక హుదైబియా ఒప్పందం గురించిన ప్రస్తావన ఉంది. ఈ ఒప్పందం హి.జ్రీశకం ఆరవ సంవత్సరంలో కుదిరింది. ఈ ఒప్పందం ముస్లిములకు ఒక ముఖ్యమైన రాజకీయ విజయాన్నిచ్చింది. కొత్తగా ఏర్పడిన ముస్లిం రాజ్యానికి గుర్తింపును ఇచ్చింది. విజయం అన్నది కేవలం అల్లాహ్ మాత్రమే ఇస్తాడని ఈ సూరా నొక్కి చెప్పింది. పోరాడుతున్న విశ్వాసుల హృదయాలలో ఆయన ప్రశాంతతను, స్థయిర్యాన్ని కలిగించాడు. వారు స్థిరంగా నిలబడేలా, పోరాటం కొనసాగించేలా ప్రోత్సహించాడు. పోరాడుతున్న అవిశ్వాసుల హృదయాల్లో భీతిని కలిగించింది కూడా ఆయనే.

ఈ సూరాలో కపట విశ్వాసుల గురించి కూడా ప్రస్తావన వచ్చింది. వారు ముందుకు రాకుండా వెనకే ఉండిపోయారు. యుద్ధానికి రాకపోవడానికి నానావిధ సాకులు చెప్పసాగారు. వారిని డోలాయమానమైన విశ్వాసం కలిగినవారుగా, ప్రాపంచిక ప్రయోజనాలను, యుద్ధసొత్తును మాత్రమే ఆశిస్తున్నవారిగా, కీడులో కూరుకుపోయిన వారిగా, చెడు ఆలోచనల్లో నిమగ్నమైన వారిగా అభివర్ణించడం జరిగింది.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 18,19<br>25-27 | 292-324 | 'ఇస్లాం విజయారంభం' 'ఒప్పందం' 'అబూ బసీర్ దైన్య స్థితి' | నిత్యం ఏదో ఒక సాకుతో దైవప్రవక్త ముహమ్మద్(స)ను, ముస్లింలను వేధించే మక్కా బహుదైవారాధకులు తాము తవ్విన గోతిలో తామే పడ్డారు. ఈ సంఘటన మక్కా విజయానికి నాంది పలికింది. మదీనా ముస్లింలకు-మక్కా బహుదైవారాధకులకు మధ్య ఒక చారిత్రాత్మక సంధి జరిగిన సందర్భం అది. మరి ఆ సంధి షరతులన్నీ మక్కావారికి అనుకూలంగానే ఉన్నాయి. కాని తరువాత ఆ షరతులే వారికి ప్రతికూలంగా పరిణమించాయి. ముస్లింల ఓటమిని విజయంగా మలచిన ఆ చారిత్రాత్మక సంధి సంగతులు! |

## అల్ ఫత్హ్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** (ఓ ప్రవక్తా!) మేము నీకు చాలా స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము.

**2** అల్లాహ్ నీ ముందటి, వెనుకటి పొరపాట్లను మన్నించటానికి,[2] నీపై తన అనుగ్రహాన్ని పరిపూర్ణం గావించటానికి,[3] నిన్ను రుజుమార్గంపై నడిపించటానికి,[4]

## سُورَةُ الفَتْح

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

إِنَّا فَتَحْنَا لَكَ فَتْحًا مُّبِينًا ①

لِّيَغْفِرَ لَكَ اللَّهُ مَا تَقَدَّمَ مِن ذَنبِكَ وَمَا تَأَخَّرَ وَيُتِمَّ نِعْمَتَهُ عَلَيْكَ وَيَهْدِيَكَ صِرَاطًا مُّسْتَقِيمًا ②

1. హిజ్రీ 6వ సంవత్సరంలో మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు సుమారు 1400 మంది సహచరులతో కలసి 'ఉమ్రహ్' చేసే సంకల్పంతో మక్కా వైపుకు పయనమయ్యారు. కాని మక్కాకు సమీపంలోని హుదైబియా వద్ద అవిశ్వాసులు వారిని ఉమ్రహ్ చేయకుండా నిలువరించారు. దైవప్రవక్త (స) గారు తన సహచరుడైన హజ్రత్ ఉస్మాన్ (రజి)ను ప్రతినిధిగా చేసి, ఖురైషు నాయకులతో మాట్లాడి రమ్మని మక్కా నగరానికి పంపించారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) తిరిగి రావటంలో ఆలస్యం జరిగింది. మరోవైపు ఉస్మాన్ వధించబడినట్లు వదంతులు వ్యాపించాయి. ఒక దశలో ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకుందామని దైవప్రవక్త (స) తన సహచరుల నుంచి ప్రతిజ్ఞ కూడా తీసుకున్నారు. ఆ ప్రతిజ్ఞే **'బైతె రిజ్వాన్'**గా ప్రసిద్ధి చెందింది. కాని హత్యా వార్త నిజం కాదని, అదొక వదంతి మాత్రమేనని తరువాత తెలిసింది. ఈ ఏడాది మాత్రం ముస్లింలకు ఉమ్రా చేసేందుకు అనుమతి లభించదనీ, వచ్చే సంవత్సరం అనుమతి ఇస్తామని ఖురైషు నాయకులు తెగేసి చెప్పారు. అందువల్ల ముస్లింలు హుదైబియా లోయలోనే తమ పశువులను ఖుర్బానీ చేసి, శిరోముండనం చేయించుకుని తిరిగివెళ్ళిపోవలసి వచ్చింది.

   ఈ సందర్భంగా దైవప్రవక్త (స) మక్కా నాయకులతో చేసుకున్న ఒప్పందమే ఇస్లాం చరిత్రలో కీలకమైన **'హుదైబియా ఒప్పందం'**గా ఖ్యాతి గడించింది. ప్రవక్త ప్రియ సహచరుల్లో చాలామందికి ఆ ఒడంబడిక నచ్చలేదు. తాము అంతమందిమి ఉండి కూడా లొంగిపోయే ధోరణిలో శత్రువుతో సంధి చేసుకోవటం ఏమిటి? అని ప్రవక్త (స)ను నిలదీసి అడిగారు కూడా. కాని దైవప్రవక్త (స) ఎంతో దూరదృష్టితో వ్యవహరించి సంధిపత్రంపై సంతకం చేశారు. హుదైబియా నుంచి మదీనాకు తిరిగి వస్తుండగా ఈ సూరా అవతరించింది. ఈ సంధిని దేవుడు చాలా స్పష్టమైన విజయంగా అభివర్ణించాడు. ఎందుకంటే ఈ సంధి మక్కా విజయానికి మార్గం సుగమం చేసింది. హుదైబియా ఒప్పందం జరిగిన రెండేళ్ళకే ముస్లింలు విజయకేతనం ఎగురవేస్తూ మక్కాలో ప్రవేశించారు. అందుకే ప్రవక్త సహచరులలో కొందరు 'మక్కా విజయాన్ని' గాకుండా హుదైబియా ఒప్పందాన్నే సిసలయిన విజయంగా పేర్కొనేవారు. ఈ సూరా గురించి వ్యాఖ్యానిస్తూ దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "ఈ రోజు రాత్రి నాపై ఒక సూరా అవతరించింది. అది నాకు యావత్తు ప్రపంచంకన్నా, ప్రపంచంలో ఉన్న సమస్త వస్తువులకన్నా ప్రియమైనది." (బుఖారీ – కితాబుల్ మగాజీ)

2. ఇంతకీ ఏమిటా పొరపాట్లు? అంటే ఉత్తమమైన నిర్ణయాలను గైకొనకపోవటం లేదా ఆయన (స) తన విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించి తీసుకున్న నిర్ణయాలు – అవి దోషపూరితం కాకపోయినప్పటికీ అల్లాహ్ వాటిని ఇష్టపడలేదు. ఉదాహరణకు : అబ్దుల్లా బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) సంఘటన. దానిపై అబస్ సూరా అవతరించింది. ఈ సంఘటనలు పెద్ద పొరపాట్లు కావు. అయినప్పటికీ ఆయన (సఅసం) స్థాయికి అవి శోభించవన్నది దేవుని అభిమతం. అందుకే ఆయన ద్వారా మరుపువల్ల జరిగిన ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లను సయితం క్షమిస్తున్నట్లు ఈ సూరాలో అల్లాహ్ ప్రకటించాడు. ఈ ఆయతులో పేర్కొనబడిన మూడు కారణాల వల్ల హుదైబియా ఒడంబడిక స్పష్టమైన

3 ఇంకా, అల్లాహ్ నీకు గొప్ప సహాయం అందజేయటానికిగాను (ఈ విజయం వొసగబడింది).

وَّيَنْصُرَكَ اللّٰهُ نَصْرًا عَزِيْزًا ③

4 విశ్వాసుల హృదయాలలో నెమ్మదిని (ప్రశాంతతను, నిబ్బరాన్ని) వేసినవాడు ఆయనే,[5] వారి విశ్వాసంతోపాటు మరింత విశ్వాసం పెంపొందటానికి. భూమ్యాకాశాలలోని సైనిక దళాలన్నీ అల్లాహ్‌వే.[6] అల్లాహ్ జ్ఞాన సంపన్నుడు, వివేకవంతుడు.

هُوَ الَّذِيْٓ اَنْزَلَ السَّكِيْنَةَ فِيْ قُلُوْبِ الْمُؤْمِنِيْنَ لِيَزْدَادُوْٓا اِيْمَانًا مَّعَ اِيْمَانِهِمْ ؕ وَلِلّٰهِ جُنُوْدُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ وَكَانَ اللّٰهُ عَلِيْمًا حَكِيْمًا ④

5 విశ్వసించిన పురుషులను, విశ్వసించిన స్త్రీలను క్రింద కాలువలు ప్రవహించే స్వర్గ వనాలలో ప్రవేశింపజేయడానికి,[7] వారక్కడ కలకాలం ఉండేటందుకు, వారి పాపాలను వారి నుండి తొలగించేటందుకు (అల్లాహ్ వారికి ఈ స్థిమితాన్ని ప్రసాదించాడు). అల్లాహ్ సన్నిధిలో ఇదే గొప్ప విజయం.

لِّيُدْخِلَ الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَا وَيُكَفِّرَ عَنْهُمْ سَيِّاٰتِهِمْ ؕ وَكَانَ ذٰلِكَ عِنْدَ اللّٰهِ فَوْزًا عَظِيْمًا ⑤

విజయంగా చెప్పబడింది: వీటిలో మొదటిది పొరపాట్ల మన్నింపు. ఈ ఒడంబడిక తరువాత ఇస్లాంలో ప్రవేశించే వారి సంఖ్య అనుదినం పెరగసాగింది. తత్కారణంగా ఆయన పుణ్యఫలం ఎన్నోరెట్లు పెరిగిపోయింది. ఆయనకు ఎన్నో ఉన్నత స్థానాలు ప్రాప్తమయ్యాయి.

3. అంటే, ఓ ముహమ్మద్! నువ్వు ఏ జీవన ధర్మం వైపునకు ప్రజల్ని ఆహ్వానిస్తున్నావో ఆ ధర్మాన్ని ఉన్నత స్థాయికి చేర్చుతానని అల్లాహ్ హామీ ఇచ్చాడు. మరి కొంతమంది విద్వాంసుల ప్రకారం పాపాల మన్నింపు మరియు ధర్మమార్గంపై స్థిరత్వమే అనుగ్రహాల పరిపూర్తికి ప్రబల నిదర్శనం (ఫత్‌హుల్ ఖదీర్).

4. అంటే – నీకు రుజుమార్గంపై నిలకడను, స్థిమితాన్ని చేకూర్చటానికి, ధర్మపథంలో నిన్ను అత్యున్నత శిఖరాలపై చేర్చటానికి మేము నీకు ఈ విజయాన్ని అనుగ్రహిస్తున్నాము. ఈ సూరా అవతరించిన అతి స్వల్ప కాలంలోనే అల్లాహ్ వాగ్దానం చేసిన ఆ తోడ్పాటు లభించింది. సత్యధర్మం దిన దిన ప్రవర్ధమానం అయింది.

5. అంటే – హుదైబియా ఒడంబడికలోని ఏకపక్ష షరతుల మూలంగా ముస్లింల మనసులలో కలిగిన వ్యాకులతను దూరం చేయడానికి అల్లాహ్ వారి హృదయాలలో ఒకవిధమైన ప్రశాంతతను కలిగించాడు. తద్వారా వారి మనసులు కుదుటపడ్డాయి. వారి ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. దైవంపై వారికి గల విశ్వాసం మరింతగా పెరిగింది. విశ్వాసిలోని విశ్వాసం పెరుగుతూ, తరుగుతూ ఉంటుందనటానికి ఈ ఆయతు కూడా ఒక నిదర్శనమే.

6. అల్లాహ్ గనక తలచుకుంటే తన సైనిక పటాలాలలో ఏదేని ఒక పటాలం చేత (ఉదాహరణకు : దైవదూతల చేత) అవిశ్వాసులను అంతమొందించగలడు. కాని ఆయన తన పరిపూర్ణ యుక్తిననుసరించి అలా చేయలేదు. దీనికి బదులు ధర్మయుద్ధం చేసి దుష్టులను దండించమని విశ్వాసులను ఆదేశించాడు. లేదా ఈ ఆయతుకు మరో అర్థం ఇది : భూమ్యాకాశాలలో సంచరించే దైవదూతలు, ఇతర శక్తిమంతమైన సైనికదళాలు అన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. వాటిచేత ఆయన తాను కోరిన పని చేయించుకోగలడు. కొన్ని సందర్భాలలో ఒక అవిశ్వాస సైనిక దళాన్ని మరో అవిశ్వాస సైనిక పటాలంపై దాడి చేయించి పరోక్షంగా ముస్లింలకు సహాయపడతాడు. ఇంతకీ చెప్పొచ్చిందేమిటంటే, ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీపై ఆధారపడి లేడు. ఆయన ఏ సేనావాహిని చేతనయినా తన ప్రవక్తకు, సత్యధర్మానికి తోడ్పడగలడు. ఆయన వల్ల సాధ్యం కానిదంటూ ఏదీ లేదు (ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్).

7. హదీసు ప్రకారం అల్ ఫత్‌హ్ సూరా తొలి వాక్యాలను విన్నప్పుడు ప్రవక్త ప్రియ సహచరులు (రజి), "ఓ దైవప్రవక్తా (స) ! మీకు శుభం. మరి మా కోసం ఏముంది?!" అని సందేహపడ్డారు. అప్పుడు అల్లాహ్ విశ్వాసులైన స్త్రీ

6 అల్లాహ్ విషయంలో చెడుగా అనుమానించే[8] కపట విశ్వాసులైన పురుషులను–కపట విశ్వాసులైన స్త్రీలను, బహు దైవారాధకులైన పురుషులను – బహుదైవారాధకులైన స్త్రీలను దండించటానికి (కూడా అల్లాహ్ ముస్లింలకు మనో నిబ్బరాన్ని నూరిపోశాడు). వాస్తవానికి వారి దురనుమానాలు వారిపైనే పడతాయి.[9] అల్లాహ్ వారిపై ఆగ్రహించాడు. వారిని శపించాడు. వారి కోసం నరకాన్ని సిద్ధం చేశాడు. అది అత్యంత చెడ్డ గమ్యస్థానం.

وَّيُعَذِّبَ الْمُنٰفِقِيْنَ وَالْمُنٰفِقٰتِ وَالْمُشْرِكِيْنَ وَالْمُشْرِكٰتِ الظَّآنِّيْنَ بِاللّٰهِ ظَنَّ السَّوْءِ ؕ عَلَيْهِمْ دَآئِرَةُ السَّوْءِ ۚ وَغَضِبَ اللّٰهُ عَلَيْهِمْ وَلَعَنَهُمْ وَاَعَدَّ لَهُمْ جَهَنَّمَ ؕ وَسَآءَتْ مَصِيْرًا ۝

7 మరి భూమ్యాకాశాల సేనలన్నీ అల్లాహ్‌వే. అల్లాహ్ మహాశక్తిశాలి, వివేచనా శీలి.[10]

وَلِلّٰهِ جُنُوْدُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ وَكَانَ اللّٰهُ عَزِيْزًا حَكِيْمًا ۝

8 (ఓ ప్రవక్తా!) నిశ్చయంగా మేము నిన్ను సాక్ష్యమిచ్చేవానిగా, శుభవార్తను వినిపించే వానిగా, హెచ్చరించే వానిగా చేసి పంపాము.

اِنَّآ اَرْسَلْنٰكَ شَاهِدًا وَّمُبَشِّرًا وَّنَذِيْرًا ۝

9 (ఓ ముస్లిములారా!) మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించటానికి, అతనికి తోడ్పడటానికి, అతన్ని గౌరవించటానికి, ఉదయం సాయంత్రం అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉండటానికి గాను (మేము ఈ ఏర్పాటు చేశాము).

لِّتُؤْمِنُوْا بِاللّٰهِ وَرَسُوْلِهٖ وَتُعَزِّرُوْهُ وَتُوَقِّرُوْهُ ؕ وَتُسَبِّحُوْهُ بُكْرَةً وَّاَصِيْلًا ۝

10 ఎవరయితే (నీ చేతిలో చెయ్యేసి) విధేయతా ప్రమాణం చేస్తున్నారో వారు యదార్థానికి అల్లాహ్‌తో ప్రమాణం చేస్తున్నారు.[11] వారి చేతులపై అల్లాహ్ చెయ్యి ఉంది.[12] ఎవడయినా ప్రమాణ భంగానికి పాల్పడినట్లయితే, ఆ ప్రమాణ భంగపు నష్టం

اِنَّ الَّذِيْنَ يُبَايِعُوْنَكَ اِنَّمَا يُبَايِعُوْنَ اللّٰهَ ؕ يَدُ اللّٰهِ فَوْقَ اَيْدِيْهِمْ ۚ فَمَنْ نَّكَثَ فَاِنَّمَا يَنْكُثُ

పురుషులను స్వర్గంలో ప్రవేశింపజేస్తాడన్న వాక్యాన్ని అవతరింపజేశాడు. (సహీహ్ బుఖారీ–హుదైబియా సమరం).

8. అంటే, వారు అల్లాహ్ ఆజ్ఞలపై లేనిపోని అనుమానాలను రేకెత్తిస్తారు. దైవప్రవక్త(స), ప్రవక్త సహచరులు పరాభవం పాలవుతారని లేదా వారు సమూలంగా అంతమొందించబడతారని, దాంతో ఇస్లాం నామరూపాలు లేకుండా పోతుందని అంచనాలు వేస్తారు. (ఇబ్నె కసీర్).

9. ముస్లింలకు ఏ చెడు కాలం వస్తుందని వారు ఎదురు చూస్తున్నారో ఆ దుష్టవలయంలో వారు స్వయంగా చిక్కుకుంటారు.

10. అల్లాహ్ తన విరోధులను, తాను తలచిన రీతిలో తుదముట్టిస్తాడు. కాకపోతే ఆయన తన ప్రణాళిక ననుసరించి ఎవరికి ఎంత విడుపు ఇవ్వాలో ఇస్తాడు. ఆ తరువాత ఆయన శాసనం అమలవుతుంది.

11. ఈ ప్రమాణం వాస్తవానికి అల్లాహ్‌తో చేసిన ప్రమాణమే. ఎందుకంటే జిహాద్ చేయమని ఆజ్ఞాపించినది ఆయనే. దానికి ప్రతిఫలం ఇచ్చే బాధ్యత కూడా ఆయనదే. వారి ధనప్రాణాలను ఆయన స్వర్గానికి బదులుగా కొనుగోలు చేశాడు (తౌబా – 111). అలాగే ప్రవక్తకు విధేయత చూపినవాడు అల్లాహ్‌కు విధేయత చూపినట్లే లెక్క (నిసా–80).

عَلٰى نَفْسِهٖ ۚ وَمَنْ اَوْفٰى بِمَا عٰهَدَ عَلَيْهُ اللّٰهَ فَسَيُؤْتِيْهِ اَجْرًا عَظِيْمًا ⑩

తన ఆత్మకే చేకూర్చుకుంటాడు.[13] మరెవరయినా అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నెరవేరిస్తే[14] అల్లాహ్ అతనికి త్వరలోనే గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

سَيَقُوْلُ لَكَ الْمُخَلَّفُوْنَ مِنَ الْاَعْرَابِ شَغَلَتْنَآ اَمْوَالُنَا وَاَهْلُوْنَا فَاسْتَغْفِرْ لَنَا ۚ يَقُوْلُوْنَ بِاَلْسِنَتِهِمْ مَّا لَيْسَ فِيْ قُلُوْبِهِمْ ۚ قُلْ فَمَنْ يَّمْلِكُ لَكُمْ مِّنَ اللّٰهِ شَيْـًٔا اِنْ اَرَادَ بِكُمْ ضَرًّا

**11** ఇక పల్లెటూరి ప్రజలలో వెనుక ఉండి పోయిన వారు ఇప్పుడు నీ దగ్గరకు వచ్చి, "మా ఆస్తిపాస్తులు, మా ఆలుబిడ్డలు మమ్మల్ని కదల కుండా చేశాయి. తమరు కాస్త మా క్షమాపణకై ప్రార్థించండి"[15] అని ప్రాధేయపడతారు. వారు తమ హృదయాలలో లేనిదాన్ని నోటితో పలుకుతున్నారు.[16] వారికి ఈ విధంగా చెప్పు : "అల్లాహ్‌యే గనక మీకేదైనా నష్టాన్ని కలిగించదలిస్తే[17]

12. **'బైతె రిజ్వాన్'** నేపథ్యంలో అవతరించిన ఆయతు ఇది. హజ్రత్ ఉస్మాన్ (రజి) మక్కాలో హత్యచేయబడ్డారన్న వదంతులు వ్యాపించినపుడు, దానికి ప్రతీకారం తీర్చుకోవటానికి సుమారు 14 లేక 15 వందల మంది సహచరుల చేత దైవప్రవక్త (సఅసం) తీసుకున్న ప్రమాణ స్వీకారం ఇది.

13. **'నక్సున్'** (نَكَثَ) అంటే ప్రమాణ భంగం చేయటం అని అర్థం. అంటే యుద్ధంలో పాల్గొంటానని ప్రతినబూనిన పిదప మాట తప్పటం అన్నమాట. ఎవరయినా ఇచ్చిన మాటను నిలుపుకోకపోతే దాని దుష్ఫలితం వారి మీదే పడుతుంది.

14. అంటే దైవప్రవక్త (స)కు సహాయంగా నిలిచి, శత్రువుతో పోరాడితే, విజయం వరించే వరకూ ప్రవక్త (స)కు వెన్నంటి నిలిస్తే అలాంటివారికి అల్లాహ్ గొప్ప పుణ్యఫలం ప్రసాదిస్తాడు.

15. మదీనా నగరానికి చుట్టుప్రక్కల ఉన్న పల్లెటూళ్ళలో నివసించే గిఫార్, ముజైన, జుహైన, అస్లం తదితర అరబ్బు తెగల వారి గురించి ఈ ఆయతు అవతరించింది. దైవప్రవక్త (సఅసం) కలగన్న తరువాత ఉమ్రహ్ కొరకు బయలుదేర వలసిందిగా ప్రకటన గావించారు. అప్పుడు ఈ పల్లెటూరి అరబ్బులు సందిగ్ధంలో పడిపోయారు. వారి ఆలోచనలు ఇలా సాగాయి–ప్రస్తుత మక్కా పరిస్థితులు ఉమ్రహ్ యాత్రకు అనుకూలంగా లేవు. ఇప్పటికీ మక్కాలో అవిశ్వాసుల ప్రాబల్యం ఉంది. మరోవైపు ముస్లింలు బలహీనులుగా ఉన్నారు. ఉమ్రాకోసం వెళ్లే ముస్లింలకు సాయుధులై మక్కాలో ప్రవేశించే అవకాశం కూడా లేదు. ఇలాంటి పరిస్థితులలో అవిశ్వాసులు తమపై విరుచుకుపడితే వారిని ప్రతిఘటించటం సాధ్యం కానిపని. కాబట్టి ఇప్పుడు మక్కాకు వెళ్ళటం అంటే మృత్యు కుహరంలోకి తలదూర్చటం వంటిదే.

ఈ అనుమానాలతోనే పల్లెటూరి బైతులు మహాప్రవక్త (సఅసం)తో కలసి మక్కాకు వెళ్ళలేదు. కాని ముస్లింలు సురక్షితంగా తిరిగివచ్చిన మీదట కుంటిసాకులు చెబుతూ, తమ మన్నింపు కోసం ప్రార్థించమని దైవప్రవక్త (స)ను ప్రాధేయపడ్డారు.

16. మేము లేనపుడు మా పిల్లాజల్లను, గొడ్డుగోదాములను కనిపెట్టుకుని ఉండేవారెవరూ లేకపోవటం వల్ల మేమెటూ కదలలేకపోయామని వారు కతలు చెబుతున్నారు. కాని వాస్తవానికి వారు చెప్పేది నిజం కాదు. వారి హృదయాలలో గూడు కట్టుకున్న కాపట్య రోగం మూలంగా, మృత్యువు భయం కారణంగా వారు తప్పించుకున్నారు.

17. ఒకవేళ అల్లాహ్ మీ ఆస్తిపాస్తులను సర్వనాశనం చేయదలిస్తే, మీ ఆలుబిడ్డలను అంతమొందించదలిస్తే ఆ కీడు నుండి మిమ్మల్ని కాపాడగలవాడెవడైనా ఉన్నాడా?

أَوْ أَرَادَ بِكُمْ نَفْعًا ۚ بَلْ كَانَ اللَّهُ بِمَا تَعْمَلُونَ
خَبِيرًا ﴿١١﴾

లేదా మీకేదైనా లాభాన్ని చేకూర్చదలిస్తే[18] మీ విషయంలో అల్లాహ్ నిర్ణయాన్ని అడ్డుకునే అధికారం ఎవరికుంది? పైగా మీరు చేస్తున్నదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు.[19]

بَلْ ظَنَنتُمْ أَن لَّن يَنقَلِبَ الرَّسُولُ وَالْمُؤْمِنُونَ
إِلَىٰ أَهْلِيهِمْ أَبَدًا وَزُيِّنَ ذَٰلِكَ فِي قُلُوبِكُمْ
وَظَنَنتُمْ ظَنَّ السَّوْءِ وَكُنتُمْ قَوْمًا بُورًا ﴿١٢﴾

**12** అంతేకాదు, "దైవప్రవక్త గానీ, ముస్లింలు గానీ తమ ఇంటి వారి వైపుకు తిరిగి రావటం అసంభవం అని మీరు తల పోశారు. ఈ ఆలోచన మీ ఆంతర్యాలను అలరించింది. మొత్తానికి మీ అనుమానాలు బహుచెడ్డవి.[20] అసలు మీరు ముందు నుంచే వినాశం పొందే[21] జనుల్లా ఉన్నారు.

وَمَن لَّمْ يُؤْمِن بِاللَّهِ وَرَسُولِهِ فَإِنَّا
أَعْتَدْنَا لِلْكَافِرِينَ سَعِيرًا ﴿١٣﴾

**13** మరెవడయితే అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించడో అలాంటి అవిశ్వాసుల కోసం మేము మండే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము.

وَلِلَّهِ مُلْكُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ يَغْفِرُ لِمَن
يَشَاءُ وَيُعَذِّبُ مَن يَشَاءُ ۚ وَكَانَ اللَّهُ
غَفُورًا رَّحِيمًا ﴿١٤﴾

**14** భూమ్యాకాశాల సర్వసత్తాధికారం అల్లాహ్‌దే. తాను కోరిన వారిని ఆయన క్షమిస్తాడు, తాను కోరినవారిని శిక్షిస్తాడు. అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, కరుణించేవాడు.[22]

سَيَقُولُ الْمُخَلَّفُونَ إِذَا انطَلَقْتُمْ إِلَىٰ مَغَانِمَ
لِتَأْخُذُوهَا ذَرُونَا نَتَّبِعْكُمْ ۖ يُرِيدُونَ

**15** మీరు యుద్ధప్రాప్తిని తీసుకోవటానికి వెళుతున్నప్పుడు, వెనుక ఉండిపోయిన జనులు (గబగబా) వచ్చి, "మమ్మల్ని కూడా మీ వెంట రావటానికి అనుమతించండి"[23] అని అంటారు. వారు

18. ఒకవేళ అల్లాహ్ మీకు సహాయం చేయదలిస్తే, యుద్ధప్రాప్తి ద్వారా మీ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచదలిస్తే అడ్డుకోగల శక్తి ఎవరికుంది? దైవప్రవక్త (స) వెంట వెళ్ళకుండా ఉంటే తాము ధనప్రాణాల నష్టం నుండి సురక్షితంగా ఉండగలమని ఈ పల్లెటూరి తెగలవారు అంచనాలు వేశారు. కాని లాభనష్టాలను కలిగించే అధికారం యదార్థానికి అల్లాహ్ అధీనంలోనే ఉంది.

19. అంటే – ఆయన మీ ఆచరణల ప్రకారం మీకు ప్రతిఫలం వొసగుతాడు.

20. అల్లాహ్ తన ప్రవక్తకు సహాయపడటం అనేది వట్టిమాటే అన్న వారి అనుమానం రకరకాల కుశంకలకు తావు కల్పించింది.

21. వినాశం వారి నొసట రాసివుంది. ఒకవేళ వారు ప్రాపంచిక జీవితంలో దీన్నుండి తప్పించుకున్నా పరలోక జీవితంలో మాత్రం తప్పించుకోలేరు. ఎట్టి పరిస్థితిలోనూ వారు ఘోరశిక్షను అనుభవించాల్సిందే. **"బూరన్"** (بُورًا) అంటే నాశనమయ్యేవారు అని అర్థం.

22. వెనుక ఉండిపోయిన వారు పశ్చాత్తాపం చెంది, అల్లాహ్ వైపుకు మరలవలసిందిగా ఇందులో చెప్పబడింది. వారు గనక తమ ఆంతర్యాల్లో తిష్ఠవేసిన కాపట్య రోగం పట్ల సిగ్గుతో కుంచించుకుపోయి క్షమాపణ కోరుకుంటే అల్లాహ్ ఎంతగానో క్షమించేవాడు, దయామయుడు.

23. ఈ వాక్యంలో ఖైబర్ యుద్ధ ప్రస్తావన ఉంది. హుదైబియాలోనే అల్లాహ్ ఈ శుభవార్తను ఇచ్చాడు. హుదైబియా ఒడంబడిక సందర్భంగా హాజరై ఉన్న సహచరులు మాత్రమే ఖైబర్ విజయప్రాప్తిలో భాగస్థులని కూడా అల్లాహ్

اَنْ يُّبَدِّلُوْا كَلٰمَ اللّٰهِ ؕ قُلْ لَّنْ تَتَّبِعُوْنَا كَذٰلِكُمْ
قَالَ اللّٰهُ مِنْ قَبْلُ ۚ فَسَيَقُوْلُوْنَ بَلْ
تَحْسُدُوْنَنَا ؕ بَلْ كَانُوْا لَا يَفْقَهُوْنَ اِلَّا قَلِيْلًا ﴿15﴾

అల్లాహ్ మాటనే మార్చివేయజూస్తున్నారు.[24] (ఓ ప్రవక్తా!) వారికి చెప్పేయి: "మీరు ఎట్టి పరిస్థితిలోనూ మా వెంట రాలేరు.[25] ఈ మేరకు అల్లాహ్ ముందుగానే సెలవిచ్చాడు." దానికి వారు, "అదికాదులెండి. మీరు మాపై అసూయ చెందుతున్నారు"[26] అని సమాధానమిస్తారు. అసలు విషయమేమిటంటే వారు విషయాన్ని చాలా కొద్దిగానే గ్రహిస్తారు.[27]

قُلْ لِّلْمُخَلَّفِيْنَ مِنَ الْاَعْرَابِ سَتُدْعَوْنَ اِلٰى قَوْمٍ
اُولِيْ بَاْسٍ شَدِيْدٍ تُقَاتِلُوْنَهُمْ اَوْ يُسْلِمُوْنَ ۚ
فَاِنْ تُطِيْعُوْا يُؤْتِكُمُ اللّٰهُ اَجْرًا حَسَنًا ۚ وَاِنْ
تَتَوَلَّوْا كَمَا تَوَلَّيْتُمْ مِّنْ قَبْلُ يُعَذِّبْكُمْ

**16** (ఓ ముహమ్మద్ – స!) పల్లెటూరి ప్రజలలో వెనుక ఉండి పోయిన వారితో ఇలా అను: "త్వరలోనే మీకు, తీవ్రంగా పోరాడే ఒక జాతితో తలపడేందుకు పిలుపు వస్తుంది. మీరు వారితో యుద్ధం చేయవలసి వస్తుంది. లేదా వారంతటవారే ఆత్మసమర్పణ చేసుకుంటారు.[28] (ఆ సమయంలో) మీరు గనక విధేయత చూపితే[29] అల్లాహ్ మీకు ఉత్తమప్రతిఫలం ప్రసాదిస్తాడు.[30] ఒకవేళ

స్పష్టపరిచాడు. అందువల్ల హుదైబియా నుంచి తిరిగివచ్చిన తరువాత దైవప్రవక్త (స), యూదుల నిరంతర వాగ్దాన భంగాలకు ప్రతిచర్యగా ఖైబర్‌ను ముట్టడించే వ్యూహాన్ని రూపొందించారు. ఆ సందర్భంగా ఈ వెనుక ఉండిపోయిన పల్లెటూరి బైతులు కూడా ప్రవక్త వెంట వస్తామని చెప్పారు. కాని దైవసంకేతం మేరకు వారి అభ్యర్థన ఆమోదించ బడలేదు. ఈ ఆయతులో పేర్కొనబడిన 'యుద్ధప్రాప్తి' అంటే భావం అది ఖైబర్ విజయం సందర్భంగా లభించిన ధనమే (మాలె గనీమత్).

24. **'అల్లాహ్ మాట'** అంటే ఖైబర్ విజయప్రాప్తిని హుదైబియా ఒడంబడికలో పాల్గొన్న యోధులకు పంచిపెట్టాలన్న అల్లాహ్ నిర్ణయాన్ని ఈ ప్రబుద్ధులు మార్చివేయదలుస్తున్నారు. కాని ఇలా జరగటానికి వీల్లేదు అని ఇక్కడ గుర్తుచేయటం జరిగింది.

25. అంటే మిమ్మల్ని ఖైబర్ ముట్టడి కోసం తీసుకుపోరాదన్నది దైవాజ్ఞ. కనుక మేము మిమ్మల్ని మా వెంట రానివ్వము.

26. మేము కూడా యుద్ధప్రాప్తిలో ఎక్కడ వాటా పొందుతామోనన్న అసూయతోనే మీరు ఈ చర్యకు ఒడిగట్టారన్నది వారి ఉద్దేశ్యం.

27. మొత్తానికి వారు తమ అజ్ఞానాన్ని, అవివేకాన్ని బయటపెట్టుకున్నారు. అసూయతోనో, ఓర్వలేనితనంతోనో వాళ్ళను వేరు చేయటం లేదు. లోగడ వారు చేసిన మోసానికి శిక్షగా ఈ చర్య గైకొనబడింది. ఆ సంగతిని వారు గ్రహించకపోవటం విచారకరం.

28. ఇంతకీ పోరాట పటిమ గల ఆ జాతి ఏది? ఈ విషయంలో ఖుర్ఆన్ వ్యాఖ్యాతల మధ్య అభిప్రాయభేదం ఉంది. అరేబియాకు చెందిన కొన్ని తెగలవారే ఆ జాతి వారని, ఉదాహరణకు : హవాజిన్ లేక సఖీఫ్ తెగవారనీ, హునైన్ వద్ద ముస్లిములను వారు తీవ్రంగా ప్రతిఘటించారని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. లేదా అబద్ధాగ్రేసరుడైన ముసైలమ తెగవారు (బనూ హనీఫా) అని మరికొందరన్నారు. పారసీక దేశస్థులైన మజూసీలే ఈ యుద్ధకాముకులని కొందరు భావించగా, రోము రాజ్యానికి చెందిన క్రైస్తవులే ఆ యుద్ధ వీరులని మరికొందరు తలపోశారు. హుదైబియా సందర్భంగా వెనుక ఉండిపోయిన పల్లెటూరి అరబ్బులనుద్దేశించి, "తొందరగానే మీరు ఒక బలోపేతమైన జాతితో తలపడేందుకు పిలువబడతారు. ఒకవేళ ఆ జాతివారు లొంగిపోతే సరి. లేకుంటే మీరు ఆ కీలక సమయంలో మీ చిత్తశుద్ధిని, మీ శౌర్యాన్ని నిరూపించుకోవలసి వస్తుంది" అని చెప్పబడింది.

29. ఆ క్లిష్ట పరిస్థితిలో మీరు గనక ముస్లింలతో కలిసి శాయశక్తులా పోరాడినట్లయితే...

عَذَابًا أَلِيمًا ⑯

మీరు లోగడ విముఖత చూపినట్లే విముఖులైతే ఆయన మిమ్మల్ని బాధాకరమైన శిక్షకు లోను చేస్తాడు."[31]

لَيْسَ عَلَى الْأَعْمَىٰ حَرَجٌ وَلَا عَلَى الْأَعْرَجِ حَرَجٌ
وَلَا عَلَى الْمَرِيضِ حَرَجٌ ۗ وَمَن يُطِعِ اللَّهَ
وَرَسُولَهُ يُدْخِلْهُ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا
الْأَنْهَارُ ۖ وَمَن يَتَوَلَّ يُعَذِّبْهُ عَذَابًا
أَلِيمًا ⑰

**17** గుడ్డివానిపై ఎలాంటి నిందారోపణ లేదు, కుంటివానిపైనా ఎలాంటి నిందారోపణ లేదు, వ్యాధిగ్రస్తునిపై కూడా ఎలాంటి నిందారోపణ లేదు.[32] ఎవడు అల్లాహ్కు, ఆయన ప్రవక్తకు విధేయుడై మసలుకుంటాడో అల్లాహ్ అతన్ని క్రింద సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. మరి వెన్నుచూపి తిరిగి పోయినవానికి వ్యధాభరితమైన శిక్షకు గురిచేస్తాడు.

لَّقَدْ رَضِيَ اللَّهُ عَنِ الْمُؤْمِنِينَ إِذْ يُبَايِعُونَكَ
تَحْتَ الشَّجَرَةِ فَعَلِمَ مَا فِي قُلُوبِهِمْ فَأَنزَلَ
السَّكِينَةَ عَلَيْهِمْ وَأَثَابَهُمْ فَتْحًا قَرِيبًا ⑱

**18** (ఓ ప్రవక్తా!) విశ్వాసులు చెట్టు క్రింద నీతో (విధేయతా) ప్రమాణం చేస్తూ ఉన్నప్పుడు అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు.[33] వారి హృదయాలలో ఉన్న దాన్ని ఆయన తెలుసుకున్నాడు.[34] అందువల్ల వారిపై ప్రశాంతస్థితిని (స్థిమితాన్ని) అవతరింపజేశాడు.[35] ఇంకా సమీపంలోనే లభించే విజయాన్ని కూడా అనుగ్రహించాడు.[36]

30. .... ఇహలోకంలో మీకు పుష్కలంగా యుద్ధప్రాప్తి లభిస్తుంది. పరలోకంలో మీ పాపాలు కూడా మన్నించబడతాయి. మీకు స్వర్గం ప్రాప్తిస్తుంది.

31. అంటే, లోగడ మీరు హుదైబియా ఒప్పందం సందర్భంగా అనుమాన రోగంతో మక్కా వెళ్ళటానికి తటపటాయించినట్లే, మళ్లీ పలాయనవాదాన్ని గనక అనుసరిస్తే దేవుడు మిమ్మల్ని దండించటం ఖాయం.

32. అంధత్వం, అవిటితనం ఉండి నడవలేని పరిస్థితి ఉంటే చేసేదేమీ లేదు. ఇలాంటి వికలాంగులకు యుద్ధం నుండి మినహాయింపు తప్పకుండా లభించాల్సిందే. **'నిందారోపణ లేదు'** అంటే వారు యుద్ధంలో పాల్గొనకపోయినా పాపం కాదు అని భావం. అయితే వేరితర జబ్బులు తాత్కాలికమైనవి. అస్వస్థతకు గురై ఉన్నన్నాళ్లూ యుద్ధం నుంచి రాయితీ లభిస్తుంది. స్వస్థత చేకూరిన తరువాత వారు కూడా సాటి ముస్లిం యోధులతో కలిసి ధర్మయుద్ధం చేయవలసి ఉంటుంది.

33. ఆ వృక్షం క్రింద దైవప్రవక్త (స) ఎదుట ప్రతినబూనిన సహచరులు నికార్సయిన విశ్వాసులనటానికి, ఇదొక ప్రమాణ పత్రం. తాము ఖురైషులతో ప్రాణాలొడ్డి పోరాడతామని, ఎట్టి పరిస్థితిలోనూ యుద్ధ మైదానం నుండి పారిపోమని వారు శపథం చేశారు.

34. అంటే వారి ఆంతర్యాలలో వున్న చిత్తశుద్ధిని అల్లాహ్ తెలుసుకున్నాడు. దైవప్రవక్త సహచరులు (నవూజు బిల్లాహ్) నిజానికి కపటులనీ, పైకి మాత్రమే వారు విధేయులుగా నటించేవారని దైవవిరోధులు కొందరు కూతలు కూశారు. ఈ ఆయతు వారి ఈ పోకడను కూడా ఖండిస్తోంది.

35. వాస్తవానికి ముస్లింలు యుద్ధ సంకల్పంతో రాలేదు. వారి దగ్గర ఆయుధాలు కూడా లేవు. అయినప్పటికీ హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని దైవప్రవక్త (స) పిలుపు ఇవ్వగానే వారు ఒక్క క్షణం కూడా

**19** ఇంకా ఎన్నో విజయ సొత్తులను కూడా! వాటిని వారు స్వంతం చేసుకుంటారు.[37] అల్లాహ్ అపారశక్తిమంతుడు, వివేక సంపన్నుడు.

وَمَغَانِمَ كَثِيرَةً يَأْخُذُونَهَا ۗ وَكَانَ اللَّهُ عَزِيزًا حَكِيمًا ﴿١٩﴾

**20** అల్లాహ్ మీకు ఎన్నో విజయధనాలను గురించి వాగ్దానం చేసి ఉన్నాడు.[38] వాటిని మీరు కైవసం చేసుకుంటారు. దీన్ని మాత్రం ఆయన మీకు తొందరగానే ప్రసాదించాడు.[39] ప్రజల చేతులను మీ నుండి కట్టిపడేశాడు[40] – విశ్వాసులకు ఇదొక సూచనగా ఉండటానికి![41] ఇంకా ఆయన మిమ్మల్ని రుజుమార్గాన నడప టానికి!![42]

وَعَدَكُمُ اللَّهُ مَغَانِمَ كَثِيرَةً تَأْخُذُونَهَا فَعَجَّلَ لَكُمْ هَٰذِهِ وَكَفَّ أَيْدِيَ النَّاسِ عَنكُمْ وَلِتَكُونَ آيَةً لِّلْمُؤْمِنِينَ وَيَهْدِيَكُمْ صِرَاطًا مُّسْتَقِيمًا ﴿٢٠﴾

**21** ఇంకా – మీరింతవరకూ మీ అదుపులో తీసుకోలేకపోయిన మరికొన్ని విజయాలను కూడా వొసగాడు. అల్లాహ్ వాటిని పరివేష్టించి ఉన్నాడు.[43] అల్లాహ్ ప్రతిదానిపై అధికారం కలవాడు.

وَأُخْرَىٰ لَمْ تَقْدِرُوا عَلَيْهَا قَدْ أَحَاطَ اللَّهُ بِهَا ۚ وَكَانَ اللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرًا ﴿٢١﴾

---

సంకోచించకుండా సమరానికి సిద్ధమయ్యారు. తాను వారి హృదయాల నుంచి మృత్యు భయాన్ని తొలగించాననీ, వారికి గుండె దిటవును ప్రసాదించానని, ఆ కారణంగా వారి మనోనిబ్బరం ఎంతగానో పెరిగిందని దేవుడు చెబుతున్నాడు.

36. అంటే యూదుల కంచుకోట అయిన ఖైబర్ అన్నమాట! హుదైబియా నుండి తిరిగివచ్చిన మీదట ముస్లింలు దాన్ని కైవసం చేసుకున్నారు.

37. అంటే ఖైబర్‌లో లభించే యుద్ధప్రాప్తి అన్నమాట! ఖైబర్ సస్యశ్యామల ప్రదేశం. అక్కడ పంటలు పుష్కలంగా పండేవి. అక్కడ ముస్లింలకు యుద్ధప్రాప్తిగా పెద్ద మొత్తంలో సొమ్ము లభించింది. ఆ సొమ్ములు హుదైబియా యాత్రలో పాల్గొన్న ముస్లింలకు మాత్రమే పంచబడ్డాయి.

38. ఇది ఇతరత్రా విజయాల ద్వారా ప్రాప్తమయ్యే ధనధాన్యాల శుభవార్త. ఈ శుభవార్త వర్తమానానికే కాదు, భవిష్యత్తుకూ వర్తిస్తుంది. ప్రళయదినం వరకూ వర్తిస్తుంది.

39. అంటే ఖైబర్ విజయాన్ని, హుదైబియా ఒడంబడికను ఆయన మీకు శీఘ్రంగానే ప్రసాదించాడు.

40. హుదైబియా వద్ద మక్కా అవిశ్వాసుల చేతులు మీపై లేవకుండా ఆపాడు. ఖైబర్‌లో యూదుల చేతులను కట్టిపడేశాడు. ఈ విధంగా దేవుడు ఇస్లాం విరోధుల ఆత్మస్థయిర్యాన్ని నీరుగార్చి పరోక్షంగా ముస్లింలకు సాయం చేసాడు.

41. ముస్లింలు సంఖ్యాపరంగా అల్పంగా ఉన్నప్పటికీ ఏవిధంగా దేవుడు వారికి అండగా నిలిచి, ప్రాబల్యాన్ని ఇస్తాడో తెలుసుకోదలచే వారికి ఇదొక సూచన. దైవప్రవక్త (సఅసం) చెప్పినట్లుగా ఒక్కొక్కటీ ఈ సంఘటనలన్నీ నిజమని రుజువయ్యాయి. అంతిమ దైవప్రవక్త (సఅసం) చెప్పింది సత్యం అనటానికి ఇంతకన్నా రుజువు ఇంకేం కావాలి.

42. అంటే సన్మార్గంపై మీ పాదాలకు నిలకడను వొసగటానికి, ఈ సూచనల ద్వారా మీ విశ్వాసాన్ని మరింత దృఢతరం చేయటానికి అల్లాహ్ ఈ విధంగా మీకు తోడ్పడ్డాడు.

43. తరువాత కాలంలో ముస్లింలను వరించే విజయాల గురించి, ఆ విజయాల ద్వారా లభించే సిరిసంపదల గురించి ఈ వాక్యంలో సంకేతం ఇవ్వబడింది. ఆ విజయాలను, ఆ సిరిసంపదలను అల్లాహ్ తన చెప్పుచేతల్లో ఉంచుకున్నాడు.

**22** ఒకవేళ ఈ అవిశ్వాసులు మీతో యుద్ధానికి దిగినా వెన్నుచూపి పారిపోయి ఉండేవారు. మరి తమ కోసం ఏ సహాయకుణ్ణీ, రక్షకుణ్ణీ వారు పొంది ఉండేవారు కాదు.[44]

وَلَوْ قَٰتَلَكُمُ ٱلَّذِينَ كَفَرُوا۟ لَوَلَّوُا۟ ٱلْأَدْبَٰرَ ثُمَّ
لَا يَجِدُونَ وَلِيًّا وَلَا نَصِيرًا ﴿٢٢﴾

**23** ఇది అల్లాహ్ (సమ్మతించిన) సంప్రదాయం. ఇంతకు ముందు నుంచే ఇది ఆనవాయితీగా వస్తూవుంది.[45] నీవు అల్లాహ్ సంప్రదాయంలో ఎలాంటి మార్పునూ పొందజాలవు.

سُنَّةَ ٱللَّهِ ٱلَّتِى قَدْ خَلَتْ مِن قَبْلُ ۖ وَلَن
تَجِدَ لِسُنَّةِ ٱللَّهِ تَبْدِيلًا ﴿٢٣﴾

**24** ముఖ్యంగా మక్కాలో అల్లాహ్ మీకు అవిశ్వాసులపై ప్రాబల్యం ఇచ్చిన మీదట అవిశ్వాసుల చేతులను మీ నుండి, మీ చేతులను వారి నుండి ఆపినవాడు ఆయనే.[46] (అప్పుడు) మీరు చేసేదంతా అల్లాహ్ గమనిస్తూనే ఉన్నాడు.

وَهُوَ ٱلَّذِى كَفَّ أَيْدِيَهُمْ عَنكُمْ وَأَيْدِيَكُمْ
عَنْهُم بِبَطْنِ مَكَّةَ مِنۢ بَعْدِ أَنْ أَظْفَرَكُمْ
عَلَيْهِمْ ۚ وَكَانَ ٱللَّهُ بِمَا تَعْمَلُونَ بَصِيرًا ﴿٢٤﴾

ఇప్పటివరకూ మీరింకా వాటిని అందుకోలేదు. ఆయన తాను తలచినప్పుడు మీకు స్వాధీనపరుస్తాడు. అందులో సందేహానికి తావేలేదు. ఎందుకంటే ఆయన సార్వభౌముడు. సమస్తాన్నీ తన అదుపులో ఉంచుకున్నవాడు.

కొందరు మూలంలోని **'అహాత' (أَحَاطَ)** (పరివేష్ఠించి ఉన్నాడు) అన్న పదాన్ని 'అలిమ' (ఆయనకు తెలుసు) అనే అర్థంలో తీసుకున్నారు. అంటే ముమ్మందు మీరు ఏయే ప్రాంతాలను జయించనున్నారో అల్లాహ్‌కు తెలుసు అని భావం.

44. హుదైబియాలోని యుద్ధమేఘాల నేపథ్యంలో ఈ ఆయతు వచ్చింది. మక్కా అవిశ్వాసులు సంధికి ఒప్పుకోకుండా సమరానికే పూనుకుంటే వారికి ఘోరపరాభవమే మిగిలేది. వారు యుద్ధరంగం నుంచి పెడబొబ్బలు పెడుతూ పారిపోవలసిన పరిస్థితి ఏర్పడి ఉండేది. ఒకవేళ అదేగనక జరిగితే వారిని ఆదుకునే నాధుదెవడూ ఉండేవాడు కాదు. ఎందుకంటే ఆ కీలక తరుణమే గనక అనివార్యమై ఉంటే మేము ముస్లింలకు అండగా నిలబడి ఉండేవాళ్ళం. మరి మా ముందర నిలదొక్కుకునే శక్తి ఎవరికుందనీ?

45. దేవుని ఈ సంప్రదాయం కొత్తదేమీ కాదు. తరతరాలుగా, యుగయుగాలుగా నడుస్తూ వస్తున్నదే. సత్యవాదుల – అసత్యవాదుల మధ్య నిర్ణయాత్మకమైన సమరం జరిగినప్పుడల్లా అల్లాహ్ సత్యబలం ఉన్న విశ్వాసులకు అండగా నిలబడి, వారికి సహాయం చేశాడు. ఈ సంప్రదాయం ప్రకారమే లోగడ బద్ర్ యుద్ధమైదానంలో ముస్లింలకు దైవసహాయం అందింది.

46. దైవప్రవక్త (సఅసం) తన ప్రియ సహచరులతో హుదైబియా లోయ వద్ద విడిదిచేసి ఉన్నప్పుడు సాయుధులైన 80 మంది మక్కా అవిశ్వాసులు ఒక పథకం ప్రకారం అక్కడికి వచ్చారు. నెమ్మదిగా ముస్లింల శిబిరంలో జొరబడి అదను దొరకగానే అపకారం తలపెట్టాలన్నది వారి ఎత్తుగడ. ఈ సాయుధ దళం 'తన్‌యీమ్' గుండా హుదైబియా లోనికి ప్రవేశించింది. ముస్లింలు ఈ కమెండోలను పసిగట్టి, చాకచక్యంగా వారిని తమ అదుపులోకి తీసుకున్నారు. వాళ్ళందరినీ దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరు పరచారు. కాని దైవప్రవక్త (స) ఆ తరుణంలో ఎంతో నిగ్రహంతో వ్యవహరించారు. ఎందుకంటే యుద్ధానికి బదులు శాంతి ఒప్పందం వైపుకే దైవప్రవక్త మొగ్గుచూపారు. దొంగదెబ్బ తీయటానికి ప్రయత్నించిన ఆ దుండగులకు ఏ శిక్ష విధించినా తప్పులేదు. కాని ప్రవక్త మహనీయుల వారి ఆలోచన మరోవిధంగా ఉంది. శాంతి ఒప్పందమే ముస్లింలకు శ్రేయస్కరం అని ఆయనకు తెలుసు. అందుకే ఆయన (స) వాళ్ళందరినీ క్షమించి వదలిపెట్టారు. (సహీహ్ ముస్లిం – కితాబుల్ జిహాద్). **'బత్ను మక్కా'** అంటే హుదైబియా ప్రాంతమన్నమాట.

هُمُ الَّذِيْنَ كَفَرُوْا وَصَدُّوْكُمْ عَنِ الْمَسْجِدِ
الْحَرَامِ وَالْهَدْيَ مَعْكُوْفًا اَنْ يَّبْلُغَ مَحِلَّهٗ ؕ
وَلَوْلَا رِجَالٌ مُّؤْمِنُوْنَ وَ نِسَآءٌ مُّؤْمِنٰتٌ لَّمْ
تَعْلَمُوْهُمْ اَنْ تَطَـُٔوْهُمْ فَتُصِيْبَكُمْ مِّنْهُمْ
مَّعَرَّةٌ ۢ بِغَيْرِ عِلْمٍ ۚ لِيُدْخِلَ اللّٰهُ فِيْ رَحْمَتِهٖ
مَنْ يَّشَآءُ ۚ لَوْ تَزَيَّلُوْا لَعَذَّبْنَا الَّذِيْنَ كَفَرُوْا
مِنْهُمْ عَذَابًا اَلِيْمًا ﴿25﴾

**25** వారే తిరస్కార వైఖరిని అవలంబించినవారు. మిమ్మల్ని మస్జిదె హరామ్ నుండి ఆపినవారు. ఖుర్బానీ కొరకు ప్రత్యేకించ బడిన పశువులను వాటి ఖుర్బానీ ప్రదేశానికి చేరకుండా అడ్డు తగిలినవారు.[47] (మక్కా నగరంలో) నీకు తెలియని ముస్లిం పురుషులు, (మరెంతో మంది) ముస్లిం స్త్రీలు లేకుండా ఉండినట్ల యితే,[48] తెలీని స్థితిలో వారు మీచేత త్రొక్కివేయబడతారన్న అనుమానం లేకుండా ఉన్నట్లయితే, వారివల్ల నీపై అపవాదు వచ్చే ప్రమాదం లేకపోయినట్లయితే[49] (మీకు యుద్ధం చేసేందుకు అనుమతి ఇవ్వబడి ఉండేది.[50] కాని అలాంటి పరిస్థితి రానివ్వ లేదు).[51] అల్లాహ్ తాను కోరిన వారిని తన కారుణ్యంలో చేర్పించు కోవటానికే ఆ పరిస్థితి రానివ్వలేదు. ఒకవేళ వారు (ఆ ముస్లింలు మక్కా నుండి) గనక వేర్పడి (వెళ్ళిపోయి) ఉంటే, మేము వారిలోని తిరస్కారులను బాధాకరమైన శిక్షకు గురిచేసి ఉండేవారము.[52]

47. అరబీ మూలంలో **'హదీ' (الهَدْیَ)** అనేపదం వచ్చింది. 'హదీ' అంటే హజ్ యాత్రికుడు లేక ఉమ్రా యాత్రికుడు తన వెంట తోలుకుపోయే ఖుర్బానీ పశువు. ఖుర్బానీ పశువు అక్కడ కూడా కొనవచ్చు. **'మహిల్లున్'** అంటే పశువుల వధ్యశాల. అజ్ఞాన కాలంలో ఉమ్రా యాత్రికులు మర్వా కొండవద్ద పశువును ఖుర్బానీ ఇచ్చేవారు. హజ్ యాత్రికులేమో 'మినా'లో ఖుర్బానీ ఇచ్చేవారు. ఇస్లాం తరువాత 'మినా' మరియు పవిత్ర క్షేత్రం (హరమ్) పరిధిలోపల ఎక్కడ ఖుర్బానీ ఇచ్చినా ఫరవాలేదు. ఇంతకీ ఇక్కడ చెప్పబడిన విషయం ఏమిటంటే ఈ దుర్మార్గులు మిమ్మల్ని కాబా గృహం నుండి అడ్డుకోవటమే గాకుండా, మీ ఖుర్బానీ పశువులను కూడా ఖుర్బానీ స్థలం వరకూ చేరకుండా నిరోధించారు.

48. ఆ ముస్లింలు మక్కాలో నివసిస్తున్నారు. అవిశ్వాసుల బెడద మూలంగా వారు తమ 'విశ్వాసాన్ని' తమ గుండెల్లోనే దాచుకుని మంచి రోజుల కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ల గురించి మీకు తెలీదు.

49. అవిశ్వాసులతో యుద్ధమే గనక జరిగివుంటే ఈ ముస్లింలకు కూడా ప్రాణనష్టం జరిగి ఉండేది. అదేగనక జరిగి వుంటే చేతులారా మీరు మీ శిబిరానికి కీడు కలిగించి ఉండేవారు. అవిశ్వాసులు ఈ ఉదంతాన్ని ఆసరాగా తీసుకుని మిమ్మల్ని దెప్పిపొడిచేవారు. అకారణంగా అమాయకులను చంపినందుకు పరిహారం ఇవ్వవలసివచ్చేది. మరోవైపు ముస్లింలు తమ సహోదరులనే చంపేస్తారన్న విరోధుల నిందలను సహించవలసి వచ్చేది. మూలంలో **'మఅర్రతున్'** (مَعَرَّةٌ) అని వచ్చింది. దీని అసలు అర్థం లోపం, పరిహారం. అవిశ్వాసుల తరఫు నుండి ముస్లింలకు సిగ్గుచేటుగా పరిణమించేది అని ఇక్కడ దాని భావం.

50. ఒకవేళ ఈ కీడు వాటిల్లకుండా ఉండే పక్షంలో మీకు మక్కా నగరంలో జొరబడి శత్రువుతో యుద్ధం చేసేందుకు అనుమతి ఇచ్చేవారం.

51. మక్కాలో ఇప్పటివరకూ ఇస్లాం స్వీకరించకుండా ఉన్న వారికి మరి కొంత గడువు ఇచ్చే ఉద్దేశంతోనే దేవుడు నిర్యుద్ధసంధికి రంగం సిద్ధం చేశాడు.

52. మక్కాలో నివసిస్తున్న ముస్లింలు ఒకవేళ అవిశ్వాసుల నుండి వేరైపోయి – తమ పేటను ప్రత్యేకంగా నిర్మించుకుని ఉంటే మేము అవిశ్వాసులతో యుద్ధం కొరకు అనుమతినిచ్చి ఉండేవారం. మీచేత వారికి తగిన శాస్తి జరిపించేవారం.

إِذْ جَعَلَ الَّذِينَ كَفَرُوا فِي قُلُوبِهِمُ الْحَمِيَّةَ
حَمِيَّةَ الْجَاهِلِيَّةِ فَأَنزَلَ اللَّهُ سَكِينَتَهُ عَلَىٰ
رَسُولِهِ وَعَلَى الْمُؤْمِنِينَ وَأَلْزَمَهُمْ كَلِمَةَ
التَّقْوَىٰ وَكَانُوا أَحَقَّ بِهَا وَأَهْلَهَا ۚ وَكَانَ اللَّهُ
بِكُلِّ شَيْءٍ عَلِيمًا ﴿٢٦﴾

**26** సత్య తిరస్కారులు తమ హృదయాలలో అహంభావాన్ని, అందునా అజ్ఞాన కాలపు అహంభావాన్ని పెంచుకున్న ఆ (క్లిష్ట) తరుణంలో[53] అల్లాహ్ తన ప్రవక్తపై, విశ్వాసులపై తన తరఫున ప్రశాంతస్థితిని అవతరింపజేశాడు.[54] ఇంకా, అల్లాహ్ ముస్లింలను భక్తి (తఖ్వా) వాక్కుకు కట్టుబడి ఉండేలా చేశాడు.[55] వారు దానికి తగినవారు, హక్కుదారులు కూడా. అల్లాహ్ ప్రతిదీ బాగా తెలిసిన వాడు.

53. ఆ గడ్డు సమయాన్ని మీరు ఓసారి నెమరు వేసుకోండి...

54. ముస్లింలను ఉమ్రా కోసం మక్కా నగరంలో ప్రవేశించకుండా నిరోధించాలన్న అవిశ్వాసుల నిర్ణయం మూర్ఖత్వం తప్ప మరేమీ కాదు. విజ్ఞత, వివేచన ఉన్నవారయితే ఆ విధంగా ప్రవర్తించేవారు కారు. అజ్ఞానంతో వాళ్లు ఈ విధంగా అన్నారు: "వాళ్లు (ముస్లింలు) మా బిడ్డలను, పితామహులను చంపారు. లాత్, ఉజ్జా దేవతల సాక్షిగా! మేమెన్నటికీ వాళ్లను మక్కాలో అడుగుపెట్టనివ్వము."

అంటే వాళ్లు ఈ వ్యవహారాన్ని తమ పరువు ప్రతిష్ఠలతో ముడిపడినదిగా భావించారే తప్ప దైవదాసులను దైవగృహం నుండి ఆపకూడదని మాత్రం ఆలోచించలేదు. అందుకే వాళ్ల ఈ చర్యను అజ్ఞానకాలపు అహంభావంగా అభివర్ణించటం జరిగింది. ఖురైషుల ఈ అనుచిత వైఖరి మూలంగా అటు ముస్లిం శిబిరంలో ఆవేశాలు కట్టలు త్రెంచుకునే ప్రమాదం లేకపోలేదు. వాళ్లు కూడా దీన్ని తమ పరువు ప్రతిష్ఠల సమస్యగా తీసుకునే అవకాశం ఉంది. అదేగనక జరిగితే యుద్ధం అనివార్యమవుతుంది. మరి ఆ యుద్ధం ముస్లింల పాలిట కూడా హానికరంగా పరిణమించేది.

అందుకే అల్లాహ్ ఆ కీలక తరుణంలో ముస్లింల హృదయాలలో నెమ్మదిని నూరిపోశాడు. వారి మనసులను కుదుటపరిచాడు. నిగ్రహంతో, సంయమనంతో మసలుకునే సద్బుద్ధిని వారికి అనుగ్రహించాడు. వారు తమ ప్రవక్త (సఅసం) ఆదేశానుసారం మక్కా పొలిమేరల్లోనే ఆగిపోయారు. ఆగ్రహావేశాలతో నగరం లోపలికి జొరబడలేదు.

సంధి కుదుర్చుకునే సమయంలో ఖురైషులు వ్యవహరించిన తీరునే 'అజ్ఞానకాలపు అహంభావం'గా పేర్కొనటం జరిగిందని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఒకవైపు వాళ్ల ధోరణి ఈ విధంగా ఉంటే మరోవైపు సంధి షరతులు కూడా పైకి సహించరానివిగా ఉన్నాయి. కాని పరిణామం రీత్యా ఆ సంధి ఇస్లాం మరియు ముస్లింల పాలిట వరప్రదాయిని అయింది. అందుకే అల్లాహ్ ముస్లింలకు ఆ సందర్భంలో అసాధారణమైన ఓరిమిని ప్రసాదించి, ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేని ఆ సంధిని ఆమోదించగలిగేలా చేశాడు.

ఆ సంధి గురించి క్లుప్తంగా చెప్పుకోవాలంటే –

మక్కా నుండి ఖురైషు రాయబారులు తెచ్చిన ప్రతిపాదనలను మహాప్రవక్త (సఅసం) ఒప్పుకున్నారు. వాటి ప్రకారం ముస్లింలు ఆ సంవత్సరం 'ఉమ్రా' కోసం మక్కా వెళ్లకుండా, అక్కడినుండే తిరిగివెళ్ళిపోవాలి. ఒప్పందాన్ని లిఖించమని మహాప్రవక్త (సఅసం) హజ్రత్ అలీ (రజి)ని పురమాయించారు. దైవప్రవక్త ఆదేశానుసారం హజ్రత్ అలీ (రజి) దస్తావేజు వ్రాయటానికి ఉపక్రమించారు. **'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'** (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను) అని మొదట వ్రాశారు. దానిపై వాళ్లు అభ్యంతరం చెబుతూ, ఈ 'రహ్మాన్' ఎవరో, 'రహీమ్' ఎవరో మాకు తెలీదు. మా దగ్గర ఆనవాయితీగా వస్తున్న 'బిస్మికల్లాహుమ్మ' (ఓ అల్లాహ్! నీ పేరుతో) అని మాత్రమే వ్రాయండి అన్నారు. అందువల్ల మహాప్రవక్త (స) వాళ్లు చెప్పినట్లే వ్రాయించారు. ఆ తరువాత ఆయన (స), "దైవప్రవక్త అగు ముహమ్మద్ (స) మక్కా వాసులతో చేసుకున్న ఈ ఒప్పందం ప్రకారం..." అని వ్రాయించారు. దానిపై ఖురైషు ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం లేవనెత్తారు. "మీకూ – మాకూ మధ్య ఉన్న తగవుకు మూలం అసలు దైవప్రవక్త పదవే కదా! మిమ్మల్ని దైవప్రవక్తగా మేము అంగీకరించినట్లయితే ఈ గొడవంతా

**27** నిశ్చయంగా అల్లాహ్ తన ప్రవక్తకు సత్యంతో కూడుకున్న స్వప్నాన్ని చూపించాడు. అల్లాహ్ తలిస్తే మీరు తప్పకుండా మస్జిదె హరామ్‌లో సురక్షితంగా ప్రవేశిస్తారు. శిరోముండనం చేయించుకుంటారు, తల వెంట్రుకలను కత్తిరించుకుంటారు. మీకే భయమూ ఉండదు.[56] మీకు తెలియని విషయాలు ఆయనకు తెలుసు.[57] మరి దానికి ముందే ఆయన ఓ శీఘ్ర విజయాన్ని కూడా మీకు అనుగ్రహించాడు.[58]

لَقَدْ صَدَقَ اللّٰهُ رَسُوْلَهُ الرُّءْيَا بِالْحَقِّ ۚ لَتَدْخُلُنَّ الْمَسْجِدَ الْحَرَامَ اِنْ شَآءَ اللّٰهُ اٰمِنِيْنَ ۙ مُحَلِّقِيْنَ رُءُوْسَكُمْ وَمُقَصِّرِيْنَ ۙ لَا تَخَافُوْنَ ؕ فَعَلِمَ مَا لَمْ تَعْلَمُوْا فَجَعَلَ مِنْ دُوْنِ ذٰلِكَ فَتْحًا قَرِيْبًا ﴿27﴾

ఎందుకు? మీతో యుద్ధాలెందుకు? మక్కాలోకి రాకుండా మిమ్మల్ని ఆపటమెందుకు? 'దైవప్రవక్తయగు ముహమ్మద్' బదులు 'అబ్దుల్లా కుమారుడగు ముహమ్మద్' అని వ్రాయండి" అని అన్నారు. మహాప్రవక్త (స) దీనికి కూడా ఒప్పుకుంటూ వారు చెబుతున్నట్లే వ్రాయమని హజ్రత్ అలీ (రజి)ని సూచించారు. (నిశ్చయంగా ఇది ముస్లింలను రెచ్చగొట్టే విషయమే. అల్లాహ్‌యే గనక వారి హృదయాలకు నెమ్మదిని ఇచ్చి ఉండకపోతే వారీ విషయాన్ని సహించలేకపోయేవారు). 'దైవప్రవక్త ముహమ్మద్' అనే పదాలను తన స్వహస్తాలతో కొట్టివేయటానికి హజ్రత్ అలీ నిరాకరించారు. "సరే. ఆ పదాలెక్కడ ఉన్నాయో చూపించు" అని మహాప్రవక్త (స) అడిగారు. హజ్రత్ అలీ ఆ పదాలను చూపించగా, మహాప్రవక్త (స) తన స్వహస్తంతో వాటిని కొట్టివేసి, వాటికి బదులు "అబ్దుల్లా కుమారుడగు ముహమ్మద్" అని వ్రాయించారు. ఆ తరువాత ఆ ఒడంబడికలో మూడు ముఖ్య షరతులు లిఖించబడ్డాయి: 1. మక్కానుండి ఏ ముస్లిం మీ వద్దకు వచ్చినా అతన్ని మీరు మాకు అప్పగించాలి. 2. మీ వద్దనుండి ఏ ముస్లిం మక్కాకు వచ్చినా అతన్ని మేము అప్పగించబోము. 3. ముస్లింలు వచ్చే సంవత్సరం మక్కాకు రావచ్చు. కాని మూడు రోజులకన్నా ఎక్కువ ఉండకూడదు. ఈ సందర్భంగా వారు ఆయుధాలు తీసుకురాకూడదు. (సహీహ్ ముస్లిం - కితాబుల్ జిహాద్). ఈ సంవత్సరం ఉభయవర్గాల మధ్య యుద్ధం జరగకూడదు. తెగలలో తాము కోరినవారు ముస్లింల శిబిరంలోకిగానీ, ఖురైషుల పక్షానగానీ పోవచ్చు అనే అంశాలు కూడా అందులో లిఖించబడ్డాయి.

55. ఇక్కడ భక్తి వాక్కు అంటే "లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్" అనే సద్వచనం కావచ్చు (ఇబ్నె కసీర్). లేక ముస్లింలు హుదైబియాలో ప్రదర్శించిన సహనం, హుందాతనం కావచ్చు లేక దైవభక్తి మూలంగా చేసిన ప్రమాణాన్ని నెరవేర్చటం, దాని మీద స్థిరంగా నిలబడటం కూడా కావచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).

56. దైవప్రవక్త (స) తన సహచరులతో కలసి కాబా గృహం వద్దకు చేరుకుని ఉమ్రా చేసినట్లు హుదైబియా సంఘటనకు ముందు కలగన్నారు. దైవప్రవక్తకు కల వచ్చిందంటే అది దాదాపు 'వహీ' (దైవవాణి) వంటిదే. అయితే ఈ స్వప్నం ఏ సంవత్సరంలో సాకారమవుతుందో చెప్పబడలేదు. కాని ఈ కలను మహాప్రవక్త మహాభాగ్యంగా తలపోసి వెంటనే ఉమ్రా కోసం ముస్లింలతో బయలుదేరారు. ఎట్టకేలకు హుదైబియా ఒప్పందం జరిగింది. అయితే ఒప్పందం ప్రకారం వచ్చే సంవత్సరం ప్రశాంత వాతావరణంలో ముస్లింలు 'ఉమ్రా' చేశారు. ఆ విధంగా అల్లాహ్ తన ప్రవక్తకు చూపిన స్వప్నాన్ని నిజం చేశాడు.

57. అంటే మొదటి సంవత్సరమే గనక హుదైబియాలో సంధి కుదరకపోతే యుద్ధం అనివార్యమయ్యేది. యుద్ధమే గనక జరిగివుంటే మక్కాలో నివసించే బలహీన ముస్లింలకు తీరని నష్టం జరిగి వుండేది. కాబట్టి హుదైబియా ఒడంబడికలోని శుభాలేమిటో అల్లాహ్‌కు మాత్రమే తెలుసు - మీకు తెలియదు.

58. **'శీఘ్ర విజయం' (فَتْحًا قَرِيْبًا)** అన్న దానిలో ఖైబర్ విజయం,మక్కా విజయంతోపాటు, శాంతి ఒడంబడిక ఫలితంగా తండోపతండాలుగా ప్రజలు ఇస్లాంలో చేరటం కూడా ఇమిడి ఉంది. ఇది కూడా విజయానికి ఓ ప్రబల తార్కాణమే. హుదైబియా ఒప్పందం నాటికి ముస్లిం సహచరుల సంఖ్య వెయ్యిన్నరే. ఆ తరువాత కేవలం రెండు సంవత్సరాలకే ముస్లింలు విజేతలుగా మక్కా నగరంలో ప్రవేశించినపుడు వారు పదివేలమంది దాకా ఉన్నారు.

**28** తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి దాన్ని ఇతర ధర్మాలన్నింటిపై పైచేయిగా ఉండేలా చేయటానికి పంపిన వాడు ఆయనే.[59] సాక్షిగా అల్లాహ్‌యే చాలు.

**29** ముహమ్మద్(సఅసం) అల్లాహ్ ప్రవక్త. ఆయన (స) వెంట ఉన్నవారు అవిశ్వాసులకు కొరుకుడు పడనివారు. ఒండొకరి పట్ల మాత్రం దయార్ద్ర హృదయులు. దైవ కృపను, దైవ ప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో వారు (దైవ సన్నిధిలో) వినమ్రులై వంగటాన్ని, సాష్టాంగపడటాన్ని నీవు చూస్తావు. వారి సాష్టాంగ ప్రణామాల ప్రత్యేక ప్రభావం వారి ముఖారవిందాలపై తొణకిస లాడుతూ ఉంటుంది. వీరికి సంబంధించిన ఈ ఉపమానమే తౌరాతులో ఉంది. ఇన్‌జీలులో (కూడా)వారి ఉపమానం ఉంది.[60] అది ఒక పంటపొలం వంటిది. అది తన మొలకను మొలకెత్తించింది.[61] తరువాత దానిని బలపరిచింది. ఆ తరువాత అది లావు అయింది. ఆ పైన అది తన కాండంపై నిటారుగా నిలబడింది, రైతులను అలరించసాగింది[62]- వారి ద్వారా అవిశ్వాసులను మరింత ఉడికించాలని![63] వారిలో విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి మన్నింపును, గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసి ఉన్నాడు.[64]

هُوَ الَّذِيٓ اَرۡسَلَ رَسُوۡلَهٗ بِالۡهُدٰى وَدِيۡنِ الۡحَقِّ لِيُظۡهِرَهٗ عَلَى الدِّيۡنِ كُلِّهٖ ؕ وَكَفٰى بِاللّٰهِ شَهِيۡدًا ﴿28﴾

مُحَمَّدٌ رَّسُوۡلُ اللّٰهِ ؕ وَالَّذِيۡنَ مَعَهٗۤ اَشِدَّآءُ عَلَى الۡكُفَّارِ رُحَمَآءُ بَيۡنَهُمۡ تَرٰٮهُمۡ رُكَّعًا سُجَّدًا يَّبۡتَغُوۡنَ فَضۡلًا مِّنَ اللّٰهِ وَرِضۡوَانًا سِيۡمَاهُمۡ فِىۡ وُجُوۡهِهِمۡ مِّنۡ اَثَرِ السُّجُوۡدِ ؕ ذٰ لِكَ مَثَلُهُمۡ فِى التَّوۡرٰٮةِ ۛۚ وَمَثَلُهُمۡ فِى الۡاِنۡجِيۡلِ ۛۚ كَزَرۡعٍ اَخۡرَجَ شَطۡئَهٗ فَاٰزَرَهٗ فَاسۡتَغۡلَظَ فَاسۡتَوٰى عَلٰى سُوۡقِهٖ يُعۡجِبُ الزُّرَّاعَ لِيَـغِيۡظَ بِهِمُ الۡكُفَّارَ ؕ وَعَدَ اللّٰهُ الَّذِيۡنَ اٰمَنُوۡا وَعَمِلُوا الصّٰلِحٰتِ مِنۡهُمۡ مَّغۡفِرَةً وَّاَجۡرًا عَظِيۡمًا ﴿29﴾

59. రుజువులు, ఆధారాల రీత్యా ఇతర ధర్మాలపై ఇస్లాంకు గల ఆధిక్యత విషయంలో సందేహమే లేదు. అలాగే ప్రాపంచికంగా, సైనికపరంగా కూడా ఇస్లాంకు ఆధిపత్యం ఉంటుంది. ఇంకో విషయం ఏమిటంటే ఇస్లాంకు లభించే ఈ ఆధిపత్యం తాత్కాలికమైనది కాదు. అది సర్వకాల సర్వావస్థలకు వర్తిస్తుంది. కాకపోతే ఇస్లాం ధర్మ అనుయాయులు ఆ ధర్మానికి కట్టుబడి ఉండాలన్నదే షరతు. ఇస్లాం తొలి కాలంలోనూ, ఆ తరువాత సుదీర్ఘ కాలం వరకు కూడా ఈ ఆధిక్యత కొనసాగింది. ఆ వాగ్దానం నేటికీ ఉంది. అయితే ముస్లింలు తమ యోగ్యతను నిరూపించుకోవాలి. "కృంగిపోకండి. దిగులు చెందకండి. మీరు గనక విశ్వాసులయితే మీరే ప్రాబల్యం పొందుతారు" (ఆలి ఇమ్రాన్-139). ఈ ధర్మం ప్రాబల్యం వహించటానికి వచ్చినదేగాని అణగారి ఉండటానికి కాదు.

60. వారి గుణగణాలు తౌరాతు, ఇన్‌జీలు గ్రంథాలలో కూడా వివరించబడ్డాయి అని ఒక అర్థం వస్తుంది. మరో అర్థం ప్రకారం తౌరాతులో వారి గుణగణాలు పొందుపరచబడ్డాయి. ఇంజీలు గ్రంథంలో వారు ఒక పంటపొలంతో పోల్చబడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

61. **'షత్అహు'** (**شَطْئَهٗ**) అంటే దైవాజ్ఞపై నేల లోపల ఉన్న విత్తనాన్ని చీల్చుకుంటూ మొలకెత్తిన మొలక అని అర్థం.

62. ఇక్కడ మహాప్రవక్త (స) ప్రియసహచరుల ఉదాహరణ ఇవ్వబడింది. మొదట్లో వారు మరీ బలహీనంగా ఉండేవారు. చాలా కొద్దిసంఖ్యలో ఉండేవారు. ఒకప్పుడు మొక్కరూపంలో ఎంతో బలహీనంగా ఉండే వృక్షం ఏవిధంగా

దినదినాభివృద్ధిచెంది బలపడుతుందో అదేవిధంగా ప్రవక్త ప్రియసహచరులు కూడా చూస్తూ వుండగానే – చాలా కొద్దికాలంలోనే – ఒక మహాశక్తిగా తయారయ్యారు.

63. దైవప్రవక్త ప్రియసహచరుల సంఖ్య దిన దిన ప్రవర్ధమానం అవటం, ఇస్లాం నానాటికీ బలపడటం చూసి అవిశ్వాసులు ఆగ్రహంతో మండిపడేవారు. ఎందుకంటే ఇటు ఇస్లాం రోజురోజుకూ విస్తరిస్తూ ఉండగా అటు వారి ప్రాబల్యానికి గండి పడసాగింది.

ఈ ఆయతు ఆధారంగా కొంతమంది పండితులు, దైవప్రవక్త ప్రియ సహచరుల పట్ల ద్వేషభావం, అక్కసును కలిగివుండేవారిని 'కాఫిర్‌లు'గా పేర్కొన్నారు.

64. ఈ ఆయతులోని ఒక్కొక్క వాక్యం మహాప్రవక్త ప్రియసహచరుల (సహాబా) గొప్పతనాన్ని, సద్గుణాలను చాటిచెబుతోంది. వారు చేసిన అనన్య సామాన్యమైన త్యాగాలకు గాను అల్లాహ్ వారికి మన్నింపుల, స్వర్గసుఖాల వాగ్దానం చేశాడు. దేవుడు సహాబా గురించి ఈ విధంగా వాగ్దానం చేసిన తరువాత వారి విశ్వాసాన్నీ, చిత్తశుద్ధిని శంకించే, విమర్శించే హక్కు ఎవరికీ లేదు. అలా శంకించేవారి విశ్వాసమే సందేహాస్పదం అయిపోతుంది.

49వ సూరా

# అల్ హుజురాత్

## కుటీరాలు

అవతరణ మదీనాలో

ఆయతులు 18

### పరిచయం

*సామాజిక సంబంధాల గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలోని 4వ ఆయతులో కుటీరాల గురించిన ప్రస్తావన వచ్చింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం) కుటుంబం నివసించే కుటీరాలకు సంబంధించిన ప్రస్తావన ఇది. దీనినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. కొందరు ఇస్లామ్ స్వీకరించడానికి ఒక బృందంగా వచ్చినప్పుడు వారు ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇంటి ముందు నిలబడి బిగ్గరగా పిలిచేవారు. ఈ విధంగా చేయడం ఆయన పట్ల అమర్యాదకరమైన వైఖరి మాత్రమే కాదు, సభ్యతా మర్యాదలకూ విరుద్ధమైనది.*

*ఈ సూరాలో సభ్యత, మర్యాద, నడవడి గురించి బోధించడం జరిగింది. ఒకరి పట్ల ఒకరు ఎలాంటి మర్యాదలు పాటించాలి? ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల ఎలాంటి మర్యాదలు పాటించాలన్నది ఇందులో స్పష్టం చేయడం జరిగింది. ముస్లిముల మధ్య సోదరభావాన్ని ఈ సూరా పెంపొందించింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 6 | 356 | 'తప్పుడు సమాచారం' | మన వద్దకు ఏదయినా సమాచారం వస్తే దాన్ని పునర్విచారించుకోవాలని, తప్పుడు ఆరోపణల్ని తక్షణం ఖండించి వాస్తవాలను వెల్లడి చేసుకోవటం శ్రేయస్కరమనీ, లేకపోతే అనవసరమైన ఇబ్బందులకు లోనుకావలసి వస్తుందనీ బోధించే సంఘటన. |

## سُوْرَةُ الْحُجُرٰتِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تُقَدِّمُوْا بَيْنَ يَدَيِ اللّٰهِ وَرَسُوْلِهٖ وَاتَّقُوا اللّٰهَ ۭ اِنَّ اللّٰهَ سَمِيْعٌ عَلِيْمٌ ①

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَرْفَعُوْٓا اَصْوَاتَكُمْ فَوْقَ صَوْتِ النَّبِيِّ وَلَا تَجْهَرُوْا لَهٗ بِالْقَوْلِ كَجَهْرِ بَعْضِكُمْ لِبَعْضٍ اَنْ تَحْبَطَ اَعْمَالُكُمْ وَاَنْتُمْ لَا تَشْعُرُوْنَ ②

## అల్ హుజురాత్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను మించిపోకండి.[2] అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

**2** ఓ విశ్వాసులారా! మీ కంఠస్వరాలను ప్రవక్త కంఠస్వరం కంటే పైన (హెచ్చుగా) ఉంచకండి. మీరు పరస్పరం బిగ్గరగా మాట్లాడు కునే విధంగా ఆయన (స)తో బిగ్గరగా మాట్లాడకండి. దీనివల్ల మీ కర్మలన్నీ వ్యర్థమైపోవచ్చు. ఆ సంగతి మీకు తెలియను కూడా తెలియదు.[3]

1. **తివాలె ముఫస్సల్** (సుదీర్ఘ వివరణ గల) సూరాలలో ఇది మొదటి సూరా. హుజురాత్ సూరా నుండి నాజిఆత్ సూరా వరకు గల సూరాలన్నీ 'తివాలె ముఫస్సల్'గా పిలువబడతాయి. 'ఖాఫ్' సూరా నుండి ఈ గ్రూపు మొదలవుతుందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్). ఫజ్ర్ నమాజులో ఈ సూరాలను పఠించటం సంప్రదాయం, అభిలషణీయం కూడా. అబస సూరా నుండి అష్షమ్స్ వరకు గల సూరాలు **అవ్‌సాతె ముఫస్సల్** (మధ్య తరహా వివరణ గల సూరాలు) గా పిలువబడతాయి. జుహా నుండి అన్నాస్ వరకు గల సూరాలు **ఖిసారె ముఫస్సల్** (సంక్షిప్త వివరణ గల సూరాలు)గా పరిగణించబడతాయి. జుహ్ర్, అస్ర్ నమాజులలో అవ్‌సాతు సూరాలు, మగ్రిబ్ నమాజులో ఖిసారు సూరాలు పారాయణం చేయటం వాంఛనీయం (ఐసరుత్తఫాసీర్).
2. దీని అర్థం ఏమిటంటే; ధార్మిక విషయాలలో తమంతట తాముగా నిర్ణయాలు తీసుకోవటంగానీ, తమ ఆలోచనలకు పెద్దపీట వేయటంగానీ చేయరాదు. దీనికి బదులు వారు దైవానికి, దైవప్రవక్త (స)కు విధేయత చూపాలి. తమ తరఫున ధర్మంలో హెచ్చుతగ్గులు చేయటం, సరికొత్త విషయాలను కల్పించటం వంటి పనులన్నీ దైవాన్ని, దైవప్రవక్తను మించిపోవటంగా భావించబడతాయి. ఈ దుస్సాహసానికి విశ్వాసులు పాల్పడకూడదు. అలాగే ఖుర్ఆన్ హదీసులతో నిమిత్తం లేకుండా ధార్మిక తీర్పు ఏదీ ఇవ్వరాదు. ఒకవేళ ఏదైనా తీర్పు ఇస్లామీయ షరీయతుకు విరుద్ధంగా ఉందని తెలిస్తే, ఇక దాని కోసం ప్రాకులాడకూడదు. దైవం మరియు దైవప్రవక్త (స) ఆజ్ఞలను శిరోధార్యంగా భావించటమే ఒక విశ్వాసికి శోభాయమానం. తద్భిన్నంగా అతను ఇతరుల అభిప్రాయాలను కొలబద్దగా తీసుకుంటే తలవంపు తప్పదు.
3. ఈ ఆయతులో అంతిమ దైవప్రవక్త (సఅసం) యెడల ఎలా మర్యాదగా, వినమ్రంగా మసలుకోవాలో విశ్వాసులకు బోధపరచటం జరిగింది : 1. ఆయన (స) సమక్షంలో మీరు మాట్లాడుకుంటున్నప్పుడు బిగ్గరగా, విచ్చలవిడిగా మాట్లాడుకునే బదులు మెల్లిగా, నింపాదిగా మాట్లాడుకోవాలి. 2. దైవప్రవక్త (సఅసం)తో మాట్లాడవలసి వచ్చినప్పుడు అణకువతో, సంస్కారం ఉట్టిపడే రీతిలో మాట్లాడాలి. అంతేగాని ఒండొకరిని పలకరించుకునేలా యథేచ్ఛగా మాట్లాడరాదు. ఆయన్ని పేరుపెట్టి ఓ ముహమ్మద్ (స)!, ఓ అహ్మద్!! అని పిలిచేబదులు 'ఓ దైవప్రవక్తా (స)!' అని పిలువటం సమంజసమని మరికొందరు అభిప్రాయపడ్డారు. మీరు గనక దైవప్రవక్తతో ఈ సభామర్యాదలను పాటించక పోయినట్లయితే – మీకు తెలియకుండానే మీ కర్మలన్నీ వృథా అయిపోయే ప్రమాదముంది. ఈ ఆయతు అవతరణా నేపథ్యం గురించి తెలుసుకోగోరేవారు సహీహ్ బుఖారీలోని అల్ హుజురాత్ సూరా వ్యాఖ్యానం చూడగలరు. ఈ ఆయతులోని ఆదేశం మాత్రం అందరికీ వర్తిస్తుంది.

إِنَّ الَّذِينَ يَغُضُّونَ أَصْوَاتَهُمْ عِندَ رَسُولِ اللَّهِ أُولَٰئِكَ الَّذِينَ امْتَحَنَ اللَّهُ قُلُوبَهُمْ لِلتَّقْوَىٰ ۚ لَهُم مَّغْفِرَةٌ وَأَجْرٌ عَظِيمٌ ③

**3** ఎవరయితే దైవప్రవక్త సమక్షంలో అణకువతో(తగ్గు స్వరాలలో) మాట్లాడతారో వారి హృదయాలను అల్లాహ్ ధర్మనిష్ఠ (తఖ్వా) కోసం పరికించాడు. వారికి మన్నింపుతో పాటు గొప్ప ప్రతిఫలం కూడా ఉంది.[4]

إِنَّ الَّذِينَ يُنَادُونَكَ مِن وَرَاءِ الْحُجُرَاتِ أَكْثَرُهُمْ لَا يَعْقِلُونَ ④

**4** (ఓ ప్రవక్తా!) కుటీరాల వెనుక నుంచి నిన్ను కేకలేసి పిలుస్తున్న వారిలో చాలా మందికి (బొత్తిగా) బుద్ధిలేదు.[5]

وَلَوْ أَنَّهُمْ صَبَرُوا حَتَّىٰ تَخْرُجَ إِلَيْهِمْ لَكَانَ خَيْرًا لَّهُمْ ۚ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ⑤

**5** నీవంతట నీవుగా వారి దగ్గరకు వెడలి వచ్చేవరకూ వారు గనక ఓపిక పట్టి ఉంటే, అది వారి కోసం ఎంతో ఉత్తమం అయి ఉండేది.[6] అల్లాహ్ క్షమాగుణం కలవాడు. దయా స్వభావి.[7]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِن جَاءَكُمْ فَاسِقٌ بِنَبَإٍ فَتَبَيَّنُوا أَن تُصِيبُوا قَوْمًا بِجَهَالَةٍ فَتُصْبِحُوا عَلَىٰ مَا فَعَلْتُمْ نَادِمِينَ ⑥

**6** ఓ విశ్వాసులారా! ఎవడయినా దుర్వర్తనుడు మీ వద్దకు ఏదైనా సమాచారాన్ని తీసుకువస్తే, దాని నిజానిజాలను నిర్ధారించు కోండి.[8] అన్యథా మీరు నిజం తెలియని కారణంగా ఇతర జనులకు నష్టం కలిగించి, తరువాత చేసిన దానిపై సిగ్గుతో కుంచించుకు పోవలసిన పరిస్థితి రావచ్చు.

4. దైవప్రవక్త (స) గారి గౌరవోన్నతులను దృష్టిలో పెట్టుకుని అణకువతో మాట్లాడే సహచరులు ఈ వాక్యంలో ప్రశంసించ బడ్డారు.

5. తమీమ్ తెగకు చెందిన కొంతమంది పల్లెవాసుల మొరటు వైఖరిపై ఈ ఆయతు అవతరించింది. ఒకరోజు దైవప్రవక్త మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకుంటూ ఉండగా ఈ పల్లెటూరి బైతులు కుటీరాల బయట నిలబడి 'ఓ ముహమ్మద్!' అంటూ కేకలు వేయసాగారు (ముస్నదె అహ్మద్ : 3/488, 6/394). ఆ పిలుపులో ఏమాత్రం మర్యాదగానీ, అణకువగానీ లేదు. అందుకే వారిలో అధికులు బుద్ధిహీనులని దేవుడు సెలవిచ్చాడు.

6. అంటే, వారు ఆ విధంగా కేక వేసి పిలిచే బదులు, ఆయన (స) వచ్చేవరకు నిరీక్షించి ఉంటే ధార్మికంగా, ప్రాపంచికంగా కూడా అది వారికి మేలై ఉండేది.

7. అందుకే దేవుడు ఈ తప్పిదంపై వారిని పట్టుకోవటం లేదు. ప్రస్తుతానికి వారిని మన్నించి వదలిపెట్టేశాడు. అయితే ఇకమీదట వారు ఈ విషయంలో జాగ్రత్తపడాలి.

8. చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఈ ఆయతు హజ్రత్ వలీద్ బిన్ ఉఖబ (రజి) గురించి అవతరించింది. ఆయన్ని దైవప్రవక్త (సఅసం) ముస్తలిఖ్ తెగవారి నుండి జకాత్ సొమ్మును వసూలు చేయడానికి పంపించారు. కాని ఆ తెగవారు జకాత్ చెల్లించటానికి నిరాకరించినట్లు హజ్రత్ వలీద్ వట్టి మాటలు చెప్పారు. ఈయన నివేదికను పురస్కరించుకుని దైవప్రవక్త బనూ ముస్తలిఖ్‌పై సైనిక చర్యకు పూనుకున్నారు. అంతలోనే ఆ సమాచారం నిజం కాదని, వలీద్ (రజి) అసలు అక్కడికి వెళ్ళనే లేదని తెలిసింది. అయితే ప్రామాణికత రీత్యాగానీ, యదార్థం దృష్ట్యాగానీ ఈ ఉల్లేఖనం సరైంది కాదు. ఎందుకంటే దైవప్రవక్త ప్రియసహచరుల్లోని ఒక వ్యక్తిపై ఇలాంటి విషయాన్ని రుద్దటం సరైంది కాదు.

ఈ ఆయతు అవతరణా నేపథ్యాన్ని అలా ప్రక్కనపెడితే సూత్రప్రాయంగా ఎంతో ముఖ్యమైన ఒక విషయం ఇందులో

وَاعْلَمُوٓا اَنَّ فِيْكُمْ رَسُوْلَ اللّٰهِ ۚ لَوْ يُطِيْعُكُمْ
فِيْ كَثِيْرٍ مِّنَ الْاَمْرِ لَعَنِتُّمْ وَلٰكِنَّ اللّٰهَ حَبَّبَ
اِلَيْكُمُ الْاِيْمَانَ وَزَيَّنَهٗ فِيْ قُلُوْبِكُمْ وَكَرَّهَ
اِلَيْكُمُ الْكُفْرَ وَالْفُسُوْقَ وَالْعِصْيَانَ ۚ
اُولٰٓئِكَ هُمُ الرّٰشِدُوْنَ ﴿7﴾

**7** మీ మధ్య దైవప్రవక్త ఉన్నాడనే విషయాన్ని బాగా తెలుసుకోండి.[9] చాలా విషయాలలో అతను గనక మీరు కోరినట్లుగా మసలుకుంటే మీరు ఇబ్బందుల్లో పడిపోతారు. కాని అల్లాహ్ విశ్వాసాన్ని మీకు ప్రియతమం చేశాడు. దాన్ని మీ హృదయాలలో శోభాయమానంగా చేశాడు. అవిశ్వాసం పట్ల, దుర్వర్తన పట్ల, అవిధేయత పట్ల మీకు రోత కలిగేలా చేశాడు. ఇలాంటి వారే సన్మార్గగాములు –

فَضْلًا مِّنَ اللّٰهِ وَنِعْمَةً ۚ وَاللّٰهُ عَلِيْمٌ
حَكِيْمٌ ﴿8﴾

**8** – అల్లాహ్ కృపవల్ల, ఆయన అనుగ్రహం వల్ల![10] అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేకసంపన్నుడు.

وَاِنْ طَآئِفَتٰنِ مِنَ الْمُؤْمِنِيْنَ اقْتَتَلُوْا
فَاَصْلِحُوْا بَيْنَهُمَا ۚ فَاِنْۢ بَغَتْ اِحْدٰىهُمَا عَلَى
الْاُخْرٰى فَقَاتِلُوا الَّتِيْ تَبْغِيْ حَتّٰى تَفِيْٓءَ اِلٰٓى اَمْرِ
اللّٰهِ ۚ فَاِنْ فَآءَتْ فَاَصْلِحُوْا بَيْنَهُمَا بِالْعَدْلِ

**9** ఒకవేళ ముస్లింలలోని రెండు పక్షాల వారు పరస్పరం గొడవ పడితే వారి మధ్య సయోధ్య చేయండి.[11] మరి వారిలో ఒక పక్షంవారు రెండవ పక్షం వారిపై దౌర్జన్యం చేస్తే, దౌర్జన్యంచేసే వర్గం దైవాజ్ఞ వైపు మరలివచ్చే వరకూ మీరు వారితో పోరాడండి.[12] వారు గనక మరలివస్తే వారి మధ్య న్యాయసమ్మతంగా

---

చెప్పబడింది. అదేమంటే ఒక వ్యక్తి లేక ఒక సముదాయం వద్దకు, ఒక ప్రభుత్వం వద్దకు ఒక ముఖ్యమైన సమాచారం వచ్చినపుడు, ముఖ్యంగా ఆ సమాచారాన్ని మోసుకువచ్చినవాడు దుష్టుడు, బాధ్యతారహితుడు అయినపుడు దానికి సంబంధించిన నిజానిజాలను, ఉచితానుచితాలను గురించి తెలుసుకోవాలి. కేవలం అపోహతోనో లేక వదంతుల ఆధారంగానో అన్యులపై చర్య గైకొనరాదు.

9. కాబట్టి మీరు మీ ప్రవక్తను గౌరవించాలి. ఆయనకు విధేయత చూపాలి. ఎందుకంటే ఆయన మీ మేలు కోరేవాడు. మీ సాధకబాధకాల గురించి ఆయనకు తెలుసు. ఆయనపై దైవవాణి అవతరిస్తుంది. కనుక మీరు ఆయన (స) వెనుక నడవాలి. అంతేగాని ఆయన్ని (స) మీ వెనకాల నడవమని కోరకూడదు. మీ మనోభిరామాన్ని మన్నించి ఆయన ప్రతిదీ మీరు చెప్పినట్లుగానే చేస్తూపోతే ఆనక మీరే అవస్థపడాల్సి ఉంటుంది. వేరొకచోట చెప్పబడినట్లు : "ఒకవేళ సత్యమే గనక వీరి మనోవాంఛలను అనుసరించవలసివస్తే భూమ్యాకాశాల్లో, వాటి మధ్య ఉన్నవాటిలో అరాచకం తలెత్తేది." (మూమినూన్ : 71)

10. ఈ ఆయతు కూడా ప్రవక్త ప్రియసహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) ఔన్నత్యాన్ని చాటి చెబుతోంది. వారు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించిన వారనీ, సన్మార్గాన్ని పొందిన ధన్యజీవులని చెప్పటానికి ఇదొక ప్రబల నిదర్శనం– అవిశ్వాసులకు ఈ విషయం ఎంతగా సహించరానిదయినా సరే!

11. అంటే – ఈ సయోధ్యకై చేసే ప్రయత్నాల్లో ఒక పద్ధతేమిటంటే ఆ ఉభయవర్గాలనూ ఖుర్ఆన్ హదీసుల వైపు పిలిచి, వాటి వెలుగులో వారి సమస్యకు పరిష్కారం చూపాలి.

12. అంటే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సఅసం) ఆదేశాల ప్రకారం తమ మనస్పర్థలను దూరం చేసుకోవటానికి వారిలో ఏ పక్షంవారైనా ఒప్పుకోకపోతే అప్పుడు ముస్లింలంతా కలిసి ఆ తిరగబడ్డ వర్గంతో పోరాడాలి. దైవాజ్ఞల ముందు వారు తలవంచే దాకా వారిని వదలకూడదు.

وَأَقْسِطُوا ۖ إِنَّ اللَّهَ يُحِبُّ الْمُقْسِطِينَ ⑨

సయోధ్య కుదర్చండి.[13] సమభావంతో వ్యవహరించండి. నిశ్చయంగా సమభావంతో వ్యవహరించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.[14]

إِنَّمَا الْمُؤْمِنُونَ إِخْوَةٌ فَأَصْلِحُوا بَيْنَ أَخَوَيْكُمْ ۚ وَاتَّقُوا اللَّهَ لَعَلَّكُمْ تُرْحَمُونَ ⑩

**10** విశ్వాసులు (ముస్లింలు) అన్నదమ్ములు (అన్న సంగతిని మరువకండి). కనుక మీ అన్నదమ్ముల మధ్య సర్దుబాటుకు ప్రయత్నించండి.[15] అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి – తద్వారా మీరు కరుణించబడవచ్చు.[16]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا يَسْخَرْ قَوْمٌ مِّن قَوْمٍ عَسَىٰ أَن يَكُونُوا خَيْرًا مِّنْهُمْ وَلَا نِسَاءٌ مِّن نِّسَاءٍ عَسَىٰ أَن يَكُنَّ خَيْرًا مِّنْهُنَّ ۖ وَلَا تَلْمِزُوا

**11** ఓ విశ్వాసులారా! పురుషులు సాటి పురుషులను ఎగతాళి చేయకూడదు. బహుశా వీరికంటే వారే ఉత్తములై ఉండవచ్చు. అలాగే స్త్రీలు సాటి స్త్రీలను పరిహసించరాదు. ఎందుకంటే బహుశా వీరి కంటే వారే ఉత్తమురాలై ఉండవచ్చు.[17] ఒకరి

13. అంటే తిరుగుబాటు వర్గం గనక తన తిరుగుబాటును మానుకుని దారికి వస్తే న్యాయబద్ధంగా– ఖుర్ఆన్ హదీసుల వెలుగులో – ఉభయవర్గాలను సమాధానపర్చండి.

14. అంటే మీరు నిత్యం న్యాయం చేయండి. ఎందుకంటే న్యాయం చేసేవారిని అల్లాహ్ ఎంతగానో ఇష్టపడతాడు. న్యాయం చేసేవారికి ఆయన గొప్ప బహుమానం ఇస్తాడు.

15. ఇంతకుముందు వచ్చిన ఆదేశమే ఇది. విశ్వాసం (ఈమాన్) చలువ మూలంగా విశ్వాసులంతా సహోదరులయ్యారు. ఈ సోదరబంధం అపురూపమైనది. వారందరిదీ ఒకేబాట. ఒకేమాట. ఒకేధర్మం. కాబట్టి వారు పరస్పరం కలహించుకోరాదు. పైగా వారు ఒండొకరికి చేదోడు వాదోడుగా ఉండాలి. ఒకరి దుఃఖాన్ని ఇంకొకరు పంచుకోవాలి. ఒకరి శ్రేయాన్ని మరొకరు అభిలషించాలి. ఆ విధంగా వారంతా ఒకటిగా మసలుకోవాలి. ఎప్పుడన్నా ఏదన్నా అపోహ మూలంగా తమ మధ్య వైమనస్యం ఏర్పడితే దాన్ని తొలగించుకుని మళ్ళీ ఏకమైపోవాలి (మరింత వివరణ కోసం తౌబా సూరాలోని 71వ ఆయతుకు ఇవ్వబడిన పాదసూచికను చూడండి).

16. ప్రతి విషయంలోనూ దైవానికి భయపడండి. ఈ దైవభీతి మిమ్మల్ని కనికరానికి అర్హులుగా నిలబెట్టవచ్చు.

ఈ ఆయతులో తిరుగుబాటు వర్గంతో పోరాడమని ఆజ్ఞాపించబడింది. కాని హదీసులోనేమో ముస్లింలతో పోరాడటం అవిశ్వాసానికి తార్కాణమని అనబడింది. దీనిభావం ఏమిటంటే అకారణంగా ఏ ముస్లిం సముదాయంతోనయినా పోరాడితే అట్టి పరిస్థితిలో అది అవిశ్వాస చర్య కావచ్చు. కాని తిరుగుబాటు ధోరణిని అవలంబించేవారి మెడలు వంచటానికి పోరాడటం ధర్మసమ్మతమే. పైగా ఈ రకమైన పోరాటం అనివార్యం కూడా.

ఈ ఆయతు ద్వారా అవగతమయ్యే మరొక విషయమేమిటంటే సాటి ముస్లిం వర్గంపై దౌర్జన్యానికి దిగిన వారిని దివ్య ఖుర్ఆన్ మోమిన్లు (విశ్వాసులు)గానే ఖరారు చేసింది. కాకపోతే తమ తిరుగుబాటు ధోరణి మూలంగా వారు ఘోర పాపానికి ఒడిగట్టిన వారవుతారు. అంతేగాని **ఖవారిజ్** వర్గం వారు ఇంకా **మూతజిలా** వర్గంలోని కొందరు భావించినట్లు వారు విశ్వాస (ఈమాన్) పరిధి నుండి తొలగిపోరు.

17. ఎవరయినా తన్ను తాను గొప్పవాడిగా ఊహించుకుని, ఎదుటివాడిని అల్పుని కింద జమకట్టినప్పుడే ఎదుటివాడ్ని గేలి చేస్తాడు. కాని దైవసన్నిధిలో విశ్వాసం రీత్యా, సత్కర్మల దృష్ట్యా ఉత్తముడెవడో మనకెవరికీ తెలీదు. ఆ సంగతి దైవానికి మాత్రమే తెలుసు. కాబట్టి ఎవరూ ఇంకొకరిని చిన్నచూపు చూడకూడదు. ఈ నైతికపు రుగ్మత పురుషులకన్నా

అంఫుసకుమ్ వలా తనాబజూ బిల్ అల్ ఖాబ్...

నొకరు ఎత్తిపొడుచుకోకండి.[18] ఒండొకరికి చెడ్డ బిరుదులను ఇచ్చుకోకండి.[19] విశ్వసించిన తరువాత తన సోదరుణ్ణి చెడ్డ పేరుతో అవమానించటం చాలా పాపం![20] మరెవరైతే పశ్చాత్తాపం చెందరో (ఈ ధోరణిని మానుకొనరో) వారే దుర్మార్గులు.

أَنفُسَكُمْ وَلَا تَنَابَزُوا بِالْأَلْقَابِ ۖ بِئْسَ الِاسْمُ الْفُسُوقُ بَعْدَ الْإِيمَانِ ۚ وَمَن لَّمْ يَتُبْ فَأُولَٰئِكَ هُمُ الظَّالِمُونَ ⑪

**12** ఓ విశ్వాసులారా! అతిగా అనుమానించటానికి దూరంగా ఉండండి. కొన్ని అనుమానాలు పాపాల క్రిందికి వస్తాయి సుమా![21] కూపీలు లాగకండి.[22] మీలో ఎవరూ ఇంకొకరి

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اجْتَنِبُوا كَثِيرًا مِّنَ الظَّنِّ إِنَّ بَعْضَ الظَّنِّ إِثْمٌ ۖ وَلَا تَجَسَّسُوا وَلَا يَغْتَب بَّعْضُكُم بَعْضًا ۚ أَيُحِبُّ أَحَدُكُمْ أَن يَأْكُلَ لَحْمَ

స్త్రీలలో అధికంగా ఉంటుందని అనబడుతోంది. అందుకే ప్రత్యేకంగా స్త్రీల పేరు కూడా పెట్టి అలా చేయరాదని తాకీదు చేయటం జరిగింది. ఇతరులను అధములుగా భావించటం అహంకారానికి ప్రతిరూపమని మహాప్రవక్త (స) ప్రవచనం ద్వారా కూడా రూఢీ అవుతోంది. 'అల్ కిబ్రు బతరుల్ హఖ్ఖ్, వ గమ్‌తున్నాస్' (గర్వం అంటే సత్యాన్ని త్రోసిపుచ్చటం, ప్రజలను అల్పులుగా జమకట్టటం). (అబూదావూద్ – కితాబుల్లిబాస్). మరి చూడబోతే అహంకారాన్ని అల్లాహ్ ఎంతగానో అసహ్యించుకుంటాడు.

18. అంటే ఒకరింకొకరిని ఎత్తి పొడవకండి. ఉదాహరణకు: ఓహో! నువ్వు ఫలానా వ్యక్తి కొడుకువా, నీ తల్లి గురించి ఎవరికి తెలియదనీ, నీ పుట్టుపూర్వోత్తరాల గురించి నాకు తెలీదనుకున్నావా? అని వెటకారంగా అనటం. కొందరి మాటలు ఇంతకన్నా ఘోరంగా కూడా ఉంటాయి.

19. అంటే ఇతరులను ఆటపట్టించే, అవమానించే ఉద్దేశంతో వారికి ఇష్టంలేని బిరుదులను, మారుపేర్లను వారికి అంటగట్టడం లేదా మంచిపేర్లు వక్రీకరించి పిలవటం అన్నమాట. ఈ చేష్టలన్నీ వారించబడ్డాయి.

20. అంటే – ఉన్న పేరును చెడుగా వక్రీకరించటం, ఇస్లాం స్వీకరించి పశ్చాత్తాపం చెందిన తరువాత కూడా వారిని పాపాత్ముల సరసన నిలబెట్టే పేర్లు ప్రతిపాదించటం చాలా చెడ్డ విషయం. ఉదాహరణకు : ఒరేయ్ దైవతిరస్కారీ! ఒరేయ్ త్రాగుబోతు! మొదలగునవి. మూలంలోని **'ఇస్మ్' (الِاسْمُ)** అన్న పదం ఇక్కడ 'ప్రస్తావన' అన్న అర్థంలో వాడబడింది. అంటే విశ్వసించిన తర్వాత కూడా వారి పేర్లను చెడుగా ప్రస్తావించటం పాపం అని దాని అర్థం (ఫత్‌హుల్ ఖదీర్). అయితే ఎవరికయినా వారి స్వభావానికి తగ్గ మారుపేరు పడిపోయినప్పుడు, అలా పిలవటం వల్ల ఎవరికయినా ఇబ్బంది కలగకపోతే ఫరవాలేదు. ఉదాహరణకు : ఎవరయినా అవిటితనం వల్ల మూగవాడనో, కుంటివాడనో పిలవబడతారు. అలాగే ఎవరయినా నల్లగా ఉండటం వల్ల నల్లవాడుగా పేరు మోస్తారు. పిలువబడేవారికి అభ్యంతరం లేకపోతే సరి. (ఖుర్తుబీ)

21. **'జన్' (ظَنّ)** అంటే అసలు అనుమానం, తలపోయటం అని అర్థం. అయితే శ్రేయోభిలాషుల, భక్తిపరుల, సత్యమూర్తుల గురించి లేనిపోని అనుమానాలకు పోవటం, వారిని రచ్చకీడ్చే ఉద్దేశ్యంతో కాకిలెక్కల ఆధారంగా నిందలు మోపటం వంటివన్నీ 'దురనుమానాలు' క్రిందికి వస్తాయి. హదీసులో ఇది **'అక్‌జబుల్ హదీస్'** (అన్నింటికంటే పెద్ద అబద్ధం)గా అభివర్ణించబడింది. అలాంటి అబద్ధానికి దూరంగా ఉండమని కూడా తాకీదు చేయబడింది (బుఖారీ – కితాబుల్ అదబ్, సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్). కాని పాపకార్యాలలో, అవిధేయతా వైఖరిలో తలమునకలై ఉన్నవారి చెడుగులను అనుమానించటం, వారి పాపిష్టిచేష్టల పట్ల అప్రమత్తంగా ఉండడం మాత్రం 'దురనుమానాల' క్రిందికి రాదు. (ఖుర్తుబీ)

22. అంటే – పొద్దస్తమానం ఇతరులలోని బలహీన కోణాలను ఎత్తిచూపే యత్నంలో ఉండకూడదు. ఇతరులలోని బలహీనతలను బయటపెట్టి, వారిని అవమానించాలన్న తాపత్రయం చాలా నీచమైనది. ఇలాంటి ఆరాలు తీయటం వారించబడింది. హదీసులలో కూడా ఈ వారింపు వచ్చింది. పైగా ఒకరి లోపాలు తమ దృష్టికి వచ్చినపుడు

గురించి వీపు వెనుక చెడుగా (చాడీలు) చెప్పుకోకూడదు.[23] ఏమిటి, మీలో ఎవరయినా చచ్చిపోయిన మీ సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా? చూడండి, మీరు స్వయంగా దీన్ని ఏవగించుకుంటున్నారు.[24] అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించే వాడూను.

اَخِيْهِ مَيْتًا فَكَرِهْتُمُوْهُ ۚ وَاتَّقُوا اللّٰهَ ۚ اِنَّ اللّٰهَ تَوَّابٌ رَّحِيْمٌ ﴿١٢﴾

**13** ఓ మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము.[25] మరి మీ (పరస్పర) పరిచయం కోసం మిమ్మల్ని వివిధ వర్గాలుగా, తెగలుగా చేశాము.[26] యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువగా భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువగా ఆదరణీయుడు.[27] నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అప్రమత్తుడు.

يٰۤاَيُّهَا النَّاسُ اِنَّا خَلَقْنٰكُمْ مِّنْ ذَكَرٍ وَّاُنْثٰى وَجَعَلْنٰكُمْ شُعُوْبًا وَّقَبَآىِٕلَ لِتَعَارَفُوْا ۚ اِنَّ اَكْرَمَكُمْ عِنْدَ اللّٰهِ اَتْقٰىكُمْ ۚ اِنَّ اللّٰهَ عَلِيْمٌ خَبِيْرٌ ﴿١٣﴾

---

సాధ్యమైనంతవరకు వాటిని మరుగుపరచాలని, జనుల ముందు దండోరా వేస్తూ తిరగరాదని ఆదేశించబడింది. ఈ మధ్య కాలంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎనలేని ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. ఇస్లాం కూడా కూపీలు లాగటాన్ని వారించి, మనిషి స్వేచ్ఛకు, గౌరవోన్నతులకు పెద్దపీట వేసింది. అయితే పాశ్చాత్య ప్రపంచం స్వేచ్ఛపేరిట విశృంఖలత్వానికి పర్మిట్ ఇచ్చేసి సామాజిక కట్టుబాట్లన్నింటినీ మరీ అడ్డగోలుగా త్రెంచివేసే పరిస్థితిని సృష్టించింది. మనిషికి గల స్వేచ్ఛ ఎదుటివారికి హానికరంగా పరిణమించకుండా ఉన్నంతవరకే సమ్మతం. ఒకవేళ అది వ్యక్తుల్ని, సముదాయాల్ని సర్వనాశనం చేసే స్థాయికి చేరుకున్నప్పుడు 'కొన్ని ఆంక్షలు' తప్పనిసరవుతాయి. లేకపోతే సామాజిక జీవితం దుర్భరం అయిపోతుంది.

23. ఒక వ్యక్తిలో ఉన్న వెలితిని గురించి అతని వీపు వెనుక – పరోక్షంలో – ఎవరికయినా చెబితే అది 'చాడీ' లేక పరోక్షనింద అవుతుంది. ఒకవేళ ఆ వ్యక్తిలో లేని దాన్ని గురించి వీపు వెనక చెబితే అది 'అపనింద' అవుతుంది. ఇవి రెండూ పెద్ద నేరాల క్రిందికే వస్తాయి.

24. తోటి ముస్లిం సోదరుని గురించి వేరొకరి ముందు చెడుగా చెప్పుకోవటం మామూలు విషయం కాదు – అది మృత సోదరుని మాంసం తినటంతో సమానం. మృత కళేబరాన్ని కొరికి తినాలనే తలంపునే అందరూ అసహ్యించుకుంటారు. కాని చాడీలు చెప్పటానికి, చాడీలు వినడానికి మాత్రం అందరూ ఎగబడతారు – కదు శోచనీయం కదూ!

25. అంటే ఆదిమానవులైన ఆదం, హవ్వాల జంట నుండి అన్నమాట! మీ అందరి మూలం ఒక్కటే. కాబట్టి మీరు కులగోత్రాల, వంశపరంపరల పేరిట గర్వాన్ని ప్రదర్శించవలసిన అవసరం లేదు. మీమధ్య నిమ్నోన్నతా భేదభావాలకు కూడా తావులేదు. ఎందుకంటే మీ అందరి వంశవృక్షం చివరకు ఆది మానవుడైన ఆదం (అలైహి) తోనే కలుస్తుంది.

26. **'షువూబన్'** (شُعُوْبًا) అంటే వంశపరంపర లేక పెద్ద తెగ అని అర్థం. దాన్నుండే తెగలు, ఉపతెగలు మొదలగునవి ఏర్పడతాయి (ఫత్‌హుల్ ఖదీర్). పలు కుటుంబీకులుగా, తెగలుగా విభజించబడటంలోని అంతరార్థం ఒక్కటే – అదే పరస్పర పరిచయం! బంధుత్వ సంబంధాల పరిరక్షణ!! అంతేగాని వేరొకరిపై తమ ఆధిక్యతను చాటుకుని, మీసాలు మెలేయటానికి మాత్రం కాదు. తమ పూర్వీకుల ఘనకార్యాలను చెప్పుకుని ఇతరులను కించపరిచే చర్యలను ఇస్లాం 'అజ్ఞానం'గా అభివర్ణించింది.

14 "మేము విశ్వసించాము" అని పల్లెవాసులు అంటున్నారు. (ఓ ప్రవక్తా!) వారికిలా చెప్పు: "నిజానికి మీరింకా విశ్వసించలేదు. కాని '(వ్యతిరేక ధోరణిని మానుకుని) లొంగిపోయాము (ఇస్లాం స్వీకరించాము)' అని మాత్రం అనండి. వాస్తవానికి విశ్వాసం ఇంకా మీ హృదయాలలో ప్రవేశించనే లేదు.[28] మీరు గనక అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపితే, ఆయన మీ కర్మల (ప్రతిఫలం) లో ఏ మాత్రం కోత విధించడు. నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలి, దయాశీలి."

قَالَتِ الْأَعْرَابُ اٰمَنَّا ؕ قُلْ لَّمْ تُؤْمِنُوْا وَلٰكِنْ قُوْلُوْۤا اَسْلَمْنَا وَلَمَّا يَدْخُلِ الْاِيْمَانُ فِىْ قُلُوْبِكُمْ ؕ وَاِنْ تُطِيْعُوا اللّٰهَ وَرَسُوْلَهٗ لَا يَلِتْكُمْ مِّنْ اَعْمَالِكُمْ شَيْـًٔا ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿14﴾

15 అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను (దృఢంగా) విశ్వసించి, తరువాత ఎలాంటి సందేహానికీ తావీయకుండా ఉంటూ, తమ ధనప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారే విశ్వాసులు. వారే సత్యవంతులు.[29]

اِنَّمَا الْمُؤْمِنُوْنَ الَّذِيْنَ اٰمَنُوْا بِاللّٰهِ وَرَسُوْلِهٖ ثُمَّ لَمْ يَرْتَابُوْا وَجٰهَدُوْا بِاَمْوَالِهِمْ وَاَنْفُسِهِمْ فِىْ سَبِيْلِ اللّٰهِ ؕ اُولٰٓئِكَ هُمُ الصّٰدِقُوْنَ ﴿15﴾

16 వారికి చెప్పు: "ఏమిటీ, మీ ధార్మికత గురించి మీరు అల్లాహ్‌కే తెలియపర్చాలనుకుంటున్నారా?[30] భూమ్యాకాశాలలో ఉన్న ప్రతిదీ అల్లాహ్‌కు తెలుసు. అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు."[31]

قُلْ اَتُعَلِّمُوْنَ اللّٰهَ بِدِيْنِكُمْ ؕ وَاللّٰهُ يَعْلَمُ مَا فِى السَّمٰوٰتِ وَمَا فِى الْاَرْضِ ؕ وَاللّٰهُ بِكُلِّ شَىْءٍ عَلِيْمٌ ﴿16﴾

27. అంటే మనిషి దైవసన్నిధిలో గౌరవాదరణలు పొందటానికి కులీనుడో, సంపన్నుడో అయి ఉండనవసరంలేదు. ఇది మనిషి వల్ల సాధ్యమయ్యే పని కూడా కాదు. అయితే మనిషి సదాచరణ చేసి, భయభక్తులతో కూడిన జీవితం గడిపితే దైవసమక్షంలో గొప్పగా సత్కరించబడతాడు. కాస్తంత కష్టపడితే ప్రతి మనిషీ ఈ లక్ష్యాన్ని సాధించ గలుగుతాడు. వివాహం విషయంలో వంశపరంపరను చూడవలసిన అవసరం లేదని, కేవలం ధార్మికత ఆధారంగా వధువును ఎంపిక చేయమని చెప్పేవారు ఈ ఆయతునే ప్రమాణంగా తీసుకుంటారు (ఇబ్నెకసీర్)

28. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఈ వాక్యం బనూ అసద్, ఖుజైమా తెగలకు చెందిన కపటుల నేపథ్యంలో అవతరించింది. కరువు కాటకాల నుండి గట్టెక్కే ఉద్దేశ్యంతోనో, యుద్ధఖైదీలుగా పట్టుబడతామేమోనన్న భయంతోనో వారు ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. కాని వారి ఆంతర్యాలలో ఇంకా ఇస్లాం ప్రవేశించలేదు. వారి విశ్వాసం ఇంకా దృఢతరం కాలేదు. వారి మనసులో చిత్తశుద్ధి లేదు (ఫత్‌హుల్ ఖదీర్).

కాని ఇమామ్ ఇబ్నె కసీర్ ప్రకారం ఈ ఆయతు అప్పుడప్పుడే ఇస్లాం స్వీకరించిన అరబ్బు పల్లెటూరి వాళ్లను గురించి అవతరించింది. నిజానికి వారి హృదయాలలో విశ్వాస (ఈమాన్) బీజం ఇంకా గట్టిగా నాటుకోలేదు. అయినప్పటికీ వారు తమను నికార్సయిన విశ్వాసులుగా ప్రకటించుకునేవారు. అందుకే వారికి ఈ ఆయతు ద్వారా 'ప్రవర్తనా నియమావళి' బోధించబడింది. పదే పదే తమ 'విశ్వాసం' (ఈమాన్) గురించి దండోరా వేసుకోవటం మంచిది కాదని, విశ్వాస బీజం మనోభూమిలో నాటుకుని అదొక మహావృక్ష సృజన ప్రారంభించటానికి మరికొంత సమయం పడుతుందని, అప్పుడే మీరు ఆ విశ్వాస మాధుర్యాన్ని సరిగ్గా ఆస్వాదించగలుగుతారని చెప్పబడింది.

29. తాము ముస్లింలమని కేవలం నోటితో ప్రకటిస్తే సరిపోదు, క్రియాత్మకంగా రుజువు చేసుకోవాలి. రుజువు చేసుకున్నవారే ధన్యులు.

**17** తాము ఇస్లాం స్వీకరించి నీకేదో ఉపకారం చేసినట్లుగానే వారు మాట్లాడుతున్నారు. (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "మీ ఇస్లాం స్వీకరణకు సంబంధించిన ఉపకారం నాపై పెట్టకండి. వాస్తవానికి మీరు సత్యవంతులే అయితే (తెలుసుకోండి), అల్లాహ్ విశ్వాస మార్గం చూపి మీకు మహోపకారం చేశాడు.[32]

يَمُنُّونَ عَلَيْكَ أَنْ أَسْلَمُوا ۖ قُل لَّا تَمُنُّوا عَلَيَّ
إِسْلَامَكُم ۖ بَلِ اللَّهُ يَمُنُّ عَلَيْكُمْ أَنْ هَدَاكُمْ
لِلْإِيمَانِ إِن كُنتُمْ صَادِقِينَ ﴿١٧﴾

**18** "భూమ్యాకాశాలలో వున్న రహస్య విషయాలన్నీ అల్లాహ్‌కు బాగా తెలుసు (అన్న సంగతిని మీరు గ్రహించాలి). మీరు చేసే దంతా ఆయన చూస్తూనే ఉన్నాడు."

إِنَّ اللَّهَ يَعْلَمُ غَيْبَ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ
وَاللَّهُ بَصِيرٌ بِمَا تَعْمَلُونَ ﴿١٨﴾

30. అంటే-మీ విశ్వాస స్థితి గురించి, ధర్మావలంబన గురించి అల్లాహ్‌కు తెలీదనుకున్నారా? మీ అంతరంగాల గురించి మీరు ఆయనకు ఎరుకపరచాలను కుంటున్నారా? మీరు చెప్పనవసరం లేదు - ఆయనకు అంతా తెలుసు.

31. విశ్వాసపరంగా మీరు ఏ స్థాయికి ఎదిగారో, మీలో ఏ పాటి చిత్తశుద్ధి ఉందో ఆయన గమనిస్తూనే ఉన్నాడు.

32. అరబ్బు పల్లెటూరి బైతులను సంస్కరించేందుకు అనబడిన మాటలివి. "ఓ ముహమ్మద్ (సఅసం) ! చూశారా, మేము ఇస్లాం స్వీకరించి మీకు అండగా నిలిచాము. ఇప్పటికీ చాలామంది అరబ్బులు మీకు వ్యతిరేకంగా ఉన్నారు" అన్న ధోరణి వారి మాటల్లో వ్యక్తమయ్యేది. వారి ధోరణిని ఖండిస్తూ దేవుడిలా సెలవిచ్చాడు : "ముస్లింలుగా మారి మీరు అల్లాహ్‌కు మేలు చేసినట్లుగా సంబరపడిపోకండి. మీరు గనక సంకల్పశుద్ధితో ఇస్లాం స్వీకరించి ఉంటే అది మీకే మేలు చేకూరుస్తుంది-అల్లాహ్‌కు కాదు. నిజం చెప్పాలంటే అల్లాహ్ మీకు సత్య ధర్మమైన ఇస్లాంను స్వీకరించే సద్బుద్ధిని వొసగి గొప్ప మేలు చేశాడు. అంతేగాని అల్లాహ్‌కు మీరు చేసిందేమీ లేదు."

50 వ సూరా

# ఖాఫ్

## ఖాఫ్

అవతరణ మక్కాలో

ఆయతులు 45

### పరిచయం

ఏక దైవారాధన, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరా ప్రారంభంలో వచ్చిన 'ఖాఫ్' అనబడే పొడి అక్షరాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ పొడి అక్షరానికి అసలు అర్థం అల్లాహ్‌కే బాగా తెలుసు, కాని కొందరు వ్యాఖ్యాతలు ఈ పొడి అక్షరం అర్థం గురించి వివరణలు ఇచ్చారు. అవిశ్వాసులు తీర్పుదినాన్ని, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని తిరస్కరించడం ఈ సూరా ప్రస్తావించింది. అవిశ్వాసులు తాము మరణించిన తర్వాత తమ దేహాలు దుమ్ము, ధూళిలో కలిసి పోయిన తర్వాత మళ్ళీ తమను బతికించడం అన్నది ఎలా సాధ్యమని వాదించేవారు. ఈ వాదనకు ఈ సూరాలో జవాబు ఇస్తూ, ఒకసారి సృష్టించిన అల్లాహ్ అలసిపోలేదని, ఆయన జీవితాన్ని మరణాన్ని ప్రసాదిస్తాడనీ, ఆయన మృతభూమికి జీవం పోస్తాడనీ, ఆయన భూమ్యాకాశాలను, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఆరు రోజులలో సృష్టించాడనీ తెలియజేసింది.

ఈ సూరా మృత్యువుకు సంబంధించిన బాధాకరమైన పరిస్థితిని, ప్రళయఘడియ వచ్చినప్పుడు శంఖం పూరించబడే పరిస్థితిని, మరణించిన వారు మళ్ళీ లేపబడే విషయాన్ని, తీర్పుదినం నాటి దృశ్యాలను అవిశ్వాసులకు స్పష్టంగా తెలియజేసింది. ప్రతి వ్యక్తి వెంట ఒక దైవదూత సాక్షిగా ఉంటాడు. అవిశ్వాసులను నరకాగ్నిలోకి నెట్టడం జరుగుతుంది. వారు సత్యాన్ని అనుమానించారు, అహంకారంతో వ్యవహరించారు, మూర్ఖంగా అల్లాహ్‌ను తిరస్కరించారు. వారు మంచిని నిషేధించుకున్నారు. సన్మార్గులకు వారికి వాగ్దానం చేయబడిన స్వర్గవనాలు లభిస్తాయి. వారు అల్లాహ్‌కు భయపడేవారు. వారు భక్తితో అల్లాహ్ వైపునకు మరలేవారు. నిజాయితీగా పశ్చాత్తాపపడేవారు. ఈ సూరాలో గత కాలాల్లో సత్యాన్ని తిరస్కరించిన జాతులకు పట్టిన గతిని గుర్తుచేయడం జరిగింది. నూహ్ (అస) జాతి, సమూద్ తెగలు, ఆద్ జాతి, ఫిర్‌ఔన్ జాతి, లూత్ (అస)జాతి – ఈ జాతులు సంపద, అధికారాలు కలిగిఉన్నప్పటికీ నాశనానికి గురయ్యాయి. ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి సహనంతో వ్యవహరించాలని, సన్మార్గానికి కట్టుబడాలని బోధించడం జరిగింది.

## سُوۡرَةُ قٓ

## ఖాఫ్[1]సూరా

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

قٓ ۚ وَالۡقُرۡاٰنِ الۡمَجِيۡدِ ۚ (1)

1 ఖాఫ్. దివ్యమైన ఖుర్ఆన్ సాక్షిగా![2]

بَلۡ عَجِبُوۡۤا اَنۡ جَآءَهُمۡ مُّنۡذِرٌ مِّنۡهُمۡ فَقَالَ
الۡكٰفِرُوۡنَ هٰذَا شَىۡءٌ عَجِيۡبٌ ۚ (2)

2 తమ వద్దకు స్వయంగా తమలో నుండే హెచ్చరించేవాడొకడు రావటం వారిని ఆశ్చర్యపరిచింది. అందుకే అవిశ్వాసులు ఇలా అన్నారు: "ఇది మరీ విచిత్రంగా ఉందే![3]

ءَاِذَا مِتۡنَا وَكُنَّا تُرَابًا ۚ ذٰلِكَ رَجۡعٌ ۢ بَعِيۡدٌ (3)

3 "ఏమిటీ, మేము మరణించి మట్టిగా మారిన తరువాత (మళ్ళీ బ్రతికించబడతామా?) ఈ తిరిగిపోవటం చాలా దూరం (బుద్ధికి అందనిది)!"[4]

قَدۡ عَلِمۡنَا مَا تَنۡقُصُ الۡاَرۡضُ مِنۡهُمۡ ۚ وَعِنۡدَنَا
كِتٰبٌ حَفِيۡظٌ (4)

4 భూమి వారిలో (ఎందరిని) ఏ మేరకు హరిస్తుందో కూడా మాకు తెలుసు. మా దగ్గర అన్నింటినీ భద్రపరిచే పుస్తకం ఉంది.[5]

بَلۡ كَذَّبُوۡا بِالۡحَقِّ لَمَّا جَآءَهُمۡ فَهُمۡ فِىۡۤ
اَمۡرٍ مَّرِيۡجٍ (5)

5 పైగా వారు, సత్యం తమ వద్దకు వచ్చినప్పుడు దాన్ని అబద్ధంగా చిత్రీకరించారు. అసలు వారు అయోమయంలో పడిపోయారు.[6]

1. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజులలో ఈ సూరాతోపాటు, **ఇఖ్తరబతిస్సాఅతు** సూరా పఠించేవారు (సహీహ్ ముస్లిం). ప్రతి శుక్రవారం (జుమా) ప్రసంగంలో కూడా ఈ సూరా పఠించేవారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ జుమా). పండుగ నమాజులలో, శుక్రవారం ప్రసంగంలో ఈ సూరాలను పఠించటమంటే బహుశా జనులు ఎక్కువగా సమావేశమయ్యే చోట్ల ఆయన ఈ సూరా పఠించేవారు. ఇందులో గొప్ప పరమార్థం ఉంది. ఎందుకంటే వీటి ప్రారంభంలో సృష్టి ప్రక్రియ గురించి, మరణానంతర జీవితం గురించి, లెక్కల గురించి, స్వర్గ నరకాల గురించి, పుణ్యము పాపముల గురించి, శుభవార్తలు – హెచ్చరికల గురించి చెప్పబడింది. (ఇబ్నె కసీర్)
2. **"మీరు ప్రళయదినాన తప్పక లేపబడతారు"** అనే సమాధానం ఈ వాక్యంలో ఇమిడి ఉందని కొందరు అభిప్రాయపడ్డారు. తరువాతి ఆయతులలో చెప్పబడిన విషయాలకు ఈ (మొదటి) ఆయతు పీఠిక లాంటిదని మరికొంతమంది చెప్పారు (ఫత్హుల్ ఖదీర్, ఇబ్నె కసీర్).
3. నిజానికి ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ప్రవక్తలంతా ఆయా జాతులకు చెందిన వారే. ఆ లెక్కన మక్కాకు చెందిన ఖురైషులను హెచ్చరించటానికి ఖురైషులలో నుండే ఒకానొక వ్యక్తిని ఎన్నుకోవటం జరిగింది.
4. మరి చూడబోతే అందులో బుద్ధికి అందని విషయం ఏదీ లేదు. రాబోయే వాక్యాలలో దీనికి సమాధానం వస్తుంది.
5. అంటే భూమి మనిషి మాంసాన్ని, ఎముకలను, వెంట్రుకలను సయితం క్రమక్రమంగా తినేస్తూ ఉంటుంది. ఆ విధంగా అది అతన్ని తుత్తునియలుగా చేసేస్తుంది. అదంతా మాకు తెలియకుండా లేదు. ఇంకా చెప్పాలంటే ఆ విషయాలన్నీ మా వద్ద ఉన్న గ్రంథంలో నమోదై ఉన్నాయి. అందుచేత శరీరావయవాలన్నింటినీ సమకూర్చి వారిని మలిసారి బ్రతికించటం మాకేమాత్రం క్లిష్టతరం కాదు.

| | |
|---|---|
| 6 ఏమిటీ, తమపైన ఉన్న ఆకాశాన్ని వారు చూడలేదా, ఏ విధంగా మేము దాన్ని నిర్మించి,[7] ముస్తాబు చేశామో?[8] మరి అందులో ఎలాంటి పగుళ్ళూ లేవు.[9] | اَفَلَمۡ يَنۡظُرُوۡۤا اِلَى السَّمَآءِ فَوۡقَهُمۡ كَيۡفَ بَنَيۡنٰهَا وَزَيَّنّٰهَا وَمَا لَهَا مِنۡ فُرُوۡجٍ ﴿6﴾ |
| 7 ఇంకా మేము భూమిని పరచి, అందులో పర్వతాలను చేశాము. ఇంకా అందులో అందాలు చిందే అన్ని రకాల వస్తువులను మొలిపించాము.[10] | وَالۡاَرۡضَ مَدَدۡنٰهَا وَاَلۡقَيۡنَا فِيۡهَا رَوَاسِىَ وَاَنۡۢبَتۡنَا فِيۡهَا مِنۡ كُلِّ زَوۡجٍۢ بَهِيۡجٍ ﴿7﴾ |
| 8 (అల్లాహ్ వైపు) మరలి వచ్చే ప్రతి దాసునికీ ఇవి కనువిప్పుగా, గుణపాఠంగా ఉన్నాయి.[11] | تَبۡصِرَةً وَّذِكۡرٰى لِكُلِّ عَبۡدٍ مُّنِيۡبٍ ﴿8﴾ |
| 9 ఇంకా మేము ఆకాశం నుండి శుభప్రదమైన నీటిని (వర్షాన్ని) కురిపించాము. తద్వారా తోటలను, కోతకొచ్చే ఆహార ధాన్యాలను[12] మొలిపించాము. | وَنَزَّلۡنَا مِنَ السَّمَآءِ مَآءً مُّبٰرَكًا فَاَنۡۢبَتۡنَا بِهٖ جَنّٰتٍ وَّحَبَّ الۡحَصِيۡدِ ﴿9﴾ |
| 10 ఒకదానిపై ఒకటి పేరుకుని ఉండే పండ్ల గుత్తులు గల ఎత్తయిన ఖర్జూరపు చెట్లను,[13] | وَالنَّخۡلَ بٰسِقٰتٍ لَّهَا طَلۡعٌ نَّضِيۡدٌ ﴿10﴾ |

6. ఇక్కడ **సత్యం** (హఖ్) అంటే దివ్య ఖుర్ఆన్ లేదా ఇస్లాం లేదా ముహమ్మద్ (స) దైవదౌత్యం అని భావం. ఏ అర్థంలో తీసుకున్నా ఒక్కటే. **'మరీజ్'** (مَّرِيۡجٍ) అంటే అయోమయం లేక తికమక అని అర్థం. తీవ్రమైన సందేహం వారిని ఆ స్థితికి లోను చేసింది. వారికి ఏమీ పాలుపోవటం లేదు. ఒక్కోసారి ముహమ్మద్ (స)ని మాంత్రికుడంటారు. ఒక్కోసారేమో కవిపుంగవుడంటారు.

7. అంటే – ఏ విధమైన ఆధారంగానీ, స్తంభాలుగానీ లేకుండానే ఆకాశాన్ని మీపైన నిలిపి ఉంచాము.

8. అంటే – నక్షత్రాలనే దీపాలతో దాన్ని అందంగా అలంకరించాము.

9. అంతేకాదు, ఈ ఆకాశమండలంలో ఎలాంటి అపసవ్యత, ఎగుడుదిగుడు కూడా కానరాదు. ఈ విషయమే మరోచోట ఇలా అనబడింది : "ఆయన ఒకదానిపై ఒకటిగా సప్తాకాశాలను నిర్మించాడు. నీవు కరుణామయుని సృష్టి ప్రక్రియలో ఎలాంటి అపసవ్యతనూ కానలేవు. కావాలంటే నీ దృష్టిని సారించు. అందులో నీకేమైనా లోపం కానవస్తోందా? మళ్లీ మళ్లీ చూడు. నీ దృష్టి అలసిసొలసి విఫలమై నీ వద్దకు తిరిగి వస్తుంది." (అల్ ముల్క్ – 3, 4).

10 **జౌజ్** (زَوۡجٍ) అన్న పదాన్ని కొందరు 'జతలు' అని అనువదించారు. అంటే – ఆయన అన్ని రకాల వృక్షజాలను, వస్తువులను జతలు జతలుగా (ఆడ–మగలుగా) సృజించాడు. చూడటానికి అవి ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా, మనోరంజకంగా ఉంటాయి. **'బహీజ్'** (بَهِيۡجٍ) అంటే కనువిందుచేసే దృశ్యం.

11. అంటే – భూమ్యాకాశాల సృష్టిలోనూ, వాటి మధ్య ఉన్న వివిధ రకాల వస్తువులలోనూ దేవుని వైపుకు రుజువర్తన చెందే భక్తుల కోసం హితబోధ ఉంది.

12. కోతకువచ్చే ఆహారధాన్యాలంటే వరి, గోధుమ, మొక్కజొన్న, రాగి, పప్పుదినుసులతో కూడిన పంటలన్నమాట. కోతకోసిన తరువాత ఈ ఆహారధాన్యాలు ఒక ప్రణాళిక ప్రకారం నిల్వ చేయబడతాయి.

13. పండ్ల తోటలలో ఖర్జూరం కూడా చేరి ఉన్నప్పటికీ, ఖర్జూరచెట్ల గురించి ప్రత్యేకంగా చెప్పటం గమనార్హం. దీన్నిబట్టి

**11** దాసుల ఉపాధి నిమిత్తం వీటిని (ఉత్పత్తి చేశాము). ఇంకా మేము దీంతో నిర్జీవంగా ఉన్న ప్రదేశానికి జీవం పోశాము. ఈ విధంగానే (సమాధుల నుండి) బయటకు రావలసి ఉన్నది.[14]

رِّزْقًا لِّلْعِبَادِ ۖ وَأَحْيَيْنَا بِهِ بَلْدَةً مَّيْتًا ۚ كَذَٰلِكَ الْخُرُوجُ ﴿١١﴾

**12** వీరికి పూర్వం నూహ్ జాతి వారు, రస్ జనులు,[15] సమూదు వారు ధిక్కరించినవారే.

كَذَّبَتْ قَبْلَهُمْ قَوْمُ نُوحٍ وَأَصْحَابُ الرَّسِّ وَثَمُودُ ﴿١٢﴾

**13** ఆదు వారు, ఫిరౌను జనులు, లూత్ సోదరులు,

وَعَادٌ وَفِرْعَوْنُ وَإِخْوَانُ لُوطٍ ﴿١٣﴾

**14** అయికా వారు,[16] తుబ్బా జాతివారు[17] కూడా. వారంతా ప్రవక్తలను ధిక్కరించారు.[18] దాంతో నా శిక్షా వాగ్దానం వారి విషయంలో నిజమని తేలింది.

وَأَصْحَابُ الْأَيْكَةِ وَقَوْمُ تُبَّعٍ ۚ كُلٌّ كَذَّبَ الرُّسُلَ فَحَقَّ وَعِيدِ ﴿١٤﴾

**15** ఏమిటీ, మేము తొలి(సారి) సృష్టికే అలసిపోయామా?[19] అది కాదు, వారసలు సరికొత్త సృష్టి గురించి సందిగ్ధంలో పడి పోయారు.[20]

أَفَعَيِينَا بِالْخَلْقِ الْأَوَّلِ ۚ بَلْ هُمْ فِي لَبْسٍ مِّنْ خَلْقٍ جَدِيدٍ ﴿١٥﴾

ఖర్జూరపండ్లకు గల ప్రాముఖ్యత విదితమవుతోంది. అరబ్బులకు లభ్యమయ్యే పండ్లలో ఖర్జూరపండు అతి ముఖ్యమైనది కదా!

**బాసిఖాత్** (بٰسِقٰتٍ) అంటే ఎత్తైనది. **'తల్‌వున్'** (طَلْعٌ) అంటే లేత ఖర్జూరపండ్లు. **'నజీద్'** (نَضِيْدٌ) అంటే పొరలు పొరలుగా ఉండేదని అర్థం.

14. మేము వర్షపు నీటిద్వారా మృతభూమిని బ్రతికించి సజీవంగా, సస్యశ్యామలంగా చేసినట్లే, ప్రళయదినాన సమాధుల నుండి మృతులను బ్రతికించి లేపుతాము. ఈ పని మాకేమాత్రం కష్టం కాదు.

15. **రస్‌జనుల** గురించి వ్యాఖ్యాతల మధ్య తీవ్రమైన భేదాభిప్రాయముంది. ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ మాత్రం వీరిని కందకాల వాళ్ళని గట్టిగా వక్కాణించారు. కందకాల వాళ్ళ గురించి అల్ బురూజ్ సూరాలో వచ్చింది (మరిన్ని వివరాల కోసం ఫుర్ఖాన్ సూరా 38వ ఆయతుకు వ్యాఖ్యానంగా ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్ గ్రంథాలను చూడవచ్చు).

16. అయికా వారి గురించి వివరాల కోసం షుఅరా సూరా 176వ ఆయతు వివరణను చూడండి.

17. తుబ్బా జాతి వారి గురించి దుఖాన్ సూరా 37వ ఆయతు పాదసూచికను చూడండి.

18. ఈ జాతుల వారంతా తమ తమ కాలాల నాటి ప్రవక్తలను త్రోసిపుచ్చినవారే. ఈ ఉదాహరణల ద్వారా అంతిమ దైవప్రవక్త (స)ను ఓదార్చటం జరిగింది. ఓ ముహమ్మద్ (సఅసం)! నీవు నీ జాతి జనుల ధిక్కారవైఖరిపై దిగులు చెందకు. ఈ ధిక్కరణ కొత్త విషయమేమీ కాదు. నీకు పూర్వం కూడా మా ప్రవక్తల పట్ల ఇలాంటి వ్యవహారమే జరిగింది. మరోవైపు ఈ ఆయతు మక్కావాసులకు హెచ్చరికగా వచ్చింది – లోగడ ప్రవక్తలను తిరస్కరించిన ఆయా జాతుల వారికి ఏ దుర్గతి పట్టిందో చూశారుగా! మీరు కూడా అలాంటి దుర్గతిని కొనితెచ్చుకోవాలనుకుంటున్నారా? ఆ దుర్గతి వద్దనుకుంటే, మరి ధిక్కార వైఖరిని మానుకుని అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించండి.

19. లేదుకదా! మరలాంటప్పుడు పునరుత్థాన దినాన మలిసారి సృష్టికి ఎలా అలసి పోతామనుకున్నారు? మలిసారి సృష్టి తొలిసారి సృష్టికన్నా తేలిక. "తొలిసారి ప్రాణులను సృష్టించేవాడు ఆయనే. మలిసారి కూడా ఆయనే సృష్టిస్తాడు. ఈ

**16** మేమే మనిషిని సృష్టించాము. వాడి మదిలో మెదిలే ఆలోచనలు సయితం మాకు తెలుసు.[21] మేమతని ప్రాణ నాళం కంటే కూడా అతనికి చేరువలో ఉన్నాం.[22]

وَلَقَدْ خَلَقْنَا الْإِنْسَانَ وَنَعْلَمُ مَا تُوَسْوِسُ بِهٖ نَفْسُهٗ ۖ وَنَحْنُ اَقْرَبُ اِلَيْهِ مِنْ حَبْلِ الْوَرِيْدِ ﴿16﴾

**17** తీసుకోవలసిన ఇద్దరు(దూతలు) తీసుకోవటానికి వెళ్ళినప్పుడు (వారిలో) ఒకతను కుడి ప్రక్కన, మరొకతను ఎడమ ప్రక్కన కూర్చొని ఉంటాడు.

اِذْ يَتَلَقَّى الْمُتَلَقِّيٰنِ عَنِ الْيَمِيْنِ وَعَنِ الشِّمَالِ قَعِيْدٌ ﴿17﴾

**18** (మనిషి) నోట ఒక మాట వెలువడటమే ఆలస్యం, అతని దగ్గర ఒక పర్యవేక్షకుడు (దాన్ని నమోదు చేయడానికి) సిద్ధంగా ఉంటాడు.[23]

مَا يَلْفِظُ مِنْ قَوْلٍ اِلَّا لَدَيْهِ رَقِيْبٌ عَتِيْدٌ ﴿18﴾

పని చేయడం ఆయనకు ఇంకా తేలిక" (రూమ్-27). యాసీన్ సూరా 78, 79 ఆయతులలో కూడా ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. హదీసె ఖుద్సీలో ఇలా అనబడింది– అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "అల్లాహ్ తొలిసారి నన్ను సృష్టించినట్లుగా ఎట్టి పరిస్థితిలోనూ మలిసారి సృష్టించలేడని చెప్పి ఆదం పుత్రుడు నాకు బాధకలిగిస్తున్నాడు. నిజానికి తొలిసారి సృష్టి మలిసారి సృష్టికన్నా తేలికైంది కాదు." ఒకవేళ అది కష్టసాధ్యమైన పని అనుకుంటే తొలిసారి సృష్టే కష్టసాధ్యమై ఉండేది (బుఖారీ - ఇఖ్లాస్ సూరా వ్యాఖ్యానం).

20. అంటే - వీళ్లు దేవుని శక్తి సామర్థ్యాలను శంకించటం లేదు. కాని ప్రళయం, మరణానంతర జీవితం లాంటి విషయాల పట్ల మాత్రమే వారు సంశయానికి లోనవుతున్నారు.

21. అంటే - మనిషి తన గుండెల్లో దాచుకునే గుట్టును, మనసులో అల్లుకునే ఆలోచనలను మేమెరుగుదుము. మనిషి ఆంతర్యంలో జనించే ప్రేరణల గురించి అతనికి తప్ప వేరెవరికీ తెలియదు. కాని అల్లాహ్‌కు ప్రేరణల సంగతి కూడా తెలిసిపోతుంది. అందుకే హదీసులో ఇలా అనబడింది : "నా అనుచర సమాజ సభ్యుల ఆంతర్యాల్లో జనించే ప్రేరణలను అల్లాహ్ క్షమిస్తాడు. వాటిని గురించి నిలదీయడు. అయితే ఆ ప్రేరణలను బహిర్గతం చేస్తే లేక, వాటికి క్రియారూపం ఇస్తే మటుకు అల్లాహ్ నిలదీస్తాడు." (బుఖారీ, ముస్లిం).

22. కంఠనాళం లేక ప్రాణనాళాన్ని అరబీలో **'వరీద్'** (الْوَرِيْدِ) అంటారు. అది గనక తెగితే క్షణాల్లో ప్రాణం పోతుంది. ఈ నాళం కంటే దగ్గరగా ఉండటమంటే 'జ్ఞానం రీత్యా' అత్యంత చేరువలో ఉన్నాడని భావం. మేమతనికి ఎంత దగ్గరలో ఉన్నామంటే అతని అంతరంగంలో జనించే ఆలోచనలు సయితం ఎప్పటికప్పుడు మాకు తెలిసి పోతుంటాయని దేవుడంటున్నాడు. అరబీ మూలంలో ఉన్న **'నహ్ను'** (نَحْنُ) (మేము) అనే పదం దైవదూతలకు వర్తిస్తుందని ఇమామ్ ఇబ్నె కసీర్ అంటున్నారు. అంటే - మా దూతలు మనిషి ప్రాణ నాళం కన్నా దగ్గరలో ఉన్నారు. ఎందుకంటే మనిషి కుడివైపున, ఎడమవైపున దైవ దూతలు అనుక్షణం ఉంటారు. వారు మనిషి చెప్పే ప్రతి మాటను, ప్రతిచేష్టను రికార్డు చేస్తారు.

**'యతలఖ్ఖల్ ముతలఖ్ఖియాన్'**కు వివరణగా ఇమామ్ షౌకానీ ఈ విధంగా అభిప్రాయపడ్డారు:

దీని భావం ఏమిటంటే, మనిషి స్థితిగతులన్నింటినీ మేము ఎరుగుదుము. మా దూతలను మనిషిపై నియమించినంత మాత్రాన మనిషి గురించి మాకేమీ తెలియదని కాదు. లాంఛనప్రాయంగా మాత్రమే మేము మా దూతలను నియమించాము. వారు మనిషి వాక్కర్మలను గ్రంథస్థం చేస్తూ ఉంటారు. అంతమాత్రాన మేము మా దూతలపై ఆధారపడి ఉన్నామని అనుకోరాదు.

ఇద్దరు దూతల్లో ఒకరు సత్కర్మలను, మరొకరు దుష్కర్మలను నోట్ చేస్తారని మరికొందరు అభిప్రాయపడ్డారు.

19 చివరికి మరణ మైకం – సత్య సమేతంగా – రానేవచ్చింది.[24]
“(ఓ మనిషీ!) దేనిపట్ల నువ్వు బెదిరి పారిపోయేవాడివో అదే
ఇది.”[25]

وَجَآءَتْ سَكْرَةُ الْمَوْتِ بِالْحَقِّ ۚ ذٰلِكَ مَا كُنْتَ مِنْهُ تَحِيْدُ ﴿19﴾

20 మరి శంఖం ఊదబడుతుంది. (శిక్ష గురించి) వాగ్దానం చేయ
బడిన రోజు ఇదే.

وَنُفِخَ فِي الصُّوْرِ ۚ ذٰلِكَ يَوْمُ الْوَعِيْدِ ﴿20﴾

21 ప్రతి వ్యక్తీ తన వెంట తనను తీసుకొచ్చేవాడొకడు, సాక్ష్య
మిచ్చేవాడొకడు ఉన్న స్థితిలో హాజరవుతాడు.[26]

وَجَآءَتْ كُلُّ نَفْسٍ مَّعَهَا سَآئِقٌ وَّشَهِيْدٌ ﴿21﴾

22 (అతనితో ఇలా అనబడుతుంది:) “నిశ్చయంగా నువ్వు దీని
పట్ల అలసత్వం వహించావు. ఇక నీ నుండి నీ తెరను తొలగిం
చాము. ఈనాడు నీ చూపు చాలా సునిశితంగా ఉంది.”

لَقَدْ كُنْتَ فِيْ غَفْلَةٍ مِّنْ هٰذَا فَكَشَفْنَا عَنْكَ غِطَآءَكَ فَبَصَرُكَ الْيَوْمَ حَدِيْدٌ ﴿22﴾

23 “ఇదిగో, (ఇతని కర్మల చిట్టా) నావద్ద సిద్ధంగా ఉంది” అని
అతని సహవాసి (అయిన దైవదూత) అంటాడు.[27]

وَقَالَ قَرِيْنُهٗ هٰذَا مَا لَدَيَّ عَتِيْدٌ ﴿23﴾

24 (అప్పుడు ఈ విధంగా సెలవీయబడుతుంది : ) “పొగరు
బోతు అయిన ప్రతి దైవతిరస్కారినీ నరకంలో విసరివేయండి.

اَلْقِيَا فِيْ جَهَنَّمَ كُلَّ كَفَّارٍ عَنِيْدٍ ﴿24﴾

25 “వాడు మంచిని అడ్డుకునేవాడు, బరితెగించి పోయేవాడు,
అనుమానాల అయ్యగా ప్రవర్తించేవాడు.

مَّنَّاعٍ لِّلْخَيْرِ مُعْتَدٍ مُّرِيْبٍ ﴿25﴾

---

ఇంకొంతమంది ప్రకారం పగలు – రేయి డ్యూటీ మారే దైవదూతలు వారు. పగలు ఇద్దరు దూతలుంటారు. రాత్రి ఇద్దరు దూతలుంటారు. (ఫత్‌హుల్ ఖదీర్).

23. ‘రఖీబ్’ ( رَقِيْبٌ ) అంటే కాపరివాడు, పర్యవేక్షకుడు అని అర్థం. మనిషి వాక్కర్మలను నమోదు చేయడానికి ఎదురుచూస్తూ ఉండేవాడు అన్న అర్థం కూడా వస్తుంది. ‘అతీద్’ ( عَتِيْدٌ ) అంటే ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవాడు అన్నమాట.

24. అంటే మృత్యువు ఆసన్నమైనపుడు సత్యం స్పష్టమైపోతుంది. ప్రళయం గురించి, స్వర్గనరకాల గురించి దైవప్రవక్తలు (అలైహిముస్సలాం) చెప్పిన ఎన్నో విషయాల వాస్తవికత ఆ సమయంలో తేటతెల్లమవుతుంది.

25. ఓ మానవుడా! నువ్వు మృత్యువుకు భయపడి పారిపోయేవాడవు. కాని అది మాత్రం నిన్ను వదలలేదు. వెంటాడుతూ వచ్చి అమాంతం నిన్ను కబళించింది.

26. ‘సాయిఖ్’ ( سَآئِقٌ ) అంటే తీసుకువచ్చేవాడు అనీ, ‘షహీద్’ ( شَهِيْدٌ ) అంటే సాక్ష్యంగా ఉండేవాడు అనీ అర్థం. కాని ఈ రెండు పదాల భావార్థంపై విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం లేదు. నిజానికి అవి దైవదూతల పేర్లనీ, వారిలో ఒకతను ప్రళయదినం వరకూ మనిషిని తీసుకుని వస్తూ ఉంటాడనీ, ఇంకొకడు మనిషి చేసే కర్మలకు సాక్షిగా ఉంటాడని ఇమామ్ తబ్రీ భావిస్తున్నారు.

27. ఆనాడు అతన్ని వెన్నంటి ఉన్న దైవదూత అతని కర్మల రికార్డును సమర్పించి, ‘ఇదిగో! నీవు చేసుకున్న నీ వ్యక్తిగత కర్మ’ అంటాడు.

**26** “వాడు అల్లాహ్‌తోపాటు మరోదైవాన్ని చేర్చాడు. కాబట్టి వాణ్ణి తీవ్రమైన శిక్షలో పడవేయండి.”[28]

الَّذِي جَعَلَ مَعَ اللَّهِ إِلَٰهًا آخَرَ فَأَلْقِيَاهُ فِي
الْعَذَابِ الشَّدِيدِ ﴿٢٦﴾

**27** “మాప్రభూ! నేనితన్ని పెడదారి పట్టించలేదు. ఇతనే స్వయంగా బహుదూరపు అపమార్గంలో పడిఉన్నాడ”ని[29] అతని సహవాసి (అయిన షైతాన్) అంటాడు.

قَالَ قَرِينُهُ رَبَّنَا مَا أَطْغَيْتُهُ وَلَٰكِن كَانَ فِي
ضَلَالٍ بَعِيدٍ ﴿٢٧﴾

**28** అప్పుడు అల్లాహ్ ఇలా అంటాడు: “నా దగ్గర ఇప్పుడు గొడవ చేయకండి. నేను ముందుగానే హెచ్చరికను (శిక్షకు సంబంధించిన వాగ్దానాన్ని) పంపాను.”[30]

قَالَ لَا تَخْتَصِمُوا لَدَيَّ وَقَدْ قَدَّمْتُ إِلَيْكُم
بِالْوَعِيدِ ﴿٢٨﴾

**29** “నా దగ్గర మాట మారదు.[31] నేను నా దాసులకు కొంచెం కూడా అన్యాయం చేసేవాణ్ణి కూడా కాను.”[32]

مَا يُبَدَّلُ الْقَوْلُ لَدَيَّ وَمَا أَنَا بِظَلَّامٍ
لِّلْعَبِيدِ ﴿٢٩﴾

**30** “నువ్వు నిండిపోయావా?” అని మేము నరకాన్ని అడిగిన నాడు, “ఏం, ఇంకా ఏమన్నా ఉందా?” అని అది అంటుంది.[33]

يَوْمَ نَقُولُ لِجَهَنَّمَ هَلِ امْتَلَأْتِ وَتَقُولُ هَلْ
مِن مَّزِيدٍ ﴿٣٠﴾

28. అతని స్వీయకర్మల ఆధారంగా ఆనాడు అల్లాహ్ న్యాయబద్ధంగా తీర్పు చేస్తాడు.

29. అందుకే నా ఎత్తులకు తేలిగ్గా చిత్తయిపోయాడు. ఇతనే గనక నీ మార్గంపై స్థిరంగా ఉండే భక్తుడైతే నా కవ్వింపులకు ప్రభావితుడయ్యేవాడు కాదు. **ఖరీన్** అంటే సహవాసి, షైతాన్ అని భావం.

30. అప్పుడు అల్లాహ్ అవిశ్వాసులను, వారి దుష్ట సహవాసులైన షైతానులను ఉద్దేశించి, “ఇప్పుడు నా న్యాయస్థానంలో నిందారోపణలు చేసుకుని ప్రయోజనం ఏమీ లేదు. నేను మీకు కావలసినంత గడువు ఇచ్చాను. నా ప్రవక్తల ద్వారా, గ్రంథాల ద్వారా శిక్ష గురించి ముందే భయపెట్టాను. కాని మీరు మా హెచ్చరికలను పెడచెవిన పెట్టారు” అని అంటాడు.

31. అంటే నేను చేసిన వాగ్దానం అక్షరాలా అమలవుతుంది. అన్నమాట ప్రకారమే ఈనాడు మిమ్మల్ని శిక్షించబోతున్నాను. నా నిర్ణయానికి తిరుగు ఉండదు.

32. నేరం చేయని వారిని శిక్షించటం నా విధానం కాదు. ఏ పాపం ఎరుగని వారిని అనవసరంగా శిక్షిస్తామని ఎలా అనుకున్నారు? అలాగే దురాగతాలకు పాల్పడిన వారిని వదలివేయటం కూడా మా పద్ధతి కాదు. మూలంలో **‘జల్లామ్’** (ظَلَّامٍ) అని ఉంది. ఈ పదంలో భావ ఆధిక్యత (Supremacy) ఉంది. అతి ఎక్కువగా దౌర్జన్యం చేసేవాడు అని దాని అర్థం. అయితే అల్లాహ్ తను దౌర్జన్యం చేయనని చెప్పటానికి ‘జల్లామ్’ అని చెప్పాల్సిన అవసరం లేదు. ‘జాలిమ్’ అంటే సరిపోయేది. మరి ‘జల్లామ్’ అన్న పదం ఎందుకు వాడబడింది? అన్న సందేహం అరబీ వ్యాకరణంలో ప్రవేశం ఉన్నవారికి కలగటం సహజం. దీనికి సమాధానం ఏమిటంటే నిజానికి ఆ పదంలో భావ ఆధిక్యత లేదు. ‘జాలిమ్’ అన్న అర్థంలోనే అది వాడబడింది. ఒకవేళ దాన్ని ఆధిక్యతా భావంలో తీసుకున్నా ఆ భావ ఆధిక్యత దౌర్జన్యం చేయకపోవడంలోనే గాని దౌర్జన్యం చేయటంలో కాదన్న విషయం గమనార్హం.

33. “నేను నరకాన్ని మానవులతో, జిన్నులతో నింపుతాను” అని అల్లాహ్ అంటున్నాడు (అలిఫ్ లామ్ మీమ్ అస్సజ్దా –13). ఈ వాగ్దానం ప్రకారం అల్లాహ్ నరకాన్ని అవిశ్వాసులైన మనుషులతో, జిన్నులతో నింపిననాడు, నరకాన్ని ఉద్దేశించి, “నువ్వు నిండిపోయావా?” అని అడుగుతాడు. “ఎందుకు, ఇంకా ఏమన్నా (రావలసింది) ఉందా?!” అని నరకం అంటుంది. నరకం అలా అనటంలోని ఉద్దేశం ఇది: “అల్లాహ్! నేను నిండిపోయిన సంగతి నిజమే. కాని

31 స్వర్గం భయభక్తులు గలవారికి దగ్గరగా తీసుకురాబడుతుంది – అది ఏమాత్రం దూరాన ఉండదు.[34]

وَأُزْلِفَتِ الْجَنَّةُ لِلْمُتَّقِينَ غَيْرَ بَعِيدٍ ﴿٣١﴾

32 “ఇదీ మీకు వాగ్దానం చేయబడినది. (అల్లాహ్ వైపు) మరలి, నిష్ఠగా ఉండే ప్రతి ఒక్కరికీ ఉద్దేశించినది.[35]

هَٰذَا مَا تُوعَدُونَ لِكُلِّ أَوَّابٍ حَفِيظٍ ﴿٣٢﴾

33 “కరుణామయుణ్ణి చూడకుండానే అతనికి భయపడుతూ, (అల్లాహ్ వైపు) మరలే హృదయాన్ని తీసుకువచ్చిన వారికి ఇది ప్రత్యేకించబడింది.[36]

مَّنْ خَشِيَ الرَّحْمَٰنَ بِالْغَيْبِ وَجَاءَ بِقَلْبٍ مُّنِيبٍ ﴿٣٣﴾

34 “మీరు ఈ స్వర్గంలో ప్రశాంతంగా, సురక్షితంగా ప్రవేశించండి. ఇది నిత్యం నిలిచి ఉండే దినం.”

ادْخُلُوهَا بِسَلَامٍ ۖ ذَٰلِكَ يَوْمُ الْخُلُودِ ﴿٣٤﴾

35 అక్కడ వారికి కోరుకున్నదల్లా లభిస్తుంది. (పైగా) మా దగ్గర మరెంతో ఉన్నది.[37]

لَهُم مَّا يَشَاءُونَ فِيهَا وَلَدَيْنَا مَزِيدٌ ﴿٣٥﴾

36 వీరికి పూర్వం ఎన్నో సముదాయాలను మేము తుదముట్టించి ఉన్నాము. వారు బలపరాక్రమాల రీత్యా వీళ్లకన్నా ఘటికులే. వారు (నిలువ నీడ కోసం) పట్టణాలలో గాలించసాగారు.[38] కాని పారిపోయి ఆశ్రయం పొందే స్థలం ఏదైనా వారికి లభించిందా?!

وَكَمْ أَهْلَكْنَا قَبْلَهُم مِّن قَرْنٍ هُمْ أَشَدُّ مِنْهُم بَطْشًا فَنَقَّبُوا فِي الْبِلَادِ هَلْ مِن مَّحِيصٍ ﴿٣٦﴾

---

నీ శత్రువులు గనక ఇంకా మిగిలి ఉంటే వారిని వదలిపెట్టకు. ఎంతమంది ఉన్నాసరే వారిని ఆహుతి చేసుకుంటాను.” దేవుడు నరకాన్ని ఆ విధంగా ప్రశ్నించటం, నరకం అలా సమాధానమివ్వటం అసంభవం ఏమీ కాదు. దైవచిత్తమయితే ప్రతిదీ సంభవమే.

హదీసులో ఇలా ఉంది : ప్రజలు నరకానికి ఆహుతి అవుతారు. ‘ఇంకా ఏమైనా ఉందా?’ అని నరకం అంటుంది. ఆఖరికి అల్లాహ్ నరకంపై తన పాదం మోపుతాడు. అప్పుడది ‘చాలు, చాలు’ అని కేకవేస్తుంది. (సహీహ్ బుఖారీ– ఖాఫ్ సూరా వ్యాఖ్యానం). ఇక స్వర్గం విషయానికి వస్తే, స్వర్గం ఇంకా ఖాళీగా మిగిలిపోతుంది. దానికోసం అల్లాహ్ కొత్త ప్రాణుల్ని సృష్టిస్తాడు. వారు అందులో ఉంటారు.” (సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్).

34. రానున్న ప్రతిదీ చాలా సమీపంలోనే ఉంది, దూరాన లేదు. (ఇబ్నె కసీర్)

35. స్వర్గవాసులు చాలా దగ్గరినుండి స్వర్గాన్ని చూసినప్పుడు వారితో అనబడే మాటలివి. **‘అవ్వాబ్’** (أَوَّابٍ) అంటే అల్లాహ్ వైపుకు అధికంగా మరలేవాడు, అధికంగా పశ్చాత్తాపం చెందేవాడు, ఎక్కువగా దైవనామ స్మరణ చేసేవాడు, ఏకాంతంలో తన వల్ల జరిగిన తప్పిదాలను తలచుకుని దైవసన్నిధిలో కుమిలి కుమిలి రోదించేవాడు అని అర్థం. **‘హఫీజ్’** (حَفِيظٍ) అంటే తన పాపాలను గుర్తు చేసుకుని పశ్చాత్తాపం చెందేవాడు లేదా అల్లాహ్ హక్కులను, ఆయన అనుగ్రహాలను జ్ఞాపకం ఉంచుకునేవాడు, దైవాదేశాలను, నిషిద్ధాంశాలను నిత్యం గుర్తుంచుకుని వాటికి కట్టుబడి ఉండేవాడు (ఫత్హుల్ ఖదీర్).

36. **‘మునీబ్’** (مُّنِيبٍ) అంటే అల్లాహ్ వైపు చిత్తశుద్ధితో మరలేవాడు. విధేయతా పూరితమైన శుభాత్మ. బహుదైవోపాసనా భావాలకు, పాపకార్యాలకు, పైశాచిక ఆలోచనలకు చోటు ఇవ్వని నిష్కల్మష హృదయం.

37 హృదయాన్ని కలిగి ఉండి[39] లేదా శ్రద్ధగా ఆలకించి,[40] సావధానంగా మసలుకునే ప్రతి వ్యక్తికీ[41] ఇందులో హితబోధన గలదు.

إِنَّ فِي ذَٰلِكَ لَذِكْرَىٰ لِمَن كَانَ لَهُ قَلْبٌ أَوْ أَلْقَى السَّمْعَ وَهُوَ شَهِيدٌ ﴿٣٧﴾

38 నిశ్చయంగా మేము భూమ్యాకాశాలను, వాటి మధ్య ఉన్న వాటన్నింటినీ (కేవలం) ఆరుదినాలలో సృష్టించాము. మరి మాకు అలసట సోకనయినా లేదు.

وَلَقَدْ خَلَقْنَا السَّمَاوَاتِ وَالْأَرْضَ وَمَا بَيْنَهُمَا فِي سِتَّةِ أَيَّامٍ وَمَا مَسَّنَا مِن لُّغُوبٍ ﴿٣٨﴾

39 కనుక (ఓ ప్రవక్తా!) వారు చెప్పే మాటలపై నువ్వు ఓర్పు వహించు. సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికి ముందు కూడా స్తోత్రసమేతంగా నీ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ ఉండు.[42]

فَاصْبِرْ عَلَىٰ مَا يَقُولُونَ وَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ قَبْلَ طُلُوعِ الشَّمْسِ وَقَبْلَ الْغُرُوبِ ﴿٣٩﴾

40 రాత్రిపూట కూడా (ఏ సమయంలోనయినా) ఆయన పవిత్రతను కొనియాడు,[43] మరి నమాజు తరువాత కూడా (ఆయన్ను స్తుతించు).[44]

وَمِنَ اللَّيْلِ فَسَبِّحْهُ وَأَدْبَارَ السُّجُودِ ﴿٤٠﴾

37. **"మా దగ్గర మరెంతో ఉంది"** అంటే ఏమిటి? అది స్వర్గవాసులకు ప్రాప్తమయ్యే దైవదర్శన భాగ్యం. యూనుస్ సూరా 26వ ఆయతులో కూడా ఈ విషయం సూచనా ప్రాయంగా తెలుపబడింది.

38. **'పట్టణాలలో గాలించసాగారు'** అంటే అర్థం ఆ జాతుల వారు కూడా మక్కావాసుల కన్నా ఎక్కువగా వ్యాపారం నిమిత్తం వివిధ దేశాలలో పర్యటించేవారు. ఎన్నో రాజ్యాలతో వారికి వాణిజ్య సంబంధాలుండేవి. కాని మా శిక్ష విరుచుకుపడినప్పుడు వారు పారిపోయి తలదాచుకునే స్థలం ఏదీ వారికి దొరకలేదు.

39. అంటే ఆలోచించి సత్యాన్ని గ్రహించే జాగృత హృదయం గలవాడన్నమాట!

40. అంటే – గత జాతుల గాథలను వివరించే దైవవాణిని శ్రద్ధగా వినేవాడైతే....

41. అంటే మనసును, మస్తిష్కాన్ని పూర్తిగా అదుపులో పెట్టుకుని ఏకాగ్రతతో విషయాన్ని ఆస్వాదించగలిగినట్లయితే అందలి హితబోధ అర్థమవుతుంది. శారీరకంగా అక్కడ హాజరై ఉండి కూడా మనసు గైర్హాజరై ఉంటే విషయం బుర్రకెక్కదు.

42. ఈ వాక్యంలో ఫజ్ర్, అస్ర్ నమాజుల గురించి ప్రత్యేకంగా తాకీదు చేయబడింది.

43. అంటే రాత్రిపూట కూడా కొంత సమయాన్ని (తహజ్జుద్) నమాజ్ కొరకు కేటాయించమని దేవుడు తన ప్రవక్తకు సూచించాడు. ఈ విషయమే మరోచోట ఇలా అనబడింది: "(ఓ ప్రవక్తా!) రాత్రిపూట లేచి తహజ్జుద్ నమాజు సలుపు. ఇది నీ కొరకు అదనం" (బనీ ఇస్రాయీల్ – 79). కొంతమంది విద్వాంసుల ప్రకారం మేరాజ్ (గగన యాత్ర)కు ముందు ముస్లింలకు కేవలం ఫజ్ర్, అస్ర్ నమాజులు మాత్రమే విధిగా ఉండేవి. ప్రవక్తగారికైతే తహజ్జుద్ నమాజు కూడా విధిగా ఉండేది. కాని మేరాజ్ సందర్భంగా రోజుకు 5 పూటల నమాజులు విధి (ఫర్జ్) గా చేయబడ్డాయి. (ఇబ్నె కసీర్)

44. అంటే నమాజు తర్వాత కూడా అల్లాహ్ పవిత్రతను కొనియాడాలి. ఇక్కడ తస్బీహ్ (అల్లాహ్ పవిత్రతను కొనియాడటం) అంటే ఫర్జ్ నమాజుల తర్వాత పఠించమని దైవప్రవక్త (స) ఆదేశించిన తస్బీహ్ వచనాలని కొంతమంది భావించారు.

**41** ఇంకా విను:[45] ఏ రోజున పిలిచేవాడొకడు[46] చాలా దగ్గరి
స్థలం నుండి పిలుస్తాడో[47]...

وَاسْتَمِعْ يَوْمَ يُنَادِ الْمُنَادِ مِنْ مَّكَانٍ قَرِيْبٍ ﴿41﴾

**42** ఏ రోజున అందరూ ఒక భీకర అరుపును ఖచ్చితంగా
వింటారో, అది (మృతులు సమాధుల నుండి) బయటపడే రోజై
ఉంటుంది.[48]

يَّوْمَ يَسْمَعُوْنَ الصَّيْحَةَ بِالْحَقِّ ۭ ذٰلِكَ يَوْمُ الْخُرُوْجِ ﴿42﴾

**43** మేమే బ్రతికిస్తున్నాం.[49] మేమే చంపుతున్నాం. ఎట్టకేలకు
మా వైపుకే మరలి రావలసి ఉన్నది.[50]

اِنَّا نَحْنُ نُحْيٖ وَنُمِيْتُ وَاِلَيْنَا الْمَصِيْرُ ﴿43﴾

**44** భూమి బ్రద్దలైపోయిన రోజున వారు ఉరుకులు పరుగులతో[51]
(బయటికి వస్తారు). ఈపాటి సమీకరణ మాకు చాలా తేలిక.

يَوْمَ تَشَقَّقُ الْاَرْضُ عَنْهُمْ سِرَاعًا ۭ ذٰلِكَ حَشْرٌ عَلَيْنَا يَسِيْرٌ ﴿44﴾

**45** వారు చెప్పేదేమిటో మాకు బాగా తెలుసు. (ఓ ప్రవక్తా!)
నీవు వాళ్లను బలవంత పెట్టేవాడివి కావు.[52] కాబట్టి నీవు మా
హెచ్చరికలకు భయపడేవారికి ఖుర్ఆను ద్వారా బోధపరుస్తూ
ఉండు.[53]

نَحْنُ اَعْلَمُ بِمَا يَقُوْلُوْنَ وَمَآ اَنْتَ عَلَيْهِمْ بِجَبَّارٍ ۣ فَذَكِّرْ بِالْقُرْاٰنِ مَنْ يَّخَافُ وَعِيْدِ ﴿45﴾

---

అనగా 33సార్లు సుబ్హానల్లాహ్ అనీ, 33సార్లు అల్హమ్దు లిల్లాహ్ అనీ, 34 సార్లు అల్లాహు అక్బర్ అనీ పఠించటమన్నమాట (బుఖారీ–కితాబుల్ అజాన్, ముస్లిం– కితాబుల్ మసాజిద్). అయితే ఈ తస్బీహ్ వచనాలు ఈ సూరా అవతరించిన తర్వాత చాలా కాలానికి తెలియజేయబడ్డాయన్న సంగతి గమనార్హం. ఇంకా కొంతమంది ఆయతులోని 'అద్బారస్సుజూద్' (సజ్దాల తర్వాత) అన్న పదానికి మగ్రిబ్ తర్వాత రెండు రకాతుల నమాజు అన్న అర్థం తీసుకున్నారు.

45. అంటే, దైవవాణి (వహీ) ద్వారా తెలుపబడే ప్రళయదిన విశేషాలను శ్రద్ధగా వినండి అని అర్థం.

46. ఆ పిలిచేవాడు ఇస్రాఫీల్ దైవదూతగాని, జిబ్రయీల్ దూతగానీ అయి ఉంటారు. ఆ పిలుపుతో అందరూ మహ్షర్ మైదానంలో సమావేశమవుతారు. అంటే అది రెండవసారి ఊదబడే శంఖం అన్నమాట.

47. ఆ స్థలం సఖరయె బైతుల్ మఖ్దిస్ అనీ, అది ఆకాశానికి అతి చేరువలో ఉండే స్థలమని కొందరు అభిప్రాయపడ్డారు. మరి కొంతమంది ప్రకారం ప్రతి వ్యక్తీ చాలా దగ్గరి నుండి ఆ పిలుపు వినిపిస్తున్నట్లు భావిస్తాడని అన్నారు (ఫత్హుల్ ఖదీర్). ఈ రెండవ అభిప్రాయమే సమంజసం అనిపిస్తోంది.

48. ఆ పిలుపు (ప్రళయ శంఖారావం) తథ్యం. అందులో సందేహానికి ఆస్కారమే లేదు. ఆ రోజునే అందరూ సమాధుల నుండి లేపబడతారు.

49. ప్రపంచంలో మానవులకు మరణం వొసగటమైనా, పరలోకంలో వారిని తిరిగి బ్రతికించటమైనా – ఇదంతా మా పనే. ఈ పనిలో మాకు భాగస్వాములుగా ఎవరూ లేరు.

50. అక్కడ మేము ప్రతి వ్యక్తికీ అతని కర్మలను బట్టి ప్రతిఫలం ఇస్తాము.

51. పిలుపు ఇచ్చిన వాని వైపుకు వారంతా పరుగులు తీస్తారు (ఫత్‌హుల్ ఖదీర్). “భూమి బ్రద్దలైనపుడు అందరికంటే ముందు బ్రతికి బయల్పడేవాణ్ణి నేనే”నని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) చెప్పారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఫజాయెల్).

52. అంటే (ఓ ముహమ్మద్ – సఅసం)! వారు విశ్వసించాల్సిందేనని పట్టుబట్టడం నీ పని కాదు. సత్యాన్ని అందజేయటం వరకే నీ పని. ఆ పనిని నువ్వు చేస్తూ ఉండు.

53. అల్లాహ్‌కు భయపడుతూ, ఆయన హెచ్చరికలపై భీతితో కంపిస్తూ, ఆయన వాగ్దానాలను సత్యమని నమ్మేవారు మాత్రమే నీ హితబోధను గ్రహిస్తారు. అందుకే హజ్రత్ ఖతాదా ఇలా ప్రార్థిస్తూ ఉండేవారు: **“అల్లాహుమ్మజ్ అల్నా మిమ్మన్ య్యఖాఫు వయీదక వ యర్జూ మవ్‌వూదక యా బార్రు యా రహీమ్.”** (ఓ అల్లాహ్! నీ హెచ్చరిక లకు భయపడుతూ, నీ వాగ్దానం పట్ల ఆశపెట్టుకునే వారిలో మమ్ము చేర్చు. ఓ మేలు చేసేవాడా! ఓ దయాకరా!!)

51 వ సూరా

# అజ్ జారియాత్

## గాలి దుమారం

అవతరణ మక్కాలో

ఆయతులు 60

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, శిక్షా బహుమానాల గురించి ప్రస్తావించింది. ఈ సూరాలో దుమ్ముధూళి రేణువులను ఎగురవేసి దూర ప్రాంతాలకు కొనిపోయే గాలి దుమారం గురించి, వర్షపు మేఘాలను కొనివచ్చే గాలి దుమారం గురించి ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ గాలి వర్షాన్ని తీసుకొచ్చి మృతభూమికి జీవం పోసి పంటలు పండేలా చేస్తే అది మంచి ఫలితాన్ని ఇచ్చే గాలి. కాని వినాశాన్ని తీసుకొచ్చి, దేవుని శక్తిసామర్థ్యాలను చాటిచెప్పేదయితే చెడు ఫలితాన్ని ఇస్తుంది.

ఇబ్రాహీమ్ (అస) గాథ దేవుని శక్తిసామర్థ్యాలకు మరో నిదర్శనాన్ని ఇస్తుంది. ఇబ్రాహీమ్(అస) చాలా ముసలివారయ్యారు. ఆయన భార్య కూడా వయోవృద్ధురాలు. ఆమెకు పిల్లలు కలిగే వయస్సు ఎప్పుడో దాటిపోయింది. వారికి సంతానం కలుగ బోతోందని దైవదూతలు వారికి చెప్పారు. అది విని వారు ఆశ్చర్యపోయారు. కాని ఆ వార్త నిజమయ్యింది. వారికి ఇస్హాఖ్ (అస) జన్మించారు. విశ్వాసాన్ని తిరస్కరిస్తున్న వారికి ఈ వాస్తవాలను గుర్తుచేయడం జరిగింది. సత్యాన్ని తిరస్కరించినందువల్ల వారికి ఎదురయ్యే పరిణామాల గురించి వారిని హెచ్చరించడం జరిగింది. ఈ సందర్భంగా గతకాలాలకు చెందిన కొన్ని జాతుల గురించి, వారికి పట్టిన దుర్గతి గురించి తెలియజేయడం కూడా జరిగింది. ఆద్, సమూద్, లూత్(అస) జాతులు, ఫిర్ఔన్ జాతి గురించి తెలియజేయడం జరిగింది. మొండిగా అవిశ్వాసం అవలంబిస్తున్న వారి నుంచి వైదొలగాలని ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు బోధించడమైంది. వారి తప్పులకు ఆయనను బాధ్యునిగా చేయడం జరగదని ఈ సూరా స్పష్టం చేసింది. అవిశ్వాసులకు దేవుని ఔన్నత్యాన్ని గుర్తు చేయాలని, వారికి దైవవాణి వల్ల ఒనగూడే ప్రయోజనాల గురించి తెలుపాలని చెప్పింది.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 24-46 | 14, 21, 25, 50, 81, 83 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవ ప్రవక్త సాలిహ్' 'దైవ ప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' 'దైవప్రవక్త మూసా' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారావాహికంగా ఇక్కడ లభ్యమవుతాయి. ఏయే జాతుల వారి వద్దకు అల్లాహ్ ఏయే ప్రవక్తలను పంపించాడు? ఆయా ప్రవక్తలకు తమ జాతి ప్రజల నుంచి ఏం సమాధానం లభించింది? విశ్వాసులను అల్లాహ్ ఏ విధంగా కాపాడాడు? తిరస్కారులను ఎలా శిక్షించాడు? - ప్రతిదీ తెలుసుకోవచ్చు. |

## سُوْرَةُ الذّٰرِيٰت

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

وَالذّٰرِيٰتِ ذَرۡوًا ۙ﴿1﴾

فَالۡحٰمِلٰتِ وِقۡرًا ۙ﴿2﴾

فَالۡجٰرِيٰتِ يُسۡرًا ۙ﴿3﴾

فَالۡمُقَسِّمٰتِ اَمۡرًا ۙ﴿4﴾

اِنَّمَا تُوۡعَدُوۡنَ لَصَادِقٌ ۙ﴿5﴾

وَّاِنَّ الدِّيۡنَ لَوَاقِعٌ ؕ﴿6﴾

وَالسَّمَآءِ ذَاتِ الۡحُبُكِ ۙ﴿7﴾

## అజ్ జారియాత్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** దుమ్మును రేపే గాలుల సాక్షిగా![1]

**2** మరి బరువును లేపే మేఘాలు (సాక్షి!)[2]

**3** మరి అలవోకగా, సుతిమెత్తగా సాగిపోయే ఓడలు (సాక్షి!)[3]

**4** మరి పనులను పంపకం చేసేవారు (సాక్షి!)[4]

**5** మీకు వేటి గురించి వాగ్దానం చేయబడుతున్నదో అవి నిజంగా సత్యమైనవి.

**6** నిశ్చయంగా న్యాయం (తీర్పు) జరగనున్నది.

**7** మార్గాలతో నిండిన ఆకాశం సాక్షిగా![5]

1. అంటే దుమ్మును, ధూళిని రేపి నలువైపులా వెదజల్లే వాయువులన్నమాట.
2. **వఖ్రున్** (وِقْر) అంటే బరువు. **హామిలాత్** (الحٰمِلٰت) అంటే మేఘాలను తీసుకునిపోయే వాయువులని ఒక అర్థం. లేదా నీటి బరువును లేపుకుని పోయే మేఘాలు అన్న అర్థం కూడా వస్తుంది.
3. **జారియాత్** అంటే నీటిలో చాలా తేలికగా నడిచే ఓడలు. **'యుస్రన్'** అంటే తేలికగా నన్నమాట!
4. **ముఖస్సిమాత్** అంటే తమ పనులను పంచుకునే దైవదూతలు. వారిలో కారుణ్య దూతలూ ఉన్నారు. శిక్షను తెచ్చే దూతలు కూడా ఉన్నారు. వర్షం కురిపించే దూతలూ ఉన్నారు. అనావృష్టి దూతలూ ఉన్నారు. గాలుల దూతలూ ఉన్నారు. మృత్యుదూతలూ ఉన్నారు. కొంతమంది వ్యాఖ్యాతలు పై వాక్యంలో ఉన్న వాటన్నిటిని 'వాయువులు' అన్న అర్థంలో తీసుకున్నారు. ఉర్దూ అనువాదకులు ఆ అర్థం ప్రకారమే తర్జుమా చేశారు. మేము (ఉర్దూ వ్యాఖ్యాత) మాత్రం ఇబ్నె కసీర్, ఇమామ్ షౌకానీ గార్ల వ్యాఖ్యానాలను అనుసరించి ఆ వాక్యాలను కాస్త వివరించి రాశాము. పై ఆయతుల్లో ప్రమాణం చేసి విషయాన్ని వివరించటం జరిగింది. ఎవరైనా ప్రమాణం ఎప్పుడు చేస్తారు? అంటే ప్రమాణం చేయబడే వస్తువు సత్యాన్ని నిరూపించటానికి లేక మాటలో చేవ తీసుకురావటానికి లేక సదరు వస్తువును సాక్షిగా ఉంచే ఉద్దేశంతో కూడా ఆ వస్తువుపై ప్రమాణం చేయటం జరుగుతుంది. ఇక్కడ ఈ మూడవ అర్థంలోనే ప్రమాణ పరంపర కొనసాగింది. ఈ నాలుగు ఆయతులలో (1 – 4) వివిధ వస్తువులను సాక్షిగా పెట్టి వచ్చే ఆయతులలో చెప్పబడే విషయం ఇది : మీకు చేయబడే వాగ్దానాలన్నీ నిజమైనవి. ప్రళయదినం తథ్యం. ఆనాడు న్యాయబద్ధంగా తీర్పు జరుగుతుంది. ఈ గాలుల పయనం, మేఘాలు నీటిని ఎత్తుకుని తిరగటం, సముద్రాలలో సునాయాసంగా నావలు నడవటం, దైవదూతలు వివిధ విధులను నిర్వర్తించటం – ప్రళయం సంభవిస్తుందనటానికి సంకేతంగా ఉన్నాయి. ఎందుకంటే అత్యంత క్లిష్టమైన, అసాధారణమైన ఈ పనులను అలవోకగా నిర్వహించే పరమ ప్రభువే ప్రళయదినాన మానవులందరినీ తిరిగి బ్రతికిస్తాడు. ఈ పని చేయటం ఆయనకు ఏ మాత్రం కష్టసాధ్యం కాదు.

8 నిశ్చయంగా మీరు అభిప్రాయభేదంతో కూడిన మాటలో పడి ఉన్నారు.[6]

إِنَّكُمْ لَفِي قَوْلٍ مُّخْتَلِفٍ ﴿8﴾

9 మరలింపబడినవాడే దాన్నుండి మరలి పోతాడు.[7]

يُؤْفَكُ عَنْهُ مَنْ أُفِكَ ﴿9﴾

10 నిరాధారమైన మాటలు మాట్లాడేవారు నాశనమవుదురు (గాక!)

قُتِلَ الْخَرَّاصُونَ ﴿10﴾

11 వారు పరధ్యానంలో పడి, మైమరచి పోయారు.

الَّذِينَ هُمْ فِي غَمْرَةٍ سَاهُونَ ﴿11﴾

12 ఇంతకీ తీర్పుదినం ఎప్పుడట?! అని వారు ప్రశ్నిస్తున్నారు.

يَسْأَلُونَ أَيَّانَ يَوْمُ الدِّينِ ﴿12﴾

13 అది వారు అగ్నిలో మాడ్చబడే దినమై ఉంటుంది.[8]

يَوْمَ هُمْ عَلَى النَّارِ يُفْتَنُونَ ﴿13﴾

14 మీ శిక్ష యొక్క రుచి చూడండి.[9] ఏ శిక్ష గురించి మీరు హడావిడి చేశారో ఆ శిక్ష ఇదే! (అని వారితో అనబడుతుంది).

ذُوقُوا فِتْنَتَكُمْ هَٰذَا الَّذِي كُنتُم بِهِ تَسْتَعْجِلُونَ ﴿14﴾

15 నిశ్చయంగా భక్తిపరులు మాత్రం ఉద్యానవనాల, ఊటల మధ్య ఉంటారు.

إِنَّ الْمُتَّقِينَ فِي جَنَّاتٍ وَعُيُونٍ ﴿15﴾

16 తమ ప్రభువు తమకు ప్రసాదించిన దాన్ని వారు గ్రహిస్తూ ఉంటారు. వారు అంతకుముందు సదాచార సంపన్నులుగా ఉండే వారు.

آخِذِينَ مَا آتَاهُمْ رَبُّهُمْ ۚ إِنَّهُمْ كَانُوا قَبْلَ ذَٰلِكَ مُحْسِنِينَ ﴿16﴾

5. అందాలు చిందే ఆకాశం సాక్షిగా! అని కూడా అనువదించవచ్చు. ఎందుకంటే దేదీప్యమానమైన సూర్యచంద్రులతో, ప్రకాశమానమైన నక్షత్రాలతో, అద్భుతమైన గ్రహాలతో గగనసీమ సింగారించబడింది. అది ఒక్కో కోణం నుంచి ఒక్కో రకమైన అందాన్ని చిందిస్తూ ఉంటుంది.

6. ఓ మక్కావాసులారా! ఏ ఒక్క విషయంపై కూడా మీరు ఏకాభిప్రాయానికి రావటం లేదాయె. మా ప్రవక్తను గురించి మీరు నానా మాటలంటున్నారు. అతడు కవిపుంగవుడని కొందరంటే జ్యోతిష్యుడని మరి కొందరంటున్నారు. అసత్యవాది అని కొందరు ఆరోపిస్తున్నారు. ప్రళయదినాన్ని కొందరు పూర్తిగా కొట్టిపారేయగా, మరి కొంతమంది దాని గురించి సంశయంలో పడి ఉన్నారు. మీలో కొందరు ఒకవైపు అల్లాహ్‌ను సృష్టికర్తగా, ఉపాధి ప్రదాతగా అంగీకరిస్తూనే మరోవైపు ఇతర దేముళ్లను కూడా చేరుస్తున్నారు. మీ ధోరణిలో ఏమాత్రం స్పష్టత, విజ్ఞత లేదు.

7. అంటే సత్యం నుండి విముఖుడైనవాడు, ముహమ్మద్ (సల్లం)ను విశ్వసించే విషయమై తిరిగిపోయినవాడు అని భావం. లేదా దేవుని తరఫున సద్బుద్ధిని పొందిన వ్యక్తి ఈ భేదాభిప్రాయానికి దూరంగా మసలుకున్నాడు అన్న అర్థం కూడా వస్తుంది.

8. **యుఫ్తనూన్** అంటే 'పరీక్షించబడతార'ని అసలు అర్థం. ఇక్కడ దాని భావం అగ్నితో కాల్చబడతారు. బంగారాన్ని ఏ విధంగా అగ్నిలో కాల్చి దాన్ని పరికించటం జరుగుతుందో అదేవిధంగా వీళ్ల నరకాగ్నిలో కాల్చబడతారు.

9. అంటే అగ్ని యాతనను చవిచూడండి అని భావం.

**17** వారు రాత్రిపూట చాలా తక్కువగా నిద్రించేవారు.[10]

كَانُوا قَلِيلًا مِّنَ اللَّيْلِ مَا يَهْجَعُونَ ﴿17﴾

**18** రాత్రి చివరి గడియలలో క్షమాపణకై (అల్లాహ్‌ను) వేడుకునే వారు.[11]

وَبِالْأَسْحَارِ هُمْ يَسْتَغْفِرُونَ ﴿18﴾

**19** వారి ధనంలో యాచించేవారికి, యాచించని పేదవారికి కూడా హక్కుండేది.[12]

وَفِي أَمْوَالِهِمْ حَقٌّ لِّلسَّائِلِ وَالْمَحْرُومِ ﴿19﴾

**20** నమ్మేవారికి భూమిలో పలు నిదర్శనాలున్నాయి.

وَفِي الْأَرْضِ آيَاتٌ لِّلْمُوقِنِينَ ﴿20﴾

**21** స్వయంగా మీ ఆత్మలలో (అస్తిత్వంలో) కూడా ఉన్నాయి. మరి మీరు పరిశీలనగా చూడటం లేదా?

وَفِي أَنفُسِكُمْ ۚ أَفَلَا تُبْصِرُونَ ﴿21﴾

**22** ఇంకా మీ ఉపాధి, దాంతోపాటు మీకు వాగ్దానం చేయబడే దంతా ఆకాశంలోనే ఉంది.[13]

وَفِي السَّمَاءِ رِزْقُكُمْ وَمَا تُوعَدُونَ ﴿22﴾

**23** కనుక భూమ్యాకాశాల ప్రభువు సాక్షిగా! ముమ్మాటికీ ఇది[14] సత్యం. మీరు పరస్పరం మాట్లాడుకుంటున్నట్లే (సత్యమిది).

فَوَرَبِّ السَّمَاءِ وَالْأَرْضِ إِنَّهُ لَحَقٌّ مِّثْلَ مَا أَنَّكُمْ تَنطِقُونَ ﴿23﴾

---

10. **'హుజూవున్'** (هُجُوع) అంటే రాత్రి నిద్రపోవటం అని అర్థం. రాత్రిపూట చాలా తక్కువగా నిద్రపోయేవారంటే అర్థం రాత్రంతా వారు అలసత్వానికి లోనై ఉండటమో లేక విషయ లోలత్వంలో పడి ఉండటమో కాకుండా రాత్రిలో కొంతభాగాన్ని దైవారాధన కోసం కేటాయించేవారు. తమ తప్పిదాలపై దైవసన్నిధిలో దుఃఖంతో విలపించేవారు. హదీసులలో కూడా రాత్రి జాగారం గురించి తాకీదు వచ్చింది. ఉదాహరణకు ఒక హదీసులో ఇలా అనబడింది: "ప్రజలారా! జనులకు అన్నంపెట్టండి. బంధుత్వాలను కలపండి. సలాంను సర్వసామాన్యం చేయండి. రాత్రి పూట ప్రజలు ఆదమరచి నిద్రపోతున్న సమయంలో లేచి నమాజు చేయండి – నిశ్చింతగా స్వర్గంలో ప్రవేశిస్తారు" (ముస్నదె అహ్మద్ – 5/451).

11. రాత్రి చివరి జాము దుఆ స్వీకారానికి చాలా అనువైన సమయం. హదీసులో ఇలా అనబడింది: "రాత్రి చివరి (మూడో వంతు) భాగం మిగిలి ఉండగా అల్లాహ్ భూమండలానికి సమీపంలో నున్న ఆకాశంపై దిగి వచ్చి, ఈ విధంగా పిలుస్తాడు: 'పశ్చాత్తాపం చెందే వారెవరైనా ఉన్నారా? నేను వారి పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాను. మన్నింపుకై ప్రార్థించే వారెవరయినా ఉంటే, నేను వారిని మన్నిస్తాను. అర్థించేవారెవరయినా ఉంటే నేను వారి అర్థింపుకు ఆమోదముద్ర వేస్తాను.' ఆయన అలా పిలుస్తూనే ఉంటాడు. తెల్లవారిపోతుంది." (సహీహ్ ముస్లిం – కితాబు సలాతిల్ ముసాఫిరీన్).

12. ఇక్కడ అడగనివారు (మహ్రూమ్) అంటే, అవసరం ఉన్నప్పటికీ ఆత్మాభిమానం వల్ల చేయి చాపకుండా జాగ్రత్తపడే వారని అర్థం. లేదా ప్రకృతి వైపరీత్యాల కారణంగా తమ దగ్గర ఉన్నదంతా తుడిచిపెట్టుకుపోయిన వారని భావం.

13. అంటే వర్షం కురిసేది ఆకాశం నుంచే కదా! ఆ వర్షపు నీటి ద్వారా మీకు ఆహారం సమకూరుతుంది. ఈనాడు మీకు వాగ్దానం చేయబడుతున్న స్వర్గనరకాలు, సత్కర్మల ప్రతిఫలం, దుష్కర్మల ప్రతిఫలం కూడా ఆకాశాలలోనే ఉన్నాయి.

14. **'ఇది'** అంటే ఇప్పటివరకూ చెప్పబడిన విషయాలన్నమాట! ఇక్కడ ప్రమాణం చేసి మరీ చెప్పటంలోని ఉద్దేశం

**24** (ఓ ప్రవక్తా!) ఏమిటి, ఇబ్రాహీము యొక్క గౌరవనీయులైన అతిథుల గాథ నీకు చేరిందా?![15]

هَلْ أَتَاكَ حَدِيثُ ضَيْفِ إِبْرَاهِيمَ الْمُكْرَمِينَ ﴿24﴾

**25** వారతని దగ్గరకు వచ్చినప్పుడు అతనికి 'సలామ్' చెప్పారు. అతను కూడా సలాంకు జవాబు చెప్పి, 'వీళ్లు అపరిచిత వ్యక్తుల్లా ఉన్నారే!' (అనుకున్నాడు).[16]

إِذْ دَخَلُوا عَلَيْهِ فَقَالُوا سَلَامًا ۖ قَالَ سَلَامٌ قَوْمٌ مُنْكَرُونَ ﴿25﴾

**26** తరువాత (మారు మాట్లాడకుండా గబగబా) తన ఇంటివారి వద్దకు వెళ్ళి, ఒక బలిసిన ఆవుదూడను (దాని మాంసము వేయించి) తెచ్చాడు.

فَرَاغَ إِلَىٰ أَهْلِهِ فَجَاءَ بِعِجْلٍ سَمِينٍ ﴿26﴾

**27** దాన్ని వారి ముందు సమర్పించాడు. "(అయ్యో!) మీరు తినరేమిటీ?"అన్నాడు.[17]

فَقَرَّبَهُ إِلَيْهِمْ قَالَ أَلَا تَأْكُلُونَ ﴿27﴾

**28** (అప్పటికీ వారు తినకపోయేసరికి) వారి గురించి లోలోపలే భయపడి పోయాడు.[18] "భయపడకండి"[19] అని వారు అభయమిచ్చారు. ఇంకా వారతనికి జ్ఞానసంపన్నుడైన అబ్బాయి పుడతాడని శుభవార్త వినిపించారు.

فَأَوْجَسَ مِنْهُمْ خِيفَةً ۖ قَالُوا لَا تَخَفْ ۖ وَبَشَّرُوهُ بِغُلَامٍ عَلِيمٍ ﴿28﴾

**29** అంతలోనే అతని భార్య లబోదిబోమంటూ[20] ముందుకు వచ్చింది. నెత్తీ నోరూ బాదుకుంటూ, "హవ్వ! నేనా ముసలిదాన్ని. దానికి తోడు గొడ్రాలిని కూడా" (నాకు సంతానమేమిటి?) అని అన్నది.

فَأَقْبَلَتِ امْرَأَتُهُ فِي صَرَّةٍ فَصَكَّتْ وَجْهَهَا وَقَالَتْ عَجُوزٌ عَقِيمٌ ﴿29﴾

---

ఏమిటంటే – ఆకాశం నుంచి వర్షం కురవటం ఎంత సత్యమో ప్రళయదినం కూడా అంతే సత్యం. మీరు ఈనాడు ఒండొకరితో మాట్లాడుకోవటం ఎంత సత్యమో పరలోకంలో శిక్షా బహుమానాలు కూడా అంతే సత్యం. అందులో సందిగ్ధానికి ఆస్కారమే లేదు.

15. దేవుడు తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స)ను ఇలా ప్రశ్నించటంలోని ఆంతర్యం ఏమిటో తెలుసా? ఈ సంగతి నిజానికి నీకు తెలీదు. మేము నీకు 'వహీ' ద్వారా తెలియపరుస్తున్నాము అని దీని ఉద్దేశం.
16. ఈ మాటను బిగ్గరగా కాకుండా తన మనసులోనే అనుకున్నాడు.
17. భోజనాన్ని వడ్డించిన తరువాత కూడా వాళ్లు తినకపోవటంతో మర్యాదపూర్వకంగా ఆ విధంగా అడిగాడు.
18. ఆయన ఆ క్షణంలో భయపడటానికి కారణమేమిటంటే అసలే ఆ వ్యక్తులు అపరిచితులు. అందునా రుచికరమైన ఆహారం వడ్డించిన పిదప కూడా వారు దాన్ని ముట్టుకోవటం లేదంటే వారు మంచి ఉద్దేశంతో వచ్చినట్టులేదు. బహుశా ఏదో ప్రమాదం పొంచి వుంది అని ఆయనకు అనిపించింది.
19. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ముఖారవిందంపై ఆందోళనా ఛాయలు వ్యక్తమయ్యేసరికి ఆయనకు అభయమివ్వటం అవసరమని దైవదూతలు భావించారు. అందుకే 'భయపడకండి' అన్నారు.
20. **'సర్రతున్'**(صَرَّةٌ)కు మరో అర్థం అరుపులు, కేకలు. కనుక అరుస్తూ, కేకలు వేస్తూ వచ్చింది అని కూడా చెప్పవచ్చు.

30 "అవును, ఇలాగే జరుగుతుందని నీ ప్రభువు సెలవిచ్చాడు. నిశ్చయంగా ఆయన వివేకవంతుడు, సర్వం తెలిసినవాడు" అని వారన్నారు.[21]

قَالُوا كَذَٰلِكِ قَالَ رَبُّكِ ۖ إِنَّهُ هُوَ الْحَكِيمُ الْعَلِيمُ ﴿٣٠﴾

31 "ఓ దైవదూతలారా! ఇంతకీ మీ రాకలోని ముఖ్య ఉద్దేశం ఏమిటి?"[22] అని (ఇబ్రాహీము) అడిగాడు.

قَالَ فَمَا خَطْبُكُمْ أَيُّهَا الْمُرْسَلُونَ ﴿٣١﴾

32 "మేము అపరాధ జనుల వైపుకు పంపబడ్డాము.[23]

قَالُوا إِنَّا أُرْسِلْنَا إِلَىٰ قَوْمٍ مُّجْرِمِينَ ﴿٣٢﴾

33 "వారిపై మట్టి రాళ్ళను కురిపించటానికి (వచ్చాము).[24]

لِنُرْسِلَ عَلَيْهِمْ حِجَارَةً مِّن طِينٍ ﴿٣٣﴾

34 "బరితెగించిపోయిన వారి కోసం నీ ప్రభువు వద్ద గుర్తులు వేయబడిన రాళ్ళవి"[25] అని వారు చెప్పారు.

مُّسَوَّمَةً عِندَ رَبِّكَ لِلْمُسْرِفِينَ ﴿٣٤﴾

35 మరి అక్కడున్న విశ్వాసులందరినీ మేము బయటికి తీసుకు వచ్చాము.[26]

فَأَخْرَجْنَا مَن كَانَ فِيهَا مِنَ الْمُؤْمِنِينَ ﴿٣٥﴾

36 అయితే మేమక్కడ ముస్లింలకు చెందిన ఒక్కగానొక్క ఇల్లును మాత్రమే కనుగొన్నాము.[27]

فَمَا وَجَدْنَا فِيهَا غَيْرَ بَيْتٍ مِّنَ الْمُسْلِمِينَ ﴿٣٦﴾

21. ఈ శుభవార్తను మా అంతట మేము వినిపించటం లేదు. నీ ప్రభువు చెప్పిన విషయాన్ని మాత్రమే మేము నీకు చేరవేశాము. కాబట్టి దీనిపై నువ్వు ఆశ్చర్యపోవలసిన అవసరం గానీ, శంకించవలసిన పనిగానీ లేదు. ఎందుకంటే దేవుడు తలచినది జరిగి తీరుతుంది. దానికి తిరుగులేదు అని దైవదూతలు ఆమెను సముదాయించారు.

22. **'ఖత్బున్'** (خَطْبٌ) అంటే సంగతి, గాథ అన్న అర్థాలొస్తాయి. సందర్భం ప్రకారం, ఇంతకీ ఈ శుభవార్తతో పాటు మీరొచ్చిన అసలు పనేమిటి? అని అర్థం వస్తుంది.

23. అంటే లూత్ జనులన్నమాట! వారు ఒడిగట్టిన అతిపెద్ద పాపం స్వలింగ సంపర్కం (హోమో సెక్సువాలిటీ). ఈ పాడు పనిని మొదలెట్టినవారు అసలు లూత్ జాతివారే. అందుచేత దానికి 'లవాతత్' అనే పేరు పడింది.

24. కురిపించటం అంటే, ఆ రాళ్ళ వాన ద్వారా వారిని శిక్షించటమని అర్థం. ఆ రాళ్లు ప్రత్యేక తరహా రాళ్లు. అవి ఆకాశం నుంచి కురిపించబడిన వడగళ్లు కావు. మట్టితో కాల్చబడిన రాళ్లు.

25. **'ముసవ్వమతన్'** అంటే గుర్తు వేయబడినవి లేక పేరు పెట్టబడినవి అని అర్థం. ఆ గుర్తుల ప్రకారం అవి శిక్ష కోసం ప్రత్యేకించబడ్డాయని తెలుస్తుంది. మరికొందరి అభిప్రాయం ప్రకారం చంపబడేవారి పేర్లు ఆయా రాళ్లపై లిఖించబడ్డాయి. **'ముస్రిఫీన్'** అంటే వారు హద్దులను అతిక్రమించారు. బహుదైవారాధనలో, అపమార్గంలో చాలా దూరం వెళ్ళిపోయారు. నీతిబాహ్యతలో, పాపిష్టి పనులలో మితిమీరి పోయారు.

26. అంటే, శిక్షను విధించకముందే ఆ బస్తీ నుండి వెడలిపొమ్మని మేము విశ్వాసులకు ఆజ్ఞాపించాము.

27. ఆ ఇల్లు ఎవరిదో కాదు, దైవప్రవక్త హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) గారిదే. ఆ ఇంట్లో ఆయనగారి ఇద్దరు కుమార్తెలు, మరి కొంతమంది విశ్వాసులు ఉండేవారు. వారు మొత్తం 13 మంది అని అనబడుతోంది. వారిలో లూత్ గారి

37 మరి మేమక్కడ, వ్యధాభరితమైన శిక్షకు భయపడేవారి కోసం ఒక (స్పష్ట మైన) సూచనను వదలిపెట్టాము.[28]

وَتَرَكْنَا فِيهَآ ءَايَةً لِّلَّذِينَ يَخَافُونَ ٱلْعَذَابَ ٱلْأَلِيمَ ﴿٣٧﴾

38 మరి మూసా (వృత్తాంతం)లో కూడా (మా తరఫున సూచన ఉంది). మేమతనికి స్పష్టమైన ప్రమాణాన్ని ఇచ్చి ఫిరౌను వద్దకు పంపించాము.

وَفِى مُوسَىٰٓ إِذْ أَرْسَلْنَٰهُ إِلَىٰ فِرْعَوْنَ بِسُلْطَٰنٍ مُّبِينٍ ﴿٣٨﴾

39 కాని అతను (ఫిరౌను) తన బలగాలను చూసుకుని విముఖతకు పాల్పడ్డాడు.[29] "(వీడా! వీడొక) మాంత్రికుడో లేదా పిచ్చివాడో అయి ఉంటాడ"ని ప్రేలాడు.

فَتَوَلَّىٰ بِرُكْنِهِۦ وَقَالَ سَٰحِرٌ أَوْ مَجْنُونٌ ﴿٣٩﴾

భార్య లేదు. పైగా ఆమె తన భర్తకు వ్యతిరేకంగా లోగుట్టు కార్యకలాపాలు నిర్వర్తించి నాశనం చేయబడేవారి జాబితాలో చేర్చబడింది (ఐసరుత్తఫాసీర్).

ఇస్లాం అంటే విధేయత, సమర్పణ అని అర్థం. దైవాజ్ఞలను శిరోధార్యంగా భావించిన వాడే సిసలైన ముస్లిం. కాబట్టి ఈ లెక్కన ప్రతి విశ్వాసీ ముస్లిం అనబడతాడు. అందుకే వారికోసం (ఆ 13 మంది కోసం) మొదట 'విశ్వాసులు' అనే పదం ప్రయోగించబడింది. ఆ తరువాతి వచనంలో 'ముస్లింలు' అన్న పదం వాడబడింది. ఈ వాక్యాల ఆధారంగా – కొంతమంది తేడా పాటిస్తున్నట్లుగా విశ్వాసి – ముస్లిం మధ్య పెద్దగా తేడా లేదని తెలుస్తోంది. దివ్య ఖుర్ఆన్ కొన్నిచోట్ల విశ్వాసి (మోమిన్), మరికొన్నిచోట్ల ముస్లిం అనే పదం ప్రయోగించిందంటే – అరబీ నిఘంటువు ప్రకారం – ఆ పదాల మధ్య గల భావార్థం రీత్యా, సందర్భోచితంగా ఈ వైవిధ్యాన్ని ప్రదర్శించింది. కాబట్టి నిఘంటువుకన్నా షరీయతు వాస్తవికత రీత్యా దగ్గరి అనుబంధం కల అర్థానికి మనం అధిక ప్రాధాన్యత ఇవ్వటం సమంజసం. జిబ్రయీల్ హదీసు ద్వారా మనం ఈ వాస్తవికతను సరిగ్గా మదించవచ్చు. "ఇస్లాం అంటే ఏమిటి?" అని హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) మహాప్రవక్త (సఅసం)ను అడిగినప్పుడు, "లా ఇలాహ ఇల్లల్లాహ్ గురించి సాక్ష్యమివ్వటం, నమాజును నెలకొల్పటం, జకాత్ చెల్లించటం, ఉపవాసం పాటించటం, హజ్ చేయటం ఇస్లాం" అని చెప్పారు. ఈమాన్ (విశ్వాసం) గురించి ప్రశ్నించినపుడు, "అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, (మేలు జరిగినా, కీడు జరిగినా దేవుని తరఫుననే జరుగుతుంది అన్న) విధివ్రాతను విశ్వసించటమే ఈమాన్" అని ఆయన (సఅసం) విడమరచి చెప్పారు. అంటే మనస్ఫూర్తిగా ఈ విషయాలను నమ్మటం ఈమాన్ అయితే, దైవాజ్ఞలను, విధులను క్రియాత్మకంగా – ఖచ్చితంగా – పాటించటం ఇస్లాం అన్నమాట. దీని ప్రకారం ప్రతి విశ్వాసీ ముస్లిం అవుతాడు. అలాగే ప్రతి ముస్లిం విశ్వాసి అవుతాడు (ఫత్‌హుల్ ఖదీర్).

ఇక మోమిన్‌కి – ముస్లింకి మధ్య వ్యత్యాసం పాటించేవారు చెప్పే విషయం ఇది: "ఇక్కడ ఖుర్ఆన్ ఒకే వర్గం కోసం మోమిన్ – ముస్లిం అనే రెండు పదాలను ప్రయోగించిన సంగతి నిజమే. కాని వాటిమధ్య కొంచెం వ్యత్యాసం ఉంది. అదేమంటే ప్రతి మోమిన్ (విశ్వాసి) ముస్లిం కూడా అయి ఉంటాడు. కాని ప్రతి ముస్లిం విశ్వాసి (మోమిన్) కానవసరం లేదు (ఇబ్నె కసీర్). మొత్తమ్మీద ఇది శాస్త్రీయపరమైన చర్చ. ఇరువర్గాల దగ్గర కూడా తమ తమ వాదనకు అనుకూలమైన ఆధారాలు ఉన్నాయి.

28. ఈ సూచన లేక సంపూర్ణ ఆనవాలు సర్వనాశనం చేయబడిన ఆ బస్తీలలో ఒక సుదీర్ఘ కాలం వరకూ శిక్షా నిదర్శనంగా మిగిలి ఉంది. దైవాగ్రహానికి భయపడే ప్రజలకు ఇది ఒక సూచనగా ఉంటుంది. ఎందుకంటే హితబోధ ప్రభావం పడేది కూడా వారిపైనే. దైవ వాక్యాలపై చింతన చేసేది కూడా వారే.

29. అంటే, తన సైనిక బలాలను, మందీమార్బలాన్నీ, పరిపాలనా యంత్రాగాన్ని చూసుకుని ఫిరౌన్ అహంకారంతో విర్రవీగాడు.

**40** ఎట్టకేలకు మేము అతన్నీ, అతని సైన్యాలను పట్టుకుని సముద్రంలో పడవేశాము. వాడసలు నిందార్హుడే.[30]

فَأَخَذْنَٰهُ وَجُنُودَهُۥ فَنَبَذْنَٰهُمْ فِى ٱلْيَمِّ وَهُوَ مُلِيمٌ ﴿40﴾

**41** అలాగే ఆదు వారిలో కూడా[31] (మా తరఫున సూచన కలదు). మేము వారిపై అశుభమైన గాలులను పంపినపుడు,[32]

وَفِى عَادٍ إِذْ أَرْسَلْنَا عَلَيْهِمُ ٱلرِّيحَ ٱلْعَقِيمَ ﴿41﴾

**42** అవి ఏ వస్తువుపై వీచినా (ఎడాపెడా ఊపేసి) దాన్ని తుత్తు నియలు చేసిగాని వదిలేవి కావు.[33]

مَا تَذَرُ مِن شَىْءٍ أَتَتْ عَلَيْهِ إِلَّا جَعَلَتْهُ كَٱلرَّمِيمِ ﴿42﴾

**43** ఇంకా సమూదు (గాథ)లో కూడా (గుణపాఠం ఉంది). "కొద్ది రోజుల పాటు లబ్ది పొందండి"[34] అని వారితో అనబడినప్పుడు...

وَفِى ثَمُودَ إِذْ قِيلَ لَهُمْ تَمَتَّعُوا۟ حَتَّىٰ حِينٍ ﴿43﴾

**44** (వారు దారికి రాకుండా) తమ ప్రభువు ఆజ్ఞ పట్ల పెడసరి వైఖరిని ప్రదర్శించారు. తత్కారణంగా వారు చూస్తూ ఉండగానే ఒక భయంకరమైన కేక (ప్రేలుడు)[35] అమాంతం వారిని కబళించింది.

فَعَتَوْا۟ عَنْ أَمْرِ رَبِّهِمْ فَأَخَذَتْهُمُ ٱلصَّٰعِقَةُ وَهُمْ يَنظُرُونَ ﴿44﴾

**45** అంతే! (ఆ దెబ్బకు) వారు నిలబడనూ లేకపోయారు.[36] తమకు సహాయం కూడా చేసుకోలేకపోయారు.[37]

فَمَا ٱسْتَطَٰعُوا۟ مِن قِيَامٍ وَمَا كَانُوا۟ مُنتَصِرِينَ ﴿45﴾

---

30. అంటే – వాడి తీరుతెన్నులన్నీ నిందించదగినవే. అడుగడుగునా వాడు తలబిరుసుతనాన్ని ప్రదర్శించాడు.

31. అంటే – ఆదు జాతి వారిని అంతమొందించటం ద్వారా కూడా మేము భావితరాలకు ఒక సూచనను మిగిల్చి ఉంచాము.

32. **'రీహున్ అఖీమ్'** (رِيحٌ عَقِيمٌ) అంటే గొడ్రాలు అయినటువంటి గాలి అని అసలు అర్థం. అంటే నిష్ఫలమైన గాలి అన్నమాట. వృక్షజాలకు మేలు కలిగించే గుణంగానీ, వర్షాన్ని మోసుకువచ్చే సంకేతంగానీ అందులో లేదు. పైగా అది వినాశాన్ని సూచించే గాలి.

33. ఆదు జాతిని తుదముట్టించడానికి పంపబడిన గాలి అది! అది ప్రచండ వేగంతో ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లపాటు నిరాఘాటంగా వీస్తూ ఉండింది (అల్ హాఖ్ఖా సూరా).

34. అంటే, వారి కోరికపైనే దేవుడు ఆడ ఒంటెను సృజించినపుడు వారు ఆ ఒంటెను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. అప్పుడు వారికి మూడు రోజుల వ్యవధి ఇవ్వబడింది. ఈ మూడు రోజులపాటు మీరు ప్రాపంచిక సుఖాలను జుర్రుకోండి. మూడు రోజుల తరువాత మీరు సర్వనాశనానికి గురవుతారు అని సమూదు జాతి వారికి చెప్పబడింది.

మరి కొంతమంది వ్యాఖ్యాతలు దీన్ని హజ్రత్ సాలెహ్‌గారు ప్రవక్తగా తొలిదశలో చేసిన హెచ్చరికగా పేర్కొన్నారు. ఆయతులోని పదాల ద్వారా ఈ భావం కూడా స్ఫురిస్తోంది. పైగా ఈ భావమే సందర్భానికి చాలా దగ్గరగా ఉంది.

35. **సాయిఖా** (ٱلصَّٰعِقَةُ) ఇది అసలు ఆకాశం నుండి వచ్చిన భయంకరమైన గర్జన. దానికి తోడు భూమి కూడా కంపించింది. అల్ ఆరాఫ్ సూరా 78వ వచనం చూడండి.

36. కనీసం లేవలేకపోయినప్పుడు వేరొక చోటికి ఎలా పారిపోగలుగుతారు?

**46** మరి నూహ్ జాతివారికి కూడా అంతకుమునుపు (అదే గతి పట్టింది). వారు కూడా పరమ అవిధేయులుగా ఉండేవారు.[38]

وَقَوْمَ نُوحٍ مِّن قَبْلُ ۖ إِنَّهُمْ كَانُوا قَوْمًا فَاسِقِينَ ﴿٤٦﴾

**47** ఇంకా ఆకాశాన్ని మేము (మా) హస్తాలతో నిర్మించాము.[39] నిశ్చయంగా మేము విశాలంగా చేసేవారము.[40]

وَالسَّمَاءَ بَنَيْنَاهَا بِأَيْدٍ وَإِنَّا لَمُوسِعُونَ ﴿٤٧﴾

**48** భూమిని మేము పాన్పుగా చేశాము.[41] ఎంతయినా మేము చాలా చక్కగా పరచేవారము.

وَالْأَرْضَ فَرَشْنَاهَا فَنِعْمَ الْمَاهِدُونَ ﴿٤٨﴾

**49** మరి మీరు హితబోధను గ్రహించేటందుకుగాను[42] మేము ప్రతి వస్తువునూ జతలు జతలుగా సృష్టించాము.[43]

وَمِن كُلِّ شَيْءٍ خَلَقْنَا زَوْجَيْنِ لَعَلَّكُمْ تَذَكَّرُونَ ﴿٤٩﴾

**50** కనుక మీరు అల్లాహ్ వైపు పరుగెత్తండి.[44] నేను మాత్రం ఆయన తరఫున (వచ్చి) మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి మాత్రమే.

فَفِرُّوا إِلَى اللَّهِ ۖ إِنِّي لَكُم مِّنْهُ نَذِيرٌ مُّبِينٌ ﴿٥٠﴾

---

37. అంటే – దైవశిక్ష నుండి తమను కాపాడుకోలేకపోయారు.
38. నూహుజాతి ప్రజలు ఆద్, సమూద్, ఫిరౌను జాతులకన్నా చాలా పూర్వీకులు. వారు కూడా దైవాజ్ఞల ముందు తలఒగ్గకుండా తిరుగుబాటు వైఖరిని అవలంబించారు. తమ ప్రవక్తను హేళన చేశారు. ఎట్టకేలకు వారు కూడా ఉప్పెన ద్వారా ముంచివేయ బడ్డారు.
39. ఆకాశం లాంటి గొప్ప వస్తువునే మేము మా స్వశక్తితో సృష్టించినప్పుడు అంతకంటే గొప్ప వస్తువుల్ని సృష్టించినా ఆశ్చర్యమేముందీ?
40. ఆకాశం ముందు నుంచే చాలా విశాలంగా ఉంది. దాన్ని మేము మరింత విశాలంగా చేసినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఆ శక్తి మాకుంది. లేదా ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి ఉపాధిలో మరింత విస్తృతిని వొసగే సామర్థ్యం మాకుంది. ఇక మూలంలోని **'మూసివూన్'** ( مُوسِعُونَ ) అనే పదాన్ని **'వుస్‌వున్'** (శక్తిగలవాడు) అన్న అర్థంలో గనక తీసుకున్నట్లయితే ఇలాంటి ఆకాశాలు మరెన్నింటినో చేసే శక్తి కూడా మాలో ఉన్నది, భూమ్యాకాశాలను నిర్మించి మేము అలసిపోలేదు, మా శక్తి సామర్థ్యాలు అంతులేనివి అన్న భావం వస్తుంది.
41. అంటే దాన్ని పాన్పులాగా పరచి ఉంచాము.
42. అంటే అందరినీ సృష్టించేవాడు అల్లాహ్‌యేనని, ఆయన ఒక్కడేనని, ఆయనకు సహవర్తులెవరూ లేరని మీరు తెలుసుకునేటందుకు.
43. అంటే ప్రతి వస్తువునూ జంటగా లేదా ఆడ – మగగా చేశాడు. లేదా ప్రతి వస్తువుకు విరుద్ధంగా ఉండే ఇంకొక వస్తువును సృష్టించాడు. ఉదాహరణకు : వెలుగుకు ఆపోజిట్‌గా చీకటి, మెరక ప్రాంతానికి వ్యతిరేకంగా లోతట్టు ప్రాంతం, సూర్యుడు – చంద్రుడు, తీపి – చేదు, రేయి – పగలు, మేలు – కీడు, జీవితం – మరణం, విశ్వాసం – అవిశ్వాసం, భాగ్యం – దౌర్భాగ్యం, స్వర్గం – నరకం, మానవులు – జిన్నులు మొదలగునవి. ఇన్ని వస్తువులు జతలు జతలుగా ఉన్నప్పుడు ఇహలోకానికి కూడా జత ఉండటం అవసరం. అదే పరలోకం – ప్రాపంచిక జీవితానికి ఆపోజిట్‌గా ఉన్న మరో జీవితం, పరలోక జీవితం!

**51** అల్లాహ్‌తోపాటు మరో ఆరాధ్య దైవాన్ని చేర్చకండి. నిశ్చ యంగా నేను ఆయన తరఫున మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించే వాడిని.[45]

وَلَا تَجْعَلُوا مَعَ اللَّهِ إِلَٰهًا آخَرَ ۖ إِنِّي لَكُم مِّنْهُ نَذِيرٌ مُّبِينٌ (51)

**52** ఇలాగే వీరికి పూర్వం గడచిన వారు కూడా తమ వద్దకు వచ్చిన ప్రవక్తను గురించి, "ఇతడు మాంత్రికుడైనా అయిఉంటాడు లేదా పిచ్చివాడైనా అయి ఉంటాడు" అనేవారు.

كَذَٰلِكَ مَا أَتَى الَّذِينَ مِن قَبْلِهِم مِّن رَّسُولٍ إِلَّا قَالُوا سَاحِرٌ أَوْ مَجْنُونٌ (52)

**53** ఏమిటీ, ఈ విషయాన్ని వారు ఒండొకరికి తాకీదు చేసు కుంటూ వస్తున్నారా?[46] లేదు, అసలు వారంతా తలబిరుసులే.[47]

أَتَوَاصَوْا بِهِ ۚ بَلْ هُمْ قَوْمٌ طَاغُونَ (53)

**54** కాబట్టి నువ్వు వాళ్ల నుండి ముఖం త్రిప్పుకో. నీపై ఎలాంటి నింద ఉండదు.

فَتَوَلَّ عَنْهُمْ فَمَا أَنتَ بِمَلُومٍ (54)

**55** అయితే బోధనా కార్యక్రమాన్ని మాత్రం కొనసాగించు. ఎందుకంటే బోధన విశ్వాసులకు లాభదాయకం అవుతుంది.[48]

وَذَكِّرْ فَإِنَّ الذِّكْرَىٰ تَنفَعُ الْمُؤْمِنِينَ (55)

**56** నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది వారు నన్ను ఆరాధించటానికి మాత్రమే.[49]

وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ (56)

44. అంటే మీ వల్ల జరిగిపోయిన పాపాలపై పశ్చాత్తాపం చెంది, మీ ప్రభువు సన్నిధిలో తలవంచండి. ఈ విషయంలో ఎలాంటి తాత్సారం చేయకండి.

45. అంటే మిమ్మల్ని చాలా సూటిగా హెచ్చరిస్తున్నాను. మీ శ్రేయాన్ని అభిలషిస్తూ ఒకే దేవుడైన అల్లాహ్ వైపు మరలమని, ఆయన్నే నమ్ముకోమని, ఆయన్నే ఆరాధించమని, ఆయనకు భాగస్వాములుగా ఇతరులను కల్పించరాదని మీకు చెబుతున్నాను. మీరు గనక నేను చెప్పినట్లు విన్నారంటే స్వర్గ సుఖాలను పొందుతారు. అన్యథా శాశ్వితమైన స్వర్గానుగ్రహాలకు దూరమైపోతారు.

46. అంటే – భావితరాలకు చెందిన ప్రతి ఒక్కరూ తమ కాలంలో వచ్చిన ప్రవక్తను తిరస్కరించటమే గాకుండా, ఆ ప్రవక్తను మాంత్రికునిగానో, ఉన్మాదిగానో జమకట్టారు. ఈ పరిస్థితిని చూస్తే పాత తరాలవారు లోకం విడిచి వెళ్తూ తమ తర్వాతి తరాల వారికి ఈ వైఖరి గురించి తాకీదు చేసి మరీ వెళ్ళారేమో అనిపిస్తుంది. ఎందుకంటే వారంతా వరుసగా ఒకరి తరువాత మరొకరు ప్రవక్తలను త్రోసిపుచ్చినవారే.

47. ప్రతి జాతివారూ ఈ తిరస్కారవైఖరిలో ఇతరులను మించినవారే. తిరస్కారం పెనుభూతంలా వారి అణువణువునూ పెనవేసుకుపోయింది. సత్యం పట్ల వారి హృదయకవాటాలు మూసుకుపోయాయి. ప్రవక్తల పట్ల వారి ధోరణి ఇంచుమించు ఒకేవిధంగా ఉండేది. పూర్వీకులు ఏం చెప్పేవారో, ఏం చేసేవారో తరువాతి వారు కూడా అదే చెప్పేవారు, అదే చేసేవారు. కనుక సత్యతిరస్కారం విషయంలో వారంతా ఒకే గూటి పక్షులు.

48. ఎందుకంటే హితబోధ వల్ల ప్రయోజనం చేకూరేది విశ్వాసులకే. లేదా ఓ ప్రవక్తా! నీవు మాత్రం నీ బోధనా కార్య క్రమాన్ని యథాప్రకారం కొనసాగిస్తూ ఉండు. ఈ బోధనవల్ల దేవుడు సద్బుద్ధి ప్రసాదించే వారికి తప్పక ప్రయోజనం చేకూరుతుంది. వారు తప్పకుండా ఇస్లాం ధర్మం స్వీకరిస్తారని భావం.

مَآ اُرِيۡدُ مِنۡهُمۡ مِّنۡ رِّزۡقٍ وَّمَآ اُرِيۡدُ اَنۡ يُّطۡعِمُوۡنِ ﴿57﴾

57 నేను వారి నుండి జీవనోపాధిని కోరటం లేదు. వారు నాకు అన్నం పెట్టాలని కూడా నేను కోరటంలేదు.[50]

اِنَّ اللّٰهَ هُوَ الرَّزَّاقُ ذُو الۡقُوَّةِ الۡمَتِيۡنُ ﴿58﴾

58 అల్లాహ్‌యే స్వయంగా అందరికీ ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహా శక్తిశాలి, మహాబలుడు.

فَاِنَّ لِلَّذِيۡنَ ظَلَمُوۡا ذَنُوۡبًا مِّثۡلَ ذَنُوۡبِ اَصۡحٰبِهِمۡ فَلَا يَسۡتَعۡجِلُوۡنِ ﴿59﴾

59 కాబట్టి ఈ దుర్మార్గుల్లాంటి వారికి ఏ వంతు లభించిందో అలాంటి వంతే వీరికి కూడా లభిస్తుంది.[51] కాబట్టి వారు దాని కోసం నన్ను తొందరపెట్టరాదు.[52]

فَوَيۡلٌ لِّلَّذِيۡنَ كَفَرُوۡا مِنۡ يَّوۡمِهِمُ الَّذِىۡ يُوۡعَدُوۡنَ ﴿60﴾

60 ఏ దినం గురించి వాగ్దానం చేయబడుతున్నదో ఆ దినాన అవిశ్వాసులకు మూడటం తథ్యం.

49. మానవులను, జిన్నులను పుట్టించటంలోని తన ఉద్దేశ్యమేమిటో దేవుడు ఈ వాక్యంలో తెలియపరచాడు. వారంతా తనను మాత్రమే ఆరాధించాలి, తనకు మాత్రమే విధేయత చూపాలన్నది ఆయన అభిమతం. అయితే దానికోసం ఆయన మనుషులనుగానీ, జిన్నాతులనుగానీ కట్టుబానిసలుగా చేసుకోలేదు. వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను హరించ లేదు. ఒకవేళ అదేగనక అయివుంటే మనుషులు, జిన్నాతులు తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా దైవారాధనకు కట్టుబడి ఉండేవారు. కాని దేవుడు వారికి స్వేచ్ఛను ఇస్తూనే తనను ఆరాధించమని కోరాడు. వారి పుట్టుకలోని పరమార్థాన్ని వారికిక్కడ జ్ఞాపకం చేశాడు. ఈ పరమార్థాన్ని విస్మరించిన వారికి పరలోకంలో ఎదురయ్యే పరాభవాన్ని గురించి కూడా హెచ్చరించాడు.

50. ఈ ఆరాధన మరియు విధేయత ద్వారా నా పోషణ జరుగుతుందని అనుకుంటున్నారేమో! అదేమీ కాదు. ప్రపంచంలో మీరు కల్పించే చిల్లర దేవుళ్ల లాంటి వాణ్ణి కాను నేను. ఆ మాటకొస్తే భూమ్యాకాశాల్లోని సమస్త ఖజానాలు నా అధీనంలోనే ఉన్నాయి. నా ఆరాధన వల్ల నా భక్తులకే లాభం చేకూరుతుంది. వారికి ఇహపరాల సాఫల్యం కలుగుతుంది. అంతేగాని నాకు చేకూరే ప్రయోజనం ఏమీ ఉండదు.

51. అంటే – లోగడ కుఫ్ర్‌కు, షిర్క్‌కు పాల్పడిన వారికి వారి వంతు శిక్ష వారికెలా వడ్డించబడిందో అలాగే మీలోని దుర్మార్గులకు కూడా వారి వంతు శిక్ష వడ్డించబడుతుంది.
మూలంలో **'జనూబ్'** ( ذَنُوۡبُ ) అని ఉంది. నిండు కడవ అని దాని అసలు అర్థం. కడవతో బావి నుండి నీటిని చేది పంచటం జరుగుతుంది. ఆ విధంగా 'జనూబ్' అన్న పదం పంపకం, వంతు, భాగం అనే అర్థాల్లో ఉపయోగించబడుతోంది.

52. అయితే వారి వంతు శిక్ష వారికి ఎప్పుడు పడుతుంది? ఇది దేవుని ప్రణాళికను బట్టి ఉంటుంది. కాబట్టి శిక్ష కోరటంలో వారు హడావిడి చేయరాదు. ఆ సమయం వచ్చినప్పుడు దుర్మార్గులు దాన్నుండి తప్పించుకోలేరు.

52వ సూరా

# అత్ తూర్

## తూర్ పర్వతం

అవతరణ
మక్కాలో

ఆయతులు
49

### పరిచయం

ఏక దైవారాధన, దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరా ప్రారంభ వచనంలో సినాయ్ పర్వతం లేదా తూర్ పర్వతం గురించిన ప్రస్తావన వచ్చింది. తూర్ పర్వతంపై ప్రవక్త మూసా(అస)కు దైవవాణి అందించడం జరిగింది. దీని ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై చేస్తుండిన ఆరోపణలను కూడా ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరగదని అవిశ్వాసులు భావించడాన్ని ప్రస్తావిస్తూ, మరణానంతర జీవితం భ్రమ కాదని, ఒక వాస్తవమనీ నొక్కి చెప్పడం జరిగింది. అనివార్యంగా, తప్పనిసరిగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరుగుతుందనీ హెచ్చరించింది. తీర్పుదినాన ఆకాశం ముక్కలవుతుంది. పర్వతాలు పెకలించబడి గాల్లో ఎగురుతాయి. సత్యాన్ని తిరస్కరించిన వారిని ఆ రోజున నరకాగ్ని వైపునకు నెట్టడం జరుగుతుంది. వారు సత్యాన్ని నిరాకరించారు. వారు దుర్మార్గానికి తగిన ప్రతిఫలాన్ని పొందారు. దైవభీతితో వ్యవహరించిన వారికి నిత్యం దైవానుగ్రహాలు వర్షించే స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడ వారికి సౌకర్యవంతమైన ఆసనాలు, పానీయాలు, ఆహారపదార్థాలు లభ్యమవుతాయి. వారి కోసం అందమైన భార్యలు ఉంటారు. వారి మంచిపనులకు లభించిన ప్రతిఫలం అది.

దివ్యఖుర్ఆన్ వంటి గ్రంథాన్ని తయారు చేసి చూపించాలని ఈ సూరా అవిశ్వాసులను సవాలు చేసింది. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు ఎవరూ లేరని, ఆయన ఆకాశాలకు, భూమికి సృష్టికర్త అనీ, ఆయనకు అనంతమైన జ్ఞానం, అపరిమితమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయనీ, ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరని, ఉనికిలో ఉన్న సమస్తానికి సంబంధించిన గోప్యంగా ఉన్న విషయాలన్నీ ఆయనకు తెలుసుననీ ఈ సూరా స్పష్టంగా చెప్పింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి, సహనంతో వ్యవహరించాలని, అల్లాహ్ ఔన్నత్యాన్ని రాత్రింబవలు కొనియాడాలనీ బోధించింది.

## అత్ తూర్ సూరా

## سُورَةُ الطُّورِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 తూరు (పర్వతం) సాక్షిగా![1]

وَالطُّوْرِ ﴿1﴾

2 వ్రాయబడిన గ్రంథం సాక్షిగా![2]

وَكِتٰبٍ مَّسْطُوْرٍ ﴿2﴾

3 (అది) విప్పబడిన పత్రంలో[3] ఉంది.

فِيْ رَقٍّ مَّنْشُوْرٍ ﴿3﴾

4 నిత్యం దాసులతో నిండుగా ఉండే గృహం (బైతె మామూర్) సాక్షిగా![4]

وَّالْبَيْتِ الْمَعْمُوْرِ ﴿4﴾

5 ఎత్తయిన కప్పు సాక్షిగా![5]

وَالسَّقْفِ الْمَرْفُوْعِ ﴿5﴾

6 రాజేయబడిన సముద్రం సాక్షిగా![6]

وَالْبَحْرِ الْمَسْجُوْرِ ﴿6﴾

1. తూరు పర్వతం అంటే దేవుడు తన ప్రవక్త అయిన హజ్రత్ మూసా (అలైహిస్సలాం)తో సంభాషణ జరిపిన పర్వతం అన్నమాట. ఈ మహత్యం మూలంగానే అల్లాహ్ ఆ పర్వతంపై ప్రమాణం చేసి మరీ తన సందేశాన్ని వివరిస్తున్నాడు. ఈ పర్వతాన్ని 'తూరె సైనా' అని కూడా పిలుస్తారు.

2. **'మస్తూర్'** (مَسْطُوْرٌ) అంటే లిఖిత పూర్వకమైనది. ఇంతకీ లిఖితపూర్వకమైన ఆ గ్రంథం ఏది? అంటే అది ఖుర్ఆన్ అనీ, లౌహె మహ్ఫూజ్ అనీ, సమస్త ఆకాశ గ్రంథాల సముదాయం అనీ, దైవదూతలు నమోదు చేసే మానవ కర్మల చిట్టా అనీ అనబడుతోంది.

3. **'రఖ్ఖిన్'** ( رَقٌّ) అంటే వ్రాయటానికి ఉపయోగించే అత్యంత పలుచని చర్మం. **'మన్షూర్'** ( مَنْشُوْرٌ) అంటే విప్పబడినది లేక విస్తరించబడినది అని అర్థం.

4. ఈ బైతె మామూర్ వాస్తవానికి దైవదూతల ప్రార్థనాలయం. ఇది ఏడవ ఆకాశంపైన ఉంది. దైవదూతలతో అది అహోరాత్రులు కళకళలాడుతూ ఉంటుంది. ప్రతి రోజూ 70 వేల మంది దైవదూతలు ఈ ప్రార్థనా గృహానికి వస్తుంటారు. ఒకసారి ఈ ప్రార్థనాలయంలో ప్రార్థన చేసిన దైవదూతకు మళ్లీ ప్రళయదినం వరకూ ఆ అవకాశం లభించదు. మేరాజ్‌కు సంబంధించిన హదీసులో ఈ వివరాలు వచ్చాయి.

   మరి కొంతమంది విద్వాంసులు 'బైతె మామూర్'ను కాబాగృహం అనే అర్థంలో తీసుకున్నారు. కాబా గృహం కూడా భక్తులతో రేయింబవళ్లు కళకళలాడుతూ ఉంటుంది. **'మామూర్'** అంటేనే జనంతో నిండుగా ఉండేది అని అర్థం.

5. కప్పు అంటే ఆకాశం అన్నమాట. దివ్య ఖుర్ఆన్ దీన్ని సురక్షితమైన కప్పుగా అభివర్ణించింది. "మేము ఆకాశాన్ని ఒక సురక్షితమైన కప్పుగా నిర్మించాము. కాని వాళ్లు మాత్రం సృష్టిలోని ఈ సూచనలపై తమ దృష్టిని మళ్ళించరు" (అల్ అంబియా - 32). మరికొంతమంది వ్యాఖ్యాతలు ఈ 'కప్పు'ను అర్ష్ (దైవ సింహాసనం) అన్న అర్థంలో తీసుకున్నారు. ఎందుకంటే ఇది ప్రాణులన్నింటికీ కప్పుగా ఉంటుంది.

6. **'మస్జూర్'** అంటే 'రాజుకున్న' అని అర్థం. కొంతమంది అభిప్రాయం ప్రకారం 'మస్జూర్' అనేది దైవసింహాసనం క్రింద ఉండే నీరు. అది ప్రళయదినాన కురిపించబడుతుంది. దాంతో మృత శరీరాలన్నీ జీవం పోసుకుంటాయి. మరి కొంతమంది ప్రకారం ఇది సముద్రం. ప్రళయదినాన సముద్రం రాజేయబడుతుంది. "మరెప్పుడయితే సముద్రాలు

| | |
|---|---|
| 7 నీ ప్రభువు శిక్ష సంభవించి తీరుతుంది. | اِنَّ عَذَابَ رَبِّكَ لَوَاقِعٌ ⑦ |
| 8 దాన్ని అడ్డుకోగలిగే వాడెవడూ లేడు.[7] | مَّا لَهٗ مِنْ دَافِعٍ ⑧ |
| 9 ఏ రోజున ఆకాశం గజగజా వణికిపోతూ[8] ఉంటుందో, | يَّوْمَ تَمُوْرُ السَّمَآءُ مَوْرًا ⑨ |
| 10 మరెప్పుడయితే పర్వతాలు నడుస్తూ తిరుగుతూ ఉంటాయో, | وَّتَسِيْرُ الْجِبَالُ سَيْرًا ⑩ |
| 11 ఆ రోజు ధిక్కరించే వారికి మూడుతుంది. | فَوَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ ⑪ |
| 12 వారు తమ అపసవ్యమైన విషయాలలో ఎగురుతూ, దుముకుతూ ఉండేవారు.[9] | الَّذِيْنَ هُمْ فِيْ خَوْضٍ يَّلْعَبُوْنَ ⑫ |
| 13 ఆ రోజు వారు త్రోయబడుతూ, నెట్టబడుతూ[10] నరకాగ్ని వైపు తీసుకురాబడతారు. | يَوْمَ يُدَعُّوْنَ اِلٰى نَارِ جَهَنَّمَ دَعًّا ⑬ |
| 14 "మీరు ధిక్కరిస్తూ వచ్చిన నరకాగ్ని ఇదే."[11] | هٰذِهِ النَّارُ الَّتِيْ كُنْتُمْ بِهَا تُكَذِّبُوْنَ ⑭ |
| 15 "(ఇప్పుడు చెప్పండి) ఇది మంత్రజాలమా?[12] లేక మీకు కనబడటం లేదా?"[13] | اَفَسِحْرٌ هٰذَآ اَمْ اَنْتُمْ لَا تُبْصِرُوْنَ ⑮ |

రాజేయబడతాయో!" (తక్వీర్ – 6) అన్న దివ్య వచనం ఈ సందర్భంగా గమనించదగినది. ఇమామ్ షౌకానీ ఈ అభిప్రాయానికే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చారు.

ఇంకా కొంతమంది ప్రకారం 'మస్జూర్' అంటే 'నిండిఉన్న' అని అర్థం. అంటే వాస్తవానికి సముద్రాలలో అగ్ని మాత్రం లేదు. అవి నీటితో నిండి ఉన్నాయి. ఇమామ్ తబ్రీ మాత్రం ఈ అభిప్రాయం వైపు మొగ్గారు. ఇలాంటి అభిప్రాయాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. వివరాలకు ఇబ్నె కసీర్ వ్యాఖ్యానం చూడండి.

7. పైన చేయబడిన ప్రమాణాలన్నింటికీ ఇది సమాధానంగా ఉంది. అంటే ఆ వస్తువులన్నీ అల్లాహ్ అసాధారణ శక్తి సామర్థ్యాలకు ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చేసిన శిక్షా వాగ్దానం తప్పక సంభవిస్తుందనడానికి అవి నిదర్శనాలు. ఆ శిక్షను ఆపేశక్తి ఎవరికీ లేదు.

8. **'మౌర్'** అంటే కదలటం, కంపించటం అని అర్థం. ప్రళయదినాన గగన మండలమంతా అతలాకుతలమైపోతుంది. నక్షత్రాలు, గ్రహాలు ఛిన్నాభిన్నమైన కారణంగా ఆకాశమంతా అల్లకల్లోలంగా ఉంటుంది. దాంతో అది వణికిపోతూ ఉంటుంది. మరోవైపు భూమండలంలోని పర్వతాలు దూదిపింజాల్లాగా ఎగిరిపోతూ, ఇసుక దిబ్బల మాదిరిగా ఒరిగిపోతూ ఉంటాయి.

9. అంటే – తమ తిరస్కార వైఖరిలో తలమునకలై, సత్యాన్ని గేలిచేస్తూ తైతక్కలాడుతున్నారు.

10. ఏ మాత్రం దయాదాక్షిణ్యాలు లేకుండా త్రోసివేస్తూ ఉంటారు.

11. నరకానికి పాలకులుగా నియమించబడిన దైవదూతలు పలికే మాటలివి!

12. ఇహలోకంలో మీరు ప్రవక్తలను మాంత్రికులని నిందించారుగా! ఇప్పుడు చెప్పండి! ఈ నరకాగ్ని కూడా మాంత్రికమేనా?

13. ఇహలోకంలో మీరు కళ్లుండి కూడా సత్యాన్ని కానలేకపోయారు. అలాగే ఈ నరకయాతన కూడా మీ కంటికి కనిపించటం లేదా? నిజానికి వారికి కానవస్తూనే ఉంటుంది. అయితే వారిని ఇంకా ఉడికించటానికి, భయపెట్టటానికి ఈ విధంగా చెప్పబడుతుంది.

**16** "నరకానికి ఆహుతి అవండి. ఇప్పుడు మీరు ఓపికపట్టినా, ఓపిక పట్టకపోయినా మీకు ఒకటే. మీరు చేసుకున్న దాని ఫలితమే మీకివ్వబడింది" (అని అనబడుతుంది).

اِصۡلَوۡهَا فَاصۡبِرُوۡۤا اَوۡ لَا تَصۡبِرُوۡا ۚ سَوَآءٌ عَلَيۡكُمۡ ؕ
اِنَّمَا تُجۡزَوۡنَ مَا كُنۡتُمۡ تَعۡمَلُوۡنَ ﴿16﴾

**17** నిశ్చయంగా భయభక్తులు గలవారు (స్వర్గ) వనాలలో, సుఖసౌఖ్యాలలో ఉంటారు.[14]

اِنَّ الۡمُتَّقِيۡنَ فِىۡ جَنّٰتٍ وَّنَعِيۡمٍۙ ﴿17﴾

**18** వారు తమ ప్రభువు ప్రసాదించిన దానిపై సంతోషిస్తూ ఉంటారు.[15] వారి ప్రభువు వారిని నరకయాతన నుండి రక్షించాడు కదా!

فٰكِهِيۡنَ بِمَاۤ اٰتٰٮهُمۡ رَبُّهُمۡ ۚ وَوَقٰٮهُمۡ رَبُّهُمۡ
عَذَابَ الۡجَحِيۡمِ ﴿18﴾

**19** (వారితో ఇలా అనబడుతుంది:) "మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా హాయిగా తింటూ, త్రాగుతూ ఉండండి."[16]

كُلُوۡا وَاشۡرَبُوۡا هَنِيۡٓـئًا ۢ بِمَا كُنۡتُمۡ تَعۡمَلُوۡنَۙ ﴿19﴾

**20** వారక్కడ వరుసగా పరచబడిన ఆసనాలపై దిండ్లకు ఆనుకుని (ఠీవిగా) కూర్చుని ఉంటారు.[17] పెద్ద పెద్ద కన్నులు గల సుందరాంగులతో మేము వారి వివాహం జరిపిస్తాము.

مُتَّكِـِٕيۡنَ عَلٰى سُرُرٍ مَّصۡفُوۡفَةٍ ۚ وَزَوَّجۡنٰهُمۡ
بِحُوۡرٍ عِيۡنٍ ﴿20﴾

**21** మరెవరయితే విశ్వసించారో, వారి సంతానం కూడా విశ్వసించి వారిని అనుసరించి ఉంటే, మేము వారి సంతానాన్ని కూడా వారితో కలుపుతాము. మరి వారి కర్మలను ఏ మాత్రం తగ్గించము.[18] (నిజానికి) ప్రతి వ్యక్తి తన సంపాదనకు తాకట్టుగా ఉన్నాడు.[19]

وَالَّذِيۡنَ اٰمَنُوۡا وَاتَّبَعَتۡهُمۡ ذُرِّيَّتُهُمۡ بِاِيۡمَانٍ
اَلۡحَقۡنَا بِهِمۡ ذُرِّيَّتَهُمۡ وَمَاۤ اَلَـتۡنٰهُمۡ مِّنۡ عَمَلِهِمۡ
مِّنۡ شَىۡءٍ ؕ كُلُّ امۡرِیءٍۢ بِمَا كَسَبَ رَهِيۡنٌ ﴿21﴾

---

14. దైవతిరస్కారుల, అభాగ్యుల తరువాత ఇక్కడి నుంచి విశ్వాసుల, భాగ్యవంతుల ప్రస్తావన మొదలవుతుంది.

15. అంటే – తమకు వొసగబడిన స్వర్గవనాలు, నివాసగృహాలు, అన్నపానీయాలు, వాహనాలు, అందగత్తెలైన భార్యలు తదితర దైవానుగ్రహాలపై వారు సంబరపడుతూ ఉంటారు. ఎందుకంటే ఈ సుఖసౌఖ్యాలు, ఈ భోగభాగ్యాలు ప్రపంచ జీవితంలోని భాగ్యాలకన్నా ఎన్నో రెట్లు మెరుగైనవై ఉంటాయి. వాటిని ఏ కళ్లూ చూడలేదు. ఎవరి చెవులూ వాటి గురించి వినలేదు. ఆఖరికి దానికి సంబంధించిన ఊహ కూడా ఏ మనిషి హృదయానికీ రాదు.

16. మరోచోట సెలవీయబడినట్లు : "మీరు ఇంతకుముందు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా ఈ రోజు మీరు హాయిగా తినండి, తాగండి" (హాఖ్ఖహ్ సూరా). దీన్నిబట్టి బోధపడేదేమిటంటే స్వర్గసుఖాలు అనుభవించటానికి విశ్వసించటంతో పాటు, సత్కర్మలు కూడా విధిగా చేయవలసి ఉంటుంది.

17. ఆ ఆసనాలు వరుసగా పేర్చబడి ఉంటాయి. లేదా ఎదురెదురుగా వేయబడి ఉంటాయని మరి కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. "వారక్కడ ఆసనాలపై ఎదురెదురుగా కూర్చుని ఉంటారు" (సాఫ్ఫాత్ – 44) అని వేరొకచోట చెప్పబడటం గమనార్హం.

18. అంటే–ఎవరి పితామహులు తమ సద్వర్తన మూలంగా, భయభక్తుల ప్రాతిపదికగా స్వర్గంలోని ఉన్నత శ్రేణులను పొందారో అల్లాహ్ విశ్వసనీయులైన వారి సంతానానికి కూడా ఉన్నత స్థానాలను ప్రసాదించి, వారిని వారి పితామహుల

22 మేము వారి కోరిక మేరకు ఫలాలను, మాంసాహారాలను పుష్కలంగా సరఫరా చేస్తూ ఉంటాము.[20]

وَ اَمۡدَدۡنٰهُمۡ بِفَاكِهَةٍ وَّلَحۡمٍ مِّمَّا يَشۡتَهُوۡنَ (22)

23 వారు ఒకరి నుండి ఒకరు మధు పాత్రలను (ఆనందంతో) అందుకుంటూ ఉంటారు.[21] ఆ మధువు వల్ల వ్యర్థ ప్రేలాపనలుగానీ, పాపం (వైపు ప్రేరేపించే గుణం) గానీ ఉండవు.[22]

يَتَنَازَعُوۡنَ فِيۡهَا كَاۡسًا لَّا لَغۡوٌ فِيۡهَا وَلَا تَاۡثِيۡمٌ (23)

24 వారి చుట్టూ (సేవ కోసం) అందమైన బాల సేవకులు తిరుగుతూ ఉంటారు. వారు మూసి ఉంచబడిన ముత్యాల్లా (స్వచ్ఛంగా) ఉంటారు.[23]

وَيَطُوۡفُ عَلَيۡهِمۡ غِلۡمَانٌ لَّهُمۡ كَاَنَّهُمۡ لُؤۡلُؤٌ مَّكۡنُوۡنٌ (24)

స్థాయికి చేరుస్తాడు. అంతేగాని పితామహుల తరగతులను తగ్గించి వారిని వారి సంతతి వద్దకు చేర్చడు. అంటే ఒకవిధంగా దేవుడు ఈ విశ్వాసులకు రెట్టింపు ఉపకారం చేస్తాడు. ఒకటి: తండ్రీబిడ్డలను కలుపుతాడు. దాంతో వారికి కంటి చలువ ప్రాప్తమవుతుంది. రెండు: దిగువ శ్రేణికి చెందిన విశ్వాసులను తీసుకుపోయి ఉన్నత శ్రేణికి చెందిన విశ్వాసుల సరసన నిలబెడతాడు. అంతేగాని 'ఎ' క్లాసు వారిని తెచ్చి 'బి' క్లాసులో చేర్చడు. ముమ్మాటికీ ఇది దేవుని మహోపకారమే. పితామహుల సంకల్పశుద్ధి మూలంగా, వారి సత్కర్మల సమృద్ధి (బరకత్) మూలంగా సంతతికి ఈ భాగ్యం లభిస్తుంది.

సజ్జనులైన పిల్లలు తమ పెద్దల క్షమాభిక్షకై చేసే ప్రార్థన వల్ల కూడా పెద్దల అంతస్తులు పెరుగుతాయని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. స్వర్గంలో ఒక వ్యక్తికి ఉన్నత తరగతి లభించినపుడు, తన ఉన్నత స్థాయికి కారణమేమిటని ఆ వ్యక్తి అల్లాహ్‌ను అడుగుతాడు. 'నీ సంతానం నీ క్షమాపణ కోసం వేడుకున్న కారణంగా నీకీ ఉన్నతస్థితి ప్రాప్తమయింద'ని అల్లాహ్ సమాధానమిస్తాడు (ముస్నదె అహ్మద్ – 2/509). వేరొక హదీసు ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది – "మనిషి చనిపోవటంతోనే అతని కర్మల పరంపర తెగిపోతుంది. కాకపోతే మూడు విషయాల పుణ్యఫలం మాత్రం మరణానంతరం కూడా కొనసాగుతూ ఉంటుంది. 1. ఎడతెగని దానం (సదఖయె జారియా). 2. ప్రజలు ఎల్లప్పుడూ లబ్ధిపొందుతూ ఉండే జ్ఞానం. 3. తన కోసం సజ్జన సంతతి చేసే ప్రార్థన. (ముస్లిం – కితాబుల్ వసియ్య).

19. 'ప్రతి వ్యక్తీ తన సంపాదనకు తాకట్టుగా ఉంటాడు' అంటే భావం ఇది : ప్రతి వ్యక్తీ తాను చేసిన కర్మనుబట్టి ఫలితం అనుభవిస్తాడు. సత్కర్మలకు సత్ఫలితం, దుష్కర్మలకు దుష్ఫలితం లభిస్తుంది. ఈ వాక్యం విశ్వాసికీ, అవిశ్వాసికి కూడా వర్తిస్తుంది.

మరొక అర్థం ఇది: అవిశ్వాసులు తమ చెడు కర్మలలో చిక్కుకుని ఉంటారు. ఎందుకంటే "కుడిపక్షంవారు (విశ్వాసులు) తప్ప అందరూ తమ కర్మలలో చిక్కుకుని ఉంటారు" అని చెప్పబడింది (చూడండి: అల్ ముద్దస్సిర్ : 38, 39).

20. వారు తమకిష్టమైన ఆహార వస్తువులను, కోరినంతగా తీసుకోవచ్చు.

21. మూలంలో **'యతనాజవూన్'** (يَتَنَازَعُوۡنَ) అని ఉంది. ఒకరి దగ్గర నుంచి ఒకరు లాక్కుంటూ ఉంటారని దాని అసలు అర్థం. అంటే సరదాకు అలా లాక్కుంటూ ఉంటారన్నమాట. ఉర్దూ అనువాదకులు ఆ భావమే తీసుకున్నారు. ఆయతులో **'కాస్'** (كَاۡسً) అనే మరో పదం వచ్చింది. మద్యం లేక మరేదయినా పానీయంతో నిండివున్న పాత్రను 'కాస్' అంటారు. ఖాళీ పాత్రను 'కాస్' అని చెప్పరు! (ఫత్‌హుల్ ఖదీర్).

22. ప్రాపంచిక మద్యపానంలో ఉండే మైకం, కిక్కు ఆ మధువులో ఉండదు. దాన్ని తాగినవారు తూలటంగానీ, నోటికొచ్చినట్లు వాగటంగానీ ఉండదు. తాగిన మత్తులో పాపకార్యాలకు ఒడిగట్టడం కూడా ఉండదు.

25 వారు ఒండొకరి వైపుతిరిగి ప్రశ్నలు వేసుకుంటూ ఉంటారు.[24]

وَاَقْبَلَ بَعْضُهُمْ عَلٰى بَعْضٍ يَّتَسَآءَلُوْنَ ﴿25﴾

26 వారిలా అంటారు : "ఇదివరకు మేము మా వాళ్ల మధ్య భయపడుతూ గడిపే వాళ్ళం.[25]

قَالُوْٓا اِنَّا كُنَّا قَبْلُ فِيْٓ اَهْلِنَا مُشْفِقِيْنَ ﴿26﴾

27 "ఇప్పుడు అల్లాహ్ మాకెంతో మేలు చేశాడు. తీవ్రమైన వడగాల్పుల శిక్ష నుండి మమ్మల్ని రక్షించాడు.[26]

فَمَنَّ اللّٰهُ عَلَيْنَا وَوَقٰىنَا عَذَابَ السَّمُوْمِ ﴿27﴾

28 "మేము ఇదివరకే ఆయన్ని ఆరాధిస్తూ ఉండేవారం.[27] నిశ్చయంగా ఆయన సద్వ్యవహారం చేసేవాడు, దయాకరుడు."

اِنَّا كُنَّا مِنْ قَبْلُ نَدْعُوْهُ ؕ اِنَّهٗ هُوَ الْبَرُّ الرَّحِيْمُ ﴿28﴾

29 కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు వారికి బోధ పరుస్తూ ఉండు. ఎందుకంటే నీ ప్రభువు అనుగ్రహం వల్ల నీవు (విషయాన్ని జిన్నాతుల నుండి గ్రహించే) జ్యోతిష్యుడవూ కావు, పిచ్చివాడవూ కావు.[28]

فَذَكِّرْ فَمَآ اَنْتَ بِنِعْمَتِ رَبِّكَ بِكَاهِنٍ وَّلَا مَجْنُوْنٍ ﴿29﴾

30 "ఇతడొక కవిపుంగవుడు. మేమితనిపై కాలచక్రపు విపత్తులు వచ్చిపడతాయని ఎదురు చూస్తున్నాము" అని వారంటున్నారా?[29]

اَمْ يَقُوْلُوْنَ شَاعِرٌ نَّتَرَبَّصُ بِهٖ رَيْبَ الْمَنُوْنِ ﴿30﴾

23. స్వర్గవాసుల సేవకోసం పిన్నవయస్కులైన బాలురు ప్రత్యేకించబడతారు. అందచందాలలోనూ, పరిశుభ్రతలోనూ వారు కడిగిన మేలిమి ముత్యాల్లా ఉంటారు. ముట్టుకుంటేనే మాసిపోయేంత స్వచ్ఛంగా ఉంటారు.

24. ప్రాపంచిక స్థితిగతుల గురించి వారు పరస్పరం అడిగి తెలుసుకుంటూ ఉంటారు. మీరు ప్రపంచంలో ఎలాంటి వాతావరణంలో జీవించారు? మీ 'విశ్వాసాన్ని' ఎలా కాపాడుకునేవారు? సదాచరణలో మీకు ఎలాంటి అవరోధాలుండేవి? లాంటి విషయాలను గురించి ప్రశ్నించుకుంటూ ఉంటారు.

25. అంటే – దైవాగ్రహం ఎక్కడ విరుచుకుపడుతుందోనని మాకు భయమేసేది. అందుకే దాన్నుండి తప్పించుకునేందుకు కృషి చేసేవారం. మనిషికి ఈ భయం ఉండటం అవసరం. భయభక్తులున్నప్పుడే అతడు శిక్షనుండి బయటపడే తరుణోపాయం ఆలోచిస్తాడు.

26. **'సమూమ్'** అంటే మాడ్చివేసే వడగాలి అని అర్థం. నరకానికి గల అనేక పేర్లలో ఇదొకటి.

27. అంటే – కేవలం ఒక్కడైన అల్లాహ్‌నే ఆరాధించేవారము. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ చేర్చేవారము కాము. లేక నరకాగ్ని నుండి కాపాడమని ఆయన్నే అర్థించేవారము అన్న అర్థం కూడా కావచ్చు.

28. ఈ వాక్యంలో మహనీయ ముహమ్మద్ (సఅసం)ను అల్లాహ్ ఓదార్చాడు. ఓ ముహమ్మద్ (సల్లం)! నీ బోధనా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించు. నీ గురించి వారు చెప్పే మాటలను పట్టించుకోకు. దైవకృపవల్ల నీవు జ్యోతిష్యుడవో, పిచ్చివాడవో కావు. పైగా నీమీద మా సందేశం (వహీ) అవతరిస్తుంది. జ్యోతిష్యులకు ఈ సందేశం అందదు. నీవు ప్రజలకు వినిపించే వాణి విజ్ఞతకు, వివేచనకు దర్పణం వంటిది. ఉన్మాది అయిన వ్యక్తి ఎవడూ ఇలాంటి విషయాలను వినిపించడు.

31 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "సరే, మీరు ఎదురుచూస్తూ ఉండండి. మీతో పాటు నేను కూడా ఎదురుచూస్తాను."[30]

قُلْ تَرَبَّصُوا فَإِنِّي مَعَكُم مِّنَ الْمُتَرَبِّصِينَ ﴿31﴾

32 ఏమిటి, వారి బుద్ధులు వారికి ఆజ్ఞాపించేది ఇదేనా?![31] లేక వారు పొగరుబోతు జనులుగా తయారయ్యారా?[32]

أَمْ تَأْمُرُهُمْ أَحْلَامُهُم بِهَٰذَا أَمْ هُمْ قَوْمٌ طَاغُونَ ﴿32﴾

33 "ఇతను దీనిని (ఈ ఖుర్ఆన్‌ను) స్వయంగా కల్పించు కున్నాడ"ని వారంటున్నారా? అసలు విషయం ఏమిటంటే వీళ్లు విశ్వసించటం లేదు.[33]

أَمْ يَقُولُونَ تَقَوَّلَهُ ۚ بَل لَّا يُؤْمِنُونَ ﴿33﴾

34 సరే, ఒకవేళ వారు (ఈ ఆరోపణలో) సత్యవంతులే అయితే దీన్ని పోలిన ఒక్క వాక్కునయినాసరే చేసి తీసుకురావాలి.[34]

فَلْيَأْتُوا بِحَدِيثٍ مِّثْلِهِ إِن كَانُوا صَادِقِينَ ﴿34﴾

35 ఏమిటి, వీరు (పుట్టించేవాడు) ఎవరూ లేకుండానే వారంతట వారే పుట్టుకు వచ్చారా?[35] లేక వారే స్వయంగా సృష్టి కర్తలా?[36]

أَمْ خُلِقُوا مِنْ غَيْرِ شَيْءٍ أَمْ هُمُ الْخَالِقُونَ ﴿35﴾

36 ఏమిటి, భూమ్యాకాశాలను వాళ్ళే సృష్టించారా? అసలు వాళ్లు నమ్మే రకం కాదు.[37]

أَمْ خَلَقُوا السَّمَاوَاتِ وَالْأَرْضَ ۚ بَل لَّا يُوقِنُونَ ﴿36﴾

---

29. కాలచక్రంలోని చేదు సంఘటనలు నీకు ఎదురవాలని, దాంతో నీ కథ కంచికి చేరాలని, ఆ తరువాత తాము హాయిగా ఊపిరి పీల్చవచ్చని మక్కా అవిశ్వాసులు కోరుకుంటున్నారు. **'రైబున్'** (رَيْب) అంటే దుర్ఘటనలు అని అర్థం. **'మనూన్'** (الْمَنُون) : మృత్యువుకు గల అనేక పేర్లలో ఇదొకటి.
30. సరే. ముందు ఎవరు మృత్యువాతన పడతారో ఎదురు చూడండి! వినాశాన్ని చవిచూసేదెవరో మీకే తెలుస్తుంది.
31. నీ విషయంలో వీరు మరీ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. లేనిపోని మాటల్ని కల్పిస్తున్నారు. వాళ్ల బుద్ధిజ్ఞానాలు వాళ్లకు ఈ మేరకే ఆదేశిస్తున్నాయా?
32. లేదు, వీళ్ళసలు తలబిరుసులు. అపమార్గంలో బాగా ముదిరి పోయినవారు. ఈ పొగరే వీళ్ళచేత అలాంటి మాటల్ని చెప్పిస్తోంది.
33. అంటే – ఖుర్ఆన్ ముహమ్మద్ (స) స్వకల్పితమన్న వారి ఆరోపణకు వారిని పురికొల్పినది కూడా వారి అవిశ్వాసమే.
34. అంటే – దివ్య ఖుర్ఆన్ ముహమ్మద్ (స) విరచితమన్న తమ ఆరోపణలో వారు సత్యవంతులే అయితే వారు కూడా అటువంటి అపురూపమైన గ్రంథాన్ని రచించి తీసుకురమ్మనండి. ఆ గ్రంథం కూడా భాషాపరంగా, బోధనా శైలిరీత్యా, నుడికారపు ఒంపుసొంపుల దృష్ట్యా, సమస్యలకు చూపే పరిష్కారం రీత్యా, సత్యప్రకటన రీత్యా దివ్యఖుర్ఆన్ స్థాయికి దీటుగా ఉండాలి.
35. నిజంగా వారు స్వయంగా ఉనికిలోకి వచ్చి ఉంటే వారిని ఆదేశించే హక్కు ఎవరికీ ఉండేది కాదు. కాని అది వాస్తవం కాదు కదా! పుట్టించే వాడొకడు వారిని పుట్టించినపుడు, ఆ పుట్టుక వెనుక ఒక పరమార్థం తప్పకుండా ఉంటుంది. అలాంటప్పుడు ఆ సృష్టికర్త వారిని ఇట్టే ఎలా వదిలేస్తాడు?
36. పోనీ, తమ పుట్టుకకు వాళ్లు స్వయంగా కర్తలా? అదీ కాదాయె. తమను సృష్టించినవాడు అల్లాహ్ అని వాళ్లు ఖుద్దుగా అంగీకరిస్తున్నారాయె.

**37** పోనీ, వాళ్ల దగ్గర నీ ప్రభువు ఖజానాలు గాని ఉన్నాయా?[38] వాళ్లుగాని ఆ ఖజానాలకు కావలివాళ్లుగా ఉన్నారా?[39]

أم عندهم خزائن ربك أم هم المصيطرون (37)

**38** పోనీ, వారి దగ్గర నిచ్చెన ఏదైనా ఉందా? దానిపైకెక్కి వారు (ఊర్ధ్వ లోకాల రహస్యాలు) వినివస్తున్నారా?[40] ఒకవేళ అలాంటి దేదైనా ఉంటే ఆ వినివచ్చేవాడు ఆ మేరకు ఏదైనా స్పష్టమైన ప్రమాణాన్ని సమర్పించాలి.

أم لهم سلم يستمعون فيه فليأت مستمعهم بسلطان مبين (38)

**39** ఏమిటి, అల్లాహ్‌కైతే అందరూ ఆడపిల్లలూను, మీకేమో మగ పిల్లలా?

أم له البنات ولكم البنون (39)

**40** ఏమిటి, నువ్వు ఏదన్నా ప్రతిఫలం అడుగుతున్నావా వారిని, దాని భారంతో వారు అణగారిపోతున్నారనటానికి?[41]

أم تسألهم أجرا فهم من مغرم مثقلون (40)

**41** ఏమిటి, వారి దగ్గర అగోచర జ్ఞానంగాని ఉందా? దాన్ని వారు లిఖిస్తూ ఉన్నారా?[42]

أم عندهم الغيب فهم يكتبون (41)

**42** ఏమిటి, వీళ్ళేదైనా మాయోపాయం చేస్తున్నారా?[43] అలాగైతే అవిశ్వాసులే ఆ మాయోపాయంలో పడతారు.[44]

أم يريدون كيدا ط فالذين كفروا هم المكيدون (42)

**43** ఏమిటి, అల్లాహ్ తప్ప వారికి వేరే ఆరాధ్యదైవం ఉన్నాడా? (ముమ్మాటికీ లేదు) వారు కల్పించే భాగస్వామ్యాలకు అల్లాహ్ అతీతుడు, పరిశుద్ధుడు.

أم لهم إله غير الله ط سبحان الله عما يشركون (43)

---

37. కాని వాళ్లు అల్లాహ్ వాగ్దానాల పట్ల, హెచ్చరికల పట్ల సంశయంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు.
38. తద్వారా వాళ్లు లోకవాసుల అదుపు అజమాయిషీ చేస్తున్నారా? తాము కోరిన వారికి ఉపాధిని ఇచ్చి, తాము కోరిన వారికి ఇవ్వకుండా ఉండే విశిష్ఠాధికారాలు వారికి ఉన్నాయా?
39. దేవుని ఖజానాల లెక్కలు వాళ్లుగాని చూస్తున్నారా? దేవుని ఖజానాలను తమకిష్టం వచ్చినట్లు ఖర్చుచేసే అధికారాలు వారికి ఇవ్వబడ్డాయా? ఏదేని పనిని పర్యవేక్షిస్తూ దానికి సంబంధించిన లెక్కలు, వివరాలు రాసేవాళ్ళని **'ముసైతిర్'** అంటారు.
40. ఏమిటి, వీళ్లు కూడా ముహమ్మద్ (స) ప్రవక్త మాదిరిగా గగన యాత్రచేసి, అక్కడి వింతలను చూసివచ్చారా? నిచ్చెన ద్వారా పైకెక్కి రహస్య సమాచారాలేమైనా సేకరించారా?
41. అంటే – ఆ వేతనం చెల్లించటం వారికి కష్టసాధ్యం అవుతుందని అనుకోవటానికి ప్రవక్త వేతనమేదీ అడగటం లేదుకదా!
42. తమ కంటే ముందు ముహమ్మద్ (సఅసం) మరణిస్తాడన్న సంగతి వారికేమన్నా తెలుసా?
43. అంటే – మా ప్రవక్తను తుదముట్టించే కుతంత్రం పన్నుతున్నారా?
44. వారి కుతంత్రం వారికే బెడిసికొడుతుంది. ఎట్టకేలకు నష్టపోయేది వారే. అదే జరిగింది కూడా. బద్ర్ రణరంగంలో

**44** ఒకవేళ వారు ఆకాశం నుండి ఏదయినా రాలిపడే తునకను చూసినా “అది దట్టమైన మేఘం మాత్రమే” అంటారు.[45]

وَإِن يَرَوْا كِسْفًا مِّنَ السَّمَاءِ سَاقِطًا يَقُولُوا سَحَابٌ مَّرْكُومٌ ﴿٤٤﴾

**45** కనుక (ఓ ముహమ్మద్!) వారు స్పృహ తప్పి పడిపోయే రోజును ఎదుర్కొనే వరకూ వారిని వారి మానాన వదలిపెట్టు.

فَذَرْهُمْ حَتَّىٰ يُلَاقُوا يَوْمَهُمُ الَّذِي فِيهِ يُصْعَقُونَ ﴿٤٥﴾

**46** ఆ రోజు వారి మాయోపాయమేదీ వారికి ఉపయోగపడదు. వారికెలాంటి సహాయం కూడా చేయబడదు.

يَوْمَ لَا يُغْنِي عَنْهُمْ كَيْدُهُمْ شَيْئًا وَلَا هُمْ يُنصَرُونَ ﴿٤٦﴾

**47** నిశ్చయంగా దుర్మార్గులకు అది గాకుండా మరిన్ని శిక్షలు కూడా ఉన్నాయి.[46]కాని వారిలో చాలా మందికి తెలియదు.[47]

وَإِنَّ لِلَّذِينَ ظَلَمُوا عَذَابًا دُونَ ذَٰلِكَ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ ﴿٤٧﴾

**48** మరి నీవు నీ ప్రభువు ఆజ్ఞకై ఓపికతో నిరీక్షించు. నిశ్చయంగా నువ్వు మా కళ్ళ ముందరే ఉన్నావు. నువ్వు నిలబడినప్పుడల్లా[48] నీ ప్రభువు పవిత్రతను కొనియాడు, ఆయన్ని స్తుతించు.

وَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ فَإِنَّكَ بِأَعْيُنِنَا وَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ حِينَ تَقُومُ ﴿٤٨﴾

**49** రాత్రిపూట కూడా[49] ఆయన పవిత్రతను కొనియాడు – మరి నక్షత్రాలు వెను తిరిగే వేళ కూడా.[50]

وَمِنَ اللَّيْلِ فَسَبِّحْهُ وَإِدْبَارَ النُّجُومِ ﴿٤٩﴾

---

కాకలు తీరిన అవిశ్వాసులు ఎందరో కుప్పకూలారు. ఆ తరువాత కూడా వారు వేర్వేరు సందర్భాలలో ఘోర పరాభవాన్ని చవిచూశారు.

45. అంత జరిగినా వాళ్లు తమ అవిశ్వాస వైఖరిని, విరోధాన్ని మానుకోరు. పైగా మంకుతనంతో, “ఇది దైవాగ్రహమేదీ కాదు. దట్టమైన మేఘమాలిక మాత్రమే” అనంటారు.

46. అంటే ప్రాపంచిక శిక్ష అన్నమాట! సూరె సజ్దాలో కూడా ఈ విషయమే చెప్పబడింది: “ఆ పెద్ద శిక్షకు ముందు, మేము ఈ లోకంలోనే చిన్న శిక్షను కూడా రుచి చూపిస్తూ ఉంటాము – బహుశా వారు మరలి వస్తారేమోనని!” (అస్ సజ్దహ్ : 21)

47. మానవులు కళ్లు తెరచి, యదార్థాన్ని తెలుసుకుని రుజువర్తనులవుతారేమోనని అల్లాహ్ ప్రపంచ జీవితంలోనే అనేక కష్టనష్టాలకు గురిచేస్తూ ఉంటాడు. కాని మానవులు ఈ యదార్థాన్ని గ్రహించకపోవటం వల్ల పశ్చాత్తాపం చెందరు. ఒక్కోసారి మునుపటికన్నా ఎక్కువ పాపాలకు ఒడిగడుతూ పోతారు. ఒక హదీసులో ఉంది : “ జబ్బుపడిన తరువాత ఆరోగ్యవంతుడయ్యే కపట విశ్వాసి పరిస్థితి ఒంటె లాంటిది. తనను ఎందుకు కట్టి ఉంచుతారో, మరెందుకు వదులుతారో ఒంటెకు తెలియదు కదా!” (అబూ దావూద్ – కితాబుల్ జనాయెజ్, హ.నెం. 3089).

48. **‘లేచి నిలబడటం’** అంటే ఏ వేళ లేచి నిలబడటం? నమాజు కోసం లేచి నిలబడటం అని కొందరు వ్యాఖ్యానించారు. ఉదాహరణకు: నమాజు కొరకు నిలబడినప్పుడు ప్రారంభంలో ‘సనా’ (సుబ్హానకల్లాహుమ్మ వ బిహమ్దిక...) పఠిస్తారు. నిద్ర నుండి మెలకువ వచ్చినప్పుడు దేవుని పవిత్రతను కొనియాడటమనీ, ఆ సమయంలో ఆయన్ని స్మరించటం సంప్రదాయమని మరికొంతమంది పండితులు భావిస్తున్నారు. “ఏదైనా సమావేశం నుండి లేచి నిలబడినప్పుడు...” అని ఇంకా కొంతమంది అభిప్రాయపడ్డారు. ఎందుకంటే – ఏ వ్యక్తి అయినా ఏదైనా సమావేశానికి హాజరై (చివర్లో)

లేచినప్పుడు ఈ దుఆను పఠిస్తే సమావేశ సందర్భంగా అతనివల్ల జరిగిన తప్పులు మన్నించబడతాయని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఆ దుఆ ఇది : **"సుబ్హాన కల్లాహుమ్మ వ బిహమ్దిక అష్హదు అన్ లా ఇలాహ ఇల్లా అన్త అస్తగ్ఫిరుక వ అతూబు ఇలైక్"** (ఓ అల్లాహ్! నీవు పవిత్రుడవు. స్తోత్రం నీకే చెందుతుంది. నీవు తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. నీ క్షమాభిక్షకై ప్రార్థిస్తున్నాను. నీ వైపుకు మరలుతున్నాను). (సుననె తిర్మిజీ – అబ్వాబుద్దావాత్).

49. అంటే తహజ్జుద్ నమాజ్ (ఖియాముల్లైల్) అన్నమాట! మహాప్రవక్త (సఅసం) వారు జీవితాంతం ఈ నమాజు చేశారు.

50. ఇంతకీ నక్షత్రాలు వెను తిరిగే ఆ సమయం ఏది? అంటే అది ప్రభాత సమయం. అంటే ఫజ్ర్ నమాజుకు సంబంధించిన రెండు రకాతుల సున్నత్ నమాజు! దైవప్రవక్త (సఅసం) తాను పాటించే అదనపు (నవాఫిల్) నమాజులలో ఈ రెండు రకాతులకు చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. "ఫజ్ర్‌లోని రెండు సున్నతులు ప్రపంచంకన్నా, ప్రపంచంలో ఉన్న వాటన్నింటి కన్నా శ్రేష్ఠమైనవి" అని ఆయన (స) చెప్పినట్లు ఒక ఉల్లేఖనం ఉంది. (బుఖారీ – కితాబుత్తహజ్జుద్).

53 వ సూరా

# అన్ నజ్మ్

## నక్షత్రం

అవతరణ మక్కాలో

ఆయతులు 62

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి బోధించింది. ఈ సూరా మొదటి ఆయతులో నక్షత్రం గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. దైవవాణి అవతరణను, ప్రవక్తల పరంపరను అవిశ్వాసులు నిరాకరించేవారు. కాని అవి వాస్తవాలని ఈ సూరా ధృవీకరించింది. దివ్యఖుర్ఆన్‌ను అల్లాహ్ అవతరింపజేసాడనీ, దైవవాణి అవతరణ భ్రమ కాదని, ఒక వాస్తవమనీ, దైవదూత జిబ్రయీల్ (అస) ద్వారా దైవవాణిని పంపడం జరిగిందనీ ఇందులో గట్టిగా చెప్పడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రత్యక్షంగా దైవదూత జిబ్రయీల్(అస)ను రెండుసార్లు చూసారని ఈ సూరా వల్ల తెలుస్తోంది. దైవదూత ప్రథమంగా దైవవాణిని తీసుకొచ్చినపుడు మొదటిసారి, మేరాజ్ (గగనయాత్ర) సందర్భంగా రెండవసారి ఆయన జిబ్రయీల్(అస)ను చూసారు.*

*అల్లాహ్‌కే ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యాన్ని విశదీకరించడం ద్వారా దేవుని ఏకత్వాన్ని ఈ సూరాలో నిదర్శనాలతో సహా రుజువుచేయడం జరిగింది. ఆయన మనిషిని మట్టి నుంచి సృష్టించాడు. మాతృగర్భంలో పిండం రూపంలో ఉన్నవారి గురించి కూడా ఆయనకు అన్నీ తెలుసు. ఆయన జీవితాన్ని ఇస్తాడు, చావును ఇస్తాడు. మనకు ఆనందాన్ని, దుఃఖాన్ని ఇచ్చేది ఆయనే. ఆయన ఒక్క వీర్యం బిందువు నుంచి స్త్రీపురుషులను సృష్టించాడు. మరణించిన తర్వాత మళ్ళీ లేపడం ద్వారా ఆయన మళ్ళీ రెండవసారి పుట్టిస్తాడు. ఆయనే విశ్వానికి సృష్టికర్త, విశ్వపోషకుడు. ఆయనే సంపదలను, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తాడని బోధించింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి ఇస్లాం సందేశాన్ని కాదంటున్న వారిని పట్టించుకోవద్దని, వారు కేవలం ప్రాపంచిక జీవితం పట్ల మాత్రమే ఆసక్తి కలిగి ఉన్నారని బోధించడమైనది.*

## అన్ నజ్మ్[1] సూరా

سُوْرَةُ النَّجْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 క్రింద పడేటప్పటి నక్షత్రం సాక్షిగా![2]

وَالنَّجْمِ اِذَا هَوٰى ①

2 మీ సహచరుడు (అయిన ముహమ్మద్‌- స) దారి తప్పనూ లేదు, పెడదారి పట్టనూ లేదు.[3]

مَا ضَلَّ صَاحِبُكُمْ وَمَا غَوٰى ②

3 అతను తన మనోవాంఛల ప్రకారం మాట్లాడటమూ లేదు.

وَمَا يَنْطِقُ عَنِ الْهَوٰى ③

4 అది (అతను మాట్లాడేదంతా) అతని వద్దకు పంపబడే దైవవాణి (వహీ) తప్ప మరేమీ కాదు.[4]

اِنْ هُوَ اِلَّا وَحْيٌ يُّوْحٰى ④

1. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా అవిశ్వాసుల సమక్షంలో బహిరంగంగా పారాయణం చేసిన తొలి సూరా ఇది. దీని పఠనం తరువాత మహాప్రవక్త (సఅసం), ఆయన వెనుక ఉన్న వారంతా సాష్టాంగ ప్రణామం చేశారు – ఒక్క ఉమయ్య బిన్ ఖల్ఫ్ తప్ప! అతడు మాత్రం గుప్పెడు మట్టి తీసుకుని, దానిపై సాష్టాంగ ప్రణామం చేశాడు. అందుచేత అతడు అవిశ్వాస స్థితిలోనే మరణించాడు (సహీహ్ బుఖారీ – నజ్మ్ సూరా వ్యాఖ్యానం).
మరికొన్ని ఆధారాల ప్రకారం ఆ వ్యక్తి ఉత్బా బిన్ రబీయ అని తెలుస్తోంది (తఫ్సీర్ ఇబ్నె కసీర్). నిజము దేవుడెరుగు. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) ఇలా అంటున్నారు: “నేను ఈ సూరాను ఆయన (సఅసం) సమక్షంలో పారాయణం చేశాను. ఆయన మాత్రం సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేయలేదు” (సహీహ్ బుఖారీ). దీన్నిబట్టి తెలిసేదేమిటంటే సజ్దా చేయటం వాంఛనీయమే గాని తప్పనిసరి కాదు. ఎప్పుడయినా ఈ సజ్దా చేయకపోయినా ఫరవాలేదు.

2. ఈ **‘నక్షత్రం’** పేరుపై వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. కొంతమంది దీన్ని **‘సురయ్యా’** అని పేర్కొనగా, మరికొంతమంది ‘జుహ్‌రా’గా పేర్కొన్నారు. నక్షత్రాలన్నిటికీ ఈ పదం వర్తిస్తుందని ఇంకొంతమంది వ్యాఖ్యానించారు. **‘హవా’** (هَوٰى) అంటే పైనుంచి క్రిందికి పడటం అని అసలు అర్థం. అనువాదకులు కొందరు దీన్ని అస్తమించటం అన్న భావంలో తీసుకున్నారు. రాత్రి చివరిభాగంలో – ఫజ్ర్ నమాజ్ వేళ – అది పడ్తుంది. లేదా షైతానులను తరిమి కొట్టేందుకు పడ్తుంది. లేదా కొంతమంది అభిప్రాయపడినట్లు ప్రళయదినాన నక్షత్రాలు క్రిందపడతాయి.

3. **‘మీ సహచరుడు’** (صَاحِبُكُمْ) అంటే ముహమ్మద్ ప్రవక్త (సఅసం) అన్నమాట! అతడు సత్య సంధుడు. దైవప్రవక్తగా నియమించబడక ముందు – నలభై సంవత్సరాల పాటు – ఆయన మీ మధ్యన ఉన్నాడు. అతని రేయింబవళ్ళ రికార్డు అంతా మీ ముందు ఉన్నది. అతని గుణగణాల గురించి మీకు క్షుణ్ణంగా తెలుసు. అతనిలో మీరు సత్యసంధతను, నిజాయితీ తత్పరతను తప్ప మరో దుర్గుణాన్ని ఎరుగరు. ఇప్పుడు నలభై ఏండ్ల తరువాత అతను దైవప్రవక్తనని ప్రకటించుకుంటే, అతను అబద్ధం చెబుతున్నాడని ఎలా అంటారు? మీరే ఆలోచించండి! వాస్తవానికి అతను మార్గవిహీనుడూ కాదు, అతను దారి మరవనూ లేదు. కాకపోతే అపమార్గం పట్ల, అజ్ఞానం పట్ల అతడు తన విసుగును, వైముఖ్యాన్ని ప్రకటిస్తున్నాడు. ఉద్దేశ్య పూర్వకంగా అతడు సత్యాన్ని పరిత్యజించి ఉంటే పెడదారి పట్టాడని అనుకోవచ్చు. కాని మీ సహచరుడు అలాంటిదేదీ చేయలేదు. అయినా మీరు అతనిపట్ల లేనిపోని అనుమానా లకు ఎందుకు పోతున్నారు?

4. అతడు ఏది మాట్లాడినా దైవవాణి ప్రకారమే మాట్లాడతాడు. ఏ పనిచేసినా దైవాదేశానుసారమే చేస్తాడు. అతడు

| | |
|---|---|
| **5** అసాధారణ శక్తిగల దైవదూత (జిబ్రయీల్) అతనికి (ఖుర్ఆన్) నేర్పాడు. | عَلَّمَهُ شَدِيدُ الْقُوَىٰ ⑤ |
| **6** అతడు గొప్ప శక్తిసంపన్నుడు.[5] మరి అతను తిన్నగా నిలబడ్డాడు – | ذُو مِرَّةٍ فَاسْتَوَىٰ ⑥ |
| **7** అతడు ఎత్తయిన ఆకాశపుటంచులపై ఉన్నాడు.[6] | وَهُوَ بِالْأُفُقِ الْأَعْلَىٰ ⑦ |
| **8** మరి అతను సమీపించసాగాడు.... అలా అలా వాలుతూ వచ్చాడు.[7] | ثُمَّ دَنَا فَتَدَلَّىٰ ⑧ |
| **9** చివరికి అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంత కన్నా తక్కువ దూరాన ఉండిపోయాడు.[8] | فَكَانَ قَابَ قَوْسَيْنِ أَوْ أَدْنَىٰ ⑨ |
| **10** తరువాత అతడు దైవదాసునికి అందజేయవలసిన సందేశాన్ని అందజేశాడు.[9] | فَأَوْحَىٰ إِلَىٰ عَبْدِهِ مَا أَوْحَىٰ ⑩ |
| **11** (ప్రవక్త) తిలకించినది అసత్యమని అతని హృదయం చెప్పలేదు.[10] | مَا كَذَبَ الْفُؤَادُ مَا رَأَىٰ ⑪ |

నవ్వే, నవ్వించే సమయంలో కూడా–మాట వరుసకు కూడా – సత్యవిరుద్ధమైన విషయమేదీ చెప్పడు. మరలాంటప్పుడు అతను మార్గ భ్రష్టుడుగానీ, దారితప్పిన వాడుగానీ ఎలా అవుతాడు? (సుననె తిర్మిజీ – అబ్వాబుల్ బిర్ర్). అలాగే కోపావేశంలో సయితం ఆయన (స) ఎన్నడూ అదుపు తప్పలేదు. కోపంలో ఎన్నడూ ఆయన నోట వాస్తవ విరుద్ధమైన విషయం వెలువడలేదు (అబూదావూద్ – కితాబుల్ ఇల్మ్).

5. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) గురించి ఇక్కడ చెప్పబడుతోంది. అతను దృఢకాయుడు. బలశాలి. దేవుని వద్ద నుంచి సందేశాన్ని (వహీని) తీసుకువచ్చే, దైవప్రవక్త (స)కు వినిపించే బాధ్యత ఈ దైవదూతపై ఉంది.

6. వహీని ప్రవక్తకు నేర్పిన పిదప ఆ దైవదూత ఆకాశపుటంచుపై వెళ్ళి నిలబడ్డాడు.

7. తరువాత దివి నుండి భువికి దిగివచ్చాడు. క్రమక్రమంగా దైవప్రవక్త (సఅసం)ను సమీపించాడు.

8. కొంతమంది “రెండు చేతులంత దూరాన” అని అనువదించారు. దైవప్రవక్త (స)కు – దైవదూత జిబ్రయీల్‌కు మధ్య గల సామీప్యాన్ని ఇది సూచిస్తోంది. అంతేగాని కొంతమంది భావిస్తున్నట్లు ఇది ముహమ్మద్ ప్రవక్తకు – దేవునికి మధ్య ఏర్పడిన సామీప్యం కాదు. సందర్భం దృష్ట్యా కూడా ఇవి ముహమ్మద్ (స)కు – జిబ్రయీల్‌కు సంబంధించి చెప్పిన విషయాలేనన్నది గమనార్హం. ఈ సందర్భంగానే దైవప్రవక్త (స) ఆయన్ని నిజరూపంలో చూశారు. అది మహాప్రవక్త (స)కు దైవదౌత్యం లభించిన ఆరంభ కాలం. తరువాత రెండవసారి మేరాజ్ యాత్ర సందర్భంగా ఆయన ఈ దైవదూతను నిజరూపంలో చూశారు.

9. అంటే జిబ్రయీల్ (అలైహిస్సలాం) మహాప్రవక్త ముహమ్మద్ (స)కు దైవవాణిని వినిపించారు.

10. ఆయన (అలైహిస్సలాం)కు 600 రెక్కలున్నాయని, ఒక్కో రెక్క తూర్పు – పడమరలంత పొడవుగా ఉందని, మహాప్రవక్త (స) తన కళ్లతో చూసిన దాన్ని ఆయన హృదయం తిరస్కరించలేదని, పైగా దేవుని ఈ శక్తిని ఒప్పుకుందని అనబడింది.

أَفَتُمٰرُونَهُۥ عَلَىٰ مَا يَرَىٰ ⑫
12 ఏమిటీ (ప్రవక్త) చూస్తున్న దానిపై మీరు అతనితో వాదులాడుతున్నారా?

وَلَقَدْ رَءَاهُ نَزْلَةً أُخْرَىٰ ⑬
13 అతను (ముహమ్మద్ – స) అతన్ని (జిబ్రయీల్‌ను) మరో సందర్భంలో కూడా చూసి ఉన్నాడు –

عِندَ سِدْرَةِ ٱلْمُنتَهَىٰ ⑭
14 'సిద్రతుల్ ముస్తహా' దగ్గర![11]

عِندَهَا جَنَّةُ ٱلْمَأْوَىٰٓ ⑮
15 అక్కడే 'జన్నతుల్ మావా'[12] కూడా ఉంది.

إِذْ يَغْشَى ٱلسِّدْرَةَ مَا يَغْشَىٰ ⑯
16 అప్పుడు ఆ 'సిద్రా'ను ఆవరించే వస్తువేదో ఆవరిస్తూ ఉన్నది.[13]

مَا زَاغَ ٱلْبَصَرُ وَمَا طَغَىٰ ⑰
17 (అతని) చూపు తప్పిపోనూ లేదు, హద్దు దాటిపోనూ లేదు.[14]

لَقَدْ رَأَىٰ مِنْ ءَايَٰتِ رَبِّهِ ٱلْكُبْرَىٰٓ ⑱
18 నిస్సందేహంగా అతను తన ప్రభువు యొక్క గొప్ప సూచనలు (కొన్నింటిని) తిలకించాడు.[15]

أَفَرَءَيْتُمُ ٱللَّٰتَ وَٱلْعُزَّىٰ ⑲
19 ఏమిటీ, మీరు లాతు, ఉజ్జాలను గాని చూశారా?

وَمَنَوٰةَ ٱلثَّالِثَةَ ٱلْأُخْرَىٰٓ ⑳
20 మూడవది, చివరిది అయిన మనాతును[16] (కూడా చూశారా?)

11. మేరాజ్ (గగన యాత్ర) సందర్భంగా అన్నమాట. ఆ సమయంలో కూడా దైవప్రవక్త (సల్లం) దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను నిజస్థితిలో చూశారు. **'సిద్రతుల్ ముస్తహా'** అనేది ఒక రేగు వృక్షం. అది ఆరవ లేక ఏడవ ఆకాశంలో ఉంది. అది చివరి హద్దు. ఆ హద్దును దాటి ఏ దైవదూత కూడా ముందుకు పోలేదు. దైవాజ్ఞలను కూడా దైవదూతలు ఇక్కడి నుండే పొందుతారు.

12. దాన్ని **'జన్నతుల్ మావా'** (స్వర్గధామం) అనటానికి ఒక కారణమేమిటంటే హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) నివాస స్థలం అక్కడే ఉండేది. ఆత్మలు ఈ ప్రదేశానికి వచ్చి చేర్తాయని కొందరు అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

13. మహాప్రవక్త (సఅసం) మేరాజ్ సందర్భంగా ఆ వృక్షాన్ని చూచినప్పటి అనిర్వచనీయమైన స్థితి ఇక్కడ చెప్పబడింది. ఆ వృక్షం చుట్టూ బంగారు దూదిపురుగులు ఎగురుతున్నాయి. దైవదూతల ప్రతిబింబం దానిపై పడుతూ ఉంది. పరమ ప్రభువు తేజస్సు కూడా అక్కడ తొణికిసలాడుతూ ఉంది (ఇబ్నె కసీర్). ఆ ప్రదేశం దగ్గరే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారికి మూడు కానుకలు వొసంగబడ్డాయి: 1. ఐదుపూటల నమాజులు 2. అల్ బఖరా సూరా చివరి ఆయతులు 3. షిర్క్ కాలుష్యానికి దూరంగా ఉండే ముస్లింకు క్షమాభిక్ష ప్రసాదించబడుతుందన్న వాగ్దానం. (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

14. అంటే – ఆ మధుర క్షణాలలో మహాప్రవక్త (సఅసం) వారి దృష్టి కుడి ఎడమల వైపు మళ్లటంగానీ, అవధులు మీరిపోవటంగానీ జరగలేదు. ఆ దృశ్యాన్ని ఆయన తదేకంగా తిలకించారు (ఐసరుత్తఫాసీర్).

15. జిబ్రయీల్‌ను నిజరూపంలో చూడటం, సిద్రతుల్ ముస్తహాను తిలకించటం కూడా ఆ గొప్ప సూచనలలో భాగమే. మిగిలిన సూచనలు మేరాజ్ యాత్రకు సంబంధించిన హదీసులలో వివరించబడ్డాయి.

| | |
|---|---|
| 21 ఏమిటేమిటి!? మీ కోసమేమో మగపిల్లలూను, ఆయన కోసమేమో ఆడపిల్లలా?[17] | أَلَكُمُ الذَّكَرُ وَلَهُ الْأُنثَىٰ ﴿٢١﴾ |

16. బహుదైవారాధకులకు హెచ్చరికగా ఈ మాటలనబడ్డాయి. అల్లాహ్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) లాంటి గొప్ప దూతలను సృష్టించాడు. ముహమ్మద్ (సఅసం) లాంటి ఉత్తములను తన ప్రవక్తగా నియమించుకున్నాడు. ఆ ప్రవక్తను సప్తాకాశాలలోకి పిలుచుకుని ఆయనకు అద్భుత సూచనలను చూపించాడు. ఆయన ద్వారా ముస్లిం సమాజానికి అమూల్య కానుకల్ని కూడా ఇచ్చి పంపాడు. మరైతే మీరు కొలిచే దేవీ దేవతలలో ఈ సుగుణాలు ఉన్నాయా? ఈ సందర్భంగా అరబ్బు ద్వీపంలో ఖ్యాతి గడించిన మూడు దేవతల పేర్లు ప్రస్తావించబడ్డాయి.

మొదటిది **'లాత్'**. అసలు ఈ పదం 'అల్లాహ్' అనే పదం నుంచి ఏర్పడినదేనని కొంతమంది అభిప్రాయపడ్డారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం 'లాత్' అంటే త్రిప్పటం, మళ్ళించటం అని అర్థం. అరబ్బు పూజారులు తమ మెడలను ఆ దేవత వైపుకు త్రిప్పేవారు. దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. అందుచేత దానికా పేరు పడింది. మరి కొంతమంది ప్రకారం ఈ పదం 'లత్త' నుంచి ఏర్పడింది. లత్త అంటే పిండి నానబెట్టటం అని అర్థం. పూర్వం మక్కాలో 'లాత్' అనే పుణ్యపురుషుడుండేవాడు. అతడు పిండిని నానబెట్టి హజ్ యాత్రీకులకు (పాయసం లాంటి పదార్థాన్ని) త్రాగించేవాడు. అతను చనిపోయిన తరువాత జనులు అతని జ్ఞాపకార్థం ఒక గుమ్మటం నిర్మించారు. కొంతకాలం గడిచాక అక్కడ అతని విగ్రహాలు ప్రతిష్ఠించబడ్డాయి. అతను తాయఫ్‌లో సఖీఫ్ తెగవారి అతి పెద్ద దేవతగా వర్థిల్లసాగాడు.

**'ఉజ్జా'** అనేది అల్లాహ్ గుణవాచకమైన 'అజీజ్' నుండి పుట్టుకు వచ్చిందని కొంతమంది చెబుతారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం 'గిత్ఫాన్' ప్రాంతంలో 'ఉజ్జా' అనే ఒక వృక్షం ఉండేది. జనులు దాన్ని పూజించేవారు. ఇంకొక కథనం ప్రకారం ఇదొక దెయ్యం. అడపాదడపా అది కొన్ని చెట్లపై ప్రత్యక్షమయ్యేది. వేరొక కథనం ప్రకారం నిజానికి అదొక తెల్ల రాయి. ప్రజలు దాన్ని మొక్కుకునే వారు. ముఖ్యంగా ఖురైషు, కినానా తెగవారు దీన్ని కొలిచేవారు.

**'మనాత్'** అంటే 'ప్రవహింపజెయ్యటం' అని అర్థం. ఈ దేవత మెప్పు పొందటం కోసం జనులు దాని ముందు జంతు బలి ఇచ్చి రక్తం ప్రవహింపజేసేవారు. ఈ విగ్రహం మక్కా – మదీనా ప్రాంతాల మధ్య ఉండేది (ఫత్‌హుల్ ఖదీర్). 'ఖుదైద్'కు ఎదురుగా 'ముషల్లల్' అనే చోట ఇది ఉండేది. బనూ ఖుజాఆ తెగవారి ప్రత్యేక దేవత ఇది. అజ్ఞాన కాలంలో ఔస్, ఖజ్రజ్ తెగలవారు హజ్ యాత్రకు వెళ్ళినప్పుడు ఈ స్థలం (విగ్రహం) వద్దనే 'ఇహ్రామ్' (దీక్ష) బూనేవారు. ఆ విగ్రహం చుట్టూ వారు ప్రదక్షిణ కూడా చేసేవారు. (ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్).

ఇవిగాక ఆ పరిసర ప్రాంతాల్లో మరికొన్ని చిట్టిపొట్టి దేవుళ్ళ బొమ్మలు, దేవాలయాలు కూడా ఉండేవి. మక్కా విజయం తరువాత మహాప్రవక్త (సఅసం) ఈ విగ్రహాలను, విగ్రహారాధనాలయాలను నిర్మూలించారు. విగ్రహాలపై వెలసిన గుమ్మటాలను, పక్కా నిర్మాణాలను కూడా నేలమట్టం చేశారు. పూజా పునస్కారాలకు కేంద్రాలుగా మారిన చెట్లను కూడా నరికించివేశారు. విగ్రహారాధనకు ప్రతిరూపాలుగా ఉన్న ఇతరత్రా చిహ్నాలను కూడా రూపుమాపారు. ఈ పనికోసం ఆయన (సఅసం) హజ్రత్ ఖాలిద్, హజ్రత్ అలీ, హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్, హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా బజలీ (రిజ్వానుల్లాహి అలైహిమ్ అజ్మయీన్) తదితరులను నియమించారు. వారు అరేబియా భూభాగంలో ఉన్న ఈ విగ్రహ కేంద్రాలన్నింటినీ తొలగించి షిర్క్ (బహుదైవోపాసన)ను నిర్మూలించారు (ఇబ్నె కసీర్).

ఈ ప్రక్షాళన జరిగిన చాలా కాలం తరువాత అరేబియాలో మళ్లీ క్రమక్రమంగా విగ్రహారాధన మొదలయింది. దేశమంతటా పక్కా సమాధులు, గుమ్మటాలు, చిన్న చిన్న విగ్రహాలు వెలవటం మొదలయ్యాయి. సరిగ్గా ఆ సమయంలోనే షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ అనే సంస్కర్తను అల్లాహ్ ప్రభవింపజేశాడు. ఆయన 'దర్ఇయా' పరిపాలకుని సహాయసహకారాలతో ఈ షిర్క్ ఆనవాళ్ళన్నింటినీ రూపుమాపారు. ఈ బృహత్తర కార్యం ఇంకొకసారి – హిజాజ్ గవర్నర్ అయిన సుల్తాన్ అబ్దుల్ అజీజ్ (ప్రస్తుత సవూదీ పరిపాలకుల మూలపురుషుడు) కాలంలో కూడా రాజ్య

تِلْكَ إِذًا قِسْمَةٌ ضِيزَىٰ ﴿22﴾

**22** ఈ విభజన మరీ ఘోరమైనది (కదూ!).[18]

إِنْ هِيَ إِلَّا أَسْمَاءٌ سَمَّيْتُمُوهَا أَنتُمْ وَآبَاؤُكُم مَّا أَنزَلَ اللَّهُ بِهَا مِن سُلْطَانٍ ۚ إِن يَتَّبِعُونَ إِلَّا الظَّنَّ وَمَا تَهْوَى الْأَنفُسُ ۖ وَلَقَدْ جَاءَهُم مِّن رَّبِّهِمُ الْهُدَىٰ ﴿23﴾

**23** నిజానికి ఇవన్నీ మీరూ, మీ తాత ముత్తాతలు వాటికి పెట్టుకున్న పేర్లు మాత్రమే. వీటిని గురించి అల్లాహ్ ఏ ప్రమాణమూ పంపలేదు. వీళ్లు కేవలం అంచనాలను, తమ మనో వాంఛలను అనుసరిస్తున్నారు. మరి చూడబోతే వారి ప్రభువు తరఫున వారి వద్దకు ఖచ్చితంగా మార్గదర్శకత్వం వచ్చి ఉన్నది.

أَمْ لِلْإِنسَانِ مَا تَمَنَّىٰ ﴿24﴾

**24** ఏమిటీ, మనిషి కోరుకున్నదల్లా అతనికి ప్రాప్తిస్తుందా?[19]

فَلِلَّهِ الْآخِرَةُ وَالْأُولَىٰ ﴿25﴾

**25** ఇహలోకమూ, పరలోకమూ అల్లాహ్ అధీనంలో మాత్రమే ఉన్నాయి.[20]

وَكَم مِّن مَّلَكٍ فِي السَّمَاوَاتِ لَا تُغْنِي شَفَاعَتُهُمْ شَيْئًا إِلَّا مِن بَعْدِ أَن يَأْذَنَ اللَّهُ لِمَن يَشَاءُ وَيَرْضَىٰ ﴿26﴾

**26** ఆకాశాలలో ఎంతోమంది దైవదూతలు ఉన్నారు. కాని వాళ్ళ సిఫారసు ఏ మాత్రం పనికిరాదు. కాకపోతే అల్లాహ్ తన ఇష్టంతో, తాను కోరిన వారి విషయంలో (సిఫారసు వినడానికి) సమ్మతిస్తే అది వేరే విషయం.[21]

إِنَّ الَّذِينَ لَا يُؤْمِنُونَ بِالْآخِرَةِ لَيُسَمُّونَ الْمَلَائِكَةَ تَسْمِيَةَ الْأُنثَىٰ ﴿27﴾

**27** పరలోకాన్ని విశ్వసించనివారు దైవదూతలకు ఆడవారి పేర్లు పెడతారు.

وَمَا لَهُم بِهِ مِنْ عِلْمٍ ۖ إِن يَتَّبِعُونَ إِلَّا الظَّنَّ ۖ وَإِنَّ الظَّنَّ لَا يُغْنِي مِنَ الْحَقِّ شَيْئًا ﴿28﴾

**28** వాస్తవానికి వారికి ఈ విషయంలో ఎలాంటి పరిజ్ఞానమూ లేదు. వారు ఉత్త అనుమానాలను అనుసరిస్తున్నారు. నిజానికి (మూఢ) అనుమానాలు సత్యం ముందు దేనికీ పనికిరావు.

---

మంతటా కొనసాగింది. ఆయన ఆ రాజ్యంలోని పక్కా సమాధులను, గుమ్మటాలను నేలమట్టంచేసి మహాప్రవక్త (సఅసం) సంప్రదాయాన్ని (సున్నత్‌ను) పునరుజ్జీవింపజేశారు. దైవకృపవల్ల, మహనీయుల నిర్విరామ కృషివల్ల నేడు యావత్తు సవూదీ అరేబియాలో ఎక్కడా పక్కా గోరీలుగానీ, గుమ్మటాలు గానీ లేవు.

17. మక్కా ముష్రిక్కులు దైవదూతలను అల్లాహ్ కుమార్తెలుగా భావించేవారు. ఈ ఆయతులో ఆ మూఢ విశ్వాసాన్ని ఖండించటం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల ఈ అంశం పునరావృతమయింది.

18. **'జీజా'** (ضِيزَىٰ) అంటే అన్యాయపూరితమైనది అని అర్థం.

19. అంటే వారు కోరినదల్లా వారి దేవీదేవతలు వారికి ఇస్తున్నాయా? వారి సిఫారసులను ఆమోదిస్తున్నాయా? ఇది అసంభవం కదా!

20. అంటే – ఆయన కోరినది మాత్రమే నెరవేరుతుంది. ఎందుకంటే సర్వాధికారాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి.

21. అంటే – అల్లాహ్‌కు అత్యంత సన్నిహితులైన దైవదూతలకు సయితం సిఫారసు చేసే అధికారం లేదు. వారు ఒకవేళ సిఫారసు చేసినా అల్లాహ్ కోరిన వారి విషయంలో మాత్రమే ఏదన్నా సిఫారసు చేయగలుగుతారు. మరి యదార్థం ఇదైనపుడు రాతి విగ్రహాలు ఎలా పనికివస్తాయి? వాటిపై కోటి ఆశలు పెట్టుకోవటం ఎంతవరకు సహేతుకం.

**29** కనుక (ఓ ప్రవక్తా!) మా ధ్యానం నుండి తిరిగిపోయి, కేవలం ప్రాపంచిక జీవితాన్ని మాత్రమే ఆశించేవాణ్ణి నువ్వు పట్టించుకోకు.

فَأَعْرِضْ عَن مَّن تَوَلَّىٰ عَن ذِكْرِنَا وَلَمْ يُرِدْ إِلَّا الْحَيَوٰةَ الدُّنْيَا ﴿29﴾

**30** వారికి తెలిసింది అంతవరకే. తన మార్గం నుండి తప్పి పోయిన వాడెవడో నీ ప్రభువుకు బాగా తెలుసు. సన్మార్గం పొందిన వాని గురించి కూడా ఆయనకు బాగా తెలుసు.

ذَٰلِكَ مَبْلَغُهُم مِّنَ الْعِلْمِ ۚ إِنَّ رَبَّكَ هُوَ أَعْلَمُ بِمَن ضَلَّ عَن سَبِيلِهِ وَهُوَ أَعْلَمُ بِمَنِ اهْتَدَىٰ ﴿30﴾

**31** భూమ్యాకాశాలలో ఉన్నదంతా అల్లాహ్‌దే. దుష్కర్మలు చేసే వారికి అల్లాహ్ వారి కర్మలకు తగ్గ ప్రతిఫలం ఇవ్వటానికి, సత్కర్మలు చేసేవారికి వారి కర్మలకు తగ్గట్టుగా పుణ్యఫలం ప్రసాదించటానికి (సన్మార్గ దుర్మార్గాలు ఆయన చేతుల్లోనే ఉన్నాయి).[22]

وَلِلَّهِ مَا فِي السَّمَٰوَٰتِ وَمَا فِي الْأَرْضِ لِيَجْزِيَ الَّذِينَ أَسَٰٓءُوا بِمَا عَمِلُوا وَيَجْزِيَ الَّذِينَ أَحْسَنُوا بِالْحُسْنَى ﴿31﴾

**32** ఎవరయితే పెద్ద పాపాలకు దూరంగా ఉంటారో, చిన్న చిన్న తప్పులు మినహా[23] నీతిబాహ్యతను కూడా విడనాడతారో[24] (వారి పాలిట) నిశ్చయంగా నీ ప్రభువు ఎంతో ఉదారంగా క్షమించే

الَّذِينَ يَجْتَنِبُونَ كَبَٰٓئِرَ الْإِثْمِ وَالْفَوَٰحِشَ إِلَّا اللَّمَمَ ۚ إِنَّ رَبَّكَ وَٰسِعُ الْمَغْفِرَةِ ۚ هُوَ أَعْلَمُ بِكُمْ

అదలా వుంచితే ముష్రిక్కుల కోసం సిఫారసు చేసే అనుమతిని అల్లాహ్ ఎక్కడిస్తాడని? ఆయన సన్నిధిలో అత్యంత ఘోర విషయం షిర్కే కదా!

22. అంటే–సన్మార్గమైనా, అపమార్గమైనా ఆయన చేతుల్లోనే ఉంది. ఆయన తాను కోరిన వారికి సన్మార్గం వొసగుతాడు. తాను కోరిన వారిని అపమార్గాన వదిలేస్తాడు. సన్మార్గగాములకు వారి సత్కర్మల ప్రతిఫలం ఇవ్వటానికి, దుర్మార్గులకు వారి దురాగతాలకు తగ్గ ప్రతిఫలం ఇవ్వటానికి ఆయన ఈ 'వ్యవస్థ'ను ఏర్పరచాడు. (ఫత్‌హుల్ ఖదీర్).

23. **'లమమ్'** అంటే తక్కువ, అల్పం, చిన్నపాటి అని అర్థం. ఏదైనా ఒక పనిని ఒకసారి చేసి వదిలెయ్యటం, మాటిమాటికీ దాని జోలికి పోకుండా ఉండటం, మనసులో మాత్రమే తలపోయటం – ఇవన్నీ 'ల్లమమ్' అనబడతాయి. (ఫత్‌హుల్ ఖదీర్). ఈ క్రమంలో 'లమమ్' అన్న పదం 'చిన్న చిన్న పాపాలు' అన్న అర్థంలో ఉపయోగించబడింది. దీని మతలబు ఏమిటంటే పెద్ద పెద్ద పాపాలు చేయాలన్న ఆలోచన మనసులో వచ్చినప్పటికీ దాన్ని ఆలోచనల వరకే పరిమితం చేయటం, క్రియాత్మకంగా పెద్ద పాపాలకు ఒడిగట్టకుండా ఉండటం, ఏదైనా ఒక పాపకార్యం ఒకటి రెండుసార్లు జరిగిపోయాక ఇక శాశ్వతంగా దానికి స్వస్తి పలకటం లాంటివి చిన్న చిన్న పొరపాట్లుగా పరిగణించబడతాయి. మనిషి పెద్ద పాపాల జోలికిపోకుండా ఉన్నట్లయితే వాటి పుణ్యమా అని దేవుడు చిన్న చిన్న పొరపాట్లను కూడా మన్నిస్తాడు.

24. ఇంతకీ **'పెద్దపాపాలు'** ఏవి? ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఏ పాపాలకు ఒడిగట్టడం వల్ల నరకయాతన తథ్యమని హెచ్చరించబడిందో, మరే పనులను ఖుర్‌ఆన్ హదీసులు తీవ్రంగా ఖండిస్తున్నాయో అవన్నీ పెద్ద పాపాల జాబితాలోనికి వస్తాయని చాలా మంది పండితులు భావిస్తున్నారు. చిన్న చిన్న పాపాలపై మనిషి సిగ్గుపడకుండా వాటిని యధేచ్ఛగా చేస్తూపోతే అవి పెద్ద పాపాలుగా పరిణమిస్తాయని కూడా విద్వాంసులు చెప్పారు. అలాంటి పాపాలను కొందరు విద్వాంసులు క్రోడీకరించారు. ఉదా : ఇమామ్ జహబీగారి 'కితాబుల్ కబాయిర్', అజ్జవాజిర్ మొదలగు గ్రంథాలు.

ఇకపోతే నీతిబాహ్యమైన చేష్టలు; ఉదాహరణకు : వ్యభిచారం, స్వలింగ సంపర్కం లాంటివి ఈ కోవలోకి వస్తాయి. ఏ సిగ్గుమాలిన పనులకు షరీయతు శిక్షల్ని విధిస్తుందో అవన్నీ 'నీతిబాహ్యత' క్రిందికి వస్తాయని మరి కొంతమంది

إِذْ أَنشَأَكُم مِّنَ الْأَرْضِ وَإِذْ أَنتُمْ أَجِنَّةٌ فِي بُطُونِ أُمَّهَاتِكُمْ ۖ فَلَا تُزَكُّوا أَنفُسَكُمْ ۖ هُوَ أَعْلَمُ بِمَنِ اتَّقَىٰ ﴿٣٢﴾

వాడు. ఆయన మిమ్మల్ని భూమి (మట్టి) నుండి సృజించినప్పుడూ, మీరు మీ మాతృగర్భాలలో శిశువులుగా ఉన్నప్పుడు[25] కూడా మీ గురించి ఆయనకు బాగా ఎరుకే. కాబట్టి మీ పారిశుద్ధ్యాన్ని గురించి మీరు (గొప్పలు) చెప్పుకోకండి.[26] దైవానికి భయపడే వాడెవడో ఆయనకు బాగా తెలుసు.

أَفَرَأَيْتَ الَّذِي تَوَلَّىٰ ﴿٣٣﴾

**33** సరేగాని (ఓ ప్రవక్తా! దైవమార్గం నుండి) ముఖం త్రిప్పు కున్నవాణ్ణి నువ్వు గమనించావా?

وَأَعْطَىٰ قَلِيلًا وَأَكْدَىٰ ﴿٣٤﴾

**34** అతడు కాస్తంత ఇచ్చాడు. తర్వాత ఆపేశాడు.[27]

أَعِندَهُ عِلْمُ الْغَيْبِ فَهُوَ يَرَىٰ ﴿٣٥﴾

**35** వాడి దగ్గర రహస్య జ్ఞానంగాని ఉందా? వాడు అన్నీ చూస్తూ ఉన్నాడా?[28]

---

భావిస్తున్నారు. నేడు లోకంలో నీతిబాహ్యత సర్వసామాన్యం అయిపోయింది. నీతిబాహ్యతే ప్రస్తుతం 'నాగరికత'గా వర్ధిల్లుతోంది. చివరికి ముస్లింలు సయితం ఈ నీతిమాలిన నాగరికతను ఆశ్రయిస్తున్నారు. నేడు ఇంటింటా టీవీలు, వి.సి.ఆర్‌లు వచ్చేశాయి. స్త్రీలు పరదా ఆజ్ఞలను ఖాతరు చెయ్యకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నారు. కో ఎద్యుకేషన్, స్త్రీ పురుషుల మిశ్రమ సభలు సమావేశాలు, ఆఫీసుల్లో స్త్రీ పురుషుల విచ్చలవిడి కలయిక ఎన్నో అనర్థాలకు కారణభూతమవుతోంది. నిజానికి ఇవన్నీ 'నీతిబాహ్యత'కు వారధులే. చిన్న చిన్న పొరపాట్లను మినహాయించి పెద్ద పాపాలకు, నీతిబాహ్యతకు దూరంగా ఉండేవారికి దేవుని క్షమాభిక్ష లభిస్తుందని ఈ ఆయతులో చెప్పబడిందేగాని నీతిబాహ్యతకు మార్గం తెరిచే వారికి క్షమాభిక్ష లభిస్తుందని అనబడలేదు.

25. **'అజిన్నతున్'** అంటే గర్భస్థ శిశువులన్నమాట! 'జనీన్' దీని ఏకవచనం. జనీన్ అంటే కనిపించనిది. ఈ శిశువులు ప్రజల దృష్టికి రారు. కాని వారి పరిస్థితి గురించి దైవానికి ఎరుకే.

26. మీరు మీ మాతృగర్భాలలో ఉన్నప్పుడు ఏ పరిస్థితుల్ని ఎదుర్కొన్నారో, ఏ ఏ దశలను ఎలా అధిగమించారో ఎవరికీ తెలీకపోయినా దైవానికి మాత్రం తెలుసుకదా! మరలాంటప్పుడు మీరు మీ పవిత్రతను గురించి కోతలు కోయవలసిన అవసరం ఏముంది? అనవసరంగా మీరు మీ బడాయిని చాటుకోకండి. మీరు ప్రదర్శనా బుద్ధికి దూరంగా ఉండాలన్నదే దేవుని అభిలాష.

27. అంటే–కొద్దిగా దానం చేసి తన చేతిని కట్టిపడేసుకున్నాడు. లేదా కాస్తోకూస్తో విధేయత కనబరచి ఆ తరువాత వెనుకంజ వేశాడు. అరబీలో **'అక్దా'** అనబడింది. అక్దా అంటే అసలు అర్థం నేలను తవ్వుతూ తవ్వుతూ కఠినమైన రాయి వచ్చేసరికి తవ్వలేక మానెయ్యటం. ఎవరికయినా ఎంతో కొంత ఇచ్చి – పూర్తిగా ఇవ్వకుండా మధ్య నుంచే మానేసే వారి కొరకు ఈ పదం వాడబడింది. ఏదైనా మంచి పనిని ఉత్సాహంతో మొదలెట్టి దాన్ని పూర్తి చెయ్యకుండా వదిలేసే ఆరంభశూరులకు కూడా ఈ పదం వర్తిస్తుంది.

28. ఏమిటి, దైవమార్గంలో తాను నిరంతరం దానధర్మాలు చేస్తూపోతే తన సంపద తరిగి పోతుందని వాడనుకున్నాడా? దానికి సంబంధించిన రహస్య జ్ఞానంగాని అతని వద్ద ఉన్నదా? ముమ్మాటికీ లేదు. అసలు విషయం ఏమిటంటే అతని మనసు పేరాశకు నిలయమై పోయింది. పిసినారితనం అతన్ని ఆవహించింది. ప్రాపంచిక వ్యామోహం, పరలోకం పట్ల నమ్మక రాహిత్యం మూలంగా, దైవవిధేయత పట్ల వైముఖ్య ధోరణి కారణంగా వాడు ప్రస్తుతం నిందార్హుడుగా మారాడు.

36 ఏమిటీ, మూసా గ్రంథ ప్రతుల్లో గల విషయం గురించి వాడికి సమాచారం ఇవ్వబడలేదా?

أَمْ لَمْ يُنَبَّأْ بِمَا فِي صُحُفِ مُوسَىٰ (36)

37 (అలాగే) విశ్వాసపాత్రుడైన ఇబ్రాహీము గ్రంథ ప్రతుల్లోని విషయం గురించి.

وَإِبْرَاهِيمَ الَّذِي وَفَّىٰ (37)

38 (ఆ విషయం ఏమిటంటే) బరువును మోసేవాడెవడూ ఇంకొకరి బరువును మోయడు.

أَلَّا تَزِرُ وَازِرَةٌ وِزْرَ أُخْرَىٰ (38)

39 ప్రతి మనిషీ దేనికోసం పాటుపడతాడో అది మాత్రమే అతనికి లభిస్తుంది.[29]

وَأَن لَّيْسَ لِلْإِنسَانِ إِلَّا مَا سَعَىٰ (39)

40 నిశ్చయంగా అతని కృషి త్వరలోనే చూడబడుతుంది.[30]

وَأَنَّ سَعْيَهُ سَوْفَ يُرَىٰ (40)

29. ఏ విధంగా ఒక వ్యక్తి ఇతరుల పాపాలకు బాధ్యుడు కాడో, అదేవిధంగా ఇతరుల పుణ్యఫలాలు కూడా అతనికి ఇవ్వ బడవు. అతను చేసుకున్న సత్కర్మల మేరకే పరలోకంలో అతనికి పుణ్యఫలం వొసగబడుతుంది (ఈ విషయం పరలోకానికి మాత్రమే వర్తిస్తుంది, ప్రపంచానికి కాదు. కొంతమంది సోషలిస్టు భావాలుగలవాళ్లు ఈ ఆయతును ప్రాపంచికమైన అర్థంలో తీసుకొని, నేరుగా శ్రమించనటువంటి జమీందారీ వ్యవస్థని, బాడుగల వసూళ్లను అధర్మంగా ఖరారు చేశారు. కాని వారి ఈ వాదన సరైనది కాదు). అయితే ఈ ఆయతు ఆధారంగా మృతునికి పుణ్యఫలం చేకూర్చే ఉద్దేశంతో నిర్వహించబడే ప్రత్యేక ఖుర్ఆన్ పారాయణా సదనాల పుణ్యం మృతునికి చేరదని విద్వాంసులు కొందరు చెబుతున్నారు. వారి ఈ వాదన సరైనదే. ఎందుకంటే ఇది మృతుని కృషిగానీ, అతని సత్కర్మగానీ కాదు. అందుకే మహనీయ ముహమ్మదు (సఅసం) వారు మృతుని పేరిట ఖుర్ఆన్ పఠనా సదస్సులను పెట్టమని తన అనుచరులకు సూచనాప్రాయంగా కూడా చెప్పలేదు. 'మూలం' ద్వారా కూడా ఆ మేరకు ఎలాంటి ఆధారం లభించదు. అలాగే ప్రవక్త ప్రియసహచరుల (రజి) ద్వారా కూడా దీనికి సంబంధించిన ఉదాహరణలేమీ కనిపించవు. ఒకవేళ ఈ పని 'పుణ్యప్రదం' అయివుంటే ప్రవక్త ప్రియసహచరులు (రజి) దాన్ని తప్పకుండా చేసి ఉండేవారు.

అదలా వుంచితే ఆరాధనలకు, సామీప్యానికి సంబంధించిన ఏదైనా ఆచరణ చేయాలంటే దానికి ఏదైనా 'మూలం' అవశ్యం. ఈ విషయంలో కాకిలెక్కలు, ఊహాగానాలు పనికిరావు. కాకపోతే దుఆ (వేడుకోలు), దానధర్మాల పుణ్యం మాత్రం మృతులకు చేరుతుంది. ఈ విషయంలో విద్వాంసుల మధ్య కూడా ఏకాభిప్రాయం ఉంది. ఎందుకంటే దీన్ని సమర్థించే 'మూలం' ఉంది. మనిషి మరణించిన తరువాత కూడా అతనికి సంబంధించిన మూడు విషయాలు కొనసాగుతుంటాయన్న హదీసు దీనికి మూలాధారంగా ఉన్నది. నిజానికి అవి కూడా ఆ మృతునికి సంబంధించిన కర్మలే. అతడు చనిపోయిన తరువాత కూడా ఏదో ఒకవిధంగా అవి ఎడతెగకుండా సాగుతుంటాయి. మనిషి సంతానాన్ని మహాప్రవక్త (స) అతని సంపాదనగా ఖరారు చేశారు (సుననె నసాయి – కితాబుల్ బుయూ). ఇక 'సదఖయె జారియా' (ఎడతెగని దానం) కూడా – వక్ఫ్ మాదిరిగా – మనిషి వదలివెళ్ళిన సదాచరణే. "వారు ముందు చేసి పంపినదీ, వెనుక విడిచి వెళ్ళినదీ మేము వ్రాస్తుంటాము" (యాసీన్ – 12). అలాగే మనిషి ప్రజల మధ్య వదలి వెళ్ళిన జ్ఞానాన్ని ప్రజలు గనక అనుసరించి ప్రయోజనం పొందుతూ ఉంటే అది కూడా అతని 'సంపాదన'గానే పరిగణించబడుతుంది. "ఎవరయినా సన్మార్గం వైపుకు పిలుపు ఇస్తే, అతని పిలుపు మేరకు భావితరాలు దాన్ని అనుసరిస్తే, అలా అనుసరించే వారి పుణ్యఫలం కూడా ఆ వ్యక్తికి చేరుతూ ఉంటుందన్న హదీసు (సుననె అబూదావూద్ – కితాబుస్సున్న) ఈ ఖుర్ఆన్ వచనానికి విరుద్ధం కాదు (ఇబ్నె కసీర్).

30. అంటే – అతను ప్రపంచంలో మంచి చేసినా – చెడు చేసినా, రహస్యంగా చేసినా – బహిరంగంగా చేసినా ప్రళయ దినాన అది అతని ముందుకు తీసుకురాబడుతుంది. దానికి తగ్గ ప్రతిఫలం అతనికి ఇవ్వబడుతుంది.

| | |
|---|---|
| 41 మరి అతనికి సంపూర్ణ ప్రతిఫలం వొసగబడుతుంది. | ثُمَّ يُجْزٰىهُ الْجَزَآءَ الْاَوْفٰى ﴿41﴾ |
| 42 కడకు అందరూ పోయి చేరవలసింది నీ ప్రభువు వద్దకే. | وَاَنَّ اِلٰى رَبِّكَ الْمُنْتَهٰى ﴿42﴾ |
| 43 మరి ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడిపిస్తున్నాడు. | وَاَنَّهٗ هُوَ اَضْحَكَ وَاَبْكٰى ﴿43﴾ |
| 44 మరి ఆయనే చంపుతున్నాడు, ఆయనే బ్రతికిస్తున్నాడు. | وَاَنَّهٗ هُوَ اَمَاتَ وَاَحْيَا ﴿44﴾ |
| 45 మరి ఆయనే జంటలను – అంటే ఆడ మగలను – సృజించాడు. | وَاَنَّهٗ خَلَقَ الزَّوْجَيْنِ الذَّكَرَ وَالْاُنْثٰى ﴿45﴾ |
| 46 (గర్భంలో) కార్చబడినప్పటి వీర్యపు బిందువుతో! | مِنْ نُّطْفَةٍ اِذَا تُمْنٰى ﴿46﴾ |
| 47 మలిసారి బ్రతికించి లేపే బాధ్యత కూడా ఆయనదే. | وَاَنَّ عَلَيْهِ النَّشْاَةَ الْاُخْرٰى ﴿47﴾ |
| 48 మరి ఆయనే ధనవంతులుగా చేస్తున్నాడు. మూలధనాన్ని కూడా ప్రసాదిస్తున్నాడు.[31] | وَاَنَّهٗ هُوَ اَغْنٰى وَاَقْنٰى ﴿48﴾ |
| 49 షీరా (నక్షత్రము) కు ప్రభువు కూడా ఆయనే.[32] | وَاَنَّهٗ هُوَ رَبُّ الشِّعْرٰى ﴿49﴾ |
| 50 ప్రాచీన ఆదు వారిని అంతమొందించింది కూడా ఆయనే.[33] | وَاَنَّهٗۤ اَهْلَكَ عَادَا ۨالْاُوْلٰى ﴿50﴾ |
| 51 సమూదు వారిని కూడా – ఒక్కర్నీ మిగల్చకుండా (తుద ముట్టించినవాడూ ఆయనే)! | وَثَمُوْدَا۠ فَمَاۤ اَبْقٰى ﴿51﴾ |
| 52 అంతకు మునుపు నూహు జాతివారిని (ఆయనే తుడిచి పెట్టాడు). నిశ్చయంగా వారు పరమ దుర్మార్గులు, తలబిరుసులు. | وَقَوْمَ نُوْحٍ مِّنْ قَبْلُ ؕ اِنَّهُمْ كَانُوْا هُمْ اَظْلَمَ وَاَطْغٰى ﴿52﴾ |
| 53 తలక్రిందులుగా చేయబడిన బస్తీలను ఆయనే అమాంతం ఎత్తి పడవేశాడు.[34] | وَالْمُؤْتَفِكَةَ اَهْوٰى ﴿53﴾ |

31. అంటే – కొందరికి ఆయన కావలసినంత సంపదను ఇచ్చి ఇతరులపై ఆధారపడకుండా చేస్తాడు. వారి జీవనావసరాలు తీరటంతోపాటు వారి దగ్గర ధనధాన్యాలు మిగిలిపోతాయి.

32. ఆ మాటకొస్తే సమస్తానికి యజమాని ఆయనే. కాకపోతే కొన్ని అరబ్బు తెగలు 'షీరా' అనే ఒక ప్రకాశమానమైన నక్షత్రాన్ని పూజిస్తూ ఉన్నందువల్ల – వారి మూఢనమ్మకాన్ని త్రుంచటానికి – ఆ నక్షత్రానికి ప్రభువు అల్లాహ్‌యే అని నొక్కి పలకటం జరిగింది.

33. ఆదు జాతి వారిని ప్రాచీనులు లేక ప్రథములు అని అనటంలోని ఔచిత్యమేమిటంటే వారు సమూదు జాతికి పూర్వం గతించారు. నూహ్ జాతివారి తరువాత దైవాగ్రహానికి గురైన అతి పెద్ద జాతి ఇదే.
మరికొంతమంది అభిప్రాయం ప్రకారం 'ఆదు' పేరుతో రెండు జాతులు గడిచాయి. ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన వారు మొదటివారు. వీళ్లు ఉధృతమైన పెనుగాలుల ద్వారా అంతమొందించబడ్డారు. రెండవ ఆదు జాతివారు కాల చక్రపు ఎగుళ్లు దిగుళ్లతో వివిధ పేర్లతో – చెల్లాచెదురై – మనుగడ సాగించారు.

54 మరి ఆ బస్తీలపై క్రమ్ముకున్నదేదో వచ్చి క్రమ్ముకుంది.[35] فَغَشّٰىهَا مَا غَشّٰى ﴿54﴾

55 కనుక (ఓ మనిషీ!) నువ్వు నీ ప్రభువు అనుగ్రహాలలో దేనిపై గొడవపడగలవు?[36] فَبِاَيِّ اٰلَاۤءِ رَبِّكَ تَتَمَارٰى ﴿55﴾

56 ఈయన పూర్వం హెచ్చరించిన ప్రవక్తల మాదిరిగానే హెచ్చరించే ప్రవక్త. هٰذَا نَذِيْرٌ مِّنَ النُّذُرِ الْاُوْلٰى ﴿56﴾

57 రానున్న గడియ దగ్గరపడింది. اَزِفَتِ الْاٰزِفَةُ ﴿57﴾

58 అల్లాహ్ తప్ప దాన్ని (ఆ నిర్ణీతసమయాన) స్పష్టంగా చూపించే వాడెవడూ లేదు. لَيْسَ لَهَا مِنْ دُوْنِ اللّٰهِ كَاشِفَةٌ ﴿58﴾

59 ఏమిటీ, మీరు ఈ విషయంపై ఆశ్చర్యపోతున్నారా?[37] اَفَمِنْ هٰذَا الْحَدِيْثِ تَعْجَبُوْنَ ﴿59﴾

60 నవ్విపోతున్నారా? ఏడుపు రావటంలేదా? وَتَضْحَكُوْنَ وَلَا تَبْكُوْنَ ﴿60﴾

61 పైపెచ్చు ఆటపాటల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారు. وَاَنْتُمْ سٰمِدُوْنَ ﴿61﴾

62 అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడండి. (ఆయన్నే) ఆరాధించండి.[38] فَاسْجُدُوْا لِلّٰهِ وَاعْبُدُوْا ﴿62﴾

34. తలక్రిందులుగా చేయబడిన బస్తీలు (పురములు) అంటే హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) జనులన్నమాట. వారి పాపిష్టి పని మూలంగా వారి బస్తీలను వారి మీదే ఎత్తి పడవెయ్యటం జరిగింది.

35. అంటే – తర్వాత వారిపై రాళ్ల వాన కురిసింది.

36. ఈ కల్లోల జనకులను, తిరుగుబాటుదార్లను అంతమొందించటం కూడా ఒక విధంగా దైవానుగ్రహమే. ఈ అనుగ్రహాలను మనిషి ఎలా కాదనగలడు? వాటిని ఎలా అనుమానిస్తాడు?? వాటిపై ఎలా దెబ్బలాడతాడు???

37. ఇక్కడ **'విషయం'** (హదీస్) అంటే దివ్య ఖుర్ఆన్ అని అర్థం. అంటే మీరు ఈ ఖుర్ఆన్‌పై ఆశ్చర్యం చెందుతున్నారా? ఇందలి విషయాన్ని ఎగతాళి చేస్తున్నారా? వాస్తవానికి ఇందులో ఆశ్చర్యపోయే విషయంగానీ, వేళాకోళపు మాటగాని ఏదీ లేదు.

38. ముష్రిక్కులకు, దైవధిక్కారులకు హెచ్చరికగా వచ్చిన ఆదేశమిది. వారు దివ్య ఖుర్ఆన్ ఆజ్ఞలముందు తల ఒగ్గాల్సిందిపోయి, దాన్ని పరిహసించే విధంగా ప్రవర్తిస్తున్నారు. మా ప్రవక్త చేసే హితబోధనలను వారు లెక్కచేయటం లేదు. కాబట్టి ఓ ముస్లింలారా! మీరు మాత్రం అల్లాహ్ సన్నిధిలో మోకరిల్లండి. ఆయన్ని సేవించి, ఆయన ఆజ్ఞలను శిరసావహించి ఖుర్ఆన్ పట్ల గల గౌరవప్రపత్తులను చాటిచెప్పండి. ఈ ఆజ్ఞ రాగానే దైవప్రవక్త (స) మరియు ఆయన ప్రియసహచరులు దైవసన్నిధిలో 'సజ్దా' చేశారు. ఆ సమయంలో ఆ సమావేశంలో ఉన్న అవిశ్వాసులు సయితం సాష్టాంగపడిపోయారని హదీసుల ద్వారా తెలుస్తోంది.

54వ సూరా

# అల్ ఖమర్

## చంద్రుడు

అవతరణ మక్కాలో

ఆయతులు 55

### పరిచయం

ప్రళయ ఘడియ రావడం గురించి, హెచ్చరికలను తిరస్కరించడం గురించి, మనోకాంక్షలను అనుసరించడం గురించి ఈ సూరా ముఖ్యంగా నొక్కి చెప్పింది. ఈ సూరా మొదటి ఆయతులో చంద్రుని గురించి ప్రస్తావన ఉంది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవక్త పదవికి నిదర్శనంగా చంద్రుడు రెండుముక్కలుగా చీలిపోయాడు. అవిశ్వాసులు తమ కళ్లారా ఈ నిదర్శనం చూసుకోవాలని ఈ మహత్యాన్ని ప్రదర్శించడం జరిగింది. చంద్రుడు చీలిపోవడాన్ని ప్రవక్త ముహమ్మద్ (సఅసం), ఆయన అనుచరులు మాత్రమే కాదు అవిశ్వాసులు కూడా చూసారు. ఈ మహత్యం ద్వారా వాస్తవాన్ని నిరూపించినప్పటికీ, అవిశ్వాసులు సత్యాన్ని తిరస్కరించడం, దైవవాణిని నిరాకరించడం కొనసాగించారు. చంద్రుడు చీలిపోవడమన్నది నిజానికి ఒక ప్రస్ఫుటమైన హెచ్చరిక. ప్రళయ ఘడియ సమీపిస్తున్నదనీ, మరణించిన వారిని మళ్ళీ లేపడం అనివార్యమని చాటిచెప్పే హెచ్చరిక ఇది. ఈ సందర్భంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని ఈ సూరాలో ప్రస్తావించడం జరిగింది.

శంఖం ఊదబడినప్పుడు, ఆ పిలుపునకు మానవులందరూ జవాబిస్తారు. తమ తమ సమాధుల నుంచి చెల్లాచెదరైన మిడతల దండులా, బిత్తరచూపులతో, అయోమయంగా పరుగెత్తుతూ వస్తారు. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి. భయంతో కళ్ళెత్తలేకుండా ఉంటారు. ఈ సూరాలో దుర్మార్గులు, దుష్టులైన వారి గురించి ప్రస్తావన కూడా వచ్చింది. అహంకారంతో సత్యాన్ని తిరస్కరించిన వారి గురించి చెప్పడం జరిగింది. లూత్ (అస) జాతి ప్రజలు, ఆద్, సమూద్ జాతుల ప్రజలు, నూహ్(అస) జాతి ప్రజలు, ఫిర్ఔను అతడి అనుచరులు – వీరందరూ సత్యాన్ని తిరస్కరించారు. హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. తమ అవిశ్వాసాన్ని, దుర్మార్గాన్ని కొనసాగించారు. ఫలితంగా అందరూ నాశనమయ్యారు.

దివ్యఖుర్ఆన్‌ను ప్రజలు అర్థం చేసుకోవడానికి, ఆచరించడానికి సులభతరంగా చేయడం జరిగిందని, దీనిని అనుసరించేవారు, హితబోధ గ్రహించేవారు ఎవరున్నారని ఈ సూరా ప్రశ్నించింది. తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని ప్రస్తావిస్తూ అవిశ్వాసులు దుర్మార్గంలో కూరుకుపోయారని పేర్కొన్నది. వారిని బోర్లా నరకాగ్నివైపునకు లాక్కెళ్ళడం జరుగుతుంది. దైవభీతి పరులు స్వర్గవనాల శాశ్వత ఆనందాన్ని పొందుతారు.

## అల్ ఖమర్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

1 ప్రళయ ఘడియ దగ్గరపడింది.[2] చంద్రుడు చీలిపోయాడు.[3]

2 ఒకవేళ వీళ్లు ఏదైనా మహిమను చూసినా, దాన్నుండి ముఖం త్రిప్పుకుంటారు. "పూర్వం నుండీ జరుగుతూ వస్తున్న మాయా జాలమే కదా ఇది!"[4] అనంటారు.

3 వీళ్లు ధిక్కరించారు. తమ మనోవాంఛల వెనుకపోయారు. అయితే ప్రతి విషయానికీ ఒక సమయం నిర్ధారితమై ఉంది.[5]

4 నిశ్చయంగా వారి వద్దకు ఎన్నో వార్తలొచ్చాయి.[6] వాటిలో మందలింపుతో కూడిన హితోపదేశం ఉంది.[7]

## سُورَةُ القَمَرِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

اقْتَرَبَتِ السَّاعَةُ وَانشَقَّ الْقَمَرُ ①

وَإِن يَرَوْا آيَةً يُعْرِضُوا وَيَقُولُوا سِحْرٌ مُّسْتَمِرٌّ ②

وَكَذَّبُوا وَاتَّبَعُوا أَهْوَاءَهُمْ وَكُلُّ أَمْرٍ مُّسْتَقِرٌّ ③

وَلَقَدْ جَاءَهُم مِّنَ الْأَنبَاءِ مَا فِيهِ مُزْدَجَرٌ ④

---

1. దైవప్రవక్త (సఅసం) పండుగ నమాజుల్లో పఠించే సూరాలలో ఇది కూడా ఒకటి.
2. గడచిపోయిన కాలం గడచిపోయినట్లే. మిగిలివున్న కాలం బహుస్వల్పం. రానున్న ప్రతి వస్తువు సమీపంలోనే ఉంది. కాలం ఎవరి కోసమూ ఆగదు. క్షణం క్షణం అది ముందుకు సాగిపోతూనే ఉంటుంది. అందుకే అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు తన గురించి చెప్పుకుంటూ ఇలా అన్నారు : "నా ఉనికి ప్రళయానికి అంటిపెట్టుకుని ఉంది. అంటే నాకూ – ప్రళయానికి మధ్య మరే ప్రవక్తా రాడు."
3. మక్కావాసుల డిమాండుపై దేవుడు చూపిన మహిమ ఇది. చంద్రుడు రెండుగా చీలిపోయాడు. ఆ రెండు భాగాల మధ్యన 'హిరా' పర్వతం ఉండటాన్ని మక్కావాసులు ప్రత్యక్షంగా తిలకించారు. అంటే చంద్రుని ఒక ముక్క పర్వతానికి అటుప్రక్కన, మరో ముక్క పర్వతానికి ఇటు ప్రక్కన ఉన్నట్లు కానవచ్చింది (సహీహ్ బుఖారీ – అన్సార్ల మహిమోన్నతుల ప్రకరణం; సహీహ్ ముస్లిం – ప్రళయ వివరణ ప్రకరణం). ముస్లిం సమాజపు తొలివారు (సలఫ్), తుదివారు (ఖలఫ్)లో అత్యధికమంది ఇదే దృక్పథాన్ని కల్గి ఉన్నారు (ఫత్హుల్ ఖదీర్). ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా అంటున్నారు: "చంద్రుడు రెండుగా చీలిపోయిన సంఘటన మహాప్రవక్త (స) జీవిత కాలంలోనే జరిగింది, ఇది ఆయన (సఅసం) గారి స్పష్టమైన మహిమలలో ఒకటి. దీనిపై ముస్లిం విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. ప్రామాణికమైన, ముతవాతిర్ ఆధారాల ద్వారా సేకరించబడిన హదీసులు కూడా దీన్ని రూఢీ చేస్తున్నాయి."
4. అంటే మక్కావాసులైన ఖురైషులన్నమాట! వారు దాన్ని విశ్వసించలేదు సరికదా, 'అదొక ఇంద్రజాలం' అని తేలిగ్గా కొట్టిపారేసి, తమ తిరస్కార వైఖరిపై పాతుకుపోయారు.
5. మక్కావాసుల ధిక్కారవైఖరిని, మనోవాంఛల దాస్యాన్ని ఖండిస్తూ చెప్పబడిన మాట ఇది : ప్రతి విషయం వెనుక ఒక ఉద్దేశ్యం, లక్ష్యం ఉంటుంది. అది మంచిదైనా, చెడ్డదైనా దానికంటూ ఒక పర్యవసానం ఉంటుంది. మంచి పని పరిణామం మంచిగానే ఉంటుంది. చెడు చెడుగానే ఉంటుంది. దైవం గనక తలచుకుంటే ఒక్కోసారి ప్రపంచంలో కూడా పర్యవసానం ప్రస్ఫుటం కావచ్చు. ఇక పరలోకంలోనయితే ఫలితం ఎలాగూ తేలుతుంది.
6. అంటే – ధిక్కార వైఖరిని అవలంబించిన పూర్వపు జాతుల వార్తలు.
7. ఆ వార్తలలో ఎంతో నీతి ఉంది. గుణపాఠ సూచనలు ఉన్నాయి. హెచ్చరికలున్నాయి. వాటి ద్వారా గుణపాఠం నేర్చుకోదలచినవారు – షిర్కును, పాపకార్యాలను విడనాడి – గుణపాఠం నేర్చుకోవచ్చు.

5 సంపూర్ణ వివేకం[8] ఉంది. కాని ఆ హెచ్చరికలు కూడా వారికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు.[9]

حِكْمَةٌۢ بَالِغَةٌ فَمَا تُغْنِ النُّذُرُ ⑤

6 కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు వారిని వదలిపెట్టు. పిలిచేవాడు భరించశక్యం కాని విషయం వైపు పిలిచిన నాడు,[10]

فَتَوَلَّ عَنْهُمْ يَوْمَ يَدْعُ الدَّاعِ إِلَىٰ شَيْءٍ نُّكُرٍ ⑥

7 వారు కళ్లు వంచుకుని గోరీల నుండి లేచి చెల్లాచెదురైన మిడుతల దండు వలే వస్తారు.[11]

خُشَّعًا أَبْصَارُهُمْ يَخْرُجُونَ مِنَ الْأَجْدَاثِ كَأَنَّهُمْ جَرَادٌ مُّنتَشِرٌ ⑦

8 తమను పిలిచేవాని వైపు పరుగెత్తుకుంటూ వస్తారు.[12] అప్పుడు అవిశ్వాసులు "ఇది చాలా గడ్డు రోజు" అనంటారు.

مُّهْطِعِينَ إِلَى الدَّاعِ ۖ يَقُولُ الْكَافِرُونَ هَٰذَا يَوْمٌ عَسِرٌ ⑧

9 వారికి పూర్వం నూహ్ జాతి వారు కూడా (తమ ప్రవక్తను) ధిక్కరించారు. వారు మా దాసుణ్ణి త్రోసిపుచ్చి, అతణ్ణి "పిచ్చోడ" న్నారు. అతన్ని విదిలించారు.[13]

كَذَّبَتْ قَبْلَهُمْ قَوْمُ نُوحٍ فَكَذَّبُوا عَبْدَنَا وَقَالُوا مَجْنُونٌ وَازْدُجِرَ ⑨

10 అప్పుడతను, "నేను అశక్తుణ్ణి అయిపోయాను. కాబట్టి నీవు నాకు సహాయం చెయ్యి" అంటూ తన ప్రభువును మొర పెట్టు కున్నాడు.

فَدَعَا رَبَّهُ أَنِّي مَغْلُوبٌ فَانتَصِرْ ⑩

8. అంటే అది వినాశం నుండి తప్పించే వివేక వచనం కావచ్చు లేదా ఈ ఖుర్ఆన్ సంపూర్ణ వివేకంతో కూడుకున్నది అన్నది దాని అర్థం కావచ్చు. లేక అల్లాహ్ ఎవరికి సన్మార్గం ప్రసాదించినా, మరెవరిని అపమార్గానికి లోనుచేసినా అందులో వివేకంతో కూడిన ఏదో లీల ఉంటుంది, అది ఆయనకు మాత్రమే తెలుసు అన్న అర్థం కూడా కావచ్చు.

9. దేవుడు ఎవరి నొసట దౌర్భాగ్యాన్ని రాసిపెట్టేశాడో, మరెవరి హృదయాలకు సీలు వేసేశాడో వారికి దైవప్రవక్త హెచ్చరికలు ప్రయోజనం ఎలా చేకూరుస్తాయి? "నీవు వారిని హెచ్చరించినా, హెచ్చరించకపోయినా ఒక్కటే" (యాసీన్-10) అన్న సూత్రం వారికి వర్తిస్తుంది. ఇంచుమించు ఇదే భావం గల మరో వచనం ఇది: "సత్యానికి చేర్చేవాదన అల్లాహ్‌తోనే ఉన్నది. అల్లాహ్ గనక తలచి ఉంటే నిస్సందేహంగా ఆయన మీ అందరికీ సన్మార్గం చూపి ఉండేవాడు" అని వారితో అను. (అల్ అన్ఆమ్-149)

10. ఆ రోజును కాస్త నెమరువేసుకోండి. అది అత్యంత భయంకరమైన రోజు. మహ్షర్ మైదానంలో సమావేశమై లెక్కలు తేల్చబడే రోజు. **'నుకుర్'** అంటే అత్యంత భయంకరమైనది, భరించశక్యం కానిది అని అర్థం.

11. వారు గోరీల నుండి బయటికి వచ్చి తమ లెక్కల కోసం, జమాబందీల కోసం ఆదరాబాదరాగా పరుగెడుతున్న తీరును చూస్తుంటే నేలపై వ్యాపించి ఉన్న మిడుతల దండు గుర్తుకువస్తుంది.

12. **'ముహ్తియీన'** ( مُهْطِعِينَ ) అంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా పరుగెత్తుతారు. తమ పరిస్థితి ఏమిటి? అన్న ఆత్రుత, భయం వారిలో కలగలసి ఉంటాయి. అవిశ్వాసుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

13. నూహ్ జనులు అతన్ని తిరస్కరించటంతోనే వదలిపెట్టలేదు. పైగా అతన్ని విదిలించారు. బెదిరించారు. పరిహసించారు. అతన్ని పిచ్చివాని క్రింద జమకట్టారు. "ఓ నూహ్! నువ్వు గనక నీ వైఖరిని మానుకోకపోతే నీపై రాళ్లు రువ్వవలసి ఉంటుంది" (షుఅరా - 116) అని కూడా హెచ్చరించారు.

**11** అప్పుడు మేము ఉధృతంగా నీటిని కురిపించేలా ఆకాశ ద్వారాలను తెరచి వేశాము.[14]

فَفَتَحْنَآ أَبْوَٰبَ ٱلسَّمَآءِ بِمَآءٍ مُّنْهَمِرٍ ﴿11﴾

**12** మరి భూమి నుండి కూడా నీటి ఊటలు పొంగిపొరలేలా చేశాము. నిర్ణయించబడిన పనిని పూర్తిచేయటానికి (రెండు) నీళ్లు కలిశాయి.[15]

وَفَجَّرْنَا ٱلْأَرْضَ عُيُونًا فَٱلْتَقَى ٱلْمَآءُ عَلَىٰٓ أَمْرٍ قَدْ قُدِرَ ﴿12﴾

**13** మరి మేమతన్ని పలకలు, మేకులు గల దానిలో ఎక్కించాము.[16]

وَحَمَلْنَٰهُ عَلَىٰ ذَاتِ أَلْوَٰحٍ وَدُسُرٍ ﴿13﴾

**14** అది మా కనుల ముందరే పయనించసాగింది – త్రోసి పుచ్చబడినవానికి ప్రతిఫలంగా!

تَجْرِى بِأَعْيُنِنَا جَزَآءً لِّمَن كَانَ كُفِرَ ﴿14﴾

**15** నిశ్చయంగా మేము ఈ సంఘటనను ఒక సూచనగా మిగిల్చి ఉంచాము.[17] మరి హితబోధను గ్రహించే వాడెవడైనా ఉన్నాడా?[18]

وَلَقَد تَّرَكْنَٰهَآ ءَايَةً فَهَلْ مِن مُّدَّكِرٍ ﴿15﴾

**16** నా శిక్ష, నా హెచ్చరికలు ఎలా ఉండినవో చెప్పండి.

فَكَيْفَ كَانَ عَذَابِى وَنُذُرِ ﴿16﴾

**17** నిశ్చయంగా మేము ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవటానికిగాను సులభతరం చేశాము.[19] మరి (దీని ద్వారా) హితబోధను గ్రహించే వాడెవడైనా ఉన్నాడా?

وَلَقَدْ يَسَّرْنَا ٱلْقُرْءَانَ لِلذِّكْرِ فَهَلْ مِن مُّدَّكِرٍ ﴿17﴾

14. **'మున్‌హమిర్'** అనే పదం పుష్కలంగా, కుండపోతగా, ఉధృతంగా అన్న అర్థంలో వాడబడుతుంది. ఆ వర్షం నలభై రోజులపాటు–ఏకధాటిగా–ధారాపాతంగా కురిసిందని అనబడుతోంది.

15. అంటే ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు, భూమి నుండి ఉబికివచ్చిన భూగర్భ జలం – రెండూ కలసి దేవుడు నిర్ణయించిన కార్యక్రమాన్ని పూర్తి చేశాయి. తుఫాను, ఉప్పెన రూపంలో విజృంభించి అవిధేయులందరినీ ముంచి వేశాయి.

16. అంటే చెక్క పలకలతో, లోహపు మేకులతో నిర్మించబడిన నౌక అన్నమాట! అసలు అరబీ మూలంలో **'దుసుర్'** అని ఉంది. 'దిసార్' దీని ఏకవచనం. నౌకలోని చెక్కల్ని ఒకదానికొకటి కలిపి కట్టటానికి ఉపయోగించే తాళ్లు లేక మేకులు అని దాని అర్థం.

17. అంటే – చింతన చేసే వారికోసం ఈ సంఘటనలో సూచన ఉంది. లేదా నేడు నౌకాయానం చేసే వారికి ఆనాటి ఆ నౌకా సంఘటన ఒక 'జ్ఞాపిక' కావాలి. దేవుని అపార శక్తికి ఇదొక తార్కాణం. పై వాక్యంలో ఈ 'సంఘటనను' అనే దానికి బదులు ఈ నౌకను ఒక సూచనగా మిగిల్చి ఉంచాము అన్న భావం కూడా వస్తుంది. (ఫత్‌హుల్ ఖదీర్).

18. **'ముద్దకిర్'** అంటే బోధను గ్రహించేవాడు, గుణపాఠం గరిపేవాడు అని అసలు అర్థం. (ఫత్‌హుల్ ఖదీర్).

19. అంటే అందలి విషయాల లోతుల్లోకి పోవటాన్ని, దాని ద్వారా ఉపదేశం గ్రహించటాన్ని, దాన్ని కంఠస్థం చేసుకోవటాన్ని మేము సులభతరం చేశాము. అందుకే – దివ్య ఖుర్ఆన్ సాహిత్యపరంగా అత్యున్నత స్థాయికి చెందిన గ్రంథమైనప్పటికీ,

**18** ఆద్ జాతి వారు (కూడా) ధిక్కరించారు. మరి నా శిక్ష, నా హెచ్చరికలు ఎలా ఉండినాయో (చూశారుగా)!

كَذَّبَتْ عَادٌ فَكَيْفَ كَانَ عَذَابِي وَنُذُرِ (18)

**19** మేము వారిపై నిరంతరంగా వీచే ప్రచండమైన పెనుగాలిని ఒకానొక దుర్దినాన పంపాము.[20]

إِنَّا أَرْسَلْنَا عَلَيْهِمْ رِيحًا صَرْصَرًا فِي يَوْمِ نَحْسٍ مُسْتَمِرٍّ (19)

**20** అది ఆ జనులను, కూకటివ్రేళ్లతో పెకలించబడిన ఖర్జూరపు బోదెలవలె అమాంతం లేపి పడవేసేది.[21]

تَنْزِعُ النَّاسَ كَأَنَّهُمْ أَعْجَازُ نَخْلٍ مُنْقَعِرٍ (20)

**21** మరి నా శిక్ష, నా హెచ్చరిక ఎలా ఉండింది? (చూశారుగా)!

فَكَيْفَ كَانَ عَذَابِي وَنُذُرِ (21)

**22** నిశ్చయంగా మేము ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకునేందుకుగాను సులభతరం చేశాము. మరి (దీని ద్వారా) హితబోధను గ్రహించే వాడెవడైనా ఉన్నాడా?

وَلَقَدْ يَسَّرْنَا الْقُرْآنَ لِلذِّكْرِ فَهَلْ مِنْ مُدَّكِرٍ (22)

**23** సమూదు జాతి వారు (కూడా) హెచ్చరించేవారిని ధిక్కరించారు.

كَذَّبَتْ ثَمُودُ بِالنُّذُرِ (23)

ఎవరైనా కాస్తంత శ్రద్ధవహిస్తే చాలు – సులభంగా ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకోగలుగుతారు. దానికోసం అరబీ వ్యాకరణాన్ని నేర్చుకోవాల్సిన అవసరం కూడా లేదు. అలాగే మొదటి నుండి – చివరివరకు ఒక్కో అక్షరంతో సహా పూర్తిగా కంఠపాఠం చేసుకునే ఏకైక గ్రంథం కూడా ఇదే. ఒక చిన్న గ్రంథాన్ని కూడా ఈ రీతిలో కంఠస్థం చేయటం, ఒకవేళ చేసినా దాన్ని జ్ఞాపకముంచుకోవటం చాలా కష్టం. కాని ఖుర్‌ఆన్ విషయంలో మాత్రం అలా కాదు. మనిషి మానసిక ఏకాగ్రతతో మార్గదర్శకత్వం పొందాలన్న తపనతో దాన్ని చదివితే, హితబోధను గ్రహించే చెవులతో దాన్ని వింటే, గ్రాహ్య హృదయంతో దానిపై ఆలోచిస్తే ఇహపరాల భాగ్యాలన్నీ అతని కోసం తెరువబడతాయి. అప్పుడు ఈ గ్రంథం అతని హృదయాంతరాళాల లోతుల్లోకి పోయి అవిశ్వాసం, అపరాధాల కాలుష్యాన్నంతటినీ కడిగివేస్తుంది.

20. అది బుధవారం సాయంత్రం అని తెలుస్తోంది. ఒకసారి మొదలైన ఆ పెనుగాలి నిరంతరం ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లు నడిచింది. పటిష్టమైన నివాస గృహాలలో, కోటలలో తలదాచుకున్న జనులను సయితం ఈ ఈదురుగాలులు బయటికి లాగి, అమాంతం పైకి లేపి గిరవాటు కొట్టేవి. దాంతో వారి తల ఒక వైపు – మొండెం ఒక వైపు పడిపోయేవి. ఆ విధంగా ఆ రోజు వారి పాలిట దరిద్రపు రోజుగా పరిణమించింది. ఆ పెనుగాలి ఆదు జాతి వారందరినీ తుడిచిపెట్టే వరకూ ఆగలేదు. అంతమాత్రాన నేడు కొంతమంది తలపోస్తున్నట్లు బుధవారం లేక మరో వారం అశుభంతో కూడినదని అనటం సరైంది కాదు.

21. బలిష్ఠులు, పొడుగరులైన ఆదు జాతివారు ఆ పెనుగాలి ముందు ఎందుకూ పనికిరాని వారు అయ్యారు. నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కుప్పకూలిందన్నట్లు ఆదు జాతి వారు కూడా సమూలంగా పెకలించబడిన ఖర్జూరపు బొద్దుల మాదిరిగా కుప్పకూలిపోయారు. తమ శరీర సౌష్టవాన్ని, పర్సనాలిటీని చూసుకుని ఆదు జనులు మురిసిపోయేవారు. కాని దేవుని శక్తి ముందు వారెంత? వారి జోరెంత?? **'ఆజాజు'** (أَعْجَازُ) అంటే ఏదేని వస్తువు యొక్క మొదలు, వేరు అని అర్థం. 'అజిజున్' దాని ఏకవచనం. **'మున్‌ఖయిర్'** (مُنْقَعِرٌ) అంటే కూకటివ్రేళ్లతో పెకిలించబడినది అని అర్థం.

24 "ఏమిటీ, మనలోని ఒక మానవుణ్ణి మనం అనుసరించాలా? ఒకవేళ అదే గనక జరిగితే మనం ముమ్మాటికీ పెడదారిపట్టి, పిచ్చిలో పడినట్లే.[22]

فَقَالُوٓا أَبَشَرًا مِّنَّا وَاحِدًا نَّتَّبِعُهُۥٓ إِنَّآ إِذًا لَّفِى ضَلَٰلٍ وَسُعُرٍ ﴿٢٤﴾

25 "ఏమిటి, మనం ఇంతమందిమి ఉండగా మన మధ్యన కేవలం అతనొక్కడికే బోధన (వహీ) పంపబడిందా? లేదు, అతను బీరాలు పోతున్న అబద్ధాలరాయుడు"[23] అన్నారు.

أَءُلْقِىَ ٱلذِّكْرُ عَلَيْهِ مِنۢ بَيْنِنَا بَلْ هُوَ كَذَّابٌ أَشِرٌ ﴿٢٥﴾

26 అబద్ధాలరాయుడు, బడాయిని చాటుకునేవాడెవడో రేపు అందరూ తెలుసుకుంటారు.[24]

سَيَعْلَمُونَ غَدًا مَّنِ ٱلْكَذَّابُ ٱلْأَشِرُ ﴿٢٦﴾

27 వీళ్లను పరీక్షించటానికి మేము ఒక ఆడ ఒంటెను పంపిస్తున్నాము.[25] కాబట్టి (ఓ సాలెహ్!) నువ్వు వీళ్ల (పరిణామం) కోసం ఎదురుచూస్తూ ఉండు. కాస్త ఓపిక పట్టు.[26]

إِنَّا مُرْسِلُوا ٱلنَّاقَةِ فِتْنَةً لَّهُمْ فَٱرْتَقِبْهُمْ وَٱصْطَبِرْ ﴿٢٧﴾

28 అయితే వాళ్ల మధ్య నీళ్ల పంపకం జరిగిందని,[27] ప్రతి ఒక్కరూ (నీళ్ల కోసం) తమ తమ వంతు ప్రకారం రావలసి ఉంటుందని వారికి తెలియజెయ్యి.[28]

وَنَبِّئْهُمْ أَنَّ ٱلْمَآءَ قِسْمَةٌۢ بَيْنَهُمْ ۖ كُلُّ شِرْبٍ مُّحْتَضَرٌ ﴿٢٨﴾

29 కాని వాళ్లు మాత్రం తమ సహవాసిని పిలిచారు.[29] వాడు (ఆడ ఒంటెపై) దాడి చేసి,[30] దాని గిట్టల్ని నరికివేశాడు.

فَنَادَوْا صَاحِبَهُمْ فَتَعَاطَىٰ فَعَقَرَ ﴿٢٩﴾

22. తమ లాంటి ఒక మానవమాత్రుణ్ణి దైవప్రవక్తగా ఒప్పుకోవటం వారికి మింగుడు పడలేదు. దాన్ని వాళ్లు పిచ్చిగా భావించారు.

23. **'అషిర్'** అంటే అబద్ధాలు చెప్పటంలో హద్దుమీరిపోయినవాడు అని అసలు అర్థం. అంటే ఇతను మామూలు అబద్ధం చెప్పలేదు, చాలా పెద్ద అబద్ధమాడి, తద్వారా తన గొప్పను చాటుకుంటున్నాడు. దైవసందేశం (వహీ) తనకు మాత్రమే అందుతుందిట! ఏదో పెద్ద పథకంతోనే అతనీ విధంగా మాట్లాడుతున్నాడు అని వారు ఎద్దేవా చేశారు.

24. అబద్ధం చెప్పేది ప్రవక్త (సాలెహ్)కాదు, వాళ్లే మా ప్రవక్తపై నిందలు మోపుతున్నారు. అసలు అబద్ధాలు చెప్పేదెవరో 'రేపు' అందరూ తెలుసుకుంటారు. 'రేపు' అంటే ప్రళయదినమూ కావచ్చు. లేక ప్రపంచంలో వారిపై దైవశిక్ష అవతరించనున్న రోజు కూడా కావచ్చు.

25. అంటే ఇప్పుడైనా వారు అల్లాహ్‌ను విశ్వసిస్తారో లేదో చూడటానికి మేము ఈ ఆడ ఒంటెను ఒక సూచనగా పంపిస్తున్నాము. మరి చూడబోతే ఈ ఒంటెను కూడా వాళ్ల కోరికపైనే ఒక బండరాయి నుండి తీయటం జరిగింది.

26. ఇంతకీ వీళ్లు తమ వాగ్దానం ప్రకారం విశ్వాస మార్గాన్ని అవలంబిస్తారో లేదో గమనిస్తూ ఉండు. వాళ్ల బాధాకర మైన వైఖరిపై సంయమనం పాటించు. అంతేగాని రెచ్చిపోకు.

27. అంటే త్రాగునీరు కోసం ఒక రోజు ఒంటె వస్తుందని, ఒక రోజు నీ జాతి జనులు రావాలని వాళ్లకు స్పష్టంగా చెప్పు.

28. ఎవరి వంతు ప్రకారం వారు రావాలి. అంతేగాని తమకు కేటాయించబడని రోజు వచ్చి గంద్రగోళం సృష్టించరాదు. **'షుర్బున్'** అంటే నీళ్లు తీసుకునే వంతు.

| | |
|---|---|
| **30** ఇక నా శిక్ష ఎలా పడిందో, నా హెచ్చరిక ఎలా పరిణమిం చిందో (చూడండి)! | فَكَيْفَ كَانَ عَذَابِي وَنُذُرِ ﴿٣٠﴾ |
| **31** మేము వారిపై ఒకే ఒక కేకను వదిలాము. అంతే! వాళ్ల పరిస్థితి కంచె నిర్మించేవాడు తొక్కివేసిన గడ్డి మాదిరిగా అయి పోయింది.[31] | إِنَّا أَرْسَلْنَا عَلَيْهِمْ صَيْحَةً وَاحِدَةً فَكَانُوا كَهَشِيمِ الْمُحْتَظِرِ ﴿٣١﴾ |
| **32** మేము ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకునేటందుకు ఎంతో సులభ తరం చేశాము. మరి (దీనిద్వారా) హితబోధను గ్రహించే వాడెవడైనా ఉన్నాడా? | وَلَقَدْ يَسَّرْنَا الْقُرْآنَ لِلذِّكْرِ فَهَلْ مِن مُّدَّكِرٍ ﴿٣٢﴾ |
| **33** లూత్ జాతి వారు (కూడా తమను) హెచ్చరించేవారిని ధిక్కరించారు. | كَذَّبَتْ قَوْمُ لُوطٍ بِالنُّذُرِ ﴿٣٣﴾ |
| **34** మేము వారిపై రాళ్లు కురిపించే గాలిని పంపాము.[32] అయితే లూత్ ఇంటివారిని మాత్రం (శిక్షనుండి) మినహాయించాము. వాళ్లను మేము రాత్రి వేకువజామున కాపాడాము[33] – | إِنَّا أَرْسَلْنَا عَلَيْهِمْ حَاصِبًا إِلَّا آلَ لُوطٍ ۖ نَّجَّيْنَاهُم بِسَحَرٍ ﴿٣٤﴾ |
| **35** మా అనుగ్రహంతో![34] కృతజ్ఞతా భావం కలిగి ఉండే వారం దరికీ మేమిలాగే (మంచి) ప్రతిఫలం ఇస్తూ ఉంటాము. | نِّعْمَةً مِّنْ عِندِنَا ۚ كَذَٰلِكَ نَجْزِي مَن شَكَرَ ﴿٣٥﴾ |

29. ఆ ఒంటెను చంపమని వారు ఆ వ్యక్తిని పురమాయించారు. ఆ వ్యక్తి పేరు ఖుదార్ బిన్ సాలిఫ్ అనబడుతోంది.

30. ఆ వ్యక్తి ఆ ఆడ ఒంటెపై ఖడ్గంతో లంఘించాడు. లేదా దాన్ని పట్టుకున్నాడు. మొదట దాని కాలి గిట్టెల్ని నరికివేశాడు. ఆ తరువాత మెడపై వేటు వేశాడు. మొత్తమ్మీద ఆ ఒంటెను చిత్రహింసలు పెట్టి మరీ చంపారు. కొంతమంది పండితులు మూలంలోని **'తఆతా'** (تَعَاطَى) అన్న పదాన్ని దుస్సాహసానికి ఒడిగట్టాడు అన్న అర్థంలో తీసుకున్నారు.

31. పశువుల రక్షణ కోసం కంచె నిర్మించేవాని ఎండు కట్టెలు, గడ్డిపరకలు ఏ విధంగా నలిగి తునకలవుతాయో అదే విధంగా వారు కూడా మా దెబ్బకు తుక్కుతుక్కై పోయారు. **'ముహ్‌తజిర్'** (مُحْتَظِرٌ) అంటే కంచె నిర్మించేవాడు. **'హషీమ్'** (هَشِيمٌ) అంటే తొక్కివేసిన గడ్డి అని భావం.

32. ఆ గాలి వారి బస్తీలను తలక్రిందులుగా చేసి వేసింది. దరిమిలా వారిపై రాళ్ళవాన కురిసింది (ఈ వివరాలు హూద్ సూరాలో వచ్చాయి).

33. **'లూత్ ఇంటివారు'** అంటే లూత్ (అలైహిస్సలాం)తో పాటు ఆయన్ని విశ్వసించిన జనులు అని భావం. అయితే ఈ విశ్వాసులలో లూత్ భార్య మాత్రం లేదు. ఎందుకంటే ఆమె ధిక్కరించింది. లూత్ కుమార్తెలిద్దరు మాత్రం ఈ విశ్వాసుల వర్గంలో చేరి ఉన్నారు. ఈ కొద్దిమంది విశ్వాసులను దేవుడు రాత్రి చివరి భాగంలో (తెల్లవారు జామున) రక్షించాడు.

34. అంటే కేవలం దైవకృపవల్లనే వారు రక్షించబడ్డారు. మొత్తం జనవాసాన్ని తుడిచిపెట్టే శిక్ష నుండి ఆ గుప్పెడు మందిని కాపాడుకోవటం అనేది దైవానుగ్రహంతోనే సాధ్యమవుతుంది.

وَلَقَدْ أَنذَرَهُم بَطْشَتَنَا فَتَمَارَوْا بِالنُّذُرِ (36)

**36** అతను (లూత్ ప్రవక్త) వారికి మా పట్టు గురించి ముందు గానే హెచ్చరించాడు.[35] కాని వారు హెచ్చరికల విషయంలో (సందేహించి అతనితో) కయ్యానికి దిగారు.[36]

وَلَقَدْ رَاوَدُوهُ عَن ضَيْفِهِ فَطَمَسْنَا أَعْيُنَهُمْ فَذُوقُوا عَذَابِي وَنُذُرِ (37)

**37** అతన్నుండి అతని అతిథులను తీసుకోగోరి, అతన్ని దువ్వటం మొదలెట్టారు.[37] అయితే మేము వారి కళ్లు పోగొట్టాము.[38] 'నా శిక్ష, నా హెచ్చరికల రుచి చూడండి!" (అని వారితో అనటం జరిగింది).

وَلَقَدْ صَبَّحَهُم بُكْرَةً عَذَابٌ مُّسْتَقِرٌّ (38)

**38** తెల తెల వారుతుండగానే స్థిరమైన శిక్ష వారిని అమాంతం కబళించింది.[39]

فَذُوقُوا عَذَابِي وَنُذُرِ (39)

**39** కాబట్టి నా శిక్షను, నా హెచ్చరికను చవిచూడండి.

وَلَقَدْ يَسَّرْنَا الْقُرْآنَ لِلذِّكْرِ فَهَلْ مِن مُّدَّكِرٍ (40)

**40** నిశ్చయంగా మేము ఖుర్ఆన్‌ను హితబోధన నిమిత్తం సులభతరం చేశాము.[40] మరి ఈ హితబోధనను గ్రహించే వాడెవడైనా ఉన్నాడా?

35. మేము ఏ జాతి వారినయినా అకారణంగా శిక్షించము. మా హెచ్చరికలను పెడచెవిన పెట్టి, ఇష్టారాజ్యం చేసే వారిని మాత్రమే మేము ఈ విధంగా దండిస్తాము.

36. కాని ఈ దుష్టులు మా ప్రవక్తను ఖాతరు చేయలేదు సరికదా అతనితో మొండి వాదన మొదలెట్టారు. తలాతోకా లేకుండా మాట్లాడసాగారు.

37. నయానా భయాన లూత్ ఇంటికి వచ్చిన అతిథులను రప్పించుకునేందుకు యత్నించారు. (నిజానికి వారు ఈ పాపాత్ములను శిక్షించటానికి మానవాకారంలో వచ్చిన దైవదూతలు.) అంటే అందమైన ఆ యువకులను తమకు అప్పగిస్తే అసహజమైన తమ లైంగిక వాంఛను తీర్చుకుంటామన్నది వారి డిమాండులోని అంతరార్థం.

38. ఆ దైవదూతలు జిబ్రయీల్, మీకాయిల్, ఇస్రాఫీల్ అని అనబడుతోంది. ఆ పాపాత్ములు తమ దురుద్దేశంపై మొండికేయటం గమనించి దైవదూత జిబ్రయీల్ తన రెక్కను కొద్దిగా వారిపై ఝుళిపించారు. అంతే – వారి కనుగుడ్లు బయటికొచ్చేశాయి. కేవలం కంటిచూపు పోయిందని మరికొందరు అభిప్రాయపడ్డారు. మొత్తానికి ఆ పెద్ద విపత్తు రాకముందే లూత్ ఇంటి దగ్గర రగడ చేసిన అల్లరిమూకకు ఈ శాస్తి జరిగింది. ఆ విధంగా వాళ్లు అంధులుగానే తమ ఇళ్లకు చేరుకున్నారు. ఆ తరువాత యావత్తు జాతిని మట్టుపెట్టే పెద్ద శిక్ష వేకువజామున అమలుపరచబడింది. (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

39. అంటే ఎట్టకేలకు తప్పనిసరిగా రావలసిన శిక్ష – తిరుగులేని శిక్ష – రానే వచ్చింది. తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్న దౌర్భాగ్యుల భరతం పట్టింది. **'ముస్తఖిర్'** ( مُسْتَقِرٌّ) అంటే స్థిరమైనది, నాశనం చేయకుండా వదలిపెట్టనిది అని అర్థం.

40. దివ్య ఖుర్ఆన్‌ను సులభతరం చేశామన్న విషయం ఈ సూరాలో పదే పదే గుర్తుచేయబడటం గమనార్హం. ఇది కూడా దైవానుగ్రహమే. కాబట్టి మనిషి దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఈ మహదనుగ్రహాన్ని మరువరాదు.

41 ఫిరౌనువారి వద్దకు కూడా హెచ్చరించేవారు వచ్చారు.[41]

وَلَقَدْ جَآءَ اٰلَ فِرْعَوْنَ النُّذُرُ ﴿41﴾

42 కాని వారు మా సూచనలన్నింటినీ ధిక్కరించారు.[42] అందు చేత మేము వారిని మహాశక్తిమంతుడు, సర్వాధికారి పట్టుకున్నట్లే పట్టుకున్నాము.[43]

كَذَّبُوْا بِاٰيٰتِنَا كُلِّهَا فَاَخَذْنٰهُمْ اَخْذَ عَزِيْزٍ مُّقْتَدِرٍ ﴿42﴾

43 (ఓ ఖురైషులారా!) మీలోని తిరస్కారులు (గతించిన) ఆ తిరస్కారుల కంటే ఘనులా?[44] లేక పూర్వపు గ్రంథాలలో మీ కోసం (మినహాయింపు) ఏదయినా వ్రాయబడి ఉందా?[45]

اَكُفَّارُكُمْ خَيْرٌ مِّنْ اُولٰٓئِكُمْ اَمْ لَكُمْ بَرَآءَةٌ فِى الزُّبُرِ ﴿43﴾

44 లేక "మేము గెలుపొందే వర్గం వాళ్ళము" అని వారు ధీమాను వ్యక్తపరుస్తున్నారా?"[46]

اَمْ يَقُوْلُوْنَ نَحْنُ جَمِيْعٌ مُّنْتَصِرٌ ﴿44﴾

45 (బాగా తెలుసుకోండి) త్వరలోనే ఆ వర్గం ఓడిపోతుంది. వారు వెన్ను చూపి పారిపోతారు.[47]

سَيُهْزَمُ الْجَمْعُ وَيُوَلُّوْنَ الدُّبُرَ ﴿45﴾

41. **'నుజుర్'** (النُّذُرُ) అనేది 'నజీర్' (హెచ్చరించేవాడు, భయపెట్టేవాడు) అనే పదానికి బహువచనం (ఫత్‌హుల్ ఖదీర్). హెచ్చరించేవారు అంటే నరకాగ్ని యాతన గురించి, దైవాగ్రహం గురించి జాగరూకపరిచే దైవప్రవక్తలు అన్నమాట.

42. అంటే – దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహి) ఫిరౌనీయులకు చూపెట్టిన నిదర్శనాలన్న మాట. ఇవి మొత్తం తొమ్మిది నిదర్శనాలు. ఇవి ఇంతకు ముందు ప్రస్తావనకు వచ్చాయి.

43. అంటే – వారిని తుదముట్టించాము. ఆ శిక్ష అసాధారణ శక్తిమంతునిది. ఒకసారి ఆయన శిక్షా కొరడాను ఝుళిపించిన మీదట ఇక దాన్నుంచి బ్రతికి బట్టకట్టేవారెవరూ ఉండరు.

44. ముమ్మాటికీ కారు. అంటే ఓ అరబ్బులారా! మీలోని అవిశ్వాసులు పూర్వకాలపు అవిశ్వాసులకన్నా బలవంతులేమీ కాదు. వాళ్లు తమ తిరస్కారవైఖరి కారణంగా తుడిచిపెట్టబడినపుడు మీరేపాటి? దైవశిక్ష నుండి తప్పించుకోవచ్చని మీరు ఎలా అనుకుంటున్నారు?

45. **'జుబుర్'** (الزُّبُرِ) అంటే లోగడ ప్రవక్తలపై అవతరించిన ఆకాశ గ్రంథాలు లేక సహీఫాలు అని అర్థం. మరి ఆ ఆకాశ గ్రంథాలలో కురైషులు లేక అరబ్బులకు ప్రత్యేక రాయితీ ఏమైనా ఇవ్వబడిందా? వారెలా ఇష్టారాజ్యం చేసినా దేవుడు వారి జోలికి పోడని ఎక్కడైనా హామీ పత్రం రాయబడి ఉందా? (లేదు కదా!)

46. మందీమార్బలం రీత్యాగానీ, సంఖ్యాపరంగాగానీ తమను ఎదుర్కొనే ధైర్యం ఎవరికీ లేదని వారనుకుంటున్నారా? తమ సంఘటిత శక్తి తిరుగులేనిదన్న ధీమా వారికి ఉందా?

47. నిజానికి అది వారి బలుపు కాదు, వాపు మాత్రమే. వారి ధీమాలో పసలేదని తేలిపోయింది. బద్ర్ సంగ్రామంలో వారు ఘోరంగా ఓడిపోయారు. అంతేకాదు, చాలామంది అవిశ్వాస సైనికులు చావుతప్పి, కన్నులొట్టపోయి ఇంటిదారి పట్టారు.

కాని మరోవైపు ఆ యుద్ధ మైదానంలో మహాప్రవక్త (స) పరిస్థితిని చూడండి! ఆయన తన గుడారులో కడు దీనంగా తన ప్రభువును సహాయం కోసం వేడుకోసాగారు. కడకు హజ్రత్ అబూబకర్ (రజి) అక్కడికి వచ్చి "చాలు

بَلِ السَّاعَةُ مَوْعِدُهُمْ وَالسَّاعَةُ أَدْهَىٰ وَأَمَرُّ ﴿46﴾

**46** పైగా వారికి వాగ్దానం చేయబడిన అసలు (పరాభవ) సమయమైతే ప్రళయమే. ఆ ఘడియ అత్యంత కఠినమైనది, చేదైనది.[48]

إِنَّ الْمُجْرِمِينَ فِي ضَلَالٍ وَسُعُرٍ ﴿47﴾

**47** నిశ్చయంగా అపరాధులు మార్గవిహీనులయ్యారు. యాతనకు గురయ్యారు.

يَوْمَ يُسْحَبُونَ فِي النَّارِ عَلَىٰ وُجُوهِهِمْ ذُوقُوا مَسَّ سَقَرَ ﴿48﴾

**48** ఏ రోజున వారు తమ ముఖముల ఆధారంగా అగ్నిలోకి ఈడ్చబడతారో (ఆ రోజు) "నరకాగ్ని తాకిడి రుచిచూడండి"[49] (అని వారితో అనబడుతుంది).

إِنَّا كُلَّ شَيْءٍ خَلَقْنَاهُ بِقَدَرٍ ﴿49﴾

**49** నిశ్చయంగా, మేము ప్రతి వస్తువును ఒక (నిర్ణీత) 'విధి' ప్రకారం సృష్టించాము.[50]

وَمَا أَمْرُنَا إِلَّا وَاحِدَةٌ كَلَمْحٍ بِالْبَصَرِ ﴿50﴾

**50** మా ఆజ్ఞ ఒక్కటి చాలు, (అది అమల్లోకి రావటం అనేది) రెప్పపాటు కాలంలో జరిగిపోతుంది.

وَلَقَدْ أَهْلَكْنَا أَشْيَاعَكُمْ فَهَلْ مِن مُّدَّكِرٍ ﴿51﴾

**51** మేము (గతంలో) మీలాంటి వారినెందరినో తుదముట్టించి ఉన్నాము.[51] మరి (దీని ద్వారా) నీతిని గ్రహించే వాడెవడైనా ఉన్నాడా?

وَكُلُّ شَيْءٍ فَعَلُوهُ فِي الزُّبُرِ ﴿52﴾

**52** వీళ్లు చేసినదంతా కర్మల పత్రాలలో నమోదై ఉంది.[52]

---

దైవప్రవక్తా(స)! తమరు ప్రభువుసన్నిధిలో ఎంతగానో విన్నవించుకున్నారు" అని చెప్పిన మీదట ఆయన(స) బయటికి వచ్చారు. ఆ సమయంలో ఆయన ఈ ఆయతునే పఠిస్తూ ఉన్నారు (బుఖారీ – తఫ్సీర్ ఇఖ్తరబతిస్సాఅతు సూరా).

48. అంటే – యుద్ధంలో వారు వధించబడటం, ఖైదీలుగా పట్టుబడటంతో సరిపోలేదు. దీనికన్నా కఠినమైన శిక్షలు, ఘోర అవమానాలు వారికి తీర్పుదినాన ఎదురు కానున్నాయి. దేవుడు వారికి చేసిన ఈ వాగ్దానం తప్పక నెరవేరుతుంది. **'అద్హా'** (اَدْهٰى) అంటే తీవ్రంగా పరాభవం పాలుచేసేది అనీ, **'అమర్రు'** ( اَمَرُّ) అంటే అత్యంత చేదైనది అని అర్థం.

49. **'సఖర్'** ( سَقَر) కూడా నరకంలోని పేర్లలో ఒక పేరు. అంటే దాని వేడిని, శిక్షా తీవ్రతను చవిచూడండి.

50. ఈ ఆయతు ఆధారంగా, ఇంకా ఇటువంటి ఇతర ఆయతుల ఆధారంగా ధర్మవేత్తలు, ఇమాములు దేవుని విధివ్రాతకు సంబంధించి ఒక నిర్ధారణకు వచ్చారు. అదేమంటే, విశ్వంలోని సమస్త వస్తువులను సృష్టించకముందే వాటికి సంబంధించిన విధివ్రాత గురించి దైవానికి తెలుసు. ఆయన అందరి విధిని నిర్ధారించాడు. ఈ ఆయతు ద్వారా దైవప్రవక్త సహచరుల కాలం చివర్లో ఉనికిలోకి వచ్చిన 'ఖద్రియ వర్గం' భావాలు కూడా ఖండించబడ్డాయి (ఇబ్నె కసీర్).

51. అంటే సత్యతిరస్కారం విషయంలో గతకాలపు అవిశ్వాసులు కూడా మీలాగే మహా ఘటికులు. ఓ పట్టాన లొంగని వారు. కాని మేము వాళ్ళను సమూలంగా తుడిచి పెట్టాము (ఫత్హుల్ ఖదీర్).

| | |
|---|---|
| **53** (అలాగే) ప్రతి చిన్న పెద్ద విషయం వ్రాయబడి ఉంది.[53] | وَكُلُّ صَغِيرٍ وَكَبِيرٍ مُسْتَطَرٌ ﴿53﴾ |
| **54** నిశ్చయంగా మాపట్ల భయభక్తులు కలవారు (స్వర్గ) వనాల, సెలయేరుల మధ్య ఉంటారు.[54] | إِنَّ الْمُتَّقِينَ فِي جَنَّٰتٍ وَنَهَرٍ ﴿54﴾ |
| **55** సర్వశక్తుడు అయిన రాజాధిరాజు (అల్లాహ్) దగ్గర[55] సత్యంతో కూడిన, గౌరవప్రదమైన సదస్సులో ఉంటారు.[56] | فِي مَقْعَدِ صِدْقٍ عِندَ مَلِيكٍ مُّقْتَدِرٍ ﴿55﴾ |

52. మరో అర్థం ప్రకారం 'లౌహె మహ్ఫూజ్'లో నమోదై ఉంది.

53. అంటే వారు చెప్పింది, చేసింది, అంతా రికార్డు చేసి ఉంచాము. ప్రతి చిన్నమాట, ప్రతి చిన్నాపెద్ద పని అంతా భద్రంగా ఉంది.

54. ఇక్కడి నుంచి సజ్జనుల స్వర్గసుఖాల ప్రస్తావన వచ్చింది. వారు స్వర్గంలోని వివిధ ఉద్యానవనాలలో, కాలువలలో తమకు మనసైన వాటిని పొందవచ్చు.

55. ఆయన తిరుగులేని సామ్రాట్టు. ఆయన మాటకు, అధికారానికి ఎదురు చెప్పే వారెవరూ ఉండరు. ఆయనపై ఒత్తిడి తీసుకువచ్చే వారు కూడా ఎవరూ ఉండరు. అటువంటి సర్వోన్నత ప్రభువు తరఫున విశ్వాసులకు ఈ గౌరవ పురస్కారం లభిస్తుంది.

56. **'మఖ్అది సిద్ఖిన్'** (مَقْعَدِ صِدْقٍ) అంటే గౌరవంతో కూడిన సదస్సు లేదా సత్యానికి ప్రతీక అయిన సదనం అన్న అర్థాలు వస్తాయి. ఆ సదనంలో నీతిమాలిన మాటలుగానీ, వ్యర్థ విషయాలుగానీ ప్రస్తావనకు రావు.

55వ సూరా

# అర్ రహ్మాన్

## కరుణామయుడు

అవతరణ మదీనాలో

ఆయతులు 78

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా దైవవాణి అవతరణ, మానవులకు అల్లాహ్ ప్రసాదించిన అపరిమిత అనుగ్రహాలు, అల్లాహ్‌కే ప్రత్యేకమైన విశిష్టమైన సృష్టి సామర్ధ్యం, తీర్పుదినాల గురించి వివరించింది. ఈ సూరా మొదటి ఆయతులో "రహ్మాన్" (కరుణామయుడు) అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరాలో దేవుని అపరిమిత శక్తియుక్తులను, ఆయన సృష్టిసామర్ధ్యాన్ని చెప్పడం జరిగింది. ఆయన విజ్ఞతావివేచనలకు, జ్ఞానసంపదకు నిదర్శనంగా ఇవి ప్రస్తావించబడ్డాయి. ఆయన సూర్యచంద్రులను సృష్టించాడు. అవి తమ కక్ష్యలలో ఖచ్చితంగా తిరుగాడుతున్నాయి. చెట్టుచేమలు దేవుని ఆరాధనలో తలలు వంచుతున్నాయి. ఆయన ఆకాశాన్ని ఎత్తుగా చేసాడు. ఆయన భూమిని పరిచాడు. తాను సృష్టించిన ప్రాణుల కోసం వివిధ రకాలైన ఫలాలు, ధాన్యాలు ఉత్పత్తి చేస్తున్నాడు. ఆయన మనిషిని ఎండిన పెంకు లాంటి మట్టి నుంచి సృష్టించాడు. జిన్నులను పొగలేని అగ్ని నుంచి సృష్టించాడు. ఆయన నదులలోని మంచినీటిని, సముద్రాలలోని ఉప్పునీటిని వేరు చేస్తున్నాడు. ఆయన ముత్యాలను, పగడాలను సృష్టించాడు. సముద్రాలలో నౌకలు ప్రయాణించేలా చేస్తున్నాడు. ఈ వాస్తవాలను ప్రస్తావిస్తూ ఆ సూరాలో తీర్పుదినాన ఆకాశం తునాతునకలై బాగా కాగిన ఎర్రని తైలంగా మారిపోతుందని హెచ్చరించడం జరిగింది.*

*సన్మార్గులకు శాశ్వత నివాస స్థలంగా లభించే స్వర్గవనం గురించి వర్ణన ఇక్కడ ఇవ్వడం జరిగింది. అక్కడ అన్ని విధాల వృక్షాలు, ఫలాలు ఉంటాయి. రెండు సెలయేర్లు ఉంటాయి. వారి కొరకు ఈడూ జోడూ కలిగిన అందమైన భార్యలు ఉంటారు. తివాచీలు ఉంటాయి. సౌకర్యవంతమైన ఆసనాలు ఉంటాయి.*

# అర్ రహ్మాన్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** కరుణామయుడు (అయిన అల్లాహ్)

**2** ఖుర్ఆన్‌ను నేర్పాడు.[2]

**3** ఆయన మనిషిని పుట్టించాడు.[3]

**4** ఆయన అతనికి మాట్లాడటం నేర్పాడు.[4]

**5** సూర్యుడు, చంద్రుడు ఒక (నిర్ణీత) లెక్క ప్రకారం పోతున్నాయి.[5]

# سُورَةُ الرَّحْمَٰنِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

الرَّحْمَٰنُ ﴿١﴾

عَلَّمَ الْقُرْآنَ ﴿٢﴾

خَلَقَ الْإِنسَانَ ﴿٣﴾

عَلَّمَهُ الْبَيَانَ ﴿٤﴾

الشَّمْسُ وَالْقَمَرُ بِحُسْبَانٍ ﴿٥﴾

1. ఈ సూరా మదీనాలో అవతరించిన సూరా అని కొందరు ఖరారు చేశారు. కాని దీన్ని 'మక్కీ' సూరా అనటమే సరైనది (ఫత్‌హుల్ ఖదీర్). ఒక హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. ఈ హదీసు ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా అన్నారు : "ఏమిటీ, (ఈ సూరాను పఠిస్తున్నప్పుడు) మీరు మౌనంగా ఉండిపోతారు? మీకన్నా ఆ జిన్నులే నయం. వారు నాకు తారసపడిన రాత్రి నేను ఈ సూరా పఠించాను. ఆ సందర్భంగా నేను **"ఫబిఅయ్యి ఆలాయి రబ్బికుమా తుకజ్జిబాన్"** (మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరించగలరు?) అన్న వచనం పలికినప్పుడల్లా, వారు దానికి జవాబుగా **"లా బి షయ్ఇమ్ మిన్నిఅమిక రబ్బనా! నుకజ్జిబు ఫలకల్ హమ్ద్"** (ప్రభూ! నీవు ప్రసాదించిన ఏ వరాన్ని కూడా మేము త్రోసిపుచ్చలేము. ప్రశంసలు, పొగడ్తలన్నీ నీకే తగును) అని చెప్పేవారు (తిర్మిజీ).
2. ఎవరో మానవమాత్రుడు ముహమ్మద్ (సఅసం)కు ఈ ఖుర్ఆన్ నేర్పి పంపిస్తున్నాడన్న మక్కావాసుల అభిప్రాయానికి సమాధానంగా ఈ వాక్యం అవతరించిందని కొందరు భావిస్తున్నారు. ఇంతకీ రహ్మాన్ అంటే ఏమిటి? అన్న వారి అనుమానానికి సమాధానంగా ఈ వాక్యం అవతరించిందని మరికొందరు చెప్పారు. ఈ వాక్యంలో ఖుర్ఆన్ అర్థం ఏమిటో దేవుడు తన ప్రవక్తకు విశదీకరించాడు లేదా దేవుడు తన ప్రవక్తకు ఖుర్ఆన్ నేర్పాడు. ప్రవక్త తన అనుచర సమాజానికి నేర్పాడు. ఈ సూరాలో దేవుడు తన అనుగ్రహాలెన్నింటినో జ్ఞాపకం చేశాడు. అయితే వీటన్నింటిలోకీ ఖుర్ఆన్ బోధన అతిపెద్ద అనుగ్రహం. అందుకే అన్నింటికన్నా ముందు ఈ విషయాన్నే ఎత్తిచూపటం జరిగింది (ఫత్‌హుల్ ఖదీర్).
3. అంటే మానవుడు కోతి నుండి పుట్టి, క్రమక్రమంగా పరిణామం చెందుతూ నేటి మానవాకారంలోకి వచ్చాడన్న డార్విన్ సిద్ధాంతం నిజం కాదు. మానవుడు ఒక ప్రత్యేక సృష్టి. అతన్ని అల్లాహ్ అచ్చమయిన మనిషి ఆకారంలోనే సృష్టించాడు. తొలి నుండే అతనికి అసాధారణమైన తెలివితేటల్ని ప్రసాదించాడు.
4. ఇక్కడ **'మాట్లాడటం'** అంటే అతని మాతృభాష అన్నమాట! దాన్ని మానవుడు ప్రత్యేకంగా నేర్చుకోడు. తనంతట తానే తన మనోభావాల్ని అందులో వ్యక్తపరుస్తాడు. చివరికి ఏ పరిజ్ఞానమూ, ఏ చైతన్యమూ లేని చంటిపిల్లాడు సయితం మాతృభాషలో మాట్లాడసాగుతాడు. ఇది వాస్తవానికి దైవిక ప్రేరణ! **'అల్లమహుల్ బయాన్'** (అతనికి మాట్లాడటం నేర్పాడు) అంటే ఇదే మరి!
5. అంటే అవి తమ సృష్టికర్త నిర్ధారించిన కక్ష్యలో నిర్ణీత గమ్యం వైపుకు నిరంతరం సాగిపోతూ ఉంటాయి. అవి ఎన్నడూ దైవాజ్ఞను ఎదిరించటంగానీ, తమ పరిధిని దాటిపోవటంగానీ చేయవు.

6 నక్షత్రాలు, వృక్షాలు సాష్టాంగపడుతూ ఉన్నాయి.[6]

وَّالنَّجْمُ وَالشَّجَرُ يَسْجُدٰنِ ⑥

7 ఆయనే ఆకాశాన్ని ఎత్తుగా చేశాడు, ఆయనే (సమతూకం నిమిత్తం) త్రాసును ఉంచాడు.[7]

وَالسَّمَاۗءَ رَفَعَهَا وَوَضَعَ الْمِيْزَانَ ⑦

8 మీరు తూకంలో వైపరీత్యానికి పాల్పడకుండా[8] ఉండేటందుకు!

اَلَّا تَطْغَوْا فِي الْمِيْزَانِ ⑧

9 తూకం సరిగ్గా – న్యాయసమ్మతంగా – ఉండేలా చూడండి. తూకంలో తగ్గించి ఇవ్వకండి.

وَاَقِيْمُوا الْوَزْنَ بِالْقِسْطِ وَلَا تُخْسِرُوا الْمِيْزَانَ ⑨

10 ఆయన సృష్టిరాశుల కోసం భూమిని పరచి ఉంచాడు.

وَالْاَرْضَ وَضَعَهَا لِلْاَنَامِ ⑩

11 అందులో పండ్లు ఫలాదులు, పొరలలో చుట్టబడిన ఖర్జూరాలు ఉన్నాయి.[9]

فِيْهَا فَاكِهَةٌ ۠ وَّالنَّخْلُ ذَاتُ الْاَكْمَامِ ⑪

12 ఊక గల ధాన్యాలూ,[10] సువాసన గల పువ్వులు కూడా ఉన్నాయి.

وَالْحَبُّ ذُو الْعَصْفِ وَالرَّيْحَانُ ⑫

13 కనుక (ఓ మనుషులు, జిన్నులారా!) మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను కాదనగలరు?[11]

فَبِاَيِّ اٰلَاۗءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ⑬

6. ఈ విషయమే వేరొకచోట ఇలా అనబడింది : “భూమ్యాకాశాలలో ఉన్న సమస్త సృష్టిరాసులు అల్లాహ్ ముందు సాష్టాంగపడుతున్న సంగతిని నువ్వు చూడటం లేదా? సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు కూడా (సాష్టాంగ పడుతున్నాయి) (అల్ హజ్జ్ – 18).

7. అంటే ఆయన ధరణిలో న్యాయాన్ని నెలకొల్పాడు. న్యాయాన్ని నెలకొల్పమని మనకు ఆజ్ఞాపించాడు. “నిశ్చయంగా మేము మా ప్రవక్తలకు స్పష్టమయిన నిదర్శనాలను ఇచ్చి పంపాము. వాటితోపాటు గ్రంథాన్నీ, త్రాసును కూడా అవతరింపజేశాము – ప్రజలు న్యాయాన్ని స్థాపించాలన్నదే దీని పరమార్థం” (అల్ హదీద్ – 25).

8. అంటే అన్యాయానికి పాల్పడకండి అని భావం.

9. **‘అక్మామ్’** అంటే – ఖర్జూరపండ్ల పైన ఉండే అతి సన్నని పొరలు.

10. **‘హబ్బ్’** అంటే మనుషులు, పశువులు కూడా తినే ఆహారం అని అర్థం. పండిన (ఎండిన) తరువాత అది పొట్టుగా, తొక్కుగా మారుతుంది. అది పశువులకు గ్రాసంగా ఉపయోగపడుతుంది.

11. దేవుడు తన మహదానుగ్రహాలను జ్ఞాపకం చేస్తూ మనుషులను, జిన్నాతులను అడుగుతున్నాడు – వీటిలో మీరు ఏ అనుగ్రహాన్ని కాదనగలరో చెప్పండి! అని. ఉదాహరణకు: ఒక వ్యక్తి మరో వ్యక్తికి నిరంతరం ఉపకారం చేస్తూనే ఉన్నా ఎదుటి వ్యక్తి ఆ ఉపకారాన్ని పొందుతూ కూడా దాన్ని గుర్తించడు. దానికిగాను కృతజ్ఞతలు తెలుపడు. పైగా నమ్మకద్రోహిగా మారతాడు. అప్పుడు ఉపకారం చేసే వ్యక్తి అతన్ని ఉద్దేశించి, నేను నీకు ఫలానా మేలు చేశాను, నీకు గుర్తుందా! నేను నీకు ఫలానా పని చేసిపెట్టాను, జ్ఞాపకం తెచ్చుకో! నేను నీకు ఫలానా ఉపకారం చేశాను. కాస్తయినా నువ్వు దృష్టిలో పెట్టుకున్నావా!? అని నిలదీసి అడుగుతాడు (ఫత్హుల్ ఖదీర్). అలాగే తన అసంఖ్యాక

14 ఆయన మనిషిని పెంకు మాదిరిగా శబ్దంచేసే మట్టితో సృజించాడు.[12]

خَلَقَ الْإِنسَانَ مِن صَلْصَالٍ كَالْفَخَّارِ ⑭

15 మరి జిన్నాతులను ఆయన అగ్ని జ్వాలలతో[13] సృష్టించాడు.

وَخَلَقَ الْجَانَّ مِن مَّارِجٍ مِّن نَّارٍ ⑮

16 కనుక మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో దేనిని త్రోసిపుచ్చ గలరు?[14]

فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ⑯

17 రెండు తూర్పులకు ప్రభువు (ఆయనే), రెండు పడమరలకు ప్రభువు (కూడా ఆయనే).[15]

رَبُّ الْمَشْرِقَيْنِ وَرَبُّ الْمَغْرِبَيْنِ ⑰

18 మరైతే (ఓ మానవ, జిన్ను వర్గీయులారా!) మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను త్రోసిపుచ్చగలరు?

فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ⑱

19 రెండు సాగర జలాలు పరస్పరం కలిసి ప్రవహించేలా వదలి పెట్టినవాడు ఆయనే.

مَرَجَ الْبَحْرَيْنِ يَلْتَقِيَانِ ⑲

20 అయితే ఆ రెండింటి మధ్య ఒక అడ్డు తెర ఉంది. దాన్ని అవి దాటిపోవు.[16]

بَيْنَهُمَا بَرْزَخٌ لَّا يَبْغِيَانِ ⑳

మైన మేళ్లను అహోరాత్రులు అనుభవిస్తూ కూడా తనను విస్మరించిన సృష్టిశ్రేష్ఠులను ఉద్దేశించి అల్లాహ్ ఈ సూరాలో పదే పదే ప్రశ్నిస్తున్నాడు. ఈ సూరాలో **"ఫబిఅయ్యి ఆలాయి రబ్బికుమా తుకజ్జిబాన్"** అనే వచనం పదే పదే పునరావృతం అవుతూ ఉంటుంది.

12. **'సల్సాలిన్'** ( صَلْصَالٍ) అంటే ఎండిన మట్టి లేక గార అని అర్థం. దీని నుంచి శబ్దం వస్తుంది. **'ఫఖ్ఖార్'** (الفَخَّارُ) అంటే నిప్పులో కాల్చబడిన మట్టి అని అర్థం. అదే పెంకు. ఇక్కడ **'ఇన్సాన్'** (మనిషి) అంటే ఆదం అన్నమాట. ఆయన మొదట మట్టితో మానవాకారం గల బొమ్మగా తయారుచేయబడ్డారు. తరువాత అల్లాహ్ ఆ బొమ్మలో ప్రాణం ఊదాడు. దరిమిలా ఆయన (ఆదం) ఎడమ ప్రక్కటెముకచే హవ్వాను సృజించాడు. మరి వారిద్దరి ద్వారా ప్రపంచంలో మానవ సంతతి వ్యాపించింది.

13. అంటే జిన్నుల మూలపురుషుడు – తొలి జిన్ను – అని భావం. ఈ జిన్నును ఆయన అగ్ని జ్వాలలతో పుట్టించాడు. **'మారిజ్'** ( مَارِجٌ) అంటే అగ్నిజ్వాల.

14. మీ మూల పురుషుని పుట్టుక అయినా, ఆ తరువాత ప్రపంచంలో ఎంతో వేగంగా విస్తరించే మనుజ జాతి అయినా దేవుని గొప్ప అనుగ్రహమే. మీరు ఈ అనుగ్రహాన్ని కాదనగలరా?

15. ఒకటి వేసవికాలపు తూర్పు, మరొకటి చలికాలపు తూర్పు. అలాగే పడమరలు కూడా. అందుకే రెండు తూర్పులు, రెండు పడమరలని ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది. ఒక కాలంలో తూర్పు ప్రాంతం వేడిగా ఉంటే పశ్చిమ ప్రాంతాలు చల్లగా ఉంటాయి. ఈ వైవిధ్యం కూడా ప్రాణులకు ఎంతగానో మేలు చేకూరుస్తుంది. కాబట్టి ఇది కూడా దేవుని అనుగ్రహంగా పేర్కొనబడింది.

16. **'మరజ'** అంటే ప్రవహింపజేశాడు అని అర్థం. అల్ ఫుర్ఖాన్ సూరా (53వ ఆయతు)లో ఈ వివరాలు వచ్చాయి. కొంతమంది పండితుల దృష్టిలో రెండు సముద్రాలంటే అవి రెండూ వేర్వేరు. ఒకటేమో మంచినీటి ప్రవాహం.

21 కాబట్టి మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో దేనిని నిరాకరించ గలరు?

فَبِاَيِّ اٰلَاۤءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿21﴾

22 ఆ రెండింటి నుంచీ ముత్యాలు, పగడాలు బయల్పడుతున్నై.[17]

يَخْرُجُ مِنْهُمَا اللُّؤْلُؤُ وَالْمَرْجَانُ ﴿22﴾

23 మరి మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో ఏ ఒక్కదానిని తిరస్క రించగలరు?[18]

فَبِاَيِّ اٰلَاۤءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿23﴾

24 సముద్రాలలో పర్వతాల్లా ఎత్తుగాఉండి రాకపోకలు సాగిస్తున్న ఓడలు కూడా ఆయనవే.[19]

وَلَهُ الْجَوَارِ الْمُنْشَئٰتُ فِى الْبَحْرِ كَالْاَعْلَامِ ﴿24﴾

---

దానివల్ల పంటపొలాలు తడుస్తాయి. మనుషులకు మంచినీరు సరఫరా అవుతుంది. రెండవది : సముద్రపు నీరు. అది ఉప్పగా, చేదుగా ఉంటుంది. దాని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఇవి రెండూ అంత తేలిగ్గా కలిసిపోవు. ఆ రెండు నీటి ప్రవాహాలు ఒకచోట కలిసినా – వేటికవే వేర్వేరుగా ప్రవహిస్తుంటాయి.

మరికొంతమంది అభిప్రాయం ప్రకారం సృష్టికర్త ఉప్పు నీరున్న సముద్రంలోనే కొన్నిచోట్ల మంచినీటి ఒనరులను కూడా సృజించాడు. ఆ నీరు ఉప్పునీరులో కలవకుండా వేరుగానే ఉంటుంది. మరి కొన్నిచోట్ల ఉపరితలంలో ఉప్పు నీరుంటే అడుగు భాగంలో మంచినీటి ఊటలుంటాయి. అలాగే వేర్వేరు ప్రదేశాల సముద్ర జలాలు వేర్వేరు రంగుల్లో ఉంటాయి. రుచిలో కూడా మార్పు ఉంటుంది.

అదలా ఉంచితే అనేక ప్రాంతాలలోని మంచినీరు నదీనదాల ద్వారా పోయి సముద్రంలో కలుస్తూ ఉంటుంది. అలా కలుసుకున్న చోట్ల జాగ్రత్తగా గమనించిన వారికి కనిపించేదేమిటంటే – ఆ రెండు జలాలు ఓ పట్టాన మిశ్రమం కావు. కొన్ని కిలోమీటర్ల దూరం వరకు అవి రెండూ వేర్వేరుగా ప్రవహిస్తూ ఉంటాయి. ఒక ప్రక్కన నదీజలం! మరో ప్రక్కన సముద్రజలం!! వాటిమధ్యన ఏ అడ్డుగోడా లేదు. అయినాసరే ఏదో అనిర్వచనీయమైన అడ్డుతెర ఉంటుంది. ఆ అడ్డును ఏ ఒక్కటీ మీరిపోదు.

17. **'మర్జాన్'** అంటే చిన్నముత్యాలని అర్థం. ఆకాశం నుంచి వర్షం కురిసే సమయంలో ఆలుచిప్పలు నోరు తెరుస్తాయని, ఆ సందర్భంగా వాటిలోపల పడే వర్షపు బిందువు తోనే ముత్యం తయారవుతుందని అంటారు. సాధారణంగా ఈ ముత్యాలు మంచినీటి సరస్సులలో కాకుండా సముద్రపు నీటిలోనే ఉత్పన్నమవుతాయి. కాని ఖుర్ఆన్‌లో చెప్పబడిన దాన్నిబట్టి ఈ రెండు జలాశయాలలో కూడా ముత్యాలు లభ్యమవుతాయని అవగతమవుతోంది. అయితే అత్యధికంగా అవి సముద్రాల నుంచే లభ్యమవుతూ ఉండటం వల్ల బహుశా అవి సముద్రపు ఉత్పత్తేనన్నది జగద్విదితం అయిపోయింది. అంతమాత్రాన నదీ ప్రవాహాలలో స్వాతిముత్యాలు లభ్యమయ్యే విషయాన్ని ఎవరూ కొట్టివేయలేరు. నూతన పరిశోధనల్లో కూడా ఈ సంగతి రూఢీ అయింది. కాని నదీజలాల నీరు నిరంతరం ప్రవహిస్తూ ఉండటం వల్ల ముత్యాలను వెలికి తీయటం కష్టమవుతుంది. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం నదీ జలాల గమ్యస్థానం సముద్రమే, నదీజలాలతో పాటు ముత్యాలు కూడా సముద్రంలోనికే చేర్తాయి. కాబట్టి సముద్రం నుంచి మనకు లభించే ముత్యాలలో ఈ రెండు రకాల ముత్యాలు కూడా కలిసి ఉంటాయి.

18. మొత్తానికి ఈ ముత్యాలు – పగడాలు, వజ్రవైఢూర్యాలు ప్రజలకు ఆభరణాలుగా ఉపయోగపడటమే గాకుండా వారి అంతస్థుకు చిహ్నంగా ఉంటున్నాయి. కాబట్టి అవి కూడా దైవానుగ్రహాలుగా పరిగణించబడ్డాయి.

19. **'అల్ జవారి'** ( الْجَوَارِ) అంటే నడిచేవి, సాగిపోయేవి అని అసలు అర్థం. **'మున్షఆత్'** (الْمُنْشَئٰتُ) అంటే ఎత్తైనవి

25 కనుక మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను కాదన గలరు?[20]

فَبِاَیِّ اٰلَآءِ رَبِّکُمَا تُکَذِّبٰنِ ﴿25﴾

26 భూమండలంపై ఉన్నవారంతా నశించి పోవలసినవారే.

کُلُّ مَنۡ عَلَیۡهَا فَانٍ ﴿26﴾

27 ఎప్పటికీ మిగిలి ఉండేది ఘనత, గౌరవం గల నీ ప్రభువు అస్తిత్వం మాత్రమే.

وَّ یَبۡقٰی وَجۡهُ رَبِّکَ ذُو الۡجَلٰلِ وَ الۡاِکۡرَامِ ﴿27﴾

28 మరి మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో దేనిని త్రోసిపుచ్చ గలరు?[21]

فَبِاَیِّ اٰلَآءِ رَبِّکُمَا تُکَذِّبٰنِ ﴿28﴾

29 ఆకాశాలలో, భూమిలో ఉన్నవారంతా (తమ అవసరాలు తీర డానికి) ఆయన్నే అర్థిస్తున్నారు.[22] ప్రతి దినం ఆయన ఓ (వినూత్న) వైభవంతో వెలుగొందుతూ[23] ఉంటాడు.

یَسۡـَٔلُهٗ مَنۡ فِی السَّمٰوٰتِ وَ الۡاَرۡضِ ؕ کُلَّ یَوۡمٍ هُوَ فِیۡ شَاۡنٍ ﴿29﴾

30 కనుక (ఓ జిన్నులారా! మానవుల్లారా!) మీరుభయులూ మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను త్రోసిపుచ్చగలరు?[24]

فَبِاَیِّ اٰلَآءِ رَبِّکُمَا تُکَذِّبٰنِ ﴿30﴾

అని అర్థం. ఈ ఎత్తయిన, కొండల్లాంటి ఓడలను నిర్మించింది మీరే అయినా, మిమ్మల్ని నిర్మించినవాడు ఆ దేవుడే కదా! కాబట్టి మీరూ, మీ ఆవిష్కరణలు కూడా వాస్తవానికి ఆ సృష్టికర్తకు చెందినవే. మీ ఓడలు నడిచేది కూడా ఆయన నిర్మించిన సముద్రంలోనే.

20. ఈ నౌకాయానం ద్వారా మీకు ఒనగూడే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. నిస్సందేహంగా ఇది కూడా మీ ప్రభువు అనుగ్రహమే. కాబట్టి మీరు ఆ అనుగ్రహాన్ని ఎట్టి పరిస్థితిలోనూ త్రోసిపుచ్చలేరు.

21. ఈ ప్రపంచం నశించిన మీదట శిక్షా బహుమానాల వ్యవస్థ నెలకొంటుంది. ఇది కూడా మీప్రభువు మహదనుగ్రహమే. కాబట్టి ఇందుకుగాను మీరు కృతజ్ఞతలు చెల్లించవలసిందే.

22. అంటే అందరూ ఆయన దయాదాక్షిణ్యాలపై జీవించేవారే. అందరూ ఆయనపై ఆధారపడి ఉన్నవారే. ఆయన కృప లేనిదే ఎవరూ ఒక్క క్షణం కూడా మనజాలరు.

23. **'ప్రతిదినం'** అంటే ప్రతి ఘడియ, ప్రతిక్షణం! **'వినూత్న వైభవం'** అంటే సరికొత్త వ్యాపకం, కొంగ్రొత్త ప్రక్రియ అని భావం. ఆయన ప్రతిక్షణం ఏదో ఒక ముఖ్యమైన పనిలో నిమగ్నుడై ఉంటాడు. కొందరికి స్వస్థతను ప్రసాదించటంలోనో, కొందరిని అస్వస్థతకు లోను చేయటంలోనో మునిగి ఉంటాడు. కొందరికి కలిమిని ఇస్తే మరి కొందరిని లేమికి గురిచేస్తూ ఉంటాడు. కొందరిని ధనికులుగా, మరికొందరిని కటిక దరిద్రులుగా మారుస్తూ ఉంటాడు. కొందరిని కీర్తి శిఖరాల అంబరాలకు చేరిస్తే, మరికొందరిని పతనాల లోయల్లోకి నెట్టివేస్తూ ఉంటాడు. చెప్పొచ్చేదేమిటంటే విశ్వమండలంలోని ఈ ఉత్థాన పతనాల తెరల వెనుక క్రియాత్మక పాత్రను పోషించేది ఆయనే. ఆయన ప్రణాళికను అనుసరించే ఇదంతా జరుగుతోంది. రేయింబవళ్ళలో ఏ ఒక్క క్షణం కూడా ఆయన ప్రమేయం లేకుండా ఏదీ నడవదు. ఆయన అజరుడు, నిత్యుడు. సకల చరాచర సృష్టికి ఆయన మూలాధారం. ఆయన ఒక్క క్షణం కూడా నిదురపోడు. ఆయనకు కునుకు కూడా రాదు.

24. మరి అంతటి గొప్పవాడు అనుక్షణం తన దాసుల వ్యవహారాలలో తలమునకలై ఉండటం మామూలు విషయమా? మరి ఆయన మహోపకారాన్ని మీరు ఎలా తిరస్కరిస్తారు?

31 (జిన్ను జాతికి, మనుజ జాతికి చెందిన) ఓ ఇరువర్గాల వారలారా! అతి త్వరలోనే మేము తిరిగ్గా మీసంగతి చూస్తాము.[25]

سَنَفْرُغُ لَكُمْ اَيُّهَ الثَّقَلٰنِ ﴿31﴾

32 మరి మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో దేనిని త్రోసిపుచ్చు తారు?

فَبِاَيِّ اٰلَآءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿32﴾

33 ఓ జిన్నుల, మానవుల సమూహానికి చెందినవారలారా! మీలో ఎవరికయినా భూమ్యాకాశాల అంచుల నుండి పారిపోయే శక్తి ఉంటే పారిపోయి చూడండి![26] అధికారం లేకుండా మీరు ఎట్టి పరిస్థితిలోనూ పోలేరు.[27]

يٰمَعْشَرَ الْجِنِّ وَالْاِنْسِ اِنِ اسْتَطَعْتُمْ اَنْ تَنْفُذُوْا مِنْ اَقْطَارِ السَّمٰوٰتِ وَ الْاَرْضِ فَانْفُذُوْا ؕ لَا تَنْفُذُوْنَ اِلَّا بِسُلْطٰنٍ ﴿33﴾

34 కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను కాదనగలరు?

فَبِاَيِّ اٰلَآءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿34﴾

35 (ఒకవేళ మీరు అవిధేయతకు పాల్పడినట్లయితే) మీపైకి మండే అగ్ని జ్వాలలు, ధూమకెరటాలు పంపబడతాయి.[28] దాన్నుంచి మీరు తప్పించుకోలేరు.[29]

يُرْسَلُ عَلَيْكُمَا شُوَاظٌ مِّنْ نَّارٍ ۙ وَّنُحَاسٌ فَلَا تَنْتَصِرٰنِ ﴿35﴾

36 కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు?

فَبِاَيِّ اٰلَآءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿36﴾

37 మరెప్పుడయితే ఆకాశం చీలిపోయి, ఎర్రని చర్మంలా తయా రవుతుందో[30] (ఆ స్థితిని ఓసారి నెమరు వేసుకోండి!)

فَاِذَا انْشَقَّتِ السَّمَآءُ فَكَانَتْ وَرْدَةً كَالدِّهَانِ ﴿37﴾

25. అంటే అల్లాహ్‌కు బొత్తిగా తీరికలేదని దీని భావం ఎంతమాత్రం కాదు. హెచ్చరికగా అలా అనటం జరిగింది. మనుషులను, జిన్నులను దైవ శాసనాలకు కట్టుబడి ఉండేలా చేయటం దీని అసలు ఉద్దేశం.

26. ఈ ఆంక్ష కూడా ఒకందుకు మంచిదే. దీనివల్ల వారు అదుపు అజమాయిషీలో ఉంటారు. దుర్మార్గులు తమ దుర్మార్గాలను మానుకుంటారు. సజ్జనులు తమ సత్కర్మలలో మరింత ముందంజ వేస్తారు. కాబట్టి ఇది కూడా ఒక విధంగా ప్రాణుల పాలిట వరమే.

27. పారిపోయే శక్తి ఎవరిలో ఉందనీ?! ఒకవేళ పారిపోయినా ఎందాక పోతారు? దేవుని అదుపులో లేని భూభాగం ఎక్కడుంది? ఈ ఆంక్ష కూడా మానవత పాలిట ఒక విధంగా గొప్ప అనుగ్రహమే.

మరి కొంతమంది ప్రకారం ఈ మాట మహ్షర్ మైదానంలో అనబడుతుంది. ఆ సమయంలో దైవదూతలు అందరినీ నలువైపుల నుండీ చుట్టుముట్టి ఉంటారు. ఈ రెండు అభిప్రాయాలు కూడా సరైనవే.

28. ఒకవేళ మీరు పారిపోయేందుకు ప్రయత్నించినా పారిపోలేరు. పారిపోయే వారిని దైవదూతలు వెంబడిస్తారు. మీపై అగ్నిజ్వాలలు, ధూమకెరటాలు వదులుతారు. కరిగించబడిన రాగిని నెత్తిమీద వేసి మిమ్మల్ని ఈడ్చుకు వస్తారు. **'నుహాసున్'** (نُحَاسٌ) అంటే కరిగించబడిన రాగి అని అర్థం.

**38** మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను కాదంటారు?

فَبِاَیِّ اٰلَآءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿38﴾

**39** ఆ రోజు ఏ మనిషికీ, ఏ జిన్నుకూ అతని పాపాల గురించి ప్రశ్నించవలసిన అగత్యం ఉండదు.[31]

فَیَوْمَئِذٍ لَّا یُسْـَٔلُ عَنْ ذَنْۢبِهٖۤ اِنْسٌ وَّلَا جَآنٌّ ﴿39﴾

**40** కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను నిరాకరిస్తారు?

فَبِاَیِّ اٰلَآءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿40﴾

**41** అపరాధులు తమ వాలకాన్ని (నలుపు ఆవరించిన తమ ముఖాలను) బట్టే పసిగట్టబడతారు.[32] మరి వారు తమ నుదుటి జుత్తు ద్వారా, పాదాల ద్వారా పట్టుకోబడతారు.[33]

یُعْرَفُ الْمُجْرِمُوْنَ بِسِیْمٰهُمْ فَیُؤْخَذُ بِالنَّوَاصِیْ وَالْاَقْدَامِ ﴿41﴾

**42** మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను ధిక్కరిస్తారు?

فَبِاَیِّ اٰلَآءِ رَبِّكُمَا تُكَذِّبٰنِ ﴿42﴾

**43** నేరస్థులు అబద్ధమని కొట్టిపారేసిన నరకం ఇదే.

هٰذِهٖ جَهَنَّمُ الَّتِیْ یُكَذِّبُ بِهَا الْمُجْرِمُوْنَ ﴿43﴾

**44** వారు దీనికీ (నరకానికీ) – సలసలా కాగే నీళ్లకు మధ్య తచ్చాడుతూ ఉంటారు.[34]

یَطُوْفُوْنَ بَیْنَهَا وَبَیْنَ حَمِیْمٍ اٰنٍ ﴿44﴾

29. అంటే దైవశిక్షను అడ్డుకునే శక్తిగానీ, వాయిదా వేయించే తాహతుగానీ మీకు లేదు.

30. ప్రళయదినాన ఆకాశం బ్రద్దలైపోతుంది. దైవదూతలు దివి నుంచి భువికి దిగివస్తారు. ఆనాడు ఆకాశం నరకాగ్ని తాపానికి కరిగి ఎర్రని చర్మంలా మారిపోతుంది.

31. అంటే వారు సమాధుల నుండి లేచి వస్తున్నప్పుడు వారిని ప్రశ్నించటం జరగదు. వారంతా లెక్కలు తేల్చేచోట సమావేశమయ్యాకే ప్రశ్నించబడతారని ఒక అర్థం.

ఈ ఆయతుకు మరో అర్థం ఇది: "ఎన్ని పాపాలు చేశావు? లాంటి ప్రశ్నలు వారికి వేయబడవు. ఎందుకంటే వారి వారి పాపాల చిట్టా అంతా అక్కడ సిద్ధంగా ఉంటుంది. కాబట్టి ఈ పాపాలు ఎందుకు చేశావు? అని మాత్రమే ప్రశ్నించటం జరుగుతుంది. లేదా వేరొక అభిప్రాయం ప్రకారం అసలు వారిని ప్రశ్నించాల్సిన అవసరమే ఉండదు. వారి శరీరావయవాలు ఖుద్దుగా వారి దురాగతాలను గురించి ఏకరువు పెడతాయి.

32. అంటే ఆనాడు సజ్జనులు ప్రకాశించే తమ ముఖారవిందాల ఆధారంగా గుర్తించబడినట్లే పాపాత్ములు కూడా తమ పాపిష్ఠి ముఖాల ద్వారా ఇట్టే తెలుసుకోబడతారు. వారి ముఖాలపై నలుపు ఆవరించి ఉంటుంది. వారి కళ్లు కాంతి హీనంగా ఉంటాయి.

33. దైవదూతలు ఒక్కోసారి వారి నుదుటి జుత్తును వారి పాదాలతో కలిపి నిర్దాక్షిణ్యంగా నరకం వైపుకు ఈడ్చుకుపోతారు. ఒక్కోసారి కాళ్ళు పట్టి ఈడుస్తారు. ఒక్కోసారి జుత్తు పట్టి ఈడుస్తారు.

34. అంటే వారు ఒక్కోసారి నరకాగ్నిలో మాడ్చబడితే, ఒక్కోసారి వారికి సలసల కాగే నీరు త్రాగటానికి ఇవ్వబడుతుంది. అది త్రాగగానే వారి కడుపులోని ప్రేగులు తెగిపోతూ ఉంటాయి. **'ఆనిన్'** (اٰنٍ) అంటే వేడిది, సలసల కాగేది అని అర్థం.

فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿45﴾

**45** మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు?

وَلِمَنْ خَافَ مَقَامَ رَبِّهِ جَنَّتَانِ ﴿46﴾

**46** తమ ప్రభువు ఎదుట నిలబడవలసి ఉందనే భయం కలిగి ఉండేవారికి రెండు తోటలుంటాయి.[35]

فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿47﴾

**47** కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు?

ذَوَاتَا أَفْنَانٍ ﴿48﴾

**48** (అవి రెండూ) శాఖోపశాఖలుగా విస్తరించి ఉంటాయి.[36]

فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿49﴾

**49** మరి మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో దేన్ని త్రోసిపుచ్చుతారు?

فِيهِمَا عَيْنَانِ تَجْرِيَانِ ﴿50﴾

**50** మరి ఆ రెండు తోటలలోనూ రెండు సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి.[37]

فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿51﴾

**51** మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను త్రోసిపుచ్చుతారు?

فِيهِمَا مِنْ كُلِّ فَاكِهَةٍ زَوْجَانِ ﴿52﴾

**52** ఆ రెండు తోటలలోనూ ప్రతి పండు యొక్క రెండేసి రకాలు ఉంటాయి.[38]

فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿53﴾

**53** మరి మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో దేనిని కాదంటారు?

---

35. హదీసులో ఇలా ఉంది : "రెండు వెండి తోటలుంటాయి. ఆ తోటలలోని పాత్రలు, ఇంకా వాటిలో ఉన్నవన్నీ వెండివే అయి ఉంటాయి. రెండు బంగారు తోటలుంటాయి. అందలి పాత్రలు, ఇంకా ఇతరత్రా అందులో ఉన్నవన్నీ బంగారువే అయి ఉంటాయి." (సహీహ్ బుఖారీ : అర్రహ్మాన్ సూరా వ్యాఖ్యానం). బంగారు తోటలు చాలా సన్నిహితులైన విశ్వాసులకు లభిస్తాయనీ, వెండి తోటలు కుడిపక్షం వారైన సాధారణ విశ్వాసులకు లభిస్తాయని మరికొన్ని ఆధారాల ద్వారా తెలుస్తోంది (ఇబ్నె కసీర్).

36. ఆ తోటల్లోని వృక్షాలు శాఖోపశాఖలుగా విస్తరించి నలువైపులా దట్టమైన నీడలను ఇస్తూ ఉంటాయి. అదీగాక ప్రతి కొమ్మకు, ప్రతి రెమ్మకు పండ్లు ఉంటాయి. పండ్ల బరువు వల్ల ఆ కొమ్మలు క్రిందికి వంగి కనుల విందుగా ఉంటాయి. (ఇబ్నె కసీర్).

37. ఆ రెండు సెలయేరులలో ఒక దానిపేరు 'తస్నీమ్'. రెండవదాని పేరు 'సల్సబీల్.'

38. ప్రతి జాతికి చెందిన పండులో రెండేసి రకాలంటే తీపి, రుచి దృష్ట్యా వేర్వేరుగా ఉంటాయన్నమాట! దేవుని ప్రత్యేక కటాక్షానికి ఇదొక ప్రతిరూపం అన్నమాట! రెండేసి రకాలంటే ఒకటి ఎండినది, మరొకటి పండినది అని కొందరు అభిప్రాయపడ్డారు.

| | |
|---|---|
| **54** వారు (స్వర్గవాసులు) దళసరి పట్టు వస్త్రపు అస్తరుగల పరుపులపై దిండ్లకు ఆనుకుని (దర్జాగా) ఆసీనులైఉంటారు.[39] ఆ రెండు తోటల పండ్లు ఫలాలు (వారికి) మరీ దగ్గరగాఉంటాయి.[40] | مُتَّكِـِٔينَ عَلَىٰ فُرُشٍۭ بَطَآئِنُهَا مِنْ إِسْتَبْرَقٍ ۚ وَجَنَى ٱلْجَنَّتَيْنِ دَانٍ ﴿٥٤﴾ |
| **55** కనుక మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను ధిక్క రిస్తారు? | فَبِأَىِّ ءَالَآءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿٥٥﴾ |
| **56** వాటి మధ్య (బిడియంతో) చూపులు క్రిందికి వాలి ఉండే స్వర్గ కన్యలుంటారు.[41] వీరికి పూర్వం ఆ స్వర్గ కన్యలను ఏ మానవుడుగానీ, ఏ జిన్నుగానీ ముట్టుకొని ఉండడు.[42] | فِيهِنَّ قَٰصِرَٰتُ ٱلطَّرْفِ لَمْ يَطْمِثْهُنَّ إِنسٌ قَبْلَهُمْ وَلَا جَآنٌّ ﴿٥٦﴾ |
| **57** మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను త్రోసి పుచ్చగలరు? | فَبِأَىِّ ءَالَآءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿٥٧﴾ |
| **58** ఆ స్వర్గకన్యలు (అందచందాల రీత్యా స్వచ్ఛమైన) కెంపులు, పగడాల మాదిరిగా ఉంటారు.[43] | كَأَنَّهُنَّ ٱلْيَاقُوتُ وَٱلْمَرْجَانُ ﴿٥٨﴾ |
| **59** మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరించగలరు? | فَبِأَىِّ ءَالَآءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿٥٩﴾ |

39. ఇక్కడ కేవలం అస్తరు (అంచు) మాత్రమే వర్ణించబడింది. దాని అస్తరే ఇంత ఖరీదైన దైనప్పుడు ఆ పరుపులు, వాటిపై కప్పబడే వస్త్రం మరెంత ఖరీదైనవో ఊహించవచ్చు.

40. మరీ దగ్గరగా ఉండటమంటే అర్థం వారు తామున్నచోటే కూర్చొని ఆ పండ్లను కోసుకోవచ్చు. ఆ పండ్ల గుత్తులు వారి తలల మీదే వ్రేలాడుతూ ఉంటాయి! (అల్ హాఖ్ఖ సూరా 23వ ఆయతును చూడండి).

41. వారి కన్నులు వ్రీడ బరువుతో, క్రిందికి వాలి ఉంటాయి. వారి చూపులు తమ భర్తలపైనే తప్ప వేరొకరిపై పడవు. వారి కంటికి వారి భర్తలు మాత్రమే అందరికంటే అందమైన వారుగా కనిపిస్తారు.

42. అంటే వారు కన్యలై ఉంటారు. అంతకుముందు ఎవరితోనూ వారికి వివాహమై ఉండదు. ఈ ఆయతు ద్వారాను, ఇంతకుముందు వచ్చిన మరికొన్ని ఆయతుల ద్వారాను తెలిసేదేమిటంటే విశ్వసించిన జిన్నులు కూడా విశ్వసించిన మనుషుల్లాగే స్వర్గానికి పోతారు. స్వర్గంలో మనుషులతో జరిగే సద్వ్యవహారమే జిన్నులతో కూడా జరుగుతుంది.

43. అంటే స్వచ్ఛతలో కెంపుల్లా, తెలుపు ఎరుపు రంగుల పగడాల్లా మెరిసిపోతూ ఉంటారు. వారి సౌందర్యం గురించి ప్రామాణిక హదీసుల్లో వర్ణనలు ఉన్నాయి. ఉదాహరణకు: "వారి అందం ఎంత గొప్పదంటే వారి పిక్కల లోపల ఉన్న ఎముకలోని గుజ్జు సయితం బయటకు కనిపిస్తూ ఉంటుంది" (సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్). మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది : "స్వర్గంలోని స్త్రీల అందం వర్ణనాతీతం. వారిలో ఏ స్త్రీ అయినా భూమండలం వైపుకు తొంగిచూస్తే చాలు, భూమ్యాకాశాల మధ్య గల భాగమంతా ధగధగా మెరిసిపోతుంది. సువాసనతో నిండి పోతుంది. ఆమె తలపై ఉండే వోణి విలువ ప్రపంచం మరియు అందులో ఉన్నదానంతటికన్నా గొప్పది." (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్).

| | |
|---|---|
| 60 సద్వ్యవహారానికి ప్రతిఫలం సద్వ్యవహారం గాక మరేం కాగలదు?[44] | هَلْ جَزَآءُ الْإِحْسَانِ إِلَّا الْإِحْسَانُ ﴿60﴾ |
| 61 మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్క రించగలరు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿61﴾ |
| 62 ఈ రెండు తోటలే గాకుండా మరో రెండు తోటలు కూడా ఉన్నాయి.[45] | وَمِن دُونِهِمَا جَنَّتَانِ ﴿62﴾ |
| 63 కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క అనుగ్రహాలలో దేనిని త్రోసి పుచ్చుతారు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿63﴾ |
| 64 అవి రెండూను గుబురుగా, (రంగులో) ముదురు ఆకుపచ్చగా ఉంటాయి.[46] | مُدْهَامَّتَانِ ﴿64﴾ |
| 65 మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను త్రోసి పుచ్చగలరు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿65﴾ |
| 66 ఆ రెండు వనాలలో పొంగిపొరలే రెండు సెలయేరు లుంటాయి.[47] | فِيهِمَا عَيْنَانِ نَضَّاخَتَانِ ﴿66﴾ |
| 67 కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను కాదన గలరు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ ﴿67﴾ |
| 68 ఆ రెండింటిలోనూ పండ్లు, ఖర్జూరాలు, దానిమ్మ కాయలు (పుష్కలంగా) ఉంటాయి.[48] | فِيهِمَا فَاكِهَةٌ وَنَخْلٌ وَرُمَّانٌ ﴿68﴾ |

44. ఈ వాక్యంలోని మొదటి సద్వ్యవహారాని (ఇహ్సాన్)కి భావం సత్కార్యం, దైవవిధేయత. రెండవ సద్వ్యవహారానికి అర్థం సత్ఫలితం, స్వర్గం.

45. ఈ రెండు తోటలు ఇంతకు ముందు 46వ ఆయతులో ప్రస్తావించబడిన తోటలకన్నా అంతస్థుల రీత్యా కాస్త దిగువ శ్రేణికి చెందినవి.

46. బాగా ఏపుగా పెరిగి ఉండటం వల్ల ఆ వృక్షాలు ఒకింత నల్లగా కానవస్తూ ఉంటాయి.

47. ఇంతకుముందు రెండు సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి (50) అని చెప్పటం జరిగింది. ఈ ఆయతులో మాత్రం **'నజ్జాఖతాన్'** (نَضَّاخَتَانِ) (పొంగిపొరలుతూ) అని అనబడింది. ఇందులో ఉధృతి కాస్త తక్కువగా ఉంటుందని భావం.

48. ఇంతకుముందు ప్రస్తావించబడిన రెండు తోటలలో ప్రతి పండూ రెండేసి రకాలుగా ఉంటుందని తెలుపబడింది. నిజమే. ఆ తోటలు ఈ రెండు తోటలకన్నా ఉన్నత శ్రేణికి చెందినవి. దైవసామీప్యం పొందిన ధన్యజీవుల కొరకు అవి ఉద్దేశించినవి మరి!

| | |
|---|---|
| **69** మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ (69) |
| **70** వాటిలో సౌశీల్యవతులు, సౌందర్యవతులు అయిన స్త్రీలు ఉంటారు.[49] | فِيهِنَّ خَيْرَاتٌ حِسَانٌ (70) |
| **71** కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను త్రోసి పుచ్చగలరు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ (71) |
| **72** గుడారాలలో సురక్షితంగా ఉంచబడిన (ఎర్రని) సుందరాంగులు[50] కూడా ఉన్నారు. | حُورٌ مَّقْصُورَاتٌ فِي الْخِيَامِ (72) |
| **73** కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క అనుగ్రహాలలో దేనిని త్రోసి పుచ్చగలరు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ (73) |
| **74** వారికి (ఈ స్వర్గవాసులకు) పూర్వం వారిని ఏ మనిషిగానీ, జిన్నుగానీ ముట్టుకొని ఉండదు. | لَمْ يَطْمِثْهُنَّ إِنسٌ قَبْلَهُمْ وَلَا جَانٌّ (74) |
| **75** కాబట్టి (ఓ జిన్నులారా! ఓ మానవులారా!) మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను త్రోసిపుచ్చుతారు? | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ (75) |
| **76** వారు పచ్చటి పరుపులపై, ఖరీదైన తివాచీలపై దిండ్లకు ఆనుకుని కూర్చుని ఉంటారు.[51] | مُتَّكِئِينَ عَلَىٰ رَفْرَفٍ خُضْرٍ وَعَبْقَرِيٍّ حِسَانٍ (76) |
| **77** కాబట్టి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను కాదంటారు?[52] | فَبِأَيِّ آلَاءِ رَبِّكُمَا تُكَذِّبَانِ (77) |

49. **"ఖైరాత్"** (خَيْرٰتٌ) అంటే గుణగణాలకు, నడతకు సంబంధించిన గొప్పదనం. **'హిసాన్'** (حِسَانٌ) అనేది అందచందాలను, లలిత లావణ్యాలను సూచిస్తుంది.

50. మహాప్రవక్త (సఅసం) వారు ఇలా అన్నారు: "స్వర్గంలో ముత్యాలు పొదగబడిన గుడారాలుంటాయి. వాటి వెడల్పు 60 మైళ్ళు. ఆ గుడారంలోని ఒక్కో మూలలో స్వర్గవాసి అర్ధాంగి ఉంటుంది. వారు మరో మూలన ఉన్నవారికి కానరారు. విశ్వాసి ఆ గుడారంలో సంచరిస్తాడు." (సహీహ్ బుఖారీ – అర్రహ్మాన్ సూరా వ్యాఖ్యానం; సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్).

51. **'రఫ్‌రఫిన్'** (رَفْرَفٍ) అంటే పరుపు, తివాచీ లేక పరచబడిన మరేదైనా వస్త్రం అని అర్థం. ఇక ప్రతి ఖరీదైన, ఉత్తమమైన వస్తువును **'అబ్‌ఖరియ్యున్'** (عَبْقَرِيٌّ) అంటారు. ఒకసారి దైవప్రవక్త (స) తన ప్రియసహచరుడైన హజ్రత్ ఉమర్‌ని ఉద్దేశించి, "నేనింతవరకూ ఉమర్‌లాగా ఉత్తమంగా పనిచేసే వానిని (అబ్‌ఖరియ్యున్‌ని) చూడలేదు" అన్నారు (బుఖారీ – కితాబుల్ మనాఖిబ్; సహీహ్ ముస్లిం – ప్రవక్త సహచరుల మహిమోన్నతులు). ఇంతకీ ఈ ఆయతు భావం ఏమిటంటే; స్వర్గవాసులు పచ్చటి, సుతిమెత్తని వస్త్రాలతో అలంకరించబడిన పీఠాలపై దర్జాగా కూర్చుని ఉంటారు. వారి సదనాలలో ఖరీదైన తివాచీలు కూడా పరచబడి ఉంటాయి.

| | |
|---|---|
| **78** ఘనత గౌరవాలు గల నీ ప్రభువు నామం ఎంతో శుభప్రద మైనది.[53] | تَبٰرَكَ اسْمُ رَبِّكَ ذِى الْجَلٰلِ وَالْاِكْرَامِ ﴿٧٨﴾ |

52. ఈ ఆయతు ఈ సూరాలో 31 సార్లు వచ్చింది. ఈ సూరాలో దేవుడు తన అనుగ్రహాలెన్నింటినో ప్రస్తావించి ప్రతి ఒక్క అనుగ్రహం లేక రెండు మూడు అనుగ్రహాల తరువాత "మీరు దేన్ని కాదనగలరో చెప్పండి?" అంటూ నిలదీసి అడిగాడు. నరకాగ్ని యాతనను, మహ్షర్ మైదానంలోని తీవ్రతను గురించి చెప్పేటప్పుడు కూడా ఈ ప్రశ్న వేశాడు. పరలోక భీతిని రగుల్గొల్పటం, నరకయాతన గురించి భయపెట్టడం కూడా దేవుని అనుగ్రహమే. ఈ హెచ్చరికల తరువాత కొందరు పశ్చాత్తాపం చెంది దారికి రావచ్చు.

మరో ముఖ్య విషయమేమిటంటే మనుషుల్లాగానే జిన్నులు కూడా బుద్ధివివేకాలు గల జీవులే. ఒక్కడైన నిజదైవాన్ని పూజించాలని, షిర్కుకు ఒడిగట్టరాదని జిన్నులకు ఆదేశించబడింది. షరీయతు ఆజ్ఞలకు కట్టుబడి జీవితం గడపాల్సిందిగా ఈ రెండు ప్రాణులకే (మనుషులకు, జిన్నులకు) సూచించబడింది. అందుకే ఈ రెండు ప్రాణులకు ఆలోచించే అర్థం చేసుకునే తెలివితేటల్ని ఇవ్వటంతోపాటు, ఎంపిక స్వేచ్ఛ కూడా ప్రసాదించబడింది. ఎందుకంటే వారిని పరీక్షించాలన్నదే దేవుని అభిమతం.

దేవుడు పదే పదే తన అనుగ్రహాలను ప్రస్తావించడాన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే దైవానుగ్రహాల ద్వారా లబ్ది పొందటం సమ్మతం మాత్రమే కాదు, వాంఛనీయం కూడాను. ఈ లబ్ది భక్తి పరాయణతకు విరుద్ధమూ కాదు, దైవసామీప్య యత్నంలో అవరోధమూ కాదు. ప్రపంచంలోని ఈ వరప్రసాదాలు భక్తి మార్గంలో అడ్డంకిగా నిలుస్తాయన్న సూఫీల, బైరాగుల వాదన అర్థం లేనిది.

"మీరు ఏ ఏ అనుగ్రహాలను తిరస్కరిస్తారు?" అని మాటి మాటికీ ప్రశ్నించటంలోని మర్మం ఒక్కటే – మానవులను, జిన్నులను దేవుని అవిధేయత నుండి ఆపాలి. వారిలో కృతజ్ఞతా భావాన్ని పెంపొందించాలి. అందుకే మహాప్రవక్త (సఅసం) వారు ఈ ఆయతు వచ్చినప్పుడల్లా **"లా బి షయ్యిమ్ మిన్నిఅమిక – రబ్బనా! నుకజ్జిబు ఫలకల్ హమ్ద్"** అని బదులు పలకటాన్ని ఇష్టపడేవారు (సుననె తిర్మిజీ). దీని అర్థం ఇది : "ప్రభూ! నీవు ప్రసాదించిన ఏ వరాన్ని కూడా మేము కాదనటం లేదు. కాబట్టి ప్రశంసలు, పొగడ్తలన్నీ నీకే తగును."

53. **'తబారక'** అనేది 'బర్కత్' అనే పదం నుంచి వచ్చినది. బర్కత్ అంటే శుభం అని అర్థం. దీని లోతుల్లోకి పోతే బయల్పడే అర్థం ఏమిటంటే అది ఎప్పటికీ ఉండేది, శాశ్వితమైనది. అంటే దేవుని వద్ద ఎన్నటికీ తరగని మేళ్ళు, నిధి నిక్షేపాలు ఉంటాయి.

మరి కొంతమంది ఈ పదాన్ని అత్యున్నతమైన, వైభవోపేతమైన అన్న అర్థంలో తీసుకున్నారు. ఆయన నామమే మహోన్నతమైనపుడు, ఆయన అస్తిత్వం మరెంతటి ఉన్నతమైనదో కదా! అని వారు అభిప్రాయపడ్డారు.

56 వ సూరా

# అల్ వాఖిఅహ్

## సంఘటన

అవతరణ
మక్కాలో

ఆయతులు
96

### పరిచయం

*ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి, ఆ రోజున లభించే శిక్షా బహుమానాల గురించి వివరించింది. మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన "వాఖిఅహ్" (సంఘటన) అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది భ్రమ కాదని, ప్రళయం తప్పనిసరిగా జరిగే సంఘటన అని నొక్కి చెప్పడం జరిగింది. ఆ రోజున భూమి తీవ్రంగా కుదిపివేయ బడుతుంది. పర్వతాలు తునాతునకలవుతాయి. మానవులు మూడు వర్గాలుగా విభజించబడతారు.*

1. *అల్లాహ్ సామీప్యం పొందినవారు. విశ్వాసంలోను, మంచిపనులలోను అందరికన్నా ముందున్నవారు.*
2. *సాధారణ సన్మార్గులు – దయతో వ్యవహరించినవారు, సన్మార్గాన నడిచినవారు.*
3. *అగ్నికి ఆహుతయ్యేవారు.*

*ఈ సూరాలో అవిశ్వాసులు తీర్పుదినం గురించి వెలిబుచ్చుతున్న అనుమానాలను ప్రస్తావించడం జరిగింది. మరణించే వ్యక్తి ప్రాణాలు అతడి గొంతులోకి వచ్చినప్పుడు కలిగే బాధను కూడా ఇందులో గుర్తుచేయడం జరిగింది. ప్రశ్నలను సంధిస్తూ, ఈ సూరాలో అల్లాహ్ శక్తిసంపన్నతను, సృష్టించే విశిష్ట సామర్థ్యాన్ని వివరించడం జరిగింది. ప్రతివ్యక్తిని, ప్రతివస్తువును సృష్టించింది అల్లాహ్‌యే. పురుష వీర్యాన్ని, స్త్రీ అండాన్ని సృష్టించింది ఆయనే. పంటలను సృష్టించింది ఆయనే. నీటిని, అగ్నిని సృష్టించిందీ ఆయనే.*

## అల్ వాఖిఅహ్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

1 నిజంగా సంభవించేది (ప్రళయం) సంభవించినపుడు,[2]

2 అది సంభవించటంలో అబద్ధానికి ఆస్కారమే లేదు.

3 అది (కొందరిని) తొక్కివేసేది, (మరి కొందరిని) ఉన్నతికి చేర్చేది అయి ఉంటుంది.[3]

4 భూమి తీవ్రమైన ప్రకంపనలతో కుదిపి వేయబడినప్పుడు,

5 పర్వతాలు తుత్తునియలుగా చేయబడినప్పుడు,[4]

6 కడకు అవి ఎగిరే ధూళిరేణువుల్లా అయిపోతాయి.

7 మరి మీరు మూడు సమూహాలుగా వర్గీకరించబడతారు.[5]

8 వారిలో కుడిపక్షం వారు; ఆ కుడిపక్షం వారి (అదృష్టం) గురించి ఏమని చెప్పేది?![6]

## سُورَةُ الْوَاقِعَةِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

إِذَا وَقَعَتِ الْوَاقِعَةُ ﴿١﴾

لَيْسَ لِوَقْعَتِهَا كَاذِبَةٌ ﴿٢﴾

خَافِضَةٌ رَّافِعَةٌ ﴿٣﴾

إِذَا رُجَّتِ الْأَرْضُ رَجًّا ﴿٤﴾

وَبُسَّتِ الْجِبَالُ بَسًّا ﴿٥﴾

فَكَانَتْ هَبَاءً مُّنبَثًّا ﴿٦﴾

وَكُنتُمْ أَزْوَاجًا ثَلَاثَةً ﴿٧﴾

فَأَصْحَابُ الْمَيْمَنَةِ مَا أَصْحَابُ الْمَيْمَنَةِ ﴿٨﴾

---

1. ఈ సూరా **'భాగ్యవంతమైన సూరా'** (సూరతుల్ గినా)గా ప్రసిద్ధి చెందింది. ప్రతి రోజూ రాత్రి పూట ఈ సూరాను పారాయణం చేసిన వ్యక్తికి దారిద్ర్యం, పస్తులు దరి చేరవని అంటారు. కాని వాస్తవానికి ఈ సూరాకు సంబంధించి ఈ రకమైన ప్రామాణిక ఉల్లేఖనాలేమీలేవు. దీనిని ప్రతి రాత్రి పఠించాలి, ఇంకా పిల్లలకు నేర్పించాలి అన్న ఉల్లేఖనాలు బలహీనమైనవి. పైగా అవి వట్టి కల్పనలు. వివరాలకు అల్‌బానీ గారు రచించిన "అల్ అహాదీసుజ్జయీఫ" (హ.నెం. 2991) చూడండి.

2. **'వాఖియహ్'** ( وَاقِعَةٌ) అంటే తప్పకుండా సంభవించేది, జరిగి తీరేది అని అర్థం. అంటే ప్రళయదినం అన్నమాట. ప్రళయదినానికి గల అనేక పేర్లలో 'వాఖియహ్' ఒకటి.

3. అది ఉత్థానపతనాల దినం అయి ఉంటుంది. అంటే అది దేవుని పట్ల విధేయతాభావం గల దాసులను గౌరవోన్నతుల శిఖరాగ్రానికి చేర్చి, అవిధేయులను అథఃపాతాళానికి నెట్టివేస్తుంది. అంటే ఆనాడు పరిస్థితి తారుమారు కావచ్చు. ప్రపంచంలో అధికార మదంతో, ధనమదంతో నిజ ప్రభువును ధిక్కరించి చెలరేగిపోయిన వారంతా ఆనాడు పరాభవం పాలు కావచ్చు.

4. **'రజ్జా'** అంటే తీవ్రమైన కుదుపు అని అర్థం. ఆ కుదుపు ఎంత భయంకరంగా ఉంటుందంటే దాని ధాటికి నేలంతా గజ గజా వణికిపోతుంది. ఆ దెబ్బకు నేలపై నిలిచివున్న ఎత్తయిన మేడలు మిద్దెలు, బ్రహ్మాండమైన పర్వతాలన్నీ నేలమట్టం అయిపోతాయి. **'బస్సా'** అంటే తుత్తునియలు అయిపోవటం.

5. ఈ వాక్యంలో **'అజ్వాజన్'** (أَزْوَاجًا) అనే పదం రకాలు అన్న భావంలో ప్రయోగించబడింది.

9 ఇక ఎడమ పక్షంవారు; ఆ ఎడమ పక్షం వారి (దురదృష్టం) గురించి ఏమని చెప్పేది?![7]

وَاَصۡحٰبُ الۡمَشۡـَٔمَةِ ۙ مَاۤ اَصۡحٰبُ الۡمَشۡـَٔمَةِ ؕ ﴿9﴾

10 ఇక (విశ్వాసంలో) ముందంజ వేసిన వారు! ఎంతైనా వారు మున్ముందు ఉండే వారే.[8]

وَالسّٰبِقُوۡنَ السّٰبِقُوۡنَ ۚ ﴿10﴾

11 వారే (దైవ) సామీప్యం పొందినవారు.

اُولٰٓـئِكَ الۡمُقَرَّبُوۡنَ ۚ ﴿11﴾

12 వారు అనుగ్రహాభరితమైన స్వర్గవనాలలో ఉంటారు.

فِىۡ جَنّٰتِ النَّعِيۡمِ ﴿12﴾

13 వారిలో అత్యధికులు తొలి (కాలపు) తరాలకు చెందినవారై ఉంటారు.

ثُلَّةٌ مِّنَ الۡاَوَّلِيۡنَ ۙ ﴿13﴾

14 కొద్దిమంది మాత్రం తరువాతి (తరాలకు చెందిన) వారై ఉంటారు.[9]

وَقَلِيۡلٌ مِّنَ الۡاٰخِرِيۡنَ ؕ ﴿14﴾

15 వారు బంగారు తీగలతో నేయబడిన పీఠాలపై ఉంటారు.

عَلٰى سُرُرٍ مَّوۡضُوۡنَةٍ ۙ ﴿15﴾

16 ఎదురెదురుగా దిండ్లకు ఆనుకుని కూర్చుని ఉంటారు.[10]

مُّتَّكِـِٕيۡنَ عَلَيۡهَا مُتَقٰبِلِيۡنَ ﴿16﴾

6. కుడిపక్షం వారంటే సామాన్య విశ్వాసులు, కర్మల పత్రాలు కుడిచేతికి ఇవ్వబడిన వారని అర్థం. కర్మల పత్రం కుడిచేతికి ఇవ్వబడటమే వారి అదృష్టానికి సంకేతం అన్నమాట!

7. అంటే వీరు కర్మల పత్రాలు ఎడమ చేతికి ఇవ్వబడిన అవిశ్వాసులన్నమాట!

8. వీరు సజ్జనులు, మహనీయులు, విశ్వసించటంలో ముందంజ వేసినవారు. సత్కార్యాలలో హృదయపూర్వకంగా పాల్గొన్నవారు. వారి అసాధారణ త్యాగాల కారణంగా అల్లాహ్ వారికి తన సమీపంలో స్థానం కల్పించాడు. స్వర్గంలో గొప్ప అంతస్తుల్ని ప్రసాదించాడు.

9. **'సుల్లతున్'** (ثُلَّةٌ) అంటే లెక్కించటం సాధ్యం కానంత పెద్ద వర్గం అని అర్థం. **'పూర్వీకులు'** (అవ్వలీన్) అంటే హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) మొదలుకుని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సహచరుల కాలం వరకు గతించిన వారని భావం. **'తరువాతివారు'** (ఆఖిరీన్) అంటే ముహమ్మద్ (స) అనుచర సమాజంలోని సభ్యులు అని విద్వాంసులు అభిప్రాయపడ్డారు. పూర్వీకుల్లో నుంచి చాలామంది ముందంజ వేసిన వారిలో ఉంటారంటే, మరి వారి కాలం కూడా సుదీర్ఘమైనదే. వేలాది మంది ప్రవక్తల అనుయాయులు ఇందులో చేరి ఉన్నారు. వారితో పోల్చుకుంటే అంతిమ దైవప్రవక్త (సఅసం) అనుయాయుల కాలం చాలా చిన్నది. అందువల్ల వీరిలో 'ముందంజ వేసినవారి' సంఖ్య కూడా తక్కువగానే ఉంటుంది. ఒక హదీసు ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా అన్నారు: "మీరు స్వర్గవాసులలో సగం వరకూ ఉంటారని నేనాశిస్తున్నాను" (సహీహ్ ముస్లిం – హ.నెం.200). అంతమాత్రం చేత ఈ హదీసు దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులకు విరుద్ధంగా ఉందని తలపోయవలసిన పనిలేదు. ఎందుకంటే ముహమ్మద్ (స) అనుచర సమాజంలోని 'ముందంజ వేసినవారి'నీ సాధారణ విశ్వాసులనూ కలుపుకుంటే వీళ్ల సంఖ్య స్వర్గానికి పోయే ఇతర ఉమ్మతీల సంఖ్యకు సగం అవుతుంది.

మరి కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ పూర్వీకులు, తరువాతి వారు కూడా ముహమ్మద్ (స) అనుచర సమాజానికి చెందినవారే. వీరిలో ముందంజ వేసేవారు తొలి కాలానికి చెందినవారు ఎక్కువమంది, తరువాతి కాలంలో

17 వారి సేవలో నిత్యం (అబ్బాయిలుగానే ఉండే) అబ్బాయిలు[11] తిరుగాడుతూ ఉంటారు.
يَطُوفُ عَلَيْهِمْ وِلْدَانٌ مُّخَلَّدُونَ ﴿١٧﴾

18 వారు గిన్నెలు, కూజాలు, గ్లాసులు పట్టుకుని, ప్రవహించే మధువు నుంచి గిన్నెలు నింపుకుని (తిరుగుతూ ఉంటారు).
بِأَكْوَابٍ وَأَبَارِيقَ وَكَأْسٍ مِّن مَّعِينٍ ﴿١٨﴾

19 ఆ మధుపానం వల్ల వారికి తలనొప్పి రావటంగానీ, బుద్ధి తికమక పడటంగానీ జరగదు.[12]
لَّا يُصَدَّعُونَ عَنْهَا وَلَا يُنزِفُونَ ﴿١٩﴾

20 వారు మెచ్చిన పండ్లు ఫలాలను,
وَفَاكِهَةٍ مِّمَّا يَتَخَيَّرُونَ ﴿٢٠﴾

21 వారు ఇష్టపడిన పక్షుల మాంసాన్ని (ఆ అబ్బాయిలు) సమర్పిస్తారు.
وَلَحْمِ طَيْرٍ مِّمَّا يَشْتَهُونَ ﴿٢١﴾

22 (వారి కొరకు) పెద్ద పెద్ద కన్నులు గల సుందరాంగులు ఉంటారు.
وَحُورٌ عِينٌ ﴿٢٢﴾

23 వారు (ఆ సుందరాంగులు) దాచిపెట్టిన స్వచ్ఛమైన ముత్యాల్లా ఉంటారు.[13]
كَأَمْثَالِ اللُّؤْلُؤِ الْمَكْنُونِ ﴿٢٣﴾

24 వారు చేసుకున్న సత్కర్మలకు తగిన ప్రతిఫలం ఇది.
جَزَاءً بِمَا كَانُوا يَعْمَلُونَ ﴿٢٤﴾

25 అక్కడ వారు వ్యర్థ ప్రేలాపనలుగానీ, పాప విషయాలుగానీ వినరు.
لَا يَسْمَعُونَ فِيهَا لَغْوًا وَلَا تَأْثِيمًا ﴿٢٥﴾

---

తక్కువమంది ఉంటారు. ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ రెండవ అభిప్రాయానికే ప్రాముఖ్యం యిచ్చారు. ఈ అభిప్రాయమే సరైనదనిపిస్తోంది.

10. **'మౌజూనతున్'** (مَّوْضُونَةٍ) అంటే తయారుచేయబడిన, నేయబడిన అనే అర్థాలు వస్తాయి. అంటే ఇక్కడ ప్రస్తావించబడిన స్వర్గవాసులు బంగారు తీగలతో అల్లబడిన, వజ్రవైఢూర్యాలు పొదగబడిన ఆసనాలపై ఎదురెదురుగా మెత్తని దిండ్లకు ఆనుకుని ఆసీనులవుతారు.

11. అంటే వారు సదా ఒకే (టీనేజ్) వయస్సులో ఉంటారు. వారి వయస్సు పెరిగి పెద్ద వారవటం, ముసలివారవటం అనేది ఉండదు. వారు నిత్యం ఒకేవిధంగా చురుకుగా సేవలు చేస్తుంటారు.

12. ప్రపంచంలో తప్ప త్రాగిన వారికి తల తిరగటం (సుదావున్), త్రాగిన మత్తులో నోటికొచ్చినట్లు వదరటం (ఇన్‌జాఫ్) మామూలే. కాని స్వర్గంలో ఇవ్వబడే మద్యం ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. అందులో మత్తు పదార్థంగానీ, మనిషి అదుపు తప్పి ప్రవర్తించే గుణంగానీ ఉండదు. అటువంటి స్వచ్ఛమైన మధువు చెలమలు అక్కడ పొంగిపొరలుతూ ఉంటాయి. అవి ఎన్నటికీ ఇంకిపోవు.

13. **'మక్నూన్'** అంటే దాచిపెట్టబడిన, అందమైన గలీవులో చుట్టబడిన అన్న అర్థాలు వస్తాయి. తత్కారణంగా ఆ ముత్యాలు మాసిపోకుండా, దుమ్ముధూళి పడకుండా స్వచ్ఛంగా ఉంటాయి. అదేవిధంగా స్వర్గవాసుల కొరకు ప్రత్యేకించబడిన ఈ స్త్రీలు కూడా కడిగిన ముత్యాల్లా, కాపడని వజ్రాల్లా ఉంటారు.

إِلَّا قِيلًا سَلَٰمًا سَلَٰمًا ﴿26﴾

**26** (ఎటు చూచినా) శాంతీ శుభదాయకమైన పలుకులే ప్రతి ధ్వనిస్తూ ఉంటాయి.[14]

وَأَصْحَٰبُ ٱلْيَمِينِ مَآ أَصْحَٰبُ ٱلْيَمِينِ ﴿27﴾

**27** ఇక కుడి పక్షంవారు; కుడిపక్షం వారి (అదృష్టం) గురించి ఏమని చెప్పేది?![15]

فِى سِدْرٍ مَّخْضُودٍ ﴿28﴾

**28** వారు ముళ్లు లేని రేగుచెట్ల మధ్య ఉంటారు.

وَطَلْحٍ مَّنضُودٍ ﴿29﴾

**29** ఇంకా ఒకదానిపై ఒకటి దట్టంగా పేరుకున్న అరటి గెలలు,

وَظِلٍّ مَّمْدُودٍ ﴿30﴾

**30** సుదూరంగా విస్తరించిన నీడలు,[16]

وَمَآءٍ مَّسْكُوبٍ ﴿31﴾

**31** ప్రవహించే నీళ్లు,

وَفَٰكِهَةٍ كَثِيرَةٍ ﴿32﴾

**32** పుష్కలమైన పండ్లు ఫలాల మధ్య,[17]

لَّا مَقْطُوعَةٍ وَلَا مَمْنُوعَةٍ ﴿33﴾

**33** ఎన్నటికీ తరగని, మరెన్నటికీ ఆపుకోబడనివి.

وَفُرُشٍ مَّرْفُوعَةٍ ﴿34﴾

**34** ఎత్తయిన పరుపుల మధ్య (హాయిగా) ఉంటారు.[18]

إِنَّآ أَنشَأْنَٰهُنَّ إِنشَآءً ﴿35﴾

**35** మేము వారి (భార్యల)ని ప్రత్యేకంగా ప్రభవింపజేశాము.

فَجَعَلْنَٰهُنَّ أَبْكَارًا ﴿36﴾

**36** మరి మేము వారిని కన్యలుగా చేశాము.[19]

14. ప్రాపంచిక జీవితంలో అయిన వారి మధ్య, కాని వారి మధ్య కూడా ఎప్పుడూ లడాయిలే. చివరికి రక్తం పంచుకుపుట్టిన తోబుట్టువుల మధ్య కూడా మనస్పర్థలు, అవాంఛనీయమైన ఘటనలు మామూలే. అందువల్ల రాగద్వేషాలు పెరుగుతాయి. ఉద్రిక్తతలు ఏర్పడతాయి. మాటామాటా పెరిగి వ్యవహారం తిట్టుకోవడం, నిందించుకోవటం, అభాండాలు మోపటం వరకూ పోతుంది. కాని స్వర్గ వాతావరణం ఈ దుర్గంధాలకు, వ్యర్థ ప్రేలాపనలకు అతీతంగా– ఎంతో పవిత్రంగా ఉంటుంది. అక్కడ ఎటు చూచినా కుశల ప్రశ్నలే! శాంతీ శ్రేయాలే!! నోరు జారటంగానీ, అధిక ప్రసంగాలు చేయటంగానీ అక్కడ ఉండదు.

15. ఇప్పటి వరకూ దైవసామీప్యం పొందినవారి (ముఖర్రబీన్) గురించి చెప్పటం జరిగింది. ఇక్కడి నుంచి కుడిపక్షం వారిలోని సాధారణ విశ్వాసుల ప్రస్తావన మొదలయింది.

16. ఒక హదీసు ప్రకారం "స్వర్గంలోని ఒక చెట్టు నీడలో ఒక గుర్రపు రౌతు నూరేళ్ళు ప్రయాణించినా ఆ నీడ తరగదు" (సహీహ్ బుఖారీ – అల్ వాఖియహ్ సూరా వ్యాఖ్యానం; ముస్లిం – కితాబుల్ జన్నహ్).

17. ఈ పండ్లు ఒక్క సీజన్‌కు మాత్రమే పరిమితం కాకుండా ఎల్లప్పుడూ ఉంటాయి. సీజన్ అయిపోగానే పండ్లు అయిపోతాయన్న చింత ఉండదు. అలాగే ఆ పండ్లను పొందే విషయంలో ఎలాంటి అడ్డంకులుగానీ, ఆంక్షలుగానీ, నిషేధాజ్ఞలుగానీ ఉండవు.

18. కొంతమంది ఈ ఆయతులో **'ఫురుష్'** అంటే భార్యలనీ, **'మర్ఫూఅ'** అంటే ఉన్నత స్థానం కలిగిన అనే అర్థాలు తీసుకున్నారు.

37 వారు మనసైన వారై, సమ వయస్కులై ఉంటారు.[20] عُرُبًا أَتْرَابًا ﴿٣٧﴾

38 కుడిపక్షం వారికి ప్రాప్తమయ్యే భాగ్యాలివి. لِّأَصْحَابِ الْيَمِينِ ﴿٣٨﴾

39 వీరిలో పూర్వీకుల్లో నుంచి (కూడా) చాలామంది ఉంటారు.[21] ثُلَّةٌ مِّنَ الْأَوَّلِينَ ﴿٣٩﴾

40 తరువాతి తరాల వారిలో నుంచి (కూడా) అత్యధికమంది ఉంటారు.[22] وَثُلَّةٌ مِّنَ الْآخِرِينَ ﴿٤٠﴾

41 ఇకపోతే ఎడమ పక్షంవారు; ఎడమ పక్షం వారి (దుర్భర స్థితి) గురించి ఎలా చెప్పేది?![23] وَأَصْحَابُ الشِّمَالِ مَا أَصْحَابُ الشِّمَالِ ﴿٤١﴾

42 వారు తీవ్రమైన సెగలలో, సలసలా కాగే నీళ్లలో (చిక్కుకుని) ఉంటారు. فِي سَمُومٍ وَحَمِيمٍ ﴿٤٢﴾

43 ఇంకా నల్లని పొగల నీడలో...[24] وَظِلٍّ مِّن يَحْمُومٍ ﴿٤٣﴾

44 అది చల్లగానూ ఉండదు, ఆహ్లాదకరంగానూ ఉండదు.[25] لَّا بَارِدٍ وَلَا كَرِيمٍ ﴿٤٤﴾

19. స్వర్గవాసుల కోసం స్వర్గంలో లభించే భార్యలు ప్రత్యేక రీతిలో సృష్టించబడతారు. వారి పుట్టుక సాధారణ పుట్టుక కాదు. దేవుడు తన ప్రత్యేక శక్తితో వారిని ప్రత్యేక తరహాలో ప్రభవింపజేస్తాడు. ఈ స్వర్గకన్యలు గాకుండా ప్రపంచ జీవితంలోని భార్యలు కూడా స్వర్గవాసులకు భార్యలుగా ఉంటారు. ఒకవేళ వారు ముసలివారుగానో, నల్లగానో, అందవికారంగానో ఉంటే దేవుడు వారందరినీ యుక్తవయసులో ఉండే అందగత్తెలుగా చేసేస్తాడు. పైగా వారంతా కన్యలుగా ఉంటారు.

20. అరబీ మూలంలో **'ఉరుబున్'** (**عُرُبٌ**) అని ఉంది. అంటే తమ అందచందాల రీత్యా, తమలోని ఇతరత్రా సుగుణాల దృష్ట్యా భర్తల హృదయాలను దోచుకున్న భార్యలని అర్థం. **'అత్‌రాబున్'** అంటే సమవయస్కులు. అంటే స్వర్గవాసులకు లభించే స్త్రీలంతా ఒకే వయస్సులో ఉంటారు. హదీసులో చెప్పబడినట్లుగా వారందరి వయస్సు 33 ఏండ్లు అయి ఉంటుంది (సుననె తిర్మిజీ) లేదా వారి వయస్సు స్వర్గంలోని తమ భర్తల వయస్సు అంత ఉంటుంది. ఏ విధంగా తీసుకున్నా అర్థం ఒక్కటే.

21. అంటే వారు ఆదం (అలైహిస్సలాం) మొదలుకుని అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాలం వరకు గల ప్రజల్లో నుంచి ఉంటారు. లేదా ముహమ్మద్ (సఅసం) అనుచర సంఘంలోని పూర్వీకులు అయి ఉంటారు.

22. అంటే – వారు మహాప్రవక్త ముహమ్మద్ (స) అనుచర సంఘంలోనివారు లేక వారిలోని పూర్వీకులు.

23. ఎడమపక్షం వారంటే నరకవాసులన్నమాట! వారి కర్మల పత్రాలు వారి ఎడమచేతికి ఇవ్వబడతాయి. అది వారు అనుభవించబోయే దుర్భర బ్రతుకుకు ఆనవాలు.

24. **'సమూమ్'** అంటే అగ్నిజ్వాలల వల్ల ఏర్పడే తీవ్రమైన వేడి లేక సెగ. అది శరీరాన్ని మాడ్చి వేస్తూ ఉంటుంది. **'హమీమ్'** ( **حَمِيمٌ**) అంటే సలసలా కాగే నీరు. **'యహ్‌మూమ్'** (**يَحْمُومٌ**) అంటే దట్టమైన నల్లటి పొగ. నరక తాపానికి తట్టుకోలేక వారు ఏదన్నా నీడలో సేద తీరాలని వెతుకుతారు. వారికి నీడ కనిపిస్తుంది. వారక్కడికి చేర్తారు కూడా. కాని అది చల్లదనాన్ని, హాయినీ ఇచ్చే నీడకాదు. అది నరకాగ్ని నుండి వచ్చిన నల్లని పొగల నీడ. మరికొందరి అభిప్రాయం ప్రకారం అది నరకాగ్నికి ఆహుతి అయిన వారి కొవ్వు నుండి పుట్టిన దట్టమైన పొగ.

45 (అవును మరి!) అంతకుముందు వారంతా సుఖ విలాసా లలో తేలియాడిన వారే.[26]
اِنَّهُمْ كَانُوْا قَبْلَ ذٰلِكَ مُتْرَفِيْنَ ﴿45﴾

46 ఇంకా వారు, మహాపరాధాలపై హఠం చేసేవారు.
وَكَانُوْا يُصِرُّوْنَ عَلَى الْحِنْثِ الْعَظِيْمِ ﴿46﴾

47 పైగా వారిలా అనేవారు: "ఏమిటి, మేము మరణించి, మట్టిగా, ఎముకలుగా అయిపోయాక, మళ్లీ సజీవులుగా లేపబడ తామా?!
وَكَانُوْا يَقُوْلُوْنَ ۙ اَىِٕذَا مِتْنَا وَكُنَّا تُرَابًا وَّعِظَامًا ءَاِنَّا لَمَبْعُوْثُوْنَ ﴿47﴾

48 "(మాతోపాటు) మా పూర్వీకులైన తాతముత్తాతలు కూడానా?!"[27]
اَوَ اٰبَآؤُنَا الْاَوَّلُوْنَ ﴿48﴾

49 (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "పూర్వీకులు, తరువాతి వారూ అందరూ,
قُلْ اِنَّ الْاَوَّلِيْنَ وَالْاٰخِرِيْنَ ﴿49﴾

50 "ఒకరోజు తప్పకుండా నిర్ధారిత సమయాన సమీకరించ బడతారు.
لَمَجْمُوْعُوْنَ ۙ اِلٰى مِيْقَاتِ يَوْمٍ مَّعْلُوْمٍ ﴿50﴾

51 "మరి మీరు – ఓ మార్గభ్రష్టులారా! ధిక్కార జనులారా!
ثُمَّ اِنَّكُمْ اَيُّهَا الضَّآلُّوْنَ الْمُكَذِّبُوْنَ ﴿51﴾

52 "మీరు జెముడు వృక్షాలను తింటారు.
لَاٰكِلُوْنَ مِنْ شَجَرٍ مِّنْ زَقُّوْمٍ ﴿52﴾

53 "వాటితోనే మీరు మీ కడుపులు నింపుకోవలసి ఉంటుంది.[28]
فَمَالِـُٔوْنَ مِنْهَا الْبُطُوْنَ ﴿53﴾

54 "మరి ఆపైన మీరు సలసల కాగే నీరు త్రాగబోతున్నారు...
فَشٰرِبُوْنَ عَلَيْهِ مِنَ الْحَمِيْمِ ﴿54﴾

55 "దప్పికగొన్న ఒంటెలు త్రాగినట్లు తాగుతారు."[29]
فَشٰرِبُوْنَ شُرْبَ الْهِيْمِ ﴿55﴾

ఇంకొందరి అభిప్రాయం ప్రకారం అది నల్లని బొగ్గు. ఇమామ్ జహాక్ ఇలా అంటున్నారు: "నరకాగ్ని కూడా నల్లగానే ఉంటుంది. నరక వాసులు కూడా నల్లగానే ఉంటారు. నరకంలోని ప్రతిదీ నలుపు ఆవరించి ఉంటుంది." అల్లాహ్! ఈ నరకాగ్ని నుండి మమ్ము రక్షించు!

25 సాధారణంగా నీడ చల్లగా ఉంటుంది. కాని వారు నీడ అనుకున్నది నిజానికి నీడ కాదు. అది నరకాగ్ని నుంచి వచ్చిన నల్లని పొగ. కాబట్టి అందులో చల్లదనంగానీ, శుభసూచకమైన మరే గుణంగానీ ఉండదు.

26. అంటే పరలోక జీవితాన్ని విస్మరించి, ప్రాపంచిక భోగభాగ్యాలలో మునిగితేలుతూ ఉండేవారు.

27. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే పరలోకం పట్ల విశ్వాసం లేని మనిషి కుఫ్ర్, షిర్క్ వంటి ఘోరపాపాలకు పాల్పడటానికి ఏమాత్రం జంకడు. పైగా వాటికోసం నిత్యం అర్రులు చాస్తూ ఉంటాడు. ఎందుకంటే తన ఘోరకృత్యాలపై నిలదీసి అడిగే వాడున్నాడన్న భయం అతనికి ఉండదు.

28. ఈ దుర్భరస్థితి మీకు భరించశక్యం కాకపోవచ్చు. అత్యంత దారుణమైన, చేదైన ఈ జెముడు వృక్షం మీకు మింగుడు పడకపోవచ్చు. అయినా తప్పదు. ఆకలిబాధను తీర్చుకోవటానికి మీరు ఆ వృక్షాన్ని నమలవలసిందే!

**56** తీర్పుదినాన వారికి లభించే (మొదటి) ఆతిథ్యం ఇది![30]

هٰذَا نُزُلُهُمْ يَوْمَ الدِّيْنِ ﴿56﴾

**57** మీ అందరినీ పుట్టించినది మేమే అయినప్పుడు, మీరీ సత్యాన్ని ఎందుకు ధృవీకరించరు?[31]

نَحْنُ خَلَقْنٰكُمْ فَلَوْلَا تُصَدِّقُوْنَ ﴿57﴾

**58** అది సరేగాని, మీరు వదిలే రేతస్సును గురించి ఎప్పుడైనా ఆలోచించారా?!

اَفَرَءَيْتُمْ مَّا تُمْنُوْنَ ﴿58﴾

**59** ఏమిటి, దాంతో (మనిషిని) సృష్టించేది మీరా? లేక మేము సృష్టిస్తున్నామా?[32]

ءَاَنْتُمْ تَخْلُقُوْنَهٗۤ اَمْ نَحْنُ الْخٰلِقُوْنَ ﴿59﴾

**60** మేమే మీ మధ్య చావును నియమించాము.[33] ఈ విషయంలో మేము అశక్తులము కాము.[34]

نَحْنُ قَدَّرْنَا بَيْنَكُمُ الْمَوْتَ وَمَا نَحْنُ بِمَسْبُوْقِيْنَ ﴿60﴾

**61** మీ స్థానంలో మీ వంటి వారిని తీసుకువచ్చే, మీరెరుగని అవస్థలో మిమ్మల్ని తిరిగి లేపే శక్తి మాకుంది.[35]

عَلٰۤى اَنْ نُّبَدِّلَ اَمْثَالَكُمْ وَنُنْشِئَكُمْ فِيْ مَا لَا تَعْلَمُوْنَ ﴿61﴾

**62** మొదటి పుట్టుక గురించి మీకు ఎలాగూ తెలుసు. మరి దాని ద్వారా గుణపాఠం ఎందుకు నేర్చుకోరు?[36]

وَلَقَدْ عَلِمْتُمُ النَّشْاَةَ الْاُوْلٰى فَلَوْلَا تَذَكَّرُوْنَ ﴿62﴾

29. ఆయతులో **'హీమ్'** (الْهِيْمِ) అనబడింది. ఒకానొక వ్యాధికి గురైన ఒంటెలు అదేపనిగా నీరు త్రాగుతూ ఉంటాయి. ఎంత త్రాగినా వాటికి దాహం తీరదు. అలాగే జెముడు వృక్షం తిన్నమీదట వారికి విపరీతంగా దాహం అవుతుంది. వారికి ఇష్టం ఉన్నా లేకపోయినా వారు మాత్రం దప్పికగొన్న ఒంటెల మాదిరిగా వేడినీళ్ళపై ఎగబడతారు. కాని ఎంత త్రాగినా దాహం మాత్రం తీరదు.

30. ఈ వాక్యంలో వ్యంగ్యం ఉంది. ఆతిథ్యం అనేది నిజానికి అతిథి గౌరవార్థం ఇవ్వబడుతుంది. "వారికి వ్యధాభరిత శిక్ష గురించి 'శుభవార్త' వినిపించు" (ఆలి ఇమ్రాన్ : 21) ఆయతు వంటిదే ఇది కూడా.

31. అంటే – అల్లాహ్‌యే మీ సృష్టికర్త అన్న సత్యం మీకు తెలిసినప్పుడు మీరు దాన్ని ఎందుకు ఒప్పుకోరు? మరణానంతర జీవితాన్ని ఎందుకు నమ్మరు?

32. అంటే – మీరు మీ భార్యలతో రతిక్రీడ జరిపినప్పుడు, మీరు వారి గర్భాశయాలలో వదిలే వీర్యబిందువులకు (మానవ) రూపకల్పన చేసేవారు మీరా? లేక మేమా?

33. అంటే – ప్రతి ఒక్కరికీ మరణ ఘడియ నిర్ధారితమై ఉంది. దాన్ని ఎవడూ దాటవేయలేడు. ఆ మృత్యువు కొందరిని బాల్యంలో, మరికొందరిని యవ్వనంలో, ఇంకా కొందరిని వృద్ధాప్యంలో కబళిస్తుంది.

34. పైగా ఈ కార్యనిర్వహణపై మాకు పూర్తి అదుపు ఉంది.

35. మీ రూపు రేఖలను మార్చి మిమ్మల్ని కోతులు, పందుల్లాంటి నీచమైన జంతువులుగా చేసివేయటం లేదా సరిగ్గా మిమ్మల్నే పోలిన మరో ప్రాణికోటిని ప్రభవింపజేయటం మాకు చాలా తేలికైన పని.

36. అంటే – మొదటిసారి మిమ్మల్ని పుట్టించినవాడు మలిసారి కూడా బ్రతికించగలడన్న విషయాన్ని ఎందుకు జీర్ణింపజేసుకోలేక పోతున్నారు?

**63** సరే! మీరు నాటే వస్తువును (విత్తనాన్ని) గురించి ఎప్పుడైనా ఆలోచించారా?

أَفَرَءَيْتُم مَّا تَحْرُثُونَ ﴿63﴾

**64** ఏమిటి, దాన్ని మీరు పండిస్తున్నారా? లేక దానిని పండించేది మేమా?[37]

ءَأَنتُمْ تَزْرَعُونَهُۥٓ أَمْ نَحْنُ ٱلزَّٰرِعُونَ ﴿64﴾

**65** మేమే గనక తలచుకుంటే దానిని పొట్టు పొట్టుగా చేసేయ గలము. మరి మీరు ఆశ్చర్యంతో లబోదిబోమంటూ,[38]

لَوْ نَشَآءُ لَجَعَلْنَٰهُ حُطَٰمًا فَظَلْتُمْ تَفَكَّهُونَ ﴿65﴾

**66** “అసలుకే నష్టపోయామే![39]

إِنَّا لَمُغْرَمُونَ ﴿66﴾

**67** “అంతేకాదు, మేము దేనికీ నోచుకోకుండా పోయాము” అని వాపోతారు.

بَلْ نَحْنُ مَحْرُومُونَ ﴿67﴾

**68** పోనీ, మీరు త్రాగే మంచినీరు గురించి ఎన్నడయినా ఆలోచించారా?

أَفَرَءَيْتُمُ ٱلْمَآءَ ٱلَّذِى تَشْرَبُونَ ﴿68﴾

**69** దాన్ని మేఘాల నుంచి మీరు కురిపిస్తున్నారా? లేక దానిని కురిపించేది మేమా?

ءَأَنتُمْ أَنزَلْتُمُوهُ مِنَ ٱلْمُزْنِ أَمْ نَحْنُ ٱلْمُنزِلُونَ ﴿69﴾

**70** మేమే గనక తలచుకుంటే దానిని చేదు నీరుగా మార్చేయ గలం. మరలాంటప్పుడు మీరు కృతజ్ఞులుగా ఎందుకు మసలు కోరు?[40]

لَوْ نَشَآءُ جَعَلْنَٰهُ أُجَاجًا فَلَوْلَا تَشْكُرُونَ ﴿70﴾

**71** పోనీ, మీరు రాజేసే నిప్పును గురించి ఎప్పుడైనా ఆలోచించారా?

أَفَرَءَيْتُمُ ٱلنَّارَ ٱلَّتِى تُورُونَ ﴿71﴾

---

37. నేలలో మీరు నాటే విత్తనం నుండి ఒక మొక్క మొలకెత్తుతుంది. మరి ఆ మొక్కను మొలిపించటానికి నేల గుండెను చీల్చి, దాన్నుండి ఒక మహావృక్ష సృజన ప్రారంభించేది ఎవరు? ఒక అల్పమైన వీర్య బిందువు నుండి మనిషిని సృజించినట్లే ఇది కూడా మా శక్తి సామర్థ్యాలకు ప్రతీకే. ఈ మహాకార్యాన్ని చేసే నైపుణ్యంగానీ, తాంత్రికశక్తిగానీ మీకుందా?

38. పంట ఏపుగా పెరిగి, కోతకు రావటానికి సిద్ధంగా ఉన్నప్పుడు మేము గనక కోరితే అకస్మాత్తుగా దానిపై తెగులును పంపి పొట్టుపొట్టుగా చేసివేయగలం. ఆనక మీరు దిక్కుతోచక దిక్కులు చూస్తూ ఉండిపోతారు. ‘అయితే గీతే...’ లాంటి మీ కాకిలెక్కలు ఎందుకూ పనికి రాకుండాపోతాయి. చివరికి మీరు మీ తలరాతపై ఏడుస్తూ ఉండటం తప్ప ఏమీ మిగలదు.

39. అయ్యో! పొలము దున్నినది, విత్తనం చల్లినది మేమేనే! ఎరువు వేసి, నీరు సరఫరా చేసినది కూడా మేమేనే! తీరా పంట నోటికాడికి వచ్చేసరికి పురుగుపట్టి పొట్టుగా మారిపోయెనే! మా పెట్టుబడితో పాటు శ్రమ కూడా వృథా అయిపోయెనే! అసలుకే నష్టపోయామే! అని నెత్తీనోరూ బాదుకుంటారు.

40. ముమ్మాటికీ ఇది మా మహోపకారం అన్న సంగతిని మరచిపోకండి. కాబట్టి ఈ ఉపకారానికి గాను మీరు కృతజ్ఞులుగా వ్యవహరించాలి.

72 దాని వృక్షాన్ని మీరు ఉత్పత్తి చేశారా? లేక దానిని ఉత్పన్నం చేసినది మేమా?[41]

ءَاَنْتُمْ اَنْشَاْتُمْ شَجَرَتَهَآ اَمْ نَحْنُ الْمُنْشِئُوْنَ ﴿٧٢﴾

73 మేము దానిని గుణపాఠ సూచనగా,[42] బాటసారులకు ప్రయోజనకర వస్తువుగా చేశాము.[43]

نَحْنُ جَعَلْنٰهَا تَذْكِرَةً وَّمَتَاعًا لِّلْمُقْوِيْنَ ﴿٧٣﴾

74 కాబట్టి (ఓ ప్రవక్తా!) మహోన్నతుడగు నీ ప్రభువు నామ పవిత్రతను కొనియాడు.

فَسَبِّحْ بِاسْمِ رَبِّكَ الْعَظِيْمِ ﴿٧٤﴾

75 అది కాదు, నక్షత్రాలు రాలిపడటంపై నేను ప్రమాణం చేస్తున్నాను.[44]

فَلَآ اُقْسِمُ بِمَوٰقِعِ النُّجُوْمِ ﴿٧٥﴾

76 మీరు గనక తెలుసుకోగలిగితే ఇది చాలా పెద్ద ప్రమాణం.

وَاِنَّهٗ لَقَسَمٌ لَّوْ تَعْلَمُوْنَ عَظِيْمٌ ﴿٧٦﴾

77 నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ చాలా గౌరవప్రదమైనది.[45]

اِنَّهٗ لَقُرْاٰنٌ كَرِيْمٌ ﴿٧٧﴾

41. అరేబియాలో మర్ఖ్, ఇఫార్ అనే రెండు వృక్షాలున్నాయనీ, ఆ రెండు వృక్షాల రెమ్మలను కలిపి రాజేస్తే నిప్పు పుట్టుకు వస్తుందని చెబుతారు.

42. దీని ప్రభావం అసాధారణమయింది. అసంఖ్యాకమైన వస్తువుల తయారీలో, వస్తుసేవల వినియోగంలో దీనికి గల ప్రాముఖ్యత ఎనలేనిది. అయితే ఇది మా శక్తికి ప్రతీక. మేము ప్రపంచంలో ఈ అగ్నిని పుట్టించినట్లే, పరలోకంలో కూడా పుట్టించగలము. హదీసులో చెప్పబడినట్లు ఆ అగ్ని ప్రపంచంలోని అగ్నికన్నా 69 రెట్లు ఎక్కువ వేడిగా ఉంటుంది.

43. మూలంలో **'ముఖ్వీన్'** (مُقْوِيْنَ) అని ఉంది. ఎడారిలోకి ప్రవేశించేవారు అని అర్థం. ప్రయాణీకులు అని ఇక్కడ దాని భావం. అంటే ఎడారి ప్రదేశాలలో, అడవుల గుండా ప్రయాణించే వారు ఈ వృక్షాల ద్వారా లబ్ది పొందుతారు. వాటి ద్వారా వెలుగును, వేడిని పొందుతారు. ఇంధనాన్ని వాడుకుంటారు. కొందరు 'ముఖ్వీన్' అనే పదానికి 'ఆకలి మూలంగా ఖాళీ కడుపుతో ఉన్న నిరుపేదలు' అన్న అర్థం తీసుకున్నారు. మరికొందరు ఈ పదాన్ని 'ముస్తమ్తియీన్' (ప్రయోజనం పొందేవారు) అన్న అర్థంలో తీసుకున్నారు. ఈ అర్థం తీసుకున్నట్లయితే అందరూ అందులోకి వచ్చేస్తారు. అందుకే హదీసులో మూడు వస్తువులను సర్వసామాన్యంగా పరిగణించాలని, వాటి ఉపయోగం విషయంలో ఎవరికీ అడ్డు తగలరాదని ఆదేశించబడింది. ఆ మూడు వస్తువులలో నీరు, గడ్డితోపాటు అగ్ని కూడా ఉంది. (అబూ దావూద్ – కితాబుల్ బుయూ; సుననె ఇబ్ను మాజా). ఇమామ్ ఇబ్నె కసీర్ కూడా ఈ భావార్థాన్నే సమర్థించారు.

44. **'అది కాదు'** అన్న పదం వాక్యంలో ముందు గడిచిన విషయాన్ని ఖండిస్తోంది. ఈ ఖుర్ఆన్ ఏ కాకమ్మ కథో లేక కవనమో కాదు. నేను నక్షత్రాలు రాలిపడటంపై ప్రమాణం చేసి చెబుతున్నాను – ఈ ఖుర్ఆన్ ఎంతో గౌరవం గలదని! **'మవాఖివు న్నుజూమ్'** అంటే నక్షత్రాలు ఉదయించే, అస్తమించే స్థలాలు అని అర్థం. అంటే వాటి గమ్యస్థానాలు, కక్ష్యలన్నమాట! మరికొంత మంది ఈ ఆయతును, "ఆయతులు అవతరించే ప్రవక్తల హృదయాలపై నేను ప్రమాణం చేస్తున్నాను" అని అనువదించారు. దివ్య ఖుర్ఆన్ కొద్దికొద్దిగా – అంచెల వారీగా – అవతరించిందన్నది ఈ వాక్యానికి భావం అని కొందరు అభిప్రాయపడగా, ప్రళయదినాన నక్షత్రాలు రాలి పడే విషయం ఇందులో ప్రస్తావించబడిందని మరికొందరు భావించారు. (ఇబ్నె కసీర్)

45. ఇది ప్రమాణానికి సమాధానం.

78 అదొక సురక్షితమైన గ్రంథంలో (నమోదై) ఉంది.[46]
فِىۡ كِتٰبٍ مَّكۡنُوۡنٍۙ ‏(78)

79 పరిశుద్ధులు మాత్రమే దాన్ని ముట్టుకోగలరు.[47]
لَّا يَمَسُّهٗۤ اِلَّا الۡمُطَهَّرُوۡنَؕ ‏(79)

80 ఇది సర్వలోకాల ప్రభువు తరఫున అవతరించింది.
تَنۡزِيۡلٌ مِّنۡ رَّبِّ الۡعٰلَمِيۡنَ‏ (80)

81 మరి ఇటువంటి (గొప్ప) విషయాన్ని మీరు తేలిగ్గా తీసు
కుంటున్నారా?[48]
اَفَبِهٰذَا الۡحَدِيۡثِ اَنۡتُمۡ مُّدۡهِنُوۡنَۙ‏ (81)

82 ధిక్కార వైఖరినే మీ వాటా (ఆహార సామగ్రి)గా గ్రహిస్తు
న్నారా?
وَتَجۡعَلُوۡنَ رِزۡقَكُمۡ اَنَّكُمۡ تُكَذِّبُوۡنَ‏ (82)

83 మరి (గుండెలోని) ప్రాణం గొంతు దాకా వచ్చేసినపుడు,
فَلَوۡلَاۤ اِذَا بَلَغَتِ الۡحُلۡقُوۡمَۙ‏ (83)

84 ఆ స్థితిని మీరు కళ్లారా చూస్తూ ఉండిపోతారు.[49]
وَاَنۡتُمۡ حِيۡنَـئِذٍ تَنۡظُرُوۡنَۙ‏ (84)

85 మేము ఆ చనిపోయేవ్యక్తికి మీకన్నా చాలా సమీపంలో
ఉంటాము.[50] కాని మీరు మాత్రం చూడలేరు.[51]
وَنَحۡنُ اَقۡرَبُ اِلَيۡهِ مِنۡكُمۡ وَلٰكِنۡ
لَّا تُبۡصِرُوۡنَ‏ (85)

86 మరి మీరే గనక ఒకరి ఆజ్ఞకు లోబడి ఉండకపోతే,
فَلَوۡلَاۤ اِنۡ كُنۡتُمۡ غَيۡرَ مَدِيۡنِيۡنَۙ‏ (86)

87 మీరు (మీ వాదనలో) సత్యవంతులే అయితే, ఆ పోయే
ప్రాణాన్ని (కాస్త) తిరిగి రప్పించుకోండి![52]
تَرۡجِعُوۡنَهَاۤ اِنۡ كُنۡتُمۡ صٰدِقِيۡنَ‏ (87)

88 మరెవడయితే దైవసామీప్యం పొందిన వారిలో చేరాడో,[53]
فَاَمَّاۤ اِنۡ كَانَ مِنَ الۡمُقَرَّبِيۡنَۙ‏ (88)

46. అంటే 'లౌహె మహ్‌ఫూజ్' అన్నమాట!

47. అంటే 'లౌహె మహ్‌ఫూజ్'ను తాకలేరు. 'పరిశుద్ధులు' అంటే దైవదూతలు అని భావం. మరి కొంతమంది దీన్ని 'ఖుర్ఆన్' అన్న భావంలో తీసుకున్నారు. అంటే ఊర్ధ్వ లోకాలలో ఒక్క దైవదూతలు తప్ప వేరెవరూ ఈ దివ్య గ్రంథాన్ని సమీపించలేదు. దివ్య ఖుర్ఆన్‌ను షైతాన్ శక్తులు తీసుకు వస్తున్నాయన్న ముష్రిక్కుల ఆరోపణ ఈ వాక్యం ద్వారా ఖండించబడింది.

48. ఇక్కడ **'హదీసు'** అంటే ఖుర్ఆన్ అని భావం. కాబట్టి ఈ ఖుర్ఆన్ విషయంలో అవిశ్వాసులతో, ముష్రిక్కులతో రాజీపడవలసిన పనిలేదు.

49. కాని మీరు మరణాన్ని వాయిదా వేయటంగానీ, చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తికి ఏదన్నా ప్రయోజనం చేకూర్చటంగానీ చేయలేరు.

50. చూడబోతే మీరు చనిపోయే ఆ వ్యక్తికి దగ్గరలో ఉంటారు. కాని జ్ఞానపరంగా, వీక్షణాపరంగా మీకన్నా దగ్గరగా మేముంటాము. 'మేము' అంటే ప్రాణం తీయటానికి దేవుని తరఫున నియమించబడిన మరణదూతలు అని కూడా అర్థం కావచ్చు.

51. అల్లాహ్ మీ ప్రాణనాళం కన్నా సమీపంలో ఉన్నాడు. కాని మీ అజ్ఞానంవల్ల మీరు ఆ విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. లేదా ప్రాణం తీసే దైవదూతలను మీరు మీ కళ్లతో చూడలేరు అన్న భావం కూడా కావచ్చు.

**89** అతని కొరకు సౌఖ్యం, మధుర భక్ష్యాలు, అనుగ్రహభరిత మైన స్వర్గవనం ఉంది.

فَرَوْحٌ وَّرَيْحَانٌ ۙ وَّجَنَّتُ نَعِيْمٍ ﴿٨٩﴾

**90** మరెవడయితే కుడిపక్షం వారిలో చేరి ఉంటాడో,[54]

وَاَمَّآ اِنْ كَانَ مِنْ اَصْحٰبِ الْيَمِيْنِ ﴿٩٠﴾

**91** కుడిపక్షం వారిలో చేరినందున నీకు సలాం! (అని అనబడు తుంది).

فَسَلٰمٌ لَّكَ مِنْ اَصْحٰبِ الْيَمِيْنِ ﴿٩١﴾

**92** కాని ఎవడయినా ధిక్కరించే మార్గభ్రష్టుల్లో గనక చేరిపోతే,[55]

وَاَمَّآ اِنْ كَانَ مِنَ الْمُكَذِّبِيْنَ الضَّآلِّيْنَ ﴿٩٢﴾

**93** వాడికి ఆతిథ్యంగా సలసల కాగే నీరు ఉంటుంది.

فَنُزُلٌ مِّنْ حَمِيْمٍ ﴿٩٣﴾

**94** నరక ప్రవేశం ఉంటుంది.

وَّتَصْلِيَةُ جَحِيْمٍ ﴿٩٤﴾

**95** నిశ్చయంగా ఇది తిరుగులేని సత్యం. (అత్యంత నమ్మదగిన విషయం.)

اِنَّ هٰذَا لَهُوَ حَقُّ الْيَقِيْنِ ﴿٩٥﴾

**96** కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు మహోన్నతుడగు నీ ప్రభువు నామ పవిత్రతను కొనియాడు.[56]

فَسَبِّحْ بِاسْمِ رَبِّكَ الْعَظِيْمِ ﴿٩٦﴾

52. మిమ్మల్ని అదుపు అజమాయిషీలో పెట్టిన ఒక యజమాని ఎవడూ లేడన్న మీ వాదనలో మీరు సత్యవంతులే అయితే పోయే ప్రాణాన్ని కాస్త తిరిగి రప్పించండి చూద్దాం! మీరే గనక ఈ పనిచేయలేకపోతే మీ అనుమానాలన్నీ బూటకం అని అనుకోవలసి వస్తుంది. ముమ్మాటికీ మీకొక యజమాని ఉన్నాడు. మీ యజమాని మిమ్మల్ని నిలదీసి అడిగే ఒక **'మహా రోజు'** తప్పకుండా వస్తుంది. ఆనాడు ఆయన ప్రతి ఒక్కరికీ వారి కర్మలనుబట్టి ప్రతిఫలం ఇస్తాడు.

53. ఈ సూరా ఆరంభంలో ఆచరణలను బట్టి మానవుల మూడు తరగతులు చేయబడ్డాయి. ఆ మూడు వర్గాల ప్రస్తావన ఇక్కడ మళ్లీ వచ్చింది. దైవసామీప్యం పొందినవారు ప్రథమ శ్రేణికి చెందినవారు. వారే 'ముందంజ వేసినవారు'గా కూడా కొనియాడబడ్డారు. ఎందుకంటే వారు సత్కార్యాలలో సతతం ముందుకు దూసుకుపోయేవారు. విశ్వసించటంలో కూడా వారెన్నడూ సంకోచించలేదు.

54. వీరు ద్వితీయ శ్రేణికి చెందిన సాధారణ విశ్వాసులు. వీరు కూడా నరకాగ్ని యాతన నుండి రక్షించబడ్డారు. స్వర్గంలో ప్రవేశార్హత సంపాదిస్తారు. అయితే అంతస్థుల విషయంలో మాత్రం దైవసామీప్యం పొందినవారికన్నా వెనుకబడి ఉంటారు. మరణ సమయంలో వీరికి కూడా దైవదూతలు 'సలాం'తో స్వాగతం పలుకుతారు.

55. వీరు మూడవ శ్రేణికి చెందినవారు – ఎడమ పక్షానికి చెందినవారు. అభాగ్యులు. తమ ధిక్కారవైఖరికి, కాపట్య వైఖరికి ప్రతిగా వారిని నరకయాతన చుట్టుముడుతుంది.

56. హదీసులో ఈ విధంగా ఉంది : "రెండు వచనాలు అల్లాహ్‌కు ఎంతో ప్రీతికరమైనవి. నోటికి (పలకటానికి) అవి చాలా తేలిక. త్రాసులో మాత్రం చాలా బరువైనవి. అవే : 1. సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ. 2. సుబ్‌హానల్లాహిల్ అజీమ్." (సహీహ్ బుఖారీ – ఆఖరి హదీసు ; సహీహ్ ముస్లిం – ధ్యాన ప్రకరణం).

57వ సూరా

# అల్ హదీద్

## ఇనుము

అవతరణ మదీనాలో

ఆయతులు 29

### పరిచయం

*ఏక దైవారాధన, అల్లాహ్ మార్గంలో ఖర్చుచేయడం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఇందులోని 25వ ఆయత్‌లో ప్రస్తావనకు వచ్చిన 'హదీద్' (ఇనుము) అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఇనుము శాంతి కాలంలో నిర్మాణ కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. యుద్ధకాలంలో ఆయుధాల తయారీకి ఉపయోగపడుతుంది. అలాంటి ఇనుమును సృష్టించి ఇచ్చింది దేవుడేనని ఈ సూరా తెలిపింది. అల్లాహ్‌ను హృదయపూర్వకంగా, ఎలాంటి సందేహానికి తావు లేకుండా విశ్వసించాలని బోధించింది. అల్లాహ్ సర్వజ్ఞాన సంపన్నుడు, అపరిమిత శక్తి సామర్థ్యాలు కలిగినవాడు, సృష్టించే విశిష్ట శక్తి ఉన్నవాడని ఈ సూరా నిదర్శనాలతో సహా వివరించింది. అల్లాహ్ మహా వివేకవంతుడు, అత్యంత శక్తిసంపన్నుడు. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించాడు, వాటిని అదుపు చేస్తున్నాడు. ఆకాశం నుంచి దిగేది ఏదో, ఆకాశానికి ఎక్కేది ఏదో అన్నీ ఆయనకు తెలుసు. ఆయన రాత్రిని పగటిలో ఐక్యం చేస్తాడు, పగలును రాత్రిలో ఐక్యం చేస్తాడు. ఆయన అందరి రహస్యాలు తెలిసినవాడు. మనం ఎక్కడున్నా ఆయన మనతోపాటు ఉంటాడు. భూమ్యాకాశాలలోని సర్వస్వం ఆయనదే, ఆయనే వాటికి వారసుడు. ఈ సూరాలో ప్రవక్త ఈసా(అస)ను (అంటే ప్రవక్త ఏసుక్రీస్తు), ఆయనకు ఇవ్వబడిన ఇంజీల్ గ్రంథాన్ని ప్రస్తావించడం జరిగింది. ఇంజీల్ గ్రంథం ప్రవక్త ఏసుకు ఇవ్వబడిన గ్రంథం. కాని ఇప్పుడు ఆ గ్రంథం చాలా వరకు మార్పులు చేర్పులకు గురయ్యింది. ఈసా(అస)ను అనుసరించిన శిష్యుల హృదయాల్లో కారుణ్యాన్ని, దయను సృష్టించడం జరిగిందని ఈ సూరా వివరించింది. కాని వారు తమకు తామే సన్యాసత్వాన్ని పాటించడం ప్రారంభించారని, ఆ తర్వాత దానికి కట్టుబడలేకపోయారని తెలిపింది. సన్మార్గులకు లభించే మంచి ప్రతిఫలం గురించి, కాపట్యాన్ని అవలంబించిన వారికి లభించే అవమానాల గురించి కూడా ఇందులో ప్రస్తావించడం జరిగింది.*

## అల్ హదీద్ సూరా

## سُوْرَةُ الْحَدِيْدِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న వస్తువులన్నీ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతున్నాయి.[1] ఆయన గొప్ప శక్తిశాలి, వివేచనాశీలి.

سَبَّحَ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ①

2 భూమ్యాకాశాల సార్వభౌమత్వం ఆయనదే.[2] జీవన్మరణాల ప్రదాత ఆయనే. ఆయన ప్రతిదీ చేయగల అధికారం గలవాడు.

لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ يُحْيٖ وَيُمِيْتُ ۚ وَهُوَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ②

3 ఆయనే మొదటివాడు, చివరివాడు. ఆయనే బాహ్యం. ఆయనే నిగూఢం.[3] ఆయన ప్రతిదీ తెలిసినవాడు.

هُوَ الْاَوَّلُ وَالْاٰخِرُ وَالظَّاهِرُ وَالْبَاطِنُ ۚ وَهُوَ بِكُلِّ شَيْءٍ عَلِيْمٌ ③

1. వివిధ వస్తువులు చేసే స్తోత్రం మనకు అర్థం కానవసరం లేదు. అందుకే ఇలా అనబడింది : "ఆయన స్తోత్రంతో సహా ఆయన పవిత్రతను కొనియాడని వస్తువంటూ ఏదీ లేదు. కాకపోతే మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు" (బనీ ఇస్రాయీల్ – 44). దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అలైహిస్సలాం) గారితో చేరి పర్వతాలు కూడా దేవుని పవిత్రతను కొనియాడేవని వేరొకచోట చెప్పబడింది (అల్ అంబియా – 79).

2. అందువల్ల ఆయన భూమ్యాకాశాల మధ్య తన అధికారాలను తాను కోరిన విధంగా చెలాయిస్తాడు. తాను కోరిన వారిని అనుగ్రహిస్తాడు. తాను కోరిన వారిని దండిస్తాడు. ఆయన అధికారానికి తిరుగులేదు. ఆయన ప్రభుత్వంలో ఇంకొకరి అధికారం చెల్లనేరదు. వర్షాలు, వృక్షజాలు, ఆహారనిధులు అన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయి.

3. ఆయనే ఆది (తొలివాడు). ఆయనకు పూర్వం ఏదీ లేదు. ఆయనే అంతం. ఆయన తరువాత మరేదీ ఉండబోదు. ఆయనే బాహ్యం. ఆయన సర్వాన్నీ అధీష్టించి ఉన్నాడు. ఆయన్ని లొంగదీసుకోగలిగే శక్తి ఏదీ ఈ జగతిలో లేదు. ఆయన నిగూఢం. జనుల ఆంతర్యంలో జనించే సర్వ విషయాలు, రహస్యాలు ఆయనకు మాత్రమే తెలుసు. ఆయన ప్రజల కంటికి కానరాని, బుద్ధికి అందని అస్తిత్వం. (ఫత్హుల్ ఖదీర్). దైవప్రవక్త (స) తన పుత్రిక ఫాతిమా (రజి అన్హా)కు ఈ దుఆ పఠిస్తూ ఉండమని పురమాయించారు: **"అల్లాహుమ్మ ! రబ్బస్సమావాతిస్సబ్‌యి వ రబ్బల్ అర్షిల్ అజీమ్. రబ్బనా వ రబ్బ కుల్లిషైయిన్. ముంజిలత్తౌరాతి, వల్ ఇంజీలి వల్ ఫుర్ఖాన్, ఫాలిఖల్ హబ్బి వన్నవా, అవూజు బిక మిన్ షర్రి కుల్లి షైయిన్ అంత ఆఖిజున్ బినాసియతిహీ. అల్లాహుమ్మ అంతల్ అవ్వలు ఫలైస ఖబ్‌లక షైవున్, వ అంతల్ ఆఖిరు ఫలైస బాదక షైవున్, వ అంతజ్జాహిరు ఫలైస ఫౌఖక షైవున్, వ అంతల్ బాతిను ఫలైస దూనక షైవున్. అఖ్జి అన్నద్దైన వ అగ్‌నినా మినల్ ఫఖర్."** (ఓ అల్లాహ్! సప్తాకాశాలకు, మహోన్నత సింహాసనానికి ప్రభువా! మాకూ, ఇంకా ప్రతి వస్తువుకూ ప్రభువా! తౌరాత్‌ను, ఇంజీల్‌ను, గీటురాయిని అవతరింపజేసినవాడా! గింజను, టెంకను చీల్చేవాడా! అన్ని వస్తువుల కీడు నుండి నేను నీ శరణు వేడుకుంటున్నాను. ప్రతి వస్తువు జుత్తు నీ చేతిలోనే ఉన్నది. ఓ అల్లాహ్! నీవే ఆదివి. నీకంటే పూర్వం ఏమీ లేదు. నీవే అంతానివి. నీ తర్వాత కూడా ఏమీ ఉండదు. నీవే బాహ్యానివి. నీపై ఏమీ లేదు. నీవే నిగూఢానివి. నీ కింద కూడా ఏమీ ఉండదు. (ప్రభూ!) మా రుణభారాన్ని తొలగించు. పేదరికం నుంచి మమ్మల్ని సంపన్నులుగా చెయ్యి) (సహీహ్ ముస్లిం). రుణభారం నుంచి విముక్తి కోసం చేయబడే ఈ మస్నూన్ ప్రార్థనలో అవ్వల్, ఆఖిర్, జాహిర్, బాతిన్‌లకు సంబంధించిన వివరాలు వచ్చేశాయి.

**4** ఆయనే భూమ్యాకాశాలను ఆరు రోజులలో సృష్టించాడు. ఆ తరువాత సింహాసనాన్ని అధిష్టించాడు.[4] భూమి లోపలికి పోయేదీ,[5] అందులో నుంచి బయల్పడేదీ,[6] ఆకాశం నుంచి క్రిందికి దిగేదీ,[7] మరందులోకి ఎక్కిపోయేదీ[8] – అంతా ఆయనకు (బాగా) తెలుసు. మీరెక్కడ ఉన్నా ఆయన మీతోనే ఉంటాడు.[9] మరి మీరు చేసే పనులన్నింటినీ అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.

هُوَ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ فِيْ سِتَّةِ
اَيَّامٍ ثُمَّ اسْتَوٰى عَلَى الْعَرْشِ ؕ يَعْلَمُ مَا يَلِجُ
فِي الْاَرْضِ وَمَا يَخْرُجُ مِنْهَا وَمَا يَنْزِلُ
مِنَ السَّمَآءِ وَمَا يَعْرُجُ فِيْهَا ؕ وَهُوَ مَعَكُمْ اَيْنَ
مَا كُنْتُمْ ؕ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ④

**5** భూమ్యాకాశాల సార్వభౌమత్వం ఆయనదే. సమస్త వ్యవహారాలు (తీర్పు నిమిత్తం) ఆయన వైపుకే మరలించబడతాయి.

لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ وَاِلَى اللّٰهِ تُرْجَعُ
الْاُمُوْرُ ⑤

**6** ఆయనే రాత్రిని పగటిలోనికి ప్రవేశింపజేస్తున్నాడు,[10] మరి ఆయనే పగటిని రాత్రిలోనికి జొప్పిస్తున్నాడు. ఆయన గుండె ల్లోని గుట్టును (సయితం) బాగా ఎరిగినవాడు.

يُوْلِجُ الَّيْلَ فِي النَّهَارِ وَيُوْلِجُ النَّهَارَ فِي
الَّيْلِ ؕ وَهُوَ عَلِيْمٌ ۢ بِذَاتِ الصُّدُوْرِ ⑥

4. ఈ భావం గల ఆయతులు ఆరాఫ్ సూరా 54వ ఆయతులో, యూనుస్ సూరా 3వ ఆయతులో, అలిఫ్ లామ్ మీమ్ అస్సజ్దా సూరా 4వ ఆయతులో కూడా ఇంతకు ముందు వచ్చాయి. వాటి వివరణలు చూడండి.

5. అంటే భూమి అడుగు భాగంలోకి దిగే వర్షపు బిందువులను, నేలలో నాటుకునే ఆహార గింజలను, టెంకలను గురించి, వాటి పరిణామాలను గురించి ఆయనకు తెలుసు.

6. భూమిలో నుంచి మొలకెత్తే ధాన్యపు గింజలను గురించి, ఇతరత్రా వృక్షజాల గురించి, తీపి పండ్లను, చేదుఫలాలను ఇచ్చే చెట్ల గురించి, సువాసన చిందించే తీగల గురించి కూడా ఆయనకు తెలుసు. ఈ విషయమే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: “అగోచర విషయాలకు సంబంధించిన నిగూఢ రహస్యాలన్నీ ఆయనకు మాత్రమే తెలుసు. ఆయనకు తప్ప వాటిని గురించి వేరెవరికీ తెలీదు. భూప్రదేశాలలో, నదీనదాలలో ఏముందో ఆయనకే తెలుసు. చెట్టు నుండి రాలే ఏ ఆకు కూడా ఆయన జ్ఞాన పరిధి నుంచి తప్పించుకోజాలదు. ఆఖరికి భూమిలోని చీకటి పొరలలో పడివుండే గింజ సైతం ఆయన జ్ఞానపరిధిలో ఉంటుంది. పచ్చి వస్తువులు, ఎండు వస్తువులు కూడా – ఇవన్నీ స్పష్టమైన గ్రంథంలో నమోదై ఉంటాయి” (అల్ అన్ ఆమ్ – 59).

7. అంటే – వర్షం, వడగళ్లు, మంచు, ఇంకా దైవదూతలు తీసుకుని వచ్చే దైవాదేశాలు, విధివ్రాత – వీటన్నింటి గురించి ఆయనకు తెలుసు.

8. అంటే దైవదూతలు ఊర్ధ్వలోకాల వైపుకు మోసుకుపోయే మానవ కర్మలన్నమాట! హదీసు ప్రకారం “దైవదూతలు రాత్రిపూట చేయబడిన కర్మలు తెల్లవారకముందే అల్లాహ్ వద్దకు చేరవేస్తారు. పగటిపూట కర్మలు రాత్రి అవక ముందే చేరవేస్తారు” (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

9. అంటే – మీరు ఎడారిలో వున్నా–సముద్ర ప్రయాణంలో ఉన్నా, రాత్రి చీకటిలో ఉన్నా– పగటి వెలుతురులో ఉన్నా, ఏకాంతంలో ఉన్నా–నలుగురిలో వున్నా, ఇంట్లో వున్నా – వీధిలో వున్నా సర్వకాల సర్వావస్థల్లో ఆయన మీ వెంట ఉంటాడు. మీ చేష్టలను కనిపెట్టుకుని ఉంటాడు. మీరు చెప్పేదంతా వింటూ ఉంటాడు. ఈ విషయమే ఇంతకుముందు హూద్ సూరా 3వ ఆయతులో, అర్రాద్ సూరా 10వ ఆయతులో, ఇతర ఆయతులలో కూడా వచ్చింది.

10. అంటే – సమస్త వస్తువులకు యజమాని ఆయనే. తాను కోరిన విధంగా ఆయన వాటిని ఉపయోగించుకుంటాడు. ఆయన ఆజ్ఞానుసారం కొంతకాలం పాటు రాత్రి పెద్దదిగా పగలు చిన్నదిగా ఉంటుంది. అలాగే మరి కొంతకాలంపాటు

**7** మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించండి. అల్లాహ్ మిమ్మల్ని ఏ సంపదకైతే వారసులుగా[11] చేశాడో అందులో నుంచి ఖర్చుచేయండి. మరి మీలో విశ్వసించి, దానధర్మాలు చేసేవారికి గొప్ప పుణ్యఫలం లభిస్తుంది.

آمِنُوا بِاللَّهِ وَرَسُولِهِ وَأَنفِقُوا مِمَّا جَعَلَكُم
مُّسْتَخْلَفِينَ فِيهِ ۖ فَالَّذِينَ آمَنُوا مِنكُمْ
وَأَنفَقُوا لَهُمْ أَجْرٌ كَبِيرٌ ⑦

**8** మీరు అల్లాహ్‌ను ఎందుకు విశ్వసించరు? అసలు మీకేమై పోయింది? చూడబోతే దైవప్రవక్త స్వయంగా మీ ప్రభువును విశ్వసించమని మీకు పిలుపు ఇస్తున్నాడు. మీరు నిజంగా విశ్వసించినవారైతే ఆయన మీ నుండి గట్టి వాగ్దానం కూడా తీసుకున్నాడు (అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి).[12]

وَمَا لَكُمْ لَا تُؤْمِنُونَ بِاللَّهِ ۙ وَالرَّسُولُ يَدْعُوكُمْ
لِتُؤْمِنُوا بِرَبِّكُمْ وَقَدْ أَخَذَ مِيثَاقَكُمْ إِن كُنتُم
مُّؤْمِنِينَ ⑧

**9** మిమ్మల్ని కారుచీకట్ల నుంచి వెలికితీసి కాంతివైపు తీసుకుపోవటానికి తన దాసునిపై తేటతెల్లమైన ఆయతులను అవతరింపచేసినవాడు ఆయనే (అల్లాహ్‌యే). నిశ్చయంగా అల్లాహ్ మీ యెడల మృదుస్వభావి, దయాశీలి.

هُوَ الَّذِي يُنَزِّلُ عَلَىٰ عَبْدِهِ آيَاتٍ بَيِّنَاتٍ
لِّيُخْرِجَكُم مِّنَ الظُّلُمَاتِ إِلَى النُّورِ ۚ وَإِنَّ اللَّهَ
بِكُمْ لَرَءُوفٌ رَّحِيمٌ ⑨

**10** మీరు అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టక పోవటానికి కారణం ఏమిటి? అసలు మీకేమయింది? వాస్తవానికి భూమ్యాకాశాల లోని వారసత్వం అంతా అల్లాహ్‌కే చెందుతుంది. మీలో (మక్కా) విజయానికి పూర్వం దైవమార్గంలో ఖర్చుచేసినవారు, పోరాడిన వారూ – ఇతరులూ సమానులు కాలేరు.[13] (మక్కా) విజయం

وَمَا لَكُمْ أَلَّا تُنفِقُوا فِي سَبِيلِ اللَّهِ وَلِلَّهِ
مِيرَاثُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ لَا يَسْتَوِي مِنكُم
مَّنْ أَنفَقَ مِن قَبْلِ الْفَتْحِ وَقَاتَلَ ۚ أُولَٰئِكَ

---

పగలు పెద్దదిగానూ, రాత్రి చిన్నదిగానూ ఉంటుంది. కొంత కాలంపాటు రేయింబవళ్లు సమానంగా ఉంటాయి. అలాగే కొంతకాలం పాటు చలిగాలులు వీస్తే, కొంతకాలం పాటు వేడిగాలులు వీస్తాయి. మరి కొంతకాలం వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. వాతావరణంలోని ఈ మార్పుల వెనుక ఆయన 'ఇచ్ఛ', ఆయన ప్రణాళిక మాత్రమే పనిచేస్తున్నాయి.

11. అంటే – ఈ సంపద ఒకప్పుడు ఇతరుల దగ్గర ఉండేది. మీ దగ్గర కూడా ఈ సంపద శాశ్వతంగా ఉండదు. ఇంకొకరు దీనికి వారసులవుతారు. ఒకవేళ మీరు గనక ఈ సంపదను దైవమార్గంలో ఖర్చుపెట్టకపోతే, మీకు వారసులుగా వచ్చేవారు దానిని దైవమార్గంలో వెచ్చించి సత్కార్యాలలో మిమ్మల్ని మించిపోవచ్చు. ఒకవేళ వారు అవిధేయతా మార్గంలో ఈ సొమ్మును వెచ్చిస్తే అప్పుడు కూడా (ఆ పాపంలో) మీరు వారికి సహాయపడిన వారవుతారు (ఇబ్నె కసీర్). హదీసులో ఇలా అనబడింది: "నా సొమ్ము నా సొమ్ము అని మనిషి అంటాడు. నిజానికి 1. నువ్వు తిని త్రాగి అవజేసినదే నీ సొమ్ము. 2. నువ్వు తొడిగి చించేసినది నీ సొమ్ము. 3. నువ్వు దైవమార్గంలో ఖర్చుచేసి పరలోకం కోసం భద్రపరచుకున్నది నీ సొమ్ము. అది తప్ప మిగిలినదంతా ఇతరుల వాటాలోనికి పోతుంది" (సహీహ్ ముస్లిం– కితాబుజ్జుహ్ద్).

12. ఇంతకీ ఈ గట్టి వాగ్దానం తీసుకున్నదెవరు? ఇబ్నె కసీర్ అభిప్రాయం ప్రకారం ఇది దైవప్రవక్త (సఅసం) తన సహచరుల నుండి తీసుకున్న వాగ్దానం. "కలిమిలోనూ – లేమిలోనూ, కష్టాలలోనూ – సుఖాలలోనూ విధేయతకు కట్టుబడి ఉంటాము" అని ఆయన (స) తన సహచరుల చేత ప్రమాణం (శపథం) చేయించేవారు.

اَعۡظَمُ دَرَجَةً مِّنَ الَّذِيۡنَ اَنۡفَقُوۡا مِنۡۢ بَعۡدُ وَقٰتَلُوۡا ؕ وَكُلًّا وَّعَدَ اللّٰهُ الۡحُسۡنٰى ؕ وَاللّٰهُ بِمَا تَعۡمَلُوۡنَ خَبِيۡرٌ ⑩

తర్వాత ఖర్చుచేసి, పోరాడిన వారికంటే వీరు గొప్ప అంతస్థులు కలవారు.[14] అయితే మేలు చేస్తానన్న అల్లాహ్ వాగ్దానం మాత్రం వీరందరికీ వర్తిస్తుంది.[15] మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

مَنۡ ذَا الَّذِىۡ يُقۡرِضُ اللّٰهَ قَرۡضًا حَسَنًا فَيُضٰعِفَهٗ لَهٗ وَلَهٗۤ اَجۡرٌ كَرِيۡمٌ ⑪

**11** అల్లాహ్‌కు ఉత్తమ (రీతిలో) రుణం ఇచ్చేవాడెవడు? దాన్ని ఆయన అతని కోసం పెంచుతూపోతాడు. అతని యెడల అది అత్యుత్తమ ప్రతిఫలంగా రూపొందుతుంది.[16]

ఇమామ్ ఇబ్నె జరీర్ ప్రకారం ఈ వాగ్దానం తీసుకున్నవాడు అల్లాహ్. ఆయన సమస్త మానవులను ఆదం (అలైహిస్సలాం) వెన్ను నుంచి తీసినపుడు వారిచేత తీసుకున్న వాగ్దానం ఇది. ఇది **'అహ్దె అలస్త్'**గా వ్యవహరించబడుతుంది. అల్ ఆరాఫ్ సూరా 172వ వచనంలో ఈ వివరాలు వచ్చాయి.

13. **'విజయం'** అంటే అత్యధికమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం 'మక్కా విజయం' అని భావం. కాని కొంతమంది వ్యాఖ్యాతలు హుదైబియా ఒప్పందాన్ని 'విజయం'గా భావించారు. మొత్తానికి హుదైబియా ఒప్పందానికి పూర్వం అయినా, మక్కా విజయానికి మునుపు అయినా ముస్లింలు సంఖ్యాపరంగానూ, సాధనసంపత్తుల రీత్యానూ బలహీనులుగానే ఉండేవారు. అటువంటి అభాగ్య పరిస్థితుల్లో దైవమార్గంలో విరివిగా ఖర్చుచేయటం, పోరాడటం మామూలు విషయం కాదు. అది సాహసోపేతమైన కార్యం! కాని మక్కా విజయం తరువాత ముస్లింల పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ఒకవైపు వారు సంఖ్యాపరంగా విపరీతంగా పెరగటంతో పాటు మరో వైపు వారి ఆర్థిక పరిస్థితులు కూడా చాలా వరకు మెరుగుపడ్డాయి. అందుకే తొలికాలపు ముస్లింలు చేసిన త్యాగాలు అసాధారణమైనవనీ, వారి అంతస్థులు గొప్పవనీ అల్లాహ్ ఇక్కడ స్పష్టపరిచాడు.

14. ఎందుకంటే అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో వారు ధన, ప్రాణాలను త్యాగం చేశారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే కష్టకాలంలో తమ సర్వస్వాన్ని ధర్మోన్నతి కోసం అర్పించే త్యాగధనులకు (సాధారణ జనులకన్నా) పెద్ద పీట వేయటం జరుగుతుంది. అందుకే అహ్లె సున్నత్ వారి దృష్టిలో హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) స్థానం ఇతరులకన్నా ఉత్తమమైనది. ఎందుకంటే మహాప్రవక్త ముహమ్మద్ (స) పరిచయం చేసిన జీవన ధర్మాన్ని విశ్వసించిన తొలి విశ్వాసి కూడా ఆయనే, దైవమార్గంలో ఖర్చుపెట్టడంలో ముందంజవేసిన త్యాగశీలి కూడా ఆయనే. దైవమార్గంలో పోరాడటానికి బయలు దేరినదీ ఆయనే. అందుకే మహాప్రవక్త (స) తన జీవిత కాలంలోనే అబూబకర్(రజి)ను నమాజ్ సారథ్యం కోసం ముందుకు పంపారు. ఆ సంకేతాన్ని పురస్కరించుకునే అనుయాయులు (ప్రవక్త ప్రియసహచరులు) ఆయన్ని ప్రథమ ఖలీఫాగా ఎన్నుకున్నారు.

15. అంతస్థుల రీత్యా ప్రవక్త సహచరుల మధ్య అంతరం ఉన్నప్పటికీ తరువాతి కాలంలో ఇస్లాం స్వీకరించిన సహాబీలు (ర.అన్హుం) ధార్మికంగా, నైతికంగా మరీ వెనుకబడి ఉన్నవారని దీని అర్థం ఎంతమాత్రం కాదు. హజ్రత్ ముఆవియా (రజి), ఈయన తండ్రి గారైన హజ్రత్ అబూ సుఫ్యాన్ (రజి), మరికొంతమంది గొప్ప సహాబీలను గురించి కొంతమంది ప్రబుద్ధులు అమర్యాదకరంగా మాట్లాడతారు. తన సహచరులందరి గురించి మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు : "నా సహచరులను తూలనాడకండి. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ అస్తిత్వం సాక్షిగా చెబుతున్నాను – మీలో ఎవరయినా సరే ఉహుద్ పర్వతమంత బంగారాన్ని దైవమార్గంలో ఖర్చుచేసినా అది నా ప్రత్యక్ష సహచరుడు ఖర్చుచేసిన ఒక 'ముద్' (కొలపాత్ర)కు, ఆఖరికి ముద్‌లో సగభాగానికి కూడా సమానం కాజాలదు" (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం – ప్రవక్త సహచరుల మహిమోన్నతుల ప్రకరణం).

16. అల్లాహ్‌కు ఉత్తమ రీతిలో రుణం ఇవ్వటం అంటే అల్లాహ్ మార్గంలో దానధర్మాలు చేయటం అని అర్థం. దైవమార్గంలో

يَوْمَ تَرَى الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ يَسْعٰى نُوْرُهُمْ بَيْنَ اَيْدِيْهِمْ وَبِاَيْمَانِهِمْ بُشْرٰىكُمُ الْيَوْمَ جَنّٰتٌ تَجْرِىْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَا ؕ ذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿12﴾

12 ఆ రోజు (ప్రళయదినాన) విశ్వాసులైన పురుషులను, విశ్వాసులైన స్త్రీలను నీవు చూస్తావు. వారి కాంతి వారికి ముందు వైపున, కుడి వైపున పరుగెడుతూ ఉంటుంది.[17] "ఈ రోజు మీకో శుభవార్త! క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలు మీకోసం ఉన్నాయి. అందులో మీరు కలకాలం ఉంటారు. ఇదే గొప్ప సాఫల్యం!"[18] (అని వారితో అనబడుతుంది).

يَوْمَ يَقُوْلُ الْمُنٰفِقُوْنَ وَالْمُنٰفِقٰتُ لِلَّذِيْنَ اٰمَنُوا انْظُرُوْنَا نَقْتَبِسْ مِنْ نُّوْرِكُمْ ۚ قِيْلَ ارْجِعُوْا وَرَآءَكُمْ فَالْتَمِسُوْا نُوْرًا ؕ فَضُرِبَ بَيْنَهُمْ بِسُوْرٍ لَّهٗ بَابٌ ؕ بَاطِنُهٗ فِيْهِ الرَّحْمَةُ وَظَاهِرُهٗ مِنْ قِبَلِهِ الْعَذَابُ ﴿13﴾

13 ఆ రోజు కపటులైన పురుషులు, కపటులైన స్త్రీలు విశ్వాసుల నుద్దేశించి, "కాస్త మాకోసం ఆగండి! మేము కూడా మీ కాంతి నుండి కాస్త లబ్ధి పొందుతాం"[19] అని అంటారు. "మీరు వెనక్కి మరలండి. వెలుతురును అక్కడే వెతుక్కోండి"[20] అని వారికి సమాధానం ఇవ్వబడుతుంది. మరి వారి మధ్య[21] ఒక అడ్డుగోడ ఏర్పరచబడుతుంది. అందులో ఒక ద్వారం కూడా ఉంటుంది. దాని లోపలి వైపు కారుణ్యం[22] ఉంటుంది. బయటి వైపు మాత్రం యాతన[23] ఉంటుంది.

يُنَادُوْنَهُمْ اَلَمْ نَكُنْ مَّعَكُمْ ؕ قَالُوْا بَلٰى وَلٰكِنَّكُمْ فَتَنْتُمْ اَنْفُسَكُمْ وَتَرَبَّصْتُمْ وَارْتَبْتُمْ وَغَرَّتْكُمُ

14 వీళ్లు (కపటులు) వారిని (విశ్వాసులను) బిగ్గరగా పిలుస్తూ, "మేము మీ వెంటలేమా?!"[24] అనంటారు. దానికి వారు, "అవును. మా వెంట ఉన్న సంగతి నిజమే. కాని మీరు మీ

మనిషి ఖర్చుపెట్టే ఈ ధనం వాస్తవానికి దైవప్రసాదితమే. అయినప్పటికీ ఆయన దాన్ని 'మంచి రుణం'గా ఖరారు చేయటం, దాన్ని ఎన్నో రెట్లు పెంచుతానని అనటం – ఇదంతా దైవకృపే.

17. పరలోకంలో 'పుల్‌సిరాత్' (వారధి)ని దాటుతున్నప్పుడు విశ్వాసులకు వారి విశ్వాసం (ఈమాన్) మరియు సదాచరణల (అమలుస్సాలెహ్) కు ప్రతిఫలంగా ఈ కాంతి ప్రసరిస్తూ ఉంటుంది. ఈ కాంతిలో వారు స్వర్గలోక బాటను తొందరగా అధిగమిస్తారు. ఇమామ్ ఇబ్నె కసీర్, ఇమామ్ ఇబ్నె జరీర్‌లు మాత్రం **'వ బి అయ్‌మానిహిమ్'** అన్న పదాన్ని 'వారి కుడిచేతుల్లో వారి కర్మల పత్రాలుంటాయి' అన్న భావంలో తీసుకున్నారు.

18. వారికి స్వాగతం పలకటానికి, అతిథి మర్యాదలు చేయటానికి సిద్ధంగా ఉన్న దైవదూతలు పలికే మాటలివి!

19. ఈ కపటులు కొంతదూరం పాటు విశ్వాసుల వెలుగులో నడుస్తారు. ఆ తరువాత దైవాజ్ఞతో కపటులపై అంధకారం అలుముకుంటుంది. అప్పుడు వారు విశ్వాసులతో ఈ విధంగా అంటారు.

20. అంటే – ప్రపంచంలోకి తిరిగివెళ్ళి, చేతనైతే విశ్వాసం మరియు సత్కర్మల మూలధనాన్ని తీసుకురండి. లేదా మేమెక్కడి నుంచి ఈ కాంతిని తెచ్చుకున్నామో అక్కడే మీరు కూడా వెతకండి అని విశ్వాసులు వారితో వెటకారంగా అంటారు.

21. అంటే, విశ్వాసుల – కపటుల మధ్య ఈ అడ్డుగోడ ఏర్పడుతుంది.

22. ఇక్కడ **'కారుణ్యం'** అంటే స్వర్గం అన్నమాట. ఈ స్వర్గంలో విశ్వాసులుంటారు.

23. అంటే అటువైపున నరకం ఉంటుంది.

الْأَمَانِيُّ حَتَّىٰ جَاءَ أَمْرُ اللَّهِ وَغَرَّكُم بِاللَّهِ الْغَرُورُ ﴿١٤﴾

ఆత్మలను వంచించుకున్నారు.[25] (మాపై గడ్డుకాలం రావాలని) ఎదురు చూశారు.[26] సందేహాలలో ఊగిసలాడారు.[27] పనికి మాలిన మీ అభిలాషలే మిమ్మల్ని దగా చేశాయి.[28] ఎట్టకేలకు దైవాజ్ఞ రానే వచ్చింది.[29] అల్లాహ్ విషయంలో మోసగించినవాడు (షైతాన్), మిమ్మల్ని (కడ దాకా) మోసంలోనే ఉంచాడు."[30]

فَالْيَوْمَ لَا يُؤْخَذُ مِنكُمْ فِدْيَةٌ وَلَا مِنَ الَّذِينَ كَفَرُوا ۚ مَأْوَاكُمُ النَّارُ ۖ هِيَ مَوْلَاكُمْ ۖ وَبِئْسَ الْمَصِيرُ ﴿١٥﴾

**15** ఏమైనా ఈ రోజు మీనుండి గానీ, అవిశ్వాసుల నుండి గానీ పరిహారం తీసుకోబడదు. మీ అందరి నివాస స్థలం నరకాగ్నే. అదే మీ నేస్తం.[31] అది మహా చెడ్డ గమ్యస్థానం.

أَلَمْ يَأْنِ لِلَّذِينَ آمَنُوا أَن تَخْشَعَ قُلُوبُهُمْ لِذِكْرِ اللَّهِ وَمَا نَزَلَ مِنَ الْحَقِّ وَلَا يَكُونُوا

**16** ఏమిటీ, విశ్వాసుల హృదయాలు అల్లాహ్ జ్ఞాపకం పట్ల, ఆయన అవతరింపజేసిన సత్యం పట్ల మెత్తబడే సమయం ఇంకా వారికి ఆసన్నం కాలేదా?[32] వీరికి మునుపు గ్రంథం వొసగబడిన

---

24. అడ్డుగోడ ఏర్పడేసరికి కపటులు నివ్వెరపోతారు. వారు ముస్లిములను ఉద్దేశించి, "సోదరులారా! మేము మీకు తోడుగా ఉండలేదా! మీతో కలసి నమాజు చేయలేదా? మీతో కలసి యుద్ధాలు చేయలేదా?" అని ప్రాధేయపడతారు.
25. నిత్యం మీ అంతరంగాలలో కాపట్య కుల్లు, తిరస్కార వైఖరి తిష్ఠవేసి ఉండేది.
26. ముస్లింలపై ఎప్పుడు కష్టకాలం వస్తుందా! అని మీరు గంపెడు ఆశతో ఎదురుచూస్తూ ఉండేవారు.
27. ధర్మం విషయంలోనూ, అల్లాహ్ విషయంలోనూ మీరు నిత్యం అనుమానాలకు లోనై ఉండేవారు. దైవసహాయం విషయంలో కూడా మీరు పొద్దస్తమానం కీడును శంకించేవారు.
28. ఎందుకంటే మీరు షైతాను ప్రేరణలకు లొంగిపోయారు. ఆ మాయలమారిని నమ్ముకున్న వారు దగా పడకతప్పదు.
29. ఈ లోగా మీరు దారికి వస్తారేమో అనుకుంటే రాలేదు. మీకు మరణ కాలం వచ్చేసింది. లేక అటు ముస్లింలు విజయం సాధించారు. మీ కాకిలెక్కలన్నీ తారుమారయ్యాయి అన్న భావం కూడా కావచ్చు.
30. అల్లాహ్ మీకు వ్యవధి ఇచ్చిన కొద్దీ మీరు పెచ్చరిల్లిపోయారు. ఆయన స్వతహాగా సహనశీలి. చీటికీ మాటికీ ఆయన తన దాసులను దండించకుండా – వారి రుజువర్తన కోసం తగినంత గడువు ఇస్తాడు. కాని ఈ గడువును సద్వినియోగం చేసుకునే బదులు మీరు షైతాను మాయాజాలంలో చిక్కుకున్నారు.
31. ఇక్కడ అరబీలో **'మౌలా'** అనబడింది. ఒకరి పనులకు సంబంధించి బాధ్యత వహించే వ్యక్తిని మౌలా అంటారు. ఇక్కడ మతలబు ఏమిటంటే ఇకనుంచి ఆ నరకవాసుల వ్యవహారాలను నరకమే చూసుకుంటుంది. ఎవరిని ఏమేరకు శిక్షించాలో దానికి బాగా తెలుసు.

    మరొక అర్థం ప్రకారం ఎల్లప్పుడూ తోడుగా ఉండేవాణ్ణి 'మౌలా' అంటారు. అంటే ఇకనుంచి నరకాగ్నే వారికి నేస్తంగా ఉంటుంది. ఇంకొక అభిప్రాయం ప్రకారం దేవుడు నరకానికి కూడా చైతన్యాన్ని, పూర్తి స్పృహను వొసగుతాడు. అందువల్ల అది అవిశ్వాసులపై ఆగ్రహంతో నిప్పులు కక్కుతుంది. వారిని శిక్షించే బాధ్యతను తీసుకుని వ్యధాభరితమైన శిక్షకు గురిచేస్తుంది.
32. ముస్లిములను ఉద్దేశించి చేయబడిన హితబోధ ఇది. వారు దైవధ్యానం పట్ల మరింత శ్రద్ధ వహించాలి. దివ్య ఖుర్ఆన్ నుండి మార్గదర్శకత్వం పొందుతూ ఉండాలి. హృదయాలు మెత్తబడినపుడే ఇది సాధ్యమవుతుంది. ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన 'సత్యం' (హఖ్) అంటే దివ్య ఖుర్ఆన్ అని భావం.

كَالَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ مِنْ قَبْلُ فَطَالَ عَلَيْهِمُ
الْاَمَدُ فَقَسَتْ قُلُوْبُهُمْ ؕ وَكَثِيْرٌ مِّنْهُمْ
فٰسِقُوْنَ ⑯

వారి మాదిరిగా వీరు కాకూడదు.[33] మరి ఆ గ్రంథవహులపై ఒక సుదీర్ఘకాలం గడచి పోయేసరికి వారి హృదయాలు కఠినమై పోయాయి.[34] వారిలో చాలామంది అవిధేయులు.[35]

اِعْلَمُوْٓا اَنَّ اللّٰهَ يُحْيِ الْاَرْضَ بَعْدَ مَوْتِهَا ؕ
قَدْ بَيَّنَّا لَكُمُ الْاٰيٰتِ لَعَلَّكُمْ تَعْقِلُوْنَ ⑰

**17** బాగా తెలుసుకోండి! భూమి మృతి చెందిన మీదట, అల్లాహ్‌యే దానిని తిరిగి బ్రతికిస్తున్నాడు. మీరు అర్థం చేసుకునేటందుకు మేము మా సూచనలను బాగా విడమరచి చెప్పాము.

اِنَّ الْمُصَّدِّقِيْنَ وَالْمُصَّدِّقٰتِ وَاَقْرَضُوا اللّٰهَ
قَرْضًا حَسَنًا يُّضٰعَفُ لَهُمْ وَلَهُمْ اَجْرٌ كَرِيْمٌ ⑱

**18** నిశ్చయంగా దానధర్మాలు చేసే పురుషులు, దానధర్మాలు చేసే స్త్రీలు, అల్లాహ్‌కు (చిత్తశుద్ధితో) మంచి రుణం ఇచ్చేవారు–వారు ఇచ్చినది వారి కొరకు పెంచబడుతుంది.[36] మరి వారి కొరకు గౌరవప్రదమైన ప్రతిఫలం ఉంది.[37]

وَالَّذِيْنَ اٰمَنُوْا بِاللّٰهِ وَرُسُلِهٖٓ اُولٰٓئِكَ هُمُ
الصِّدِّيْقُوْنَ ۖ وَالشُّهَدَآءُ عِنْدَ رَبِّهِمْ ؕ لَهُمْ
اَجْرُهُمْ وَنُوْرُهُمْ ؕ وَالَّذِيْنَ كَفَرُوْا وَكَذَّبُوْا بِاٰيٰتِنَآ
اُولٰٓئِكَ اَصْحٰبُ الْجَحِيْمِ ⑲ ع

**19** మరెవరయితే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసిస్తారో వారే తమ ప్రభువు దగ్గర సత్యవంతులు, సాక్షులు.[38] వారికొరకు వారి పుణ్యఫలం కూడా ఉంటుంది. వారిజ్యోతి కూడా ఉంటుంది. మరెవరయితే అవిశ్వాసులై మా సూచనలను ధిక్కరించారో వారే నరకవాసులవుతారు.

33. అంటే యూదుల, క్రైస్తవుల మాదిరిగా తయారవకండి అని భావం.

34. ఎందుకంటే వారు (ఆ గ్రంథవహులు) దైవగ్రంథంలో మార్పులు చేశారు. ప్రక్షిప్తాలకు పాల్పడ్డారు. అల్పమైన మూల్యంపై దైవవాక్యాలను అమ్ముకునే స్థితికి దిగజారారు. దైవాజ్ఞలను నిర్లక్ష్యం చేశారు. ధర్మావలంబన విషయంలో అతిశయిల్లి, మతాచార్యుల వాక్కులనే ప్రభువాజ్ఞగా పరిగణించారు. అందుకే మీరు కూడా వారి మాదిరిగా తయారవకండి అని ముస్లిములను హెచ్చరించటం జరిగింది. ఒకవేళ మీరు కూడా మీ ఇష్టానుసారం ప్రవర్తించారంటే మీ గుండెలు కూడా కరకు గుండెలయిపోతాయి. వారికి మంచిగా అనిపించే చెడ్డపనులే మీక్కూడా మంచివిగా అనిపిస్తాయి. చివరికి దైవాగ్రహానికి కారణభూతమయ్యేవి ఇవే.

35. అంటే, వారి మనసులు నిష్కల్మషమైనవి కావు. వారి ఆచరణలు భ్రష్టుపట్టాయి. వేరొకచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వారు తమ వాగ్దానాన్ని భంగపరచిన కారణంగా మేము వారిని మా కారుణ్యానికి దూరం చేశాము. వారి హృదయాలను కర్కశం చేశాము. ఇప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందంటే, వారు పదాలను తారుమారు చేసి వాటి అర్థాన్ని, సందర్భాన్ని పూర్తిగా మార్చివేస్తారు. వారికి ఇవ్వబడిన బోధలలో ఎక్కువ భాగాన్ని వారు మరచిపోయారు." (అల్ మాయిద : 13).

36. అంటే–ఒక్కో సత్కార్యానికి కనీసం పదింతల పుణ్యఫలం, అంతకన్నా అధికంగా 700 రెట్ల పుణ్యఫలం ప్రసాదించబడుతుంది. దైవచిత్తమయితే ఒక్కోసారి ఈ పుణ్య ఫలం అంతకన్నా ఎక్కువగా కూడా ఉంటుంది. అయితే అది ఇచ్చేవాడి చిత్తశుద్ధిపై, పుచ్చుకునే వాడి అగత్యస్థితిపై ఆధారపడి ఉంటుంది. మక్కా విజయానికి పూర్వం ధనం ఖర్చుపెట్టినవారికి ఆ తర్వాత ధనం ఖర్చుపెట్టిన వారికంటే ఎంతో అధికంగా పుణ్యఫలం ప్రసాదించబడిందన్న విషయం మనం ఇంతకుముందు చెప్పుకున్నాం.

37. అంటే – వారికి లభించే ప్రతిఫలం అనంతమైనది. తరగనిది.

20 బాగా తెలుసుకోండి! ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, తమాషా, అలంకార ప్రాయం, పరస్పరం బడాయిని చాటు కోవటం, సిరిసంపదలు, సంతానం విషయంలో ఒండొకరిని మించిపోవడానికి ప్రయత్నించటం మాత్రమే. (దీని) ఉపమానం వర్షపునీరు లాంటిది. దానివల్ల మొలచిన పైరు రైతులను[39] అలరిస్తుంది. మరి ఆ పంట ఎండిపోగానే అది పసుపువన్నెగా మారిపోవటం నీవు చూస్తావు. ఆ తరువాత అది పొట్టు పొట్టుగా తయారవుతుంది.[40] మరి పరలోకంలో మాత్రం తీవ్రమైన శిక్ష ఉంది,[41] అల్లాహ్ తరఫున క్షమాపణ, ఆయన ప్రీతి కూడా ఉంది.[42] మొత్తానికి ప్రాపంచిక జీవితం మభ్యపెట్టే వస్తువు తప్ప మరేమీ కాదు.[43]

اِعْلَمُوْٓا اَنَّمَا الْحَيٰوةُ الدُّنْيَا لَعِبٌ وَّلَهْوٌ وَّ
زِيْنَةٌ وَّتَفَاخُرٌۢ بَيْنَكُمْ وَتَكَاثُرٌ فِى الْاَمْوَالِ
وَالْاَوْلَادِ ؕ كَمَثَلِ غَيْثٍ اَعْجَبَ الْكُفَّارَ نَبَاتُهٗ
ثُمَّ يَهِيْجُ فَتَرٰىهُ مُصْفَرًّا ثُمَّ يَكُوْنُ حُطَامًا ؕ
وَفِى الْاٰخِرَةِ عَذَابٌ شَدِيْدٌ ۙ وَّمَغْفِرَةٌ مِّنَ
اللّٰهِ وَرِضْوَانٌ ؕ وَمَا الْحَيٰوةُ الدُّنْيَآ اِلَّا
مَتَاعُ الْغُرُوْرِ ﴿٢٠﴾

38. అరబీలో **'సిద్దీఖూన్'** అనబడింది. విశ్వాసం (ఈమాన్)లో పండిపోయినవారు, సత్యం కోసం ఏ బాధనయినా మనస్ఫూర్తిగా భరించటానికి సిద్ధమైన వారు మాత్రమే ఈ స్థాయికి ఎదుగుతారు. హదీసులో ఇలా ఉంది : "ఒక మనిషి సదా సత్యమే చెబుతాడు. సత్యాన్నే అన్వేషిస్తాడు. సత్యం కోసమే పాటుపడతాడు. కడకు అతను అల్లాహ్ వద్ద సత్యవంతుడుగా వ్రాసుకోబడతాడు" (ముత్తఫఖున్ అలైహి – మిష్కాత్: కితాబుల్ ఆదాబ్). మరొక హదీసు ప్రకారం; సిద్దీఖులకు (సత్యవంతులకు) స్వర్గంలో లభించే గొప్ప స్థానం గురించి ఈ విధంగా చెప్పబడింది: "స్వర్గవాసులు తమ పై అంతస్థు వారిని చూస్తారు. వారు ప్రకాశించే తూరుపు లేక పశ్చిమ తారల వలె ఆకాశపుటంచున ఉన్నట్లు కనిపిస్తారు. అంటే క్రిందివారికీ– పైవారికీ అంతటి వ్యత్యాసం ఉంటుంది." 'బహుశా అవి ప్రవక్తల ఉన్నత స్థానాలై ఉంటాయి. సామాన్యులకు ఆ స్థానాలు లభించవు' అని సహచరులు అభిప్రాయపడగా మహాప్రవక్త (స) ఇలా అన్నారు :"అవును. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! వారు అల్లాహ్‌ను విశ్వసించటంతో పాటు, దైవప్రవక్తలను సత్యసంధులుగా ధృవీకరించినవారు." (సహీహ్ బుఖారీ). అంటే వారు ఈమాన్ (విశ్వాసం) మరియు తస్‌దీఖ్ (ధృవీకరణ)ల హక్కును సజావుగా నెరవేర్చారు (ఫత్‌హుల్ బారీ).

39. రైతులకోసం ఉపయోగించబడిన పదం **'కుఫ్ఫార్.'** అందువల్ల కుఫ్ఫార్ అంటే నిఘంటువు ప్రకారం 'దాచేవారు' అని అర్థం. అవిశ్వాసుల హృదయాలలో అల్లాహ్ పట్ల, పరలోకం పట్ల తిరస్కారభావం దాగి వుంటుంది. అందుకే అవిశ్వాసులను 'కుఫ్ఫార్'గా వ్యవహరించటం జరిగింది. ఇక రైతులను 'కాఫిర్లు'గా వ్యవహరించటంలోని మర్మం ఏమిటంటే వారు కూడా విత్తనాన్ని నేలలో కప్పిపుచ్చుతారు.

40. ప్రాపంచిక జీవితం కూడా పొలంలోని పంట మాదిరిగా చాలా తొందరగా క్షీణించేదే. పంట ఏపుగా పెరిగినపుడు నవనవలాడుతూ ఉంటుంది. రైతులు దాన్ని చూచి సంబరపడిపోతారు. కాని అది బహుకొద్ది కాలంలోనే పండిపోయి, పసుపు పచ్చగా తయారై, తరువాత గడ్డిపరకల్లా మారిపోతుంది. మనిషి జీవితం కూడా ఇంతే. చూడటానికి అది ఎంతో అందంగా ఉంటుంది. అందలి రంగు రంగులు, జిలుగు వెలుగులు, ఆస్తీ అంతస్థులు, ఆలుబిడ్డలు మనిషి మనసును మురిపిస్తాయి. గమ్యాన్ని మరపిస్తాయి. కాని ఆ జీవితం ఆగదు. చూస్తూ ఉండగానే అరిగిపోతుంది, కరిగి పోతుంది.

41. యాతన పాపాత్ముల కోసం, అవిధేయుల కోసం ఉంటుంది. ఎందుకంటే వాళ్లు ఈ ప్రాపంచిక జీవితపు ఆటపాటల్లో, తమాషాలో మైమరచి ఇదే సర్వస్వం అనుకున్నారు.

42. క్షమాపణ, ప్రీతి దైవవిధేయులకోసం, పుణ్యాత్ముల కోసం ఉద్దేశించినది. ఎందుకంటే వాళ్లు ఈ ప్రపంచాన్నే సర్వస్వంగా

**21** (రండి!) మీ ప్రభువు క్షమాభిక్ష వైపు పరుగెత్తండి.[44] ఇంకా, భూమ్యాకాశాలంత వెడల్పు గల స్వర్గం వైపు పరుగిడండి.[45] అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను విశ్వసించేవారి కోసం అది తయారు చేయబడింది. ఇది అల్లాహ్ అనుగ్రహం! ఆయన దీనిని తాను కోరిన వారికి ఇస్తాడు.[46] అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.[47]

سَابِقُوا إِلَىٰ مَغْفِرَةٍ مِّن رَّبِّكُمْ وَجَنَّةٍ عَرْضُهَا
كَعَرْضِ السَّمَاءِ وَالْأَرْضِ أُعِدَّتْ لِلَّذِينَ
آمَنُوا بِاللَّهِ وَرُسُلِهِ ۚ ذَٰلِكَ فَضْلُ اللَّهِ يُؤْتِيهِ
مَن يَشَاءُ ۚ وَاللَّهُ ذُو الْفَضْلِ الْعَظِيمِ ﴿٢١﴾

**22** ఏ ఆపద అయినా సరే – అది భూమిలో వచ్చేదైనా,[48] స్వయంగా మీ ప్రాణాలపైకి వచ్చేదైనా[49] – మేము దానిని పుట్టించకమునుపే అదొక ప్రత్యేక గ్రంథంలో వ్రాయబడి[50] ఉంది. ఇలా చేయటం అల్లాహ్‌కు చాలా తేలిక.

مَا أَصَابَ مِن مُّصِيبَةٍ فِي الْأَرْضِ وَلَا فِي
أَنفُسِكُمْ إِلَّا فِي كِتَابٍ مِّن قَبْلِ أَن نَّبْرَأَهَا ۚ
إِنَّ ذَٰلِكَ عَلَى اللَّهِ يَسِيرٌ ﴿٢٢﴾

**23** పోయే దానిపై మీరు దుఃఖించకుండా, ప్రసాదించబడిన దానిపై మిడిసిపడకుండా ఉండాలని (మీకీ సంగతి తెలియజేయబడింది).[51] అదిరిపడే ఏ అహంభావినీ అల్లాహ్ ఇష్టపడదు సుమా!

لِّكَيْلَا تَأْسَوْا عَلَىٰ مَا فَاتَكُمْ وَلَا تَفْرَحُوا بِمَا
آتَاكُمْ ۗ وَاللَّهُ لَا يُحِبُّ كُلَّ مُخْتَالٍ فَخُورٍ ﴿٢٣﴾

తలపోయలేదు. పైగా దాన్ని వారు తాత్కాలికంగా, నశ్వరంగా, పరీక్షాస్థలంగా భావిస్తూ దేవుని సూచనానుసారం జీవితం గడిపేవారు.

43. అంటే మోసపోయి, తన పారలౌకిక జీవితం కోసం ఏమీ చేసుకోలేని దురదృష్టవంతుల పాలిట ఈ జీవితం ఒక మాయ అన్నమాట! కాని ఈ ప్రాపంచిక జీవితాన్ని పారలౌకిక సాఫల్యం కోసం వారధిగా చేసుకున్న వారి పాలిట మాత్రం ఇది ఎంతో మేలైనది, శుభకరమైనది!

44. అంటే సత్కార్యాల కోసం, నిజమైన పశ్చాత్తాపం కోసం వేగిర పడండి. ఎందుకంటే ఈ పనులే ప్రభువు క్షమాభిక్షకు ఉపయోగపడతాయి.

45. దాని వెడల్పే భూమ్యాకాశాల వెడల్పుకు సమానంగా ఉన్నప్పుడు పొడవు ఇంకెంత ఉంటుందో కదా! ఎందుకంటే వెడల్పు కన్నా పొడవు ఎక్కువగా ఉంటుంది.

46. దేవుడు సాధారణంగా ఎవరిని కోరుకుంటాడో చెప్పండి! తనను ధిక్కరించకుండా, పాపాల మన్నింపుకై వేడుకుని, సదాచరణ చేస్తూ జీవితం గడిపిన వారిని మాత్రమే దేవుడు ఇష్టపడతాడు. అందుకే దేవుడు వారికి సన్మార్గాన్ని అవలంబించే సద్బుద్ధిని కూడా ప్రసాదించి స్వర్గానికి చేరుస్తాడు.

47. ఆయన గొప్ప ప్రదాత. పిసినారితనం ఆయన దరికి చేరదు. సకల శుభాలు ఆయన హస్తగతమై ఉన్నాయి. ఆయన ఎవరికయినా ఏదయినా ఇవ్వదలిస్తే ఎవరూ ఆపలేరు. ఆయన ఇవ్వదలచకపోతే ఎవరూ ఇప్పించలేరు. ఆయన తిరుగులేని ఉపాధి ప్రదాత.

48. అంటే – కరువు, వరదలు, తదితర ప్రకృతి వైపరీత్యాలు.

49. ఉదాహరణకు : వ్యాధులు, దారిద్ర్యం, అలసత్వం మొదలగునవి.

50. అంటే అల్లాహ్ తన జ్ఞానం ప్రకారం ప్రాణులను సృష్టించక మునుపే ఈ విషయాలన్నింటినీ గ్రంథస్థం చేశాడు. ఒక హదీసులో మహాప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించక–50 వేల సంవత్సరాల క్రితమే అందరి విధి వ్రాతను వ్రాసేశాడు." (సహీహ్ ముస్లిం : కితాబుల్ ఖద్ర్).

24 వారెలాంటి వారంటే తాము (స్వయంగా) పిసినారితనం చూపటమే గాక ఇతరులను (కూడా) పిసినారితనానికి పురికొల్పు తారు. ఎవడు (అల్లాహ్ మార్గం నుండి) ముఖం త్రిప్పుకుని పోయినా[52] అల్లాహ్ అక్కరలేనివాడు, స్తోత్రనీయుడన్న సంగతిని అతను గుర్తుంచుకోవాలి.

الَّذِينَ يَبْخَلُونَ وَيَأْمُرُونَ النَّاسَ بِالْبُخْلِ ۗ وَمَن يَتَوَلَّ فَإِنَّ اللَّهَ هُوَ الْغَنِيُّ الْحَمِيدُ ﴿٢٤﴾

25 నిశ్చయంగా మేము మా ప్రవక్తలకు స్పష్టమైన నిదర్శనాలను ఇచ్చి పంపాము. వారితోపాటు గ్రంథాన్ని, ధర్మకాంటాను కూడా అవతరింపజేశాము[53] – ప్రజలు న్యాయంపై నిలిచి ఉండటానికి! ఇంకా మేము ఇనుమును కూడా అవతరింపజేశాము.[54] అందులో చాలా బలం ఉంది,[55] జనుల కొరకు (ఇతరత్రా) ప్రయోజనాలు కూడా ఉన్నాయి.[56] ఇంకా – చూడకుండానే తనకు, తన ప్రవక్త లకు తోడ్పడే వారెవరో అల్లాహ్ తెలుసుకోదలిచాడు.[57] నిస్సందే హంగా అల్లాహ్ మహాబలుడు, తిరుగులేనివాడు.[58]

لَقَدْ أَرْسَلْنَا رُسُلَنَا بِالْبَيِّنَاتِ وَأَنزَلْنَا مَعَهُمُ الْكِتَابَ وَالْمِيزَانَ لِيَقُومَ النَّاسُ بِالْقِسْطِ ۖ وَأَنزَلْنَا الْحَدِيدَ فِيهِ بَأْسٌ شَدِيدٌ وَمَنَافِعُ لِلنَّاسِ وَلِيَعْلَمَ اللَّهُ مَن يَنصُرُهُ وَرُسُلَهُ بِالْغَيْبِ ۚ إِنَّ اللَّهَ قَوِيٌّ عَزِيزٌ ﴿٢٥﴾

51. మనిషి కష్టాలొచ్చినప్పుడు బాధపడటం, సుఖసౌఖ్యాలపై ఆనందించటం సహజ విషయమే. కాని ఈ విషయంలో 'అతి' మంచిది కాదు. మనిషి అదుపు తప్పకూడదు. అవధులు మీరిన ఆనందం, మితిమీరిన దుఃఖం మనిషికి చేటుగా పరిణమిస్తుంది. అతడు ధర్మవిరుద్ధమైన పనులకు పూనుకుంటాడు. అయితే విశ్వాసి అయినవాడు ఇలాంటి సందర్భాలలో అతిశయిల్లడు. అతడు కష్టాలొచ్చినపుడు ఓర్పు వహిస్తాడు. దేవుని విధి వ్రాతపై సంతృప్తపడతాడు. గగ్గోలు చెందటం వల్ల తన స్థితిలో మార్పు రాదని అతనికి తెలుసు. అలాగే అతను కలిమిపై ఉబ్బితబ్బిబ్బవడు. పైగా కృతజ్ఞుడుగా మెలగుతాడు. తన దగ్గరున్న సిరిసంపదలు కేవలం తన కృషి ఫలితం కాదని, దైవకటాక్షం వల్లనే తనకు ఈ భాగ్యం ప్రాప్తించిందన్న వాస్తవాన్ని అతను గుర్తుంచుకుంటాడు.

52. అంటే – దైవమార్గంలో ఖర్చుపెట్టే విషయంలో అతను విముఖతను కనబరుస్తాడు. మనిషిలోని లోభత్వం బయటపడేది ఇక్కడే.

53. **ధర్మకాంటా** లేక **త్రాసు** (మీజాన్) అంటే న్యాయం అని భావం. అంటే, మేము ప్రజలకు న్యాయం చేయమని ఆజ్ఞాపించాము. కొంతమంది దీన్ని కొలతలు, తూనికల్లో ఖచ్చితంగా వ్యవహరించండి అన్న అర్థంలో తీసుకున్నారు.

54. త్రాసును అవతరింపజేశామని అన్నా, ఇనుమును అవతరింపజేశామని చెప్పినా నిజానికి అది 'సృష్టించాము, వస్తు నిర్మాణ కళను నేర్పాము' అన్న అర్థంలోనే చెప్పబడింది. ఇనుము (లోహం) ద్వారా అసంఖ్యాకమైన వస్తువులు తయారవుతాయి. యదార్థానికి ఇవన్నీ దేవుడు మనిషికి నేర్పిన విద్యకు దర్పణాలే.

55. ఈ లోహంతోనే ఆయుధాలు కూడా తయారవుతాయి. ఉదాహరణకు : ఖడ్గం, ఈటె, తుపాకీ, శతఘ్నులు, యుద్ధ విమానాలు, మిజైళ్లు, యుద్ధటాంకర్లు మొదలగునవి. ఈ ఆయుధాలు శత్రువుపై దాడిచేయడానికే గాకుండా ఆత్మ రక్షణకు కూడా ఉపయోగపడతాయి.

56. కేవలం ఆయుధాలేగాక దైనందిన జీవితంలో మానవునికి ఉపయోగపడే ఎన్నో వస్తువులు ఇనుము ద్వారా తయారవుతాయి. ఉదాహరణకు : వంటసామగ్రి, కత్తి, సుత్తి, సూది, దబ్బనం, పార, పలుగు మొదలగునవి. ఇంకా ఎన్నో కర్మాగార వస్తువులు, యంత్రపరికరాలు ఈ లోహంతోనే తయారవుతాయి.

57. అల్లాహ్‌ను చూడకపోయినా పరలోక పుణ్యాన్ని పొందే ఉద్దేశంతో అతని ప్రవక్తల్ని నమ్మి, వారికి సహాయపడే ధన్యజీవులెవరో దేవుడు పరీక్షించదలిచాడు. ప్రవక్తల్ని పంపటంలోని ఉద్దేశం ఏమిటో ఈ వాక్యంలో చెప్పబడింది.

**26** మేము నూహును, ఇబ్రాహీమును ప్రవక్తలుగా చేసిపంపాము. మరి వారిద్దరి సంతతిలో ప్రవక్త పదవిని, గ్రంథ పరంపరను ఉంచాము. అయితే వారిలో కొందరు సన్మార్గ భాగ్యం పొందగా, అత్యధికులు అవిధేయులయ్యారు.

وَلَقَدْ اَرْسَلْنَا نُوْحًا وَّ اِبْرٰهِيْمَ وَجَعَلْنَا فِيْ
ذُرِّيَّتِهِمَا النُّبُوَّةَ وَالْكِتٰبَ فَمِنْهُمْ مُّهْتَدٍ ۚ
وَكَثِيْرٌ مِّنْهُمْ فٰسِقُوْنَ ﴿26﴾

**27** మరి వారి వెనుకే మేము మా ప్రవక్తలను నిరంతరం పంప సాగాము. వారి తరువాత మర్యమ్ కుమారుడైన ఈసాను పంపాము. అతనికి ఇన్జీలు గ్రంథాన్ని వొసగాము. అతన్ని అనుస రించే వారి హృదయాలలో మృదుత్వాన్ని, జాలిని సృజించాము.[59] మరైతే సన్యాసత్వాన్ని (రహ్‌బానియత్‌ను)వారంతట వారే కల్పించు కున్నారు.[60] మేము మాత్రం దీనిని వారిపై విధించలేదు,[61] దైవ ప్రీతిని తప్ప![62] మరి వారు దానికి తగురీతిలో కట్టుబడి ఉండలేక పోయారు.[63] అయినప్పటికీ మేము వారిలో విశ్వసించిన వారికి వారి పుణ్యఫలాన్ని ప్రసాదించాము.[64] వారిలో అధికులు మాత్రం అవిధేయులుగా తయారయ్యారు.

ثُمَّ قَفَّيْنَا عَلٰٓى اٰثَارِهِمْ بِرُسُلِنَا وَقَفَّيْنَا بِعِيْسَى
ابْنِ مَرْيَمَ وَاٰتَيْنٰهُ الْاِنْجِيْلَ ۙ وَجَعَلْنَا فِيْ قُلُوْبِ
الَّذِيْنَ اتَّبَعُوْهُ رَاْفَةً وَّرَحْمَةً ۭ وَرَهْبَانِيَّةَ
ۨ ابْتَدَعُوْهَا مَا كَتَبْنٰهَا عَلَيْهِمْ اِلَّا ابْتِغَاۗءَ رِضْوَانِ
اللّٰهِ فَمَا رَعَوْهَا حَقَّ رِعَايَتِهَا ۚ فَاٰتَيْنَا الَّذِيْنَ
اٰمَنُوْا مِنْهُمْ اَجْرَهُمْ ۚ وَكَثِيْرٌ مِّنْهُمْ فٰسِقُوْنَ ﴿27﴾

58. ప్రజలు దైవానికి, దైవప్రవక్తలకు సహాయపడితేనే లోకం ముందుకు సాగుతుందని దీని భావం ఎంతమాత్రం కాదు. అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఆయన గనక కోరుకుంటే ఎవరి అవసరమూ లేకుండానే తన కార్యక్రమాన్ని కొనసాగిస్తాడు. కాకపోతే జనులకు మేలు చేయదలచి ఆయన ఈ విధంగా ఆజ్ఞాపించాడు. ఎవరయినా దైవప్రవక్తలకు ఆదరువుగా నిలిస్తే నిజానికి వారు తమ స్వయానికే మేలు చేసుకున్నారని అనుకోవాలి. తద్వారానే వారు అల్లాహ్‌ను మెప్పించి, ఆయన క్షమాభిక్షకు అర్హులు కాగలుగుతారు.

59. అంటే – దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు)ను అనుసరించిన హవారీయులలో మేము పరస్పరం ప్రేమానురాగాల, సహాయసహకారాల భావాలను నూరిపోశాము. మహాప్రవక్త (సఅసం) ప్రియసహచరులు పరస్పరం ప్రేమాదరణలతో మెలగినట్లే ఏసుక్రీస్తు అనుయాయులు కూడా ఒండొకరిపట్ల దయాభావంతో మెలిగేవారు. కాని ఈ ప్రేమైక భావం యూదులలో ఉండేది కాదు. **'రాఫతున్'** అంటే మృదుత్వం, దయ అని అర్థం.

60. **సన్యాసత్వం** (రహ్‌బానియత్) అంటే భవబంధాలను, ప్రాపంచిక జంఝాటాలను త్యజించి కొండల్లోకో, కోనల్లోకోపోయి ఆరాధన చేసుకోవటం అని భావం. దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) తరువాత కొంతమంది రాజులు తౌరాతు, ఇన్జీలు గ్రంథాలలో మార్పులు చేర్పులు చేశారు. ప్రజాబాహుళ్యంలో ఒక వర్గం వారు ఈ సవరణలను అంగీకరించలేకపోయారు. వారు తమ కాలం నాటి రాజులకు భయపడి పర్వత గుహలను, అడవులను ఆశ్రయించారు. క్రైస్తవ జగతిలో సన్యాసత్వానికి దారితీసిన ప్రధానకారణం ఇదే. కాని భావితరాల వారు తమ పూర్వీకుల పోకడను గుడ్డిగా అనుసరించి, జనవాసాలకు దూరంగా కఠోర అభ్యాసాలు చేస్తూ బ్రతకటమే ధర్మనిష్ఠ అనుకున్నారు. తమను చర్చీలకు, ఆశ్రమాలకే పరిమితం చేసుకుని సంసార బంధనాలను త్రెంచుకున్నారు. అందుకే అల్లాహ్ దీనిని 'వారంతట వారే ఆవిష్కరించుకున్న పోకడ'గా పేర్కొన్నాడు.

61. నిజానికి ఇది క్రైస్తవులు తొక్కిన కొత్తపుంతేగాని, దేవుడు విధించిన ఆచారం కాదు.

62. కేవలం మా ప్రసన్నతను చూరగొనే పనులు చేయమని మాత్రమే మేము వారిని ఆదేశించాము. లేదా దైవప్రసన్నతను

**28** ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. అతని ప్రవక్తను విశ్వసించండి. అల్లాహ్ మీకు తన కారుణ్యం నుంచి రెట్టింపు భాగాన్ని ప్రసాదిస్తాడు.[65] ఇంకా మీకు జ్యోతిని అనుగ్రహిస్తాడు. దాని వెలుగులో మీరు నడుస్తారు. ఆయన మీ పాపాలను కూడా క్షమిస్తాడు. అల్లాహ్ గొప్ప క్షమాశీలి, దయాశీలి.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا ٱتَّقُوا ٱللَّهَ وَءَامِنُوا بِرَسُولِهِۦ
يُؤْتِكُمْ كِفْلَيْنِ مِن رَّحْمَتِهِۦ وَيَجْعَل لَّكُمْ نُورًا
تَمْشُونَ بِهِۦ وَيَغْفِرْ لَكُمْ ۚ وَٱللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴿28﴾

**29** దైవానుగ్రహంలోని ఏ భాగంపై కూడా తమకెలాంటి అధికారం లేదని, అనుగ్రహమంతా దేవుని చేతిలోనే ఉందనీ, ఆయన తాను కోరిన వారికి దాన్ని ప్రసాదిస్తాడని గ్రంథ ప్రజలు తెలుసుకోవాలని (ఆయన ఈ విధంగా చేశాడు). అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.

لِّئَلَّا يَعْلَمَ أَهْلُ ٱلْكِتَٰبِ أَلَّا يَقْدِرُونَ عَلَىٰ شَىْءٍ
مِّن فَضْلِ ٱللَّهِ ۙ وَأَنَّ ٱلْفَضْلَ بِيَدِ ٱللَّهِ يُؤْتِيهِ
مَن يَشَآءُ ۚ وَٱللَّهُ ذُو ٱلْفَضْلِ ٱلْعَظِيمِ ﴿29﴾

అన్వేషించే ప్రయత్నంలో వారు ఈ పోకడను ప్రారంభించారు. ధర్మంలో కొత్తపుంతలు తొక్కటం వల్ల దైవప్రసన్నత ప్రాప్తించదని అల్లాహ్ స్పష్టంగా చెప్పేశాడు. ప్రజలు తొక్కే ఆ కొత్తపుంత ఎంత అకర్షణీయంగా, అందంగా ఉన్నాసరే అది దురాచారమే. దేవుడు సూచించిన విధంగా ఆయనకు విధేయత చూపినపుడే ఆయన ప్రసన్నత ప్రాప్తిస్తుంది.

63. దైవప్రీతిని బడసే ఉద్దేశంతో వారు వైరాగ్యాన్ని కనిపెట్టడమైతే చేశారుగాని, దానికి వారు కట్టుబడి ఉండలేకపోయారు.

64. అంటే దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) అందజేసిన ధర్మంపై స్థిరంగా ఉన్నవారికి మేము వారి పుణ్యఫలం వొసగాము.

65. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు పూర్వం గల ప్రవక్తలను విశ్వసిస్తూ, ఆ తరువాత మహాప్రవక్త (స)ను కూడా విశ్వసించిన వారికి ఈ రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. హదీసులో చెప్పబడిన విషయం కూడా ఇదే (సహీహ్ బుఖారీ–కితాబుల్ ఇల్మ్; సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్). వేరొక వ్యాఖ్యానం ప్రకారం గ్రంథం కల ప్రజలు తమకు రెట్టింపు పుణ్యఫలం లభిస్తుందని గర్వాతిశయంతో ప్రకటించుకుంటూ ఉండగా, దేవుడు ముస్లింలపై ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు. (వివరాల కోసం ఇబ్నె కసీర్ వ్యాఖ్యానం చూడండి).

58 వ సూరా

# అల్ ముజాదలా

## వాదన

అవతరణ మదీనాలో

ఆయతులు 22

### పరిచయం

*ఈ సూరా ఇస్లామీయ చట్టసంబంధమైన విషయాలను, నడవడికకు సంబంధించిన విషయాలను ముఖ్యంగా బోధించింది. ఖౌలా బింతె సాలబా అనే మహిళ గృహ సంబంధమైన సమస్యతో ప్రవక్త ముహమ్మద్(సఅసం) వద్దకు వచ్చింది. అప్పటి అజ్ఞాన అరబ్బు సమాజంలో ఉన్న ఒక విధమైన అనుచిత విడాకుల పద్ధతి విషయమై ఆమె వాదిస్తూ తనకు న్యాయం చేయమని కోరింది. ఆ పద్ధతి ప్రకారం భర్త విడాకులివ్వకుండానే భార్యను దూరం చేసేవాడు. ఆ భార్య ఎలాంటి హక్కులు లేకుండా కేవలం ఇంటిపనులు చేస్తూ పడిఉండవలసి వచ్చేది. ఆ దురాచారాన్ని ఈ సూరాలో తీవ్రంగా ఖండించడం జరిగింది.*

*ఈ సూరాలో ముస్లిములు పాటించవలసిన కొన్ని నియమాలను, విలువలను తెలుపడం జరిగింది. ఈ సూరాలో మరికొన్ని విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. అల్లాహ్‌కు, అల్లాహ్‌ప్రవక్త (సఅసం)కు విరోధులైన వారితో రహస్య సమాలోచనలు జరపడాన్ని ఈ సూరా ప్రస్తావించింది. కపట విశ్వాసుల గురించి, వారు యూదులతో కూటమి కట్టడం గురించి, ముస్లిం సముదాయానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని తమ మిత్రులకు అందించడం గురించి ఈ సూరాలో ప్రస్తావించడం జరిగింది. నమాజు స్థాపించాలని, జకాత్ చెల్లించాలని, అల్లాహ్ పట్ల, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల విధేయత చూపాలని ముస్లిములకు బోధించడం జరిగింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 1-4 | 359 | 'వాదించిన మహిళ' | ఆ స్త్రీ తన భర్త విషయమై ముహమ్మద్(స)తో వాదిస్తూ, అల్లాహ్‌కు ఫిర్యాదు చేసుకుంది. ఆమె మొరను ఆలకించిన అల్లాహ్ ఆమె సమస్యకు పరిష్కారమూ సూచించాడు. పనిలో పనిగా ముస్లిం సమాజానికి ఒక మూఢాచారం నుంచి బయట పడే మార్గాన్నీ చూపించాడు. ఎవరా పుణ్య స్త్రీ? ఏమిటా మూఢాచారం? ఆ దురాచారాన్ని ఇస్లాం ఏ విధంగా ఖండిం చింది? |

## అల్ ముజాదలా సూరా

## سُورَةُ الْمُجَادَلَةِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

قَدْ سَمِعَ اللَّهُ قَوْلَ الَّتِي تُجَادِلُكَ فِي زَوْجِهَا وَتَشْتَكِي إِلَى اللَّهِ وَاللَّهُ يَسْمَعُ تَحَاوُرَكُمَا إِنَّ اللَّهَ سَمِيعٌ بَصِيرٌ ①

**1** (ఓ ప్రవక్తా!) తన భర్త విషయమై నీతో వాదిస్తూ, అల్లాహ్‌కు ఫిర్యాదు చేసుకుంటూ ఉన్న ఆ స్త్రీ మాటను అల్లాహ్ విన్నాడు. ఇంకా, అల్లాహ్ మీరిద్దరి మధ్య జరిగిన సంవాదనను (కూడా) విన్నాడు.[1] నిశ్చయంగా అల్లాహ్ (అంతా) వినేవాడు, చూసే వాడు.

الَّذِينَ يُظَاهِرُونَ مِنكُم مِّن نِّسَائِهِم مَّا هُنَّ أُمَّهَاتِهِمْ إِنْ أُمَّهَاتُهُمْ إِلَّا اللَّائِي وَلَدْنَهُمْ وَإِنَّهُمْ لَيَقُولُونَ مُنكَرًا مِّنَ الْقَوْلِ وَزُورًا وَإِنَّ اللَّهَ لَعَفُوٌّ غَفُورٌ ②

**2** మీలో ఎవరయినాసరే తమ భార్యలపై 'జిహార్'ను ప్రయోగించినంత మాత్రాన (నీవు నా తల్లి వీపు లాంటి దానవు అని నోరు జారినంత మాత్రాన) వారు వారికి తల్లులైపోరు. వారిని కన్నవారు మాత్రమే వాస్తవానికి వారి తల్లులు.[2] నిజానికి ఈ విధంగా పలికేవారు అసహ్యమైన మాటను, అబద్ధాన్ని పలికారు. నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడు, క్షమాభిక్ష పెట్టేవాడూను.[3]

1. ఆ స్త్రీ పేరు హజ్రత్ ఖౌలా బిన్తె మాలిక్ బిన్ సాలబ (ర.అన్హా). అజ్ఞాన కాలంలో అరబ్బులు తమ భార్యలతో గొడవపడినపుడు కోపావేశంలో "నువ్వు నాకు తల్లిలాంటి దానవు" అని చెప్పేవారు. ఈ మాటపైనే విడాకులు జరిగిపోయేవి. లేదా వారు తమ భార్యకు దూరమైపోయేవారు. ఈ పద్ధతిని వారు 'జిహార్'గా వ్యవహరించేవారు. ఒకసారి హజ్రత్ ఖౌలా భర్త ఔస్ బిన్ సామిత్ (రజి) కూడా అదే పని చేశారు. దాంతో ఆమె ఎంతగానో ఆందోళన చెంది, మహాప్రవక్త (సఅసం) దగ్గరికి పరుగెత్తుకొనివచ్చి లబోదిబోమంది. అప్పటివరకు దానికి సంబంధించిన ఉత్తర్వులేవీ అల్లాహ్ తరపు నుంచి అవతరించలేదు. అందుచేత దైవప్రవక్త (స) కూడా ఆమెకు సమాధానం ఇవ్వటంలో తాత్సారం చేసేసరికి ఆమె వాదులాటకు దిగింది. మరోవైపు తన ప్రభువుకు ఫిర్యాదు కూడా చేసుకున్నది. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. దేవుడు ఈ వాక్యం ద్వారా 'జిహార్'కు సంబంధించిన స్పష్టమైన ఆదేశాన్ని జారీ చేశాడు. ఆ సమస్యకు 'పరిహారం' ద్వారా పరిష్కారం చూపాడు (అబూ దావూద్ – కితాబుత్తలాఖ్).

   ఈ సంఘటనపై హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఏమంటున్నారో చూడండి: "అల్లాహ్ జనుల మాటలను ఎంత చక్కగా వింటాడు! ఆ స్త్రీ ఇంటిమూలన దైవప్రవక్త (స)తో వాదోపవాదాలు మొదలెట్టింది. తన భర్త చేసిన అనుచితమైన పనిపై ఫిర్యాదు చేసుకోసాగింది. కాని నేను ఆమె మాటల్ని వినలేకపోయాను. అయితే ఆకాశాలలో ఉన్న అల్లాహ్ ఆమె మొరను ఆలకించాడు" (సుననె ఇబ్నుమాజ). సహీహ్ బుఖారీలో కూడా క్లుప్తంగా ఈ ప్రస్తావన ఉంది. (కితాబుత్తౌహీద్).

2. మీరు మీ భార్యలను 'తల్లులు' అని చెప్పినంతమాత్రాన వారు మీ కన్నతల్లులై పోరు. ఒకవేళ ఎవరయినా 'తల్లి' అని చెప్పేబదులు చెల్లి లేక కూతురు వంటి దానవు అని చెబితే అట్టి స్థితిలో కూడా అది జిహార్ అవుతుందా? 'అవును' అంటున్నారు ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫాలు. ఇతర విద్వాంసులు మాత్రం దీనిని జిహార్‌గా పరిగణించటం లేదు. మొదటి అభిప్రాయమే సరైనదిగా తోస్తోంది.

   ఇక్కడ మరో విషయం కూడా గమనించాలి. ఆ రోజుల్లో జిహార్ చేసే వ్యక్తి తన భార్యనుద్దేశించి 'అంతి అలయ్య

وَالَّذِيْنَ يُظٰهِرُوْنَ مِنْ نِّسَآئِهِمْ ثُمَّ يَعُوْدُوْنَ
لِمَا قَالُوْا فَتَحْرِيْرُ رَقَبَةٍ مِّنْ قَبْلِ اَنْ يَّتَمَآسَّا ؕ
ذٰلِكُمْ تُوْعَظُوْنَ بِهٖ ؕ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ خَبِيْرٌ ﴿3﴾

**3** మరెవరయినా తమ భార్యలపై 'జిహార్' ను ప్రయోగించి, తమ నోటి ద్వారా జారిపోయిన (తప్పుడు) మాటను ఉపసంహరించ దలచుకుంటే[4] వారు ఒకరినొకరు తాకకముందే అతను ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించాలి.[5] దీనిద్వారా మీకు గుణపాఠం నేర్పబడుతున్నది. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

فَمَنْ لَّمْ يَجِدْ فَصِيَامُ شَهْرَيْنِ مُتَتَابِعَيْنِ مِنْ
قَبْلِ اَنْ يَّتَمَآسَّا ؕ فَمَنْ لَّمْ يَسْتَطِعْ فَاِطْعَامُ سِتِّيْنَ
مِسْكِيْنًا ؕ ذٰلِكَ لِتُؤْمِنُوْا بِاللّٰهِ وَرَسُوْلِهٖ ؕ وَتِلْكَ
حُدُوْدُ اللّٰهِ ؕ وَلِلْكٰفِرِيْنَ عَذَابٌ اَلِيْمٌ ﴿4﴾

**4** ఈ స్థోమతలేనివాడు, భార్యాభర్తలు పరస్పరం ముట్టుకోక ముందే అతను రెండు మాసాలపాటు ఎడతెగకుండా ఉపవాసాలు పాటించాలి. ఈపాటి శక్తి కూడా లేనివాడు అరవైమంది అగత్య పరులకు అన్నం పెట్టాలి. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై మీ పరిపూర్ణ విశ్వాసం రూఢీ కావటానికే ఇది మీపై విధింప బడింది. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. అవిశ్వాసులకు బాధాకరమైన శిక్ష ఖాయం.

కజహ్రి ఉమ్మీ' (నీవు నా కొరకు నా తల్లి వీపు లాంటిదానవు) అని అనేవాడు. జహ్రున్ అంటే వీపు అని అర్థం. జిహార్ అన్న పదం దీన్నుండి వచ్చినదే. ఈ 'జహ్రున్' అన్న పదం ఆధారంగానే పండితుల మధ్య ఒక చర్చ సాగింది. అదేమిటంటే, ఎవడైనా వ్యక్తి 'వీపు' ప్రస్తావన లేకుండా 'నీవు నా తల్లిలాంటి దానవు' అని అంటే అప్పుడేమవుతుంది? అది జిహార్‌గా పరిగణించబడుతుందా? ఈ విషయంలో కొంత భేదాభిప్రాయం ఉంది. ఒకవేళ అతను 'జిహార్' చేయాలన్న ఉద్దేశంతోనే ఆ మాట అంటే అప్పుడది జిహార్‌గా పరిగణించబడుతుందనీ, లేనిపక్షంలో అది జిహార్ కాబోదని పండితులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) ఏమంటున్నారంటే, చూడటం ధర్మ సమ్మతమైనటువంటి అవయవంతో గనక పోల్చి చెప్పినట్లయితే అది జిహార్ క్రిందికి రాదు. ఇమామ్ షాఫయీ (రహ్మలై) కూడా 'వీపు లాంటి దానవు' అని అన్నప్పుడే జిహార్ అవుతుందని అభిప్రాయపడ్డారు. (ఫత్‌హుల్ ఖదీర్).

3. అందుకే దేవుడు ఈ అనుచితమైన చర్యకు పాల్పడి ఇరుక్కుపోయిన వారిని పరిహారం (కఫ్ఫారా) ద్వారా బయటపడే అవకాశం కల్పించాడు.

4. 'జిహార్'కు సంబంధించిన వివరాలు ఇక్కడి నుంచి మొదలవుతున్నాయి. ఉపసంహరించుకోవటమంటే ఆ భార్య వద్దకు పోదలచటం అని భావం.

5. అంటే, ఆమెతో సంభోగించకముందే 'పరిహారం' చెల్లించాలి. పరిహారం ఈ విధంగా చెల్లించాలి : 1. ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించాలి. లేదా 2. ఈ స్థోమత లేని పక్షంలో ఎడతెగకుండా రెండు నెలలపాటు ఉపవాసాలుండాలి. ఒకవేళ మధ్యలో తగు కారణం లేకుండా ఉపవాసం నాగాచేస్తే మళ్లీ మొదటినుంచి ఉపవాసాలు మొదలెట్టి రెండు మాసాల వ్యవధిని పూర్తిచేయాలి. తగు కారణం అంటే వ్యాధిగ్రస్తతకు లోనవటం లేదా ప్రయాణం చేయవలసి రావటం. ఇమామ్ అబూ హనీఫా ప్రకారం వ్యాధిమూలంగా మధ్యలో నాగా వచ్చినా మళ్లీ మొదటినుండి ఉపవాసా లుండవలసిందే. 3. ఒకవేళ రెండు నెలలపాటు నిరాఘాటంగా ఉపవాసాలుండగలిగే శక్తి లేకపోతే 60 మంది నిరుపేదలకు అన్నం పెట్టాలి. కొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం ఒక్కో పేదవాడికి కనీసం రెండు 'ముద్'ల (అంటే 1250 గ్రాముల) ఆహారం ఇవ్వాలి. ఒక ముద్ ఇచ్చినా సరిపోతుందని మరికొందరు అభిప్రాయ పడ్డారు. కాని ఖుర్‌ఆన్‌లోని పదజాలం ప్రకారం పేదలు కడుపునిండా – తృప్తిగా – తినగలిగేంత అన్నం పెడితే

إِنَّ الَّذِينَ يُحَادُّونَ اللَّهَ وَرَسُولَهُ كُبِتُوا كَمَا كُبِتَ الَّذِينَ مِن قَبْلِهِمْ وَقَدْ أَنزَلْنَا آيَاتٍ بَيِّنَاتٍ وَلِلْكَافِرِينَ عَذَابٌ مُّهِينٌ ﴿٥﴾

**5** అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు వారి పూర్వీకులు పరాభవం పాలైనట్లే[6] పరాభవం పాలవుతారు.[7] నిశ్చయంగా మేము స్పష్టమైన నిదర్శనాలను అవతరింపజేసి ఉన్నాము. అవిశ్వాసులకు అవమానకరమైన శిక్ష తథ్యం.

يَوْمَ يَبْعَثُهُمُ اللَّهُ جَمِيعًا فَيُنَبِّئُهُم بِمَا عَمِلُوا أَحْصَاهُ اللَّهُ وَنَسُوهُ وَاللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ شَهِيدٌ ﴿٦﴾

**6** ఏ రోజున అల్లాహ్ వారందరినీ తిరిగి లేపుతాడో అప్పుడు వారికి వారు చేసుకున్న కర్మలను తెలియపరుస్తాడు. అల్లాహ్ దాన్ని లెక్కించి పెట్టాడు. వారు మాత్రం దానిని మరచిపోయారు.[8] కాని అల్లాహ్ అన్నింటికీ సాక్షిగా ఉన్నాడు.[9]

أَلَمْ تَرَ أَنَّ اللَّهَ يَعْلَمُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ مَا يَكُونُ مِن نَّجْوَىٰ ثَلَاثَةٍ إِلَّا هُوَ رَابِعُهُمْ وَلَا خَمْسَةٍ إِلَّا هُوَ سَادِسُهُمْ وَلَا أَدْنَىٰ مِن ذَٰلِكَ وَلَا أَكْثَرَ إِلَّا هُوَ مَعَهُمْ أَيْنَ مَا كَانُوا ثُمَّ يُنَبِّئُهُم بِمَا عَمِلُوا يَوْمَ الْقِيَامَةِ إِنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿٧﴾

**7** భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువు గురించి అల్లాహ్‌కు తెలుసన్నది నీవు చూడటం లేదా? నాల్గవవాడుగా అల్లాహ్ లేకుండా ఏ ముగ్గురి మధ్య కూడా రహస్య మంతనాలు జరగవు. ఆరవవాడుగా అల్లాహ్ లేకుండా ఏ ఐదుగురి మధ్యన కూడా (రహస్య సమాలోచనలు సాగవు). అంతకన్నా తక్కువ మంది ఉన్నా, ఎక్కువ మంది ఉన్నా–వారెక్కడ ఉన్నా[10]– ఆయన వారితో ఉంటాడు.[11] మరి వారు చేసుకున్నవన్నీ ప్రళయదినాన వారికి తెలియపరుస్తాడు.[12] నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు.

సరిపోతుందని తెలుస్తోంది. అందరికీ ఒకేసారి అన్నం పెట్టాలన్న నిబంధన ఏమీ లేదు. కిస్తుల వారీగా కూడా తినిపించవచ్చు (ఫత్‌హుల్ ఖదీర్). అయితే పూర్తిగా 60 మందికి అన్నం పెట్టేవరకు మాత్రం భార్యతో సమాగమం జరపకూడదు.

6. ఈ రకమయిన విరోధ భావం వల్లనే గతంలో ఎన్నో జాతులవారు వినాశం పాలైనారు.

7. మీరు గనక ఈ విరోధాన్ని మానుకోకపోతే మీకు కూడా అదే గతి పడుతుందని దేవుడు హెచ్చరించాడు. విరోధాన్ని విడిచిపెట్టని మక్కా ముష్రిక్కులకు అవమానం తప్పలేదు. బద్ర్ యుద్ధ దినాన వారు ఘోర పరాభవానికి గురయ్యారు. వారిలో కొందరు వధించబడగా, మరికొందరు ఖైదీలుగా పట్టుబడ్డారు. ఆ యుద్ధంలో ముస్లిం లు గెలిచారు. ఈ గెలుపు కూడా ముష్రిక్కులకు తీవ్ర అవమానకరంగా పరిణమించింది.

8. పాపాల కుప్ప అంత పెద్దదిగా ఉన్నప్పుడు దాన్ని జ్ఞాపకముంచుకోవటమెలా?! అన్న సందేహం ఇక్కడ నివృత్తి చేయబడింది. నిజమే. మీకోసం ఇది అసాధ్యమే. మీకు మీరు చేసుకున్న కొన్ని పనులే జ్ఞాపకం ఉండవు. కాని అల్లాహ్‌కు ఇది ఎంతమాత్రం కష్టసాధ్యం కాదు. మీరు చేసిన ఒక్కో చేష్టను ఆయన భద్రపరచి ఉంచాడు.

9. ఏ వస్తువు కూడా ఆయన నుండి దాగిలేదు. ఆయన ప్రతిదీ తెలుసుకుంటాడనే విషయం తరువాతి వాక్యంలో చెప్పబడింది.

10. ఇక్కడ **'సంఖ్య'** ఉదాహరణగా మాత్రమే ఇవ్వబడింది. మంతనాలు జరిపేవారు ఏ సంఖ్యలో ఉన్నా, వారు ఎంత రహస్యంగా మాట్లాడుకున్నా దేవుడు తప్పక తెలుసుకుంటాడు. ఎందుకంటే ఆయన బిగ్గరగా మాట్లాడినా, లోలోపలే గుసగుసలాడుకున్నా పసిగడతాడు. ఆయన ఆంతర్యాల్లోని రహస్యాలను సయితం ఎరిగినవాడు.

11. మనిషి ఏకాంతంలో ఉన్నా లేక జన సమూహంలో ఉన్నా, పట్టణాలలో ఉన్నా పల్లెల్లో ఉన్నా, పర్వత గుహల్లో

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ نُهُوا عَنِ النَّجْوَىٰ ثُمَّ يَعُودُونَ
لِمَا نُهُوا عَنْهُ وَيَتَنَاجَوْنَ بِالْإِثْمِ وَالْعُدْوَانِ
وَمَعْصِيَتِ الرَّسُولِ وَإِذَا جَاءُوكَ حَيَّوْكَ بِمَا لَمْ
يُحَيِّكَ بِهِ اللَّهُ وَيَقُولُونَ فِي أَنفُسِهِمْ لَوْلَا يُعَذِّبُنَا
اللَّهُ بِمَا نَقُولُ ۚ حَسْبُهُمْ جَهَنَّمُ يَصْلَوْنَهَا ۖ فَبِئْسَ
الْمَصِيرُ ⑧

8 రహస్య మంతనాలు జరపరాదని వారించబడినవారిని నీవు చూడలేదా? అయినాసరే వారు వారింపబడిన దానికే మళ్లీ పాల్పడుతున్నారు.[13] వారు పాపం, అత్యాచారం, ప్రవక్త పట్ల అవిధేయతలకు సంబంధించిన రహస్య మంతనాలను సాగిస్తున్నారు.[14] వారు నీ దగ్గరకు వచ్చినపుడు, అల్లాహ్ నీకు ఏ పదజాలంతో సలాం చెయ్యలేదో ఆ పదజాలంతో నీకు సలాం చేస్తారు.[15] పైపెచ్చు, "మనం పలికే ఈ మాటలపై అల్లాహ్ మనల్ని ఎందుకు శిక్షించటంలేదు?!" అని లోలోపలే చెప్పుకుంటారు.[16] వారికి నరకం(యాతన) సరిపోతుంది. వారు అందులోకి ప్రవేశిస్తారు.[17] అది అత్యంత చెడ్డ గమ్యస్థానం.

దాగివున్నా ఎడారి ప్రదేశాలలో సంచరిస్తున్నా – అతడు అల్లాహ్ నుండి దాగి ఉండలేడు. సర్వకాల, సర్వావస్థల్లో ఆయన మనిషి వెంట ఉంటాడు.

12. అంటే దాని ప్రకారమే ఆయన వారికి 'ప్రతిఫలం' ఇస్తాడు. సజ్జనులకు సత్కార్యాల ప్రతిఫలం! దుర్జనులకు వారి దురాగతాల ప్రతిఫలం! చేసుకున్న వారికి చేసుకున్నంత!

13. వారు మదీనాలోని కపటులు, యూదులు. వారు కూర్చునివున్న స్థలం వైపునుండి ముస్లింలు సాగిపోతున్నప్పుడు వారు మరింత దగ్గరై పరస్పరం చెవులు కొరుక్కుంటున్నట్లుగా గుసగుసలాడుతారు. వారు ముస్లిములకు వ్యతిరేకంగా ఏదో కుట్ర పన్నుతున్నారన్న భావం ఆ దృశ్యంలో అంతర్లీనమై ఉంటుంది. లేదా శత్రు సైన్యం ముస్లిం సేనలకు పెద్ద నష్టం కలిగించిందన్న భావం అందులో స్ఫురిస్తూ ఉంటుంది. మొత్తానికి ముస్లింల శిబిరంలో కలవరం సృష్టించి, వారి శ్రేణుల్లో భయోత్పాతాన్ని, గందరగోళాన్ని వ్యాపింపజేయాలన్నది వారి ఉద్దేశం. అందుకే ఇలాంటి చెవి కొరుకుడు ధోరణిని అవలంబించరాదని దైవప్రవక్త (స) వారికి తాకీదు చేశారు. కొన్నాళ్లపాటు వారు దాన్ని మానుకున్నారు. కాని కొంతకాలం తరువాత మళ్లీ ఆ నిందార్హమైన చేష్టను మొదలెట్టారు. ఈ ఆయతులో కపటుల, యూదుల ఆ వెకిలి చేష్ట గురించే చెప్పబడింది.

14. వారు ఎప్పుడు రహస్య సమాలోచన జరిపినా సత్కార్యం, భయభక్తుల గురించి చెప్పుకోరు సరికదా అన్యాయం అక్రమాల గురించి, పాపిష్టి పనుల గురించి, వెన్నుపోటు చర్యల గురించే మాట్లాడుకుంటారు. ప్రవక్త ఆజ్ఞలను ఉల్లంఘించమని ఒండొకరిని ప్రేరేపిస్తూ ఉంటారు.

15. **'సలాం'** చేసే పద్ధతిని అల్లాహ్ మనకు తెలియజేశాడు. **'అస్సలాము అలైకుమ్'** (మీకు శాంతి కలుగుగాక!) అని ఎదుటివారిని దీవించమని చెప్పాడు. కాని యూదులు దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చినపుడు "అస్సాము అలైకుమ్ యా అలైక" (నీకు చావు మూడుగాక!) అని శాపనార్థం పెట్టేవారు. అందుకే దైవప్రవక్త (స) వాళ్లకు ప్రతి సలాం చేస్తూ, క్లుప్తంగా "వ అలైకుమ్" లేక "వ అలైక" (మీక్కూడ) అని పలికేవారు. ఎవరయినా గ్రంథవహులు మీకు సలాం చెబితే, దానికి జవాబుగా మీరు 'అలైక' అని పలకండి అని ముస్లిములకు తాకీదు చేశారు. అంటే మీరు మా కోసం ఏం కోరుకుంటున్నారో అదే మీకునూ కలుగుగాక! అని దీని భావం (సహీహ్ బుఖారీ, ముస్లిం – కితాబుల్ అదబ్).

16. ఈ ప్రవక్త సత్యవంతుడే అయితే మనం పలికే ఈ చెడు మాటలకు దేవుడు మనల్ని శిక్షించాలి కదా! అన్నది వారి ఉద్దేశం.

17. అల్లాహ్ తన ప్రణాళికననుసరించి ఇహలోకంలో వారి విపరీత చర్యలపై తక్షణం దండించకపోయినా పరలోకంలో

**9** ఓ విశ్వాసులారా! మీరు గనక (పరస్పరం) రహస్య సమాలోచన జరిపితే పాపం, అత్యాచారం, ప్రవక్త పట్ల అవిధేయత గురించిన సమాలోచన జరపకండి.[18] దానికి బదులు సత్కార్యం, భయభక్తులకు సంబంధించిన సమాలోచన జరపండి.[19] అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. ఆయన వద్దకే మీరంతా సమీకరించబడతారు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓا۟ إِذَا تَنَٰجَيْتُمْ فَلَا تَتَنَٰجَوْا۟ بِٱلْإِثْمِ وَٱلْعُدْوَٰنِ وَمَعْصِيَتِ ٱلرَّسُولِ وَتَنَٰجَوْا۟ بِٱلْبِرِّ وَٱلتَّقْوَىٰ ۖ وَٱتَّقُوا۟ ٱللَّهَ ٱلَّذِىٓ إِلَيْهِ تُحْشَرُونَ ⑨

**10** విశ్వాసులను వ్యాకుల పరచాలనుకునే (కుత్సిత) సమాలోచనలు షైతాను ప్రేరణలే.[20] అల్లాహ్ అనుజ్ఞ కానంతవరకూ వాడు వారికి ఎలాంటి కీడు కలిగించలేడన్నది నిజం. విశ్వాసులు మాత్రం అల్లాహ్‌నే నమ్ముకోవాలి.[21]

إِنَّمَا ٱلنَّجْوَىٰ مِنَ ٱلشَّيْطَٰنِ لِيَحْزُنَ ٱلَّذِينَ ءَامَنُوا۟ وَلَيْسَ بِضَآرِّهِمْ شَيْـًٔا إِلَّا بِإِذْنِ ٱللَّهِ ۚ وَعَلَى ٱللَّهِ فَلْيَتَوَكَّلِ ٱلْمُؤْمِنُونَ ⑩

**11** ఓ విశ్వాసులారా! సమావేశాలలో కాస్త ఎడంగా కూర్చోండి అని మీతో అనబడినప్పుడు, మీరు కాస్త ఎడంగా కూర్చోండి.[22] అల్లాహ్ మీకు విస్తృతిని ప్రసాదిస్తాడు.[23] 'లేవండి' అని మీతో

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓا۟ إِذَا قِيلَ لَكُمْ تَفَسَّحُوا۟ فِى ٱلْمَجَٰلِسِ فَٱفْسَحُوا۟ يَفْسَحِ ٱللَّهُ لَكُمْ ۖ وَإِذَا قِيلَ ٱنشُزُوا۟

వారికి నరకశిక్ష ఖాయం. అక్కడ వారు ఎలా తప్పించుకుంటారు? వారి రాకకోసం పరలోకంలో నరకం ఎదురుచూస్తూ ఉంది.

18. యూదులు, కపట ముస్లిములు ఈ రకంగా చెవులు కొరుక్కునేవారు. ముస్లిములను ఈ దురలవాటు నుంచి దూరంగా ఉంచే ఉద్దేశంతో ఈ తాకీదు చేయబడింది. – ఓ ముస్లిములారా! మీరు మీ విశ్వాసం విషయంలో నిజాయితీ గలవారైతే ఇలాంటి పాపకార్యాలతో కూడిన మంతనాలకు, గుసగుసలకు దూరంగా ఉండండి అని హెచ్చరించటం జరిగింది.

19. మీరెప్పుడైనా రహస్య సమాలోచన సాగించవలసివస్తే అందులో పరోపకారం, శ్రేయోభిలాష, దైవభక్తి, దైవప్రవక్త (స) యెడల విధేయతా భావం తొణకిసలాడుతూ ఉండాలి. అపకారబుద్ధి ఏ కోశానా ఉండరాదు. సత్కార్యం, దైవ భీతి (తఖ్వా) అంటే ఇదే.

20. అపచారాన్ని, అవిధేయతను, అపరాధాలను తలపెట్టే రహస్య మంతనాలు షైతాను తరఫున మాత్రమే ఉంటాయి. ఇలాంటి దుష్ప్రేరణల ద్వారా విశ్వాసులను ఇరకాటంలో పెట్టాలన్నదే ఆ ధూర్తుడి ఉద్దేశం.

21. అయితే దైవాజ్ఞ కానంతవరకూ ఈ రహస్య మంతనాల వల్ల, షైతాను ప్రేరణల వల్ల మీకెలాంటి హాని కలగదు. అందుకే మీరు శత్రువుల తుచ్ఛమైన చేష్టలకు వెరవవలసిన అవసరం లేదు. పైగా మీరు అల్లాహ్‌నే నమ్ముకోండి. ఎందుకంటే మీ సమస్త వ్యవహారాలు అల్లాహ్ చెప్పుచేతల్లో ఉన్నాయి. మిమ్మల్ని దొంగదెబ్బ తీయాలనుకుంటున్న ఈ యూదుల, కపటుల ఆటలు ఎంతమాత్రం సాగవు.

సమాలోచనలకు సంబంధించి ముస్లింలకు చేయబడిన ఒక ముఖ్యహితవు ఏమిటంటే, వారిలో ముగ్గురు వ్యక్తులు ఒకచోట చేరినప్పుడు, తమలోని ఒక వ్యక్తిని విడిచిపెట్టి ఇద్దరు వ్యక్తులు పరస్పరం గుసగుసలాడుకోకూడదు. ఎందుకంటే ఈ పద్ధతి వల్ల వేరైపోయిన ఆ ఒక్క వ్యక్తి మనసు నొచ్చుకుంటుంది. (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇస్తీజాన్; సహీహ్ ముస్లిం – కితాబుస్సలామ్). అయితే ఆ మూడవ వ్యక్తి అనుమతిని పొందిన మీదట మాట్లాడుకుంటే అందులో తప్పులేదు.

22. ఈ వాక్యంలో ముస్లింలకు సభా మర్యాదలు తెలుపబడ్డాయి. ఇక్కడ సభ (లేక సమావేశం) అనే పదం చాలా

فَانْشُزُوْا يَرْفَعِ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا مِنْكُمْ ۙ وَالَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ دَرَجٰتٍ ؕ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ خَبِيْرٌ ⑪

అనబడినప్పుడు మీరు లేచినిలబడండి.[24] మీలో విశ్వసించినవారి, జ్ఞానం ప్రసాదించబడినవారి అంతస్థులను అల్లాహ్ పెంచుతాడు.[25] మీరు చేసే ప్రతి పనీ అల్లాహ్ జ్ఞానపరిధిలో ఉంది.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْۤا اِذَا نَاجَيْتُمُ الرَّسُوْلَ فَقَدِّمُوْا بَيْنَ يَدَيْ نَجْوٰىكُمْ صَدَقَةً ؕ ذٰلِكَ خَيْرٌ لَّكُمْ وَاَطْهَرُ ؕ فَاِنْ لَّمْ تَجِدُوْا فَاِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ⑫

**12** విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు దైవప్రవక్త (సఅసం)తో రహస్య సమాలోచన చేయదలిస్తే, మీరు రహస్య సమాలోచనకు ముందు ఎంతో కొంత దానం చేయండి.[26] ఇది మీ కొరకు ఎంతో ఉత్తమమైనది, పవిత్రమైనది.[27] ఒకవేళ మీకు ఆ స్థోమత లేకపోతే అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు.

ءَاَشْفَقْتُمْ اَنْ تُقَدِّمُوْا بَيْنَ يَدَيْ نَجْوٰىكُمْ صَدَقٰتٍ ؕ فَاِذْ لَمْ تَفْعَلُوْا وَتَابَ اللّٰهُ عَلَيْكُمْ

**13** ఏమిటి, మీ రహస్య సమాలోచనకు ముందు మీరు దానం చేయాలి అనేసరికి భయపడిపోయారా? మీరు ఈ దాన ధర్మము చేయలేకపోయినప్పుడు అల్లాహ్ కూడా మిమ్మల్ని మన్నించాడు.[28]

విస్తృతార్థం గలది. మంచి ఉద్దేశంతో, పుణ్యం పొందే ఉద్దేశంతో, ఇతరులకు బోధపరిచే సంకల్పంతో నిర్వహించే ప్రతి సభా ఇందులోకి వస్తుంది (ఖుర్తుబీ). 'ఎడంగా కూర్చోండి' అంటే మీరు కూర్చున్న సభాస్థలి విశాలంగా ఉండాలి. తరువాత వచ్చిన వారు ఇబ్బంది పడకుండా సర్దుకుని కూర్చునేలా ముందునుంచే జాగ్రత్తపడాలి. తరువాత వచ్చేవారు నిలబడక తప్పని పరిస్థితిని సృష్టించకూడదు. ముందు వచ్చి కూర్చున్న వారిని లేపి వారి స్థలంలో కూర్చోవటం కూడా మంచి పద్ధతి కాదు. మనసులో చోటు ఉంటే సభలలో కూడా చోటు ఉంటుంది. అందుకే మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "ఎవరయినా ఒక వ్యక్తి మరో వ్యక్తిని లేపి తాను ఆ చోటులో కూర్చోరాదు. ఈ పరిస్థితి రాకుండా ఉండటానికి (ముందుగానే) సభాస్థలిని విశాలంగా ఉంచండి" (సహీహ్ బుఖారీ – కితాబుల్ జుముఅ; సహీహ్ ముస్లిం – కితాబుస్సలాం).

23. అంటే – అల్లాహ్ మీకు స్వర్గంలో సువిశాలమైన స్థలాన్ని ఇస్తాడు. దీనికి మరో అర్థం ఇది: మీరు కోరిన విషయంలో అల్లాహ్ మీకు విస్తృతిని వొసగుతాడు. ఉదాహరణకు : మీ నివాస గృహంలో, మీ ఉపాధిలో, మీ సమాధిలో – సర్వత్రా మీకు విశాలాన్ని ప్రసాదిస్తాడు.

24. అంటే – ఏ మంచి పని కోసం లేవమని ఆజ్ఞాపించబడినా తాత్సారం చేయకుండా లేచి వెళ్ళిపొండి. ముస్లిములకు ఈ విధంగా ఆజ్ఞాపించబడటంలోని ముఖ్యోద్దేశం ఏమిటంటే ప్రవక్త ప్రియసహచరులు (రజి) సాధారణంగా దైవప్రవక్త సమావేశాలలో నుంచి లేచి వెళ్ళడానికి ఇష్టపడేవారు కాదు. అందువల్ల ఏకాంతంలో దైవప్రవక్త (స) ముందు సందేహాలు తీర్చుకోవాలనుకునే వారికి ఇబ్బంది కలిగేది.

25. అంటే – సాధారణ విశ్వాసులకు కూడా స్వర్గం లభించినప్పటికీ వారిలోని జ్ఞానులకు మరిన్ని ఉన్నత స్థానాలు లభిస్తాయి. ధర్మజ్ఞానం కలవారి అంతస్థులు పెరుగుతాయని ఈ వాక్యం ద్వారా విదితమవుతోంది.

26. ప్రతి ముస్లిం దైవప్రవక్త (సఅసం)ను ఏకాంతంలో కలుసుకుని తన సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఉవ్విళ్ళూరేవాడు. దీంతో దైవప్రవక్త (స)కు సహజంగానే కొంత ఇబ్బంది కలిగేది. కపటులైతే అవసరం లేకపోయినా దైవప్రవక్తతో సుదీర్ఘంగా సంభాషణ జరిపేవారు. ఈ ధోరణిని అడ్డుకోవటానికి దేవుడు ఈ ఆయతును ఒక ఆంక్షగా అవతరింపజేశాడు.

27. (ఉత్తమం, పవిత్రం) ఎందుకంటే ఈ దానధర్మాల వల్ల మీ ధార్మికసోదరుల్లోని పేద వారికే మేలు జరుగుతుంది. ఇంకా ఈ సత్కార్యం వల్ల ఆత్మశుద్ధి జరుగుతుంది. దీని ద్వారా బోధపడేదేమిటంటే ఈ ఆజ్ఞ విధిగా కాకుండా పుణ్యఫలాపేక్షతోనే విధించబడింది.

فَأَقِيمُوا الصَّلَاةَ وَآتُوا الزَّكَاةَ وَأَطِيعُوا اللَّهَ وَرَسُولَهُ ۚ وَاللَّهُ خَبِيرٌ بِمَا تَعْمَلُونَ ⑬

అందుకే ఇప్పుడు నమాజులను (సజావుగా) నెలకొల్పండి. జకాత్‌ను (విధిగా) ఇస్తూ ఉండండి. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతూ ఉండండి.[29] మీరు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా ఎరుకే.

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ تَوَلَّوْا قَوْمًا غَضِبَ اللَّهُ عَلَيْهِم مَّا هُم مِّنكُمْ وَلَا مِنْهُمْ وَيَحْلِفُونَ عَلَى الْكَذِبِ وَهُمْ يَعْلَمُونَ ⑭

**14** ఏమిటి, అల్లాహ్ ఆగ్రహానికి గురైన వారితో కుమ్మక్కు అయిన వారిని నీవు చూడలేదా?[30] అసలు వీరు (ఈ కపటులు) మీ వారూ కారు, వాళ్ల పక్షాన చేరినవారూ కారు.[31] తెలిసి కూడా వారు– ఉద్దేశ్యపూర్వకంగా – అసత్య విషయాలపై ప్రమాణం చేస్తున్నారు.[32]

أَعَدَّ اللَّهُ لَهُمْ عَذَابًا شَدِيدًا ۖ إِنَّهُمْ سَاءَ مَا كَانُوا يَعْمَلُونَ ⑮

**15** వారికోసం అల్లాహ్ అత్యంత కఠినమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు.[33] వారు చేసేవి ముమ్మాటికీ చెడు పనులే.

اتَّخَذُوا أَيْمَانَهُمْ جُنَّةً فَصَدُّوا عَن سَبِيلِ اللَّهِ فَلَهُمْ عَذَابٌ مُّهِينٌ ⑯

**16** వారు తమ ప్రమాణాలను ఆసరా(డాలు)గా చేసుకున్నారు.[34] పైగా అల్లాహ్ మార్గం నుండి ఆపుతున్నారు.[35] వారికి అవమాన కరమైన శిక్ష తథ్యం.

---

28. ఇది పుణ్యఫలాపేక్షతో ఆజ్ఞాపించబడిన విషయమే అయినప్పటికీ ముస్లింలకు కొంత ఇబ్బందికరంగా పరిణమించింది. అందుకే అల్లాహ్ ఈ ఆంక్షను తొందరగానే ఎత్తివేశాడు.

29. అంటే – మీరు గనక నమాజు, జకాతు వంటి విధులను ఖచ్చితంగా నెరవేర్చి, దైవాదేశాలకు, దైవప్రవక్త ఉపదేశాలకు కట్టుబడి ఉన్నట్లయితే మీ ఈ సదాచరణ దానధర్మాలకు ప్రత్యామ్నాయంగా పరిగణించబడుతుంది.

30. దివ్య ఖుర్ఆన్‌లో వివరించబడిన దాని ప్రకారం అల్లాహ్ ఆగ్రహానికి గురైన వారంటే యూదులన్నమాట. వారితో నికార్సయిన ముస్లిములెన్నడూ దోస్తీ చేయరు. కపట ముస్లింలు మాత్రమే యూదులతో స్నేహ సంబంధాలు పెట్టుకుంటారు. మదీనాలో ఒకవైపు యూదుల కుట్రలు తీవ్రతరమై, మరోవైపు కపటులు కూడా ముస్లిం సమాజంలో పుట్టుకు వచ్చినప్పుడు ఈ వాక్యం అవతరించింది. కాని అప్పటికింకా యూదులు మదీనా నుంచి బహిష్కారానికి గురికాలేదు.

31. ఈ కపటులు ఇటు ముస్లింలూ కారు, అటు ధార్మికంగా యూదులు కూడా కారు. మరైతే వీరు యూదులతో స్నేహం ఎందుకు చేసినట్టు? కేవలం ఇస్లాం పట్ల, దైవప్రవక్త (సఅసం) పట్ల విరోధం వల్ల వారు పరస్పరం చెట్టాపట్టాలేసు కున్నారు.

32. ఈ కపటుల ఆంతర్యాలలో కుళ్లు నిండి ఉంది. వారు ముస్లిములకు ఎదురుపడినప్పుడు, "అయ్యో! మేము కూడా ముస్లింలమే కదండీ!" అని ఒట్టేసి మరీ చెబుతారు. లేదా యూదులతో తమకెలాంటి సంబంధం లేదని అబద్ధపు ప్రమాణం చేస్తారు. కాని వారు చెప్పేదొకటి, చేసేది ఒకటి.

33. యూదులతో చేతులు కలిపి ఇస్లాంకు, ముస్లిములకు వెన్నుపోటు పొడిచిన కారణంగా, అబద్ధపు ప్రమాణాలు చేసిన కారణంగా అల్లాహ్ వారిని కఠినంగా శిక్షిస్తాడు.

34. **"ఐమాన్"** అంటే ప్రమాణాలు అని అర్థం. 'యమీన్' దీని ఏకవచనం. ఒక యోధుడు యుద్ధరంగంలో శత్రువు

**17** వారి సిరిసంపదలుగానీ, వారి సంతానం గానీ అల్లాహ్‌కు వ్యతిరేకంగా వారికేమాత్రం పనికిరావు. వారు నరకవాసులు. వారందులో కలకాలం ఉంటారు.

لَنْ تُغْنِيَ عَنْهُمْ أَمْوَالُهُمْ وَلَآ أَوْلَادُهُمْ مِّنَ اللّٰهِ شَيْـًٔا ؕ أُولٰٓئِكَ أَصْحٰبُ النَّارِ ؕ هُمْ فِيهَا خٰلِدُونَ ⑰

**18** వారందరినీ అల్లాహ్ తిరిగి లేపిన రోజున, వారు మీ ముందు ప్రమాణాలు చేసినట్లే ఆయన ముందు కూడా ప్రమాణాలు చేస్తారు.[36] తమకూ ఏదో ఒక ఆధారం ఉందని తలపోస్తారు.[37] బాగా తెలుసుకోండి! వారు పచ్చి అబద్ధాల కోరులు.

يَوْمَ يَبْعَثُهُمُ اللّٰهُ جَمِيعًا فَيَحْلِفُونَ لَهٗ كَمَا يَحْلِفُونَ لَكُمْ وَيَحْسَبُونَ أَنَّهُمْ عَلٰى شَيْءٍ ؕ أَلَآ إِنَّهُمْ هُمُ الْكٰذِبُونَ ⑱

**19** షైతాను వారిని లొంగదీసుకున్నాడు.[38] వారు అల్లాహ్ ధ్యానాన్ని మరచిపోయేలా చేశాడు.[39] వాళ్లు షైతాను ముఠాకు చెందినవారు. బాగా తెలుసుకోండి! ఎట్టకేలకు నష్టపోయేది షైతాను ముఠాయే.[40]

اِسْتَحْوَذَ عَلَيْهِمُ الشَّيْطٰنُ فَأَنْسٰهُمْ ذِكْرَ اللّٰهِ ؕ أُولٰٓئِكَ حِزْبُ الشَّيْطٰنِ ؕ أَلَآ إِنَّ حِزْبَ الشَّيْطٰنِ هُمُ الْخٰسِرُونَ ⑲

**20** ఎవరయితే అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల వైరవైఖరిని అవలంబిస్తారో[41] వారు అత్యంత ఎక్కువగా పరాభవం పాలయ్యే వారిలో ఉంటారు.[42]

إِنَّ الَّذِينَ يُحَآدُّونَ اللّٰهَ وَرَسُولَهٗٓ أُولٰٓئِكَ فِي الْأَذَلِّينَ ⑳

వేటునుండి తనను రక్షించుకోవటానికి డాలును ఎలా అడ్డుగా పెట్టుకుంటాడో అలాగే ఈ కపటులు ముస్లిముల ఖడ్గపు వేటుకు బలికాకుండా ఉండేందుకు తెలివిగా 'అబద్ధపు ప్రమాణాన్ని' ఆసరాగా చేసుకున్నారు.

35. ఈ కపటులు గోముఖ వ్యాఘ్రాలు. వారు తమను తాము ముస్లిములుగా చెప్పుకుని ముస్లిం శిబిరంలో తూట్లు వేసే పనులు చేసేవారు. సత్కార్యాల నుండి ముస్లింలను ఆపటమే గాక, ఇస్లాంలో ప్రవేశించదలిచే వారిని కూడా నిరోధించేవారు. ఆ విధంగా ప్రజలను దైవమార్గంలో అడ్డుకునే నేరం కూడా వారిపై పడింది.

36. ఇది వారి దుస్సాహసానికి పరాకాష్ఠ. ఎందుకంటే ఏ రహస్యమూ దాగని ప్రళయదినాన కూడా ప్రభువు ఎదుట అబద్ధపు ప్రమాణం చేయటానికి వారు సంకోచించరు.

37. తమ అబద్ధపు ప్రమాణాలు ఇహలోకంలో తమను తాత్కాలికంగా ఆదుకున్నట్లే పరలోకంలో కూడా అవి తమల్ని తాత్కాలికంగా ఉపయోగపడతాయని వారు భావిస్తారు. కాని అవి ఎందుకూ ఉపయోగపడవు.

38. **'ఇస్తహ్‌వజ'** (اِستَحوَذَ) అంటే ఆవహించటం, చుట్టుముట్టడం, అదుపులోకి తీసుకోవటం, ఆధిపత్యం వహించటం అనే అర్థాలు వస్తాయి. అందుకే ఈ వాక్యానికి షైతాను వారిని లొంగదీసుకున్నాడు అని అనువదించటం జరిగింది. లొంగదీసుకున్నాడు అన్న మాటలో ఈ అర్థాలన్నీ ఇమిడి ఉన్నాయి.

39. అంటే దేవుడు ఆజ్ఞాపించిన పనులను వారు విస్మరించేటట్లు చేసి, వారించిన పనులను మాత్రం వారు చేసేటట్టు వారిని పురికొల్పుతాడు. చెడు పనులనే అందమైన పనులుగా చిత్రీకరించి వారిని బోల్తా కొట్టిస్తాడు. లేదా వారు తమ మనోవాంఛలకు బానిసలుగా మారేలా చేస్తాడు.

40. అంటే నష్టం మరియు వినాశం అంతా వారి ఖాతాలోనే జమ అవుతుంది. ఎందుకంటే వారు స్వర్గానికి బదులు అపమార్గాన్ని కొనితెచ్చుకున్నారు. అల్లాహ్‌పై అబద్ధాలను కల్పించారు. ఇహలోకంలోనూ, పరలోకంలోనూ అసత్య ప్రమాణాలు చేశారు.

41. **"ముహాద్దతున్"** (مُحَادَّةٌ) అంటే బద్ధశత్రుత్వం, తీవ్రమైన వ్యతిరేకత, రెండు వర్గాలు పరస్పరం కలిసి కూర్చోవటానికే

كَتَبَ اللّٰهُ لَاَغْلِبَنَّ اَنَا وَرُسُلِیْ ؕ اِنَّ اللّٰهَ قَوِیٌّ
عَزِیْزٌ ﴿۲۱﴾

21 “నేనూ, నా ప్రవక్తలు మాత్రమే ఆధిపత్యం వహిస్తాము” అని అల్లాహ్ వ్రాసిపెట్టేశాడు.[43] నిశ్చయంగా అల్లాహ్ మహా బలుడు, తిరుగులేనివాడు.[44]

لَا تَجِدُ قَوْمًا یُّؤْمِنُوْنَ بِاللّٰهِ وَالْیَوْمِ الْاٰخِرِ یُوَآدُّوْنَ مَنْ
حَآدَّ اللّٰهَ وَرَسُوْلَهٗ وَلَوْ كَانُوْۤا اٰبَآءَهُمْ اَوْ اَبْنَآءَهُمْ اَوْ
اِخْوَانَهُمْ اَوْ عَشِیْرَتَهُمْ ؕ اُولٰٓئِكَ كَتَبَ فِیْ قُلُوْبِهِمُ الْاِیْمَانَ
وَاَیَّدَهُمْ بِرُوْحٍ مِّنْهُ ؕ وَیُدْخِلُهُمْ جَنّٰتٍ تَجْرِیْ مِنْ
تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِیْنَ فِیْهَا ؕ رَضِیَ اللّٰهُ عَنْهُمْ وَرَضُوْا

22 అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించేవారు అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల శత్రుత్వం వహించేవారిని ప్రేమిస్తున్నట్లు నీవు ఎక్కడా చూడవు[45] – ఆఖరికి వారు తమ తండ్రులైనాసరే, తమ కొడుకులైనాసరే, తమ అన్నదమ్ములైనాసరే, తమ పరివార జనులైనాసరే[46] (ససేమిరా వారిని ప్రేమించరు). అల్లాహ్ విశ్వాసాన్ని రాసి పెట్టినది ఇలాంటి వారి హృదయాలలోనే![47] ఆయన తన

సుముఖత చూపనంతటి వైరం అన్న అర్థాలు వస్తాయి. ఆ రెండింటివీ భిన్న ధృవాలు. అసలు ఈ పదం 'హద్' (హద్దు) నుంచి వచ్చినదే. ఒకరు ఒక హద్దున ఉంటే మరొకరు మరో హద్దున ఉంటారన్నమాట. ఈ క్రమంలో ఈ పదం వారింపు అన్న అర్థంలోనూ ఉపయోగించబడింది. ద్వారం దగ్గర కాపలా ఉండేవాణ్ణి కూడా అరబీలో హద్దాద్ అని అనటం జరుగుతుంది. (బహుశా అతను ఇతరుల్ని లోనికి రాకుండా అడ్డుకుంటాడనే భావంతో కావచ్చు) (ఫత్‌హుల్ ఖదీర్).

ఏమైనప్పటికీ దేవుని పట్ల, దైవప్రవక్త పట్ల ఇంతటి తీవ్రమయిన వ్యతిరేకతను ప్రదర్శించిన వారికి చివరకు మిగిలేది ఘోరపరాభవం తప్ప మరేమీ కాదు.

42. గత కాలంలో దైవం మరియు దైవప్రవక్తల యెడల శత్రువులుగా మారిన వారెవరూ ప్రాబల్యం వహించలేదు. పైగా వారు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ తుచ్ఛులయ్యారు. అలాగే అంతిమ దైవప్రవక్త (సఅసం) పట్ల వైరవైఖరి ప్రదర్శించేవారు కూడా ఇహలోకంలోనూ, పరలోకంలోనూ అవమానంపాలు కావలసి ఉంటుంది.

43. అంటే – “లౌహె మహ్‌ఫూజ్” లో ఈ విషయం రాసిపెట్టబడి ఉంది. అందులో ఎటువంటి మార్పూ ఉండదు. ఈ విషయం మోమిన్ సూరా 51, 52 ఆయతుల పాద సూచికలలో కూడా వివరించబడింది.

44. ఈ విధివ్రాతను రాసిపెట్టినవాడు అత్యంత శక్తిశాలి, తిరుగులేని వాడైనపుడు మరి ఆ నిర్ణయాన్ని మార్చగల వాడెవడుంటాడు? దీని భావం ఏమిటంటే దేవుని విధివ్రాత తిరుగులేనిది, మార్పులు చేర్పులకు వీలు లేనటువంటిది.

45. ఈ ఆయతులో దేవుడు చెప్పిన ముఖ్య విషయం ఏమిటంటే దేవునిపట్ల, పరలోకం పట్ల సంపూర్ణ విశ్వాసం గలవారు దైవవిరోధులతో, దైవప్రవక్త విరోధులతో స్నేహసంబంధాలుగానీ, బంధుత్వ సంబంధాలుగానీ పెట్టుకోరు. విశ్వాసం (ఈమాన్) గల ఒకే హృదయంలో – ఏకకాలంలో – దైవం, దైవప్రవక్త పట్ల విశ్వాసంతోపాటు దైవం మరియు దైవప్రవక్త విరోధుల పట్ల ప్రేమ పాదుకోలేవు. ఈ విషయం దివ్య ఖుర్‌ఆన్‌లో పలుచోట్ల నొక్కి చెప్పబడింది. ఉదాహరణకు : ఆలి ఇమ్రాన్ – 28, తౌబా – 24 సూరాలను చూడండి.

46. ఎందుకంటే వారిలోని విశ్వాసం (ఈమాన్) వారిని కట్టిపడేస్తుంది. 'విశ్వాసం' ముందు బంధుత్వ సంబంధాలు, ఆత్మీయతలు, మమతానురాగాలన్నీ దిగదుడుపే. మహాప్రవక్త ప్రియసహచరులు ఈ విషయాన్ని క్రియాత్మకంగా రుజువుచేశారు. దేవునిపై సంపూర్ణ విశ్వాసంగల ఒక సహాబీ దైవవిరోధి అయిన తన తండ్రిని, తనయుణ్ణి, సోదరుణ్ణి, బాబాయిని, మేనమామ, ఇతర బంధువులను కడతేర్చడానికి కించిత్తు కూడా తటపటాయించలేదు. యుద్ధరంగంలో తమను మార్కొన్నప్పుడు వారితో తమ ప్రాణాలొడ్డి పోరాడారు. చరిత్రే ఇందుకు సాక్ష్యం.

47. అంటే వారి ఆంతర్యాలలో విశ్వాసాన్ని స్థిరపరిచాడు.

عَنْهُ ؕ اُولٰٓئِكَ حِزْبُ اللّٰهِ ؕ اَلَآ اِنَّ حِزْبَ اللّٰهِ هُمُ الْمُفْلِحُوْنَ ﴿22﴾

ఆత్మద్వారా వీరిని ప్రత్యేకంగా బలపరిచాడు.[48] ఇంకా వీరికి, క్రింద సెలయేరులు పారే స్వర్గ వనాలలో ప్రవేశం కల్పిస్తాడు. అందులో వీరు కలకాలం ఉంటారు. అల్లాహ్ వీరి పట్ల ప్రసన్నుడయ్యాడు. వీరు అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు.[49] అల్లాహ్ పక్షానికి చెందినవారంటే వీరే. నిశ్చయంగా సాఫల్యం పొందేవారు అల్లాహ్ పక్షంవారే.[50]

48. ఇక్కడ **'ఆత్మ'** అంటే దేవుని ప్రత్యేక తోడ్పాటు అని భావం. లేదా విశ్వాసజ్యోతి అని అర్థం. వారి చిత్తశుద్ధి మూలంగా దేవుడు వారిపై ఈ విధంగా – ప్రత్యేకంగా – దయదలిచాడు.

49. అత్యుత్తమ శ్రేణికి చెందిన ఆ ముస్లింలు విశ్వాసం (ఈమాన్) ప్రాతిపదికపై తమ రక్త సంబంధీకులతో సయితం తెగత్రెంపులు చేసుకోవటానికి సిద్ధమైనపుడు – వారి అసాధారణ త్యాగనిరతికి బదులుగా – అల్లాహ్ వారికి తన ప్రసన్నతను అనుగ్రహించాడు. దైవానుగ్రహాల పట్ల వారు కూడా అమితంగా సంతోషించారు.

మూలంలో **'రజియల్లాహు అన్‌హుమ్ వ రజూ అన్‌హు'** (అల్లాహ్ వారిపట్ల ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్ పట్ల ప్రసన్నులయ్యారు) అన్నమాట ఉంది. ఈ ఆయతు ప్రత్యేకంగా దైవప్రవక్త సహచరుల విషయంలోనే అవతరించినప్పటికీ దీనికి ప్రప్రథమ హక్కుదారులు మాత్రం వారే. అందరికంటే ముందు ఈ వాక్యం దైవప్రవక్త సహచరులకే వర్తిస్తుందన్న విషయంలో మాత్రం సందేహానికి తావులేదు. మరి 'రజియల్లాహు అన్‌హు' అనే గౌరవ వచనాన్ని దైవప్రవక్త సహచరుల (సహాబా) తర్వాత వేరితరుల కోసం వాడవచ్చా? దీనికి సమాధానం తెలుసుకోవటానికి కొంత చర్చ అవసరం. ఈ వచనాలను సామాన్య అర్థంలో గనక తీసుకున్నట్లయితే పైన ఆయతులో పేర్కొనబడిన సుగుణాలను కల్గివున్న వారందరికీ ఈ గౌరవవచనాలను వర్తింపజేయవచ్చు. అయితే ఖుర్‌ఆన్ హదీసులను అనుసరించే అహ్లె సున్నత్ పండితులు ఈ గౌరవ వచనాలను దైవప్రవక్త సహచరులను తప్పించి వేరితరుల కోసం చెప్పటం, రాయటం ధర్మసమ్మతం కాదని అభిప్రాయపడ్డారు. అంటే ఇప్పుడవి చిహ్నాలు (షిఆర్)గా మారిపోయాయన్నమాట. సహాబా కోసం రజియల్లాహు అన్‌హుమ్ అనీ, దైవప్రవక్తలకయితే అలైహిముస్సలాతు వస్సలామ్ అని చెబుతున్నారు. ఈ విషయాన్ని మనం ఈ విధంగా కూడా అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు 'రహిమహుల్లాహ్' (అల్లాహ్ ఆయన్ని కరుణించుగాక!) అనే వచనం ఉంది. ఇదొక వేడుకోలు వచనం. శాబ్దిక భావం రీత్యా దీన్ని బతికున్నవారికైనా, చనిపోయినవారికైనా – ఎవరికైనా చెప్పవచ్చు. అల్లాహ్ కారుణ్యం చనిపోయినవారికి, బతికున్నవారికి అందరికీ అవసరమే, అయితే వ్యవహారంలో ఇది మృతుల కోసం చెప్పబడుతోంది కాబట్టి బతికున్న వారికోసం ఈ వేడుకోలు వచనాన్ని జనం ఇష్టపడటం లేదు. **'రజియల్లాహు అన్‌హు'** సంగతి కూడా అంతే!

50. అంటే విశ్వాసుల ఈ వర్గం మాత్రమే పరలోకంలో ఉత్తీర్ణత పొంది స్వర్గంలో ప్రవేశిస్తుంది. దీనికి భిన్నంగా వ్యవహరించిన వారు ఈ సాఫల్యానికి నోచుకోరు.

59 వ సూరా

# అల్ హష్ర్

## సమీకరణ

అవతరణ మదీనాలో

ఆయతులు 24

### పరిచయం

*ఏక దైవారాధన, యుద్ధసొత్తు పంపిణీ గురించి ఈ సూరా బోధించింది. ఈ సూరాలోని రెండవ ఆయతులో వచ్చిన "అల్ హష్ర్" (సమీకరణ) అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మదీనాలో కొత్తగా ఏర్పడిన ముస్లిం సమాజాన్ని ప్రమాదంలో పడెయ్యడానికి అక్కడి బనూ నజీర్ అనబడే యూద తెగ కుట్రపన్నింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)తో చేసుకున్న ఒప్పందాన్ని వారు ఉల్లంఘించారు. అవిశ్వాసులతో, కపటవిశ్వాసులతో కూటమి కట్టారు. క్రీ.శ.625లో ఇది జరిగింది. వారందరినీ ప్రవక్త ముహమ్మద్(సఅసం) మదీనా నుంచి బహిష్కరించారు. వారి వస్తుసామగ్రిని, ఆయుధాలు తప్ప మిగిలిన సమస్తాన్ని తీసుకువెళ్ళడానికి అనుమతి ఇచ్చారు. వారి ఆస్తిపాస్తులు, పొలాలను బీద ముస్లిములకు పంచడం జరిగింది.*

*ఈ సూరా అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడుతూ ప్రారంభమయ్యింది. ఆయన అపార శక్తిసంపన్నుడు, మహా వివేకవంతుడు. ఈ సూరాలో వినమ్రత, సదాచరణల ప్రాముఖ్యాన్ని గుర్తుచేయడం జరిగింది. ఎందుకంటే విశ్వంలోని సమస్తం అల్లాహ్ ఔన్నత్యాన్ని మాత్రమే కొనియాడుతోంది. యూదులకు మిత్రులుగా వ్యవహరిస్తున్న కపట విశ్వాసుల గురించి ఈ సూరా ప్రస్తావించింది. యూదులు చివరకు కష్టంలో చిక్కుకున్నప్పుడు ఈ కపట విశ్వాసులు వారికి ఎలా సహాయం చేయలేకపోయారో కూడా తెలిపింది. మదీనా వలస వచ్చిన విశ్వాసుల త్యాగనిరతి, నిజమైన విశ్వాసాల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ప్రారంభంలో ముస్లిములు మక్కా నగరాన్ని వదిలి మదీనాకు వలస రావలసి వచ్చింది. మదీనాలో వారికి సహాయపడిన స్థానికుల గురించి వారు ఏ విధంగా వలస వచ్చిన వారికి ఆశ్రయం, ఆర్థిక సహాయం అందించినది ఈ సూరాలో తెలియ జేయడం జరిగింది.*

## అల్ హష్ర్ సూరా[1]

## سُوْرَةُ الْحَشْرِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతున్నది. ఆయన మహా శక్తిమంతుడు, వివేక వంతుడు.

سَبَّحَ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۚ
وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ①

**2** ఆయనే గ్రంథవహులలోని అవిశ్వాసులను వారి ఇండ్ల నుండి తొలి(సారి) సమీకరణలోనే తీసివేశాడు.[2] వారు వెళ్ళి పోతారని మీరు (సయితం) ఊహించలేదు. (పటిష్టమైన) తమ కోటలు తమను అల్లాహ్ (దెబ్బ) నుండి రక్షిస్తాయని వారు అనుకున్నారు.[3] అయితే వారు ఊహించని చోటు నుంచి అల్లాహ్ దెబ్బ వారిపై విరుచుకుపడింది.[4] ఇంకా, అల్లాహ్ వారి గుండెల్లో దడ పుట్టిం

هُوَ الَّذِيْٓ اَخْرَجَ الَّذِيْنَ كَفَرُوْا مِنْ اَهْلِ الْكِتٰبِ مِنْ
دِيَارِهِمْ لِاَوَّلِ الْحَشْرِ ۭ مَا ظَنَنْتُمْ اَنْ يَّخْرُجُوْا وَظَنُّوْٓا
اَنَّهُمْ مَّانِعَتُهُمْ حُصُوْنُهُمْ مِّنَ اللّٰهِ فَاَتٰىهُمُ اللّٰهُ
مِنْ حَيْثُ لَمْ يَحْتَسِبُوْا وَقَذَفَ فِيْ قُلُوْبِهِمُ الرُّعْبَ

---

1. యూదుల తెగ అయిన బనూ నజీర్ గురించి ఈ సూరా అవతరించింది. అందుకే ఈ సూరాను **'సూరతున్నజీర్'**గా కూడా వ్యవహరిస్తారు (సహీహ్ బుఖారీ – అల్ హష్ర్ సూరా వ్యాఖ్యానం).

2. మదీనా పరిసరాలలో మూడు యూద తెగలు నివసించేవి – అవి 1. బనూనజీర్, 2. బనూ ఖురైజా 3. బనూ ఖైనుఖా. దైవప్రవక్త మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన తరువాత యూద తెగలతో 'మైత్రీ ఒప్పందం' కూడా చేసుకున్నారు. కాని యూదులు మాత్రం ఆ ఒప్పందాన్ని ఖాతరు చేయకుండా మక్కాలోని ఖురైషులతో చేతులు కలిపి ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలు పన్నసాగారు. కడకు వారి కుతంత్రాలు ఏ స్థాయికి చేరాయంటే దైవప్రవక్త (స) నే హత్య చేయాలనుకున్నారు. ఒకానొక తగాదాను పరిష్కరించడానికి దైవప్రవక్త (స) యూదుల వాడకు వెళ్ళినప్పుడు, వారు ఇంటి పై కప్పు నుండి దైవప్రవక్త (స)పై ఒక పెద్ద బండరాయిని దొర్లించబోయారు. ఈ సంగతి వహీ (దైవ సందేశం) ద్వారా ప్రవక్తకు తెలుపబడింది.

   దైవప్రవక్త (స) వెంటనే అక్కడినుంచి తిరిగి వచ్చేశారు. బనూ నజీర్ విశ్వాస ఘాతుక చర్యల కారణంగా దైవప్రవక్త (స) వారికి వ్యతిరేకంగా ఒక సైనిక దళాన్ని సమాయత్తం చేశారు. కొన్ని రోజుల వరకూ ఆ యూదులు ముట్టడించబడ్డారు. ఆఖరికి ప్రాణభిక్ష పెట్టే పక్షంలో తాము నగరాన్ని విడిచిపెట్టి పోతామని వారు రాయబారం పంపారు. మహాప్రవక్త (స) ఈ ప్రతిపాదనను ఆమోదించారు. ఇదే తొలిసారి సమీకరణ (అవ్వలుల్ హష్ర్)గా అభివర్ణించబడింది. ఆ విధంగా వారు మదీనా పొలిమేరల నుంచి తీసివేయబడ్డారు. అనంతరం ఖైబరులో నివసించసాగారు. ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) వారిని రెండవసారి అక్కడి నుంచి గెంటివేయగా, వారు సిరియా ప్రాంతం వైపు తరలిపోయారు. సమస్త మానవాళి ఆఖరి సమీకరణ అక్కడే జరుగుతుందని చెబుతారు.

3. ఎందుకంటే యూదులు చాలా పటిష్టమైన కోటల్ని నిర్మించుకున్నారు. తమ కోటల్ని జయించే శక్తి ఎవరికీ లేదని వారు మిడిసిపడేవారు. యూదుల కోటలను వశపరచుకోవటం అంత తేలిక కాదని ఇటు ముస్లింలు కూడా భావించేవారు.

4. కాని ఎవరూ ఊహించని రీతిలో దైవప్రవక్త (సఅసం) తన సేనా వాహినితో వారి కోటలను నలువైపుల నుంచీ ముట్టడించి, వారి దైనందిన జీవనాన్ని స్థంభింపజేశారు.

يُخْرِبُونَ بُيُوتَهُم بِأَيْدِيهِمْ وَأَيْدِي الْمُؤْمِنِينَ فَاعْتَبِرُوا يَا أُولِي الْأَبْصَارِ ②

చాడు.[5] వారు తమ ఇండ్లను చేజేతులా నాశనం చేసుకోసాగారు.[6] ముస్లింల చేతుల మీదుగా కూడా (ధ్వంసం చేయించుకున్నారు).[7] కాబట్టి ఓ కళ్లున్నవారలారా! దీని ద్వారా గుణపాఠం నేర్చుకోండి.[8]

وَلَوْلَا أَن كَتَبَ اللَّهُ عَلَيْهِمُ الْجَلَاءَ لَعَذَّبَهُمْ فِي الدُّنْيَا ۖ وَلَهُمْ فِي الْآخِرَةِ عَذَابُ النَّارِ ③

**3** ఒకవేళ అల్లాహ్ వారిపై దేశ బహిష్కరణను వ్రాసి ఉండక పోతే, వారిని ప్రపంచంలోనే దండించి ఉండేవాడు.[9] పరలోకం లోనైతే వారికి నరకాగ్ని శిక్ష ఎలాగూ ఉంది.

ذَٰلِكَ بِأَنَّهُمْ شَاقُّوا اللَّهَ وَرَسُولَهُ ۖ وَمَن يُشَاقِّ اللَّهَ فَإِنَّ اللَّهَ شَدِيدُ الْعِقَابِ ④

**4** ఈ విధంగా ఎందుకు జరిగిందంటే వారు అల్లాహ్‌పై, ఆయన ప్రవక్తపై కయ్యానికి కాలు దువ్వారు. ఎవడు అల్లాహ్‌పై కయ్యానికి కాలు దువ్వినా అల్లాహ్ వాడ్ని చాలా కఠినంగా శిక్షిస్తాడు.

---

5. మరోవైపు దేవుడు యూదుల గుండెల్లో గుబులు పుట్టించాడు. అందుకే వారు ఊరు విడిచి పోవటానికి సులభంగా అంగీకరించారు. ఆ సందర్భంగా కపటుల సర్దారు అయిన అబ్దుల్లా బిన్ ఉబై ఎట్టిపరిస్థితిలోనూ ముస్లింలకు లొంగరాదని, తామంతా యూదులకు అండగా నిలుస్తామని కబురంపాడు. అయితే దేవుడు తన ప్రవక్తకు అపూర్వమైన రీతిలో తోడ్పడ్డాడు. ఆయన (స) నెలరోజుల ప్రయాణానికి దూరంగా ఉండగానే శత్రువు గుండెల్లో అలజడి రేగేది. అందువల్ల యూదుల శిబిరాల్లో తీవ్రమయిన భయోత్పాతం ఏర్పడింది. బ్రతికుంటే బలుసాకైనా తిని ఉండవచ్చన్న ఉద్దేశంతో వారు కాళ్ళ బేరానికి వచ్చారు. తాము మోసుకుపోగలిగేంత వస్తుసామగ్రిని తీసుకువెళ్ళేందుకు అనుమతించమని ప్రాధేయపడ్డారు. దైవప్రవక్త (స) అందుకు సమ్మతించారు. అప్పుడు వారు ఇంటి తలుపులను సయితం పెకలించి తమ వెంట తీసుకుపోయారు.
6. తాము ఊరు విడిచిపోక తప్పదని తేలిపోయిన తరువాత యూదులు తమ ఇండ్లను తమ స్వహస్తాలతో నాశనం చేయసాగారు. ఆ ఇళ్లు ముస్లింలకు నివాసయోగ్యంగా ఉండరాదన్నది వారి ఉద్దేశం. అదీగాక మోయగలిగినంత సామాను తీసుకుపోయేందుకు అనుమతించబడినందున, ఈ వెసులుబాటు నుండి పూర్తిగా లబ్ధిపొందుతూ వారు తమ ఇండ్లను సయితం కూల్చి వాటిలోని ముఖ్యమైన సామగ్రినంతటినీ తీసుకుపోయారు.
7. ముట్టడి జరిగినప్పుడు లోపల ఒకవైపు యూదులు తమ ఇండ్లను తామే నాశనం చేస్తూ ఉంటే, మరోవైపు బయటి నుండి ముస్లిం సేనలు వారి ఇండ్లను ధ్వంసం చేయసాగారు. లేదా యూదులు పాక్షికంగా తమ ఇండ్లను కూల్చివెళ్ళగా మిగతా సామగ్రిని వెలికి తీయటానికి ముస్లింలు మరిన్ని కూల్చివేత కార్యక్రమాలు చేపట్టవలసి వచ్చింది.
8. చూడబోతే బనూ నజీర్ తెగ సాధన సంపత్తుల రీత్యా, రణనీతి దృష్ట్యా ఎంతో బలవత్తరమైనది. కాని అల్లాహ్ వారికి ఇచ్చిన గడువు పూర్తవటంతో వారు దేవుని ఉచ్చులో బిగుసుకుపోయారు. వారి తెలివితేటలుగానీ, వారి కంచుకోటలుగాని వారిని ఆదుకోలేకపోయాయి. అన్ని హంగులూ ఉండి కూడా వారు చేతులెత్తేయక తప్పలేదు. ఆలోచించే వారికొరకు ఇందులో గొప్ప నీతి ఉంది.
9. అంటే – వారికి దేశ బహిష్కార శిక్ష పడనుందన్న సంగతి దేవుడు ముందుగానే రాసి పెట్టాడు. ఒకవేళ ఈ శిక్ష పడని యెడల దేవుడు ఇహలోకంలోనే వారిని తీవ్రంగా శిక్షించేవాడు. వారి సహోదరులైన బనూ ఖురైజాకు ఎంటువంటి శిక్ష పడిందో వీరికీ అటువంటి శిక్షే పడి ఉండేది. బనూ ఖురైజాకు చెందిన యువకులను వధించి, వృద్ధులను, ఇతరులను నిర్బంధించిన సంగతి తెలిసిందే. వారి ఆస్తిపాస్తులు ముస్లింలకు 'మాలె గనీమత్' (యుద్ధప్రాప్తి)గా అప్పగించబడ్డాయి.

5 మీరు కొన్ని ఖర్జూరపు వృక్షాలను నరికివేసినా లేదా వాటిని వాటి వ్రేళ్లపై నిలిచి ఉండేలా వదిలివేసినా – ఇదంతా అల్లాహ్ అనుజ్ఞతోనే జరిగింది–అవిధేయులను అవమానపరచటానికి [10] (ఆపాటి చర్య అవసరమయింది).

مَا قَطَعْتُمْ مِّنْ لِّيْنَةٍ اَوْ تَرَكْتُمُوْهَا قَآئِمَةً عَلٰٓى اُصُوْلِهَا فَبِاِذْنِ اللّٰهِ وَلِيُخْزِىَ الْفٰسِقِيْنَ ⑤

6 ఇంకా – అల్లాహ్ తన ప్రవక్తకు అందజేసిన వారి సొమ్ముల కోసం మీరు మీ గుర్రాలనుగానీ, ఒంటెలను గానీ పరుగెత్తించ లేదు. అల్లాహ్ తన ప్రవక్తలకు తాను కోరిన వారిపై అధికారం వొసగుతాడు.[11] అల్లాహ్‌కు అన్నింటిపై అధికారం ఉంది.

وَمَآ اَفَآءَ اللّٰهُ عَلٰى رَسُوْلِهٖ مِنْهُمْ فَمَآ اَوْجَفْتُمْ عَلَيْهِ مِنْ خَيْلٍ وَّلَا رِكَابٍ وَّلٰكِنَّ اللّٰهَ يُسَلِّطُ رُسُلَهٗ عَلٰى مَنْ يَّشَآءُ ۗ وَاللّٰهُ عَلٰى كُلِّ شَىْءٍ قَدِيْرٌ ⑥

7 (మీరు చెమటోడ్చకుండానే ఇతర) పుర ప్రజల నుండి అల్లాహ్ తన ప్రవక్తకు స్వాధీనపరచిన సొమ్ము అల్లాహ్‌కు, ప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, నిరుపేదలకు, బాటసారులకు వర్తిస్తుంది. ఈ సంపద మీలోని ధనిక వర్గాల మధ్యనే పరిభ్రమిస్తూ ఉండ రాదన్న ఉద్దేశంతో ఈ విధంగా నిర్ణయించటం జరిగింది. దైవ ప్రవక్త మీకు ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే, దాన్ని వదిలి పెట్టండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ కఠినంగా శిక్షించగలవాడు.

مَآ اَفَآءَ اللّٰهُ عَلٰى رَسُوْلِهٖ مِنْ اَهْلِ الْقُرٰى فَلِلّٰهِ وَلِلرَّسُوْلِ وَلِذِى الْقُرْبٰى وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ وَابْنِ السَّبِيْلِ ۙ كَىْ لَا يَكُوْنَ دُوْلَةًۢ بَيْنَ الْاَغْنِيَآءِ مِنْكُمْ ۗ وَمَآ اٰتٰىكُمُ الرَّسُوْلُ فَخُذُوْهُ ۚ وَمَا نَهٰىكُمْ عَنْهُ فَانْتَهُوْا ۚ وَاتَّقُوا اللّٰهَ ۗ اِنَّ اللّٰهَ شَدِيْدُ الْعِقَابِ ⑦

8 (ముఖ్యంగా ఈ 'ఫై' సొమ్ము) తమ ఇల్లూ వాకిలి నుండి, తమ ఆస్తిపాస్తుల నుండి గెంటివేయబడిన నిరుపేద ముహాజిర్లకు వర్తిస్తుంది. (ఎందుకంటే) వారు దైవానుగ్రహాన్ని, దైవప్రసన్నతను ఆశిస్తూ, దైవానికీ, ఆయన ప్రవక్తకు తోడ్పడుతున్నారు. వారే అసలు సిసలు సత్యసంధులు.[12]

لِلْفُقَرَآءِ الْمُهٰجِرِيْنَ الَّذِيْنَ اُخْرِجُوْا مِنْ دِيَارِهِمْ وَاَمْوَالِهِمْ يَبْتَغُوْنَ فَضْلًا مِّنَ اللّٰهِ وَرِضْوَانًا وَّيَنْصُرُوْنَ اللّٰهَ وَرَسُوْلَهٗ ۗ اُولٰٓئِكَ هُمُ الصّٰدِقُوْنَ ۚ ⑧

10. **'లీనతిన్'** అనేది ఖర్జూరాలలో ఒక రకం. ఉదాహరణకు అజ్వా, బర్నీ లాంటి రకాల మాదిరిగానే ఇది కూడా ఒక మేలుజాతి ఖర్జూరం అన్నమాట, లేదా సాధారణ ఖర్జూర చెట్టు కూడా కావచ్చు. బనూనజీర్ వాడను ముట్టడించినపుడు ముస్లింలు దైవప్రవక్త (సఅసం) ఆదేశానుసారం కొన్ని ఖర్జూర చెట్లను నరికివేశారు. మరికొన్ని ఖర్జూర చెట్లకు నిప్పు పెట్టారు. శత్రువును బయటికి తీయటానికి, వారిని లొంగదీసుకోవటానికి అవలంబించిన వ్యూహం ఇది. దేవుడు కూడా ముస్లింల ఈ రణనీతిని సమర్థించాడు. దాన్ని యూదులను పరాభవం పాల్జేయడానికి గైకొనబడిన చర్యగా అభివర్ణించాడు.

11. ముస్లింల స్వాధీనంలోనికి వచ్చిన బనూ నజీర్ భూభాగం మదీనా నగరానికి మూడు మైళ్లదూరంలో ఉంది. అంటే ఈ ప్రదేశం కోసం ముస్లింలు సుదీర్ఘ ప్రయాణం చేయవలసిన అవసరం ఏర్పడలేదు. వారు తమ గుర్రాలను, ఒంటెలను దౌడు తీయించి చెమటోడ్చలేదు. వారు యూదులతో పోరాడనూ లేదు. అలుపూ సలుపూ లేకుండానే – అలవోకగా – ఒప్పందం ద్వారా ఆ ప్రాంతం ముస్లింల కైవసం అయింది. అంటే యుద్ధం జరగకుండానే ఈ

وَالَّذِيْنَ تَبَوَّؤُ الدَّارَ وَالْاِيْمَانَ مِنْ قَبْلِهِمْ
يُحِبُّوْنَ مَنْ هَاجَرَ اِلَيْهِمْ وَلَا يَجِدُوْنَ فِيْ
صُدُوْرِهِمْ حَاجَةً مِّمَّآ اُوْتُوْا وَيُؤْثِرُوْنَ عَلٰٓى
اَنْفُسِهِمْ وَلَوْ كَانَ بِهِمْ خَصَاصَةٌ ۗ وَمَنْ يُّوْقَ شُحَّ
نَفْسِهٖ فَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ⑨

**9** ఇకపోతే; వీరికంటే ముందే ఈ ప్రదేశం (మదీనా)లోనూ, విశ్వాసంలోనూ స్థానికులై ఉన్నవారు (వారికి కూడా ఈ సొమ్ము వర్తిస్తుంది);[13] వారు ఇల్లూ వాకిలిని వదలి తమ వైపుకు వలస వచ్చే ముహాజిర్లను ప్రేమిస్తారు. వారికి ఏమి ఇవ్వబడినా దానిపై తమ అంతర్యాలలో ఏ కాస్త అసూయను కూడా రానివ్వరు.[14] తాము అమిత అవసరంలో ఉన్నప్పటికీ తమపైన వారికే ప్రాధాన్యతనిస్తారు.[15] వాస్తవానికి తమలోని స్వార్థప్రియత్వం (పేరాశ) నుండి రక్షించబడినవారే కృతార్థులు.[16]

ప్రాంతాన్ని దేవుడు తన ప్రవక్తకు స్వాధీనపర్చాడు. అందుకే ఇక్కడ ప్రాప్తమయిన సొమ్ము **'ఫై'** గా ఖరారు చేయబడింది. శత్రువుతో తలపడకుండానే పాదాక్రాంతమైన సొత్తు 'ఫై' గా వ్యవహరించబడుతుంది. యుద్ధం జరిగిన పిదప ముస్లిం సేనల స్వాధీనంలోకి వచ్చిన సొమ్ము 'మాలె గనీమత్' (యుద్ధప్రాప్తి)గా పరిగణించబడుతుంది.

12. **'ఫై'**గా వ్యవహరించబడే సొమ్మును ఏ ఏ పద్దుల్లో ఖర్చుపెట్టాలో ఇక్కడ వివరంగా తెలియజేయటం జరిగింది. దీంతోపాటు దైవమార్గంలో ఇల్లువాకిలి వదలి వలస పోయిన వారి (ముహాజిర్ల) గొప్పదనం కూడా శ్లాఘించబడింది. ఆ త్యాగధనులు అన్ని త్యాగాలు చేసిన మీదట కూడా వారి విశ్వాసాన్ని ఎవరయినా శంకిస్తే ఒకవిధంగా అది ఖుర్ఆన్‌ను శంకించటం వంటిదే.

13. వీరు మదీనాకు చెందిన అన్సారులు. ముహాజిర్లు మదీనాకు రాకపూర్వం నుంచే వారు మదీనాలో నివసిస్తున్నారు. వారి హృదయాలలో విశ్వాస బీజం కూడా బాగా నాటుకుంది. పై ఆయతుకు భావం అన్సారులు, ముహాజిర్ల కంటే ముందుగానే ఇస్లాం స్వీకరించారని కాదు. ఎందుకంటే అన్సార్లలో అత్యధిక మంది ముహాజిర్లు ఇస్లాం స్వీకరించిన తర్వాత ఇస్లాం పరిధిలోకి వచ్చినవారే. పై వాక్యంలో దారుల్ హిజ్రత్ అంటే మదీనా నగరమని అర్థం.

14. దైవమార్గంలో స్వదేశాన్ని వదలివచ్చిన ముహాజిర్లకు దైవప్రవక్త (సఅసం) ఆర్థికంగా ఎలాంటి సహాయం చేసినా దానిపై వారు మనస్తాపానికి గురికారు. పైగా సంతోషిస్తారు. 'ఫై' రూపంలో వచ్చిన సొమ్ములను పంపిణీ చేసే సమయంలో ముహాజిర్లకు ప్రాధాన్యం ఇచ్చినా అన్సార్లు అన్యథా భావించలేదు.

15. ఇది అన్సార్ల ఔదార్యానికి ఒక మచ్చుతునక. వారు పస్తులుండి కూడా ముహాజిర్లకు అన్నం పెట్టేవారు. హదీసులో వచ్చిన ఒక సంఘటన ఇలా వుంది : దైవప్రవక్త (సఅసం) దగ్గరికి ఒక అతిథి వచ్చాడు. కాని ఆయన (స) ఇంట్లో అతిథి మర్యాద కోసం ఏమీలేదు. అందువల్ల ఒక అన్సార్ వ్యక్తి ఆ అతిథిని తన ఇంటికి తోడ్కుని వెళ్ళారు. తీరా ఇల్లాలిని ఆరాతీస్తే, ఇంట్లో పిల్లలకు సరిపడా అన్నం మాత్రమే ఉందని తెలిసింది. వారిద్దరూ పరస్పరం సంప్రతించుకుని, ఆ రోజు రాత్రి పిల్లలకు పస్తు పడుకోబెట్టాలని నిర్ణయించుకున్నారు. తాము కూడా అన్నం తినకుండా ఉందామని అనుకున్నారు. అతిథికి భోజనం వడ్డించిన తరువాత ఇంట్లోని దీపం ఆర్పివేయాలని కూడా చెప్పుకున్నారు. ఆ విధంగా రాత్రి చీకటిలో భార్యాభర్తలిరువురూ అన్నం తింటున్నట్లు అద్భుతంగా అభినయం చేసి, అతిథికి మాత్రం కడుపు నిండా తినిపించాలన్నది వారి పథకం. వారు తమ పథకాన్ని సక్రమంగానే అమలుపరచారు. తెల్లవారాక ఆ సహాబి దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చినప్పుడు, రాత్రి మీరిద్దరు చేసిన అతిథి మర్యాదను దేవుడు కొనియాడుతూ "తమకు లేకపోయినప్పటికీ వారు తమపైన వారికే ప్రాధాన్యతనిస్తారు" అన్న ఆయతును అవతరింపజేశాడు అని ఆయన (స) తెలియజేశారు (సహీహ్ బుఖారీ : హష్ర్ సూరా వ్యాఖ్యానం). అన్సార్లు చేసిన అసాధారణ త్యాగాలకు మరో ఉపమానం ఏమిటంటే, ఒక అన్సార్ సోదరునికి ఇద్దరు భార్యలుండేవారు. అతను తన భార్యలలో ఒకామెకి విడాకులిస్తానని ప్రతిపాదించాడు. విడాకులివ్వబడిన ఆమెకు - ఇద్దత్ (గడువు) ముగిసిన పిదప - తన ముహాజిర్ సోదరునికిచ్చి వివాహం జరిపించాలన్నది అతని అభిమతం (సహీహ్ బుఖారీ : కితాబున్నికాహ్).

**10** వారి తరువాత వచ్చినవారు (వారికీ ఈ సొమ్ము వర్తిస్తుంది), వారిలా వేడుకుంటారు : "మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేష భావాన్నీ కలిగించకు.[17] మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదు స్వభావం కలిగిన వాడవు, కనికరించేవాడవు."

وَالَّذِينَ جَاءُو مِنْ بَعْدِهِمْ يَقُولُونَ رَبَّنَا
اغْفِرْ لَنَا وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ
وَلَا تَجْعَلْ فِي قُلُوبِنَا غِلًّا لِّلَّذِينَ آمَنُوا رَبَّنَا
إِنَّكَ رَءُوفٌ رَّحِيمٌ ⑩

**11** (ఓ ముహమ్మద్ – స!) నీవు కపటులను చూడలేదా? వారు గ్రంథవహుల్లోని తమ అవిశ్వాస సోదరులతో, "మీరు గనక దేశం నుండి బహిష్కరించబడితే మేము కూడా తప్పకుండా మీ వెంటే బయలు దేరతాము. మీ విషయంలో మేమెన్నటికీ ఎవరి మాటా వినము. ఒకవేళ మీతో గనక యుద్ధం జరిగితే మేము మీకు తప్ప కుండా సాయం చేస్తాము"[18] అని అంటారు. కాని వాళ్ళు వట్టి అబద్ధాల రాయుళ్ళని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు.[19]

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ نَافَقُوا يَقُولُونَ لِإِخْوَانِهِمُ الَّذِينَ
كَفَرُوا مِنْ أَهْلِ الْكِتَابِ لَئِنْ أُخْرِجْتُمْ لَنَخْرُجَنَّ
مَعَكُمْ وَلَا نُطِيعُ فِيكُمْ أَحَدًا أَبَدًا وَإِنْ قُوتِلْتُمْ
لَنَنْصُرَنَّكُمْ وَاللَّهُ يَشْهَدُ إِنَّهُمْ لَكَاذِبُونَ ⑪

**12** ఒకవేళ వారు వెళ్ళగొట్టబడితే, వీరు వారితోపాటు వెళ్ళేరకం కాదు. ఒకవేళ వారితో యుద్ధం జరిగితే వీళ్లు వారికి సాయం కూడా చేయరు.[20] ఒకవేళ సాయంగా వచ్చినా[21] వెన్నుచూపి పారి పోతారు.[22] మరి వారికి ఎలాంటి తోడ్పాటు కూడా లభించదు.[23]

لَئِنْ أُخْرِجُوا لَا يَخْرُجُونَ مَعَهُمْ وَلَئِنْ
قُوتِلُوا لَا يَنْصُرُونَهُمْ وَلَئِنْ نَصَرُوهُمْ لَيُوَلُّنَّ
الْأَدْبَارَ ثُمَّ لَا يُنْصَرُونَ ⑫

16. స్వార్థప్రియత్వం లేక ఆత్మ లోభత్వం గురించి హదీసులో ఈ విధంగా చెప్పబడింది: "మీరు ఆత్మలోభత్వం నుండి మిమ్మల్ని రక్షించుకోండి. ఈ ఆత్మలోభత్వమే పూర్వీకులను నాశనం చేసింది. ఈ రోగమే వారిని రక్తపాతానికి పురిగొల్పింది. మరి వారు అధర్మ విషయాలను ధర్మసమ్మతం చేసేసుకున్నారు." (సహీహ్ ముస్లిం–కితాబుల్ బిర్ర్).

17. వీరు **'ఫై'** సొమ్ముకు అర్హులైన వారిలో మూడవ వర్గం వారు. వీరు దైవమార్గంలో ప్రస్థానం చేసివచ్చిన ప్రవక్త ప్రియ సహచరులను ఆదర్శంగా తీసుకున్నవారు. తాబయీలు, వారి తరువాతి వారు, ప్రళయదినం వరకు ఉనికిలోనికి వచ్చే విశ్వాసులు, భక్తిపరాయణులు అందరూ ఈ తృతీయ శ్రేణిలో ఉంటారు. అయితే వీరంతా ప్రవక్త ప్రియసహచరులైన అన్సార్లను, ముహాజిర్లను గౌరవిస్తూ, వారి మన్నింపు కోసం ప్రార్థించేవారై ఉండాలి. అంతేగాని ప్రవక్త ప్రియశిష్యులను కించపరిచేవారు, శంకించే వారై ఉండకూడదు. వారిపట్ల ఆంతర్యాల్లో వైరభావం లేశమైనా కలిగి ఉండకూడదు.

ఈ ఆయతును ఆధారంగా చేసుకొని ఇమామ్ మాలిక్ ఏమంటున్నారో చూడండి: దైవప్రవక్త సహచరులను తూలనాడే రాఫిజీలకు 'ఫై' ధనంలో నుంచి వాటా ఇవ్వబడదు. ఎందుకంటే ('ఫై' సొమ్ము పంపిణి నేపథ్యంలో) అల్లాహ్ ప్రవక్త సహచరులను కొనియాడగా వీరు వారిని తూలనాడుతున్నారు.

విశ్వాసుల తల్లి హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా అంటున్నారు : "దైవప్రవక్త ప్రియసహచరుల (రజి) మన్నింపు కోసం ప్రార్థించమని మీకు ఆజ్ఞాపించబడింది. కాని మీరేమో ఆ మహనీయులను తూలనాడుతున్నారు. ఈ ఉమ్మత్లోని తరువాతి వారు తమ పూర్వీకులపై శాపనార్థాలు పెట్టనంతవరకూ ఈ ఉమ్మత్ రూపుమాపబడదు అని మీ ప్రవక్త(స) చెప్పగా నేను విన్నాను." (ఇబ్నె కసీర్).

**13** (ముస్లిములారా!) వారి హృదయాలలో అల్లాహ్ భయం కన్నా అధికంగా మీ భయం ఉంది.[24] ఎందుకంటే వారు తెలివి లేని జనులు.[25]

لَأَنتُمْ أَشَدُّ رَهْبَةً فِي صُدُورِهِم مِّنَ اللَّهِ ۚ ذَٰلِكَ بِأَنَّهُمْ قَوْمٌ لَّا يَفْقَهُونَ ⑬

**14** వారంతా ఏకమైనా మీతో (మైదానాలలో) పోరాడలేరు. అయితే కోటలు గల పురములలో ఉండిగానీ, గోడల చాటున మాటేసిగానీ పోరాడగలరు.[26] అసలు వాళ్ల మధ్యనే తీవ్రమైన మనస్పర్థలున్నాయి.[27] వాళ్లు కలసికట్టుగా ఉన్నారని నువ్వు అనుకుంటున్నావు. కాని వారి మనసులు పరస్పరం వేరుపడి ఉన్నాయి.[28] వాళ్ల ఈ (దు)స్థితికి కారణం వాళ్ళ తెలివిమాలిన తనమే.[29]

لَا يُقَاتِلُونَكُمْ جَمِيعًا إِلَّا فِي قُرًى مُّحَصَّنَةٍ أَوْ مِن وَرَاءِ جُدُرٍ ۚ بَأْسُهُم بَيْنَهُمْ شَدِيدٌ ۚ تَحْسَبُهُمْ جَمِيعًا وَقُلُوبُهُمْ شَتَّىٰ ۚ ذَٰلِكَ بِأَنَّهُمْ قَوْمٌ لَّا يَعْقِلُونَ ⑭

18. లోగడ మదీనాలోని కపటులు యూద తెగ అయిన బనూనజీర్‌కు ఈ విధంగా కబురుచేసిన సంగతి విదితమే.

19. కాని తీరా బనూనజీర్ తెగవారు ముట్టడించబడినప్పుడు వీరు జారుకున్నారు. యూదులకు సహాయంగా రానూ లేదు. యూదులతోపాటు మదీనా విడిచి వెళ్ళనూ లేదు.

20. కపటుల కల్లబొల్లి మాటలు ఇక్కడ స్పష్టంగా చెప్పబడ్డాయి.

21. ఉదాహరణగా ఈ విషయం చెప్పబడింది. నిజానికి వారసలు సహాయంగా రారని దేవుడు ముందే చెప్పేశాడు.

22. అంటే – ఘోరంగా ఓడిపోయి, చావు తప్పి కన్నులొట్టపోయి పలాయనం చిత్తగిస్తారు.

23. యూదులకు అభయమిచ్చిన కపటులే వెన్నుచూపి పారిపోయినప్పుడు ఇక యూదులను ఆదుకునే నాథుడెవడుంటాడు? మరికొంతమంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం ఈ వాక్యం కూడా కపటుల నేపథ్యంలోనే వచ్చింది. దీని అర్థం ఇది : దగాకోరులైన కపటులకు ఎటువైపు నుంచి కూడా తోడ్పాటు అందదు. వారు దిక్కుతోచక దిక్కులు చూసే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విధంగా దేవుడు వారిని అవమానపరుస్తాడు.

24. **'వారు'** అంటే వారు యూదులూ కావచ్చు, కపట ముస్లింలూ కావచ్చు. లేదా వారందరూ కావచ్చు.

25. వారు అవివేకులు గనకనే వారి ఆంతర్యాలలో మీ పట్ల జడుపు ఏర్పడింది. వారే గనక వివేకవంతులైతే ముస్లింల ఈ ఆధిపత్యానికి అసలు కారణం దేవుని తోడ్పాటేనని, భయపడవలసింది కూడా దైవానికేనని తెలుసుకునేవారు.

26. అంటే – ఈ యూదులు, కపటులు కలిసి కూడా బహిరంగ ప్రదేశంలో మిమ్మల్ని ప్రతిఘటించలేరు. కాకపోతే వాళ్లు ఏ గోడల చాటునో, కోటల లోపల కూర్చొనో దొంగదెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తారు. దీన్నిబట్టి తేటతెల్లమయ్యే దేమిటంటే వాళ్లు వట్టి పిరికిపందలు. మీరంటేనే వారి గుండెల్లో వణుకు పుడుతుంది.

27. వారిలో ఒకరి పొడ ఇంకొకరికి గిట్టదు. పైకి మాత్రం వారు ఒకరుగా కనిపిస్తారు. లోపలి నుంచి వారి పరిస్థితి మేడిపండు వంటిది.

28. అంటే – ఇది కపటుల మానసిక స్థితీ కావచ్చు, కపటుల – యూదుల పరస్పర స్థితీ కావచ్చు, లేదా ముష్రిక్కుల – గ్రంథవహుల స్థితీ కావచ్చు. వారంతా సత్యానికి వ్యతిరేకంగా ఒకే జట్టుగా కనిపిస్తారు. కాని వారి మనసులు మాత్రం ఒకటి కావు. ఒకరింకొకరికి పూర్తిగా భిన్నం. ఒకరు ఇంకొకరిపట్ల వైరభావం కలిగి ఉన్నారు.

29. ఇంతకీ వారి ఈ కలతలకి, కార్పణ్యాలకి మూలకారణం వారి మూర్ఖత్వమే. విషయాన్ని గ్రహించే విశాల హృదయత గనక వారిలో ఉండి ఉంటే వారు సత్యాన్ని ఇప్పటికే గ్రహించి ఉండేవారు.

كَمَثَلِ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ قَرِيْبًا ذَاقُوْا وَبَالَ
اَمْرِهِمْ ۚ وَلَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿15﴾

**15** చూడబోతే వీళ్ల వ్యవహారం వీరికి కొద్దికాలం క్రితమే గతించినవారిని పోలి ఉన్నది. వారెలాగూ తమ స్వయంకృతపు రుచిని చూశారు.[30] వ్యధాభరితమైన శిక్ష కూడా వారికి పడుతుంది.[31]

كَمَثَلِ الشَّيْطٰنِ اِذْ قَالَ لِلْاِنْسَانِ اكْفُرْ ۚ فَلَمَّا كَفَرَ
قَالَ اِنِّيْ بَرِيْٓءٌ مِّنْكَ اِنِّيْٓ اَخَافُ اللّٰهَ
رَبَّ الْعٰلَمِيْنَ ﴿16﴾

**16** వీళ్ల సంగతి షైతాను మాదిరిగా ఉన్నది. వాడు మానవునితో, "తిరస్కార వైఖరిని అవలంబించు" అని అంటాడు. తీరా అతను తిరస్కార వైఖరికి పాల్పడినప్పుడు "నీతో నాకెలాంటి సంబంధం లేదు, పో.[32] నేను సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతున్నాను"[33] అని అంటాడు.

فَكَانَ عَاقِبَتَهُمَآ اَنَّهُمَا فِى النَّارِ خَالِدَيْنِ
فِيْهَا ؕ وَذٰلِكَ جَزٰٓؤُا الظّٰلِمِيْنَ ﴿17﴾

**17** పర్యవసానంగా వారిరువురూ (నరకం) అగ్నిలో ఉంటారు – శాశ్వతంగా ఉండేవారుగా! తమ ఆత్మలకు అన్యాయం చేసుకునే వారికి తగిన శాస్తి ఇదే.[34]

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اتَّقُوا اللّٰهَ وَلْتَنْظُرْ نَفْسٌ
مَّا قَدَّمَتْ لِغَدٍ ۚ وَاتَّقُوا اللّٰهَ ؕ اِنَّ اللّٰهَ خَبِيْرٌۢ
بِمَا تَعْمَلُوْنَ ﴿18﴾

**18** విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.[35] ప్రతి వ్యక్తీ రేపటి (తీర్పుదినం) కొరకు తానేం పంపుకున్నాడో చూసుకోవాలి.[36] ఎల్లవేళలా అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా మీరు ఏమేం చేస్తున్నారో అల్లాహ్ కనిపెట్టుకునే ఉన్నాడు.[37]

---

30. ఇంతకీ స్వయంకృతానికి పాల్పడిన వారెవరు? అంటే వారు మక్కా ముష్రిక్కులని కొందరు భావించారు. బనూ నజీర్ సంఘటనకు కొన్ని నెలల క్రితం బద్ర్ యుద్ధ రంగంలో ఈ ముష్రిక్కులకు ఘోరపరాజయం ఎదురైంది. వారు మూటగట్టుకున్నటు వంటి అవమానాన్నే వీళ్లు కూడా మూటగట్టుకున్నారు. మరి కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ వాక్యం యూద తెగ అయిన బనూ ఖైనుఖా పరాజయం నేపథ్యంలో అవతరించింది. (ఇబ్నె కసీర్)
31. వారికి పడిన ఈ శిక్ష ఇహలోక శిక్ష. పరలోక శిక్ష ఇంతకన్నా తీవ్రంగా ఉంటుంది.
32. కపటుల–యూదుల పొత్తు ఎటువంటిదో తెలియపరచటానికి ఈ ఉపమానం ఇవ్వబడింది. షైతాను తన మాయమాటలతో మానవుణ్ణి ఎలా మోసం చేశాడో అలాగే ఈ కపటులు కూడా యూదులను దగా చేశారు. మొదట్లో వారికి ఆశలపల్లకిని చూపించారు. తీరా ఆపద సమయం వచ్చిపడినప్పుడు తోక ముడిచారు.
33. షైతాన్ తన మాటలో సత్యవంతుడు కాడు. షైతాను మోసంలో పడి మానవుడు ఒడిగట్టిన అవిశ్వాసం నుండి తప్పించుకోవటానికి మాత్రమే వాడు ఈ విధంగా మాట మార్చాడు.
34. అంటే వారు చేసిన అన్యాయానికి తగిన శిక్ష శాశ్వతమైన నరకమే.
35. ఈ ఆయతులో విశ్వసించిన వారిని ఉద్దేశించి ప్రత్యేకంగా హితబోధ చేయబడింది – దైవానికి భయపడుతూ ఉండండి అని!

    అల్లాహ్‌కు భయపడటం అంటే అసలు అర్థం ఆయన చేయమని ఆజ్ఞాపించిన వాటిని ఖచ్చితంగా చేయటం, ఆయన వారించిన వాటిని విడనాడటం! ఈ ఆయతులో అల్లాహ్‌కు భయపడమని రెండుసార్లు గట్టిగా చెప్పటం జరిగింది. ఈ భయము, భక్తి లేనిదే మనిషి మంచిపనులు చేయడు. చెడు పనుల నుండి ఆగి ఉండడు.
36. ఆ **'రేపు'** ఎంతో దూరంలో లేదు. అది చాలా సమీపంలోనే ఉంది.

19 మీరు అల్లాహ్‌ను మరచిపోయిన వారి మాదిరిగా అయి పోకండి. (వారి ఈ విస్మరణ కారణంగా) అల్లాహ్ కూడా వారిని తమ ఆత్మలనే మరచిపోయిన వారిగా చేసేశాడు.[38] ఇలాంటి వారే పరమ అవిధేయులు.

وَلَا تَكُوْنُوْا كَالَّذِيْنَ نَسُوا اللّٰهَ فَاَنْسٰىهُمْ اَنْفُسَهُمْ ۭ اُولٰۗىِٕكَ هُمُ الْفٰسِقُوْنَ ⑲

20 నరకవాసులు–స్వర్గవాసులు ఎన్నటికీ సమానులు కాలేరు.[39] స్వర్గవాసులు మాత్రమే సాఫల్యం పొందినవారు.[40]

لَا يَسْتَوِيْٓ اَصْحٰبُ النَّارِ وَاَصْحٰبُ الْجَنَّةِ ۭ اَصْحٰبُ الْجَنَّةِ هُمُ الْفَاۗىِٕزُوْنَ ⑳

21 ఒకవేళ మేము ఈ ఖుర్‌ఆనును ఏ పర్వతం మీదనో దింపి ఉంటే[41] అది అల్లాహ్ భీతితో అణగారి, తునాతునకలై పోవ టాన్ని[42] నీవు చూసి ఉండేవాడివి. ప్రజలు యోచన చేయగలందు లకు గాను మేము ఈ దృష్టాంతాలను వారికి వివరిస్తున్నాము.[43]

لَوْ اَنْزَلْنَا هٰذَا الْقُرْاٰنَ عَلٰي جَبَلٍ لَّرَاَيْتَهٗ خَاشِعًا مُّتَصَدِّعًا مِّنْ خَشْيَةِ اللّٰهِ ۭ وَتِلْكَ الْاَمْثَالُ نَضْرِبُهَا لِلنَّاسِ لَعَلَّهُمْ يَتَفَكَّرُوْنَ ㉑

37. కాబట్టి ఆయన ప్రతి ఒక్కరికీ వారు చేసుకున్న కర్మలనుబట్టి 'ప్రతిఫలం' ఇస్తాడు. పుణ్యానికి పుణ్యఫలం, పాపానికి పాపఫలం ఉంటుంది.

38. అంటే వారి అపరాధాల కారణంగా అల్లాహ్ వారిపై ఆగ్రహించాడు. వారి ఆత్మలకు మేలు చేకూర్చే సత్కార్యాల నుండి వారిని మరిపింపజేశాడు. అలాగే వారి ఆత్మలను శిక్ష నుండి కాపాడే పనుల పట్ల కూడా వారిని విస్మరణకు గురిచేశాడు. ఈ విధంగా దైవాన్ని మరచిన మానవుడు తన్నుతానే మరచిపోయే నికృష్ట స్థితికి దిగజారిపోతాడు. అతని బుద్ధి అతన్ని సరైన దిశలో మార్గం చూపదు. అతని కళ్లు అతనికి సత్యమార్గం చూపించవు. అతని కర్ణపుటాలకు సత్యబద్ధమైన మాటలు తాకవు. తత్ఫలితంగా తనను వినాశంపాలు చేసే పనులు తన స్వహస్తాలతో చేసుకుంటూ పోతాడు.

39. దైవాన్ని మరచిపోయి, తమ ఆత్మలకే అన్యాయం చేసుకున్న ఈ నేరస్థులు దేవుని బోనులో నిలబడే రోజు తప్పకుండా వస్తుంది. తమ ఏ శరీరం కోసం వారు ఇహలోకంలో అడ్డదారులు తొక్కారో ఆ శరీరమే నరకానికి ఇంధనంగా మారుతుంది. వీరికి ప్రతిగా మరోవర్గం వారుంటారు. వారు అనునిత్యం అల్లాహ్‌ను స్మరిస్తూ, ఆయన ఆదేశాలకను గుణంగా జీవితం గడుపుతూ ఉండేవారు. వారు తమ సత్కర్మలకు గాను పుణ్యఫలం పొందే రోజు తప్పకుండా వస్తుంది. ఆ రోజు అల్లాహ్ వారికి అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అనుగ్రహాలతో నిండివున్న తన స్వర్గవనంలో వారికి ప్రవేశం కల్పిస్తాడు. వారికి సౌఖ్యాన్ని, హాయిని ఇచ్చే అనుగ్రహాలు అందులో ఎన్నో ఉంటాయి. అలాంటప్పుడు పరిణామం రీత్యా ఈ రెండు వర్గాల వారు పరస్పరం సమానులెలా అవుతారు? వారిరువురి మధ్య భూమ్యాకాశాలంత వ్యత్యాసం ఉంది. వీరిలో ఒక వర్గం వారు తమ గమ్యస్థానాన్ని గుర్తుంచుకుని దానికోసం జాగ్రత్తపడగా, మరోవర్గం వారు తమ గమ్యాన్ని మరచి, తమ కర్తవ్యం పట్ల నేరపూరితమైన అలసత్వం ప్రదర్శించారు.

40. పరీక్ష కోసం కష్టపడిన వారు ఉత్తీర్ణులైనట్లే విశ్వాసులు, దైవభీతిగల వారు స్వర్గాన్ని పొందటంలో సఫలీకృతులవుతారు. ఎందుకంటే వారు దీనికోసం ఇహలోక జీవితంలో అనుదినం సాధన చేశారు. ప్రాపంచిక జీవితాన్ని వారు పరీక్షా లయంగా, పరిశ్రమించే క్షేత్రంగా తలపోశారు. ఈ యదార్థాన్ని తెలుసుకుని, జాగ్రత్తపడినవారు కృతార్థులు అవుతారు. అయితే ఈ ప్రాపంచిక జీవితపు వాస్తవికతను గ్రహించటంలో అశ్రద్ధ వహించినవాడు, గమ్యాన్ని మరచి పాపాలకు, ఘోరాలకు ఒడిగట్టినవాడు విఫలుడవుతాడు. దేవుడు మనందరినీ కృతార్థుల జాబితాలో చేర్చుగాక!

41. మానవునిలో మేము ప్రోది చేసిన తెలివితేటలను, గ్రాహ్యశక్తిని పర్వతాలకు కూడా ఇచ్చి ఉండినట్లయితే....

42. దివ్య ఖుర్‌ఆన్‌కు మేము వొసగిన శక్తి అటువంటిది మరి! అది విషయాన్ని చెప్పే తీరు, దాని భాష ఎంత అమోఘమైన

هُوَ اللّٰهُ الَّذِىۡ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ‌ۚ عٰلِمُ الۡغَيۡبِ وَالشَّهَادَةِ‌ ۚ هُوَ الرَّحۡمٰنُ الرَّحِيۡمُ ﴿۲۲﴾

22 ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడు- గోప్యంగా ఉన్నవాటిని,[44] బహిర్గతమై ఉన్నవాటిని ఎరిగినవాడు. ఆయన కరుణామయుడు, కృపాశీలుడు.

هُوَ اللّٰهُ الَّذِىۡ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ‌ۚ اَلۡمَلِكُ الۡقُدُّوۡسُ السَّلٰمُ الۡمُؤۡمِنُ الۡمُهَيۡمِنُ الۡعَزِيۡزُ الۡجَبَّارُ الۡمُتَكَبِّرُ‌ؕ سُبۡحٰنَ اللّٰهِ عَمَّا يُشۡرِكُوۡنَ ﴿۲۳﴾

23 ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్యుడులేడు. ఆయనే రాజాధిరాజు, (పరమ పవిత్రుడు), లోపాలన్నింటికీ అతీతుడు, శాంతి (భద్రతల) ప్రదాత, పర్యవేక్షకుడు, సర్వశక్తుడు, బలపరాక్ర మాలు గలవాడు, పెద్దరికం గలవాడు. ప్రజలు ఆయనకు కల్పించే భాగస్వామ్యాల నుండి అల్లాహ్ పవిత్రంగా ఉన్నాడు.

هُوَ اللّٰهُ الۡخَالِقُ الۡبَارِئُ الۡمُصَوِّرُ‌ لَهُ الۡاَسۡمَآءُ الۡحُسۡنٰى‌ؕ يُسَبِّحُ لَهٗ مَا فِى السَّمٰوٰتِ وَالۡاَرۡضِ‌ۚ وَهُوَ الۡعَزِيۡزُ الۡحَكِيۡمُ ﴿۲۴﴾

24 ఆయనే అల్లాహ్-సృష్టికర్త, ఉనికిని ప్రసాదించేవాడు,[45] రూప కల్పన చేసేవాడు. అత్యుత్తమమైన పేర్లు ఆయనకు ఉన్నాయి.[46] భూమ్యాకాశాలలో వున్న ప్రతి వస్తువూ ఆయన పవిత్రతను కొనియాడుతోంది.[47] ఆయనే సర్వాధికుడు, వివేకవంతుడు.[48]

---

దంటే ఎత్తయిన, దృఢమైన పర్వతాలు సయితం దాని ప్రభావానికి కృంగిపోతాయి. దైవభీతితో కంపించి, బద్దలై పోతాయి. ఈ ఉపమానం ద్వారా మానవుడు హెచ్చరించబడుతున్నాడు. ఓ మానవుడా! నీకు ఆలోచించే, అర్థం చేసుకునే శక్తులు ఇవ్వబడ్డాయి. అయినప్పటికీ ఖుర్ఆన్‌ను విన్న తరువాత కూడా నీ హృదయం ద్రవించకపోతే నీ పర్యవసానం దారుణంగా ఉండ బోతుందని తెలుసుకో.

43. ఖుర్ఆన్ ఉపదేశాల ద్వారా వారు గుణపాఠం నేర్చుకోవాలని, దాని హెచ్చరికల ద్వారా వారు అవిధేయతకు దూరం కావాలని ఈ ఉపమానాలు ఇవ్వబడ్డాయి.
మరి కొంతమంది ఈ ఆయతులకు చెప్పిన వ్యాఖ్యానం ఇలా ఉంది: "ఈ ఆయతు అంతిమ దైవప్రవక్త(స) నుద్దేశించి అవతరించింది. దీని మర్మం ఏమిటంటే – ఓ ప్రవక్తా! మేము నీపై అవతరింపజేసిన ఈ గ్రంథం ఎంత గొప్పదంటే, ఒకవేళ మేము గనక దీనిని ఒక పర్వతంపై దింపి ఉంటే అది ఈ పాటికి ఒత్తిడికి లోనై బద్దలైపోయి ఉండేది. కాని మేము నీపై అమితంగా దయదలిచాము. దివ్య ఖుర్ఆన్ వంటి శక్తిమంతమైన గ్రంథాన్ని భరించే ఓర్పును, నేర్పును, శక్తిని మేము నీకు ప్రసాదించాము. నిజానికి దాన్ని భరించగలిగే శక్తి పర్వతాలకు సయితం లేదు (ఫత్‌హుల్ ఖదీర్). ఈ ఆయతు తరువాత అల్లాహ్ తన గుణగణాలను తెలియజేసి దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ను) చాటి చెప్పాడు. షిర్క్‌ను ఖండించాడు.

44. **"గోప్యంగా ఉన్నవాటిని"** అంటే సృష్టితాలపరంగా అని భావం. నిజానికి అల్లాహ్ నుండి ఏ వస్తువు కూడా గోప్యంగా లేదు. విశ్వమండలంలోని వస్తువులన్నీ-అవి ఆయన సమక్షంలో ఉన్నా, దాగివున్నా – ఆయనకు తెలుసు. చీకటి పొరలలో నడిచే చీమల పరిస్థితి కూడా ఆయనకు ఎరుకే.

45. **ఖాలిఖ్, బారీ** అనే రెండు వేర్వేరు పదాలు ఉపయోగించబడ్డాయి. పైకి ఈ రెండు పదాలు 'సృష్టికర్త' అన్న అర్థంలో వాడబడుతున్నప్పటికీ, ఈ రెండిటి భావంలో కాస్తంత వ్యత్యాసం ఉందనీ, ఖాలిఖ్ అంటే తన ప్రణాళికననుసరించి అంచనా వేసేవాడనీ, బారీ అంటే ఆ విధంగా అంచనా వేసినదాన్ని సృష్టించి ఉనికిలోకి తీసుకొచ్చేవాడని చెబుతారు.

46. అల్లాహ్‌కు చెందిన మంచి పేర్ల గురించి ఇంతకుముందు అల్ ఆరాఫ్ సూరా – 180వ ఆయతులో వచ్చింది.

47. కాని వాటి భాష మనకు అర్థం కాదు.

48. ఆయన ఏ నిర్ణయం గైకొన్నా అది యుక్తితో, పరమార్థంతో నిండి ఉంటుంది. దాన్ని గురించి మనం ఊహించలేము.

60 వ సూరా

# అల్ ముమ్‌తహినహ్

## పరీక్షించేది

అవతరణ
మదీనాలో

ఆయతులు
13

### పరిచయం

*అవిశ్వాసులతో సామాజిక సంబంధాలు, ఇస్లాం స్వీకరిస్తున్న మహిళలు తదితర విషయాలను ఈ సూరా ప్రధానంగా ప్రస్తావించింది. ఇందులోని 10వ ఆయతులో 'ముమ్‌తహినహ్' (పరీక్షించేది) అన్న ప్రస్తావన వచ్చింది. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా ముఖ్యంగా అవిశ్వాసులకు సంబంధించి రెండు వర్గాల మధ్య తారతమ్యాన్ని స్పష్టం చేయడం జరిగింది.*

*(1). విశ్వాసుల పట్ల విద్వేషం కలిగి ఉన్నవారు, ముస్లిములను వారి విశ్వాసం కారణంగా వేధింపులకు, దౌర్జన్యాలకు గురిచేసినవారు. ఇలాంటి అవిశ్వాసులతో సామాజిక సంబంధాలను త్రెంచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రాహీమ్ (అస) ఆయన అనుచరుల గాధను ప్రస్తావించడం జరిగింది. ఇబ్రాహీమ్(అస) తనను, తన అనుచరులను వేధించిన అవిశ్వాసులతో ఎలా వ్యవహరించినది వివరించడం జరిగింది.*

*(2). ముస్లిముల పట్ల ద్వేషం, వైరం లేని అవిశ్వాసులు. ముస్లిములకు ఎలాంటి హానీ తలపెట్టనివారు. ఇలాంటి వారి పట్ల గౌరవమర్యాదలతో వ్యవహరించాలని, న్యాయంగా వ్యవహరించాలని, వారి పట్ల కారుణ్యంతో మెలగాలని చెప్పడం జరిగింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 4 | 30-49 | 'దైవప్రవక్త ఇబ్రాహీమ్ (అ)' | తను స్వచ్ఛమైన ఏక దైవారాధకుడు. కాని తన తండ్రేమో పచ్చి విగ్రహ పూజారి. తన తండ్రికి సత్యం బోధించటానికి ఆ తనయుడు శతవిధాలా ప్రయత్నించాడు. కాని తండ్రి వినలేదు సరికదా! రాళ్లతో కొట్టి చంపేస్తానని బెదిరించాడు. ఆ తనయుడు మరెవరో కాదు, దైవప్రవక్త ఇబ్రాహీమ్ (అ). తన తండ్రి కోసం ఆయన అల్లాహ్‌ను ప్రార్థించాలనుకున్నారు. కాని తన తండ్రి ప్రార్థనకు అర్హుడు కాడని తెలిసి ప్రయత్నం మానుకున్నారు. ఏక దైవారాధన ప్రాముఖ్యత తెలియాలంటే ఆయన జీవితం ఒకసారి చదివి తీరాల్సిందే. |

## سُورَةُ المُمْتَحِنَة

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُواْ لَا تَتَّخِذُواْ عَدُوِّي وَعَدُوَّكُمۡ
أَوۡلِيَآءَ تُلۡقُونَ إِلَيۡهِم بِٱلۡمَوَدَّةِ وَقَدۡ كَفَرُواْ بِمَا
جَآءَكُم مِّنَ ٱلۡحَقِّ يُخۡرِجُونَ ٱلرَّسُولَ وَإِيَّاكُمۡ
أَن تُؤۡمِنُواْ بِٱللَّهِ رَبِّكُمۡ إِن كُنتُمۡ خَرَجۡتُمۡ جِهَٰدٗا فِي
سَبِيلِي وَٱبۡتِغَآءَ مَرۡضَاتِيۚ تُسِرُّونَ إِلَيۡهِم بِٱلۡمَوَدَّةِ

## అల్ ముమ్‌తహినహ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** విశ్వసించిన ఓ ప్రజలారా! నా శత్రువుల్ని, మీ శత్రువుల్ని మీ స్నేహితులుగా చేసుకోకండి.[1] మీరేమో స్నేహపూర్వకంగా వారివైపు సందేశం పంపుతున్నారు.[2] వారేమో మీ వద్దకు వచ్చిన సత్యాన్ని త్రోసిపుచ్చారు. మీ ప్రభువైన అల్లాహ్‌ను మీరు విశ్వసించి నందుకు వారు ప్రవక్తను, స్వయంగా మిమ్మల్ని కూడా దేశంనుండి బహిష్కరించారు.[3] మీరు గనక నా మార్గంలో పోరాడటానికి, నా ప్రసన్నతను చూరగొనటానికి బయలుదేరినవారైతే (మీరు వాళ్లతో స్నేహం చేయకండి).[4] మీరు వారి వద్దకు స్నేహ సందేశాన్ని

1. మక్కా అవిశ్వాసులకు – దైవప్రవక్త (స)కు మధ్య జరిగిన హుదైబియా ఒడంబడికను మక్కావారు ఉల్లంఘించారు. అందువల్ల వారికి వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు మొదలెట్టవలసినదిగా దైవప్రవక్త (స) ముస్లిములకు చూచాయగా తెలియజేశారు. అయితే హజ్రత్ హాతిబ్ బిన్ అబూ బల్తఆ (రజి) అనే ముహాజిర్ సహాబి ఈ సమాచారాన్ని కురైషులకు తెలియజేయాలనుకున్నారు. దీనికి కారణం హాతిబ్‌కు కురైషులతో ఎలాంటి బంధుత్వ సంబంధాలు లేవు. కాని ఈయన ఆలుబిడ్డలు మాత్రం మక్కాలోనే చిక్కుకుని ఉన్నారు. ఈ యుద్ధసన్నాహాల గురించిన సమాచారాన్ని తాను కురైషులకు అందజేస్తే దానికి ప్రతిఫలంగా వారు తన ఆలుబిడ్డలకు అపకారం తలపెట్టకుండా ఉంటారని హాతిబ్ ఆశించారు. అందువల్ల ఈయన ఒక ఉత్తరాన్ని వ్రాసి, ఒక స్త్రీ ద్వారా దాన్ని మక్కా వాసులకు పంపారు.
   కాని ఈ సంగతి 'వహీ' (దైవసందేశం) ద్వారా దైవప్రవక్తకు తెలియపరచబడింది. ఆయన (స) వెంటనే హజ్రత్ అలీ, హజ్రత్ మిఖ్దాద్, హజ్రత్ జుబైర్‌లను పంపిస్తూ, 'రౌజయెఖాఖ్' అనే చోట ఆ మహిళ ఉందని, ఆమె దగ్గర ఉన్న ఆ లేఖను స్వాధీనపరచుకోమని ఆదేశించారు. వారు ఆ మహిళను పట్టుకుని, ఆ ఉత్తరాన్ని తీసుకున్నారు. దాన్ని ఆమె తన శిరోజాలలో దాచిపెట్టింది. ఈ నమ్మక ద్రోహానికి ఎందుకు పాల్పడ్డావని దైవప్రవక్త (సఅసం) హజ్రత్ హాతిబ్‌ను నిలదీసి అడిగారు. అప్పుడు హాతిబ్ తన మనసులోని మాటను దాపరికం లేకుండా చెప్పేశారు. ఆయన ఇలా అన్నారు : "నేను అవిశ్వాసంతో ఈ పని చేయలేదు. నేను ధర్మభ్రష్టుణ్ణి కూడా కాలేదు. నా చేష్టకు అసలు కారణం ఏమిటంటే, ఇతర ముహాజిర్ల మాదిరిగా నాకు మక్కా వారితో బంధుత్వాలు లేవు. కాని మరోవంక నా భార్యాపిల్లలు ఇప్పటికీ మక్కాలోనే ఉన్నారు. కురైషులకు నేనేదన్నా సహాయం చేస్తే దానికి ప్రతిగా వారు నా ఆలుబిడ్డల పట్ల మంచిగా మసలుకుంటారని ఆశించి ఈ రాజద్రోహానికి పాల్పడ్డాను. ఇంతకుమించి నాకు మరో దురుద్దేశం లేదు." మొత్తానికి హాతిబ్‌గారు తన మనసులోని మాటను చెప్పటం వల్ల దైవప్రవక్త (స) ఈయన్ని మన్నించారు. అయితే భవిష్యత్తులో ముస్లింలు ఇక ఎన్నడూ ఇలాంటి చేష్టకు పాల్పడకుండా ఉండటానికి హెచ్చరికగా ఈ ఆయతులను కూడా దేవుడు అవతరింపజేశాడు (సహీహ్ బుఖారీ – ముమ్తహినా సూరా వ్యాఖ్యానం).
2. ఏమిటీ, మీరు దైవప్రవక్త (సఅసం)కు సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేసి వాళ్లతో స్నేహసంబంధాలు ఏర్పరచుకోవాలని భావిస్తున్నారా?
3. మరోవంక వాళ్లు సత్యాన్ని తిరస్కరించి మీ స్వస్థలాల నుండి మిమ్మల్ని వెళ్లగొట్టినప్పుడు, వారు మీకు స్నేహితులవుతారని ఆశించటం ఎంతవరకు సమంజసం?

وَاَنَا اَعْلَمُ بِمَآ اَخْفَيْتُمْ وَمَآ اَعْلَنْتُمْ ۭ وَمَنْ يَّفْعَلْهُ مِنْكُمْ فَقَدْ ضَلَّ سَوَآءَ السَّبِيْلِ ①

రహస్యంగా పంపిస్తారా! మీరు దాచేదీ, బహిర్గతం చేసేది– అంతా నాకు తెలుసు. మీలో ఎవడు ఈ కార్యకలాపాలకు పాల్పడినా అతను తిన్నని మార్గం నుండి తప్పిపోయినట్లే.[5]

اِنْ يَّثْقَفُوْكُمْ يَكُوْنُوْا لَكُمْ اَعْدَآءً وَّيَبْسُطُوْٓا اِلَيْكُمْ اَيْدِيَهُمْ وَاَلْسِنَتَهُمْ بِالسُّوْۗءِ وَوَدُّوْا لَوْ تَكْفُرُوْنَ ②

**2** ఒకవేళ మీరు గనక వారి చేతికి చిక్కినట్లయితే, వారు మీ పట్ల బద్ధ శత్రువులుగా వ్యవహరిస్తారు. చెడు రీతిలో మీపై చేయి చేసుకుంటారు, నోరు కూడా పారేసుకుంటారు. మీరు (కూడా వారిలాగే) అవిశ్వాసానికి పాల్పడాలని కోరుకుంటారు.[6]

لَنْ تَنْفَعَكُمْ اَرْحَامُكُمْ وَلَآ اَوْلَادُكُمْ ۚ يَوْمَ الْقِيٰمَةِ ۚ يَفْصِلُ بَيْنَكُمْ ۭ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ③

**3** మీ రక్తసంబంధాలు, బంధుత్వాలు, మీ బిడ్డలు ప్రళయదినాన మీకు ఏవిధంగానూ ఉపయోగపడరు.[7] అల్లాహ్ మీ మధ్య తీర్పు చేసేస్తాడు.[8] మీరు చేసే పనులన్నిటినీ అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.

قَدْ كَانَتْ لَكُمْ اُسْوَةٌ حَسَنَةٌ فِيْٓ اِبْرٰهِيْمَ وَالَّذِيْنَ مَعَهٗ ۚ اِذْ قَالُوْا لِقَوْمِهِمْ اِنَّا بُرَءٰۗؤُا مِنْكُمْ وَمِمَّا تَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ ۡ كَفَرْنَا

**4** (ఓ ముస్లిములారా!) మీకు ఇబ్రాహీములోనూ, అతని వెంట నున్న వారిలోనూ అత్యుత్తమమైన ఆదర్శం ఉంది.[9] వారంతా తమ జాతి వారితో స్పష్టంగా ఇలా చెప్పేశారు: “మీతోనూ, అల్లాహ్‌ను వదలి మీరు పూజించే వారందరితోనూ మాకెలాంటి సంబంధం

4. ఒకప్పుడు మీరు దైవప్రసన్నత నిమిత్తం అవిశ్వాసులను శత్రువులుగా పరిగణించారు. మరి ఇప్పుడు మీకేమయింది? వారితో చెలిమి చేసి దైవాగ్రహాన్ని కొనితెచ్చుకోగోరుతున్నారా? మీరు నిజంగా దైవప్రసన్నతను పొందగోరేవారే అయితే, మీకు, దైవానికి ఉమ్మడి శత్రువులైన వారితో దోస్తీ చేయకండి.

5. అంటే – నాకూ, మీకూ శత్రువులైన వారితో ప్రేమైక సంబంధాలు ఏర్పరచుకోదలచి, వారికి రహస్య సమాచారాన్ని అందజేయటం – సరాసరి అపమార్గం. ఈ మార్గం ముస్లిములైన వారికి ఎంతమాత్రం తగదు.

6. మీ పట్ల వారి హృదయాలలో పగ, ద్వేషం, వైరం తిష్ఠవేసి ఉన్నాయి. అటువంటి వారివైపేనా మీరు స్నేహ హస్తం చాచేది?!

7. ఏ సంతానం కోసం, మరే బంధుత్వాల కోసం మీరు అవిశ్వాసులపై స్నేహాన్ని వ్యక్త పరుస్తున్నారో అవేవీ మీకు తీర్పు దినాన దైవ సమక్షంలో పనికిరావు. ఆ రోజు మీకు ప్రయోజనం కలిగించేది దైవం మరియు దైవప్రవక్త (స) పట్ల విధేయతా భావమే. మరలాంటప్పుడు మీరు అవిశ్వాసులతో చెలిమిచేసి, దేవుని ఆగ్రహానికి ఎందుకు కారకులవుతారు?

8. దీనికి మరో అర్థం ఇది : అల్లాహ్ మీ మధ్య వేర్పాటు చేసేస్తాడు. మిమ్మల్ని విడదీస్తాడు. విధేయులను స్వర్గంలో ప్రవేశింపజేసి, అవిధేయులను, పాపాత్ములను నరకానికి ఆహుతి చేస్తాడు. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఆనాడు జనులు ఒండొకరి నుండి పారిపోతారు – “ఆనాడు జనులు తమ సోదరుని నుండి పారిపోతారు.” (అబస – 34).

9. **“ఉస్వతున్”** (اُسْوَةٌ) అంటే అందరూ అనుసరించిన ఉదాహరణ అని అర్థం. అవిశ్వాసులతో తెగత్రెంపుల ఆవశ్యకతను మరింతగా విడమరచి చెప్పడానికి ఇక్కడ దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఉదాహరణ ఇవ్వబడింది.

بِكُمْ وَبَدَا بَيْنَنَا وَبَيْنَكُمُ الْعَدَاوَةُ وَالْبَغْضَآءُ أَبَدًا حَتّٰى تُؤْمِنُوْا بِاللّٰهِ وَحْدَهٗٓ إِلَّا قَوْلَ إِبْرٰهِيْمَ لِأَبِيْهِ لَأَسْتَغْفِرَنَّ لَكَ وَمَآ أَمْلِكُ لَكَ مِنَ اللّٰهِ مِنْ شَيْءٍ ۖ رَبَّنَا عَلَيْكَ تَوَكَّلْنَا وَإِلَيْكَ أَنَبْنَا وَإِلَيْكَ الْمَصِيْرُ ④

లేదు.[10] మేము మిమ్మల్ని (మీ మిథ్యా విశ్వాసాలను) తిరస్కరిస్తున్నాము. ఒకే ఒక్కడైన అల్లాహ్‌ను మీరు విశ్వసించనంతవరకూ మాకూ – మీకూ మధ్య శాశ్వతంగా విరోధం, వైషమ్యం ఏర్పడి నట్లే."[11] అయితే ఇబ్రాహీము తన తండ్రితో, "(నాన్నా!) నేను మీ మన్నింపు కోసం తప్పకుండా ప్రార్థిస్తాను. (కాని) మీ విషయంలో నేను అల్లాహ్ సమక్షంలో అంతకంటే ఎక్కువ ఏమీ చేయలేను" అన్న మాట మాత్రం[12] (వినాయింపుతో కూడుకున్నది) – (ఇంకా వారిలా వేడుకున్నారు:) "మా ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాము.[13] నీ వైపుకే మరలుతున్నాము. (ఎట్టకేలకు) నిన్నే చేరుకోవలసి ఉంది.

رَبَّنَا لَا تَجْعَلْنَا فِتْنَةً لِّلَّذِيْنَ كَفَرُوْا وَاغْفِرْ لَنَا رَبَّنَا ۚ إِنَّكَ أَنْتَ الْعَزِيْزُ الْحَكِيْمُ ⑤

5 "మా ప్రభూ! అవిశ్వాసుల కొరకు మమ్మల్ని పరీక్షా సాధనంగా చేయకు.[14] ప్రభూ! మా తప్పులను క్షమించు. నిశ్చయంగా నీవు మాత్రమే సర్వాధికుడవు, వివేకవంతుడవు."

10. అంటే – షిర్క్ కారణంగా మీతో మేము తెగత్రెంపులు చేసుకుంటున్నాము. ఏక దైవారాధకులకు బహుదైవారాధకుల జీవన విధానాలతో పొత్తేమిటి?

11. అంటే – మీరు అవిశ్వాసాన్ని, షిర్కును విడనాడి ఏకదైవారాధకులు కానంతవరకూ మీకూ – మాకూ మధ్య ఈ అంతరాలు ఇలాగే ఉండిపోతాయి. అయితే మీరు ఒకే ఒక్కడైన అల్లాహ్ ముందు తలవంచిననాడు ఈ శత్రుత్వం స్నేహంగా మారిపోతుంది. వైషమ్యం ప్రేమగా పరిణమిస్తుంది.

12. దీని అర్థం ఏమిటంటే; దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి జీవితమంతా మనందరికీ ఆదర్శప్రాయమే. కాకపోతే ఆయన తండ్రితో పలికిన ఈ మాట మాత్రం ఆదర్శప్రాయం కాదు. కాబట్టి ఈ ఒక్క విషయాన్ని అనుసరించవలసిన అవసరం లేదు. ఎందుకంటే తన తండ్రి అంతరంగం గురించి తెలీని స్థితిలో ఇబ్రాహీం పలికిన మాట అది! కాని తన తండ్రి దైవవిరోధి అన్న సంగతి స్పష్టం అయ్యాక ఆయన తన తండ్రితో కూడా తెగత్రెంపులు చేసుకున్నారు. (తౌబా సూరాలోని 114వ ఆయతును చూడండి).

13. **'తవక్కుల్'** అంటే సాధ్యమైనంతవరకు తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుని, ఆ తరువాత ఆ వ్యవహారాన్ని దేవునికి అప్పగించటం, దైవంపై భారం మోపటం అని అర్థం. మన వంతు ప్రయత్నం ఏమీ చేయకుండానే అంతా దేవుడే చూసుకుంటాడులే అని అనుకుంటే అది 'తవక్కుల్' అనిపించుకోదు. ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం)ను కలుసుకోవటానికి దూరం నుండి వచ్చాడు. వచ్చీ రావటంతోనే ఒంటెను బయట వదిలేసి, లోపలకు ప్రవేశించాడు. ఒంటె గురించి ప్రవక్త (స) అడిగితే, దాన్ని అల్లాహ్‌కు అప్పగించి వచ్చానని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అల్లాహ్‌పై భారం వేయటం (తవక్కుల్) అంటే ఇదికాదు. ముందు ఆ ఒంటెను దేనికైనా కట్టేయ్. ఆ తరువాత దైవంపై భారం వేయి" అని అతనికి బోధపరిచారు (తిర్మిజీ). 'ఇనాబత్' అంటే రుజువర్తనులవటం, అల్లాహ్ వైపు మరలటం అని అర్థం.

14. అంటే – అవిశ్వాసులకు మాపై ఆధిక్యతను వొసగకు! అదేగనక జరిగితే అవిశ్వాసులు తాము అవలంబిస్తున్న వైఖరి, తాము నడుస్తున్న మార్గాలే సత్యమైనవని భావిస్తారు. ఆ విధంగా మా మూలంగా వారు పరీక్షకు లోనవుతారు. అటువంటి స్థితికి మమ్మల్ని గురిచెయ్యకు. లేదా మరో భావం ఇది కూడా కావచ్చు : ఓ అల్లాహ్! వారి ద్వారాగాని

**6** నిశ్చయంగా వారి (జీవన విధానం)లో[15] మీకు అత్యుత్తమ
మైన ఆదర్శం ఉంది – ముఖ్యంగా అల్లాహ్(తో సమావేశము)ను,
అంతిమదినాన్ని ఆశించే ప్రతి ఒక్కరికీ![16] ఒకవేళ ఎవరయినా
విముఖత చూపితే (నష్టపోయేది వారే),[17] అల్లాహ్ మాత్రం లక్ష్య
పెట్టేవాడు కాదు. ఆయన సకల స్తోత్రాలకు అర్హుడు.

لَقَدْ كَانَ لَكُمْ فِيهِمْ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ
يَرْجُو اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ ۚ وَمَن يَتَوَلَّ فَإِنَّ اللَّهَ
هُوَ الْغَنِيُّ الْحَمِيدُ ⑥

**7** బహుశా అల్లాహ్ మీకూ – మీ విరోధులకు మధ్య స్నేహాన్ని
ఏర్పరచినా ఆశ్చర్యపోనవసరంలేదు.[18] అల్లాహ్‌కు అన్నీ సాధ్యమే.
అల్లాహ్ (అపారంగా) క్షమించేవాడు, కనికరించేవాడు.

عَسَى اللَّهُ أَن يَجْعَلَ بَيْنَكُمْ وَبَيْنَ الَّذِينَ
عَادَيْتُم مِّنْهُم مَّوَدَّةً ۚ وَاللَّهُ قَدِيرٌ ۚ وَاللَّهُ
غَفُورٌ رَّحِيمٌ ⑦

**8** ధర్మం విషయంలో మీపై కాలుదువ్వకుండా,[19] మిమ్మల్ని మీ
ఇల్లూ వాకిలి నుండి వెళ్లగొట్టకుండా[20] ఉన్న వారితో మీరు
సద్వ్యవహారం చేయటాన్ని, వారికి న్యాయం చేయటాన్ని అల్లాహ్
ఎంత మాత్రం నిరోధించడు.[21] పైగా అల్లాహ్ న్యాయం చేసే
వారిని ప్రేమిస్తాడు.[22]

لَّا يَنْهَاكُمُ اللَّهُ عَنِ الَّذِينَ لَمْ يُقَاتِلُوكُمْ فِي
الدِّينِ وَلَمْ يُخْرِجُوكُم مِّن دِيَارِكُمْ أَن تَبَرُّوهُمْ
وَتُقْسِطُوا إِلَيْهِمْ ۚ إِنَّ اللَّهَ يُحِبُّ الْمُقْسِطِينَ ⑧

---

లేక స్వయంగా నీ తరఫునగాని మమ్మల్ని ఎటువంటి శిక్షలకూ గురిచెయ్యకు. ముస్లింలు సత్యవంతులైతే మరి వారికి ఇన్ని కష్టాలు ఎందుకు వస్తున్నాయి అనుకుంటారు. ఈ విధంగా మా ఉనికి వారికి పరీక్షగా మారటం నుండి మేము నీ శరణు వేడుతున్నాము.

15. అంటే – దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీము జీవితంలోనూ, ఆయన సహచరులలోనూ మీకు మంచి ఆదర్శం ఉందని భావం.

16. ఎందుకంటే ఇలాంటి వారు మాత్రమే దైవానికి, పరలోక శిక్షకు భయపడతారు. ఇలాంటి విజ్ఞులు మాత్రమే పరిస్థితుల నుండి స్ఫూర్తి పొందుతారు, సంఘటనల ద్వారా గుణపాఠం నేర్చుకుంటారు.

17. అంటే – ఎవరయినా దైవప్రవక్త ఇబ్రాహీం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవటం పట్ల వైముఖ్యం కనబరిస్తే....

18. అంటే – వారిని ముస్లింలుగా మార్చి, మీ ప్రగాఢ స్నేహితులుగా చేసేస్తాడు. దీనివల్ల మీ మధ్య గల కక్షలు, కార్పణ్యాలు సమసిపోయి ప్రేమభావాలు, సహాయసహకారాల భావాలు జనిస్తాయి. ఇలా చేయటం దైవానికి కష్టమేమీ కాదు. చివరకు జరిగింది కూడా అదే. మక్కా విజయం అనంతరం జనులు తండోపతండాలుగా వచ్చి ఇస్లాం స్వీకరించసాగారు. దాంతో వారి మధ్య ప్రేమానురాగాల దివ్వెలు వెలిగాయి. ఒకప్పుడు ముస్లింల పచ్చి రక్తం త్రాగాలని పరితపించినవారే వారి ప్రాణస్నేహితులుగా మారిపోయారు.

19. ఇస్లాం ధర్మాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తున్నారన్న నెపంతో ముస్లింలపై కత్తికట్టకుండా ఉండే అవిశ్వాసుల పట్ల సద్భావంతో మెలగటాన్ని అల్లాహ్ ఎన్నడూ ఆపడు.

20. అలాగే ఇస్లాం ధర్మాన్ని ఖచ్చితంగా పాటిస్తున్న కారణంగా ముస్లింలను వారి స్వస్థలాల నుండి వెళ్లగొట్టకుండా – సహజీవనం సాగించే అవిశ్వాసుల యెడల కూడా సత్ప్రవర్తన కలిగి ఉండటాన్ని దేవుడు వారించడు. ఇకపోతే మూడోవర్గం వారు ఎవరంటే ముస్లింలకు వ్యతిరేకంగా ఇతర అవిశ్వాసులకు ఏ విధంగానూ సహాయసహకారాలు అందజేయనివారు. వీరిపట్ల కూడా ముస్లింలు సద్భావంతో మెలగటంలో తప్పులేదు.

21. పైగా అటువంటి సహనభావం గల అవిశ్వాసులతో సత్ప్రవర్తన కలిగి ఉండటం, న్యాయవైఖరిని అవలంబించటం

إِنَّمَا يَنْهَىٰكُمُ اللَّهُ عَنِ الَّذِينَ قَٰتَلُوكُمْ فِي الدِّينِ
وَأَخْرَجُوكُم مِّن دِيَٰرِكُمْ وَظَٰهَرُوا عَلَىٰٓ إِخْرَاجِكُمْ
أَن تَوَلَّوْهُمْ ۚ وَمَن يَتَوَلَّهُمْ فَأُولَٰٓئِكَ
هُمُ الظَّٰلِمُونَ ⑨

**9** ధర్మం విషయంలో మీపై కయ్యానికి కాలుదువ్వి, మిమ్మల్ని మీ ఇల్లూ వాకిళ్ళనుండి వెళ్లగొట్టినవారితో, మిమ్మల్ని వెళ్లగొట్టడంలో ఇతరులకు సహాయపడిన వారితో స్నేహసంబంధాలు ఏర్పరచుకోవటాన్ని మాత్రమే అల్లాహ్ వారిస్తున్నాడు. అలాంటి వారితో[23] కుమ్మక్కు అయినవారే దుర్మార్గులు.[24]

يَٰٓأَيُّهَا الَّذِينَ ءَامَنُوٓا إِذَا جَآءَكُمُ الْمُؤْمِنَٰتُ مُهَٰجِرَٰتٍ
فَامْتَحِنُوهُنَّ ۖ اللَّهُ أَعْلَمُ بِإِيمَٰنِهِنَّ ۖ فَإِنْ
عَلِمْتُمُوهُنَّ مُؤْمِنَٰتٍ فَلَا تَرْجِعُوهُنَّ إِلَى الْكُفَّارِ ۖ
لَا هُنَّ حِلٌّ لَّهُمْ وَلَا هُمْ يَحِلُّونَ لَهُنَّ ۖ وَءَاتُوهُم

**10** ఓ విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు మీవద్దకు వలస వచ్చినప్పుడు మీరు వారిని పరీక్షించండి.[25](ఆ విషయానికి వస్తే) వారి విశ్వాసం గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు. వారు గనక విశ్వాసపాత్రులని మీకు అనిపిస్తే[26] వారిని అవిశ్వాసుల వద్దకు తిప్పి పంపకండి. ఈ స్త్రీలు వారికి ధర్మసమ్మతం కారు. వారు

అభిలషణీయం కూడా. ఉదాహరణకు : ఒకసారి హజ్రత్ అస్మా (ర.అన్హా) గారు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, ఇస్లాం స్వీకరించని తన తల్లి పట్ల తానెలా మెలగాలని ప్రశ్నించగా, "నీ తల్లి పట్ల ఉత్తమంగా మెలగు" అని ఆయన (స) చెప్పారు. (బుఖారీ – కితాబుల్ అదబ్).

22. ఈ వాక్యంలో న్యాయం చేసే వారి ప్రాశస్త్యం గురించి చెప్పబడింది. అవిశ్వాసుల యెడల సయితం న్యాయంగా వ్యవహరించమని తాకీదు చేయబడింది. హదీసులో న్యాయం చేసేవారి ఔన్నత్యం గురించి ఇలా చెప్పబడింది : "న్యాయం చేసేవారు కరుణామయునికి కుడివైపున గల జ్యోతిర్మయమైన వేదికలపై ఉంటారు. కరుణామయుని రెండు చేతులూ కుడి చేతులే– వారు తమ నిర్ణయాలలో, తమ ఇంటి వారి విషయంలో, తమ పాలితుల విషయంలో న్యాయంగా వ్యవహరిస్తారు." (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఇమారహ్).

23. అంటే దైవాజ్ఞల్ని కాదని అటువంటి అవిశ్వాసులతో చేయి కలిపినవారితో...

24. ఎందుకంటే వారు స్నేహం చేయకూడని వారితో స్నేహం చేశారు. ఆ విధంగా వారు తమ ఆత్మలకే అన్యాయం చేసుకున్నారు. ఆ విషయమే మరోచోట ఇలా అనబడింది: "మీరు యూదులను, క్రైస్తవులను మీ స్నేహితులుగా చేసుకోకండి. వారు తమలో తామే ఒండొకరికి స్నేహితులు. మీలో ఎవరయినా వారితో స్నేహం చేస్తే అతను కూడా వారిలో ఒకడుగా పరిగణించబడతాడు. నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు." (అల్ మాయిద – 51).

25. **'హుదైబియా ఒప్పందం'**లోని ఒక షరతు ప్రకారం మక్కా నుండి ఎవరయినా పారిపోయి ముస్లింల వద్దకు (మదీనా) వస్తే వారు అతన్ని మక్కావాసుల వద్దకు తిప్పి పంపాలి. ఆ షరతులో స్త్రీల సంగతి స్పష్టంగా లేదు. ఈ సంధి జరిగిన కొన్నాళ్ళ తరువాత కొంతమంది మహిళలు మక్కా నుండి ప్రస్థానం చేసి మదీనా వచ్చారు. ఆ స్త్రీలను తమ వద్దకు తిప్పి పంపమని మక్కాకు చెందిన అవిశ్వాసులు ముస్లింలను డిమాండు చేశారు. అప్పుడు దేవుడు ముస్లింలకు కొన్ని మార్గదర్శక సూత్రాలను ఇస్తూ ఈ ఆయతులను అవతరింపజేశాడు. వలస వచ్చిన స్త్రీలను పరీక్షించటం అంటే వారి స్థితిగతులను క్షుణ్ణంగా విచారించటం అని భావం. అంటే – ఇంతకీ వారు దేశం విడిచివచ్చినది ఇస్లాం ధర్మం కోసమా? లేక అవిశ్వాసులయిన తమ భర్తలతో గొడవపడి వచ్చారా? లేక వారు ఎవరి ప్రేమలోనయినా పడ్డారా? మరేమైనా ఇతరత్రా ఉద్దేశ్యాలున్నాయా? – ఇత్యాది విషయాలను బాగా పరికించి, పరిశోధించి నిజ నిర్ధారణకు రావాలి.

26. మీరు విచారణ జరిపిన తరువాత వారు తమ 'విశ్వాసం' (ఈమాన్)లో చిత్తశుద్ధి గలవారేనన్న నమ్మకం కుదిరితే వారిని మక్కాకు తిరిగి పంపకండి.

مَّآ اَنۡفَقُوۡا ؕ وَلَا جُنَاحَ عَلَيۡكُمۡ اَنۡ تَنۡكِحُوۡهُنَّ
اِذَاۤ اٰتَيۡتُمُوۡهُنَّ اُجُوۡرَهُنَّ ؕ وَلَا تُمۡسِكُوۡا بِعِصَمِ
الۡكَوَافِرِ وَسۡـَٔلُوۡا مَاۤ اَنۡفَقۡتُمۡ وَلۡيَسۡـَٔلُوۡا مَاۤ اَنۡفَقُوۡا ؕ
ذٰلِكُمۡ حُكۡمُ اللّٰهِ ؕ يَحۡكُمُ بَيۡنَكُمۡ ؕ وَاللّٰهُ عَلِيۡمٌ
حَكِيۡمٌ ⑩

ఈ స్త్రీలకు కూడా ధర్మసమ్మతం కాజాలరు.[27] అవిశ్వాసులు ఖర్చుచేసినది వారికి చెల్లించండి.[28] ఆ తర్వాత మీరు ఈ స్త్రీలకు మహర్ సొమ్మును చెల్లించి వారిని వివాహమాడటం ఏమాత్రం దోషం కాదు.[29] విశ్వసించని స్త్రీల మానాన్ని మీ వివాహ బంధంలో ఉంచకండి.[30] మీరు ఖర్చుపెట్టినది అడిగి తీసేసుకోండి.[31] అటు అవిశ్వాసులు కూడా వారు ఖర్చు చేసినది అడిగి తీసేసుకోవాలి.[32] ఇది అల్లాహ్ ఆజ్ఞ (తీర్పు). దీన్ని ఆయన మీ మధ్య విధించాడు.[33] అల్లాహ్ మహాజ్ఞాని, మహావివేకి.

27. వారిని తిప్పి పంపకపోవటానికి ప్రధాన కారణం ఏమిటంటే, ఇక నుండి విశ్వసించిన ఏ స్త్రీ కూడా అవిశ్వాసి అయిన భర్తకు ధర్మపత్ని కాజాలదు. ప్రారంభంలో ఇందుకు అనుమతి ఉండేది. ఉదాహరణకు: దైవప్రవక్త (సఅసం) పుత్రిక అయిన హజ్రత్ జైనబ్ (ర.అన్హా) వివాహం అబుల్ ఆస్‌తో జరిగింది. కాని అప్పటికి ఆయన ముస్లిం కాలేదు. కాని ఈ ఆయతు ప్రకారం ఇకమీదట ఇలా చేయరాదని చెప్పటం జరిగింది. అందుకే వారు ఒండొకరికి ధర్మసమ్మతం (హలాల్) కానేరరు అని నొక్కి వక్కాణించటం జరిగింది. కాబట్టి విశ్వసించి, మదీనా నగరానికి వలస వచ్చిన స్త్రీలను అవిశ్వాసులైన వారికి అప్పగించకూడదు. ఒకవేళ అవిశ్వాసులైన వారి భర్తలు కూడా ఇస్లాం స్వీకరిస్తే ఆ 'వివాహబంధం' యధాతథంగా కొనసాగగలదు.

28. అంటే, ఈ ముస్లిం మహిళలకు వారి అవిశ్వాస భర్తలు ఇచ్చి ఉన్న మహర్ సొమ్మును మీరు వారికి చెల్లించండి.

29. ఈ మాట ముస్లిం పురుషుల్ని ఉద్దేశించి చెప్పటం జరిగింది. – ఓ ముస్లింలారా! 'విశ్వాసం' కోసం సత్యతిరస్కారులైన తమ భర్తలను వదలిపెట్టేసి, ప్రస్థానం చేసివచ్చిన స్త్రీలను మీరు మీ వివాహబంధంలోకి తీసుకుంటే అందులో ఎంతమాత్రం తప్పులేదు. అయితే వివాహమాడదలచిన వారు ఆ స్త్రీలకు మహర్ చెల్లించటం తప్పనిసరి. ఈ వివాహం కూడా అడ్డగోలు పద్ధతిలో కాకుండా ధర్మశాస్త్రం ప్రకారమే జరగాలి. వారి 'ఇద్దత్' (గడువు) పూర్తయిన తరువాతే వారిని వివాహమాడాలి. ఆ స్త్రీల సంరక్షకుని నుంచి వివాహానికి అనుమతి పొందటంతోపాటు, న్యాయశీలురైన ఇద్దరు వ్యక్తుల్ని సాక్షులుగా కూడా పెట్టుకోవాలి. ఒకవేళ స్త్రీ 'ఇద్దత్' గడపవలసిన అవసరం లేని పక్షంలో వెంటనే ఆమెను వివాహమాడవచ్చు.

30. అంటే – భార్యాభర్తలలో భర్త ఇస్లాం స్వీకరించి, భార్య అవిశ్వాసురాలుగా ఉండిపోతే అటువంటి స్త్రీని ముస్లిం భర్త తన వివాహబంధంలో ఉంచుకోవటం ధర్మసమ్మతం కాదు. ఆమెకు వెంటనే విడాకులు ఇచ్చేసి, వేరుపరచాలి. ఈ ఆజ్ఞ రాగానే హజ్రత్ ఉమర్ (రజి) తన ఇద్దరు ముష్రిక్ భార్యలకు విడాకులు ఇచ్చారు. హజ్రత్ తల్హా (రజి) కూడా ముష్రిక్కు అయిన తన భార్యకు విడాకులిచ్చేశారు (ఇబ్నె కసీర్). అయితే ఇస్లాం స్వీకరించని భార్య గనక గ్రంథవహురాలు (యూదురాలు లేక క్రైస్తవ మతస్థురాలు) అయినట్లయితే ఆమెకు విడాకులు ఇవ్వనవసరం లేదు. ఎందుకంటే వారితో వివాహం ధర్మసమ్మతమే.

31. అంటే – అవిశ్వాసాన్ని అంటిపెట్టుకుని ఉన్న కారణంగా, మీ నుండి వేర్పడి అవిశ్వాసుల వద్దకు వెళ్ళిపోయిన స్త్రీలనుండి మీరు వారికి చెల్లించిన 'మహర్'ను వాపసు తీసుకోవచ్చు.

32. అంటే ఇస్లాం స్వీకరించి, అవిశ్వాసులైన తమ భర్తల్ని వదలి వచ్చేసిన స్త్రీలు.

33. అంటే ఎవరి హక్కు వారికి చెందాలి. లేక వసూలు చేసుకోవాలి అన్నది దేవుని తీర్పు. ఈ తీర్పు కేవలం ఆ కాలానికి మాత్రమే పరిమితమని ఇమామ్ ఖుర్తుబీ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో విద్వాంసులందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది (ఫత్‌హుల్ ఖదీర్). దీనికి కారణమేమిటంటే ఆ కాలంలో ఇరువర్గాల మధ్య ఆ మేరకు ఒప్పందం జరిగింది. కాబట్టి ఇలాంటి ఒడంబడికలు జరిగి ఉంటేనే దీన్ని పాటించవలసి ఉంటుంది. లేకపోతే లేదు.

وَاِنْ فَاتَكُمْ شَيْءٌ مِّنْ اَزْوَاجِكُمْ اِلَى الْكُفَّارِ
فَعَاقَبْتُمْ فَاٰتُوا الَّذِيْنَ ذَهَبَتْ اَزْوَاجُهُمْ
مِّثْلَ مَآ اَنْفَقُوْا ؕ وَاتَّقُوا اللّٰهَ الَّذِيْٓ اَنْتُمْ بِهٖ
مُؤْمِنُوْنَ ﴿11﴾

**11** ఒకవేళ మీ భార్యలలో ఎవరయినా మీ అదుపాజ్ఞలను ఉల్లంఘించి అవిశ్వాసుల వద్దకు చేరితే, ఆ తరువాత బదులు తీర్చుకునే వంతు మీకు వస్తే, ఎవరి స్త్రీలు వెళ్ళిపోయారో వారికి, వారు ఖర్చుచేసినంత సొమ్మును చెల్లించండి.[34] మీరు విశ్వసించినటువంటి అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.

يٰٓاَيُّهَا النَّبِيُّ اِذَا جَآءَكَ الْمُؤْمِنٰتُ يُبَايِعْنَكَ عَلٰٓى
اَنْ لَّا يُشْرِكْنَ بِاللّٰهِ شَيْـًٔا وَّلَا يَسْرِقْنَ وَلَا
يَزْنِيْنَ وَلَا يَقْتُلْنَ اَوْلَادَهُنَّ وَلَا يَاْتِيْنَ بِبُهْتَانٍ
يَّفْتَرِيْنَهٗ بَيْنَ اَيْدِيْهِنَّ وَاَرْجُلِهِنَّ وَلَا يَعْصِيْنَكَ
فِيْ مَعْرُوْفٍ فَبَايِعْهُنَّ وَاسْتَغْفِرْ لَهُنَّ اللّٰهَ ؕ
اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿12﴾

**12** ఓ ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు నీవద్దకు వచ్చి, తాము ఎవరినీ అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పించబోము అనీ, దొంగతనం చేయబోము అనీ, వ్యభిచారానికి పాల్పడబోము అనీ, తమ సంతానాన్ని చంపబోము అనీ, తమ కాళ్ళ చేతుల మధ్య నుండి ఎలాంటి అభాండాన్నీ కల్పించబోము అనీ, ఏ సత్కార్యంలోనూ నీకు అవిధేయత చూపబోము అని ప్రమాణం చేస్తే నువ్వు వారి చేత ప్రమాణం చేయించు.[35] వారి క్షమాపణ కొరకు అల్లాహ్‌ను ప్రార్థించు. నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలి, దయాశీలి.

34. ఈ వాక్యానికి ఒక అర్థం ఇది : ఇస్లాం స్వీకరించని తమ భర్తలను వదలి వచ్చేసిన స్త్రీల తరఫున మీరు వారి అవిశ్వాస భర్తలకు మహర్ పరిహారం చెల్లించవలసి ఉన్నదికదా, ఆ మొత్తాన్ని అవిశ్వాసులకు ఇచ్చేబదులు తమ భర్తల్ని వదలి అవిశ్వాసుల వద్దకు వెళ్ళిపోయిన వారి ముస్లిం భర్తలకు ఇవ్వండి.

రెండవ అర్థం ఇది: మీరు అవిశ్వాసులతో యుద్ధం చేయగా వచ్చిన యుద్ధప్రాప్తి (మాలె గనీమత్) పంపకం కాకముందే, అవిశ్వాసులైన స్త్రీలను వదిలించుకున్న ముస్లిం భర్తలకు వారి ఖర్చుకు తగిన మొత్తం ఇవ్వండి. ఆ విధంగా 'యుద్ధప్రాప్తి' నుండి ముస్లింలకు నష్టపరిహారం లభిస్తుంది. ఇది కూడా అవిశ్వాసులకు ఒక రకంగా శాస్తే (ఇబ్నె కసీర్). ఒకవేళ యుద్ధప్రాప్తి పద్దు నుండి కూడా ఆ నష్ట పరిహారం లభించకపోతే ప్రభుత్వ ఖజానా నుండి వారికి ఆ నష్టం ఇవ్వాలి (ఐసరుత్తఫాసీర్).

35. సాధారణంగా ముస్లిం స్త్రీలు హిజ్రత్ (వలస) చేసి వచ్చినప్పుడు వారిచేత ఈ రీతిలో ప్రమాణ స్వీకారం (బైత్) చేయించేవారు. ఈ సూరాకు వ్యాఖ్యానంగా సహీహ్ బుఖారీలో పేర్కొనబడిన విషయం కూడా ఇదే. అలాగే మక్కా విజయం సందర్భంగా కూడా అంతిమ దైవప్రవక్త (సఅసం) కురైషు స్త్రీలతో ఈ రకమైన 'ప్రతిజ్ఞ' చేయించారు. ప్రతిజ్ఞ చేయించే సమయంలో ఆయన (స) వారి ద్వారా నిర్ణీత మాటలు పలికించేవారు. అంతేగాని ఏ మహిళ చేతిని కూడా తన చేతిలో తీసుకుని 'బైత్' తీసుకోలేదు. ఈ విషయమై హజ్రత్ ఆయిషా(ర.అన్హా) ఇలా అంటున్నారు: "అల్లాహ్ సాక్షి! ప్రమాణ స్వీకారం సందర్భంగా దైవప్రవక్త (స) ఏ స్త్రీ చేయిని కూడా తన చేత్తో తాకలేదు. ప్రమాణ స్వీకారం (బైత్) సమయంలో ఆయన (స), 'నేను ఈ ఈ విషయాలకు సంబంధించి నీ నుండి ప్రమాణం తీసుకున్నాను' అని మాత్రం నోటితో చెప్పేవారు" (సహీహ్ బుఖారీ – ముమ్తహినా సూరా వ్యాఖ్యానం). ఈ సందర్భంగా దైవప్రవక్త (స) ఆ స్త్రీల నుంచి మృతునిపై పెడబొబ్బలు పెట్టరాదని, బట్టలు చించుకోరాదని, జుత్తు పీక్కోరాదని, అజ్ఞానకాలపు దురాచారాలకు పాల్పడరాదని కూడా ప్రతిజ్ఞ చేయించుకున్నారు (బుఖారీ, ముస్లిం). ఈ 'ప్రమాణం'లో నమాజ్, రోజా, జకాత్, హజ్‌ల ప్రస్తావన లేదు. ఎందుకంటే ఇవి ఇస్లాం మౌలికాంశాలు కావటం వల్ల వాటి గురించి ప్రత్యేకంగా వివరించలేదు.

సాధారణంగా మహిళలలో ఉండే సహజ దౌర్బల్యాలను దృష్టిలో పెట్టుకుని ఆయన (స) ఆయా ప్రత్యేక అంశాలపై

13 ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ ఆగ్రహానికి గురైనవారితో స్నేహం చేయకండి.[36] చచ్చి సమాధుల్లో పడివున్న వారి పట్ల అవిశ్వాసులు ఎలా ఆశలు వదులుకున్నారో అలాగే వారు కూడా పరలోకం పట్ల ఆశ వదులుకున్నారు.[37]

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَتَوَلَّوْا قَوْمًا غَضِبَ اللَّهُ عَلَيْهِمْ قَدْ يَئِسُوا مِنَ الْآخِرَةِ كَمَا يَئِسَ الْكُفَّارُ مِنْ أَصْحَابِ الْقُبُورِ ⑬

మాత్రమే వారినుండి 'మాట' తీసుకున్నారు. ఇస్లాం మౌలిక అంశాలను పాటించటంతో పాటు, ఈ చెడులను కూడా పరిత్యజిస్తాము అన్నది ఆ ప్రతిజ్ఞ సారాంశం. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే పండితులు, బోధకులు, సందేశప్రచారకులు పొద్దస్తమానం నమాజ్, రోజాల గురించి మాత్రమే గాకుండా సదరు ప్రతిజ్ఞలో పేర్కొనబడిన నిషిద్ధాంశాలను గురించి కూడా నొక్కి చెబుతూ ఉండాలి. ఆ మాటకొస్తే ఈ దురాచారాలకు వ్యతిరేకంగా చాలా గట్టిగా ఉద్ఘాటించాలి. ఎందుకంటే ఇవి సమాజంలో వ్రేళ్లూనుకుపోయాయి. నమాజులు చేస్తూ, ఉపవాసాలు పాటించే ప్రబుద్ధులు సయితం ఈ దురాచారాల ఊబిలో చిక్కుకుని ఉన్నారు.

36. దైవాగ్రహానికి గురైన వీరు ఎవరు? వీరు యూదులని కొందరు వ్యాఖ్యానించగా, కపటులు అని కొందరు అభిప్రాయ పడ్డారు. సమస్త అవిశ్వాసులు ఈ కోవలోకి వస్తారని మరికొందరు పేర్కొన్నారు. చివరి అభిప్రాయమే చాలా వరకు సరైనదని అనిపిస్తోంది. ఎందుకంటే ఇందులో యూదులు, కపటులు కూడా వచ్చేస్తారు. అదలా ఉంచితే సమస్త అవిశ్వాసులు దైవాగ్రహానికి పాత్రులే. అందువల్ల దైవాన్ని, దైవ గ్రంథాన్ని, దైవప్రవక్తను, అంతిమ దినాన్ని త్రోసిపుచ్చే వారందరితోనూ సన్నిహిత సంబంధాలు పెట్టుకోరాదన్నది ఈ ఆయతు సారాంశం. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల చర్చించబడింది.

37. పరలోకంపై ఆశ వదులుకోవటమంటే పరలోకాన్ని తిరస్కరించటమని భావం. సమాధుల్లో ఉన్నవారి పట్ల ఆశ వదులుకోవటమన్నా కూడా భావం అదే. అంటే వారు తిరిగి బ్రతికించబడటం కల్ల అన్నది వారి విశ్వాసం. ఈ వాక్యానికి మరో భావం ఇది : సమాధుల్లో ఖననం చేయబడిన అవిశ్వాసులు సకల శ్రేయాలపై ఆశలు వదులుకున్నారు. ఎందుకంటే చచ్చిన తర్వాత వారు తమ అవిశ్వాసానికి లభించే పర్యవసానమేమిటో చూసుకున్నారు. కనుక ఇక వారికి మంచి జరుగుతుందన్న ఆశ ఎక్కడుంటుంది? (ఇబ్నె జరీర్ తబ్రీ).

61వ సూరా

# అస్ సఫ్

## పంక్తి

అవతరణ మదీనాలో

ఆయతులు 14

### పరిచయం

*అల్లాహ్ మార్గంలో త్యాగనిరతి, ధనప్రాణాలతో త్యాగానికి సిద్ధపడడం, క్రమశిక్షణ, సమైక్యత, యుద్ధ రంగంలో ధైర్యసాహసాల గురించి ఈ సూరా ప్రధానంగా ప్రస్తావించింది. ఇందులోని 4వ ఆయతులో వచ్చిన 'సఫ్' (పంక్తి) అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్ మార్గంలో పోరాడాలని, చెక్కుచెదరని పంక్తులుగా, దృఢసంకల్పంతో నిలబడి పోరాడాలని, తమ విశ్వాసాన్ని ఆచరణలో చూపించాలని బోధించింది. ప్రవక్త మూసా(అస), ఈసా(అస)ల గాథలను ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు ఊరట ఇవ్వడానికి ప్రస్తావించడం జరిగింది. మూసా(అస) జాతి ప్రజలు, అంటే ఇస్రాయీల్ సంతతి ప్రజలు ఆయనకు బాధ కలిగేలా, ఆగ్రహం కలిగేలా వ్యవహరించారు. వారికి ఆయన దేవుని సందేశహరుడని తెలిసినా కూడా అలా వ్యవహరించారు. ఈసా(అస)కు కూడా ఇస్రాయీల్ సంతతి ప్రజలు బాధ కలిగించారు. ఆయన దైవప్రవక్త అన్న విషయం కూడా వారికి తెలుసు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) దేవుడు పంపించిన దైవప్రవక్త, అల్లాహ్ ఆయనకు మార్గదర్శకత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి యావత్తు మానవాళి కొరకు పంపించాడని ఈ సూరా నొక్కి చెప్పింది. అవిశ్వాసులకు ఇష్టం లేకపోయినాగాని అల్లాహ్ తన ధర్మాన్ని పరిపూర్ణం చేస్తాడనీ, వ్యాపింపచేస్తాడని చెప్పడం జరిగింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 5 | 82-117 | 'దైవప్రవక్త మూసా, ఇస్రాయీల్ జాతి వారి విమోచన కర్త' | దైవప్రవక్త మూసా (అ) చరిత్ర దివ్యఖుర్ఆన్ గ్రంథంలో ఎన్నో విభాగాలుగా, ఎన్నో చోట్ల ప్రస్తావించబడింది. అలా అని చెప్పిన మాటే మళ్ళీ మళ్ళీ చెప్పబడలేదు. ప్రతిసారి ఏదో ఒక కొత్త విషయం! ఏదో ఒక సరికొత్త కోణం!! మరి ఆ వింత సంగతులన్నింటినీ మాలగా కూర్చుకొని చదువుకుంటే ఇంకెంత బాగుంటుంది?! |
| 6-14 | 184-198 | 'మర్యమ్' 'ప్రవక్త ఈసా జననం' 'నేడు మనకు తెలిసిన క్రైస్తవ విశ్వాసాలు' | ఈసా ప్రవక్త జీవిత వాస్తవ విశేషాలు, కాలక్రమానుగుణంగా. |

## అస్ సఫ్[1] సూరా

## سُورَةُ الصَّفِّ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతున్నది. ఆయన సర్వశక్తుడు, వివేక వంతుడు.

سَبَّحَ لِلَّهِ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ ۖ وَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ ①

**2** ఓ విశ్వాసులారా! మీరు చేయ(లే)ని దాన్ని గురించి ఎందుకు చెబుతారు?[2]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لِمَ تَقُولُونَ مَا لَا تَفْعَلُونَ ②

**3** మీరు చేయని దాన్ని గురించి చెప్పటం అల్లాహ్ సమక్షంలో ఎంతో సహించరానిది.[3]

كَبُرَ مَقْتًا عِنْدَ اللَّهِ أَنْ تَقُولُوا مَا لَا تَفْعَلُونَ ③

**4** అల్లాహ్ ప్రేమించేది సీసం పోసి నిర్మింపబడిన గోడలాగా వరుసతీరి స్థిరంగా అతని మార్గంలో పోరాడేవారినే[4] సుమా!

إِنَّ اللَّهَ يُحِبُّ الَّذِينَ يُقَاتِلُونَ فِي سَبِيلِهِ صَفًّا كَأَنَّهُمْ بُنْيَانٌ مَرْصُوصٌ ④

**5** మూసా తన జాతివారితో, "ఓ నా జాతి ప్రజలారా! నేను మీ వద్దకు అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తనన్న సంగతి తెలిసి కూడా మీరు నన్నెందుకు ఇంతగా వేధిస్తున్నారు?"[5] అని చెప్పి నప్పటి విషయం (జ్ఞాపకం చేసుకోదగినది). వారు వక్రంగానే

وَإِذْ قَالَ مُوسَىٰ لِقَوْمِهِ يَا قَوْمِ لِمَ تُؤْذُونَنِي وَقَدْ تَعْلَمُونَ أَنِّي رَسُولُ اللَّهِ إِلَيْكُمْ ۖ فَلَمَّا زَاغُوا

1. మహాప్రవక్త సహచరులు కొంతమంది ఒకచోట కూర్చొని, 'దేవునికి ఇష్టమైన పని ఏది? అదేదో తెలిస్తే మేము తప్పకుండా చేసేవారమే! అదేదో దైవప్రవక్త (స)ను అడిగి తెలుసుకోవాలి' అని చెప్పుకుంటున్నారు. కాని ఆ మాట దైవప్రవక్త (స)ను అడగటానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ సూరా అవతరించింది (ముస్నదె అహ్మద్ – 5/452; సుననె తిర్మిజీ – అస్సఫ్ సూరా వ్యాఖ్యానం).
2. ఈ వాక్యంలో హెచ్చరిక ఉంది. వట్టిమాటల వల్ల ప్రయోజనం ఏమీ లేదు. ఆచరణ ముఖ్యం. దేవునికి ప్రియమైన పనేదో తెలిస్తే తప్పకుండా చేస్తామని గొప్పలు చెప్పుకుని, తీరా ఆ పనేదో తెలుపబడిన తరువాత చతికిలబడటం సహించరాని విషయం. అందుకే చేయలేని దాన్ని గురించి నోటితో ఎందుకు చెప్పుకుంటారు? ఆడిన మాటను ఎందుకు నిలుపుకోరు? అని ప్రశ్నించటం జరిగింది.
3. ఈ విధంగా మాటలకు – చేతలకు మధ్య వైరుధ్యం కనబరచే వారిని దేవుడు అసహ్యించుకుంటాడు. అలాంటి వారు ఒక్కోసారి దైవాగ్రహానికి కూడా గురి కావలసి వస్తుంది.
4. ఇంతకీ అల్లాహ్‌కు ఎంతో ప్రియమైన పనేమిటో తెలుసుకోవాలనుకుంటున్నారా!? అదే దైవమార్గంలో పోరాడటం.
5. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) దేవుని తరఫు నుండి పంపబడిన సత్యవంతుడైన ప్రవక్త అని తెలిసి కూడా ఇస్రాయీల్ జనులు ఆయన్ని వేధించేవారు. అనరాని మాటలు అని మనస్తాపం కలిగించేవారు. ఆయన శరీరావయ వాల్లో లోపం ఉందని పుకార్లు పుట్టించేవారు. నిజానికి అలాంటి లోపం ఏదీ ఆయనలో లేదు.

ఉండటంతో, అల్లాహ్ వారి హృదయాలు వంకరగానే ఉండేలా చేశాడు.[6] అవిధేయ జనులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

أَزَاغَ اللَّهُ قُلُوبَهُمْ ۚ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الْفَاسِقِينَ ⑤

**6** మర్యమ్ కుమారుడైన ఈసా, "ఓ ఇస్రాయీలు సంతతి వార లారా! నేను మీ వైపు అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను.[7] నా తరువాత రాబోయే ఒక ప్రవక్తను గురించి శుభవార్తను ఇస్తు న్నాను. అతని పేరు అహ్మద్"[8] అని చెప్పినప్పటి సంగతి (కూడా స్మరించదగినదే). తీరా అతను స్పష్టమైన నిదర్శనాలను తీసుకు వచ్చినప్పుడు, "ఇది పచ్చి ఇంద్రజాలం"[9] అని వారు అన్నారు (తేలిగ్గా కొట్టి పారేశారు).

وَإِذْ قَالَ عِيسَى ابْنُ مَرْيَمَ يَا بَنِي إِسْرَائِيلَ إِنِّي رَسُولُ اللَّهِ إِلَيْكُم مُّصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيَّ مِنَ التَّوْرَاةِ وَمُبَشِّرًا بِرَسُولٍ يَأْتِي مِن بَعْدِي اسْمُهُ أَحْمَدُ ۖ فَلَمَّا جَاءَهُم بِالْبَيِّنَاتِ قَالُوا هَٰذَا سِحْرٌ مُّبِينٌ ⑥

6. అంటే విషయం తెలిసిన తరువాత కూడా విముఖులైపోయారు. సత్యం బదులు అసత్యాన్ని, మేలుకు బదులు కీడును, విశ్వాసానికి బదులు అవిశ్వాసాన్ని అవలంబించారు. అందువల్ల వారికి తగిన శాస్తిగా అల్లాహ్ వారిని శాశ్వతంగా వక్ర మనస్కులుగా చేసేశాడు. మనిషి అపమార్గం, అసత్యాలపై పాతుకుపోయినప్పుడు అతని హృదయ కవాటాలపై మూతపడిపోతుంది. తరువాత అవిధేయత, తిరస్కార భావం, హింస అతని నైజంగా మారిపోతాయి. ఇక అటువంటి వాణ్ణి మార్చటం ఎవరితరమూ కాదు. అందుకే "అల్లాహ్ అవిధేయులకు మార్గదర్శకత్వం వహించడు" అని ఈ సందర్భంగా చెప్పటం జరిగింది. ఎందుకంటే దేవుడు తన సంప్రదాయాన్ననుసరించి ఇలాంటి వారిని అపమార్గాన వదిలేసి ఉంటాడు. స్వయంగా దేవుడే మార్గ భ్రష్టుణ్ణి చేసిన వారికి ఇక సన్మార్గం ఎవరు చూపగల్గుతారు?

7. ఇక్కడ దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) సంగతి కూడా ఎందుకు ప్రస్తావించ బడిందంటే ఇస్రాయీల్ వంశీయులు మూసాను ఎదిరించినట్లే ఈసాను కూడా ఎదిరించారు. ఈ వాక్యం ద్వారా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఓదార్చటం జరిగింది- "ఓ ముహమ్మద్ (స)! ఈ యూదులు నీ పట్లనే కాదు, లోగడ కూడా వారు ప్రవక్తలను ఎంతగానో బాధించారు. అసలు వాళ్ల చరిత్ర ఆసాంతం ప్రవక్తల ధిక్కరణతో నిండి ఉన్నది."

తౌరాతు గ్రంథాన్ని ధృవీకరించటంలోని భావం ఏమిటంటే, నేను ఈనాడు మీకు ఏ సందేశం అందజేస్తున్నానో తౌరాతు సందేశం కూడా అదే. అంటే నాకు పూర్వం తౌరాతు గ్రంథం తెచ్చిన ప్రవక్త (మూసా) అయినా, ఇంజీలు గ్రంథాన్ని తెచ్చిన నేను (ఈసా) అయినా - మేమిద్దరం చెప్పేది ఒకే మాట. మేమిద్దరం నడిచేది ఒకే బాట. అందుచేత మీరు మూసా, హారూను, దావూదు, సులైమాను ప్రవక్తలను నమ్మి నడుచుకున్నట్లే నన్ను కూడా నమ్మి నడవండి. ఎందుకంటే నేను తౌరాతును సత్యమని ధృవీకరిస్తున్నాను. ఆ గ్రంథాన్ని త్రోసిపుచ్చటం లేదు.

8. దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు - అలైహిస్సలాం) తరువాత రాబోయే అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గురించి ఈ ఆయతులో శుభవార్త ఇవ్వబడింది. అందుకే ముహమ్మద్ (సఅసం) వారు ఇలా చెబుతుండేవారు : "నేను నా పితామహుడైన ఇబ్రాహీము ప్రార్థనా ఫలాన్ని. ఈసా (ఏసుక్రీస్తు) శుభవార్తకు ప్రతీకని" (ఐసరుత్త ఫాసీర్). ఇక **'అహ్మద్'** (أَحْمَدُ) అనే పదానికి రెండు అర్థాలు వస్తాయి. ఒకటి: జనులందరిలోకెల్లా ఎక్కువగా దైవస్తోత్రం చేసేవాడు. రెండు : తనలోని సుగుణాల రీత్యా అందరికన్నా ఎక్కువగా ప్రశంసించబడినవాడు (ఫత్హుల్ ఖదీర్).

9. అంటే దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) సమర్పించిన నిదర్శనాలను వారు మాంత్రిక విద్యగా కొట్టిపారేశారు. అంతకు ముందు గతించిన అనేక జాతుల వారు కూడా ఇలాగే వ్యవహరించారు.

మరి కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)కు వర్తిస్తుందని చెప్పారు. అట్టి పరిస్థితిలో 'ఇది మాంత్రిక విద్య' అని చెప్పినవారు మక్కా వారవుతారు.

**7** ఇస్లామ్ వైపు తనను ఆహ్వానించబడుతున్నప్పటికీ[10] అల్లాహ్‌పై
అబద్ధపు నిందలను కల్పించేవాడికంటే పరమ దుర్మార్గుడెవ
డుంటాడు[11] ఇలాంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

وَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَىٰ عَلَى اللَّهِ الْكَذِبَ وَهُوَ
يُدْعَىٰ إِلَى الْإِسْلَامِ ۚ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ
الظَّالِمِينَ ⑦

**8** వారు అల్లాహ్ జ్యోతిని తమ నోళ్ళతో ఊది ఆర్పివేయదలుస్తు
న్నారు.[12] అయితే అల్లాహ్ మాత్రం తన జ్యోతిని పరిపూర్ణంగావి
స్తాడు[13] – అవిశ్వాసులకు అది ఎంతగా సహించరానిదైనా సరే!

يُرِيدُونَ لِيُطْفِئُوا نُورَ اللَّهِ بِأَفْوَاهِهِمْ وَاللَّهُ
مُتِمُّ نُورِهِ وَلَوْ كَرِهَ الْكَافِرُونَ ⑧

**9** ఆయనే తన ప్రవక్తకు సన్మార్గాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చిపంపాడు–
దాన్ని మత ధర్మాలన్నింటిపై ఆధిక్యం వహించేలా చేయటానికి![14]
ఈ విషయం బహుదైవారాధకులకు ఇష్టం లేకపోయినాసరే.[15]

هُوَ الَّذِي أَرْسَلَ رَسُولَهُ بِالْهُدَىٰ وَدِينِ الْحَقِّ
لِيُظْهِرَهُ عَلَى الدِّينِ كُلِّهِ وَلَوْ كَرِهَ الْمُشْرِكُونَ ⑨

**10** ఓ విశ్వాసులారా! మిమ్మల్ని వ్యధాభరితమైన శిక్ష నుండి
రక్షించే వర్తకమేదో[16] నేను మీకు తెలుపనా?

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا هَلْ أَدُلُّكُمْ عَلَىٰ تِجَارَةٍ
تُنجِيكُم مِّنْ عَذَابٍ أَلِيمٍ ⑩

**11** మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించండి. అల్లాహ్
మార్గంలో మీ ధన ప్రాణాలొడ్డి పోరాడండి. మీరు గనక తెలుసుకో
గలిగితే ఇది మీకు ఎంతో మేలైనది.

تُؤْمِنُونَ بِاللَّهِ وَرَسُولِهِ وَتُجَاهِدُونَ فِي سَبِيلِ
اللَّهِ بِأَمْوَالِكُمْ وَأَنفُسِكُمْ ۚ ذَٰلِكُمْ خَيْرٌ لَّكُمْ
إِن كُنتُمْ تَعْلَمُونَ ⑪

10. ఈ ధర్మం (ఇస్లాం) ఉన్నతమైనది. అటువంటి ధర్మం వైపు పిలువబడే వ్యక్తి అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదించటం అనేది ఊహించరానిది. ఒకవేళ ఎవరయినా అలా చేస్తే అది దుర్మార్గానికి పరాకాష్ఠే!

11. ఇంతకీ ఆ అబద్ధపు నిందలు ఏవై ఉంటాయి? అంటే ఉదాహరణకు: అల్లాహ్‌కు సంతానాన్ని ఆపాదించటం, ఆయన నిషేధించని పశువులను నిషిద్ధమని ప్రజలకు నమ్మబలకటం.

12. ఇక్కడ జ్యోతి (నూర్) అంటే దివ్య ఖుర్ఆనూ కావచ్చు, ఇస్లాం ధర్మమూ కావచ్చు, ముహమ్మద్ (స) ప్రవక్త కూడా కావచ్చు లేక దేవుని నిదర్శనాలు కూడా కావచ్చు. 'నోటితో ఊదటం' అంటే వారు తమ నోటితో పలికే ఎత్తిపొడుపు మాటలు, అనుచిత వ్యాఖ్యలు అని అర్థం.

13. అంటే ఈ సత్యధర్మాన్ని యావత్ప్రపంచంలో విస్తరింపజేస్తాడు. లేక ఈ ధర్మానికి ఇతర మతాలపై స్పష్టమైన ఆధిక్యతను ఇస్తాడు. ఈ ఆధిక్యత భౌతికంగానూ కావచ్చు, ప్రమాణాల నిదర్శనాల దృష్ట్యా కూడా కావచ్చు.

14. ఇంతకుముందు చెప్పిన విషయమే ఇది. దీనికున్న ప్రాముఖ్యత దృష్ట్యా ఇది మరోసారి పునరావృతం అయింది.

15. ఏది ఏమైనాసరే దైవనిర్ణయానికి తిరుగు ఉండదు.

16. విశ్వాసాన్ని, దైవమార్గంలో పోరాటాన్ని ఇక్కడ లాభసాటి వ్యాపారంగా అభివర్ణించటం గమనార్హ విషయం. ఇంతకీ ఆ లాభం ఏమిటి? అంటే అది స్వర్గ ప్రవేశం! నరక యాతన నుండి రక్షణ!! ఇంతకన్నా గొప్ప లాభం ఇంకేముంటుంది? ఈ విషయమే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది : "అల్లాహ్ విశ్వాసుల నుండి వారి ప్రాణాలను, వారి సంపదలను స్వర్గానికి బదులుగా కొనుగోలు చేశాడు." (తౌబా – 111).

12 అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు. క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలో మీకు ప్రవేశం కల్పిస్తాడు. శాశ్వతంగా ఉండే ఉద్యానవనాలలో గల పరిశుభ్రమైన గృహాలలో ప్రవేశింపజేస్తాడు. నిజానికి ఇదే గొప్ప సాఫల్యం.

يَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ وَيُدْخِلْكُمْ جَنّٰتٍ تَجْرِىْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ وَمَسٰكِنَ طَيِّبَةً فِىْ جَنّٰتِ عَدْنٍ ؕ ذٰلِكَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿12﴾

13 మీరెంతగానో ఇష్టపడే మరొకటి (అనుగ్రహం) కూడా వొసగుతాడు. అది అల్లాహ్ సహాయం, శీఘ్ర విజయం![17] (ఓ ప్రవక్తా!) విశ్వాసులకు దీని గురించి శుభవార్తను వినిపించు.[18]

وَاُخْرٰى تُحِبُّوْنَهَا ؕ نَصْرٌ مِّنَ اللّٰهِ وَفَتْحٌ قَرِيْبٌ ؕ وَبَشِّرِ الْمُؤْمِنِيْنَ ﴿13﴾

14 ఓ విశ్వాసులారా! మర్యమ్ కుమారుడైన ఈసా తన హవారీలతో, "అల్లాహ్ మార్గంలో నాకు సహాయపడగల వారెవరు?" అని అన్నపుడు, "అల్లాహ్ మార్గంలో మేము సహాయపడతాము"[19] అని హవారీలు సమాధానమిచ్చినట్లు మీరు కూడా అల్లాహ్‌కు సహాయకులు అవండి.[20] తరువాత ఇస్రాయీలు సంతతివారిలో ఒక వర్గం వారు విశ్వసించగా, మరొక వర్గం వారు తిరస్కరించారు.[21] అప్పుడు మేము విశ్వసించిన వారికి వారి శత్రువులకు వ్యతిరేకంగా తోడ్పడ్డాము. తత్ఫలితంగా వారు గెలుపొందారు.[22]

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُوْنُوْۤا اَنْصَارَ اللّٰهِ كَمَا قَالَ عِيْسَى ابْنُ مَرْيَمَ لِلْحَوَارِيّٖنَ مَنْ اَنْصَارِىْۤ اِلَى اللّٰهِ ؕ قَالَ الْحَوَارِيُّوْنَ نَحْنُ اَنْصَارُ اللّٰهِ فَاٰمَنَتْ طَّآئِفَةٌ مِّنْۢ بَنِىْۤ اِسْرَآءِيْلَ وَكَفَرَتْ طَّآئِفَةٌ ۚ فَاَيَّدْنَا الَّذِيْنَ اٰمَنُوْا عَلٰى عَدُوِّهِمْ فَاَصْبَحُوْا ظٰهِرِيْنَ ﴿14﴾

17. అంటే – మీరు ఆయన మార్గంలో పోరాడినప్పుడు, ఆయన ధర్మానికి సహాయపడినప్పుడు ఆయన కూడా మీకు తోడ్పడతాడు. మీకు విజయం చేకూరుస్తాడు. ఈ సంగతిని ఆయన మరోచోట ఈ విధంగా తెలిపాడు :1."మీరు గనక దైవానికి తోడ్పడితే, ఆయన మీకు తోడ్పడతాడు. మీ పాదాలకు నిలకడను, స్థయిర్యాన్ని ఇస్తాడు." (ముహమ్మద్ – 7). 2. "ఎవరయినా అల్లాహ్‌కు సాయం చేస్తే అల్లాహ్ కూడా వారికి తప్పకుండా సాయపడతాడు. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప శక్తిమంతుడు, ఆధిపత్యం కలవాడు." (అల్ హజ్ – 40). **'శీఘ్ర విజయం'** అంటే మక్కా విజయమని కొందరు అభిప్రాయపడ్డారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం ఇది రోమనులపై, పారశీకులపై ముస్లింలకు లభించిన విజయం. 'ఖిలాఫతె రాషిదా' కాలంలో ముస్లింలను ఈ విజయం వరించింది.

18. అంటే – మరణానంతరం స్వర్గం ఖాయం అన్న సంతోషవార్తను, ప్రాపంచిక జీవితంలో కూడా ఇతరులపై విజయం లభిస్తుందన్న శుభవార్తను వినిపించు. కాకపోతే విశ్వాసులు విశ్వాసం వాంఛించే విధ్యుక్త ధర్మాలను నెరవేర్చాలి.

"మీరు గనక నికార్సయిన విశ్వాసులైతే అవిశ్వాసులపై మీరే పైచేయిగా ఉంటారు." (ఆలి ఇమ్రాన్ : 139).

19. మహాప్రవక్త (సఅసం) వారు కూడా హజ్ కాలంలో ప్రజలనుద్దేశించి, "నాకు ఆశ్రయమిచ్చే వారెవరు? మీరు గనక నాకు సహాయపడితే నేను దైవదాసులకు దైవసందేశం అందజేస్తాను. ఎందుకంటే ఖురైషులు ఈ కర్తవ్య నిర్వహణలో అడ్డు తగులుతున్నారు" అని ప్రకటించేవారు. ఆయన (స) గారి ఈ పిలుపుపై మదీనాకు చెందిన ఔస్ ఖజ్రజ్ తెగలవారు ముందుకు వచ్చారు. వారు ఆయన (స) చేతిలో చెయ్యేసి ఆయన (స)కు సాయపడతామని వాగ్దానం చేశారు. మహాప్రవక్త (స) గనక మక్కా నుండి మదీనాకు వలస వస్తే అన్ని విధాలా సహాయం చేస్తామని కూడా మాటిచ్చారు. ఇచ్చిన మాటను నిలుపుకున్నారు కూడా. మహాప్రవక్త (స) మరియు ఆయన సహచరులు మక్కా

నుండి మదీనాకు హిజ్రత్ చేసినపుడు వారు అందించిన తోడ్పాటు అపూర్వమైనది. వారి ఈ సేవలకు చిహ్నంగా దేవుడు, దైవప్రవక్త (స) వారిని **'అన్సార్లు'** (సహాయకులు) అని పిలిచారు. దేవుడు వారితో ప్రసన్నుడగుగాక! (ఇబ్నె కసీర్).

20. ఎల్లవేళలా మనస్ఫూర్తిగా దైవమార్గంలో తోడ్పడండి. మీ మాటల ద్వారా, చేతల ద్వారా కూడా సహాయపడండి. మీ సిరిసంపదల ద్వారా, మీ ప్రాణాల ద్వారా కూడా తోడ్పడండి. దైవప్రవక్త మిమ్మల్ని ఏ ఘడియలో పిలిచినా తక్షణం హాజరు పలకండి. పూర్వం దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) పిలుపుపై హవారీలు స్పందించినట్లుగానే మీరు కూడా సకారాత్మకంగా స్పందించండి.

21. తిరస్కరించిన వారు యూదులు. వారు దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు)ను కేవలం తిరస్కరించటంతోనే ఆగలేదు. ఆయన తల్లి మర్యమ్‌పై అభాండం కూడా మోపారు.

మరి కొంతమంది ప్రకారం దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం)ను దేవుడు ఆకాశం పైకి తీసుకున్నప్పుడు అనుయాయుల మధ్య విభేదం పొడసూపింది (చీలిక వచ్చింది). ఈసా రూపంలో దేవుడే భువిపై ప్రభవించాడనీ, ఇప్పుడాయన ఆకాశం పైకి వెళ్ళిపోయాడని ఒక వర్గం వాదించింది. ఇది 'యాఖూబియా' వర్గం అనబడుతుంది. ఈసా (ఏసు) దేవుని కుమారుడని, తండ్రి తన కుమారుణ్ణి గగనానికి పిలుచుకున్నాడని 'నస్తూరియా' వర్గం వాదించింది. ఈసా (ఏసు) దేవుని దాసుడనీ, దేవుని ప్రవక్త అని మూడో వర్గం వాదించింది. మూడవ వర్గం వాదనే సరైనది.

22. అంటే మేము అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను ప్రభవింపజేసి, మిథ్యావాదులకు విరుద్ధంగా వారిలోని చివరి వర్గానికి సాయం చేశాము. క్రైస్తవుల్లోని ఈ మూడవ వర్గం మహాప్రవక్త (స)ను కూడా విశ్వసించింది. వారి దగ్గరున్న సత్యబలం కారణంగా మేము వారికి ఇతర అవిశ్వాసులపై కూడా ఆధిక్యతను వొసగాము. ప్రళయదినానికి ముందు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) భువిపైకి దిగివచ్చినప్పుడు ఈ ఆధిక్యత మరింతగా స్పష్టమవుతుంది. హదీసులలో ఈ విషయం చాలా వివరంగా ఉంది.

62వ సూరా

# అల్ జుముఅహ్

## శుక్రవారం

అవతరణ మదీనాలో

ఆయతులు 11

### పరిచయం

*శుక్రవారం నాటి సామూహిక ప్రార్థనలను, వాటి వల్ల ఒనగూడే ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక ప్రయోజనాలను ఇందులో తెలియజేయడం జరిగింది. తొమ్మిదవ ఆయత్‌లో వచ్చిన 'జుముఅహ్' (శుక్రవారం) అన్న పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్ సమస్త మానవాళి కొరకు దైవప్రవక్తగా ముహమ్మద్(సఅసం)ను పంపించాడని, మానవాళికి దివ్యఖుర్ఆన్ బోధించడానికి, వివేక వచనాలు నేర్పడానికి, అల్లాహ్‌కు భాగస్వాములు కల్పించే చెడు నుంచి వారిని ప్రక్షాళనం చేయడానికి ఆయన్ను పంపించాడని ఈ సూరా తెలియజేసింది. ఇస్లామ్ అల్లాహ్ తరఫున మానవాళికి లభించిన దైవానుగ్రహం. ముస్లిములు దివ్యఖుర్ఆన్ బోధనలకు దృఢంగా కట్టుబడాలని ఈ సూరా బోధించింది. యూదుల మాదిరిగా, దివ్య సందేశాన్ని పొంది కూడా దాన్ని విడిచిపెట్టి, సత్యానికి విముఖులయ్యే వైఖరి చూపరాదని చెప్పడం జరిగింది. శుక్రవారం నాటి సాముదాయిక ఆరాధనకు సంబంధించిన నియమాలను ఈ సూరా తెలియజేసింది. ఉమ్మడిగా, బహిరంగంగా అందరూ సమైక్యంగా చేసే ఈ ఆరాధన ముస్లిముల సమైక్యతకు చిహ్నం. నమాజు సమయం కాగానే :*

1. *చేస్తున్న పనిని వదిలేసి శుక్రవారం నమాజుకై ఇవ్వబడిన పిలుపునకు జవాబు ఇవ్వాలి.*
2. *నమాజు పూర్తికాగానే అక్కడి నుంచి తిరిగి తమ తమ పనులకు వెళ్ళిపోవాలి.*
3. *అల్లాహ్‌ను తరచూ స్మరిస్తూ ఉండడం ద్వారా విజయాలు సాధించాలి.*

## అల్ జుముఅహ్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** భూమ్యాకాశాలలో ఉన్న వస్తువులన్నీ సార్వభౌముడు, పరిశుద్ధుడు, శక్తిశాలి, వివేచనాశీలి అయిన అల్లాహ్ పవిత్రతను కొనియాడుతున్నాయి.

**2** ఆయనే నిరక్షరాస్యులైన జనులలో[2]–స్వయంగా వారిలో నుంచే ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. అతడు వారికి దేవుని వాక్యాలను చదివి వినిపిస్తున్నాడు, వారిని పరిశుద్ధపరుస్తున్నాడు, వారికి గ్రంథాన్నీ, వివేకాన్ని బోధిస్తున్నాడు. అంతకుముందు వారు స్పష్టమైన మార్గవిహీనతకు లోనై ఉండేవారు.

**3** ఇంకా వారితో చేరని ఇతరుల కొరకు కూడా[3] (ఆ ప్రవక్తను ప్రభవింపజేశాడు). ఆయన (అల్లాహ్) గొప్ప శక్తిశాలి, వివేచనా శీలి.

**4** ఇది అల్లాహ్ అనుగ్రహం.[4] ఆయన తాను కోరిన వారికి దీనిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.

## سُوْرَةُ الْجُمُعَةِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

يُسَبِّحُ لِلّٰهِ مَا فِى السَّمٰوٰتِ وَمَا فِى الْاَرْضِ الْمَلِكِ
الْقُدُّوْسِ الْعَزِيْزِ الْحَكِيْمِ ﴿1﴾

هُوَ الَّذِىْ بَعَثَ فِى الْاُمِّيّٖنَ رَسُوْلًا مِّنْهُمْ
يَتْلُوْا عَلَيْهِمْ اٰيٰتِهٖ وَيُزَكِّيْهِمْ وَيُعَلِّمُهُمُ
الْكِتٰبَ وَالْحِكْمَةَ ۗ وَاِنْ كَانُوْا مِنْ قَبْلُ لَفِىْ
ضَلٰلٍ مُّبِيْنٍ ﴿2﴾

وَّاٰخَرِيْنَ مِنْهُمْ لَمَّا يَلْحَقُوْا بِهِمْ ۗ
وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿3﴾

ذٰلِكَ فَضْلُ اللّٰهِ يُؤْتِيْهِ مَنْ يَّشَآءُ ۗ
وَاللّٰهُ ذُو الْفَضْلِ الْعَظِيْمِ ﴿4﴾

---

1. దైవప్రవక్త (సఅసం) శుక్రవారం నమాజులో సూరయె జుముఅ, సూరయె మునాఫిఖూన్ పారాయణం చేసే వారు (సహీహ్ ముస్లిం–జుమా ప్రకరణం). అయితే శుక్రవారం నాడు రాత్రి ఇషా నమాజులో ఈ సూరా పఠనానికి సంబంధించి ప్రామాణిక హదీసులు లేవు. అయితే ఒక బలహీన ఉల్లేఖనంలో ఈ ప్రస్తావన ఉన్నది (లిసానుల్ మీజాన్ – లిఇబ్నె హజర్). (శుక్రవారం రాత్రి అంటే ఇస్లామీయ క్యాలెండరు ప్రకారం గురువారం తర్వాత వచ్చే రాత్రి అన్న విషయాన్ని పాఠకులు గమనించాలి).

2. **'నిరక్షరాస్యులు'** (ఉమ్మియ్యీన్) అంటే అరబ్బులు. వారిలో అత్యధికులకు చదవటం, వ్రాయటం రాదు. మహాప్రవక్త (సఅసం)ను దేవుడు పంపినది సకల జనుల కోసమే అయినప్పటికీ, మొట్టమొదట ఆయన (స) దైవసందేశం అందజేసినది ఈ చదువురాని అరబ్బులకే. ఆ విధంగా దేవుడు ఈ పామరులపై ప్రత్యేకంగా దయదలిచాడు అని చెప్పటం ఈ ఆయతు ఉద్దేశం.

3. ఆ **'ఇతరులు'** ఎవరు? అంటే వారు అరబ్బులకు పొరుగున ఉన్న పారసీకులు, అరబ్బేతర జాతులు. ప్రళయదినం వరకూ మహాప్రవక్త (సఅసం)ను విశ్వసించే వారంతా ఇందులోకి వస్తారు. సహాబా తర్వాత ప్రళయం వరకూ దైవప్రవక్త (స)ను విశ్వసించే అరబ్బు, అరబ్బేతర జాతుల వాళ్ళందరూ ఈ ఆయతు భావపరిధిలోకి వస్తారని మరికొందరు వ్యాఖ్యానించారు. ఉదాహరణకు : రోమనులు, మంగోలులు, సూడానీలు, తురుష్కులు, మొగలులు, కుర్దులు, చైనీయులు, భారతీయులు – అందరికీ ఇది వర్తిస్తుంది. అంటే ఆయన (సఅసం) దైవదౌత్యం ఈ జాతులందరికీ చెందినది. ఈ విధంగా ఎవరు విశ్వసించినా వారందరూ ముస్లిం సమాజంలో కలిసిపోతారు. ముస్లిం సమాజం మొత్తం ఒకే సమాజం (ఉమ్మతె వాహిదా)గా పరిగణించబడుతుంది.

**5** తౌరాతు గ్రంథం ప్రకారం ఆచరించాలని ఆదేశించబడినప్పటికీ, దానికి అనుగుణంగా ఆచరించనివారి ఉపమానం ఎన్నో గ్రంథాలు (వీపుపై) మోపబడిన గాడిదలాంటిది.[5] అల్లాహ్ వాక్యాలను ధిక్కరించినవారి దృష్టాంతం చాలా చెడ్డది. దుర్మార్గ జనులకు అల్లాహ్ సన్మార్గం చూపదు.

الْحِمَارِ يَحْمِلُ أَسْفَارًا ۚ بِئْسَ مَثَلُ الْقَوْمِ الَّذِينَ كَذَّبُوا بِآيَاتِ اللَّهِ ۚ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ ﴿٥﴾

**6** (ఓ ముహమ్మద్ – స!) వారికి ఈ విధంగా చెప్పు: "ఓ యూద జనులారా! ఇతర జనులకన్నా మీరే అల్లాహ్‌కు ప్రియమైన వార[6]న్నది మీ తలంపు అయితే, మీరు చావును కోరుకోండి.[7] మీరు మీ వాదనలో సత్యవంతులే అయితే[8] (ఈ సవాలును స్వీకరించండి)."

قُلْ يَا أَيُّهَا الَّذِينَ هَادُوا إِن زَعَمْتُمْ أَنَّكُمْ أَوْلِيَاءُ لِلَّهِ مِن دُونِ النَّاسِ فَتَمَنَّوُا الْمَوْتَ إِن كُنتُمْ صَادِقِينَ ﴿٦﴾

4. ఈ **'అనుగ్రహం'** దైవప్రవక్త(స) నేపథ్యంలోనూ ప్రస్తావించబడి ఉండవచ్చు లేక ఆయన్ని విశ్వసించిన అనుయాయులందరినీ దృష్టిలో పెట్టుకుని కూడా ప్రస్తావించి ఉండవచ్చు.

5. **'అస్ఫార్'** అనే పదం సిఫ్ర్‌కు బహువచనం. పెద్ద గ్రంథం అని దీని అర్థం. మనిషి ఒక గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసినప్పుడు దాని అర్థాల్లో ప్రయాణం (సఫ్ర్) చేస్తాడు (విహరిస్తాడు). అందుకే గ్రంథాన్ని సిఫ్ర్‌గా వ్యవహరిస్తారు (ఫత్‌హుల్ ఖదీర్). ఆచరణ లోపించిన యూదులను ఇక్కడ పుస్తకాలు మోసే గాడిదతో పోల్చటం జరిగింది. తన వీపుపై మోపబడిన పుస్తకాలలో ఏం ఉందో గాడిదకు తెలియదు. చివరకు తాను మోస్తున్నది పుస్తకాలో, చెత్తాచెదారమో కూడా దానికి తెలీదు. ఈ యూదుల వ్యవహారం కూడా అలాగే ఉంది. వారు తౌరాతు గ్రంథాన్నయితే మోస్తూ ఉన్నారు. ఆ గ్రంథాన్ని తాము చదివినట్లు, కంఠస్థం చేసుకున్నట్లు కూడా లోకానికి నమ్మ బలుకుతారు. కాని దాన్ని అర్థం చేసుకోవటంగానీ, దానికనుగుణంగా ఆచరించటం గానీ చేయరు. పైగా అందులో ప్రక్షిప్తాలకు, మార్పులు చేర్పులకు పాల్పడతారు. అందువల్ల వీరు వాస్తవానికి గాడిదకన్నా హీనులు. ఎందుకంటే గాడిద పుట్టుకతోనే బుద్ధివివేకాలు లేని జంతువు. కాని వీళ్లు అలా కాదే ! వీళ్లు ఉద్దేశపూర్వకంగా తమ తెలివితేటల్ని, బుద్ధివివేకాల్ని ఉపయోగించటం లేదు. అందుకే వీళ్ల దృష్టాంతం చాలా చెడ్డదని అనబడింది. "వాళ్లు పశువుల్లాంటి వారు. వాటికన్నా ఎక్కువగా మార్గ విహీనులు" (ఆరాఫ్ – 179) అని వేరొకచోట అనబడింది. అయితే ఈ ఉపమానం దివ్య ఖుర్‌ఆన్‌ని చదివి, దాన్ని కంఠస్థం చేసుకుని, దాని అర్థాన్ని ఆకళింపు చేసుకుని తదనుగుణంగా ఆచరించని ముస్లిం విద్వాంసులకు కూడా వర్తిస్తుంది.

6. ఉదాహరణకు : "మేము కుమారులం. ఆయనకు ప్రీతిపాత్రులం" (అల్ మాయిద – 18) అని వారు అనేవారు. "యూదులు, క్రైస్తవులు కాని వారెవ్వరూ స్వర్గంలోకి పోలేరు" అని కూడా వారు ఎద్దేవా చేసేవారు (అల్ బఖర – 111).

7. అంటే – దేవునికి ప్రీతిపాత్రులం అని మీరు అంతగా గర్వపడుతున్నప్పుడు మరణానంతర జీవితం కొరకు మీరు వేగిరపడాలి కదా! వెనుకాడుతున్నారెందుకు?

8. ఎందుకంటే తమకు ఎలాగూ స్వర్గం లభిస్తుందని వారంటున్నారు కాబట్టి. స్వర్గానికి పోయేవాడు సాధారణంగా దానికోసం ఆరాటపడతాడు.

'ముబాహలా' నేపథ్యంలో ఈ ఆయతు అవతరించిందని హాఫిజ్ ఇబ్నె కసీర్‌గారు అభిప్రాయపడ్డారు. ఓ యూదులారా! ముహమ్మద్ (సఅసం) దైవదౌత్యాన్ని గనక మీరు త్రోసిపుచ్చుతున్నట్లయితే, దైవసమక్షంలో ప్రీతిపాత్రులుగా నిలిచేది మీరేనన్న మీ తలంపు సత్యమైతే ముస్లింలతో కలిసి 'ముబాహలా' చేయడానికి సిద్ధపడండి. అంటే ముస్లింలు,

**7** వారు తమ చేజేతులా చేసుకున్న అకృత్యాల కారణంగా వారెన్నటికీ చావును కోరుకోరు.[9] దుర్మార్గుల సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు.

وَلَا يَتَمَنَّوْنَهُ أَبَدًا بِمَا قَدَّمَتْ أَيْدِيهِمْ ۚ
وَاللَّهُ عَلِيمٌ بِالظَّالِمِينَ ⑦

**8** వారికి చెప్పు: "ఏ చావు నుండి మీరు పారిపోతున్నారో అది మిమ్మల్ని చేరుకోవటం ఖాయం. ఆ తరువాత మీరు రహస్య, బహిర్గత విషయాలను ఎరిగిన వాని సమక్షంలోకి తరలించబడ తారు. మరి ఆయన మీరు చేస్తూ ఉండిన పనులన్నింటినీ మీకు తెలియజెపుతాడు."

قُلْ إِنَّ الْمَوْتَ الَّذِي تَفِرُّونَ مِنْهُ فَإِنَّهُ
مُلَاقِيكُمْ ۖ ثُمَّ تُرَدُّونَ إِلَىٰ عَالِمِ الْغَيْبِ
وَالشَّهَادَةِ فَيُنَبِّئُكُمْ بِمَا كُنْتُمْ تَعْمَلُونَ ⑧

**9** ఓ విశ్వాసులారా! శుక్రవారంనాడు నమాజు కొరకు అజాన్ (పిలుపు) ఇవ్వబడినప్పుడు, మీరు అల్లాహ్ ధ్యానం వైపు పరు గెత్తండి. క్రయవిక్రయాలను వదలిపెట్టండి.[10] మీరు గనక తెలుసు కోగలిగితే ఇది మీ కొరకు ఎంతో మేలైనది.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا نُودِيَ لِلصَّلَاةِ مِنْ يَوْمِ
الْجُمُعَةِ فَاسْعَوْا إِلَىٰ ذِكْرِ اللَّهِ وَذَرُوا الْبَيْعَ ۚ
ذَٰلِكُمْ خَيْرٌ لَكُمْ إِنْ كُنْتُمْ تَعْلَمُونَ ⑨

---

యూదులు కలిసి దైవసమక్షంలో నిలిచి, "ఓ అల్లాహ్! మా ఇరువర్గాలలో ఎవరు అసత్యవాదులో వారిని మృత్యువాతన పడవెయ్యి" అని ప్రార్థించాలి (వివరాలకు అల్ బఖరా సూరా 94వ వచనానికి ఇవ్వబడిన వివరణను చూడండి).

9. పాపకార్యాలలో వారు అగ్రగాములు. దైవగ్రంథాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం నిస్సిగ్గుగా మార్చినవారు. అందువల్ల దైవసన్నిధిలో నిలబడే ధైర్యం వారికి లేదు.

10. ఇంతకీ ఈ అజాన్ పిలుపు ఎలా ఇవ్వాలి? ఏ వాక్యాలతో ఇవ్వాలి? ఈ వివరాలు ఖుర్ఆన్‌లో ఎక్కడా లేవు. హదీసు ద్వారానే అది మనకు తెలుస్తుంది. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే హదీసు లేకుండా ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవటంగానీ, ఆచరించటంగానీ సంభవం కాదు. జుమాను 'జుమా' అని అనటంలోని ఔచిత్యం ఏమిటంటే ఆ రోజు దేవుడు సమస్త వస్తువుల సృష్టికార్యాన్ని పరిపూర్తి గావించాడు. ఆ విధంగా ఆ రోజు సృష్టితాల సమీకరణ జరిగింది. లేదా ఆ రోజు సామూహిక నమాజు నిమిత్తం సమావేశం జరుగుతుంది. అందువల్ల కూడా దానికి జుమా (సమావేశం) రోజు అనే పేరు వచ్చింది (ఫత్‌హుల్ ఖదీర్). 'ఫస్అవ్' (పరుగెత్తండి) అంటే నమాజుకోసం పరుగులు తీస్తూ రమ్మని దీని అర్థం కాదు. అజాన్ పిలుపు ఇవ్వగానే మీ క్రయవిక్రయాలను, దైనందిన వ్యవహారాలను విడనాడి నమాజు కోసం సిద్ధం కండి అని అర్థం. ఎందుకంటే నమాజు కొరకు పరుగెత్తుతూ రావటం నిషిద్ధం. హుందాగా, సౌమ్యంగా నమాజుకు రావాలని తాకీదు చేయబడింది (సహీహ్ బుఖారీ – కితాబుల్ అజాన్; సహీహ్ ముస్లిం – కితాబుల్ మసాజిద్).

**'క్రయవిక్రయాలను వదలిపెట్టండి'** అన్న వాక్యం ఆధారంగా కొంతమంది శుక్రవారం నమాజు పట్టణ ప్రజలకు మాత్రమే పరిమితం అనీ, పల్లెవాసులకు ఈ ఆజ్ఞ వర్తించదని, ఎందుకంటే క్రయవిక్రయాలు పట్నాల్లో మాత్రమే జరుగుతాయని వాదించారు. కాని ఈ వాదన సహేతుకం కాదు. ప్రపంచంలో క్రయవిక్రయాలు జరగని గ్రామం ఏదీ లేదు. కనుక ఈ వాదన సత్యదూరం. ఇక్కడ క్రయవిక్రయాలంటే ప్రాపంచిక లావాదేవీలు, వ్యవహారాలని అర్థం. అవి ఎలాంటివైనాసరే లావాదేవీల క్రిందికే వస్తాయి. కాబట్టి శుక్రవారం నమాజుకై పిలుపు ఇవ్వబడగానే వాటన్నింటినీ త్యజించాలి – వారు పట్టణవాసులైనా, పల్లెవాసులైనా, వ్యాపారస్తులైనా, రైతులైనా, ఉద్యోగులు అయినా– ఎవరయినా సరే!

11. ఇక్కడ దైవానుగ్రహం అంటే వర్తకం, ఉపాధి, జీవన భృతి అని భావం. శుక్రవారం నమాజు ముగిసిన పిమ్మట

10 మరి నమాజు ముగిసిన తరువాత భూమిలో విస్తరించి, దైవానుగ్రహాన్ని అన్వేషించండి.[11] ఎక్కువగా అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు.

فَإِذَا قُضِيَتِ الصَّلٰوةُ فَانْتَشِرُوْا فِي الْأَرْضِ وَابْتَغُوْا مِنْ فَضْلِ اللّٰهِ وَاذْكُرُوا اللّٰهَ كَثِيْرًا لَّعَلَّكُمْ تُفْلِحُوْنَ ﴿10﴾

11 (జనుల పరిస్థితి ఎలా ఉందంటే) ఎప్పుడు ఏ వ్యాపార వస్తువు అమ్మబడుతున్నట్లు చూసినా, ఏ వినోద వస్తువు కానవచ్చినా వారు దాని వైపుకు పరుగెడుతున్నారు. నిన్ను నిలబడి ఉన్న స్థితిలోనే విడిచిపోతున్నారు.[12] వారికి చెప్పు: "అల్లాహ్ దగ్గర ఏదైతే ఉందో[13] అది వినోదం కన్నా, వర్తకం కన్నా ఎంతో మేలైనది.[14] అల్లాహ్ ఉపాధి ప్రదాతలలో కెల్లా ఉత్తముడు."[15]

وَإِذَا رَأَوْا تِجَارَةً أَوْ لَهْوًا انْفَضُّوْا إِلَيْهَا وَتَرَكُوْكَ قَائِمًا ۚ قُلْ مَا عِنْدَ اللّٰهِ خَيْرٌ مِّنَ اللَّهْوِ وَمِنَ التِّجَارَةِ ۚ وَاللّٰهُ خَيْرُ الرّٰزِقِيْنَ ﴿11﴾

మీరు మీ దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నులు కండి. దేవుడు మీ కోసం నిర్ణయించిన 'కృప'ను వెతకండి. ఆ రోజంతా మీరు పనులు మానుకోవలసిన అవసరం లేదు. కేవలం నమాజు వేళల్లో మాత్రమే వాటిని త్యజిస్తే సరిపోతుంది.

12. ఒకసారి మహాప్రవక్త (సఅసం) శుక్రవారం నాడు మస్జిదులో ప్రసంగిస్తుండగా మదీనాలో ఒక వర్తక బిడారు వచ్చింది. ఈ సంగతి తెలియగానే కొంతమంది క్రయవిక్రయాల నిమిత్తం (బయటికి) పరుగులు తీశారు. మహాప్రవక్త (స) ప్రసంగిస్తున్నారన్న ధ్యాస కూడా వారికి లేకపోయింది. మస్జిదులో కేవలం 12 మంది మాత్రమే మిగిలారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది (సహీహ్ బుఖారీ – జుమా సూరా వ్యాఖ్యానం; సహీహ్ ముస్లిం– జుముఅ ప్రకరణం). వ్యాపారం ఒక ధర్మసమ్మత విషయం. పైగా ఒక కోణం నుంచి చూస్తే మనిషి బ్రతుకుతెరువు కోసం కష్టపడటం విధి అనే చెప్పాలి. అలాంటి విధే జుమా ఖుత్బా సమయంలో వారింపబడుతున్నప్పుడు, ఇక క్రీడలు, వినోదాలు, ఇతర వ్యాపకాలు అధర్మం అన్న విషయంలో లేశమైనా సందేహం ఉండరాదు. "నిలబడి ఉన్న స్థితిలోనే...." అని చెప్పటాన్నిబట్టి, జుమా ప్రసంగం నిలబడి ఇవ్వటం సంప్రదాయం అని తెలుస్తోంది. మహాప్రవక్త (స) రెండు ప్రసంగాలిచ్చేవారని, రెండు ప్రసంగాలకు మధ్య కొద్దిసేపు ఆయన కూర్చునేవారని, ప్రసంగంలో ఆయన ఖుర్ఆన్ పఠించేవారని, ప్రజలకు హితబోధ చేసేవారని హదీసు ద్వారా తెలుస్తోంది. (సహీహ్ ముస్లిం – కితాబుల్ జుముఅ).

13. అంటే – అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త (స)కు విధేయులై ఉన్నందుకు అల్లాహ్ సన్నిధిలో లభించే గొప్ప పుణ్యఫలం.

14. మీరు మస్జిదును, జుమా ప్రసంగాన్ని సయితం వదలి ఏ వస్తువుల వైపు పరుగెత్తుతున్నారో అవి చాలా అల్పమైనవి.

15. కాబట్టి మీరు ఉపాధికోసం అల్లాహ్‌నే వేడుకోండి. ఆయనకు పూర్తిగా విధేయత కనబరచండి. మీరు వినమ్రతతో ఆయన వైపు మరలి, ఆయన్ని అర్థించటమే ఉపాధి సముపార్జనకు అత్యుత్తమ సాధనం.

63 వ సూరా

# అల్ మునాఫిఖూన్

## కపటులు

అవతరణ మదీనాలో

ఆయతులు 11

## పరిచయం

ఇందులో ముఖ్యంగా కపట విశ్వాసుల గురించి చెప్పడం జరిగింది. మొదటి ఆయత్‌లో కపటవిశ్వాసుల గురించి వచ్చిన ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. సమాజంలో కపట విశ్వాసుల వల్ల తలెత్తే ప్రమాదాలను, వారి దుర్మార్గాన్ని ఈ సూరా వివరించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పట్ల వారి చెడుప్రవర్తన, అమర్యాదకరమైన వైఖరులను ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. కపట విశ్వాసులు అబద్ధపు ప్రమాణాలు చేస్తారనీ, తమ దుర్మార్గాన్ని, తమ ఉద్దేశ్యాలను దాచడానికి తీయతీయని మాటలు చెబుతారనీ, తమకు అవకాశం దొరకగానే విశ్వాసులకు హాని కలిగించడానికి, వారిని పారద్రోలడానికి చూస్తున్నారనీ తెలియజేసింది. వారి ఆకారం, రూపురేఖలు హుందాగా ఉన్నా, వారు ప్రవక్త (సఅసం) చెప్పే మాటలను శ్రద్ధగా వింటున్నట్లు కనిపించినా, ప్రవక్త (సఅసం) చెప్పే విషయాలను సమ్మతించినా అదంతా కేవలం మోసమేనని చెప్పడం జరిగింది. వారు తమ వైఖరిని విడిచిపెట్టారనీ, విశ్వాసులు దానధర్మాలు చేయకుండా, ఇతరులకు సహాయపడకుండా నిరోధిస్తుంటారనీ, మదీనాకు వలస వచ్చిన ముస్లిములను పారద్రోలడానికి ప్రయత్నిస్తున్నారనీ, వారు నమ్మదగ్గవారు కాదనీ, అహంభావులనీ, అబద్ధాలు చెబుతారనీ, వారి ఆత్మసాక్షి ఎల్లప్పుడు వారిని నిలదీస్తుంటుందనీ ఈ సూరా తెలిపింది. వారి కుట్రలకు బలి కారాదని హెచ్చరించింది. ముస్లిములు కూడా తమ విషయంలో ఈ వైఖరి చోటు చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పింది. ముస్లిములు దానధర్మాలు చేయాలని, తమ వ్యాపారాలు, కుటుంబం వంటి కారణాలతో అల్లాహ్ స్మరణను, అల్లాహ్ దాస్యాన్ని నివారించే పరిస్థితి తెచ్చుకోరాదని, కపట విశ్వాసుల మాదిరిగా విశ్వాసాన్ని దెబ్బతీసే పరిస్థితి తెచ్చుకోరాదని ప్రబోధిస్తూ, కపట విశ్వాసులు ప్రాపంచిక ప్రయోజనాల మాయలో మునిగిపోయారని, అల్లాహ్ స్మరణ పట్ల నిర్లక్ష్యానికి గురయ్యారని వ్యాఖ్యానించింది.

## అల్ మునాఫిఖూన్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** (ఓ ముహమ్మద్!) కపటులు నీ దగ్గరికి వచ్చినప్పుడు, "తమరు నిశ్చయంగా దైవప్రవక్తేనని మేము సాక్ష్యమిస్తున్నాం" అనంటారు.[1] నీవు ముమ్మాటికీ ఆయన ప్రవక్తే[2]నన్న సంగతి అల్లాహ్‌కు తెలుసు. ఈ కపటులు పచ్చి అబద్ధాలకోరులని కూడా అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు.[3]

**2** వారు తమ ప్రమాణాలను ఆసరాగా చేసుకున్నారు.[4] ఆపై వారు అల్లాహ్ మార్గం నుండి ఆగిపోయారు.[5] వారు పాల్పడే ఈ చేష్ట బహుచెడ్డది.

**3** ఎందుకంటే వారు (మొదట) విశ్వసించి, ఆ తరువాత అవిశ్వాస వైఖరికి పాల్పడ్డారు.[6] అందువల్ల వారి హృదయాలపై సీలు వేయబడింది. ఇక వారు ఏమీ అర్థం చేసుకో(లే)రు.

**4** నీవు వారిని చూసినప్పుడు వారి శరీరాకారాలు నిన్ను ఆకట్టుకుంటాయి.[7] వారు మాట్లాడుతుంటే నువ్వు (అమితాసక్తితో) వారి మాటల్ని వింటూనే ఉండి పోతావు.[8] ఒక రకంగా (చెప్పాలంటే)

## سُوْرَةُ الْمُنٰفِقُوْنَ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اِذَا جَآءَكَ الْمُنٰفِقُوْنَ قَالُوْا نَشْهَدُ اِنَّكَ لَرَسُوْلُ اللّٰهِ ۘ وَاللّٰهُ يَعْلَمُ اِنَّكَ لَرَسُوْلُهٗ ؕ وَاللّٰهُ يَشْهَدُ اِنَّ الْمُنٰفِقِيْنَ لَكٰذِبُوْنَ ۚ ﴿1﴾

اِتَّخَذُوْٓا اَيْمَانَهُمْ جُنَّةً فَصَدُّوْا عَنْ سَبِيْلِ اللّٰهِ ؕ اِنَّهُمْ سَآءَ مَا كَانُوْا يَعْمَلُوْنَ ﴿2﴾

ذٰلِكَ بِاَنَّهُمْ اٰمَنُوْا ثُمَّ كَفَرُوْا فَطُبِعَ عَلٰى قُلُوْبِهِمْ فَهُمْ لَا يَفْقَهُوْنَ ﴿3﴾

وَاِذَا رَاَيْتَهُمْ تُعْجِبُكَ اَجْسَامُهُمْ ؕ وَاِنْ يَّقُوْلُوْا تَسْمَعْ لِقَوْلِهِمْ ؕ كَاَنَّهُمْ خُشُبٌ مُّسَنَّدَةٌ ؕ

---

1. **'కపటులు'** అంటే అబ్దుల్లా బిన్ ఉబై, అతని అనుంగు అనుచరులు అని భావం. వీరు మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చినప్పుడల్లా "అయ్యో! మీరు దైవప్రవక్త కాదని ఎవరన్నారండీ! మీరు నిశ్చయంగా దైవప్రవక్తే. ఇదిగో ఒట్టు" అని నమ్మబలికేవారు.
2. కపటుల ఈ ధోరణి కడు ఆక్షేపణీయం. వారు తమ నోటితోనయితే ముహమ్మద్‌ను దైవప్రవక్తగా అంగీకరిస్తున్నారు. కాని వారి మనసుల్లో నమ్మకం లేదు. వారు నమ్మినా నమ్మకపోయినా ముమ్మాటికీ ముహమ్మద్ (స) మా ప్రవక్తే అని మాకు తెలుసు అని దేవుడు ఈ వాక్యంలో తెలియపరుస్తున్నాడు.
3. కడుపులో లేనిది కౌగిలించుకుంటే వస్తుందా!? ముహమ్మద్ (స) దైవదౌత్యం గురించి వారు నోటితో పలికేవన్నీ కల్లబొల్లి మాటలే. ఈ మాటల ద్వారా వారు తమ ఆత్మలను వంచించుకున్నదే గాక ఇతరులను కూడా మోసగించే ప్రయత్నం చేస్తున్నారు.
4. అంటే–వారు మీ మాదిరిగానే ముస్లిములమని నిరూపించుకునేందుకు ఉత్తుత్తి ప్రమాణాలు చేస్తున్నారు. అలా చేస్తే మీ ఖడ్గాల వేటునుండి రక్షణ లభిస్తుందన్నది వారి ఎత్తుగడ.
5. దీనికి మరో అనువాదం ఇది: "వారు సందేహాలు, సంశయాలను లేవనెత్తి ప్రజలను అల్లాహ్ మార్గంనుండి ఆపారు."
6. కపటులు కూడా అవిశ్వాసులేనని ఈ ఆయతు ద్వారా తేటతెల్లమవుతోంది.
7. అంటే, అందచందాల రీత్యా, దేహదారుఢ్యం రీత్యా వారు మంచి పర్సనాలిటీ గలవారుగా కనిపిస్తారు.

వారు గోడకు ఆనించబడిన కర్రల్లాంటి వారు.[9] (కాస్త గట్టిగా వినబడిన) ప్రతి కేకను వారు తమపై వచ్చి పడిన గండంగానే భావిస్తారు.[10] వీరే అసలు శత్రువులు. వీరి పట్ల కాస్త జాగ్రత్తగా ఉండండి. అల్లాహ్ వీళ్లను నాశనం చేయ! వీరు (సత్యం నుండి) ఎలా తిరిగిపోతున్నారు!?

يَحْسَبُوْنَ كُلَّ صَيْحَةٍ عَلَيْهِمْ ۚ هُمُ الْعَدُوُّ فَاحْذَرْهُمْ ۚ قٰتَلَهُمُ اللّٰهُ ۖ اَنّٰى يُؤْفَكُوْنَ ④

5 "రండి, దైవప్రవక్త మీ పాపాల మన్నింపుకై ప్రార్థిస్తాడు" అని వారితో అన్నప్పుడు, వారు తమ తలలు తిప్పుకుంటారు.[11] మరి వారు గర్వాతిశయంతో ఆగి పోవటం నీవు చూస్తావు.[12]

وَاِذَا قِيْلَ لَهُمْ تَعَالَوْا يَسْتَغْفِرْ لَكُمْ رَسُوْلُ اللّٰهِ لَوَّوْا رُءُوْسَهُمْ وَرَاَيْتَهُمْ يَصُدُّوْنَ وَهُمْ مُّسْتَكْبِرُوْنَ ⑤

6 (ఓ ప్రవక్తా!) వారి క్షమాపణ కొరకు నువ్వు ప్రార్థించినా, ప్రార్థించకపోయినా ఒక్కటే[13] – అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ వారిని క్షమించడు.[14] నిశ్చయంగా అల్లాహ్ (ఇలాంటి) అవిధేయులకు సన్మార్గం చూపడు.

سَوَآءٌ عَلَيْهِمْ اَسْتَغْفَرْتَ لَهُمْ اَمْ لَمْ تَسْتَغْفِرْ لَهُمْ ۚ لَنْ يَّغْفِرَ اللّٰهُ لَهُمْ ۚ اِنَّ اللّٰهَ لَا يَهْدِى الْقَوْمَ الْفٰسِقِيْنَ ⑥

7 "దైవప్రవక్త వెంట ఉన్నవారిపై ఏమీ ఖర్చుపెట్టకండి. చివరికి వారంతట వారే చెల్లాచెదురైపోతారు"[15] అని చెప్పేది కూడా వీరే. యదార్థానికి భూమ్యాకాశాలలోని నిధినిక్షేపాలన్నీ అల్లాహ్ యాజమాన్యంలోనివే.[16] కాని కపటులు అర్థం చేసుకోవటం లేదు.[17]

هُمُ الَّذِيْنَ يَقُوْلُوْنَ لَا تُنْفِقُوْا عَلٰى مَنْ عِنْدَ رَسُوْلِ اللّٰهِ حَتّٰى يَنْفَضُّوْا ۚ وَلِلّٰهِ خَزَآئِنُ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَلٰكِنَّ الْمُنٰفِقِيْنَ لَا يَفْقَهُوْنَ ⑦

8. వాక్చాతుర్యం వల్ల, భాషపైగల అపారమైన పట్టు వల్ల వారి మాటలు ఎదుటి వారిని ఇట్టే ఆకట్టుకుంటాయి.

9. వారు పైకి ఆరడుగుల అందగాళ్లుగా కనిపించినప్పటికీ, వారివల్ల సమాజానికి కలిగే ప్రయోజనం శూన్యమే. వారు గోడకు ఆసరాగా నిలబెట్టబడిన కొయ్యదుంగల వంటివారు. చూడటానికి అవి బొద్దుగా, అందంగానే ఉంటాయి. కాని వాటివల్ల చేకూరే లాభం ఏమిటి? ఈ కపటులు దైవప్రవక్త (సఅసం) సమావేశాల్లో కూర్చున్నప్పటికీ మంచి మాట ఏదీ వారి బుర్రకెక్కదు. గోడకు ఆనించిన కర్రల్లాగా కూర్చుంటారు వారు. ఏ విషయం అర్థం చేసుకోరు (ఫత్హుల్ ఖదీర్).

10. వీళ్లు ఒట్టి పిరికిపందలు. ఒక గట్టి కేక వినిపిస్తే చాలు – ఏ ఆపద ముంచుకు వచ్చిందోనని బెంబేలెత్తిపోతారు. గుమ్మడి కాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు, ఏ హెచ్చరిక వచ్చినా తమ పేరెక్కడ వస్తుందోనని తొట్రుపాటుకు లోనవుతూ ఉంటారు.

11. అంటే, క్షమాభిక్ష పట్ల కూడా వారికి ఏమాత్రం ఆసక్తి, ఆశాభావం ఉండదు.

12. అంటే – పిలిచేవారి పిలుపును వారు ఖాతరు చేయరు. లేదా దైవప్రవక్త (సఅసం) పిలుపును వారు లక్ష్యపెట్టరు.

13. తమ కాపట్య వైఖరిపై మొండికేసిన కారణంగా వారి రోగం బాగా ముదిరిపోయింది. కాబట్టి ఇప్పుడు వారి క్షమాపణ కోసం ప్రార్థించినా, ప్రార్థించకపోయినా వారికి ఒరిగేదేమీ ఉండదు.

14. వారు గనక ఒకవేళ ఈ కాపట్య రోగంతోనే మరణిస్తే దేవుని క్షమాభిక్ష వారికి లభించే ప్రసక్తే లేదు. అయితే వారు ప్రాపంచిక జీవితంలోనే తమ కాపట్యంపై పశ్చాత్తాపం చెంది, క్షమాపణ కోరుకుంటే అప్పుడేదన్నా అవకాశం ఉంటుంది.

8 "మనం గనక మదీనా నగరానికి తిరిగి వెళ్ళినట్లయితే, గౌరవనీయుడు అల్పుణ్ణి అక్కణ్ణుంచి వెళ్ళగొడతాడు"[18] అని వారు అంటున్నారు. నిజానికి గౌరవమైతే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు, విశ్వాసులకే చెందుతుంది.[19] కాని ఈ కపటులు తెలుసుకోవటం లేదు.[20]

يَقُولُونَ لَئِن رَّجَعْنَآ إِلَى ٱلْمَدِينَةِ لَيُخْرِجَنَّ ٱلْأَعَزُّ مِنْهَا ٱلْأَذَلَّ ۚ وَلِلَّهِ ٱلْعِزَّةُ وَلِرَسُولِهِۦ وَلِلْمُؤْمِنِينَ وَلَٰكِنَّ ٱلْمُنَٰفِقِينَ لَا يَعْلَمُونَ ⑧

9 ఓ విశ్వాసులారా! మీ సిరిసంపదలు, మీ సంతానం మిమ్మల్ని అల్లాహ్ ధ్యానం నుండి మరల్చరాదు.[21] ఎవరైతే అలా చేస్తారో వారే నష్టపోయేవారు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ لَا تُلْهِكُمْ أَمْوَٰلُكُمْ وَلَآ أَوْلَٰدُكُمْ عَن ذِكْرِ ٱللَّهِ ۚ وَمَن يَفْعَلْ ذَٰلِكَ فَأُو۟لَٰٓئِكَ هُمُ ٱلْخَٰسِرُونَ ⑨

---

15. ఒకానొక యుద్ధానికై ముస్లింలు మదీనా నుండి బయలుదేరారు. (మరీసీ లేక బనుల్ ముస్తలిక్ యుద్ధంగా చరిత్రకారులు దాన్ని పేర్కొంటారు). మార్గమధ్యంలో ఒక ముహాజిర్ వ్యక్తికీ – అన్సార్ వ్యక్తికి మధ్య ఏదో విషయంలో గొడవ జరిగింది. ఇరువురూ తమ తమ సహాయం కోసం తమ వర్గం వారిని పిలిచారు. అప్పుడు కపటుల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబై అన్సార్ వ్యక్తితో ఇలా అన్నాడు: "చూశావా! ఎంత చెప్పినా వినకుండా ముహాజిర్లకు సహాయం చేశారు. వాళ్ళను నెత్తినెక్కించుకున్నారు. దాని ఫలితమే ఇది. వీళ్లు ఇప్పటిదాకా మీ సొమ్ము తిని మీకే ఎసరుపెట్టేస్థితికి ఎదిగారు. అసలు వీళ్లకు (ముహాజిర్లకు) సహాయం ఆపేస్తే సరి. తిక్క కుదురుతుంది. ఎవరిదారి వాళ్లు చూసుకుంటారు." "(మర్యాదస్తులం అయిన) మేము ఈ అల్పులను (ముహాజిర్లను) మదీనా నగరం నుండి గెంటివేస్తాం" అని కూడా అన్నాడు ఆ కపటాగ్రేసరుడు. వాడి నీచమైన మాటలు హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) చెవిన పడ్డాయి. ఆయన ఈ సంగతిని దైవప్రవక్త (స) కు తెలియపరచారు. దైవప్రవక్త (స) అబ్దుల్లా బిన్ ఉబైని పిలిచి విచారిస్తే, 'అబ్బే, నేనలా అనలేదే!' అన్నాడు. ఆ క్షణంలో హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ ఎంతో ఆవేదనకు లోనయ్యారు. ఆయన (రజి) సమాచారంలోని సత్యతను ధృవీకరించడానికి అల్లాహ్ ఈ సూరాను అవతరింపజేసి కపటుల బండారాన్ని బట్టబయలు చేశాడు. (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ మునాఫిఖూన్).

16. ఎందుకంటే ముహాజిర్ల ఉపాధి ప్రదాత అయినా, అన్సార్ల ఉపాధి ప్రదాత అయినా అల్లాహ్‌యే. ధనాగారాలు, ధాన్యాగారాలన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన తాను కోరిన వారికి కోరినంతగా ఇస్తాడు. కాబట్టి ముహాజిర్లకు ఆర్థికంగా చేయూత ఇచ్చినంతమాత్రాన ఆ విషయాన్ని పదే పదే ఎత్తిచూపవలసిన అవసరం లేదని ఇక్కడ బోధించబడింది.

17. ఈ వాస్తవం కపటుల బుర్రకెక్కితే ఇలాంటి చవుకబారు మాటలు పలికేవారు కాదు. అన్సార్ సోదరులు ముహాజిర్లను అడుగడుగునా ఆదుకోబట్టే ముహాజిర్లు బలపడ్డారని, ఆర్థిక సహకారాన్ని నిలిపివేస్తే తిండిలేక చస్తారని ఈ కపటులు అనుకుంటున్నారు. ఎంత నీచమైన ఆలోచన వారిది!?

18. ఈ మాటల్ని అన్నది ఎవరో కాదు, కపటాగ్రేసరుడైన అబ్దుల్లా బిన్ ఉబైనే. 'గౌరవనీయులు' అంటే తనూ, తన వెంటనున్న కపట సహచరులు అని వాడి ఉద్దేశం. 'అల్పులు' అంటే దైవప్రవక్త (దైవం మన్నించుగాక!) మరియు ఆయన వెంట వున్న ముహాజిర్ ముస్లింలు అన్నమాట!

19. గౌరవోన్నతులు వాస్తవానికి అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆపైన ఆయన తాను కోరిన వారికి కోరినంతగా ఈ గౌరవోన్నతుల్ని ప్రసాదిస్తాడు. ఆయన తన సందేశహరునికి (స), అతనిని విశ్వసించిన ముస్లిములకు గౌరవాన్ని ప్రసాదించాడు కూడా. అవిధేయులకు, ఆత్మవంచన చేసుకునే వారికి ఆయన గౌరవం వొసగడు.

ఈ విధంగా ఈ ఆయతులో దేవుడు కపటుల కారుకూతలను ఖండించాడు. కపటులు తమను తాము గౌరవనీయులుగా

10 మీలో ఎవరికయినా చావు వచ్చి, "నా ప్రభూ! నాకు మరి కొంత గడువు ఎందుకు ఇవ్వలేదు?[22] (ఇస్తే) నేను కూడా దాన ధర్మాలు చేసి సజ్జనులలో చేరేవాణ్ణి కదా!" అని (కడు దీనంగా) పలికే దుస్థితి దాపురించకముందే మేము మీకు ప్రసాదించిన దాని నుండి (మా మార్గంలో) ఖర్చు చేయండి.[23]

وَأَنفِقُوا مِن مَّا رَزَقْنَاكُم مِّن قَبْلِ أَن يَأْتِيَ
أَحَدَكُمُ الْمَوْتُ فَيَقُولَ رَبِّ لَوْلَا أَخَّرْتَنِي إِلَىٰ
أَجَلٍ قَرِيبٍ فَأَصَّدَّقَ وَأَكُن مِّنَ الصَّالِحِينَ ⑩

11 ఏ ప్రాణికైనా, దాని నిర్ధారిత సమయం ఆసన్నమైందంటే, ఇక అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ దానికి గడువు ఇవ్వడు. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

وَلَن يُؤَخِّرَ اللَّهُ نَفْسًا إِذَا جَاءَ أَجَلُهَا ۚ
وَاللَّهُ خَبِيرٌ بِمَا تَعْمَلُونَ ⑪

అభివర్ణించుకున్నంత మాత్రాన వారికి గౌరవమర్యాదలు ప్రాప్తం కావని, గౌరవమర్యాదలకు అర్హులైన వారికి మాత్రమే దేవుడు వాటిని అనుగ్రహిస్తాడని స్పష్టం చేయటం జరిగింది.

20. అందుకే వారు అడుగడుగునా తప్పటడుగులు వేసి, తమ వినాశాన్ని తామే కొనితెచ్చుకుంటున్నారు. వారికే గనక ఈ సత్యం తెలిసివుంటే వారి ప్రవర్తన కూడా హుందాగా ఉండేదే.

21. అంటే ఆస్తిపాస్తుల, కన్నపిల్లల ప్రేమలోపడి మీరు దైవాజ్ఞలను మరచిపోకూడదు. ఆలుబిడ్డల కోర్కెల్ని తీర్చే తాపత్రయంలో దేవుడు విధించిన ధర్మాధర్మాలను (హలాల్– హరామ్‌లను) విస్మరించకూడదు. కపటుల ప్రస్తావన ముగిసిన వెంటనే ముస్లిములకు ఈ హెచ్చరిక చేయటం గమనార్హం. ఓ ముస్లింలారా! జాగ్రత్త! మీరు కూడా కపటుల మాదిరిగా ధనాశలోపడి దైవధ్యానం పట్ల అలసత్వం ప్రదర్శిస్తారేమో! ఒకవేళ ఆ జబ్బు గనక మీలో తిష్ఠవేసిందంటే మీరు కూడా నష్టపోవలసి ఉంటుంది సుమా! అని దేవుడు హెచ్చరిస్తున్నాడు.

22. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే జకాత్ వంటి విధి దానాల చెల్లింపులోనూ, స్వచ్ఛంద దానధర్మాల విషయంలోనూ, ఆర్థికస్థోమత ఉన్నప్పుడు హజ్ యాత్ర చేసే విషయంలోనూ మనిషి జాప్యం చేయకూడదు. ఎందుకంటే మృత్యువు ఏ క్షణంలో కబళిస్తుందో తెలీదు. అది వచ్చిపడినపుడు మనిషి ఏం చేయాలనుకున్నా చేయలేదు.

23. ఇక్కడ ఖర్చు చేయటమంటే, తమపై విధిగా చేయబడిన 'జకాత్'ను చెల్లించటం, ఇతర దానాలను చేయటం అని అర్థం.

64వ సూరా

# అత్ తగాబున్

## గెలుపోటములు

అవతరణ మదీనాలో

ఆయతులు 18

### పరిచయం

*ఏక దైవారాధన, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, ప్రళయం, తీర్పుదినం ముఖ్యంగా ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చాయి. ఈ సూరా 9వ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన గెలుపోటములు అన్న పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది.*

*అల్లాహ్ మానవులను సృష్టించి వారికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు. సత్యాన్ని స్వీకరించడం లేదా తిరస్కరించడం వారి యిష్టా యిష్టాలకు వదిలివేసాడు. కొందరు దైవభీతిని అనుసరించారు. సత్యాన్ని స్వీకరించారు. అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉన్నారు. కాగా ఇతరులు సత్యాన్ని తిరస్కరించారు. అల్లాహ్ పట్ల కృతఘ్నులైపోయారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరుగుతుందనీ, మానవులను సృష్టించి వారికి నిర్దిష్టమైన ఆకారం ఇచ్చిన అల్లాహ్‌కు, భూమ్యాకాశాలను సృష్టించిన అల్లాహ్‌కు, మనం దాచిన విషయాలు, మనం ప్రకటించే విషయాలు అన్ని తెలిసిన అల్లాహ్‌కు మరణించిన వారిని మళ్ళీ లేపడం తేలికనీ ఈ సూరా విస్పష్టంగా తెలిపింది. అల్లాహ్‌కు భయపడాలని, ఆయనకు విధేయత చూపాలని, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు విధేయత చూపాలని, మంచి పనులు చేయాలని, దాన ధర్మాలు చేయాలని ఈ సూరా ప్రబోధించింది. ప్రాపంచిక సంపద, సంతానం మనిషికి పరీక్షలనీ తెలుపుతూ, కుటుంబం, వ్యాపారాలు అల్లాహ్ స్మరణను మరిచిపోయే స్థాయిలో అనుబంధాలు పెంచుకోరాదని హెచ్చరించింది. ఆ విధంగా వారు తమ విశ్వాసానికి, తమ విలువలకు ద్రోహం చేసిన వారవుతారని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా గత కాలాలకు చెందిన ప్రజలు, సత్యాన్ని తిరస్కరించిన వారు ఎలాంటి వినాశానికి గురయ్యారో, ఎలాంటి శిక్ష వారిని చుట్టుముట్టిందో గుర్తుచేయడం జరిగింది.*

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 5,6 | 14, 21, 25, 50, 81, 83 | 'దైవప్రవక్త నూహ్' 'దైవప్రవక్త హూద్' 'దైవ ప్రవక్త సాలిహ్' 'దైవ ప్రవక్త లూత్' 'దైవప్రవక్త షుఐబ్' 'దైవప్రవక్త మూసా' | గత కాలపు ఎన్నదగిన ప్రవక్తల జీవిత విశేషాలన్నీ ధారావాహికంగా ఇక్కడ లభ్యమవుతాయి. ఏయే జాతుల వారి వద్దకు అల్లాహ్ ఏయే ప్రవక్తలను పంపించాడు? ఆయా ప్రవక్తలకు తమ జాతి ప్రజల నుంచి ఏం సమాధానం లభించింది? విశ్వాసులను అల్లాహ్ ఏ విధంగా కాపాడాడు? తిరస్కారులను ఎలా శిక్షించాడు? – ప్రతిదీ తెలుసుకోవచ్చు. |

## అత్ తగాబున్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** భూమ్యాకాశాలలో ఉన్నవన్నీ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతున్నై.[1] సర్వసత్తాధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకే శోభాయమానం.[2] ఆయన అన్నింటిపై అధికారం కలవాడు.

**2** మిమ్మల్ని సృష్టించినవాడు ఆయనే. మరి మీలో కొందరు అవిశ్వాసులుగా ఉంటే మరికొందరు విశ్వాసులుగా ఉన్నారు. మీరు చేసేదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు.[3]

**3** ఆయన ఆకాశాలనూ, భూమినీ (న్యాయంతో), సమతూకం (సత్యం)తో సృష్టించాడు.[4] మరి (ఆయన) మీ రూపురేఖలను తీర్చిదిద్దాడు. మీకు చాలా మంచి రూపమిచ్చాడు.[5] కడకు చేరుకోవలసింది ఆయన వద్దకే.[6]

## سُورَةُ التَّغَابُنِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

يُسَبِّحُ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۚ لَهُ الْمُلْكُ وَلَهُ الْحَمْدُ ۫ وَهُوَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ①

هُوَ الَّذِيْ خَلَقَكُمْ فَمِنْكُمْ كَافِرٌ وَّمِنْكُمْ مُّؤْمِنٌ ؕ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ②

خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ بِالْحَقِّ وَصَوَّرَكُمْ فَاَحْسَنَ صُوَرَكُمْ ۚ وَاِلَيْهِ الْمَصِيْرُ ③

---

1. అంటే – భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి జీవరాసి దేవుని స్తోత్రం చేస్తున్నది. ఆయన ఏ లోపమూ లేనివాడని, సర్వ స్తోత్రములకు అర్హుడని తమ తమ భాషలలో చాటి చెబుతున్నాయి.

2. వాస్తవానికి సార్వభౌమత్వం ఆయనదే. ఈ లోకంలో ఎవరికైనా ఏదైనా అధికారం ఉంటే అది ఆయన ఇచ్చినదే. మరెవరికైనా అందం, ఐశ్వర్యం వంటి సంపదలు ఉన్నా అవి కూడా దైవప్రసాదితాలే. కాబట్టి స్తోత్రం కూడా ఆయనకే చెందాలి.

3. దేవుడు మనిషి ముందు రెండు మార్గాలుంచాడు. అదే మంచీ లేక చెడు. మేలు లేక కీడు. విశ్వాసం లేక అవిశ్వాసం. వాటి పరిణామాన్ని కూడా వివరించిన తరువాత మనిషి తనకు నచ్చిన మార్గాన్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛాధికారం వొసగాడు. ఈ విషయంలో దేవుడు మనిషిపై ఎలాంటి బలవంతం చేయలేదు. నిర్బంధం పెట్టలేదు. ఒకవేళ దేవుడే గనక మనిషిపై నిర్బంధం పెట్టి ఉంటే ప్రపంచంలో ఏ ఒక్కరూ పాపాత్ముడుగా, అవిశ్వాసిగా ఉండేవాడు కాదు. ఒకవేళ అదే గనక జరిగి ఉంటే; మానవుణ్ణి దేవుడు పరీక్షించే నిమిత్తం చావుబ్రతుకుల వ్యవస్థను ఉంచాడన్న (అల్ ముల్క్ – 2) దానికి అర్థమే ఉండేది కాదు.

   దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే 'అవిశ్వాసి'ని సృష్టించినవాడు దేవుడైనప్పుడు, 'అవిశ్వాసాన్ని' సృష్టించినవాడు కూడా దేవుడే. అయితే ఈ అవిశ్వాసం ఆ వ్యక్తి పోగుచేసుకున్న సంపాదనే అనబడుతుంది. ఎందుకంటే అతను తన ఇచ్ఛతో, తన సంకల్పంతోనే దాన్ని ఆర్జించాడు. అదేవిధంగా విశ్వాసిని, విశ్వాసాన్ని సృష్టించినవాడు కూడా దేవుడే. అయితే ఈ విశ్వాసం విశ్వాసి కూడబెట్టిన సంపదగా పరిగణించబడుతుంది. ఈ సంపాదన లేక ఆచరణ ఆధారంగానే ఇరువురికీ (విశ్వాసులకు – అవిశ్వాసులకు) 'ప్రతిఫలం' లభిస్తుంది. ఎందుకంటే దేవుడు తన దాసుల ఆచరణను గమనిస్తూ ఉన్నాడు.

4. కాబట్టి ఈ 'సమతూకం' (న్యాయం, సత్యం) వాంఛించేది ఏమిటంటే మంచివారికి వారుచేసిన మంచికిగాను పుణ్యఫలం లభించాలి. చెడ్డవారికి వారి చెడు పనులకుగాను శిక్ష లభించాలి. దేవుడు అంతిమ దినాన ఈ మేరకు తీర్పుచేసి న్యాయం ప్రకారం ఎవరికి ఏం ఇవ్వాలో అది ఇస్తాడు.

**4** భూమ్యాకాశాలలో ఉండే వాటన్నింటి గురించి ఆయనకు తెలుసు. మీరు దాచేదీ, బహిర్గతం చేసేదీ (అంతా) ఆయనకు తెలుసు. అల్లాహ్ గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు.[7]

يَعْلَمُ مَا فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ وَيَعْلَمُ مَا تُسِرُّوْنَ وَمَا تُعْلِنُوْنَ ؕ وَاللّٰهُ عَلِيْمٌۢ بِذَاتِ الصُّدُوْرِ ④

**5** ఏమిటి, ఇంతకుమునుపు తిరస్కార వైఖరికి పాల్పడిన వారి సమాచారం మీకు చేరలేదా? వారు తమ ఆగడాల దుష్పరిణామాన్ని చవిచూశారు.[8] వారి కొరకు బాధాకరమైన శిక్ష ఉన్నది.[9]

اَلَمْ يَاْتِكُمْ نَبَؤُا الَّذِيْنَ كَفَرُوْا مِنْ قَبْلُ ۫ فَذَاقُوْا وَبَالَ اَمْرِهِمْ وَلَهُمْ عَذَابٌ اَلِيْمٌ ⑤

**6** ఎందుకంటే,[10] వారి దగ్గరకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చినప్పుడు, "ఏమిటీ, మానవమాత్రులు మాకు మార్గదర్శకత్వం వహిస్తారా?"[11] అని వారు (చులకనగా) మాట్లాడారు. ఆ విధంగా వారు (సత్యాన్ని) తిరస్కరించారు.[12] ముఖాలు త్రిప్పుకున్నారు.[13] మరి అల్లాహ్ కూడా వారిని పట్టించుకోలేదు.[14] అల్లాహ్ నిరపేక్షాపరుడు.[15] అన్ని విధాలా ప్రశంసనీయుడు.[16]

ذٰلِكَ بِاَنَّهٗ كَانَتْ تَّاْتِيْهِمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ فَقَالُوْٓا اَبَشَرٌ يَّهْدُوْنَنَا ۫ فَكَفَرُوْا وَتَوَلَّوْا وَّاسْتَغْنَى اللّٰهُ ؕ وَاللّٰهُ غَنِيٌّ حَمِيْدٌ ⑥

---

5. దేవుడు మీకు అందచందాలను ఇచ్చాడు. మీ ఎత్తును, శరీరాకృతిని అద్భుతంగా మలిచాడు. ఈ విషయమే మరోచోట ఇలా అనబడింది : "ఓ మనిషీ! దయాశీలి అయిన నీ ప్రభువు విషయంలో నిన్ను మోసపుచ్చినది ఏది? చూడబోతే నిన్ను పుట్టించినవాడు, ఏ లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దినవాడు, నిన్ను తగురీతిలో పొందికగా మలచినవాడు, తాను కోరిన ఆకృతిని నీకు ప్రసాదించినవాడు ఆయనే కదయ్యా!" (ఇన్ఫితార్ : 6 – 8)

   "మీ రూపురేఖలను తీర్చిదిద్దినవాడు, దానిని ఎంతో అందంగా మలచినవాడు, పరిశుభ్రమైన ఉపాధిని మీకు ప్రసాదించినవాడు అల్లాహ్‌యే కదా!" (అల్ మూ'మిన్ – 64)

6. ఆయన్ని చేరుకోవటం తప్ప మార్గాంతరం లేదు. ఆయన పట్టునుంచి రక్షించేవారు కూడా ఎవరూ లేరు.

7. ఆయన జ్ఞానపరిధి బహు విస్తృతమైనది. అది భూమ్యాకాశాలన్నింటినీ పరివేష్టించి ఉన్నది. ఆయన ఆంతర్యాల్లో జనించే ప్రేరణలను గురించి కూడా తెలుసుకోగలడు.

8. అరేబియాలోని అవిశ్వాసుల్ని – ముఖ్యంగా మక్కావారిని ఉద్దేశించి చెప్పబడిన మాటలివి. అంతకు మునుపు అవిశ్వాస వైఖరికి పాల్పడిన వారంటే నూహు జాతివారు, ఆద్ జాతివారు, సమూద్ తదితర జాతుల వారని భావం. వారు తమ దురాగతాల మూలంగా, అవిశ్వాస వైఖరి కారణంగా దైవాగ్రహానికి పాత్రులై నాశనం చేయబడ్డారు.

9. ప్రపంచంలో పడిన శిక్ష ఒక్కటే కాదు, పరలోకంలో కూడా వారికోసం వ్యథాభరితమైన శిక్ష సిద్ధంగా ఉంది.

10. అంటే వారికి ఇహపరాలలో పడిన (పడే) శిక్షకు కారణమేమిటంటే....

11. అదీ వారి తిరస్కార వైఖరికి కారణం! తమ లాంటి ఒక మనిషి తమకు మార్గం చూపటమేమిటి? తమ లాగా అన్నం తినే, తమ లాగా దైనందిన జీవితావసరాలను తీర్చుకునే వ్యక్తి తమకు దర్శకత్వం వహించటం వారి ఊహకందని విషయం అయింది. అంతెందుకు, నేటికీ కొంతమంది బిద్అతీలు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారిని మానవమాత్రునిగా అంగీకరించటానికి సిద్ధంగా లేరు. అల్లాహ్ వారికి సద్బుద్ధిని వొసగుగాక!

12. అందుకే వారు దైవప్రవక్తలను దైవసందేశహరులుగా ఒప్పుకోవటానికి, ధృవీకరించటానికి నిరాకరించారు.

7 తాము మరణించిన పిదప తిరిగి బ్రతికించబడటం అనేది ఎట్టి పరిస్థితిలోనూ జరగని పని అని అవిశ్వాసులు తలపోస్తున్నారు.[17] (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఎందుకు జరగదు? నా ప్రభువు తోడు! మీరు తప్పకుండా మళ్లీ లేపబడతారు.[18] మీరు చేసినదంతా మీకు తెలియపరచబడుతుంది.[19] ఇలా చేయటం అల్లాహ్‌కు చాలా తేలిక."[20]

زَعَمَ الَّذِيْنَ كَفَرُوْٓا اَنْ لَّنْ يُّبْعَثُوْا ؕ قُلْ بَلٰى وَرَبِّىْ لَتُبْعَثُنَّ ثُمَّ لَتُنَبَّؤُنَّ بِمَا عَمِلْتُمْ ؕ وَذٰلِكَ عَلَى اللّٰهِ يَسِيْرٌ ⑦

8 కాబట్టి మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను,[21] మేము అవత రింపజేసిన జ్యోతిని విశ్వసించండి.[22] మీరు చేసే ప్రతి పనినీ అల్లాహ్ కనిపెట్టుకుని ఉన్నాడు.

فَاٰمِنُوْا بِاللّٰهِ وَرَسُوْلِهٖ وَالنُّوْرِ الَّذِىْٓ اَنْزَلْنَا ؕ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ خَبِيْرٌ ⑧

9 ఏ రోజున ఆయన మిమ్మల్నందరినీ సమీకరణ జరిగే రోజుకై[23] సమీకరిస్తాడో అది గెలుపోటముల రోజై ఉంటుంది.[24] ఎవరయితే అల్లాహ్‌ను విశ్వసించి, సదాచరణ చేస్తారో అల్లాహ్ వారి

يَوْمَ يَجْمَعُكُمْ لِيَوْمِ الْجَمْعِ ذٰلِكَ يَوْمُ التَّغَابُنِ ؕ وَمَنْ يُّؤْمِنْۢ بِاللّٰهِ وَيَعْمَلْ صَالِحًا يُّكَفِّرْ عَنْهُ

13. అంటే, వారు దైవప్రవక్తలను ఏమాత్రం ఖాతరు చేయలేదు. వారు అందజేసే సందేశాన్ని గురించి ఏకాస్త కూడా ఆలోచించలేదు.

14. అంటే వారి విశ్వాసానికి, వారి ఆరాధనలకు సంబంధించి అల్లాహ్ కూడా శ్రద్ధ తీసుకోలేదు.

15. ఎవరు ఆయన్ని ఆరాధించినా, మరెవరు ఆయన్ని ధిక్కరించినా ఆయనకు కలిగే లాభంగానీ, నష్టంగానీ ఏమీలేదు.

16. ఆయన స్వతహాగా కూడా ప్రశంసనీయుడే. సమస్త జీవరాసుల చేత కూడా కొనియాడ బడుతున్నవాడే.

17. తాము తిరిగి బ్రతికించబడేది లేదన్న అవిశ్వాసుల వాదన పసలేనిది. వారి తలంపు వెనుక బలమైన ఆధారం ఏదీ లేదు. పైగా వారు గాలి మేడలు కడుతున్నారు.

18. అల్లాహ్ మానవుల్ని తప్పకుండా తిరిగి బ్రతికిస్తాడని ప్రభువుపై ప్రమాణం చేసి చెప్పవలసిందిగా దివ్య ఖుర్ఆన్‌లో మూడుసార్లు తన ప్రవక్తకు ఆజ్ఞాపించాడు. ఇంతకుముందు ఒకచోట యూనుస్ సూరా 53వ ఆయతులోనూ, మరోచోట సబా సూరాలోని మూడవ ఆయత్‌లోనూ ఈ ప్రమాణం గురించి వచ్చింది.

19. ఇంతకీ మానవులందరినీ తిరిగి బ్రతికించటం మరియు తీర్పుదినాన్ని నిర్ధారించటంలోని ప్రధాన ఉద్దేశం ఏమిటంటే, అక్కడ ప్రతి ఒక్కరికీ తాము ఏమేం చేశారో తెలియాలి. ప్రతి ఒక్కరికీ వారి పనులనుబట్టి 'ప్రతిఫలం' లభించాలి. ఎందుకంటే ప్రాపంచిక జీవితంలో ఈ ప్రతిఫలం పూర్తిగా లభించకపోవచ్చు. మరికొందరికి అసలు ఏమీ లభించక పోవచ్చు. మరి తీర్పుదినాన సంపూర్ణ ప్రతిఫలం లభించకపోయినట్లయితే ఈ ప్రాపంచిక జీవితానికి అర్థమే ఉండదు. పైగా ఇదొక ఆషామాషీ వ్యవహారమైపోతుంది. కాగా; అల్లాహ్ ఇలాంటి లోపభూయిష్టమైన వాటన్నింటికీ అతీతుడు, ఉన్నతుడు. న్యాయశీలుడు.

20. ఈ **'మరణానంతర జీవితం'** మానవులకు అసాధ్యం అనిపిస్తే అనిపించవచ్చుగాని అల్లాహ్‌కు మాత్రం ఇది చాలా సులభసాధ్యం.

21. అసలు విషయం తేటతెల్లమైన తర్వాత మీరు దైవాన్ని, దైవప్రవక్తను విశ్వసించి, ఈ విషయాలన్నింటినీ సత్యమని ధృవీకరించటం వినా మార్గాంతరం లేదు.

22. ఆయన (స)తో పాటు పంపబడిన ఈ 'జ్యోతి' దివ్య ఖుర్ఆన్. దాని ద్వారా అంధకారం పటాపంచలై కాంతిరేఖలు ప్రసరిస్తాయి.

سَيِّاٰتِهٖ وَيُدْخِلْهُ جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا
الْاَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا ۭ ذٰلِكَ الْفَوْزُ
الْعَظِيْمُ ⑨

పాపాలను వారి నుండి దూరం చేస్తాడు. క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) తోటలలో వారికి ప్రవేశం కల్పిస్తాడు. వారందులో కలకాలం ఉంటారు. గొప్ప సాఫల్యం ఇదే.

وَالَّذِيْنَ كَفَرُوْا وَكَذَّبُوْا بِاٰيٰتِنَآ اُولٰۗىِٕكَ
اَصْحٰبُ النَّارِ خٰلِدِيْنَ فِيْهَا ۭ وَبِئْسَ الْمَصِيْرُ ⑩

**10** మరెవరయితే తిరస్కారానికి పాల్పడ్డారో, మా ఆయతులను ధిక్కరించారో వారే నరకవాసులు. వారు నరకంలో కలకాలం ఉంటారు. అది చాలా చెడ్డ గమ్యస్థానం.

مَآ اَصَابَ مِنْ مُّصِيْبَةٍ اِلَّا بِاِذْنِ اللّٰهِ ۭ وَمَنْ
يُّؤْمِنْۢ بِاللّٰهِ يَهْدِ قَلْبَهٗ ۭ وَاللّٰهُ بِكُلِّ شَيْءٍ
عَلِيْمٌ ⑪

**11** అల్లాహ్ అనుమతి లేనిదే ఏ ఆపదా రాదు.[25] ఎవడు అల్లాహ్‌ను విశ్వసిస్తాడో అతని హృదయానికి అల్లాహ్ (సరైన దిశలో) మార్గదర్శకత్వం వహిస్తాడు.[26] అల్లాహ్ అన్ని విషయాలూ తెలిసినవాడు.

23. ప్రళయదినాన్ని **'సమీకరణ దినం'** (యౌముల్ జమా)గా పేర్కొనటం జరిగింది. ఎందుకంటే ఆ దినాన మానవులంతా ఒకేచోట సమీకరించబడతారు. దైవదూత పిలువగానే వారంతా అతని పిలుపును వింటారు. అందరి చూపులు చివరి హద్దుల దాకా చేరుకుంటాయి. ఎందుకంటే మధ్యలో ఏ వస్తువూ అడ్డుగా ఉండదు. ఆ విషయమే మరోచోట ఇలా అనబడింది : 1. "అది సర్వమానవులు సమావేశమయ్యే రోజు. ఆ రోజు జరిగేదంతా అందరి కళ్లముందే జరుగుతుంది." (హూద్ – 103). 2. "నిశ్చయంగా పూర్వీకులు, తరువాతి వారు – అందరూ ఒకరోజు తప్పకుండా సమీకరించబడతారు. దాని కాలం కూడా నిర్ధారితమై ఉంది." (అల్ వాఖియ – 49, 50).

24. అంటే ఒక వర్గం విజయం సాధించగా, మరో వర్గం ఓటమి పాలవుతుంది. విశ్వాసులు అవిశ్వాసులపై విజయం సాధిస్తారు. విధేయులు అవిధేయులపై గెలుస్తారు. విశ్వాసులను వరించే అతిగొప్ప విజయం ఏమిటంటే వారు స్వర్గంలో ప్రవేశింపజేయబడతారు. నరకవాసుల గొప్ప గొప్ప భవంతులు, బంగళాలన్నీ స్వర్గవాసుల స్వాధీనమవుతాయి. నరకవాసులు నరకానికి గొనిపోయే కార్యాలు చేసివుండకపోతే స్వర్గంలోని ఆ భవంతులు, బంగళాలన్నీ వారికే దక్కి ఉండేవి. ఆనాడు నరకవాసులకు దక్కే అతిపెద్ద అవమానం ఏమిటంటే వారు నరకానికి ఆహుతి కావలసి ఉంటుంది. ఎందుకంటే వారు ప్రపంచంలో అడ్డగోలుగా వ్యవహరించారు. దైవానుగ్రహాలను దుర్వినియోగ పరిచారు. తమ గర్వాహంకారం తమ పాలిట ఎలా చేటుగా పరిణమించిందో ఆనాడు అవిశ్వాసులు, పాపాత్ములు తెలుసుకుంటారు. ఆనాడు విశ్వాసులకు కూడా ఒక సత్యం తెలిసివస్తుంది – అదేమంటే తాము గనక ప్రాపంచిక జీవితంలో మరిన్ని సత్కార్యాలు చేసివుంటే స్వర్గంలో తమకు మరిన్ని గొప్ప తరగతులు లభించి ఉండేవని! **'గబన్'** (**غبن**) అనే పదానికి నష్టం అన్న అర్థం కూడా ఉంది. దాని ప్రకారం 'యౌముత్తగాబున్'ను 'నష్టం కలిగే రోజు' అని కూడా అనువదించవచ్చు. పైన ఆయతులో దీన్నే 'గెలుపోటముల రోజు'గా అనువదించటం జరిగింది.

25. అంటే – అది రాసిపెట్టి ఉంటేనే సంభవిస్తుంది. మరి కొంతమంది ప్రకారం అవిశ్వాసుల సందేహానికి సమాధానంగా ఈ ఆయతు అవతరించింది. "ఒకవేళ ముస్లింలు అవలంబించే మార్గం సత్యమార్గమైతే వారిపై ఇన్ని కష్టాలు ఎందుకు వస్తాయి?" అని అవిశ్వాసులు సందేహపడేవారు (ఫత్‌హుల్ ఖదీర్).

26. అంటే – తనకు ఏ కష్టనష్టం వచ్చినా అది దైవేచ్ఛతోనే వచ్చిందన్న సంగతిని అతను తెలుసుకుని దానిపై సహనం వహిస్తాడు. అటువంటి వ్యక్తికి అల్లాహ్ మనోబలాన్ని ప్రసాదిస్తాడు. ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అంటున్నారు : అల్లాహ్ అతని హృదయంలో నమ్మకాన్ని గట్టిగా నాటుతాడు. దాంతో అతను, తనపై రావలసి ఉన్న ఆపద ఏదీ తన నుండి తొలగిపోదని, తొలగిపోవలసిన ఆపద ఎన్నటికీ తనపై రాదని గట్టిగా నమ్ముతాడు (ఇబ్నె కసీర్).

**12** (ప్రజలారా!) మీరు అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త మాటను వినండి. ఒకవేళ మీరు విముఖత చూపితే, మా ప్రవక్త బాధ్యతల్లా స్పష్టంగా విషయాన్ని చేరవేయటమే.[27]

وَاَطِيْعُوا اللّٰهَ وَاَطِيْعُوا الرَّسُوْلَ ۚ فَاِنْ تَوَلَّيْتُمْ فَاِنَّمَا عَلٰى رَسُوْلِنَا الْبَلٰغُ الْمُبِيْنُ ﴿12﴾

**13** అల్లాహ్! ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేదు. విశ్వసించిన వారు అల్లాహ్‌ను మాత్రమే నమ్ముకోవాలి.[28]

اَللّٰهُ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ ۗ وَعَلَى اللّٰهِ فَلْيَتَوَكَّلِ الْمُؤْمِنُوْنَ ﴿13﴾

**14** ఓ విశ్వాసులారా! మీ భార్యలలో, మీ బిడ్డలలో కొందరు మీకు శత్రువులు.[29] కాబట్టి వారి పట్ల అప్రమత్తంగా ఉండండి.[30] ఒకవేళ మీరు గనక ఉపేక్షించి, క్షమించి, సడలింపుల వైఖరిని అవలంబించినట్లయితే అల్లాహ్ క్షమించేవాడు, దయదలిచే వాడు.[31]

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْۤا اِنَّ مِنْ اَزْوَاجِكُمْ وَاَوْلَادِكُمْ عَدُوًّا لَّكُمْ فَاحْذَرُوْهُمْ ۚ وَاِنْ تَعْفُوْا وَتَصْفَحُوْا وَتَغْفِرُوْا فَاِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿14﴾

**15** మీ సిరిసంపదలు, మీ సంతానం నిజానికి మీ పాలిట ఒక పరీక్ష.[32] గొప్ప ప్రతిఫలమైతే అల్లాహ్ వద్ద ఉన్నది.[33]

اِنَّمَاۤ اَمْوَالُكُمْ وَاَوْلَادُكُمْ فِتْنَةٌ ۗ وَاللّٰهُ عِنْدَهٗۤ اَجْرٌ عَظِيْمٌ ﴿15﴾

27. మీరు మా ప్రవక్త మాటను వినకపోయినంత మాత్రాన అతనికి చేకూరే నష్టం ఏమీ ఉండదు. అతని పనల్లా సందేశాన్ని అందజేయటమే. అల్లాహ్ బాధ్యతల్లా ప్రవక్తను పంపటం, ప్రవక్త బాధ్యతల్లా దైవసందేశాన్ని ప్రచారం చేయటం, ప్రజల బాధ్యతల్లా ఆ సందేశాన్ని శిరసావహించటం అని ఇమామ్ జుహ్రీ అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

28. అంటే – వారు తమ వ్యవహారాలన్నీ అల్లాహ్ వైపుకే మరలించాలి. ఆయనపైనే భరోసా ఉంచాలి. ఆయనపైనే ఆధారపడాలి. ఆయన్నే అర్థించాలి. ఎందుకంటే ఆయన తప్ప మరొకరెవరూ గండం నుంచి గట్టెక్కించలేరు. ఆయన తప్ప ఇంకొకరెవరూ దాసుల అవసరాలు తీర్చలేరు.

29. వారు గనక మీకు సత్కార్యాలలో అడ్డు తగిలినా, దైవవిధేయతా మార్గంలో మీకు ఆటంకాలు సృష్టించినా వారు మీకు శత్రువులుగా పరిణమించినట్లే. ఒకవేళ మీరు వారిని ఎంతగా ప్రేమించినా, వారిని మీ శ్రేయోభిలాషులుగా భావించినాసరే పారలౌకికంగా వారు మిమ్మల్ని వినాశంపాలు చేసినట్లే.

30. అంటే మీరు వారి అడుగుజాడల్లో నడవకండి. వారు డిమాండు చేసిన ప్రతి కోర్కెను తీర్చకండి. ఈ సందర్భంగా ధర్మాధర్మాలను గురించి బాగా ఆలోచించండి. మీరు మీ ఆలుబిడ్డల వెనుక పరుగెత్తడం మానుకుని, వారు మీ అడుగుజాడలలో నడుచుకునేలా చేయండి.

31. ఈ ఆయతు పూర్వాపరాలు ఇవి : మక్కాలో ఇస్లాం స్వీకరించిన కొంతమంది ముస్లింలు దైవమార్గంలో మక్కానుండి మదీనాకు వలసపోవాలని సంకల్పించుకున్నారు. కాని వారు నగర ప్రస్థానం చేయడానికి ఆలుబిడ్డలు ఒప్పుకోలేదు. భార్యాబిడ్డల ప్రేమానురాగాలు అడ్డు తగలడంతో వారు వలస (హిజ్రత్) సంకల్పాన్ని వాయిదా వేసుకున్నారు. కాని కొంతకాలం తర్వాత వారు దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి చూస్తే, హిజ్రత్ చేసిన ముస్లింలు ధార్మికంగా ఎంతో ముందంజవేసినట్లు కనిపించారు. అప్పుడు వారు తమ పొరపాటును తెలుసుకున్నారు. ధర్మమార్గంలో అడ్డుతగిలిన తమ ఆలుబిడ్డలపై వారికి కోపం వచ్చింది. ధార్మికంగా తమను నష్టపరచిన ఆలుబిడ్డలను శిక్షించాలనుకున్నారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి, వారి తప్పును మన్నించాలని, సర్దుకుపోవాలని తాకీదు చేశాడు (సుననె తిర్మిజీ – తగాబున్ సూరా వ్యాఖ్యానం).

**16** కాబట్టి శాయశక్తులా మీరు అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. (ఆజ్ఞలను) వినండి, విధేయత చూపండి.[34] (దైవ మార్గంలో) ఖర్చుచేస్తూ ఉండండి. ఇది స్వయంగా మీకే శ్రేయస్కరం.[35] ఎవరయితే తమ ఆత్మ లోభత్వం నుండి రక్షించబడ్డారో వారే సాఫల్య భాగ్యం పొందినవారు.

فَاتَّقُوا اللّٰهَ مَا اسْتَطَعْتُمْ وَاسْمَعُوْا وَاَطِيْعُوْا
وَاَنْفِقُوْا خَيْرًا لِّاَنْفُسِكُمْ ؕ وَمَنْ يُّوْقَ شُحَّ
نَفْسِهٖ فَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ⑯

**17** మీరు గనక అల్లాహ్‌కు మంచి రుణం ఇస్తే (అంటే అల్లాహ్ మార్గంలో ఖర్చు పెడితే)[36] దాన్ని ఆయన మీ కొరకు పెంచుతూ పోతాడు. మీ పాపాలను కూడా క్షమిస్తాడు.[37] అల్లాహ్ (తన దాసుల సేవలను) గుర్తించేవాడు, సహనశీలుడు.[38]

اِنْ تُقْرِضُوا اللّٰهَ قَرْضًا حَسَنًا يُّضٰعِفْهُ لَكُمْ
وَيَغْفِرْ لَكُمْ ؕ وَاللّٰهُ شَكُوْرٌ حَلِيْمٌ ⑰

**18** ఆయన రహస్య, బహిర్గత విషయాలు తెలిసినవాడు. సర్వాధిక్యుడు, వివేకవంతుడు.

عٰلِمُ الْغَيْبِ وَالشَّهَادَةِ الْعَزِيْزُ الْحَكِيْمُ ⑱

32. సిరిసంపదలు, కన్నపిల్లలు యదార్థానికి మనిషి పాలిట ఒక వైపు దైవానుగ్రహమే అయినప్పటికీ, మరోవైపు పరీక్ష కూడా. వారు గనక మిమ్మల్ని అధర్మ (హరామ్) పనుల వైపు ప్రోత్సహించినా, బంధువుల అగత్యపరుల హక్కుల్ని చెల్లించటంలో అవరోధంగా నిలిచినా వారు మీ పాలిట హానికరంగా పరిణమిస్తున్నారని గ్రహించాలి. అట్టి పరిస్థితిలో మీరు అప్రమత్తులై దేవుని అవిధేయతా ధోరణిని మానుకోవాలి. మీ ఆస్తిపాస్తుల్ని సక్రమమైన పద్ధతిలో కూడబెట్టాలి. సక్రమమైన రీతిలోనే ఖర్చుచేయాలి. సంతానానికి తగు శిక్షణ ఇవ్వాలి. ఈ ఆస్తిపాస్తుల, ఆలుబిడ్డల ద్వారా దేవుడు పెట్టిన పరీక్షలో నెగ్గుకు రావాలి.

33. అంటే – సిరిసంపదల పట్ల, సంతానం పట్ల గల ప్రేమకన్నా దైవవిధేయతకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి, పాపకార్యాలను విడనాడిన వ్యక్తి కొరకు అల్లాహ్ దగ్గర అపారమైన పుణ్యఫలం సిద్ధంగా ఉంటుంది.

34. అంటే – అల్లాహ్ ఆదేశాలను, ప్రవక్త (స) ఉపదేశాలను సావధానంగా వినండి. విన్నవాటిని ఆచరణలో పెట్టండి. విన్న దాన్ని ఆచరణలో పెట్టనంతవరకూ ప్రయోజనం కలగదు.

35. **'ఖర్చుచేస్తూ ఉండండి'** అనే వాక్యంలో తప్పనిసరిగా చెల్లించవలసిన దానాలు (సదకాతె వాజిబా), స్వచ్ఛంద దానాలు (సదకాతె నాఫిలా) – రెండూ వచ్చేస్తాయి. జకాత్, ఉష్ర్ లాంటివి తప్పనిసరి దానాల క్రిందికివస్తే, ఇతరత్రా దానాలన్నీ స్వచ్ఛంద దానాల క్రిందికి వస్తాయి.

36. **'మంచిరుణం ఇవ్వటం'** అంటే చిత్తశుద్ధితో దైవమార్గంలో ఖర్చుపెట్టడం, మనస్ఫూర్తిగా సంపదను వ్యయపరచటం అని అర్థం.

37. మీరు చేసిన ఖర్చుకు ఎన్నోరెట్ల పుణ్యఫలాన్ని ప్రసాదించటంతో పాటు, మీ పాపాలను కూడా కడిగివేస్తాడు.

38. అంటే – దేవుడు తన వినయశీలురైన దాసుల కృషిని ఎన్నటికీ విస్మరించడు. వారి కృషికి ఎన్నోరెట్ల పారితోషికాన్ని ప్రసాదిస్తాడు. అదే సమయంలో ఆయన సహనశీలుడు కూడా. అంటే ఆయన పాపాత్ములను వెంటనే పట్టుకుని శిక్షించకుండా వారికి తగినంత గడువు ఇస్తాడు.

65వ సూరా

# అత్ తలాఖ్

## విడాకులు

అవతరణ మదీనాలో

ఆయతులు 12

### పరిచయం

ఇది ముఖ్యంగా విడాకుల గురించి ప్రస్తావించిన సూరా. మొదటి ఆయత్‌లో వచ్చిన పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా కుటుంబ బంధాల ప్రాముఖ్యాన్ని చాటి చెప్పింది. వివాహ మర్యాదను కాపాడాలని, తొందరపడి విడాకుల నిర్ణయానికి రాకూడదని బోధిస్తూ, ఆ విధంగా హక్కులకు భంగం కలిగే పరిస్థితిని నివారించింది. ఇస్లామ్ అనుమతించిన వాటన్నింటిలోను అల్లాహ్‌కు అత్యంత అయిష్టమైన చర్య విడాకులు. కాని అందుకు అనుమతి ఇవ్వబడింది. గృహ సంబంధమైన ఇలాంటి వ్యవహారాల్లో దేవునిపట్ల భక్తితో, దేవుని పట్ల భయంతో వ్యవహరించాలని, తమ నిర్ణయాన్ని ఒకటికి రెండుసార్లు పునరాలోచించు కోవాలని విశ్వాసులను ఈ విషయమై హెచ్చరించడం జరిగింది. భార్యకు విడాకులిచ్చే హక్కు భర్తకు ఉంది. కాని విడాకులన్నవి సరియైన పద్ధతిలో, సరియైన సమయంలో ఇస్లామీయ చట్టం ప్రకారం జరగాలి. ఎలా అంటే :

- భార్య రుతుకాలంలో ఉన్నప్పుడు విడాకులు ఇవ్వరాదు.
- నిర్దిష్ట సమయం గడిచేవరకు ఆమెను ఇంటినుంచి బలవంతంగా బయటకు పంపరాదు. నిర్దిష్ట సమయం (ఇద్దత్) మూడువిధాలుగా ఉంటుంది.
- ఈ నిర్దిష్ట కాలంలోనూ, గర్భంతో ఉన్న కాలంలోను భర్త తన భార్యపోషణకు ఖర్చు చేయాలి.
- శిశువు జన్మించిన తర్వాత విడాకులిచ్చిన భార్య తన శిశువుకు పాలుపట్టడానికి అంగీకరిస్తే, అందుకు భర్త తగిన పారితోషికం చెల్లించాలి.
- పాలుపట్టే విషయంలో వారిద్దరి మధ్య ఎలాంటి అంగీకారం కుదరనట్లయితే, వేరే మహిళతో పాలుపట్టించే ఏర్పాటు చేయాలి.

## అత్ తలాఖ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

1 ఓ ప్రవక్తా! (నీ అనుచర సమాజానికి చెప్పు) మీరు మీ స్త్రీలకు విడాకులు ఇస్తున్నప్పుడు[1] వారి గడువు (ఇద్దత్) ప్రకారం విడాకులివ్వండి.[2] 'గడువు' (రుతువు)ను లెక్కిస్తూ ఉండండి.[3] మీ ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు వారిని వారి ఇండ్ల నుండి గెంటివేయకండి,[4] వారు సయితం వెళ్ళి పోకూడదు.[5] ఒకవేళ వారు బాహాటంగా ఏదైనా నీతిబాహ్యమైన

## سُورَةُ الطَّلَاقِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

يَا أَيُّهَا النَّبِيُّ إِذَا طَلَّقْتُمُ النِّسَاءَ فَطَلِّقُوهُنَّ لِعِدَّتِهِنَّ وَأَحْصُوا الْعِدَّةَ ۖ وَاتَّقُوا اللَّهَ رَبَّكُمْ ۖ لَا تُخْرِجُوهُنَّ مِن بُيُوتِهِنَّ وَلَا يَخْرُجْنَ إِلَّا

1. ప్రవక్త (సఅసం) గారి స్థాయి దృష్ట్యా ఆయన్ని ఉద్దేశించి ఈ సూచనలు ఇవ్వబడినప్పటికీ, నిజానికి ఇవి యావత్తు ముస్లిం సమాజానికి ఇవ్వబడిన దైవాదేశాలు. లేదా ప్రవక్త (సఅసం) ఆచరణ సమస్త ముస్లిం జగతికి ఆదర్శప్రాయం కావటం వల్ల కేవలం ఆయన్ని మాత్రమే ఉద్దేశించి ఈ ఆజ్ఞలు వచ్చి ఉండవచ్చు. **'తల్లఖ్‌తుమ్'** అంటే విడాకులివ్వాలని గట్టిగా సంకల్పించుకున్నప్పుడు అని ఇక్కడ భావం.

2. ఈ వాక్యంలో విడాకులు ఇవ్వవలసిన పద్ధతి, విడాకులు ఇవ్వవలసిన సమయం గురించి చెప్పబడింది. గడువు ప్రారంభంలో విడాకులివ్వాలి. అంటే, భార్య బహిష్టు అనంతరం పరిశుద్ధతను పొందిన మీదట ఆమెతో సంభోగించకుండానే విడాకులు ఇవ్వాలి. అంటే, పరిశుద్ధావస్థ ఆమె గడువు (ఇద్దత్)కు ఆరంభం అన్నమాట. దీన్నిబట్టి తెలిసేదేమంటే బహిష్టు స్థితిలోగానీ, లేక ఆ తర్వాత ఆమెతో పడక సుఖం పొందిన తరువాత గానీ విడాకులు ఇవ్వటం తప్పుడు పద్ధతి. దీన్ని ధర్మవేత్తలు 'అనుచితమైన విడియాకు' (తలాఖె బిదయీ)గా, ముందుగా పేర్కొనబడిన పద్ధతిని 'తలాఖె సున్నత్'గా అభివర్ణించారు. ఈ విషయాన్ని సమర్థించే హదీసు కూడా ఉంది. దీని ప్రకారం హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తన భార్యకు అశుద్ధావస్థలో విడాకులిచ్చారు. ఈ సంగతి తెలిసినప్పుడు దైవప్రవక్త (సఅసం) ఆగ్రహోదగ్రులయ్యారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పరిశుద్ధస్థితిలో విడాకులివ్వవలసిందిగా ఆయనకు ఆదేశించారు. ఈ సందర్భంగా దైవప్రవక్త (స) ఈ ఆయతును ఉదాహరించారు (సహీహ్ బుఖారీ – కితాబుత్తలాఖ్). అయితే అశుద్ధావస్థలో ఇవ్వబడిన విడియాకు – అది అనుచితమైన పద్ధతి అయినప్పటికీ – విడాకు (అయిపోయినట్లు)గానే పరిగణించబడుతుంది. హదీసువేత్తల, అత్యధిక మంది పండితుల అభిప్రాయం కూడా ఇదే. అయితే ఇమామ్ ఇబ్నె ఖయ్యిమ్, ఇమామ్ ఇబ్నె తైమియ వంటి విద్వాంసులు మాత్రం ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. అనుచిత పద్ధతిలో ఇవ్వబడిన తలాఖ్ నిజంగా తలాఖ్ కాజాలదని వారు గట్టిగా వాదించారు. (వివరాలకు 'నైలుల్ అవ్‌తార్' గ్రంథంలోని విడాకుల ప్రకరణాన్ని చూడగలరు).

3. అంటే రుతువు ఆరంభాన్ని, ముగింపును ఖచ్చితంగా లెక్కిస్తూ ఉండాలి. ఎందుకంటే గడువు (ఇద్దత్) ముగిసిన వెంటనే ఆ స్త్రీ పునర్వివాహానికి ధర్మపరంగా పరిస్థితి స్పష్టంగా ఉండాలి. లేదా ఒకవేళ మీరే ఆమె వైపు మరలదలిస్తే గడువు ముగియక ముందే మరలేందుకు వీలుగా 'లెక్క' అవసరం. (అంటే మొదటి లేక రెండవ విడియాకు తరువాత ఆమెను తిరిగి రప్పించుకోవటానికి అవకాశం ఉంటుంది. మూడవ విడియాకు కూడా ఇచ్చేస్తే ఇక ఆ దాంపత్య సంబంధాన్ని పునరుద్ధరించే ద్వారాలన్నీ దాదాపు మూసుకుపోయినట్లే).

4. అంటే – విడియాకు (తలాఖ్) ఇచ్చినంతనే ఆమెను తమ ఇంటినుండి గెంటివేయకూడదు. పైగా గడువు ముగిసే వరకు ఆమెను సాదరంగా తమ ఇంట్లోనే ఉంచాలి. అప్పటివరకూ వారికి ఉత్తమ రీతిలో అన్నవస్త్రాలు, మనోవర్తి ఇవ్వాలి.

أَنْ يَأْتِينَ بِفَاحِشَةٍ مُّبَيِّنَةٍ ۚ وَتِلْكَ حُدُودُ اللَّهِ ۚ وَمَنْ يَتَعَدَّ حُدُودَ اللَّهِ فَقَدْ ظَلَمَ نَفْسَهُ ۚ لَا تَدْرِي لَعَلَّ اللَّهَ يُحْدِثُ بَعْدَ ذَٰلِكَ أَمْرًا ①

చేష్టకు ఒడిగడితే (అప్పుడు వెళ్ళగొట్టవచ్చు).[6] ఇవి అల్లాహ్ నిర్ధారించిన హద్దులు. ఎవరయితే అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమిస్తాడో అతడు తన స్వయానికే అన్యాయం చేసుకున్న వాడవుతాడు.[7] నీకు తెలీదు – బహుశా అల్లాహ్ దీని తరువాత ఏదైనా కొత్త పరిస్థితిని కల్పిస్తాడేమో![8]

فَإِذَا بَلَغْنَ أَجَلَهُنَّ فَأَمْسِكُوهُنَّ بِمَعْرُوفٍ أَوْ فَارِقُوهُنَّ بِمَعْرُوفٍ وَأَشْهِدُوا ذَوَيْ عَدْلٍ

**2** మరి ఆ స్త్రీలు తమ గడువు (ఇద్దత్)కు చేరుకున్నప్పుడు వారిని ఉత్తమ రీతిలో మీ వివాహబంధంలోనయినా ఉంచుకోండి. లేదంటే ఉత్తమరీతిలో వారిని వేర్పరచటమైనా చేయండి.[9] మీలోని

5. ఈ గడువు కాలంలో విడాకులు పొందిన మహిళలు కూడా వారి ఇండ్ల నుంచి వెళ్ళి పోకూడదు – మరీ ఏదన్నా అవసరం ఏర్పడితే తప్ప!

6. ఒకవేళ ఈ గడువు కాలంలో ఆమె ఏదైనా సిగ్గుమాలిన పనికి పాల్పడినా లేక నోరు పారేసుకున్నా లేక కుటుంబ పరువును మంటగలిపే పోకడలకు పాల్పడినా – అట్టి పరిస్థితిలో ఆమెను ఇంటినుంచి పంపివేయవచ్చు.

7. అంటే, ఇప్పటివరకూ విడాకుల విషయంలో చెప్పబడినవన్నీ దైవం నిర్ణయించిన హద్దులు. వీటికి కట్టుబడి ఉండటం విధి. ఒకవేళ ఎవరయినా ఈ హద్దుల్ని అతిక్రమిస్తే వారు తమ స్వయానికే అన్యాయం చేసుకున్నారన్నమాట! ఎందుకంటే ఈ అతిక్రమణ మూలంగా వాటిల్లే ప్రాపంచిక, ధార్మిక నష్టాలను వారే భరించవలసి ఉంటుంది.

8. అంటే – విడాకులు (ఒకటి లేక రెండు విడాకులు అప్పటికే) పొందివున్న భార్యపట్ల భర్త హృదయంలో ప్రేమాను రాగాలను సృజిస్తాడేమో! బహుశా భర్త ఆమెను తిరిగి కాపురానికి రప్పించుకుంటాడేమో! ఎందుకంటే మొదటి లేక రెండవ విడాకుల తర్వాత కూడా భర్తకు ఆమెను కాపురానికి రప్పించుకునే అవకాశం ఇవ్వబడింది. అందుకే కొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం ఈ ఆయతులో దేవుడు ఒక సమయంలో కేవలం ఒక్క 'తలాఖ్' మాత్రమే ఇవ్వాలని తాకీదు చేశాడు. ఒకేసారి మూడు విడాకులు ఇవ్వటాన్ని వారించాడు. ఎందుకంటే అతను ఒకేసారి మూడు విడాకులు ఇవ్వగా (షరీఅత్ దాన్ని మూడుసార్లు విడాకులు ఇచ్చినట్లుగా పరిగణించినట్లయితే) 'దేవుడు ఏదన్నా కొత్త స్థితిని కల్పిస్తాడేమో!' అని చెప్పాల్సిన అవసరం ఉండేదికాదు (ఫత్హుల్ ఖదీర్). దీని ఆధారంగానే తొలి రెండు విడాకులు పొందిన మహిళలకు మాత్రమే అన్నపానీయాలు, మనోవర్తి వర్తిస్తుందని ఇమామ్ అహ్మద్ తదితర ఇమాములు సూత్రీకరించారు. ఎందుకంటే అట్టి పరిస్థితిలోనే విడాకులిచ్చిన భర్తలకు తమ స్త్రీలను తిరిగి పిలిపించుకునే అధికారం ఉంటుంది. మూడవసారి విడాకులు పొందిన మీదట ఇక ఆ స్త్రీకి తన మాజీ భర్త నుంచి ఎలాంటి మనోవర్తి లభించదు. మూడవసారి విడియాకు పొందాక ఆమెను తక్షణం భర్త ఇంటి నుంచి తరలించటం జరుగుతుంది. ఎందుకంటే భర్త ఇక ఆమెను కాపురానికి తిరిగి రప్పించుకునే మార్గాలన్నీ మూసుకుపోయాయి. అందువల్ల ఆమె అన్నవస్త్రాల నిమిత్తంగానీ, మనోవర్తి నిమిత్తంగానీ – తనకు సంబంధంలేని– మాజీ భర్త నుంచి ఎలాంటి డిమాండూ చేయజాలదు.

హజ్రత్ ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) సంఘటన ద్వారా కూడా ఈ విధానానికి సమర్థన లభిస్తోంది. ఆమె భర్త ఆమెకు మూడవ (చివరి) విడియాకు ఇచ్చిన మీదట, ఆమెను ఇల్లు ఖాళీ చేయవలసిందిగా సూచించబడింది – దానికామె ససేమిరా అంది. ఎట్టకేలకు ఆ వ్యవహారం దైవప్రవక్త (స) దాకా వెళ్ళింది. ఆమెకు ఇంటి వసతిగానీ, మనోవర్తిగానీ లభించదని దైవప్రవక్త (స) తీర్పు యిచ్చారు. వెంటనే ఆమె ఇల్లు విడిచిపెట్టవలసిందిగా కూడా ఆయన (స) ఆదేశించారు. కొన్ని ఉల్లేఖనాలలోనయితే భర్త రాజీ పడటానికి హక్కు ఉన్న స్త్రీకి మాత్రమే మనోవర్తి, ఇంటి వసతి లభిస్తుందని స్పష్టంగా ఉంది (అహ్మద్, నసాయి). అలాగే గర్భవతులైన మహిళలకు మనోవర్తి, ఇంటి వసతి లభిస్తుందని కూడా కొన్ని ఉల్లేఖనాల్లో చెప్పబడింది. (దీని వివరాల కోసం నైలుల్ అవ్‌తార్ గ్రంథాన్ని

న్యాయశీలురైన ఇద్దరు వ్యక్తుల్ని సాక్షులుగా పెట్టుకోండి.[10] అల్లాహ్ కొరకు సరైన సాక్ష్యాన్ని నెలకొల్పండి.[11] అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించేవానికి ఇందు మూలముగా ఉపదేశించబడు తోంది. ఎవడయితే అల్లాహ్‌కు భయపడుతూ మసలుకుంటాడో అతనికి అల్లాహ్ (ఈ సంక్షోభం నుండి) బయటపడే మార్గం కల్పిస్తాడు.[12]

مِّنكُمْ وَأَقِيمُوا الشَّهَادَةَ لِلَّهِ ۚ ذَٰلِكُمْ يُوعَظُ بِهِ
مَن كَانَ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۚ وَمَن
يَتَّقِ اللَّهَ يَجْعَل لَّهُ مَخْرَجًا ②

**3** అతను ఊహించనయినాలేని చోటు నుండి అతనికి ఉపాధిని సమకూరుస్తాడు. అల్లాహ్‌పై భారం మోపిన వానికి అల్లాహ్‌యే చాలు. అల్లాహ్ తన కార్యాన్ని చేసి తీరుతాడు.[13] అల్లాహ్ ప్రతి విషయానికీ ఒక లెక్కను నిర్ధారించాడు.[14]

وَيَرْزُقْهُ مِنْ حَيْثُ لَا يَحْتَسِبُ ۚ وَمَن يَتَوَكَّلْ
عَلَى اللَّهِ فَهُوَ حَسْبُهُ ۚ إِنَّ اللَّهَ بَالِغُ أَمْرِهِ ۚ
قَدْ جَعَلَ اللَّهُ لِكُلِّ شَيْءٍ قَدْرًا ③

**4** మీ స్త్రీలలో ముట్టుపై ఆశ వదులుకున్నవారి విషయంలో మీకే దైనా సందేహముంటే, వారి గడువు మూడు నెలలు. రజస్వల (రుతుస్రావం మొదలు) కాని వారి గడువు కూడా అంతే.[15] గర్భవతుల గడువు వారి ప్రసవం అయ్యేవరకూ ఉంటుంది.[16] ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతనికి అల్లాహ్ అతని వ్యవహారంలో అన్ని విధాలా సౌలభ్యం కల్పిస్తాడు.

وَاللَّائِي يَئِسْنَ مِنَ الْمَحِيضِ مِن نِّسَائِكُمْ إِنِ
ارْتَبْتُمْ فَعِدَّتُهُنَّ ثَلَاثَةُ أَشْهُرٍ وَاللَّائِي لَمْ
يَحِضْنَ ۚ وَأُولَاتُ الْأَحْمَالِ أَجَلُهُنَّ أَن
يَضَعْنَ حَمْلَهُنَّ ۚ وَمَن يَتَّقِ اللَّهَ يَجْعَل لَّهُ
مِنْ أَمْرِهِ يُسْرًا ④

---

చూడండి). కొంత మంది ఈ ఉల్లేఖనాలను "వారిని ఇండ్ల నుండి తీసివేయకండి" అన్న దైవాదేశానికి విరుద్ధంగా ఖరారుచేసి, వాటిని కొట్టివేస్తుంటారు. ఇది సరైనది కాదు. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ దైవాదేశం మొదటి రెండు విడాకులకు సంబంధించినది. మూడవ విడియాకు తర్వాత భర్తతో సంబంధం పూర్తిగా తెగిపోతుంది.

9. సంభోగానంతరం విడాకులు ఇవ్వబడిన స్త్రీ గడువు (ఇద్దత్) మూడు రుతువులు. ఒకవేళ ఆమెను తిరిగి కాపురానికి రప్పించదలచుకుంటే గడువు ముగియకముందే రప్పించుకోవాలి. అన్యథా ఆమెను ధర్మప్రకారం – ఉత్తమ రీతిలో – వదలిపెట్టాలి.

10. మీరు ఆమెను తిరిగి రప్పించగోరినా లేక (కొంతమంది ప్రకారం) ఆమెకు విడియాకులు ఇవ్వదలచినా ఈ మొత్తం వ్యవహారంపై నమ్మకస్థులైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టుకోవాలి. సాక్షుల్ని నియమించుకోవటం తప్పనిసరి ఏమీ కాదుగాని సాక్షులుంటే మంచిదే కదా!

11. సాక్షులు నిష్పక్షపాతంగా, ధైర్యంగా సాక్ష్యం ఇచ్చేవారై ఉండాలి. వారెలాంటి రాగద్వేషాలకు, ప్రలోభాలకు లొంగకుండా విషయాన్ని ఉన్నదున్నట్టు చెప్పేవారై ఉండాలి.

12. అంటే పరిస్థితుల క్లిష్టస్వరూపం నుండి, కఠిన పరీక్షల నుండి గట్టెక్కే అవకాశం కల్పిస్తాడు.

13. అంటే – ఆయన అనుకున్నదల్లా చేస్తాడు. ఆయన నిర్ణయాన్ని, సంకల్పాన్ని ఎవరూ అడ్డుకోలేరు.

14. కష్టాల విషయంలోనయినా, సుఖాల విషయంలోనయినా ఆయన ఒక హద్దు పెట్టాడు. అవి ఆ హద్దువరకే ఉంటాయి. మరి కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యం రుతు చక్రానికి, గడువుకు వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు.

15. అంటే – వయసు పైబడిన కారణంగా బహిష్టు ఆగిపోయిన స్త్రీలు, అసలు రుతుస్రావమే మొదలుకాని స్త్రీలు కూడా.

ذٰلِكَ اَمْرُ اللّٰهِ اَنْزَلَهٗۤ اِلَيْكُمْ ؕ وَمَنْ يَّتَّقِ اللّٰهَ يُكَفِّرْ عَنْهُ سَيِّاٰتِهٖ وَيُعْظِمْ لَهٗۤ اَجْرًا ⑤

5 ఇది అల్లాహ్ ఆజ్ఞ. దీన్ని ఆయన మీ వైపు అవతరింపజేశాడు. ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతని పాపాలను అల్లాహ్ అతని నుండి రూపుమాపుతాడు. అతనికి గొప్ప పుణ్యఫలాన్ని వొసగుతాడు.

اَسْكِنُوْهُنَّ مِنْ حَيْثُ سَكَنْتُمْ مِّنْ وُّجْدِكُمْ وَلَا تُضَآرُّوْهُنَّ لِتُضَيِّقُوْا عَلَيْهِنَّ ؕ وَاِنْ كُنَّ اُولٰتِ حَمْلٍ فَاَنْفِقُوْا عَلَيْهِنَّ حَتّٰى يَضَعْنَ

6 మీ స్థోమత మేరకు మీరు ఉండే చోటే (విడాకులు పొందిన) ఆ మహిళలను కూడా ఉండనివ్వండి.[17] వారిని ఇబ్బందులపాలు చేసే ఉద్దేశంతో బాధించకండి.[18] ఒకవేళ వారు గర్భవతులై ఉంటే, వారు శిశువును కనేవరకూ వారికి ఖర్చులు ఇస్తూ

స్త్రీలలో చాలా అరుదుగా జరిగే విశేషమేమిటంటే వారు యుక్త వయస్సుకు చేరినప్పటికీ రజస్వల కారు. అలాంటి స్త్రీల విషయంలో కూడా కనీసం మూడు నెలల కాలం ఆగి ఉండాల్సిందేనని సూచించబడింది.

16. విడాకులు పొందిన మహిళ ఒకవేళ గర్భవతి అయివుంటే ఆమె ప్రసవం దాకా ఆగాలి. విడాకులివ్వబడిన రెండో రోజు కాన్పు అయినా గడువు ముగిసినట్లే. ఈ ఆయతు ద్వారా తెలిసే మరో ముఖ్యాంశం ఏమిటంటే గర్భవతిగా ఉన్న మహిళ – ఆమె విడాకులు పొందినా లేక ఆమె భర్త చనిపోయినా – కాన్పు అయిన వెంటనే ఆమె ఇద్దత్ (గడువు) ముగుస్తుంది. హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది (వివరాలకు సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలు చూడండి). అయితే గర్భవతులు కాని మహిళల భర్తలు గనక చనిపోతే వారి ఇద్దత్ (గడువు) నాలుగు మాసాల పదిరోజులు (అల్ బఖరా సూరా – 234).

17. అంటే మొదటి రెండు విడాకులు ఇవ్వబడిన మహిళలను అన్నమాట. చివరిసారి (మూడవసారి) విడాకులిచ్చేశాక వారికి వసతి సౌకర్యంగానీ, మనోవర్తిగానీ ఇవ్వబడదు. స్థోమతకు తగ్గవిధంగా ఉండనివ్వటమంటే భావం, ఇల్లు విశాలంగా ఉండి అందులో అనేక గదులున్నప్పుడు, ఒక గదిని ఆమె కొరకు ప్రత్యేకంగా కేటాయించాలి. లేదా మగవారు తాముండే గదిని ఖాళీచేసి, దాన్ని ఆమెకు ప్రత్యేకించాలి. వారిని దగ్గరలోనే ఉంచి ఇద్దత్ (గడువు)ని గడపటం వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమిటంటే ఆ దంపతుల మధ్య ఆవేశం తగ్గి ఆలోచన కలగవచ్చు. ఈలోగా సదవగాహన పెంపొంది వారుభయులు రాజీకి కూడా రావచ్చు. అప్పటికే వారికి సంతానం కలిగి ఉంటే రాజీపడటానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది.

కాని శోచనీయమైన విషయం ఏమిటంటే ముస్లిం సోదరులు ఈ మార్గదర్శక సూత్రాన్ని అనుసరించరు. తత్కారణంగా వారు మానవ నైజం వాంఛించే ఈ మేలుకు నోచుకోకుండా పోతున్నారు. మననాట స్త్రీకి విడాకులివ్వగానే ఆమెను అంటరానిదిగా పరిగణించి, ఆమెను ఇంటి నుండి వెళ్ళగొట్టడం జరుగుతుంది. ఒక్కోసారి స్వయంగా ఆడపిల్ల తరఫువారే ఆమెను తీసుకెళ్ళిపోతుంటారు. ఈ రివాజు దివ్య ఖుర్ఆన్ ప్రబోధనలకు పూర్తిగా విరుద్ధం అని మరువరాదు.

18. అంటే – మనోవర్తిని చెల్లించటంలోనూ, ఇంటి సదుపాయం కల్పించటంలోనూ వారిని నానా ఇక్కట్లకు గురిచేసి, వారు ఇల్లు వదిలి వెళ్ళిపోయేలా చేయకూడదు.

మరి కొంతమంది ఈ వాక్యానికి చెప్పిన భావం ఇది: "గడువు (ఇద్దత్) పూర్తవబోతుండగా వారిని తిరిగి కాపురానికి రప్పించుకుని, మరి కొన్నాళ్ళకు మళ్ళీ విడాకులిచ్చి సతాయించరాదు. పూర్వం అజ్ఞానకాలంలో మగవారు ఆడవారిని ఇలాగే వేధించేవారు. ఈ అన్యాయాన్ని అరికట్టేందుకు ఇస్లామీయ షరీయతు కొన్ని నిర్ధిత కట్టుబాట్లను నిర్ధారించింది. వీటి ప్రకారం ఒక మగవాడు తన భార్యకు మొదటి రెండు విడియాకులు ఇచ్చిన పరిస్థితిలో మాత్రమే ఆమెను తిరిగి రప్పించుకునే అధికారం కలిగి ఉంటాడు. మూడవసారి విడాకులిచ్చాక శాశ్వతంగా విడిపోవలసి ఉంటుంది.

ఉండండి.[19] ఆ తరువాత వారు–మీ అభ్యర్థనపై – బిడ్డకు పాలిచ్చి నట్లయితే వారికి వారి ప్రతిఫలాన్ని ముట్టజెప్పండి.[20] ధర్మాను సారం పరస్పరం సంప్రతించుకోండి.[21] ఒకవేళ మీరు పరస్పరం గొడవపడినట్లయితే అతని కోరికపై మరొకామె బిడ్డకు పాలుపడు తుంది.[22]

حَمْلَهُنَّ ۚ فَإِنْ أَرْضَعْنَ لَكُمْ فَآتُوهُنَّ أُجُورَهُنَّ ۖ وَأْتَمِرُوا بَيْنَكُم بِمَعْرُوفٍ ۖ وَإِن تَعَاسَرْتُمْ فَسَتُرْضِعُ لَهُ أُخْرَىٰ ⑥

7 స్థోమత ఉన్నవాడు తన స్థోమతకు తగ్గట్టుగా ఖర్చుచేయాలి.[23] మరెవరికయితే అతని ఉపాధి కుదించబడిందో,[24] అతను అల్లాహ్ తనకు ప్రసాదించిన దానిలో నుంచి (తన స్థాయికి తగ్గట్టుగానే) ఖర్చు పెట్టాలి. అల్లాహ్ ఏ ప్రాణిపైనా దానికి ఇచ్చిన దానికంటే ఎక్కువ భారం మోపడు.[25] అల్లాహ్ ఇబ్బందుల తరువాత సౌలభ్యాన్ని కూడా కల్పిస్తాడు.[26]

لِيُنفِقْ ذُو سَعَةٍ مِّن سَعَتِهِ ۖ وَمَن قُدِرَ عَلَيْهِ رِزْقُهُ فَلْيُنفِقْ مِمَّا آتَاهُ اللَّهُ ۚ لَا يُكَلِّفُ اللَّهُ نَفْسًا إِلَّا مَا آتَاهَا ۚ سَيَجْعَلُ اللَّهُ بَعْدَ عُسْرٍ يُسْرًا ⑦

8 ఎన్నో జనపదాలవారు తమ ప్రభువు ఆజ్ఞ పట్ల, ఆయన ప్రవక్తల పట్ల తిరుగుబాటు ధోరణిని[27] అవలంబించిన కారణంగా మేము కూడా వారి నుండి కఠినంగా లెక్క తీసుకున్నాము. కానరాని రీతిలో వారిని దెబ్బతీశాము.[28]

وَكَأَيِّن مِّن قَرْيَةٍ عَتَتْ عَنْ أَمْرِ رَبِّهَا وَرُسُلِهِ فَحَاسَبْنَاهَا حِسَابًا شَدِيدًا وَعَذَّبْنَاهَا عَذَابًا نُّكْرًا ⑧

19. ఒకవేళ విడాకులు పొందిన మహిళ గర్భవతి అయివుంటే – ఆమెకు మూడవసారి విడాకులు ఇవ్వబడినాసరే – ప్రసవించే వరకూ ఆమెకు ఇంటి వసతిని కల్పించటంతో పాటు, ఆమెకు అన్నవస్త్రాలు కూడా సమకూర్చవలసిందే.

20. విడాకులు పొందిన తరువాత కూడా ఆమె మీ బిడ్డకు పాలిచ్చినట్లయితే మీరు ఆమెకు వేతనం చెల్లించవలసి ఉంటుంది.

21. అంటే – పరస్పర సంప్రతింపుల ద్వారా ఉభయులూ వేతనం తదితర విషయాలను నిర్ధారించుకోవచ్చు. ఉదాహరణకు: పిల్లవాని తండ్రి అతని స్థాయికి తగ్గట్టు వేతనం చెల్లించాలి. విడాకులు పొందిన మహిళ కూడా ఆ బిడ్డ తండ్రి నుండి తగిన రీతిలోనే వేతనాన్ని డిమాండు చేయాలి. ఈ సందర్భంగా ఇరువురిలో ఏ ఒక్కరు కూడా అనుచితమైన ధోరణిని అవలంబించకూడదు.

22. ఒకవేళ వారిద్దరూ పరస్పరం ఒక అంగీకారానికి రాలేకపోతే – అట్టి పరిస్థితిలో – మగవాడు మరెవరి చేతనయినా ఆ బిడ్డకు పాలుపట్టే ఏర్పాటు చేయించవలసి ఉంటుంది.

23. అంటే – పాలుపట్టే స్త్రీలకు శక్తికి తగ్గట్టుగా వేతనం ఇవ్వాలి. ఒకవేళ దేవుడు బిడ్డ తండ్రికి సిరిసంపదల్ని పుష్కలంగా ప్రసాదించివుంటే, అతను తన అంతస్తుకు తగినట్లుగానే ఆయాలకు వేతనం చెల్లించాలి.

24. ఒకవేళ బిడ్డతండ్రి ఆర్థికంగా బలహీనుడై ఉంటే అతను తన స్థాయికి తగ్గట్టుగానే ఇవ్వాలి.

25. అందువల్ల ఆయన బలహీనుడైన వ్యక్తిపై కూడా స్థాయికి మించిన వేతనాన్ని వడ్డించి అతన్ని కష్టాలపాల్జేయడు. కాబట్టి బిడ్డతండ్రి అయినా, బిడ్డ తల్లి అయినా ఈ సందర్భంగా ధర్మబద్ధంగా మసలుకుంటే ఏ గొడవా ఉండదు. ఆ విషయమే మరొకచోట ఈ విధంగా చెప్పబడింది : "బిడ్డను కన్న కారణంగా తల్లి మీద ఎక్కువ భారం మోపటం భావ్యం కాదు. బిడ్డకు తండ్రి కనుక తండ్రిని ఇరకాటంలో పెట్టడం కూడా సమంజసం కాదు." (అల్ బఖర : 233)

26. కాబట్టి, ఎవరయితే అల్లాహ్‌పై పూర్తిగా ఆధారపడి, ధర్మసమ్మతంగా మసలుకుంటారో వారికి అల్లాహ్ ఆర్థికంగా వెసులుబాటును కూడా కల్పిస్తాడు.

**9** అంతే! వారు తమ కర్మల దుష్ఫలితాన్ని చవిచూశారు. చివరకు వారికి మిగిలింది తీవ్రనష్టమే.

فَذَاقَتْ وَبَالَ اَمْرِهَا وَكَانَ عَاقِبَةُ
اَمْرِهَا خُسْرًا (9)

**10** వారి కోసం అల్లాహ్ కఠినమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. కనుక విశ్వసించిన ఓ విజ్ఞులారా! అల్లాహ్‌కు భయపడండి. నిశ్చయంగా అల్లాహ్ మీ వైపు హితబోధను పంపాడు.

اَعَدَّ اللّٰهُ لَهُمْ عَذَابًا شَدِيْدًا ۙ فَاتَّقُوا اللّٰهَ
يٰٓاُولِي الْاَلْبَابِ ۖۚ الَّذِيْنَ اٰمَنُوْا ۚ قَدْ اَنْزَلَ
اللّٰهُ اِلَيْكُمْ ذِكْرًا (10)

**11** (అనగా) అల్లాహ్ యొక్క స్పష్టమైన వాక్యాలను (ఆదేశాలను) చదివి వినిపించి, విశ్వసించి సత్కార్యాలు చేసిన వారిని ఆయన కారుచీకట్లలో నుండి వెలుగులోనికి తీసుకువచ్చేందుకు [29] ఒక ప్రవక్తను పంపాడు. మరెవరయితే అల్లాహ్‌ను విశ్వసించి సదాచరణ చేస్తారో[30] వారిని అల్లాహ్ క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలో ప్రవేశింపజేస్తాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. నిశ్చయంగా అల్లాహ్ అతనికి అత్యుత్తమమయిన ఉపాధిని వొసగాడు.

رَّسُوْلًا يَّتْلُوْا عَلَيْكُمْ اٰيٰتِ اللّٰهِ مُبَيِّنٰتٍ لِّيُخْرِجَ
الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ مِنَ الظُّلُمٰتِ
اِلَى النُّوْرِ ۗ وَمَنْ يُّؤْمِنْۢ بِاللّٰهِ وَيَعْمَلْ صَالِحًا
يُّدْخِلْهُ جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ
خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا ۗ قَدْ اَحْسَنَ اللّٰهُ لَهٗ
رِزْقًا (11)

**12** అల్లాహ్–ఆయనే సప్తాకాశాలనూ, అలాంటివే భూములను[31] సృష్టించినవాడు. ఆయన ఆజ్ఞ వాటి మధ్య అవతరిస్తుంది[32]– అల్లాహ్ అన్నింటిపై అధికారం కలిగి ఉన్నాడనీ, ఇంకా అల్లాహ్ తన జ్ఞానంతో అన్నింటినీ పరివేష్ఠించి ఉన్నాడని మీరు తెలుసుకోవటానికి. [33]

اَللّٰهُ الَّذِيْ خَلَقَ سَبْعَ سَمٰوٰتٍ وَّمِنَ
الْاَرْضِ مِثْلَهُنَّ ۗ يَتَنَزَّلُ الْاَمْرُ بَيْنَهُنَّ
لِتَعْلَمُوْٓا اَنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ۙ
وَّاَنَّ اللّٰهَ قَدْ اَحَاطَ بِكُلِّ شَيْءٍ عِلْمًا (12)

---

27. అంటే ధర్మాధర్మాలకు సంబంధించి వారిపై విధించబడిన కట్టుబాట్లను వారు లెక్కచేయకుండా, బరితెగించిపోయిన కారణంగా...

28. మూలంలో హిసాబ్ (లెక్క), అజాబ్ (శిక్ష) – అని రెండు పదాలు వచ్చాయి. ఈ రెండూ ప్రాపంచికమైన శిక్షల్నే సూచిస్తున్నాయి. లేక కొంతమంది అభిప్రాయం ప్రకారం 'అజాబన్ నుక్‌రా' అంటే కరువుకాటకాలు, భూమిలో కూరుకుపోవటం లాంటి ప్రాపంచికమైన శిక్షలు కాగా; హిసాబన్ షదీదా (గట్టి లెక్క) పరలోకానికి సంబంధించిన శిక్ష (ఫత్‌హుల్ ఖదీర్).

29. ఈ వాక్యంలో దైవప్రవక్త బాధ్యతలు తెలుపబడ్డాయి. దైవప్రవక్త (స) దైవగ్రంథమైన ఖుర్ఆన్ ద్వారా ప్రజలను నైతిక అధోగతి నుండి, బహుదైవారాధన, మార్గభ్రష్టత్వం అనే అంధకారం నుండి వెలికితీసి విశ్వాసం, సదాచరణ అనే కాంతిశిఖరాల ఉన్నతికి చేరుస్తారు. ఇక్కడ దైవప్రవక్త అంటే అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అని భావం.

30. సత్కార్యాలు (అమలె సాలెహ్) అన్న పదంలో రెండు విషయాలు అంతర్లీనమై ఉన్నాయి: 1. దైవాదేశాల, విధుల పాలన. 2. పాపకార్యాలను, అధర్మ విషయాలను విడనాడటం. అంటే కేవలం నోటితో విశ్వాస ప్రకటన చేయటంతోనే సరిపుచ్చకుండా – విశ్వాసం వాంఛించే సదాచరణ కూడా చేసి, పాపాలకు దూరంగా మసలుకున్న విశ్వాసి మాత్రమే స్వర్గంలో ప్రవేశిస్తాడన్నమాట!

31. ఏడు ఆకాశాల మాదిరిగా ఏడు భూములను కూడా ఆయన సృష్టించాడు. కొందరు ఏడు భూములు అంటే ఏడు ఖండాలు అని అభిప్రాయపడ్డారు. కాని ఇది సరైనది కాదు. ఒక భూమండలానికి – మరో భూమండలానికి మధ్య పెద్ద అంతరం ఉంది. ప్రతి భూమండలంలోనూ దేవుని జీవరాసులున్నాయి (ఖుర్తుబీ). హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ఉదాహరణకు : ఒకసారి మహాప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరయినా ఇతరులకు చెందిన ఒక జానెడు నేలను ఆక్రమించుకున్నా ప్రళయ దినాన ఆ నేలంతటి భాగం ఏడు భూమండలాల నుండి గుది బండగా తయారుచేసి అతని మెడలో వేయటం జరుగుతుంది." (సహీహ్ ముస్లిం – కితాబుల్ బుయూ). 'అతన్ని ఏడు భూముల లోతుకి కూర్చివేయటం జరుగుతుంది' అని బుఖారీలో ఉంది (సహీహ్ బుఖారీ, కితాబుల్ మజాలిమ్). ప్రతి భూమండలంలోనూ ఈ భూమండలం వంటి ప్రవక్తలే వస్తూ ఉండేవారని కూడా కొందరు చెబుతారు. అంటే ఆదం కాలంలో ఆదం, నూహ్ కాలంలో నూహ్ ప్రవక్త – ఈ విధంగా! కాని ఈ విషయానికి ప్రామాణికమైన ఆధారాలేవీ లేవు.

32. ప్రతి ఆకాశంపై అల్లాహ్ ఆజ్ఞ ప్రవేశపెట్టబడినట్లే, ప్రతి భూమండలంపై అల్లాహ్ ఆజ్ఞ చెల్లుతుంది. ఆకాశాల మాదిరిగానే భూమండలాలకు సంబంధించి కూడా ఆయన వ్యూహరచన చేస్తుంటాడు.

33. ఆయన గ్రహణా పరిధిలో లేని విషయమంటూ ఏదీ లేదు. ప్రతిదీ ఆయన జ్ఞానంలో ఇమిడి ఉంది.

66వ సూరా

# అత్ తహ్‌రీమ్

## నిషిద్ధం

అవతరణ మదీనాలో

ఆయతులు 12

### పరిచయం

*ఈ సూరా ప్రవక్త ముహమ్మద్(సఅసం) కుటుంబ జీవనం గురించి, ఆయన భార్యల వివాదాల గురించి తెలియజేసింది. ఈ సమస్యలకు సూచించబడిన పరిష్కారాన్ని విశ్వాసులు ఒక పాఠంగా, సంతోషకరమైన కుటుంబ జీవనానికి ఆదర్శంగా స్వీకరించాలని చెప్పడం జరిగింది. ఈ సూరా మొదటి ఆయత్‌లో వచ్చిన పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరాలో రెండు ముఖ్యమైన విషయాలను ప్రస్తావించడం జరిగింది. మొదటి విషయం: ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన భార్యలను దూరంగా ఉంచారు. అందుకు కారణం వారిలో కొందరు ఈర్ష్యాసూయలకు గురికావడం వల్ల ఆయన అలా చేయవలసి వచ్చింది.*

*రెండవ విషయం: ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన భార్యలలో ఒకరికి ఒక రహస్యాన్ని తెలియజేసారు. ఆమె ఆ విషయాన్ని మరో భార్యకు చెప్పారు. ఈ విషయం తెలిసి ప్రవక్త(సఅసం) చాలా నిరాశకు గురయ్యారు. ఈ ప్రవర్తనను విశ్వాసఘాతుకంగా భావించారు. ఆయన ఎంతగా వేదనకు గురయ్యారంటే వారికి విడాకులు ఇస్తానని హెచ్చరించారు కూడా. ఈ సూరాలో ప్రవక్త(సఅసం) భార్యలను ఉద్దేశించి, వారి వివాదాల విషయమై కఠినంగా హెచ్చరికలు చేయబడ్డాయి.*

*ఈ సూరాలో భార్యలకు సంబంధించి రెండు విభిన్నమైన ఉదాహరణలను ఇవ్వడం జరిగింది. లూత్(అస), నూహ్(అస) వంటి విశ్వాసులను పెళ్ళాడిన అవిశ్వాస భార్యలకు సంబంధించినది మొదటి ఉదాహరణ. రెండవ ఉదాహరణలో అవిశ్వాసిని పెళ్ళాడిన విశ్వాసి అయిన భార్య గురించి చెప్పడం జరిగింది. ఇందులో ఫిర్ఔన్ భార్య గురించి తెలియ జేయడం జరిగింది. అలాగే అవివాహిత కన్య అయిన మర్యం గురించి కూడా ప్రస్తావించబడింది. ఈ ఉదాహరణల ద్వారా తెలుసుకోవలసిన పాఠాలు ఏమంటే, తీర్పుదినాన కుటుంబ సంబంధాలు ఏ విధంగాను ఉపయోగపడవు. ఆ రోజున ఉపయోగపడేది మంచిపనులే. భార్య అయినా, భర్త అయినా ఎవరు చేసుకున్న మంచి పనులు వారికే ఉపయోగపడతాయి. బాధాకరమైన శిక్ష నుంచి మనిషిని కాపాడేది సదాచరణ మాత్రమే.*

## అత్ తహ్రీమ్ సూరా

## سُوْرَةُ التَّحْرِيْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

يٰۤاَيُّهَا النَّبِيُّ لِمَ تُحَرِّمُ مَاۤ اَحَلَّ اللّٰهُ لَكَ ۚ تَبْتَغِيْ مَرْضَاتَ اَزْوَاجِكَ ؕ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ①

**1** ఓ ప్రవక్తా! అల్లాహ్ నీ కోసం ధర్మ సమ్మతం చేసిన దానిని నువ్వెందుకు (నీ కొరకు) నిషేధించుకుంటున్నావు?[1] (ఏమిటి?) నువ్వు నీ భార్యల ప్రసన్నతను పొందగోరుతున్నావా? అల్లాహ్ క్షమాశీలుడు, దయామయుడు.

1. ఇంతకీ అంతిమ దైవప్రవక్త (సఅసం) తన కొరకు నిషేధించుకున్న ఆ వస్తువు ఏది? దేవుడు ఈ విషయమై ఎందుకింతగా అప్రసన్నుడయ్యాడు? అని ప్రశ్నించుకుంటే ఈ సందర్భంగా ఒక సుప్రసిద్ధ సంఘటన ముందుకు వస్తుంది. సహీహ్ బుఖారీ తదితర హదీసు గ్రంథాలలో వచ్చిన దాని ప్రకారం దైవప్రవక్త (స) ప్రతిరోజూ తన ధర్మపత్ని అయిన హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా) వద్దకు వెళ్ళి కాస్సేపు ఆగేవారు. ఆమె గారిచ్చిన తేనెను ఆయన సేవించేవారు. దైవప్రవక్త (స) ఈ విధంగా మామూలుకన్నా కొంత ఎక్కువ సమయం అక్కడ గడపటాన్ని హజ్రత్ హఫ్సా, హజ్రత్ ఆయిషా (ర.అన్హా)లు గమనించారు. దైవప్రవక్త (స)ను అక్కడ ఆగకుండా చేయటానికి వారిద్దరూ ఒక పథకం తయారుచేశారు. ఈ పథకం ప్రకారం దైవప్రవక్త (స) తామిద్దరిలో ఎవరింటికి వచ్చినాసరే, "దైవప్రవక్తా (స)! తమరి నోటినుంచి మగాఫీర్ (అదొక రకమైన పువ్వు. దాని వాసన కాస్త వెగటుగా ఉంటుంది) వాసన వస్తోందేమిటి?" అని అడగాలి. వారు అనుకున్నంత పనీ చేశారు కూడా. వారి ప్రశ్నకు దైవప్రవక్త (స) సమాధానమిస్తూ, "ఏమిటీ, నా నోటినుంచి దుర్వాసన వస్తోందా? నేను జైనబ్ ఇంట కేవలం తేనె మాత్రమే సేవించానే! సరే, ఇకనుంచి ఎన్నడూ తేనె త్రాగనని నేను ఒట్టేసుకుంటున్నాను. కాని ఈ సంగతి మీరెవరికీ చెప్పొద్దు" అన్నారు (సహీహ్ బుఖారీ – అత్తహ్రీమ్ సూరా వ్యాఖ్యానం). సుననె నసాయిలో వచ్చిన దాని ప్రకారం ఆయన (స) తన స్వాధీనంలో ఉన్న ఒక బానిసరాలిని తన కొరకు నిషేధించుకున్నారని ఉంది (షేఖ్ అల్‌బానీ దీనిని ప్రామాణికమైన ఉల్లేఖనంగా ఖరారు చేశారు). (సుననె నసాయి – 3/83). కాగా; మరికొంతమంది విద్వాంసులు దీనిని బలహీన ఉల్లేఖనంగా అభిప్రాయపడ్డారు. ఈ సంఘటన గురించి ఇతర గ్రంథాలలో వచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి – ఆమె పేరు మారియా ఖిబ్తియా (ర.అన్హా). దైవప్రవక్త (స)కు ఇబ్రాహీం అనే అబ్బాయి కలిగింది ఈమె ద్వారానే. ఒకసారి ఈమె హజ్రత్ హఫ్సా (ర.అన్హా) ఇంటికి వచ్చారు. ఆ సమయంలో హఫ్సా ఇంట్లో లేరు. దైవప్రవక్త (స) మాత్రమే ఉన్నారు. వారిద్దరూ తన కుటీరంలో ఏకాంతంలో ఉండగా హజ్రత్ హఫ్సా (ర.అన్హా) ఏతెంచారు. తాను ఇంట్లో లేనపుడు మారియా ఖిబ్తియా తన ఇంట్లోకి రావటం, దైవప్రవక్త (స)తో ఏకాంతంలో గడపటం హఫ్సాకు ఎంతమాత్రం నచ్చలేదు. ఆమెలోని అసహనాన్ని దైవప్రవక్త (స) సయితం పసిగట్టారు. అప్పుడు దైవప్రవక్త (స) హఫ్సాను ప్రసన్నురాలిని చేయటానికి, మారియాను తన కొరకు నిషేధించుకున్నట్టు ఒట్టేసి చెప్పారు. ఈ సంగతి ఎవరి ముందూ ప్రస్తావించరాదని హఫ్సా (ర.అన్హా)కు తాకీదు చేశారు.

దీనిపై ఇమామ్ ఇబ్నె హజర్ ఇలా వ్యాఖ్యానించారు : "ఈ సంఘటన పలు విధాలుగా సంకలనం అయింది. ఒకటి మరో దానికి ఆధారంగా ఉంది. బహుశా ఈ రెండు సంఘటనలూ జరిగి ఉండవచ్చు. ఈ రెండు నిషిద్ధ అంశాల నేపథ్యంలో ఈ ఆయతు అవతరించి ఉండవచ్చు" (ఫత్‌హుల్ బారీ – తహ్రీమ్ సూరా వ్యాఖ్యానం). ఇమామ్ షౌకానీ కూడా ఇంచుమించు ఇలాగే అభిప్రాయపడ్డారు. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే దేవుడు ధర్మసమ్మతం (హలాల్) చేసిన ఏ వస్తువునయినా నిషిద్ధం (హరామ్) చేసుకునే అధికారం ఎవరికీ లేదు – చివరికి దైవప్రవక్త (సఅసం)కు కూడా ఈ నిర్ణయాధికారం లేదు.

قَدْ فَرَضَ اللّٰهُ لَكُمْ تَحِلَّةَ اَيْمَانِكُمْ ۚ وَاللّٰهُ
مَوْلٰىكُمْ ۚ وَهُوَ الْعَلِيْمُ الْحَكِيْمُ ②

**2** (అనుచితమైన) మీ ప్రతిజ్ఞలను మీరు ఉపసంహరించుకోవటాన్ని అల్లాహ్ విధిగా ఖరారు చేశాడు సుమా![2] అల్లాహ్‌యే మీ సంరక్షకుడు. ఆయనే సర్వజ్ఞాని, వివేక సంపన్నుడు.

وَاِذْ اَسَرَّ النَّبِيُّ اِلٰى بَعْضِ اَزْوَاجِهٖ حَدِيْثًا ۚ
فَلَمَّا نَبَّاَتْ بِهٖ وَاَظْهَرَهُ اللّٰهُ عَلَيْهِ عَرَّفَ
بَعْضَهٗ وَاَعْرَضَ عَنْۢ بَعْضٍ ۚ فَلَمَّا نَبَّاَهَا
بِهٖ قَالَتْ مَنْ اَنْۢبَاَكَ هٰذَا ؕ قَالَ نَبَّاَنِیَ
الْعَلِيْمُ الْخَبِيْرُ ③

**3** ప్రవక్త తన భార్యలలో ఒకామెతో ఒక రహస్య విషయం చెప్పినప్పుడు[3], ఆమె ఆ విషయాన్ని (మరొకామెకు) తెలియపరిచింది.[4] ఈ సంగతిని అల్లాహ్ తన ప్రవక్తకు తెలియపరచగా, ప్రవక్త ఈ విషయాన్ని కొంత చెప్పి, మరికొంత దాటవేశాడు.[5] ప్రవక్త ఈ సమాచారాన్ని తన భార్యకు తెలిపినపుడు, 'ఇంతకీ ఈ విషయం మీకెవరు తెలిపారు?'[6] అని ఆమె అడిగింది. "అన్నీ తెలిసిన, సర్వం ఎరిగిన అల్లాహ్ నాకీ సంగతిని తెలియజేశాడు"[7] అని ప్రవక్త చెప్పాడు.

اِنْ تَتُوْبَاۤ اِلَى اللّٰهِ فَقَدْ صَغَتْ قُلُوْبُكُمَا ۚ
وَاِنْ تَظٰهَرَا عَلَيْهِ فَاِنَّ اللّٰهَ هُوَ مَوْلٰىهُ

**4** (ఓ ప్రవక్త సతీమణులారా!) మీరిద్దరూ అల్లాహ్ సమక్షంలో పశ్చాత్తాపం చెందితే[8] (అది మీకే శ్రేయస్కరం). నిశ్చయంగా మీ హృదయాలు వంగిపోయాయి.[9] మీరు గనక ప్రవక్తకు

2. అంటే – ఏదైతే చెయ్యకూడదని శపథం చేసుకున్నారో దానికి పరిహారం చెల్లించి, రుజువర్తనులు అయ్యేందుకు అనుమతి ఇచ్చాడు. ప్రమాణానికి (ప్రతిజ్ఞకు) సంబంధించిన ఈ పరిహారం గురించి అల్ మాయిద సూరా 89వ వచనంలో వివరించబడింది. అందువల్ల దైవప్రవక్త (స) కూడా పరిహారం ఇచ్చారు. (ఫత్‌హుల్ ఖదీర్). ఈ విషయంలో పండితుల మధ్య అభిప్రాయభేదం ఉంది. ఒక వ్యక్తి ఏదైనా ఒక వస్తువును తన కొరకు నిషేధించుకుంటే అతనేం చేయాలి? అత్యధిక మంది విద్వాంసుల ప్రకారం ఒక్క భార్య తప్ప మరే వస్తువూ అతని కొరకు నిషిద్ధం (హరామ్) కాజాలదు. అతను పరిహారం చెల్లించవలసిన అవసరం కూడా లేదు. కాని అతను భార్యను తన కొరకు నిషిద్ధంగా ప్రకటిస్తే మాత్రం ఇది అతనికి వర్తిస్తుంది. అలా ప్రకటించటం వెనుక అతని ఉద్దేశం విడాకులివ్వటమే అయి ఉంటే విడాకులిచ్చేసినట్లే. ఒకవేళ విడాకులివ్వాలన్నది అతని అభిమతం కాకుంటే మాత్రం అది ప్రమాణం (ప్రతిజ్ఞ)గా పరిగణించబడుతుంది. అట్టి పరిస్థితిలో అతను పరిహారం (కఫ్ఫారా) చెల్లించవలసి ఉంటుంది (ఐసరుత్తఫాసీర్).

3. ఆ రహస్య విషయం తేనె విషయమో లేక మారియా (ర.అన్హా)ను నిషేధించుకోవటమో అయి ఉంటుంది. ఈ విషయాన్ని ఆయన (స) హజ్రత్ హఫ్సా (ర.అన్హా) తో చెప్పారు.

4. హజ్రత్ హఫ్సా (ర.అన్హా) ఈ విషయాన్ని హజ్రత్ ఆయిషా (ర.అన్హా)కు చేరవేశారు.

5. తాను చెప్పిన రహస్యాన్ని రట్టుచేసిన సంగతిని ఆయన (స) హఫ్సాకు తెలియజేశారు. అయితే తన ఉన్నత స్థానం గౌరవ మర్యాదల దృష్ట్యా ఆయన (సఅసం) దీనిపై ఎలాంటి రాద్ధాంతం చేయకుండా ఎంతో హుందాగా వ్యవహరించారు. విషయాన్ని చూచాయగా మాత్రమే ప్రస్తావించారు.

6. నేను చెప్పిన రహస్యాన్ని నువ్వు బహిర్గతం చేశావుగదా! అని మహాప్రవక్త (సఅసం) నిలదీసినపుడు హజ్రత్ హఫ్సా (ర.అన్హా) ఆశ్చర్యచకితులయ్యారు. ఎందుకంటే ఈ రహస్యాన్ని ఆమె ఆయిషా (ర.అన్హా)కు తప్ప ఇంకెవరికీ చెప్పలేదు. మొదటినుంచీ ఈ తంత్రంలో వారిద్దరే భాగస్థులు. కాబట్టి హజ్రత్ ఆయిషా (ర.అ) కూడా ఈ సంగతిని దైవప్రవక్త (స)కు చెప్పే ప్రసక్తే ఉండదు.

وَجِبْرِيلُ وَصَالِحُ الْمُؤْمِنِينَ ۖ وَالْمَلَائِكَةُ
بَعْدَ ذَٰلِكَ ظَهِيرٌ ④

వ్యతిరేకంగా ఒండొకరికి సహాయపడితే ప్రవక్తకు సంరక్షకుడుగా అల్లాహ్ ఉన్నాడు. జిబ్రయీలు, సజ్జనులైన విశ్వాసులు (అతనికి) ఆదరువుగా ఉన్నారు – అదీగాక దైవదూతలు కూడా అతనికి సహాయకులుగా ఉన్నారు.[10]

عَسَىٰ رَبُّهُ إِن طَلَّقَكُنَّ أَن يُبْدِلَهُ
أَزْوَاجًا خَيْرًا مِّنكُنَّ مُسْلِمَاتٍ مُّؤْمِنَاتٍ
قَانِتَاتٍ تَائِبَاتٍ عَابِدَاتٍ سَائِحَاتٍ ثَيِّبَاتٍ
وَأَبْكَارًا ⑤

**5** ఒకవేళ అతను (ప్రవక్త) మీకు విడాకులిస్తే అతి త్వరలోనే అతని ప్రభువు అతనికి మీకు బదులుగా మీకన్నా ఉత్తమురాలైన భార్యలను ప్రసాదిస్తాడు.[11] వారు ముస్లిములు, విశ్వాసం కలిగి ఉన్నవారు, విధేయత చూపేవారు, పశ్చాత్తాపంచెందేవారు, ఆరాధనలు చేసేవారు, ఉపవాసాలు పాటించేవారు అయి ఉంటారు. వారు వితంతువులూ అయి ఉంటారు, కన్యలూ అయి ఉంటారు.[12]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا قُوا أَنفُسَكُمْ وَأَهْلِيكُمْ
نَارًا وَقُودُهَا النَّاسُ وَالْحِجَارَةُ عَلَيْهَا
مَلَائِكَةٌ غِلَاظٌ شِدَادٌ لَّا يَعْصُونَ اللَّهَ
مَا أَمَرَهُمْ وَيَفْعَلُونَ مَا يُؤْمَرُونَ ⑥

**6** ఓ విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుటుంబీకుల్ని అగ్ని బారి నుండి కాపాడుకోండి.[13] (ఆ అగ్ని ఎటువంటిదంటే) మనుషులు, రాళ్లు దాని ఇంధనం కానున్నారు. దానిపై కర్కశులు, బలిష్ఠులు అయిన దూతలు నియమితులై ఉన్నారు. అల్లాహ్ ఆజ్ఞలను పాలించటంలో వారు ఏమాత్రం అలక్ష్యం చేయరు. పైగా వారికి జారీ చేయబడిన ఆజ్ఞలను వారు ఖచ్చితంగా పాలిస్తారు.

7. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే ఖుర్ఆన్ మాత్రమేగాక కొన్ని ఇతర విషయాలు కూడా దైవప్రవక్త (స)కు 'వహీ' ద్వారా తెలియజేయబడేవి.

8. అంటే – మీరు గనక దైవసమక్షంలో పశ్చాత్తాపపడితే మీ పశ్చాత్తాపం స్వీకరించబడుతుంది.

9. అంటే – దైవప్రవక్త (స)కు ఇష్టంలేని ఒకానొక విషయంలో మీరిద్దరూ కుమ్మక్కు అయ్యారంటే మీ హృదయాలు సత్యం నుండి కొద్దిగా ప్రక్కకు తొలిగాయి. (ఫత్హుల్ ఖదీర్).

10. దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా మీరు జట్టు కట్టినంతమాత్రాన మీరు ప్రవక్తకు ఎలాంటి నష్టం కలిగించలేరు. ఎందుకంటే ప్రవక్తకు దేవుని అండదండలున్నాయి. దైవదూతల, విశ్వాసుల తోడ్పాటు కూడా అతనికి ఉన్నది.

11. ప్రవక్త సతీమణులకు ఈ ఆయతు హెచ్చరిక వంటిది. జాగ్రత్త! మీరేమనుకుంటున్నారు!? దేవుడు గనక తలిస్తే ప్రవక్తకు మీకన్నా ఉత్తమురాలైన భార్యలను – మీకు బదులుగా – ప్రసాదిస్తాడు.

12. **"సయ్యిబాత్"** (**ثَيِّبَاتٍ**) అంటే తిరిగివచ్చేవారు అని అసలు అర్థం. వితంతువు అయిన స్త్రీని 'సయ్యిబ్' అని ఎందుకంటారంటే, ఆమె తన భర్త నుండి తిరిగివస్తుంది (భర్తను కోల్పోయి వస్తుంది). కన్య (బిక్రున్) అంటే– ఇంకా భర్త పొందు ఎరగనిది, సృష్టించబడిన స్థితిలోనే ఉన్నది అని అర్థం (ఫత్హుల్ ఖదీర్).

13. ఈ ఆయతులో విశ్వాసులైన ముస్లింలకు అత్యంత ముఖ్యమైన వారి బాధ్యతను గుర్తు చేయటం జరిగింది. అదేమంటే వారు తమతోపాటు తమ కుటుంబసభ్యులను కూడా సంస్కరించాలి. వారికి ధార్మికంగా మంచి శిక్షణ ఇవ్వాలి. అప్పుడే వారు నరకాగ్ని బారినుండి రక్షించుకోగలుగుతారు. అందుకే పిల్లలు ఏడేండ్ల వయస్సుకు చేరుకోగానే వారికి నమాజు గురించి ప్రోత్సహించాలని, పదేండ్ల తరువాత వారు నమాజుల పట్ల అశ్రద్ధవహిస్తే వారిని దండించాలని

7 ఓ అవిశ్వాసులారా! ఈ రోజు మీరు సాకులు చెప్పకండి. మీరు చేసుకున్న కర్మల ఫలితం మాత్రమే మీకివ్వబడుతుంది.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ كَفَرُواْ لَا تَعۡتَذِرُواْ ٱلۡيَوۡمَۖ
إِنَّمَا تُجۡزَوۡنَ مَا كُنتُمۡ تَعۡمَلُونَ ⑦

8 ఓ విశ్వాసులారా! అల్లాహ్ వైపు పశ్చాత్తాపంతో మరలండి- నిష్కల్మషమైన పశ్చాత్తాపభావంతో![14] మీ ప్రభువు మీ పాపా లను మీనుండి దూరం చేయవచ్చు. క్రింద సెలయేళ్లు ప్రవహించే (స్వర్గ) వనాలలో మీకు ప్రవేశం కల్పించవచ్చు. ఆ రోజు అల్లాహ్ ప్రవక్తనూ, అతని వెంట నున్న విశ్వాసులను అవమానపరచడు. వారి కాంతి వారి ముందూ, వారి కుడి వైపూ పరుగెడుతూ ఉంటుంది. అప్పుడు వారిలా వేడుకుంటూ ఉంటారు : "మా ప్రభూ! మా కాంతిని మా కొరకు పరిపూర్ణం గావించు.[15] మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా నీవు అన్నింటిపై అధికారం కలవాడవు."

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُواْ تُوبُوٓاْ إِلَى ٱللَّهِ تَوۡبَةٗ
نَّصُوحًا عَسَىٰ رَبُّكُمۡ أَن يُكَفِّرَ عَنكُمۡ سَيِّـَٔاتِكُمۡ
وَيُدۡخِلَكُمۡ جَنَّٰتٖ تَجۡرِي مِن تَحۡتِهَا ٱلۡأَنۡهَٰرُ
يَوۡمَ لَا يُخۡزِي ٱللَّهُ ٱلنَّبِيَّ وَٱلَّذِينَ ءَامَنُواْ
مَعَهُۥۖ نُورُهُمۡ يَسۡعَىٰ بَيۡنَ أَيۡدِيهِمۡ
وَبِأَيۡمَٰنِهِمۡ يَقُولُونَ رَبَّنَآ أَتۡمِمۡ لَنَا نُورَنَا
وَٱغۡفِرۡ لَنَآۖ إِنَّكَ عَلَىٰ كُلِّ شَيۡءٖ قَدِيرٞ ⑧

9 ఓ ప్రవక్తా! అవిశ్వాసులతో, కపటులతో పోరాడు.[16] వారి పట్ల కఠినంగా వ్యవహరించు.[17] వారి నివాసం నరకం.[18] అది చాలా చెడ్డ గమ్యం.

يَٰٓأَيُّهَا ٱلنَّبِيُّ جَٰهِدِ ٱلۡكُفَّارَ وَٱلۡمُنَٰفِقِينَ وَٱغۡلُظۡ
عَلَيۡهِمۡۚ وَمَأۡوَىٰهُمۡ جَهَنَّمُۖ وَبِئۡسَ ٱلۡمَصِيرُ ⑨

---

మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పారు (సుననె అబూ దావూద్, సుననె తిర్మిజీ - కితాబుస్సలాత్). అలాగే వారిచేత ఉపవాసాలు పాటింపజేయాలి. ఇతర షరీయతు ఆదేశాలను కూడా వారు అవలంబించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే వారు పెద్దవారయ్యాక సత్యధర్మమైన ఇస్లాంకు కట్టుబడి జీవితం గడుపుతారు (ఇబ్నె కసీర్).

14. నిష్కల్మషమైన లేక నిజమైన పశ్చాత్తాపం అంటే ఇది : 1. మనిషి తాను చేసిన ఏ పాపం పట్ల పశ్చాత్తాపం చెందుతున్నాడో దాన్ని త్యజించాలి. 2. ఆ తప్పుపై దైవ సమక్షంలో సిగ్గుతో కుమిలిపోవాలి. 3. ఇకమీదట ఎన్నడూ దానిని తిరిగి చేయనని సంకల్పించుకోవాలి. 4. తాను చేసిన తప్పు మానవహక్కులకు సంబంధించినదైతే- ఉదాహరణకు: ఎవరి హక్కునయినా తాను కబళించి ఉంటే, దాన్ని తిరిగి ఇచ్చి వేయాలి. తాను దౌర్జన్యం చేసిన వారికి క్షమాపణ చెప్పాలి. కేవలం ముఖం మీద లెంపలేసుకున్నంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదు.

15. కపటుల కాంతి ఆర్పివేయబడినప్పుడు విశ్వాసులు ఈ విధంగా ప్రార్థిస్తారు. అల్ హదీద్ సూరాలో దీని వివరాలు వచ్చాయి. స్వర్గంలో ప్రవేశించేవరకూ ఈ కాంతిని మిగిల్చి ఉంచమని, పూర్తి కాంతిని ప్రసాదించమని వారు విన్నవించుకుంటారు.

16. అవిశ్వాసులతో ధర్మయుద్ధం చేయటంతో పాటు కపటులకు కూడా గుణపాఠం నేర్పాలి. ముఖ్యంగా వారు షరీయతు పరిమితులను ఉల్లంఘించినట్లు రుజువైనపుడు కపటులను కఠినంగా శిక్షించాలి.

17. అంటే - ధర్మపరిచయం విషయంలో వారి యెడల చాలా ఖచ్చితంగా ఉండు. షరీయతు ఆదేశాలలో కూడా వారిపట్ల నిర్ద్వంద్వంగా వ్యవహరించు. ఎందుకంటే వారు మృదువుగా వ్యవహరిస్తే వినే రకం కాదు. దండోపాయమే వారికి తగిన మందు. దైవసందేశ ప్రచారకార్యంలో మృదుత్వం అవసరమే. కాని ఒక్కోసారి సూటిగా వ్యవహరించాల్సిన అవసరం కూడా ఏర్పడుతుంది. ప్రతిచోటా మెతక వైఖరి మంచిది కాదు. అలాగే ప్రతిచోటా కఠినవైఖరి కూడా

10 అల్లాహ్ అవిశ్వాసుల (హితబోధ) కోసం నూహు, లూతు భార్యల ఉదాహరణలను ఇస్తున్నాడు.[19] వారిద్దరూ మా దాసుల్లోని ఇద్దరు సజ్జనుల ఆధ్వర్యంలో ఉండేవారు. అయితే వారిద్దరూ తమ భర్తల పట్ల ద్రోహానికి ఒడిగట్టారు.[20] అందువల్ల వారిద్దరు (సజ్జన దాసులు) దైవశిక్ష విషయంలో వారిని (తమ భార్యలను) ఏ విధంగానూ ఆదుకోలేకపోయారు.[21] "పొండి, నరకానికి పోయే వారితోపాటు మీరూ పోయిపడండి"[22] అని ఆ స్త్రీలిరువురితో అనబడింది.

ضَرَبَ اللّٰهُ مَثَلًا لِّلَّذِيْنَ كَفَرُوا امْرَاَتَ نُوْحٍ وَّامْرَاَتَ لُوْطٍ ؕ كَانَتَا تَحْتَ عَبْدَيْنِ مِنْ عِبَادِنَا صَالِحَيْنِ فَخَانَتٰهُمَا فَلَمْ يُغْنِيَا عَنْهُمَا مِنَ اللّٰهِ شَيْـًٔا وَّقِيْلَ ادْخُلَا النَّارَ مَعَ الدّٰخِلِيْنَ ﴿10﴾

11 మరి అల్లాహ్ విశ్వాసుల కొరకు ఫిరౌను భార్య ఉదాహరణను ఇస్తున్నాడు.[23] అప్పుడామె ఇలా వేడుకున్నది : "నా ప్రభూ! నా కోసం నీ దగ్గర–స్వర్గంలో– ఒక గృహాన్ని నిర్మించు. నన్ను ఫిరౌను నుండి, అతని (దుష్ట) పోకడ నుండి రక్షించు. దుర్మార్గ జనుల బారి నుండి నాకు విముక్తిని ప్రసాదించు."

وَضَرَبَ اللّٰهُ مَثَلًا لِّلَّذِيْنَ اٰمَنُوا امْرَاَتَ فِرْعَوْنَ ۘ اِذْ قَالَتْ رَبِّ ابْنِ لِيْ عِنْدَكَ بَيْتًا فِي الْجَنَّةِ وَنَجِّنِيْ مِنْ فِرْعَوْنَ وَعَمَلِهٖ وَنَجِّنِيْ مِنَ الْقَوْمِ الظّٰلِمِيْنَ ﴿11﴾

---

మంచిది కాదు. పరిస్థితుల స్వరూపాన్ని బట్టి, వ్యక్తుల, సముదాయాల మనస్తత్వాలనుబట్టి తగు విధానాన్ని అవలంబించవలసి ఉంటుంది.

18. అంటే – అవిశ్వాసుల, కపటుల నివాస స్థలం నరకం అవుతుంది.

19. అరుదైన, విచిత్రమైన ఒక సంఘటనను బోధించి దానిద్వారా అటువంటి మరో స్థితిని, సంఘటనను వివరించటాన్ని 'మసలున్' (ఉపమానం లేక ఉదాహరణ) అంటారు. ఈ ఆయతులో కూడా అవిశ్వాసుల కరడు గట్టిన వ్యతిరేకతను ఎత్తిచూపుతూ, వారి బోధనార్థం గతంలోని ఉదాహరణ ఇవ్వబడింది. ఇది దైవప్రవక్తలైన నూహ్(అలైహి), లూత్ (అలైహి)ల భార్యల ఉపమానం.

20. ఇక్కడ **'ద్రోహం'** అంటే భావం శీలానికి సంబంధించిన ద్రోహం కాదు. ఆ మాటకొస్తే ఏ ప్రవక్త భార్య కూడా చెడునడత గలది కాజాలదన్న విషయంపై విద్వాంసులందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది (ఫత్హుల్ ఖదీర్). అయితే నూహు, లూతు ప్రవక్తల భార్యలు తమ భర్తల సందేశాన్ని నమ్మలేదు. పైగా వారు కాపట్యానికిలోనై తమ భర్తల సందేశానికి వ్యతిరేకంగా, తమ జాతి జనులకు మద్దతు ఇచ్చారు. ఉదాహరణకు: హజ్రత్ నూహు భార్యనే చూడండి, ఆమె తన భర్త గురించి జనులకు చెబుతూ 'ఆయన గారికి పిచ్చిపట్టుకున్నట్టుంది' అని అనేది. అలాగే లూతు భార్య తన భర్తకు వ్యతిరేకంగా గూఢచారి కార్యకలాపాలు నిర్వహించేది. తన భర్త దగ్గరికి వచ్చిన యువ అతిథుల గురించి ఆమె తన జాతి వారికి సమాచారం అందజేసింది. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం వీరిద్దరూ తమ భర్తల గురించి ప్రజలకు చాడీలు చెప్పేవారు.

21. హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం), హజ్రత్ లూత్ (అలైహిస్సలాం)లు దైవప్రవక్తలు, దైవసామీప్యం పొందిన దాసులై ఉండి కూడా తమ భార్యలను దైవశిక్షనుండి రక్షించలేకపోయారు.

22. ఈ మాట వారికి ప్రళయదినాన అనబడుతుంది లేదా మరణ సమయంలో అనబడింది. అవిశ్వాసుల ఈ ఉపమానాన్ని ఇక్కడ ప్రత్యేకంగా ఇవ్వటంలోని ఉద్దేశం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి సతీమణులను హెచ్చరించటమే. వారు ముమ్మాటికీ దైవప్రవక్త (స) ఇంటికి దీపాల వంటివారే. వారు ఇతర మహిళామణుల కన్నా శ్రేష్ఠులు అన్నది కూడా నిజమే. అయినాసరే వారు గనక దైవప్రవక్త (సఅసం)ను ఎదిరించినా, లేక దైవప్రవక్త (స) మనసు

وَمَرْيَمَ ابْنَتَ عِمْرَانَ الَّتِيْٓ اَحْصَنَتْ فَرْجَهَا فَنَفَخْنَا فِيْهِ مِنْ رُّوْحِنَا وَصَدَّقَتْ بِكَلِمٰتِ رَبِّهَا وَكُتُبِهٖ وَكَانَتْ مِنَ الْقٰنِتِيْنَ ⑫

**12** మరి ఇమ్రాన్ కుమార్తె అయిన మర్యమ్ (గురించి కూడా అల్లాహ్ ఉదాహరిస్తున్నాడు).[24] ఆమె తన మానాన్ని కాపాడు కున్నది. మరి మేము మా తరఫున ఆమెలో ప్రాణం (ఆత్మ)ను ఊదాము. మరి ఆమె తన ప్రభువు వచనాలను,[25] ఆయన గ్రంథాలను సత్యమని ధృవపరచింది. ఆమె వినయవిధేయతలు గల స్త్రీమూర్తుల కోవకు చెందినది.[26]

నొప్పించినా అది క్షంతవ్యం కాజాలదు. దేవుడు వారిని నిలదీయవచ్చు. అదే గనక జరిగితే వారిని ఇక కాపాడేవాడెవడూ ఉండడు.

23. అంటే ముస్లింలలో సహనస్థయిర్యాలను, ధైర్యసాహసాలను, వజ్రసంకల్పాన్ని నూరి పోయటం కోసం ఫిరౌను భార్యను ఉపమానంగా పేర్కొన్నాడు. ఫిరౌను లాంటి కరడు గట్టిన దైవవిరోధి భార్యయే విశ్వాస మార్గంలో నిలకడ కలిగి ఉన్నప్పుడు, మీరు మాత్రం ఎందుకు స్థిరంగా ఉండలేరు? అని అల్లాహ్ యిక్కడ చెప్పదలిచాడు.

24. హజ్రత్ మర్యమ్ (అలైహిస్సలాం)ను ఇక్కడ ప్రస్తావించటంలోని ఉద్దేశ్యం ఇది: ఆమెగారు మార్గవిహీనులైన జనుల మధ్య నివసిస్తూ కూడా శీలవతిగా, వినయవతిగా రాణించి దైవప్రసన్నతను చూరగొన్నది. దేవుడామెకు ప్రపంచ మహిళలందరిపై శ్రేష్ఠతను ప్రసాదించాడు.

25. ఇక్కడ ప్రభువు వచనాలు అంటే దైవసూచనలు, దైవాజ్ఞలు అని భావం.

26. ఆమె పుట్టిన వంశం దైవభక్తుల వంశం. ఆ వంశంలో అంతకు ముందు చాలామంది సజ్జనులు, విధేయులు జన్మిం చారు. ఆమె కూడా సద్వర్తనలో ఎన్నదగ్గ మహిళ. హదీసులో ఇలా ఉంది: "స్వర్గంలోని స్త్రీలలో అందరికన్నా ఉత్తములు హజ్రత్ ఖదీజా, హజ్రత్ ఫాతిమా, హజ్రత్ మర్యమ్, ఫిరౌన్ భార్యయగు ఆసియాలు." (ముస్నద్ అహ్మద్ –1/293; అస్సహీహతు లిల్ అల్‌బానీ – 1508). మరొక హదీసులో మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "పురుషులలో పూర్ణ పరిణతి గలవారు చాలామంది గతించారు. కాని స్త్రీలలో పరిపూర్ణత నొందినవారు ఫిరౌను భార్యయగు ఆసియా, ఇమ్రాన్ పుత్రిక అయిన మర్యమ్, ఖువైలిద్ కుమార్తె అయిన ఖదీజా (ర.అ)లే. కాగా; సరీద్ వంటకానికి ఇతర వంటకాలపై ఎటువంటి ఆధిక్యత ఉందో మహిళలలో ఆయిషా (ర.అన్హా)కు కూడా అటువంటి ఆధిక్యతే ఉంది (సహీహ్ బుఖారీ – కితాబు బద్‌యిల్ ఖల్ఖ్; సహీహ్ ముస్లిం – కితాబుల్ ఫజాయెల్).

67 వ సూరా

# అల్ ముల్క్

## విశ్వరాజ్యాధికారం

అవతరణ మక్కాలో

ఆయతులు 30

### పరిచయం

ఏక దైవారాధన, దేవుని రాజ్యాధికారం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినాల గురించి ఈ సూరాలో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన రాజ్యాధికారం అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్ ఆకాశాలకు, భూమికి ప్రభువు. ప్రకృతిలోను, విశ్వంలోను ఉన్న క్రమబద్ధత ఈ వాస్తవాన్ని నిరూపిస్తుందని ఈ సూరా వివరించింది. సమస్తాన్ని అల్లాహ్యే నియంత్రిస్తున్నాడని తెలియజేసింది. ఆయనకు అన్నింటిపై అధికారం ఉంది. ఆయన జీవితాన్ని, మృత్యువును సృష్టించాడు. ఆయన అపార కృపాశీలుడు, విశ్వ సామ్రాజ్యాధిపత్యం కలిగినవాడు, అన్నీ తెలిసినవాడు, పోషకుడు, ఆయన ఒక్కడే, తీర్పుదినం గురించిన జ్ఞానం ఆయనకు మాత్రమే ఉంది.

గతకాలాలకు చెందిన జాతులకు పట్టబోయే దుర్గతి గురించి ఈ సూరాలో తెలియజేయడం జరిగింది. ఆయా జాతులు తమ ప్రవక్తల పట్ల అవిశ్వాసాన్ని చూపాయి, వారిని ఎగతాళి చేసాయి, తిరస్కరించాయి. చివరకు అవమానకరమైన శిక్షను చవి చూసాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) మానవాళికి హెచ్చరిక చేసేవారు మాత్రమేనని ఈ సూరా స్పష్టం చేసింది. ఈ సూరాలో దేవుని శక్తిసామర్థ్యాల గురించిన వివరాలు అందజేయడం జరిగింది. ఆయన ఏడు ఆకాశాలను ఖచ్చితమైన సమతుల్యంతో తయారు చేసాడు. భూమికి దగ్గరగా ఉన్న ఆకాశాన్ని ఆయన నక్షత్రాలతో అలంకరించాడు. ఆయన భూమిని నివాసయోగ్యంగా చేసాడు. ఆయన ప్రజలకు హెచ్చరికగా తీవ్రమైన శిక్షలు పంపగలడు. ఈ సూరాలో విశ్వాసులకు, అవిశ్వాసులకు లభించే బహుమానం, శిక్షల గురించిన దృశ్యాలను కూడా వర్ణించడం జరిగింది. అవిశ్వాసుల కొరకు నరకశిక్ష సిద్ధం చేయబడింది. తమ ప్రభువుకు భయపడుతూ బ్రతికిన వారికి క్షమాభిక్ష, బహుమానాలు సిద్ధంగా ఉన్నాయి.

## అల్ ముల్క్[1] సూరా

## سُوْرَةُ الْمُلْكِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** ఎవరి చేతిలో విశ్వసామ్రాజ్యాధికారం ఉన్నదో ఆయన ఎంతో శుభకరుడు.[2] ఆయన ప్రతి వస్తువుపై అధికారం కలవాడు.

تَبٰرَكَ الَّذِيْ بِيَدِهِ الْمُلْكُ ۡ وَهُوَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرُ ۙ﴿1﴾

**2** మీలో మంచిపనులు చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావుబతుకులను[3] సృష్టించాడు. ఆయన శక్తిశాలి, క్షమాశీలి కూడాను.

الَّذِيْ خَلَقَ الْمَوْتَ وَالْحَيٰوةَ لِيَبْلُوَكُمْ اَيُّكُمْ اَحْسَنُ عَمَلًا ۭ وَهُوَ الْعَزِيْزُ الْغَفُوْرُ ۙ﴿2﴾

**3** ఆయన ఒకదానిపై ఒకటిగా సప్తాకాశాలను నిర్మించాడు. (ఓ చూచేవాడా!) నీవు కరుణామయుని సృష్టి ప్రక్రియలో ఎలాంటి అస్తవ్యస్తతను కానలేవు.[4] కావాలంటే మరోసారి (దృష్టిని సారించి) చూడు. నీకేమైనా లోపం (బీటలు వారినట్టు) కనిపిస్తోందా?[5]

الَّذِيْ خَلَقَ سَبْعَ سَمٰوٰتٍ طِبَاقًا ۭ مَا تَرٰى فِيْ خَلْقِ الرَّحْمٰنِ مِنْ تَفٰوُتٍ ۭ فَارْجِعِ الْبَصَرَ ۙ هَلْ تَرٰى مِنْ فُطُوْرٍ ﴿3﴾

1. ఈ సూరా మహత్మ్యాన్ని చాటే ఉల్లేఖనాలు చాలా ఉన్నాయి. అయితే వాటిలో కొన్ని ఉల్లేఖనాలు మాత్రమే ప్రామాణిక మైనవి. లేదా 'హసన్' కోవకు చెందినవి. ఒక ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త (సఅసం) వారు ఇలా ప్రవచించారు: "దైవగ్రంథంలో ఒక సూరా ఉంది. అందులో కేవలం 30 ఆయతులే ఉన్నాయి. ఇది మనిషి కొరకు సిఫారసు చేస్తుంది. అతనికి క్షమాభిక్ష ప్రసాదించబడేవరకూ సిఫారసు చేస్తూనే ఉంటుంది." (సుననె తిర్మిజీ, సుననె అబూ దావూద్, ఇబ్నెమాజ, ముస్నదె అహ్మద్– 2/299 321). వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "దివ్య ఖుర్ఆన్‌లో ఒక సూరా ఉంది. అది తనను పఠించేవాని తరఫున వాదిస్తుంది. కడకు అతన్ని స్వర్గంలో చేర్పిస్తుంది (మజ్‌మవుజ్జవాయెద్). సుననె తిర్మిజీలోని ఒక ఉల్లేఖనంలో ఈ విధంగా వివరించబడింది: దైవప్రవక్త (సఅసం) రాత్రి నిద్రించేముందు సూరయె అలిఫ్ లామ్ మీమ్ సజ్దా మరియు సూరయె ముల్క్ తప్పకుండా పారాయణం చేసేవారు (ఫజాయెలె ఖుర్ఆన్ అధ్యాయాలు). షేఖ్ అల్‌బానీ అస్సహీహ (హ.నెం. 1140/సంపుటి – 3)లో ప్రస్తావించిన ఒక ఉల్లేఖనంలో "అల్ ముల్క్ సూరా సమాధి యాతన నుండి ఆపుతుంది" అని ఉంది. అంటే ఈ సూరాను అధికంగా పఠించేవ్యక్తి సమాధి యాతన నుండి సురక్షితంగా ఉంటాడని ఆశించవచ్చు. అయితే అతను ఇస్లాం విధులకు, షరీయతు ఆదేశాలకు కట్టుబడేవాడై ఉండాలి.
2. **'తబారక'** అనే పదం **'బరకత్'** నుండి వచ్చింది. బరకత్ అంటే సమృద్ధి, శుభం, పెరుగుదల అని అర్థం. సృష్టిరాశుల గుణాలకు అతీతుడు, ఉన్నతుడు అని కొంతమంది తర్జుమా చేశారు. 'ఆయన చేతిలోనే సార్వభౌమాధికారం ఉంది' అంటే అన్నిరకాల అదుపు, అధికారం, ఆధిక్యత ఆయన అధీనంలోనే ఉందని భావం. ఆయన ఈ విశ్వవ్యవస్థలో ఏం చేసినా చెల్లుతుంది. ఆయన్ని ఆపే అధికారం ఎవరికీ లేదు. ఆయన ఒక రాజును ఫకీరుగా మార్చగలడు, ఫకీరును రాజుగా మార్చగలడు. ధనికుణ్ణి దరిద్రుడుగా మార్చగలడు. దరిద్రుణ్ణి ధనికుడుగా కూడా మార్చగలడు. ఆయన ప్రణాళికా రచనలో ఎవరూ జోక్యం చేసుకోలేరు.
3. ఈ ప్రాపంచిక జీవితాన్ని ఎవరు సద్వినియోగం చేసుకుంటారో ఆయన చూడదలిచాడు. ఎవరైతే దీన్ని విశ్వాసం, విధేయతల కొరకు ఉపయోగిస్తాడో అతని కోసం మంచి ప్రతిఫలం ఉంది. ఇతరులకు శిక్షపడుతుంది. **'రూహ్'** (ప్రాణం) అనేది ఒక కనిపించని వస్తువు. దానికి శరీరంతో సంబంధం ఏర్పడితే ఆ శరీరం జీవం గలదిగా భావించబడుతుంది. దేహంతో దాని సంబంధం తెగిపోయిన నాడు ఆ దేహం నిర్జీవంగా ఉండిపోతుంది.

4 మళ్లీ మళ్లీ దృష్టిని సారించు. నీ దృష్టి అలసిసొలసి, విఫలమై నీ వైపు తిరిగి వస్తుంది.[6]

ثُمَّ ارْجِعِ الْبَصَرَ كَرَّتَيْنِ يَنقَلِبْ إِلَيْكَ الْبَصَرُ خَاسِئًا وَهُوَ حَسِيرٌ ④

5 నిశ్చయంగా మేము (భూమికి) సమీపంలో ఉన్న ఆకాశాన్ని దీపాలతో (నక్షత్రాలతో) ముస్తాబు చేశాము. ఇంకా వాటిని (ఆ దీపాలను) షైతానులను తరిమికొట్టే సాధనాలుగా చేశాము.[7] షైతానుల కొరకైతే మేము మండే నరకాగ్ని శిక్షను కూడా సిద్ధ పరచి ఉంచాము.

وَلَقَدْ زَيَّنَّا السَّمَاءَ الدُّنْيَا بِمَصَابِيحَ وَجَعَلْنَاهَا رُجُومًا لِّلشَّيَاطِينِ ۖ وَأَعْتَدْنَا لَهُمْ عَذَابَ السَّعِيرِ ⑤

6 తమ ప్రభువును తిరస్కరించిన వారికి నరకయాతన తథ్యం. అదెంత చెడ్డ గమ్య స్థలం!?

وَلِلَّذِينَ كَفَرُوا بِرَبِّهِمْ عَذَابُ جَهَنَّمَ ۖ وَبِئْسَ الْمَصِيرُ ⑥

7 వారు అందులో పడవేయబడినప్పుడు దాని వికృత గర్జనను వారు వింటారు. అది ఉద్రేకంతో ఉడికిపోతూ ఉంటుంది.[8]

إِذَا أُلْقُوا فِيهَا سَمِعُوا لَهَا شَهِيقًا وَهِيَ تَفُورُ ⑦

8 ఆగ్రహంతో బ్రద్దలైపోయినట్లే ఉంటుంది.[9] అందులో ఏదైనా ఒక సమూహం పడవేయబడినప్పుడల్లా, దాని రక్షకులు వారి నుద్దేశించి, "ఏమిటి, మీవద్దకు హెచ్చరించేవారెవరూ రాలేదా?"[10] అని అడుగుతారు.

تَكَادُ تَمَيَّزُ مِنَ الْغَيْظِ ۖ كُلَّمَا أُلْقِيَ فِيهَا فَوْجٌ سَأَلَهُمْ خَزَنَتُهَا أَلَمْ يَأْتِكُمْ نَذِيرٌ ⑧

4. అంటే, ఏ లోపంగానీ, క్రమరాహిత్యంగానీ, వంకరతనంగానీ వాటిలో కానరాదు. పైగా వాటిమధ్య ఎంతో క్రమబద్ధత, సత్యత, సమానత్వం కానవస్తుంది. దీన్నిబట్టి కూడా ఈ సప్తాకాశాల నిర్మాతలు అనేకులు కారని, ఆ నిర్మాత ఒక్కడేనని విదితమవుతోంది.

5. ఒక్కోసారి పునఃపరిశీలన ద్వారా వస్తువులోని లోపం బయటపడవచ్చు. అందుకే సృష్టికర్త మీకు పిలుపు ఇస్తున్నాడు– మరోసారి సునిశిత దృష్టితో ఆకాశాల వ్యవస్థను పరిశీలించమని!

6. దేవుడు తన ఏకత్వాన్ని, బ్రహ్మాండమైన పనితనాన్ని, తిరుగులేని అధికారాన్ని స్పష్టపరచటానికే ఈ విధంగా మాటిమాటికీ సవాలు విసిరాడు.

7. ఈ వాక్యంలో నక్షత్రాల రెండు ఉద్దేశాలు వివరించబడ్డాయి. 1. ఆకాశాలకు అలంకరణ. ఎందుకంటే అవి దీపాల మాదిరిగా వెలుగొందుతూ ఆకాశానికి శోభనిస్తాయి. 2. షైతానులు ఆకాశాలపైకి వెళ్ళి, అక్కడి విశేషాలను రాబట్టదలిస్తే అవి వారిపై విరుచుకుపడతాయి. నక్షత్రాల ద్వారా చేకూరే మూడో ప్రయోజనం ఏమిటంటే సముద్రాలలో, ఎడారి ప్రదేశాలలో (రాత్రిపూట) వాటి ఆధారంగా మార్గం కనుగొనబడుతుంది.

8. **'షహీఖ్'** (شَهِيق) అని అనబడింది. గాడిద తొలిసారి గాండ్రించినపుడు వచ్చే ధ్వనిని షహీఖ్ అంటారు. ఈ ధ్వని పరమరోతగా, కర్ణ కఠోరంగా ఉంటుంది. నరకం కూడా గార్ధభం మాదిరిగా అరుస్తూ, పొయ్యిపై ఉన్న కుండ ఉడికినట్లుగా ఉడుకుతూ ఉంటుంది.

9. కోపం కొద్దీ అది పగిలి ముక్కలైపోతుందా? అన్నట్లే ఉంటుంది. అవిశ్వాసులను, పాపాత్ములను చూసినపుడు దాని ఆగ్రహం కట్టలు త్రెంచుకుంటుంది. ఆనాడు దేవుడు నరకానికి ఆ మేరకు చైతన్యాన్ని ఇస్తాడు. నరకానికి ఈపాటి స్పృహను వొసగటం దేవునికి ఏమాత్రం కష్టతరం కాదు.

10. మీరు నరకానికి ఎందుకు ఆహుతి అవుతున్నారు? దైవశిక్ష గురించి భయపెట్టే ప్రవక్త ఎవరూ మీవద్దకు రాలేదా?

قَالُوا بَلَىٰ قَدْ جَاءَنَا نَذِيرٌ فَكَذَّبْنَا وَقُلْنَا
مَا نَزَّلَ اللَّهُ مِنْ شَيْءٍ إِنْ أَنْتُمْ إِلَّا فِي
ضَلَالٍ كَبِيرٍ ⑨

9 "ఎందుకు రాలేదు? హెచ్చరించేవాడొకడు వచ్చాడు. కాని మేమే అతన్ని ధిక్కరించాము. 'అల్లాహ్ దేనినీ అవతరింపజేయ లేదు. మీరే పెద్ద అపమార్గానికి లోనై ఉన్నార'[11]ని (సూటిగా) చెప్పేశాము" అని వారు ఒప్పుకుంటారు.

وَقَالُوا لَوْ كُنَّا نَسْمَعُ أَوْ نَعْقِلُ مَا كُنَّا
فِي أَصْحَابِ السَّعِيرِ ⑩

10 వారు ఇంకా ఇలా అంటారు: "మేము విని ఉంటే లేదా బుద్ధి పెట్టి ఆలోచించి ఉంటే నరకాగ్నికి ఆహుతి అయిన వాళ్ళతో చేరేవాళ్ళం కాము."[12]

فَاعْتَرَفُوا بِذَنْبِهِمْ فَسُحْقًا لِأَصْحَابِ السَّعِيرِ ⑪

11 ఆ విధంగా వారు తమ తప్పును (పాపాన్ని) ఒప్పుకుంటారు.[13] కనుక ఈ నరకవాసులు (దైవకారుణ్యానికి) దూరమవుదురు గాక![14]

إِنَّ الَّذِينَ يَخْشَوْنَ رَبَّهُمْ بِالْغَيْبِ لَهُمْ
مَغْفِرَةٌ وَأَجْرٌ كَبِيرٌ ⑫

12 తమ ప్రభువును చూడకుండానే ఆయనకు భయపడుతూ ఉండే వారి కోసం క్షమాపణ, గొప్ప పుణ్యఫలం ఉన్నాయి.[15]

وَأَسِرُّوا قَوْلَكُمْ أَوِ اجْهَرُوا بِهِ ۖ إِنَّهُ عَلِيمٌ
بِذَاتِ الصُّدُورِ ⑬

13 మీరు మీ మాటలను రహస్యంగా (మెల్లగా) పలికినా, బిగ్గరగా పలికినా (అల్లాహ్‌కు తెలియకుండా ఉండవు).[16] నిశ్చయంగా ఆయన గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు.[17]

---

11. అంటే – మేము మా వద్దకు వచ్చిన ప్రవక్తల మాట వినలేదు. పైగా వారిని త్రోసి పుచ్చాము. దైవగ్రంథాలను ఆసాంతం నిరాకరించాము. ప్రవక్తలే పెడదారి పట్టినారని తెగేసి చెప్పాము అని వారు అంగీకరిస్తారు.
12. అంటే – ప్రవక్తల సందేశాన్ని శ్రద్ధగా ఆలకించి, వారి ఉపదేశాలను అనుసరించి ఉంటే, దేవుడిచ్చిన బుద్ధివివేకాలను సద్వినియోగపరచుకుని ఉంటే ఈ రోజు నరకం వాతన పడేవారం కాము.
13. ఈ కారణంగానే వారు శిక్షార్హులుగా ఖరారయ్యారు. దైవం పట్ల తిరస్కారవైఖరి, దైవప్రవక్తల పట్ల పెడసరిధోరణి కడకు వారి కొంపముంచింది.
14. వారు దైవకారుణ్యానికి దూరమై పోయారు. మూలంలో **'సుహుఖ్'** (سُحْقٌ) అని ఉంది. అది నరకంలోని ఒకానొక లోయ అని కొంతమంది అభిప్రాయం వెలిబుచ్చారు.
15. తిరస్కారుల ధిక్కారవైఖరి గురించి ఇంతకు ముందు చెప్పబడింది. ఇప్పుడు విశ్వాసుల, దైవానుగ్రహాల ప్రస్తావన వచ్చింది. **'బిల్ గైబ్'** (بالغيب) అంటే వారు అల్లాహ్‌ను చూడకుండానే ఆయనకు భయపడ్డారు. దైవప్రవక్తలను సత్యవంతులుగా ధృవపరచారు. దీనికి మరో అర్థం ఇది: వారు ప్రజల కంటికి కనిపించకుండా ఏకాంతంలో అల్లాహ్‌కు భయపడుతూ గడిపారు. తమ తప్పిదాలపై ఏకాంతంలో కుమిలిపోతూ అల్లాహ్‌ను క్షమాపణ కోరుకున్నారు.
16. ఇక్కడ మళ్ళీ అవిశ్వాసుల్ని ఉద్దేశించి హెచ్చరిక చేయబడింది : మీరు అంతిమ దైవప్రవక్త (సఅసం)కు వ్యతిరేకంగా రహస్యంగా గుసగుసలాడినా, బాహాటంగా మాట్లాడినా – అంతా అల్లాహ్‌కు తెలిసిపోతుంది. ఏ ఒక్క చిన్న విషయం కూడా ఆయన నుండి దాగిలేదు.
17. ఆంతర్యంలో రేకెత్తే ప్రేరణలను సయితం ఎరిగిన వాని ముందు మీ దాపరికాలు దాగుతాయా? అసంభవం.

14 ఏమిటి, పుట్టించిన ఆయనే ఎరుగకుండా ఉంటాడా?[18] ఆయనైతే సూక్ష్మగ్రాహి, సర్వాన్నీ కనిపెట్టుకుని ఉన్నవాడు.[19]

اَلَا یَعۡلَمُ مَنۡ خَلَقَ ؕ وَ هُوَ اللَّطِیۡفُ الۡخَبِیۡرُ ﴿14﴾

15 ధరిత్రిని మీకు లోబడి ఉండేలా[20] చేసినవాడు ఆయనే. కాబట్టి మీరు దాని మార్గాలపై నడవండి.[21] ఆయన సమకూర్చిన ఆహారాన్ని భుజించండి.[22] కడకు మీరు సజీవులై నిలబడవలసింది ఆయన సన్నిధిలోనే.

هُوَ الَّذِیۡ جَعَلَ لَكُمُ الۡاَرۡضَ ذَلُوۡلًا فَامۡشُوۡا فِیۡ مَنَاكِبِهَا وَ كُلُوۡا مِنۡ رِّزۡقِهٖ ؕ وَ اِلَیۡهِ النُّشُوۡرُ ﴿15﴾

16 ఏమిటి, నింగినున్నవాడు మిమ్మల్ని నేలలోనికి దిగబడేలా చేసే విషయమై, ఆపై నేల అకస్మాత్తుగా ప్రకంపించటంపై మీరు నిర్భయంగా ఉన్నారా?[23]

ءَاَمِنۡتُمۡ مَّنۡ فِی السَّمَآءِ اَنۡ یَّخۡسِفَ بِكُمُ الۡاَرۡضَ فَاِذَا هِیَ تَمُوۡرُ ﴿16﴾

17 లేక నింగినున్నవాడు మీపై రాళ్లవాన కురిపిస్తాడన్న భయం మీకు బొత్తిగా లేదా?[24] మరైతే నా హెచ్చరిక ఎటువంటిదో మీకు త్వరలోనే తెలిసిపోతుంది.[25]

اَمۡ اَمِنۡتُمۡ مَّنۡ فِی السَّمَآءِ اَنۡ یُّرۡسِلَ عَلَیۡكُمۡ حَاصِبًا ؕ فَسَتَعۡلَمُوۡنَ كَیۡفَ نَذِیۡرِ ﴿17﴾

18 వీరి పూర్వీకులు కూడా ధిక్కరించినవారే. మరి వారిపై నా దెబ్బ ఎలాపడిందో చూశారుగా!

وَ لَقَدۡ كَذَّبَ الَّذِیۡنَ مِنۡ قَبۡلِهِمۡ فَكَیۡفَ كَانَ نَكِیۡرِ ﴿18﴾

18. గుండెల్లోని గుట్టులు, ఆంతర్యంలో జనించే ప్రేరణలు – వీటన్నింటినీ సృష్టించినవాడు కూడా అల్లాహ్‌యేకదా! అటువంటి సృష్టికర్త తన సృష్టితాల గురించి తెలియకుండా ఎలా ఉంటాడు?

19. **'లతీఫ్'** అంటే సూక్ష్మాతిసూక్ష్మ విషయాలను సయితం ఎరిగిన వాడని అర్థం. ఆయన గ్రహణాశక్తి ఎంత సూక్ష్మమైనదంటే ఆంతర్యాల్లో తిష్ఠవేసిన ప్రేరణలను సయితం ఆయన కనుగొంటాడు (ఫత్‌హుల్ ఖదీర్).

20. **'జలూల్'** (**ذَلُوۡلٌ**) అంటే విధేయురాలైన, లొంగిపోయిన అనే అర్థాలు వస్తాయి. అంటే దేవుడు మీ కోసం భూమిని మెత్తగా చేసి పాదాక్రాంతం చేశాడు. దానిపై మీరు సంచరించటాన్ని ఎంతో సులభతరం చేశాడు. అదేగనక ఓ పట్టాన లొంగకపోతే, మీకు కావలసిన విధంగా మారకపోతే దానిపై మీ మనుగడ దుర్లభమైపోయేది.

21. **'మనాకిబ్'** అంటే వైపు(లు) అని అర్థం. ఇక్కడ భూమండలంలోని మార్గాలు, పరిసర ప్రాంతాలు అనే అర్థాలు వస్తాయి. దేవుడు మీ కోసం ఈ నేలను సానుకూలంగా చేశాడు. అందువల్ల మీరు దాని మార్గాలలో సంచరించి– ధర్మసమ్మతంగా – మీకు కావలసిన ఉపాధిని అన్వేషించండి.

22. అంటే – భూమిలో పండిన పంటలను తినండి. ఈ అన్నపానీయాలు దైవప్రసాదితమైనవే. ఆఖరికి మీరు మళ్లీ సజీవులై ఆయన వద్దకే పోవలసి ఉంది.

23. అవిశ్వాసులకు ఇది హెచ్చరిక అన్నమాట! ఓ అవిశ్వాసులారా! ఈనాడు మీరు ఈ నేలపై నిశ్చింతగా సంచరిస్తున్నారు. నింగినున్నవాడు ఈ నేలను మీకోసం ఎంతో అనువైనదిగా చేశాడు. అందులో మీ ఉపాధిని నిక్షిప్తం చేసి ఉంచాడు. ఎంతో స్థిరంగా, నిశ్చలంగా ఉన్న ఈ నేలను ఆయన ఏ క్షణంలోనయినా కుదిపివేయవచ్చు. ఇందలి పర్వతాలు దూదిపింజల్లా ఎగిరిపోవచ్చు. క్షణాల్లో మీరు నేలలో కూరుకుపోవచ్చు. అటువంటి భయంకరమైన ఆపద పట్ల మీరు నిశ్చింతగా ఉన్నారా?

24. లూత్ జాతి వారిపై, ఏనుగుల వారిపై రాళ్ల వాన కురిపించి అంతమొందించినట్లే మీపైన కూడా అలాంటి రాళ్ల వానను కురిపించవచ్చు. కాబట్టి మీరు దానిపట్ల నిర్భయంగా ఉండరాదు.

19 ఏమిటీ, వీరు తమపై రెక్కల్నిచాచుతూ,(ఒక్కోసారి) ముడుచు కుంటూ ఎగిరే పక్షుల్ని చూడటం లేదా?[26] కరుణామయుడు (అయిన అల్లాహ్) తప్ప వాటిని ఆ స్థితిలో ఎవరూ నిలిపిఉంచటం లేదు.[27] నిశ్చయంగా ప్రతి వస్తువూ ఆయన దృష్టిలో ఉంది.

أَوَلَمْ يَرَوْا إِلَى الطَّيْرِ فَوْقَهُمْ صَٰٓفَّٰتٍ وَيَقْبِضْنَ ۚ مَا يُمْسِكُهُنَّ إِلَّا الرَّحْمَٰنُ ۚ إِنَّهُۥ بِكُلِّ شَيْءٍۭ بَصِيرٌ ﴿١٩﴾

20 కరుణామయుడు (అయిన అల్లాహ్)కు విరుద్ధంగా మీకు సాయపడే సైన్యం ఏదో కాస్త చెప్పండి!?[28] అవిశ్వాసులు మాత్రం మోసంలో పడి ఉన్నారు.[29]

أَمَّنْ هَٰذَا الَّذِي هُوَ جُندٌ لَّكُمْ يَنصُرُكُم مِّن دُونِ الرَّحْمَٰنِ ۚ إِنِ الْكَٰفِرُونَ إِلَّا فِي غُرُورٍ ﴿٢٠﴾

21 ఒకవేళ ఆయన గనక తన ఉపాధిని నిలిపివేస్తే, మరి మీకు ఉపాధిని ఇచ్చేవాడెవడో చెప్పండి!?[30] (ఎవరూ లేరు.) కాని వీరు (ఈ అవిశ్వాసులు) మాత్రం తమ తలబిరుసుతనంపై, పలా యనంపై పాతుకుపోయారు.[31]

أَمَّنْ هَٰذَا الَّذِي يَرْزُقُكُمْ إِنْ أَمْسَكَ رِزْقَهُۥ ۚ بَل لَّجُّوا فِي عُتُوٍّ وَنُفُورٍ ﴿٢١﴾

22 సరే, తలక్రిందులై ముఖంతో నడిచి పోయేవాడు సన్మార్గం పొందుతాడా?[32] లేక సవ్యమైన బాటలో (తన కాళ్లమీద) తిన్నగా నడిచి పోయేవాడు సన్మార్గం పొందుతాడా?[33]

أَفَمَن يَمْشِي مُكِبًّا عَلَىٰ وَجْهِهِۦٓ أَهْدَىٰٓ أَمَّن يَمْشِي سَوِيًّا عَلَىٰ صِرَٰطٍ مُّسْتَقِيمٍ ﴿٢٢﴾

25. కాని అప్పుడు తెలుసుకుని ప్రయోజనం కూడా లేదు.

26. పక్షులు ఆకాశంలో ఎగురుతున్నప్పుడు రెక్కల్ని చాచటంతో పాటు, అప్పుడప్పుడూ ముడుచుకుంటూ కూడా ఉంటాయి.

27. పక్షులు ఎగురుతున్నప్పుడు – అవి నేలపై పడకుండా, ఆకాశంలో నిలిపి ఉంచిన వారెవరు? ఇది నిస్సందేహంగా దేవుని గొప్ప సూచనలలో ఒక సూచన.

28. **'జున్దున్'** (جُندٌ) అంటే సైన్యం లేక దళం అని అర్థం. అల్లాహ్‌కు వ్యతిరేకంగా మీకు సహాయపడగల సైన్యం ఏదీ ఈ లోకంలో లేదు. ఈ ఆయతు కూడా హెచ్చరికగా వచ్చింది.

29. అంటే – వారు షైతాను మాయాజాలానికి లోనై ఉన్నారు.

30. అంటే – ఆయన వర్షాన్ని కురిపించకపోయినా, వ్యవసాయోత్పత్తులను నిలిపివేసినా లేక పండిన పంటలను నాశనం చేసేసినా – ఒక్కోసారి ఇలా జరుగుతుంది కూడా – మీపై కరువు కాటకాలు వచ్చిపడతాయి. ఒకవేళ మీపై గనక ఆ దుర్భిక్షం తాండవిస్తే అప్పుడు దైవప్రణాళికకు వ్యతిరేకంగా మిమ్మల్ని ఆదుకోగలిగేవాడు, మీకు పుష్కలంగా ఉపాధిని ప్రసాదించేవాడెవడైనా ఉన్నాడా?

31. అంటే వీరికి ఎంతగా ఉపదేశించినా, ఎన్ని ఉపమానాలను ఇచ్చినా వారి మనసులు మారటం లేదు. పైగా మా హితబోధ వారి తలబిరుసుతనాన్ని మరింత పెంచుతూ పోతోంది. మేము బోధపరచిన కొద్దీ వారు మరింత దూరం పారిపోతున్నారు. బొత్తిగా తమ బుద్ధిని ఉపయోగించటం లేదు.

32. బోర్లాపడి ముఖం ఆధారంగా నడిచేవ్యక్తికి కుడివైపు, ఎడమవైపు, ముందు వైపు ఏమీ కనిపించదు. ఎదురు దెబ్బల నుండి కూడా అతను సురక్షితంగా ఉండలేడు. ఇలాంటి వ్యక్తి తన గమ్యస్థానాన్ని ఎలా చేరుకుంటాడు? అదేవిధంగా ఇహలోకంలో దైవాజ్ఞలను పెడచెవిన పెట్టిన మనిషి పరలోకంలో సాఫల్యానికి, ముక్తికి దూరమైపోతాడు.

**23** వారికి చెప్పు: "మిమ్మల్ని పుట్టించినవాడు ఆయనే[34] (అల్లాహ్‌యే). మీ చెవులను, కళ్లను, హృదయాలను చేసినవాడూ ఆయనే.[35] మీరు కృతజ్ఞతలు తెలిపేది మాత్రం చాలా తక్కువ."[36]

قُلْ هُوَ الَّذِيْٓ اَنْشَاَكُمْ وَجَعَلَ لَكُمُ السَّمْعَ وَالْاَبْصَارَ وَالْاَفْـِٕدَةَ ۗ قَلِيْلًا مَّا تَشْكُرُوْنَ ﴿٢٣﴾

**24** వారికి చెప్పు: "మిమ్మల్ని నేలలో విస్తరింపజేసినవాడు ఆయనే. (కడకు) ఆయన వైపే మీరంతా సమీకరించబడతారు."[37]

قُلْ هُوَ الَّذِيْ ذَرَاَكُمْ فِى الْاَرْضِ وَاِلَيْهِ تُحْشَرُوْنَ ﴿٢٤﴾

**25** "మీరు చెప్పేదే నిజమైతే ఆ వాగ్దానం ఎప్పుడు సంభవిస్తుంది?"[38] అని (అవిశ్వాసులు) అడుగుతున్నారు కదూ!

وَيَقُوْلُوْنَ مَتٰى هٰذَا الْوَعْدُ اِنْ كُنْتُمْ صٰدِقِيْنَ ﴿٢٥﴾

**26** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "ఆ విషయం అల్లాహ్‌కే తెలుసు.[39] నేను మటుకు స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి మాత్రమే."[40]

قُلْ اِنَّمَا الْعِلْمُ عِنْدَ اللّٰهِ ۖ وَاِنَّمَآ اَنَا۠ نَذِيْرٌ مُّبِيْنٌ ﴿٢٦﴾

---

33. వంకర టింకర దారుల్లో కాకుండా సరైన మార్గంపై నడచినవాడు గమ్యస్థానానికి చేరుకుంటాడు. మరోవిధంగా చెప్పాలంటే దైవవిధేయతా మార్గాన్ని ఎన్నుకున్న వ్యక్తి పరలోకంలో సాఫల్యం పొందుతాడు. మరికొంతమంది అభిప్రాయంలో ప్రళయదినాన అవిశ్వాసికి – విశ్వాసికి ఎదురయ్యే పరిస్థితి ఇక్కడ వర్ణించబడింది. అవిశ్వాసి ఆనాడు తలక్రిందులుగా చేయబడి నరకంలోకి తీసుకుపోబడతాడు. విశ్వాసి మాత్రం తన కాళ్లమీదే నడచి తిన్నగా స్వర్గానికి వెళతాడు. అవిశ్వాసుల గురించి ఖుర్‌ఆన్‌లోనే మరోచోట ఇలా అనబడింది : "వారిని మేము ప్రళయం నాడు గుడ్డివారుగా, మూగ వారుగా, చెవిటివారుగా చేసి బోర్లాపడవేసి లాక్కువస్తాము." (బనీ ఇస్రాయీల్ – 97).
34. అంటే, తొలిసారి మిమ్మల్ని ప్రభవింపజేసినవాడు ఆయనే.
35. వాటి ద్వారా మీరు వినగలగాలని, చూడగలగాలని, దేవుని సృష్టితాలపై చింతన చేసి వాస్తవికతను గ్రహించగలగాలని ఆయన మీకు ఈ శక్తులను ప్రసాదించాడు. ఈ మూడింటి ద్వారా మనిషి వింటాడు, చూస్తాడు, ఉచితానుచితాలను గురించి ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తాడు. దేవుని ఈ అసాధారణ అనుగ్రహాలపై మానవుడు తగురీతిలో కృతజ్ఞతలు తెలుపటంలేదన్న నిందారోపణ కూడా ఇందులో అంతర్లీనమై ఉంది. అందుకే చివర్లో "మీరు కృతజ్ఞతలు తెలిపేది చాలా తక్కువ" అని అనటం జరిగింది.
36. అంటే చాలా తక్కువగా కృతజ్ఞతలు చెల్లిస్తారు లేక కొంతకాలం మాత్రమే కృతజ్ఞత చూపుతారు. లేదా అసలే కృతజ్ఞత చూపరు.
37. అంటే – మానవుల్ని పుట్టించి నేల నాలుగు చెరగులా వ్యాపింపజేసినవాడు ఆయనే. మరి ప్రళయంనాడు అందరూ ఆయన సన్నిధికే తరలించబడతారు.
38. ప్రళయం ఉత్తుత్తిదే అని ఎత్తి పొడుస్తూ అవిశ్వాసులు – వెటకారంగా – ఈ ప్రశ్న వేసేవారు.
39 ఇంతకీ ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందో అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ తెలీదు. ఆ విషయం మరోచోట ఈ విధంగా చెప్పబడింది : "(ఓ ప్రవక్తా!) ఆ జ్ఞానం నా ప్రభువు వద్దనే ఉంది" అని వారికి చెప్పు. (అల్ ఆరాఫ్ – 187).
40. అంటే – మీరు అవలంబించే ధిక్కార వైఖరి మూలంగా మీకు పట్టే దుర్గతి గురించి హెచ్చరించటమే నా పని. వేరే మాటల్లో చెప్పాలంటే నేను భయపెట్టేవాడనేగాని అగోచర విషయాలు తెలిపేవాడను కాను. ఏదైనా విషయం నా ప్రభువు తెలియజేస్తే తప్ప నాకు తెలియదు.

فَلَمَّا رَاَوْهُ زُلْفَةً سِيْٓـَٔتْ وُجُوْهُ الَّذِيْنَ كَفَرُوْا وَقِيْلَ هٰذَا الَّذِيْ كُنْتُمْ بِهٖ تَدَّعُوْنَ ﴿27﴾

27 వారు ఆ వాగ్దానాన్ని[41] అతి దగ్గరలో చూసుకున్నప్పుడు అవిశ్వాసుల ముఖాలు వికృతంగా మారిపోతాయి.[42] "మీరు (పదే పదే) అడుగుతుండేది ఇదే"[43] అని వారితో అనబడుతుంది.

قُلْ اَرَءَيْتُمْ اِنْ اَهْلَكَنِيَ اللّٰهُ وَمَنْ مَّعِيَ اَوْ رَحِمَنَا ۙ فَمَنْ يُّجِيْرُ الْكٰفِرِيْنَ مِنْ عَذَابٍ اَلِيْمٍ ﴿28﴾

28 వారిని అడుగు : "చూడండి! ఒకవేళ నన్నూ, నా వెంటనున్న వారిని అల్లాహ్ అంతమొందించినా లేక మాపై దయ దలిచినా (ఏది ఏమైనా) అవిశ్వాసులను వ్యధాభరితమైన యాతన నుండి కాపాడే వాడెవడో చెప్పండి?"[44]

قُلْ هُوَ الرَّحْمٰنُ اٰمَنَّا بِهٖ وَعَلَيْهِ تَوَكَّلْنَا ۚ فَسَتَعْلَمُوْنَ مَنْ هُوَ فِيْ ضَلٰلٍ مُّبِيْنٍ ﴿29﴾

29 (ఓ ప్రవక్తా! వారికి) చెప్పు: "ఆయనే కరుణామయుడు (అయిన అల్లాహ్). మేము ఆయన్ని విశ్వసించాము.[45] ఆయన పైనే భారం మోపాము.[46] ఇకపోతే, స్పష్టమైన మార్గభ్రష్టత్వానికి గురై ఉన్నదెవరో మీకు త్వరలోనే తెలిసిపోతుంది."[47]

قُلْ اَرَءَيْتُمْ اِنْ اَصْبَحَ مَآؤُكُمْ غَوْرًا فَمَنْ يَّاْتِيْكُمْ بِمَآءٍ مَّعِيْنٍ ﴿30﴾

30 వారిని ఇలా అడుగు: "చూడండి, మీరు త్రాగే ఈ నీరు గనక భూమిలో ఇంకిపోతే, మీ కొరకు నీటి ఊటను బయటికి తెచ్చే దెవరో చెప్పండి!?"[48]

41. ఆ వాగ్దానం అంటే ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ప్రళయవేదన.

42. అంటే – ఒక్కసారిగా వారి ముఖాలపై పరాభవం, ఆందోళన, భయం క్రమ్ముకుంటాయి. వారి ముఖాలపై నలుపు ఆవరిస్తుందని ఇతరచోట్ల అభివర్ణించబడింది. (ఆలి ఇమ్రాన్ – 106)

43. ఏ శిక్ష గురించి మీరు ఇహలోకంలో ఆదుర్దా చెందేవారో, మరే ప్రళయ ఘడియ గురించి మీరు వేళాకోళం చేసేవారో అది ఇదే. సూరయె సాద్ (16), సూరయె అన్ఫాల్ (32) లలో కూడా ఇది ప్రస్తావనకు వచ్చింది.

44. దేవుడు తన ప్రవక్తను, అతని వెంటనున్న సహచరులను అంతమొందించనూ వచ్చు లేక వారికి మరి కొంత గడువును ఇవ్వనూ వచ్చు. కాని అవిశ్వాసులను మాత్రం అల్లాహ్ పట్టునుండి రక్షించేవాడెవడూ లేడు.

45. అంటే – మేము ఆయన ఏకత్వాన్ని దృఢంగా విశ్వసించాము. అందుకే ఆయనకు సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టము.

46. వేరెవరిపైనా మాకు నమ్మకం లేదు. మేము మా వ్యవహారాలన్నింటినీ ఆయనకే అప్పజెప్పాము. ముష్రిక్కుల మాదిరిగా మేము ఇతరత్రా చిల్లరదేవుళ్లపై ఆధారపడి ఉండము.

47. అంటే – మార్గవిహీనులు మీరో మేమో తెలిపోతుంది. ఈ వాక్యంలో అవిశ్వాసులకు తీవ్రమైన హెచ్చరిక ఉంది.

48. **'గౌరన్'** (غَوْرًا) అంటే నీరు నేలలో ఇంకిపోవటం లేదా మరీ అడుగుభాగంలోనికి దిగిపోవటం అని అర్థం. అంటే దేవుడు మీ త్రాగునీరును లభ్యం కాకుండా చేస్తే లేక మీరు తోడి తీయటానికి వీలుకానంత లోపలికి దాన్ని దిగబెడితే మరి మీకు స్వచ్ఛమైన, తియ్యని నీరును సరఫరా చేయగలవాడెవడు? ఎవడూ లేడు కదా! మీరు నిరంతరం పాపాలకు, అపరాధాలకు పాల్పడుతున్నప్పటికీ ఆయన మీకు త్రాగునీటిని సమకూర్చుతున్నాడంటే నిశ్చయంగా ఇది ఆయన కటాక్షమే.

68వ సూరా

# అల్ ఖలమ్

కలం

అవతరణ మక్కాలో

ఆయతులు 52

## పరిచయం

ప్రవక్తల పరంపర, రుజుమార్గం పొందినవారికి, మార్గభ్రష్టులైన వారికి మధ్య వ్యత్యాసం, తీర్పుదినాల గురించి ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఈ సూరా పేరు మొదటి ఆయత్‌లో వచ్చింది. ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఉత్తమ గుణగణాల గురించి, అత్యున్నత నైతికప్రమాణాల గురించి స్పష్టమైన పదాలతో తెలియజేయడం జరిగింది. అవిశ్వాసులు చేస్తున్న అబద్ధపు ఆరోపణలకు – ఆయనకు పిచ్చిపట్టిందని, ఆయన చెప్పేవి అబద్ధాలనీ, దివ్యఖుర్ఆన్ ప్రాచీనకాలానికి చెందిన కథలనీ చెబుతున్న మాటలకు తగిన జవాబు ఇవ్వడం జరిగింది.

అసత్యంపై సత్యం తప్పక విజయం సాధిస్తుందని ఈ సూరా నిర్ద్వంద్వంగా ప్రకటించింది. సత్యాన్ని తిరస్కరించే వారు ఏ విధంగా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను మానసికంగా వేధించారో, ఏ విధంగా దౌర్జన్యాలకు పాల్పడ్డారో ఈ సూరాలో వివరిస్తూ, అవిశ్వాసులను అజ్ఞానులుగా, సత్యతిరస్కారులుగా, అపవాదులు వేస్తూ తిరిగేవారిగా, సత్యాన్ని అడ్డుకునేవారిగా, దౌర్జన్యపరులుగా అభివర్ణించింది. దేవుని మహోపకారాన్ని విస్మరించి, ధనవ్యామోహంలో చిక్కుకుని, పిసినారులుగా మారి, పేదవారి హక్కును కాజేసేవారికి పట్టే గతేమిటో తెలియజేయడానికి తోటవాళ్ల వృత్తాంతం ఒకటి ఈ సూరాలో మనోహరంగా వివరించటం జరిగింది.

విశ్వాసులను అభివర్ణిస్తూ, రుజుమార్గం పొందినవారిగా, జ్ఞానానికి మూలమైన కలం సూచించే వస్తువులన్నింటి అవగాహన వున్న వారిగా పేర్కొంది. ఈ సూరాలో తీర్పుదినం నాటి దృశ్యాన్ని అభివర్ణించడం జరిగింది. ఆ రోజున నైచ్యం, అవమానం వారిని చుట్టుముడతాయి. వారి చూపులు క్రిందికి వాలిపోతాయి. దివ్యఖుర్ఆన్ మానవాళి అందరి కోసం దేవుని తరఫున అవతరించిన సందేశమని ఈ సూరా స్పష్టంగా ప్రకటించింది.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 17-33 | 147-150 | 'స్వార్థపరులైన సోదరులు' | దేవుని మహోపకారాన్ని విస్మరించి, ధనవ్యామోహంలో చిక్కుకుని, పిసినారులుగా మారి, పేదవారి హక్కును కాజేసేవారికి పట్టే గతేమిటో తెలియజేయడానికి తోటవాళ్ల వృత్తాంతం ఒకటి ఈ సూరాలో మనోహరంగా వివరించటం జరిగింది. |

## అల్ ఖలమ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** నూన్[1] – కలము సాక్షిగా![2] వారు (దైవదూతలు) వ్రాసే వ్రాతసాక్షిగా![3]

**2** (ఓ ముహమ్మద్!) నీ ప్రభువు అనుగ్రహం వల్ల నీవు పిచ్చివాడవు కావు.[4]

**3** నిశ్చయంగా నీకు ఎన్నటికీ తరగని పుణ్యఫలం లభిస్తుంది.[5]

**4** ఇంకా, నీవు నైతికంగా అత్యున్నత స్థానంలో ఉన్నావు.[6]

**5** కాబట్టి (త్వరలోనే) నీవూ చూస్తావు, వారూ చూసుకుంటారు,[7]

## سُورَةُ الْقَلَمِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

نٓ وَالْقَلَمِ وَمَا يَسْطُرُونَ ﴿1﴾

مَآ أَنتَ بِنِعْمَةِ رَبِّكَ بِمَجْنُونٍ ﴿2﴾

وَإِنَّ لَكَ لَأَجْرًا غَيْرَ مَمْنُونٍ ﴿3﴾

وَإِنَّكَ لَعَلَىٰ خُلُقٍ عَظِيمٍ ﴿4﴾

فَسَتُبْصِرُ وَيُبْصِرُونَ ﴿5﴾

1. దీని అర్థం అల్లాహ్‌యే ఎరుగు.

2. దేవుడు కలముపై ప్రమాణం చేశాడంటే కలం ప్రాముఖ్యం ఎటువంటిదో తెలుస్తోంది. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం ఇక్కడ 'కలం' అంటే దేవుడు మొదటిసారిగా సృష్టించిన కలము. ప్రాణుల విధివ్రాతను వ్రాయమని దేవుడు దానికి ఆజ్ఞాపించాడు. అప్పుడది ఆది నుండి అంతం వరకు జరిగే విషయాలన్నింటినీ లిఖించింది (సుననె తిర్మిజీ–సూరయె ఖలమ్ వ్యాఖ్యానం).

3. **'మా యస్తురూన్'** అంటే వ్రాసేవారు, కలము కలవారు వ్రాసేది అని అర్థం. ఆ వ్రాసేవారు దైవదూతలు అని గ్రహించాలి. వారు దైవాజ్ఞను పురస్కరించుకుని కలముతో మనుషుల కర్మలను నమోదు చేస్తారన్న భావం కూడా దీనికి వర్తించవచ్చు.

4. మొదటి ఆయతులో చేయబడిన ప్రమాణానికి ఇది జవాబు. ముహమ్మదు (సఅసం) పిచ్చివాడని అంటున్న అవిశ్వాసుల ఆరోపణ అర్థం లేనిది. "ఓ ఖుర్ఆన్ అవతరించిన మనిషీ! నీవు ముమ్మాటికీ పిచ్చివాడవే" (అల్ హిజ్ర్ – 6) అని వారన్నారు. వాస్తవానికి ముహమ్మదు (స) పిచ్చివాడు కాడు.

5. (ఓ ముహమ్మద్ –స!) దైవప్రవక్తగా బాధ్యతా నిర్వహణలో నీవు ఎన్ని బాధలు భరించావో, విరోధుల మాటలను నీవు ఎంతగా సహించావో వాటికి తగ్గట్టుగా దేవుడు నీకు అనంతమైన పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు. అది ఎన్నటికీ తరగదు.

6. **'ఖులుఖిన్ అజీమ్'** అంటే ఒక అర్థం: ఇస్లాం, ధర్మం లేదా ఖుర్ఆన్. అంటే ఓ ముహమ్మద్ (సఅసం)! దివ్య ఖుర్ఆన్‌లో లేదా ఇస్లాంలో ఏ ఉత్తమ ఆదర్శాల గురించి దేవుడు నీకు ఆదేశించాడో వాటిని నీవు స్థాపించావు.

   మరో అర్థం ప్రకారం సంస్కారం, మర్యాద, మృదుత్వం, వాత్సల్యం, నిజాయితీ, సచ్ఛీలత, సౌమ్యం, దాతృత్వం, ప్రేమ, జాలి వంటి సుగుణాలన్నీ ఈ 'ఖులుఖిన్ అజీమ్'లో కలగలసి ఉన్నాయి. దైవప్రవక్తగా ఎంపిక కాకపూర్వం కూడా ఆయన (స) ఈ విషయాలలో అగ్ర స్థానంలో ఉండేవారు. దైవదౌత్యం తరువాతైతే ఆయన (స) లోని ఈ సుగుణాలు మరింత ఉన్నతికి చేరుకున్నాయి. అందుకేనేమో, దైవప్రవక్త (స) గారి గుణగణాల గురించి కొంతమంది అమ్మ ఆయిషా (ర.అన్హా)ను అడిగినప్పుడు, "ఆయన (స) గారి గుణగణాలు ఖుర్ఆన్‌కు దర్పణం వంటివి"

6 మీలో మతి స్థిమితం లేనివారెవరో! (అందరూ చూస్తారు.)

بِأَيِّكُمُ الْمَفْتُونُ ⑥

7 తన మార్గం నుండి తప్పిపోయిన వారెవరో నీ ప్రభువునకు బాగా తెలుసు. సన్మార్గం పొందినవారెవరో కూడా ఆయనకు బాగా తెలుసు.

إِنَّ رَبَّكَ هُوَ أَعْلَمُ بِمَنْ ضَلَّ عَنْ سَبِيلِهِ ۖ وَهُوَ أَعْلَمُ بِالْمُهْتَدِينَ ⑦

8 కాబట్టి నువ్వు ధిక్కారుల మాట వినకు.[8]

فَلَا تُطِعِ الْمُكَذِّبِينَ ⑧

9 నువ్వు కాస్త మెత్తబడితే, తాము కూడా మెతకవైఖరి అవలంబించవచ్చునని వారు కోర్తున్నారు.[9]

وَدُّوا لَوْ تُدْهِنُ فَيُدْهِنُونَ ⑨

10 నువ్వు అదేపనిగా ప్రమాణాలు చేసే తుచ్ఛుని మాట వినకు.

وَلَا تُطِعْ كُلَّ حَلَّافٍ مَهِينٍ ⑩

11 వాడు (ఎంతసేపటికీ) చులకనగా మాట్లాడతాడు, చాడీలు చెబుతాడు.

هَمَّازٍ مَشَّاءٍ بِنَمِيمٍ ⑪

12 మంచి పనులను అడ్డుకుంటాడు, బరితెగించిపోయే పాపాత్ముడు వాడు.

مَنَّاعٍ لِلْخَيْرِ مُعْتَدٍ أَثِيمٍ ⑫

13 మిక్కిలి కర్కశుడు, వీటన్నింటికీ తోడు కళంకితుడు.[10]

عُتُلٍّ بَعْدَ ذَٰلِكَ زَنِيمٍ ⑬

అని సమాధానమిచ్చారామె (సహీహ్ ముస్లిం – కితాబుల్ ముసాఫిరీన్). ఆమెగారి ఈ జవాబులో పైన పేర్కొనబడిన రెండు రకాల భావాలూ ఇమిడి ఉన్నాయి.

7. అంటే సత్యం ప్రస్ఫుటమైనప్పుడు అపోహలన్నీ పటాపంచలౌతాయి. ప్రళయంనాడు ఇలా జరగటం తథ్యం. ఇందులోని విషయం బద్ర్ సంగ్రామానికి సంబంధించినదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు.

8. అంటే – మనస్సాక్షికి, అంతరాత్మ ప్రబోధానికి విరుద్ధంగా ఈ ముష్రిక్కుల వైపు మొగ్గవలసిన పనిలేదు. వారి డిమాండులకు తల ఒగ్గవలసిన అవసరం కూడా లేదు.

9. అంటే – ఓ ముహమ్మద్ (స)! నువ్వు వారి ఆరాధ్య దైవాల పట్ల కాస్త మెతక వైఖరిని అవలంబిస్తే వారు కూడా నీ పట్ల మెతక వైఖరిని అవలంబిస్తామన్నది వారి ఉద్దేశం. కాని సత్యం విషయంలో రాజీ ధోరణి మంచిది కాదు. అసత్య వాదులకు ఏ ఎండకా గొడుగు పట్టడం అలవాటే. కాని సత్యాన్ని ప్రాణప్రదంగా ప్రేమించే ప్రవక్తలకు అవకాశవాద ధోరణి ఎంతమాత్రం శోభించదు. పైగా ఈ ధోరణి హానికరంగా పరిణమిస్తుంది.

10. ఇది అవిశ్వాసుల నైతిక పతనానికి, దివాలాకోరుతనానికి ప్రతిబింబం. అందుకే వారితో ఎలాంటి రాజీకి రాకూడదని ప్రవక్తకు తాకీదు చేయటం జరిగింది. ఈ నైతిక అవగుణాలు ఒకానొక వ్యక్తికి సంబంధించినవా లేక సాధారణంగా అవిశ్వాసులందరికీ అవి వర్తిస్తాయా? అన్న ప్రశ్న ఇక్కడ ఉదయిస్తుంది. ఒక ప్రత్యేక క్యారెక్టర్‌ని ఉద్దేశించి ఈ ఆయతులు అవతరించాయన్న ఉల్లేఖనాలు కొన్ని ఉన్నాయి. అయితే అవి ప్రామాణికమైనవి కావు. అందువల్ల ఈ దుర్గుణాలు ఉన్న అవిశ్వాసులందరికీ అవి వర్తిస్తాయని చెప్పవచ్చు. **'జనీమ్'** (زَنِيمٌ) అంటే అక్రమ సంతానం అని అసలు అర్థం. అంటే పరువులేనివాడు, నిందార్హుడు అన్నమాట.

**14** ఇంతకీ వాడి తలబిరుసుతనానికి కారణం వాడికి సిరి సంపదలు, పుత్ర సంతానం ఉండటమే.[11] (కాబట్టి నువ్వు అతన్ని అనుసరించకు).

أَنْ كَانَ ذَا مَالٍ وَّبَنِيْنَ ⑭

**15** వాడి ముందు మా ఆయతులను పఠించినప్పుడు, “ఇవి పూర్వీకుల కట్టు కథల”ంటూ తేలిగ్గా కొట్టిపారేస్తాడు.

إِذَا تُتْلٰى عَلَيْهِ اٰيٰتُنَا قَالَ اَسَاطِيْرُ الْاَوَّلِيْنَ ⑮

**16** ఇక మేము త్వరలోనే వాడి తొండం (ముక్కు)పై వాత వేస్తాము.[12]

سَنَسِمُهٗ عَلَى الْخُرْطُوْمِ ⑯

**17** మేము తోటవారిని పరీక్షించినట్లే[13] వీరిని (మక్కావారిని) కూడా పరీక్షించాము.[14] అప్పుడా తోట యజమానులు “తెల్లవారే సరికల్లా ఆ తోటపండ్లను కోసుకుంటాము” అని ప్రతిన బూనారు.[15]

إِذْ اَقْسَمُوْا لَيَصْرِمُنَّهَا مُصْبِحِيْنَ ⑰

**18** మరి వారు, “ఇన్‌షా అల్లాహ్ (అల్లాహ్ తలచినట్లయితే)” అని అనలేదు.

وَلَا يَسْتَثْنُوْنَ ⑱

11. తన దగ్గర ఉన్న ధనాన్ని, మగ సంతానాన్ని చూసుకుని వాడు పెట్రేగిపోతున్నాడు. అందుకే అడ్డూఆపూ లేకుండా దురాగతాలకు పాల్పడుతున్నాడు. దైవప్రసాదితమయిన అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలుపుకునే బదులు కృతఘ్నుడుగా వ్యవహరిస్తున్నాడు. ఒక వ్యక్తిలో ఇన్ని చెడులు తిష్ఠవేసి ఉండగా – వాడు శ్రీమంతుడు అన్న కారణంపై – వాడి ముందు తల ఒగ్గటం, దూడూ బసవన్నలా తలూపటం సమంజసమా? ముమ్మాటికీ సమంజసం కాదు.

12. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఈ వాక్యం ప్రపంచంలో అవిశ్వాసులకు పట్టే దుర్గతిని సూచిస్తోంది. ఉదాహరణకు : బద్ర్ యుద్ధంలో అనేకమంది అవిశ్వాస నాయకుల ముక్కులు ఖడ్గాలవేటుకు గురయ్యాయి. మరికొంత మంది ప్రకారం ప్రళయదినాన నరకవాసులకు ఆనవాలుగా వారి ముక్కులపై వాతలు వేయబడతాయి. లేదా వారి ముఖాలపై ఆవరించే నలుపును ఇది సూచిస్తుంది. అవిశ్వాసులకు ఇహలోకంలో, పరలోకంలో కూడా ఈ రకమయిన దుర్గతి పడుతుందని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు.

13. అరబ్బులలో **‘తోటవారి గాథ’** చాలా ప్రసిద్ధిచెందింది. ఈ తోట ‘సన్‌ఆ’ (యమన్) నగరానికి సమీపంలో ఉండేది. ఆ తోట యజమాని ధర్మదాత. తోట ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిరుపేదల, అభాగ్యుల కోసం విరివిగా ఖర్చుపెట్టేవాడు. కాని ఆ ధర్మదాత మరణానంతరం వారసులుగా వచ్చిన అతని సంతానంలో దాతృగుణం లేదు. అతి కష్టమ్మీద మాకు వచ్చే కొద్దిపాటి ఆదాయాన్ని పేదలకెందుకు ఇవ్వాలి? అన్నారు. అందుకే వారు పేదసాదలకు వ్యతిరేకంగా పథకం వేశారు. ఈ లోగా దేవుడు తన పథకం ప్రకారం తోటను తుడిచిపెట్టేశాడు. దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) ఆకాశానికి లేపుకోబడిన కొద్దికాలానికే ఈ సంఘటన జరిగిందని అనబడుతోంది. (ఫత్‌హుల్ ఖదీర్) – ఈ వివరాలన్నీ ఖుర్‌ఆన్ వ్యాఖ్యానాల నుండి సేకరించబడ్డాయి.

14. **‘వీరిని’** అంటే మక్కా వారిని అని అర్థం. మేము వీరికి సిరిసంపదల్ని ఇచ్చాము. సంతానాన్ని ప్రసాదించాము. అందుకు గాను వారు కృతజ్ఞులుగా మెలగాలి. చేసిన మేలును మరచిపోకూడదు. కాని వారు మా దయానుగ్రహాలను మరచిపోయి, అహంకారంతో విర్రవీగుతున్నారు. అందుకే మేము వీరిని దుర్భిక్షానికి లోను చేశాము. ఎందుకంటే

**19** అంతే! వారు నిద్రపోతుండగానే నీ ప్రభువు తరఫున ఒక
ఆపద దాన్ని చుట్టుముట్టి పోయింది.[16]

فَطَافَ عَلَيْهَا طَآئِفٌ مِّن رَّبِّكَ وَهُمْ نَآئِمُونَ ﴿١٩﴾

**20** అంతే. ఆ తోట కోతకోసిన చేనుమాదిరిగా అయిపోయింది.[17]

فَأَصْبَحَتْ كَٱلصَّرِيمِ ﴿٢٠﴾

**21** తెల్లవారగానే వారు ఒండొకరిని పిలువసాగారు..

فَتَنَادَوْا مُصْبِحِينَ ﴿٢١﴾

**22** "పండ్లు కోసుకోవాలనే ఉంటే మీ పొలానికి ఉదయం పెంద
లాడే పదండి" (అని చెప్పారు).

أَنِ ٱغْدُوا عَلَىٰ حَرْثِكُمْ إِن كُنتُمْ صَٰرِمِينَ ﴿٢٢﴾

**23** మరి వారు మెల్లిగా ఇలా మాట్లాడుకుంటూపోయారు[18] –

فَٱنطَلَقُوا وَهُمْ يَتَخَٰفَتُونَ ﴿٢٣﴾

**24** "ఈ రోజు ఏ బీదవాడు కూడా మీ వద్దకు జొరబడి రాకూడదు
సుమా!"[19]

أَن لَّا يَدْخُلَنَّهَا ٱلْيَوْمَ عَلَيْكُم مِّسْكِينٌ ﴿٢٤﴾

**25** ఆ విధంగా మితిమీరిన ధీమాతో తెలతెలవారుతుండగా
వారు గబగబా అక్కడికి చేరుకున్నారు.[20]

وَغَدَوْا عَلَىٰ حَرْدٍ قَٰدِرِينَ ﴿٢٥﴾

**26** కాని తీరా తోటను చూసినప్పుడు[21] "నిశ్చయంగా మనం
దారి తప్పి వచ్చాం" అన్నారు.[22]

فَلَمَّا رَأَوْهَا قَالُوٓا إِنَّا لَضَآلُّونَ ﴿٢٦﴾

---

వీరు దైవప్రవక్త (సఅసం) మనసు నొప్పించారు. ఈ కారణంగా ప్రవక్త (స) వీరిని శపించారు. ఇలా శపించిన కొద్దిరోజులకే వారిపై దుర్భిక్షం తాండవించింది.

15. ఈ మాట వారి మితిమీరిన ఆత్మవిశ్వాసాన్ని, అహంకారాన్ని సూచిస్తోంది.
16. రాత్రికి రాత్రే ఆ తోటకు నిప్పు అంటుకుందని కొందరు అభిప్రాయపడ్డారు. దైవదూత జిబ్రీల్ (అలైహిస్సలాం) వచ్చి ఆ తోటను నేలమట్టం చేశారని మరికొంతమంది వ్యాఖ్యానించారు.
17. కోతకోసిన మీదట పొలం ఏవిధంగా వెలవెలబోతుందో అదేవిధంగా ఆ తోట కనిపించింది. ఆ తోట రాత్రి చీకటి మాదిరిగా కాలి బూడిదగా మారిపోయిందని కొందరు అనువదించారు.
18. తోటకు తొందరగా చేరుకునే ఉద్దేశంతో పెందలాడే బయలుదేరినదిగాక, తమ మాటలు విని పేదవారు ఎక్కడ వెంటపడతారోనని చాలా మెల్లిగా మాట్లాడుకోసాగారు.
19. ఈ రోజు నుంచి వాళ్ల ఆటలు సాగవు. ఇప్పటి వరకూ ఈ పేద జనులు మా తండ్రిని ఇష్టమొచ్చినట్లు దోచుకున్నారు. మా పిచ్చి తండ్రి వాళ్లను చూడగానే మనసు విప్పి బోలెడన్ని పండ్లు ఇచ్చేసేవాడు. ఇక మీదట ఈ నిర్వాకం సాగదు అనేది వారి మాటల ఆంతర్యం.
20. అరబీలో **'హర్దిన్' (حَرْدٍ)** అనే పదం ప్రయోగించబడింది. హర్దిన్ అంటే తీవ్రత, శక్తికొలదీ అన్న అర్థాలువస్తాయి. మరి కొంతమంది అనువాదకులు ఈ పదాన్ని కోపం, అసూయ అన్న అర్థాల్లో తీసుకున్నారు. అంటే ఆ తోట యజమానులు తమ ఊరిలోని పేదవారిపై తీవ్రమైన కోపాన్ని, విద్వేషాన్ని వెళ్లగ్రక్కుతూ వెళ్లారు. తోట పండ్లన్నీ ఇక తమవేనన్న ధీమా వారి మాటల్లో వ్యక్తమయింది. లేదా పేదవారి ప్రయత్నాన్ని అడ్డుకోవటంలో తాము సఫలీకృతులమయ్యామన్న విజయగర్వం వారి నడకలో తొంగిచూసింది.

بَلْ نَحْنُ مَحْرُومُونَ ﴿٢٧﴾

27 "కాదు, కాదు. మనం సర్వమూ కోల్పోయాం"[23] అని పలికారు.

قَالَ أَوْسَطُهُمْ أَلَمْ أَقُل لَّكُمْ لَوْلَا تُسَبِّحُونَ ﴿٢٨﴾

28 వారందరిలో కాస్త మంచివాడు "మీరు అల్లాహ్ పవిత్రతను ఎందుకు కొనియాడరు?! అని నేను మీతో అనలేదా?"[24] అన్నాడు.

قَالُوا سُبْحَانَ رَبِّنَا إِنَّا كُنَّا ظَالِمِينَ ﴿٢٩﴾

29 అప్పుడు వారందరూ (తేరుకుని), "మన ప్రభువు పరమ పవిత్రుడు. నిజానికి మనమే దుర్మార్గులం"[25] అని పలికారు.

فَأَقْبَلَ بَعْضُهُمْ عَلَىٰ بَعْضٍ يَتَلَاوَمُونَ ﴿٣٠﴾

30 ఆ తరువాత వారు ఒండొకరి వైపు తిరిగి పరస్పరం నిందించుకోసాగారు.

قَالُوا يَا وَيْلَنَا إِنَّا كُنَّا طَاغِينَ ﴿٣١﴾

31 "మా పాడుగాను! నిశ్చయంగా మనం హద్దుమీరి పోయాము.

عَسَىٰ رَبُّنَا أَن يُبْدِلَنَا خَيْرًا مِّنْهَا إِنَّا إِلَىٰ رَبِّنَا رَاغِبُونَ ﴿٣٢﴾

32 "మన ప్రభువు మనకు ఈ తోట స్థానంలో ఇంతకన్నా మంచి తోటను ప్రసాదించవచ్చు. కాబట్టి ఇప్పుడు మనం మన ప్రభువు వైపునకే మరలుదాం"[26] అని అన్నారు.

كَذَٰلِكَ الْعَذَابُ ۖ وَلَعَذَابُ الْآخِرَةِ أَكْبَرُ ۚ لَوْ كَانُوا يَعْلَمُونَ ﴿٣٣﴾

33 ఇలాగే వచ్చిపడుతుంది విపత్తు.[27] పరలోక విపత్తు అయితే ఇంతకన్నా పెద్దది. వారు దీన్ని తెలుసుకుంటే ఎంత బావుండు![28]

إِنَّ لِلْمُتَّقِينَ عِندَ رَبِّهِمْ جَنَّاتِ النَّعِيمِ ﴿٣٤﴾

34 నిశ్చయంగా దైవభీతి పరాయణుల కోసం వారి ప్రభువు దగ్గర అనుగ్రహభరితమైన స్వర్గ వనాలున్నాయి.

---

21. ఎందుకంటే వారికి ఆ తోట బదులు కాలి భస్మమైన కుప్ప లేక చెత్తాచెదారం కనిపించింది.
22. తొలిసారి చూచినప్పుడు వారికి అలా అనిపించింది మరి!
23. మళ్లీ కాస్త నిశితంగా పరిశీలించాక వారికి అర్థమయింది – విపత్తుకు గురైన ఆ తోట తమదేనని! తాము అవలంబించిన పద్ధతికి శాస్తిగా దేవుడు తమకా గతి పట్టించాడన్న సంగతిని కూడా వారు తెలుసుకున్నారు.
24. **'అల్లాహ్ పవిత్రత'** అంటే ఇక్కడ **'ఇన్షాఅల్లాహ్'** అయి ఉండవచ్చని కొందరు అభిప్రాయపడ్డారు.
25. తాము తమ తండ్రి విధానానికి వ్యతిరేకంగా ప్రవర్తించి చాలా పెద్ద తప్పు చేశామని వారికి బోధపడింది. దీనిద్వారా తెలిసే ఒక ముఖ్య విషయం ఏమిటంటే చెడుకు సంబంధించిన వ్యూహరచన కూడా అపరాధమే. ఒక్కోసారి దీనిపై కూడా దైవదాసులు నిలదీయబడతారు. అయితే మనసులో జనించే చెడు ఆలోచనలు మాత్రం క్షమార్హం.
26. ఈ తోట స్థానంలో దేవుడు తమకు మరో మంచి తోటనుగానీ, ఐశ్వర్యాన్ని గానీ ప్రసాదిస్తే తమ తండ్రిలాగే తాము కూడా బీదసాదలకు, అగత్యపరులకు ఆర్థిక సాయం చేస్తామని వారంతా సంకల్పం చేసుకున్నారు. తాము పశ్చాత్తాపం చెంది నందున తమ ప్రభువు తమను మళ్లీ కనికరిస్తాడన్న ఆశ కూడా వారిలో చిగురించింది.
27. అంటే దైవాజ్ఞలను పెడచెవిన పెట్టేవారికి, దైవానుగ్రహాలపట్ల పిసినారితనం ప్రదర్శించే వారికి మేము తలచుకుంటే ప్రపంచంలో ఇలాగే శిక్షిస్తాము.
28. కాని చాలామంది ఈ సత్యాన్ని తెలుసుకోరు. అందుకే వారు ఇలా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తారు.

**35** ఏమిటి? మేము దైవవిధేయులను(ముస్లిములను) అపరాధుల సరసన నిలబెడతామా?[29]

أَفَنَجْعَلُ الْمُسْلِمِينَ كَالْمُجْرِمِينَ ﴿35﴾

**36** అసలు మీకేమయింది? ఈ విధంగా ఎలా నిర్ణయించు కుంటున్నారు?

مَا لَكُمْ كَيْفَ تَحْكُمُونَ ﴿36﴾

**37** ఏమిటీ, మీ వద్ద మీరు చదివే పుస్తకం ఏదయినా ఉందా?[30]

أَمْ لَكُمْ كِتَابٌ فِيهِ تَدْرُسُونَ ﴿37﴾

**38** అందులో మీరు కోరినదల్లా మీకు దొరుకుతుందని రాసి వుందా?

إِنَّ لَكُمْ فِيهِ لَمَا تَخَيَّرُونَ ﴿38﴾

**39** లేక మీరు తీర్మానించుకున్నదల్లా మీకు లభ్యమయ్యేట్టు, ప్రళయదినం వరకూ ఉండే ప్రమాణాలుగాని మీరు మా నుండి తీసుకున్నారా?[31]

أَمْ لَكُمْ أَيْمَانٌ عَلَيْنَا بَالِغَةٌ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ ۙ إِنَّ لَكُمْ لَمَا تَحْكُمُونَ ﴿39﴾

**40** వారిలో ఎవరు ఈ విషయానికి బాధ్యులుగా ఉంటారో అడుగు.[32]

سَلْهُمْ أَيُّهُم بِذَٰلِكَ زَعِيمٌ ﴿40﴾

**41** ఏమిటి, వారి భాగస్థులుగాని ఎవరయినా ఉన్నారా? (ఒకవేళ ఉంటే), వారు సత్యవంతులైనట్లయితే తమ తమ భాగస్వాములను తీసుకురావాలి.[33]

أَمْ لَهُمْ شُرَكَاءُ فَلْيَأْتُوا بِشُرَكَائِهِمْ إِن كَانُوا صَادِقِينَ ﴿41﴾

29. ఒకవేళ ప్రళయం అనేదే సంభవిస్తే, అక్కడ ప్రతిఫలం అనేదే దొరికితే తాము ఇహలోకంలో ముస్లింలకన్నా మెరుగైన స్థితిలో ఉన్నట్లే పరలోకంలో కూడా మంచి స్థితిలో ఉంటామని మక్కాలోని ముష్రిక్కులు (బహుదైవారాధకులు) చెప్పేవారు. ఇదెలా సాధ్యం? ఏమిటి? మేము ఈ నేరస్థులనూ, మా విధేయులను (ముస్లిములను) ఒకే వరుసలో నిలబెడతామా? ముమ్మాటికీ ఇది జరగని పని. మేము విధేయులైన దాసులకు సుఖసౌఖ్యాలతో నిండిన ఉద్యానవనాల్లో ప్రవేశం కల్పిస్తాము అని దేవుడంటున్నాడు.

30. పరలోకంలో కూడా మీరు ఇష్టపడినదల్లా మీకు లభిస్తుందన్న విషయం ఆ పుస్తకంలో వ్రాయబడి ఉందా?

31. లేక మేము మీకు వాగ్దానం చేశామా? మీరు మీ కోసం తీర్మానించుకున్నదల్లా మీకు లభించే విధంగా – ఈ పరంపర ప్రళయం వరకూ కొనసాగే విధంగా – మాతో ఏదైనా ఒప్పందం చేసుకున్నారా? అలాంటిదేమీ లేదే! మరలాంటప్పుడు ఎందుకిలా ఊహాలోకాల్లో విహరిస్తున్నారు?

32. దేవుడు తీర్పుదినాన ముస్లింలకు ఏదైతే ప్రసాదిస్తాడో అదే ఈ దైవవిరోధులకు కూడా ప్రసాదిస్తాడన్న విషయానికి వారిలో ఎవరు జామీనుగా ఉంటారో (ఓ ప్రవక్తా!) వారిని నిలదీసి అడుగు.

33. పోనీ, వాళ్లు కల్పించుకున్న భాగస్వాములు (చిల్లర దేవుళ్లు) వాళ్లకు అండగా నిలబడి, వాళ్లకు మంచి స్థానాలు ప్రసాదిస్తారా? అలాంటి భాగస్వాములెవరైనా ఉంటే వారిని తీసుకురమ్మను. వారు తమ వాదనలో సత్యవంతులైతే ఈ సవాలును స్వీకరించాలి.

يَوْمَ يُكْشَفُ عَنْ سَاقٍ وَّيُدْعَوْنَ إِلَى السُّجُوْدِ فَلَا يَسْتَطِيْعُوْنَ ﴿42﴾

**42** ఏ రోజున పిక్క విప్పబడుతుందో, అప్పుడు వారు సాష్టాంగ ప్రణామం (సజ్దా) కొరకు పిలువబడతారు. కాని వారు సాష్టాంగ పడలేరు.[34]

خَاشِعَةً أَبْصَارُهُمْ تَرْهَقُهُمْ ذِلَّةٌ ۖ وَقَدْ كَانُوْا يُدْعَوْنَ إِلَى السُّجُوْدِ وَهُمْ سٰلِمُوْنَ ﴿43﴾

**43** వారి చూపులు క్రిందికి వంగి ఉంటాయి. అవమానం వారిని క్రమ్ముకుంటూ ఉంటుంది.[35] వారు మంచి స్థితిలో (క్షేమంగా) ఉన్నప్పుడు కూడా సాష్టాంగప్రణామాల కోసం పిలువబడేవారు.[36]

فَذَرْنِيْ وَمَنْ يُّكَذِّبُ بِهٰذَا الْحَدِيْثِ ۖ سَنَسْتَدْرِجُهُمْ مِّنْ حَيْثُ لَا يَعْلَمُوْنَ ﴿44﴾

**44** సరే! ఇక నన్నూ, ఈ విషయాన్ని ధిక్కరించేవారినీ వదలి పెట్టు.[37] మేము వారిని, వారికి ఏమాత్రం తట్టని రీతిలో క్రమ క్రమంగా (పతనం వైపు) లాగుతూ పోతున్నాము.[38]

وَأُمْلِيْ لَهُمْ ۖ إِنَّ كَيْدِيْ مَتِيْنٌ ﴿45﴾

**45** నేను వారికి కొంత గడువు ఇస్తాను. నిశ్చయంగా నా వ్యూహం చాలా గట్టిది.[39]

34. **"పిక్క విప్పబడటం"** అన్న పదాన్ని కొంతమంది అనువాదకులు "ప్రళయదినం నాటి గడ్డు సమయం" అన్న అర్థంలో తీసుకున్నారు. కాని ఈ నేపథ్యంలో ఉన్న ఒక ప్రామాణిక హదీసు గమనించదగినది. ఈ హదీసు ప్రకారం ప్రళయదినాన అల్లాహ్ తన పిక్కను విప్పుతాడు. (ఆ విప్పటం అనేది ఆయన ఔన్నత్యానికి, వైభవానికి అనుగుణంగా ఉంటుంది). అప్పుడు విశ్వసించిన ప్రతి ఒక్కరూ – పురుషులు, స్త్రీలు – ఆయన ముందు సాష్టాంగపడతారు. అయితే ఇహలోకంలో తమ కీర్తి ప్రతిష్ఠల కోసం 'సజ్దా' చేసేవారు మాత్రం సాష్టాంగపడలేకపోతారు. వారు సాష్టాంగ ప్రణామం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తారు. కాని వెన్నెముక తిన్నని పలకలా మారిపోయి వారిని వంగనివ్వదు (సహీహ్ బుఖారీ – అల్ ఖలమ్ సూరా వ్యాఖ్యానం). ఇంతకీ దేవుని ఈ పిక్క ఎలా ఉంటుంది? అదెలా విచ్చుకుంటుంది? దాని స్థితి గురించి మనం తెలుసుకోలేము. దాని గురించి వివరించనూ లేము. అందుకే మనం ఆయన కళ్లను, చెవులను, చేతులను చూడకుండానే, వాటి తీరును గురించి తెలియకుండానే విశ్వసించినట్లే ఖుర్ఆన్ హదీసులలో చెప్పబడిన దాని ప్రకారం ఆయన పిక్కను కూడా విశ్వసించాలి. హదీసువేత్తల, ప్రవక్తల సహచరుల, వారి శిష్యుల విధానం కూడా ఇదే.
35. ఇహలోకంలో వారు ప్రవర్తించిన తీరుకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది వారి పరిస్థితి. వారు ఇహలోకంలో గర్వాహంకారంతో విర్రవీగేవారు. నిక్కుతూ నడిచేవారు. అందువల్ల పరలోకంలో వారి తలలు అవమానభారంతో వంగిపోతాయి.
36. వారు ప్రాపంచిక జీవితంలో ఆరోగ్యవంతంగా ఉండేవారు. దైవారాధన చేయకుండా ఉండటానికి ఏ వస్తువూ అడ్డు తగలలేదు. అయినప్పటికీ వారు ఇబాదత్ (దైవారాధన) విషయంలో నిర్లక్ష్యం వహించారు.
37. అంటే – ఓ ప్రవక్తా! వాళ్ల సంగతి నేనొక్కణ్ణే చూసుకుంటాను. కాబట్టి నీవు విచారించకు.
38. ఈ గడువు ఇవ్వటం గురించి దివ్య ఖుర్ఆన్‌లో ఎన్నో చోట్ల చర్చించటం జరిగింది. హదీసులలో కూడా దీని వివరాలు వచ్చాయి. వ్యక్తులు లేక జాతులు అవిధేయులుగా మారినప్పటికీ ప్రాపంచికంగా వారికి ఆస్తిపాస్తులు పుష్కలంగా లభించినంతమాత్రాన దేవుడు వారిని అనుగ్రహిస్తున్నాడని అనుకోరాదు. దేవుని ప్రణాళికననుసరించి అది వారికి ఇవ్వబడిన గడువు, అవకాశం. చివరకు దేవుడు వారి భరతం పట్టాలని నిశ్చయించుకున్నప్పుడు వారిని ఆదుకోగలిగే వారెవరూ ఉండరు.

| | |
|---|---|
| **46** (ఓ ప్రవక్తా!) నువ్వు వారి దగ్గర ఏదన్నా వేతనం అడుగుతున్నావా, మరి దాని భారంతో వారు కృంగిపోతున్నారా?[40] | اَمْ تَسْـَٔلُهُمْ اَجْرًا فَهُمْ مِّنْ مَّغْرَمٍ مُّثْقَلُوْنَ ﴿46﴾ |
| **47** పోనీ, వారి వద్ద రహస్య జ్ఞానం ఉందా? తద్వారా వారు లిఖిస్తున్నారా?[41] | اَمْ عِنْدَهُمُ الْغَيْبُ فَهُمْ يَكْتُبُوْنَ ﴿47﴾ |
| **48** కనుక (ఓ ప్రవక్తా!) నీవు నీ ప్రభువు నిర్ణయం జరిగేవరకూ ఓపికపట్టు.[42] చేపవాని మాదిరిగా అయిపోకు.[43] అప్పుడతను దుఃఖితుడై మమ్మల్ని మొర పెట్టుకున్నాడు.[44] | فَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ وَلَا تَكُنْ كَصَاحِبِ الْحُوْتِ ۘ اِذْ نَادٰى وَهُوَ مَكْظُوْمٌ ﴿48﴾ |
| **49** అతని ప్రభువు అనుగ్రహమే గనక అతనికి తోడ్పడకుండా ఉంటే నిశ్చయంగా అతను నిందార్హ స్థితిలో, కటిక మైదానంలోకి విసిరివేయబడేవాడు.[45] | لَوْلَآ اَنْ تَدٰرَكَهٗ نِعْمَةٌ مِّنْ رَّبِّهٖ لَنُبِذَ بِالْعَرَآءِ وَهُوَ مَذْمُوْمٌ ﴿49﴾ |
| **50** అయితే అతని ప్రభువు అతన్ని (మళ్ళీ) ఎన్నుకున్నాడు.[46] అతన్ని సజ్జనులలో చేర్చాడు.[47] | فَاجْتَبٰىهُ رَبُّهٗ فَجَعَلَهٗ مِنَ الصّٰلِحِيْنَ ﴿50﴾ |

39. ఇంతకు ముందు వచ్చిన ఆయతులో (44వ ఆయతులో) చెప్పబడిన విషయమే మళ్లీ తాకీదు చేయబడింది. 'కైద్' అంటే రహస్య వ్యూహం, ఎత్తుగడ, తంత్రం అని అర్థం. సదుద్దేశంతో వ్యూహం పన్నటంలో ఏమాత్రం తప్పులేదు. అయితే దీనిని పన్నాగం, వ్యూహం, పథకం, ఉపాయం అన్న సకారాత్మక అర్థాల్లోనే తీసుకోవాలి.

40. ఈ మాట అంతిమ దైవప్రవక్త (స)ను ఉద్దేశించి చెప్పబడినప్పటికీ, నిజానికది ఆయన్ని విశ్వసించని జనులకు హెచ్చరిక వంటిది.

41. అగోచర జ్ఞానం వాళ్ల అధీనంలో ఉందా? 'లౌహె మహ్ఫూజ్' వాళ్ల చెప్పుచేతల్లో ఉందా? దాన్నుండి తమకు కావలసిన దానిని వాళ్లు నకలు చేసుకుంటున్నారా? అందుకే నీకు విధేయత చూపవలసిన అవసరం లేదని వారు భావిస్తున్నారా? "ముమ్మాటికీ కాదు" అన్నదే దీని సమాధానం.

42. కాబట్టి ఓ ముహమ్మద్ (స)! నీవు నీ సందేశ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండు. ఈ నిందితుల విషయంలో దైవనిర్ణయం కొరకు ఎదురు చూస్తూ ఉండు. వాళ్ల ఆగడాలపై ఆవేదన చెందకు.

43. **'చేపవాడు'** అంటే హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం). ఆయన తన జాతివారి ధిక్కార వైఖరిని చూసి తల్లడిల్లిపోయారు. వాళ్ల వ్యవహారంలో ప్రభువు నిర్ణయం రాకముందే కోపంతో తన జాతి వారిని వదలిపోయారు.

44. తత్కారణంగా సముద్రంలోని చేప ఆయన్ని మింగేసింది. ఆ సమయంలో ఆయన దుఃఖంలో మునిగి, సహాయం కొరకు తన ప్రభువును కడుదీనంగా వేడుకున్నారు. ఈ వివరాలు ఇంతకు ముందు వచ్చాయి.

45. అల్లాహ్ హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) గారికి క్షమాపణ వేడుకునే, దుఆ చేసే సద్బుద్ధిని వొసగాడు. ఆయన దుఆ (ప్రార్థన)ను ఆమోదించాడు. ఇది నిస్సందేహంగా దైవకటాక్షమే. దైవానుగ్రహమే గనక యూనుస్ (అలైహిస్సలాం) కు తోడ్పడి ఉండకపోతే ఆయనకు చేప కడుపు నుండి ముక్తి లభించేదే కాదు. ఒకవేళ చేప కడుపు నుండి విముక్తి లభించినా సారవంతమైన, చెట్లతీగెలు కల తీరప్రాంతంలో ఆశ్రయం లభించేది కాదు. అదీగాక దైవం దృష్టిలో

51 ఈ అవిశ్వాసులు ఖుర్ఆన్‌ను విన్నప్పుడల్లా తమ వాడి చూపులతో నిన్ను జారించి పడవేసినట్లే ఉంటారు.[48] "ఖచ్చితంగా ఇతడు పిచ్చివాడే"[49] అని అంటారు.

وَإِن يَكَادُ الَّذِينَ كَفَرُوا لَيُزْلِقُونَكَ بِأَبْصَارِهِمْ لَمَّا سَمِعُوا الذِّكْرَ وَيَقُولُونَ إِنَّهُ لَمَجْنُونٌ ﴿٥١﴾

52 నిజానికి ఇది (ఈ ఖుర్ఆన్) సకల లోకాల వారికి ఆసాంతం హితబోధిని.[50]

وَمَا هُوَ إِلَّا ذِكْرٌ لِّلْعَالَمِينَ ﴿٥٢﴾

కూడా ఆయన నిందార్హుడుగా మిగిలిపోయేవారు. కాని దేవుడు ఆయన్ని క్షమించి, మరోసారి ఆయనచేత తన సేవ చేయించుకున్నాడు. ఆయన్ని తిరిగి ప్రవక్తల జాబితాలో చేర్చాడు.

46. ఆయనకు సంపూర్ణ స్వస్థత చేకూరిన పిదప, ఆయన్ని తిరిగి ఆయన జాతి వారివద్దకు ప్రవక్తగా పంపాడు. అస్ సాఫ్ఫాత్ సూరాలోని 147వ ఆయతు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది.

47. అందుకేనేమో మహాప్రవక్త ముహమ్మదు (సఅసం) వారు ఇలా అన్నారు: "మీలో ఎవరూ కూడ, 'నేను యూనుస్ బిన్ మత్తయి కన్నా గొప్పవాడిని' అని అనకూడదు." (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఫజాయెల్).

48. ఓ ముహమ్మద్ (సఅసం)! నీకు దేవుని తోడ్పాటు ఉండబట్టి సరిపోయింది. లేకపోతేనా!? ఈ అవిశ్వాసుల చెడుచూపుల బారినపడి నీకు దిష్టి తగిలి ఉండేది. ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ ఆయతును ఈ అర్థంలోనే తీసుకున్నారు. ఆయన ఇంకా ఇలా పేర్కొన్నారు: "దిష్టి తగలటం, దైవాజ్ఞ మేరకు అది ఎదుటివారిని ప్రభావితుల్ని చేయటం సత్యం అన్న దానికి ఇది ప్రబల తార్కాణం." ఈ దిష్టి నుండి సురక్షితంగా ఉండేందుకు కొన్ని దుఆలు కూడా విశదీకరించబడ్డాయి. అందుకే మీకేదన్నా వస్తువు అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తే 'మాషాఅల్లాహ్' లేదా 'బారకల్లాహ్' అనండి అని కూడా తాకీదు చేయబడింది. అలా చెప్పటం వల్ల దిష్టి తగలకుండా ఉంటుంది. అలాగే "ఎవరికయినా ఎవరిదైనా దిష్టి తగిలితే, అతనికి స్నానం చేయించి ఆ నీరు దిష్టి తగిలిన వ్యక్తిపై పోయండి" అని అనబడింది (వివరాలకు తఫ్సీర్ ఇబ్నె కసీర్‌ను, హదీసు గ్రంథాలను చూడండి). మరికొంతమంది ఈ ఆయతుకు భావార్థం చెబుతూ "వీళ్లు తమ తీక్షణ వీక్షణాలతో నిన్ను నీ ప్రచార బాధ్యతల నుండి మరల్చాలనుకుంటున్నారు" అని అభిప్రాయపడ్డారు.

49. అర్థరహితమైన వారి ఈ ప్రేలాపనలకు కారణాలు : 1. అసూయ. 2. ప్రజలు దివ్య ఖుర్ఆన్‌కు ప్రభావితులు అవుతారేమోనన్న భయం. అందుకే ఈ అవిశ్వాసులు తమ తీక్షణ వీక్షణాలతో దైవప్రవక్త (స)కు హాని కలుగజేయటానికి ప్రయత్నించటమే గాక, తమ కారు కూతల ద్వారా కూడా ఆయన (స) మనసు నొప్పించేవారు.

50. దివ్య ఖుర్ఆన్ అటు మానవులకు, ఇటు జిన్నులకు కూడా మార్గదర్శకంగా పంపబడినప్పుడు, మరి ఆ దివ్య వాణిని ప్రజలకు వినిపించే ప్రవక్త పిచ్చివాడెలా అవుతాడు?

69 వ సూరా

# అల్ హాఖ్ఖహ్

## జరిగి తీరేది

అవతరణ మదీనాలో

ఆయతులు 52

### పరిచయం

తీర్పుదినం గురించి, దైవవాణి అవతరణ గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరా మొదటి ఆయతులో 'హాఖ్ఖహ్' (జరిగి తీరేది) అన్న ప్రస్తావన ఆధారంగా ఈ పేరు పెట్టడం జరిగింది. తీర్పుదినం తప్పనిసరిగా వస్తుందని ఈ సూరా ఉద్బోధించింది. గతకాలాలకు చెందిన సత్యతిరస్కార జాతులు, ఆద్‌జాతి, సమూద్ జాతి, ఫిరౌన్ ప్రజలు వంటి సత్యాన్ని నిరాకరించిన జాతులు, తమ ప్రవక్తలను వ్యతిరేకించిన జాతులు ఎలాంటి దుర్గతికి గురయ్యాయో వివరించడం ద్వారా హితబోధను, గుణపాఠాన్ని అందిస్తోంది. సత్యాన్ని తిరస్కరించిన ఆ జాతులు దేవుని ఆగ్రహానికి గురయి నాశనమయ్యాయి.

తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను ఇందులో వర్ణించడం జరిగింది. ఆ రోజున శంఖం పూరించబడు తుంది. భూమి, పర్వతాలు నుగ్గునుగ్గు కావించబడతాయి. ఆకాశం తునాతునకలవుతుంది. దైవదూతలు ప్రత్యక్షమవు తారు. దేవుని సింహాసనాన్ని ఎనిమిది మంది దైవదూతలు మోస్తుంటారు. ప్రతివ్యక్తి కర్మల చిట్టా తెరువడం జరుగుతుంది. మంచిపనులు చేసిన పుణ్యాత్ములకు వారి కుడిచేతిలో వారి కర్మల చిట్టా ఇవ్వబడుతుంది. వారు ఆనందంగా శాశ్వత స్వర్గవనాల్లోకి ప్రవేశిస్తారు. కాగా; సత్యతిరస్కారులకు వారి కర్మల చిట్టా ఎడమచేతిలో ఇవ్వబడుతుంది. వారు నరక నివాసులవుతారు.

ప్రవక్త ముహమ్మద్(సఅసం) కవి కాదని, ఆయన జోతిష్కుడు కూడా కాదని, దివ్యఖుర్ఆన్ స్వచ్ఛమైన సత్యమని, విశ్వప్రభువు మానవాళి కొరకు పంపిన సత్యమనీ, అల్లాహ్‌కు భయపడేవారికి ఇది స్మరణ గ్రంథమనీ ఈ సూరా విస్పష్టంగా ప్రకటించింది. విశ్వాసులు తమ ఆలోచనలలోను, మాటలలోను, ఆచరణల్లోను దేవుని ఔన్నత్యాన్ని ప్రస్తుతించాలని బోధించింది.

## అల్ హాఖ్ఖహ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** జరిగి తీరేది.[1]

**2** ఏమిటా జరిగి తీరేది?[2]

**3** ఆ జరిగి తీరే దాని గురించి నీకేం తెలుసు?[3]

**4** తట్టేటటువంటి విపత్తును సమూదు, ఆదు జనులు ధిక్కరించారు.[4]

**5** (పర్యవసానంగా) సమూదు వారు అత్యంత భయంకరమైన కేక ద్వారా అంత మొందించబడ్డారు.[5]

**6** ఆదు వారు ప్రచండమైన పెనుగాలుల ద్వారా నాశనం చేయబడ్డారు.[6]

**7** వాటిని అల్లాహ్ వారిపై నిరంతరం ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్ళు విధించాడు.[7] (నీవు గనక అక్కడ ఉండి ఉంటే) వారు అక్కడ బోసిపోయిన ఖర్జూరపు బొద్దులవలే నేలకొరిగి పడి ఉండటం చూసేవాడివి.[8]

## سُورَةُ الْحَاقَّةِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

الْحَاقَّةُ ﴿1﴾

مَا الْحَاقَّةُ ﴿2﴾

وَمَا أَدْرَاكَ مَا الْحَاقَّةُ ﴿3﴾

كَذَّبَتْ ثَمُودُ وَعَادٌ بِالْقَارِعَةِ ﴿4﴾

فَأَمَّا ثَمُودُ فَأُهْلِكُوا بِالطَّاغِيَةِ ﴿5﴾

وَأَمَّا عَادٌ فَأُهْلِكُوا بِرِيحٍ صَرْصَرٍ عَاتِيَةٍ ﴿6﴾

سَخَّرَهَا عَلَيْهِمْ سَبْعَ لَيَالٍ وَثَمَانِيَةَ أَيَّامٍ
حُسُومًا فَتَرَى الْقَوْمَ فِيهَا صَرْعَىٰ كَأَنَّهُمْ
أَعْجَازُ نَخْلٍ خَاوِيَةٍ ﴿7﴾

---

1. అరబీలో **'అల్ హాఖ్ఖహ్' (الْحَاقَّةُ)** అనబడింది. ఇది ప్రళయదినానికి గల పేర్లలో ఒక పేరు. ఆరోజు యదార్థం తేటతెల్లమవుతుంది. అది సంభవించటం తథ్యం.అందుకే దానిని 'అల్ హాఖ్ఖహ్' (జరిగితీరేది)గా పేర్కొనటం జరిగింది.
2. ప్రళయదిన వైభవాన్ని చాటి చెప్పేందుకే ఈ విధంగా ప్రశ్నించటం జరిగింది.
3. అంటే – దానికి సంబంధించిన పూర్తి పరిజ్ఞానం నీకు ఎవరి ద్వారా లభిస్తుంది? నీకు ఆ పరిజ్ఞానం లేదని చెప్పటం దీని అసలు ఉద్దేశం. ఎందుకంటే నువ్వు ఇంత వరకు దాన్ని చూడలేదు. దాని భయోత్పాతాన్ని కళ్ళారా వీక్షించలేదు. మరోవిధంగా చెప్పాలంటే అది ప్రాణుల జ్ఞానపరిధికి అందని విషయం (ఫత్‌హుల్ ఖదీర్).
4. ప్రళయాన్ని ఈ ఆయతులో తట్టేటటువంటి, బాదేటటువంటి విపత్తుగా అభివర్ణించటం జరిగింది.
5. **'తాఘియహ్' (الطَّاغِيَةِ)** అంటే మితిమీరిపోయిన శబ్దం అని అసలు అర్థం. అంటే ఎంతో భయంకరమైన, తీవ్రమైన కేక ద్వారా సమూద్ జాతి వారు తుదముట్టించబడ్డారు.
6. **'సర్‌సరిన్' (صَرْصَرٍ)** అంటే మిక్కిలి చల్లని అని అర్థం. **'ఆతియతిన్' (عَاتِيَةٍ)** అంటే అదుపుతప్పిపోయిన, అడ్డూఆపూ లేకుండా పోయిన అని అర్థం. అంటే అత్యంత ప్రచండమైన, అతి చల్లని గాలుల ద్వారా హజ్రత్ హూద్ (అలైహిస్సలాం) గారి ఆదు జాతిని అంతమొందించటం జరిగింది.
7. **'హుసూమన్'** అంటే ఎడతెగకుండా, నిరాఘాటంగా అని అర్థం. అసలు ఈ పదం 'హస్మున్' నుంచి వచ్చింది. హస్మున్ అంటే కోయటం, వేరుపరచటం అని అర్థం.

فَهَلْ تَرَىٰ لَهُم مِّن بَاقِيَةٍ ﴿٨﴾

**8** మరి వారిలో ఎవరైనా మిగిలి ఉన్నట్లు నీకు కనిపిస్తున్నాడా?

وَجَاءَ فِرْعَوْنُ وَمَن قَبْلَهُ وَالْمُؤْتَفِكَاتُ بِالْخَاطِئَةِ ﴿٩﴾

**9** ఫిరౌను, అతనికి పూర్వం గతించినవారు, తలక్రిందులుగా చేయబడిన పట్టణాలవారు[9] కూడా పాపాలకు ఒడిగట్టారు.

فَعَصَوْا رَسُولَ رَبِّهِمْ فَأَخَذَهُمْ أَخْذَةً رَّابِيَةً ﴿١٠﴾

**10** వారు తమ ప్రభువు పంపిన ప్రవక్త(ల)ను ఎదిరించారు. అందువల్ల అల్లాహ్ వాళ్ళను (కూడా) చాలా గట్టిగా పట్టుకున్నాడు.[10]

إِنَّا لَمَّا طَغَى الْمَاءُ حَمَلْنَاكُمْ فِي الْجَارِيَةِ ﴿١١﴾

**11** నీళ్ల ఉధృతి పెరిగిపోయినప్పుడు[11] మేము మిమ్మల్ని నావలోకి ఎక్కించాము.[12]

لِنَجْعَلَهَا لَكُمْ تَذْكِرَةً وَتَعِيَهَا أُذُنٌ وَاعِيَةٌ ﴿١٢﴾

**12** దీనిని మీకొక హితబోధగా, జ్ఞాపికగా చేయటానికి,[13] విని జ్ఞాపకముంచుకునే చెవులు దీనిని (ఎల్లకాలం) జ్ఞాపకముంచుకునేందుకు[14] (ఈ విధంగా చేశాము).

فَإِذَا نُفِخَ فِي الصُّورِ نَفْخَةٌ وَاحِدَةٌ ﴿١٣﴾

**13** మరి శంఖం ఒకసారి పూరించబడినప్పుడు,[15]

وَحُمِلَتِ الْأَرْضُ وَالْجِبَالُ فَدُكَّتَا دَكَّةً وَاحِدَةً ﴿١٤﴾

**14** భూమిని, పర్వతాలను ఎత్తి,[16] ఒకే ఒక దెబ్బకు తుత్తునియలుగా చేసి వేయబడినప్పుడు,

فَيَوْمَئِذٍ وَقَعَتِ الْوَاقِعَةُ ﴿١٥﴾

**15** ఆ రోజు జరగవలసిన సంఘటన నిజంగానే జరుగుతుంది.

وَانشَقَّتِ السَّمَاءُ فَهِيَ يَوْمَئِذٍ وَاهِيَةٌ ﴿١٦﴾

**16** అప్పుడు ఆకాశం బ్రద్దలైపోతుంది. మరి ఆ రోజు అది పట్టు సడలిపోతుంది.[17]

---

8. ఆద్ జాతివారు చాలా పొడుగ్గా, అందంగా ఉండేవారు. కాని ఈ ఘోరకలి ముందు వారు దేనికీ కొరగాని వారయ్యారు. నేలకొరిగిన వారి శరీరాలు బోసిపోయిన ఖర్జూరపు బొద్దుల్లా కానవచ్చాయి.
9. తలక్రిందులుగా చేయబడిన పట్టణవాసులంటే లూత్ జాతి ప్రజలన్నమాట.
10. **'రాబియహ్'** అంటే ఎక్కువగా అని అర్థం. అంటే – ఇతర జాతుల వారెవరినీ శిక్షించనంత కఠినంగా శిక్షించాడు.
11. అంటే – వరద వెల్లువ పెల్లుబికి, నీటిమట్టం బాగా పెరిగిపోయినప్పుడు...
12. అంటే, దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం)ను, ఆయన అనుచరులను నావలోకి ఎక్కించి, భయంకరమైన తుఫాను నుండి వారిని రక్షించాము. మీరు కూడా వారి సంతతికి చెందినవారే.
13. అంటే – అవిశ్వాసులను నీటి వెల్లువలో ముంచివేసి, విశ్వాసులను కాపాడటం ఒక గుణపాఠ సూచన. ఈ సంఘటన ద్వారా మీరు గుణపాఠం నేర్చుకుని, దైవవిధేయతా మార్గాన్ని అవలంబించండి.
14. ఈ యదార్థ గాథలను గురించి విన్నవారు కూడా వాటిని జ్ఞాపకముంచుకోవాలి. వాటి నుంచి నీతిని గ్రహించాలి.
15. ధిక్కారుల పర్యవసానం గురించి వివరించిన మీదట, జరగవలసిన సంఘటన (హాఖ్ఖహ్) ఎలా జరుగుతుందో చెప్పబడింది. ఇస్రాఫీల్ దూత ఒక్కసారి శంఖంలో ఊదగానే ఈ జగతి పునాదులన్నీ కదలిపోతాయి.

**17** దైవదూతలు దాని అంచులపై ఉంటారు.[18] ఆ రోజు నీ ప్రభువు సింహాసనాన్ని ఎనమండుగురు (దైవదూతలు) తమపై ఎత్తుకుని ఉంటారు.[19]

وَّالْمَلَكُ عَلٰٓى اَرْجَاۤىِٕهَاۗ وَيَحْمِلُ عَرْشَ رَبِّكَ فَوْقَهُمْ يَوْمَىِٕذٍ ثَمٰنِيَةٌ ﴿17﴾

**18** ఆనాడు మీరందరూ (దైవ సన్నిధిలో) హాజరుపరచబడ తారు.[20] మీ రహస్యమేదీ దాగి ఉండదు.

يَوْمَىِٕذٍ تُعْرَضُوْنَ لَا تَخْفٰى مِنْكُمْ خَافِيَةٌ ﴿18﴾

**19** మరి ఎవరి కర్మల పత్రం అతని కుడి చేతికి[21] ఇవ్వబడు తుందో అతనంటాడు: "ఇదిగో, నా కర్మల పత్రాన్ని చదవండి."[22]

فَاَمَّا مَنْ اُوْتِيَ كِتٰبَهٗ بِيَمِيْنِهٖ ۙ فَيَقُوْلُ هَاۤؤُمُ اقْرَءُوْا كِتٰبِيَهْ ﴿19﴾

**20** "నాకు నా లెక్క లభించనున్నదన్న గట్టి నమ్మకం నాకుం డేది."[23]

اِنِّيْ ظَنَنْتُ اَنِّيْ مُلٰقٍ حِسَابِيَهْ ﴿20﴾

**21** మరి అతను మనసు మెచ్చిన భోగ జీవితం గడుపుతూ ఉంటాడు.

فَهُوَ فِيْ عِيْشَةٍ رَّاضِيَةٍ ﴿21﴾

**22** ఉన్నతమైన స్వర్గ వనంలో![24]

فِيْ جَنَّةٍ عَالِيَةٍ ﴿22﴾

16. అంటే – దైవాజ్ఞతో అవి ఉన్న చోటు నుంచి పైకి లేపుకోబడతాయి.
17. ఆనాడు గగన మండలంలో ఎలాంటి బలంగానీ, క్రమబద్ధతగానీ ఉండదు. పగిలి ముక్కలై పోయిన వస్తువులో ఇక బలమెక్కడ ఉంటుందీ?
18. ఆకాశమే పగిలి ముక్కచెక్కలై పోయినప్పుడు మరి దైవదూతలు ఎక్కడుంటారు? వారు ఆకాశపుటంచులపై ఉంటారని అనబడింది. అంటే ఆకాశం పగిలిపోకముందే దైవదూతలు దైవాదేశంపై భువిపైకి వచ్చేస్తారు. అంటే వారు భూమండలపు అంచులపై ఉంటారన్నది దీని అర్థం కావచ్చు. లేదా ఆకాశం పగిలి అనేక ముక్కలైపోగా, దైవ దూతలు భూమిపై పడి ఉండే ఆ ముక్కలపై నిలబడి ఉంటారన్నదీ దీని భావం కావచ్చు (ఫత్‌హుల్ ఖదీర్).
19. అంటే – ఆ ప్రత్యేక దూతలు దైవసింహాసనాన్ని ఎత్తుకుని మోస్తూ ఉంటారు. **'సింహాసనం'** (అర్ష్) అంటే తీర్పు నిమిత్తం భువిపై ఉంచబడిన న్యాయపీఠమూ కావచ్చు. దానిపై అల్లాహ్ ఆసీనుడవుతాడు. (ఇబ్నె కసీర్).
20. ఈ హాజరుపరచబడటం ఎందుకు? ఎవరెలాంటివారో దేవునికి తెలీక కాదు. ఆయనకు అన్నీ తెలుసు. కాకపోతే ఒక పద్ధతి ప్రకారం విచారణ జరిగిందన్న సంగతి మనుషులకు తెలియటానికే ఈ న్యాయవ్యవస్థ ఏర్పరచబడుతుంది.
21. అది అతని అదృష్టానికి, ముక్తికి, విజయానికి నిదర్శనం.
22. అతను సంతోషాన్ని పట్టలేక అందరికీ తన కర్మల రికార్డును చూపించుకుంటాడు : "ఇంద! నా కర్మల రికార్డు. నా కర్మల పత్రం నాకెలాగూ లభించింది" అంటాడు. అందులో తన సదాచరణలు నమోదై ఉంటాయన్న దృఢనమ్మకం అతనికుంటుంది. తన వల్ల జరిగిన తప్పుల్ని అల్లాహ్ మన్నించి ఉంటాడన్న సంపూర్ణ ఆశ కూడా అతనికుంటుంది.
23. అంటే పరలోకంలో – లెక్కల ఘడియను ఎదుర్కోవలసి ఉందన్న విషయాన్ని నేను సదా విశ్వసించేవాణ్ణి.
24. స్వర్గంలో కూడా వివిధ అంతస్థులు ఉంటాయి. ఒక అంతస్థుకు మరో అంతస్థుకు మధ్య ఎంతో అంతరం ఉంటుంది. ఉదాహరణకు : దైవమార్గంలో పోరాడే యోధుల గురించి మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "స్వర్గంలో దైవమార్గంలో పోరాడే యోధుల కోసం వంద అంతస్థులు సిద్ధం చేయబడ్డాయి. ఒక అంతస్థుకు – మరో అంతస్థుకు

**23** దాని పండ్లు అతి సమీపంలో వ్రేలాడుతూ ఉంటాయి.[25]

قُطُوفُهَا دَانِيَةٌ ﴿23﴾

**24** "గత కాలంలో మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా హాయిగా తినండి, త్రాగండి"[26] (అని వారితో అనబడుతుంది).

كُلُوا وَاشْرَبُوا هَنِيٓـًٔا بِمَآ أَسْلَفْتُمْ فِي الْأَيَّامِ الْخَالِيَةِ ﴿24﴾

**25** ఇక ఎవరి కర్మల చిట్టా అతని ఎడమ చేతికి ఇవ్వబడుతుందో అతను ఇలా అంటాడు : "అయ్యో! నా కర్మల పత్రం నాకివ్వ బడకుండా ఉంటే...[27]

وَأَمَّا مَنْ أُوتِيَ كِتَابَهُ بِشِمَالِهِ فَيَقُولُ يَا لَيْتَنِي لَمْ أُوتَ كِتَابِيَهْ ﴿25﴾

**26** "నా లెక్కేమిటో నాకసలు తెలియకుండా ఉంటే ఎంత బావుం డేది![28]

وَلَمْ أَدْرِ مَا حِسَابِيَهْ ﴿26﴾

**27** "అయ్యో! ఆ చావే (నా వ్యవహారాన్ని) తేల్చేసి ఉంటే బాగుం డేదే![29]

يَا لَيْتَهَا كَانَتِ الْقَاضِيَةَ ﴿27﴾

**28** "నా ధనం నాకేమాత్రం అక్కరకు రాలేదు.

مَآ أَغْنَىٰ عَنِّي مَالِيَهْ ﴿28﴾

**29** "నా అధికారం కూడా నానుండి చేజారి పోయిందే!"[30] (అని బాధపడతాడు).

هَلَكَ عَنِّي سُلْطَانِيَهْ ﴿29﴾

**30** (అప్పుడిలా ఆదేశించబడుతుంది) "పట్టుకోండి వాణ్ణి. వాడికి (మెడలో) గుదిబండ వేయండి.

خُذُوهُ فَغُلُّوهُ ﴿30﴾

**31** "మరి వాణ్ణి నరకంలోకి త్రోసివేయండి.[31]

ثُمَّ الْجَحِيمَ صَلُّوهُ ﴿31﴾

---

మధ్య భూమ్యాకాశాల మధ్య ఉన్నంత దూరం ఉంటుంది. (సహీహ్ ముస్లిం–నాయకత్వ ప్రకరణం; సహీహ్ బుఖారీ–జిహాద్ ప్రకరణం).

25. అవి ఎంత సమీపంలో ఉంటాయంటే, వాటిని కోసుకోవాలనుకునే వారు కూర్చుని, పరుండి కూడా కోసుకోవచ్చు. **'ఖుతూఫున్'** (قُطُوف) అంటే కోయబడినవి, ఫలాలు అని భావం.
26. అంటే – వారు ప్రాపంచిక జీవితంలో చేసిన మంచిపనులకు బదులుగా ఈ స్వర్గసుఖాలు ప్రసాదించబడ్డాయి.
27. ఎవరికయినా కర్మల పత్రం ఎడమచేతికి ఇవ్వబడింది అంటే వారికి మూడినట్లే లెక్క.
28. ఎందుకంటే ఆ లెక్కంతా అతని పాలిట నష్టకరంగా ఉంటుంది.
29. ప్రపంచంలో వచ్చిన చావే తనను శాశ్వతంగా చంపేసి ఉంటే, మరణానంతర జీవితం లేకుండా ఉంటే తనకీ దుర్గతి పట్టేది కాదే! అని అంటాడు.
30. ఆస్తిపాస్తులు పనికిరాకుండా పోయినట్లే, తన అధికారం కూడా, ప్రాపంచిక పదవులు కూడా పనికిరాకుండా పోయాయే! అని తలబాదుకుంటారు. ఎల్లప్పుడూ తన వెంట ఉండే వందిమాగధులు, భజనపరులు ఎవరూ వెంటరాలేదే! తాను ఒంటరివాణ్ణి అయిపోయానే! అని ఆందోళన చెందుతాడు.

**32** “మరి వాణ్ణి డెబ్భయి మూరల పొడవు గల సంకెళ్ళతో బిగించి కట్టండి.[32]

ثُمَّ فِي سِلْسِلَةٍ ذَرْعُهَا سَبْعُونَ ذِرَاعًا فَاسْلُكُوهُ ﴿٣٢﴾

**33** “వాడు మహోన్నతుడైన అల్లాహ్‌ను విశ్వసించేవాడూ కాదు,[33]

إِنَّهُ كَانَ لَا يُؤْمِنُ بِاللَّهِ الْعَظِيمِ ﴿٣٣﴾

**34** “నిరుపేదకు అన్నం పెట్టమని (కనీసం) ప్రోత్సహించేవాడూ కాదు.[34]

وَلَا يَحُضُّ عَلَىٰ طَعَامِ الْمِسْكِينِ ﴿٣٤﴾

**35** “కాబట్టి ఈ రోజు ఇక్కడ వీడి (స్థితిపై సానుభూతి చూపే) స్నేహితుడెవడూ లేడు.

فَلَيْسَ لَهُ الْيَوْمَ هَاهُنَا حَمِيمٌ ﴿٣٥﴾

**36** “గాయాల కడుగు నీరు తప్ప మరొకటేదీ వీడికి ఆహారంగా లభించదు.[35]

وَلَا طَعَامٌ إِلَّا مِنْ غِسْلِينٍ ﴿٣٦﴾

**37** “దానిని పాపాత్ములు తప్ప వేరెవరూ తినరు.”[36]

لَا يَأْكُلُهُ إِلَّا الْخَاطِئُونَ ﴿٣٧﴾

**38** మరి మీరు చూచే వాటిపై నేను ప్రమాణం చేస్తున్నాను.[37]

فَلَا أُقْسِمُ بِمَا تُبْصِرُونَ ﴿٣٨﴾

**39** ఇంకా మీరు చూడలేని వాటిపై కూడా.

وَمَا لَا تُبْصِرُونَ ﴿٣٩﴾

**40** నిశ్చయంగా ఇది (ఈ ఖుర్ఆన్) గౌరవనీయుడైన సందేశ హరుడు తెచ్చిన (దైవ) వాక్కు.[38]

إِنَّهُ لَقَوْلُ رَسُولٍ كَرِيمٍ ﴿٤٠﴾

31. ఇది దేవుడు నరక దూతలకు ఇచ్చే ఆజ్ఞ.

32. ఇంతకీ అది ఎవరి చేతి మూర? అదెంత ఉంటుంది? ఎవరికీ వివరించతరం కాదిది. ఆ సంకెల పొడవు 70 మూరలుంటుందన్న విషయం ఒక్కటే ఈ సందర్భంగా చెప్పబడింది.

33. వారికి పడిన శిక్షకు కారణమేమిటో ఇక్కడ చెప్పబడింది.

34. అంటే – వీడు ఆరాధన, విధేయతల ద్వారా దేవుని హక్కును కూడా నెరవేర్చేవాడు కాదు. పేద ప్రజలకు సహాయంచేసి సాటి మానవుల హక్కులను కూడా చెల్లించేవాడు కాదు. కాగా; విశ్వాసులైన వారు ఒక వైపు దేవుని హక్కులను చెల్లించటంతో పాటు, మరోవైపు దాసుల హక్కులను కూడా చెల్లిస్తారు.

35. నరకవాసుల శరీరాల నుండి, పుండ్ల నుండి కారే చీము నెత్తురే వారికి ఆహారంగా ఇవ్వబడుతుంది. అది నరకంలో ఏదో ఒక చెట్టు అయి ఉంటుందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. ఇంకొంతమంది అభిప్రాయంలో నరకంలోని జఖ్ఖూమ్ (జెముడు) వృక్షాన్నే ఇక్కడ ‘గిస్‌లీన్’గా అభివర్ణించటం జరిగింది.

36. పాపాత్ములు (ఖాతివూన్) అంటే నరకవాసులన్నమాట. దైవతిరస్కారం, బహుదైవారాధన కారణంగా వారు నరకానికి ఆహుతి అవుతారు.

37. దివ్య ఖుర్ఆన్ దేవుని సత్యమైన గ్రంథమని చెప్పటానికి దేవుడు తాను సృష్టించిన వస్తువులపై ప్రమాణం చేస్తున్నాడు. ఆ వస్తువుల్లో మానవులు కొన్నింటిని చూడగలుగుతారు, మరికొన్నింటిని చూడలేరు. అయితే ఈ వస్తువులన్నీ దేవుని అస్థిత్వానికి, ఆయన ప్రబల శక్తికి నిదర్శనాలు.

38. గౌరవనీయుడైన సందేశహరుడు అంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అన్నమాట. వాక్కు అంటే పారాయణం

41 ఏ కవి పుంగవుడో పలికిన మాట కానే కాదు.[39] మీరు విశ్వసించేది చాలా తక్కువ.

وَمَا هُوَ بِقَوْلِ شَاعِرٍ ۚ قَلِيلًا مَّا تُؤْمِنُونَ ﴿٤١﴾

42 ఇది ఏ జోతిష్యుని పలుకో అంతకన్నా కాదు.[40] మీరు హిత బోధను గ్రహించేది బహు స్వల్పం.[41]

وَلَا بِقَوْلِ كَاهِنٍ ۚ قَلِيلًا مَّا تَذَكَّرُونَ ﴿٤٢﴾

43 నిజానికిది సకల లోకాల ప్రభువు తరఫున అవతరించింది.[42]

تَنزِيلٌ مِّن رَّبِّ الْعَالَمِينَ ﴿٤٣﴾

44 ఒకవేళ ఇతను (ముహమ్మద్ – స) గనక ఏదైనా విషయాన్ని కల్పించి మాకు ఆపాదించి ఉంటే,[43]

وَلَوْ تَقَوَّلَ عَلَيْنَا بَعْضَ الْأَقَاوِيلِ ﴿٤٤﴾

45 మేమితని కుడి చెయ్యిని పట్టుకుని ఉండేవారం.[44]

لَأَخَذْنَا مِنْهُ بِالْيَمِينِ ﴿٤٥﴾

46 మరి ఇతని కంఠనాళాన్ని కోసి వేసేవారం.[45]

ثُمَّ لَقَطَعْنَا مِنْهُ الْوَتِينَ ﴿٤٦﴾

47 మరి మీలో ఎవరూ నన్ను ఈ పని చేయకుండా ఆపగలిగే వారు కాదు.[46]

فَمَا مِنكُم مِّنْ أَحَدٍ عَنْهُ حَاجِزِينَ ﴿٤٧﴾

48 నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ (అల్లాహ్ పట్ల) భయభక్తులు గల వారికి హితబోధిని.[47]

وَإِنَّهُ لَتَذْكِرَةٌ لِّلْمُتَّقِينَ ﴿٤٨﴾

అని అర్థం. అంటే దైవప్రవక్త (స) చేసే ఖుర్ఆన్ పారాయణం అన్నమాట. లేక ముహమ్మద్ (స) ప్రవక్త ద్వారా అందిన దైవ సందేశం. అంతేగాని ఈ ఖుర్ఆన్ దైవదూత అయిన జిబ్రీల్‌గానీ, ముహమ్మద్ ప్రవక్తగానీ తమ తరఫున కల్పించినది మాత్రం కాదు. కాకపోతే ఇది దైవదూత జిబ్రీల్ ద్వారా దైవప్రవక్త ముహమ్మద్ (స)పై అవతరింపజేయబడింది. తరువాత ప్రవక్త (స) దానిని ప్రజలకు అందజేశాడు.

39. ఇది కవిత్వమని మీరనుకుంటున్నారు. కాని ఇది నిజం కాదు. ఖుర్ఆన్ వాక్యాలు కవనాన్ని గానీ, దాని ఛందస్సునుగానీ పోలినవి కావు. ఒక కవి అసలు ఇలాంటి వాక్యాలను వినిపించలేడు.

40. ఇది జోస్యం అనీ, లేక అటువంటిదే మరో పలుకు అని మీరు అప్పుడప్పుడూ అంటున్నారు. ఇది వాస్తవ విరుద్ధం.

41. మీరు ఖుర్ఆన్‌ను విశ్వసించనూ విశ్వసించరు. దాని ద్వారా మంచిని కూడా గ్రహించరు. కాని దాని గురించి అనరాని మాటలు అంటూ ఉంటారు.

42. అంటే – దైవప్రవక్త (స) నోట వెలువడే ఈ వాక్కు వాస్తవానికి పరమ ప్రభువు అయిన అల్లాహ్ తరఫున అవతరించింది.

43. అంటే – తనంతట తానుగా ఏదైనా విషయాన్ని కల్పించి, దాన్ని మాకు అంటగట్టి ఉంటే లేదా దైవసందేశంలో ఏవైనా హెచ్చుతగ్గులు చేసి ఉంటే వెంటనే మేమతన్ని నిలదీసి ఉండేవాళ్ళం. అతనికి ఏ కాస్త కూడా గడువు ఇచ్చి ఉండేవారం కాము.

44. లేదా కుడిచేత్తో పట్టి శిక్షించేవారం అన్న భావం కూడా వస్తుంది. ఎందుకంటే కుడిచేత్తో పట్టుకుంటే గట్టిపట్టు లభిస్తుంది. కాగా; హదీసు ప్రకారం అల్లాహ్‌కు గల రెండు చేతులూ కుడిచేతులే.

45. ఇంతకీ ఈ శిక్ష ఎవరికో కాదు, దైవప్రవక్త (స) గురించే ఈ విధంగా చెప్పబడింది! ముహమ్మద్ (స) ప్రవక్త మాటల్లోని సత్యతను చాటిచెప్పటం దీని అసలు ఉద్దేశం.

**49** మీలో కొందరు ధిక్కరించేవారున్నారని మాకు బాగా తెలుసు.

وَاِنَّا لَنَعۡلَمُ اَنَّ مِنۡكُمۡ مُّكَذِّبِيۡنَ ﴿49﴾

**50** నిశ్చయంగా ఇది (ఈ ధిక్కారవైఖరి) అవిశ్వాసులను బాధ పడేలా చేస్తుంది.[48]

وَاِنَّهٗ لَحَسۡرَةٌ عَلَى الۡكٰفِرِيۡنَ ﴿50﴾

**51** నిశ్చయంగా ఇది తిరుగులేని సత్యం.[49]

وَاِنَّهٗ لَحَقُّ الۡيَقِيۡنِ ﴿51﴾

**52** కనుక (ఓ ప్రవక్తా!) నీవు మహోన్నతుడైన నీ ప్రభువు నామం పవిత్రతను కొనియాడు.[50]

فَسَبِّحۡ بِاسۡمِ رَبِّكَ الۡعَظِيۡمِ ﴿52﴾ ع

46. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే ముహమ్మద్ ప్రవక్త (స) సత్యసంధులు. ఆయన ఇచ్చిన సందేశం ఆసాంతం సత్యమైనది. అల్లాహ్ ఆయన్ని శిక్షించలేదు. పైగా బలమైన నిదర్శనాల ద్వారా, మహిమల ద్వారా ఆయనకు అపూర్వంగా సహాయపడ్డాడు.

47. ఎందుకంటే భయభక్తులు గలవారు మాత్రమే ఈ దివ్య గ్రంథం ద్వారా ఎక్కువ ప్రయోజనం పొందుతారు.

48. అంటే – వారు ప్రళయదినాన బాధపడతారు. అయ్యో! మేము ఖుర్ఆన్‌ను ధిక్కరించకుండా ఉంటే బావుండునే! అని కుమిలిపోతారు. దివ్య ఖుర్ఆన్‌ను విశ్వసించి, తదనుగుణంగా ఆచరించిన వారికి లభించే పుణ్యఫలాన్ని చూచి ఈర్ష్య చెందుతారు.

49. అంటే – దివ్య ఖుర్ఆన్ దేవుని తరఫున పంపబడిన గ్రంథం అన్నది నిశ్చయం. అందులో సందేహానికి తావేలేదు. లేక ప్రళయ వార్త సత్యబద్ధమైనది అన్న అర్థం కూడా కావచ్చు.

50. ఎందుకంటే ఆయన దివ్య ఖుర్ఆన్ వంటి గొప్ప గ్రంథాన్ని మానవతకు ప్రసాదించాడు.

70 వ సూరా

# అల్ మఆరిజ్

## పైకి ఎక్కే మెట్లు

అవతరణ మక్కాలో

ఆయతులు 44

### పరిచయం

*ప్రళయం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినాల గురించి ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఈ సూరాకు పెట్టిన పేరు ఇందు లోని 3వ ఆయతులో వచ్చింది. తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను ఈ సూరా అభివర్ణించింది. తుది తీర్పు జరుగుతుందనీ, లెక్కతీసుకునే రోజు భ్రమ ఎంతమాత్రం కాదనీ, సత్యతిరస్కారులను నాశనం చేసే సామర్థ్యం అల్లాహ్‌కు ఉందనీ, వారి కన్నా ఉత్తమమైన ప్రజలను వారి స్థానంలో తీసుకొచ్చే శక్తి అల్లాహ్‌కు ఉందని ఈ సూరా ప్రకటించింది. కాలానికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఈ సూరా తెలియజేసింది. తీర్పుదినం చాలా దూరంగా ఉన్నట్లు మనకు కనబడినా, అల్లాహ్ దృష్టిలో ఆ రోజు చాలా దగ్గరగా ఉంది.*

*ఈ సూరా అవిశ్వాసులను విమర్శిస్తూ, వారి అనుమానాలు నిష్ప్రయోజనకరమైనవనీ, ఎందుకంటే మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది అనివార్యమనీ తెలిపింది. మరణించిన వారిని మళ్ళీ లేపే రోజున చనిపోయిన వారందరూ లేచి నిలబడుతారు. సత్యాన్ని తిరస్కరించినవారు, అవిశ్వాసులు తమ సమాధుల నుంచి పరుగు పరుగున కంగారు కంగారుగా వస్తారు. వారు పరాభవానికి, నైచ్యానికి గురయి ఉంటారు. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి.*

## అల్ మఆరిజ్ సూరా

## سُوْرَةُ الْمَعَارِجِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** అడిగేవాడొకడు[1] తప్పకుండా రానున్న శిక్షను గురించి అడిగాడు.

سَاَلَ سَآئِلٌۢ بِعَذَابٍ وَّاقِعٍ ﴿1﴾

**2** అది అవిశ్వాసులపై (రానున్నది). దానిని తప్పించే వాడెవ్వడూ లేడు.

لِّلْكٰفِرِيْنَ لَيْسَ لَهٗ دَافِعٌ ﴿2﴾

**3** అది (ఆ శిక్ష) సోపానాలకు యజమాని అయిన అల్లాహ్ తరఫున సంభవిస్తుంది.[2]

مِّنَ اللّٰهِ ذِى الْمَعَارِجِ ﴿3﴾

**4** యాభై వేల సంవత్సరాల పరిమాణం గల రోజున[3] దైవదూతలు మరియు ఆత్మ (జిబ్రయీల్) ఆయన వైపునకు అధిరోహిస్తారు.[4]

تَعْرُجُ الْمَلٰٓئِكَةُ وَالرُّوْحُ اِلَيْهِ فِىْ يَوْمٍ كَانَ مِقْدَارُهٗ خَمْسِيْنَ اَلْفَ سَنَةٍ ﴿4﴾

1. అతను నజర్ బిన్ హారిస్ లేదా అబూజహల్ అని కొందరు అంటున్నారు. అతనిలా అన్నాడు: "ఓ అల్లాహ్! ఈ ఖుర్ఆన్ నిజంగా నీ తరఫు నుంచే పంపబడినదైతే మాపై ఆకాశం నుంచి రాళ్లవాన కురిపించు. లేదా మాపై ఏదన్నా వ్యధాభరితమైన శిక్షను తీసుకురా." (అన్ ఫాల్ – 32) అందువల్ల అతడు బద్ర్ యుద్ధ రంగంలో వధించబడ్డాడు.
   మరికొంత మంది ప్రకారం శిక్షను అడిగిన వ్యక్తి దైవప్రవక్తే (సఅసం)! తన సందేశాన్ని ధిక్కరించిన జనులను ఆయన (స) శపించారు. పర్యవసానంగా మక్కావాసులపై దుర్భిక్షం తాండవించింది.
2. లేక అది అంతస్థులు గల లేదా ఉన్నత సోపానాలు గల దేవుని తరఫున వస్తుంది. ఆయన సాన్నిధ్యానికి దైవదూతలు ఎక్కిపోతుంటారు.
3. ఇంతకీ ఆ రోజు ఏది? అన్న విషయంపై అభిప్రాయ భేదాలున్నాయి. అలిఫ్ లామ్ మీమ్ సజ్దా సూరా ఆరంభంలో కూడా మేము దీనిని వివరించి ఉన్నాము. ఈ సందర్భంగా ఇమామ్ ఇబ్నె కసీర్ నాలుగు ఉల్లేఖనాలను ప్రస్తావించారు. మొదటిది: యాభై వేల సంవత్సరాలంత పరిమాణం లేక దూరం అంటే దైవసింహాసనం (అర్ష్) నుంచి భూమి అట్టడుగు భాగం వరకు చేరడానికి పట్టే సమయం 50 వేల ఏండ్లకు సమానం.
   రెండవది : ఇది ప్రపంచం యొక్క మొత్తం వ్యవధిని సూచిస్తున్నది. ఆది నుంచి ప్రళయదినం వరకు గల వ్యవధిలో ఎంత వ్యవధి గడిచిపోయింది? ఇంకా ఎంత వ్యవధి మిగిలి ఉందనేది అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.
   మూడవది : ఈ దూరం ఇహలోకానికి – పరలోకానికి మధ్య గల అంతరాన్ని సూచిస్తోంది.
   నాల్గవది : ఇది అసలు ప్రళయదినం ఎంత సుదీర్ఘంగా ఉంటుందో తెలియపరుస్తోంది. అంటే అవిశ్వాసుల పాలిట ఈ రోజు 50 వేల సంవత్సరాలంత భారంగా తోస్తుంది. అదే విశ్వాసులకైతే ఒక ఫర్జ్ నమాజును ముగించినంత సమయంకన్నా తక్కువే అనిపిస్తుంది (ముస్నదె అహ్మద్ – 3/75). ఇమామ్ ఇబ్నె కసీర్ కూడా ఈ నాల్గవ అభిప్రాయం వైపే మొగ్గుచూపారు. ఎందుకంటే హదీసుల ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది. ఉదాహరణకు: ఒక హదీసులో; జకాత్ చెల్లించని వ్యక్తికి ప్రళయదినాన విధించబడే శిక్ష గురించి వివరిస్తూ మహాప్రవక్త(స) ఇలా అన్నారు: "చివరకు అల్లాహ్ తన దాసుల మధ్య ఒకానొక రోజున తీర్పు చేస్తాడు. ఆ రోజు మీ లెక్క ప్రకారం యాభై వేల సంవత్సరాలంత ఉంటుంది." (సహీహ్ ముస్లిం – జకాత్ ప్రకరణం). ఈ వివరణ ప్రకారం 'ఆ రోజు' అనేది శిక్షకు సంబంధించినది.

**5** కనుక (ఓ ప్రవక్తా!) నువ్వు అత్యుత్తమ రీతిలో సహనం వహించు.

فَاصْبِرْ صَبْرًا جَمِيلًا ⑤

**6** అది (ఆ శిక్ష) చాలా దూరాన ఉందని వారు భావిస్తున్నారు.

إِنَّهُمْ يَرَوْنَهُ بَعِيدًا ⑥

**7** కాని అది మాకు చాలా దగ్గరే కనిపిస్తున్నది.[5]

وَنَرَاهُ قَرِيبًا ⑦

**8** ఆ రోజు ఆకాశం నూనె గసిలా అయి పోతుంది.

يَوْمَ تَكُونُ السَّمَاءُ كَالْمُهْلِ ⑧

**9** పర్వతాలు రంగురంగుల ఉన్నిలాగా అయిపోతాయి.[6]

وَتَكُونُ الْجِبَالُ كَالْعِهْنِ ⑨

**10** ఏ స్నేహితుడూ మరొక స్నేహితుని (మంచీ చెడులను గురించి) అడిగి చూడడు.

وَلَا يَسْأَلُ حَمِيمٌ حَمِيمًا ⑩

**11** వారు ఒండొకరికి చూపించబడతారు.[7] కాని నేరస్థుడు ఆ రోజు (తనకు పడే) శిక్ష నుంచి తప్పించుకోవటానికి పరిహారంగా తన కుమారులను,

يُبَصَّرُونَهُمْ ۚ يَوَدُّ الْمُجْرِمُ لَوْ يَفْتَدِي
مِنْ عَذَابِ يَوْمِئِذٍ بِبَنِيهِ ⑪

**12** తన ఇల్లాలినీ, తన సోదరుణ్ణి,

وَصَاحِبَتِهِ وَأَخِيهِ ⑫

**13** తనకు ఆశ్రయమిచ్చిన తన కుటుంబాన్నీ,

وَفَصِيلَتِهِ الَّتِي تُؤْوِيهِ ⑬

**14** భూమండలంలోని సమస్త జనులనూ ఇచ్చేసి, తాను మాత్రం బయటపడాలని కోరుకుంటాడు.[8]

وَمَنْ فِي الْأَرْضِ جَمِيعًا ثُمَّ يُنْجِيهِ ⑭

**15** (కాని ఇది) అసంభవం. నిశ్చయంగా అది జ్వలించే అగ్ని.[9]

كَلَّا ۖ إِنَّهَا لَظَىٰ ⑮

---

అంటే తప్పకుండా సంభవించే ఆ శిక్ష ప్రళయదినాన సంభవిస్తుంది. అది అవిశ్వాసుల పాలిట 50 వేల సంవత్సరాలంత బరువుగా ఉంటుంది.

4. ఆత్మ అంటే హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం). ఈయన కూడా దైవదూతల్లో ఒకరైనప్పటికీ ఈయన ఔన్నత్యం దృష్ట్యా ఈయన గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది. లేక ఆత్మ అంటే మానవాత్మలు కూడా కావచ్చు. మనుషుల మరణానంతరం ఈ ఆత్మలు ఆకాశం వైపు తీసుకుపోబడతాయని కొన్ని ఉల్లేఖనాలు రూఢీ చేస్తున్నాయి.

5. అంటే ప్రళయం అనేది అసంభవమని వారనుకుంటున్నారు. కాని అది తథ్యమని, మాకు తెలుసు. విశ్వాసులకు (మోమిన్లకు) ప్రళయదినంపై పూర్తి నమ్మకం ఉంటుంది. "రానున్న ప్రతిదీ సమీపంలోనే ఉంటుంది."

6. అంటే, కొండలు ఏకిన దూదిపింజాల్లా అయిపోతాయి (అల్ ఖారియ – 5).

7. కాని ఎవరి చింత వారికుంటుంది. వారు ఒండొకరిని గుర్తుపట్టి కూడా వారి యోగ క్షేమాలను గురించి విచారించరు.

8. ఆలుబిడ్డలను, అన్నదమ్ములను, కుటుంబసభ్యులను ప్రతి మనిషీ ఎంతో ప్రేమిస్తాడు. కాని తీర్పు దినాన నేరస్థుడు ఈ బంధుత్వాలను ఏమాత్రం పట్టించుకోడు. తనకు పడబోయే శిక్షనుండి తప్పించుకోవటానికి వీలైతే అందరినీ పణంగా పెట్టాలనుకుంటాడు.

نَزَّاعَةً لِّلشَّوٰى ﴿16﴾

**16** అది తలలోని చర్మాన్ని, మాంసాన్ని సయితం దహించి వేస్తుంది.[10]

تَدْعُوْا مَنْ اَدْبَرَ وَتَوَلّٰى ﴿17﴾

**17** అది వీపు త్రిప్పుకునిపోయే, విముఖత చూపే ప్రతి ఒక్కరినీ కేకేసి పిలుస్తుంది.[11]

وَجَمَعَ فَاَوْعٰى ﴿18﴾

**18** అలాగే ధనాన్ని పోగుచేసి, భద్రంగా దాచిపెట్టేవాణ్ని కూడా.

اِنَّ الْاِنْسَانَ خُلِقَ هَلُوْعًا ﴿19﴾

**19** నిశ్చయంగా మానవుడు మహా దూకుడు స్వభావిగా పుట్టించ బడ్డాడు.[12]

اِذَا مَسَّهُ الشَّرُّ جَزُوْعًا ﴿20﴾

**20** (కాస్తంత) కీడు కలగగానే కలవరం చెందుతాడు.

وَّاِذَا مَسَّهُ الْخَيْرُ مَنُوْعًا ﴿21﴾

**21** మరి మేలు కలిగినప్పుడు మాత్రం పిసినారిగా ప్రవర్తిస్తాడు.

اِلَّا الْمُصَلِّيْنَ ﴿22﴾

**22** కాని నమాజు చేసేవారు మాత్రం అలాంటివారు కారు.

الَّذِيْنَ هُمْ عَلٰى صَلَاتِهِمْ دَآئِمُوْنَ ﴿23﴾

**23** వారు తమ నమాజుల (వ్యవస్థ)పై నిత్యం కొనసాగు తారు.[13]

وَالَّذِيْنَ فِيْٓ اَمْوَالِهِمْ حَقٌّ مَّعْلُوْمٌ ﴿24﴾

**24** వారి సంపదలో నిర్ణీత హక్కు[14] ఉంటుంది.

9. అంటే నరకాగ్ని అన్నమాట. దాని తీవ్రతను గురించి తెలియపరచటానికి ఒక ఉదాహరణ ఇవ్వబడింది.

10. మనిషి కాలి అస్థిపంజరంగా మిగిలిపోతుంటాడు.

11. అంటే సత్యం పట్ల పలాయనవాదాన్ని అనుసరిస్తూ, ధనవ్యామోహంలో దారుణంగా చిక్కుకుని పిసినారిగా మారినవారిని, దైవమార్గంలో ఖర్చుచేయకుండా మూటలు కట్టి దాచే వారిని ఆనాడు నరకాగ్ని కేకలేసి మరీ పిలుస్తుంది. దేవుడు నరకానికి ఆనాడు మాట్లాడే శక్తిని ఇస్తాడు. తమ దుష్కర్మల మూలంగా నరకాగ్నికి ఆహుతి అవటం అనివార్యం అయిన వారినందరినీ అది పిలుస్తుంది.

    పిలిచేది దైవదూతలే అయినప్పటికీ దాన్ని 'నరక పిలుపు'గా చెప్పటం జరిగిందని కొంతమంది అభిప్రాయపడగా, అసలు అక్కడ ఎలాంటి కేకలు, పిలుపులు ఉండవనీ, ఇది కేవలం ఉపమానంగా మాత్రమే చెప్పబడిందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు.

12. అత్యాశ గలవాడినీ, ప్రతిదానికీ తొందరపెట్టేవాణ్ణి **'హలూఅ'** (**هَلُوْع**) అంటారు. అంటే ఓపికలేనివాడు, మహా చపలచిత్తుడు, మానసికంగా పరిపక్వత లేనివాడని అర్థం. ఇలాంటి మనిషి సాధారణంగా పిసినారి, పేరాశాపరుడై ఉంటాడు. కష్టకాలంలో కంగారెత్తిపోతాడు. కలిమిలో మాత్రం పీనాసితనం ప్రదర్శిస్తాడు.

13. అయితే విశ్వసించినవారిలో, దేవుని ఏకత్వంపై దృఢనమ్మకం ఉన్నవారిలో ఈ బలహీనతలు, అవగుణాలు ఉండవు. పైగా వారు సద్గుణ సంపన్నులై ఉంటారు. నమాజు వ్యవస్థపై స్థిరంగా ఉండటమంటే అర్థం –వారు నిత్యం నమాజు చేస్తారు. నమాజు విషయంలో అశ్రద్ధ చూపరు. వేళకు నమాజు చేస్తారు. నమాజులలో అణకువను, ఏకాగ్రతను కలిగి ఉంటారు. వారి దైనందిన కార్యకలాపాలు ఏవీ వారిని నమాజు నుంచి ఆపవు. ఎన్ని ముఖ్యమైన పనులు, వ్యాపకాలు ఉన్నప్పటికీ ప్రతి నమాజును వేళకు ఖచ్చితంగా చేస్తారు.

25 అడిగేవారికి, అడగని వారికి కూడా.[15]

لِّلسَّآئِلِ وَالْمَحْرُوْمِ ﴿25﴾

26 వారు ప్రతిఫల దినాన్ని దృఢంగా నమ్మే వారై ఉంటారు.[16]

وَالَّذِيْنَ يُصَدِّقُوْنَ بِيَوْمِ الدِّيْنِ ﴿26﴾

27 వారు తమ ప్రభువు శిక్షకు భయపడుతూ ఉంటారు.[17]

وَالَّذِيْنَ هُمْ مِّنْ عَذَابِ رَبِّهِمْ مُّشْفِقُوْنَ ﴿27﴾

28 నిశ్చయంగా వారి ప్రభువు శిక్ష నిర్భయంగా ఉండదగినది కాదు.[18]

اِنَّ عَذَابَ رَبِّهِمْ غَيْرُ مَاْمُوْنٍ ﴿28﴾

29 వారు తమ మర్మాంగాలను (అక్రమ సంబంధాల నుండి) కాపాడుకుంటారు.

وَالَّذِيْنَ هُمْ لِفُرُوْجِهِمْ حٰفِظُوْنَ ﴿29﴾

30 అయితే తమ భార్యల విషయంలో, (ధర్మబద్ధంగా) తమ స్వాధీనంలో ఉన్న బానిస స్త్రీల విషయంలో మాత్రం వారు నిందార్హులు కారు.[19]

اِلَّا عَلٰٓى اَزْوَاجِهِمْ اَوْ مَا مَلَكَتْ اَيْمَانُهُمْ فَاِنَّهُمْ غَيْرُ مَلُوْمِيْنَ ﴿30﴾

31 ఇక ఎవరయినా ఇదిగాక ఇంకా ఏదైనా (ఇతరత్రా అడ్డ దారులు అవలంబించ) కోరితే, వారు హద్దు మీరిన వారవుతారు.

فَمَنِ ابْتَغٰى وَرَآءَ ذٰلِكَ فَاُولٰٓئِكَ هُمُ الْعٰدُوْنَ ﴿31﴾

32 వారు తమ అప్పగింతలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండే వారై ఉంటారు.[20]

وَالَّذِيْنَ هُمْ لِاَمٰنٰتِهِمْ وَعَهْدِهِمْ رٰعُوْنَ ﴿32﴾

14. అంటే విధిగా చెల్లించవలసిన జకాత్ సొమ్ము అన్నమాట. మరి కొంతమంది ప్రకారం తప్పనిసరిగా ఇవ్వవలసిన దానాలు (సదఖాతె వాజిబా), స్వచ్ఛంద దానాలు (సదఖాతె నాఫిలా) కూడా ఈ 'నిర్ణీత హక్కు'లో అంతర్భాగమే.

15. అడగనివారంటే ఎవరు? కేవలం చేయి చాపి యాచించనివారు మాత్రమే కాదు, అవసరం ఉండి కూడా ఆత్మాభిమానం వల్ల అడగని వారు, ఉపాధికి నోచుకోనివారు, ప్రకృతి వైపరీత్యాల వాతనపడి తమ సర్వస్వాన్ని కోల్పోయిన వారంతా ఇందులోకి వస్తారు.

16. వారెన్నడూ ప్రతిఫల దినాన్ని నిరాకరించటంగానీ, సందేహాన్ని వ్యక్తం చేయటంగానీ చేయరు.

17. అనుక్షణం దైవానికి భయపడుతూ, మంచిపనులు చేస్తూ కూడా దేవుని ఔన్నత్యం దృష్ట్యా ఆయనకు భయపడుతూ ఉంటారు. దేవుని కటాక్షవీక్షణాలు తమపై ప్రసరించనంతవరకూ – తాము కేవలం తమ పుణ్యకార్యాల ఆధారంగా స్వర్గానికి పోలేమని భావిస్తూ ఉంటారు.

18. నిజమే. ప్రభువు శిక్షపట్ల ఎవరూ నిశ్చింతగా, నిర్భయంగా ఉండకూడదు. నిత్యం ఆయనకు భయపడుతూ, ఆయన శిక్ష నుండి కాపాడే సదాచరణలు చేస్తూ ఉండాలి.

19. మానవుని లైంగిక వాంఛల పరిపూర్తి కోసం దేవుడు రెండు ధర్మసమ్మతమైన మార్గాలను తెరచి ఉంచాడు. ఒకటి : భార్య. రెండు : ధర్మబద్ధంగా మనిషి యాజమాన్యంలోనికి వచ్చిన బానిస స్త్రీ. ఇస్లాం చూపిన ఈ రెండవ మార్గం నేడు ప్రపంచంలో దాదాపు లేనట్లే. అయితే చట్టరీత్యా ఈ మార్గాన్ని మాత్రం అలాగే ఉంచటం జరిగింది. ఎందుకంటే ఈ సమస్య లోకంలో ఎప్పుడైనా ఉత్పన్నం కావచ్చు. మొత్తానికి ఈ ఆయతు ద్వారా విదితమయ్యే అసలు

**33** వారు తమ సాక్ష్యాలపై నిలకడ కలిగి ఉంటారు.[21]

وَالَّذِينَ هُمْ بِشَهَادَاتِهِمْ قَائِمُونَ ﴿٣٣﴾

**34** ఇంకా – వారు తమ నమాజులను కాపాడుతారు.

وَالَّذِينَ هُمْ عَلَىٰ صَلَاتِهِمْ يُحَافِظُونَ ﴿٣٤﴾

**35** ఇలాంటి వారే స్వర్గవనాలలో సగౌరవంగా ఉండేవారు.

أُولَٰئِكَ فِي جَنَّاتٍ مُكْرَمُونَ ﴿٣٥﴾

**36** (ఓ ముహమ్మద్ – స!) ఇంతకీ ఈ తిరస్కారులకు ఏమై
పోయిందీ? వారు నీ వైపు (పిచ్చిగా) ఎగబడి వస్తున్నారు!?

فَمَالِ الَّذِينَ كَفَرُوا قِبَلَكَ مُهْطِعِينَ ﴿٣٦﴾

**37** – కుడివైపు నుంచి, ఎడమ వైపు నుంచి గుంపులు గుంపు
లుగా![22]

عَنِ الْيَمِينِ وَعَنِ الشِّمَالِ عِزِينَ ﴿٣٧﴾

**38** ఏమిటి, వారిలోని ప్రతి ఒక్కడూ సుఖ సౌఖ్యాలతో నిండిన
స్వర్గంలో తాను కూడా ప్రవేశింపజేయబడాలని ఆశపడ్తున్నాడా?

أَيَطْمَعُ كُلُّ امْرِئٍ مِنْهُمْ أَنْ يُدْخَلَ جَنَّةَ نَعِيمٍ ﴿٣٨﴾

**39** అసంభవం.[23] మేము వారిని దేంతో పుట్టించామో స్వయంగా
వారికీ తెలుసు.[24]

كَلَّا ۖ إِنَّا خَلَقْنَاهُمْ مِمَّا يَعْلَمُونَ ﴿٣٩﴾

**40** అది కాదు. నేను తూర్పుల, పడమరల[25] ప్రభువుపై ప్రమాణం
చేసి చెబుతున్నాను...... నిశ్చయంగా మేము శక్తిమంతులం.

فَلَا أُقْسِمُ بِرَبِّ الْمَشَارِقِ وَالْمَغَارِبِ إِنَّا لَقَادِرُونَ ﴿٤٠﴾

---

విషయమేమిటంటే విశ్వాసులు తమ కామతాపాన్ని చల్లార్చుకోవటం కోసం ధర్మసమ్మతమైన విధానాలను తప్ప ఇతరత్రా అక్రమ మార్గాలను అవలంబించరు.

20. అంటే – ప్రజలు తమ దగ్గర భద్రపరచమని చెప్పి ఇచ్చిన వస్తువుల్లోగానీ, నగదులోగానీ వారెలాంటి ద్రోహానికి పాల్పడరు. అలాగే వారు చేసిన వాగ్దానాలను భంగపరచరు. పైగా వారు ఇచ్చిన మాటను నిలుపుకుంటారు.

21. సాక్ష్యం విషయంలో వారెంతో నిర్ద్వంద్వంగా, నిజాయితీగా, సూటిగా వ్యవహరిస్తారు. తాము ఇచ్చే సాక్ష్యం తమ బంధుమిత్రులకు వ్యతిరేకంగా పరిణమించినాసరే సాక్ష్యాన్ని కప్పిపుచ్చటం, వక్రీకరించి చెప్పటం వంటి చర్యలకు ఒడిగట్టరు.

22. దైవప్రవక్త (సఅసం) వారి సమావేశాలకు అవిశ్వాసులు అదేపనిగా పరుగెత్తుకుంటూ వచ్చేవారు. కాని వారు ఆయన (స) బోధించిన ఆధ్యాత్మిక విషయాలను ఆచరించే బదులు వాటిని ఎగతాళి చేసేవారు. జట్లు జట్లుగా విడిపోయి దుష్ప్రచారం మొదలెట్టేవారు. వారిలా అనేవారు : "ఒకవేళ ముస్లింలకే గనక స్వర్గప్రవేశం లభించేపక్షంలో వాళ్ళకన్నా ముందు మేమే స్వర్గంలో ప్రవేశిస్తాము." తరువాతి వాక్యంలో అల్లాహ్ అవిశ్వాసుల ఈ భ్రమలను పటాపంచలు చేశాడు.

23. అవిశ్వాసులు, విశ్వాసులు – ఇద్దరూ ఏకకాలంలో స్వర్గంలో ప్రవేశించటమనేది ఎలా సంభవం? దైవప్రవక్తను అనుసరించేవారికీ, ధిక్కరించేవారికి కూడా పరలోక శాశ్వత సౌఖ్యం లభిస్తుందా? అలా ఎన్నటికీ జరగదు.

24. ఎంతో అల్పమైన వీర్య బిందువు (మావున్ మహీన్)తో మనిషి పుట్టించబడ్డాడు. అలాంటప్పుడు బడాయిని చాటుకోవటం, అహంకారంతో విర్రవీగటం మానవునికి ఏమాత్రం శోభించదు. అహంకారం వల్లనే వాడు దైవాన్ని, దైవప్రవక్తను ఎదిరిస్తున్నాడు.

41 ..... వీరికి బదులుగా, వీరికన్నా మెరుగైనవారిని తీసుకు రాగల (శక్తిగల వార)ము.[26] ఈ విషయంలో మేము అశక్తులం ఎంత మాత్రం కాము.[27]

عَلَىٰٓ أَن نُّبَدِّلَ خَيْرًا مِّنْهُمْ وَمَا نَحْنُ بِمَسْبُوقِينَ ﴿٤١﴾

42 కనుక (ఓ ప్రవక్తా!) నీవు వారిని ఆషామాషీ విషయాలలో, ఆటపాటలలోనే పడి ఉండనివ్వు.[28] చివరకు వారు తమకు వాగ్దానం చేయబడుతున్న దినాన్ని ఎలాగూ చేరుకుంటారు.

فَذَرْهُمْ يَخُوضُوا۟ وَيَلْعَبُوا۟ حَتَّىٰ يُلَٰقُوا۟ يَوْمَهُمُ ٱلَّذِى يُوعَدُونَ ﴿٤٢﴾

43 ఆ రోజు వారు సమాధుల నుంచి లేచి, ఒక నిర్ణీత లక్ష్యం వైపు ఉరకలు వేసినట్లే పరుగెడుతూ ఉంటారు.[29]

يَوْمَ يَخْرُجُونَ مِنَ ٱلْأَجْدَاثِ سِرَاعًا كَأَنَّهُمْ إِلَىٰ نُصُبٍ يُوفِضُونَ ﴿٤٣﴾

44 వారి చూపులు క్రిందికి వంగి వుంటాయి.[30] పరాభవం వారిని ఆవరిస్తూ ఉంటుంది.[31] ఇదే వారికి వాగ్దానం చేయ బడుతూ ఉన్న రోజు![32]

خَٰشِعَةً أَبْصَٰرُهُمْ تَرْهَقُهُمْ ذِلَّةٌ ذَٰلِكَ ٱلْيَوْمُ ٱلَّذِى كَانُوا۟ يُوعَدُونَ ﴿٤٤﴾

25. **'రబ్బిల్ మషారిఖి వల్ మగారిబి'** అని అనబడింది. తూర్పుల, పడమరల ప్రభువు అని అనటంలోని ఔచిత్యం ఏమిటంటే ప్రతిరోజూ సూర్యుడు తూర్పు వైపున సరికొత్త స్థలంనుంచి ఉదయిస్తాడు. అలాగే పడమరన సరికొత్త స్థలంలో అస్తమిస్తాడు. ఆ విధంగా అనేక తూర్పులున్నాయి. అనేక పడమరలున్నాయి. మరిన్ని వివరాల కోసం సాఫ్ఫాత్ సూరా 5వ వచనాన్ని చూడండి.

26. అంటే, వీరిని తుదముట్టించి, వీరి స్థానంలో మరో నూతన సృష్టిని చేయటం మాకేమాత్రం కష్టం కాదు.

27. మరలాంటప్పుడు మేము ప్రళయదినాన వీళ్లను తిరిగి లేపకుండా ఉంటామా?

28. అంటే పనికిమాలిన, వ్యర్థ విషయాలలో వదలిపెట్టు. అయితే నీ సందేశ ప్రచార కార్యక్రమాన్ని మాత్రం నిర్వర్తిస్తూ ఉండు. వీళ్ల అనుచిత ధోరణికి వెరచి, నీవు నీ కర్తవ్యాన్ని విస్మరించకు. నిన్ను నువ్వు చిన్నబుచ్చుకోకు.

29. **'అజ్దాస్'** (ٱلْأَجْدَاث) అంటే గోరీలు, సమాధులు అని అర్థం. **'నుసుబ్'** అంటే విగ్రహాల పేర జంతువులను బలి ఇచ్చే ఆస్థానాలు. విగ్రహాలు అన్న భావంలో కూడా ఈ పదం ఉపయోగించబడుతుంది. ఇక్కడ కూడా ఈ భావంలోనే ప్రయోగించబడింది. విగ్రహ పూజారులు సూర్యోదయ సమయంలో హడావిడిగా అందరికన్నా ముందు ముద్దుపెట్టు కునేందుకు తమ విగ్రహాల వైపు పరుగులు తీస్తారు. మరికొంతమంది ఈ పదాన్ని ధ్వజం (పతాకం) అన్న భావంలో తీసుకున్నారు. యుద్ధరంగంలో సమరయోధులు విజయానందంతో తమ ధ్వజాన్ని ముద్దాడేందుకు వేగంగా దానివైపుకు పరుగెడుతారు. అదేవిధంగా వారు ప్రళయదినాన సమాధుల నుంచి లేచి తమ లక్ష్యం వైపు విద్యుత్ వేగంతో పరుగెడుతారు.

30. నేరస్థులు తల దించుకుని నిలబడినట్లే వారు కూడా క్రిందికి చూస్తూ ఉంటారు. ఎందుకంటే వారికి వారు చేసిన ఘోరాల గురించి తెలుసు.

31. అంటే తీవ్రమైన అవమానం వారిని చుట్టుముడుతూ ఉంటుంది. భయంకొద్దీ వారి ముఖాలు పాలిపోతాయి.

32. అంటే – ఈ ప్రళయదినం గురించి దైవప్రవక్తలు వారికి పదే పదే తాకీదు చేశారు. దైవగ్రంథాల ద్వారా కూడా వారికి ఈ దినం గురించి వాగ్దానం చేయబడింది.

71వ సూరా

# నూహ్

## దైవప్రవక్త నూహ్

అవతరణ
మక్కాలో

ఆయతులు
28

### పరిచయం

సత్యతిరస్కారులను నాశనం చేసే శక్తిసామర్థ్యాలు అల్లాహ్‌కు ఉన్నాయని ఈ సూరా హెచ్చరించింది. మొదటి ఆయత్‌లో 'నూహ్' అన్న ప్రస్తావన వచ్చింది. ఈ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా ప్రవక్త నూహ్(అస) గాథతో ప్రారంభమయ్యింది. ఆయన తన జాతి ప్రజలకు హెచ్చరిక చేయడానికి అల్లాహ్ తరఫున పంపబడ్డారు. బాధాకరమైన శిక్ష గురించి హెచ్చరించడానికి, అల్లాహ్ పట్ల భయభక్తులతో జీవితం గడపమని బోధించడానికి ఆయన వచ్చారు. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, క్షమాభిక్షకై ఆయనను మాత్రమే అర్థించాలని ఆయన బోధించారు. నూహ్(అస) తన ప్రయత్నాలలో అనుసరించిన పద్ధతుల గురించి, ఆయన సంఘర్షణ గురించి ఇందులో వివరించడం జరిగింది. నూహ్ (అస) రాత్రింబవలు తన జాతి ప్రజలకు హితబోధ చేసారు. వారితో వ్యక్తిగతంగాను, సాముదాయికంగానూ మాట్లాడారు. అల్లాహ్‌ను విశ్వసించాలని, బహుదైవారాధన మానుకోవాలని బోధించారు. అల్లాహ్ క్షమాశీలం గురించి వారికి తెలియజేసారు. వారు నిజాయితీగా పశ్చాత్తాపపడితే లభించే అల్లాహ్ అనుగ్రహాల గురించి వారికి తెలిపారు. అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడాన్ని మానుకోవాలని వారికి బోధించారు. అల్లాహ్ శక్తిసామర్థ్యాల గురించి వారికి వివరించారు.

నూహ్(అస) ఎదుర్కొన్న వేధింపుల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ప్రజలు ఆయనకు దూరంగా పారి పోయారు. ఆయన చెప్పే మాటలు వినకుండా ఉండడానికి తమ చెవుల్లో వేళ్ళు పెట్టుకునేవారు. ఆయన కంటబడకుండా ఉండడానికి ముసుగులు వేసుకునేవారు. అధికారం, సంపద ఉన్న వారిని మాత్రమే వారు అనుసరించే వారు. నూహ్(అస)ను, ఆయన అనుచరులను వదిలించుకోవడానికి వారు కుట్రలు పన్నారు. వారు తమ దుర్మార్గాలను, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే మహాపరాధాన్ని చేస్తూ పోయారు. వారి సత్యతిరస్కారానికి, వారి చెడులకు పర్యవసానంగా వారిని మహా వరదలో ముంచేయడం జరిగింది. పరలోకంలో వారు నరకంలో నెట్టబడుతారు.

## సందర్భ వివరణలు 'ఖుర్ఆన్ కథామాలిక' నుంచి

| సూరాలో చారిత్రక సందర్భం ఆయత్ నెం. | కథామాలికలో దాని పూర్వాపరాలు పేజీ నెం. | సందర్భానుసారం ఖుర్ఆన్ కథామాలికలో చదవదగిన ముఖ్య శీర్షికలు | వీటి గురించి తెలుసుకుంటారు! |
|---|---|---|---|
| 1-28 | 14-20 | 'దైవప్రవక్త నూహ్' | పూర్వకాలంలో ఒకానొకప్పుడు యావత్ ప్రపంచంలో జల ప్రళయం వచ్చింది. అతి కొద్దిమంది మనుషులు, కొన్ని జంతువులు, పక్షులు లాంటి జీవులు మాత్రమే ఆ ఘోరకలి నుంచి బతికి బయటపడ్డాయి. నూహ్ ప్రవక్త కాలంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆ జలప్రళయ పూర్వాపరాలు. |

## నూహ్ సూరా

## سُوْرَةُ نُوْحٍ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

إِنَّآ أَرْسَلْنَا نُوحًا إِلَىٰ قَوْمِهِۦٓ أَنْ أَنذِرْ قَوْمَكَ مِن قَبْلِ أَن يَأْتِيَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿١﴾

1 మేము నూహు (అలైహిస్సలాం)ను అతని జాతివైపు పంపించి,[1] "నీ జాతి వారిపై బాధాకరమైన శిక్ష వచ్చిపడక ముందే నీవు వారిని భయపెట్టు" (అప్రమత్తుల్ని చేయి అని చెప్పాము).[2]

قَالَ يَٰقَوْمِ إِنِّى لَكُمْ نَذِيرٌ مُّبِينٌ ﴿٢﴾

2 (నూహ్) ఇలా అన్నాడు : "ఓ నా జాతివారలారా! నేను మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరిస్తున్నాను[3]...

أَنِ ٱعْبُدُوا۟ ٱللَّهَ وَٱتَّقُوهُ وَأَطِيعُونِ ﴿٣﴾

3 "మీరు అల్లాహ్‌ను ఆరాధించండి.[4] ఆయనకు మాత్రమే భయ పడండి.[5] నా మాట వినండి.[6] (నన్ను అనుసరించండి).

يَغْفِرْ لَكُم مِّن ذُنُوبِكُمْ وَيُؤَخِّرْكُمْ إِلَىٰٓ أَجَلٍ مُّسَمًّى ۚ إِنَّ أَجَلَ ٱللَّهِ إِذَا جَآءَ لَا يُؤَخَّرُ ۖ لَوْ كُنتُمْ تَعْلَمُونَ ﴿٤﴾

4 "(అప్పుడు) అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు. ఒక నిర్ణీత గడువు వరకు మీకు అవకాశం ఇస్తాడు.[7] నిశ్చయంగా అల్లాహ్ నిర్ణయించిన గడువు వచ్చేసిందంటే ఇక అది వాయిదా పడట మంటూ ఉండదు.[8] ఈ సంగతిని మీరు తెలుసుకోగలిగితే ఎంత బావుండు?"[9]

1. హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) దేవుని గొప్ప ప్రవక్తలలో ఒకరు. జాతి జనుల సంస్కరణ నిమిత్తం దేవుడు ప్రభవింపజేసిన తొలిప్రవక్త నూహు అని సహీహ్ ముస్లింలోని సిఫారసుకు సంబంధించిన హదీసు ద్వారా తెలుస్తోంది. భూమండలంలో షిర్క్ (బహు దైవారాధన) జాడ్యం మొదలైంది కూడా ఆయన జాతి ప్రజల ద్వారానే.
2. ప్రళయదినాన ఆపద చుట్టుముట్టకముందే... లేదా ఇహలోకంలో ఘోర విపత్తు దాపురించకమునుపే.. ఉదాహరణకు: ఆ జాతి వారిపై వచ్చిన జలప్రళయం.
3. అంటే దైవశిక్ష గురించి మిమ్మల్ని జాగరూకపరుస్తున్నాను. మీరు గనక దైవాన్ని నమ్మి నీతిగా నడుచుకోకపోతే మీకు శిక్ష ఖాయం. ఈ శిక్ష నుండి మీరు గనక తప్పించుకోవాలంటే నేను చెప్పినట్లు వినాలి. అదేమిటంటే...
4. మీరు బహుదైవారాధనను మాని, ఒకే దైవాన్ని – నిజదైవాన్ని – ఆరాధించాలి.
5. దేవుని అవిధేయతను మానుకోండి. అన్యాయం, అక్రమాలకు దూరంగా ఉండండి. అన్యథా మీరు దేవుని శిక్షకు పాత్రులవుతారు.
6. అంటే – నేను మీకు బోధించే విషయాలను మీరు అనుసరించండి. నాకు విధేయత చూపండి. ఎందుకంటే మీకు సన్మార్గం చూపించే నిమిత్తం నేను దేవుని తరఫున పంపబడిన ప్రవక్తను. దైవ ప్రతినిధిని.
7. దీని భావమేమిటంటే; మీరు గనక నిజదైవాన్ని విశ్వసించి, భయభక్తుల మార్గాన్ని అవలంబించినట్లయితే దేవుడు మీ ఆయుష్షును పెంచి మీరు పుణ్యకార్యాలను చేసుకునే అవకాశం ఇస్తాడు. ఒకప్పుడు మీ వల్ల జరిగిన మీ పాపాలను మీనుండి దూరం చేస్తాడు. కాబట్టి ఈ ఆయతు ద్వారా విదితమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే విధేయత,

5 (నూహ్) ఇలా విన్నవించుకున్నాడు : "నా ప్రభూ! నేను నా జాతివారిని రేయింబవళ్లూ నీ వైపు పిలిచాను.[10]

قَالَ رَبِّ إِنِّي دَعَوْتُ قَوْمِي لَيْلًا وَنَهَارًا ⑤

6 "కాని నా పిలుపు వారి పలాయనాన్ని మరింత పెంచింది.[11]

فَلَمْ يَزِدْهُمْ دُعَاءِي إِلَّا فِرَارًا ⑥

7 "నీ క్షమాభిక్షకై నేను వారిని పిలిచినప్పుడల్లా[12] వారు తమ వ్రేళ్ళను తమ చెవులలో పెట్టుకున్నారు.[13] తమ వస్త్రాలను తమపైన కప్పుకున్నారు.[14] మరీ మొండి ఘటాలుగా మారి పోయారు.[15] మహా గర్విష్ఠుల్లా ప్రవర్తించారు.[16]

وَإِنِّي كُلَّمَا دَعَوْتُهُمْ لِتَغْفِرَ لَهُمْ جَعَلُوا أَصَابِعَهُمْ فِي آذَانِهِمْ وَاسْتَغْشَوْا ثِيَابَهُمْ وَأَصَرُّوا وَاسْتَكْبَرُوا اسْتِكْبَارًا ⑦

8 "మరి నేను వారిని బహిరంగంగా (లేక బిగ్గరగా) పిలిచాను.

ثُمَّ إِنِّي دَعَوْتُهُمْ جِهَارًا ⑧

9 "ఆపైన నేను వారికి బాహాటంగా కూడా బోధపరచాను. రహస్యంగా (ఏకాంతంలో) కూడా విడమరచి చెప్పాను.[17]

ثُمَّ إِنِّي أَعْلَنْتُ لَهُمْ وَأَسْرَرْتُ لَهُمْ إِسْرَارًا ⑨

సదాచరణ వల్ల, బంధుత్వ సంబంధాలను మెరుగుపరచటం వల్ల మనిషి ఆయుషు పెరుగుతుంది. "బంధువుల ఆదరణ (సిలా రహ్మీ) దీర్ఘాయుషుకు సాధనం" అన్న హదీసు ఈ సందర్భంగా గమనించదగినది (ఇబ్నె కసీర్). ఈమాన్ (విశ్వాసం) వల్ల మనిషి వయసులో శుభం ఉంటుందనీ, అవిశ్వాసం వల్ల మనిషి ఈ శుభానికి నోచుకోకుండా పోతాడని మరి కొంతమంది వ్యాఖ్యానించారు.

8. పైగా అది సంభవించి తీరుతుంది. కాబట్టి మీరు దైవాన్ని విశ్వసించి, ప్రవక్త బోధనలను అనుసరించటంలోనే మీ మేలుంది. అన్యథా మీరు నలువైపుల నుండీ ముట్టడించబడే ఆపదలో చిక్కుకు పోవచ్చు.

9. ఈ విషయాన్ని మీరు గ్రహిస్తే నా మార్గాన్ని అనుసరించటానికి వేగిరపడేవారు.

10. అంటే – (ఓ ప్రభూ!) నీవు అప్పజెప్పిన బాధ్యతలో నేను ఎలాంటి అలసత్వాన్నీ కనబరచలేదు. పైగా నేను అహోరాత్రులు శ్రమించి నీ సందేశాన్ని జనసామాన్యానికి చేరవేశాను.

11. అంటే – నేను వీరిని నీ మార్గం వైపు పిలిచినకొద్దీ వీళ్లు మరింత దూరం పారిపోయారు. ఏ జాతి వారైనాసరే మార్గభ్రష్టత యొక్క ఆఖరి అంచులకు చేరుకున్నప్పుడు వారి పరిస్థితి ఇలాగే ఉంటుంది. దైవమార్గం వైపు ఆహ్వానించే కొలదీ వారు వీపు త్రిప్పుకుని పోతుంటారు.

12. అంటే – క్షమాభిక్షకు మూల కారకాలైన విశ్వాసం (ఈమాన్), విధేయతల వైపుకు ఆహ్వానించినప్పుడల్లా....

13. నా సందేశం తమ కర్ణపుటాలకు తాకరాదన్న ఉద్దేశంతో వారలా చేసేవారు.

14. నా వంక చూడటం కూడా వారికిష్టం ఉండేది కాదు. ఇది వారి వైముఖ్య ధోరణికి, వైర వైఖరికి పరాకాష్ఠ. మరి కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం, ప్రవక్త దృష్టిలో తాము పడరాదన్న ఉద్దేశంతో – మొహం చాటేయడానికి – వారావిధంగా వస్త్రాలు కప్పుకునేవారు.

15. అంటే – వారు తమ అవిశ్వాస వైఖరిపై పాతుకుపోయి ఉన్నారు. ఎంతగా నచ్చజెప్పినా క్షమాపణ కోరుకోలేదు. జగమొండిలా ప్రవర్తించారు.

16. అంటే – వారు సత్యం పట్ల దురహంకారం ప్రదర్శించారు.

17. వారిని దారికి తీసుకురావటానికి నేను రకరకాల పద్ధతుల్ని అవలంబించాను. (మరి కొందరి అభిప్రాయం ప్రకారం) సభలు, సమావేశాల ద్వారా కూడా వారికి సందేశం అందజేశాను. ఏకాంతంలో కూడా వారికి నీ జీవన విధానం గురించి బోధపరిచాను.

10 "నేనిలా అన్నాను – క్షమాపణకై మీ ప్రభువును వేడుకోండి.[18] నిశ్చయంగా ఆయన అమితంగా క్షమించేవాడు.[19]

فَقُلۡتُ ٱسۡتَغۡفِرُواْ رَبَّكُمۡ إِنَّهُۥ كَانَ غَفَّارٗا ﴿١٠﴾

11 "ఆయన ఆకాశం నుంచి మీపై ధారాపాతంగా వర్షం కురిపిస్తాడు.[20]

يُرۡسِلِ ٱلسَّمَآءَ عَلَيۡكُم مِّدۡرَارٗا ﴿١١﴾

12 "మీ సిరిసంపదల్లోనూ, పుత్ర సంతతిలోనూ పురోభివృద్ధిని వొసగుతాడు. మీ కొరకు తోటల్ని ఉత్పన్నం చేస్తాడు. ఇంకా మీ కోసం కాలువలను ప్రవహింపజేస్తాడు."[21]

وَيُمۡدِدۡكُم بِأَمۡوَٰلٖ وَبَنِينَ وَيَجۡعَل لَّكُمۡ جَنَّٰتٖ وَيَجۡعَل لَّكُمۡ أَنۡهَٰرٗا ﴿١٢﴾

13 "అసలేమైంది మీకు, అల్లాహ్ ఔన్నత్యం (ఘనత) పట్ల మీకు బొత్తిగా భయం లేదేమిటీ?[22]

مَّا لَكُمۡ لَا تَرۡجُونَ لِلَّهِ وَقَارٗا ﴿١٣﴾

14 "వాస్తవానికి ఆయన మిమ్మల్ని సృష్టి ప్రక్రియలోని అనేక దశలగుండా తీర్చిదిద్దాడు.[23]

وَقَدۡ خَلَقَكُمۡ أَطۡوَارًا ﴿١٤﴾

18. 'విశ్వాసం మరియు విధేయతా మార్గాన్ని అవలంబించండి, గతంలో మీ వల్ల జరిగిన ఘోరాలపై కుమిలిపోతూ క్షమాపణకై వేడుకోండి' అని కూడా చెప్పాను.

19. పశ్చాత్తాపభావంతో తన వైపు మరలివచ్చిన వారిని ఆయన ఎంతగానో క్షమిస్తాడని కూడా ఉపదేశించాను.

20. ఈ ఆయతు కారణంగానే కొంతమంది విద్వాంసులు 'నమాజె ఇస్తిస్ఖా'లో నూహ్ సూరాను పారాయణం చేస్తారు. ఇలా పారాయణం చేయటం పుణ్యప్రదంగా కూడా భావిస్తారు. హ॥జ్రత్ ఉమర్ (రజి) గారు కూడా ఒకసారి నమాజె ఇస్తిస్ఖా సందర్భంగా వేదిక ఎక్కి క్షమాభిక్షకు సంబంధించిన ఆయతులు పఠించి వేదిక నుంచి దిగారు. అందులో ఈ ఆయతు కూడా ఉంది. అనంతరం ఆయన ఇలా అన్నారు : నేను వర్షాన్ని ఆకాశంలో ఉన్న వర్ష మార్గాల ద్వారా కురిపించమని కోరాను. ఆ మార్గాల ద్వారానే వర్షం నింగి నుంచి నేలకు దిగుతుంది (ఇబ్నె కసీర్).

హ॥జ్రత్ హసన్ బస్రీ గురించి ఈ విధంగా అనబడింది : ఎవరో ఒక వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చి కరువు కాటకాల గురించి బాధతో చెప్పుకోగా 'ప్రభువును క్షమాపణ కోరుకోండి' అని ఆయన ఉపదేశించారు. మరొక వ్యక్తి వచ్చి దారిద్ర్యం గురించి ఫిర్యాదు చేసుకున్నాడు. అతనికి కూడా "క్షమాభిక్షకై అల్లాహ్‌ను వేడుకోండి" అని ఆయన బోధ పరచారు. వేరొక వ్యక్తి వచ్చి తన తోట ఎండిపోయిందని వాపోయాడు. ఆయన అతనికి కూడా అదే సలహా ఇచ్చారు. ఇంకొక వ్యక్తి కూడా వచ్చి తనకు సంతానప్రాప్తి లేదని చెప్పుకోగా, అతనికి కూడా ఆయన అదే చికిత్స ప్రతిపాదించారు. తమరు ప్రతి ఒక్కరికీ ఒకే ఇస్తిగ్ఫార్ మందు (క్షమాభిక్ష మందు) ఇస్తున్నారేమిటీ అని ఎవరో ప్రశ్నిస్తే, అప్పుడాయన ఇలా అన్నారు : "ఈ సమస్యలన్నింటికీ అల్లాహ్ చూపిన పరిష్కారం ఇదే" (ఐసరుత్తఫాసీర్).

21. అంటే – ఈమాన్, విధేయత ద్వారా మీకు కేవలం పారలౌకిక అనుగ్రహాలు మాత్రమే గాక ప్రాపంచిక భౌతికానుగ్రహాలు కూడా సిద్ధిస్తాయి. ఉదాహరణకు : మీ సిరిసంపదలు పెరుగుతాయి. సంతాన భాగ్యం లభిస్తుంది. మీరు ఉండే ప్రదేశాల్లో పాడిపంటలు పొంగిపొరలుతాయి.

22. అంటే – దేవుని ఔన్నత్యం పట్ల మీలో భయంతోపాటు, ఆశాభావం కూడా ఉండాల్సింది. మీరు ఆయన ఔన్నత్యం దృష్ట్యా ఆయన్ని ఒక్కడిగా నమ్మాల్సింది. ఆయనకు విధేయత చూపాల్సింది. కాని మీ ధోరణి దీనికి భిన్నంగా ఉంది. అసలు మీకేమైపోయింది? ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు?

23. అంటే మొట్టమొదట మిమ్మల్ని వీర్య బిందువుతో చేశాడు. ఆ తరువాత నెత్తుటి గడ్డగా, ఆపైన మాంసపు ముద్దగా

15 “ఏమిటి, అల్లాహ్ సప్తాకాశాలను ఎలా ఒకదానిపై ఒకటిగా సృష్టించాడో మీరు చూడటం లేదా?[24]

اَلَمْ تَرَوْا كَيْفَ خَلَقَ اللّٰهُ سَبْعَ سَمٰوٰتٍ طِبَاقًا ﴿15﴾

16 “మరి వాటిలో చంద్రుణ్ణి కాంతిమంతంగా చేశాడు.[25] సూర్యుణ్ణి దేదీప్యమానంగా చేశాడు.[26]

وَّجَعَلَ الْقَمَرَ فِيْهِنَّ نُوْرًا وَّجَعَلَ الشَّمْسَ سِرَاجًا ﴿16﴾

17 “ఇంకా అల్లాహ్ మిమ్మల్ని నేల నుండి (ఒక ప్రత్యేక రీతిలో) మొలిపించాడు.[27]

وَاللّٰهُ اَنْۢبَتَكُمْ مِّنَ الْاَرْضِ نَبَاتًا ﴿17﴾

18 “మరి మిమ్మల్ని అందులోనికే తిరిగి తీసుకుపోతాడు. మరి ఆ నేలలో నుంచే మిమ్మల్ని (విచిత్రంగా) వెలికితీస్తాడు.[28]

ثُمَّ يُعِيْدُكُمْ فِيْهَا وَيُخْرِجُكُمْ اِخْرَاجًا ﴿18﴾

19 “ఇంకా – అల్లాహ్ భూమిని మీ కోసం పాన్పు మాదిరిగా చేశాడు.[29]

وَاللّٰهُ جَعَلَ لَكُمُ الْاَرْضَ بِسَاطًا ﴿19﴾

20 “మీరు దాని సువిశాల మార్గాల్లో నడవటానికి” (అని చెప్పాను).[30]

لِّتَسْلُكُوْا مِنْهَا سُبُلًا فِجَاجًا ﴿20﴾

మార్చాడు. తరువాత ఎముకల్ని కూర్చాడు. అటుపిమ్మట మాంసం ఎక్కించాడు. చివరకు మిమ్మల్ని సంపూర్ణ మానవాకారంగా మలిచాడు. అంబియా, మోమిన్, హజ్, మోమినూన్ తదితర సూరాలలో ఈ దశలు పేర్కొనబడ్డాయి.

24. ఈ నిర్మాణం ఆయన నైపుణ్యానికి, పనితనానికి అద్దం పడుతోంది. ఆరాధనలకు, దాస్యానికి ఆయన మాత్రమే అర్హుడని ఈ అపూర్వ సృష్టి చాటి చెబుతోంది.

25. తత్ఫలితంగా చంద్రుడు యావత్తు భూమండలంపై వెలుగును విరజిమ్ముతున్నాడు.

26. మానవుడు పగటిపూట తన జీవనోపాధిని అన్వేషించటానికి, దైనందిన జీవనావసరాలను తీర్చుకోవటానికిగాను దేవుడు ఈ ఏర్పాటు చేశాడు.

27. అంటే – మీ పితామహుడగు హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)ను తొలుత మట్టితో చేసి, తరువాత అందులో ప్రాణం పోయటం జరిగింది. ఒకవేళ ఈ వాక్యం సమస్త మానవాళిని ఉద్దేశించి చెప్పబడిందనుకుంటే దీని భావం ఇది : ఏ వీర్యపు బిందువుతో మీరు సృజించబడుతున్నారో అది ఈ నేలలో పండే ఆహారం ద్వారానే తయారవుతుంది. ఈ రకంగా చూస్తే అందరి పుట్టుకకు మూల వస్తువు మట్టే.

28. అంటే – మరణించిన పిదప ఆ మట్టిలోనే కలవవలసి ఉంది. ప్రళయదినాన ఆ మట్టిలో నుంచే మిమ్మల్ని మళ్లీ బ్రతికించి లేపటం జరుగుతుంది.

29. మీరు మీ ఇండ్లలో, కార్యాలయాల్లో పరచిన తివాచీలపై నడచినట్లే ఈ భూమిపై నడుస్తున్నారు. ఈ భూమిపైనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ భూమిలో నుంచే మీ ఉపాధిని అన్వేషిస్తున్నారు.

30. ఈ భూమిపై దేవుడు సువిశాలమైన దారులను ఏర్పరచి, మానవుడు ఒకచోటి నుంచి మరో చోటికి, ఒక పట్టణం నుంచి మరో పట్నానికి, ఒక దేశం నుంచి మరో దేశానికి తరలిపోవటానికి సౌలభ్యం కల్పించాడు. కాబట్టి ఈ భూమార్గాలు కూడా మానవుని వాణిజ్య అవసరాలకు, సంస్కృతీ నాగరికతలకు ఎంతో అవసరమే. దేవుడు మానవుల ఈ అవసరాన్ని తీర్చి వారికి మహోపకారం చేశాడు.

21 (ఆఖరికి) నూహ్ ఇలా మొరపెట్టుకున్నాడు : "నా ప్రభూ! వీళ్లు నా మాటల్ని లక్ష్యపెట్టలేదు.[31] ఎవరికి సిరిసంపదలు, సంతానం నష్టకరంగా పరిణమించాయో వారి మాటల్ని మాత్రమే వీళ్లు విన్నారు.[32]

قَالَ نُوحٌ رَّبِّ إِنَّهُمْ عَصَوْنِي وَاتَّبَعُوا مَن لَّمْ يَزِدْهُ مَالُهُ وَوَلَدُهُ إِلَّا خَسَارًا ﴿٢١﴾

22 "ఇంకా – వీళ్లు పెద్ద పెద్ద కుట్రలు పన్నారు.[33]

وَمَكَرُوا مَكْرًا كُبَّارًا ﴿٢٢﴾

23 "ఇంకా వారిలా అన్నారు – ఎట్టి పరిస్థితిలోనూ మీ పూజ్య దైవాలను వదలకండి. వద్దను గానీ, సువాను గానీ, యగూస్, యవూఖ్ నస్రలను గానీ వదలి పెట్టకండి."[34]

وَقَالُوا لَا تَذَرُنَّ آلِهَتَكُمْ وَلَا تَذَرُنَّ وَدًّا وَلَا سُوَاعًا وَلَا يَغُوثَ وَيَعُوقَ وَنَسْرًا ﴿٢٣﴾

24 "(ప్రభూ!) వీళ్లు చాలామందిని అపమార్గం పట్టించారు.[35] (కాబట్టి) నీవు ఈ దుర్మార్గుల అపమార్గాన్ని మరింతగా పెంచు."

وَقَدْ أَضَلُّوا كَثِيرًا ۖ وَلَا تَزِدِ الظَّالِمِينَ إِلَّا ضَلَالًا ﴿٢٤﴾

**'సుబుల్'** అంటే దారులు అని అర్థం. 'సబీల్' దీని ఏకవచనం. 'ఫిజాజున్' అంటే విశాలమైనవి అని అర్థం.

31. అంటే – నన్ను ఎదిరించటమే వాళ్ల లక్ష్యం అయింది. నేనెప్పుడు వాళ్ల మంచిని కోరినా దానికి వాళ్లు స్పందించలేదు.

32. వీళ్లలోని సామాన్యులంతా తమ శ్రీమంతుల, నాయకుల మాటలే విన్నారు. పోనీ ఆ శ్రీమంతులైనా మంచివారా? అంటే అదీ కాదు. వారి ఆస్తిపాస్తులు, ఆలుబిడ్డలు వారిని ప్రాపంచికంగానూ, పారలౌకికంగానూ నష్టపరిచాయే తప్ప ఎలాంటి లాభం కలిగించలేదు. అటువంటి శ్రీమంతుల మాటలు విని ఈ మూర్ఖులు మోసపోతున్నారు.

33. వారు దైవప్రవక్త నూహు (అలైహిస్సలాం)ను హతమార్చమని కూడా కొంతమందిని ప్రేరేపించారు. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం వారి సిరిసంపదలు, వారి సంతానం వారిని మోసానికి గురిచేశాయి. తాము అవలంబించే బహుదైవారాధన ఒకవేళ సత్యం కాకపోతే తమకీ ఐశ్వర్యం ఎందుకు ప్రాప్తిస్తుంది? అని కొందరు ప్రశ్నించేవారు. అందుకే తమ పూజ్య దైవాలను వదలిపెట్టరాదని వారు తమ జనులకు గట్టిగా నొక్కి వక్కాణించారు. ఆ విధంగా వారు తమ అపమార్గంపై పాతుకుపోయారు.

34. ఇంతకీ ఎవరు వీరు? వీళ్లు హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) కాలానికి చెందిన పుణ్య పురుషులే. వీళ్లు చనిపోయిన తరువాత షైతాన్ వారి అభిమానుల్లో దురాలోచనలను నూరిపోశాడు. అందుచేత ఈ అభిమానులు ఆ సజ్జనుల స్మారకార్థం వాళ్ల చిత్రపటాలను, ప్రతిమలను తయారుచేసి తమ ఇండ్లలో, దుకాణాలలో ప్రతిష్ఠించారు. ఈ సజ్జనుల జ్ఞాపకార్థం వాళ్లు కూడా పుణ్యకార్యాలు చేసేవారు. కాని వారు మరణించిన తరువాత, వాళ్ల తరువాతి తరాన్ని షైతాన్ పెడత్రోవ పట్టిస్తూ, "మీ పెద్దలు ఈ విగ్రహాలను పూజించేవారు. మీరు మాత్రం ఎందుకు పూజించరు?" అని ఉసిగొల్పాడు. అప్పుడు వారు వద్ద్, సువా, యగూస్, యవూఖ్, నస్రల పేరున తయారైన ప్రతిమలను పూజించటం మొదలెట్టారు. (సహీహ్ బుఖారీ – నూహ్ సూరా వ్యాఖ్యానం). ఆ విధంగా ఈ విగ్రహారాధన నూహు జాతి ప్రజలలో సర్వసామాన్యమైపోయింది. ఈ విగ్రహారాధన ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే వేనవేల సంవత్సరాలు గడచిపోయినా అరేబియాలో వద్ద్, సువా, యగూస్, యవూఖ్, నస్రల పూజ కొనసాగేది. ఉదాహరణకు: 'వద్ద్'ను దౌమతుల్ జందల్లో కల్బ్ తెగవారు పూజించేవారు. 'సువా'ను సముద్రతీర ప్రాంతంలో నివసించే హుజైల్ తెగవారు మొక్కేవారు. 'యగూస్'ను సబా ప్రాంతానికి సమీపంలో ఉన్న జర్ఫ్‌లో మురాద్, బనీ గతీఫ్ తెగవారు ఆరాధించేవారు. 'యవూఖ్'ను హమదాన్ తెగవారు పూజించేవారు. 'నస్ర్'ను హుమైర్ జాతికి చెందిన జుల్‌కిలా తెగవారు ఆరాధించేవారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

25 (ఎట్టకేలకు) వారు తమ పాపాల కారణంగానే[36] ముంచి వేయబడ్డారు. మరి వారు నరకానికి చేర్చబడ్డారు. మరి వారు అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ సహాయకులుగా పొందలేకపోయారు.

مِمَّا خَطِيٓـَٔـٰتِهِمْ أُغْرِقُوا۟ فَأُدْخِلُوا۟ نَارًا فَلَمْ يَجِدُوا۟ لَهُم مِّن دُونِ ٱللَّهِ أَنصَارًا ﴿٢٥﴾

26 నూహ్ ఇలా ప్రార్థించాడు: "నా ప్రభూ! నీవు భూమండలంపై ఏ ఒక్క అవిశ్వాసినీ సజీవంగా వదలిపెట్టకు.[37]

وَقَالَ نُوحٌ رَّبِّ لَا تَذَرْ عَلَى ٱلْأَرْضِ مِنَ ٱلْكَـٰفِرِينَ دَيَّارًا ﴿٢٦﴾

27 "ఒకవేళ నీవు గనక వీళ్ళను వదలి పెడితే, వీళ్లు నీ దాసులను మార్గం తప్పిస్తారు. వీళ్లకు పుట్టబోయేబిడ్డలు కూడా అవిధేయులు, కరడుగట్టిన అవిశ్వాసులై ఉంటారు.

إِنَّكَ إِن تَذَرْهُمْ يُضِلُّوا۟ عِبَادَكَ وَلَا يَلِدُوٓا۟ إِلَّا فَاجِرًا كَفَّارًا ﴿٢٧﴾

28 "నా ప్రభూ! నన్నూ, నా తల్లిదండ్రులను, విశ్వసించి నా ఇంట్లో ప్రవేశించిన వారందరినీ, విశ్వాసులైన సమస్త పురుషులను, స్త్రీలను క్షమించు.[38] దుర్మార్గులకు వినాశంలో తప్ప మరెందులోనూ వృద్ధినొసగకు." [39]

رَّبِّ ٱغْفِرْ لِى وَلِوَٰلِدَىَّ وَلِمَن دَخَلَ بَيْتِىَ مُؤْمِنًا وَلِلْمُؤْمِنِينَ وَٱلْمُؤْمِنَـٰتِ ۖ وَلَا تَزِدِ ٱلظَّـٰلِمِينَ إِلَّا تَبَارًۢا ﴿٢٨﴾

35. అపమార్గం పట్టించిన వారు జాతికి చెందిన దుష్టనాయకులు. ఈ వాక్యం ఆ ఐదు విగ్రహాలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు : హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కూడా ఈ విధంగా పలికారు – "ప్రభూ! ఈ విగ్రహాలు చాలా మందిని మార్గం తప్పించాయి" (ఇబ్రాహీం – 36).

36. అంటే వారు తమ దుర్మార్గాల, పాపిష్టిపనుల మూలంగా ఉప్పెన ద్వారా ముంచివేయ బడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

37. సహనానికీ ఒక హద్దు ఉంటుంది. 950 ఏండ్లు అహోరాత్రులు శ్రమించిన తర్వాత కూడా వారు దారికి రాకపోవటంతో దైవప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) నిరాశచెంది ఇలా శపించారు. వారిలో ఇక ఎవరూ విశ్వసించబోరని దేవుడు కూడా ఆయనకు తెలియపరచాడు. (హూద్ – 36).

38. మార్గభ్రష్టుల కోసం శపించిన నూహు తన కోసం, సమస్త విశ్వాసుల మన్నింపు కోసం 'దుఆ' చేశారు.

39. ప్రవక్త నూహ్ పెట్టిన ఈ శాపనార్థం ప్రళయదినం వరకు వచ్చే అవిశ్వాసులకు వర్తిస్తుంది. అలాగే ఆయన చేసిన 'దుఆ' లోకంలోని సమస్త విశ్వాసులకు వర్తిస్తుంది.

72వ సూరా

# అల్ జిన్న్

## జిన్నులు, అగోచర ప్రాణులు

అవతరణ మక్కాలో

ఆయతులు 28

### పరిచయం

*ఏక దైవారాధన, ప్రవక్తల పరంపర గురించి ఈ సూరా ముఖ్యంగా వివరించింది. మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన జిన్నులు అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. దివ్యఖుర్ఆన్ మహత్యానికి జిన్నులు కూడా ప్రభావితమయ్యాయని తెలియజేయడం ద్వారా ఖుర్ఆన్ ఔన్నత్యాన్ని విశదీకరించడం జరిగింది. జిన్నులు రెండు రకాలని, కొందరు మంచివారని, కొందరు చెడ్డవారని తెలిపింది. కొందరు జిన్నులు దైవవాణిని విన్న తర్వాత దానిని విశ్వసించారు. ఈ సూరా ఏకదైవారాధన ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పింది. అల్లాహ్‌కు భాగస్వాములను చేర్చడం మహాపరాధమనీ, దానికి దూరంగా ఉండాలని బోధించింది. అల్లాహ్‌కు కుమారులు ఎవరూ లేరని, ఆయనకు భాగస్వాములు కూడా లేరని, ఆయనకు అగోచరాలు (కంటికి కనబడనివి) అన్నీ తెలుసనీ, అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను తిరస్కరించినవారు నరకాగ్నికి ఆహుతి అవుతారని హెచ్చరించింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను అల్లాహ్ ఎన్నుకుని తన సందేశాన్ని మానవాళికి చేరవేయడానికి పంపాడని, మానవులు ఆయనకు విధేయత చూపాలని, అల్లాహ్‌కు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదని బోధించింది.*

## سُوْرَةُ الْجِنِّ

## అల్ జిన్న్ సూరా

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

قُلْ اُوْحِيَ اِلَيَّ اَنَّهُ اسْتَمَعَ نَفَرٌ مِّنَ الْجِنِّ فَقَالُوْٓا اِنَّا سَمِعْنَا قُرْاٰنًا عَجَبًا ۝1

1 (ఓ ముహమ్మద్ – సఅసం!) వారికి చెప్పు : నాకు దివ్యవాణి (వహీ) ద్వారా ఇలా తెలియజేయబడింది – జిన్నుల సమూహం ఒకటి[1] (ఖుర్ఆన్ను) విన్నది. వారు(తమ వాళ్లతో) ఇలా అన్నారు: "మేమొక అద్భుతమైన ఖుర్ఆన్ను విన్నాము."[2]

يَّهْدِيْٓ اِلَى الرُّشْدِ فَاٰمَنَّا بِهٖ ؕ وَلَنْ نُّشْرِكَ بِرَبِّنَآ اَحَدًا ۝2

2 "అది సన్మార్గం వైపు దర్శకత్వం వహిస్తోంది.[3] అందుకే మేము దానిని విశ్వసించాము.[4] ఇక నుంచి మేము ఎవరినీ – ఎన్నటికీ– మా ప్రభువుకు సహవర్తుల్ని కల్పించము."[5]

وَّاَنَّهُ تَعٰلٰى جَدُّ رَبِّنَا مَا اتَّخَذَ صَاحِبَةً وَّلَا وَلَدًا ۝3

3 "ఇంకా – మా ప్రభువు మహిమ అత్యున్నతమైనది. ఆయన తన కోసం (ఎవరినీ) భార్యగాగానీ, కొడుకుగాగానీ చేసుకోలేదు."[6]

1. ఈ సంఘటనకు సంబంధించిన కొన్ని వివరాలు ఇంతకు ముందు అహ్ఖాఫ్ సూరా– 29వ వచనానికి వివరణగా వచ్చాయి. 'నఖ్లా' అనే ఒక లోయలో దైవప్రవక్త (స) తన సహచరులను ఫజ్ర్ నమాజ్ చేయిస్తూ ఉండగా జిన్నుల సమూహం ఒకటి అటువైపుగా వెళుతూ మహాప్రవక్త (స) నోట ఖుర్ఆన్ పారాయణం విన్నది. దానికి వారెంతో ప్రభావితులయ్యారు. వారు ఖుర్ఆన్ విన్న సంగతి దైవప్రవక్త (స)కు కూడా తెలీదు. దైవవాణి (వహీ) ద్వారా ఆయన (స)కు ఈ విషయం తెలియజేయబడింది.

2. మేము విన్న ఆ ఖుర్ఆన్ చాలా గొప్పది. అరబీ భాషరీత్యా, తేటదనం దృష్ట్యా అద్భుతమైనది. బోధనాతీరు దృష్ట్యా అది అమోఘం. శుభాల రీత్యా ఎంతో విచిత్రమైనది. (ఫత్హుల్ ఖదీర్).

3. ఈ ఖుర్ఆన్లోని మరో సుగుణం ఏమిటంటే అది సన్మార్గాన్ని చూపిస్తుంది. సత్యాన్ని చాలా చక్కగా విశ్లేషించి చెబుతుంది. నిజదైవాన్ని కనుగొనే జిజ్ఞాసను రేకెత్తిస్తుంది.

4. అంటే–మేము ఈ ఖుర్ఆన్ను విన్నంతనే అది ఖచ్చితంగా దైవవాక్కు అని, అది మానవ కల్పితం కాదని తెలుసు కున్నాము. ఈ ఆయతులో అవిశ్వాసులకు హెచ్చరిక ఉంది. ముఖ్యంగా మక్కావాసులకు! జిన్నులు ఒకసారి వినగానే ఈ వాణిని విశ్వసించారు. కొన్ని వాక్యాలు వినేసరికే వారి జీవితాలు మారిపోయాయి. ఈ వాక్కు మానవవాక్కు కాదన్న సత్యాన్ని కూడా వారు గ్రహించారు. కాని మానవులకు, ముఖ్యంగా వారి నాయకమన్యులకు ఈ గ్రంథం బుర్రకెక్కలేదు. మరి చూడబోతే వారు దైవప్రవక్త (సఅసం) నోట ఎన్నోసార్లు ఖుర్ఆన్ పారాయణం విన్నారు. మరి ఆ ప్రవక్త కూడా బయటి నుంచి వచ్చినవాడు కాదు, స్వయంగా వారిలో నుంచి ప్రభవింపజేయబడిన వాడే. మరి ఖుర్ఆన్ కూడా పరభాషలో కాకుండా వారి మాతృభాషయైన అరబీలోనే వచ్చింది. అయినప్పటికీ వారు దీనిని విశ్వసించటానికి ఎందుకు తటపటాయిస్తున్నారు?

5. ఆయన సృష్టితాల్లో నుంచిగానీ, ఇతరత్రా చిల్లర దేవుళ్లనుగానీ మేము అల్లాహ్కు సాటిగా నిలబెట్టబోము. ఎందుకంటే ఆయన తన గుణగణాల రీత్యా, అధికారాల దృష్ట్యా విలక్షణమైన వాడు. ఆయనను సరిపోలిన వారెవరూ లేరు.

6. అంటే ప్రాణులు కల్పించే భాగస్వామ్యాలకు మన ప్రభువు అతీతుడు, ఉన్నతుడు. అటువంటి మహోన్నతునికి

4 "ఇంకా – మనలోని మూర్ఖుడు అల్లాహ్ గురించి సత్యవిరుద్ధ మైన మాటలు పలికే వాడు."[7]

وَّاَنَّهٗ كَانَ يَقُوْلُ سَفِيْهُنَا عَلَى اللّٰهِ شَطَطًا ④

5 "మనుషులైనా, జిన్నులైనా అల్లాహ్‌కు అబద్ధాలు అంటగట్టడం అనేది అసంభవమని మనం అనుకున్నాము."[8]

وَّاَنَّا ظَنَنَّآ اَنْ لَّنْ تَقُوْلَ الْاِنْسُ وَالْجِنُّ عَلَى اللّٰهِ كَذِبًا ⑤

6 "అసలు విషయమేమిటంటే కొందరు మనుషులు కొందరు జిన్నాతుల శరణు వేడేవారు.[9] ఈ కారణంగా జిన్నాతుల పొగరు మరింత పెరిగిపోయింది."[10]

وَّاَنَّهٗ كَانَ رِجَالٌ مِّنَ الْاِنْسِ يَعُوْذُوْنَ بِرِجَالٍ مِّنَ الْجِنِّ فَزَادُوْهُمْ رَهَقًا ⑥

7 "అల్లాహ్ ఎవరినీ పంపడని (లేక ఎవరినీ తిరిగి బ్రతికించడని) మీరు తలపోసినట్లుగానే మనుషులు కూడా తలపోశారు."

وَّاَنَّهُمْ ظَنُّوْا كَمَا ظَنَنْتُمْ اَنْ لَّنْ يَّبْعَثَ اللّٰهُ اَحَدًا ⑦

8 "మేము ఆకాశంలో బాగా వెదికాము. అది అప్రమత్తులైన పహారాదారులతో, అగ్నిజ్వాలలతో నిండి ఉండటం చూశాము."[11]

وَّاَنَّا لَمَسْنَا السَّمَآءَ فَوَجَدْنٰهَا مُلِئَتْ حَرَسًا شَدِيْدًا وَّشُهُبًا ⑧

9 "లోగడ మనం విషయాలు వినటానికి ఆకాశంలో పలుచోట్ల (మాటేసి) కూర్చునే వాళ్ళం.[12] ఇప్పుడు ఎవరయినా చెవి యొగ్గి వినదలిస్తే, తన కోసం కాచుకుని ఉన్న అగ్నిజ్వాలను అతను పొందుతున్నాడు."[13]

وَّاَنَّا كُنَّا نَقْعُدُ مِنْهَا مَقَاعِدَ لِلسَّمْعِ ؕ فَمَنْ يَّسْتَمِعِ الْاٰنَ يَجِدْ لَهٗ شِهَابًا رَّصَدًا ⑨

భార్యను, సంతానాన్ని ఆపాదించటం మహాపాతకం. – ఈ విధంగా జిన్నులు ముష్రిక్కుల (బహుదైవారాధకుల) మూఢనమ్మకాన్ని ఎండగట్టారు.

7. **'మనలోని మూర్ఖుడు'** అంటే వాడు షైతాన్ అని కొందరు భావిస్తున్నారు. జిన్నాతుల సహచరులు అని మరికొందరు అభిప్రాయపడ్డారు. అల్లాహ్‌కు సంతానం కలదని ఆ మూర్ఖులు తలపోసేవారు. **'షతత'** అంటే అన్యాయం, అబద్ధం, ఘోరం, మిథ్య, తిరస్కార వైఖరికి పరాకాష్ఠ అని అర్థం. అంటే మధ్యే మార్గానికి అతిదూరం, హద్దుమీరి పోవటం అని భావం. అల్లాహ్‌కు సంతానం కలదన్న మాట సమత్వం, సమతూకం నుండి తొలగిపోయినమాట. ఇలాంటి మాటల్ని మూర్ఖులు మాత్రమే పలుకుతారు. పైగా ఇది బరితెగించిన పోకడ! అబద్ధాలరాయుళ్లు మాత్రమే ఇలాంటి కల్లబొల్లి మాటల్ని నిజదైవానికి ఆపాదిస్తారు.

8. అందుకే అల్లాహ్ గురించి వారు ఏం చెప్పినా నిజమని నమ్మేవాళ్ళం. కాని ఖుర్ఆన్ వాణిని విన్న తరువాత నిజానిజాలు మాకు తెలిశాయి.

9. ముఖ్యంగా అజ్ఞానకాలంలో వారు సుదీర్ఘ ప్రయాణాలు చేస్తున్నప్పుడు – మార్గ మధ్యంలో ఏ లోయలోనైనా విడిది చేసినప్పుడు ఆ ప్రదేశంలోని పెద్దల శరణు కోరినట్లే జిన్నాతుల రక్షణ కోరేవారు. ఇస్లాం ఈ సంప్రదాయాన్ని నిర్మూలించి, ఒక్కడైన అల్లాహ్ శరణు మాత్రమే కోరాలని తాకీదు చేసింది.

10. మానవుల్లో కొందరు తమ శరణు వేడటం చూసి జిన్నాతులు మరింతగా రెచ్చిపోయారు. తామేం చేసినా సమ్మతమే నన్న మొండి ధైర్యం జిన్నులలో కలగసాగింది.

وَّاَنَّا لَا نَدْرِيْٓ اَشَرٌّ اُرِيْدَ بِمَنْ فِي الْاَرْضِ اَمْ اَرَادَ بِهِمْ رَبُّهُمْ رَشَدًا ⑩

10 "ఇంకా – భూమిలో ఉన్న వారికోసం ఏదైనా కీడు తలపెట్ట బడినదో లేక వారి ప్రభువు వారికి సన్మార్గ భాగ్యం ప్రసాదించ గోరుతున్నాడో మాకు తెలియదు."[14]

وَّاَنَّا مِنَّا الصّٰلِحُوْنَ وَمِنَّا دُوْنَ ذٰلِكَ ؕ كُنَّا طَرَآئِقَ قِدَدًا ⑪

11 "ఇంకా ఏమిటంటే – మనలో కొందరు సజ్జనులుంటే మరి కొందరు తద్భిన్నంగా ఉన్నారు. మన దారులు వేర్వేరుగా ఉన్నాయి."[15]

وَّاَنَّا ظَنَنَّآ اَنْ لَّنْ نُّعْجِزَ اللّٰهَ فِي الْاَرْضِ وَلَنْ نُّعْجِزَهٗ هَرَبًا ⑫

12 "మనం భూమిలో అల్లాహ్‌ను అశక్తుణ్ణి చేయటంగానీ, పారి పోయి (ఊర్ధ్వలోకాల్లో) ఆయన్ని ఓడించటంగానీ మనవల్ల కాని పని అని మాకర్థమైపోయింది."[16]

وَّاَنَّا لَمَّا سَمِعْنَا الْهُدٰٓى اٰمَنَّا بِهٖ ؕ فَمَنْ يُّؤْمِنْۢ بِرَبِّهٖ فَلَا يَخَافُ بَخْسًا وَّلَا رَهَقًا ⑬

13 "మేము మాత్రం సన్మార్గ బోధను వినగానే దానిని విశ్వ సించాం. ఇక ఎవడు తన ప్రభువును విశ్వసించినా అతనికి ఎలాంటి నష్టంగానీ, అన్యాయంగానీ జరుగుతుందన్న భయం ఉండదు."[17]

11. అంటే – నిత్యం దైవదూతలు ఆకాశంలో పహరా కాస్తున్నారు. ఆకాశంలోని విషయాలు షైతానుల శక్తుల చెవిన పడకుండా వారు చూస్తూ ఉంటారు. ఒకవేళ ఏ షైతాను అయినా చాటుమాటుగా ఏదైనా వినదలిస్తే నక్షత్రాలు జ్వాలలై వారిపై విరుచుకుపడతాయి. **'హరసున్'** (حَرَسٌ) అంటే పహరా కాసేవారు.

12. గతంలో మనం చాటుమాటుగా ఆకాశ విశేషాలు కొన్నింటిని విని జ్యోతిష్యులకు, మంత్రగాళ్లకు చేరవేసేవాళ్ళం. వాళ్ళేమో తమ తరఫున మరికొన్ని అబద్ధాలను కల్పించి తమ పబ్బం గడుపుకునేవాళ్లు.

13. కాని ముహమ్మద్ (సఅసం) ప్రభవనం తరువాత మన ఆటలు సాగటం లేదు. ఇప్పుడు మనలో ఎవరు ఆకాశంలోకి తొంగిచూసినా ఒక అగ్ని జ్వాల అతన్ని వెంటాడుతుంది.

14. అంటే – ఆకాశంలో కట్టుదిట్టమైన ఈ భద్రతా ఏర్పాట్ల ద్వారా దేవుడు భూలోకంలో ఏదైనా పథకానికి కార్యరూపం ఇవ్వదలిచాడో లేక భూలోక వాసులను శిక్షించదలిచాడో లేక ప్రవక్త ద్వారా ఏదైనా మహోపకారం మానవాళికి చేయదలిచాడో మాకు తెలీదు.

15. అంటే – మన అభిమతాలు, సిద్ధాంతాలు విభిన్నంగా ఉన్నాయి. మనం వివిధ సమూహాలుగా వేర్పడి, వివిధ జీవన దృక్పథాలను అవలంబిస్తున్నాము – దీని భావం ఏమిటంటే జిన్నులలో కూడా ముస్లింలు, యూదులు, క్రైస్తవులు, జొరాష్ట్రియన్లు, ముష్రిక్కులు, నాస్తికులు తదితరులు ఉంటారు. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం జిన్నుల్లోని ముస్లింలలో కూడా అనేక వర్గాలుంటాయి (ఫత్‌హుల్ ఖదీర్). **'ఖిదదన్'** (قِدَدًا) అంటే ముక్క అని అర్థం. ప్రజల వ్యవహారాలు పరస్పరం భిన్నంగా మారిపోయినప్పుడు అరబీలో "సారల్ ఖౌము ఖిదదన్" అని అనటం కద్దు.

16. ఇక్కడ **'జన్న్'** (ظَنَّ) అనే అరబీ పదం జ్ఞానం, నమ్మకం అన్న భావంలో ప్రయోగించబడింది.

17. అంటే – అతను చేసిన సత్కార్యాల ప్రతిఫలం తగ్గించబడుతున్న భయం అతనికి ఉండనవసరం లేదు. అలాగే అతనివల్ల జరిగిన దుష్కార్యాలు ఎక్కువచేసి చూపబడతాయన్న ఆందోళన కూడా అతనికి అక్కర లేదు.

**14** “ఇంకా –మనలో కొందరు ముస్లింలై (దైవవిధేయులై) ఉంటే, మరికొందరు సన్మార్గంనుండి తొలగిఉన్నారు.[18] కనుక విధేయతా వైఖరిని అవలంబించిన వారు సన్మార్గాన్ని అన్వేషించుకున్నారు.”

وَأَنَّا مِنَّا الْمُسْلِمُونَ وَمِنَّا الْقَاسِطُونَ ۖ فَمَنْ
أَسْلَمَ فَأُولَٰئِكَ تَحَرَّوْا رَشَدًا ﴿14﴾

**15** “సన్మార్గం నుండి తొలగిపోయి, అపవాదానికి లోనైనవారు– నరకానికి ఇంధనం అవుతారు.”[19]

وَأَمَّا الْقَاسِطُونَ فَكَانُوا لِجَهَنَّمَ حَطَبًا ﴿15﴾

**16** ఇంకా (ఓ ప్రవక్తా! వారికి చెప్పు): వీరు గనక సన్మార్గంపై నిలకడగా ఉంటే మేము వారికి పుష్కలంగా నీళ్లు త్రాగించి ఉండే వారం.

وَأَن لَّوِ اسْتَقَامُوا عَلَى الطَّرِيقَةِ لَأَسْقَيْنَاهُم مَّاءً
غَدَقًا ﴿16﴾

**17** తద్వారా వారిని ఈ విషయంలో పరీక్షించటానికి![20] మరెవడు తన ప్రభువు ధ్యానం నుండి ముఖం త్రిప్పుకుంటాడో అతన్ని అల్లాహ్ కఠినమైన శిక్షకు లోను చేస్తాడు.[21]

لِّنَفْتِنَهُمْ فِيهِ ۚ وَمَن يُعْرِضْ عَن ذِكْرِ رَبِّهِ
يَسْلُكْهُ عَذَابًا صَعَدًا ﴿17﴾

**18** ఇంకా–మస్జిదులు కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కాబట్టి (వాటిలో) అల్లాహ్‌తోపాటు ఇతరులెవరినీ పిలవకండి.[22]

وَأَنَّ الْمَسَاجِدَ لِلَّهِ فَلَا تَدْعُوا مَعَ اللَّهِ أَحَدًا ﴿18﴾

18. అంటే – ముహమ్మద్ (స)ను అంతిమ దైవప్రవక్తగా నమ్మినవారు సిసలైన దైవవిధేయులు. ఆయన (స) దైవదౌత్యాన్ని తిరస్కరించినవారు అవిధేయులు, అన్యాయపరులు, సత్యమార్గం నుండి తొలగిపోయినవారుగా పరిగణించబడతారు.

19. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే మనుషుల మాదిరిగానే జిన్నాతులు కూడా స్వర్గంలో, నరకంలో ప్రవేశిస్తారు. వారిలోని అవిశ్వాసులు, దుర్మార్గులు నరకానికి ఆహుతి అవగా ముస్లింలు, మంచివారు స్వర్గానికి పోతారు. ఈ వాక్యంతో జిన్నాతుల సంభాషణ ముగిసింది. తరువాతి ఆయతు నుండి దైవవాక్కు మొదలవుతుంది.

20. ఇక్కడ **‘తరీఖ’** అంటే సన్మార్గం, ఇస్లాం అని అర్థం. **‘గదఖన్’** (غَدَقًا) అంటే చాలా అని భావం. అంటే ప్రపంచంలో వారికి సిరిసంపదల్ని, ఆర్థిక వనరుల్ని ప్రసాదించి పరీక్షిస్తాము. ఈ విషయమే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: “నగరాల ప్రజలు విశ్వసించి, భయభక్తుల వైఖరిని అవలంబించి ఉంటే మేము వారి కొరకు ఆకాశంలోని, భూమిలోని శుభాల ద్వారాలను తెరచి ఉండేవారం” (అల్ ఆరాఫ్ – 96). ఈ మాటే గ్రంథవహుల్ని కూడా ఉద్దేశించి చెప్పబడింది: “... వారు గనక అలా చేసి ఉంటే వారి కొరకు ఆహారం పైనుండి వర్షించేది. క్రింది నుండి పొంగి వుండేది.” (అల్ మాయిద–66). మక్కాలోని అవిశ్వాసులపై కరువు కాటకాలు వచ్చినప్పుడు ఈ ఆయతు అవతరించిందని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

‘తరీఖ’ అనే పదాన్ని ‘అపమార్గం’ అన్న భావంలో కూడా అనువదించటం జరిగింది. ఈ భావంలో గనక తీసుకుంటే దేవుడు మానవులకు సిరిసంపదలను ప్రసాదించి వారికి విడుపును, అవకాశాన్ని ఇస్తూ పోతున్నాడనీ, ఈ సిరిసంపదలు దైవప్రసన్నతకు ప్రతీకలు కావనీ, పైగా ఇవి దైవపరీక్షకు ఆనవాళ్లని అర్థం చేసుకోవాలి. మరిన్ని వివరాలకై చూడండి: అల్ అన్ఆమ్ సూరా (44), అల్ మూమినూన్ (55, 56). ఆయతులోని “పరీక్షించటానికి” అన్న పదం దృష్ట్యా ఇమామ్ ఇబ్నె కసీర్ ఈ రెండవ అర్థానికే ప్రాధాన్యతనిస్తుండగా, ఇమామ్ షౌకానీ మాత్రం మొదటి అభిప్రాయం వైపుకే మొగ్గుచూపారు.

**19** అల్లాహ్‌దాసుడు (ముహమ్మద్) అల్లాహ్‌నుమాత్రమే ఆరాధించ టానికి నిలబడినప్పుడు ఈ మూక అమాంతం అతనిపై విరుచుకు పడినట్లే ఉంటుంది."[23]

وَّاَنَّهٗ لَمَّا قَامَ عَبۡدُ اللّٰهِ يَدۡعُوۡهُ كَادُوۡا يَكُوۡنُوۡنَ عَلَيۡهِ لِبَدًا ؕ ﴿19﴾

**20** (ఓ ప్రవక్తా!) "నేనైతే కేవలం నా ప్రభువునే మొరపెట్టుకుం టాను, ఆయనకు సహవర్తులుగా ఎవరినీ చేర్చను"[24] అని చెప్పు.

قُلۡ اِنَّمَاۤ اَدۡعُوۡا رَبِّىۡ وَلَاۤ اُشۡرِكُ بِهٖۤ اَحَدًا ﴿20﴾

**21** "మీకు కీడు (నష్టం) గానీ, మేలు (లాభం) గానీ చేకూర్చే అధికారం నాకు లేదు"[25] అని (ఓ ప్రవక్తా!) చెప్పు.

قُلۡ اِنِّىۡ لَاۤ اَمۡلِكُ لَـكُمۡ ضَرًّا وَّلَا رَشَدًا ﴿21﴾

**22** "అల్లాహ్ పట్టునుండి నన్నెవరూ రక్షించలేరు.[26] నేను ఆయన ఆశ్రయం తప్ప వేరొకరి ఆశ్రయాన్ని పొందలేను" అని (ఓ ప్రవక్తా! వారికి) చెప్పు.

قُلۡ اِنِّىۡ لَنۡ يُّجِيۡرَنِىۡ مِنَ اللّٰهِ اَحَدٌ ۙ وَّلَنۡ اَجِدَ مِنۡ دُوۡنِهٖ مُلۡتَحَدًا ﴿22﴾

---

21. **'సఅదా'** (صَعَدًا) అంటే కఠినాతి కఠినమైన, భరించశక్యంకాని శిక్ష అని అర్థం. (ఇబ్నె కసీర్).

22. **'మస్జిద్'** అంటే సాష్టాంగ ప్రణామ స్థలం అని అర్థం. సాష్టాంగ ప్రణామం (సజ్దా) కూడా నమాజులో ఒక మూలాంశమే. అందువల్ల నమాజు చేసే స్థలాన్ని 'మస్జిద్'గా వ్యవహరిస్తారు. ఈ ఆయతులో చెప్పబడిన దాని సారాంశం ఏమిటంటే మస్జిదులు అల్లాహ్ ఆరాధన కొరకు ఉద్దేశించినవి. అందువల్ల మస్జిదులలో అల్లాహ్‌ను గాకుండా ఇతరులను మొరపెట్టుకోవటం, ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేర్చటం, అవసరాలు తీరటానికి ఇతరులను అర్థించటం, ఇతరులను మొక్కుకోవటం ధర్మ సమ్మతం కానేరదు. ఆ మాటకొస్తే ఈ విషయాలు సర్వత్రా నిషిద్ధమైనవే. వీటిని గనక మస్జిదులో చేస్తే అది మరింత తీవ్రంగా పరిగణించబడుతుంది. మస్జిదుల్లో షిర్కు చేయరాదని ప్రత్యేకంగా చెప్పటంలోని ఉద్దేశం ఏమిటంటే, మస్జిదులు కేవలం అల్లాహ్ ఆరాధన నిమిత్తం నిర్మించబడతాయి. అటువంటి పవిత్ర స్థలాలలో కూడా దైవేతరులను వేడుకోవటం మొదలెడితే ఇక అంతకన్నా అమానుషమైన, దారుణమైన చేష్ట ఇంకొకటి ఉండబోదు. కాని దురదృష్టవశాత్తు కొంతమంది అవివేకులు ఇప్పుడు మస్జిదులలో సయితం అల్లాహ్‌తో పాటు ఇతరులను సహాయం కొరకు అర్థిస్తూ ఉన్నారు. అల్లాహ్‌ను వదలి ఇతరులను అర్థించే నినాదాలను, శిలా ఫలకాలను వారు మస్జిదు గోడలలో అమర్చుతున్నారు. ఇంతకన్నా దారుణమైన విషయం ఇంకేముంటుందీ?

23. ఇక్కడ **'అబ్దుల్లాహ్'** (అల్లాహ్ దాసుడు) అంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అన్నమాట! దీని భావం ఏమిటంటే మనుషులు జిన్నులు – అందరూ కలసి దేవుని ఈ జ్ఞాన జ్యోతిని ఆర్పివేయాలనుకుంటున్నారు. ఈ ఆయతుకు వ్యాఖ్యాతలు పలు భావార్థాలు చెప్పారు. కాని ఇమామ్ ఇబ్నె కసీర్ మాత్రం ఈ అభిప్రాయం వైపే మొగ్గారు.

24. అంటే – ఓ ముహమ్మద్ (స)! అందరూ నీకు బద్ధశత్రువులుగా మారి నీ మీద ముఠా కట్టినప్పుడు నువ్వు వారికి చెప్పెయ్యి – నేను మాత్రం ఒక్కడైన ప్రభువునే ఆరాధిస్తానని! ఆయన్నే శరణు వేడుతానని!! ఆయన్నే నమ్ముకుంటానని!!!

25. మిమ్మల్ని సన్మార్గానికి తెచ్చే లేక మిమ్మల్ని మార్గవిహీనుల్ని చేసే అధికారంగానీ, మీకు లాభనష్టాలు చేకూర్చే శక్తిగానీ నాకు లేదు. నేను విశ్వప్రభువుచే నియమించబడిన దాసుడను, సందేశహరుడను మాత్రమే. దైవసందేశాన్ని ఉన్నదున్నట్టు దైవదాసులకు చేరవేయటమే నా కర్తవ్యం.

26. ఒకవేళ నేను గనక ఆ పరమ ప్రభువును ఎదిరిస్తే, దానికిగాను ఆయన నన్ను శిక్షించదలిస్తే నన్నెవరూ ఆదుకోలేరు.

**23** "అయితే నా బాధ్యతల్లా అల్లాహ్ వాణిని, ఆయన సందేశాలను (ప్రజలకు) అందజేయటమే.[27] ఇక ఇప్పుడు ఎవరయినా అల్లాహ్ మాటను, అతని ప్రవక్త మాటను వినకపోతే వారికొరకు నరకాగ్ని ఉంది. అందులో వారు కలకాలం ఉంటారు."

إِلَّا بَلَٰغًا مِّنَ ٱللَّهِ وَرِسَٰلَٰتِهِۦ ۚ وَمَن يَعْصِ ٱللَّهَ
وَرَسُولَهُۥ فَإِنَّ لَهُۥ نَارَ جَهَنَّمَ خَٰلِدِينَ فِيهَآ
أَبَدًا ﴿٢٣﴾

**24** ఎట్టకేలకు – వారికి వాగ్దానం చేయబడుతున్నది వారు చూసుకున్నప్పుడు,[28] ఎవరి సహాయకులు బలహీనులో, ఎవరి సమూహం అతి తక్కువగా ఉందో[29] వారే తెలుసుకుంటారు.

حَتَّىٰٓ إِذَا رَأَوْا۟ مَا يُوعَدُونَ فَسَيَعْلَمُونَ مَنْ
أَضْعَفُ نَاصِرًا وَأَقَلُّ عَدَدًا ﴿٢٤﴾

**25** (ఓ ప్రవక్తా! వారికి) చెప్పు : "మీతో వాగ్దానం చేయబడుతున్న విషయం (శిక్ష) సమీపంలోనే ఉందో లేక నా ప్రభువు దానికోసం దూరపు గడువును నిర్ణయిస్తాడో నాకు తెలీదు."[30]

قُلْ إِنْ أَدْرِىٓ أَقَرِيبٌ مَّا تُوعَدُونَ
أَمْ يَجْعَلُ لَهُۥ رَبِّىٓ أَمَدًا ﴿٢٥﴾

**26** "ఆయన అగోచర జ్ఞానం కలవాడు. తన అగోచర విషయాలను ఆయన ఎవరికీ తెలుపడు.....

عَٰلِمُ ٱلْغَيْبِ فَلَا يُظْهِرُ عَلَىٰ غَيْبِهِۦٓ أَحَدًا ﴿٢٦﴾

**27** "........ తాను ఇష్టపడిన ప్రవక్తకు తప్ప![31] అయితే ఆ ప్రవక్తకు ముందూ, వెనుకా కూడా తన పహారాదారులను నియమిస్తాడు.[32]

إِلَّا مَنِ ٱرْتَضَىٰ مِن رَّسُولٍ فَإِنَّهُۥ يَسْلُكُ مِنۢ
بَيْنِ يَدَيْهِ وَمِنْ خَلْفِهِۦ رَصَدًا ﴿٢٧﴾

27. అల్లాహ్ పట్టు నుండి నన్ను కాపాడేది ఏదయినా ఉందంటే అది నా విధ్యుక్త ధర్మమైన సందేశ ప్రచారమే. ఈ బాధ్యతా నిర్వహణను దేవుడు నాపై తప్పనిసరిగా చేశాడు.

28. అంటే – వీరు దైవప్రవక్త (సఅసం) మరియు విశ్వాసుల పట్ల కడదాకా విరోధులుగా ఉండి, కడకు ప్రపంచంలోనో లేదా పరలోకంలోనో దేవుడు వాగ్దానం చేసిన శిక్షను చవిచూసినప్పుడు వాస్తవమేమిటో తెలిసివస్తుంది.

29. అంటే – విశ్వాసులకు అండగా నిలిచినవాడు శక్తిహీనుడో లేక ముష్రిక్కుల సహాయకుడు శక్తిహీనుడో ఆ సమయంలో తెలిసిపోతుంది. ఏక దైవారాధకుల సంఖ్య అల్పమైనదో లేక దైవేతర పూజారుల సంఖ్య అల్పమైనదో కూడా వారికి విదితమైపోతుంది. దీని భావమేమిటంటే ముష్రిక్కులకు ఆనాడు అండగా నిలిచేవాడెవడూ అసలుండడు. కాగా; అసంఖ్యాకమైన అల్లాహ్ సేనల ముందు ఈ ముష్రిక్కుల సంఖ్య అత్యల్పంగా కనిపిస్తుంది.

30. ఇంతకీ వాగ్దానం చేయబడిన ఆ విషయం ఏమిటి? అది శిక్షా? లేక ప్రళయదినమా? ఏమైనప్పటికీ అది అతీంద్రియజ్ఞానానికి సంబంధించినది. కాబట్టి అది దగ్గరలో ఉందో, దూరాన ఉందో దేవునికే తెలుసు.

31. అగోచర విషయాలలో తాను తలచిన కొన్నింటిని దేవుడు తన ప్రవక్తకు తెలియపరుస్తాడు. ఆ విషయాలు దైవదౌత్యంతో ముడిపడి ఉంటాయి లేక దైవదౌత్య ధృవీకరణకు నిదర్శనంగా ఉంటాయి. కొన్ని విషయాలను దేవుడు తన ప్రవక్తకు తెలిపినంత మాత్రాన ప్రవక్త అగోచరాల జ్ఞాని అయిపోడు. ఎందుకంటే దైవప్రవక్తకు కూడా అగోచర విషయాల జ్ఞానం ఉంటే మరి దేవుని తరఫున అగోచర విషయాలు తెలుపబడటంలో అర్థమే ఉండదు. అందుచేత అగోచర విషయాల జ్ఞాని ఒక్క అల్లాహ్ మాత్రమే.

32. ఎందుకంటే దైవవాణి అవతరణ సమయంలో దైవప్రవక్తకు ముందూ వెనుకా దైవదూతలు కాపలాదారులుగా ఉంటారు. ఆ రహస్య విషయాలు షైతానుల, జిన్నాతుల చెవిన పడకుండా వారు జాగ్రత్త వహిస్తారు.

**28** వారు తమ ప్రభువు సందేశాన్ని అందజేశారని తెలియటానికి (ఈ ఏర్పాటు జరిగింది).[33] ఆయన వారి పరిసరాలన్నింటినీ పరివేష్ఠించి,[34] ఒక్కో వస్తువును లెక్కపెట్టి ఉంచాడు.[35]

لِّيَعْلَمَ أَنْ قَدْ أَبْلَغُوا رِسٰلٰتِ رَبِّهِمْ وَأَحَاطَ
بِمَا لَدَيْهِمْ وَأَحْصٰى كُلَّ شَيْءٍ عَدَدًا ﴿28﴾

33. ఇంత గట్టి బందోబస్తు చేయటంలోని ఉద్దేశం ఏమిటంటే దైవదూతలు దైవసందేశాన్ని దైవప్రవక్తకు అందించారా? లేదా? దైవప్రవక్త దైవదాసులకు ఖచ్చితంగా – హెచ్చుతగ్గులు లేకుండా – అందజేశారా లేదా? చూడాలి. దైవానికి ప్రతి విషయం ముందు నుంచే తెలుసు. అయినప్పటికీ ఇలాంటి సందర్భాలలో దేవుడు తన ప్రవక్తలను, దాసులను పరికించి చూస్తాడు. ఉదాహరణకు : అల్ బఖరా సూరాలోని 143వ వచనంలో "తమ ప్రవక్తను అనుసరించే వారెవరో, వెనుతిరిగిపోయేవారెవరో పరీక్షించడానికే మేము మీ ఖిబ్లాను మార్చాము" అన్నాడు.

34. **'వారి పరిసరాలను'** అంటే దైవదూతల పరిసరాలూ కావచ్చు లేదా దైవప్రవక్త పరిసరాలూ కావచ్చు.

35. ఎందుకంటే ఆయన మాత్రమే అగోచరాల జ్ఞాని. జరిగిపోయింది, జరగబోయేదీ – అన్నింటినీ ఆయన లెక్కపెట్టి ఉంచాడు. ప్రతిదీ ఆయన జ్ఞానపరిధిలో ఉంది.

73వ సూరా

# అల్ ముజ్జమ్మిల్

## దుప్పటి కప్పుకున్నవాడు

అవతరణ
మక్కాలో

ఆయతులు
20

### పరిచయం

ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గడిపిన ఆధ్యాత్మిక జీవితం గురించి ఈ సూరా ముఖ్యంగా వివరించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదబంధం మొదటి ఆయతులో వచ్చింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను 'దుప్పటికప్పుకున్న వాడు' అని పిలువడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వ్యక్తిగత ఆధ్యాత్మిక జీవితం గురించి, ఆయన సహచరుల ఆధ్యాత్మిక జీవితం గురించి వారి దైవభీతి గురించి ఈ సూరా ప్రస్తావించింది. వారు రాత్రిలో మూడింట రెండువంతులు, లేదా రాత్రిలో సగభాగం లేదా మూడింటా ఒక భాగం నమాజులో, దైవస్మరణలో, దివ్యఖుర్ఆన్ పారాయణంలో గడిపేవారు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి సహనంతో స్థిరంగా నిలబడాలని, జనం కల్పించే మాటలను పట్టించుకోరాదని, వారిని వారి మానాన వదిలెయ్యాలని బోధించడం జరిగింది.

విశ్వాసులు దివ్యఖుర్ఆన్‌ను వారు చదువగలిగినంత వరకు చదువుతూ ఉండాలని, నమాజు చేస్తూ ఉండాలని, దానధర్మాలు చేస్తూ ఉండాలని బోధించడం జరిగింది. ప్రవక్త (సఅసం) సాక్షిగా వ్యవహరిస్తారని, దివ్యఖుర్ఆన్ ఒక హితబోధ అని ఇందులో అభివర్ణించడం జరిగింది. తీర్పుదినాన భూమి, పర్వతాలు కుదిపి వేయబడతాయని, పర్వతాలు ఇసుక గుట్టల మాదిరిగా తునాతునకలైపోతాయని హెచ్చరించడం జరిగింది.

## سُوْرَةُ الْمُزَّمِّلِ

## అల్ ముజ్జమ్మిల్ సూరా

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

يٰٓاَيُّهَا الْمُزَّمِّلُ ﴿1﴾

1 ఓ వస్త్రమును కప్పుకున్నవాడా?[1]

قُمِ الَّيْلَ اِلَّا قَلِيْلًا ﴿2﴾

2 కొద్దిసేపు మినహా రాత్రంతా (నమాజులో) నిలబడు.

نِّصْفَهٗٓ اَوِ انْقُصْ مِنْهُ قَلِيْلًا ﴿3﴾

3 సగం రాత్రి లేదా దానికంటే కొంచెం తక్కువ చేసుకో.

اَوْ زِدْ عَلَيْهِ وَرَتِّلِ الْقُرْاٰنَ تَرْتِيْلًا ﴿4﴾

4 లేదా దానిని మరికొద్దిగా పెంచుకో.[2] ఖుర్ఆన్‌ను మాత్రం బాగా – ఆగి ఆగి నింపాదిగా (స్పష్టంగా) పఠించు.[3]

اِنَّا سَنُلْقِيْ عَلَيْكَ قَوْلًا ثَقِيْلًا ﴿5﴾

5 నిశ్చయంగా మేము నీపై ఒక బరువైన వాక్కును వేయ నున్నాము.[4]

اِنَّ نَاشِئَةَ الَّيْلِ هِيَ اَشَدُّ وَطْاً وَّاَقْوَمُ قِيْلًا ﴿6﴾

6 నిశ్చయంగా రాత్రివేళ లేవటం మనో స్థిమితానికి ఎంతో ఉపయుక్తమైనది.[5] మాట సూటిగా వెలువడటానికి అది ఎంతో అనువైనది.[6]

1. ఈ ఆయతులు అవతరించినపుడు దైవప్రవక్త (సఅసం) దుప్పటికప్పుకుని పడుకుని ఉన్నారు. దేవుడు ఆయన (స) పరిస్థితిని వివరిస్తూ కర్తవ్య బోధ చేశాడు – 'ఇక నువ్వు పడకమీది నుంచి లేచి నిలబడు. రాత్రివేళ కొంత సమయం దైవారాధనలో గడుపు. అంటే తహజ్జుద్ నమాజ్ చేస్తూ ఉండు.' ఈ ఆదేశం దృష్ట్యా తహజ్జుద్ నమాజు మహాప్రవక్త (సఅసం)కు తప్పనిసరి (వాజిబ్)గా చేయబడిందని కొందరు భావిస్తున్నారు (ఇబ్నె కసీర్).

2. అంటే సగం రాత్రికన్నా కొంచెం ఎక్కువ లేక మూడింట రెండొంతుల రాత్రి మేల్కొన్నా తప్పులేదు.

3. అందువల్ల ఆయన (సఅసం) దివ్యఖుర్ఆన్‌ను బాగా ఆగి ఆగి పఠించేవారని హదీసుల ద్వారా తెలుస్తోంది. ఖుర్ఆన్‌ను చాలా నింపాదిగా, స్పష్టంగా పఠించవలసిందిగా ఆయన (స) తన సహచరులకు కూడా తాకీదు చేస్తుండేవారు.

4. రాత్రివేళ జాగారం అంటే మామూలు విషయం కాదు. ఒక రకంగా ఇది మనో వాంఛలను నియంత్రించటమే. దేవుడు తన ప్రవక్తపై వేయనున్న కీలకమైన బాధ్యతల దృష్ట్యా, ఆయన (స)కు రాత్రిపూట ఆరాధన ద్వారా తగు మనోస్థయిర్యాన్ని, స్థిమితాన్ని ప్రసాదించగోరాడు. ఆ విషయమే ఇక్కడ చెప్పాడు కూడా. మేము నీపై ఒక బరువైన వాక్కును అవతరింపజేయబోతున్నాం. అదే ఖుర్ఆన్. అందలి ఆదేశాలను శిరసావహిస్తూ, అందరి విధ్యుక్త ధర్మాలను పాటిస్తూ, అది విధించిన కట్టుబాట్లకు కట్టుబడి ఉండాలి సుమా! అంతేకాదు, ఆ వాక్కును ప్రజలకు అందజేయాలి. దాని ఆధారంగా మానవ సమాజాన్ని సంస్కరించాలి. ఇది మామూలు విషయం కాదు. దానికోసం నిన్ను నీవు శారీరకంగా, మానసికంగా తయారు చేసుకోవాలి.

మరి కొంతమంది విద్వాంసులు **'బరువైన వాక్కు'** అనే దానిని మరో అర్థంలో తీసుకున్నారు. దైవవాణి అవతరించిన సమయంలో దైవప్రవక్త తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యేవారనీ, తీవ్రమైన చలికాలంలో సయితం దైవవాణి (వహీ) అవతరించినపుడు ప్రవక్త శరీరమంతా చెమటలు పట్టేవన్న విషయాన్ని వారు ఉదాహరించారు (ఇబ్నె కసీర్).

إِنَّ لَكَ فِي النَّهَارِ سَبْحًا طَوِيلًا ⑦

7 నిశ్చయంగా పగటిపూట నీకు సుదీర్ఘమైన వ్యాపకాలున్నాయి.[7]

وَاذْكُرِ اسْمَ رَبِّكَ وَتَبَتَّلْ إِلَيْهِ تَبْتِيلًا ⑧

8 అందుకే నీవు నీ ప్రభువు నామాన్ని స్మరిస్తూ ఉండు. అన్నింటినీ వదలి ఆయన వైపే మనసును లగ్నం చేయి.[8]

رَبُّ الْمَشْرِقِ وَالْمَغْرِبِ لَا إِلَٰهَ إِلَّا هُوَ فَاتَّخِذْهُ وَكِيلًا ⑨

9 ఆయన తూర్పు-పడమరలకు ప్రభువు. ఆయన తప్ప వేరొక ఆరాధ్య దైవం లేదు. కాబట్టి నీవు ఆయన్నే నీ కార్యసాధకునిగా చేసుకో.

وَاصْبِرْ عَلَىٰ مَا يَقُولُونَ وَاهْجُرْهُمْ هَجْرًا جَمِيلًا ⑩

10 వారు చెప్పే మాటలపై ఓర్పు వహించు. హుందాగా వారి నుండి నిష్క్రమించు.

وَذَرْنِي وَالْمُكَذِّبِينَ أُولِي النَّعْمَةِ وَمَهِّلْهُمْ قَلِيلًا ⑪

11 ధిక్కార వైఖరికి ఒడిగట్టిన ఈ శ్రీమంతుల సంగతిని నాకు వదలిపెట్టు. వారికి మరికొంత గడువును ఇవ్వు.

إِنَّ لَدَيْنَا أَنكَالًا وَجَحِيمًا ⑫

12 నిశ్చయంగా మా దగ్గర (వారి కొరకు) సంకెళ్లు ఉన్నాయి. (భగ భగ మండే) నరకాగ్ని ఉంది.

---

5. దీనికి మరో అర్థం ఏమిటంటే రాత్రిపూట లేవటం, దైవారాధనలో నిలబడటం సాధారణ విషయం కాదు. ఇది మనసుకు కఠినమైన అభ్యాసం. దీనివల్ల మనసు అదుపులోకి వస్తుంది. మనోవాంఛలకు కళ్లెం పడుతుంది. ఆ సమయంలో మాట సూటిగా వెలువడుతుంది. హృదయాంతరాళంలో నుంచి వెలువడే ప్రతి విన్నపం ప్రభువు వద్ద స్వీకృతి పొందుతుంది. ఆ సమయంలో మనిషి నోటినుంచి వచ్చే ప్రతి మాటతో హృదయం సమన్వయం చెందుతుంది. అందుకే తహజ్జుద్ నమాజులో మనిషి అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతాడు.

6. దీనికి మరో అర్థం ఏమిటంటే పగటివేళ కన్నా రాత్రివేళ ఖుర్ఆన్ పారాయణం చాలా స్పష్టంగా ఉంటుంది. మనో మస్తిష్కాలకు అది తృప్తినీ, హాయినీ కలిగిస్తుంది. ఎందుకంటే ఆ సమయంలో ఇతరత్రా వ్యాపకాలు, గలాటా ఉండవు. సర్వత్రా ప్రశాంతత ఆవరించి ఉంటుంది. ఆ సమయంలో మనిషి నమాజులో ఏ మేరకు ఖుర్ఆన్ పారాయణం చేసినా మధురంగా ఉంటుంది. అతని నోట వెలువడే ఒక్కో వాక్యం మనో భూమిలో నాటుకుపోతూ ఉంటుంది.

7. పగటి పూట లెక్కలేనన్ని పనులుంటాయి. దైనందిన సమస్యలు ఎన్నో ఎదురవుతుంటాయి. కాబట్టి రాత్రివేళ నమాజు, రాత్రివేళ ఖుర్ఆన్ పఠనం ఎక్కువ ప్రభావవంతమై ఉంటాయి. అందుకే రాత్రిపూట జాగరణపై నిలకడ కలిగి ఉండమని ఈ ఆయతులో ప్రవక్త (స)కు సూచించబడింది.

8. **'తబత్తుల్'** (విడిపోవటం) అంటే దైవారాధన నిమిత్తం ఇతరత్రా వ్యాపకాలన్నింటినీ కొంతసేపు విడనాడి, ఏకాగ్రచిత్తంతో ఆరాధనలో లీనమవటం అని అర్థం. ఇది సన్యాసత్వం, వైరాగ్యం (రుహ్బానియత్) కంటే భిన్నమైనది. సన్యాసత్వం భవబంధాలను, ప్రాపంచిక జంఝాటాలన్నింటినీ త్యజించమంటుంది. దీనిని ఇస్లాం హర్షించదు. 'తబత్తుల్' ప్రకారం మనిషి ప్రాపంచిక వ్యవహారాలను కాస్సేపు పక్కన పెట్టి ఏకాగ్రతతో దైవారాధన వైపు మరలుతాడు. ఆరాధనలో లీనమై తన్మయత్వాన్ని పొందుతాడు. అప్పుడు అతని ప్రార్థనల్లో, వేడుకోళ్ల విన్నపాలలో అణకువ, అశక్తత, దీనావస్థ, భయభక్తులు తొణికిసలాడుతూ ఉంటాయి.

**13** గొంతులో ఇరుక్కుపోయే ఆహారం, అత్యంత బాధాకరమైన శిక్షా ఉన్నాయి.[9]

وَّطَعَامًا ذَا غُصَّةٍ وَّعَذَابًا اَلِيْمًا ﴿13﴾

**14** ఏ రోజున భూమి, పర్వతాలు తీవ్రంగా కంపిస్తాయో, పర్వతాలు ఇసుక తిప్పలు మాదిరిగా అయిపోతాయో (ఆ రోజు ఈ శిక్ష పడుతుంది.)[10]

يَوْمَ تَرْجُفُ الْاَرْضُ وَالْجِبَالُ وَكَانَتِ الْجِبَالُ كَثِيْبًا مَّهِيْلًا ﴿14﴾

**15** మేము ఫిరౌను వద్దకు ప్రవక్తను పంపినట్లే మీ వద్దకు కూడా మీపై సాక్షిగా ఉండటానికి ఒక ప్రవక్తను పంపాము.[11]

اِنَّآ اَرْسَلْنَآ اِلَيْكُمْ رَسُوْلًا ۙ شَاهِدًا عَلَيْكُمْ كَمَآ اَرْسَلْنَآ اِلٰى فِرْعَوْنَ رَسُوْلًا ﴿15﴾

**16** మరి ఫిరౌను ఆ ప్రవక్త మాట వినలేదు. అందువల్ల మేమతన్ని చాలా కఠినంగా పట్టుకున్నాము.[12]

فَعَصٰى فِرْعَوْنُ الرَّسُوْلَ فَاَخَذْنٰهُ اَخْذًا وَّبِيْلًا ﴿16﴾

**17** ఒకవేళ మీరు కూడా తిరస్కరించినట్లయితే పసివాళ్లను సయితం పండు ముసలివాళ్లుగా మార్చివేసే ఆ రోజు నుండి మీరెలా తప్పించుకుంటారు?[13]

فَكَيْفَ تَتَّقُوْنَ اِنْ كَفَرْتُمْ يَوْمًا يَّجْعَلُ الْوِلْدَانَ شِيْبًا ﴿17﴾

9. **'అన్‌కాలున్'** అంటే బేడీలు అని అర్థం. కొందరు దీన్ని 'అగ్‌లాలున్' (మెడకు బిగించే పట్టాలు) అన్న అర్థంలో తీసుకున్నారు. **'జహీమా'** అంటే భగభగమండే అగ్ని. గొంతులో ఇరుక్కుపోయే ఆహారం (జా గుస్సతిన్) అంటే అది బహుశా జఖ్ఖూమ్ (జెముడు) వృక్షం అయి ఉండవచ్చు. లేదా **'జరీ'** (ضَرِيْع) వృక్షం అయి ఉండవచ్చు. 'జరీ' అనేది ముళ్లవృక్షం. అది ఎంతో కంపుకొడుతూ ఉంటుంది. మరీ చేదుగా ఉంటుంది. ఈ ఆహారం అటు వారి గొంతులోనికీ దిగదు. ఇటు వారి గొంతు దాటి బయటికీ రాదు.

10. సువిశాలమైన ఈ భూమి, ఎత్తయిన ఈ పర్వతాలు ప్రకంపించి, అతలాకుతలమై పోయినప్పుడు, స్థిరమైన పర్వతాలు ఇసుక తిప్పల్లా మారిపోయినప్పుడు అవిశ్వాసులకు ఈ కఠిన శిక్ష విధించబడుతుంది. **'కసీబ్'** (كَثِيْب) అంటే ఇసుక దిబ్బ. **'మహీలా'** (مَّهِيْلًا) అంటే కాళ్లక్రింది నుంచి జారిపోయే ఇసుక.

11. ఆ ప్రవక్త తీర్పుదినాన మీ కర్మలకు సాక్షిగా ఉంటాడు.

12. ఈ ఆయతులో మక్కాలోని అవిశ్వాసులకు ఒక హెచ్చరిక ఉంది – ఓ మక్కా వాసులారా! మీరు గనక ముహమ్మద్ (స) మాట వినకపోతే మూసా ప్రవక్తను ధిక్కరించిన ఫిరౌనుకు ఏ గతి పట్టిందో అదే మీకూ పడుతుంది, జాగ్రత్త!

13. **'షీబున్'** అంటే ముసలివాళ్ళు; అంటే ప్రళయదినపు తీవ్రతకు పసివాళ్లు సయితం వృద్ధులైపోతారు లేదా ఉపమానంగా ఇలా అనబడింది. హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ప్రళయదినాన దేవుడు హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) నుద్దేశించి, "నీ సంతతి నుండి నరకవాసులను వేరుపరచుకో" అనంటాడు. 'ఓ అల్లాహ్! ఎలా వేరుపరచుకోను?' అని ఆయనంటారు. "ప్రతి వెయ్యిమందిలో నుంచి 999 మందిని" అని ఆజ్ఞాపించబడుతుంది. ఆ సమయంలో గర్భవతులకు గర్భస్రావం జరిగిపోతుంది. పిల్లలు వృద్ధులైపోతారు. ఈ మాట వినగానే ప్రవక్త ప్రియసహచరులు తీవ్రంగా ఆందోళన చెందారు. వారి ముఖకవళికలు మారిపోయాయి. అప్పుడు అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు : "యాజూజ్ మాజూజ్ జాతివారిలో 999 మంది చొప్పున ఉంటారు. మీలో నుంచి ఒక్కరే... దైవకారుణ్యం పట్ల నాకు పూర్తి ఆశాభావం ఉంది. మొత్తం స్వర్గవాసులలో సగం వరకు మనమే ఉంటాం" (సహీహ్ బుఖారీ – అల్ హజ్ సూరా వ్యాఖ్యానం).

**18** (ఆ రోజు) ఆకాశం బ్రద్దలైపోతుంది.[14] అల్లాహ్ చేసిన ఈ వాగ్దానం జరిగి తీరుతుంది.[15]

السَّمَآءُ مُنۡفَطِرٌۢ بِهٖ ؕ كَانَ وَعۡدُهٗ مَفۡعُوۡلًا (18)

**19** నిశ్చయంగా ఇదొక ఉపదేశం. ఇక కోరినవారు తమ ప్రభువు వైపు వెళ్లే మార్గాన్ని అవలంబించవచ్చు.

اِنَّ هٰذِهٖ تَذۡكِرَةٌ ۚ فَمَنۡ شَآءَ اتَّخَذَ اِلٰى رَبِّهٖ سَبِيۡلًا (19)

**20** (ఓ ముహమ్మద్ – సఅసం!) నువ్వు ఒక్కోసారి మూడింట రెండువంతుల రాత్రి కంటే కొంచెం తక్కువ, ఒక్కోసారి సగం రాత్రి, ఒక్కోసారి మూడింట ఒక వంతు రాత్రి ఆరాధనలో నిలబడుతున్నావనీ, నీ సహచరుల్లోని ఒక వర్గం కూడా ఇలాగే చేస్తుందన్న సంగతి నీ ప్రభువుకు బాగా తెలుసు.[16] రేయింబవళ్ల లెక్కను ఖచ్చితంగా మదించగలవాడు అల్లాహ్ మాత్రమే.[17] ఎట్టి పరిస్థితిలోనూ మీరు దీనిని నిర్వర్తించలేరని ఆయనకు తెలుసు.[18] అందుకే ఆయన మీపై దయదలిచాడు.[19] కాబట్టి మీరు

اِنَّ رَبَّكَ يَعۡلَمُ اَنَّكَ تَقُوۡمُ اَدۡنٰى مِنۡ ثُلُثَىِ الَّيۡلِ وَنِصۡفَهٗ وَثُلُثَهٗ وَطَآٮِٕفَةٌ مِّنَ الَّذِيۡنَ مَعَكَ ؕ وَاللّٰهُ يُقَدِّرُ الَّيۡلَ وَالنَّهَارَ ؕ عَلِمَ اَنۡ لَّنۡ تُحۡصُوۡهُ فَتَابَ عَلَيۡكُمۡ فَاقۡرَءُوۡا مَا تَيَسَّرَ

14. ఇది ఆ 'రోజు' తీవ్రతకు మరొక తార్కాణం. దాని భయంకర స్థితికి ఆకాశం సైతం బ్రద్దలవుతుంది.

15. అంటే – మరణానంతర జీవితానికి, లెక్కలకు, స్వర్గ నరకాలకు సంబంధించి అల్లాహ్ చేసిన వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది.

16. ఈ సూరా ప్రారంభంలో వచ్చిన ఆజ్ఞను పురస్కరించుకుని దైవప్రవక్త (సఅసం), ఆయన ప్రియసహచరుల్లోని మరికొంతమంది కూడా రాత్రిపూట దైవారాధన (తహజ్జుద్ నమాజ్) చేసేవారు. వారు కొన్నిసార్లు మూడింట రెండొంతుల రాత్రి వరకూ మేల్కొని ఉండేవారు. కొన్నిసార్లు సగం రాత్రి జాగారం చేసేవారు. కొన్నిసార్లు మూడింట ఒక వంతు రాత్రి దైవారాధన చేసేవారు. కాని నిత్యం రాత్రి జాగారం అనేది కష్టసాధ్యమైన పని. అదీగాక సగం రాత్రి మేల్కొన్నామా లేక రెండొంతుల రాత్రి మేల్కొన్నామా? లేక ఒక వంతు రాత్రి మేల్కొన్నామా? అని ఖచ్చితంగా అంచనా వేయలేని పరిస్థితి ఎదురయ్యేది. అందువల్ల అల్లాహ్ ఈ ఆయతులో సడలింపును ప్రకటించాడు. ఈ 'సడలింపు'పై పండితుల మధ్య ద్వంద్వాభిప్రాయాలున్నాయి. కొంతమంది ప్రకారం రాత్రిపూట జాగారాన్ని విడనాడేందుకు అనుమతి ఇవ్వబడింది. మరికొంతమంది ప్రకారం తహజ్జుద్ నమాజ్‌కు గల 'ఫర్జ్' స్థాయిని రద్దుచేసి, 'ముస్తహబ్'గా ఖరారు చేయటం జరిగింది. పుణ్యాన్ని ఆశించేవారు తమశక్తి కొలదీ రాత్రిపూట మేల్కొని దైవారాధన చేయవచ్చు. ఇంకొక అభిప్రాయం ప్రకారం దైవప్రవక్త (స) సహచరులు తహజ్జుద్ నమాజును చేసినా చేయకపోయినా, దైవప్రవక్త (స) మాత్రం తప్పకుండా చేయాల్సిందే.

17. రాత్రిలో ఎంతభాగం గడిచింది, ఎంతభాగం ఇంకా మిగిలి ఉందన్న విషయాన్ని ఖచ్చితంగా లెక్కించటం అల్లాహ్‌కే సాధ్యం. మీరు దీనిని ఖచ్చితంగా లెక్కించలేరు.

18. ఎంత రాత్రి గడిచింది? అన్న విషయం మీకు ఖచ్చితంగా తెలియనప్పుడు నిర్ణీత వేళ వరకు మీరు తహజ్జుద్ నమాజులో ఎలా నిమగ్నులవుతారు?

19. అంటే – దేవుడు మీపై గల (రాత్రి జాగరణ) ఆంక్షను ఎత్తివేశాడు. ఇప్పుడు మీరు ఖచ్చితంగా రాత్రిపూట లేవాలన్న ఉత్తర్వు లేదు. కాకపోతే శక్తిగలవారు, తమ శక్తిమేరకు దైవారాధనలో నిలబడితే అది పుణ్యప్రదం (ముస్తహబ్) అవుతుంది. వేళల నిర్ధారణ కూడా లేదు. సగం రాత్రిగానీ, రెండొంతుల రాత్రిగానీ, ఒక వంతు రాత్రిగానీ మేల్కొని ప్రార్థన చేయాల్సిందేనన్న నిబంధన కూడా ఇప్పుడు లేదు. మీరు కొద్దిపాటి సమయాన్ని వెచ్చించి రెండు రకాతులు

ఖుర్ఆన్‌లో సులభంగా పఠించగలిగినంత భాగాన్ని పఠించండి.[20] మీలో కొందరు వ్యాధిగ్రస్తులుంటారనీ, మరి కొందరు భువిలో సంచరించి దైవానుగ్రహాన్ని (అంటే ఉపాధిని) అన్వేషించేవారు న్నారనీ,[21] ఇంకా కొందరు దైవమార్గంలో యుద్ధం చేసేవారు కూడా ఉంటారని[22] ఆయనకు తెలుసు. కాబట్టి మీరు సులువుగా

مِنَ الْقُرْاٰنِ ؕ عَلِمَ اَنْ سَيَكُوْنُ مِنْكُمْ مَّرْضٰى ۙ وَاٰخَرُوْنَ يَضْرِبُوْنَ فِى الْاَرْضِ يَبْتَغُوْنَ مِنْ فَضْلِ اللّٰهِ ۙ وَاٰخَرُوْنَ يُقَاتِلُوْنَ فِىْ سَبِيْلِ اللّٰهِ ۖ

నమాజు చేసినా, దైవసన్నిధిలో రాత్రి జాగారం చేసిన పుణ్యానికి పాత్రులుగా నిలబడవచ్చు. అయితే ఎవరయినా– దైవప్రవక్త (స) వారి సంప్రదాయాన్ని అనుసరిస్తూ – ఎనిమిది రకాతుల తహజ్జుద్ నమాజు చేయగలిగితే అది ఎంతో మేలైనది.

20. **'పఠించండి'** అంటే నమాజు చేయండి అని భావం. ఇక్కడ ఖుర్ఆన్ అంటే నమాజు అని అర్థం. రాత్రివేళ ఆరాధన లేక తహజ్జుద్ నమాజ్‌లో ఎక్కువసేపు నిలబడి సుదీర్ఘంగా ఖుర్ఆన్ పఠించబడుతుంది. అందుకే తహజ్జుద్ నమాజును ఖుర్ఆన్ పఠనంగా అభివర్ణించటం జరిగింది. నమాజులో ఫాతిహా సూరా పఠనం అత్యంత అవసరం కనుక ఒక హదీసె ఖుద్సీలో సూరె ఫాతిహానే నమాజుగా అభివర్ణించటం జరిగింది. (ఫాతిహా సూరాలో దీని వివరాలు వచ్చాయి). ఇది కూడా అటువంటిదే. "ఖుర్ఆన్‌ను సులువుగా పఠించగలిగినంతగా పఠించండి" అంటే రాత్రివేళ ఎంతగా నమాజ్ చేయగలుగుతారో చేయండి" అని భావం. దానికి ప్రత్యేకంగా ఒక వేళంటూ నిర్ధారణ కాలేదు. ఇన్ని రకాతులు చేయాల్సిందేనన్న ఆంక్ష కూడా లేదు.

ఈ ఆయతు ఆధారంగా కొందరు, నమాజులో ఫాతిహా సూరా చదువవలసిన అవసరం లేదంటారు. సాధ్యమైనంతగా ఖుర్ఆన్ పఠిస్తే చాలనీ, ఎవరయినా కేవలం ఒక ఆయతు చదివినా సరిపోతుందని (నమాజ్ అవుతుందని) అంటారు. కాని ఇది సరైనది కాదు. ఇంతకు ముందు మేము చెప్పినట్లు ఇక్కడ ఖుర్ఆన్ పఠనం అనేది నమాజు అర్థంలో ఉంది. కాబట్టి నమాజులో ఖిరాత్ (ఖుర్ఆన్ పఠనం) ఏ మేరకు తప్పనిసరి? అన్న విషయంతో ఈ ఆయతు ముడిపడిలేదు. ఒకవేళ ఈ ఆయతు కేవలం 'ఖుర్ఆన్ పఠనం' గురించే నొక్కిచెబుతుందని మనం అనుకున్నా నమాజులో ఫాతిహా సూరా పఠించకపోయినా ఫరవాలేదన్న వాదనలో మాత్రం పసలేదు. ఎందుకంటే 'వీలైనంతగా (సులువుగా)' అన్న పదానికి దైవప్రవక్త (స) ఖుద్దుగా వ్యాఖ్యానం చెప్పారు – సూరె ఫాతిహా కనీస పారాయణమనీ, దాన్ని పఠించనిదే నమాజ్ నెరవేరదని!

అందువల్ల దీనిని తప్పకుండా పఠించమని కూడా ఆయన ప్రవచించారు. ప్రామాణికమైన, స్పష్టమైన హదీసులలో ఈ మేరకు ఆదేశం ఉంది. అలాంటప్పుడు దైవప్రవక్త (స) వ్యాఖ్యానానికి విరుద్ధంగా నమాజులో ఫాతిహా సూరా పఠించనవసరం లేదని అనటం, పైగా ఏ ఒక్క ఆయతు పఠించినా నమాజు నెరవేరుతుందని చెప్పటం దుస్సాహసం. దైవప్రవక్త (సఅసం) వారి హదీసుల పట్ల గల నిర్లక్ష్య వైఖరికి ఇది తార్కాణం.

పైగా ఈ వాదన ఇమాముల ప్రకటనలకు కూడా విరుద్ధమే. ఎందుకంటే ఫికహ్ సిద్ధాంతాలకు సంబంధించిన గ్రంథాల్లో వారు సైతం ఈ ఆయతు ఆధారంగా ఇమామ్ వెనుక ఉన్నప్పుడు ఖుర్ఆన్ పారాయణం చేయరాదని వాదించటం సరైనది కాదని రాశారు. అయితే ఖుర్ఆన్ పారాయణం బిగ్గరగా జరిగే జహ్రీ నమాజుల్లో ఎవరైనా ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించకపోతే కొన్ని హదీసుల దృష్ట్యా కొంతమంది పండితుల అభిప్రాయం ప్రకారం అది సమ్మతమే. కొంతమంది పండితులు అయితే ఆ సందర్భంగా ఖుర్ఆన్ పారాయణం చేయకుండా ఉండటమే ఉత్తమమని అభిప్రాయపడ్డారు. (వివరాలకు 'ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠనం విధి' అన్న పుస్తకాలు చదవండి).

21. అంటే – వారు వర్తకం నిమిత్తం సుదీర్ఘ ప్రయాణాలు చేయవలసి ఉంటుంది. ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి, ఒక రాజ్యం నుంచి మరో రాజ్యానికి వెళ్ళవలసి ఉంటుంది.

فَاقْرَءُوْا مَا تَيَسَّرَ مِنْهُ ۙ وَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ
وَاَقْرِضُوا اللّٰهَ قَرْضًا حَسَنًا ؕ وَمَا تُقَدِّمُوْا لِاَنْفُسِكُمْ
مِّنْ خَيْرٍ تَجِدُوْهُ عِنْدَ اللّٰهِ هُوَ خَيْرًا وَّاَعْظَمَ
اَجْرًا ؕ وَاسْتَغْفِرُوا اللّٰهَ ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿20﴾

పఠించగలిగినంత ఖుర్‌ఆన్‌ను పఠించండి.[23] నమాజును నెలకొల్పండి.[24] జకాత్‌ను ఇస్తూ ఉండండి. అల్లాహ్‌కు మంచి రుణం ఇవ్వండి.[25] మీరు మీ కోసం ఏ మంచిని (పుణ్యకార్యాన్ని) ముందుగా పంపినా, దాన్ని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ పుణ్యఫలం రూపంలో అత్యధికంగా పొందుతారు.[26] క్షమాపణకై అల్లాహ్‌ను అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప క్షమాశీలి, దయాశీలి.

22. అలాగే జిహాద్‌లో కూడా సంక్లిష్టమైన ప్రయాణాలు చేయవలసి ఉంటుంది. ఎన్నో కష్టనష్టాలను భరించవలసి ఉంటుంది. అందుచేత అస్వస్థత, ప్రయాణం, యుద్ధం – అనే ఈ మూడు విషయాలు ఏదో ఒక దశలో ఎదురవుతూనే ఉంటాయి. అందుకే అల్లాహ్ రాత్రిపూట దైవారాధన విషయంలో తన ఆజ్ఞను సడలించాడు.

23. సడలింపుకు గల కారణాలను వివరిస్తూ మరోసారి ఈ ఆదేశం ప్రస్తావించబడింది.

24. అంటే ప్రతి రోజూ విధిగా చేయబడిన ఐదు నమాజులను క్రమం తప్పకుండా చేస్తూ ఉండండి.

25. అంటే దైవమార్గంలో – అవసరం ఉన్నప్పుడు – ఉదారంగా ఖర్చుచేయండి. ఈ ఖర్చును అల్లాహ్ **'మంచి రుణం'** గా అభివర్ణించాడు. దీనికి బదులుగా అల్లాహ్ మీకు ఏడు వందల రెట్ల పుణ్యఫలాన్ని – అంతకంటే కూడా ఎక్కువ పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు.

26. అంటే నఫిల్ నమాజులు, దానధర్మాలు, తదితర పుణ్యకార్యాలు – ఏమిచేసినా, ఎంత చేసుకున్నా వాటికి మీరు అల్లాహ్ సన్నిధిలో ఉత్తమ ప్రతిఫలం పొందుతారు. చాలామంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఈ సూరాలోని ఈ 20వ ఆయతు మదీనాలో అవతరించింది. అందువల్ల ఈ సూరాలోని సగభాగం మక్కాలో అవతరించినా, మరో సగభాగం మదీనాలో అవతరించిందని వారు అభిప్రాయపడుతున్నారు (ఐసరుత్తఫాసీర్).

74వ సూరా

# అల్ ముద్దస్సిర్

## కంబళి కప్పుకున్నవాడు

అవతరణ మక్కాలో

ఆయతులు 56

### పరిచయం

*ప్రవక్త (సఅసం) సందేశ ప్రచారోద్యమాన్ని, తీర్పుదినాన్ని, అవిశ్వాసులకు ఎదురయ్యే పర్యవసానాన్ని ఇందులో ముఖ్యంగా తెలుపడం జరిగింది. 'ముద్దస్సిర్' (కంబళి కప్పుకున్నవాడు) అన్న వ్యక్తీకరణ మొదటి ఆయతులో ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించినది. ఈ సూరాకు ఇదే పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) సందేశ ప్రచారోద్యమం గురించి ఈ సూరా వివరించింది. సత్యసందేశాన్ని బోధించాలని, ప్రకటించాలని, ప్రజలను బహిరంగంగా ఈ విషయమై హెచ్చరించాలని ప్రవక్త (సఅసం)కు బోధించడం జరిగింది. సహనంతో స్థిరంగా నిలబడాలని ఆయనకు చెప్పడం జరిగింది.*

*దివ్యఖుర్ఆన్ ఒక హితబోధగా, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) మానవాళికి హెచ్చరిక చేసే సందేశహరునిగా ఈ సూరా అభివర్ణించింది. పరలోకంలో నరకాగ్ని గురించి, అక్కడి బాధాకరమైన శిక్ష గురించి వివరించడం జరిగింది. తీర్పు దినాన్ని చాలా కఠినమైనదిగా, చాలా ఘోరమైనదిగా తెలుపుతూ, ఆ రోజున శంఖం పూరించబడుతుందని, ఆకాశం తెరుచుకోబడుతుందనీ, అవిశ్వాసులకు ఆ రోజు చాలా కఠినంగా ఉంటుందనీ, తమ సంపద, సంతానాలు చూసుకుని విర్రవీగినవారు, సుఖభోగాల జీవితాన్ని అనుభవించినవారు, తీర్పుదినాన్ని తిరస్కరించి, అల్లాహ్‌కు విముఖులైన వారికి ఆ రోజు చాలా నిరుత్సాహకరంగా ఉంటుందని తెలియజేయడం జరిగింది. వారందరినీ అగ్నిలోకి విసిరివేయడం జరుగుతుందని తెలుపుతూ, ఈ భయంకరమైన రోజు రావడానికి ముందు వారు అల్లాహ్‌ను తిరస్కరించారనీ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరగదని విర్రవీగారనీ, నిరుపేదలకు అన్నం పెట్టలేదని, దుర్మార్గానికి కట్టుబడ్డారని వ్యాఖ్యానించింది.*

## అల్ ముద్దస్సిర్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

1 ఓ కంబళి కప్పుకున్నవాడా![1]

2 లే. (లేచి జనులను) హెచ్చరించు.[2]

3 నీ ప్రభువు గొప్పతనాన్ని చాటిచెప్పు.

4 నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో.[3]

5 అశుద్ధతను వదలిపెట్టు.[4]

6 ఉపకారం చేసి ఎక్కువ (ప్రతిఫలం) పొందాలని ఆశించకు.[5]

7 నీ ప్రభువు కొరకు ఓర్పు వహించు.

8 మరెప్పుడయితే శంఖం పూరించబడుతుందో....

9 ఆ రోజు చాలా గడ్డు రోజై ఉంటుంది.[6]

10 అది అవిశ్వాసుల పాలిట సులభమైనది కాదు.

## سُورَةُ المُدَّثِّر

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

يَا أَيُّهَا الْمُدَّثِّرُ (1)

قُمْ فَأَنذِرْ (2)

وَرَبَّكَ فَكَبِّرْ (3)

وَثِيَابَكَ فَطَهِّرْ (4)

وَالرُّجْزَ فَاهْجُرْ (5)

وَلَا تَمْنُن تَسْتَكْثِرُ (6)

وَلِرَبِّكَ فَاصْبِرْ (7)

فَإِذَا نُقِرَ فِي النَّاقُورِ (8)

فَذَٰلِكَ يَوْمَئِذٍ يَوْمٌ عَسِيرٌ (9)

عَلَى الْكَافِرِينَ غَيْرُ يَسِيرٍ (10)

1. ప్రప్రథమంగా **ఇఖ్రఅ బిస్మి రబ్బికల్లజీ ఖలఖ్...** సందేశం (వహీ) అవతరించింది. ఆ తరువాత చాలా రోజుల వరకు వహీ రాలేదు. దైవప్రవక్త (సఅసం) వ్యాకులతకు లోనయ్యారు. ఒకరోజు అకస్మాత్తుగా హిరా కొండగుహలో సందేశం తెచ్చిన దైవదూతే దర్శనమిచ్చాడు. ఈసారి ఆ దైవదూత భూమ్యాకాశాల మధ్య ఓ కుర్చీపై కూర్చొని ఉన్నాడు. ఈ దృశ్యాన్ని చూచిన మహాప్రవక్త (స) భయాందోళనకు గురయ్యారు. ఇంటికి వెళ్ళి "నాపై ఏదన్నా వస్త్రంగానీ, దుప్పటిగానీ కప్పండి" అని ఇంటివారలకు పురమాయించారు. ఇంటివారు ఆయన (స)పై దుప్పటి కప్పారు. అప్పుడు ఈ ఆయతులు అవతరించాయి (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం – అల్ ముద్దస్సిర్ సూరా, కితాబుల్ ఈమాన్). ఈ విధంగా ఇది రెండవసారి వచ్చిన దైవవాణి (వహీ) అనవచ్చు.
2. మక్కా వారు గనక నిజప్రభువును విశ్వసించకపోతే వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని సావధానపరచు.
3. అంటే సంకల్పశుద్ధి, ఆత్మశుద్ధితోపాటు నీ దుస్తులను కూడా పరిశుభ్రంగా ఉంచుకో. ఆ రోజుల్లో మక్కా ముష్రిక్కులు 'తహారత్' (శుచీ, శుభ్రతల)ను పాటించేవారు కాదు. అందువల్ల దైవప్రవక్త (స)కు ప్రత్యేకంగా ఈ ఆదేశం ఇవ్వబడింది.
4. అంటే – విగ్రహారాధనను విడనాడు. వాస్తవానికి ఈ ఆదేశం ఆయన (స) ద్వారా జనసామాన్యానికి ఇవ్వబడింది.
5. అంటే – పరోపకారం చేసి, చేసిన దానికి ఎక్కువ ప్రతిఫలం దొరకాలన్న ఉద్దేశాన్ని మనసులో ఉంచకు.
6. అంటే – తీర్పుదినం అవిశ్వాసుల పాలిట చాలా గడ్డుగా ఉంటుంది. ఎందుకంటే ఆ రోజు వారు తమ అవిశ్వాసపు (కుఫ్ర్) రుచిని చూడవలసి ఉంటుంది.

11 నన్నూ, నేను ఒంటరిగా పుట్టించిన వాడినీ వదలిపెట్టు[7] (వాడి సంగతి నేను చూసుకుంటాను).

ذَرْنِي وَمَنْ خَلَقْتُ وَحِيدًا ⑪

12 వాడికి నేను విరివిగా సంపద ఇచ్చాను.

وَجَعَلْتُ لَهُ مَالًا مَّمْدُودًا ⑫

13 ఎల్లప్పుడూ వెన్నంటి ఉండే కొడుకులను కూడా (ఇచ్చాను).[8]

وَبَنِينَ شُهُودًا ⑬

14 ఇంకా వాడికోసం అన్ని విధాలా సుఖసౌఖ్యాల సామగ్రిని సమకూర్చాను.[9]

وَمَهَّدتُّ لَهُ تَمْهِيدًا ⑭

15 అయినా నేను వాడికి ఇంకా... ఇంకా ప్రసాదించాలని వాడు (పిచ్చిగా) ఆశపడుతున్నాడు.[10]

ثُمَّ يَطْمَعُ أَنْ أَزِيدَ ⑮

16 అలా జరగదు.[11] వాడు మా ఆయతుల (సూచనల)కు బద్ధ విరోధిగా తయారయ్యాడు.[12]

كَلَّا ۖ إِنَّهُ كَانَ لِآيَاتِنَا عَنِيدًا ⑯

17 త్వరలోనే నేను వాణ్ణి కఠినమైన ఎత్తుకు ఎక్కిస్తాను.[13]

سَأُرْهِقُهُ صَعُودًا ⑰

7. ఈ వాక్యం తీవ్రమైన హెచ్చరిక వంటిది. దైవధిక్కారానికి పాల్పడిన ఒక క్యారెక్టర్ ఇక్కడ ప్రస్తావించబడింది. వాణ్ణి ఉద్దేశించి దేవుడు, 'నేను వాణ్ణి తల్లి కడుపునుంచి ఒంటరిగా పుట్టించాను. వాడి దగ్గర ఆస్తిపాస్తులూ లేవు. ఆలుబిడ్డలూ లేరు. కాని నేను వాణ్ణి అపారంగా అనుగ్రహించాను. అయినా వాడి ధన దాహం తీరలేదు. వాడి సంగతి నాకు వదలిపెట్టండి. నేనొక్కణ్ణే వాడి పనిపడతాను' అన్నాడు. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరోకాదు, వలీద్ బిన్ ముగైరా. వాడు అవిశ్వాసం, అవిధేయత, తలబిరుసుతనంలో మితిమీరిపోయాడు. అందువల్ల వాడి గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పటం జరిగింది.

8. దేవుడు వాడికి పుత్రసంతతిని వొసగాడు. వాళ్లు నిత్యం అతని కళ్ల ముందరే కదలాడుతూ ఉండేవాళ్లు. వాడి ఇంట్లో సిరిసంపదలు పొంగిపొర్లేవి. అందువల్ల కొడుకులు బయటికి పోయి కష్టపడాల్సిన పని ఉండేది కాదు. అందువల్ల వాళ్లు ఎల్లప్పుడూ తండ్రినే వెన్నంటి ఉండేవారు. వాళ్లు మొత్తం పన్నెండు మందో, పదమూడు మందో ఉండేవారు. వారిలో ముగ్గురు మాత్రమే ఇస్లాం స్వీకరించారు. వారి పేర్లు ఖాలిద్, హిషామ్, వలీద్ బిన్ వలీద్ (ఫత్హుల్ ఖదీర్).

9. అంటే – సిరిసంపదల రీత్యా, పేరు ప్రతిష్ఠల దృష్ట్యా, అధికారం నాయకత్వాల దృష్ట్యా, దీర్ఘాయుష రీత్యా...

10. ఒకవైపు వాడు సత్యతిరస్కారిగా, పాపాత్ముడుగా చెలామణీ అవుతూనే మరోవైపు వాడు మరిన్ని ఆర్థిక ఒనరులను ఆశిస్తున్నాడు.

11. అంటే – వాడు కోరుతున్నది ఇక మీదట వాడికి ఇవ్వను.

12. ఎందుకంటే వాడు సత్యమేదో తెలిసికూడా సత్యాన్ని వ్యతిరేకిస్తున్నాడు. సత్యాన్ని రూపుమాపే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇలాంటివాడిని అరబీలో **'అనీద్'** అంటారు.

13. అంటే–వాడు తట్టుకోలేని యాతనకు వాణ్ణి గురిచేస్తాను. నరకంలో ఒక అగ్ని పర్వతం ఉంటుందని, ఆ పర్వతంపైకి అతను ఎక్కించబడతాడని కొంతమంది అన్నారు. **'ఇర్హాఖ్'** (اِرْهَاق) అంటే చాలా బరువైన వస్తువు మోపటం (ఫత్హుల్ ఖదీర్).

18 వాడు ఆలోచించి ఒక ప్రతిపాదన చేశాడు.[14]

إِنَّهُ فَكَّرَ وَقَدَّرَ ﴿18﴾

19 వాడు నాశనంగాను! ఎటువంటి ప్రతిపాదన చేశాడు వాడు!?

فَقُتِلَ كَيْفَ قَدَّرَ ﴿19﴾

20 మరి వాడు నాశనమైపోను!! ఎలాంటి (తప్పుడు) ప్రతిపాదన
చేశాడు!?[15]

ثُمَّ قُتِلَ كَيْفَ قَدَّرَ ﴿20﴾

21 తరువాత వాడు దృష్టిని సారించాడు[16] (ఆలోచించాడు).

ثُمَّ نَظَرَ ﴿21﴾

22 ఆపైన నుదురు చిట్లించాడు. పాడు ముఖం పెట్టుకున్నాడు.[17]

ثُمَّ عَبَسَ وَبَسَرَ ﴿22﴾

23 అటుపిమ్మట వీపు త్రిప్పుకున్నాడు. గర్వం ప్రదర్శించాడు.[18]

ثُمَّ أَدْبَرَ وَاسْتَكْبَرَ ﴿23﴾

24 (చివరికి) ఇలా అన్నాడు: "ఇది పూర్వం నుంచీ నకలు చేయ
బడుతూ వస్తున్న మాయాజాలం మాత్రమే."[19]

فَقَالَ إِنْ هَٰذَا إِلَّا سِحْرٌ يُؤْثَرُ ﴿24﴾

25 "ఇది మానవ వాక్కు తప్ప మరేమీ కాదు."

إِنْ هَٰذَا إِلَّا قَوْلُ الْبَشَرِ ﴿25﴾

26 నేను త్వరలోనే వాణ్ణి నరకాగ్నికి ఆహుతి చేస్తాను.

سَأُصْلِيهِ سَقَرَ ﴿26﴾

27 ఆ నరకాగ్ని ఎటువంటిదో నీకేం తెలుసు?[20]

وَمَا أَدْرَاكَ مَا سَقَرُ ﴿27﴾

28 అది (ఏ పాపాత్ముణ్ణీ) మిగల్చదు, (దేనినీ కాలకుండా) వదలి
పెట్టదు.[21]

لَا تُبْقِي وَلَا تَذَرُ ﴿28﴾

---

14. అంటే–వాడు దివ్య ఖుర్ఆన్‌ను, మహాప్రవక్త (స) వారి సందేశాన్ని విని, ఏం జవాబు ఇవ్వాలా? అని దీర్ఘంగా ఆలోచించాడు. చివరకు మనసులో ఒక పథకం వేశాడు.
15. ఇవి వాడికి శాపనార్థాలన్నమాట! ఎందుకంటే వాడికి తట్టిన ఆలోచన చాలా చెడ్డ ఆలోచన.
16. ఈ ఖుర్ఆన్‌ను ఎలా తిప్పికొట్టాలా? అన్నది వాడి యోచన. ఇలాంటి యోచనలో ఉన్న వ్యక్తి సాధారణంగా – దిక్కుతోచక – దిక్కులు చూస్తూ ఉంటాడు.
17. అలా ఆలోచిస్తూ ఉండగా వాడి ముఖకవళికలు మారిపోయాయి. భృకుటి ముడిపడింది. ముఖంపై అసహనం తొంగిచూసింది. చివరకు ఆలోచన తట్టగానే వాడి ముఖం కళావిహీనమై పోయింది. ఎందుకంటే వాడికి తట్టిన ఆలోచన మంచి ఆలోచన కాదు గనక!
18. అంటే – సత్యంపట్ల విముఖత చూపాడు. విశ్వసించడానికి నిరాకరించాడు.
19. అంటే – ఇతను (ముహమ్మదు) ఎవరి వద్దనో ఈ విద్యను నేర్చుకుని, దైవవాణి అని నమ్మబలుకుతున్నాడని వాడు ఆరోపించాడు.
20. **'సఖర్'** (سَقَر) అనేది నరకానికి గల పేర్లలో ఒక పేరై ఉండవచ్చు లేదా నరకంలోని వివిధ దశలలో అదొక దశ అయి ఉండవచ్చు.

**29** (మనుషుల) చర్మాన్ని మాడ్చివేస్తుంది.

لَوَّاحَةٌ لِّلْبَشَرِ ﴿٢٩﴾

**30** దానిపై పందొమ్మిది మంది (దైవ దూతలు నియమితులై) ఉన్నారు.[22]

عَلَيْهَا تِسْعَةَ عَشَرَ ﴿٣٠﴾

**31** మేము నరకపాలకులుగా దైవదూతలను మాత్రమే ఉంచాము. ఇంకా మేము వారి (19) సంఖ్యను అవిశ్వాసులను పరీక్షించ టానికి మాత్రమే నిర్ధారించాము.[23] గ్రంథవహులకు నమ్మకం కుదరటానికి,[24] విశ్వాసులు తమవిశ్వాసంలో మరింత ముందంజ వేయటానికి,[25] గ్రంథవహులు, విశ్వసించినవారు సందేహానికి గురికాకుండా ఉండటానికి మేమిలా చేశాము. ఇంకా– హృద యాలలో రోగమున్నవారు, అవిశ్వాసులు, "ఇంతకీ ఈ (19) దృష్టాంతం ద్వారా అల్లాహ్ ఏం చెప్పదలిచాడు?"[26] అని చెప్పటా నికి కూడా (మేము ఈ విధంగా చేశాము). ఈ విధంగా అల్లాహ్ తాను కోరినవారిని పెడదారి పట్టిస్తాడు, తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు.[27] నీ ప్రభువు సైన్యాలను స్వయంగా ఆయన తప్ప మరెవరూ ఎరుగరు.[28] ఈ (నరక) వృత్తాంతం మానవ మాత్రుల బోధనార్థం ప్రస్తావించబడింది.[29]

وَمَا جَعَلْنَا أَصْحَابَ النَّارِ إِلَّا مَلَائِكَةً ۙ وَمَا جَعَلْنَا
عِدَّتَهُمْ إِلَّا فِتْنَةً لِّلَّذِينَ كَفَرُوا لِيَسْتَيْقِنَ
الَّذِينَ أُوتُوا الْكِتَابَ وَيَزْدَادَ الَّذِينَ آمَنُوا
إِيمَانًا ۙ وَلَا يَرْتَابَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ
وَالْمُؤْمِنُونَ ۙ وَلِيَقُولَ الَّذِينَ فِي قُلُوبِهِم
مَّرَضٌ وَالْكَافِرُونَ مَاذَا أَرَادَ اللَّهُ بِهَٰذَا
مَثَلًا ۚ كَذَٰلِكَ يُضِلُّ اللَّهُ مَن يَشَاءُ وَيَهْدِي
مَن يَشَاءُ ۚ وَمَا يَعْلَمُ جُنُودَ رَبِّكَ إِلَّا هُوَ ۚ
وَمَا هِيَ إِلَّا ذِكْرَىٰ لِلْبَشَرِ ﴿٣١﴾

---

21. అంటే – అది వారి శరీరాలపై గల మాంసాన్నిగానీ, చర్మాన్నిగానీ వదలి పెట్టదు. లేదా వారిని సజీవులుగానూ వదలదు, మృతులుగా కూడా వదలిపెట్టదు.

22. నరకానికి 19 మంది దైవదూతలు కాపలాదారులుగా లేదా కార్యనిర్వాహకులుగా ఉంటారు.

23. ఖురైషు ముష్రిక్కుల ధోరణి ఇందులో ఖండించబడింది. దేవుడు నరకపాలకుల గురించి ప్రస్తావించినప్పుడు, అబూజహల్ దీనిని గేలి చేశాడు. అతడు ఖురైషులను సంబోధిస్తూ "మీలోని ప్రతి పదిమందీ కలిసి ఒక దైవదూత సంగతి చూడటానికి సరిపోరా?" అన్నాడు. వారిలో కిల్దా అనే వ్యక్తి తన బలపరాక్రమాలపై విర్రవీగుతూ, "మీరంతా కలిసి ఇద్దరు దైవదూతలను చూసుకోండి. నేనొక్కణ్ణే మిగతా పదిహేడు మంది దూతల్ని చూసుకుంటాను" అని ప్రేలాడు. కొన్ని కథనాల ప్రకారం ఇతగాడు అనేకసార్లు దైవప్రవక్త (సఅసం)పై కుస్తీ కోసం సవాలు విసిరాడు. ప్రతిసారీ చిత్తయ్యాడు. కాని దైవప్రవక్త (స) సందేశాన్ని మాత్రం విశ్వసించలేదు. రుకానా బిన్ అబ్దె యజీద్‌తో కూడా ఆయన (స) కుస్తీ పట్టారు. అయితే రుకానా కుస్తీలో ఓడిపోగానే ఇస్లాం స్వీకరించారు (ఇబ్నె కసీర్). ఇంతకీ చెప్పొచ్చిందేమిటంటే ఈ నరకపాలకుల సంఖ్య కూడా వారి పాలిట ఒక పరీక్షగా పరిణమించింది.

24. అంటే – ఈ ప్రవక్త (సఅసం) సత్యవంతుడనీ, పూర్వపు గ్రంథాలలో ఉన్న యదార్థాన్నే ఈయన పలికాడన్న దానిపై వారికి దృఢ నమ్మకం కలగడానికి మేము ఇలా చేశాము.

25. గ్రంథవహులు కూడా తమ ప్రవక్త (స) చెప్పినదాన్ని సత్యమని ధృవీకరించటం ద్వారా వారి విశ్వాసం మరింతగా పెరగాలని....

26. హృదయాలలో రోగమున్నవారంటే కపటులు. లేదా మనసులలో అనుమానాలు ఉన్నవారు. ఎందుకంటే మక్కాలో 'కపటులు' లేరు. దేవుడు దైవదూతల సంఖ్యను ప్రత్యేకంగా ప్రస్తావించటంలోని మర్మం ఏమిటి? అని వారు ప్రశ్నించాలనే మేమిలా చేశాము.

**32** నిజం చెబుతున్నాను.[30] చంద్రుని సాక్షిగా!

كَلَّا وَالْقَمَرِ (32)

**33** తి(త)రిగి పోతున్న రాత్రి సాక్షిగా!

وَاللَّيْلِ إِذْ أَدْبَرَ (33)

**34** ప్రకాశమానమైన ఉదయం సాక్షిగా!

وَالصُّبْحِ إِذَا أَسْفَرَ (34)

**35** నిశ్చయంగా అది (ఆ నరకం) చాలా పెద్ద విషయం.[31]

إِنَّهَا لَإِحْدَى الْكُبَرِ (35)

**36** మానవులకు ఒక హెచ్చరిక![32]

نَذِيرًا لِّلْبَشَرِ (36)

**37** మీలో ముందంజ వేయదలిచే ప్రతి ఒక్కరికీ, వెనుక ఉండి పోదలిచే ప్రతి ఒక్కరికీ.[33]

لِمَن شَاءَ مِنكُمْ أَن يَتَقَدَّمَ أَوْ يَتَأَخَّرَ (37)

**38** ప్రతి వ్యక్తీ తాను చేసుకున్న దానికి (తాను చేసిన కర్మలకు) ప్రతిగా తాకట్టుగా ఉన్నాడు[34] –

كُلُّ نَفْسٍ بِمَا كَسَبَتْ رَهِينَةٌ (38)

**39** కుడి పక్షం వారు తప్ప![35]

إِلَّا أَصْحَابَ الْيَمِينِ (39)

---

27. తాను కోరిన వారిని అపమార్గానికి లోనుచేసి, తాను కోరిన వారికి సన్మార్గం చూపటంలోని యుక్తి, పరమార్థం ఏమిటో అల్లాహ్‌కే తెలుసు.

28. నరకంలో ఉన్నది 19 మంది దైవదూతలే కదా! వాళ్లను అదుపులోకి తీసుకోవటం ఏమంత కష్టమైన పనికాదు అని అవిశ్వాసులు, ముష్రిక్కులు తలపోసేవారు. కాని ప్రభువు సైనికుల సంఖ్య అగణ్యమన్న సంగతి ఈ అవివేకులకు తెలీదు. ఆ సైనికులు నిజానికి ఎంతమందో దైవానికి మాత్రమే తెలుసు. అల్లాహ్ ఆరాధన నిమిత్తం 'బైతుల్ మామూర్'లో అనుదినం ప్రవేశించే దైవదూతల సంఖ్యే 70 వేలు. అలా ఒకసారి ప్రవేశించిన వారికి ప్రళయదినం వరకూ మళ్లీ ఆ అవకాశం దొరకదు. (సహీహ్ బుఖారీ, ముస్లిం)

29. అంటే – ఈ నరకం, నరకపాలకుల సంగతి ప్రజలకు హితబోధగా చెప్పబడింది. తద్వారా వారు అవిధేయతను మానుకుని సన్మార్గానికి వస్తారని!

30. మక్కావాసుల ఆలోచనలు ఇక్కడ ఖండించబడ్డాయి – ఓ మక్కా వాసులారా! దైవ దూతలను ఓడించగలమన్న మీ ధీమా పస లేనిది. మీ ఆటలు ఏమాత్రం సాగవు. చంద్రునిసాక్షిగా! రేయిసాక్షిగా! ఉదయం సాక్షిగా! నేను చెప్పేది నిజం. మీ పథకాలు పారవు.

31. మూడు ముఖ్యమైన వస్తువులపై ప్రమాణం చేసిన తరువాత దేవుడు నరకం ఉగ్రరూపం గురించి చెప్పాడు. దీన్నిబట్టి అదొక గొప్ప విషయం అనటంలో సందేహానికి ఆస్కారం లేదు.

32. మానవులను హెచ్చరించేది ఏది? అంటే అది నరకమూ కావచ్చు. ఖుర్‌ఆన్ కూడా కావచ్చు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) నేపథ్యంలో కూడా ఈ వాక్యం వచ్చి ఉండవచ్చు.

33. విశ్వాసంలో, విధేయతలో పురోగమించేవారికి ఇది హెచ్చరికే. విముఖత చూపేవారికి కూడా ఇది హెచ్చరిక వంటిదే. హెచ్చరిక అందరికీ వర్తిస్తుంది. మనిషి విశ్వాసి అయినా, అవిశ్వాసి అయినా – తరచూ హెచ్చరించే, సావధానపరచే విషయం అతని ముందుకు రానంతవరకూ అతను జాగ్రత్తపడడు.

34. ప్రతి మనిషీ తన కర్మలకు బదులుగా తాకట్టు (కుదువ) ఉన్నాడు అంటే భావం – ఆ కర్మలు (అతను పుణ్యాత్ముడైతే)

| | |
|---|---|
| 40 వారు (స్వర్గ) వనాలలో (కూర్చొని) అడుగుతూ ఉంటారు,[36] | فِيْ جَنّٰتٍ ۛ يَتَسَآءَلُوْنَ ﴿40﴾ |
| 41 అపరాధుల గురించి. | عَنِ الْمُجْرِمِيْنَ ﴿41﴾ |
| 42 "ఇంతకీ ఏ విషయం మిమ్మల్ని నరకానికి తీసుకువచ్చింది?" (అని ప్రశ్నిస్తారు). | مَا سَلَكَكُمْ فِيْ سَقَرَ ﴿42﴾ |
| 43 వారిలా సమాధానమిస్తారు : "మేము నమాజు చేసేవారము కాము." | قَالُوْا لَمْ نَكُ مِنَ الْمُصَلِّيْنَ ﴿43﴾ |
| 44 "నిరుపేదలకు అన్నం పెట్టేవారమూ కాము."[37] | وَلَمْ نَكُ نُطْعِمُ الْمِسْكِيْنَ ﴿44﴾ |
| 45 "పైగా, మేము పిడివాదన చేసే వారితో (తిరస్కారులతో) చేరి, వాదోపవాదాలలో మునిగి ఉండేవారం."[38] | وَكُنَّا نَخُوْضُ مَعَ الْخَآئِضِيْنَ ﴿45﴾ |
| 46 "ప్రతిఫల దినాన్ని ధిక్కరించేవాళ్ళం." | وَكُنَّا نُكَذِّبُ بِيَوْمِ الدِّيْنِ ﴿46﴾ |
| 47 "తుదకు మాకు మరణం వచ్చేసింది."[39] | حَتّٰىٓ اَتٰىنَا الْيَقِيْنُ ﴿47﴾ |
| 48 మరి సిఫారసు చేసేవారి సిఫారసు వారికి ఏమాత్రం ఉపయోగపడదు.[40] | فَمَا تَنْفَعُهُمْ شَفَاعَةُ الشّٰفِعِيْنَ ﴿48﴾ |
| 49 ఇంతకీ వారికేమైపోయిందనీ, వారెందుకిలా హితబోధ నుండి ముఖం త్రిప్పుకుని పోతున్నారు? | فَمَا لَهُمْ عَنِ التَّذْكِرَةِ مُعْرِضِيْنَ ﴿49﴾ |
| 50 వారు బెదిరి (పారి)పోయే అడవి గాడిదల్లా ఉన్నారే!?[41] | كَاَنَّهُمْ حُمُرٌ مُّسْتَنْفِرَةٌ ﴿50﴾ |

అతనికి ముక్తినయినా ప్రసాదిస్తాయి లేదా (అతను పాపాత్ముడై ఉంటే) అతని పాలిట వినాశకరంగానయినా పరిణమిస్తాయి.

35. వారు తమ సత్కర్మల మూలంగా తాకట్టుగా ఉండరు. పైగా వారు స్వతంత్రులుగా ఉంటారు.

36. ఈ కుడిపక్షంవారు స్వర్గంలోని ఎత్తయిన స్థానాలపై కూర్చుని నరకవాసులను వాకబు చేస్తూ ఉంటారు.

37. నమాజ్ దేవుని హక్కుల జాబితాలోకి వస్తే, నిరుపేదలకు అన్నం పెట్టడం దాసుల హక్కుల జాబితాలోకి వస్తుంది. అంటే – అటు తాము దేవుని హక్కులుగానీ, ఇటు దాసుల హక్కులు గానీ చెల్లించలేదని నరకవాసులు ఒప్పుకుంటారు.

38. అంటే – వారు తలా తోకా లేకుండా వాదించటమే గాకుండా ప్రజలను మార్గభ్రష్టతకు లోను చేసే కార్యకలాపాలలో నిమగ్నులై ఉండేవారు.

39. **'యఖీన్'** (اليَقِين) అంటే ఇక్కడ 'మృత్యువు' అన్నమాట! ఈ విషయం వేరొకచోట ఈ విధంగా అనబడింది: "మరణ ఘడియ (యఖీన్) వచ్చేవరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ ఉండు." (అల్ హిజ్ర్ – 99)

40. పైన పేర్కొనబడిన అవగుణాలు ఉన్న వారికోసం ఎవరు సిఫారసు చేసినా అది పనికిరాదు. ఎందుకంటే సత్యతిరస్కారం

51 అవి సింహాన్ని చూసి పారిపోతుంటాయి.

فَرَّتْ مِنْ قَسْوَرَةٍ ﴿٥١﴾

52 పైగా వారిలోని ప్రతి వ్యక్తీ, తనకు ప్రకాశిత 'సహీఫాలు' (ప్రతులు) ఇవ్వబడాలని కోరుకుంటున్నాడు.[42]

بَلْ يُرِيدُ كُلُّ امْرِئٍ مِّنْهُمْ أَن يُؤْتَىٰ صُحُفًا مُّنَشَّرَةً ﴿٥٢﴾

53 అలా జరగనేరదు. వారసలు పరలోకానికి భయపడటం లేదు.[43]

كَلَّا ۖ بَل لَّا يَخَافُونَ الْآخِرَةَ ﴿٥٣﴾

54 ముమ్మాటికీ కాదు (వాస్తవమేమిటంటే) ఈ ఖుర్ఆన్ ఒక హితబోధిని.[44]

كَلَّا إِنَّهُ تَذْكِرَةٌ ﴿٥٤﴾

55 కాబట్టి ఇక కోరినవారు దీనిద్వారా ఉపదేశం గ్రహించవచ్చు.

فَمَن شَاءَ ذَكَرَهُ ﴿٥٥﴾

56 అయితే అల్లాహ్ తలచినప్పుడు మాత్రమే వారు హితబోధను ఆస్వాదించగలరు.[45] వారు భయపడవలసింది ఆయనకు మాత్రమే. క్షమాభిక్ష పెట్టడం కూడా ఆయనకే చెల్లు.[46]

وَمَا يَذْكُرُونَ إِلَّا أَن يَشَاءَ اللَّهُ ۚ هُوَ أَهْلُ التَّقْوَىٰ وَأَهْلُ الْمَغْفِرَةِ ﴿٥٦﴾

(కుఫ్ర్) కారణంగా వారసలు సిఫారసుకే నోచుకోరు. విశ్వాసభాగ్యం పొందిన వారికోసం సిఫారసుకు అనుమతి లభిస్తే అప్పుడది స్వీకారయోగ్యం అవుతుంది.

41. అంటే – వారు సత్యాన్ని ద్వేషించటంలో, సత్యం పట్ల విముఖత చూపటంలో పులిని చూసి భయపడి పారిపోయే అడవి గాడిదల్లాంటివారు. పులిగాని, మరేదయినా అడవి మృగంగానీ వాటిని వేటాడదలచినప్పుడు అవి ఎలా పరుగులు తీస్తాయో అలాగే వీళ్లు కూడా సత్యం నుండి పారిపోతున్నారు. **'ఖస్వరతున్'** (قَسْوَرَةٌ) అంటే పులి. కొందరు దీన్ని 'విలుకాళ్ళు' అన్న అర్థంలో కూడా తీసుకున్నారు.

42. అంటే – తమలో ప్రతి ఒక్కరిపై స్పష్టమైన గ్రంథం అవతరించాలనీ, ఆ గ్రంథంలో ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త అన్న విషయం వ్రాసి ఉండాలని వారు ఆశిస్తున్నారు. మరి కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం వారు; ఆచరణ ఏమి లేకుండానే మోక్షం లభించే ధృవీకరణ పత్రం తమకు లభించాలని వారు కోరుకుంటున్నారు (ఇబ్నె కసీర్).

43. వారిలోని చెడుగులన్నింటికీ ప్రధాన కారణం పరలోకంపై విశ్వాస రాహిత్యమే. అందుకే వారు మరణానంతర జీవితాన్ని తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు.

44. అయితే ఈ గ్రంథం ద్వారా బోధను గ్రహించాలని, జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని ఆరాటపడేవారికి మాత్రమే అది లాభదాయకమవుతుంది.

45. అంటే – అల్లాహ్ తలచిన వారికి మాత్రమే ఈ ఖుర్ఆన్ గ్రంథం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. "సకల లోకాల ప్రభువైన అల్లాహ్ తలచనంతవరకూ – మీరు తలచినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదు." (తక్వీర్ – 29).

46. అంటే మానవులు భయపడవలసింది అల్లాహ్‌కే. అల్లాహ్ పేరుతోనే సాటిప్రజల్లో భయభక్తులను నూరిపోయాలి. ఆయన తిరుగులేనివాడు. ఆయన గొప్ప క్షమాశీలి. క్షమించే అధికారం కూడా ఆయనకు మాత్రమే ఉంది. కాబట్టి ఆయనకు మాత్రమే ప్రజలు విధేయత చూపాలి. ఆయన్ని ఎదిరించకూడదు. ఆయన ఆజ్ఞలన్నింటినీ శిరసావహించాలి. ఆయన వారించిన విషయాలను విడనాడాలి. అప్పుడే మానవులు ఆయన మన్నింపుకు, కనికరానికి నోచుకుంటారు.

75వ సూరా

# అల్ ఖియామహ్

## ప్రళయం

అవతరణ మక్కాలో

ఆయతులు 40

### పరిచయం

*ఈ సూరా ప్రళయం గురించి, ఆ రోజున మరణించిన వారు మళ్ళీ లేపబడడం గురించి, తీర్పుదినం గురించి, శిక్షాబహుమానాల గురించి బోధించింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది ఒక భ్రమ ఎంతమాత్రం కాదని, అనివార్యంగా చోటుచేసుకునే సంఘటన అనీ ఈ సూరా హెచ్చరించింది. ప్రళయం రోజు భయాందోళనలతో అందరూ కళ్ళు తేలవేస్తారు. చంద్రుడు కాంతివిహీనుడై పోతాడు. సూర్యచంద్రులు తమ కాంతిని కోల్పోతాయి. తీర్పుదినాన ప్రతి ఒక్కరికి వారి కర్మల గురించి తెలియజేయడం జరుగుతుంది. ప్రతి ఒక్కరి నాలుక, కాళ్ళుచేతులు అవి చేసిన పనులకు సాక్ష్యం చెబుతాయి. మనిషిని ఒక వీర్యపు బిందువుతో పుట్టించిన అల్లాహ్ చనిపోయిన తర్వాత మళ్ళీ లేపి నిలబెట్టే శక్తిసామర్థ్యాలు ఉన్నవాడు.*

*ఈ సూరాలో ఈ క్రింది ముఖ్యాంశాలు చర్చించబడ్డాయి:*

***1. స్వేచ్ఛ :*** *సృష్టి వెనుక హేతుబద్ధమయిన, అర్థవంతమైన ఉద్దేశం ఉంది. జీవితంలో ఎలాంటి లక్ష్యం లేకుండా మనిషిని సృష్టించటం జరుగలేదు. కనుక మనిషి తన కర్మలకు తాను బాధ్యత వహించవలసి ఉంటుంది.*

***2. మృత్యువు :*** *మృత్యువు అన్నది శాశ్వతమైన జీవితానికి ప్రారంభం. ఆ పరలోక జీవితం ఆనందకరమైనది కావచ్చు, లేదా బాధాకరమైనది కావచ్చు. అది మన విశ్వాసం లేదా అవిశ్వాసాలపై, ప్రాపంచిక జీవితంలో మనం చేసిన పనులపై ఆధారపడి ఉంటుంది.*

***3. ప్రాపంచిక జీవితం :*** *ఈ ప్రాపంచిక జీవితం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి. పరలోకంలోని శాశ్వతమైన జీవితానికి ప్రతి ఒక్కరూ ఏర్పాట్లు చేసుకోవాలి. మంచిపనులు చేయాలి.*

## అల్ ఖియామహ్ సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

1 నేను ప్రళయ దినంపై ప్రమాణం చేస్తున్నాను.[1]

2 ఇంకా నేను, తనను తాను నిందించుకునే ఆత్మపై ప్రమాణం చేస్తున్నాను.[2]

3 ఏమిటి, మానవుడు మేమతని ఎముకలను కూర్చలేమని అనుకుంటున్నాడా?[3]

4 తప్పకుండా కూర్చగలము. మేమతని వ్రేళ్ల కొనలను సయితం (యధాతథంగా) సవరించగలం.[4]

5 ఈ మానవుడైతే ఇక మీదట కూడా దురంతాలకు పాల్పడ దలుస్తున్నాడు.[5]

## سُورَةُ الْقِيَامَةِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

لَآ أُقْسِمُ بِيَوْمِ الْقِيٰمَةِ ﴿1﴾

وَلَآ أُقْسِمُ بِالنَّفْسِ اللَّوَّامَةِ ﴿2﴾

أَيَحْسَبُ الْإِنْسَانُ أَلَّنْ نَّجْمَعَ عِظَامَهُ ﴿3﴾

بَلٰى قٰدِرِيْنَ عَلٰٓى أَنْ نُّسَوِّيَ بَنَانَهُ ﴿4﴾

بَلْ يُرِيْدُ الْإِنْسَانُ لِيَفْجُرَ أَمَامَهُ ﴿5﴾

1. **'లా ఉఖ్సిము'** (لَآ أُقْسِمُ) అనే పదంలో 'లా' అదనంగా ఉంది. ఇది అరబీ భాషలోని విశిష్ఠత. కొంతమంది అభిప్రాయం ప్రకారం ఈ 'లా' (లేదు) అన్న అక్షరం ద్వారా సత్యతిరస్కారుల ఆరోపణలు ఖండించబడ్డాయి. మరణానంతరం మరో జీవితం గీవితం లేదని సత్యతిరస్కారులు వాదించేవారు. వారి వాదనలకు సమాధానంగా, "మీరు చెప్పేది నిజం కాదు. నేను ప్రళయదినం తోడుగా చెబుతున్నాను" అని అనటం జరిగింది. ప్రళయదినంపై ప్రమాణం చేయడాన్నిబట్టి దాని ప్రాముఖ్యం, ఔన్నత్యం వెల్లడవుతోంది.
2. ఈ ఆత్మ నింద లేక అంతర్మథనం మంచీ – చెడు రెండింటిపై కూడా జరుగుతుంది. మంచి విషయంలో 'ఇంకా ఎందుకు చేసుకోలేదు?' అని మనసు బాధపడుతుంది. చెడు విషయంలో 'అయ్యో! ఈ చెడుకు ఎందుకు పాల్పడ్డానో!? దాని జోలికి పోకుండా ఉంటే బావుండేదే!' అని మధనపడుతుంది. ఇహలోకంలో కూడా మనసున్న మనుషుల, సజ్జనుల పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఇక పరలోకం విషయానికి వస్తే – అక్కడ అందరి మనసులూ ఆత్మనింద చేసుకుంటూ ఉంటాయి. **'నఫ్సె లవ్వామ'** అంటే అంతర్మథనం చెందే మనసు, ఆత్మ నింద చేసుకునే మనసు, లోలోపలే పశ్చాత్తాపం చెందే మనసు అని అర్థం.
3. ఇంతకు ముందు చేసిన ప్రమాణానికి సమాధానమిది. ఇక్కడ 'మనిషి' అంటే ప్రళయ దినాన్ని త్రోసిపుచ్చే అవిశ్వాసి, నాస్తికుడు అన్నమాట. దేవుడు మానవుని ఎముకలను కూర్చలేడన్న అతని ఆలోచన తప్పు. దేవుడు నిశ్చయంగా మానవుని ఎముకలను సమీకరిస్తాడు. ఇక్కడ ఎముకలను గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటంలోని ఉద్దేశం ఏమిటంటే ఎముకలే మానవుని ఆకృతికి కీలకమైనవి.
4. **'బనాన్'** అంటే మనిషి కాళ్లు చేతులపై గల కీళ్లు, కణుపులు, గోళ్లు, సూక్ష్మాతిసూక్ష్మ నరాలు, అతి పలుచని బొమికలతో కూడుకున్న శరీరభాగాలు. ఈ సూక్ష్మ వస్తువులను సయితం మేము సరిగ్గా అతికినట్లే సవరించగలిగినపుడు పెద్ద పెద్ద శరీరభాగాలను జోడించటం ఏమంత కష్టమైనపని?
5. అంటే-ప్రళయదినంగానీ, మరణానంతర జీవితంగానీ లేవన్న ధీమాతో నిరాఘాటంగా పాపకార్యాలు చేస్తూ పోతాడు. సత్యాన్ని తిరస్కరిస్తూనే ఉంటాడు.

6 "ఇంతకీ ప్రళయదినం ఎప్పుడు?"[6] అని అడుగుతున్నాడు.
يَسْـَٔلُ أَيَّانَ يَوْمُ ٱلْقِيَٰمَةِ ⑥

7 చూపు చెదిరిపోయినప్పుడు...[7]
فَإِذَا بَرِقَ ٱلْبَصَرُ ⑦

8 చంద్రుడు కాంతిహీనుడైపోయినప్పుడు...[8]
وَخَسَفَ ٱلْقَمَرُ ⑧

9 సూర్యచంద్రులు కలిపివేయబడినప్పుడు...[9]
وَجُمِعَ ٱلشَّمْسُ وَٱلْقَمَرُ ⑨

10 ఆ రోజు మానవుడు, "నేనెక్కడికి పారిపోను?" అంటాడు.[10]
يَقُولُ ٱلْإِنسَٰنُ يَوْمَئِذٍ أَيْنَ ٱلْمَفَرُّ ⑩

11 లేదు. ఎక్కడా ఏ ఆశ్రయమూ లేదు.[11]
كَلَّا لَا وَزَرَ ⑪

12 ఆ రోజు నీ ప్రభువు వద్దనే స్థానముంటుంది.[12]
إِلَىٰ رَبِّكَ يَوْمَئِذٍ ٱلْمُسْتَقَرُّ ⑫

13 ఆ రోజు మనిషికి, తానేం ముందుకు పంపాడో, మరేం వెనుక
వదిలాడో తెలుపబడుతుంది.[13]
يُنَبَّؤُا۟ ٱلْإِنسَٰنُ يَوْمَئِذٍۭ بِمَا قَدَّمَ وَأَخَّرَ ⑬

14 మానవుడు తనకు వ్యతిరేకంగా తానే సాక్షిగా ఉంటాడు.[14]
بَلِ ٱلْإِنسَٰنُ عَلَىٰ نَفْسِهِۦ بَصِيرَةٌ ⑭

15 (తన దుష్కర్మలను కప్పిపుచ్చుకోవటానికి) ఎన్ని సంజాయిషీలు
ఇచ్చుకున్నప్పటికీను.[15]
وَلَوْ أَلْقَىٰ مَعَاذِيرَهُۥ ⑮

---

6. దుష్కర్మలపై పశ్చాత్తాపంచెందే ఉద్దేశంతో వాడు ఈ ప్రశ్న వేయటంలేదు. వేళాకోళంగా మాత్రమే అడుగుతున్నాడు. రానున్న వాక్యంలో దేవుడు ప్రళయదినం రాకను గురించి వివరించాడు.

7. బిత్తరపోయినప్పుడు, భయకంపితులైనపుడు చూపులు ఎలా ఉంటాయో అలా ఆ రోజు ఉంటాయి. పైగా ప్రాణం పోయే సమయంలో మనిషి కనుగుడ్లు ఎలా తేలవేస్తాడో ఆ రోజు అలాగే తేలవేస్తాడు.

8. సాధారణంగా చంద్రుడికి గ్రహణం పట్టినప్పుడు అది కాంతిహీనమై పోతుంది. గ్రహణం వీడిన తరువాత చంద్రుడు కాంతిని చిందిస్తాడు. కాని ప్రళయ దినాన చంద్రుడు ఒకసారి కాంతిహీనుడయ్యాక మళ్లీ కాంతి తిరిగిరాదు.

9. అంటే – సూర్యుడు, చంద్రుడు కాంతి విహీనులై ఉన్న స్థితిలో ఒకచోట చేర్చబడతాయి. చంద్రుని మాదిరిగానే సూర్యుని వెలుతురు కూడా అంతరించిపోతుంది.

10. ఈ విపత్కర పరిణామాలు సంభవించగానే మానవుడు దేవుని నుండి పారిపోదలుస్తాడు లేదా నరకయాతన నుండి పారిపోదలుస్తాడు. కాని ఆ సమయంలో పారిపోయే దారేదీ ఉండదు.

11. ఆ రోజు మనిషి ఆశ్రయం పొందడానికి ఏ పర్వత గుహగానీ, మరే సురక్షిత స్థావరం గానీ ఉండదు. 'వజర' (وَزَرَ) అంటే కొండ లేక కోట అని అర్థం.

12. ఆయన అక్కడ దాసుల మధ్య న్యాయ విచారణ జరిపి తీర్పు ఇస్తాడు. దేవుని ఈ ధర్మాసనం నుండి పారిపోయి దాక్కొనే చోటు ఏదీ ఆనాడు మనిషికి దొరకదు.

13. ఆనాడు మనిషికి అతని కర్మలన్నీ తెలియపరచబడతాయి. ముందు వెనుకా చేసినదంతా, చిన్నా–పెద్దా ప్రతిదీ అతని ముందు పెట్టబడుతుంది. (కహఫ్ సూరా–29).

14. ఎందుకంటే, స్వయంగా అతని కాళ్లు చేతులు, కళ్లు నోరు తదితర శరీరావయవాలు అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తాయి. లేదా తన లోపాలేమిటో మనిషికి స్వయంగా తెలుసు.

16 (ఓ ప్రవక్తా!) నీవు ఖుర్ఆన్‌ను తొందరగా కంఠస్థం చేసుకోవటానికి నీ నాలుకను వేగంగా కదిలించకు.[16]

لَا تُحَرِّكْ بِهٖ لِسَانَكَ لِتَعْجَلَ بِهٖ ﴿16﴾

17 దాన్ని సమకూర్చే, (నీచేత) పారాయణం చేయించే బాధ్యత మాది.[17]

اِنَّ عَلَيْنَا جَمْعَهٗ وَ قُرْاٰنَهٗ ﴿17﴾

18 కాబట్టి మేము దానిని పఠించాక,[18] నువ్వు దాని పఠనాన్ని అనుసరించు.[19]

فَاِذَا قَرَاْنٰهُ فَاتَّبِعْ قُرْاٰنَهٗ ﴿18﴾

19 మరి దానిని విడమరచి చెప్పే బాధ్యత కూడా మాపైనే ఉంది.[20]

ثُمَّ اِنَّ عَلَيْنَا بَيَانَهٗ ﴿19﴾

20 ఎన్నటికీ కాదు. మీరసలు తొందరగా లభించేదాని (ప్రపంచం)పై మోజు పడుతున్నారు.

كَلَّا بَلْ تُحِبُّوْنَ الْعَاجِلَةَ ﴿20﴾

21 పరలోకాన్ని మాత్రం వదలిపెడుతున్నారు.[21]

وَتَذَرُوْنَ الْاٰخِرَةَ ﴿21﴾

15. ఆ రోజు మనిషి, కాదు కూడదు అని ఎంతగా వాదించినా, మరెంతగా మొత్తుకున్నా, ఎన్నిసాకులు చెప్పుకున్నా అవి అతనికి ఎంతమాత్రం ప్రయోజనకరం కాలేవు. ఆ సాకుల వల్ల అతని మనస్సాక్షి కూడా తృప్తిచెందదు.

16. దైవదూత జిబ్రీల్ (అలైహిస్సలాం) దైవవాణిని తెచ్చినప్పుడు, దైవప్రవక్త (స) దాన్ని కంఠస్థం చేసుకోవటానికి వేగిరపడేవారు. ఏ వాక్యాన్నయినా మరచిపోతానేమోనన్న భయంతో ఆయన (స) తొందరపడేవారు. దైవదూత వినిపించే వాక్యాలను కంఠస్థం చేసుకోవటంలో కంగారు పడవద్దని దేవుడు తన ప్రవక్తకు తాకీదు చేశాడు (సహీహ్ బుఖారీ – అల్ ఖియామ సూరా వ్యాఖ్యానం). ఈ విషయం ఇంతకుముందు కూడా ప్రస్తావనకు వచ్చింది. ఉదా : "(ఓ ప్రవక్తా!) నీ వైపు పంపబడిన వహీ (అప్పజెప్పటం) పూర్తి కానంతవరకు నువ్వు ఖుర్ఆన్ చదవటంలో తొందరపడకు" (తాహా – 114). ఈ ఆదేశం వచ్చిన తరువాత ఆయన (సఅసం) దైవవాణిని చాలా ప్రశాంతంగా వినేవారు.

17. అంటే – నీ మనోఫలకంపై ఈ ఖుర్ఆన్ సూరాలన్నింటినీ ముద్రించే, ఆపైన నీ నోట దానిని అప్పజెప్పించే బాధ్యత మాది. ఈ ఖుర్ఆన్‌లోని ఏ ఒక్క భాగాన్ని కూడా నీవు మరువటంగానీ, మరపింపజేయటంగానీ జరగదు.

18. అంటే – మా దూత జిబ్రయీల్ ద్వారా ఈ వాణి (వహీ)ని మేము నీకు వినిపించిన మీదట...

19. అంటే – దీని ఆదేశాలను, నిషిద్ధాంశాలను ప్రజలకు చదివి వినిపించు. ఈ ఆదేశాలను నీవు స్వయంగా ఆచరించి, నీ అనుయాయుల ముందు ఆదర్శాన్ని నెలకొల్పు.

20. అంటే – కొన్ని సంక్లిష్టమైన విషయాలను విశదీకరించే, ధర్మాధర్మాలను విడమరచి చెప్పే బాధ్యత కూడా మాదే. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే దైవప్రవక్త (స) దివ్య ఖుర్ఆన్‌లోని వివిధ అంశాలకు చెప్పిన తఫ్సీళ్ళే హదీసులనబడతాయి. ఈ హదీసులు కూడా దేవుని తరఫున ఇవ్వబడిన సంకేతాలే. కాబట్టి హదీసులను కూడా ఖుర్ఆన్ మాదిరిగానే శిరసావహించాలి.

21. అంటే – (ఓ అవిశ్వాసులారా!) మీరు పరలోకాన్ని ధిక్కరిస్తున్నారు. దేవుడు అవతరింప జేసిన ఆదేశాలను ఎదిరిస్తున్నారు. సత్యం పట్ల విముఖత చూపుతున్నారు. దీనంతటికీ కారణం మీరు ప్రాపంచిక వ్యామోహంలో పడిపోవటమే.

**22** ఆ రోజు ఎన్నో ముఖాలు (ఆహ్లాదకరంగా) తాజాగా ఉంటాయి.

وُجُوهٌ يَوْمَئِذٍ نَّاضِرَةٌ ﴿٢٢﴾

**23** తమ ప్రభువు వైపు చూస్తూ ఉంటాయి.[22]

إِلَىٰ رَبِّهَا نَاظِرَةٌ ﴿٢٣﴾

**24** ఆ రోజు మరెన్నో ముఖాలు ఉదాసీనం (కాంతిహీనం)గా ఉంటాయి.[23]

وَوُجُوهٌ يَوْمَئِذٍ بَاسِرَةٌ ﴿٢٤﴾

**25** తమ పట్ల నడ్డి విరిచే వ్యవహారం జరగనున్నదని అవి అనుకుంటూ ఉంటాయి.[24]

تَظُنُّ أَن يُفْعَلَ بِهَا فَاقِرَةٌ ﴿٢٥﴾

**26** అసంభవం.[25] (గుండెలోని) ప్రాణం గొంతు ప్రక్కన గల ఎముక వరకూ చేరుకున్నప్పుడు,[26]

كَلَّا إِذَا بَلَغَتِ التَّرَاقِيَ ﴿٢٦﴾

**27** "మంత్రించి నయం చేసే వాడెవడైనా ఉన్నాడా?"[27] అని అనబడినప్పుడు,

وَقِيلَ مَنْ ۜ رَاقٍ ﴿٢٧﴾

**28** "పోయేకాలం వచ్చింద"న్న [28] సంగతిని అతను తెలుసు కున్నప్పుడు,

وَظَنَّ أَنَّهُ الْفِرَاقُ ﴿٢٨﴾

**29** ఒక పిక్క మరో పిక్కతో ఒడుసుకున్నప్పుడు,[29]

وَالْتَفَّتِ السَّاقُ بِالسَّاقِ ﴿٢٩﴾

**30** (ఓ మానవాత్మా!) ఈ రోజు నీవు నీ ప్రభువు వైపు సాగి పోవలసి ఉంటుంది.

إِلَىٰ رَبِّكَ يَوْمَئِذٍ الْمَسَاقُ ﴿٣٠﴾

22. వెలిగిపోయే ఈ ముఖాలు విశ్వాసులవి. తమ సత్పరిణామంపట్ల హర్షాతిరేకంతో వారి ముఖాలు విప్పారుతాయి. వారి చెంపకెంపులు కాంతులీనుతూ ఉంటాయి. దానికితోడు దైవదర్శన భాగ్యంవల్ల వారి ఆనందానికి అవధులు ఉండవు.
23. ఇవి అవిశ్వాసుల ముఖాలు. దుఃఖం, అవమానభారంతో వారి ముఖాలు కళావిహీనం అవుతాయి.
24. అంటే – తమను నరకంలోనికి త్రోసివేయటం ఖాయం అని వారికి అర్థమైపోతుంది.
25. అంటే – అవిశ్వాసులు అంతిమ దినాన్ని విశ్వసించటం అనేది జరగని పని.
26. **'తరాఖీ'** అంటే కంఠానికి అతి దగ్గరలో ఛాతీకి – భుజాలకు మధ్య ఉండే ఎముక (Collar Bone).
27. అంటే మృత్యువుతో పోరాడుతున్న మనిషి చుట్టుప్రక్కల చేరిన వారిలో మంత్రించి ప్రాణం పోకుండా ఆపే వారెవరైనా ఉన్నారా? మరికొంతమంది అనువాదకులు ఇలా అనువదించారు: ఇతని ఆత్మను ఊర్ధ్వలోకాల్లోకి తీసుకుపోయే వారెవరు? కారుణ్యదూతలా? లేక శిక్షించే దూతలా? రెండవ అనువాదమే సరైందని అనుకున్నప్పుడు ఈ పలుకులు దైవదూతలవి అయి ఉంటాయి (ఫత్‌హుల్ ఖదీర్).
28. అంటే గుండెలోని ప్రాణం గొంతుదాకా వచ్చిన వ్యక్తి ఇట్టే అర్థం చేసేసుకుంటాడు – ఆస్తిపాస్తులను, ఆలుబిడ్డలను వీడిపోవలసిన తరుణం ఆసన్నమైందని!
29. అంటే దీని అర్థం : మరణ సమయంలో రెండు కాళ్లు కలసిపోవటం కావచ్చు. లేదా తెరలుతెరలుగా – నిరాఘాటంగా – వస్తూ ఉండే కష్టాలన్నది మరో అర్థం కావచ్చు. చాలామంది వ్యాఖ్యాతలు రెండవ అనువాదం వైపే మొగ్గుచూపారు. (ఫత్‌హుల్ ఖదీర్).

| | |
|---|---|
| **31** వాడు సత్యాన్ని ధృవీకరించనూ లేదు, నమాజు చేయనూ లేదు.[30] | فَلَا صَدَّقَ وَلَا صَلَّىٰ (31) |
| **32** పైగా వాడు (సత్యాన్ని) ధిక్కరించాడు, వెను తిరిగిపోయాడు.[31] | وَلَٰكِن كَذَّبَ وَتَوَلَّىٰ (32) |
| **33** మిడిసిపడుతూ, తన ఇంటివారల వైపు వెళ్ళిపోయాడు.[32] | ثُمَّ ذَهَبَ إِلَىٰ أَهْلِهِ يَتَمَطَّىٰ (33) |
| **34** శోచనీయం. నీ వైఖరి కడు శోచనీయం. | أَوْلَىٰ لَكَ فَأَوْلَىٰ (34) |
| **35** మరి విచారకరం. నీ ధోరణి మిక్కిలి విచారకరం.[33] | ثُمَّ أَوْلَىٰ لَكَ فَأَوْلَىٰ (35) |
| **36** ఏమిటీ, తనను ఇట్టే వదలిపెట్టడం జరుగుతుందని మానవుడు అనుకుంటున్నాడా?[34] | أَيَحْسَبُ الْإِنسَانُ أَن يُتْرَكَ سُدًى (36) |
| **37** ఏమిటి, అతను (ఒకప్పుడు, మాతృ గర్భంలో) స్ఖలించబడిన చిక్కటి వీర్య బిందువుగా ఉండలేదా? | أَلَمْ يَكُ نُطْفَةً مِّن مَّنِيٍّ يُمْنَىٰ (37) |
| **38** మరి అతను ఒక నెత్తుటి గడ్డగా మారాడు. తరువాత అల్లాహ్ అతన్ని (దశను) మలిచాడు. ఆపైన అతన్ని తగు విధంగా తీర్చి దిద్దాడు.[35] | ثُمَّ كَانَ عَلَقَةً فَخَلَقَ فَسَوَّىٰ (38) |
| **39** మరి దాన్నుండి ఆడ మగలనే జంటలను చేశాడు. | فَجَعَلَ مِنْهُ الزَّوْجَيْنِ الذَّكَرَ وَالْأُنثَىٰ (39) |
| **40** ఇదంతా చేసినవాడు మృతులను బ్రతికించలేడా?[36] | أَلَيْسَ ذَٰلِكَ بِقَادِرٍ عَلَىٰ أَن يُحْيِيَ الْمَوْتَىٰ (40) |

30. అంటే, ఈ మానవుడు దైవప్రవక్త (స)ను, దివ్య ఖుర్ఆన్‌ను త్రోసిపుచ్చాడు. నమాజు కూడా చేయలేదు.
31. దైవప్రవక్త (స)ను ఎదిరించటమేగాక, విశ్వాసం (ఈమాన్) పట్ల విముఖత చూపాడు.
32. **'యతమత్తా'** (يَتَمَطَّىٰ) అంటే అహంకారంతో విర్రవీగుతూ, నిక్కుతూ ఇంటికెళ్ళి పోయాడు – తానేదో ఘనకార్యం సాధించినట్లుగా!
33. హెచ్చరికగా ఈ మాటలనబడ్డాయి. ఓ ధిక్కారీ! నువ్వు ఊహించని విపత్కర స్థితిని దేవుడు నీపై తెచ్చిపెట్టుగాక! అని దీని భావం.
34. అంటే – తనకు ఏ ఆజ్ఞా ఇవ్వబడదనీ, ఏ విషయం నుండీ తాను ఆపబడననీ, తన నుండి లెక్క తీసుకోబడదని ఈ మనిషి అంచనా వేస్తున్నాడా?! లేక ఇతన్ని సమాధిలో ప్రశ్నించకుండా వదలివేయటం జరుగుతుందని, తనను తిరిగి బ్రతికించటం జరగదని తలపోస్తున్నాడా?
35. అంటే – అతన్ని అనేక దశలుగా మలిచాడు. నఖశిఖ పర్యంతం అతన్ని తీర్చిదిద్దాడు. సంపూర్ణ మానవాకృతి ప్రసాదించిన పిదప అందులో ప్రాణం పోశాడు.
36. మనిషిని ఇన్ని దశలలో మలిచి ప్రాణం పోసినవాడు, చచ్చిన తరువాత తిరిగి బ్రతికించ లేడా ఏమి?

76వ సూరా

# అద్ దహ్ర్ (అల్ ఇన్సాన్)

## యుగం (మానవుడు)

అవతరణ మక్కాలో

ఆయతులు 31

### పరిచయం

విశ్వసించి మంచిపనులు చేసిన వారికి లభించే సుఖసంతోషాల గురించి ఇందులో చెప్పడం జరిగింది. ఈ సూరాకు పెట్టబడిన పేరు మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. అల్లాహ్ మనలను సృష్టించి, మనకు రుజుమార్గాన్ని చూపించాడు. అల్లాహ్ పట్ల కృతజ్ఞతగా వ్యవహరించడం లేదా కృతఘ్నత చూపడం అన్నది మన ఇష్టానికి వదిలేయడం జరిగింది. ఈ సూరాలో విశ్వసించి మంచిపనులు చేసేవారి గుణగణాలను వర్ణించడం జరిగింది. వారు తమ ఆధ్యాత్మిక, సామాజిక బాధ్యతలను నిర్వర్తిస్తారు. తీర్పుదినానికి భయపడతారు. నిరుపేదలకు, అనాథలకు సహాయపడతారు. కాగా, సత్యతిరస్కారుల కోసం సంకెళ్ళు, గుదిబండలు, భగభగలాడే అగ్ని సిద్ధం చేయబడ్డాయి. పుణ్యాత్ములకు అల్లాహ్ అనుగ్రహాలు అపరిమితమైనవి. వారికి స్వర్గంలోని సెలయేటి నీరు కలిసిన మద్యం పాత్రలు అందుబాటులో ఉంటాయి. వారు చక్కని పట్టు వస్త్రాలు ధరిస్తారు. వారు బంగారు జలతారు వస్త్రాలు ధరిస్తారు. వారికి సౌకర్యవంతమైన ఆసనాలు ఉంటాయి. అక్కడ తీవ్రమైన వేడిగాని, తీవ్రమైన చలి గాని ఉండవు. అక్కడ వారికి వివిధ రకాల ఫలాలు లభిస్తాయి. అవి వారికి అందుబాటులో క్రిందికి వేలాడుతూ ఉంటాయి. వెండిపాత్రలు వారి ముందు ఉంటాయి. వారక్కడ సొంటి కలిసిన మధు పాత్రలు అందుకుంటారు (ఆ మద్యం ఎలాంటి మత్తు కలిగించదు- ఖుర్ఆన్:47:15). వారి సేవ కోసం నిత్యబాలలు అటూఇటూ పరుగిడుతూ ఉంటారు.

ఈ సూరాలో ఈ క్రింది ముఖ్యాంశాలు చర్చించబడ్డాయి:

***1. సహాయం :*** *అల్లాహ్ కోసం అవసరార్థులకు సహాయం చేయాలి. ప్రజల నుంచి ప్రతిఫలం పొందాలని ఎన్నడూ ఆశించరాదు.*

***2. బహుమానం :*** *ప్రపంచంలో మంచి పనులు చేసి పరలోకంలో అల్లాహ్ బహుమానాలు పొందాలి.*

***3. ప్రాపంచిక జీవితం :*** *తాత్కాలికమైన ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహం పెంచుకోరాదు.*

***4. భక్తి :*** *విశ్వప్రభువు పట్ల విధేయతతో ఆయన్ను ఆరాధించాలి. ఉదయం, సాయంత్రం, రాత్రివేళల్లో ఆయన ఔన్నత్యాన్ని కొనియాడాలి.*

## అద్ దహ్ర్[1] (అల్ ఇన్సాన్) సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** సుదీర్ఘమైన కాలంలో మానవుడు చెప్పుకోదగ్గ వస్తువుగా లేకుండా ఉండిన సమయం ఒకటి గడవలేదా?[2]

**2** నిశ్చయంగా మేము మానవుణ్ణి పరీక్షించడానికి ఒక మిశ్రమ వీర్య బిందువుతో[3] పుట్టించాము. మరి మేము అతన్ని వినే వాడుగా, చూసేవాడుగా చేశాము.[4]

**3** మేమతనికి మార్గం కూడా చూపాము. ఇక వాడు కృతజ్ఞుడుగా వ్యవహరించినా లేక కృతఘ్నుడుగా తయారైనా[5] (వాడి ఇష్టం. మేము వాడి స్వేచ్ఛను హరించలేదు).

## سُوْرَةُ الْاِنْسَانِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

هَلْ اَتٰى عَلَى الْاِنْسَانِ حِيْنٌ مِّنَ الدَّهْرِ لَمْ يَكُنْ
شَيْـًٔا مَّذْكُوْرًا ﴿1﴾
اِنَّا خَلَقْنَا الْاِنْسَانَ مِنْ نُّطْفَةٍ اَمْشَاجٍ ۖ نَّبْتَلِيْهِ
فَجَعَلْنٰهُ سَمِيْعًا بَصِيْرًا ﴿2﴾
اِنَّا هَدَيْنٰهُ السَّبِيْلَ اِمَّا شَاكِرًا وَّاِمَّا كَفُوْرًا ﴿3﴾

1. ఈ సూరా మక్కాలో అవతరించిందా? లేక మదీనాలోనా? అన్న విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. అత్యధికమంది విద్వాంసులు మాత్రం దీన్ని మదీనా సూరా గానే ఖరారు చేశారు. ఈ సూరాలోని చివరి 10 వచనాలు మాత్రం మక్కాలోనివనీ, మిగతా ఆయతులన్నీ మదీనాలో అవతరించాయని మరి కొంతమంది భావిస్తున్నారు. (ఫత్‌హుల్ ఖదీర్). మహాప్రవక్త (సఅసం) వారు శుక్రవారం నాడు ఫజ్ర్ నమాజులో సజ్దా సూరాతో పాటు దహ్ర్ (ఇన్సాన్) సూరా కూడా పఠించేవారు (సహీహ్ ముస్లిం – జుమా ప్రకరణం). ఈ సూరాను సూరయె ఇన్సాన్‌గా కూడా వ్యవహరిస్తారు.
2. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ ఆయతులో **'ఇన్సాన్'** అనే పదం ఆది మానవుడు హజ్రత్ ఆదం నేపథ్యంలో ఉంది. **'హీన్'** (حِيْنٌ) అంటే ఒకప్పుడు, ఒక సమయం అని అర్థం. అంటే ప్రాణం పోయకముందు ఉన్న (గడచిన) సమయం – అది 40 ఏండ్లు. చాలామంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారమైతే 'ఇన్సాన్' అనే పదం మనుజ జాతి అన్న భావంలోనే ప్రయోగించబడింది. మానవుడు తల్లి గర్భంలో ఉన్న కాలం 'హీన్' అనబడుతుందని వారు వ్యాఖ్యానించారు. గర్భస్థ శిశువుగా ఉన్న సమయంలో మనిషి పెద్దగా చెప్పుకోదగ్గవాడు కాదు. అత్యంత అల్పమైన వీర్య బిందువుతో అతని నిర్మాణ దశ మొదలవుతుంది. కాని వాడు తీరా అత్యంత అందమైన శరీరాకారంతో తల్లి కడుపును చించుకుని బయటకు రాగానే గడసరి మనిషిగా మారిపోతాడు. పెడసరి మాటలు పలుకుతాడు. బీరాలు పోతాడు. నిజానికి వాడు తన పూర్వ స్థితిని మరువరాదు. ఒకప్పుడు తనకంటూ ఒక ఉనికి లేదని, తనెవరో ఎవరికీ తెలియదని అతను గుర్తించాలి. ఈ విధంగా అహంభావులైన మనుషులందరినీ ఈ ఆయతు హెచ్చరిస్తుంది.
3. **'మిశ్రమ వీర్య బిందువు'** అంటే స్త్రీ పురుషులిద్దరూ రతిక్రీడ జరిపినప్పుడు వెలువడే ద్రవపదార్థం అన్నమాట. ఆ తరువాత స్త్రీ గర్భాశయంలో అది వివిధ దశల్లో అభివృద్ధి చెందుతుంది. ఇంతకీ ఈ మానవ పుట్టుకలోని పరమార్థం అతన్ని పరీక్షించటమే. ఎవరు ఉత్తమంగా ఆచరిస్తారో పరీక్షించేందుకే (అల్ ముల్క్ – 2) దేవుడు మనిషిని సృజించాడు.
4. అంటే అతనికి కనే, వినే శక్తులను కానుకగా ప్రసాదించాము. ఎందుకంటే అతను అన్నింటినీ చూడాలి. అందరూ చెప్పేది వినాలి. ఆ తరువాత మంచీ చెడులలో ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకోవాలి.
5. మేము మనిషికి ఈ శక్తియుక్తులను ప్రసాదించి ఇట్టే వదలిపెట్టలేదు. ఆధ్యాత్మికంగా అతని మార్గదర్శకత్వం కోసం గొప్ప ఏర్పాటు కూడా చేశాము. మేము మా ప్రవక్తల ద్వారా, మా గ్రంథాల ద్వారా, మా సందేశహరుల ద్వారా

4 అవిశ్వాసుల కోసం మేము సంకెళ్ళను, ఇనుప పట్టాలను, జ్వలించే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము.[6]

إِنَّآ أَعْتَدْنَا لِلْكَٰفِرِينَ سَلَٰسِلَا۟ وَأَغْلَٰلًا وَسَعِيرًا ﴿٤﴾

5 నిశ్చయంగా సజ్జనులు (విశ్వాసులు) 'కాఫూర్' కలుపబడిన మధు పాత్రలను సేవిస్తారు.[7]

إِنَّ ٱلْأَبْرَارَ يَشْرَبُونَ مِن كَأْسٍ كَانَ مِزَاجُهَا كَافُورًا ﴿٥﴾

6 అదొక సరోవరం.[8] దైవదాసులు దాన్నుండి (తనివి తీరా) త్రాగుతారు. (తాము కోరిన చోటికి) దాని పాయలు తీసుకు పోతారు.[9]

عَيْنًا يَشْرَبُ بِهَا عِبَادُ ٱللَّهِ يُفَجِّرُونَهَا تَفْجِيرًا ﴿٦﴾

7 వారు తమ మొక్కుబడులను చెల్లిస్తుంటారు.[10] ఏ రోజు కీడు నలువైపులా విస్తరిస్తుందో ఆ రోజు గురించి భయపడు తుంటారు.[11]

يُوفُونَ بِٱلنَّذْرِ وَيَخَافُونَ يَوْمًا كَانَ شَرُّهُۥ مُسْتَطِيرًا ﴿٧﴾

8 అల్లాహ్ ప్రీతికోసం[12] నిరుపేదలకు, అనాధులకు, ఖైదీలకు అన్నం పెడుతుంటారు.

وَيُطْعِمُونَ ٱلطَّعَامَ عَلَىٰ حُبِّهِۦ مِسْكِينًا وَيَتِيمًا وَأَسِيرًا ﴿٨﴾

---

సన్మార్గమేదో చక్కగా వివరించాము. ఇప్పుడతను దైవవిధేయతా మార్గాన్ని అవలంబించి ధన్యజీవిగా నెగ్గుకువస్తాడో లేక దుర్మార్గాన్ని అనుసరించి మా మేలును మరచిపోతాడో అతని ఇష్టం. ఈ విషయాన్నే మహాప్రవక్త (సఅసం) వారు ఈ విధంగా ప్రవచించారు : "ప్రతి వ్యక్తీ తన అంతరాత్మను క్రయవిక్రయాలకై పెడతాడు. ఈ వర్తకంలో అతడు దాన్ని చంపినా చంపేస్తాడు లేదా దానికి స్వేచ్ఛనయినా ప్రసాదిస్తాడు" (సహీహ్ ముస్లిం – శుచీశుభ్రతల ప్రకరణం). అంటే అతడు తన కర్మల ద్వారా దాని గొంతు నులిమి వేయటమో లేక దాని గౌరవాన్ని కాపాడటమో చేస్తాడు. అతను దురాగతాలకు పాల్పడితే అంతరాత్మను చంపేసినట్లే. ఒకవేళ అతను సత్కార్యాలు చేస్తే అంతరాత్మకు ముక్తిని ప్రసాదించిన వాడవుతాడు.

6. దేవుడిచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను దుర్వినియోగపరచినందుకు కలిగిన పర్యవసానమిది.

7. **'కాసున్'** (كَأْس) అంటే నిండుగా ఉన్న గ్లాసు. **'కాఫూర్'** అనేది చల్లని, సువాసనతో కూడిన పదార్థం. దానిని మధువులో కలపటం వలన దాని రుచి, మాధుర్యం ఇంకా పెరుగుతుంది. మధువు సేవించే చోట సువాసన గుభాళిస్తూ ఉంటుంది.

8. కాఫూర్ ద్రవ్యం కలిసిన ఆ మద్యం కాస్తో కూస్తో ఉండదు. అదొక పెద్ద సరోవరం. అది ఎన్నటికీ తరగదు.

9. వారు ఆ సరోవరం నుంచి తాము విడిదిచేసిన చోటికి పిల్ల కాలువలు తీసుకుపోతారు.

10. అంటే వారు నిజ దైవాన్ని పూజిస్తారు. ఆయనకే విధేయత చూపుతారు. మొక్కుకున్నా ఆ ఒక్క దైవం పేరునే మొక్కుకుంటారు. ఆయన పేరుమీదే మొక్కుబడులు చెల్లిస్తారు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే మొక్కుబడులను చెల్లించటం అవసరం. అయితే ఆ మొక్కుబడులలో షిర్క్ ఉండకూడదు. హదీసులో ఈ విధంగా ఉంది : "ఎవరయితే అల్లాహ్‌కు విధేయత చూపుతానని మొక్కుకున్నాడో అతను ఆ మొక్కును నెరవేర్చాలి. మరెవరయితే అల్లాహ్‌కు అవిధేయత కనబరుస్తానని మొక్కుకున్నాడో అతను దాన్ని నెరవేర్చకూడదు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్).

11. అంటే – ఆ రోజు భీకరస్థితిని తలచుకుంటూ పాపకార్యాలకు, దేవుని అవిధేయతకు దూరంగా ఉంటారు. ఆ రోజు దేవుడు తన మన్నింపు, కారుణ్య ఛాయలోకి తీసుకున్న వారు మాత్రమే సురక్షితంగా ఉంటారు. మిగిలిన వారిని ఆ రోజు ఆపద నలువైపుల నుంచీ చుట్టుముట్టుతుంది.

**9** (పైగా వారిలా అంటారు) : "మేము కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే మీకు తినిపిస్తున్నాము. అంతేగాని మీ నుండి మేము ఎలాంటి ప్రతిఫలాన్నిగానీ, ధన్యవాదాలనుగానీ ఆశించటం లేదు."

إِنَّمَا نُطْعِمُكُمْ لِوَجْهِ اللَّهِ لَا نُرِيدُ مِنكُمْ جَزَاءً
وَلَا شُكُورًا ﴿٩﴾

**10** "నిశ్చయంగా మేము మా ప్రభువు తరపున సంభవించే అత్యంత కఠినమైన, సుదీర్ఘమైన రోజు గురించి భయపడుతున్నాము."[13]

إِنَّا نَخَافُ مِن رَّبِّنَا يَوْمًا عَبُوسًا قَمْطَرِيرًا ﴿١٠﴾

**11** అందువల్ల అల్లాహ్ వారిని ఆనాటి కీడు నుండి రక్షించి,[14] వారికి ఉల్లాసాన్నీ, ఆహ్లాదాన్నీ వొసగాడు.[15]

فَوَقَاهُمُ اللَّهُ شَرَّ ذَٰلِكَ الْيَوْمِ وَلَقَّاهُمْ نَضْرَةً
وَسُرُورًا ﴿١١﴾

**12** వారి సహనానికి బదులుగా[16] వారికి స్వర్గాన్నీ, పట్టువస్త్రాలను ప్రసాదించాడు.

وَجَزَاهُم بِمَا صَبَرُوا جَنَّةً وَحَرِيرًا ﴿١٢﴾

**13** వారక్కడ దిండ్లకు ఆనుకుని పీఠాలపై కూర్చుని ఉంటారు. అక్కడ వారు సూర్య తాపాన్నిగానీ, చలి తీవ్రతనుగానీ చూడరు.[17]

مُّتَّكِئِينَ فِيهَا عَلَى الْأَرَائِكِ ۖ لَا يَرَوْنَ فِيهَا
شَمْسًا وَلَا زَمْهَرِيرًا ﴿١٣﴾

---

12. వారు తమ సుఖసంతోషాలను సయితం పక్కనబెట్టి దేవుని మెప్పుకోసం అగత్యపరులకు అన్నం పెట్టేవారు. కారాగార వాసులు తమ మతస్థులు కాకపోయినా వారిపట్ల సద్వ్యవహారం చేయాలని ఈ ఆయతులో తాకీదు చేయబడింది. ఉదాహరణకు : బద్ర్ యుద్ధానంతరం యుద్ధ ఖైదీల పట్ల మర్యాదగా మసలుకోవాలని దైవప్రవక్త(స) తన సహచరులకు ఉపదేశించారు. అందువల్ల ప్రియసహచరులు తాము తినకుండానే ఆ యుద్ధ ఖైదీలకు పెట్టేవారు. వాళ్లు మాత్రం తరువాత తినేవారు (ఇబ్నె కసీర్). అలాగే బానిసలు, ఇంటిసేవకులు కూడా ఈ కోవలోకే వస్తారు. వారిపట్ల అలాగే మసలు కోవాలి. మహాప్రవక్త (స) చివరి బోధనల్లో ఒకటి "సమాజులను, బానిసలను కనిపెట్టుకుని ఉండండి" అన్నది. (ఇబ్ను మాజ – వీలునామాల ప్రకరణం).

13. **'ఖమ్‌తరీరా'** (قَمْطَرِيرًا) అంటే చాలా సుదీర్ఘమైనది అని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు. 'అబూస్' అంటే కఠినమైనది అని అర్థం. ఆ రోజు అత్యంత కఠినమైనది, దుర్భరమైనదవటంచేత అవిశ్వాసులకు అది చాలా సుదీర్ఘం అనిపిస్తుంది (ఇబ్నె కసీర్).

14. ఎందుకంటే ఆనాటి కీడుకు వారు భయపడేవారు. దాన్నుండి తమను కాపాడమని దైవాన్ని ప్రార్థిస్తూ ఉండేవారు.

15. వారి మొహాలపై ఉల్లాసం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. వారి మనసులు సంతోషంతో పులకిస్తాయి. మనిషి మనసులో తృప్తి, ఆనందం ఉన్నప్పుడు అతని మొహంపై కూడా ఆహ్లాదం కానవస్తుంది. మహాప్రవక్త (సఅసం)కు కూడా సంతోషం కలిగినప్పుడు ఆయన (స) ముఖారవిందం పున్నమి చంద్రుని వలె వెలిగి పోతుండేదని హదీసు ద్వారా తెలుస్తోంది (బుఖారీ – కితాబుల్ మగాజీ; ముస్లిం – కితాబుత్తౌబా).

16. **సహనం** (సబ్ర్) అంటే దైవమార్గంలో ఎదురైన కష్టనష్టాలను మనస్ఫూర్తిగా సహించటం, దైవవిధేయతా యత్నంలో మనోవాంఛలను అదుపులో పెట్టుకోవటం, పాపాలకు దూరంగా ఉండటం అని అర్థం.

17. స్వర్గంలోని వాతావరణం ఎప్పుడూ ఒకేవిధంగా ఉంటుంది. అక్కడ తీవ్రమైన వేసవి గాని, ఎముకలు కొరికే చలిగానీ ఉండదు. పైగా అక్కడి వాతావరణం మధ్యస్థంగానూ–వసంతకాలం మాదిరిగానూ ఉంటుంది. **'జమ్‌హరీరా'** (زَمْهَرِيرًا) అంటే విపరీతమైన చలి.

**14** స్వర్గవనాల నీడలు వారిపై పడుతూ ఉంటాయి.[18] వాటి పండ్ల గుత్తులు క్రిందికి వ్రేలాడుతూ(అందుబాటులో) ఉంటాయి.[19]

وَدَانِيَةً عَلَيْهِمْ ظِلَالُهَا وَذُلِّلَتْ قُطُوفُهَا تَذْلِيلًا ﴿١٤﴾

**15** వారి సేవలో వెండి పాత్రలు, గాజు గిన్నెలు త్రిప్పబడుతూ ఉంటాయి.[20]

وَيُطَافُ عَلَيْهِم بِآنِيَةٍ مِّن فِضَّةٍ وَأَكْوَابٍ كَانَتْ قَوَارِيرَا ﴿١٥﴾

**16** ఆ గాజు గిన్నెలు కూడా వెండివై ఉంటాయి.[21] వాటిని (నింపే వారు) ఒక అంచనా ప్రకారం సరిగ్గా నింపి ఉంటారు.[22]

قَوَارِيرَا مِن فِضَّةٍ قَدَّرُوهَا تَقْدِيرًا ﴿١٦﴾

**17** వారికక్కడ సొంటి[23] కలిపిన మధు పాత్రలు త్రాగడానికి ఇవ్వబడతాయి –

وَيُسْقَوْنَ فِيهَا كَأْسًا كَانَ مِزَاجُهَا زَنجَبِيلًا ﴿١٧﴾

**18** స్వర్గంలోని ఒక సెలయేరు నుండి. దాని పేరు సల్‌సబీల్.[24]

عَيْنًا فِيهَا تُسَمَّىٰ سَلْسَبِيلًا ﴿١٨﴾

**19** వారి చుట్టూ (నవ నవలాడే) పిన్న వయస్కులైన అబ్బాయిలు తిరుగాడుతూ ఉంటారు. వాళ్లు నిత్యం అబ్బాయిలుగానే ఉంటారు.[25] నీవు వారిని చూసినప్పుడు చెదిరిన ముత్యాలా! అని భావిస్తావు.[26]

وَيَطُوفُ عَلَيْهِمْ وِلْدَانٌ مُّخَلَّدُونَ إِذَا رَأَيْتَهُمْ حَسِبْتَهُمْ لُؤْلُؤًا مَّنثُورًا ﴿١٩﴾

18. అక్కడ గ్రీష్మతాపం ఉండనప్పటికీ స్వర్గవనాల నీడలు స్వర్గవాసులపై పడుతూ ఉంటాయి. లేదా చెట్లశాఖలు వారికి దగ్గరగా వంగి ఉంటాయి.

19. పండ్ల గుత్తులు ఎంతో వినయంగా వారి ముందు వాలి ఉంటాయి. స్వర్గవాసులు ఎప్పుడు ఏ పండు తినాలనుకున్నా అది వారికి అందుబాటులోకి వచ్చేస్తుంది. వారు కూర్చుని, పరుండి కూడా వాటిని తుంచుకోవచ్చు (ఇబ్నె కసీర్).

20. అంటే – సేవకులు వాటిని పట్టుకుని స్వర్గవాసుల మధ్య తిరుగుతూ ఉంటారు.

21. అంటే ఆ పాత్రలు, కప్పులు వెండితోనూ, గాజుతోనూ చేయబడినవి. అవి ఎంతో నాజూగ్గా, తెల్లగా ఉంటాయి. ప్రపంచంలోని ఏ పరిశ్రమలో కూడా అటువంటి నాణ్యమైన పాత్రలు తయారవవు.

22. ఆ గిన్నెలలో నింపబడిన మధువు స్వర్గవాసులకు సరిగ్గా సరిపోతుంది. తగ్గటంగానీ, మిగిలిపోవటంగానీ ఉండదు. సేవకులు ఎంతో మర్యాదపూర్వకంగా వారికి ఈ ద్రాక్షరసాన్ని సమర్పిస్తూ ఉంటారు.

23. **'జన్‌జబీల్'** (زَنجَبِيلٌ) అంటే సొంటి లేక ఎండు అల్లం. ఇది వేడి వస్తువు. దీనిని కలుపటం వల్ల మనసుకు, మస్తిష్కానికి ఒకలాంటి వెచ్చదనం, హాయి లభిస్తుంది. సొంటి అరబ్బులకు ఎంతో ప్రియమైనది. వారు కాఫీ మాదిరిగా త్రాగే 'గహ్వా' లో కూడా సొంటి కలుపబడుతుంది. మొత్తానికి తేలిందేమిటంటే స్వర్గంలో రెండు రకాల మద్యాలుంటాయి. ఒకటి : చల్లని మద్యం. అందులో కర్పూర జలం కలుపబడుతుంది. రెండవది: వేడినిచ్చే మద్యం. అందులో సొంటి కలుపబడుతుంది.

24. అంటే–ఈ రకమైన వేడి మద్యాన్ని త్రాపే సెలయేరు ఒకటి ప్రత్యేకంగా ఉంటుంది. అది **'సల్‌సబీల్'**గా వ్యవహరించ బడుతుంది.

25. మధువు గుణం గురించి తెలుపబడిన తరువాత, ఆ మధువును అందించే సేవకుల గుణగణాలు కూడా వివరించ బడ్డాయి. వారు నిత్యం స్వర్గవాసుల సేవలో ఉంటారు. 'నిత్యం' అన్న మాటలో రెండు అర్థాలు స్ఫురిస్తున్నాయి. 1. వారికి అసలు మృత్యువు అనేది ఉండదు. 2. వారు సదా టీనేజీ కుర్రాళ్లుగానే ఉంటారు. వారు ముసలి వారవరు. వారి అందం చెక్కు చెదరకుండా అలాగే ఉంటుంది.

**20** నువ్వు అక్కడ ఎటుచూసినా గొప్ప[27] అనుగ్రహాలు, మహా సామ్రాజ్య వైభవమే కానవస్తాయి.

وَإِذَا رَأَيْتَ ثَمَّ رَأَيْتَ نَعِيمًا وَمُلْكًا كَبِيرًا ﴿٢٠﴾

**21** వారి శరీరాలపై పచ్చని, నాణ్యమైన సన్నని సిల్కు వస్త్రాలు,[28] దళసరి పట్టు వస్త్రాలే ఉంటాయి. ఇంకా, వారికి వెండి కంకణాలు – ఆభరణంగా – తొడిగింపబడతాయి.[29] వారి ప్రభువు వారికి స్వచ్ఛమైన, పరిశుద్ధమైన మధువును త్రాగిస్తాడు.

عَالِيَهُمْ ثِيَابُ سُندُسٍ خُضْرٌ وَإِسْتَبْرَقٌ ۖ وَحُلُّوا أَسَاوِرَ مِن فِضَّةٍ وَسَقَاهُمْ رَبُّهُمْ شَرَابًا طَهُورًا ﴿٢١﴾

**22** "ఇది మీ కర్మలకు బదులుగా ఇవ్వబడిన ప్రతిఫలం. మీ కృషి స్వీకరించబడింది (గుర్తించబడింది అని వారితో అనబడు తుంది)."

إِنَّ هَٰذَا كَانَ لَكُمْ جَزَاءً وَكَانَ سَعْيُكُم مَّشْكُورًا ﴿٢٢﴾

**23** నిశ్చయంగా మేము నీపై ఖుర్ఆన్‌ను అంచెలవారీగా అవత రింపజేశాము.[30]

إِنَّا نَحْنُ نَزَّلْنَا عَلَيْكَ الْقُرْآنَ تَنزِيلًا ﴿٢٣﴾

**24** కాబట్టి (ఓ ముహమ్మద్ – స!) నువ్వు నీ ప్రభువు ఆదేశంపై స్థిరంగా ఉండు.[31] వారిలోని ఏ పాపాత్ముని, మరే కృతఘ్నుని మాటా వినకు.[32]

فَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ وَلَا تُطِعْ مِنْهُمْ آثِمًا أَوْ كَفُورًا ﴿٢٤﴾

**25** నీ ప్రభువు నామాన్ని ఉదయం, సాయంత్రం స్మరిస్తూ ఉండు.[33]

وَاذْكُرِ اسْمَ رَبِّكَ بُكْرَةً وَأَصِيلًا ﴿٢٥﴾

26. పరిశుభ్రత రీత్యా, అందచందాల రీత్యా, ఆకర్షణ రీత్యా వారు కడిగిన ముత్యాల్లా ఉంటారు. **'చెదిరిన'** అంటే వారు ఒకే చోట నిలబడకుండా స్వర్గవాసుల సేవలో అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు.

27. అంటే – స్వర్గంలో ఏ వైపు దృష్టిని సారించినా...

28. **'సుందుస్'** అంటే పలుచటి పట్టువస్త్రాలు. **'ఇస్తబ్రఖ్'** అంటే దళసరి పట్టు వస్త్రాలు.

29. ఒకప్పుడు రాజులు, కులపెద్దలు, ప్రముఖులు ఇలాంటి కంకణాలను ధరించేవారు.

30. అంటే – దివ్య ఖుర్ఆన్‌ను ఒకేసారి కాకుండా కొద్దికొద్దిగా, అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా – వివిధ సందర్భాలలో – అవతరింపజేశాము. ఈ వాక్యానికి మరో అర్థం ఇది కూడా కావచ్చు : "ఈ గ్రంథాన్ని మేమే అవతరింపజేశాము. (ఓ ప్రవక్తా!) ఈ ముష్రిక్కులు నిందిస్తున్నట్లు ఇది నీ స్వీయరచన కాదు."

31. అంటే – నీ ప్రభువు నిర్ణయం కొరకు ఎదురుచూస్తూ ఉండు. నీకు తోడ్పాటునందించటంలో దేవుడు ఆలస్యం చేసినంత మాత్రాన నువ్వు కలవరం చెందనవసరం లేదు. ఇందులో కూడా ఏదైనా పరమార్థం ఉండవచ్చు. అందుకే నీవు ఓపిక పట్టాలి.

32. వాళ్లు ఎప్పుడయినా నిన్ను దైవాదేశాల నుండి ఆపే ప్రయత్నం చేస్తే నువ్వు వాళ్ల మాట వినకు. సందేశ ప్రచార కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తూ ఉండు. అల్లాహ్‌పై భారం మోపి ముందుకు సాగిపో. జనుల కీడు నుండి ఆయన నిన్ను రక్షిస్తాడు. దైవధిక్కారులైనా, మనసుల్లో తిరస్కారం పెనవేసుకుపోయిన వారైనా, శత్రుత్వంలో హద్దులు

**26** రాత్రివేళ ఆయన సన్నిధిలో సాష్టాంగ పడుతూ ఉండు. రాత్రి చాలాసేపు ఆయన పవిత్రతను కొనియాడు.[34]

وَمِنَ الَّيْلِ فَاسْجُدْ لَهٗ وَسَبِّحْهُ لَيْلًا طَوِيْلًا ﴿26﴾

**27** వీళ్లు తొందరగా లభించేదాని (ప్రపంచం)పై మోజు పడుతున్నారు.[35] తమ వెనుక ఒక బరువైన దినాన్ని వదలి వేస్తున్నారు.[36]

اِنَّ هٰٓؤُلَآءِ يُحِبُّوْنَ الْعَاجِلَةَ وَ يَذَرُوْنَ وَرَآءَهُمْ يَوْمًا ثَقِيْلًا ﴿27﴾

**28** (మరి చూడబోతే) వీరిని పుట్టించింది, వీళ్ల కీళ్లను దృఢ పరచినది మేమే.[37] మరి మేము తలచుకున్నప్పుడల్లా వీరికి బదులుగా వీరిలాంటి వారిని తీసుకురాగలము.[38]

نَحْنُ خَلَقْنٰهُمْ وَشَدَدْنَآ اَسْرَهُمْ ۚ وَاِذَا شِئْنَا بَدَّلْنَآ اَمْثَالَهُمْ تَبْدِيْلًا ﴿28﴾

**29** నిశ్చయంగా ఇదొక ఉపదేశం. ఇక కోరినవారు తమ ప్రభువు మార్గాన్ని అవలంబించవచ్చు.[39]

اِنَّ هٰذِهٖ تَذْكِرَةٌ ۚ فَمَنْ شَآءَ اتَّخَذَ اِلٰى رَبِّهٖ سَبِيْلًا ﴿29﴾

---

మీరిపోయే వారైనా – వారెవరూ నిన్ను ఏమీ చేయలేరు. మూలంలో **'కఫూరా'** అని ఉంది. మనసులో తిరస్కార వైఖరిని అవలంబించేవారిని, తిరస్కారంలో మితిమీరిపోయేవారిని 'కఫూర్' అంటారు. కాగా; చేతల్లో దైవ అవిధేయతకు పాల్పడుతుండేవాడిని **'ఫాజిర్'** అంటారు.

కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఈ వాక్యం వలీద్ బిన్ ముగీరాను దృష్టిలో పెట్టుకుని అవతరించింది. ఎందుకంటే ఈ దైవవిరోధి దైవప్రవక్త (సఅసం) వద్దకు పంపిన ఒక ప్రతిపాదనలో "నువ్వు ఈ పనిని మానుకుంటే, నువ్వు కోరినంత ధనాన్ని నీ పాదాక్రాంతం చేస్తాం. అరేబియాలోని ఏ సుందరాంగిని నువ్వు వివాహమాడదలచినా ఆమెను నీకిచ్చి వివాహం జరిపిస్తాం" అన్నాడు (ఫత్‌హుల్ ఖదీర్).

33. **'ఉదయం, సాయంత్రం'** అంటే ఎల్లవేళలా అని దీని భావం. లేక ఉదయం అంటే ఫజ్ర్ నమాజ్‌లో అనీ, సాయంత్రం అంటే అస్ర్ నమాజులో అనీ అర్థం కావచ్చు.

34. రాత్రివేళ సజ్దా చేయటమంటే కొంతమంది అభిప్రాయం ప్రకారం మగ్రిబ్, ఇషా నమాజులన్నమాట. పవిత్రతను కొనియాడటమంటే ఏ ఏ విషయాలతో అల్లాహ్‌కు ఎలాంటి సంబంధం లేదో వాటినుండి అల్లాహ్ పరిశుద్ధుడు అనే భావాన్ని స్ఫురింపజేసే పదాలతో, వాక్యాలతో అల్లాహ్‌ను స్తుతించటం. రాత్రిపూట నఫిల్ నమాజు – తహజ్జుద్ నమాజ్ – లో ఎక్కువసేపు గడపటమే దీని భావం అని మరికొంతమంది వ్యాఖ్యానించారు.

35. ఈ మక్కా అవిశ్వాసులుగానీ, వీరిలాంటి ఇతర జనులుగానీ ప్రాపంచిక వ్యామోహంలో పడి ఉన్నారు. వీరి సకల సన్నాహాలు, సమస్త పథకాలు ఈ ఐహిక జీవితం కొరకే పరిమితం అయినాయి.

36. అంటే ప్రళయదినాన్ని వీళ్లు విస్మరిస్తున్నారు. ఆ దినాన తిరస్కారులకు ఎదురయ్యే ఎన్నో గడ్డు సమస్యల మూలంగా దానిని బరువైన దినంగా పేర్కొనటం జరిగింది. కాని ఈ మొండి ఘటాలు ఆ దినం కోసం ఏ మాత్రం చింతించటం లేదు.

37. అంటే, వారి పుట్టుకను మేము ఎంతో పటిష్టపరచాము. లేదా నరాల ద్వారా, నాడుల ద్వారా వారి ఎముకలకు శక్తిని ఇచ్చాము.

38. అంటే వీరిని తుదముట్టించి, వీరి స్థానంలో మరొక జాతిని ఉనికిలోనికి తీసుకురాగలము. లేక ప్రళయదినాన వీరిని మళ్లీ బ్రతికిస్తాము అన్న అర్థం కూడా కావచ్చు.

30 అల్లాహ్ కోరనిదే మీరు కోరలేరు.[40] నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేచనాపరుడు.[41]

وَمَا تَشَآءُونَ إِلَّآ أَن يَشَآءَ ٱللَّهُ ۚ إِنَّ ٱللَّهَ كَانَ عَلِيمًا حَكِيمًا ﴿٣٠﴾

31 ఆయన తాను కోరిన వారిని తన కారుణ్య పరిధిలోకి తీసుకుంటాడు. దుర్మార్గుల కోసం ఆయన బాధాకరమైన శిక్షను సిద్ధం చేసి ఉంచాడు.

يُدْخِلُ مَن يَشَآءُ فِى رَحْمَتِهِۦ ۚ وَٱلظَّٰلِمِينَ أَعَدَّ لَهُمْ عَذَابًا أَلِيمًۢا ﴿٣١﴾

39. అంటే, ఈ ఖుర్ఆన్ గ్రంథం ద్వారా వారు ఉపదేశం గ్రహించవచ్చు.

40. అంటే – మీలో ఎవరూ ఎవరికీ సన్మార్గం ప్రసాదించే శక్తినిగానీ, మీ స్వయానికి ఏదైనా లాభాన్ని చేకూర్చుకోగల అధికారంగానీ కలిగిలేరు. అయితే అల్లాహ్ గనక తలిస్తే ఇలా జరగటం సాధ్యమే. ఆయన ఇచ్ఛతో నిమిత్తం లేకుండా మీరేమీ చేయలేరు. కాని సంకల్పశుద్ధిని బట్టి ఆయన ప్రతి ఒక్కరికీ పుణ్యఫలాన్ని మాత్రం ప్రసాదిస్తాడు. "ఆచరణలు సంకల్పాలపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రతి మనిషికీ అతను సంకల్పించుకున్నదే లభిస్తుంది."

41. ఆయన మహాజ్ఞాని. గొప్ప వివేకవంతుడు. అందువల్ల ఆయన తరఫున జరిగే ప్రతి పనిలో యుక్తి, వివేకం నిండి ఉంటుంది. సన్మార్గం, అపమార్గాల నిర్ణయాలు కూడా అల్లాటప్పాగా జరగవు. సన్మార్గ భాగ్యానికి యోగ్యుడైన వ్యక్తికే సన్మార్గం ప్రసాదించబడుతుంది. మరెవరి వాటాలోనికయినా మార్గవిహీనత వచ్చిందంటే, వాస్తవానికి అతను దానికే తగినవాడని భావించాలి.

77వ సూరా

# అల్ ముర్సలాత్

## నిరాఘాటంగా పంపబడే గాలులు

అవతరణ మక్కాలో

ఆయతులు 50

### పరిచయం

*ఈ సూరాలో ముఖ్యంగా ప్రళయం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినాల గురించి ప్రస్తావించడం జరిగింది. ఈ సూరాకు పెట్టబడిన పేరు మొదటి ఆయతులో వచ్చింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది తప్పనిసరిగా జరిగే సంఘటన అని ఈ సూరా నొక్కి చెప్పింది. ఆ రోజున నక్షత్రాలు మసకబారిపోతాయి. ఆకాశం తునా తునకలవుతుంది. పర్వతాలు దుమ్ముమాదిరిగా ఎగురుతాయి. ఆ రోజున ప్రవక్తలందరినీ పిలిచి వారు అల్లాహ్ సందేశాన్ని మానవాళికి అందించడం జరిగిందా లేదా అన్న విషయమై వాంగ్మూలం ఇవ్వమని కోరడం జరుగుతుంది.*

*ఈ సూరాలో అల్లాహ్ శక్తిసామర్థ్యాల ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. ఆ విధంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపడం ఆయనకు చాలా తేలికని నిరూపించడం జరిగింది. సత్యతిరస్కారుల వాదన అసత్యంగా రుజువవుతుందని చెప్పడం జరిగింది. తీర్పుదినాన్ని చాలా కఠినమైన రోజుగా, దుస్థితి దాపురించే రోజుగా అభివర్ణించడం జరిగింది. ఆ రోజున భారీ నిప్పురవ్వలు ఎగురుతుంటాయి. ఆ రోజున సత్యతిరస్కారులు మాట్లాడే స్థితిలో ఉండరు. వారికి ఎలాంటి సాకులు చెప్పే అనుమతి కూడా ఉండదు. దైవభీతి కలిగినవారు చల్లని నీడలో, సెలయేర్లతో, వివిధ రకాల ఫలాలతో సంతోషాన్ని పొందుతారు.*

*ఈ సూరాలో ఈ క్రింది అంశాలు చర్చించబడ్డాయి :*

***1. విశ్వాసం :*** *మరణించిన తర్వాత మళ్ళీ లేపబడటాన్ని, లెక్కల ఘడియను పూర్తిగా విశ్వసించాలి.*

***2. మంచి పనులు :*** *మంచి పనులు చేసిన వారికి శాశ్వత స్వర్గ వనాలు లభిస్తాయి. దుర్మార్గులకు శాశ్వత అగ్ని శిక్ష లభిస్తుంది.*

## అల్ ముర్సలాత్[1] సూరా

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** నిరాఘాటంగా (ఒకదాని తరువాత ఒకటి) పంపబడే గాలుల సాక్షిగా![2]

**2** మరి ప్రచండ వేగంతో వీచే పెనుగాలుల సాక్షిగా![3]

**3** మేఘాలను లేపి చెల్లాచెదురు చేసే గాలుల సాక్షిగా![4]

**4** మరి (సత్యాసత్యాలను) వేరుపరచే వా(టి)రి సాక్షిగా![5]

**5** జ్ఞాపికను తీసుకువచ్చే దూతల సాక్షిగా![6]

**6** సాకులు లేకుండా చేయటానికి, హెచ్చరించటానికి.[7]

## سُوْرَةُ الْمُرْسَلٰتِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

وَالْمُرْسَلٰتِ عُرْفًا ﴿1﴾

فَالْعٰصِفٰتِ عَصْفًا ﴿2﴾

وَّالنّٰشِرٰتِ نَشْرًا ﴿3﴾

فَالْفٰرِقٰتِ فَرْقًا ﴿4﴾

فَالْمُلْقِيٰتِ ذِكْرًا ﴿5﴾

عُذْرًا اَوْ نُذْرًا ﴿6﴾

1. బుఖారీ, ముస్లిం గ్రంథాలలోని ప్రామాణిక హదీసుల ప్రకారం ఈ సూరా మక్కాలో అవతరించింది. హజ్రత్ ఇబ్నె మస్వూద్ (రజి) ఇలా తెలియజేశారు : మేము 'మినా'లోని ఒక పర్వత గుహలో ఉండగా దైవప్రవక్త (సఅసం)పై ఈ సూరా అవతరించింది. ఆయన (స) ఈ సూరాను పారాయణం చేస్తుంటే నేను ఆయన నుండి గ్రహించ సాగాను. అంతలో అకస్మాత్తుగా ఒక పాము ప్రత్యక్షమయింది. దాన్ని చంపమని దైవప్రవక్త (స) పురమాయించారు. కాని ఆ పాము మెరుపు వేగంతో ఎటో మాయమై పోయింది. అప్పుడు ఆయన (సఅసం) "నువ్వు దాని కీడు నుంచి రక్షించబడ్డావు. అది నీ కీడు నుంచి తప్పించుకుంది" అని అన్నారు (బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ ముర్సలాత్; ముస్లిం – కితాబ్ ఖత్లుల్ హయ్యాత్ ...). దైవప్రవక్త (స) కొన్నిసార్లు మగ్రిబ్ నమాజులో కూడా ఈ సూరా పఠించారు (బుఖారీ – కితాబుల్ అజాన్; ముస్లిం – కితాబుస్సలాత్).
2. ఆహ్లాదపరచే విధంగా పంపబడే గాలులు అని కూడా చెప్పవచ్చు. మరికొందరు **'ముర్సలాత్'** అంటే దైవదూతలు లేదా దైవప్రవక్తలు అని భావించారు. ఈ రెండవ అనువాదం సరైనదని భావించిన పక్షంలో **'ఉర్ఫా'** అనే పదం దైవవాణి (వహీ) లేక షరీయతు ఆదేశాలు అన్న అర్థంలో వస్తుంది.
3. అవి గాలులూ కావచ్చు లేదా దైవదూతలు కూడా కావచ్చు. వారు కొన్నిసార్లు శిక్ష రూపంలో తీవ్రగాలులతో పాటు పంపబడతారు.
4. అంటే మేఘమాలికలను గగన తలంలో నలువైపులా వ్యాపింపజేసే లేదా తమ రెక్కలను విప్పే దైవదూతల సాక్షి. అయితే ఇమామ్ ఇబ్నె కసీర్, ఇమామ్ తబ్రీలు మాత్రం మొదటి మూడు ఆయతులు గాలుల నేపథ్యంలోనే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. మేము కూడా దీనిని అనుసరించే అనువాదం చేశాము.
5. అంటే సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను వేరుపరచే ఆజ్ఞలను తీసుకుని వచ్చే దైవదూతలన్నమాట. లేదా సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను స్పష్టంగా వేరుపరచే ఖుర్ఆన్ ఆయతులన్నమాట! లేదా దైవవాణి (వహీ)ని పురస్కరించుకుని సత్యాన్ని అసత్యం నుండి వేరుపరిచే దైవప్రవక్తలు కూడా కావచ్చు.
6. ఈ పనిచేసే వారు దైవదూతలూ కావచ్చు లేదా దైవప్రవక్తలూ కావచ్చు.
7. అంటే – మమ్మల్ని హెచ్చరించే వారెవరూ రాలేదని సాకులు చెప్పే అవకాశం లేకుండా చేయటానికి. నరకం

| | |
|---|---|
| 7 ఏ విషయం గురించి మీకు వాగ్దానం చేయబడుతున్నదో అది వచ్చి తీరుతుంది.[8] | إِنَّمَا تُوعَدُونَ لَوَاقِعٌ ﴿٧﴾ |
| 8 నక్షత్రాలు కాంతిహీనం అయిపోయినప్పుడు[9]...... | فَإِذَا النُّجُومُ طُمِسَتْ ﴿٨﴾ |
| 9 ఆకాశం బద్దలైపోయినప్పుడు... | وَإِذَا السَّمَاءُ فُرِجَتْ ﴿٩﴾ |
| 10 పర్వతాలు తునాతునకలుగా చేసి ఎగుర వేయబడినప్పుడు[10].... | وَإِذَا الْجِبَالُ نُسِفَتْ ﴿١٠﴾ |
| 11 ప్రవక్తలందరూ నిర్ధారిత సమయంలో హాజరుపరచబడినప్పుడు[11].... | وَإِذَا الرُّسُلُ أُقِّتَتْ ﴿١١﴾ |
| 12 ఏ రోజు కోసం (వారందరిని) వాయిదా వేసినట్టు?![12] | لِأَيِّ يَوْمٍ أُجِّلَتْ ﴿١٢﴾ |
| 13 తీర్పుదినం కోసం![13] | لِيَوْمِ الْفَصْلِ ﴿١٣﴾ |
| 14 తీర్పు దినమేమిటో నీకేం తెలుసు? | وَمَا أَدْرَاكَ مَا يَوْمُ الْفَصْلِ ﴿١٤﴾ |

గురించి భయపెట్టడానికి లేదా విశ్వాసులకు శుభవార్తగా మరియు అవిశ్వాసులకు హెచ్చరికగా.

ఇమామ్ షౌకానీ ఇలా అంటున్నారు : ముర్సలాత్, ఆసిఫాత్, నాషిరాత్ అంటే గాలులని అర్థం. ఫారిఖాత్, ముల్ఖియాత్ అంటే దైవదూతలని భావం. ఈ అభిప్రాయమే ఎన్నదగినది.

8. అంటే ప్రళయదినం అన్నమాట! ప్రళయం తథ్యమని మీకు పదే పదే చేయబడుతున్న వాగ్దానం ఉత్తుత్తి వాగ్దానం కాదు సుమా! అది తప్పకుండా వస్తుంది. ఇందులో సందేహానికి ఏమాత్రం తావులేదు. దీనికోసం మీరు సిద్ధంగా ఉండాలి. పరలోకంలో మీకు ఉపయోగపడే సామగ్రిని సమకూర్చుకోవాలి. ఇంతకీ ఈ ప్రళయదినం ఎప్పుడు సంభవిస్తుంది? రానున్న వాక్యాలలో ఈ విషయం విశదపరచబడింది.

9. **'తమ్స్'** (طَمس) అంటే ఎలాంటి ఆనవాలు లేకుండా చెరిగిపోవటం, అంతరించటం అని అర్థం. 'తమస్సు' (అంధకారం, చీకటి) అనే సంస్కృత పదం బహుశా దీనినుండే వచ్చి ఉంటుంది. నక్షత్రాలు నిస్తేజమై, నామరూపాలు లేకుండా పోయినప్పుడు...

10. అంటే – వాటిని భూమి నుండి పెకలించి, ఎడాపెడా దంచి వేయటం జరుగుతుంది. అప్పుడు భూమి చదునుగా అయిపోతుంది.

11. అంటే – న్యాయవిచారణ నిమిత్తం ప్రవక్తలు పిలువబడతారు. వారి నివేదిక ఆధారంగా జాతుల గురించి న్యాయనిర్ణయం తీసుకోబడుతుంది.

12. ఈ వాక్యం ఒకింత విశేషంగా, ఒకింత గౌరవసూచకంగా వచ్చింది. ఆనాటి ఉగ్ర రూపాన్ని కళ్లముందు చిత్రీకరించటానికే ఇలా అనబడింది. ప్రవక్తలందరినీ సమావేశపరచి వారి కాలాల నాటి జాతుల స్థితిగతులను విచారించే దినం సాధారణ దినం కాదు మరి!

13. ఆ రోజు మనుషుల మధ్య న్యాయనిర్ణయం జరుగుతుంది. దాని ప్రకారం ఒక వర్గం వారిని స్వర్గం కోసం, మరోవర్గం వారిని నరకం కోసం వేరుపరచటం జరుగుతుంది.

**15** ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.[14] — وَيۡلٞ يَوۡمَئِذٖ لِّلۡمُكَذِّبِينَ ⑮

**16** ఏమిటి, మేము పూర్వీకులను అంతమొందించలేదా? — أَلَمۡ نُهۡلِكِ ٱلۡأَوَّلِينَ ⑯

**17** మరి మేము వారి తర్వాత వెనుకటి తరాల వారిని తీసుకు వచ్చాము.[15] — ثُمَّ نُتۡبِعُهُمُ ٱلۡأٓخِرِينَ ⑰

**18** మేము నేరస్తుల (పాపాత్ముల) పట్ల ఇలాగే వ్యవహరిస్తాం.[16] — كَذَٰلِكَ نَفۡعَلُ بِٱلۡمُجۡرِمِينَ ⑱

**19** ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం. — وَيۡلٞ يَوۡمَئِذٖ لِّلۡمُكَذِّبِينَ ⑲

**20** ఏమిటి, మేము మిమ్మల్ని అల్పమైన నీళ్లతో (వీర్యబిందువుతో) సృష్టించలేదా? — أَلَمۡ نَخۡلُقكُّم مِّن مَّآءٖ مَّهِينٖ ⑳

**21** ఆ తరువాత దానిని ఒక పటిష్ఠమైన, సురక్షితమైన చోట ఉంచాము[17] – — فَجَعَلۡنَٰهُ فِي قَرَارٖ مَّكِينٍ ㉑

**22** ఒక నిర్ణీత కాలం వరకు.[18] — إِلَىٰ قَدَرٖ مَّعۡلُومٖ ㉒

**23** మేము తగురీతిలో లెక్క వేశాము.[19] ఆహా! మేము ఎంత ఖచ్చితంగా లెక్కించే శక్తి గలవారమో! — فَقَدَرۡنَا فَنِعۡمَ ٱلۡقَٰدِرُونَ ㉓

14. **'వైల్'** అంటే వినాశం అని ఒక అర్థం. 'వైల్' అనేది నరకంలోని ఒక లోయ అని మరికొంతమంది భావిస్తున్నారు. ఈ ఆయతు ఈ సూరాలో పదే పదే పునరావృతం అవుతూ ఉంటుంది. ఎందుకంటే ప్రతి దైవధిక్కారి నేరం ఇతర ధిక్కారుల నేరాలకు భిన్నంగా ఉంటుంది. దాని ప్రకారమే వారికి పడే శిక్ష కూడా – నేర స్వభావాన్ని బట్టి – భిన్నంగా ఉంటుంది. అందుకే వైల్ అన్న పదం పలుమార్లు పలు విధాలుగా పునరావృతం అయింది. (ఫత్‌హుల్ ఖదీర్).

15. అంటే మక్కాలోని తిరస్కారులు ఇంకా వారి మిత్రులన్నమాట! వీరు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ధిక్కరించారు.

16. ఇహలోకంలోగానీ, పరలోకంలోగానీ వారిని పట్టుకుని శిక్షిస్తాం.

17. అంటే మాతృగర్భంలో అని భావం.

18. గర్భకాలం పూర్తయ్యేవరకూ. ఈ గడువు 6 మాసాల నుండి 9 మాసాల వరకూ ఉంటుంది.

19. అంటే – శిశువు గర్భంలో ఉండగా శరీరావయవాల పొందిక ఎలా ఉండాలో నిర్ధారిస్తాము. ఏ అవయవం ఎక్కడ ఉండాలో, ఏ పరిమాణంలో ఉండాలో, వాటి మధ్య ఎంత అంతరం ఉండాలో నిర్ణయిస్తాము. కళ్లుండవలసిన చోట కళ్లే ఉంటాయి. కాళ్లుండవలసిన చోట కాళ్లే ఉంటాయి. ఇతర వస్తువులు కూడా మేము నిర్ధారించిన దాని ప్రకారం సరిగ్గా తయారవుతాయి. చివరకు ఏ లోపమూ లేని – సంపూర్ణ మానవాకారం గల శిశువు మాతృగర్భం నుండి బయటికి వస్తుంది.

24 ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.

وَيْلٌ يَّوْمَئِذٍ لِّلْمُكَذِّبِيْنَ ﴿24﴾

25 ఏమిటీ, మేము భూమిని తనలో ఇమిడ్చుకునేదిగా చేయ లేదా?[20]

اَلَمْ نَجْعَلِ الْاَرْضَ كِفَاتًا ﴿25﴾

26 సజీవ మరియు నిర్జీవ స్థితుల్లో.

اَحْيَآءً وَّاَمْوَاتًا ﴿26﴾

27 ఇంకా, మేమందులో ఎత్తయిన, బ్రహ్మాండమైన పర్వతాలను ప్రతిష్ఠించాము.[21] మీ దాహాన్ని తీర్చే మంచి నీరును మీకు త్రాపాము.

وَّجَعَلْنَا فِيْهَا رَوَاسِىَ شٰمِخٰتٍ وَّاَسْقَيْنٰكُمْ مَّآءً فُرَاتًا ﴿27﴾

28 ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.

وَيْلٌ يَّوْمَئِذٍ لِّلْمُكَذِّبِيْنَ ﴿28﴾

29 "మీరు ధిక్కరిస్తూ ఉన్న ఆ నరకం వైపే పదండి!"[22]

اِنْطَلِقُوْٓا اِلٰى مَا كُنْتُمْ بِهٖ تُكَذِّبُوْنَ ﴿29﴾

30 "మూడు పాయలుగా చీలిన ఆ నీడ వైపు పదండి!!"[23]

اِنْطَلِقُوْٓا اِلٰى ظِلٍّ ذِىْ ثَلٰثِ شُعَبٍ ﴿30﴾

31 నిజానికి అది మీకు నీడనూ ఇవ్వదు, అగ్ని జ్వాలల నుండి మీకు రక్షణనూ ఇవ్వదు.[24]

لَّا ظَلِيْلٍ وَّلَا يُغْنِىْ مِنَ اللَّهَبِ ﴿31﴾

32 నిశ్చయంగా నరకం మేడలు, మిద్దెలంతటి నిప్పు రవ్వలను విసురుతుంది.[25]

اِنَّهَا تَرْمِىْ بِشَرَرٍ كَالْقَصْرِ ﴿32﴾

33 అవి పసుపు పచ్చని ఒంటెల మాదిరిగా ఉంటాయి.[26]

كَاَنَّهٗ جِمٰلَتٌ صُفْرٌ ﴿33﴾

20. అంటే–భూమి బ్రతికి ఉన్నవారిని తన వీపుపై మోస్తుంది, మరణించిన వారిని తన గర్భంలోపల సమీకరించుకుంటుంది.

21. **'రవాసియ'** అంటే పర్వతాలు; **'షామిఖాతున్'** అంటే ఎత్తైనవి అని అర్థం.

22. దైవదూతలు నరకవాసులతో చెప్పేమాటలివి.

23. నరకం నుండి లేచే దట్టమైన పొగ మూడు శాఖలుగా చీలి విస్తరిస్తుంది. దాని నీడ గోడ నీడలాగా లేదా వృక్షం నీడలాగానే ఉంటుంది. ఆ నీడలో కాస్త విశ్రాంతి తీసుకుందామని వారు ఆశిస్తారు. కాని నిజానికి అది చల్లదనాన్ని, హాయిని ఇచ్చే నీడకాదు.

24. అంటే – నరక ఉష్ణం నుండి తప్పించుకోవటం వారివల్ల అయ్యే పనికాదు.

25. ఈ ఆయతుకు మరో అనువాదం ఇది : ఆ నిప్పు రవ్వలు కొయ్య దుంగల వలే ఉంటాయి.

26. **'సుఫ్రున్'** (పసుపు పచ్చని) అనే అరబీ పదం అరేబియాలో 'నల్లని' అన్న అర్థంలో కూడా వాడుకలో ఉంది. నరకం జిమ్మే ఆ నిప్పు రవ్వ ఒక్కొక్కటి ఒక్కో భవనమంత ఉంటుంది. ఆ నిప్పు పగిలి మరిన్ని కణాలను వెదజల్లుతుంది. ఒక్కో కణం ఒక్కో ఒంటె అంత ఉంటుంది.

وَيۡلٌ يَوۡمَئِذٍ لِّلۡمُكَذِّبِينَ ﴿34﴾
34 ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.

هَٰذَا يَوۡمُ لَا يَنطِقُونَ ﴿35﴾
35 ఆ రోజు వారు మాట్లాడనూ లేరు.[27]

وَلَا يُؤۡذَنُ لَهُمۡ فَيَعۡتَذِرُونَ ﴿36﴾
36 సంజాయిషీ ఇచ్చుకునే అనుమతి కూడా వారికి ఇవ్వ బడదు.[28]

وَيۡلٌ يَوۡمَئِذٍ لِّلۡمُكَذِّبِينَ ﴿37﴾
37 ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.

هَٰذَا يَوۡمُ ٱلۡفَصۡلِۖ جَمَعۡنَٰكُمۡ وَٱلۡأَوَّلِينَ ﴿38﴾
38 ఇది నిర్ణయ దినం. (దీని కోసం) మేము మిమ్మల్నీ, మీ పూర్వీకులందరినీ సమీకరించాము.[29]

فَإِن كَانَ لَكُمۡ كَيۡدٌ فَكِيدُونِ ﴿39﴾
39 మరి మీరు నా నుండి (తప్పించుకునే) ఎత్తుగడ ఏదైనా వేయ దలిస్తే వేయండి.[30]

وَيۡلٌ يَوۡمَئِذٍ لِّلۡمُكَذِّبِينَ ﴿40﴾
40 ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.

إِنَّ ٱلۡمُتَّقِينَ فِي ظِلَٰلٍ وَعُيُونٍ ﴿41﴾
41 నిశ్చయంగా దైవభీతిపరులు చల్లని నీడలలో,[31] (సల్లగసాగే) సెలయేరుల మధ్య ఉంటారు.

27. ప్రళయదినాన సత్యతిరస్కారులు వివిధ పరిస్థితులను ఎదుర్కొంటారు. వారు ఒక దశలో అక్కడా అబద్ధాలు చెప్పి తప్పించుకోజూస్తారు. దేవుడు వారి నోటికి తాళం వేస్తాడు. వారి శరీరావయవాలు వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి. తరువాత వారు నరకం వైపు తీసుకుపోబడతారు. ఆందోళనాభరితమైన ఆ సమయంలో కూడా వారి నోరు పెగలదు. మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం వారేదో చెప్పడానికి ప్రయత్నిస్తారు. కాని వారి దగ్గర ఎలాంటి ఆధారమూ ఉండదు. అందువల్ల వారికి ఏమీ పాలుపోదు. మనం ప్రపంచంలో సయితం చూస్తూ ఉంటాము – ఏ ఆధారమూ లేకుండా కేవలం వాగ్ధాటితో ఎదుటి వారి నోరు మూయించేందుకు ప్రయత్నించేవారు ఒక్కోసారి నిజం బయటపడేసరికి ఏం చెప్పాలో అర్థంకాక నీళ్లు నములుతుంటారు. ఆ క్షణంలో అసలు వారి నోరు పెగలదు. పరలోకంలో సత్య తిరస్కారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది.

28. ఎందుకంటే అసలు వారి దగ్గర సముచితమైన సంజాయిషీ (కారణం) ఏదీ ఉండదు.

29. దేవుడు తన దాసులతో పలికే మాటలివి : "ఈ రోజు మేము మా శక్తితో మీ అందరినీ ఒకే మైదానంలో సమీకరించాము. ఈనాడు మీ వ్యవహారాలన్నీ తేల్చబడతాయి."

30. ఇదొక హెచ్చరిక! ఓ అవిధేయులారా! ఈ రోజు మీరు తెలివినంతటినీ ఉపయోగించి, నానుండి తప్పించుకునే ఉపాయం ఏదయినా ఆలోచించగలిగితే ఆలోచించండి అంటాడు దేవుడు. కాని ఆ ధైర్యంగానీ, ఆ శక్తిగానీ ఎవరికుంటుంది? ఈ ఆయతు కూడా అర్రహ్మాన్ సూరాలోని 33వ ఆయతులాంటిదే. అందులో ఇలా అనబడింది: "ఓ జిన్నులారా! ఓ మానవులారా! భూమ్యాకాశాల అంచుల నుండి పారిపోయే శక్తి మీలో గనక ఉంటే పారిపోయి చూడండి. శక్తి, ప్రాబల్యం లేకుండా మీరెన్నటికీ పారిపోలేరు."

**42** ఇంకా, తాము మెచ్చిన పండ్లు ఫలాల మధ్య[32] (హాయిగా) ఉంటారు.

وَّفَوَاكِهَ مِمَّا يَشْتَهُوْنَ ﴿42﴾

**43** "మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా హాయిగా తినండి, త్రాగండి"[33] (అని వారితో అనబడుతుంది).

كُلُوْا وَاشْرَبُوْا هَنِيْٓـًٔا بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿43﴾

**44** నిశ్చయంగా మేము సదాచార సంపన్నులకు ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తాము.[34]

اِنَّا كَذٰلِكَ نَجْزِي الْمُحْسِنِيْنَ ﴿44﴾

**45** ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.[35]

وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ ﴿45﴾

**46** (ఓ ధిక్కార జనులారా! మీరు ప్రాపంచిక జీవితంలో) అంతో ఇంతో తినండి, లబ్దిని పొందండి. మీరెలాగూ నేరస్థులే.[36]

كُلُوْا وَتَمَتَّعُوْا قَلِيْلًا اِنَّكُمْ مُّجْرِمُوْنَ ﴿46﴾

**47** ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.

وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ ﴿47﴾

**48** (దైవ సన్నిధిలో) "వినయపూర్వకంగా తలవంచండి" అని వారితో అన్నప్పుడు వారు తలవంచరు.[37]

وَاِذَا قِيْلَ لَهُمُ ارْكَعُوْا لَا يَرْكَعُوْنَ ﴿48﴾

31. నరకవాసుల మాదిరిగా ఇక్కడ అగ్నికీలల ఛాయ ఉండదు. పైగా ఇక్కడ దట్టమైన వృక్షాల, పెద్ద పెద్ద భవంతుల చల్లని నీడలు సర్వత్రా వ్యాపించి ఉంటాయి.
32. అక్కడ రకరకాల పండ్లు వ్రేలాడుతూ ఉంటాయి. స్వర్గవాసులు ఏ పండును ఆరగించాలన్నా అవి వారి ముందుకు వచ్చేస్తాయి.
33. ఉపకారానికి బదులు ఉపకారమే కదా! అందుకే వారు ఇహలోకంలో చేసిన మంచి పనులకు బదులుగా వారికి ఈ బహుమానం ఇవ్వబడిందని తెలుపటం జరిగింది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే దైవకారుణ్యానికి మనిషి నోచుకుని, స్వర్గంలో ప్రవేశించాలంటే అతను సత్కర్మలు చేయాలి. సదాచరణ చేయకుండా దైవకారుణ్యాన్ని ఆశించేవారి ఉపమానం నేలను దున్ని విత్తనం నాటకుండా వదిలేసిన రైతులవంటిది. లేదా చేదు విత్తనాలను నాటి తీపి ఫలాలను ఆశించే మూర్ఖుల వంటిది.
34. ఈ ఆయతు ద్వారా తెలిసే సత్యం కూడా అదే – మీరు పరలోకంలో సత్ఫలితాన్ని పొందగోరుతుంటే ఇహలోకంలో సత్కార్యాలు ఇతోధికంగా చేయండి, సన్మార్గాన నడవండి.
35. దైవభక్తి పరాయణులు దైవానుగ్రహాలకు నోచుకున్నారు. అయితే ధిక్కారజనుల వాటా క్రిందికి పరాభవమే మిగిలింది. ఇంతకన్నా నష్టం ఇంకేముంటుంది?
36. ప్రళయదినాన్ని త్రోసిపుచ్చే దుర్మార్గులను ఉద్దేశించి చెప్పబడిన మాటలివి. నిజానికి ఇది తీవ్రమైన హెచ్చరిక! 'సరే కొంతకాలంపాటు ప్రాపంచిక సుఖసౌఖ్యాలను జుర్రుకోండి. మీరెలాగూ పాపాత్ములే. మీలాంటి దుష్టుల కోసం యాతనా సామగ్రి సిద్ధంగానే ఉంటుంది' అని చెప్పబడింది.
37. అంటే – నమాజు చేయండని వారికి చెప్పినప్పుడు వారు నమాజు చేయరు.

| | |
|---|---|
| **49** ధిక్కార వైఖరిని అవలంబించే వారికి ఆ రోజు వినాశం ఖాయం.[38] | وَيۡلٞ يَوۡمَئِذٖ لِّلۡمُكَذِّبِينَ ﴿٤٩﴾ |
| **50** ఇక ఈ (ఖుర్ఆన్) విషయం తరువాత వారు విశ్వసించ టానికి ఏం ఉంది(ట)?[39] | فَبِأَيِّ حَدِيثِۭ بَعۡدَهُۥ يُؤۡمِنُونَ ﴿٥٠﴾ |

38. అంటే – దైవాజ్ఞలను ఖాతరు చేయకుండా ఇష్టారాజ్యం చేసిన వారిని ఆ రోజు అవమానం క్రమ్ముకుంటుంది.

39. దివ్య ఖుర్ఆన్‌లాంటి అద్భుత విషయాన్నే వారు త్రోసిపుచ్చినప్పుడు ఇక వారు మరే విషయాన్ని విశ్వసిస్తారు? ఈ ఆయతులో కూడా దివ్య ఖుర్ఆన్‌ను 'హదీసు' అనే పదంతో పేర్కొనటం జరిగింది. ఇలాంటి ఉదాహరణలు ఇంకా అనేకం ఉన్నాయి. బలహీన ఆధారాలతో ఉల్లేఖించబడిన ఒక హదీసులో ఇలా ఉంది: "అత్తీన్ సూరాలోని చివరి వాక్యం **"అలైసల్లాహు ....** పఠించినప్పుడు సమాధానంగా, **'బలా వ అన అలా జాలిక మినష్షాహిదీన్"** అనాలి. సూరె ఖియామాలోని చివరి వాక్యం చదివినప్పుడు కూడా జవాబుగా **'బలా'** అని పలకాలి. అలాగే ముర్సలాత్ సూరాలోని చివరి వాక్యం – **ఫబిఅయ్యి హదీసిమ్ బాదహు యూమినూన్** పఠించినప్పుడు, దీనికి సమాధానంగా **'ఆమన్నా బిల్లాహి"** అనాలి (అబూ దావూద్). కొంతమంది పండితుల ప్రకారం ఈ ఆయతుల పఠనం విన్నవారు కూడా పై విధంగా సమాధానమివ్వాలి.

78వ సూరా

# అన్ నబా

## గొప్పవార్త

అవతరణ మక్కాలో

ఆయతులు 40

### పరిచయం

ప్రళయాన్ని, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని, తీర్పుదినాన్ని, శిక్షా బహుమానాలను ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఈ సూరాలోని రెండవ ఆయతులో ప్రస్తావించబడిన 'అన్ నబా' (గొప్పవార్త) అన్న పదాన్నే దీనికి పేరుగా నిర్ధారించడమైనది.

అవిశ్వాసులు ముఖ్యంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్న విషయమై ప్రవక్త ముహమ్మద్ (సఅసం)తో వాదించేవారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని వారు తిరస్కరించేవారు, ఎగతాళి చేసేవారు. ఈ సూరా అవిశ్వాసులకు వారు వినడానికి ఇష్టపడని గొప్పవార్తను తెలియజేసింది. ఆ వార్త... మనిషి చేసిన పనులకు బాధ్యత వహించవలసి ఉంటుంది, జవాబు చెప్పుకోవలసి ఉంటుందన్న వార్త. తీర్పుదినం తప్పనిసరిగా వస్తుందని ఈ సూరా నొక్కి చెప్పింది. సత్యతిరస్కారుల వాదనను తిప్పికొట్టడానికి ఈ సూరాలో అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ప్రకృతిలో కనిపించే దృష్టాంతాలను వివరించడం జరిగింది. అల్లాహ్ భూమిని పరచి మనిషికి నివాసయోగ్యంగా చేశాడు. భూమి తొణకకుండా దానిపై పర్వతాలను నిలబెట్టాడు. ఆయన మనలను జంటలుగా సృష్టించాడు. నిద్రను విశ్రాంతి కోసం సృష్టించాడు. ఆయన మనపై ఏడు ఆకాశాలను నిలబెట్టాడు. ఆకాశంలో దీపంగా సూర్యుడిని ఉంచాడు. మేఘాల నుంచి వర్షాన్ని కురిపిస్తున్నాడు.

తీర్పుదినం స్వచ్ఛమైన సత్యం. మంచీచెడులను వేరు చేసే రోజు. ప్రతి ఒక్కరు తప్పక చవిచూడవలసిన రోజు. ఈ విషయాలు తెలుపుతూ నరకాగ్నిని వర్ణించడం కూడా జరిగింది. సత్యాన్ని తిరస్కరించిన వారికి, తీర్పుదినాన్ని కాదన్న వారికి నరకాగ్ని ఒక మాటు వంటిదని చెప్పడం జరిగింది. నరకంలో వారికి నల్లని, జుగుప్సాకరమైన, సలసలకాగే ద్రవం ఇవ్వబడుతుంది. అక్కడ చల్లని నీడ కాని, చల్లని పానీయం కాని దొరకదు. మరోవైపు స్వర్గవనాలను వర్ణిస్తూ మనోహరమైన ఉద్యానవనంగా పేర్కొనడం జరిగింది. అక్కడ వారికి సమవయస్కులైన కన్యలు ఉంటారు.

| అన్ నబా సూరా | سُورَةُ النَّبَإِ |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ |
| **1** వీళ్లు దేన్ని గురించి అడుగుతున్నారు?[1] | عَمَّ يَتَسَآءَلُونَ ﴿1﴾ |
| **2** గొప్ప సమాచారాన్ని గురించేనా? | عَنِ ٱلنَّبَإِ ٱلۡعَظِيمِ ﴿2﴾ |

1. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) దైవప్రవక్తగా నియుక్తులవగానే ఆయన(స) దేవుని ఏకత్వం (తౌహీద్), ప్రళయం (ఖియామత్), మరణానంతర జీవితం గురించి ప్రజలకు బోధపరచటం మొదలెట్టారు. దివ్య ఖుర్ఆన్ వాక్యాలను చదివి వినిపించారు. ఇదంతా అవిశ్వాసులకు, ముష్రిక్కులకు వింతగా తోచింది. 'ఏమిటీ, ఈ ప్రళయదినం, ఈ మరణానంతర జీవితం నిజంగా సంభవిస్తాయంటారా?!' అని వాళ్లు పరస్పరం గుసగుసలాడుకునేవారు. ముహమ్మద్ (సఅసం) అంటున్నట్లు ఈ ఖుర్ఆన్ నిజంగానే దైవవాణి అంటారా?! అని మరికొందరు ప్రశ్నించేవారు.

| | |
|---|---|
| 3 దాని గురించి వారందరూ విభేదించుకుంటున్నారు.[2] | الَّذِي هُمْ فِيهِ مُخْتَلِفُونَ ③ |
| 4 కాదు, త్వరలోనే వారు తెలుసుకుంటారు. | كَلَّا سَيَعْلَمُونَ ④ |
| 5 మరెన్నటికీ కాదు. అతి త్వరలోనే వారికి (వాస్తవం) తెలిసి పోతుంది.[3] | ثُمَّ كَلَّا سَيَعْلَمُونَ ⑤ |
| 6 ఏమిటి, మేము భూమిని పాన్పుగా చేయలేదా?[4] | أَلَمْ نَجْعَلِ الْأَرْضَ مِهَادًا ⑥ |
| 7 పర్వతాలను మేకులుగా (పాతిపెట్టలేదా?)[5] | وَالْجِبَالَ أَوْتَادًا ⑦ |
| 8 ఇంకా, మేము మిమ్మల్ని జంటలుగా సృష్టించాము.[6] | وَخَلَقْنَاكُمْ أَزْوَاجًا ⑧ |
| 9 ఇంకా, మేము మీ నిద్రను హాయినిచ్చేదిగా చేశాము.[7] | وَجَعَلْنَا نَوْمَكُمْ سُبَاتًا ⑨ |

వారి సందేహాలను పటాపంచలు చేయటానికి దేవుడు తొలుత వారి సందేహాలనే ప్రస్తావించి ఆ తరువాత సమాధానమిచ్చాడు.

2. ఇంతకీ వారు విభేదించుకుంటున్న ఆ మహావార్త ఏది? ఖుర్ఆన్ గురించి వారి మధ్య భిన్నాభిప్రాయాలు పొడసూపాయని కొంతమంది వ్యాఖ్యాతలు భావిస్తున్నారు. ఎందుకంటే వారు దివ్య ఖుర్ఆన్ గురించి రకరకాలుగా చెప్పుకునేవారు. కొందరు దాన్ని ఇంద్రజాలం అంటే, కొందరు జ్యోతిష్యం అన్నారు. కొందరు కవిత్వం అనంటే మరికొందరు పూర్వీకుల కట్టుకథలన్నారు.

మరికొంతమంది ప్రకారం మరణానంతర జీవితం, ప్రళయదినం వారికి వింతగా తోచింది. ఈ విషయాన్ని వారు సంచలనాత్మక సమాచారంగా భావించి, దాని గురించి గుసగుసలు మొదలెట్టారు. కొందరు దీన్ని ఆసాంతం త్రోసి పుచ్చగా మరికొందరు దీని గురించి సందిగ్ధంలో పడిపోయారు. కొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం అవిశ్వాసులతో పాటు విశ్వాసులు కూడా ఈ 'మహావార్త'ను గురించి ప్రశ్నించేవారు. అయితే విశ్వాసులు మాత్రం తమ విశ్వాసాన్ని, నమ్మకాన్ని మరింత దృఢతరం చేసుకునే ఉద్దేశంతో ప్రశ్నించేవారు. కాని అవిశ్వాసులు మాత్రం వేళాకోళం చేసే ఉద్దేశంతో వెటకారంగా ప్రళయదినం గురించి ప్రశ్నలు గుప్పించేవారు.

3. వాస్తవానికి ఇది తిరస్కార జనులకు హెచ్చరిక లాంటిది. ఏమిటి? మీరు ప్రళయదినాన్ని, దైవసన్నిధిలో సమాధానం ఇచ్చుకోవలసిన చాలా ముఖ్యమైన విషయాన్ని ఎగతాళి చేస్తున్నారా? మీరనుకునేది ఎంతమాత్రం నిజం కాదు. మీకు శీఘ్రంగానే యదార్థం తెలిసిపోతుంది అని అల్లాహ్ చెప్పాడు. ఆ తరువాత తిరస్కారులకు విషయాన్ని విడమరచి చెప్పటానికి దేవుడు తన అపూర్వ సృష్టిని, తన అసాధారణ శక్తియుక్తులను గురించి ప్రస్తావించాడు. దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ను), దైవప్రవక్త (సఅసం) ఇచ్చే సందేశాన్ని ప్రజలు సత్యమని నమ్మి అనుసరించాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం.

4. అంటే – మేము భూమిని నివాసయోగ్యంగా చేశాము. దానిపై మీరు స్థిరంగా నడుస్తారు. పండుకుంటారు. నిలబడతారు, కూర్చుంటారు. బ్రతుకు తెరువుకు సంబంధించిన సమస్త కార్యకలాపాలు సాగిస్తారు. ఇంకా ఈ భూమిలోనే మీరు వ్యవసాయం కూడా చేస్తారు. మేమే గనక భూమిని సువిశాలంగా పరచి, స్థిరంగా ఉంచకపోతే మీ బ్రతుకు దుర్భరమైపోయేది.

5. **'అవ్‌తాద్'** అంటే మేకులని అర్థం. ఈ భూమిని మరింత సుస్థిరం చేయడానికి అందులో పర్వతాలను మేకులుగా పాతాము. తత్ఫలితంగా నేల కదలకుండా, ఓ ప్రక్కకు ఒరిగిపోకుండా, ప్రకంపించకుండా స్థిరంగా ఉంటుంది. అలా కాకుండా నేల తరచూ కదులుతూ, కంపిస్తూ ఉంటే మానవ మనుగడే ప్రశ్నార్థకం అయిపోయేది.

6. అంటే; ఆడ – మగ, పెంటి – పోతు అనే జతలను పుట్టించాము. వివిధ ఆకారాలలో, వివిధ రంగులలో పుట్టిం

| | |
|---|---|
| **10** ఇంకా, మేము రాత్రిని మీ కొరకు ఆచ్ఛాదనగా చేశాము.[8] | وَّجَعَلْنَا الَّيْلَ لِبَاسًا ⑩ |
| **11** ఇంకా, పగటిని జీవనోపాధి సమయంగా చేశాము.[9] | وَّجَعَلْنَا النَّهَارَ مَعَاشًا ⑪ |
| **12** ఇంకా, మీపైన మేము పటిష్టమైన ఏడు ఆకాశాలను నిర్మించాము.[10] | وَّبَنَيْنَا فَوْقَكُمْ سَبْعًا شِدَادًا ⑫ |
| **13** ఇంకా, ఉజ్వలమైన ఒక దీపాన్ని సృజించాము.[11] | وَّجَعَلْنَا سِرَاجًا وَّهَّاجًا ⑬ |
| **14** ఇంకా, మేము నీళ్లతో నిండిన మేఘాల ద్వారా పుష్కలంగా వర్షాన్ని కురిపించాము.[12] | وَّاَنْزَلْنَا مِنَ الْمُعْصِرٰتِ مَاۤءً ثَجَّاجًا ⑭ |
| **15** తద్వారా ఆహార ధాన్యాలు, పచ్చిక బయళ్లు[13] వెలికితీయటానికి. | لِّنُخْرِجَ بِهٖ حَبًّا وَّنَبَاتًا ⑮ |
| **16** దట్టమైన తోటలు (ఉత్పన్నం చేయటానికి!)[14] | وَّجَنّٰتٍ اَلْفَافًا ⑯ |
| **17** నిశ్చయంగా తీర్పుదిన సమయం నిర్ధారితమై ఉంది.[15] | اِنَّ يَوْمَ الْفَصْلِ كَانَ مِيْقَاتًا ⑰ |

చాము అన్న అర్థం కూడా వస్తుంది. అందచందాల రీత్యా, రూపురేఖల దృష్ట్యా, రంగు రీత్యా, పరిమాణం రీత్యా ఒక్క మానవ జాతిలోనే ఎంతో వైవిధ్యం కానవస్తుంది.

7. **'సుబాత్'** అంటే త్రెంపేది అని అర్థం. అంటే రాత్రి సమయం మనుషులను, పశువులను వారి వారి వ్యాపకాల నుంచి సంబంధాన్ని త్రెంచి నిద్రపుచ్చుతుంది. తద్వారా వారు తియ్యని నిద్రను తనివితీరా ఆస్వాదించి నవజీవనాన్ని పొందుతారు.
8. అంటే రాత్రి చీకటి ప్రతి వస్తువును తన ఒడిలో కప్పుకుంటుంది. ఒక మనిషి ధరించే దుస్తులు అతని ఒంటిని, మర్మస్థానాలను మరుగుపరచినట్లే రాత్రి కూడా లోకంలోని వస్తువులను మరుగుపరుస్తుంది.
9. అంటే – పగటివేళ మనుషులు దేవుని ఉపాధిని అన్వేషించేందుకు వీలుగా వెలుగుమయం చేశాము.
10. వాటిలో ఒక ఆకాశానికి – మరో ఆకాశానికి మధ్య 500 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణానికి సమానమైన అంతరం ఉంది. ఈ ఆకాశాల సుస్థిరమైన వ్యవస్థకు ఇదొక మచ్చుతునక మాత్రమే.
11. అంటే సూర్యుడని అర్థం. మూలంలోని **'జఅల'** (చేశాము) అన్న పదం **'ఖలఖ'** (సృజించాము) అన్న అర్థంలో ఉపయోగించబడింది.
12. **'మూసిరాత్'** (مُعْصِرَاتٌ) అంటే నీళ్ళతో నిండిన మేఘమాలికలు, కాని అప్పటిదాకా కురవకుండా ఉన్నవి అని భావం. బహిష్టు దగ్గరపడిన స్త్రీని అరబీలో **'అల్ మర్అతుల్ మూతసిర'** అని అనటం గమనార్హం. **'సజ్జాజా'** (ثَجَّاجًا) అంటే అత్యధికంగా ప్రవహించే నీరు అని అర్థం.
13. **'హబ్బ్'** (حَبٌّ) అంటే తిండి కోసం నిలువచేసి ఉంచే గింజలని అర్థం. అంటే ఆహార ధాన్యాలన్నమాట. ఉదాహరణకు: గోధుమలు, వరి, జొన్నలు మొదలగునవి. **'నబాత్'** అనే పదంలో కూరగాయలు, వృక్షాలు, పశువుల మేత లాంటివన్నీ చేరి ఉన్నాయి.
14. **'అల్ఫాఫా'** ( اَلْفَافًا ) అంటే శాఖోపశాఖలుగా విస్తరించినందువల్ల ఒకదానితో ఒకటి కలిసి దట్టంగా ఏర్పడిన వృక్షాలని భావం.
15. అంటే – పూర్వీకులు, వెనుకటివారు – అందరూ సమావేశపరచబడతారని వాగ్దానం చేయబడిన రోజు. అది

18 శంఖం పూరించబడిననాడు, మీరు తండోపతండాలుగా తరలివస్తారు.[16]

يَّوْمَ يُنْفَخُ فِى الصُّوْرِ فَتَأْتُوْنَ اَفْوَاجًا ﴿18﴾

19 మరి ఆకాశం తెరువబడుతుంది. అందులో ఎన్నెన్నో ద్వారాలు ఏర్పడతాయి.[17]

وَّفُتِحَتِ السَّمَآءُ فَكَانَتْ اَبْوَابًا ﴿19﴾

20 పర్వతాలు నడిపింపబడి, ఎండమావుల్లా మారిపోతాయి.[18]

وَّسُيِّرَتِ الْجِبَالُ فَكَانَتْ سَرَابًا ﴿20﴾

21 నిశ్చయంగా నరకం మాటేసి ఉన్నది.[19]

اِنَّ جَهَنَّمَ كَانَتْ مِرْصَادًا ﴿21﴾

22 తలబిరుసుల నివాస స్థలమదే.

لِّلطَّاغِيْنَ مَاٰبًا ﴿22﴾

23 వారందులో యుగాల తరబడి (మగ్గుతూ) ఉంటారు.[20]

لّٰبِثِيْنَ فِيْهَآ اَحْقَابًا ﴿23﴾

24 వారందులో ఎలాంటి చల్లదనాన్నిగానీ, త్రాగటానికి ఏ పానీయాన్నిగానీ రుచిచూడరు –

لَا يَذُوْقُوْنَ فِيْهَا بَرْدًا وَّلَا شَرَابًا ﴿24﴾

---

తీర్పుదినంగా ఖరారు చేయబడటంలోని మర్మం ఏమిటంటే, ఆ రోజు మానవులందరి కర్మలను బట్టి తీర్పు ఇవ్వటం జరుగుతుంది.

16. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ప్రతి మానవ సముదాయం తమ తమ ప్రవక్తల వెంట మహ్షర్ మైదానంలో హాజరవుతుంది. ఇది రెండవసారి ఊదబడిన శంఖం. ఈ పిలుపుపై అందరూ సమాధుల నుండి సజీవులై బయటికి వస్తారు. దేవుడు ఆకాశం నుంచి నీటిని కురిపిస్తాడు. దాంతో మానవులు మొక్కలు మొలకెత్తినట్లే వెలికి వస్తారు. మానవుని ప్రతి అవయవం కుళ్ళి కృశించి పోతుంది. కాని వెన్నెముకలోని ఒక చివరి భాగం మాత్రం కృశించదు. దాంతోనే పునరుత్థాన దినాన మనుషులంతా మళ్లీ కూర్చబడతారు (సహీహ్ బుఖారీ – అన్ నబా సూరా వ్యాఖ్యానం).

17. దైవదూతలు దివి నుంచి భువికి దిగి రావటానికి వీలుగా ఈ ద్వారాలు ఏర్పడతాయి.

18. **'సరాబ్'** అంటే ఎండమావి. దూరం నుంచి నిగనిగలాడుతూ నీరులా కనిపించే ఇసుక తిన్నెలను ఎండమావులంటారు. ఆనాడు పెద్ద పెద్ద పర్వతాలు సయితం ఎండమావుల్లా –దూరం నుంచి– కనిపిస్తాయి. చివరికి అవి నామరూపాల్లేకుండా సమసిపోతాయి.

కొంతమంది విద్వాంసుల వ్యాఖ్యానం ప్రకారం దివ్య ఖుర్ఆన్‌లో పర్వతాల వివిధ స్థితిగతులు వివరించబడ్డాయి. వాటన్నింటినీ జోడించి చూస్తే, విదితమయ్యే విషయమేమిటంటే, మొదటి దశలో అవి ఎడాపెడా దంచబడి తుత్తునియలుగా చేయబడతాయి (అల్ హాఖ్ఖా – 14). తరువాత అవి ఏకబడిన దూదిపింజాల్లా అయిపోతాయి (అల్ ఖారియహ్ – 5). అవి చెలరేగిన దుమ్ముధూళిలా మారిపోతాయి (వాఖియహ్– 6). అవి ధూళిగా ఎగురవేయబడతాయి (తాహా –105). చివరి దశలో వాటి పరిస్థితి ఎండమావుల్లా తయారవుతుంది. అంటే అసలక్కడ ఏమీ ఉండదు. (ఫత్‌హుల్ ఖదీర్).

19. శత్రువు కోసం వేచి ఉండే స్థలాన్ని 'మాటు' అంటారు. శత్రువులు అటువైపునుంచి వెళుతున్నప్పుడు మెరుపుదాడి చేస్తారు. తీర్పు దినాన నరకభటులు కూడా నరకవాసుల కోసం మాటేసి కూర్చుని ఉంటారు. స్వయంగా నరకం సయితం దైవాదేశానుసారం నరకవాసుల కోసం కడు ఆతురతతో వేచి ఉంటుంది.

20. **'అహ్ఖాబ్'** ( اَحْقَابٌ ) అనేది 'హుఖుబ్'కు బహువచనం. హుఖుబ్ అంటే యుగం, కాలం అని అర్థం. ఆ లెక్కన అహ్ఖాబ్ అనే పదానికి ఎల్లకాలం అనే అర్థం వస్తుంది. అనంతకాలం వారు నరకంలో పడి ఉండవలసిందే. ఈ శిక్ష ముష్రిక్కులకు, అవిశ్వాసులకు ప్రత్యేకం. వారికింక విముక్తి ఉండదు.

25 మరిగే నీరు, (కారే) చీము తప్ప![21]
إِلَّا حَمِيمًا وَغَسَّاقًا ﴿٢٥﴾

26 మొత్తానికి వారికి పూర్తి ప్రతిఫలం లభిస్తుంది.[22]
جَزَآءً وِفَاقًا ﴿٢٦﴾

27 నిశ్చయంగా వారికి లెక్క గురించిన ధ్యాసే ఉండేది కాదు.[23]
إِنَّهُمْ كَانُوا۟ لَا يَرْجُونَ حِسَابًا ﴿٢٧﴾

28 మా వాక్యాలను వారు యధేచ్ఛగా ధిక్కరించేవారు.
وَكَذَّبُوا۟ بِـَٔايَٰتِنَا كِذَّابًا ﴿٢٨﴾

29 మేము ప్రతి విషయాన్ని లిఖించి, లెక్కించి ఉంచాము.[24]
وَكُلَّ شَىْءٍ أَحْصَيْنَٰهُ كِتَٰبًا ﴿٢٩﴾

30 ఇక మీరు (మీ స్వయంకృతాల) రుచి చూడండి. మేము మీకు (నరక) శిక్ష తప్ప మరే విషయాన్నీ పెంచము.[25]
فَذُوقُوا۟ فَلَن نَّزِيدَكُمْ إِلَّا عَذَابًا ﴿٣٠﴾

31 నిశ్చయంగా దైవభీతిపరులు సాఫల్య భాగ్యం పొందుతారు.[26]
إِنَّ لِلْمُتَّقِينَ مَفَازًا ﴿٣١﴾

32 వారి కొరకు స్వర్గవనాలు, ద్రాక్ష ఫలాలున్నాయి.[27]
حَدَآئِقَ وَأَعْنَٰبًا ﴿٣٢﴾

33 నవనవలాడే సమ వయస్కులైన కన్యలున్నారు.[28]
وَكَوَاعِبَ أَتْرَابًا ﴿٣٣﴾

---

21. నరకవాసుల శరీరాల నుండి కారే చీము నెత్తురు అది.

22. అంటే వారు ప్రాపంచిక జీవితంలో చేసిన దురాగతాలకు, పాపకార్యాలకు తగ్గట్టుగానే వారికి ఆ శిక్ష పడుతుంది.

23. ఎందుకంటే వారు లెక్కల దినాన్ని ఖాతరు చేసేవారు కాదు. పైగా లెక్కల ఘడియను వారు పరిహసించేవారు. అసలు మరణానంతర జీవితంపైనే వారికి నమ్మకం ఉండేదికాదు. అందుచేత దేవుడు వారికి ఈ దుర్గతిని పట్టించాడు.

24. అంటే **"లౌహె మహ్ఫూజ్"** అన్నమాట! లేదా దైవదూతలు భద్రపరిచే కర్మల చిట్టా కూడా కావచ్చు. మొదటిదే చాలావరకు సరైనది. ఎందుకంటే, దేవుడు వేరొకచోట; "మేము ప్రతిదానిని ఒక స్పష్టమైన గ్రంథంలో నమోదుచేసి ఉంచాము" అని అన్నాడు (యాసీన్ - 12).

25. పైగా ఈ యాతన శాశ్వితమైనది. నరకవాసుల చర్మాలు కాలిపోతే, వాటి స్థానంలో కొత్తచర్మాలు వస్తాయి (నిసా - 56). నరకాగ్ని చల్లారితే మళ్లీ రాజేయబడుతుంది (బనీ ఇస్రాయీల్ - 97).

26. దౌర్భాగ్యుల ప్రస్తావన తరువాత ఇప్పుడు భాగ్యవంతుల ప్రస్తావన వచ్చింది. వారు శాశ్వతమైన స్వర్గసుఖాలను ఆస్వాదిస్తారు. వారి భయభక్తుల, సత్కార్యాల మూలంగా వారికి ఈ భోగభాగ్యాలు ప్రాప్తించాయి. విశ్వాసం కోరే నైతిక నడవడిని, విధేయత వాంఛించే సదమరవర్తనను అలవరచుకున్న మనిషి నికార్సయిన భక్తిపరుడు (ముత్తఖీ)గా రాణిస్తాడు. కాబట్టి విశ్వసించిన మీదట సత్కార్యాలు చేసి భయభక్తుల జీవితాన్ని గడిపిన వారు నిజంగా ధన్యులు. ఆ పరమ ప్రభువు మనందరినీ ఆ ధన్యులలో చేర్చుగాక!

27. ఇవి కూడా ఆ సాఫల్య భాగ్యంలోనివే.

28. అంటే యౌవనం ఎగిసిపడే, పరువం ఉరకలు వేసే సుందరాంగులు. పైగా వారు స్వర్గంలోని పురుషులతో సమవయస్కులై ఉంటారు. అందువల్ల వారి ఈడూ జోడూ సరిగ్గా ఉంటుంది. వారు తమ దంపతులకు నిజమైన ప్రేమానురాగాలను, అన్యోన్యాన్ని పంచి ఇవ్వగల వారై ఉంటారు. మూలంలో **'కవాయిబ్'** (كَوَاعِبُ) అని ఉంది. అసలు ఇది 'కాబున్' నుంచి వచ్చింది. కాబున్ అంటే 'కాలి గిలక' అని అర్థం. కాలి గిలకలు ఎత్తుగా ఉన్నట్లు వారి రొమ్ము భాగం కూడా ఎత్తుగా ఉండి అందాలొలికిస్తూ ఉంటుంది. **'అత్రాబ్'** అంటే సమవయస్కులు అని అర్థం.

34 మద్యంతో నిండిన మధుపాత్రలున్నాయి.[29]

وَّكَاْسًا دِهَاقًا ﴿34﴾

35 అక్కడ వారు ఏ విధమైన వ్యర్థ ప్రలాపనలుగానీ, అసత్యాలనుగానీ వినరు.[30]

لَا يَسْمَعُوْنَ فِيْهَا لَغْوًا وَّلَا كِذّٰبًا ﴿35﴾

36 నీ ప్రభువు తరఫు నుండి వారికి (వారి కర్మలకు ప్రతిఫలంగా) తగినంతగా లభించే బహుమానం ఇది.[31]

جَزَآءً مِّنْ رَّبِّكَ عَطَآءً حِسَابًا ﴿36﴾

37 ఆయన భూమ్యాకాశాలకు, వాటి మధ్యనున్న సమస్త వస్తువులకు ప్రభువు. మిక్కిలి కరుణామయుడు. ఆయనతో సంభాషించడానికి ఎవరూ సాహసించరు.[32]

رَّبِّ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَمَا بَيْنَهُمَا الرَّحْمٰنِ لَا يَمْلِكُوْنَ مِنْهُ خِطَابًا ﴿37﴾

38 ఏ రోజున ఆత్మ మరియు దైవదూతలు వరుసలు తీరి నిలబడతారో[33] (ఆ రోజు), కరుణామయుని అనుమతి పొందిన వాడు తప్ప మరెవడూ మాట్లాడలేడు. మరి అతనైనా సరైన మాటను మాత్రమే పలుకుతాడు.[34]

يَوْمَ يَقُوْمُ الرُّوْحُ وَالْمَلٰٓئِكَةُ صَفًّا ۙ لَّا يَتَكَلَّمُوْنَ اِلَّا مَنْ اَذِنَ لَهُ الرَّحْمٰنُ وَقَالَ صَوَابًا ﴿38﴾

39 ఆ రోజు (సంభవించటం అనేది) సత్యం.[35] ఇక కోరినవారు (మంచి పనులు చేసి) తమ ప్రభువు దగ్గర స్థానం ఏర్పరచుకోవచ్చు.[36]

ذٰلِكَ الْيَوْمُ الْحَقُّ ۚ فَمَنْ شَآءَ اتَّخَذَ اِلٰى رَبِّهٖ مَاٰبًا ﴿39﴾

29. ఆ మద్యం స్వచ్ఛమైనది, మనిషి మనోమస్తిష్కాలపై ఏమాత్రం చెడు ప్రభావం వేయనిది అయి ఉంటుంది. పైగా ఆ మధు పాత్రలు నింపబడిన తీరు చూడముచ్చటగా ఉంటుంది.

**'దిహాఖా'** అంటే నిండుగా ఉన్నవి, వరుసగా పేర్చబడినవి, ఒకదాని తర్వాత ఒకటిగా పేర్చబడినవి, స్వచ్ఛమైనవి అనే అర్థాలు వస్తాయి. **'కాసున్'** అంటే బాగా నిండివున్న పాత్ర.

30. అంటే – అక్కడ పనికిమాలిన మాటలుగానీ, వ్యర్థ విషయాలుగానీ ఉండవు. స్వర్గ వాసులు పరాచికానికి కూడా పరస్పరం అబద్ధాలాడరు.

31. **'అతాఅన్'** ( عَطَآءً ) అన్న తర్వాత **'హిసాబా'** అనే పదాన్ని చేరిస్తే దాని ద్వారా భావంలో ఎంతో ఆధిక్యత స్ఫురిస్తుంది. దేవుని అనుగ్రహాలు పరిమితమైనవి కావు. దైవదాసులు సత్కార్యాలలో ఎంత ముందంజవేసినాసరే – వారి పురోగతి ప్రకారం ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఎవరికీ రవంత కూడా తగ్గించి ఇవ్వబడదు.

32. అంటే – అల్లాహ్ ఔన్నత్యాన్ని, వైభవాన్ని, ప్రతాపాన్ని చూసి ఆయన సమక్షంలో నోరు మెదపటానికి మొదట ఎవరూ సాహసించరు. అందుకే ఆయన అనుజ్ఞ కానంతవరకూ ఎవరూ సిఫారసు నిమిత్తం నోరెత్తరు.

33. ఇక్కడ **'రూహ్'** అంటే ఆత్మ. ఈ ఆత్మను జిబ్రయీల్ (అలైహి) తో పాటు మరిన్ని అర్థాల్లో తీసుకోవటం జరిగింది. సందర్భం దృష్ట్యా ఈ పదం ఆదం సంతతికి బాగా వర్తిస్తుందని ఇబ్నె కసీర్ భావించారు.

34. ఈ అనుమతిని బహుశా దేవుడు దైవదూతలకు, దైవప్రవక్తలకు ఇస్తాడు. లేదా సజావుగా మాట్లాడేవారికి, కలిమయె తయ్యిబాను మనస్ఫూర్తిగా స్వీకరించి ఉన్నవారికి మాత్రమే మాట్లాడేందుకు అనుమతి లభిస్తుంది.

35. అంటే ఈ తీర్పుదినం వచ్చి తీరుతుంది. అది రాకుండా ఎవరూ అడ్డుకోలేరు.

40 దగ్గరలోనే ఉన్న శిక్షను గురించి మేము మీకు హెచ్చరిం
చాము.[37]ఆ రోజు మానవుడు తన చేతులతో ఆర్జించి–ముందుగా
పంపుకున్న – దానిని చూసుకుంటాడు.[38] అప్పుడు అవిశ్వాసి,
"అయ్యో! నేను మట్టినైపోయినా బావుండేదే!"[39] అనంటాడు.

إِنَّآ أَنذَرْنَٰكُمْ عَذَابًا قَرِيبًا يَوْمَ يَنظُرُ ٱلْمَرْءُ
مَا قَدَّمَتْ يَدَاهُ وَيَقُولُ ٱلْكَافِرُ يَٰلَيْتَنِى كُنتُ
تُرَٰبًۢا (40)

36. అంటే – వారు రానున్న ఆ దినాన్ని దృష్టిలో పెట్టుకుని విశ్వాసమార్గాన్ని, భయభక్తుల మార్గాన్ని అవలంబించాలి. అలా జాగ్రత్తపడినవారికే ఆ రోజు మంచి స్థానం లభిస్తుంది.

37. అంటే – మీకు చాలా సమీపంలోనే ఉన్న ప్రళయదిన శిక్ష గురించి మిమ్మల్ని హెచ్చరించటం జరిగింది. ఆ రోజు రావటం తథ్యం. రానున్న ఆ వస్తువు మీకు ఎంతో దూరాన లేదు.

38. అది సత్కర్మ అయినా, దుష్కర్మ అయినా – అది అతని ముందు సమర్పించబడుతుంది. ఇహలోక జీవితంలో అతను సంపాదించుకున్నదంతా ప్రళయదినాన అతని ముందుకు వచ్చేస్తుంది. దాన్ని అతను చూసుకుంటాడు. "వారు ఏమేం చేశారో అదంతా తమ ప్రభువు ముందు ప్రత్యక్షం కావటాన్ని చూస్తారు" (అల్ కహఫ్–49). "ఆ రోజు మనిషికి, అతడు ముందూ వెనుకా చేసిందీ, చేయించిందీ – అంతా తెలుపబడుతుంది." (అల్ ఖియామా – 13).

39. ఆ రోజు ఒళ్లు గగుర్పొడిచే యాతనను చూడగానే మనిషి నోట వెలువడే మాటలివి! మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం దేవుడు ఆనాడు జంతువుల మధ్య కూడా న్యాయసమ్మతంగా తీర్పు చేస్తాడు. కడకు కొమ్ములుగల ఒక మేక కొమ్ములు లేని మరో మేకపై దౌర్జన్యానికి పాల్పడి ఉంటే దాని పరిహారం కూడా ఇప్పించబడుతుంది. ఈ తీర్పు తరువాత దేవుడు జంతువులను ఉద్దేశించి "మట్టి అయిపోండి" అని ఆజ్ఞాపిస్తాడు. అవన్నీ మట్టి అయిపోతాయి. ఆ సమయంలో అవిశ్వాసులు తమ దుస్థితిపై జాలిపడుతూ, అయ్యో! మేము మట్టిగా మారిపోయినా బావుండేదే! అంటారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

79వ సూరా

# అన్ నాజిఆత్

## ప్రాణాన్ని వెలికి లాగేవారు

అవతరణ మక్కాలో

ఆయతులు 46

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షా బహుమానాల గురించి బోధించింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో దైవదూతల గురించిన ప్రస్తావన వచ్చింది. అవిశ్వాసులకు మృత్యువు సమీపించినప్పుడు వారు అవిశ్వాసుల ప్రాణాలను గుంజి బాధాకరంగా బయటకు లాగుతారు. కాగా; విశ్వాసుల ప్రాణాలను మృదువుగా బయటకు తీస్తారని ఇందులో చెప్పబడింది. ఈ ప్రస్తావన ఆధారంగానే ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది అనివార్యమనీ, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఈ సూరా నొక్కి చెప్పింది. తీర్పుదినం నాటి భయానక పరిస్థితుల గురించి ఈ సూరా వర్ణించింది. ఆ రోజున ప్రకంపనాల కుదుపులకు గుండెలు దడదడలాడుతాయి. చూపులు క్రిందికి వాలిపోతాయి. ఈ సందర్భంగా ఫిర్ఔన్ కథను, ఫిర్ఔన్ అనుచరుల వినాశాన్ని గురించి తెలిపి హెచ్చరిక చేయడం జరిగింది. అల్లాహ్‌కు గల ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యం గురించి వివరించడం జరిగింది. అల్లాహ్ మనపైన ఆకాశాలను నిర్మించాడు. ఆయన భూమిని సృష్టించి దానిలో నీరు, ఆహారాలు కల్పించాడు. ఆయన పర్వతాలను సృష్టించాడు అని వివరిస్తూ విశ్వాసులకు లభించే శాశ్వత స్వర్గవనాల గురించి, అవిశ్వాసులకు లభించే అగ్ని శిక్ష గురించి తెలిపింది.

### అన్ నాజిఆత్ సూరా | سُورَةُ النَّازِعَاتِ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| 1 మునిగి నిర్దాక్షిణ్యంగా (ప్రాణాలు) లాక్కుపోయేవారి సాక్షిగా![1] | وَالنَّازِعَاتِ غَرْقًا ① |
| 2 ముడిని విప్పి విడిపించేవారి సాక్షిగా![2] | وَالنَّاشِطَاتِ نَشْطًا ② |
| 3 తేలియాడుతూపోయే వారి సాక్షిగా![3] | وَالسَّابِحَاتِ سَبْحًا ③ |

1. మరణదూతల స్వభావం ఇక్కడ తెలుపబడింది. వారు అవిశ్వాసుల ప్రాణాలను శరీరాల్లోనికి దూరి కర్కశంగా బయటికి లాగుతారు.
**'నజ్‌వున్'** ( نَزْعٌ ) అంటే కఠినంగా లాగటం అని అర్థం. **'గర్‌ఖన్'** ( غَرْقًا ) అన్న పదానికి 'మునగటం' అని అర్థం.
2. అయితే విశ్వాసుల ప్రాణాలను మాత్రం వారు ఎంతో లాఘవంగా – కట్లు విప్పి విడుదల చేసినట్లే – తీసుకుంటారు. 'నష్‌తున్' అంటే ముడి విప్పటం.
3. **'సబ్‌హన్'** ( سَبْحًا ) అంటే ఈదటం, తేలియాడటం అని అర్థం. దైవదూతలు ప్రాణం తీయటానికి మనిషి లోపలికి చొచ్చుకుపోయి – సముద్రంలోని ముత్యాలను వెలికితీసే గజ ఈతగాళ్ల సముద్రపు అగాథంలోకి పోయి ఈదినట్లే– మనిషి శరీరంలో ఈదుతూ తిరుగుతారు. లేదా వారు దైవాజ్ఞను తీసుకుని వాయువేగంతో భువిపై వాలుతారు. అత్యంత వేగంగా పరుగెత్తే గుర్రాన్ని కూడా అరబీలో 'సాబిహ్' అని అనటం గమనార్హం.

4 వేగంగా దూసుకుపోతూ, ఒండొకరిని మించిపోయేవారి సాక్షిగా![4]

فَالسّٰبِقٰتِ سَبْقًا ﴿٤﴾

5 (తమ ప్రభువు అప్పగించిన) పనులను పకడ్బందీగా అమలు పరిచే వారి సాక్షిగా![5]

فَالْمُدَبِّرٰتِ اَمْرًا ﴿٥﴾

6 ఆ రోజు దద్దరిల్లేది దద్దరిల్లుతుంది.[6]

يَوْمَ تَرْجُفُ الرَّاجِفَةُ ﴿٦﴾

7 మరి దాని వెనుక వచ్చేది (వెంబడిస్తూనే) వస్తుంది.[7]

تَتْبَعُهَا الرَّادِفَةُ ﴿٧﴾

8 (ఎన్నో) గుండెలు ఆ రోజు భయంతో దడదడలాడుతాయి.[8]

قُلُوْبٌ يَّوْمَىِٕذٍ وَّاجِفَةٌ ﴿٨﴾

9 వారి చూపులు క్రిందికి వంగి ఉంటాయి.[9]

اَبْصَارُهَا خَاشِعَةٌ ﴿٩﴾

10 "ఏమిటి, మేము మొదటి అవస్థలోనికే మళ్ళించబడ తామా?"[10] (అని వారు అడుగుతున్నారు.)

يَقُوْلُوْنَ ءَاِنَّا لَمَرْدُوْدُوْنَ فِي الْحَافِرَةِ ﴿١٠﴾

4. ఈ దైవదూతలు దైవసందేశాన్ని దైవప్రవక్తలకు అందజేసేటప్పుడు కూడా చాలా వేగంగా పోతారు. దైవసందేశం గగనతలంలోని షైతానుల చెవిన పడకుండా ఉండాలన్నదే వారి తాపత్రయం. ఈ ఆయతుకు మరొక అర్థం ఇది కూడా కావచ్చు:- వారు విశ్వాసుల (మోమినుల) ప్రాణాలను ఊర్ధ్వలోకాలకు- స్వర్గానికి- తీసుకు పోవటంలో అత్యంత చురుకుగా ఉంటారు. ఒండొకరిని మించిపోయేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు.

5. అంటే – దేవుడు వారికి అప్పగించిన బాధ్యతల నిర్వహణపై చాలా ఖచ్చితంగా వ్యవహరిస్తారు. వాస్తవానికి ఈ వ్యూహరచన చేసేవాడు దేవుడే. కాని దేవుడు తన యుక్తిననుసరించి ఈ కార్యాన్ని తన దూతలతో చేయించినప్పుడు కూడా వారిని వ్యూహకర్తలుగా అభివర్ణించటం జరిగింది. ఈ విధంగా ఈ సూరాలో దైవదూతల ఐదు ముఖ్య లక్షణాలు తెలుపుతూ, వాటిపై దేవుడు ప్రమాణం చేశాడు. ఈ ప్రమాణాల అంతరార్థం ఏమిటంటే – "మీరు తప్పకుండా మళ్లీ బ్రతికించబడతారు. మీరు చేసిన కర్మలేమిటో మీకు తప్పకుండా తెలియపరచబడతాయి." మరణానంతర జీవితం గురించి దివ్య ఖుర్ఆన్‌లో అనేకచోట్ల ప్రమాణం చేయబడింది. ఉదాహరణకు: తగాబున్ సూరా 7వ ఆయతులో కూడా దేవుడు ప్రమాణం చేసి ఈ యదార్థాన్ని స్పష్టపరిచాడు. ఇంతకీ ఇది ఎప్పుడు జరుగుతుంది? దీనికి సమాధానం రాబోయే వాక్యాలలో వుంది.

6. ఇది మొదటిసారి ఊదబడే శంఖం. దీన్నే వినాశకర శంఖారావం (నఫ్ఖయె ఫనా) అని కూడా అంటారు. ఈ శంఖం పూరించబడినపుడు విశ్వమంతా దద్దరిల్లుతుంది. భూమండలమంతా ప్రకంపిస్తుంది. ఆ రోజు జగతిన ఉన్నవన్నీ నశిస్తాయి.

7. ఇది మలిసారి శంఖారావం. ఈసారి శంఖం పూరించబడినపుడు సమాధులలో ఉన్నవారంతా సజీవులై – లేచి – వస్తారు. ఈ మలిసారి శంఖారావం తొలిసారి శంఖారావం జరిగిన 40 ఏండ్ల తరువాత సంభవిస్తుంది. ఈ రెండవ శంఖారావాన్ని 'రాదిఫహ్' అంటారు. 'రాదిఫహ్' అంటే వెనుక లేక తర్వాత వచ్చేది అని అర్థం.

8. ఎందుకంటే ప్రళయదినపు పరిస్థితి అలా ఉంటుంది మరి.

9. భయకంపితులైన ఈ వ్యక్తుల చూపులు కూడా (నేరస్థుల మాదిరిగా) వంగి ఉంటాయి.

10. ఇవి సత్య తిరస్కారుల పలుకులు. మరణానంతర జీవితం అనే విషయం వారికి మింగుడుపడలేదు. అందుకే వారావిధంగా ప్రశ్నించారు. **'హాఫిరతున్'** (حَافِرَةٌ) అంటే మొదటి స్థితి అని అర్థం. మరణించిన తర్వాత మేము మళ్లీ పూర్వ స్థితికి వస్తామా అని అవిశ్వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు.

| | |
|---|---|
| 11 "మేము కృశించిన ఎముకలుగా మారిన తరువాత కూడానా?!" (అని వారు అంటున్నారు కదూ!)[11] | ءَاِذَا كُنَّا عِظَامًا نَّخِرَةً ⑪ |
| 12 "మరయితే ఈ మళ్ళింపు (మా పాలిట) నష్టకరమే" అని కూడా వారంటున్నారు.[12] | قَالُوْا تِلْكَ اِذًا كَرَّةٌ خَاسِرَةٌ ⑫ |
| 13 అదొక (భయంకరమైన) గద్దింపు (అని మరువకండి). | فَاِنَّمَا هِيَ زَجْرَةٌ وَّاحِدَةٌ ⑬ |
| 14 (అది సంభవించగానే) వారంతా ఒక్కసారిగా మైదానంలో సమీకరించబడతారు.[13] | فَاِذَا هُمْ بِالسَّاهِرَةِ ⑭ |
| 15 (ఓ ప్రవక్తా!) మూసా సంగతిగాని నీ వరకు చేరిందా? | هَلْ اَتٰىكَ حَدِيْثُ مُوْسٰى ⑮ |
| 16 అప్పుడు అతని ప్రభువు అతన్ని 'తువా' అనే పవిత్ర లోయ లోకి పిలిచాడు.[14] | اِذْ نَادٰىهُ رَبُّهٗ بِالْوَادِ الْمُقَدَّسِ طُوًى ⑯ |
| 17 "నువ్వు ఫిరౌను వద్దకు వెళ్ళు. వాడు మరీ చెలరేగి పోయాడు."[15] | اِذْهَبْ اِلٰى فِرْعَوْنَ اِنَّهٗ طَغٰى ⑰ |
| 18 "నీ స్వీయ సంస్కరణకు నువ్వు సిద్ధంగా ఉన్నావా?" అని వాణ్ణి అడుగు.[16] | فَقُلْ هَلْ لَّكَ اِلٰٓى اَنْ تَزَكّٰى ⑱ |

11. తీర్పుదినాన్ని నిరాకరించేవారు లేవనెత్తిన మరో సందేహం ఇది! మేము చచ్చి, కుళ్లి కృశించిపోయిన తరువాత, మా ఎముకలు సయితం పుప్పొడిగా మారిపోయాక మేము మళ్లీ బ్రతికించబడతామా? వింతగా ఉందే! అని వారంటున్నారు.
12. ఒకవేళ ముహమ్మద్ (సఅసం) చెబుతున్నట్టుగా, మరణానంతర జీవితమే గనక ఉంటే ఆ జీవితం తమ పాలిట దుర్భరంగా, నష్టదాయకంగా ఉంటుందని కూడా వారు చెప్పారు.
13. ఆయతులో **'సాహిరతున్'** అని ఉంది. సాహిర అంటే చదునైన మైదానం, బహిరంగ ప్రదేశం అని అర్థం. అసలు ఈ పదానికి 'జాగారం చేయటం' అనే అర్థం ఉంది. ప్రాణులు నిద్రపోయేది, మేల్కొనేది భూ ఉపరితలం మీదే కాబట్టి దాన్ని 'సాహిరా' అంటారని కొంతమంది చెబుతారు. మరికొంతమంది ప్రకారం అడవి ప్రదేశాలలో, ఎడారి ప్రదేశాలలో భయాందోళనల మూలంగా మనిషికి నిద్రపట్టదు. అందువల్ల అతను మేల్కొనే ఉంటాడు. అందుకే దాన్ని **సాహిరా** అనటం జరిగింది (ఫత్హుల్ ఖదీర్). ప్రళయదినపు పరిస్థితిని వివరించటానికి ప్రయోగించబడిన పదజాలాలలో ఇదొకటి. శంఖం పూరించగానే – ఒక్కసారిగా – జనులంతా ఒక మైదానంలోకి వచ్చి చేర్తారు.
14. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) మద్యన్ నుండి తన స్వస్థలానికి తిరిగి వస్తున్నప్పుడు – నిప్పుకోసం తూరు పర్వతం వద్దకు వెళ్ళగా – అక్కడ దేవుడు ఒక వృక్షం వెనుక నుండి ఆయనతో సంభాషించినప్పటి సంఘటన ఇది. తాహా సూరా ప్రారంభంలో ఈ వివరాలు వచ్చాయి. ప్రవక్త మూసాతో దేవుడు సంభాషించాడంటే ఆయనకు ప్రవక్తా పదవిని, దైవదౌత్యాన్ని అనుగ్రహించాడన్నమాట! అంటే మూసా వెళ్లింది నిప్పుకోసమైతే, ఆయనకు ప్రవక్త పదవి లభించింది.
15. అంటే – సత్యతిరస్కారంలోనూ, దైవధిక్కరణలోనూ, అహంకారంలోనూ ఫిరౌను హద్దుమీరిపోయాడు.
16. అంటే – నీ దిద్దుబాటుకు, సంస్కరణకు తగిన మార్గాన్ని అవలంబించటానికి ఇష్టపడుతున్నావా? అలాగైతే నిన్ను నువ్వు సర్వోన్నతుడైన అల్లాహ్ ముందు సమర్పించుకో. ఆయనకు విధేయుడవై ఉండు.

| | |
|---|---|
| 19 "నువ్వు భయభక్తులతో మసలుకునేందుకుగాను, నేను నీకు నీ ప్రభువు మార్గం చూపించనా!?"[17] (అని చెప్పమని అల్లాహ్ మూసాకు ఉపదేశించాడు). | وَ اَهْدِيَكَ اِلٰى رَبِّكَ فَتَخْشٰى ﴿19﴾ |
| 20 మరి (మూసా) అతనికి గొప్ప సూచన (మహిమ)ను చూపాడు.[18] | فَاَرٰىهُ الْاٰيَةَ الْكُبْرٰى ﴿20﴾ |
| 21 కాని వాడు మాత్రం ధిక్కరించాడు, అవిధేయతకు పాల్పడ్డాడు.[19] | فَكَذَّبَ وَعَصٰى ﴿21﴾ |
| 22 ఆ తర్వాత తిరిగివెళ్ళి, తన సన్నాహాలు మొదలెట్టాడు.[20] | ثُمَّ اَدْبَرَ يَسْعٰى ﴿22﴾ |
| 23 మరి అందరినీ సమావేశపరచి, ప్రకటించాడు:[21] | فَحَشَرَ فَنَادٰى ﴿23﴾ |
| 24 "నేనే మీ సర్వోన్నత ప్రభువును" అన్నాడు. | فَقَالَ اَنَا رَبُّكُمُ الْاَعْلٰى ﴿24﴾ |
| 25 అందువల్ల అల్లాహ్ అతన్ని ఇహపర లోకాల శిక్షగా పట్టు కున్నాడు.[22] | فَاَخَذَهُ اللّٰهُ نَكَالَ الْاٰخِرَةِ وَ الْاُوْلٰى ﴿25﴾ |
| 26 నిశ్చయంగా ఇందులో దైవభీతిగల ప్రతి ఒక్కరికీ గొప్ప గుణపాఠం ఉంది.[23] | اِنَّ فِيْ ذٰلِكَ لَعِبْرَةً لِّمَنْ يَّخْشٰى ﴿26﴾ |

17. నువ్వు దేవుని ఏకత్వాన్ని ఒప్పుకుని, ఆయన్ని ఆరాధించినావంటే నీలో భయభక్తులు జనిస్తాయి. తద్వారా నీకు సన్మార్గ భాగ్యం ప్రాప్తమవుతుంది.

18. అంటే–దేవుని తరఫున తనకు ప్రసాదించబడిన సత్య నిదర్శనాలను మూసా అతని ముందు ప్రదర్శించారు. ఇంతకీ ఆ సత్య సూచనలేమిటి? చేతిలోని కర్ర పాముగా మారటం, చంకలో చేయి పెట్టినప్పుడు ప్రకాశించటమే ఆ సూచనలని కొందరు అభిప్రాయపడగా, మూసా కాలంలో సంభవించిన "తొమ్మిది సంఘటనలే" ఆ నిదర్శనాలని మరికొందరు భావిస్తున్నారు.

19. కాని ఆ మహిమలకు, సూచనలకు వాడు ఏమాత్రం ప్రభావితుడు కాలేదు. పైగా వాడు తన ధిక్కార వైఖరిపై మరింతగా మొండికేశాడు.

20. వాడు విశ్వాస మార్గాన్ని, విధేయతా మార్గాన్ని విడనాడటమే గాక భువిపై చెలరేగి పోయాడు. కల్లోలాన్ని రేకెత్తించాడు. ప్రజలపై, ముఖ్యంగా బలహీనవర్గాలపై దౌర్జన్యం చేశాడు. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) సందేశాన్ని, ఉద్యమాన్ని విఫలం చేసేందుకు రాజ్యంలోని మాంత్రికులందరినీ ప్రోగుచేశాడు. ఎలాగైనా మూసాను అసత్యవాదిగా చిత్రీకరించా లన్నది వాడి ఉద్దేశం.

21. అంటే; తన జాతి జనులను, ప్రముఖులను సమావేశపరిచాడు. మరో అర్థంలో తన సైనికులను, మాంత్రికులను సమీకరించాడు. తన వాదంపై హఠం చేస్తూ, తన్ను తాను గొప్ప ప్రభువుగా ప్రకటించుకున్నాడు.

22. దేవుడు వాణ్ణి శిక్షించే తీరు ఉదాహరించదగినది. భావితరాల వారందరికీ గొప్ప గుణపాఠ సూచనగా మిగిలి ఉండేలా దేవుడు అతన్ని దండించాడు. పరలోక శిక్ష ఇంతకన్నా తీవ్రమైనది. అది అక్కడ అతనికి విధించబడుతుంది.

23. ఈ వాక్యంలో అంతిమ దైవప్రవక్త (స)కు ఓదార్పూ, మక్కా అవిశ్వాసులకు హెచ్చరికా ఉన్నాయి. ఒకవేళ వారు గనక గతించిన వారి ఉదంతాల ద్వారా గుణపాఠం గ్రహించకపోతే వీళ్ళ పర్యవసానం కూడా దారుణంగా ఉంటుంది.

| | |
|---|---|
| 27 ఏమిటి, మిమ్మల్ని సృష్టించటం కష్టంతో కూడుకున్న పనా? లేక ఆకాశాన్నా?[24] ఆయనే (అల్లాహ్‌యే) దానిని నిర్మించాడు. | ءَاَنۡتُمۡ اَشَدُّ خَلۡقًا اَمِ السَّمَآءُ ؕ بَنٰٮهَا ﴿27﴾ |
| 28 ఆయనే దాని కప్పును బాగా ఎత్తుగా చేశాడు. మరి దానిని తీర్చిదిద్దాడు.[25] | رَفَعَ سَمۡكَهَا فَسَوّٰٮهَا ﴿28﴾ |
| 29 దాని రాత్రిని చీకటిమయంగా చేశాడు. దాని పగటిని (వెలుతురుగా) బయల్పరిచాడు.[26] | وَاَغۡطَشَ لَيۡلَهَا وَاَخۡرَجَ ضُحٰٮهَا ﴿29﴾ |
| 30 తరువాత భూమిని సుగమం చేశాడు.[27] | وَالۡاَرۡضَ بَعۡدَ ذٰلِكَ دَحٰٮهَا ﴿30﴾ |
| 31 అందులో నుంచి దాని నీళ్లను, దాని పచ్చికను వెలికి తీశాడు. | اَخۡرَجَ مِنۡهَا مَآءَهَا وَمَرۡعٰٮهَا ﴿31﴾ |
| 32 ఇంకా, పర్వతాలను (స్థిరంగా) పాతి పెట్టాడు. | وَالۡجِبَالَ اَرۡسٰٮهَا ﴿32﴾ |
| 33 ఇదంతా మీ కోసమూను, మీ పశువుల ప్రయోజనం కోసమే. | مَتَاعًا لَّكُمۡ وَلِاَنۡعَامِكُمۡ ﴿33﴾ |
| 34 మరెప్పుడయితే ఆ మహా విపత్తు (ప్రళయం) వచ్చి పడుతుందో... | فَاِذَا جَآءَتِ الطَّآمَّةُ الۡكُبۡرٰى ﴿34﴾ |
| 35 ఆ రోజు మనిషి తాను చేసిన దాన్ని నెమరు వేసుకుంటాడు. | يَوۡمَ يَتَذَكَّرُ الۡاِنۡسَانُ مَا سَعٰى ﴿35﴾ |
| 36 ప్రతి చూపరి ముందూ నరకం బహిర్గతం చేయబడు తుంది.[28] | وَبُرِّزَتِ الۡجَحِيۡمُ لِمَنۡ يَّرٰى ﴿36﴾ |

24. మక్కా అవిశ్వాసుల్ని ఉద్దేశించి వేయబడిన ప్రశ్న ఇది. ఇందులో వారికి హెచ్చరిక కూడా ఉంది. ఆకాశాలను నిర్మించి, వాటిలో ఎన్నో అద్భుతాలను చేసిన దేవుడు, చనిపోయిన మిమ్మల్ని తిరిగి బ్రతికించలేడని ఎలా అనుకున్నారు? మిమ్మల్ని తిరిగి బ్రతికించటం ఆకాశాల నిర్మాణం కన్నా కష్టసాధ్యమైనపని అనుకున్నారా?

25. తీర్చిదిద్దటం లేక సరిదిద్దటం అంటే ఆకాశమండలంలో ఎలాంటి లోపంగానీ, వక్రతగానీ, బీటలుగానీ, అవరోధంగానీ లేకుండా సమతూకం గలదిగా చేయటం అని అర్థం.

26. అంటే, ఆయన పగటిని సూర్యుని ద్వారా వెలుగుమయం చేశాడు.

27. హామీమ్ సజ్దా సూరాలోని 9వ వచనంలో కూడా ఈ వివరాలు వచ్చాయి. భూమి ఆకాశం కంటే ముందే సృజించ బడింది. అయితే దీన్ని తీర్చిదిద్దే పని మాత్రం ఆకాశనిర్మాణం తర్వాతనే జరిగింది. ఈ విషయమే ఇక్కడ చెప్ప బడింది. **'దహాహా'** అంటే విశాలంగా పరచటం, సుగమం చేయటం, నివాసయోగ్యంగానూ, మనుగడకు అనువైనది గానూ మలచటం అని అర్థం. ఇందు నిమిత్తం ఏ ఏ వస్తువులు అవసరమో వాటన్నింటినీ దేవుడు భువిపై సమకూర్చాడు. ఉదాహరణకు : నేలనుండి నీళ్లను తీశాడు. పచ్చికను, ఆహారాన్ని ఉత్పన్నం చేశాడు. భూమి కదలకుండా ఉండటానికి పర్వతాలను మేకుల మాదిరిగా పాతాడు.

28. అంటే నరకానికి ఆహుతి కానున్న అవిశ్వాసులు దాన్ని చూసుకోవటానికి వీలుగా, అది వారి ముందుకు తీసుకు రాబడుతుంది. మరికొంతమంది విద్వాంసుల ప్రకారం చూచే ప్రతి ఒక్కరి ముందూ – అంటే విశ్వాసుల, అవిశ్వాసుల

**37** కాబట్టి ఎవడు తలబిరుసుగా వ్యవహరించాడో,[29]

فَأَمَّا مَنْ طَغٰى ﴿37﴾

**38** మరి ప్రాపంచిక జీవితానికే ప్రాధాన్యం ఇచ్చాడో[30]

وَاٰثَرَ الْحَيٰوةَ الدُّنْيَا ﴿38﴾

**39** అతని నివాసం నరకమే అవుతుంది.[31]

فَاِنَّ الْجَحِيْمَ هِيَ الْمَاْوٰى ﴿39﴾

**40** మరెవడు తన ప్రభువు ఎదుట నిలబడే విషయమై భయ పడ్డాడో,[32] ఇంకా తన మనసును చెడు వాంఛల నుండి ఆపుకున్నాడో,[33]

وَاَمَّا مَنْ خَافَ مَقَامَ رَبِّهٖ وَنَهَى النَّفْسَ عَنِ الْهَوٰى ﴿40﴾

**41** అతని నివాసం స్వర్గమవుతుంది.[34]

فَاِنَّ الْجَنَّةَ هِيَ الْمَاْوٰى ﴿41﴾

**42** వారు ప్రళయం గురించి, 'ఇంతకీ అదెప్పుడు సంభ విస్తుందీ?' అని నిన్ను అడుగుతున్నారు కదూ![35]

يَسْـَٔلُوْنَكَ عَنِ السَّاعَةِ اَيَّانَ مُرْسٰىهَا ﴿42﴾

**43** ఆ వివరణతో అసలు నీకేం సంబంధం (ఉందనీ?)[36]

فِيْمَ اَنْتَ مِنْ ذِكْرٰىهَا ﴿43﴾

**44** ఆ సంగతి (దాని పరిజ్ఞానం) పూర్తిగా నీ ప్రభువు వైపే మరలు తుంది (కదా!)

اِلٰى رَبِّكَ مُنْتَهٰىهَا ﴿44﴾

**45** నువ్వు మాత్రం దానికి భయపడేవారిని హెచ్చరించే వాడివి మాత్రమే.[37]

اِنَّمَآ اَنْتَ مُنْذِرُ مَنْ يَّخْشٰىهَا ﴿45﴾

---

ముందుకు కూడా – నరకం ప్రత్యక్షపరచబడుతుంది. విశ్వాసులు దాన్ని చూసి అల్లాహ్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటారు. ఎందుకంటే, అల్లాహ్ వారిని నరకయాతన నుండి కాపాడాడు గనక. అయితే అప్పటికే కలవరానికి గురై ఉన్న అవిశ్వాసులు నరకాన్ని చూడగానే మరింత ఆందోళనకు లోనవుతారు. తమ దీనావస్థపై వారికి సిగ్గేస్తుంది.

29. అంటే – తిరస్కారం, దుర్మార్గంలో బరితెగించిపోయాడో..

30. అంటే – ప్రాపంచిక వ్యామోహంలో కూరుకుపోయి పరలోక జీవితానికి కావలసిన మంచి సామగ్రిని సమకూర్చు కోనివాడు.

31. నరకం మినహా వాడు ఆశ్రయం పొందేందుకు వేరొక ఆశ్రయం దొరకదు.

32. అంటే – తాను గనక దేవుని పట్ల అవిధేయతకు పాల్పడినట్లయితే, అల్లాహ్ పట్టునుంచి తనను రక్షించేవాడెవడూ ఉండడని భావించి సత్కార్యాలు చేసినవాడు, పాపకార్యాలను త్యజించినవాడు...

33. అంటే, తన ఆత్మను పాపాల నుండి, నిషిద్ధ విషయాల నుండి కాపాడుకుని, ధర్మపథంలో తన జీవన రథాన్ని నడిపించినవాడు.

34. అక్కడ అతను శాశ్వతంగా, దేవుని అతిథిగా ఉంటాడు.

35. అంటే ప్రళయం సంభవించే ఆ తుది ఘడియ ఏదో ఖచ్చితంగా చెప్పమని వారు ప్రశ్నిస్తున్నారు.

36. (ఓ ముహమ్మద్ – సఅసం!) నిజానికి దీని గురించి నీక్కూడా తెలియదు. కాబట్టి ఆ సంగతి నీకు అనవసరం. ఆ సంగతిని అల్లాహ్‌కు వదలిపెట్టు. ఎందుకంటే ఆ ఘడియ ఎప్పుడనేది ఆయనకు మాత్రమే తెలుసు.

37. జనులను హెచ్చరించటం వరకే నీ పని. అగోచర విషయాల జ్ఞానాన్ని దేవుడు ఏ ప్రవక్తకు కూడా ఇవ్వలేదు.

| | |
|---|---|
| **46** వారు దానిని ప్రత్యక్షంగా చూసిన నాడు, తాము (ప్రపంచంలో) కేవలం ఒక దినములో అంత్య భాగమో లేక దాని ఆరంభ భాగమో ఉండి ఉంటామని వారికి అనిపిస్తుంది.[38] | كَأَنَّهُمْ يَوْمَ يَرَوْنَهَا لَمْ يَلْبَثُوٓا۟ إِلَّا عَشِيَّةً أَوْ ضُحَىٰهَا ﴿46﴾ |

ప్రళయ ఘడియ గురించి కూడా అంతే. మనసులో భయభక్తులు ఉన్నవారు కూపీలు లాగే ప్రయత్నం చేయరు. వారు ఎల్లప్పుడూ హితబోధ ద్వారా ప్రయోజనం పొందే ప్రయత్నంలో ఉంటారు.

38. **'అషియ్యతన్'** (عَشِيَّةً) అంటే మధ్యాహ్నం (జుహ్ర్) నుండి సూర్యాస్తమయం వరకు గల సమయం. **'జుహా'** (ضُحَىٰ) అంటే సూర్యోదయం నుండి సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చే వరకు గల సమయం. అవిశ్వాసులు నరక యాతనను చూడగానే, వారు ప్రాపంచిక జీవితంలో జుర్రుకున్న సుఖసౌఖ్యాలను, అనుభవించిన భోగభాగ్యాలను పూర్తిగా మరచిపోతారు. తాము ప్రపంచంలో పూర్తిగా ఒక్కరోజు కూడా ఉండలేదని, మహాఅయితే ఒక పూట ఉండి ఉంటామని వారు అనుకుంటారు.

80 వ సూరా

# అబస

## నుదురు చిట్లించాడు

అవతరణ: మక్కాలో

ఆయతులు: 42

### పరిచయం

ఈ సూరా మర్యాదల గురించి, ప్రళయం గురించి, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి, తీర్పుదినం గురించి ముఖ్యంగా బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన 'అబస' (నుదురు చిట్లించాడు) అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. దివ్య ఖుర్ఆన్ జ్ఞానం పొందడానికి ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన ఒక నిరుపేద గుడ్డి వాని కథతో ఈ సూరా ప్రారంభమవుతుంది. ఆ గుడ్డి వ్యక్తి ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చినప్పుడు ప్రవక్త (సఅసం) కొందరు ఖురైష్ అవిశ్వాసులకు దివ్యఖుర్ఆన్ బోధిస్తున్నారు. వాళ్ళు పలుకుబడి కలిగిన ప్రముఖులు. ఆ సమయంలో వచ్చిన గుడ్డివాణ్ణి చూసి ప్రవక్త (సఅసం) కాస్త చికాగ్గా నుదురు చిట్లించారు. ఈ సందర్భంగా అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్(సఅసం)కు చేసిన బోధన ఈ సూరాలో ఉంది. మనిషి సాధారణంగా మొండిగా వ్యవహరిస్తాడని, ఒక వీర్యబిందువు నుంచి తాను ఉద్భవించిన వాస్తవాన్ని మరిచిపోయి సత్యాన్ని తిరస్కరిస్తాడని ఈ సూరా వ్యాఖ్యానించింది. తీర్పుదినం నాటి చెవులు చిల్లులు పడే శంఖారావం గురించి, ఆనాడు ఎదురయ్యే భయానక పరిస్థితుల గురించి, ఆనాడు ప్రజల స్థితిగతుల గురించి ఈ సూరాలో వివరించడం జరిగింది. ఆనాడు ఎవరికీ తమ గురించి తప్ప ఇతరుల గురించి ఆలోచన రానేరాదు.

### అబస సూరా[1] — سُورَةُ عَبَسَ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ ٱللَّهِ ٱلرَّحْمَٰنِ ٱلرَّحِيمِ |
| **1** (ప్రవక్త) నుదురు చిట్లించాడు, ముఖం త్రిప్పుకున్నాడు – | عَبَسَ وَتَوَلَّىٰٓ ﴿1﴾ |
| **2** తన వద్దకు ఒక అంధుడు వచ్చినంత మాత్రానికే.[2] | أَن جَآءَهُ ٱلْأَعْمَىٰ ﴿2﴾ |

3 (ఓ ప్రవక్తా!) నీకేం తెలుసు, బహుశా అతను తనను సంస్క
రించుకుంటాడేమో!?[3]

وَمَا يُدْرِيكَ لَعَلَّهُ يَزَّكَّىٰ (3)

4 లేదా ఉపదేశం వింటాడేమో! ఉపదేశం అతనికి ప్రయోజన
కరం అవుతుందేమో!!

أَوْ يَذَّكَّرُ فَتَنفَعَهُ الذِّكْرَىٰ (4)

5 ఎవడయితే నిర్లక్ష్యం చేస్తున్నాడో[4]

أَمَّا مَنِ اسْتَغْنَىٰ (5)

6 అతనిపై నువ్వు ఎంతో శ్రద్ధ చూపుతున్నావు.[5]

فَأَنتَ لَهُ تَصَدَّىٰ (6)

7 వాడు గనక దిద్దుబాటు చేసుకోకపోతే, ఆ నింద నీపై లేదుకదా![6]

وَمَا عَلَيْكَ أَلَّا يَزَّكَّىٰ (7)

8 మరెవరయితే నీ దగ్గరకు (శ్రద్ధగా) పరుగెత్తుకుంటూ
వస్తున్నాడో,[7]

وَأَمَّا مَن جَاءَكَ يَسْعَىٰ (8)

9 దైవభీతి (కూడా) కలిగి ఉన్నాడో,[8]

وَهُوَ يَخْشَىٰ (9)

1. ఈ సూరా అవతరణ వెనుక గల సందర్భంపై పండితులందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. ప్రవక్త ప్రియసహచరులైన హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమ్మె మక్తూమ్ నేపథ్యంలో ఇది అవతరించింది. ఈయన అంధులు. ఒకసారి – దైవప్రవక్త ఖురైష ప్రముఖులతో చర్చలు జరుపుతుండగా ఇబ్నె ఉమ్మె మక్తూమ్ అకస్మాత్తుగా వచ్చి ఏదో ధర్మసందేహం వెలిబుచ్చబోయారు. చర్చల్లో అంతరాయం కలిగినందుకు దైవప్రవక్త (సఅసం) వారి ముఖారవిందంపై కించిత్ అసహనం తొంగిచూసింది. ఉన్నట్టుండి ఆ సహాబి అక్కడ ఊడిపడటంపై దైవప్రవక్త (స) కాస్తంత విసుగు చెందారు. ఈ ధోరణి అల్లాహ్‌కు నచ్చలేదు. అందువల్ల దైవప్రవక్త (స)కు మందలింపుగా ఈ ఆయతులు అవతరించాయి (తిర్మిజీ–అబస సూరా వ్యాఖ్యానం; అల్‌బానీ గారు ఈ హదీసును ప్రామాణిక హదీసుల జాబితాలో చేర్చారు).
2. ఇబ్నె ఉమ్మె మక్తూమ్ గారు అకస్మాత్తుగా వచ్చినందుకు దైవప్రవక్త మోముపై వ్యక్తమయిన చిరాకు సహజమే అయినా, అది ప్రవక్త స్థాయికి శోభించని విషయం.
3. అంటే ఆ గుడ్డివాడు నీ ద్వారా ధర్మసందేహాన్ని నివృత్తి చేసుకుని సదాచరణకు ఉపక్రమించవచ్చు. తత్ఫలితంగా అతని దిద్దుబాటు జరగవచ్చు. అతని అంతరంగం పరిశుద్ధం కావచ్చు. నీ హితబోధ అతనికి లాభసాటి కావచ్చు. కనుక ఓ ముహమ్మద్ (స)! ఈ కులీనుల, భాగ్యవంతుల కోసం నువ్వు, నీ దగ్గరకు వచ్చిన అభాగ్య జీవులను నిర్లక్ష్యం చేయకు! అని దేవుడు తన ప్రవక్తకు బోధపరుస్తున్నాడు.
4. అంటే – విశ్వాసం (ఈమాన్) పట్ల, ప్రవక్త వద్దకు వచ్చిన 'జ్ఞానం' పట్ల చాలా నిర్లక్ష్యంగా ఉండేవాడు. లేదా తన సిరిసంపదల్ని చూసుకుని మురిసిపోతూ ఇతరులను లక్ష్యపెట్టనివాడు.
5. ఓ ముహమ్మద్! చిత్తశుద్ధిగల ఈ అభిమానధనులను విస్మరించి, సత్యంపట్ల వైముఖ్య ధోరణిని కనబరిచే ఈ బడా ఆసాములపై దృష్టిని కేంద్రీకరించటం నీకు తగదు అని దేవుడు మరోసారి తన ప్రవక్తను మృదువుగా మందలించాడు.
6. ఓ ప్రవక్తా! సందేశాన్ని చేరవేయటం వరకే నీ కర్తవ్యం. దాన్ని గ్రహించి బాగుపడేవారు లాభం పొందుతారు. ఒకవేళ ఎవరయినా తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోక పోయినట్లయితే దానికి నీవు బాధ్యుడవు కావు. కాబట్టి ఈ సోకాల్డ్ అరిస్టోక్రాట్‌ల కోసం నువ్వు మరీ అంతగా దిగులు చెందాల్సిన అవసరం లేదు సుమా!
7. అంటే – నీవు చూపే సన్మార్గం కోసం తహతహలాడేవాడు, నీ ఉపదేశాలను విని పవిత్ర జీవితం గడపాలని ఉవ్విళ్ళూరే పేదవాడు మరోవైపున ఉన్నాడు.
8. పైగా అతను అనుక్షణం దైవానికి భయపడుతూ, నీ సహచర్యం కోసం పరితపిస్తున్నాడు. అందువల్ల నీవు చేసే

10 అతని పట్లేమో నువ్వు అశ్రద్ధ వహిస్తున్నావు.[9]
فَأَنتَ عَنْهُ تَلَهَّىٰ ⑩

11 ఇది సరైనది కాదు.[10] ఈ ఖుర్‌ఆను మాత్రం హితబోధ నిమిత్తమే ఉన్నది.
كَلَّآ إِنَّهَا تَذْكِرَةٌ ⑪

12 కాబట్టి, కోరినవారు దీని ద్వారా హితబోధను గ్రహించ వచ్చు.[11]
فَمَن شَآءَ ذَكَرَهُۥ ⑫

13 అది గౌరవప్రదమైన సహీఫాల్లో (లిఖితమై) ఉన్నది.[12]
فِى صُحُفٍ مُّكَرَّمَةٍ ⑬

14 అవి మహోన్నతమైనవి, పవిత్రమైనవీను.[13]
مَّرْفُوعَةٍ مُّطَهَّرَةٍۭ ⑭

15 అది లేఖకుల (దైవదూతల) చేతుల్లో[14] ఉంది.
بِأَيْدِى سَفَرَةٍ ⑮

హితబోధ అతనికి లాభం చేకూరుస్తుందన్న ఆశ ఉంది. నీ ప్రబోధనలను అతను అక్షరాలా పాటిస్తాడన్న నమ్మకం కూడా ఉంది. కనుక అలాంటి సచ్ఛీలురను నువ్వు అశ్రద్ధ చేయకు.

9. అసలు నువ్వు శ్రద్ధ తీసుకోవలసింది ఇలాంటి త్యాగధనుల పట్లనేగాని, ధనమదాంధుల, అధికార మదాంధుల పట్లకాదు. ఈ ఆయతుల ద్వారా అవగతమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే, దైవధర్మ పరిచయం (ప్రచారం) విషయంలో కొందరిపట్ల ప్రత్యేకంగా వ్యవహరించవలసిన, కొందరికి పెద్దపీట వేయవలసిన అవసరం లేదు. ఈ విషయంలో ఆసాములు – అగత్యపరులు; కలవారు – లేనివారు; యజమానులు– సేవకులు; స్త్రీలు – పురుషులు; వృద్ధులు – పిన్నవయస్కులు అంతా ఒక్కటే. కాబట్టి అందరిపట్లా సమభావం కలిగి ఉండాలి. అయితే దేవుడు తన యుక్తిననుసరించి, తాను తలచిన వారికి సన్మార్గ భాగ్యాన్ని అనుగ్రహిస్తాడు. (ఇబ్నె కసీర్).

10. అంటే – పేదవారిపట్ల అనాసక్తతను కనబరచి, శ్రీమంతుల పట్ల అమితాసక్తిని చూపే నీ ధోరణి సరైనది కాదు. ఇకమీదట ఇలాంటివి జరగకుండా జాగ్రత్తపడు! అని చెప్పటం దీని అంతరార్థం.

11. అంటే – ఈ గ్రంథం పట్ల శ్రద్ధాభక్తులు ఉన్నవారు దీన్నుండి గుణపాఠం నేర్చుకోవాలి. ఇందలి ఉపదేశాలను ఆచరించాలి. ఈ గ్రంథాన్ని లక్ష్యపెట్టని వారిని పట్టించుకోవాల్సిన పనిలేదు. మక్కాకు చెందిన సర్దారులు, కులీనులు కూడా ఈ గ్రంథంపట్ల అనాసక్తతే చూపారు. దానివల్ల ధర్మానికి వాటిల్లిన నష్టం ఏమీ లేదు. కాబట్టి విముఖత చూపేవారిని గురించి చింతించాల్సిన పనిలేదు.

12. అంటే **"లౌహె మహ్‌ఫూజ్"** లో అని భావం. ఎందుకంటే దివ్య ఖుర్‌ఆన్ అవతరించేది అక్కడి నుండే. మరో అర్థం ప్రకారం ఈ సహీఫాలు (పత్రాలు) దేవుని దగ్గర ఎంతో గౌరవప్రదమైనవి. ఎందుకంటే అవి జ్ఞానంతోనూ, యుక్తితోనూ నిండి ఉన్నవి.

13. **'మర్‌ఫూఅతిన్'** (مَّرْفُوعَةٍ) అంటే అవి దైవసన్నిధిలో ఉన్నత స్థానం గలవి. (లేదా) దోషాలకు అతీతమైనవి, మహోన్నతమైనవి. **'ముతహ్హరతిన్'** (مُّطَهَّرَةٍ) అంటే అవి ఆసాంతం పరిశుద్ధమైనవి. ఎందుకంటే వాటిని పవిత్రులు (దైవదూతలు) తప్ప ఎవరూ తాకరు. (లేదా) అవి హెచ్చుతగ్గులకు, మార్పులు చేర్పులకు అతీతమైనవి.

14. **'లేఖకులు'** అంటే దైవదూతలు. వారు దైవవాణిని దైవప్రవక్తలకు చేరవేస్తారు. అంటే దైవానికి–దైవప్రవక్తలకు మధ్య 'దౌత్యం' నిర్వహిస్తారు. అందుకే అరబీలో వారిని **'సఫరతిన్'** గా వ్యవహరించటం జరిగింది. సఫరతిన్ అంటే 'దూతలు' అని అర్థం. దైవదూతలు దైవదౌత్యాన్ని అందిస్తారు. రాయబారులుగా వ్యవహరిస్తారు. (రాయబార కార్యాలయం, దౌత్యసిబ్బంది, దూతవంటి పదాలు తెలుగువారికి సుపరిచితమే కదా!)

16 (వారు) మహిమాన్వితులు, మంచి వారు కూడాను.[15] كِرَامٍۭ بَرَرَةٍ ⑯

17 మనిషి నాశనంగాను! ఎటువంటి కృతఘ్నుడు వాడు?![16] قُتِلَ الْاِنْسَانُ مَاۤ اَكْفَرَهٗ ⑰

18 (అల్లాహ్) వాణ్ణి దేంతో పుట్టించాడు? مِنْ اَيِّ شَيْءٍ خَلَقَهٗ ⑱

19 ఒక్క వీర్య బిందువుతో (నే కదా!)[17] పుట్టించాడు! మరి
అతనికి (కావలసినవి) తగు రీతిలో ఉండేలా నిర్ధారించాడు.[18] مِنْ نُّطْفَةٍ ؕ خَلَقَهٗ فَقَدَّرَهٗ ⑲

20 ఆపైన అతని కొరకు మార్గాన్ని సులభతరం చేశాడు.[19] ثُمَّ السَّبِيْلَ يَسَّرَهٗ ⑳

21 అటుపిమ్మట అతనికి చావునిచ్చాడు. ఆ తరువాత అతన్ని
సమాధిలోనికి చేర్చాడు.[20] ثُمَّ اَمَاتَهٗ فَاَقْبَرَهٗ ㉑

22 మరి తాను కోరినప్పుడు అతన్ని బ్రతికించి లేపుతాడు. ثُمَّ اِذَا شَآءَ اَنْشَرَهٗ ㉒

23 ఎంతమాత్రం కాదు.[21] అసలతను ఇంతవరకూ దైవాజ్ఞలను
నెరవేర్చనేలేదు. كَلَّا لَمَّا يَقْضِ مَاۤ اَمَرَهٗ ㉓

15. అంటే – వారు పుట్టుకరీత్యా పునీతులు, ఆదరణీయులు. ఆచరణ రీత్యా సద్వర్తనులు, పవిత్రులు. దీన్నిబట్టి బోధపడే ఒక ముఖ్య విషయం ఏమిటంటే దివ్య ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేసినవారు, దివ్య ఖుర్‌ఆన్‌లో పాండిత్యం సంపాదించినవారు నైతికంగా సద్గుణ సంపన్నులుగా, క్రియాత్మకంగా సజ్జనులుగా ఉండాలి. వారి జీవితమంతా ఈ **'కిరామిన్ బరరహ్'**కు ప్రతిరూపంగా ఉండాలి (ఇబ్నె కసీర్). ఒక హదీసు ప్రకారం మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఇలా ప్రవచించారు: "ఎవరయితే దివ్య ఖుర్‌ఆన్‌ను పఠిస్తాడో, ఖుర్‌ఆన్‌లో ప్రావీణ్యం సంపాదించాడో అతను మహిమాన్వితు లైన, సజ్జనులైన దైవదూతల సరసన ఉంటాడు. మరెవరయితే దివ్య ఖుర్‌ఆన్‌ను చాలా కష్టపడుతూ పఠిస్తాడో (అంటే ఖుర్‌ఆన్ పండితుల మాదిరిగా ధారాళంగా చదవలేడో) అతనికి రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది." (సహీహ్ బుఖారీ – సూరయె అబస వ్యాఖ్యానం; ముస్లిం – కితాబుస్సలాత్).

16. ఇక్కడ **'మనిషి'** అంటే ఏ ఆధారమూ లేకుండా, మరే నిదర్శనమూ లేకుండా మరణానంతర జీవితాన్ని త్రోసిపుచ్చే మనిషి అన్నమాట! వాడు దేవుడు చేసిన మేళ్లను మరచిపోయాడు. ఆ మేళ్లేమిటో జ్ఞప్తికి తెస్తే బహుశా వాడు రుజువర్తనుడవుతాడేమోనని, దేవుడు ఇక్కడ తన అనుగ్రహాలను గుర్తుచేశాడు.

17. చూడండి! అత్యంత అల్పమైన రేతస్సుతో సృష్టించబడిన ఈ మనిషికి గర్వం, బడాయి శోభిస్తుందా?

18. అంటే – అతని ఉనికికి, స్థాయికి అవసరమైన వాటిని సమకూర్చాడు. అతనికి రెండు కళ్లను, రెండు కాళ్లను, రెండు చేతులను ఇచ్చాడు. వినేశక్తిని, గ్రహించే సామర్థ్యాన్ని వొసగాడు. ఇంకా ఎన్నో విలువైన శరీరావయవాలను, శక్తియుక్తు లను అతనికి ప్రదానం చేశాడు.

19. అంటే – మంచీ చెడుల మార్గాన్ని అతనికి స్పష్టపరిచాడు. మరి కొంతమంది ప్రకారం అతనికి తల్లి కడుపునుంచి బయటికి వచ్చే దారి చూపాడు. కాని మొదటి అర్థమే సరైనది, సహేతుకమైనది.

20. అంటే – మరణానంతరం అతన్ని మట్టిలో కలిపేందుకు ఆదేశించాడు. ఎందుకంటే అతన్ని సకల మర్యాదలతో ఖననం చేయకపోతే కాకులు, గ్రద్దలు, మృగాలు, జంతువులు అతని శవాన్ని చీల్చి చెండాడుతాయి. తత్కారణంగా అతని మానమర్యాదలకు తీరని విఘాతం కలుగుతుంది.

21. అంటే – దైవతిరస్కారి అయిన ఈ మనిషి అంటున్నదేదీ నిజం కాదు.

| | |
|---|---|
| **24** అయితే ఈ మనిషి తాను తినే ఆహారాన్ని కూడా కాస్త చూడాలి.[22] | فَلۡيَنظُرِ ٱلۡإِنسَٰنُ إِلَىٰ طَعَامِهِۦٓ ﴿٢٤﴾ |
| **25** మేము పుష్కలంగా నీటిని కురిపించాము. | أَنَّا صَبَبۡنَا ٱلۡمَآءَ صَبّٗا ﴿٢٥﴾ |
| **26** మరి నేలను అద్భుతమైన రీతిలో చీల్చాము. | ثُمَّ شَقَقۡنَا ٱلۡأَرۡضَ شَقّٗا ﴿٢٦﴾ |
| **27** మరి అందులో ఆహార ధాన్యాన్ని ఉత్పన్నం చేశాము. | فَأَنۢبَتۡنَا فِيهَا حَبّٗا ﴿٢٧﴾ |
| **28** ద్రాక్షపండ్లను, కూరగాయలను, | وَعِنَبٗا وَقَضۡبٗا ﴿٢٨﴾ |
| **29** జైతూను (ఆలివ్), ఖర్జూర పండ్లను (పండించాము). | وَزَيۡتُونٗا وَنَخۡلٗا ﴿٢٩﴾ |
| **30** దట్టమైన తోటలను, | وَحَدَآئِقَ غُلۡبٗا ﴿٣٠﴾ |
| **31** పండ్లు ఫలాలను, పచ్చిక బయళ్ళను (కూడా పండించాము).[23] | وَفَٰكِهَةٗ وَأَبّٗا ﴿٣١﴾ |
| **32** ఇదంతా మీ కోసం, మీ పశువుల ప్రయోజనార్థం (చేశాము). | مَّتَٰعٗا لَّكُمۡ وَلِأَنۡعَٰمِكُمۡ ﴿٣٢﴾ |
| **33** (గూబ గుయ్యిమనిపించే) గావుకేక (అంటే ప్రళయం) వచ్చినప్పుడు[24].... | فَإِذَا جَآءَتِ ٱلصَّآخَّةُ ﴿٣٣﴾ |
| **34** ఆ రోజు మనిషి తన (స్వంత) సోదరుని నుండి పారిపోతాడు. | يَوۡمَ يَفِرُّ ٱلۡمَرۡءُ مِنۡ أَخِيهِ ﴿٣٤﴾ |
| **35** తన తల్లి నుండి, తండ్రి నుండి, | وَأُمِّهِۦ وَأَبِيهِ ﴿٣٥﴾ |
| **36** తన భార్య నుండి, తన పిల్లల నుండి (పారిపోతాడు). | وَصَٰحِبَتِهِۦ وَبَنِيهِ ﴿٣٦﴾ |
| **37** ఆ రోజు ప్రతి ఒక్కరికీ తన సంగతి చూసుకోవటంతోనే సరిపోతుంది.[25] | لِكُلِّ ٱمۡرِيٕٖ مِّنۡهُمۡ يَوۡمَئِذٖ شَأۡنٞ يُغۡنِيهِ ﴿٣٧﴾ |

22. అంటే ఏ విధంగా దేవుడు తన జీవిక కోసం అన్నపానీయాలను సమకూర్చాడో, తన మనుగడ కోసం ఎన్నెన్ని ఉత్పత్తి కారకాలను లోకంలో పొందుపరచాడో అతను ఆలోచించాలి. అతనిలో ఈ ఆలోచన చిగురించినపుడే అతను పరలోకంలో సాఫల్యానికి దోహదపడే మార్గాన్ని పొందుతాడు.

23. కేవలం మనుషుల కోసమేగాక, మనుషులు ఆధారపడే పశువుల గ్రాసం కూడా ఆయన ఈ నేలనుండి మొలకెత్తించాడు.

24. ప్రళయదినాన్ని చెవుల్ని మొద్దుబార్చేది (సాఖ్ఖహ్)గా వర్ణించటంలోని ఆంతర్యం ఏమిటంటే అది అత్యంత భయంకరమైన శబ్దంతో వస్తుంది. దాంతో చెవులకు చెవుడు వచ్చేస్తుంది.

25. లేదా తన రక్త సంబంధీకుల పట్ల, సమీప బంధువుల యెడల చూచీ చూడనట్లుగా ప్రవర్తిస్తాడు. హదీసు ప్రకారం

38 ఆ రోజు ఎన్నో ముఖాలు వెలిగి పోతుంటాయి. | وُجُوهٌ يَوْمَئِذٍ مُّسْفِرَةٌ ﴿٣٨﴾

39 (తమకు వినిపించబడిన శుభవార్తపై) నవ్వులు చిందిస్తూ, ఆనందంలో తేలియాడుతూ ఉంటాయి.[26] | ضَاحِكَةٌ مُّسْتَبْشِرَةٌ ﴿٣٩﴾

40 మరెన్నో ముఖాలు ఆనాడు దుమ్ము కొట్టుకుని ఉంటాయి. | وَوُجُوهٌ يَوْمَئِذٍ عَلَيْهَا غَبَرَةٌ ﴿٤٠﴾

41 వాటిపై నలుపు ఆవరించి ఉంటుంది.[27] | تَرْهَقُهَا قَتَرَةٌ ﴿٤١﴾

42 వారే అవిశ్వాసులు, దుర్జనులు.[28] | أُولَٰئِكَ هُمُ الْكَفَرَةُ الْفَجَرَةُ ﴿٤٢﴾

అంతిమ దైవప్రవక్త (సఅసం) వారు ఇలా ప్రవచించారు: "అందరూ మహ్షర్ మైదానంలోకి నగ్న శరీరాలతో తరలివస్తారు. వారి పాదాలకు చెప్పులుండవు. వాహనాల్లేకుండా నడచివస్తారు. వారు సున్నతీ (సుంతీ) చేయబడని స్థితిలో ఉంటారు." 'వారా విధంగా వస్తే వారి మర్మాంగాలపై ఇతరుల దృష్టిపడదా?' అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అడిగితే, దైవప్రవక్త (స) ఈ ఆయతునే పఠించారు. అంటే ఆ రోజు ఎవరి చింత వారికుంటుంది. ఇతరుల్ని గురించి పట్టించుకునే తీరికగానీ, ధ్యాసగానీ వారికుండదు అన్నమాట (తిర్మిజీ – అబస సూరా; నసాయి– కితాబుల్ జనాయెజ్). మరొక అభిప్రాయం ప్రకారం; ప్రళయదినాన తనవారు పడ్తున్న అవస్థల్ని, వారు ఎదుర్కొంటున్న బాధాకర పరిస్థితిని చూసి మనిషి అక్కణ్ణుంచి పారిపోతాడు. ఇంకొక అభిప్రాయం ప్రకారం; తాము ఇతరులకు ఎలాంటి లాభాన్ని చేకూర్చలేమని వారికి తెలుసు. అందుకే వారు తమ ఆత్మీయులను పట్టించుకోకుండా తమ సంగతిని మాత్రమే చూసుకుంటారు (ఫత్హుల్ ఖదీర్).

26. ఇవి విశ్వాసుల, సజ్జనుల ముఖాలు. వారి కర్మల పత్రాలు వారి కుడిచేతికి ఇవ్వబడతాయి. తద్వారా వారు తమ పరలోక సాఫల్యాన్ని ఊహిస్తారు. అంతే! వారి మోహాలు దేదీప్యమానం అవుతాయి. ఆనందంతో విప్పారుతాయి.

27. అవమానంతో అవిశ్వాసుల ముఖాలు పాలిపోతాయి. ఒకవైపు శిక్షాభయం, మరోవైపు నిరాశ కూడా వారిని చుట్టుముడు తుంది. పుట్టెడు దుఃఖంతో విలపిస్తూ ఉంటారు. ఆ విషాదఛాయలన్నీ వారి మోహాలపై తొంగిచూస్తూ ఉండటం వల్ల అవి నల్లగా తయారవుతాయి.

28. అంటే – వారు దైవాన్ని, దైవప్రవక్తలను, పరలోక జీవితాన్ని త్రోసిపుచ్చటంతోపాటు, మంచిపనులను కూడా విడనాడేవారు. పైగా దుర్మార్గానికి, దౌష్ట్యానికి పాల్పడేవారు.

81వ సూరా

# అత్ తక్వీర్

## చుట్టబడటం

అవతరణ మక్కాలో

ఆయతులు 29

### పరిచయం

దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపర, తీర్పుదినం నాటి భయానక పరిస్థితుల గురించి ఈ సూరా ముఖ్యంగా వివరించింది. మొదటి ఆయతులో 'తక్వీర్' (చుట్టబడటం) అన్న ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. తీర్పుదినం నాడు చోటు చేసుకునే తీవ్రమైన రోదసీ మార్పుల గురించి ఇందులో చెప్పడం జరిగింది. ఆ రోజు సూర్యుడు చుట్టబడతాడు. నక్షత్రాలు కాంతిని కోల్పోతాయి. పర్వతాలు స్థానభ్రంశం చెందుతాయి. ఆనాటి బీభత్సం కారణంగా ప్రజలు తమ విలువైన సంపదను కూడా పట్టించు కోకుండా వదిలేస్తారు. అడవి జంతువులు ఒకచోట సమీకరించ బడతాయి. సముద్రాలు మరుగుతాయి. ఆత్మలను వాటి శరీరాలతో తిరిగి కలుపడం జరుగుతుంది. ఆ రోజు సజీవంగా సమాధి కావించబడిన ఆడపిల్ల నేనే పాపం చేసాను? నన్నెందుకు హత్య చేసారని ప్రశ్నిస్తుంది. ఆకాశానికి ఉన్న తెరలు తొలగించబడతాయి. స్వర్గవనాలు దగ్గరకు తీసుకురాబడతాయి. మానవుల కర్మల చిట్టాలు తెరువబడతాయి. ఆ రోజున ప్రతి ఒక్కరికి తాను చేసిన మంచి లేదా చెడు తెలిసి వస్తుంది. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) అత్యంత గౌరవనీయుడైన దైవ సందేశహరుడనీ, ఆయన పిచ్చివాడు కాదని, ఆయన దేవుని సందేశాన్ని మానవాళికి చేరవేస్తారని, అల్లాహ్ ఆయనకు తెలియజేసినది తప్ప ఆయనకు మరేవిధమైన అగోచరాల జ్ఞానం లేదని ఈ సూరా విశదీకరించింది. దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు అని, ఇది యావత్తు మానవాళికి హెచ్చరిక అని ఈ సూరా స్పష్టంగా చెప్పింది.

### అత్ తక్వీర్ సూరా | سُورَةُ التَّكْوِيرِ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| 1 సూర్యుడు చుట్టివేయబడినప్పుడు,[2] | إِذَا الشَّمْسُ كُوِّرَتْ ﴿1﴾ |
| 2 నక్షత్రాలు కాంతిహీనం అయిపోయినప్పుడు,[3] | وَإِذَا النُّجُومُ انكَدَرَتْ ﴿2﴾ |

1. ఈ సూరాలో ప్రళయదృశ్యం కళ్లకు కట్టినట్లే చిత్రీకరించబడింది. అందుకేనేమో మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా చెప్పారు: "ఎవరయినా ప్రళయాన్ని తమ కళ్లారా చూడదలిస్తే వారు తక్వీర్ సూరాను, ఇన్ఫితార్ సూరాను, ఇన్షిఖాఖ్ సూరాను (శ్రద్ధగా) చదవాలి" (తిర్మిజీ–తక్వీర్ సూరా వ్యాఖ్యానం; ముస్నదె అహ్మద్ – 2/27, 36, 100).
2. అంటే – తలకు తలపాగా చుట్టినట్లే సూర్యుణ్ణి చుట్టివేయటం జరుగుతుంది. దాంతో సూర్యకాంతి అంతరించిపోతుంది. "ప్రళయదినాన సూర్యుడు, చంద్రుడు చుట్టివేయబడతాయ"ని హదీసులో కూడా ఉంది (సహీహ్ బుఖారీ). మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం సూర్యచంద్రులు చుట్టివేయబడి, నరకంలోకి విసరివేయబడతాయి. ఆ విధంగా సూర్యచంద్రులను పూజించే ముష్రిక్కులను ఆనాడు మరింతగా ఉడికించటం జరుగుతుంది. (ఫత్హుల్ బారీ).
3. 'నక్షత్రాలు రాలిపడిపోయినప్పుడు...' అని కూడా అర్థం వస్తుంది. అంటే అవి ఆకాశంలో లేనపుడు వాటి కాంతి ఉండే ప్రసక్తే ఉండదు.

3 పర్వతాలు నడిపింపబడినప్పుడు,[4]

وَإِذَا ٱلْجِبَالُ سُيِّرَتْ ﴿3﴾

4 పదిమాసాల సూడి ఒంటెలు (వాటి మానాన) వదలివేయ బడినప్పుడు,[5]

وَإِذَا ٱلْعِشَارُ عُطِّلَتْ ﴿4﴾

5 అడవి జంతువులన్నీ ఒకచోట సమీకరించబడినప్పుడు,[6]

وَإِذَا ٱلْوُحُوشُ حُشِرَتْ ﴿5﴾

6 సముద్రాలు రాజేయబడినప్పుడు,[7]

وَإِذَا ٱلْبِحَارُ سُجِّرَتْ ﴿6﴾

7 ఆత్మలు (వాటి తనువులతో) అనుసంధానం చేయబడి నప్పుడు,[8]

وَإِذَا ٱلنُّفُوسُ زُوِّجَتْ ﴿7﴾

8 సజీవంగా పాతిపెట్టబడిన బాలిక ప్రశ్నించబడినప్పుడు,[9]

وَإِذَا ٱلْمَوْءُۥدَةُ سُئِلَتْ ﴿8﴾

9 'తను ఏ పాపం చేసిందని హతమార్చబడింది?' అని.

بِأَىِّ ذَنۢبٍ قُتِلَتْ ﴿9﴾

10 కర్మల చిట్టాలు తెరువబడినప్పుడు,[10]

وَإِذَا ٱلصُّحُفُ نُشِرَتْ ﴿10﴾

11 ఆకాశం తోలు ఒలచివేయబడినప్పుడు,[11]

وَإِذَا ٱلسَّمَآءُ كُشِطَتْ ﴿11﴾

12 నరకం మండించబడినప్పుడు,

وَإِذَا ٱلْجَحِيمُ سُعِّرَتْ ﴿12﴾

13 స్వర్గం చాలా దగ్గరగా తేబడినప్పుడు,

وَإِذَا ٱلْجَنَّةُ أُزْلِفَتْ ﴿13﴾

4. అంటే పర్వతాలు భూమిలో నుండి పెకలించివేయబడతాయి. అప్పుడవి గాల్లో దూది పింజాల మాదిరిగా తేలియాడతాయి.

5. పదిమాసాల సూడి ఒంటెలు (ఇషార్) అరబ్బుల దృష్టిలో చాలా విలువైనవి. ఆ సమయంలో వారు ఆ ఒంటెలను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. కాని ప్రళయ ఘడియ ఎంత భయానకంగా ఉంటుందంటే, అది వచ్చిపడినప్పుడు వారు తమ సూడి ఒంటెలను సయితం ఏమాత్రం పట్టించుకోకుండా, వాటిని వాటి మానాన వదలివేస్తారు.

6. అంటే – అడవి జంతువులు కూడా ప్రళయదినాన సమీకరించబడతాయి.

7. అంటే దైవాజ్ఞపై వాటిలో అగ్ని మండసాగుతుంది.

8. ఈ వాక్యానికి అనేక భావార్థాలు చెప్పబడ్డాయి. కాని చాలా వరకు సరైన భావం ఇది కావచ్చు: ప్రతి మనిషీ తన మతస్థునితో, తన దృక్పథం గల వానితో చేర్చబడతాడు. విశ్వాసి విశ్వాసులతో, యూదుడు యూదులతో, క్రైస్తవుడు క్రైస్తవులతో, నాస్తికుడు నాస్తికులతో చేర్చబడతారు.

9. ఈ విధంగా ఆడపిల్లను చంపిన హంతకుణ్ణి నిలదీయటం జరుగుతుంది. ప్రశ్నవేసేది ఆడపిల్లకే అయినా, నిజానికి ఇక్కడ విచారణ జరుపుతున్నది ఆమెను సజీవంగా పాతిపెట్టిన హంతకుణ్ణి.

10. మరణ సమయంలో చుట్టివేయబడిన ఈ కర్మల రికార్డులు మళ్లీ తీర్పుదినాన విప్పబడతాయి. పైగా అవి ఆయా వ్యక్తుల చేతులకు ఇవ్వబడతాయి. ఆనాడు ప్రతి వ్యక్తీ తన సంపాదనను కళ్లారా చూస్తాడు.

11. అంటే – ఇంటికప్పును తొలచినట్లుగా, పశువు చర్మాన్ని ఒలచివేసినట్లుగానే ఆకాశ చర్మం కూడా ఒలచివేయటం జరుగుతుంది. దాంతో ఆకాశం లోపల ఉన్న వస్తువులన్నీ బహిర్గతం అవుతాయి.

**14** అప్పుడు (ఆ రోజు) ప్రతి ప్రాణీ తాను తన వెంట తెచ్చుకున్న దేమిటో తెలుసుకుంటుంది.[12]

عَلِمَتْ نَفْسٌ مَّآ أَحْضَرَتْ ﴿١٤﴾

**15** కనుక అది కాదు. వెనక్కి జరిగే నక్షత్రాలపై నేను ప్రమాణం చేస్తున్నాను,[13]

فَلَآ أُقْسِمُ بِالْخُنَّسِ ﴿١٥﴾

**16** అవి సంచరించేవి, కనుమరుగైపోయేవి.

الْجَوَارِ الْكُنَّسِ ﴿١٦﴾

**17** గడచిపోయేటప్పటి రాత్రి సాక్షిగా![14]

وَالَّيْلِ إِذَا عَسْعَسَ ﴿١٧﴾

**18** ప్రకాశిస్తున్నప్పటి ఉదయం సాక్షిగా[15] (చెబుతున్నాను) !

وَالصُّبْحِ إِذَا تَنَفَّسَ ﴿١٨﴾

**19** నిశ్చయంగా ఇది గౌరవనీయుడైన సందేశవాహకుడు (జిబ్రయీల్) తెచ్చిన (దైవ) వాక్కు.[16]

إِنَّهُۥ لَقَوْلُ رَسُولٍ كَرِيمٍ ﴿١٩﴾

**20** అతడు శక్తిశాలి.[17] అతడు సింహాసనాధిపతి (అయిన అల్లాహ్) దగ్గర ఉన్నత స్థానం కలవాడు.

ذِى قُوَّةٍ عِندَ ذِى الْعَرْشِ مَكِينٍ ﴿٢٠﴾

**21** (ఊర్ధ్వ లోకాలలో) అతని మాట అనుసరణీయం. అతను ఎంతో నిజాయితీపరుడు.[18]

مُّطَاعٍ ثَمَّ أَمِينٍ ﴿٢١﴾

**22** (ఓ ప్రజలారా!) మీ ఈ సహచరుడు పిచ్చివాడు కాదు.[19]

وَمَا صَاحِبُكُم بِمَجْنُونٍ ﴿٢٢﴾

12. ఇప్పటి వరకూ చెప్పబడిన విషయాలకు జవాబు ఇది. వాటిలో మొదటి ఆరు విషయాలు ప్రపంచానికి సంబంధించినవి కాగా; తర్వాతి ఆరు విషయాలు పరలోకానికి సంబంధించినవి. ఆనాడు ప్రతి మనిషికీ తాను ఆర్జించింది పుణ్యమో, పాపమో తెలిసిపోతుంది.
13. నక్షత్రాలు వెనక్కి జరగటం అంటే అర్థం, అవి పగటిపూట అదృశ్యమవుతాయి. లేదా అవి కనబడకుండా దాక్కుంటాయి.
14. **'అస్‌అస్'** (عَسْعَسَ) అంటే 'వచ్చే పోయే' అని అర్థం. కాని ఈ ఆయతులో మాత్రం ఇది తిరిగిపోయే అన్న భావంలోనే ప్రయోగించబడింది.
15. అంటే తొలి జాములోని తెలుపు లేదా తొలి పొడుపులోని ఎరుపు అన్నమాట!
16. ఎందుకంటే ఈ వాక్కును అతడు అల్లాహ్ తరఫునుండి తెచ్చాడు.
17. అతనికి ఏ బాధ్యతను అప్పగించినా చాలా వేగంగానూ, పకడ్బందీగానూ నిర్వర్తిస్తాడు.
18. అంటే – దైవదూతలు అతన్ని అనుసరిస్తారు. అతడు దైవదూతలలో కెల్లా అగ్రగణ్యుడు. దైవవాణిని అందజేసే విషయంలో చాలా ఖచ్చితంగా వ్యవహరించేవాడు.
19. మక్కావాసులను ఉద్దేశించి చెప్పబడిన వాక్యాలివి. ఇక్కడ **'సహచరుడు'** (صَاحِبُكُم) అంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అని భావం. ఓ మక్కావాసులారా! మీ జాతివాడు, మీ దేశస్థుడు అయిన ముహమ్మద్ (స)ను మీరు పిచ్చివాడుగా భావిస్తున్నారు (దైవం మన్నించుగాక!) మీ తలంపు సరైనది కాదు. కాస్త ఖుర్‌ఆన్‌ను పఠించి చూడండి. ఏ పిచ్చివాడైనా ఇలాంటి వాస్తవాలను, పరమార్థంతో కూడుకున్న విషయాలను వివరిస్తాడా?! గతించిన జాతుల యదార్థ గాథలను ఒక ఉన్మాది కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరిస్తాడా?

23 అతనా సందేశహరుణ్ణి స్పష్టమైన గగనతలంపై చూసి ఉన్నాడు.[20]

وَلَقَدْ رَاٰهُ بِالْاُفُقِ الْمُبِيْنِ ﴿23﴾

24 ఇంకా అతను అగోచర విషయాలను తెలియపరచటంలో పిసినారి కూడా కాడు.[21]

وَمَا هُوَ عَلَى الْغَيْبِ بِضَنِيْنٍ ﴿24﴾

25 ఇది (ఈ ఖుర్ఆన్) శాపగ్రస్తుడైన షైతాన్ వాక్కు కూడా కాదు.[22]

وَمَا هُوَ بِقَوْلِ شَيْطٰنٍ رَّجِيْمٍ ﴿25﴾

26 మరి మీరు ఎటుపోతున్నారు.[23]

فَاَيْنَ تَذْهَبُوْنَ ﴿26﴾

27 ఇది సమస్త లోకవాసుల కొరకు హితోపదేశం.

اِنْ هُوَ اِلَّا ذِكْرٌ لِّلْعٰلَمِيْنَ ﴿27﴾

28 (ముఖ్యంగా) మీలో రుజుమార్గాన నడవదలచిన వారికోసం!

لِمَنْ شَآءَ مِنْكُمْ اَنْ يَّسْتَقِيْمَ ﴿28﴾

29 సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్ కోరనంతవరకు మీరేదీ కోరలేరు.[24]

وَمَا تَشَآءُوْنَ اِلَّآ اَنْ يَّشَآءَ اللّٰهُ رَبُّ الْعٰلَمِيْنَ ﴿29﴾

20. దైవప్రవక్త (సఅసం) దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను రెండుసార్లు అసలు సిసలు స్థితిలో చూశారన్న విషయం ఇంతకుముందు కూడా వచ్చింది. వాటిలో ఒకటి ఇక్కడ ప్రస్తావించబడినది. అది దైవదౌత్యం అందిన తొలికాలం. ఆ సమయంలో మహాప్రవక్త (స) జిబ్రయీల్‌ను చూసినప్పుడు ఆ దూతకు 600 రెక్కలున్నాయి. ఆ రెక్కలతో దిఙ్మండలమంతా నిండిపోయినట్లు కనిపించింది. రెండవసారి మేరాజ్ (గగన యాత్ర) సందర్భంగా చూశారు. నజ్మ్ సూరాలో ఈ వివరాలు వచ్చాయి.

21. అంతిమ దైవప్రవక్త (సఅసం) నిజాయితీ తత్పరత గురించి ఈ ఆయతులో చెప్పబడింది. తన వద్దకు వచ్చిన దైవవాణిని ఆయన (స) ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా మానవాళికి అందజేస్తారు. ఏ ఒక్క విషయాన్ని కూడా దాచిపెట్టరు.

22. జ్యోతిష్యుల వద్దకు, సోదె చెప్పేవారివద్దకు షైతానులు వచ్చి ఊర్ధ్వలోకాల్లోని కొన్ని విషయాలను చూచాయగా తెలియజేస్తాయేమో! కాని ఖుర్ఆన్ మాత్రం అటువంటిది కాదు. దీన్ని జిబ్రయీల్ (అలైహిస్సలాం) తప్ప వేరొకరు తీసుకురాలేరు.

23. ఈ యదార్థం మీకు తేటతెల్లమైపోయినప్పుడు మీరు దీనిపట్ల ఎందుకు విముఖత చూపుతున్నారు. ఈ సత్యాన్ని మీరు ఎందుకు ఒప్పుకోరు.

24. మీరు కోరేది ఏదైనా అది దేవుడు ఇచ్చే సద్బుద్ధిపై ఆధారపడి ఉంది. మీ ఇచ్ఛతో పాటు దైవేచ్ఛ కూడా ఉండాలి. ఆయనకు సమ్మతం కానంతవరకూ మీరు సన్మార్గాన్ని పొందలేరు. ఈ యదార్థమే అల్ ఖసస్ సూరా – 56వ వచనంలో ఈ విధంగా చెప్పబడింది – “తన మార్గదర్శకత్వాన్ని స్వీకరించే వారెవరో ఆయనకు బాగా తెలుసు.”

82వ సూరా

# అల్ ఇన్‌ఫితార్

## బ్రద్దలు కావడం

అవతరణ మక్కాలో

ఆయతులు 19

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షాబహుమానాల గురించి బోధించింది. తీర్పు దినాన చోటుచేసుకునే తీవ్రమైన రోదసీ (అంతరిక్షంలోని) మార్పులను గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ఆరోజున సమాధులు తెరువబడతాయి. ఆకాశం బద్దలవుతుంది. నక్షత్రాలు చెల్లాచెదరవుతాయి. ప్రతి ఒక్కరికి తాను చేసిన మంచి లేదా చెడుల గురించి తెలిసివస్తుంది. ఆరోజు వేరుపరిచే రోజు. ఆ రోజు మంచిపనులు చేసిన వారు ఆనందాన్ని ఆస్వాదిస్తారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడతామన్న వాస్తవాన్ని తిరస్కరించిన సత్యతిరస్కారులు అగ్నికి ఆహుతి అవుతారు.

### అల్ ఇన్‌ఫితార్ సూరా

سُوۡرَةُ الۡاِنۡفِطَارِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

**1** ఆకాశం చీలిపోయినప్పుడు,[1]

اِذَا السَّمَآءُ انۡفَطَرَتۡ ۙ﴿1﴾

**2** నక్షత్రాలు రాలి (పడి) పోయినప్పుడు,

وَاِذَا الۡكَوَاكِبُ انۡتَثَرَتۡ ۙ﴿2﴾

**3** సముద్రాలు ఉప్పొంగినప్పుడు,[2]

وَاِذَا الۡبِحَارُ فُجِّرَتۡ ۙ﴿3﴾

**4** సమాధులు పెళ్ళగించబడినప్పుడు,[3]

وَاِذَا الۡقُبُوۡرُ بُعۡثِرَتۡ ۙ﴿4﴾

**5** (అప్పుడు) ప్రతి ఒక్కనికీ తాను ముందుకు పంపుకున్నదీ, వెనుక వదలి పెట్టినదీ (అంతా) తెలిసివస్తుంది.[4]

عَلِمَتۡ نَفۡسٌ مَّا قَدَّمَتۡ وَاَخَّرَتۡ ؕ﴿5﴾

1. అంటే – దైవాజ్ఞతో, దైవభీతితో ఆకాశం బ్రద్దలైపోతుంది. అప్పుడు దైవదూతలు క్రిందికి దిగివస్తారు.
2 అప్పుడు సముద్రాలన్నీ కలిసిపోతాయి. అప్పుడు అల్లాహ్ పంపే పశ్చిమ గాలివల్ల సముద్రంలో అగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఉవ్వెత్తున మంటలు లేస్తాయి.
3. అంటే – మృతులు సమాధుల నుంచి బ్రతికి బయటికి వచ్చినప్పుడు... ఆ సమయంలో గోరీలలోని మట్టి పెళ్లగించబడుతుంది. లేదా సమాధులన్నీ అతలాకుతలం అవుతాయి.
4. అంటే – ఈ పరిణామాలన్నీ పొడసూపినప్పుడు మనిషికి తాను చేసినదంతా తెలిసి పోతుంది. తన మంచిపనులు–చెడుపనులన్నీ అతని ముందుకు వచ్చేస్తాయి. **“వెనుక వదలిపెట్టినది”** అంటే తన నడవడిక ద్వారా తన మరణానంతరం ప్రపంచంపై పడిన ప్రభావం అన్నమాట! అది మంచిదీ కావచ్చు. చెడ్డదీ కావచ్చు. ఒకవేళ అది మంచిదై ఉండి, భావితరాల వారు దాన్ని ఆదర్శంగా తీసుకుని ఆచరిస్తే ఆ పుణ్యం ఎడతెగకుండా అతనికి చేరుతూ ఉంటుంది. ఒకవేళ అతను వదలిపెట్టి పోయినది చెడ్డదై ఉండి, జనులు దాన్ని అవలంబిస్తే ఆ పాపం కూడా అతనికి ఎడతెగకుండా చేరుతూ ఉంటుంది.

**6** ఓ మానవుడా! ఉదాత్తుడైన నీ ప్రభువు పట్ల ఏ విషయం నిన్ను మోసంలో పడవేసింది?[5]

يَٰٓأَيُّهَا ٱلْإِنسَٰنُ مَا غَرَّكَ بِرَبِّكَ ٱلْكَرِيمِ ⑥

**7** (యదార్థానికి) ఆయనే నిన్ను పుట్టించాడు,[6] నిన్ను చక్కగా తీర్చిదిద్దాడు,[7] ఆపైన నిన్ను తగు రీతిలో పొందికగా మలిచాడు.[8]

ٱلَّذِى خَلَقَكَ فَسَوَّىٰكَ فَعَدَلَكَ ⑦

**8** తాను కోరిన ఆకారంలో నిన్ను కూర్చాడు.[9]

فِىٓ أَىِّ صُورَةٍ مَّا شَآءَ رَكَّبَكَ ⑧

**9** ఎన్నటికీ కాదు, మీరైతే శిక్షా బహుమానాల దినాన్ని ధిక్కరిస్తున్నారు.[10]

كَلَّا بَلْ تُكَذِّبُونَ بِٱلدِّينِ ⑨

**10** నిశ్చయంగా మీపైన పర్యవేక్షకులు నియమితులై ఉన్నారు.

وَإِنَّ عَلَيْكُمْ لَحَٰفِظِينَ ⑩

**11** (వారు మీ కర్మలను నమోదు చేసే) గౌరవనీయులైన లేఖకులు.

كِرَامًا كَٰتِبِينَ ⑪

**12** మీరు చేసేదంతా వారికి తెలుసు సుమా![11]

يَعْلَمُونَ مَا تَفْعَلُونَ ⑫

---

5. నువ్వెందుకు ఆ కృపాకరుణ్ణి ధిక్కరిస్తున్నావు? అసలు ఏ విషయం నిన్ను ఆయన గురించి ఏమార్చింది? చూడబోతే నీకు ఉనికిని ప్రసాదించి, నీకు తెలివితేటలను ఇచ్చి, మంచి మార్గాన్ని చూపే ఏర్పాటుచేసి, నీకు మహోపకారం చేసినవాడు ఆయనే కదా!

6. మరి నిన్ను పుట్టించింది కూడా దేంతో? అత్యంత అల్పమైన రేతస్సుతో! అంతకు ముందు నీకంటూ ఒక ఉనికి ఉండేదే కాదు.

7. నిన్ను ఒక సంపూర్ణ మనిషిగా – నఖశిఖ పర్యంతం – తీర్చిదిద్దాడు. నీకు కనే, వినే, గ్రహించే శక్తులను ప్రసాదించాడు.

8. తగు రీతిలో మలచటమంటే అర్థం – శరీరావయవాల నిష్పత్తిలో ఎలాంటి లోపం లేకుండా చేశాడు. కళ్లుండవలసిన చోట కళ్లను, కాళ్లుండవలసిన చోట కాళ్ళను ఉంచాడు. రెండు చేతులను, రెండు చెవులను, రెండు పెదవులను, ముక్కును, నాలుకను సమపాళ్ళలో రూపొందించాడు. ఆలోచించే, అర్థం చేసుకునే మనోమస్తిష్కాలను వొసగాడు. వీటన్నింటినీ అనుగ్రహించి, సభ్య సమాజంలో నిన్ను ఎంతో అందమైన జీవిగా నిలబెట్టాడు. నీ ఆకృతి గురించి చెబుతూ, “మేము మానవుణ్ణి అత్యుత్తమమైన ఆకృతిలో సృజించాము” అని అన్నాడు. (సూరెతీన్)

9. దీనికి ఒక అర్థం ఇది: దేవుడు గర్భస్థ శిశువుకు తాను కోరిన వారి పోలికల్ని–అంటే తల్లి పోలికల్నిగానీ, తండ్రి పోలికల్నిగానీ, మేనమామ పోలికల్నిగానీ ప్రసాదిస్తాడు. మరొక అర్థం ప్రకారం, దేవుడు తాను కోరిన ఆకారం ఇవ్వగలడు. ఆయన గనక తలచుకుంటే భయంకరమైన జంతువు ఆకారంలో కూడా పుట్టించగలడు. కాని ఆయన పరమదాత, ఉదాత్తుడు అయినందువల్ల సాధారణంగా అలా చేయడు. మనిషిని ఆయన మంచి ఆకృతిలోనే పుట్టిస్తాడు.

10. ఓ అవిశ్వాసులారా! తీర్పుదినంపై మీకు నమ్మకం లేకపోవటం మూలంగానే అసలు మీరు దేవుడు చేసిన గొప్ప మేళ్లను మరచిపోతున్నారు. పరలోకభీతి మీలో పాదుకోనంతవరకూ మీ ఆలోచనలు వక్రంగానే ఉంటాయి.

11. తీర్పుదినాన్ని మీరు త్రోసిపుచ్చినంత మాత్రాన అది మీనుండి తొలగిపోతుందని అనుకోకండి. మీకు ఇష్టమున్నా, లేకున్నా మీరు క్షణం క్షణం దానివైపుకు తీసుకుపోబడుతున్నారు. మరోవైపు మీ కర్మలు గ్రంథస్థం అవుతున్నాయి. దైవదూతలు మీపై కావలివాళ్లుగా నియమితులై ఉన్నారు. మీ నోట వెలువడే ఒక్కో మాటా, మీ చేత జరిగే ఒక్కో

13 నిశ్చయంగా పుణ్యాత్ములు (స్వర్గ) సుఖాలలో ఉంటారు. إِنَّ الْأَبْرَارَ لَفِي نَعِيمٍ ⑬

14 మరి నిశ్చయంగా పాపాత్ములు నరకాగ్నిలో ఉంటారు.[12] وَإِنَّ الْفُجَّارَ لَفِي جَحِيمٍ ⑭

15 ప్రతిఫల దినాన వారు అందులోకి ప్రవేశిస్తారు.[13] يَصْلَوْنَهَا يَوْمَ الدِّينِ ⑮

16 వారు దాన్నుండి ఎన్నటికీ అదృశ్యం కాలేరు.[14] وَمَا هُمْ عَنْهَا بِغَائِبِينَ ⑯

17 ఆ ప్రతిఫల దినం ఎటువంటిదో నీకేం తెలుసు? وَمَا أَدْرَاكَ مَا يَوْمُ الدِّينِ ⑰

18 మరి ఆ ప్రతిఫల దినం ఎటువంటిదో (దాని గురించి) నీకేం తెలుసు?[15] ثُمَّ مَا أَدْرَاكَ مَا يَوْمُ الدِّينِ ⑱

19 ఆ రోజు ఏ జీవీ మరో జీవి కోసం ఏమీ చెయ్యజాలదు. ఆ రోజు సమస్త వ్యవహారాలు (అధికారాలన్నీ) అల్లాహ్ వద్దనే ఉంటాయి.[16] يَوْمَ لَا تَمْلِكُ نَفْسٌ لِّنَفْسٍ شَيْئًا ۖ وَالْأَمْرُ يَوْمَئِذٍ لِّلَّهِ ⑲

చేష్టా రికార్డు అవుతోంది. కాబట్టి మీరు ఒక మాటను పలికేముందు అది సరైనదో కాదో ఆలోచించుకోండి. ఒక పనిని చేసే ముందు అది మంచి పనో చెడ్డ పనో తేల్చుకోండి – "ఇద్దరు లేఖకులు అతనికి కుడిప్రక్కన, ఎడమప్రక్కన కూర్చొని ప్రతి విషయాన్నీ నమోదు చేస్తున్నారు. అతని నోటినుండి వెడలే ప్రతి మాటనూ వ్రాయటానికి అనుక్షణం ఒక పరిశీలకుడు సిద్ధంగా ఉంటాడు." (ఖాఫ్ – 17, 18). ఒక దైవదూత మంచిపనులను రికార్డు చేస్తే, మరొక దూత చెడుపనులను నమోదు చేస్తాడన్నమాట! ఈ డ్యూటీని రాత్రిపూట ఇద్దరు దూతలు, పగటిపూట ఇద్దరు దూతలు నిర్వహిస్తారని హదీసుల్లో వివరించబడింది.

12. మరోచోట చెప్పబడినట్లు; "ఒక వర్గంవారు స్వర్గానికి పోతే, మరో వర్గం వారు నరకానికి పోతారు" (షూరా – 7).

13. వారు ఏ శిక్షా బహుమానాల దినాన్ని ధిక్కరించేవారో సరిగ్గా ఆ దినానే తమ దుష్కర్మలకు ప్రతిగా నరకానికి ఆహుతి అవుతారు.

14. అంటే – వారు దాన్నుండి బయటపడటంగానీ, వేరుకావటంగానీ జరగదు. కలకాలం అందులోనే పడి ఉంటారు.

15. ఆ దినానికి గల ప్రాముఖ్యాన్ని, దాని ఔన్నత్యాన్ని, ఆగ్రహస్థితిని స్పష్టం చేయడానికి ఇక్కడ మళ్లీ మళ్లీ ప్రశ్నించటం జరిగింది.

16. దేవుడు మనిషిని పరీక్షించే నిమిత్తం ఈ ప్రాపంచిక జీవితంలో – తాత్కాలికంగా – మనిషికి కొన్ని అధికారాలను దత్తం చేశాడు. కాని ప్రళయదినాన మనిషికి ఏ నిర్ణయాధికారమూ ఉండదు. సర్వాధికారాలు అల్లాహ్ అధీనమై ఉంటాయి. దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడినట్లు–"ఈ రోజు విశ్వసార్వభౌమాధికారం ఎవరిది? అది ఒకే దేవుడు, సర్వాధికారం గల అల్లాహ్‌దే కదా!" అని అనబడుతుంది (మోమిన్ – 16). అందుకే అంతిమ దైవప్రవక్త (స) తన ముద్దుల కూతురు (ఫాతిమా)ను, తన మేనత్త సఫియా (ర.అన్హా)ను ఉద్దేశించి ఇలా అన్నారు : "నేను మీకోసం దైవసన్నిధిలో ఏ అధికారమూ కలిగి ఉండను సుమా!" (సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్). బనీ హాషిమ్, బనీ అబ్దుల్ ముత్తలిబ్ వారిని ఉద్దేశించి, "మిమ్మల్ని మీరు అగ్ని నుండి కాపాడుకోండి. దైవసాక్షి! దైవ సన్నిధిలో నేను మీకు ఏ విధంగానూ తోడ్పడలేను" అని చెప్పారు. (ముస్లిం : కితాబుల్ ఈమాన్).

83వ సూరా

# అల్ ముతఫ్ఫిఫీన్

## కొలతలు, తూనికల్లో మోసం చేసేవారు

అవతరణ మక్కాలో

ఆయతులు 36

### పరిచయం

వర్తక వ్యాపారాల్లో జరిగే మోసాలకు సంబంధించి ఈ సూరా ముఖ్యంగా చర్చించింది. మొదటి ఆయతులో కొలతలు, తూకాల్లో మోసానికి సంబంధించిన ప్రస్తావనలు వచ్చాయి. వాటి ఆధారంగానే ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఇతరులను మోసం చేసేవారిని ఈ సూరా హెచ్చరిస్తోంది. పరలోకంలో వారికి తీవ్రమైన, బాధాకరమైన శిక్ష తప్పదని వ్యాఖ్యానించింది. సత్యతిరస్కారులను గురించి క్లుప్తంగా వర్ణించింది. వారు చెడ్డవారు, దుర్మార్గులు, హద్దులు అతిక్రమించేవారు, తీర్పుదినాన్ని తిరస్కరించేవారు, దివ్యఖుర్‌ఆన్‌ను ప్రాచీనకాలపు కథలుగా అభివర్ణించేవారు. ఇలాంటివారు భగభగ మండే అగ్నిలోకి ప్రవేశిస్తారు. కాగా; విశ్వసించి మంచిపనులు చేసినవారు శాశ్వత ఆనందాన్ని పొందుతారు.

### అల్ ముతఫ్ఫిఫీన్[1] సూరా — سُورَةُ المُطَفِّفِين

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** (కొలతలు, తూనికల్లో) తగ్గించి ఇచ్చే వారు నాశనమవుదురు గాక!

وَيْلٌ لِّلْمُطَفِّفِيْنَ (1)

**2** వారు ప్రజల నుండి కొలిచి తీసుకునేటప్పుడు మాత్రం పూర్తిగా – ఖచ్చితంగా – తీసుకుంటారు.

الَّذِيْنَ اِذَا اكْتَالُوْا عَلَى النَّاسِ يَسْتَوْفُوْنَ (2)

**3** కాని వారికి కొలచిగానీ, తూకం వేసిగానీ ఇచ్చేటప్పుడు మాత్రం తగ్గించి ఇస్తారు.[2]

وَاِذَا كَالُوْهُمْ اَوْ وَّزَنُوْهُمْ يُخْسِرُوْنَ (3)

1. కొంతమంది ఈ సూరాను మక్కీ సూరాగానూ, మరికొంతమంది మదనీ సూరాగానూ భావిస్తున్నారు. ఇంకా కొందరయితే దీన్ని మక్కా – మదీనాల మధ్యలో అవతరించిన సూరాగా తలపోస్తున్నారు. ఈ సూరా అవతరణా నేపథ్యంలో ఉన్న ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) మదీనాకు ఏతెంచినపుడు మదీనా ప్రజలు కొలతలు తూనికలలో మరీ అడ్డగోలుగా వ్యవహరించేవారని ప్రతీతి. అందువల్ల దేవుడు ఈ సూరాను అవతరింపజేశాడు. తత్ఫలితంగా మదీనావాసులు తమ కొలతలను, తూనికలను సరిచేసుకున్నారు (ఇబ్నె మాజ – వాణిజ్య ప్రకరణం).
2. అంటే – పుచ్చుకునేటప్పుడు, ఇచ్చేటప్పుడు వేర్వేరు కొలమానాలను, వేర్వేరు తూనికలను ఉంచటం, ఆ విధంగా ఎదుటివారిని మోసం చేయటం ఒక నైతిక రుగ్మత. ఈ రుగ్మత వల్ల మనిషి ధార్మికంగా, పారలౌకికంగా నాశన మవుతాడు. కొలతలు తూనికలలో మోసంచేసే జాతిపై కరువుకాటకాలు వస్తాయని, వారు ఎంత కష్టపడినా కష్టాలు తీరవని, దౌర్జన్యపరులైన పరిపాలకులు వారిపై నియమించబడతారని ఒక హదీసులో ఉంది. (ఇబ్నె మాజ–హ.నెం. 4019. అల్లామా అల్‌బానీ గారు ఈ హదీసును తన సహీహ్‌లో పొందుపరిచారు).

**4** ఏమిటి, తాము (మరణానంతరం) తిరిగి లేపబడతామన్న ఆలోచన వారికి బొత్తిగా లేదా?

أَلَا يَظُنُّ أُولَٰٓئِكَ أَنَّهُم مَّبْعُوثُونَ ﴿٤﴾

**5** ఒక మహాదినాన....

لِيَوْمٍ عَظِيمٍ ﴿٥﴾

**6** ఆ రోజు జనులంతా సర్వలోకాల ప్రభువు ముందు నిలబడతారు.[3]

يَوْمَ يَقُومُ ٱلنَّاسُ لِرَبِّ ٱلْعَٰلَمِينَ ﴿٦﴾

**7** ముమ్మాటికీ (వారు అనుకునేది నిజం) కాదు. నిశ్చయంగా పాపాత్ముల కర్మల చిట్టా 'సిజ్జీను'లో ఉంది.[4]

كَلَّآ إِنَّ كِتَٰبَ ٱلْفُجَّارِ لَفِى سِجِّينٍ ﴿٧﴾

**8** 'సిజ్జీను' అంటే ఏమిటో నీకేం తెలుసు?

وَمَآ أَدْرَىٰكَ مَا سِجِّينٌ ﴿٨﴾

**9** (అదొక) లిఖితపూర్వక గ్రంథం.

كِتَٰبٌ مَّرْقُومٌ ﴿٩﴾

**10** ధిక్కరించేవారికి ఆ రోజు మూడటం ఖాయం.

وَيْلٌ يَوْمَئِذٍ لِّلْمُكَذِّبِينَ ﴿١٠﴾

**11** వారు ప్రతిఫల దినాన్ని ధిక్కరించేవారు.

ٱلَّذِينَ يُكَذِّبُونَ بِيَوْمِ ٱلدِّينِ ﴿١١﴾

**12** బరితెగించిన పాపాత్ముడు మాత్రమే దాన్ని ధిక్కరిస్తాడు.

وَمَا يُكَذِّبُ بِهِۦٓ إِلَّا كُلُّ مُعْتَدٍ أَثِيمٍ ﴿١٢﴾

**13** వాడికి మా వాక్యాలను చదివి వినిపించినప్పుడు, "ఇవి పూర్వీకుల కట్టుకథలే కదా!"[5] అనంటాడు.

إِذَا تُتْلَىٰ عَلَيْهِ ءَايَٰتُنَا قَالَ أَسَٰطِيرُ ٱلْأَوَّلِينَ ﴿١٣﴾

---

3. కొలతలు, తూనికలలో మోసంచేసే ఈ జనులు అత్యంత భయంకరమైన తీర్పుదినం గురించి ఆలోచించటం లేదా? తామంతా అన్నీ తెలిసిన తమ ప్రభువు ఎదుట నిలబడి సమాధానం ఇవ్వాల్సి ఉందని భయపడటం లేదా? దీని భావం ఏమిటంటే, మనసులో దైవభీతి, పరలోక భీతి లేనివారు మాత్రమే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారు. ఆనాడు వారు లెక్క ఇవ్వటానికి తమ ప్రభువు సమక్షంలో హాజరైనపుడు చెమట మనుషుల సగం చెవుల దాకా నిండిపోతుందని హదీసుల ద్వారా తెలుస్తోంది (సహీహ్ బుఖారీ – తత్‌ఫీఫ్ సూరా వ్యాఖ్యానం). మరొక హదీసు ప్రకారం ప్రళయ దినాన సూర్యుడు మనుషులకు ఎంతగా చేరువవుతాడంటే సూర్యునికి – ప్రాణులకు మధ్య అంతరం ఒక 'మైలు' మాత్రమే ఉంటుంది. దైవప్రవక్త (స) మైలు అని చెప్పటంలో ఆయన ఉద్దేశం దూరాన్ని సూచించే మైలో లేక కళ్లకు సుర్మా పెట్టుకునేందుకు వాడే చిన్న పుల్లో నాకు తెలియదు అని ఈ హదీసు ఉల్లేఖకులైన సులైమ్ బిన్ ఆమిర్ అన్నారు ('మీల్' అన్న పదానికి అరబీలో పైన చెప్పినట్టు రెండు అర్థాలు ఉన్నాయన్న విషయం గమనార్హం). అప్పుడు మనుషులు తమ కర్మలనుబట్టి తమ చెమటలో మునుగుతారు. కొందరి చెమట వారి మోకాళ్ళ వరకూ ఉంటే, కొందరి చెమట నడుము వరకూ ఉంటుంది. మరి కొందరి పాలిట అది కళ్లెంలా పరిణమిస్తుంది. అంటే వారు పీకల లోతు చెమటలో మునిగి ఉంటారు (సహీహ్ ముస్లిం – ప్రళయం స్వభావం).

4. **'సిజ్జీన్'** అనేది ఒక చెరసాల అని కొందరు అభిప్రాయపడ్డారు. అంటే కఠిన కారాగారం మాదిరిగా అది ఎంతో ఇరుకైన, దుర్భరమైన స్థలం అన్నమాట! మరికొంతమంది ప్రకారం 'సిజ్జీన్' అనేది భూమండలంలో అత్యంత అధమస్థానం. ఆ పాతాళ స్థానంలో అవిశ్వాసుల, ముష్రిక్కుల, దుర్జనుల ఆత్మలు, వారి కర్మలు భద్రపరచబడతాయి. అందుకే తరువాతి వాక్యంలో దానిని, **'లిఖించబడిన గ్రంథం'** అని అనటం జరిగింది.

14 అది కాదు.[6] అసలు విషయం ఏమిటంటే వారి దురాగతాల మూలంగా వారి హృదయాలకు తుప్పు పట్టింది.[7]

كَلَّا بَلْ رَانَ عَلَىٰ قُلُوبِهِم مَّا كَانُوا يَكْسِبُونَ ﴿١٤﴾

15 కాదు, కాదు. ఆ రోజు వారు తమ ప్రభువును చూడకుండా వుండే విధంగా – చాటున – ఉంచబడతారు.[8]

كَلَّا إِنَّهُمْ عَن رَّبِّهِمْ يَوْمَئِذٍ لَّمَحْجُوبُونَ ﴿١٥﴾

16 ఆపైన వారు తప్పకుండా నరకంలోకి త్రోయబడతారు.

ثُمَّ إِنَّهُمْ لَصَالُوا الْجَحِيمِ ﴿١٦﴾

17 "(ఇంతకాలంగా) మీరు త్రోసిపుచ్చుతూ వచ్చిన వాస్తవం ఇదే" అని అప్పుడు వారితో అనబడుతుంది.

ثُمَّ يُقَالُ هَٰذَا الَّذِي كُنتُم بِهِ تُكَذِّبُونَ ﴿١٧﴾

18 ఎన్నటికీ కాదు. నిశ్చయంగా పుణ్యాత్ముల కర్మల చిట్టా 'ఇల్లియ్యీన్'లో ఉంది.[9]

كَلَّا إِنَّ كِتَابَ الْأَبْرَارِ لَفِي عِلِّيِّينَ ﴿١٨﴾

19 'ఇల్లియ్యీన్' గురించి నీకేం తెలుసు?

وَمَا أَدْرَاكَ مَا عِلِّيُّونَ ﴿١٩﴾

20 (అదొక) లిఖితపూర్వక గ్రంథం.

كِتَابٌ مَّرْقُومٌ ﴿٢٠﴾

21 సామీప్యం పొందినవారు (దైవ దూతలు) దాన్ని కనిపెట్టు కుని ఉంటారు.

يَشْهَدُهُ الْمُقَرَّبُونَ ﴿٢١﴾

5. ఇది అతని అతిక్రమణా వైఖరికి పరాకాష్ఠ! అందుకే దైవవాక్యాలు అతనికి వినిపించినపుడు అవి అతని బుర్రకెక్కలేదు. వాటిపై అతను ఆలోచించకపోగా, వాటిని పుక్కిటి పురాణాలని తేలిగ్గా కొట్టిపారేశాడు.

6. అంటే – అవిశ్వాసులు చెబుతున్నట్లు ఈ ఖుర్ఆన్ కట్టుకథల సమాహారం ఎంతమాత్రం కాదు. పైగా ఇది దైవవాక్కు. ఆయన అవతరింపజేసిన మహత్తర వాణి (వహీ) ! తన దూత అయిన జిబ్రయీల్ (అలైహిస్సలాం) ద్వారా తన కట్ట కడపటి ప్రవక్త అయిన ముహమ్మద్ (సఅసం) వద్దకు పంపిన దివ్య ఔషధం!!

7. వారు దివ్య ఖుర్ఆన్‌ను త్రోసిపుచ్చడానికి అసలు కారణమేమిటంటే, వారి పాపాల వల్ల వారి కళ్లు బైర్లుకమ్మాయి. వారి హృదయాలపై తుప్పు పేరుకుంది. సాధారణంగా మనిషి పాపాలను నిర్విఘ్నంగా చేస్తూ పోయినప్పుడు మనసుపై నల్లని మచ్చ ఒకటి ఏర్పడుతుంది. రానురాను ఆ మచ్చ పెరిగి పెద్దదవుతుంది. హదీసులో చెప్పబడినట్లు దైవదాసుడు పాపం చేసినప్పుడు అతని హృదయంపై ఒక నల్లని బిందువు ఏర్పడుతుంది. ఆ సమయంలో అతను గనక పశ్చాత్తాపం చెందితే, ఆ బిందువు రూపుమాపబడుతుంది. కాని అతను పశ్చాత్తాపం చెందేబదులు నిర్భయంగా పాపం చేస్తూపోతే ఆ నల్లని మచ్చ పెరిగి పెద్దదవుతుంది. తుదకు అది అతని హృదయాన్నంతటినీ ఆవరిస్తుంది. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన ఆ 'తుప్పు' ఇదే. (తిర్మిజీ – ముతఫ్ఫిఫీన్ సూరా వ్యాఖ్యానం; ఇబ్నె మాజ – ఐహిక అనాసక్తతా ప్రకరణం).

8. తద్భిన్నంగా విశ్వాసులకు దైవదర్శన భాగ్యం లభిస్తుంది. దానికి వారు అమితంగా సంతోషిస్తారు.

9. **'ఇల్లియ్యీన్'** ( عِلِّيِّين ) అనేది **'ఉలువ్వున్'** నుండి వచ్చింది. అంటే ఉన్నతమైనదని అర్థం. ఇది 'సిజ్జీన్'కు వ్యతిరేకపదం. ఇది ఊర్ధ్వలోకాలలో లేదా స్వర్గంలో లేదా సిదరతుల్ ముంతహా వద్ద లేదా దైవసింహాసనం (అర్ష్) దగ్గర ఉన్న ఒక ప్రత్యేక స్థలం. అక్కడ సజ్జనుల ఆత్మలు, వారి కర్మల పత్రాలు భద్రపరచబడ్డాయి. దైవసాన్నిధ్యం పొందిన దైవదూతలు వాటిని పర్యవేక్షిస్తూ ఉన్నారు.

**22** నిశ్చయంగా పుణ్యాత్ములు (స్వర్గ) సుఖాలలో ఉంటారు.

إِنَّ الْأَبْرَارَ لَفِي نَعِيمٍ (22)

**23** (దర్జాగా) ఆసనాలపై కూర్చుని (పరిసరాలను) వీక్షిస్తూ ఉంటారు.

عَلَى الْأَرَائِكِ يَنظُرُونَ (23)

**24** వారి ముఖాలపై ఉట్టిపడే సుఖసౌఖ్యాల కళను నువ్వు (ఇట్టే) గుర్తుపడతావు.[10]

تَعْرِفُ فِي وُجُوهِهِمْ نَضْرَةَ النَّعِيمِ (24)

**25** సీలువేయబడిన స్వచ్ఛమైన మధువు వారికి త్రాపించబడుతుంది.[11]

يُسْقَوْنَ مِن رَّحِيقٍ مَّخْتُومٍ (25)

**26** పైగా అది కస్తూరితో కూడుకున్న ముద్ర (సీలు). మరి పోటీపడేవారు ఈ విషయంలో పోటీ పడాలి.[12]

خِتَامُهُ مِسْكٌ ۚ وَفِي ذَٰلِكَ فَلْيَتَنَافَسِ الْمُتَنَافِسُونَ (26)

**27** అందులో 'తస్నీం' కలిసి ఉంటుంది.[13]

وَمِزَاجُهُ مِن تَسْنِيمٍ (27)

**28** అదొక సెలయేరు. సామీప్యం పొందిన సజ్జనులు ఆ విశిష్ట పానీయాన్ని సేవిస్తారు.

عَيْنًا يَشْرَبُ بِهَا الْمُقَرَّبُونَ (28)

10. సాధారణంగా మనం ప్రపంచంలో చూస్తూ ఉంటాం – సిరిసంపదలతో తులతూగే వారి, ఏ చీకూచింతా లేకుండా బ్రతికేవారి మొహాలు ఎంతో తాజాగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంటాయి. వారి ఆస్తిపాస్తులు, అంతస్థులు ఇచ్చిన తాజాదనం అది. అదేవిధంగా పరలోకంలో స్వర్గవాసులపై వర్షించే వరాల జల్లు, అనంతమైన సుఖసౌఖ్యాల మూలంగా వారి మొహాలు దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారు తమ అందచందాల వల్ల, కాంతులీనే చెంపకెంపుల వల్ల వారే స్వర్గవాసులని ఇట్టే కనుగొనబడతారు.

11. **'రహీఖ్'** ( رَحِيقٌ ) అంటే స్వచ్ఛమైన, పరిశుద్ధమైన,– కల్తీలేని – మధువు అని అర్థం. **'మఖ్తూమ్'** ( مَخْتُومٌ ) అంటే ముఖబంధితం. సీలు వేయబడింది. ఇది ఆ మధువు స్వచ్ఛతను మరింతగా స్పష్టీకరిస్తోంది.

మరి కొంతమంది ప్రకారం ఇది మిశ్రమ మధువు. అందులో కస్తూరి కలుపబడింది. దాంతో దాని రుచి రెట్టింపు అవుతుంది. దాని సువాసన ఘుమఘుమలాడుతూ మైమరపిస్తుంది. మస్తిష్కానికి ఎంతో హాయినీ, తృప్తినీ ఇస్తుంది. మరికొంతమంది 'మఖ్తూమ్'ను 'ముగింపు' అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే ఆ మధువులోని చివరి గుక్కెడు కస్తూరిదై ఉంటుంది. ఇంకా కొంతమంది ఈ 'ఖితామ్'ను సుగంధ పరిమళం అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే ఆ మధువు కస్తూరి సువాసనను గుబాళిస్తూ ఉంటుంది (ఇబ్నె కసీర్). హదీసులో వచ్చిన పదం కూడా ఇదే. "ఏ విశ్వాసి అయినా మరో విశ్వాసికి గుక్కెడు మంచినీరు త్రాగించి దాహం తీర్చి ఉంటే, అల్లాహ్ అతనికి **అర్రహీఖుల్ మఖ్తూమ్** త్రాపుతాడు. మరెవరయినా ఆకలిగొన్న ఒక విశ్వాసికి అన్నం పెడితే అల్లాహ్ అతనికి స్వర్గ ఫలాలు తినిపిస్తాడు. ఇంకా ఎవరయినా బట్టలులేని ఒక విశ్వాసికి వస్త్రదానం చేస్తే అల్లాహ్ అతనికి స్వర్గంలోని పచ్చని దుస్తులు తొడిగిస్తాడు." (ముస్నదె అహ్మద్–3/13, 14).

12. అంటే సదాచరణ చేసేవారు తమకు స్వర్గంలో ఇలాంటి గొప్ప గొప్ప సౌఖ్యాలు పొందే సదాచరణ చేయాలి. సత్కార్యాలలో వారు ఇతరులకన్నా ముందంజ వేసేందుకు ప్రయత్నించాలి. "ఇలాంటి విజయం కోసమే కర్మశీలురు కర్మలు చేయాలి." (సాఫ్ఫాత్ – 61).

13. **'తస్నీమ్'** అంటే ఎత్తయినది అని అర్థం. ఒంటె మూపురాన్ని అరబీలో 'సినామ్' అనీ, సమాధిని ఎత్తుగా కట్టడాన్ని 'తస్నీముల్ ఖుబూర్' అని అంటారన్న విషయం ఈ సందర్భంగా గమనార్హం. స్వర్గంలోని ఎత్తయిన స్థానం నుండి

**29** అపరాధులు విశ్వాసుల స్థితిపై (చులకనగా) నవ్వేవారు.[14]

إِنَّ الَّذِينَ أَجْرَمُوا كَانُوا مِنَ الَّذِينَ آمَنُوا يَضْحَكُونَ (29)

**30** వారి దగ్గరనుండి వెళుతున్నప్పుడు, పరస్పరం కన్నుగీటి మరీ సైగలు చేసేవారు.[15]

وَإِذَا مَرُّوا بِهِمْ يَتَغَامَزُونَ (30)

**31** తమ వారి వద్దకు తిరిగి వెళ్ళినప్పుడు కూడా (విశ్వాసులను గురించి) వేళాకోళం చేస్తూనే వెళ్ళేవారు.[16]

وَإِذَا انْقَلَبُوا إِلَىٰ أَهْلِهِمُ انْقَلَبُوا فَكِهِينَ (31)

**32** వారిని (విశ్వాసులను) చూసినప్పుడల్లా, "నిశ్చయంగా వీళ్లు పెడదారి పట్టార"ని అనేవారు.[17]

وَإِذَا رَأَوْهُمْ قَالُوا إِنَّ هَٰؤُلَاءِ لَضَالُّونَ (32)

**33** ఇంతకీ వాళ్లు (అవిశ్వాసులు) వారిపై (విశ్వాసులపై) కావలి వాళ్లుగా చేసి పంపబడలేదు కదా![18]

وَمَا أُرْسِلُوا عَلَيْهِمْ حَافِظِينَ (33)

**34** మరి ఈ రోజు విశ్వాసులు అవిశ్వాసుల స్థితిపై నవ్వుతారు.[19]

فَالْيَوْمَ الَّذِينَ آمَنُوا مِنَ الْكُفَّارِ يَضْحَكُونَ (34)

**35** ఎత్తయిన ఆసనాలపై కూర్చుని చూస్తూ ఉంటారు.

عَلَى الْأَرَائِكِ يَنْظُرُونَ (35)

**36** ఏం?! ఈ అవిశ్వాసులు, తాము చేసుకున్న దానికి పూర్తి ప్రతిఫలం పొందారు కదా![20]

هَلْ ثُوِّبَ الْكُفَّارُ مَا كَانُوا يَفْعَلُونَ (36)

---

పుట్టే ఒక సరోవరం ద్వారా ఈ 'తస్నీమ్' సరఫరా అవుతుంది. స్వర్గంలోని చాలా నాణ్యమైన మధువులలో ఇదొకటి.

14. అంటే – వారిని మరీ అల్పుల క్రింద జమకట్టి ఎగతాళి చేసేవారు.

15. ఒండొకరికి కళ్లతోనే సైగలు చేసి ముస్లిముల పరిస్థితిని పరిహసించేవారు.

16. అంటే – తమ పరివారం ముందు విశ్వాసులను గురించి ప్రస్తావించి, వాళ్ళను ఆటపట్టించినందుకు తెగ సంబరపడిపోయేవారు. ఈ ఆయతుకు మరోభావం ఇది: వారు తమ ఇండ్లకు వెళ్ళినపుడు వారి కలిమి వారికి స్వాగతం పలికేది. వారు కోరినదల్లా వారికి లభించేది. దీనిపై వారు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవలసింది పోయి విశ్వాసులను పరిహసించటంతోనే పొద్దుపుచ్చేవారు. (ఇబ్నె కసీర్).

17. అంటే బహుదైవారాధకుల దృష్టికి ఏకదైవారాధకులు మార్గభ్రష్టులుగా కనిపించేవారు. అవిశ్వాసుల దృష్టికి విశ్వాసులు దుర్మార్గులుగా కనిపించేవారు. విచిత్రం కదూ! ఈ పరిస్థితి ఇప్పటికీ నెలకొని ఉంది. మార్గభ్రష్టతకు గురైన ఎన్నో వర్గాలవారు నేడు సన్మార్గాన ఉన్నవారిని దారితప్పారని ఎక్కిరిస్తున్నారు.

18. ఇంతకీ వాళ్లకు ముస్లింలంటే అంతగా ఆసక్తి ఎందుకట? పొద్దస్తమానం ముస్లింల ఆచరణల గురించే వారు ఎందుకు చర్చించుకుంటున్నట్లు? దేవుడు వాళ్ళను ముస్లింలపై పర్యవేక్షకులుగా చేసి పంపలేదు కదా!

19. ఇహలోకంలో అవిశ్వాసులు విశ్వాసులను చూసి నవ్వినట్లే విశ్వాసులు తీర్పుదినాన అవిశ్వాసులను ఎగాదిగా చూసి నవ్వుతారు. అవిశ్వాసులు ఖుద్దుగా మార్గభ్రష్టులై యుండి తమను మార్గభ్రష్టుల క్రింద జమకట్టేవారే! అన్న విషయం తలచుకుని వారు గుంభనంగా నవ్వుతారు. మొత్తానికి ఈ రోజు అవిశ్వాసులకు తెలిసివచ్చింది – మార్గభ్రష్టులెవరో!

20. అవును, వారు చేసుకున్న కర్మలను ఈనాడు వారు అనుభవించక తప్పదు మరి!

84వ సూరా

# అల్ ఇన్‌షిఖాఖ్

## తెరువబడటం

అవతరణ మక్కాలో

ఆయతులు 25

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి బోధించింది. మొదటి ఆయతులోనే దీనికి పేరుగా పెట్టబడిన పదాలు వచ్చాయి. తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను క్లుప్తంగా అభివర్ణిస్తూ ఈ సూరా ప్రారంభమవుతుంది. రోదసి(అంతరిక్షం)లో చోటుచేసుకునే ప్రళయభీకర పరిస్థితుల గురించి ఈ సూరా వివరించింది. ఆ రోజున ఆకాశం తెరువబడుతుంది. భూమి చదునుగా చేయబడుతుంది. పర్వతాలు చెల్లాచెదరవుతాయి. అందరిని అల్లాహ్ ముందు హాజరుపరచడం జరుగుతుంది. ఈ సూరాలో అవిశ్వాసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ పరలోకంలో ఎదురయ్యే తీవ్రమైన శిక్ష గురించి హెచ్చరించడం జరిగింది. సన్మార్గంపై స్థిరంగా ఉన్నవారికి శాశ్వత స్వర్గవనాలు లభిస్తాయని ఈ సూరా పునరుద్ఘాటించింది.

### అల్ ఇన్‌షిఖాఖ్ సూరా

سُوْرَةُ الْاِنْشِقَاقِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 ఆకాశం బ్రద్దలైపోయినప్పుడు,[1]

اِذَا السَّمَآءُ انْشَقَّتْ ﴿1﴾

2 అది తన ప్రభువు ఆజ్ఞను వింటుంది.[2] దానికదే తగినది మరి![3]

وَاَذِنَتْ لِرَبِّهَا وَحُقَّتْ ﴿2﴾

3 మరి భూమి (సాగదీయబడి) విస్తృత పరచబడినప్పుడు,[4]

وَاِذَا الْاَرْضُ مُدَّتْ ﴿3﴾

4 అది తన లోపల ఉన్నదంతా బయట పడేసి, ఖాళీ అయి పోతుంది.[5]

وَاَلْقَتْ مَا فِيْهَا وَتَخَلَّتْ ﴿4﴾

5 అది తన ప్రభువు ఆదేశాన్ని (ఖచ్చితంగా) వింటుంది.[6] దానికదే శోభాయమానం మరి!

وَاَذِنَتْ لِرَبِّهَا وَحُقَّتْ ﴿5﴾

1. అంటే – ప్రళయం సంభవించినప్పుడు...
2. అంటే – బ్రద్దలైపొమ్మన్న తన ప్రభువు ఆజ్ఞను అది శ్రద్ధగా వినటమేగాక, దాన్ని అక్షరాలా పాటిస్తుంది.
3. ప్రభువాజ్ఞను విని, దాన్ని తు.చ. తప్పకుండా పాటించటం తప్ప దానికి వేరే మార్గాంతరం కూడా లేదు. ఎందుకంటే సర్వాధిపతి ఆ ప్రభువు మాత్రమే. అందరూ – తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా – ఆయనకు లోబడి మసలు కోవలసిందే. మరలాంటప్పుడు ఆయన ఆజ్ఞను ఎదిరించే దుస్సాహసానికి ఎవరు ఒడిగట్టగలరు?
4. అంటే – భూమి పొడవు, వెడల్పు మరింత పెంచబడుతుంది. లేదా నేలపై ఉన్న పర్వతాలు తుత్తునియలుగా చేయబడి, నేలంతా చదునుగా చేయబడుతుంది. అందులో అప్పుడు ఎలాంటి ఎత్తుపల్లాలు ఉండవు.

6 ఓ మానవుడా! నువ్వు నీ ప్రభువును చేరుకునేవరకూ ఈ సాధనలో, (ఈ కఠోర పరిశ్రమలోనే) నిమగ్నుడవై ఉండి, తుదకు ఆయన్ని చేరుకుంటావు.[7]

يَاأَيُّهَا الْإِنسَانُ إِنَّكَ كَادِحٌ إِلَىٰ رَبِّكَ كَدْحًا فَمُلَاقِيهِ ⑥

7 (ఆ సమయంలో) ఎవరి కర్మల పత్రం అతని కుడిచేతికి ఇవ్వబడుతుందో –

فَأَمَّا مَنْ أُوتِيَ كِتَابَهُ بِيَمِينِهِ ⑦

8 అతని నుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంది.[8]

فَسَوْفَ يُحَاسَبُ حِسَابًا يَسِيرًا ⑧

9 అతను తనవారి వైపు సంబరపడుతూ వెళతాడు.[9]

وَيَنقَلِبُ إِلَىٰ أَهْلِهِ مَسْرُورًا ⑨

5. అంటే – భూమిలోపల ఖననమై ఉన్న మృతులంతా బ్రతికి బయటికి వస్తారు. భూమి తన లోపల నిక్షిప్తమై ఉన్న నిధులు, నిక్షేపాలన్నింటినీ బయటికి కక్కేసి అది మాత్రం నిక్షేపంగా ఉండిపోతుంది.

6. భూమ్యాకాశాలే తమ ప్రభువు ఆదేశాలను యధావిధిగా పాలిస్తున్నప్పుడు మనిషికి మాత్రం ప్రభువు ఆజ్ఞలను ఎదిరించే అధికారం ఎక్కడుంది?

7. ఇక్కడ **'మానవుడు'** అన్న పదంలో మంచివారు–చెడ్డవారు, విశ్వాసులు – అవిశ్వాసులు అందరూ చేరి ఉన్నారు. **'కద్‌హున్'** (كَدْحٌ) అంటే కఠోరశ్రమ, క్లిష్టసాధన అని అర్థం. కఠోర పరిశ్రమ మంచి కోసం జరిగినా, చెడుకోసం జరిగినా శ్రమ శ్రమే కదా! దీని భావం ఏమిటంటే–ఓ మనిషీ! ప్రళయం వచ్చినప్పుడు నువ్వు నీ ప్రభువును ఎలాగూ కలుసుకుంటావు. ఆ సమయంలో నీవు చేసిన కర్మలు –అవి మంచివైనా, చెడ్డవైనా–నీ ముందు ఉంటాయి. వాటి ప్రకారమే నీకు పుణ్యఫలమో, పాపఫలమో లభిస్తుంది. దీని వివరాలు తరువాతి వాక్యాలలో వచ్చాయి.

8. తేలికపాటి లెక్క అంటే ఏమిటి? అదెలా ఉంటుంది? అంటే విశ్వాసి (మోమిన్) కర్మల పత్రం విచారణకు వస్తుంది. అతని తప్పులు కూడా అతని ముందుకు తేబడతాయి. అయితే అల్లాహ్ తన దయాదాక్షిణ్యాలతో వాటిని మన్నిస్తాడు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా అంటున్నారు : "లెక్క తీసుకోబడినవాడు చచ్చాడన్నమాటే!" అని దైవప్రవక్త (సఅసం) ప్రవచించినపుడు, "ఓ దైవప్రవక్తా (సఅసం)! దేవుడు నన్ను మీకు అర్పించుగాక! 'ఎవరికర్మల పత్రం వారి కుడిచేతికి ఇవ్వబడుతుందో వారినుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంద'ని అల్లాహ్ సెలవిచ్చాడు కదా! (ఈ ఆయతు ప్రకారం లెక్క తీసుకోబడిన విశ్వాసి వినాశం పాలవుతాడని చెప్పబడలేదే!)" అని నేను సందేహపడ్డాను. అప్పుడు ఆయన (సఅసం) ఇలా విశదీకరించారు : "ఇది దైవసమక్షంలో హాజరవటం మాత్రమే (అసలు విశ్వాసి పట్ల ఖచ్చితంగా లెక్క తీసుకోబడదు). విశ్వాసులు తమ ప్రభువు ఎదుట హాజరు పరచబడతారు. ఎవడయినా నిలదీసి అడగబడ్డాడంటే అతనికి మూడినట్లే" (సహీహ్ బుఖారీ – ఇన్‌షిఖాఖ్ సూరా తాత్పర్యం). ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఈ విధంగా తెలియజేశారు: "దైవప్రవక్త (సఅసం) అప్పుడప్పుడూ నమాజులలో **అల్లాహుమ్మ హాసిబ్‌నీ హిసాబన్ య్యసీరా** (ఓ అల్లాహ్! నానుండి తేలికపాటి లెక్క తీసుకో) అని ప్రార్థించేవారు. ఆయన నమాజును ముగించిన తరువాత **'హిసాబన్ య్యసీరా'** (తేలికపాటి లెక్క) అంటే ఏమిటని నేను అడగ్గా, 'అల్లాహ్ తన దాసుని కర్మల పత్రాన్ని స్థూలంగా చూసి, అతన్ని మన్నిస్తాడు' అని ఆయన (సఅసం) వివరించారు." (ముస్నదె అహ్మద్ – 6/48).

9. అంటే – తన కుటుంబీకుల్లో స్వర్గం పొందినవారి వద్దకు. లేదా స్వర్గం పొందిన తన తల్లిదండ్రుల వద్దకు. లేదా స్వర్గంలో తనకు లభించే కన్యల వద్దకు.

10 మరెవరి కర్మల పత్రం అతని వీపు వెనుక నుండి ఇవ్వబడు
తుందో,

وَأَمَّا مَنْ أُوتِيَ كِتَٰبَهُۥ وَرَآءَ ظَهْرِهِۦ ﴿١٠﴾

11 అతను చావు కోసం కేకలు వేస్తాడు.[10]

فَسَوْفَ يَدْعُوا۟ ثُبُورًا ﴿١١﴾

12 మరి (అతను) మండే నరకాగ్నిలోకి ప్రవేశిస్తాడు.

وَيَصْلَىٰ سَعِيرًا ﴿١٢﴾

13 ఈ వ్యక్తి (ఇహలోకంలో) తన వారి మధ్య తెగ సంబరపడే
వాడు.[11]

إِنَّهُۥ كَانَ فِىٓ أَهْلِهِۦ مَسْرُورًا ﴿١٣﴾

14 తానెన్నటికీ (అల్లాహ్ వద్దకు) తిరిగి పోనని తలపోసేవాడు,[12]

إِنَّهُۥ ظَنَّ أَن لَّن يَحُورَ ﴿١٤﴾

15 ఎందుకు పోడు?![13] నిజానికి అతని ప్రభువు అతన్ని బాగా
గమనిస్తూనే ఉండేవాడు.[14]

بَلَىٰٓ إِنَّ رَبَّهُۥ كَانَ بِهِۦ بَصِيرًا ﴿١٥﴾

16 సాయంకాలపు ఎర్రని కాంతి తోడు![15]

فَلَآ أُقْسِمُ بِٱلشَّفَقِ ﴿١٦﴾

17 రాత్రి తోడు! అది తనలో లీనం చేసుకునే వస్తువుల తోడు![16]

وَٱلَّيْلِ وَمَا وَسَقَ ﴿١٧﴾

18 పూర్ణచంద్రుని తోడు![17] (గా చెబుతున్నాను)

وَٱلْقَمَرِ إِذَا ٱتَّسَقَ ﴿١٨﴾

---

10. అంటే; అతను కేకలు వేస్తాడు, అరుస్తాడు. గోలపెడతాడు. తాను సర్వనాశనమై పోయానని తలబాదుకుంటాడు.

11. అంటే – అతను ప్రాపంచిక జీవితంలో తన మనోవాంఛలకు బానిసై, భోగభాగ్యాలలో మునిగితేలేవాడు. పొద్దస్తమానం వాడికి వాడి లోకమే తప్ప వేరే ధ్యాస ఉండేదికాదు.

12. వాడి 'సంబరానికి' కారణం పరలోకం పట్ల వాడికి విశ్వాసం లేకపోవటమే. ఈ విశ్వాస రాహిత్యం అతన్ని మరీ భౌతికవాదిగా, స్వార్థపరునిగా మార్చేసింది. 'హౌర్' అంటే మరలివెళ్ళటం అని అర్థం. మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రార్థించేవారు: **"అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ హౌరి బాదల్ కౌర్"** (ఓ అల్లాహ్! విశ్వసించిన మీదట అవిశ్వాసానికి లోనవటం నుండి, విధేయత చూపిన తరువాత అవిధేయుడుగా మారటం నుండి, మేలువైపు మరలిన తరువాత కీడు వైపుకు మొగ్గిపోవటం నుండి నేను నీ శరణువేడుతున్నాను). (సహీహ్ ముస్లిం, తిర్మిజీ, ఇబ్ను మాజ).

13. తప్పకుండా తన ప్రభువు వద్దకు మరలిపోతాడు. తనకిష్టం ఉన్నా లేకున్నా అతని ఈ పయనం ఆగదు.

14. అంటే – అతను చేసే ఏ పనీ అతని ప్రభువు నుండి దాగిలేదు.

15. సూర్యాస్తమయం తరువాత ఆకాశంలో ప్రస్ఫుటమయ్యే ఎరుపుదనాన్ని **'షఫఖ్'** ( ٱلشَّفَقِ ) అంటారు. ఇషా నమాజు వేళ మొదలయ్యేవరకు ఈ ఎరుపుదనం ఉంటుంది.

16. చీకటిపడగానే ప్రతి వస్తువూ తన గమ్యం వైపుకు, విశ్రాంతి స్థలం వైపుకు వెళ్ళిపోతుంది. వేరే మాటల్లో చెప్పాలంటే రాత్రి చీకటి వాటిని తన ఒడిలోనికి తీసుకుంటుంది.

**19** నిశ్చయంగా మీరు క్రమేణా ఒక స్థితి నుండి మరో స్థితికి సాగిపోతుంటారు.[18]

لَتَرْكَبُنَّ طَبَقًا عَنْ طَبَقٍ (19)

**20** అసలు వారికేమైపోయిందీ, వారు ఎందుకని విశ్వసించరు?

فَمَا لَهُمْ لَا يُؤْمِنُونَ (20)

**21** వారి ముందు ఖుర్‌ఆనును పఠించినప్పుడు వారెందుకని సాష్టాంగపడరు?[19]

وَإِذَا قُرِئَ عَلَيْهِمُ الْقُرْآنُ لَا يَسْجُدُونَ (21)

**22** పైగా విశ్వసించని ఈ జనులు (దీనిని) ధిక్కరిస్తున్నారు?[20]

بَلِ الَّذِينَ كَفَرُوا يُكَذِّبُونَ (22)

**23** వారు తమ లోపల దాచి పెట్టుకునే లోగుట్టును గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు.[21]

وَاللَّهُ أَعْلَمُ بِمَا يُوعُونَ (23)

**24** కాబట్టి వారికి బాధాకరమైన యాతనకు సంబంధించిన 'శుభవార్త'ను వినిపించు.

فَبَشِّرْهُمْ بِعَذَابٍ أَلِيمٍ (24)

**25** అయితే, విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి మాత్రం ఎన్నటికీ తరగని పుణ్యఫలం ఉంది.

إِلَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ لَهُمْ أَجْرٌ غَيْرُ مَمْنُونٍ (25)

---

17. అంటే చంద్రుని దశలు రోజు రోజుకూ పెరిగి పరిపూర్ణతను సంతరించుకున్నప్పుడు... 13వ తేదీ రాత్రి నుండి 16వ తేదీ రాత్రి వరకు చంద్రుడు 'పూర్ణచంద్రుడు'గా వెలుగొందుతాడు.

18. **'తబఖ్'** ( طَبَق ) అంటే తీవ్రమైన, కఠినమైన అని అసలు అర్థం. ప్రళయదినాన ఎదురయ్యే ప్రతి అవస్థ పూర్వపు అవస్థకన్నా ఎంతో కఠినంగా ఉంటుంది (ఫత్‌హుల్ బారీ – ఇన్‌షిఖాఖ్ సూరా వ్యాఖ్యానం). గత ఆయతులలో చేయబడిన ప్రమాణాలకు సమాధానం ఈ ఆయతులో ఇవ్వబడింది.

19. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)గారు, ఆయన ప్రియసహచరులు (రజి) కూడా ఈ ఆయతు వచ్చినప్పుడు సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేసేవారని హదీసుల ద్వారా రూఢీ అవుతోంది.

20. అంటే – విశ్వసించాల్సింది పోయి దానిని త్రోసిపుచ్చుతున్నారు.

21. అంటే వారు రహస్యంగా చేసే పనులు, వారు తమ ఆంతర్యాల్లో దాచిపెట్టే ధిక్కారవైఖరి – ఏదీ అల్లాహ్‌కు తెలియకుండా లేదు.

85వ సూరా

# అల్ బురూజ్

## విశ్వాంతరాళాల్లో ఉండే గ్రహ నక్షత్ర సముదాయాలు

అవతరణ మక్కాలో

ఆయతులు 22

### పరిచయం

అల్లాహ్‌పై విశ్వాసంకోసం తన్ను తాను త్యాగం చేసుకునే వైఖరిని ఈసూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఇందులోని మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన 'మహా బురుజులు' అన్న పేరునే దీనికి పెట్టడం జరిగింది. సత్యాన్ని విశ్వసించిన వారిపై వేధింపులు, దౌర్జన్యాలనుగురించి ఈసూరా ప్రస్తావించింది. ఒకే దేవుడైన అల్లాహ్‌ను విశ్వసించిన వారిని దుర్మార్గులు నానా విధాలుగా హింసించేవారు. ఒక గుంటలో అగ్నిని మండించి అందులో వారిని విసిరేసి ఆనందించేవారు. ఏకైక దేవుడిని విశ్వసించినవారు ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డారు కాని తమ విశ్వాసాన్ని ఇసుమంత కూడా సడలనీయలేదు. ఈ సంఘటనలను ప్రస్తావిస్తూ, దౌర్జన్యాలు చేస్తున్నవారికి పరలోకంలో ఎదురయ్యే బాధాకరమైన శిక్ష గురించి హెచ్చరించడం జరిగింది. సమయం గడిచిపోక ముందే వారు పశ్చాత్తాపం చెందాలని అల్లాహ్ వారికి బోధించాడు. ఈ సందర్భంగా ఫిరౌన్ ప్రజల కథను, వారికి పట్టిన దుర్గతిని ప్రస్తావించి, దుర్మార్గులను, సత్యతిరస్కారులను అల్లాహ్ కఠినంగా శిక్షిస్తాడని గుర్తుచేయడం జరిగింది. దివ్యఖుర్ఆన్ మహోన్నతమైనదనీ, శాశ్వతమైనదనీ, మార్పులు చేర్పులకు అతీతమైనదనీ స్పష్టం చేయడం జరిగింది.

### అల్ బురూజ్[1] సూరా — سُوْرَةُ الْبُرُوْجِ

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్ — بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

وَالسَّمَآءِ ذَاتِ الْبُرُوْجِ ①

**1** బురుజులు గల ఆకాశం సాక్షిగా![2]

وَالْيَوْمِ الْمَوْعُوْدِ ②

**2** వాగ్దానం చేయబడివున్న రోజు సాక్షిగా![3]

وَشَاهِدٍ وَّ مَشْهُوْدٍ ③

**3** సాక్ష్యదినం (సమావేశమైనవారి) సాక్షిగా! సమావేశమైన చోటు సాక్షిగా![4]

1. దైవప్రవక్త (సఅసం) తరచూ అల్ బురూజ్ సూరాను, అత్తారిఖ్ సూరాను జుహ్ర్, అస్ర్ నమాజులలో చదివేవారు.

2. **'బుర్జ్'** (بُرُجٌ) అంటే అసలు 'ప్రస్ఫుటమవటం' అని అర్థం. అసలివి నక్షత్రాల మజిలీలు. ఆకాశంలో వాటికిగల ప్రాముఖ్యం, విశిష్టత దృష్ట్యా వాటికి 'బురుజుల' స్థాయి లభించింది. కొంతమంది అనువాదకులు ఈ పదాన్ని నక్షత్రాలు అన్న అర్థంలో తీసుకున్నారు. మరికొంతమంది ఆకాశద్వారాలు అన్న భావంలో తీసుకున్నారు. చంద్రుని మజిలీలు అని కూడా కొందరు భావించారు (ఫత్‌హుల్ ఖదీర్).

3. వాగ్దానం చేయబడివున్న రోజు అంటే ప్రళయదినం అన్నమాట!

4. **'షాహిద్'** మరియు **'మష్‌హూద్'** ల వ్యాఖ్యానంలో భేదాభిప్రాయం ఉంది. అయితే ఇమామ్ షౌకానీ గారు హదీసుల, చారిత్రక ఆధారాల ద్వారా వివరించిన దాని ప్రకారం ఇక్కడ 'షాహిద్' (సాక్షి) అంటే శుక్రవారం రోజు. ఆ రోజు ఎవరు ఏ ఆచరణ చేసినా ప్రళయదినాన అది దానికి సంబంధించిన సాక్ష్యమిస్తుంది. 'మష్‌హూద్' అంటే అరఫా

4 కందకం వాళ్ళు సర్వనాశనమయ్యారు.[5]

قُتِلَ أَصْحٰبُ الْأُخْدُوْدِ ④

5 అది ఇంధనంతో బాగా మండించబడిన అగ్ని.[6]

النَّارِ ذَاتِ الْوَقُوْدِ ⑤

6 ఆ సమయంలో వాళ్లు (కందకంవాళ్ళు) దాని చుట్టూ కూర్చున్నారు.

إِذْ هُمْ عَلَيْهَا قُعُوْدٌ ⑥

7 తాము విశ్వాసుల (ముస్లింల) పట్ల చేస్తున్న దాన్ని (తమాషాగా) తిలకిస్తూ ఉన్నారు.[7]

وَّهُمْ عَلٰى مَا يَفْعَلُوْنَ بِالْمُؤْمِنِيْنَ شُهُوْدٌ ⑦

8 ఇంతకీ ఆ విశ్వాసులు చేసిన తప్పు – వారు సర్వశక్తుడు, స్తోత్రనీయుడైన అల్లాహ్‌ను విశ్వసించటం తప్ప మరొకటి కాదు.[8] దానికే వారు ప్రతీకారం తీర్చుకున్నారు.

وَمَا نَقَمُوْا مِنْهُمْ إِلَّآ أَنْ يُّؤْمِنُوْا بِاللّٰهِ الْعَزِيْزِ الْحَمِيْدِ ⑧

రోజు (జిల్ హజ్జ్ 9వ తేదీ). ఆ రోజు దైవదాసులు హజ్ నిమిత్తం అరఫా మైదానంలో హాజరై కొంత సమయం అక్కడ విడిది చేస్తారు.

5. అంటే – కందకాలు (గుంటలు) తవ్వి, విశ్వప్రభువును విశ్వసించేవారిని అందులో పడవేసి, అగ్నికి ఆహుతిచేసిన దుర్మార్గులు నాశనమవుతారు. ఇక్కడ **'నాశనమయ్యారు'** అనే మాట 'శపించబడ్డారు' అన్న భావంలో ఉంది.

6. ఈ కందకాలు వంటచెరకుతో నింపబడి, అగ్నితో బాగా మండించబడ్డాయి. ఏకైక దైవాన్ని నమ్మిన ముస్లింలను ఆహుతి చేయటానికి మండించబడిన అగ్ని అది.

7. అవిశ్వాసి, దైవవిరోధి అయిన రాజు, అతని మందిమార్బలమంతా ఆ కందకాల చుట్టూ కూర్చొని, ముస్లింలు మంటల్లో కాలిపోతుంటే వికటాట్టహాసం చేస్తూ వేడుక చూడసాగారు.

8. వారు ఏ నేరం చేశారని అగ్ని గుండాల్లో పడవేయబడ్డారు? సర్వాధికారి అయిన అల్లాహ్‌ను విశ్వసించటమేగా! ప్రామాణిక హదీసుల ప్రకారం ఈ సంఘటన పూర్వాపరాలివి :

**కందకాల వాళ్ళగాథ:**

పూర్వకాలంలో ఒక రాజు వద్ద ఒక మాంత్రికుడు ఉండేవాడు. ఆ మాంత్రికుడు వృద్ధుడైపోయాడు. తనకు తెలివితేటలున్న ఒక బాలుణ్ణి ఇస్తే, తానతనికి మంత్రతంత్రాల విద్యను నేర్పుతానని రాజుతో చెప్పాడు. రాజుగారు ఆ ముసలివాడి అభ్యర్థనపై మంచి తెలివితేటలు గల ఒక బాలుణ్ణి ఈ పని కోసం అంకితం చేశాడు. ఆ బాలుడు ప్రతిరోజూ తాంత్రిక విద్యను నేర్చుకోవటానికి ఆ వృద్ధుని ఆశ్రమానికి వెళ్ళేవాడు. మార్గమధ్యంలో ఒక మతాచార్యుని కుటీరం ఉండేది. ఆ అబ్బాయి వస్తూపోతూ కాస్సేపు ఆ కుటీరం వద్ద కూడా కూర్చుని ఆ మతాచార్యుని ఉపదేశాలను కూడా ఆలకించేవాడు. మతాచార్యుని మాటలు ఆ అబ్బాయిని ఆకట్టుకున్నాయి. రోజులు గడుస్తున్నాయి.

ఒక రోజు ఆ పసివాడు వెళుతుండగా దారిలో ఒక మృగం బైఠాయించి ఉంది. దానివల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. అదే సమయంలో ఆ పసివాడికి ఒక ఆలోచన తట్టింది. మతాచార్యుడు చెప్పేది నిజమా? మాంత్రికుని విద్య నిజమా? అతను ఒక రాయి చేతిలో తీసుకుని, "ఓ అల్లాహ్! నీ దృష్టిలో ఈ మతాచార్యుని విధానం మాంత్రికుని పోకడకన్నా వాంఛనీయమైనదైతే ఈ రాయి ద్వారా నీవు ఈ క్రూరమృగాన్ని చంపివేయ్!" అని సంకల్పించుకుని రాయి విసిరాడు. అలా చెప్పి రాయి రువ్వగానే ఆ మృగం కాస్తా చచ్చిఊరుకుంది. ప్రజల ఇబ్బంది తొలగిపోయింది. ఆ అబ్బాయి ఆ రోజు జరిగిన సంఘటననంతటినీ మతాచార్యునికి వివరించాడు. మతాచార్యుడు ఆశ్చర్యపోయాడు. తరువాత ఇలా అన్నాడు: "చంటీ! నువ్విప్పుడు పరిపక్వతను సంతరించుకుంటున్నావ్‌రా! ఇకనుంచి నీకు అడుగడుగునా పరీక్షలు కూడా ఎదురవుతాయి. కాని ఎవరయినా నిన్ను నిలదీసి అడిగినప్పుడు నా పేరు చెప్పకు."

9 మరి వాస్తవానికి భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి (కూడా) ఆయనే. మరి అల్లాహ్ అన్నింటికీ సాక్షిగా ఉన్నాడు.

الَّذِي لَهُ مُلْكُ السَّمَاوَاتِ وَالْأَرْضِ ۚ وَاللَّهُ عَلَىٰ كُلِّ شَيْءٍ شَهِيدٌ ﴿٩﴾

10 ఎవరయితే విశ్వసించిన పురుషులను, విశ్వసించిన స్త్రీలను వేధించి (కనీసం) పశ్చాత్తాపం (కూడా) చెందలేదో వారి కొరకు నరక యాతన సిద్ధంగా ఉంది, దహించి వేసే యాతన కూడా ఉంది.

إِنَّ الَّذِينَ فَتَنُوا الْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ ثُمَّ لَمْ يَتُوبُوا فَلَهُمْ عَذَابُ جَهَنَّمَ وَلَهُمْ عَذَابُ الْحَرِيقِ ﴿١٠﴾

11 అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసేవారి కోసం క్రింద కాలువలు ప్రవహించే తోటలు ఉన్నాయి. ఇదే గొప్ప విజయం.

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ لَهُمْ جَنَّاتٌ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ ۚ ذَٰلِكَ الْفَوْزُ الْكَبِيرُ ﴿١١﴾

12 నిశ్చయంగా నీ ప్రభువు పట్టు చాలా కఠినమైనది.[9]

إِنَّ بَطْشَ رَبِّكَ لَشَدِيدٌ ﴿١٢﴾

ఈ అబ్బాయి గుడ్డివాళ్లను, కుష్ఠరోగులను, ఇతర వ్యాధిగ్రస్తులను నయం చేసేవాడు. అయితే తన దగ్గరకు వచ్చిన రోగులందరినీ నిజప్రభువు అయిన అల్లాహ్‌ను విశ్వసించాలన్న షరతు మీదనే చికిత్స చేసేవాడు. ఈ షరతుపైనే అతను రాజుగారి దర్బారులో అంధుడుగా ఉన్న ఒక సలహాదారునికి కంటిచూపును ఇచ్చాడు. తన దగ్గరకు ఏ రోగివచ్చినా, "ఓ అల్లాహ్! నీవు ఇతని జబ్బును (లేక లోపాన్ని) దూరం చేయి!" అని ప్రార్థించేవాడు. అతని వేడుకోలు దైవసన్నిధిలో స్వీకరించబడేది. ఎంతోమంది రోగులకు ఆరోగ్యం చేకూరింది. వారంతా ఆ బాలుడు నమ్మే ప్రభువును నమ్మి నడుచుకోవటం మొదలెట్టారు. ఆ విధంగా ఆ అబ్బాయి పేరు మార్మోగిపోసాగింది. రాజుగారి చాప క్రిందికి నీళ్లు వచ్చేశాయి. తన రాజరిక వ్యవస్థకు ముప్పువాటిల్లే ప్రమాదాన్ని పసిగట్టిన ఆ నిరంకుశ రాజు ఎంతోమంది విశ్వాసులను హతమార్చాడు. చివరికి ఆ అబ్బాయిని కూడా బంధించి, అతన్ని వధించటానికి ఒక ప్రత్యేక దళాన్ని నియమించాడు. అతన్ని ఒక పెద్ద పర్వత శిఖరం మీదికి తీసుకుపోయి, అక్కణ్ణుంచి క్రిందికి తోసెయ్యండని తన భటులకు ఆదేశించాడు. పర్వతం మీదికి పోతుండగా ఆ పసివాడు తన నిజప్రభువును ప్రార్థించాడు. అంతే! ఆ పర్వతం ప్రకంపించసాగింది. రాజభటులంతా కుప్పకూలిపోయారు. ఆ అబ్బాయి మాత్రం సురక్షితంగా ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రాజు గారికి మతి పోయినంత పనయింది. తుదకు అతన్ని పడవ మీద తీసుకుపోయి, సముద్రంలో పడవెయ్యమని ఆజ్ఞాపించాడు. కాని అక్కడా రాజుగారికి శృంగభంగమే అయింది. ఆ అబ్బాయి ప్రార్థన చేయగానే పడవ మునిగిపోయింది. అందరూ సముద్రంలో మునిగి చచ్చిపోయారు. ఆ అబ్బాయి మాత్రం ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రాజు నివ్వెరపోయాడు. అప్పుడు ఆ బాలుడు స్వయంగా సలహా యిస్తూ, "నన్ను చంపాలన్నదే నీ ధ్యేయమైతే ఒక బహిరంగ ప్రదేశంలో జనులను సమావేశపరచు. 'ఈ అబ్బాయి విశ్వసిస్తున్న ప్రభువు నామంతో' అని బిగ్గరగా పలికి నా మీద బాణాన్ని సంధించు" అన్నాడు. రాజు అలాగే చేశాడు. మరుక్షణమే బాణం గుచ్చుకుని ఆ పసివాడు మరణించాడు. మేము కూడా ఈ అబ్బాయి విశ్వసించే ప్రభువునే విశ్వసిస్తున్నాం అని ప్రజలు ఎలుగెత్తి చాటారు. రాజు మరింతగా ఆందోళన చెందాడు. అప్పుడతను పెద్ద పెద్ద కందకాలను త్రవ్వించి, అగ్నిని మండించాడు. తన మాట వినకుండా నిజ దైవాన్ని నమ్మే వారందరినీ అగ్నికి ఆహుతి చేయమని ఆజ్ఞాపించాడు. ఆ విధంగా విశ్వాసులు వరుసగా కందకాలలో త్రోసివేయబడ్డారు. ఆఖరికి ఒక స్త్రీ చంటి పిల్లవాణ్ణి ఎత్తుకుని వచ్చింది. ఆమెలోని మమకారం ఉప్పొంగగా, కందకంలో దూకటానికి తటపటాయించింది. అప్పుడు మాటలు కూడా రాని ఆ చంటిపిల్లవాడు, "అమ్మా! సందేహపడకు. నువ్వు సత్యంపై ఉన్నావు" అన్నాడు (సహీహ్ ముస్లిం – కందకాల వాళ్ళ వృత్తాంతం – టూకీగా). ఇమామ్ ఇబ్నె కసీర్ మరికొన్ని సంఘటనలను కూడా నకలు చేశారు. అవి కొంత భిన్నంగా ఉన్నాయి. బహుశా ఇలాంటి దురంతాలు ఎన్నో పలుచోట్ల పలు విధాలుగా జరిగి ఉండవచ్చు. (వివరాల కోసం తఫ్సీర్ ఇబ్నె కసీర్ చూడండి).

13 ఆయనే తొలిసారి పుట్టిస్తున్నాడు. మలిసారి ప్రభవింప జేసేవాడు కూడా ఆయనే.[10]

إِنَّهُۥ هُوَ يُبۡدِئُ وَيُعِيدُ ﴿13﴾

14 ఆయనే అపారంగా క్షమించేవాడు, అమితంగా ప్రేమించే వాడు.

وَهُوَ ٱلۡغَفُورُ ٱلۡوَدُودُ ﴿14﴾

15 పీఠాధిపతి, ఘనత గలవాడు.[11]

ذُو ٱلۡعَرۡشِ ٱلۡمَجِيدُ ﴿15﴾

16 తలచుకున్న దాన్ని చేసితీరేవాడు.[12]

فَعَّالٞ لِّمَا يُرِيدُ ﴿16﴾

17 సైనిక దళాల సంగతిగాని నీకు చేరిందా?[13]

هَلۡ أَتَىٰكَ حَدِيثُ ٱلۡجُنُودِ ﴿17﴾

18 (అనగా) ఫిరౌను మరియు సమూదు (దళాలు).

فِرۡعَوۡنَ وَثَمُودَ ﴿18﴾

19 కాని (ఈ) తిరస్కారులు మాత్రం ధిక్కార వైఖరిలోనే పడి ఉన్నారు.

بَلِ ٱلَّذِينَ كَفَرُواْ فِي تَكۡذِيبٖ ﴿19﴾

20 అల్లాహ్ కూడా వాళ్లను అన్ని వైపుల నుండీ చుట్టుముట్టాడు.[14]

وَٱللَّهُ مِن وَرَآئِهِم مُّحِيطُۢ ﴿20﴾

21 కాదు… అసలు ఈ ఖుర్ఆన్ మహిమాన్వితమైనది.

بَلۡ هُوَ قُرۡءَانٞ مَّجِيدٞ ﴿21﴾

22 సురక్షిత ఫలకంలో (లిఖితమై ఉంది).[15]

فِي لَوۡحٖ مَّحۡفُوظِۭ ﴿22﴾

9. అంటే – తన ప్రవక్తలను ధిక్కరించే వారి భరతం పట్టాలని ఆయన అనుకున్నప్పుడు, ఆయన పట్టు నుండి వారిని ఎవరూ కాపాడలేరు.

10. అంటే – ఆయనే తన శక్తియుక్తుల ద్వారా సృష్టికి శ్రీకారం చుట్టాడు. మరి పునరుత్థాన దినాన కూడా ఆయన ప్రాణులను తొలిసారి సృష్టించినట్లే తిరిగి లేపుతాడు.

11. ఆయన ఇతర సృష్టితాలన్నింటికంటే విలక్షణమైనవాడు, సర్వోన్నతుడు. అన్నింటికన్నా ఉన్నతస్థాయిలో ఉన్న 'అర్ష్'కు ఆయన అధిపతి. ఈ విషయంలో ప్రవక్త ప్రియ సహచరులు, వారి శిష్యులు, హదీసువేత్తల నమ్మకం కూడా ఇదే. **'అల్ మజీద్'** అంటే ఘనాఘనుడు, మహిమాన్వితుడు, ఉదాత్తుడు అనే అర్థాలువస్తాయి.

12. ఆయన, తానేం కోరినా దాన్ని చేసేస్తాడు. ఆయన ఆజ్ఞను, ఆయన ప్రణాళికను అడ్డుకునే లేక వాయిదా వేయించేవాడెవడూ లేడు. ఆయన్ని ప్రశ్నించే అధికారం కూడా ఎవరికీ లేదు. హజ్రత్ అబూబక్ర్ (ర.అ) మరణ శయ్యపై ఉన్నప్పుడు ఎవరో, "ఏ వైద్యుడైనా తమరిని పరిశీలించాడా?" అని అడిగాడు. దానికాయన "అవున"ని జవాబిచ్చారు. "వైద్యుడేమన్నాడు?" అని మళ్లీ అడిగితే, "నేను తలచింది చేస్తాను. నా వ్యవహారంలో జోక్యం చేసుకునే వాడెవడూ లేడ"న్నాడు అని సమాధానమిచ్చారాయన (ఇబ్నె కసీర్). దీని ఆంతర్యం ఏమిటంటే, ఇప్పుడు పరిస్థితి వైద్యుల చేయిదాటి పోయింది. నా అంతిమ ఘడియలు ఆసన్నమయ్యాయి. అల్లాహ్‌యే ఇప్పుడు నా వైద్యుడు. ఆయన ఇచ్ఛను దాటవేసే శక్తి ఇక ఎవరిలోనూ లేదు.

13. అంటే – వారిపై నా తరఫున శిక్ష విధించబడినప్పుడు, నేను వారిని చాలా కఠినంగా పట్టుకున్నాను. ఆ సమయంలో వాళ్లను ఎవరూ ఆదుకోలేకపోయారు.

14. వాళ్లు ధిక్కరించి బాపుకునేదేమీ లేదు. ఈ ధిక్కారానికి శిక్ష ఎలాగూ తప్పదు.

15. అక్కడ దైవదూతలు దాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. అందులో ఎలాంటి మార్పులు చేర్పులకు ఆస్కారం ఉండదు.

86 వ సూరా

# అత్ తారిఖ్

## ప్రభాత నక్షత్రం

అవతరణ మక్కాలో

ఆయతులు 17

### పరిచయం

ఇందులో ముఖ్యంగా ప్రస్తావించిన విషయాలు – ప్రళయం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, దైవవాణి అవతరించడం. మొదటి ఆయతులో వచ్చిన 'తారిఖ్' ( ప్రభాత నక్షత్రం) అన్న ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మనిషిని ఏ విధంగా వీర్యద్రవం నుంచి సృష్టించింది తెలుపుతూ అల్లాహ్ మరణించిన ప్రతి ఒక్కరిని తీర్పుదినాన మళ్ళీ లేపి నిలబెట్టగలడని, ఆ రోజున యావత్తు మానవాళి తుది తీర్పు కోసం దేవుని ముందు హాజరవుతుందని చెప్పడం జరిగింది. ఆ రోజున ప్రతిఒక్కరి మంచి లేదా చెడు పనులు బట్టబయలవుతాయి. దివ్యఖుర్ఆన్ దేవుడు పంపిన సత్యమనీ, ఇది మంచిని చెడు నుంచి వేరు చేస్తుందనీ, ఇవి వ్యర్థమైన ప్రసంగాలు కావని నొక్కి చెప్పింది.

### అత్ తారిఖ్ [1] సూరా — سُورَةُ الطَّارِقِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

1 ఆకాశం సాక్షిగా! రాత్రి చీకటిలో ప్రస్ఫుటమయ్యే దాని సాక్షిగా!

وَٱلسَّمَآءِ وَٱلطَّارِقِ ①

2 రాత్రిపూట ప్రస్ఫుటమయ్యేదేమిటో నీకు తెలుసా?

وَمَآ أَدۡرَىٰكَ مَا ٱلطَّارِقُ ②

3 అది ప్రకాశించే నక్షత్రం.[2]

ٱلنَّجۡمُ ٱلثَّاقِبُ ③

4 తనను కనిపెట్టుకుని ఉండే దూత లేకుండా ఏ ప్రాణీ లేదు.[3]

إِن كُلُّ نَفۡسٖ لَّمَّا عَلَيۡهَا حَافِظٞ ④

---

1. హజ్రత్ ఖాలిద్ ఉద్వానీ (రజి) ఇలా అంటున్నారు: నేను దైవప్రవక్తను ఊతకర్ర సహాయంతోనో, ధనస్సు సహాయంతోనో సఖీఫ్ బజారులో నిలబడి ఉండగా చూశాను. ఆయన (సఅసం) నా నుండి సహాయం పొందేందుకు వచ్చారు. అక్కడే నేను ఆయన (స) నుండి అత్ తారిఖ్ సూరా విన్నాను. నేనప్పటికి ఇస్లాం స్వీకరించలేదు. అయినా ఈ సూరాను కంఠస్థం చేసుకున్నాను. ఆ తరువాత దేవుడు నాకు ఇస్లాం భాగ్యం కూడా ప్రసాదించాడు. ఇస్లాం స్వీకారం తరువాత కూడా నేను ఈ సూరాను పఠించాను (ముస్నదె అహ్మద్ – 4/335).

   హజ్రత్ ముఆజ్ (రజి) ఒకసారి మగ్రిబ్ నమాజులో అల్ బఖరా, నిసా సూరాలను పఠించారు. ఈ సంగతి దైవ ప్రవక్త(స)కు తెలిసినపుడు ఆయన, "నువ్వు ప్రజలను పరీక్షలకు లోను చేస్తున్నావా?" అంటూ ముఆజ్‌ను మందలించారు. "నువ్వు వస్సమాయి వత్తారిఖ్, వష్షమ్సి', మరలాంటి సూరాలే పఠిస్తే సరిపోతుంది కదా!" అని కూడా సూచించారు (నసాయి – కితాబుల్ ఇఫ్తితాహ్).

2. **'తారిఖ్'** (طَارِقٌ) అంటే ఏమిటో స్వయంగా ఖుర్ఆనే స్పష్టం చేసింది. తారిఖ్ అనేది అసలు 'తురూఖ్' నుంచి వచ్చింది. తురూఖ్ అంటే తలుపు తట్టడం. ఆ క్రమంలోనే రాత్రివేళ ఇంటికి వచ్చేవారిని 'తారిఖ్' అంటారు. నక్షత్రాలను కూడా 'తారిఖ్'గా అభివర్ణించటంలోని ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, అవి పగటివేళ కనుమరుగై పోయి, రాత్రివేళ మెరుస్తూ ప్రత్యక్షమవుతాయి.

**5** ఇక మానవుడు, తాను దేంతో పుట్టించబడ్డాడో చూసుకోవాలి.

فَلْيَنظُرِ الْإِنسَانُ مِمَّ خُلِقَ ⑤

**6** అతను ఎగిసిపడే నీటితో పుట్టించబడ్డాడు.[4]

خُلِقَ مِن مَّاءٍ دَافِقٍ ⑥

**7** అది వెన్నెముక, ఛాతీ భాగం మధ్య నుండి వెలువడుతుంది.[5]

يَخْرُجُ مِن بَيْنِ الصُّلْبِ وَالتَّرَائِبِ ⑦

**8** నిశ్చయంగా ఆయన, అతన్ని తిరిగి రప్పించుకునే శక్తిని కూడా కలిగి ఉన్నాడు.[6]

إِنَّهُ عَلَىٰ رَجْعِهِ لَقَادِرٌ ⑧

**9** ఆ రోజు లోగుట్టులన్నీ (రట్టయి) పరికించబడతాయి.[7]

يَوْمَ تُبْلَى السَّرَائِرُ ⑨

**10** అప్పుడు అతనికంటూ ఏ (అధికార) బలమూ ఉండదు. ఏ సహాయకుడూ ఉండడు.[8]

فَمَا لَهُ مِن قُوَّةٍ وَلَا نَاصِرٍ ⑩

**11** వర్షం గల ఆకాశం సాక్షిగా![9]

وَالسَّمَاءِ ذَاتِ الرَّجْعِ ⑪

3. ప్రతి ప్రాణి (మనిషి)పై దైవదూతలు నియమించబడి ఉన్నారు. వారు అతని సత్కర్మలతోపాటు దుష్కర్మలను కూడా నమోదు చేస్తూ ఉన్నారు. మరి కొంతమంది విద్వాంసుల ప్రకారం ఇక్కడ కనిపెట్టుకుని ఉండే దూతలంటే మనిషిని కాపాడే దూతలని అర్థం. ఉదాహరణకు: అర్రాద్ సూరా 11వ వచనం ప్రకారం మనిషిని కాపాడటానికి దేవుని తరఫున నియమితులైన దైవదూతలుంటారు. వారు మనిషిని ముందు వెనుకా అంటిపెట్టుకుని ఉంటారు.

4. అంటే – వీర్యంతో! రతిక్రీడ పరాకాష్ఠకు చేరినప్పుడు అది ఉధృతంగా – దుముకుతూ– వెలువడుతుంది. ఈ వీర్యకణమే స్త్రీ గర్భాశయంలోకి పోయి – దైవాదేశానుసారం – గర్భధారణకు కారకమవుతుంది.

5. పురుషుని వెన్నెముక నుండి, స్త్రీ ఛాతీభాగం నుంచి ఈ 'నీరు' ఉత్పన్నమవుతుందని అనబడుతోంది. వీరిరువురి నీళ్ళ మిశ్రమంతోనే మానవ సృష్టి ప్రక్రియ మొదలవుతుంది. అయితే దాన్ని ఒకే నీరుగా అభివర్ణించటంలోని ఆంతర్యం ఏమిటంటే అవి రెండూ ఏకమై ఒక్కటిగా అవుతాయి. **'తరాయిబ్'** అంటే కంఠహారం వ్రేలాడుతూ ఉండే (స్త్రీ) ఛాతీ భాగం.

6. అంటే మనిషి చచ్చిన తరువాత అతన్ని తిరిగి బ్రతికించే శక్తిని, అధికారాన్ని దేవుడు కలిగి ఉన్నాడు.

7. అంటే – అంతరంగాలలో దాగి ఉన్న రహస్య విషయాలన్నీ ఆ రోజు బహిర్గతం చేయబడతాయి. ఎందుకంటే వాటి ఆధారంగానే సత్కరించటమో లేక శిక్షించటమో చేయాల్సి ఉంటుంది. "దగా చేసిన ప్రతి వ్యక్తి వెనుక ఒక జెండా ఆనవాలుగా పాతబడుతుంది. వీడు ఫలానా ఫలానా దగుల్బాజీ పనులు చేశాడని ప్రకటించబడుతుంది" అని హదీసులో చెప్పబడింది (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిజ్‌యా; ముస్లిం – కితాబుల్ జిహాద్).

8. అంటే – ఆనాడు మనిషి వద్ద దైవశిక్ష నుండి తప్పించుకునే అధికారం ఉండదు. దైవాగ్రహం నుండి అతన్ని కాపాడేవాడు కూడా ఎవడూ ఉండడు.

9. **'రజ్‌వున్'** (رَجْع) అంటే తిరిగి రావటం, మరలటం అని అసలు అర్థం. వర్షం కూడా మళ్లీ మళ్లీ వస్తూ ఉంటుంది. అందుకే వర్షాన్ని 'రజ్‌వున్'గా పేర్కొనటం జరిగింది. మరి కొంతమంది చెప్పేదేమంటే; మేఘాలు సముద్రం నుండే నీటిని గ్రహించి, దాన్ని భూభాగంపై కురిపిస్తాయి. అందుచేత వర్షాన్ని 'రజ్‌వున్'గా అభివర్ణించటం జరిగింది. వర్షం మాటిమాటికీ కురుస్తూ ఉండాలన్న అభిలాషతో అరబ్బులు వర్షాన్ని 'రజ్‌వున్'గా పిలిచారని మరికొందరు వ్యాఖ్యానించారు (ఫత్‌హుల్ ఖదీర్).

| | |
|---|---|
| 12 బీటలు వారే భూమి సాక్షిగా![10] | وَالْاَرْضِ ذَاتِ الصَّدْعِ ﴿12﴾ |
| 13 నిశ్చయంగా ఇది (ఈ ఖుర్ఆన్) నిర్ణాయకమైన వాక్కు.[11] | اِنَّهٗ لَقَوْلٌ فَصْلٌ ﴿13﴾ |
| 14 ఇదేదో ఆషామాషీ విషయం కాదు.[12] | وَّمَا هُوَ بِالْهَزْلِ ﴿14﴾ |
| 15 వీళ్లు (ఈ అవిశ్వాసులు) కొన్ని పన్నాగాలు పన్నుతున్నారు.[13] | اِنَّهُمْ يَكِيْدُوْنَ كَيْدًا ﴿15﴾ |
| 16 నేను కూడా ఒక పన్నాగం పన్నుతున్నాను.[14] | وَّاَكِيْدُ كَيْدًا ﴿16﴾ |
| 17 కాబట్టి (ఓ ప్రవక్తా!) నువ్వు అవిశ్వాసులకు కాస్త విడుపు ఇవ్వు.[15] కొన్నాళ్ల పాటు వారిని వదలిపెట్టు. | فَمَهِّلِ الْكٰفِرِيْنَ اَمْهِلْهُمْ رُوَيْدًا ﴿17﴾ |

10. అంటే – నేల నుండి మొక్కలు మొలకెత్తేటప్పుడు నేల నెర్రకొడుతుంది. లేక భూమి చీలుతుంది. అలాగే భూమి చీలినపుడే దానిలోపల నుంచి నీటి ఊటలు చిమ్ముకు వస్తాయి. అలాగే ఒక రోజు రానున్నది. ఆ రోజు భూమి బ్రద్దలవుతుంది. అప్పుడు భూగర్భంలో ఉన్న మృతులంతా సజీవులై లేచివస్తారు. అందుకే భూమిని బీటలు వారేదిగా, నెర్రకొట్టేదిగా వ్యవహరించటం జరిగింది.

11. వెనుకటి రెండు ఆయతులలో ఆకాశాన్ని, భూమిని సాక్ష్యంగా పెట్టి ఈ ఆయతులో ఒక ముఖ్య విషయం చెప్పబడింది. అదేమంటే ఈ ఖుర్ఆన్ గ్రంథం విషయాన్ని ఎంతో నిర్దిష్టంగా, ఖచ్చితంగా విడమరచి చెబుతుంది. దీనిమూలంగా సత్యం నుండి అసత్యం, ధర్మం నుండి అధర్మం, మేలిమి నుండి కల్తీ వేరైపోతాయి.

12. అంటే ఇదేదో నవ్వులాట కోసం వచ్చిన వస్తువు కాదు. క్రీడా వస్తువు అంతకన్నా కాదు. కాలక్షేపం కోసం చెప్పబడే కబురు అసలే కాదు. ఇదొక మహదాశయంతో వచ్చిన స్పష్టమైన గ్రంథం.

13. అంటే – అంతిమ దైవప్రవక్త (సఅసం) తెచ్చిన సత్యధర్మాన్ని విఫలం చేయటానికి వాళ్లు కుట్ర పన్నుతున్నారు. లేదా వారు దైవప్రవక్త (సఅసం)ను మోసగించేందుకు ఎత్తుగడ వేస్తున్నారు. మనసులో లేని విషయాన్ని నోటితో పలుకుతున్నారు.

14. వారి కుట్రలు, కుతంత్రాలు నాకు తెలియకుండా లేవు. నేను కూడా వారి కుతంత్రాలకు విరుగుడుగా నా వ్యూహాన్ని రచిస్తున్నాను. **'కైద్'** (**كَيْدٌ**) అంటే రహస్యంగా పన్నే ఉపాయం, వ్యూహం, ఎత్తుగడ అని అర్థం. అది మంచి ఉద్దేశంతో జరిగితే మంచిదే. చెడు ఉద్దేశంతో జరిగినప్పుడు అది మాయోపాయం, కుట్ర, కుతంత్రం, పన్నాగం, వెన్నుపోటు అనిపించుకుంటుంది.

15. అంటే (ఓ ముహమ్మద్ –సఅసం!) వారిని శిక్షించమని తొందరపెట్టకు. పైగా వారికి తగినంత వ్యవధిని ఇవ్వు. ఈ గడువు లేక విడుపు కూడా దైవవిరోధుల పాలిట ఒక లాంటి వ్యూహరచనే. ఉదాహరణకు ఈ ఆయతులను గమనించండి. "మేము వారిని క్రమేణా – వారికి ఏమాత్రం తెలియకుండానే – వినాశం వైపుకు తీసుకుపోతున్నాము. నేను వారికి విడుపును ఇస్తున్నాను. నా వ్యూహం తిరుగులేనిది." (అల్ ఆరాఫ్ – 182, 183).

87 వ సూరా

# అల్ ఆలా

## సర్వోన్నతుడు

అవతరణ మక్కాలో

ఆయతులు 19

### పరిచయం

ఇది ముఖ్యంగా ఏకదైవారాధన గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన 'ఆలా' (సర్వోన్నతుడు) అన్న పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. దేవుని ఏకత్వం, ఆయనకున్న విశిష్టమైన సృష్టిసామర్థ్యాలను ఈ సూరా ప్రధానంగా వివరించింది. ప్రజలు హితబోధను అనుసరించాలని, అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయన కారుణ్యాన్ని, ఆయన అనుగ్రహాలను, ఆయన ఆగ్రహాన్ని, శిక్షాబహుమానాలను ఇతరులకు గుర్తుచేయాలని ఈ సూరా బోధించింది. మానవులు ఇహలోక జీవితం పట్ల వ్యామోహం పెంచుకున్నారని, కాని నిజానికి మనిషికి పరలోక జీవితమే లక్ష్యం కావాలని, పరలోక జీవితం ఇంత కన్నా ఉన్నతమైనదని, శాశ్వతమైనదని ఈ సూరా ప్రబోధించింది.

### అల్ ఆలా[1] సూరా

سُوْرَةُ الْاَعْلٰى

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 (ఓ ప్రవక్తా!) సర్వోన్నతుడైన నీ ప్రభువు నామం యొక్క పవిత్రతను కొనియాడు.[2]

سَبِّحِ اسْمَ رَبِّكَ الْاَعْلَى ①

2 ఆయనే సృష్టించాడు, మరి ఆపైన తీర్చిదిద్దాడు.[3]

الَّذِيْ خَلَقَ فَسَوّٰى ②

3 ఆయనే (కావలసిన వాటిని తగురీతిలో) నిర్ధారించాడు. పిదప మార్గం చూపించాడు.[4]

وَالَّذِيْ قَدَّرَ فَهَدٰى ③

1. దైవప్రవక్త (సఅసం) సాధారణంగా జుమా నమాజులోనూ, పండుగల నమాజుల్లోనూ ఈ సూరాను, అల్ గాషియా సూరాను పారాయణం చేసేవారు. అలాగే విత్ర్ నమాజులోని మొదటి రకాత్‌లో కూడా అల్ ఆలా సూరాను పఠించేవారు. రెండవ రకాతులో కాఫిరూన్ సూరా, మూడవ రకాతులో ఇఖ్లాస్ సూరాను సాధారణంగా పఠించేవారు. హజ్రత్ ముఆజ్ (రజి) నమాజులో సుదీర్ఘమైన సూరాలు చదువుతున్నారని ఫిర్యాదు వచ్చినప్పుడు దైవప్రవక్త (స) ఆయనగారికి ఫలానా ఫలానా సూరాలు చదివితే సరిపోతుందని సూచించారు. ఆ సూరాల జాబితాలో ఈ సూరా కూడా ఉంది (సహీహ్ హదీసులలో ఈ వివరాలున్నాయి).
2. అంటే అల్లాహ్ ఔన్నత్యానికి శోభించే విధంగా ఆయన్ని స్తుతించాలి. ఈ సూరాలోని ఈ వాక్యం వచ్చినప్పుడల్లా దైవప్రవక్త (సఅసం), **"సుబ్‌హాన రబ్బియల్ ఆలా"** అనేవారని హదీసు ద్వారా తెలుస్తోంది. (ముస్నదె అహ్మద్ – 1/232; అబూ దావూద్ – కితాబుస్సలాత్; అల్‌బానీ ఈ హదీసును ప్రామాణికమైన హదీసుగా పేర్కొన్నారు.)
3. దీని వివరాల కోసం ఇన్‌ఫితార్ (82వ) సూరా 7వ ఆయతుకు ఇవ్వబడిన పాదసూచికలను చూడండి.
4. అంటే, మంచీ – చెడులనే రెండు మార్గాలను మనుషుల ముందుంచాడు. అలాగే జీవనావసరాలను సమకూర్చాడు. ఈ మార్గదర్శకత్వం పశువులకు కూడా చేయబడింది. ఆహార వస్తువులను ప్రసాదించటంతోపాటు, ఆ వస్తువుల గుణాలను, వాటి లాభనష్టాలను కూడా మనిషికి ఎరుకపరిచాడు. మనిషి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నదే దీని అసలు ఉద్దేశం.

4 మరి ఆయనే పచ్చిక బయళ్లను ఉత్పన్నం చేశాడు.[5] وَالَّذِيْٓ اَخْرَجَ الْمَرْعٰى ۝4

5 ఆపైన వాటిని నల్లని చెత్తకుప్పగా చేసేశాడు.[6] فَجَعَلَهٗ غُثَاۗءً اَحْوٰى ۝5

6 మేము నిన్ను చదివిస్తాము–మరి నువ్వు దానిని మరువలేవు.[7] سَنُقْرِئُكَ فَلَا تَنْسٰٓى ۝6

7 అయితే అల్లాహ్ తలచినది మాత్రం (మరువగలవు). ఆయన బహిర్గతమయ్యే దానినీ, గోప్యంగా ఉన్నదానినీ ఎరిగినవాడు.[8] اِلَّا مَا شَاۗءَ اللّٰهُ ۭ اِنَّهٗ يَعْلَمُ الْجَهْرَ وَمَا يَخْفٰى ۝7

8 (ఓ ముహమ్మద్ – స!) మేము నీకు సౌలభ్యాన్ని సమకూరుస్తాము.[9] وَنُيَسِّرُكَ لِلْيُسْرٰى ۝8

9 కనుక నీవు ఉపదేశం లాభదాయకం అయితే, ఉపదేశిస్తూ ఉండు.[10] فَذَكِّرْ اِنْ نَّفَعَتِ الذِّكْرٰى ۝9

10 (అల్లాహ్ పట్ల) భయమున్నవాడు ఉపదేశాన్ని గ్రహిస్తాడు.[11] سَيَذَّكَّرُ مَنْ يَّخْشٰى ۝10

5. వాటిని పశువులు మేస్తాయి.

6. ఎండిపోయిన గడ్డిని **'ఘుసాఅన్'** ( غُثَاۗءً ) గా వ్యవహరిస్తారు. **'అహ్వా'** (اَحوٰی) అంటే నల్లగా మార్చేయటం. ఒకప్పుడు పచ్చగా నవనవలాడుతూ ఉండే గడ్డిని మేము తరువాత చెత్తాచెదారంగానూ, కసువుగానూ మార్చేస్తాము అని భావం.

7. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవవాణిని తీసుకుని వచ్చినప్పుడు మహాప్రవక్త (సఅసం) దాన్ని కంఠస్తం చేసుకునేందుకు తొందరపడేవారు. దైవవాణి (ఖుర్ఆన్)ని మరచిపోతానేమోనన్న భయం ఆయనకు ఉండేది. దానికోసం కంగారు పడాల్సిన అవసరం లేదని, తాను అవతరింపజేసిన వాణి (వహీ)ని చదివింపజేసి, దాన్ని జ్ఞాపకం ఉంచేలా చేసే బాధ్యత తనదని దేవుడు ఈ వాక్యంలో తన ప్రవక్తకు అభయం ఇచ్చాడు. ఒకవేళ అల్లాహ్ ఏ విషయాన్నయినా మరపింపజేయదలచుకుంటే అది వేరే విషయం. కాని అలా జరగలేదు కూడా. తనపై అవతరింపజేయబడిన ఖుర్ఆన్ గ్రంథం దైవప్రవక్త (సఅసం)కు ఆసాంతం కంఠస్థం అయింది. అయితే ఖుర్ఆన్ గ్రంథంలో – దేవుడు రద్దు పరచదలచిన ఆయతులను మరపింపజేస్తాడని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు (ఫత్హుల్ ఖదీర్).

8. అంటే – ఖుర్ఆన్ భాగాలలో నీవు బిగ్గరగా పలికేదీ, లోలోపల పలికేదీ, అందరికీ తెలిసేవిధంగా ఆచరించేదీ, గోప్యంగా ఆచరించేదీ – అంతా అల్లాహ్‌కు తెలుసు. ఆయన నుండి ఏ విషయం కూడా దాగిలేదు.

9. అంటే – దివ్య ఖుర్ఆన్ కంఠపాఠాన్ని, దాని ప్రకారం ఆచరించటాన్ని నీకు సులభతరం చేస్తాము. ఖుర్ఆన్ చూపే మార్గంలో పురోగమించటాన్ని కూడా మేము క్రమేణా సులభతరం చేస్తాము. స్వర్గానికి పోయే మార్గాన్ని మేము నీకు సులువు చేస్తాము. శుభాలతో నిండిన ఉపదేశాలను, కర్మలను మేము నీ కొరకు తేలిక చేస్తాము. మేము నీ కొరకు ఆమోదించే ధర్మశాస్త్రాన్ని (షరీయతు) కూడా ఎంతో సరళమైనదిగా, స్థిరమైనదిగా, అనువైనదిగా, సమతూకంతో కూడుకున్నదిగా చేస్తాము. అందులో ఎలాంటి వక్రతగానీ, ఆటంకంగానీ, అపసవ్యతగానీ, ఇబ్బందిగానీ ఉండదు.

10. ఎవరికయినా హితబోధ ప్రయోజనకరం అవుతుందనుకుంటేనే హితబోధ చేయి. హితబోధకు, శిక్షణకు సంబంధించిన ఒక సూత్రం ఈ ఆయతు ద్వారా విశదీకరించబడింది (ఇబ్నె కసీర్). ఇమామ్ షౌకానీ దీనిని ఈ భావంలో తీసుకున్నారు: ప్రవక్తా! మీరు హితబోధ చేస్తూ ఉండండి. అది ప్రయోజనదాయకం అయినా కాకపోయినా సరే; మీరు మాత్రం తప్పనిసరిగా సందేశాన్ని అందజేస్తూ ఉండాల్సిందే.

**11** దౌర్భాగ్యుడు మాత్రమే దాన్ని దాట వేస్తాడు.[12]

وَيَتَجَنَّبُهَا الْأَشْقَى ﴿11﴾

**12** వాడు పెద్ద (ఘోరమైన) అగ్నిలోకి ప్రవేశిస్తాడు.

الَّذِي يَصْلَى النَّارَ الْكُبْرَى ﴿12﴾

**13** వాడందులో చావనయినా చావడు, బ్రతకనయినా బ్రతకడు.[13] (రెంటికీ మధ్య దుర్భరస్థితిలో ఉంటాడు).

ثُمَّ لَا يَمُوتُ فِيهَا وَلَا يَحْيَى ﴿13﴾

**14** పవిత్రుడైనవాడు ఖచ్చితంగా సాఫల్యం పొందాడు.[14]

قَدْ أَفْلَحَ مَنْ تَزَكَّى ﴿14﴾

**15** అతను తన ప్రభువు నామాన్ని స్మరించాడు. నమాజు ఆచరించాడు.

وَذَكَرَ اسْمَ رَبِّهِ فَصَلَّى ﴿15﴾

**16** కాని మీరు మాత్రం ప్రాపంచిక జీవితానికే ప్రాముఖ్య మిస్తున్నారు.

بَلْ تُؤْثِرُونَ الْحَيٰوةَ الدُّنْيَا ﴿16﴾

**17** వాస్తవానికి పరలోకం ఎంతో మేలైనది, ఎప్పటికీ మిగిలి వుండేది.[15]

وَالْآخِرَةُ خَيْرٌ وَأَبْقَى ﴿17﴾

**18** ఈ విషయాలు మునుపటి గ్రంథాలలోనూ ఉన్నాయి.

إِنَّ هٰذَا لَفِي الصُّحُفِ الْأُولَى ﴿18﴾

**19** (అంటే) ఇబ్రాహీము, మూసాల గ్రంథాలలో!

صُحُفِ إِبْرٰهِيمَ وَمُوسَى ﴿19﴾

---

11. మనసులో దైవభీతిగలవారు, తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలన్న తపనగలవారు నీ ఉపదేశం ద్వారా తప్పకుండా లబ్ది పొందుతారు. అలాంటివారి విశ్వాసం నీ బోధ మూలంగా మరింత దృఢతరం అవుతుంది.

12. నీ ఉపదేశాలు వారి బుర్రకెక్కవు. ఎందుకంటే దైవధిక్కార వైఖరిపై పాతుకుపోయిన కారణంగా, నిరంతరం పాపాలు చేస్తూ ఉండటం వల్ల వారి హృదయాలకు తుప్పు పట్టింది. వారి మేధ ముకుళించుకుపోయింది.

13. నరకానికి ఆహుతి అయ్యే వారిలో కొందరు శాశ్వతంగా నరకయాతనను అనుభవిస్తారు. మరికొందరి వ్యవహారం తద్భిన్నంగా ఉంటుంది. వారు నరకంలో కొంతకాలం మాత్రమే ఉంచబడతారు. దేవుడు వారికి ఒకలాంటి చావును కూడా ఇస్తాడు. వారు అగ్నిలో మాడి బొగ్గులా తయారవుతారు. ఆ తరువాత దేవుడు తన ప్రవక్తల సిఫారసుపై వారిని వర్గాలుగా, సమూహాలుగా బయటికి తీస్తాడు. వారంతా స్వర్గకాలువలో ముంచబడతారు. స్వర్గవాసులు కూడా వారిపై నీళ్ళు కుమ్మరిస్తారు. ఆ విధంగా వారు సజీవులవుతారు – వరద వెల్లువలో కొట్టుకువచ్చిన చెత్తకుప్పపై మొలకెత్తిన విత్తనం మాదిరిగా! (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

14. తమ ఆంతర్యాన్ని నైతికపు రుగ్మతల నుండి, పాపిష్టికరమైన ఆలోచనల నుండి, బహుదైవోపాసనా కాలుష్యం నుండి రక్షించుకుని ఏకాగ్రతతో నిజప్రభువు మార్గాన్ని అవలంబించినవారు, దైవదాస్యమే జీవిత పరమావధిగా భావించినవారు నిశ్చయంగా కృతార్థులవుతారు. వారి జీవితం ధన్యమవుతుంది.

15. ఎందుకంటే ప్రాపంచిక జీవితం క్షణభంగురం. పరలోకం శాశ్వతం. విజ్ఞుడైనవాడు తాత్కాలిక వస్తువుకు బదులు శాశ్వత వస్తువునే కోరుకుంటాడు.

88వ సూరా

# అల్ గాషియహ్

## క్రమ్ముకొనే ఆపద

అవతరణ మక్కాలో

ఆయతులు 26

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, తీర్పుదినాల గురించి ప్రస్తావించింది. ఈ సూరా మొదటి ఆయతులో వచ్చిన పదాలనే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరాలో తీర్పుదినం గురించి వివరాలు ఇవ్వబడ్డాయి. ఆనాటి భయానక పరిస్థితులలో ప్రజలు దిక్కుతోచని రీతిలో ఉంటారు. ఈ సూరాలో దుర్మార్గునికి, సన్మార్గునికి మధ్య భేదాన్ని గురించి సోదాహరణంగా వివరించడం జరిగింది. అవిశ్వాసులు భగభగలాడే అగ్నిలోకి ప్రవేశిస్తారు. తీవ్రమైన పరాభవానికి గురవుతారు. వారి ముఖాలు క్రిందికి వేలాడు తుంటాయి. వారికి సలసల కాగే నీరు తాగడానికి ఇవ్వబడుతుంది. ఎండిన ముళ్ళగడ్డి తినడానికి ఇవ్వబడుతుంది. దాని వల్ల బలమూ లభించదూ, ఆకలీ తీరదు. కాగా; విశ్వాసులు శాశ్వత స్వర్గవనాలు పొంది ఆనందిస్తారు. ఈ సూరాలో అల్లాహ్‌కు గల విశిష్టమైన సృష్టి సామర్థ్యాన్ని వివరించడం జరిగింది. సత్యానికి దూరంగా పోయినవారు, అల్లాహ్‌ను తిరస్కరించినవారు అద్భుతమైన ఒంటెలను, ఆకాశాన్ని, పర్వతాలను, భూమిని ఆయన ఎలా సృష్టించినదీ చూడాలని ఉద్బోధించబడింది.

### అల్ గాషియహ్[1] సూరా — سُورَةُ الغَاشِيَةِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం — بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

1 క్రమ్ముకునే ఆపద సంగతిగాని నీకు చేరిందా?[2] — هَلۡ أَتَىٰكَ حَدِيثُ ٱلۡغَٰشِيَةِ ﴿١﴾

2 ఆ రోజు ఎన్నో ముఖాలు అవమానంతో పాలిపోయి ఉంటాయి.[3] — وُجُوهٞ يَوۡمَئِذٍ خَٰشِعَةٌ ﴿٢﴾

3 శ్రమిస్తూ, అలసి సొలసి ఉంటాయి.[4] — عَامِلَةٞ نَّاصِبَةٞ ﴿٣﴾

1. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుమా నమాజు సందర్భంగా జుమా సూరాతోపాటు అల్ గాషియహ్ సూరా కూడా పారాయణం చేసేవారు. (ముఅత్తా ఇమామ్ మాలిక్)
2. **గాషియహ్** (ఆవరించేది) అంటే ప్రళయం అని భావం. దాని భీతావహస్థితి ప్రాణులందరిపై క్రమ్ముకుంటుంది.
3. అంటే అవిశ్వాసుల, అవిధేయుల ముఖాలన్నమాట. పరాభవంతో వారి తలలు క్రిందికి వంగిపోయి ఉంటాయి. ముఖాలపై ఏమాత్రం కళ ఉండదు సరికదా ఉదాసీనత ఆవరించి ఉంటుంది.
4. **'నాసిబతున్'** అంటే అలసటతో ఢీలా పడిపోవటం అని అర్థం. ఆనాటి పరిశ్రమ ఎంత తీవ్రమైనదంటే, దాని ధాటికి వారు కోలుకోలేనంతగా అలసిపోతారు.

   మరొక అర్థం ప్రకారం వారు ప్రపంచంలో ఎంతో శ్రమించారు. ఎన్నో కర్మలు చేసుకున్నారు. కాని వారు అవలంబించిన మతం మిథ్య కావటం వల్ల వారు చేసిన కర్మలు వ్యర్థమైపోతాయి. చివరకు వారు నరకాగ్నికి ఆహుతి కావలసివస్తుంది. ఈ భావార్థం ప్రకారం ఈ వాక్యం క్రైస్తవుల నేపథ్యంలో అనబడిందని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) భావించారు (సహీహ్ బుఖారీ – అల్ గాషియహ్ సూరా తాత్పర్యం).

**4** వారు మండే అగ్నికి ఆహుతి అవుతారు.
تَصْلَىٰ نَارًا حَامِيَةً ﴿4﴾

**5** వారికి ఉడికే చెలమ నీరు త్రాగించబడుతుంది.[5]
تُسْقَىٰ مِنْ عَيْنٍ آنِيَةٍ ﴿5﴾

**6** వారికి తినడానికి ముండ్ల చెట్టు తప్ప వేరొకటి ఆహారంగా దొరకదు.[6]
لَّيْسَ لَهُمْ طَعَامٌ إِلَّا مِن ضَرِيعٍ ﴿6﴾

**7** అది వారిని లావుగానూ చేయదు, వారి ఆకలిని కూడా తీర్చదు.
لَّا يُسْمِنُ وَلَا يُغْنِي مِن جُوعٍ ﴿7﴾

**8** మరెన్నో ముఖాలు ఆనాడు నవనవలాడుతూ ఉంటాయి.
وُجُوهٌ يَوْمَئِذٍ نَّاعِمَةٌ ﴿8﴾

**9** వారు తమ కృషిపై సంతోషంతో ఉంటారు,
لِّسَعْيِهَا رَاضِيَةٌ ﴿9﴾

**10** ఉన్నతమైన స్వర్గంలో ఉంటారు.
فِي جَنَّةٍ عَالِيَةٍ ﴿10﴾

**11** వారక్కడ ఎలాంటి అపసవ్యమైన మాట వినరు.
لَّا تَسْمَعُ فِيهَا لَاغِيَةً ﴿11﴾

**12** అందులో (అద్భుతంగా) ప్రవహించే ఒక సెలయేరు ఉంటుంది.
فِيهَا عَيْنٌ جَارِيَةٌ ﴿12﴾

**13** (ఇంకా) అందులో (రాజసం ఉట్టిపడే) ఎత్తయిన పీఠాలు వేయబడి ఉంటాయి.
فِيهَا سُرُرٌ مَّرْفُوعَةٌ ﴿13﴾

**14** వారికెదురుగా (మధు) పాత్రలు పేర్చబడి ఉంటాయి.
وَأَكْوَابٌ مَّوْضُوعَةٌ ﴿14﴾

**15** వరుసగా వేయబడిన దిండ్లు ఉంటాయి.
وَنَمَارِقُ مَصْفُوفَةٌ ﴿15﴾

**16** అన్ని వైపులా పట్టు తివాచీలు పరచబడి ఉంటాయి.[7]
وَزَرَابِيُّ مَبْثُوثَةٌ ﴿16﴾

---

5. **'ఉడికే నీరు'** అంటే అత్యంత వేడి నీరు అన్నమాట (ఫత్‌హుల్ ఖదీర్).

6. ఇదొక రకమైన ముండ్ల వృక్షం. ఇది ఎండిపోయినప్పుడు దీని ఆకులను తినడానికి పశువులు సయితం ఇష్టపడవు. ఇది కూడా జెముడు వృక్షంలాగా ఎంతో చేదుగా, చెండాలంగా ఉంటుంది. దానివల్ల శరీరానికి బలం ఎలాగూ చేకూరదు. పోనీ, ఆకలిబాధ అన్నా తీరుతుందా అంటే అదీ జరగదు.

7. ఇక స్వర్గవాసుల పరిస్థితి! వారు నరకవాసులకు భిన్నంగా ఎంతో హాయిగా, ఆనందంగా, భోగభాగ్యాలను ఆస్వాదిస్తూ ఉంటారు. **'ఐనున్'** (ఊట) అనేది మచ్చుకు ఒకటి చెప్పబడింది. నిజానికి అలాంటి ఊటలు లెక్కకు మించినవి ఉంటాయి. అక్కడ పరచబడిన తివాచీలుగానీ, వేయబడిన ఆసనాలుగానీ, పేర్చబడిన మధు పాత్రలుగానీ – అవన్నీ స్వర్గవాసుల భోగభాగ్యాలకు దర్పణం వంటివి.
**'నమారిఖు'** ( نَمَارِقُ ) అంటే దిండ్లు; **జరాబియ్యు** ( زَرَابِيُّ ) అంటే తివాచీలు, పరుపులు; **'మబ్సూసహ్'** (مَبْثُوثَةٌ) అంటే పరచబడి ఉన్నవి అని అర్థం.

**17** ఏమిటి, ఒంటెలు ఎలా సృష్టించబడ్డాయో వారు చూడటం లేదా?[8]

أَفَلَا يَنظُرُونَ إِلَى الْإِبِلِ كَيْفَ خُلِقَتْ ﴿17﴾

**18** ఆకాశం ఎలా ఎత్తుగా చేయబడిందో వారు గమనించటం లేదా?[9]

وَإِلَى السَّمَاءِ كَيْفَ رُفِعَتْ ﴿18﴾

**19** పర్వతాలు ఎలా పాతిపెట్టబడ్డాయో తిలకించటం లేదా?[10]

وَإِلَى الْجِبَالِ كَيْفَ نُصِبَتْ ﴿19﴾

**20** భూమి ఎలా (విశాలంగా) పరచబడి ఉన్నదో వారు వీక్షించటం లేదా?[11]

وَإِلَى الْأَرْضِ كَيْفَ سُطِحَتْ ﴿20﴾

**21** కనుక (ఓ ప్రవక్తా!) నీవు మాత్రం బోధపరుస్తూ ఉండు. నీవు హితబోధ చేసేవాడివి మాత్రమే.[12]

فَذَكِّرْ إِنَّمَا أَنتَ مُذَكِّرٌ ﴿21﴾

**22** నీవు వారిపై కావలివాడవు కావు.[13]

لَّسْتَ عَلَيْهِم بِمُصَيْطِرٍ ﴿22﴾

**23** అయితే విముఖత చూపి, తిరస్కరించినవాణ్ణి,

إِلَّا مَن تَوَلَّىٰ وَكَفَرَ ﴿23﴾

**24** అల్లాహ్ అతనికి చాలాపెద్ద శిక్ష విధిస్తాడు.[14]

فَيُعَذِّبُهُ اللَّهُ الْعَذَابَ الْأَكْبَرَ ﴿24﴾

8. ఒంటె అరేబియాలో సుప్రసిద్ధ పశువు–అది వారి 'ఎడారి ఓడ.' దానిపై వారు సుదీర్ఘ ప్రయాణాలు చేస్తారు. అందుకే దేవుడు ఇక్కడ ఒంటెను ప్రస్తావించి దాని సృష్టిపై యోచన చెయ్యమని పిలుపు ఇచ్చాడు. చూడండి! దేవుడు మీకు ఎంత గొప్ప 'ఉనికి' ని స్వాధీనం చేశాడో! ఆ జంతువులో ఉన్న అసాధారణ శక్తిని గురించి ఆలోచించారా? అయినా అది మీకు లోబడి, మీరు చెప్పినట్లు చేస్తుంది. తనపై ఎంతబరువు మోపినా మోస్తుంది. ఎంతసేపు నడిపించినా అలసిపోకుండా నడుస్తుంది. మీ సేవలో అది నిరంతరం నిమగ్నమై ఉంటుంది. మీరు దాన్ని కోసి, దాని మాంసాన్ని భుజిస్తారు. దాని పాలు తాగుతారు. దాని రోమాలతో దుప్పట్లవంటివి తయారుచేసి చలికాలంలో ఉపయోగిస్తారు. ఇన్ని రకాలుగా మీకు ఉపయోగపడుతున్న ఒంటె నిర్మాణంపై మీరెన్నడైనా ఆలోచించారా? దాని నిర్మాత గురించి చింతన చేశారా?

9. ఆకాశం ఎంత ఎత్తుగా ఉందో చూడండి! 500 సంవత్సరాలు ప్రయాణించినా అందుకోజాలని ఎత్తు ఉన్న ఆకాశం ఎలాంటి స్థంభం కూడా లేకుండా నిలబడి ఉంది. మరి ఈ గగన మండలంలో ఎలాంటి అవరోధంగానీ, వక్రతగానీ కనిపించదు. పైగా మేము దాన్ని నక్షత్రాలతో ముస్తాబు చేశాము.

10. భూమి కదలకుండా స్థిరంగా ఉండేందుకుగాను మేము ఏ విధంగా అందులో పర్వతాలను – మేకులుగా – పాతిపెట్టామో మీరు చూడటం లేదా? మరి ఆ భూమిలోపల ఉన్న ఖనిజ సంపద ద్వారా, చమురు సంపద ద్వారా మీరు పొందుతున్న ప్రయోజనం కూడా గమనించదగినదే కదా!

11. అంటే ఏ విధంగా నేల విస్తృతంగా పరచబడిందో, మరి ఏ విధంగా మీ మనుగడకు అనుకూలంగా చేయబడిందో ఆలోచించండి! దానిపై మీరు ప్రయాణిస్తున్నారు. నిర్మాణాలు చేపడుతున్నారు. వ్యవసాయం, వర్తకం చేస్తున్నారు.

12. అంటే, ఉపదేశించటం, ధర్మప్రచారం చేయటం వరకే నీ పని. అంతకుమించి నీ మీద వేరే బాధ్యత లేదు.

13. వారిని బలవంతంగా లాక్కుని వచ్చి ఇస్లాంలో చేర్చటం నీ పనికాదు. ఈ ఆయతు హిజ్రత్‌కు పూర్వం అవతరించినదని, హిజ్రత్ తరువాత ఈ ఆదేశం రద్దు పరచబడినదని కొంతమంది భావిస్తున్నారు.

| | |
|---|---|
| 25 ఎట్టి పరిస్థితిలోనూ వారు మా వద్దకే తిరిగి రావలసి ఉన్నది. | إِنَّ إِلَيْنَآ إِيَابَهُمْ ﴿25﴾ |
| 26 మరి వారి నుండి లెక్క తీసుకునే బాధ్యత మాపైనే ఉంది.[15] | ثُمَّ إِنَّ عَلَيْنَا حِسَابَهُم ﴿26﴾ |

14. అంటే – శాశ్వతమైన నరక యాతనకు గురిచేస్తాడు.
15. దీనికి సమాధానంగా **"అల్లాహుమ్మ! హాసిబ్నా హిసాబన్ య్యసీరా"** (ఓ అల్లాహ్! మా నుండి తేలికపాటి లెక్క తీసుకో) అనే దుఆను పఠించాలని చెబుతారు. మహాప్రవక్త (సఅసం) కొన్ని కొన్ని నమాజులలో ఈ దుఆ చేసేవారని కూడా ఇంతకుముందు ఇన్‌షిఖాఖ్ సూరాలో వచ్చింది. కాని ఆయన (సఅసం) ప్రత్యేకంగా ఈ ఆయతుకు జవాబుగా పఠించినట్లు మాత్రం రూఢీ కాలేదు.

89 వ సూరా

# అల్ ఫ(జ్

## ఉషోదయం

అవతరణ మక్కాలో

ఆయతులు 30

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. తీర్పుదినపు భయానక పరిస్థితులను ఈ సూరా వర్ణించింది. ఆ రోజున భూమి పూర్తిగా చదును చేయబడుతుంది. పంక్తులు తీరిన దైవదూతలతో అల్లాహ్ ప్రత్యక్షమవుతాడు. నరకం తీసుకురాబడుతుంది. గుణపాఠం గ్రహించడానికి గాను ఈ సూరాలో గతకాలాలకు చెందిన మూడు జాతుల ప్రస్తావన వచ్చింది. ఆద్‌జాతి, సమూద్ జాతి, ఫిర్‌ఔన్ జాతిప్రజల గురించి వివరిస్తూ, వారు సత్యాన్ని తిరస్కరించినందుకుగాను, అల్లాహ్‌ను కాదన్నందుకు గాను తీవ్రంగా శిక్షించబడిన వైనాన్ని తెలియజేసింది. ఈ సూరాలో అనేక నైతిక ప్రమాణాలను కూడా బోధించడం జరిగింది.

| అల్ ఫ(జ్ సూరా | سُورَةُ الْفَجْرِ |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| 1 ఉషోదయం సాక్షిగా![1] | وَالْفَجْرِ ﴿1﴾ |
| 2 పది రాత్రుల సాక్షిగా![2] | وَلَيَالٍ عَشْرٍ ﴿2﴾ |

1. ఇక్కడ **'ఉషోదయం'** (ఫ(జ్) అంటే అర్థం సాధారణ ఉదయమే. ఏదో ఒక ప్రత్యేక దినానికి చెందిన ఉదయం కాదు.
2. **'పది రాత్రులు'** అంటే జుల్‌హిజ్జ నెలలోని మొదటి పది రాత్రులని అత్యధిక మంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. హదీసుల ద్వారా కూడా ఈ పదిరాత్రుల ప్రాముఖ్యం విదితమవుతోంది. "జుల్‌హిజ్జ నెలలోని ప్రథమ దశకంలో చేసిన పుణ్యకార్యాలు అల్లాహ్‌కు అన్నిటికన్నా ఎక్కువ ప్రియమైనవి. ఆఖరికి దైవమార్గంలో

3 సరి, బేసి (సంఖ్య)ల సాక్షిగా![3]
وَالشَّفْعِ وَالْوَتْرِ ﴿3﴾

4 గడచిపోతున్నప్పటి రాత్రి సాక్షిగా![4]
وَاللَّيْلِ إِذَا يَسْرِ ﴿4﴾

5 ఏమిటి, బుద్ధిజ్ఞానం కలవానికి ఇందులోని ప్రమాణాలు చాలవా?[5]
هَلْ فِي ذَٰلِكَ قَسَمٌ لِّذِي حِجْرٍ ﴿5﴾

6 నీ ప్రభువు ఆద్ జాతివారి పట్ల ఎలా వ్యవహరించాడో నీవు చూడలేదా?[6]
أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِعَادٍ ﴿6﴾

7 ఎత్తయిన స్తంభాల వారైన 'ఇరము' పట్ల[7] (నీ ప్రభువు చేసిన వ్యవహారం ఏమిటో గమనించలేదా)?
إِرَمَ ذَاتِ الْعِمَادِ ﴿7﴾

8 అలాంటి (శక్తి గల) వారు పట్టణాలలో అసలు సృష్టించబడ లేదు.[8]
الَّتِي لَمْ يُخْلَقْ مِثْلُهَا فِي الْبِلَادِ ﴿8﴾

జరిపిన పోరాటం కూడా దీనంతగా ప్రియమైనది కాదు. అయితే మనిషి అమరగతి నొందే పోరాటం సంగతి వేరు" అని మహాప్రవక్త (స) ప్రవచించారు. (బుఖారీ – పండుగల ప్రకరణం)

3. అంటే – సరిసంఖ్య, బేసిసంఖ్య అని ఒక అర్థం. లేదా జతల రూపంలో మరియు బేసి రూపంలో ఉండే వస్తువులు అని ఇంకొక అర్థం. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం వాస్తవానికి ఇది సృష్టిపై ప్రమాణం. ఎందుకంటే సృష్టిలో ఏ వస్తువైనా ఒంటరిగా ఉంటుంది లేక జంటగానైనా ఉంటుంది. అంతకుమించి వేరే రకం ఏదీ సృష్టిలో లేదు (ఐసరుత్తఫాసీర్).

4. అంటే రాకపోకలు సాగించే రాత్రి అన్నమాట. ఎందుకంటే 'సైర్' (సంచారం) అనేది రావటానికి, పోవటానికి కూడా వర్తిస్తుంది.

5. **'హిజ్రున్'** ( حِجْرٌ ) అంటే ఆపటం, వారించటం అని అర్థం. మానవ బుద్ధిజ్ఞానాలు కూడా మనిషిని చెడుపనుల నుండి వారిస్తాయి. అందుకే మనిషిలోని బుద్ధిని, విజ్ఞతను కూడా 'హిజ్రున్'గా అభివర్ణించటం జరిగింది. ఈ సూరాలోని మొదటి ఐదు ఆయతులలో చేయబడిన ప్రమాణాలకు సమాధానం 14వ ఆయతులో (నిశ్చయంగా నీ ప్రభువు మాటేసి ఉన్నాడు అని) ఇవ్వబడింది. ధిక్కార వైఖరికి పాల్పడిన అనేక జాతులను దేవుడు ఇక్కడ ప్రస్తావించి, ఆఖరికి వాటికి పట్టిన దుర్గతిని తెలియజేశాడు. ఓ మక్కా వాసులారా! మీరు గనక ముహమ్మద్ (సఅసం) పట్ల అవలంబిస్తున్న తిరస్కార వైఖరిని మానుకోకపోతే మీకూ అదే గతి పడుతుందని హెచ్చరించటం ప్రధాన ఉద్దేశం.

6. ఆద్ జాతి వారి వైపుకు దేవుడు హూద్ అనే ప్రవక్తను పంపాడు. కాని ఆద్‌వారు హజ్రత్ హూద్ (అలైహిస్సలాం) మాటలను పెడచెవిన పెట్టారు. ఆఖరికి దేవుడు వారిపై ప్రచండమైన పెనుగాలిని పంపాడు. ఆ పెనుగాలి నిరంతరం ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లూ కొనసాగింది (అల్ హాఖ్ఖ : 7 – 10). దాంతో వారు సర్వనాశనం అయ్యారు.

7. **'ఇరము'** అనే వ్యక్తి ఆద్‌జాతి వారికి మూల పురుషుడు. వంశవృక్షం ప్రకారం ఆద్ బిన్ ఔస్ బిన్ ఇరమ్ బిన్ సామ్ బిన్ నూహు (ఫత్‌హుల్ ఖదీర్). వీళ్లు ప్రాచీన ఆద్‌జాతి వారన్నమాట. **'స్తంభాల వారు'** గా వ్యవహరించటంలోని మర్మం ఏమిటంటే, వాళ్ళంతా చాలా పొడుగాటివారు. మహాబలురు. మంచి శరీరదారుఢ్యం గలవారు. వారికి తమ శక్తిసామర్థ్యాలపై అపారమైన నమ్మకం ఉండేది. ఈ గర్వం వల్లనే వారు దైవసందేశాన్ని త్రోసిపుచ్చారు.
దానికి తోడు వారు భవన నిర్మాణాలలో, కళలలో మంచి ప్రావీణ్యం ఉన్నవారు. కళ్లు చెదిరే కట్టడాలను కట్టేవారు. 'ఎత్తయిన స్తంభాలవారు' అన్న బిరుదుకు ఇది కూడా ఒక కారణమే.

8. అంటే – శక్తియుక్తుల రీత్యా, శరీరదారుఢ్యం దృష్ట్యా అలాంటి జనులు లోకంలో పుట్టించబడనేలేదు. **"మాకన్నా**

**9** లోయలో పెద్ద పెద్ద కొండరాళ్ళను చెక్కిన సమూదు వారి పట్ల[9] (జరిగిందేమిటో నీవు గమనించలేదా?)

وَثَمُودَ الَّذِينَ جَابُوا الصَّخْرَ بِالْوَادِ ⑨

**10** మేకులవాడైన ఫిరౌను పట్ల[10] (నీ ప్రభువు ఏ విధంగా వ్యవహరించాడో నీకు తెలియదా)?

وَفِرْعَوْنَ ذِي الْأَوْتَادِ ⑩

**11** వాళ్ళంతా పట్టణాలలో (రాజ్యాలలో) చెలరేగిపోయిన వాళ్ళే.

الَّذِينَ طَغَوْا فِي الْبِلَادِ ⑪

**12** మరి వారు వాటిలో ఎంతో అరాచకాన్ని సృష్టించారు.

فَأَكْثَرُوا فِيهَا الْفَسَادَ ⑫

**13** అందువల్ల (ఎట్టకేలకు) నీ ప్రభువు వారందరిపై శిక్షా కొరడాను ఝుళిపించాడు.[11]

فَصَبَّ عَلَيْهِمْ رَبُّكَ سَوْطَ عَذَابٍ ⑬

**14** నిశ్చయంగా నీ ప్రభువు (వారి కోసం) మాటేసి ఉన్నాడు.[12]

إِنَّ رَبَّكَ لَبِالْمِرْصَادِ ⑭

**15** మనిషి పరిస్థితి ఎలాంటిదంటే అతని ప్రభువు అతన్ని పరీక్షించదలచి అతనికి గౌరవమర్యాదలను, అనుగ్రహ భాగ్యాలను ప్రసాదించినపుడు అతను (ఉబ్బి తబ్బిబ్బై), "నా ప్రభువు నన్ను గౌరవనీయుణ్ణి చేశాడయా!" అనంటాడు.[13]

فَأَمَّا الْإِنسَانُ إِذَا مَا ابْتَلَاهُ رَبُّهُ فَأَكْرَمَهُ وَنَعَّمَهُ فَيَقُولُ رَبِّي أَكْرَمَنِ ⑮

**16** మరి ఆయన అతన్ని (మరో విధంగా) పరీక్షించదలచి, అతని ఉపాధిని కుదించినప్పుడు, "అయ్యో! నా ప్రభువే నన్ను పరాభవానికి గురిచేశాడు!"[14] అని వాపోతాడు.

وَأَمَّا إِذَا مَا ابْتَلَاهُ فَقَدَرَ عَلَيْهِ رِزْقَهُ فَيَقُولُ رَبِّي أَهَانَنِ ⑯

---

**ఎక్కువ బలవంతులెవరున్నారు?"** అని వారు మిడిసి పడేవారు (హామీమ్ సజ్దా - 15).

9. ఇది హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలాం) గారి జాతి. దేవుడు వీళ్ళకి పర్వతాలను సయితం తొలచి అందమైన భవనాలను, గుహలను నిర్మించే కళను ప్రసాదించాడు. "మీరు కొండలను తొలచి విర్రవీగుతూ వాటిలో మీ నివాస గృహాలను నిర్మిస్తారు" (షుఅరా– 149) అన్న దివ్యఖుర్ఆన్ వచనం కూడా ఈ సందర్భంగా గమనించదగినదే.

10. అంటే పెద్ద సైన్యంగల వాడని భావం. వాడు సామ్రాజ్య విస్తరణ నిమిత్తం వెడలినప్పుడల్లా మేకులు పాతి గుడారాలు వేయబడేవి. లేదా ఆ నిరంకుశరాజు (ఫిరౌను) మేకుల ద్వారా ప్రజలను చిత్రహింసలు పెట్టి చంపేవాడని ఇంకొక అర్థం (ఫత్హుల్ ఖదీర్).

11. అంటే – నీ ప్రభువు వారందరిపై ఆకాశం నుంచి శిక్షను అవతరింపజేసి సర్వనాశనం చేయటమేగాక, భావితరాల వారి కోసం వారి దుర్గతిని ఒక గుణపాఠ సూచనగా చేశాడు.

12. అంటే – ఆయన అన్ని జాతులను, అన్ని సమూహాలను కనిపెట్టుకుని ఉన్నాడు. ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తూపోతు న్నాడు. వారి ఉనికి లోకానికి చాలా ప్రమాదకరంగా పరిణమించినపుడు వారిని శిక్షిస్తాడు. పరలోక శిక్ష ఎలాగూ ఉంటుంది. మరికొందరికి దేవుడు ఇహలోకంలో పూర్తిగా విడుపు ఇచ్చినప్పటికీ పరలోకంలో మాత్రం వారిని వదలిపెట్టడు.

13. అంటే – దేవుడు ఎవరికయినా ప్రాపంచిక సిరిసంపదలను, పదవులను ప్రసాదించినపుడు, దేవుడు తనను అమితంగా కటాక్షించాడని అతను సంబరపడిపోతాడు. నిజానికి ఈ ఆస్తిపాస్తులు, ఆలుబిడ్డలు, అధికారాలు – అతన్ని పరీక్షించే నిమిత్తమే ప్రసాదించబడ్డాయి.

**17** అది (వాస్తవం) కాదు.[15] అసలు విషయం ఏమిటంటే మీరు అనాథలను ఆదరించరు.[16]

كَلَّا ۖ بَل لَّا تُكْرِمُونَ الْيَتِيمَ ﴿17﴾

**18** నిరుపేదలకు అన్నంపెట్టే విషయంలో ఒకర్నొకరు ప్రోత్స హించుకోరు.

وَلَا تَحَاضُّونَ عَلَىٰ طَعَامِ الْمِسْكِينِ ﴿18﴾

**19** ఇంకా మీరు (మృతుల) ఆస్తిపాస్తులను సమీకరించి, స్వాహా చేస్తారు.[17]

وَتَأْكُلُونَ التُّرَاثَ أَكْلًا لَّمًّا ﴿19﴾

**20** మీరు ధనాన్ని విపరీతంగా ప్రేమిస్తారు.[18]

وَتُحِبُّونَ الْمَالَ حُبًّا جَمًّا ﴿20﴾

**21** (మీ ధోరణి సరైనది) కాదు.[19] భూమి దంచి దంచి చదునుగా చేయబడినప్పుడు....

كَلَّا إِذَا دُكَّتِ الْأَرْضُ دَكًّا دَكًّا ﴿21﴾

**22** నీ ప్రభువు (స్వయంగా) వరుసలు తీరిన దైవదూతల సమేతంగా ఏతెంచినపుడు[20]....

وَجَاءَ رَبُّكَ وَالْمَلَكُ صَفًّا صَفًّا ﴿22﴾

**23** నరకం సయితం తేబడిననాడు[21]... ఆనాడు మనిషికి జ్ఞానోదయం అవుతుంది. కాని ఆ రోజు జ్ఞానం కలిగి ఏం లాభం?[22]

وَجِيءَ يَوْمَئِذٍ بِجَهَنَّمَ ۚ يَوْمَئِذٍ يَتَذَكَّرُ الْإِنسَانُ وَأَنَّىٰ لَهُ الذِّكْرَىٰ ﴿23﴾

---

14. దేవుడు ఆర్థిక ఇబ్బందులకు లోనుచేసి పరీక్షించినపుడు, మనిషి దైవకటాక్షంపైనే సందేహపడతాడు. ఆ పైవాడే తనను అవమానపరచినపుడు ఎవరికి చెప్పి ఏం లాభం? అని నిందిస్తాడు.
15. మనిషి ఈ రకంగా ఆలోచించటం సరైంది కాదు. దేవుడు కలిమిని తన ప్రియతమ భక్తులకూ ఇస్తాడు, అవిధేయులకు కూడా ఇస్తాడు. అలాగే ఆయన తన సజ్జన దాసులను కూడా లేమికి గురిచేస్తాడు. దుర్మార్గులను కూడా ఇక్కట్లకు లోనుచేస్తాడు. ఈ కలిమి లేములు సర్వసాధారణం. ఈ రెండు స్థితుల ద్వారా దేవుడు పరీక్షిస్తాడు. రెండు అవస్థల్లో కూడా నిగ్రహం, సంయమనం పాటించిన మనిషే యుక్తిపరుడు. లేమిలో కృంగిపోకుండా, కలిమిలో పొంగిపోకుండా దైవానికి విధేయత చూపాలి. ముఖ్యంగా లేమిలో సహనం వహించాలి. కలిమిలో కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఈ రకంగా మసలుకున్నవాడు దేవుడు పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణుడవుతాడు.
16. తండ్రిలేని బిడ్డలు ఆదరణకు అర్హులు. కాని పేరాశకు గురైనవారు అనాథలను ఆదరించరు. దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "ఏ ఇంట అనాథ పట్ల సద్వ్యవహారం జరుగుతుందో ఆ ఇల్లు అత్యుత్తమమైనది. మరే ఇంట అనాథ పట్ల దుర్వ్యవహారం జరుగుతుందో ఆ ఇల్లు అధ్వాన్నమైనది." ఆ తరువాత ఆయన (సఅసం) తన చేతి వ్రేళ్ళ ద్వారా సైగ చేస్తూ, "నేనూ, అనాథను పోషించేవాడు స్వర్గంలో ఈ విధంగా (దగ్గర దగ్గరగా) ఉంటాము" అని అన్నారు. (అబూ దావూద్ – కితాబుల్ అదబ్).
17. అంటే – ఆ ఆస్తి ధర్మసమ్మతంగా వస్తోందా? లేక అక్రమ రీతిలో సంక్రమిస్తోందా? అని కూడా ఆలోచించకుండా వచ్చింది వచ్చినట్టు తీసేసుకుంటారు.
18. వారి మనసంతా ధనం పట్ల ప్రేమతో నిండిపోయింది. మరోవిధంగా చెప్పాలంటే వారు ధన వ్యామోహంలో దారుణంగా చిక్కుకుపోయారు.
19. అంటే – మీరిలా విచ్చలవిడిగా వ్యవహరించరాదు. ఎందుకంటే ఒక రోజు రానున్నది. ఆనాడు...
20. దైవదూతలు దివి నుంచి భువికి దిగివచ్చినప్పుడు ప్రతి ఆకాశంలో ఉండే దూతలు వేర్వేరుగా బారులు తీరి నిలబడతారని అనబడుతోంది. ఈ విధంగా వారు ఏడు వరుసలు తీరేసరికి భూభాగమంతా వారితో నిండిపోతుంది.

24 “అయ్యో! నేనీ (పరలోక) జీవితం కోసం ముందుగానే (జాగ్రత్తపడి ఏదైనా) చేసుకుని ఉంటే ఎంత బావుండేది!”[23] అని అతనంటాడు.

يَقُولُ يَٰلَيْتَنِى قَدَّمْتُ لِحَيَاتِى ﴿٢٤﴾

25 మరి ఆ రోజు అల్లాహ్ శిక్షించినట్లుగా శిక్షించేవాడెవడూ ఉండడు.

فَيَوْمَئِذٍ لَّا يُعَذِّبُ عَذَابَهُۥٓ أَحَدٌ ﴿٢٥﴾

26 అలాగే ఆయన బంధించినట్లుగా ఎవడూ బంధించలేడు.[24]

وَلَا يُوثِقُ وَثَاقَهُۥٓ أَحَدٌ ﴿٢٦﴾

27 “ఓ ప్రశాంత మనసా!”

يَٰٓأَيَّتُهَا ٱلنَّفْسُ ٱلْمُطْمَئِنَّةُ ﴿٢٧﴾

28 “నీ ప్రభువు వైపు పద![25] నువ్వు ఆయన పట్ల సంతోషించావు. ఆయన నీ పట్ల సంతోషించాడు.

ٱرْجِعِىٓ إِلَىٰ رَبِّكِ رَاضِيَةً مَّرْضِيَّةً ﴿٢٨﴾

29 “కాబట్టి (సత్కరించబడిన) నా దాసులలో చేరిపో.

فَٱدْخُلِى فِى عِبَٰدِى ﴿٢٩﴾

30 “నా స్వర్గంలో చేరిపో” (అని విధేయులతో అనబడుతుంది).

وَٱدْخُلِى جَنَّتِى ﴿٣٠﴾

---

21. 70 వేల కళ్ళెములతో నరకం బిగించబడి ఉంటుంది. ప్రతి కళ్ళాన్ని 70 వేల మంది దైవదూతలు పట్టుకుని లాగుతూ ఉంటారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్; తిర్మిజీ). చివరికి దాన్ని దైవసింహాసనానికి ఎడమ వైపున నిలబెట్టడం జరుగుతుంది. దాన్ని చూడగానే దైవసామీప్యం పొందిన దాసులు, ప్రవక్తలంతా మోకాళ్ళ ఆధారంగా క్రిందపడి “యా రబ్బ్! నఫ్సీ నఫ్సీ!” అని మొరపెట్టుకుంటారు (ఫత్హుల్ ఖదీర్).

22. ఈ భీతావహ దృశ్యాన్ని తిలకించిన మనిషికి అప్పుడు బుద్ధి వస్తుంది. అతడు తన పాపకార్యాలపై, ధిక్కార వైఖరిపై సిగ్గుపడతాడు. కాని ఆ రోజు సిగ్గుపడినా ప్రయోజనమేమీ ఉండదు.

23. ఆనాటి అతని పశ్చాత్తాపం కూడా లాభకరం కాజాలదు.

24. ఎందుకంటే ఆ రోజు అధికారాలన్నీ ఒక్క అల్లాహ్ అధీనంలోనే ఉంటాయి. వేరెవరూ ఆయన సమక్షంలో సలహాలు ఇవ్వలేరు. నోరు మెదిపే అధికారం కూడా ఎవరికీ ఉండదు. కడకు ఆయన అనుమతి లేకుండా ఆయన సమ్ముఖంలో ఎవరూ సిఫారసు కూడా చేయలేరు. దైవ తిరస్కారులకు పట్టే దుర్గతి ఎటువంటిదో, దేవునిచే బంధించబడిన వారి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో అసలు మనం ఊహించనయినా ఊహించలేము. అయితే విశ్వసించి, విధేయతా వైఖరిని అవలంబించినవారి పరిస్థితి దీనికి –పూర్తిగా – భిన్నంగా ఉంటుంది. రానున్న ఆయతులలో దీని వివరాలున్నాయి.

25. అంటే – ప్రభువు పుణ్యఫలం వైపు పద! ఆయన సజ్జనులైన దాసుల కోసం నిర్మించిన స్వర్గం వైపు పద!! ఈ శుభవార్త ప్రళయదినాన ఇవ్వబడుతుందని కొందరు అభిప్రాయపడ్డారు. మరణ సమయంలోనే దైవదూతలు ఈ శుభవార్త వినిపిస్తారని మరి కొందరు చెప్పారు. హాఫిజ్ ఇబ్నె కసీర్ గారు ఇబ్నె అసాకిర్ ఆధారంతో నకలుచేసిన ఒక ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త (సఅసం) ఒక వ్యక్తికి ఈ దుఆ చేయమని ఆదేశించారు: **“అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక నఫ్సన్ బిక ముత్మయిన్నతన్ తూమిను బిలిఖాయిక వ తర్జా బిఖజాయిక వ తఖ్నవు బి అతాయిక్.”** (ఓ అల్లాహ్! నీ పట్ల సంతృప్తిచెందే, నిన్ను కలవటాన్ని విశ్వసించే, నీ నిర్ణయాలను అంగీకరించే, నీ ప్రసాదాలతో సరిపెట్టుకునే మనసును నాకు ప్రసాదించమని నేను నిన్ను ప్రార్థిస్తున్నాను). (ఇబ్నె కసీర్)

90 వ సూరా

# అల్ బలద్

## నగరం

అవతరణ మక్కాలో

ఆయతులు 20

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి, శిక్షాబహుమానాల గురించి వివరించింది. మొదటి ఆయతులో వచ్చిన పదం (బలద్) ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. మానవులు సహనంతో కష్టనష్టాలను భరిస్తూ మంచిపనులు కొనసాగించాలని ఇందులో బోధించడం జరిగింది. అహంభావులైన అవిశ్వాసులు తమ సంపద, అధికారాలు శాశ్వతమన్న తప్పుడు అభిప్రాయానికి గురయి ఉన్నారు. తమ సంపద, అధికారాలు తమను అన్నివిధాల కష్టాల నుంచి కాపాడుతాయన్న భ్రమలో ఉన్నారు. తమ ఇష్టం వచ్చినట్లు చేసే స్వేచ్ఛ తమకు ఉందని, తమ పనులకు ఎవరికీ జవాబు చెప్పుకోనవసరం లేదని కూడా వారు భావిస్తున్నారు. అల్లాహ్ గమనిస్తున్నాడన్న విషయాన్ని వారు మరిచిపోయారు. తీర్పుదినాన తమ కర్మలకు అల్లాహ్ ముందు జవాబు ఇవ్వవలసి వస్తుందన్న వాస్తవాన్ని వాళ్ళు నిర్లక్ష్యం చేశారు. తీర్పుదినాన అహంభావులైన ఈ సత్యతిరస్కారులు బాధాకరమైన శిక్షను చవిచూస్తారు. సన్మార్గగాములకు శాశ్వత సుఖాలు లభిస్తాయి. ఈ సూరాలో కూడా అనేక నైతిక ప్రమాణాలను బోధించడం జరిగింది.

### అల్ బలద్ సూరా | سُوْرَةُ الْبَلَدِ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ |
| **1** ఈ నగరం తోడుగా (నేను చెబుతున్నాను)![1] | لَآ اُقْسِمُ بِهٰذَا الْبَلَدِ ① |
| **2** (ఓ ముహమ్మద్ –సఅసం) ! నువ్వు ఈ నగరంలో స్వేచ్ఛా వాసివి.[2] | وَاَنْتَ حِلٌّۢ بِهٰذَا الْبَلَدِ ② |

1. ఇక్కడ **'నగరం'** అంటే పవిత్ర మక్కానగరం అని భావించాలి. ఈ సూరా అవతరించినపుడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మక్కా నగరంలోనే ఉన్నారు. ఆయన జన్మస్థానం కూడా అదే. దేవుడు ఈ ఆయతులో ఆయన (స) గారి జన్మ స్థలంపై ఒట్టేసి విషయం చెబుతున్నాడు. దీన్నిబట్టి కూడా ఈ నగరం ప్రాశస్త్యాన్ని ఊహించవచ్చు.
2. మక్కా నగరంపై మహాప్రవక్త (సఅసం)కు లభించిన విజయానికి ఇది సంకేతం! పవిత్ర మక్కా నగరంలో మారణ కాండకు అనుమతి లేదు. కాని దుష్టశిక్షణ, శిష్టరక్షణ నిమిత్తం ఒకానొక ఘడియలో అంతిమ దైవప్రవక్త (సఅసం)కు దైవవిరోధుల్ని దండించే విశిష్టాధికారం దేవుని తరపున లభించింది. హదీసు ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "అల్లాహ్ భూమ్యాకాశాలను పుట్టించిన నాటినుంచీ ఈ నగరాన్ని నిషిద్ధ నగరంగా ఖరారు చేశాడు. కాబట్టి అల్లాహ్ నిర్ధారించినప్పటి నుండి ప్రళయం వరకూ దీని నిషిద్ధ (పవిత్ర) స్థితి ఉంటుంది. ఇక్కడి చెట్లను నరకటంగానీ, ముళ్ళకంపలను పెకలించటంగానీ సమ్మతం కాదు. నా కోసం ఒకానొక రోజులోని ఒక ఘడియలో ఇది సమ్మతం చేయబడింది. ఈ నిషేధం నిన్నటిరోజున ఎలా ఉండేదో అలాగే ఈ రోజు ఈ 'నిషిద్ధం' మళ్ళీ యథాతథంగా విధించబడింది. ... ఒకవేళ ఎవరయినా ఇక్కడ మారణకాండను సృష్టించే ఉద్దేశంతో నా ఉదాహరణను ఇస్తే, 'దేవుడు తన ప్రవక్త (స)కు మాత్రమే ఈ మేరకు అనుమతి ఇచ్చాడని, నీకు ఈ అనుమతి ఇవ్వలేద'ని అతనికి చెప్పండి." (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇల్మ్; ముస్లిం – కితాబుల్ హజ్).

| | |
|---|---|
| **3** కన్న తండ్రి (తోడుగా), అతను కన్న సంతానం (తోడుగా చెబుతున్నాను).[3] | وَوَالِدٍ وَّمَا وَلَدَ ③ |
| **4** నిశ్చయంగా మేము మనిషిని నిత్య కష్టాల్లో సృష్టించాము.[4] | لَقَدْ خَلَقْنَا الْإِنْسَانَ فِي كَبَدٍ ④ |
| **5** ఏమిటి, తనపై ఎవరి అదుపూ, అజమాయిషీ లేదని అతను అనుకుంటున్నాడా?[5] | أَيَحْسَبُ أَن لَّن يَقْدِرَ عَلَيْهِ أَحَدٌ ⑤ |
| **6** "నేను రాసులకొద్దీ ధనాన్ని ఖర్చుపెట్టాను తెలుసా!" అని అతను (గొప్పలు) చెప్పుకుంటున్నాడు.[6] | يَقُولُ أَهْلَكْتُ مَالًا لُّبَدًا ⑥ |
| **7** ఏమిటి, తననెవరూ చూడలేదని అతను తలపోస్తున్నాడా?[7] | أَيَحْسَبُ أَن لَّمْ يَرَهُ أَحَدٌ ⑦ |
| **8** ఏమిటి, మేమతనికి రెండు కళ్లను సృజించలేదా?[8] | أَلَمْ نَجْعَل لَّهُ عَيْنَيْنِ ⑧ |
| **9** ఒక నాలుకను, రెండు పెదవులను (చేయలేదా)?[9] | وَلِسَانًا وَشَفَتَيْنِ ⑨ |
| **10** మరి మేమతనికి రెండు మార్గాలు కూడా చూపాము.[10] | وَهَدَيْنَاهُ النَّجْدَيْنِ ⑩ |

3. ఈ ఆయతులో **'తండ్రి'** అంటే ఆదిమానవుడైన హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) అనీ, **'సంతానం'** అంటే ఆయన ద్వారా ఉనికిలోనికి వచ్చిన వారని కొందరు భావించారు. మరికొంతమంది ప్రకారం ప్రతి తండ్రికి, అతని సంతతికి ఇది వర్తిస్తుంది.

4. అంటే–పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు మనిషి జీవితమంతా నిరంతరం శ్రమతో, కష్టాలతో కూడుకున్నది. ఇమామ్ తబ్రీగారు కూడా ఈ భావాన్నే తీసుకున్నారు.

5. అంటే – తనను నిలదీసి అడిగేవారు, తన నుండి లెక్క తీసుకునేవారు ఎవరూ లేరని మానవుడు అనుకుంటున్నాడా?

6. **'లుబదా'** (لُبَدًا) అంటే చాలా, రాశులకొద్దీ అని అర్థం. మనిషి ప్రాపంచిక వ్యవహారాలలో బడాయి కోసం ఎంతో డబ్బును ఊదేస్తాడు. అవసరంకన్నా ఎక్కువగా దుబారా ఖర్చుచేస్తాడు. దాంతో ఊరుకోకుండా ఈ విధంగా లెక్కలేనంతగా ఖర్చుచేశానని బడాయిని చాటుకుంటాడు.

7. ఈ విధంగా దేవుని అవిధేయతా మార్గంలో ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టినదిగాక, తనను ఎవరూ గమనించటంలేదని వాడనుకుంటున్నాడా? యదార్థానికి దేవుడు అన్నింటినీ గమనిస్తూనే ఉన్నాడు. రానున్న వాక్యాలలో దేవుడు తాను మానవునికి ప్రసాదించిన కొన్ని వరాలను గుర్తుచేసి, మనిషి చేయవలసిన పనులేమిటో వివరించాడు.

8. వాటితోనే కదా వాడు చూడగలుగుతున్నాడు!

9. ఆ నాలుక ఉండబట్టే అతను మాట్లాడగలుగుతున్నాడు. తన మనోభావాన్ని వ్యక్తపరచగలుగుతున్నాడు. మేమిచ్చిన అతని రెండు పెదవులు అతని ముఖానికెంతో అందాన్నివ్వటమే గాకుండా మాట్లాడటంలో, తినటంలో, త్రాగటంలో అతనికి సహాయకారిగా ఉన్నాయి.

10. అంటే ఒక మార్గం శ్రేయస్కరమైనది – ఇంకొక మార్గం హానికరమైనది. "అవును. మేమతనికి మార్గం చూపాము. తద్వారా అతను కృతజ్ఞుడు అయినా కావచ్చు లేదా సత్యాన్ని తిరస్కరించేవాడైనా కావచ్చు" (దహ్ర్ – 3). **'నజ్ద్'** (نَجْدٌ) అంటే ఎత్తయిన స్థలం అని అర్థం. అందుకేనేమో కొంతమంది అనువాదకులు ఈ ఆయతుకు "మేము మనిషికి (తల్లియొక్క) రెండు వక్షోజాల మార్గం చూపాము" అని అనువదించారు. అంటే పసిపిల్లలకు సయితం

11 కాని అతను కఠినమైన కనుమను దాటిపోలేదు.[11] فَلَا اقْتَحَمَ الْعَقَبَةَ (11)

12 కఠినమైన కనుమ అంటే ఏమిటో నీకు తెలుసా? وَمَا أَدْرٰىكَ مَا الْعَقَبَةُ (12)

13 ఏ (బానిస లేక బానిసరాలి) మెడనయినా (బానిసత్వం నుండి) విడిపించటం. فَكُّ رَقَبَةٍ (13)

14 లేదా ఆకలిగొన్న నాడు అన్నం పెట్టడం – أَوْ إِطْعٰمٌ فِي يَوْمٍ ذِي مَسْغَبَةٍ (14)

15 బంధుత్వంగల ఏ అనాథకు గాని, يَتِيمًا ذَا مَقْرَبَةٍ (15)

16 మట్టిలో పడివున్న ఏ నిరుపేదకు గానీ (అన్నం పెట్టడం)![12] أَوْ مِسْكِينًا ذَا مَتْرَبَةٍ (16)

17 అటుపిమ్మట, విశ్వసించి[13] పరస్పరం సహనబోధ చేసు కుంటూ, ఒండొకరికి దయాదాక్షిణ్యాల గురించి తాకీదు చేసు కునేవారైపోవాలి.[14] ثُمَّ كَانَ مِنَ الَّذِينَ ءَامَنُوا وَتَوَاصَوْا بِالصَّبْرِ وَتَوَاصَوْا بِالْمَرْحَمَةِ (17)

తల్లిపాలు త్రాగే విద్య నేర్పామన్నమాట! కాని ఈ రెండవ అనువాదం కన్నా మొదటి అనువాదమే చాలావరకు సరైనది.

11. పర్వత కనుమను **'అఖబతున్'** (الْعَقَبَةُ) అని అంటారు. సాధారణంగా ఈ దారి దుర్గమమైనది. ఈ ఉపమానం ద్వారా చెప్పదలచిన అసలు విషయం ఏమిటంటే, మానవుడు 'సత్కార్యాలు' అనే కఠినమైన మార్గంలో ప్రవేశించటానికి ఇష్టపడడు. ఆ మార్గంలో ప్రవేశించకుండా షైతాన్ అతనికి అడ్డుతగిలాడు. లేదా మనిషి తన మనోవాంఛలకు లొంగిపోయి బాధలు భరించటానికి, త్యాగం చేయడానికి సుముఖుడు కాలేదు. పర్వత కనుమను దాటిపోవాలంటే మనిషికి ఓపిక ఉండాలి. వ్యయప్రయాసలను భరించగలగాలి కదా! (ఫత్హుల్ ఖదీర్).

12. **'మస్ఘబతిన్'** (مَسْغَبَةٍ) అంటే ఆకలి అని అర్థం. ఆకలిగొన్న రోజున అంటే అతను తినటానికి ఏమీ లేకుండా ఆకలితో అలమటిస్తున్నప్పుడు. **'జా మత్రబతిన్'** (ذَا مَتْرَبَةٍ) అంటే ఒకవైపు దారిద్ర్యం, మరోవైపు దీనావస్థ మూలంగా కటికనేలపై పడి ఉన్నవాడు అని భావం. ఇల్లూ వాకిలి లేకుండా ఫుట్‌పాత్‌లపై గడిపే నిరాధారజీవి అన్నమాట!

ఈ వాక్యాల సారాంశం ఏమిటంటే ఎవరినయినా బానిసత్వం లేదా వెట్టిచాకిరీ నుండి విముక్తుల్ని చేయటం, ఒక ఆకలిగొన్నవాడికి అన్నం పెట్టడం, ఆప్తుడైన ఒక అనాథను ఆదరించటం, ఒక అభాగ్యజీవికి చేయూతనిచ్చి నిలపటం– ఇదంతా దుర్గమమైన పర్వత కనుమను దాటిపోవటం వంటిదే. ఈ మార్గం గుండా సాగిపోయిన వ్యక్తి నరకాగ్ని నుండి తనను కాపాడుకోవటమే గాక స్వర్గంలో కూడా ప్రవేశార్హత పొందుతాడు. సాధారణంగా ఒక అనాథను పోషించటం ఎంతో పుణ్యప్రదం. అందులోనూ మనం పోషించే ఆ తండ్రిలేని బిడ్డ బంధువుల్లోనివాడై ఉంటే రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది – ఒక వంతు పుణ్యం పోషించినందుకు! రెండవ వంతు పుణ్యం బంధుత్వ హక్కును నెరవేర్చినందుకు!! అలాగే బానిసకు విముక్తి కల్పించటం కూడా చాలా గొప్ప కార్యమే. ఈనాడు బానిసత్వం లేకపోయినప్పటికీ రుణగ్రస్తులు మాత్రం ఉన్నారు. అక్కడక్కడా వెట్టిచాకిరీలో మ్రగ్గుతున్నవారు కూడా పల్లెప్రాంతాల్లో ఉన్నారు. అలాంటివారిని అప్పుల ఊబి నుండి బయటికి లాగటానికి ఆర్థిక సాయం చేస్తే అది "మెడను విడిపించటం" క్రిందికే వస్తుంది.

13. అయితే మనిషి చేసే ఈ పుణ్యకార్యాలన్నీ దైవసన్నిధిలో స్వీకారయోగ్యం కావాలంటే అతను విశ్వాసి (మోమిన్) అయి ఉండటం తప్పనిసరి. విశ్వాసం (ఈమాన్) లేని పుణ్యకార్యాలు ఫలప్రదం కాజాలవు.

| | |
|---|---|
| 18 వీళ్ళే కుడిపక్షం వారు (భాగ్యవంతులు). | أُولَٰئِكَ أَصْحَابُ الْمَيْمَنَةِ ﴿18﴾ |
| 19 మరెవరయితే మా ఆయతుల పట్ల తిరస్కార వైఖరిని అవలంబించారో వారు దౌర్భాగ్యులు. | وَالَّذِينَ كَفَرُوا بِآيَاتِنَا هُمْ أَصْحَابُ الْمَشْأَمَةِ ﴿19﴾ |
| 20 వారిని (అన్ని వైపుల నుంచి) అగ్ని చుట్టుముట్టుతుంది.[15] | عَلَيْهِمْ نَارٌ مُّؤْصَدَةٌ ﴿20﴾ |

14. ఇది విశ్వసించిన వారిలో ఉండే సుగుణం. వారు పరస్పరం సహనం, సానుభూతి, దయ, జాలి గురించి ఉపదేశించుకుంటూ ఉంటారు.

15. **'మూసదతున్'** (مُّؤْصَدَةٌ) అంటే మూయబడినది అని అర్థం. అంటే – వారిని అగ్నిలో పడవేసి అన్ని వైపుల నుంచి మార్గాలు మూసివేయబడతాయి. అందువల్ల అగ్ని సెగలన్నీ వారినే చుట్టుకుంటాయి. వారు ఎటూ పారిపోలేని పరిస్థితి అది!

91 వ సూరా

# అష్ షమ్స్

## సూర్యుడు

అవతరణ
మక్కాలో

ఆయతులు
15

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ఆధ్యాత్మికత గురించి, అనైతిక వ్యవహార శైలి గురించి, అనైతికత వల్ల వాటిల్లే వినాశాల గురించి వివరించింది. ఇందులోని మొదటి ఆయతులో ఈ సూరా పేరుకు సంబంధించిన పదం ప్రస్తావనకు వచ్చింది. ఈ సూరా మానవుల ఆధ్యాత్మిక విధులను గుర్తు చేసింది. అల్లాహ్‌కుగల ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని వర్ణిస్తూ, సూర్యచంద్రుల ప్రకాశం, భూమి, అద్భుతమైన రోదసీ (అంతరిక్ష) వ్యవస్థల సృష్టి గురించి తెలియజేసింది. మానవులందరికీ ఇష్టమొచ్చిన మార్గాన్ని అవలంబించే స్వేచ్ఛ ఉందని, మంచిగా గాని, చెడుగా గాని వ్యవహరించే స్వేచ్ఛ ఉందని, ఏ మార్గాన నడవాలన్నది మనమే నిర్ణయించుకోవా లని తెలియజేస్తూ, అనైతికంగా వ్యవహరించి, అల్లాహ్ ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే ఫలితంగా దైవాగ్రహానికి గురి కావలసి వస్తుందని ఈ సూరా తెలియజేసింది.

### అష్ షమ్స్ సూరా | سُورَةُ الشَّمْسِ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| 1 సూర్యుని సాక్షిగా! దాని ఎండ సాక్షిగా![1] | وَالشَّمْسِ وَضُحَاهَا ﴿1﴾ |
| 2 (సూర్యుణ్ణి) వెంబడిస్తూ వచ్చేటప్పటి చంద్రుని సాక్షిగా![2] | وَالْقَمَرِ إِذَا تَلَاهَا ﴿2﴾ |
| 3 (సూర్యుణ్ణి) దేదీప్యమానం చేసినప్పటి పగటి సాక్షిగా![3] | وَالنَّهَارِ إِذَا جَلَّاهَا ﴿3﴾ |

1. ఎండ సాక్షిగా అనటానికి బదులు పగటిసాక్షిగా అని కూడా అనవచ్చు.

**4** (సూరీడును) క్రమ్ముకున్నప్పటి రాత్రి సాక్షిగా![4]

وَالَّيْلِ اِذَا يَغْشٰهَا ﴿4﴾

**5** ఆకాశం సాక్షిగా! దాని (అద్భుత) నిర్మాణం సాక్షిగా![5]

وَالسَّمَآءِ وَمَا بَنٰهَا ﴿5﴾

**6** భూమి సాక్షిగా! దాన్ని సుగమం చేసిన ప్రక్రియ సాక్షిగా![6]

وَالْاَرْضِ وَمَا طَحٰهَا ﴿6﴾

**7** ఆత్మ సాక్షిగా! దాన్ని తీర్చిదిద్దిన వాని సాక్షిగా![7]

وَنَفْسٍ وَّمَا سَوّٰهَا ﴿7﴾

**8** మరి (ఆయన) దానికి చెడునూ, చెడు నుంచి తప్పించుకుని మసలుకునే ప్రేరణను ఇచ్చాడు.[8]

فَاَلْهَمَهَا فُجُوْرَهَا وَتَقْوٰهَا ﴿8﴾

**9** దానిని (అంతరాత్మను, మనసును) పరిశుద్ధ పరచుకున్నవాడు సాఫల్యం పొందాడు.[9]

قَدْ اَفْلَحَ مَنْ زَكّٰهَا ﴿9﴾

**10** దాన్ని అణచి పెట్టినవాడు నష్టపోయాడు.[10]

وَقَدْ خَابَ مَنْ دَسّٰهَا ﴿10﴾

**11** సమూదు (జాతి) వారు తమ పొగరు మూలంగా (వారి ప్రవక్తను) ధిక్కరించారు.[11]

كَذَّبَتْ ثَمُوْدُ بِطَغْوٰهَآ ﴿11﴾

---

2. ఒక మాసంలో మొదటి 15 రోజులు చంద్రుడు సూర్యుణ్ణి వెంటాడుతూనే ఉదయిస్తాడు. సూర్యుడు అస్తమించగానే చంద్రుడు ఉదయిస్తాడు.

3. ఇక్కడ చీకటి గురించి వేరుగా ప్రస్తావించలేదు. కాని పగటి వెలుగు రాత్రి చీకటి తెరలను చీల్చుకుంటూ వస్తుంది (ఫత్హుల్ ఖదీర్).

4. క్రమ్ముకుంటూ వచ్చే రాత్రి కూడా గమనించదగినదే. అది సూర్యుణ్ణి తెరమరుగు చేయటంతో పాటు అన్నివైపులా గాఢాంధకారం అలుముకునేలా చేస్తుంది.

5. లేదా ఆకాశాన్ని నిర్మించినవాని సాక్షిగా!

6. లేదా భూమిని సుగమం చేసిన వాని సాక్షిగా!

7. లేదా ఆత్మను సంస్కరించిన తీరు సాక్షిగా!

8. ఇక్కడ **'ప్రేరణ'** అంటే అర్థం ఏమిటి? మంచి ఏదో, చెడు ఏదో మనిషికి స్పష్టంగా బోధపరచటం కావచ్చు. లేదా ప్రవక్తల ద్వారా, గ్రంథాల ద్వారా చూపించిన మార్గం కావచ్చు. లేదా మానవ నైజంలోనే మంచీ చెడులను పరికించే గుణాన్ని ప్రోదిచేసి ఉండవచ్చు. మానవుడు మంచిని అనుసరించి చెడుల నుంచి తన్ను కాపాడుకో వాలన్నదే దీని ఉద్దేశం.

9. అంటే – షిర్కు నుండి, పాపాల నుండి, నైతికపు రుగ్మతల నుండి తన ఆత్మను ప్రక్షాళనం చేసుకుని, పరలోక సాఫల్యం పొందిన వాడన్నమాట.

10. అంటే – తన అంతరాత్మ ప్రబోధాన్ని అణచివేసినవాడు, దాన్ని కప్పిపుచ్చినవాడు, దాన్ని దాని మానాన వదలివేసినవాడు, అంతరంగాన్ని దైవాజ్ఞాపాలన కోసం సంసిద్ధం చేయనివాడు, సత్కార్యాల వైపు మరలనివాడు. ఇలాంటివాడు దారి తప్పి నష్టపోయిన వానితో సమానం.

إِذِ انْبَعَثَ أَشْقَاهَا ﴿١٢﴾

**12** అప్పుడు వారిలోని ఒక పెద్ద దౌర్భాగ్యుడు (వారి తలబిరుసు పోకడలకు సారథిగా) నిలబడ్డాడు.[12]

فَقَالَ لَهُمْ رَسُولُ اللَّهِ نَاقَةَ اللَّهِ وَسُقْيَاهَا ﴿١٣﴾

**13** "మీరు దేవుని ఈ ఆడ ఒంటె విషయంలో, దాని నీళ్ల వంతు విషయంలో జాగ్రత్తగా ఉండండి" అని దైవప్రవక్త వారిని హెచ్చరించాడు.[13]

فَكَذَّبُوهُ فَعَقَرُوهَا فَدَمْدَمَ عَلَيْهِمْ رَبُّهُم بِذَنبِهِمْ فَسَوَّاهَا ﴿١٤﴾

**14** కాని వారు మాత్రం తమ ప్రవక్త (మాటల)ను త్రోసిపుచ్చి, దాని గిట్టెలను నరికి(చంపేశారు).[14] అంతే! వారి ప్రభువు వారి దురాగతాల కారణంగా వారిపై వినాశాన్ని పంపాడు.[15] వారందరినీ సమానం (నేలమట్టం) చేశాడు.[16]

وَلَا يَخَافُ عُقْبَاهَا ﴿١٥﴾

**15** దాని పరిణామాలను గురించి ఆయన ఏమాత్రం భయపడడు.[17]

11. **'తుగ్‌యాన్'** (طُغْيَانٌ) అంటే హద్దుమీరిపోవటం అన్నమాట. ఈ దుర్మార్గం వల్లనే వారు తమ ప్రవక్త మాటలను పెడచెవిన పెట్టారు.
12. వాడిపేరు ఖుదార్ బిన్ సాలిఫ్ అని ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. దైవధిక్కార వైఖరిలో వాడు పోషించిన కీలకపాత్ర కారణంగా సమూదు జాతిలోని పొగరుబోతులంతా వాణ్ణి తమ నాయకునిగా ఎన్నుకున్నారు.
13. అంటే – ఆ ఒంటెకు ఎలాంటి కీడు తలపెట్టరాదని దైవప్రవక్త (హజ్రత్ సాలెహ్) వారికి సూచించారు. త్రాగునీరు కోసం ఆ ఒంటెకు కేటాయించబడిన 'వంతు' విషయంలో కూడా ఆటంకం సృష్టించరాదని నచ్చజెప్పారు. త్రాగునీరు కోసం సమూద్ జాతికి ఒక రోజు, దేవుని సూచనగా ఉన్న ఆ ఆడ ఒంటెకు ఒక రోజు వంతులు వేయబడ్డాయి. కాని ఆ దుర్మార్గులు ఆ సూచనను సయితం ధిక్కరించారు.
14. ఒంటెను చిత్రహింసలుపెట్టి చంపే ఆ తంతునంతా ఖుదార్ ఒక్కడే నిర్వహించాడు. అయితే ఆ మహాపరాధంలో ఆ జాతివారంతా అతనికి అండగా నిలిచిన కారణంగా వారంతా అపరాధులుగానే ఖరారు అయ్యారు. ఈ ఉదంతం ద్వారా స్పష్టమయ్యే ఒక సూత్రప్రాయమైన విషయం ఏమిటంటే, ఒక చెడుకు పాల్పడేవారు కొద్దిమందే అయినప్పటికీ సమాజ సభ్యులంతా దాన్ని ఖండించే బదులు సుముఖత తెలిపితే లేక తెలిసీ తెలియనట్లుగా వదలివేస్తే, అప్పుడు దేవుని దృష్టిలో ఆ సమాజ సభ్యులంతా ఆ చెడులో భాగస్థులుగానే పరిగణించబడతారు.
15. అంటే – చాలా భయంకరమైన విపత్తును వారిపైకి అవతరింపజేశాడు.
16. ఆ విపత్తును ఏ కొద్దిమంది కొరకు గాకుండా అందరికీ వర్తించే విధంగా చేశాడు. ఆ జాతిలోని పిన్నలు – పెద్దలు, స్త్రీలు – పురుషులు అందరూ ఆ దెబ్బకు తా అన్నారు.
17. వారిని ఆ విధంగా నాశనం చేసినందుకు ఎవరయినా తనపై ప్రతీకారం తీర్చుకుంటారన్న భయం దైవానికి లేదు. ప్రతీకారం తీర్చుకునేదెవరు? ఆ శక్తి ఎవరికుందని? ప్రతీకారం తీర్చుకోవాలంటే సమ ఉజ్జీ అయి ఉండటం అవసరం. కాని విశ్వప్రభువుతో సరితూగగల వాడెవడున్నాడని?

92వ సూరా

# అల్ లైల్

రాత్రి

అవతరణ మక్కాలో

ఆయతులు 21

## పరిచయం

ఈ సూరా ముఖ్యంగా అల్లాహ్ మార్గంలో కృషిచేయడం గురించి, ఇహలోకంలో మన సంఘర్షణ గురించి తెలియజేసింది. మొదటి ఆయతులో వచ్చిన 'లైల్' (రాత్రి) అన్న ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టబడింది. ఇహలోక జీవితం ఒక సంఘర్షణ అని, ఇహపర లోకాల్లో సాఫల్యం లేదా వైఫల్యం అన్నది ఈ సంఘర్షణపై ఆధారపడి ఉందని, మనం అల్లాహ్‌ను విశ్వసించి మంచి పనులు చేస్తే, అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగిఉండి దానధర్మాలు చేస్తే, సత్యాన్ని విశ్వసిస్తే సాఫల్యం పొందగలమనీ, అల్లాహ్ మనకు శాశ్వత స్వర్గవనాలు ప్రసాదిస్తాడని ఈ సూరా తెలిపింది. కాని మనిషి దుర్మార్గానికి ఒడిగట్టి, అల్లాహ్‌కు దూరమైతే, స్వార్థంతో, దురాశతో వ్యవహరిస్తే, సత్యాన్ని తిరస్కరిస్తే దారుణంగా విఫలమవు తాడు. అల్లాహ్ ఆదేశాలను తిరస్కరించిన వారికి భగభగమండే అగ్నిశిక్ష సిద్ధంగా ఉందని ఇందులో హెచ్చరించడం జరిగింది.

## అల్ లైల్ సూరా — سُورَةُ اللَّيْلِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

1 (చీకటిని) అలుముకున్నప్పటి రాత్రి సాక్షిగా![1]

وَاللَّيْلِ إِذَا يَغْشَىٰ ﴿1﴾

2 వెలుగును విరజిమ్మేటప్పటి పగటి సాక్షిగా![2]

وَالنَّهَارِ إِذَا تَجَلَّىٰ ﴿2﴾

3 మగ, ఆడ జాతులను సృష్టించిన వాని సాక్షిగా![3]

وَمَا خَلَقَ الذَّكَرَ وَالْأُنثَىٰ ﴿3﴾

4 నిశ్చయంగా మీ కృషి (ప్రయత్నం) అనేక విధాలుగా ఉంటుంది.[4]

إِنَّ سَعْيَكُمْ لَشَتَّىٰ ﴿4﴾

---

1. పగలు – రేయి, వెలుగు – చీకటి, ఆడ – మగ మొదలగునవి ఒండొకదానికి విరుద్ధంగా ఉన్నట్లే మనిషి చేసే కర్మల్లో కూడా మంచీ – చెడు అనే పరస్పర విరుద్ధమైనవి ఉంటాయి. రానున్న వాక్యాలలో ఆ విషయం చెప్పటానికి ఈ ప్రమాణం చేయబడింది. రాత్రి చీకటి కూడా పగటి వెలుగును వెంటాడుతూ ఉంటుంది.
2. పగలును రాత్రి తరుముకుంటూ వచ్చినట్లే రాత్రిని పగలు కూడా వెంటాడుతూ వస్తుంది. తెల్లవారు జామున ఆకాశంలో ధవళరేఖలు ప్రస్ఫుటం అయ్యేకొలదీ చీకటి విడిపోతూ ఉంటుంది. చివరికి మసక మసక వెలుతురు కాస్తా చీకటి తెరలను చీలుస్తూ పూర్తిగా ప్రత్యక్షమవుతుంది.
3. ఇక్కడ దేవుడు తన గురించి తానే ప్రమాణం చేశాడు. ఎందుకంటే లోకంలో ఆడ – మగ (లేక పెంటి – పోతు) జతలను సృష్టించినవాడు స్వయంగా ఆయనే.
4. అంటే కొందరు సత్కర్మలు చేసుకుంటారు. మరికొందరు దుష్కర్మలు చేస్తారు. సత్కర్మలు చేసినవారు తమ సంపాదనకు ప్రతిఫలంగా స్వర్గం పొందుతారు. దుష్కర్మలకు పాల్పడినవారు తమ సంపాదనకు బదులుగా నరకానికి ఆహుతి అవుతారు.

| | |
|---|---|
| 5 ఎవరయితే (దైవమార్గంలో) ఇచ్చాడో, (తన ప్రభువుకు) భయపడుతూ ఉన్నాడో,[5] | فَاَمَّا مَنۡ اَعۡطٰى وَاتَّقٰىۙ ﴿5﴾ |
| 6 ఇంకా సత్ఫరిణామాన్ని సత్యమని ధృవపరిచాడో,[6] | وَصَدَّقَ بِالۡحُسۡنٰىۙ ﴿6﴾ |
| 7 అతనికి మేము సులువైన మార్గపు సౌకర్యం వొసగుతాము.[7] | فَسَنُيَسِّرُهٗ لِلۡيُسۡرٰىؕ ﴿7﴾ |
| 8 మరెవరయితే పిసినారిగా తయారై, నిర్లక్ష్యధోరణిని ప్రదర్శిం చాడో,[8] | وَاَمَّا مَنۡۢ بَخِلَ وَاسۡتَغۡنٰىۙ ﴿8﴾ |
| 9 సత్ఫరిణామాన్ని త్రోసిపుచ్చాడో,[9] | وَكَذَّبَ بِالۡحُسۡنٰىۙ ﴿9﴾ |
| 10 అతనికి మేము కఠిన (దుర్) మార్గపు సామగ్రిని సమకూరుస్తాము.[10] | فَسَنُيَسِّرُهٗ لِلۡعُسۡرٰىؕ ﴿10﴾ |
| 11 అతను పడిపోయే సమయంలో అతని ధనం అతనికే విధంగానూ పనికిరాదు.[11] | وَمَا يُغۡنِىۡ عَنۡهُ مَالُهٗۤ اِذَا تَرَدّٰىؕ ﴿11﴾ |

5. అంటే, ఎవరు మంచి పనుల కొరకు తన ధనాన్ని ఖర్చుపెడతాడో, దేవుడు అధర్మంగా ఖరారు చేసిన పనులకు దూరంగా ఉంటాడో ఆ వ్యక్తి.

6. అంటే – దైవమార్గంలో ధనాన్ని వెచ్చించినందుకు, భయభక్తులతో జీవితం గడిపినందుకు దేవుడు బహుమానం ఇస్తాడని ఎవరు దృఢంగా నమ్ముతారో....

7. **'యుస్రా'** అంటే సత్కార్యాలు లేక సద్బుద్ధి. అంటే, ఇలాంటి సజ్జనునికి మేము మంచి పనులు చేసే, దైవవిధేయతా మార్గాన నడిచే సద్బుద్ధిని ప్రసాదిస్తాము. ఆ మార్గాన్ని అతని కొరకు సులభతరం చేస్తాము. ఈ ఆయతు హజ్రత్ అబూబకర్ (రజి) నేపథ్యంలో అవతరించినదని ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అబూబకర్ (రజి) ఆరుగురు బానిసలకు బానిసత్వం నుండి విముక్తి కల్పించారు. వారు ఇస్లాం స్వీకరించినందుకు మక్కా అవిశ్వాసులు వారిని తీవ్రంగా వేధించేవారు (ఫత్‌హుల్ ఖదీర్).

8. అంటే దైవమార్గంలో ఖర్చుపెట్టకుండా, దైవాజ్ఞలను లక్ష్యపెట్టకుండా నిర్భయంగా ఉండే వ్యక్తి.

9. ఇంకా – పరలోకంలో దేవుడు ఇచ్చే బహుమానాన్ని లేక విధించే శిక్షను నమ్మనివాడు.

10. **'ఉస్రా'** ( عُسۡرٰى ) అంటే గడ్డుస్థితి అని అర్థం. చెడుల మార్గం, నష్టకరంగా పరిణమించే విధానం అన్నమాట! అంటే దైవమార్గంలో పిసినిగొట్టుగా తయారై, దైవాదేశాలను సయితం ఖాతరు చేయకుండా పోయేవాడికి మేము అవిధేయతా మార్గాన్ని మరింత సులువు చేస్తాము. దాంతో అతనికి మంచిని, శుభాన్ని ఆస్వాదించే భాగ్యం మరింత కష్టమైపోతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విషయాన్ని దేవుడు పలుచోట్ల పలు విధాలుగా వివరించాడు. సారాంశం మాత్రం ఒక్కటే – శ్రేయస్కర మార్గాన్ని అవలంబించిన వ్యక్తికి దేవుడు ఆ మార్గంలో ఇంకా ముందుకు సాగిపోయే సౌకర్యాన్ని ఇస్తాడు. దానికి బదులు దుర్మార్గాన్నే అంటిపెట్టుకుని ఉండే వాడ్ని దేవుడు వాడి మానాన వదలిపెట్టేస్తాడు. ఇదంతా దేవుడు తన జ్ఞానంతో రాసిపెట్టిన విధివ్రాత ప్రకారమే జరుగుతుంది (ఇబ్నె కసీర్). ఈ మాటే హదీసులో ఈ విధంగా చెప్పబడింది : "మీరు ఆచరణకు ఉపక్రమించండి. ప్రతి వ్యక్తీ తానేపని కోసం పుట్టించబడ్డాడో అది అతని కోసం సులభతరం చేయబడుతుంది. సౌభాగ్యవంతునికి సౌభాగ్యానికి నోచుకునే కర్మలను చేసే సద్బుద్ధి వొసగబడుతుంది. దౌర్భాగ్యునికి దౌర్భాగ్యానికి లోను చేసే కర్మలు సులభతరం చేయబడతాయి" అని మహనీయ ముహమ్మద్ (సఅసం) చెప్పారు. (సహీహ్ బుఖారీ – అల్ లైల్ సూరా వ్యాఖ్యానం).

**12** నిజంగా మార్గం చూపే బాధ్యత మాదే.[12]
إِنَّ عَلَيْنَا لَلْهُدَىٰ ﴿12﴾

**13** పరలోకం, ఇహలోకం కూడా నిజంగా మా అధీనంలోనే ఉన్నాయి.[13]
وَإِنَّ لَنَا لَلْآخِرَةَ وَالْأُولَىٰ ﴿13﴾

**14** మరి నేను మటుకు నిప్పులు చెరిగే నరకాగ్ని గురించి మిమ్మల్ని హెచ్చరించాను.
فَأَنذَرْتُكُمْ نَارًا تَلَظَّىٰ ﴿14﴾

**15** దౌర్భాగ్యుడు మాత్రమే దానికి ఆహుతి అవుతాడు.[14]
لَا يَصْلَاهَا إِلَّا الْأَشْقَى ﴿15﴾

**16** వాడు(సత్యాన్ని) ధిక్కరించి, (దాన్నుండి) ముఖం తిప్పుకుని పోయాడు.
الَّذِي كَذَّبَ وَتَوَلَّىٰ ﴿16﴾

**17** దైవభీతిపరుడు మాత్రం దాన్నుండి సురక్షితంగా ఉంచ బడతాడు[15] –
وَسَيُجَنَّبُهَا الْأَتْقَى ﴿17﴾

**18** (ఎందుకంటే) అతను పవిత్రుడయ్యే నిమిత్తం తన ధనాన్ని ఇస్తాడు.[16]
الَّذِي يُؤْتِي مَالَهُ يَتَزَكَّىٰ ﴿18﴾

**19** పోనీ, అతనెవరికయినా ప్రత్యుపకారం చేస్తున్నాడా అంటే, అతనిపై ఒకరి ఉపకారం కూడా లేదాయె.[17] (అయినాసరే అతను ఉపకారం చేస్తూనే ఉన్నాడు).
وَمَا لِأَحَدٍ عِندَهُ مِن نِّعْمَةٍ تُجْزَىٰ ﴿19﴾

---

11. అంటే – వాడు నరకంలో పడిపోయే సమయంలో వాడు కూడబెట్టిన ధనం వాడికేమాత్రం ఉపయోగపడదు.

12. అంటే – ధర్మాధర్మాలను, మంచీచెడులను, ఉచితానుచితాలను, సత్యాసత్యాలను విడమరచి చెప్పి సన్మార్గమేదో – అపమార్గమేదో సూచించే బాధ్యత మామీదే ఉన్నది (అయితే ఆ పనిని మేము చేసేశాము) అని దేవుడంటున్నాడు.

13. అంటే–ఇహపరాలు రెండింటికీ యజమానులం మేమే. ఈ రెండు లోకాలలో కూడా మేము తలచినట్లుగా చేస్తాము. కాబట్టి మా దాసులలో ఎవరయినాసరే – తమకు ఇహం కావాలన్నా, పరం కావాలన్నా – మమ్మల్నే అడగాలి. ఎందుకంటే అభ్యర్థించే ప్రతి ఒక్కరికీ మేమే మా ప్రణాళిక ననుసరించి ప్రసాదిస్తాము.

14. ఈ ఆయతును అర్థం చేసుకోవటంలో ముర్జియా అనే ఒక వర్గంవారు పొరబడ్డారు. అవిశ్వాసులు మాత్రమే నరకానికి ఆహుతి అవుతారని, ముస్లింలు ఎన్ని పాపాలు చేసినా వారిని నరకాగ్ని తాకదని వక్రభాష్యం చెప్పారు. ఈ భాష్యం సరైనది కాదు. ఎంతోమంది ముస్లింలు కూడా తమ పాపాల మూలంగా నరకానికి పోతారు. అయితే దేవుడు వారిని, వారి దురాగతాలకుగాను కొంతకాలం పాటు శిక్ష విధించి, దైవప్రవక్తల, దైవదూతల, పుణ్యపురుషుల సిఫారసుపై వారిని నరకం నుంచి విముక్తి కల్పిస్తాడు. కరడుగట్టిన అవిశ్వాసులు దౌర్భాగ్యులనీ, నరకం అసలు వారికోసమే చేయబడిందని చెప్పటం ఈ ఆయతు ముఖ్యోద్దేశం. వారు నరకంలో శాశ్వతంగా ఉంటారు. అదే ముస్లింలలోని తలబిరుసులు, అవిధేయులైతే వారు తమ పొగరు మూలంగా నరకానికి తప్పకుండా ఆహుతి అవుతారు. కాని వారు నరకంలో కలకాలం ఉండరు. కొంతకాలం తరువాత నరకం నుంచి తీయబడతారు (ఫత్హుల్ ఖదీర్).

15. అంటే, అతను నరకానికి దూరంగా ఉంచబడతాడు. స్వర్గంలో ప్రవేశింపజేయబడతాడు.

16. అంటే – అతను తన సంపదను దైవాజ్ఞల కనుగుణంగా ఖర్చుచేస్తాడు. తద్వారా తన ఆత్మను పరిశుద్ధపరచుకోవటంతో పాటు, తన సంపదను కూడా పరిశుద్ధపరచుకుంటాడు. జకాత్ ద్వారా ధనం పరిశుద్ధమవుతుంది కదా!

20 మహోన్నతుడైన తన ప్రభువు ప్రసన్నతను పొందటానికి మాత్రమే అతను ఈ పని చేస్తున్నాడు.[18]

إِلَّا ٱبۡتِغَآءَ وَجۡهِ رَبِّهِ ٱلۡأَعۡلَىٰ ⑳

21 కాబట్టి ఆయన (కూడా) తప్పకుండా సంతోషిస్తాడు.[19]

وَلَسَوۡفَ يَرۡضَىٰ ㉑

17. అంటే – ఒకరు తనకు చేసిన ఉపకారానికి బదులు తీర్చుకునే ఉద్దేశంతో గాకుండా మేలుచేసే ఉద్దేశంతో ఇస్తాడు.

18. అతను ఎవరికి ఏ ఉపకారం చేసినా, ఎవరికి ఏ సహాయం చేసినా, ఎన్ని దానధర్మాలు చేసినా అతని లక్ష్యం ఒక్కటే అయి ఉంటుంది – తన ప్రభువును ప్రసన్నుణ్ణి చేయాలి, తద్వారా స్వర్గం పొందాలి.

19. దీన్ని రెండు విధాలుగా అర్థం చేసుకునేందుకు ఆస్కారం ఉన్నది. 1. ఆయన (అంటే అల్లాహ్) కూడా సంతోషిస్తాడు. లేదా 2. ఈ సద్గుణాలున్న వ్యక్తికి దేవుడు స్వర్గభాగ్యాలు ప్రసాదిస్తాడు. దాంతో ఆ వ్యక్తి ఎంతగానో సంతోషిస్తాడు. ఈ ఆయతు హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (రజి) నేపథ్యంలో అవతరించిందని చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఆధారాలతో సహా అభిప్రాయపడ్డారు. అయితే ఈ వాక్యం సదరు సద్గుణాలున్న విశ్వాసులందరికీ వర్తిస్తుందనేది నిజం.

**93 వ సూరా**

# అజ్ జుహా

## పగటి ప్రకాశం

అవతరణ **మక్కాలో**

ఆయతులు **11**

### పరిచయం

ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలు ఇందులో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త (సఅసం)కు ఊరటనిస్తూ, అల్లాహ్ ఆయన్ను వదలిపెట్టలేదని చెప్పడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అనాథ బాలునిగా ఉన్నప్పుడు ఆయనకు సహాయం చేసింది అల్లాహ్‌యేనని, మార్గం తెలియని స్థితిలో ఉన్నప్పుడు మార్గం చూపింది అల్లాహ్‌యేనని, బీదరికంలో ఉన్నప్పుడు సంపద ప్రసాదించింది అల్లాహ్‌యేనని గుర్తుచేయడం జరిగింది. రాబోయే కాలం గతకాలం కన్నా నిశ్చయంగా మేలైనదిగా ఉంటుందని చెప్పడం జరిగింది. అనాథల పట్ల దయతో వ్యవహరించాలని, యాచకులను కసురుకోరాదని, అల్లాహ్ ప్రసాదించిన వరాలను గురించి అందరికీ తెలియజేయాలని చెప్పడం జరిగింది.

### అజ్ జుహా[1] సూరా

سُورَةُ الضُّحَىٰ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

1 పొద్దెక్కుతున్నప్పటి ఎండ సాక్షిగా![2]

وَٱلضُّحَىٰ ①

1. ఒకసారి దైవప్రవక్త ముహమ్మదు (సఅసం) వారికి జబ్బుచేసింది. రెండు మూడు రాత్రులు ఆయన (సఅసం) తహజ్జుద్ నమాజుకై లేవలేకపోయారు. ఒక స్త్రీ వచ్చి ఆయన్ని రెచ్చగొట్టే ఉద్దేశంతో, "ఓ ముహమ్మద్ (సఅసం) ! నీ దెయ్యం నిన్ను విడిచిపెట్టేసినట్టుందే! నాకు తెలిసినంతవరకు రెండు మూడు రాత్రుల నుండి అది నీ దగ్గరకు

**2** కుదుటపడిన రాత్రి సాక్షిగా![3]

وَالَّيْلِ إِذَا سَجَىٰ ﴿2﴾

**3** (ఓ ముహమ్మద్ – సఅసం!) నీ ప్రభువు నిన్ను వదలిపెట్టనూ లేదు, నీతో విసిగిపోనూ లేదు.[4]

مَا وَدَّعَكَ رَبُّكَ وَمَا قَلَىٰ ﴿3﴾

**4** నిశ్చయంగా నీ కోసం చివరికాలం తొలికాలం కన్నా మేలైనదిగా ఉంటుంది.[5]

وَلَلْآخِرَةُ خَيْرٌ لَّكَ مِنَ الْأُولَىٰ ﴿4﴾

**5** నీ ప్రభువు త్వరలోనే నీకు (గొప్ప బహుమానం) వొసగుతాడు. దాంతో నీవు సంతోషపడతావు.[6]

وَلَسَوْفَ يُعْطِيكَ رَبُّكَ فَتَرْضَىٰ ﴿5﴾

**6** ఏమిటి, నువ్వు అనాథగా ఉండటం చూసి, ఆయన నీకు ఆశ్రయం కల్పించలేదా?[7]

أَلَمْ يَجِدْكَ يَتِيمًا فَآوَىٰ ﴿6﴾

**7** మరి నిన్ను మార్గం తెలియనివానిగా గ్రహించి, సన్మార్గం చూపలేదా?[8]

وَوَجَدَكَ ضَالًّا فَهَدَىٰ ﴿7﴾

**8** ఇంకా – నిన్ను అభాగ్యునిగా పొంది భాగ్యవంతునిగా చేయలేదా?[9]

وَوَجَدَكَ عَائِلًا فَأَغْنَىٰ ﴿8﴾

---

రావటంలేదు కదూ!"అన్నది. ఈ నేపథ్యంలోనే అల్లాహ్ ఈ సూరాను అవతరింపజేశాడు (సహీహ్ బుఖారీ– అజ్జుహా సూరా వ్యాఖ్యానం). ఇంతకీ ఆ స్త్రీ ఎవరోకాదు, ఆమె అబూలహబ్ భార్య అయిన ఉమ్మె జమీల్. (ఫత్హుల్ బారీ)

2. సూర్యుడు ఉజ్వలంగా ప్రకాశిస్తూ పైకెక్కే సమయాన్ని అరబీలో **'జుహా'** (ضُحىٰ) అంటారు.

3. **'సజా'** (سَجىٰ) అంటే శాంతించిన, కుదుటపడిన, నిశ్చలమైన అని అర్థం. రాత్రి దట్టమైన చీకటిని అలుముకున్నప్పుడు ఈ స్థితి ఏర్పడుతుంది. ఎందుకంటే ఆ సమయంలో నలువైపులా ప్రశాంతత, నిశ్శబ్దం ఆవరిస్తుంది.

4. నీ ప్రభువు నిన్ను అనాథగా, అనామకునిగా విడిచిపెట్టేశాడని ఈ అవిశ్వాసులు అనుకుంటున్నారు కదూ! ముమ్మాటికీ అది నిజం కాదు.

5. లేదా (మరొక అర్థం ప్రకారం) పరలోకం ఇహలోకంకన్నా శ్రేష్ఠమైనది. రెండు అర్థాలు కూడా సందర్భం రీత్యా సరైనవే.

6. అంటే – ప్రపంచంలో నీ ప్రభువు నీకు గొప్ప విజయాలు ప్రసాదించటంతో పాటు, పరలోకంలో కూడా నీకు అనంతమైన పుణ్యఫలాన్ని అనుగ్రహిస్తాడు. మహాప్రవక్త (సఅసం) తన అనుచర సమాజంలోని పాపాత్ముల కోసం చేసే సిఫారసు కూడా ఈ బహుమానంలో చేరి వుంది.

7. అంటే – నువ్వు కూడా బాల్యంలో తండ్రి నీడను కోల్పోయావు. మేము నీకు అండగా ఉన్నాము. నీ పోషణకు కావలసిన ఏర్పాట్లు చేశాము.

8. ఒకప్పుడు నీకు ధర్మజ్ఞానంగానీ, షరీయతు పరిజ్ఞానంగానీ ఉండేది కాదు. మరి మేము నీకు దారి చూపాము. ప్రవక్త పదవిని అనుగ్రహించాము. నీపై గ్రంథాన్ని అవతరింపజేశాము. అంతకుముందైతే నువ్వు సన్మార్గం కోసం చింతాగ్రస్తుడై ఉండేవాడివి.

| | |
|---|---|
| **9** కాబట్టి (ఓ ప్రవక్తా!) నువ్వు కూడా అనాథ పట్ల దురుసుగా ప్రవర్తించకు.[10] | فَأَمَّا الْيَتِيمَ فَلَا تَقْهَرْ ﴿٩﴾ |
| **10** యాచించేవానిని కసిరికొట్టకు.[11] | وَأَمَّا السَّائِلَ فَلَا تَنْهَرْ ﴿١٠﴾ |
| **11** ఇంకా నీ ప్రభువు అనుగ్రహాలను గురించి పొగుడుతూ ఉండు.[12] | وَأَمَّا بِنِعْمَةِ رَبِّكَ فَحَدِّثْ ﴿١١﴾ |

9. అంటే – ఒకరిపై ఆధారపడకుండా నిన్ను స్వతంత్రునిగా, నిరపేక్షాపరునిగా చేశాను. నీవు లేమిలో సహనశీలునిగానూ, కలిమిలో కృతజ్ఞుడిగానూ ఉండి సరైన మార్గాన్నే ఎన్నుకున్నావు. అందుకే దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా అంటూ ఉండేవారు: "పుష్కలమైన సాధనసంపత్తులే 'కలిమి'కి చిహ్నం కావు. అసలు సిసలు కలిమి హృదయంలోని కలిమి (నిరపేక్షాభావం) మాత్రమే." (సహీహ్ ముస్లిం – జకాత్ ప్రకరణం).

10. పైగా నువ్వు తండ్రిలేని బిడ్డపట్ల మృదువుగా వ్యవహరించు. అతనిపై జాలి చూపు.

11. అర్థించేవారిని అదిలించకు. వారిపై విసుగును, అసహనాన్ని ప్రదర్శించకు. కరకు మాటలతో వారి మనసు నొప్పించకు. వారికేదన్నా చెప్పవలసివస్తే మంచిగా, ప్రేమగా చెప్పు, అంతే.

12. అంటే (ఓ ముహమ్మద్ – సఅసం!) దేవుడు నీకు చేసిన అపారమైన మేళ్లను మరచిపోకు. ఉదాహరణకు : దేవుడు నీకు సన్మార్గం చూపటమే కాకుండా నిన్ను తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. నీవు ఒక అనాథ అయినప్పటికీ నీ పోషణకు గొప్ప ఏర్పాటు చేశాడు. నీకు ఆత్మతృప్తినీ, నిరపేక్షాభావాన్నీ ప్రసాదించాడు. కాబట్టి నువ్వు కృతజ్ఞతా వైఖరి ద్వారా ఈ అనుగ్రహాలను వ్యక్తపరుస్తూ ఉండు. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే దైవానుగ్రహాలను వ్యక్తపరచటం, మెచ్చుకోలుగా చెప్పుకోవటం దైవానికి ఇష్టకరమైనది. అయితే అలా వ్యక్తం చేస్తున్నప్పుడు మనిషిలో అహంకారంగానీ, బడాయిగానీ తొంగిచూడకూడదు. పైగా దేవునిపట్ల వినయంతో, కృతజ్ఞతాభావంతో అతని గుండెలు కరిగి, కళ్ల ద్వారా వర్షించాలి. అదే సమయంలో దేవుని మహోజ్వలానికి కించిత్ భయం కూడా చెందాలి. ఎందుకంటే ఈ అనుగ్రహ భాగ్యాలు ఏ క్షణంలోనయినా దక్కకుండా పోవచ్చున్న భయం మనిషిని వినమ్రునిగా ఉంచుతుంది.

94 వ సూరా

# అష్ షరహ్

## హృదయాన్ని తెరవటం

అవతరణ మక్కాలో

ఆయతులు 8

### పరిచయం

ప్రవక్త ముహమ్మద్(సఅసం)పై అల్లాహ్ అనుగ్రహాలను ఈ సూరాలో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరా మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం) హృదయాన్ని అల్లాహ్ కారుణ్యంతో నింపాడు. ప్రజలందరినీ ఆహ్వానించే విశాల హృదయం ప్రసాదించాడు. కష్టనష్టాలను తొలగించి, ఆయన హోదా గౌరవాలను ఇనుమడింపచేసాడు. కాబట్టి, అధైర్యపడకుండా, క్రుంగిపోకుండా, అల్లాహ్ ప్రసన్నత పొందడానికి తీరిక లభించినపుడు ఆరాధనలో నిమగ్నమై పోవాలని ఆయనకు బోధించడం జరిగింది.

### అష్ షరహ్ సూరా سُورَةُ الشَّرْح

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ |
| 1 (ఓ ముహమ్మద్ – స!) ఏమిటి, మేము నీ హృదయాన్ని నీ కోసం విప్పలేదా?[1] | اَلَمْ نَشْرَحْ لَكَ صَدْرَكَ ① |
| 2 ఇంకా నీ మీది నుంచి నీ భారాన్ని కూడా మేము దించేశాము.[2] | وَوَضَعْنَا عَنْكَ وِزْرَكَ ② |

1. ఈ సూరాను అలమ్ నష్రహ్ లేదా అష్ షర్హ్ సూరా అని కూడా అంటారు. వెనుకటి (జుహా) సూరాలో దేవుని మూడు అనుగ్రహాలు ప్రస్తావించబడ్డాయి. మరో మూడు మహదానుగ్రహాలు ఈ సూరాలో కూడా పేర్కొనబడ్డాయి. హృదయాన్ని విప్పారజేయటం వీటిలో మొదటిది. దీని ఆంతర్యం ఏమిటంటే మేము (ఓ ముహమ్మద్) నీ హృదయాన్ని జ్యోతిర్మయం చేశాము. నీకు హృదయవిశాలతను ప్రసాదించాము. తత్కారణంగా సత్యవాక్కు నీకు శీఘ్రంగా అవగతమవుతుంది. అది నీ పాలిట ఫలవంతమవుతుంది. ఈ విషయాన్నే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులో ఇలా చెప్పటం జరిగింది : "అల్లాహ్ తాను సన్మార్గం చూపగోరిన వ్యక్తి హృదయాన్ని ఇస్లాం కొరకు విప్పారజేస్తాడు" (అల్ అన్ఆమ్ – 125). అప్పుడు ఆ వ్యక్తి ఇస్లాంను సత్యధర్మంగా తెలుసుకోవటమేగాక, దాన్ని హృదయపూర్వకంగా గ్రహిస్తాడు కూడా.

   హృదయాన్ని విప్పారజేసే ఈ ప్రక్రియలో **'రొమ్మును చీల్చటం'** కూడా అంతర్లీనమై ఉంది. ప్రామాణిక ఆధారం ప్రకారం రెండుసార్లు అంతిమ దైవప్రవక్త (సఅసం) వారి రొమ్ము చీల్చబడింది. ఒకసారి బాల్యంలో ఈ పని జరిగింది. ఆయన (స) నాల్గవ యేటలో ఉండగా దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) వచ్చి ఆయన రొమ్మును చీల్చి, అందులోని పైశాచిక భాగాన్ని తీసివేశారు. (ఈ పైశాచిక ప్రవృత్తి ప్రతి మనిషిలో దాగి ఉంటుంది). తరువాత ఆ రొమ్మును కడిగి, దాన్ని మూసివేశారు (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్). రెండవసారి మేరాజ్ (గగన యాత్ర) సందర్భంగా ఈ పని జరిగింది. ఈసారి ఆయన (సఅసం) రొమ్మును చీల్చి హృదయాన్ని బయటికి తీసి, దాన్ని జమ్‌జమ్ జలంతో కడిగి, యధాస్థానంలో ఉంచటం జరిగింది. దాన్ని విశ్వాసంతో, యుక్తితో నింపటం జరిగింది. (సహీహ్ బుఖారీ, ముస్లిం – మేరాజ్ అధ్యాయాలు, నమాజు ప్రకరణం).

2. ఈ భారం ప్రవక్తగా నియమించబడక మునుపు గల 40 ఏండ్ల ఆయన (స) జీవితానికి సంబంధించినది. ఈ 40

| | |
|---|---|
| **3** అది నీ వీపును విరిచివేస్తూ ఉండేది. | الَّذِيٓ اَنْقَضَ ظَهْرَكَ ﴿3﴾ |
| **4** ఇంకా – మేము నీ కీర్తిని ఉన్నతం చేశాము.[3] | وَرَفَعْنَا لَكَ ذِكْرَكَ ﴿4﴾ |
| **5** అయితే (ప్రతి) కష్టంతోపాటే సౌలభ్యం కూడా ఉంది. | فَاِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا ﴿5﴾ |
| **6** నిశ్చయంగా (ప్రతి) కష్టంతోపాటే సౌలభ్యం కూడా ఉంది.[4] | اِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا ﴿6﴾ |
| **7** కాబట్టి నీకు తీరిక చిక్కినప్పుడు (ఆరాధనలో) గట్టిగా శ్రమించు.[5] | فَاِذَا فَرَغْتَ فَانْصَبْ ﴿7﴾ |
| **8** నీ ప్రభువు వైపే మనసును లగ్నం చెయ్యి.[6] | وَاِلٰى رَبِّكَ فَارْغَبْ ﴿8﴾ |

ఏండ్ల కాలంలో ఆయన పాపకార్యాలకు దూరంగా ఉండినప్పటికీ, ఏ విగ్రహం ఎదుట కూడా ఆయన సాష్టాంగ ప్రణామం చేయనప్పటికీ, ఎన్నడూ సారాయి త్రాగనప్పటికీ, ఇతరత్రా చెడులకు ఆమడ దూరంగా ఉన్నప్పటికీ– ఈ కాలంలో తాను సజావుగా దైవారాధన చేయలేకపోయానే! అన్న భావన ఆయన్ని కృంగదీసేది. నిజానికి అందులో ఆయన దోషం ఏమీ లేకపోయినప్పటికీ, ఒక సుదీర్ఘకాలం జీవితం అర్థరహితంగా, లక్ష్యరహితంగా కరిగిపోయిందే అన్న బాధ లోలోపలే కలిగి, ఆయన(స) కుమిలిపోతుండేవారు. ఈ భారాన్ని ఆయన (స) పైనుంచి దించివేస్తున్నట్లు దేవుడు ప్రకటించి ఆయన (స)కు మహోపకారం చేశాడు. “అల్లాహ్ నీ పూర్వపు పొరపాట్లను, భావికాలపు పొరపాట్లను మన్నించదలిచాడు”(అల్ ఫత్హ్–2) అన్న ఆయతు కూడా దాదాపు ఈ నేపథ్యంలోనే ఉంది.

మరికొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం ఈ ‘భారం’ ప్రవక్త పదవీ బాధ్యతలకు సంబంధించినది. ఈ బాధ్యతలు మానసికంగా ఆయన్ని (స) తీవ్రమైన ఒత్తిడికి లోనుచేసేవి. అందువల్ల దేవుడు దాన్ని తేలికచేశాడు. అంటే ఈ మార్గంలో ఎదురయ్యే బాధలను ఓర్పుతో, నేర్పుతో భరించే స్థయిర్యాన్ని ప్రసాదించాడు. దైవధర్మ ప్రచార కార్యంలో గల కొన్ని అవరోధాలను సులభతరం చేశాడు.

3. అంటే – ఓ ముహమ్మద్ (సఅసం)! నీ పేరు మార్మోగిపోయేలా చేశాము. దీని భావం ఏమిటంటే ‘అల్లాహ్’ పేరు వచ్చిన చోటల్లా ముహమ్మద్ (సఅసం) పేరు కూడా వస్తుంది. ఉదాహరణకు : అజాన్, ఇఖామత్, నమాజులలోనూ, ఇతరత్రా ధార్మిక సదనాలలోనూ మీరు ఈ విషయాన్ని గమనిస్తారు. వెనుకటి ఆకాశగ్రంథాలలో కూడా ఆయన (స) పేరు, గుణగణాలు ప్రస్తుతించబడ్డాయి. దైవదూతలు సయితం ఊర్ధ్వలోకాలలో ఆయన (స) స్మరణ చేస్తూ ఉంటారు. ఆయన (స)కు విధేయత చూపటం తనకు విధేయత చూపటం వంటిదేనని దేవుడు సెలవిచ్చాడు.

4. ఈ వాక్యంలో దైవప్రవక్త (స)కు, ఆయన ప్రియసహచరులకు శుభవార్త ఉంది. దైవ మార్గంలో కష్టాలు ఎదురైనంత మాత్రాన మీరు కలత చెందవలసిన అవసరం లేదని, ఈ కష్టాల తరువాత సుఖాలు కూడా వస్తాయని తెలియజేయ బడింది. చివరికి జరిగింది కూడా అదే. యావత్ప్రపంచానికి ఈ సంగతి తెలిసిందే.

5. అంటే దైవధర్మ ప్రచార కార్యక్రమం నుండి, మిథ్యావాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటం నుండి వెసులుబాటు లభించినప్పుడల్లా ప్రార్థనల్లో లీనమై తీవ్రంగా పరిశ్రమించాలి. సుదీర్ఘమైన దుఆలు చేయాలి. అలసిపోయే వరకూ అల్లాహ్‌ను ఆరాధిస్తూనే ఉండాలి.

6. అంటే నీ ప్రభువు పైనే ఆశలు పెట్టుకో. ఆయన నుంచే స్వర్గాన్ని కోరు. నీకేం కావాలన్నా ఆయన్నే అర్థించు. వ్యవహారాలన్నింటిలోనూ ఆయనపైనే నమ్మకం పెట్టుకో. ఆయనే నమ్మదగ్గ నేస్తం.

95వ సూరా

# అత్ తీన్

## అంజూరం

అవతరణ మక్కాలో

ఆయతులు 8

### పరిచయం

సృష్టిరాసులన్నింటిలోను మానవునికి అత్యున్నత స్థానాన్ని ఇవ్వడం జరిగిందన్న విషయాన్ని ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. మొదటి ఆయతులో వచ్చిన 'తీన్' (అంజూరం) అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మనిషిని చక్కని రూపులో సృష్టించడం జరిగిందని, ఉత్తమమైన శారీరక, మానసిక శక్తులు ప్రసాదించడం జరిగిందని, ఇవన్నీ అల్లాహ్ అనుగ్రహాలని ఈ సూరా తెలియజేసింది. అందువల్ల మనిషి అల్లాహ్‌కు కృతజ్ఞుడై ఉండాలని బోధించింది. అల్లాహ్‌కు దూరమైతే మనిషి తన హోదాను కోల్పోతాడనీ, అవమానాలపాలై పతనమవుతాడనీ, పరలోకం అనివార్యమని హెచ్చరించింది.

### అత్ తీన్ సూరా

سُورَةُ التِّينِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

1 అత్తిపండు సాక్షిగా! ఆలివు సాక్షిగా!

وَالتِّينِ وَالزَّيْتُونِ ۝١

2 సినాయ్ పర్వతం సాక్షిగా![1]

وَطُورِ سِينِينَ ۝٢

3 శాంతియుతమైన ఈ నగరం (మక్కా) సాక్షిగా![2]

وَهَٰذَا الْبَلَدِ الْأَمِينِ ۝٣

4 నిశ్చయంగా మేము మానవుణ్ణి అత్యుత్తమమైన ఆకృతిలో సృజించాము.[3]

لَقَدْ خَلَقْنَا الْإِنسَانَ فِي أَحْسَنِ تَقْوِيمٍ ۝٤

1. దేవుడు తన ప్రవక్త అయిన మూసా (అలైహిస్సలాం)తో సంభాషణ జరిపినది ఈ పర్వతం మీదే.

2. శాంతియుతమైన నగరం అంటే మక్కా నగరం. ఈ నగరంలో హత్యాకాండకు అనుమతి లేదు. ఈ నగరంలో ప్రవేశించిన వారికి రక్షణ లభిస్తుంది.

   మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం ఈ సూరాలో మూడు ప్రదేశాలపై ప్రమాణం చేయబడింది. ఈ మూడు ప్రదేశాలు కూడా చరిత్రాత్మకమైనవి. ఎందుకంటే ఆ స్థలాలలో గొప్ప గొప్ప ప్రవక్తలు, షరీయతు ప్రదాతలు వచ్చారు. "అత్తిపండు, ఆలివ్‌ల సాక్షిగా!" అంటే అత్తిపండ్లు, ఆలివ్‌పండ్లు విరివిగా ఉత్పత్తి అయ్యే ప్రదేశం అని అర్థం. అది బైతుల్ మఖ్దిస్ (జెరూసలేము) ప్రదేశం. దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) ఆ ప్రదేశంలో ప్రభవించారు. సినాయ్ పర్వతంపై మూసా (అలైహిస్సలాం)కు ప్రవక్త పదవి ఇవ్వబడింది. కాగా; మక్కానగరంలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) జన్మించారు (ఇబ్నె కసీర్).

3. పై మూడు ఆయతులలో చేయబడిన ప్రమాణానికి జవాబు ఈ ఆయతులో ఇవ్వబడింది. అదేమంటే ఈ లోకంలో మానవుణ్ణి దేవుడు అత్యుత్తమ రీతిలో సృజించాడు. ఇతర ప్రాణులతో, జంతువులతో పోల్చుకున్నప్పుడు ఈ తేడా

5 అటుపిమ్మట అతణ్ణి అధమాతి అధమ స్థానానికి మళ్ళించాము.[4]

ثُمَّ رَدَدْنٰهُ اَسْفَلَ سٰفِلِيْنَ ﴿5﴾

6 అయితే విశ్వసించి, ఆ పైన మంచి పనులు చేసిన వారికి మాత్రం ఎన్నటికీ తరగని పుణ్యఫలం ఉంది.[5]

اِلَّا الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ فَلَهُمْ اَجْرٌ غَيْرُ مَمْنُوْنٍ ﴿6﴾

7 మరైతే (ఓ మానవుడా!) ప్రతిఫల దినాన్ని ధిక్కరించమని ఏ వస్తువు నిన్ను పురమాయిస్తున్నది?[6]

فَمَا يُكَذِّبُكَ بَعْدُ بِالدِّيْنِ ﴿7﴾

8 ఏమిటి, అధికారులందరికంటే అల్లాహ్ గొప్ప అధికారి కాడా?[7]

اَلَيْسَ اللّٰهُ بِاَحْكَمِ الْحٰكِمِيْنَ ﴿8﴾

కొట్టొచ్చినట్లే కనిపిస్తుంది. ఇతర జీవుల ముఖాలు క్రిందికి వంగి ఉంటాయి. కాని దేవుడు మనిషిని మాత్రం నిటారుగా నిలబడి నడిచేవానిగా, అందగాడుగా మలిచాడు. ఇతర ప్రాణులకు భిన్నంగా మానవుడు తన చేతులతో సంపాదించి తింటాడు. త్రాగుతాడు. అతని శరీరావయవాలు ఎంతో పొందికగా ఉన్నాయి. వేర్వేరు అవయవాల మధ్య చాలినంత ఎడం ఉంది. ఇతర ప్రాణుల మాదిరిగా వాటిమధ్య అస్తవ్యస్తతగానీ, అసౌకర్య పరిస్థితిగానీ లేదు. ముఖ్యమైన అవయవాలు రెండేసి చేయబడ్డాయి. మరి అతనిలో కనే, వినే, ఆలోచించే, అర్థంచేసుకునే శక్తియుక్తులు పొందుపరచబడ్డాయి. "దేవుడు ఆదంను తన ఆకారంపై పుట్టించాడ"న్న హదీసును (ముస్లిం – కితాబుల్ బిర్....) విద్వాంసులు ఈ నేపథ్యంలో ఉదాహరించటం కూడా గమనార్హ విషయమే. మానవ సృజనలో ఈ విషయాలన్నింటి మేళవింపే **"అహ్సని తఖ్వీమ్"** (అందమైన ఆకృతి). అందునా దేవుడు మూడుసార్లు ప్రమాణం చేసిన తరువాత ఈ మాట చెప్పాడు (ఫత్హుల్ ఖదీర్).

4. ఈ ఆయతును పలువురు వ్యాఖ్యాతలు పలు విధాలుగా గ్రహించారు. కొంతమంది ప్రకారం ఈ ఆయతు మనిషి యొక్క హీనాతి హీనమైన వార్థక్యాన్ని (ముసలితనాన్ని) సూచిస్తోంది. ఈ వయసులో మనిషి జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. అతను విచక్షణా జ్ఞానాన్ని సయితం కోల్పోయి పసిపిల్లవాడిలా ప్రవర్తిస్తాడు. మరికొంత మంది ప్రకారం మానవుడు తన దురాగతాల కారణంగా నైతికంగా దిగజారి పాతాళానికి త్రోసివేయబడతాడు. పాముల, క్రిమికీటకాల కన్నా హీనుడిగా తయారవుతాడు. ఇంకా కొంత మంది ప్రకారం నరకంలో అవిశ్వాసులకు పట్టే దురవస్థ ఇది! అంటే మానవుడు దైవాన్ని, దైవప్రవక్త (స)ను ఎదిరించి, తనను అత్యుత్తమ స్థానం నుంచి ఎగదోసుకుని నరకంలోని అధమాతి అధమ స్థానంలో పడవేసుకుంటాడు.

5. అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారిని మాత్రం దేవుడు ఈ దుష్పరిణామం నుండి మినహాయించాడు.

6. ఇది మనిషికి చేయబడే హెచ్చరిక! ఓ మనిషీ! నిన్ను అత్యుత్తమ ఆకృతిలో పుట్టించి, గౌరవోన్నతుల్ని వొసగిన ప్రభువు అత్యంత అధమస్థితికి చేర్చే శక్తి కూడా కలిగి ఉన్నాడని మరచిపోకు. అలాగే నిన్ను తిరిగి బ్రతికించటం కూడా ఆయనకు ఏమాత్రం కష్టతరం కాదు. ఇది తెలిసి కూడా నువ్వు ప్రళయదినాన్ని, శిక్షాబహుమానాన్ని త్రోసిపుచ్చుతున్నావా? మరికొందరు దీని అర్థం ఇలా చెబుతారు: (ఓ ముహమ్మద్!) దీని తరువాత తీర్పుదినానికి సంబంధించి నిన్ను ఎవరు ధిక్కరించగలరు?

7. ఆయన ఏ ఒక్కరికీ అన్యాయం చేయడు సరికదా, తీర్పు దినాన్ని నెలకొల్పి అన్యాయం జరిగిన వారందరికీ న్యాయం చేస్తాడు. ఈ సూరా చివరిలో **"బలా వ అన అలా జాలిక మినష్షాహిదీన్"** (ఎందుకు కాదు?! ఈ విషయానికి నేను సయితం సాక్షినే) అని పలకాలని తిర్మిజీ గ్రంథంలోని ఒక బలహీన హదీసు ద్వారా తెలుస్తోంది.

96 వ సూరా

# అల్ అలఖ్

## రక్తపు ముద్ద

అవతరణ మక్కాలో

ఆయతులు 19

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా దైవవాణి అవతరణ గురించి బోధించింది. ఇందులోని రెండవ ఆయతులో ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం ప్రస్తావనకు వచ్చింది. దైవవాణి అవతరణను ఈ సూరా వివరించింది. అల్లాహ్ మానవులకు ప్రసాదించిన బుద్ధిజ్ఞానాల అనుగ్రహాల గురించి కూడా ఇందులో ప్రస్తావించడం జరిగింది. సన్మార్గాన్ని అవలంబించడం, మంచిపనులు చేయడం ఎంత ముఖ్యమో ఈ సూరాలో స్పష్టంగా తెలియజేయడం జరిగింది. అల్లాహ్‌కు దగ్గరై ఆయనకు విధేయతతో ఆరాధించవలసిన అవసరాన్ని వివరించింది. అల్లాహ్ కొందరికి సమృద్ధిని ప్రసాదించాడని, కాని వారు తిరుగుబాటు వైఖరిని అవలంబించి, అల్లాహ్‌కు దూరమయ్యారని విమర్శించింది.

### అల్ అలఖ్ సూరా — سُورَةُ العَلَق

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 (ఓ ముహమ్మద్ – సఅసం!) చదువు, సృష్టించిన నీ ప్రభువు పేరుతో.[1]

اِقْرَاْ بِاسْمِ رَبِّكَ الَّذِىْ خَلَقَ ﴿1﴾

2 ఆయన మనిషిని నెత్తుటి ముద్దతో సృష్టించాడు.[2]

خَلَقَ الْاِنْسَانَ مِنْ عَلَقٍ ﴿2﴾

3 నువ్వు చదువుతూ పో. నీ ప్రభువు దయాశీలి.[3]

اِقْرَاْ وَرَبُّكَ الْاَكْرَمُ ﴿3﴾

4 ఆయన కలం ద్వారా (జ్ఞాన) బోధ చేశాడు.[4]

الَّذِىْ عَلَّمَ بِالْقَلَمِ ﴿4﴾

1. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) హిరా కొండ గుహలో దైవధ్యానంలో ఉండగా ఆయన (స)పై అవతరించిన మొట్టమొదటి దైవవాణి (వహీ) ఇది. దైవదూత జిబ్రీల్ (అలైహిస్సలాం) వచ్చి, 'చదువు' అని ఆయన్ని పురమాయించగా, "నేను చదువుకున్నవాణ్ణి కాను" అని ఆయన (స) చెప్పారు. దైవదూత ఆయన్ని పట్టుకుని గట్టిగా కుదిపి, "చదువు" అని మళ్ళీ పురమాయించాడు. "నాకు చదవటం రాదు" అనే ఆయన (స) బదులిచ్చారు. ఈసారి దైవదూత మూడుసార్లు ఆయన్ని కుదుపుతూ ఈ ఆయతులను పఠించాడు. ఆయన (స) చేత కూడా చదివించాడు.
2. జగతిలో ఎన్నో జీవరాసులున్నాయి. కాని దేవుడు మనిషి పుట్టుక తీరును గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటాన్నిబట్టి ఈ లోకంలో మానవ సృష్టికి ఉన్న ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.
3. 'నాకు చదువురాద'న్న ప్రవక్త నిస్సహాయతకు సమాధానంగా దేవుడు మళ్ళీ మళ్ళీ 'చదువు' అని అన్నాడు. దీని అంతరంగం ఏమిటంటే దేవుడు గొప్ప కృపాకరుడు. మానవుని బలహీనతల దృష్ట్యా అతన్ని క్షమించి, కనికరించటం ఆయన ప్రధానగుణం.
4. 'జ్ఞానం'లో కొంతభాగం మనిషి మనోమస్తిష్కాలలో నిక్షిప్తమై ఉంటుంది. మరికొంత భాగం అతని నోటి ద్వారా వ్యక్తమవుతుంది. ఇంకా కొంత భాగాన్ని మనిషి 'కలం' ద్వారా అక్షర రూపం ఇస్తాడు. మేధస్సులో నాటుకున్నదంతా

5 ఆయన మనిషికి, అతడు ఎరుగని దానిని నేర్పాడు.
عَلَّمَ الْإِنسَانَ مَا لَمْ يَعْلَمْ ﴿5﴾

6 అది కాదు. అసలు విషయం ఏమిటంటే మానవుడు హద్దుమీరి పోతున్నాడు.
كَلَّا إِنَّ الْإِنسَانَ لَيَطْغَىٰ ﴿6﴾

7 ఎందుకంటే, తనకు ఎవరి అవసరమూ లేదన్న భావన అతనికుంది.
أَن رَّآهُ اسْتَغْنَىٰ ﴿7﴾

8 నిశ్చయంగా (అందరూ) మరలిపోవలసింది నీ ప్రభువు వైపే.
إِنَّ إِلَىٰ رَبِّكَ الرُّجْعَىٰ ﴿8﴾

9 అడ్డు తగిలేవాడిని నీవు చూశావా?[5]
أَرَأَيْتَ الَّذِي يَنْهَىٰ ﴿9﴾

10 ఒక దాసుణ్ణి, అతను నమాజు చేస్తుండగా (అడ్డుకున్నాడు).
عَبْدًا إِذَا صَلَّىٰ ﴿10﴾

11 ఇదిగో చూడు! ఒకవేళ అతను గనక సన్మార్గాన ఉంటే[6]....
أَرَأَيْتَ إِن كَانَ عَلَى الْهُدَىٰ ﴿11﴾

12 లేదా అతను భయభక్తులను గురించి ఆజ్ఞాపిస్తూ ఉన్నట్లయితే.... (అతని గురించి నీ ఉద్దేశం ఏమిటి?)[7]
أَوْ أَمَرَ بِالتَّقْوَىٰ ﴿12﴾

13 ఇదిగో చూడు! వాడేమో ధిక్కార వైఖరిని అవలంబిస్తూ, ముఖం త్రిప్పుకుని పోతుంటే...(వాడి గురించి నీ అభిప్రాయం ఏమిటి)?[8]
أَرَأَيْتَ إِن كَذَّبَ وَتَوَلَّىٰ ﴿13﴾

14 ఏమిటి, అల్లాహ్ తనను గమనిస్తున్నాడన్న విషయం అతనికి తెలియదా?[9]
أَلَمْ يَعْلَم بِأَنَّ اللَّهَ يَرَىٰ ﴿14﴾

---

అతనితోపాటే వెళ్ళిపోతుంది. అతను నోటితో చెప్పింది కూడా చాలా వరకు సురక్షితంగా ఉండదు. అయితే పెన్నుతో రాసిపెట్టింది మాత్రం (అది వృధా కాకుండా ఉన్నట్లయితే) చాలాకాలం వరకు సురక్షితంగా ఉంటుంది. ఈ 'కలము' ద్వారా వెనుకటి జాతుల గాధలు, మహనీయుల జ్ఞానసుధ చరిత్రపుటల్లో సురక్షితంగా ఉన్నాయి. దీన్నిబట్టి పెన్నుకు ఉన్న ప్రాధాన్యత ఎటువంటిదో ఊహించటం కష్టం కాదు. అందుకే అల్లాహ్ అన్నిటికన్నా ముందు 'కలము'ను సృష్టించి, ప్రాణులందరి విధివ్రాతను లిఖించమని దానికి ఆజ్ఞాపించాడు.

5. మహాప్రవక్త ముహమ్మద్ (స)కు అడ్డుతగిలే ఆ వ్యక్తి ఎవరో కాదు, ఇస్లాం బద్ధవిరోధి అయిన అబూజహలే అని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలంటున్నారు. **'దాసుడు'** (అబ్దున్) అంటే ముహమ్మద్ (సఅసం).

6. అంటే – సన్మార్గాన ఉన్న ఒక వ్యక్తిని నమాజు చేయకుండా ఆపటం ముమ్మాటికీ దౌర్జన్యమే.

7. అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (స) బోధించే విషయాలు మామూలు విషయాలు కావు. అవి ఏకదైవారాధన (తౌహీద్), సదాచరణ (అమలె సాలెహ్), చిత్తశుద్ధి (ఇఖ్లాస్)తో కూడుకున్న విషయాలు. వాటిద్వారా మానవ సమాజంలో ధర్మపరాయణత, దైవభీతి, పరలోక భీతి వంటి సుగుణాలు ఆవిర్భవిస్తాయి. అవి మనుషులను నరకాగ్ని నుండి కాపాడుతాయి. మరి ఇలాంటి ఉత్తమ విషయాలను నిరోధించటం సమంజసమా? వీటిని ప్రబోధించే వ్యక్తిని బెదిరించటం సహేతుకమా??

8. ముహమ్మద్ (స)ను పొద్దస్తమానం వేధిస్తూ వెంటపడిన అబూజహల్ పోకడలు మంచివేనా? అతని పెడసరి ధోరణి వల్ల మానవతకు కలిగే ప్రయోజనం ఏమిటో చెప్పండి?

| | |
|---|---|
| 15 కానేకాదు. ఒకవేళ వాడు గనక (తన వ్యతిరేక ధోరణిని) మానుకోకపోతే మేము వాడి నుదుటి జుత్తును పట్టి ఈడుస్తాము.[10] | كَلَّا لَئِن لَّمْ يَنتَهِ ۙ لَنَسْفَعًۢا بِالنَّاصِيَةِ ﴿15﴾ |
| 16 అబద్ధాలతో, దురంతాలతో కూడుకున్న (వాడి) నుదుటి జుత్తును![11] | نَاصِيَةٍ كَاذِبَةٍ خَاطِئَةٍ ﴿16﴾ |
| 17 (కావాలంటే) వాడు తన సలహా మండలి సభ్యులను (సహాయార్థం) పిలుచుకోవచ్చు. | فَلْيَدْعُ نَادِيَهُ ﴿17﴾ |
| 18 మేము కూడా (నరక) భటులను పిలుస్తాము.[12] | سَنَدْعُ الزَّبَانِيَةَ ﴿18﴾ |
| 19 తస్మాత్ జాగ్రత్త! నువ్వు వాడి మాట వినకు. (నీ ప్రభువు సన్నిధిలో) సాష్టాంగ పడి, సామీప్యం పొందు. | كَلَّا ۖ لَا تُطِعْهُ وَاسْجُدْ وَاقْتَرِب ۩ ﴿19﴾ |

9. ఏమిటీ, సర్వోన్నత ప్రభువు అయిన అల్లాహ్ సదా తన చేష్టలను చూస్తూనే ఉంటాడని అబూజహల్‌కు తెలీదా?

10. అంటే, దైవప్రవక్త (సఅసం) పట్ల విరోధాన్ని మానుకోకపోతే, ఆయన (సఅసం) నమాజు చేస్తుండగా ఆటంకాలు సృష్టించే పనిని మానుకోకపోతే, మేము వాడి ముంగురులు పట్టి ఈడుస్తాము. హదీసులో వచ్చిన వివరాల ప్రకారం; "ముహమ్మదు గనక కాబా గృహం వద్ద నమాజు చేయటం మానుకోకపోతే నేనతని మెడపై కాలుపెట్టి తొక్కేస్తాన"ని అబూజహల్ సవాలు విసిరాడు. ఈ విషయం దైవప్రవక్త (సఅసం)కు తెలిసినప్పుడు, "అతనే గనక ఈ చేష్టకు పాల్పడితే దైవదూతలు అతన్ని పట్టుకుంటార"ని ఆయన పలికారు. (సహీహ్ బుఖారీ – అల్ అలఖ్ సూరా వ్యాఖ్యానం).

11. అంటే అబూజహల్ ఇస్లాంకు వ్యతిరేకంగా సత్యవిరుద్ధమైన ప్రగల్భాలు పలికేవాడు. పైగా జంకూ గొంకూ లేకుండా పాపకార్యాలకు పాల్పడేవాడు.

12. హదీసులో వచ్చిన వివరాల ప్రకారం ఒక రోజు దైవప్రవక్త (సఅసం) కాబా గృహం వద్ద నమాజు చేస్తూ ఉన్నారు. అబూజహల్ అటు వైపుగా సాగిపోతూ, "ఓ ముహమ్మద్ (స)! ఇక్కడ నమాజు చేయరాదని నీకు చెప్పానా? లేదా?" అంటూ తీవ్రంగా మందలించాడు. అతని మాటలకు మహాప్రవక్త (సఅసం) కూడా కాస్త తీవ్రంగానే స్పందించారు. అప్పుడతను, "ముహమ్మద్ (సఅసం)! జాగ్రత్తగా ఉండు! దైవసాక్షిగా చెబుతున్నా. ఈ (మక్కా) లోయలో నా మద్దతుదారులు, సభాసదులు అందరికన్నా ఎక్కువన్న సంగతిని మరచిపోకు" అని బెదిరించాడు. ఈ సందర్భంగానే ఈ ఆయతు (వాడు తన సలహామండలి సభ్యులను పిలుచుకోవచ్చు) అవతరించింది. ఒకవేళ అతను గనక తన భజనపరులను పిలిచివుంటే అప్పటికప్పుడే దైవదూతలు అతన్ని పట్టుకుని శిక్షించి ఉండేవారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు (తిర్మిజీ, తఫ్సీర్ సూరయె ఇఖ్రా, ముస్నదె అహ్మద్ –1/329, తఫ్సీర్ ఇబ్నె జరీర్).

సహీహ్ ముస్లిం ప్రకారం : వాడు (అబూజహల్) ముందుకు వెళ్ళి ఆయన (సఅసం) మెడపై కాలుపెట్టి తొక్కాలని సంకల్పం చేసుకున్నాడు. అంతే! మరుక్షణమే వెనక్కి తిరిగి, తన చేతులతో తనను విడిపించుకోసాగాడు. "ఏమిటి, సంగతి?" అని తనను ఎవరో అడిగితే "నాకూ–ముహమ్మద్ (సఅసం)కి మధ్య అగ్ని గుండం ఏర్పడింది. ఈ దృశ్యం ఎంతో భయంకరంగా ఉంది. నాకు వ్యతిరేకంగా ఎంతోమంది ప్రత్యక్షమయ్యార"ని చెప్పాడు. "ఒకవేళ అతనే గనక నా జోలికి వచ్చివుంటే దైవదూతలు అతన్ని చీల్చిచెండాడి ఉండేవారు" అని మహాప్రవక్త (స) అన్నారు. (ప్రళయదిన ప్రకరణం). **'జబానియహ్'** (زَبَانِيَةٌ) అంటే భటులు, కావలివాళ్లు, ప్రత్యేక భద్రతా దళాలు అనే అర్థాలొస్తాయి.

97వ సూరా

# అల్ ఖద్ర్

## ఘనమైనది

అవతరణ మక్కాలో

ఆయతులు 5

### పరిచయం

ముఖ్యంగా దైవవాణి అవతరణ గురించి ఇందులో చెప్పడం జరిగింది. 'లైలతుల్ ఖద్ర్' (ఘనమైన రాత్రి) అన్న ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. దివ్యఖుర్ఆన్ అవతరించిన రాత్రి ఎంత ఘనమైనదో ఇందులో చెప్పడం జరిగింది. ఆ ఘనమైన రాత్రి అల్లాహ్‌ను ఆరాధిస్తే వెయ్యి మాసాలపాటు చేసిన ఆరాధనకు సమానమవుతుంది. అంటే 83 సంవత్సరాల 4 నెలల ఆరాధనకు సమానమవుతుంది. ఆ ఘనమైన రాత్రి దైవదూతలు, జిబ్రయీల్(అస) దేవుని అనుమతితో దైవాదేశాలు తీసుకుని అవతరిస్తారు.

### అల్ ఖద్ర్[1] సూరా | سُورَةُ القَدۡرِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

1 నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖుర్ఆనును) ఘనమైన రాత్రి యందు అవతరింపజేశాము.[2]

إِنَّآ أَنزَلۡنَٰهُ فِي لَيۡلَةِ ٱلۡقَدۡرِ ١

2 ఘనమైన రాత్రి గురించి నువ్వేమనుకున్నావు?[3]

وَمَآ أَدۡرَىٰكَ مَا لَيۡلَةُ ٱلۡقَدۡرِ ٢

1. ఈ సూరా మక్కాలో అవతరించిందా? లేక మదీనాలో అవతరించిందా? అనే దానిపై ద్వంద్వాభిప్రాయాలున్నాయి. ఈ సూరా పేరు గురించి కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. **'ఖద్ర్'** (ٱلۡقَدۡرِ) అంటే విలువైనది, ఘనత గలది అని ఒక అర్థం. అందుచేత దీనిని విలువైన రాత్రి అనీ, ఘనత గల రాత్రి అనీ అంటారు. 'ఖద్ర్' అంటే నిర్ధారించటం, లెక్కించటం అని ఇంకొక అర్థం. ఈ రాత్రిపూట ఒక ఏడాది కాలానికి సంబంధించిన వ్యవహారాలన్నీ సమీక్షించి, నిర్ణయించబడతాయి. అందువల్ల దీనిని మహత్పూర్వకమైన రేయిగా, నిర్ణయాత్మక రాత్రిగా, ఉత్తర్వులను జారీచేసే రాత్రిగా కూడా వ్యవహరిస్తారు. 'ఖద్ర్' అంటే 'ఇరుకైనది' అని వేరొక అర్థం. ఈ రాత్రియందు దివి నుంచి దిగివచ్చిన దైవదూతలతో భువి అంతా కిక్కిరిసిపోతుంది. ఈ కారణంగా దీనిని 'కిటకిటలాడే రాత్రి'గా కూడా అభివర్ణిస్తారు. ఈ రాత్రి యందు చేసే దైవారాధన మహత్పూర్వకమైనది. ఎంతో పుణ్యప్రదమైనది. అందువల్ల దీనిని మహిమాన్వితమైన రాత్రి అని కూడా అంటారు. ఇంతటి విలువైన ఈ రాత్రి ఇంతకీ ఎప్పుడు? అనే విషయమై భిన్నాభిప్రాయముంది (ఫత్‌హుల్ ఖదీర్). అయితే హదీసులను, చారిత్రక ఉల్లేఖనాలనుబట్టి ఇది రమజాన్ నెల చివరి దశకంలోని బేసి రాత్రుల్లో ఏదో ఒక రాత్రి నెలకొంటుందని తెలుస్తోంది. ఈ సంగతి అస్పష్టంగా ఉండటంలో కూడా ఒక పరమార్థం ఉన్నది. రమజాన్ చివరిలో – బేసిరాత్రుల్లో ఈ విలువైన రాత్రిని అన్వేషించే ప్రయత్నంలో భక్తులు వీలైనంత ఎక్కువగా దైవారాధన చేసి, పాపాల మన్నింపు కోసం వేడుకోవాలన్నదే దీని పరమార్థం.

2. దేవుడు దివ్య ఖుర్ఆన్‌ను 'లౌహె మహ్‌ఫూజ్' నుండి భూమండలానికి సమీపంలోనున్న ఆకాశంపై దింపాడు.

3 ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా మేలైనది.[4]

لَيْلَةُ الْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ ﴿٣﴾

4 ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ (జిబ్రయీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల (నిర్వహణ) నిమిత్తం (దివి నుంచి భువికి) దిగివస్తారు.[5]

تَنَزَّلُ الْمَلَائِكَةُ وَالرُّوحُ فِيهَا بِإِذْنِ رَبِّهِم مِّن كُلِّ أَمْرٍ ﴿٤﴾

5 ఆ రాత్రి ఆసాంతం శాంతియుతమైనది[6] – తెల్లవారే వరకూ (అది ఉంటుంది).

سَلَامٌ هِيَ حَتَّىٰ مَطْلَعِ الْفَجْرِ ﴿٥﴾

అక్కడి నుండి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)పై – అంచెల వారీగా, కొద్దికొద్దిగా – 23 ఏండ్ల కాలంలో పూర్తిగా అవతరింపజేశాడు. **'లైలతుల్ ఖద్ర్'** అనేది రమజాన్ మాసంలోనే వస్తుంది."దివ్య ఖుర్ఆన్ అవతరించిన నెల రమజాన్ (నెల)" అన్న ఆయతు ఈ సందర్భంగా గమనించదగినది (అల్ బఖర – 185).

3. ప్రశ్నార్థకమైన ఈ వాక్యం ద్వారా కూడా ఈ రాత్రికి గల మహత్తు స్పష్టమవుతోంది. మానవమాత్రులెవరూ దీని లోతుల్లోకి పూర్తిగా పోలేరు. ఆ సంపూర్ణ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది.

4. అంటే – ఈ రాత్రి యందు చేసే దైవారాధన వెయ్యి మాసాలలో చేసే ఆరాధన కంటే కూడా గొప్పది. వెయ్యి మాసాలంటే మామూలు విషయమా? 83 సంవత్సరాల 4 నెలలన్న మాట! అతి తక్కువ కాలంలో అత్యంత అధికంగా పుణ్యం సంపాదించుకునేందుకు వీలుగా దేవుడు ముహమ్మద్ (సఅసం) అనుచర సమాజంపై చేసిన మహోపకారం ఇది.

5. ఇక్కడ **'రూహ్'** (ఆత్మ) అంటే జిబ్రయీల్ (అలైహిస్సలాం) అని మరువరాదు. దైవదూత జిబ్రయీల్ తన తోటి దూతలందరితో కలసి భూమండలంపై దిగుతారు. ఆ సంవత్సరం దేవుడు సమ్మతించి ఆమోదించిన విషయాలకు కార్యరూపం ఇచ్చే నిమిత్తం వస్తారు.

6. అంటే – ఆ రాత్రియందు కీడు అన్నదే లేదు. అది పూర్తిగా శాంతితో కూడుకున్నది. ఆ రాత్రి పూట దైవదాసులంతా షైతాన్ కీడు నుంచి సురక్షితంగా ఉంటారు. లేదా దైవదూతలు విశ్వాసులకు 'సలాం' పంపిస్తారు. ఆ రాత్రియందు ఈ దుఆ చేయాలని దైవప్రవక్త (స) గట్టిగా నొక్కి వక్కాణించారు: **"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ"** (తిర్మిజీ – దుఆల ప్రకరణం; ఇబ్ను మాజా – దుఆ ప్రకరణం).

(**అర్థం:** ఓ అల్లాహ్! నిశ్చయంగా నీవు క్షమించేవాడవు. క్షమాభిక్ష పెట్టడమంటే నీకు మహా ఇష్టం. కాబట్టి నన్ను క్షమించు).

# 98వ సూరా

# అల్ బయ్యినహ్

## స్పష్టమైన నిదర్శనం

అవతరణ
మదీనాలో

ఆయతులు
8

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన 'బయ్యినహ్' (స్పష్టమైన నిదర్శనం) అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. గ్రంథ ప్రజలు, విగ్రహారాధకులు సత్యాన్ని తిరస్కరించడాన్ని ఈ సూరాలో ఖండించడం జరిగింది. వారు స్పష్టంగా కనబడుతున్న సత్యాన్ని అహంభావంతో తిరస్కరించడమే కాదు, దేవుని ఏకత్వాన్ని నిరాకరించడం కొనసాగిస్తున్నారు. నిజానికి గ్రంథ ప్రజలు (యూదులు, క్రయిస్తవులు) అందరికన్నా ముందుగా ఈ దైవవాణిని ఆహ్వానించి స్వీకరించి ఉండాల్సిందని, ఎందుకంటే వారి ఆకాశ గ్రంథాలు ఈ విషయమై వారికి బోధించాయని ఈ సూరా తెలియజేసింది. కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, నమాజు స్థాపించాలని, జకాత్ చెల్లించాలని బోధించడం జరిగింది. నరకాగ్ని గురించి హెచ్చరించడంతో పాటు సన్మార్గులకు లభించే స్వర్గవనాల గురించి కూడా ప్రస్తావించడం జరిగింది.

### అల్ బయ్యినహ్[1] సూరా

سُوْرَةُ الْبَيِّنَةِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** గ్రంథవహులకు చెందిన తిరస్కారులు,[2] బహుదైవారాధకులు[3] తమ వద్దకు స్పష్టమైన నిదర్శనం రానంతవరకూ (తమ తిరస్కార వైఖరిని) మానుకోనివారుగా ఉండేవారు. (ఇంతకీ ఆ నిదర్శనం ఏమిటంటే...)

لَمْ يَكُنِ الَّذِيْنَ كَفَرُوْا مِنْ اَهْلِ الْكِتٰبِ وَالْمُشْرِكِيْنَ مُنْفَكِّيْنَ حَتّٰى تَاْتِيَهُمُ الْبَيِّنَةُ ﴿1﴾

**2** పరిశుద్ధమైన గ్రంథ పత్రములను[4] చదివి వినిపించే దైవ ప్రవక్త[5] తమ వద్దకు రావాలి.

رَسُوْلٌ مِّنَ اللّٰهِ يَتْلُوْا صُحُفًا مُّطَهَّرَةً ﴿2﴾

1. ఈ సూరాను 'లమ్ యకున్' సూరాగా కూడా వ్యవహరిస్తారు. దైవప్రవక్త(సఅసం) ఒకసారి ఉబై బిన్ కాబ్ (రజి)తో, "లమ్‌యకునిల్లజీన సూరాను నీకు చదివి వినిపించవలసిందిగా దేవుడు నన్ను ఆజ్ఞాపించాడు" అన్నారు. దానికి హజ్రత్ ఉబై (రజి), "ఏమిటీ, దేవుడు నా పేరుపెట్టి మరీ ఇలా చెప్పాడా?" అని అడిగారు. "అవున"న్నారాయన (స). అప్పుడు (ఆనందంతో) హజ్రత్ ఉబై గారి కళ్లలో నీళ్లు ఉబికి వచ్చాయి (సహీహ్ బుఖారీ – లమ్ యకున్ సూరా వ్యాఖ్యానం).
2. ఇక్కడ **'గ్రంథవహులు'** అంటే యూదులు, క్రైస్తవులని గమనించాలి.
3. **'బహు దైవారాధకులు'** అంటే విగ్రహాలను, చెట్లను, పుట్టలను, అగ్నిని పూజించే అరబ్బులు, అరబ్బేతరులు. **'స్పష్టమైన నిదర్శనం'** (బయ్యినహ్) అంటే మహాప్రవక్త ముహమ్మద్ (స). ఈ వాక్యం సారాంశం ఏమిటంటే, యూదులు క్రైస్తవులు తమకు ఖుర్ఆన్ గ్రంథ వాక్యాలను చదివి వినిపించి, తమ మార్గవిహీనత గురించి విడమరచి చెప్పే,

**3** మరి వాటిలో (ఆ గ్రంథ పత్రాలలో) స్థిరమైన, సవ్యమైన ఆదేశాలు ఉండాలి.[6]

فِيهَا كُتُبٌ قَيِّمَةٌ ③

**4** మరి (ఈ) గ్రంథవహులు తీరా తమ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చేసిన తరువాతే (విభేదించుకుని) చీలిపోయారు.[7]

وَمَا تَفَرَّقَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ إِلَّا
مِن بَعْدِ مَا جَاءَتْهُمُ الْبَيِّنَةُ ④

**5** వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, ఏకాగ్రచిత్తులై[8] – నమాజును నెలకొల్పాలనీ, జకాత్‌ను ఇస్తూ ఉండాలని మాత్రమే వారికి ఆదేశించబడింది.[9] ఇదే స్థిరమైన, సవ్యమైన ధర్మం.[10]

وَمَا أُمِرُوا إِلَّا لِيَعْبُدُوا اللَّهَ مُخْلِصِينَ
لَهُ الدِّينَ حُنَفَاءَ وَيُقِيمُوا الصَّلَاةَ
وَيُؤْتُوا الزَّكَاةَ وَذَٰلِكَ دِينُ الْقَيِّمَةِ ⑤

**6** గ్రంథవహులలో తిరస్కారవైఖరికి పాల్పడినవారు, బహు దైవారాధకులు తప్పకుండా నరకాగ్నికి ఆహుతి అవుతారు. వారందులో కలకాలం ఉంటారు. వారు సృష్టితాలలో అందరి కంటే చెడ్డవారు.[11]

إِنَّ الَّذِينَ كَفَرُوا مِنْ أَهْلِ الْكِتَابِ وَالْمُشْرِكِينَ
فِي نَارِ جَهَنَّمَ خَالِدِينَ فِيهَا ۚ أُولَٰئِكَ هُمْ
شَرُّ الْبَرِيَّةِ ⑥

---

తమను విశ్వాసమార్గం వైపు పిలిచే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) తమ వద్దకు రానంతవరకూ తమ పెడసరి పోకడలను విడిచిపెట్టరు.

4. అంటే – లౌహె మహ్‌ఫూజ్‌లో సురక్షితంగా ఉన్న దివ్య ఖుర్‌ఆన్ అన్నమాట.

5. అంటే దేవుని చిట్టచివరి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అన్నమాట.

6. ఇక్కడ **'కుతుబున్'** (كُتُبٌ) అంటే శాసనాలు, ఆదేశాలు, నిర్దేశిక నియమాలు, మార్గదర్శక సూత్రాలు అని భావం. **'ఖయ్యిమతున్'** (قَيِّمَةٌ) అంటే స్థిరమైనవి, సవ్యమైనవి, నిర్దిష్టమైనవి, ఖచ్చితత్వం గలవి, సమత్వం సమతూకంతో కూడుకున్నవి అని అర్థం.

7. అంతిమ దైవప్రవక్త (సఅసం) రాకకు ముందు గ్రంథం ప్రసాదించబడిన ప్రజలు కలసికట్టుగా ఉండేవారు. కాని అంతిమ ప్రవక్త (సఅసం) ప్రభవనం జరగగానే వారు విభేదించుకున్నారు. వారిలో కొందరు విశ్వసించగా అనేకులు విశ్వాస భాగ్యానికి నోచుకోకుండాపోయారు. ముహమ్మద్ (స) రాకను, ఆయన దైవదౌత్యాన్ని 'స్పష్టమైన నిదర్శనం'గా పేర్కొనటంలోని ఔచిత్యం ఏమిటంటే ఆయన్ని దైవప్రవక్తగా విశ్వసించటం వినా మార్గాంతరంలేదు. కాని గ్రంథవహులు కేవలం అసూయతో, వైరభావంతో ఆయన్ని ధిక్కరించారు. ఈ కారణంగానే విభేదించుకున్న వారి జాబితాలో కేవలం గ్రంథవహుల (యూదుల, క్రైస్తవుల) పేర్లు మాత్రమే ప్రస్తావించబడ్డాయి. మరి చూడబోతే ఇతరులు కూడా ఈ విషయంలో విభేదించుకోకపోలేదు. అయితే గ్రంథవహులు జ్ఞానసంపన్నులు, అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) లక్షణాల గురించి క్షుణ్ణంగా తెలిసి ఉండి కూడా ఆయన్ని త్రోసిపుచ్చటం చాలా తీవ్ర విషయమవటం చేత వారిని గురించి ఇక్కడ ప్రత్యేకంగా ఎత్తిచూపటం జరిగింది.

8. **'హనీఫ్'** (حَنِيفٌ) అంటే ఏకోన్ముఖుడు, మనసును పూర్తిగా లగ్నం చేసుకున్నవాడు అని అర్థం. **'హునఫాఅ'** (حُنَفَاءَ) అనేది బహువచనం. షిర్క్ నుండి ఏకదైవారాధన వైపుకు మరలాలనీ, ఇతరత్రా మతధర్మాలతో, మిథ్యా వాదాలతో తెగత్రెంపులు చేసుకుని ఇస్లాం ధర్మానికే పూర్తిగా అంకితం అయిపోవాలనీ, ఈ విషయంలో దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) స్థిరచిత్తాన్ని ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథవహులకు చెప్పటం జరిగింది.

7 అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు; నిశ్చయంగా సృష్టిలో వారే అందరికన్నా ఉత్తములు.[12]

8 వారికి ప్రతిఫలంగా వారి ప్రభువు దగ్గర శాశ్వతమైన స్వర్గ వనాలున్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు.[13] వారు అల్లాహ్‌పట్ల సంతోషపడ్డారు.[14] ఈ అనుగ్రహ భాగ్యం తన ప్రభువుకు భయపడేవానికి మాత్రమే.[15]

إِنَّ ٱلَّذِينَ ءَامَنُوا۟ وَعَمِلُوا۟ ٱلصَّٰلِحَٰتِ أُو۟لَٰٓئِكَ هُمْ خَيْرُ ٱلْبَرِيَّةِ ⑦

جَزَآؤُهُمْ عِندَ رَبِّهِمْ جَنَّٰتُ عَدْنٍ تَجْرِى مِن تَحْتِهَا ٱلْأَنْهَٰرُ خَٰلِدِينَ فِيهَآ أَبَدًا ۖ رَّضِىَ ٱللَّهُ عَنْهُمْ وَرَضُوا۟ عَنْهُ ۚ ذَٰلِكَ لِمَنْ خَشِىَ رَبَّهُۥ ⑧

9. అంటే – వారి గ్రంథాలైన తౌరాతు, బైబిల్‌లలో వారికి ఈ ఆదేశాలు ఇవ్వబడ్డాయి.

10. అరేబియాలోని ముష్రిక్కులు బహుదైవారాధన చేస్తూనే ఇబ్రాహీము ప్రవక్త సన్మార్గాన ఉన్నాడని గొప్పలు చెప్పుకునేవారు. మరి చూడబోతే ఖుర్ఆన్ ప్రబోధించే మార్గం ఇబ్రాహీం అనుసరించిన మార్గమే. అందువల్ల బహుదైవారాధకులు ఖుర్ఆనును త్రోసిపుచ్చినట్లయితే ఇబ్రాహీము మార్గాన్ని కూడా త్రోసిపుచ్చినట్లే లెక్క. వారు గనక సవ్యమైన ధర్మంపై ఉండాలంటే ఒక్కడైన అల్లాహ్‌ను నిష్కల్మషమైన మనసుతో నమ్మాలి. నమాజులు చేయాలి. విధి దానాలు ఇస్తూ ఉండాలి. ఇదే ఖుర్ఆను మార్గం, ఇదే ఇబ్రాహీం విధానం కూడా! ఈ ఆయతు ప్రకారం మనిషి కర్మలు ఈమాన్ (విశ్వాసం)లో అంతర్లీనమై ఉంటాయని చాలామంది ఇమాములు సూత్రీకరించారు (ఇబ్నె కసీర్).

11. దైవప్రవక్తలను, దైవగ్రంథాలను తిరస్కరించేవారికి పట్టే దుర్గతి ఇది. పైగా వారు జీవరాశులలోకెల్లా నీచమైన వారుగా ఖరారు చేయబడ్డారు.

12. అంటే – హృదయపూర్వకంగా విశ్వసించి, మంచిపనులను ధనపరంగానూ, శారీరకంగానూ చేసినవారు సృష్టితాలలోకెల్లా శ్రేష్ఠులుగా ఖరారు చేయబడతారు. విశ్వాసులైన మనుషులు దైవదూతలకన్నా గొప్పవారని విద్వాంసులు భావిస్తున్నారు. దానికి వారు చూపే నిదర్శనాలలో ఈ ఆయతు కూడా ఒకటి.

13. వారి విశ్వాసం (ఈమాన్), విధేయత, సదాచరణ మూలంగా వారికీ అనుగ్రహ భాగ్యం దక్కింది. "అల్లాహ్ ప్రసన్నత అన్నింటికన్నా గొప్పది" (తౌబా – 72) కదా!

14. అవును. దేవుడు వారికి ప్రసాదించిన అనుగ్రహాలే అలాంటివి మరి! వాటితో వారి తనువు మనసూ – రెండూ పులకించాయి.

15. అంటే – ఇహలోకంలో దైవానికి నిత్యం భయపడుతూ, దేవుని అవిధేయతకు ఒడిగట్టకుండా జాగ్రత్తగా జీవితం గడిపిన వారికి మాత్రమే ఈ వరాలు ప్రత్యేకం. ఒకవేళ ఎప్పుడైనా మానవ సహజమైన దౌర్బల్యం వల్ల తప్పు జరిగిపోయినా వారు వెంటనే తమ తప్పును గ్రహించి పశ్చాత్తాపపడతారు. క్షమాపణ కోరుకుంటారు. ఇకమీదట అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్తపడతారు. కడకు వారు విశ్వాసస్థితిలోనే తనువు చాలిస్తారు. దీని భావం ఏమిటంటే నిజంగా దైవానికి భయపడే వ్యక్తి పాప కార్యాలను పదే పదే చేయడు. ఎవరయితే ఈ విధంగా చేస్తాడో అతని మనసులో దైవభీతి లేనేలేదు.

99 వ సూరా

# అజ్ జిల్‌జాల్

## భూకంపం

అవతరణ మదీనాలో

ఆయతులు 8

### పరిచయం

తీర్పుదినం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చిన 'జిల్‌జాల్' (భూకంపం) అన్న పదాన్ని దీనికి పేరుగా పెట్టడం జరిగింది. తీర్పుదినం నాటి భయానక స్థితిని, ఆనాటి ప్రకంపనాలను ఈ సూరా వర్ణించింది. ఆ రోజు భూమి తీవ్రంగా కుదిపివేయబడుతుంది. భూమి తనలో ఉన్న సమస్తాన్ని వెళ్ళగ్రక్కుతుంది. అంటే మృతులను బయట పడేస్తుంది. ప్రజలు ఆ రోజు తమ కర్మలను చూసుకునేందుకు భిన్న పరిస్థితుల్లో తమ ప్రభువు వైపునకు మరలుతారు. శిక్షా లేదా బహుమానాలు పొందుతారు.

### అజ్ జిల్‌జాల్[1] సూరా — سُوْرَةُ الزِّلْزَالِ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ |
| **1** భూమి చాలా తీవ్రమైన తన ప్రకంపనలతో కంపింపజేయ బడినప్పుడు,[2] | اِذَا زُلْزِلَتِ الْاَرْضُ زِلْزَالَهَا ۝1 |
| **2** మరి భూమి తన బరువులన్నింటినీ తీసి బయటపడవేసి నప్పుడు,[3] | وَاَخْرَجَتِ الْاَرْضُ اَثْقَالَهَا ۝2 |
| **3** "అరె! దీనికేమైపోయిందీ?" అని మనిషి (కలవరపడుతూ) అంటాడు.[4] | وَقَالَ الْاِنْسَانُ مَا لَهَا ۝3 |
| **4** ఆ రోజు భూమి తన సంగతులన్నీ వివరిస్తుంది.[5] | يَوْمَىِٕذٍ تُحَدِّثُ اَخْبَارَهَا ۝4 |

1. ఈ సూరా మక్కాలో అవతరించిందా? లేక మదీనాలో అవతరించిందా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ సూరా మహత్తుకు సంబంధించి కూడా ఎన్నో ఉల్లేఖనాలు ఉన్నాయి. కాని అవి ప్రామాణికమైనవి కావు.
2. అంటే – ఆ తీవ్ర ప్రకంపనలకు భూమి అంతా దద్దరిల్లుతుంది. దానిపై ఉన్న పెద్ద వస్తువులు, నిర్మాణాలన్నీ కుప్పకూలిపోతాయి. తొలిసారి శంఖం పూరించబడినప్పుడు ఈ ప్రళయం సంభవిస్తుంది.
3. భూమిలో ఖననం చేయబడిన వారంతా భూమిలోని భారమే. ఈ భారాన్ని ప్రళయ దినాన భూమి బయటపడవేస్తుంది. అంటే, దైవాజ్ఞ కాగానే భూమిలో ఉన్నవారంతా సజీవులై బయటికి వస్తారు. భూమిలో నిక్షిప్తమైవున్న ఇతర నిధులు కూడా ఆ రోజు బయటపడతాయి. రెండవసారి శంఖం ఊదబడినప్పుడు ఇది జరుగుతుంది.
4. ఆ క్షణంలో మనిషికి ఏమీ పాలుపోదు. అతను తీవ్రంగా ఆందోళన చెందుతూ, "ఈ భూమికి ఏమైపోయిందీ? ఇదెందుకిలా ఊగిపోతోంది? ఇందులోని వస్తువులు ఎందుకలా బయటపడుతున్నాయి?" అని అంటాడు.

5 ఎందుకంటే నీ ప్రభువు దానికి, ఆ మేరకు ఆజ్ఞాపించి ఉంటాడు.[6]

بِأَنَّ رَبَّكَ أَوْحَىٰ لَهَا ⑤

6 ఆ రోజు జనులు– వారి కర్మలు వారికి చూపబడేందుకుగాను[7] – వేర్వేరు బృందాలుగా తరలివస్తారు.[8]

يَوْمَئِذٍ يَصْدُرُ النَّاسُ أَشْتَاتًا لِّيُرَوْا أَعْمَالَهُمْ ⑥

7 కనుక ఎవడు అణుమాత్రం సత్కార్యం చేసినా దాన్ని అతను చూసుకుంటాడు.[9]

فَمَن يَعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ خَيْرًا يَرَهُ ⑦

8 మరెవడు అణుమాత్రం దుష్కార్యం చేసినా దాన్ని అతను చూసుకుంటాడు.[10]

وَمَن يَعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ شَرًّا يَرَهُ ⑧

5. హదీసు ప్రకారం ఒకసారి దైవప్రవక్త (సఅసం) ఈ ఆయతును పఠించి,"ఇంతకీ భూమి సంగతులేమిటో మీకు తెలుసా?" అని అడిగారు. "దైవానికి, దైవప్రవక్తకే బాగా తెలుసు" అని ప్రియసహచరులు చెప్పారు. అప్పుడాయన(స) "ఏ దాసుడు, ఏ దాసురాలు భూమి వీపుపై ఏ ఏ కార్యాలు చేశారో వాటిని గురించి అది సాక్ష్యమిస్తుంది. ఫలానా వ్యక్తి ఫలానా పని చేశాడని, ఫలానా రోజున ఈ విధంగా చేశాడని భూమి పూసగుచ్చినట్లు చెబుతుంది." (తిర్మిజీ– ప్రళయదిన వివరణకు సంబంధించిన అధ్యాయాలు, జిల్‌జాల్ సూరా వ్యాఖ్యానం; ముస్నదె అహ్మద్–2/374).

6. అంటే – భూమికి ఈ మాట్లాడేశక్తిని అల్లాహ్ ప్రసాదిస్తాడు. అందువల్ల ఈ విషయంపై ఆశ్చర్యచకితులు కానవసరం లేదు. ఎందుకంటే ఆనాడు మనిషి శరీరావయవాలకు మాట్లాడేశక్తిని ఇచ్చినట్లే దేవుడు నేలకు కూడా తన గోడును వినిపించుకునే శక్తిని ఇస్తాడు. అప్పుడది తన ప్రభువు ఆజ్ఞను పురస్కరించుకుని మాట్లాడుతుంది.

7. మనుషులందరికీ–వారి కర్మలు వారికి ఎలాగూ చూపబడతాయి. వారు గనక ఒకవేళ కాదు, కూడదు అంటే వారికి వ్యతిరేకంగా వారి శరీరావయవాలు సాక్ష్యమిస్తాయి. వారు సంచరించిన భూమి సయితం జరిగింది జరిగినట్లుగా చెబుతుంది.

8. అంటే – వారు సమాధుల నుండి లేచి లెక్కలు తేల్చబడే స్థలానికి వస్తారు లేదా లెక్కలు తేల్చబడిన తరువాత తమ గమ్యస్థానమైన స్వర్గానికిగానీ, నరకానికిగానీ తిరిగి వెళతారు. అప్పుడు వారు జట్లు జట్లుగా విడిపోతారు. వారిలో కొన్ని గుంపులు నిశ్చింతగా ఉంటే మరికొన్ని గుంపులు ఆందోళనకు గురై ఉంటాయి. కొందరి ముఖాలు దేదీప్యమానంగా ఉంటాయి. వారు స్వర్గవాసులై ఉంటారు. మరికొందరి ముఖాలపై నలుపు ఆవరించి ఉంటుంది. వారు నరకానికి ఆహుతి కానున్నారనటానికి అదొక చిహ్నం. కొందరు కుడి వైపు సాగిపోతుంటే, మరికొందరు ఎడమవైపు పోతుంటారు. ఆయా ప్రజల అభిమతాలను, కర్మలను బట్టి వేర్వేరు గుంపులుగా విభజించటం జరుగుతుంది.

9. దాన్ని చూసుకుని అతను అమితంగా సంతోషిస్తాడు.

10. దాన్ని చూసుకుని అతను సిగ్గుతో కుంచించుకుపోతాడు. తనకు పట్టబోయే దుర్గతిని తలచుకుని కలవరం చెందుతాడు. **'జర్రతిన్'** (ذَرَّةٍ) అంటే అణుమాత్రం, రేణువు లేక రవ్వంత అనే అర్థాలు వస్తాయి. అది చీమకన్నా చిన్నదిగా ఉండేది అని కొందరు భావించగా, మనిషి మట్టిపై చేయిని కొట్టినప్పుడు అతని చేతికి అంటేది రేణువు అని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఏదైనా రంధ్రంలో నుంచి సూర్యకిరణాలు ప్రసరిస్తున్నప్పుడు ఆ వెలుగులో తేలియాడుతున్నట్లు కనిపించే దుమ్ము ధూళి నలకలే రేణువులని ఇంకా కొందరు భావిస్తున్నారు. ఇమామ్ షౌకానీగారైతే ఈ మూడింటిలో మొదటి అభిప్రాయమే సరైనదని అన్నారు. ఇమామ్ ముఖాతిల్ ఇలా అంటున్నారు: "ఇద్దరు వ్యక్తుల గురించి ఈ వాక్యాలు అవతరించాయి. వారిలో ఒకడు : యాచకునికి అత్యంత అల్పమైన దానం చేయటానికి కూడా వెనుకాడడు. మరొకడు చిన్నపాటి పాపం చేయటానికి కూడా భయపడడు." (ఫత్‌హుల్ ఖదీర్).

100 వ సూరా

# అల్ ఆదియాత్

## పరుగెత్తే గుఱ్ఱాలు

అవతరణ మక్కాలో

ఆయతులు 11

### పరిచయం

అల్లాహ్ పట్ల మనిషి కృతఘ్నుతను, ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహాన్ని ఈ సూరా ప్రస్తావించింది. ఈ సూరాకు పెట్టిన పేరు మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. ఈ సూరా యుద్ధ రంగంలో విశ్వాసులు ఉపయోగించే గుఱ్ఱాలకు సంబంధించిన వర్ణనతో ప్రారంభమయ్యింది. ప్రజలు తమ సంపద పట్ల, ప్రాపంచిక భోగభాగ్యాల పట్ల ఎలా వ్యామోహం పెంచుకుంటారో వివరించింది. అల్లాహ్ పట్ల ఎలా కృతఘ్నులు అవుతారో తెలిపింది. తీర్పుదినాన ప్రతి ఒక్కరి కర్మల చిట్టా అతని ముందు ఉంటుందని, ప్రతి ఒక్కరి రహస్యాలు బట్టబయలవుతాయని తెలియజేసింది.

### అల్ ఆదియాత్ సూరా

سُورَةُ الْعَادِيَاتِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** రొప్పుతూ, రివ్వున దూసుకుపోయే గుఱ్ఱాల సాక్షిగా![1]

وَالْعٰدِيٰتِ ضَبْحًا ﴿1﴾

**2** మరి డెక్కల రాపిడితో నిప్పు రవ్వలను చెరిగేవాటి సాక్షిగా![2]

فَالْمُوْرِيٰتِ قَدْحًا ﴿2﴾

**3** మరి ప్రభాత సమయాన (ప్రత్యర్థులపై) మెరుపుదాడి చేసేవాటి సాక్షిగా![3]

فَالْمُغِيْرٰتِ صُبْحًا ﴿3﴾

**4** మరి ఆ సమయంలో అవి దుమ్ము ధూళిని రేపుతాయి.[4]

فَاَثَرْنَ بِهٖ نَقْعًا ﴿4﴾

1. **'ఆదియాత్' (العٰدِيَاتُ)** అంటే చాలా వేగంగా పరుగెత్తే గుఱ్ఱాలని అర్థం. **'జబ్హున్' (ضَبْحٌ)** అంటే వగర్చటం, రొప్పటం అని ఒక అర్థం. సకిలించటం అని మరో అర్థం. అంటే రొప్పుతూ లేక ఆవేశంతో సకిలిస్తూ రణరంగంలో శత్రుసేనల వైపు దూసుకుపోయే గుఱ్ఱాలని భావం.
2. అవి పరుగెత్తుతూ పోతున్నప్పుడు వాటి డెక్కల రాపిడికి నిప్పు కూడా పుడుతుంది. ముఖ్యంగా అవి పర్వత కనుమల మీదుగా పోతున్నప్పుడు, రాతి ప్రదేశాలలో తమ ఖురములను నేలకు కొడుతూ పోతున్నప్పుడు ఈ దృశ్యం కనిపిస్తుంది. అటువంటి అశ్వాల మీద ప్రమాణం చేసి రానున్న వాక్యాలలో ఒక ముఖ్య విషయం చెప్పబడుతోంది.
3. **'ముగీరాత్' (مُغِيْرَاتُ)** అంటే ఆకస్మిక దాడి జరిపేవి అని అర్థం. పూర్వం అరేబియాలో సాధారణంగా ఉదయం పూటే యుద్ధం మొదలయ్యేది. రాత్రిపూట అందరూ ఆదమరిచి నిద్రపోతుండగా శత్రు శిబిరాలపై విరుచుకుపడటం పిరికితనానికి నిదర్శనమని, శూరులైన వారెవరూ అలాంటి వెన్నుపోటుకు పాల్పడరని వారు భావించేవారు.
4. అంటే – ఆ గుఱ్ఱాలు వేగంగా దూసుకుపోతున్నప్పుడు, శత్రుశిబిరంపై ఆకస్మిక దాడులు జరిపినప్పుడు ఆ ప్రాంత మంతా దుమ్ముధూళితో నిండిపోతుంది.

5 మరి దాంతోపాటు (శత్రు) సైనిక పంక్తుల మధ్యలోకి చొచ్చుకు పోతాయి.[5]

فَوَسَطْنَ بِهِ جَمْعًا ⑤

6 అసలు విషయం ఏమిటంటే మానవుడు తన ప్రభువు (విషయంలో) చేసిన మేలును మరచినవాడుగా తయారయ్యాడు.[6]

إِنَّ الْإِنسَانَ لِرَبِّهِ لَكَنُودٌ ⑥

7 నిజానికి ఈ విషయానికి స్వయంగా అతనే సాక్షి![7]

وَإِنَّهُ عَلَىٰ ذَٰلِكَ لَشَهِيدٌ ⑦

8 యదార్థానికి అతను ధన ప్రేమలో మహా ఘటికుడు.[8]

وَإِنَّهُ لِحُبِّ الْخَيْرِ لَشَدِيدٌ ⑧

9 ఏమిటి, సమాధుల్లోని వాటిని బయటికి కక్కించబడే సమయం గురించి అతనికి తెలియదా?[9]

أَفَلَا يَعْلَمُ إِذَا بُعْثِرَ مَا فِي الْقُبُورِ ⑨

10 గుండెల్లోని గుట్టంతా రట్టు చేయబడే సమయం గురించి[10] (అతనికి తెలీదా?)

وَحُصِّلَ مَا فِي الصُّدُورِ ⑩

11 నిశ్చయంగా ఆ రోజు వారి ప్రభువుకు వారి గురించి బాగా తెలిసి ఉంటుంది.[11]

إِنَّ رَبَّهُم بِهِمْ يَوْمَئِذٍ لَّخَبِيرٌ ⑪

---

5. **'వసత్న'** ( وَسَطْنَ ) అంటే మధ్యలోకి అని అర్థం. తాము రేపిన దుమ్ముతో ఆ ప్రదేశమంతా కలుషితమై, ఏమీ కానరాని పరిస్థితి ఏర్పడినప్పుడు ఆ గుర్రాలు అకస్మాత్తుగా శత్రువుల శ్రేణులలోకి చొచ్చుకుపోయి కలకలాన్ని సృష్టిస్తాయి.

6. మొదటి ఐదు ఆయతులలో చేయబడిన ప్రమాణాలకు సమాధానం ఈ (6వ) ఆయతులో ఇవ్వబడింది. ఇక్కడ 'మానవుడు' అంటే సత్య తిరస్కారి, దైవధిక్కారి అయినవాడు అన్నమాట! మేలును మరచిన వారే ఇలా తయారవుతారు.

7. అంటే – మనిషి తన ప్రవర్తన ద్వారా, మాటల ద్వారా తాను దేవుని కృతఘ్నుణ్ణి అని ఖుద్దుగా నిరూపించుకుంటున్నాడు.

8. ఇక్కడ **'ఖైర్'** అనే అరబీ పదం ధనం, డబ్బు, సిరిసంపదలు అన్న అర్థంలో ప్రయోగించబడింది. ఉదాహరణకు: అల్ బఖరా సూరాలోని 180వ వచనంలో **"ఇన్ తరకల్ ఖైరా...."** ను చూడండి. అక్కడ ఆ పదం ఆస్తిపాస్తులు, సిరిసంపదలు అన్న అర్థంలోనే ఉంది. **'షదీద్'** అంటే 'చాలా గట్టివాడు' అని అసలు అర్థం. అయితే ధనాశ కలవాడు, పిసినారి అని కూడా చెప్పవచ్చు. సాధారణంగా సంపద వ్యామోహంలో చిక్కుకు పోయినవాడే పిసినిగొట్టుగా, పేరాశాపరునిగా తయారవుతాడు.

9. అంటే – సమాధులలో ఉన్న మృతులంతా బ్రతికించబడి, లేపబడే సమయం....

10. అంటే – హృదయాలలో దాగివున్న రహస్య విషయాలన్నీ బయటపెట్టబడిన వేళ.

11. మృతులను సమాధుల నుంచి సజీవంగా లేపిన పరమప్రభువు, వారి ఆంతర్యాల్లోని రహస్య విషయాలను వెళ్ళగ్రక్కించే దేవుడు ఎంతటి సూక్ష్మద్రష్టయో ఊహించవచ్చు. ఆయన నుండి ఏ వస్తువూ దాగిలేదు. మరి ఆయన ప్రతి ఒక్కరికీ వారి కర్మలనుబట్టి పుణ్యఫలమో, పాపఫలమో ఇస్తాడు. దైవానుగ్రహాలను అనుక్షణం ఆస్వాదిస్తూ దేవుని మేళ్లను మరచి విర్రవీగే వారికి ఇదొక హెచ్చరిక! అలాగే ధనవ్యామోహంలో పడిపోయి తమ సంపదలో నుంచి హక్కుదారుల హక్కు చెల్లించకుండా ఉండే పిసినారులకు కూడా ఇది హెచ్చరికే!

101 వ సూరా

# అల్ ఖారిఅహ్

## మహోపద్రవం

అవతరణ మక్కాలో

ఆయతులు 11

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి వివరించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను ఇందులో వివరించడం జరిగింది. ఆ రోజున తీవ్రమైన ప్రకంపనాలు సంభవిస్తాయి. పర్వతాలు దూదిపింజాల్లా ఎగురుతాయి. మానవులు దిక్కుతోచని స్థితిలో నిస్సహాయంగా చెల్లాచెదరయిన దీపపు పురుగుల్లా కనబడతారు. చేసిన కర్మలకు తగిన విధంగా శిక్షా లేదా బహుమానాలు ఆ రోజున లభిస్తాయి.

### అల్ ఖారిఅహ్ సూరా

سُورَةُ القَارِعَة

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** ఎడా పెడా బాదేది.

الْقَارِعَةُ ﴿1﴾

**2** ఏమిటీ, ఆ ఎడా పెడా బాదేది?[1]

مَا الْقَارِعَةُ ﴿2﴾

**3** ఆ ఎడా పెడా బాదే దాని గురించి నీకేం తెలుసు?

وَمَا أَدْرَاكَ مَا الْقَارِعَةُ ﴿3﴾

**4** ఆ రోజు మనుషులు చెల్లాచెదురైన దీపపు పురుగుల్లా అయి పోతారు.[2]

يَوْمَ يَكُونُ النَّاسُ كَالْفَرَاشِ الْمَبْثُوثِ ﴿4﴾

**5** పర్వతాలు ఏకిన రంగు రంగుల దూది పింజాల్లా (లేక ఉన్నిలా) అయిపోతాయి.[3]

وَتَكُونُ الْجِبَالُ كَالْعِهْنِ الْمَنفُوشِ ﴿5﴾

1. **'అల్ ఖారియహ్'** (القَارِعَة) కూడా ప్రళయదినానికి గల అనేక పేర్లలో ఒక పేరు. ఉదాహరణకు: ఇంతకుముందు వచ్చినట్టు 'అల్ హాఖ్ఖా', 'అస్సాఖ్ఖతు', 'అస్సాఅతు', అల్ వాఖియహ్ మొదలగునవి. 'అల్ ఖారియహ్' అంటే తట్టేది, బాదేది అని అసలు అర్థం. సాధారణంగా తలుపును నెమ్మదిగా తడితే దాన్ని తలుపు తట్టడం అంటారు. అదే ధబధబా, వేగంగా, నిరంతరం కొడితే దాన్ని తలుపు బాదడం అంటారు. అర్ధరాత్రి పూట ఇంట్లో అందరూ నిద్రపోతున్న సమయంలో ఎవరయినా అకస్మాత్తుగా తలుపుబాదితే ఏమవుతుందో ఊహించుకోండి. ఆ సమయంలో ఇంట్లోనివారు భయాందోళన చెందటం సహజం. ప్రళయదినాన్ని 'అల్ ఖారియహ్'గా వ్యవహరించటం లోని మర్మం అదే. అది ఎప్పుడు వచ్చినా అందరినీ కలవరపరచే విధంగానూ, గుండె దడ పెంచే విధంగానూ ఉంటుంది.
2. **'ఫరాష్'** అంటే చీకటిలో దీపం చుట్టూ పరిభ్రమించే ఉసుళ్లు, దీపపు పురుగులు, దోమలు అని అర్థం. ఒక పద్ధతీ పాడూ లేకుండా అవి జ్యోతి చుట్టూ తిరుగుతుంటాయి. ప్రళయదినాన మనుషుల పరిస్థితి కూడా ఇంచుమించు అంతే.
3. పర్వతాలు ఎంత స్థిరంగా తమ ఉనికిని చాటుకుంటూ ఉంటాయో అందరికీ తెలిసిందే. దేవుడు వాటిని గురించి

6 ఎవరి త్రాసు పళ్ళాలు బరువుగా ఉంటాయో.[4]
فَأَمَّا مَن ثَقُلَتْ مَوَازِينُهُ ﴿6﴾

7 అతను మనసు మెచ్చిన భోగభాగ్యాలతో కూడిన జీవితంలో ఉంటాడు.[5]
فَهُوَ فِي عِيشَةٍ رَّاضِيَةٍ ﴿7﴾

8 మరెవరి త్రాసు పళ్ళాలు తేలికగా ఉంటాయో,[6]
وَأَمَّا مَنْ خَفَّتْ مَوَازِينُهُ ﴿8﴾

9 అతని నివాస స్థానం 'హావియా' అవుతుంది.[7]
فَأُمُّهُ هَاوِيَةٌ ﴿9﴾

10 అదేమిటో ('హావియా' అంటే ఏమిటో) నీకేం తెలుసు?[8]
وَمَا أَدْرَاكَ مَا هِيَهْ ﴿10﴾

11 అది దహించివేసే అగ్ని.[9]
نَارٌ حَامِيَةٌ ﴿11﴾

దివ్య ఖుర్ఆన్‌లో చెబుతూ, మేము పర్వతాలను ఎలా మేకులుగా పాతిపెట్టామో గమనించటం లేదా? అన్నాడు. అటువంటి స్థిరమైన పర్వతాలే ఆనాడు పేకమేడల్లా కూలిపోయి, నుజ్జునుజ్జయిపోతాయి. ఏకిన ఉన్ని వలే గాలిలో ఎగిరిపోతాయి. దీన్నిబట్టి ఆ ప్రళయ ఘడియ ఎంత భయానకంగా ఉంటుందో అంచనా వేసుకోవచ్చు. రానున్న వాక్యాలలో కర్మల దృష్ట్యా రెండు వర్గాల పరిస్థితి ఎలా ఉంటుందో సంక్షిప్తంగా తెలుపబడింది.

4. **'మవాజీన్'** (مَوَازِيْنُ) అనేది **'మీజాన్'** కు బహువచనం. ఈ తక్కెడ పళ్ళెములలో సత్కర్మలు తూయబడతాయి. అల్ ఆరాఫ్ సూరా 8వ వచనం ద్వారా, అల్ కహఫ్ సూరా 105వ వచనం ద్వారా, అంబియా సూరా 47వ వచనం ద్వారా తెలుపబడినది కూడా ఇదే. మరి కొంతమంది విద్వాంసుల ప్రకారం ఇక్కడ 'మవాజీన్' అంటే అర్థం త్రాసుపళ్ళాలు కాదు, దైవసన్నిధిలో ప్రత్యేక ప్రాముఖ్యం గల సత్కర్మల బరువు అని భావం (ఫత్‌హుల్ ఖదీర్). కాని మొదటి అర్థమే సరైనది, ఎన్నదగినదీను. దీనిప్రకారం ఎవరి సత్కర్మలు అధికంగా ఉంటాయో, తూకం వేయబడినప్పుడు వారి సత్కర్మల పళ్ళెం బరువుగా ఉంటుంది.

5. అంటే – ఆ వ్యక్తి కోరుకున్నవి అతనికి ప్రాప్తిస్తాయి.

6. అంటే – సత్కర్మలకన్నా దుష్కర్మలు అధికంగా ఉన్న వ్యక్తి అన్నమాట! ఆ వ్యక్తి కర్మలు తూకం వేయబడినప్పుడు దుష్కర్మల పళ్ళెం వంగుతుంది.

7. **'హావియహ్'** అనేది నరకం పేర్లలో ఒకటి. 'హావియా' అంటే నరకంలో అత్యంత అడుగున ఉండే స్థలం. ఆ రోజు నరకవాసులు నరకంలోని లోతైన గోతిలో పడతారు.

8. నరకాగ్ని తీవ్రత గురించి అందరికీ అర్థమయ్యేలా చెప్పటానికి ఇక్కడ ఇలా ప్రశ్నించటం జరిగింది. నిజానికి దాని తీవ్రత మనిషి అంచనాలకు అందనిది. మానవ మేధ దాన్ని అంచనా వేయజాలదు.

9. హదీసులో తెలియజేయబడిన దాని ప్రకారం ప్రపంచంలో మనిషి మండించే అగ్ని తీవ్రత నరకాగ్ని తీవ్రతలో 70వ వంతు మాత్రమే. నరకాగ్ని తీవ్రత ఈ లోకంలోని అగ్నికన్నా 69 రెట్లు ఎక్కువ (సహీహ్ బుఖారీ – కితాబ్ బదవుల్ ఖల్ఖ్; సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్). వేరొక హదీసు ప్రకారం ; అగ్ని తన ప్రభువుతో, 'ప్రభూ! నాలోని ఒక భాగం మరో భాగాన్ని తినేస్తున్నది' అని విన్నవించుకున్నది. అప్పుడు పరమ ప్రభువు దానికి రెండుసార్లు నిట్టూర్చేందుకు అనుమతి ఇచ్చాడు. వాటిలో ఒకటి వేడిని బయటికి వదిలేది. రెండవది చల్లగా గాలివదిలేది. చల్లని గాలిని వదిలినప్పుడు తీవ్రమైన చలి వేస్తుంది. వేడి గాలిని వదిలినప్పుడు తీవ్రమైన ఎండలుంటాయి (సహీహ్ బుఖారీ). వేరొక హదీసులో మహనీయ ముహమ్మదు (స) వారు ఇలా ప్రవచించారు : "వేసవి తీవ్రంగా ఉన్నప్పుడు నమాజును, చల్లపడ్డాక చేయండి. ఎందుకంటే వేసవి తీవ్రతకు ముఖ్యకారణం నరక తాపమే." (ముస్లిం – కితాబుల్ మసాజిద్).

102 వ సూరా

# అత్ తకాసుర్

## అధికంగా ప్రోగుచేయటం

అవతరణ మక్కాలో

ఆయతులు 8

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా సంపద పట్ల వ్యామోహం గురించి వివరించింది. మానవులు విపరీతంగా ప్రాపంచిక సుఖభోగాల వ్యామోహం కలిగి ఉంటారు. ఎల్లప్పుడు తమ సంపదను ఇంకా పెంచుకోవాలని చూస్తుంటారు. తమ హోదాను, అధికారాన్ని పెంచుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటారు. ప్రాపంచిక ప్రయోజనాలను సాధించడంలో పూర్తిగా నిమగ్నులైపోయి పరలోకాన్ని విస్మరిస్తారు. నిజానికి పరలోకం మనిషి భవిష్యత్తు. మృత్యువు ఆసన్నమైనప్పుడు, సమాధిలో వాస్తవాన్ని గుర్తిస్తారు. తీర్పుదినాన వారు తమ కళ్ళారా నరకాన్ని చూసుకుంటారు. అల్లాహ్‌కు దూరమైనందుకు, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు బాధాకరమైన శిక్షను అనుభవిస్తారు.

### అత్ తకాసుర్ సూరా | سُورَةُ التَّكَاثُرِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

**1** అధికంగా పొందాలన్న ఆశ మిమ్మల్ని పరధ్యానంలో పడ వేసింది.[1]

أَلۡهَىٰكُمُ ٱلتَّكَاثُرُ ۝١

**2** ఆఖరికి మీరు (ఈ ఆశల ఆరాటంలోనే) సమాధులకు చేరు కుంటారు.[2]

حَتَّىٰ زُرۡتُمُ ٱلۡمَقَابِرَ ۝٢

**3** ఎన్నటికీ కాదు.[3] మీరు తొందరగానే తెలుసుకుంటారు.

كَلَّا سَوۡفَ تَعۡلَمُونَ ۝٣

**4** మరెన్నటికీ కాదు... మీరు చాలా తొందరగానే తెలుసు కుంటారు.[4]

ثُمَّ كَلَّا سَوۡفَ تَعۡلَمُونَ ۝٤

1. **'అల్‌హా'** అంటే ఏమరుపాటుకు లోనుచేయటం, మరుపుకు గురిచేయటం, అలసత్వంలో పడవేయటం అని అర్థం. పరధ్యానం అన్నా అదే. 'తకాసుర్' అంటే మరీ ఎక్కువగా పొందాలన్న ఆశ. అది సిరిసంపదలకు, సంతానానికి, పదవులకు, బంగారం వజ్రవైఢూర్యాలకు – అన్నింటికీ వర్తిస్తుంది. మనిషికి వస్తువుల పట్ల ఆశ ఉండటంలో తప్పులేదు. కాని వాటిని జుర్రుకోవాలన్న ఆరాటం అతన్ని దైవాజ్ఞల పట్ల, ధర్మాదేశాల పట్ల ఏమరుపాటుకు గురిచేయకూడదు. దేవుడు మనిషిలోని ఈ బలహీనతను ఎత్తిచూపటంలోని అసలు ఉద్దేశం ఏమిటంటే మానవ సమాజాల్లో చాలామంది ఈ పరీక్షలో బోల్తా కొడుతూ ఉంటారు.
2. దీని భావమేమిటంటే ఈ ఆశల ఆరాటంలో మనిషి తీవ్రంగా పోరాడుతూ ఉంటాడు. ఆఖరికి తన జీవిత లక్ష్యాన్ని కూడా మరచిపోతాడు. అంతలోనే అతను కాటికి చేరుకోవలసి వస్తుంది.
3. అంటే మీలోని పేరాశ మంచిది కాదు. అది మిమ్మల్ని బాగుపడనివ్వదు.

| | |
|---|---|
| **5** అది కాదు. మీరు గనక నిశ్చిత జ్ఞానంతో తెలుసుకున్నట్లయితే (అసలు పరధ్యానంలోనే పడిఉండరు).[5] | كَلَّا لَوْ تَعْلَمُونَ عِلْمَ الْيَقِينِ ⑤ |
| **6** మీరు నరకాన్ని చూసి తీరుతారు.[6] | لَتَرَوُنَّ الْجَحِيمَ ⑥ |
| **7** అవును! మీరు దానిని ఖచ్చితంగా కళ్ళారా చూస్తారు సుమా![7] | ثُمَّ لَتَرَوُنَّهَا عَيْنَ الْيَقِينِ ⑦ |
| **8** మరి ఆ రోజు (దేవుని) అనుగ్రహాల గురించి మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నించటం జరుగుతుంది.[8] | ثُمَّ لَتُسْأَلُنَّ يَوْمَئِذٍ عَنِ النَّعِيمِ ⑧ |

4. అంటే దీని (పేరాశ) పరిణామం ఏమిటో మీరు త్వరలోనే తెలుసుకుంటారు. ఈ విషయం బాగా గుర్తుంచుకోవాలన్న ఉద్దేశంతో ఒకటికి రెండుసార్లు నొక్కి వక్కాణించబడింది.
5. దీని భావం ఇది : మీ పరధ్యానం వల్ల మీకు వాటిల్లే నష్టం ఏమిటో మీరు తెలుసుకున్నట్లయితే మీరెన్నటికీ ఈ ప్రాపంచిక వ్యామోహంలో పడరు. పైగా మీరు దైవానికి భయపడుతూ మధ్యేమార్గం అవలంబిస్తారు. అటు దేవుని హక్కులను, ఇటు దాసుల హక్కులను కూడా సరిగ్గా నిర్వర్తిస్తారు.
6. దైవసాక్షి! పేరాశవల్ల పరధ్యానంలో పడినవారు నరకయాతనకు తప్పక గురవుతారు.
7. తొలిచూపు దూరం నుంచి, ఈసారి చూపు చాలా దగ్గరి నుంచి. అందుకే దీన్ని నిశ్చిత కన్నులతో చూస్తారని అనటం జరిగింది.
8. అంటే – మనిషికి దేవుడు ప్రసాదించిన వివిధ వరాలను గురించి నిలదీసి అడగటం జరుగుతుంది. ఉదాహరణకు: కళ్లు, చెవులు, మనోమస్తిష్కాలు, కాళ్లుచేతులు, ఆస్తిపాస్తులు, ఆలుబిడ్డలు, ఆయురారోగ్యాలు ఇత్యాదివి. ఇంతకీ ప్రశ్నించబడేదెవరు? అవిశ్వాసులు మాత్రమేనా? వీటిని గురించి ప్రతి ఒక్కరూ ప్రశ్నించబడతారని కొందరు అభిప్రాయపడగా అవిశ్వాసులు మాత్రమే ప్రశ్నించబడతారని మరికొంతమంది అన్నారు. ఈ దైవానుగ్రహాలను సద్వినియోగం చేసుకున్నవారు (ప్రశ్నించబడినప్పటికీ) శిక్ష నుండి సురక్షితంగా ఉంటారు. దైవానుగ్రహాలను దుర్వినియోగపరచిన వారికి మాత్రం శిక్ష తప్పదు.

# 103వ సూరా

# అల్ అస్ర్

## కాలం

అవతరణ: మక్కాలో

ఆయతులు: 3

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా సన్మార్గం గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన 'అస్ర్' (కాలం) అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్‌ను విశ్వసించినవారు, మంచి పనులు చేసినవారు, పరస్పరం హితబోధ చేసుకున్నవారు తప్ప మిగిలిన వారందరూ తీర్పుదినాన నష్టానికి గురవుతారని ఈ సూరా తెలియజేసింది. ఈ సూరా సన్మార్గానికి సంబంధించిన ప్రధానమైన సూత్రాలను ప్రతిపాదించింది. అవి: అల్లాహ్‌ను విశ్వసించడం, మంచి పనులు చేయడం, సత్యం, సహనాల విషయమై ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం.

## అల్ అస్ర్ సూరా

## سُوۡرَةُ الۡعَصۡرِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

**1** కాలం సాక్షిగా![1]

وَالۡعَصۡرِۙ ‏(1)

**2** నిశ్చయంగా మానవుడు నష్టంలో పడి ఉన్నాడు.[2]

اِنَّ الۡاِنۡسَانَ لَفِىۡ خُسۡرٍۙ ‏(2)

**3** అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు,[3] పరస్పరం సత్యం గురించి ఉపదేశించినవారు,[4] ఒండొకరికి సహనం (స్థయిర్యం) గురించి తాకీదు చేసినవారు[5] మాత్రం నష్టపోరు.

اِلَّا الَّذِيۡنَ اٰمَنُوۡا وَعَمِلُوا الصّٰلِحٰتِ وَتَوَاصَوۡا بِالۡحَقِّ ۙ وَتَوَاصَوۡا بِالصَّبۡرِ ‏(3)

1. **'కాలం'** ( اَلْعَصْر ) అంటే రేయింబవళ్ళ చక్రభ్రమణం. రాత్రి వచ్చినప్పుడు చీకటి అలుముకుంటుంది. పగలు వచ్చినప్పుడు సర్వం వెలుగుమయం అవుతుంది. అదీగాక ఈ రేయింబవళ్లు తరుగుతూ పెరుగుతూ ఉంటాయి. పగలు సుదీర్ఘంగా ఉన్నప్పుడు రాత్రి చిన్నదిగా ఉంటుంది. రాత్రి పెద్దదిగా ఉన్నప్పుడు పగలు చిన్నదిగా ఉంటుంది. రేయింబవళ్లలోని ఈ ఎగుళ్లు దిగుళ్ల మిశ్రమమే 'కాలం'. ఇది దేవుని అపార శక్తికి, అసాధారణ కార్యదక్షతకి ఒక దర్పణం. అందుకే పరమ ప్రభువు 'కాలం'పై ప్రమాణం చేశాడు. ఇంతకుముందు కూడా చెప్పినట్లు దేవుడు తన సృష్టితాలలో తాను తలచిన దానిపై ప్రమాణం చేయగలడు. కాని మానవులు మాత్రం దేవునిపై తప్ప మరే వస్తువుపై కూడా ప్రమాణం చేయకూడదు.

2. మనిషి కష్టనష్టాలు సుస్పష్టమే. అతడు బ్రతికున్నంత కాలం అహోరాత్రులు నిరంతరం పరిశ్రమిస్తూ ఉంటాడు. తుదకు అతనికి మరణం వస్తుంది. అయితే మరణించిన పిదప అయినా అతనికి విశ్రాంతి, సుఖం ప్రాప్తిస్తుందా అంటే అదీ లేదు. పైగా అతను నరకానికి ఆహుతి అవుతున్నాడు.

3. అయితే **'విశ్వాసం'** (ఈమాన్) అనే భాగ్యాన్ని పొంది, ఆపైన మంచిపనులు చేస్తూ జీవితం గడిపినవారు మాత్రం ఈ నష్టం నుండి సురక్షితంగా ఉండగలుగుతారు. మరణానంతరం వారు శాశ్వితమైన దైవానుగ్రహాలను, స్వర్గలోక భాగ్యాలను ఆస్వాదిస్తారు. తరువాతి వాక్యంలో విశ్వాసులలోని మరో రెండు సుగుణాలు ప్రస్తావించబడ్డాయి.

4. అంటే దైవధర్మాన్ని, దైవాజ్ఞలను గురించి ప్రబోధిస్తూ, దేవుడు నిషేధించిన విషయాలకు, పాపకార్యాలకు దూరంగా ఉండాలని ఉపదేశించేవారు...

5. ఇంతకీ సహనం (ఓర్పు, నిగ్రహం) దేనిపై? అంటే – కష్టాలపై ! దైవశాసనాల ప్రకారం జీవితం గడిపే సమయంలో ఎదురయ్యే పరీక్షలపై! పాపకార్యాలు, నీతిబాహ్యమైన విషయాలు ఎదురుపడినప్పుడు! మనోవాంఛలను త్యాగం చేయవలసి వచ్చినప్పుడు! ఇలాంటి పరిస్థితుల్లో మనిషి ఓపిక పట్టి, సత్యధర్మంపై స్థిరత్వం కనబరచాలి. ఇది నిజంగా సాహసోపేతమైన విషయమే. 'సహనం' కూడా 'సత్యం'లో ఇమిడి ఉన్న విషయమే అయినప్పటికీ ఈ సూరాలో దీన్ని ప్రత్యేకంగా విడదీసి చెప్పటం జరిగింది. దీన్నిబట్టి ధర్మావలంబనలో 'సహనానికి' గల ప్రాముఖ్యత ఎంతటిదో అవగతం అవుతోంది.

104వ సూరా

# అల్ హుమజహ్

## నిందలు వేసేవాడు

అవతరణ మక్కాలో

ఆయతులు 9

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా అపనిందలు వేయడాన్ని, సంపద పట్ల విపరీతమైన వ్యామోహాన్ని చర్చించింది. మొదటి ఆయతులో వచ్చిన 'హుమజహ్' (నిందలు వేసేవాడు) అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అపనిందలు మోపడం, ఇతరుల గురించి చెడుగా మాట్లాడడం వంటి రుగ్మతలను ఇందులో తీవ్రంగా ఖండించడం జరిగింది. అలాగే సంపదను ప్రోగుచేయడంలో మునిగిపోయి, దానధర్మాలు చేయని వారిని ఈ సూరా తీవ్రంగా హెచ్చరించింది. ఈ రెండు రకాల ప్రజలు నరకాగ్ని శిక్ష పొందుతారని తెలిపింది.

### అల్ హుమజహ్ సూరా | سُورَةُ الهُمَزَةِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** (ఇతరుల) తప్పులెన్నుతూ, పరోక్ష నిందకు పాల్పడే ప్రతి ఒక్కడికీ మూడుతుంది.[1]

وَيْلٌ لِّكُلِّ هُمَزَةٍ لُّمَزَةٍ ①

**2** వాడు ధనాన్ని పోగుచేసి, పదే పదే లెక్కపెడుతూ ఉంటాడు.[2]

الَّذِي جَمَعَ مَالًا وَعَدَّدَهُ ②

**3** తన ధనం ఎల్లకాలం తన వెంటే ఉంటుందని వాడనుకుంటు న్నాడు.[3]

يَحْسَبُ أَنَّ مَالَهُ أَخْلَدَهُ ③

**4** ఎన్నటికీ అలా జరగదు.[4] వాడు తుత్తునియలు చేసివేసే దాంట్లో విసిరివేయబడతాడు.[5]

كَلَّا لَيُنبَذَنَّ فِي الْحُطَمَةِ ④

---

1. **'హుమజహ్' ( هُمَزَةُ ), 'లుమజహ్' ( لُمَزَةُ )** పదాలను కొంతమంది ఒకే అర్థంలో తీసుకున్నారు. మరికొంతమంది రెండు వేర్వేరు అర్థాలలో తీసుకున్నారు. 'హుమజహ్' అంటే అదేపనిగా ఇతరులలోని లోపాలను ఎంచటం అనీ, లుమజహ్ అంటే ఒకరి వీపు వెనుక నిందించటమనీ అన్నారు. కళ్లతో, చేతులతో సైగలు చేస్తూ హేళన చేయటం 'హుమజహ్' క్రిందికి వస్తుందని, నోటితో నిందించటం 'లుమజహ్'గా పరిగణించబడుతుందని ఇంకా కొందరు వ్యాఖ్యానించారు.
2. డబ్బును లెక్కపెట్టి ఉంచటం, ధనాన్ని సర్దిపెట్టడం స్వతహాగా తప్పుకాదు. కాని డబ్బును దైవమార్గంలో ఖర్చుపెట్టకుండా, జకాత్ సదకా వంటి దానధర్మాలు చేయకుండా కడుపులు కొట్టి, మూటలు కట్టి దాచటం, పదే పదే దాన్ని సర్దిపెడుతూ మురిసిపోతూ ఉండటమే ఖండించదగినది. మనిషికి ధనవ్యామోహం ఎక్కువై పోయినప్పుడే ఇలా చేస్తాడు.
3. **'అఖ్లద'** అనే పదానికి సరైన తర్జుమా 'తనను ఎల్లకాలం సజీవంగా ఉంచేది' అని. అంటే ఈ ధనం వల్ల తన ఆయుష్షు పెరుగుతుందని, తానెన్నటికీ చావనని వాడనుకుంటున్నాడా?

| | |
|---|---|
| 5 ఆ తుత్తునియలు చేసివేసేదాన్ని గురించి ఏమనుకున్నావు?[6] | وَمَآ أَدۡرَىٰكَ مَا ٱلۡحُطَمَةُ ⑤ |
| 6 అది అల్లాహ్ రాజేసినటువంటి అగ్ని. | نَارُ ٱللَّهِ ٱلۡمُوقَدَةُ ⑥ |
| 7 అది హృదయాల వరకూ చొచ్చుకు పోయేటటువంటిది.[7] | ٱلَّتِي تَطَّلِعُ عَلَى ٱلۡأَفۡـِٔدَةِ ⑦ |
| 8 ఆ అగ్ని వారిపై అన్ని వైపుల నుండీ మూసివేయబడుతుంది.[8] | إِنَّهَا عَلَيۡهِم مُّؤۡصَدَةٞ ⑧ |
| 9 వారు పొడవాటి స్తంభాల (అగ్నికీలల) మధ్య (చిక్కుకుని ఉంటారు). | فِي عَمَدٖ مُّمَدَّدَةِۭ ⑨ |

4. వాడి అంచనా సరైనది కాదు.

5. ఇలాంటి పిసినిగొట్టు ఎవరయినాసరే **'హుతమహ్'** (ٱلۡحُطَمَةُ) లో పారేయబడతాడు. 'హుతమహ్' అనేది నరకానికి గల అనేక పేర్లలో ఒక పేరు. అది నుజ్జు నుజ్జు చేసి వేసేది.

6. దాని భయంకర స్థితిని వర్ణించటానికి ఈ విధంగా ప్రశ్నించటం జరిగింది. అది ఎంత తీవ్రంగా దహించే అగ్ని అంటే అది మీ బుద్ధిజ్ఞానాలకు అందనిది. అది మీ ఆలోచనలకు అందనిది.

7. దాని ఉష్ణోగ్రత (సెగ) హృదయాంతరాళాల దాకా చొచ్చుకుపోతుంది. ఆ మాటకొస్తే ప్రపంచంలోని అగ్ని సయితం తక్కువేమీ కాదు. అది కూడా ప్రతి వస్తువునూ దహించి వేస్తుంది. కాని ప్రపంచంలోని అగ్ని మానవ హృదయంలోకి చొచ్చుకోక ముందే మనిషి చచ్చిపోతాడు. అయితే నరకాగ్ని అలా కాదు. అది గుండెల దాకా చేరినప్పటికీ అక్కడ మనిషికి చావు రాదు. చావుకోసం మనిషి కోరుకుంటాడు. కాని చావు రాదు.

8. అంటే – నరకమార్గాలు, ద్వారాలు అన్నీ మూసివేయబడతాయి. తత్కారణంగా నరకవాసులు బయటికి పారిపోలేరు. పైగా వారిని ఇనుప మేకులతో బంధించటం జరుగుతుంది. అవి మామూలు మేకులు కావు – స్తంభాల్లా ఉంటాయి. కొంతమంది ఇనుప గొలుసులనీ, గుదిబండలనీ అభిప్రాయపడ్డారు.

105 వ సూరా

# అల్ ఫీల్

## ఏనుగు

అవతరణ మక్కాలో

ఆయతులు 5

### పరిచయం

సత్య తిరస్కారులకు పట్టిన దుర్గతిని ముఖ్యంగా ఈ సూరా ప్రస్తావించింది. మొదటి ఆయతులో 'ఫీల్' (ఏనుగు) గురించిన ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పుట్టుకకు రెండు నెలల ముందు జరిగిన ఒక చారిత్రక సంఘటనను ఈ సూరా ప్రస్తావించింది. యమన్‌కు చెందిన అబ్రహా రాజు మక్కాపై దండయాత్రకు వచ్చాడు. ఏనుగుల మహాసైన్యంతో దాడికి దిగాడు. కాని అల్లాహ్ ఆ దుర్మార్గపు దాడిని నిరోధించాడు. ఆ సైన్యంపైకి పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారిపై గట్టి కంకరరాళ్ళను విసిరాయి. వాటి ధాటికి ఆ సైన్యం నాశనమయ్యింది.

## అల్ ఫీల్ సూరా

## سُورَةُ الفِيلِ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

**1** ఏమిటీ, నీ ప్రభువు ఏనుగుల వారిపట్ల వ్యవహరించిన తీరును నీవు చూడలేదా?[1]

**2** ఏమిటీ, వాళ్ల కుట్రను (ఆయన) భగ్నం చేయలేదా?[2]

**3** వాళ్లపై ఆయన గుంపులు గుంపులుగా పక్షులను పంపించాడు.[3]

**4** అవి వారిపై మట్టితో తయారైన కంకర్రాళ్ళను కురిపించ సాగాయి.[4]

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

اَلَمۡ تَرَ كَيۡفَ فَعَلَ رَبُّكَ بِاَصۡحٰبِ الۡفِيۡلِؕ ﴿1﴾

اَلَمۡ يَجۡعَلۡ كَيۡدَهُمۡ فِىۡ تَضۡلِيۡلٍۙ ﴿2﴾

وَّاَرۡسَلَ عَلَيۡهِمۡ طَيۡرًا اَبَابِيۡلَۙ ﴿3﴾

تَرۡمِيۡهِمۡ بِحِجَارَةٍ مِّنۡ سِجِّيۡلٍۙ ﴿4﴾

---

1. కాబా గృహాన్ని నేలమట్టం చేసే ఉద్దేశ్యంతో యమన్ నుండి వచ్చిన ఏనుగుల వారిపట్ల నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో (ఓ ముహమ్మద్!) నీకు తెలియనిది కాదు. ఈ సంగతి నీ పట్టణవాసులకు కూడా తెలిసిందే. ఇలా ప్రశ్నించటంలోని ఉద్దేశం ఏమిటంటే, ఈ సంఘటన జరిగి ఎక్కువ కాలం కాలేదు. మక్కావాసులు దీనిని అంత సులువుగా మరచిపోలేరు. సుప్రసిద్ధ ఉల్లేఖనాల ప్రకారం ఏనుగుల వాళ్ళ సంఘటన మహాప్రవక్త (సఅసం) జన్మించిన సంవత్సరమే జరిగింది. క్లుప్తంగా ఈ సంఘటన ఇది :

   అబిసీనియా చక్రవర్తి తరఫున అబ్రహా యమన్ ప్రాంతానికి గవర్నరుగా ఉండేవాడు. అతను 'సన్ఆ' అనే పట్టణంలో చాలా పెద్ద చర్చిని నిర్మించాడు. ఆ ప్రాంతంలోని జనులంతా మక్కాలోని కాబా గృహానికి బదులు ఆ చర్చికి వచ్చి ప్రార్థనలు జరపాలన్నది అతని అభిలాష. అబ్రహా ప్రయత్నాలు మక్కావాసులకు, ఇతర అరేబియా తెగలకు మింగుడు పడలేదు. ఆ ఉక్రోషంతోనే అరేబియాకు చెందిన ఒక వ్యక్తి అబ్రహా కట్టించిన ప్రార్థనాలయంలో మలినం వేసి అపవిత్రం చేశాడు. ఈ సంగతి తెలుసుకున్న అబ్రహా ఆగ్రహోదగ్రుడయ్యాడు. కాబా గృహాన్ని నేలమట్టం చేసే సంకల్పంతో అతను ఓ పెద్ద సైన్యం తీసుకుని మక్కా వైపుకు దండెత్తి వచ్చాడు. అతని వెంట ఓ గజదళం కూడా ఉంది. తీరా అబ్రహా సైన్యం కాబా పరిసరాల్లోకి రాగానే దేవుడు ఆ సైన్యంపైకి ఓ పక్షుల గుంపును పంపాడు. అవి ఆ సైన్యంపై కంకర్రాళ్ళు పడేయటం మొదలెట్టాయి. ఆ కంకరరాళ్లు పడిన సైనికులు తీవ్రమైన దురదతో శరీరాలు గోక్కోసాగారు. ఆ గోకుడుకు కొద్దిసేపట్లోనే వారి శరీరాల మాంసం ఊడిపోసాగింది. ఆ విధంగా ఎంతోమంది సైనికులు నేలకొరిగారు. ఈ వింత పరిణామానికి అబ్రహా సైతం బెంబేలెత్తి తోకముడిచాడు. అతను సైతం 'సన్ఆ' పట్టణానికి చేరుకోగానే దురదను భరించలేక చనిపోయాడు. ఈ విధంగా అల్లాహ్ తన గృహాన్ని అపూర్వంగా కాపాడాడు. అంతకుముందు అబ్రహా మక్కా పొలిమేరల్లో విడిది చేసి మక్కా సర్దారు, మహాప్రవక్త (స) తాతగారైన అబ్దుల్ ముత్తలిబ్ ఒంటెలను వశపరచుకున్నాడు. అబ్దుల్ ముత్తలిబ్ అబ్రహా దగ్గరకు వచ్చి, "నీ సైనికులు వశపరచుకున్న నా ఒంటెలను నాకు అప్పగించు. ఇక కాబా గృహమంటావా?! అది దైవగృహం. దాన్ని పడగొట్టే ఉద్దేశంతో నువ్వొచ్చావ్. ఆ వ్యవహారం నీకూ – అల్లాహ్‌కు మధ్య ఉంది. ఆయన స్వయంగా దాన్ని కాపాడుకుంటాడు" అని పలికారు. (ఐసరుత్తఫాసీర్).

2. అంటే, కాబా గృహాన్ని పడగొట్టడానికి వచ్చిన ఏనుగుల వాళ్ల కుయుక్తులను అల్లాహ్ వమ్ముచేశాడు.

3. **'అబాబీల్'** అంటే గుంపులు గుంపులుగా వచ్చినవి అని అర్థం.

4. **'సిజ్జీల్'** అంటే మట్టిని అగ్నిలో కాల్చి తయారుచేసిన కంకర్రాళ్ళని అర్థం. ఈ చిన్న చిన్న కంకర్రాళ్ళే ఆ సమయంలో శతఘ్నుల మాదిరిగా, మిజైళ్ళ మాదిరిగా పని చేశాయి.

| | |
|---|---|
| 5 ఎట్టకేలకు, ఆయన వారిని తిని (తొక్కి వేసి)న తొక్కు మాదిరిగా చేసేశాడు.[5] | فَجَعَلَهُمْ كَعَصْفٍ مَّأْكُولٍ ⑤ |

5. అంటే వారి శరీరాలు పశువులు తిని తొక్కేసిన పొట్టు లేక చెత్త మాదిరిగా అయిపోయాయి.

106వ సూరా

# ఖురైష్

## ఖురైషులు

అవతరణ మక్కాలో

ఆయతులు 4

### పరిచయం

ఖురైష్ ప్రజలకు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఇందులో ప్రస్తావించడం జరిగింది. 'ఖురైష్' అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఖురైషు తెగ ప్రవక్త ముహమ్మద్(సఅసం) స్వంత తెగ. అరేబియాలో అత్యంత ఉన్నతమైన తెగ. కాబా ధర్మకర్తృత్వ బాధ్యతను నిర్వర్తిస్తున్న తెగ. అల్లాహ్ ఈ తెగకు హోదా, సంపద, భద్రతలు ప్రసాదించాడు. వారు అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించాలని, కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, దైవప్రవక్త(సఅసం)కు, అవతరిస్తున్న దైవవాణి (వహీ)కి మద్దతు ఇవ్వాలని ఈ సూరాలో వారికి బోధించడం జరిగింది.

### ఖురైష్[1] సూరా — سُورَةُ قُرَيْشٍ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| 1 ఖురైషులను అలవాటు చేసిన కారణంగా, | لِإِيلَافِ قُرَيْشٍ ① |
| 2 (అంటే) చలికాలపు, ఎండాకాలపు ప్రయాణాలకు వారిని అలవాటు చేసిన కారణంగా,[2] | إِيلَافِهِمْ رِحْلَةَ الشِّتَاءِ وَالصَّيْفِ ② |
| 3 వారు ఈ (కాబా) గృహం యొక్క ప్రభువునే ఆరాధించాలి. | فَلْيَعْبُدُوا رَبَّ هَٰذَا الْبَيْتِ ③ |

1. ఈ సూరాను **'ఈలాఫ్ సూరా'** అని కూడా అంటారు. వెనుకటి సూరా (అల్ ఫీల్ సూరా)తో ఈ సూరాకు విడదీయరాని సంబంధం ఉన్నది.

2. **'ఈలాఫ్'** అంటే అలవాటు పడిపోవటం, చేరువ కావటం అని అర్థం. అంటే ఏదైనా పనివల్ల లేక ఏదైనా వ్యవహారం వల్ల కలిగే అసౌకర్యం, ఇబ్బందిని తేలిగ్గా అధిగమించగలగటం అన్నమాట. ఆనాడు మక్కాకు చెందిన ఖురైషు జనుల ప్రధాన వృత్తి వ్యాపారం. ఏడాదిలో రెండుసార్లు వారి వర్తకబృందాలు సుదీర్ఘ ప్రయాణాలు చేసి విదేశాలకు వెళ్ళేవి. ఉష్ణోగ్రత అధికంగా ఉండే యమన్ ప్రదేశానికి చలికాలంలో వెళ్ళి, శీతల ప్రదేశమైన సిరియాకు వేసవి కాలంలో వెళ్ళేవారు. కురైషులు కాబా గృహ సేవకులవటం చేత అరబ్బులంతా వారిని అమితంగా ఆదరించేవారు.

| | |
|---|---|
| 4 ఆయనే వారికి ఆకలిగొన్నప్పుడు అన్నం పెట్టాడు.[3] భయాందోళనల స్థితిలో భద్రత కల్పించాడు.[4] | الَّذِيْٓ اَطْعَمَهُمْ مِّنْ جُوْعٍ ۙ وَّاٰمَنَهُمْ مِّنْ خَوْفٍ ④ |

వారు ఏ ప్రదేశాలకు వెళ్ళినా ప్రజలు హృదయ పూర్వకంగా స్వాగతించేవారు. ఈ ప్రయాణాలలో వారికెక్కడా, ఎలాంటి అవరోధాలు ఎదురయ్యేవి కావు. ఈ సంగతినే దేవుడిక్కడ ప్రస్తావించాడు. ఓ ఖురైషు జనులారా! మీకు లభించే ఈ స్వాగత సన్మానాలకు, గౌరవాదరణలకు అసలు కారణం కాబా గృహమే. ఈ కాబా గృహం వల్లనే మీరు మక్కాలో సుఖశాంతులతో వర్ధిల్లుతున్నారు.

కాబట్టి మీరు మీ ప్రభువు దయానుగ్రహాన్ని మరువకండి. ఈ కాబా గృహం యొక్క ప్రభువును ఆరాధించండి. ఆయనకు సాటి కల్పించకండి. ఆయన మీకు చేసిన మహోపకారానికిగాను కృతజ్ఞులై ఉండండి. ఎందుకంటే, మీ ప్రభువు అండదండలే గనక మీకు లేకుండా ఉంటే మీరు ఏడాదిలో రెండు పెద్ద ప్రయాణాలు చేయగలిగేవారు కాదు. ఏనుగుల వాళ్ళను కూడా తరిమికొట్టి మేము మీ గౌరవోన్నతులకు విఘాతం కలగకుండా చూశాము. ఒకవేళ అబ్రహాయే గనక తన దురుద్దేశంలో కృతకృత్యుడై ఉంటే మీ పేరు ప్రతిష్ఠలన్నీ మంటగలసిపోయేవి. మీ వాణిజ్యం కూడా దెబ్బతినేదే. కనుక మీరు మీ ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుకోండి. ఆయన్ని ఆరాధించండి. చిత్తశుద్ధితో కాబా గృహం సేవలు చేయండి.

3. అంటే, వర్తకం ద్వారా, సుదీర్ఘ ప్రయాణాల ద్వారా వారి ఆకలి బాధను తీర్చాడు.

4. ఆనాడు అరేబియా అంతటా అశాంతి అలజడులు ఉండేవి. సర్వత్రా రక్తపాతం జరిగేది. కాని పవిత్ర గృహం కారణంగా మక్కాలోని ఖురైషులకు ఈ బెడద తప్పింది. వారు సుఖంగా, ప్రశాంతంగా జీవించేవారు.

107 వ సూరా

# అల్ మాఊన్

## సామాన్య వాడుక వస్తువులు

అవతరణ మక్కాలో

ఆయతులు 7

### పరిచయం

అవిశ్వాసులు, కపట విశ్వాసుల గురించి ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఈ సూరా చివరి ఆయతులో వచ్చిన 'మాఊన్' (సామాన్య వాడుక వస్తువులు) అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. రెండు రకాల ప్రజలను ఈ సూరాలో తీవ్రంగా విమర్శించడం జరిగింది.

1 తీర్పుదినాన్ని నిరాకరిస్తున్న అవిశ్వాసులు. వారు అనాథలను కఠినంగా కసరి కొడతారు. నిరుపేదలకు సహాయం చేయడాన్ని వారు ప్రోత్సహించరు.

2. కపట విశ్వాసులైన ముస్లిములు – నమాజులకు ఆలస్యం చేస్తారు. వేళకు నమాజు చేయరు. అందరూ చూడాలని మంచి పనులు చేస్తారు. చిన్న చిన్న విషయాలలో కూడా తమ తోటి వారికి సహాయం చేయడానికి ముందుకు రారు.

## అల్ మాఊన్[1] సూరా

سُوۡرَةُ المَاعُون

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

**1** తీర్పు (దినము)ను ధిక్కరించే వాడిని నీవు చూశావా?![2]

أَرَءَيۡتَ ٱلَّذِي يُكَذِّبُ بِٱلدِّينِ ﴿1﴾

**2** వీడే అనాథను గెంటివేసేవాడు.[3]

فَذَٰلِكَ ٱلَّذِي يَدُعُّ ٱلۡيَتِيمَ ﴿2﴾

**3** నిరుపేదకు అన్నం పెట్టమని కనీసం (ఇతరులకు) ప్రేరేపించనివాడు.[4]

وَلَا يَحُضُّ عَلَىٰ طَعَامِ ٱلۡمِسۡكِينِ ﴿3﴾

**4** ఆ నమాజీలకు వినాశం తప్పదు ('వైల్' అనే నరక స్థానం వారికొరకు ఉన్నది).

فَوَيۡلٞ لِّلۡمُصَلِّينَ ﴿4﴾

**5** (ఎందుకంటే) వారు తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహిస్తారు.[5]

ٱلَّذِينَ هُمۡ عَن صَلَاتِهِمۡ سَاهُونَ ﴿5﴾

1. ఈ సూరాను సూరయె దీన్‌గా, సూరయె అరఐత్‌గా, సూరయె యతీమ్‌గా కూడా వ్యవహరిస్తారు (ఫత్‌హుల్ ఖదీర్).
2. నీవు చూశావా? లేక నీవు గమనించావా? అని దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)తో అనబడిన మాటలివి. తీర్పుదినాన్ని, శిక్షా బహుమానాలను త్రోసిపుచ్చే వ్యక్తి ఎలా ఉంటాడో నీవు పరికించావా? వాడి గుణం ఎలా ఉంటుందో తదుపరి వాక్యంలో చెప్పబడింది.
3. 1. వాడు పరమ పీనాసి. 2. అంతిమ దినాన్ని తిరస్కరించేవాడు. ఇలాంటివాడు తండ్రిలేని బిడ్డలను ఎలా ఆదరిస్తాడు? మానవీయ విలువల పట్ల, నైతిక నియమాల పట్ల నమ్మకం గలవాడు, పరలోకంలోని శిక్షాబహుమానాలను సత్యమని విశ్వసించేవాడు మాత్రమే సాధారణంగా అనాథల, నిరాధార జీవుల యెడల దయతో మెలగుతాడు. అలా కాకుండా ధన వ్యామోహంలో పడి, పిసినిగొట్టుగా తయారైనవాడు అభాగ్య జీవులపై జాలి చూపడు. వాడి గుండె కరకు గుండెగా మారిపోతుంది.
4. నిరుపేదలకు అన్నం పెట్టమని ప్రోత్సహించే పని కూడా పరలోకంపై దృఢ విశ్వాసం గలవాడు మాత్రమే చేస్తాడు. ఎందుకంటే తాను చేసిన ఈ పుణ్య కార్యానికిగాను తన ప్రభువు పుణ్యఫలం ఇస్తాడన్న ఆశ అతనికి ఉంటుంది.
5. ఎవరు వీరు? అసలు నమాజులను పట్టించుకోనివారు. లేదా ఒకప్పుడు నమాజు చేస్తూ ఉండి ప్రస్తుతం నమాజు చేయటం మానేసినవారు. లేదా నమాజులను నిర్ణీత వేళకు చేయకుండా తమకు వీలు చిక్కినప్పుడు చేసేవారు. నమాజులలో ఏకాగ్రత పట్ల, అణకువ, వినమ్రత పట్ల తగినంత శ్రద్ధ చూపకుండా చాలా అజాగ్రత్తగా వుండేవారు. మరీ బద్ధకంతో, బలవంతంగా నమాజు చేసేవారు. – ఈ అంశాలన్నీ ఈ **'అశ్రద్ధ'**లో ఇమిడి ఉన్నాయి. కాబట్టి నమాజు చేసేటప్పుడు ఈ లోపాలన్నింటినీ అధిగమించి, శ్రద్ధాభక్తులతో నమాజు చేయాలి. సాధారణంగా పరలోకంపై లెక్కల ఘడియపై గట్టి నమ్మకం లేనివారు మాత్రమే తమ ప్రార్థనలలో ఈ రకమైన ఏమరుపాటుకు, అలసత్వానికి గురవుతుంటారు. ముఖ్యంగా కపట విశ్వాసులలో ఇలాంటి ధోరణి అధికంగా ప్రబలుతుంది. అందుకే వారినుద్దేశించి ఇలా అనబడింది–"వారు నమాజ్ కొరకు లేస్తే, బద్ధకంగా, కేవలం ప్రజలకు చూపేందుకే లేస్తారు. అల్లాహ్‌ను చాలా తక్కువగా స్మరిస్తారు." (అన్ నిసా – 142).

| | |
|---|---|
| **6** వారు (ఒకవేళ నమాజు చేసినా) పరులకు చూపటానికి చేస్తారు.[6] | الَّذِينَ هُمْ يُرَاءُونَ ⑥ |
| **7** అతి సామాన్యమైన వాడుక వస్తువులు సయితం ఇవ్వటానికి వారు నిరాకరిస్తారు.[7] | وَيَمْنَعُونَ الْمَاعُونَ ⑦ |

6. అసలు ఇలాంటి వారి నమాజులో చిత్తశుద్ధి ఉండదు. వారు జనుల వెంట ఉన్నప్పుడు మాత్రం నమాజు చేస్తారు. అన్యథా అసలు నమాజు గురించే ఆలోచించరు. అంటే కేవలం నలుగురికి చూపే ఉద్దేశంతో మాత్రమే వారు నమాజు చేస్తారు.

7. **'మాఊన్'** (مَاعُونُ) అంటే 'జకాత్ అని కొందరు అభిప్రాయపడ్డారు. 'జకాత్' కూడా చాలా తక్కువ పరిమాణంలో (కేవలం రెండున్నర శాతం) ఉండటం వల్ల బహుశా 'మావూన్' అనేది ఇదే అని వారి వాదన. మరికొంతమంది ప్రకారం 'మావూన్' అంటే ఇండ్లలో ఉపయోగించే చాలా చిన్న చిన్న వస్తువులు, సాధారణ పనిముట్లు. ఇరుగుపొరుగు వారు వాటిని అవసరానికి అడిగి తీసుకుంటూ ఉంటారు. ఇలాంటి వస్తువులను తమ పొరుగువారు అడిగినప్పుడు అన్యథా భావించకుండా ఇస్తూ ఉండటం మంచి లక్షణం. దీనికి భిన్నంగా పిసినారితనం ప్రదర్శించటం మంచిది కాదు. పైగా ఇది పరలోకంపై విశ్వాస రాహిత్యానికి నిదర్శనం.

108 వ సూరా

# అల్ కౌసర్

## సమృద్ధి

అవతరణ మక్కాలో

ఆయతులు 3

### పరిచయం

ప్రవక్త ముహమ్మద్ (స)కు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఈసూరాలో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన 'కౌసర్' (సమృద్ధి) అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)కు ప్రసాదించబడిన అసంఖ్యాక అనుగ్రహాలను ప్రస్తావిస్తూ, అల్లాహ్‌ను కొనియాడాలని, ఆయనకు కృతజ్ఞత చూపాలని బోధించడం జరిగింది. అవిశ్వాసుల వైరం, వారి గర్వం ప్రవక్త(సఅసం)ను ఏమాత్రం నష్టపరచలేవని హామీ ఇవ్వడం జరిగింది.

### అల్ కౌసర్[1] సూరా — سُورَةُ الْكَوْثَرِ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| **1** నిశ్చయంగా మేము నీకు కౌసర్ (సరస్సును, మరెన్నో వరాల)ను ప్రసాదించాము.[2] | إِنَّا أَعْطَيْنَاكَ الْكَوْثَرَ ① |

1. ఈ సూరాను సూరతు'న్నహ్ర్'గా కూడా వ్యవహరిస్తారు.

2. **'కౌసర్'** (كَوْثَر) అనే పదం బహుళార్థకాలకు సంకేతం. దీని అర్థాలు కూడా అనేకం. ఇబ్నె కసీర్ గారు 'అత్యధిక

| | |
|---|---|
| **2** కాబట్టి నువ్వు నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి, ఖుర్బానీ ఇవ్వు.[3] | فَصَلِّ لِرَبِّكَ وَانْحَرْ ﴿٢﴾ |
| **3** ముమ్మాటికీ నీ శత్రువే నామరూపాల్లేకుండా పోయేవాడు.[4] | إِنَّ شَانِئَكَ هُوَ الْأَبْتَرُ ﴿٣﴾ |

శుభాలు' అన్న అర్థానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎందుకంటే ఇతరత్రా అర్థాలు కూడా ఈ పదంలో ఇమిడి ఉన్నాయి. ఉదాహరణకు ప్రామాణిక హదీసులలో వచ్చిన వివరాల ప్రకారం కౌసర్ అనేది స్వర్గంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు వొసగబడే ఒక కాలువ. మరికొన్ని హదీసులలో కౌసర్ అనేది ఒక 'సరస్సు' అని, విశ్వాసులు స్వర్గంలో ప్రవేశించే ముందు మహాప్రవక్త (సఅసం) చేతుల మీదుగా ఆ సరస్సు నీరును త్రాగుతారని, ఆ సరస్సులోకి వచ్చే నీరు కూడా స్వర్గంలోని ఆ కాలువకే చెందింది అయి ఉంటుందని తెలుపబడింది. అలాగే ఇహలోకంలో మహాప్రవక్త (సఅసం) వారికి లభించిన విజయాలు, కీర్తి ప్రతిష్ఠలు, పరలోకంలోని పుణ్యఫలాలు – ఇవన్నీ ఈ "అత్యధిక శుభాలు" లోకి వచ్చేస్తాయి. (ఇబ్నె కసీర్).

3. అంటే నమాజు కూడా కేవలం ఒక్కడైన అల్లాహ్ కొరకే చేయాలి. ఖుర్బానీ కూడా ఒక్కడైన ఆ అల్లాహ్ పేరిటే ఇవ్వాలి. బహుదైవారాధకుల మాదిరిగా ఈ ఖుర్బానీలో ఇతరులను భాగస్వాములుగా చేర్చరాదు. 'నహ్ర్' అంటే ఒంటె గొంతుపై ఈటెతోగానీ, కత్తితోగానీ కొట్టి, ఆ తరువాత దానిని 'జిబహ్' చేయటం అని అసలు అర్థం. అయితే ఇతర పశువులను మాత్రం నేలపై పరుండబెట్టి గొంతు కోయటాన్ని 'జిబహ్'గా వ్యవహరిస్తారు. కాని ఈ ఆయతులో 'నహ్ర్' అంటే అసలు సిసలు అర్థం ఖుర్బానీ. ఇక ఇతరత్రా దానధర్మాలుగా పశువును ఖుర్బానీ చేయటం, హజ్ సందర్భంగా 'మినా' పర్వత లోయలో పశువును ఖుర్బానీ చేయటం, బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వటం– ఇవన్నీ ఇందులో అంతర్భాగాలే.

4. **'అబ్తర్'** అంటే తోక తెగటం అని అసలు అర్థం. ఒకరి వంశపరంపర ముందుకు సాగకుండా ఆగిపోయిన వారిని, పేరు కూడా ప్రస్తావించకుండా వదిలివేసిన అనామకులను 'అబ్తర్'గా వ్యవహరిస్తారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి మగపిల్లలు చనిపోవటం గమనించిన కొంతమంది అవిశ్వాసులు ఆయన్ని 'అబ్తర్'గా అవహేళన చేయసాగారు. అప్పుడు దేవుడు ఆయన్ని (స) ఓదారుస్తూ ఈ వాక్యాలను అవతరింపజేశాడు –

"ఓ ముహమ్మద్ (స)! నీవు అనామకుడవు కావు. నీ విరోధులే అనామకులవుతారు" అని ధైర్యం చెప్పాడు. మహాప్రవక్త (స) ఆడపిల్లల ద్వారానే దేవుడు ఆయన సంతతికి ప్రపంచంలో గొప్ప కీర్తి ప్రతిష్ఠల్ని ప్రసాదించాడు. ఒకవిధంగా చెప్పాలంటే, ఆయన (సఅసం) అనుచర సమాజమంతా ఆయన బిడ్డల్లాంటివారే. వారి సంఖ్యాబలంపై ఆయన (స) ప్రళయదినాన గర్వపడతారు. అదీగాక ఆయన (స) గౌరవమర్యాదలను దేవుడు ఎంతగానో పెంచాడు. లోకమంతా నేడు ఆయన (స) పేరును ఎంతో భక్తితో, వినయంతో ప్రస్తావిస్తుంది. ఆయన (సఅసం)పై శాంతీశుభాలు కురవాలని లోకవాసులంతా ప్రార్థిస్తారు. అదే సమయంలో మహాప్రవక్త (స) శత్రువులు చరిత్రపుటలకే పరిమితం అయిపోయారు. ఒకవేళ ఎవరయినా వారి ఊసు ఎత్తినా వారిని దుష్టులుగానే చూస్తారుగాని మంచివారుగా చూడరు.

109 వ సూరా

# అల్ కాఫిరూన్

## తిరస్కారులు

అవతరణ మక్కాలో

ఆయతులు 6

### పరిచయం

అవిశ్వాసాన్ని, అవిశ్వాసులను తిరస్కరించడం ఈ సూరా ప్రధాన ఉద్దేశ్యం. మొదటి ఆయతులో అవిశ్వాసుల (కాఫిరూన్) గురించిన ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఏకదైవారాధన పట్ల ఎన్నడూ రాజీపడరాదు. అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినయినా గాని, లేదా మరి దేన్నయినా గాని ఆరాధించడాన్ని ఈ సూరా తిరస్కరించింది.

### అల్ కాఫిరూన్[1] సూరా

سُوۡرَةُ الكَافِرُونَ

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

1 (ఓ ప్రవక్తా! వారికి) చెప్పు : "ఓ తిరస్కారులారా![2]

قُلۡ يَٰٓأَيُّهَا ٱلۡكَٰفِرُونَ ١

2 "మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించటం లేదు.

لَآ أَعۡبُدُ مَا تَعۡبُدُونَ ٢

3 "నేను ఆరాధిస్తున్న వానిని మీరు ఆరాధించరు.

وَلَآ أَنتُمۡ عَٰبِدُونَ مَآ أَعۡبُدُ ٣

4 "మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించబోను.

وَلَآ أَنَا۠ عَابِدٞ مَّا عَبَدتُّمۡ ٤

5 "మరి నేను ఆరాధించేవానిని మీరెలాగూ ఆరాధించరు.[3]

وَلَآ أَنتُمۡ عَٰبِدُونَ مَآ أَعۡبُدُ ٥

6 "మీ ధర్మం మీది, నా ధర్మం నాది."[4]

لَكُمۡ دِينُكُمۡ وَلِيَ دِينِ ٦

1. దైవప్రవక్త (సఅసం) కాబా గృహ ప్రదక్షిణ సందర్భంగా రెండు రకాతుల నమాజు చేసినప్పుడు గానీ, మగ్రిబ్, ఫజ్ర్‌లలోని సున్నత్ నమాజులలోగాని ఈ సూరాతోపాటు, ఇఖ్లాస్ సూరా పఠించేవారని ప్రామాణిక హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. రాత్రిపూట ఈ సూరా (ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్) పఠించి నిద్రపోతే షిర్క్‌తో తెగత్రెంపులు చేసుకున్నవారుగా ఖరారవుతారని ఆయన (స) ప్రియసహచరులు కొందరికి చెబుతూ ఉండేవారు (ముస్నదె అహ్మద్- 5/456; తిర్మిజీ -3403; అబూ దావూద్-5055; మజ్‌మవుజ్జవాయెద్ - 10/121). ఆయన (సఅసం) స్వయంగా కూడా ఈ విధంగా ఆచరించేవారని మరికొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది (ఇబ్నె కసీర్).
2. ఈ సూరాలోని 'కాఫిరూన్' (సత్యతిరస్కారులు, విశ్వసించటానికి నిరాకరించినవారు) అనే పదం ప్రత్యేకంగా కొంతమందికి మాత్రమే వర్తిస్తుంది. వారెవరో అల్లాహ్‌కే తెలుసు. ఎందుకంటే ఈ సూరా అవతరించిన తరువాత మక్కాకు చెందిన అనేకమంది అవిశ్వాసులు విశ్వసించి, అల్లాహ్‌ను ఆరాధించారు. (ఫత్‌హుల్ ఖదీర్).
3. చెప్పిన విషయమే ఇంకొకసారి చెప్పబడింది. కొంతమంది అనువాదకులు మొదటి వాక్యాలను (2, 3) వర్తమాన కాలంగా, తరువాతి వాక్యాలకు (4,5) భవిష్యత్కాలంగా తీసుకున్నారు. దీని గురించి మరీ అంతగా సతమతం కావలసిన అవసరం ఏమీ లేదంటారు ఇమామ్ షౌకానీ. ఎందుకంటే విషయాన్ని నొక్కి వక్కాణించటానికి మాటను

పునరావృతం చేయటం అరబీ భాష విశిష్ఠత. దివ్య ఖుర్ఆన్‌లో కూడా అనేకచోట్ల ఈ శైలి అవలంబించబడింది. ఉదాహరణకు : అర్రహ్మాన్ సూరా, ముర్సలాత్ సూరాలలో ఒకే ఆయతు అనేకసార్లు పునరావృతం అవుతుంటుంది. అల్ కాఫిరూన్ సూరాలో ఒకటికి రెండుసార్లు చెప్పిన మాటే చెప్పటంలోని ఉద్దేశం ఏమిటంటే, "ఓ అవిశ్వాసులారా! మీరంతా కోరుతున్నట్లు నేను ఏకేశ్వరోపాసనా మార్గాన్ని వీడి బహుదైవోపాసనా మార్గాన్ని అవలంబించటమన్నది ఎన్నటికీ జరగని పని. ఒకవేళ దేవుడు మీ నొసట సన్మార్గ భాగ్యం రాసి ఉండకపోతే మీరు ఏకదైవారాధనకు నోచుకోలేరు." ఒక సంవత్సరకాలం పాటు నీవు మా దేవతలను పూజిస్తే, ఒక సంవత్సరకాలం పాటు మేము నీ ఆరాధ్య దైవాన్ని పూజిస్తామని అవిశ్వాసులు మహాప్రవక్త (స) ముందు ప్రతిపాదించినప్పుడు ఈ సూరా అవతరించింది.

4. (ఓ అవిశ్వాసులారా!) మీరు మీ దేవీదేవతలను వదలుకోవటానికి సిద్ధంగా లేనపుడు నేను నా నిజదైవాన్ని ఎందుకు వదలు కోవాలి. నేను నా ధర్మంపై సంతోషంగా ఉన్నాను."మా కర్మలు మావి. మీ కర్మలు మీవి." (అల్ ఖసస్-55).

110 వ సూరా

# అన్ నస్ర్

## సహాయం

అవతరణ మదీనాలో

ఆయతులు 3

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా విశ్వాసులకు హామీ ఇవ్వబడిన దేవుని సహాయం గురించి ప్రస్తావించింది. మొదటి ఆయతులో వచ్చిన 'నస్ర్' (సహాయం) అన్న ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రజలు తండోపతండాలుగా సత్యధర్మాన్ని స్వీకరిస్తారని ఈ సూరా తెలిపింది. అల్లాహ్ ఔన్నత్యాన్ని స్తుతిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతూ, ఆయన సన్నిధిలో పొరబాట్లకు క్షమాపణ కోరుకుంటూ వినమ్రులై ఉండాలని ఈ సూరా ఉద్బోధించింది.

| అన్ నస్ర్[1] సూరా | سُورَةُ النَّصْرِ |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ |
| **1** (ఓ ప్రవక్తా!) అల్లాహ్ సహాయం అందినప్పుడు, విజయం వరించినప్పుడు, | إِذَا جَاءَ نَصْرُ اللّٰهِ وَالْفَتْحُ ﴿١﴾ |
| **2** ప్రజలు గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మంలోకి వచ్చి చేరటాన్ని నీవు చూసినప్పుడు,[2] | وَرَأَيْتَ النَّاسَ يَدْخُلُونَ فِي دِينِ اللّٰهِ أَفْوَاجًا ﴿٢﴾ |

1. ఖుర్ఆన్ అవతరణా క్రమం ప్రకారం ఇది చివరి సూరా (సహీహ్ ముస్లిం – వ్యాఖ్యాన ప్రకరణం). ఈ సూరా అవతరించినప్పుడు; దైవప్రవక్త (సఅసం) మరణకాలం సమీపించిందని, అందుకే దైవస్తోత్రం, క్షమాపణ గురించి ఆయన (స)కు ఆజ్ఞాపించబడిందని కొంతమంది సహాబీలకు అర్థమైపోయింది. బుఖారీలో ప్రస్తావించబడిన హజ్రత్ ఇబ్నె అబ్బాస్, హజ్రత్ ఉమర్ (ర.అన్హుమా)ల సంఘటనే దీనికి నిదర్శనం. (అన్నస్ర్ సూరా వ్యాఖ్యానం).

2. 'అల్లాహ్ సహాయం' (نَصْرُ اللّٰهِ) అంటే మిథ్యావాదంపై, మిథ్యావాదులపై ఇస్లాం మరియు ముస్లింలకు లభించిన

| | |
|---|---|
| **3** నీవు నీ ప్రభువు స్తోత్రంతో సహా ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండు. మన్నింపుకై ఆయన్ని ప్రార్థించు. నిస్సందేహంగా ఆయన మహా గొప్పగా పశ్చాత్తాపాన్ని ఆమోదించే వాడు.[3] | فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَاسْتَغْفِرْهُ ۚ إِنَّهُ كَانَ تَوَّابًا ﴿٣﴾ |

తిరుగులేని ఆధిక్యం. 'విజయం' అంటే మక్కా విజయం అన్నమాట! మక్కా నగరం దైవప్రవక్త జన్మస్థలం. కాని అవిశ్వాసులు ఆయన్ని అక్కడ ప్రశాంతంగా ఉండనివ్వలేదు. ఆయన్ని, ఆయన ప్రియసహచరులను వలసపోక తప్పని పరిస్థితులను సృష్టించారు. కాని దైవప్రవక్త హి(జీ శకం 8వ ఏట మక్కాలో విజేతగా తిరిగి వచ్చినప్పుడు జనులు జట్లు జట్లుగా వచ్చి ఇస్లాంలో ప్రవేశించసాగారు. అంతకు ముందు ఈ విధంగా భారీ సంఖ్యలో ప్రజలు ఇస్లాంలో చేరేవారు కాదు. మక్కా విజయం తరువాత పరిస్థితి అనూహ్యంగా మారింది. ముహమ్మద్ (స) దేవుని నిజప్రవక్త అనీ, ఇస్లాం నిజధర్మమని ప్రజలు తెలుసుకున్నారు. తమ మోక్షానికి ఇస్లాం తప్ప మార్గాంతరం లేదని వారు గ్రహించారు. ఈ నేపథ్యంలోనే అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు....

3. ఓ ముహమ్మద్ (స) ! దైవసందేశాన్ని జనులకు చేరవేయవలసిన నీ బాధ్యత పూర్తికావచ్చింది. నీవు ఇహలోకం నుండి ప్రస్థానం చేయవలసిన సమయం కూడా దగ్గర పడింది. కాబట్టి నువ్వు సాధ్యమైనంత ఎక్కువగా దైవస్తోత్రంలో నిమగ్నుడవై ఉండు. పొరపాట్ల మన్నింపు కోసం నీ ప్రభువును వేడుకుంటూ ఉండు. ఈ దైవోపదేశాన్ని బట్టి అవగతమయ్యేదేమిటంటే జీవితపు చరమదశలో మనిషి వీలైనంత అధికంగా దైవధ్యానం చేయాలి. క్షమాభిక్షకై వేడుకుంటూ ఉండాలి.

111 వ సూరా

# అల్ లహబ్

## అగ్నిజ్వాల

అవతరణ మక్కాలో

ఆయతులు 5

### పరిచయం

ఈ సూరా ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్(సఅసం) పట్ల అవిశ్వాసుల తీవ్రవిద్వేషాన్ని ప్రస్తావించింది. మొదటి ఆయతులో వచ్చిన 'లహబ్' (అగ్నిజ్వాల) అన్న ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా ప్రవక్త (సఅసం) పినతండ్రి గురించి ప్రస్తావించింది. అతడి అహంకారాన్ని, సంపద చూసుకుని గర్వించడాన్ని, అబూలహబ్ భార్య ప్రవక్త ముహమ్మద్(సఅసం) పట్ల ప్రదర్శించిన తీవ్రమైన ద్వేషాన్ని తెలియజేసింది. అబూలహబ్, అతడి భార్య – ఇద్దరికీ పరలోకంలో తీవ్రమైన శిక్ష తప్పదని తెలిపింది.

### అల్ లహబ్[1] సూరా — سُورَةُ اللَّهَبِ

| | |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| **1** అబూ లహబ్ చేతులు రెండూ విరిగి పోయాయి. వాడు సయితం నాశనమై పోయాడు.[2] | تَبَّتْ يَدَا أَبِي لَهَبٍ وَتَبَّ ﴿١﴾ |

1. ఈ సూరాను **'సూరతుల్ మసద్', 'సూరయె తబ్బత్'** అని కూడా అంటారు.

**పూర్వరంగం:** బంధుమిత్రులకు దైవధర్మాన్ని పరిచయం చేయమని దేవుడు తన ప్రవక్త (సఅసం)కు ఆదేశించినపుడు,

**2** వాడి ధనంగానీ, వాడి సంపాదన గాని వాడికేమాత్రం పనికి రాలేదు.[3]

مَآ اَغْنٰى عَنْهُ مَالُهٗ وَمَا كَسَبَ ﴿2﴾

**3** త్వరలోనే వాడు భగ భగ మండే అగ్నికి ఆహుతి అవుతాడు.

سَيَصْلٰى نَارًا ذَاتَ لَهَبٍ ﴿3﴾

**4** ఇంకా అతని భార్య; పుల్లలు మోసుకుంటూ ఆమె కూడా[4] (నరకానికి పోతుంది).

وَّامْرَاَتُهٗ ۭ حَمَّالَةَ الْحَطَبِ ﴿4﴾

**5** ఆమె మెడలో (ఖర్జూర ఆకుతో) గట్టిగా పేనిన ఒక త్రాడు ఉంటుంది.[5]

فِيْ جِيْدِهَا حَبْلٌ مِّنْ مَّسَدٍ ﴿5﴾

ఆయన (స) 'సఫా' కొండపైకెక్కి "యా సబాహా!" అని బిగ్గరగా నినదించారు. ఇలాంటి పిలుపును అరబ్బులు ప్రమాద సంకేతంగా తలపోసేవారు. అందుకే అందరూ హడావిడిగా అక్కడికి తరలివచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) అందరినీ ఉద్దేశించి, "ఈ పర్వతానికి ఆవలివైపున ఒక అశ్వదళం మనపై దండెత్తడానికి సిద్ధంగా ఉందని నేను చెబితే మీరు నమ్ముతారా?" అని అడిగారు. "ఎందుకు నమ్మము?! నువ్వు ఎన్నడూ అబద్ధం చెప్పినట్లు మేమెరుగము" అన్నారంతా ముక్తకంఠంతో. "అయితే వినండి! నేను మిమ్మల్ని ఒక పెద్ద శిక్ష గురించి భయపెట్టడానికి వచ్చాను. మీరు గనక ఈ అవిశ్వాసాన్ని, బహుదైవారాధనను మానుకోకపోతే మీకు శిక్ష తప్పదు" అని ఆయన (స) చెప్పారు. ఇది విని అబూ లహబ్ మండిపడ్డాడు. "నువ్వు నాశనమవ్వ! ఇది చెప్పటానికేనా నువ్వు మమ్మల్ని పిలిచింది?!" అని అవహేళన చేశాడు. దీనిపై అల్లాహ్ ఈ సూరాను అవతరింపజేశాడు. (సహీహ్ బుఖారీ – సూరయె లహబ్).

అబూలహబ్ అసలు పేరు అబ్దుల్ ఉజ్జా. తన అందచందాల రీత్యా, దేదీప్యమానమైన ముఖవర్చస్సు దృష్ట్యా అతను అబూలహబ్ (జ్వాలాముఖి)గా పిలువబడేవాడు. ఇకపోతే; పరిణామం రీత్యా కూడా అతడు అగ్నిజ్వాలలకే ఆహుతి కావలసి ఉన్నది. చూడబోతే అతడు మహాప్రవక్త (సఅసం)కు స్వయాన పినతండ్రి. కాని సైద్ధాంతికంగా మాత్రం మహాప్రవక్త (స)కు బద్ధవిరోధి. అతని భార్య ఉమ్మె జమీల్ కూడా శత్రుత్వంలో భర్తకు ఏమాత్రం తీసిపోదు.

2. సాధారణంగా పెద్ద నష్టం సంభవించినప్పుడు చేతులు విరిగిపోయాయి అంటారు. అబూలహబ్ పతనాన్ని సూచించే పలుకులు ఇవి. వాడు మహాప్రవక్త (సఅసం)ను శపించిన సంగతి తెలిసిందే. కాని దేవుడు వాడి శాపాన్ని వాడిపైన్నే తిప్పికొట్టాడు. అంతేకాదు, చాలా శీఘ్రంగానే వాడు చావనున్నాడన్న సంగతి కూడా ఈ సూరాలో తెలుపబడింది. చెప్పినట్లే జరిగింది కూడా. బద్ర్ యుద్ధం జరిగిన కొన్నాళ్ళకే వాడు ప్లేగు లాంటి ఒక విచిత్రమైన రోగంతో, కుళ్ళి, కృశించి చచ్చాడు. అతని కుటుంబ సభ్యులెవరూ అతని దగ్గరకు పోలేదు. మూడు రోజుల వరకూ శవం అలాగే పడి ఉండింది. కుళ్ళి కంపుకొట్ట సాగింది. ఎట్టకేలకు అతని కొడుకులు అంటు వ్యాధులు వ్యాపిస్తాయేమోనన్న భయంతో అసహ్యించుకుంటూనే అల్లంత దూరం నుంచి అతని శరీరంపై రాళ్లు మట్టివేసి పూడ్చివేశారు. (ఐసరుత్తఫాసీర్).

3. **'సంపాదన'**లో అతని పదవులు, పరువుప్రతిష్ఠలు, సంతానం – అన్నీ చేరివున్నాయి. అంటే దేవుడతన్ని శిక్షించదలచు కున్నప్పుడు అతని ఆస్తిపాస్తులుగానీ, ఆలుబిడ్డలుగానీ, అధికారాలుగానీ ఏమీ ప్రయోజనకరం కాలేకపోయాయి.

4. అంటే ఆమె నరకంలో కట్టెలు మోసుకుంటూ వచ్చి తన భర్తను (అబూ లహబ్) కాల్చే అగ్నిపై వేస్తూ ఉంటుంది. దాంతో ఆ అగ్ని మరింతగా మండుతుంది. ఇదంతా దేవుని తరఫున విధించబడినది. ఎందుకంటే ఆమె ఇహలోకంలో భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ విశ్వాసులను అవమానపరిచేది. పరలోకంలో కూడా తన భర్తను శిక్షించటంలో తోడ్పడుతుంది (ఇబ్నె కసీర్). మరికొన్ని ఆధారాల ప్రకారం ఆమె (ఇహలోకంలో) ముళ్ళచెట్లు మోసుకుంటూ వచ్చి దైవప్రవక్త (స) మార్గంలో వేసేది. వేరొక ఆధారం ప్రకారం చాడీలు చెప్పే దురలవాటును ఎత్తిచూపటానికి ఇలా

అనబడింది. ఈమె ఖురైషు అవిశ్వాసుల వద్దకు వెళ్ళి దైవప్రవక్త (స)ను పరోక్షంగా నిందించేది. దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా జనులను రెచ్చగొట్టేది. (ఫత్‌హుల్ బారీ).

5. **'జీద్'** (جِيدِ) అంటే మెడ అనీ, **'మసద్'** అంటే బాగా పేనిన త్రాడు అనీ అర్థం. ఈ త్రాడు గురించి కూడా విభిన్న వ్యాఖ్యానాలున్నాయి. వాటన్నింటినీ అలా ప్రక్కన పెట్టి ఆలోచిస్తే నరకంలో ఇది ఆమె దురవస్థను సూచిస్తుంది.

112 వ సూరా

# అల్ ఇఖ్లాస్

## ప్రత్యేకించుకోవటం

అవతరణ మక్కాలో

ఆయతులు 4

### పరిచయం

ముఖ్యంగా ఏకదైవారాధన గురించి ఈ సూరా బోధించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం ఇందులో ఎక్కడా ప్రస్తావనకు రాలేదు, కాని ఈ సూరా భావానికి సూచనగా ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా ఏకదైవారాధనను వివరిస్తూ, అల్లాహ్ గుణగణాలను తెలియజేసింది. ఒకే ఒక్క దేవుడైన అల్లాహ్‌నే ఆరాధించాలని నొక్కి చెప్పింది. అల్లాహ్ ఎలాంటి అవసరమూ లేనివాడు, ఆయనకు కుమారులు ఎవరూ లేరు. ఆయనకు తండ్రి, తల్లి, భాగస్వాములు ఎవరూ లేరు. అందరూ, అన్ని వస్తువులు ఆయనపైననే ఆధారపడి ఉన్నాయి.

| అల్ ఇఖ్లాస్[1] సూరా | سُورَةُ الإِخْلَاصِ |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ |
| **1** (ఓ ముహమ్మద్-స!) వారికి ఇలా చెప్పు: ఆయన అల్లాహ్ (నిజమైన ఆరాధ్యుడు) ఒక్కడు. | قُلْ هُوَ اللَّهُ أَحَدٌ ﴿١﴾ |
| **2** అల్లాహ్ నిరపేక్షాపరుడు.[2] (ఏ అక్కరా లేనివాడు). | اللَّهُ الصَّمَدُ ﴿٢﴾ |
| **3** ఆయన (ఎవరినీ) కనలేదు. ఆయన (కూడా) ఎవరికీ పుట్టినవాడు కాడు.[3] | لَمْ يَلِدْ وَلَمْ يُولَدْ ﴿٣﴾ |
| **4** ఆయనకు సరిసమానుడు (పోల్చదగిన వాడు) ఎవడూ లేడు.[4] | وَلَمْ يَكُن لَّهُ كُفُوًا أَحَدٌ ﴿٤﴾ |

1. పైకి చాలా క్లుప్తంగా కనిపించే ఈ సూరా భావార్థం రీత్యా చాలా గొప్పది. మహత్పూర్వకమైనది. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ సూరాను మూడోవంతు ఖుర్‌ఆన్‌గా ఖరారు చేశారు. రాత్రిపూట ఈ సూరాను చదువుతూ ఉండవలసిందిగా ఆయన (స) నొక్కి వక్కాణించారు (బుఖారీ – తౌహీద్ ప్రకరణం, ఖుర్‌ఆన్ మహిమోన్నతుల ప్రకరణం). కొంతమంది సహాబీలు నమాజు సందర్భంగా ప్రతి రకాతులోనూ ఇతర సూరాలతోపాటు ఈ సూరాను కూడా కలిపి పారాయణం చేసేవారు. తన ప్రియసహచరుల ఈ పద్ధతిని గమనించిన మహాప్రవక్త (స), "ఈ సూరా పట్ల మీకు గల మక్కువ మిమ్మల్ని స్వర్గానికి చేరుస్తుంది" అన్నారు. (బుఖారీ– తౌహీద్ ప్రకరణం; అజాన్

ప్రకరణం; ముస్లిం – ప్రయాణీకుల నమాజు ప్రకరణం). నీ ప్రభువు పుట్టుపూర్వోత్తరాలను, ఆయన వంశపరంపరను గురించి కాస్త వివరించమని బహుదైవారాధకులు మహాప్రవక్త (స)ను డిమాండు చేసిన నేపథ్యంలో ఈ సూరా అవతరించింది. (ముస్నదె అహ్మద్ – 5/133 – 134).

2. అంటే ఆయనకు ఎవరి అవసరమూ లేదు. ఆయన ఎవరిపైనా ఆధారపడినవాడు కాడు. అందరికీ ఆయన అవసరం ఉంది. అందరూ ఆయన పైనే ఆధారపడి ఉన్నారు. అల్లాహ్ అందరికన్నా వేరైనవాడు, నిరపేక్షాపరుడు.

3. అంటే ఆయనకు సంతానం లేదు. ఆయనకు సైతం తల్లిదండ్రులు లేరు. మరి ఆయన కూడా ఎవరినీ కుమారులుగాగానీ, కూతుళ్ళుగాగానీ చేసుకోలేదు.

4. ఆయన ఉనికిలోగానీ, ఆయన గుణగణాలలోగానీ, ఆయన అధికారాలలోగానీ ఆయనకు భాగస్వాములు లేరు. ఆయన్ని పోలినవారూ లేరు. ఆయనకు సరిజోడీ కూడా లేరు. "ఆయన లాంటి వస్తువు సృష్టిలో ఏదీలేదు" (షూరా – 11). ఒక హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "మానవుడు నన్ను దూషిస్తున్నాడు. అంటే నాకు సంతానాన్ని ఆపాదిస్తున్నాడు. వాస్తవానికి నేను ఒక్కడినే. నేను నిరపేక్షాపరుణ్ణి. నేనెవరినీ కనలేదు. నేనెవరికీ పుట్టనూ లేదు. నాకు సరిజోడీ కూడా ఎవరూ లేరు." (సహీహ్ బుఖారీ – ఖుల్హు వల్లాహు అహద్ సూరా వ్యాఖ్యానం). ఈ సూరా ద్వారా బహుదైవారాధకుల మూఢనమ్మకాలు, అల్లాహ్‌కు కుమారులను ఆపాదించే వారి మిథ్యావాదాలు, దైవానికి భాగస్వాములను కల్పించే వారి కాల్పనిక సిద్ధాంతాలు – అన్నీ నిర్ద్వంద్వంగా ఖండించబడ్డాయి.

113 వ సూరా

# అల్ ఫలఖ్

## ఉషోదయం

అవతరణ మక్కాలో

ఆయతులు 5

### పరిచయం

ప్రతి దుష్టశక్తి నుంచి అల్లాహ్ శరణు కోరడాన్ని ఇందులో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన 'ఫలఖ్' (ఉషోదయం) అన్న ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. దుష్ట ప్రాణుల, దుష్ట పథకాల, ప్రజల ఈర్ష్యాసూయల నుంచి ఈ సూరా ద్వారానే దేవుని శరణు కోరాలని ఈ సూరా బోధించింది.

| అల్ ఫలఖ్[1] సూరా | سُورَةُ الفَلَقِ |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ |
| 1 చెప్పు : నేను ప్రాతఃకాలపు ప్రభువు శరణు కోరుతున్నాను[2]– | قُلْ اَعُوْذُ بِرَبِّ الْفَلَقِ ① |

1. ఈ సూరా తరువాత సూరతున్నాస్ రాబోతోంది. ఈ రెండు సూరాల మహత్తు గురించి ఎన్నో హదీసులున్నాయి. ఉదాహరణకు : ఒక హదీసులో మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు : "ఈ రోజు రాత్రి నాపై కొన్ని ఆయతులు అవతరించాయి. అటువంటి ఆయతులను నేను కనీ వినీ ఎరుగను." ఇలా చెప్పిన తరువాత ఆయన ఈ రెండు సూరాలను పఠించారు. (సహీహ్ ముస్లిం – ప్రయాణీకుల నమాజు ప్రకరణం; తిర్మిజీ). అబూ హాబిస్ జుహనీ (రజి)తో ఆయన (సఅసం) ఒకసారి, "ఓ అబూ హాబిస్! శరణుకోరే వారు ఏ తావీజు ఆధారంగా శరణుకోరుతారో

| | |
|---|---|
| 2 ఆయన సృష్టించిన వాటన్నింటి కీడు నుండి,[3] | مِنْ شَرِّ مَا خَلَقَ ﴿٢﴾ |
| 3 కటిక చీకటి క్రమ్ముకున్నప్పటి రాత్రి చీకటి కీడు నుండి,[4] | وَمِنْ شَرِّ غَاسِقٍ إِذَا وَقَبَ ﴿٣﴾ |
| 4 (మంత్రించి) ముడులలో ఊదే వారి కీడు నుండి,[5] | وَمِنْ شَرِّ النَّفَّاثَاتِ فِي الْعُقَدِ ﴿٤﴾ |
| 5 అసూయాపరుడు అసూయచెందినప్పటి కీడు నుండి[6] (నేను నా ప్రభువు రక్షణ కోరుతున్నాను). | وَمِنْ شَرِّ حَاسِدٍ إِذَا حَسَدَ ﴿٥﴾ |

దాని గురించి నీకు తెలుపనా?" అన్నారు. దానికి ఆయన, 'తప్పకుండా తెలుపండి' అని అభ్యర్థించారు. అప్పుడు మహాప్రవక్త (సఅసం) ఈ రెండు సూరాలను ప్రస్తావించి, **"ఇవి రెండూ 'ముఅవ్వజతైన్' (రక్షణ కోరబడేవి)"** అని అన్నారు. (సహీహ్ నసాయి– లిల్ అల్బానీ. నెం.5020). మానవుల, జిన్నుల దిష్టినుండి దైవప్రవక్త (స) శరణు కోరేవారు. ఈ రెండు సూరాలు అవతరించిన తరువాత ఆయన (స) వాటిని పారాయణం చేయటం ఆనవాయితీగా చేసుకుని, ఇతరత్రా వాటిని వదలివేశారు. (సహీహ్ తిర్మిజీ – లిల్ అల్బానీ:2150). మహాప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా తెలిపారు: "ఆయన (స)కు ఎప్పుడు, ఏ బాధ కలిగినా 'ముఅవ్వజతైన్' (ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్, ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్ సూరాలు) పఠించి తన దేహంపై ఊదేవారు. చివరి రోజుల్లో ఆయన (స) బాధ మరీ పెరిగి పోయినప్పుడు నేను ఈ రెండు సూరాలను పఠించి, శుభం జరుగుతుందన్న ఆశతో ఆయన రెండు చేతులను ఆయన (స) శరీరంపై స్పర్శించేదాన్ని." (బుఖారీ – ఫజాయిలె ఖుర్ఆన్; ముస్లిం – కితాబుస్సలామ్).

దైవప్రవక్త (సఅసం)కు చేతబడి జరిగినప్పుడు దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఈ రెండు సూరాలనే తీసుకుని వచ్చి, ఒక యూదవ్యక్తి ఆయన (స)పై చేతబడి చేశాడని, ఆ చేతబడికి సంబంధించిన సామగ్రి అంతా ఫలానా బావిలో ఉందని తెలియజేశారు. మహాప్రవక్త (సఅసం) హజ్రత్ అలీ (రజి)ని పంపి ఆ వస్తువులను తెప్పించారు. (ఆ వస్తువులలో ఒక దువ్వెన, కొన్ని వెంట్రుకలు, నరం ఉన్నాయి. ఆ నరానికి పదకొండు ముడులు వేయబడివున్నాయి. సూదులు గుచ్చబడిన ఒక మైనపు దిష్టిబొమ్మ కూడా ఉంది. జిబ్రయీల్ సూచన ప్రకారం ఆయన (సఅసం) ఈ రెండు సూరాలలోని ఒక్కొక్క ఆయత్‌ను పఠిస్తూపోతే, ఒక్కొక్క ముడి విచ్చుకోసాగింది. చివరి ఆయతు వరకూ వచ్చేసరికి ముడులన్నీ విచ్చుకున్నాయి. సూదులన్నీ ఊడిపడ్డాయి. దాంతో ఆయన (స)కు సంపూర్ణ స్వస్థత చేకూరింది. అప్పటివరకూ ఇబ్బంది పడుతూ ఉన్న ఆయన(స)కు పూర్తి స్వేచ్ఛ లభించినట్టయింది. (సహీహ్ బుఖారీ – ఫత్‌హుల్ బారీతో సహా – కితాబుత్తిబ్; ముస్లిం – కితాబుస్సలామ్). సాధారణంగా మహాప్రవక్త (సఅసం) రాత్రి నిద్రించే సమయంలో ఇఖ్లాస్ సూరాను, ముఅవ్వజతైన్‌ను పఠించి తన రెండు అరచేతులపై ఊదేవారు. ఆ తరువాత అరచేతులను తన శరీరంపై తుడిచేవారు. మొదట తలను, పిదప మోహాన్ని, తర్వాత ఉదరభాగాన్ని, ఆ తర్వాత శరీరంలోని మిగతా భాగాన్ని తుడిచేవారు. ఆయన (స) మూడుసార్లు ఈ విధంగా చేసేవారు. (సహీహ్ బుఖారీ – ఖుర్ఆన్ మహిమల ప్రకరణం).

2. **'ఫలఖ్'** ( فَلَقٌ ) అంటే అసలు ఉషోదయం లేక ప్రభాత సమయం అని అర్థం. దేవుడు ఏ విధంగా చిమ్మచీకట్లను చీల్చి పగటి వెలుగును ప్రస్ఫుటం చేస్తాడో అదే విధంగా ఆ దేవుడు భయోత్పాతాన్ని, వ్యాకులతను దూరం చేసి, తన రక్షణ కోరేవారికి శాంతి భద్రతలను చేకూరుస్తాడు. లేదా గాఢాంధకారంలో గడిపే మనిషి తెల్లవారి వెలుగు కోసం ఎలా వేచి ఉంటాడో అలాగే భీతిగొన్నవాడు దేవుని శరణు ద్వారా శుభసమయం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. (ఫత్‌హుల్ ఖదీర్).

3. సృష్టితాలు అనే పదం సర్వసామాన్యం. ఈ సృష్టితాలలో షైతాను, వాడి మానసపుత్రులు, నరకం మరియు మనిషికి హాని కలిగించే సమస్తమూ వచ్చేస్తాయి.

4. రాత్రిపూట దట్టమైన చీకటిలో క్రూరమృగాలు, విషసర్పాలు స్వైరవిహారం చేస్తాయి. నేరప్రవృత్తి గలవాళ్ళు ఈ సమయంలోనే తమ పథకాలను అమలుపరుస్తారు. అందువల్ల ఈ వాక్యం ద్వారా దుష్టశక్తులన్నింటి కీడు నుంచి శరణు జొచ్చటం జరిగింది. **'ఘాసిఖున్'** ( غَاسِقٍ ) అంటే రాత్రి అని అర్థం. **'వఖబ్'** ( وَقَبَ ) అంటే వ్యాపించటం, క్రమ్ముకోవటం, ఆవరించటం, అలుముకోవటం అని భావం.

5. ముడులలో మంత్రించే వారంటే చేతబడి, క్షుద్రవిద్యకు పాల్పడే వారన్నమాట. **'నప్ఫాసాత్'** ( نَفّٰثٰتِ ) అనే పదం స్త్రీలింగాన్ని సూచిస్తున్నప్పటికీ క్షుద్రవిద్యకు ఒడిగట్టే స్త్రీ పురుషులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ మాంత్రికులు భూత పిశాచాలను ఆశ్రయించి ఈ ముదనష్టపు పనులు చేస్తారు. సాధారణంగా వారు ఎవరిపై చేతబడి చేయదలుస్తారో వారికి చెందిన కొన్ని వస్తువులను తెలివిగా రాబడతారు. ఉదాహరణకు : వెంట్రుకలు, దువ్వెనలు, దుస్తులు.

6. అసూయాపరుడు, తాను అసూయ చెందేవారి దగ్గరున్నదంతా నాశనమైపోవాలని కోరుకుంటాడు. అందుకే అసూయా పరుని కీడు నుండి కూడా శరణుకోరటం జరిగింది. అసూయ కూడా అత్యంత దారుణమైన నైతిక రుగ్మతే. అది మనిషిలోని మంచినంతటినీ హరించివేస్తుంది.

114వ సూరా

# అన్ నాస్

## మానవులు

అవతరణ మక్కాలో

ఆయతులు 6

### పరిచయం

షైతాన్ నుంచి అల్లాహ్ శరణు కోరుకోవాలని ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలోని మొదటి ఆయతు మొదలు అనేక ఆయతుల్లో ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం 'నాస్' (మానవులు) ప్రస్తావనకు వచ్చింది. షైతాన్ దుర్మార్గం నుంచి అల్లాహ్ శరణు కోరుకోవాలని ఈ సూరా ప్రబోధించింది. షైతాన్ మానవాళికి ప్రధాన శత్రువు. అల్లాహ్ యావత్తు మానవాళికి ప్రభువనీ, ఆయనే అందరి చక్రవర్తి, అందరి ఆరాధ్య దైవమనీ తెలిపింది. షైతాన్ మన హృదయాలలో భ్రమలు కలిగిస్తాడనీ, ఆ విధంగా మన విశ్వాసాన్ని దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తాడనీ, మంచీచెడుల విచక్షణ కోల్పోయేలా చేస్తాడని వివరించింది.

| అన్ నాస్[1] సూరా | سُوْرَةُ النَّاسِ |
|---|---|
| అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం | بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ |
| **1** (ఈ విధంగా) చెప్పు : "నేను మానవుల ప్రభువు రక్షణ కోరుతున్నాను.[2] | قُلْ اَعُوْذُ بِرَبِّ النَّاسِ ① |

1. దీని మహత్తు గురించి ఇంతకుముందే చెప్పటం జరిగింది. వేరొక హదీసులో ఇలా ఉంది: ఒకసారి దైవప్రవక్త (సఅసం) నమాజు చేస్తూ ఉండగా ఆయనకు తేలు కుట్టింది. నమాజు ముగించిన తరువాత ఆయన (స) ఉప్పు,

2 మానవుల చక్రవర్తిని,[3]

مَلِكِ النَّاسِ ﴿2﴾

3 మానవుల ఆరాధ్య దైవాన్ని (ఆశ్రయిస్తున్నాను)[4] –

إِلَٰهِ النَّاسِ ﴿3﴾

4 దురాలోచనలను రేకెత్తించి, తప్పించుకునేవాడి కీడు నుండి,[5]

مِن شَرِّ الْوَسْوَاسِ الْخَنَّاسِ ﴿4﴾

5 వాడు జనుల హృదయాలలో దురాలోచనలను రేకెత్తిస్తాడు –

الَّذِي يُوَسْوِسُ فِي صُدُورِ النَّاسِ ﴿5﴾

6 – వాడు జిన్నులు వర్గానికి చెందినవాడైనా సరే, మానవ వర్గానికి చెందినవాడైనా సరే![6]

مِنَ الْجِنَّةِ وَالنَّاسِ ﴿6﴾

నీరు తెప్పించి తేలుకుట్టినచోట పూసారు. ఆ తరువాత ఆయన (స) **ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్...**, **ఖుల్‌హు వల్లాహు అహద్...., ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్** సూరాలు పఠించసాగారు. (మజ్‌మవుజ్జవాయెద్ – 5/ 111).

2. **'ప్రభువు'** (రబ్బ్) అనే పదం చాలా విస్తృత భావంలో ఉంది. మనిషి తల్లి కడుపులో పడినప్పటి నుంచీ ఆయన అతన్ని పోషిస్తాడు. అంచెలవారీగా అతన్ని తీర్చిదిద్దుతాడు. ఆ విధంగా మనిషి పెరిగి పెద్దవాడవుతాడు. మరి ఈ నిర్వహణ, పరిపోషణ కొందరికి మాత్రమే ప్రత్యేకం కాదు. సమస్త మానవులకు వారికి కావలసిన వాటిని సమకూరుస్తాడు. కేవలం మానవులకేనా !? అంటే మానవులకు మాత్రమే కాదు, సమస్త సృష్టిరాశులకు ఆయన పోషకత్వం వర్తిస్తుంది. ఈ సూరాలో మాత్రం ఒక్క మానవుల విషయమే ప్రస్తావించబడింది.

3. సమస్త జనుల జీవికకు కావలసిన వస్తుసామగ్రినంతటినీ సమకూర్చి, వారిని నిత్యం కనిపెట్టుకుని ఉన్నవాడు మాత్రమే వాస్తవానికి ఈ జగతికి పాలకుడు, చక్రవర్తి, రాజాధిరాజు కాగలుగుతాడు.

4. సమస్త జగతిని నడిపేవాడు, సమస్త విశ్వానికి సామ్రాట్టు అయినవాడే జనుల దాస్యానికి, ఆరాధనలకు అర్హుడు కాగలడు. అందువల్ల నేను ఆ గొప్ప శక్తిమంతుని శరణు జొచ్చుతున్నాను.

5. **'దురాలోచన'** (వస్‌వస) లేక దుష్ప్రేరణ అనేది చాలా మెల్లగా, శబ్దం లేకుండా నూరిపోయబడుతుంది. షైతాన్ కూడా మనిషి ఆంతర్యంలో ఎంతో చాకచక్యంగా, తెలీకుండా ఈ దుష్టభావాలను కలుగజేస్తాడు. **'ఖన్నాస్'** ( الْخَنَّاسِ ) అంటే జారుకునేవాడు, తప్పించుకునేవాడు, వెనక్కి తగ్గేవాడు, మరలిపోయేవాడు, తోక ముడిచేవాడు అని అర్థం. ఈ గుణాలు షైతాన్‌లో పుష్కలంగా ఉంటాయి. ఈ ధూర్తుడు దైవనామస్మరణ జరుగుతున్నప్పుడు మెల్లగా జారుకుంటాడు. దైవధ్యానం పట్ల ఏమరుపాటుకు లోనైనపుడు అమాంతం మనిషి మనసును ఆవరిస్తాడు.

6. దురాలోచనలను రేకెత్తించేవారిలో రెండు రకాల వారున్నారు.

**మొదటి రకం:** మానవులను పెడత్రోవ పట్టించే శక్తిని దేవుడు జిన్నుల్లోని షైతానులకు ఇచ్చి ఉన్నాడు. అదీగాక ప్రతి మనిషి వెంట ఒక షైతాను ఉంటాడు. వాడతన్ని ఎంతసేపటికీ మార్గం తప్పించేందుకు యత్నిస్తుంటాడు. ఈ విషయాన్ని దైవప్రవక్త (స) తన సహచరులకు తెలియజేసినప్పుడు, "ఓ దైవప్రవక్తా (సఅసం)! వాడు తమరిని కూడా వెన్నంటి ఉంటాడా?" అని సహచరులు అడిగారు. దానికాయన(స), "అవును. నా వెంట కూడా ఉంటాడు. అయితే వాడికి వ్యతిరేకంగా అల్లాహ్ నాకు తోడ్పడ్డాడు. అందువల్ల వాడు నాకు లొంగిపోయాడు. వాడు నాకు మంచిని గురించి తప్ప మరే విషయంలోనూ శాసించడు" అని బదులిచ్చారు. (సహీహ్ ముస్లిం – ప్రళయదిన లక్షణాల ప్రకరణం).

అలాగే వేరొక హదీసు ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఏతెకాఫ్‌లో ఉండగా, ఆయన్ని పలకరించటానికి ఆయన (స) ధర్మపత్ని హజ్రత్ సఫియా (ర.అన్హా) మస్జిదుకు వచ్చారు. అది రాత్రి సమయం. ఆయన (స) ఆమెను ఇంటి దగ్గర వదలిపెట్టడానికి ఆమె వెంట నడిచారు. దారిలో ఇద్దరు అన్సార్ సహచరులు ఎదురుపడ్డారు. ఆయన (స) వారిని బిగ్గరగా పిలుస్తూ, "ఈవిడగారు ఎవరో కాదు, ఈమె నా ధర్మపత్నియగు సఫియా బిన్తె హుయి" అని వివరించారు. ప్రియసహచరులు ఈ మాట విని, "దైవప్రవక్తా (సఅసం)! ఇదంతా మీరు మాకు చెప్పాలా?! మీ పట్ల మాకు దురనుమానం కలుగుతుందా?!" అని చెప్పగా, "అది సరేననుకోండి. కాని షైతాను మాత్రం అలాంటివాడు కాడు. వాడు మనిషి నరాల్లో రక్తంలా ప్రవహిస్తూ ఉంటాడు. వాడు మీ ఆంతర్యాల్లో ఎక్కడ దురాలోచనను రేకెత్తిస్తాడోనని నాకు భయమేసింది" అని మహాప్రవక్త (సఅసం) విశదీకరించారు. (సహీహ్ బుఖారీ – ఆదేశాల ప్రకరణం).

**రెండవ రకం :** ఇక రెండవ రకం షైతానులు మానవుల్లోనే ఉంటారు. వారు ఎదుటివారి బాగోగులను కోరేవారుగా, ప్రేమానురాగాలు గలవారుగా నటించి మనుషులను పెడదారి పట్టిస్తారు.

మరి కొంతమంది ప్రకారం షైతాను మనుషులను, జిన్నులను కూడా దారి తప్పించే వాడై ఉంటాడు. జిన్నులు కూడా షైతాను మాయమాటలకు, దుష్ప్రేరణలకు మోసపోతుంటారు.

**(శుభ సమాప్తం)**

## అనుబంధం-1

# కొత్త పదాలు - వాటి అర్థాలు

### అ

| | | |
|---|---|---|
| **అ/అస/అ.స** | = | "అలైహిస్సలామ్" అనే వాక్యానికి సంక్షిప్త రూపం. అల్లాహ్ శాంతి వారిపై కలుగుగాక అని దీనికి అర్థం. దైవప్రవక్తల నామం తరువాత ఈ ప్రార్థనా వచనం పలకటం ఆనవాయితి. |
| **అన్సార్** | = | సహాయకులు; మదీనా నగరంలో దైవప్రవక్త (సఅసం)ను, ఇస్లాం కోసం అక్కడికి వలస వచ్చిన వారిని అన్నివిధాలా ఆదుకున్న మదీనా వాసులు. |
| **అమానతు** | = | ఒకర్ని నమ్మి అప్పగించిన అప్పగింత; విశ్వసనీయత; నిజాయితి. |
| **అరఫాత్** | = | ఒక మైదానం పేరు; హజ్ యాత్రికులు ఈ ప్రదేశంలో ఆగటం హజ్ విధుల్లో అంతర్భాగం. ఈ ప్రదేశం మక్కాకు ఆగ్నేయ దిశలో సుమారు 25 కి.మీ దూరంలో ఉంది. |
| **అలస్తు వాగ్దానం** | = | మానవుల ఆత్మావస్థలో అల్లాహ్ వారి నుంచి తీసుకున్న వాగ్దానం; |
| **అసబ** | = | మృతుని తండ్రి మరియు తండ్రి తరఫు సమీప బంధువులు. |
| **అసర్** | = | హదీసుల్లో ఒక రకం; దైవప్రవక్త (స) తో నిమిత్తం లేకుండా ఆయన సహచరులు చెప్పిన లేక చేసిన విషయాలు; ఇస్లాం స్ఫూర్తికి విరుద్ధంగా లేని పక్షంలో దైవప్రవక్త (స) హదీసుల మాదిరిగా ముస్లింల కొరకు ఇవి కూడా అనుసరణీయమే. |
| **అహ్లెసున్నత్ వల్ జమాఅత్** | = | దైవప్రవక్త (స) గారి విధానాన్ని, ఆయన శిష్యుల (సహాబాల) విధానాన్ని అనుసరించేవారు. |

### ఆ

| | | |
|---|---|---|
| **ఆయతులు** | = | ఖుర్ఆన్‌లోని వాక్యాలు; అల్లాహ్ వచనాలు; నిదర్శనాలు. |

### ఇ

| | | |
|---|---|---|
| **ఇంజీలు** | = | దైవప్రవక్త ఈసా (యేసు)పై అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథం. |
| **ఇజ్తిహాద్** | = | ఇస్లామీయ మూలసూత్రాలకు ఏమాత్రం విఘాతం కలగకుండా ఖుర్ఆన్ హదీసుల వెలుగులో సమకాలీన సమస్యలకు పరిష్కారాలు వెతకటం. |
| **ఇజ్మా** | = | చూడండి నిసా(4వ) సూరా, 168వ పాదసూచిక. |
| **ఇబాదత్** | = | ఆరాధన; అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) సూచించిన సంవిధానం ప్రకారం జీవితం గడపటం. |
| **ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్** | = | ఇది దివ్య ఖుర్ఆన్‌లోని ఒక ఆయతు; ఎవరైనా చనిపోయినప్పుడు గాని, ఏదైనా బాధాకరమైన విషయాన్ని వెల్లడించినప్పుడుగాని వ్యవహారంలో దీన్ని పఠిస్తారు. "మనం అల్లాహ్ వారమే. ఎప్పటికైనా మనం మరలి వెళ్ళవలసింది ఆయన వద్దకే" అని దీని భావం. (ఖుర్ఆన్ 2 :156) |

| | | |
|---|---|---|
| **ఇస్రాఫీల్** | = | ప్రముఖ దైవదూత; ముఖ్యులైన నలుగురు దైవదూతల్లో ఒకరు; శంఖాన్ని పూరించి ప్రళయాన్ని సంభవింపజేయటం ఈయన ముఖ్య విధి; మిగిలిన దూతల పేర్లు: జిబ్రయీల్, మీకాయీల్, ఇజ్రాయీల్. |
| **ఇహ్రామ్** | = | కాబాయాత్ర కోసం ధరించే దుస్తులు; సాధారణమైన పరిస్థితుల్లో ధర్మసమ్మతమైన చాలా విషయాలు నిర్ణీత సమయం వరకు నిషేధించబడి ఉండే ఒక ప్రత్యేక దీక్ష; హజ్, ఉమ్రా యాత్రలు చేసినప్పుడు ఈ దీక్షలో ఉంటారు. |

## ఉ

| | | |
|---|---|---|
| **ఉమ్మహ్ / ఉమ్మత్** | = | సమాజం; అనుచర సమాజం; జాతి; ఒక ప్రవక్తకు ఉద్దేశించబడిన జనులు. ఉదాహరణకు ముహమ్మద్ (సఅసం) కాలం నుంచి ప్రళయం వరకు పుట్టబోయే వారంతా ఆయన ఉమ్మత్‌గానే భావించబడతారు. |
| **ఉమ్రహ్** | = | కాబా యాత్ర; హజ్ యాత్రకు–ఉమ్రహ్‌కు భేదం ఏమిటంటే హజ్ యాత్ర జుల్ హిజ్జా నెల 8, 9, 10 తేదీల్లో మాత్రమే నిర్వహించబడుతుంది. కాని ఉమ్రహ్ యాత్ర సంవత్సరంలో ఎప్పుడైనా చేసుకోవచ్చు. కాకపోతే, ఉమ్రహ్ కన్నా హజ్‌లో అదనంగా మరికొన్ని ప్రత్యేకమైన విధులు నిర్వర్తించవలసి ఉంటుంది. |

## ఔ

| | | |
|---|---|---|
| **ఔలియా** | = | 'వలీ' అన్న పదానికి బహువచనం; సన్నిహితులు, ప్రియతములు అని అర్థం; ఔలియాను దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా నిర్వచించాడు: "వారు విశ్వాసులై ఉంటారు. అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉంటారు" (యూనుస్:63); సాధారణంగా వలీలంటే "బాబాలు" అని అనుకుంటారు జనం. కాని నిజానికి వలీలంటే సోకాల్డ్ బాబాలు కారు. మంచివారైన విశ్వాసులందరూ, ప్రవక్తల అనుచరులందరూ అల్లాహ్ వలీలుగానే భావించబడతారు. ఈ పదానికి వేరితర అర్థాలు కూడా ఉన్నాయి. ఉదా: సంరక్షకుడు, సహాయకుడు. |

## క

| | | |
|---|---|---|
| **కనానీయులు** | = | ఒకానొక జాతివారు; కనాన్ ప్రాంత ప్రజలు; |
| **కలిమయె షహాదత్** | = | సాక్ష్యవచనం; అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని ధృవీకరించటం. |
| **కుఫ్ర్** | = | అవిశ్వాసం; దైవతిరస్కారం; ఆత్మప్రబోధనను తొక్కిపెట్టటం. |

## ఖ

| | | |
|---|---|---|
| **ఖలఫ్** | = | తరువాతి తరాల వారు; సలఫ్ కాలం తరువాతి తరాలవారిని 'ఖలఫ్'గా వ్యవహరిస్తారు. |
| **ఖలీఫా** | = | ప్రతినిధి, నాయకుడు. |
| **ఖారిజీలు** | = | ఖారిజియా వర్గానికి చెందినవారు; ఖారిజియా అనేది పూర్వం మార్గభ్రష్టతకు గురైన ఒకానొక మతవర్గం. అసలు ఖారిజియా అనే పదం 'ఖురూజ్' నుంచి వచ్చింది. అరబీలో 'ఖురూజ్ అలా' అంటే "తిరుగుబాటు చేయటం" అని అర్థం. ఈ వర్గంవారు తమ కాలంలోని ఖలీఫా (ఇస్లామీయ రాజ్యాధినేత) కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. తమ వర్గం |

| | | |
|---|---|---|
| | | మినహా మిగతా ముస్లింలందరూ ధర్మభ్రష్టులని అన్నారు. కనుకనే వారికి "ఖారిజీలు" అని పేరుపడింది. |
| **ఖారూన్ ఖజానాలు** | = | ఖారూన్ అనే అతను ఫిరౌన్ చక్రవర్తి యుగంలో, మూసా ప్రవక్త కాలంలో గడిచిన ఓ అపర కుబేరుడు. తనకు లభించిన అనన్యసామాన్య ఖజానాలకుగాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకునే బదులు ఆ దైవద్రోహి కృతఘ్నతా వైఖరికి పాల్పడ్డాడు. ఆ సంపాదన మొత్తం తన కష్టార్జితమేననీ, అందులో దేవుడిచ్చిందేమీలేదని బీరాలు పోయాడు. అల్లాహ్ మీద ఏమాత్రం విశ్వాసం లేకుండా మాట్లాడాడు. ప్రాయశ్చిత్తంగా అల్లాహ్ అతన్ని అతని ధనరాసులతో సహా భూమిలో కూర్చివేశాడు. (మరిన్ని వివరాలకై చూడండి-28 : 76-82) |
| **ఖవారిజ్** | = | చూడండి. **'ఖారిజీలు'** |
| **ఖిబ్లా** | = | ముస్లింలు నమాజు కోసం నిలబడే దిశ. |
| **ఖునూతె నాజిలా** | = | ముస్లిం జగత్తు కష్టాల్లో ఉన్నప్పుడు వారి శ్రేయస్సు కోసం ఫర్జ్ నమాజుల్లో చేసే ప్రత్యేక ప్రార్థనలు. |
| **ఖురైషు** | = | మక్కా నగరంలోని ఒక తెగ పేరు; దైవప్రవక్త (స) ఈ తెగకు చెందినవారే. |
| **ఖుర్తుబీ** | = | ఒకానొక ఖుర్‌ఆన్ వ్యాఖ్యాత పేరు; ఆయన రచించిన ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన గ్రంథం. |
| **ఖుర్బానీ** | = | జుల్‌హిజ్జా 10వ తేదీన అల్లాహ్ ప్రసన్నత కోసం పశువుని కోయటం. |
| **ఖుర్రా** | = | 'ఖారి' అన్న పదానికి బహువచనం; ఖుర్‌ఆన్ పారాయణ విద్యలో పండితులు అని అర్థం. |
| **ఖైరుల్ ఖురూన్** | = | శ్రేష్ఠమైన తరాలు; దైవప్రవక్త (స) కాలం నుంచి మొదటి మూడు తరాలు ధార్మికంగా, విశ్వాసపరంగా అత్యుత్తమమైనవని దైవప్రవక్త (స) చెప్పారు. వాటినే ఆయన "ఖైరుల్ ఖురూన్" (అత్యుత్తమ తరాలు) అన్నారు. |

# గ

| | | |
|---|---|---|
| **గాయిబానా** | = | అంటే పరోక్షంగానన్నమాట; జనాజా నమాజు 'గాయిబానా'గా కూడా చేయటానికి అనుమతి ఉంది. దైవప్రవక్త (స) ఆ విధంగా చేసి ఉన్నారు. |
| **గోషా** | = | పరదా; తెరచాటున ఉండటం; |

# జ

| | | |
|---|---|---|
| **జమరాత్** | = | 'జమ్రహ్' అన్న పదానికి బహువచనం; ఇబ్రాహీమ్ ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయీల్‌ను అల్లాహ్ కోసం జిబహ్ చేయటానికి తీసుకువెళ్తున్నప్పుడు దైవవిరోధి షైతాన్ మూడు చోట్ల ఆయన్ని అడ్డుకోవటానికి ప్రయత్నించాడు. ఆ మూడు ప్రదేశాలే మూడు జమ్రాలుగా ప్రసిద్ధికెక్కాయి. మినా అనే ప్రదేశంలో ఈ మూడు జమ్రాలు నెలకొని ఉన్నాయి. అజ్‌హా పండుగ సందర్భంగా నాలుగు రోజులపాటు యాత్రికులు ఈ నాలుగు జమ్రాలకు కంకరాళ్లు కొట్టటం హజ్ యాత్ర క్రియల్లో అంతర్భాగం. |
| **జహ్‌రీ నమాజులు** | = | ఖుర్‌ఆన్ పారాయణం బిగ్గరగా జరిగే నమాజులు (ఫజర్, మగ్రిబ్, ఇషా). |

**జిజ్‌యా** = ఇస్లామీయ రాజ్యపరిధిలో ఉండే ముస్లిమేతరులను రక్షిస్తున్నందుకుగాను ఇస్లామీయ రాజ్యం వారి నుంచి తీసుకునే మొత్తం.

**జిన్నులు / జిన్నాతులు** = అగ్నితో సృష్టించబడిన, మనుషుల కంటికి కనిపించని ప్రాణులు.

**జిబహ్** = అల్లాహ్ పేరును స్మరించి పశువును కోయటం.

**జిబ్రయీల్** = ప్రముఖ దైవదూత; ముఖ్యులైన నలుగురు దైవదూతల్లో ఒకరు; దైవసందేశం ప్రవక్తలకు చేరవేయటం ఈయన ముఖ్యవిధి; మిగిలిన దూతల పేర్లు: మీకాయీల్, ఇస్రాఫీల్, ఇజ్రాయీల్.

**జిమ్మీలు** = ఇస్లామీయ రాజ్యపరిధిలో శరణుతీసుకున్న ముస్లిమేతరులు.

**జీకఅద** = ఇస్లామీయ క్యాలెండరులో 11వ నెల.

## త

**తఖ్వా** = భయభక్తులు; దైవభీతి; అల్లాహ్‌కు భయపడి పాపాలకు దూరంగా ఉండటం.

**తఫ్‌సీర్** = ఖుర్‌ఆన్ వ్యాఖ్యానం; వివరణ.

**తవాఫ్** = కాబా గృహం చుట్టూ ప్రదక్షిణ చేయటం.

**తవాఫె ఖుదూమ్** = హజ్ యాత్రకై మక్కా నగరం వెళ్ళినప్పుడు కాబా గృహం చుట్టూ మొట్టమొదటగా చేసే ప్రదక్షిణలు.

**తవాఫె ఇఫాజా** = జుల్ హిజ్జా మాసం 10వ తేదిన హజ్ యాత్రికులు మినా ప్రదేశంలో ఉంటూ మక్కాకు తిరిగొచ్చి కాబా గృహం చుట్టూ చేసే ప్రదక్షిణ. హజ్ యాత్రలో అత్యంత ప్రధానంగా ఆచరించవలసిన పనుల్లో ఇదొకటి.

**తవాఫె జియారత్** = తవాఫె ఇఫాజాకు గల మరో పేరు.

**తహారత్** = తహారత్ అంటే షరీఅత్ ఆదేశించిన పద్ధతిలో పరిశుద్ధతను పొందటం. చిన్న తహారత్, పెద్ద తహారత్ అని ఇందులో రెండు రకాలు ఉన్నాయి. మలమూత్ర విసర్జన చేసినప్పుడు, అపాన వాయువు వెలువడినప్పుడు 'వుజూ' (నిర్ణీత పద్ధతి ప్రకారం ముఖం, కాళ్ళూ చేతులు కడుక్కోవటం) చేసుకోవాలి. ఇది చిన్నతరహా తహారత్; లైంగిక అశుద్ధత నుంచి, బహిష్టుస్థితి నుంచి, పురిటి రక్తస్రావాల నుంచి పరిశుద్ధత పొందటానికి గుస్ల్ (స్నానం) చేయాలి. ఇది పెద్ద తరహా తహారత్ క్రిందికి వస్తుంది.

**తాగూత్** = అల్లాహ్ గాకుండా ప్రజలచేత పూజించబడే మిథ్యా దైవాలన్నీ తాగూత్‌గానే భావించబడతాయి.

**తాబియీ** = సహాబీ (దైవప్రవక్త సహచరుని) వద్ద శిష్యరికం చేసినవారు లేదా విశ్వాస స్థితిలో వారిని కలిసినవారు.

**తౌరాత్** = దైవప్రవక్త మూసా (మోషే)పై అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథం.

**తౌహీద్** = ఏకదైవారాధన; అస్తిత్వం రీత్యాగాని, ఆరాధన హక్కు విషయంలోగాని, నామాలు– గుణగణాల విషయంలోగాని దేవుడు ఒక్కడేనని మనసా, వాచా, కర్మణా నమ్మటం.

## ద

**దావతె ముబాహలా** = ముబాహలా కొరకు ఆహ్వానించడం; రెండువర్గాల వారిలో ప్రతిఒక్కరు తాము చెప్పేదే సత్యమని వాదిస్తున్నప్పుడు అసత్యం పలికేవారిపై దేవుని శాపం పడుగాక అని ఒండొకరిని శపించటాన్ని 'ముబాహలా' అంటారు.

**దీనారు** = ఒక పురాతన బంగారు నాణెం.

**దుఆ** = ప్రార్థన.

## న

**నవూజు బిల్లాహ్** = "అల్లాహ్ శరణు"; "అల్లాహ్ మనల్ని రక్షించుగాక!" అని అర్థం. అల్లాహ్‌శరణు వేడుకోదలచినప్పుడు లేక ఒక అవాంఛనీయమైన మాటను నోటిద్వారా పలకవలసి వస్తున్నప్పుడు సాధారణంగా ఈ వచనం వాడుతారు.

## ప

**పుల్‌సిరాత్** = నరకంపై ఉన్న ఒక వంతెన. ప్రతి మానవుడు దాన్ని దాటి వెళ్ళవలసి ఉంటుంది. నరకవాసులైనవారు దానిపై నడుస్తూ, తెగి నరకంలో పడిపోతారు. స్వర్గవాసులు మాత్రం ఎట్టకేలకు ఈ వంతెన దాటి స్వర్గానికి చేరుకుంటారు.

**పైగంబరు** = దైవప్రవక్త.

**ఫఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్** = ఇది దివ్య ఖుర్‌ఆన్‌లోని ఒక ఆయతు; ఎవరైనా చనిపోయినప్పుడు గాని, ఏదైనా బాధాకరమైన విషయాన్ని వెల్లడించినప్పుడుగాని వ్యవహారంలో దీన్ని పఠిస్తారు. "మనం అల్లాహ్ వారమే, ఎప్పటికైనా మనం మరలి వెళ్ళవలసింది ఆయన వద్దకే" అని దీని భావం. (ఖుర్‌ఆన్ 2 : 156)

**ఫర్జ్ నమాజు** = ప్రతి ముస్లిం విధిగా చేయవలసిన నమాజు; రోజులో ఫజ్ర్, జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా అని ఐదు పూటలు ఐదు ఫర్జ్ నమాజులు ఉన్నాయి.

**ఫిత్నా** = ఉపద్రవం; షిర్క్. (చూడండి 'షిర్క్')

**ప్రభవనం** = పుట్టుక

**ప్రక్షిప్తాలు** = లేనివి కల్పించబడినవి.

## బ

**బిద్‌అత్** = ఖుర్‌ఆన్ హదీసులకు – వాటి స్ఫూర్తికి విరుద్ధమైన కొత్త అర్థాలు చెప్పటం; ధర్మంలో కొత్తపుంతలు తొక్కటం; ఈ తరహా పోకడలు ఘోరపాపాలుగా భావింపబడతాయి. దైవప్రవక్త (స) వీటిని తీవ్రంగా ఖండించారు.

**బిద్‌అతీలు** = ఖుర్‌ఆన్ హదీసులకు – వాటి స్ఫూర్తికి విరుద్ధమైన కొత్త అర్థాలు చెప్పేవారు. ధర్మంలో కొత్తపుంతలు తొక్కేవారు; ఈ తరహా పోకడలు ఘోరపాపాలుగా భావింపబడతాయి. దైవప్రవక్త (స) వీటిని తీవ్రంగా ఖండించారు.

| | | |
|---|---|---|
| **బైతుల్ మఖ్దిస్** | = | జెరూసలేంలోని ఓ పుణ్యక్షేత్రం. పూర్వం ఇది ముస్లింల ఖిబ్లాగా ఉండింది. ప్రస్తుతం ముస్లింల ఖిబ్లా కాబా గృహం. ముస్లింలు పుణ్యఫలాపేక్షతో కేవలం మూడు ప్రదేశాలకు మాత్రమే యాత్ర చేయాలి. అవి: 1.మక్కాలోని కాబా గృహం, 2. మదీనాలోని మస్జిదె నబవీ. 3.ఇదే (అంటే జెరూసలేంలోని బైతుల్ మఖ్దిస్). |
| **భ్రాతృజుడు** | = | అన్న కుమారుడు లేక తమ్ముని కుమారుడు. |

# మ

| | | |
|---|---|---|
| **మజూసీ** | = | జొరాష్ట్రియన్; అగ్నిపూజారి. |
| **మనాత్** | = | పూర్వం అరబ్బు బహుదైవారాధకులు పూజించిన ఒక విగ్రహం పేరు. |
| **మర్ఫూ** | = | దైవప్రవక్త (స) స్వయంగా ప్రకటించిన లేక చేసిన లేక ఆమోదించిన విషయం. |
| **మస్జిదె హరామ్** | = | మక్కాలోని పుణ్యక్షేత్రం. ఈ పరిధిలోనే కాబా గృహం నెలకొని ఉంది. |
| **మసీహె మౌవూద్** | = | మసీహ్ అనేది ఈసా ప్రవక్త పేరు. మౌవూద్ అంటే వాగ్దానం చేయబడిన అని అర్థం. ప్రళయానికి ముందు మరో మారు ఈసా ప్రవక్త ఈ ప్రపంచంలోకి వస్తారని హదీసుల్లో వాగ్దానం చేయబడింది. కనుక ఆయన్ని "మసీహె మౌవూద్" గా వ్యవహరిస్తారు. |
| **మహ్షర్ మైదానం** | = | పరలోకంలో మానవులందరూ సమీకరించబడే స్థానం. |
| **మహర్** | = | వివాహ సమయంలో వరుడు వధువుకు చెల్లించవలసిన సొమ్ము. |
| **మార్జితము** | = | తుడిచివేయబడింది; అవసరం లేదని భావించి తీసివేయబడింది(మహ్జూఫ్). |
| **మాలె గనీమత్** | = | యుద్ధప్రాప్తి; యుద్ధంలో శత్రువుల మీద విజయం తర్వాత వారి నుంచి లభించే ధనం; |
| **మీఖాత్** | = | హజ్ లేక ఉమ్రా యాత్రికులు ఇహ్రామ్ దుస్తులు ధరించి దాటవలసిన సరిహద్దు. ప్రపంచంలో నలువైపులా వ్యాపించి ఉన్న ప్రాంతాల ప్రజల కోసం నాలుగు దిక్కుల్లో నాలుగు మీఖాత్‌లు ఉన్నాయి. |
| **మీసాఖ్** | = | గట్టి ప్రమాణం; ఒప్పందం. |
| **ముక్తదీలు** | = | ఇమామును అనుసరిస్తూ నమాజ్ చేసేవారిని "ముక్తదీలు" అంటారు. నమాజుకు సారథ్యం వహించే వ్యక్తి 'ఇమాము' అని పిలువబడతాడు; |
| **ముఖాతిల్** | = | ఒక ఖుర్‌ఆన్ వ్యాఖ్యాత పేరు; |
| **ముజాహిద్** | = | ఒక ఖుర్‌ఆన్ వ్యాఖ్యాత పేరు; |
| **ముత్‌ఆ** | = | నిర్ణీత కాలం కోసమని చేసుకునే వివాహం; ఇస్లాం దీన్ని అత్యంత స్పష్టమైన రీతిలో నిషేధించింది. ఈ విధమైన వివాహం చేసుకోవటం అధర్మంగా ఖరారు చేసింది; "ముత్‌ఆ" అనే పదానికి ఇంకో అర్థం కూడా ఉంది. అసలు నిఘంటువు ప్రకారం ముత్‌ఆ అంటే అర్థం ప్రయోజనం చేకూర్చటం. కనుక విడాకుల ద్వారా వేరుపడిన మహిళకు చేకూర్చబడే ప్రయోజనాన్ని కూడా షరీఅత్ పరిభాషలో 'ముత్‌ఆ' గానే వ్యవహరిస్తారు. |
| **ముతవాతిర్** | = | ప్రవక్త (స) గారికి సంబంధించిన ఏదయినా విషయాన్ని ఆయన కాలం నుంచి నేటి వరకు ప్రతి యుగంలోనూ ఎంతోమంది - వారందరూ కలిసి ఈ విషయాన్ని కల్పించు కున్నారని చెప్పటానికి వీలులేనంత మంది - ఉల్లేఖించటం. |
| **ముత్తఫకున్ అలైహ్** | = | బుఖారీ-ముస్లిం పండితులు ఉభయులూ ఏకీభవించిన హదీసు. |

**ముద్** = ఒక కొలమానం; కిలోగ్రాములో మూడింట రెండొంతులు (సుమారు); అంతకంటే ఎక్కువ లేక తక్కువ కూడా కావచ్చు.

**ముబాహలా** = రెండు వర్గాల వారిలో ప్రతి ఒక్కరు తాము చెప్పేదే సత్యమని వాదిస్తున్నప్పుడు అసత్యం పలికేవారిపై దేవుని శాపం పడుగాక అని ఒండొకరిని శపించటాన్ని 'ముబాహలా' అంటారు.

**ముర్సల్** = దైవప్రవక్త సహచరుని (సహాబీ) తో నిమిత్తం లేకుండానే నేరుగా తాబియీ తన తరఫున దైవప్రవక్త (స) ఇలా చెప్పారని గాని లేక ఒక పని ఆయన చేశారని గాని లేక ఆయన సమక్షంలో ఆ పని జరిగిందని గాని ఉల్లేఖించబడిన హదీసు; (చూడండి **"తాబియీ"**)

**ముష్రిక్కులు** = షిర్క్ చేసేవారు; (చూడండి **"షిర్క్"**)

**ముహాజిర్లు** = దైవప్రవక్త (సల్లం) కాలంలో ఇస్లాంకోసం తమ స్వస్థలాన్ని వదలి మదీనా నగరానికి వలస వెళ్ళినవారు; అల్లాహ్ కోసం, ఇస్లాం కోసం సొంత ప్రదేశాన్ని వదలి వెళ్ళేవారు; అల్లాహ్ నిషేధించిన వస్తువులను పరిత్యజించినవారు;

**మూతజిలీ** = మూతజిలా వర్గానికి చెందినవాడు; మూతజిలా అనేది పూర్వం మార్గభ్రష్టతకు గురై, ఖుర్ఆన్ హదీసుల బోధనలను వదలిపెట్టి స్వీయ బుద్ధిజ్ఞానాల ప్రకారం నడచుకున్న ఒకానొక మతవర్గం.

**మేరాజ్** = గగనయాత్ర; దైవప్రవక్త (స) తన 52వ యేట సశరీరంగా గగనయాత్ర (మేరాజ్) చేశారని హదీసుల ద్వారా స్పష్టంగా బోధపడుతోంది.

# య

**యస్రిబ్** = మదీనా నగరానికి గల పాతపేరు.

**యా రబ్బ్! నఫ్సీ నఫ్సీ!!** = "ప్రభూ! నా పరిస్థితి ఏంటి? నా పట్ల ఎలా వ్యవహరించబడుతుంది?"

# ర

**ర.అన్హుం** = "రజియల్లాహు అన్హుమ్" అనే వాక్యానికి సంక్షిప్త రూపం; అల్లాహ్ వారిపట్ల ప్రసన్నుడు అగుగాక! అని దీనికి అర్థం. దైవప్రవక్త సహచరుల (సహాబా) నామం తర్వాత ఈ ప్రార్థనా వచనం పలకటం ఆనవాయితీ.

**రుకూ** = నమాజులోని ఒక ముఖ్య అంశం; నమాజులో అల్లాహ్ ముందు వినమ్రంగా చేతులతో మోకాళ్ల చిప్పలు పట్టుకొని వంగి ఉండే స్థితి.

**రెండుసజ్దాల సూరా** = ఖుర్ఆన్ పారాయణం చేసేటప్పుడు మధ్యలో కొన్ని సందర్భాలు వస్తాయి. ఆ సందర్భాల్లో సజ్దా చేయటం సున్నత్ (సంప్రదాయం). చాలా సూరాల్లో అటువంటి సందర్భాలు ఉన్నాయి. వాటిలో హజ్ సూరా కూడా ఒకటి. అయితే ఈ ఒక్క సూరాలోనే రెండు చోట్ల సజ్దా సందర్భాలు ఉండటం దీని ప్రత్యేకత.

# ల

**లా ఇలాహ ఇల్లల్లాహ్** = "అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేదు."

**లాత్** = పూర్వం అరబ్బు బహుదైవారాధకులు పూజించిన ఒక విగ్రహం పేరు.

**లౌహె మహ్ఫూజ్** = సురక్షిత ఫలకం; అల్లాహ్ మానవులకు ఇచ్చే ఆజ్ఞలు రాయబడి ఉన్న మూలగ్రంథం లేక ఫలకం.

**వలీ** = సన్నిహితుడు, ప్రియతముడు అని అర్థం; వలీలను దివ్య ఖుర్ఆన్లో అల్లాహ్ ఈ విధంగా నిర్వచించాడు: "వారు విశ్వాసులై ఉంటారు. అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉంటారు" (యూనుస్:63); సాధారణంగా వలీలంటే "బాబాలు" అని అనుకుంటారు జనం. కాని నిజానికి వలీలంటే సోకాల్డ్ బాబాలు కారు. మంచివారైన విశ్వాసులందరూ, ప్రవక్తల అనుచరులందరూ అల్లాహ్ వలీలుగానే భావించబడతారు. ఈ పదానికి వేరితర అర్థాలు కూడా ఉన్నాయి. ఉదా: సంరక్షకుడు, సహాయకుడు.

# వ

**వసీయతు** = వీలునామా; మనిషి తను చనిపోయేటప్పుడు తన వారసులకు పురమాయించే విషయాలు.

**వహీ** = దైవవాణి.

**వుజూ** = నిర్ణీత పద్ధతి ప్రకారం ముఖం, కాళ్ళూ చేతులు కడుక్కోవడం.

# ష

**షరీఅతు** = ధర్మశాస్త్రం; ఇస్లామీయ చట్టం.

**షహీదులు** = దైవమార్గంలో వీరమరణం పొందినవారు.

**షియాలు** = ఒక మత వర్గం; అసలు షియా అంటే "అనుసరించేవారు" అని అర్థం. వీరు తమల్ని తాము దైవప్రవక్త (స) గారి బాబాయి కుమారుడు, ఆయన అల్లుడైన అలీ (రజి)గారి అనుచరులమని చెప్పుకుంటారు. దైవప్రవక్త మరణానంతరం అలీ (రజి) గారు ఇస్లామీయ రాజ్యపు మొట్టమొదటి ఖలీఫా పదవికి అర్హులని వీరు భావిస్తారు. కనుకనే సున్నీల ప్రకారం దైవప్రవక్త (స) తదనంతరం ఖలీఫాలుగా నియమించబడిన అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్ (రజి) గార్ల ఖిలాఫత్ పదవిని వీరు తిరస్కరిస్తారు. ఈ విధంగా ఇస్లాంలో లేని "వంశపారంపర్య రాజ్యాధికారం" అనే కొత్త భావనకు ఈ వర్గం ఊపిరి పోసింది. దైవప్రవక్త (స) ప్రబోధనలపై సొంత ఊహాగానాలకు ప్రాముఖ్యమిచ్చి ఇస్లామీయ మౌలికాంశాలకే విరుద్ధమైన ఓ సరికొత్త విధానానికి తెరతీసింది. తౌహీద్ అంటే ఏకదైవారాధన కాదనీ, తౌహీద్ అంటే అలీ (రజి)కి చెందిన ఏకగ్రీవమైన రాజ్యాంగమనీ, అందులో భాగం తీసుకున్నవారు ధర్మభ్రష్టులని షియాలు అన్నారు. ఆ విధంగా వారు అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్ (రజి) గార్లను, ఇతర సహాబీలందరినీ ధర్మభ్రష్టులుగా ఖరారు చేశారు. వాస్తవానికి అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్ (రజి) గార్లకు ఖిలాఫత్ పదవీ బాధ్యతలు స్వయానా దైవప్రవక్త (స) అభీష్టానికి అనుగుణంగానే లభించాయి.

**షిర్క్** = అల్లాహ్ ఆరాధన (ఉలూహియత్) లోగాని, ఆయన పోషణ (రుబూబియత్)లోగాని, ఆయన నామ, గుణగణాల (అస్మా వ సిఫాత్)లోగాని వేరొకరికి భాగస్వామ్యం కల్పించటం. ఇది ఘోరమైన పాపం. దాసుడు పశ్చాత్తాప భావంతో ఈ పాపాన్ని వదలిపెట్టనంత వరకు

అతనికి క్షమాభిక్ష లేదు. షిర్క్ చేసే వారిని 'ముష్రిక్కులు' అంటారు. అంటే అల్లాహ్‌తోపాటు వేరొకరికి భాగస్వామ్యం కల్పించేవారన్నమాట.

## స

**స / సఅసం / సల్లం** = 'సల్లల్లాహు అలైహి వ సల్లం' అనే వాక్యానికి సంక్షిప్త రూపం. ఆయనపై అల్లాహ్ శాంతీ కారుణ్యాలను కురిపించుగాక! అని దీని భావం. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) నామం తరువాత ఈ ప్రార్థనా వచనం తప్పనిసరిగా పలకాలి.

**సజ్దా** = సాష్టాంగ ప్రణామం; అల్లాహ్ సమక్షంలో మోకరిల్లటం;

**సయీ** = పరుగెత్తటమని అసలు అర్థం. అయితే ఇది హజ్, ఉమ్రా యాత్రలకు సంబంధించిన ఒక పారిభాషిక పదం. ఈ యాత్రల్లో భాగంగా 'సఫా'-'మర్వా' అనే ప్రదేశాల మధ్య పరుగెత్తటాన్ని లేక వడివడిగా నడవటాన్ని 'సయీ' అంటారు.

**సలఫ్** = పూర్వీకులు; ఇస్లాంలో తొలి మూడు తరాలకు చెందిన నికార్సయిన ముస్లింలు.

**సలఫె సాలిహీన్** = సజ్జనులైన పూర్వీకులు; ఇస్లాంలో తొలి మూడు తరాలకు చెందిన నికార్సయిన ముస్లింలు.

**సహాబీలు** = దైవప్రవక్త ముహమ్మద్(స) సహచరులు, ఇస్లాం స్వీకరించి, ఇస్లాంపై మరణించిన ఆయన శిష్యులు; ('సహాబీ' ఏకవచనం).

**సహీఫాలు** = ఆకాశం నుంచి అల్లాహ్ ప్రవక్తలపై అవతరింపజేయబడిన ప్రతులు; ఖుర్‌ఆన్, ఇంజీల్, తౌరాత్, జబూర్ లాంటివి. ఇబ్రాహీమ్ సహీఫాలు, మూసా సహీఫాలు మొదలగునవి.

**సహీహ్** = దృఢమైన ఆధారాలు కలది; ప్రామాణికమైనది; హదీసుల్లో ఉత్తమ రకం; 'హసన్' కోవకు చెందిన హదీసుల కంటే కూడా ప్రామాణికమైనది;

**సహీహైన్** = ఆధారాల రీత్యా అత్యంత దృఢమైన రెండు హదీసు గ్రంథాలు; బుఖారీ, ముస్లిం హదీసు గ్రంథాలని భావం.

**సామిరీ** = మూసా ప్రవక్త కాలంలో ఇస్రాయీల్ జాతి వారి కోసం ఆవుదూడ విగ్రహాన్ని తయారుచేసి వారు విగ్రహారాధనకు పాల్పడటానికి కారకుడైనవాడు.

**సిద్రతుల్ ముస్తహా** = ఏడవ ఆకాశం పైన స్వర్గానికి సమీపంలో ఉన్న ఒక రేగు చెట్టు.

**సిర్రీ నమాజులు** = ఖుర్‌ఆన్ పారాయణం మెల్లిగా, నిశ్శబ్దంగా జరిగే నమాజులు (జుహర్, అస్ర్).

**సీరత్** = జీవిత చరిత్ర; దైవప్రవక్త (స) జీవిత చరిత్ర.

**సున్నత్** = పద్ధతి; ముహమ్మద్ (సల్లం) గారి విధానం.

**సున్నతె ముఅక్కదా** = దైవప్రవక్త (స) తను స్వయంగా ఆచరించటమే కాకుండా తన మాటల ద్వారా గాని, తన ఆచరణల ద్వారా గాని ఆ పని గురించి తన అనుచర సమాజానికి గట్టిగా తాకీదు చేసిన విషయం.

**సుబ్‌హానల్లాహిల్ అలీమిల్ ఖదీర్** = "సర్వం తెలిసినవాడు, సర్వాధిక్యుడు అయిన అల్లాహ్ పరమ పవిత్రుడు."

**సూరా** = ఖుర్‌ఆన్‌లోని ఒక అధ్యాయం.

# హ

| | | |
|---|---|---|
| **హదీసు** | = | దైవప్రవక్త (సఅసం) గారి పలుకు; లేక ఆచరణ; లేక ఆయన అంగీకారం పొందిన పలుకు లేక ఆచరణ. |
| **హదీసె ఈలా** | = | నిర్ణీత కాలం వరకు భార్య వద్దకు వెళ్ళనని భర్త ఒట్టేసుకోవటాన్ని 'ఈలా' అంటారు. దీని గురించిన ప్రస్తావన ఉన్న హదీసునే 'హదీసె ఈలా'గా వ్యవహరించటం జరిగింది. |
| **హదీసె ఖుద్సీ** | = | అల్లాహ్ మాటలను ప్రవక్త తన నోటితో అల్లాహ్ ఇలా ఆదేశించాడని చెప్పటం; మామూలు హదీసుకు - హదీసె ఖుద్సీకు మధ్య భేదాన్ని మనం ఈ విధంగా గ్రహించవచ్చు. సాధారణంగా అల్లాహ్ ప్రేరణతో దైవప్రవక్త(స) చెప్పేవన్నీ మామూలు హదీసులు అవుతాయి. అయితే దైవప్రవక్త(స) ఏదయినా హదీసులో నేరుగా అల్లాహ్ ఇలా అంటున్నాడని గాని, ఇలా ఆదేశించాడని గాని చెప్పినట్లయితే అటువంటి హదీసులు 'హదీసె ఖుద్సీ'గా భావించబడతాయి. |
| **హరబీ** | = | ముస్లిం శత్రు దేశస్థుడు. |
| **హరమ్** | = | మక్కా, మదీనా నగరాల్లోని నిషిద్ధ (గౌరవప్రద) ప్రాంతం. |
| **హరామ్** | = | నిషిద్ధం. |
| **హవారీలు** | = | దైవప్రవక్త ఈసా (యేసు) సహచరులు; |
| **హష్ర్** | = | పరలోకంలో మానవులందరిని సమీకరించటం. |
| **హసన్** | = | మంచిది; హదీసుల్లో ఒక రకం; ప్రామాణికమైనది; సహీహ్ కంటే కొంచెం తక్కువ స్థాయి కలిగిన హదీసు; |
| **హాజీలు** | = | హజ్ యాత్ర చేసేవారు. |
| **హాఫిజులు** | = | ఖుర్ఆన్ సంస్మర్తలు; దివ్యఖుర్ఆన్‌ను కంఠతా గుర్తుపెట్టుకొని సంరక్షిస్తున్నవారు; |
| **హిజ్రత్** | = | ఇస్లాం కోసం ఒక ప్రదేశం వదలిపెట్టి మరో ప్రదేశానికి వలస వెళ్ళటం; ఇస్లామీయ చరిత్రలో ముహమ్మద్ ప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలసవెళ్ళిన ఒక చారిత్రకమైన సంఘటన. |
| **హిజ్రీ శకం** | = | హిజ్రత్ తర్వాత నుంచి మొదలైన క్యాలెండరు. |
| **హుదైబియా** | = | అరేబియాలోని ఒక ప్రాంతం పేరు; ఇక్కడే ముస్లింలకు - మక్కా అవిశ్వాసులకు మధ్య ఒక చారిత్రాత్మకమైన సంధి జరిగింది. |

# క్ష

| | | |
|---|---|---|
| **క్షంతవ్యుడు** | = | క్షమార్హుడు. |

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

నిశ్చయంగా
ఈ ఖుర్ఆన్ చాలా
గౌరవప్రదమైనది.
అదొక సురక్షితమైన
గ్రంథంలో ఉంది.

(56 :77,78)

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# ప్రభూ!
# మాకు సన్మార్గం చూపించు

(అల్ ఫాతిహా : 6)